విజేతకాంపిటీషన్స్®

తెలుగు ప్రజల చరిత్ర సంస్కృతుల విజ్ఞాన సర్వస్వం

సమగ్ర
ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి

మూడవ భాగం

క్రీ.శ. 1323 నుండి క్రీ.శ. 1724 వరకు

డా॥ ముప్పాళ్ల హనుమంతరావు

Rs. 399

రచన

డా॥ ముప్పాళ్ల హనుమంతరావు

ఎం.ఏ., బి.యల్., పిహెచ్‌డి

BANDLA PUBLICATIONS
2-2-1130/24/1 D/1, Behind Indian Bank,
Shivam road, New Nallakunta, Hyderabad-500 044.
Ph: 27673494, 9963293399

VIJETA COMPETITIONS

SAMAGRA ANDHRA DESA CHARITRA-SAMSKRITHI
THE ENCYCLOPEDIA OF THE HISTORY & CULTURE OF TELUGU PEOPLE

© Reserved by Pub shers

Ed t on 2013

No Part of th s book may be repr nted or reproduced or ut sed n any form or by any e ectron c, mechan ca or other means, now or hereafter nvented nc ud ng photocopy ng and record ng, or n any nformat on storage and retrieva system w thout perm ss on n wr t ng from the pub shers

Although every care has been taken to avo d errors of om ss on th s pub cat on s be ng so d on the cond - tion and understand ng that nformat on g ven n th s book is mere y for reference and must not be taken as hav ng authority of or b nd ng n any way on the authors ed tors pub shers and se ers who do not owe any respons b ity for any damage or oss to any person a purchaser of th s pub cat on or for the result of any act on taken on the bas s of th s work The pub shers sha be ob ged f m stakes are brought to the r not ce for carry ng out correct on n the next ed t on

915.484 03

Concept & Design: Band a Sa Babu

Author: Muppa a Hanumanth Rao

Composing & Layout Design: Kaman Raghava Swamy

Cover Design: M Ruthv k

99947

Published by: Band a Pub cat ons,

2-2-1130/24/1/D/1, Beh nd nd an Bank, Shivam Road,

New Na akunta Hyderabad - 500 044

Phone 27673494, 27626336 98480-43787

పరిచయం

Dr. R. Soma Reddy M.A., Ph.D.,
Professor, Department of History
Osmania University
Hyderabad - 500 007

సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతి 5 సంపుటాలలో రూపొందించే ముప్పాళ్ల హనుమంతరావు ప్రయత్నం అభినందనీయం. ప్రస్తుత గ్రంథం వాటిలో తృతీయ సంపుటం. ఒక వ్యక్తి ఇంత పెద్ద పథకాన్ని చేపట్టడం హర్షించదగింది.

మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్ర ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. ఆంధ్రదేశంలో సామాజిక మరియు ఆర్థికపరంగా ముఖ్యమైన మార్పులు ఈ యుగంలో చోటు చేసుకున్నాయి. ఈ యుగ చరిత్రకు గల ఆధారాలు ఇంతకుముందు వాటికంటే చాలా ఎక్కువ. వాటన్నింటినీ సంపూర్ణంగా ఉపయోగించి ఈ కాలపు సమగ్ర తెలుగుదేశ చరిత్ర ఇప్పటి వరకు రాయబడలేదు. మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరి వెంకటరమణయ్య, హెచ్.కె. షేర్వాణి మొదలైన వారు సాహిత్య మరియు శాసనపరమైన ఆధారాలను ఉపయోగించి రాశారు. కాని మెకంజీ కైఫీయత్తులు మరియు ఐరోపా యాత్రికుల రాతలలోని సమాచారాన్ని ఇప్పటి వరకు మధ్యయుగ ఆంధ్రదేశ చరిత్ర రచనకు పూర్తిగా ఉపయోగించలేదు.

ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతిపై ఇంతవరకు జరిగిన పరిశోధనా ఫలిత సమాచారాన్ని రచయిత హనుమంతరావు సేకరించి ఈ గ్రంథాలలో సమగ్రపరచడానికి ప్రయత్నించారు. ఈ సంపుటాలు ఆంధ్రదేశ చరిత్ర పాఠకులకు, పండితులకు, పరిశోధకులకు మరియు విద్యార్థులకు ఉపకరిస్తాయని ఆశిద్దాం. ముఖ్యంగా సామంత రాజవంశాల గురించి ముప్పాళ్ల హనుమంతరావు ఇచ్చిన సమాచారం చరిత్ర పరిశోధకులకు భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతుంది.

ఆర్.సోమారెడ్డి
ప్రొఫెసర్
చరిత్ర శాఖ
ఉస్మానియా విశ్వవిద్యాలయం

హైదరాబాద్

రచయిత మనవి

ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతులకు సంబంధించిన అన్ని అంశాల మీద మరెక్కడా వెతుక్కోవలసిన అవసరం లేకుండా సమగ్రంగా సమాచారం ఇచ్చే గ్రంథం రూపొందించి ఆంధ్రదేశానికి అందించాలని నాకు చిరకాలంగా కోరిక ఉండేది. ఆ కోరిక ఇప్పటికి ఫలించింది.

ఈ గ్రంథ రచనకు నేను పడిన శ్రమను గూర్చి చిన్న మనవి. అనేకమంది చరిత్రకారులు, పండితులు, రీసెర్చ్ స్కాలర్లు, ఎంతో కష్టపడి, ఎన్నో పరిశోధనలు చేసి ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతులపై ఎంతో సమాచారం బయల్పరచారు. కాని ఆ సమాచారమంతా నిరుపయోగంగా మరుగున పడి ఉంది. అలాంటి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి అవగాహన చేసుకొని నాదైన శైలితో ఒక క్రమపద్ధతిలో ఆంధ్రదేశ చరిత్ర, సంస్కృతికి సమగ్ర రూపం ఇచ్చాను. ఈ చరిత్ర రచనకు నేను చాలా కష్టపడ్డాను. నేను పడ్డ కొన్ని కష్టాలను వివరిస్తాను.

ఆంధ్రదేశ చరిత్రపై ఎన్ని అంశాల మీద పరిశోధన జరిగింది, ఎంత సమాచారం ఉంది అనేవి తెలుసుకోవడం మొదటి కష్టం. ఎవరు ఏ అంశంపై పరిశోధించారో తెలుసుకున్న తరవాత ఆ సమాచారాన్ని సేకరించడం రెండవ కష్టం. వందలాది గ్రంథాలు, వేలాదిగా ఉన్న సిద్ధాంతాలను, వ్యాసాలను సేకరించి వాటన్నింటినీ లోతుగా అధ్యయనం చేసి జీర్ణించుకొని సబ్జెక్టుపై కమాండ్ తెచ్చుకోవడం, అహోరాత్రుల కృషి. అనేక అంశాలపై పరస్పర విరుద్ధ అభిప్రాయాలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని సమన్వయం చేసుకోవడం జటిలమైన సమస్య. అలాంటి సమస్యలను సమన్వయం చేసుకోవడంలో ఎంతో బాధ్యత వహించవలసి ఉంటుంది. కొన్ని అంశాలను తెలుసుకోవడానికి అసలు పుస్తకాలే ఉండవు. కొన్ని అంశాలను గూర్చి సమాచారం ఇచ్చే పుస్తకాలు ఉంటాయి. కాని అవి దొరకవు. కొండవీడి దండకవిలె, వెలుగోటి వారి వంశావళి, కొన్ని కైఫీయత్తులు, కొన్ని అపురూప గ్రంథాల కోసం ఎన్నో లైబ్రరీలు తిరిగాను కాని, నాకు అవి లభ్యం కాలేదు. వివిధ అంశాల మీద లభించిన కొన్ని గ్రంథాలు చదివిన తరవాత ఎన్నో సందేహాలు కలిగాయి. కొన్ని పుస్తకాలలో విషయాలు గందరగోళంగా పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. అలాంటి గ్రంథాలు చదవడం ద్వారా నాకు ఎన్నో సందేహాలు కలిగాయి. ఆ సందేహాలు తీర్చుకోవడానికి మరెన్నో పుస్తకాలను వెతుక్కోవలసి వచ్చింది. ఎంతమందినో సంప్రదించవలసి వచ్చింది.

విషయ సేకరణ కొరకు నేను ఎన్ని తిప్పలు పడ్డానో, ఎన్ని లైబ్రరీల చుట్టూ తిరిగానో, ఎన్ని వందల గ్రంథాలు అధ్యయనం చేశానో నాకే తెలుసు. ఈ గ్రంథ రచనకు నేను పడిన కష్టాలు, శ్రమ, ఇబ్బందులను గురించి ఒక గ్రంథం రాయవచ్చును. ఆంధ్ర దేశ చరిత్రకు సంబంధించిన ఏ పుస్తకం చూసినా ఆఖరికి చిన్న విషయం లభించినా వదిలిపెట్టకుండా అధ్యయనం చేసి ఆకళింపు చేసుకున్నాను. సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి అని గ్రంథానికి నామకరణం చేసినందువల్ల ఏ అంశాన్నీ వదలిపెట్టకూడదని నిర్ణయించుకున్నాను. అలా అయితేనే ఈ గ్రంథానికి న్యాయం చేయగలను అని భావించాను. ఎన్నో ఇబ్బందులు పడి, ఎంతో దీర్ఘకాలిక శ్రమతో ఈ సమాచారాన్నంతా సేకరించాను. అందువల్ల సమాచార పరిధి బాగా పెరిగిపోయింది. నా రాత ప్రతులలో దాదాపు 17000 పేజీలు వచ్చింది. ఈ 17000 పేజీలు క్రమపద్ధతిలో పెట్టి ఏకధాటిగా రాయటానికి, దేనిని వదలివేయాలి, దేనిని ఉంచాలి అని నిర్ణయం తీసుకోవడానికి, తీసుకున్న సమాచారాన్ని ఎక్కడ ఏ విధంగా ప్రజెంట్ చేయాలి, ఏ అప్రోచ్‌ని అనుసరించాలి అని నిర్ణయించుకోవడంలో నేను ఎంతో మానసిక క్లేశానికి గురయ్యాను. ఒక స్కాలర్ ఒక అంశాన్ని తీసుకొని రీసెర్చ్ చేసి తన సిద్ధాంతాన్ని సమర్పించడానికి కనీసం 4 లేక 5 సంవత్సరాలు పడుతుంది. అటువంటి వందలాది స్కాలర్లు చేసిన కృషి, వారి సిద్ధాంతాలు, వ్యాసాలు అన్నింటినీ సేకరించి సమన్వయం చేసుకొని అధ్యయనం చేసి మనసుకు పట్టించుకొని అనాది నుండి నేటి వరకు ఉన్న ఆంధ్రదేశ చరిత్ర సంస్కృతులన్నింటినీ ఒక్క వ్యక్తి రాయాలంటే ఒక జీవిత కాలం సరిపోతుందా! అటువంటి కృషి ఇది. ఆంధ్ర సామంత రాజవంశాలను కూడా తీసుకుంటే ఆంధ్రదేశాన్ని గత రెండు వేల సంవత్సరాల నుండి దాదాపు 400 వంశాల దాకా పాలించాయి. ఈ వంశాలలో ఎంతో మంది రాజులు, ఎన్నో శాసనాలు, ఎన్నో, నాణేలు, ఎన్నో రాజకీయ, సాంస్కృతిక అంశాలున్నాయి. ప్రతి అంశాన్ని అధ్యయనం చేయవలసిందే. దేనినీ వదలిపెట్టడానికి వీలులేదు. అలాగే ఎవరూ విమర్శించడానికి అవకాశం లేకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నా

నాకు తెలియని విషయాలు ఎన్నో ఉండి ఉండవచ్చు లేక రాసిన దాంట్లో తప్పులు దొర్లి ఉండవచ్చును. ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి అంశాన్ని నా చేతనైనంత వరకు పరిశీలించి ఈ సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి గ్రంధాన్ని 5 భాగాలుగా రూపొందించాను.

ఈ గ్రంధ రచనలో నేను భారతీయ విద్యాభవన్ పబ్లికేషన్స్ వారి పద్ధతిని అనుసరించాను. భారతదేశ చరిత్ర - సంస్కృతులనంతటినీ సమగ్రంగా 'ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్' అనే పేరుతో భారతీయ విద్యాభవన్ వారు 11 భాగాలుగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే. నేను అదే పద్ధతిలో ఆంధ్రుల చరిత్ర - సంస్కృతిని కలిపి కాలమాన పద్ధతిలో ఐదు భాగాలుగా విభజించి సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి అని గ్రంధానికి నామకరణం చేశాను. అవి -

1. ప్రాచీన యుగం - చారిత్రక పూర్వయుగం నుండి క్రీ.శ.624 వరకు
2. మధ్య యుగం-1 - క్రీ.శ. 624 నుండి 1323 వరకు
3. మధ్య యుగం-2 - క్రీ.శ. 1323 నుండి 1724 వరకు
4. నిజాం బ్రిటిష్ ఆంధ్ర - క్రీ.శ. 1724 నుండి 1956 వరకు
5. ఆంధ్రప్రదేశ్ చరిత్ర-సంస్కృతి - క్రీ.శ. 1956 నుండి 2012 వరకు

ఇందులో మళ్లీ ప్రతి భాగం రెండు అంతర్విభాగాలుగా విభజించబడింది. అంటే మొత్తం 10 భాగాల గ్రంధం. మొదటి భాగంలో రాజకీయ చరిత్ర, పరిపాలనా విధానాలు, సామంత రాజవంశాల చరిత్రలు ఉంటాయి. ఆనాటి రాజ్యాల సరిహద్దులను సూచించే రాజకీయ పటాలు కూడా చేర్చబడ్డాయి.

రెండవ భాగంలో పూర్తిగా సాంస్కృతిక అంశాలుంటాయి. సంస్కృతి, దాని పరిణామ దశలు - సాంఘిక, మత, కళ, భాషా సాహిత్యాలు విడివిడిగా సంపూర్ణంగా వివరించాను. మొత్తం ఐదు భాగాలు కలిపి 4,720 పేజీల గ్రంధంగా తయారైంది. 'ది హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ ది ఇండియన్ పీపుల్' వలె ఈ గ్రంధం కూడా 'ది హిస్టరీ అండ్ ది కల్చర్ ఆఫ్ ది ఆంధ్ర పీపుల్'.

ఇంతవరకు వెలుగులోనికి రాని ఆంధ్రదేశ చారిత్రకాంశాలన్నింటినీ ఆంధ్ర పాఠక లోకానికి అందించాలనేదే నా ఏకైక లక్ష్యం, తపన. కనుక నేను మరుగున పడి ఉన్న పార్శ్యగ్రంధాల్లో చేర్చని అనేక నూతన అంశాలను సేకరించి ఇందులో చేర్చాను. అయితే నా దృష్టికి రాని అంశాలు ఇంకా ఎన్నో ఉండవచ్చును. చరిత్ర ఒక మహాసాగరం. దానిని సంపూర్ణంగా అధ్యయనం చేయడానికి ఎవరికీ జీవితకాలం చాలదు. నేను సేకరించినంత వరకు చేర్చాను. ఈ సేకరణ దాదాపు 10 సంవత్సరాల నా కృషి ఫలితం. నాకు తెలియని నూతన అంశాలు ఎవరైనా నాకు తెలియపరిస్తే వారికి నా కృతజ్ఞతలు.

ఈ చరిత్ర రాయడానికి ఎందరో మహానుభావుల కృషి, పరిశోధనలు ఉపయోగపడ్డాయి. ఈ గ్రంధ రచనకు నేను ఆధారాలుగా తీసుకొన్న గ్రంధాలు, వాటి రచయితల పేర్లను బిబ్లియోగ్రఫీలో పొందుపరిచాను. వారికి నేను ఆజన్మాంతం రుణపడి ఉంటాను. వారికి నా ప్రణామాలు. ఈ విధంగా ప్రతి అంశాన్ని చేర్చి ఆంధ్రదేశ చరిత్ర -సంస్కృతికి సమగ్రత్వం తీసుకురావడానికి నేను చేసిన కృషిని ఆంధ్రదేశం ఆదరిస్తుందని ఆశిస్తున్నాను. ఈ గ్రంధ రచనా కాలంలో నా ధర్మపత్ని శ్రీమతి కమలాదేవి, మా పెద్దమ్మాయి నళినీ చౌదరి, చిన్న అమ్మాయి రధినీ చౌదరి, మా అబ్బాయి శ్రీకృష్ణ కిషోర్ చౌదరిలు ఎప్పటికప్పుడు శుద్ధ ప్రతులు రాస్తూ తగిన సూచనలిస్తూ అన్ని విధాలా తమ సహాయ సహకారాలనందిస్తూ నన్ను ప్రోత్సహించినందువలన ఈ రచనలో నాకు కొంత సౌలభ్యం కలిగింది. వారికి కూడా నా కృతజ్ఞతలు.

భవదీయుడు
డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు

మూడవ భాగానికి ప్రత్యేక భూమిక

సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి మూడవ భాగం క్రీ.శ.1323 తరవాత స్థాపించబడిన కమ్మ, రెడ్డి, వెలమ రాజ్యాలతో ప్రారంభమై, 1724వ సంవత్సరంలో అసఫ్‌జాహీ రాజ్యస్థాపనతో ముగుస్తోంది. కాకతీయుల వద్ద సేనాధిపతులుగా పనిచేసిన కమ్మ, రెడ్డి, వెలమ కులస్తులు కాకతీయ యుగం తరవాత నూరు సంవత్సరాలు ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. ఈ మూడు కులాల సేనాధిపతులు వేరు వేరుగా తమ తమ రాజ్యాలను స్థాపించుకున్నారు. కమ్మ రాజ్యం అర్ధశతాబ్దం, రెడ్డి రాజ్యం ఒక శతాబ్దం, వెమల రాజ్యం ఒకటిన్నర శతాబ్దాలు నిలిచాయి. గజపతులు ఆంధ్రదేశాన్ని జయించే వరకు వీరి రాజ్యాలు కొనసాగాయి. వెలమలు ముసునూరి కమ్మ రాజ్యాన్ని అంతం చేశారు వీరిలో మొదట రాజ్యాన్ని స్థాపించిన వారు ముసునూరి వంశస్తులు. వీరు కమ్మ కులస్తులని ఈనాడు పండితులందరూ భావిస్తున్నారు. డాక్టర్ బి యస్.యల్. హనుమంతరావు గారు తమ ఆంధ్రుల చరిత్ర అనే గ్రంథంలో 277వ పేజీలో కమ్మవారిలో ముసునూరి వారున్నారు. కృష్ణాజిల్లాలోని ఉయ్యూరు సమీపంలోని ముసునూరులో కోటగోడల శిధిలాలు నేటికీ కనిపిస్తాయి. ముసునూరి నాయకుల స్వాతంత్ర్య పోరాట రంగస్థలం కృష్ణాజిల్లా సమీపంలో ఉన్నందున అందలి ముసునూరి వారి జన్మస్థలం అయి ఉండవచ్చు అని రాశారు. దీనిని బట్టి ముసునూరి నాయకులు కమ్మ కులస్తులని బి.యస్.యల్. హనుమంతరావు అభిప్రాయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర శాఖాచార్యులు (రిటైర్డ్) ఆచార్య పిశుపాటి శ్రీరామశర్మచే రచించబడి, తెలుగు అకాడమీ వారు ప్రచురించిన ఆంధ్రదేశ చరిత్ర - సంస్కృతి క్రీ.శ.1336 వరకు 1993 ఎడిషన్ 205వ పేజీలో చతుర్థకులజుడైన ముసునూరి ప్రొలనేడు ధైర్యశాలి, యువకుడు. పోచానాయకుని కుమారుడు. వీరి పూర్వీకులు ముసునూరు గ్రామవాసులై ఉందురు. నేటికి కమ్మవారి కుటుంబాలలో కొన్నిటికి ముసునూరు ఇంటి పేరుగా ఉన్నందున ప్రొలనేడు కమ్మశాఖకు చెంది ఉంటుందని కొందరి అభిప్రాయం అని రాశారు.

అలాగే నేను జమీందారీ వంశస్తుల చరిత్రను రాసేటప్పుడు నూజివీడు జమీందారైన శ్రీ ఎం.ఆర్. అప్పారావుని కలిసి ముచ్చటించిన సందర్భంలో ముసునూరి నాయకుల ప్రస్తావన వచ్చి, వారి కులం ఏమిటి అనే చర్చ జరిగింది. దానికి అప్పారావు ముసునూరి వంశస్తులు కమ్మవారు, దానిలో ఎలాంటి సందేహం లేదు, ఆ కాలంలోనే కాకతీయ సేనానులుగా ఉన్న కమ్మ, రెడ్డి, వెలమ వారు ఈ మూడు కులాలుగా విడిపోయి, అవి తమ పూర్తి రూపాన్ని సంతరించుకొన్నాయని చెప్పారు. గ్రామం పేరు ఇంటి పేరుగా పెట్టుకొనే ఆచారం మధ్య యుగంలోనే వచ్చింది. నేడు ఆంధ్రుల ఇళ్ల పేర్లలో చాలా భాగం ఊళ్ల పేర్లే అలాగే ముసునూరు వారు, వారి గ్రామం పేరునే ఇంటి పేరుగా శాసనాలలో పేర్కొని ఉంటారు. ముసునూరు ఇంటి పేరు గల వారు కమ్మ కులంలో మాత్రమే ఉన్నారు. కనుక ముసునూరు వంశస్తులు కమ్మ కులస్తులే అనే అభిప్రాయాన్ని నేడు చాలా మంది పండితులు గాఢంగా నమ్ముతున్నారు.

ఈ విధంగా అనేక మంది పండితులు ముసునూరి వంశస్తులు కమ్మ కులస్తులని నమ్ముతూ తమ గ్రంథాలలో రాసినప్పుడు వారి రాజ్యాన్ని కమ్మ రాజ్యమని రాయడం సమంజసమని అనిపించింది. కనుకనే ముసునూరి నాయక రాజ్యానికి ముసునూరి కమ్మ రాజ్యం అని నామకరణం చేశాను. అందువలన కాకతీయుల, గజపతుల మధ్యకాలపు ఆంధ్రదేశ చరిత్రను కమ్మ, రెడ్డి, వెలమ యుగమని కూడా ప్రస్తావించాను.

మూడవ భాగం: క్రీ.శ.1323 నుండి క్రీ.శ.1724 వరకు అంటే 400 సంవత్సరాల ఆంధ్రదేశ చరిత్రను వివరిస్తోంది. ఈ నాలుగు వందల సంవత్సరాల ఆంధ్రదేశ చరిత్రను మూడు దశలుగా విభజించవచ్చును.

1. కమ్మ, రెడ్డి, వెలమ యుగం - క్రీ.శ. 1323 నుండి క్రీ.శ. 1475 వరకు.
2. గజపతుల యుగం - క్రీ.శ. 1448 నుండి క్రీ.శ. 1572 వరకు.
3. ముస్లిం యుగం (గోల్కొండ, మొగల్) - క్రీ.శ. 1518 నుండి క్రీ.శ. 1724 వరకు.

మొదటి దశలో ముసునూరి కమ్మ నాయకరాజ్యం, కొండవీటి రెడ్డి రాజ్యం , రాచకొండ, దేవరకొండల వెలమ రాజ్యం, ఆంధ్రదేశాన్ని పాలించాయి. ఈ రాజ్యాలలో ముసునూరి కమ్మ రాజ్యం 50 సంవత్సరాలు, కొండవీటి రెడ్డి రాజ్యం 100 సంవత్సరాలు, దాని అవశేషం అయిన రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం మరొక పాతిక

సంవత్సరాలు, వెలమ రాజ్యం 150 సంవత్సరాలు నిలిచాయి. ఈ మూడు రాజ్యాలు బహమనీ రాజ్య ప్రమాదం నుండి ఆంధ్రదేశాన్ని రక్షించే గురుతర బాధ్యతను విస్మరించి తమలో తాము అంతః కలహాలలో మునిగి పరస్పరం నాశనం చేసుకొన్నారు. ఏమైనా కొంత కాలం ఆంధ్రదేశాన్ని పాలించారు. వీరికి సమకాలికంగా పశ్చిమ ఉత్తర దిక్కులలో బహమనీ వంశం, దక్షిణాన విజయనగర రాజ్యాన్ని సంగమ వంశం పాలించాయి. బహమనీ రాజ్యం మహారాష్ట్ర రాజ్యంగా, విజయనగర రాజ్యం కర్నాటక రాజ్యంగా భావించవచ్చును. అనంతపురం, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు జిల్లా ప్రాంతాలు విజయనగర రాజ్యంలోను, హైదరాబాద్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లా ప్రాంతాలు బహమనీ రాజ్యంలో ఉన్నాయి. అయినప్పటికీ ఆ రాజ్యాలను ఆంధ్రదేశపు రాజవంశాలుగా గుర్తించనవసరం లేదు. ఈ దశలో ఆంధ్రదేశానికి కమ్మ, రెడ్డి, వెలమ రాజ్యాలనే ప్రధాన రాజవంశాలుగా భావించాలి.

కొండవీటి రెడ్డి రాజ్య పతనం ఆంధ్రదేశ చరిత్రలో అనూహ్యామైన పరిస్థితులను తెచ్చింది. రాజకీయ అనిశ్చితస్థితి ఏర్పరచింది. రాచవేమారెడ్డి మరణం తరవాత విజయనగర రాజులకు ఆంధ్రదేశాన్ని జయించాలని ఆశ కలిగింది. అదే సందర్భంలో తెలంగాణలో వెలమరాజ్యం కూడా బలహీనపడింది. దాంతో బహమనీ సుల్తానుల కన్ను తెలంగాణపై పడింది. ఈ రెండు రాజ్యాలు ఆంధ్రదేశాన్ని జయించాలని ఆశలను పెంచుకున్నాయి. విజయనగర సార్వభౌముడైన సంగమ రెండవ దేవరాయలు కోస్తాపై దండెత్తాడు. ఇలాంటి సందర్భంలో ఈ రెండు వంశాలకు ప్రత్యర్థులుగా గజపతులు ప్రత్యక్షమయ్యారు. కపిలేశ్వర గజపతి గంగవంశాన్ని తొలగించి క్రీ.శ.1438వ సంవత్సరంలో కళింగ అధిపతయ్యాడు. అతని కన్ను కూడా ఆంధ్రదేశంపై పడింది. దానితో ఆంధ్రదేశంపై ఆధిపత్యం కోసం నరపతి, అశ్వపతి, గజపతుల సంఘర్షణ ప్రారంభమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే కొండవీటి రెడ్డి రాజ్యపతనం ఆంధ్రదేశ చరిత్రలో గజపతి, నరపతి, అశ్వపతుల త్రైరాజ్య సంఘర్షణకు దారితీసింది. ఈ త్రైరాజ్య సంఘర్షణలో గజపతులు విజయం సాధించారు. వారు విజయనగర, బహమనీ ప్రభువులను తరిమేసి యావదాంధ్ర దేశాన్ని జయించారు. దానితో ఆంధ్రదేశం గజపతి సామ్రాజ్యంలో అంతర్భాగమై పోయింది. గజపతులు సుమారు 125 సంవత్సరాలు అంటే క్రీ.శ.1448 నుండి క్రీ.శ.1572 వరకు ఆంధ్రదేశాన్ని పాలించారు. మధ్యలో గవాన్ కాలంలో ఒక పర్యాయం, తర్వాత శ్రీ కృష్ణదేవరాయల కాలంలో మరొక పర్యాయం గజపతి రాజ్యంపై దండయాత్రలు జరిగి తాత్కాలిక అపజయాలు పొందినా ప్రతాపరుద్ర గజపతి మరణం తర్వాత కూడా ఆంధ్రదేశంలో వారి అధికారం కొనసాగింది. ప్రతాపరుద్ర గజపతి మరణం తర్వాత గజపతి సామంతులైన చితాబ్‌ఖాన్, వేదాద్రిల పాలన 1572 వరకు సాగింది. ఈ 125 సంవత్సరాలలో 1448 నుండి 1515 వరకు అనగా కృష్ణదేవరాయలు ఉదయగిరిని జయించే వరకు సుమారు 70 సంవత్సరాలు యావదాంధ్ర దేశాన్ని గజపతులు స్థిరంగా పాలించారు. క్రీ.శ.1518 తర్వాత కృష్ణానదికి దక్షిణ భాగం విజయనగర రాజ్యంలో భాగమైంది. అదిపోను మిగిలిన ఆంధ్రదేశం మొత్తం అంటే తెలంగాణ, ఉత్తర కోస్తా, ఇచ్చాపురం వరకు 1534 వరకు, అంటే కులీకుతుబ్‌షా కొండపల్లి, ఏలూరు సర్కారులను జయించే వరకు సుమారు 15 సంవత్సరాలు గజపతులు పాలించారు. తర్వాత 1572 వరకు రాజమహేంద్రవరాన్ని, అంటే ఇబ్రహీం కుతుబ్‌షా రాజమహేంద్రవరాన్ని జయించే వరకు, గోదావరి తీరం నుండి ఇచ్చాపురం వరకు గజపతి సామంతులైన చితాబ్‌ఖాన్, వేదాద్రిలు పాలించారు. కనుక ఈ 125 సంవత్సరాల వరకు ఆంధ్రదేశ చరిత్రను గజపతి యుగం అని చెప్పాలి. ఈ కాలంలో వారు ముస్లింల దాడుల నుండి ఆంధ్రదేశాన్ని, ఆంధ్ర సంస్కృతిని రక్షించి కళలు, ఆంధ్రభాషా సంస్కృతులకు ప్రోత్సాహాన్ని ఇచ్చారు. ఆంధ్ర వంశాలు నశించినా గజపతుల ప్రతాపం వల్లనే మరొక 125 సంవత్సరాలు ఆంధ్రదేశం ముస్లింల వశం కాకుండా నిలిచింది. గజపతి వంశం లేని పక్షంలో రెడ్డి రాజ్య పతనం తర్వాత వెంటనే ఆంధ్రదేశం ముస్లింల పాలపడి ఉండేది. దేవగిరి యాదవ రాజ్య పతనం తర్వాత మహారాష్ట్ర దేశం శాశ్వతంగా ఎలా ముస్లింల వశం అయిపోయిందో అదేవిధంగా ఆంధ్రదేశం కూడా గజపతులు 125 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని కాపాడారు. కాని ఆంధ్రదేశ చరిత్రలో వారికి ఇవ్వవలసిన స్థానాన్ని గాని, ప్రాముఖ్యతను గాని, చరిత్ర రచయితలు ఇంత వరకు ఇవ్వలేదు. ఈ యుగం నాటి చరిత్రలో విజయనగర రాజ్యానికి అమిత ప్రాధాన్యతను ఇచ్చారు. వాస్తవానికి విజయనగర సామ్రాజ్యాన్ని ఆంధ్రదేశపు రాజవంశంగా భావించడానికి వీలులేదు. ఆ రాజ్యాన్ని కర్ణాటక రాజ్యంగా భావించడం సమంజసంగా ఉంటుంది. కారణం వారు ఆంధ్రదేశాన్ని పూర్తిగా జయించనూ లేదు, పాలించనూ లేదు. పైగా వారు స్వయంగా తాము

కర్ణాటక రాజ్య రమారములమని చెప్పుకున్నారు. శ్రీనాథుడు ప్రౌఢరాయలను కర్ణాటక్షితిపాలుడని వర్ణించాడు. శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు తనను కన్నడరాయ అని పిలిచాడని శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా చెప్పుకున్నాడు. కర్ణాట రాజ్య రమారమా అని వర్ణింపబడ్డాడు. విద్యారణ్యుల వారికి కర్ణాటక రాజ్యస్థాపనాచార్య అనే బిరుదుంది. అంటే విజయనగర రాజ్యం కర్ణాటక సామ్రాజ్యమని అర్థం. సంగమ, సాళువ, తుళువ వంశాలు కన్నడిగులు. ఒక్క ఆరవీటి వంశస్తులే తెలుగువారు కాని వారి కాలంలో వారి కింద ఉండే ఆంధ్ర భూభాగంలో చాలా భాగాన్ని పోగొట్టుకున్నారు. గోల్కొండ నవాబులు కొండవీడు, ఉదయగిరి దుర్గాలను జయించారు. రెడ్డి రాజ్య పతనం తర్వాత చివరి సంగమ తుళువ వంశస్తుల కాలంలో మాత్రం కృష్ణకు దక్షిణ భాగం వారి కింద ఉంది. తెలుగు సాహిత్య సంగీతాలకు విజయనగర ఆస్థానంలో విశేష ఆదరణ లభించింది దేశ భాషలందు తెలుగు లెస్స అని ప్రసిద్ధి చెందింది. తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగం పట్టింది. పైగా వారు దక్షిణ భారతదేశంలో హిందూ మతాన్ని, సంస్కృతిని రక్షించడానికి కంకణం కట్టుకున్నారు. కనుక పూర్వపు చరిత్రకారులందరూ విజయనగర చరిత్రకు అమిత ప్రాధాన్యతను ఇచ్చారు. దాని ఘనకార్యాలను ఘనంగా శ్లాఘించారు. కాని రాజకీయంగా పరిశీలిస్తే ఆంధ్ర దేశానికి సంబంధించినంత వరకు ఈ కాలంలో అంటే రెడ్డి రాజ్య పతనం తర్వాత గజపతులే ఆంధ్రదేశపు రాజవంశం అని తప్పక చెప్పవలసి ఉంటుంది. కటకం వరకు జయించిన కృష్ణదేవరాయలు కూడా కృష్ణకు ఉత్తర భాగం అంతా గజపతులకే తిరిగి ఇచ్చివేశాడు అంటే గజపతులే ఆంధ్రదేశపు రాజవంశం అని పరోక్షంగా కృష్ణదేవరాయలు అంగీకరించినట్లే. కనుక సాళువ, తుళువ వంశాలకు సమకాలికంగా గజపతులే ఆంధ్రాధీశ్వరులు అని చెప్పడం సమంజసం. కనుక నేను ఈ యుగంలో చివరి సంగమ వంశస్తులు సాళువ, తుళువ వంశాలకు సమకాలికంగా క్రీ.శ.1448 నుండి 1572 వరకు ఆంధ్రదేశ చరిత్రలో గజపతులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చాను గజపతి వంశమే ఆంధ్రదేశపు రాజవంశంగా తీసుకున్నాను. కనుక ఆ కాలపు ఆంధ్రదేశ చరిత్రకు గజపతుల యుగం అని పేరు పెట్టాను. గజపతుల చరిత్రే ఆంధ్రదేశ చరిత్ర అనే భావాన్ని కలిగించాను. కనుక ఆంధ్రదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్య చరిత్రను సందర్భోచితంగా చెప్పుకుంటే సరిపోతుందని భావించాను. అలా అని విజయనగర చరిత్రను తగ్గించలేదు, వివరంగానే రాశాను.

గజపతుల యుగం తర్వాత ఆంధ్రదేశం గోల్కొండ నవాబుల వశమైంది. గోల్కొండ వంశానికి మూల పురుషుడైన కులీకుతుబ్‌షా క్రీ.శ.1518 నుండే తెలంగాణకు అధిపతి అయ్యాడు. కోస్తాను కూడా జయించాలని ప్రయత్నాలు ఆరంభించాడు కాని, బలవంతులైన శ్రీకృష్ణదేవరాయలు, ప్రతాపరుద్ర గజపతులు అతని సమకాలికులు. కనుక వారు జీవించి ఉన్నంత కాలం అతని ఆటలు సాగలేదు. కృష్ణదేవరాయల మరణానంతరం కులీ కొండవీటిని జయించాలని ముట్టడించాడు. కాని అచ్యుత దేవరాయలు అతనిని ఓడించి తరిమాడు. తర్వాత గజపతి రాజ్యంపై దండెత్తాడు. కాని గజపతులు కూడా ఓడించారు. కనుక అతని కాలంలో కోస్తాను జయించలేక పోయాడు తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర రాజ్యం చావు దెబ్బ తిన్నది. దానితో గోల్కొండ నవాబులకు ఆంధ్రదేశాన్ని జయించడానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పోయాయి. కనుక ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ఆంధ్రదేశాన్ని పూర్తిగా జయించడానికి పూనుకున్నాడు. అతనిని గజపతుల సామంతులైన సీతాబ్‌ఖాన్ (ఇతడు ఖమ్మం, బెల్లంకొండ, కొండపల్లి పాలకుడు), వేదాద్రి (ఇతడు రాజమహేంద్రవరం పాలకుడు), వత్సవాయి ముసలి లేక వత్సవాయి తిమ్మరాజు (ఇతడు పెద్దాపురం పాలకుడు)లు ఇబ్రహీం కుతుబ్‌షా సైన్యాన్ని క్రీ.శ.1572లో రాజమండ్రి వద్ద ఎదిరించి ఓడిపోయారు. దానితో రాజమహేంద్రవర దుర్గం గోల్కొండ నవాబుల వశమైంది. తిరిగి ఆ దుర్గం ఏనాడూ హిందువుల చేతిలోకి రాలేదు. అక్కడ ఇబ్రహీం కుతుబ్‌షా గోల్కొండ రాజప్రతినిధిని నియమించాడు. ఆ తర్వాత గోల్కొండ నవాబులకు ఎదురు లేకుండా పోయింది. చిక్కాకోల్ అంటే శ్రీకాకుళం వరకు గోల్కొండ నవాబుల వశమైంది. కృష్ణకు దక్షిణంగా కూడా ఉన్న ఆంధ్ర ప్రాంతాలను కూడా జయించారు. దానితో ఒక్క చిత్తూరు, అనంతపురం జిల్లాలు తప్ప యావదాంధ్ర దేశం గోల్కొండ రాజ్యంలో భాగమైపోయింది. దానితో ఆంధ్రదేశ చరిత్రలో గోల్కొండ కుతుబ్‌షాల యుగం ప్రారంభమైంది. ఆంధ్రదేశంలో ఆంధ్రుల పాలన, హిందువుల పాలన అంతమైంది. ఆ తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన ఆంధ్రుడు లేడు. ఆంధ్రులు కొద్ది మంది సంస్థానాధీశులుగా, గోల్కొండ నవాబుల కింద పాలించారు. వారు సామంతులే గాని ఆంధ్రదేశపు పాలకులని భావించడానికి వీలులేదు. కనుక గోల్కొండ నవాబుల కాలం నుండి ఆంధ్రదేశ చరిత్రను పూర్తిగా ముస్లిం యుగం అని చెప్పవచ్చును. గోల్కొండ నవాబుల తర్వాత మొగలులు, వారి తర్వాత నిజాం వంశస్తులు తర్వాత ఫ్రెంచి వారు

తర్వాత ఇంగ్లిషు వారు వరుసగా ఆంధ్రదేశాన్ని పాలించారు.

క్రీ.శ.1758-59 సంవత్సరంలో చెందుర్తి యుద్ధంలో ఫ్రెంచి వారు ఓడిపోవడంతో సలాబత్‌జంగ్ ఉత్తర సర్కారులను ఇంగ్లిషు వారికి ఇచ్చాడు. దానితో ఆంధ్రదేశ చరిత్రలో ముస్లిం యుగం అంతరించి బ్రిటిష్ యుగం ప్రారంభమైంది. వారి పాలన క్రీ.శ.1947 వరకు సాగింది. అంటే క్రీ.శ.1572 నుండి 1947 వరకు పూర్తిగా ఆంధ్రదేశం పరాయి వారి పాలన కింద ఉండిపోయింది. ఈ విధంగా సాగిన ఈ నాలుగు వందల సంవత్సరాల చరిత్రను ఈ భాగంలో వివరించాను మొదటి రెండు భాగాలను ఆదరించినట్లు ఈ భాగాన్ని కూడా ఆంధ్రదేశం ఆదరిస్తుందని ఆశిస్తున్నాను.

భవదీయుడు
డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు

విషయ సూచిక

మొదటి భాగం ప్రధాన రాజవంశాల చరిత్ర 17-405

- ✦ కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ఆంధ్రదేశ పరిస్థితి 19
- ✦ ఆంధ్రదేశంలో తుగ్లక్ సార్వభౌమాధికారం క్రీ.శ.1325-35 ...21
- ✦ ఆంధ్ర స్వాతంత్ర్య సమరం క్రీ.శ.1325-26 25
- ✦ కమ్మ, రెడ్డి, వెలమ యుగం 32
- ✦ ముసునూరి కమ్మనాయక సామ్రాజ్యం 35
- ✦ ముసునూరి కమ్మనాయక రాజ్యానికి
  సరిహద్దు రాజ్యాలతో గల సంబంధాలు 68
- ✦ కొండవీటి రెడ్డి రాజ్యం 71
- ✦ కందుకూరి రెడ్డి రాజ్యం 117
- ✦ చందోలు శాఖ 120
- ✦ రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం 125
- ✦ రెడ్డి రాజ్యానికి పొరుగు రాజ్యాలతో గల సంబంధాలు 136
- ✦ ఉత్తరాంధ్ర లేక దక్షిణ కళింగ లేక కళింగాంధ్ర చరిత్ర 139
- ✦ కళింగ గాంగ - ఆంధ్ర రాజవంశాల సంఘర్షణ 150
- ✦ ఆంధ్రదేశ చరిత్రలో గజపతి యుగం 156
- ✦ కళింగ సామ్రాజ్య నిర్మాత కపిలేశ్వర గజపతి 164
- ✦ పురుషోత్తమ గజపతి 183
- ✦ ప్రతాపరుద్ర గజపతి 194
- ✦ కళింగ గజపతులకు పొరుగు రాజ్యాలతో సంబంధాలు 218
- ✦ దక్షిణాంధ్ర చరిత్ర-దక్షిణాంధ్రపై ఆధిపత్యం కోసం సంఘర్షణ ...221
- ✦ విజయనగర సామ్రాజ్యం 224
- ✦ సంగమ వంశం 247
- ✦ సాళువ వంశం 281
- ✦ తుళువ వంశం 293
- ✦ ఆరవీటి వంశం 350
- ✦ విజయనగర సామ్రాజ్య పతనానికి కారణాలు 379
- ✦ బహమనీ విజయనగర సంఘర్షణ లేక సంబంధాలు 384
- ✦ విజయనగర సామ్రాజ్యానికి పోర్చుగీసు గల సంబంధాలు 392

✦ విజయనగర సామ్రాజ్యానికి గోల్కొండ
రాజ్యంతో గల సంబంధాలు 396

తెలంగాణ చరిత్ర 406-506

✦ పద్మనాయక చరిత్ర 406
✦ గోండు రాజుల చరిత్ర 422
✦ ఆంధ్రదేశంలో ముస్లిం పరిపాలన 426
✦ బహమనీ రాజ్యానికి ఆంధ్రదేశంతో గల సంబంధాలు 427
✦ గోల్కొండ - కుతుబ్‌షాహీ రాజ్య చరిత్ర 431
✦ కుతుబ్‌షాహీ రాజ్యానికి పొరుగు రాజ్యాలతో సంబంధాలు . . .484
✦ ఆంధ్రదేశంలో మొగలుల పరిపాలన 489
✦ ఆంధ్రదేశంలో మొగల్ సుబేదారుల పరిపాలన 493
✦ సర్వాయి పాపన్న అరాచకాలు 501

రెండవ భాగం సామంత రాజవంశాల చరిత్ర 507-594

✦ **వెలనాటి చోడుల సామంత రాజ్యాలు**
✤ దుర్జయ వంశాలు 509
✤ అయ్యప వంశం 509
✤ గొల్లపూడి చోళ వంశం 510
✤ ఆలూర్రి వంశం 511
✦ **ముసునూరి కమ్మ నాయక రాజ్య సామంత రాజ్యాలు**
✤ కోరుకొండ మంచికంటి రాజ్యం 513
✤ సబ్బి మండలం - రామగిరి రాజ్యం 516
✤ పిఠాపురం కొప్పుల వంశం 516
✤ తొయ్యేరు రాజ్యం 519
✤ యేరువ చోళ వంశం 519
✤ సూరవరం క్షత్రియ రాజ్యం 523
✤ యలమంచిలి పాంచదార్ల చాళుక్యులు 524
✦ **గజపతుల సామంత రాజ్యాలు**
✤ రఘుదేవపురం సామంత రాజ్యం 526
✤ హుమ్మ రాజ్యం 527
✤ కిమిడి రాజ్యం 528
✤ చికటి వంశం 528

✤ పాలూరు సంస్థానం 529
✤ కళ్లికోట సంస్థానం 529
✤ అటగడ సంస్థానం .529
✤ గజపతుల కాలం నాటి కమ్మ సేనాధిపతులు 530
✤ కొండవీడు, కొండపల్లిలను పాలించిన
గజపతి సామంతులు-మహాపాత్రులు 532
✤ ఇతర గజపతి సామంతులు 533
✦ విజయనగర సామంత రాజ్యాలు
✤ గండికోట పెమ్మసాని వంశం 541
✤ కురివికుల రాజ్యం 550
✤ రావెళ్లవారి సామంత రాజ్యం 550
✤ రావులవారి రాజ్యం .553
✤ పొత్తపి, పులుగునాడు దివాన్‌గిరులు 553
✤ చెరకు వంశం 554
✤ వెలిసేటి వారి రాజ్యం 554
✤ పులివర్తి సీమ 554
✤ మేదూరి సీమ 555
✤ కలిదిండి సీమ 555
✤ కొప్పర్రు సీమ 555
✤ శాఖమూరు వంశం 555
✤ సూర్యదేవర వంశం .555
✤ ధూపాటి సీమ 556
✤ విజయనగర కాలం నాటి కమ్మ సేనాధిపతులు 556
✤ దొనకొండ రాజ్యం 557
✤ హండే నాయకుల వంశం 558
✤ కుందుర్పి నాయక వంశం 558
✤ హరితి వంశం 559
✤ వెలుగోడు వంశం 559
✤ నందేల నాయక వంశం 560
✤ అరవీడు నాయకుల అవుకు రాజ్యం 560
✤ కందనవోలు గని సీమ రాజ్యం 560
✤ మట్ల వంశం 560

- యాదవరాయ తొండై మండల రాజ్యం 564
- తంజావూరు నాయక రాజ్యం 565
- మధుర నాయక రాజ్యం 570
- జింజి నాయక రాజ్యం 574
- మైసూరు నాయక రాజ్యం 576

✦ గోల్కొండ నవాబుల కాలం నాటి సామంత రాజ్యాలు

- గోల్కొండ నవాబుల కాలంలో కమ్మ సామంతులు 578
- కొండవీటి చౌదరీల పాలన 579
- రొంపిచెర్ల దుర్గం - మేదరమెట్ల వారి పాలన 579
- నందిగామ పరగణా - వాసిరెడ్డి వంశం 579
- చింతపల్లి వంటు జమీ 579
- ముక్త్యాల జమీ 580
- దోమకొండ సంస్థానం 580

✦ మొగల్ యుగంలో సామంత రాజ్యాలు

- కొచ్చర్లకోట, సర్వేపల్లి సీమలు 581
- కర్నూలు నవాబీ 581
- బనగానపల్లె నవాబీ 582
- కడప నవాబీ - మయన వంశం 583
- ఆర్కాట్ రాజ్యం లేక ఆర్కాట్ నవాబీ 586

✦ మరికొన్ని సామంత రాజవంశాలు

- నల వంశం 589
- బడినేనిపల్లె తెలుగు చోళ వంశం 589
- నిడుగల్ చోళులు 589
- నెల్లూరు తెలుగు చోళ వంశాలు-తొండియ రాజు 590
- గుండికర్రు లేక గుండికీర్తి తెలుగు చోళ వంశం 590

✦ మరికొన్ని సామంత రాజ్యాలు

- పాలవంచ సంస్థానం 590
- నెల్లూరు జిల్లా పాలెగాండ్రు - వెంకటగిరి 591
- చుండీ జాగీరు 592
- ముత్యాలపాడు జాగీరు 592
- జూపల్లి జాగీరు 592
- సైదాపురం జాగీరు 592

✤ ఉదయగిరి నవాబీ 593
✤ గుడ్లూరు జాగీరు 593
✤ ఒంగోలు జాగీరు 593
✤ తురవారు జాగీరు 593
✤ తాడిబోయిన జాగీరు 593
✤ చిట్టేడు జాగీరు 593
✤ ఉదాత్తర్ జాగీరు 594
✤ గంగులవారి చెరువపల్లి జాగీరు 594
✤ బుచ్చిరెడ్డిపాలెం జాగీరు 594

మూడవ భాగం పరిపాలనా వ్యవస్థలు 595-670

✦ ముసునూరి కమ్మ నాయక రాజ్య పరిపాలనా వ్యవస్థ 597
✦ రెడ్డి రాజుల పరిపాలనా వ్యవస్థ 599
✦ పద్మనాయకుల పరిపాలనా వ్యవస్థ 605
✦ గజపతుల పరిపాలనా వ్యవస్థ 606
✦ విజయనగర సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థ 612
✦ బహమనీ సుల్తాన్ల పరిపాలనా వ్యవస్థ 650
✦ గోల్కొండ కుతుబ్‌షాహీల పరిపాలనా వ్యవస్థ 653
✦ గోండుల పరిపాలనా వ్యవస్థ 666
✦ రాజవంశాల పట్టికలు 669

నాల్గవ భాగం సంస్కృతీ విభాగం 671-739

ఈ యుగంలో ఆంధ్ర సాంఘిక వ్యవస్థలో వచ్చిన పరిణామం

✦ కమ్మ కులం పుట్టుక – పరిణామం 673
✦ 12వ శతాబ్ద స్థితి – కమ్మ, రెడ్డి, వెలమ కులాలు
ప్రత్యేకంగా రూపొందుట 675
✦ కమ్మలు – వెలమలుగా, కమ్మలుగా చీలుట 676
✦ వెలమ కుల ప్రారంభం 676
✦ రెడ్డి కులం రూపొందడం .677
✦ చాళుక్య, చోళ, కాకతీయ, తెలుగు చోడ వంశాలు
కమ్మ, రెడ్డి కులాల్లో చేరిపోవడం 678
✦ బలిజలు 680
✦ యాదవులు-గొల్లలు 680

✦ క్షత్రియులు లేక రాజులు 680
✦ రెడ్డి, నాయుడు, రాయుడు, చౌదరి పదాల ఉత్పత్తి 681
✦ ముసునూరి కమ్మ నాయక కాలం నాటి సంస్కృతి 683
✦ రెడ్డి యుగంలో ఆంధ్రదేశ సంస్కృతి 684
✦ కమ్మ, రెడ్డి, వెలమ యుగంలో మత పరిస్థితులు 693
✦ రెడ్డి రాజుల కాలం నాటి భాషా సాహిత్యాలు 698
✦ రెడ్డి రాజుల కాలం నాటి శిల్పకళ-ఇతర కళలు 711
✦ పద్మనాయకుల నాటి సంస్కృతి 714
✦ గోండుల సంస్కృతి 721
✦ గజపతుల కాలం నాటి ఆంధ్ర సంస్కృతి 723
✦ గజపతుల కాలంలో భాషా సాహిత్యాలు 729

విజయనగర సంస్కృతి 740-889

✦ విజయనగర పట్టణ వైభవం 740
✦ విజయనగర కాలం నాటి సాంఘిక పరిస్థితులు 744
✦ విజయనగర యుగంలో స్త్రీల స్థితిగతులు 755
✦ విజయనగర యుగంలో ఆర్థిక పరిస్థితులు 760
✦ విజయనగర యుగంలో మత పరిస్థితులు 779
✦ ముస్లింల పట్ల విజయనగర చక్రవర్తుల వైఖరి 795
✦ విజయనగర యుగంలో సంస్కృత భాషా సాహిత్యాలు 801
✦ విజయనగర యుగంలో తెలుగు భాషా సాహిత్యాలు 807
✦ దక్షిణాత్యంలో తెలుగు భాషా సాహిత్యాలు-
నాయక రాజుల యుగం .818
✦ విజయనగర యుగంలో కన్నడ సాహిత్యం 826
✦ విజయనగర యుగంలో తమిళ సాహిత్యం 831
✦ విజయనగర యుగంలో శిల్పకళ 835
✦ ముస్లిం సంస్కృతి - హిందూ ముస్లింల సంబంధాలు 882
✦ బహమనీ కాలం నాటి సంస్కృతి 884

గోల్కొండ యుగంలో ఆంధ్ర సంస్కృతి 890-976

✦ గోల్కొండ యుగంలో సాంఘిక పరిస్థితులు 890
✦ గోల్కొండ యుగంలో మత పరిస్థితులు 897
✦ గోల్కొండ యుగంలో ఆర్థిక పరిస్థితులు 900

✦ కుతుబ్‌షాహీల కాలంలో భాషా సాహిత్యాలు 913
✦ కుతుబ్‌షాహీల తెలుగు భాషా పోషణ 916
✦ కుతుబ్‌షాహీల వాస్తువు - శిల్పకళ 922
✦ గోల్కొండ, హైదరాబాద్ నిర్మాణాలు 923
✦ కొండపల్లి, కొండవీడు దుర్గాలు 943
✦ నేలకోట - రంపచోడవరం మండలం 947
✦ గుఱ్ఱంకొండ దుర్గం 948
✦ ఈ యుగంలోని పద కవిత్వం -
వాగ్గేయకారులు - సంఘ సంస్కర్తలు 950
✦ ఐరోపా వారి రాక - నూతన ఆర్థిక వ్యవస్థ 954
✦ ఇంగ్లిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ 959
✦ నాణేలు 963
✦ కాకతీయ నాయకులు .965
✦ కొత్త అంశాలు 967
✦ యుగ సమీక్ష 975
✦ BIBLIOGRAPHY 976

మొదటి భాగం

ప్రధాన రాజవంశాల చరిత్ర

కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ఆంధ్రదేశ పరిస్థితి

ప్రతాపరుద్రుని ఓటమి తర్వాత ఓరుగల్లు తుగ్లక్‌ల వశమైంది. ప్రతాపరుద్రుని ఢిల్లీకి బందీగా పంపారు. అతడు మార్గమధ్యంలో నర్మదా నదిలో దూకి ఆత్మార్పణ చేసుకున్నాడు. ప్రతాపరుద్రుని మరణవార్త విన్న కాకతీయ కుటుంబం భయభ్రాంతులకు లోనైంది. ముస్లింలు తమను ఏమి చేస్తారోనని నగరం వదిలి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నారు. ప్రతాపరుద్రునికి విరూపాక్షదేవుడు, వీరభద్రదేవుడు అనే ఇద్దరు కుమారులు, అన్నమదేవుడు అనే తమ్ముడు ఉన్నారు. అన్నమదేవుడు అన్న కుమారులను, ఇతర కుటుంబ సభ్యులను తీసుకొని ఓరుగల్లు విడిచి బస్తరు అడవుల్లోకి వెళ్లిపోయాడు. అక్కడ వారు ఒక రాజ్యాన్ని స్థాపించుకున్నారు. ఆ రాజ్యమే బస్తరు సంస్థానం. చాళుక్య, కాకతీయయుగంలో ఈ రాజ్యానికి చక్రకూట రాజ్యమని పేరుంది. ఆ రాజ్యమే బ్రిటిష్ యుగంలో బస్తరు సంస్థానంగా రూపొందింది. బస్తరు సంస్థానాధీశులు తాము కాకతీయ వంశస్తులమని చెప్పుకున్నారు. ఈ వంశంలో చివరివాడు బంజ్‌దేవ్. 1966వ సంవత్సరంలో ఆయన కాల్పుల్లో మరణించాడు. దాంతో బస్తరు సంస్థానం పూర్తిగా భారత్ యూనియన్‌లో కలిసిపోయింది. ఈ విధంగా కాకతీయ వంశం ఆంధ్ర దేశానికి దూరంగా వెళ్లిపోయింది.

కాకతీయ కుటుంబం ఓరుగల్లును వదిలి వెళ్లిపోయిన తర్వాత ఓరుగల్లు కోట, నగరంతోసహా కాకతీయ సామ్రాజ్యం పూర్తిగా తుగ్లక్‌ల వశమైంది. కాకతీయ సేనానులు ఓరుగల్లును వదిలిపెట్టి వెళ్లిపోయారు. కొందరు బందీలుగా చిక్కారు. మరికొందరు అడవులకు పారిపోయారు. సైన్యం చెల్లాచెదురైంది. రాజ్య వ్యవస్థ అంతా ఛిన్నాభిన్నమైంది. కొందరు సేనాధిపతులు ముస్లింలకు చిక్కి, ముస్లింలుగా మార్చబడ్డారు. మరికొందరు ఇష్టపూర్తిగానే ముస్లింలుగా మారి వారి కొలువులో చేరి ఉద్యోగాలు సంపాదించారు. అట్టివారిలో గన్నమ నాయకుడు ప్రసిద్ధుడు. ఇతడు ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లు కోట రక్షకుడిగా నియమింపబడ్డాడు. అతడు యుద్ధకాలంలో ప్రతాప రుద్రునికి ద్రోహం చేసి తుగ్లక్ సైన్యాలకు సహాయం చేశాడు. అంతేగాక బుచ్చిరెడ్డి, బొబ్బారెడ్డి మొదలగు కాకతీయ సేనానులను కూడా ముస్లింల వైపు తిప్పి గొప్ప ద్రోహం చేశాడు. అతడు ముస్లిం మతంలోకి మారిపోయాడు. మాలిక్ మక్బూల్ అని ముస్లిం పేరు కూడా పెట్టుకున్నాడు. అతని సేవలకు మెచ్చి సుల్తాన్ అతనిని ఓరుగల్లుకు గవర్నర్‌గా నియమించాడు. ఇతని లాగా మరికొందరు కూడా ముస్లిం మతం పుచ్చుకొని పదవులు సంపాదించారు. ఈ విధంగా మారిన నూతన ముస్లింలు ఇంకా దారుణంగా వ్యవహరించి హిందువులను హింసించారు. పైగా వారికి హిందువుల లోటుపాటులన్నీ తెలుసు గనుక వారిని ఇంకా సులభంగా ఎక్కువ బాధలకు గురిచేశారు.

ఆత్మాభిమానం గల సేనాధిపతులు, ఉద్యోగులు సుల్తాన్‌ల కింద నాయంకర పదవులు స్వీకరించేకన్నా దారిద్ర్యాన్ని అనుభవించడమే మేలని ఢిల్లీ సుల్తాన్ కొలువును నిరాకరించారు. అలాంటివారి పాలిత ప్రాంతాలను లాక్కున్నారు. కొందరు రాజకీయ జీవితానికి స్వస్తి చెప్పారు. కొందరు బందీలయ్యారు. మరికొందరు కొండలు, కోనలు పట్టిపోయి అజ్ఞాతంగా జీవించసాగారు. కొందరు మాత్రం సుల్తాన్‌యందు విధేయతలను నటిస్తూ తమ పదవులను అంటిపెట్టుకొని ఉన్నారు. ఆ స్థితిలో ముస్లిం సైన్యాలకు అడ్డూ ఆపూ లేకపోయింది. వారు తెలుగు ప్రజలపై అమానుష దుష్కార్యాలు జరిపారు. హిందువుల సామూహిక హత్యలు, మతాంతరీకరణలు సర్వసాధారణమై పోయాయి. హిందువులను బానిసలుగా చేసి తమ పై అధికారులకు బహూకరించారు. యుద్ధ ఖైదీలుగా చిక్కిన సైనికులకు కొరత వేశారు. దేశాన్ని కొల్లగొట్టారు. ఇళ్లలో చొరబడి స్త్రీలపై అత్యాచారాలు జరిపారు. వారి సొత్తును దోచుకున్నారు. వారి పిల్లలను కత్తులకు ఎర వేశారు. గోవులను వధించి గోమాంస భక్షణ చేశారు. స్త్రీలను చెరపట్టారు. వేలాది యువతులను పట్టుకొని గుంపులు గుంపులుగా ఈడ్చుకొనిపోయి తమ పై అధికారులకు బహూకరించారు. వారి కుషీ విలాస జీవితాలకు స్త్రీలు బలి పశువులయ్యారు. మధ్యయుగంలో స్త్రీలు కూడా పురుషునిగా ఆస్తిగా పరిగణింపబడేవారు. కనుక స్త్రీని బహుమతి వస్తువుగా ఇచ్చేవారు.

ముస్లింలు దేవాలయాలపై దాడులు చేశారు. పూజారులను, బ్రాహ్మణులను వధించారు. కొందరి నాలుకలు

కోసి వినోదించారు. దేవాలయాలలోని పవిత్ర హిందూ గ్రంధాలను దగ్ధం చేశారు. దేవాలయాలను నాశనం చేశారు. కొన్ని దేవాలయాలను మసీదులుగా మార్చారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని సోమేశ్వరాలయం శిఖరాన్ని కూల్చి గుమ్మటం నిర్మించి మసీదుగా మార్చారు. అదే నేడు దేవల్ మసీదుగా పిలవబడుతోంది. రామప్ప, పిల్లలమర్రి, ఓరుగల్లు, హనుమకొండ మొదలైన ప్రాంతాల్లో కూడా అనేక దేవాలయాలు విధ్వంసానికి గురయ్యాయి. పాలమూరు సమీపంలోని బూదాపూరులో ఉన్న ఒక దేవాలయాన్ని కూల్చి అక్కడ ఒక మసీదును నిర్మించారు. ఆ మసీదు గోడలపై అనేక కాకతీయ శాసనాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. రాజమహేంద్రవరంలోని పెద్దబజారులో చాళుక్య రాజరాజ నరేంద్రుడు నిర్మించిన ఒక విష్ణు దేవాలయాన్ని క్రీ.శ.1324లో పడగొట్టి దానిని మసీదుగా మార్చారు. ఈ మసీదును నేడు రాజమండ్రిలో పెద్ద మసీదు అని పిలుస్తున్నారు. ఈ మసీదులోని స్తంభాలు, ముఖద్వారం మార్చకుండా అలాగే ఉన్నాయి. దానిని చూస్తే అది దేవాలయం అని ఎవరికైనా తెలుస్తుంది. అలాగే దేశమంతటా అనేక దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. అనేక మసీదులు నిర్మించబడ్డాయి. అలాగే త్రిపురాంతకం, నెల్లూరు, పెనుగొండలలో కూడా అనేక దేవాలయాలు కూడా నాశనం చేయబడ్డాయి. అక్కడ కూడా మసీదులు నిర్మించారు. క్రీ.శ.1327వ సంవత్సరంలో ముస్లిం సైన్యం శ్రీరంగంపై దాడిచేసింది. ఆ క్లిష్టసమయంలో అక్కడ అర్చకులు దేవాలయంలోని మూలవిరాట్టును తీసి మారు తోవగుండా కేరళ చేర్చారు. అక్కడి నుండి మైసూరు రాష్ట్రంలోని మేల్కోట్‌కు చేర్చారట. అక్కడి నుండి తిరుమల అడవులలోకి చేర్చి దాచి రక్షించారట. ఆ విగ్రహం క్రీ.శ.1371 వరకు తిరుమలలోనే ఉన్నదట. కంపరాయలు మధుర సుల్తాన్‌లను ఓడించి తొండై మండలం, మధుర రాజ్యాలను జయించిన తర్వాత క్రీ.శ.1371వ సంవత్సరంలో విజయోత్సాహంతో ఆ విగ్రహాన్ని తిరిగి శ్రీరంగం చేర్చి ప్రతిష్టించారట. ఈ విధంగా అనేక దేవాలయాలు ముస్లింల దౌష్ట్యానికి గురయ్యాయి. అలెగ్జాండర్ అనే పురాతత్వ శాస్త్రవేత్త- దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. అర్చకులు, భక్తులు వధింపబడ్డారు, దైవధనం అపహరింపబడిందని రాశాడు.

ఈ విధంగా ఆంధ్ర దేశ పరిస్థితి అరాచకత్వానికి నిలయమైంది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించారు. సుల్తాన్ దేశ ప్రజలపై తన ఇష్టం వచ్చినట్లు పన్నులు విధించాడు. అంతకు పూర్వం వసూలు చేసిన పన్నులకన్నా 10 శాతం ఎక్కువ విధించాడని, అధిక పన్నుల భారంతో, నిర్బంధపు వసూళ్లతో ప్రజలు, రైతులు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారని జియావుద్దీన్ బారానీ రాశాడు.

ఆంధ్రదేశంలో తుగ్లక్ సార్వభౌమాధికారం క్రీ.శ.1325-35

1323వ సంవత్సరంలో కాకతీయ సామ్రాజ్య పతనానంతరం తుగ్లక్ సైన్యాలు కొద్ది కాలంలోనే ఆంధ్ర దేశాన్నంతటినీ ఆక్రమించాయి. ఓరుగల్లు కోట దగ్గర జరిగిన చివరి యుద్ధంలో ప్రతాపరుద్రుడు బందీగా చిక్కడంతో ఓరుగల్లు కోట జునాఖాన్ వశమైంది. జునాఖాన్ ప్రతాపరుద్రుని ఢిల్లీ పంపాడు. మార్గమధ్యంలో అతడు నర్మదా నదిలో దూకి ఆత్మార్పణ చేసుకున్నాడని విలస శాసనం తెలుపుతోంది. ప్రతాపరుద్రుని మరణానంతరం అతని కుటుంబీకులు బస్తరు అడవులలోకి వెళ్లిపోయారు. దాంతో జునాఖాన్ ఓరుగల్లును పూర్తిగా ఆక్రమించి సుల్తాన్‌పూర్ అని నామకరణం చేసి తుగ్లక్ సామ్రాజ్యంలో అంతర్భాగం చేశాడు. తర్వాత తెలంగాణ ప్రాంతమంతా జయించడానికి ఒక పెద్ద సైన్యాన్ని పంపాడు ఆ సైన్యం తెలంగాణ ప్రాంతాలన్నీ జయించి సుల్తాన్ స్వాధీనంలోకి తెచ్చింది. దాంతో తెలంగాణ అంతటా సుల్తాన్ అధికారం స్థిరపడింది. ఆ తర్వాత అతడు కాకతీయ రాజ్య భాగాలన్నింటినీ తన ఆధిపత్యంలోకి తెచ్చుకోడానికి అన్ని దిక్కులకు తుగ్లక్ సైన్యాలను పంపాడు. ఒక సైన్యం కోస్తా ఆంధ్రను జయించడానికి పంపాడు. ప్రతాపరుద్రుని మరణానంతరం వివిధ ప్రాంతాలను పాలించిన కాకతీయ ప్రతినిధులు స్వతంత్రం ప్రకటించి ఉండవచ్చు. వారిని అదుపులోకి తెచ్చి కాకతీయ సామ్రాజ్య భాగాలన్నింటినీ తన ఆధిపత్యం కిందికి తెచ్చుకోవడానికి జునాఖాన్ ఆంధ్రదేశంలోని అన్ని దిక్కులకు సైన్యాలు పంపినట్లుగా కన్పిస్తోంది.

రాజమహేంద్రవరంపై దాడి: ఆ విధంగా దాడికి పంపిన ఒక సైన్యం కోస్తా ఆంధ్ర దేశంపై దండెత్తింది. ఆ సైన్యం మార్గమధ్యంలోని నిడదవోలు లేక నిరవద్యపురం కోటను జయించింది. తర్వాత రాజమహేంద్రవరంపై దండెత్తి దానిని కూడా ఆక్రమించి ఆ ప్రాంతాలన్నీ ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపింది. ఈ దండయాత్రా కాలంలో రాజమహేంద్రవరం ప్రధాన వీధిలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయాన్ని ధ్వంసం చేసి దానిని మసీదుగా మార్చి, దాని ముఖద్వారంపై పర్షియా భాషలో శాసనం రాయించబడింది. ఈ శాసనం క్రీ.శ.1324 సెప్టెంబర్ 10వ తేదీన వేయించబడింది. ఈ మసీదు నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. ఇదే నేటి రాజమండ్రి పట్టణం ప్రధాన వీధి మధ్యలో ఉన్న పెద్ద మసీదు. ఇది ఒకప్పుడు హిందూ దేవాలయం అని రుజువు చేస్తూ ఆలయ ముఖద్వారం, మసీదు లోపల ఉన్న దేవాలయస్తంభాలు ఇప్పటికీ అలాగే నిలిచి ఉన్నాయి. ఈ మసీదు ముఖద్వారంపై వేయించిన పర్షియన్ శాసనం ఉలుగ్‌ఖాన్ అనే తుగ్లక్ సేనాధిపతి రాయించినట్లు ఉంది. కనుక కోస్తాను జయించడానికి బయలుదేరిన తుగ్లక్ సైన్యానికి ఉలుగ్‌ఖాన్ అనే సరదారుడు నాయకత్వం వహించాడని స్పష్టపడుతోంది. ఈ ఉలుగ్ ఖాన్ తుగ్లక్ రాజకుమారుడైన జునాఖాన్ అని భావింపబడింది. ఘియాజుద్దీన్ సుల్తాన్ అతనినే రాజమహేంద్రవర దుర్గపాలకునిగా నియమించాడు. ఈ శాసనం కోస్తాలో ఘియాజుద్దీన్ తుగ్లక్ అధికారం ఏర్పడిందని స్పష్టంగా తెలుపుతోంది. రాజమహేంద్రవర ఆక్రమణతో ఉత్తరాంధ్ర వరకు వ్యాపించి ఉన్న కాకతీయ రాజ్య భాగాలన్నీ తుగ్లక్‌ల అధికారం కిందికి వచ్చాయి. క్రీ.శ.1324వ సంవత్సరానికి చెందిన ఘియాజుద్దీన్ తుగ్లక్ నాణేలు ఏలూరు సమీపంలో లభించాయి. కోస్తా ఆంధ్ర దేశంలో తుగ్లక్ పరిపాలన ఏర్పడిందని ఈ నాణేలు కూడా రుజువు చేస్తున్నాయి.

కటకంపై దాడి: రాజమహేంద్రవరాన్ని ఆక్రమించిన తర్వాత తుగ్లక్ సైన్యం జాజి నగరంపై దండెత్తినట్లు ముస్లిం రచనలు తెలుపుతున్నాయి. త్రిలింగ దేశాన్ని జయించిన తర్వాత జునాఖాన్ జాజినగరంపై దండెత్తి కొల్లగొట్టాడని ముస్లిం చరిత్రకారులు స్పష్టంగా రాశారు. ఒరిస్సాను ముస్లిం రచయితలు జాజినగరంగా పేర్కొన్నారు. ఈ కాలంలో కళింగ దేశాన్ని భానుదేవుడు పాలించాడు. తుగ్లక్ సైన్యాలు భానుదేవుని ఓడించి 40 ఏనుగులను బహుమానంగా పొంది విజయంతో తిరిగి వచ్చినట్లు చెబుతున్నాయి. కాని భానుదేవుని వారసుడైన రెండవ నరసింహుని శాసనం భానుదేవుడు ముస్లిం సైన్యాలను ఓడించి తరిమి వేసినట్లు తెలుపుతోంది. ఏమైనా రాజమహేంద్రవర ఆక్రమణ తర్వాత తుగ్లక్ సైన్యాలు ఒరిస్సాపై దండెత్తాయని స్పష్టంగా అంగీకరింపవచ్చు. అలాగే ఒరిస్సా వరకు ఉన్న ఆంధ్రా కోస్తా అంతా తుగ్లక్‌ల వశమైందని కూడా భావించవచ్చు.

దక్షిణాంధ్ర ఆక్రమణ - నెల్లూరుపై విజయం: నెల్లూరు మొదలగు దక్షిణాంధ్ర ప్రాంతాలను జయించడానికి జునాఖాన్, మరొక తుగ్లక్ సైన్యాన్ని పంపినట్లు తెలుస్తోంది. ప్రతాపరుద్రుని కాలంలో నెల్లూరు సీమను ముప్పిడి నాయకుడు పాలించాడు. అతని పాలన తర్వాత నెల్లూరు ప్రాంతాన్ని ముస్లింలు పాలించినట్లు ఒక చాటుపద్యం తెలుపుతోంది. కనుక దక్షిణాంధ్రను జయించడానికి పంపిన తుగ్లక్ సైన్యం నెల్లూరును ఆక్రమించి ఉండవచ్చు. తర్వాత తుగ్లక్ సైన్యం ఇంకా దక్షిణంగా పురోగమించి కంచి వరకు ఉన్న ఆంధ్ర ప్రాంతాలన్నింటినీ ఆక్రమించింది. ఆ కాలంలో కంచి ప్రాంతాన్ని సంబువరాయ అనే వంశం వారు పాలించినట్లు తెలుస్తోంది. వీరు ప్రతాపరుద్రుని సామంతులు కావచ్చు. వీరి రాజధాని కంచి, పడైవీడులు. పడైవీడుకు రాజగంభీరదుర్గం అని కూడా పేరుంది. కంచి తర్వాత తుగ్లక్ సైన్యాలు మధురపై దండెత్తాయి.

మధుర రాజ్య ఆక్రమణ: ఉత్తరాంధ్ర స్వాధీనం కాగానే ఒరిస్సాపై దండెత్తినట్లు దక్షిణాంధ్ర ఆక్రమణ పూర్తికాగానే తుగ్లక్ సైన్యం తమిళ దేశంలోని మధుర రాజ్యంపై కూడా దండెత్తింది. అతి ప్రాచీన కాలం నుంచీ మధుర రాజ్యాన్ని పాండ్యులు పాలించేవారు. గణపతిదేవుని కాలంలో పాండ్యులు అద్వితీయ శక్తివంతులుగా రూపొంది, కాకతీయ రాజ్యంపై దండెత్తి ముత్తుకూరు యుద్ధంలో గణపతి దేవుని ఓడించారు. తర్వాత రుద్రమదేవి వారిని ఓడించి తరిమి వేసింది. ప్రతాపరుద్రుని కాలంలో పాండ్య సింహాసనం కోసం సుందర పాండ్యుడు, వీరపాండ్యులు తగవులాడి చివరకు ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్‌కు లొంగిపోయారు. వారసత్వ కలహాలతో బలహీనమై ఉన్న పాండ్య రాజ్యాన్ని తుగ్లక్ సేనలు సునాయాసంగా జయించాయి. అక్కడ పాండ్య వంశాన్ని తొలగించి జునాఖాన్ జలాలుద్దీన్ హసన్‌షా అనే సరదారుని మధుర గవర్నర్‌గా నియమించాడు. బహుశ మధురపై దండెత్తిన తుగ్లక్ సేనకు జలాలుద్దీన్ నాయకత్వం వహించి ఉంటాడు. ప్రాంతీయ రచనలు క్రీ.శ.1323లో ఢిల్లీ నుండి వచ్చిన ముస్లిం సైన్యాలు మధురను జయించినట్లు స్పష్టంగా తెలుపుతున్నాయి. కనుక ఓరుగల్లును ఆక్రమించిన సంవత్సరంలోనే తుగ్లక్ సైన్యాలు దక్షిణాంధ్రపై దండెత్తి నెల్లూరు, కంచిలను జయించుకుంటూ మధురను ఆక్రమించాయని భావించవచ్చు. 1328వ సంవత్సరం నాటికే నెల్లూరు, మాబార్ ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యంలో భాగాలయ్యాయని అబ్దుల్లావాసఫ్ రచన తెలుపుతోంది. మధుర, తెలంగాణలు తుగ్లక్ సామ్రాజ్యంలో రెండు రాష్ట్రాలయ్యాయి. దేవగిరి వజీరైన మాలక్ బుర్హాన్ ఉద్దీన్ తెలంగాణకు అధిపతి అయ్యాడు. పరిపాలనలో అతనికి సహాయంగా ఓరుగల్లులో మాలిక్ మక్బూల్ నాయబ్ వజీరుగా నియమింపబడ్డాడు. మహ్మద్‌బీన్ తుగ్లక్ 23 రాష్ట్రాలలో మాబార్ కూడా ఒకటని బారాని అనే ముస్లిం చరిత్రకారుడు రాశాడు. మధుర రాజ్యాన్ని ముస్లిం చరిత్రకారులు మాబార్ అని వ్యవహరించారు. క్రీ.శ.1327వ సంవత్సరంలో మహమ్మద్ బీన్ తుగ్లక్ తన రాజధానిని ఢిల్లీ నుండి దేవగిరికి మార్చినప్పుడు అతని సామ్రాజ్యంలో ఉన్న 23 రాష్ట్రాల్లో మాబారు లేక మధుర కూడా ఒకటని పేర్కొనబడింది. కనుక కాకతీయ రాజ్యాన్ని ఆక్రమించిన వెంటనే మధుర పాండ్య రాజ్యాన్ని కూడా జునాఖాన్ జయించి తుగ్లక్ సామ్రాజ్యంలో భాగం చేశాడని పండితులు అభిప్రాయపడ్డారు. ఈ విజయాలతో యావదాంధ్ర దేశం క్రీ.శ.1323-24వ సంవత్సరం నాటికి తుగ్లక్ సామ్రాజ్యంలో అంతర్భాగం అయింది.

ఆంధ్రదేశంలో తుగ్లక్ పరిపాలన-క్రీ.శ.1323-25: ఆంధ్రదేశాన్ని జయించిన తర్వాత జయించిన ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని శాశ్వతంగా నిలుపుకోవడానికి జునాఖాన్ ఆంధ్రదేశంలో తుగ్లక్ పరిపాలనా విధానాన్ని ప్రవేశపెట్టాడు. వివిధ ప్రాంతాలలో ఉన్నత పదవులలో అమీరులు, మాలిక్‌లు మొదలగు ముస్లిం సరదారులను నియమించాడు. ఇతర సిబ్బందిని కూడా ఏర్పాటు చేశాడు. అంతకు పూర్వం అమల్లో ఉన్న కాకతీయ పరిపాలనా పద్ధతులను పూర్తిగా తొలగించి వేశాడు. కీలక ప్రాంతాలలో ముస్లిం సైన్యాన్ని నిలిపాడు. దాంతో ఆంధ్ర దేశం మొత్తం పూర్తిగా తుగ్లక్‌లకు తలవంచింది.

తుగ్లక్ సామ్రాజ్య పరిపాలనా విభాగాలు: దక్షిణ భారతదేశంలో క్రమబద్ధమైన ముస్లిం పరిపాలనను మొట్టమొదట ప్రవేశపెట్టిన వాడు మహమ్మద్ బీన్ తుగ్లక్. అంతకు పూర్వం దక్షిణ భారతదేశంలో అడుగుపెట్టిన మొదటివాడు అల్లావుద్దీన్ ఖిల్జీ. అతడు విజేత కూడా. కాని దక్షిణ భారతదేశాన్ని ఢిల్లీ సామ్రాజ్యంలో కలపాలనే కోరిక అతనికి లేదు. కప్పాలతో తృప్తిపడ్డాడు. కాని మహమ్మద్ బీన్ తుగ్లక్ అలాగాక తాను జయించిన ప్రాంతాలన్నీ ఢిల్లీ సామ్రాజ్యంలో ఉండాలని తలచి కాకతీయ, మధుర, కంపిలి రాజవంశాలను తొలగించి ముస్లిం గవర్నర్‌లను నియమించి వారి ప్రాంతాలను సామ్రాజ్యంలో కలిపేశాడు. దక్షిణ దేశాన్ని అదుపులో పెట్టడానికి తన రాజధానిని దౌలతాబాద్‌కు మార్చి దానికి ఖబ్బాతు ఇ ఇస్లాం Qubbatu-I-Islam అని పేరు పెట్టాడు. అంటే

Dome of Islam అని అర్థం. కాని ఆ పేరు నిలువలేదు. తిరిగి దౌలతాబాద్‌గానే పిలువబడింది.

సుల్తాన్ దక్షిణ భారతదేశంలో తాను జయించిన ప్రాంతాలన్నింటినీ ఐదు రాష్ట్రాలుగా విభజించాడు.

1. దేవగిరి.
2. తిలింగ్.
3. ద్వార సముద్రం.
4. కంపిలి.
5. మాబార్.

రాష్ట్రాన్ని ఇఖ్లిమ్ Iqlım or Aqalı అని పిలిచేవారు ఇఖ్లిమ్‌కు అధిపతిని అంటే రాష్ట్ర గవర్నర్‌ను వలి అనేవారు. ఇఖ్లిమ్‌ను మదీనాలుగా (Madına) విభజించారు. మదీనాలు మళ్లీ రెండు రకాలు షహర్‌లు, షిక్‌లు Shahrs and Shıqes. షహర్‌లు Urban dıstrıcts, Shıque లు Rural dıstrıcts. వీటిపై అధికారులను షిగ్దార్ అని పిలిచేవారు షిగ్దార్‌లకు పరిపాలనలో తోడ్పడటానికి అమీల్‌లు లేక నాజిమ్‌లు (Amıls or Nazıms) అనే ఉద్యోగులను నియమించారు. షిక్‌ల తర్వాత 100 గ్రామాలు గల మరొక పరిపాలన విభాగాలను ఏర్పాటు చేసి వాటిని సదహ్‌లని పేరుపెట్టారు. సదహ్‌లపై అమీరాని ఐ సదహి అనే అధికారిని నియమించారు. ఈ అమీరానీలు కేవలం పన్నులు వసూలు చేసే అధికార్లే కాదు, వారికి సైన్యాధిపతులు కూడా ఈ విధంగా ఏర్పరచబడిన ఉద్యోగి దళాన్ని అమీరులు అనేవారు రాష్ట్రాధిపతులైన వలి, షిక్ అధిపతి అయిన షిగ్దార్‌లు ప్రజలకు కనిపించేవారు కాదు. కింది తరగతి ఉద్యోగులు ప్రజల వద్దకు వచ్చేవారు. వారేమిటో ప్రజలకు తెలియదు. ఈ విధంగా తాము ఎరుగని నూతన పరిపాలనా విధానం క్రీ.శ.1323-1325 సంవత్సరాల మధ్య దక్షిణ దేశ ప్రజలపై హఠాత్తుగా విధింపబడింది అందువల్ల పరిపాలనాపరంగా అగమ్యగోచర పరిస్థితులు తటస్థించాయి. అలాంటి స్థితిలో చిన్న తరగతి ముస్లిం ఉద్యోగులు, సైనికులు ప్రజలపై దారుణ కృత్యాలకు పాల్పడ్డారు. సైన్యాధిపతులను అమీర్ ఉల్ ఉమ్మా అనేవారు. అన్ని ప్రాంతాలకు అవసర సమయాలలో సైన్యాలను త్వరగా చేర్చడానికి బారీబర్‌దారాన్ అనే ప్రత్యేక సేనాధిపతులు నియమింపబడ్డారు. దేశంలోని అన్ని ముఖ్య కేంద్రాలు ముస్లిం సైనికులతో నింపబడ్డాయి. దాంతో ఆంధ్రదేశంలో పూర్తిగా ముస్లిం సైనిక పరిపాలన ఏర్పడింది.

ముస్లిం సరదారులు ఆంధ్ర దేశంలో సాంప్రదాయకంగా వచ్చే అన్ని విధానాలను తారుమారు చేశారు. ధనం కోసం రైతులు, బీదలు, ధనవంతులు అనే భేదం లేకుండా ప్రజలను పీడించారు రైతులపై విపరీతమైన పన్నులు విధించి క్రూరంగా వసూలు చేశారు పూర్వం బ్రాహ్మణులకు రాజులు ఇచ్చిన అగ్రహారాలను లాక్కున్నారు అనేక మంది బ్రాహ్మణులను గోవులను వధించారు. కల్లు తాగడం, గోమాంసం భక్షించడం, స్త్రీలపై అత్యాచారాలు చేయడం, బ్రాహ్మణులను వధించడం నిత్యకృత్యాలయ్యాయని విలస శాసనం వర్ణించింది. అనేక దేవాలయాలు నేలమట్టం అయ్యాయి. కొన్నింటిని మసీదులుగా మార్చారు. దేవాలయాలకు పూర్వం రాజులు ఇచ్చిన ఈనాములను ఆక్రమించారు. కొన్ని దేవాలయ ఈనాములను మసీదుల పరం చేశారు. హిందువులను నాశనం చేయడమే వారి ధ్యేయంగా ప్రవర్తించారు. ముస్లిం పాలనలో ఆంధ్ర ప్రజలు అనుభవించిన కడగళ్లను విలస శాసనం వర్ణించగా, ద్రవిడ దేశంలో ద్రవిడ ప్రజలు, ద్రవిడ కాంతలు అనుభవించిన దుర్భర జీవితాలను గంగాదేవి మధురా విజయం వర్ణించింది.

ఆనాటి ఆంధ్రదేశ పరిస్థితులను విలస శాసనం వర్ణించింది. ఆ శాసనంలోని 21వ శ్లోకం నుండి 28వ శ్లోకం వరకు అప్పటి ప్రజలు అనుభవించిన బాధలను, దయనీయ గాథలను కళ్లకు కట్టినట్లు చిత్రించింది. ప్రతాపరుద్రుడనే భానుడు అంతర్హితుడు కాగా దేశంలో తురుష్క అంధకారం వ్యాపించింది ప్రతాపరుద్రుని చేత తరిమివేయబడి అధర్మం శత్రువులైన యవనులను చేరి ఉండవచ్చు. లేకపోతే తురుష్కుల తోపాటు నిరాటంకంగా ఎలా విజృంభించగలిగింది, దేశం యవనాక్రాంతమైన తర్వాత ధనికులు పాపులైన తురుష్కుల చేత ధనం కోసం ఎలా పీడింపబడిందో తెలిపింది. పారశీకులను చూసిన వెంటనే కొందరు ప్రాణాలు వదిలారు. ద్విజులు తమ యజ్ఞకర్మలను వదులుకున్నారు. దేవప్రతిమలు సమస్తం భగ్నాలయ్యాయి. చిరకాలంగా మహాపండిత భుక్తాలైన అగ్రహారాలు, దేవమాన్యాలు అపహృతాలయ్యాయి. పాపులైన యవనులు వ్యవసాయం చేసేవారి పంటలను బలాత్కారంగా లాక్కున్నారు. రైతు కుటుంబాలు అన్నీ నాశనమయ్యాయి. అందువలన ధనవంతులు, దరిద్రులు భేదం లేకుండాపోయింది. ఆ మహా విపత్కాల సమయంలో ప్రజలకు ఇది తన ఆస్తి అని, ఇది తన భార్య అనే

భావం పూర్తిగా నశించిపోయింది. కల్లు తాగాలి, గోమాంసం భక్షించాలి, బ్రాహ్మణులను చంపాలి, ఇది యవనాధముల వృత్తి వాళ్ల వ్యాపారం ఇలా ఉంటే ఇంక భూమి మీద ప్రాణికోటి జీవించేదెలా? ఈ విధంగా రాక్షసుల వంటి ఈ తురుష్కుల వలన పీడింపబడిన త్రిలింగ దేశాన్ని రక్షించే వారెవరో తెలియక కార్చిచ్చు చుట్టుకున్న అడవి లాగా ప్రజలు పరితపించిపోయారు ఆ స్థితిలో ప్రజలను, దేశాన్ని రక్షించడానికి విష్ణు అంశతో ముసునూరి ప్రోలయనాయకుడు అవతరించాడు అని విలస శాసనం వివరించింది.

ఆంధ్రదేశం పరిస్థితి ఇలా ఉండగా పాండ్య రాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత తురుష్కులు తమిళ దేశంలో జరిపిన అత్యాచారాలను గంగాదేవి తన మధురా విజయం అనే సంస్కృత కావ్యంలో వర్ణించింది. దేవాలయాలు పాడుబడ్డాయని, తమిళ కన్నెలను చెరపట్టి ఈడ్చుకువెళ్లారని, ధనాన్ని కొల్లగొట్టారని తమిళుల దీనస్థితిని వర్ణించింది. ఆనాడు దక్షిణ దేశంలో కొల్లగొట్టిన ధనరాసులను ముస్లిం చరిత్రకారులు వర్ణించారు. ఆంధ్ర దేశంలోని వజ్రకరూర్ నుండి వజ్రాలు, బంగారం, తమిళ దేశం నుండి ముత్యాలు, మైసూరు నుండి ఏనుగు దంతాలు, చందనం, ఏనుగులు, ఒంటెలపై వేసుకొని ఢిల్లీకి కొనిపోయారట. ఓరుగల్లులో వారికి మణుగుల లెక్కలో బంగారం, వజ్రాలు, రత్నాలు, ఆభరణాలు లభించాయట. దక్షిణ భారతదేశ హిందువులపై తుగ్లక్ సైన్యాలు ప్రదర్శించిన క్రూరత్వం, సామాన్య ప్రజలపై జరిపిన మారణకాండ, స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, చరిత్రలో కనీవినీ ఎరుగనివి. దేవాలయాలపై జరిగిన దాడులు, హిందూ మతానికి జరిగిన అపహాస్యం ప్రతి హిందువులో తీవ్రమైన ద్వేషం కలిగించి ప్రతీకారజ్వాలలను రేకెత్తించాయి. ఆ ప్రతీకారజ్వాలలే దక్షిణ భారత దేశ స్వతంత్ర సమర పోరాటాలుగా మారి స్వల్ప వ్యవధిలో దక్షిణ దేశం నుండి ముస్లింలను పారదోలాయి. అలాంటి స్వాతంత్ర్య సమరం మొట్టమొదట ఆంధ్రదేశంలో ప్రారంభమైంది.

ఆంధ్రదేశం క్రీ.శ.1323 నుండి 1325 వరకు రెండు సంవత్సరాలు తుగ్లక్‌ల భయంకర పరిపాలనలో మగ్గిపోయింది ఈ రెండు సంవత్సరాల ముస్లిం పరిపాలనకు ఆంధ్ర ప్రజలు భయభ్రాంతులయ్యారు. ఎలాగైనా ఈ ముస్లిం పాలన నుండి బయటపడాలని ప్రతి ఆంధ్రునికి గాఢమైన కాంక్ష కలిగింది. ఆంధ్ర దేశంలో తుగ్లక్ అధికారాన్ని అంతం చేయాలని తీవ్ర ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. తత్ఫలితంగా తుగ్లక్ సామ్రాజ్యాధికారంపై క్రీ శ 1325వ సంవత్సరంలో ఆంధ్రదేశం స్వతంత్ర సమరాన్ని ప్రకటించింది. ఈ స్వాతంత్ర్య సమరాన్ని ప్రారంభించిన వారే కమ్మసేనానులైన ముసునూరి ప్రోలయ, కాపయ నాయకులు. క్రీ శ.1325వ సంవత్సరంలో వారికి ముస్లింను పారద్రోలడానికి తగిన అవకాశం లభించింది. క్రీ.శ.1325వ సంవత్సరంలో తుగ్లక్‌లకు వ్యతిరేకంగా బెంగాలులో తిరుగుబాటు జరిగింది. ఆ తిరుగుబాటును అణచడానికి వెళుతూ ఘియాజుద్దీన్ తుగ్లక్ తన కుమారుడైన జునాఖాన్‌ను ఓరుగల్లు నుండి ఢిల్లీ రావలసిందిగా ఆదేశించి తాను బెంగాలుపై దండెత్తాడు. జునాఖాన్, తండ్రి ఆజ్ఞ ప్రకారం ఢిల్లీ వెళ్తూ తన స్థానంలో మాలిక్ బుర్హన్ ఉద్దీన్ అనే సరదారుని దేవగిరి, ఓరుగల్లుపై అధిపతిగా నియమించాడు. అతనికి సహాయంగా ఓరుగల్లులో మాలిక్ మగ్బుల్ అనే మరొక సరదారుని వజీరుగా నియమించాడు ఇతని అసలు పేరు నాగయగన్న. ఇతనిని కన్ను అని కూడా పిలిచేవారు. ఇతడు ప్రతాపరుద్రుని కాలంలో ఓరుగల్లు కోట రక్షకుడు. కటక పాలకుడు అని కూడా అనేవారు. చివరి యుద్ధంలో ఇతడు ముస్లింల వైపు చేరి ప్రతాపరుద్రుని ఓటమికి తోడ్పడ్డాడు. కనుక జునాఖాన్ అతనిని ముస్లింగా మార్చి తన సేనాధిపతులలో ఒకడిగా చేర్చుకున్నాడు. జునాఖాన్ ఢిల్లీ వెళ్లే సమయంలో నాగయగన్నను అంటే మాలిక్ మగ్బుల్‌ను ఓరుగల్లు అధిపతిగా నియమించాడు. దాంతో అతడు తెలంగాణకు పరిపాలకుడయ్యాడు. అతనికి కాకతీయ రాజ్య రహస్యాలన్నీ తెలుసని, కనుక అతడు రాజ్యాన్ని జాగ్రత్తగా కాపాడతాడని జునాఖాన్ ఆశించాడు. జునాఖాన్ ఢిల్లీ వెళ్లి తండ్రిని చంపి సింహాసనం ఎక్కాడు. ఆ సమయంలో అతడు అనేక సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. కనుక అతడు ఓరుగల్లు రాజ్యంపై దృష్టి పెట్టలేకపోయాడు. దానిని ఆసరాగా తీసుకొని, అతని బలహీనతలు కూడా తెలుసును గనుక మాలిక్ మగ్బుల్ వెంటనే క్రీ.శ.1325వ సంవత్సరంలో స్వాతంత్ర్య సమరాన్ని ప్రకటించాడు. వీరోచితంగా పోరాడి ఆంధ్రదేశాన్ని ముస్లిం పాలన నుండి విముక్తి చేశాడు.

ఆంధ్ర స్వాతంత్ర్య సమరం - క్రీ.శ.1325-26

ముస్లిం పాలనలో ఆంధ్ర ప్రజలు భరించలేని బాధలను పద్దారు. అందువల్ల వారిలో అంతులేని తెగింపు కలిగి తుగ్లక్‌ల అధికారంపై తిరుగుబాటు చేసి రెండు సంవత్సరాలలోనే ఆంధ్ర దేశానికి విముక్తిని సాధించారు. ఈ విమోచన యుద్ధాన్ని చరిత్రకారులు ఆంధ్ర స్వాతంత్ర్య సమరమని వర్ణించారు. ఈ ఆంధ్ర స్వాతంత్ర్య సమరం రెండు ఘట్టాలుగా సాగి ఆంధ్ర దేశం విముక్తమైంది. మొదటిది క్రీ.శ.1325- 26వ సంవత్సరంలో ముసునూరి ప్రోలయనాయకుని నాయకత్వంలో జరిగి, కోస్తా ఆంధ్రదేశం మొత్తం, తెలంగాణలో ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలు విముక్తి చెందాయి. తర్వాత రెండవ ఘట్టంలో క్రీ.శ.1335వ సంవత్సరంలో కాపయనాయకుని నాయకత్వంలో ఓరుగల్లు కోట విముక్తి చెందింది. ఉత్తర తెలంగాణ మొత్తం కాపయనాయకుని స్వాధీనం అయింది. దాంతో ఆంధ్రదేశంలో తుగ్లక్ అధికారం నశించి తెలుగుదేశం స్వతంత్రమైంది. ఈ విమోచన ఉద్యమానికే ఆంధ్ర స్వాతంత్ర్య సమరం అని పేరు.

ఆంధ్రదేశాన్ని కడగళ్ల పాలుచేసి, ఆంధ్రుల జీవితాలను దుఃఖమయం చేసిన ముస్లింలను పారదోలి ఆంధ్ర దేశానికి విముక్తి కలిగించడానికి ప్రోలయనాయకుడు నడుం బిగించాడు. ఇతని పూర్వ కార్యకలాపాలు తెలియవు క్రీ.శ.1323వ సంవత్సరంలో ప్రతాపరుద్రునికి జునాఖాన్‌కు జరిగిన యుద్ధంలో ప్రోలయనాయకుడు నిర్వహించిన పాత్ర కూడా మనకు తెలియదు. కాని హఠాత్తుగా క్రీ.శ.1325వ సంవత్సరంలో ప్రోలయనాయకుడు ఆంధ్ర స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించి ముస్లింలను పారదోలి ఆంధ్రదేశానికి విమోచన కలిగించాడు. ఈ విమోచన యుద్ధంలో కాకతీయ కుటుంబసభ్యులుగాని, ఇతర సమకాలీన రాజవంశాలుగానీ మరే ఇతర క్షత్రియ కుటుంబాలు గానీ పాల్గొన్నట్టు లేదు. కేవలం ప్రోలయనాయకుడు, అతని అనుయాయుల సాహసకృత్యాలే ఆంధ్ర దేశానికి విముక్తి కలిగించినట్లుగా తెలుస్తోంది. ప్రోలయనాయకుని విజయాలను అతని చేత విదుదల చేయబడిన విలస శాసనం వర్ణించింది. యవనుల కబంధ హస్తాల నుండి ప్రోలయనాయకుడు త్రిలింగ దేశాన్ని విముక్తి చేశాడని, యవనుల కాలంలో నశించిపోయిన వైదిక ధర్మాన్ని పునరుద్ధరించాడని, యవనుల అశ్వగిట్టలచే మైలబడిన ఆంధ్రదేశాన్ని యజ్ఞాలు జరిపించి శుద్ధపరచాడని, బ్రాహ్మణుల అగ్రహారాలు పునరుద్ధరించాడని, దేవాలయాలలో పూజలు జరిపించాడని, తురుష్కులు ధ్వంసం చేసిన వాటినన్నింటినీ ప్రోలయ పునరుద్ధరించించాడని అదే శాసనం వివరించింది. విలస శాసన కథనాన్ని అతని వారసుడు కాపయ నాయకుడు విదుదల చేసిన పోలవరం శాసనం బలపరుస్తోంది. కనుక ముస్లింలను పారదోలి ఆంధ్రదేశాన్ని విడిపించి నాటి ఆంధ్ర ప్రజల మన్ననలను అందుకున్న ఘనుడు ప్రోలయనాయకుడు. అయితే ప్రోలయనాయకుడు చేసిన యుద్ధాలను, ఓడించిన ప్రత్యర్థులను గురించి ఈ శాసనాలు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదు. కనుక అతని విజయాలను పూర్తిగా తెలుసుకోవడానికి వీలు కలగలేదు. అంతేగాక అతడు ఆంధ్రదేశాన్ని పూర్తిగా విముక్తి చేయలేదని కూడా తెలుస్తోంది. అందుకు కారణమేమిటంటే- క్రీ.శ.1334వ సంవత్సరం వరకు ఓరుగల్లు కోట, తెలంగాణ ప్రాంతాలు తుగ్లక్‌ల వశంలోనే ఉన్నాయని ముస్లిం చరిత్రకారులు రాశారు. ప్రోలయనాయకుని తర్వాత అతని వారసుడు కాపయ నాయకుడు ఓరుగల్లును జయించి తన రాజ్యానికి రాజధానిని చేసుకున్నాడు. కనుక ప్రోలయ నాయకుడు కోస్తా ఆంధ్రదేశాన్ని, ఖమ్మం జిల్లా ప్రాంతాలను మాత్రమే విముక్తి చేశాడని భావించారు

ప్రోలయ నాయకుని రాజధాని ఖమ్మం జిల్లాలోని భద్రాచలానికి దగ్గరలో ఉన్న మాల్యవంత పర్వతాల సమీపంలో ఉన్న రేకపల్లి. కనుక అతడు ముస్లిం సైన్యాలకు అందకుండా రక్షణగా ఉండటానికి పర్వతాలు, అడవులతో నిండి ఉన్న రేకపల్లి ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకొని అక్కడ నివసించే కోయలు మొదలైన ఆటవిక జాతులను సమీకరించి వారికి ఆయుధ ప్రయోగ శిక్షణ, కత్తి సాము, గుర్రపు స్వారీలను నేర్పి మెరుపు దాడులు చేయగల సైన్యాన్ని తయారుచేసుకొని గెరిల్లాయుద్ధం ద్వారా ముస్లింను ఓడించి, కోస్తా ప్రాంతాన్ని, రేకపల్లి ప్రాంతాన్ని విముక్తి చేసి ఉంటాడని పండితులు భావించారు. రేకపల్లి కీలక స్థానంలో ఉంది. అక్కడి నుండి బస్తరు అడవుల్లోకి పారిపోవచ్చు. ఇటువైపు కృష్ణా గోదావరీ నదుల మధ్య ప్రాంతమైన వేంగి దేశంలోకి వెళ్లవచ్చు. గోదావరి దాటి కోరుకొండ, రాజమహేంద్రవర ప్రాంతాలలోకి వెళ్లిపోవచ్చు. అటువైపు తెలంగాణ ప్రాంతాలపై మెరుపు దాడులు చేయవచ్చు. ఈ విధంగా ఎలాంటి పరిస్థితులలోను శత్రువుకు చిక్కకుండా సులభంగా శత్రువుపై

హరాత్తు దాడులు చేయడానికి వీలుగా ఉన్న ప్రదేశం రేకపల్లి అలాంటి ప్రదేశాన్ని తన విముక్తి యుద్ధానికి స్థావరంగా ఎన్నుకోవడంలోనే ప్రోలయనాయకునికి ఉన్న యుద్ధ వ్యూహరచనా చాతుర్యం తెలుస్తోంది. అందువల్ల అతడు అక్కడ, వన, గిరి దుర్గాలను నిర్మించి విముక్తి యుద్ధాన్ని ప్రారంభించాడు. అంతేగాక రేకపల్లి నుండి అతడు ముస్లింలపై గెరిల్లా యుద్ధం ప్రారంభించాడని పండితులు భావించారు. ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలోనే కాదు, ప్రపంచం మొత్తంలోనే గెరిల్లా యుద్ధాన్ని ప్రారంభించిన మొట్టమొదటి వీరుడని పండితులు ప్రోలయ నాయకుని శ్లాఘించారు ఆ తర్వాత మొగలులపై గెరిల్లా పద్ధతిలో అద్భుత విజయాలు సాధించిన మాలిక్ అంబర్, శివాజీలకు కూడా ప్రోలయనాయకుడే మార్గదర్శకుడట ప్రోలయనాయకుడు కృష్ణానది నుండి కళింగ వరకు తీరాంధ్ర దేశాన్ని, తెలంగాణలో ఖమ్మం, దాని పరిసర ప్రాంతాల నుండి ముస్లిం సరదారులను పారదోలి తన ఆధిపత్యం కిందకు తెచ్చుకున్నాడు క్రీ.శ.1326వ సంవత్సరం తర్వాత తీరాంధ్ర దేశంలో ఘియాజుద్దీన్ తుగ్లక్ నాణేలు లభించలేదు క్రీ.శ.1326వ సంవత్సరం నాటి నాణేలే అతని చివరి నాణేలు. కనుక క్రీ.శ.1326 నాటికి ప్రోలయ నాయకుడు తీరాంధ్ర దేశాన్ని విమోచన చేశాడని స్పష్టంగా భావించవచ్చు.

ప్రోలయ వేమారెడ్డి కమ్మనాడు, పలనాడు, వెలనాడుల ఆక్రమణ క్రీ.శ.1325-26: ఇదే సందర్భంలో ప్రోలయ వేమారెడ్డి కమ్మనాడు, పలనాడు, వెలనాడు అని పిలువబడిన నేటి గుంటూరు, ప్రకాశం జిల్లా ప్రాంతాలను ఆక్రమించాడు. ఇతడు ఎవరిని జయించి ఈ ప్రాంతాలు ఆక్రమించాడో తెలియదు. ప్రోలయ వేమారెడ్డికి ముందు ఈ ప్రాంతాలను ఎవరు పాలించిందీ తెలియదు క్రీ.శ.1325వ సంవత్సరం నాటి మల్లవరం శాసనం ప్రోలయ వేమారెడ్డిని మ్లేచ్ఛాబ్ధి-కుంభోద్భవః అని వర్ణించినది. కనుక ఈ ప్రాంతాలను కూడా తుగ్లక్ సరదారులు పాలిస్తూ ఉండి ఉండవచ్చు వారిని పారదోలి ప్రోలయ వేమారెడ్డి ఈ ప్రాంతాలను ఆక్రమించాడని భావించవచ్చు. ప్రోలయ వేమారెడ్డి మల్లవరం శాసనం క్రీ.శ.1326 నాటి కొలని రుద్రదేవుని సంతమాగులూరి శాసనాలు ఈ స్వాతంత్ర్య సమరం క్రీ.శ 1325-26 సంవత్సరాల మధ్య జరిగినట్లు తెలుపుతున్నాయి. క్రీ.శ 1326వ సంవత్సరం నాటి ఘియాజుద్దీన్ నాణెమే కోస్తాలో లభించిన చివరి తుగ్లక్ నాణెం. కనుక కృష్ణకు దక్షిణ భాగం కూడా క్రీ.శ.1325-26 సంవత్సరంలో విముక్తి చెందిందని భావింపబడింది.

దక్షిణ తెలంగాణ విమోచన: ఇదే కాలంలో రేచర్ల సింగమనాయకుడు నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతాలను విమోచన చేశాడు. రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, అనుమగల్లు, పిల్లలమర్రి, పాలమూరు మొదలైన ప్రాంతాలన్నీ ఇతని వశమయ్యాయి. ఓరుగల్లు కోట, ఉత్తర తెలంగాణ ప్రాంతాలైన కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలు తప్ప మిగిలిన తెలంగాణ అంతా ముస్లింల పాలన నుండి విముక్తి చెందింది. ఓరుగల్లు, ఉత్తర తెలంగాణ క్రీ.శ.1334 వరకు ముస్లింల చేతిలోనే ఉండిపోయాయి. అలాగే రాయలసీమలోని అనంతపురం ప్రాంతం కంపిలి రాజ్యంలో ఉండిపోయింది కర్నూలు జిల్లా ప్రాంతం ముస్లింల పాలనలోనే ఉండిపోయినట్లు కనిపిస్తోంది.

మొత్తం మీద ప్రోలయనాయకుడు, ప్రోలయ వేమారెడ్డి, రేచర్ల సింగమనాయకుల సాహసకార్యాల వల్ల ఆంధ్ర దేశంలో ఎక్కువ భాగం క్రీ.శ.1325-26 నాటికి తుగ్లక్‌ల నిరంకుశ పరిపాలన నుండి విముక్తి చెందింది. అయితే ఈ ముగ్గురూ తమ విజయాలను సంయుక్తంగా సాధించారా లేక ఎవరికి వారు సాధించి స్వంత రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారా అనే విషయం స్పష్టంగా తెలియదు. క్రీ.శ.1323వ సంవత్సరంలో జరిగిన చివరి యుద్ధంలో ప్రతాపరుద్రుని సేనాధిపతులలో అన్నమంత్రి కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమ నాయకుడు తప్ప మిగిలిన అందరూ మరణించారని, రెండు సంవత్సరాల ముస్లిం నిరంకుశ అధికారాన్ని చూసిన వీరు ఆంధ్ర వీరులను సమావేశపరచి ముసునూరి ప్రోలయనాయకుని తమ నాయకునిగా ఎన్నుకొని స్వాతంత్ర్య సమరం సాగించి ముస్లింలను పారదోలి ఆంధ్ర దేశాన్ని విముక్తి చేశారని పండితులు భావించారు. కనుక క్రీ..1325-26 వ సంవత్సరంలో జరిగిన ఆంధ్రస్వాతంత్ర్య సమర స్వచ్ఛంద ప్రజాసేవను నిర్మించి ఈ నాయకులు సంయుక్తంగా పోరాటం జరిపి సాధించిన విజయం అని పండితులు తీర్మానించారు. కనుకనే ఆనాటి నాయకులందరూ స్వంత రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నా, ప్రోలయ వేమారెడ్డి, సింగనాయకుడు కూడా ప్రోలయనాయకుని ఆధిపత్యాన్ని అంగీకరించారని, అదే పద్ధతి కాపయనాయకుని కాలంవరకు కొనసాగిందని అని తల్లి కలువచేరు శాసనం సూచిస్తోంది. కనుక క్రీ.శ.1325-26వ సంవత్సరంలో తుగ్లక్ సామ్రాజ్యాధికారానికి వ్యతిరేకంగా జరిగిన ఆంధ్ర స్వాతంత్ర్య సమరం ముసునూరి ప్రోలయనాయకుని నాయకత్వం కింద జరిగిందని స్పష్టంగా చెప్పవచ్చును. ఈ

స్వాతంత్ర్య సమరంలో ప్రోలయ వేమారెడ్డి, సింగనాయకుడేగాక అనేక మంది ఆంధ్ర వీరులు పాల్గొన్నారు. వారిలో కొప్పుల ప్రోలయనాయకుడు, మంచికొండ గణపతి, కొలని రుద్రుడు, అన్నమంత్రి అతిముఖ్యులు. కొలని రుద్రుడు, బెండపూడి అన్నయామాత్యుడు ప్రోలయ వేమారెడ్డితో సహకరించారు. కొలనిరుద్రుడు సంతమాగులూరులో శాసనం వేయించాడు బెండపూడి అన్నమంత్రిని శ్రీనాధుడు ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠాపనాచార్య అని వర్ణించాడు. వేంగి ప్రాంతంలో ప్రోలయనాయకునికి వేంగి ప్రభువైన వెంగ భూపాలుడు సహకరించాడు.

స్వాతంత్ర్య సమరవీరులు విజయం సాధించిన తర్వాత ప్రోలయనాయకుని తమ సార్వభౌమునిగా అంగీకరించి, తాము జయించిన ప్రాంతాలను తామే పాలించుకున్నారు. వారికి ప్రోలయనాయకుడు స్వేచ్ఛను ఇచ్చాడు. వారి రాజ్యాలలో జోక్యం చేసుకోలేదు. ప్రోలయ నాయకుడు క్రీ.శ.1335వ సంవత్సరంలో మరణించినట్లు తెలుస్తోంది. అతడు మరణించేనాటికి ఆంధ్రదేశం పూర్తిగా విముక్తి కాలేదు.

ఆంధ్ర స్వాతంత్ర్య సమరం రెండవ ఘట్టం క్రీ.శ.1335-36 కాపయనాయకుని నాయకత్వం: ప్రోలయ నాయకునికి సంతానం లేదు. కనుక తనకు వారసునిగా తన సోదరుని కుమారుడైన కాపయనాయకుని నియమించి ఓరుగల్లు కోటను జయించే దాకా విశ్రమించవద్దని అంతిమ సందేశం ఇచ్చి మరణించాడు. దాంతో కాపయనాయకుడు ఆంధ్ర స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించాడు. ముస్లింలను పూర్తిగా పారద్రోలి మిగిలిన ఆంధ్ర దేశాన్ని విముక్తి చేయడానికి కాపయనాయకుడు పూనుకున్నాడు. దాంతో స్వాతంత్ర్య సమరంలో రెండవ ఘట్టం మొదలైంది. ఇదే సందర్భంలో తుగ్లక్ సామ్రాజ్యంలో అనేక తిరుగుబాట్లు జరిగాయి. తుగ్లక్ సామ్రాజ్యంలోని పరిస్థితులు కాపయనాయకునికి మంచి అవకాశం కల్పించాయి.

కంపిలి రాజ్య పతనం క్రీ.శ.1329-30: రాయచూరు అంతర్వేది ప్రాంతంలో దేవగిరి యాదవ వంశానికి చెందిన ముమ్మడి సింగమ నాయకుడు ఒక చిన్న రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడని కుమార రమణ కథ తెలుపుతోంది. దేవగిరి రాజ్యంపై మాలికాఫర్ దండెత్తి రామచంద్రదేవుని ఓడించి ఢిల్లీ బందీగా తీసుకువెళ్లిన తర్వాత సింగమ నాయకుడు దక్షిణంగా వెళ్లి రాజ్యస్థాపన చేశాడని కుమార రమణ కథ తెలిపింది. క్రీ.శ.1280వ సంవత్సరానికి చెందిన ఒక శాసనంలో సింగమనాయకుడి ప్రస్తావన ఉంది. ఆ శాసనంలో చౌండ రాసుడనే యోధుడు సింగమనాయకునితో పోరాడి మరణించినట్లు వివరించింది. క్రీ.శ.1281వ సంవత్సరానికి చెందిన మరొక శాసనం చితల్‌దుర్గలోని ఒక కోటను సింగమనాయకుడు ముట్టడించినట్లు తెలుపుతోంది. ఈ శాసనాలను బట్టి ముమ్మడి సింగమనాయకుడు చారిత్రక పురుషుడని, అతడు దేవగిరి యాదవ రాజ్య సేనాధిపతిగా పై యుద్ధాలు నిర్వహించి ఉంటాడని భావింపబడింది. ఇతని కుమారుడు వీరకంపిలిదేవుడు. హొయసాల మూడవ భల్లాలునితో యాదవ రామచంద్రదేవునికి జరిగిన యుద్ధాలలో వీరకంపిలి దేవుడు పాల్గొన్నట్టు ఆధారాలున్నాయి. క్రీ.శ.1307-08 సంవత్సరాలలో రామచంద్రదేవుడు ఖిల్జీ సైన్యాల చేతిలో ఓడిపోయి ఢిల్లీకి తరలించబడ్డాడు. ఢిల్లీ సుల్తాన్‌కు సామంతునిగా ఉండే షరతుతో రామచంద్రదేవుడు తిరిగి తన రాజధాని దేవగిరి చేరాడు. కాని అతని రాజ్యం బలహీనమైంది. రాజ్యంలో అలజడులు చెలరేగాయి. వాటిని రామచంద్రదేవుడు అణచలేకపోయాడు. అలాంటి అస్థిరస్థితిలో సింగమ దేవుడు, అతని కుమారుడు వీరకంపిలి దేవుడు తుంగభద్రా కృష్ణాదుల మధ్య ప్రాంతంలో అనెగొంది రాజ్యాన్ని స్థాపించారు. ఈ రాజ్యాన్ని కంపిలి దేవుడు పాలించినందున దానికి కంపిలి రాజ్యం అని పేరు వచ్చింది. అనెగొంది రాజ్యాన్ని ముస్లిం చరిత్రకారులు కుమ్మెటకోట అని వర్ణించారు. దానినే పెరిష్టా నాగుండమ్ అని, న్యూనిజ్ నాగుందిమ అని పేర్కొన్నారు. కుమార రమణ చరిత్ర కంపిలి రాజ్యచరిత్రను మొదటి నుండి చివరి వరకు పూర్తిగా తెలుపుతోంది. ఈ చరిత్ర ముమ్మడి సింగమ వంశానికి చెందిన అనేకమందిని ప్రస్తావిస్తోంది. వారందరూ చారిత్రక పురుషులేనని చరిత్రకారులు అంగీకరిస్తున్నారు. సింగమ నాయకుని కుమారుడైన వీరకంపిలి రాయల విజయాలను కుమార రమణ చరిత్ర ఘనంగా వర్ణించింది. అంతేగాక ఇతని ప్రస్తావన ఇతర గ్రంథాలలోను, కొన్ని శాసనాలలో కూడా ఉంది. హంపి విరూపాక్ష దేవాలయంలో ఇతని శాసన ఒకటి ఉంది. తెలుగు బాలభాగవతం ఇతడు కొటికంటి రాఘవునికి శత్రువని తెలుపుతుంది. రాఘవుడు కాకతీయ ప్రతాపరుద్రుని సామంతుడని, అతనితో వీరకంపిలి దేవుడు పోరాడి ఉండవచ్చని భావించారు. కంపిలి దేవుని రాజధానిని గురించి కొన్ని సందేహాలున్నాయి. అతడు తుంగభద్రా నది ఒడ్డున ఉన్న కొండలలో హొసల అనే దుర్గాన్ని నిర్మించాడని, అదే అనెగొంది అని పండితులు భావించారు. నంజుడయ్య, గంగయ్య అనే ఇద్దరు

వ్యక్తులు మురానేయ సంధి అనే చోట హొసల దుర్గాన్ని నిర్మించారని మరొక గాథ ఉంది. వీరిచేత కంపిలి దేవుడు నిర్మించి ఉంటాడు. మురానేయ సంధి అంటే ఏనుగు ఆకారంతో ఉన్న మూడు కొండలు కలిసేచోటు అని అర్థమట. కాలక్రమేణా మురానేయ సంధి అనేయ సంధి అని తర్వాత అనెగొంది అని మారిందని భావించారు. హొసల దుర్గ నిర్మాణం తర్వాత కంపిలిదేవుడు రాజ్యవిస్తరణకు పూనుకున్నాడు. తోరగల్ బాదామి, హోనగళ్, రాయచూరు, ముద్గళ్ మొదలగు దుర్గాలను జయించాడు. దాంతో రాయచూరు, అంతర్వేది ప్రాంతం అంతా అతని వశం అయింది. తర్వాత తుంగభద్రానదికి దక్షిణంగా తన రాజ్యాన్ని విస్తరించాడు. పెనుగొండ, నిడుగల్, కందునూల్ నాడులను జయించాడు. తర్వాత గుత్తి పాలకుడైన జగతాపిరాయుడిని, గండికోటను పాలించిన గంగరాజును, ఉదయగిరిని పాలించిన సంగముని ఓడించి తన సామంతులుగా చేసుకున్నాడు. తర్వాత కంపిలిదేవుడు హొయసాల మూడవ భిల్లాలునితో కూడా పోరాడినట్లు భిల్లాలరాయన యుద్ధ అనే కావ్యం, కుమార రమణ చరిత్ర, కొన్ని శాసనాలు వర్ణిస్తున్నాయి. హొయసాల శాసనాలలో కూడా కంపిలి దేవుని ప్రస్తావనలున్నాయి. కంపిలి సమీపంలోని పూలపల్లి గ్రామంలోని ఒక శాసనంలో కుమార రామానాథుని ప్రస్తావన ఉంది. మరొక శాసనం కంపిలిరాయని శౌర్యప్రతాపాలను వర్ణించినది. కంపిలిరాయుడు ప్రతాపరుద్రునితో కూడా పోరాడాడు. భల్లాలునితో జరిగిన యుద్ధంలో తనకు సహాయం చేయవలసిందిగా కోరుతూ కంపిలిదేవుడు రామనాథుడనే రాయబారిని ఓరుగల్లుకు పంపాడు. కాని ప్రతాపరుద్రుడు యుద్ధంలో పాల్గొనడానికి తిరస్కరించాడు. అందుకు కోపించిన కంపిలిదేవుడు ప్రతాపరుద్రుని బిరుదులను ధరించాడు. అది అవమానంగా భావించి ప్రతాపరుద్రుడు రేచర్ల మొదటి సింగమనాయకుని పెద్దసేనతో కంపిలి రాజ్యంపైకి దండు పంపాడు. ఈ యుద్ధంలో ఉభయులూ తాము గెల్చినట్లు ప్రకటించుకున్నారు మొత్తం మీద కంపిలి రాజ్యం క్రీ.శ.1308-12 సంవత్సరాల మధ్య స్థాపించబడి అనతికాలంలోనే ప్రఖ్యాతి వహించింది. తుంగభద్రా నదికిరువైపులా కంపిలి రాజ్యం విస్తరించి ఉంది. ఫెరిష్టా తన రచనలో కంపిలి రాజ్య విస్తీర్ణాన్ని పరోక్షంగా తెలిపాడు. సుల్తాన్ ముజాహిద్‌కు, బుక్కరాయలకు సరిహద్దు వివాదం రాగా ముజాహిద్ రాయచూరు, అంతర్వేది ప్రాంతాలు తనవని ఖాళీ చేయమని కోరాడు. అందుకు బుక్కరాయలు రాయచూరు, అంతర్వేది ప్రాంతాలు మొదటినుండి అనెగొంది రాచకుటుంబానికి చెందినవని, కనుక అవి విజయనగర రాజ్యానికే చెందుతాయని ముజాహిదే ఆ ప్రాంతాలను ఖాళీ చేయాలని చెప్పాడని ఫెరిష్టా రాశాడు. రామచంద్రదేవుని తర్వాత దేవగిరి సింహాసనం అధిష్టించిన శంకరదేవుడు ఢిల్లీ సుల్తాన్‌పై తిరుగుబాటు చేసి ఓడిపోయాడు. మరపాలదేవుని తర్వాత దేవగిరి యాదవరాజ్యం ఢిల్లీ సామ్రాజ్యంలో భాగం అయింది. కాని ఖిల్జీలు కంపిలి రాజ్యాన్ని ఆక్రమించలేదు. ఖిల్జీల తర్వాత ఘియాజుద్దీన్ తుగ్లక్ ఢిల్లీ సుల్తానయ్యాడు. అతని కాలంలో అతని కుమారుడు జునాఖాన్ క్రీ.శ.1323లో కాకతీయ రాజ్యాన్ని మధుర రాజ్యాన్ని ఆక్రమించాడుగాని కంపిలి, హొయసాల రాజ్యాలను కబళించలేదు. ఢిల్లీ నుండి మధుర వరకు సుల్తాన్ సామ్రాజ్యంలో భాగం అయినా హొయసాల, కంపిలి రాజ్యాలు మాత్రం విడిగానే ఉన్నాయి. ఈ స్థితిలో బహద్దీన్ గుష్టాస్ప (Baha-Ud-din-Gushatsp) సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు.

బహద్దీన్ గుష్టాస్ప తిరుగుబాటు - కంపిలి పతనం: బహుద్దీన్ తిరుగుబాటు కంపిలి రాజ్యాన్ని పతనం చేసింది గుష్టాస్ప సుల్తాన్ ఘియాజుద్దీన్ తుగ్లక్ సోదరుని కుమారుడు. ఘియాజుద్దీన్‌ను చంపి మహమ్మద్ బిన్ తుగ్లక్ సింహాసనానికి రావడం అతడు హర్షించలేదు. సుల్తాన్ పట్ల విధేయతను ప్రకటించలేదు. అయినప్పటికీ మహమ్మద్ బిన్ తుగ్లక్ తాను సుల్తాన్ కాగానే గుష్టాస్పను సాగర్ గవర్నర్‌గా నియమించాడు. అయినా గుష్టాస్ప సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. అతనిని దండించడానికి సుల్తాన్ సైన్యాలను పంపాడు. ఆ పోరాటాలలో గుష్టాస్ప ఓడిపోయి సాగర్ దుర్గంలోకి పారిపోయాడు. కాని ఢిల్లీ సైన్యం అతనిని వదిలిపెట్టలేదు. కోటను ముట్టడించడంతో గుష్టాస్ప భయపడి దక్కనుకు పారిపోయాడు. ఢిల్లీ సైన్యం వెంటపడి తరిమింది. చివరకు అతడు కంపిలి రాజ్యంలో ప్రవేశించి వీరకంపిలి దేవుని శరణు వేడాడు. కంపిలి దేవుడు వివేకశూన్యుడై ముందు వెనుకలు ఆలోచించకుండా అతనికి అభయహస్తం ఇచ్చి తన కోటలో ఆశ్రయం ఇచ్చాడు. ఈ చర్య ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యంతో కంపిలి రాజ్యానికి విరోధాన్ని తెచ్చిపెట్టింది. మహమ్మద్ బిన్ తుగ్లక్ తన శత్రువును అప్పగించమని వర్తమానం పంపాడు. కాని కంపిలి దేవుడు తాను అతనికి అభయ హస్తం ఇచ్చానని అతనిని సుల్తాన్‌కు అప్పగించే ప్రశ్నే లేదని సమాధానం పంపాడు. కనుక సుల్తాన్ ఆగ్రహావేశుడై కాంపిల్యదేవుని శిక్షించడానికి రుక్నుద్దీన్ అనే వాడి నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. కంపిలి దేవుడు రుక్నుద్దీన్‌ను ఓడించి తరిమాడు. రెండవసారి మాలిక్ జహన్

నాయకత్వంలో మరొక సేన కంపిలిపై దాడి చేసింది. కాని ఆ సైన్యం కూడా ఓడిపోయింది. రెండవ దాడి కూడా విఫలం కావడంతో తుగ్లక్ అహమ్మద్ అయాజ్‌మాలిక్ అనే సైన్యాధిపతి నాయకత్వంలో పెద్ద సేనను కుమ్మెటకోటను ముట్టడించడానికి పంపాడు. ఆ సైన్యాన్ని ఓడించలేక కంపిలిదేవుడు గుష్టాస్పన్‌ను వెంట తీసుకొని హోసల దుర్గానికి పారిపోయాడు. కాని తుగ్లక్ సైన్యం హోసల కోటను కూడా ముట్టడించింది. చివరకు తాను జయించలేనని గ్రహించి గుష్టాస్పను హొయసల రాజ్యంలోకి పంపి తాను తన పరివారంతో ఢిల్లీ సైన్యాలతో వీరోచితంగా పోరాడదలచుకున్నాడు. నెలరోజుల ముట్టడి తర్వాత కంపిలి దేవుడు, అతని కుమారుడు రామనాథుడు, వారి భార్యలను, బంధువుల స్త్రీలను, అనుచరుల భార్యలను, వారి గృహాలను అగ్నికి ఆహుతి చేసి కోట బయటకు వచ్చి ఢిల్లీ సేనలతో తలపడి వీరోచితంగా పోరాడుతూ మరణించారు. ఈ సంఘటన క్రీ.శ.1328-30 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చును. కంపిలి దేవుని మరణంతో కంపిలి రాజ్యం సుల్తాన్ వశం అయింది. యుద్ధంలో కంపిలి రాయలు మరణించలేదని పెరిష్టా, భట్టర్ కైఫీయత్తులు తెలిపాయి. కాని అతడు యుద్ధంలో మరణించాడని ఇబన్ బటూటా రాశాడు. విజయానంతరం మహమ్మద్ బిన్ తుగ్లక్ కంపిలి దేవుని 11 మంది కుమారులను ముస్లింలుగా మార్చాడని కూడా తెలపబడింది. కంపిలి రాజ్యం క్రీ.శ.1330వ సంవత్సరంలో ఢిల్లీ సామ్రాజ్యంలో భాగం అయిందని, కుమ్మెటకోట ముస్లిం సైన్యాలకు శిబిరంగా మారిందని భట్టర్, కంపిలి కైఫీయత్తులు కూడా తెలుపుతున్నాయి. పెరిష్టా న్యూనిజ్‌లు కూడా నాగుందలను సుల్తాన్ జయించాడని రాశారు. జయించిన కంపిలిని పాలించడానికి మాలిక్‌నుబి అనే సరదారుని నియమించాడు. న్యూనిజ్ అతనిని Enybiquymelly అని పేర్కొన్నాడు. కంపిలి ఆక్రమణ తర్వాత ముస్లిం సైన్యం ద్వారసముద్రంపై దండెత్తింది. వీరభల్లాలుడు యుద్ధం చేయకుండా లొంగిపోయి తన రాజ్యంలో ప్రవేశించిన గుష్టాస్పను సుల్తాన్‌కు అప్పగించాడు. సుల్తాన్‌కు కప్పం చెల్లించి సామంతుడుగా ఉండటానికి కూడా అంగీకరించాడు. కనుక సుల్తాన్ ద్వార సముద్ర రాజ్యాన్ని ధ్వంసం చేయకుండా గుష్టాస్పను బంధించి తీసుకొని వెళ్ళిపోయాడు. ఈ విజయాలతో మొత్తం దక్షిణ భారత దేశం సుల్తాన్ సామ్రాజ్యంలో భాగం అయిపోయింది. కనుక ముస్లిం చరిత్రకారులు క్రీ.శ.1324-35 సంవత్సరాల మధ్యకాలంలో మొత్తం దక్షిణ భారతదేశం ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యంలో భాగమైందని, పరిపాలనా సౌలభ్యం కోసం దేవగిరి, తిలింగ్, కంపిలి, ద్వారసముద్రం, మధుర అనే ఐదు రాష్ట్రాలుగా విభజింపబడిందని గర్వంగా రాసుకున్నారు.

ద్వారసముద్రంలో బందీగా చిక్కిన బహుద్దీన్ గుష్టాస్పను సుల్తాన్ అతిక్రూరంగా వధించాడు. గుష్టాస్ప బందీగా చిక్కగానే అతనిని, స్త్రీల వద్దకు పంపాడట. వారు అతనిపై ఉమ్మివేసి అవమానించారట. తర్వాత ఒక చర్మంలో చుట్టి కుట్టివేశారట. ఊపిరాడక అతడు మరణించాడట. తర్వాత అతని చర్మం వలచి, అతని మాంసాన్ని కోసి బియ్యంతో కలిపి వండి అందులో కొంత భాగాన్ని అతని భార్య పిల్లలకు పంపాడట. మిగిలిన భాగాన్ని ఏనుగులకు పెట్టించాడట. కాని అవి దానిని ముట్టుకోలేదట. తర్వాత మిగిలిన చర్మాన్ని బెంగాలులో తిరుగుబాటు చేసిన ఘియాజుద్దీన్ బహదూర్ బురా అవశేషాలతో కలిపి దేశమంతటా ఊరేగించమని ఆజ్ఞాపించాడట. మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆ విధంగా గుష్టాస్పను వధించి తన కసిని తీర్చుకున్నాడు. ఈ విధంగా గుష్టాస్ప కంపిలి రాజ్య పతనానికి కారకుడై తాను కూడా అతిక్రూరంగా వధింపబడ్డాడు. కంపిలి రాజ్య పతనం ఆంధ్రదేశ స్వాతంత్ర్య సమర రెండవ ఘట్టాన్ని కొనసాగించడానికి దోహదం చేసింది.

ఆంధ్రదేశ స్వాతంత్ర్య సమరం రెండవ ఘట్టం క్రీ.శ.1335-44: కంపిలి రాజ్యం స్వాధీనమైన తర్వాత మాలిక్ నెబిని అక్కడ గవర్నర్‌గా నియమించాడు. అతని పాలనతో కంపిలి రాజ్యంలో కూడా ముస్లిం అరాచకాలకు ప్రజలు బలైపోయారు. కనుక అక్కడ ముస్లిం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభం అయింది. ఈ తిరుగుబాటుకు ఆరవీటి సోమదేవరాజు నాయకత్వం వహించాడు. అందుగుల వెంకన్న రచించిన రామరాజీయం, దొనేరు లేక కోనేరు నాథుడు రచించిన బాల భాగవతంలో ఆరవీటి వంశస్తుల చరిత్ర ఉంది. సోమదేవరాజు ఆరవీటి తాత పిన్నమరాజు కుమారుడు. వీరి వంశం కర్నూలు పరిసర ప్రాంతాలలో స్థానిక పాలకులుగా ఉన్నట్లు కనిపిస్తోంది. వారికి మాల్యాల కేంద్రంగా ఉండేది. కాకతీయుల కాలంలో ఈ ప్రాంతం చెరుకు వంశస్తుల పాలనలో ఉండేది. చెరుకు వంశం చేతి నుండి ఆరవీటి వంశస్తులు ఎప్పుడూ ఆ ప్రాంతాలను ఆక్రమించినదీ తెలియదు. ప్రతాపరుద్రుడు అంబయదేవుని మామను ఓడించినప్పుడు ఈ ప్రాంతంపై ఆరవీటి వంశస్తులను పాలకులుగా నియమించి ఉండవచ్చు. సోమదేవరాజు సవతి సోదరుడైన కొటికంటి రాఘవుడు కంపిలిదేవుని

ఓడించినట్లు వివరింపబడింది. బహుశా రాఘవుడు కాకతి ప్రతాపరుద్రుని సేనాధిపతిగా కంపిలి రాజ్యంతో పోరాడి ఉండవచ్చు. దీనిని బట్టి ఆరవీటి వంశస్తులు కాకతీయులకు సామంతులుగా ఆ ప్రాంతాలు పరిపాలించినట్లు భావించవచ్చు. కర్నూలు, శ్రీశైల ప్రాంతాలు వీరి ఆధీనంలో ఉండేవి. కంపిలి దేవుని కుమారుడు రామనాధుడు, ప్రతాపరుద్రుడు తమకు సహాయం చేయలేదనే కోపంతో ప్రతాపరుద్రుని బిరుదులు ధరించి కాకతీయులతో విరోధాన్ని తెచ్చుకున్నాడు. అందువల్ల ప్రతాపరుద్రుడు కంపిలిపై దండయాత్ర చేశాడు. ఆ యుద్ధంలో కొటికంటి రాఘవుడు పాల్గొని ఉండవచ్చు. కంపిలి ప్రజలను ముస్లిం పాలననుంచి కాపాడటానికి ఆరవీటి సోమరాజు తిరుగుబాటు చేసి ఉండవచ్చును. ఆరవీటి వారు చాళుక్య వంశస్తులని ప్రతీతి. కాపయ నాయకుని కాలంలో జల్లిపల్లి, మగతలలను పాలించిన చాళుక్యులకు వీరు దాయాదులు.

మధుర సుల్తాన్ తిరుగుబాటు క్రీ.శ.1335: క్రీ.శ.1328లో కంపిలి రాజ్యాన్ని జయించి మహమ్మద్ బిన్ తుగ్లక్ ఢిల్లీ వెళ్లిపోయిన తర్వాత సుల్తాన్‌కు వ్యతిరేకంగా అతని సామ్రాజ్యంలో తిరుగుబాట్లు జరిగాయి. గుష్తాస్పను అతిక్రూరంగా వధించడం చాలామంది ముస్లిం సరదారులకు భయాన్ని కలిగించింది. సుల్తాన్‌పై ఆగ్రహాన్ని, ద్వేషాన్ని కల్గించి తిరుగుబాట్లకు దారితీసింది. ఆ విధంగా తిరుగుబాటు చేసిన మొట్టమొదటి వాడు మధుర గవర్నర్ అయిన సయ్యద్ అహమ్మద్ జలాలుద్దీన్ షా. అతడు క్రీ.శ.1335వ సంవత్సరంలో స్వతంత్రం ప్రకటించి స్వతంత్ర మధుర సుల్తానత్‌ను స్థాపించాడు. మధుర సుల్తాన్‌ను అణచడానికి సుల్తాన్ స్వయంగా పెద్ద సేనతో బయలుదేరాడు. కాని దక్కన్ ప్లేగు వ్యాధిన పడింది. ఓరుగల్లు చేరిన సుల్తాన్ సైన్యం ప్లేగు వ్యాధిలో చిక్కుకొని సతమతమైంది. కనుక సుల్తాన్ వెనుదిరిగి వెళ్లిపోయాడు. సుల్తాన్ మధుర గవర్నర్‌ను ఏమీ చేయలేకపోవడంతో మిగిలిన వారందరికీ ధైర్యం కలిగి సామ్రాజ్యం అంతటా తిరుగుబాట్లు ప్రారంభమయ్యాయి. క్రీ.శ.1336-37వ సంవత్సరంలో బెంగాల్ నవాబు ఫకృద్దీన్ ముబారక్ షా తిరుగుబాటు చేసి బెంగాలును స్వతంత్ర రాజ్యంగా ప్రకటించాడు. అయోధ్యలో ఐన్ ఉల్‌ముల్క్ స్వతంత్రుడయ్యాడు. దాంతో ఉత్తర దేశంలో కూడా తుగ్లక్ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడం ప్రారంభమైంది. ఉత్తర దేశ తిరుగుబాట్లను అణచడంలో సుల్తాన్ నిమగ్నుడయ్యాడు. ఆ స్థితిలో తెలంగాణలో కాపయనాయకుడు, రాయలసీమలో ఆరవీటి సోమరాజు తిరుగుబాటు చేసి ఆంధ్ర స్వాతంత్ర్య సమరాన్ని ముందుకు నడిపారు.

ఆరవీటి సోమరాజు విజయాలు: సోమరాజు సైన్యాలను కూర్చుకొని కంపిలి ముస్లిం సేనతో తీవ్రంగా పోరాటాలు సాగించాడు. అతనిని సుల్తాన్ విధేయులైన గంగినాయక, గుజ్జల సోమదేవరాజు గంగినేనికొండ వద్ద ఓడించి ముసలిమడుగు, కందనవోలు, సాతానికోట, కలువకొండ, రాయచూరు, కోటరాచూరు, యాతగిరి, ఎలగిరిలను ఆక్రమించాడు. తర్వాత మణిజిల్లకోట పాలకుడు మన్నె గోసంగిని ఓడించి దానిని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత ముందుకుసాగి ఆకులపాడు, ముద్గల్, అనెగొందిని ముట్టడించాడు. అక్కడ సుల్తాన్ ప్రతినిధి మాలిక్ నెబి సోమదేవరాజు నెదిరించి ఓడిపోయి 6000 అశ్వదళంతో బందీగా చిక్కి శరణు వేడి ప్రాణాలు దక్కించుకొని అనెగొంది కోటను వదలి వెళ్లిపోయాడు. నెబి పారిపోయిన తర్వాత సోమరాజు అనెగొంది కోటలో ప్రవేశించాడు. పూర్వపు కంపిలి రాజ్యం అంతా సోమదేవరాజు వశం అయింది. ఈ యుద్ధాలలో సోమదేవరాజుకు ప్రోలయ వేమారెడ్డి సహాయం చేశాడని కొందరు భావిస్తారు. కాపయనాయకుడు సోమదేవరాజుకు తన ఆశీస్సులనందించి ప్రోలయ వేమారెడ్డిని అతనికి సహాయంగా పంపాడని, ప్రోలయ వేమారెడ్డి రాయచూరు యుద్ధంలో పాల్గొని రాచూరు దుర్గవిభాళ అనే బిరుదు ధరించాడని కొందరు చరిత్రకారులు భావిస్తారు. అది ఎంతవరకు వాస్తవమో తెలియదు. కాని సోమదేవరాజు పూర్వపు కంపిలి రాజ్యాన్ని మొత్తం జయించి అనెగొందిని రాజధానిగా చేసుకొని పాలించాడు. కంపిలి, అనెగొందిల పాలకుడు ముస్లిం గవర్నర్ మాలిక్ నాయబ్‌పై తిరుగుబాటు జరిగిందని పోర్చుగీసు యాత్రికుడైన న్యూనిజ్ రాశాడు. తిరుగుబాటు చేసిన వీరుడు ఆరవీటి సోమరాజేనని స్పష్టంగా చెప్పవచ్చు.

కాపయనాయకుని విజయాలు: ఇదే సందర్భంలో కాపయనాయకుడు తెలంగాణ నుండి ముస్లింలను పూర్తిగా పారద్రోలి ఓరుగల్లు కోటను ఆక్రమించడానికి పూనుకున్నాడు. కాపయనాయకుడు పెద్దసేనతో ఓరుగల్లును ముట్టడించాడు. అతడు సులభంగానే ఓరుగల్లు గవర్నర్ మాలిక్ మగ్బూల్ నాయబ్‌ను ఓడించి తరిమివేశాడు. విజయం తర్వాత విజయభేరీలతో కాపయనాయకుడు ఓరుగల్లు కోటలో ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకొని ఆంధ్ర సురత్రాణ, ఆంధ్రాదీశ్వర అనే బిరుదులతో ఓరుగల్లు సింహాసనాన్ని అధిష్ఠించాడు.

దాంతో ఆంధ్ర దేశం మొత్తం తుగ్లక్ అధికారం నుండి విముక్తి చెందింది. ప్రోలయనాయకుని మరణ సందేశం పూర్తిగా నెరవేరింది. ఆంధ్ర దేశం సంతోషజలధిలో ఓలలాడింది. ఓరుగల్లు ఆక్రమణ క్రీ.శ.1335-36 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చని భావించారు. ఆంధ్ర దేశాన్ని పాలించిన కాకతి ప్రతాపరుద్రుని వలె 75 మంది నాయకులు కొలుస్తుండగా కాపయ నాయకుడు ఓరుగల్లు సింహాసనంపై కూర్చొని ఏకఛత్రాధిపత్యంగా పాలించాడని అనితల్లి కలువచేరు శాసనం ఘనంగా వర్ణించింది. కాపయనాయకుని ఓరుగల్లు ఆక్రమణతో ఆంధ్ర స్వాతంత్ర్య సమరం ముగిసింది. ఆంధ్ర దేశంలో తిరిగి ఆంధ్రుల అధికారం ఏర్పడింది. భారత దేశంలోని ఏ ప్రాంతంలో కూడా ముస్లింల అధికారం ఇంత త్వరగా అంతరించలేదు. ఇది ఆంధ్ర స్వాతంత్ర్య సమర ప్రత్యేకత అని చెప్పవచ్చు. కాపయనాయకుని విజయాలకు ఉత్తేజితుడైన హొయసాల మూడవ భల్లాలుడు స్వతంత్రం ప్రకటించాడు. తర్వాత 1347వ సంవత్సరంలో జఫార్‌ఖాన్ గుల్బర్గాలో స్వతంత్ర బహమనీ రాజ్యం స్థాపించాడు. దాంతో దక్షిణ దేశంలో తుగ్లక్ సామ్రాజ్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆంధ్ర స్వాతంత్ర్య సమరం దక్షిణ దేశంలో తుగ్లక్ సామ్రాజ్యాన్ని అంతం చేసింది. ఆంధ్ర స్వాతంత్ర్య సమరం ఆంధ్ర దేశాన్ని విమోచనం చేయడమేగాక దక్షిణ దేశంలో తుగ్లక్ సామ్రాజ్యాన్ని సమూలంగా తుడిచిపెట్టింది. ఇది మరొక ప్రత్యేకత.

కంపిలి రాజ్యంలో మార్పు: కంపిలి రాజ్యం చేజారిపోవడం మహమ్మద్ బిన్ తుగ్లక్ సహించలేక పోయాడు. అతడు కంపిలిని స్వాధీనం చేసుకున్నప్పుడు హరిహర, బుక్కరాయలు బందీగా పట్టుబడ్డారు. వారిని సుల్తాన్ ఢిల్లీ తీసుకువెళ్లి ఖైదు చేశాడు. సుల్తాన్ వారిని విడుదల చేసి ముస్లింలుగా మార్చి అనెగొందిని జయించమని ఆదేశించాడు. వారు అనెగొందిని ఆక్రమించి విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. ఆరవీటి వంశం వారికి సామంతులుగా మారిపోయారు. కనుక అనెగొంది రాజ్యస్థానంలో నూతనంగా క్రీ.శ.1336లో విజయనగర రాజ్యం అవతరించింది. కనుకనే కంపిలి పతనానికి, విజయనగర రాజ్యస్థాపనకు సంబంధం ఉన్నదని ముస్లిం చరిత్రకారులు రాశారు. అనెగొందిని తిరిగి జయించడానికి పంపిన సుల్తాన్ సేనాధిపతుల చర్యలే విజయనగర రాజ్యస్థాపనకు కారణమని ముస్లిం చరిత్రకారులు వివరించారు.

ఇదే సమయంలో ఓరుగల్లులో కూడా ముస్లింలు ఓడిపోయారని, ఓరుగల్లుతోపాటే కంపిలి కూడా ముస్లింల చేతి నుండి జారిపోయిందని జియావుద్దీన్ బరని రాశాడు. ఇసామీ అనే ముస్లిం రచయిత కూడా తిలింగ్ తిరుగబడింది, ఓరుగల్లు కోట ముస్లింల చేతుల నుండి తప్పించుకొంది, మతం మార్చుకున్న వాడొకడు కన్నడం నుండి మల్బారు వరకు ఉన్న దేశాన్ని జయించాడు అని రాశాడు. కనుక హరిహర, బుక్కరాయలు కంపిలి రాజ్యాన్ని, కాపయనాయకుడు ఓరుగల్లును ఏకకాలంలో జయించారని భావించవచ్చును. కనుక ఈ రెండు సంఘటనలు క్రీ.శ.1335-36వ సంవత్సరంలో జరిగి ఉండాలి.

ఆంధ్రుల ఐక్యత - తాత్కాలికం: కంపిలి రాజ్యంలో స్థాపించబడిన విజయనగర రాజ్యం అనతికాలంలోనే కర్ణాటక, తమిళనాడులను జయించి గొప్ప సామ్రాజ్యంగా బలిష్టంగా రూపొంది, దక్షిణ భారత దేశ హిందువులకు ఆశాజ్యోతిగా మారింది. కాని కాపయనాయకుని నాయకత్వంలో ఆంధ్ర స్వాతంత్ర్య సమరం విజయవంతంగా ముగిసి ఆంధ్ర దేశం విముక్తి చెంది కాకతీయులనాటి ఆంధ్ర సామ్రాజ్యం ఏర్పడినా, ఆంధ్ర దేశపు ఐక్యత తాత్కాలికంగా మిగిలిపోయింది. అనతికాలంలో ముసునూరి, రేచర్ల పద్మనాయకుల మధ్య కొండవీటిరెడ్డి, రేచర్ల పద్మనాయకుల మధ్య ఈర్ష్యాద్వేషాలు రగిలి విచక్షణ లేకుండా పరస్పర యుద్ధాలకు దిగి అందరూ నశించి పోయారు. తత్ఫలితంగా ఆంధ్ర దేశం మళ్లీ పరాయి పాలనలోనికి వెళ్లిపోయింది. గజపతులు, వారి తర్వాత గోల్కొండ నవాబులకు ఆంధ్ర దేశం దాసోహం అంది. తర్వాత మొగలులు, తరువాత నిజాంలు, తర్వాత ఇంగ్లిషు వారు వరుసగా పాలించారు. కాపయనాయకుని తర్వాత ఆంధ్ర దేశాన్ని మొత్తంగా పాలించిన తెలుగువాడు ఒక్కడు కూడా లేడు. ఆంధ్ర స్వాతంత్ర్య సమరం ముగిసిన తర్వాత ఆంధ్ర దేశంలో ఏర్పడిన రాజ్యాలు. ముసునూరి కమ్మనాయకుల ఓరుగల్లు రాజ్యం, కొండవీటి రెడ్డి రాజ్యం, నల్లగొండ, దేవరకొండ, రేచర్ల పద్మ నాయకుల రాజ్యం, కంపిలిలో ఏర్పడిన విజయనగర రాజ్యం. ఆంధ్రదేశంలో ఎక్కువ భాగం ఈ నాలుగు రాజ్యాల మధ్య చీలిపోయింది. ఇవిగాక ఉత్తరాంధ్రలోని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా ప్రాంతాలు కళింగ గంగ రాజ్యంలో భాగంగా ఉండేవి. మొత్తం ఐదు భాగాలుగా ఆంధ్రదేశం చీలిపోయింది.

కమ్మ, రెడ్డి, వెలమ యుగం క్రీ.శ.1324-1475

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం క్రీ.శ.1324 నుండి 1475 వరకు సుమారు 150 సంవత్సరాల కాలాన్ని ఆంధ్రదేశ చరిత్రలో కమ్మ, రెడ్డి, వెలమ యుగం అని చెప్పవచ్చు. ఈ కాలంలో ఆంధ్రదేశంలో కమ్మ, రెడ్డి, వెలమ కులస్తులు రాజ్యాలు స్థాపించి పాలించారు. ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పునరుద్ధరించిన ముసునూరు నాయకులు కమ్మవారు. అద్దంకి, కొండవీటి రాజ్యాన్ని స్థాపించినవారు రెడ్లు. రాచకొండ, దేవరకొండ రాజ్య స్థాపకులు పద్మనాయక వెలమలు. ఈ మూడు కులాలు స్థానిక తెలుగు ప్రజలు. వీరి రాజ్యాలకు సమకాలికంగా కర్ణాటక దేశంలో విజయనగర రాజులు, మహారాష్ట్ర, గుల్బర్గా ప్రాంతాలలో బహమనీ సుల్తానులు, కళింగను తూర్పుగాంగులు పాలించారు. ఈ మూడు వంశాలు, వారికి సమీపంలోని ఆంధ్ర ప్రాంతాల్లో కొన్ని భాగాలను పాలించారు. దక్షిణాంధ్ర దేశంలోని రాయలసీమ, నెల్లూరు ప్రాంతాలు విజయనగర సామ్రాజ్యంలో ఉండేవి. ఉత్తర తెలంగాణ ప్రాంతాలు బహమనీ రాజ్యంలో ఉండేవి. అలాగే ఉత్తరాంధ్ర ప్రాంతాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం జిల్లా ప్రాంతాలు తూర్పుగాంగుల సామ్రాజ్యంలో భాగాలై ఉండేవి. ఈ సరిహద్దులలోని ఈ మూడు వంశాలు ఆంధ్రదేశంలోకి చొచ్చుకు రావాలని ప్రయత్నిస్తూ ఉండేవి అది గమనించకుండా ఆంధ్ర దేశ రాజ్యాలైన కమ్మ, రెడ్డి, వెలమ రాజ్య పాలకులు అజ్ఞానంతో ఈర్ష్యాద్వేషాలతో అంతఃకలహాల పాలై ఒకరిపై ఒకరు పోరాటాలు సాగించి క్రీ.శ.1475 నాటికి అందరూ నశించారు. వారి తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన ఆంధ్రుడు లేడు. వారి పతనం తర్వాత సరిహద్దులలోని విజయనగర, బహమనీ, గాంగ వంశస్తులు ఆంధ్ర దేశంలోకి చొచ్చుకు వచ్చారు. ఇంచుమించు ఇదేకాలంలో గంగ వంశస్తులను తొలగించిన కళింగ గజపతులు, గంగవంశ వారసులుగా తూర్పు నుండి ఆంధ్ర దేశంలోకి చొచ్చుకొని వచ్చారు. దాంతో దిక్కూ మొక్కూ లేని ఆంధ్ర దేశంపై ఆధిపత్యం కోసం గజపతి, నరపతి, అశ్వపతులు పోటీపడ్డారు. దక్షిణ భారతదేశ చరిత్రలోని గజపతి, నరపతి, అశ్వపతుల సంఘర్షణకు ఆంధ్రదేశం రంగస్థలమైంది. మొదట గజపతులు, తర్వాత బహమనీ సుల్తానుల వారసులైన గోల్కొండ నవాబులు ఆంధ్ర దేశాన్ని జయించారు. ఆ తర్వాత వరసగా మొగలులు, నిజాంలు, ఇంగ్లిషు వారు పాలించారు. ఆంధ్రరాష్ట్రం, ఆంధ్రప్రదేశ్‌లు ఏర్పడేవరకు శతాబ్దాల తరబడి ఆంధ్రులు పరాయి పాలనలో మగ్గిపోయారు. కనుక ఆంధ్రదేశ చరిత్రలో కమ్మ, రెడ్డి, వెలమ యుగమే స్వచ్ఛమైన ఆంధ్రజాతి పాలన అని చెప్పవచ్చు. ఈ యుగంలో రాజకీయంగా ఆంధ్రులు స్వాతంత్ర్యాన్ని కోల్పోవడమేగాక సాంఘికంగా కూడా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందులో ఆంధ్ర సమాజంలో క్షత్రియ కులం అదృశ్యమై కమ్మ, రెడ్డి, వెలమ అనే ప్రత్యేక కులాలు రూపొందటం మొదటి పరిణామం. ప్రాచీన కాలం నుంచి ఉన్న స్థానిక పేర్లు మారిపోవడం రెండవ పరిణామం. క్షత్రియకులం అంతం కావడం మూడవ పరిణామం. చాళుక్య, కాకతీయ అనే రాజవంశాల పేర్లు మటుమాయం కావడం మరొక పరిణామం.

కాకతీయుల కాలం వరకు కులబేధాలు లేని రైతులు, కాపులు, కాకతీయ రాజ్య పతనం తర్వాత కమ్మ, రెడ్డి, వెలమ అనే మూడు వర్గాలుగా చీలిపోయారు. చివరికి 15వ శతాబ్దంలో మూడు ప్రత్యేక కులాలుగా రూపొందారు. చాళుక్యయుగంలో వ్యవసాయ వృత్తిని సాగించిన రైతులు యుద్ధ సమయాలలో తమ రాజులకు సహాయంగా సైనికులుగా యుద్ధాలకు వెళ్లేవారు. యుద్ధాలు లేని కాలంలో తమ వ్యవసాయ వృత్తిని కొనసాగించే వారు. వ్యవసాయ వృత్తిని సాగించే రైతులను కాపులు అని కూడా అనేవారు. భూమిని నమ్ముకొని దానినే కాపు కాసుకుంటూ జీవించేవారు గనుక వారిని కాపులు అని కూడా పిలిచేవారు. పల్లవ చాళుక్య, చోళ చాళుక్య సంఘర్షణా కాలంలో దక్షిణదేశంలో నిరంతర యుద్ధాలు సాగి సైనిక వృత్తికి విశేష ప్రాధాన్యత వచ్చింది. యుద్ధ వీరులకు అమిత ప్రాచుర్యం వచ్చింది. కనుక నాటిరాజులు వీరులను, దృఢకాయులను సైనికులుగా చేర్చుకున్నారు. ధైర్య సాహసాలు కలిగిన వారిని, పరాక్రమవంతులను సేనాధిపతులుగా నియమించుకున్నారు. సైనిక వృత్తి మంచి లాభసాటిగా మారడంతో అనేక మంది రైతులు వ్యవసాయ వృత్తిని వదిలివేసి సైనికులుగా చేరిపోయారు. ఈ విధంగా వ్యవసాయ వృత్తిని వదిలివేసి సైనిక వృత్తిని స్వీకరించిన కుటుంబాల వారిని రాజులు మాండలీకులుగా, సామంతులుగా కూడా నియమించారు. దాంతో వారు రాజ్యాధికారాన్ని పొంది సమాజంలో క్షత్రియుల స్థానాన్ని పొందారు కాని వారు వాస్తవానికి శూద్రులు. ఇలాంటి కుటుంబాల వారు చాళుక్యుల వద్ద,

కాకతీయుల వద్ద సేనాధిపతులుగా, మాండలీకులుగా పనిచేశారు. కాకతీయుల కాలం వరకూ వారిలో శాఖాభేదాలు లేవు. అందరూ ఒకరితో ఒకరు వియ్యం పొందారు. కానీ కాకతీయుల పతనానంతరం వారు కమ్మ, రెడ్డి, వెలమ అనే మూడు ప్రత్యేక కులాలుగా చీలిపోయారు. వారు ఆ విధంగా చీలిపోవడానికి స్పష్టమైన కారణాలు తెలియదు. కానీ 14వ శతాబ్దాంతానికల్లా ఈ మూడు కులాలు స్పష్టమైన ప్రత్యేక రూపాలను సంతరించుకున్నాయి. ఈ మూడుకులాల వారు రాజ్యాలు సంపాదించి పాలించారు. కాకతీయ సామ్రాజ్య పతనకాలం నుండి కళింగ గజపతులు ఆంధ్రదేశాన్ని జయించే వరకు ఈ మూడు కులాలు ఆంధ్రదేశాన్ని పాలించాయి. కనుక ఈ కాలాన్ని ఆంధ్రదేశ చరిత్రలో కమ్మ, రెడ్డి, వెలమ యుగంగా పరిగణించవచ్చు. కమ్మ, రెడ్డి, వెలమ యుగంలోని మరొక ప్రత్యేకత ఏమిటంటే ఆంధ్రదేశంలో క్షత్రియకులం అదృశ్యమైంది. చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్న తెలుగు చోళులు, కోణ హైహయ వంశాలు పూర్తిగా అదృశ్యమైపోయాయి. ఈ వంశాలన్నీ కమ్మ, రెడ్డి, వెలమ కులాలలో విలీనం అయిపోయాయి. చాళుక్యులు, చోళ వంశాలు కమ్మవారిలో విలీనం అయిపోయాయని పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. 14వ శతాబ్దం నాటికి ఈ మూడు కులాలే పాలక కులాలుగా మిగిలాయి. చోళ, చాళుక్య, కాకతీయ వంశ నామాలన్నీ అదృశ్యం అయిపోయాయి. అంతవరకు ఆంధ్రదేశపు రాజ్యాలన్నీ వంశ నామాలతో ఉండేవి. చాళుక్య రాజ్యం, చోళరాజ్యం, హైహయ రాజ్యం, కాకతీయ రాజ్యం మొదలైన పేర్లతో ఉండేవి. 14వ శతాబ్దాంతం నాటికి వంశాల పేర్లు అంతరించి కులాల పేర్లతో రాజ్యాలు ప్రఖ్యాతి చెందాయి. కొండవీటి రెడ్డి రాజ్యం, రాచకొండ, రేచర్ల పద్మనాయక రాజ్యం అనే కుల సంకేతాలతో రాజ్యాలు ఏర్పడ్డాయి. మరొక మార్పు ప్రాచీన కాలం నుంచి వస్తున్న స్థానిక ప్రాంతాల పేర్లు కూడా మారిపోయాయి. రెడ్డిరాజ్యం స్థాపించిన ప్రాంతానికి అంతకుముందు కమ్మనాడు, వెలనాడు, పలనాడు అనే పేర్లుండేవి. గుండ్లకమ్మ నదికి ఇరువైపులా ఉన్న ప్రాంతాన్ని కమ్మనాడు అని పిలిచేవారు. అంటే నేటి ప్రకాశం జిల్లా, గుంటూరు జిల్లాలోని దక్షిణ ప్రాంతం ఇక్ష్వాకు శాసనాలు దానిని కర్మ రాష్ట్రం అని పేర్కొన్నాయి. తర్వాత అదే కమ్మరాష్ట్రం, కమ్మనాడు అని పిలిచారు. గుండ్లకమ్మ అనే పేరు కూడా కమ్మ అనే పదం నుండే వచ్చింది. అంటే కమ్మ నది. దానిలో గుండ్లు ఎక్కువగా ఉన్నందువల్ల దానికి గుండ్లకమ్మ నది అని పేరు వచ్చింది. ఈ ప్రాంతమే నేటి కమ్మవారి స్వస్థానం. బౌద్ధ యుగంలో కమ్మ అనే జాతి వారుండేవారు. వారిని కమ్మలు, నవకమ్మలు అని అమరావతి శాసనం పేర్కొంది. వారే కమ్మవారికి మూల పురుషులు. వారి నివాస ప్రాంతం గుంటూరు, ప్రకాశం జిల్లా ప్రాంతాలు. అందువల్ల ఆ ప్రాంతానికి కమ్మ రాష్ట్రం అని పేరు వచ్చింది. అక్కడి నుండే కమ్మవారు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారు. వారు వెళ్లిన ప్రాంతంలో వారిని కమ్మనాటి వారు అని పిలిచేవారు. నేడు కూడా ఈ ప్రాంతంలో కమ్మవారి జనాభా ఎక్కువ. ప్రోలయ వేమారెడ్డి కమ్మనాటిలో రాజ్యస్థాపన చేశాడు. అతని రాజధాని అద్దంకి. అది గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్నది. రెడ్డి రాజ్య స్థాపన చేసిన తర్వాత అంతవరకు వాడుకలో ఉన్న కమ్మరాష్ట్రం, కమ్మనాడు అనే పేర్లు మరుగునపడిపోయి అద్దంకి రాజ్యం- అద్దంకి సీమ అనే పేరు వాడుకలోకి వచ్చింది. పలనాడు ప్రాంతంలో రెడ్డి రాజులు బెల్లంకొండ, కేతవరం, తంగెడ, నాగార్జునకొండ కోటలు నిర్మించి పలనాడు ప్రాంతాన్ని విభజించి ఆ కోటలకు అనుబంధం చేశారు. దాంతో పలనాడు అనే పేరు పోయి బెల్లంకొండ సీమ, తంగెడ సముతు, నాగార్జునకొండ సముతు అనే పేర్లు వాడుకలోకి వచ్చాయి. పలనాటిసీమ సత్తెనపల్లి వద్ద భృగుబండ వరకు విస్తరించి ఉండేది. ఆ ప్రాంతానికి పలనాడు అనే పేరు అంతరించి పోయింది. ఆ ప్రాంతం బెల్లంకొండ సీమ, బెల్లంకొండ రాజ్యం అనే పేరుతో ప్రత్యేక ప్రాంతంగా రూపొందింది. పిల్లేరు నదికి పశ్చిమ ప్రాంతం మాత్రం నేటికీ పలనాడు అనే పేరు నిలబెట్టుకుంది. అందుకు కారణం అక్కడి ప్రజలలో పలనాటి పదం వాడుకలో ఉన్నందువల్లే నేటికీ ఆ పేరు నిలిచి ఉంది. కాని కమ్మనాడు; వెలనాడు అనే పేర్లు ఆ ప్రాంత ప్రజల స్మృతిపథం నుండి శాశ్వతంగా నశించిపోయాయి. అయితే బ్రాహ్మణుల శాఖల పేర్లలో మాత్రం అవి నిలిచి ఉన్నాయి. కమ్మనాటి బ్రాహ్మణులు, వెలనాటి బ్రాహ్మణులు, ఆరువేల నియోగులు అని నేటికీ ఉన్నారు. కమ్మనాడు ఆరువేల గ్రామాలతో ఉండేదట. అందువల్ల కమ్మనాటి శాఖ వారికి ఆరువేల నియోగులు అనే పేరు కూడా వచ్చింది. బ్రాహ్మణుల శాఖల పేర్ల రూపంలో మాత్రమే నేడు కమ్మనాడు, వెలనాడు నిలిచి ఉన్నాయి. అలాగే తెలంగాణలోని స్థానిక పేర్లయిన కొరవిసీమ, మెతుకుసీమ, నతవాడి మొదలలైన పేర్లు మరుగునపడి ఓరుగల్లు రాజ్యం రాచకొండ, దేవరకొండ రాజ్యాలు అనే పేర్లు వచ్చాయి. ఈ విధంగా వంశాల పేర్లు పోయి కులాల పేర్లు, ప్రాచీన స్థానిక నామాలు పోయి రాజ్యాల రాజధానుల పేర్లే స్థలనామాలుగా మారిపోయాయి. కనుక ఆంధ్రదేశ చరిత్రలో కాకతీయరాజ్య పతనం ఒక యుగ

సమాప్తికి సంకేతం. అంటే ప్రాచీన వంశాలు, స్థలనామాలు అంతరించి ప్రాచీనయుగం సమాప్తమైంది. తర్వాత నూతన సాంఘిక, రాజకీయ వ్యవస్థలు వచ్చాయి. ఆనాడు రూపొందిన కమ్మ, రెడ్డి, వెలమ కులాలు నేటికీ తమ ప్రత్యేకతలతో కొనసాగుతున్నాయి. కనుక ఆంధ్రదేశ చరిత్రలో క్రీ.శ.1323వ సంవత్సరంలో కాకతీయ సామ్రాజ్యం కూలిపోవడంతో నూతన యుగం ప్రారంభమైంది అదే కమ్మ, రెడ్డి, వెలమ యుగం - ఈ మూడు కులాలు తమ రాజ్యాలు పోయిన తర్వాత కూడా సైనిక రాజకీయ వృత్తిని వదిలిపెట్టలేదు. ముసునూరు రాజ్యం పోయిన తర్వాత కమ్మవారు విజయనగర రాజ్యంలో సేనాధిపతులుగా చేరారు. వెలమలు కూడా తమ రాజ్యం పోయిన తర్వాత విజయనగర రాజ్యంలో సేనాధిపతి పదవులు సంపాదించారు. రెడ్డి రాజ్యం పోయిన తర్వాత ఎక్కువ మంది రెడ్లు వ్యవసాయ వృత్తిలో ప్రవేశించారు. విజయనగర సామ్రాజ్యంలో రెడ్డి సేనానులు లేరు. విజయనగర రాజ్యం పోయిన తర్వాత కూడా కమ్మ, వెలమ వారు తమ రాజకీయ సైనిక వృత్తిని మానలేదు. వారు తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన గోల్కొండ, మొగల్, నిజాం నవాబుల వద్ద సేనాధిపతులుగా, మాండలీకులుగా, సామంతులుగా కొనసాగారు. బ్రిటిష్ వారి కాలంలో జమిందారులుగా మారి తమ ఉనికిని కాపాడుకున్నారు. కనుకనే ఈ మూడు కులాలు నేటివరకూ తమ ప్రఖ్యాతిని నిలుపుకున్నాయి. జనాభా తగ్గి ప్రస్తుతం వెలమ కులం కనుమరుగైంది మిగిలిన కమ్మ, రెడ్డి కులాలు తమ ప్రఖ్యాతిని కొనసాగిస్తూనే ఉన్నాయి.

ముసునూరి కమ్మనాయక సామ్రాజ్యం

ముసునూరి కమ్మనాయక రాజ్య చరిత్ర తెలుసుకోవడానికి మనకు ఎక్కువ ఆధారాలు లేవు. కొద్ది ఆధారాలే ఉన్నాయి. అయినప్పటికీ అందులో వారి వీరోచిత గాథలు, ఘనకార్యాలు ఆంధ్రదేశాన్ని ముస్లింల దుష్కార్యాల నుండి విముక్తి చేసి నాటి ప్రజలను రక్షించి మన్ననలను పొందిన వైనాన్ని ఘనంగా శ్లాఘిస్తున్నాయి. వారు శాసనాలలో ఆంధ్రదేశ విముక్తి ప్రదాతలుగా, ప్రజాసంరక్షకులుగా వర్ణింపబడ్డారు. వారి చరిత్రను తెలుసుకోవడానికి మనకు -

1. ప్రోలయనాయకుని విలస శాసనం.
2. కాపయనాయకుని ప్రోలవరం శాసనం.
3. అని తల్లి కలువచేరు శాసనం.

ఇవి బాగా ఉపయోగపడుతున్నాయి. ఇందులో ప్రోలయ నాయకుని విలస శాసనం, ప్రోలయ నాయకుడు తురుష్కుల భయంకర పైశాచిక పాలన నుండి దేవాలయాలను, గోబ్రాహ్మణులను రక్షించి, దేవబ్రాహ్మణ మాన్యాలను పునరుద్ధరించి అడుగంటిపోయిన వైదిక ధర్మాన్ని నిలబెట్టినట్లు తెలుపుతోంది. కాపయనాయకుని ప్రోలవరం శాసనం ముసునూరి వంశస్తులకు చెందిన మూడు తరాల వంశ వృక్షాన్ని ఇస్తుంది. ఈ శాసనం వారి వంశ చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడుతోంది. దానికంటే ముందు విడుదల చేయబడిన విలస శాసనంలో వారి వంశపు పూర్వ చరిత్ర ఏమీ లేదు. కనీసం ప్రోలయ నాయకుని తండ్రి పేరును కూడా ప్రస్తావించలేదు. కాని ప్రోలవరం శాసనం అలాకాక అతని పూర్వీకులను కూడా ప్రస్తావించింది. అందువల్ల వారి వంశ చరిత్రను నిర్మాణం చేయడానికి ఈ శాసనం ప్రధాన ఆధారంగా ఉపయోగపడుతోంది. అనితల్లి కలువచేరు శాసనం ప్రతాపరుద్రుని స్మరించింది. ప్రతాపరుద్రుడు వైభవంగా రాజ్యం చేశాడని, అతనిని నరపతి అని పేర్కొంది. అంతేగాక అతడు గజపతులైన ఉత్కళ ప్రభువులకంటే, అశ్వపతులైన తురుష్క ప్రభువులకంటే చాలా గొప్పవాడని కీర్తించింది. తర్వాత ప్రోలయ నాయకుని అంతకంటే ఘనంగా వర్ణించింది. ప్రతాపరుద్రుని మరణం వల్ల సముద్ర జలంలో మునిగిపోయిన భూమిని ఆదివరాహం ఉద్ధరించినట్లు, తురుష్కులు దిగమింగిన త్రిలింగ దేశాన్ని ప్రోలయ నాయకుడు ఉద్ధరించాడని వర్ణించింది. ప్రోలయ నాయకుడి తర్వాత సూర్యప్రతాపుడగు కాపయ నాయకుడు 75గురు నాయకులు తన పాదపద్మాలను సేవిస్తుండగా రాజ్యాన్ని రక్షిస్తున్నాడని, అతనిని సేవించే ఆ నాయకులతో పంట వంశాన జన్మించిన వేమభూపాలుడు అగ్రగణ్యుడని వివరించింది. అనితల్లి శాసనం ముసునూరి రాజ్య విస్తీర్ణాన్ని, కాపయనాయకుని అధికార పరిధిని నిర్ణయించడానికి చక్కగా ఉపయోగపడుతోంది. ముసునూరి వంశస్తుల చరిత్ర నిర్మాణానికి ఉపయోగపడే ఈ శాసనాల పూర్తి పాఠం కింద ఇవ్వబడింది.

1. **ముసునూరి ప్రోలయనాయకుని "విలస" శాసనం:** ఈ శాసనం తూర్పుగోదావరి జిల్లా పిఠాపురానికి సమీపంలోని కందరాడ గ్రామంలో శ్రీ హుండి వెంకటరావు పంతులుచే 1856లోనే కనుగొనబడింది. కాని చాలా కాలం తర్వాత ప్రకటింపబడింది. ఇందులో చతుర్థకులస్తుడు, ముసునూరి వంశస్తుడు అయిన ప్రోలయ నాయకుడు చంద్రగ్రహణ సమయాన (సంవత్సరం, నెల ఉటంకింపబడలేదు) భారద్వాజ గోత్రజుడు, అన్నయ కుమారుడు, గణపయ సోదరుడు అయిన వెన్నయ అనే బ్రాహ్మణ పండితునికి కోనసీమ (నేటి అమలాపురం తాలూకా)లోని విలస గ్రామాన్ని అగ్రహారంగా దానం ఇచ్చినట్లు అభివర్ణింపబడింది. ప్రోలయనాయకుడు కమ్మ కులానికి చెందిన వాడని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ నిర్ణయించారు. (Forgotten Chapter of Andhra History P-33). ఇందులో సంవత్సరం ఉటంకింపబడక పోయినప్పటికీ, ఈ దాన శాసనం క్రీ.శ.14వ శతాబ్దిలో నాలుగు, అయిదు శతాబ్దాల నాటిదని కూడా నిర్ణయింపబడింది. నేటి అమలాపురం తాలూకాలోని విలస గ్రామమే శాసనప్రోక్తమైన అగ్రహారం. శాసనంలోని భాష సంస్కృతం. గ్రామ సీమ నిర్ణయంలో మాత్రం తెలుగు భాషే ఉపయోగింపబడింది. వెన్నయ నుండి అగ్రహారాన్ని దానంగా గ్రహించిన బ్రాహ్మణుల పట్టిక గల శ్లోకాలు, గ్రామ సీమా నిర్ణయం తెలిపే వాక్యాలు తప్ప శాసన పాఠమంతా యధాతథంగా ఇవ్వబడింది. కింద తెలుగు అనువాదం కూడా జోడింపబడింది.

1. యాం ప్రేమ్ణా శశి మౌళినా గజముఖో గాఢం సమాలింగిత
శ్చాపల్యా చ్ఛశిన: కలాం కరతలేనాదాయ మూర్ధ్ని స్థితాం
నిక్షిప్యేతరదంతసమ్ని సమమాత్ సంలక్ష్యదంత ద్వయ:
కల్యాణం వితనోతు సా శశికలా విఘ్నేశ్వర: సోపిన:
అర్థం: శివునిచే ప్రేమతో కౌగిలింపబడిన గజముఖుడు తండ్రి శిరస్సుపై గల శశికళను చాపల్యంచే అరచేతిలోకి తీసుకొని, రెండవ దంత ప్రదేశమున నిక్షేపించి (దానినే రెండవ దంతంగా భావించి) దంత ద్వయమును కొలిచెనో, ఆ శశికళయు, ఆ విఘ్నేశ్వరుడును మీకు శుభం చేకూర్చుగాక!
2. పుష్టిం కృషీష్ట వ: పోత్రీ పురాణ:
పురుషోత్తమ: యుద్ధం ష్ట్రాహరిణాంకస్య వసుధా లాంఛనాయతే
అర్థం: ఎవరి దంష్ట్రయనెడి చంద్రునికి భూమియే లాంఛనమగుచున్నదో ఆదివరాహుడగు ఆ విష్ణువు మీకు పుష్టినొసంగు గాక!
3. ఉపాత్త సత్త్వో భగవానాదౌ నారాయణో
విభు: అద్రాక్షీ దమ్మయం విశ్వము న్నీలన్నయ నాంబుజమ్
అర్థం: సత్త్వగుణ ప్రతిష్ఠితుడైన భగవాన్ నారాయణుడు ఆదియందు నేత్రపద్మములను తెరచి జలమయమైన విశ్వమును పరికించెను.
4. తత: పరీతో రజసా గుణేన బ్రాహ్మీ ముపాశ్రిత్య తనుం మహేశ:
అకల్పయ త్పూర్వవదేవ లోకా స్సర్వాన్ కృపార్ద్రీకృతచిత్తవృత్తి:
అర్థం: అంతట రజోగుణముచే కూడినవాడై బ్రాహ్మీమయమైన తనువును ఆశ్రయించి దయార్ద్రచిత్తుడై సర్వలోకములను పూర్వమువలెనే సృష్టించెను.
5. సముద్ర ద్వీపసం వీతా హేమాచలమనోహరా
సర్వేషా మపి లోకానాం మధ్యస్థేయం వసుంధరా
అర్థం: సర్వలోకములకును నడుమునున్న ఈ భూమి సముద్రములతో ద్వీపములతో కూడినదై సువర్ణ పర్వతముతో మనోహరమై యొప్పారుచున్నది.
6. తస్యాశ్చ రత్నగర్భాయా: సర్వస్యా
మధ్యవర్తినం జంబూద్వీపం విదుర్దేశం లవణాంబుధివేష్టితమ్
అర్థం: రత్నగర్భయగు ఆ భూమికంతటికీ మధ్య భాగమున విరాజిల్లుచు లవణ సముద్రముచే పరివేష్టింపబడిన ప్రదేశమును జంబూద్వీపమందురు.
7. ద్వీపే పి తస్మిన్నవధా విభక్తే హిమాచలా దక్షిణ మాసముద్రం
భాగం భువో భారతవర్షమాహు: ఫలన్తి కర్మాణి కృతాని యత్ర
అర్థం: ఆ జంబూద్వీపమున హిమాచలం నుండి దక్షిణమున సముద్రము వరకు తొమ్మిది భాగములుగ విభజింపబడిన భూభాగమును భారత వర్షమందురు. అచ్చట చేయబడిన కర్మలన్నియును ఫలవంతములే.
8. భాషా సమాచార భిదా విభిన్నే దేశైరనేకై ర్బహుధా విభక్తే
వర్షే చ తస్మిన్ కమనీయ వాస్త్రిలింగనామో స చకాస్తి దేశ:
అర్థం: విభిన్న భాషలచే బహువిధములైన ప్రాంతములుగ విభజింపబడిన ఆ భారత వర్షమున త్రిలింగ దేశము సుమనోహరమై యొప్పారుచున్నది.
9. మహర్ధి రమ్యాణి పురాణి నద్య: పుణ్యోదకా రమ్యతరా మహీధ్రా:
వనాన్య సేన్యాన్య తలాస్తటాకా దుర్గాణ్యధృష్యాణి చ సంతి యత్ర
అర్థం: ఆ త్రిలింగ దేశమున రమ్యములైన నగరములు, పుణ్య జలములు గల నదులు, రమ్యతరములైన పర్వతములు, వనములు, తటాకములు దుర్భేద్యములైన దుర్గములు కలవు.
10. ఏవం విధా మంబుధిమేఖలాంతామపీపలన్ ధర్మనయక్రమేణ
సోమార్కవంశ్యా నరపాలవర్యా: పురాణసిద్దా:పురుహూతభాసా:

అర్థం: సముద్రవేష్టితమైన ఆ దేశమును పురాణ ప్రసిద్ధులు, సూర్య చంద్ర వంశజులైన రాజవర్యులు ధర్మబద్ధముగా, దేవేంద్ర వైభవముతో పరిపాలించిరి.

11. గతేషు తేషు క్షితి పాలకేషు క్షితీశ్వరాః కాకతి వంశజాతాః
కాలే కలౌ సంప్రతి వర్తమానే తిలింగ మాఖ్యాయ శశాసు రుర్వీః
అర్థం: పూర్వ రాజులు, రాజవంశములు గతించిన వెనుక కలికాలము ప్రవర్తిల్లుచుండగ ఈ త్రిలింగ దేశమును కాకతి వంశజాతులైన రాజులు పరిపాలించిరి.

12. తేషామేకశిలానామనగరీ పృథివీక్షితాం
ఇక్ష్వాకూణా మయోధ్యేవ రమ్యా భూత్కులవాసభూః
అర్థం: ఆ త్రిలింగ దేశమున కాకతి వంశ ప్రభువులకు ఏక శిలానగరము ఇక్ష్వాకు వంశజులకు అయోధ్యవలె రమ్య రాజధానియై విలసిల్లెను.

13. కాలక్రమాత్ ప్రయాతేషు తేష్వనల్పపరాక్రమః
ప్రతాపరుద్రో నృపతిః పాలయామాస మేదినీమ్
అర్థం: కాలక్రమమున ఆయారాజులు గతింపగా అమిత పరాక్రమోపేతుడగు ప్రతాపరుద్ర నరపాలుడు భూమిని పరిపాలించెను.

14. సర్వే పి దానప్రవణా మనుష్యా ద్విజాతయో యజ్ఞపరాస్సమస్తాః
కలిస్తదా సీత్ కృతకాలచిహ్నో యస్మిన్ మహీం శాసతి వీరరుద్రే
అర్థం: ప్రతాపరుద్రుడు రాజ్యపాలన చేయుచుండగా మానవులందరూ దానపరులు, అందును బ్రాహ్మణులందరు యజ్ఞపరులు నగుటచే కలికాలము కృతకాల చిహ్నములు దాల్చెను.

15. యస్మిన్ మహీం శాసతి శాసనాంకాం ప్రజాః ప్రజాపాలనకర్మదక్షే నాస్మార్షు
రాద్యాన్నరపాలముఖ్యాన్యయాతినా భాగభగీరథాద్యాన్
అర్థం: ప్రజాపాలనయందు సమర్థుడగు అతడు రాజ్యమును శాసించుచుండగా ప్రజలు యయాతి, ఆభాగుడు, భగీరథుడు మున్నగు పూర్వచక్రవర్తులను స్మరింపకుండిరి.

16. అథేవం శాసతా తేన తురుష్కాణా మధీశ్వరః
అహమ్మదు సురత్రాణో మహద్వైరం సమాచరత్
అర్థం: ఇట్లు అతడు పాలించుచుండగా తురుష్క చక్రవర్తియగు అహమ్మద్ సుల్తాన్ అతనితో మహా వైరము నవలంబించెను.

17. భూపాలలయకాలేన యేన నిశ్శేషతాం గతాః
జామదగ్న్యేన రామేణ హతశేషా మహీభృతః
అర్థం: జామదగ్నుడైన పరశురామునిచే చంపబడగా మిగిలిన రాజులెల్లరును క్షత్రియుల పాలిటి లయకారుడైన అహమ్మద్ షా చేత నిశ్శేషముగ వధింపబడిరి.

18. వీరోద్భటభట స్సో పి వీరరుద్రః ప్రతాపవాన్
అజయ త్సప్తకృత్వ స్తం నవలక్షాశ్వసాధనమ్
అర్థం: పరాక్రమవంతుడు, మహావీరుడునగు వీరరుద్రుడు కూడా నవలక్షాశ్వపతియగు ఆ తురుష్క రాజును ఏడుమార్లు జయించెను.

19. నీతిప్రశస్తో పి బలాధికో పి సహాయయుక్తోనపి చ వీరరుద్రః
భాగ్యక్షతే ర్వానుషమండలస్య తురుష్క భర్తు ర్వశతా మయాసీత్
అర్థం: నయకోవిదుడైనను, బలాధికుడైనను, సహాయ యుక్తుడైనను వీరరుద్ర చక్రవర్తి ప్రజల భాగ్యహీనత వలన తురుష్క ప్రభువు చేత జిక్కెను.

20. స నీయమానో నగరీం స్వకీయాం దిల్లీం ప్రయత్నాద్యవనేశ్వరేణ
సోమోద్భవాయాః సరితః ప్రతీరే దైవాదయా సీత్రిదశాధివాసం
అర్థం: ప్రతాపరుద్రుడు తురుష్క ప్రభువుచేత తన రాజధానియగు ఢిల్లీ నగరమునకు కొనిపోబడుచు నర్మదా నదీ తీరప్రాంతమైన దైవవశమున స్వర్గస్థుడయ్యెను.

21. ప్రతాపరుద్రతిగ్మాంశౌ లోకాంతరతిరోహితే
తురుష్కాంధతమిస్రేణ సమాక్రాంతం మహీతలం
అర్థం: ప్రతాపరుద్రుడను సూర్యుడు లోకాంతరముకేగి తిరోహితుడు కాగా తురుష్క సమూహమను కారు చీకటి భూతలమంతట క్రమ్ముకొనెను.

22. ప్రతాపరుద్రేణ పరం పరాస్తో రిపూ నధర్మో యవనాన్ గతోను
నో చేద్గతే స్మిన్ యవనైస్సహైవ కథం నిరాబాధసుఖం జజృంభే
అర్థం: ప్రతాపరుద్రునిచే తొలగింపబడిన అధర్మము, శత్రువులైన తురుష్కుల నాశ్రయించెను కాబోలు. లేకున్నచో ప్రతాపరుద్రుడు గతించిన వెంటనే తురుష్కులతో బాటు అధర్మము కూడా నిరాటంకముగా నెట్లు విజృంభింపగలదు?

23. కేచి ద్ధనాఢ్యాః పరిబాధ్యమానా ధనాయ పాపైర్వివిధైరుపాయైః
కేచిన్నిరీక్ష్యైవ చ పారశీకాన్ పర్యత్యజన్ ప్రాణనభస్వతో న్యే
అర్థం: కొందరు ధనాఢ్యులు పాపులైన తురుష్కులచే ధనము కొరకు వివిధోపాయములచే బాధింపబడిరి. మరికొందరు ఆ పారశీకులను చూసిన మాత్రముననే ప్రాణములను వదిలిరి.

24. ద్విజాతయ స్త్యాజితకర్మబంధా భగ్నాశ్చ దేవప్రతిమా స్సమస్తాః
విద్వద్వరిష్టై శ్చిరకాలభుక్తా స్సర్వే వ్యపాహారిషతాగ్రహారాః
అర్థం: తురుష్కులు బ్రాహ్మణుల కర్మబంధములను వదిలించిరి (యజ్ఞకర్మలను నిరోధించిరి). దేవతా విగ్రహములను పగులగొట్టిరి. పండిత వరేణ్యులు చిరకాలముగా అనుభవించుచున్న అగ్రహారములను అపహరించిరి.

25. ఆత్తే కర్షణలాభౌ పాపైర్యవనై ర్బలాత్కారాత్
దీనాదీనకుటుంబాః కృషీవలా నాశమాపన్నాః
అర్థం: పాపాత్ములైన యవనులు పండిన పంటనంతయు బలవంతముగా లాగుకొనగా పెద్ద, చిన్న రైతులందరూ నష్టపడిరి.

26. ధనదారాదికే నృణాం కస్మింశ్చిదపి వస్తుని
స్వాయత్తతామతి ర్నాభూద్భువి తస్యాం మహాపది
అర్థం: అట్టి మహాపదయందు ధనదారాదికములైన ఏ వస్తువులందును రాజ్యప్రజలకు స్వాయత్తతా భావము కలుగకుండెను.

27. పేయా సురా గోపిశితం చ భోజ్యం, లీలావిహారో ద్విజఘాతనం చ
అశ్రాంత మాసీ ద్యవనాధమానాం కథంను జీవేద్భువి. జీవలోకః
అర్థం: యవనాధములు ఎడతెగక త్రాగునది మద్యము, తినునది గోమాంసము, బ్రాహ్మణులను చంపుట లీలావిహారము. ఇక జీవలోకము భూమిపై ఎట్లు జీవింపగలదు?

28. ఇత్థం తైర్యవనభటైః ప్రబాధ్యమానం త్రైలింగం ధరణీతలం సురారికల్పైః
త్రాతారం కమపిప్పాదా వ్యవిందమానం సంతేపే వనమివ దావవహ్ని జుష్టమ్
అర్థం: ఇట్లు రాక్షసులతో సమానులైన ఆ యవన భటులచే మిక్కిలి బాధింపబడుచున్న త్రిలింగ దేశమును రక్షించువానికై కోరుచు దావాగ్నిచే తపించు అడవివలె ప్రజాసందోహము సంతాపము పొందెను.

29. అనంతరం సంస్మృతి యావనం తామాలోక్య పీడామనుకంపమానః
అంశావతీర్ణో భగవానివాద్యః ప్రోలక్షితీశో వసుధాం బిభర్తి
అర్థం: పిమ్మట ఇప్పుడు యవన పీడనాలోకించి దయాళువై అవతరించిన విష్ణుదేవుని వలె ప్రోలక్షితీశుడు భూమిని పాలించుచున్నాడు.

30. పుంసఃపురాణస్య పదా దుదీర్ణం వర్ణం యమాహుః కలికాలవర్యమ్
తత్ర ప్రశస్తో ముసునూరి వంశో యజ్జన్మధామ ప్రథతే పృథివ్యామ్
అర్థం: భగవంతుని పాదమునుండి ఉద్భవించినదియు కలికాలమున శ్రేష్టమైనదియు చతుర్థకులము.

'అందు ముసునూరి వంశము భూమి యందు 'ప్రసిద్ధమైనది.

31. స ప్రోలభూపో ముసునూరి వంశ్య స్థథావిధం యావన మాధిపత్యం
విశ్వోపజీవ్యేన విశృంఖలేన వ్యనీనశ ద్బాహుబలేన వీరః
అర్థం: ముసునూరి వంశజుడు వీరుడునైన ఆ ప్రోలయ భూపతి విశృంఖలమైన తన బాహుబలముచే యవనుల ఆధిపత్యమును నాశమొనర్చెను.

32. నామా స్య తేషాం యవనాధమానాం మంత్రః కిముచ్చాటన కర్మకారీ
దీనా యదుచ్చారణ మాత్రతస్తే దుర్గాణి సంత్యజ్యకుతో ప్యభూవన్
అర్థం: అతని నామము యవనాధములను పారద్రోలగల మంత్రమై విరాజిల్లెను. అతని నామము నుచ్చరించిన మాత్రముననే వారు దుర్గములను వదలి ఎటకో పారిపోయిరి.

33. యాః ప్రజాః సమబాధ్యతంత యవనై స్తామనూపమం
ప్రభవం తం తమేవాగు ర్నిదాఘార్తా ఇవ హ్రదమ్
అర్థం: యవనులచే మిక్కిలి బాధింపబడిన ప్రజలు వేసవిచే తపించిన వారు సరస్సును చేరినట్లు ప్రభువగు ఆ ప్రోలయను చేరిరి.

34. యే పీడితా స్తురుష్కై రనారతం మానుషా ఘోరం
తే తానేవ నిజఘ్ను ర్బలమాశ్రయజం మహత్ ఖ్యాతమ్
అర్థం: తురుష్కులచే ఏ జనులు ఘోరంగా పీడింపబడిరో, ఆ జనులే వారిని చంపిరి. ఆశ్రయము వలన కలుగు బలము గొప్పదని చెప్పబడును.

35. ఇత్థం పరాస్య ప్రబలం ప్రపంచం యావనం బలీ
నష్టమాపది కష్టాయాం ధర్మం పునరవీవృతత్
అర్థం: ఇట్లు బలవంతుడైన ప్రోలయ ప్రబలమైన తురుష్క సందోహమును నాశనమొనర్చి ఆపదలో నశించిన ధర్మమును పునరుద్ధరించెను.

36. అపాహృతాంస్తై రతిపాపచర్యైః ప్రత్తాన్ పురాణై ర్మనుజేంద్రవర్యైః
అనేకశః పూర్వమహీసురేభ్యః ప్రోలక్షితీశో దదతాగ్రహారాన్
అర్థం: పూర్వ రాజేంద్రులచే దానముగ నీయబడి, అతిపాపాత్ములైన తురుష్కులచే అపహరింపబడిన అగ్రహారములను ప్రోలక్షితీశుడాయా బ్రాహ్మణులకు మరల నొసంగెను.

37. కృత్వా ప్రవృత్తాన్ విరత ప్రసంగాన్
యజ్ఞాన్ హవిర్ధూమపరంపరాభిః
తురుష్క సంచారణజాతపాపానాంధ్రాన్ ప్రదేశా ననఘానకార్షీత్
అర్థం: హవిర్ధూమ పరంపరలతో యజ్ఞములను ఎడతెగక ప్రవర్తిల్లజేసి ఆ ప్రోలయ తురుష్క సంచారములచే పాపాత్మకమునైన ఆంధ్ర దేశమును పుణ్యవంతము గావించెను.

38. కృషీవలాశ్చాపి కృపేః ఫలానాం యథోదితం భాగమదుః ప్రహృష్టాః
తపస్వినష్షష్ఠమివ ప్రభాగం పృధ్వీభుజే స్మై తపసః ఫలానామ్
అర్థం: తపస్వులు తమ తపఃఫలమున షష్ఠాంశమును రాజున కొసగినట్లు, కృషీవలులు కూడా పంటలో విధింపబడిన భాగమును సంతోషముతో నొసంగిరి.

39. యద్యత్కృతం పారశీకైః వ్యత్యస్తం ధరణీతలే
తత్తత్సర్వం యధాపూర్వం వ్యరీరచదయం బలీ
అర్థం: భూతలమున పారశీకులచే ఏవేవి తలకిందులు చేయబడినవో వానినన్నిటినీ బలవంతుడగు ప్రోలయ యథాపూర్వముచేసి సరిదిద్దెను.

40. ఇత్థం ప్రోలమహీవరేణ బలినా సర్వం సహేయం చిరా
త్కష్టాయా. యవనేంద్ర ఘోరనివకృతే స్సంమోచ్య హస్తే ధృతా
సంతుష్టా సుకృతోపచార విధిభి ర్విస్మృత్య పూర్వాన్ నృపాం
స్తస్మిన్ భావమనన్యగం వితనుతే సౌస్థిత్య సందర్శితం

అర్థం: ఇట్లు తురుష్క ప్రభువుచే చిరకాలము ఘోరముగా పీడింపబడిన ఆంధ్రభూమిని విముక్తమొనర్చి ప్రోలభూపతి తన హస్తమున వహించెను. సుకృతోపచారములచే సంతుష్టి నొందిన రాజ్యలక్ష్మి పూర్వ నరేంద్రులను విస్మరించి అనన్యమనస్కయై అతనినే సేవించెను.

41. తస్యాస్తి తస్యాంబుని రాజధానీ మహీభృతో మాల్యవతస్సమీపే
గోదావరీ ప్రాంతభువి ప్రశస్తాం యాం రేకపల్లీతి వదంతి దేశ్యాః
అర్థం: గోదావరీ ప్రాంత భూభాగమున మాల్య వత్పర్వత సమీపమున అతని రాజధాని ప్రశస్తమై అలరారెను. అది దేశీయులచే రేకపల్లి అని వ్యవహరింపబడుతున్నది.

42. దాన భోగోపయోగాభి స్సర్వాభిర్వసుభూరిభిః
యా తిచక్రామ నగరీ మలకాం చామరావతీమ్
అర్థం: దానమునకు భోగమునకు ఉపయుక్తములైన సమస్తభూరి సంపదలచే విరాజిల్లు ఆ రేకపల్లి నగరము అలకానగరమును మించిపోయెను.

43. ముక్తాఫలై ర్విద్రుమభంగజాలకై ర్మణిప్రజై రున్నత హేమరాశిభిః
రుద్వాపణా యా సతతం విరాజతే ధనేశ్వరస్యేవ చ భాండగేహభూః
అర్థం: ముత్యములతో, పగడములతో, మణిరాసులతో, హేమరాసులతో ఆ నగరము కుబేరుని భాండాగారమువలె ఎల్లప్పుడూ సమృద్ధమై విరాజిల్లుతున్నది.

44. సతామధిష్ఠాయ పురీం సమృద్ధాం ప్రోలక్షితీశః పురుహూతితేజాః
పాస్తవైరిక్షితిపాలలోకాం ప్రశాస్తి పృథ్వీం నిజశాసనాంకామ్
అర్థం: సంపత్సమృద్ధమైన ఆ పురము నధిష్ఠించిన ఇంద్రతేజస్కుడైన ప్రోలక్షితీశుడు శత్రురాజ సమూహామును అణచి పృథ్విని శాసించెను.

45. యద్ధాటీషు వలత్తురంగమఖుర ప్రోద్యద్రజోమండలీ విస్తారైః పరిధూసరాలకభర ప్రాంతా దిశాయోషితః
దృష్ట్వా భ్రాంతి మవాప్నువంతి మహతీం గంధర్వ కన్యా ముహుర్భీత్యా దూరతర
ప్రధావదహితక్ష్మాపాలయోషా ఇతి
అర్థం: గుఱ్ఱపు గిట్టల తాకిడిచే రేగిన దుమ్ముచే దిగ్వనితల ముంగురులు ధూళిధూసరితములు కాగా, వానిని చూచిన గంధర్వకన్యలు భీతితో దూరదూరముగ పరుగెత్తుచున్న శత్రురాజుల భార్యలను భ్రాంతి నొందుచున్నారు.

46. యత్ప్రతాపతపనేన విహ్వలా వైరిణః క్షితిభృతో మహీయసా
పాపద్మనఖచంద్ర రోహిణీం శీతలాం పరిచరంతి చంద్రికామ్
అర్థం: అతని ప్రతాపమును సూర్యునిచే భీతినొందిన శత్రురాజులు అతని పాదపద్మములను, నఖచంద్రుని చేరి చల్లని వెన్నెలలో చరించుచున్నారు.

47. యద్బాహుపీఠం సంప్రాప్య ప్రతాపోష్మలమున్నతమ్
త్యజత్యంబుధిసంవాసక్లేశమద్య వసుంధరా
అర్థం: ప్రతాపమును వెచ్చదనము కలిగిన అతని ఉన్నత బాహుపీఠము నాశ్రయించి భూమి సముద్ర సహవాసము వలని క్లేశమును నేడు వీడినది.

48. అరత్నమౌళిపరిదంతురేషు నిరాతపత్రావరణేషు యస్య
ఆజ్ఞానటీ నృత్యతి భూపతీనాం మూర్ధాగ్రరంగేషు సమున్నతేషు
అర్థం: రత్నములు లేక వెలవెలపోవు కిరీటములు కలిగి, ఛత్రములు లేని రాజుల యొక్క సమున్నతములైన శిరస్సుల పై భాగములను రంగస్థలములందు ప్రోలయ శాసనమును నర్తకి నృత్యము చేయుచున్నది.

49. ఆరోపితగుణం యస్య ధనుస్సాపత్న్యశంకయా
అరిరాజన్య కాంతానాం కంఠస్థా నలునా ద్గుణాన్
అర్థం: నారినెక్కుపెట్టిన ప్రోలయ ధనుస్సుసపత్నులు (సవతులు, విరోధులు) అను శంకచే శత్రురాజుల

భార్యల కంఠములందున్న మంగళ సూత్రములను త్రెంపుచున్నది.

50. తస్యా భవన్ కాపయనాయకకాద్యా స్సుభ్రాతర శ్శౌర్యనయోపపన్నాః
యేషు ప్రతిష్ఠాయ దురంధరాయాఃప్రభు స్స ధర్మార్జన తత్పరో భూత్
అర్థం: అతనికి శౌర్యము, రాజనీతితో కూడిన కాపయనాయకుడు మున్నగు తమ్ములు కలరు. రాజ్యపాలన భారమును వారిపైనుంచి అతడు ధర్మకార్య తత్పురుడయ్యెను.

51. మహీసురేభ్యః కలికాలపర్యంతం దానరూపం పరమం విదిత్వా
ప్రాదా ప్త్రశస్తాన్ బహుశో గ్రహారాన్ మహాన్తి దానాన్యకరోద్బహూని
అర్థం: బ్రాహ్మణులకిచ్చిన దానములు కలికాల పర్యంతముండునని గ్రహించి ప్రోలయ అనేక ప్రశస్త అగ్రహారములను, పెక్కు గొప్ప దానములను ఒసంగెను.

52. యే సూరయస్సంతి మహీతలే స్మిన్ సత్పాత్రభూతావసుభూరి తేషు
దత్వా తిపాత్రే ప్రతిపాదనాయ వ్యచాయయత్తజ్జగతీతలేంద్రః
అర్థం: ఈ భూతలమున సత్పాత్రులైన పండితులకు భూరిదానములిచ్చుటయే గాక అతిపాత్రులకై దానమిచ్చుటకు ఆ రాజేంద్రుడు అన్వేషించెను.

53. భారద్వాజో మునిః పూర్వమభవద్వేదవిశ్రుతః
ప్రథతే నుత్తమం గోత్రం యదుపజ్ఞం మహీతలమ్
అర్థం: పూర్వము భారద్వాజుడను వేదవిశ్రుతుడగు ముని యుండెను. అతని గోత్రము భూతలమున మిక్కిలి ఉత్తమమని పేరొందెను.

54. తద్గోత్రే న్నయవిదుషః పౌత్రః చ న్నయార్యస్య
అన్నయనామా విద్వానభవత్ ఖ్యాతో యజుర్వేదీ
అర్థం: ఆ గోత్రమున నయకోవిదుడైన వెన్నయార్యుని మనుమడు అన్నమ నామధేయుడు యజుర్వేదియై విద్వాంసుడని పేరుపొందెను.

55. వెన్నయ గణపయ విదుషౌ తత్పుత్రౌ జగతి విశ్రుతఖ్యాతీ
యత్పాదపద్మసంగాత్ ధరణిరియం ధన్యతాం ధత్తే
అర్థం: అతని పుత్రులగు వెన్నయ, గణపయ అనువారు లోకమున విద్వాంసులని విఖ్యాతులైరి. వారి పాదపద్మ సంగముచే ఈ భూమి ధన్యత నందినది.

56. త్రివిష్టపాదేత్య గురుస్సురాణాం పాతాళ లోకాత్పణినాం పతిశ్చ
సౌభ్రాత్ర సౌఖ్యానుభవాయ భూమిం సంప్రాప్తవంతావివ యౌ విభాతః
అర్థం: స్వర్గమునుండి సురగురువగు బృహస్పతియు, పాతాళము నుండి శేషుడను సౌభ్రాత్ర సౌఖ్యమును అనుభవించుటకై భూతలమునకు వచ్చినట్లు ఆ సోదరులు విలసిల్లిరి.

57. జ్యేష్ఠస్తయో ర్వెన్నయ సూరివర్యః ప్రశస్త విద్యావినయాభిరామః
విస్తారిభిర్యః కుముదావదాతై ర్యశోభిరాశా స్సురభీకరోతి
అర్థం: వారిలో జ్యేష్ఠుడగు వెన్నయ విద్యా వినయములతో విరాజిల్లుచు తెల్లగలువల వంటి శుభ్రకీర్తులతో దిక్కులన్నింటిని పరిమళింప జేసెను.

58. యత్పాదపంకేరుహపార్శ్వనమ్ర క్షితీశ్వరశ్రేణి లలాటలగ్నా
బ్రాహ్మీలిపి ర్భాగ్యవదాస్ఫురద్భి ర్నఖాంశుజాలై స్సువచత్వమేతి
అర్థం: అతని పాదపద్మముల కడ మోకరిల్లిన రాజుల నుదుటిపై గల బ్రహ్మ వ్రాత ప్రకాశమానమైన అతని నఖకాంతుల వలన స్పష్టముగ చదువదగినదై ఒప్పారుచున్నది.

59. యత్రాస్తి విద్యా న చ తత్ర లక్ష్మీర్యత్రాస్తి లక్ష్మీ ర్న చ తత్ర విద్యా
విద్యా చ లక్ష్మీ చ విహాయ వైరం యస్మిన్నుభే తే మతః ప్రహృష్టే
అర్థం: విద్య యున్నచోట లక్ష్మి ఉండదు, లక్ష్మి యున్నచో విద్య ఉండదు; కాని విద్యయు, లక్ష్మియు రెండును వైరమును వీడి సంతోషముతో వెన్నయకడ నివసించుచున్నవి.

60. భోగాదనంతరం దానం ప్రసిద్ధం పృథివీతలే

త్యక్త్వా భోగం వితరణం యస్మిన్నేవ విజృంభతే
అర్థం: భూతలమున భోగము తర్వాతనే దానము అనుట సుప్రసిద్ధము కాని వెన్నయయందు భోగము కంటె దానమే విజృంభించుచున్నది.

61. యద్దానలక్ష్మీ సంప్రాప్తి బుద్ధ్యా స్వర్లోకధేనవః
ఊర్ధ్వపాదాశ్చరంతీవ చిరం ఘోరతరం తనః
అర్థం: అతడొసగు దానలక్ష్మిని పొందు తలంపుతో స్వర్గమునందలి కామధేనువులు పాదములు పైకెత్తి చిరకాలముగ ఘోరతరముగ తపస్సు చేయుచున్నవి.

62. యస్మాదవాప్తై ర్బహుభి స్సువర్ణై రనారతానుష్ఠితయాగతంత్రాః
విభాంతి భూమౌ విమలప్రచారా యశఃపతాకా ఇవ యాయజూకాః
అర్థం: అతని నుండి పొందిన బహు సువర్ణములతో యాయాజూకులు ఎడతెగక యాగములు చేయుచు భూమియందు అతనియొక్క నిర్మలకీర్తి పతాకములవలె ఒప్పుచుండిరి.

63. విప్రేభ్యో విధివద్దేనూః ప్రదత్వో
భయతో ముఖీః యః కరోతి నిజాం కీర్తిం నిర్మలాం సర్వతోముఖీం
అర్థం: ప్రోలయ ఇహపరసాధకములైన (ఉభయతోముఖీః) ధేనువులను బ్రాహ్మణులకు దానమొనర్చి తన నిర్మలకీర్తిని సర్వతోముఖముగ నొనర్చెను.

64. యన్నిసృష్టాగ్రహారేషు ప్రతితిష్ఠంతి భూసురాః
పదవాక్య ప్రమాణజ్ఞా ధర్మస్తంభా ఇవోచ్ఛ్రితాః
అర్థం: అతడొసంగిన అగ్రహారములందు పదవాక్య ప్రమాణజ్ఞులైన బ్రాహ్మణులు ఉన్నత ధర్మస్తంభముల వలె నెలకొనిరి.

65. కృతేషు దానేషు మహత్సు యేన విశ్వాస విభ్రాజిత మానసేన
చిరాయ దాన ప్రతిపాదకాని ప్రయాన్తి శాస్త్రాణి యధార్థ్యభావం
అర్థం: విశ్వాసముచే వెలుగొందు మానసముతో అతడు చిరకాలముగా చేసిన మహాదానము దాన ప్రాశస్త్యమును ప్రతిపాదించిన శాస్త్రముల యాధార్థ్యమును నిరూపించెను.

66. నిశ్చిత్య తం ప్రోలనృపో తిపాత్రం సంప్రార్థయద్గ్రామవరం గ్రహీతుం
ప్రతిగ్రహాత్ సో పి నివృత్తచేతా స్తత్పక్షపాతేన కథంచి దైచ్ఛత్
అర్థం: ప్రోలనృపుడు వెన్నయను అతిపాత్రునిగా నిశ్చయించి విశిష్ట గ్రామమును గ్రహింపుమని ప్రార్థించెను. ప్రతిగ్రహమునెడ విముఖుడైనను వెన్నయ రాజునెడ గల పక్షపాతముచే ఎట్లో అంగీకరించెను.

67. తతోనుగోదావరి తుష్టచేతా గ్రహే విధీః ప్రాదిశ దగ్రహారం
కోనావనీ మండల సారభూతం గ్రామం స తస్మై విలసాభిధానం
అర్థం: అంతట గోదావరీ ప్రాంతమున కోనసీమలో శ్రేష్ఠమైన విలసయను అగ్రహారమును సంతుష్ట చేతస్కుడైన రాజు వెన్నయకు ఒసంగెను.

68. విభాంతి యస్యా తిపచేళిమాని క్షేత్రాణి శాలీక్షువణోచితాని
ఆరామభాగాశ్చ భుజంగవల్లీ రంభామ్రపూగీ పనసాది రమ్యాః
అర్థం: ఆ విలస గ్రామమునకు చెందిన పొలములు సారవంతములైనవి. చెరకు విస్తారముగా పండును. తోటలు అరటి, మామిడి, పనస పండ్లు మున్నగు వానిచే రమ్యములై యుండును.

69. తమగ్రహారం ప్రతిగృహ్య తస్మాత్ ప్రోలక్షితీశాదధ వెన్నయార్యః
సహానుజో దిత్సత భూసురేభ్యః ప్రదత్తయే తస్య ధనార్జనం హి
అర్థం: ప్రోలక్షితీశుని వలన వెన్నయార్యుడు ఆ అగ్రహారమును ప్రతిగ్రహించి తమ్మునితో కలిసి దానిని బ్రాహ్మణుల కీయదలచెను. అతని ధనార్జనము ఇతరులకు దానమిచ్చుటకే గదా!

70. అనేక శాస్త్రార్ణవకర్ణధారాన్ వేదాధ్వ సంలంఘన జాంఘికాన్ సః
ప్రసిద్ధ శీలాచరణాభిజాత్యా నయూధయద్విప్రవరాంశ్చిరేణ

అర్థం: బహుశాస్త్రములనెడి సముద్రములకు కర్ణధారులును వేదాధ్యయన పరులును, శీలాచరణమందు ప్రసిద్ధులైన బ్రాహ్మణశ్రేష్ఠులను ప్రోగు చేసెను.

71. **ఐశ్వర్య భోగై ర్యుతమష్టసంఖ్యై స్తమంకయిత్వా నృపశ్చనామ్నా**
అష్టోత్తరేణ ప్రవిభజ్య భాగైశ్వతేన సో దాత్సమతి ర్ద్విజేభ్యః
అర్థం: అష్టసంఖ్యలతోడి ఐశ్వర్య భోగములతో ఆ అగ్రహారమును లెక్కించి నూట ఎనిమిది విభాగములు చేసి బ్రాహ్మణులకాతడు రాజు పేరిటనే దానమొసంగెను.

72. **అపాత్ర భాగినాం నామశాఖాది ర్గోత్రవర్గశః**
ప్రవర్ణ్యతే సమాసేన భాగసంఖ్యాచ భాగినామ్
అర్థం: ఇందు భాగస్థులైన వారియొక్క నామ శాఖాదులన్నియు గోత్రముల ననుసరించి, వారి భాగసంఖ్యయు మొత్తముమీద వర్ణింపబడును.

73. **సర్వే పి భాగినో ర్హంతి ప్రాధమ్యం**
గుణవత్తమాః తథాపి క్రమవృత్తిత్వా ద్వాపో మే నాత్ర మూఢతా
అర్థం: గుణవత్తములైన భాగస్థులందరును ప్రాధమ్యమునకు అర్హులే అయినను క్రమపద్ధతిని అనుసరించి నామాట ప్రవర్తిల్లును. ఇందు మూఢత్వ ప్రసక్తి లేదు.

2. **ముసునూరి కాపయనాయకుని ప్రోలవరం శాసనం (శక సంవత్సరం 1267 పార్థివ నామ సంవత్సర మాఘమాసం సూర్యగ్రహణ వేళ):** ఈ శాసనం డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య గారిచే 1934 భారతి మాసపత్రికలో ప్రచురింపబడింది. ఇది కృష్ణా జిల్లా గుడివాడ తాలూకాలోని గురజ గ్రామంలో లభించింది. ఈ శాసనం రెండు రాగిరేకులపై ఇరువైపులా రాయబడింది. ఇందు ఏకశిలా నగరాధీశుడైన కాపయనాయకుడు ప్రోలయ నాయకుని పుణ్యము కొరకై శక సంవత్సరం 1267 కు సరియగు పార్థివ నామ సంవత్సరం మాఘమాసమున సూర్యగ్రహణ వేళయందు మలఘ్నీ నదీ తీరమున గల ప్రోలవరము గ్రామమును దానముగా నిచ్చిన వృత్తాంతము అభివర్ణింపబడింది. దానగ్రహీత శౌనక గోత్రజుడైన కందయ పెద్దిభట్టు అనే బ్రాహ్మణుడు. ఇతడు శ్రీశైలమున సత్రయాగము చేసినవాడు. గిరీశ సహస్రకమునకు భాష్యము రాసిన పండితుడు. ఈ శాసనంలో పేర్కొనబడిన మలఘ్నీ నదియు, అనవేమరెడ్డి శక సం 11-1293లో వేయించిన జుజ్జవరం శాసనంలో పేర్కొనబడిన మలాపహానదియు ఒక్కటియే అని నిర్ణయించబడింది. ఈ మలాపహ (మలఘ్నీ) నదీ తీరంలో ప్రోలవరం, ధృజ్జవరం, కోడూరు అనే మూడు గ్రామాలున్నాయి. వీనిలో కోడూరు గ్రామాన్ని శక సంవత్సరం 1280లో అనవోతారెడ్డి బ్రాహ్మణులకు దానమిచ్చాడు. శాసనములోని ధృజ్జవరం, కోడూరు అనే గ్రామాలు గుడివాడ తాలూకాలోని జుజ్జవరం, కోడూరు గ్రామాలూ ఒక్కటే. కనుక మలాపహ (మలఘ్ని) నదియు, ప్రోలవరం ఆ తాలూకాలోనివే అని చెప్పవచ్చు. కాపయ నాయకుని శాసనంలోని ప్రోలవరం, గుడివాడ తాలూకాలోని ప్రోలవరం అనే జమీందారుడి గ్రామం ఒక్కటే అని నిర్ణయింపబడింది.

1. **అవ్యాజ్జగంతి విభురాదివరాహమూర్తి ర్భర్తా రుచిరబాలతమాలనీలః**
ఆవిర్బభూవ కిలయస్య మహాంబులీనే దంష్ట్రామృణాళశిఖరే ధరణీసరోజః
అర్థం: మహాసముద్రమున మునుగుచున్న ఏ దేవుని దంష్ట్రామృణాళ శిఖరమున ధరణి అనెడి పద్మము ఆవిర్భవించెనో అట్టి భూభర్తయు మనోహరబాల తమాలనీల వర్ణము గల వాడును నగు ఆదివరాహమూర్తి జగములను రక్షించుగాక!

2. **ఆసీత్ పోతమహీపతి స్సుకృతినామాద్యో**
జగద్విశ్రుతః పోతః కల్పమహీరుహస్య విలస ద్విశ్రాణ శ్లాఘయా
పోతో యో విపదంబురాశితరణే సర్వప్రజానామపి
క్షీరాబ్ధావివ చంద్రమా బుధజనాధార శ్చతుర్థాన్వయే
అర్థం: జగద్విఖ్యాతుడగు పోతమహాపతి పుణ్యాత్ములలో అగ్రగణ్యుడై యుండెను. అతడు కల్పవృక్షమునకు విశ్రాంతినొసంగెనని చెప్పబడెను. ఆపదలను సముద్రము దాటించుట యందు సర్వప్రజలకు అతడు తెప్ప యయ్యెను. క్షీరాబ్ధివంటి చతుర్థ కులమున బుధజనాధారుడైన చంద్రునివలె

ప్రకాశించెను.

3. తస్యాభూవం స్తనయా గుణాఢ్యాశ్చతుర్భుజస్యేవ భుజా మహాంతః

అర్థం: అతనికి చతుర్భుజుని భుజములవలె గుణాఢ్యులైన నల్గురు పుత్రులు కలిగిరి.

4. పోచక్షితీశో నరదేవ ముఖ్యోదేవశ్చ కామాధిప రాజభూపౌ

అర్థం: వారు పోచయ, దేవయ, కామయ, రాజయ అనువారు.

5. పోచక్షోణిపతే స్సుతౌ సుకృతినౌ ప్రోలక్షితీశోత్తమః

శ్లాఘ్యశ్రీ రేఱపోతభూపతిరపి ద్వౌలోక సంభావితౌ

అర్థం: పోచయకు ప్రోలయ, ఎఱపోతయ అను పుణ్యాత్ములు, లోకమాన్యులగు ఇద్దరు కుమారులు.

6. దేవక్ష్మాధిపతేశ్చకాపనృపతి శ్రీముమ్మడీ శాహ్వయౌ

సంజాతౌ భువి రామలక్ష్మణ నిభౌ సూర్యేందుతుల్యశ్రియౌ

అర్థం: దేవయకు కాపయ, ముమ్మడయ అను నామధేయములు గల సూర్యచంద్ర సమాన తేజస్కులు, రామలక్ష్మణ సమానులునైన కుమారులు కలిగిరి.

7. కామక్షితీశతనయౌ పునరిమ్మడీశ

దేవప్రభూ భువన విశ్రుతదానశీలౌ

అర్థం: కామయకు ఇమ్మడయ, దేవయ అను విఖ్యాత దానశీలురైన పుత్రులు జన్మించిరి.

8. పుత్రో పి రాజనృపతేరనపోతభూప

స్తొయ్యేటి నామనగరీపతి రార్యబంధుః

అర్థం: రాజయకు అనపోతయ పుట్టెను. అతడు తొయ్యేటి నగరాధీశుడయ్యెను.

9. ఏతేషాం సహజన్మనాం సుకృతినాం మధ్యే ప్రసిద్ధోదయః

క్షోణీచక్రమవక్రవిక్రమ యశస్సంభావ్య బాహార్గళః

ఏకచ్ఛత్ర మపాలయత్ బుధజన శ్లాఘ్య ప్రభావోన్నతో

లక్ష్మీవాన్ముసునూరి ప్రోలనృపతి స్సద్బంధు చింతామణిః

అర్థం: ఈ సోదరులలో ముసునూరి ప్రోలనృపతి సుప్రసిద్ధుడై అవక్రవిక్రమ కీర్తిమంతుడై, పండితులచే పొగడబడిన గొప్ప ప్రభావము కలవాడై సద్బంధు చింతామణియై దేశమును సకల సంపదలతో ఏకచ్ఛత్రాధిపత్యముగ పరిపాలించెను.

10. తస్యానంతర మంతరంగవిమలో భావ ప్రభావోదయః

శ్లాఘ్య ప్రస్ఫుట ధర్మకర్మ చతురః శ్రీకాపపృధ్వీపతిః

కాశ్యాం విశ్వపతేః ప్రసాదమహిమ ప్రాప్తాఖిల ప్రాభవః

క్షోణీ రక్షణ దక్షదక్షిణ భుజస్తంభో జరీజృంభతే

అర్థం: ఆ ప్రోలయ తర్వాత స్వచ్ఛ హృదయుడును, ఉన్నత భావములు కలవాడును, ధర్మకర్మ సమర్థుడును, కాశీవిశ్వేశ్వరుని కరుణచే అఖిల వైభవపేతుడును, భూరక్షాదక్షమైన భుజాస్తంభము గలవాడును అను శ్రీ కాపయ భూపతి ప్రభుత్వము వహించి విరాజిల్లుచున్నాడు.

11. ప్రతాపరుద్ర ప్రతిమ ప్రభావః శ్రీకాపభూపః కరుణాకలాపః

అశాదశేషాం భువ మద్భుతశ్రీ రేకో వసన్నేకశిలా నగర్యామ్

అర్థం: ప్రతాపరుద్రునితో సమానశక్తిమంతుడును, దయాపరుడును అగు శ్రీ కాపభూపుడు ఏకశిలా నగరము రాజధానిగా సమస్త భూమండలమున పరిపాలించెను.

12. అసీన్నైమిశనామ పావన వనావాసో మహాసంయమీ

వ్యాప్త ద్వాదశ వర్ష సత్రమహిమా వ్యాసేతిహాసప్రియః

అంహస్సంఘభయానక స్త్రీభువనే సద్దాన కీర్త్యానకః

క్షామక్షీణసమస్త దీనజనతా సంతానకల్పానకః

అర్థం: నైమిశారణ్య నివాసియు, పన్నెండేండ్లు సత్రయాగమొనర్చిన వాడును, వ్యాస, భారత ప్రియుడును, పాపసందోహమునకు భయంకరుడును, సద్దానములచే ముల్లోకములందు కీర్తినొందిన

వాడును, దీనజనుల పాలిటి కల్పవృక్షమునునగు శౌనకుడను సంయమీంద్రు డుండెను.

13. **తస్యాన్వయే జయతి కందచె పెద్ది భట్టః**
శ్రీశైల సీమ్ని కృతవిశ్రుత సత్రయాగః
వ్యాఖ్యాన కృద్గిరిశనామ సహస్రకన్య
పంచాగ్రహార పరిరక్షిత బంధువర్గః
అర్థం: ఆతని వంశమున కందయ పెద్దిభట్టు జన్మించెను. అతడు శ్రీవైలమున గొప్ప సత్రయాగ మొనరించెను. శివసహస్రకమునకు వ్యాఖ్యాన మొనరించెను. ఐదు అగ్రహారములందు తన బంధువర్గమును పరిపోషించుచున్నాడు.

14. **శాకాబ్దే గిరితర్క భానుగణితే సంవత్సరే పార్థివే**
మాఘే మాసి రవిగ్రహే సుచరితః శ్రీ కాపపృధ్వీపతిః
శ్రీమత్ప్రోలమహీపతే స్సుకృతినః పుణ్యాయ పుణ్యాశయః
గ్రామ ప్రోలవరాహ్వయం స్వయమ దాత్తస్మై యలఘ్నీతటే
అర్థం: శక సంవత్సరం 1267 పార్థివ నామ వత్సరమున మాఘమాసము నందు సూర్యగ్రహణ వేళయందు పుణ్యాత్ముడు, పుణ్యాశయములు గలవాడునగు శ్రీ కాపభూపతి అతనికి మలఘ్ని తీరము నందలి ప్రోలవర గ్రామమును శ్రీ ప్రోలమహీపతి పుణ్యము కొరకై దానమొసంగెను.

15. **అస్యగ్రామస్య సీమాచిహ్నాని**
అర్థం: ఆ గ్రామమునకు సరిహద్దు గుర్తులు.

3. **అనితల్లి కలువచేరు శాసనం (శక సంవత్సరం 1345, శ్రావణమాసం, బహుళాష్టమి):** ఈ శాసనం తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ తాలూకాలోని ఆర్యవటం గ్రామంలో లభించింది. తెలుగు అకాడమీ జర్నల్‌లో (వాల్యూమ్ 93-112 పేజీలలో) ప్రచురింపబడింది. ఇది శక సంవత్సరం 1345 శ్రావణ మాసం బహుళాష్టమినాడు రాజమహేంద్రవర ప్రభువు వీరభద్రారెడ్డి యొక్క దేవేరియగు అనితల్లి కాళనాధ భట్ట కుమారుడును, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడునునగు పరహితాచార్యునికి కలువచేరు గ్రామాన్ని అగ్రహారంగా దానమిచ్చిన వృత్తాంతం తెలుపుతుంది. దానశాసనమునందు ముసునూరి వంశజులకు సంబంధించిన శ్లోకములు మాత్రమే దిగువనీయబడ్డాయి.

1. **అధసౌరుద్రమదేవీ ప్రతాపరుద్రే హృతారి నృపభద్రే**
దౌహిత్రే సుచరిత్రే సర్వాముర్వీం నిధాయ ముదితవతీ
అర్థం: అంతట ఆ రుద్రమదేవి శత్రురాజుల సంపదలను హరించువాడును మంచి నడవడి గలవాడును తన మనుమడును నగు ప్రతాపరుద్రుని సమస్త రాజ్యమున సమ్మోదముతో నిలిపెను.

2. **తస్మిన్ రాజని శాసతి క్షితితలం భూమండలాఖండలే**
భృత్యామాత్య సుహృ న్నిజద్విజబు, దాచార్యాదయ స్సమ్మతాః
తల్లక్ష్మీముదితా స్వమందిరగతా శ్రత్రు క్షితీశాః
పునర్వేలాకానన శైల కందరగతా స్తత్కీర్తి విత్రాసితాః
అర్థం: భూలోక దేవేంద్రుడగు ఆ రాజు భూతలమును పాలించుచుండగా భృత్యులు, అమాత్యులు, మిత్రులు, బ్రాహ్మణులు, ఆచార్యులు అందరూ సంతోషించిరి. రాజ్యలక్ష్మితో విలసిల్లుచు స్వమందిరము లందుండిన శత్రురాజులు అతని కీర్తిచే భయపెట్టబడిన వారై మరల అడవులు, కొండ గుహల నాశ్రయించిరి.

3. **విద్యావిశేషై ర్వినయోపచారై ర్వితీర్ణిభిర్విశ్వజనోపకారైః**
విద్యన్నికాయో వితత ప్రతాపే విద్యోతతే వీతరజస్యముష్మిన్
అర్థం: విపుల ప్రతాపుడై పుణ్యాత్ముడై అతడు ప్రకాశించుచుండగా విద్వాంసులెల్లరు విద్యావిశేషములతో, వినయోపచారములతో, దాతృత్వముతో ఉపకారములతో విలసిల్లిరి.

4. **గజపతి రుత్కళనాథః పాశ్చాత్యాధీశ్వరో శ్వపతిః**
తాభ్యాంనరపతిరధికః ప్రతాపరుద్రో యతస్త్రిలింగేశః

అర్థం: ఉత్కళ ప్రభువు గజపతి, తురుష్క ప్రభువు అశ్వపతి, త్రిలింగ దేశాధిపతి యగు ప్రతాపరుద్రుడు నరపతి యగుటచే వారిరువురికంటే అధికుడు.

5. తస్మిన్ ప్రతాపరుద్రే స్వస్థానం స్వేచ్ఛయైన యాతవతి
అథ సా భూ ర్యవనమయీ జాతై వాహో మహామహోమహిమా
అర్థం: ఆ ప్రతాపరుద్రుడు తన ఇష్టముతో స్వస్థానమును (కైలాసము) ప్రాప్తించగా త్రిలింగదేశము యవన మయముగా మార్చెను. ఆహా! అతని జీవన ప్రకాశము ఎంత మహిమాన్వితమో!

6. వరాహవద్వారిధివారిమగ్నాం ధరామ శేషాం యవనోదరస్థాం
సముద్ధరన్ ప్రోలయనాయకేంద్ర స్తతః ప్రతిష్ఠాపయతిస్మ తద్వత్
అర్థం: సముద్ర జలములందు మునిగిన భూమిని ఆది వరాహము ఉద్ధరించినట్లు తురుష్కులు దిగమ్రింగిన రాజ్యమును ప్రోలయ నాయకుడు పునరుద్ధరించెను.

7. స్వర్గాతిథౌ ప్రోలయ భూమిపాలే విశ్వేశ్వరాజ్ఞా మధిగమ్య గత్వా
అపాలయత్కాపయ నాయకేంద్ర స్తదియ్య రాజ్యం తరణి ప్రతాపః
అర్థం: శివాజ్ఞననుసరించి ప్రోలయ భూపాలుడు స్వర్గమునకు అతిథి కాగా, తదీయ రాజ్యమును సూర్య ప్రతాపుడగు కాపయనాయకుడు పరిపాలించెను.

8. అథ పంచోత్తరసప్తతినాయకసం సేవ్యమా నపదపద్మః
కాపావనీశ్వరః శ్రీ విశ్వేశ్వర కరుణయాక్షితి మరక్షత్
అర్థం: డెబ్బదియైదుగురు నాయకులు తన పాదపద్మములను సేవించుచుండగా కాపయ నాయకుడు శ్రీ విశ్వేశ్వర కరుణ చేత రాజ్యమును సంరక్షించెను.

9. తురుష్కై ర్యే సమాక్రాంతా స్తే చాన్యే కాపభూభుజా
అగ్రహారాః పునర్దత్తా భూపో భువమభూషయన్
అర్థం: కాపయ నాయకుడు తురుష్కులచే ఆక్రమింపబడిన అగ్రహారములను బ్రాహ్మణులకిచ్చి తన పరిపాలనచే భూమి నలంకరించెను.

10. విశ్వేశ్వరాయ వివిధాం ప్రవిధాయ సేవాం యాతే విభౌ దివి చ తత్పదసేవనాయ
తై ర్నాయకై స్స్వనగరాణ్యధిగమ్య సర్వై స్సంరక్షితా గతవిరోధకథై స్స్వదేశాః
అర్థం: విశ్వేశ్వరునికి వివిధ సేవలు చేయుచు శివపాద సేవనమునకై కాపయ నాయకుడు దివికేగెను. అంతట డెబ్బది యైదుగురు నాయకులు అందరును తమ తమ రాజధాని నగరములకేగి తమ రాజ్యములను, విరోధములను మరచి సంరక్షించుకొనిరి.

11. తేషాం వేమనరేశ్వరః క్షితిభుజాం ధర్మాత్మనా మగ్రణీః
శ్శశ్వద్భారత దివ్య పూరుష కథా ధౌతాంతరంగ స్సుధీః
శ్రీమత్పంటకులో ధ్రువశ్శివపద ద్వంద్వైక సేనాపరో
విప్రాశీర్వచోన్నతో జితరిపుస్సూర్జత్ప్ర తాపోదయః
అర్థం: ధర్మాత్ములైన ఆ నాయకులలో భారత దివ్య పురుషుల కథాశ్రవణముచే ఎల్లప్పుడూ నిర్మలాంత రంగుడును, శివపాదద్వంద్వ సేవాపరాయణుడును బ్రాహ్మణా శీర్వచనములచే ఉన్నతుడైనవాడును, శత్రువులను జయించు ప్రతాపముగల వాడును, పంట వంశమున జన్మించిన వాడును నగు వేమ భూపాలుడు అగ్రగణ్యుడు.

ఇట నుండి 34 శ్లోకములలో దాన ప్రతిగ్రహీతల నామములును పిమ్మట గ్రామ సీతా నిర్ణయమును లిఖింపబడ్డాయి.

ఇతర ఆధారాలు: ఈ శాసనాలే గాక వెలుగోటి వారి వంశావళి, పద్మనాయకుల శాసనాలు, గురజ శాసనం, చోడ భక్తిరాజు పెంటపాడు శాసనం, పిల్లలమర్రి, గణపేశ్వరం శాసనాలు, సమకాలీన సాహిత్యం, పెరిష్టా మొదలైన వారి ముస్లిం రచనలు కూడా వారి చరిత్రను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి.

శాసనాలలో ముసునూరి వారి ప్రస్తావన 11వ శతాబ్దం నుండి కనిపిస్తుంది. బాపట్లలోని భావనారాయణ దేవాలయంలోని 11వ శతాబ్దపు ఒక శాసనంలో ముసునూరి గొండయ్య అనే వ్యక్తిని పేర్కొంది. ఇతడు

కుళోత్తుంగచోడుని కాలం నాటి వాడు. తర్వాత జమ్మిపల్లిలోని మల్లికార్జునాలయంలో 1221వ సంవత్సరపు శాసనం ముసునూరి ముచ్చినాయుడనే వానిని ప్రస్తావిస్తోంది. అతడు కాకతీయ గణపతి దేవుని కాలం నాటి వాడు. ఈ శాసనాలను బట్టి ముసునూరి వారు 11వ శతాబ్దం నుండే ప్రఖ్యాతులుగా ఉన్నారని చెప్పవచ్చును.

ముసునూరి వంశస్తుల కులం: ముసునూరి వంశస్తుల కులాన్ని గురించి గత అర్ధ శతాబ్దం నుండి అనేక మంది పండితులు తమ అభిప్రాయాలను వెలువరిస్తున్నారు. మొట్టమొదటిసారిగా వారు కమ్మ కులస్తులని గుర్తించిన వారు కొత్త భావయ్య చౌదరి. వారు కమ్మవారి చరిత్ర అనే గ్రంధాన్ని రాశారు. ఆ గ్రంథంలో పూర్వకాలపు కమ్మవారిని వారి గోత్రాలు, ఇంటి పేర్ల ఆధారంతో గుర్తించగలిగారు.

ఇంటి పేర్లు: ఆంధ్రదేశంలో ప్రతి వ్యక్తికి ఒక ఇంటి పేరు ఉంటుంది. ఈ ఆచారం తమిళ, కర్ణాటక జాతులలో కనిపించదు. ఆంధ్రులలో ఈ ఆచారం ఉండటానికి మధ్యయుగంలో కొన్ని కారణాలు దోహదం చేశాయి. ప్రాచీన కాలంలో ఆంధ్రదేశంలో బౌద్ధమతం ప్రబలంగా ఉండేది. ఆంధ్రదేశంలో నివసించిన జాతులు బౌద్ధ మతాన్ని స్వీకరించాయి. క్రీ.శ.4వ శతాబ్దం నుండి బౌద్ధ మతం క్షీణించసాగింది. దానితో చాలా మంది వైదిక మతంలోకి మారారు. కాని కొందరు వైదిక మతంలోకి రావడం ఇష్టం లేక జైన మతాన్ని స్వీకరించారు. జైన మతం చాళుక్య యుగంలో వైదిక మతంతోపాటు మంచి ప్రాచుర్యంలో ఉండేది. కాని 12వ శతాబ్దంలో వీరశైవ ఉద్యమం జైన మతాన్ని నాశనం చేసింది. కనుక జైనులు తప్పనిసరి పరిస్థితులలో వైదిక మతంలోకి మారిపోయారు. వీరందరినీ వైదిక మతస్తులు స్వీకరించడానికి వారికి గోత్రాలు ఇవ్వవలసి వచ్చింది. అదే కాలంలో వారికి ఇంటి పేర్లు కూడా స్థిరపరచవలసి వచ్చింది. కనుక ఏ వూరి వారైతే వారికి అదే ఇంటి పేరుగా స్థిరపరచారు. దాంతో ప్రతి కుటుంబానికి ఇంటి పేరు, గోత్రనామాలు వచ్చేశాయి. అందువల్లనే తెలుగువారి ఇంటి పేర్లన్నీ ఊళ్ల పేర్లే అయినవి.

కనుక ఈనాటి వారి ఇండ్ల పేర్లను బట్టి మధ్యయుగంలో 12వ శతాబ్దం వరకు శాసనాలలో ఉన్నవారి కులాలను గుర్తించవచ్చును. ఈ పద్ధతిని అనుసరించి భావయ్య చౌదరి మధ్యయుగపు కమ్మవారిని గుర్తించారు. ఆయన కమ్మవారి ఇండ్ల పేర్లు, గోత్రాల పేర్లు సేకరించి ఆ గోత్రాలు ఇంటి పేర్లు ఏయే శాసనాలలో ఉన్నయో పరిశోధించారు. మద్రాసు ఆర్కీవ్స్‌లోని శాసనాలన్నింటిని పరిశీలించారు. వారి పరిశోధన దాదాపు 12 సంవత్సరాలు పట్టింది. తమ 12 సంవత్సరాల పరిశోధనలలో నేటి కమ్మవారి ఇండ్ల పేర్లు, గోత్రాలు ఉన్న అన్ని శాసనాలను సేకరించి అధ్యయనం చేశారు. దాని పర్యవసానంగా నేటి ఇంటి పేర్లు గల కమ్మవారు చాళుక్యుల కాలం నుండి ఉన్నట్టు రుజువైంది. కాకతీయుల కాలం నుండి వారు సేనాధిపతులు, మండలేశ్వరులుగా అనేక ఉన్నత పదవులు నిర్వహించినట్టు శాసనాలు తెలుపుతున్నాయి. కనుక, భావయ్య చౌదరి ఆ విధంగా సేకరించిన వారిని కాలమాన పద్ధతిలో చాళుక్య యుగంనాటి కమ్మవారు, కాకతీయుల నాటి కమ్మవారు, రెడ్డిరాజుల కాలం నాటి కమ్మవారు, విజయనగరయుగం నాటి కమ్మవారు, గోల్కొండ నవాబుల కాలంనాటి కమ్మవారు, బ్రిటిష్ యుగం నాటి కమ్మవారు అనే శీర్షికల కింద విభజించి కమ్మవారి చరిత్రను రూపొందించారు. ఈ విధంగా 12 సంవత్సరాలు కష్టపడి మధ్యయుగం నుండి జీవించిన కమ్మవారి చరిత్ర రాయగలిగారు.

ఆ విధంగా రచింపబడిన కమ్మవారి చరిత్రలో ముసునూరి వంశస్తులు కూడా ఒకరు. నేడు కూడా కమ్మవారిలో ముసునూరు అనే ఇంటి పేరు గల వారు ఉన్నారు. ఆ ఇంటి పేరు గల వారు ఒక్క కమ్మ కులంలోనే ఉన్నారు. మధ్యయుగంలో చాళుక్య యుగం తరువాత శూద్రకులాలు రాజకీయ శక్తులుగా ఎదిగాయి. రైతులుగా ఉన్న శూద్రులు మొదట సైనికులుగా చేరి యుద్ధోన జీవిత వృత్తిని చేపట్టారు. తరువాత సేనాధిపతులుగా, మండలేశ్వరులుగా ఎదిగి చివరకు రాజ్యాలు సంపాదించి రాజులయ్యారు. ఆ విధంగా ఎదిగిన శూద్రకులాలను నాటి గ్రంధాలు సత్‌శూద్రులు అని వర్ణిస్తున్నాయి. ఆ విధంగా రాజ్యాధికారం సంపాదించిన కులాలు మూడు. అవే కమ్మ, రెడ్డి, వెలమ కులాలు.

కాకతీయుల కాలం నాటి ఈ మూడు కులాలలో తీవ్రమైన భేదం లేదు. ఒకరితో ఒకరు వియ్యం కూడా పొందారు. అమరావతిని ఏలిన కమ్మకులానికి చెందిన కోట వంశస్తుల ఆడపడుచు సూరాంబికను రెడ్డి కులానికి చెందిన కొండవీటి రెడ్డిరాజు పెదకోమటి వేమారెడ్డి వివాహం చేసుకున్నాడు. కమ్మకులస్తురాలైన సూరాంబిక కొండవీటి రెడ్డి రాజ్యానికి రాణి అయింది. ఇలాంటివి చాలా ఉదాహరణలున్నాయి. కాకతీయుల కాలంలో ఈ మూడు కులాల వారు వారి వద్ద సేనానులుగా పనిచేశారు. కాకతీయుల తరువాత ఈ మూడు కులాలు ప్రత్యేకంగా

స్థిరరూపం ధరించాయి. మూడు కులాలు రాజ్యాలు సంపాదించి రాజవంశాలుగా ప్రసిద్ధికెక్కాయి. మిగిలిన శూద్రులలో రాజవంశాలుగా ప్రసిద్ధి చెందిన కులాలు లేవు.

ఈ మూడు కులాలలో ముసునూరు అనే ఇంటి పేరు గల వారు ఒక్క కమ్మ వారిలోనే ఉన్నారు. వెలమ, రెడ్డి కులస్తులో ఒక్క కుటుంబం కూడా ముసునూరు అనే ఇంటి పేరు గల వారు లేరు. అయితే కమ్మ కులస్తుల ఇంటి పేర్లు కొన్ని రెడ్లలోను, వెలమలలో కూడా ఉన్నాయి. అంటే కమ్మ, రెడ్డి, వెలమ కులాలు తమ స్థిరరూపం ధరించుకునే 13-14వ శతాబ్దాలలో ఆ ఇంటి పేరు గల కొన్ని కుటుంబాలు రెడ్లతోను, మరికొన్ని కుటుంబాలు వెలమలతోను వియ్యాలు అంది వారి కులంలో సభ్యులయ్యారన్న మాట. ఉదాహరణగా గండిరెడ్డి అనే ఇంటి పేరు రెడ్లలోను, కమ్మవారిలోనూ ఉంది. అంటే ఆ ఇంటి పేరు గల కుటుంబాలలో ఒక కుటుంబం రెడ్లతో వియ్యం అంది ఆ కుటుంబం రెడ్డి కులస్తులుగా మారిపోయారు. అలాగే మరొక గండిరెడ్డి కుటుంబం వారు కమ్మవారిగా మారిపోయారు. తరువాత కాలంలో ఈ గంగిరెడ్డి అనే ఇంటి పేరు గల కమ్మవారు గంగిరెడ్డి అనే పదంలోని రెడ్డిని తొలగించి దాని స్థానంలో నేని అని తగిలించుకున్నారు. కనుక గంగిరెడ్డి గంగినేనిగా మారిపోయింది. అలాగే నన్నపరెడ్డి అని కమ్మవారిలో మరొక ఇంటి పేరు ఉండేది. వీరు కూడా నన్నపనేని అని తగిలించుకున్నారు. అదే విధంగా దేవిరెడ్డి వారు దేవినేని, సూరారెడ్డి వారు సూరపనేని అని మార్చుకున్నారు. అలాగే రెడ్లలో దొడ్డా అనే ఇంటి పేరు గల వారు ఉన్నారు. అదే పేరు కొద్ది మార్పులతో దొడ్డపనేని, దొడ్డాల అనే ఇంటి పేరు గలవారు కమ్మవారిలో ఉన్నారు. అంటే ఆ ఇంటి పేరు గల రెండు కులాల కుటుంబాలు ఒకే ఊరికి చెంది ఉండాలి. ఒకే కుటుంబం వారు రెండు కులాల్లో చేరిన ఉదాహరణలు ఉన్నాయి. ఏరువ భక్తిరాజుకు ఇద్దరు కుమారులు. పెద్దవాడు అనపోతు, చిన్నవాడు భీమరాజు. చిన్నవాడైన భీమరాజుకు అనవేమారెడ్డి తన కుమార్తెనిచ్చి వివాహం చేశాడు. అందువల్ల భీమరాజు సంతతివారు రెడ్డి కులస్తులుగా మారిపోయారు. అనపోతు వంశస్తులు కమ్మ కులంలో సభ్యులయ్యారు. ఏరువ అనే ఇంటి పేరు గలవారు నేడు కూడా కమ్మ వారిలో ఉన్నారు. దేసట్ల అనే గోత్రీకులు కమ్మవారిలో ఉన్నారు. కొండవీటి రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డిని ఎర్రాప్రెగడ, రాజమండ్రి వీరభద్రారెడ్డిని శ్రీనాధుడు దేసేటి వంశస్తులని వర్ణించారు. దేసటి అనే గ్రామం ఉన్నట్టు స్థానిక చరిత్రల ద్వారా తెలుస్తోంది. దేసటి గ్రామం ప్రోలయ వేమారెడ్డి స్వస్థలం అయి ఉండవచ్చు. అదే ప్రోలయ వేమారెడ్డి ఇంటి పేరు కూడా అయి ఉండవచ్చు. కనుక ఎర్రాప్రెగ్గడ, ప్రోలయ వేమారెడ్డిని దేసట వేమా అని సంబోధించాడు. అలాగే శ్రీనాధుడు వీరభద్రారెడ్డిని శ్రీ మద్దేసంటి వంశ గ్రామణి అని వర్ణించాడు. వాసిరెడ్డి, తమ్మారెడ్డి, సూర్రెడ్డి, నన్నపరెడ్డి అనే ఇంటి పేర్లు గల వారు కమ్మవారిలోను, రెడ్డి కులస్తులలోను ఉన్నారు. అట్లే కోమటి, గుత్త అనే ఇంటి పేర్లు రెండు కులాల్లో ఉన్నాయి. కనుక ఒకే ఇంటి పేరు గల వారు ఈ మూడు కులాలలో ఉండటం జరిగింది.

అదే విధంగా రెడ్లు, కమ్మవారిలాగే వెలమలు, కమ్మవారిలో కూడా ఒకే ఇంటి పేరు కలిగిన వారు ఉన్నారు. రేచర్ల గోత్రం గల వారు కమ్మ వారిలో ఉన్నారు. ఈ రేచర్ల అనేది రాచకొండ, దేవరకొండను ఏలిన ప్రసిద్ధి చెందిన పద్మనాయకుల ఇంటి పేరు. పలనాటి బ్రహ్మనాయుని గోత్రం కూడా రేచర్ల గోత్రమే. పద్మనాయకులకు మూలపురుషుడు బ్రహ్మనాయుడని ప్రతీతి. అలాగే ఝుప్పాళ్ల అనే ఇంటి పేరు కమ్మవారిలోను, వెలమలలోనూ ఉంది. కమ్మవారిలో వెలనాటి, వెలమాటి అనే ఇంటి పేర్లు ఉండగా వెలమలలో వెలుగోటి అనే ఇంటి ఉంది. వెలమలలో వెలుగోటి కుటుంబం వారు చాలా ప్రఖ్యాతి చెందిన వారు. విజయనగర యుగంలో వారు గొప్ప స్థానాన్ని అలంకరించారు.

ఇలాంటి ఇంటి పేర్లే ఈ మూడు కులాల్లో గాక మరికొన్ని శూద్రకులాలలో కూడా ఉండవచ్చును. అందుకు కారణమేమిటంటే- ఇంటి పేర్లు ఇచ్చేటప్పుడు ఒక గ్రామంలో నివసించిన అన్ని కులాల వారికి అదే ఇంటి పేరు అయింది. కనుక బ్రాహ్మణులు, కుమ్మరి, కమ్మరి, ఆఖరికి పంచములలో కూడా అవే ఇంటి పేరులు ఉండవచ్చును. కాని వారిని పరిగణనలోనికి తీసుకోనవసరం లేదు. కారణమేమిటంటే మిగిలిన శూద్రకులాలు యుద్ధోపజీవులు కాదు. రాజ్యాలు సంపాదించలేదు. రాచరికాలు వెలగబెట్టలేదు. రాజ్యార్హత లేని శూద్రులలో యుద్ధ వీరులుగా వృత్తిని చేపట్టి రాజ్యాధికారం సంపాదించిన వారు కమ్మ, రెడ్డి, వెలమ కులాలు మాత్రమే. కనుక ఈ ఇంటిపేర్లు మిగిలిన శూద్రకులాలలో ఉన్నా వాటిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు. అలాగే అప్పటివరకు క్షత్రియులుగా ఉన్న చాళుక్యులు, మరికొన్ని కుటుంబాలు కూడా ఈ మూడు కులాలలో చేరిపోయి తమ కులాన్ని పోగొట్టుకున్నాయి. జల్లిపిల్లి యుద్ధంలో వెలమ సింగమనాయుడు చనిపోయినందుకు ప్రతీకారంగా అతని

కుమారుడు అనపోతనాయకుడు జల్లిపల్లిపై దండెత్తి ఆ దుర్గాన్ని పాలించే చాళుక్యులను ఊచకోత కోశాడు. వెలమల ధాటికి తట్టుకోలేక మిగిలిన చాళుక్యులు కమ్మ కులంలో కలిసిపోయారని, అందువలన కమ్మవారిలో ఎలమంచిలి అనే ఇంటి పేరుగల వారు ఉన్నారని భావయ్య చౌదరి వివరించారు. ఎలమంచిలిని ఒక చాళుక్య వంశం పాలించింది. చాళుక్యులు చంద్రవంశ క్షత్రియులు. తరువాత ఎలమంచిలి వారి ఇంటి పేరుగా మారింది. కనుక ఎలమంచిలి అనే ఇంటి పేరు గల కమ్మవారు చాళుక్య వంశానికి చెందిన వారని భవయ్య చౌదరి తీర్మానించారు. ఈ విధంగా పాలకవర్గాలుగా ఉన్న సూర్య వంశ, చంద్రవంశ క్షత్రియులు కూడా ఈ మూడు కులాలలో దేనిలో ఒకదానిలో చేరిపోయారు. అందువల్లనే సూర్య వంశస్తులమని చెప్పుకున్న చోళులు, చంద్ర వంశస్తులమని చెప్పుకున్న చాళుక్య వంశాలు ఆంధ్ర సమాజంలో అదృశ్యమయ్యాయని చౌదరిగారి అభిప్రాయం. ఆ విధంగా కాకతీయుల తరువాత క్షత్రియ కులాలు పూర్తిగా అంతరించాయి. ఎక్కువమంది క్షత్రియ కుటుంబాలు కమ్మ కులంలో చేరిపోయాయని చౌదరి గారి అభిప్రాయం. మొత్తంమీద ఈ మూడు కులాలు పాలక కులాలుగా రూపొంది ఆంధ్ర సామ్రాజ్యంలో అత్యున్నత స్థానాన్ని పొందాయి. శూద్రులైన కమ్మ, రెడ్డి, వెలమ కులాలు సామాజిక ఊర్ధ్వచలనాన్ని పొందాయని ప్రముఖ చారిత్రక పరిశోధకులైన డాక్టర్ బి.ఎస్.ఎల్. హనుమంతరావు గారు కూడా తమ ఆంధ్రదేశంలో కుల పరిణామం అనే చిన్న గ్రంథంలో వివరించారు.

ఇక ముసునూరి ఇంటి పేరు గల వారి విషయానికి వస్తే ఈ ఇంటి పేరు ప్రస్తుతం ఒక్క కమ్మవారిలోనే ఉంది. కమ్మవారితోసహా పాలక కులాలైన రెడ్లు, వెలమ కులస్తులలో లేదు. కనుక ఇంటి పేర్ల నిర్ధారణ విధానంతో ముసునూరి వంశస్తులు కమ్మ కులస్తులని భావయ్య చౌదరి నిరూపించారు. వారి సిద్ధాంతాన్ని కాదని ఇంతవరకు ఎవరూ అనలేదు. పైగా చాలా మంది చరిత్రకారులు వారి వాదన సరియైనదనే అభిప్రాయానికి వచ్చారు. మల్లంపల్లి సోమశేఖరశర్మ కూడా ముసునూరి వారు కమ్మవారు అని అంగీకరించారు. డా బి.ఎస్.ఎల్. హనుమంతరావు కూడా వారి ఆంధ్రుల చరిత్ర అనే గ్రంథంలో ముసునూరి వంశస్తులు కమ్మవారని రాశారు. ఈనాడు రాయబడే అన్ని చరిత్ర గ్రంథాలలో ముసునూరి వారే కమ్మ కులస్తులని రాస్తున్నారు.

ముసునూరి వంశస్తుల శాసనాలలో చారిత్రక ఆధారాలుగా తీసుకున్న పైమూడు శాసనాలలో వారిని కమ్మకులస్తులని ప్రస్తావించలేదు గదా అని అనవచ్చు. కాని ఆ వాదన నిలువదు. అందుకు కారణం ఆ కాలం నాటి ఏ శాసనంలోనూ ఏ రాజు కులం పేర్కొనబడలేదు. వారి వంశాలు మాత్రమే పేర్కొనబడ్డాయి. వారి కులం విషయంలో వారిని చతుర్థ కులస్థులుగా శాసనాలు వర్ణించాయి. ఉదాహరణగా అని తల్లి కలువచేరు శాసనంలోని 11వ శ్లోకంలో ప్రోలయ వేమారెడ్డి ప్రస్తావన ఉంది. కాని శాసనంలో వేమారెడ్డి అనే పదం గాని, రెడ్డి కులం అనే పదం గాని లేదు. అక్కడ పంట కులంలో జన్మించిన వేమనరేశ్వరః అని లిఖించబడి ఉంది. పంట అనునది కులం గాదు. రెడ్డి కులాలలో ఒక శాఖ మాత్రమే. అలాగే ముసునూరి ప్రోలయ నాయకుని విలస శాసనంలోని 30వ శ్లోకంలో అతడు చతుర్థ కులస్థుడని, 31వ శ్లోకంలో ముసునూరి వంశస్తుడని పేర్కొన్నారు. కనుక ఆనాడు ఇంటి పేరును వంశంగాను, కులంగాను పేర్కొనేవారు. రెడ్డి శాసనాలలో తాము రెడ్డి కులస్తులమని గాని, పద్మనాయక శాసనాలలో తాము వెలమ కులస్తులమని గాని ఎక్కడా పేర్కొనలేదు. అలాగే ముసునూరి ప్రోలయ నాయకుని ముసునూరి వంశస్తుడని, చతుర్థ కులస్థుడని మాత్రమే పేర్కొన్నవి. కారణం ఆనాడు ఈ మూడు కులాలను చతుర్థ కులస్తులుగా భావించారే తప్ప ఈనాటివలె ప్రత్యేకంగా కమ్మ, రెడ్డి, వెలమ కులాలనే భావన ఆనాడు లేదు. ఆ వేరు భావనే ఉంటే అనితల్లి ప్రోలయ, కాపయ నాయకులను తన శాసనంలో అంత ఘనంగా వర్ణించి ఉండేది కాదు. నాటి సాహిత్యం కూడా ఈ మూడు కులాల వారిని చతుర్థ కులస్తులనే పేర్కొంది. ఆ తర్వాత ముసునూరు వంశస్తులు కమ్మ కులం గాను, పంట వంశస్తులు రెడ్లగాను, పద్మనాయకులు వెలమ కులస్తులుగాను ప్రత్యేక కులాలుగా రూపొందాయి. వెలుగోటి వారి వంశావళిలో కమ్మ దొరల మోదిన కాలదండను బిరుదులు నిరసించు కమ్మ నాయకులు, అనే రెండు పదాలున్నాయి. సింగమనాయకుని కుమారులైన అనపోతా నాయకుడు, మాధవ నాయకుడు ఈ బిరుదులు ధరించారు. వెలుగోటి వంశావళిలో వీరిచే మోదబడిన కమ్మ దొరలు అని పేర్కొనబడిన వారు ఎవరు?

ఈ కాలంలో సింగమ నాయకుడు వెలమరాజ్య విస్తరణకు పూనుకున్నాడు. ఈతని రాజ్య సరిహద్దులో మొకుగూరు మగతల, ఇనుగుర్తి, జల్లిపల్లి దుర్గాలను చాళుక్య వంశానికి చెందిన నాయకులు పాలించేవారు. వారు కాపయనాయకని సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు. వారి రాజ్యాన్ని జయించాలని సింగనాయకుడు వారి

రాజ్యాలపై తరచూ దండెత్తేవాడు. చివరలో జల్లిపల్లి వద్ద జరిగిన యుద్ధంలో తమ్మల జియ్య అనే అతడు సింగనాయకుని వధించాడు. దాంతో అతని కుమారులు అనపోతానాయకుడు, మాధవ నాయకుడు తండ్రిని పంచిన పగ తీర్చుకోడానికి జల్లిపల్లిపై దండెత్తారు. జల్లిపల్లి చాళుక్యులు కాపయనాయకుని సహాయం అర్థించగా అతడు కొంత సైన్యాన్ని వారికి సహాయంగా పంపాడు. కాని ఈ యుద్ధంలో వెలమలు విజయం సాధించారు. ఆ యుద్ధంలో పాల్గొన్న చాళుక్య, కమ్మ సైన్యాలను ఊచకోత కోశారు. ఈ యుద్ధం క్రీ.శ.1361వ సంవత్సరంలో జరిగింది. ఈ యుద్ధంలో లభించిన విజయంతో అనపోతానాయకుడు, మాధవ నాయకుడు అంటే సోదరులిద్దరూ సోమకుల పరుశరామ కమ్మదొరల మోదిన కాలదండను అనే బిరుదులు వహించారు. ఇందులో సోమకుల పరుశరామ అనే బిరుదు చాళుక్యులను ఓడించినందుకు ధరించారు. సోమకులం అంటే చంద్రవంశం. చాళుక్యులు చంద్రవంశ క్షత్రియులుగా చెప్పుకునే వారు. ఈ యుద్ధంలో పాల్గొన్న కమ్మ సైన్యాలను ఓడించినందుకు కమ్మ నాయకులను మోదిన కాలదండను అనే బిరుదులు ధరించారు. ఆ తర్వాత ఈ అన్నదమ్ములతో జరిగిన యుద్ధంలోనే క్రీ.శ.1368వ సంవత్సరంలో కాపయనాయకుడు కూడా స్వర్గస్తుడైనాడు. అయితే వెలుగోటివారి వంశావళి సమకాలిక గ్రంథం కాదు. తర్వాత రాయబడింది. ఆ గ్రంథం రాసే నాటికి కమ్మ, రెడ్డి, వెలమ కులాలు తమ స్పష్టరూపాన్ని పొంది ఉన్నాయి. కనుక తమ సమకాలిక కమ్మవారికి కాపయ నాయకుడే పూర్వీకుడు అని వెలుగోటి వారి వంశావళి గ్రంధకర్త గుర్తించాడన్న మాట. కనుకనే కాపయ నాయకునిపై సాధించిన విజయాల వల్లనే కమ్మదొరలను మోదిన కాలదండమ అనే బిరుదు అనపోతానాయకునికి ఉన్నట్లు రాశాడు. అనపోతా నాయకుని కాలంలో ఉన్నవి మూడు రాజ్యాలే. కొండవీడు, రాచకొండ, ఓరుగల్లు రాజ్యాలు. వీటిలో కొండవీడు రెడ్డిరాజ్యం, రాచకొండ వెలమరాజ్యం, మరి కమ్మదొరల రాజ్యం ఏది? అదే కాపయ నాయకుని ఓరుగల్లు రాజ్యం. నేటికీ నిలిచి ఉన్న వెలమ జమీందారీ కుటుంబాల వారు కాపయ నాయకుని కమ్మ కులస్తుడనే చెబుతారు. కారణం కాపయనాయకునిపై తమ పూర్వీకులు సాధించిన విజయాలను వారు చాలా ఘనంగా భావిస్తారు. కాపయనాయకుని కాలం నుండి ఆ సంఘటన వారి కుటుంబాలలో తరతరాలుగా చెప్పుకుంటూ వస్తున్నారు. కనుకనే నూజివీడు జమిందారుగారైన ఎంఆర్ అప్పారావుగారు, ముసునూరు వారు కమ్మవారని కచ్చితంగా చెప్పగలిగారు. వెలుగోటి వంశావళి పేర్కొన్న మరొకపదం బిరుదులు నిరసించు కమ్మ నాయకులు. కాపయ నాయకుని మరణానంతరం అతని రాజ్యం మొత్తం వెలమల స్వాధీనం అయింది. కమ్మ నాయకుల పరిస్థితి దైన్యస్థితికి దిగజారింది. కాపయనాయకుని మరణం తర్వాత వెలమలు రెడ్డి రాజ్యంపై తీవ్ర విరోధాన్ని సాగించారు. ఆ సమయంలో నిరాశ్రయులైన కమ్మ సేనానులను వెలమరాజులు తమ సైన్యంలోకి ఆహ్వానించారు. వారికి బిరుదులు, మడిమాన్యాలు ఇస్తామని ఎన్నో ఆశలు పెట్టారు. కాని వారు కాపయనాయకుని వధించిన వెలమలను పరమ విరోధులుగా భావించి వారి కొలువులో చేరడానికి తిరస్కరించారు. అందువల్ల కమ్మ వారిని బిరుదులు నిరసించు కమ్మనాయకులు అని వెలుగోటి వంశావళి గ్రంథం వివరించింది.

కాపయనాయకుని మరణం తర్వాత కమ్మ నాయకులు వెలమలకు విరోధులైన కొండవీటి రెడ్ల కొలువులో కూడా చేరలేదు. అంతవరకు కాపయనాయకుని కొల్చిన కొండవీటి రెడ్డి రాజ్యంలో సేనానులుగా చేరడానికి వారు చిన్నతనంగా భావించారు. దాంతో వారు ఆంధ్రదేశాన్ని వదిలి విజయనగర సామ్రాజ్యం చేరి వారి కొలువులో సేనాధిపతులుగా చేరారని భావయ్య చౌదరి రాశారు. ఆనాడు విజయనగర రాజ్యానికి ఇటు కోస్తాలో రెడ్డి రాజ్యంతోను, అటు తెలంగాణవైపు వెలమ రాజ్యంతోను విరోధం ఉంది. కనుక ఆ రెండు వంశాలకు భిన్నమైన కమ్మవారిని వెంటనే తమ సైన్యంలో చేర్చుకొని ఆదరించారు. ఆనాటి నుండి విజయనగర రాజ్యంలో కమ్మ సేనానులు ప్రముఖ పాత్రను నిర్వహించి సామంతులు, మాండలీకులుగా ఎదిగారు. అలాంటి వారిలో గండికోట తిమ్మానాయకుడు, మధుర విశ్వనాధనాయకుని కుటుంబాలు అతి ముఖ్యమైనవి. విజయనగర కాలంనాటి కవిసార్వభౌముడైన శ్రీనాథుడు కూడా తన కావ్యాలలో చతుర్థకులం పంటలను, కమ్మలను, వెలమలను శాఖోపశాఖలుగా చీలిపోయిందని స్పష్టంగా వర్ణించాడు. కనుక ముసునూరి ప్రోలయ, కాపయ నాయకులు కమ్మ కులస్తులని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. చివరగా ఒక్క ప్రశ్న- ఈనాడు ముసునూరి ఇంటి పేరు గల వారు కమ్మ వారిలో ఉన్నారు. నేటి ముసునూరి వారు కమ్మవారైనప్పుడు, ఆనాటి ముసునూరి వారు కమ్మవారు ఎందుకు కారు? ఇంటి పేరు తరతరాలుగా వస్తూ ఉంటుంది. కనుక నేటి ముసునూరి వారి పూర్వీకులే ఆనాటి ముసునూరి ప్రోలయ, కాపయనాయకులు అని ఘంటాపథంగా చెప్పవచ్చు. అందుకు నిదర్శనం పెమ్మసాని వారి

కుటుంబం. గండికోటను పాలించిన పెమ్మసాని వారు కమ్మవారనేది చారిత్రక సత్యం. నేడు పెమ్మసాని అని ఇంటిపేరుగల అనేక కుటుంబాలు కమ్మవారిలో ఉన్నాయి. అలాగే ఆనాటి ముసునూరి వారు కమ్మవారే! ఈనాటికీ కృష్ణాజిల్లా నూజివీడు వద్ద ఉన్న ముసునూరు గ్రామంలో ముసునూరి వారితో పూజలు జరుగుతూ ఉన్నాయి. కనుక ముసునూరి ప్రోలయ, కాపయనాయకులు ఆ ముసునూరికి చెందిన కమ్మకులస్తులనేది నిర్వివాదాంశం.

ముసునూరి వంశస్తుల స్వస్థానం: ముసునూరి వంశస్తులు ముసునూరు అనే గ్రామవాసులు. వారి స్వగ్రామం వల్ల వారికి ముసునూరు అనే ఇంటి పేరు వచ్చింది. వారి ఇంటి పేరునే విలస శాసనం ముసునూరు వంశంగా పేర్కొంది. నేడు ఆంధ్రదేశంలో ముసునూరు అనే పేరు గల గ్రామాలు రెండు ఉన్నాయి. ఒకటి నెల్లూరు జిల్లాలోను, మరొకటి కృష్ణా జిల్లాలోను ఉన్నాయి. నెల్లూరు జిల్లాలోని ముసునూరు వారి స్వగ్రామం అయి ఉండదు. అయి ఉంటే అక్కడ నుండే ప్రోలయ నాయకుడు తన కార్యక్రమాలను ప్రారంభించి ఉండేవాడు. ప్రోలయ నాయకుడు తన విముక్తి యుద్ధాలను కృష్ణా గోదావరి తీరప్రాంతాలలోనే ప్రారంభించాడు. అతని రాజ్యం కూడా కృష్ణానదికి ఉత్తరంగానే ఉంది. కృష్ణకు దిగువ భాగంలో అంటే నెల్లూరు, గుంటూరు జిల్లా ప్రాంతాలలో ప్రోలయ వేమారెడ్డి తన కార్యక్రమాలు చేపట్టాడు. ప్రోలయ వేమారెడ్డి కార్యక్రమాలను ప్రోలయ ఆమోదించాడు. పైగా ఒకరికొకరు సహకరించుకొని కూడా ఉండవచ్చు. కనుకనే వీరు కృష్ణా జిల్లాలోని ముసునూరు వాస్తవ్యులు అయి ఉండటానికే ఎక్కువ అవకాశం ఉంది.

కృష్ణా జిల్లాలోని ముసునూరులో నేటికీ కొన్ని కోట శిధిలాలు కన్పిస్తున్నాయి. మధ్యయుగంలో అది ఒక గొప్ప పట్టణం అని, అక్కడ ఒక కోట ఉండేదని భావించవచ్చు. ఈ వంశస్తులు ఆ కోటకు అధిపతులై ఉండవచ్చు. కాకతీయులకు సామంతులుగా ఆ ప్రాంతాన్ని పాలించి ఉండవచ్చు. కాకతీయుల సేనాధిపతులందరూ రాజధానిలో ఉండాలి. కనుక ముసునూరి వంశస్తులు ఓరుగల్లులో నివసిస్తూ కాకతీయులను కొలిచి ఉంటారు. ప్రతాపరుద్రుని మరణానంతరం తురుష్క పాలనలో ఆంధ్ర ప్రజల కడగళ్లను చూసి ఆంధ్ర దేశాన్ని రక్షించడానికి ప్రోలయ నాయకుడు నడుం కట్టి ఉంటాడు. కాని ముసునూరు సురక్షిత ప్రదేశం కాదు కనుక అతడు రేకపల్లిని కేంద్రంగా చేసుకొని ఉండవచ్చు. దాంతో ముసునూరి కుటుంబం ముసునూరిని వదిలివేసి ఉండవచ్చు. వారు వెళ్లిపోవడంతో ముసునూరు ప్రాముఖ్యత తగ్గి, అక్కడి కోట కాలక్రమేణా శిధిలం అయి ఉండవచ్చు. నేటికీ ఈ ముసునూరులో కమ్మకులస్తులు అధికంగానే జీవిస్తున్నారు. కనుక కమ్మవారి గ్రామం అయిన ఈ గ్రామమే వారి స్వస్థానం అని, అందువల్లనే వారికి ముసునూరు వంశస్తులని పేరు వచ్చిందని చెప్పవచ్చు. వారు ముసునూరు గ్రామాన్ని వదిలివెళ్లిపోయినా వారి ఊరి పేరే వారి వంశం పేరుగాను, ఇంటి పేరుగాను స్థిరపడి శాసనాలలో ఎక్కింది.

ముసునూరి వారి వంశవృక్షం: ముసునూరి వారి పుట్టుపూర్వోత్తరాలు స్పష్టంగా తెలియదు. వారి వంశాన్ని గురించి తెలుసుకోవడానికి మనకు ఉన్న ఒకే ఒక్క ఆధారం కాపయనాయకుని ప్రోలవరం శాసనం. ఆ శాసనంలో వారి వంశాన్ని గురించి కొద్ది వివరాలే ఉన్నాయి. అందులో సమాచారం వల్ల ఈ వంశానికి చెందిన 13 పేర్లు తెలుస్తున్నాయి. ఆ వివరాలపై ఆధారపడి వారి వంశవృక్షాన్ని రూపొందించవచ్చు. ఆ శాసనంలోని రెండవ శ్లోకంలో చతుర్థ కులమున బుధజనాధారుడైన చంద్రుని వలె పోతమహీపతి ఉండెను అని, మూడవ శ్లోకంలో అతనికి చతుర్భుజములవలె నల్గురు పుత్రులు కలిగారని తెలుపబడింది.

నాల్గవ శ్లోకంలో వారి పేర్లు ఇవ్వబడ్డాయి. వారు పోచయ, దేవయ, కామయ, రాజయ అనేవారు. 5వ శ్లోకంలో పోచయకు ప్రోలయ, ఎఱపోతయ అనే పుణ్యాత్ములు, లోకమాన్యులు అయిన ఇద్దరు కుమారులని, 6వ శ్లోకంలో దేవయకు సూర్యచంద్ర తేజస్కులు రామలక్ష్మణ సమానులైన కాపయ, ముమ్మిడయ అనే ఇద్దరు కుమారులు కల్గారని, 7వ శ్లోకంలో కామయకు ఇమ్మడయ, దేవయ అనే విఖ్యాత దానశీలురైన ఇద్దరు పుత్రులు జన్మించారని, రాజయకు అనపోతయ జన్మించి అతడు తొయ్యేటి నగరానికి అధిపతి అయ్యాడని, ముసునూరి వారి వంశాన్ని గురించి వివరాలు ఇవ్వబడ్డాయి. 9వ శ్లోకంలో సోదరులలో ముసునూరి ప్రోలయ అవక్రవిక్రమ పరాక్రమవంతుడై పండితులచే కీర్తింపబడినవాడై సద్బంధుచింతామణియై సకల సంపదలతో ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించాడని, 10వ శ్లోకంలో ప్రోలయ తర్వాత భూరక్షాదక్షుడైన స్వచ్ఛ హృదయుడు ఉన్నత భావాలు గలవాడు, ధర్మకర్మ సమర్థుడు కాశీవిశ్వేశ్వరుని మహిమ వలన ప్రాభవాన్ని పొందినవాడును క్షోణీరక్షణ దక్ష దక్షిణ భుజస్తంభం గలవాడైన కాపపృథ్వీపతి రాజ్యం చేయుచున్నాడు అని వర్ణింపబడింది. 11వ శ్లోకంలో ప్రతాప రుద్రునితో సమానమైన శక్తిమంతుడు, కరుణాకరుడు అయిన కాపభూపతి ఏక శిలానగరం రాజధానిగా సమస్త

ACC ... 99147 ... 500032

భూ మండలాన్ని పాలిస్తున్నాడని వివరింపబడింది. ఈ శాసనంలోని 2 నుండి 11 వరకు ఉన్న శ్లోకాలను బట్టి వారి వంశవృక్షం ఈ కింది విధంగా రూపొందించబడింది.

వంశవృక్షం

పోతయ

- పోచయ
  - ప్రోలయ (1323-35)
  - ఎఱపోతయ
- దేవయ
  - కాపయ (1335-68)
  - ముమ్మిడయ
- కామయ
  - ఇమ్మడయ
  - దేవయ
- రాజయ
  - అనపోతయ తొయ్యేటి అధిపతి

వీరిలో ప్రోలయ నాయకుడు క్రీ.శ.1325 సంవత్సరం రేకపల్లిని రాజధానిగా చేసుకొని రాజ్యస్థాపన చేశాడు. అతని తర్వాత కాపయనాయకుడు రాజ్యానికి వచ్చాడు. ప్రోలయ నాయకుడు 10 సంవత్సరాలు పాలించాడు. అంటే క్రీ.శ.1325 నుండి 1335 వరకు పాలించి మరణించగా, 1335 నుండి కాపయ నాయకుడు రాజ్యానికి వచ్చి క్రీ.శ.1368 వరకు పాలించాడు. అంటే అతడు 33 సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. ముసునూరి వంశస్తులు మొత్తం 43 సంవత్సరాలు ర్యాజ్యపాలన చేశారు. ప్రోలయనాయకుడు క్రీ.శ.1325వ సంవత్సరంలో రాజ్యస్థాపన చేసేనాటికి 40 సంవత్సరాల ప్రాయం కలవాడని అంచనా. అంటే అతడు 1325-40= క్రీ.శ.1285వ సంవత్సరంలో జన్మించి ఉండవచ్చు. అపుడు అతని తండ్రి పోచయ 30 సంవత్సరాల యువకుడని భావిస్తే అతడు 1285 - 30= క్రీ.శ.1255వ సంవత్సరంలో జన్మించి ఉండవచ్చు. అప్పటికి అతని తండ్రి పోతయకు 30 సం॥ లు ఉంటాయని భావిస్తే 1255 - 30= క్రీ.శ.1220వ సంవత్సరంలో అతడు జన్మించి ఉండవచ్చు. అంటే ముసునూరి వంశానికి మూలపురుషుడైన పోతయ గణపతిదేవ చక్రవర్తి సమకాలికుడు. అతడు గణపతిదేవుని వద్ద సేనానిగా పనిచేసి ఉండవచ్చును. అతని కుమారుడు పోచయ రుద్రమదేవి సమకాలికుడు. అతని కుమారుడు ప్రోలయ అంటే రాజ్యస్థాపకుడు ప్రతాపరుద్రుని సమకాలికుడు. ప్రతాపరుద్రుని కొలువులో సేనాధిపతిగా ఉండి ఉండవచ్చును. నూజివీడు దగ్గరున్న ముసునూరు గ్రామంలో నేడు కన్పించే కోట శిధిలాలు వీరి కాలంనాటివి కావచ్చు. కాపయదేవుని కుమారుడు వినాయక దేవుడు. అతడు తండ్రికంటే ముందుగానే గతించాడు. వినాయకదేవునితో 14 మంది ముసునూరి వంశస్తుల పేర్లు మనకు తెలుస్తున్నాయి.

పోతయ (క్రీ.శ.1220-1270)

- పోచయ 1255-1300
  - ప్రోలయ నాయకుడు 1325-1335
- దేవయ
  - కాపయ నాయకుడు 1335-1368
    - వినాయకదేవుడు
- కామయ
  - ఇమ్మడయ దేవయ
- రాజయ
  - అనపోతానాయకుడు (తొయ్యేరు అధిపతి) 1335-1356

ఈ వంశంలోని 14 మందిలో ప్రోలయ నాయకుడు, కాపయ నాయకుడు, అనపోతానాయకుడు మాత్రమే రాజ్యం చేశారు. వినాయక దేవుడు వెలం పట్టణంలో రాజప్రతినిధిగా నియమింపబడ్డాడు. వెలం పట్టణం వద్ద బహమనీ సుల్తాన్‌తో జరిగిన యుద్ధంలో ఓడి వారికి బందీగా చిక్కి సుల్తాన్‌చేత అతిక్రూరంగా వధింపబడ్డాడు.

ప్రోలయ నాయకుడు: క్రీ.శ.1323 నుండి క్రీ.శ.1325 వరకు నిరాటంకంగా సాగిన తురుష్క అధికారంలో ముస్లిం సరదారులు ప్రజలను పీడించి దోపిడీలు చేయడం, కొల్లగొట్టడం నిత్యకృత్యం అయింది. ఆ స్థితిలో తమని రక్షించే వారెవరని ప్రజలు విలపిస్తున్న తరుణంలో వారి బాధలను చూసిన ప్రోలయ నాయకుడు ప్రాణాలకు తెగించి ఆంధ్ర ప్రజలను కాపాడడానికి నడుం బిగించి ముందుకు వచ్చాడు. ప్రోలయ ధైర్యసాహసాలు, చొరవ, నిర్మాణ దక్షత, యుద్ధకుశలత గల్గిన యోధుడు. ప్రతాపరుద్రుని కాలంలో అతని హోదా ఏమిటో మనకు స్పష్టంగా తెలియదు కాని, ఆంధ్ర విమోచన యుద్ధంలో అతడు ప్రదర్శించిన సాహసం, పరాక్రమం, యుద్ధ

వ్యూహం, మేధాశక్తి, గెరిల్లా యుద్ధం పద్ధతులను పరిశీలించినట్లయితే అతడు గొప్ప వీరాగ్రేసరుడు అని స్పష్టం అవుతుంది. కనుక ప్రతాపరుద్రుని కాలంలో కూడా అతడు గొప్ప పదవిని నిర్వహించే ఉంటాడు. అంతేగాక బారాని మొదలైన ముస్లిం చరిత్రకారులు స్వాతంత్ర్య పోరాటాన్ని జరిపిన నాయకుడు కృష్ణనాయక్ అని, అతడు ప్రతాపరుద్రుని కుమారుడని రాశారు. దీనినిబట్టి అతడు రాజకుటుంబానికి బంధువు అయికూడా ఉండవచ్చని భావన కలుగుతుంది. ఆ రోజులలో ప్రతాపరుద్రుడు తన అంగరక్షణకు లెంకెలు అనే ప్రత్యేక వీరులను పోషించాడు. వారు చక్రవర్తి అంగరక్షకులు. ఎల్లప్పుడూ చక్రవర్తిని అంటిపెట్టుకొని ఉండేవారు. చక్రవర్తి తిని వదలగా మిగిలిన ఆహారాన్ని భుజించేవారు. పగలురాత్రి అనే భేదం లేకుండా చక్రవర్తిని కాపలా కాస్తూ ఉండేవారు. ఆ లెంకెలను చక్రవర్తి తన కుమారులని ప్రకటించేవాడు. యుద్ధ సమయాలలో కూడా వారు ఆయన చుట్టూ ఉండేవారు. శత్రువుల రాజుపై దాడిచేస్తే వారు శత్రువులతో పోరాడి చక్రవర్తిని కాపాడుతారు. ఆ పోరాటంలో వారు శత్రువును వధించనైనా వధించేవారు లేదా వధింపబడేవారు. కాని తమ స్థానాన్ని వదిలి పారిపోయే వారు కాదు. కనుక చక్రవర్తి ఆ లెంకెలను తన కుమారులుగా చూసేవాడు. కనుక చాలామంది తాము ప్రతాపరుద్రుని కుమారులమని చెప్పుకున్నారు. అంటే వారందరూ ఆయనకు కాపుకాసిన లెంకలు అన్నమాట. విముక్తి యుద్ధం సాగించిన ప్రోలయ నాయకుని ప్రతాపరుద్రుడు కుమారుడని బారాని మొదలైన వారు రాశారు. అంటే బహుశా ప్రోలయ నాయకుడు కూడా ప్రతాపరుద్రుని లెంకెగా పనిచేసి, అతని కుమారునిగా పరిగణింపబడి ఉండవచ్చును. అంతకుపూర్వం అతని హోదా ఏమైనా ముస్లింలను పారద్రోలడానికి అతడు పన్నిన వ్యూహం, చెదిరిపోయిన కాకతీయ సేనానులను కూడగట్టడంలో అతడు ప్రదర్శించిన నేర్పు, నాయక సమాఖ్యను నిర్మించి నడిపిన తీరులోని అతని రాజనీతిజ్ఞత చాలా గొప్పది. అంతేగాక బ్రాహ్మణులను, పండితులను రప్పించి ఉద్యమాన్ని గురించి ప్రజలలో ప్రచారం చేయించి వారి ఆశీర్వాదాలు పొందడం ప్రోలయ నాయకునిలోని మరొక విశేషం. ఈ విధంగా ఉద్యమాన్ని నడపడంలో అతడు అసమాన ప్రజ్ఞను ప్రదర్శించాడు. అట్టి గొప్ప ప్రజ్ఞాశాలి గనుకనే ఉద్యమం విజయం సాధించి ఆంధ్ర దేశం విముక్తి పొందింది. అలాంటి నాయకత్వం లక్షణాలుండబట్టే కాకతీయ సేనానులందరూ తమ తమ వ్యక్తిగత అహంకారాన్ని పక్కనబెట్టి ప్రోలయ నాయకత్వాన్ని అంగీకరించారు.

ప్రోలయ నాయకుని శరీరాకృతిని గురించి ఆచార్యరంగా తన కాకతీయ నాయకులు అనే గ్రంథంలో 48వ పేజీలో మూడవ పేరాలో ఊహావర్ణన చేశారు. ఆయన ఊహ ప్రకారం ప్రోలయ ఎత్తయినవాడు, వజ్రశరీరుడు, ఆజానుబాహుడు, విశాల వక్షస్థలం గల్గినవాడు. ఎత్తైన భుజాలు గలిగినవాడు. బిగువైన మూతిగలవాడు, దట్టమైన నల్లని మీసం గలవాడు. సమ్మోహనకరమైన కాంతులీనే కమలాల వంటి కన్నులు గలవాడు, విశాలమైన ఫాలభాగం కలవాడు, నల్లని పొడవైన కురులు గలవాడు. ఆ కురులను నడినెత్తిన కొప్పుగా ముడి వేసుకొని ఉన్నవాడు. నడుముకు ఖడ్గాన్ని ధరించిన యుద్ధవీరుడు, తలపై జరీతలపాగా ధరించి ఉన్నవాడు. పసిమి పచ్చని ఛాయతో ఉన్నవాడు. అతని ముఖం చూడగానే భయం, భక్తి ఏకకాలంలో కలిగేటట్టు ఉండేవాడు. విముక్తి పోరాటం ప్రారంభించే నాటికి సుమారు 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండవచ్చు అని వర్ణించాడు. ప్రజల మొరలాలకించి దేవతలు ఇచ్చిన వరం ప్రోలయనాయకుడు. ఓరుగల్లు ఆలయాల ప్రాంగణాలలో చెల్లాచెదురుగా పడి ఉన్న నల్లరాతి విగ్రహాలు, గుర్రపు రౌతుల విగ్రహాలు చూసి, వీరు కాకతీయులనాటి యుద్ధవీరుల ఆకారాలని గ్రహించవచ్చు. హనుమకొండ రామప్ప దేవాలయాలలో చెక్కిన యుద్ధవీరులు అశ్వికులు ఇతర నల్లరాతి విగ్రహాలను చూసి ప్రోలయ, కాపయ నాయకుల ఆకారాలను ఊహించానని శ్రీ రంగా చెప్పుకున్నారు.

అలాగే కాపయనాయకుని ఆకారాన్ని ఈ కింది విధంగా వర్ణించారు. కాపయ వయసున చిన్నవాడు. సుమారు 30 సంవత్సరాలు ఉండవచ్చు. యువనాయకులకు ప్రేమాస్పదుడు, బంగారువన్నె కలవాడు. స్ఫురద్రూపి, ఆవేశపరుడు, చురుకైనవాడు, మేధావి. తన తలపై జరీ అంచు తలపాగా ధరించాడు. ఆజానుబాహుడు, బలమైన చేతులు, వ్రేళ్లు, ఉక్కు పిడికిలి గలవాడు. కత్తి యుద్ధంలో అజేయుడు, మెరిసే ఎర్రని కళ్లు గలవాడు. నాయకులు వినయ విధేయతలతో మెలిగేటట్లు చేసుకోగలిగే వాడు అని వర్ణించారు. ఇవన్నీ ఊహలే అయినప్పటికీ దృఢశరీరుడు కానివాడు యుద్ధవీరుడు కాలేదు కనుక వారు దృఢశరీరంగల యుద్ధ వీరులని భావించవచ్చును.

ప్రోలయ నాయకుడు నాయకత్వం స్వీకరించే నాటికి ఆంధ్రదేశపు రాజకీయ పరిస్థితి: ప్రోలయనాయకుడు నాయకత్వం స్వీకరించే నాటికి యావదాంధ్ర దేశం తుగ్లక్ సామ్రాజ్యంలో చేరి ఉంది. ఓరుగల్లులో మాలిక్ మగ్బూల్ గవర్నర్‌గా ఉన్నాడు. మిగిలిన ప్రాంతాలలోని కోటలలో కొద్ది కొద్ది ముస్లిం సైన్యాలు నిలుపబడ్డాయి.

రాజమండ్రిలో మరొక ముస్లిం పాలెగాడు నియమింపబడ్డాడు. అతడు కోస్తాపై అధికారం చెలాయిస్తున్నాడు. కోస్తాలో స్థానికంగా ఉన్న హిందూ సామంత రాజులను ముస్లింలు పూర్తిగా తొలగించలేదు. కోనసీమ, పాలకొల్లు ప్రాంతాలలో హైహయులు, స్థానికులు పాలకులుగా ఉన్నారు. ఉత్తరాంధ్రలో మత్స్యవంశాలు ఉన్నాయి. దక్షిణాంధ్రలో కూడా స్థానిక వంశాలు ఉన్నాయి. కడప, కర్నూలు ప్రాంతాలలో అరవీటి వంశస్తులు స్థానిక పాలకులుగా ఉన్నారు. కంపిలి రాజ్యంలో మాలిక్ నబిను గవర్నర్‌గా సుల్తాన్ నియమించాడు. మధురలో ముస్లిం గవర్నర్ నియమింపబడ్డాడు. ముస్లింలు తెలంగాణలో తమ అధికారాన్ని స్థిరపరచుకోవడంలో నిమగ్నులై ఉన్నారు.

ముస్లింలు దక్షిణాపథాన్ని జయించినా వారు స్థిరమైన అధికారాన్ని నెలకొల్పలేకపోయారు. వారు కోటలు, సైనిక స్థావరాలు మాత్రమే జయించారు. ముఖ్యమైన కోటలలో ముస్లిం సైన్యం ఉండేది. పరిపాలనా యంత్రాంగం చాలా భాగం స్థానికులైన హిందువుల చేతిలోనే ఉండేది అని గ్రిబెల్ అనే పండితుడు రాశాడు. కనుక క్రీ.శ.1323లో తుగ్లక్‌లు కాకతీయ సామ్రాజ్యాన్ని జయించిన సామ్రాజ్యం విశాలమైనదైనందున ఆంధ్రదేశం మొత్తం మీద వారి అధికారం పూర్తిగా స్థిరపడి ఉండలేదని చెప్పవచ్చు.

క్రీ.శ.1325 సంవత్సరంలో మహ్మద్ బిన్ తుగ్లక్ (తక్రుద్దీన్ జునాఖాన్ లేక ఉలుగ్‌ఖాన్) ఢిల్లీ సింహాసనం అధిష్ఠించాడు. ఘియాజుద్దీన్ మరణం, మహమ్మద్ బిన్ తుగ్లక్ సింహాసనం అధిష్టించడం, ఢిల్లీలో కొంత రాజకీయ అస్థిరత్వం ఏర్పడటం జరిగింది. ఈ పరిస్థితిలో ప్రోలయనాయకుడు తన స్వాతంత్ర్య యుద్ధాన్ని ప్రారంభించాడు.

విముక్తి వ్యూహం - గెరిల్లా యుద్ధం: ప్రోలయ నాయకుడు తన కార్యకలాపాలకు రహస్య స్థావరం అవసరమని గ్రహించాడు. కనుక అతడు గోదావరి నది ఒడ్డున దట్టమైన అడవుల మధ్య ఉన్న రేకపల్లిని తన కేంద్రంగా చేసుకున్నాడు. అది మారుమూల ఉంది. చుట్టూ భయంకరమైన అడవులున్నాయి. అక్కడికి చేరటానికి సరైన త్రోవలు లేవు. కనుక శత్రు సైన్యాలు రాలేవు. అవసరమైతే అక్కడి నుండి బస్తరు అడవులలోకి వెళ్లిపోవచ్చు. ఆ అడవులలో ప్రతాపరుద్రుని సోదరుడు అన్నయదేవుడు స్థావరం ఏర్పాటు చేసుకున్నాడు. కనుక తనకు అన్నివిధాలా రేకపల్లి అనుకూలంగా ఉంటుందని భావించి దానిని తన రాజధానిని చేసుకున్నాడు. అక్కడ బలమైన దుర్గాన్ని నిర్మించుకున్నాడు. తర్వాత బ్రాహ్మణులను, పండితులను పిలిపించి దేశమంతా తిరిగి ప్రజలను సహకరించేటట్లు హితబోధలు చేయమని కోరాడు. వారు సంతోషంతో ఆ కార్యాన్ని నిర్వర్తించారు. ప్రతి గ్రామం తిరిగి ప్రోలయనాయకుని ప్రయత్నాలు చెప్పి ప్రజా సహకారం ఇవ్వవలసిందిగా అభ్యర్థించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవించే ప్రజలు తక్షణమే తమ మద్దతు ప్రకటించారు. ముస్లింల చేతులలో ధన, మాన, ప్రాణాలు పోగొట్టుకున్నవారు స్వయంగా బయలుదేరి రేకపల్లి చేరి ప్రోలయనాయకునితో చేరారు. యవనులతో విపరీతంగా బాధింపబడిన ప్రజలు వేసవిచే తపించబడినవారు సరస్సును చేరినట్లు ప్రభువగు ఆ ప్రోలయను చేరిరి అని విలస శాసనంలో 33వ శ్లోకం వివరించింది. ప్రతీకార జ్వాలతో ఉడికిపోయి ఆ విధంగా చేరిన ప్రజలతో ప్రోలయ సైన్యాన్ని నిర్మించాడు. అలాంటి దృఢ సంకల్పం కలిగిన కొద్దిమందే చాలు శత్రువును నిర్మూలించడానికి. వారి సహాయంతో ఒక్కొక్క దుర్గాన్ని సాధించడానికి పూనుకున్నాడు. పినతండ్రి కుమారుడైన కాపయనాయకునికి అంతకుపూర్వం కాకతీయ సైన్యాధిపతులుగా ఉన్న నాయకులను కలిసి వారిని కూడగట్టే కార్యాన్ని అప్పగించాడు. మిగిలిన సోదరులను కోనసీమ, రాజమండ్రి, కోరుకొండ మొదలైన ప్రాంతాలను జయించడానికి పంపాడు. అనపోతానాయకుడు తొయ్యేటి ప్రాంతాన్ని జయించాడు. ముమ్మడినాయకుడు కోరుకొండ ప్రాంతాన్ని జయించాడు. కోనసీమ జయింపబడింది. కృష్ణకు ఉత్తర ప్రాంతం అంతా ప్రోలయ స్వాధీనం అయింది. కృష్ణా, గోదావరీ తీర ప్రాంతాలన్నింటిని తన అధీనంలోకి తెచ్చుకొని స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. దాంతో వేంగి, ఖమ్మం జిల్లా ప్రాంతం, ఉత్తరాంధ్ర మొత్తం విముక్తి పొందాయి. ప్రోలయ నాయకుడు ఒక్కొక్క దుర్గాన్ని జయిస్తూ ఉంటే ఆంధ్రదేశం ఉప్పొంగి పోయింది. ప్రజలకు, పూర్వపు కాకతీయ నాయకులకు ధైర్యోత్సాహాలు కలిగి ఎక్కడి వారు అక్కడ విమోచన యుద్ధానికి సన్నద్ధులయ్యారు. ఆ విధంగా వారికి ప్రేరణ ఇవ్వగలిగాడు. అదే సమయంలో కాపయ నాయకుడు వారినందరినీ కలిసి విమోచన యుద్ధానికి తయారు చేశాడు. దాంతో నెల్లూరు, గుంటూరు జిల్లా ప్రాంతంలో ప్రోలయ వేమారెడ్డి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో సింగమనాయకుడు విముక్తి పోరాటానికి నడుం కట్టారు. ప్రోలయ వేమారెడ్డి విజయాలతో కృష్ణకు దక్షిణ భాగం అంతా విముక్తి చెందింది. మహబూబ్‌నగర్ ప్రాంతాన్ని సింగమనాయకుడు విముక్తి చేశాడు. రాయచూరు, కడప, కర్నూలు ప్రాంతంలో అరవీటి వంశస్తులు విముక్తి యుద్ధాన్ని ప్రారంభించారు. ఈ విధంగా ఒక్క ఓరుగల్లు, ఉత్తర తెలంగాణ తప్ప

మిగిలిన ఆంధ్రదేశం అంతా విముక్తి చెందింది. ముస్లింలను తరిమికొట్టారు. ముస్లింల చేతిలో బాధలు పడ్డ హిందువులే ప్రోలయ నాయకుని చేరి అతని నాయకత్వం కింద నడచి తమను బాధించిన ముస్లింలను వధించారని విలస శాసనంలోని 34వ శ్లోకం వివరిస్తోంది.

ఈ విధంగా దేశం విముక్తి కావడంతో ఆంధ్ర ప్రజల సంతోషాలకు అంతులేకపోయింది. ప్రోలయ నాయకుడు తమ పాలిట ఆపద్బాంధవునిగా చూశారు. అతడు సాధించిన ఘనకార్యాలను విలస శాసనంలోని 28వ శ్లోకం నుండి 35వ శ్లోకం వరకు ఘనంగా కీర్తించాయి. రాక్షసులతో సమానమైన యవన భటులచేత బాధింపబడుతున్న త్రిలింగ దేశాన్ని దయాళువై అవతరించిన విష్ణువువలె ప్రోలక్షితీసుడు ఉద్ధరించి పాలిస్తున్నాడు అని, అతడు తన బాహు బలం చేత యవనుల ఆధిపత్యాన్ని నాశనం చేశాడని, అతని నామం యవనాధములను పారదోలగలిగిన మంత్రముందని ప్రజలందరూ అతనిని చేరారని, బలవంతుడైన ప్రోలయ తురుష్క సందోహాన్ని నాశనం చేసి, ఆపదలో నశించిన ధర్మాన్ని పునరుద్ధరించాడని వర్ణించింది. పూర్వ ధరణీపతులచే నొసంగబడిన, తురుష్కులచే అపహృతమైన అగ్రహారాలు తిరిగి బ్రాహ్మణులకు ఇచ్చాడని, తురుష్కుల పాదఘట్టాల చేత అపవిత్రమైన దేశాన్ని ప్రోలరాజు పవిత్రీకరించాడని, తపశ్శక్తి మహర్షులు ధారపోసినట్లు తమ ఆదాయంలో 6వ వంతును ప్రజలు రాజుకు చెల్లించారని, నేల నాలుగు చెరగుల పారశీకులు ఒనరించిన దౌష్ట్యాలను ప్రోలరాజు చక్కదిద్దాడని వర్ణించింది. అనితల్లి కలువచేరు శాసనం కూడా ప్రోలయ ఘనతను అద్భుతంగా వర్ణించింది. ఆ శాసనంలోని 6వ శ్లోకంలో సముద్రజలములందు మునిగిన భూమిని ఆదివరాహం ఉద్ధరించినట్లు తురుష్కులు దిగమింగిన రాజ్యాన్ని ప్రోలయనాయకుడు పునరుద్ధరించాడు అని ఘనంగా కీర్తించారు. అంటే ప్రోలయ నాయకుడు సాధించిన ఆ ఘనత అని తల్లి కాలం వరకు ప్రజల స్మృతిపథంలో చెక్కుచెదరకుండా ఉందని భావించాలి. తురుష్కుల నుండి రాజ్యవిముక్తి జరిగిన తర్వాత ప్రోలయ నాయకుడు ముస్లింల కాలంలో నాశనం చేయబడిన పరిస్థితిని పునరుద్ధరించాడు. బ్రాహ్మణుల అగ్రహారాలు బ్రాహ్మణులకు ఇచ్చాడు. దేవమాన్యాలను దేవాలయాలకు పునరుద్ధరించాడు. ముస్లింలు రైతులపై విధించిన పన్నులను రద్దు చేశాడు. ముస్లింలు ఆక్రమించిన రైతుల భూములను ఎవరివి వారికి దాఖలు పరిచాడు. అతడు చేసిన పునరుద్ధరణ కార్యక్రమాలన్నీ విలస శాసనంలోని 39వ శ్లోకం నుండి 52వ శ్లోకం వరకు వర్ణింపబడ్డాయి. భూతలం మీద పారశీకుల చేత ఏవేవి తల్లకిందులు చేయబడ్డాయో వాటన్నింటినీ బలవంతుడైన ప్రోలయ యధాపూర్వకంగా సరిదిద్దాడు. తురుష్కుల చేత పీడింపబడిన ఆంధ్రభూమిని విముక్తి గావించి ప్రోలయ భూపతి తన చేతితో పైకి తెచ్చాడు. రేకపల్లిని రాజధానిగా చేసుకున్నాడు. అది అలకానగరం, అమరావతివలె వెలిగింది. ఆ పట్టణంలో ఇంద్రతేజస్సుడై ప్రోలక్షితీసుడు వెలుగుతూ పృధ్విని శాసించాడు. అతని గుర్రపు గిట్టల తాకిడి చేత రేగిన దుమ్మును చూసి శత్రువుల భార్యలు భీతితో పరిగెత్తారు. ప్రోలయ ఎక్కుపెట్టిన బాణాలు శత్రువుల భార్యల మంగళసూత్రాలను తెంపాయి. అతడు రాజనీతి, శౌర్యాదులు గల కాపయనాయకుడు మొదలైన తమ్ములకు రాజ్యపాలనను అప్పగించి, ధర్మకార్యతత్పరుడయ్యాడు. బ్రాహ్మణులకిచ్చిన దానాలు కలికాలపర్యంతం ఉంటాయని గ్రహించి అనేక ప్రశస్త అగ్రహారాలను, పెక్కు దానాలను చేశాడు. ఈ దానాలలో భాగంగానే విలస గ్రామాన్ని భరద్వాజ గోత్రీకుడైన వెన్నయ అనే బ్రాహ్మణునికి అగ్రహారంగా ఇచ్చి ఈ విలస శాసనాన్ని రాయించాడు. ఈ శాసనం ద్వారానే ప్రోలయనాయకుడు సాధించిన ఈ ఘనకార్యాలన్నీ మనకు తెలుస్తున్నాయి. ఈ శాసనం క్రీ.శ.1330లో రాయించబడిందని భావిస్తున్నారు. ప్రోలయ నాయకుడు ఎన్నాళ్లు పాలించింది మనకు తెలియదు. అతడు క్రీ.శ. 1335లో పాలించాడని చరిత్రకారులు భావిస్తారు.

కళింగ గాంగుల దండయాత్ర-ప్రోలయనాయకుని మరణం క్రీ.శ.1335: ఉత్తరాంధ్ర దేశంపై కళింగ గాంగులు దండెత్తగా వారినెదుర్కొని పోరాడుతూ ప్రోలయ నాయకుడు యుద్ధభూమిలో మరణించాడని ఆచార్య రంగా తమ కాకతీయ నాయకులు అనే గ్రంథంలో రాశారు. అది వాస్తవమేనని భావించటానికి ఆధారాలు కనిపిస్తున్నాయి. క్రీ.శ.1335లో కళింగ రాజ్యాన్ని మూడవ నరసింహదేవుడు పాలించాడు. అతడు సామ్రాజ్యవాది. 1353లో ఆంధ్రదేశంపై దండెత్తి కృష్ణాతీరం వరకు ఆక్రమించాడు. కనుక అతడు అంతకుముందు అంటే ప్రోలయ నాయకుని కాలంలో, క్రీ.శ.1335లో దండెత్తి ఉండవచ్చు. అతనిని ఎదిరించి ప్రోలయనాయకుడు ఉత్తరాంధ్రను కాపాడుకొని ఉండవచ్చు. ఆ యుద్ధంలో ప్రోలయనాయకుడు మరణించి ఉండవచ్చు. అద్దంకి రెడ్డి రాజ్యస్థాపకుడైన ప్రోలయవేమారెడ్డి కాలం నాటి చీమకుర్తి శాసనంలో అతడు కళింగ, వడ్డాది, మత్స్య రాజ్యాలను

జయించినట్టు ఉంది. మల్లంపల్లి సోమశేఖరశర్మ ప్రోలయ వేమారెడ్డి కళింగను జయించటానికి అవకాశం లేదు అని, ఈ శాసనంలో చెప్పబడిన బిరుదులు అతిశయోక్తులని భావించారు. కాని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయం సరైనది కాదు. ప్రోలయ వేమారెడ్డి ప్రోలయ నాయకునికి సహాయంగా 1335లో కళింగ దండయాత్రలో పాల్గొని ఉండవచ్చు. ఆ సమయంలో ప్రోలయ వేమారెడ్డి కళింగ, మత్స్య, వడ్డాది రాజ్యాలపై విజయాలు సాధించి ఉండవచ్చు. అందువల్ల అతడు ఆ బిరుదులు ధరించి ఉండవచ్చు. కనుక చీమకుర్తి శాసనం ముసునూరి ప్రోలయ నాయకుడు ఉత్తరాంధ్రపై దండెత్తిన కళింగ గంగరాజును ఎదిరించాడని, అందుకు ముసునూరి ప్రోలయనాయకునికి ప్రోలయ వేమారెడ్డి సహాయంగా యుద్ధంలో పాల్గొన్నాడని తెలిపే సమాచారమే చీమకుర్తి శాసనం తెలిపే విషయం అని భావించవచ్చు. కనుక ఆచార్యరంగా రాసినట్టు కళింగ గంగ రాజ్యంతో పోరాడుతూ ఆ యుద్ధంలోనే ముసునూరి ప్రోలయనాయకుడు క్రీ.శ.1335లో మరణించి ఉండవచ్చు. కనుక రంగా రచనలో వాస్తవం ఉందని చీమకుర్తి శాసనం బలపరుస్తోంది. అతని తర్వాత క్రీ.శ.1335లో కాపయ నాయకుడు ముసునూరి రాజ్యభారం వహించి రేకపల్లి సింహాసనం అధిష్టించాడు.

ప్రోలయనాయకుడు మహోన్నత విజయాలు సాధించినా తానే అధికారమంతా చెలాయించాలని భావించలేదు. యువనాయకులకు బాధ్యతలు అప్పగించాడు. ఢిల్లీ పాలకుల దుష్టపరిపాలన వల్ల మానసికంగా గాయపడిన తెలుగు ప్రజలను ఓదార్చాడు. దేవాలయాల జీర్ణోద్ధరణను చేపట్టాడు. గ్రామాలను పునర్నిర్మాణం చేశాడు నీటివనరులు, రహదారుల అభివృద్ధికి పాటుపడ్డాడు. విద్యా, వైద్య సౌకర్యాలు కల్గించాడు. విప్లవ నాయకుల మధ్య ఐక్యతను పెంపొందించాడు. నూతనంగా నాయకత్వానికి ఎదిగిన రెడ్లను గౌరవించాడు. అద్దంకి ప్రోలయ వేమారెడ్డికి సహకరించాడు. రేచర్ల పద్మనాయకులు, కొలను, కాయత్స ఇతర దుర్జయ వంశస్తులు ఒకటిగా చేరి ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశాడు. దక్షిణాపథ నాయకులతో సత్సంబంధాలు నెలకొల్పుకున్నాడు. విముక్తి యుద్ధం విజయం సాధించేలా చేశాడు. విద్యాధికులైన బ్రాహ్మణులకు అపూర్వంగా దానాలు చేసి వైదిక ధర్మాన్ని పునరుద్ధరించాడు. కవి పండితులను పోషించాడు. ముస్లిం దండయాత్రా కాలంలో బ్రాహ్మణులు పోగొట్టుకున్న అగ్రహారాలు వారికి పునరుద్ధరించడమే గాక, నూతన అగ్రహారాలు దానాలు చేశాడు. ఆ విధంగా దానాలు చేసిన అగ్రహారాలలో విలస గ్రామం ఒకటి. ఆనాడు తర్క మీమాంస, షడ్దర్శన పండితులు, ధర్మ శాస్త్రవేత్తలు, సంగీత సాహిత్యాలలో నిష్ణాతులు, ఆయుర్వేద శాస్త్రవేత్తలు ఉన్నారని విలస శాసనం తెలుపుతోంది.

ఆంధ్రదేశం ప్రోలయ నాయకుని స్మృతిని చాలా కాలం నిలబెట్టుకున్నదని అని తల్లి కలువచేరు శాసనం చెబుతోంది అంతేగాక ఆయనపై ఉన్న గౌరవం వలన ఆయన స్మృతిపథంగా తమ పిల్లలకు పోలయ్య, పోలమ, పుల్లయ్య, పుల్లమ్మ అనే పేర్లు పెట్టుకున్నారు. ఈ పేర్లు ప్రోలయకు పర్యాయపదాలు. అలాగే ఉభయ గోదావరి జిల్లాల్లో ఉన్న పోలవరం అనే గ్రామాలు ప్రోలయ నాయకుని పేరుతో నిర్మించి ఉండవచ్చు. ప్రోలయనాయకుడు స్వాతంత్ర్య సమరానికి పునాదులు వేసి అందరికీ మార్గదర్శకుడయ్యాడు. భారతదేశ పారతంత్ర విముక్తి పోరాటంలో ఇది ఏకైక సంఘటన. ఇలాంటి స్వాతంత్ర్య పోరాటం మధ్యయుగంలో ప్రపంచంలో ఏ దేశంలోను జరగలేదు. కనుక ఈ విముక్తి పోరాటాన్ని చరిత్రకారులు ఆంధ్ర స్వాతంత్ర్య సమరపోరాటం అని వర్ణించారు.

కాపయ నాయకుడు క్రీ.శ1335-1368: ప్రోలయ నాయకుని మరణానంతరం కాపయనాయకుడు రాజ్యానికి వచ్చాడు. అతడు ధైర్యసాహసాలలోను, ఉత్సాహంలోను ప్రోలయ నాయకునికి తీసిపోనివాడు. అతడు చిన్నతనం నుండే సోదరుని వద్ద రాజకీయ చాతుర్యంతోపాటు, అస్త్రశస్త్ర విద్యలు, గుర్రపుస్వారీ, కత్తిసాము అన్నీ నేర్చుకొని ఆరితేరాడు. మొదటి నుండి సోదరునికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. కాపయనాయకుడు విశ్వేశ్వర భక్తుడు. ఇతడు తెలంగాణ వాలి అని బర్నీ మసిరో అనే ముస్లిం చరిత్రకారుడు వర్ణించాడు. క్రీ.శ.1335లో కాపయనాయకుడు రేకపల్లి సింహాసనాన్ని అధిష్టించాడు. కాపయనాయకుని చరిత్రకు అతని పోలవరం శాసనం, గురజ, పిల్లలమర్రి, గణపేశ్వరం శాసనాలు, వెలుగోటివారి వంశావళి, పెరిష్టా మొదలైన ముస్లిం చరిత్రకారుల రచనలు ముఖ్య ఆధారాలు. చోడభక్తిరాజు పెంటపాడు శాసనం, అనితల్లి కలువచేరు శాసనాలు కూడా కాపయనాయకుని ప్రస్తావిస్తున్నాయి. కాపయనాయకుని ఆంధ్రసురత్రాణ అంటే ఆంధ్ర దేశాన్ని రక్షించిన వాడని అర్థం; ఆంధ్రాధీశ్వర అంటే ఆంధ్ర దేశాధిపతి అని శాసనాలు వ్యవహరిస్తున్నా, అనితల్లి కలువచేరు శాసనం అథ పంచోత్తర సప్తతినాయక సంసేవ్యయాన పదపద్మః కాపాయనాయకః అని వర్ణించింది. అంటే, ప్రతాపరుద్రుని వలె కాకతీయుల కాలం నాటి 75 మంది నాయకులు కాపయను సేవిస్తున్నారని వర్ణించింది. ముస్లిం చరిత్రకారులు

అతనిని కృష్ణనాయక్, కన్యానాయక్, కాన్యాపాయక్, కానానాయండ్, కాబానాయండ్ అనే పేర్లతో వ్యవహరించారు. అంతేగాక అతడు ప్రతాపరుద్రుని కుమారుడని కూడా వర్ణించారు. ఇంకా ఇతనికి చోడరాయ స్థాపనాచార్య, కాంచీ రక్షపాలక, విషమదాడి పాంచాల ఖడ్గనారాయణ, గాయగోవాళి, హిందూ రామసురత్రాణ, ఇరువెత్తు గండ, గండగోపాల మూరురాయ జగదళ, అనుమగంటి పురహరాధీశ్వర అనే బిరుదులున్నట్లు కొత్త భావయ్య చౌదరి తమ కమ్మవారి చరిత్రలో రాశారు. ముసునూరి వంశస్తుల పూర్వీకులకు నాయనింగారు అనే బిరుదున్నదట. క్రీ.శ.1221వ సంవత్సరంనాటి జమ్మిపల్లి మల్లిఖార్జునాలయంలో ముసునూరి ముబ్బనాయకుని శాసనం ఉంది. కనుక కాపయనాయకుడు సర్వలాంఛనాలతో యావదాంధ్ర దేశాన్ని పాలించాడని స్పష్టం అవుతోంది.

ప్రోలయనాయకుడు మరణ సమయంలో తాను ప్రారంభించిన ఆంధ్ర స్వాతంత్ర్య సమరాన్ని కొనసాగించి ఓరుగల్లును స్వాధీనం చేసుకొనవలసిందిగా ఆదేశించాడు. ఆ లక్ష్యసాధనకు కాపయనాయకుడు రాజ్యానికి వచ్చిన నాటి నుండే ప్రయత్నాలు ఆరంభించాడు.

ఓరుగల్లు ఆక్రమణ: క్రీ.శ.1335లోనే అతడు రాజ్యానికి వచ్చిన సంవత్సరంలో అతనికి అనుకూల పరిస్థితులు అందివచ్చాయి. 1335వ సంవత్సరం మధుర గవర్నర్ సయ్యద్ జలాలుద్దీన్ అసన్‌షా ఢిల్లీ సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. అతనిని అణచివేయడానికి మహమ్మద్ బిన్ తుగ్లక్ పెద్ద సైన్యంతో దక్కను చేరాడు. కాని అదే కాలంలో దక్కనులో ప్లేగు వ్యాధి వ్యాపించింది. అయినా సుల్తాన్ తన సైన్యంతో ఓరుగల్లు చేరాడు. అక్కడ ప్లేగు వ్యాధి తీవ్రంగా ఉండి సుల్తాన్ సైనికులు చాలామంది మరణించారు. సుల్తాన్‌కి కూడా ప్లేగు వ్యాధి సోకిందని ఇసామి అనే రచయిత రాశాడు. కనుక తప్పనిసరి పరిస్థితులలో సుల్తాన్ మాబార్ అంటే మధురపై దండయాత్రను విరమించి వెనుకకు మరలి దౌలతాబాద్ చేరి అక్కడ చికిత్స చేయించుకొని ప్రాణాలు కాపాడుకొని ఢిల్లీ వెళ్లిపోయాడు. సుల్తాన్ అశక్తత మధుర సుల్తాన్ స్వతంత్ర మధుర సుల్తానత్‌ను స్థాపించుకోడానికి అవకాశం కల్గించింది. ఈ పరిణామం కాపయనాయకునికి చక్కని అవకాశం కల్పించింది. కనుక అతడు దక్షిణ దేశంలో తుగ్లక్ సామ్రాజ్యాన్ని అంతం చేయడానికి గొప్ప వ్యూహం పన్నాడు. దక్షిణాది హిందూ రాజులనందరిని ఐక్యపరచే కార్యక్రమం రూపొందించాడు. ముఖ్యంగా హొయసాల మూడవ భల్లాలునితో మైత్రిని సంపాదించి కంపిలి, ఓరుగల్లు, హొయసాల రాజ్యాలను తుగ్లక్‌ల అధికారం నుండి విముక్తి చేయడానికి గొప్ప ప్రణాళికను తయారు చేశాడని ఫెరిష్టా తన రచనలలో వివరించాడు. తన ప్రణాళికను ఏకకాలంలో అమలు జరపాలని అందరినీ ఆదేశించాడు. దాంతో హొయసాల మూడవ భల్లాలుడు స్వతంత్రం ప్రకటించాడు. అరవీటి సోమరాజు కంపిలి రాజ్యంలోని ముస్లిం గవర్నర్‌పై యుద్ధం ప్రకటించాడు. కాపయనాయకుడు ఓరుగల్లుపై దండెత్తాడు. కంపిలి లేక అనెగొంది ముస్లిం గవర్నర్ మాలిక్‌నెబి 6000 అశ్వదళంతో బందీగా చిక్కి శరణువేడి ప్రాణాలు దక్కించుకొని పారిపోయాడు. కాపయనాయకుడు ఓరుగల్లుపై దండెత్తి అక్కడి ముస్లిం గవర్నర్ మాలిక్ మగ్బూల్‌ను ఓడించి తరిమివేశాడు. ఓరుగల్లు, కంపిలి ఏకకాలంలో ముస్లింల చేతినుంచి తప్పించుకున్నాయని ముస్లిం చరిత్రకారులు రాశారు. విజయం తర్వాత కాపయనాయకుడు విజయదుందుభులతో ఓరుగల్లు కోటలో ప్రవేశించి ఆంధ్ర సురత్రాణ, ఆంధ్రాధీశ్వర అనే బిరుదులతో సింహాసనం అధిష్టించాడు. దాంతో ఆంధ్ర దేశంపై తుగ్లక్‌ల అధికారం అంతం అయింది. ఓరుగల్లు కోటపై స్వతంత్ర ఆంధ్ర పతాకం రెపరెపలాడింది.

ఆంధ్రసురత్రాణ - ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు ధరించడం: ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత కాపయనాయకుడు యావదాంధ్ర దేశానికి అధిపతి అయి ఆంధ్రసురత్రాణ, ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు ధరించి సర్వలాంఛనాలతో ఆంధ్రదేశపు సార్వభౌముడుగా పాలించాడని శాసనాలు వర్ణిస్తున్నాయి. ఆంధ్రసురత్రాణ అంటే ఆంధ్ర దేశాన్ని రక్షించిన వాడని అర్థం. ఆంధ్రాధీశ్వర అంటే ఆంధ్ర దేశాధిపతి అని అర్థం. ఈ బిరుదులతో కాపయనాయకుని శాసనాలు ప్రస్తావిస్తున్నాయి. ఈ బిరుదులను అంతకుపూర్వం ధరించిన ఆంధ్రరాజు ఎవరూ లేరు. ఇలాంటి బిరుదులను ధరించిన మొట్టమొదటి వాడు కాపయనాయకుడు. ఈ బిరుదులు అతడు యావదాంధ్ర దేశానికి సార్వభౌముడని తెలుపుతున్నాయి. అనితల్లి కలువచేరు శాసనం అధ పంచోత్తర సప్తతినాయక సంసేవ్యయాన పదపద్మాః కాపాయనాయకః అని వర్ణించింది. అంటే ప్రతాపరుద్రుని లాగా కాకతీయుల కాలంనాటి 75 మంది నాయకులు కాపయను సేవిస్తున్నారని వర్ణించింది. ముస్లిం చరిత్రకారులు అతనిని కృష్ణనాయక్, కన్యానాయక్, కాన్యాపాయక, కానానాయండ్, కాబానాయండ్ అనే పేర్లతో వ్యవహరించారు. అంతేగాక అతడు ప్రతాపరుద్రుని కుమారుడని కూడా వర్ణించారు. ఇంకా ఇతనికి చోడరాయ స్థాపనాచార్య, కాంచీ

రక్షపాలక, విషమదాడి పెంచాల ఖడ్గనారాయణ, గాయగోవాళి, హిందూరాయ సురత్రాణ, ఇరువెత్తుగండ, గండగోపాల మూరురాయ జగదళ, అనుమగంటి పురవరాధీశ్వర అనే బిరుదులున్నట్టు కొత్త భావయ్యా చౌదరి తమ కమ్మవారి చరిత్రలో రాశారు. ముసునూరి వంశస్తుల పూర్వీకులకు నాయనింగారు అనే బిరుదు ఉందట. క్రీ.శ.1221వ సంవత్సరానికి చెందిన జమ్మిపల్లి మల్లిఖార్జునాలయంలోని ఒక శాసనంలో ముసునూరి ముచ్చినాయకుని శాసనం ఉంది. అతనికి నాయనింగారు అనే బిరుదు ఉన్నట్లు కనిపిస్తోంది. శాసనాలలో లభించిన మొట్టమొదటి ముసునూరి వంశస్తుడు ఇతడు. కనుక కాపయనాయకుని కంటే ముందునుండే ముసునూరి వంశస్తులకు నాయనింగారని బిరుదు ఉందని ఈ శాసనం స్పష్టపరుస్తోంది.

కొండవీటి రాచకొండ రాజ్యాలలో జోక్యం కల్గించుకోకపోవడం: కాపయనాయకుడు ఇన్ని బిరుదులు ధరించి యావదాంధ్ర దేశానికి అధిపతి అయినప్పటికీ ప్రోలయనాయకుని కాలంలోనే రాజ్యాలు స్థాపించిన ప్రోలయవేమారెడ్డి, రేచర్ల సింగమనాయకుల రాజ్యాలలో జోక్యం చేసుకోలేదు. వారు కాపయనాయకుని సార్వభౌమత్వాన్ని అంగీకరించి వారి ప్రాంతాలను వారే అన్ని అధికారాలతో పాలించుకున్నారు. కాకతీయుల కాలం నాటి 75 మంది నాయకులు కాపయనాయకుని కొలిచారని అనితల్లి కలువచేరు శాసనం తెలుపుతోంది. కనుక ప్రోలయ వేమారెడ్డి, రేచర్ల సింగమనాయకుడు కొంతకాలం కాపయనాయకుని సామంతులుగా కొనసాగారని చెప్పవచ్చు.

ఆంధ్రదేశ రాజకీయ విభాగాలు: ఆంధ్రదేశమంతా కాపయ నాయకుని సార్వభౌమాధికారాన్ని అంగీకరించినప్పటికీ ఆంధ్రదేశం నాలుగు రాజ్యాల సమాఖ్యగా కొనసాగిందని చెప్పవచ్చు.

1. కాపయనాయకుని ఓరుగల్లు రాజ్యం.
2. రేచర్ల సింగమనాయకుని రాచకొండ, దేవరకొండ రాజ్యం.
3. ప్రోలయ వేమారెడ్డి కొండవీటి రాజ్యం.
4. అరవీటి సోమరాజు అనెగొంది రాజ్యం.

వీనిలో రేచర్ల సింగమనాయకుని రాజ్యంలో మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా ప్రాంతాలు చేరి ఉన్నాయి. పూర్వపు కందూరు చోళరాజ్యమే రేచర్ల పద్మనాయక రాజ్యం అని చెప్పవచ్చు. వీరి రాజ్యానికి దక్షిణంగా కృష్ణకు దిగువన అనెగొంది, అనంతపూర్, కర్నూలు జిల్లా దక్షిణ ప్రాంతాలు అరవీటి సోమరాజు అనెగొంది రాజ్యంలో చేరి ఉన్నాయి. కాని ఈ రాజ్యాన్ని మరు సంవత్సరం అంటే క్రీ.శ.1336లో హరిహరబుక్కరాయలు జయించారు. దాంతో పూర్వపు కంపిలి, అనెగొంది రాజ్యప్రాంతం విజయనగర రాజ్యస్థావరంగా మారింది. కర్నూలు జిల్లా ఉత్తరప్రాంతాలు నెల్లూరు జిల్లా ఉత్తర ప్రాంతాలు, ప్రకాశం, గుంటూరు జిల్లా ప్రాంతాలు అంటే కృష్ణానదికి దక్షిణ ప్రాంతం ప్రోలయ వేమారెడ్డి రాజ్యంలో ఉన్నాయి. మిగిలిన ఆంధ్ర దేశం అంతా అంటే కృష్ణానది నుంచి సింహాచలం వరకు ఉత్తర కోస్తా మొత్తం, తెలంగాణలో ఉత్తర తెలంగాణ మొత్తం, కాపయనాయకుని ఓరుగల్లు రాజ్యంలో భాగంగా ఉన్నాయి. కాపయనాయకుని రాజ్యం ఉత్తరాన బీదరు, కౌలాస్ దుర్గాల నుండి దక్షిణాన కంపిలి వరకు, తూర్పున బంగాళాఖాతం వరకు ఉత్తర కోస్తా మొత్తం సింహాచలం నుండి కృష్ణానది వరకు విస్తరించి ఉంది. ఈ నాల్గు రాజ్యాలు గాక దక్షిణాన చిత్తూరు జిల్లాలో చంద్రగిరి రాజ్యం కూడా ఉంది. చంద్రగిరి, తిరుపతి, తిరుమల మొదలైన చిత్తూరు జిల్లా ప్రాంతాలు, కొన్ని నెల్లూరు జిల్లా దక్షిణ ప్రాతాలు ఈ రాజ్యంలో చేరి ఉన్నాయి. ఈ రాజ్యాన్ని యాదవ వంశస్తులు పాలించారు. ఈ రాజ్యం తెలుగు ప్రాంతం అయినా ఈ రాజ్యాధిపతులు హొయసాల సామంతులుగా కొనసాగారు.

తుండీర రాజ్య విజయం: ఆ రాజ్యానికి దక్షిణంగా తుండీర రాజ్యం ఉంది. ఆ రాజ్యంలో విరించిపురం, రాజగంభీరమలై అనే ప్రాంతాలు ఉన్నాయి. ఈ రాజ్యానికి రాజగంభీరరాజ్యం అని కూడా పేరుంది. ఆ రాజ్యం చంద్రగిరి, మధుర రాజ్యాల మధ్య ఉంది. అప్పుడు దానిని రాజనారాయణ శంభువరాయుడు పాలిస్తున్నాడు. అతడు కూడా హొయసాల సామంతుడే. తుండీరరాజ్యపు రాజు రాజగంభీరుని మదుర సుల్తాన్ ఓడించి కారాగారంలో పెట్టాడు. కాపయనాయకుడు విజయనగర బుక్కరాయలతో కలిసి మధుర సుల్తాన్‌ను ఓడించి రాజగంభీరుని విడిపించి తిరిగి అతనిని తుండీరరాజ్య సింహాసనంపై ప్రతిష్ఠించాడు. ఈ విజయం వల్ల కాపయనాయకుని ప్రతిభ తమిళ దేశంలో కూడా వ్యాపించింది. అలాగే సింహాచలం నుండి శ్రీకాకుళం జిల్లావరకు ఉన్న ఉత్తరాంధ్ర కళింగ తూర్పుగాంగ వంశస్తుల సామ్రాజ్యంలో భాగంగా ఉంది.

రాజ్యాన్ని పటిష్టపరచడం: తన అధీనంలో ఉన్న ఓరుగల్లు రాజ్య రక్షణ కోసం కాపయనాయకుడు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాడు. ఓరుగల్లు కోటను కట్టుదిట్టంగా రూపొందించాడు. రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించి రాజబంధువులను రాష్ట్రపాలకులుగా నియమించాడు. తనకు విశ్వాసపాత్రులైన వారిని ఉన్నత పదవులలో నియమించాడు. తన పినతండ్రి రాజనాయకుని కుమారుడు అనపోతానాయకుని రాజమహేంద్రవర ప్రాంతానికి పాలకునిగా నియమించాడు. అతడు తొయ్యేరును రాజధానిగా చేసుకున్నాడు. అందువల్ల అతడు తొయ్యేరు అనపోతానాయకుడుగా ప్రసిద్ధి చెందాడు. అతనికి రాజమహేంద్రవరం రెండవ రాజధానిగా ఉండేది. కాపయనాయకుడు కోరుకొండ దుర్గాన్ని నిర్మించి, అతని సోదరుని అల్లుడైన మంచికొండ కూనపనాయకుని దాని అధిపతిగా నియమించాడు. క్రమేపి కోరుకొండ రాజ్యం ఆ ప్రాంతంలో బలమైన రాజ్యంగా రూపొంది ఉత్తరాంధ్ర రాజకీయాల్లో కీలకపాత్రను నిర్వహించింది. కూనపనాయకుని వంశం మంచికొండ వంశంగా ప్రసిద్ధి చెందింది. కూనపనాయకుని కుమారునికి కాపయ తన మేనకోడలినిచ్చి వివాహం చేసి తన బంధుకోటిలో చేర్చుకున్నాడు. కొప్పులయ్య అనే అతడిని పిఠాపుర ప్రాంతానికి అధిపతిని చేశాడు. అతని వంశం పిఠాపురం కొప్పుల వంశంగా ప్రసిద్ధి చెందింది. తెలంగాణలోని సబ్బి మండలానికి గురజాల తెలుంగున్నపుని కుమారుడు ముప్పభూపాలుని అధిపతిని చేశాడు. నేటి కరీంనగర్ జిల్లా ప్రాంతాన్ని నాడు సబ్బి మండలం అనే వారు. ముప్పభూపాలుని రాజధాని రామగిరి. అది కరీంనగర్ జిల్లాలోని మంథని మండలంలో ఉంది. మడికిసింగన ఇతని ఆస్థానంలో నివసించాడు. ఈ మడికిసింగన తొయ్యేరు అనపోతానాయకుని వద్ద మంత్రిగా పని చేసిన అయ్యలార్యుని కుమారుడు. ఈ విధంగా రాజ్యంలో సమర్థులైన సేనాధిపతులను రాష్ట్ర పాలకులుగా నియమించి రాజ్యరక్షణను పటిష్టపరచాడు. తర్వాత ముస్లింల పరిపాలన వల్ల చిన్నాభిన్నమైన ఆంధ్ర పరిపాలనా వ్యవస్థను పునరుద్ధరించాడు. ముస్లింలు ప్రవేశపెట్టిన అన్ని విధానాలను తొలగించి కాకతీయుల కాలంనాటి పరిపాలనా పద్ధతులను తిరిగి ప్రవేశపెట్టాడు. బ్రాహ్మణులకు అగ్రహారాలు పునరుద్ధరించాడు. వాటిలో గురజ గ్రామం ఒకటి. దేవాలయాలను పునర్నిర్మించి హైందవ ధర్మాన్ని పునరుద్ధరించాడు. కాకతీయుల కాలంనాటి వైభవాన్ని పునరుద్ధరించాడు. ప్రజలు పూర్వం ముస్లిం పాలనలో పడిన కష్టాలు మరచిపోయారు. కాపయనాయకుడు తన విధానాల వల్ల ప్రజాభిమానాలు పొంది కీర్తిచంద్రికలతో ఓరుగల్లు సింహాసనంపై కూర్చొని ఆంధ్రదేశాన్ని క్రీ.శ.1347 వరకు నిశ్చింతగా పాలించాడు. ఆ తర్వాత కాపయనాయకుని వైభవం తిరోగమించింది.

బహమనీ రాజ్యస్థాపన క్రీ.శ.1347: కాపయనాయకుడు తన రాజ్యాన్ని పటిష్టపరచుకునే కాలంలో దక్కనులో మిగిలి ఉన్న తుగ్లక్ సామ్రాజ్యంపై మరొక తిరుగుబాటు జరిగి స్వతంత్ర బహమనీ రాజ్యస్థాపనకు దారితీసింది. దక్కన్‌లోని ముస్లిం సరదారులు జాఫర్‌ఖాన్ అనే సరదారుని నాయకునిగా ఎన్నుకొని తమ సుల్తాన్‌పై తిరుగుబాటు చేశారు.

కాపయనాయకుని రాజకీయ వ్యూహం-బహమనీ రాజ్య అవతరణ: దక్కన్‌లోని తిరుగుబాటు వార్త కాపయ నాయకునికి తెలియ వచ్చింది. ఈ సంఘటన కాపయనాయకునిలో నూతన ఆలోచనలను రేకెత్తించింది. తాను ఆంధ్ర దేశాన్ని పూర్తిగా విముక్తి చేసినా ఏ సమయంలోనైనా ఢిల్లీ సుల్తాన్ తన రాజ్యంపై దాడి చేసి ఆంధ్ర దేశాన్ని తిరిగి పునరాక్రమించే అవకాశం లేకపోలేదు. కనుక తన రాజ్యానికి, ఢిల్లీ సుల్తాన్ రాజ్యానికి మధ్య మరొక స్వతంత్ర రాజ్యం ఉన్నట్లయితే అది తన రాజ్యానికి రక్షణగా ఉంటుంది అని, ఒకవేళ సుల్తాన్ దక్షిణ దేశంపై దండెత్తినా అతడు మొదట ఆ నూతన రాజ్యాన్ని జయించవలసి ఉంటుంది, తన రాజ్యంపై దండెత్తడానికి వీలు లేకుండా ఉంటుంది అని ఆలోచించి జాఫర్‌ఖాన్‌కు సైనిక సహాయం పంపాడు. కాపయ, జాఫర్‌ఖాన్‌కు తనంతట తానే సైనిక సహాయం చేశాడా లేక జాఫర్‌ఖాన్ తనకు సహాయం చేయమని అర్థించాడా స్పష్టంగా తెలియదు. కానీ కాపయ నాయకుడు జాఫర్‌ఖాన్‌కు 1500 అశ్వీక దళాన్ని సహాయంగా పంపాడని ఫెరిష్టా రాశాడు. జాఫర్‌ఖాన్ సులభంగా విజయం సాధించాడు. సుల్తాన్ జాఫర్‌ఖాన్ తిరుగుబాటును అణచలేకపోయాడు. అందువలన జాఫర్‌ఖాన్ హసన్‌గంగు బహమన్‌షా అనే పేరుతో దక్కనులో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించి గుల్బర్గాను రాజధానిగా చేసుకున్నాడు. దాంతో దక్కనులో బహమనీ రాజ్యం అవతరించి దక్షిణ దేశ రాజకీయాలలో నూతన అధ్యాయం ప్రారంభం అయింది. తన రాజ్యానికి, సుల్తాన్ సామ్రాజ్యానికి మధ్యలో బహమనీ రాజ్యం అవతరించినందుకు కాపయనాయకుడు చాలా సంతోషించాడు. కాని అతని సంతోషం ఎంతోకాలం నిలవలేదు. తాను ఊహించినది తప్పని, బహమనీ రాజ్యం తన రాజ్యానికి సుల్తాన్ కంటే ప్రమాదకరమైనదని త్వరలో అవగతమైంది. హసన్‌గంగు

గుల్బర్గాల్లో తన స్థానాన్ని పటిష్టపరచుకున్న తర్వాత అతడు తన రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. రాజ్య విస్తరణలో అతడు నీతినియమాలు పాటించలేదు. తనకు సహాయం చేసినా కాపయనాయకుని పట్ల విశ్వాసహీనుడిగా ప్రవర్తించి ముసునూరు రాజ్యంపై కూడా దండెత్తాడు. కాపయనాయకుడు ఐదు పర్యాయాలు బహమనీలతో పోరాడవలసి వచ్చింది. ఆ యుద్ధాలలో ఓడిపోయిన తన రాజ్యంలో కొంత భాగాన్ని పోగొట్టుకోవలసి వచ్చింది. ఆ పరాజయాల ఫలితం మిగిలిన ప్రాంతాలపై బడి తన సామంతులు స్వతంత్రం ప్రకటించడానికి దోహదం చేసింది. చివరకు తన సామంతుల తిరుగుబాట్లు అణచే ప్రయత్నంలో రేచర్ల వెలమలతో జరిగిన యుద్ధాలలో మరణించి తన రాజ్యం అంతరించడానికి కారణమైంది. దీనంతటికీ బహమనీ రాజ్య అవతరణే కారణమని చెప్పవచ్చు.

మొదటి బహమనీ దండయాత్ర క్రీ.శ.1350: హసన్‌గంగు ముసునూరు రాజ్యాన్ని జయించడానికి క్రీ.శ.1350వ సంవత్సరంలో సికిందర్‌ఖాన్ అనే సేనాధిపతిని పెద్ద సైన్యంతో పంపాడు. కాపయనాయకుడు ముస్లిం సైన్యంతో పోరాడాడు. కాని ఓడిపోయాడు. ఓటమి తర్వాత హసన్‌గంగుతో సంధి చేసుకొని తన రాజ్యంలోని ఉత్తర తెలంగాణలోని కౌలాస్ దుర్గాన్ని, అపార ధనరాశులను బహమనీ సుల్తాన్‌కు సమర్పించుకున్నాడు. ఈ సంధితో కాపయ నాయకుడు తన రాజ్యంలోని పశ్చిమోత్తర ప్రాంతాలైన అదిలాబాద్, నిజామాబాద్ ప్రాంతాలను కోల్పోయాడు. అవి బహమనీ రాజ్యంలో భాగాలయ్యాయి.

రేచర్ల సింగమనాయకుని తిరుగుబాటు: బహమనీ రాజ్యంతో జరిగిన యుద్ధంలో కాపయనాయకుడు ఓడిపోవడం తన పశ్చిమోత్తర ప్రాంతాలు పోగొట్టుకోవడంతో ఆగలేదు. ఈ ఓటమి ప్రభావం ఇతర సామంత రాజులపై ప్రసరించింది. ప్రప్రథమంగా దాని ప్రభావం వల్ల రేచర్ల సింగమనాయకుడు కాపయనాయకునిపై తిరుగుబాటు చేశాడు. సింగమనాయకుడు కాపయనాయకుని కన్నా వయసులో పెద్దవాడు. ప్రతాపరుద్రుని సేనాధిపతిగా క్రీ.శ.1323 యుద్ధంలో పాల్గొన్నాడు. అందరు సేనాధిపతులు మరణించగా ప్రాణాలు దక్కించుకున్న వారిలో ఒకడు. తన కన్నా చిన్నవాడైన కాపయనాయకుడు ఓరుగల్లు సింహాసనం అధిష్టించి ఆంధ్ర దేశాధిపతి కావడం అతనికి రుచించినట్లు లేదు. అంతకుమించి కాపయనాయకుని సార్వభౌమాధికారం కింద జీవించడం అతనికి ఇష్టం లేకపోయింది. కాపయనాయకుని వైభవం, అధికారం అతనికి ఈర్ష్యాద్వేషాలు కలిగించినట్లు కూడా కన్పిస్తుంది. క్రీ.శ.1350 సంవత్సరం హసన్‌గంగు సైన్యం చేతిలో ఓడిపోవడంతో సింగమ నాయకుడు కాపయనాయకుని ధిక్కరించి స్వతంత్రం ప్రకటించాడు. బహమనీల చేతిలో ఓడిపోయిన కాపయనాయకునికి సింగమనాయకుని తిరుగుబాటు మరొక దెబ్బగా మారింది. కనుక ఆ తిరుగుబాటును అణచకపోతే తన సామ్రాజ్యం విచ్ఛిన్నమవుతుందని గ్రహించి కాపయనాయకుడు వెంటనే సింగమనాయకునిపై దండెత్తాడు. ఉభయులకు జరిగిన యుద్ధంలో కాపయనాయకుడు సింగముని ఓడించి అతని రాజ్యాభాగాలు ఆక్రమించాడు. ఆనాడు సింగమనాయకునికి అనుమగల్లు రాజధానిగా ఉండేది. వాడపల్లి రేవు పట్టణంగా ప్రఖ్యాతి వహించి ఉండేది. సింగమనాయకుని రాజ్యాన్ని అనుమగల్లు రాజ్యం అని పిలిచేవారు. కాపయనాయకుడు విజయం సాధించిన తర్వాత అనుమగల్లు రాజ్యాన్ని పాలించడానికి ఎరపోతులెంక అనే తన సేనాధిపతిని నియమించాడు. అతడు పిల్లలమర్రిని తన స్థావరంగా చేసుకొని కాపయ సేనానాయకునిగా ఆ ప్రాంతాన్ని పాలించాడు. కాపయనాయకుడు బహమనీల చేతిలో ఓడిపోయినా తన రాజ్యంలో జరిగిన రేచర్ల వారి తిరుగుబాటును అణచి తన సామ్రాజ్య ఐక్యతను నిలబెట్టుకున్నాడు.

ఉత్తరాంధ్రపై కళింగ గాంగుల దండయాత్ర క్రీ.శ.1553: ఇంచుమించు ఇదే సమయంలో ఉత్తరాంధ్రపై కళింగ గాంగులు దండెత్తారు. ఈ కాలంలో కళింగను మూడవ నరసింహదేవుడు పాలిస్తున్నాడు. అతడు కాపయనాయకుడు, రేచర్ల సింగమనాయకునితో పోరాడే సమయంలో దక్షిణ కళింగను జయించి తన సామ్రాజ్యంలో చేర్చాలని భావించి ఆంధ్ర దేశంపై దండెత్తాడు. ఆ ప్రాంతాలు పూర్వం కళింగ రాజ్యంలో భాగాలుగా ఉండేవి. గంగ సైన్యాలు కాళిదాసు, గోవింద అనే సేనాధిపతుల నాయకత్వంలో ఉత్తర ఆంధ్రపై దాడి ప్రారంభించి పిఠాపురం, కోరుకొండ, రాజమహేంద్రవరాలలోని కాపయనాయకుని సామంత రాజ్యాలను జయించుకుంటూ కృష్ణాతీరం వరకు విజయపరంపరలతో నడిచాయి. ఈ దండయాత్రలో ఉత్తర కోస్తా అంతా గంగవంశస్తుల అధీనంలోకి వచ్చింది. కృష్ణా తీరంలోని శ్రీకాకుళంలో గంగవంశ శాసనం లభించింది. అది క్రీ.శ.1353వ సంవత్సరానికి చెందింది. ఈ శాసనం- వీరనరసింహుని భార్య గంగాదేవి తన సేనాధిపతుల

ద్వారా శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దేవునికి పట్టుగొడుగులు పహండికాయలు, వింజామరలు, వెండితో చేసిన దివ్వకోలలు, గంటలు, పచ్చపట్టు దానం చేసినట్టు తెలుపుతోంది. కనుక కృష్ణాతీరం వరకు గంగ వంశస్తుల స్వాధీనంలోకి వచ్చిందని ఈ శాసనం స్పష్టం చేస్తోంది. తన ఆధిపత్యంలో ఉన్న కృష్ణా నది నుంచి సింహాచలం వరకు ఉన్న ఉత్తర తీరాంధ్ర దేశంలో కాపయనాయకుని అధికారం అంతమైందని చెప్పవచ్చు. గంగ సైన్యం వెనుదిరిగి వెళ్లిన తర్వాత అక్కడి మంచికొండ, కొప్పుల వంశాలు స్వతంత్రం ప్రకటించాయి. వేంగి రాజ్యాన్ని భక్తిచోడరాజు ఆక్రమించాడు. కోణ హైహయులు కూడా స్వతంత్రం ప్రకటించారు. వారినందరినీ తిరిగి కాపయనాయకుడు తన ఆధిపత్యంలోకి తెచ్చుకోలేక పోయాడు. అందుకు కారణం అతడు తెలంగాణలో తిరిగి బహమనీల దండయాత్రను ఎదుర్కోవలసి వచ్చింది.

బహమనీల రెండవ దండయాత్ర క్రీ.శ.1356: క్రీ.శ.1356వ సంవత్సరంలో బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ హసన్‌గంగు రెండవ పర్యాయం కాపయనాయకుని రాజ్యంపై దండెత్తాడు. ఓరుగల్లు రాజ్యాన్ని ఓడించి సామంతరాజ్యంగా చేసుకొని ప్రతి సంవత్సరం కప్పం వసూలు చేసే లక్ష్యంతో హసన్‌గంగు దండయాత్ర చేశాడని పెరిస్టా రాశాడు. ఈ దండయాత్ర కాపయనాయకుని రాజ్యం పశ్చిమ భాగాలకే పరిమితం కాలేదు. బహమనీ సైన్యాలు కాపయనాయకుడు నూతనంగా జయించిన అనుమగల్లు రాజ్యంలో ప్రవేశించి అక్కడినుండి ఓడపల్లి చేరి తర్వాత కృష్ణా తీరంలోని ధరణికోట వరకు నడచి అమరావతిలోని అమరేశ్వరాలయాన్ని దోచుకున్నాయి. అమరేశ్వరాలయం దోపిడీకి గురైనట్టు రెడ్డి శాసనాలు తెలుపుతున్నాయి. ఈ దండయాత్రా కాలంలో అమరావతి, అద్దంకి రెడ్డిరాజ్యంలో భాగంగా ఉండేది. కనుక ఈ దాడిలో బహమనీ సైన్యాలు ముసునూరి రాజ్యంపైనే గాక రెడ్డి రాజ్యంపై కూడా దండయాత్ర సాగించినట్లు భావించవచ్చు. ఈ యుద్ధంలో తన రాజ్యం అంతా దాడులకు గురి కావడంతో కాపయనాయకుడు హసన్‌గంగుకు భువనగిరి దుర్గాన్ని ఇచ్చి సంధి చేసుకున్నాడు.

అనుమగల్లు రాజ్యం స్థిరంగా ఉండటం: ఈ రెండవ యుద్ధంలో బహమనీ సేనలు అనుమగల్లు ప్రాంతం గుండా వెళ్లినప్పటికీ ఈ ప్రాంతాన్ని తిరిగి సింగమనాయకుడు జయించే ప్రయత్నం చేయలేదు. అది కాపయనాయకుని అధీనంలో ఉన్నట్లు అనుమగల్లులో క్రీ.శ.1357వ సంవత్సరంలో అక్కడ కాపయనాయకునిచే నియమించబడిన ఎరపోతులెంక వేయించిన శాసనం వల్ల తెలుస్తోంది. ఆ శాసనంలో కాపయనాయకుడు అనుమగంటి పురవరాధీశ్వర, ఆంధ్రదేశాధీశ్వర, చోదరాయస్థాపనాచార్య అని శ్లాఘించబడ్డాడు. కనుక బహమనీల రెండవ దండయాత్ర తర్వాత కూడా ఈ ప్రాంతాలు కాపయనాయకుని పాలనలో ఉన్నట్టు ఈ శాసనం ధ్రువపరుస్తోంది.

అనపోతారెడ్డి ఉత్తరాంధ్ర దండయాత్ర క్రీ.శ.1356: రెండవసారి కాపయనాయకుడు బహమనీ సుల్తాన్ చేతిలో ఓడిపోవడం, సుల్తాన్ సైన్యాలు అమరావతి వరకు వచ్చి అమరేశ్వరాలయాన్ని దోచుకోవడం అద్దంకి రెడ్డి రాజుల కళ్లు తెరిపించింది. ఇంతవరకు రెడ్డి రాజ్యం కృష్ణానదిని దాటలేదు. కృష్ణానదే రెడ్డి రాజ్యానికి ఉత్తర సరిహద్దుగా ఉండేది. దక్షిణాన విజయనగర రాజ్యం ఉండేది. విజయనగర రాజులు తమ రాజ్య విస్తరణ కోసం రెడ్డి రాజ్యంపై దాడులు ప్రారంభించారు. ప్రోలయ వేమారెడ్డి కాలంలోనే రెడ్డి ప్రాంతాలు కొన్ని విజయనగరం వశమయ్యాయి. క్రీ.శ.1353వ సంవత్సరంలో ప్రోలయ వేమారెడ్డి మరణించాడు. అతని కుమారుడు అనపోతారెడ్డి రాజ్యానికి వచ్చాడు. అతడు తన రాజధానికి రక్షణ లేదని అద్దంకినుండి కొండవీడుకు మార్చాడు. దక్షిణాన విజయనగర రాజ్యమేగాక ఉత్తర, పశ్చిమ దిక్కులనుండి కూడా తన రాజ్యానికి ప్రమాదం ఉందని గ్రహించాడు. పశ్చిమ దిక్కునుండి బహమనీ సుల్తాన్‌లు తమ రాజ్యంపై దాడి చేయసాగారు. తెలంగాణ అధిపతి అయిన కాపయనాయకుడు వారిని నిలువరించగల స్థాయిలో లేడు. అలాగే ఉత్తర దిక్కున గల కళింగ గాంగులు కాపయ నాయకుని సామంతులను ఓడించి కృష్ణాతీరం వరకు వచ్చారు. గంగ సైన్యం తిరిగి వెళ్లగానే ఉత్తరాంధ్రలోని కాపయ సామంతులు స్వతంత్ర వైఖరినవలంబించారు. వారిని కాపయనాయకుడు అదుపుచేయలేక పోయాడు. కనుక ఉత్తరాంధ్ర రాజ్యాలను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవడం మంచిదని, అందువల్ల ఉత్తర దిక్కు నుండి తన రాజ్యానికి గాంగరాజుల ప్రమాదం తప్పిపోవడమే గాక తన రాజ్యం విస్తరిస్తుందని భావించి అనపోతారెడ్డి ఉత్తరాంధ్రపై దండయాత్ర చేశాడు. ప్రోలయ వేమారెడ్డి కాలం వరకు రెడ్డి రాజ్యం కాపయ నాయకునికి విధేయంగానే ఉంది. కాని అనపోతారెడ్డి కాలం నుంచి తమ విధేయతను వదిలివేసి ఉత్తరాంధ్రలోని కాపయ నాయకుని రాజ్యభాగాలపై దాడి ప్రారంభం చేశారు. ఈ సందర్భంలో పిఠాపురం రాజ్యంలో అంతఃకలహాలు

చెలరేగి ఉన్నాయి. అలాగే రాజమహేంద్రవరంలో తొయ్యేటి అనపోతానాయకుడు క్రీ.శ.1356లో మరణించాడు. అతని మరణానంతరం రాజమహేంద్రవరం, తొయ్యేరులను కోరుకొండనేలిన మంచికంటి వంశస్తులు తమ రాజ్యంలో భాగం చేసుకున్నారు. కోరుకొండనేలిన ముమ్మిడినాయకుడు పానార, కొన, కురవాట, చెంగర మొదలైన గోదావరీ ఉభయతీర ప్రాంతాలను జయించి పెద్ద రాజ్యంగా రూపొందించి స్వతంత్రం ప్రకటించాడు. వెంగ భూపాలుని మేనల్లుడైన చోడ భక్తిరాజు, వేంగిలో స్వతంత్రుడైనాడు. ఈ సమయంలో కాపయనాయకుడు బహమనీలతో రెండవ యుద్ధంలో చిక్కుకొని ఉన్నాడు. కనుక ఉత్తర తీర ప్రాంతంలో స్వతంత్రం ప్రకటించిన తన సామంతులను అదుపు చేయలేకపోయాడు. ఈ సందర్భంలో అనపోతారెడ్డి మొట్టమొదటగా కృష్ణానదిని దాటి వేంగి దేశంలో అడుగుపెట్టాడు. వేంగి, పాలకొల్లు, కోణ, కోరుకొండ, రాజమహేంద్రవరం, పిఠాపురాలను జయించి ద్రాక్షారామం చేరి అక్కడ క్రీ.శ.1356వ సంవత్సరంలో శాసనం వేయించాడు. ఈ శాసనం అనపోతారెడ్డి ఉత్తరాంధ్ర దండయాత్రను ధ్రువపరుస్తోంది. కాని తిరుగు ప్రయాణంలో వేంగినేలిన చోడ భక్తిరాజు వేంగి దేశంలోని కొన్ని క్షత్రియ కుటుంబాలు కూటమిగా ఏర్పడి సూరవరం వద్ద ఓడించినట్లు అన్నదేవచోడుని రాజమహేంద్రవర శాసనం సూచిస్తోంది. కనుక అనపోతానాయకుని దండయాత్ర విఫలం అయిందని, చోడ భక్తిరాజు పిఠాపురం కొప్పుల వంశం కోరుకొండ మంచికంటి వంశస్తులు తిరిగి స్వతంత్రులయ్యారని భావించవచ్చు. తన సామ్రాజ్యంలోని ఉత్తరాంధ్రలో జరుగుతున్న ఈ పరిణామాలన్నీ కాపయనాయకుడు నిస్సహాయంగా చూస్తూ ఊరుకున్నాడు. బహమనీ రాజ్యంనుండి తన రాజ్యానికి ప్రమాదం లేకుండా చేసుకున్న తర్వాత మిగిలిన ప్రాంతాల తిరుగుబాట్లను అణచవచ్చని భావించి ఉంటాడు. అందువల్ల అతడు ఉత్తరాంధ్రపై దృష్టిని మరల్చకుండా బహమనీ రాజ్యంపైనే తన దృష్టిని నిలిపాడు.

బహమనీ రాజ్యంతో మూడవ యుద్ధం క్రీ.శ.1360-61: ఈ స్థితిలో బహమనీ సుల్తాన్ హసన్‌గంగు మరణించాడు. అతని కుమారుడు మొదటి మహమ్మద్ షా సింహాసనానికి వచ్చాడు. ఈ సమయంలో తాను కోల్పోయిన రాజ్యభాగాలు తిరిగి సంపాదించవచ్చని కాపయనాయకునికి ఆలోచన కలిగింది. అంతేగాదు, భవిష్యత్తులో కూడా బహమనీ రాజ్యం తన రాజ్యంపై దాడులు చేయకుండా బుద్ధి చెప్పాలని కూడా కాపయనాయకుడు నిశ్చయించుకున్నాడు. అందుకు విజయనగర రాజు బుక్కరాయలను సహాయం అర్థించాడు. బహమనీ సుల్తాన్ విజయనగరంపై కూడా దాడులు చేస్తుండేవాడు. కనుక బహమనీ రాజ్యం వల్ల తమకు ఉన్న ప్రమాదాన్ని గుర్తించి ఉభయ రాజ్యాలు సంయుక్తంగా వ్యవహరించడం మంచిదని భావించి బుక్కరాయలు కాపయనాయకునితో సహకరించడానికి అంగీకరించాడు. కాపయ నాయకుడు, బుక్కరాయలు- గుల్బర్గాకు తమ రాయబారిని పంపి సుల్తాన్ ఆక్రమించిన తమ రాజ్యప్రాంతాలను తమకు ఇవ్వాలని, లేకపోతే తాము ఢిల్లీ సుల్తాన్‌కు నివేదించవలసి వస్తుందని బెదిరించారు. అందుకు సుల్తాన్ వారే తనకు సామంతులనీ, కప్పం చెల్లించాలనీ ఎదురు జవాబు ఇచ్చాడు. దాంతో బహమనీ రాజ్యంతో యుద్ధానికి దిగాలని తమ సైన్యాన్ని అభివృద్ధి చేసుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. బహమనీ సుల్తాన్‌లకు అమ్మడానికి వచ్చే విదేశీ మేలుజాతి గుర్రాలను అరబ్బు వర్తకుల నుండి కొనసాగారు. కొన్నింటిని తక్కువ ధరలకు నిర్బంధంగా సంగ్రహించారు. ఇంకా డబ్బు చాలక బహమనీల నాణేలను సంగ్రహించారు. బహమనీలు బంగారు నాణేలను ముద్రించి చెలామణిలోకి తెచ్చారు. కనుక వారి నాణేలను సంపాదించి కరగించి బంగారంగా మార్చి తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచుకోవాలని కాపయనాయకుడు ఆశించినట్లు కనిపిస్తోంది. ఉత్తరకోస్తా ఆంధ్ర చేజారిపోవడంతో అతని రాజ్యానికి ఆదాయం తగ్గినట్లుగా ఉంది. అందువల్ల బహమనీల బంగారునాణేలు సంగ్రహించి కరగించి బంగారంతో సైన్యసమీకరణకు పూనుకొని ఉండవచ్చును. బుక్కరాయలు కూడా ఇదే పద్ధతిని అవలంబించాడు. కనుక పెరిష్టా హిందూరాజు బహమనీల బంగారు నాణేలను కరిగిస్తున్నాడనీ, బహమనీల కోసం తెచ్చే మేలుజాతి గుర్రాలను అరబ్బు వర్తకులను అడ్డగించి, బెదిరించి తీసుకొనిపోతున్నాడని రాశాడు. బంగారు నాణేలను కరగించడం, తమకు తెచ్చే అశ్వాలను తీసుకువెళ్లిపోవడం రెండు చర్యలూ బహమనీ రాజ్యానికి సైనికపరంగా, ఆర్థికపరంగా అమిత నష్టాన్ని తెచ్చాయి.

వినాయకదేవుని దాడి క్రీ.శ. 1360-61: ఈ తరుణంలో బహమనీ రాజ్యాన్ని సులభంగా ఓడించవచ్చని, అంతకుముందు కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సంపాదించవచ్చని కాపయనాయకుని కుమారుడు వినాయకదేవుని నాయకత్వంలో ముసునూరి సైన్యం యుద్ధానికి బయలుదేరింది. బుక్కరాయలు 20000

అశ్వదళాన్ని సహాయంగా పంపాడు. విజయనగర, ఓరుగల్లు సైన్యాలు సంయుక్తంగా బహమనీ రాజ్యంపై దండెత్తాయి. వినాయక దేవుడు అంతకు పూర్వం తాము పోగొట్టుకున్న ప్రాంతాలను సాధించాలని మొదట భువనగిరిని ముట్టడించి జయించాడు. తర్వాత విజయోత్సాహంతో కౌలాసదుర్గంపై దండెత్తాడు. కౌలాస్‌దుర్గం కూడా స్వాధీనం అయింది. కౌలాస్‌దుర్గం పోయిందని తెలియగానే సుల్తాన్ బహదూర్‌ఖాన్ అనే సేనాధిపతిని వినాయక దేవునిపైకి పంపాడు. అతడు వినాయకదేవుని ఓడించి తరిమాడు. వినాయకదేవుడు వెనుదిరిగి వెలం పట్టణ కోటలో తల దాచుకున్నాడు. తర్వాత మహమ్మద్ షా బహుదూర్‌ఖాన్‌ను ఓరుగల్లుపైకి పంపి, తాను మరికొంత సైన్యంతో విజయనగర సామ్రాజ్యంపై దండెత్తి బుక్కరాయలను ఓడించాడు. కాపయనాయకుడు కొంత ధనాన్ని, కొన్ని అశ్వాలను, ఏనుగులను ఇచ్చి సంధి చేసుకున్నాడు. విజయనగరం సహాయంతో బహమనీ సుల్తాన్‌ను అదుపు చేయాలని కాపయనాయకుడు చేసిన ప్రయత్నం కూడా విఫలం అయింది. మూడవ యుద్ధంలో కూడా నష్టపడ్డాడు. ఈ యుద్ధం తర్వాత బహమనీ సైన్యాలు క్రీ.శ.1361వ సంవత్సరంలో రెడ్డి రాజ్యంపై దాడిచేసి అమరావతిని కొల్లగొట్టి, కొన్ని దేవాలయాలను ధ్వంసం చేశాయట. అనపోతారెడ్డి మంత్రి మల్లయవేమన సుల్తాన్ దాడిని తిప్పికొట్టి అమరేశ్వరస్వామిని పునఃప్రతిష్ట చేసినట్లు మల్లయవేమన అక్కడ వేయించిన శాసనం తెలుపుతోంది.

వినాయకదేవుడు బహమనీలతో నాల్గవ యుద్ధం క్రీ.శ.1362 - మరణం: ఓరుగల్లు వద్ద తన తండ్రిని ఓడించి ధనారసులు, అశ్వాలు, గజాలను తీసుకుపోయినందుకు వినాయకదేవుడు ఆగ్రహించి ఎలాగైనా బహమనీ సుల్తాన్‌ను ఓడించాలని దృఢంగా నిర్ణయించుకొని మళ్లీ యుద్ధ ప్రయత్నం చేశాడు. అరబ్బుల నుంచి బలవంతంగా అశ్వాలను సేకరించ సాగాడు. బహమనీల బంగారు నాణేలు సంగ్రహించి కరిగించసాగాడు. దాంతో క్రీ.శ.1362వ సంవత్సరంలో అరబ్బు వర్తకులు సుల్తాన్ మహమ్మద్ షాకు ఫిర్యాదు చేసి వినాయకదేవుని నుంచి తమ వ్యాపారాన్ని రక్షించమని కోరారు. దాంతో సుల్తాన్ నాల్గవసారి ముసునూరి రాజ్యంపై దండెత్తి వినాయక దేవుడు నివసించే వెలం పట్టణాన్ని ముట్టడించాడు. వినాయకదేవుడు వీరోచితంగా పోరాడినప్పటికీ ఓడిపోయి పట్టుబడ్డాడు. బందీగా చిక్కిన వినాయకదేవుని సుల్తాన్ నాలుక కోయించి కోట బురుజులపై నుంచి కింద మంటలు పెట్టి అందులోకి తోయించి అతి క్రూరంగా చంపించాడట. తర్వాత సుల్తాన్ వెనుదిరిగాడు. వీరకిశోరం అయిన వినాయకదేవుడు అస్తమించాడు. ఆనాడు వినాయకదేవుడు గొప్ప వీరుడుగా ప్రసిద్ధి చెందాడు. తన సాహసకృత్యాలతో నాయకత్వ లక్షణాలతో ప్రజాసమీకరణ చేసి అద్భుత విజయాలు సాధిస్తూ ఉండేవాడు. ఆంధ్ర, కర్ణాటక యువనాయకులలో అతనికి గొప్ప పేరు ప్రతిష్టలుండేవి. అలాంటి వినాయకదేవుని సుల్తాన్ వధించాడని తెలియగానే పరిసరాల ప్రజలు ఆగ్రహావేశం చెంది మార్గమధ్యంలో సుల్తాన్ సైన్యాన్ని చుట్టుముట్టి దాడిచేశారు. గాయపర్చారు. వారి దాడులకు తట్టుకోలేక సుల్తాన్ తాను కొల్లగొట్టిన సామానంతటినీ తగులబెట్టించి, వజ్రాలు, బంగారాన్ని మాత్రం తీసుకొని పారిపోయాడట. అతికష్టంపై తన రాజధాని గుల్బర్గాను చేరగలిగాడు. వినాయక దేవుని మరణం ఆంధ్రదేశానికి అమిత నష్టాన్ని కలిగించింది. వినాయకదేవుడు అమిత సాహసి, పరాక్రమవంతుడు, భయం ఎరుగని వీరుడు. బహమనీలను ఆంధ్ర దేశం నుండి తరిమికొట్టాలని దృఢ సంకల్పంతో ప్రాణాలకు తెగించి పోరాడిన యోధుడు. అలాంటి కుమారుడు యుద్ధంలో అతి దారుణ వధకు గురికావడంతో కాపయనాయకుడికి వెన్నెముక విరిగిపోయినట్లయింది. కుమారుడి మరణం కాపయనాయకునికి కోలుకోని దెబ్బ అయింది.

కాపయనాయకుని ఐదవ యుద్ధం క్రీ.శ.1364-65: తన కుమారుని దారుణంగా సంహరించిన బహమనీ రాజ్యాన్ని ఎలాగైనా దెబ్బతీయాలని కాపయనాయకుడు నిశ్చయించుకొని మళ్లీ బహమనీ రాజ్యంతో పోరాడాలని నిశ్చయించుకొని ఢిల్లీ సుల్తాన్ సహాయం అర్థించాడు. ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ తుగ్లక్ హిందూ మతద్వేషి. ఒక హిందూ రాజు ముస్లిం రాజ్యంపై దండెత్తడం గొప్ప అక్రమం అని భావించి తాను ముస్లింల రక్తాన్ని చిందించనని సమాధానం పంపాడు. స్వతంత్రం ప్రకటించుకున్న దక్కను ప్రాంతాన్ని కాపయనాయకుని సహాయంతో తిరిగి ఢిల్లీ సామ్రాజ్యంలో చేర్చే అవకాశం వచ్చినప్పటికీ ఫిరోజ్ రాజకీయ దృక్పథాన్ని త్రోసివేసి మత దృష్టితో చూసి కాపయ నాయకుడికి సహాయం చేయడానికి తిరస్కరించాడు. కాపయనాయకుడు నిరుత్సాహానికి గురి అయ్యాడు. ఏమి చేయడానికి పాలుపోలేదు. గూఢచారుల ద్వారా ఢిల్లీకి కాపయనాయకుడు పంపిన రాయబారం, సైనిక సన్నాహాలు తెలుసుకున్న మహమ్మద్ షా మండిపడి ఓరుగల్లు ముసునూరి రాజ్యాన్ని పూర్తిగా ధ్వంసం చేయాలని నిశ్చయించి

పెద్ద సేనతో ముసునూరి రాజ్యాన్ని ముట్టడించడానికి తన సేనాధిపతులను పంపాడు. ఆజాం హుమాయూన్ అనే సేనాధిపతిని గోల్కొండపైకి, సఫ్దర్ జాన్‌ఖాన్ అనే మరొక సేనానిని ఓరుగల్లుపైకి పంపాడు. తర్వాత తాను కూడా మరికొంత సైన్యంతో గోల్కొండవైపు నడిచాడు. కాపయనాయకుడు బుక్కరాయలను సహాయం పంపవలసిందిగా రాయబారం పంపాడు. కాని విజయనగరం నుండి సహాయం అందలేదు. కాపయనాయకుడు ఒంటరిగా పోరాడి ఓడిపోయాడు. దాంతో గత్యంతరం లేక బహదూర్‌ఖాన్ మధ్యవర్తిత్వంతో క్రీ.శ.1364-65 సంవత్సరాలలో మహమ్మద్ షాతో సంధి చేసుకొని గోల్కొండ దుర్గాన్ని, 100 ఏనుగులు, 250 అశ్వాలు ఇచ్చి, 33 లక్షలు ధనం నష్టపరిహారంగా చెల్లించాడు ఈ సంధి ప్రకారం ఉభయ రాజ్యాలకు గోల్కొండ సరిహద్దుగా అంగీకరించారు. ఈ సంధి షరతులు ఉభయ రాజ్యాల ముందుతరాల వారసులు కూడా పాటించాలని నిర్ణయించారు. అంతేగాకుండా ఒకరిపై ఒకరు దాడులు చేసుకోకూడదని అంగీకరించారు. తర్వాత కాపయనాయకుడు పచ్చలు, మరకత మాణిక్యాలు, వజ్ర వైఢూర్యాలు పొదిగిన ఒక వజ్ర సింహాసనాన్ని కూడా మహమ్మద్ షాకు బహూకరించాడట. ఈ సింహాసనం 35 లక్షల రూపాయల విలువ కలిగినదట. దానిని సుల్తాన్ గుల్బర్గాకు తీసుకొని వెళ్లి వేడుకలు జరుపుకొని అధిష్టించాడట. ఇదే కాపయనాయకుడు బహమనీ రాజ్యంతో చేసిన చివరి యుద్ధం. తర్వాత బహమనీ సుల్తాన్ కాపయనాయకునిపై దండెత్తలేదు. చివర చేసుకున్న సంధి షరతులకు కట్టుబడి ఉన్నాడు. కానీ ఈ బహమనీ యుద్ధాలు కాపయనాయకుని నిర్వీర్యం చేశాయి.

రేచర్ల సింగమనాయకుని విజృంభణ: బహమనీ యుద్ధాలతో నిర్వీర్యుడైన కాపయనాయకుని దుస్థితిని గమనించిన రేచర్ల సింగమనాయకుడు తన రాజ్య భాగాలను తిరిగి సంపాదించడానికి విజృంభించాడు. కాపయ నాయకుడు అనుమగల్లు, పిల్లలమర్రి, వాడపల్లి ప్రాంతాలపై దండెత్తిన సమయంలో సింగమనాయకుడు అక్కడ లేడు. మహబూబ్‌నగర్ ప్రాంతాలు, కృష్ణా, తుంగభద్రానది మధ్యలోని అంతర్వేది ప్రాంతాలను జయించడానికి వెళ్లాడు. అదే సందర్భంలో కాపయనాయకుడు అనుమగల్లు రాజ్యాన్ని ఆక్రమించాడు. ఆ రాజ్యం పోవడంతో సింగనాయకునికి నూతనంగా జయించిన మహబూబ్‌నగర్, అంతర్వేది ప్రాంతాలే దక్కాయి. ఆ ప్రాంతాలన్నీ కలిపి ఒక చిన్న రాజ్యాన్ని ఏర్పరచుకొని ఆ రాజ్యాన్ని పాలించుకుంటూ అక్కడే నిలిచిపోయాడు. క్రీ.శ.1365వ సంవత్సరంలో కాపయనాయకుడు సుల్తాన్‌తో చేసుకున్న సంధి కాపయనాయకుని ఆర్థికంగా, సైనికపరంగా చాలా బలహీనపరచింది. అది గ్రహించిన సింగమనాయకుడు స్వతంత్రం ప్రకటించి అంతకు పూర్వం తాను కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సాధించడానికి నడుం కట్టాడు. దాంతో కాపయనాయకునికి రేచర్ల పద్మ నాయకులతో తిరిగి యుద్ధాలు ప్రారంభమయ్యాయి. చివరకు ఈ యుద్ధాలే కాపయనాయకుని బలి తీసుకున్నాయి.

సింగమనాయకుని విజయాలు: సింగమనాయకుడు అనుమగంటిపై దండెత్తి అనుమగల్లు, పిల్లలమర్రి, వాడపల్లి, నల్లగొండ, దేవరకొండ ప్రాంతాలన్నింటినీ జయించాడు. దాంతో అతని పూర్వ రాజ్యం అంతా అతని స్వాధీనం అయింది. తర్వాత అతడు అంతటితో ఊరుకోక కాపయనాయకుని రాజ్యంపైన, మరొకవైపు రెడ్డి రాజ్యంపైన దాడులు ప్రారంభించి తన రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. జీలుగుపల్లి (మొలంగూరు, హుజూరాబాద్ తాలూకా), ఇనుగుర్తి, మగతల, జల్లిపల్లి (ఓరుగల్లు మండలం), చేజర్ల (కరీంనగర్ ప్రాంతం) ప్రాంతాలను సోమకుల క్షత్రియులు అని పిలువబడే చాళుక్య వంశస్థులు కాపయనాయకుని సామంతులుగా పాలించేవారు. సింగమనాయకుడు తన రాజ్య విస్తరణ కోసం సోమకుల చాళుక్యుల కోటలపై దండయాత్రలు సాగించాడు. వారు సింగమనాయకునితో వీరోచితంగా పోరాడారు. యుద్ధ సమయంలో రేచర్ల సింగమనాయకుని బావమరిది చింతపల్లి సింగమను సోమ వంశీయులు బంధించారు. చింతపల్లి సింగమనాయకుడు పోతుగంటి మైలి వంశస్థుడు. అతనిని విడిపించడానికి సింగమనాయకుడు జల్లిపల్లి కోటలో ప్రవేశించాడు. సింగమనాయకుడు కోటలోనికి రాగానే తంబళ్ల బ్రహ్మాజీ లేక తమ్మల జియ్య అనే అతడు సింగమనాయకుని సంహరించాడు. సింగమనాయకుని మరణానంతరం అతని కుమారులు అనపోతనాయకుడు, మాదానాయకుడు తమ తండ్రిని చాళుక్యులు మోసంతో చంపారని భావించి చాళుక్యులపై పగబట్టారు.

అనపోత, మాదానాయకుల జల్లిపల్లి దండయాత్ర క్రీ.శ.1361: తమ తండ్రిని చంపిన పగ తీర్చుకోడానికి అనపోత, మాదానాయకులు చాళుక్యులపై మళ్లీ దండెత్తారు. చాళుక్యులు కాపయనాయకుని సహాయం అర్థించారు. కాపయనాయకుడు కొంత సేనను వారికి సహాయంగా పంపాడు. కొండవీటి నుండి అనపోతారెడ్డి కూడా కొంత సైన్యాన్ని చాళుక్యులకు సహాయంగా పంపాడు. ముసునూరి రాజ్యం నుండి వచ్చిన కమ్మ సైన్యం

కొండవీటినుండి వచ్చిన రెడ్డి సైన్యాన్ని కలుపుకొని చాళుక్యులు అనపోతు, మాదానాయకులను ఎదిరించారు. వారికి జల్లిపల్లి, మొలంగూరు, చెంజర్ల, ఇంద్రియాల వద్ద ఘోర యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలలో వెలమ సోదరులైన అనపోత, మాదానాయకులు కమ్మ, రెడ్డి, చాళుక్యుల సంయుక్త సైన్యాలను చీల్చిచెండాడారు. అందులో అనేకమంది కమ్మ, రెడ్డి, చాళుక్య వీరులు వీరస్వర్గం అలంకరించారు. చాళుక్య వంశానికి చెందిన గన్నవిభుడు, కొమ్మనేని బాచడు, రుద్రసేనాని ఓబలరాజులు యుద్ధంలో మరణించారు. యుద్ధంలో బందీలుగా చిక్కిన మిగిలిన వీరులను చిత్రవధ చేశారు. వారి రక్తంతో తమ తండ్రికి తర్పణాలు వదిలారట. దానిని రణంకూడు అని పిలిచేవారట. ఈ యుద్ధ కాలం నుంచి పద్మనాయకులు రణంకూడు అనే అతిక్రూరమైన యుద్ధాచారాన్ని ప్రారంభించారు. చాళుక్యుల రాజ్య ప్రాంతాలను పరశురామప్రీతి చేశారు. అందువల్ల వారు సోమకుల పరశురామ, కమ్మ దొరలను మోదిన కాలదండమ, జల్లిపల్లి రణక్షోణీ భారతకమల్లి అనే బిరుదులు ధరించారని కొత్త భావయ్య చౌదరిగారు తమ కమ్మవారి చరిత్రలో రాశారు. తర్వాత చేజర్ల, మొగళ్లూరుల వద్ద రెడ్డి సైన్యాన్ని ఓడించి తరిమివేశారు. తర్వాత రెడ్డి రాజ్యంపై దండెత్తారు.

రెడ్డి రాజ్యంపై వెలమల దండయాత్ర: సోమవంశ చాళుక్యులకు అనపోతారెడ్డి సాయం చేసినందుకు ఆగ్రహించి వెలమ సోదరులు రెడ్డి రాజ్యంపై దండెత్తి కృష్ణానదిని దాటి శ్రీశైల ప్రాంతాలను ఆక్రమించారు. తర్వాత అనపోతారెడ్డి, కాపయనాయకుని సహాయం కోరగా, కాపయనాయకుడు కొంత సైన్యాన్ని పంపాడు. కమ్మ, రెడ్డి సైన్యాలు మళ్లీ ధరణికోట వద్ద వెలమ సోదరులతో తలపడ్డాయి. ఈ యుద్ధంలో కూడా అనపోత, మాదానాయకులే విజయం సాధించారు. రెడ్డి రాజ్యానికి సహాయం చేసినందుకు వారు కాపయనాయకునిపై కత్తిగట్టారు. అంతటితో ఆగక వారు కాపయనాయకునికి చెందిన ఉత్తరాంధ్రపై దండెత్తి కళింగ వరకు నడిచారు. తిరిగి వస్తూ వేంగి రాజ్యంలో చోడ భక్తిరాజును తమ వైపుకు తిప్పుకున్నారు. మొత్తం మీద జల్లిపల్లి యుద్ధం తర్వాత వెలమ సోదరులు రెడ్డి, కమ్మ రాజ్యాలపై వీరవిహారం చేశారు.

చోడ భక్తిరాజును చేరదీయటం: కాపయనాయకుడు సింహాసనం అధిష్టించిన తర్వాత చోడ భక్తిరాజును కాదని తన పినతండ్రి కుమారుడు అనపోతానాయకునికి వేంగి పరిపాలనను అప్పగించాడు. రాజ్యం కోల్పోయిన భక్తిచోడుడు ఈ సమయంలో వెలమలతో చేరిపోయాడు. చోడ భక్తిరాజు వెలమల సహాయంతో కామపురి రాజధానిగా ఒక స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేసుకున్నాడు. భక్తిరాజును వెలమలు సమర్థించి వేంగి రాజ్యంలో కాపయనాయకుని అధికారాన్ని అంతం చేశారు. అంతేగాకుండా రెడ్డి రాజ్యం కృష్ణకు ఉత్తరంగా విస్తరించకుండా నిరోధించడానికి చోడ భక్తిరాజును రెడ్డి రాజ్యానికి ప్రత్యర్థిగా నిల్పారు. ఇదే కాలంలో కాపయనాయకుని కుమారుడు వినాయకదేవుడు భువనగిరి, కౌలాస్‌దుర్గాలను సాధించడానికి బహమనీ సుల్తాన్‌తో పోరాడుతున్నాడు. ఆ మరు సంవత్సరమే వినాయకదేవుడు సుల్తాన్ చేతిలో ఘోరంగా వధింపబడ్డాడు. ఆ దుఃఖంలో కాపయ నాయకుడు కోస్తా రాజకీయాలను పట్టించుకోలేకపోయాడు. కనుకు వెలమ సోదరులు కళింగ వరకు నడచి వేంగిలో చోడ భక్తిరాజును ప్రత్యర్థిగా నిలబెట్టగలిగారు. ఒకవైపు బహమనీ సుల్తాన్ చేతిలో కుమారుడు వినాయక దేవుడు మరణించడం, మరొకవైపు వెలమ సోదరుల యుద్ధాలు, వారి వ్యతిరేక చర్యలు కాపయనాయకుని పూర్తిగా నిస్తేజుని చేశాయి. అంతేగాక చోడ భక్తిరాజు రాజమండ్రిని పాలించే ముమ్మడినాయకునిని కూడా చంపాడు. దాంతో కాపయనాయకుని బలం ఇంకా తగ్గిపోయింది.

అనపోతానాయకుని దండయాత్ర-భీమవరం యుద్ధం క్రీ.శ.1368-కాపయనాయకుని మరణం: చాళుక్యుల యుద్ధం తర్వాత అనపోతానాయకుడు కాపయనాయకుడిపై కూడా దండెత్తాలని నిశ్చయించుకున్నాడు. అందుకు కారణమేమిటంటే- జల్లిపల్లిలో తమ తండ్రి సింగమనాయకుని చంపడంలో కాపయనాయకుని పాత్ర ఉందని భావించాడు. కాపయతో యుద్ధం సామాన్యమైనది కాదు గనుక అతడు రాచకొండలో నూతన దుర్గాన్ని నిర్మించి తన రాజధానిని అనుమగల్లునుండి రాచకొండకు మార్చి, తన రాజ్యానికి తగిన రక్షణ ఏర్పరచుకొని తర్వాత కాపయనాయకునిపై దండెత్తాడు. కాపయనాయకుడు వెలమ సైన్యాన్ని ఎదిరించడానికి ఓరుగల్లు నుండి తన సైన్యంతో బయలుదేరాడు. మార్గమధ్యంలో ఉభయసైన్యాలు భీమవరం అనే చోట తారసిల్లాయి. అక్కడ ఉభయులకు భయంకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ కాపయనాయకుడు వీరస్వర్గం అలంకరించాడు. దాంతో వెలమలకు విజయం లభించింది. ఈ యుద్ధం తర్వాత అనపోతానాయకుడు క్రీ.శ.1369 జూలై మాసంలో ఐనవోలులో శాసనం వేయించాడు. కనుక భీమవరం యుద్ధం ఆ తేదీకి ముందు

జరిగి ఉండాలి. కనుక అది క్రీ.శ.1368-69 సంవత్సరాలలో జరిగిందని భావించవచ్చు. కాపయనాయకుని మరణానంతరం అతని వారసులెవ్వరూ రాజ్యం చేసినట్లు ఆధారాలు లేవు.

కాపయనాయకుని వారసులు: కాపయకు వినాయకదేవుడు అనే కుమారుడు ఉండేవాడు. అతడు తండ్రికంటే ముందే యుద్ధంలో మరణించాడు. కాపయనాయకుని సోదరులు గాని, కుమారులు గాని, ఇతర దాయాదులు గాని, కాపయన నాయకుని ఓరుగల్లు రాజ్యానికి వారసులు కాలేదు. అతని మరణానంతరం ఓరుగల్లు రాజ్యం మొత్తం వెలమల రాజ్యం రాచకొండ పద్మనాయకుల రాజ్యంలో భాగమైపోయింది. దాంతో ముసునూరి కమ్మనాయక రాజ్యం అస్తమించింది. అప్పటివరకు ఆంధ్ర నగరిగా ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు శాశ్వతంగా తన రాజకీయ ప్రాభవాన్ని పోగొట్టుకుంది. భీమవరం యుద్ధం తర్వాత అనపోతానాయకుని తెలంగాణ అధిపతిగా బహమనీ సుల్తాన్ గుర్తించాడు. అందువల్ల కాపయనాయకునితో భీమవరం యుద్ధానికి వెళ్లేముందు అనపోతానాయకుడు బహమనీ సుల్తాన్‌తో మైత్రి ఏర్పరచుకొని ఉండవచ్చని కొందరు పండితులు భావిస్తారు. అది వాస్తవం కావచ్చు. కారణమేమిటంటే ఆ తర్వాత రేచర్ల రాజ్యంపై సుల్తాన్‌లు ఫిరోజ్ షా కాలం వరకు దండెత్తలేదు. కాపయనాయకుని మరణం తెలంగాణలో రాచకొండ పద్మనాయక రాజ్యం విస్తరించడానికి దోహదం చేసినట్లే ఉత్తర కోస్తాలో రెడ్డి రాజ్యం విస్తరించడానికి కూడా అనుకూలించింది. ముసునూరి రాజ్యంలోని తెలంగాణ ప్రాంతాలు రాచకొండ పద్మనాయక రాజ్యంలో కలిసిపోగా ఉత్తరకోస్తాలోని ముసునూరి రాజ్యభాగాలు కొండవీటి రెడ్డి రాజ్యంలో కలిసిపోయి రెడ్డి రాజ్యం సింహాచలం వరకు విస్తరించింది.

కవిపండిత పోషణ: కాపయనాయకుడు తన సోదరునిలాగే కవి పండితులను పోషించాడు. బ్రాహ్మణులను ఆదరించాడు. ఆ కాలంలో ఆంధ్ర దేశంలో జ్యోతిష, తర్క మీమాంస శాస్త్ర పండితులు, షడ్దర్శన శాస్త్ర విశారదులు, సంగీత, సాహిత్య స్రష్టలు ఉండేవారు. అలాంటి పండితులకు అగ్రహారాలు ఇచ్చి సత్కరించాడు. ఆ అగ్రహారాల్లో గురజ గ్రామం ఒకటి. కాపయనాయకుడు విశ్వేశ్వర భక్తుడని అనితల్లి కలువచేరు శాసనం వర్ణించింది. అతని జీవితమంతా యుద్ధాలతో గడిచిపోయింది. అందువల్ల అతడు నూతన దేవాలయాలను నిర్మించిన దాఖలాలు లేవు. కాని ఓరుగల్లులో ముస్లింల వలన ధ్వంసం చేయబడిన దేవాలయాలను పునరుద్ధరించి, వాటి నిర్వహణకు దానాలు చేసి ఉండవచ్చు. ఇతని కాలంలో క్రీ.శ.1344వ సంవత్సరంలో ఆంధ్రదేశంలో పెద్ద కరవు వచ్చిందట. ఇతని కాలంలో ఓరుగల్లు అతి సుందరంగా ఉండేదట. గ్రీబెల్ ఓరుగల్లును వర్ణించాడు. వెలుపల మట్టికోట ఉండేదని, ఇది చాలా విశాలంగా 2 $^{1}/_{2}$ మైళ్ల విస్తీర్ణంతో ఉండేదని, దాని గోడలు చాలా ఎత్తుగా ఉన్నాయని రాశాడు. లోపలి కోట ఒక చదరపు మైలు ఆవరణ చుట్టూ నిర్మింపబడింది. ఆ కోట నాల్గు దిక్కులలో నాల్గు అత్యంత సుందరాలైన మంటపాలు నిలుపబడి ఉన్నాయి. ఇవి బహుశా రాజప్రసాదపు ప్రవేశ ద్వారాలు అయి ఉండవచ్చు. వాటి దగ్గరలో పెద్ద హాలు ఉన్నది. అది రాజభాండారం అయి ఉంటుందని భావించారు. అక్కడ నల్లని ఎత్తైన రాతిస్తంభాలు చలువరాతి స్తంభాల లాగా కనిపిస్తాయి. దేవాలయపు అంతర్భాగాలు నాజూకయిన రాతి తెరలచే ఆచ్ఛాదింపబడ్డాయి. తూర్పుగోదావరి జిల్లాలోని సామర్లకోట దగ్గర ఉన్న కాపవరం కాపయనాయకుని పేరుతో నిర్మించిన గ్రామం అయి ఉండవచ్చు.

ఆంధ్రదేశ చరిత్రలో ముసునూరి వంశస్థుల స్థానం: ముసునూరి వంశానికి చెందిన ముగ్గురు మహావీరులు యుద్ధ భూమిలో వీరమరణం చెందారు. రాజ్యాన్ని విస్తరిస్తూ కళింగ, గంగ వంశస్థుల చేతిలో ప్రోలయ మరణించాడు. బహమనీ సుల్తాన్‌లను ఆంధ్ర దేశం నుంచి తరిమికొట్టే ప్రయత్నంలో వీరోచిత పోరాటం జరిపి వినాయకదేవుడు వీరమరణం చెందాడు. ఆంధ్ర దేశ ఐక్యతను కాపాడటానికి పోరాడుతూ కాపయనాయకుడు భీమవరం యుద్ధంలో వీరస్వర్గం అలంకరించాడు. ఈ ముగ్గురు మహావీరులూ ఆంధ్ర దేశ రక్షణలో అసువులు బాశారు. ఆంధ్ర జాతి ప్రజల ధనమాన ప్రాణాల రక్షణ కొరకు వీరోచిత పోరాటాలు జరిపిన ముసునూరి వంశస్థులను ఆనాటి తెలుగు ప్రజలు ఆంధ్ర దేశ విముక్తి ప్రదాతలుగా, ఆంధ్ర ప్రజల రక్షకులుగా గౌరవించారు. వారి సాహసకార్యాలకు నీరాజనాలు పట్టారు. వారి విజయాలకు జేజేలు పలికారు. వారు తమను రక్షింపవచ్చిన విష్ణుంశ సంభూతులుగా భావించారు. తమ పాలిట దైవస్వరూపులని శాసనాలలో వారిపట్ల గౌరవాభిమానాలను భద్రంగా భద్రపరిచారు. విలస శాసనంలోని 28వ శ్లోకంలో అసురులతో సమానమైన యవన భటులచేత మిక్కిలి బాధింపబడుతున్న త్రిలింగ దేశాన్ని రక్షించే వారి కోసం ప్రజలు పరితపిస్తుండగా విష్ణుదేవుని లాగా ఆ దుష్కార్యాలనుండి తమను రక్షించేందుకు చతుర్థ కులంలో ముసునూరి వీరుడు ప్రోలయ భూపతి జన్మించాడని

29వ శ్లోకంలోను, వీరుడైన ముసునూరి ప్రోలయ భూపతి తన బాహుబలం చేత యవనుల అధికారాన్ని నాశనం చేశాడని 30వ శ్లోకం వర్ణించాయి. అలాగే 31వ శ్లోకంలో అతని నామం యవనాధములను పారద్రోలు మంత్రం అయి విరాజిల్లిందని, అతని పేరు ఉచ్ఛరించగానే వారు దుర్గాలను వదిలి ఎక్కడికో పారిపోయారని వివరించింది. ముస్లింల నుండి ఆంధ్ర ప్రజానీకాన్ని ప్రోలయ నాయకుడు ఏ విధంగా కాపాడి వారి మన్ననలకు పాత్రుడు అయ్యాడో ఈ శ్లోకాలు తెలుపుతున్నాయి. ప్రోలయ, కాపయ నాయకులు చేసిన త్యాగాలు, వారి సాహసకార్యాలను ఆ తర్వాత 100 సంవత్సరాల వరకు ఆంధ్ర ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారని అనితల్లి కలువచేరు శాసనం తెలియజేస్తోంది. ఆమె తన శాసనంలోని ఆరవ శ్లోకంలో సముద్ర జలములందు మునిగిన భూమిని ఆది వరాహము ఉద్ధరించినట్లు తురుష్కులు దిగమ్రింగిన రాజ్యాన్ని ప్రోలయ నాయకేంద్రుడు ఉద్ధరించాడని కీర్తించింది. 7వ శ్లోకంలో ప్రోలయ భూపాలుడు శివాజ్ఞతో స్వర్గానికి అధిపతి కాగా రాజ్యాన్ని సూర్యప్రతాపుడగు కాపయనాయకుడు పాలించాడు అని, 8వ శ్లోకంలో అతని పాదపద్మాలను 75గురు నాయకులు సేవిస్తున్నారని, 9వ శ్లోకంలో తురుష్కుల చేత ఆక్రమింపబడిన అగ్రహారాలను బ్రాహ్మణులకు ఇచ్చి తన పరిపాలన చేత భూమిని అలంకరించాడని శ్లాఘించింది. ఈ శాసన కథనాన్నిబట్టి ముసునూరి నాయకులు ఆంధ్ర ప్రజల హృదయాలలో ఎంత గొప్ప స్థానాన్ని సంపాదించుకున్నారో బోధపడుతుంది. ఆంధ్ర దేశం తురుష్క పాదాక్రాంతమై ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేక, దిక్కుతోచక అల్లాడుతుంటే తెలుగు ప్రజల కోసం ప్రాణాలను లెక్క చేయకుండా సాహసోపేతంగా యుద్ధ భూమిలో దూకి యవనులను పారదోలి దేశాన్ని రక్షించిన ముసునూరి వంశస్తుల యందు అప్పటి ప్రజలు అత్యంత గౌరవ ప్రపత్తులను ప్రదర్శించారని ఈ శాసనాలు చాటుతున్నాయి. ఆపత్కాలంలో ప్రజలను రక్షించి ఆంధ్రదేశ మధ్యయుగపు స్వాతంత్ర్య సమరయోధులుగా, జాతి విముక్తి ప్రదాతలుగా ఆంధ్ర ప్రజల సంరక్షకులుగా, ఆంధ్ర దేశ చరిత్రలో ముసునూరి కమ్మ సేనానులు చిరస్మరణీయ స్థానాన్ని సంపాదించుకున్నారు. ముసునూరి వంశస్తుల సాహసకార్యాలే ఆంధ్ర దేశంపై ఏర్పడిన తుగ్లక్ అధికారాన్ని రెండు సంవత్సరాలలోనే పటాపంచలు చేశాయి. తుగ్లక్ వంశ సార్వభౌమాధికారాన్ని వారు తుదముట్టించినందువల్లనే తర్వాత 250 సంవత్సరాల వరకు ఆంధ్ర దేశం ముస్లింల పాలపడకుండా సురక్షితంగా ఉండగల్గింది. వారు ఈ సాహసకార్యానికి పూనుకోకపోయినట్లయితే క్రీ.శ.1323 నుండే ఆంధ్ర దేశంలో ముస్లింల పాలన కొనసాగి ఉండేది. దేవగిరి రాజ్యం పడిపోగానే మహారాష్ట్ర దేశంలో ఎలా ముస్లిం పాలన స్థిరపడి కొనసాగిందో అలాగే ఆంధ్ర దేశంలో ముస్లింల పరిపాలన స్థిరపడిపోయి ఉండేది. 1325 తర్వాత వచ్చిన రెడ్డి, వెలమ రాజ్యాలు, ఆ తర్వాత వచ్చిన గజపతి రాజ్యం ఆంధ్ర దేశ చరిత్రలో ఉండేవి కావు.ఆంధ్ర జాతి కోసం త్యాగాలు, ఆత్మార్పణలు చేసిన ప్రోలయ, కాపయ, వినాయకదేవులు ఆంధ్ర జాతి గర్వించదగిన అమరవీరులు.

ముసునూరి వంశస్తులను ఆదర్శంగా తీసుకొని వారి అడుగు జాడలలో నడుస్తూ కొండవీటి రెడ్డి రాజులు ఆంధ్ర దేశాన్ని రక్షించడానికి శతవిధాలా ప్రయత్నించారు. కాని రాచకొండ, దేవరకొండ పద్మనాయకులు ముసునూరి నాయకులను ఆదర్శంగా తీసుకోకపోగా రెడ్డి రాజ్యంపై నిరంతర దాడులు చేస్తూ విచక్షణారహితంగా ప్రవర్తించి ఆంధ్ర జాతికి తీరని అన్యాయం చేశారు. వారు దక్షిణ భారత దేశాన్ని రక్షించడానికి నడుం కట్టిన విజయనగర రాజులతో కూడా వైరానికి దిగారు. అంతేగాక బహమనీ సుల్తాన్‌లతో కలిసి విజయనగర, రెడ్డి రాజ్యాలకు తీరని కష్టనష్టాలు కల్గించారు. కాని వారు బావుకున్నది ఏమీ లేదు. అంతేగాక రణంకూడు అనే అతిక్రూర ఆచారాన్ని పాటించి చేతికి చిక్కిన శత్రువులను అత్యంత క్రూరంగా బలి ఇచ్చి మానవత్వాన్ని కూడా వదిలివేశారు. అనతికాలంలో వారు నమ్మి స్నేహం చేసిన బహమనీ సుల్తాన్‌లకే ఆహుతి అయిపోయారు. చివరకు వారు ద్వేషించి యుద్ధాలు సాగించిన విజయనగర ప్రభువులే వారికి దిక్కు అయ్యారు. రాజ్యం పోగొట్టుకున్న తర్వాత వారు విజయనగరం కొలువులో సేనాధిపతులుగా చేరి జీవించారు.

మార్గదర్శకత్వం: ముస్లిం యుగంలో తెలుగు రాజులలో ముస్లింలతో పోరాడిన ఆంధ్ర వీరులుగా కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తిని, ప్రోలయ, కాపయనాయకులను స్మరిస్తూ ఉండేవారు. ఆ విధంగా స్మరిస్తూ రాయించినదే అనితల్లి కలువచేరు శాసనం. ముసునూరి కమ్మ సేనానులు, కొండవీటి రెడ్లు ఎక్కడా ఘర్షణ పడినట్లు కన్పించదు. పైగా వారు ఒకరితో ఒకరు సహకరించుకున్నారు. అనపోతారెడ్డిని వెలమలు సంహరించినప్పుడు రెడ్డి రాజ్య రక్షణకు కాపయనాయకుడు తన సైన్యాన్ని పంపాడు. కనుక రెడ్డి రాజులకు ముసునూరి వంశస్తులు అభిమానపాత్రులై ఉంటారు. అందువల్లే అనితల్లి తన శాసనంలో వారిని ఘనంగా శ్లాఘించి ఉంటుంది.

ముసునూరు కమ్మనాయక రాజ్యానికి సరిహద్దు రాజ్యాలతో గల సంబంధాలు

ముసునూరు రాజ్యానికి తూర్పు కోస్తాలో ఉత్తరాన కళింగ గాంగుల సామ్రాజ్యం, దక్షిణాన కోస్తాలో కృష్ణానదికి దక్షిణంగా కొండవీటి రెడ్డి రాజ్యం, తెలంగాణలో పశ్చిమోత్తర దిక్కున బహమనీ రాజ్యం, దక్షిణ తెలంగాణలో రేచర్ల పద్మనాయక రాజ్యం సరిహద్దు రాజ్యాలుగా ఉండేవి. ఈ రాజ్యాలలో తూర్పు గాంగ వంశస్తులతో ముసునూరి వంశస్తులు పోరాటాలు జరిపినట్టు దాఖలాలు లేవు. కాని ముసునూరి ప్రోలయ నాయకుడు కళింగ గాంగులతో పోరాడుతూ యుద్ధంలో మరణించినట్లు చీమకుర్తి శాసనం సూచిస్తోంది. దక్షిణ కోస్తాలోని రెడ్డి రాజ్యంతో ముసునూరి కమ్మనాయకులు మొదటినుండి స్నేహ సంబంధాలు కొనసాగించారు. ఈ రెండు రాజ్యాలు ఘర్షణ పడిన సంఘటన ఒకటి కూడా లేదు. పైగా ముసునూరి నాయకులు రెడ్డి రాజ్యానికి తమ సహాయాన్ని కూడా అందించారు. ప్రోలయనాయకుడు ప్రోలయ వేమారెడ్డికి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకోడానికి తన సహకారాన్ని అందించాడు. రేచర్ల పద్మనాయకులు రెడ్డి రాజ్యంపై దాడిచేసి ధరణికోటను ముట్టడించినప్పుడు కాపయనాయకుడు అనపోతారెడ్డికి తన సైన్యాన్ని సహాయంగా పంపాడు. క్రీ.శ.1325-26 నాటి సంతమాగలూరు శాసనం, మల్లవరం శాసనాలు కాపయనాయకుడు ప్రోలయ వేమారెడ్డి సోదరుడు మల్లారెడ్డి పరమ మిత్రుడని చాటుతున్నాయి. ఈ విధంగా ముసునూరి కమ్మనాయకులు అద్దంకి, కొండవీటి రెడ్డి నాయకులు ఒకరితో ఒకరు సహకరించుకుంటూ మైత్రీబంధాలతో రాజ్యం చేశారు. అలాగే హొయసాల మూడవ భల్లాలునితోను, అనెగొందిని ఆక్రమించిన ఆరవీటి సోమరాజుతోను కూడా కాపయనాయకుడు మైత్రీ సంబంధాలు కొనసాగించాడు. ఆరవీటి అనెగొంది రాజ్యస్థానంలో వచ్చిన విజయనగర రాజ్యంతో కూడా కాపయనాయకుడు స్నేహసంబంధాలు నెలకొల్పుకున్నాడు. బుక్కరాయలతో కలిసి బహమనీ రాజ్యాన్ని లొంగదీయాలని ప్రయత్నించాడు. చివరివరకు వారి మైత్రి కొనసాగింది.

విరోధ సంబంధాలు: అన్ని రాజ్యాలతో కాపయనాయకుడు మైత్రీ సంబంధాలు కొనసాగించగలిగాడు, కానీ బహమనీ, రేచర్ల పద్మనాయకులతో మాత్రం మైత్రీ సంబంధాలను కొనసాగించలేకపోయాడు. వారితో అతడు అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. అందువల్ల ఈ రెండు రాజ్యాలతో మొదటినుండి ముసునూరి నాయక రాజ్యానికి విరోధమే కొనసాగింది.

బహమనీ ముసునూరు నాయకరాజ్య సంబంధాలు: మొదట కాపయనాయకుడు బహమనీ రాజ్యంతో మైత్రీభావంతోనే తన రాజకీయ సంబంధాలను ప్రారంభించాడు. ఢిల్లీ సుల్తాన్ దండయాత్రలను అరికట్టి దక్షిణ దేశంలో తుగ్లక్‌ల అధికారం లేకుండా చేయాలంటే దక్కనులో స్వతంత్ర ముస్లిం రాజ్యం ఉండటం తన అవసరమని, అది తన రాజ్యానికి రక్షణగా ఉంటుందని ఆశించాడు. అందువల్ల అల్లావుద్దీన్ హసన్‌గంగుకు 1500 అశ్వదళాన్ని సహాయంగా పంపాడు. హసన్‌గంగు తిరుగుబాటు విజయవంతమైంది. క్రీ.శ.1347వ సంవత్సరంలో గుల్బర్గాలో స్వతంత్ర బహమనీ రాజ్యం వెలిసింది. కాని హసన్‌గంగు కాపయనాయకుడు చేసిన మేలు మరచిపోయి ముసుమూరు రాజ్యంపై దండయాత్రలు ప్రారంభించాడు. అతడు ప్రారంభించిన దండయాత్రలు రెండు తరాలు సాగాయి. మొత్తం ఐదు దాడులు జరిగాయి. రెండు దాడులు అల్లావుద్దీన్ హసన్‌గంగు కాలంలోను, మూడు దాడులు అతని కుమారుడు మహమ్మద్ షా కాలంలోనూ జరిగాయి. ఈ యుద్ధాలలో కాపయనాయకుని కుమారుడు వినాయకదేవుడు మరణించడమే గాక కొన్ని ముసునూరు రాజ్య భాగాలు బహమనీ రాజ్యంలో భాగాలు అయిపోయాయి. ముసునూరు రాజ్యం బలహీనపడింది.

మొదటి దండయాత్ర క్రీ.శ.1350: బహమనీ రాజ్యస్థాపకుడైన అల్లాఉద్దీన్ హసన్‌గంగు గుల్బర్గాలో తన రాజ్యం స్థిరపడగానే తన రాజ్యాన్ని నలుదిక్కులకు విస్తరించాలని నిశ్చయించాడు. కాపయనాయకుడు తనకు సహాయం చేసినా, తన రాజ్య విస్తరణకు అది అవరోధం కారాదని భావించి కాపయనాయకుని రాజ్యంపై కూడా దాడి చేయాలని నిర్ణయించుకొని సికిందర్‌ఖాన్ అనే తన సేనానిని ముసునూరు రాజ్యంపై దాడికి పంపాడు. కాపయనాయకుడు సికిందర్‌ఖాన్‌ను ఎదుర్కొని పోరాడాడు. కాని ఓడిపోయాడు. సంధి చేసుకొని కౌలాస్ దుర్గాన్ని,

అపార ధనరాశులను, కొన్ని ఏనుగులను సమర్పించాడు. దాంతో ముసునూరు రాజ్యంలోని పశ్చిమోత్తర ప్రాంతాలు బహమనీ రాజ్యంలో చేరిపోయాయి. బహమనీ రాజ్యం ఆంధ్రదేశంలోకి చొచ్చుకొని వచ్చింది.

రెండవ దండయాత్ర క్రీ.శ.1356: మొదటి యుద్ధంలో కాపయనాయకుడు ఓడిపోయినప్పటికీ బహమనీ సుల్తాన్‌కు సామంతుడు కాలేదు. కనుక కాపయను లొంగదీసి తన సామంతునిగా చేసుకొని ప్రతి సంవత్సరం కప్పం వసూలు చేయాలనే సంకల్పంతో దండయాత్ర చేశాడని ఫెరిష్టా రాశాడు. బహమనీ సైన్యాలు ముసునూరి రాజ్యంలో వీరవిహారం చేసి కృష్ణను దాటి రెడ్డి రాజ్యంపై దాడిచేసి అమరావతిని ముట్టడించాయి. కాపయ నాయకుడు మళ్లీ సంధి చేసుకొని భువనగిరి దుర్గాన్ని ఇచ్చాడు.

మూడవ దండయాత్ర క్రీ.శ.1360-61: అల్లావుద్దీన్ హసన్‌గంగు మరణించి అతని కుమారుడు మొదటి మహమ్మద్ షా రాజ్యానికి వచ్చాడు. ఈ సమయంలో బహమనీ రాజ్యంపై దాడిచేసి తాను కోల్పోయిన రాజ్య భాగాలు తిరిగి సంపాదించాలని కాపయనాయకునికి ఆశ కలిగింది. కనుక అతడు విజయనగర ప్రభువు బుక్కరాయల సహాయం కోరాడు. విజయనగర రాజ్యానికి కూడా ప్రమాదంగా తయారైన బహమనీ రాజ్యాన్ని దెబ్బతీయడానికి బుక్కరాయలు కాపయనాయకునికి సహాయం చేయడానికి వెంటనే అంగీకరించాడు. కాపయ నాయకుడు ఈ దండయాత్ర సాగించడానికి తన కుమారుడు వినాయకదేవుని నియమించాడు. అతడు యుద్ధ ప్రయత్నం ప్రారంభించి సైన్యాన్ని సమీకరించాడు. విజయనగర, ముసునూరు సంయుక్త సైన్యాలకు నాయకత్వం వహించి వినాయకదేవుడు బహమనీ రాజ్యంపై దండెత్తాడు. వినాయకదేవుడు తాము అంతకుముందు కోల్పోయిన భువనగిరి, కౌలాస్ దుర్గాలను జయించాడు. ఆ వార్త తెలియగానే సుల్తాన్ మహమ్మద్ షా జాఫర్‌ఖాన్ అనే సరదారుని పంపాడు. అతడు వినాయకదేవుని ఓడించాడు. వినాయకదేవుడు వెనుదిరిగి వెలం పట్టణం అనే కోటలో ప్రవేశించాడు. తర్వాత బహదూర్‌ఖాన్ ఓరుగల్లుపై దండెత్తాడు. సుల్తాన్ స్వయంగా విజయనగర రాజ్యంపై దండెత్తి కొల్లగొట్టాడు. ఓరుగల్లు, విజయనగరాలు ఓడిపోయి సంధి చేసుకున్నాయి. కాపయనాయకుడు సుల్తాన్‌కు కొన్ని అశ్వాలను, ధనాన్ని సమర్పించుకున్నాడు. సుల్తాన్ వెనుదిరిగి వెళ్లిపోయాడు.

వినాయకదేవుని నాల్గవ యుద్ధం క్రీ.శ.1362: మూడవ యుద్ధ ఓటమితో వినాయకదేవునికి పట్టుదల పెరిగింది. అతడు ఆత్మాభిమాని. ఎలాగైనా బహమనీ సుల్తాన్‌ను ఓడించి తమ ప్రాంతాలను పునరాక్రమణ చేయాలనే కృతనిశ్చయంతో సైన్య సమీకరణకు పూనుకున్నాడు. బహమనీ రాజ్యం కోసం అరబ్బు వర్తకులు తెచ్చే గుర్రాలను బలవంతంగా లాక్కొన్నాడు. బహమనీ రాజుల బంగారు నాణేలు కరిగించి ధనాన్ని పోగు చేయనారంభించాడు. అరబ్బు వర్తకులు, వినాయకదేవుడు తమను అటకాయించి సుల్తాన్‌కు తెచ్చే అశ్వాలను సంగ్రహిస్తున్నాడని చెప్పారు. దాంతో సుల్తాన్ వినాయకదేవుని దండించడానికి సైన్యంతో బయలుదేరి వెలం పట్టణాన్ని ముట్టడించాడు. వినాయకదేవుడు ఓడి, బందీగా చిక్కాడు. సుల్తాన్ అతనిని అతి క్రూరంగా వధించాడు. సుల్తాన్ వినాయకదేవుని నాలుక కోయించి కోటబురుజుల పైనుండి కింద మంటలలోకి తోయించి అతి క్రూరంగా చంపాడు. వీరకిశోరం అయిన వినాయకదేవుడు అస్తమించాడు. ఆనాడు వినాయకదేవుడు గొప్ప వీరుడుగా ప్రసిద్ధి పొందాడు. తన సాహసకృత్యాలతో, నాయకత్వ లక్షణాలతో ప్రజాసేకరణ చేసి అద్భుత విజయాలు సాధిస్తూ ఉండేవాడు. ఆంధ్ర, కర్ణాటక యువనాయకులలో అతనికి గొప్ప పేరు ప్రతిష్టలుండేవి. అలాంటి వినాయకదేవుని వధించాడని తెలియగానే పరిసరాల ప్రజలు సుల్తాన్ సైన్యాలను చుట్టుముట్టి దాడి చేశారు. గాయపరిచారు. వారి దాడులను భరించలేక సుల్తాన్ తాను కొల్లగొట్టిన సామగ్రినంతటినీ తగులబెట్టించి వజ్రాలు, బంగారాన్ని మాత్రం తీసుకొని పారిపోయాడట.

ఐదవ యుద్ధం క్రీ.శ.1364-65: కుమారుడు వినాయకదేవుని మరణం కాపయనాయకునికి అంతులేని దుఃఖాన్ని కలిగించింది. సుల్తాన్‌పై పగతీర్చుకోవాలని తీర్మానించుకొని బహమనీ రాజ్యంపై దండయాత్ర చేయాలని తలచాడు. కాని తన శక్తిచాలదని గ్రహించాడు. ఢిల్లీని ఏలే ఫిరోజ్ తుగ్లక్ సహాయం అర్థించాడు. అతడు ఒక కాఫిర్‌కు సహాయం చేయలేనన్నాడు. ఢిల్లీ సుల్తాన్ సహాయం కాపయనాయకుడు కోరాడని చారుల ద్వారా తెలుసుకున్న సుల్తాన్ ఉగ్రుడై, ఓరుగల్లుపై దండెత్తాడు. కాపయనాయకుడు మళ్లీ ఓడిపోయి సంధి చేసుకున్నాడు. గోల్కొండ దుర్గం, 33 లక్షల ధనం, 100 ఏనుగులు, 250 అశ్వాలు, ఒక వజ్ర సింహాసనం ఇచ్చి తన రాజ్యాన్ని దక్కించుకున్నాడు. ఉభయ రాజ్యాలు గోల్కొండ సరిహద్దుగా అంగీకరించాయి. ఇదే ఈ రాజ్యాల మధ్య జరిగిన చివరి యుద్ధం. ఆ తర్వాత రెండు రాజ్యాలమధ్య యుద్ధాలు జరగలేదు. కాని ఈ యుద్ధాల వలన కాపయ

కొండవీటి రెడ్డి రాజ్యం క్రీ.శ.1324-1424

రెడ్డి రాజుల చరిత్రకు ఆధారాలు: కొండవీటి రెడ్డి రాజులు ఆరు తరాలు, సుమారు ఒక శతాబ్దం పాటు తీరాంధ్ర దేశాన్ని పాలించి ముస్లిం దండయాత్రల నుంచి ఆంధ్రదేశాన్ని కాపాడి ఆంధ్ర సంస్కృతికి, తెలుగు భాషకు అపార సేవ చేశారు. కొండవీటి రెడ్డిరాజుల చరిత్ర తెలుసుకోవడానికి మనకు చాలా ఆధారాలు ఉన్నాయి. వారు విడుదల చేసిన తామ్ర శిలాశాసనాలు, సమకాలీన సంస్కృత తెలుగు కావ్యాలు, ముస్లిం చరిత్రకారులు రాసిన అరబ్బీ, పర్షియా గ్రంధాలు ఉపయోగపడుతున్నాయి. వారి ఆస్థాన కవులైన ఎర్రాప్రెగ్గడ, వామనభట్టు, శ్రీనాధుడు రచించిన కావ్యాలు ముఖ్యంగా హరివంశం, భీమేశ్వర పురాణం, వెన్నెలకంటి సూరన రాసిన విష్ణుపురాణం ఉపయోగపడుతున్నాయి. కొమ్మనామాత్యుని కావ్యం ప్రోలయ వేమారెడ్డి కాలానికి ముట్లూరి శాసనం కొండవీటి వంశస్తుల మూలపురుషులని పేర్కొంటోంది. మల్లవరం శాసనం, కొలని రుద్రదేవుని సంతమాగులూరు శాసనం, వలివేరు, నకరికల్లు, కుంకలగుంట, గణపేశ్వరం, పెరవలి, వేమవరం, మాంచాల అనపోతారెడ్డి కాలం నాటి ఈడ్పుగల్లు, ద్రాక్షారామ, అమరావతి, పచ్చలతాడిపర్రు, అన్నవరం, రాజమండ్రి మ్యూజియం, అనవేమారెడ్డి కాలంనాటి నడుపూరు, వాడపల్లి, సింహాచలం, పలివెల, శ్రీశైలం, ద్రాక్షారామం, కుమారగిరిరెడ్డి కాలం నాటి సర్పవరం, అనపర్తి, కొమరగిరిపురం, పాలకొల్లు, సింహాచలం, అమరావతి, తొకొరపూడి, మధురపూడి, సంతానసాగరం, గోకవరం శాసనాలు, అనితల్లి కలువచేరు శాసనం, వెలుగోటివారి వంశావళి, ఇంకా విజయనగర రాజుల శాసనాలు కూడా రెడ్డిరాజుల చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి.

వామనభట్టు రాసిన వేమభూపాలచరిత్ర, కాటయవేమారెడ్డి రాసిన కుమారగిరి విజయం, అమరశతకాన్ని శృంగారదీపిక అనే పేరుతో పెదకోమటి వేమారెడ్డి రాసిన గ్రంధం, శ్రీనాధుడు రాసిన కాశీఖండం, కొమ్మన రాసిన శివలీలా విలాసం, ఈ కాలానికే చెందిన హరవిలాసం, క్రీడాభిరామం, సింహాసన ద్వాత్రింశిక ముఖ్య ఆధారాలు. ముస్లిం చరిత్రకారులు రాసిన వాటిలో అమీర్ ఖుస్రూ రాసిన Khazainul-Fuiuh, మహమ్మద్ ఖాసి హిందూషా రాసిన Tanikhi-Ferishta, ఇటన్ టూబా, అబ్దుల్ రజాక్ రచనలు ఉపయోగపడుతున్నాయి. వెల్లాల సదాశివ శాస్త్రి, అవధానం శాస్త్ర శాస్త్రిలు రాసిన వెలుగోటి వారి వంశావళి, చాటుకృతులు కూడా రెడ్డి చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. శ్రీనాధుని చాటువులు ఆనాటి తెలుగుదేశపు ఆర్థిక సాంఘిక జీవన విధానాలను తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి. స్థానిక కైఫీయత్తులు, మెకంజీ రాతప్రతులు, కొండవీటి దండకవిలె, కొండవీటి కైఫీయత్తు, కొండవీటి రెడ్డి రాజ్య చరిత్ర అధ్యయనానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

రెడ్డి పద ఉత్పత్తి: రెడ్డి పద ఉత్పత్తి గురించి అనేక అభిప్రాయాలున్నాయి. రెడ్డి అనే పదం క్రీ.శ.14వ శతాబ్దం నుండి వాడబడుతోంది. తెనాలి రామలింగడు తన పాండురంగ మహాత్మ్యంలో రెడ్డి అనే పదాన్ని వాడాడు. అంతకుముందు రడ్డి అనే పదం ఉండేది. రడ్డిపేటలు అను పదం వాడారు. ఈ పదంనుంచే రెడ్డి పదం ఉత్పత్తి అయింది. 14వ శతాబ్దంలో రెడ్డి పదం వాడుకలోకి వచ్చినా కూడా అంతకుముందు ఉన్న రడ్డి పదం కూడా 17వ శతాబ్దం దాకా కొనసాగింది. చివరకు 17వ శతాబ్దం నుంచి రడ్డి పదం పూర్తిగా పోయి రెడ్డి అనే పదమే నిలిచి ఇప్పటికీ కొనసాగుతోంది. రడ్డికి ముందు రట్టడి అనే పదం ఉండేది. ఈ ప్రయోగం 14వ శతాబ్దపు తెలుగు సాహిత్యంలో కనిపిస్తోంది. 12వ శతాబ్దంలో రట్టడికి బహువచనంగా పండితారాధ్య మల్లికార్జునుడు రట్టళ్లు అని వాడాడు. రట్టడి 10-11 శతాబ్దాల నుండి వాడుకలో ఉన్నట్లు మచిలీపట్నం శాసనం తెల్పుతోంది. అలాగే రట్టడి పదానికి ముందు రట్టొడు అనే పదం ఉపయోగించినట్టు తూర్పుచాళుక్యుల తామ్ర శాసనాల నుండి తెలుస్తోంది. రట్టొడి చేను, రట్టొడి తోట, దానిని రట్టొడి కాపులు కాచువారు, అన్న పదాలు ఆ శాసనాలలో వాడారు. తూర్పుచాళుక్య అమ్మరాజమహేంద్రుడు క్రీ.శ.955లో మాడియరట్టొడి మనుమడి మాడియ రట్టొడి సేవలకు మెచ్చి అత్తిలినాడులోని పొందువ గ్రామాన్ని మహాసామంత బిరుదులతో ఇచ్చాడు. రట్టొడి అనేది ఒక పదవి. ఆ పదవులను నిర్వహించిన వారిని రట్టొడులు అని అనేవారు. ఈ రట్టొడు పదం క్రీ.శ.7వ శతాబ్దం నుండి కనిపిస్తోంది. క్రీ.శ.6వ శతాబ్దంలో రట్టకుడి అనే పదం, రట్టగుడి అనే పదాలు కడప, కర్నూలు, గుంటూరు జిల్లాలలో తెలుగు శాసనాలలో వాడారు. కడప జిల్లా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం

మండలాలలోను, గుంటూరు జిల్లా పలనాటి ప్రాంతాలలోని తెలుగు శాసనాలలో రట్టొడి, రట్టొడ్లు, రట్టగుడి, రట్టగుడ్లు అనే పదాలు ప్రయోగించారు. మారమ్మ కల్కిరట్టగుడి, కుర్రమ్మ, పల్లరట్టగుడి లేక పల్లవరట్టగుడి, ఉత్తమాదిత్య రట్టగుడ్లు, చోళియరట్టగుడ్లు, గంగరట్టగుడ్ల, గగ్గరట్టగుడ్లు, కోలియరట్ట గుడ్లు అనే పదాలు రాసి ఉన్నాయి. ఈ శాసనాలలోని పదాల క్రమపరిణామాన్ని పరిశీలిస్తే, రట్టకుడి అనేది మొదటి పదం. అదే పై పదాలన్నింటికి మూలం అని స్పష్టమవుతోంది. రట్టకుడి, రట్టగుడి అని కూడా వాదారు. తెలుగులో 'క'కు బదులు 'గ' వాడే పద్ధతి ఉంది. కనుక రట్టకుడి, రట్టగుడి ఒకే పదానికి సంకేతం. అలాగే రట్టగుడికి బహువచనంగా రట్టగుడ్లు అని వాడి ఉంటారు. వ్యక్తుల పేర్లతో చివరన ఈ పదాలు ఉన్నందున ఆ వ్యక్తులు రట్టగుడి అనే పదవిని నిర్వహించి ఉంటారు. కుర్రమ్మ పల్లవ రట్టగుడి - ఈ పదంలోని కుర్రమ్మ మనిషి పేరు. పల్లవ జాతి సంకేతం రట్టగుడి, అతడు నిర్వహించిన పదవి అయి ఉంటుంది. అలాగే చోళియ రట్టగుడ్లు అనే పదంలో చోళియ జాతి సంకేతం, రట్టగుడ్లు పదవి సంకేతం- చోళియ జాతి వారైన రట్టగుడ్లు అని అర్థం. ఇక్కడ జాతిని బహువచనంగా వాడి ఉంటారు. ఈ ప్రయోగాలు క్రీ.శ.6వ శతాబ్దంలో ఉన్నాయి. క్రీ.శ.7వ శతాబ్దంలో రట్టొడు అనే ప్రయోగం వచ్చింది. రట్టొడి చేను, రట్టొడి తోట ఈ పదాలు రట్టకుడి అనే పదాల నుండే వచ్చి ఉంటాయి. అంటే రట్టగుడి లేక రట్టకుడి అనే పదంలో కు లేక గు అనే అక్షరం పోయింది. కనుక రట్టడి అయి ఉచ్చారణలో రట్టొడిగా మారి ఉంటుంది. ఈ ప్రయోగాలు 10-11 శతాబ్దాలలో తూర్పుచాళుక్యుల కాలంనాడు రూపొందాయి. 12వ శతాబ్దంలో పండితారాధ్యుడు రట్టడి పదానికి రట్టళ్లు అని వాదాడు. అంతకుముందు రటగుడి పదానికి బహువచనంగా రట్టగుడ్లు అని వాడగా పండితారాధ్యుడు రట్టడి పదంలోని 'డి'కి 'ళ' రూపం తీసుకొని 'ళ్లు' అని వాడాడు. ఈ రట్టడి పదం 14వ శతాబ్దం దాకా సాగింది. 14వ శతాబ్దంలో రట్టడి పదంలోని ట్ట ఎగిరిపోయి రడి అనే రెండు అక్షరాలే మిగిలి ఉచ్చారణలో రడ్డిగా మారింది. కనుక రడ్డిపేటలు అనే పద ప్రయోగం ఉపయోగించారు. ఆ రడ్డి పదాన్నే తెనాలి రామలింగడు రెడ్డి అని ఉయోగించాడు. 16వ శతాబ్దం వరకు రడ్డి, రెడ్డి పదాలు వాడుకలో ఉన్నాయి. అయితే క్రీ.శ.6వ శతాబ్దంలో ప్రారంభమైన రట్టకుండి అనే పదానికి సమానాంతరంగా రాష్ట్రకూట అనే మరొక పదం కూడా శాసనాలలో కన్పిస్తోంది. రట్టకుడి అనేది తెలుగుపదం, రాష్ట్రకూట అనేది సంస్కృత పదం. రేనాటిచోళులు తెలుగువారు. వారే మొట్టమొదట తెలుగు శాసనాలు రాయించారు. కనుక తెలుగు పదమైన రట్టకుడి అనే పదాన్ని వారు వాడారు. ఇంచుమించు ఇదే కాలంలో దక్కను పీఠభూమిలో రాష్ట్రకూట వంశానికి చెందిన వారు చిన్న చిన్న రాజ్యాలు పాలించేవారు. ఈ రాష్ట్రకూట వంశాలలో ఒక వంశం పశ్చిమ చాళుక్యులను కూలదోసి మహాసామ్రాజ్యాన్ని స్థాపించి మాల్గేడ్ రాజధానిగా చేసుకొని పాలించింది. వారి కాలం నుండి రాష్ట్రకూట పదం బాగా వాడుకలోకి వచ్చింది. వారి శాసనాలు సంస్కృతంలో రాయించారు. అందువలన రాష్ట్రకూట శబ్దం బాగా ప్రాచుర్యం పొందింది. ఆంధ్రదేశంలో వాడుకలో ఉన్న రట్టకుడి, దక్కనులో వాడుకలో ఉన్న రాష్ట్రకూట పదాలు రెండూ ఒకటేనని మనకు శాసనాధారం లభించింది. క్రీ.శ.1904-1905వ సంవత్సరంలో ద్రాక్షారామంలో కుళోత్తుంగచోళునికి చెందిన శాసనాలు లభించాయి. ఇవి 11-12 శతాబ్దాలకు చెందినవి. ఈ శాసనాలలో తెలుగులో రట్టడం అనే పదం, సంస్కృతంలో రాష్ట్రకూటం అనే పదం సమాన అర్థాలతో వాడబడ్డాయి. రట్టడం అనేది పదవి, అలాగే రాష్ట్రకూటం అనేది కూడా పదవే. రట్టడం రట్టకుడి అనే పదం నుండి వచ్చి ఉంటుంది. కనుక రట్టకుడి అనే తెలుగు పదంలోని రట్టకు సంస్కృతంలో రాష్ట్ర అని, కుడి అనే తెలుగు పదానికి సంస్కృతంలో కూట అని వాడారన్నమాట. కనుక ఈ రెండు పదాలు ఒకే అర్థం కలిగి ఉన్నాయి. కుళోత్తుంగ చోళుని కాలంనుండి రట్టకుడు రాష్ట్రకూటుదు, రట్టడము, రాష్ట్రకూటం అనే రెండు పదాలు పక్కపక్కనే ఉన్నాయని చెప్పవచ్చు. ఈ విధంగా ఎందుకు వాదారు? దానికి కూడా కారణం ఉంది. క్రీ.శ.10వ శతాబ్దంలో రాష్ట్రకూట సామ్రాజ్యం అంతరించి కళ్యాణీ చాళుక్య సామ్రాజ్యం వెలసింది. రాజ్యం పోగొట్టుకున్న రాష్ట్రకూట కుటుంబీకులు రాయలసీమ, తెలంగాణలో కళ్యాణీ చాళుక్యుల వద్ద రాష్ట్రకూట పదవులు అంటే గ్రామ ఉద్యోగాలు, మాండలీక ఉద్యోగాలు నిర్వహించారు. అంటే రట్టడికాన్ని నిర్వహించారు. వారిని రాష్ట్రకూటులుగానే పిలిచేవారు. కొన్ని రాష్ట్ర కూట కుటుంబాలు ఆంధ్రదేశంలోకి వచ్చి తూర్పు చాళుక్యుల వద్ద కూడా ఆ ఉద్యోగాలు సంపాదించారు. వారు రాష్ట్ర కూటులుగానే పిలువబడ్డారు. అది సంస్కృత పదం. అంతకుముందు ఆంధ్రదేశంలో అదే పదవిని నిర్వహించేవారు రట్టకుడి, రట్టొడు అని పిలువబడుతున్నారు. అది తెలుగుపదం. కనుక ఈ రెండు పదాలు ఒకే ఉద్యోగానికి సంకేతాలని తెలుపుతూ కుళోత్తుంగుని శాసనాలలో

రెండు భాషా పదాలు అనగా, రట్టడం, రాష్ట్రకూటం అనే పదాలు వాడబడ్డాయి. కనుక ఈ రెండు పదాలు ఒకటే. ఒకటి తెలుగుపదం, రెండవది సంస్కృత పదం.

అయితే ఈ పదాలకు మూలం ఏమిటి? క్రీ.శ. తొలి శతాబ్దాల వరకు ఇలాంటి పదాలు ఏ శాసనాలలో కనిపించవు. శాతవాహన, మహామేఘవాహన శాసనాలలో ఇలాంటి పదాలు కనిపిస్తున్నాయి. శాతవాహనుల నానేఘాట్, కన్హేరి, కార్లె శాసనాలలో మహారథుల ప్రస్తావన ఉంది. అలాగే హాతిగుంఫ శాసనంలో రథికుల ప్రస్తావన ఉంది. ఈ పదాలకు మూలం ఇంకా అంతకన్నా ముందు ఉంది. అశోకుని శిలాశాసనాలలో రథికులు ఒక జాతి వారిగా, దక్షిణదేశ జాతులలో ఒకటిగా పేర్కొన్నాడు. అంధ, పులింద, శబరు, పిటినిక, రథిక అనే ఐదు జాతులను దక్షిణ దేశంలో నివసిస్తున్నట్లు పేర్కొన్నాడు. వీనిలో రథిక పదం రాష్ట్రిక, రాట్రక, రిస్టిక అనే రూపాలు తీసుకున్నదని పండితులు అంటారు. కనుక 6-7 శతాబ్దాలలో తెలుగుదేశంలోని శాసనాలలో వాడబడిన రట్టకుండి, రాష్ట్రకూట అనే పదాలకు అశోకుని శిలా శాసనాలలోని రథిక పదం మూలం అని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ రథిక పదం శాతవాహనుల కాలం దాకా కొనసాగి తర్వాత మరుగున పడిపోయింది. అందువల్ల ఈ పదాల ప్రస్తావన శాసనాలలో లేదు. తిరిగి క్రీ.శ.6-7 శతాబ్దాలలో ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది ఎందువల్ల జరిగింది అంటే దానికి కూడా కారణం ఉంది. శాతవాహన సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తర్వాత ఆంధ్ర దేశంలో అనేక మార్పులు వచ్చాయి. అంతవరకు ప్రబలంగా ఉన్న బౌద్ధ మతం తన స్థానాన్ని పోగొట్టుకుంది. వైదిక మతం దినదినాభివృద్ధి పొందసాగింది. దాంతో సాంఘిక మత రంగాలలో గొప్ప మార్పు వచ్చింది. శాతవాహన సామ్రాజ్యం కూలిపోవడంతో ఆ వంశం చేత ఆదరింపబడిన రాజోద్యోగ కుటుంబాలన్నీ చిన్నాభిన్నం అయ్యాయి. నూతన వంశాల పరిపాలన ప్రారంభం అయింది. రాజకీయంగా పెద్ద మార్పు వచ్చింది. ఆ స్థితిలో రథికులు అనే వారు తమ వ్యవసాయ వృత్తులను అవలంబించి మరుగున పడిపోయి ఉండవచ్చు. తిరిగి చాళుక్యయుగంలో యుద్ధవీరుల అవసరం ఏర్పడి రైతులుగా ఉన్న వీరు సైనిక వృత్తిని చేపట్టి తిరిగి ప్రఖ్యాతిలోకి వచ్చి ఉంటారు. అప్పటికి రథిక అనే పేరు మరుగున పడిపోయి రట్ట, రట్టకుడి అని ఆంధ్రదేశంలో, రాష్ట్రకూట అని మహారాష్ట్ర దేశంలో పేరు పొంది ఉంటారు. పులకేశి ఐహోలు శాసనంలో మహారాష్ట్ర కూట అనే పద ప్రయోగం ఉంది. కనుక అశోకుని కాలం నాటి రథికులే క్రీ.శ.6-7 శతాబ్దాల నాటి రట్టకుండి, రాష్ట్రకూటులు అని భావించవచ్చును. కనుక ఇది మొదట ఒక జాతి నామం. కనుకనే రాష్ట్రకూటులు రట్టకందర్ప, రట్టవిద్యాధర, రట్టకులభూషణ, రట్టవంశోద్భవ అనే బిరుదులు ధరించారు. ఈ బిరుదులు కన్నడ శాసనాలలో కనిపిస్తున్నాయి. కనుక రాష్ట్రకూటులు రట్టకులం వారని, రట్ట వంశం వారని బోధపడుతోంది. అయితే ఈ పదాలకు అర్థం ఏమిటి, రట్టకుడి, రాష్ట్రకూట అనే పదాలలోని రట్ట, రాష్ట్ర సమాన అర్థాలు కలిగినవి. వాటి అర్థం ఏమిటి? రాష్ట్ర అనే పదం ఒక ప్రాంతాన్ని సూచించే పదం. కర్మరాష్ట్రం, ముండ రాష్ట్రం మొదలలైనవి. కనుక రట్ట అనేది కూడా ప్రదేశాన్ని సూచించేది అయి ఉండాలి. అలాంటి ఉదాహరణలు కూడా ఉన్నాయి.

శాతవాహనరట్ట అని పల్లవ శివస్కంధవర్మ శాసనంలో ఉంది. కనుక రట్ట, రాష్ట్ర రెండు పదాలు ఒకే అర్థంతో వాడబడ్డాయి. దీనిని బట్టి ఈ రెండు పదాలలో రట్ట ప్రాచీనమైంది. ఇది ప్రాకృత పదం. దానికే సంస్కృత పదం రాష్ట్ర. శాతవాహనుల కాలంలో ప్రాకృతమే రాజభాష కనుక పరిపాలనా విభాగాలను రట్ట అని వాదారు. సంస్కృతం వచ్చిన తర్వాత రట్ట అనేపదాన్ని సంస్కృతీకరించి రాష్ట్ర అని వాదారు. అలాగే రాష్ట్ర అనే పదానికి రాష్ట్రిక, రాష్ట్రీయ, రాష్ట్రపాలనే రూపాంతరాలున్నాయి. ఇవి సంస్కృత పదాలు. వీటి అర్థం ఏమిటి? ఇవి వ్యక్తిని సూచిస్తున్నాయి. రాష్ట్రిక అంటే రాష్ట్రాన్ని పాలించే వ్యక్తికి సంకేతం. అలాగే రాష్ట్రీయ, రాష్ట్రపాల అనే పదాలు కూడా రాష్ట్రాన్ని పాలించే వ్యక్తికి సంకేతాలు. కనుక రాష్ట్రిక అనే పదం నుండి రాష్ట్రకూట అనే పదం వచ్చి ఉంటుంది. అంటే రాష్ట్రపాలకుడు. ఇది సంస్కృత పదం. అలాగే తెలుగులో కొనసాగి రట్టకుండి ప్రాకృతపదం అయి ఉంటుంది. రట్టక అనే ప్రాకృత పదానికి తెలుగులోని ప్రథమా విభక్తులైన దకారం చేరి రట్టకుండి లేక రట్టకుడు అనే పదంగా మారి ఉంటుంది. సంస్కృతం రాష్ట్రకు తెలుగులో సమానమైన రట్ట పదం కూడా తర్వాత రట్టకుడుగా ప్రయోగింపబడింది. అంటే రట్టను పాలించేవాడు అని అర్థం. ఇది వ్యక్తి సంకేతం. దీన్ని బట్టి రట్ట, రాష్ట్ర అంటే ప్రాంతం, రట్టకుడు, రట్టకుడి, రాష్ట్రకూట అంటే వ్యక్తి అని చెప్పవచ్చు. అంటే ఈ పదాలు వ్యక్తులు, ప్రాంతాలకు కూడా అన్వయించారు. దీన్ని బట్టి రట్ట అనే పదం మొదట ఒక జాతిని సూచించేది. భారత దేశం అనేక జాతుల మయం కనుక ఒక్కొక్క జాతి ఒక్కొక్క ప్రాంతంలో నివసించినప్పుడు ఆ జాతి పేరుతోనే ఆ ప్రాంతానికి పేరు

వచ్చేది. కమ్మ రాష్ట్రం, కమ్మనాడు ఆ మాదిరి కమ్మవారి తొలిస్థావరం గనుక అది కమ్మ రాష్ట్రంగా పిలువబడింది. అలాగే రట్టజాతి వారు నివసించిన ప్రాంతాలకు కూడా అలాంటి పేర్లు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. అరట్ట, మరట్ట, సురట్ట, రట్టపది, రట్టవాడి అనే పేర్లు శాసనాలలో పేర్కొనబడ్డాయి. ఈ ప్రాంతాలన్నింటిలో రట్టజాతి వారు నివసించినందువల్ల ఆ పేర్లు వచ్చాయని, పేర్లలో తేడా ఉండటానికి స్థానిక వ్యత్యాసాలు కారణం అని పండితులు అంటున్నారు. కనుక రాష్ట్రకూట అంటే రాష్ట్ర వంశస్తుడు అని అర్థం అని భావించారు. అందువల్లనే వారిని రాష్ట్రకూట ప్రముఖాన్ అని శాసనాలు తెలుపుతున్నాయని భావించారు. కూట అంటే పర్వత శిఖరం అని, అది పర్వతాలకంటే ఉన్నతమైనదని, అలాగే రాష్ట్రకూట అంటే ప్రజలలో ఉన్నతమైనవాడు, ప్రథమ స్థానంలో ఉన్నవాడని కృష్ణశాస్త్రి అర్థం చెప్పారు. అలాగే రట్టకుడిలోని కుడి అన్నా అదే అర్థం అని, తమిళంలో కుడి అంటే ప్రథమస్థానం వారని కనుక రట్టకుడి అన్నా సమాజంలో ప్రథముడని డా ప్లేట్ అన్నారు. తమిళ, తెలుగు భాషలు ఒకే కుటుంబానికి చెందినవి. కనుక రట్ట పదానికి కుడి చేర్చి తెలుగు పదం చేర్చి ఉంటారని, కనుక రాష్ట్రకూట, రట్టకుడి అనగా ఉన్నతమైన వారు అని అర్థం అని ప్లేట్ అన్నాడు. కాని కూట అంటే సమూహం అని కూడా అర్థం ఉంది. అంటే గ్రామ పెద్దల సమూహం అని కూడా చెప్పవచ్చు. రెడ్లను నేడు కూడా రాయలసీమలో కాపులు అని పిలుస్తారు. తమిళంలో కుడియన్ అంటే కాపులు అని అర్థం ఉంది. కనుక కుడి అంటే కాపుల సమూహం అని కూడా చెప్పవచ్చు. రట్టకుడి పదంలోని కుడి, తమిళంలోని కుడియన్ అనే పదాన్ని, కాపులు అనే సమాన అర్థంలో వాడి ఉండాలి. తమిళ పదాలు అనేక తెలుగులో ఉన్నాయి. రట్టరికమే రిడ్డరికంగా రూపొందింది. అంటే గ్రామాధికారి. పన్నులు వసూలు చేయడం, న్యాయ నిర్ణయం చేయడం ఈ ఉద్యోగి విధులు. రట్టరికం వంశపారంపర్యంగా ఉండేది. ఈ పదవిని నిర్వహించిన వారిని రట్టొడ్డి, రడ్డి, రెడ్డి అని అనే వారు. గ్రామ పరిపాలన రక్షణతోపాటు వ్యవసాయాన్ని కూడా చేయాలి. భూమిని సాగులోకి తేవాలి. కనుక అతనిని కాపు అని కూడా పిలిచేవారు. అందువల్లనే తూర్పు చాళుక్య శాసనాలలో దీనిని రట్టొకాపులు కాచువారు అని రాశారు. తూర్పు చాళుక్యుల కాలం నుండి రట్టరికం అమలులో ఉంది. క్రీ.శ.10వ శతాబ్దంలో తూర్పుచాళుక్య ప్రభువు అమ్మరాజమహేంద్రువు తనకు సేవ చేసినందుకు మాడియ రట్టొడికి మహాసామంత బిరుదునిచ్చి అత్తిలివద్దనున్న పొందువ గ్రామాన్ని ఇచ్చాడు. కనుక రట్టోలు గ్రామ పరిపాలకులుగానే గాక రాజసేవలో ప్రత్యక్షంగా పాల్గొని మహాసామంతులుగా కూడా నియమింపబడుతున్నారని ఈ శాసనం తెలుపుతోంది. కనుక ఆంధ్రప్రదేశ్‌లోని నేటి రెడ్లు క్రీ.శ.7వ శతాబ్దానికి చెందిన రట్టజాతి వారని, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాలకు చెందిన రాష్ట్ర కూటులు కూడా రట్టజాతి వారని, కనుక రాష్ట్రకూటులు రెడ్లకు మూలపురుషులని పండితులు భావిస్తున్నారు. మహారాష్ట్రలో మహారధులుగా పిలువబడిన జాతివారు. వారే రట్టజాతి వారు. వారిలో ఒక శాఖ రాజస్థాన్‌కు వెళ్లి రాథోడ్‌లుగా పేరు పొందారు. మరొక శాఖవారు ఆంధ్రదేశం వచ్చి రెడ్లుగా మారారని పండితుల అభిప్రాయం. అందువల్లనే రాష్ట్రకూటులు పాలించిన తెలంగాణ, రాయలసీమల్లోనే నేటికీ రెడ్డి కులస్తుల జనాభా అధికంగా ఉందని కూడా చెపుతారు. రాష్ట్రకూట సామ్రాజ్యం వెలిగే రోజుల్లో కోస్తా ఆంధ్ర తూర్పు చాళుక్యుల కింద ఉండేది. తెలంగాణ, రాయలసీమలు రాష్ట్రకూట సామ్రాజ్యంలో భాగాలుగా ఉండేవి. రాష్ట్రకూట సామ్రాజ్య పతనానంతరం రాష్ట్రకూటులే అక్కడ స్థిరపడి రెడ్లుగా మారారని పండితుల అభిప్రాయం. ఇంతవరకు అక్కడ ఆంధ్రదేశపు రెడ్లు రాష్ట్రకూటుల సంతతివారనే పండితులు భావిస్తున్నారు. ముఖ్యంగా డా॥ బి.యస్.యల్. హనుమంతరావు, రెడ్డినాడు సంచికలో కొండవీటి రెడ్డి వంశచరిత్రను ధారావాహికంగా రాసిన ఈమని శివనాగిరెడ్డి కూడా రెడ్లకు మూలపురుషులు రాష్ట్రకూటులనే అభిప్రాయం వెల్లడించారు. కాని ఇటీవల జరిగిన పరిశోధనలు ఇచ్చే సమాచారాన్ని బట్టి వారి అభిప్రాయాలు సరైనవి కావనే (ముప్పాళ్ల హనుమంతరావు) భావన కలుగుతోంది. క్రీ.శ.1977–78 సంవత్సరాల మధ్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డా బి.ఆర్.సుబ్రహ్మణ్యం కర్నూలుజిల్లా వీరాపురంలో పరిశోధనలు జరిపారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఆ ప్రాంతం మునిగిపోతోందని, అది అతి ప్రాచీన చారిత్రక ప్రదేశమని, ఆ ప్రాంతంలో త్రవ్వకాలు పరిశోధనలు జరిపారు. అందులో భాగంగా వీరాపురంలో పరిశోధనలు జరిగాయి. ఆ గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది కుడిఒడ్డున పెద్ద గుట్టమీద డా॥ సుబ్రహ్మణ్యం త్రవ్వకాలు జరిపి పరిశోధనలు చేశారు. అందులో క్రీ.పూ.1300 నుండి క్రీ.శ.3వ శతాబ్దం వరకు వివిధ యుగాలకు చెందిన పురాతన వస్తువులు లభించాయి. అందులో అతి ప్రాచీన పొరలలో 13 లీడ్ నాణేలు లభించాయి. ఈ నాణేలు అన్నింటిపై తొండాలు పైకెత్తి నడుస్తున్న ఏనుగుల ముద్రలు ఉన్నాయి. త్రిభుజాకారం కలిగిన జంతువు బొమ్మ

వీపు మీద శ్రీవత్సం గుర్తు ఉంది. దాని మీద శివఖాద, మహారథిఖాద, మహారథి ఇయమసివ అనే ఆఖ్యలు ఉన్నాయి. ఈ నాణేలు క్రీ.శ.1వ శతాబ్దానికి చెందినవని నిర్ణయించారు. అలాగే ధరణికోటలో ఇటీవల జరిగిన త్రవ్వకాల పరిశోధనలలో మరికొన్ని నూతన నాణేలు లభించాయి. వాటిలో మహారథి సోమాలాయుడు పేరు ఉన్న నాణేలున్నాయి. అదే విధంగా ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లిలో మహారథి శివకనాసుడు అనే పేరు గలిగిన నాణేలు లభించాయి. కర్ణాటక రాష్ట్రంలో ఇటీవల జరిగిన పరిశోధనలో మహరథి అనే పేరు గలిగిన అనేక నాణేలు లభించాయి. ఆ నాణేలు కూడా ఇంచుమించు ఇదే కాలానికి అంటే క్రీ.శ.1వ శతాబ్దానికి చెందినవి.

ఈ నాణేలపై ఉన్న పేర్లను పరిశీలించినట్లయితే ఆనాడు మహరథి అనే వంశం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈ వంశస్తులు గుంటూరు జిల్లాలోని ధరణికోట, ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి, కర్నూలు జిల్లాలోని వీరాపురం, కర్ణాటక రాష్ట్రాలలో పాలించినట్లు కనిపిస్తోంది. అశోకుని శిలాశాసనాలు రధికులను పేర్కొంటున్నాయి. రధికులు, అంధులు, పుళిందులు, శబరులు, పిటినికులు అనే ఐదు జాతులవారు దక్షిణదేశంలో నివసిస్తున్నట్లు అశోకుడు తన 13వ శిలాశాసనంలో పేర్కొన్నాడు. మౌర్యుల కాలంలో ఈ జాతులవారు మౌర్య సామంతులుగా ఉండి ఉండవచ్చును. మౌర్య సామ్రాజ్య పతనానంతరం శాతవాహనులతో పాటు రధికులు స్వతంత్ర్యం ప్రకటించి ఆంధ్ర కర్ణాటకలలో తమ రాజ్యాలను స్థాపించుకొని ఉండవచ్చును. అలాంటి రాజ్యాలే వీరాపురం, నేలకొండపల్లి, ధరణికోటలో పాలించిన రధికుల రాజ్యాలు అయిఉండాలి. వీరు క్రీ.పూ.100-50 సంవత్సరాల మధ్య ఆ ప్రాంతాలను పాలించారు. గౌతమీపుత్ర శాతకర్ణి వీరి రాజ్యంపై దండెత్తి ఓడించి వారి ప్రాంతాలను శాతవాహన సామ్రాజ్యంలో కలిపాడు. తర్వాత అతని కుమారుడు పులమావి అమరావతి, ధరణికోటను రాజధానిని చేసుకున్నాడు. కోస్తా, రాయలసీమ అన్ని ప్రాంతాలు శాతవాహన సామ్రాజ్యంలో భాగాలయ్యాయి. దాంతో రధికుల రాజ్యాలు అంతరించిపోయాయి. ఈ పరిశోధనల సారాంశాన్ని బట్టి మహారాష్ట్రలో రాష్ట్రకూట సామ్రాజ్యం స్థాపించకముందే, మార్గేడ్ పట్టణం నిర్మింపబడకముందే ఆంధ్రప్రదేశ్ క్రీ.శ.1వ శతాబ్దం నుండే రధిక జాతివారు ఉన్నారని స్పష్టం అవుతోంది. శాతవాహనులు తమ రాజ్యాన్ని జయించిన తర్వాత వారు మరుగున పడిపోయారు. క్రీ.శ.6వ శతాబ్దం వరకు వారి ప్రస్తావన ఎక్కడా లేదు.

తిరిగి క్రీ.శ. 6-7 శతాబ్దంలో రేనాటిచోళుల శాసనాలలో రట్టకుడి అనే పేరు పేర్కొనబడింది. రేనాటి చోళుల శాసనాలే మొట్టమొదటి తెలుగు శాసనాలు, చోళులు కడప, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలను పాలించారు. అంతకుముందు రధికులు పాలించిన వీరాపురం కూడా వీరిరాజ్యంలో భాగమై ఉండవచ్చును. భాగం కాకపోయినా ఆ ప్రాంతం వీరి రాజ్యానికి అతి సమీపంలో ఉంది. కనుక వీరాపురంలో 1వ శతాబ్దంలో రాజ్యం చేసిన రధికులే రేనాటిచోళుల శాసనాలలో రట్టకుడులుగా ఎక్కిఉంటారు. 7వ శతాబ్దం నాటికి రధిక అనే పేరు రట్టక అని రూపాంతరం చెంది ఉంటుంది. 1వ శతాబ్దంలో మరుగునపడిపోయిన రధికులు 7వ శతాబ్దానికి రేనాటి చోళుల వద్ద గ్రామోద్యోగాలు సంపాదించి రట్టక అనే పేరుతో శాసనంలోకి ఎక్కి ఉంటారు. రేనాటి చోళరాజ్యం అస్తమించిన తర్వాత ఆ వంశానికి చెందిన కుటుంబాలు నెల్లూరు, గుంటూరు, కర్నూలు ప్రాంతాలలోకి విస్తరించి ఉండవచ్చును. కనుకనే రట్టకుడి అనే పదం కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాలోనే 7-8 శతాబ్దాల శాసనాలలో కన్పిస్తోంది. తర్వాత రట్టకులు తూర్పుచాళుక్యుల ఆస్థానంలో ప్రవేశించి ఉద్యోగాలు సంపాదించారు. ఆ కాలంనాటికి వారు రట్టొడులుగా పిలువబడ్డారు. తూర్పు చాళుక్య శాసనాలు రట్టొడులు అని పేర్కొంటున్నాయి. అప్పటికి వారు రట్టకుడి అనే పేరు పోయి రట్టొడి అని పిలువబడ్డారన్నమాట.

ఆ కాలం నాటికి రాష్ట్రకూట సామ్రాజ్యం స్థాపించబడలేదు. క్రీ.శ.755లో దంతిదుర్గుడు పశ్చిమ చాళుక్యులను కూలదోసి రాష్ట్రకూట సామ్రాజ్యం స్థాపించాడు. అతని రాజధాని ఎల్లోరా. మాల్ఖేడ్ పట్టణాన్ని అమోఘవర్షుడు నిర్మించాడు. అతడు 9వ శతాబ్దం వాడు. రాష్ట్రకూట సామ్రాజ్యం క్రీ.శ.973లో తైలపుడు కూలదోశాడు. 10వ శతాబ్దం దాకా రాష్ట్రకూట సామ్రాజ్యం నిలిచి ఉంది. ఈ కాలం నాటికే ఆంధ్రదేశంలో రట్టొడులున్నారని తూర్పు చాళుక్యుల శాసనాలు స్పష్టంగా తెలుపుతున్నాయి. క్రీ.శ.955 అమ్మరాజమహేంద్రుడు, మాడియ రొట్టొడికి మహాసామంత బిరుదులతో అత్తిలి సమీపంలోని పొందువ గ్రామాన్ని ఇచ్చాడు. క్రీ.శ. 955 నాటికి గ్రామస్థాయి నుండి రట్టొడులు సామంత స్థాయికి ఎదిగారు. ఆ నాటికి రాష్ట్రకూట సామ్రాజ్యం పోలేదు. నిలిచే ఉంది. రాష్ట్రకూట వంశంలో అత్యంత ప్రతిభావంతుడైన మూడవకృష్ణుడు పాలిస్తున్నాడు. అతడు క్రీ.శ.939-967ల మధ్య పాలించాడు. అంటే అంతవరకు రాష్ట్రకూట కుటుంబాలు ఉద్యోగాలు వెతుక్కుంటూ

ఆంధ్రదేశంలోని వారి ప్రత్యర్థులైన తూర్పు చాళుక్యుల ఆస్థానానికి రావలసిన అవసరం లేదు. మూడవ కృష్ణుని కాలంలోనే క్రీ.శ.955లో తూర్పు చాళుక్య అమ్మరాజమహేంద్రుడు మాడియ రట్టోడికి పొందూరు గ్రామాన్ని ఇచ్చాడు. కనుక ఆంధ్రదేశంలో అప్పటివరకు ఉన్న రట్టోడులు రాష్ట్రకూట కుటుంబానికి చెందినవారు కాదని తేలుతోంది. రాష్ట్రకూటులే వారి సామ్రాజ్యం పోయిన తర్వాత ఆంధ్రదేశంలో స్థిరపడి నేటి రెడ్లుగా మారారనేది సరియైన అభిప్రాయం కాదని ఈ గ్రంధ రచయిత అభిప్రాయపడుతున్నారు. రెడ్డినాడు ఆగస్టు- సెప్టెంబర్, 1916 సంచికలో ఈమని శివనాగిరెడ్డి మాల్ఖేడ్ నుండి దక్షిణంగా వలస వచ్చి తెలుగుదేశంలో స్థిరపడి రాష్ట్రకూట ప్రముఖులుగా పిలువబడి తర్వాత రట్టొడ్లు, రెడ్లుగా మారారని రాశారు. కాని వారి సిద్ధాంతం కూడా అంగీకరించడానికి వీలులేదు. వారి సిద్ధాంతాన్ని అంగీకరిస్తే 9వ శతాబ్దానికి ముందు ఆంధ్ర దేశంలో రెడ్లు లేరని, ఆ తర్వాత వలస వచ్చిన వారేనని అంగీకరించవలసి ఉంటుంది. రాష్ట్రకూటులను కూడా మహారాష్ట్రానికి చెందినవారని చెప్పడానికి వీలులేదు. వారు తాము లట్టలూరు పురాధీశులమని తమ శాసనాలలో చెప్పుకున్నారు. లట్టలూరుపురం కర్ణాటకంలోని ఎల్లోరా ప్రాంతానికి రాష్ట్ర పాలకులుగా నియమించినందువల్ల దంతిదుర్గుని పూర్వీకులు లట్టలూరు నుండి మహారాష్ట్రం వెళ్ళారు. కుళోత్తుంగుని ద్రాక్షారామ శాసనాల్లో రట్టడము, రాష్ట్రకూట పదాలు రెండూ వాడబడ్డాయి. రట్టడము తెలుగు పదం. తెలుగులో మొదట శాసనాలు వేయించినవారు రేనాటిచోళులు. వారే మొదట తెలుగులో ఈ పదాన్ని వాడారు. ఆనాటి నుండి ఈ తెలుగుపదం ఆంధ్రదేశంలో వాడుకలో ఉంది. రాష్ట్రకూట పదం సంస్కృతంలో 8వ శతాబ్దంలో వచ్చింది. రాష్ట్రకూట సామ్రాజ్యం పతనం తర్వాత కొన్ని రాష్ట్రకూట కుటుంబాలు ఆంధ్రదేశంలో కళ్యాణీచాళుక్యులు చోళచాళుక్యుల వద్ద ఉద్యోగాలు సంపాదించి ఉండవచ్చును. అప్పుడు అంతకుముందు ఉన్న రట్టోడులకు, కొత్తగా వచ్చిన రాష్ట్రకూట కుటుంబాలకు భేదాన్ని చూపుతూ రట్టడము రాష్ట్రకూటం అనే రెండు పదాలు వాడి ఉండవచ్చును. కనుకనే రట్టోడులలో దేశరట్టోడి అనే పదం పుట్టి ఉంటుంది. అంటే 7వ శతాబ్దం నుండి ఆంధ్రదేశంలో ఉన్న వారు దేశరట్టోడులుగాను, తర్వాత వచ్చిన రాష్ట్రకుటుంబాలవారు రాష్ట్రకూటులుగా పిలువబడి ఉంటారు. వారిలో తేడా చూపించడానికి కుళోత్తుంగ శాసనాలలో రెండు పేర్లు పేర్కొనబడి ఉంటాయి. ఓంగేరు మార్గాన్ని పాలించిన వారిని దేశరట్టాలుగా పిలిచారు. కనుక నేరాటి ప్రాంతం నుండి ఉత్తరంగా వచ్చిన పూర్వపు రధిక కుటుంబాలు రట్టకుడి అనే పేరుతో ఓంగేరు మార్గంలో నివసించి ఉండవచ్చును. వారే దేశరట్టోడులుగా ప్రసిద్ధి చెంది ఉంటారు. దేశరట్టోడ్లే దేసట్లుగా మారి ఉంటుంది. దేసట్లు నివసించిన ఒక గ్రామానికి దేసట్లపురం అని కూడా పేరువచ్చి ఉండవచ్చును. కొండవీటి రెడ్డి వంశం కూడా ఈ ప్రాంతానికి చెందినదే. కనుక వారు దేశరట్టోడులుగా, దేసటి పురాధీశ్వరులుగా పిలువబడి ఉంటారు. కనుక ఆంధ్రదేశంలోని రెడ్లు క్రీ.శ. తొలి శతాబ్దాలలో నేలకొండపల్లి, ధరణికోట వీరాపురాలలో పాలించిన రధికుల సంతతి వారేగాని 9-10 శతాబ్దాలకు చెందిన రాష్ట్రకూటుల సంతతి వారు కాదని స్పష్టంగా చెప్పవచ్చును. అలాగే రెడ్లు ఆంధ్రదేశపు స్థానికులేగాని మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి వలసవచ్చిన వారు కాదని ఈ గ్రంధ రచయిత భావిస్తున్నారు. అయితే వారు ఆంధ్రులు కారు. ఆంధ్రజాతికి భిన్నమయిన రధిక లేక రట్ట జాతికి చెందినవారు. తొలి శతాబ్దాలలో ఆంధ్రదేశంలో ప్రవేశించి తెలుగుదేశంలో స్థిరపడి, తెలుగు భాషా సంస్కృతులను స్వీకరించి, తెలుగు జాతిలో విలీనం చెంది, తెలుగు జాతివారిగా మారిపోయారు.

రెడ్డి పద ఉత్పత్తి

రధిక, రరిక	క్రీ.శ. 1వ శతాబ్దం	వీరాపురం మహరధి వంశస్తుల కాలం
రట్టక	క్రీ.శ. 6వ శతాబ్దం	రేనాటి చోళుల కాలం
రట్టకుడు	క్రీ.శ. 7వ శతాబ్దం	దుమువులు ప్రథమా విభక్తితో పిలువబడిన శబ్దం
రట్టడు	'కు'.పోయినది	
రట్టోడు	తూర్పు చాళుక్యుల కాలం 10వ శతాబ్దం ఉచ్చరణ, రట్టోడిచేను - ఏకవచన ప్రయోగం	
రట్టడ్లు, రట్టళ్లు	బహువచన ప్రయోగం 12వ శతాబ్దం పండితారాధ్యుని రచనలో	
రడ్లు	'ట్ట' పోయింది	
రడ్డి	14వ శతాబ్దం ఉచ్చారణ	
రెడ్డి	తెనాలి రామలింగని ప్రయోగం -17వ శతాబ్దం మల్లారెడ్డి రచన.	

ఈ విధంగా రెడ్డి పద ఉత్పత్తి జరిగి ఉండవచ్చును.

రెడ్లు ప్రత్యేక కులంగా రూపొందటం: 11వ శతాబ్దం నాటికే రట్టొడి అనే పదం కుల సంకేతంగా మారినదని కొందరు అంటారు. కాని దానికి ఎలాంటి ఆధారాలు లేవు. 14వ శతాబ్దం దాకా రెడ్డికులం ఏర్పడలేదు. అంతవరకు కమ్మ, రెడ్డి, క్షత్రియ అనే భేదం లేకుండా అందరూ ఒకరితో ఒకరు వియ్యం అందారు: అనవేమారెడ్డి తన కుమార్తెను చోడభక్తిరాజు కుమారుడైన భీమరాజుకిచ్చి వివాహం చేశాడు. ఆ భీమరాజు కుమార్తెను అల్లాడరెడ్డి వివాహమాడాడు. పెదకోమటి వేమారెడ్డి కమ్మవారైన ధరణికోట వారి రాజకుమార్తె సూరాంబికను వివాహం ఆడాడు. రెడ్డి రాజ్య పతనం తర్వాతనే అంతకుముందు రట్టొడ్లుగా పిలువబడినవారంతా రెడ్డి అనే పేరుతో ఒక కులంగా రూపొందారు.

రెడ్డి శాఖలు -కొండవీటి వంశశాఖ- స్వస్థలం: రట్టొడులు లేక రెడ్లు ఆంధ్రదేశంలోని వివిధ ప్రాంతాలలో నివసించునందు వల్ల శాఖాభేదాలు ఏర్పడ్డాయి. కమ్మనాటి వారు కమ్మ కులస్తులుగా, వెలనాటివారు వెలమ కులస్తులుగా రూపొందినట్లు, వెలనాటి బ్రాహ్మణులు వెలనాటి శాఖగా, కమ్మనాటి బ్రాహ్మణులు కమ్మనాటి శాఖగా ఆరు వేల నియోగులుగా బ్రాహ్మణులలో శాఖాభేదాలు ఏర్పడినట్లు రెడ్లలో కూడా నివసించే ప్రాంతాలను బట్టి శాఖలుగా చీలిపోయారు. రెడ్లలో 7 శాఖలున్నాయని కొందరు, 14 శాఖలున్నాయని మరికొందరు అంటున్నారు. వడ్లలో ఎన్నిరకాలున్నాయో రెడ్లలో అన్ని రకాలున్నాయని ఆంధ్ర ప్రజలలో వాడుక ఉంది.

1. పాకనాటి
2. వెలనాటి
3. మోటాటి
4. మొరస
5. పొంగలినాటి
6. మున్నూటి
7. పంట
8. నేరేటి
9. భూమంచి
10. దేసటి
11. అయోధ్య
12. ఓరుగంటి
13. కురిచేటి
14. గండికోట

ఆరవీడు వంశానికి చెందిన పిన్నమరాజు కుమారుడు బుక్కభూపాలుని కాలంలో 15వ శతాబ్దంలో భట్టురాజు అనే అతడు చాటు పద్యం ద్వారా రెడ్లలోని 14 శాఖలను తెలిపాడు. ఈ పేర్లను బట్టి చూడగా తాము నివసించిన ప్రాంతాలను బట్టి ఈ శాఖాభేదాలు వచ్చినట్లు కనిపిస్తుంది. వీటిలో చాలా పేర్లు ప్రదేశాల పేర్లు. ఈ శాఖలలో కొండవీటి వంశం పంటశాఖకు చెందినవారు. పంటరాష్ట్ర వాసులైనందున వారికి పంట రెడ్లు అని పేరు వచ్చింది. నెల్లూరు ప్రాంతాన్ని పాకనాడు అని పిలిచేవారు. పాకనాటిలో పంటరాష్ట్రం అంతర్భాగంగా ఉండేదని తమ్మసిద్ధి శాసనం వల్ల తెలుస్తోంది. పంట రాష్ట్రంలోని ముట్టియెంబాక్కం అనే గ్రామాన్ని తెలుగు చోడరాజు తమ్మసిద్ధి దానం చేసినట్లు అతడు విడుదల చేసిన శాసనంలో ఉంది. గూడూరు తాలూకాలో ముట్టింబాక అనే గ్రామ ఉంది. తమ్మసిద్ధి దానం చేసిన గ్రామం ఇదేనని గుర్తించారు. కనుక నేటి నెల్లూరు జిల్లాలోని గూడూరు ప్రాంతం పంటరాష్ట్రం అని, అదే కొండవీటి వంశంవారి స్వస్థలమని భావించవచ్చును. శ్రీనాధుని రచనలు కూడా ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. పాకనాటిలోని విక్రమసింహపురం, గండవరాదిపట్నం, దువ్వూరు ప్రాంతాలు పంటదేసటి రాజ్యాధికారానికి కేంద్రాలని శ్రీనాధుడు తన భీమేశ్వర పురాణంలో వివరించాడు. రాజమహేంద్రవర రెడ్డివంశానికి మూల పురుషుడు దువ్వూరి పేర్మాండిరెడ్డి. కనుక పేర్మాండిరెడ్డి వంశస్తులు కూడా పంటశాఖకు చెందినవారే. వారి గోత్రాలు మాత్రమే వేరు. కొండవీటి వారిది వెల్లచేరి గోత్రం. రాజమహేంద్రవర వంశం వారిది పొల్వల గోత్రం. వారు వియ్యంకులు గనుక గోత్రం పేరుగా ఉండాలి. ఈ రెండు కుటుంబాలు నెల్లూరు జిల్లా ప్రాంతానికి చెందినవారే చెప్పవచ్చును. ఈ కొండవీటి వంశ వియ్యంకుడైన దొడ్డరెడ్డి కూడా పాకనాటికి చెందినవాడే. ఈ మూడు కుటుంబాలు నెల్లూరు తెలుగు చోళవంశస్తుల వద్ద సైనిక వృత్తిని చేపట్టి ప్రఖ్యాతిలోకి వచ్చాయని భావించవచ్చును.

ఇదేకాలంలో కొన్ని రెడ్డికుటుంబాలు కాకతీయుల వద్ద కూడా సేనాధిపతులుగా చేరారు. కాకతి మొదటి ప్రోలరాజు దగ్గర బమ్మిరెడ్డి అనే సేనాని ఉండేవాడు. అతనికి బమ్మసేనాని అని కూడా పేరుంది. రెండవ ప్రోలరాజు సేనాధిపతి కామచమూపతి. అతని కుమారులు రేచర్ల బేతిరెడ్డి నామిరెడ్డిలు. కాకతి మొదటి రుద్రదేవుడు గణపతిదేవుల వద్ద సేనానులుగా పనిచేశారు. రేచర్ల వంశానికి చెందిన రుద్రుడు, గణపతి వద్ద సేనాధిపతి. ఇతని వంశస్తులు పిల్లలమర్రి రాజధానిగా కాకతీయ సామంతులుగా పనిచేశారు. కాని రేచర్ల

వంశస్తులు కొందరు రెడ్డి కులస్తులని కొందరు భావిస్తున్నారు గాని, వారు రెడ్డికులస్తులు కారు. వారు వెలమ కులస్తులని చెప్పడానికే ఎక్కువ ఆధారాలున్నాయి. వారు పాలించిన పిల్లలమర్రి, అనుమగల్లు ప్రాంతాలలో తర్వాత రేచర్ల సింగమనాయక రాజ్యం స్థాపించాడు. రేచర్ల కామచమూపతి, బేతిరెడ్డి, నామిరెడ్డి, రేచర్ల రుద్రుడు సింగమనాయకునికి ముందుతరాల వెలమ కుటుంబాలకు చెందినవారై ఉండవచ్చును.

కాకతి రుద్రమదేవి దగ్గర గోన గన్నారెడ్డి, గోన విఠలరెడ్డి సేనానులుగా, సామంతులుగా ఉండేవారు. వారు కూడా రెడ్లని కొందరు భావిస్తున్నారు గాని వారు హైహయ వంశానికి చెందిన క్షత్రియులు.

ప్రతాపరుద్రుని 75 నియోగాధిపరులైన నాయకులలో కొల్లిపాక నాగిరెడ్డి, తాడిమర్తి గన్నారెడ్డి, చంద మల్లారెడ్డి, గడ్డి మన్నారెడ్డి, గోన కోటారెడ్డి ఉండేవారు. ప్రోలయ వేమారెడ్డి కూడా ప్రతాపరుద్రుని నాయంకరులలో ఒకడని భావన ఉంది.

తెలుగు చోళుల వద్ద కూడా రెడ్లు సేనాధిపతులుగా పనిచేశారు. చోడ తిక్కతోపాటు హొయసాలులు పాండ్యులతో రెడ్డిసేనానులు పోరాడినట్లుగా కన్పిస్తోంది. కొండవీటి వంశం తెలుగు చోడతిక్క కాలం నుండే ప్రఖ్యాతిలోకి వచ్చింది. ఎన్ని రెడ్డి కుటుంబాలు సేనాధిపతులుగా చేసినా అది పెద్ద లెక్కలోనిది కాదు. అంతకంటే ఎన్నోరెట్లు సామంతులుగా, మాండలీకులుగా, సేనాధిపతులుగా కమ్మ, వెలమ కులస్తులు పనిచేశారు. రెడ్డికులానికి ఘనకీర్తిని, రాజవంశ హోదాను తెచ్చిన వారు అద్దంకి కొండవీడు రాజ్యాన్ని స్థాపించిన రెడ్డి వంశం మాత్రమే.

కోమటి అని పేరు: కొండవీటి రెడ్డిరాజుల పేర్లలో కోమటి అనే పదం ఉంది. ఈ పదం వారు అంతకు పూర్వం ఒక కోమటిని మోసం చేసి పరుసవేదిని కాజేసినందుకు ఆ కోమటి గౌరవార్థం, కోమటి అనే పేరు పెట్టుకున్నారని ఒక కథ ప్రచారంలో ఉంది. కాని శాసనాలలో కొందరు రెడ్లు వ్యాపారవృత్తిని చేపట్టినట్లు ప్రస్తావనలు ఉన్నాయి. ముమ్మడి భీమవరపు శాసనంలో చోడగొంకరాజుశెట్టి, అయ్యపరడ్డి కొడుకు రడ్డిమాంక అని ఉంది. అలాగే మరొక శాసనంలో భాండారి కొండపరడ్డి కొడుకు పోతిరడ్డి అని లిఖించి ఉంది. ఈ శాసనాలు రెడ్లు, వెలనాటిచోడుల వద్ద రాజశెట్లుగా పనిచేసినట్లుగాను, భాండాగారికులుగా ఉద్యోగాలు చేసినట్లు ధృవపరుస్తున్నాయి. ఆ కాలంలో రాజాంతఃపురం, రాజ దర్బారుకు కావలసిన సరుకులను సరఫరా చేయడానికి శెట్లను నియమించుకునేవారు. వారిని రాజశెట్లు అని పిలిచేవారు. ఇది ఒక రకంగా రాజదర్బారు, అంతఃపురానికి కావలసిన సరుకులను సప్లయి చేయడానికి ఇచ్చే కాంట్రాక్టు లాంటిది.

కొండవీటి రెడ్డిరాజులకు కూడా అవచి దేవయశెట్టి, అతని కుమారుడు అవచి తిప్పయశెట్టి రాజశెట్లుగా నియమింపబడినట్లు శ్రీనాథుడు పేర్కొన్నాడు. అలాగే వెలనాటి చోడులకాలంలో రెడ్లు కొందరు రాజశెట్లుగా ఉన్నారని, ఆ రెండు శాసనాలు తెలుపుతున్నాయి. శెట్లనే కోమట్లు అని కూడా అనేవారు. నేడు కూడా కోమటిశెట్టి అని పిలుస్తారు. వ్యాపారం, లెక్కలలో నిష్ణాతులైన వారినే రాజభాండారికులుగా నియమించేవారు. దీనిని బట్టి కొండవీటి రెడ్లు కూడా అంతకుపూర్వం వ్యాపారవృత్తిని చేసి కోమటి అనే బిరుదు పొందినట్లుగా ఊహించటానికి అవకాశం కలుగుతోంది. అలాగే దేశట్టి అనే పదం కూడా దేసశెట్టికి పర్యాయపదం అని కొందరు అంటున్నారు. ఆ పదంలోని 'స'పోయి దేశట్టి అయి ఉండవచ్చునని వారి భావన. కనుక దేసశెట్టి, కోమటి అనే రెండు పదాలు వ్యాపారవృత్తిని సూచిస్తున్నాయి.

కొండవీటి సామ్రాజ్య రచయిత మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ గారు కొండవీటి వంశాన్ని గురించి భిన్నమైన వివరాలు ఇచ్చారు. వారి ప్రకారం కొండవీటి వంశస్తులు దొంతివారు. వారికి మూలపురుషుడు అల్లారెడ్డి పంటకులం. అతడు నిజాం రాజ్యంలోని చదలవాడ గ్రామ నివాసి. అతడు అక్కడి నుండి హనుమకొండ వచ్చాడు. తర్వాత గుంటూరు మండలంలోని కవులూరు చేరాడు. తర్వాత అతడు క్రీ.శ.1225లో ధరణికోటకు వచ్చి అక్కడ స్థిరపడి ధరణికోట దుర్గాధ్యక్షుడయ్యాడు. వారి వంశస్తుడు అక్కడ పాలించారు. వారిలో ప్రోలయ వేమారెడ్డి కాకతీయ ప్రతాపరుద్రుని ఓడించి స్వతంత్రం ప్రకటించి క్రీ.శ.1320లో ధరణికోటలో పుట్టకోట నిర్మించాడు అని వివరించారు. ఇదే విషయాన్ని రెడ్డినాడు ఆగస్టు-సెప్టెంబర్ 1996 సంచికలో చదలవాడ ఒంగోలు జిల్లాలో ఉందని, అక్కడ రెడ్డి కుటుంబాలు నివసిస్తూ ఉండేవారని, వారి కులదైవం రాఘవస్వామి అని, వారినే దొంతివారని పిలిచేవారని, వారిని గురించి ఒక కథ ఉందని ఈ విధంగా వివరింపబడింది. ఒకరోజున దొంతి కుటుంబం వారు భూమిని దున్నుతుండగా వారికి పెద్ద నిధి దొరికింది. అది వెల్లడి అయిపోగా గ్రామస్తులు ఆ నిధిని గ్రామానికి అప్పగించాలని కోరగా ఏమి చేయటానికీ తోచలేదట. అప్పుడు వారికి వారి కులదైవం రాఘవస్వామి కలలో

కనిపించి మరొక ప్రదేశానికి వెళ్లిపొమ్మని ఆదేశించాడట. స్వామి తన బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చెయ్యాలని కూడా చెప్పాడట.. అప్పుడు వారు చదలవాడను విడిచిపెట్టి తెలంగాణలోని హనుమకొండకు వెళ్లిపోయారట. కొంతకాలం అక్కడ ఉండి వారి వంశానికి చెందిన అల్లాడరెడ్డి కొండవీడుకు వచ్చి అక్కడ రాజ్యస్థాపన చేశారని, అదే కొండవీటి రాజ్యం అని ఈమని శివనాగిరెడ్డి రాశారు.

కొండవీటి రెడ్ల వంశం: కొండవీటి దండకవెలె, కైఫీయత్తులు కొండవీటి రెడ్లు దొంతివారని చెబుతున్నాయి. కాని రెడ్డి శాసనాలలో గాని సాహిత్యంలోగాని ఆ ఇంటి పేరు కనిపించదు. వారు పంటాన్వయులని దేసటి వంశస్థులని పేర్కొంటున్నాయి. ఎర్రాప్రెగడ తన హరివంశంలో ప్రోలయవేముని దేసటి వేమ సమస్త ధీరలలామా అని సంబోధించాడు. శ్రీనాథుడు చతుర్థకుల మండన బెకీర్తివిహారఘంటాపథంబైనపంట దేసటి మహాన్వయంబున అని వర్ణించాడు. రాజమహేంద్రవర వీరభద్రారెడ్డిని మద్దేసంటివంశ గ్రామణి అని వర్ణించాడు. వీరభద్రారెడ్డి సమకాలికులైన కొమ్మనామాత్యుడు, రాజమహేంద్రవర వంశాన్ని కూడా దేసటి వంశస్థులని వర్ణించాడు.

దేసట్టి పద ఉత్పత్తి: దేసట్టి అనే పదం కొండవీటి రెడ్లకు ఇంటి పేరుగా తెల్పబడింది. ఈ పదం కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 10-11-12 శతాబ్దాల శాసనాలలో అనేకమంది నాయకుల పేర్ల చివరన కనిపిస్తోంది. కొనకొంద్రవాడి వంశకర్త కొండదేశాటిగా పేర్కొనబడ్డాడు. వినుకొండ మండలంలోని ఇనుమెళ్ల గ్రామంలో కాత్యదేశాటి లేక కాటయదేశాటి ప్రస్తావన ఉంది. ఓంగేరు మార్గాన్ని పాలించిన మాండలీకులు దేశాటి మహా సామంతులుగా పేర్కొనబడ్డారు. క్రీ.శ.1043 నాటి వలివేరు శాసనంలో తెనాలి తాలూకాను పాలించిన మాండలీకుడు గుండయను దేశాటి సామంతుడని అతని తండ్రి నంబయ్య అని రాశారు. వెలనాటి కులోత్తుంగ పృథ్వీశ్వరుని సేనాని ఈరపనాయకుని, గద్యన కుమారుడని ఈరప దేశాటి మనుమడని తెలపబడింది. క్రీ.శ.1229 నాటి బెజవాడ శాసనంలో చతుర్థ కులానికి చెందిన మల్లదేశాటి ప్రోలదేశాటి కుమారుడని చెప్పబడింది. ఈ దేశాటి పదం కొంత మంది రెడ్డి రాజులకు కూడా ఉంది.

ప్రోలయ వేమారెడ్డిని ఎర్రాప్రెగ్గడ దేశాటివేమ అని, శ్రీనాథుడు, కొమ్మనామాత్యుడు వీరభద్రారెడ్డిని దేశాటి వంశస్థుడని పేర్కొన్నారు. ఈ పద ఉత్పత్తి గురించి మరొక అభిప్రాయం ఉంది. రట్టొడులలో రెండు రకాలున్నారు. ఆంధ్ర దేశంలోని స్థానిక ప్రజలు కొందరు రట్టొడులుగా నియమింపబడ్డారు. మరికొందరు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి అంటే రాజ్యం పోగొట్టుకున్న రాష్ట్రకూట వంశస్థులు వచ్చి తూర్పుచాళుక్యుల వద్ద రట్టోడులుగా ఉద్యోగాలు సంపాదించారు. పరాయి ప్రాంతాల నుండి వచ్చిన వారిని రట్టోడులని, దేశ ప్రజల నుండి ఆ పదవి పొందిన వారిని దేశ రట్టోడులని పిలిచేవారట.

ఈ దేశరట్టోడు పదమే క్రమేపి దేసట్లు అని మారిందని వారు అంటారు. కనుక ఆంధ్ర దేశానికి చెందిన కొంతమంది రట్టొడులుగా నియమింపబడి దేశ రట్లోలుగా చివరకు దేసట్లుగా ప్రసిద్ధి చెందారని, దేశరట్టొడి అనే పదవి క్రీ.శ.1230 వరకు వాడుకలో ఉన్నట్లు శాసనాధారాలున్నాయి. కనుక దేశరట్టొడికి హ్రస్వరూపమే దేసట్టులు, దేసటివారు అని ఆచార్య పిసుపాటి శ్రీరామశర్మ వివరణ ఇచ్చారు. కనుకనే గుంటూరు మండలానికి చెందిన అనేక మంది దేసటి నాయకులని శాసనాలు తెలుపుతున్నాయి. ఓంగేరు మార్గం లేక ఓగేరు నది ప్రవహించే ప్రాంతాన్ని దేసటి మహాసామంతులు పాలించినట్లు కూడా శాసనాలున్నాయి. కనుక ఆనాటి అనేకమంది సైనిక నాయకులు దేసటి వారని శాసనాలు పేర్కొంటున్నాయి. అలాంటి వారిలో కొండవీటి కుటుంబం కూడా ఒకటి అయి ఉండవచ్చని, కనుక వారు స్థానిక రట్టడి కుటుంబానికి చెందిన వారని వారు భావించినట్లుగా కనిపిస్తోంది. కనుక దేసటి అనేది పదవి అని, అదే వారి ఇంటి పేరుగా మారిందని మరొక అభిప్రాయం ఉంది. క్రీ.శ.1147 నాటి కొడిదెస శాసనంలో నాయక, క్షత్రియులతో పాటు దేసట్లు అనే ప్రయోగం ఉంది.

దేసట్లపురం: కాని ఈ పేరు వారు నిర్వహించిన పదవి వల్ల గాక దేసి అనే పురం నామం వల్ల వచ్చినట్లుగా కనిపిస్తోంది. కాకతీయ ప్రతాపరుద్రుని 75 మంది నాయకుల బిరుదులలో దేశట్ల పురాధీశ్వరుడు ఒకరు ఉన్నారు. క్రీ.శ.1005 నాటికి చెందిన కళ్యాణం చాళుక్య సత్యాశ్రయుని సామంతుడైన మహాసామంత శోభరసుని శాసనంలో దేసటిదుర్గ ప్రస్తావన ఉంది. అతడు దేసటిగిరి దుర్గమల్ల అనే బిరుదు వహించాడు. కనుక దేసట పట్టణం ఒకటి ఉందని తెలుస్తోంది. పూర్వం రెడ్డిరాజుల పూర్వీకులు దేసటి పురాధిపతులు అయి ఉంటారు. అందువల్ల వారికి దేసటి అనే ఇంటి పేరు వచ్చి ఉంటుంది. ఓంగేరు మార్గం లేక ఓగేరు నది ప్రవహించే

ప్రాంతాన్ని దేసటి మహాసామంతులు పాలించినట్లు ఆధారాలున్నాయి. గుంటూరు మండలంలోని అనేక మంది నాయకులు దేసటివారని శాసనాలు తెలుపుతున్నాయి. కనుక దేసట్ల అనే పదం ఉన్నట్లు, అదే వారి ఇంటి పేరుగా, వంశంగా శాసనాలు వెల్లడిస్తున్నాయి. 10-12 శతాబ్దాలలో తెలుగు ప్రజలకు తమ ఊరి పేర్లు ఇంటి పేర్లుగా, వంశం పేర్లుగా ఉండేవి కావు. 10-12 శతాబ్దాల వరకు ఆంధ్రదేశంలో బౌద్ధ జైనమతాలు ఉండేవి. 12వ శతాబ్దం తర్వాత బౌద్ధులు, జైనులు మొత్తం హిందూమతంలో ప్రవేశించారు. వారికి ఇంటి పేర్లు, గోత్రాలు, సూత్రాలు ఇవ్వవలసి వచ్చింది.

కనుక వారి ఊరి పేర్లే ఇంటి పేర్లుగా ఇచ్చారు. దాంతోపాటు తలా ఒక గోత్రం, సూత్రం కూడా ఇచ్చారు. దాంతో వారందరూ హిందువులుగా గుర్తింపబడ్డారు. అప్పటి నుండి ఆంధ్రులకు ఇళ్ల పేర్లు పెట్టుకునే ఆచారం వచ్చింది. కనుక వీరికి దేసటి వంశస్తులు అని పేరు వచ్చి ఉంటుంది. దానినే ఎర్రాప్రెగ్గడ, శ్రీనాథులు తమ కావ్యాలలో పేర్కొని ఉంటారు. కాకతి గణపతి దేవుని సేనాధిపతులలో కూడా దేసటి నాయకులు ఉన్నట్లుగా కొన్ని శాసనాలు సూచిస్తున్నాయి.

దొంతి వంశం: కొండవీటి దండకవిలె కైఫీయత్తులు దొంతివారని పేర్కొన్నాయి. అందుకు కూడా కారణం ఉందని కొండవీటి సామ్రాజ్య రచయిత మద్దులపల్లి గురుబ్రహ్మ శర్మ ఈ విధంగా సమర్థించుకున్నారు. కొండవీటి వంశస్తులు దేసటిపురాధీశులు కాకముందు వారి ఇంటి పేరు దొంతివారు అని అన్నారు. తర్వాత వారు దేసటి పురానికి వచ్చి స్థిరపడినందువల్ల వారి ఇంటి పేరు దేసటిగా మారి ఉంటుందని, ఆ కాలంలో ఊరు మారినప్పుడల్లా ఇంటి పేర్లు మారడం సర్వసాధారణం అని అన్నారు. కనుక మొదటి వారి ఇంటి పేరు దొంతివారు, తర్వాత దేసటి వారయ్యారని గురుబ్రహ్మం భావించారు.

మనుమ కులం: అనవేమారెడ్డి, కుమారగిరి శాసనాలలో వారు తమ వంశం మనుమ కులానికి చెందిందని, వారు మనుమకుల సముద్రానికి చంద్రుని వంటి వారమని చెప్పుకున్నారు. శాలి శకం 1085 కాలానికి చెందిన కోటిరెడ్డి మనుమ కులానికి చెందినవాడని భావిస్తారు. అలాగే కొంతమంది నాయకరాజులు మనుమ కులానికి చెందినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

శాలిశకం 1082 నాటికి చెందిన మల్లనాకుడు శక 1275 నాటికి చెందిన మర్థాలి మారయనాయకుడు గణపతినాయకుని ఆస్థానంలో పనిచేసిన కల్పనాయకుడు తాము మనుమకులస్తులమని చెప్పుకున్నారు. కొండవీటి అనవేముడు, కుమారగిరిలు తాము ఎందుకు మనుమ కులానికి చెందినవారమని చెప్పుకున్నారో తెలియదు. ఆ కాలంలోని ఆంధ్రదేశపు రాజవంశాలకు మనుమకులం, దినకరకులం, సోమకులం, దుర్జయకులం మూలాలని శాసనాలు సూచిస్తున్నాయి.

పల్లవ వంశం: ప్రోలయ వేమారెడ్డి, అనవేమారెడ్డి పల్లవాదిత్య, పల్లవ త్రినేత్ర అనే బిరుదులను ధరించారు. అందువల్ల కొండవీటి రెడ్డిరాజులు పల్లవ వంశానికి చెందిన వారనే భావన కూడా ఉంది. కంచిని పాలించిన పల్లవ వంశం అంతరించిన తర్వాత కూడా కొన్ని సామంత వంశాలు తాము పల్లవ వంశస్తులమని త్రిలోచన పల్లవుని వారసులమని చెప్పుకున్నారు. వారిలో నెల్లూరు పల్లవులు ఒకరు.

వీరి రాజ్యం పోయిన తర్వాత వారి వంశస్తులు క్రీ.శ.1273 శతాబ్దాలలో కోల ప్రభువుల వద్ద నుంచి మాన్యాలు పుచ్చుకున్నారట. పల్లవ వంశస్తులకు మాన్యాలు ఇచ్చిన నాయకులకు, రెడ్డి వంశస్తులకు వివాహ సంబంధాలు ఉన్నాయి. కనుక ఈ వివాహ సంబంధాల వల్ల రెడ్లు పల్లవ వంశస్తులుగా పరిగణింపబడ్డారని, అందువల్ల వారు పల్లవ త్రినేత్ర, పల్లవాదిత్య అనే బిరుదులు ధరించారని కొందరు భావించారు. కాని అది వాస్తవంగా కనిపించదు. నెల్లూరు చోళతిక్క పల్లవ వంశానికి చెందిన కొప్పెరుజింగని వంశస్తులతో పోరాడినప్పుడు కొండవీటి వంశస్తులు ఆ యుద్ధాలలో పాల్గొని కొప్పెరుజింగుని పూర్వీకులనెవరినో సంహరించారని, అందువల్ల వారు అళిగియవరద శిరఃఖండన అనే బిరుదుతో పాటు పల్లవత్రినేత్ర, పల్లవాదిత్య అనే బిరుదులు ధరించారని చరిత్రకారులు భావిస్తారు.

బి.ఎస్.శాస్త్రి రచించిన ఆంధ్రదేశ చరిత్ర-సంస్కృతి రెండవ భాగంలో ఇవ్వబడిన కొండవీటి వంశవృక్షం: కొండవీటి వంశానికి మూలపురుషుడు కామభూపాలుడని చిలుకరి వీరభద్రరావు తాము రచించిన ఆంధ్రుల చరిత్రలో పేర్కొన్నారు. అదే ఆధారంగా బి.ఎస్. శాస్త్రి కామభూపాలుని మూలపురుషునిగా తీసుకొని ఈ వంశ వృక్షాన్ని రూపొందించి ఉంటారు.

కామభూపాలుడు

వేమ భూపాలుడు

ప్రోలయరెడ్డి

- మాచారెడ్డి
  - రెడ్డిపోత
    - పెదకోమటి వేమ 1402-1420
      - రాచవేమారెడ్డి 1420-1424
    - మాచా
  - పెదకోమటి
  - నాగ
- ప్రోలయవేమారెడ్డి క్రీ.శ.1325-1353
  - అనపోతారెడ్డి 1353-1364
  - అనవేమారెడ్డి 1364-1386
    - కొమరగిరిరెడ్డి 1386-1402
      - అనపోత
    - దొడ్డాంబిక భర్త కాటయవేమారెడ్డి
  - దొడ్డాంబిక భర్త కాటయరెడ్డి
- అన్నయ భార్య వేమసాని
- దొడ్డ
- మల్ల

కొండవీటి దండకవిలె ఇచ్చిన వంశవృక్షం: కొండవీటి చరిత్ర తెలిపే కొండవీటి దండకవిలెను కల్నల్ మెకంజీ ప్రోద్భలంతో పులిగడ్డ మల్లయ్య క్రీ.శ.1812 మార్చి 26వ తేదీ బుధవారంనాడు ప్రారంభించాడు. కల్నల్ మెకంజీ క్రీ.శ.1810లో సర్వేయర్ జనరల్‌గా పదవిని చేపట్టాడు. ఈ గ్రంథం కొండవీటి పాపయ్య వద్ద లభించింది. కొండవీటికి సంపుటం వారు కరణాలుగా ఉండేవారు. వారిలో జయని నాగభట్టు, తర్వాత సంపుటం కోనప్ప కొండవీటి కరణాలుగా చేశారు. వారిలో జయని నాగభట్టు శాలిశకం 1250 అంటే క్రీ.శ.1328 లో కరణంగా పనిచేశాడు. తర్వాత సంపుటం కోనప్ప కొండవీటి కరణంగా చేశారు. తర్వాత వారి ఇంటి పేరు కొండవారుగా మారింది. వీరు రాసిన కైఫీయత్తుల ఆధారంగా పులిగడ్డ మల్లయ్య కొండవీటి కైఫీయత్తును రాశాడు. దానిని బట్టి క్రీ.శ.1338 నాటికే కొండవీడు గ్రామం ఉందని స్పష్టమవుతోంది. అసలు కాకతి గణపతి దేవుని కాలంనాటికే అక్కడ ఒక కోట ఉన్నట్లు మోటుపల్లి శాసనం తెలుపుతోంది. మోటుపల్లి శాసనంలో కొండపట్టణే అని పేర్కొంది. కొండవీటి పాపప్ప కొండవీటి కరణాల వారసుడు. అతని వద్ద లభించిన కైఫీయత్తులను సేకరించి క్రీ.శ.1907-1920-1935 సంవత్సరాలలో మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ కొండవీటి సామ్రాజ్యం అనే గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథంలో ఇవ్వబడిన కొండవీటి రెడ్డి రాజుల వంశవృక్షం.

వేమయ

కోమటిప్రోల - భార్య అన్నమ్మ

- మాచయ (చందోలు శాఖ)
  - రెడ్డిపోత
  - పెదకోమటి
    - పెదకోమటి వేమయ
      - రాచవేమ
    - మాచయ
  - నాగయ
- దేసటివేమ లేక ప్రోలయ వేమ (పల్లవ త్రినేత్ర)
- దొడ్డయ
  - అనపోతయ
  - కోమటి వేమయ
  - అనవేమయ
  - దొడ్డాంబ భర్త కాటయ
  - వేమాంబ భర్త నల్లనూకయ్య
- అన్నయ
- మల్లయవేమ (వల్లభయ)

కందుకూరు శాఖ

మల్లయవేమ (వల్లభయ)

పినకోమటి

శ్రీగిరి | మాచక

కోమటి | మల్లయ | అనవేమ | నారాయణ

వీరి మాతామహవంశం అంటే ప్రోలయ వేమారెడ్డి తల్లి అన్నమ్మ వంశం.

దొడ్డయ

ప్రోలయ | చిట్టయ్య | నాగయ | అన్నమ్మ లేక అన్నెమాంబ కోమటి ప్రోలుని భార్య ప్రోలయ వేమారెడ్డి తల్లి

నల్లనూకయ్య
హేమాంబ భర్త

ముట్లూరి శాసనం ఇస్తున్న వంశవృక్షం: ప్రోలయ వేమారెడ్డి కాలంనాటి ముట్లూరు శాసనం ప్రోలయ వేమారెడ్డికి ముందు రెండు తరాల వారిని పేర్కొంటోంది. శాసనాలు రాసేటప్పుడు శాసనకర్త తండ్రి, తాతలను పేర్కొనడం ఆనవాయితీ. కనుక ప్రోలయ వేమారెడ్డికి ముందు రెండు తరాల వారి పేర్లే రాసి ఉంటారు. అంతకుముందు వారి పేర్లు తెలిసినా వదిలేసి ఉంటారు. కనుక ఈ శాసనంలోని మొదటి వ్యక్తి అయిన వేమనే కొండవీటి వంశానికి మూలపురుషునిగా భావించారు.

వంశవృక్షం

వేమ క్రీ.శ.1250-1270

ప్రోల క్రీ.శ.1270-1295- భార్య అన్నెమాంబ (దొడ్డారెడ్డి కుమార్తె)

మాచారెడ్డి | వేమ | దొడ్డ | అన్నయ | మల్లారెడ్డి

ఈ శాసనంలో పేర్కొనబడిన వేమ కొండవీటి వంశకర్తగా చరిత్రకారులు భావిస్తున్నారు. అతనిని గురించిన వివరాలు ఈ శాసనంలో లేవు. అతడు సేనాధిపతి అని మాత్రమే అందులో పేర్కొన్నారు. అతని కుమారుడు ప్రోలరెడ్డి. అతనికి కోమటి ప్రోల అనే పేరు కూడా ఉంది. క్షమానాధుడు అని మరొక పేరు కూడా ఉందని అదే శాసనం తెలుపుతోంది. ఇతని భార్య అన్నెమాంబ లేక అన్నమ్మ. ఆమె పాకనాటికి చెందిన దొడ్డారెడ్డి కుమార్తె. ఈ దంపతులకు ఐదుగురు పుత్రులు కలిగారు. మాచారెడ్డి, ప్రోలయ వేమారెడ్డి, దొడ్డారెడ్డి, అన్నయరెడ్డి, మల్లారెడ్డి. వీరిలో రెండవ కుమారుడైన ప్రోలయ వేమారెడ్డి అద్దంకి రాజ్యస్థాపకుడు. రాజ్యస్థాపనలో ఇతనికి సోదరులందరూ సహకరించారు. ప్రోలయ వేమారెడ్డికన్న పెద్దవాడైన మాచారెడ్డి ఉన్నప్పటికీ రాజ్యస్థాపకుడు ప్రోలయ వేమారెడ్డేనని శాసనాలు తెలుపుతున్నాయి.

పువ్వాడ శాసనం వంశకర్త వేమ అని చెబుతోంది. అతని కుమారుడే ప్రోల. ఇతనికి, అన్నెమాంబకు ఐదుగురు కుమారులు జన్మించారు. వారిలో ప్రోలయవేముడే అద్దంకి రాజ్యస్థాపకుడు.

కోమటి - వేమ అనే పదాలు: ఈ వంశస్తులలో అనేకమందికి కోమటి, వేమ అనే పేర్లున్నాయి. అద్దంకి రాజ్యస్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డికి కూడా కోమటీంద్రుడు అనే పేరుంది. కొండవీటి దండకవిలె, కొండవీటి కైఫీయత్తులలో ఒక కథ రాసి ఉంది. వంశకర్త వేమారెడ్డి, వేమన అనే పేర్లు కలిగిన కోమటిని మోసం చేసి అతని దగ్గరున్న ఇనుమును బంగారంగా మార్చే ఒక పరుసువును అంటే రాయిని కాజేశాడని, ఆ దుఃఖాన్ని భరించలేక కోమటి అగ్నిప్రవేశం చేసి ఆత్మాహుతి చేసుకున్నాడని, తర్వాత అతడు వేమారెడ్డికి కలలో కనిపించి తనకు నిజం

తెలిసిందని, తన పరసుపు ద్వారా తయారు చేసిన బంగారాన్ని దానధర్మాలకు, మంచిపనులకు వినియోగించాలని ఆదేశించి వారి వంశం వారు తన పేరు పెట్టుకోవాలని, లేకపోతే వారి వంశాన్ని నాశనం చేస్తానని బెదిరించాడని, అందువల్ల ఈ వంశస్తులు తమ పేర్లలో కోమటి, వేమ అనే పదాలను చేర్చుకున్నారని కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ప్రోలయ వేమారెడ్డి మాంచెళ్ల తామ్ర శాసనంలో స్వర్ణకర ప్రసిద్ధియేలబ్దవా అనే వాక్యం ఉంది. దానినిబట్టి పై గాథలో కొంత యదార్థం ఉన్నట్లు తెలుస్తుంది.

కాని ఈ సిద్ధాంతాన్ని ప్రస్తుతం ఎవరూ ఆమోదించటం లేదు. 1907వ సంవత్సరంలో వారు ఆ గ్రంథాన్ని రాసేనాటికి పెద్దగా పరిశోధనలు జరగలేదు కాబట్టి దండకవిలెలో చెప్పిన విషయాలే యదార్థమని భావించి ఉండవచ్చు. ఇప్పటివరకు జరిగిన పరిశోధనల ప్రకారం దండకవిలెలో రాసిన విషయాలు వాస్తవాలు కావని నేటి చరిత్రకారులు భావిస్తున్నారు. అదే విషయాన్ని చర్చిస్తూ త్రివేణి పత్రిక 1933 నవంబర్ నెల 278వ పేజీలో ప్రోలయ వేమారెడ్డి నెల్లూరు ప్రాంతం వాడని రాసింది. పరిశోధనలలో తెలియవచ్చిన నూతన సమాచారంతో కొండవీటి దండకవిలె ఇచ్చిన సమాచారం తప్పని చరిత్రకారులు నిర్ణయించారు.

కొండవీటి వంశస్తుల పూర్వచరిత్ర- క్రీ.శ.1225-1300: కొండవీటి వంశస్తుల పూర్వచరిత్ర తెలుసుకోవడానికి మనకు తగిన ఆధారాలు లభించలేదు. కనుక వారి పూర్వచరిత్రను గురించిన స్పష్టమైన అవగాహన లేదు. వారు ధరించిన బిరుదులను బట్టి వారి పూర్వపు స్థితిగతులు కొంతవరకు గ్రహించబడ్డాయి. వారి ఆస్థాన పండితులు ఎఱ్ఱాప్రెగడ, శ్రీనాధుడు రచించిన హరివంశం, కాశీఖండం, భీమేశ్వర పురాణాలలో రెడ్డి రాజులు ధరించిన కొన్ని బిరుదులు పేర్కొనబడ్డాయి. అలాంటి వారు విడుదల చేసిన కొన్ని తామ్ర శిలాశాసనాలు కూడా వారి బిరుదులను ప్రస్తావిస్తున్నాయి.

అప్పయ్య - గొప్పయ్య దిశపట్టు - జగనొబ్బగండ
దన్నెన - గొవ - అళగియ వరద - శిరఃఖండన
పల్లవ త్రినేత్ర - పాండ్యరాయ గజకేసరి - చెంచుమలచూరకార
గజ్జరితట్టు విభాళ - రాచూరు దుర్గ విభాళ

అనేయ మండలి కరగండ అనే బిరుదులు ధరించారు. ఈ బిరుదులన్నీ క్రీ.శ.1330 ముందే కనిపిస్తున్నాయి. కనుక ఆ బిరుదులు అంతకుముందే సాధించి ఉండాలి. అప్పయ్య గొప్పయ దశపట్టు అనే బిరుదు, ఆ పేరు కలిగిన వ్యక్తులపై సాధించిన విజయాల్ని బట్టి అలాంటి బిరుదులు పెట్టుకొని ఉంటారు. ద్వారసముద్ర హొయసాల రెండవ వీరనరసింహ దేవుని సేనానులలో అప్పయ గొప్పయ అనే వారు ఉన్నారు. తిరువేందిపుర శాసనం ఈ సేనాధిపతుల విజయాలను పేర్కొంటోంది. అంతేకాక గొప్పయకు దండిగొప, జగనొబ్బగండ అనే బిరుదులున్నట్లు కాంచీపుర శాసనం తెలుపుతోంది. జగనొబ్బగండ అంటే ప్రపంచ ఏకైక వీరుడని అర్థం. చాళుక్య చోళచక్రవర్తి మూడవ రాజరాజు కాలంలో సామంతుల తిరుగుబాట్లు జరిగాయి. వాటి నాసరాగా తీసుకొని హొయసాల రెండవ వీరనరసింహుడు, అతని కుమారుడు సోమేశ్వరుడు చోళరాజ్యంపై దండెత్తారు. చోళరాజరాజు తరపున నెల్లూరి చోడతిక్క హొయసాల సైన్యాలతో యుద్ధం చేశాడు. కొండవీటి రెడ్ల పూర్వీకులు చోడతిక్క వద్ద సేనాధిపతులుగా కొలువు చేస్తూ ఈ యుద్ధంలో పాల్గొని హొయసాల సేనానులైన అప్పయ గొప్పయలను ఓడించారు. ఆ కాలంలో ఓడిపోయిన వారు తమ లాంఛనాలను విజయం సాధించిన వీరులముందు ఉంచుతారు. గెలిచినవారు వారి లాంఛనాలను స్వీకరించి వారి బిరుదులను కూడా తాము పొంది ధరిస్తారు. అది నాటి ఆచారం. కనక హొయసాల సేనానుల బిరుదులైన దండిన గొప, జగనొబ్బగండ, దిశపట్ట అనే బిరుదులు తమ పూర్వీకులు సంపాదించారు. కనుక కొండవీటి రెడ్డి రాజులు వాటిని తమ వారసత్వంగా ధరించి ఉంటారు.

అలాగే అళగియ వరద శిరఃఖండన పల్లవ త్రినేత్ర అనే బిరుదులు ఆ పేరు కలిగిన వారి శిరస్సు రెడ్లు ఖండించి ఉండాలి. చోళ రాజరాజుపై తిరుగుబాటు చేసిన సామంతులలో కాడవ కొప్పెరింజింగడు అనే వ్యక్తి పల్లవ వంశస్తుడు. పాండ్యుల సామంతుడు. అతనికి, అతని తండ్రికి అళగియ వరద అనే బిరుదులున్నాయి. కనుక ఈ యుద్ధంలో కొప్పెరుజింగని వంశానికి చెందిన పల్లవరాజును కూడా రెడ్డి సేనానులు తలగొట్టి సంహరించి ఉంటారు. అందువల్ల వారు ఆ బిరుదులు ధరించారు. పాండ్యరాయ గజకేసరి అనే బిరుదు పాండ్యులపై సాధించిన విజయానికి కారణమై ఉంటుంది. కాకతీయ ప్రతాపరుద్రుని కాలంలో నెల్లూరు రాజ్యాన్ని ఆక్రమించిన

తర్వాత కాకతీయ సైన్యాలు కంచిపై దండెత్తాయి. పాండ్యులు కంచివద్ద కాకతీయ సైన్యాన్ని ఎదుర్కొన్నారు. ఆనాడు సుందరపాండ్య విక్రమపాండ్య, వీరపాండ్య, పరాక్రమ పాండ్య, కులశేఖర పాండ్య అనే వారు పంచపాండ్యులుగా ప్రసిద్ధి చెందారు. పాండ్యులు ఓడి పారిపోయారు. కాకతి ప్రతాపరుద్రుడు కంచిని ఆక్రమించాడు. ఆ సందర్భంలో అతడు తన సేనానాయకులకు పాండ్యరాయ గజకేసరి అనే బిరుదులు ప్రదానం చేశాడు. ఆ బిరుదులు పొందిన రేచర్ల నాయకులతోపాటు రెడ్డి సేనానులకు కూడా ప్రదానం జరిగి ఉంటుంది. ఈ సేనానులు ప్రోలయరెడ్డి, అతని కుమారుడు వేమారెడ్డి అని భావించారు. చెంజమల అనే బిరుదు చెంచువులకు పర్యాయపదం అని, చెంచుమల చూరకార అంటే చెంచుమలను జయించాడని అర్థం అని పండితుల అభిప్రాయం. చెంచుమల అనగా జింజిదుర్గం అని భావించారు. ఈ బిరుదు ప్రోలయ వేమారెడ్డి తొలి శాసనాలలో కనిపిస్తోంది. కనుక ప్రతాపరుద్రుడు పాండ్యులపై చేసిన యుద్ధకాలంలో బహుశ క్రీ.శ.1321లో కాకతీయ సైన్యం జింజిదుర్గాన్ని జయించి దాచుకొని ఉండవచ్చును. అందులో ప్రోలయ వేమారెడ్డి కూడా పాల్గొని ఉండవచ్చు. గుజ్జరితట్టు విభాళ అంటే గుజ్జరి అశ్వదళనాశనకారి అని అర్థం. మహమ్మద్ బిన్ తుగ్లక్ గూర్జర అశ్వదళాన్ని కంపిలి దండయాత్రలో ఉపయోగించాడు. గుజ్జరి అశ్వదళం తుగ్లక్ దక్షిణ దండయాత్రలో ఒక్క కంపిలి యుద్ధంలో మాత్రమే పాల్గొంది. కనుక రెడ్డి సేనానులు కంపిలి యుద్ధంలో పాల్గొని అలాంటి బిరుదు పొంది ఉండాలి. రాచూరుదుర్గవిభాళ, అనేయ మండలి వరగండ అనే బిరుదులు ఆంధ్ర స్వాతంత్ర్యోద్యమ కాలంలో రెడ్డి వీరులు సంపాదించినట్లు కన్పిస్తోంది. అరవీటి సోమరాజు అనెగొందిపై దండయాత్ర చేసిన కాలంలో కాపయనాయకుని కోరికపై ప్రోలయ వేమారెడ్డి అరవీటి సోమరాజుతో కలిసి ముస్లిం సైన్యంతో పోరాడి రాయచూరు దుర్గంలో ప్రవేశించి ఈ బిరుదులు పొంది ఉండవచ్చును. ఈ బిరుదులను బట్టి వారి పూర్వకార్యకలాపాలు కొంత వరకు ఊహించడానికి వీలు కలుగుతుంది.

కామభూపాలుడు క్రీ.శ.1225-50: పై బిరుదులవల్ల కొండవీటి వంశస్తుల పూర్వీకులు కాకతి గణపతి దేవుని కాలంలో సైనిక వృత్తిని చేపట్టి నెల్లూరు తెలుగు చోళుల కొలువులో ప్రవేశించి ప్రఖ్యాతిలోకి వచ్చినట్లు కన్పిస్తోంది. కాకతి గణపతిదేవుని కాలంలో నెల్లూరును తెలుగు చోళవంశస్థుడైన తిక్క భూపతి పాలిస్తూ ఉండేవాడు. అతడు తెలుగు చోళులలో అగ్రగణ్యుడు. గొప్పవీరుడు. అతడు క్రీ.శ.1209 నుండి 1248 వరకు పాలించాడు. ఇదేకాలంలో కాకతీయ గణపతి ప్రబలుడు అయ్యాడు. తిక్క భూపాలుడు తంజావూరు నుంచి ఏలిన చోళచాళుక్య చక్రవర్తి అయిన మూడవ రాజరాజు సామంతుడు. మూడవ రాజరాజు క్రీ.శ.1216 నుండి 1246 వరకు పాలించాడు. అతని కాలంలో సామంతులంతా తిరుగుబాట్లు చేశారు. పాండ్యులు అతనిని లొంగదీశారు. పాండ్యులను అదుపులోకి తీసుకురావడానికి అతడు హొయసాలుల సహాయం అర్థించాడు. హొయసాలులు పాండ్యులను ఓడించి చోళ రాజ్యంలో తిష్ట వేశారు. ఆ సమయంలో నెల్లూరు తిక్క హొయసాలులతో యుద్ధాలకు దిగి వారితో నాలుగు యుద్ధాలు చేశాడు. క్రీ.శ.1231వ సంవత్సరంలో హొయసాల రెండవ నరసింహుడు, అతని కుమారుడు వీరనరసింహుడు ఇద్దరినీ తిక్క ఓడించాడు. క్రీ.శ.1229, 1240, తర్వాత మరొక యుద్ధం చేశాడు. ఈ యుద్ధాలలో కొండవీటి వంశస్తులు పాల్గొని హొయసాల సేనానులైన అప్పయ్య, గొప్పయ్యలను ఓడించి, వారి బిరుదులైన దండినగొప, జగనొబ్బగండ దిశపట్ట అనే బిరుదులు ధరించి ఉంటారు. ఈ కాలంలో పాండ్యులు గొప్ప శక్తివంతులుగా రూపొంది చోళ సామ్రాజ్యంలో తిరుగుబాటులు ప్రారంభించారు. మారవర్మ సుందరపాండ్యుడు (క్రీ.శ.1216-1238), రెండవ సుందరపాండ్యుడు (క్రీ.శ.1238-1253), చోడతిక్కకు మూడవ రాజరాజుకు సమకాలికులు. మారవర్మ సుందరపాండ్యుడు చోళ సామ్రాజ్యంపై దండెత్తి మూడవ రాజరాజును ఓడించి చోళ సామ్రాజ్య పునాదులను కదిలించాడు. చోళ సామ్రాజ్యాన్ని కాపాడటానికి తిక్క పాండ్యులతో పోరాడాడు. ఈ యుద్ధాలలో కూడా కొండవీటి వంశస్తులు పాల్గొని పాండ్యులపై సాధించిన విజయాలకు పాండ్యగజకేసరి అనే బిరుదులు ధరించి ఉంటారు. ఈ యుద్ధాలలోనే చోళులతో పోరాడిన కొప్పెరుజింగని వంశస్తులను ఓడించి అళగియ వరద శిరఃఖండన అని, పల్లవ త్రినేత్ర అని బిరుదులు ధరించి ఉంటారు. ఈ యుద్ధాలలో పాల్గొని అలాంటి బిరుదులు ధరించిన కొండవీటి పూర్వీకులు ఎవరో స్పష్టంగా చెప్పలేము. వీరి వంశానికి మూల పురుషుడు వేమభూపాలుడు అని ముట్లూరు శాసనం తెలుపుతోంది. అతని తండ్రి కామభూపాలుడని బి.ఎన్.శాస్త్రి తమ ఆంధ్రదేశ చరిత్ర- సంస్కృతి రెండవ భాగంలో రాశారు. కామభూపాలుడు క్రీ.శ.1231-1246 సంవత్సరాల మధ్యకాలంలో నెల్లూరు తిక్క సైన్యంతో చేరి హొయసాలులు పాండ్యులతో జరిపిన పోరాటాలలో

పాల్గొన ఉండవచ్చు. అలాగైతే అతడు గణపతి దేవుడు, చోడతిక్కలకు సమకాలికుడు అయి ఉంటాడు. అతని సేవలకు మెచ్చి తిక్క అతనిని గూడూరు పరిసరాలలోని దేసట్లపురానికి స్థానికి పాలెగాడుగా నియమించి ఉండవచ్చు.

కాకతి గణపతి దినదిన ప్రవర్ధమానుడిగా ఎదగడం: ఇదే సందర్భంలో కాకతి గణపతిదేవుడు విజృంభించాడు. క్రీ.శ.1210లో వెలనాటి పృధ్వీశ్వరుడు మరణించిన నాటి నుండి కాకతి గణపతి దేవుడు దినదిన ప్రవర్ధమానుదయ్యాడు. వేంగి రాజ్యాన్ని పూర్తిగా జయించాడు. దివిని స్వాధీనం చేసుకున్నాడు. కాకతీయ సామ్రాజ్యం నెల్లూరు చోళరాజ్య సరిహద్దులను తాకింది. ఉత్తరాన తూర్పుగాంగ రాజ్య సరిహద్దుల వరకు విస్తరించింది.

వేమభూపాలుడు క్రీ.శ.1250-70-కాకతి గణపతితో సంబంధాలు: నెల్లూరులో చోళతిక్క క్రీ.శ.1248లో మరణించాడు. అతని మరణానంతరం చోళ సామ్రాజ్యంలో చాలా మార్పులు జరిగాయి. తంజావూరులో మూడవ రాజరాజు తర్వాత మూడవ రాజేంద్రుడు (క్రీ.శ.1246-1279) తంజావూరు సింహాసనం అధిష్టించాడు. అతని కాలంలో చోళ సామ్రాజ్యం దిగజారిపోయింది. పాండ్యులు బలవంతులై క్రీ.శ.1258వ సంవత్సరంలో తంజావూరుపై దండెత్తి రాజేంద్రుని ఓడించి తమ సామంతునిగా చేసుకున్నారు. దాంతో తమిళ దేశంలో పాండ్యుల సార్వభౌమాధికారం ఏర్పడింది. పాండ్యుల అధికారానికి తలవంచడం ఇష్టం లేని నెల్లూరు రాజ్యం స్వతంత్రం ప్రకటించింది. చోళతిక్క మరణం తర్వాత అతని కుమారుడు మూడవ మనుమసిద్ధి తిక్క అల్లుడు అల్లుతిక్క నెల్లూరు రాజ్యంలో సహపాలకులుగా రాజ్యపాలన ప్రారంభించారు. తర్వాత వారు రాజ్యాన్ని పంచుకొని నెల్లూరును రాజధానిగా చేసుకొని మాతృ రాజ్యాన్ని మనుమసిద్ధి పాలించగా అల్లుతిక్క కంచిని రాజధానిగా చేసుకొని తమిళ ప్రాంతాలను పాలించాడు. పాండ్యులు తమ సార్వభౌముడుగా చోళ రాజేంద్రుని ఓడించడంతో అల్లుతిక్క, మనుమసిద్ధి ఇద్దరూ స్వతంత్రం ప్రకటించారు.

అక్కన్న బయ్యన్న-మనుమసిద్ధి: నెల్లూరు రాజ్యంలో మనుమసిద్ధి దాయాదులు అక్కన్న, బయ్యన్నలు తిరుగుబాటు చేసి మనుమసిద్ధిని ఓడించి తరిమి నెల్లూరు రాజ్యాన్ని ఆక్రమించారు. తన రాజ్యాన్ని తిరిగి సంపాదించడానికి మనుమసిద్ధి తన ఆస్థానకవి అయిన తిక్కన సోమయాజిని ఓరుగల్లు పంపి కాకతి గణపతి దేవుని సహాయం అర్థించాడు. దాంతో గణపతిదేవుడు పెద్ద సైన్యంతో బయలుదేరి నెల్లూరు రాజ్యంలో ప్రవేశించి అక్కన్న, బయ్యన్నలను పారదోలి తిరిగి మనుమసిద్ధిని నెల్లూరు సింహాసనం ఎక్కించాడు. తర్వాత కాకతీయ సైన్యాలు వల్లూరు పరిసర ప్రాంతాలను జయించాయి. గణపతి గగయ సాహిణిని అక్కడ తన ప్రతినిధిగా నిలిపాడు. దాంతో దక్షిణాంధ్ర దేశంలో కాకతీయ అధికారం ప్రతిష్టించబడింది. ఈ సమయంలో కొండవీటి వంశస్తుడైన వేమభూపాలునికి కాకతీయులతో సంబంధాలు ఏర్పడి ఉండవచ్చు.

ముత్తుకూరు యుద్ధం క్రీ.శ.1260: చోళ సామంతరాజ్యమైన నెల్లూరు రాజ్యం స్వతంత్రం ప్రకటించడం, దక్షిణాంధ్ర దేశంపై కాకతీయుల అధికారం ఏర్పడటాన్ని పాండ్యులు సహించలేకపోయారు. నెల్లూరు రాజ్యం తంజావూరు చోళ సామంతరాజ్యం గనుక తాము తంజావూరి సామ్రాజ్యానికి వారసులయ్యారు. గనుక నెల్లూరు రాజ్యం తమ సార్వభౌమత్వంలో ఉండాలని పాండ్యులు ఆశించారు. కాని కాకతీయులు సార్వభౌమాధికారంలోకి వెళ్లిపోయింది. కనుకు నెల్లూరు రాజ్యాన్ని తమ ఆధిపత్యంలోనికి తీసుకురావడానికి పాండ్యులు నెల్లూరు రాజ్యంపై దండెత్తారు. నెల్లూరు రాజ్య రక్షణకు కాకతీయ గణపతి పాండ్యులతో తలపడవలసి వచ్చింది. మనుమసిద్ధి, వైదుంబ సామంతరాజు, ఇతర సామంతులు, కాకతీయ సైన్యాలు అన్నీ కలిసి పాండ్యులను ఎదిరించడానికి బయలుదేరాయి. నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు వద్దకు చేరిన పాండ్య సైన్యాలపై యుద్ధానికి దిగాయి. అక్కడ పాండ్యులకు, కాకతీయులకు ప్రచండ యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో పాండ్యసేనలు అప్రతిహత శౌర్య ప్రతాపాలతో పోరాడి కాకతీయ సైన్యాలను చిత్తుచిత్తుగా ఓడించాయి. మనుమసిద్ధి యుద్ధంలో మరణించాడు. పాండ్య సైన్యాల ధాటికి నిలబడలేక కాకతీయ సైన్యాలు చెల్లాచెదురై కృష్ణా నది వరకు తిరిగి చూడకుండా పారిపోయాయి. వైదుంబరాజు పరిసర అడవులలోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. కృష్ణానది వరకు పాండ్య సైన్యాలు వీరవిహారం చేశాయి. దక్షిణాంధ్ర దేశంలో కాకతీయుల అధికారం ఛిన్నాభిన్నమైంది. పాండ్య సేనాని కొప్పెరుజింగడు గోదావరి మండలంలో కూడా ప్రవేశించాడు. కాకతి గణపతి వారిని ఏమీ చేయలేకపోయాడు. ఆ అపజయంతో కృంగిపోయిన గణపతి అనారోగ్యం పాలై రాచకార్యాలు వదలివేసి తన

కుమార్తె రుద్రమదేవిని తన వారసురాలిగా ప్రకటించి రాజ్యభారం అప్పగించాడు. ఈ పాండ్య, కాకతీయ యుద్ధ సమయాలలో కొండవీటి వంశస్థుడైన కామభూపతి కుమారుడు వేమభూపాలుడు కాకతీయ సైన్యాలతో కలిసి పాండ్యులతో పోరాడి ఉండవచ్చు.

రుద్రమదేవి దక్షిణాంధ్ర పునరాక్రమణ-వేమ భూపాలుడు: తండ్రిని ఓడించిన పాండ్యులను సాధించడానికి రుద్రమదేవి సైన్యాలను పోగు చేసి పాండ్యులపై దండెత్తి వారిని ఓడించి తరిమి దక్షిణాంధ్రను తిరిగి ఆక్రమించి, నెల్లూరు రాజ్యానికి తన సేనాధిపతిగా నాగదేవ మహారాజును తన ప్రతినిధిగా నిలిపింది. వల్లూరులో గంగయ సాహిణి మేనల్లుడైన అంబదేవుని కాకతీయ ప్రతినిధిగా నియమించింది. దాంతో దక్షిణాంధ్రపై కాకతీయుల అధికారం పునఃప్రతిష్ఠించబడింది. ఆ సమయంలో రుద్రమదేవి వేమభూపాలునికి దేసట్లపుర నాయంకరాన్ని స్థిరపర్చి ఉంటుంది. కనుక వేమ భూపాలుని కాలం నుంచి వారు కాకతీయుల సామంతులుగా మారి ఉండవచ్చు. ముట్లూరి శాసనం వేముని కొండవీటి వంశకర్తగా చెబుతోంది. కాని అందులో వివరాలు లేవు. అతడు సేనాధిపతి అని మాత్రమే ఉంది.

ప్రోలభూపతి క్రీ.శ.1270-1300: వేమభూపాలుని తర్వాత అతని కుమారుడు ప్రోలభూపతి దేసట్ల నాయంకరానికి అధిపతి అయి ఉంటాడు. ఇతడు త్రిపురాంతక ప్రాంతానికి అధికారి అని ఆచార్య పిసుపాటి శ్రీరామశర్మ రాశారు. దేసటిపురం నుండి త్రిపురాంతకం వరకు వారి నాయంకరం విస్తరించి ఉండవచ్చు.

అంబదేవుని తిరుగుబాటు: ఇది జరిగిన కొద్ది కాలానికే వల్లూరు, గండికోటల ప్రతినిధి అంబదేవుడు స్వతంత్రం ప్రకటించి పలనాటి వరకు ఆక్రమించి స్వతంత్ర కాయస్త రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. ఆ కాలంలో దేసట్లు పరాధిపతి అయిన ప్రోల భూపతి అంబదేవుని సామంతునిగా మారి ఉండవచ్చు. అంబదేవుని లొంగదీయడానికి రుద్రమదేవి సైన్యాన్ని పంపింది. కాని ఆ సైన్యాలను అంబదేవుడు ఓడించాడు. అంబదేవుని ఓడించడానికి రుద్రమదేవి తన వారసుడు, మనుమడు అయిన యువరాజు ప్రతాపరుద్రుని నియమించింది. అతడు పెద్ద సైన్యంతో అంబదేవుని రాజ్యంపై దండెత్తి ఓడించి, వల్లూరు, గండికోట రాజ్యాలను ఆక్రమించాడు. ఈ చివరి యుద్ధంలో ప్రోలభూపతి పాత్ర ఏమిటో చెప్పలేము. అంబదేవుడు ఓడిపోగానే అతడు తిరిగి కాకతీయుల సామంతుడిగా కొనసాగి ఉండవచ్చు. ప్రోలభూపతి తర్వాత అతని కుమారుడు ప్రోలయ వేమారెడ్డి దేసట్ల పురాధిపతిగా సింహాసనం అధిష్ఠించి ఉండవచ్చు. అందువల్లే కాబోలు ఎర్రాప్రెగ్గడ దేసటి వేమా అని పేర్కొన్నాడు. కనుక అద్దంకి రెడ్డిరాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి ప్రతాపరుద్రుని నాయంకరులలో ఒకడుగా కొనసాగి ఉంటాడు. అందువల్లే ప్రతాపరుద్రుని 72 మంది నాయంకరాలలో దేసట్లపురం కూడా ఒకటిగా పేర్కొనబడి ఉంటుంది.

అద్దంకి రాజ్య స్థాపన క్రీ.శ.1324-25: క్రీ.శ.1280 వరకు అద్దంకిని ఒక యాదవ వంశం పాలించేది. రుద్రమదేవి కాలంలో ఈ వంశం అంతం అయింది. ప్రోలయ వేమారెడ్డి ఏ పరిస్థితులలో ఎలా అద్దంకి రాజ్యాన్ని స్థాపించాడో తెలుసుకోవడానికి తగిన ఆధారాలు లేవు. తెలుగుచోడులు బలహీనపడటంతో ప్రోలయ వేమారెడ్డి కాయస్థులతో మైత్రి వహించాడు. అంబదేవుడు రుద్రమదేవి మీద తిరుగుబాటు చేసి స్వతంత్ర కాయస్థ రాజ్యం ఏర్పడిన తర్వాత అతని అండదండలతో ప్రోలయ వేమారెడ్డి ధరణికోట ప్రాంతంలో బలపడి ఉంటాడు. అంబదేవుని మంత్రి అయిన యేడరాయ గంగదేవుడు ప్రోలయ వేమారెడ్డి గురువని, గంగదేవుని కృపవల్లనే వేమారెడ్డి రాజకీయ అధికారం సంపాదించాడని శాసనాలు, వాఙ్మయాలు చాటుతున్నాయని డా॥ బి.ఎస్.ఎల్. హనుమంతరావు రాశారు. ఎర్రాప్రెగడ తన హరి వంశంలో శ్రీసార్వతీశ భక్తివ్యాపితగుణ ఘోడెరాయ గురుకృపా స్థాపిత సామ్రాజ్య సముద్దీపమే మక్షితీంద్ర అని రాశాడని ధన్యోవేమ మహపతిః ఘోడెరాయ గంగాఖ్య గురుపదాబ్జషట్పదః అని రాశాడని ఆతుకూరు శాసనం తెలుపుతోంది. కనుక అంబదేవుడు ఘోడెరాయ గంగదేవుని సహాయంతో ప్రోలయ వేమారెడ్డి రాజ్యం సంపాదించాడని తన వాదనకు ఆధారాలు చూపారు. అంబదేవుని ఓటమి తర్వాత ప్రతాపరుద్రునికి నామమాత్రంగా లొంగిపోయాడని, ఆ తర్వాత ప్రతాపరుద్రుని సార్వభౌమాధికారాన్ని అంగీకరించలేదని, అతడు పశ్చిమ గోదావరి జిల్లా మొగల్లులో భూదానం చేసి రెండు శాసనాలు వేయించాడని, అందు ఒకదానిలో (తేదీ లేదు) అనవేముడనే పేరుతో ప్రమథకవి శ్రీగిరిదేవయ్యనింకి మొగల్లులో భూదానం చేశాడని, అయితే ఇందులో పోలయ వేముని హోదాగాని, కాకతీయుల ప్రసక్తిగాని లేదని, రెండవ శాసనం క్రీ.శ.1315 నాటిదని, అది కాకతీయ ప్రతాపరుద్రుని కాలం నాటిదని, కనుక ప్రోలయ వేమారెడ్డి 1315 నాటికే

స్వతంత్రంగా రాజ్యం చేస్తున్నాడని తీర్మానించారు. కనుకనే క్రీ.శ.1320లో ప్రోలయ వేమారెడ్డి ధరణికోటలో స్వతంత్ర రెడ్డి రాజ్యం స్థాపించాడని స్థానిక చరిత్రలు చాటుతున్నాయని కూడా వివరించారు. బహుశా వారు ఆధారంగా తీసుకున్న స్థానిక చరిత్రలు కొండవీటి దండకవిలె కావచ్చును. దండకవిలె కూడా ప్రోలయ వేమారెడ్డి ప్రతాపరుద్రుని ఓడించి, ధరణికోటలో స్వతంత్ర రాజ్యం స్థాపించాడని, అక్కడ పుట్టకోటను నిర్మించాడని తెలుపుతున్నాయి. ప్రోలయ వేమారెడ్డి కాకతీయ నాయంకరులలో ఒకడని బలమైన అభిప్రాయం ఉందని, కాని కాకతి ప్రతాపరుద్రుడు ఓరుగల్లు వద్ద ఉలుగ్‌ఖాన్‌తో క్రీ.శ.1323లో చేసిన చివరి యుద్ధంలో ప్రోలయ వేమారెడ్డిగాని, అతని సోదరులు మాచారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్న దాఖలాలు లేవని, కనుక ప్రోలయ వేమారెడ్డి కాకతీయ సామంతుడు కాదని కూడా బిఎస్ఎల్ అభిప్రాయపడ్డారు. కాని డా॥ బి.ఎస్.ఎల్. హనుమంతరావు అభిప్రాయాన్ని అంగీకరించడానికి అనేక అభ్యంతరాలున్నాయి.

అభ్యంతరాలలో పోలయ వేమారెడ్డి కాయస్థ అంబదేవుడు అతని మంత్రి ఘోడెరాయ గంగదేవుని సహాయంతో స్వతంత్ర రాజ్య స్థాపన చేశాడనేది మొదటిది. రుద్రమదేవి చివరికాలంలో వీరప్రతాపరుద్ర యువరాజు కాయస్థ రాజ్యంపై దండెత్తి క్రీ.శ.1291లో జయించాడు. ఓడిపోయిన కాయస్థ అంబదేవుడు ములికినాడులోకి పారిపోయాడు. కాయస్థ రాజ్యంలో తన సేనాని పట్టసాహిణి సోమానాయకుని కాకతీయ ప్రతినిధిగా నిల్పాడు. పారిపోయిన అంబదేవుడు ములికినాడులో క్రీ.శ.1305 వరకు పాలించాడు. అతని తర్వాత మురారి దేవుడు, తర్వాత మల్లదేవుడు పాలించారు. మాలిక్‌కపూర్ ఓరుగల్లుపై దండెత్తి ప్రతాపరుద్రుని ఓడించిన తర్వాత త్రిపురారి, మల్లిదేవులు క్రీ.శ.1309లో మళ్లీ తిరుగుబాటు చేశారు. వారిని అదుపులోకి తేవడానికి ప్రతాపరుద్రుడు జుట్టియలెంక, గొంకరెడ్డిలను పంపాడు. వారు మల్లదేవుని సంహరించారు. ఈ విజయం తర్వాత ప్రతాపరుద్రుడు వారిని ములికినాడు ప్రతినిధులుగా నిలిపాడు. వారు గండికోటను రాజధానిగా చేసుకొని ములికినాడును పాలిస్తున్నట్టు క్రీ.శ.1314 నాటి చెన్నూరు శాసనం తెలుపుతోంది. ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1353 వరకు జీవించాడు. అపుడు అతని వయసు ఎంత? సుమారు అరవై సంవత్సరాలని భావిస్తే అతడు క్రీ.శ.1293లో జన్మించి ఉంటాడు. క్రీ.శ.1291లోనే కాయస్థ అంబదేవుడు తన రాజ్యం కోల్పోయి ములికినాడులో తలదాచుకొని ఉంటే ప్రోలయనాయకుడు ఏ విధంగా అంబదేవుడు, అతని మంత్రి ఘోడెగంగరాయుపి సహాయంతో స్వతంత్ర రాజ్యం స్థాపించుకొని ఉంటాడు? అప్పటికి ప్రోలయ వేమారెడ్డి జన్మించి కూడా ఉండడు. ఒకవేళ ప్రోలయ వేమారెడ్డి 70 ఏళ్లు జీవించాడని భావించినా 1291నాటికి అతడు ఏడు ఎనిమిది సంవత్సరాల బాలుడై ఉంటాడు. ఒకవేళ ప్రోలయవేమారెడ్డి తండ్రి ప్రోలయకు అంబదేవుడు సహాయం చేశాడని అనుకుందామంటే ప్రోలయ రాజ్యస్థాపకుడు కాదు. ఒకవేళ అతడు రాజ్య స్థాపకుడు అని అనుకున్నా తన రాజ్యంలోనే తనకు దిక్కు లేకపోతే ఎక్కడో కృష్ణా నదీ తీరంలోని ధరణికోటలో రాజ్యం స్థాపించడానికి సహాయం చేయడానికి అంబదేవుడుకి సాధ్యం అవుతుందా? ఏ విధంగా చూసినా అంబదేవుడు, అతని మంత్రి ఘోడెరాయగంగరాయుని సహాయంతో రాజ్యం సంపాదించాడనే వాదన అసంబద్ధమైనదిగా కనిపిస్తోంది. ఆతుకూరు శాసనం ఘోడెరాయ గురువు పాదపద్మాలకు ప్రోలయ వేమారెడ్డి తేనెటీగ వంటివాడని తెలుపుతోంది. ఈ ఘోడెరాయ అంబదేవుని మంత్రి అని బి.ఎస్.ఎల్. హనుమంతరావు పోల్చారు. కాని ఈ ఘోడెరాయడు అంబదేవుని మంత్రి అయి ఉండడు. అతడు ప్రోలయ వేమారెడ్డికి దీక్ష ఇచ్చిన ఆధ్యాత్మిక గురువు అయి ఉంటాడు. అలాంటి వారినే అలా భగవంతునితో సమానంగా చూసి పాదపద్మాలకు శిరస్సు వంచానని చెప్పుకుంటారు. రాజకీయ సలహాదారులను అలా కీర్తించరు. హరిహర బుక్కరాయలకు విద్యారణ్యుల మాదిరిగా ఆతుకూరి శాసనంలో చెప్పబడిన ఘోడెరాయ గంగయ ప్రోలయ వేమారెడ్డిని ఆశీర్వదించిన గురువు అయి ఉంటాడు. ఇతడు త్రిపురాంతక దేవుని, భక్తుడని ప్రోలయ వేమునికి రాజగురువని రెడ్డినాడు పత్రికలో రెడ్డిరాజుల ప్రారంభ దశలో ఈమని శివనాగిరెడ్డి రాశారు. బహుశా ఇతడు త్రిపురాంతకంలో నివసించిన తపశ్శక్తి సంపన్నుడై ఉంటాడు. అతని ఆశీర్వాదం ప్రోలయ వేమారెడ్డికి లభించి ఉంటుంది.

ఇక రెండవ అభ్యంతరం- ప్రతాపరుద్రుని ఓడించి ధరణికోటలో ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యం స్థాపించాడని కొండవీడు కైఫీయత్తులు, స్థానిక రాతలు తెలుపుతున్నాయని బి.ఎస్.ఎల్. హనుమంతరావు అనడం. ప్రతాపరుద్ర చక్రవర్తి ఒక నాయంకరుని చేతిలో ఓడిపోయేటంత హీనస్థితిలో లేడు. ప్రతాపరుద్రుడు ముస్లింల చేతిలో ఓడిపోయినా కూడా తన సామంతుల తిరుగుబాట్లను ఎప్పటికప్పుడు అణచివేస్తూ తన చివరికాలం వరకు

యావదాంధ్ర దేశంపై తన అధికారాన్ని స్థిరంగా నిల్పుకున్నాడు క్రీ శ 1309లో మల్లదేవుని వధించి కాయస్థ రాజ్యాన్ని ఆక్రమించడమే అందుకు ప్రబల సాక్ష్యం అలాంటి ప్రతాపుడు ఓరుగల్లుకు అతి సమీపంలో ఉన్న ధరణికోటలో ఒక చిన్న నాయంకరుడు స్వతంత్రం ప్రకటిస్తే సహించి ఊరుకుంటాడా? అసంభవం కనుక ప్రతాపరుద్రుని ఓడించి ప్రోలయవేముడు ధరణికోటలో స్వతంత్ర రాజ్యం స్థాపించాడనడం అభూత కల్పన ఒకవేళ ప్రోలయ వేమారెడ్డి ధరణికోటలో స్వతంత్ర రాజ్యం స్థాపిస్తే అద్దంకి రాజధానిని మార్చవలసిన అవసరం ఏమిటి? రక్షణ రీత్యా అద్దంకి కన్నా ధరణికోట ఎన్నోరెట్లు ఉన్నతమైనది ఒకవైపు కృష్ణానది, మరొకవైపు దట్టమైన అడవులు ఉన్నాయి ఒకవేళ ధరణికోటలోనే అతడు రాజ్యం స్థాపించి ఉంటే ప్రతాపరుద్రుని తర్వాత వచ్చిన ముస్లిం పరిపాలనా కాలంలో ప్రోలయ వేముని స్థితి ఏమిటి? ధరణికోటను ముస్లింలకు కోల్పోయాడా? ఒకవేళ కోల్పోయినా ముస్లింల నుండి ఆంధ్ర దేశం విముక్తి చెందిన తర్వాత ప్రోలయ వేముని రాజధాని ధరణికోటే అయి ఉండాలి గదా! అద్దంకి ఎందుకు రాజధానిగా ఎన్నుకోబడింది? కనుక ప్రోలయ వేమారెడ్డి ధరణికోటలో స్వతంత్ర రాజ్యం స్థాపించలేదనేది నిర్వివాదాంశం ఇక పశ్చిమ గోదావరి జిల్లాలోని మోగల్లు గ్రామంలో ప్రమదకవికి భూదానం చేశాడు అనేది ప్రోలయ వేమారెడ్డి రాజ్యం కృష్ణానదిని దాటి విస్తరించలేదు తన రాజ్యం కానిచోట ప్రోలయ వేమారెడ్డి భూదానం ఏ విధంగా చేయగలడు అక్కడ అనవేమ అని ఉన్నదని బి ఎస్ ఎల్ హనుమంతరావు అన్నారు కనుక అవి అనవేమారెడ్డి శాసనాలు కావచ్చు అతడు సింహాచలం వరకు విజయ యాత్ర చేశాడు రెండవ శాసనం క్రీ శ 1315 నాటిది అని అన్నారు ఆ శాసన కాల నిర్ణయంలో పొరపాటు జరిగి ఉండి ఉండవచ్చు

ఇక చివరి అభ్యంతరం- ప్రోలయ వేమారెడ్డి, అతని సోదరులు క్రీ శ 1323 ఓరుగల్లు యుద్ధంలో పాల్గొనలేదని చెప్పడం పాల్గొన్నారని చెప్పడానికి ఏ విధంగా ఆధారాలు లేవో, పాల్గొనలేదని చెప్పడానికి కూడా ఆధారాలు లేవు ప్రతాపరుద్రుడు తన 72 మంది నాయంకర్లలో వెలమ నాయకులకు అధిక గౌరవ మర్యాదలిచ్చేవాడని- పద్మనాయకుడైన సింగ అసీతివరహాల సింగడని కూడా కీర్తి వహించాడట- అందుకు రెడ్డి సేనానులు అలుక వహించి ఉలుగ్‌ఖాన్‌తో జరిగిన యుద్ధ సమయంలో రెడ్డి సైన్యం యుద్ధ భూమినుండి నిష్క్రమించిందని, అందువల్లే ప్రతాపరుద్రుడు ఓడిపోయి బందీగా చిక్కాడని హనుమకొండ కైఫీయత్తు తెలుపుతోంది ఆ విధంగా కినుక వహించిన రెడ్డి సేనానులలో ప్రోలయ వేమారెడ్డి కూడా ఉన్నాడేమో అని అనుకున్నా ప్రోలయ వేమారెడ్డి మాత్రం స్వతంత్ర రాజు మాత్రం కాదు కనుక ప్రోలయ వేమారెడ్డి ప్రతాపరుద్రుని మరణం వరకు కాకతీయుల నాయంకరుడుగానే ఉన్నాడని, క్రీ శ 1324-25లో అతడు అద్దంకిలోనే రాజ్యస్థాపన చేశాడని, అంతకుముందే ధరణికోటలో రాజ్యం స్థాపించలేదని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రతాపరుద్రుని మరణం తర్వాత కాకతీయ సామ్రాజ్యం అంతా ముస్లిం వశం అయింది అపుడు ప్రోలయ వేమారెడ్డి కూడా వారికి లొంగిపోయి కప్పం చెల్లిస్తూ తన రాజ్యాన్ని కాపాడుకొని ఉంటాడు.

ముసునూరి ప్రోలయనాయకుని స్వాతంత్ర్య సమరం క్రీ.శ.1324-25: ముస్లింల పాలనలో ఆంధ్ర ప్రజలు అనుభవించే బాధలను చూసి ప్రోలయ నాయకుడు స్వాతంత్ర్య పోరాటాన్ని ప్రారంభించాడు అతని పోరాటం ప్రోలయ వేమారెడ్డికి మంచి అవకాశాన్ని కలుగజేసి, ప్రోలయ నాయకుని ఉత్తరాంధ్ర విముక్తి యుద్ధం విజయం సాధించడంతో ప్రోలయ వేమారెడ్డి స్ఫూర్తి పొంది ఉంటాడు ఒక తరం ఆంధ్ర నాయకులంతా ఓరుగల్లు యుద్ధంలో మరణించారు. దక్షిణాంధ్రలో మిగిలిన వీరులలో కొండపల్లి వారి వంశం ఒక్కటే మిగిలి ఉండి ఉంటుంది. ప్రోలయ నాయకుని స్వతంత్ర ఉద్యమానికి ఉత్తేజితుడై దక్షిణాంధ్ర దేశంలో ప్రోలయ వేమారెడ్డి ఆంధ్ర స్వాతంత్ర్య సమరానికి నాయకత్వం వహించి ముస్లింలను ఓడించి తరిమి కృష్ణానది పర్యంతం విముక్తి కల్గించి ఉంటాడు అందువల్లనే అతడు మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవ అనే బిరుదు ధరించాడు. దీనివల్ల అతడు తప్పకుండా ముస్లింలతో పోరాడాడని చెప్పవచ్చు. ముస్లింలను ఓడించగల్గినందుకే అతడు స్వంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోగలిగాడని స్పష్టంగా భావించవచ్చు. అదే సమయంలో దక్షిణ తెలంగాణలో రేచర్ల సింగమనాయకుడు కూడా స్వంత రాజ్యాన్ని ఏర్పరచుకోగలిగాడు ప్రోలయ నాయకుని ఉద్యమం విజయవంతం అయినందువల్లనే ప్రోలయ వేమారెడ్డి, రేచర్ల సింగమనాయకుని ఉద్యమాలు కూడా విజయం సాధించాయి కనుక ముసునూరి ప్రోలయనాయకుని స్వాతంత్ర్య పోరాటం లేకపోతే ఆంధ్ర దేశ చరిత్రలో రెడ్డి, వెలమ, కొండవీటి రెడ్డి, రాచకొండ, దేవరకొండ, రేచర్ల పద్మనాయక రాజ్యాలు ఉండేవి కాదు. కనుక వారు ప్రోలయ నాయకుని సార్వభౌమాధికారాన్ని

అంగీకరించారు తర్వాత కాపయనాయకుని కొల్చారు ప్రోలయ వేమారెడ్డితో సహా ప్రతాపరుద్రుని కాలంనాటి 75 మంది నాయకులు కాపయనాయకుని కొల్చారని అనితల్లి కలువచేరు శాసనం వర్ణించింది. కలువచేరు శాసన కథనం అతిశయోక్తి అని, విశ్వసించదగినది కాదని పండితుల అభిప్రాయం అని బిఎస్ఎల్ హనుమంతరావు గారు వ్యాఖ్యానించారు కాని ఏ పండితుడూ అది విశ్వసనీయం కాదని ప్రకటించలేదు అది బిఎస్ఎల్ గారి స్వంత అభిప్రాయం తమ పూర్వీకుడు మరొక రాజును సేవించాడని చెప్పుకోవలసిన అవసరం అనితల్లికి లేదు. రెడ్డి రాజులకు ముసునూరి వంశం మీద అమిత గౌరవ మర్యాదలున్నాయని, అవి అనితల్లి కాలం వరకు కూడా కొనసాగాయని అనితల్లి శాసనం సాక్ష్యంగా నిలుస్తున్నది కనుక ప్రోలయ వేమారెడ్డి అద్దంకిలో స్వంత రాజ్యం స్థాపించుకోడంలో ముసునూరి ప్రోలయనాయకుని స్వాతంత్ర్య సమరం అవకాశం కల్పించిందని చెప్పవచ్చు. అయినప్పటికీ ప్రోలయ వేమారెడ్డి రాజ్యంలో ముసునూరి నాయకులు జోక్యం చేసుకోలేదు ప్రోలయ వేమారెడ్డి తన రాజ్యాన్ని స్వతంత్రంగానే పాలించుకున్నాడు వలివేరు శాసనం అతడు స్వతంత్రంగానే వేయించాడు

రెడ్డి రాజుల కాలనిర్ణయం: స్థానిక కైఫీయత్తులు, మెకంజీ రాతప్రతులు, చాటువులు, కొండవీటి దండకవిలె మొదలైనవి- ఆరుగురు రెడ్డి రాజులు 100 సంవత్సరాలు పాలించారని తెలుపుతున్నాయి ఈ ఆధారాలు ప్రోలయ వేమారెడ్డి శక 1242లో అద్దంకిలో రాజ్య స్థాపన చేశాడని తెలిపాయి అది క్రీ శ 1320 సంవత్సరం అవుతుంది అంతేగాక వారి పాలనా కాలాలను వరుసగా 12, 30, 15, 40, 20, 4 సంవత్సరాలు అని తెలుపుతున్నాయి అవి మొత్తం లెక్క వేస్తే 95 సంవత్సరాలు పాలించినట్లు తేలుతోంది ఈనాడు లభ్యమైన ఆధారాలతో సరిపోలిస్తే రాజ్యస్థాపనా కాలం, వారి పాలనా సంవత్సరాలు తప్పని రుజువైంది ప్రతాపరుద్రుని పాలనా కాలం నాటి చివరి శాసనం శక 1243 నాటిది ద్రాక్షారామంలో లభించింది ఈ శాసనాన్ని అతని సేనాధిపతి ముప్పిడినాయకుని కుమారుడు పెదరుద్ర వేయించాడు దాని ప్రకారం క్రీ శ 1321వ సంవత్సరం ప్రతాపరుద్రుడు క్రీ శ 1323లో ఉలుగ్‌ఖాన్‌కు బందీగా చిక్కాడని ముస్లిం చరిత్రకారులు రాశారు రాజమహేంద్రవరం పెద్దమసీదు శాసనం క్రీ శ 1324లో ఉలుగ్‌ఖాన్ చేత వేయించబడింది కనుక నెల్లూరును ప్రతాపరుద్రుని సామంతుడు ముప్పిడినాయకుడు క్రీ శ 1323 వరకు పాలించినట్లు ఆధారాలున్నాయి. క్రీ శ.1324 వరకు ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించే అవకాశమే లేదు కనుక కొండవీటి దండకవిలె, మెకంజీ రాతప్రతులు ఇచ్చిన వారి రాజ్య స్థాపనా కాలం అయిన శక 1242 అంటే క్రీ శ 1320 సంవత్సరం రాజ్య స్థాపనా కాలంగా అంగీకరించడానికి వీలులేదు

తుగ్లక్ పరిపాలన తర్వాత లభ్యమైన మొదటి హిందూ శాసనాలు శక 1247న క్రీ శ 1325నాటి మల్లవరం శాసన శక 1248 అంటే క్రీ శ.1326 నాటి సంతమాగులూరు శాసనాలు మాత్రమే మల్లవరం శాసనాన్ని అద్దంకి రెడ్డి రాజ్య స్థాపకుడైన ప్రోలయ వేమారెడ్డి వేయించాడు సంతమాగులూరు శాసనాన్ని కాకతీయ ప్రతాపరుద్ర దేవుని సేనాధిపతి అయిన కొలనిరుద్రుడు తన ప్రభువు పుణ్యఫలానికై వేయించాడు ఈ రెండు శాసనాలు వీరిద్దరూ ఆయా ప్రాంతాలలో స్వతంత్ర రాజ్యాలు స్థాపించినట్లు చెబుతున్నాయి కనుక ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ 1325లో స్వతంత్ర రాజ్యస్థాపన చేశాడని చెప్పవచ్చును అతడు వేయించిన రెండవ శాసనం క్రీ శ 1332 నాటి నకరికల్లు శాసనం ఈ మధ్య కాలంలో అతని శాసనాలు లేవు. బహుశ రాజ్యవిస్తరణ చేస్తూ ఉండి ఉండవచ్చును. ఈ మధ్యకాలంలోనే సంతమాగులూరులో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన కొలని రుద్రదేవుని కూడా జయించి తన రాజ్య విస్తరణ చేసుకొని ఉండవచ్చు. కనుక రెడ్డి రాజ్య స్థాపన క్రీ శ 1324-25 అని భావించవచ్చు. ఇక రెడ్డిరాజులు పాలించిన కాల పరిమితిని కూడా నిర్ణయించవచ్చు. దండకవిలె, మెకంజీ ప్రతులు రెడ్డిరాజులు నూరు సంవత్సరాలు పాలించారని తెలుపుతున్నాయి క్రీ.శ.1324 రాజ్యస్థాపనా కాలంగా తీసుకొంటే దానికి నూరు సంవత్సరాలు కలుపుకుంటే రాజ్య పతనం క్రీ శ 1424 అవుతుంది ఈ సంవత్సరం సరిగ్గా ప్రకాశం జిల్లాలోని పైడిపాడు శాసన కథనానికి సరిపోతోంది రెండవ దేవరాయల సామంతుడైన పంట మైలారుదేవుడు అంతకు పూర్వం ముమ్మడి వేమయరెడ్డి అనే పేరు గల పెదకోమటి వేమారెడ్డి ఇచ్చిన దాన శాసనాన్ని పునరుద్ధరించాడు ఈ ముమ్మడి వేమయరెడ్డి కొండవీటి రాజులలోని ఐదవరాజు. కనుక నాటికి రెడ్డి రాజ్యాన్ని రెండవ దేవరాయలు జయించాడని స్పష్టమవుతోంది. కనుక రెడ్డి రాజ్యం క్రీ శ 1324-25లో ప్రారంభమై క్రీ.శ.1324-1424 సంవత్సరాల మధ్య సాగిందని చరిత్రకారులు నిర్ణయించారు. ఇక వారి పాలనా సంవత్సరాలు, కైఫీయత్తులు, దండకవిలె సంవత్సరాలు లభ్యమైన శాసనాలు ఇచ్చిన సంవత్సరాలకు మధ్య

తేదాలున్నాయి శాసనాల సమాచారంపై వారి కాల నిర్ణయం చేయబడింది. ప్రోలయ వేమారెడ్డి మొదటి శాసనం మల్లవర శాసనం శక 1247 అంటే క్రీ శ 1325, చివరి శాసనం వరకు 28 సంవత్సరాలు పాలించాడు కైఫీయత్తు, దండకవిలె, మెకంజీ రాతప్రతులు అతడు 12 సంవత్సరాలు మాత్రమే పాలించాడని తెలుపుతున్నాయి అవి ఇచ్చిన ప్రారంభ సంవత్సరమే గాక అతను పాలించిన పాలనా కాల సంవత్సరాలు కూడా తప్పని మల్లవరం, మణికేశరం శాసనాలు స్పష్టంగా రుజువు చేస్తున్నాయి

మణికేశవరం శాసనాల తర్వాత లభించిన అన్ని శాసనాలు అనపోతారెడ్డికి సంబంధించినవి అయితే అనపోతుని త్రిపురాంతక శాసనం శక 1268 అంటే క్రీ శ 1347 నాటిది లభించింది కాని అది అతడు రాజుగా వేయించినది కాదు అతడు యువరాజుగా త్రిపురాంతకాన్ని పాలించాడు యర్రాప్రెగడ హరివంశం అనపోతు యువరాజుగా పని చేశాడని స్పష్టంగా పేర్కొంది కనుక క్రీ శ 1347 నాటి శాసనం తండ్రి కాలంలోనే యువరాజుగా వేయించినది. కనుక అనపోత క్రీ శ 1353లో తండ్రి మరణానంతరం రాజ్యానికి వచ్చాడు. అతని చివరి శాసనం శక 1286 అంటే క్రీ శ 1365 నాటిది కనుక అనవేమారెడ్డి మొదటి శాసనం శక 1286 అంటే క్రీ శ 1364లో వేయించిన కోదుతాడిపత్రి శాసనం అతని చివరి శాసనం శక 1304 అంటే క్రీ శ 1382 మాన్యపురం శాసనం కనుక అనవేమారెడ్డి క్రీ శ 1364 నుండి 1382 వరకు పాలించి ఉండాలి కాని ఇతర శాసనాల వల్ల అతడు క్రీ శ 1386 వరకు పాలించినట్లు తెలుస్తోంది తర్వాత రాజ్యానికి వచ్చిన కుమారగిరి రెడ్డి మొదటి శాసనం అతడు శక 1312 అంటే క్రీ శ 1390లో వేయించిన అనపర్తి శాసనం అనవేమారెడ్డి చివరి శాసనం, కుమారగిరి మొదటి శాసనానికి మధ్య 8 సంవత్సరాల కాలం ఉంది ఈ మధ్య కాలాన్ని గురించి తెలుసుకోడానికి కాటయవేమారెడ్డి శాసనాలు ఉపయోగపడుతున్నాయి శక 1308 అంటే క్రీ శ 1386 సంవత్సరం నాటి సింహాచల శాసనంలో కాటయవేముడు కుమారగిరి ప్రధానిగా పేర్కొనబడ్డాడు కనుక కుమారగిరి రెడ్డి క్రీ శ 1382-1386 సంవత్సరాల మధ్య సింహాసనానికి వచ్చి ఉండాలి కుమారగిరి చివరి సంవత్సరం కూడా స్పష్టంగా తెలియదు తంగెడ శాసనంలో భాద్రపదమాసంలో అనవేమా రాజ్యానికి వచ్చాడని ఉంది ఈ శాసనంలోని అనవేముడు పెదకోమటి వేమునిగా గుర్తించారు ఇందులో చెప్పబడిన భాద్రపదమాసాన్ని లెక్కించి క్రీ శ 1402 ఆగస్టు 2వ తేదీ అని నిర్ణయించారు. ఇది పెదకోమటి వేముని మొదటి శాసనం అలాగే శక 1324 అంటే క్రీ శ 1402 నాటి తాళ్లూరు శాసనం కుమారగిరిరెడ్డి, అతని భార్య పుణ్యఫలానికి దానం చేయబడింది కనుక తాళ్లూరి శాసనం ప్రకారం క్రీ శ 1402 వరకు కుమారగిరి పాలించాడు కనుక తాళ్లూరు తంగెడ శాసనాలను బట్టి క్రీ శ 1402 వరకు కుమారగిరి పాలించాడు, అదే సంవత్సరం ఆగస్టులో పెదకోమటి వేమారెడ్డి సింహాసనానికి వచ్చాడు అని చెప్పవచ్చును పెదకోమటి వేముని చివరి శాసనం శక 1341 అంటే క్రీ శ 1419 నాటి రుద్రవరం శాసనం కనుక పెదకోమటి వేముడు క్రీ శ 1402 నుండి 1419 వరకు పాలించాడని భావించవచ్చును. రాచవేమారెడ్డికి సంబంధించిన ఒక్క శాసనం కూడా లభించలేదు. శక 1337 అంటే క్రీ శ 1415 నాటి అమీనాబాద్ శాసనంలో తన తండ్రి కాలం సంతాన వారధికి అతని తల్లి పేర కాలువ త్రవ్వించాడని మాత్రం తెలుపబడింది. తండ్రి తర్వాత అతడు క్రీ శ 1419-20 సంవత్సరంలో రాజ్యానికి వచ్చి ఉంటాడు అతడు నాలుగు సంవత్సరాలు పాలించాడని చాటువులు తెలుపుతున్నాయి కనుక క్రీ శ.1424లో అతని పాలన అంతమై ఉంటుంది కనుక పై శాసనాలను బట్టి రెడ్డి రాజుల పాలనా సంవత్సరాలు ఈ విధంగా రూపొందించవచ్చును

	రాజుపేరు	ప్రారంభ సం॥లు	చివరి సం॥లు	మొత్తం సం॥లు	చాటువులు, మెకంజీ ఇచ్చిన సం॥లు
1	ప్రోలయవేమ	1247/1325	1275/1353	28	12
2.	అనపోత	1275/1353	1286/1364	12	30
3	అనవేమ	1286/1364	1308/1386	22	15లేక17
4.	కుమారగిరి	1308/1386	1324/1402	16	14
5	పెదకోమటివేమ	1324/1402	1342/1420	18	20-25-27
6	రాచవేమ	1342/1420	1346/1424	4	4
				100	95

ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1324-1353: ప్రోలయ వేమారెడ్డి స్థాపించిన రెడ్డి రాజ్యం అద్దంకి నుండి ప్రారంభం అయి కొండవీడు, కందుకూరు, చందోలు శాఖ రాజమహేంద్రవరం శాఖలుగా విస్తరించి తీరాంధ్రదేశాన్ని 100 సంవత్సరాలు పాలించింది. ప్రోలయ వేమారెడ్డి పేరులో తండ్రి తాతల పేర్లు కలిసి ఉన్నాయి తండ్రి పేరు ప్రోల, తాత పేరు వేమ రెండు పేర్లతో ప్రోలయ వేమారెడ్డి అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు ప్రోలయ వేమారెడ్డి చరిత్ర తెలుసుకోడానికి ముట్లూరు, వలివేరు, నకరికల్లు, సంతమాగులూరు, గణపేశ్వరం, పువ్వాడ, ద్రాక్షారామం, మల్లవరం, ఆత్మకూరు, దృజ్జవరం, కల్వపాముల, మాంచాల, అమరావతి, పెరవలి, వేమవరం శాసనాలు ఉపయోగపడుతున్నాయి ఇంకా ఎర్రాప్రెగడ హరివంశం, వామనభట్టు వేమభూపాలీయం, శ్రీనాథుని హరవిలాసం మొదలైన కావ్యాలు కూడా అతని కాలంనాటి సమాచారాన్ని తెలుపుతున్నాయి ప్రోలయ వేముడికి ఘోడెరాయ గంగదేవుడు గురువని రాజ్యస్థాపనలో అతని సహాయ సహకారాలున్నాయని ఎర్రప్రెగ్గడ హరివంశం, ఆత్మకూరు, దృజ్జవరం శాసనాలు తెలుపుతున్నాయి. అతని సోదరులు మాచారెడ్డి, మల్లారెడ్డి పంటనాటి ప్రాంతానికి లేక పాకనాటిలోని విక్రమసింహపురానికి చెందిన తాత దొడ్డారెడ్డి, మేనమామ నాగసేనాపతి, బావమరదులు, పినతండ్రి కుమారులు పోతియ, నాగయ, చిట్టెయలు అండగా నిలిచారు. తమ్ముడు మల్లారెడ్డి సేనాధిపతిగా పని చేశాడు ప్రోలయ వేమారెడ్డి కుటుంబం చాలా పెద్దది కుటుంబ సభ్యులు ఇతర బంధువర్గం కూడా అతనికి వెన్నుదన్నుగా నిలిచారు ఇతనికి సమకాలికుడైన ముసునూరి ప్రోలయ నాయకుని కుటుంబం కూడా చాలా పెద్దది అతనికి కూడా అతని సోదరులు, సోదర సంతానం, వారి వియ్యంకులు, ఇంకా ఇతర బంధువర్గం తోడ్పడింది అలాగే ప్రోలయ వేమారెడ్డి కుటుంబ సభ్యులు కూడా అతనికి సహాయపడ్డారు. ఈ రెండు కుటుంబాలు ముస్లిం బారి నుండి ఆంధ్రదేశానికి విమోచన కలిగించాయి. ఆనాటి ఆంధ్ర స్వాతంత్ర్య సమరంలో రెండు కుటుంబాలు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకున్నారు కాంచీపురానికి చెందిన అవచి పావడిశెట్టి కుమారుడు దేవయశెట్టి కూడా సహాయపడ్డాడట

తుగ్లక్ పాలన - దురంతాలు: ప్రోలయ వేమారెడ్డి అద్దంకి రాజ్యం స్థాపించబోయే ముందు ఆంధ్రదేశం అంతా తుగ్లక్‌ల దురంతాలకు లోనై ఉంది. దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి బ్రాహ్మణులు వధించబడ్డారు వారి అగ్రహారాలు లాక్కోబడ్డాయి వారు యజ్ఞ యాగాదులు చేయడానికి వీలులేదు స్త్రీలపై అత్యాచారాలు జరుగుతున్నాయి రైతులపై భరించరాని పన్నులు విధింపబడ్డాయి. ఆ స్థితిలో ముసునూరి ప్రోలయనాయకుడు ఉత్తరాంధ్ర, తూర్పు తెలంగాణలో స్వతంత్రం సాగించగా ఉత్తేజితుడై ప్రోలయ నాయకునితోపాటు ప్రోలయ వేమారెడ్డి కూడా దక్షిణాంధ్ర దేశంలో స్వతంత్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు సైన్యాన్ని సమీకరించుకొని ముస్లింలతో యుద్ధానికి దిగాడు ప్రోలయ నాయకుడు కాకతీయ నాయంకరునిగా యుద్ధ విద్యలలో ఆరితేరినవాడు అతడు గొప్ప యుద్ధనీతి, అస్త్రశస్త్రాలను ప్రయోగింపగల వీరుడని, గొప్ప విలుకాడని వేమభూపాల చరిత్ర తెలుపుతోంది తనకున్న యుద్ధానుభవంతో సైన్యాన్ని తయారు చేసుకొని వారికి శిక్షణ ఇచ్చి ముస్లింలతో పోరాడి దక్షిణాంధ్రను విముక్తి చేశాడు. తన నాయంకరమైన దేసట్లపురం నెల్లూరి రాజ్యానికి అనుబంధంగా ఉండేది. కాకతీయ ప్రతినిధి ముప్పిడి నాయకుని తర్వాత నెల్లూరును తుగ్లక్ సైన్యాలు ఆక్రమించాయని చాటు పద్యాలు తెలుపుతున్నాయి. కనుక ప్రోలయ నాయకుడు నెల్లూరులోని తుగ్లక్ ప్రతినిధితో పోరాడి ఉంటాడు. ముస్లింలతో పోరాడకుండా రాజ్యస్థాపన చేయడానికి వీలులేదు. కనుక అతడు ముస్లింలతో తప్పకుండా పోరాడి ఉంటాడు. ముస్లింలపై సాధించిన విజయాల వల్ల మ్లేచ్ఛాబ్ధికుంభోద్భవ అనే బిరుదు ధరించి ఉంటాడని మల్లవరం శాసనం తెలుపుతోంది తర్వాత గుండ్లకమ్మ నది ఒడ్డున ఉన్న అద్దంకిని తన రాజధానిగా చేసుకొని ఉండవచ్చును అద్దంకి చాళుక్యుల కాలం నుండి ప్రసిద్ధి చెందిన కోట. కనుక అచటి కోటను పునర్ నిర్మాణం చేసి బలిష్టంగా తీర్చిదిద్దుకొని తన రాజధానిగా చేసుకొని ఉంటాడు. దాంతో అద్దంకి రెడ్డిరాజ్యం స్థాపించబడినది

కొలని రుద్రదేవుడు - సంతమాగులూరు శాసనం: ప్రోలయ వేమారెడ్డి అద్దంకిలో క్రీ శ 1325లో రాజ్యం స్థాపించిన కాలంలోనే ప్రకాశం జిల్లా సంతమాగులూరులో కొలనిరుద్రుడు మరొక రాజ్యం స్థాపించి పాలించినట్లుగా కనిపిస్తోంది. సంతమాగులూరులో కొలనిరుద్రుని శాసనం ఉంది ఈ శాసనం క్రీ శ.1326వ సంవత్సరానికి చెందినది. ఆ శాసనంలో కొలనిరుద్రుడు కాకతీయ ప్రతాపరుద్రుని తన సార్వభౌమునిగా పేర్కొన్నాడు ప్రతాపరుద్రుడు క్రీ.శ 1323లోనే మరణించాడు. మరి 1326లో కొలనిరుద్రుడు ప్రతాపరుద్రుని ప్రభువుగా పేర్కొంటూ శాసనం వేయించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. క్రీ శ.1323లో ఓరుగల్లు కోట వద్ద

ముస్లింలతో జరిగిన యుద్ధంలో పోరాడిన 75 మంది కాకతీయ సేనానులలో మరణించకుండా మిగిలినవారు ముగ్గురే. వారే రేచర్ల సింగమ నాయకుడు, బెండపూడి అన్నయ, కొలనిరుద్రుడు. ముసునూరి ప్రోలయ నాయకుడు ప్రారంభించిన స్వాతంత్ర్య సమరకాలంలో అంటే క్రీ.శ.1325లో కొలనిరుద్రుడు కూడా సంతమాగులూరు ప్రాంతంలో ముస్లింలను పారదోలి స్వంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. రాజ్యం ఏర్పడిన తర్వాత తనను తాను కాకతీయ సామంతునిగా భావించుకొని ఈ శాసనం వేయించి ఉండవచ్చును ఈ శాసనాన్ని బట్టి కొందరు ప్రోలయ వేమారెడ్డికి అద్దంకి రాజ్యం స్థాపించడంలో కొలనిరుద్రుడు సహాయపడి ఉండవచ్చని భావించారు కాని ఈ శాసనం ప్రకారం కొలనిరుద్రుడు కూడా ప్రోలయ వేమారెడ్డితోపాటే సంతమాగులూరు లో తన స్వంత రాజ్యాన్ని స్థాపించుకొని ఉంటాడని భావం కలుగుతోంది తర్వాత ప్రోలయ వేమారెడ్డి, కొలనిరుద్రుని తొలగించి గాని, ఓడించి గాని ఆ ప్రాంతాన్ని తన రాజ్యంలో కలుపుకొని ఉండవచ్చును ఈ ఒక్క శాసనంలో తప్ప మరెక్కడా కొలనిరుద్రుని ప్రస్తావన లేదు. కనుక అతడు రాజ్యం స్థాపించుకున్న కొద్దికాలం తర్వాత ప్రోలయ వేమారెడ్డి ఆ రాజ్యాన్ని ఆక్రమించి ఉండవచ్చును

ఆరవీటి సోమరాజుకు సహాయపడటం-రాయచూరుపై దాడి: ఇదే సమయంలో రాయలసీమలో ఆరవీటి సోమరాజు విముక్తి యుద్ధం ప్రారంభించాడు. అతనికి సహాయం చేయమని కాపయనాయకుడు ప్రోలయ వేమారెడ్డిని ఆదేశించాడు. ఆరవీటి సోమరాజుకు సహాయంగా ప్రోలయ వేమారెడ్డి వెళ్లి రాయచూరు దుర్గాన్ని జయించాడు ఈ విజయానికి సంకేతంగా రాయచూరు దుర్గ విభాళ గుజ్జరిభట్టు విభాళ అనే బిరుదులు ధరించాడు ఆరవీటి సోమరాజు విజయాలతో రాయలసీమ కంపిలి రాజ్యం ముస్లింల నుండి విముక్తి చెందింది

రాజ్యవిస్తరణ - త్రిపురాంతకం, శ్రీశైలంలను ఆక్రమించడం: ఆ తర్వాత అతడు రాజ్యవిస్తరణకు పూనుకున్నాడు. త్రిపురాంతకం, శ్రీశైల ప్రాంతాలలో తెలుగు చోడ కుటుంబాలు ఉండేవి. వారు ఆ ప్రాంతంలో స్వంత రాజ్యాలను ఏర్పాటు చేసుకోడానికి ప్రయత్నాలు ఆరంభించినట్లు కనిపిస్తోంది. అది గమనించిన ప్రోలయ తన తమ్ముడు అన్నారెడ్డి, అన్నారెడ్డి అతని కుమారుడు అనపోతారెడ్డిని పంపగా వారు ఆ ప్రాంతాలు జయించి అద్దంకి రాజ్యంలో కలిపారు. ఆలకుంటల ప్రభువుకు ఉద్యోగి అయిన రామనాయకుడు కరికాల వంశానికి చెందిన మనుమ మల్లదేవుని శిరస్సు ఖండించి అతని కోటలను ఆక్రమించాడని అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. ఈ రామనాయకుడు రెడ్డి సేనాని అయి ఉండవచ్చును. ఈ ప్రాంతంలో శక 1268 నుండి రెడ్డి శాసనాలు కనిపిస్తున్నాయి. ప్రోలయ వేముని త్రిపురాంతక శాసనం కూడా శక 1268 నాటిదే. తర్వాత వారు అహోబిళాన్ని కూడా జయించారు. విజయం తర్వాత త్రిపురాంతకంలో క్రీ.శ.1346-47 సంవత్సరాలలో శాసనాలు వేయించారు. ఈ విజయాల తర్వాత ప్రోలయ వేమారెడ్డి శ్రీశైలానికి, అహోబిళానికి మెట్లు కట్టించాడు. ఆ విషయాన్ని ముట్లూరు శాసనం ధృవపరుస్తోంది కనుక ఈ ప్రాంతాలు ప్రోలయ వేముని రాజ్యంలో భాగాలయ్యాయని, దాని తర్వాత రేనాడు కూడా జయింపబడిందని ఈ శాసనాలు తెలుపుతున్నాయి. కందుకూరుకు దక్షిణంగా రెడ్డి శాసనాలు లేవు కనుక అంతవరకే రెడ్డి రాజ్యం విస్తరించిందని భావింపవచ్చును.

మోటుపల్లిని జయించటం: ఇదే సమయంలో తన సోదరుడు మల్లారెడ్డిని మోటుపల్లిని జయించడానికి పంపాడు. అతడు అక్కడి పాలకులను ఓడించి మోటుపల్లిని ఆక్రమించాడు. మోటుపల్లిలో మల్లారెడ్డి ఓడించిన శత్రువులు ఎవరో తెలియదు. ప్రతాప ధరణీపాలవశీందొలి మల్లారెడ్డి మోటుపల్లిని ఆక్రమించాడని సాహిత్యం వర్ణిస్తోంది. ఏమైనా మోటుపల్లి అద్దంకి రాజ్యంలో చేరింది. కాకతీయుల రికార్డులలో మోటుపల్లిని చైత్రపుర అని, అది వేసవి విడిది అని పేర్కొనబడింది. ప్రోలయవేమారెడ్డి మోటుపల్లిని ఎప్పుడు జయించిందీ స్పష్టంగా తెలియదు

నెల్లూరు, కందుకూరుల ఆక్రమణ: ప్రోలయ వేమారెడ్డి కమ్మనాటిని జయించిన తర్వాత పాకనాటిని కూడా జయించి తన రాజ్యంలో కలుపుకొని ఉంటాడు. పూర్వం పాకనాటిని బలీయవిహారం అని కూడా అనేవారు. నెల్లూరులోని ముస్లిం వజీరులను ఓడించిన కాలంలోనే పాకనాడు అతని వశం అయి ఉంటుంది. విజయనగరం హరిహర బుక్కరాయులు, నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి వరకు రెడ్డిరాజ్యంలో చేరి ఉన్నట్లు కనిపిస్తోంది. నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరు, కనిగిరి కూడా అతని రాజ్యంలో భాగాలయ్యాయి.

వెలనాడు పలనాడు: కమ్మనాటిని జయించిన తర్వాత దానికి ఉత్తరంగా వెలనాడు, పలనాడులను కూడా జయించి కృష్ణా నది వరకు తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. దాంతో అతని రాజ్యం ఉత్తరాన కృష్ణా నది నుండి దక్షిణాన పాకనాటి వరకు, తూర్పున బంగాళాఖాతం నుండి పశ్చిమాన శ్రీశైలం, అహోబిలం వరకు విస్తరించింది.

శ్రీనాధుడు తన భీమేశ్వర పురాణంలో పెన్నానది నుండి కృష్ణానది వరకు ప్రోలయవేముని రాజ్యం విస్తరించిందని, అందులో విక్రమసింహపురం, గండవరం, దువ్వూరు ముఖ్య పట్టణాలని పేర్కొన్నాడు. పాకనాడు, పూంగినాడు, ఏరువనాడు, కమ్మనాడు, వెలనాడు, పలనాడులు ప్రోలయవేముని రాజ్యంలో భాగాలుగా ఉండేవి

వేంగి రాజకీయాలు - ఏరువ భక్తిరాజుతో సంబంధాలు: ముసునూరి ప్రోలయ నాయకుడు క్రీ.శ 1330-35 మధ్య మరణించి ఉండవచ్చని అంచనా. అతని మరణం తర్వాత వేంగిరాజ్యంలో రాజకీయాలు మారాయి. ఉత్తరాంధ్రను విముక్తి చేసే సందర్భంలో వేంగి పాలకుడు చంద్రవంశస్తుడైన వెంగభూపాలుడు ప్రోలయ నాయకునికి సహాయపడ్డాడు కాని స్వాతంత్ర్య సమరంలో వెంగభూపాలుడు మరణించినట్లు కనిపిస్తోంది. వెంగభూపాలుడు తన సోదరిని ఏరువచోళ వంశానికి చెందిన భక్తీశ్వర చోళునకు ఇచ్చి వివాహం చేశాడు వెంగభూపాలుని మరణం తర్వాత ప్రోలయ నాయకుడు భక్తీశ్వరచోళుని వేంగి దేశాధిపతిని చేశాడు. భక్తీశ్వరుని పెంటపాడు, అతని కుమారుడు అన్నెదేవచోడుని రాజమండ్రి శాసనం, మద్రాసు మ్యూజియం శాసనాల వలన ఏరువ చోడుల చరిత్ర తెలుస్తోంది. ప్రోలయ నాయకుని మరణానంతరం కాపయనాయుడు రేకపల్లి రాజ్యాధిపతి అయ్యాడు అతడు క్రీ.శ 1335-36లో ఓరుగల్లు నుండి ముస్లిం గవర్నర్ మాలిక్‌మక్బూల్‌ను తరిమి ఓరుగల్లునాక్రమించి ఆంధ్రసురత్రాణ ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు పొంది పూర్వపు కాకతీయ సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు తర్వాత అతడు తన రాజ్యాన్ని పటిష్టపరచుకోడానికి ఉత్తరాంధ్రను వివిధ పరిపాలనా భాగాలు చేసి తనకు విశ్వాసపాత్రులైన వారిని, సమీప బంధువులను ఆయా ప్రాంతాలలో తన ప్రతినిధులుగా నియమించాడు ఆ సందర్భంలో రాజమహేంద్రవరానికి అధిపతిగా తన పినతండ్రి రాజానాయకుని కుమారుడు అనపోతా నాయకుని నియమించి వేంగిరాజ్యాన్ని కూడా అప్పగించాడు దాంతో భక్తీశ్వరచోడుడు తన రాజ్యాన్ని కోల్పోయాడు. రాజ్యం కోల్పోయిన భక్తీశ్వరుడు ప్రోలయ వేమారెడ్డిని సహాయం అర్థించి ఉంటాడు ప్రోలయ వేమారెడ్డి తన కుమార్తెను భక్తీశ్వరుని పెద్ద కుమారుడైన భీమరాజుకు ఇచ్చి వివాహం చేశాడు అతనికి భీమలింగచోడుడు అని కూడా పేరు కాశీఖండం, శివలీలా విలాసం కూడా ఈ విషయాన్ని తెలుపుతున్నాయి దాంతో రెడ్డి ఏరువ వంశాలు బంధువులయ్యారు అతని చిన్న కుమారుడు సూరవరాన్ని పాలించిన పిన ఉండి రాజు కూతురు ఇరుగాంబికను వివాహం చేసుకున్నాడు. భక్తీశ్వరుడు కొన్నాళ్లు రెడ్డిరాజ్యంలో ఉండి క్రీ శ 1355లో శ్రీశైలం త్రిపురాంతకాలను దర్శించి దాన శాసనాలు వేయించాడు

శ్రీశైల ప్రాంతంలో భక్తీశ్వరచోడుని స్థానం ఏమిటి?: నందికొట్కూరు తాలూకాలోని కంద్వకొలను అనే గ్రామాన్ని ఏరువ భక్తిచోడుడు శ్రీపర్వత వాసి అయిన శైవ బ్రహ్మచారికి, కౌశిక గోత్రీకుడైన విశ్వనాధునికి శక 1277 అంటే క్రీ శ 1355వ సంవత్సరంలో దానం చేశాడు అదే సమయంలో శ్రీపర్వతేశ్వరునికి ఆతుకూరు గ్రామాన్ని దానం చేశాడు. ఈ దానాలు స్వతంత్ర హోదాలో చేశాడు కనుక అచట క్రీ శ 1355లో ప్రోలయ వేమారెడ్డి అధికారం ఉందా, లేదా అని అనుమానం కలుగుతోంది. అంటే త్రిపురాంతకం నుంచి నందికొట్కూరు తాలూకా వరకు ఉన్న ప్రాంతాన్ని భక్తీశ్వరచోడుడు స్వతంత్రంగా పాలించినట్లు కనిపిస్తోంది చోడ భక్తిరాజు తండ్రి గంగాధర చోడుడు, తాత సోమరాజు. అంతకుపూర్వం వారిద్దరూ ఏరువ విషయాన్ని పాలించారు. కనుక ఆ ప్రాంతం భక్తిరాజు స్వస్థానం అని స్పష్టంగా తెలుస్తోంది కనుక అతడు స్వతంత్ర హోదాతోనే ఈ దానాలు చేశాడు అని భావించవలసి వస్తుంది

తర్వాత రెడ్డిరాజుల సహాయంతో భక్తీశ్వరుడు తిరిగి వేంగి రాజ్యాన్ని సంపాదించాడు. ప్రోలయ వేమారెడ్డి కాపయనాయకునికి సామంతుడు కనుక కాపయను ఒప్పించి భక్తీశ్వరునికి రాజ్యం ఇప్పించి ఉంటాడు. ప్రోలయ వేమారెడ్డి కాపయనాయకునితో అంటే ముసునూరి రాజ్యం, రెడ్డి రాజ్యం ఎప్పుడూ ఘర్షణ పడలేదు. కనుక కాపయ నాయకుని ఒప్పించి తన వియ్యంకునికి రాజ్యం ఇప్పించి ఉంటాడు భక్తీశ్వర చోడుడు వేంగి దేశానికి వెళ్లిపోయిన తర్వాత అతని అధీనంలో ఉన్న శ్రీశైలం, మార్కాపురం, నందికొట్కూరు తాలూకా ప్రాంతాలు తిరిగి రెడ్డి రాజ్యంలో విలీనమై ఉండవచ్చును మొత్తం మీద ప్రోలయ నాయకుడు వేంగి రాజకీయాలలో జోక్యం చేసుకొని ప్రముఖ పాత్ర నిర్వహించాడని చెప్పవచ్చును.

పరిపాలనా విభాగాలు - చందోలు, కందుకూరు సీమలు: ప్రోలయ వేమారెడ్డి తన రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం విభాగాలు చేశాడు. వెలనాడును ఒక విభాగంగా చేసి దానికి చందోలును రాజధానిగా చేశాడు. చందోలులో తన అన్న మాచారెడ్డిని పరిపాలకుడుగా నియమించాడు. అందువల్ల చందోలు ఒక ఉపరాజ్యంగా

ర్పడి, మాచారెడ్డి సంతతివారు అక్కడ పాలకులుగా కొనసాగింది చందోలు రాజ్యంలో వెలనాడు పలనాడులు సరడికోట భాగాలుగా ఉండేవి. చందోలుకు దనదపురం అని పేరు దానిని శాఖాపురమని రెడ్డి శాసనాలు పర్ణించాయి. రాజ్యంలోని దక్షిణ భాగాన్ని మరొక విభాగంగా చేసి దానికి కందుకూరును రాజధానిగా చేసి, అక్కడ తన తమ్ముడు మల్లారెడ్డిని పాలకునిగా నియమించాడు. అది కూడా ఒక ఉపరాజ్యంగా మారి మల్లారెడ్డి సంతతివారు ఆ రాజ్యాన్ని పాలించారు. మల్లారెడ్డి రెడ్డిరాజ్యానికి సర్వసైన్యాధ్యక్షుడిగా కూడా పని చేశాడు మల్లవరం శాసనం, హరివంశం ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. రాజ్యంలోని మధ్య ప్రాంతం అంతా అద్దంకి అధికారంలో, తన ప్రత్యక్ష పాలనలో ఉంది

రాజ్యరక్షణ - కోటల నిర్మాణం: ప్రోలయ వేమారెడ్డి రాజ్యరక్షణకు కోటలు అతిప్రధానం అని గుర్తించి రాజ్యం అంతటా గిరిదుర్గాలు నిర్మించాడు రాజ్యంలోని ప్రధాన కొండలన్నింటి మీద దుర్గాలు నిర్మించాడు వినుకొండ, బెల్లంకొండ, కొండవీడులలో బలిష్టమైన గిరిదుర్గాలను నిర్మించాడు. అతని కాలంలో మొత్తం 84 కోటలు నిర్మింపబడ్డాయని మాంచాళ శాసనం పేర్కొంటోంది. అతడు నిర్మించిన ఈ దుర్గాలు రెడ్డిరాజ్యం పోయిన తర్వాత కూడా గజపతి, అశ్వపతి, నరపతుల యుగంలోనే గాక, గోల్కొండ నవాబుల కాలంలో కూడా దక్షిణాంధ్ర దేశంలో ప్రముఖ పాత్రను నిర్వహించాయి. ముఖ్యంగా కొండవీడు, బెల్లంకొండ, శత్రు దుర్భేధ్యాలుగా కీర్తి గాంచాయి. తర్వాత అన్ని దుర్గాలలో మంచి శిక్షణ గల సైన్యాన్ని ఏర్పాటు చేశాడు.

కమ్మనాడు పేరు మరుగున పడిపోవడం: ప్రోలయ వేమారెడ్డి అద్దంకిలో రాజ్యస్థాపన చేసిన తర్వాత అంతవరకు కమ్మనాడు అని పిలువబడిన ఆ ప్రాంతం పేరు మరుగునపడిపోయింది. ఆనాటి నుండి అద్దంకి రాజ్యం అనే పేరు ప్రచారంలోకి వచ్చింది. గుండ్లకమ్మ నదికిరువైపుల ప్రాంతాన్ని కమ్మనాడు అని అనేవారు ఇక్ష్వాకుల కాలం నుంచి శాసనాలలో కమ్మనాడు అని పేర్కొనబడింది. గుండ్లకమ్మనది కూడా కమ్మ అనే పదం నుండి వచ్చిందే. కమ్మనది కమ్మనాడులో ప్రవహించే నది. గుండ్లకమ్మకు కుండిప్రభ, బ్రహ్మకుండి అని కూడా పేర్లున్నాయి. ఈ అద్దంకి గుండ్లకమ్మ నది ఒడ్డునే ఉంది. పూర్వకాలంలో జాతులు నివసించిన నదులను వారి పేరుతోనే పిలిచేవారు. పలనాటిలో నాగజాతి వారుండేవారు. వారివల్ల అక్కడి నదికి నాగులేరు అని పేరు వచ్చింది. అలాగే శబరజాతి వారి వల్ల శబరి నదికి పేరు వచ్చింది. కమ్మజాతి వారు నివసించినందువల్ల కమ్మ పేరు మీదుగా గుండ్లకమ్మ అని పేరు వచ్చింది. ఈ ప్రాంతానికి చెందినవారే నేటి కమ్మ కులస్థులు. అంటే కమ్మవారి స్వస్థలం కమ్మనాడు. అద్దంకి రాజ్యం కొండవీటి రాజ్యం అనే పేర్లు ప్రాముఖ్యత వహించినప్పటికీ పెదకోమటి వేమారెడ్డి కాలం వరకూ శాసనాల్లో కమ్మనాడు ప్రస్తావించబడింది. రెడ్డి రాజులు తర్వాత ఈ ప్రాంతాన్ని ఆక్రమించిన కళింగ గజపతులు ఈ ప్రాంతాలకు ఒరిస్సా పరిపాలనా విభాగాలైన దండపాడి అనే పేరు పెట్టారు. వారి కాలంలో ఆ ప్రాంతాన్ని కొండవీటి దండపాడి అనే పేరు పెట్టినందువల్ల కమ్మనాడు అనే పదం పూర్తిగా అంతరించిపోయింది.

విజయనగర సామ్రాజ్య విస్తరణ: అద్దంకి రాజ్యస్థాపన జరిగిన తర్వాత 10 సంవత్సరాలకు విజయనగర హరిహర, బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. వారు ఆరవీటి సోమరాజు వంశస్తులను ఓడించి గుత్తి, అనెగొంది, కంపిలి ప్రాంతాలను ఆక్రమించి, విజయనగర పట్టణాన్ని నిర్మించారు. అది అచిర కాలంలోనే బలపడి నలుదిక్కులకు విస్తరించింది. వారి రాజ్య విస్తరణలో భాగంగా హరిహర, బుక్కరాయలు అద్దంకి రాజ్యంపై దండెత్తారు. ప్రోలయ వేమారెడ్డి వారితో పోరాడినదీ, లేనిదీ తెలియదు గానీ తన దక్షిణ ప్రాంతాలు కోల్పోయాడు పాకనాడు విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది ఉదయగిరి, నెల్లూరు, కృష్ణ పట్టణాలు వారి వశం అయ్యాయి. క్రీ.శ.1343 నాటి నుండి నెల్లూరు జిల్లాలో విజయనగర సైన్యాధిపతులైన విరూపణ్ణ, మొదటి కంపన ఒడయారు శాసనాలు కనిపిస్తున్నాయి. క్రీ.శ.1339 నాటికే హరిహరరాయలు పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వర అనే బిరుదు ధరించాడు. కనుక దక్షిణ దిక్కున ప్రోలయ వేమారెడ్డి రాజ్యం కందుకూరు వరకే పరిమితమైందని చెప్పవచ్చును. అంటే విజయనగర రాజులలో రెడ్డిరాజ్యానికి ప్రోలయ వేమారెడ్డి కాలంలో విరోధం ప్రారంభమైంది ప్రోలయ వేమారెడ్డి చివరి కాలంలో అంటే క్రీ.శ.1353లో కళింగ చక్రవర్తి మూడవ నరసింహదేవుడు కాపయ నాయకుని రాజ్యభాగమైన ఉత్తరాంధ్రపై దండెత్తి జయించి, కృష్ణానదీ తీరానికి చేరాడు. అతని సేనానులు కాళిదాసు, గోవిందలు శ్రీకాకుళంలోని దివిసీమలోని శ్రీకాకుళం వరకు జయించినట్లు శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు దేవాలయంలోని శాసనం తెలుపుతోంది. గంగ దండయాత్ర అంతవరకే పరిమితమైంది. రెడ్డి

రాజ్యంపై దాడి చేయకుండా వెనుదిరిగిపోయింది. అందువల్ల ప్రోలయ వేమారెడ్డి రాజ్యానికి ఎలాంటి ఉపద్రవం జరగలేదు.

ధరణికోట మీద బహమనీల దాడి: ప్రోలయ వేమారెడ్డి కాలంలో క్రీ.శ.1352లో బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ హసన్‌గంగు ధరణికోట మీద దాడి చేశాడని కొందరు భావించారు. మెకంజీ మాన్యుస్క్రిప్ట్స్ ప్రోలయ వేముడు, అల్లావుద్దీన్ మొదలైన తురుష్క మల్లులను జయించాడని తెలుపుతున్నాయి. ఇతడు గుల్బర్గాలో క్రీ.శ.1347లో బహమనీ రాజ్యాన్ని స్థాపించిన అల్లావుద్దీన్ హసన్‌గంగు అయి ఉండవచ్చును. హసన్‌గంగు క్రీ.శ.1350 ప్రాంతంలో అమరావతిపై దండెత్తాడని భావింపబడుతోంది. బహుశా ఆ దండయాత్రా ప్రస్తావనే అయి ఉంటుంది. ఈ యుద్ధంలో ముస్లింలతో మల్లారెడ్డి పోరాడాడని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయపడ్డారు.

ముసునూరు వంశస్తులతో సంబంధాలు: ప్రోలయ వేమారెడ్డి ముసునూరు నాయకులతో అన్ని విధాల సహకరించాడు. ప్రోలయ నాయకునికి విధేయుడుగా ఉన్నాడు. కాపయనాయకుడు ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత పూర్వపు కాకతీయకాపయ నాయకుని అధికారాన్ని అంగీకరించాడు. అనితల్లి కలువచేరు శాసనం ప్రతాపరుద్రుని కాలం నాటి 75 మంది నాయకులు ప్రోలయవేమునితో సహా కాపయనాయకుని కొలిచారని తెలుపుతోంది. అయినప్పటికీ ముసునూరి నాయకులు ప్రోలయ వేమారెడ్డి మీద తమ అధికారాన్ని చెలాయించినట్లుగా లేదు. నామమాత్రపు సార్వభౌమాధికారాన్ని అంగీకరించి ప్రోలయ వేమారెడ్డి తన రాజ్యాన్ని స్వతంత్రంగానే పాలించుకున్నాడు. మొత్తం మీద రెండు రాజ్యాల మధ్య స్నేహ సంబంధాలేగాని విరోధం లేదు.

చీమకుర్తి తామ్ర శాసనం అంటే అనవేముని శాసనం - చీమకుర్తి కరణం వద్ద నుంచి క్రీ.శ.1920లో ఎపిగ్రఫీ ఇండికా Vol XXI పేజి 276లో ప్రకటించబడింది. ఇది దాన శాసనం. శ్రీశైలం వద్ద అమ్మనబ్రోలు సీమలోని రామతీర్థ గ్రామాన్ని సర్వాగ్రహారంగా చేసి చిట్టమూరు తిమ్మనభట్టు శాస్త్రులకు (అతని తండ్రి కొండభట్టారకుడు, తాత కామేశ్వర భట్టు) శక 1257లో దానం చేయబడింది. ఈ శాసనం రెడ్లు ధరించు సాధారణ బిరుదులు కాక ప్రోలయవేముడు కళింగరాయమానమర్దన, వడ్డియరాయ నిద్దునాధమ, జంతురు నాటరాయ అల్లకల్లోల అనే బిరుదులు ధరించినట్లు తెలుపుతోంది. దీనిని బట్టి అతడు కళింగ దండయాత్రను నిర్వహించాడని స్పష్టమవుతోంది. ప్రోలయవేముని రాజ్యం కృష్ణానదిని దాటలేదు. మరి కళింగ మీద దండెత్తడం సాధ్యమా అని తర్కించవలసి ఉంది. ఈ విజయాలు అతడు ప్రోలయనాయకునికి సహాయంగా వెళ్లి సాధించిన విజయాలు. ప్రోలయనాయకుడు గాంగ వంశస్తులతో పోరుతూ మరణించాడు. ఆ యుద్ధ ప్రస్తావనే ఈ చీమకుర్తి శాస కధనం అయి ఉంటుంది.

సమకాలీనత్వం: ప్రోలయ వేమారెడ్డి, ముసునూరి ప్రోలయ నాయకుడు, కాపయనాయకుడు, తూర్పు గాంగరాజైన మూడవ నరసింహదేవుడు, విజయనగర రాజులైన హరిహరరాయలు, బహమనీ సుల్తాన్ అల్లాఉద్దీన్ బహమన్‌షాలకు సమకాలికుడు.

దానధర్మాలు: ప్రోలయ వేమారెడ్డి కాలంనాటి అనేక శాసనాలు లభించినా అందులో అతని రాజకీయ కార్యకలాపాలను గురించి తెలియలేదు. అవన్నీ దాన శాసనాలు. కనుక అవి అతడు చేసిన దాన ధర్మాలను తెలుసుకోవడానికి బాగా ఉపయోగపడుతున్నాయి. ముస్లింలను పారద్రోలి రాజ్యస్థాపన చేసిన ప్రోలయవేముడు హైందవధర్మ రక్షణకు పూనుకున్నాడు.

అగ్రహారాలు - దానాలు: ముస్లింల పాలనలో లాక్కున్న అగ్రహారాలను బ్రాహ్మణులకు పునరుద్ధరించాడు. అవేగాక నూతనంగా అనేక బ్రాహ్మణులకు అగ్రహారాలు, భూదానాలు చేశాడు. క్రీ.శ.1330లో వలివేరు గ్రామాన్ని అగ్రహారంగా చేసి బ్రహ్మభట్ల అనే బ్రాహ్మణునికి దానం చేశాడు. క్రీ.శ.1335లో చీమకుర్తి, పులికొండ, భీమేశ్వరం, కొమరపురం, మైలవరాలలోని కొన్ని భూములను సర్వపరిహారం మాన్యాలుగా చేసి బ్రాహ్మణులకు దానం చేశాడు. క్రీ.శ.1344లో మాంచాల్ల గ్రామాన్ని అగ్రహారంగా చేసి యలకూచివల్లభశిష్ట అనే బ్రాహ్మణునికి దానం చేశాడు. అదే సంవత్సరంలో తన తల్లి అన్నెమాంబ పుణ్యం కోసం పెరవలి గ్రామాన్ని 108 వృత్తులుగా విభజించి సర్వాగ్రహారంగా అష్టభోగస్వామ్యంగా బ్రాహ్మణులకు దానం చేశాడు. ఆతుకూరును వేమపురం అని పేరు మార్చి శాలిశకం 1267 అంటే 18-3-1345లో బ్రాహ్మణులకు దానం చేశాడని త్రివేణి 1933 నవంబరు సంచిక 278వ పేజీలో ప్రకటించబడింది. తన మేనమామ నాగసేనాని ప్రోలయ వేమునకు అండగా నిలిచాడు.

అందుకు తన గౌరవాభిమానాలు వెల్లడించడానికి గుంటూరు జిల్లాలోని ముట్టూరు గ్రామాన్ని నాగపురమని పేరు మార్చి అగ్రహారంగా చేసి జొన్నలగడ్డ మృత్యుంజయాచార్యునికి ఏకభోగంగా దానం చేశాడు. అతడు మొత్తం 44 గ్రామాలు దానం చేసినట్లు శాసనాలున్నాయి ఈ 44 గ్రామాలలో 3 గ్రామాలు వేంగినాటి బ్రాహ్మణులకు, 36 గ్రామాలు వెలనాటి శాఖ వారికి, 5 గ్రామాలు ద్రావిడ బ్రాహ్మణులకు దానం చేసినట్లు తెలుస్తోంది. అందువల్ల బ్రాహ్మణులు అతనిని అనవరత పురోహిత కృతసోపాన ధర్మత్రిష్ఠాగురు అని కీర్తించారు. అతడు బ్రాహ్మణులకు చేసిన దానాలను పరిశీలిస్తే, బ్రాహ్మణులకు గొప్ప గౌరవ మర్యాదలను చూపినట్లు, వారిని అపరిమితంగా ఆదరించినట్లు కనిపిస్తుంది. హేమాద్రి రాసిన చతుర్వర్గ చింతామణిలో చెప్పబడిన వ్రతఖండం 15వ ఖండలో చెప్పిన అన్ని దానాలను చేసి ధర్మవితరునిగా కీర్తి వహించాడు. అందువల్ల అతనికి అపరిమిత భూదాన పరశురామ, నిశ్శమ భూదాన పరుశురామ అనే బిరుదులు వచ్చాయి.

దేవాలయాలకు దానాలు - మరమ్మతులు: బ్రాహ్మణులను ఆదరించడమేగాక ముస్లింల కాలంలో దెబ్బతిన్న అనేక దేవాలయాలను పునరుద్ధరించి వాటి నిర్వహణకు దానాలు చేశాడు. ఎర్రాప్రెగడ నివసించిన చదలవాడ గ్రామాన్ని తన తమ్ముడు మాచారెడ్డి పేరుతో మల్లవరంగా మార్చి దేవభోగంగా దానం చేశాడు. మల్లారెడ్డి ప్రోలయవేముని కంటే ముందు మరణించినట్లు కనిపిస్తోంది. అమరావతిలోని అమరేశ్వరాలయానికి మరమ్మతులు చేసి బంగారు శిఖరాన్ని ప్రతిష్టించాడు. అమరావతికి దానం చేసిన శిలాశాసనం క్రీ.శ.1345 కార్తీక మాసంలో ప్రతిష్టించబడింది. తన రాజధాని అద్దంకిలో కూడా దేవాలయాలు నిర్మించాడు. తాను నిర్మించిన 84 దుర్గాలలో కూడా దేవాలయాలు నిర్మించి ఉంటాడు. ఆనాడు ముందు దేవాలయ ప్రతిష్ట చేసి తర్వాత గ్రామాలను నిర్మించుకొనే ఆచారం ఉంది. శ్రీశైలానికి మెట్లు కట్టించాడు శ్రీశైల పర్వతాన్ని ఎన్ని శ్రీశైల పర్వతంపై ఉన్న మల్లికార్జున ఆలయాన్ని చేరడానికి మెట్లు కట్టించాడు. ముట్టూరు శాసనంలో ఈ ప్రస్తావన ఉన్నందున క్రీ.శ.1346 నాటికే మెట్లు నిర్మించడం పూర్తయి ఉంటుందని అలాగే పాతాళ గంగలోకి ప్రజలు దిగి స్నానాలు చేయడానికి కూడా మెట్లు కట్టించాడు. అహోబిలానికి కూడా మెట్లు కట్టించి దానాలు చేశాడు. అందువల్ల అతనికి శ్రీపర్వతాహోబిల నిర్మితసోపానుడు అనే బిరుదు వచ్చింది.

ప్రజా సంక్షేమం: ప్రజల సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టాడు. రాజ్యమంతటా బావులు, చెరువులు త్రవ్వించాడు. వ్యవసాయాభివృద్ధికి తగిన చర్యలు తీసుకున్నాడు. తోటలు, వాణిజ్య పంటలను ప్రోత్సహించాడు మోటుపల్లి రేవుని అభివృద్ధి పరచి విదేశీ వ్యాపారానికి సౌకర్యాలు కల్గించాడు. ముస్లింలు రైతులపైన, వృత్తిపని వారిపైన విధించిన అన్యాయపు పన్నులు తొలగించాడు ప్రజలకు రక్షణ ఇచ్చాడు. ప్రజలు సుఖంగా జీవించే ఏర్పాట్లు చేశాడు.

సాహిత్య పోషణ - ఎర్రాప్రెగ్గడ: రాజులు తమ రాచకార్యాలను చూసుకోవడమేగాక కవులను పోషించి భాషా సారస్వతాలను అభివృద్ధి చేసేవారు. ప్రోలయవేముడు కూడా ఆ కాలానికి తగినట్లు తనవంతు పాత్రను నిర్వహించి అనేకమంది కవి పండితులను పోషించాడు చదలవాడ నివాసి అయిన ఎర్రాప్రెగ్గడ కందుకూరు నేలే మల్లారెడ్డి ఆశ్రయం సంపాదించాడు. ఎర్రాప్రెగ్గడ ఆనాటి తెలుగు కవులలో గొప్పవాడు. అతడు కవిత్రయంలో ఒకడు. అతని పాండిత్య ప్రతిభను తెలుసుకొని ప్రోలయవేముడు అతనిని తన ఆస్థానానికి ఆహ్వానించి ఆదరించాడు. వేముని ఆదరణతో ఎర్రన రామాయణం, హరివంశం, అహోబిల క్షేత్రమహాత్మ్యం అనే కావ్యాలు రాశాడు. నన్నయభట్టు వదిలేసిన అరణ్యపర్వాన్ని పూర్తి చేశాడు. వాటిలో హరివంశాన్ని ప్రోలయవేమారెడ్డికి అంకితం చేశాడు. ఎర్రనకు శంభుదాసుడు అనే బిరుదు ఉంది. ప్రోలయవేముని ఆస్థానంలో లొల్లమహాదేవుడనే సంగీత వాగ్గేయకారుడు ఉండేవాడు. అతడు భరతుని నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం రాసిన లొల్ల లక్ష్మీధరునికి శిష్యుడని ఎర్రాప్రెగ్గడ తన హరివంశంలో పేర్కొన్నాడు. ఇంకా అనేకమంది కవులకు ప్రోలయవేముడు దానాలు చేసి ఉండవచ్చును.

పరమత సహనం: ప్రోలయ వేమారెడ్డి పరమత సహనం పాటించి తన రాజ్యంలోని అన్ని శాఖల వారిని ఆదరించాడు. ఆనాడు శైవ, వైష్ణవ శాఖాబేధాలు ఉండేవి. ప్రోలయ శైవవైష్ణవ మతాచార్యుల నందరినీ సమానంగా ఆదరించాడు. శైవ వైష్ణవ దేవాలయాలన్నింటికి దానాలు చేశాడు. ఈ విధంగా ప్రజానురంజకంగా 28 సంవత్సరాలు పాలించి ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1353లో మరణించాడట.

బిరుదులు: ప్రోలయ వేమారెడ్డి తాను సాధించిన ఘనకార్యాల వల్ల అనేక బిరుదులు పొందాడు. ఇతనికి

మేగ్బాబ కుంభసంభవ, గుజ్జరిభట్టు విభ్రాళ, పల్లవత్రినేత్ర, పల్లవాదిత్య, జగనొబ్బగండ, చెంచుమల చూరకార, వీరనారాయణ, ఏకరాయ స్థాపనాచార్య, ఏకసింహాసనాలంకార, అపరిమిత భూదాన పరశురామ, శ్రీపర్వతాహోబిల పర్వత సోపాన నిర్మిత కేళాదిరాయ, సంగ్రామధనుంజయ, బ్రహ్మకుండిన సహ్యజ గౌతమీజ క్రీడావినోద అనే బిరుదులున్నాయి.

ప్రోలయ వేమారెడ్డి రాజ్యానికి హద్దులు: ప్రోలయ వేమారెడ్డి కాలంలో రెడ్డి రాజ్యం పశ్చిమాన శ్రీశైలం, త్రిపురాంతకం, అహోబిలం వరకు విస్తరించింది. మల్లవరం శాసనం, మద్రాసు మ్యూజియం రికార్డులు శ్రీశైలంలో, అహోబిలంలో సోపానాలు నిర్మించిన విషయం తెలియజెయ్యడం లేదు. ఈ విషయాన్ని ప్రస్తావించే మొదటి శాసనం, శక 1265 నాటి ముట్లూరు శాసనం ఈ శాసనం తర్వాత వేయించిన అన్ని రెడ్డి శాసనాలు శ్రీశైల సోపానాల నిర్మాణాన్ని ప్రస్తావిస్తున్నాయి. కనుక శ్రీశైలం, అహోబిళాలలో సోపానాలను క్రీ.శ.1346వ సంవత్సరంలో ప్రాంతంలో నిర్మించి ఉంటాడని నిర్ధారించబడింది నెల్లూరు జిల్లాలోని కందుకూరుకు దక్షిణంగా రెడ్డి శాసనాలు లేవు కనుక దక్షిణ దిక్కున అతని రాజ్యపు సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించడానికి వీలు కుదరలేదు. ప్రోలయ వేమారెడ్డి తన తొలిరోజుల లోనే నెల్లూరు ప్రాంతాన్ని ముస్లింల నుండి విముక్తి చేసి ఉంటాడు. పైగా నెల్లూరు తన తల్లితరపున తాతగారి స్వస్థానం. అతని తండ్రి కోమటిప్రోలుడు విక్రమసింహపురి వాసి అయిన దొడ్డారెడ్డి కుమార్తె అయిన అన్నెమాంబను వివాహమాడాడు. ఆమెకు అనంతాంబ అని పేరు కూడా ఉంది. కనుక నెల్లూరు ప్రోలయ వేముని తల్లిగారి వూరు. అనవేమారెడ్డి మంత్రి అయిన పెద్దన తాత చిట్టి పెద్దన విక్రమసింహపురికి స్థానిక పాలెగాడు. అతడు ప్రోలయవేమునిచే నియమింపబడి ఉంటాడు. చిట్టిపెద్దన కుటుంబం రెడ్డిరాజుల కాలంలో మంచి ప్రఖ్యాతిలోకి వచ్చింది. కనుక ప్రోలయ వేమారెడ్డి నెల్లూరు ప్రాంతాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకొని ఉంటాడు. కనుక మొదట నెల్లూరు వరకు ప్రోలయవేమారెడ్డి రాజ్యంలో ఉండి ఉంటుంది. కాని కందుకూరుకు దక్షిణంగా మాత్రం అతని శాసనాలు లేవు. అందుకు కారణం విజయనగర రాజ్యవిస్తరణ అయి ఉంటుంది క్రీ.శ.1336 నుండి విజయనగర రాజ్యం అతిశీఘ్రంగా అన్ని దిక్కులకు విస్తరించసాగింది. శక 1261 నాటి అంటే క్రీ.శ.1339 నాటి అలుకలగుండు శాసనం, శక 1262 నాటి అంటే క్రీ.శ.1340 ఆకుమళ్ల తామ్రశాసనం మొదటి హరహరరాయలను పూర్వ పశ్చిమ సముద్రాధీశ్వరా అని వర్ణిస్తున్నాయి. కొవ్వూరు, కావలి, ఉదయగిరి శాసనాలు క్రీ.శ.1346కు ముందే ఆ ప్రాంతాలలో హరిహర రాయల అధికారం ఉన్నట్లు ధృవీకరిస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో లభించిన మొదటి విజయనగర శాసనం శక 1265 అంటే క్రీ.శ.1343 నాటి విరూపణ్ణ ఒడయూరు శాసనం. ఇతడు మొదటి బుక్కరాయల కుమారుడు. తర్వాత శాసనం కొవ్వూరు తాలూకాలోని కొడవలూరు శాసనం. ఈ శాసనాన్ని హరిహరరాయల తమ్ముడు కంపణ వడయూరు శక 1268 అనగా క్రీ.శ.1346వ సంవత్సరంలో వేయించాడు. కంపణ పెన్నానదికి ఉత్తరంగా ఉన్న ప్రాంతానికి అతడు అధిపతి అని ఈ శాసనం తెలుపుతోంది. కావలి దగ్గరున్న కృష్ణపట్నంలో కూడా విజయనగర శాసనాలున్నాయి. కనుక ఈ శాసనాలు పెన్నారు నదీ లోయవరకు విజయనగర ప్రభువులు తమ అధికారాన్ని విస్తరించారని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. అలాగే కందుకూరు, కనిగిరి ప్రాంతాల వరకు ఉన్న ప్రాంతం అంతకుముందు నుంచే వారి ఆధీనంలో ఉంది. బహుశా ఆ ప్రాంతాలు కూడా క్రీ.శ.1343కు ముందే జయించి ఉంటారు. కనుక ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1339, 1343 మధ్యకాలంలో దక్షిణ ప్రాంతాలు అంటే పాకనాడును విజయనగర చక్రవర్తులకు కోల్పోయి ఉంటాడు. కనుక దక్షిణాన అతని రాజ్యానికి కందుకూరు సరిహద్దు అని భావించవచ్చును. ఉత్తరాన ప్రోలయ వేమారెడ్డి శాసనాలు లభించాయి. కృష్ణకు ఉత్తరంగా శాసనాలు లభించలేదు. కనుక ఉత్తరాన కృష్ణానది సరిహద్దు అని భావించాలి. కృష్ణకు ఉత్తర ప్రాంతం అంతా ముసునూరి కమ్మ నాయకరాజ్యంలో భాగంగా ఉంది. ఆ కాలంలో ముసునూరి అనపోత లేక తొయ్యేరు అనపోత ముసునూరి వారి ప్రతినిధిగా వేంగి రాజ్యాన్ని పాలించాడు. కృష్ణానది వాయవ్యదిశలో, ఉత్తర దిశలో ముసునూరి, రెడ్డి రాజ్యాలకు సరిహద్దుగా ఉంది. అలాగే కృష్ణానది వాయవ్యాన రెడ్డి రాజ్యానికి, రేచర్ల పద్మనాయక రాజ్యానికి కూడా సరిహద్దుగా ఉంది. కృష్ణానదికి పశ్చిమాన అంటే నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో రేచర్ల పద్మనాయక రాజ్యం ఉంది. ఈ రెండు రాజ్యాలకు కూడా కృష్ణానదే సరిహద్దుగా ఉంది. కనుక ప్రోలయవేముని రాజ్యానికి ఉత్తరాన, వాయువ్యాన కృష్ణానది, తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన కందుకూరు, పశ్చిమాన కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, నందికొట్కూరు తాలూకా ప్రాంతం సరిహద్దులుగా ఉన్నాయని చెప్పవచ్చును.

ప్రోలయవేముని స్థానం: ప్రోలయవేముని స్థానాన్ని ఖచ్చితంగా నిర్ణయించలేము అతడు మొదటి నుండి స్వతంత్రుడా? లేక ముసునూరి వారికి సామంతుడుగా కొనసాగాడా, స్పష్టంగా తెలియడం లేదు. అనితల్లి తన కలువచేరు శాసనంలో కాపయనాయకుని కొల్చిన 75 మంది సామంతులలో ప్రోలయ వేముడు మేటి అని పేర్కొంది. కాపయ నాయకుడు ఆంధ్రాధీశ్వరా, ఆంధ్రసురత్రాణ అనే బిరుదులు ధరించాడు. అంటే అతడు ఆంధ్ర దేశానికంతకు అధిపతినని చెప్పుకున్నాడు. కనుక మొదట ప్రోలయ వేమారెడ్డి ముసునూరి వారి సామంతుడుగానే కొనసాగి ఉండవచ్చును. అల్లావుద్దీన్ హసన్‌గంగు కాపయనాయకుని రాజ్యంపై దండెత్తిన తర్వాత కాపయ నాయకుని శక్తి క్షీణించింది. కనుక హసన్‌గంగు బహమన్ దండయాత్ర తర్వాత ప్రోలయ నాయకుడు పూర్తి స్వతంత్రుడైనట్లు కనిపిస్తోందని మల్లంపల్లి సోమశేఖరశర్మ భావించారు

మహామండలేశ్వర బిరుదు: కాకతీయుల లాగ అద్దంకి, కొండవీటి రెడ్డిరాజులు ముసునూరి నాయక రాజులు మహామండలేశ్వరా అనే బిరుదు ధరించలేదు రెడ్డిరాజులు శ్రీమతు అనే బిరుదును మాత్రమే ధరించారు ఒక్క పెదకోమటి వేమారెడ్డి మాత్రం మహామండలేశ్వరా అని ఒక శాసనంలో వర్ణించబడ్డాడు. కాని ఆ శాసనం అతడు వేయించలేదు. అతని సామంతుడు వేయించాడు. అది తప్ప ఏ శాసనమూ రెడ్డిరాజులు మహామండలేశ్వర అనే బిరుదులు ధరించినట్లు తెలపడం లేదు కాకతీయులు సామంతులైన ఈ రెండు వంశాల వారు ఎందువల్ల వారు ధరించిన మహామండలేశ్వర అనే బిరుదులు ధరించలేదు? అదే సమయంలో వారి సమకాలికులైన విజయనగర చక్రవర్తులు మహామండలేశ్వరా అనే బిరుదు వహించారు ఇది ఆశ్చర్యకరమైన విషయం. కాని అందుకు కొన్ని కారణాలున్నాయి.

ఏ వంశమైనా మొదట సామంతులుగా నియమింపబడినప్పుడు వారి ప్రభువులు వారికి రాజ లాంఛనాలను ఇస్తారు. అలా ఇచ్చినప్పుడే వారు పరిపాలకులుగా గుర్తింపబడతారు కాకతీయులు తమ రాజ లాంఛనాలను తమ ప్రభువులైన చాళుక్యుల వద్ద నుంచి పొందారు. సామంతులుగా ఉన్నంతకాలం వారు మండలేశ్వర్లుగా భావింపబడేవారు. సామంత వంశాలు స్వతంత్రం ప్రకటించినప్పుడు వారు మహామండలేశ్వరులు అనే బిరుదులు ధరించేవారు కళ్యాణీ చాళుక్య సామ్రాజ్యం పోయిన తర్వాత కాకతీయులు సర్వస్వతంత్రులై మహామండలేశ్వరా అనే బిరుదు ధరించారు. అలాగే కొన్ని రాజవంశాలు తమకు తమ కులదేవతలు రాజ్యాధికారాన్ని ప్రసాదించారని చెప్పుకున్నారు. చాళుక్యులు చాళుక్యగిరిపై వసించిన నందభాగవతి తమకు రాచరికాన్ని ప్రసాదించిందని తమ శాసనాలలో చెప్పుకున్నారు. అలాగే తూర్పుగాంగులు మహేంద్రగిరి మీద ఉన్న గోకర్ణేశ్వరుడు తమకు రాజ్యాధికారాన్ని ప్రసాదించాడని చెప్పుకున్నారు అంటే రాజ్యాధికారాన్ని ఎవరివల్లనో పొందాలి. అపుడే వారు మండలేశ్వరులుగా, మహామండలేశ్వరులుగా గుర్తింపు పొందుతారు ఆ బిరుదులు ధరిస్తారు. ముసునూరి కమ్మ నాయకులకు అద్దంకి, కొండవీడు రెడ్లకు ఎవరూ రాజకీయాధికారాన్ని ప్రసాదించలేదు. ముస్లిం దండయాత్రా కాలంలో పరిస్థితులు అనుకూలించి తమ స్వయంకృషి వల్ల రాజ్యాధికారాన్ని సంపాదించుకున్నారు. కనుక వారు మహామండలేశ్వర అనే బిరుదు ధరించలేదు. ఇక విజయనగర సార్వభౌములు విజయనగర సామ్రాజ్యం తమదని చెప్పుకోలేదు. అది విరూపాక్షస్వామిదని, దానికి తాము ప్రతినిధులమని మాత్రమే చెప్పుకున్నారు. వారికి రాజ్యాధికారం విరూపాక్షస్వామి ప్రసాదించాడని భావించారు. కనుక వారు మహామండలేశ్వరా అనే బిరుదు ధరించారు. అలాగే క్షత్రియులు కాని వారికి కూడా రాజ్యాధికారం లేదు. ముసునూరు వారు, రెడ్లు క్షత్రియులు కాదు. చతుర్థ కులస్థులు. రాజ్యాధికారం ఉన్న క్షత్రియులే మహామండలేశ్వర అనే బిరుదులు ధరించాలి. కనుక ముసునూరు, రెడ్డి నాయకులు క్షత్రియులుగా పరిగణింపబడేవారు ధరించే మహామండలేశ్వర బిరుదుల జోలికి పోలేదు విజయనగర చక్రవర్తులు తాము యదు వంశస్తులమని, చంద్రవంశ క్షత్రియులమని కూడా చెప్పుకున్నారు. కనుక వారు ఆ బిరుదు ధరించారు.

అనపోతారెడ్డి క్రీ.శ.1353-1364: అనపోతారెడ్డి చరిత్ర తెలుసుకోడానికి, ద్రాక్షారామం, ఈదుపుగల్లు లేక ఇప్పగల్లు, మోటుపల్లి, అమరావతి, నాగళ్ల, కొల్లూరు, పచ్చల తాడిపర్రు, మాన్యమాపురం, అన్నవరం, రాజమండ్రి మ్యూజియం తామ్రశాసనాలు, ఉత్తర హరివంశం, విష్ణుపురాణం వేమభూపాలీయం, కొండవీటి దండకవిలె, మెకంజీ రాతప్రతులు, వెలుగోటి వారి వంశావళి ముఖ్య ఆధారాలు.

అనపోతారెడ్డి ఎవరి కుమారుడు, అనే విషయంలో ఏకాభిప్రాయం లేదు కాని అన్నవరం శాసనం ప్రకారం ప్రోలయ వేమారెడ్డికి సంతానం లేదని, తన తమ్ముడు అన్నారెడ్డి కుమారులైన అనపోత, అనవేమారెడ్డిలను, ఒక

కుమార్తెను దత్తు తీసుకున్నాడని తెలుస్తోంది. దత్తపుత్రులిద్దరికీ చిన్న తనం నుంచే విద్యాబుద్ధులు, సప్తాంగాల రాజనీతి, యుద్ధతంత్రాలలో తర్ఫీదు నిచ్చాడు. అనపోతారెడ్డిని యువరాజుగా నియమించాడు. ఎఱ్ఱాప్రెగ్గడ రచించిన హరివంశ అవతారికలో అనపోతారెడ్డిని యువరాజుగా ఉన్నప్పుడే అతడు తన పినతండ్రి అన్నారెడ్డితో కలసి శ్రీశైలం, త్రిపురాంతకాలను జయించి త్రిపురాంతకంలో క్రీ.శ.1346-47 సంవత్సరంలో శాసనాలు వేయించారు. ఆ విజయాల వలన అనపోత వీరాన్నపోత అనే బిరుదు పొందాడు. ఆ విజయాల తర్వాత శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాలకు రాజప్రతినిధిగా నియమింపబడ్డాడు. అతని తమ్ముడైన అనవేమారెడ్డి తన శాసనాలలో అనపోతారెడ్డిని పత్యబ్దం ప్రతిపక్ష దేశ జయినః అని వర్ణించాడు.

ప్రోలయ వేమారెడ్డికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయం. అనపోత, అనమాచ, అనవేమ అనే ముగ్గురు కుమారులు, దొడ్డాంబిక అనే కుమార్తె గాక పేరు తెలియని మరొక కుమార్తె ఉన్నారని మల్లంపల్లి సోమశేఖరశర్మ భావించారు. వారిలో దొడ్డాంబికను తన మేనమామ కుమారుడైన రెండవ కాటారెడ్డికిచ్చి వివాహం చేశాడు. రెండవ కుమార్తెను చోడభక్తిరాజు కుమారుడైన భీమదేవరాజు కిచ్చి వివాహం చేశాడని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయపడ్డారు. సోమశేఖరశర్మ అభిప్రాయాన్ని కాటయ వేమారెడ్డి సర్పవరం శాసనం, కుమారగిరి అనపర్తి శాసనం బలపరుస్తున్నాయి. కాటయ వేమారెడ్డి సర్పవరం శాసనం ప్రోలయ వేమారెడ్డికి సంతానం ఉందని తెలుపుతోంది. ఆ శాసనం అనపోతారెడ్డి, ప్రోలయ వేమారెడ్డి కుమారుడని స్పష్టంగా తెలియజేస్తోంది. అలాగే కుమారగిరి అనపర్తి శాసనం ప్రోలయ వేమారెడ్డికి అనవోత, అనవేమారెడ్డి అనే కుమారులు ఉన్నట్లు తెలుపుతోంది. కనుక ఈ రెండు శాసనాలు ప్రోలయ వేమారెడ్డి సంతానహీనుడు కాదని ఋజువు చేస్తున్నాయి.

ప్రోలయ వేమారెడ్డి చివరి దశలో అస్తమావ్యాధికి గురై సవ్యంగా పరిపాలన చేయలేకపోయాడని మెకంజీ రాతప్రతులు చెబుతున్నాయి. అందువల్ల క్రీ.శ.1353 అనపోతారెడ్డికి పట్టాభిషేకం జరిపించి తాను పరిపాలన నుండి వైదొలిగాడు. క్రీ.శ.1353 నుండి 1364 వరకు అనపోతారెడ్డి రాజ్యం చేశాడు.

నాటి రాజకీయ పరిస్థితులు: రెడ్డి రాజ్యానికి దక్షిణాన విజయనగర సామ్రాట్టుగా హరిహర, బుక్కరాయలు రాజ్యం చేస్తున్నారు. బహమనీ రాజ్యాన్ని హసన్‌గంగు, అతని కుమారుడు మొదటి మహమ్మద్‌షాలు ఏలుతున్నారు. ఓరుగల్లు రాజధానిగా ఆంధ్రసురత్రాణ, ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు వహించిన ముసునూరి కాపయ నాయకుడు ఆంధ్ర దేశాధిపతిగా ఏలుతున్నాడు. కాని బహమనీల దండయాత్రల వల్ల అతని అధికారం బలహీనమైంది. అందువల్ల రాజకొండ, దేవరకొండను ఏలిన సింగమనాయకుడు స్వతంత్ర వైఖరిని అవలంబించాడు. అంతేగాక ఉత్తరాంధ్రపై కూడా కాపయుని పట్టుసడలి అతని సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. వేంగి దేశంలో అంటే కృష్ణా, గోదావరి నదుల మధ్య మూడు ప్రముఖ రాజ్యాలున్నాయి.

1. కామపురి రాజధాని (అది నేటి కామవరపు కోటగా లేక కామవరంగా గుర్తించారు)గా పశ్చిమ గోదావరి జిల్లాలలోని ఏజన్సీ ప్రాంతాలైన పశ్చిమ ప్రాంతాలలో చోడభక్తిరాజు పాలిస్తున్నాడు.
2. సూరవరం రాజధానిగా కృష్ణా జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని తూర్పు ప్రాంతాలను సూర్యవంశ తమ్మరాజు పాలిస్తున్నాడు.
3. నిరవద్యప్రోలును అంటే నేటి నిడదవోలు నుండి కొవ్వూరు వరకు ఉన్న ప్రాంతాలను నిడదవోలు చాళుక్య వంశానికి చెందిన మహదేవుడు పాలిస్తున్నాడు.
4. పాలకొల్లు, కోనసీమ ప్రాంతాలను చివరి హైహయవంశస్తులు పాలిస్తున్నారు.
5. రాజమహేంద్రవరం, తొయ్యేరులను ముసునూరి కాపయనాయకుని పినతండ్రి రాజానాయకుని కుమారుడైన తొయ్యేరు అనపోతానాయకుడు.
6. కోరుకొండ రాజ్యాన్ని ముమ్మడి నాయకుడు.
7. పిఠాపురం కొట్టాం రాజ్యాన్ని కొప్పుల వంశస్తులు.
8. ఎలమంచిలి పాంచదార్లను ఎలమంచిలి చాళుక్యులు.
9. ఒడ్డాదిని మత్స్యవంశస్తులు పాలిస్తున్నారు. ఈ రాజ్యాలన్నింటిపై తొయ్యేరు అనపోతానాయకుడు కాపయ నాయకుని ప్రతినిధిగా వ్యవహరిస్తున్నాడు.
10. కళింగ దేశంలో తూర్పు గాంగ వంశానికి చెందిన మూడవ నరసింహదేవుడు ఏలుతున్నాడు.

కళింగ గాంగుల దండయాత్ర క్రీ.శ.1353: ఈ పరిస్థితులలో కాపయ నాయకునికి, బహమనీ సుల్తాన్‌లకు పోరాటాలు జరుగుతున్నాయి. అతడు కోస్తా రాజకీయ పరిస్థితులను పట్టించుకోగలిగిన స్థితిలో లేడు. దాని నాసరాగా తీసుకొని కళింగ గాంగరాజు మూడవ నరసింహదేవుడు క్రీ.శ 1353లో కోస్తాపై దండెత్తాడు. అతని సేనాధిపతులు కాళిదాసు గోపాలజియ్య గోవిందుడు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళం వరకు విజయపరంపరలతో చేరారు. నరసింహదేవుని రాణి గంగమహాదేవి తరపున వారు శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు దేవాలయానికి పట్టుగొడుగులు, వెండి దీపాలు, బంగారు మామిడి పిందెలతో అలంకరించిన వింజామరలు దానం చేసినట్లు అక్కడ క్రీ.శ.1353లో వారు వేయించిన శాసనం వల్ల తెలుస్తోంది. అక్కడి నుండి వారు కృష్ణకు దక్షిణంగా ఉన్న రెడ్డిరాజ్యంపై దండెత్తినదీ లేనిదీ తెలియదు. బహుశా అనపోతారెడ్డి వారితో యుద్ధానికి తయారై ఉండవచ్చును అందువల్ల వారు వెనుదిరిగి ఉండవచ్చును ఏమైనప్పటికీ గంగవంశస్తుల వలన రెడ్డి రాజ్యానికి ప్రమాదం ముంచుకొని వచ్చింది. కాపయనాయకుడు ఉత్తరాంధ్రను అదుపులో ఉంచగలిగినస్థితిలో లేడు. కనుక అనపోతారెడ్డి తన రాజ్య భద్రత కోసం ఉత్తరాంధ్ర లేక దక్షిణ కళింగను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలని సంకల్పించి దక్షిణ కళింగపై దండయాత్ర చేశాడు.

ద్వీప విజయం: అనపోతారెడ్డి కృష్ణానదిని దాటి మొదట ద్వీపం లేక దివిసీమపై దండెత్తాడు. అతడు శక1278 లేక క్రీ శ 1356 సంవత్సరంలో వేయించిన ద్రాక్షారామ శాసనంలో అతనికి ద్వీపజేత అని బిరుదు ఉన్నట్లు పేర్కొనబడింది. దానికి పెదదివిపుర అని కూడా పేరుంది. ఇది ఇప్పటి దివిసీమలోని తలగడదీవి అనే గ్రామంగా గుర్తింపబడింది. ఇక్కడ మొదట పూర్వకాలంలో దనదుడు లేక కుబేరుడు అనే రాజు కోటను నిర్మించాడని ప్రతీతి ఇది కృష్ణానది సముద్రంలో చేరు ప్రాంతంలోని ఒక దీవి. తర్వాత చందవోలును పాలించిన వెలనాటి చోడుల ప్రతినిధి నారాయణ అనే సేనాధిపతి ఇక్కడ కోటను పటిష్టంగా రూపొందించి దానిని ఒక పట్టణంగా అభివృద్ధి చేశాడు తర్వాత జాయపసేనాని వంశస్తులు దానిని పాలించారు జాయపసేనానిని ఓడించి కాకతి గణపతి దేవుడు దివిని ఆక్రమించి దాని సరిహద్దు కోటగా ఇంకా బలపరిచాడు. అప్పటి నుండి దివి ఒక ప్రముఖమైన కోటగా ప్రసిద్ధి చెందింది. ఆ విధంగా ప్రసిద్ధి చెందిన దివికోటను అనపోతారెడ్డి జయించి దివిజేతగా బిరుదు ధరించి ఉంటాడు. కాని ద్రాక్షారామ శాసనంలోగాని, అతని తమ్ముడు అనవేమారెడ్డి శాసనాలలోగాని దివియుద్ధాన్ని గురించి వివరాలు లేవు. కాని అతని దివిజేత అనే బిరుదు వలన దానిని జయించి ఉంటాడని భావింపబడింది అలాగే ఏ సంవత్సరంలో దివిని ఆక్రమించింది కూడా తెలియదు.

దక్షిణ కళింగ దండయాత్ర క్రీ.శ.1356: తర్వాత అనపోత దక్షిణ కళింగపై దండెత్తి ద్రాక్షారామం వరకు నడచి అక్కడ శక 1278 విశాఖ వైశాఖమాసం 15వ రోజు శుక్రవారం నాడు ద్రాక్షారామ భీమేశ్వరునికి ఐదు గంటలను దానం చేసి శాసనం వేయించాడు. శక 1278 అంటే క్రీ.శ.1356వ సంవత్సరం అవుతుంది అనపోతు దక్షిణ కళింగ దండయాత్ర ఎప్పుడు జరిగినది, ఎవరిని జయించాడు, వివరాలు ఆ శాసనంలో లేవు మూడవ నరసింహుడు వెనుదిరగగానే తన దండయాత్ర ప్రారంభించాడో లేక 1356లో దండెత్తాడా స్పష్టంగా తెలియదు. క్రీ శ 1356లో రాజమహేంద్రవరాన్ని పాలించిన తొయ్యేరు అనపోతానాయకుడు మరణించాడు అతని మరణానంతరం కోరుకొండను ఏలే ముమ్మడి నాయకుడు తొయ్యేరు అనపోతానాయకునికి వారసుడై తొయ్యేరు, రాజమహేంద్రవరం, కోణ, కురవాటి, పానార ప్రాంతాలను తన రాజ్యంలో కలుపుకున్నాడు ముసునూరి అనపోతానాయకుడు యుద్ధంలో భక్తిరాజు చేతిలో మరణించాడని ఒక వాదన ఉంది. చోడభక్తిరాజు ప్రోలయ వేమారెడ్డికి విధేయుడు. ప్రోలయ వేమారెడ్డి కుమార్తెను భక్తిరాజు కుమారుడు భీమదేవరాజుకిచ్చి వివాహం చేసి బంధుత్వం కలుపుకొన్నాడు. కనుక చోడభక్తిరాజు అనపోతారెడ్డికి సహాయంగా రాజమహేంద్రవరంపై దండెత్తి ముసునూరి అనపోతానాయకుని వధించి ఉండవచ్చును. కనుక ఈ సంఘటన క్రీ శ 1356లో జరిగి ఉండవచ్చును. ఈ యుద్ధం తర్వాత అనపోతారెడ్డి ద్రాక్షారామం చేరి అక్కడ శాసనం వేయించి ఉండవచ్చును. అనపోతారెడ్డి ఆ తర్వాత మిగిలిన రాజ్యాలను జయించినది లేనిదీ తెలియదు. అతడు వెనుదిరిగిన తర్వాత కోరుకొండను పాలించే మంచికొండ ముమ్మడి నాయకుడు తొయ్యేరు అనపోతానాయకునికి వారసుడై రాజమండ్రి, తొయ్యేరు, కోణ, పానార, కురవాటి సీమలను జయించి తన రాజ్యాన్ని పెంచుకొని ఉంటాడు. కనుక అనపోతారెడ్డి మళ్లీ కళింగ దండయాత్ర చేసి ఉండవచ్చును. ఈ దండయాత్రలో అనపోతారెడ్డి ముమ్మడి నాయకునితో పోరాడి ఉంటాడు.

కళింగ దండయాత్ర: అనవేమారెడ్డి ఈడ్పుగల్లు శాసనంలో తన సోదరుడు శవర లేక శబర దేశాన్ని జయించాడని వర్ణించాడు. శబరులు ఉత్తరాంధ్ర దక్షిణ ఒరిస్సా రాష్ట్రంలో జీవించే ఒక జాతి దానిని బట్టి అనపోతారెడ్డి ముమ్మడి నాయకుని జయించిన తర్వాత ఇంకా ఉత్తరంగా సాగి శబరులను ఓడించి ఉండవచ్చును. అనవేమారెడ్డి తన పచ్చల తాడిపర్రు శాసనంలో తన సోదరుడు వింధ్య పర్వతాలలోని మేఘల శ్రేణి వరకు జయించాడని వర్ణించాడు. శబరులను జయించిన తర్వాత అతడు కళింగదేశంపై దండెత్తి వింధ్య పర్వత భాగమైన మేఘల శ్రేణి వరకు జయించాలి అంటే అతడు కళింగ గాంగులతో పోరాడి ఉండాలి. క్రీ.శ. 1356లో మూడవ భానుదేవుడు కళింగను పాలిస్తున్నాడు. అతనితో అనపోతారెడ్డి పోరాడినట్లు ఏ ఆధారమూ లేదు. మేఘలశ్రేణి ప్రాంతాన్ని రెడ్డిరాజులెవ్వరూ పాలించలేదు. కనుక పచ్చల తాడిపర్రు శాసనంలోని అనవేమారెడ్డి వర్ణనను మల్లంపల్లి సోమశేఖరశర్మ మొదలైన చరిత్రకారులు ఉత్ప్రేక్షగా భావించారు. కాకపోతే అతడు కళింగదేశంపై విజయవంతం కాని కొన్నిచిన్నచిన్న దాడులు చేసి ఉండవచ్చును అని కూడా తీర్మానించారు.

సూరవరం యుద్ధం: అనపోతారెడ్డి దక్షిణ కళింగపై ఎన్ని పర్యాయాలు దండెత్తినప్పటికీ ఆ ప్రాంతాలను నిలుపుకోలేకపోయాడు. అన్నెదేవచోడుని రాజమండ్రి మ్యూజియం తామ్రశాసనం తన తండ్రి భక్తిరాజు సూరవరం యుద్ధంలో వీరాన్నపోతను ఓడించాడని చెప్పుకున్నాడు. ఈ కాలంలో ఆంధ్రదేశంలో అనపోతు అనే పేరు గలిగిన వారు ముగ్గురున్నారు. వారిలో మొదటిరాజు రాచకొండనేలిన పద్మనాయకరాజు. రెండవవాడు రాజమహేంద్రవరాన్ని యేలిన తొయ్యేటి అనపోతానాయకుడు. మూడవ వ్యక్తి రెడ్డిరాజైన అనపోతు. రేచర్ల అనపోతానాయకునితో భక్తిరాజు పోరాడటానికి అవకాశం లేదు. రాజమహేంద్రవరం తొయ్యేటి అనపోతానాయకునికి వీరాన్నపోతు అనే బిరుదు లేదు. అనపోతారెడ్డికే వీరాన్నపోతు అనే బిరుదు ఉంది. కనుక భక్తిరాజు చేతిలో ఓడిపోయిన వీరాన్నపోతు రెడ్డిరాజైన అనపోతారెడ్డేనని చెప్పవచ్చును. కాని భక్తిరాజు అనపోతారెడ్డికి బంధువు. అతని చెల్లెలిని తన కుమారునితో వివాహం చేసి ఉన్నాడు. బంధువై ఉండి అనపోతారెడ్డితో భక్తిరాజు ఎందుకు పోరాడాడు? అందుకు కారణాలున్నాయి. వేంగి దేశంలో ఆనాడు ఉన్న నాలుగు రాజ్యాలు క్షత్రియులవి. సూరవరాన్ని పాలించిన తమ్మరాజు సూర్యవంశ క్షత్రియుడు. నిరవద్యపురాన్ని పాలించిన చాళుక్యులు చంద్రవంశ క్షత్రియులు. కామపురానిన్న పాలించిన భక్తిరాజు సూర్యవంశ క్షత్రియుడు. కోణ, పాలకొల్లులను పాలించిన హైహయులు కార్తవీరార్జునుని సంతతికి చెందిన క్షత్రియులు. అనపోతారెడ్డి తరచు తమ రాజ్యాలపై దండెత్తడాన్ని ఈ క్షత్రియవంశాలు సహించలేకపోయి వారందరూ ఏకమై అనపోతును ఎదిరించి ఉండవచ్చును. పైగా వారంతా ఒకరికొకరు బంధువులు. నిడదవోలు చాళుక్యుల రాజకుమారి రుద్రమదేవిని తమ్మరాజు కుమారుడు పిన ఉండిరాజు వివాహం చేసుకున్నాడు. తమ్మరాజు కుమార్తె ఇరుగాంబికను భక్తిరాజు చిన్నకుమారుడు అన్నెదేవచోడుడు వివాహం చేసుకున్నాడు. అందువల్ల భక్తిరాజు ఇటు సూరవరం వంశానికి, అటు రెడ్డి వంశానికి కూడా బంధువు. బంధుత్వానికి వస్తే భక్తిరాజు రెడ్ల బంధుత్వానికన్నా సూరవరం వంశ బంధుత్వానికే ఎక్కువ విలువను ఇచ్చి ఉండవచ్చు. అంతేగాక అనపోతారెడ్డి తనను సామంతునిగా కూడా భావించి ఉండవచ్చును. అది సహింపలేని భక్తిరాజు సూరవరం యుద్ధంలో పాల్గొని ఉండవచ్చును. అనపోతు తన తూర్పు దండయాత్రలో సూరవరం సూర్యవంశస్తులపై దండెత్తి ఉంటాడు. సూరవరం రాజవంశానికి మద్దతుగా నిరవద్యపురం చాళుక్యులు భక్తిరాజు సహాయంగా వచ్చి అనపోతారెడ్డిని ఓడించారు. ఈ యుద్ధ కాలం శాసనంలో ఇవ్వలేదు. కాని యుద్ధం క్రీ.శ.1360లో జరిగి ఉండవచ్చును. క్రీ.శ.1361లో అనపోతారెడ్డి బహమనీ రాజ్యంతో పోరాడినట్లు అతని క్రీ.శ.1361 నాటి శాసనం తెలుపుతోంది. కనుక క్రీ.శ.1360లో జరిగిందని చెప్పవచ్చును. సూరవరం యుద్ధం తర్వాత అనపోతారెడ్డి కృష్ణకు ఉత్తరభాగం అంతా పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత ఆ ప్రాంతంపై దండెత్తడానికి అతనికి వీలుకాలేదు. క్రీ.శ.1361-64 సంవత్సరాల మధ్య తన రాజ్యంపై దండెత్తిన బహమనీలు, పద్మనాయకులు, విజయనగర రాజ్యాలతో పోరాడటమే సరిపోయింది. కనుక క్రీ.శ.1353-1360 సంవత్సరాల మధ్య 7 సంవత్సరాలు ఉత్తర కోస్తా ప్రాంతాలు సంపాదించడానికి చేసిన ప్రయత్నం వ్యర్థమైంది. దివిసీమతో సహా అన్ని ప్రాంతాలు చేజారిపోయాయి.

మోటుపల్లి రేవును అభివృద్ధి చేయడం: కళింగ దండయాత్రానంతరం అనపోతారెడ్డి మోటుపల్లి రేవు అభివృద్ధికి చర్యలు చేపట్టాడు. ప్రోలయ వేమారెడ్డి కాలంలో అతని తమ్ముడు మల్లారెడ్డి మోటుపల్లిని జయించి రెడ్డిరాజ్యంలో చేర్చాడు. దానికి పూర్వం మునుంపురం అని పేరుండేది. కాని రేవు అంతగా అభివృద్ధి చెందలేదు.

కాకతీయ రాజ్య పతనం తర్వాత అక్కడ వ్యాపారులకు రక్షణ లేకుండా పోయింది. రెడ్డి రాజ్యంలో చేరిన తర్వాత కూడా దానిపై శ్రద్ధ తీసుకోలేదు. సుంకాలు అధికంగా వసూలు చేయబడ్డాయి. ఇవన్నీ అనపోతారెడ్డి దృష్టికి వచ్చాయి. అతడు విదేశ వ్యాపారులపై వసూలు చేసే అపుత్రికము, కుద్బాయం అనే రెండు సుంకాలను పూర్తిగా రద్దు చేశాడు. తమిళనాడు నుండే వచ్చే పట్టు నూలు, ముత్యాలు, ఇతర సరుకుల మీద సుంకాలు తగ్గించాడు వ్యాపారుల రక్షణకు అంతకుపూర్వం సుమారు 114 సంవత్సరాలకు ముందు క్రీ.శ.1244లో గణపతిదేవుడు అక్కడి వ్యాపారులకు రక్షణ కలిగించి అభయ శాసనం వేయించాడు. అలాగే అనపోతారెడ్డి కూడా మోటుపల్లిలోని వర్తకులకు, వ్యాపారానికి రక్షణ కలిగించి క్రీ.శ.1359లో అక్కడ గల వీరభద్రాలయంలో తెలుగు, తమిళం, సంస్కృతం మూడు భాషలలో శాసనం వేయించాడు. ఈ శాసనాన్నే అనపోతారెడ్డి అభయ శాసనం అని లేక ధర్మశాసనం అని అంటారు. మోటుపల్లి రక్షణ వల్ల విదేశీ వ్యాపారం అభివృద్ధి చెంది సుంకాల రూపంగా ఆదాయం పెరిగింది. క్రీ శ.1970 దశకంలో పురావస్తు శాఖ నిర్వహించిన పరిశోధనలలో రెండు శిథిలకట్టడాలు బయల్పడ్డాయి అందులో ఒకటి కష్టమ్స్ హవుస్ అని, మరొకటి విదేశీ వ్యాపారుల సౌకర్యార్థం నిర్మించిన విడిది గృహం అని నిర్ధారించారు. దీనిని బట్టి యాత్రికుల సౌకర్యార్థం రేవు పట్టణాలలో విడిది గృహాలు నిర్మింపబడేవని తెలియవచ్చింది. ఇంకా అక్కడ చైనా, పింగాణీ, కాంస్య విగ్రహాలు, చోళుల నాణేలు లభించాయి. పింగాణీ వస్తువులు లభించినందువల్ల మోటుపల్లి నుండి చైనాతో వ్యాపారం జరిగిందని రుజువైంది.

బహమనీలతో అమరావతి యుద్ధం క్రీ.శ.1361: క్రీ.శ.1361 నాటి అమరావతి శాసనం శక 1283 రెడ్డిరాజ్యంపై బహమనీ సైన్యాలు దండెత్తి అమరేశ్వరాలయానికి నష్టం కల్గించినట్లు తెలుపుతోంది. క్రీ.శ.1361లో మొదటి మహమ్మద్‌షా బహమనీ రాజ్యాన్ని పాలిస్తున్నాడు. అతడు కాపయ నాయకరాజ్యంపై దండెత్తి తర్వాత అమరావతిపై దాడి చేశాడు. ముస్లిం సైన్యాలను చూడగానే అనేకమంది దుర్గాధిపతులు తమ కోటలను విడిచి పారిపోయారని, ఆ పరిస్థితులలో అనపోతారెడ్డి మంత్రి మల్లయవేమ ముస్లిం సైన్యాలను ఎదిరించి వారిని పూర్తిగా పారదోలి రెడ్డి రాజ్యాన్ని రక్షించాడని అమరావతి శాసనం తెలుపుతోంది. యుద్ధకాలంలో ముస్లింలు అంతకు పూర్వం కాపయనాయకుని కాలంలో పిల్లలమర్రిలోని దేవాలయాలకు నష్టం కలిగించిన విధంగానే అమరావతిలోని అమరేశ్వరాలయానికి నష్టం కలిగించారు. విజయానంతరం మల్లయవేమ అమరేశ్వరుని ఆలయాన్ని పునర్నిర్మాణం చేసి అక్కడ క్రీ.శ 1361లో అనపోతారెడ్డి తరపున శాసనం వేయించాడు.

పద్మనాయక వెలమలతో యుద్ధం-శ్రీశైల ఆక్రమణ: వెలుగోటివారి వంశావళి రేచర్ల అనపోతా నాయకునికి పద్మనాయకులకు, అనపోతారెడ్డికి యుద్ధం జరిగినట్లు తెలుపుతోంది. అనపోతానాయకుని సోదరుడు మాదానాయకుడు అతని అన్న కుమారుడు కటారి నాగనాయకుడు రెడ్డిరాజ్యంలోని దన్నాలకోట లేక ధరణికోటపై దండెత్తి అనపోతారెడ్డిని ఓడించినట్లు తెలుపుతోంది. ఇది రెడ్డి, పద్మనాయకుల మధ్య జరిగిన మొదటి సంఘర్షణ ఈ యుద్ధంతో మొదలైన రేచర్ల, కొండవీటి రాజ్యాల విరోధం చివరి వరకు కొనసాగింది. రేచర్ల రెడ్డిరాజుల శాసనాలు ఈ సంఘర్షణను తెలపడం లేదు. ఆనాటి సమకాలీన తెలుగు, సంస్కృత సాహిత్యాలు కూడా ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. చాటువులు, వెలుగోటి వంశావళి మాత్రమే ఈ సంఘర్షణను వర్ణించాయి. శక 1283లో అంటే క్రీ.శ.1361లో రేచర్ల సింగమనాయకుడు జల్లిపల్లి యుద్ధంలో మరణించాడు. ఈ యుద్ధంలో కాపయ నాయకుడు, అనపోతారెడ్డి జల్లిపల్లి చాళుక్యులకు సహాయం చేశారు. జల్లిపల్లి చాళుక్యులు ఆరవీటి సోమదేవరాజు వారసులనే భావన ఉంది. సోమదేవరాజు కూడా చాళుక్యవంశస్తుడు. మొదటిసారిగా రెడ్డి సైన్యాలు పద్మనాయకులతో పోరాడాయి. అందుకు కోపగించి తన తండ్రి మరణానికి రెడ్లు కూడా కారకులని సింగమ నాయకుని కుమారులైన అనపోతానాయకుడు, మాదానాయకుడు కృష్ణను దాటి రెడ్డి రాజ్యంలో ప్రవేశించి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, త్రిపురాంతకాలను ఆక్రమించారు. ఇది వాస్తవమేనని తెలుస్తోంది. రెండవ సింగమనాయకుడు రచించిన శృంగారరస ప్రధాన సంస్కృత కావ్యమైన రసార్ణవ సుధాకరం ఈ విజయాలను వర్ణించింది. అందులో అతని తండ్రి మొదటి అనపోతానాయకుడు శ్రీశైల పర్వతానికి మెట్లు కట్టించాడని వర్ణించాడు. వంశావళి కూడా ఈ విజయాన్ని ధృవపరుస్తోంది. ఈ యుద్ధాలలో అనపోతారెడ్డి పినతండ్రి అన్నారెడ్డి, అనపోతారెడ్డి మామ మరణించినట్లుగా తెలుస్తోంది. చాటువులు, వంశావళి వారి మరణాన్ని వివరించలేదు. కాని అనపోతానాయకుని ఐనవోలు శాసనంలో వారి మరణ ప్రస్తావన ఉంది. కాని ఆంధ్రా యూనివర్సిటీ సేకరించిన Epigraphical Evidence పేజి damage అయిఉంది. కనుక స్పష్టంగా తెలియటం లేదు. ఈ విజయాల తర్వాత శ్రీశైలం,

త్రిపురాంతకం, ధూపాడు లేక మార్కాపుర ప్రాంతాలు పద్మనాయక రాజ్యంలో కలుపబడ్డాయని తెలుస్తోంది.

దన్నాల కోట లేక ధరణి కోట యుద్ధం: తర్వాత మాదానాయకుడు తన అన్న కుమారుడు కటారి నాగనాయకుడుతో కలిసి దన్నాలకోటపై దాడి చేశాడు. ఉభయులకు భీకరమైన యుద్ధం జరిగింది. వంశావళి ఈ యుద్ధంలో విరాటుని పశువులను తోలుకు వెళ్లడానికి వచ్చిన దుర్యోధనుని అర్జునుడు పారదోలినట్లు అనపోతారెడ్డి మానంబును సిగ్గును బోనాడిరయంబున బరచెనని వర్ణించింది. కాని వెన్నెలకంటి సూరన రచించిన విష్ణు పురాణం అనపోతారెడ్డి రావుత కేశభూపాలుని ఓడించాడని తెలుపుతోంది. కనుక అనపోత మొదట కొన్ని విజయాలు సాధించి ఉండవచ్చును. కాని చివరకు ఈ యుద్ధంలో పద్మనాయకులే గెలిచినట్లు స్పష్టమవుతోంది. అంతేగాక అనపోతానాయకుడు వారికి బందీగా చిక్కగా కటారి నాయనాయకుడు బంధ విముక్తుని చేసి పంపాడట. ఇది ఆశ్చర్యకరమైన విషయం యుద్ధంలో చిక్కిన శత్రువుని నిర్దాక్షిణ్యంగా వధించి రణము కూడు పొలి పెట్టడం పద్మనాయకుల ఆచారం. అందుకు భిన్నంగా కటారి నాగనాయకుడు పద్మనాయకుల లాంఛనాన్ని అనపోతుని వీపుపై ముద్రించి వదిలివేశాడట. ఈ యుద్ధం తర్వాత రేచర్ల నాయకులు రెడ్ల బిరుదులైన జగనొబ్బగండ, సంగ్రామ ధనుంజయ, రాజవేశ్యభుజంగ అనే బిరుదులు ధరించారు అందువల్ల దన్నాల కోట యుద్ధంలో పద్మనాయకులు విజయం సాధించారని చరిత్రకారులు భావించారు. శ్రీశైలం, దన్నాలకోట విజయాలతో కర్నూలు, గుంటూరు జిల్లాలలోని కృష్ణా తీర ప్రాంతాలను అనపోతారెడ్డి కోల్పోయాడు.

విజయనగర సామ్రాజ్య దండయాత్ర క్రీ.శ.1363-64: బహమనీ పద్మనాయకుల దండయాత్రలతో రెడ్డిరాజ్యం బాగా బలహీనపడింది. పద్మనాయకులు రెడ్డిరాజ్య ప్రాంతాలను ఆక్రమించడంతో వారి రాజ్యం విజయనగర రాజ్య సరిహద్దులను తాకింది. అది సహించని మొదటి బుక్కరాయలు శ్రీశైల ప్రాంతంపై దండెత్తాడు. అక్కడ పద్మనాయకులను ఓడించి తరిమి వేశాడు శ్రీశైలం, త్రిపురాంతకం, దూపాడు సీమలను ఆక్రమించి విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. తర్వాత రెడ్డిరాజ్యంపై దండెత్తి వినుకొండ వరకు ఆక్రమించాడు. వినుకొండ నుంచి రెడ్డిరాజ్య రాజధాని అద్దంకి అతి సమీపంలో ఉంది. రెడ్డిరాజ్య ఉనికికే ప్రమాదం వచ్చింది. విజయనగర రికార్డులు ఈ విజయాలను ధృవీకరిస్తున్నాయి. పొదిలి, దర్శి, నెల్లూరు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో వారి పాలన ఉన్నట్లు స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి ఈ దండయాత్ర శక 1285-86 అంటే క్రీ.శ.1362-64 సంవత్సరాలలో జరిగింది. దువ్వపాడు లేక దూపాడు కైఫీయత్తు ఆ ప్రాంతాన్నంతటినీ శక 1286 అంటే క్రీ.శ.1364లో అనెగొంది నరపతులు జయించారని పేర్కొంది. దూపాడు గ్రామం మార్కాపురం మండలంలో ఉంది. దూపాడును జయించిన తర్వాత అక్కడ రావెల వంశస్తులను విజయనగర ప్రతినిధులుగా నియమించాడు. తూర్పు పడమరలలో కృష్ణానది తమ రాజ్యానికి సరిహద్దుగా ఉండాలని హరిహర, బుక్కరాయలు భావించేవారు. అందుకు కారణమేమిటంటే విద్యారణ్యులవారు కృష్ణానదికి దక్షిణ ప్రాంతం అంతా విరూపాక్షునిది అని చెప్పి, దానిని కాపాడమని ఆదేశించాడు. కనుక కృష్ణా తుంగభద్రానదుల మధ్య ప్రాంతం కోసం బహమనీ రాజ్యంతో సంఘర్షణకు దిగారు. అలాగే ఈశాన్య దిక్కున వారు రెడ్డిరాజ్యంతో తలపడాలని కూడా నిర్ణయించి హరిహరరాయల కాలంలోనే ఉదయగిరి కృష్ణపట్నంలను జయించారు. అప్పుడు అనపోతారెడ్డి పరిస్థితి బలహీనపడగా ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రీ.శ.1363లో రెడ్డిరాజ్య దక్షిణ ప్రాంతాలపై దండెత్తి వినుకొండవరకు ఆక్రమించాడు. దాంతో రెడ్డి రాజధాని అద్దంకికి ప్రమాదం ముంచుకొని వచ్చింది. కనుక అనపోతారెడ్డి భయపడి బుక్కరాయలతో సంధి చేసుకొని యుద్ధ విరమణ చేసి ఉండవచ్చును. మొత్తం మీద వినుకొండ వరకు విజయనగర రాజ్యంలో చేరిపోయింది. దాంతో దక్షిణాన, పశ్చిమాన రెడ్డిరాజ్య సరిహద్దులు కుంచించుకుపోయాయి.

కొండవీటికి రాజధాని మార్పిడి క్రీ.శ.1364: విజయనగర విజయాలతో తన రాజధానికి భద్రత లేదని అనపోతారెడ్డి తెలుసుకున్నాడు. అద్దంకి స్థల దుర్గం చుట్టూ ఎలాంటి ఆపు లేదు. కనుక నలుదిక్కుల నుంచీ సులభంగా దాడి చేయవచ్చును; కనుక అది రాజ్యరక్షణకు పనికిరాదని తన రాజ్యంలో ఉన్న దుర్గాలలోకల్లా కొండవీడు రక్షణకు సరైనదని నిర్ణయించుకొని క్రీ.శ.1364లో తన రాజధానిని కొండవీడుకు మార్చాడు. కొండవీడుకు పూర్వకుండిన నగరం అని పేరు ఉండేది. అక్కడ ప్రోలయవేమారెడ్డి పుట్టకోట అనే పేరుతో చిన్నకోటను నిర్మించాడు. అనపోతారెడ్డి ఆ కోటను పటిష్టపరచి రాజ ప్రాసాదాలు నిర్మించాడు. కొండవీడుకు రాజధాని మారిందని క్రీ.శ.1364 నాటి అనవేమారెడ్డి మాన్యమాపుర శాసనం, కాటయ వేమారెడ్డి అన్నవర

శాసనం, శ్రీనాథుని శృంగార నైషధం తెలుపుతున్నాయి

మరణం - ఘనత: రాజధానిని మార్చిన తర్వాత అనపోతారెడ్డి ఎక్కువ కాలం జీవించలేదు. అదే సంవత్సరంలో అంటే క్రీ శ 1364లో అనపోతారెడ్డి మరణించాడు. ఆ సమయంలో విజయనగరంలో యుద్ధాలు కొనసాగుతున్నాయని మల్లంపల్లి సోమశేఖరశర్మ రాశారు. అంటే విజయనగరంతో జరిగే యుద్ధాల మధ్యనే, పూర్తికాకుండానే యుద్ధంలో మధ్యలో మరణించాడని భావించవచ్చును. అనపోతారెడ్డి జీవితమంతా నిరంతర యుద్ధాలతో గడిచిపోయింది. అతడు గొప్పవీరుడని కొల్లూరు శాసనం తెలుపుతోంది. అనపోతారెడ్డి దండెత్తి వచ్చాడంటే శత్రురాజుల భార్యలు తమ భర్తల ప్రాణాలు దక్కవని శోకించేవారని ఆ శాసనం వర్ణిస్తోంది. కాని అతని జీవితమంతా అపజయాలమయం. రాజ్యం అపారనష్టానికి గురి అయి ప్రతిష్టను కోల్పోయింది. రాజ్యపు సరిహద్దులు బాగా తగ్గిపోయాయి. అయినప్పటికీ అతడు సాగించిన ఉత్తరాంధ్ర దండయాత్ర ఆ తర్వాత అనవేమారెడ్డి కుమారగిరుల కాలంలో ఉత్తరంగా రెడ్డిరాజ్యం వ్యాప్తి చెందడానికి మార్గం వేసింది. అతని అడుగుజాడలలో నడచి అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి సేనాధిపతి కాటయవేమారెడ్డి సింహాచలం వరకు రాజ్యాన్ని విస్తరించగలిగారు. వారికి ప్రేరణ అనపోతారెడ్డి, అనపోతారెడ్డికి పరిపాలనలో యుద్ధాలలో మల్లన, సోమయ, కేతయ మల్లవేమ సహాయపడ్డారు సోమయమంత్రి మోటుపల్లి రేవును అభివృద్ధి చేయడానికి కృషి చేశాడు. కేతయ మల్లమంత్రి ధరణికోట యుద్ధంలో రెడ్డి సైన్యాన్ని నడిపాడు అనపోతారెడ్డి ఆస్థానంలో బాలసరస్వతి అనే కవి ఉన్నాడు. అతడు అనపోతారెడ్డి విడుదల చేసిన శాసనాలను లిఖించాడు. అంటే శాసన లేఖకుడు. కాని అతడు కావ్యాలు రాసినట్లు లేదు. అనపోత నరేంద్రస్యవిద్వాన్ బాలసరస్వతిః అని మాత్రమే తనను గురించి చెప్పుకున్నాడు ఇంతకుమించి అతని గురించి వివరాలు తెలియదు. అతడు అనవేమారెడ్డి ఆస్థానంలో కూడా కొనసాగాడు. అనపోతారెడ్డి ప్రజాసంక్షేమం కొరకు పాటుబడ్డాడు పుణ్యక్షేత్రాలలో యాత్రికుల సౌకర్యార్థం విడిదిగృహాలు నెలకొల్పాడు. అనపోతారెడ్డి, దేవేరి మనుమాంబ త్రిపురాంతక దేవుని భక్తులు. వారికి కుమారగిరి అనే కుమారుడు, దొడ్డాంబిక అనే కుమార్తె కలిగారు. త్రిపురాంతకం కొండకు కుమారగిరి కొండ అనే పేరున్నది ఆ దేవుని పేరుతో వారు తమ కుమారునికి కుమారగిరి అని పేరు పెట్టుకున్నారు. తన కుమార్తెను మేనల్లుడు కాటయవేమారెడ్డికిచ్చి వివాహం చేశాడు ఆమెకు అన్నమ అని కూడా పేరుంది. క్రీ.శ.1364లో అనపోతారెడ్డి మరణించే నాటికి కుమారుడు కుమారగిరి చిన్నవాడు కనుక అనపోత తమ్ముడు అనవేమారెడ్డి రాజ్య భారం చేపట్టాడు.

రాజ్య సరిహద్దులు: అనపోత శ్రీశైలం నుండి మేఘుల వరకు జయించాడని, కృష్ణా నది నుండి గోదావరి వరకు పాలించాడని అనవేమారెడ్డి తన సోదరుని కీర్తించాడు కాని నేడు మనకు లభ్యమైన ఆధారాలతో పరిశీలించిన అది వాస్తవం కాదని స్పష్టపడింది. అనపోత మరణించే నాటికి రెడ్డి రాజ్యానికి ఉత్తరాన కృష్ణానది దక్షిణాన గుండ్లకమ్మ నది, తూర్పున బంగాళాఖాతం సరిహద్దులని చెప్పవచ్చును.

అనవేమారెడ్డి క్రీ.శ.1364-1386: అనవేమారెడ్డి చరిత్ర తెలుసుకోడానికి పెదచెరుకూరు క్రీ.శ.1371, సింహాచలం క్రీ.శ 1375, వాడపల్లి క్రీ.శ 1377, పలివెల క్రీ.శ.1377, శ్రీశైలం శిలాశాసనం క్రీ.శ.1378 ద్రాక్షారామ క్రీ శ.1381, మాన్యమాపురం క్రీ.శ.1382, దృజ్జవరం, ఇప్పగల్లు, పచ్చల తొండిపర్రు, పచ్చల తాడిపర్రు, కొల్లూరు, వానపల్లి, పెదపలకలూరు, నడుపూరు తామ్ర శాసనాలు, క్రీ శ.1378 నాటి శ్రీశైల శిలాశాసనం, వెన్నలకంటి సూరన రచించిన విష్ణుపురాణం, శ్రీనాథుని శృంగాక నైషధం ముఖ్య ఆధారాలు.

పట్టాభిషేకం క్రీ.శ.1364: అనవేముని శాసనాలను పరిశీలించినట్లయితే అతడు వారసత్వంతో రాజ్యానికి వచ్చినట్లు కన్పించదు. అతడు తన శాసనాలలో రాజ్యశ్రీరమణి స్వయంవర లబ్దనాయక సౌభాగ్య అని చెప్పుకున్నాడు అతడు వారసత్వ హక్కుతోగాక మంత్రులు, సేనాధిపతులు అతనిని రాజుగా నిర్ణయించినట్లు కనిపిస్తుంది. అనపోతారెడ్డి మరణించే నాటికి అతని కుమారుడు కుమారగిరి చిన్నవాడు. అపుడు రెడ్డిరాజ్యం అతి క్లిష్టపరిస్థితులలో ఉంది. రేచర్ల, విజయనగర రాజ్యాల చేతిలో ఘోరపరాజయం పాలైఉంది. ఆ స్థితిలో బాలుడు సింహాసనం అధిష్టించడం మంచిది కాదని, ఆ పరిస్థితుల నెదుర్కోగలిగిన సమర్థుడైన వ్యక్తి కావాలని మంత్రులు, సేనానాయకులు భావించి అందుకు తగినవాడు అనవేముడని నిర్ణయించినట్లుగా భావించవచ్చు. అయినా కుమారగిరిని సింహాసనం మీద కూర్చోబెట్టి తాను రక్షకుడుగా, ప్రతినిధిగా రాజ్యపాలన చేయవచ్చును. కాని అనవేముడు అలా చేయలేదు. అలా చేసినట్లయితే నిర్ణయాలు తీసుకోవడంలో పూర్తి స్వేచ్ఛ ఉండదు

క్లిష్టపరిస్థితిలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చును. కనుక సర్వాధికారాలు గలిగిన పాలకుడు అప్పటిస్థితిలో అవసరం కనుక మంత్రులు అనవేముని సింహాసనం అధిష్టించమని కోరి ఉండవచ్చును. అయినా అనవేముడు సింహాసనం అధిష్టించడానికి కొంత వ్యతిరేకత కూడా లేకపోలేదు. అనపోతారెడ్డి అల్లుడైన కాటయవేమారెడ్డి, అతని తండ్రి కాటయరెడ్డి, వారి బంధువులు, అనవేముని వారసత్వాన్ని ఇష్టపడినట్లుగా కన్పించదు. కాని ఆనాటి పరిస్థితులలో వారు అయిష్టంగానే అంగీకరించి ఉండవచ్చు. కనుకనే అనవేముడు మంత్రి సామంతుల అనుమతితో పట్టాభిషేకం జరుపుకొని అధికారాన్ని చేపట్టాడని భావించవచ్చు. కాని కొందరు అనవేమారెడ్డి కుయుక్తితో రాజ్యానికి వచ్చాడని భావించారు. అది వాస్తవంగా కన్పించదు. తర్వాత రాజ్యానికి వచ్చిన కుమారగిరి తన అనపర్తి శాసనంలో అనపోత, అనవేములు ధర్మనిరతితో పాలించారని పేర్కొన్నాడు కనుక అనవేముడు అందరి ఆమోదంతోనే అధికారం పొందాడని భావించడమే సమంజసంగా కనిపిస్తుంది.

అనవేముడు రాజ్యానికి వచ్చేనాటికి రెడ్డిరాజ్య భాగాలు చాలా చేజారిపోయాయి దక్షిణాన విజయనగర రాజ్యం అతి బలిష్టంగా రూపొందింది పద్మనాయకులు రెడ్డిరాజ్యంపై కత్తులు నూరుతున్నారు. ఆ స్థితిలో అనవేమారెడ్డి తమరాజ్యపు పూర్వవైభవాన్ని పునరుద్ధరించటంలో తన శక్తి సామర్థ్యాలు చూపి మంత్రులు, దండనాయకులు తనను రాజుగా ఎన్నుకున్న నిర్ణయం సరైనదని నిరూపించాడు.

దివి, వేంగి దండయాత్ర: రెడ్డిరాజులు మొదటి నుండి ఉత్తరాంధ్రను తమ ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నారు అనపోతారెడ్డి ఆ కార్యాన్ని సాధించలేకపోయాడు. కనుక అనవేమారెడ్డి ఎలాగైనా ఉత్తరాంధ్రను తన ఆధిపత్యంలోకి తీసుకురావాలని దృఢనిర్ణయం తీసుకున్నాడు తగిన అవకాశం కూడా వచ్చింది. వేంగిరాజ్యంలో భక్తీశ్వరచోడుడు క్రీ.శ.1366లో మరణించాడు. అతని కుమారులు భీమదేవచోడుడు, అన్నదేవచోడుడు సింహాసనానికి పోటీ పడ్డారు. అలాగే అందులో అన్నదేవచోడుడు అన్నను తరిమివేసి శక 1289 అంటే క్రీ.శ.1367లో కామపురి సింహాసనం అధిష్టించాడు. సింహాసనం కోల్పోయిన భీమదేవచోడుడు అనవేమారెడ్డిని ఆశ్రయించి ఉండవచ్చును. అతడు అనవేమారెడ్డి బావ రాజమహేంద్ర మ్యూజియం శాసనం, భీమప్రోలుసీమ, వేంగినాడు మొదలైన ప్రాంతాలను అన్నదేవచోడుడు పాలిస్తున్నాడని తెలుపుతోంది సింహాసనాన్ని పోగొట్టుకున్న భీమదేవచోడుడు అనవేమారెడ్డిని ఆశ్రయించి ఉండవచ్చును అతడు అనవేమారెడ్డి బావ. ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమచేతులనుంచి జారిపోయిన కృష్ణకు ఉత్తరంగా ఉన్న ప్రాంతాలను తిరిగి జయించాలని దిగ్విజయయాత్రకు పూనుకున్నాడు. అతడి దిగ్విజయయాత్ర విజయవంతం అయిందని అతడు ధరించిన బిరుదులవల్ల తెలుస్తోంది. అతని బిరుదులను పేర్కొంది. దివిదుర్గ విభాళ, రాజమహేంద్ర-నిరవద్యనగరాధి బహువిధ, స్థలదుర్గ, విదళన బలరామ, సాగరగౌతమి సలల సంగమ సకళ జలదుర్గ సాధక రఘురామ అనే బిరుదులు ధరించాడని శాసనాలు చెబుతున్నాయి. ఈ బిరుదులను బట్టి అతడు సాధించిన విజయాలు తెలుస్తున్నాయి. ఇంకా అతనికి కలవారభైరవ, క్షరికాశయ కరవాళ మైనతీయ, మహానీయాంధ్రదేశ పట్టాభిషేక సంవృత, మహాభాగ్య అనే బిరుదులు కూడా ఉన్నాయి. అతడు దివిదుర్గాన్ని జయించడంతో అతని దండయాత్ర ప్రారంభం అయి ఉండవచ్చును. అనపోతారెడ్డి దివిదుర్గాన్ని జయించాడు కాని అతనికి సూరవరం యుద్ధంలో జరిగిన ఓటమితో అది స్వతంత్రమైంది. కనుక అనవేమారెడ్డి తిరిగి ఆ దుర్గాన్ని జయించి దివిదుర్గవిభాళ అనే బిరుదు ధరించి ఉంటాడు.

తర్వాత అనవేముడు వేంగిదేశంలో ప్రవేశించాడు. వేంగిదేశంలోని తూర్పు ప్రాంతాలు ఉండి, సూరవరం సూర్యవంశస్తుడైన పిన ఉండి రాజు ఏలుతున్నాడు. అతనిపై దండెత్తి అతనిని ఓడించి అతని రాజధాని సూరవర పట్టణాన్ని తన ఆధిపత్యం కిందికి తెచ్చుకున్నాడు. సూరవరం వద్ద జరిగిన అపజయం వల్ల వచ్చిన అప్రదిష్టను తుడిచివేశాడు.

అన్నదేవచోడుని ఓడించడం: తర్వాత అనవేముని సైన్యాలు నిరవద్యపురాన్ని జయించారు. నిరవద్యపురాన్ని చాళుక్యులు పాలించేవారు. కాని ఈ కాలానికి వేంగి మొత్తం అన్నెదేవచోడుని ఆధీనంలో ఉన్నట్లుగా కనిపిస్తోంది. అనవేముడు వేంగిని జయించినట్లు శాసనాలలో లేదు. కాని నిరవద్యప్రోలును జయించినట్లు శ్రీశైల శాసనం తెలుపుతోంది. నిడదవోలు వద్ద చాళుక్యులు కామపురి రాజైన అన్నెదేవచోడుడు కలసి రెడ్డిసైన్యాన్ని ఎదిరించి ఉండవచ్చును. ఈ యుద్ధంలో అన్నెదేవచోడుడు ఓడిపోయి వేంగిని విడిచి వెళ్లిపోయాడు. అతడు రాజ్యం పోగొట్టుకున్న తర్వాత పద్మనాయకుల వద్దకు చేరి ఉంటాడు. దేవరకొండ పెదవేదగిరి అన్నెదేవచోడుని

ఆదరించాడని వెలుగోటివంశావళి తెలుపుతోంది. అన్నెదేవచోడుడు వెళ్లిపోయిన తర్వాత అనవేమారెడ్డి భీమదేవ చోడుని వేంగి సింహాసనాధీశుని చేసి ఉండవచ్చును

కోనసీమ ఆక్రమణ: అన్నెదేవుని ఓడించిన తర్వాత అనవేముడు కోనసీమపై దండెత్తాడు. గోదావరి సముద్రంలో కలిసే చోట కొన్ని జలదుర్గాలున్నాయి. వాటితోసహా కోణ, పానార, కురువట ప్రాంతాలను జయించాడు. ఈ ప్రాంతాలు కోరుకొండనేలిన మంచికొండ ముమ్మడి నాయకునికి చెందినవి ఈ విజయాలతో కోనసీమ మొత్తం వశమైంది. నడుపూరు, పలివెల, ద్రాక్షారామ, వానపల్లి శాసనాలు పానార, కోనసీమలను జయించినట్లు తెలుపుతున్నాయి ఈ ప్రాంతాలపై దండెత్తడానికి అనవేముడు తూర్పుదిక్కుగా తిరిగి పానార చేరి దానిని జయించిన తర్వాత అక్కడ వాశిష్టను దాటి కోణమండలంలో ప్రవేశించి ఉండవచ్చును. కోణమండలంలో అనేక జలదుర్గాలున్నాయి. వాటిని జయించి గౌతమిని దాటి రాజమహేంద్రవరం చేరిఉంటాడు. రాజమండ్రి బ్రిడ్జి నిర్మింపకముందు ఆ ప్రాంతాలనుండే వాశిష్ట గౌతమిలను దాటేవారు ఈ ప్రాంతాలు జయించడానికి అనవేమునకు తమ మేనమామల కుటుంబానికి చెందిన అనగా దువ్వూరి కుటుంబానికి చెందిన రెండవ కాటయరెడ్డి, రెండవ మారయరెడ్డి, దొడ్డారెడ్డి సహాయపడి ఉండవచ్చును. వారిలో రెండవ కాటయరెడ్డికి జలదుర్గమల్ల అనే బిరుదు ఉంది దువ్వూరి కుటుంబం ప్రోలయ వేమారెడ్డికాలంలోనే రాజమహేంద్రవరం చేరిందని ప్రతీతి గౌతమిని దాటిన తర్వాత అనవేముడు రాజమహేంద్రవర దుర్గాన్ని ముట్టడించాడు.

గోదావరీ ప్రాంత ఆక్రమణ: గోదావరినదికి ఉత్తరభాగాన్ని దక్షిణకళింగ అని పిలిచేవారు. అనవేముని దండయాత్రాకాలం నాటికి కోరుకొండ, రాజమహేంద్రవరాలను కేంద్రాలుగా చేసుకొని మంచికొండ ముమ్మడి నాయకుడు అతని సోదరుడు సింగమనాయకుడు పాలిస్తున్నారు. వారి రాజ్యంపైన పిఠాపురాన్ని, తుని, కొట్టాంలను కేంద్రాలుగా చేసుకొని కొప్పులవెలమలు పాలిస్తున్నారు. వారి రాజ్యంలో కొట్టాం, వజ్రగడం అనుబలమైన దుర్గాలున్నాయి. ఈ రాజ్యానికి ఉత్తరంగా యలమంచిలి పాంచదార్లను చాళుక్యులు పాలిస్తున్నారు. వారికి ఉత్తరంగా ఒడ్డాదిని మత్స్యవంశస్తులు ఏలుతున్నారు. రాజమహేంద్రవరం ముమ్మడినాయకుడు పోరాడి ఓడిపోయి ఉండవచ్చును. పానార, కోణ, రాజమహేంద్రవరాలను జయించినట్లు అతని ద్రాక్షారమ, పలివెల శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. తర్వాత పిఠాపురంపై దండెత్తి కొప్పులవెలమలను ఓడించి వారి రాజ్యంలోని బెండపూడి, తుని, కొట్టాం, వజ్రగడ కోటలను జయించాడు. తర్వాత ఎలమంచిలి చేరి చాళుక్యరాజైన నాల్గవ ఉపేంద్రను ఓడించి వడ్డాది చేరి పాలించే మత్స్యవంశానికి చెందిన వీరార్జునుని అక్కడ ఓడించి తర్వాత సింహాచలం చేరాడు. ఈ రాజుల పేర్లు శ్రీశైల శాసనంలో లేవు, కాని వీరందరూ అనవేముని సమకాలికులు. ఈ తూర్పు దండయాత్రకు అనవేముని బ్రహ్మన మంత్రి సేనాధిపతి అయిన చెన్నమనాయకుడు నడిపాడు. కాని అనవేముడు తాను జయించిన ప్రాంతాలను రెడ్డిరాజ్యంలో కలుపలేదు. ఆయా ప్రాంతాలలో ఆ వంశస్తులనే సామంతులుగా పాలించేటట్లు అంగీకరించాడు. వారివద్ద కప్పాలు వసూలుచేసి ఉండవచ్చును. సింహాచలం చేరిన తర్వాత అతని సేనాని చెన్నమనాయకుడు మత్స్యరాజ్యంలోని గోటివాడ అనే గ్రామాన్ని మత్స్యరాజైన వీరార్జునుని నుండి పొంది సింహాచల దేవాలయానికి దానం చేసి అక్కడ క్రీ.శ 1375 ఏప్రిల్ 4వ తేదీన శాసనం వేయించాడు. కనుక క్రీ.శ 1375 ఏప్రిల్ మాసంలో అనవేముని తూర్పు దండయాత్ర పూర్తి అయిందని అందువల్ల ఈ శాసనం జయించిన ప్రాంతాల అనవేముని ప్రత్యక్షపాలన కిందికి రాలేదని స్పష్టం చేస్తోంది. అంతే కాకుండా అనవేముని తూర్పు దిగ్విజయయాత్ర క్రీ.శ.1375 ఏప్రిల్ సమాప్తమైనదని కూడా నిరూపిస్తోంది. ఈ విధంగా అనవేముని తూర్పు దిగ్విజయయాత్ర విజయవంతమైంది. అందువల్లనే శక 1297 అంటే క్రీ.శ.1375 నాటి మాన్యమాపుర శాసనం అనవేముని సింహాచల వింధ్యపాద ప్రతిష్ఠాపిత కీర్తి స్తంభ అని కీర్తిస్తోంది. '

రేచర్ల విజయనగర రాజ్యాలతో యుద్ధం శక 1299 క్రీ.శ.1387: అనవేముడు కళింగ దండయాత్ర తర్వాత తన దృష్టిని రేచర్ల విజయనగర రాజ్యాలపై త్రిప్పాడు. అనపోతారెడ్డి కాలంలో బుక్కరాయలు జయించిన ప్రాంతాలు విజయనగర రాజ్యంలోనే ఉండిపోయాయి. ఆ ప్రాంతాలలోని విజయనగర శాసనాలు ఈ విషయాన్ని ధృవపరుస్తున్నాయి. విజయనగర సేనాని వెలుగోటి తిప్ప మహానంది వేయించిన శాసనం, శక 1294 క్రీ.శ.1372 సంవత్సరంలో యేరువ రాజ్యంలోని చాంగలనాడులోని శాసనం అందుకు నిదర్శనాలు. మహానంది శాసనం వెలుగోటి తిప్ప తాత గంగలరాజు చెన్నరాజు కొచ్చర్లకోట వద్ద విజయం సాధించినట్లు తెలుపుతోంది. చాంగలనాడు శాసనం వినుకొండ సీమలోని పాపవినాశన దేవునికి నర్సరావుపేట తాలూకాలోని వింజనంపాడు

గ్రామాన్ని దానం చేసినట్లు తెలుపుతోంది. దీనిని బట్టి విజయనగర సామ్రాజ్యం కొండవీటి రాజ్యంలోకి చొచ్చుకొని వచ్చిందని తెలుస్తోంది.

రేచర్లవారితో యుద్ధం: క్రీ.శ.1368లో కాపయనాయకుని వధించి రేచర్ల అనపోతనాయకుడు వరంగల్లును ఆక్రమించి తెలంగాణ ప్రాంతం మొత్తానికి ప్రభువుగా మారాడు అనవేముడు తన సోదరుడు అనపోతకు ధరణికోట వద్ద జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయదానికి రేచర్లవారి రాజ్యం మీద దండెత్తాడు. వెలుగోటివారి వంశావళి మాదానాయకుడు అనవేముని ఓడించాడని చెబుతోంది. అది వాస్తవం కాదు. అనవేమారెడ్డి రేచర్ల వారిని ఓడించి నల్లగొండ జిల్లాలోని కొంతప్రాంతాన్ని ఆక్రమించాడు. వజీరాబాద్ ఓడపల్లిలో శక 1229 క్రీ.శ.1377 సంవత్సరం నాటి అనవేముని శాసనం ఉంది. ఈ శాసనంలో కడియం పోతినాయకుడు అక్కడున్న అగస్త్యేశ్వర మహాదేవుని ఆలయానికి గోపురం నిర్మించినట్లు, ఆ దేవునికి మరికొన్ని దానాలు చేసినట్లు ఉంది. ఆ దానాలు అసమాచారెడ్డి పుణ్యఫలానికి చేసినట్లుగా ఉంది. ఈ అనమాచారెడ్డి అనవేముని సోదరుడు. ఈ శాసనం అనవేముడు రేచర్లవారిపై విజయం సాధించి ఓడపల్లి ప్రాంతాన్ని ఆక్రమించినట్లు స్పష్టం చేస్తున్నాయి. ఈ శాసనమే గాక నల్లగొండ జిల్లాలోనే బూరుగడ్డ అనే గ్రామంలో చిలకుర్తి అన్న భీమనాయకుని కుమారుడు దేసట్ల అన్నమానాయకుని శాసనం ఉంది ఇతడు కొండవీటి రాచకుటుంబపు వ్యక్తి అయి ఉంటాడు. అంతేగాక వాడపల్లి, బూరుగడ్డ రెండు శాసనాలు అనవేముని శ్రీశైల శాసనం లాగా శక 1299 పింగళి నామ సంవత్సరంలో వేయించబడ్డాయి. కనుక ఈ రెండు శాసనాలలో వ్యక్తులు అనవేముని సేనాధిపతులై ఉండవచ్చు. కనుక అనవేముడు రేచర్లవారిపై విజయం సాధించాడని చెప్పవచ్చు. ఈ విజయం వల్ల రేచర్లవారి రాజ్యభాగం కొంత అనవేముని వశం అయిందని కూడా చెప్పవచ్చును.

విజయనగర రాజ్యంపై దండయాత్ర: రేచర్లవారి రాజ్యదండయాత్రలో భాగంగా అనవేముడు విజయనగర రాజ్యంపై దండెత్తాడు. ఆ కాలంలో మొదటి బుక్కరాయలు మరణించాడు. విజయనగరం వారసత్వ సమస్యలో మునిగి ఉంది. కనుక పరిస్థితి అనుకూలంగా ఉంది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని శ్రీశైలం వరకు ఆక్రమించాడు. ఆ విజయ సూచకంగా శక 1299లో శ్రీశైలంలో శిలాశాసనం వేయించాడు. ఈ విజయాలతో పూర్వం తాము కోల్పోయిన ప్రాంతాలన్నీ తిరిగి రెడ్డిరాజ్యంలో శక 1304 క్రీ.శ.1382 సంవత్సరం నాటి మాన్యమాపురం శాసనం అనవేముడు శ్రీశైలం నుండి సింహాచలం వరకు గల ప్రాంతాన్ని పాలిస్తున్నాడని తెలుపుతోంది. ఈ విధంగా అనవేముడు అన్ని దిక్కులలో విజయం సాధించి రెడ్డి రాజ్యావైభవాన్ని పునః ప్రతిష్టించాడు.

ఘనత - ధర్మకార్యాలు: కొండవీటి రెడ్డిరాజులలో అనవేమారెడ్డి అగ్రగణ్యుడు. అతడు అనేక బిరుదులు ధరించాడు. ఆ బిరుదుల వల్ల అతడు సాధించిన విజయాలు అతని ప్రజ్ఞను అంచనా వేయవచ్చు. ప్రజాపరిచిత చతుర్విధోపాయ అంటే సామదాన భేద దండోపాయాలైన రాజనీతిలో నిష్ణాతుడు. పరిచితానేక గటి విశేషవరణ మారణోపాయ అనగా పలురకాల గజాలను పట్టి వధించగలవాడు అని అర్థం. కరవాల వైనతేయ, కలియుగ భేతాళ, విక్రమపంజర మొదలైన నిగ్రిహితరిపురాజసింహ, విజయకుంజర బిరుదులు ధరించాడు. అలాగే కనకధార, గోసహస్ర దానాలు చేసి బహుసహస్ర సువర్ణదాన సంతోషిత మహాకపీశ్వర అని కూడా కీర్తిపొందాడు. అతడు బ్రాహ్మణులకు ఇప్పుగల్లు, ధృజ్జవరం, కొల్లూరు, నదుపూరు, వానపల్లి, పెదచెరుకూరు, మాన్యమాపురం మొదలగు అగ్రహారాలను ఇచ్చాడు. వీనిలో క్రీ.శ.1371లో ఇక్షు గ్రామం అనే పేరు కలిగిన చెరుకుపల్లిని చంద్రగ్రహణం రోజున వేదపండితులకు అష్టభోగతేజ గ్రామంగా దానం చేశాడు. అలాగే దేవాలయాలకు దానాలు చేశాడు. ఏనుగు శిఖరాలు కలిగిన గంటలను పంచారామాలకు దానం చేశాడు. కవులను పోషించాడు. బాలసరస్వతి, ప్రకాశ భారతి యోగిత్రిలోచనాచార్యుడు మొదలైన కవులు అతని స్థానంలో ఉండేవారు. అతడు శైవుడు అయినప్పటికీ పరమతసహని. వైష్ణవ క్షేత్రాలైన సింహాచలం, శ్రీకూర్మదేవాలయాలకు దానాలు చేశాడు. శ్రీశైలం, త్రిపురాంతక దేవాలయాలకు భూరి దానాలు చేశాడు. రెడ్డిరాజుల కులదేవత మూలగూరమ్మకు మూడు గ్రామాలు దానం చేసినట్లు అమీనాబాద్ శాసనం తెలుపుతోంది. శ్రీశైలంలో శివభక్తుల ఆత్మార్పణ చేసుకోదానికి వీరశిరోమండపాన్ని నిర్మించాడు. సింహాచలంలో అనవేమ నగరి అనే పేరుతో మరొక మండపాన్ని నిర్మించాడు. అసమాచారెడ్డి ఉద్యోగి కండియం పోతి అక్కడ అగస్త్యేశ్వరాలయానికి గోపురం చంద్రశాల నిర్మించాడు. సత్రాలు నిర్మించి బాటసారులకు ప్రయాణ సౌకర్యం కలిగించాడు. హేమాద్రివ్రత ఖండంలో చెప్పిన దానాలు చేశాడు.

అనవేముని పాలనలో ప్రజలు సుఖశాంతులు అనుభవించారని వెన్నెలకంటి సూరన విష్ణుపురాణంలో వివరించాడు దేశం సిరిసంపదలతో ఉందని పంటలు పుష్కలంగా పండాయని తెలుస్తోంది. అతని పాలనలో కవులకు మృద్వన్నం, చామరాలు లభిస్తున్నాయని ఒక కవి చెప్పగా, తన బతుకు భూమీసురులకు అనవేముడు ధారపోస్తున్నాడని సూరన శ్లాఘించాడు.

వసంతోత్సవాలు: చైత్రమాసంలో జరుపుకొనే వసంతోత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా జరిపేవాడు ప్రజలు ఉత్సాహంగా అందులో పాల్గొనేవారు. పరిసర గ్రామాల నుండి స్త్రీ పురుషులు రాజధాని కొండవీడుచేరి వసంతోత్సవ వేడుకలలో పాల్గొనేవారట. శృంగార పురుష రవసెల్లాలు ధరించి అతి ఉల్లాసంగా మదనోత్సవాలలో పాల్గొనేవారట నృత్యం, కోలాటం, నాట్యగానాలతో 9 రోజులు కొండవీడు కోలాహలంగా ఉండేదట. ఈ విధంగా ప్రతి సంవత్సరం అనవేముడు వసంతోత్సవాలు జరిపి వసంతరాయలు అనే బిరుదును పొందాడు.

అనవేమునికి పరిపాలనలో, యుద్ధాలలో అనేక మంది ప్రజ్ఞావంతులు సహాయపడ్డారు. మామిడి పెద్దనామాత్యుడు అతని మంత్రి, దండనాయకుడు. అతనికి అనవేమాధివరాజ్య భారభరణ అనే బిరుదు ఉంది ఇమ్మడేంద్రుడనే మరొక మంత్రి సమస్త శాస్త్ర పారంగతుడు. అతని సేవలకు మెచ్చి అనవేముడు ఇమ్మడిలంక అనే గ్రామాన్ని దానం చేశాడు. అల్లాడరెడ్డి మరొక మంత్రి, సేనాధిపతి, కళింగ దండయాత్ర జరిపిన బ్రాహ్మణసేనాని చెన్నమనాయకుడు మరొక మంత్రి, సలహాదారుడు వీరందరి సహాయ సహకారాలతో అనవేమారెడ్డి రాజ్యాన్ని విస్తరించి చక్కగా పాలించాడు.

అనవేముడు తన అన్నకుమారుడైన కుమరిగిరిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. అతనికి రాచ విద్యలలో తర్ఫీదు ఇవ్వడానికి ఏర్పాట్లు చేశాడు. విద్యాబుద్ధులు, సంగీత, నృత్య, సాహిత్య కళలను నేర్పించాడు. యుద్ధ తంత్రాలు, రాజనీతిలో తాను శిక్షణ ఇచ్చి తన తర్వాత వారసుణ్ణి తయారు చేశాడు. ఈ విధంగా అనవేమారెడ్డి అన్ని రంగాలలో విజయం సాధించి రాజ్యాన్ని ఉన్నతస్థితికి తెచ్చాడు. కందుకూరు నుండి సింహాచలం వరకు రాజ్యాన్ని విస్తరించి తన తండ్రి ప్రోలయవేముడు, తన అన్న అనపోతల కలలను సఫలంచేసి క్రీ.శ.1386లో మరణించాడు అనవేమునికి మగసంతానం లేదని మల్లంపల్లి సోమశేఖరశర్మ భావించారు. అతని తర్వాత కుమారగిరి రాజ్యానికి వచ్చాడు.

కుమారగిరి రెడ్డి క్రీ.శ.1386-1402: అనవేముని తర్వాత అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరి క్రీ.శ.1386లో కొండవీటి సింహాసనాన్ని అధిష్టించాడు. కుమారగిరి చరిత్ర తెలుసుకోవడానికి కాటయవేమారెడ్డి పాలకొలను, సింహాచలం, అమరావతి, తొత్తరమూడి, మధురపూడి, గోపవరం, సంతాన సాగరం శాసనాలు గొగ్గయ దేవనాయని క్రీ.శ.1388 నాటి సర్పవరం శాసనం, క్రీ.శ.1399 నాటి బండారు శెట్టి తాళ్లూరి మరం శాసనం, అల్లయవేముని కోరుమిల్లి, వేమవరం, శాసనాలు, కొమరగిరి అనపర్తి, క్రీ.శ.1309 నాటి కొమరగిరిపురం, క్రీ.శ.1400 నాటి కొత్తూరు శాసనాలు, ఇంకా విజయనగర ప్రభువులైన రెండవ హరిహరరాయలు, అతని మనుమలైన రామచంద్రరాయల క్రీ.శ.1385-86 నాటి త్రిపురాంతక శాసనాలు, ఎనమదల, పరుచూరు శాసనాలు, కాటయవేముని కుమారరాజీయం, మాళవికాగ్నిమిత్రం, శాకుంతల వ్యాఖ్యానాలు, శ్రీనాథుని హరవిలాసం, కాశీఖండం, భీమేశ్వరపురాణం, కొమ్మన శివలీలావిలాసం, తెలుగు చాటువులు ముఖ్య ఆధారాలు అసంపూర్ణ ద్రాక్షారామ శాసనం, అనపోతారెడ్డి భార్య కుమారగిరి తల్లి మనుమాంబిక అని తెలియజేస్తోంది. ఏ శాసనంలోనూ అనపోతారెడ్డి భార్య పేరు పేర్కొనలేదు. ఏ శాసనమూ ఇవ్వని సమాచారాన్ని ఈ శాసనం ఇస్తోంది.

కుమారగిరి రాజ్యానికి వచ్చిన మొదటి సంవత్సరంలో వేయించిన శక 1312 అంటే క్రీ.శ.1390 నాటి అనపర్తి శాసనం కుమారగిరి ప్రశాంతంగా రాజ్యం చేస్తున్నట్లు తన ఉత్తర, దక్షిణ తూర్పు పడమర సరిహద్దులలో ఉన్న రాజ్యాలతో స్నేహ సంబంధాలు కొనసాగుతున్నట్లు తెలుపుతోంది. తర్వాత వేయించిన గోపవరం శాసనం, కాటయవేమారెడ్డి కృష్ణుడు ధర్మరాజుని ఉద్ధరించినట్లు కాటయవేముడు కుమారగిరిని ఉద్ధరించాడని ఒక వాక్యం ఉంది. దానిని బట్టి కుమారగిరి సింహాసనానికి సంఘర్షణ జరిగినట్లు కనిపిస్తోంది.

వారసత్వ వివాదం: కుమారగిరి వారసత్వానికి అడ్డు తగిలిన వారి ప్రస్తావన ఏ శాసనంలో లేదు. కాని కొంత ఊహించడానికి అవకాశం ఉంది. ప్రోలయ వేమారెడ్డికి ముగ్గురు కుమారులు. వారిలో అనపోతారెడ్డి కుమారుడు కుమారగిరి. అనవేమారెడ్డికి పుత్రసంతానం లేదు. అనమాచారెడ్డి ప్రస్తావన వాడపల్లి శాసనంలో

ఉంది. అతడు అనవేమారెడ్డి కాలంలోనే గతించాడు. కనుక కుమారగిరి ప్రత్యర్థులు ప్రోలయ వేమారెడ్డి అన్న అయిన మాచారెడ్డి పుత్రులని భావింపబడింది. అందుకు కారణం అనపర్తి శాసనంలో దక్షిణ రాజులు అని ఉంది. వారు చందోలువారని భావించారు. ప్రోలయవేమారెడ్డి తన అన్న మాచారెడ్డిని చందోలు పరిపాలకునిగా నియమించాడు. అతని కుమారుడు పెదకోమటి రెడ్డి తర్వాత చందోలును పాలించాడు. అతనికి వేమా, మాచా అనే ఇద్దరు కుమారులున్నారు. వీరే కుమారగిరి ప్రత్యర్థులని భావించారు. అనవేమారెడ్డి తర్వాత కొండవీటి సింహాసనం తమకు చెందాలని వారు వాదించి ఉండవచ్చును కుమారగిరి తన బావ కాటయ వేమారెడ్డికి అధిక ప్రాధాన్యత నిచ్చాడు. రాజకీయాలలో తమ ప్రాముఖ్యత పోయిందని చందోలు శాఖవారు భావించి వారసత్వానికి ప్రయత్నించి ఉండవచ్చు. కుమారగిరి తన బావ కాటయ వేమారెడ్డికి అధిక ప్రాధాన్యతనిచ్చాడు. రాజకీయాలలో తమ ప్రాముఖ్యత పోయిందని చందోలు శాఖవారు భావించి వారసత్వానికి ప్రయత్నించి ఉండవచ్చు. అనవేమారెడ్డి కాలం వరకు బ్రాహ్మణులు మంత్రులుగా ఉండేవారు. ప్రోలయవేమారెడ్డి కొలువులో రామాప్రెగడ, మల్లినాథులు అనే వారు మంత్రులుగా చేశారు. అనపోత కూడా మల్లినాథుని మంత్రిగా కొనసాగనిచ్చాడు. మల్లినాథుడు రామరాజు కుమారుడు. సోమయప్రెగ్గడ అనే మరొక మంత్రి కూడా ఉండేవాడు. అనవేముని కాలంలో మల్లయ మంత్రి కుమారుడు ఇమ్మడింద్ర, భారద్వాజ గోత్రీకుడైన మామిడన్న కుమారుడు పెద్దన అనే ముగ్గురు బ్రాహ్మణ మంత్రులు ఉండేవారు. వీరంతా బ్రాహ్మణులు. కుమారగిరి బ్రాహ్మణ మంత్రులను నియమించే ఆచారాన్ని వదలి తన బావ కాటయవేమారెడ్డిని ప్రధాన మంత్రిగా చేశాడు. అందువల్ల రాజ్యంలో కాటయవేముని ప్రాబల్యం పెరిగిపోయింది. బహుశ అది గిట్టక చందోలు శాఖవారు వారసత్వ వివాదం తెచ్చి ఉంటారు. ఈ వారసత్వ వివాదంలో అనవేముని మంత్రి అయిన పెద్దన కుమారులైన వేమప్రెగ్గడ, సింగన అనే వారు అతని తమ్ముడు వారి సంతతి వారు కూడా పెదకోమటిని సమర్థించారు. వారి వంశవృక్షం శృంగారనైషధంలో ఇవ్వబడింది. ఈ వంశానికి మూలపురుషుడు పెద తుర్కన. అతని కుమారుడు చిట్టిపెద్దన, అతని కుమారుడు మామిడన్న. అతని భార్య అక్కాంబ. వారికి పెద్దన, వీరభద్ర, మారన నామన అనే నలుగురు కుమారులు. వీరిలో చిట్టి పెద్దన, మామిడన్న, పెద్దనలు, ఈ కుటుంబీకులు ప్రోలయ, అనవేమ కాలాలలో మంత్రులుగా చేశారు. ఈ వంశస్తులు పెదకోమటిని సమర్థించారు. కాటయ వేమారెడ్డి వద్ద అప్పయ్య కుమారుడు పెద్ది అనే బ్రాహ్మణుడు మంత్రిగా ఉండేవాడు. వారసత్వ వివాదంలో కుమారగిరి పెదకోమటిరెడ్డితో సమాధానపడ్డాడు. చందోలు రాజ్యంలో తాను జోక్యం చేసుకోనని, తనకు కుమారులు లేనిపక్షంలో సింహాసనం పెదకోమటి వేముని సంతానానికి చెందుతుందని, రాజీపడినట్లు అమీనాబాద్ శాసనంలో సూచన ఉంది. ఆ శాసనంలో పెదకోమటి వేమారెడ్డి కుమారగిరితో చేసుకున్న ఒప్పందం ప్రకారం తాను సింహాసనానికి వచ్చాడని చెప్పుకున్నాడు. కనుక ఈ ఒప్పందం ప్రకారం అంతర్యుద్ధం ముగిసి కుమారగిరి పట్టాభిషేకం జరిగి ఉంటుంది. అంటే క్రీ.శ.1390 సంవత్సరానికి ముందు జరిగి ఉండాలి. కాటయవేముడు ప్రధానిగా పనిచేస్తున్నాడని, తెలిపిన మొదటి శాసనం శక 1308 నాటి అమరావతి శాసనం. దానిని కాటయవేముని పుణ్యానికి అతని ముఖ్య అధికారి అప్పన పెద్ది దానం చేసి వేయించాడు. ఇదే సంవత్సరం నాటి కాటయవేముని సింహాచలం శాసనం కూడా అతడు ప్రధాన మంత్రి అని తెలుపుతోంది. కనుక శక 1308 అంటే క్రీ.శ.1386లో అంతర్యుద్ధం ముగిసి కుమారగిరి పట్టాభిషేకం జరిగి ఉంటుందని భావించవచ్చును.

విజయనగర దండయాత్ర క్రీ.శ.1385-86: కొండవీడులో అంతర్యుద్ధం జరుగుతుండగా విజయనగర చక్రవర్తి రెండవ హరిహరరాయలు త్రిపురాంతకంపై దండెత్తి ఆక్రమించాడు. ఆ ప్రాంతం విజయనగర అధికారంలో ఉందని శక 1307-08 త్రిపురాంతక శాసనాలు స్పష్టం చేస్తున్నాయి. వీటిలో మొదటి శాసనం రెండవ హరిహరరాయల కుమారుడు వీరదేవరాయల పుణ్యానికి దానం చేయబడింది. మొదటి బుక్కరాయల ప్రధాన మంత్రి అయిన భావదుర ఓడయ దానశాసనం, విజయనగర సైన్యం ముందుకుసాగి వినుకొండను కూడా ఆక్రమించినట్లు వల్లభరాయుని క్రీడాభిరామం తెలుపుతోంది. అందులో వల్లభరాయుని తండ్రి తిప్పన వినుకొండ రాజ్యంలో రత్నభాండాగారుడుగా పనిచేస్తున్నట్లు కూడా తెలిపింది. వినుకొండకు శృతపర్వతం అని కూడా పేరు ఉంది. అనవేమారెడ్డి ఆక్రమించిన ఈ ప్రాంతాలను రెండవ హరిహరరాయలు పునరాక్రమించాడు. తర్వాత విజయనగర సైన్యాలు రాచకొండ రాజ్యంపై దండెత్తాయి. కాని బహమనీ రేచర్ల సంయుక్త సైన్యాలు మహబూబ్‌నగర్ జిల్లాలోని కట్టకొండవద్ద విజయనగర సైన్యాలను ఓడించాయి. ఇదే సందర్భంలో కుమారగిరిరెడ్డి

అంతర్యుద్ధం ముగిసిన తర్వాత కాటయవేమారెడ్డి నాయకత్వంలో శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాలను తిరిగి జయించడానికి పంపాడు. విజయనగర రెడ్డి సైన్యాలు త్రిపురాంతక ప్రాంతంలో యుద్ధానికి దిగాయి. కాని చివరకు వారు సంధి చేసుకున్నారు. బహమనీ రేచర్ల రాజ్యాలు శక్తివంతంగా పెరుగుతున్నందున రెడ్డిరాజ్యంతో వైరం కన్న స్నేహం చేయడం మంచిదని రెండవ హరిహరరాయలు తనకుమార్తె హరిహరాంబను కాటయవేమారెడ్డికిచ్చి వివాహం చేశాడు. హరిహరాంబకు హీరాంబిక అని కూడా పేరుంది. దాంతో విజయనగర, రెడ్డి రాజ్యాలు బంధువులుగా మారాయి. విజయనగరంతో సంఘర్షణ పోయింది. నాటి నుండి రెడ్డిరాజ్యానికి సరిహద్దుపై దండయాత్రలు జరిగే ప్రమాదం తొలిగిపోయింది

రేచర్ల వారితో సంబంధాలు: వెలుగోటి వారి వంశావళి మాదానాయకుడు కుమారగిరిని ఓడించాడని తెలుపుతోంది. ఇది వాస్తవంగా కన్పించదు. ఒకవేళ ఇది వాస్తవం అయితే ఈ సంఘటన శక 1302 అంటే క్రీ.శ.1380 ప్రాంతంలో జరిగి ఉండాలి రాచకొండనేలే మొదటి అనపోతానాయకునికి చెందిన శక 1302 నాటి శాసనం ఒకటి సింహాచలంలో ఉంది. అతని చివరి కాలంలో రేచర్ల వారు కోస్తాపై దండెత్తినట్లు కనిపిస్తోంది. ఈ యుద్ధంలో రేచర్ల యువరాజు పెదవేదగిరి రెండవ మాదానాయకులు పాల్గొన్నట్లుగా ఉంది. పెదవేదగిరి బెండపూడి దుర్గాన్ని జయించినట్లు, అతనికి బెండపూడి దుర్గవిభాళ అనే బిరుదు ఉన్నట్లు వారి వంశావళి వర్ణిస్తోంది. కాని బెండపూడిపై వారి ఆధిపత్యం కొనసాగలేదు కనుక ఆ విజయం తాత్కాలికమే. అయినప్పటికీ ఈ యుద్ధం కుమారగిరి కాలంలో జరుగలేదని చెప్పవచ్చు. ఒకవేళ కుమారగిరి కాలంలో జరిగిఉంటే కాటయవేముని ప్రస్తావన ఉండేది. కాని వెలుగోటివారి వంశావళిలో ఒక్కసారి కూడా కాటయవేముని ప్రస్తావించలేదు. కనుక రేచర్ల వారికి, కుమారగిరికి యుద్ధం జరగలేదని చెప్పవచ్చును.

అన్నదేవచోడునితో సంబంధాలు: అనవేమారెడ్డి అన్నదేవచోడుని ఓడించి తరిమి వేంగినాక్రమించాడు అనవేమారెడ్డి చివరి కాలంలో రాజ్యం కోల్పోయిన అన్నదేవచోడుడు దేవరకొండచేరి పెదవేదగిరిని ఆశ్రయించాడని వెలుగోటివారి వంశావళి తెలుపుతోంది ఆ కాలంలో అతడు బహమనీ సుల్తాన్‌లతో కూడా స్నేహం చేశాడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా విజయనగర రాజ్యంపై దాడి చేసిన సందర్భంలో క్రీ.శ.1398లో సాగరుపైకి దండెత్తాడు. ఆ దండయాత్రలో అన్నదేవచోడుడు, సుల్తాన్ తరపున విజయనగర సేనలతో పోరాడాడు. ఆవిధంగా అన్నదేవచోడుడు రేచర్ల, బహమనీ సుల్తానుల స్నేహం సంపాదించి తన రాజ్యాన్ని వారి సహాయంతో తిరిగి వశపరచుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. అనవేమారెడ్డి చివరి కాలంలో అన్నదేవుడు వేదగిరి సహాయంతో తన రాజ్యాన్ని తిరిగి సంపాదించడానికి కోస్తాపై దండెత్తి ఉండవచ్చును. ఆ సందర్భంలో పెదవేదగిరి బెండపూడిని జయించి ఉండవచ్చు. బెండపూడి దుర్గవిభాళ అనే బిరుదు ధరించి ఉండవచ్చు. తర్వాత కళింగ గాంగులను కూడా ఓడించారట. ఓడిన నరసింహదేవుడు తనకుమార్తె కనకమహాలక్ష్మిని సింగమనాయకుని కుమారుడు అనపోత కిచ్చి వివాహం చేశాడట. కాని ఇది వాస్తవంగా కనిపించదు. అనవేముడు వెలమలను తరిమివేసి ఉంటాడు.

త్రిపురాంతక ప్రాంత ఆక్రమణ: వేంగిని జయించలేకపోయినా అన్నదేవచోడుడు రేచర్ల వారి సహాయంతో త్రిపురాంతక ప్రాంతాన్ని జయించినట్లు తెలుస్తోంది. అన్నదేవచోడుడు త్రిపురాంతక దేవునికి కాంచనపల్లి అనే గ్రామాన్ని దానం చేసి త్రిపురాంతకంలో శాసనం వేయించాడు. ఈ శాసనంలో రెడ్డిరాజుల పేరు లేదు. కనుక అతడు స్వతంత్రుడని చెప్పవచ్చును. త్రిపురాంతక ప్రాంతాన్ని పూర్వం యేరువనాడు అనేవారు. అన్నదేవచోడుని తండ్రి అతని పూర్వీకులు ఆ ప్రాంతం వారే. కనుక అతడు వేంగి దండయాత్ర విఫలమైన తర్వాత రేచర్ల పెదవేదగిరి సహాయంతో తన పూర్వీకుల ప్రాంతాన్ని జయించి ఉంటాడు. ఆ సమయంలో కాంచనపల్లిని దానం చేసి ఉండవచ్చును. ఈ విజయం శక 1302-శక 1308 మధ్య జరిగి ఉండవచ్చు. ఆ సమయంలో కొండవీటిలో కుమారగిరికి, అతని దాయాదులకు వారసత్వ వివాదం జరుగుతోంది. కనుక అది అతనికి అవకాశంగా మారి ఉండవచ్చును. ఆ సమయంలో అక్కడున్న రెడ్డి సైన్యాన్ని అతడు అతనికి సహాయంగా వచ్చిన రేచర్ల సైన్యం ఓడించి తరిమివేసి ఉంటుంది. ఆ కాలంలో కుమారగిరి కొండవీటి ప్రభువు గనుక మాదానాయకుడు కుమారగిరిని ఓడించాడని వెలుగోటి వారి వంశావళి వర్ణించి ఉంటుంది ఇదే సమయంలో విజయనగర చక్రవర్తి రెండవ హరిహరరాయలు శక 1306-1307 మధ్య త్రిపురాంతకంపై దండెత్తాడు. బహుశా రెండవ హరిహరరాయలు అతనికి సహాయంగా వచ్చిన రేచర్ల సైన్యాన్ని ఓడించి అతడు త్రిపురాంతకాన్ని జయించి ఉంటాడు. తర్వాత రేచర్ల సైన్యాన్ని తరుముతూ విజయనగర సైన్యం కృష్ణను దాటి రేచర్ల రాజ్యంలో ప్రవేశించి ఉంటుంది. రేచర్లవారు

బహమనీ సుల్తాన్ సహాయంతో విజయనగర సైన్యాన్ని కట్టకొండ కొండవద్ద ఓడించి ఉండవచ్చు. తర్వాత విజయనగర సైన్యానికి కాటయవేమారెడ్డికి యుద్ధం జరగడం, సంధి చేసుకొని త్రిపురాంతక ప్రాంతాన్ని కుమారగిరికి తిరిగి ఇవ్వడం జరిగింది. ఆ తర్వాత రేచర్ల వారు రెడ్డిరాజ్యంపై దండెత్తలేదు. కారణమేమిటంటే విజయనగర రాజ్యం, రెడ్డిరాజ్యం బంధువులైనందున వారు రెడ్డిరాజ్యంపై దండెత్తడానికి సాహసించి ఉండరు. కనుక కుమారగిరికి, రేచర్ల వారికి యుద్ధం జరగలేదని భావించవచ్చు.

కుమారగిరి తూర్పు దండయాత్ర శక 1312: విజయనగరంతో సంధి కుదరడంతో దక్షిణ పశ్చిమ ప్రాంతాల నుండి దాడులు జరుగుతాయనే భయం పోయింది కనుక కుమారగిరి ఉత్తర కోస్తాను జయించాలని సంకల్పించాడు శక 1302లో జరిగిన పెదవేదగిరి దండయాత్ర వల్ల ఆ ప్రాంతం అదుపు తప్పింది. తిరిగి దానిని జయించాలని కుమారగిరి సంకల్పించాడు. అంతేగాక కాపయనాయకుని మరణం నాటి నుండి ఉత్తరాంధ్రను జయించి రెడ్డిరాజ్యంలో కలపాలని వారికి సంకల్పం ఉండేది. కనుక కుమారగిరి తన బావ కాటయవేమారెడ్డిని ఉత్తరాంధ్రను జయించడానికి పెద్ద సేనతో పంపాడు. కాటయవేముని కళింగ దండయాత్రను గురించి శక 1310 నాటి కాటయవేముని సర్పవరం శాసనం, పాలుకొల్లు - సింహాచలం శాసనం, శక 1312 నాటి కుమారగిరి అనపర్తి, గోపవరం శాసనాలు తెలుపుతున్నాయి. ఈ శాసనాలు యుద్ధ వివరాలు ఇవ్వకపోయినా ఆ శాసనాలు ఆ ప్రాంతాలలో వేయించబడ్డాయి. గనుక ఆ ప్రాంతాలు జయించబడ్డాయని స్పష్టమవుతోంది. అంతేగాక కాటయ వేముని అభిజ్ఞాన శాకుంతలం వ్యాఖ్యానంలో కాటయవేముడు జయించిన ప్రాంతాలు వర్ణించబడ్డాయి.

1. మొల్లేటిదుర్గం
2. కిమ్మూరు దుర్గం
3. బెండపూడి
4 వజ్రకూటం
5. రామగిరి
6. వీరకూటం.

మొల్లేటి దుర్గం లేక మొల్లేరు దుర్గం గోదావరి జిల్లాలోని ఎల్లవరం ప్రాంతంలో ఉంది. అక్కడ ఉప్పుల హనుమయ అనే వ్యక్తి వేమారెడ్డికి శుభాలు కలగడానికి వేమసముద్రం అనే చెరువును నిర్మించి శాసనం వేయించాడు. ఇందులో పేర్కొనబడిన కాటమరెడ్డి వేమారెడ్డి కాటయవేమారెడ్డి అని చెప్పడానికి సందేహం లేదు.

కిమ్మూరు దుర్గం: స్థానిక రాతలు కిమ్మూరు అనే కిరాతవీరుడు తన పేరుతో ద్రాక్షారామానికి 14 క్రోసుల దూరంలో ఒక కోటను నిర్మించాడని తెలుపుతున్నాయి. కిమ్మూరుసీమలో 54 గ్రామాలుండేవి. పెద్దాపురం - దీని పూర్వపు పేరు తిమిర, కట్టమూరు, కాట్రావులపల్లి, కాండ్రకోట, గుడివాడ, ఉలిమేశ్వరం, మద్రిపాక, జగ్గంపేట ప్రాంతాలన్నీ కిమ్మూరుసీమలో భాగాలు. వీనిలోని కాండ్రకోటయే కిమ్మూరు కోట అని భావించారు. అది యేలేరు నది ఒడ్డున ఉన్న ఒక గ్రామం. అక్కడ ప్రస్తుతం కోట శిథిలాలున్నాయి. స్థానిక రచనలు వేమారెడ్డి తర్వాత కిమ్మూరుసీమను రెడ్డి పెదవెంకప్ప పాలించాడని, అతని పాలనలో కిమ్మూరు, ప్రోలునాడు, గరుగుమిల్లి, కూటాల లేకా గూటాల, కొత్తపల్లి, కొవ్వాడసీమలుండేవని తెలియజేస్తున్నాయి. అంతేగాక రెడ్డి పెదవెంకప్ప కిమ్మూరుసీమను ఇసుకపల్లి పెద్దాపాత్రు అనే అతడికి నాయంకరంగా ఇచ్చాడని కూడా తెలుపుతున్నాయి. కనుక కాటయవేమారెడ్డి కిమ్మూరుసీమను జయించిన తర్వాత అక్కడ రెడ్డి పెదవెంకప్పను స్థానిక పాలకునిగా నియమించి ఉంటాడు.

బెండపూడి: ఇది నేడు ప్రసిద్ధి చెందిన అన్నవర దేవస్థానం దగ్గరలో ఉంది. అది కాకతీయుల కాలంలో గొప్ప కోట. రుద్రమదేవి తన కుమార్తెను ఇందులూరి అన్నయ మంత్రికిచ్చి వివాహం చేసి బెండపూడికోటకు అధిపతిని చేసింది. అతనిని బెండపూడి అధిపతిని చేసినందువలన అతనికి బెండపూడి అన్నయమంత్రి అని పేరు వచ్చింది. అన్నయ మంత్రి బలమైన దుర్గాన్ని నిర్మించి కాకతమ్మ గుడిని నిర్మించి కాకతీయుల ఇష్టదైవమైన కాకతమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించాడు. ఒక చెరువును నిర్మించి కాకతమ్మ చెరువు అని కూడా పేరు పెట్టాడు. కాకతీయ సామ్రాజ్య పతనానంతరం అతడు ముసునూరి ప్రోలయనాయకునిని సమర్థించి ఆంధ్ర భూమండలాధ్యక్ష సింహాసన సంప్రతిష్ఠానాచార్య అనే బిరుదు ధరించాడు. అతని మరణం తర్వాత కూడా బెండపూడి దుర్గం తన ప్రాధానత్యను కొనసాగించింది. అనవేమారెడ్డి కాలంలో ఈ దుర్గం పిఠాపురాన్ని పాలించిన కొప్పులవెలమల ఆధిపత్యంలో ఉండేది. అనవేమారెడ్డి ఈ దుర్గాన్ని జయించాడు. కాటయవేమారెడ్డి జయించాడు. నేడు కూడా మళ్లీ

అక్కడ కోట శిధిలాలున్నాయి అంతేగాక ఆనాడు నిర్మించిన కాకతమ్మగుడి నేడు కూడా ఉంది. ఆ దేవతను స్థానికులు నేడు కాయితాలమ్మదేవత అని పిలుస్తున్నారు. పంపానది నుండి భూమిలో రాతి గొట్టాల ద్వారా నీరు వచ్చే విధంగా గొప్ప సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాట్లు చేశారని స్థానిక ప్రజలు చెపుతారు. ఆ చెరువు నేడు కూడా వాడుకలో ఉంది. దానిని కూడా కాయితాల చెరువు అని పిలుస్తున్నారు. అక్కడ ఇంకా అనేక శిధిల దేవాలయాలు ఉన్నాయి ప్రాచీన కాలం నాటి నాణేలు కూడా లభ్యం అయ్యాయి.

వజ్రకూటం: దీనికి వజ్రగడ లేక వజ్రగడ్ అని కూడా పేరుంది. ఇది విశాఖపట్టణం జిల్లాలోని నర్సీపట్టణానికి 10 కిలో మీటర్ల దూరంలో అనకాపల్లి రోడ్డులో ఉంది. ఇచట రెండు కొండల పాదాల మధ్య పెద్ద కోట ఉండేదని, దాని చుట్టూ మరి ఏడుకోటలు రక్షణ కోసం నిర్మింపబడ్డాయని విశాఖజిల్లా గజటీర్ తెలుపుతోంది. ఇక్కడ రెండు రకాలు బంగారు నాణేలు లభించాయి. కాని వానిని గుర్తించలేకపోయారు. ఈ కోట తూర్పు గోడ మధ్యలో నాలుగు వైపులా తెలుగు శాసనాలు కలిగిన ఒక చతురస్రాకార రాతి ఫలకం ఉంది. ఈ కోట ప్రాంతం చాలా భాగం దున్ని వ్యవసాయ భూమిగా మార్చబడింది. కోట శిధిలాలు నేటికీ కనిపిస్తున్నాయి.

రామగిరి-వీరకూటం: ఇది పూర్వపు జయపూర్ స్టేట్‌లో ఉన్న ప్రముఖమైన కోట. వీరకూటం విశాఖపట్టణం జిల్లాలోని పాలకొండ మండలంలో ఉంది. నేడు మట్టి కోట శిధిలాలు ఉన్నాయి. ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన కోట దానిని భారద్వాజ గోత్రానికి చెందిన పల్లవ వంశస్తులు పాలిస్తుండేవారు. ఆ వంశానికి చెందిన రెండవ పురుషోత్తమ అతని కుమారుడు సౌభాగ్యదేవుడు కుమారగిరి సమకాలికులు. వారిని కాటయవేముడు ఓడించాడు. కొన్ని తెలుగుచాటు పద్యాలు కాటయవేమారెడ్డి గౌతమీ నదిని దాటి కాటమదేవి కోటను జయించి దానిని పాలించు క్షత్రియుల స్త్రీలను, సేవకురాళ్లను కొండవీటికి తెచ్చాడని తెలుపుతున్నాయి. ఇది కాటయ వేముని తొలి దండయాత్రలో జరిగి ఉండవచ్చును. కాని ఈ కాటమదేవి కోట ఉనికి గుర్తించబడలేదు. ఇది అమలాపురం మండలంలోని కాట్రేని కోనగాని, రాజోలు మండలంలోని కాట్రేని పాదు అయి ఉండవచ్చని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయపడ్డారు. ఈ దండయాత్రా కాలంలో కోరుకొండ మంచికంటి వారి రాజ్యం, కొప్పులవారి కారాల, పిఠాపురం, తుని ప్రాంతాలను జయించి ఉంటాడు. కాటయ వేమారెడ్డి పాలకొల్లు ప్రాంతాన్ని జయించినట్లు పాలకొల్లు శాసనం ధృవీకరిస్తోంది. రెడ్డిరాజులకు పూర్వం పాలకొల్లు ప్రాంతాన్ని కోనసీమను పాలించిన హైహయ వంశస్తులు పాలించేవారు. బహుశా హైహయ వంశానికి చెందిన క్షత్రియులను ఓడించి కాటయ వేమారెడ్డి పాలకొల్లును ఆక్రమించి ఉంటాడు.

కాటయ వేముని తూర్పు దిగ్విజయయాత్రలో రాజమహేంద్రవరంలోని రెడ్లు అల్లాడరెడ్డి, అతని కుమారులు వేమ, దొడ్డారెడ్లు కూడా పాల్గొని తమ ప్రతాపాలను చూపారు. వారి సహాయంతో కాటయ వేమారెడ్డి అద్భుత విజయాలు సాధించాడు. వీరు దువ్వూరి వంశస్తులు. దువ్వూరి పెరుమాండిరెడ్డికి ఐదుగురు కుమారులు. వారిలో దొడ్డారెడ్డి ఒకరు. అతనికి అనప్రోల, కోట, అల్లాడ, అనే ముగ్గురు కుమారులు. అల్లాడరెడ్డి చోడ భీమదేవుని కుమార్తెను వివాహం చేసుకున్నాడు.

కళింగ దండయాత్ర: శక 1317 అంటే క్రీ.శ.1395 నాటి కుమారగిరి గోపవరం శాసనం కాటయ వేమునికి కటకచూరకార అనే బిరుదు ఉన్నట్లు వర్ణించింది. కాటయవేముడు తన దిగ్విజయయాత్రను సింహాచలంలో ముగించకుండా కళింగపై కూడా దండెత్తినట్లు ఈ బిరుదు సూచిస్తోంది. అల్లాడరెడ్డి అతని కుమారుడు వేమారెడ్డి, తమ్ముడు దొడ్డారెడ్డి కూడా తాము కళింగను జయించినట్లు చెప్పుకున్నారు. శక 1356 నాటి అల్లయవేముని వేమవరం శాసనం కళింగలో వీరవిహారం చేశానని సప్తమాడియ రాజులను జయించానని, సింహాచలం, పురుషోత్తం లేక కటకాన్ని జయించానని చెప్పుకున్నాడు. శ్రీనాధుని భీమేశ్వర పురాణం, కాశీఖండాలు అల్లయ వేమారెడ్డి గజపతిని, పాండు సుల్తాన్‌ను కూడా ఓడించానని వర్ణిస్తున్నాయి. మరొక తెలుగు కావ్యం దొడ్డారెడ్డి చిలక సరస్సు వద్ద విజయస్తంభం నాటాడని తెలుపుతోంది. శివలీలా విలాసం అల్లాడరెడ్డి గౌడపతిని జయించి గజపతిదళవిభళ అనే బిరుదు ధరించాడని వివరిస్తోంది. భీమేశ్వరపురాణం ఆరియేటి అన్నమంత్రి తమ్ముడైన లింగనమంత్రికి అంకితం ఇవ్వబడింది. కాశీఖండం వీరభద్రారెడ్డికి అంకితం చేశాడు. శివలెంక కొమ్మన రాసిన శివలీలావిలాసం దొడ్డారెడ్డికి అంకితం చేయబడింది. ఈ కావ్యాలలో వర్ణించిన విజయాలు కాటయవేముడు జరిపిన కళింగ దండయాత్రలో భాగాలేనా లేక అల్లాడరెడ్డి అతని కుమారులు తాము స్వయంగా జరిపిన దండయాత్రలో స్పష్టంగా తెలియటం లేదు. భీమేశ్వరపురాణం అల్లాడరెడ్డి మంత్రి ఆరియేటి లింగన జాదేశవన,

సప్తమాడె, బరహదొంతి, జంతరనాడు రాజులను జయించాడు; ఒడ్డాది ఉదాయర్జునుని నుండి కప్పం వసూలు చేశాడు; దండకారణ్యం మధ్యలోనున్న రంభను పాలించే నాగవంశానికి చెందిన పుళిందరాజులకు రక్షణ కల్పించాడు; యవన, కర్ణాటక, కటక రాజులతో స్నేహ సంబంధాలను పాటించాడు; ఈ విజయాలన్నీ తన ప్రభువు అల్లాడరెడ్డి కోసం చేశాడు అని వర్ణించింది కనుక ఈ విజయాలన్నీ అల్లాడరెడ్డికి చెందుతాయి ఇవే విజయాలతో పాటిపల్లి, నందపుర, రంభరాజులను మరికొన్ని ప్రాంతాలను అల్లయవేమ అతని సోదరుడు అల్లయవీరభద్రారెడ్డిలు కూడా సాధించారని కాశీఖండం, శివలీలావిలాసం తెలుపుతున్నాయి వీనిలో రంభ అంటే రంప అంటే రంపచోడవరం కావచ్చును. దాన్ని ఇమ్మడిరాజ అనే అతడు పాలిస్తున్నట్లు, నందపురాన్ని పల్లవరాజు పురుషోత్తమ పాలిస్తున్నాడని శివలీలా విలాసం తెలుపుతోంది. రంభ పాలకుడు నాగవంశానికి చెందిన పులిందరాజని భావించారు. జాడేశవనం జాడే అయి ఉండవచ్చును. ఇది నేటి పార్వతీపురం, బొబ్బిలి ప్రాంతం ఇది నందపురాన్ని పాలించిన శిలావంశస్తుల రాజ్యభాగం. బొబ్బిలివాసి బసవయ్య అనే అతడు శక 1347 క్రీ.శ.1425లో సింహాచలనాథునికి అల్లాల వెండి టంకాలను బహూకరించాడు దీనిని బట్టి జాడేశవనాన్ని అల్లాడరెడ్డి కట్టించడం జరిగిందని భావించారు. సప్తమాడియ అంటే ఏడు పర్వతాలు అని అర్థం. సప్త కళింగలోని పర్వత ప్రాంతాలు, కప్పకొండ, పాలకొండ, పొట్టునూరు, కలవేందిపురం, మాండవ ప్రాంతాలను సప్తమాడియలు అని భావింపబడింది. ఇవి ఆటవిక తెగలు పాలించే మన్నెప్రాంతాలు అయి ఉండవచ్చును. తర్వాత ఈ రాజ్యాల సరిహద్దులో ఉన్న కాళ్ళం త్రిపురాన్ని కూడా జయించారు. బరహదొంది అంటే పన్నెండు వరుసలు అంటే 12 మంది సామంతరాజులై ఉండవచ్చును అని భావించారు. వీరు ఒడ్డెరాజుల సామంతులై ఉంటారని వారిని అల్లాడరెడ్డి జయించి ఉండవచ్చును అని భావించారు. జంతరనాడు విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట ప్రాంతం. ఈ రాజ్యాన్ని గార్తశ్యామద గోత్రానికి చెందిన సురభివంశస్తులు పాలించినట్లు సింహాచలంలో శక 1207-1383 సంవత్సరాల శాసనాలు లభించాయి. అల్లాడరెడ్డి కాలంలో ఆ రాజ్యాన్ని సంగవభూప పాలిస్తున్నాడని, అతనిని అల్లాడరెడ్డి దయతో చూశాడని శివలీలా విలాసం తెలుపుతోంది. అతడు సురభివంశస్తుడై ఉండవచ్చును. ఒడ్డాది మత్స్యరాజ్యం. ఉదయార్జున దాని పాలకుడు వీరకూటాన్ని పల్లవ వంశస్తులైన రెండవ పురుషోత్తమ శక 1322, అతని కుమారుడు సౌభాగ్యదేవరాజు శక 1344లో పాలించారు. రెండవ పురుషోత్తముడు అల్లాడరెడ్డి సమకాలికుడు అతనిని ఓడించి ఉండవచ్చును. అల్లాడరెడ్డి అతని కుమారులు ఓడించిన గౌడపతి లేక ఒడ్డెధాత్రీనాథలు నాల్గవ నరసింహదేవుడై ఉండవచ్చు వేమవరం శాసనం ఎలమంచిలిని కూడా జయించినట్లు తెలుపుతోంది. ఈ కాలంలో సహిందిరాజ మల్లాంబికల కుమారుడు చోడగాంగ దేవుడు అల్లాడరెడ్డికి సమకాలికుడు. అల్లాడరెడ్డి జయించిన పాండు సుల్తాన్ ఎవరో తెలియదు. బహుశా బెంగాలు నవాబు కావచ్చును. ఇది బెంగాలులోని మాల్దా జిల్లాలోని పాండు అని భావించారు. బెంగాలు నవాబులకు క్రీ.శ.1342 నుండి 1392 వరకు అది రాజధానిగా కొనసాగింది కాటయవేముడు అల్లాడరెడ్డి అతని కుమారులను కలుపుకొని కళింగ దండయాత్రను నిర్వహించారు. ఈ దండయాత్రలో వారు ఉత్తరాంధ్ర కళింగదేశాలను పాలించు శిలావంశం, సురభివంశం, చాళుక్య వంశం, పల్లవ వంశం, మత్స్యవంశం, నాగవంశం, పులిందవంశం, సింధవవంశం, సురభివంశం, గజపతి లేక గంగవంశాలను ఓడించి సింహాచలం చిలక సరస్సుల వద్ద విజయస్తంభం నాటించారు. చిలక సరస్సు కేరాంభోనిధి అని వర్ణింపబడింది. ఈ విజయాలవల్ల కాటయ వేమారెడ్డి కటకచూరకార అనే బిరుదు వహించాడు. ఈ దండయాత్ర శక 1314 అంటే క్రీ.శ.1392 లో జరిగి ఉండవచ్చని మల్లంపల్లి సోమశేఖరశర్మ నిర్ణయించారు. ఈ తూర్పు దిగ్విజయయాత్ర రెడ్డి చరిత్రలో బహు గొప్పది.

అనపర్తి శాసనం ఈ దండయాత్రలో రాజకుమారుడు రెండవ అనపోత కూడా పాల్గొన్నట్లు సూచిస్తుంది. విజయానంతరం కాటయవేమారెడ్డి అంతులేని ధనరాశులతో రాజకుమారుడు అనపోతతో కొండవీడు చేరాడు గజపతిరాజు బహూకరించిన ఏనుగులు, సామంతులు చెల్లించిన కప్పాలు, ఇతర బహుమతులు కుమారగిరికి అప్పగించాడు. కుమారగిరి బావను ఘనంగా సత్కరించాడు. తర్వాత కుమారగిరి కాటయవేముడు, యువరాజు అనపోత రాజమహేంద్రవరం వచ్చి అనపోతుచేత రాజమహేంద్ర వరంలోని గోపినాథ దేవాలయానికి అనపర్తి గ్రామాన్ని దేవభోగంగా దానం చేయించారు. ఈ ఆలయాన్ని వేణుగోపాలస్వామి ఆలయం అని కూడా పిలుస్తారు. తర్వాత ద్రాక్షారామాన్ని దర్శించి కుమారగిరి తన కుమారుని తన ఒడిలో కూర్చో బెట్టుకొని తులాపురుషదానం చేశాడు.

రాజమహేంద్రవర రాజ్యం ఏర్పాటు: తూర్పు దిగ్విజయయాత్ర వలన సింహాచలం వరకు భూభాగం కొండవీటి రాజ్యంలో శాశ్వతభాగమై పోయింది పరిపాలనా సౌలభ్యం కోసం కుమారగిరి గోదావరి తీరం నుండి సింహాచలం వరకు ఉన్న ప్రాంతాన్ని ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పరచి తూర్పు రాష్ట్రంగా చేశాడు. ఈ రాష్ట్రానికే రాజమహేంద్రవర రాజ్యం అని పేరు వచ్చింది ఆ రాజ్యానికి యువరాజు రెండవ అనపోతుని రాజప్రతినిధిగా నియమించాడు. ఆ రాజ్యానికి రాజమహేంద్రవరం రాజధాని అయింది. అల్లాడరెడ్డి అతని కుమారులు అనపోతకు సహాయకులుగా తోడ్పడ్డారు. అరియేటి లింగన మంత్రి తమ్ముడు అరియేటి అన్నమంత్రి అనపోతకు ప్రధాన మంత్రిగా నియమింపబడ్డాడు. అతనిని బెండపూడి దుర్గాధిపతిగా కూడా నియమించారు. అందువల్ల అతని సంతతి వారికి బెండపూడి వారని పేరు వచ్చింది. శక 1312 అనపర్తి శాసనం వేయించే నాటికి కొండవీటి రాజ్యం శాంతిభద్రతలతో వర్ధిల్లుతోంది. సరిహద్దురాజులతో స్నేహసంబంధాలు కొనసాగుతున్నాయని ఆ శాసనం తెలుపుతోంది.

వసంతోత్సవాలు - కుమారగిరి రచనా వ్యాసంగాలు: తూర్పు దిగ్విజయ యాత్ర తర్వాత రాజ్యంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజాదాయాలు పెరిగాయి. మోటుపల్లి రేవునుండి సుంకాల రూపంలో ఆదాయం ఇంకా పెరిగింది కుమారగిరికి విరామం కలిగింది. ఈ కాలంలో అతడు రచనా వ్యాసంగాలు చేపట్టాడు వసంతోత్సవాలు జరుపుతూ సంతోషంగా జీవించాడు. ప్రతి సంవత్సరం చైత్రమాసం పంచమిరోజున వచ్చే వసంతోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఘనంగా జరిపాడు. అది తొమ్మిది రోజులు జరిగేదట. ఈ తొమ్మిది రోజులు కొండవీడును అతి సుందరంగా అలంకరించేవారు. రాజ్యం నలుమూలల నుండి స్త్రీ పురుషులు వచ్చి పాల్గొనే వారు. అవచి తిప్పయసెట్టి సరఫరా చేసే సుగంధ ద్రవ్యాలతో నగరం మొత్తం గొప్ప సువాసనలు వెదజల్లేవట అవచి తిప్పయశెట్టిని సుగంధ భాండాగారాధ్యక్షునిగా నియమించాడట. ఈ ఉత్సవ సందర్భంలో మదనపూజలు చేసేవారట. అందువల్ల దానికి మదనోత్సవాలని కూడా మరొక పేరుంది వసంతోత్సవాలను గురించి కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, వాత్స్యాయనుని కామసూత్రాలు, ధర్మసింధు, నిర్ణయసింధు, భోజుని రత్నావళి, హేమద్ర వ్రత ఖండం, ఎర్రాప్రెగ్గడ నృసింహపురాణం, శ్రీనాథుని హరవిలాసం, భీమేశ్వరపురాణం, కాటయవేముని కుమారగిరి రాజీయం, తెనాలి రామలింగని పారిజాతాపహరణం, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశకలో అనేక వివరాలున్నాయి. ఈ వసంతోత్సవాలలో కాటయవేమారెడ్డి రచించిన కుమారగిరి రాజీయంలోని అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్నిమిత్ర నాటకాలు ప్రదర్శించేవారట లకుమాదేవి అనే ప్రఖ్యాత నాట్యకత్తె అద్భుతంగా నాట్యం చేసి ప్రజలను సంభ్రమాశ్చర్యాలలో ముంచేదట. ఈ విధంగా ఘనంగా వసంతోత్సవాలు జరిపి కుమారగిరి కర్పూర వసంతరాయలు అనే బిరుదును పొందాడు. అంతేగాక వసంత రాజీయం అనే కావ్యాన్ని కూడా రాశాడు

లకుమాదేవి: కుమారగిరి కాలంలో చెప్పుకోదగిన వ్యక్తులలో లకుమాదేవి కూడా ఒకరు. ఆమె పుట్టుపూర్వోత్తరాలు తెలియవు ఆమె కుమారగిరి ఉంపుడు గత్తె అని అంటారు. ఆ కాలంలో ఆమె గొప్ప నర్తకిగా, సంగీత విద్వాంసురాలిగా గొప్ప కళాకారిణిగా ప్రసిద్ధి చెందింది. ఆనాటి కావ్యాలలో ఆమె ప్రసక్తి ఉంది. అందువల్ల ఆ కాలంలో ఆమె ఎంత కీర్తిప్రతిష్ఠలను అనుభవించిందో అర్థమవుతుంది. కుమారగిరి అనేక దేవాలయాలకు దానం చేశాడు. నూతన భవనాలు, గ్రామాలు నిర్మించాడు నేటి కుమారగిరిపట్నం అతని పేరుతో నిర్మించినదే.

కుమార అనపోత అకాల మరణం శక 1317 క్రీ.శ.1395: కుమారగిరి సంతోషంగా కాలం గడుపుతూ ఉండగా క్రీ.శ.1395లో తన ఏకైక కుమారుడు అనపోత అకాల మరణానికి గురయ్యాడు. అతని మరణం కుమారగిరిని కుంగదీసింది. అంతేగాక వారసత్వ సమస్యను సృష్టించింది కుమారుని మరణానంతరం కుమారగిరి రాజమహేంద్ర రాజ్యానికి కాటయవేముని అధిపతిగా నియమించాడు. అందుకు తగిన వ్యక్తి కాటయవేముడని కుమారగిరి భావించాడు. కాటయవేముడు కొండవీటి రాజ్యానికి అపార సేవ చేశాడు. కటకం వరకు దిగ్విజయయాత్రను నడిపి గొప్ప విజయాలు సాధించాడు. అందుకు ఇది తగిన ప్రతిఫలం అని వారెప్పుడైనా రెడ్డిరాజ్యంపై దండెత్తవచ్చు. ఉత్తరాంధ్రను కాపాడుకోవాలంటే సమర్థుడైన వ్యక్తి రాజమహేంద్రవరంలో ఉండాలి. అందుకు తగిన వ్యక్తి కాటయవేముడు కాని కాటయవేముని నియామకం చందోలు శాఖ వారికి రుచించలేదు. వారు ఈ చర్యను కొండవీటి రాజ్యాన్ని రెండుగా చీల్చడంగా భావించారు. వారి వైఖరి రాజ్యానికి సమస్యలు సృష్టించి చివరి దశలో కుమారగిరి జీవితంలో విషాదాన్ని కలిగించింది. ఇదే కాలంలో దక్కనులో 12 సంవత్సరాలు

కరువు వచ్చిందని, దానిని దుర్గాదేవి కరువని ప్రజలు పిలుచుకున్నారని, ఆ కరువులో కూడా వ్యాపించింది. కుమారగిరి దానిని సమర్థవంతంగా ఎదుర్కోలేకపోయాడు. దాంతో కుమారగిరి స్థితి బలహీనపడింది. కాటయ వేముడు కూడా దగ్గరలేదు. దానిని అవకాశంగా తీసుకొని చందోలు శాఖకు చెందిన కోమటి వేమారెడ్డి కుమారగిరిని తొలగించి తాను కొండవీడు రాజ్యాన్ని కైవసం చేసుకొనవలెనని ప్రయత్నాలు ఆరంభించాడు. దాంతో కుమారగిరికి, పెదకోమటి వేమారెడ్డికి అంతర్యుద్ధం మొదలైంది. స్థానికరచనలు కుమారగిరి పాలన బాగాలేదని, ఆస్థాన ప్రముఖులు రెండుగా చీలి కొందరు పెదకోమటి వేముని సమర్థించారనే సూచనలిస్తున్నాయి. క్రీ.శ. 1404 సంవత్సరం నాటి పెదపూడి శాసనం రెడ్డి సామంతులు చాలా మంది పెదకోమటి వైపు చేరారని స్పష్టం చేస్తోంది.

పర దండయాత్రలు-కుమారగిరి చివరి రోజులు: ఇదే సందర్భంలో బహమనీ, విజయనగర, గజపతులు రాజ్యంపై మూడు వైపుల నుండి దండెత్తారు. రెండవ మహమ్మద్ తర్వాత క్రీ.శ.1397లో బహమనీ గద్దెనెక్కిన ఫిరోజ్‌షా క్రీ.శ.1398లో విజయనగర రాజ్యంలోని ఉదయగిరిపై దండెత్తాడు. అదే సందర్భంలో రెడ్డి రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలపై దండయాత్ర చేశాడు. ముస్లిం సైన్యాలను గజరావుతిప్ప అనే సేనాని ఖమ్మంమెట్టు కోటవద్ద ఓడించాడని తెలుస్తోంది. ఇదే సందర్భంలో గొగ్గయదేవ అనే కుమారగిరి సేనాధిపతి తాను గజపతిని విహారనగిరి అనే చోట ఓడించి తరిమివేశానని శక 1339 సంవత్సరంలో కాకినాడ దగ్గరున్న సర్పవరంలో శాసనం వేయించాడు. ఇందులో పేర్కొనబడిన విహారగిరిని సింహాచలంగా గుర్తించారు. కనుక అటువైపు నుండి గజపతి దండయాత్ర జరిగిందని సర్పవర శాసనం ధృవపరుస్తోంది. ఈ సమయంలో విజయనగర రాజ్యం కూడా రెడ్డి రాజ్యంపై దండెత్తింది. ముస్లింలు వెనుదిరిగిపోగానే ఉదయగిరి దుర్గాధిపతిగా ఉన్న విజయనగర యువరాజు మొదటి దేవరాయలు తన కుమారుడు రామచంద్ర రాయలతో కలిసి నర్సరావుపేట మండలంలోని యనమదల దేవరాయలు తన కుమారుడు రామచంద్ర రాయలతో కలిసి నర్సరావుపేట మండలంలోని యనమదల వరకు రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించారు. వారి విజయాలను శక 1322 క్రీ.శ.1400 నాటి రెండవ హరిహరరాయల యనమదల శాసనం, దేవరాయలు, రామచంద్రరాయల మురుకొండపాడు, పరుచూరు శాసనాలు ధృవపరుస్తున్నాయి. దాంతో కోస్తాలో పరుచూరువరకు దక్షిణాన నర్సరావుపేట వరకు రెడ్డిరాజ్యం విజయనగర రాజ్యం పాలైంది. ఇదే సందర్భంలో కందుకూరు శాఖవారు కూడా కుమారగిరి రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించారు. కందుకూరు యువరాజు పినకోమటిరెడ్డి మనుమడు మాచారెడ్డి కుమారుడు అయిన కోమటిరెడ్డి తూర్పుకోస్తాలో తెనాలివరకు ఆక్రమించాడు. అతడు శక 1326 క్రీ.శ.1404 తెనాలిమండలం పెదపూడిలో శాసనం వేయించాడు. ఈ విధంగా కుమారగిరిని అన్ని వైపుల నుండి శత్రువులు ముట్టడించారు.

వెలుగోటి రాయపనాయనింగారు గజరావుతిప్ప-శక 1309-1320 క్రీ.శ.1387-క్రీ.శ.1398: గుంటూరు, రేపల్లె, బాపట్ల, పలనాడు మండలాలలో నాలుగు రాతిశాసనాలు లభించాయి. వాటిలో గుంటూరు, బాపట్ల శాసనాలలో రాయపనానింగారి రాయసం పురుషోత్తమయ్య భూమిని కొలిచాడు అని ఉంది. మిగిలిన రేపల్లె, పలనాటి మండలాలలోని శాసనాలలో ఒకదానిలో వెలుగోటి రాయపనాయనింగారు పురుషోత్తమయ్య పేర్లున్నాయి. మిగిలిన దానిలో మలక గజరావుతిప్ప నాయనింగారి ఉద్యోగి అయిన సింగ పండితుడు తమ ప్రభువైన వెలుగోటి రాయపనాయనింగారికి శుభాలు కలగడానికి ఒక దానం చేసి శాసనం వేయించాడని ఉంది. ఇందులో ఇవ్వబడిన ప్రభవ, బహుధాన్య అనే పదాలను బట్టి అవి శక 1309 లేక క్రీ శ.1387, శక 1320 లేక క్రీ.శ.1398 నాటివని నిర్ణయించారు. దీనిని బట్టి ఈ శాసనాలలో పేర్కొన బడిన వెలుగోటి రాయపనాయనింగారు కుమారగిరి సమకాలికుడు. ఈ శాసనాలలో కుమారగిరి పేరు గాని, మరియే రెడ్డిరాజు పేరు గాని లేదు. కనుక అతడు స్వతంత్రుడని తెలుస్తోంది. అలాగే ఇతడు వెలుగోటి అని పేర్కొనబడ్డాడు. కనుక ఇతడు రేచర్ల కుటుంబానికి చెందిన పద్మనాయకుడా అనే మరొక సందేహం కలుగుతోంది. క్రీ.శ.1387లో కుమారగిరి అధికారం స్థిరంగా ఉంది. కనుక అతడు స్వతంత్రుడిగా పాలించడానికి వీలులేదు. కనుక అతడు కుమారగిరి సామంతుడుగా ఆయా ప్రాంతాలలో పాలించి ఉండవచ్చును. అలాగే అతడు పద్మనాయకుడైనా రాచకొండ రేచర్ల వారితో ఎలాంటి సంబంధాలు లేవు. అతడు కుమారగిరి కొలువులో చేరి ఉండవచ్చు. అతని వద్ద పనిచేసే మలక గజరావుతిప్ప తెలుగు చాటువులు కీర్తించే గజరావుతిప్ప అయి ఉంటాడు. ఖమ్మం మెట్టువద్ద, కోనూరుల వద్ద అంబయ అనే అతని ముస్లిం సైన్యాలను ఓడించింది. ఈ గజరావుతిప్పేనని చెప్పవచ్చును. కుమారగిరి సేనాధిపతిగా అతడు ఆ పోరాటం జరిపిఉంటాడు. అలాగే కొండవీడు కోటవద్ద చౌండపామాత్యుని ఓడించి

ఉంటాడు. తర్వాత క్రోసూరు, గుండుగొలను వద్ద కాటయ వేముని ఓడించినవాడు కూడా ఇతడు అయిఉండాలి కొప్పునూళ్ల వారి కాకతీయ 72 నాయల బిరుదావళి ప్రకారం కూడా ఇతడు కాటయవేమారెడ్డి సమకాలికుడు గజరావుతిప్ప విజయాలను బట్టి కుమారగిరి పెదకోమటి వేముల అంతర్యుద్ధాన్ని అంచనా కట్టవచ్చును రాయపనాయనిం గారి వద్ద గజరావుతిప్ప సేనాధిపతిగా చేరి ఉంటాడు రాయపనాయనింగారు కుమారగిరిచే నియమింపబడిన స్థానికపాలకుడు. అతని ఆజ్ఞ ప్రకారం రెడ్డిరాజ్యంపై దండెత్తిన ముస్లిం సైన్యాలను ఎదుర్కోడానికి గజరావుతిప్ప ఖమ్మంమెట్టు యుద్ధానికి వెళ్లి ఉంటాడు. ఈ సంఘటనలు క్రీ.శ.1387 తర్వాత జరిగి ఉంటాయి తర్వాత అంతర్యుద్ధంలో రాయప నాయనింగారు గజరావుతిప్పలు పెదకోమటి వేమారెడ్డి వైపు చేరిపోయి ఉంటారు. పెదకోమటి సేనాధిపతిగా గజరావుతిప్ప కొండవీటి కోటవద్ద కుమారగిరికి సహాయంగా వచ్చిన విజయనగర సేనాధిపతి అయిన చౌండపామాత్యునితో పోరాడి ఓడించి ఉంటాడు. చౌండపామాత్యుని కుమారుడు చౌండపామాత్యుని తర్వాత కూడా అతని కుమారుడు విజయనగర సేనలో పనిచేసి ఉంటాడు. ఆ తర్వాత క్రోసూరు గుండుగొలను యుద్ధంలో కాటయవేముని కూడా గజరావుతిప్ప ఓడించి ఉండాలి. గుండుగొలను యుద్ధంలో కాటయవేముని కూడా గజరావుతిప్ప తన ప్రజ్ఞా పరాక్రమాలను ప్రదర్శించినందువలన అతడు గొప్పవీరుడుగా చాటు పద్యాలు రాసి ఉంటారు. గజరావుతిప్ప వంటి వీరుల సహాయంతో పెదకోమటి వేముడు కుమారగిరిని తరిమివేసి కొండవీడు సింహాసనం అధిష్టించి ఉంటాడు. కుమారగిరి చివరి శాసనం శక 1322 అంటే క్రీ.శ 1400 నాటి కొట్టూరు శాసనం. ఈ గ్రామం కృష్ణాజిల్లా, విజయవాడ మండలంలో ఉంది. అక్కడున్న వసంతరాయ లక్ష్మీనరసింహస్వామికి కొంత భూమిని దానం చేసి శాసనం వేయించాడు. ఆ తర్వాత అంతర్యుద్ధం వచ్చి రెండుమూడు సంవత్సరాలు జరిగి ఉంటుంది. చివరకు పెదకోమటికి విజయం లభించడంతో కుమారగిరి కొండవీటిని వదిలి రాజమహేంద్రవరం వెళ్లిపోయాడు. కాటయ వేమారెడ్డి కుమారగిరి రాజ్యాన్ని కాపాడటానికి పెదకోమటి వేమారెడ్డితో యుద్ధానికి దిగినట్లుగా కనిపిస్తోంది. కాని విజయం సాధించలేకపోయాడు. దాంతో కుమారగిరి తన చివరి రోజులు రాజమహేంద్రవరంలో గడిపాడు. చివరలో కుమారగిరి ఆరోగ్యం చెడిపోయి ఉండవచ్చు. అతనికి శాసనం వేయించాడు. దానిని బట్టి క్రీ.శ.1402 లోపలే కొండవీడు పెదకోమటి వేమారెడ్డి పరమైందని భావించవచ్చు. ఆ తర్వాత క్రీ.శ.1404 లోపలే కుమారగిరి మరణించాడు. దాంతో పెదకోమటి వేమారెడ్డి వారసత్వం ఖాయం అయింది. ఈ విధంగా కొండవీటి రాజ్యం ప్రోలయ వేమారెడ్డి సంతతి నుండి జారిపోయి తన అన్న మాచారెడ్డి వంశస్తుల పరమైంది. పెదకోమటి వేమారెడ్డి కొండవీడు సింహాసనం అధిష్టించడంతో చందోలుశాఖ పరిపాలన ప్రారంభమైంది.

కందుకూరు రెడ్డి రాజ్యం క్రీ.శ.1324-1420

ప్రాచీనాంధ్రదేశ చరిత్రలో నెల్లూరు జిల్లాలోని కందుకూరు కొంత ప్రాముఖ్యత వహించిన ప్రదేశం ఈ ప్రదేశం కోస్తాకు, బోయకొట్టాలకు మధ్య ఉండేది. ఆ కాలంలో ఉదయగిరి, ఆత్మకూరు, కనిగిరి ప్రాంతాలలో బోయ రాజ్యాలుండేవి. ఇవి కొండలు, అడవులతో పరివేష్టించి ఉండేవి. అక్కడ నివసించిన బోయవారు స్వతంత్రులు. బోయనాయకులు కోస్తా నుండి వచ్చే దండయాత్రలను అరికట్టడమేగాక పరిసర ప్రాంతాలపై దాడులు కూడా చేసేవారు. కనుక చాళుక్యయుగంలో గుణగ విజయాదిత్యుని సేనాధిపతి పాండురంగడు బోయవీడులపై దండెత్తి బోయతెగలను పూర్తిగా ఓడించి ఆ ప్రాంతాన్ని చాళుక్య సామ్రాజ్యంలో కలిపివేశాడు. అంతేగాక బోయనాయకులను అదుపులో ఉంచడానికి కందుకూరుని సైనిక స్థావరంగా చేశాడు. అప్పటి నుండి కందుకూరుకు రాజకీయ ప్రాముఖ్యత వచ్చింది. 10, 11 శతాబ్దాలలో కందుకూరు తెలుగు చోళుల కిందకు వచ్చింది. తర్వాత కాకతీయుల వశమైంది. కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ప్రోలయ వేమారెడ్డి కందుకూరు ప్రాంతాన్ని కూడా తన వశం చేసుకున్నాడు.

ప్రోలయవేమారెడ్డి చిన్న తమ్ముడు మల్లారెడ్డి గొప్పవీరుడు. అన్నకు కుడి భుజంగా ఉండి అనేక యుద్ధాలలో విజయం సాధించి రాజ్యాన్ని విస్తరించడమే గాక ప్రమాదాల నుండి రాజ్యాన్ని కాపాడాడు. ప్రోలయ వేమారెడ్డి మల్లవరం శాసనం అతనిని మల్లసేనాపతి అని, తెలుగుకావ్యం హరివంశం మల్లరథినీనాథా అని వర్ణిస్తున్నాయి. మోటుపల్లిని జయించింది అతడే. బహమనీ సుల్తాన్ హసన్‌గంగు అమరావతిపై దండెత్తినప్పుడు మల్లారెడ్డి ముస్లిం సైన్యాలను పారదోలి రెడ్డి రాజ్యాన్ని రక్షించాడు. అతని సేవలకు మెచ్చి ప్రోలయ వేమారెడ్డి అతనికి కందుకూరు పాలకునిగా నియమించాడు. అతని సంతతివారు కందుకూరును దాదాపు ఒక శతాబ్దం పాలించారు. వారి రాజ్యాన్ని కందుకూరు రెడ్డి రాజ్యం అని అంటారు

కందుకూరు రెడ్డి రాజ్య చరిత్ర తెలుసుకోవడానికి వారు విడుదల చేసిన శాసనాలు తోడ్పడుతున్నాయి. కాని అందులో వారి రాజకీయ జీవితానికి సంబంధించిన వివరాలు లేవు. అవి చెరువులు తవ్వించినప్పుడు, దేవాలయాలకు దానాలు చేసినప్పుడు విడుదల చేసిన శాసనాలు. తొలి దశలో శక 1246 అంటే క్రీ.శ.1324లో మల్లారెడ్డి వేయించిన శాసనం వారి రాజకీయ చరిత్ర తెలుసుకోదానికి ఉపయోగపడుతోంది. వారి శాసనాలలో కొండవీటి ప్రస్తావనలేదు. అద్దంకి ప్రస్తావనే కనిపిస్తుంది. అంతేగాక అద్దంకి, కొండవీడు రాజుల పేర్లు వారి శాసనాలలో లేవు. కనుక వారు స్వతంత్రులుగా పాలించారని కొందరు భావిస్తారు. కాని అది వాస్తవం కాదు. ప్రోలయ వేమారెడ్డి అనపోత, అనవేమారెడ్డిలు వారి రాజ్యంలో జోక్యం చేసుకోలేదు. కనుక వారు కొంత స్వేచ్ఛను అనుభవించిన మాట వాస్తవమేగాని పూర్తిగా స్వతంత్రులు కాదు. కాని శ్రీగిరిరెడ్డి కాలంలో స్వతంత్రం ప్రకటించినట్లు అతని శక 1320, 1322 శాసనాలు తెలుపుతున్నాయి. కనుక వారు మొదట కొండవీటి రాజ్యానికి విధేయులుగా ఉండి తర్వాత అంటే 14వ శతాబ్దం చివరలో స్వతంత్రులయ్యారని చెప్పవచ్చును. అంటే వారి రాజ్య విస్తీర్ణాన్ని కూడా స్పష్టంగా చెప్పలేము. వారి శాసనాలు కందుకూరు, ప్రాచీన చుండి ప్రదేశాలలో అంటే నెల్లూరు జిల్లాలో లభించాయి. రెండవ కోమటిరెడ్డి పెదపూడి శాసనం చాలా ప్రదేశాలలో శాండిల్య గోత్రానికి చెందిన యెల్లెపెద్ది లక్ష్మణదీక్షిత్ కౌశిక గోత్రానికి చెందిన సద్దర్శనాల వల్లభ యజ్వ అనే ఇద్దరు బ్రాహ్మణులకు తెనాలి తాలూకాలోని పెదపూడి గ్రామాన్ని రెండవ కోమటి దానం చేశాడు. ఈ గ్రామానికి అమృతలూరు, తాడిపర్తి, ఆలపాడు, మూలుపూరు, ముందూరు సరిహద్దు గ్రామాలని చెప్పబడింది. ఇవన్నీ తెనాలి తాలూకాలో ఉన్నాయి. ఈ శాసనం శక 1326 అంటే క్రీ.శ.1404వ సంవత్సరంలో విడుదల చేయబడింది. కడప జిల్లా టంగుటూరు శక 1328 నాటి శాసనం అన్నారెడ్డి వేయించాడు. అన్నారెడ్డి కుమారుడు మల్లారెడ్డి లేపాకలో శక 1329, శక 1335 శాసనం అన్నారెడ్డి వేయించాడు. గణపతిరెడ్డి చిత్తూరుజిల్లాలోని దామల్‌లో ఒక శాసనం వేయించాడు. అతనికి వాలుడిలంపట్టు అనే బిరుదు ఉంది. ఈ బిరుదు అరుదైనది, మరెవ్వరికి లేదు. పెదపూడి శాసనం కందుకూర శాఖ వంశవృక్షాన్ని ఇచ్చింది. మల్లారెడ్డి వంశస్తులలోని శివలింగభూపతి రాసిన గిరిశాస్త్రి సూక్తిమాల అనే కావ్యం కూడా కందుకూరు వారి వంశవృక్షాన్ని ఇస్తోంది. ఇందులో శివలింగ భూపతి, అతని సోదరుడు సోమేశ్వరుని గురించిన వివరాలు కూడా ఉన్నాయి. పెదపూడి శాసనం, సూక్తిమాలలో ఇచ్చిన వివరాల మీద

ఆధారపడి కందుకూరు శాఖ వంశవృక్షం తయారు చేయబడింది. కడప, చిత్తూరు జిల్లాలో లభించిన నాలుగు శాసనాలు అంటే టంగుటూరు, లేపాక, దామల్ శాసనాలు కూడా పరిగణలోకి తీసుకొని వంశవృక్షం తయారు చేయబడింది.

మొదటి మల్ల శక 1264 - క్రీ.శ.1324

మొదటి పినకోమటిరెడ్డి   మొదటి మాచారెడ్డి

గణపతి శక 1324

శ్రీగిరి శక 1322   రాచవేమ శక 1320   రెండవమాచ   అన్న శక 1328   పెద్ది

మూడవమల్ల

రెండవ కోమటి శక 1326   రెండవ శ్రీగిరి శక 1330-1335

సోమేశ్వర   శివలింగ-గిరిశశ్రుతి సూక్తిమాల రచయిత

రెండవమల్ల శక 1328-1330   మూడవ కోమటి శక 133   అనవేమ   నారాయణ

తిప్ప శక 1352   మూడవ శ్రీగిరి   రామ   దేవరాయ   నారాయణ

కందుకూరు శాఖకు మూల పురుషుడు మొదటి మల్లారెడ్డి. అతడు ప్రోలయ వేమారెడ్డి చిన్న సోదరుడు సేనాధిపతి. మోటుపల్లిని జయించాడు. ధరణి కోట వద్ద హసన్‌గంగు సైన్యాలను పారద్రోలాడు. ఇతని కాలం నాటి రెండు శాసనాలు లభించాయి. అందులో ఒక దానిలో శక 1246 అంటే క్రీ.శ.1324 సంవత్సరం రాయబడింది. అతని తర్వాత కందుకూరు రెడ్ల చరిత్ర మనకు తెలియడం లేదు. మొదటి మాచారెడ్డి కుమారుడు గణపతికి వాలుడిలంపట్టు అనే బిరుదుంది. ఇది ఎలా వచ్చిందో తెలియదు.

శ్రీగిరిరెడ్డి క్రీ.శ.1398-1404: ఈ వంశంలో మొదటగా ప్రఖ్యాతి వహించినవాడు మల్లారెడ్డి మనుమడైన శ్రీగిరిరెడ్డి. ఇతడు మొదటి పినకోమటిరెడ్డి పెద్దకుమారుడు. అతడు మొదటి స్వతంత్ర ప్రభువు. అతని కాలం నాటి రెండు శాసనాలు లభించాయి. మొదటిది శక 1320 సంవత్సరం నాటిది. కందుకూరులో రెండవది శక 1322 నాటి కొండముదుసుపాలెంలో లభించాయి. కందుకూరు శాసనం అతడు పినకోమటిరెడ్డి పెద్దకుమారుడని, అతని తల్లి గౌరాంబిక అని తెలుపుతోంది. అతడు గొప్ప సాహిత్య కళావిమర్శకుడట. సంగీత సాహిత్యాలలో ప్రజ్ఞ కలిగినవాడు. అతనికి కళావన్ అని కూడా పేరుందట. అతడు అనేక పెద్ద చెరువులు నిర్మించాడు. హేమాద్రి చెప్పిన అన్ని దానాలు చేశాడట. అతని గురువు గూడెరాయ కుటుంబానికి చెందిన శ్రీగిరి.

ఫిరోజ్‌షాను ఓడించడం క్రీ.శ.1404: శ్రీగిరి కాలంలో కందుకూరు రాజ్యంపై బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షా దండెత్తాడు. ఫిరోజ్‌షా క్రీ.శ.1404లో విజయనగర రాజ్యంపై దండెత్తాడు. మీర్ ఫజుల్ ఓల్లా మధ్యవర్తిత్వంలో సంధి కుదిరింది. తర్వాత సుల్తాన్ కందుకూరు రాజ్యంపై కూడా దండెత్తాడు. శ్రీగిరి సోదరుల రాచకం రెండవ మాచారెడ్డి సుల్తాన్ సైన్యాలను ఓడించి తరిమివేశారని అతని కుమారుడు రెండవ కోమటి తన క్రీ.శ.1404 నాటి పెదపూడి శాసనంలో వర్ణించాడు.

విజయనగర సామ్రాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1406: సుల్తాన్ సైన్యాలు వెళ్లిపోయిన తర్వాత కందుకూరు సైన్యాలు విజయనగర రాజ్యంపై దండెత్తాయి. క్రీ.శ.1404లో రెండవ హరిహరరాయలు మరణించాడు. అతని కుమారులు విరూపన్న ఉదయార్, మొదటి బుక్క, మొదటి దేవరాయలు వారసత్వ యుద్ధానికి దిగారు. అదే అదనుగా తీసుకొని కందుకూరు రెడ్లు విజయనగరంపై దండెత్తారు. కందుకూరు సైన్యానికి శ్రీగిరిరెడ్డి సోదరుడు అన్నారెడ్డి, అతని కుమారుడు మూడవ మల్ల నాయకత్వం వహించారు.

ఈ దండయాత్రలో సిద్ధవటం విభాగంలోని పొత్తపినాడు, చంద్రగిరి విభాగంలోని పులుగునాడును

జయించాడు. అంతేగాకుండా చిత్తూరు జిల్లాలోని రాచవేడును ముట్టడించారని స్థానిక రచనలు తెలుపుతున్నాయి. రాచవేడు నేటి రాయచోటిగా గుర్తింపబడింది. కొద్ది యుద్ధంతో రాయచోటి అన్నారెడ్డి వశమైంది. అన్నారెడ్డి మల్లారెడ్డి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి రాజ్యంపై కూడా దండెత్తారని అతని శక 1328 టంగుటూరు శాసనం తెలుపుతున్నాయి. ఉదయగిరి రాజ్యభాగాలు 7 సంవత్సరాలు కందుకూరు రాజ్యంలో ఉన్నట్లు శక 1335 నాటి మల్ల, లేపాక శాసనాలు తెలుపుతున్నాయి. కందుకూరు సైన్యాలు విజయనగర రాజ్యంపై విజయాలు సాధించే సమయంలో కందుకూరులో శ్రీగిరిరెడ్డి పరిపాలన అంతమైనట్లు కనిపిస్తోంది.

రెండవ కోమటిరెడ్డి: శ్రీగిరి తర్వాత రెండవ కోమటి రాజ్యానికి వచ్చాడు. ఇదే సమయంలో కొండవీటిలో పెదకోమటి వేమారెడ్డికి కుమారగిరి మధ్యన అంతర్యుద్ధం జరుగుతోంది. క్రీ.శ.1402లో కోమటివేమారెడ్డి కుమారగిరిని పారదోలి కొండవీటి సింహాసనం అధిష్టించాడు. అదే అదనుగా తీసుకొని రెండవకోమటి తూర్పు కోస్తా మీద దండెత్తి తెనాలి వరకు జయించాడు. ఈ దండయాత్రలో మోటుపల్లి పెదకోమటి వేమారెడ్డి సొంత రాజ్యమైన చందోలుతో సహా తెనాలి తాలూకా వరకు ఆక్రమించాడు. అతడు క్రీ శ 1404లో తెనాలి ప్రాంతంలోని పెదపూడి గ్రామాన్ని ఇద్దరు బ్రాహ్మణులకు దానం చేశాడు. ఈ శాసనం వల్ల రెండవ కోమటి అధికారం తెనాలి తాలూకా వరకు విస్తరించిందని తెలుస్తోంది. కాని ఈ విజయం తాత్కాలికమే. పెదకోమటి రెడ్డి సేనాని గజరావు తిప్ప క్రోసూరు, గుండుగొలను యుద్ధాలలో ఓడించి తరిమివేశాడు. దాంతో కొండవీటిలో పెద కోమటివేమారెడ్డి అధికారం స్థిరపడింది. వెంటనే పెదకోమటి కోస్తానాక్రమించిన కందుకూరు రెడ్లను పారదోలి ఆ ప్రాంతాలను కైవసం చేసుకున్నాడని అతని శక 1326 కలువాముల శాసనం, శక 1333 నందమూరు శాసనాలు తెలుపుతున్నాయి. రెండవ కోమటికి సోమేశ్వర, శివలింగ అనే ఇద్దరు కుమారులున్నారు వారిలో శివలింగ గొప్ప సంస్కృత పండితుడు. అతడు హరదత్తాచార్యుడు రాసిన గిరిశాస్త్రి సూక్తిమాల కావ్యానికి వ్యాఖ్యానం రాశాడు.

శ్రీగిరి రెడ్డి వంశస్తులు - చుండి రెడ్డి రాజ్యం: శ్రీగిరి తర్వాత రెండవ కోమటి రాజ్యానికి వచ్చినప్పటికి శ్రీగిరి కుమారులు పూర్తిగా రాజ్యాన్ని కోల్పోలేదు. శ్రీగిరికి నలుగురు కుమారులు. వారిలో శ్రీగిరికి గంగమాంబ వల్ల కలిగిన రెండవమల్ల పెద్దవాడు. అతడు అతని తమ్ములు చుండిని తమ రాజధానిగా చేసుకున్నారు. చుండి నెల్లూరు జిల్లా కందుకూరుకు దగ్గరలోనే ఉంది. శక 1328-1330 సంవత్సరాల మధ్య కాలానికి చెందిన రెండవ మల్ల శాసనాలు లభించాయి. అతడు చుండిలో జనార్ధనదేవునికి మండపం, ప్రాకారాలతో ఒక దేవాలయాన్ని నిర్మించాడు. రెండవమల్ల తర్వాత చుండిలో అతని తమ్ముడు మూడవ కోమటిరెడ్డి రాజ్యానికి వచ్చాడు.

కందుకూరులో రెండవ కోమటి తర్వాత అతని పినతండ్రి అన్నారెడ్డి కుమారుడు మూడవమల్ల, తర్వాత రెండవ కోమటి తమ్ముడు రెండవ శ్రీగిరి రాజ్యానికి వచ్చినట్లుగా కనిపిస్తోంది. శక 1335 అంటే క్రీ.శ.1413లో మొదటి దేవరాయలు కందుకూరు, చుండి రాజ్యాలపై దండెత్తి మూడవ కోమటిని, మూడవమల్ల, రెండవ శ్రీగిరిరెడ్డిలను ఓడించి కందుకూరు, చుండి రెండు రాజ్యాలను విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. దాంతో కందుకూరు రెడ్డి రాజ్యం తన ఉనికిని కోల్పోయింది. చుండిని ఏలిన మూడవ కోమటికి ఐదుగురు కుమారులు. తిప్ప, మూడవ శ్రీగిరి, రామదేవరాయ, నారాయణ అనే ఐదుగురు కుమారులు. వారు విజయనగరంలోని తుంగభద్రా నదీతీరంలోని విరూపాక్షదేవుని సన్నిధిలో ఉన్నట్లు శక 1352 అంటే క్రీ.శ.1430 సంవత్సరంలో శాసనం వేయించారు. దాన్ని బట్టి వారు విజయనగర చక్రవర్తి రెండవదేవరాయల సామంతులని స్పష్టపడుతోంది. సామంతుల హోదాలో విజయనగరాన్ని దర్శించి ఉండవచ్చును. వారిలో నాల్గవ వానికి దేవరాయ అనే పేరుంది. మూడవ కోమటి విజయనగర సామంతుడైన తర్వాత తన నాల్గవ కుమారునికి తన ప్రభువైన మొదటి దేవరాయల పేరు పెట్టుకొని ఉంటాడు. ఈ ఐదుగురి తర్వాత కందుకూరి రెడ్ల చరిత్ర తెలియదు. ఆ తర్వాత కందుకూరి రాజ్యం పూర్తిగా విజయనగర సామ్రాజ్యంలో విలీనమైపోయి ఉంటుంది.

చందోలు శాఖ

ప్రోలయ వేమారెడ్డి అద్దంకి రాజ్యాన్ని స్థాపించిన తర్వాత రాజ్యాన్ని మూడు పరిపాలనా విభాగాలు చేశాడు అద్దంకి రాజధానిగా ప్రధాన విభాగం, దక్షిణ విభాగానికి కందుకూరును కేంద్రంగా చేసి చినతమ్ముడు మల్లారెడ్డిని తన ప్రతినిధిగా నియమించాడు. తూర్పు విభాగానికి చందోలును రాజధానిగా చేసి తన అన్న మాచారెడ్డిని తన ప్రతినిధిగా నియమించాడు. ప్రోలయ వేమారెడ్డి వారి అంతరంగిక పరిపాలనలో జోక్యం చేసుకోలేదు కనుక కందుకూరు, చందోలు రాజ్యాలు ఒకే రకమైన స్వతంత్రాన్ని అనుభవించాయి. అనపోత కాలంలో కూడా చందోలు రాజ్యంలో జోక్యం చేసుకోలేదు.

మాచారెడ్డి రెడ్డిపోత, పెదకోమటి, నాగ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. అనపోతారెడ్డి మరణానంతరం పెదకోమటి వారసత్వ సమస్యను తెచ్చాడు. కుమారగిరి చందోలురాజ్యంలో జోక్యం చేసుకోనని, తనకు సంతానం లేనిపక్షంలో కొండవీటి సింహాసనం చందోలు శాఖకు చెందుతుందని అంగీకరించాడు. దాంతో సంఘర్షణ తప్పిపోయింది కుమారగిరి క్రీ.శ.1386లో కొండవీడు ప్రభువయ్యాడు. తర్వాత రెండు శాఖల మధ్య ఏ గొడవా జరుగలేదు క్రీ.శ.1395లో కుమారగిరి కుమారుడు రెండవ అనపోత అకాలమరణం వారసత్వ సమస్యను తిరగదోడింది కుమారగిరి రాజమహేంద్రవర రాజ్యంపై కాటయ వేమారెడ్డిని అధిపతిగా నియమించాడు ఈ చర్యను చందోలు శాఖ అంగీకరించలేదు తమకు రాజ్యం సంక్రమించకుండా చేయడానికి కుమారగిరి కావాలని కాటయవేముని నియమించాడని తలచారు. దాంతో పెదకోమటి కుమారులైన వేమ, మాచారెడ్లు కుమారగిరిపై వారసత్వ యుద్ధానికి దిగారు చివరకు వారు విజయం సాధించి కుమారగిరిని తరిమి వేసి క్రీ శ 1402లో కొండవీడును ఆక్రమించారు వారిలో పెద్దవాడైన వేమ కోమటివేమారెడ్డి అనే పేరుతో కొండవీడు సింహాసనాన్ని అధిష్టించాడు. తమ్ముడు మాచారెడ్డిని కొండపల్లి అధిపతిగా నియమించాడు. ఈ విధంగా కొండవీడు రాజ్యం ప్రోలయ వేమారెడ్డి సంతతి నుండి చందోలు మాచారెడ్డి సంతతి పరమైంది.

వంశవృక్షం

మాచారెడ్డి

రెడ్డిపోత | పెదకోమటి | నాగ

పెదకోమటి వేమ (కొండవీడు ప్రభువు) క్రీ శ.1402-1420 | మాచ (కొండపల్లి పాలకుడు)

రాచవేమారెడ్డి క్రీ శ 1420-1424 చివరివాడు.

పెదకోమటి వేమారెడ్డి క్రీ.శ.1402-1420: పెదకోమటి వేమారెడ్డి కొండవీటి సింహాసనం అధిష్టించడంతో చందోలు శాఖ పరిపాలన ప్రారంభమైంది కుమారగిరిని తరిమివేయగానే కాటయవేమారెడ్డి కోమటి వేమారెడ్డిని ఎదుర్కొని కుమారగిరి సింహాసనాన్ని కాపాడాలని నిర్ణయించుకున్నాడు. కొండవీటిలో మామిడి వంశస్థులైన మంత్రులు, గజరావుతిప్ప వంటి సేనాధిపతులు కోమటివేముని వైపు చేరిపోవడంతో కొండవీటిని జయించడం కష్టం అని విజయనగర ప్రభువు, తన మామ అయిన రెండవ హరిహరరాయల సహాయం కోరాడు హరిహరరాయలు అందుకు అంగీకరించి తన సేనాధిపతి చౌండపమంత్రిని సైన్యంతో కొండవీటిపైకి పంపాడు ఇదే సందర్భంలో కాటయవేముడు స్వయంగా తన సైన్యంతో బయలుదేరాడు. ఈ విధంగా సింహాసనం అధిష్టించగానే పెదకోమటి వేమారెడ్డి రెండువైపుల నుంచీ ముట్టడిని ఎదుర్కోవలసి వచ్చింది. అలాంటి స్థితిలో అతని సేనాధిపతి గజరావుతిప్ప అతనికి గొప్ప కొండలా అండగా నిలిచాడు. తిప్ప ముందుగా కొండవీటి రాజ్యంలోనికి వచ్చిన కాటయవేముని సైన్యాన్ని క్రోసూరు వద్ద ఓడించి తరిమాడు. క్రోసూరి ఓటమి తర్వాత కాటయవేముడు వెనుకకు మరలినట్లుంది. అతనిని తరుముతూ గజరావుతిప్ప మళ్లీ పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు వద్ద గుండుగొలను వద్ద ఓడించాడు. ఇంతలో విజయనగర సేనలు కొండవీటికి చేరాయి. కోట వద్ద

ఉభయులకు పోరు జరిగింది. అందులో గజరావుతిప్ప, విజయనగర సేనాని చౌండపామాత్యుని ఓడించి తరిమివేశాడు. మొత్తం మీద గజరావుతిప్ప పరాక్రమంతో కోమటి వేమారెడ్డి సింహాసనర నిలిచింది గజరావు తిప్పను గురించి అనేక చాటు పద్యాలున్నాయి. ఈ విజయాల తర్వాత వేయించిన శక 1326 కలువాముల, శక 1333 నాటి నందమూరు శాసనాలు కోమటివేముని రాజ్యం కృష్ణాజిల్లాకి వ్యాపించి ఉన్నట్లు తెలుపుతున్నాయి కనుక కోమటివేముడు అనేక దానాలు చేసినట్లు చాటుపద్య మణిమంజరి అనే రచన ద్వారా తెలుస్తోంది. కుమారగిరి గొప్ప దానశీలి. కొండవీటిలో అతని అభిమానులున్నారు. వారందరినీ తనవైపు తిప్పుకోడానికి పెదకోమటి తాను ఉదారుడని చాటుకోడానికి, మంచి రాజునని కీర్తి పొందడానికి విరివిగా దానాలుచేసి ఉంటాడు.

తొలి విజయాలు: క్రీ.శ.1404లో విజయనగరంలో రెండవ హరిహరరాయలు మరణించాడు. అతని కుమారులు మొదటి దేవరాయ, విరూపాక్ష, రెండవ బుక్కల మధ్య వారసత్వ యుద్ధం వచ్చింది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని పెదకోమటి వేమ అంతర్యుద్ధ కాలంలో విజయనగర రాజ్యం ఆక్రమించిన ప్రాంతాలు తిరిగి సంపాదించడానికి తనసైన్యాలు పంపాడు. ఆ సైన్యాలు త్రిపురాంతకం వరకు ఆక్రమించాయి. అలాగే అంతర్యుద్ధ కాలంలో తెనాలి వరకు కోస్తాను ఆక్రమించిన కందుకూరు శాఖకు చెందిన రెండవ కోమటిని ఓడించి కోస్తా ప్రాంతాలను పునరాక్రమించాడు. దాంతో తూర్పు దక్షిణ ప్రాంతాలు తిరిగి కొండవీటి రాజ్యంలో చేరిపోయాయి. తూర్పు, దక్షిణ ప్రాంతాలు జయించిన తర్వాత రాజమహేంద్రవర రాజ్యాన్ని కూడా జయించి కొండవీటి రాజ్యంలో కలిపివేయాలని సంకల్పించాడు. దాంతో కోమటి వేమునికి కాటయ వేమునితో యుద్ధాలు ప్రారంభమయ్యాయి.

రాజమహేంద్రవర రాజ్యంతో యుద్ధాలు క్రీ.శ.1408-1417: గుండుగొలను యుద్ధం తర్వాత కాటయ వేమారెడ్డి రాజమహేంద్రవరం తిరిగి వెళ్లాడు. కోమటి వేముని కొండవీటి రాజుగా గుర్తించలేదు. అతనిని దర్శించి తన విధేయతను ప్రకటించలేదు. అంతేగాక రాజమహేంద్రవరంలో తాను స్వతంత్రం ప్రకటించాడు దాంతో కుమారగిరి రాజ్యం కొండవీడు, రాజమహేంద్రవరం అనే రెండు రాజ్యాలుగా చీలిపోయింది. చీలిపోయిన రాజమహేంద్రవర రాజ్యాన్ని కలుపడం కోమటివేమ తన జీవితాశయంగా భావించాడు. అందువల్ల సుమారు ఒక దశాబ్దం రెండు రాజ్యాలకు పోరాటాలు జరిగి ఉభయ రాజ్యాలు బలహీనపడ్డాయి

అన్నదేవచోడుడు-కాటయవేమారెడ్డి శక 1336: రాజమండ్రి, కొండవీడు రాజ్యాల వైరాన్ని వినియోగించుకొని అనవేముని కాలంలో రాజ్యం పోగొట్టుకున్న అన్నదేవచోడుడు తన రాజ్యాన్ని పునరాక్రమించడానికి పూనుకున్నాడు. అతనికి దేవరకొండ పద్మనాయకుడు పెదవేదగిరి తన సహాయ సహకారాలను అందించాడు. వేదగిరి సహాయంతో అన్నదేవచోడుడు తాను పోగొట్టుకున్న పూర్వపు రాజ్యాన్ని మొత్తం ఆక్రమించాడు. శక 1326 అంటే క్రీ.శ.1404 ద్రాక్షారామ శాసనం అతన్ని రాజాధిరాజ పరమేశ్వర, పూర్వసింహాసనాధీశ్వర అని వర్ణిస్తోంది. కనుక అతడు 1404 నాటికి పశ్చిమగోదావరి జిల్లాలోని పూర్వపు తన వేంగిరాజ్యాన్ని ఆక్రమించాడని స్పష్టంగా తెలుస్తోంది. ఈ విజయంలో అన్నదేవచోడునికి కోమటి వేమారెడ్డి కూడా సహకరించి ఉండవచ్చు. శక 1330 అంటే క్రీ.శ.1408 నాటి ప్రోలవర శాసనం ఆ ప్రాంతం అంతా అతని ఆధీనంలో ఉందని తెలుపుతోంది. శక 1330 అంటే క్రీ.శ.1408లో అన్నదేవచోడుడు పద్మనాయకుల సహాయంతో రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తినట్లుగా కనిపిస్తోంది. శక 1330 నాటివి అంటే క్రీ.శ.1405-1408 సంవత్సరాల మధ్య పెదవేదగిరి శాసనాలు శ్రీకూర్మంలో ఉన్నాయి దానిని బట్టి పెదవేదగిరి శ్రీకూర్మం వరకు సాగిపోయినట్లు కనిపిస్తోంది. ఈ దండయాత్రతో కాటయవేముడు భయపడిపోయి తన రాజ్యాన్ని రక్షించుకోవడానికి సహాయం అర్థించడానికి విజయనగరం వెళ్లినట్లు శక 1332 క్రీ.శ.1410 నాటి అహోబిల శాసనం రుజువు చేస్తోంది. నాటి విజయనగర చక్రవర్తి మొదటిదేవరాయలు కాటయవేముని సహాయం చేయుటకు వాగ్దానం చేశాడు. కాటయవేమారెడ్డి విజయనగరం నుంచి రాజమహేంద్రవరం తిరిగివచ్చి తన సైన్యంతో అన్నదేవచోడుని రాజ్యంపై దండెత్తాడు. ఇదే సమయంలో దేవరాయలు కొండవీటి రాజ్యంపై దండెత్తి మోటుపల్లి వరకు ఆక్రమించి శక 1333లో ఇంకొల్లులో శాసనం వేయించాడు. కోమటి వేమారెడ్డి విజయనగర సైన్యాలను ప్రతిఘటించి వెనుకకు తరిమివేసినట్లుగా కనిపిస్తోంది. తర్వాత పెదకోమటి వేమారెడ్డి తన సైన్యాలతో అన్నదేవునికి సహాయంగా వెళ్లి కాటయవేముని రాజ్యాన్ని అంతం చేయడానికి ప్రయత్నించాడు.

అత్తిలి - కాంకరపర్తి యుద్ధాలు శక 1336: అన్నదేవచోడుడు కోమటివేమారెడ్డి సైన్యాలు పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి దగ్గర కాటయవేముని ఓడించాయి. 10 వేల మంది శత్రువులు శరణువేడారని అన్నదేవచోడుడు

చెప్పుకున్నాడు. తర్వాత కాంకరపర్తి వద్ద చివరి యుద్ధం జరిగింది ఈ యుద్ధంలో స్నేహితుని కోసం పిన ఉండి రాజుతో కలసి రాజమహేంద్రవర మ్యూజియం శాసనంలో చెప్పుకున్నాడు. ఈ యుద్ధంలో కోమటి వేమారెడ్డి సేనాధిపతి గజరావు తిప్ప కాటయవేముని వధించాడు అతనికి కాటయవేమ తలగొండుగండ అనే బిరుదు ఉంది అతని వంశస్థులైన కొప్పునూళ్ల వారికి ఈ బిరుదుంది. కాంకరపర్తి యుద్ధంలో కాటయవేమారెడ్డి మరణానంతరం అతని కుటుంబం అన్నదేవచోదుని ఆశ్రయించగా వారిని కాపాడానని కూడా అన్నదేవచోడుడు తన శాసనంలో చెప్పుకున్నాడు కనుక కాంకరపర్తి యుద్ధంలో కాటయవేమారెడ్డి మరణించాడని చెప్పవచ్చును. శక 1336 తర్వాత అతని శాసనాలు లభించలేదు. ఈ యుద్ధం తర్వాత ఏం జరిగిందో స్పష్టంగా తెలియదు. కోమటి వేమారెడ్డికి అన్నదేవచోదునికి ఉన్న సంబంధం కూడా స్పష్టంగా తెలియదు. కాని వారిద్దరూ రాజమహేంద్రవర రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అందువల్ల వారు రాజమహేంద్రవరంపై దండెత్తారు. కాని ఈ యుద్ధంలో అల్లాడరెడ్డి అన్నదేవచోడుని వధించాడు అల్లాడరెడ్డి ద్రోహి కుటుంబాన్ని వధించాడని కలువచేరు శాసనం తెలుపుతోంది. అన్నదేవచోడుడు శక 1337 అంటే క్రీ.శ 1415లో మరణించి ఉండవచ్చు.

పెదకోమటి-అల్లాడరెడ్డి-ఫిరోజ్‌షా శక 1339: అన్నదేవచోడుడు మరణించిన తర్వాత కూడా పెదకోమటి రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించాలనే తలంపు విడవలేదు. కాని కాటయవేముని మరణానంతరం అల్లాడరెడ్డి కాటయవేముని కుటుంబ రక్షణను చేపట్టాడు. అతనికి అండగా విజయనగర రాజ్య సహాయం ఉంది. కనుక తాను ఒక్కడే అల్లాడరెడ్డిని ఓడించలేడు. కనుక అతడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం పొందాలని భావించి తన మంత్రి మామిడి సింగయ్యను గుల్బర్గా పంపాడు శృంగారనైషధంలో మామిడి సింగయ ముస్లిం ఆస్థానంలో ఏ విధంగా సంప్రదింపులు జరిపిందీ వర్ణించబడింది. యవనాధీన సభ నిరంకుశవహోవ్యాపార పారంగతా అని వర్ణింపబడింది. బహమనీ, రెడ్డిరాజ్యాల సంబంధాలను వెలుగోటివారి వంశావళి కూడా ప్రస్తావించింది. ఫిరోజ్‌షా కోమటి వేమనకు సహాయం చేయడానికి అంగీకరించి సైన్యాలను పంపాడు. సుల్తాన్ తెలంగాణ దండయాత్రను అజీజ్ ఉల్లా తబతబ పెరిష్టాలు పేర్కొన్నారు. తబతబ, సుల్తాన్ రాజమహేంద్రవరం వరకు అనేక కోటలు ప్రాంతాలు జయించి వాటిని పాలించడానికి తన ప్రతినిధులను నియమించి రాజధానికి తిరిగి వచ్చాడని రాశాడు పెరిష్టా హిజ్రా 890 అంటే క్రీ.శ.1417లో తెలంగాణరాయ చాలా కాలం నుండి చెల్లించని కప్పం బకాయిని పంపమని రాయబారులను పంపగా అతడు బకాయిలను చెల్లించడమే గాక అనేక బహుమతులను కూడా పంపాడని రాశాడు. ఫిరోజ్‌షా ఆంధ్రదేశంపై దండెత్తాడని నందిగామ తాలూకాలో వేదాద్రిలోని రెండు శాసనాలు తెలుపుతున్నాయి. అందులో ఒక శాసనం సరఖుమలుక జైనది వొడెయ అక్కడ ఒక చెరువు నిర్మిస్తున్నాడని, అతని సోదరుడు Masanada Yeli Abibu Nidamalu Maluka వాడపల్లి లేక వజీరాబాద్‌లో ఉన్నాడని వివరిస్తోంది వీరిలో నిడమాలుమాలుకా ఓీదర్ నిజాం ఉల్ ముల్కు అతనిపై సుల్తాన్‌కు మంచి అభిమానం ఉంది. కనుక వీరిద్దరినీ సుల్తాన్ పెదకోమటికి సహాయంగా పంపాడు. సుల్తాన్ సైన్యాలను కలుపుకొని పెదకోమటి చివరిసారిగా రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు.

రామేశ్వర యుద్ధం శక 1339 అంటే క్రీ.శ.1417: బహమనీ, కొండవీటి సంయుక్త సైన్యాలను అల్లాడరెడ్డి ఓడించాడు. ఈ విజయాన్ని కొమ్మచిక్కాల శాసనం స్పష్టంగా పేర్కొంటోంది ముస్లిం చరిత్రకారులు తబతబ పెరిష్టాలు సుల్తాన్ సైన్యాలు రాజమహేంద్రవరం వరకు వచ్చాయని పేర్కొన్నారు గాని, సుల్తాన్ ఓడిపోయాడని మాత్రం రాయలేదు. అపజయ విషయంలో వారు మౌనం వహించారు. కనుక ఈ యుద్ధంలో సుల్తాన్ తప్పకుండా ఓడిపోయి ఉండాలి. లేకపోతే ముస్లిం చరిత్రకారులు అతని విజయాన్ని ఘనంగా వర్ణించే వారు. ఈ లోపల విజయనగర సైన్యాలు అల్లాడరెడ్డికి సహాయం వచ్చి పానుగల్లుపై దండెత్తాయి. సుల్తాన్ తన రాజ్యాన్ని రక్షించుకోడానికి తిరిగి వెళ్లిపోయాడు. సుల్తాన్ వెళ్లగానే కోమటి వేమారెడ్డి ఒంటరిగా పోరాడవలసి వచ్చింది చివరగా కోమటి వేమునికి అల్లాడరెడ్డికి రామేశ్వరం వద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కోమటి వేముడు పూర్తిగా ఓడిపోయి కొండవీటికి తిరిగి పోయాడు. యుద్ధం జరిగిన రామేశ్వరాన్ని గుర్తించడం కష్టమైంది తూర్పుగోదావరి జిల్లాలోని రాజోలు ప్రాంతంలో ఒక రామేశ్వరం, పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకు ప్రాంతంలో మరియొక రామేశ్వరం ఉన్నాయి. తణుకువద్ద రామేశ్వరానికి నట్టల రామేశ్వరం అని కూడా పేరుంది. కొందరు ఈ యుద్ధం రాజోలు రామేశ్వరం వద్ద జరిగిందని భావించారు. అందుకు కారణం అప్పుడు కోనసీమ ప్రాంతం అన్నదేవచోడుని ఆధిపత్యంలో ఉన్నట్లు శాసనాధారం ఉంది. రామేశ్వర యుద్ధంలో పెదకోమటిరెడ్డిని ఓడించి

అతని యుద్ధసామాగ్రి, ధనాన్ని సంగ్రహించినట్లు శివలీలా విలాసం అనే తెలుగు కావ్యం వర్ణించింది.

దేవరాయలు మోటుపల్లిని ఆక్రమించడం క్రీ.శ.1417: అల్లాడరెడ్డికి సహాయంగా వచ్చిన విజయనగరసేన రెండుగా చీలి ఒక దళం పానుగల్లు వద్దకు వెళ్లగా ఒక దళం మోటుపల్లిపై దండెత్తి ఆక్రమించింది. శక 1338 నాటి దేవరాయల శాసనం మోటుపల్లిలో ఉంది. ఇది కాకతీయ గణపతిదేవుని అభయశాసనం వంటిది. పొన్నూరులో శక 1339లో కూనుపులి అనపోత నాయకుడు శాసనం వేయించాడు. ఇతడు దేవరాయల ప్రతినిధి. కనుక ఈ రెండు శాసనాల ద్వారా మోటుపల్లి ఆక్రమణ నుండి కొండవీటి రాజ్యపతనం ప్రారంభమైందని చెప్పవచ్చును. పానుగల్లు వద్ద విజయనగర రాజ్యానికి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాకు యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కోమటివేముడు ఫిరోజ్‌షాకు సహాయంగా తన తమ్ముడు కొండపల్లి పాలకుడైన మాచారెడ్డిని పంపాడు. కాని అక్కడ కూడా బహమనీ, కొండవీటి సైన్యాలు ఓడిపోయాయి. పానుగల్లు యుద్ధంలో రాచకొండ, దేవరకొండ వెలమలు విజయనగరం వైపు పారిపోయారు. దాంతో ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితిలో బలాబలాలు మారిపోయాయి.

కోమటివేమకు రేచర్ల వారితో సంబంధాలు-మరణం శక 1342 క్రీ.శ.1420: పెదకోమటివేమ తన చివరి కాలంలో రేచర్ల వారితో పోరాడి మరణించినట్లుగా కనిపిస్తోంది. వెలుగోటి వారి వంశావళి కుమార మాదా నాయకుని కుమారులైన కుమారవేదగిరి, లింగమనేడులు పెదకోమటి, అతని తమ్ముడు మాచారెడ్డిలతో పోరాడినట్లు తెలుపుతోంది. యుద్ధంలో కుమారవేదగిరి మాచారెడ్డిని వధించి అతని బొమ్మ పెట్టాడు. అందుకు ప్రతీకారంగా పెదకోమటి రేచర్లవారిపై దండెత్తి వేదగిరిని సంహరించి అతని బొమ్మను తన తమ్మపదగన పెట్టించాడట. అందుకు ఉగ్రుడైన 12 సంవత్సరాల వయసు గల లింగమనేడు పద్మనాయక సైన్యంతో కొండవీటిపై దండెత్తి పెదకోమటి వేముని ఓడించి అతనిబొమ్మను తమ్మపదగలో పెట్టి బదులు చేశాడు. తర్వాత కోమటి వేముని సింహ లాంఛనం, నందికంట పోతరాజు కటారిని తీసుకొని వెళ్లాడట. వెలుగోటివారి వంశావళి లింగమనేడు పెదకోమటివేముని బందీగా పట్టుకొని వెళ్లాడట. వెలుగోటివారి వంశావళి లింగమనేడు పెదకోమటి వేముని బందీగా పట్టుకొని వెళ్లాడని, తర్వాత కోమటివేముని సింహ లాంఛనం, నందికంట పోతరాజు కటారిని తీసుకొని వెళ్లాడని, తర్వాత విడిచిపెట్టాడని తెలుపుతోంది. అదే వంశావళి ముమ్మడి సింగయ కుమారుడు అన్న యుద్ధంలో పెదకోమటిని సంహరించాడని తెలుపుతోంది. తదుపరి రాత అయిన వెలుగోటి వారి వంశచరిత్ర కొద్ది మార్పుగా లింగమనేడు సింగయ అన్న పెదకోమటిని యుద్ధంలో సంహరించారని వివరించింది. వెలుగోటివారి వంశావళి వంశ చరిత్రలలో చెప్పబడిన విషయాలు వాస్తవం అయి ఉండవచ్చును. పానుగల్లు యుద్ధంలో మాచారెడ్డి పాల్గొన్నాడు. ఆ సందర్భంలో వెలమలు విజయనగరం వైపు పోరాడారు. ఆ యుద్ధంలో మాచారెడ్డిని కుమార వేదగిరి సంహరించి ఉండవచ్చును. అందుకు ప్రతీకారంగా లింగమనేడు కటారిని తీసుకొని వెళ్లి ఉంటాడు. తర్వాత నందికంట పోతరాజు కటారిని శ్రీనాథుడు తెచ్చాడని కథ ప్రచారంలో ఉంది. కనుక రేచర్ల వారితో జరిగిన యుద్ధంలో పెదకోమటి మరణించాడని భావింపబడింది. పెదకోమటి చివరిశాసనం రుద్రవరం శాసనం. అది శక 1341 సంవత్సరానికి చెందింది. పెద్ది యజ్వకుమారుడు గంగాధరుని పెద్దసోదరుడు, ఖగోళశాస్త్రవేత్త అయిన రామచంద్రునికి శక 1341 మార్గశిరమాసం ధనుష్ సంక్రమణం రోజున పెదకోమటి రుద్రవరం గ్రామాన్ని దానం చేశాడు. ఆ తర్వాత అతడు మరణించి ఉంటాడు. కనుక శక 1342 అంటే క్రీ.శ.1419-1420లో పెదకోమటి వేమారెడ్డి మరణించి ఉండవచ్చని భావింపబడింది.

పెదకోమటి వేమారెడ్డి యుద్ధవీరుడు, కవిపండితుడు, పండితపోషకుడు. కాని విజ్ఞుడుకాదు. అతడు రాజమహేంద్రవర రాజ్యంతో విరోధం పెట్టుకొని అనవసర యుద్ధాలు చేసి రెండు రాజ్యాలను బలహీనపరచి రెడ్డి రాజ్యం నాశనం అయిపోవడానికి కారకుడయ్యాడు. కాటయవేముని గుర్తించి సఖ్యత పాటించినట్లయితే రెడ్డిరాజ్యం సురక్షితంగా ఉండేది. ఈ రెండు రాజ్యాల కలహం వలన గజపతులు, విజయనగర సామ్రాట్టులకు కోస్తాను ఆక్రమించాలనే ఆశలు కల్పించాయి. వారి జోక్యానికి కారణమైంది. అందువల్ల చివరకు రెండు రాజ్యాలు నశించి పోయాయి. కొండపల్లిలో తనతమ్ముడు మాచారెడ్డిని రాజుగా నియమించడం పెదకోమటి వేముడు చేసిన తప్పునే మరొక తప్పు. రాజమహేంద్రవర రాజ్యాన్ని ఏర్పాటు చేయడం ద్వారా కుమారగిరి చేసిన తప్పునే కోమటివేముడు కూడా చేశాడని కొందరు అంటారు. కాని అది వాస్తవం కాదు. మాచారెడ్డి అన్నను ఏనాడూ ధిక్కరించలేదు. అన్నకు సహాయంగా రావడానికి తిరస్కరించలేదు. అతడు ప్రతియుద్ధంలో అన్నకు అండగా నిలాచాడు. అన్న

కోరిక ప్రకారం పానుగల్లు యుద్ధంలో పాల్గొన్నాడు. రేచర్లవారితో పోరాడి యుద్ధంలోనే మరణించాడు. అంతేగాని కొండవీడు, రాజమహేంద్రవరాల మధ్య ఉన్నట్లు కొండపల్లి, కొండవీడుల మధ్య కలహాలు లేవు. కోమటివేముడు రాజకీయరంగంలో విఫలుడైనా సాహిత్యరంగంలో గొప్పస్థానాన్ని సంపాదించుకున్నాడు. అతడు గొప్పకవి. సంస్కృతంలో కొన్ని కావ్యాలు రాశాడు. శ్రవ్య దృశ్య ప్రబంధాలు, సంగీత సాహిత్య వ్యాఖ్యానాలు, సంగీత చింతామణి, సాహిత్య చింతామణి అనే కావ్యాలు రాశాడు అతని సర్వజ్ఞ అనే బిరుదు కూడా ఉంది. అనేక మంది కవులను పోషించాడని, వారికి విరివిగా దానాలు చేశాడని చాటువులు తెలుపుతున్నాయి. అతడు కవులపాలిట కల్పతరువని, కాని అతని మంత్రి తురగారాముడు అతని వద్దకు ఎవరినీ చేరనివ్వడని కూడా మరొక చాటుపద్యం ఉంది. బాణభట్టు ఇతని ఆస్థానకవి. శ్రీనాధుడు అతని ఆస్థాన విద్యాధికారి. కోమటివేముని శాసనాలన్నీ శ్రీనాధుడు రచించినవే. చివరి శాసనమైన రుద్రవర శాసనకర్త కూడా శ్రీనాధుడే. పెదకోమటి వేముడు కూడా ప్రతి సంవత్సరం వసంతోత్సవాలు జరిపి వసంతరాయలు, కర్పూర వసంతరాయలు అనే బిరుదులను ధరించాడు

రాచవేమారెడ్డి - కొండవీడు రాజ్యపతనం క్రీ.శ.1420-1424: పెదకోమటి వేముని మరణానంతరం అతని కుమారుడు రాచవేమారెడ్డి క్రీ శ.1420లో కొండవీటి సింహాసనమధిష్టించాడు. ఇతడు కొండవీటి రెడ్డి రాజులలో చివరివాడు. అతడు క్రీ.శ 1424 వరకు నాలుగు సంవత్సరాలు మాత్రమే పాలించాడు. అతడు ధాన్యకటకాన్ని పాలించిన గన్నభూపాలుని మనుమడు. అతని తల్లి సూరాంబిక ఆమె నిర్మించిన సంతానసాగరం అనే చెరువుకు జగనొబ్బగండ అనే కాలువను తవ్వించినట్లు అమీనాబాద్ శాసనం తెలుపుతోంది. ఇతని కాలం నాటి మరేశాసనం లభించలేదు. ఇతడు రాజ్యానికి వచ్చేనాటికి రాజ్యం బలహీనస్థితిలో ఉంది. అతని తండ్రి చేసిన యుద్ధాలతో ధానాగారం వట్టిపోయింది. సైన్యం నిర్వీర్యమైంది అలాంటి అతడు ధనాగారాన్ని నింపడానికి అనేక రకాల పన్నులు విధించాడు. అలాంటి పన్నులలో పురిటి పన్ను ఒకటి అతడు విధించిన అధికపన్నుల వలన ప్రజాభిమానం పొగొట్టుకున్నాడు. ఆ స్థితిలో సవరం ఎల్లయ్య అనే ఒక బలిజ నాయకుని భార్య ప్రసవించింది. రాజోద్యోగులకు అది తెలిసి వచ్చి నిర్బంధించి పురుటి పన్ను వసూలు చేశారు. అందుకు ఆగ్రహం చెందిన సవరం ఎల్లయ్య బయలుదేరి పట్టణం మధ్యలోని ముత్యాలమ్మ గుడి వద్ద ఉన్న రాచవేమారెడ్డిని కటారితో పొడిచి చంపాడని కొండవీటి కైఫీయత్తు తెలుపుతోంది. అతని మరణంతో సరిగ్గా నూరు సంవత్సరాలకు కొండవీడు రెడ్డి రాజ్యం అంతరించిపోయింది. క్రీ శ.1420 నాటికే దక్షిణ ప్రాంతాలను విజయనగరాధీశులు ఆక్రమించారు. క్రీ.శ.1420 నాటికి చెందిన విజయనగర శాసనం గుంటూరు తాలూకా పొన్నూరులో ఉంది. క్రీ శ.1424లో లాంగుల గజపతి కొండవీటిని ఆక్రమించి కొండవీటి కోటను మరమ్మతు చేయించాడని కొండవీటి కైఫీయత్తు తెలుపుతోంది. మొత్తం మీద రాచవేముని మరణానంతరం కొండవీటి రాజ్యం గజపతులు, నరపతుల వశమైంది.

రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం క్రీ.శ.1390-1448

రాజమహేంద్రవర రాజ్యం చివరగా జన్మించింది. అద్దంకి, కందుకూరు, చందోలు రాజ్యాలు ఒకేసారి జన్మించాయి. రాజమహేంద్రవర రాజ్యం అలాగాక కొండవీటి రాజ్య చివరి దశలో క్రీ.శ.1390లో జన్మించి చివరగా క్రీ.శ.1448లో అంతరించింది. ముసునూరి కాపయనాయకుని స్థితి బలహీనపడిన తర్వాత అనపోతారెడ్డి ఉత్తరాంధ్రను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. అతని విధానాన్ని అతని సోదరుడు అనవేమారెడ్డి, తర్వాత కుమారగిరిరెడ్డి అనుసరించి, చివరికి కుమారగిరి రెడ్డి కాలంలో సింహాచలం వరకు ప్రాంతాన్ని రెడ్డి రాజ్యంలో చేర్చగలిగారు. పరిపాలనా సౌలభ్యం కోసం కుమారగిరి గోదావరికి ఉత్తర ప్రాంతం అంతా సింహాచలం వరకు ఒక పరిపాలనా విభాగంగా చేసి దానికి రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసి క్రీ.శ.1390లో తనకుమారుడు రెండవ అనపోతను పాలకునిగా నియమించాడు. దాంతో రాజమహేంద్రవర రాజ్యం జన్మించింది. ప్రోలయవేమారెడ్డి చివరి కాలంలో, మొదటి అనపోతారెడ్డి కాలంలో నెల్లూరు జిల్లా నుండి కొన్ని రెడ్డి కుటుంబాలు రాజమహేంద్రవరం చేరి స్థిరపడ్డాయి. ఆ విధంగా చేరిన కుటుంబాలలో కాటయరెడ్డి కుటుంబం, దువ్వూరి కుటుంబాలు ముఖ్యమైనవి. రాజమహేంద్రవర రాజ్యంలో ఈ రెండు కుటుంబాలు ప్రముఖ పాత్రను నిర్వహించాయి. కనుక రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని కాటయరెడ్డి, దువ్వూరి రెడ్ల రాజ్యం అని చెప్పవచ్చును.

అల్లాడరెడ్డి కుటుంబం: అనపోతారెడ్డి అనవేమారెడ్డి తూర్పు దిగ్విజయయాత్రల కాలంలో కొన్ని పాకనాటి రెడ్డి కుటుంబాలు రాజమహేంద్రవరం ప్రాంతంలో స్థిరపడ్డాయి. ఆ కుటుంబాలలో కాటారెడ్డి, పెరుమాండ రెడ్డి కుటుంబాలు అతి ముఖ్యమైనవి. వీరిలో పెరుమాండిరెడ్డి దువ్వూరు వంశానికి చెందినవాడు. కళింగ రాజ్యంవైపు తమరాజ్యం విస్తరణకు ఈ కుటుంబాల సహాయ సహకారాలు చాలా అవసరమని కొండవీటి వంశం గుర్తించి ఈ కుటుంబాలతో వియ్యం పొందారు. కాటారెడ్డి మనుమడైన రెండవ కాటారెడ్డికి ప్రోలయ వేమారెడ్డి తమ కుమార్తె దొడ్డాంబిక నిచ్చి వివాహం చేశాడు. ఈ దంపతుల కుమారుడే కాటయ వేమారెడ్డి. ఇతడు మేనమామ అనపోతారెడ్డి కూతురు దొడ్డాంబికను వివాహం చేసుకొన్నాడు. ఆమెకు అన్నెమాంబ అనే మరొక పేరు కూడా ఉంది. అందువల్ల ఇతడు అనపోతారెడ్డి కుమారుడైన కుమారగిరికి బావ అయ్యాడు. కాటయ వేమారెడ్డికి అన్నెమాంబ కాక మరికొందరు భార్యలు కూడా ఉన్నారు. కాటయ వేమారెడ్డి, కాటయ కుమారగిరి అని ఇద్దరు కుమారులు, అనితల్లి అని ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో కుమారగిరి, అనితల్లి అన్నెమాంబ సంతతి కాటయ మరియొక భార్య కుమారుడు. కాని ఈ కాటయను చరిత్రకారులు గుర్తింపరు. పెరుమాండి రెడ్డి మనుమడు అల్లాడరెడ్డి. అతడు మహావీరుడు. చోడభీమలింగని పుత్రిక హేమాంబికను వివాహమాడాడు. ఈ దంపతులకు వేమ, వీరభద్ర దొడ్డ అనే ముగ్గురు కుమారులు కలిగారు. వీరిలో వీరభద్రారెడ్డి కాటయవేముని కుమార్తె అనితల్లిని వివాహం ఆడాడు. ఈ విధంగా కాటారెడ్డి పెరుమాండి రెడ్డి కుటుంబాల మధ్య బంధుత్వం ఉంది. ఈ రెండు కుటుంబాలు కొండవీటి రెడ్డి కుటుంబంతో వియ్యాలు, బంధుత్వాలు ఏర్పాడి ఉన్నాయి.

కాటయరెడ్డి వంశం

మొదటి కాట - ప్రోలయ వేమారెడ్డి సమకాలికులు

|

మారారెడ్డి

రెండవకాట | రామ

రెండవకాట
భార్య దొడ్డాంబిక లేక అన్నెమాంబ
ప్రోలయ వేమారెడ్డి కుమార్తె
(అనపోతారెడ్డి, అనవేమారెడ్డి సమకాలికుడు)

|

కాటయ వేమారెడ్డి - భార్య దొడ్డాంబిక (అన్యమ) - అనపోత కుమార్తె

(రెండవ హరిహరరాయలకు అల్లుడు - మొదటిదేవరాయల సమకాలికుడు)

రెండవ కుమారగిరి
క్రీ.శ.1414-1419

అనితల్లి
క్రీ.శ 1420-1448
(రెండవ హరిహరరాయల సమకాలికురాలు)

దువ్వూరి వంశం

పెరుమాండిరెడ్డి

అల్లాడ, పెదకోట, అనప్రోల, దొడ్డ, పినకోటారెడ్డి

(దొడ్డ) → అనప్రోల, కోటారెడ్డి, అల్లాడరెడ్డి

అల్లాడరెడ్డి
భార్య వేమాంబ
యేరువ భావదేవచోడుని కుమార్తె

(అల్లాడరెడ్డి) → అల్లయవేమ, అన్న, దొడ్డారెడ్డి, అల్లయ వీరభద్ర

అల్లయవేమ
భార్య కాటయవేముని
మరొక కుమార్తె

అల్లయ వీరభద్ర
భార్య అనితల్లి
కాటయవేముని కుమార్తె

కుమారగిరి కాలంలో కాటయవేముని నాయకత్వంతో ఈ రెండు కుటుంబాల సభ్యులు కళింగ మీద దండెత్తి అద్భుత విజయాలు సాధించారు. అల్లాడరెడ్డి సింహాచలం వద్ద దొడ్డారెడ్డి చిలక సరస్సు వద్ద విజయ స్తంభాలు నాటించారు. ఆ ప్రాంతాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం కుమారగిరి రాజ మహేంద్రవర రాజ్యంగా రూపొందించాడు. తర్వాత యువరాజు అనపోతను రాజప్రతినిధిగా నియమించాడు.

రెండవ అనపోత మరణం శక 1313: రాజమహేంద్రవరానికి రాజప్రతినిధిగా నియమించిన కొద్దికాలానికే యువరాజు అనపోత మరణించాడు. అతని మరణానికి కారణం తెలియదు. శక 1313 నాటి ఒక శాసనం కాటయ వేమారెడ్డి దస్కతులో లభించింది దానిని బట్టి అనపోతారెడ్డి శక 1313 అంటే క్రీ.శ.1391 నాటికే అనపోతారెడ్డి మరణించాడని అనిపిస్తోంది. ఏమైనా శక 1317 అంటే క్రీ.శ.1395 నాటికి కుమారగిరి గోపవరం శాసనం ప్రకారం కాటయ వేమారెడ్డిని కుమారగిరి రాజమహేంద్రవర రాజ్యానికి అధిపతిగా నియమించాడు కనుక అనపోతారెడ్డి క్రీ శ 1391-1395 సంవత్సరాల మధ్య మరణించి ఉండాలి. కాటయ వేముని నియామకం కొండవీటి రాజ్యాన్ని అల్లకల్లోలానికి గురిచేసింది. చందోలుశాఖకు చెందిన పదకోమటి వేమారెడ్డి తిరుగుబాటుచేసి కుమారగిరి కొండవీటి నుండి తరిమివేశాడు. కుమారగిరి రాజమహేంద్రవరం చేరి తన చివరి రోజులు గడిపి మరణించాడు. కుమారగిరి మరణం తర్వాత కొండవీడు రాజమహేంద్రవర రాజ్యాల విరోధం తారా స్థాయికి చేరింది. కాటయవేమారెడ్డి కొండవీటి సామంతుడుగా పెదకోమటి వేముని దర్శించలేదు. అతని అధికారాన్ని గుర్తించలేదు పైగా కాటయ వేమారెడ్డి స్వతంత్రం ప్రకటించాడు. దాంతో రెండు రాజ్యాలు ఆగర్భశత్రువుల మాదిరిగా పోరాటానికి దిగి చివరివరకు పోరాడాయి. వారు ఒకరినొకరు నాశనం చేసుకొని రెండు రాజ్యాలను యేకం చేయాలని సంకల్పించారు. ముఖ్యంగా కోమటి వేమారెడ్డి కాటయ వేముని అంతం చేసి రాజమహేంద్రవర రాజ్యాన్ని తనరాజ్యంలో కలుపుకోవాలని ధృఢంగా నిశ్చయించుకున్నాడు. దాంతో రెండు రెడ్డి రాజ్యాల మధ్య పోరు ప్రారంభమైంది. వీరి మధ్య విరోధం బహమనీ, విజయనగర, వెలమ రాజ్యాల జోక్యానికి దారితీసింది. రెండు రాజ్యాలు నాశనం అయ్యాయి. పెదకోమటి వేమారెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకోవాలని తన జీవితమంతా అంకితం చేశాడు. కాని దానిని సాధించలేకపోగా, తన రాజ్యాన్ని బలహీనపరచి కొండవీటి రాజ్య పతనానికి కారకుడయ్యాడు.

రెండు కూటములు: కాటయ వేముని అంతం చేయడానికి పెదకోమటివేముడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం అర్థించాడు. పెదకోమటికి సహాయం చేయడం ద్వారా తెలంగాణలో తన సామ్రాజ్యం విస్తరించుకోవచ్చని ఫిరోజ్‌షా సంతోషంగా తన సహాయాన్ని ప్రకటించాడు. కాటయ వేమునకు విరోధి అయిన

అన్నెదేవ చోడుడు (భక్తిరాజు కుమారుడు) తన రాజ్యాన్ని తిరిగి రాబట్టుకోవచ్చని పెదకోమటి వేమారెడ్డితో చేరాడు. కాటయ వేమారెడ్డి తన బంధువులను విజయనగర రాజులను ఆశ్రయించాడు. మొదటి దేవరాయలు కాటయ వేముని వైపు నిలబడ్డాడు. అనపోతారెడ్డి కాలం నుండి విజయనగర రాజ్యం రెడ్డి రాజ్యాన్ని ఆక్రమిస్తోంది. ఇప్పుడు కోమటి వేమారెడ్డి రాజ్యాన్ని ఆక్రమించవచ్చని, విజయనగర సామ్రాజ్య విస్తరణ చేయవచ్చని మొదటి దేవరాయలు ఆశించాడు. దాంతో రెడ్డిరాజ్యాల మధ్య వైరం దక్షిణ భారతదేశాన్ని రెండు కూటములుగా ఏర్పాటు చేసింది కొండవీడు, అన్నెదేవచోడుడు, బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా ఒక కూటమిగాను, రాజమహేంద్రవర రాజ్యం, విజయనగర రాజ్యం రెండవ కూటమిగాను ఏర్పడ్డాయి.

ధరణికోట యుద్ధం: ఇదే సమయంలో రాచకొండ వెలమసేనలు ధరణికోటను ముట్టడించి రక్షణగా ఉన్న పెదకోమటి వేమారెడ్డి తమ్ముడు మాచారెడ్డిని సంహరించాయి. వెలుగోటివారి వంశావళి కుమార వేదగిరి మాచారెడ్డిని సంహరించి అతని పుర్రెను ఉమ్మిపాత్రగా చేశాడని తెలుపుతోంది ఇంతలో బహమనీ సైన్యం కోమటి వేమారెడ్డికి సహాయంగా వచ్చింది. అందువల్ల వెలమసైన్యం ధరణికోటను ఆక్రమించలేక వెనుదిరిగి పోయింది. కాని ఈ సంఘటన మరొక రాజకీయ మార్పును తెచ్చింది. అంతవరకు వెలమ రాచకొండ, దేవరకొండ వెలమలు బహమనీ రాజ్యం ఒకటిగా ఉండేవి. కాని ధరణికోట యుద్ధంలో వెలమలకు వ్యతిరేకంగా బహమనీ సైన్యాలు ప్రవేశించినందు వల్ల వెలమల విజయనగరం వైపు మళ్లారు. దాంతో బహమనీ సుల్తాన్‌లు వెలమ రాజ్యంపై దండయాత్రలు సాగించి తెలంగాణను ఆక్రమించడానికి అవకాశం కల్పించింది ఒకవైపు కొండవీటి రెడ్డిరాజ్యం, మరొక వైపున బహమనీ రాజ్యం వెలమలపై దాడులు సాగించారు. చివరకు వెలమరాజ్య ప్రాంతాలన్నీ బహమనీల వశమయ్యాయి. వెలమరాజ్య పతనానికి కూడా రెండు రెడ్డి రాజ్యాల విరోధం దోహదం చేసిందని చెప్పవచ్చు.

అన్నెదేవచోడుడు క్రీ.శ.1404-1416: పెదకోమటి కాటయవేముల సంఘర్షణను ఆసరాగా తీసుకొని అనవేమారెడ్డి కాలంలో రాజ్యం పోగొట్టుకున్న అన్నెదేవచోడుడు రేచర్ల పెదవేదగిరి సహాయంతో రెడ్డిరాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్ర కళింగ నుండి జరిగినట్లుగా కనిపిస్తోంది. ఈ సమయంలో ఎలమంచిలి చాళుక్య రాజు విశ్వేశ్వరుడు అన్నెదేవచోడుని ఓడించి తరిమివేశాడు విశ్వేశ్వరుని ఆస్థానకవి విన్నకోట పెద్దన రాసిన కావ్యాలంకార చూడామణిలో తన ప్రభువు విశ్వేశ్వరుడు ఆంధ్ర సైన్యాన్ని శక 1324 అంటే క్రీ శ 1402లో పాంచదార్ల దగ్గర ఉన్న సర్వసిద్ధ వద్ద ఓడించి తరిమి సింహాచలం వరకు ఉన్న ప్రాంతాన్ని రెడ్డి రాజ్యంలో కలిపాడని వర్ణించాడు. కనుక విశ్వేశ్వరుడు కాటయవేముని సామంతుడని, అతడు అన్నెదేవచోడుని ఓడించి తరిమి కాటయ వేముని రాజ్యం రక్షించాడని చెప్పవచ్చును కాని అధైర్యపడకుండా ఆక్రమించుకున్నాడు. అతడు తన పూర్వ రాజ్యాన్ని సంపాదించానని రాజపరమేశ్వర, పూర్వసింహాసనాధీశ్వర అనే బిరుదులు ధరించినట్లు అతని శక 1326, క్రీ శ.1404 నాటి ద్రాక్షారామ శాసనం తెలుపుతుంది. అయినప్పటికీ అన్నెదేవచోడుడు రాజమహేంద్రవర రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించలేదు. తూర్పు గోదావరి జిల్లాలోని మధిరపూడి, తొర్రేడు, అచ్యుతాపురం, కాకినాడ వద్ద సర్పవరం వద్ద కాటయవేముని శక 1327-28 సంవత్సరం నాటి శాసనాలు లభించాయి. సర్పవరంలో వసంతరాయ మండపం నిర్మించి కాటయవేముడు శక 1327లో శాసనం వేయించాడు. కనుక అన్నెదేవచోడుని ఓడించి తరిమి రాజ మహేంద్రవర రాజ్యాన్ని పునరాక్రమించి అయినా ఉండాలి. లేదా అన్నెదేవచోడుడు పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరిజిల్లాలోని కోన మండలాన్ని మాత్రమే జయించి ఉండాలి రాజమహేంద్రవరాన్ని జయించలేదని భావించాలి. శక 1330 అంటే క్రీ.శ.1408 నాటికి అన్నెదేవుని రాజ్యం పోలవరం, భద్రాచలం ప్రాంతాల వరకు వ్యాపించి ఉన్నట్లు అతని రాజమహేంద్రవరం శాసనం తెలుపుతోంది. ఆ శాసనం ప్రకారం అతని రాజ్యం గోముఖగిరి నుండి పట్టేశగిరి వరకు విస్తరించి ఉందని తెలుస్తోంది. గోముఖగిరిని మోటీఘర్ అని మోటి అని కూడా పిలుస్తారు. గోదావరినదిలో పోలవరానికి దిగువన ఉన్న మరొకదీవి. అటువైపు అన్నెదేవుని రాజ్యానికి గోదావరి సరిహద్దని స్పష్టపడుతోంది. ఇటువైపు కోనసీమ సరిహద్దు అయి ఉండవచ్చు.

అన్నెదేవచోడ - కోమటి వేముని కూటమి శక 1308-1315: అన్నెదేవచోడుడు కాటయవేముని నిర్జించి రాజమహేంద్రవర రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించాలని భావించినట్లుగా కనిపిస్తోంది. క్రీ.శ.1407-08 సంవత్సరాలలో దేవరకొండ పద్మనాయక పెదవేదగిరి శాసనాలు శ్రీకూర్మంలో ఉన్నాయి. దీనిని బట్టి దేవరకొండ వెలమలు అన్నెదేవచోడునికి సహాయంగా కాటయ వేముని రాజ్యంపై దాడి చేసి శ్రీకూర్మం వరకు సాగినట్లుగా ఉంది. వారితో కాటయ వేముడు పోరాడినదీ లేనిదీ తెలియదు. తర్వాత పెదకోమటి కూడా అన్నెదేవచోడునితో

చేరి కాటయ వేముని నిర్జించాలని భావించాడు. అందుకు అన్నదేవచోడుడు పెదకోమటివేముడు ఒక కూటమిగా ఏర్పడ్డారు. అదితెలిసి కాటయవేముడు క్రీ.శ.1410లో విజయనగరం చేరి తన బావమరిది మొదటిరాయల సహాయం అర్థించాడు. మార్గమధ్యంలో క్రీ.శ 1410లో అహోబిలంలో శాసనం వేయించాడు. కాటయవేముడు రాజమహేంద్రవరం చేరాడు. అన్నదేవచోడుడు, కోమటివేముని సైన్యాలు రాజ మహేంద్రవరంపై దండెత్తాయి ఒంటరిగానే కాటయవేముడు వారిని ఎదిరించి ఓడించి తరిమివేసి కోనసీమతోసహా రాజమహేంద్రవర రాజ్యాన్ని కాపాడుకున్నాడు. శక 1330 నాటి పెద్దాపురం దగ్గరున్న తిరుపతి శాసనం, పిఠాపురం దగ్గరున్న శక 1332 కొమరగిరిపురం, అమలాపురం దగ్గరున్న శక 1333 తొత్తరమూడి, కాకినాడ దగ్గరున్న శక 1334-1336 నాటి సర్పవరం శాసనాలు ఆ ప్రాంతంపై కాటయవేముని అధికారాన్ని బలపరుస్తున్నాయి. కనుక రాజమహేంద్రవర రాజ్యం ఏర్పడిన శక 1312 క్రీ.శ 1390 నుండి శక 1336 అంటే క్రీ.శ.1414 వరకు సుమారు 24 సంవత్సరాలు కాటయవేముని ఆధిపత్యంలో ఉన్నాయని స్పష్టంగా తెలుస్తోంది. కుమారగిరి పురాన్ని నరసింహ అనే ఆయుర్వేద పండితునకు దానం చేశాడు కాని గోదావరికి దక్షిణంగా కాటయవేముని శాసనాలు లేవు. కనుక పశ్చిమగోదావరి జిల్లా ప్రాంతం అంతా అన్నదేవచోడుని ఆధిపత్యంలో ఉందని చెప్పవచ్చును. కోమటి వేమారెడ్డి తన సొంత బావమరిది సూరవర పట్టణ రాజు అయిన పిన ఉండిరాజు సహాయంతో ఈ ప్రాంతాలన్నీ జయించి ఉంటాడు.

అన్నదేవుని విజయాలు - జగ్గులవాగు, అత్తిలి, కాంకరపర్తి యుద్ధాలు - గోదావరి డెల్టా యుద్ధాలు రాజమండ్రి శాసనం అన్నదేవుడు సాధించిన విజయాలను తెలుపుతోంది. శత్రువులకు చెందిన జగ్గులవాగు మొదలైన ప్రదేశాలను జయించాడని అత్తిలి వద్ద తన విరోధులైన దక్షిణదేశ ప్రభువులనందరిని ఓడించాడని, అత్తిలి కోట వద్ద 10 వేల శత్రుసైన్యాన్ని బందీలుగా పట్టుకున్నాడని తెలుపుతోంది. ఇందులో పేర్కొనబడిన దక్షిణదేశపు రాజులు అంటే విజయనగర చక్రవర్తి కావచ్చును మొదటిదేవరాయలు కాటయవేమునికి సహాయంగా బయలుదేరి కొండవీటిలోని మోటుపల్లిని క్రీ.శ.1412లో జయించాడని క్రీ.శ 1412నాటి ఇంకొల్లు శాసనం తెలుపుతోంది తర్వాత విజయనగర సైన్యాలు అత్తిలి దగ్గరకు చేరి కాటయవేమునికి సహాయంగా పోరాడి ఉండవచ్చును కాని అత్తిలి యుద్ధంలో అన్నదేవచోడుడు సంపూర్ణ విజయం సాధించాడు.

అన్నదేవుడు చేసిన యుద్ధాలన్నింటిలో కాంకరపర్తి వద్ద జరిగిన యుద్ధం అతి ఘోరమైనది. ఈ యుద్ధాన్ని గురించి అన్నదేవచోడుని రాజమహేంద్రవరం మ్యూజియం శాసనం ఘనంగా వర్ణించింది. తన స్నేహితుని రక్షించడానికి పిన ఉండిరాజు ఆధ్వర్యుడుగా కాంకరపర్తి యజ్ఞవాటికలో కన్నడ, ఇతర శత్రువుల సైన్యాలను యజ్ఞపశువులుగా బలిచేశానని అన్నదేవచోడుడు ఆ శాసనంలో ఘనంగా చెప్పుకున్నాడు. ఈ శాసనంలో చెప్పబడిన స్నేహితుడు ఎవరో తెలియదు. తాను అంతగా త్యాగం చేసిన స్నేహితుని పేరును అన్నదేవచోడుడు పేర్కొనలేదు. అతని స్నేహితుడైన బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా కాదు ఫెరిష్టా, కాఫఖాన్, అజీజ్ ఉల్లా తబ తబాలు ఫిరోజ్ హిజ్రా 818-820 అని రాశారు చరిత్రకారులు వాటిని పరిశీలించి శక 1337-38 అంటే క్రీ.శ.1416లో జరిగిఉండవచ్చని చెప్పారు. కనుక రాజమండ్రి శాసనంలో చెప్పబడిన స్నేహితుడు తప్పకుండా కోమటివేముడు అయిఉంటాడు. కనుక అన్నదేవచోడుడు అత్తిలి, కాంకరపర్తి యుద్ధంలో కాటయవేమారెడ్డిని గజరావు తిప్ప సంహరించి కాటయవేమ తలగొండగండ అనే బిరుదు ధరించాడు. అతని వంశస్థుడైన కొప్పునూళ్ళ వాళ్లు వంశాచారంగా ఆ బిరుదును ధరించారు. పెదకోమటి వేముని విజయనగర కాటయవేముని సైన్యాలు చుట్టి ముట్టి ప్రమాదం ముంచుకు వచ్చినప్పుడు అన్నదేవచోడుడు పిన ఉండి రాజులు అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించి కోటయ వేమునికి విజయనగరం సంపాదించి ఉంటారు. ఈ యుద్ధంలో కాటయవేముని మరణానంతరం అతని కుటుంబం అన్నదేవచోడుని ఆశ్రయించగా అన్నదేవచోడుడు వారిని కాపాడి ఉంటాడు ఆ విషయమే రాజమండ్రి శాసనం తెలుపుతోంది. ఈ విజయానంతరం అన్నదేవ చోడుడు పాలకొల్లు, క్షీరారామేశ్వర శ్రీమన్మహాదేవుని దర్శించి తన తల్లిదండ్రులైన భక్తిరాజు, అన్నదేవమ్మకు పుణ్యఫలం కలగడానికి దానం చేసి శాసనం వేయించాడు. ఈ శాసనం 1414 జులై 23వ తేదీన వేయించబడింది.

కాటయవేముని ఘనత: రెడ్డి రాజులందరిలో కాటయవేముడు చాలా గొప్పవాడు. గొప్ప యుద్ధవీరుడు మహాపండితుడు. కుమారగిరి విజయం అనే పేరుతో కాళిదాసు మూడు నాటకాలకు వ్యాఖ్యానాలు రాశాడు. అతని వద్ద రాయని మంత్రి కుమారుడు బాచ లేక భాస్కర అనే రాయసం అంటే రాతకాడు ఉండేవాడట. అతడు

బంగారపు ఘంటంతో కాటయవేముని సమక్షంలో కూర్చొని పద్యాలు రాస్తూ ఉండే వాడని ఒక చాటుపద్యం ఉంది. కాటయవేమారెడ్డి కుమారగిరి కాలంలో రెడ్డిరాజ్యాన్ని సింహాచలం వరకు విస్తరించి స్థిరపరిచాడు. అంతకు ముందు ముసునూరి కాపయనాయకుని కాలం నాటి మంచికొండ, కొప్పులవెలమ వంశాలన్నింటినీ తొలగించి ఆ ప్రాంతంపై రెడ్ల అధికారాన్ని స్థిరంగా నిలిపి రాజమహేంద్రవర రాజ్యాన్ని పటిష్టం చేశాడు. కటకంపై దాడిచేసి రెడ్డి రాజ్య ప్రతిష్టను ఇనుమడింపజేశాడు. కాటయవేమునికి తన బావమరిది కుమారగిరిపై అమిత అభిమానం. తన కుమారునికి కుమారగిరి అని పేరు పెట్టుకున్నాడు. తన కావ్యానికి కురు కుమారగిరి రాజీయం అని పేరు పెట్టాడు. తాను దానం చేసిన కొన్ని గ్రామాలకు కుమారగిరిపురం అని పేరు పెట్టాడు. కుమారగిరి రాజ్యాన్ని నిలబెట్టడానికి జీవితమంతా కృషి చేశాడు కాని అలాంటి మహావీరుని జీవితం విషాదాంతంగా ముగిసింది.

రెండవ కొమరగిరి శక 1336-38 క్రీ.శ.1414-1416: కాటయ వేమారెడ్డికి హరిహరాంబిక, అనితల్లి అనే ఇద్దరు కుమార్తెలు, కుమారగిరి అనే ఒక కుమారుడు ఉన్నారు అల్లాడరెడ్డి కుమారులైన వేమారెడ్డికి హరిహరాంబికను, వీరభద్రారెడ్డికి అనితల్లిని ఇచ్చి వివాహం చేశాడు. అనితల్లి అనపోతారెడ్డి కూతురైన దొడ్డాంబిక కుమార్తె అంటే అనపోతారెడ్డి మనుమరాలు, కుమారగిరి రెడ్డి మేనగోడలు. కాటయ వేమారెడ్డి కుమారుడు కుమారగిరి క్రీ శ 1405లో జన్మించినట్లు తొర్రేడు శాసనం సూచిస్తోంది. కాటయవేముడు తనకు కుమారుడు కలిగిన సంతోషంలో శక 1327లో చివుకుల కుటుంబానికి చెందిన మాధవ అనే బ్రాహ్మణ పండితునికి తొర్రేడు గ్రామాన్ని దానం చేశాడు కాటయవేముడు మరణించే నాటికి కుమారగిరి 10 సంవత్సరాల బాలుడు అయినప్పటికీ, అతనికి అప్పటికే పెళ్లి అయింది. ద్రాక్షారామ దేవాలయంలో శక 1336 అంటే క్రీ శ.1414, శక 1338 అంటే క్రీ.శ.1416లో కుమారగిరి అతని భార్యకు శుభాలు కలగాలని కోరుతూ దానాలు చేసి శాసనాలు వేయబడ్డాయి. ఈ శాసనాలను బట్టి క్రీ.శ.1414లోనే కుమారగిరి రాజైనట్లు తెలుస్తోంది. కనుక కాటయవేమారెడ్డి క్రీ శ.1414కు ముందే చనిపోయి ఉండాలి.

కాటయవేముని మరణానంతరం అన్నదేవచోడుడు కాటయవేముని కుటుంబాన్ని రక్షించి వదిలాడు. కాని కాటయవేముని రాజ్యం ఆక్రమించినట్లుగా లేదు. కాటయవేముని మరణానంతరం అతని వియ్యంకుడు దువ్వూరి కుటుంబానికి చెందిన అల్లాడరెడ్డి కాటయవేముని కుటుంబ భారాన్ని తన నెత్తిన వేసుకున్నాడు. అతడు అన్నదేవచోడునికి కూడా బంధువే. అతని అన్న భీమదేవచోడుని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అల్లాడరెడ్డి రెండవ కుమారగిరిని రాజమహేంద్రవర సింహాసనంపై కూర్చోబెట్టి తాను రక్షకుడుగా రాజ్యపాలన చేపట్టాడు. కాని కుమారగిరి ఎక్కువ కాలం జీవించలేదు. అతడు క్రీ శ.1416లోనే మరణించినట్లుగా రాసి ఉంది. అతడు ఎలా మరణించింది తెలియదు. అన్నదేవచోడుడు పెదకోమటి రెడ్డి రాజమహేంద్రవరంపై దండెత్తి అతనిని సంహరించి, రాజమహేంద్రవరాన్ని ఆక్రమించి ఉండవచ్చును. లేదా సహజ మరణమే పొంది ఉండవచ్చును. ఏమైనా అతని మరణం తర్వాత రాజమహేంద్రవర రాజ్యం అన్నదేవుని చేతిలో పడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. భీమేశ్వరపురాణంలో కోన రాష్ట్రంలోని బోడసకుర్తి స్థలంలోని అన్నచోడవర అగ్రహారం ప్రస్తావన ఉంది. దానిని తన విజయం తర్వాత అన్నదేవచోడుడు బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చి ఉంటాడు. ఆ గ్రామం కోనమండలంలో ఉంది. అనితల్లి కలువచేరు శాసనంలో రెండవ కుమారగిరి మరణానంతరం ద్రోహులైన కొందరు ఉద్యోగులు తమ ప్రభువుకు ద్రోహం చేసి క్రూరులైన పరరాజులతో చేరి రాజ్యాన్ని ముంచేయగా, అల్లయనరేంద్రుడు విష్ణువువలె ఉద్ధరించి అనితల్లికి అప్పగించాడని వర్ణించింది. కనుక కుమారగిరి మరణానంతరం రాజమహేంద్రవర రాజ్యం శత్రువుల పాలైందని భావించవచ్చును. ఆ శత్రువులు అన్నదేవచోడుడు, కోమటి వేమారెడ్డి అని కూడా చెప్పవచ్చును. అలాగే అన్నదేవుని దానశాసనం కోన మండలంలో ఉంది.

అల్లాడరెడ్డి సంరక్షత్వం: కాటయవేముని మరణం తర్వాత పెదకోమటి వేమారెడ్డి అన్నదేవచోడుడు క్రీ.శ.1412వ సంవత్సరంలో రాజమహేంద్రవరంపై దండెత్తారు. వారిని అల్లాడరెడ్డి ధైర్యంగా ఎదుర్కొన్నాడు. వారిని ఓడించి తరిమి రాజ్యాన్ని కాపాడాడు. అన్నదేవచోడుడు కాటయవేముని మరణానంతరం గోదావరీ తీరంలోని పట్టిసం, మోటి దీవుల మధ్య ప్రాంతాన్ని ఆక్రమించాడు. కోనసీమ కూడా అతని వశంలోనికి వచ్చింది. వేంగి మొత్తాన్ని స్వాధీనం చేసుకొనే ప్రయత్నంలో ఉన్నాడు. కనుక అల్లాడరెడ్డి అనవేమునిపై దండెత్తి, అన్నదేవుని ఓడించడమే గాక అతనిని 1415లో సంహరించినట్లుగా తెలుస్తోంది. క్రీ.శ.1414నాటి పలివెల శాసనంలో ద్రోహిని తుదముట్టించి కాటయవేముని వంశాన్ని పునరుద్ధరించినట్లు అల్లాడరెడ్డి చెప్పుకున్నాడు. క్రీ.శ.1416

నాటికి గోదావరీతీరం అల్లాడరెడ్డి స్వాధీనంలో ఉన్నట్లు క్రీ.శ.1416 నాటి అతని సేనాని నరహరినీడు పాలకొల్లు శాసనం తెలుపుతోంది. నరహరినీడు కూడా ఈ యుద్ధంలో పాల్గొని ఉండవచ్చును. కనుక 1415వ సంవత్సరం నరహరినీడులతో జరిగిన యుద్ధాలలో అన్నదేవచోడుడు మరణించి, వేంగి ప్రాంతాలన్నీ అల్లాడరెడ్డి వశమై ఉండవచ్చును. క్రీ.శ.1415 తర్వాత అన్నదేవుని శాసనాలు కనిపించడం లేదు.

రెండవ కుమారగిరి క్రీ.శ.1416: ఇదే కాలంలో రాజమహేంద్రవరంలో రెండవ కుమారగిరి అకాల మృత్యువు పాలైనాడు. అతని మరణం అల్లాడరెడ్డికి సమస్యలు తెచ్చిపెట్టింది. కాటయవేముని కుమార్తె అనితల్లి రాజ్యానికి ఏకైక వారసురాలిగా మిగిలింది. అల్లాడరెడ్డి ఆమెను తన రెండవ కుమారుడు వీరభద్రారెడ్డికిచ్చి వివాహం చేసి ఆమెను తన కోడలిగా చేసుకున్నాడు. అనితల్లి వీరభద్రారెడ్డిలు ఇద్దరూ రాజ్యపాలన చేపట్టారు. అల్లాడరెడ్డి వారికి రక్షకుడుగా కొనసాగాడు.

నాల్గవ నరసింహదేవుని దండయాత్ర: ఈ పరిస్థితులలో ఉత్తర దిక్కు నుండి తూర్పు గాంగరాజు నాల్గవ నరసింహదేవుడు రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు. అంతకు పూర్వం కాటయవేమారెడ్డి జయించిన తమ రాజ్యభాగాలను తిరిగి ఆక్రమించడానికి దాడి జరిపాడు. అల్లాడరెడ్డి కళింగ సైన్యాలను ఎదుర్కొన్నాడు. ఈ యుద్ధంలో అల్లాడరెడ్డి విజయం సాధించినట్లు కనిపిస్తోంది. అతడు గజపతి దళవిభవ అనే బిరుదు ధరించాడు. కనుక అల్లాడరెడ్డి గంగసైన్యాన్ని ఓడించి ఉండవచ్చును. తర్వాత వారిద్దరి మధ్య సంధి జరిగి సరిహద్దులను నిర్ణయించుకున్నట్లు వేమగిరి శాసనం తెలుపుతోంది.

అన్నదేవచోడుని మరణం క్రీ.శ.1415-16: అదే కలువచేరు శాసనం అల్లాడ ద్రోహులతో కూడిన శత్రురాజును ఓడించి తరిమి రాజ్యాన్ని తిరిగి స్వాధీనం చేసుకొని అనితల్లికి అప్పగించాడని తెలుపుతోంది. ఈ విజయాలలో అల్లాడరెడ్డికి తన కుమారులైన వేమ, వీరభద్రా, దొడ్డారెడ్డు, అన్నారెడ్డి, వారిమంత్రి అరియేటి లింగన సేనాధిపతి, పిన్నమనేడు కుమారుడైన నరహరి లేక నరభూపతి సహాయపడి ఉంటారు. అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్య పునరాక్రమణకు జరిపిన యుద్ధంలో అన్నదేవచోడుడు మరణించినట్లుగా కనిపిస్తోంది. అల్లాడరెడ్డి పలివెల శాసనంలో ద్రోహికులాన్ని మొత్తాన్ని వధించి కాటయవేముని రాజ్యాన్ని పునరుద్ధరించడానికి తెలుపుతోంది. అలాగే అల్లాడరెడ్డి సేనాధిపతి నరహరిని శ్రీమద్ దొడ్డయమల్ల భూతలపతే రాజ్య ప్రతిష్ఠాపకో అని శక 1338 నాటి పాలకొల్లు శాసనం వర్ణిస్తోంది. ఈ రెండు శాసనాలు క్రీ.శ.1416 ఆగస్టు నాటివి. నరహరి కూడా ఈ యుద్ధంలో పాల్గొని ఉంటాడు. ఆ యుద్ధంలో తాను సాధించిన విజయ సూచికంగా ఈ శాసనం వేయించి ఉంటాడు. అంతేగాక క్రీ.శ.1416 నాటికి గోదావరీ తీరం అల్లారెడ్డి ఆధీనంలో ఉన్నట్లు ఈ శాసనం రుజువు చేస్తోంది. అన్నదేవచోడుని చివరి శాసనం తన తల్లిదండ్రుల పుణ్యఫలానికి వేయించిన పాలకొల్లు శాసనం. అది క్రీ.శ.1414 జులై మాసానికి చెందింది. పదివేల శాసనం క్రీ.శ.1416 ఆగస్టుకు చెందింది. కనుక అన్నదేవచోడుడు క్రీ.శ.1414 జులై, 1416 ఆగస్టు మధ్య కాలంలో జరిగి ఉండాలి. ఈ మధ్య కాలంలో రాజమహేంద్రవరాన్ని ఆక్రమించి ఉంటాడు. తిరిగి అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని పునరాక్రమించిన యుద్ధంలో అన్నదేవచోడుడు మరణించి ఉంటాడు. కనుక అన్నదేచోడుడు క్రీ.శ.1415-16 సంవత్సరాల మధ్య మరణించి ఉంటాడు. అతనికి వీరభద్రుడనే కుమారుడు ఉన్నాడు. అతడు కూడా ఎక్కువ కాలం జీవించినట్లు లేదు. అతని మరణంతో యేరువ తెలుగుచోళ వంశ చరిత్ర ముగిసింది.

అన్నదేవచోడుని మరణం కోమటి వేమారెడ్డికి తీరని నష్టం అయినప్పటికీ అతడు రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించాలనే కోరికను వదులుకోలేదు. అన్నదేవుని మరణానంతరం అల్లాడరెడ్డి రాజ్యానికి అనితల్లిని వారసురాలుగా ప్రకటించి తాను రక్షకుడిగా పాలించాడు.

అల్లాడరెడ్డి - గజపతులు, నరపతులు: ఇదే సందర్భంలో గజపతులు, నరపతులు ఘర్షణ పడి ఉభయ సైన్యాలు రాజమహేంద్రవర రాజ్యంలో ప్రవేశించాయి. అల్లాడరెడ్డి వారి ఘర్షణ వలన తన రాజ్యానికి హాని జరుగుతుందని గ్రహించి వారిద్దరికి సంధి జరిపి పంపేశాడని వేమారెడ్డి వేమవరం శాసనం తెలుపుతోంది. కొమ్ముచిక్కాల శాసనంలో అల్లాడరెడ్డి గజపతిని ఓడించి విజయనగరంతో సంధి చేసుకున్నాడని తెలుపుతోంది. అతడు గజపతి దళవిభవ అనే బిరుదు ధరించాడు. కనుక గంగ భానుదేవునికి, అల్లాడరెడ్డికి యుద్ధం జరిగి ఉండవచ్చును. కాటయ వేమారెడ్డి కాలంలో తాము పోగొట్టుకున్న ప్రాంతాలను ఆక్రమించడానికి నాల్గవ భానుదేవుడు దండెత్తాడని, అతనిని ఓడించి అల్లాడరెడ్డి ఈ బిరుదు ధరించి ఉండవచ్చును, అని ఒక భావన ఉంది.

అయితే సమకాలీన సాహిత్యం అల్లాడరెడ్డి గజపతి నరపతులతో స్నేహసంబంధాలు పాటించాడని తెలుపుతున్నాయి.

బహమనీ సుల్తాన్ - కోమటి వేముని దండయాత్రలు క్రీ.శ.1416-17: నరపతి, గజపతుల నిష్క్రమణ తర్వాత పెదకోమటి వేమారెడ్డి మరలా రాజమహేంద్రవరంపై దండెత్తాలని సంకల్పించాడు. పెదకోమటి తాను ఒక్కడే అల్లాడరెడ్డిని జయించలేనని తన మంత్రి మామిడి సింగనను గుల్బర్గా పంపి సుల్తాన్ సహకారాన్ని సంపాదించాడు. అందువలన మామిడి సింగనకు యవనాధీశ సభానిరంకుశవచో వ్యాపార పరంగతా అనే బిరుదు వచ్చింది. సుల్తాన్ నిజాం ఉల్ ముల్క్ అనే బానిస వజీర్‌ను సైన్యాలతో పంపాడు. ఆ సైన్యాలు తెలంగాణ మీదుగా నడిచాయి. వాడపల్లి, వేదాద్రిలలోని సుల్తాన్ శాసనాలు వారి దండయాత్రను బలపరుస్తున్నాయి. ఉభయ సైన్యాలను అల్లాడరెడ్డి రాజమహేంద్రవరం ఓడించాడని అతని కొమ్ముచిక్కాల తామ్రశాసనం వర్ణించింది. ఈ అపజయం తర్వాత సుల్తాన్ వెనుదిరిగి పోయాడు. సుల్తాన్ వెనుదిరగడానికి ప్రధాన కారణం ఒకటి ఉంది. అల్లాడరెడ్డికి సహాయంగా విజయనగర చక్రవర్తి మొదటి దేవరాయలు బయలుదేరి తన సైన్యాన్ని రెండుగా చేసి ఒక విభాగాన్ని మోటుపల్లి మొదలైన కొండవీటి రాజ్యభాగాలను ఆక్రమించడానికి, మరొక భాగాన్ని బహమనీ రాజ్యంపైకి పంపాడు. తన రాజ్యాన్ని కాపాడుకోవడానికి సుల్తాన్ రాజమహేంద్రవరాన్ని వదలి వెళ్లిపోయాడు. తర్వాత అల్లాడరెడ్డి మళ్లీ పెదకోమటివేముని సైన్యంపై దండెత్తి రామేశ్వరం అనే గ్రామం వద్ద రెండవసారి ఓడించాడు. వేమవరం శాసనం కోమటి వేముని రెండవసారి అల్లాడరెడ్డి ఓడించాడని స్పష్టంగా తెలుపుతోంది. కనుక క్రీ.శ.1417లో కోమటి వేమారెడ్డి అల్లాడరెడ్డి చేతిలో రెండు పర్యాయాలు ఓడిపోయి రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించే ఆశలు వదలుకొని మోటుపల్లిని రక్షించుకోడానికి వెళ్లిపోయాడు. చివరకు ఏమీ సాధించలేక అతడు, అతని తమ్ముడు మాచారెడ్డి ఇద్దరూ వెలమల చేతిలో ఘోరంగా మరణించారు.

పెదకోమటి వేమారెడ్డి, ఫిరోజ్‌ల దండయాత్ర: భానుదేవుని దండయాత్ర తర్వాత పెదకోమటి వేమారెడ్డి మరలా రాజమహేంద్రవర రాజ్యంపై దాడి చేయాలని భావించాడు. ఈ కాలాన్ని అన్నెదేవచోడుడు మరణించాడు. కనుక అతడు నిస్సహాయుడయ్యాడు. కనుక గత్యంతరం లేక తాను ఒక్కడే అల్లాడరెడ్డిని ఓడించలేనని బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో మైత్రి వహించాడు. పెదకోమటికి ఫిరోజ్‌షాకు మైత్రి కుదర్చడంలో మంత్రి మామిడి సింగన ప్రముఖ పాత్ర నిర్వహించాడు. అతనికి యవనాధీశ సభానిరంకుశ వచోవ్యాపారపరంగతా అనే బిరుదు ఉంది. ఫిరోజ్‌షా తన సైన్యాలను నిజాం ఉల్ ముల్కు అనే బానిస వజీరు నాయకత్వంలో పంపాడు. అవి తెలంగాణ మీదుగా నడిచాయి. వాడపల్లి, వేదాద్రిలోని సుల్తాన్ సైన్యాలు వీటికి సాయపడ్డాయి. ఫెరిష్టా రచనలు క్రీ.శ.1417వ సంవత్సరంలో ఈ దాడి జరిగినట్లు తెలుపుతున్నాయి. ఉభయ సైన్యాలు రాజమహేంద్రవరాన్ని ముట్టడించాయి. అల్లాడరెడ్డి ఎదుర్కొని వీరోచితంగా పోరాడి వారిని ఓడించి కోమటి వేముని సైనికసంపదను కొల్లగొట్టినట్లు శివలీలావిలాసం వర్ణిస్తోంది. కొండవీడు, గుల్బర్గా సైన్యాలను అల్లాడరెడ్డి ఓడించగలడానికి మరొక కారణం కూడా ఉంది. అల్లాడరెడ్డికి సహాయంగా విజయనగర చక్రవర్తి మొదటి దేవరాయలు సైన్యాలను పంపాడు. ఆ సైన్యాలు కొండవీటి రాజ్యంపై దాడి చేసి మోటుపల్లి వరకు ఆక్రమించాయి. క్రీ.శ.1416వ సంవత్సరంలో మోటుపల్లిలో మొదటి దేవరాయలు అభయ శాసనం వేయించాడు. విజయనగర సైన్యం రాక విని కోమటి వేమారెడ్డి ఫిరోజ్‌షాలు రాజమహేంద్రవర ముట్టడిని విరమించి వెనుకకు మరలి ఉంటాయి. వెనుదిరిగి వెళ్లే వారి సైన్యాలను తరుముతూ వెళ్లి అల్లాడరెడ్డి మళ్లీ వారిని రామేశ్వరం వద్ద ఓడించి ఉంటాడు. వెనుదిరిగి వెళ్లే ఫిరోజ్‌షా సైన్యాలు పానుగల్లును ముట్టడించాయి. పానుగల్లును రక్షించుకోడానికి విజయనగర సైన్యాలు కొండవీడు రాజ్యం నుండి వెళ్లిపోయాయి. ఆ సందర్భంలో విజయనగర, రాచకొండ వెలమలకు స్నేహసంధి కుదిరింది. వారిద్దరూ కలసి ఫిరోజ్‌షా సైన్యాలను ఓడించి తరిమి వేశారు. దాంతో రాజకీయ మైత్రి కూటములు మారిపోయాయి. అంతకు ముందు బహమనీలు వెలమలు ఒకటిగా ఉండేవారు. కొండవీటి రెడ్లు, విజయనగరం ఒకటిగా ఉండేవి.

అల్లాడరెడ్డి ఇతర విజయాలు: శివలీలా విలాసం, కాశీఖండ కావ్యాలు ధారానగర సుల్తాన్‌ను అల్లాడరెడ్డి జయించాడని తెలుపుతున్నాయి. అలాగే వేమవరం శాసనం, అల్లాడరెడ్డి అల్ఫఖాన్‌ను ఓడించి అతని అశ్వాలను సంగ్రహించాడని తెలుపుతోంది. అల్ఫఖాన్ మాళ్వాను ఏలిన దిలావర్‌ఖాన్ కుమారుడు. అతడు హిజ్రా 808 క్రీ.శ.1405లో అతని తండ్రి మరణానంతరం మాళ్వ సింహాసనాన్ని అధిష్టించాడు. అతని రాజధాని దార్ లేక

ధారానగరం. ఆల్ఫఖాన్‌కు హుషాంగ్‌షా అని కూడా పేరుంది. ఇతడు ఫిరోజ్‌షాకు సహాయంగా తన సైన్యాలను పంపాడేమో, ఆ సందర్భంలో సుల్తాన్ సైన్యంతో పాటు మాళ్వ సైన్యాలను కూడా అల్లాడరెడ్డి ఓడించి ఉంటాడు అందువల్ల ఈ విజయం వేమవరం శాసనంలో పైరెండు కావ్యాలలో పేర్కొనబడి ఉంటుంది. ఒకవేళ ఈ విజయం ఆ సంఘటనకు సంబంధించినది కాకపోతే శక 1321కి ముందు అల్లాడరెడ్డి అతనిని ఓడించి ఉండాలి. ఏమైనా ఈ ఆల్ఫాఖాన్ ఎవరో తెలియదు

అల్లాడరెడ్డి మరణం క్రీ.శ.1420: క్రీ.శ.1420లో అల్లాడరెడ్డి మరణించినట్లుగా కనిపిస్తోంది. అతని సేనాని నరహరి, భూపాలుడు క్రీ శ 1420 మాఘమాసంలో పాలకొల్లులో అల్లాడ ఈశ్వరలింగాన్ని ప్రతిష్ఠించాడు శక 1341 తర్వాత అల్లాడరెడ్డి శాసనాలు లభించలేదు. అతని అధికారి పాలకొల్లులో అల్లాడ శివలింగాన్ని ప్రతిష్ఠించడం, అతని శాసనాలు 1341 తర్వాత లేకపోవడం వల్ల అల్లాడరెడ్డి క్రీ.శ.1420లో మరణించాడని స్పష్టంగా తెలుస్తోంది. అల్లాడరెడ్డి కూడా కాటయవేమారెడ్డిలాగే గొప్ప వీరుడు. కాటయ వేమారెడ్డి మరణం తర్వాత నశించిపోయే రాజమహేంద్రవర రాజ్యాన్ని తన బాహుబలం చేత కాపాడి అనితల్లికి అప్పగించాడు. అందువల్ల తన కుమారులు రాజమహేంద్రవర రాజ్యపాలకులు కాగలిగారు. మొత్తం మీద అతడు రాజమహేంద్రవర రాజ్య రక్షకునిగా కీర్తి వహించాడు.

అల్లాడరెడ్డి సాహస పరాక్రమాలను రాజమహేంద్రవర రాజ్యం అన్ని ప్రమాదాల నుండి బయటపడి నిలదొక్కుకుంది. అనితల్లికి రాజ్యం దక్కింది. కనుక అనితల్లి తన కలువచేరు శాసనంలో అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్యానికి చేసిన సేవలను ఘనంగా శ్లాఘించింది. సముద్రంలో మునిగిపోయిన భూదేవిని వరాహ విష్ణువు ఉద్ధరించినట్లు అల్లాడరెడ్డి శత్రువుల దాడుల నుండి స్వామిద్రోహులైన సామంతుల తిరుగుబాట్ల నుండి రాజమహేంద్రవర రాజ్యాన్ని ఉద్ధరించి నిలబెట్టాడని కలువచేరు శాసనం వర్ణిస్తోంది. అల్లాడరెడ్డి గొప్ప వీరుడే గక గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతి పారంగతుడు. అతడు శత్రువులపై సాధించిన విజయాలకు గర్వించక దూరదృష్టితో ఓడిపోయిన వారితో కూడా తిరిగి రాజకీయ స్నేహ సంబంధాలను నెలకొల్పుకున్నాడు గుల్బర్గా సుల్తాన్ అహమ్మద్‌షా బహమనీలతో స్నేహ సంబంధాలను పునరుద్ధరించుకున్నాడు. ఈ కార్యసాధనలో అతని మంత్రి బెండపూడి అన్నయ ముఖ్యపాత్ర నిర్వహించాడు. ఒరిస్సాలో తూర్పు గాంగవంశంతో సంధి కుదిరింది. అదేవిధంగా విజయనగర సామ్రాజ్యంతో ఉన్న మంచి సంబంధాలను కొనసాగించాడు. రాజకీయ మిత్రులను సంపాదించాడు. బెండపూడి అన్నయ మొదలైన అనుభవజ్ఞులు, విజ్ఞులు సమర్థులైన మంత్రులను నియమించుకొని వారి సలహాలతో రాజ్యాన్ని పాలించాడు రాజ్యానికి సుస్థిరత్వం సాధించాడు. కాని అతడు ఎంతకాలమో జీవించలేదు. అల్లాడరెడ్డి క్రీ శ 1423వ సంవత్సరంలో మరణించాడు. అతడు మరణించే నాటికి రాజమహేంద్రవర రాజ్యం ఉత్తరాన వద్దాది, వజ్రఘట్టం నుండి దక్షిణాన వేంగి వరకు విస్తరించి ఉంది. ఆర్థిక పుష్టి కలిగి ఉంది అల్లాడరెడ్డి మరణంతో రాజమహేంద్రవర రాజ్యానికి పెద్దదిక్కు పోయింది.

అనితల్లి పాలన: కాటయవేమారెడ్డి కుమారుడు కుమారగిరి మరణించడంతో అతని సోదరి అనితల్లిని వారసురాలుగా అల్లాడరెడ్డి ప్రకటించాడు. రాజ్య రక్షకత్వాన్ని స్వీకరించాడు. అల్లాడరెడ్డి మరణానంతరం అనితల్లి స్వయం పాలన ప్రారంభమైంది. అనితల్లి గొప్ప విజ్ఞత కలిగిన రాజకుమార్తె ఆమె అనేక మంది కవిపండితులను పోషించి తన ఔదార్యాన్ని చాటుకుంది. ఆమె కాలంలోనే వేయించిన దానశాసనాలలో కలువచేరు శాసనం అతి ముఖ్యమైనది. అందులో అల్లాడరెడ్డి ఘనతతో పాటు అంతకు పూర్వం ముస్లింలను పారదోలి ఆంధ్రదేశాన్ని రక్షించిన ప్రోలయ, కాపయ నాయకులను కూడా ఆమె ఘనంగా కీర్తించింది. కాకతీయ చివరి చక్రవర్తి ప్రతాపరుద్రుని కూడా ఆమె తన శాసనంలో ప్రస్తావించింది. ఈ శాసనం వల్ల అనితల్లి పాలనను గురించే కాకుండా అంతకుముందు 100 సంవత్సరాల నాటి ఆంధ్రదేశ చరిత్రను తెలుసుకోడానికి సాధ్యపడుతోంది కలువచేరు అనే గ్రామానికి అన్నవరం అని నామకరణం చేసి ఒక బ్రాహ్మణునికి దానం చేస్తూ ఆమె ఈ శాసనం వేయించింది. అనేక మంది బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చి వేదవిద్యలను పోషించింది. పరహిత కుటుంబం అనే ఒక వైద్య కుటుంబాన్ని కూడా ఆమె ఆదరించింది. ఈ విధంగా వైదికధర్మాన్ని పాటిస్తూ ప్రశాంతంగా రాజ్యం చేసిన అనితల్లి రాజ్యానికి అనతి కాలంలోనే ముప్పు వాటిల్లింది.

అనప్రోలారెడ్డి కుమారులు అనపోతారెడ్డి కుమారగిరిరెడ్డిల ఆక్రమణ - కొమ్ముచిక్కాల శాసనం: అల్లాడరెడ్డి మరణానంతరం రాజమహేంద్రవర రాజ్యం అనితల్లి చేతి నుండి జారిపోయింది. అల్లాడరెడ్డి సోదరుడు

అనప్రోలారెడ్డి. అతనికి అనపోతారెడ్డి, కుమారగిరిరెడ్డి అనే ఇద్దరు కుమారులున్నారు. అల్లాడరెడ్డి కాలంలో అతని సోదరుడు అతని సంతతి, వారి స్థితిగతులు మనకు తెలియవు. కాని అల్లాడరెడ్డి మరణించిన తర్వాత సోదరులు అనపోతారెడ్డి, కుమారగిరి రెడ్డిలు రాజమహేంద్రవరంపై దాడిచేసి అనితల్లి రాజ్యాన్ని ఆక్రమించారు. అనపోతారెడ్డి రాజమహేంద్రవరం సింహాసనాన్ని అధిష్టించినట్లు కొమ్ముచిక్కాల శాసనం తెలుపుతుంది. ఈ శాసనం క్రీ.శ.1424 నాటిది. కనుక క్రీ.శ.1424 నాటికి రాజమహేంద్రవర రాజ్యం దురాక్రమణకు గురైందని చెప్పవచ్చును. అనితల్లి కలువచేరు శాసనం తర్వాత 8 సంవత్సరాల వరకు అనితల్లి వీరభద్రారెడ్డి శాసనాలు లభించడంలేదు. క్రీ శ.1420 నుండి 1428 వరకు అనితల్లి రాజ్యం పరాధీనంలో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

మూడవ కుమారగిరి-మూడవ అనపోత క్రీ.శ.1420-1422: అల్లాడరెడ్డి మరణం తర్వాత రాజమహేంద్రవర రాజ్యం అనితల్లి చేతి నుండి జారిపోయినట్లు కనిపిస్తోంది. ఆమె, ఆమె భర్త వీరభద్రారెడ్డి శాసనాలు క్రీ.శ.1423 తర్వాత కనిపిస్తున్నాయి. అల్లాడరెడ్డి మరణించిన క్రీ.శ.1420, వీరభద్రారెడ్డి శాసనాలు కనిపించిన 1423 సంవత్సరాల మధ్య రాజమహేంద్రవర రాజ్యాన్ని మూడవ కుమారగిరి, మూడవ అనపోత అనే రాజులు పాలించినట్లు శాసనాలు లభించాయి. అనపోతారెడ్డికి చెందిన ఒక తామ్రశాసనం ఒక శిలాశాసనం లభ్యమయ్యాయి. ఈ రెండు శాసనాలు శక 1344 అంటే క్రీ.శ.1422 సంవత్సరానికి చెందినవి ఈ శాసనాలు విడుదల చేసిన అనపోతారెడ్డి మరణానంతరం రాజమహేంద్రవర రాజ్యాన్ని కూడా పాలించారని మరొక ఆధారం ఉంది. వేమవరం శాసనం వేమవరానికి సరిహద్దు గ్రామంగా అనప్రోలారెడ్డి కుమారగిరిపురం అనే గ్రామం ఉన్నట్లు పేర్కొంటోంది. ఈ గ్రామం రాజమండ్రికి అతి సమీపంలో ఉంది. కనుక ఈ గ్రామాన్ని మూడవ అనపోత తన తండ్రి, సోదరుని పుణ్యఫలానికి దానం చేసి ఉంటాడు. అలాగే తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం ప్రాంతంలో ఇదే పేరు కలిగిన మరొక గ్రామం ఉంది. కనుక దానిని కూడా అనపోత దానం చేసి ఉంటాడు. కనుక క్రీ.శ.1420-1423 సంవత్సరాల మధ్య సుమారు నాలుగు సంవత్సరాలు రాజమహేంద్రవర రాజ్యాన్ని అనప్రోలారెడ్డి కుమారులు పాలించారని చెప్పవచ్చును. వారిలో మూడవ కుమారగిరి ముందుగానే మరణించాడు. తర్వాత అనపోత ఒక్కడే పాలించిన తన సోదరుడు, తండ్రి పుణ్యఫలానికి రెండు గ్రామాలు దానం చేశాడని భావించవచ్చును.

గజపతి దండయాత్ర శక 1341-42: వేమ, వీరభద్ర మొదలైన సమర్థులైన అల్లాడరెడ్డి కుమారులుండగా రాజమహేంద్రవర రాజ్యం అనప్రోలారెడ్డి సంతతికి ఎలా వెళ్లింది అనే సందేహం కలుగుతుంది. ఆనాటి కైఫీయత్తులు కొంత సమాచారం ఇస్తున్నాయి. స్థానిక కైఫీయత్తులు శక 1341-42 అంటే క్రీ.శ.1420లో లాంగూల గజపతి కొండవీటిని జయించాడని తెలుపుతున్నాయి. రాజమహేంద్రవర రాజ్యాన్ని విజయనగర చక్రవర్తులు ఆక్రమించినది శక 1364 అని అవే కైఫీయత్తులు తెలుపుతున్నాయి. లాంగూల గజపతి కొండవీడు దుర్గాన్ని బాగుచేయించి క్రీ.శ 1420 నుండి 1431 వరకు కటకం మొదలు ఉదయగిరి పర్యంతం 12 సంవత్సరాలు పాలించాడని, అతని తర్వాత ప్రతాపదేవరాయలు క్రీ.శ.1431 నుండి 1449 వరకు పాలించాడని, అతని తర్వాత 1449 నుండి 1454 వరకు హరిహరదేవరాయలు పాలించాడని కొండవీటి దండకవిలె తెలుపుతోంది. రెండవదేవరాయలు కొండవీటిని జయించే వరకు అది గజపతుల స్వాధీనంలో ఉందని స్పష్టంగా చెప్పవచ్చును. లాంగూల గజపతిని కొందరు నాల్గవ నరసింహుడని అంటారు. కాని అది వాస్తవం కాదు. చివరి గంగ చక్రవర్తి నాల్గవ భానుదేవునికి నిశ్శంకభానుదేవ, కజ్జల భానుదేవ అనే పేర్లు కూడా ఉన్నాయి. నిశ్శంక భానుదేవునికి లాంగూల నరసింహ అనే కుమారుడు ఉన్నాడేమో? ఏమైనప్పటికీ నాల్గవ భానుదేవుడు రాజమహేంద్రవరం, కొండవీడులపై దండయాత్ర చేసి ఆక్రమించాడు. ఆ సందర్భంలో నాల్గవ భానుదేవుడు విజయనగర రాజులకు అనుకూలురైన అనితల్లిని తొలగించి అనప్రోల కుమారులైన మూడవ కుమారగిరి, మూడవ అనపోతలను రాజమహేంద్రవర రాజ్యానికి తన సామంతులుగా నియమించి ఉండవచ్చును. అనపోతలను రాజమహేంద్రవర రాజ్యానికి తన సామంతులుగా నియమించి ఉండవచ్చును. అందువల్ల భానుదేవుని దండయాత్ర వల్ల అనితల్లి అధికారం క్రీ.శ.1420-1423 సంవత్సరాల మధ్య లేకుండా పోయి ఉంటుంది.

అనితల్లి పునః ప్రతిష్ట క్రీ.శ.1423: భానుదేవుడు తిరిగివెళ్లిన తర్వాత అల్లాడరెడ్డి కుమారులు వేమారెడ్డి, వీరభద్రారెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని తిరిగి సంపాదించారు. వారు యుద్ధం చేసి గజపతిసేనలను పారదోలి సంపాదించారా లేక భానుదేవునితో సంప్రదించి తమ రాజ్యాన్ని తిరిగి సంపాదించినట్లు మల్లంపల్లి సోమశేఖరశర్మ

భావించారు. రాజ్యం సంపాదించిన తర్వాత వేమారెడ్డి అనితల్లికి రాణిగా ప్రకటించాడు. అనితల్లి రాజ్యానికి నిజమైన వారసురాలు. కాటయవేమారెడ్డికి వేమారెడ్డి కూడా అల్లుడేకాని, తన తమ్ముని భార్య అనితల్లి అటు కొండవీటి రక్త సంబంధీకురాలు. ఇటు కాటయవేమారెడ్డి కుమార్తె. కనుక రెండు కుటుంబాల పరంగా ఆమెదే నిజమైన హక్కు కనుక వేమారెడ్డి రాజ్యాన్ని అనితల్లికి చెందినదిగా నిర్ణయించాడు. అనితల్లి భర్త వీరభద్రారెడ్డి గనుక వేమారెడ్డి వారిద్దరికీ పట్టాభిషేకం జరిపాడు. అయినప్పటికీ తాను కూడా పరిపాలనలో పాలు పంచుకున్నాడు. అన్నదమ్ములిద్దరూ రాజ్యాన్ని దక్షతతో క్రీ.శ.1423 నుండి 1448 వరకు సుమారు 25 సంవత్సరాలు పాలించారు.

అనితల్లి - వీరభద్రారెడ్డి పునరుద్ధరణ: విజయనగర సైన్యాల విజయం సహజంగానే అనితల్లి రాజ్యాన్ని పునరుద్ధరించింది. అనితల్లి భర్త వీరభద్రారెడ్డి సింహాసనమధిష్టించాడు. అతని అన్న అల్లయ వేమారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. అన్నదమ్ముల రాజ్యాన్ని దక్షతతో 20 సంవత్సరాలు పాలించాడు. కాని రాజమహేంద్రవర రాజ్యం విజయనగర సామ్రాజ్యానికి సామంతరాజ్యం అయింది. అన్నదమ్ములు విజయనగర సార్వభౌమాధికారాన్ని అంగీకరించి దక్షతతో తమ రాజ్యాన్ని పాలించారు.

వీరభద్రారెడ్డి పరిపాలన క్రీ.శ.1448 వరకు: వేమను అల్లయవేమ అని, వీరభద్రారెడ్డిని అల్లయ వీరభద్రారెడ్డి అని కూడా సాహిత్యం ప్రస్తావిస్తోంది. తమ ఉత్తరప్రాంతాలను గజపతికి పోగొట్టుకోవడం వారికి బాధను కలిగించింది. ఆ ప్రాంతాలు సంపాదించడానికి అవకాశం కోసం ఎదురుచూస్తుండగా మరొక ఉపద్రవం వచ్చింది. విజయనగర చక్రవర్తి రెండవదేవరాయలు గజపతులను పారదోలి కొండవీటి రాజ్యాన్ని జయించాడు శక 1353లో జయించాడని కైఫీయత్తులు తెలుపుతున్నాయి. కాని ఈ తేదీ తప్పని, శక 1350లో అంటే క్రీ.శ.1428లో తెలుంగరాయుడు విజయనగరసేనానిగా సింహాచలం వరకు జయించి అక్కడ శక 1428లో శాసనం వేయించాడు. రెండవదేవరాయలు ఆనాటికే గజపతిని జయించాడని, శక 1351 అనగా క్రీ.శ.1429 నాటి అతని ముదబిదురె శాసనం బలపరుస్తోంది. ఈ శాసనం ఏనుగులను సింహం హతమార్చినట్లు రాయలు గజపతి సైన్యాన్ని నాశనం చేశాడని వర్ణిస్తోంది. విజయంలో భాగంగానే తెలుంగరాయుడు సింహాచలం చేరి ఉంటాడు. అలాగే వెలుగోటి వారి వంశావళి కుమార మాధవనేడు కుమారుడు లింగమనేడు అల్లయవేమ, వీరభద్రారెడ్డిలను ఓడించి రాజమహేంద్రవర రాజ్యాన్ని కొల్లగొట్టి సింహాచలం చేరాడని తెలుపుతోంది. ఇవి రెండు వేరువేరు దండయాత్రలు కాకపోవచ్చును. వెలమలు క్రీ.శ.1417 పానుగల్లు యుద్ధం నాటి నుండి విజయనగర రాజ్యంతో సఖ్యతగా ఉన్నారు. కనుక విజయనగర సేనాధిపతులుగా లింగమనేడు తెలుంగరాయుడు క్రీ.శ.1428లో రాజమహేంద్రవర రాజ్యంపై దాడి చేసి సింహాచలం చేరి శాసనం వేయించి ఉంటారు. అదే విజయాన్ని వెలుగోటివారి వంశావళి పేర్కొని ఉంటుంది. రెండవ దేవరాయలు అల్లయవేమ, వీరభద్రారెడ్డిలకు సమకాలికుడు. అతడు కొండవీటిని జయించి విజయనగర సామ్రాజ్యంలో కలిపివేశాడు. దాంతో కొండవీటి రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో భాగం అయిపోయింది. సింహాచలం వరకు విజయనగర ఆధిపత్యం వ్యాపించింది. కనుక వీరభద్రారెడ్డి క్రీ.శ.1428 నుండి విజయనగర సామంతుడిగా మారిపోవలసి వచ్చింది. అయినప్పటికీ పూర్వపు బంధుత్వం వల్ల రెండవదేవరాయలు వారికి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. ఈ విజయాల తర్వాత రెండవ దేవరాయలు ఆంధ్ర నరేంద్ర సైన్యసాగర కలశోద్భవ అనే బిరుదు ధరించినట్లు క్రీ.శ.1420 నాటి శాసనం తెలుపుతోంది.

ఉత్తర ప్రాంతాలను జయించడం శక 1352-56: విజయనగర సహాయంతో అన్నదమ్ములు అంతకు పూర్వం భానుదేవునికి తాము కోల్పోయిన ప్రాంతాలను సంపాదించడానికి గాంగరాజ్య దక్షిణ సరిహద్దుపై దండయాత్ర చేసి సింహాచలం వరకు ప్రాంతాలను జయించారు. సింహాచలంలోని భానుదేవుని శాసనం శక 1352లో అన్నదమ్ములు సింహాచల ప్రాంతాన్ని జయించి ఉంటారు. శక 1356లో వేమారెడ్డి కలువలపల్లి, ఒడ్డాది, పొట్నూరు మొదలగు స్థలాలలోని దేవబ్రాహ్మణ మాన్యాలపై పన్నులను తగ్గిస్తూ శాసనం విడుదలచేశాడు. కనుక క్రీ.శ.1434 వరకు వీరభద్రారెడ్డి పరిపాలన సింహాచల ప్రాంతంపై కొనసాగింది. ఈ శాసనం స్పష్టం చేస్తోంది. అక్కడే వీరభద్రారెడ్డి తేదీలేని శాసనం కూడా ఉంది. అందులో అతడు శత్రుసైన్యాలు మాయమైపోయేలా చేశాడని వర్ణించారు. అన్నదమ్ములు గాంగరాజ్యంపై దండెత్తి అనేక ప్రాంతాలు జయించినట్లు శ్రీనాథుని రచనలు కూడా తెలుపుతున్నాయి. కోమటి వేమారెడ్డి మరణించిన తర్వాత శ్రీనాథునికి రాజాశ్రయం పోయింది. అతడు

రాజమహేంద్రవరం చేరి వీరభద్రారెడ్డి అభిమానాన్ని సంపాదించి రాజమహేంద్రవర ఆస్థాన కవిగా స్థిరపడ్డాడు. అక్కడ అతడు రాసిన తన కావ్యాలలో సోదరులు వీరభద్రారెడ్డి, వేమారెడ్డి, దొడ్డరెడ్ల విజయాలను పేర్కొన్నాడు. అతని రాతల ప్రకారం వారు సప్తమదేశం, చిడికాడ, లోటగడ్డ, శృంగారమ్‌కోట, కంచుకములు, కశింకోట, వెంకటాయి, కప్పకొండ, పాలకొండ, పొట్నూరు, ఒడ్డాది మొదలైన కోటలను జయించారని తెలుస్తోంది. ఈ కోటలను ఎప్పుడు జయించినదీ స్పష్టంగా తెలియదు. కాని క్రీ.శ.1434వ సంవత్సరం జులై నెలలో వేయించిన సింహాచలం శాసనం పొట్నూరు, ఒడ్డాది మొదలైన కోటలను జయించారని తెలుపుతోంది. కనుక వారు క్రీ.శ.1434లో ఈ దిగ్విజయ యాత్రలు జరిపి ఉండవచ్చును.

రాజమహేంద్రవర రాజ్యపతనం శక 1370 లేక క్రీ.శ.1448: వీరభద్రారెడ్డి పరిపాలన ఎనాళ్లు సాగిందీ క్రీ.శ.1434 నుండి తెలియ లేదు. క్రీ.శ.1428 నుండి 1434 వరకు వారి శాసనాలు లభించాయి. ఆ శాసనాలలో వీరభద్రారెడ్డితో పాటు అతని అన్న అన్నవేమారెడ్డి కూడా రాజుగానే పేర్కొనబడ్డాడు. దాన్ని బట్టి అన్నదమ్ములిద్దరూ భేదం లేకుండా రాజులుగా వ్యవహరించి ఉండవచ్చును. క్రీ.శ.1434 నుండి వారి శాసనాలు లభించడం లేదు. అందువల్ల రాజమహేంద్రవర రాజ్యపు పరిస్థితి అస్పష్టంగా ఉంది. క్రీ.శ.1434లో కళింగదేశంలో రాజకీయ విప్లవం జరిగి పెనుమార్పు సంభవించింది. కపిలేశ్వరగజపతి గంగవంశాన్ని తొలగించి గజపతి వంశాన్ని స్థాపించాడు. అతడు రాజమహేంద్రవర రాజ్యంపై దాడులు ప్రారంభించి ఉంటాడు. అందువల్ల వారు శాసనాలు వేయించలేకపోయి ఉండవచ్చును. అయితే 1444 వరకు అన్నదమ్ముల పాలన సాగిందని ఇతర శాసనాల ఆధారం ఉంది. 1437 సంవత్సరంలో వేయబడిన ఒక ప్రైవేటు శాసనంలో అల్లయ వేమారెడ్డి పేరు ఉంది. అలాగే 1444 నాటి రెండవ దేవరాయల సేనాధిపతి మల్లప్ప ఒడయారు ద్రాక్షారామంలో వేయించిన దానశాసనంలో వేమారెడ్డి పేరు ఉంది. క్రీ.శ.1434లో 900 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన కళింగ గాంగ వంశాన్ని తొలగించి కపిలేశ్వర గజపతి కళింగదేశంలో గజపతి వంశాన్ని స్థాపించాడు. అతడు దక్షిణ కళింగలో విజయనగర అధికారం రాజమహేంద్రవర రాజ్యంలో ఉండటం సహించలేకపోయాడు. వారు భానుదేవుని ఓడించి సంపాదించిన ప్రాంతాలను తిరిగి జయించడమే గాక, రాజమహేంద్రవర రాజ్యాన్ని కూడా గజపతి సామ్రాజ్యంలో కలపాలని రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు. వేమ వీరభద్రారెడ్లకు సహాయంగా విజయనగర చక్రవర్తి రెండవ దేవరాయలు తన సేనాని మల్లప్ప ఒడరాయను పంపాడు. అతడు గజపతిని ఓడించి తరిమి క్రీ.శ.1444లో ద్రాక్షారామంలో వేమారెడ్డి అనుమతితో శాసనం వేయించాడు. కనుక క్రీ.శ.1444లో గజపతి రాజమహేంద్రవర రాజ్యాన్ని కబళించడానికి ప్రయత్నం చేశాడని రూఢి అవుతోంది. కాని జయించలేకపోయాడు. కనుక 1444 వరకు రాజమహేంద్రవర రాజ్యం అన్నదమ్ముల ఆధీనంలోనే ఉందని స్పష్టంగా చెప్పవచ్చును. 1446లో రెండవ దేవరాయలు మరణించాడు. దాంతో విజయనగర రాజ్యపరిస్థితులు అస్తవ్యస్తమై వారి రాజ్యానికి సహాయం చేయలేకపోయి ఉండవచ్చును. రెండవ దేవరాయల మరణాన్ని ఆసరాగా తీసుకొని కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తి అన్నదమ్ములను జయించి రాజ్యాన్ని ఆక్రమించి ఉండవచ్చును. శక 1370 సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ శాసనం కపిలేశ్వరుని గజపతి క్షోణీశ్వర అని పేర్కొంది. ఈ శాసనం క్రీ.శ.1448వ సంవత్సరంలో నాటిది. కనుక 1448వ సంవత్సరం నాటికి రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం గజపతి సామ్రాజ్యంలో భాగం అయిపోయిందని స్పష్టంగా చెప్పవచ్చును. కపిలేశ్వర గజపతితో జరిగిన యుద్ధంలో అన్నదమ్ములు వేమ, వీరభద్ర, దొడ్డారెడ్లు పోరాడుతూ ముగ్గురూ మరణించి ఉంటారు. ఆ తర్వాత వారి వివరాలు తెలియవు. వీరి మరణంతో ఆంధ్రదేశ చరిత్రలో ప్రోలయ వేమారెడ్డితో ప్రారంభమైన రెడ్డిరాజ్యం అంతరించింది. కొమ్మన, శ్రీనాథుడు నివసించిన రాజమహేంద్రవర రాజ్యం కాలగర్భంలో కలిసిపోయింది.

రెడ్డి రాజ్యానికి పొరుగు రాజ్యాలతో గల సంబంధాలు

విజయనగర రెడ్డిరాజ్య సంబంధాలు: క్రీ శ.1323లో కాకతీయ సామ్రాజ్యాన్ని అంతం చేసి ఆంధ్రదేశాన్ని ఆక్రమించిన తుగ్లక్‌లను క్రీ శ.1325-35 సంవత్సరాల మధ్య ఆంధ్రవీరులు పారద్రోలి ఆంధ్రదేశాన్ని విముక్తి చేశారు. కాపయనాయకుడు ఆంధ్ర సురత్రాణ, ఆంధ్రాధీశ్వర అనే బిరుదులతో ఓరుగల్లు సింహాసనం అధిష్టించాడు కాని ఆంధ్రుల ఐక్యత తాత్కాలికమైంది. ముస్లింల భయం తీరిన తర్వాత ఎవరికి వారు సొంత రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు దాని ఫలితంగా ఆంధ్రదేశంలో అనేక రాజ్యాలు ఏర్పడ్డాయి. ఓరుగల్లులో ముసునూరి రాజ్యం, దేవరకొండ, రాచకొండలలో పద్మనాయకరాజ్యం, అద్దంకి, కొండవీడులలో రెడ్డిరాజ్యం, కోరుకొండలో మంచికొండ వారి రాజ్యం, పిఠాపురంలో కొప్పుల వెలమ వారి రాజ్యం మొదలైన రాజ్యాలు ఏర్పడ్డాయి. ఇదే కాలంలో అనెగొందిలో విజయనగర రాజ్యం, గుల్బర్గాలో బహమనీ రాజ్యాలు వెలశాయి కళింగలో ప్రాచీన కాలం నుండి పాలించే గాంగవంశం పాలిస్తోంది ఈ రాజ్యాలన్నీ ఎవరికి వారే పక్కవారి రాజ్యాలు ఆక్రమించాలని పోరాటాలకు దిగాయి.

ప్రోలయవేమారెడ్డి క్రీ శ.1325లో అద్దంకిలో రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు. అతడు ఉత్తరాన కృష్ణానది నుండి దక్షిణాన నెల్లూరు జిల్లావరకు తన రాజ్యాన్ని విస్తరించాడు. పశ్చిమాన శ్రీశైలం అహోబిలం వరకు తూర్పున బంగాళాఖాతం వరకు అతని ఆధీనంలో ఉండేది. రెడ్డి రాజ్యానికి వాయవ్యంగా ప్రవహించే కృష్ణానది తెలంగాణలో స్థాపించబడిన రాచకొండ, దేవరకొండ పద్మనాయక రాజ్యానికి సరిహద్దుగా ఉండేది. తెలంగాణ నుండి వేంగిలోకి విస్తరించి ఉన్న ముసునూరి నాయక రాజ్యానికి కూడా కృష్ణానది సరిహద్దుగా ఉండేది. రెడ్డి రాజ్యానికి ఉత్తరాన కృష్ణానది సరిహద్దు రెడ్డిరాజ్యానికి దక్షిణ దిక్కున విజయనగర రాజ్యం ఉండేది. విజయనగర రాజ్యం త్వరితగతిన బలపడి అన్ని దిక్కులకు విస్తరించసాగింది. వారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా విజయనగర రాజులు రెడ్డి రాజ్యంపై కూడా దండెత్తారు దాంతో విజయనగర, రెడ్డిరాజ్యాలకు ఘర్షణ ప్రారంభమైంది. వారి సంఘర్షణ మొదటి తరంలోనే ప్రారంభమై కొండవీటి రాజ్యం అస్తమించే వరకు కొనసాగింది. చివరకు కొండవీటి రాజ్యం విజయనగర రాజ్యంలో భాగమైపోయింది.

ప్రోలయ వేమారెడ్డి క్రీ.శ.1325-1353: ప్రోలయ వేమారెడ్డి తన తొలి సంవత్సరంలోనే నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి వరకు ఆక్రమించినట్లు కనిపిస్తోంది. రెడ్ల స్వస్థానం కూడా నెల్లూరు జిల్లాయే. ప్రోలయ వేమారెడ్డి వారిది గూడూరు ప్రాంతం. అలాగే వారి వియ్యంకులైన దొడ్డారెడ్డి, కాటారెడ్లది నెల్లూరు లేక విక్రమసింహపురం కనుక వారి స్వస్థానమైన నెల్లూరు ప్రాంతాన్ని ముస్లిం నుండి విముక్తి చేశారు కాని క్రీ.శ.1343లో విజయనగర చక్రవర్తి మొదటి హరిహరరాయలు ఉదయగిరిని ఆక్రమించాడు. క్రీ.శ.1343 నాటికే విజయనగర శాసనాలు హరిహరుని పూర్వసముద్రాధీశ్వరా అని పేర్కొన్నాయి. నెల్లూరు జిల్లాను ఆనాడు పాకనాడు అని పిలిచేవారు పాకనాటిలోని పశ్చిమోత్తర భాగంలో ఉదయగిరి దుర్గం ఉంది. దానిని వారు ప్రోలయ వేమారెడ్డి నుండే జయించి ఉండాలి ఉదయగిరిని ఆక్రమించిన తర్వాత విజయనగర చక్రవర్తులు దానిని తూర్పు ప్రాంతానికి కేంద్రంగా చేసి ఆ దుర్గాన్ని బలిష్టంగా తీర్చిదిద్దారు. రాయసింహాసనానికి ఉదయగిరి దుర్గానికి అధిపతులుగా నియమించేవారు దానిని బట్టి విజయనగర చక్రవర్తులు ఉదయగిరికి ఎంతటి ప్రాముఖ్యత ఇచ్చారో తెలుస్తోంది. నాటి ఉదయగిరి, మోపూరు శాసనాలు క్రీ.శ.1346-47 నాటి కొడవలూరు శాసనాలు తెలుపుతున్నాయి. కనుకనే ఉదయగిరి విజయం అద్దంకి రెడ్డిరాజ్య ఆక్రమణకు అంకురార్పణ చేసిందని భవిష్యత్తులో తీరాంధ్రదేశ చరిత్ర గతిని మార్చిందని ఆచార్య నేలటూరి వెంకటరమణయ్య వ్యాఖ్యానించారు ఉదయగిరిని ఆక్రమించిన నాటినుండే రెడ్డి రాజ్య భద్రతకు ముప్పు ఏర్పడింది. ఉదయగిరిని పోగొట్టుకున్న తర్వాత రెడ్డిరాజ్యం కందుకూరు వరకే పరిమితమైంది.

అనపోతారెడ్డి క్రీ.శ.1352-64: ప్రోలయ వేమారెడ్డి తర్వాత అతని కుమారుడు అనపోతారెడ్డి క్రీ.శ.1353లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1364 వరకు పాలించాడు. ఇతడు విజయనగర చక్రవర్తి బుక్కరాయల సమకాలికుడు. ఇతని కాలంలో విజయనగర రాజ్యం వల్ల మరీ ప్రమాదం ముంచుకొని వచ్చింది క్రీ.శ.1363-64లో బుక్కరాయలు రెడ్డిరాజ్యంపై దండెత్తి పొదిలి, దర్శి, శ్రీశైలం, అహోబిలం, వినుకొండలను

జయించాడు. విజయనగర సైన్యాలు రెడ్డి రాజధాని అద్దంకికి అతి సమీపంలోకి వచ్చాయి. పొదిలి, దర్శి ప్రాంతాలలో లభించిన విజయనగర శాసనాలు వారి విజయాలను బలపరుస్తున్నాయి. విజయనగర సైన్యాల పురోగమనాన్ని చూసిన అనపోతారెడ్డి తన రాజధానికి భద్రత లేకుండా వాపోయిందని భయపడి రాజధానిని క్రీ.శ.1364లో అద్దంకి నుండి కొండవీటికి మార్చాడు. 1377 వరకు జయించిన ప్రాంతాలు విజయనగర రాజ్యంలోనే ఉన్నాయని నర్సరావుపేట వద్ద ఉన్న చాంగలనాడులోని క్రీ.శ.1371 నాటి శాసనం స్పష్టం చేస్తోంది.

అనవేమారెడ్డి క్రీ.శ.1364-1386: రెడ్డిరాజ్యంతోపాటే రాచకొండ, దేవరకొండలో మొదటి సింగయ నాయకుడు పద్మనాయక రాజ్యాన్ని స్థాపించాడు. ఈ రాజ్యాలు స్థాపించిన నాటి నుంచి అంతమయ్యే వరకు ఆగర్భ శత్రువుల లాగా పోరాడి నశించాయి. పద్మనాయకులతో ప్రోలయ వేమారెడ్డి ఘర్షణ పడలేదు. అతని కుమారుడు అనపోతారెడ్డి కాలం నుండి వారి సంఘర్షణ ప్రారంభమైంది.

అనపోతారెడ్డి క్రీ.శ.1353-64: అనపోతారెడ్డి కాలంలో సింగమనాయకుడు బల్లిపల్లి చాళుక్యులపై దండెత్తి అక్కడ చంపబడ్డాడు. ఆ యుద్ధంలో చాళుక్యులకు అనపోతారెడ్డి సహాయం చేశాడని సింగమనాయకుని కుమారులు మొదటి అనపోతా నాయకుడు, మాదానాయకుడు అనుమానించి రెడ్డిరాజ్య భాగాలైన శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాలను ఆక్రమించారు. తర్వాత ధరణికోటపై దండెత్తారు. అక్కడ అనపోతారెడ్డి వారిని ఎదిరించి ఓడిపోయారు. ఓడి పారిపోతున్న అనపోతారెడ్డిని పట్టుకొని మాదానాయకుడు వీపుపై తన చిహ్నాలను ముద్రించి వదిలివేశాడని వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. అంటే ఈ యుద్ధంలో అనపోతా నాయకుడు అవమానం పాలయ్యాడు. రెడ్డి సైన్యాలు ఓడిపోయాయి.

అనవేమారెడ్డి క్రీ.శ.1364-86: అనవేమారెడ్డి అన్నకు జరిగిన పరాభవానికి వెలమ రాజ్యంపై దండెత్తి నల్లగొండ జిల్లాలోని ఓడపల్లి, బూరుగుగడ్డలను జయించాడు. శక 1299 నాటి ఓడపల్లి, బూరుగుగడ్డ శాసనాలు అతని విజయాలను పేర్కొంటున్నాయి.

కుమారగిరి క్రీ.శ.1386-1402: కుమారగిరి కాలంలో కూడా వెలమలు దాడి చేశారు. కుమారగిరి చివరికాలంలో దేవరకొండ పాలకుడు పెదవేదగిరి రాజమహేంద్రవర రాజ్యంపై దాడి చేశాడు.

పెదకోమటి వేమారెడ్డి క్రీ.శ.1402-1420: పెదకోమటి వేమారెడ్డి సింహాసనం అధిష్టించగానే పెదవేదగిరి కుమారుడు అన్నదేవునికి సహాయంగా వేంగిరాజ్యంపై దండెత్తాడు. అన్నదేవచోడుడు కృష్ణా గోదావరీ మధ్య ప్రాంతాన్ని ఆక్రమించి తన స్వంత రాజ్యాన్ని క్రీ.శ.1407-18 ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నాడు. రాజమహేంద్రవర రాజ్యాన్ని ఆక్రమించడానికి పెదకోమటి వేమారెడ్డి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాను ఆహ్వానించాడు. అతడు పెదకోమటి వేమారెడ్డితో చేరిపోయాడు. అల్లాడరెడ్డికి సహాయంగా వచ్చిన మొదటి దేవరాయలు పానుగల్లు చేరి వెలమలతో సంప్రదించి వారిని తన వైపుకు తిప్పుకున్నాడు. పానుగల్లు యుద్ధంలో వెలమలు విజయనగరం వారు ఒకవైపు, ఫిరోజ్‌షా, రెడ్లు మరియొక వైపు పోరాడారు. ఈ యుద్ధంలో దేవరకొండ పెదవేదగిరి, పెదకోమటి వేమారెడ్డి దేవరకొండపై దండెత్తి పెదవేదగిరిని తలసరికి తమ్ముడికి తర్పణం చేసి వేదగిరి తలన తమ్మపడిగలో పెట్టాడట. అందుకు ప్రతీకారంగా పెదవేదగిరి తమ్ముడు లింగమనేడు కొండవీటిపై దండెత్తి పెదకోమటి వేమారెడ్డిని సంహరించి, అతని తలసరికి తమ్మపడిగలో పెట్టి పెదకోమటి వేమారెడ్డి ఎనపోతు కటారిని తీసుకొని వెళ్లాడట. ఈ విధంగా ఉభయ రాజ్యాలు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో విరోధాలు సాగించి ఉభయులు నాశనమయ్యారు.

రాజమహేంద్రవర రాజ్యంపై లింగమనేని దాడి: పెదకోమటి వేమారెడ్డిని సంహరించిన తర్వాత లింగమనేడు రాజమహేంద్రవర రాజ్యంపై కూడా దండెత్తి అల్లకల్లోలం చేశాడు. అంతకుముందు పెదవేదగిరి సింహాచలం, శ్రీకూర్మం వరకు దండెత్తాడు. అతని శాసనాలు సింహాచలం, శ్రీకూర్మంలో ఉన్నాయి. రాజమహేంద్రవర రాజ్యంతో కూడా పద్మనాయకులు విరోధాన్నే పాటించారు. వారి అంతఃకలహాలు ఆంధ్రదేశాన్ని బలహీనపరిచాయి. చివరకు రెడ్డి రాజ్యాన్ని గజపతులు, పద్మనాయక రాజ్యాన్ని బహమనీ సుల్తాన్‌లు ఆక్రమించారు. క్రీ.శ.1411 నాటికి ఇంకొల్లు వరకు స్వాధీనమైంది. ఇదే కాలంలో పెదకోమటి వేమారెడ్డి అన్నదేవచోడుడు కలిసి కాటయవేమారెడ్డిపై దండెత్తి గుండుగొలను, కాకరపర్తి యుద్ధాలలో అతనిని ఓడించి వధించాడు. కాటయవేమారెడ్డి మరణం తర్వాత దేవరాయల సైన్యాలు తిరిగి విజయనగరం తిరిగి వెళ్తూ కందుకూరు రెడ్లపై దండెత్తి వారిని ఓడించి క్రీ.శ.1413-14లో తన సామంతులుగా చేసుకున్నాడు.

కాటయవేమారెడ్డి మరణం తర్వాత అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని రక్షించడానికి నడుం కట్టాడు. అతనిని లొంగదీసి రాజమహేంద్రవర రాజ్యాన్ని కలుపుకోడానికి పెదకోమటి వేమారెడ్డి బహమనీసుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం అర్థించాడు. సుల్తాన్ పెదకోమటి వేమారెడ్డికి సహాయంగా రాజమహేంద్రవర రాజ్యంపై దాడి చేశాడు. అల్లాడరెడ్డికి సహాయంగా .మొదటి దేవరాయలు మళ్ళీ బయలుదేరి వచ్చి తన సైన్యాన్ని రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని మోటుపల్లిపైకి పంపి, మరొక భాగాన్ని పానుగల్లువైపు పంపాడు. ఫిరోజ్‌షా తన రాజ్యాన్ని కాపాడుకోటానికి వచ్చి పానుగల్లు యుద్ధంలో ఓడి పారిపోయాడు. మోటుపల్లిపైకి పంపిన విజయనగరసేన మోటుపల్లిని జయించింది. దాంతో పెదకోమటివేమారెడ్డి తూర్పుకోస్తాలో నాల్గవ భానుదేవుడు తీరాంధ్రదేశంపై దండెత్తాడు. ఇదే సమయంలో కళింగ గాంగవంశస్తుడు నాల్గవ భానుదేవుడు తీరాంధ్ర దేశంపై దండెత్తాడు. అతన్ని తరుముతూ విజయనగర సైన్యాలు రాజమహేంద్రవరం చేరాయి. వారి యుద్ధం వల్ల తన రాజ్యం పాడైపోతుందని గ్రహించి అల్లాడరెడ్డి వారికి సంధి కుదిర్చి పంపివేశాడు.

పానుగల్లు యుద్ధం తర్వాత పెదకోమటి వేమునకు పద్మనాయకులతో యుద్ధం వచ్చి ఆ యుద్ధంలో పెదకోమటి వేమారెడ్డి మరణించాడు. అతని కుమారుడు రాచవేమారెడ్డి రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో రాజ్యం బాగా బలహీనపడింది. అతనిని క్రీ.శ 1424లో సవరం ఎల్లయ్య అనే బలిజనాయకుడు చంపాడు. అతని మరణం తర్వాత నాల్గవ భానుదేవుడు కొండవీటి రాజ్యాన్ని ఆక్రమించాడు. అతనిని పారదోలి రెండవదేవరాయలు కొండవీటి రాజ్యాన్ని క్రీ.శ.1428-30 సంవత్సరాల మధ్య విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. అంతటితో కొండవీటి రెడ్డి రాజ్యం అస్తమించింది.

రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం క్రీ.శ.1448: కొండవీటి రెడ్డిరాజ్య అవశేషమైన రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం మరొక 25 సంవత్సరాలు కొనసాగింది. కొండవీటిని జయించిన తర్వాత రెండవ దేవరాయలు రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తి అక్కడ పాలించిన వీరభద్రారెడ్డి, అనితల్లిని తన సామంతులుగా చేసుకున్నాడు. క్రీ.శ.1435-38 సంవత్సరాల మధ్య కపిలేశ్వర గజపతి కళింగలో గాంగవంశాన్ని కూలదోసి గజపతి రాజ్యాన్ని స్థాపించాడు. అతడు క్రీ.శ.1444లో రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు. రెండవ దేవరాయలు వీరభద్రారెడ్డికి సహాయంగా మల్లప్ప ఒడయారును పంపాడు. అతడు గజపతిని ఓడించి తరిమాడు క్రీ.శ.1446లో రెండవ దేవరాయలు మరణించాడు. అదే అదనుగా తీసుకొని కపిలేశ్వర గజపతి క్రీ.శ.1448లో రాజమహేంద్రవర రెడ్డిరాజ్యాన్ని జయించాడు. దాంతో క్రీ.శ.1448లో రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం కూడా అంతరించిపోయింది.

ఉత్తరాంధ్ర లేక దక్షిణ కళింగ లేక కళింగాంధ్ర చరిత్ర

ఆంధ్రదేశంలో కళింగ గాంగుల సార్వభౌమాధికారం

మలి గాంగ వంశ వృక్షం

కామార్ణవ
|
వజ్రహస్త
|
మొదటి రాజరాజ
|
చోడగంగ
|
కామార్ణవ — రాఘవ — రెండవ రాజరాజ — రెండవ అనంగభీమ

రెండవ అనంగభీమ
|
మూడవ రాజరాజ
|
మొదటి నరసింహదేవ
|
రెండవ భానుదేవ
|
రెండవ నరసింహదేవ
|
రెండవ భానుదేవ
|
మూడవ నరసింహదేవ
|
నాల్గవ నరసింహదేవ

సింహాచలం నుండి రాజమహేంద్రవరం వరకు ఉన్న ప్రాంతాన్ని దక్షిణ కళింగ అని పిలిచేవారు. దాని రాజధాని పిఠాపురం, సింహాచలం నుండి శ్రీకాకుళం వరకు ఉన్న ప్రాంతాన్ని మధ్యకళింగ అనేవారు. ఈ రెండు ప్రాంతాలు ఆంధ్రదేశంలో భాగాలు. కళింగ గాంగులు మొదట తమరాజ్యాన్ని ఆంధ్రదేశంలోనే స్థాపించారు. వారి మొదటి రాజధాని దంతపురం. రెండవ రాజధాని ముఖలింగం. ఈ రెండూ శ్రీకాకుళంలోనే ఉన్నాయి. మధ్యకళింగ వారిస్థావరం. దక్షిణకళింగను తమ రాజ్యంలో చేర్చుకోవాలని మొదటి నుండీ వారు ప్రయత్నించేవారు. వేంగిలోని తూర్పు చాళుక్యులు కూడా దక్షిణకళింగ తమ ఆధిపత్యంలో ఉండాలని కోరుకొనేవారు. అందువల్ల దక్షిణ కళింగపై ఆధిపత్యం కోసం వేంగి కళింగ గాంగులకు తరచూ యుద్ధాలు జరిగేవి. చివరకు దక్షిణ కళింగ తూర్పు చాళుక్యుల వశమై తుది వరకు కొనసాగింది. వేంగి చాళుక్యుల తర్వాత చోళచాళుక్యుల కాలంలో కూడా తూర్పు గాంగ అనంతవర్మ చోడగంగు ద్రాక్షారామం వరకు జయించాడు. కాని మళ్లీ కోల్పోయాడు. అతని తర్వాత అతని వారసులు కూడా దక్షిణ కళింగపై ఆధిపత్యం కోసం వెలనాటి చోడులతో కూడా యుద్ధాలు చేస్తూనే వచ్చారు. ఈ ప్రాంతం కోసం రెడ్డిరాజులతో కూడా యుద్ధాలు చేశారు. కొండవీటి రెడ్డి రాజ్య పతనం తర్వాత నాల్గవ భానుదేవుడు దక్షిణ కళింగనేగాక కందుకూరు వరకు జయించి గాంగ సార్వభౌమాధికారాన్ని నెలకొల్పారు. కాని అతని కాలంలోనే కపిలేశ్వర గజపతి గాంగవంశాన్ని కూలదోసి స్థాపించాడు. గాంగవంశం అంతరించే వరకు వారు దక్షిణ కళింగ కోసం ఆ పోరాటాలు జరిపి ఆంధ్రదేశ చరిత్రలో స్థానం సంపాదించారు. కనుక కళింగ గాంగవంశస్తుల చరిత్ర కూడా ఆంధ్రదేశ చరిత్రలో భాగంగా ఉంది. అనంతవర్మ చోడగంగుని తర్వాత వారిని

కడపటి గాంగులనవచ్చును. వారి చరిత్ర ఈ భాగంలో వివరింపబడింది.

కళింగదేశాన్ని ఏలిన తూర్పు గాంగ వంశస్తులలో అనంతవర్మ చోడగంగు అగ్రగణ్యుడు. అతడు ఉత్తరాంధ్రపై దండెత్తి ద్రాక్షారామం వరకు జయించి తన సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. కాని చోళ చాళుక్యులు అతనిని ఓడించి తరిమివేయడమే గాక కళింగవేశంపై దండెత్తి అమానుష దమనకాండ జరిపారు. చోడగంగు తర్వాత ఉత్తరాంధ్రను వదులుకొని వెళ్లిపోయాడు. అతడు 72 సంవత్సరాల సుదీర్ఘకాలం పాలించి క్రీ.శ.1150లో మరణించాడు. అతని చరిత్ర వరకు తూర్పుగాంగుల చరిత్ర రెండవ భాగంలో వివరింపబడింది. అతని తర్వాత అతని కుమారులు, వారి వారసులు ఆంధ్రదేశంపై దండెత్తి ఉత్తరాంధ్రను జయించడానికి ప్రయత్నించారు మూడవ భానుదేవుడు కృష్ణాతీరం వరకు జయించాడు కొండవీటి రెడ్డి రాజ్యపతనం తర్వాత నాల్గవ భానుదేవుడు కందుకూరు వరకు తీరాంధ్రదేశాన్ని జయించి గాంగ సార్వభౌమాధికారాన్ని ఆంధ్రదేశంపై నెలకొల్పాడు అందువల్ల వారు ఆంధ్రదేశ చరిత్రలో స్థానం సంపాదించుకున్నారు. గాంగ వంశస్తులు మొదటి నుండి ఉత్తరాంధ్రలో గణనీయమైన పాత్రనే నిర్వహించారు. కనుక అనంతవర్మ చోడగంగుని తర్వాత తూర్పుగాంగ వంశస్తుల చరిత్ర ఈ భాగంలో వివరించడమైంది. అనంతవర్మ చోడగంగుని తర్వాత వారిని కడపటి తూర్పుగంగ వంశస్తులని చెప్పవచ్చును. వారి చరిత్ర ఈ భాగంలో వివరించాం.

కామార్ణవుడు క్రీ.శ.1150-1156: అనంతవర్మ చోడగంగుని తర్వాత అతని భార్య కస్తూరి కమోది కుమారుడు కామార్ణవుడు గాంగ సింహాసనమధిష్టించాడు. అతనికి 7వ కామార్ణవుడని పేరు. ఇతడు క్రీ.శ.1147 నుండే తండ్రితో సహపాలన చేశాడు. తండ్రి మరణానంతరం క్రీ.శ.1150లో సింహాసనం ఎక్కి 1156 వరకు పాలించాడు. ఇతనికి జటేశ్వరుడు మధుకామార్ణవుడు అని కూడా పేర్లున్నాయి. ఇతడు వెలనాటి రెండవ గొంకరాజుకు సమకాలికుడు. గొంకరాజు కాలంలో కోణహైహయులు తిరుగుబాటు చేశారు. తన తండ్రి కాలంలో కోల్పోయిన ఉత్తరాంధ్ర లేక దక్షిణ కళింగ ప్రాంతాలను జయించాలనే ఉద్దేశ్యంతో కామార్ణవుడు కోణ హైహయులను సమర్థించాడు. అందుకు కోపించిన గొంకరాజు ఉత్తరాంధ్రపై దండెత్తి హైహయులను ఓడించి అదుపులోకి తెచ్చుకొన్నాడు. తర్వాత హైహయులను సమర్థించినందుకు కామార్ణవుని శిక్షించే ఉద్దేశ్యంతో అతడు కళింగ రాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్రకు గొంకరాజు సేనాధిపతి కొమ్మనామాత్యుడు నాయకత్వం వహించాడు. ఈ యుద్ధంలో గొంకరాజుకు విజయం లభించి ఉత్తరాంధ్ర ప్రాంతాలు గొంకరాజు వశం అయ్యాయి తన సేనాని కొమ్మనామాత్యుని ఉత్తరాంధ్రలో తన ప్రతినిధిగా నిలిపాడు. అతడు ఎలమంచిలి రాజధానిగా చేసుకొని ఆ ప్రాంతాలను పాలించాడు. కొమ్మనామాత్యుని పాలనను సూచించే శాసనాలు అక్కడ లభించాయి వెలనాటి చోదులతో జరిగిన యుద్ధం తర్వాత క్రీ.శ.1155లో కామార్ణవుడు మరణించాడు.

రాఘవుడు క్రీ.శ.1156-1170: కామార్ణవుని తర్వాత అతని సోదరుడు సింహాసనానికి వచ్చాడు. ఇతడు అనంతవర్మ చోడగంగుని మరొక భార్య ఇందిరాదేవి కుమారుడు. ఈమె సూర్యవంశ రాజకుమారి. రాఘవునకు అనంతవర్మ అనే పేరు కూడా ఉంది. ఇతని కాలంలో బెంగాలునేలిన సేనవంశ విజయసేనుడు అతని రాజ్యంపై దండెత్తి ఓడించినట్లు సేనశాసనాలు తెలుపుతున్నాయి. ఇతడు కూడా రెండవ గొంక రాజుకు సమకాలికుడు రెండవ గొంకరాజు కాలంలోనే పిఠాపురం చాళుక్య వంశస్తుడైన మూడవ విజయాదిత్యుడు స్వతంత్రం ప్రకటించాడు. ఉత్తరాంధ్ర రాజకీయాలలో జోక్యం చేసుకొని రాఘవుడు పిఠాపురం చాళుక్యులను సమర్థించాడు వెలనాటి చోడుడు పిఠాపురంపై దండెత్తి అక్కడి చోళులను ఓడించి తర్వాత రాఘవుని కూడా ఓడించాడు రాఘవుడు కొన్ని ప్రాంతాలు కోల్పోయాడు. అపజయం తర్వాత అతడు ఉన్న రాజ్యంతో తృప్తిపడి దానినే పాలించుకుంటూ క్రీ.శ.1170లో మరణించాడు.

రెండవ రాజరాజ దేవుడు క్రీ.శ.1170-1194: రాఘవుని తర్వాత అనంతవర్మ చోడగంగుని మరొక భార్య చంద్రలేఖ కుమారుడు రెండవ రాజరాజదేవుడు గంగరాజ్యాధిపతి అయినాడు. ఇతనికి కూడా అనంతవర్మ అనే బిరుదు ఉంది. ఇతని భార్య సురమాదేవి. ఈమె గౌతమ గోత్రీకుడైన ద్వారదేవుని వంశస్తుడైన స్వప్నేశ్వరుని చెల్లెలు. ఇతడు చోళచాళుక్య చక్రవర్తి రెండవ రాజరాజచోడుడు, రెండవ రాజాధిరాజు మూడవ కుళోత్తుంగునికి, వరి ప్రతినిధి అయిన వెలనాటి మూడవ గొంకరాజుకు సమకాలికుడు. ఇతడు రాజ్యానికి రాగానే దక్షిణకళింగను ఆక్రమించాలని పిఠాపురంపై దండెత్తి పిఠాపుర చాళుక్యులను వధించి గోదావరీ నది వరకు ప్రాంతాన్ని ఆక్రమించాడు. వెలనాటి మూడవగొంక తన ప్రాంతంలోని సమస్యల వల్ల ఉత్తరాంధ్ర విషయాన్ని పట్టించుకోలేక

పోయాడు. కనుక ఇతని కాలంలో దక్షిణకళింగ గంగ సామ్రాజ్యంలో కలిసిపోయింది. కాని అది శాశ్వతంగా నిలువలేదు. మూడవగొంక కుమారుడు వెలనాటి పృథ్వీశ్వరుడు కళింగరాజ్యంపై దండెత్తాడు. అతని సైన్యానికి కొరవి వెన్నయామాత్యుడు, కొమ్మనమంత్రి కుమారుడు కాశ్యపగోత్రికుడైన కేతనమంత్రి కొల్లూరి ఎరపదేసటి మొదలైన సేనానులు నాయకత్వం వహించారు వారు కోనసీమను జయించి శ్రీకూర్మం చేరి అక్కడ క్రీ.శ.1188లో శాసనం వేయించాడు. శ్రీకూర్మం వరకు అంటే మధ్యకళింగ యావత్తూ పృథ్వీశ్వరుని వశమై వెలనాటి సామ్రాజ్యంలో చేరిపోయింది. వీరగొట్టం ఆనాడు కళింగరాజ్యంలోని ఒక ప్రధానస్థావరం. శత్రుదుర్భేద్యమైన కోట కనుక దానిని జయించినందుకు పృథ్వీశ్వరునికి వీరగొట్టవిభాళ అని బిరుదు వచ్చింది. దండయాత్రలో దక్షిణ మధ్య కళింగలు తన పరమైనందున ఆ ప్రాంతం శాశ్వతంగా తమ సామ్రాజ్యంలో ప్రాంతంగా ఉండేటట్లు స్థిరపరచడానికి పృథ్వీశ్వరుడు పిఠాపురంలో కొన్నాళ్లు ఉండిపోయారు. ఈ సందర్భంలో అతని తల్లి కుంతీమాధవ దేవాలయానికి దానం చేసి శాసనం వేయించింది. గంగవంశ సామంతులు, కోణ హైహయులు వెలనాటిచోదులు సామంతులయ్యారు. ఈ పరాజయం తర్వాత రెండవ రాజరాజదేవుని రాజ్యం సగం తగ్గిపోయింది అతనికి సంతానం లేదు. అతడు క్రీ.శ.1194 దాకా పాలించాడు. అతని తర్వాత అతని సోదరుడు చంద్రలేఖ రెండవ కుమారుడు అయిన అనియంక భీముడు రాజ్యానికి వచ్చాడు

రెండవ అనియంక భీముడు క్రీ.శ.1194-1198: రాజరాజదేవుని తర్వాత అతని సోదరుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు చంద్రలేఖ రెండవ కుమారుడు. ఇతని కాలంలో పోయిన రాజ్యాన్ని తిరిగి సంపాదించడానికి ప్రయత్నించలేదు. ఇతని రాణి వాఘల్లదేవి. ఇతని మంత్రులు స్వప్నేశ్వరదేవుడు, గోవిందుడు. స్వప్నేశ్వరదేవుడు రాజరాజదేవుని బావమరిది. అతడు మేఘేశ్వరాలయాన్ని నిర్మించాడు. మంత్రి గోవిందుడు బ్రాహ్మణుడు. అతడు చాటేశ్వరాలయాన్ని నిర్మించాడు. అనియంక భీముడు రాజ్యవిస్తరణ చేయకపోయినా కవిపండితులను పోషించాడు. ఇతడు 1198 వరకు పాలించాడు. అతని తర్వాత అతని కుమారుడు మూడవ రాజరాజదేవుడు రాజ్యానికి వచ్చాడు.

మూడవ రాజరాజ దేవుడు క్రీ.శ.1198-1211: ఇతనికి అనంతవర్మ అనే బిరుదు ఉంది. ఇతడు యలమంచిలి చాళుక్య రాజకుమారి సద్గుణాదేవిని వివాహం చేసుకున్నాడు. ఈమెకు మంకుణదేవి, మల్లణదేవి అని కూడా పేర్లున్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. ఇతని కాలంలో బెంగాలునేలిన సేనవంశస్తుడైన లక్షణసేనుడు ఇతని రాజ్యంపై దండెత్తి పూరీ వద్ద జయస్తంభం ప్రతిష్టించాడు. ఇతని కాలంలో ఉత్తరహిందూస్థానంలో పెనుమార్పులు సంభవించాయి. ఇతడు ఢిల్లీనేలిన చౌహాను వంశస్తుడైన పృథ్వీరాజు, కనోజ్‌నేలిన జయచంద్రులకు సమకాలికుడు. ఇతని కాలంలోనే ఘోరీమహమ్మద్ పృథ్వీరాజును ఓడించి ఢిల్లీలో ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించాడు. తర్వాత జయచంద్రుని ఓడించి కనోజ్‌ను ఆక్రమించాడు. అతని సేనాని భక్తియార్ ఖిల్జీ బెంగాలును ఏలిన లక్షణసేనుని పారద్రోలి బెంగాలును ఆక్రమించాడు. బెంగాలునాక్రమించిన ముస్లిం సేనలు క్రీ.శ.1205లో జాజీనగర్‌పై దండెత్తాయని ముస్లిం రచయితలైన మిన్హాజుద్దీన్ రాసిన తబఖాతె నాసిరి, ములామ్‌హుస్సేన్ సలీం రాసిన రియాజున్ సలాతిన్ అనే గ్రంధాలు తెలుపుతున్నాయి. కాని ఈ దండయాత్ర వల్ల అతడు రాజ్యభాగాలను కోల్పోలేదు. ముస్లింలు దోపిడీ చేసి తిరిగి వెళ్లిపోయి ఉండవచ్చును.

అదే విధంగా ఆంధ్రదేశంలో కూడా పెను మార్పులు జరిగాయి. వెలనాటి పృథ్వీశ్వరుడు తెలుగుచోళులతో చేసిన యుద్ధంలో క్రీ.శ.1210లో మరణించాడు. అతని మరణం తర్వాత కాకతి గణపతిదేవుడు వేంగిరాజ్యాన్ని ఆక్రమించాడు. దాంతో తీరాంధ్రదేశానికి కాకతీయులు ప్రభువులైనారు. కాకతి గణపతిదేవుడు ఉత్తరాంధ్రను ఆక్రమించడానికి తనసేనానులైన ఏరువ తెలుగుచోడభీముడు, రేచర్ల రాజానాయకులను పంపాడు. వారు గోదావరిని దాటి మాడియలను పంద్రెండు మన్నియాలను జయించాడు. తర్వాత టెక్కలిని ఆక్రమించి గంజాంలో ప్రవేశించారు. అక్కడున్న అస్క తాలూకాలోని బొక్కెర వద్ద గోధుమరట్టి అనే గంగసేనాని కాకతీయులను ఎదిరించాడు. అతనిని, అతని అనుచరులను కాకతీయ సేనలు వధించాయి. బొక్కెర యుద్ధంలో గోధుమరట్ట హతుడయ్యాడని జాయపసేనాని తన గణపేశ్వరం శాసనంలో పేర్కొన్నాడు. తర్వాత పెదకిమిడిని ఆక్రమించి ఉదయగిరి దుర్గాన్ని చేరారు. పరమారయ్య అనే మరొక గంగసేనాని వారిని ఎదిరించాడు. అతనిని సంహరించి ఉదయగిరి నాక్రమించాడు. ఉదయగిరిని జయించినట్లు గొడిశాల శాసనం తెలుపుతోంది. తర్వాత బస్తరులో ప్రవేశించి చక్రకూటాన్ని జయించారు. అక్కడి నుండి కాకతీయ సైన్యాలు ఎదురులేకుండా గోదావరి దాటి

ద్రాక్షారామం చేరాయి. మొత్తం మీద ఇతని కాలంలో వెలనాటిచోడుల స్థానంలో కాకతీయులు కళింగగాంగులకు ప్రత్యర్థులయ్యారు. ఉత్తరాంధ్ర ప్రాంతాలకై గాంగులకు, కాకతీయులకు పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఇతడు అదే సంవత్సరం క్రీ.శ.1211లో మరణించాడు.

అనంగ భీముడు క్రీ.శ.1211-1245: మూడవ రాజరాజదేవుని తర్వాత అతని కుమారుడు రెండవ అనంగ భీముడు గంగ సింహాసనమధిష్టించాడు. ఇతనికి మూడవ అనియంక భీముడని కూడా పేరుంది. ఇతని రాణి కస్తూరదేవి. ఇతడు గొప్ప వీరుడు, యుద్ధనీతి విశారదుడు. ఇతడు తన తండ్రి కోల్పోయిన దక్షిణాంధ్రను తిరిగి పునరాక్రమించడానికి కాకతీయ గణపతితో పోరాటానికి దిగాడు. క్రీ శ.1211లో గణపతిసేనలు తమ విజయాల తర్వాత వెనుదిరిగిపోయాయి. సింహాసనం ఎక్కగానే అనంగ భీముడు యుద్ధ ప్రయత్నాలు చేసి దక్షిణ కళింగపై దండెత్తి ద్రాక్షారామం వరకు జయించి అక్కడ శాసనం వేయించాడు. ఆ శాసనంలో తాను త్రైవసుందర త్రికళింగలను శత్రువుల నుండి విడిపించానని చెప్పుకున్నాడు. ఈ శాసనం అతని 8వ రాజ్యకాల సంవత్సరం నాటిది. క్రీ.శ.1219 నాటిది. అప్పటికి అతడు గోదావరితీరం వరకు పునరాక్రమించి ఉండవచ్చును. ఈ యుద్ధాలలో అతని సేనానులు జెస్రాజి, మహానాథ అనే వారు పోరాడారు.

వేంగిపై దండయాత్ర: కాకతీయగణపతి పృధ్వీశ్వరుని మరణం తర్వాత వేంగిని ఆక్రమించాడు పృధ్వీశ్వరుని వారసులైన కుళోత్తుంగ రాజేంద్రుడు, గొంకరాజు లిద్దరూ జీవించి ఉన్నారు. అనంగ భీముడు వేంగిలో కూడా కాకతీయుల పాలనను అంతం చేయాలని వేంగిపై దండెత్తి కుళోత్తుంగ రాజేంద్రుడు, గొంగ రాజులను వేంగి ప్రభువులుగా ప్రకటించాడు. అదే సమయంలో కొలను మహామండలేశ్వరుడు కేశవదేవుడు మరణించాడు. దాంతో అనంగ భీముడు కొలను ప్రాంతాన్ని కూడా వశం చేసుకున్నాడు. దాంతో వేంగిరాజ్యం మొత్తం అనంగ భీముని వశమైంది. కృష్ణానది వరకు గంగ సామ్రాజ్యాధికారం నెలకొల్పబడింది. ద్రాక్షారామ శాసనంలో అతడు ధృతజతవిలసద్వంగ భూమండలుడని, త్రికళింగేశ్వరుడని త్రయీవసుంధరా సమర్ధరణుడనే బిరుదులతో వర్ణించబడ్డాడు. దీనిని బట్టి వేంగిని జయించి తిరిగి వెళుతూ ద్రాక్షారామాన్ని దర్శించి శాసనం వేయించినట్లు భావించవచ్చును. ఇతడు కంచిలో రెండు శాసనాలు వేయించాడు. అందువల్ల ఇతడు కంచి, శ్రీరంగాలను కూడా జయించాడని భావిస్తారు. కాని అది వాస్తవంగా కనిపించదు. ఈ సమయంలో గణపతిదేవుడు నెల్లూరు చోడతిక్కకు సహాయంగా కాంచీపురంపై దండెత్తి ఉన్నాడు. వేంగిదేశం అనంగ భీముని వశమైందని తెలియగానే గణపతిదేవుడు తన సేనానులైన ఇందులూరు సోమప్రధాని, మలయాల హేమాద్రి, కాలపనాయకుడు, ఏరువ భీముల నాయకత్వంలో సైన్యాలను పంపాడు. వారు వేంగిలో ప్రవేశించి కళింగ సైన్యాలను ఓడించి కొలను ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. జరిగిన యుద్ధంలో గొంకరాజు మలయాల హేమాద్రిరెడ్డి చేతిలో ఓడి పారిపోయాడు. రాజేంద్రచోడుడు కాలపనాయకునికి బందీగా చిక్కాడు. వేంగి మొత్తం గణపతి స్వాధీనం అయింది. కాలపనాయకుని వేంగి అధిపతిగా నియమించాడు. కాకతీయుల వేంగి విజయపరంపరలను ఇరగవరం పాళీశ్వర దేవాలయ స్తంభం వైపు ఉన్న గణపతి శాసనం వర్ణిస్తోంది. ఈ శాసనం క్రీ.శ.1238 నాటిది. మొత్తం మీద అనంగ భీముడు కాకతి గణపతిని ఢీకొని వేంగి వరకు తన ప్రతాపం చూపగలిగాడు. కృష్ణానది వరకు తీరాంధ్ర దేశంపై 20 సంవత్సరాలు అతని ప్రభావం ఉంది. ఈ కాలపు ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ పాత్రను నిర్వహించాడని చెప్పవచ్చును. అనంగభీముడు వేంగియుద్ధాలలో ఉండగా అతని రాజ్యంపై బెంగాలు నవాబులు దండెత్తారు. అతడు వారితో పోరాడి తరిమి తన రాజ్యాన్ని రక్షించుకున్నాడు. ముస్లింలపై అతడు సాధించిన విజయాలను చాటేశ్వరాలయశాసనం తెలుపుతోంది. అనియంకభీమునికి నరసింహదేవుడు అనే కుమారుడు చంద్రాదేవి అనే కుమార్తె ఉన్నారు. చంద్రాదేవిని హైహయ వంశస్తుడైన పరమార్థిదేవునకిచ్చి వివాహం చేశాడు. అనంగ భీముడు క్రీ.శ.1245లో మరణించాడు.

మొదటి నరసింహదేవుడు క్రీ.శ.1245-1264: అనంగ భీముని తర్వాత అతని కుమారుడు మొదటి నరసింహదేవుడు రాజ్యానికి వచ్చాడు. ఇతనికి అనంతవర్మ, వీరనరసింహదేవుడు, శ్రీనరసింహరౌతుదేవర అని కూడా నామాంతరాలున్నాయి. ఇతని కాలంలో బెంగాలు నవాబు లక్నోటి పాలకుడు అయిన తుఘాన్‌ఖాన్ 1243లో జాజ్‌నగర్‌పై దండెత్తాడు. యువరాజుగానే అతనిని ఓడించి తరిమాడు. తర్వాత కూడా ముస్లిం సైన్యాలు కళింగ రాజ్యంపై దండెత్తాయి. ఆ దండయాత్రలను కూడా ఎదుర్కొని వారిని ఓడించి తరిమాడు. అందువలన అతనికి యవనావనీవల్లభ అనే బిరుదు వచ్చింది. తర్వాత అతడు ఉత్తరాంధ్రదేశంపై తన దృష్టిని మరల్చాడు. తన

తండ్రి కాలంలో వేంగిదాకా జయించి కోల్పోవడం జరిగింది; కనుక ఆ ప్రాంతాలను తిరిగి జయించాలని అతడు వేంగిరాజ్యంపై దండెత్తాడు. గణపతి పడికం బొప్పదేవుడను సేనాధిపతి నాయకత్వంలో కాకతి సైన్యాన్ని పంపాడు. ఈ దండయాత్రలో నెల్లూరు మూడవ మనుమసిద్ధి కూడా చేరాడు. మనుమసిద్ధిని అతని దాయాదులు అక్కన్న, బయ్యన్నలు తరిమివేశారు. అతడు కాకతి గణపతి సహాయం కోసం వచ్చాడు. ఆ సమయంలో నరసింహదేవునితో యుద్ధం చేయదానికి గణపతి ప్రయత్నాలు ఆరంభించాడు. కనుక మనుమసిద్ధి కూడా కాకతీయ సైన్యాలకు సహాయంగా బయలుదేరాడు. గాంగసైన్యాలను గొంటూరు నాగదేవుడు, నారాయణదేవుడు అనే సేనాధిపతులు నడిపారు. ఉభయ సైన్యాలకు గోదావరి నది ఒడ్డున యుద్ధం జరిగిందని మనుమసిద్ధి నందలూరు శాసనం తెలుపుతోంది. ఈ యుద్ధంలో కాకతిసేనాని బొప్పదేవుడు కళింగసేనాని గొంటూరు నాగదేవుని సంహరించాడు. రెండవ సేనాని నారాయణదేవుడు ఓడిపోయిన సేనతో పారిపోయాడు. గోదావరీ ప్రాంతం అంతా అంటే దక్షిణ కళింగ మొత్తం గణపతివశమైంది. ఆ తర్వాత గణపతి జీవించి ఉన్నంత వరకు గాంగవంశస్తులు కాకతీయులతో తలపడలేదు. మొత్తం మీద కళింగ గాంగులు గణపతిదేవునితో మూడు యుద్ధాలు చేశారు.

మొదటి నరసింహదేవుడు సాహిత్య శిల్పకళను పోషించాడు. విద్యాధరుడనే కవి ఇతని ఆస్థానకవి. అతడు ఏకావళి అనే గ్రంథాన్ని రాశాడు. శ్రీకూర్మ ఆలయానికి దానాలు చేసి శాసనాలు రాయించాడు. సింహాచల ఆలయానికి నల్లరాతి శ్రీవిమానం ముఖమండపం, నాట్యశాల, తిరుచుట్టుమాలను నిర్మించాడు. ఒరిస్సాలో ప్రసిద్ధి చెందిన కోణార్క ఆలయ నిర్మాత ఈ నరసింహుడే. కోణాకోణ అనే గ్రామంలో నిర్మించినందున దానికి కోణార్క దేవాలయం అని పేరు వచ్చింది. సింహళదేశంతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడ్డాయి. కళింగ యువరాజు ఒక సింహళ రాకుమారిని వివాహం కూడా చేసుకున్నాడు. ఇతని 23వ రాజ్యకాల సంవత్సరంలో అంటే 1256లో భాగళదేవి అనే సింహళదేశానికి చెందిన సంగీత విద్వాంసురాలు శ్రీకూర్మాన్ని దర్శించి కూర్మదేవునికి అఖండ దీపారాధనకు దానం చేసి అక్కడ శాసనం వేయించింది. నరసింహుడు మాళవ రాజకుమారి సీతాదేవిని వివాహమాడాడు. వారికి మొదటి భానుదేవుడు జన్మించాడు. అతడు క్రీ.శ.1264లో రాజ్యానికి వచ్చాడు.

రెండవ భానుదేవుడు క్రీ.శ.1264-1279: ఇతనికి శాసనాలు అనంతవర్మ ప్రతాపవీరభానుదేవుడు అని వర్ణిస్తున్నాయి. ఇతడు రాజ్యానికి వచ్చేనాటికి పిన్నవయస్కుడు. అందువల్ల నరహరితీర్థులు క్రీ.శ.1264 నుంచి 1275 వరకు పరిపాలనా బాధ్యతలను స్వీకరించాడు. క్రీ.శ.1271 నాటి శాసనంలో వృద్ధ సచివుడు నరహరి తీర్థుడు ప్రస్తావించబడ్డాడు. నరహరితీర్థులు ఆనాటి వైష్ణవ మతాచార్యుడు. అతడు శ్రీకూర్మంలో నివసించి యోగానంద నృశింహ ఆలయాన్ని నిర్మించాడట. శ్రీ రామసహిత సీతాలక్ష్మణ దేవాలయాన్ని కూడా నిర్మించి 51 గండమాడలు సమర్పించాడు. సింహాచలం దేవునికి దీపదానం చేశాడు. శ్రీకూర్మం, సింహాచలాలలో నివసించి ఆ ప్రాంతాలలో వైష్ణవమత ప్రచారం చేశాడని వైష్ణవ గ్రంథాలు తెలుపుతున్నాయి. అతని ప్రచారం వల్ల కళింగ దేశంలో వైష్ణవమతం బాగా వ్యాప్తి చెందింది. శైవమతం తగ్గుముఖం పట్టింది. భానుదేవుని కాలంలో నరహరితీర్థులు గొప్ప వైష్ణవాచార్యునిగా ప్రసిద్ధి పొందాడు. అతడి గురువు ఆనందతీర్థులు. భానుదేవుని కాలంలో బెంగాలు నవాబు తుఘ్రిల్‌ఖాన్ యూజ్‌బక్ జాజ్‌నగర్‌పై దండయాత్ర చేశాడు. అతనిని భానుదేవుడు ఓడించాడు.

దక్షిణకళింగపై దండయాత్ర: ఇతడు కాకతి రుద్రమదేవికి సమకాలికుడు. తన తండ్రి గణపతి చేతిలో ఓడిపోయినందుకు ప్రతీకారంగా అతని మరణానంతరం రుద్రమదేవి కాలంలో ఉత్తరాంధ్ర ప్రాంతాలు జయించాలని, అతడు తన సామంతరాజైన వడ్డాది మత్స్యదేవునితో కలసి వేంగి రాజ్యంపై దండెత్తాడు. అతని దండయాత్రను అరికట్టడానికి రుద్రమదేవి తన సేనాధిపతులైన పోతినాయకుడు, పోలినాయకులను పంపింది. వారు గోదావరినది వద్ద గంగసైన్యాలను ఓడించి వడ్డాది మత్స్యదేవుని వధించాడు. దాంతో గోదావరీ ప్రాంతం అంతా తిరిగి రుద్రమదేవి వశమైంది. ఈ విజయాలకు చిహ్నంగా కాకతీయ సేనాధిపతులు గజపతి మత్తమాతంగా సింహవడ్డి రాయమర్దన అనే బిరుదులు ధరించారు. దక్షిణకళింగను తిరిగి తనవశం చేసుకోవాలని భానుదేవుడు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అంతేగాక భానుదేవుని ఓటమి అతని సామంతరాజుల తిరుగుబాటుకు దారి తీసింది. వడ్డాదిలోని మత్స్యవంశస్థుడైన మంకాదిత్యుడు, అతని మనుమడు ప్రతాప అర్జునదేవుడు అతని సోదరులు అన్నమదేవుడు, రెండవ మంకాదిత్యులు స్వతంత్రులయ్యారు. అన్నమదేవుడు, రెండవ మంకాదిత్యులు సింహాచలంలో శాసనాలు వేయించారు. వీరందరూ క్రీ.శ.1231-1272 మధ్య వడ్డాది రాజ్యాన్ని పాలించారు. జంతరనాటి సురభి వంశస్తులు నందాపురపు శిలావంశస్తులు, కోణ హైహయులు, వీరకూట పల్లవులు,

ఎలమంచిలి చాళుక్యులు కూడా స్వతంత్రవైఖరిని అవలంబించారు. ఎలమంచిలిలో మొదటి ఉపేంద్రుడు, అతనికి గంగమాంబ వల్ల జన్మించిన రెండవ మల్లదేవుడు ఇతని సమకాలికులు. భానుదేవుడు పరిపాలనలో శ్రద్ధ తీసుకున్నాడు. తన సామ్రాజ్యాన్ని పరిపాలనా విభాగాలు చేసి 16 గురు పాత్రులను నియమించాడు. ఇతని సోదరి చంద్రికాదేవి గొప్ప వైష్ణవభక్తురాలు. ఆమె భువనేశ్వరంలో ఒక విష్ణుదేవాలయాన్ని నిర్మించింది. అక్కడ ఉమాపతి అనే కవిచేత శాసనం రాయించింది. ఆమె పూరీలోని సుభద్రా బలరామకృష్ణులను కూడా భక్తితో కొలిచేదట. ఇతని భార్య జాకల్లదేవి. ఆమె ఎలమంచిలి రాజకుమారి. ఈ దంపతులకు రెండవ నరసింహదేవుడు జన్మించాడు.

రెండవ నరసింహదేవుడు క్రీ.శ.1279-1306: మొదటి భానుదేవుని మరణానంతరం అతని కుమారుడు రెండవ నరసింహదేవుడు క్రీ శ.1279లో రాజ్యానికి వచ్చి 1306 వరకు పాలించాడు. ఇతనికి వీరనరసింహ దేవుడని, అనంతవర్మ వీరశ్రీ నారసింహుడని కూడా పేర్లున్నాయి. ఇతడు యుద్ధాల జోలికి పోకుండా ప్రశాంతంగా రాజ్యం చేశాడు. ఇతని కాలంలో అతని సామంతులు, మంత్రులు, సేనాధిపతులు సింహాచలం శ్రీకూర్మ దేవాలయాలకు దానాలు చేసి శాసనాలు వేయించారు. వారిలో నారాయణ సేనాని ఒకడు. అతడు భరద్వాజ గోత్రానికి చెందిన గోపాలసేనాధిపతి కుమారుడు. అతడు సింహాచలదేవునికి నవరత్న ఖచిత బంగారు కంఠాభరణాలు అఖండదీపాన్ని దానం చేసి అక్కడ శాసనం వేయించాడు. ఈ శాసనం ఆనాటి దేవాలయ నిర్వహణ, దేవాలయంలోని పరిచారకులు, పరిచారికలను గురించి కూడా తెలియజేస్తోంది. రెండవ నరసింహుని కాలంలో నరహరితీర్థులు రాజాజ్ఞతో అక్కడ సీతారామలక్ష్మణుల కళింగ ప్రజలకు వైష్ణవంపై మక్కువ పెరిగి సింహాచలం, శ్రీకూర్మ దేవాలయాలపై అమితభక్తిని పెంచుకొని దానాలు చేశారు

రెండవ భానుదేవుడు క్రీ.శ.1306-1327: రెండవ నరసింహదేవునికి చోడమహాదేవి రాణి. వారికి రెండవ భానుదేవుడు జన్మించాడు. అతడు క్రీ.శ 1306లో రాజ్యానికి వచ్చాడు ఇతనికి అనంతవర్మ ప్రతాపవీరభాను దేవుడని కూడా పేరుంది. ఇతని కాలం నాటి పూరీ తామ్ర శాసనం ఇతనిని గురించి తెలుపుతోంది. ఆంధ్రదేశంలో గొప్పమార్పులు వచ్చాయి. ఇతడు కాకతి ప్రతాపరుద్రునికి సమకాలికుడు. క్రీ.శ.1323లో ఉలుగ్‌ఖాన్ కాకతి ప్రతాపరుద్రుని ఓడించి బందీగా ఢిల్లీకి పంపాడు. ప్రతాపరుద్రుడు నర్మదానదిలో దూకి ప్రాణాలు తీసుకున్నాడు కాకతీయ సామ్రాజ్యం అస్తమించింది ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత ఉలుగ్‌ఖాన్ కళింగరాజ్యంపై దండెత్తాడు అతనిని ఎదిరించడానికి భానుదేవుడు 40 వేల పదాతిదళాన్ని, 500 గుర్రాలు, కొన్ని ఏనుగులు, ధనాన్ని ఇచ్చాడు ఉలుగ్ ఖాన్ గజాలను ఢిల్లీకి పంపి తాను తిరిగి ఓరుగల్లు చేరాడు పూరీ శాసనం భానుదేవుడు ఘియాజుద్దీన్ తుగ్లక్ సైన్యాన్ని ఓడించాడని తెలుపుతోంది. కాని అది వాస్తవం అని నమ్మడానికి లేదు. ఇతని కాలంలో ఆంధ్రదేశం మొత్తం తుగ్లక్‌ల వశమైనందున అతడు ఆంధ్రదేశంపై దాడులు చేయలేదు. వీరభానుదేవుని భార్య లక్ష్మీదేవి. వారికి మూడవ నరసింహదేవుడు జన్మించాడు.

బెండపూడి సంఘటన: ఇతని కాలంలో ఆంధ్రదేశానికి సంబంధించిన ఒక్క సంఘటన జరిగింది. తూర్పు గోదావరి జిల్లా అన్నవరం వద్ద ఉన్న బెండపూడిలో పెదమల్లపరాజు, చినమల్లపరాజు అనే సోదరులు ఒక కోటను నిర్మించి ప్రతాపరుద్రుని సామంతులుగా పాలించేవారు. వారు అతి క్రూరులు. ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసి, స్త్రీలపై అత్యాచారాలు చేసేవారు. ప్రతాపరుద్రునికి తెలిసి వారిని మందలించాడు. కాని వారు దుశ్చర్యలను మానలేదు. కళింగ గాంగ భానుదేవుని బంధువుని భార్య ఆ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా ఆమెను అపహరించారు. భానుదేవుడు కోపించి బెండపూడిపై దండెత్తి సోదరులను వధించి బెండపూడిని ఆక్రమించాడు ఇదే సమయంలో ముస్లింలు ఓరుగల్లుపై దండెత్తినందువల్ల ప్రతాపరుద్రుడు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టలేక పోయాడు. అందువల్ల బెండపూడి ప్రాంతం భానుదేవుని ఆధీనంలోకి వచ్చినట్లుగా ఉంది.

మూడవ నరసింహదేవుడు క్రీ.శ.1327-1353: తండ్రి మరణానంతరం మూడవ నరసింహదేవుడు క్రీ.శ.1327లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1353 వరకు పాలించాడు. ఇతని కాలం నాటి అనేక శాసనాలు లభించాయి. అతని సేనాధిపతులు సామంతులు అనేక దానశాసనాలు వేయించారు. అతని భార్య గంగాదేవి కూడా అతని రాజ్యానికి రాకముందే యువరాణిగా క్రీ.శ 1322లో శ్రీకూర్మనాథునికి దానం చేసి శాసనం వేయించింది. ఆమె సింహాచలనాథునికి కూడా దానాలు చేసింది. ఇతని రెండవ భార్య కొమ్మిదేవి కూడా దానాలు చేసింది. అందువల్ల ఇతని కాలం నాటి విశేషాలు తెలుసుకోడానికి వీలు కలుగుతోంది. ఇతని కాలంలో ఆంధ్రదేశంలో నూతన రాజ్యాలు ఏర్పడ్డాయి. ఆంధ్ర కాకతీయ రాజ్యపతనం తర్వాత సేనానులు ముసునూరి

ప్రోలయ నాయకత్వంలో స్వాతంత్ర సమరం సాగించి ఆంధ్రదేశాన్ని విముక్తి చేశారు. ఉత్తరాంధ్ర, తూర్పు తెలంగాణలో ప్రోలయనాయకుడు ముసునూరు నాయక రాజ్యాన్ని స్థాపించాడు కృష్ణకు దక్షిణంగా ప్రోలయవేమారెడ్డి అద్దంకి రాజ్యాన్ని స్థాపించాడు దక్షిణ తెలంగాణలో రేచర్ల సింగమనాయకుడు, అనుమగల్లులో పద్మనాయక రాజ్యాన్ని స్థాపించాడు. దక్షిణ తెలంగాణలో రేచర్ల సింగమనాయకుడు, అనుమగల్లులో పద్మనాయక రాజ్యాన్ని స్థాపించాడు. ప్రోలయనాయకుని తర్వాత కాపయనాయకుడు ఓరుగల్లును జయించి తన రాజధానిని చేసుకున్నాడు. కొద్ది కాలానికే గుల్బర్గాలో హసన్‌గంగు బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు కాపయనాయకుడు ఉత్తరాంధ్రలో పరిపాలనా సౌలభ్యం కోసం కోరుకొండ, తొయ్యేరు, పిఠాపురం, వేంగి అనే భాగాలుగా చేసి తన రాజ్యంపై దండయాత్రలు ప్రారంభించారు. కాపయ ఓడిపోయాడు అతని ఓటమిని ఆసరాగా తీసుకొని ఉత్తరాంధ్రలోని పాలకులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు ఆ స్థితిలో మూడవ నరసింహదేవునికి ఉత్తరాంధ్రను అంటే దక్షిణకళింగలను జయించాలనే కోరిక కలిగింది. తమ సేనాధిపతులైన కాళిదాసు, గోవిందులను పెద్ద సైన్యంతో పంపాడు. వారు సులభంగా ఉత్తరాంధ్ర పాలకులను ఓడించి కృష్ణానది తీరం వరకు జయించారు దాంతో కృష్ణానది తీరం వరకు గంగ అధికారంలోకి వచ్చింది. అనంగ భీముని కాలంలో జయించబడిన ప్రాంతం వరకు మూడవ నరసింహుని స్వాధీనమైంది నరసింహదేవుని భార్య గంగాదేవి తమ సేనాధిపతుల ద్వారా దివిసీమలోని శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణుదేవునికి పట్టుగొడుగులు, వెండి దివ్వకోలలు, వింజామరలు, పహిండికాయలు, గంటలు, పచ్చపట్లు పంపించి దానం చేయించారు. ఈ శాసనం మూడవ నరసింహదేవుడు కృష్ణానది వరకు ఆంధ్రదేశాన్ని జయించినట్లు స్పష్టపరుస్తోంది. కృష్ణానదికి దక్షిణంగా ప్రోలయవేమారెడ్డి అద్దంకి రాజ్యం ఉంది. ఆ రాజ్యంపై నరసింహదేవుడు దండెత్తలేదు ఇతడు ఉత్తరదేశ రాజకీయాలలో కూడా ప్రముఖపాత్ర నిర్వహించాడు. మహమ్మద్‌బిన్ తుగ్లక్ క్రీ.శ.1353లో మరణించాడు. ఫిరోజ్ తుగ్లక్ ఢిల్లీ సింహాసనమెక్కాడు. ఫిరోజ్ తుగ్లక్ బెంగాలుపై దండెత్తాడు. బెంగాలు నవాబు రాజధాని పాండువా. బెంగాలు నవాబు హాజీఇల్యాస్, అతని సామంతుడైన సికిందర్‌షాలు నరసింహదేవుని సహాయం అర్థించారు నరసింహదేవుడు తన సామంతుడైన కోణ హైహయ రెండవచోదుని నాయకత్వంలో కళింగ సైన్యాన్ని బెంగాలు నవాబుకు సహాయంగా పంపాడు. అందు విజయం లభించింది. నవాబుకు ఢిల్లీ సైన్యాలకు చెందిన ఏనుగులు పట్టుబడ్డాయి వాటిని నవాబు నరసింహదేవునికి బహూకరించాడట. ఇంకా అనేక కానుకలను కూడా ఇచ్చాడట మొత్తం మీద మూడవ నరసింహదేవుడు ఉత్తర దక్షిణదేశాలలో ప్రముఖపాత్ర నిర్వహించాడు ఇతడు క్రీ.శ.1353లోనే మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు మూడవ భానుదేవుడు సింహాసనానికి వచ్చాడు.

మూడవ భానుదేవుడు క్రీ.శ.1353-1378: మూడవ భానుదేవుని కాలంలో తన తండ్రి సంపాదించిన రాజ్యాన్నీ కీర్తిని రెండింటినీ పోగొట్టుకున్నాడు. తండ్రి సాధించిన ఉత్తర దక్షిణ విజయాలు మూడవ భానుదేవునికి శాపాలయ్యాయి.

అనపోతారెడ్డి దండయాత్ర: ఉత్తరాంధ్రను కృష్ణానది వరకు జయించినందు వల్ల కృష్ణకు దక్షిణంగా ఉన్న రెడ్డిరాజ్యం గాంగవంశస్తులు తమ రాజ్యానికి ప్రమాదహేతువులని తమ రాజ్యం మీద కూడా దండెత్తవచ్చని అనపోతారెడ్డి భావించాడు. 1353లో ప్రోలయ వేమారెడ్డి మరణించి అనపోతారెడ్డి అద్దంకి సింహాసనమెక్కాడు. అతడు ఉత్తరాంధ్రను జయించడానికి బయలుదేరి వేంగి, పిఠాపురం, రాజమహేంద్రవరాన్ని జయించాడు. దాంతో ఆ ప్రాంతాలలో గాంగ అధికారం పోయింది. గాంగ రెడ్డి రాజ్యాల మధ్య విరోధం ప్రారంభమైంది అనపోతారెడ్డి ఆ ప్రాంతాలను నిలబెట్టుకోలేక పోయాడు. ఈ దండయాత్ర గాంగ, రెడ్డిరాజ్యాల సంఘర్షణను ప్రారంభించి చివరి వరకు కొనసాగింది. మూడుతరాలు రెడ్డి, గాంగవంశాల మధ్య యుద్ధాలు జరిగాయి.

అలాగే ఉత్తరదేశంలో అతని తండ్రి బెంగాలు నవాబుకు సహాయం చేసినందుకు ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ తుగ్లక్ కళింగరాజ్యంపై కత్తిగట్టాడు. ఫిరోజ్ తుగ్లక్ కళింగరాజును దండించడానికి బెంగాలు నవాబుతో సంధి చేసుకున్నాడు. ముస్లింలు ఒకటైపోయారు. కళింగ గంగరాజు మాత్రం విరోధిగా మిగిలాడు. కనుక క్రీ.శ 1360లో ఫిరోజ్‌తుగ్లక్ పెద్దసేనను తీసుకొని ఒరిస్సాపై దండెత్తాడు. మూడవ భానుదేవుడు అతని రాక విని యుద్ధం చేయకుండా ఒక పడవపై సముద్రంలోకి పారిపోయాడు. భానుదేవుడు సంధి రాయబారానికి తన పాత్రులను పంపాడు. ప్రతి సంవత్సరం కప్పం కట్టే షరతులతో సంధి జరిగింది. తర్వాత 25 ఏనుగులు ఇచ్చాడు. ఆ ఏనుగులను తీసుకొని ఫిరోజ్ వెళ్లిపోయాడు. పూరీ ఆలయంలో పెకలించిన విగ్రహాన్ని కూడా ఢిల్లీకి

పట్టుకువెళ్లాడు. ఫిరోజ్ తిరుగుబాటు గాంగరాజ్యాన్ని కుదిపివేసింది. భానుదేవుని బలహీనతను చూసి సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. వడ్డాది మత్స్యరాజులను క్రీ.శ.1375లో ఓడించి సింహాచలం చేరాడు. ఈ దండయాత్రను అతని బ్రాహ్మణసేనాని చెన్నమనాయకుడు నిర్వహించాడు. అతడు సింహాచలంలో క్రీ.శ.1375లో శాసనం వేయించాడు. అనవేముని మన్యమాపుర శాసనం అనవేముడు సింహాచల వింధ్యపాద ప్రతిష్ఠాపిత కీర్తిస్థంబ అనే బిరుదు వహించినట్లు తెలుపుతోంది. ఈ రెండవ దండయాత్రతో గంగరాజ్య ప్రతిష్ఠ మరీ దిగజారింది. ఆ తర్వాత మూడవ భానుదేవుడు యుద్ధాల జోలికి పోకుండా ఉన్న రాజ్యాన్ని పాలించుకొంటూ అతడు క్రీ శ.1378లో మరణించాడు. మూడవ భానుదేవుని భార్య హీరాదేవి. వారికి నాల్గవ నరసింహదేవుడు జన్మించాడు.

నాల్గవ నరసింహదేవుడు క్రీ.శ.1378-1424: మూడవ భానుదేవుడు తర్వాత అతని కుమారుడు నాల్గవ నరసింహదేవుడు క్రీ.శ.1378లో సింహాసనానికి వచ్చి 1424 వరకు పాలించాడు. ఇతనికి గజపతి ప్రతాప వీరనరసింహదేవ మహారాజు, గజపతి పెదనరసింహ దేవరాజని, గజనివహపతి వీరనరసింహదేవుడని కూడా పేర్లు ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి: ఇతనికి అనేక మంది భార్యలున్నారు. వారిలో తారాదేవి, నీలాదేవి, ఉత్తమదేవి, బిరుజాదేవి ప్రముఖులు. వారిలో తారాదేవి పట్టమహిషి.

తన తండ్రి కాలంలో రాచకొండ, దేవరకొండ వెలమలు రెండు పర్యాయాలు, రెడ్డి రాజులు ఒక పర్యాయం కళింగరాజ్యంపై దండెత్తారు. తన తండ్రికాలంలో అనవేమారెడ్డి కళింగరాజ్యంపై దండయాత్రచేసి క్రీ.శ.1375లో సింహాచలం వరకు జయించాడు. రెడ్డిరాజులు కళింగ రాజ్య ప్రాంతాలు ఆక్రమించి సింహాచలం వరకు తమ రాజ్యాన్ని విస్తరించడం వెలమలకు అసూయ కలిగించింది. ఉత్తరాంధ్ర కాపయనాయకుని రాజ్యంలోది కాపయనాయకుని, క్రీ.శ.1368లో భీమవరం యుద్ధంలో అనపోతా, మాదానాయకులు చంపి అతని రాజ్యాన్ని ఆక్రమించారు. కనుక కాపయనాయకుని రాజ్యానికి తాము వారసులు కనుక కాపయనాయకునికి చెందిన ఉత్తరాంధ్ర కూడా తమకే చెందుతుందని పద్మనాయకులు భావించి ఉండవచ్చును. ఆ ప్రాంతాన్ని అనవేమారెడ్డి ఆక్రమించాడు కనుక ఆ ప్రాంతాలలోని రెడ్డిరాజ్య అధికారాన్ని కూలద్రోసి తమ అధికారాన్ని ప్రతిష్ఠించడానికి అనపోతానాయకుడు క్రీ శ.1375 తర్వాత కళింగరాజ్యంపై దండెత్తాడు. నాల్గవ నరసింహదేవుడు అనపోతా నాయకునితో పోరాడి ఓడిపోయాడు.ఓటమి తర్వాత నరసింహుడు తన కుమార్తెను అనపోతానాయకుని మనుషులైన కుమార అనపోతునకు ఇచ్చి వివాహం చేశాడు. విజయం తర్వాత అనపోతా నాయకుని భార్య కనకలక్ష్మి సింహాచలాన్ని దర్శించి వరాహ నరసింహస్వామికి మాపటిధూపానికి తిరువకళిక కోల వెలిగించడానికి దానం చేసి శాసనం వేయించింది. ఈ శాసనం క్రీ.శ.1380 సంవత్సరం నాటిది. కనుక అనపోతా నాయకుని కళింగ దండయాత్ర క్రీ.శ.1375-1380 సంవత్సరాల మధ్య జరిగి ఉండాలి.

కాటయ వేమారెడ్డి దండయాత్ర: ఉత్తరాంధ్రపై అనపోతానాయకుడు దండెత్తినందువల్ల ఆ ప్రాంతంలో అనవేమారెడ్డి ప్రతిష్ఠించిన రెడ్డిరాజ్య అధికారం నశించిపోయింది కనుక ఆ ప్రాంతాలను తిరిగి ఆక్రమించడానికి అనవేమారెడ్డి తర్వాత క్రీ.శ.1387లో రాజ్యానికి వచ్చిన కుమారగిరిరెడ్డి తన బావమరిది, మంత్రి సేనాధిపతి అయిన కాటయవేమారెడ్డిని కూడా పంపాడు. అతనితోపాటు కుమారగిరి తన కుమారుడైన రెండవ అనపోతారెడ్డిని కూడా పంపాడు. వారు రెడ్డి సైన్యాలతో బయలుదేరి రాజమహేంద్రవరం చేరారు. అక్కడ వారితో అల్లాడరెడ్డి అతని కుమారులు వేమ వీరభద్రాదొడ్డారెడ్లు వారితో చేరారు. అల్లాడరెడ్డి కుటుంబం వారితో చేరినట్లు శ్రీనాధుని కాశీఖండం, శివలెంక కొమ్మన శివలీలావిలాసం తెలుపుతున్నాయి. అందరూ కలిసి కళింగపై దండెత్తారు. కాటయ వేముని కళింగ దండయాత్రలో వారు తూర్పుగోదావరి జిల్లాలోని రంప, మొల్లేటి లేక మొల్లేరు, కిమూరు పెద్దాపురం సీమ, బెండపూడిలు, విశాఖపట్నంలోని రామగిరి, వీరఘొట్టం, ఝాడేశవనం, జంతర్నాడు, వడ్డాది, గంజాం జిల్లాలోని సప్తమాడెములు, బారహదొంతిలను జయించి కటకం వరకు నడిచారు. కాటయవేముని కాళిదాస వ్యాఖ్యానాలు, కుమారగిరి గోపవరం శాసనం కాటయవేముని విజయాలను వర్ణిస్తున్నాయి. గోపవరం శాసనం కాటయవేముని కటకచూరకార అని కీర్తించింది. దొడ్డారెడ్డి కీరాంబోధిని అని పిలువబడు చిలకసరస్సులో జయస్తంభం నాటినట్లు శ్రీనాధుని కాశీఖండం వర్ణించింది. నరసింహదేవుడు రెడ్డిరాజుల చేతులలో మరొక సారి ఓడిపోయాడు. అతడు ఓడిపోయినా, అతని సామంతులు చెల్లించిన, ఇచ్చిన బహుమతులతో కాటయవేముడు కొండవీడు చేరాడు. రెడ్డిరాజుల చరిత్రలో ఇది అపూర్వమైన దండయాత్ర. వారి ప్రతాపం కటకం వరకు పారింది.

అంతటి విస్తృత దండయాత్ర ఏ రెడ్డిరాజు చేయలేదు.

రాజమండ్రి రాష్ట్రం ఏర్పాటు చేయడం: కాటయ వేమారెడ్డి కటకం వరకు నడిచినా సింహాచలం వరకే రెడ్డి రాజ్యంలో కలిపాడు. దానికి ఉత్తరంగా ఉన్న విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలు అంటే మధ్యకళింగను కళింగ రాజ్యానికే వదలివేశాడు. బహుశా నరసింహదేవుడు, కాటయవేమారెడ్డి ఆవిధంగా సంధి చేసుకొని ఉభయ రాజ్యాలకు సింహాచలం సరిహద్దుగా అంగీకరించి ఉండవచ్చును. కాటయ వేమారెడ్డి జయించిన ఈ ప్రాంతాలను శాశ్వతంగా రెడ్డి రాజ్యంలో అంతర్భాగంగా ఉండేటట్లు చేయడానికి ఆ ప్రాంతాలన్నీ కలిపి కుమారగిరి ఒక రాష్ట్రంగా ఏర్పాటుచేసి దానికి తన కుమారుడు రెండవ అనపోతారెడ్డిని ప్రతినిధిగా నియమించాడు. అనపోతారెడ్డి రాజమహేంద్రవరాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. తర్వాత ఇది రాజమహేంద్రవరాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు. తర్వాత ఇది రాజమహేంద్రవరంలో నిలిపాడు. అనపోత, అల్లాడరెడ్లు, రాజమహేంద్రవర రాజ్యంలో పరిపాలన సౌలభ్యం కొరకు సీమలుగా విభజించి, ముఖ్యమైన ప్రాంతాలలో కోటలను నిర్మించారు. అందులో బెండపూడి దుర్గం అతిముఖ్యమైనది. అంతకు ముందు ఆ ప్రాంతాలను పాలించడానికి కాపయ నాయకునిచే నియమింపబడిన మంచికంటి, ముసునూరు కుటుంబాలను తొలగించి తమకు విశ్వాసపాత్రులైన వారిని దుర్గాధ్యక్షులుగా, సీమల పాలకులుగా నియమించారు. దాంతో సింహాచలం వరకు ప్రాంతం పూర్తిగా రెడ్డి రాజ్యంలో భాగం అయిపోయింది. కళింగ రాజ్యవిస్తరణ అరికట్టబడింది. దాంతో రెడ్డి రాజ్యానికి ఉత్తరాంధ్రలో స్థిరత్వం ఏర్పడింది. కనుకనే క్రీ.శ.1390 నాటి అనపర్తి శాసనం నాలుగు దిక్కులా రాజులతో స్నేహసంబంధాలు ఏర్పడి శాంతిభద్రతలు నెలకొన్నాయని తెలిపింది.

రెండవ సింగభూపాలుడు పెదవేదగిరుల కళింగదండయాత్ర క్రీ.శ.1387: ఇదే సమయంలో రాజకొండలో అనపోతానాయకుడు మరణించి అతని కుమారుడు రెండవ సింగభూపాలుడు, దేవరకొండలో మాదానాయకుడు మరణించి, అతని కుమారుడు పెదవేదగిరి రాజ్యానికి వచ్చారు. ఉత్తరాంధ్రలో తమతండ్రులు సాధించిన విజయాలు పోయి రెడ్డి రాజ్యం బలపడటాన్ని వారు సహించలేక ఉభయులూ కలసి క్రీ.శ.1387లో ఉత్తరాంధ్రపై దండెత్తారు. వారు సింహాచలం, శ్రీకూర్మం వరకు నడిచారని క్రీ.శ.1387నాటి సింహాచలం, శ్రీకూర్మ శాసనాలు తెలుపుతున్నాయి. ఈ దండయాత్రలో బెండపూడి, వేములకొండ ప్రాంతాలను జయించి సింహాచలం చేరినట్లు సింహాచల శాసనం తెలుపుతున్నాయి. శ్రీకూర్మంలో కూడా పెదవేదగిరి శాసనం ఉంది. ఈ సమయంలో వారు దక్షిణకళింగలో అంటే గోదావరి, సింహాచలాల మధ్య మహేంద్రవర రెడ్డిరాజ్యంతోను, మధ్యకళింగ అంటే విజయనగరం, శ్రీకాకుళం జిల్లా ప్రాంతాలలో కళింగ నరసింహునితోను పోరాడి ఉండాలి. సింహాచలం రెడ్డి రాజ్యంలో, శ్రీకూర్మం, కళింగ గంగ రాజ్యంలో ఉన్నాయి. కనుక నాల్గవ నరసింహుడు మరొకసారి పద్మనాయకుల చేతిలో ఓటమి చెంది ఉండవచ్చును. తర్వాత కుమారగిరిరెడ్డి కుమారుడు రెండవ అనపోతారెడ్డి మరణించాడు. క్రీ.శ.1390 నాటి అనపర్తి శాసనం, అతని మరణ ప్రసక్తి క్రీ.శ.1396 నాటి గణపవరం శాసనంలో ఉంది. కనుక అతడు క్రీ.శ.1390-96ల మధ్య మరణించి ఉండాలి. అతని మరణం తర్వాత కుమారగిరిరెడ్డి తన బావమరిది కాటయవేమారెడ్డిని రాజమహేంద్రవర రాజ్యానికి ప్రతినిధిగా నియమించాడు. అతని నియామకం రెడ్డి రాజ్యంలో అల్లకల్లోలాన్ని సృష్టించింది. ఆ సందర్భంలో కూడా నాల్గవ నరసింహుడు దక్షిణకళింగ లేక ఉత్తరాంధ్రను జయించడానికి ప్రయత్నించలేదు. అందుకు కారణం అతని రాజ్యంపై ఉత్తరదిక్కు నుంచి బెంగాలు నవాబులు, పశ్చిమదిక్కు నుంచి మాళ్వ సుల్తాన్‌లు, గంగరాజ్యంపై దాడి సాగించారు. నిజాముద్దీన్ అహమ్మద్ అనే అతడు 825 క్రీ.శ.1421వ సంవత్సరంలో మాళ్వసుల్తాన్ హుషంగ్ వేయి అశ్వదళంతో వర్తకుడిలాగ మారువేషంలో జాజినగర్‌చౌరి నగరం బయట విడిదిచేసి తాను మేలుజాతి అశ్వాలను అమ్మడానికి తెచ్చానని కబురుపంపాడు. భానుదేవుడు గుర్రాలను ఖరీదు చేయడానికి రాగా హఠాత్తుగా అతనిని బంధించాడు. రాజును విడిపించడానికి 75 ఏనుగులను పరిహారంగా కోరాడు. గాంగరాజ్య సేనాధిపతులు 75 గజాలను సమర్పించిన తర్వాత రాజును తన రక్షణ కోసం సరిహద్దుల దాకా తీసుకొనివెళ్లి గంగరాజ్య సరిహద్దులు దాటిన తర్వాత భానుదేవుని వదిలివేశాడు. ఇవన్నీ తూర్పుగాంగవంశం తన బలదర్పాలను, ప్రాభవాన్ని పోగొట్టుకుందని స్పష్టంగా తెలుస్తోంది. వారి చేతిలో కూడా ఓడి ధనాన్ని చెల్లించాడు. ఈ విధంగా అనేక అపజయాలలో నాల్గవ నరసింహుని కాలం గడిచిపోయింది. అతడు క్రీ.శ.1424లో మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు నాల్గవ భానుదేవుడు రాజ్యానికి వచ్చాడు.

నాల్గవ భానుదేవుడు క్రీ.శ.1424-1434-ఆంధ్రదేశంపై దండయాత్ర: ఇతడు గంగ వంశంలో చివరివాడు. ఇతడు క్రీ.శ.1424లో రాజ్యానికి వచ్చి 1434 వరకు పాలించాడు. ఒరిస్సానేలిన గంగరాజులకు తమ రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను రెడ్డి రాజులకు కోల్పోవడం మొదటి అవమానంగా ఉండేది. వీలయినప్పుడల్లా వారు ఆ ప్రాంతాలను తిరిగి జయించాలని కోరుకొనేవారు. నాల్గవ భానుదేవుడు కూడా యువరాజుగా క్రీ.శ.1416వ సంవత్సరంలో రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తి అల్లాడరెడ్డి చేతిలో ఓడి వెళ్లిపోయాడు. ఇప్పుడు ఆంధ్రదేశంలోని పరిస్థితి అతనికి అనుకూలంగా మారింది. క్రీ.శ.1424వ సంవత్సరంలో ఆంధ్రదేశంలో రాజకీయ అస్థిరత్వం ఏర్పడింది. రాజమహేంద్రవర రాజ్యంలో అనితల్లి రాజ్యం పోగొట్టుకుంది. నూతనరాజు అనపోతారెడ్డి రాజ్యానికి వచ్చాడు. అతని రాజ్యం స్థిరపడలేదు. ఇదే కాలంలో కొండవీటి రెడ్డిరాజ్యంలో రాచవేమారెడ్డి హత్యకు గురయ్యాడు. కొండవీటి రెడ్డి రాజ్యంలో కూడా అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇదే సందర్భంలో విజయనగర రాజ్యంలో 1422లో మొదటి దేవరాయలు మరణించాడు. వారసత్వ పోరాటాలు జరుగుతున్నాయి. అతని కుమారుడు రామచంద్రరాయలు సింహాసనానికి వచ్చాడు. కాని కొన్ని నెలల్లోనే పదవీభ్రష్టుణ్ణి చేసి అతని తమ్ముడు విజయరాయలు రాజ్యానికి వచ్చాడు. ఇతడు సమర్థుడు కాదు. అది అదనుగా తీసుకొని బహమనీ సుల్తాన్ అహమ్మద్ షా (1422-36) పానుగల్లు యుద్ధంలో జరిగిన దానికి ప్రతీకారంగా విజయనగరంపై దాడి చేశాడు. విజయనగర రాజులు కోస్తాపై దృష్టి పెట్టడానికి వీలులేని పరిస్థితులలో ఉన్నారు. అహమ్మద్‌షా విజయనగర యుద్ధం తర్వాత వెలమలు పానుగల్లు యుద్ధంలో మొదటి దేవరాయలతో కలిసి బహమనీలకు వ్యతిరేకంగా పోరాడినందుకు శిక్షించడానికి వెలమరాజ్యంపై దండెత్తారు. దాంతో వారు తమరాజ్యాన్ని రక్షించుకొనే ప్రయత్నంలో ఉన్నారు. కనుక వారు కూడా రాజవేమారెడ్డి మరణం తర్వాత స్థానిక పాలకులు స్వతంత్రులయ్యారు. నర్సరావుపేట, ఒంగోలు ప్రాంతంలో పంటమైలారురెడ్డి, పొదలి ప్రాంతంలో సాళువ తెలుంగరాయలు స్వతంత్రం ప్రకటించారు. ఈ విధంగా ఉన్న ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితి నాల్గవ భానుదేవుని దండయాత్రకు చక్కగా అనుకూలించింది. తన పూర్వీకులు రెడ్డిరాజులకు కోల్పోయిన ప్రాంతాలను తిరిగి జయించడమే కాక యావదాంధ్రదేశాన్ని కూడా జయించవచ్చని భావించాడు. పైగా యలమంచిలి నేలిన చాళుక్యుల రెండు తరాల రాజకుమార్తెలను తమ వంశస్తులు వివాహమాడి ఉన్నారు. కనుక పూర్వం చాళుక్య ప్రాంతమైన ఆంధ్రదేశానికి తాను వారసుడనని కూడా భావించి ఉండవచ్చును.

ఇదే సందర్భంలో వెలుగోటి వారి వంశావళి మాదయలింగ పెద్ద సైన్యంతో రాజమహేంద్రవరంపై దండెత్తి నగరాన్ని కొల్లగొట్టి సింహాచలం వరకు విజయయాత్ర చేశాడని, అల్లయవేమ అతని సోదరులు వీరభద్ర, దొడ్డలను ఓడించాడని, వారు అతనికి లొంగిపోయినందున వారిని తిరిగి సింహాసనంపై పునఃప్రతిష్ఠ చేశాడని తెలియజేస్తోంది. వెలమల దండయాత్ర భానుదేవుని దండయాత్రకు ముందు జరిగి ఉండవచ్చును. విజయనగరం బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షా పోరాటాలు జరిపినప్పుడు మాదయలింగ అల్లాడరెడ్డి మరణించగానే దండెత్తి ఉండవచ్చును. అల్లాడరెడ్డి పుత్రులు వెలమల చేతిలో ఓడిపోయి ఉన్నందువలన వారిని సులభంగా తాను జయించవచ్చని కూడా భానుదేవుడు తలచి దండయాత్రకు పూనుకొని ఉండవచ్చును. కనుక నాల్గవ భానుదేవుడు రాజమహేంద్రవర రాజ్యంపైకి సైన్యాలను పంపాడు. 1424వ సంవత్సరం (1420 బి.యస్.యల్. హనుమంతరావు)లో లాంగూర గజపతి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించినట్లు స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి ఇతడు ఎవరో తెలియదు కాని భానుదేవుని సేనాధిపతో, గజదళాధిపతో అయి ఉండవచ్చును. కనుక రాజమహేంద్రవర రాజ్యం తూర్పు గాంగ భానుదేవుని వశమైందని చెప్పవచ్చును.

కొండవీడు రాజ్యంపై దండయాత్ర: రాజమహేంద్రవరం విజయం తర్వాత భానుదేవుని ఉత్సాహం పెరిగిపోయింది. అతడు రాజ మహేంద్రవర రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించి కృష్ణానదిని దాటి కొండవీటి రాజ్యంపై దండెత్తి కొండవీటి కోటను ఆక్రమించాడు. తర్వాత నెల్లూరు వరకు దాడి సాగించి స్వతంత్రులైన రెడ్డి సామంతులను ఓడించి తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. దాంతో కోస్తా మొత్తం భానుదేవుని వశమైంది. తూర్పు గాంగ సామ్రాజ్యం ఉత్తరాన బెంగాలు నుండి దక్షిణాన పెన్నానది వరకు విస్తరించింది. భానుదేవుని విజయాలు తెలిపే శాసనాలు ఏమీ లభించలేదు. కాని రాచవేముని మరణానికి, ప్రౌఢదేవరాయలు కోస్తా ఆంధ్రను జయించడానికి మధ్యకాలంలో అంటే క్రీ.శ.1424-1428 మధ్యకాలంలో కొండవీటిరాజ్యం ఒడ్డిరాజుల చేతిలో పడిందని గుంటూరు జిల్లాలోని అనేక గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ఒరియా రాజుల పరిపాలనను ఈ

కైఫీయత్తులు నమోదు చేశాయి. అల్లాడరెడ్డి మరణం తర్వాత, కలువచేరు శాసనం తర్వాత రాజమహేంద్రవర రెడ్డి రాజ్య చరిత్ర ఎలా అగమ్యగోచరంగా ఉందో రాచవేమారెడ్డి మరణం తర్వాత కొండవీటి రాజ్య చరిత్ర కూడా అంతే అగమ్యగోచరంగా ఉంది. కొండవీడులో రాచవేమారెడ్డి హత్య, అరాచక పరిస్థితులు రాజమహేంద్రవర రాజ్యంలో అల్లాడరెడ్డి మరణ కాలంతో ఏకీభవిస్తున్నాయి. కనుక అల్లాడరెడ్డి, రాచవేమారెడ్డిల మరణం తర్వాత భానుదేవుడు కోస్తా ఆంధ్రపై దండెత్తి నెల్లూరు వరకు జయించి తన సామ్రాజ్యంలో భాగం చేసుకున్నాడని చెప్పవచ్చును.

రెండవ దేవరాయల దిగ్విజయ యాత్ర: కాని భానుదేవుని విజయం శాశ్వతంగా నిలువలేదు. విజయనగర రాజ్యంలో రెండవ దేవరాయలు క్రీ.శ.1426లో సింహాసనానికి వచ్చాడు. అతనికి బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షాతో సంధి జరిగింది ఆ సంధి తర్వాత అహమ్మద్‌షా పానుగల్లులో విజయనగర సేనలకు సహాయంగా యుద్ధం చేసిన వెలమరాజ్యంపై దండెత్తాడు. కనుక రెండవ దేవరాయలకు పూర్తిగా కోస్తాపై తన దృష్టి పెట్టడానికి వీలు కలిగింది. రెండు రెడ్డిరాజ్యాలు భానుదేవుని వశమై కళింగ సామ్రాజ్యంలో చేరిపోవడం అతడు సహించలేక పోయాడు. కనుక పెద్ద సైన్యంతో కోస్తాపై దండెత్తి తూర్పుగంగ సైన్యాలను ఓడించి తరిమి కొండవీటి రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడు. తర్వాత కృష్ణను దాటి రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించాడు. సింహాచలం వరకు రాయల స్వాధీనమైంది. క్రీ.శ.1428వ సంవత్సరానికి చెందిన తెలుంగరాయల శాసనం సింహాచలంలో ఉంది. ఈ తెలుంగరాయలు రెండవ దేవరాయల సేనాధిపతి. అతడు సింహాచల నరసింహస్వామికి దానం చేసి ఈ శాసనం వేయించాడు. అంటే 1428 నాటికి సింహాచలం వరకు కోస్తా ప్రాంతం రెండవ దేవరాయల ఆధీనంలో ఉన్నట్లు స్పష్టపరుస్తోంది. దక్షిణ కెనరా జిల్లాలో క్రీ శ 1429 సంవత్సరానికి చెందిన మధుబిదరే అనే ప్రదేశంలో ఉన్న ఒక శాసనంలో రెండవ దేవరాయలు మతంగరాజ సింధువర కోటిమర్దన ఆంధ్రేనరేంద్ర సైన్యసాగర కలశోద్భవ అనే బిరుదులతో వర్ణింపబడ్డాడు. మతంగరాజ అంటే గజపతి అంటే గాంగవంశ నాల్గవ భానుదేవుడు, ఆంధ్రరాజు అంటే ఎవరో చెప్పలేము. ఆ కాలంలో రాజమహేంద్రవర రాజ్యాన్ని పాలించే అనపోతారెడ్డి కావచ్చును. లేక భానుదేవునికి సహాయంగా వచ్చిన వెలమలు కావచ్చును ఏమైనా సింహాచల శాసనాన్ని ఈ మధుబిదరే శాసనం బలపరుస్తోంది. సింహాచల వరకు కోస్తా ఆంధ్రదేశం మొత్తం విజయనగర సామ్రాజ్యంలో భాగమైంది. రెండవ దేవరాయల సార్వభౌమాధికారం మొత్తం విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది. రెండవ దేవరాయల సార్వభౌమాధికారం తారాస్థాయికి వచ్చింది.

రెండవదేవరాయల అండతో వేమ, వీరభద్రారెడ్లు కళింగరాజ్యంలోని సింహాచల పరిసర ప్రాంతాలపై దండెత్తారు. వారిని ఎదుర్కోవడానికి నాల్గవ భానుదేవుడు తన సైన్యాలతో వచ్చాడు. ఆ సందర్భంలో కటకంలో అతని ప్రధానమంత్రి కపిలేశ్వర గజపతి కుట్రచేసి కటక సింహాసనాన్ని ఆక్రమించాడు. ఆ విషయం తెలిసిన భానుదేవుడు కటకానికి వెళ్లకుండా పర్లాకిమిడి ప్రాంతంలోని గుదారికటకం చేరి తన శేషజీవితాన్ని గడిపాడు. దానికే కటకవారణాసి అని కూడా పేరుంది. నాల్గవ భానుదేవుని చివరిదశ అక్కడ గడచిపోయింది అతని మరణంతో 900 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన తూర్పు గాంగ వంశం అంతరించింది.

కళింగ గాంగ-ఆంధ్ర రాజవంశాల సంఘర్షణ క్రీ.శ.498-1434

ఆంధ్రదేశ చరిత్రలోను, దక్షిణ భారతదేశ చరిత్రలో కృష్ణ, తుంగభద్రా నదుల మధ్య అంతర్వేది ప్రాంతం మీద ఆధిపత్యం కోసం ప్రాచీన కాలం నుండి పల్లవచోళులకు, చోళచాళుక్య, బహమనీ విజయనగర సామ్రాజ్యాలు సంఘర్షణ పడ్డాయి. దానికి చరిత్రకారులందరూ అమిత గుర్తింపునిచ్చారు. కాని కోస్తాలోని ఉత్తరాంధ్ర ప్రాంతాల కోసం తూర్పుగాంగులు, ఆంధ్రదేశాన్ని పాలించిన ప్రధాన రాజవంశాలన్నింటితోను అలాంటి సంఘర్షణే పడ్డారు. కాని చరిత్రకారులు దీనిని అంతగా గమనించినట్లు లేదు. ఈ సంఘర్షణకు ప్రధాన కారణం ఉత్తరాంధ్ర ప్రాంతాలపై కళింగగాంగులు తమ ఆధిపత్యాన్ని నెలకొల్పాలనేది ప్రధాన లక్ష్యం. అందు కోసం వారు వారి రాజ్యం పతనమయ్యే వరకు ఆంధ్రదేశాన్ని తమ రాజ్యంలో భాగంగా చేసుకున్నారు. చిట్టచివరి గంగరాజు నాల్గవ భానుదేవుడు కృష్ణానదిని దాటి పాకనాటిసీమ వరకు కూడా జయించి తన ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. ఆ విధంగా వారు జరిపిన పోరాటాలను, గంగవంశస్తులకు ఆంధ్రదేశ రాజవంశాలతో ఉన్న సంబంధాలను లేదా ఆంధ్రరాజవంశాలతో వారు నడిపిన సంబంధాలను ఆంధ్రదేశ వంశాలతో తూర్పుగాంగుల సంఘర్షణ అనే పేరుతో ఇక్కడ వివరించడమైనది. తూర్పుగాంగ వంశం క్రీ.శ.498లో స్థాపించబడి క్రీ.శ.1434 వరకు సుమారు 1000 సంవత్సరాలు కొనసాగింది. ఇంత సుదీర్ఘకాలం పాలించిన వంశం మరేదీలేదు. ఈ రాజ్యానికి మూల పురుషుడు మితవర్మ అతడు పృధ్వీమూలునికి సమకాలికుడు. పృధ్వీమూలుని గోదావరి తామ్ర శాసనంలో మితవర్మ పేరు ప్రస్తావించబడింది. ఇతడు మొదట సామంతుడుగా ఉండి తర్వాత స్వతంత్రం ప్రకటించాడని, అతడు స్వతంత్రం ప్రకటించిన సంవత్సరం నుంచే అంటే క్రీ.శ.498 నుండే గంగశకం ప్రారంభమైందని భావించారు. మితవర్మ తర్వాత అతని కుమారుడు మొదటి ఇంద్రవర్మ క్రీ.శ.524లో రాజ్యానికి వచ్చి త్రికళింగాధిపతి అనే బిరుదు ధరించాడు. అతని తర్వాత అతని వారసులందరూ ఆ బిరుదును కొనసాగించారు. అతని వంశస్తులు సుమారు 40 మంది 1000 సంవత్సరాలుగా అంటే క్రీ.శ.1434 వరకు పాలించారు. వారిలో చివరివాడు నాల్గవ భానుదేవుడు. అతనితో తూర్పు గాంగరాజ్యం అస్తమించింది. వీరికి సమకాలికంగా ఆంధ్రదేశాన్ని విష్ణుకుండినులు, తూర్పు చాళుక్యులు, చోళచాళుక్యులు, వెలనాటిచోడులు, కాకతీయులు, ముసునూరి, పద్మనాయక రెడ్డిరాజ్యాలు పాలించాయి. ఉత్తరాంధ్ర ప్రాంతాలపై ఆధిపత్యం కోసం తూర్పుగాంగులు ఈ వంశాలన్నింటితో యుద్ధాలు చేశారు. ఈ చేసిన యుద్ధాలనే తూర్పుగాంగుల సంఘర్షణ అని చెప్పవచ్చును.

భారతదేశ చరిత్రలో తొమ్మిది శతాబ్దాలు అవిచ్ఛిన్నంగా పాలించిన వంశం కళింగనేలిన తూర్పుగాంగ వంశం. ఇది ఆంధ్రదేశపు రాజవంశమే. వారి కులదైవం శ్రీకాకుళం జిల్లాలోని మహేంద్రగిరి మీద వెలసి ఉన్న గోకర్ణేశ్వరుడు. వారి మొదటిరాజధాని దంతపురం, రెండవ రాజధాని కళింగనగరం. ఈ రెండూ శ్రీకాకుళం జిల్లాలోనే ఉన్నాయి. దంతపురం అతి ప్రాచీనమైనది. బౌద్ధవాఙ్మయంలో దాని ప్రస్తావన ఉంది. ఇటీవల పరిశోధనలలో బయల్పడిన దంతవక్త్రుని కోటగా గుర్తించారు. కళింగ నగరం ముఖలింగంగా గుర్తించారు. కనుక గాంగవంశస్తుల రాజ్యం ఆంధ్రదేశంలోనే స్థాపించబడింది. తర్వాత వీరి రాజధాని అనంతవర్మ చోడగంగ కాలంలో కళింగ నగరం నుండి ఉత్కళలోని కటకానికి మార్చబడింది. అప్పటి నుంచి అది కళింగ లేక ఒడ్డె రాజ్యంగా పిలువబడింది. వారు కళింగాధిపతులమని తమ శాసనాలలో చెప్పుకున్నారు. ప్రాచీన కాలంలో కళింగదేశం ఉత్తరాన బంగాళారాష్ట్రం నుండి దక్షిణాన గోదావరి నదీతీరం వరకు విస్తరించి ఉండేది. ఇది మూడు భాగాలుగా విభాజితమై ఉండేది. ఉత్తరకళింగ, మధ్యకళింగ, చిలకసరస్సు నుండి సింహాచలం వరకు మధ్య కళింగ, సింహాచలం నుండి గోదావరినది వరకు దక్షిణకళింగ. ఉత్తరకళింగే ఉత్కళగా మారి ఒరిస్సా అయింది. ఈ ప్రాంతంలో ఒరియా భాష ప్రజలు నివసించేవారు. గంగవంశస్తులు తమ శాసనాలలో తాము మొదటి నుండి త్రికళింగలు తమవేనని, తమ రాజ్యానికి దక్షిణ సరిహద్దు గోదావరి నది అని భావించేవారు. గోదావరినది వరకు ఉన్న ప్రాంతం తమ ఆధిపత్యంలో ఉండాలని వారు భావించేవారు. కాని వేంగిని పాలించిన ఆంధ్ర రాజవంశాల వారు దక్షిణ కళింగ ప్రాంతాలు తమ ఆధిపత్యంలో ఉండాలని కోరుతుండేవారు. కనుక ఆంధ్రరాజవంశాలకు,

కళింగగాంగులకు ఈ ప్రాంతాల కోసం మొదటి నుండి సంఘర్షణ జరుగుతూనే ఉండేది.

కనుక ఆంధ్రదేశ రాజవంశాలు గోదావరీ తీరాన్ని జయించడానికి ప్రయత్నించినప్పుడల్లా గాంగులు వారితో సంఘర్షణకు దిగేవారు. ఆ ప్రాంతం తమదని, దానిని దక్కించుకోవాలని వారు తాపత్రయపడేవారు. వారు ఎన్నిసార్లు గెల్చినా దక్షిణకళింగను అంటే రాజమహేంద్రవరం నుండి సింహాచలం వరకు ఉన్న ప్రాంతాన్ని దక్కించుకోలేకపోయారు. అంటే వారు ఎన్నిసార్లు ఓడిపోయినా మధ్యకళింగ అంటే సింహాచలం నుండి శ్రీకాకుళంలోని టెక్కలి వరకు ఉన్న ఆంధ్రప్రాంతాన్ని నిలబెట్టుకోగలిగారు. వెలనాటి పృధ్వీశ్వరుడు శ్రీకూర్మం వరకు జయించినా కూడా అది తాత్కాలిక విజయమే అయింది. ఈ ప్రాంతం మొదటి నుండి గంగరాజ్యంలో భాగంగా ఉండేది. ఆ ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన సింహాచల దేవాలయాన్ని, శ్రీకూర్మ దేవాలయాన్ని వారే నిర్మించారు మధ్యకళింగ దానిని గంగుల రాజ్యభాగంగానే గుర్తించారు. సింహాచలం వరకు తమకు ఉంటే చాలని తృప్తిపడ్డారు. కనుక వేంగి రాజవంశాలకు కళింగగాంగులకు సింహాచలమే హద్దుగా ఉండిపోయింది. గాంగ వంశస్తులు దక్షిణకళింగను జయించాలని ప్రయత్నించి దండయాత్రలు చేసి విజయం సాధించినప్పుడల్లా ద్రాక్షారామంలోని భీమేశ్వరుని దర్శించి కానుకలు సమర్పించి శాసనాలు వేయించేవారు. అలాగే వేంగిరాజులు వారిని తరిమికొట్టి సింహాచలం గాంగరాజ్యంలో ఉండేది. ద్రాక్షారామం వేంగిరాజుల రాజ్యంలో ఉండేది. కనుక ద్రాక్షారామంలో గంగరాజుల శాసనాలు, సింహాచలంలో వేంగిరాజుల శాసనాలు అనేకం ఉన్నాయి. ఒకవేళ శ్రీకూర్మం, కటకం దాకా వేంగిరాజులు విజయయాత్ర సాగించినా సింహాచలం వరకు తిరిగి గాంగులకే వదలివేసేవారు. గాని గాంగులు గోదావరీ తీరాన్ని జయించితే దాన్ని వారు వదిలేవారు గాదు. వారిని ఓడించి తరిమితేగాని పోయేవారు కాదు. అందుకు కారణం దక్షిణకళింగ కూడా తమదేననే భావం వారికి ఉండేది. తాము త్రికళింగాధిపతులం అని తలచేవారు. కనుక వీలైనప్పుడల్లా వారు గోదావరీ ప్రాంతం వరకు దండెత్తివచ్చి ఆంధ్రదేశాన్ని పాలించే ప్రధాన వంశాలతో సంఘర్షణ పడ్డారు. ఈ విధంగా దక్షిణకళింగ ప్రాంతం కోసం అంటే రాజమహేంద్రవరం నుండి సింహాచలం వరకు ఉన్న ప్రాంతాన్ని తమ ఆధిపత్యంలో ఉంచుకోవాలని కళింగ గాంగులు వేంగి ఆంధ్ర రాజవంశాలతో చేసిన యుద్ధాలనే కళింగ గాంగ సంఘర్షణ అని చెప్పవచ్చు. ఈ సంఘర్షణ ఘట్టాలను 8 భాగాలుగా విభజింపవచ్చును.

1. తూర్పుచాళుక్య - గంగ సంఘర్షణ
2. చోళ చాళుక్య - గంగ సంఘర్షణ
3. వెలనాటి చోడ - గంగ సంఘర్షణ
4. కాకతీయ - గంగ సంఘర్షణ
5. ముసునూరు సామంతుల - గంగ సంఘర్షణ
6. రెడ్డి - గంగ సంఘర్షణ
7. పద్మనాయక - గంగ సంఘర్షణ
8. విజయనగర - గంగ సంఘర్షణ

తూర్పు చాళుక్య గాంగ సంబంధాలు లేక సంఘర్షణ క్రీ.శ.624 - క్రీ.శ.1076: వేంగిలో తూర్పుచాళుక్య వంశం స్థాపించే వరకు గాంగవంశం స్వతంత్రంగానే రాజ్యం చేసినట్లుగా కనిపిస్తోంది. విష్ణుకుండినులతో వారి సంబంధాలు స్పష్టంగా తెలియవు. కాని తూర్పుచాళుక్యవంశం జన్మించిన తర్వాత వారు తూర్పుచాళుక్యులకు సామంతులయ్యారు. క్రీ.శ.610-650 సంవత్సరాల మధ్య కళింగదేశాన్ని మూడవ ఇంద్రవర్మ పాలించాడు. ఇతని కాలంలో రెండవ పులకేశి కళింగపై దండెత్తి ఇతనిని ఓడించాడు. కుబ్జవిష్ణు వర్ధనుడు వేంగి సింహాసనమధిష్టించిన తర్వాత మూడవ ఇంద్రవర్మను మళ్లీ ఓడించి సింహాచలం వరకు ఉన్న ప్రాంతాన్ని చాళుక్య సామ్రాజ్యంలో కలిపి తనను కొలిచిన సేనాధిపతులకు జాగీరులుగా ఇచ్చాడు. వారిలో మత్స్యవంశానికి చెందని అటవీదుర్జనుడు అతిముఖ్యుడు. ఇతనిని చీపురుపల్లి పరిసర ప్రాంతాలలో స్థానిక పాలకునిగా నియమించాడని చీపురుపల్లి శాసనం సూచిస్తోంది. ఆ శాసనానికి అటవీ దుర్జయుడు ఆజ్ఞప్తి. ఇతడే కళింగదేశంలోని మత్స్యవంశానికి మూల పురుషుడు. వారి రాజధాని వడ్డాది. ఆ తర్వాత ఆ ప్రాంతంలో మత్స్యవంశం ప్రముఖపాత్ర నిర్వహించింది. ఓటమి తర్వాత గాంగవంశ మూడవ ఇంద్రవర్మ తూర్పుచాళుక్య సామంతుడయ్యాడు. నాటి నుండి గాంగవంశస్తులు తమ స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకోవడమే గాక, దక్షిణకళింగ ప్రాంతాన్ని పూర్తిగా పోగొట్టుకున్నారు. అది వేంగిరాజ్యంలో

భాగమైంది. ఆ తర్వాత ఆ ప్రాంతాన్ని తిరిగి సంపాదించడానికి వీలయినప్పుడల్లా ఆ ప్రాంతాలపై దండెత్తుతూ ఉండేవారు తరచూ మత్స్యవంశస్థులు కూడా గాంగరాజులకు సామంతులుగా మారిపోయేవారు బలమైన వేంగిరాజులు దండెత్తి ఆ ప్రాంతాలు తిరిగి జయించే వరకు అవి గాంగరాజుల ఆధిపత్యంలోనే ఉండేవి. ఈ విధంగా సంఘర్షణ జరుగుతూ ఉండేది. మహేంద్రగిరి వరకు దక్షిణ, మధ్యకళింగలు రెండూ కుబ్జవిష్ణువర్ధనుని కుమారుడు మొదటి జయసింహునికి, గంగవంశ గుణార్ణవ మొదటి దేవేంద్రవర్మ సమకాలికుడు. అతడు జయసింహుని సామంతుడు. తర్వాత గంగవంశస్తులు కూడా క్రీ.శ.718 వరకు తూర్పుగాంగుల సామంతులుగానే కొనసాగారు.

ఎలమంచిలి రాజ్యం-కొక్కిలి క్రీ.శ.718: రెండవ జయసింహుని తర్వాత క్రీ.శ.718లో కొక్కిలి మహారాజు రాజ్యానికి వచ్చాడు. కాని అతనిని తన అన్న మూడవ విష్ణువర్ధనుడు ఓడించి తరిమివేశాడు. అతడు యలమంచిలి చేరి క్రీ.శ.718వ సంవత్సరంలో కొక్కిలి మహారాజు ప్రధానశాఖపై తిరుగుబాటు చేసి యలమంచిలిలో స్వతంత్ర రాజ్యం స్థాపించాడు యలమంచిలి ప్రాంతాన్ని పూర్వం దేవరాష్ట్రం అనేవారు. దాని రాజధాని యలమంచిలి మొదటి నుండి ఇది ప్రఖ్యాతిగాంచిన రాజ్యం కనుక కొక్కిలి పూర్వపు దేవరాష్ట్రాన్ని తన స్వంతం చేసుకొని యలమంచిలిని రాజధానిగా చేసుకున్నాడు. దాని ఫలితంగా వేంగికి తూర్పుగాంగులతో ప్రత్యక్ష సంబంధం తెగిపోయింది. ఇదే సమయంలో మూడవ విష్ణువర్ధనుని కాలంలో తూర్పుచాళుక్యులు పల్లవ నందివర్మ చేతిలో ఓడిపోయి బలహీనపడ్డారు ఆ సమయంలో గాంగులు స్వతంత్రులయ్యారు. క్రీ.శ.716-749 సంవత్సరాల మధ్య పాలించిన మూడవ దేవేంద్రవర్మ గంగశకం 254లో విశాఖపట్నంలో శాసనం వేయించాడు. దానిని బట్టి మూడవ దేవేంద్రవర్మ తూర్పుచాళుక్యులకు సామంతుడు కాదని చెప్పవచ్చును. అంతేకాకుండా సింహాచల ప్రాంతం అతని వశంలో ఉందని కూడా చెప్పవచ్చును. అప్పటి నుండి వారు స్వతంత్రపాలన చేశారు. కాని క్రీ.శ.880-893 వరకు పాలించిన ఐదవ దేవేంద్రవర్మ కాలంలో తూర్పుచాళుక్యులతో ప్రసిద్ధి చెందిన గుణగవిజయాదిత్యుడు కళింగపై దండెత్తి దేవేంద్రవర్మను ఓడించి కప్పం వసూలు చేశాడు. దాంతో గంగరాజ్యం ఛిన్నాభిన్నమై ఐదు రాజ్యాలుగా చీలిపోయింది. తర్వాత క్రీ.శ.894-938 మధ్య పాలించిన రెండవ వజ్రహస్తుడు ఐదు భాగాలను తిరిగి జయించి ఏకం చేశాడు. ఇతడు కోల్పోయిన భాగాలను తిరిగి జయించి త్రికళింగాధిపతి అని బిరుదు వహించాడు. అమ్మరాజమహేంద్రుని కాలం నుండి వేంగి రాజకీయాలు స్పర్ధలతో ఉండేవి. అందువల్ల గాంగులు స్వతంత్రంగా పాలించుకున్నారు. తర్వాత తూర్పుచాళుక్యులు కళింగగాంగులు వియ్యాలు కూడా పొందారు క్రీ శ 934-940 సంవత్సరాల మధ్య పాలించిన వజ్రహస్తుని కుమార్తె కావచ్చును..తర్వాత రాజేంద్రచోళుడు తన మరదలు రాజసుందరిని రాజరాజదేవునికిచ్చి వివాహం చేశాడు. వారి కుమారుడే గాంగులతో సుప్రసిద్ధుడైన అనంతవర్మ చోడగాంగుడు. అతడు 72 సంవత్సరాలు పాలించాడు. భారతదేశ చరిత్రలో అంత సుదీర్ఘకాలం పాలించిన రాజు మరొకడు లేడు.

చోళచాళుక్య-గాంగ సంఘర్షణ క్రీ.శ.1076-1150: రాజరాజనరేంద్రుని తర్వాత చాళుక్యయుగం ముగిసి క్రీ.శ.1076లో వేంగిలో చోళచాళుక్య యుగం ప్రారంభమైంది. ఇదే సమయంలో కళింగ రాజ్యంలో గాంగులతో సుప్రసిద్ధుడైన అనంతవర్మ చోడగంగు సింహాసనం అధిష్టించాడు. ఇతడు చాలా గొప్పవాడు. దక్షిణ కళింగ వరకు జయించి గంగసామ్రాజ్యాన్ని విస్తరించాలని వేంగిరాజ్యంపై దండెత్తి గోదావరి తీరం వరకు జయించి ద్రాక్షారామ భీమేశ్వరుని దర్శించి దానాలు చేసి శాసనాలు రాయించాడు. అతని దేవేరులు కస్తూరి కామోదిని, చంద్రలేఖలు కూడా ద్రాక్షారామ భీమేశ్వరునికి దానాలు చేశారు. గోదావరీ తీరం రెండవ కుళోత్తుంగుడు గోదావరీ యుద్ధంలో కళ్యాణీ చాళుక్యులను ఓడించి తర్వాత కళింగపై దండెత్తి అనంతవర్మ చోడగంగుని ఓడించి మహేంద్రగిరి వరకు ఆక్రమించారు. ఆ తర్వాత గంగు ఉత్తరాంధ్రపై దండెత్తలేదు. జయించిన దక్షిణాంధ్ర చేజారిపోయింది.

వెలనాటి చోడులు-గాంగుల సంఘర్షణ క్రీ.శ.1150-1210: క్రీ.శ.1150 నుండి వెలనాటి చోడులు నామమాత్రంగా తంజావూరి చోళుల సార్వభౌమాధికారాన్ని అంగీకరిస్తూ ఆంధ్రదేశాన్ని పాలించారు. వారి కాలంలో కోణ హైహయులు తిరుగుబాటు చేశారు. గోదావరీతీర ప్రాంతంలో జోక్యం చేసుకోవచ్చని అనంతవర్మ చోడగంగు కుమారుడు మధుకామార్ణవుడు హైహయులను బలపరచాడు. అందుకు కోపించి వెలనాటి గొంకరాజు కళింగపై దండెత్తి మధుకామార్ణవుని ఓడించాడు. ఈ దిగ్విజయయాత్ర జరిపింది అతని సేనాని కొమ్మనామాత్యుడు. అతడు యలమంచిలిని రాజధానిగా చేసుకొని దక్షిణకళింగను కొంతకాలం పాలించాడు

యలమంచిలిలో అతడు త్రవ్వించిన తటాకాన్ని నేటికీ కొమ్మయగుండం అనే పిలుస్తున్నారు. కొమ్మన యలమంచిలి, శ్రీకూర్మం, మొదలైన కళింగదేశ ప్రదేశాలలో 32 విష్ణువిగ్రహాలను ప్రతిష్ఠించాడట. ప్రతిరోజు వేయి మంది బ్రాహ్మణులకు భోజనం పెట్టేవాడట. తర్వాత క్రీ.శ.1156-1170 సంవత్సరాల మధ్య పాలించిన రాఘవుని కాలంలో వెలనాటి రెండవ రాజేంద్ర కుళోత్తుంగచోడుడు కళింగపై దండెత్తాడు. ఈ విజయాలను క్రీ.శ.1156 నాటి ద్రాక్షారామం శాసనం తెలుపుతోంది. తర్వాత అక్కడ కుళోత్తుంగచోడుని సేనాని ప్రోలయ నాయకుడు విశాఖ జిల్లా సర్వసిద్ధి ప్రాంతంలోని శ్రీరామాపురంలో క్రీ.శ.1169లో శాసనం వేయించాడు. అంటే అతన్ని ఆ ప్రాంతానికి స్థానిక పాలెగాడుగా చోడుడు నియమించి ఉండవచ్చును. క్రీ.శ.1170-1175 సంవత్సరాల మధ్య పాలించిన రెండవ రాజరాజు దక్షిణకళింగపై దండెత్తి సింహాచలం నుండి గౌతమీతీరం వరకు ప్రాంతాన్ని జయించాడు. మూడవ గొంకరాజు కుమారుడు పృథ్వీశ్వరుడు కాశ్యపగోత్రీకుడైన కొమ్మనమంత్రి కుమారుడైన కేతనమంత్రి, కొరవి వెన్నయామాత్యుడు, కొల్లూరు ఎరపదేసటి వంటి సేనానులను తీసుకొని క్రీ.శ.1186లో పిఠాపురంపై దండెత్తి పిఠాపుర చాళుక్య రాజ్యాన్ని అంతం చేసి, కోనసీమను జయించి, కళింగ గాంగుల సామంతులను ఘోరంగా ఓడించి కళింగనగరం, వీరగొట్టాలను జయించి క్రీ.శ.1188 నాటికి శ్రీకూర్మం చేరి అక్కడ పృథ్వీశ్వరుడు శాసనం వేయించాడు. కళింగ రాజ్యంలో ప్రధాన స్థానం వీరగొట్టం. దానిని జయించినందువల్ల పృథ్వీశ్వరుడు శాసనం వేయించాడు. కళింగ రాజ్యంలో ప్రధాన స్థానం వీరగొట్టం అని వీరఘట్టం, వీరఘోట్టం, వీరకూటమని పేర్లు ఉన్నాయి. ఇది శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ వద్ద ఉంది. ఈ విజయంతో పృథ్వీశ్వరుడు దక్షిణ కళింగనే గాక మధ్య కళింగను కూడా జయించి వెలనాటి చోడ సామ్రాజ్యంలో కలిపాడు. కనుక వెలనాటి చోడుల కాలంలో దక్షిణకళింగ పూర్తిగా వేంగి రాజ్యంలోనే ఉందని చెప్పవచ్చును. అంతేగాక చోళచాళుక్య వెలనాటి రాజుల కాలంలో దక్షిణ కళింగ తరచూ చేతులు మారింది. అందువల్ల వెలనాటి వారు దాడులు చేస్తూ ఉండేవారు. అందువల్ల ఈ కాలంలో ద్రాక్షారామం భీమేశ్వరాలయంలో కళింగగాంగులు, వెలనాటి చోడులకు, వారి దండనాయకులకు, రాజస్త్రీలకు సంబంధించిన అనేక శాసనాలు ఉన్నాయి.

కాకతీయులు - తూర్పుగాంగుల సంఘర్షణ క్రీ.శ.1210-1323: కాకతి గణపతిదేవుడు క్రీ.శ.1210లో వెలనాటి పృథ్వీశ్వరుని చంపి వేంగి నాక్రమించాడు. పృథ్వీశ్వరుని మరణానంతరం కాకతిగణపతి తెలుగు యేరువ చోడభీముడు, రాజానాయకుని, రేచర్లరుద్రుని కళింగపై దండయాత్రకు పంపాడు. వారు కళింగలోని బొక్కెరను పాలించిన వీరభటావళిని, ఉదయగిరిని పాలించు గోధుమరాటిని వధించి కళింగను ఆక్రమించినట్లు గొడిశాల శాసనం తెలుపుతోంది. ఈ దండయాత్ర మూడవ రాజరాజు చివరి కాలంలో క్రీ.శ.1211-1212 ప్రాంతంలో జరిగింది. కాకతీయ సేన కళింగలో చేసిన వీరవిహారానికి ప్రతీకారం తీర్చుకోదానికి మూడవ రాజరాజు కుమారుడు మూడవ అనియంక భీముడు క్రీ.శ.1217లో వేంగిపై దండెత్తి జయించాడు. అతడు ద్రాక్షారామం దర్శించి త్రికళింగలను శత్రువుల నుండి విడిపించానని చెప్పుకొని శాసనం వేయించాడు. ఆ శాసనం అతని సేనాని వేయించాడు. అందులో ద్రుతజత విలసద్వేంగి భూమండలుడని, త్రికళింగేశ్వరుడని, త్రయీవసుంధరా సమద్ధరణుడని వర్ణింపబడ్డాడు. తర్వాత పృథ్వీశ్వరుని మరణానంతరం ఆంధ్రదేశం అల్లకల్లోలమైంది. అరాచక పరిస్థితులను ఆసరాగా తీసుకొని అనియంకభీమదేవుడు కంచి, శ్రీరంగం వరకు దండయాత్ర చేసి కంచిలో రెండు శాసనాలు వేయించాడు. కోస్తాంధ్ర యావత్తూ అతని పాదాక్రాంతమైంది. అది తెలిసిన కాకతిగణపతి అనంగభీమునిపైకి ఇందులూరి సోమప్రధాని, మలయాల హేమాద్రిరెడ్డిలను పంపాడు. వారు రెండవసారి కళింగపై దండెత్తి దక్షిణకళింగను జయించారు. క్రీ.శ.1238లో మూడవ అనంగభీముని కుమారుడు మొదటి నరసింహుడు రాజ్యానికి వచ్చి మళ్లీ వేంగిపై దండెత్తాడు. గణపతిదేవుడు పడికం బొప్పదేవుని నాయకత్వంలో కాకతీయ సైన్యాన్ని పంపాడు. అతడు కళింగసేనాని గుంటూరు నాగదేవుని ఓడించి వధించి దక్షిణకళింగను ఆక్రమించాడు. ఈ విధంగా కాకతిగణపతి కాలంలో గాంగులు మూడు పోరాటాలు జరిపి ఓడిపోయారు. రుద్రమదేవి మొదటి భానుదేవుడు వేంగిపై కూడా దండెత్తాడు. రుద్రమదేవి క్రీ.శ.1264లో పోతినాయకుడు, పోలినాయకుడు అనే సేనాధిపతులను పంపింది. వారు గాంగులను ఓడించి గోదావరీ తీరప్రాంతాన్ని పునరాక్రమించారు. తర్వాత కాకతీయుల కాలంలో కళింగగాంగులు తమకు దక్షిణకళింగ మీదనేగాక వేంగి రాజ్యంపై కూడా హక్కు ఉందని భావించారు. అందుకు కారణం వారు వేంగిచాళుక్యులతో అంతకు పూర్వం వివాహ సంబంధాలు కలిగి ఉన్నారు. అంతేగాక ఈ తరంలో యలమంచిలి చాళుక్యులతో కూడా వారు వివాహ

సంబంధాలను పెట్టుకున్నారు. మూడవ రాజరాజు భార్య మంకుణదేవి మల్లాణదేవి యలమంచిలి చాళుక్య రాజకుమార్తె అమెకు సద్గుణాదేవి అని కూడా పేరుంది కనుక వెలనాటిచోడుల తర్వాత వేంగి రాజ్యం మీద కాకతీయులకు గాక తమకే అధికారం ఉన్నదని భావించినందు వల్లనే మూడవరాజరాజు, అతని కుమారుడు అనియంక భీముడు, మొదటి నరసింహుడు వేంగి మీద దండయాత్రలు చేశారు. కాని కాకతీయులు బలవంతులైనందున వీరిని పారదోలి వేంగిని స్వంతం చేసుకోగలిగారు. గాంగుల ప్రయత్నాలు ఫలించలేదు.

ముసునూరు రాజ్య సామంతులు-తూర్పు గాంగులు క్రీ.శ.1325-1350: కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ముస్లింలను పారదోలి ముసునూరు ప్రోలయనాయకుడు ఉత్తరాంధ్రను తన అధికారం కిందికి తెచ్చుకున్నాడు. అతని కాలంలో క్రీ.శ 1327-1353 సంవత్సరాల మధ్య కళింగనేలిన మూడవ నరసింహుడు ఉత్తరాంధ్రపై దండెత్తాడు. అతనిని ప్రోలయనాయకుడు ఎదిరించాడు. ఈ యుద్ధంలో ప్రోలయనాయకునితో పాటు యేరువచోడ భక్తిరాజు, అద్దంకి ప్రభువు ప్రోలయ వేమారెడ్డి కూడా పాల్గొన్నారు. శక 1257 నాటి చీమకుర్తి శాసనంలో ప్రోలయవేమారెడ్డి కళింగ, జంతరనాడు, ఒడ్డెయరాయని జయించినట్లుగా ఉంది. అన్నెదేవచోడుని తండ్రి చోడభక్తిరాజు గజపతిని ఓడించి పాంచదార్ల సింహాసనంపై కొప్పులపతిని నిలపానని అతని రాజమహేంద్రవర మ్యూజియం శాసనంలో వర్ణించాడు. కనుక క్రీ శ.1330-35 మధ్య మూడవ నరసింహుడు ఉత్తరాంధ్రపై దండెత్తి ఓడిపోయి వెనుదిరిగి ఉండవచ్చును. ఈ యుద్ధంలో ప్రోలయనాయకుడు మరణించాడు ప్రోలయనాయకుని తర్వాత కాపయనాయకుడు ఉత్తరాంధ్రకు అధిపతి అయ్యాడు. ఓరుగల్లు సింహాసనం అధిష్టించి ఆంధ్రసురత్రాణ, ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు ధరించాడు. కాపయనాయకుడు కోరుకొండ, తొయ్యేరు పిఠాపురం, రాజమహేంద్రవరాలలో తన సామంతులను నియమించాడు. తన పినతండ్రి కుమారుడు రాజా నాయకుని వారిపై అధిపతిగా నియమించాడు. కాపయనాయకుడు బహమనీ హసన్‌గంగు చేతిలో ఓడిపోయిన తర్వాత ఈ సామంతులు స్వతంత్రం ప్రకటించారు. దానిని అదనుగా తీసుకొని క్రీ.శ.1353లో మూడవ నరసింహదేవుడు దక్షిణ కళింగపై తన సైన్యాన్ని పంపాడు. వారు ముసునూరు రాజ్యసామంతులను ఓడించి తర్వాత వేంగిని జయించి కృష్ణాతీరం వరకు చేరి దివిసీమలోని శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దేవాలయం ద్వారా శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువుకు కానుకలు సమర్పించి శాసనాలు రాయించారు.

కొండవీటి రెడ్డి రాజ్యం - గంగ సంఘర్షణ క్రీ.శ.1356-1375: క్రీ.శ.1353లో అనపోతారెడ్డి అద్దంకి సింహాసనానికి వచ్చాడు. అతడు సింహాసనం అధిష్టించిన సంవత్సరంలోనే మూడవ నరసింహదేవుడు కృష్ణానది వరకు దండయాత్ర చేశాడు. అదే సమయంలో కాపయనాయకుడు బహమనీ దండయాత్రలలో సతమతమవుతున్నాడు. అతడు ఉత్తరాంధ్రను రక్షించుకొనే స్థితిలోలేదు. కనుక ఉత్తరాంధ్రను రెడ్డిరాజ్యంలో కలపాలని అనపోతారెడ్డి, ఉత్తరాంధ్రపై దండెత్తాడు. ఈ దండయాత్రలో విజయం సాధించి ద్రాక్షారామంలో శాసనం వేయించాడు. కాని క్రీ.శ.1360లో సూరవరం వద్ద జరిగిన యుద్ధంలో భక్తీశ్వరచోడుని చేతిలో ఓడిపోయి తిరిగివచ్చాడు. అతని తర్వాత అతని సోదరుడు అనవేమారెడ్డి కళింగ దండయాత్ర చేసి సింహాచలం వరకు చేరాడు ఇతని కాలంలో మూడవ భానుదేవుడు కళింగ గాంగరాజు క్రీ.శ.1353 నుండి 1378 వరకు పాలించాడు. అతని భార్య హీరాదేవి. అతని కాలంలో గజబలం పెరిగింది అందువల్ల గంగవంశస్తులకు గజపతులని కూడా పేరువచ్చింది. ఇతనికి, అనవేమారెడ్డికి ప్రత్యక్షయుద్ధం జరిగినట్లు ఆధారాలు లేవు. అతని తర్వాత అతని కుమారుడు నాల్గవ నరసింహుడు రాజ్యానికి వచ్చి క్రీ.శ.1378 నుండి 1409 వరకు పాలించాడు

రాచకొండ పద్మనాయకులు - గాంగులు క్రీ.శ.1380-1397: కొండవీటి రెడ్డిరాజులు ఉత్తరాంధ్రను జయించిన తర్వాత తాము ఆ ప్రాంతాలను జయించాలని క్రీ.శ.1380 అనపోతానాయకుడు, ఆ తర్వాత అతని కుమారుడు రెండవ సింగమనాయకుడు, దేవరకొండ పెదవేదగిరి రెండవసారి క్రీ.శ.1387లో దండెత్తారు. నాల్గవ నరసింహుడు వెలమలను ఎదిరించలేదు.

కాటయవేమారెడ్డి క్రీ.శ.1389-90-కుమారగిరిరెడ్డి కాలం: పద్మనాయకులు తిరిగి వెళ్లగానే కాటయ వేమారెడ్డి మళ్లీ కళింగ రాజ్యంపై దండెత్తి చిలక సరస్సు వరకు సాగాడు. నాల్గవ నరసింహ దేవుడు ఓడి కానుకలు చెల్లించాడు. సింహాచలం వరకు రెడ్డి రాజ్యంలో కలిసిపోయింది. చిలకసరస్సు వద్ద రెడ్డివీరులు విజయస్థంభాలు ప్రతిష్టించారు. క్రీ.శ.1402లో కోమటి వేమారెడ్డి కుమారగిరిని ఓడించి తరిమి కొండవీటి సింహాసనం అధిష్టించాడు. ఆ అల్లకల్లోల పరిస్థితుల్లో క్రీ.శ.1402లో అన్నెదేవచోడుని పక్షాన దేవరకొండ వెలమలు దక్షిణ

కళింగపై దండెత్తారు. వారిని యలమంచిలీ చాళుక్య విశ్వేశ్వరుడు ఓడించాడు. క్రీ.శ.1405-1407ల మధ్య మళ్లీ వెలమల దక్షిణకళింగపై దండెత్తారు. ఈ విధంగా జరిగిన రెడ్డి వెలమదాడుల వలన గంగరాజ్యం బలహీనమైంది.

నాల్గవ భానుదేవుడు క్రీ.శ.1424-1434: క్రీ.శ.1409లో నాల్గవ భానుదేవుడు రాజ్యానికివచ్చి క్రీ.శ.1438 వరకు పాలించాడు. ఇతడు గాంగవంశస్థులలో చివరివాడు. క్రీ.శ.1424లో రాచవేమారెడ్డి మరణించాడు. అది తెలిసిన నాల్గవ భానుదేవుడు గత రెండుతరాల నుండి రెడ్డిరాజులు తమ రాజ్యంపై దండెత్తి చేసిన అవమానాలకు ప్రతీకారం చేయాలని పెద్దసేనతో కోస్తాంధ్రపై దండెత్తాడు. మొదట రాజమహేంద్రవరంలో అనితల్లిని తొలగించి, అనప్రోలుని కుమారులైన మూడవ కుమారగిరి, మూడవ అనపోతలను తన సామంతులుగా నియమించి కొండవీడు చేరి కొండవీటి కోటను ఆక్రమించాడు. తర్వాత ఉదయగిరి వరకు జయించి కోస్తా మొత్తానికి ప్రభువయ్యాడు. గంగసామ్రాజ్యానికి ఇది చివరి వెలుగు. ఆరిపోయే దీపం పెద్దగా వెలుగుతుంది అన్నట్లు గంగసామ్రాజ్యం అంతరించబోయే ముందు అది బెంగాలు నుండి నెల్లూరు జిల్లావరకు మొత్తం కోస్తాను జయించగలిగింది. క్రీ.శ.1425 నుండి 1428 మూడు సంవత్సరాలు భానుదేవుని అధికారం కోస్తా మొత్తం మీద చెల్లింది.

విజయనగర - గాంగ సంఘర్షణ క్రీ.శ.1428-1430: కాని విజయనగర సామ్రాజ్య చక్రవర్తి రెండవ దేవరాయలు క్రీ.శ.1428, 1430 సంవత్సరాల మధ్య తీరాంధ్రదేశంపై దండెత్తి నాల్గవ భానుదేవుని ఓడించి తూర్పు కోస్తా మొత్తం సింహాచలం వరకు జయించాడు. దాంతో నాల్గవ భానుదేవుడు కటకం వెళ్లిపోయాడు. విజయనగర అండతో రాజమహేంద్రవర వేమ వీరభద్రారెడ్డు గంగరాజ్యంపై దాడులు చేసి సింహాచలం వరకు ఆక్రమించారు. వారిని ఓడించడానికి భానుదేవుడు దక్షిణకళింగకు వచ్చాడు. ఆ సందర్భంలో కపిలేశ్వర గజపతి కటకంలో కుట్రచేసి గంగరాజ్యాన్ని కాజేశాడు. అంటే దక్షిణకళింగను జయించాలని బయలుదేరే నాల్గవ భానుదేవుడు తన రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. దాంతో 900 సంవత్సరాల చరిత్ర కలిగిన గంగరాజ్యం అంతరించింది. అంతటితో గాంగ, ఆంధ్ర రాజవంశాల సంఘర్షణ కూడా అంతమైంది. ఈ విధంగా గాంగులు దక్షిణకళింగ కొరకు పోరాటాలు జరిపి చివరకు దానివల్లనే రాజ్యభ్రష్టులయ్యారు. అయితే వారి వారసులుగా గజపతులు కూడా అదే విధానాన్ని అవలంబించారు.

ఆంధ్రదేశ చరిత్రలో గజపతి యుగం

ఆంధ్రదేశ చరిత్రలో గజపతివంశం అత్యంత ప్రముఖపాత్ర నిర్వహించింది. ఇంతవరకు ఆంధ్రదేశ చరిత్ర రచించిన ఏ చరిత్రకారుడూ ఈ వాస్తవాన్ని పట్టించుకోలేదు. ఆంధ్రదేశ చరిత్రలో ఆ వంశానికి ఇవ్వవలసిన సముచిత స్థానాన్ని ఇవ్వలేదు. కొండవీటి రెడ్డిరాజ్యం పతనమైన తర్వాత ఆంధ్రదేశానికి నిజమైన పరిపాలనా వంశం గజపతి వంశమే. గోల్కొండ నవాబులు ఆంధ్రదేశాన్ని జయించే వరకు గజపతులు అవిచ్ఛిన్నంగా ఆంధ్ర దేశాన్ని ఏలారు. 125 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని ముస్లింల పాలపడకుండా కాపాడారు. ఆంధ్రదేశ చరిత్రలోనే కాదు వారు ఈ యుగంలో యావత్ దక్షిణ భారతదేశ చరిత్రలోనే అద్వితీయమైన పాత్రను నిర్వహించారు.

15వ శతాబ్దం మధ్యభాగంలో భారతదేశం ఐదు రాజకీయ కక్ష్యలుగా చీలిఉంది. ఉత్తరాన పంజాబు, ముల్తాను, ఢిల్లీ ముస్లిం రాజ్యాలు ఒక కక్ష్యగా ఉండగా, వాటికి దిగువన రాజస్థాన్‌లో హిందూ రాజ్యాలు ఉన్నాయి. మధ్య భారత్‌లో గుజరాత్, మాళవ, ఖాందేష్ బహమనీ రాజ్యాలు ముస్లిం రాజ్యాలు. బహమనీ రాజ్యానికి దక్షిణంగా హిందూ రాజ్యమైన విజయనగర రాజ్యం ఉంది. ఢిల్లీ ముస్లిం రాజ్యం మధ్య భారత్‌లోని ముస్లిం రాజ్యాలు, వాటిమధ్యలోని రాజస్థాన్ హిందూ రాజ్యాలతో పోరాడుతుండగా దక్షిణదేశంలో బహమనీ రాజ్యంతో విజయనగర రాజ్యం పోరాటాలు సలిపింది.

ఇక తూర్పు కోస్తాలో సూర్యవంశ గజపతుల రాజ్యం కూడా విజయనగర రాజ్యానికేమీ తీసిపోలేదు.' ఈ రాజ్యం ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన పెన్నానది వరకు విస్తరించి ఉంది. ఈ రాజ్యానికి ఉత్తరాన బెంగాలు జౌన్పూరు ముస్లిం రాజ్యాలున్నాయి. అవి ఈ రాజ్యంపై దాడులుచేస్తూ ఉండేవి. పశ్చిమాన మాళవ, బహమనీ రాజ్యాలుండేవి. అవి కూడా గజపతులతో పోరాడుతుండేవి. విజయనగర రాజ్యం ఒక్క బహమనీ రాజ్యంతో మాత్రమే పోరాడుతుండేవి. కాని గజపతి రాజ్యం రెండు ముస్లిం రాజ్య కూటాలతో పోరాటాలు సాగించింది. ఉత్తరాన బెంగాలు, జౌన్పూరు ముస్లిం రాజ్యాలతోను, మధ్యభారత్‌లోని మాళ్వ, బహమనీ ముస్లిం రాజ్యాలతోను పోరాడింది. ఒక రకంగా విజయనగర రాజ్యం కంటె గజపతి రాజ్యమే ఎక్కువ ముస్లిం రాజ్యాలతో పోరాడింది. కాని గజపతి రాజ్యం గొప్పదనాన్ని ఎవరూ సరిగా గుర్తించలేదు. విజయనగర రాజ్యాన్నే ఎక్కువగా కీర్తించారు. తూర్పుకోస్తాలో తెలుగు ప్రాంతాల కోసం విజయనగర రాజుతో కూడా పోరాడి ఉదయగిరి రాజ్యం వరకు గెలుచుకొని తన సామ్రాజ్యాన్ని పెంచుకుంది. అలాగే బహమనీలతో పోరి గుల్బర్గా వరకు తెలంగాణ ప్రాంతాలను కూడా తన ఆధిపత్యంలోకి తెచ్చుకుంది. ఈ ఘనత అంతా కపిలేశ్వర గజపతిదే. అతడు జౌన్పూరు, బెంగాలు, గుల్బర్గా (బహమనీ) విజయనగర రాజులపై పూర్తి విజయాన్ని సాధించాడు. అతడు జీవించి ఉన్నంతవరకు బహమనీలు గాని, విజయనగర ప్రభువులు గాని గజపతి రాజ్యంపై దండెత్తడానికి సాహసించలేదు. కనుక ఈ గ్రంథ రచయిత తర్వాత గజపతి వంశమే ఆంధ్రదేశ రాజవంశంగా తీసుకొని గజపతి వంశానికి అత్యంత ప్రాముఖ్యత ఇచ్చారు.

పురుషోత్తమ గజపతి కాలంలో హంవీరుని దృక్పథం వల్ల బహమనీ సుల్తాన్ మూడవ మహమ్మద్ షా, అతని మంత్రి గవాన్ గజపతి రాజ్యంపై దాడిచేసి రాజమండ్రి, కొండపల్లిలను ఆక్రమించగలిగారు. కాని చివరలో పురుషోత్తమ గజపతి తిరిగి విజృంభించి పోయిన రాజ్యం మొత్తాన్ని పునరాక్రమించాడు. తర్వాత అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి కాలంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగర రాజ్యం గొప్ప విజయం సాధించింది. రాయల దండయాత్ర గజపతిరాజ్యాన్ని బలహీనపరచింది. తర్వాత కొద్దికాలానికే గజపతి రాజ్యం కాలగర్భంలో కలసిపోయింది.

గజపతులు మూడుతరాలు 100 సంవత్సరాలు మాత్రమే పరిపాలించినా భారతదేశ చరిత్రలో వారు ఘనమైన పాత్రనే నిర్వహించారు. గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపించారు. అంతర్గతంగా కూడా సమర్థవంతమైన పాలనను ఏర్పాటు చేశారు. గంగవంశ రాజుల చివరి కాలంలో తిరుగుబాట్లు చేసిన సామంతులందరిని అణచి అదుపులోకి తెచ్చారు. అంతర్గతంగా రాజ్యాన్ని బలపరచారు. సమర్థవంతమైన పరిపాలనా విధానాన్ని ఏర్పాటు చేసి స్థిరత్వాన్ని సాధించారు. ప్రజలను బాధించే పన్నులను రద్దు చేశారు. నూతన భూములను సాగులోకి తెచ్చారు. పని చేయని ఉద్యోగులను తొలగించారు. సంస్కృతం, ఒరియా భాషలను ఆదరించారు. ఆ కాలం నాడు ప్రఖ్యాతి

వహించిన భక్తి ఉద్యమకారుడైన చైతన్య ప్రభువుని ప్రతాపరుద్రుడు ఆదరించాడు. చైతన్యుని రాకవల్ల గజపతి రాజ్యంలో మత సామరస్యం హెచ్చింది.

తూర్పుగాంగులు ఒరిస్సాలో గొప్ప దేవాలయాలను నిర్మించి ఒరిస్సాకు కీర్తి తెచ్చారు. శిల్పకళా రంగంలో గజపతులు నూతన దేవాలయాలు నిర్మించకపోయినా గాంగులు నిర్మించిన దేవాలయాలను కాపాడి ఒరిస్సా వరకు 100 సంవత్సరాలు మాత్రమే పాలించినప్పటికీ ఒరిస్సా రాష్ట్రానికి ఘనకీర్తిని సాధించిపెట్టింది. ప్రతాపరుద్ర గజపతి మంత్రి అయిన గోవింద విద్యాధరుని ద్రోహం వల్ల గజపతి వంశం అంతరించింది.

గజపతి బిరుదు-వంశం: వాస్తవానికి గజపతి అనేది వారి వంశం పేరు కాదు. సూర్యవంశస్తులమని చెప్పుకున్నా కటకరాజ వంశం గజపతి అనే బిరుదు వహించారు. ఈ వంశస్తులకు పేర్లచివరలో గజపతి అని, గజరాట్ అని తప్పకుండా ఉంటుంది. ఈ వంశరాజులను సరస్వతీ విలాసం, సతత దానరాధాసుత కపిలేశ్వరో గజపతిహ్ వర్ధయాతెశ్ర పురుషోత్తమొ గజపతిహ్ శ్రీవీరప్రతాపరుద్రదేవో గజపతిర్ అని వర్ణించింది. గజపతి అనే బిరుదు లేకుండా రాయబడిన శాసనం ఒక్కటి కూడా లేదు. ప్రతి శాసనంలో వీరశ్రీ గజపతి గౌడేశ్వర అని పేర్కొనబడింది. కనుక ఈ వంశస్తులను చరిత్రకారులు కటక గజపతులు అని, ఒరిస్సా గజపతులని పేర్కొన్నారు.

కాని గజపతి అనే బిరుదు ఈ వంశస్తులు ప్రారంభించలేదు. తూర్పుగాంగ వంశస్తులే ప్రప్రథమంగా ఈ బిరుదును ఉపయోగించారు. చోడగంగుని వారసులు గజపతి అనే బిరుదులు ధరించారు. అంతకు పూర్వపు గాంగవంశస్తులు, ముఖ్యంగా మూడవ వజ్రహస్తుడు అనంతవర్మ చోడగంగు మొదలైనవారు గంగ, ఆన్వయ్, ఆలంబన, మూలస్థంబ త్రికళింగాధిపతి అనే బిరుదులు మాత్రమే ధరించాడు. వారెవ్వరూ గజపతి అనే బిరుదు ధరించలేదు. చోడగంగుని తర్వాత వారు మాత్రమే గజపతి అనే బిరుదు వహించారు. కాని ఇది ఎప్పుడు ప్రారంభమైనదో కూడా స్పష్టంగా చెప్పలేము. గంగవంశస్తుల రాజ్యం మొదట ఆంధ్రదేశంలోనే ప్రారంభం అయింది. వారి తొలి రాజధాని దంతపురం. ఇటీవల పరిశోధనలలో అది శ్రీకాకుళం జిల్లాలో ఉన్నట్లు రుజువైంది. కనుక గంగరాజ్యం ఆంధ్రదేశపు రాజ్యమే. దక్షిణ కళింగ అని పిలువబడే ఉత్తరాంధ్ర ప్రాంతం వారి తొలిస్థావరం. తర్వాత ఈ వంశం ఉత్తరంగా వ్యాప్తి చెంది ఒరిస్సా ప్రాంతాలను కైవసం చేసుకొంది.' పశ్చిమప్రాంతం వీరి స్వాధీనంలో లేదు. తర్వాత ఆ ప్రాంతాలను కూడా జయించారు. ఆ ప్రాంతాన్ని జయించిన వారు త్రికళింగాధిపతి అనే బిరుదులు వహించారు. అంటే అప్పటి త్రికళింగలుగా పిలువబడే భూభాగాలన్నీ వారి రాజ్యంలో చేరిపోయాయి. అప్పటి వరకు కళింగరాజులనే పిలిచేవారు. అతని మనుమడు చోడగంగుని కాలంలో వీరరాజ్యం అన్ని దిక్కులకు విస్తరించింది. తూర్పు, పశ్చిమ, ఉత్తర ప్రాంతాలన్నీ జయింపబడ్డాయి. దాంతో ఉత్కళ అని పిలువబడే ప్రాంతం అంతా గంగరాజ్యంలో భాగంగా చేరిపోయింది. వారి రాజధాని కటకానికి మార్చబడింది. అప్పటి నుండి వారు ఉత్కళ రాజులుగా పిలువబడ్డారు. అంతేగాక చోడగంగుని వారసులు అప్పటి నుండి గజపతి అనే బిరుదు కూడా ధరించాడు. కాని ఈ బిరుదుకు వారు ఎక్కువ ప్రాముఖ్యాన్ని ఇవ్వలేదు. త్రికళింగాధిపతులని పిలువబడడమే ఘనతగా భావించారు. వారి వంశాన్ని కూలదోసి కటక రాజ్యాన్ని స్వాధీనపరచుకున్న కపిలేంద్రుని వంశస్తులు గజపతి అనే బిరుదుకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చి వారి వంశస్తులందరూ తప్పకుండా ఈ బిరుదు ధరించారు. అన్ని శాసనాలలో తమ పేర్ల చివరన గజపతి అని రాయించారు. వారి కాలం నాటి సాహిత్యంలో అన్ని గ్రంధాలూ వారిని గజపతులని పేర్కొన్నాయి. కనుక ఈ వంశం చరిత్రలో గజపతివంశం అని ప్రసిద్ధి చెందింది. గజపతులు తాము ఒరిస్సా వంశస్తులుగా పరిగణించినప్పటికీ ఈ వంశం అధికారానికి వచ్చిన మొదటి నుండి వంశం పతనమైన చివరి వరకు వారు ఆంధ్రదేశాన్ని తమ సామ్రాజ్యంలో భాగంగా చేసుకొని పాలించారు. వారి వంశం పతనం అయిన తర్వాత ఆంధ్రదేశం గోల్కొండ నవాబులకు వశం అయింది. అలాగే తమ స్వస్థానం అయిన ఒరిస్సా మొదట బెంగాలు నవాబు దౌడ్‌ఖాన్ వశం అయింది. తర్వాత అక్బర్ వశం అయి మొగల్ సామ్రాజ్యంలో అంతర్భాగం అయింది. కనుక గజపతి వంశ పతనం దాకా ఆంధ్ర, ఒరిస్సా రాష్ట్రాలు ముస్లింల వశం కాలేదు.

గజపతి వంశచరిత్రకు ఆధారాలు: గజపతుల చరిత్ర తెలుసుకోదానికి మనకు చాలా ఆధారాలున్నాయి. ఈ ఆధారాలను సాహిత్యం, శాసనాలు అనే రెండు భాగాలుగా విభజింపవచ్చును. సాహిత్య ఆధారాలను తిరిగి హిందూ, ముస్లిం రాతలు అని రెండు అంతర్విభాగాలుగా చేయవచ్చును.

హిందూ సాహిత్య ఆధారాలు - మాదలపంజి: గజపతి వంశస్తులు పూరీజగన్నాధుని తమ కులదైవంగా

భావించారు. అందువల్ల వారు ఆ దేవాలయానికి అనేక దానాలు చేశారు. ఈ వంశస్తులు చేసిన దానాలన్నింటినీ కాలమాన క్రమంలో తాళపత్రాలపై నమోదు చేశారు. దేవాలయ పురోహితులు గజపతులు ఇచ్చిన బహుమతులను నమోదు చేస్తూ లిఖించిన తాళపత్రాలను గుండంగా డ్రమ్ ఆకారంలో పెద్దకట్టలుగా చుట్టి భద్రపరచారు. ఈ తాళపత్ర కట్టలనే మాదలపంజి అని వ్యవహరిస్తున్నారు. పంజి అంటే తాళపత్రాల కట్ట అని అర్థం. ఇది ఒరియా పదం కావచ్చును. గజపతులు ఇచ్చిన ఆజ్ఞలు అన్నీ మాదల పంజిలో నమోదు చేశారు. ఇవి ఎప్పటి నుంచి రచింపబడ్డాయి అనే విషయంలో పండితుల మధ్య కొద్దిగా భేదాభిప్రాయాలున్నాయి. ఏమైనా అవి 14వ శతాబ్దం నుంచి ప్రారంభం చేయబడ్డాయని బాబూరాజేంద్ర లాల్‌మిత్రా అనే పండితుడు అన్నాడు. గజపతులకు సంబంధించిన గాథలు ఒరియా, సంస్కృతం, తెలుగు భాషలలో లిఖింపబడ్డాయి. మాదలపంజి ఒరియా భాషలోను, కటకరాజ వంశావళి సంస్కృతంలోను, జగన్నాథం కైఫీయత్తు తెలుగులోను రాయబడ్డాయి. జగన్నాథం కైఫీయత్తును బట్టి పూరీ దేవాలయం తెలుగు ప్రాంతంలోదని చెప్పవచ్చును. గజపతుల కాలంలో పూరీవరకు తెలుగు ప్రజలు విస్తరించి ఉండవచ్చును. నేటికీ దేవాలయపు అర్చకుల కుటుంబాలలో తెలుగు మాట్లాడుతారు కనుక వారు తెలుగు బ్రాహ్మణ కుటుంబాలే అయిఉండవచ్చును. మాదలపంజి నుంచి మనకు గజపతులకు సంబంధించిన అనేక చారిత్రక అంశాలు లభ్యమవుతున్నాయి. గజపతులు రాజ్యానికి వచ్చిన తేదీలు, వారు పాలించిన సంవత్సరాలు, వారు సాధించిన విజయాలు, వారు దేవాలయానికి చేసిన దానాలు మొదలైన అనేక అంశాలు ఇవ్వబడ్డాయి. ఈ అంశాలు ఇతర శాసనాలతోను, ముస్లిం చరిత్రకారులు లిఖించిన అంశాలతో ఏకీభవిస్తున్నాయి. కనుక మాదలపంజి గజపతుల చరిత్రకు అతిముఖ్యమైన ఆధారంగా ఉపయోగపడుతోంది మాదలపంజిలో 14వ అంక సంవత్సరంలో కుండజ్‌హోరి రాజును ఓడించి అతనిరాణి చంద్రావతిని బందీగా పట్టుకున్నాడని, అతని 18 మంది కుమారులు సింహాసనం కోసం పోరాడుకున్నారని చెప్పే విషయాలు కపిలేంద్రుని పెనుగొండ శక సంవత్సరం 1370 దానికి సరైన క్రీ.శ.1448 శాసనం గణదేవుని చింతపల్లిపాడు కొండవీటి శాసనాలు బలపరుస్తున్నాయి. అలాగే కుమారుల వారసత్వ యుద్ధాన్ని ఫెరిష్టా రచనలు కూడా బలపరుస్తున్నాయి. అలాగే పురుషోత్తమ గజపతి కర్ణాటక దండయాత్రను ప్రతాపరుద్రుని అనంతరం శాసనం బలపరుస్తున్నాయి. అలాగే ప్రతాపరుద్ర గజపతి దక్షిణదేశ దండయాత్రను అనంతరం, రాజవోలు, వెలచర్ల శాసనాలు, హుస్సేన్ షా ఒరిస్సా దండయాత్రను వెలచర్ల శాసనం బలపరచగా, చైతన్యుడు పూరీని దర్శించాడని మాదలపంజి చెప్పే విజయాన్ని చైతన్యచరితామృతం బలపరుస్తోంది. కనుక మాదలపంజిలో పేర్కొన్న అంశాలన్నీ చారిత్రక అంశాలేనని చరిత్రకారులు అంగీకరించారు. అయితే ఈ మాదలపంజి రచనలలో కొన్ని కల్పిత గాథలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా దేవతావిగ్రహానికి సంబంధించిన అంశాలు సత్యయుగంతో ప్రారంభించి సమకాలీన యుగం వరకు వర్ణించిన వర్ణనలను చారిత్రకాంశాలుగా తీసుకోడానికి వీలులేదు.

సరస్వతీ విలాసం: తర్వాత చెప్పుకోదగిన సాహిత్య ఆధారం సరస్వతీ విలాసం. ఇది ధర్మశాస్త్రం. దీనిని ప్రతాపరుద్రుడు రచించాడు. కాని దీనిని లొల్ల లక్ష్మీధరుడు రచించాడని పండితులు అంటారు. ఇది ప్రతాపరుద్రుని సమకాలిక రచన గనుక ఇందులో విషయాలు గజపతుల చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నాయి. ఇందులో గజపతులు సూర్యవంశస్తులని వివరించి వారి వంశవృక్షం ఇవ్వబడింది.

వంశవృక్షం

సూర్యుడు
|
రఘువు
|
రాముడు
|
కుశుడు
|
కపిలేంద్రుడు - పార్వతి
|

పురుషోత్తముడు - రూపాంబిక
।
వీరరుద్రదేవ - పద్మాంబ

పురుషోత్తమ

గజపతులు తాము సూర్యవంశంలోని శ్రీరాముని కుమారుడు కుశుని సంతతివారమని చెప్పుకున్నారు. ఈ గ్రంథంలో కొన్ని అంశాలు వదలివేయబడ్డాయి. ఉదాహరణగా మిగిలిన స్థానిక చరిత్రలలో పురుషోత్తముడు భోగిని నందనుడు అని చెప్పబడింది. కాని సరస్వతీవిలాసం అతడు కపిలేంద్రుని పట్టమహిషి పార్వతి కుమారుడని తెలుపుతోంది. ఏది వాస్తవమో తెలియదు. అలాగే కపిలేంద్రుని మొదటి కుమారుడు హంవీరుని ఈ కావ్యం ప్రస్తావించడం లేదు. శాసనాలు అతనిని ప్రస్తావిస్తున్నాయి. అతడు మహావీరుడు. తండ్రి తరపున అనేక యుద్ధాలు చేసి విజయాలు సాధించాడు, హంవీరుడు ప్రధాన సింహాసనం అంటే కటక సింహాసనం అధిష్టించలేదు కనుక వంశవృక్షంలో అతని పేరు తొలగించి ఉండవచ్చును కొన్ని లోపాలు ఉన్నా సరస్వతీవిలాసం ఆనాటి పరిపాలనా విధానాన్ని తెలుపుతోంది. హిందూ ధర్మశాస్త్రాలలో ఇది ఒక ముఖ్యమైన గ్రంథంగా భావించబడింది. నాటి మితాక్షరంతో సాటిగా ప్రామాణిక ధర్మశాస్త్రంగా పరిగణింపబడింది.

గంగవంశాను చరితమ్: వాసుదేవ సోమయాజి అనే ఒరియా పండితుడు సంస్కృతంలో ఈ గ్రంథాన్ని రాశాడు. శ్రీ రాజగురు పదవి ప్రతిష్టిత వాసుదేవరాధ సోమయాజకృత గంగవంశానుచరిత చంపూకావ్యే అని తన రచనను గురించి చెప్పుకున్నాడు. దీని ప్రతి మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్ట్స్ లైబ్రరీలో ఉంది. కటకం నుండి ఒరిస్సాను పాలించిన రాజవంశాలను గురించి ఈ గ్రంథం వివరిస్తోంది. అంతేగాక ముఖ్యమైన పవిత్ర యాత్రాస్థలాలను గురించి, పుణ్యక్షేత్రాలను గురించి తెలుపుతోంది. ఈ గ్రంథం తూర్పు గంగవంశస్తుల విజయాలను గురించి తెలిపే గ్రంథం. ఈ కావ్యం పై కావ్యాలలోని కొన్ని విషయాలను ఖండిస్తోంది. ముఖ్యంగా కపిలేంద్రుడు గంగవంశాన్ని కుట్రతో తొలగించి సింహాసనాన్ని కైవశం చేసుకున్నాడని, అతని కాలంలో గంగ సామంతులు తిరుగుబాటు చేశారని, అతని కాలం ప్రశాంతతను అనుభవించలేదని తెలుపుతోంది.

భక్తి భాగవత మహాకావ్య: ఈ కావ్యాన్ని కవి డిండిమ రాజగురు జీవదేవాచర్య అనేకవి రాశాడు. ఇది కూడా సమకాలీన గ్రంథమే. ఈ గ్రంథం గజపతుల కాలం నాటి విశేషాలను తెలుపుతోంది. సమకాలీన గ్రంథం కనుక ఇందులో అంశాలను వాస్తవాలుగానే తీసుకోవచ్చును. జగన్నాథదాస్, బలరామదాస్, దీనా కృష్ణదాస్ మొదలైన ఒరియా కవులను గజపతులు ఆదరించారు. కాని వారెవ్వరూ తమ కావ్యాలలో గజపతులను గూర్చిన ప్రస్తావన చేయలేదు.

తెలుగు కావ్యాలు: గజపతులు తెలుగుకవులను ఆదరించలేదు. పైగా శ్రీనాథుని బాధించారు బహుశా అందువల్లనేమో ఈ యుగంలో తెలుగుకవులు విజయనగర ప్రభువులను ఆశ్రయించారు. కాని కొంత మంది గజపతుల సామంతులు తెలుగు కవులను పోషించారు. వారిలో ఉదయగిరి పాలకుడు బసవభూపాలుడు, అతని మంత్రి గంగ ముఖ్యులు. బసవభూపాలుడు పూసపాటి వంశానికి చెందిన ఇద్దరు రాజకుమారులు ఉషాభ్యుదయం, విష్ణుభక్త సుధాకరం అనే రెండు కావ్యాలు రాశారు. అవి గజపతులు తెలుగు ప్రాంతాలను జయించిన అంశాలను తెలుపుతున్నాయి. పూసపాటి తమ్మభూపాలులకు అంకితం ఇవ్వబడి ఉండవచ్చును. అందులో వీరిద్దరూ గజపతుల తరపున తెలుగు ప్రాంతాలలో అనేక విజయాలు సాధించినట్లు తెలుపుతున్నాయి. బహుశా వీరిద్దరూ గజపతుల సేనానులు కావచ్చును. అందువలన తమ్మ భూపాలుడుని కుమారుడైన బసవ భూపాలుని కపిలేశ్వరుడు ఉదయగిరి పాలకునిగా నియమించి ఉంటాడు. అతడు, అతని మంత్రి గంగమంత్రి తెలుగుకవులను ఆదరించాడు. వారిచే ఆదరింపబడిన తెలుగు కవులైన దగ్గపల్లి దుగ్గన్న నాచికేతోపాఖ్యానం, దూబగుంట నారాయణ కవి పంచ తంత్రం, నందిమల్లయ ఘంటసింగయ ప్రభోధ చంద్రోదయం అనే కావ్యాలు రాశారు. సాళువ నరసింహరాయలు ఉదయగిరి రాజ్యాన్ని జయించిన తర్వాత ఈ కవులు విజయనగర ఆస్థానానికి వెళ్ళిపోయారు.

విజయనగర కవుల రచనలు: గజపతుల చరిత్రను తెలుసుకోడానికి విజయనగర ఆస్థానకవులు రచించిన కావ్యాలు కూడా కొంత వరకు ఉపయోగపడుతున్నాయి. గజపతులకు మల్లికార్జునరాయలు, రెండవ విరూపాక్ష రాయలు, సాళువ నరసింహ, నరసనాయకుడు, వీర నరసింహుడు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు

సమకాలికులు. వారందరూ గొప్ప కవిపండిత పోషకులు. వారిచేత ఆదరింపబడిన కవులు గజపతులు విజయనగర రాజులకు ఉన్న సంబంధాలను తమ కావ్యాలలో ప్రస్తావించారు. మల్లికార్జునరాయల కాలంలో గంగాధరుడు అనే కవి గంగాదాన ప్రతప విలాసం అనే కావ్యాన్ని రాశాడు. ఈ కావ్యంలో కపిలేంద్రుడు రెండవ దేవరాయల మరణానంతరం విజయనగరంపై దండెత్తాడని, అతనిని మల్లికార్జునరాయలు ఓడించాడని వర్ణించబడింది జయాపజయాల మాట ఎలా ఉన్నా కపిలేశ్వరుడు విజయనగర రాజధానిని ముట్టడించాడనే చారిత్రక అంశాన్ని బయల్పరచింది. ఇది గజపతి రాజ్యవిస్తరణను, గజపతి సైన్యాలు విజయనగర కోట వరకు నడిచిన ఘనతను చరిత్రకారులకు అందించింది సాళువ నరసింహుని కాలానికి చెందిన పిల్లలమర్రి పినవీరభద్రకవి జైమినీ భరతం రచించి అతనికి అంకితం ఇచ్చాడు. నందిమల్లయ, ఘంట సింగయలు వరాహపురాణం రచించి సరసనాయకునికి అంకితం ఇచ్చారు. రాజనాధ డిండిమ సాళువాభ్యుదయాన్ని రాశాడు ఈ కావ్యాలు సాళువ నరసింహుడు సరసనాయకులు గజపతులపై సాధించిన విజయాలను పేర్కొంటున్నాయి సాళువాభ్యుదయంలోని నాల్గవ అధ్యాయం సాళువ నరసింహుడు కళింగపై దండయాత్ర సాగించి విజయం సాధించాడని తెలుపుతోంది అంటే ఇవి పురుషోత్తమ గజపతి కాలం నాటి అంశాలను తెలుపుతున్నాయి. ఇక కృష్ణదేవరాయల కాలం నాటికి చెందిన ఆముక్తమాల్యద, అల్లసాని పెద్దన మనుచరిత్ర, నందితిమ్మన పారిజాతాపహరణ కావ్యాలు, రాయలు గజపతులపై సాధించిన విజయాలను పేర్కొంటున్నాయి. అంటే ఇవన్నీ మూడవ తరం వాడైన ప్రతాపరుద్ర గజపతి కాలం నాటి అంశాలను తెలుపుతున్నాయి. అలాగే రాయవాచకం గజపతి రాజు దినచర్యను పేర్కొంది. ఆనాటి గూఢచారుల కార్యకలాపాలను వివరిస్తోంది.

వెలుగోటివారి వంశావళి: వెలుగోటివారి వంశావళి పద్మనాయకుల చరిత్రను తెలుపుతోంది కపిలేశ్వరుని సమకాలికుడు మాదయలింగ, బహమనీ సుల్తాన్‌లు అతని రాజధానిని ముట్టడించినప్పుడు అతడు కపిలేశ్వరుని సహాయం అర్థించాడు. కపిలేంద్రుడు అతనికి సహాయం చేశాడు తర్వాత వెలమలను తన సామంతులుగా చేసుకున్నాడు. ఈ అంశాల వల్ల కపిలేశ్వరుని రాజ్యం తెలంగాణలోకి విస్తరించిందని స్పష్టపరుస్తోంది.

ముస్లింల రచనలు: హిందువుల రచనలేగాక ఆ కాలం నాటి ముస్లిం రచయితులు కూడా గజపతులను గురించి రాశారు. మొదటి నుండి గజపతివంశం తమ రాజ్య భద్రత కొరకు గజపతి సామ్రాజ్య విస్తరణ కోసం గుల్బర్గానేలిన బహమనీ సుల్తాన్‌లతో పోరాడవలసి వచ్చింది బహమనీ వంశరాజుల చరిత్రను రాసిన ముస్లిం చరిత్రకారులు సందర్భోచితంగా తమ రచనలలో గజపతులను గురించి కూడా రాశారు. ముస్లిం చరిత్రకారులైన పెరిష్టా, సయ్యద్ అలి, నిజాముద్దీన్ అహమ్మద్‌లు గజపతులను గురించి రాశారు. తారిఖ్-ఇ-పెరిష్టా బహమనీ సంబంధాలను రాశాడు. సయ్యద్ ఆలీ రచనల వల్ల ముస్లింలకు ఒరిస్సాను గురించి ఎటువంటి అభిప్రాయాలు ఉండేవో తెలుస్తోంది.

శాసనాలు: ఏ రాజచరిత్ర రచించాలన్నా శాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అలాగే గజపతుల తామ్ర శాసనాలు కూడా గజపతుల చరిత్ర రాయడానికి ఉపయోగపడుతున్నాయి. కాని వీరి కాలం నాటి తామ్ర శాసనాలు ఎక్కువగా లభించలేదు అలాగే వీరి కాలం నాటి ప్రశస్తులు ఒక్కటి కూడా లభించలేదు. కపిలేంద్రుని కాలానికి చెందిన తామ్రశాసనాలు గణదేవుని కొండవీడు శాసనం, వెలగళని శాసనం, హంవీర దేవుని చిరుప్రోలు శాసనాలు కపిలేశ్వరుని కాలం నాటి విజయాలను, గజపతి వంశవృక్షాన్ని ఇస్తున్నాయి. పురుషోత్తమ గజపతి కాలంలో శాసనాలు విడుదల చేసే విధానంలో మార్పు వచ్చింది. అతడు గొడ్డలి తలగల తామ్రరేకులపై శాసనాలు రాయించాడు. కాని అతని కాలం నాటివి. అందులో ప్రతాపరుద్ర గజపతి విజయాలు, ముఖ్యంగా గౌడ బెంగాలుపై విజయం, అతడు పోషించిన కవులు, కావ్యాలను గురించి తెలుపుతున్నాయి. ఇవేగాక Lytic records అనేకం లభించాయి. గోపీనాథ్‌పురం జగన్నాథ ఆలయం, భువనేశ్వర దేవాలయం, శ్రీకూర్మం, సింహాచల ఆలయాలలో ఎక్కువగా ఈ తరహా శాసనాలు వేయబడ్డాయి. ఈ శాసనాలలో ఆ దేవాలయాలకు ఇచ్చిన దానాలు నమోదు చేయబడ్డాయి. ఈ శాసనాలు గజపతి వంశవృద్ధి క్షయాలను తెలుపుతున్నాయి.

అంక కాలం: గజపతులు తమ శాసనాలను అంక సంవత్సరాలలో రాయించారు. ఈ అంక సంవత్సరాలను అర్థం చేసుకోడానికి ఒరియా కాలెండరు గురించి కూడా కొంత తెలుసుకోవాలి. తమిళులు, బెంగాలీలు Solar Reckoning ను అనుసరించి కాలెండర్లను తయారు చేస్తారు. ఈ విధానంలో మేష, ఋషభ Rishabha మొదలైన రాశులను (Signs of Zodiac) అనుసరిస్తారు. అదే పద్ధతిని ఒరియా కాలెండరులో కూడా

అనుసరిస్తారు. కాని ఇందులో మరొక ప్రత్యేకత ఉంది. వారు Lunar months ను అనుసరిస్తారు, కాని వాటి పేర్లు మాత్రం Solar names ఉంటాయి. గజపతులు తమ రాజ్య పాలనా కాలాన్ని అంకచక్ర విధానంలో నమోదు చేయించారు. అంకచక్రంలో 59 Luni Solar years ఉంటాయి. సంవత్సరంలోని అన్నినెలలు పౌర్ణమి (full moon) తో అంతం అవుతాయి సంవత్సరాలు భాద్రపదమాసంలోని 12వ రోజు నుండి ప్రారంభం అవుతాయి కాని అది సంవత్సరంలో 12వ రోజుగానే లెక్కకడతారు. ప్రతి భాద్రపదమాసంలోని 12వ రోజున సంవత్సరం మారిపోతుంది ఈ అంక చక్రవిధానం ఒరిస్సాలో ఎప్పుడు ప్రారంభం అయిందో చెప్పడం కష్టం ఈ విధానం 11వ శతాబ్దంలోనే ఉంది. తూర్పుగాంగ శాసనాలు కూడా కొన్ని అంక చక్రంలో రాయించబడ్డాయి కనుక గజపతులు ఈ విధానాన్ని ప్రారంభించలేదు. గాంగవంశస్తులు నుండి ఈ సాంప్రదాయాన్ని తీసుకున్నారు. ఈ విధానం ప్రకారం ఒక రాజు Regnal years అంటే రాజ్యం చేసిన సంవత్సరాలను లెక్కించాలంటే అంకెలలోని 1, 6, 6 తో అంతమయ్యే అంకెలు, పది తప్ప సున్నాతో అంతమయ్యే అంకెలు లెక్కించరాదు అంక సంవత్సరాల చక్రం ఎప్పుడూ 59 సంవత్సరాలకు మించదు. ఉదాహరణకు ఒక రాజు యొక్క 22వ అంకలో శాసనం వేయించాడు అని ఉంటే ఆ రాజు రాజ్యానికి వచ్చి సంవత్సరానికి అనగా Regnal year ని నిర్ణయించడానికి అంక చక్రంలోని 1, 6, 16, 20 సంవత్సరాలను తీసివేయాలి అంటే నాలుగు సంవత్సరాలు తీసివేయాలి అంటే 22-4=18. అంటే ఆ రాజు తన 18 Regnal yearలో ఆ శాసనం వేయించాడని అర్థం అలాగే రాజు సంవత్సరంలో ఎప్పుడు రాజ్యానికి వచ్చినా లేక సంవత్సరంలో ఎప్పుడు మరణించినా ఆ సంవత్సరం భాద్రపద మాసంలోని 12వ రోజుతోనే ముగుస్తుంది. తిరిగి సింహాసనం ఎక్కిన రోజు నుండి లేదా రాజు మరణించిన రోజు నుండి తిరిగి ఆ రోజు వరకు సంవత్సరంగా లెక్కించరు. అంటే 365 రోజుల సంవత్సరంగా లెక్కించరు. భాద్రపద మాసం 12వ రోజువరకు మాత్రమే లెక్క కడతారు. భాద్రపదమాసం 12వ రోజున రెండవ సంవత్సరం ప్రారంభం అయినట్లు భావిస్తారు. గజపతులు అంకవిధానాన్ని సామ్రాజ్యం అంతటా ఒకేవిధంగా అనుసరించలేదు. తెలుగు ప్రాంతాలలో వారు Lunar calender ను అనుసరించారు. శాసనాలలో అంక సంవత్సరాలతోపాటు శక సంవత్సరాలు మరియు Lunar year month ఇతర వివరాలు కూడా రాయించారు

కపిలేశ్వరుని దండయాత్రకు ముందు ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితి: కపిలేశ్వర గజపతి ఆంధ్రదేశంపై దండెత్తేనాటికి అంటే క్రీ.శ.1443 నాటికి ఆంధ్రదేశ రాజకీయ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. కొండవీటి రెడ్డి రాజ్యపతనం ఆంధ్రదేశంలో రాజకీయ అస్థిరత్వాన్ని తెచ్చింది. విజయనగర రాజులు ఒకవైపు, బహమనీ సుల్తాన్‌లు మరొకవైపు ఆంధ్రదేశాన్ని కబళించాలని ప్రయత్నాలు ఆరంభించారు. విజయనగర రెండవ దేవరాయలు సింహాచలం వరకు కోస్తాను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోగా, బహమనీ సుల్తాన్ అహమద్ షా తెలంగాణను పూర్తిగా తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు కోస్తాలోని రాజమహేంద్రవరం రెడ్డిరాజ్యం విజయనగర సామంత రాజ్యంగా మారిపోయింది. తెలంగాణలోని వెలమరాజులు బహమనీ సుల్తాన్‌ల సామంతులుగా మారిపోయారు.

రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం: కొండవీటి రాజ్యం అవశేషం అయిన రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం అల్లాడరెడ్డి మరణానంతరం అల్లకల్లోలానికి గురైంది. కొండవీటి రెడ్డిరాజ్య పతనానంతరం నాల్గవ భానుదేవుడు, రాచకొండ, దేవరకొండ వెలమలు రాజమహేంద్రవర రాజ్యంపై దండయాత్రలు సాగించారు కాని విజయనగర రాజుల సహాయంతో వేమారెడ్డి, వీరభద్రారెడ్డి తమ రాజ్యాన్ని కాపాడుకోవడమేగాక క్రీ.శ.1435 నాటికి సింహాచలం వరకు తిరిగి జయించారు. కాని వారి రాజ్యం విజయనగర సార్వభౌమాధికారాన్ని అంగీకరించవలసి వచ్చింది. వీరభద్రారెడ్డి చివరి శాసనం క్రీ.శ.1437వ సంవత్సరం నాటిది లభించింది. ఆ తర్వాత వీరభద్రారెడ్డి శాసనాలు లభించలేదు. కనుక అతడు విజయనగర సామంతుడుగా కొనసాగుతున్నట్లు భావింపబడింది.

వెలమ రాజ్యం: రెడ్డిరాజ్యానికి పశ్చిమంగా రాచకొండ వెలమరాజ్యం ఉంది. రాచకొండ, దేవరకొండ, ఓరుగల్లు మొదలగు తెలంగాణ ప్రాంతాలు వారి ఏలుబడిలో ఉంది. వారికి తెలంగాణ రాయలు అని పేరు. వారు మొదటి నుండి బహమనీ సుల్తాన్‌లతో సఖ్యతగా ఉండేవారు. పెదకోమటి వేమారెడ్డి, కాటయ వేమారెడ్డికి జరిగిన యుద్ధాలలో బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా పెదకోమటి వేమారెడ్డికి సహాయం చేశాడు. పెదకోమటి రెడ్డిని బలపరచే ఫిరోజ్‌షా వెలమరాజుల ధరణికోట ముట్టడిని హర్షించలేదు. పైగా వారికి వ్యతిరేకంగా పెదకోమటికి సహాయంగా తన సైన్యాన్ని పంపాడు. అంతవరకు తమకు మిత్రులుగా ఉండే బహమనీ సుల్తాన్‌లు కొండవీటి రెడ్డిరాజ్యంతో చేరి పోవడంతో వెలమల విజయనగరం వైపు మొగ్గారు. అందువల్ల క్రీ.శ.1425 సంవత్సరంలో వారు పానుగల్లు

యుద్ధంలో విజయనగర రాజ్యం వైపు చేరిపోయారు అందుకు ప్రతీకారం తీర్చుకోడానికి అహమ్మద్ షా వెలమ రాజ్యంపై దండెత్తాడు. తెలంగాణను బహమనీ రాజ్యంలో చేర్చాలని సంకల్పించాడు. సుల్తాన్ పెద్ద సైన్యంతో గోల్కొండ చేరాడు. అక్కడి నుండి ఖాన్-ఐ-ఆజిమ్ అనే సేనాని నాయకత్వంలో ఒక సేనను వరంగల్లుపై దాడికి పంపాడు. ఖాన్ తన సేనతో 27 రోజుల ముట్టడి తర్వాత ఓరుగల్లు కోటను ఆక్రమించి అక్కడ వెలమరాజ ప్రతినిధిని సంహరించాడు సయ్యద్ ఆలీ రాచకొండ, దేవరకొండలను జయించినట్లు రాశాడు. కాని ఓరుగల్లు ఆక్రమణ అక్కడి రాజును సంహరించడాన్ని పేర్కొనలేదు. కనుక ఓరుగల్లులో వెలమరాజు కాక వారి సేనాధిపతి మరణించి ఉంటాడని భావింపబడింది. ఏమైనా ఓరుగల్లు విజయవార్త విని సుల్తాన్ ఓరుగల్లు వచ్చి కోటలో ప్రవేశించి అక్కడ ఉండి ఖాన్‌కు పెద్దసేనను ఇచ్చి తెలంగాణను పూర్తిగా జయించమని పంపాడు. అతడు నాలుగు మాసాలపాటు తెలంగాణలోని అనేక ప్రాంతాలు జయించి తిరిగి ఓరుగల్లు వచ్చాడు. ఓరుగల్లులోని సుల్తాన్ ఖాన్‌ను తెలంగాణ ప్రాంతాలపై అధికారిగా నియమించి మిగిలిన ప్రాంతాలను కూడా జయించమని ఆదేశించి తన రాజధాని గుల్బర్గాకు వెళ్లిపోయాడు.

మాళ్వా సుల్తాన్‌తో వచ్చిన సమస్యను పరిష్కరించుకోడానికి అహమ్మద్‌షా గుల్బార్గా వెళ్లాడని పెరిష్టా రాశాడు హిజారా 837 అంటే క్రీ.శ.1433లో మాళ్వా సుల్తాన్‌తో సంధి చేసుకొని తిరిగి అహమ్మద్ షా తెలంగాణపై దండెత్తాడని, ఈ దండయాత్రలో తిరుగుబాటు చేసిన అనేకమంది తెలంగాణ నాయకులను ఓడించాడని కూడా పెరిష్టా రాశాడు ఈ దండయాత్ర కాలంలో రాచకొండనేలిన మూడవ సింగన యుద్ధం చేయకుండా లొంగిపోయాడని, అతనితో పాటు అనేక నాయకులు లొంగిపోయారని, లొంగిపోయిన వారిని కప్పం చెల్లించే షరతుపై వారి వారి ప్రాంతాల అధిపతులుగా కొనసాగించాడని కూడా రాశాడు. ఈ దండయాత్రలో లొంగిపోయిన దుర్గాలలో అత్యంత ప్రముఖమైనది రామగిరి. అలాంటి కీలకమైన ఈ దుర్గం స్వాధీనం కావడంతో వెలమల శక్తి క్షీణించి ముస్లింల అధికారం స్థిరపడింది. సుల్తాన్ ఇబ్రహీం సంజార్ ఖాన్‌ను తెలంగాణ అధిపతిగా నియమించి తాను బీదర్ వెళ్లిపోయాడు. సంజాద్‌ఖాన్ క్రీ.శ.1435వ సంవత్సరం నాటికి తెలంగాణలో మిగిలిన ప్రాంతాలను కూడా జయించి మొత్తం తెలంగాణపై బహమనీ సుల్తాన్ అధికారాన్ని బలంగా ప్రతిష్ఠించాడు అహమ్మద్ షా మరణించే ముందు తన కుమారుల మధ్య వివాదాలు లేకుండా చేయడానికి తన రాజ్యాన్ని రెండు భాగాలు చేశాడు. తెలంగాణలోని రాచకొండ, దాని పరిసర ప్రాంతాలు దౌడ్‌ఖాన్‌కు, మాహుర్, రామగిరి, కల్లుమ్, బేరారులో కొంత భాగాన్ని కలిపి మహమ్మద్ ఖాన్‌కు కేటాయించి అతడు క్రీ.శ.1435వ సంవత్సరంలో మరణించాడు. అతని తర్వాత అతని పెద్దకుమారుడు రెండవ అల్లాఉద్దీన్ సింహాసనానికి వచ్చాడు. అహమ్మద్ షా అతని కుమారులకు పంచి ఇచ్చిన ప్రాంతాలను గురించి వివాదం ఉంది. సయ్యద్ ఆలీ రాయచూర్, ఖివల్ అనే ప్రదేశాలను దౌడ్‌ఖాన్‌కు ఇచ్చాడని, సయ్యిద్ ఆలీ రాయచూర్‌ను మాత్రమే ఇచ్చాడని పెరిష్టా రాశాడు. వీరు పేర్కొన్న రాయచూరు కృష్ణా, తుంగభద్రా నదుల మధ్య - అంతర్వేది కాదు - ఇది తెలంగాణలోదని సయ్యిద్ ఆలీ మరొకచోట పేర్కొన్నాడు - కనుక ఇది రాచకొండ రాజ్య ప్రాంతం అని పండితులు భావించారు. దౌడ్‌ఖాన్ మరణానంతరం ఈ ప్రాంతాలను సుల్తాన్ అల్లావుద్దీన్ తన సోదరుడు మహమ్మద్‌ఖాన్‌కు ఇచ్చాడని సయ్యిద్ ఆలీ రాశాడు. మొత్తం మీద తెలంగాణ అంతా బహమనీ సుల్తాన్‌ల ఆధిపత్యంలోకి వచ్చింది. అదే సంవత్సరంలో కపిలేశ్వర గజపతి సింహాసనానికి వచ్చాడు. ఆ కాలం నాటికి తెలంగాణ అంతా బహమనీసుల్తాన్‌ల వశం కావడం అహమ్మద్ షా మరణించి, అతని కుమారుడు రెండవ అల్లావుద్దీన్ బహమనీ సింహాసనం అధిష్ఠించడం ఒకేసారి జరిగింది. ఆ కాలం నాటికి కోస్తాలో రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం విజయనగర సామంతరాజ్యంగా కొనసాగుతోంది. కోస్తాలో సింహాచలం వరకు విజయనగర సామ్రాజ్యం వైభవంగా వెలుగుతోంది.

తెలంగాణలోని వెలమరాజ్యం బహమనీ రాజ్యంలో భాగం అయింది. వెలమరాజ్యం అవశేషం అయిన దేవరకొండలో లింగమనేడు బహమనీల సామంతుడుగా కొనసాగుతున్నాడు. బహమనీ రాజ్యం తెలంగాణలో వైభవంగా వెలుగుతోంది. రెడ్డిరాజ్య అవశేషం రాజమహేంద్రవర రాజ్యం, వెలమరాజ్య అవశేష దేవరకొండ రాజ్యం. పేరుకు ఉన్నా అవి స్వతంత్రాలు కోల్పోయి ఉన్నాయి. మొత్తం మీద బహమనీ విజయనగర రాజ్యాలు ఆంధ్రదేశంపై ఆధిపత్యం వహించడానికి సంఘర్షణ పడుతున్నాయి. ఈ స్థితిలో కపిలేశ్వర గజపతి ఆంధ్రదేశ రాజకీయాలలో జోక్యం చేసుకున్నాడు. దాంతో దక్షిణ భారతదేశ చరిత్రలో గజపతి, నరపతి, అశ్వపతుల త్రైరాజ్య సంఘర్షణ ప్రారంభమైంది. దక్షిణ భారతదేశ చరిత్రలో ఒక శతాబ్దంపాటు సాగిన గజపతి, నరపతి త్రైరాజ్య

సంఘర్షణ ఆంధ్రదేశంపై ఆధిపత్యం సంపాదించడానికేననేది నిర్వివాదాంశం. కనుక కొండవీటి రెడ్డి రాజ్యపతనం ఆంధ్రదేశ చరిత్రలో గజపతి, నరపతి, అశ్వపతుల త్రైరాజ్య సంఘర్షణకు దారి తీసిందని చెప్పవచ్చును. ఈ త్రైరాజ్య సంఘర్షణలో గజపతులు విజయం సాధించి యావదాంధ్రదేశాన్ని తమ ఆధిపత్యంలోకి తెచ్చుకొని 100 సంవత్సరాలు పాలించారు. వారి తర్వాత వారి సామంతులైన చితాబ్ఖాన్ వేదాద్రి మొదలైన వారు మరొక అర్ధ శతాబ్దం పాలించి ఆంధ్రదేశాన్ని కాపాడారు.

గజపతి, నరపతి, హయపతుల త్రైరాజ్య సంఘర్షణ స్వభావం Tripartite Struggle: కపిలేశ్వరుడు గజపతి సామ్రాజ్యం స్థాపించిన తర్వాత దక్షిణ భారతదేశ చరిత్ర గజపతి, నరపతి, అశ్వపతుల త్రైరాజ్య సంఘర్షణగా మారిపోయింది. వారి సంఘర్షణ స్వభావాన్ని పరిశీలించినట్లయితే వారు దక్షిణదేశ సార్వభౌమాధికారానికి సంఘర్షణకు దిగలేదు. వారు సంఘర్షణకు దిగినది ఆంధ్రదేశ ప్రాంతాలను కైవసం చేసుకోదానికి మాత్రమే. బహమనీలు దక్కను సుల్తాన్‌లమని చెప్పుకున్నారు. విజయనగర ప్రభువులు కర్ణాటక రమారములమని వారిది కర్ణాటక సామ్రాజ్యం అని చెప్పుకున్నారు. గజపతులు తాము ఓఢ్రులమని, తమది కళింగ సామ్రాజ్యం అని చెప్పుకున్నారు. వారివారి ప్రాంతాలపై జాతిహక్కులు ప్రకటించుకున్నారు. అందువల్ల వీరెవరూ మిగిలినవారి స్వస్థాకులు తమవనిగాని, వాటిని జయించాలని గాని ప్రయత్నించలేదు. బహమనీలు కర్ణాటకపై హక్కు కోరలేదు. కాకపోతే కృష్ణా, తుంగభద్రా నదుల మధ్యప్రాంతంపై హక్కుకోరారు. ఒరిస్సా మీద కూడా హక్కు కోరలేదు. అలాగే విజయనగర సామ్రాట్టులు మహారాష్ట్రపై గాని, ఒరిస్సాపై గాని హక్కు కోరలేదు. అలాగే గజపతులు కర్ణాటకంపై గాని, దక్కనుపై గాని హక్కు కోరలేదు. ఒకవేళ ఇతరుల స్వస్థానాలపై విజయం లభించినా తిరిగి వారివి వారికే ఇచ్చారు. కృష్ణదేవరాయలు గుల్బర్గా, బీదరులను, కటకాన్ని జయించి కూడా తిరిగి ఇచ్చివేశాడు. బహమనీలు తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర పట్టణాన్ని ధ్వంసం చేసి కూడా దానిని తమ రాజ్యంలో కలుపుకోలేదు. కాని అందరూ ఆంధ్ర ప్రాంతాలను కోరారు. కలుపుకోవాలని తీవ్రప్రయత్నాలు చేశారు. ప్రతివారు ఆంధ్రప్రాంతాలపై తమ హక్కులు ప్రకటించారు. కారణం ఇక్కడ ఇది నాది అనేవాడెవ్వరూ లేరు. Nobody championed the cause of this land, it fell vacant or in a vaccum. కనుక ముగ్గురూ ఆంధ్రదేశంపై పడ్డారు. వారి వారి రాజ్యాలలో జాతిహక్కులున్నాయి. కాని ఇక్కడ జాతి హక్కు లేదు. కేవలం భుజబల హక్కు మాత్రమే ఉంది. కనుక ముగ్గురూ తమ శక్తిసామర్థ్యాలను ఆంధ్రదేశంపై చూపారు. సొంతం చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ ప్రాంతంపై వారి హక్కులు, అధికారాలు వారి వారి భుజబల పరాక్రమాలపైనే ఆధారపడి ఉన్నాయి. కనుక రెడ్డి రాజ్యం పడిపోయిన దగ్గరనుండి గోల్కొండ నవాబులు వచ్చేవరకు ఆంధ్రదేశం 7 పర్యాయాలు చేతులు మారింది.

1. తూర్పుగాంగ నాల్గవ భానుదేవుని ఆక్రమణ.
2. రెండవ దేవరాయల ఆక్రమణ.
3. కపిలేశ్వర గజపతి ఆక్రమణ
4. సంగం సాళువ నరసింహరాయలు, సంగం బహమనీ సుల్తాన్ ఆక్రమణలు.
5. పురుషోత్తమ గజపతి ఆక్రమణ.
6. సింహాచలం వరకు కృష్ణదేవరాయల ఆక్రమణ.
7. తిరిగి విభజన-కృష్ణకు ఉత్తరంగా ప్రతాపరుద్ర గజపతి, కృష్ణకు దక్షిణంగా విజయనగర రాజ్యంలో భాగం కావడం. చివరకు గోల్కొండ నవాబు వశమైంది.

ఈ విధంగా ఆంధ్రదేశం గజపతి, నరపతి, అశ్వపతుల మధ్య 7 సార్లు చేతులు మారింది. కనుక ఈ త్రైరాజ్య సంఘర్షణ కేవలం దిక్కుమొక్కూ లేని ఆంధ్రదేశంపై ఆధిపత్యం సంపాదించడానికే గాని, మరేదీ కాదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చును. ఇది మధ్యయుగపు ఆంధ్రదేశచరిత్రలో సంభవించిన చారిత్రక సత్యం ఒక్కమాటలో చెప్పాలంటే కాకతీయ సామ్రాజ్యం కూలిపోయిన తర్వాత ఆంధ్రదేశానికి రాజకీయ వ్యక్తిత్వం లేదనే చెప్పాలి.

కళింగ సామ్రాజ్య నిర్మాత కపిలేశ్వర గజపతి

ఒరిస్సాను పాలించిన గజపతివంశస్థులు తాము సూర్యవంశ క్షత్రియులమని, సూర్యవంశ క్షత్రియుడైన శ్రీరామచంద్రుని కుమారుడైన కుశుని సంతతివారమని చెప్పుకున్నారు. ఈ వంశ రాజులందరూ తమ పేర్లలో గజపతి అనే బిరుదును చేర్చుకున్నారు. వారు విడుదల చేసిన ప్రతి శాసనంలో వారి పేర్లతో పాటు గజపతి అనే బిరుదు తప్పకుండా ఉంటుంది. ఆ కాలం నాటి సాహిత్యంలోను, సమకాలీన రాజుల శాసనాలలోను వారు గజపతులుగా సంబోధింపబడ్డారు. కనుక ఈ వంశస్థులను చరిత్రకారులు గజపతి వంశం అని పేర్కొన్నారు. అంతేగాక వారు నవకోటి కర్ణాటకలబర్గ అనే బిరుదు కూడా వహించారు. వారు ప్రతిభావంతులుగా 100 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించి ఆంధ్రదేశ చరిత్రలో ఘనమైన స్థానాన్ని శాసనాలలో కపిలేంద్రుడని, తెలుగు శాసనాలలో కపిలేశ్వరుడని రాయబడి ఉంది. ఇతని శాసనాలు గాని, ఇతని వారసుల శాసనాలుగాని ఇతని మనుమడు రాసిన సరస్వతీ విలాసం గాని కపిలేశ్వరుని పూర్వీకులను గురించి గాని, ఇతని తొలి జీవితాన్ని గురించి గాని ఎక్కువ వివరాలు ఇవ్వడం లేదు. కాని ఇటీవల లభించిన ఇతని సోదరుని కుమారుడైన రఘుదేవ నరేంద్రుని శాసనం కపిలేంద్రుని సోదరులు, తండ్రితాతలను గురించి అంటే కపిలేశ్వరునికి ముందు రెండుతరాల వారి గురించి విలువైన సమాచారం ఇచ్చింది. అంతేగాక విజయనగర శాసనాలు ముఖ్యంగా కృష్ణదేవరాయల శాసనాలు, గోల్కొండ సుల్తానుల శాసనాలు, గజపతులకు చెందిన వారి మరికొన్ని పేర్లు ఇస్తున్నాయి. ఈ పేర్లు మరే ఇతర ఆధారాలలో లేవు. అందువల్ల విజయనగర కుతుబ్‌షాహీ శాసనాలు ఇచ్చే సమాచారం కూడా ఎంతో విలువైంది. గజపతుల చరిత్ర రచనకు తోడ్పడుతోంది. ఈ ఆధారాలన్నింటిని పరిశీలించి సూర్యవంశ గజపతుల వంశవృక్షం తయారు చేయబడింది.

సూర్యుడు

రఘువు

దశరథుడు

కుశుడు

ఇతని వంశంలో

కపిలేశ్వర

జాగేశ్వర

కపిలేంద్ర - భార్య పార్వతి　　బలరామ　　పరశురామ

హంవీర　　పురుషోత్తమ- భార్య రూపాంబిక　　రఘు దేవ నరేంద్ర

కుమార కపిలేశ్వర　　ప్రతాపరుద్ర-భార్య పద్మావతి

వీరభద్ర　　రామచంద్ర　　పురుషోత్తమ

మాదలపంజి కపిలేశ్వరుని తొలిజీవితాన్ని గురించి కొన్ని వివరాలను ఇచ్చింది. అతను పసితనంలో ఉన్నప్పుడు విమల దేవాలయం దగ్గర నుండి భానుదేవుడు తీసుకువచ్చి తన కుమారునిలా పెంచుకున్నాడు.

భానుదేవుని మరణం తర్వాత కపిలేంద్రుడు గాంగసింహాసనం అధిష్టించాడని తెలుపుతోంది. అందులో మరికొన్ని వివరాలు ఉన్నాయి. తూర్పుగాంగ వంశంలోని చివరివాడైన నాల్గవ భానుదేవునికి సంతానం లేదు. అతనికి మట్టభాను కజ్జలభాను అనే పేర్లు కూడా ఉన్నాయి. అతడు తనకు సంతానాన్ని ప్రసాదించి తన వంశాన్ని నిలపమని పూరీ జగన్నాథుని ప్రార్థించాడు. జగన్నాథుడు అతనికి కలలో దర్శనం ఇచ్చి అతని వారసుడు విమల దేవాలయం వద్ద రేపు లభిస్తాడని చెప్పాడు. మరుసటిరోజు భానుదేవుడు విమల దేవాలయనికి వెళ్లి వెదుకగా కపిలుడు కనిపించాడు. అతడిని తోడ్కొని వచ్చి దత్తత తీసుకొన్నాడు. భానుదేవుని మరణానంతరం కపిలుడు రాజ్యానికి వారసుడై సింహాసనం అధిష్టించాడని మాదలపంజి వర్ణిస్తోంది. కపిలేంద్రుని గోపీనాథపూర్ శాసనం ఈ కథను బలపరుస్తోంది. అందు జగన్నాథుని ఆదేశానుసారం తాను కళింగ రాజయ్యానని కపిలేంద్రుడు చెప్పుకున్నాడు. కటకరాజ వంశావళి, జగన్నాథం కైఫీయత్తు కూడా ఇదే కథనాన్ని వివరిస్తున్నాయి. అయితే అందులో కపిలుని పేరులో కొద్దిగా తేడా ఉంది. అందు కపిలేశ్వరుని పేరు కపిల సామంతరావ్ అని ఇవ్వబడింది. అంతేగాక ఇవి మరికొన్ని కొత్త విషయాలను తెలుపుతున్నాయి. భానుదేవుని చివరికాలంలో మొగలులు అతని రాజ్యంపై దండెత్తి పెద్దమొత్తాన్ని యుద్ధ పరిహారంగా చెల్లించమన్నారు. కాని భానుదేవుని వద్ద అంత మొత్తం లేదు. కనుక కొంత చెల్లించి మిగిలిన పైకం కింద తన దత్తుకుమారుడైన కపిలేశ్వరుని హామీగా పెట్టించాడు. తర్వాత మిగిలిన పైకం చెల్లించి కపిలుని విడిపించకుండానే మరణించాడు. అది తెలిసి మొగలులు కపిలుని వదలివేసి అతని రాజ్యం ఏలుకొమ్మని పంపారు అని తెలుపుతున్నాయి.

గంగవంశాను చరిత మరొక కథనాన్ని తెలుపుతోంది. కపిలుడు భానుదేవుని మంత్రి. భానుదేవుడు దక్షిణ దిక్కున యుద్ధానికి రాజధానిని విడిచి వెళ్లినప్పుడు కపిలుడు కుట్ర చేసి రాజ్యాన్ని కాజేశాడు భానుదేవుడు తిరిగి తన రాజ్యాన్ని స్వాధీనం చేసుకోలేక గుదారికటక అనే ప్రదేశానికి వెళ్లిపోయి అక్కడ తన చివరి రోజులు దైన్యస్థితిలో గడిపి మరణించాడు.

తూర్పు గాంగవంశంలోని చివరివాడైన నాల్గవ భానుదేవుడు క్రీ.శ.1415వ సంవత్సరంలో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1434-35 వరకు పాలించాడు. కటకరాజ వంశావళిలో మొగలులు ఒరిస్సాపై దండెత్తినట్లు ఉంది. ఇది తప్పుగా కనిపిస్తోంది. కారణం అప్పటికి భారతదేశంలో మొగల్ సామ్రాజ్యం స్థాపించబడలేదు. కనుక ఒరిస్సా సరిహద్దులోని ముస్లింరాజు ఎవరో దండెత్తి ఉండవచ్చును. నిజాముద్దీన్ అహమ్మద్ అనే ముస్లిం రచయిత క్రీ.శ.1421వ సంవత్సరంలో మాళ్వసుల్తాన్ హుషంగ్ షా (Hushang Shah) ఒరిస్సాపై దండెత్తాడని రాశాడు. కనుక ఈ దండయాత్రనే కటకరాజ వంశావళి గ్రంథకర్త పొరపాటుగా మొగలుల దండయాత్ర అని వర్ణించి ఉంటాడు. కాని ఈ దండయాత్ర భానుదేవుని చివరికాలంలో జరుగలేదు. తర్వాత 15 సంవత్సరాలు పాలించాడు. కనుక కటకరాజ వంశావళి కథనం నిజమైతే భానుదేవుని చివరికాలంలో మరొక ముస్లిం దండయాత్ర జరిగి ఉండాలి. అందులో ఓడి తన దత్తుకుమారుని యుద్ధఖైదీగా పంపి మరణించి ఉండాలి. కాని ఒరిస్సాకు పశ్చిమాన మాళ్వా, ఉత్తరాన బెంగాలు నవాబులు ఉన్నారు. కాని వారు క్రీ.శ.1434-35వ సంవత్సరంలో ఒరిస్సాపై దండెత్తిన దాఖలాలు లేవు.

గంగవంశానుచరిత్ర భానుదేవుడు రాజధానిలో లేని సమయంలో కపిలేశ్వరుడు సింహాసనాన్ని కాజేశాడని తెలుపుతోంది. కాని భానుదేవుడు ఎవరితో పోరాటానికి వెళ్లినదీ తెలుపలేదు. ఇదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1435వ సంవత్సరానికి చెందని రాజమహేంద్ర రెడ్డి రాజులైన వేమారెడ్డి, వీరభద్రారెడ్డిలకు చెందిన రెండు దానశాసనాలు సింహాచలంలో ఉన్నాయి. ఈ శాసనాలను బట్టి రాజమహేంద్ర రెడ్డిరాజులు క్రీ.శ.1434లో గంగరాజ్యంపై దండెత్తినట్లు స్పష్టపడుతోంది. బహుశా వారితో పోరాడటానికి భానుదేవుడు దక్షిణంగా వచ్చి ఉంటాడు. దానిని అవకాశంగా తీసుకొని కపిలేశ్వరుడు కటకంలో కుట్రపన్ని రాజ్యాన్ని ఆక్రమించి ఉంటాడు. భానుదేవునిపై అసంతృప్తి ఉన్నవారు, కపిలేశ్వరుని స్నేహితులు, బంధువులు, అతనికి సహాయపడి ఉండవచ్చును. మాదలపంజి బాల్యంలో కపిలేశ్వరుని సహాధ్యాయులను పేర్కొంటోంది. మహాపాత్ర కాకైసంతర, మహాపాత్ర లక్షణ పురోహిత పట్నాయక్ దామోదర మొదలైన వారి పేర్లు ఇవ్వబడింది. వారిలో మహాపాత్ర కాశీ విద్యాధర, జలసరసేన నరేంద్ర కపిలుని బాల్య స్నేహితులని స్పష్టంగా పేర్కొంటోంది. కనుక వీరందరి సహకారంతో కపిలేశ్వరుడు రాజ్యాన్ని చేజిక్కించుకొని ఉండవచ్చును.

కపిలేశ్వరుని పట్టాభిషేక కాలం: కపిలేశ్వరుడు భానుదేవుని కూలదోసి రాజ్యానికి వచ్చిన కాలాన్ని గురించి

నిర్ణయించడానికి కూడా మనకు కొన్ని ఆధారాలున్నాయి. భానుదేవుని చివరి శాసనం శక సంవత్సరం 1352 సరైన క్రీ.శ 1430 సంవత్సరం, ఆ తర్వాత భానుదేవుని శాసనాలు లభించలేదు. కాని క్రీ.శ.1430 తర్వాత కూడా అతడు పాలించినట్లు తెలుస్తోంది అంక సంవత్సరాల ప్రకారం కపిలేశ్వరుని 37వ అంక సంవత్సరం శాసనంలో శక సంవత్సరం 1386 పేర్కొనబడింది. అంక సంవత్సరాల లెక్క ప్రకారం కపిలేశ్వరుని 37వ అంక సంవత్సరం అతని 30వ రాజ్య సంవత్సరానికి చెందినది కనుక 1386-30=1356 శక సంవత్సరం అంటే క్రీ.శ.1434-35 సంవత్సరం అవుతుంది. కనుక కపిలేశ్వరుడు క్రీ.శ.1434-35లో రాజ్యాన్ని సొంతం చేసుకొని ఉంటాడు. దానిని బట్టి క్రీ.శ.1434-35 వరకు భానుదేవుడు పాలించి ఉంటాడు. క్రీ.శ.1434వ సంవత్సరంలో రాజమహేంద్ర రెడ్డిరాజులతో యుద్ధం చేయడానికి దక్షిణంగా వెళ్లినప్పుడు కపిలేశ్వరుడు సింహాసనాన్ని సొంతం చేసుకొని ఉండవచ్చును. ఈ సంఘటన క్రీ.శ.1435లో జరిగి ఉంటుంది. అదే సంవత్సరం అంటే క్రీ శ.1435వ సంవత్సరంలో సింహాచలం వరకు వేమ, వీరభద్రారెడ్లు ఆక్రమించి దానశాసనాలు వేయించారు. కనుక సింహాచలం వరకు గంగరాజ్యాన్ని వేమ, వీరభద్రారెడ్డి ఆక్రమించడం కటకంలో కపిలేశ్వరుడు సింహాసనం అధిష్టించడం ఒకే సంవత్సరంలో అంటే క్రీ శ.1435వ సంవత్సరంలో జరిగాయి. మాదలపంజి కూడా ఇదే కాలాన్ని ఇస్తోంది. అందులో కపిలేశ్వరుడు భువనేశ్వరంలో 2 కాకరసు (Kakara, Su) 4, అంక 2" 16 అని ఇస్తోంది. ఇది 1435 జూన్ 29వ తేదీ బుధవారం అవుతోంది. కపిలేశ్వరుడి పట్టాభిషేకం రోజు నుండి కపిలేశ్వర శకం ప్రారంభమైంది. ఒరియా కాలెండర్ కపిలేశ్వర శకంలో లెక్కిస్తారు. 1933వ సంవత్సరంలో కపిలేశ్వరుని శకం నిలిపివేయబడింది. అప్పటికి 498 సంవత్సరాలు గడిచినట్లు ఒరియా కేలెండర్ తెలుపుతోంది. అంటే 1933-498=1435 సంవత్సరాలు అవుతుంది. కనుక కపిలేశ్వర శకం అతని పట్టాభిషేకం రోజున ప్రారంభం అయిందని స్పష్టపడుతోంది. కనుక మాదలపంజి కపిలేశ్వర శకాన్ని ఇస్తోంది. 1435 జూన్ 29వ తేదీ బుధవారం రోజున కపిలేశ్వరుని పట్టాభిషేకం జరిగిందని స్పష్టంగా చెప్పవచ్చును.

కపిలేశ్వరుని సమస్యలు: కపిలేశ్వరుడు రాజ్యానికి అనేక సమస్యలు చుట్టుముట్టాయి. దక్షిణ సరిహద్దులో రాజమహేంద్రవర రెడ్డిరాజులు, కళింగ రాజ్య దక్షిణ సరిహద్దులో అనేక ప్రాంతాలు ఆక్రమిస్తూ ఉత్తరంగా పురోగమనాన్ని సాగిస్తున్నారు. ఉత్తరాన బెంగాలు నవాబు, ఉత్తర కళింగ భాగాలను ఆక్రమించడానికి ఉవ్విళ్లూరుతున్నాడు. పశ్చిమాన మాళ్వసుల్తాన్‌కు కూడా ఒరిస్సాపై దండెత్తాలని ఆశ కలిగింది. మూడు దిక్కుల శత్రు రాజ్యాలు ఇలా ఉండగా సొంత రాజ్యంలో కూడా కపిలేశ్వరుని సామంతులు తమ సార్వభౌమునిగా అంగీకరించలేదు. వారిలో చాలా మంది కపిలేశ్వరుని ధిక్కరించి స్వతంత్రబావుటాలు ఎగురవేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే అతని అధికారం అతని రాజధానికి మాత్రమే పరిమితమైంది. ఈ స్థితిలో తన సింహాసనాన్ని దక్కించుకోవడం అతికష్టమైనపని అని గ్రహించాడు. కనుక మొదట తన సామంతులను అదుపులోకి తెచ్చుకొని రాజ్యంలో తన అధికారం స్థిరపరచుకోవాలని నిర్ణయించుకొన్నాడు.

సామంతులను అదుపులోకి తేవడం: కపిలేశ్వరుని 4 అంక సంవత్సరంలో వేయించిన తన తొలిశాసనంలో అంటే క్రీ.శ.1436వ సంవత్సరం నాటి శాసనంలో అతడు తన సామంతులను అదుపులో పెట్టడానికి వారిని ఉద్దేశించి కొన్ని ఆజ్ఞలను జారీచేశాడు. అందులో అతడు తన రాజ్యంలోని రాజులందరూ సార్వభౌముని మంచి కోసం పని చేయాలి. రాజుకు హాని కలిగించరాదు. చెడు చేయరాదు. ఎవరైనా అలాచేస్తే వారి ఆస్తులు, రాజ్యాలు లాక్కోబడతాయని హెచ్చరికలు చేశాడు. దానిని బట్టి అతడు రాజ్యానికి రాగానే సామంతులు తిరుగుబాటు చేశారని, వారిని భయపెట్టి అదుపులోకి తీసుకురావాలని ప్రయత్నించాడని బోధపడుతుంది. అంతకుముందు గంగవంశస్తులకు విధేయులైన సామంతులు, భానుదేవుని రాజ్యభ్రష్టుణ్ణి చేయడం సహించలేక, కపిలేశ్వరునికి లొంగడం ఇష్టం లేక, తిరిగి భానుదేవుని రాజ్యభ్రష్టుణ్ణి చేయడం సహించలేక, కపిలేశ్వరునికి లొంగడం ఇష్టం లేక తిరిగి భానుదేవుని సింహాసనం ఎక్కించడానికి తిరుగుబాటు చేసినట్లు తెలుస్తోంది. ఈ తిరుగుబాటుకు విష్ణువర్ధన చక్రవర్తులు నాయకత్వం వహించి ఉండవచ్చని కొందరు చరిత్రకారులు భావించారు.

విష్ణువర్ధన చక్రవర్తుల తిరుగుబాటు: విష్ణువర్ధన చక్రవర్తులు వేంగిచాళుక్య వంశస్తులు. వేంగిచాళుక్య వంశంలోని ఒక శాఖ యలమంచిలి, పాంచదార్లను పాలిస్తుండేవారు. ప్రధాన వంశం పోయినా ఈ శాఖ ప్రాంతాలలో కొనసాగింది. వీరు తూర్పుగాంగ వంశస్తులను సామంతులుగా యలమంచిలి, పాంచదార్ల పరిసర ప్రాంతాలను పాలించేవారు. వీరు సామంతులైనప్పటికీ వేంగిచాళుక్య వంశస్తులు గనుక వారికి గొప్ప గౌరవ

మర్యాదలుండేవి. పూర్వపు గొప్పదనం వల్ల తూర్పుగాంగ వంశస్తులు వీరితో వియ్యం పొందారు. గాంగవంశానికి చెందిన మొదటి భానుదేవుడు, మూడవ భానుదేవుడు ఈ చాళుక్యవంశానికి చెందని జాకల్లిదేవిని, హీరాదేవిలను వివాహం చేసుకొన్నారు. ఈ చాళుక్య వంశస్తులకు చెందిన అనేక శాసనాలు యలమంచిలి, పొంచదార్ల పరిసర ప్రాంతాలలో లభించాయి. ఈ వంశస్తులు గాంగవంశస్తులకు వియ్యంకులు, సమీపబంధువులు. కనుక భానుదేవుని రాజ్యం అపహరించిన కపిలేశ్వరునిపై విరోధం ప్రకటించి భానుదేవుని రాజ్యాన్ని పునరుద్ధరించడానికి ప్రయత్నించి ఉండవచ్చును. వీరితో మరికొందరు సామంతులు చేరి ఉండవచ్చును. అయితే కపిలేశ్వరుడు వీరితో పోరినట్లుగా కనిపించదు. మంచిమాటలతో అంటే నయానా, భయానా వారిని అదుపులోకి తేవడానికి ప్రయత్నించినట్లు అతని 4 అంక సంవత్సరం శాసనం తెలుపుతోంది. మొత్తం మీద అతడు వారిని అదుపులోకి తెచ్చుకున్నట్లు భావించవచ్చును. అందుకు కారణం ఆ తర్వాత అతడు దిగ్విజయయాత్రలు చేసి తన సామ్రాజ్యాన్ని అన్ని దిక్కులకు విస్తరించుకున్నాడు. సామంతులను అదుపులోకి తెచ్చుకోకుండా దిగ్విజయ యాత్రలు చేయలేదు. కనుక నయానో, భయానో అతడు తన అంతరంగిక సమస్యలను పరిష్కరించుకున్నాడు. కటక రాజవంశావళి కపిలేశ్వరుడు తన రాజ్యానికి వచ్చిన తొలి రోజులలో తీర్థయాత్ర చేసి గంగానదిలో పవిత్రస్నానం చేశాడని తెలుపుతోంది. సామంతులు అదుపులోకి వచ్చిన తర్వాత తీర్థయాత్రలు చేసి గంగాస్నానం చేసి వచ్చి ఉంటాడు.

దిగ్విజయాలు - బెంగాలు దండయాత్ర: కపిలేశ్వరుని గోపినాథపూర్ శాసనం అతడు సాధించిన అనేక విజయాలను పేర్కొంటోంది. అతడు తన తొలి దండయాత్రను బెంగాలుపై సాగించాడు. ఆనాడు బెంగాలును జలాలుద్దీన్ కుమారుడైన షంషుద్దీన్ అబుల్ ముజాహిద్ అహమద్‌షా (క్రీ.శ.1430-1446) పాలించేవాడు. అతడు మహాక్రూరుడు. గంగవంశాన్ని తొలగించి గద్దెనెక్కిన కపిలేశ్వరునిపై సామంతరాజులకు అసంతృప్తి ఉందని గ్రహించి ఒరిస్సా ఆక్రమించడం సులభమని తలచి షంషుద్దీన్ కపిలేశ్వరుని రాజ్యంపై దండెత్తాడు. అతనిని ఎదుర్కోవడానికి కపిలేశ్వరుడు గోపీనాథ మహాపాత్ర అనే సేనానిని పంపాడు. మహాపాత్ర షంషుద్దీన్‌ను ఓడించి తరిమివేశాడు. దాంతో ఉత్తర సరిహద్దులకు రక్షణ ఏర్పడింది.

భ్రమరవర నృపతి: గోపీనాథపూర్ శాసనంలో కపిలేశ్వరుడు భ్రమరవర నృపతి అని వర్ణింపబడ్డాడు. ఎం.ఎం.చక్రవర్తి ఈ శాసనాన్ని ప్రకటించారు. కాని అతడు భ్రమరవర అనే దానిని గుర్తించలేదు. పూర్వం ఒరిస్సాకు పశ్చిమంగా అంటే నేటి మధ్యప్రదేశ్‌లో కొంతభాగానికి మహాకోసల అనే పేరు ఉండేది. ఈ రాజ్యాన్ని సముద్రగుప్తుని అలహాబాద్ శాసనం కూడా పేర్కొంది. మధ్యయుగంలో చాళుక్య శాసనాలు కూడా మహాకోసలను పేర్కొన్నాయి. మహాకోసల రాజుల శాసనాలలో భ్రమరవద్ర లేక భ్రమరకూట అనే ప్రదేశం పేర్కొనబడింది. మధ్యప్రదేశ్‌లోని ప్రాంతం భ్రమరకూటంగా కొందరు భావించారు. కపిలేశ్వరుడు ఈ ప్రాంతాన్ని జయించి భ్రమరవర నృపతి అనే బిరుదు ధరించి ఉండవచ్చని భావించారు. ఒరిస్సాకు పశ్చిమంగా ఉండే ప్రాంతాలను జయించడానికి వెళ్లినప్పుడు కపిలేశ్వరుడు గాని, అతని సేనాధిపతి గోపీనాథ మహాపాత్రుడు గాని భ్రమరకూటాన్ని జయించి ఉండవచ్చును. ఈ దండయాత్ర క్రీ.శ.1440-41 సంవత్సరాలలో జరిగి ఉండవచ్చును. ఈ ప్రాంతాలను జయించినందు వల్ల పశ్చిమ సరిహద్దుకు రక్షణ ఏర్పడింది.

దక్షిణ దండయాత్రలు: ఉత్తర పశ్చిమ దిక్కులలో విజయాలు సాధించిన తర్వాత కపిలేశ్వరుడు తన దృష్టిని దక్షిణ దిక్కుపై సారించాడు. దక్షిణ దిక్కున అనేక సామంతరాజులు స్వతంత్రం ప్రకటించి ఉన్నారు. కిమిడి, శిలావంశి, నందపుర, వద్దాది, పొంచదార్ల, యలమంచిలి విష్ణువర్ధన చక్రవర్తుల రాజ్యాలు ఉన్నాయి. ఈ రాజ్యాలన్నీ స్వతంత్రం ప్రకటించాయి. కనుక కపిలేశ్వరుడు ఈ రాజ్యాలపై దండెత్తాడు. మొదట కిమిడిని ఆక్రమించి తర్వాత యలమంచిలి చాళుక్య రాజ్యాల వరకు అన్ని రాజ్యాలను లొంగదీశాడు. దాంతో పూర్వం గాంగ సామంతులందరూ కపిలేశ్వరుని ఆధిపత్యాన్ని అంగీకరించారు. ఈ విజయాలన్నీ క్రీ.శ.1441-43 సంవత్సరాల మధ్య సాధించాడని భావింపబడింది. క్రీ.శ.1443 నాటికి ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన విశాఖపట్నం జిల్లాలోని కోరుకొండ వరకు అతని అధికారం వ్యాప్తి చెందింది. ఆ తర్వాత అతడు ఆంధ్రదేశంపై దండెత్తాడు.

రాజమహేంద్రవర రెడ్డిరాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1444: కపిలేశ్వరుడు క్రీ.శ.1443 నాటికి దక్షిణ దిక్కులలోని తన సామంతులనందరినీ అదుపులోకి తెచ్చాడు. దాంతో అతని రాజ్యం రాజమహేంద్రవర రెడ్డిరాజ్య సరిహద్దుకు వ్యాప్తి చెందింది. రాజమహేంద్రవర రెడ్డిరాజ్యాన్ని కూడా జయించాలని అతనికి తలంపు కలిగింది. అందుకు కారణం కూడా లేకపోలేదు. అంతకుముందు నాల్గవ భానుదేవుడు రాజమహేంద్రవర, కొండవీటి రెడ్డి

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

లభించింది. అలాగే క్రీ.శ.1452-1453 సంవత్సరాల మధ్య నర్సారావుపేట తాలూకాలోని కొండిదెసను ముదివేముల వంశానికి చెందిన తిప్పారెడ్డి, పర్వతరెడ్డిలు పాలిస్తున్నట్లు శాసనం ఉంది. వీరు అంతకు పూర్వం కొండవీటి రెడ్ల కాలంలో నియమింపబడిన స్థానిక పాలకుల వంశస్తులు కావచ్చును. కటారి ముదివేముల వంశస్తుల శాసనాలలో సార్వభౌముని పేరు లేదు. కనుక వారు రెండవ దేవరాయల మరణానంతరం స్వతంత్రం ప్రకటించి ఉండవచ్చును. మల్లికార్జునరాయలు వారిని లొంగదీయటానికి ప్రయత్నించినట్లు కనిపించదు.

ఇదే సందర్భంలో తెలంగాణలో కూడా అనేక మార్పులు వచ్చాయి. అహమ్మద్ షా వెలమలను రాచకొండ రాజ్యంపై దండెత్తి పద్మనాయక వెలమలలోని చివరివాడైన మూడవ సర్వజ్ఞసింగణను ఓడించి తరిమి రాచకొండ రాజ్యాన్ని బహమనీ సామ్రాజ్యంలో కలిపాడు. అహమ్మద్షా ఓరుగల్లులో విడిది చేసినప్పుడు సర్వజ్ఞసింగణ యుద్ధం చేయకుండా లొంగిపోయాడు. కనుక అహమ్మద్షా అతనిని తొలగించలేదు రాచకొండలో సామంతునిగా కొనసాగనిచ్చాడు. కాని తర్వాత సంజాన్ఖాన్ అతనిని రాచకొండలో నిలువనీయలేదు రాచకొండపై దండెత్తి సింగనను తరిమి రాచకొండ రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈ రాజ్యాన్నే రాయచూర్ అని, దీనిని అహమ్మద్షా కుమారుడు దౌడ్ఖాన్కు కేటాయించాడని ముస్లిం చరిత్రకారులు రాశారు దౌడ్ఖాన్ మరణానంతరం ఈ ప్రాంతాన్ని అల్లావుద్దీన్ తన సోదరుడు మహమ్మద్ఖాన్కు ఇచ్చాడు. కనుక రాచకొండ రాజ్యం పూర్తిగా బహమనీ సామ్రాజ్యంలో అంతర్భాగం అయిపోయి సుల్తాన్ ప్రత్యక్ష పాలనలోకి వచ్చింది. సంజార్ఖాన్ ఓరుగల్లులో ఉండి తెలంగాణ ప్రాంతాన్నంతటినీ రక్షించుకున్నాడు. ఒక దేవరకొండలో మాత్రం వెలమ వంశానికి చెందిన లింగమనేడును తొలగించలేదు. అతడు సుల్తాన్ సామంతుడుగా దేవరకొండను పాలిస్తున్నాడు

రాచకొండ రాజ్యం పోగొట్టుకున్న సర్వజ్ఞసింగన కోస్తాలో ప్రవేశించి బెల్లంకొండ దుర్గంపై ఆధిపత్యాన్ని సంపాదించాడు. రెండవ దేవరాయల కాలంలో బెల్లంకొండ దుర్గం విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉంది. కనుక రాజ్యం పోగొట్టుకున్న సింగన దేవరాయలను అర్థించి బెల్లంకొండను తన సొంతం చేసుకున్నాడా లేక సైనిక బలంతో ఆక్రమించాడా లేక దేవరాయల మరణానంతరం మల్లికార్జునరాయల కాలంలో ఆక్రమించాడా స్పష్టంగా తెలియదు. వి.ఆర్.11 జిటి 767 నెంబరు కలిగిన బెల్లంకొండలో తేదీ లేని శాసనం సర్వజ్ఞసింగన చేసిన దానాలను తెలుపుతోంది. కనుక అతడు బెల్లంకొండలో పాలకుడుగా ఉన్నాడని రూఢీ చేస్తోంది కోస్తాలోని ఈ పరిణామాల వల్ల విజయనగర రాజధానికి, రాజమహేంద్రవర రెడ్డిరాజ్యానికి సంబంధాలు తెగిపోయాయి మల్లికార్జున రాయలు వీరభద్రారెడ్డికి ఎలాంటి సహాయం పంపే అవకాశాలు లేవు. కనుక కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రెడ్డిరాజ్యాన్ని జయించడానికి రెండవ దండయాత్రకు సిద్ధపడి తన కుమారుడు హంవీరుని సైన్యంతో పంపాడు.

రాజమహేంద్రవర రెడ్డిరాజ్య ఆక్రమణ: హంవీరుడు మహావీరుడు. అతడు తన సైన్యంతో రాజమహేంద్రవరంపై దాడి చేసి సునాయాసంగా కోటను జయించాడు. వేమ, వీరభద్రారెడ్లు హంవీరునితో పోరాడుతూ యుద్ధంలో మరణించినట్లుగా కనిపిస్తోంది. ఆ తర్వాత వారి వివరాలు తెలియలేదు. వారి మరణంతో రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం అంతరించింది విజ్ఞత కల్గిన రాణి అనితల్లి, శ్రీనాథ కవిసార్వభౌముని పోషించిన వీరభద్రారెడ్డి వారి కుటుంబం ఆ తర్వాత ఏమైపోయాయో తెలియదు. ఆంధ్రదేశ చరిత్రలో అర్ధశతాబ్దం ప్రఖ్యాతి వహించిన కాటయవేమారెడ్డి, అల్లాడ రెడ్లవంశాలు కాలగర్భంలో కలసిపోయాయి. రాజమహేంద్రవర రాజ్యం గజపతి సామ్రాజ్యంలో అంతర్భాగం అయింది. అనితల్లి, వీరభద్రారెడ్డిల తర్వాత ఆంధ్రదేశాన్ని పాలించిన ఆంధ్రుడు ఒక్కడు కూడా లేడు.

ఖమ్మం మెట్టు ఆక్రమణ క్రీ.శ.1448: తర్వాత హంవీరుడు ఖమ్మంమెట్టుపై దండెత్తాడు హంవీరుని సేనాధిపతి గజరావుతిప్ప యవనులను ఓడించాడని చాటు పద్యాలున్నాయి. యవనులు అంటే బహమనీ సుల్తాన్లు. ఈ కాలంలో తెలంగాణ అంతా సంజాద్ఖాన్ రక్షణలో ఉంది. అతడు తెలంగాణలో తిరుగుబాట్లు చేసే హిందూ పాలెగాళ్లను అణుస్తూ ఉన్నాడు. గజపతి సైన్యం తెలంగాణలో ప్రవేశించగానే బీదరులో సుల్తాన్ అల్లావుద్దీన్ సంజార్ఖాన్కు గజపతులను అంచనా వేయవద్దని, తెలంగాణలో రక్షణ ఏర్పాట్లు పటిష్టంగా చేయమని ఆదేశాలు పంపాడు. కాని సంజార్ఖాన్ గర్వంతో గజపతులను ఎదుర్కొన్నాడు. అతనిని గజరావుతిప్ప ఓడించాడు. దాంతో ఖమ్మంమెట్టు ప్రాంతం పూర్తిగా గజపతుల స్వాధీనం అయింది ఈ ప్రాంతం కూడా రాజమహేంద్రవర రాజ్యంలో భాగంగా ఉండేది. దాంతో పూర్వపు రాజమహేంద్రవర రాజ్య భాగాలన్నీ గజపతి సామ్రాజ్యంలో భాగం

అయ్యాయి. ఖమ్మంమెట్టుతో సహా రాజమహేంద్రవర రాజ్యానికి కపిలేశ్వరుడు తన సోదరుని కుమారుడైన రఘుదేవ నరేంద్ర మహాపాత్రుని పరీక్షకునిగా నియమించాడు. ఈ విజయాలతో కృష్ణానదీ ఉత్తరతీరం వరకు గజపతుల ఆధీనం అయింది. ఈ విజయాలన్నీ క్రీ.శ.1448వ సంవత్సరం నాటికి పూర్తి అయి ఉండవచ్చని పండితులు నిర్ణయించారు.

విజయనగర సామ్రాజ్యంపై దండయాత్ర: రాజమహేంద్రవర రెడ్డిరాజ్యం జయించిన తర్వాత గజపతిసైన్యాలు కృష్ణకు దక్షిణ భాగంపై దండెత్తాయి. కృష్ణానదికి దక్షిణంగా ఉన్న ప్రాంతం రెండవ దేవరాయల ప్రత్యక్షపాలనలో ఉండేది. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ ప్రాంతాన్ని సీమలుగా విభజించారు. కొండవీటిసీమ, కందుకూరుసీమ, నెల్లూరుసీమ, ఉదయగిరిసీమ, పెనుగొండసీమ, చంద్రగిరిసీమ అనే విభాగాలుగా ఉండేవి. ఈ సీమలను రాజ్యాలని కూడా పిలిచేవారు. కొండవీటి రాజ్యం, ఉదయగిరి రాజ్యం, చంద్రగిరి రాజ్యం, పెనుగొండ రాజ్యం అని కూడా వ్యవహరించేవారు. హంవీరుడు కృష్ణను దాటి విజయనగర రాజ్యంతో తలపడ్డాడు.

క్రీ.శ.1446 మే నెలలో రెండవదేవరాయలు మరణించాడు. 1447వ సంవత్సరంలో మల్లికార్జునరాయలు సింహాసనానికి వచ్చి 1465 వరకు పాలించాడు. గంగాధరకవి తన గంగాదాస ప్రతాపవిలాసంలో మల్లికార్జున రాయలు సింహాసనం అధిష్టించగానే అంతకుముందు జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకోడానికి హైహయపతులు, గజపతులు ఏకకాలంలో విజయనగరంపై దండెత్తారు అని రాశాడు. ఇది వాస్తవం కాకపోవచ్చును. గజపతి, హయపతులు ఒకరికొకరు విరోధులు. కనుక వారు కలసి దండెత్తి ఉండరు. ఒకరి తర్వాత ఒకరు దండెత్తి ఉండవచ్చును. ప్రతాపరుద్రగజపతి అనంతవరం శాసనం హంవీరుడు విజయ నగరాన్ని ముట్టడించి విజయనగర ప్రభువును ఓడించి కప్పం వసూలు చేశాడని తెలుపుతోంది. కాని గంగాధర కవి గజపతి సైన్యాలు నగరం వద్దకు రాగానే మల్లికార్జునరాయలు గుహలోని పులి పిల్లలాగా దూకి శత్రువులను చీల్చి చెండాడాడని వర్ణించాడు. దీనిని ఉభయులు విజయం తమనే వరించినదని చెప్పుకున్నారు. కనుక మొదట గజపతి సైన్యాలు విజయాలు సాధించి విజయనగరం చేరినప్పటికీ రాజధాని వద్ద జరిగిన యుద్ధంలో మల్లికార్జున రాయలు గజపతులను ఓడించి తరిమివేసి నగరాన్ని రక్షించుకున్నాడని భావింపబడింది.

దక్షిణ కోస్తా ఆక్రమణ క్రీ.శ.1454: గజపతి సైన్యాలు తూర్పుకోస్తాను జయించుకుంటూ విజయనగరం చేరి పట్టణాన్ని ముట్టడించాయా లేక సరాసరి విజయనగరం వైపు పురోగమించి ముట్టడించాయా చెప్పలేము. కాని క్రీ.శ.1453 వరకు గుంటూరుజిల్లాలోని మార్టూరు వరకు మల్లికార్జునరాయల ఆధీనంలో ఉందని మార్టూరులో లభించిన మల్లికార్జునరాయల శాసనం తెలుపుతోంది. మార్టూరు నుండి ఉత్తరభాగం అంటే బాపట్ల ప్రాంత కరాటి సాళువతిప్పయదేవ మహారాయ ఆధీనంలోను, కొణిదెన తిప్పారెడ్డి, పర్వతరెడ్ల ఆధీనంలోను, బెల్లంకొండ రావుసింగణ ఆధీనంలో ఉన్నాయి. కనుక ఆ ప్రాంతం మల్లికార్జునరాయల చేయి జారిపోయిందని భావించవచ్చును. కాని మార్టూరు వరకు అతని ఆధిపత్యంలో ఉందని, మార్టూరు శాసనం స్పష్టంగా చాటుతోంది గుంటూరు జిల్లాలోని కొండవీడు, వినుకొండ, అద్దంకి దుర్గాలను పరీక్షకునిగా గణదేవుడనే అతడు నియమింపబడ్డాడు. అతడు కొండవీడులో ఒక శాసనం వేయించాడు. అది క్రీ.శ.1454 ఏప్రిల్ 12వ తేదీన రాయించబడింది. కనుక ఆ తేదీనాటికి ఈ మూడు ప్రాంతాలు వారి ఆధీనంలో ఉన్నాయని స్పష్టం అవుతోంది. ఇదే ప్రాంతంలోని కొణిదెన రెడ్ల శాసనాలు క్రీ.శ.1453 ఆగస్టు 19, 1454 ఏప్రిల్ 12వ తేదీల మధ్య గజపతుల స్వాధీనం అయి ఉండవచ్చునని నిర్ణయింపబడింది. కనుక మల్లికార్జునరాయలు సింహాసనం అధిష్టించగానే గజపతి సైన్యం విజయనగరాన్ని ముట్టడించిందని గంగాధరకవి రాసిన రాతలు నిజమైనట్లయితే ఈ ప్రాంతాలు జయించకముందే క్రీ.శ.1447వ సంవత్సరంలోనే సరాసరి గజపతి సైన్యాలు విజయనగరంపై హఠాత్తుగా దాడి చేశాయని చెప్పవచ్చును. తర్వాత ఈ ప్రాంతాలు జయించి ఉండవచ్చును. కృష్ణకు దక్షిణ ప్రాంతాలు గజపతులు సాధించిన విజయాలు కొన్ని చాటుపద్యాల వల్ల కూడా తెలుస్తున్నాయి. ఈ చాటువులలో గజరావుతిప్ప, తమ్మభూపతిల పేర్లు ప్రస్తావించబడ్డాయి. వీరిలో గజరావుతిప్ప వెలమవీరుడట. అతడు కపిలేశ్వర గజపతి కొలువులో సేనాధిపతిగా చేరాడు. తెలంగాణలో సంజార్‌ఖాన్‌ని ఓడించాడు. కీర్తి పొందాడు. అతడు కొండవీడు వద్ద చామడపామాత్య (Camadapamatya) అనే అతడ్ని ఓడించాడని చాటువులు తెలుపుతున్నాయి త్రిపురాంతకంలో శక సం 1345-24లో చౌండపమాత్యుని (Caundapamatya) కుమారుడైన నాగయమంత్రి ఒక దానశాసనం వేయించాడు. గజరావుతిప్ప ఓడించిన చామడపామాత్యుని శాసనంలోని చౌండపామాత్యునిగా

పోల్చారు. కాని అతడు రెండవ బుక్కరాయల కాలం నాటివాడు. అతడు ప్రయోగ రత్నమాల అనే కావ్యాన్ని రచించాడు. అతని కుమారుడు వీరభూపతి వడయార్. కనుక ఇతడు మరొక చామదపామాత్యుడని చెప్పవచ్చును. బహుశా ఇతనిని రెండవదేవరాయలు కొండవీటి ప్రతినిధిగా నిలిపి ఉంటాడు అతనిని గజరావుతిప్ప ఓడించి కొండవీటిని ఆక్రమించి ఉంటాడు. చాటువులలో చెప్పబడిన మరొక గజపతి సేనాని తమ్మభూపతి ఇతడు పూసపాటి వంశానికి చెందిన క్షత్రియుడు. ఇతని తండ్రి రాచిరాజు. ఇతడు రెండవ దేవరాయల వద్ద సేనానిగా చేసి దామెరతమ్మ అనే అతడ్ని, యవనులను ఓడించాడు. తర్వాత ఈ ప్రాంతాలు కపిలేశ్వరుని ఆధిపత్యంలోకి వెళ్లగా రాచిరాజు కుమారుడైన తమ్మభూపతి కపిలేశ్వరుని కొలువులో చేరినట్లు కనిపిస్తోంది. ఇతడు వాడపల్లి, రంగరాజుకొండ, బెల్లంకొండ దుర్గాలను జయించాడని రావు సింగణను ఓడించాడని బహత్ఖాన్ ఎవరో తెలియదు. ఇతడు బహుశా ఈ దుర్గాలలోని రాజుల వద్ద కొలువు చేరిన ముస్లిం సైన్యాధిపతి అయి ఉంటాడు. రావు సింగన రాచకొండ వెలమరాజు అయిన మూడవ సింగణ అని చెప్పవచ్చును అతడు తన రాజ్యం పోగొట్టుకున్న తర్వాత బెల్లంకొండను సంపాదించుకొన్నాడు. అతనిని కూడా ఓడించి గజపతులు బెల్లంకొండను స్వాధీనం చేసుకున్నారని ఈ చాటువులు తెలుపుతున్నాయి. ఈ విధంగా గజపతి సేనలు పూర్వపు కొండవీడు రాజ్యభాగాలన్నింటినీ తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. కొండవీటి రాజ్యానికి కపిలేశ్వరుడు తన సమీప బంధువైన గణదేవుని క్రీ.శ.1454 ఏప్రిల్ ముందు పరీక్షకునిగా నియమించాడు. గణదేవుడు తాను సూర్యవంశ కపిలేశ్వరుని వంశానికి చెందిన వాడినని తన కొండవీటి శాసనాలలో చెప్పుకున్నాడు. కపిలేశ్వరుడు కపిలేంద్రుడు కాదు. అతని తాత కపిలేశ్వరుడు. అతని పుత్రులలోని ఒకరి సంతతివాడు అయి ఉంటాడు. మొత్తం మీద రక్త సంబంధీకుడు. గణదేవుడు చావలి అనే గ్రామాన్ని దానం చేసి ఈ శాసనం వేయించాడు. ఈ శాసనం శక సంవత్సరం 1377 నాటిది, అంటే క్రీ.శ.1454వ సంవత్సరం నాటిదిగా నిర్ణయించారు.

దక్షిణ ప్రాంతాలపై దండయాత్ర క్రీ.శ.1458: కొండవీడు రాజ్య ఆక్రమణ తర్వాత కపిలేశ్వరునికి ఉత్సాహం సంతోషం పెరిగి ఇంకా దక్షిణ ప్రాంతాలు కూడా జయించాలని కోరిక కలిగింది. క్రీ శ 1458 వ సంవత్సరం నాటి కపిలేంద్రుని వెలిగళని తామ్రశాసనం కపిలేంద్రుని విజయాలను ఘనంగా వర్ణిస్తోంది. అతడు హంప, ధారా, కలబర్గ, ఢిల్లీలను గడగడ లాడించాడని వర్ణించింది. ఇందులో కొంత అతిశయోక్తి ఉన్నప్పటికీ చాలా భాగం వాస్తవమేనని చెప్పవచ్చును. హంప అంటే విజయనగరం, కలిబర్గ, అంటే గుల్బర్గా రాజ్యాలు అతని దాడులకు గురై తమ ప్రాంతాలను పోగొట్టుకున్నాయి. కపిలేశ్వరుని విజృంభణవల్లనే విజయనగర రాజ్యాన్ని పాలించిన మొదటి వంశమైన సంగమ వంశ క్షీణత ప్రారంభం అయిందని స్పష్టంగా తెలుస్తోంది. ధారా అంటే మాళ్వా ప్రాంతం. మాళవ నవాబులు తరచూ ఒరిస్సా రాజ్యంపై దండెత్తుతూ ఉండేవారు. కనుక కపిలేశ్వరుడు మాళవ సుల్తాన్లు కూడా ఓడించి ఉండవచ్చును. కపిలేశ్వరుని కాలంలో ఢిల్లీని సయ్యద్ వంశస్తులు పాలిస్తున్నారు. వారిలో మూడవ వాడైన అంటే ఖాజీర్ఖాన్ మనుమడైన మహమ్మద్ క్రీ శ 1434లో అంటే కపిలేశ్వరుడు సింహాసనం ఎక్కిన సంవత్సరంలోనే ఢిల్లీ సింహాసనం అధిష్టించాడు. అతని తర్వాత అతని కుమారుడు అల్లావుద్దీన్ ఆలమ్షా క్రీ.శ.1445లో రాజ్యానికి వచ్చి 1451 వరకు పాలించాడు. అతనిని కూలదోసి బహులాల్ లోధి క్రీ.శ.1451లో ఢిల్లీ సింహాసనం ఎక్కాడు. 1458వ సంవత్సరంలో కపిలేంద్రుడు వెలిగళని శాసనం వేయించే నాటికి బహులాల్ లోడీ ఢిల్లీ సుల్తాన్గా పాలిస్తున్నాడు. కపిలేశ్వరుని విజయాలు విని అతడు కలవరపడి ఉండవచ్చును. మొత్తం మీద ఈ కాలంలో యావద్భారతదేశంలో కపిలేశ్వరుడు గొప్ప విజేతగా కీర్తి పొందాడు. అదే విషయాన్ని వెలిగళని శాసనం ధృవపరుస్తోంది. కపిలేశ్వరుడు తన సైన్యాన్ని మూడు భాగాలుగా చేసి ఒక భాగాన్ని పూసపాటి తమ్మనాయకత్వంలో ఉదయగిరిపైకి పంపాడు. మరొక సైన్యాన్ని తన కుమారుడు హంవీరుని నాయకత్వంలో దక్షిణప్రాంతాలపైకి పంపాడు. మరొక భాగానికి తాను స్వయంగా నాయకత్వం వహించి విజయనగరంపై దండెత్తాడు.

ఉదయగిరి ఆక్రమణ: తమ్మభూపాలుడు ఉదయగిరిని జయించాడు. అతనిని కపిలేంద్రుడు అక్కడ పరీక్షకునిగా నియమించాడు. అతడు ఉదయగిరి కొండపైన ఒక దేవాలయాన్ని నిర్మించి కొన్ని దానాలుచేసి అక్కడ శాసనం వేయించాడు. ఈ శాసనం క్రీ.శ.1460 సంవత్సరానికి చెందినది. కనుక 1460వ సంవత్సరం లోపల ఉదయగిరి కోట గజపతుల స్వాధీనం అయిందని భావించవచ్చును. ఈ తమ్మభూపాలుని కుమారుడే పూసపాటి బసవ భూపాలుడు. అతడు గజపతుల సామంతుడుగా ఉదయగిరిని పాలించి రణరంగ భైరవ, రసిక శిఖామణి

అని బిరుదులు పొంది అనేకమంది తెలుగుకవులను పోషించాడు. తమ్మభూపతి కపిలేశ్వరుని కాలంలో మరికొన్ని విజయాలు సాధించాడు. అతడు తొండమారాయగుళ్ల అనే ప్రాంతాన్ని జయించాడని గోరకల్లు కరణం గంగరాజు వద్ద లభించిన విష్ణుభక్త సుధాకరం, ఉషాభ్యుదయం అనే గ్రంధాలలో (Further sources LR 55 P240) ప్రస్తావించబడింది. తొండామారాయగుళ్లను కనిగిరి తాలూకాలోని మారెళ్లగా గుర్తించారు. ఈ ఆధారాల వల్ల ఆ ప్రాంతం అంతా తమ్మభూపతి జయించాడని స్పష్టమవుతోంది. కపిలేశ్వరుడు స్వయంగా కర్నూలు ప్రాంతాలపై దాడి చేసి విజయపరంపరలతో ముందుకుసాగాడు. క్రీ.శ.1460 నాటికి అతడు శ్రీశైలం చేరి చంద్రగ్రహణం రోజున శ్రీశైల దేవాలయానికి దానాలు చేసి శాసనం వేయించాడు. కోయిలకుంట్ల తాలూకాలోని నరసింహ పాత్రుడు జయస్తంభాన్ని నాటించి కపిలేశ్వరునికి శుభాలు కలగడానికి భూదానాలు చేసి శాసనం వేయించాడు ఈ శాసనంలోని పాత్రుడు కపిలేశ్వరుని సేనాధిపతి తెలుపుతోంది. ఇతడు శ్రీశైలంలోని భిక్షు మఠాధిపతి అని గుర్తించాడు. ఇతడు మల్లికార్జునరాయల తరపున గజపతులతో పోరాడి వారి సప్తాంగాలను హరించాడని చెబుతోంది. కాని ఇది అతిశయోక్తి కావచ్చును. వెలుగోటి వారి వంశావళి మాదయలింగ ముక్తిశాంత భిక్షువృత్తిని జయించాడని తెలుపుతోంది. కపిలేశ్వరుడు తెలంగాణలో ముస్లింలతో పోరు సమయంలో మాదయలింగ కపిలేశ్వరునితో చేరి పోయి తన రాజ్యాన్ని దక్కించుకున్నాడని చరిత్రకారులు భావిస్తారు. కపిలేశ్వరుని కర్నూలు ప్రాంత దండయాత్రలలో మాదయలింగ పాల్గొని శ్రీశైలంలోని భిక్షువృత్తి మఠాధిపతిని ఓడించి ఉండవచ్చును ఈ విజయాల వల్ల శ్రీశైలంతో సహా కర్నూలు జిల్లా ప్రాంతాలు కపిలేశ్వరుని ఆధీనంలోకి వచ్చినవని చెప్పవచ్చును కర్నూలు జిల్లాలోని స్థానిక చరిత్రలు అంటే కైఫీయత్తులు ఆ ప్రాంతాలను కపిలేశ్వరరాజు పాలించాడని తెలుపుతున్నాయి.

విజయనగరం వైపు ప్రయాణం: కర్నూలు, శ్రీశైలం ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత కపిలేశ్వరుడు పెనుగొండవైపు సాగాడు. ముంచుకొనివచ్చే ప్రమాదాన్ని గ్రహించి మల్లికార్జునరాయలు చంద్రగిరి పాలకుడుగా ఉన్న సాళువ నరసింహరాయలను పెనుగొండకు బదిలీ చేశాడు. ప్రొ.యస్.కె.అయ్యంగార్ కపిలేశ్వరుని ఎదిరించడానికే ఈ బదిలీ జరిగిందని వ్యాఖ్యానించాడు. మల్లికార్జునరాయలు స్వయంగా క్రీ.శ.1459వ సంవత్సరంలో పెనుగొండను దర్శించాడు. రాచకార్యం మీద దర్శించడానికి అక్కడి శాసనం తెలుపుతోంది. ఒరిస్సా సైన్యాలను ఎదిరించడానికి పెనుగొండలో దన్నాయక తిమ్మన అనే సేనాధిపతిని కూడా నియమించాడు కపిలేశ్వరుడు పెనుగొండపై ముట్టడి చేసినట్లు కనిపించదు. పెనుగొండ గజపతుల వశం కాలేదు. కనుక కపిలేశ్వరుడు విజయనగరంపై దాడిని ఉపసంహరించుకొని ఉండవచ్చును. పెనుగొండవైపు గజపతుల దండయాత్ర ఆగిపోయినప్పటికి మరొక విధంగా సంగమవంశానికి హాని జరిగింది. పెనుగొండ పాలకునిగా నియమించిన సాళువ నరసింహుడు త్వరలో ప్రఖ్యాతుడై సంగమ వంశాన్ని తొలగించాడు.

హంవీరుని విజయాలు - తమిళ ప్రాంతాల ఆక్రమణ: తమ్మభూపాలుడు కపిలేశ్వరుడు ఆంధ్రదేశంలో విజయాలు సాధిస్తూ ఉండగా హంవీరుడు తన సైన్యాలతో తమిళ ప్రాంతాలపై విరుచుకుపడ్డాడు. మల్లికార్జునుడు ప్రవాహం లాగా వచ్చే గజపతి సైన్యాలను ఎదుర్కోడానికి తన చేతనైన ప్రయత్నాలు చేశాడు. కాని ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. హంవీరుడు విజయపరంపరలతో ముందుకు దూసుకుపోయాడు. తమిళదేశం యావత్తు జయించాడు. విజయనగర సామ్రాజ్యం తన తూర్పు భాగాలన్నింటినీ కోల్పోయింది. తమిళదేశంలోని అనేక శాసనాలు ఒడియరాజుల విజయాలను పేర్కొంటున్నాయి. వారి విజయాలకు ఒడ్డియన్‌గలబై అని పేర్కొంటున్నాయి. దక్షిణ ఆర్కాటు జిల్లాలోని మున్నూరులోని క్రీ.శ.1464 నాటి శాసనం హంవీరుని కుమారుడు దక్షిణ కపిలేశ్వర కుమార మహాపాత్రుడు పూర్వపు కొండవీటిపాలకుడు, ఇప్పుడు కొండపల్లి, అద్దంకి, వినుకొండ దండపాద, పడైవీడు, వలుదులంపట్టు సావడి, తిరువారూరు, తిరుచ్చిరాపల్లి, చంద్రగిరులను పాలిస్తున్నాడని తెలుపుతోంది. AR No 93 శక సంవత్సరం 1395 నాటి ఒక శాసనం ఒడ్డియన్ దండయాత్ర వల్ల దక్షిణ ఆర్కాట్ జిల్లాలోని జంబై శైవదేవాలయాలలోని 10 సంవత్సరాలు ఉత్సవాల నిర్వహణకు ఆటంకం ఏర్పడిందని అలాగే క్రీ.శ.1470-71 సంవత్సరం నాటి మరొక శాసనం కూడా 8 సంవత్సరాలు ఒడ్డియరాజుల పాలనను గురించి చెబుతోంది. కృష్ణరాజ విజయం కూడా కపిలేశ్వరుని దక్షిణాది దండయాత్రను పేర్కొంది. ఈ ఆధారాలన్నీ తమిళదేశంలోని గజపతి విజయాలను ముక్తకంఠంతో ఘోషిస్తున్నాయి.

చంద్రగిరి రాజ్య ఆక్రమణ: చంద్రగిరి విజయనగర రాజ్యంలో ఒక రాజకీయ విభాగం. దానిని చంద్రగిరి

రాజ్యం అని కూడా పిలిచేవారు. ఈ రాజ్యాన్ని సాళువ వంశం పాలించేది. ఈ వంశానికి చెందిన సాళువ నరసింహరాయలు తిరుమల తిరుపతి, దాని పరిసర ప్రాంతాలను పాలించేవాడు. అతని రాజ్యంలో అంటే చంద్రగిరి రాజ్యంలో ఉత్తర దక్షిణ ఆర్కాట్ జిల్లాలు, చెంగల్పట్టు జిల్లా రాయవెల్లూరు ప్రాంతాలు చేరి ఉండేవి. నరసింహరాయలు గొప్ప పరాక్రమవంతుడు. అతడు మాత్రమే గజపతులను ఎదుర్కోగలడని తలచి మల్లికార్జున రాయలు నరసింహరాయలను పెనుగొండకు మార్చాడు. అతని స్థానంలో చంద్రగిరి దుర్గాన్ని రక్షించడానికి మల్లయదేవ మహారాయని కుమారుడు సాళువ రామచంద్రరాయుని నియమించాడు సాళువ నరసింహరాయుల పెనుగొండ తరలివెళ్లగానే గజపతులు చంద్రగిరిపై దాడిచేశాడు. తమ్మభూపతి చంద్రగిరిపై దండెత్తి క్రీ.శ.1464లో సాళువ రామచంద్రరాయుని ఓడించి కోటను స్వాధీనం చేసుకున్నాడు తిరుమలైలోని ఒక శాసనం తమ్మభూపాలుని మహామండలేశ్వర మేదిని వంశస్తులను ఓడించినందువల్ల ధరించి ఉంటాడు. చంద్రగిరి వశం కావడంతో దక్షిణాన ఆంధ్రదేశపు భూభాగాలన్నీ గజపతుల సామ్రాజ్యంలో భాగాలయ్యాయి

తమిళ ప్రాంతాల ఆక్రమణ క్రీ.శ.1464: చంద్రగిరి పడిపోయిన తర్వాత గజపతులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. తిరుచ్చిరావల్లిని మల్లికార్జునరాయల సామంతునిగా గోపతిమ్మ నృపతి కుమారుడు సాళువ తిరుమలైయ దేవమహారాజు పాలిస్తున్నాడు. విజయనగర సామ్రాజ్యంలోని తమిళ ప్రాంతాలపై సాళువ వంశస్తులను పాలెగాళ్లుగా నియమించినట్లు కనిపిస్తోంది. శ్రీరంగ ప్రాంతాలపై గోపతిమ్మనృపతిని పేర్కొంటోంది. గజపతి సైన్యాన్ని విజయనగర రాజ్యం తరపున సాళువ వంశస్తులు ఎదిరించినట్లు కూడా స్పష్టపడుతోంది. గజపతి సైన్యం తిరుచరాపల్లిపై దండెత్తగా సాళువ నాయకులు ఎదిరించాడు వారికి స్వయంగా సహాయపడటానికి మల్లికార్జునరాయలు శ్రీరంగం వచ్చాడు. క్రీ.శ.1462-63 సంవత్సరం నాటి శ్రీరంగం శాసనం మల్లికార్జున రాయలు తనకు విజయాలు కలగాలని దానం చేశాడని తెలుపుతోంది. ఈ శాసనం వల్ల మల్లికార్జునరాయలు శ్రీరంగం వద్ద శత్రువులతో పోరాడుతున్నట్లు చెప్పవచ్చును. ఆ శత్రువులు హంవీరుడు, అతని కుమారుడు కుమార దక్షిణకపిలేశ్వర మహాపాత్రుడు అని బోధపడుతుంది. ఈ యుద్ధంలో మల్లికార్జునరాయలు ఓటమి చెందాడు. గజపతి సైన్యాలు విజయం సాధించి తిరుచిరాపల్లి, శ్రీరంగంలను ఆక్రమించాయి. క్రీ.శ.1464 మార్చి నెలలో దక్షిణ కపిలేశ్వర మహాపాత్రుడు శ్రీరంగ దేవాలయానికి గోవులను దానం చేసి శాసనం వేయించాడు. అంతకు పూర్వ సంవత్సరం అంటే 1463వ సంవత్సరంలో మల్లికార్జునరాయలు అక్కడ తనకు విజయాలు కలగాలని దానం చేసి శాసనం వేయించాడు. అంటే ఈ యుద్ధంలో మల్లికార్జునరాయలు ఓడిపోయి ఆ ప్రాంతాలను గజపతులకు కోల్పోయాడు. ఈ విజయం తర్వాత గజపతి సైన్యాలు ఇంకా ముందుకుసాగి దక్షిణ సముద్రం వరకు జయించాయి. యావత్తూ కన్యాకుమారి అగ్రం వరకు గజపతుల పాదాక్రాంతం అయింది. ఈ విజయాలు సాధించినందుకు సంతోషించి మనుమడు కుమార దక్షిణ కపిలేశ్వరుని ఆ ప్రాంతాలపై క్రీ.శ.1464 జూన్ మాసంలో పరీక్షకునిగా నియమించాడు. దక్షిణాగ్రంలో గజపతుల తమిళదేశ ఆక్రమణకూడా చారిత్రక ప్రాధాన్యత గల్గినదే. తమిళదేశం మీద వారు చేసిన దాడి కేవలం తాత్కాలిక దాడి కాదు. ఆ ప్రాంతాలను తమ సామ్రాజ్యంలో శాశ్వతంగా కలపాలనే సంకల్పం కపిలేశ్వర గజపతికి ఉంది అందువల్ల తన మనుమడు కుమార దక్షిణ కపిలేశ్వరుని అక్కడ పరీక్షకునిగా నిలిపాడు. ప్రాచీన కాలంలో ఖారవేలుడు పాండ్యకూటమిని విచ్ఛిన్నం చేసి తమిళదేశంపై విజయం సాధించాడు. కోస్తా మొత్తం జయించాడు. భారతదేశ చక్రవర్తులలో ఒకడుగా కీర్తి చెందాడు. కళింగ రాజ్యానికి కీర్తిని తెచ్చాడు. అదే విధంగా మధ్యయుగంలో కపిలేశ్వర గజపతి కన్యాకుమారి అగ్రం వరకు కోస్తా మొత్తాన్ని జయించి కళింగరాజ్యానికి దేశవ్యాప్త కీర్తిని తెచ్చాడు. అంతేకాదు, దక్షిణ భారతదేశచరిత్రలో ప్రముఖమైన రెండు సామ్రాజ్యాలైన బహమనీ, విజయనగర సామ్రాజ్యాలను ఓడించి, వారి ప్రాంతాలను ఆక్రమించి దక్షిణదేశంలో ప్రథమస్థానాన్ని పొందాడు. అలాగే బెంగాలు, మాళ్వ, జౌన్పూరు సుల్తాన్‌లను ఓడించి ఉత్తరదేశ రాజకీయాలలో కూడా ప్రథముడిగా నిలిచాడు. ఈ విధంగా తనకాలం మొత్తం భారతదేశంలోనే కపిలేశ్వరుడు ప్రథముడని కీర్తిపొంది కళింగదేశానికి ఎనలేని కీర్తిని తెచ్చాడు. కనుక మధ్యయుగంలో భారతదేశ చరిత్రలో గజపతులకు అంత గొప్పకీర్తి వచ్చింది. దక్షిణదేశ చరిత్రలో గొప్పగా కీర్తించబడిన విజయనగర రాజులు గజపతుల దినచర్యను తెలుసుకోడానికి ఆసక్తి చూపారు. రాయవాచకంలో గజపతి దినచర్యను గూర్చిన వర్ణన ఉంది. అంటే గజపతి నాటి సమకాలీన రాజవంశాలు గజపతులను ఎంతగా పరిశీలించారో, ఆ వంశం వారిని ఎంతగా ఆకర్షించిందో అవగతం అవుతోంది.

తమిళదేశంపై గజపతుల అధికార కాలం: ఆంధ్రదేశంపై గజపతులు చివరిదాకా తమ ఆధిపత్యాన్ని నిలుపుకున్నారు. కాని తమిళదేశంపై నిలుపుకోలేకపోయారు. అక్కడ వారి పాలన 10 సంవత్సరాలు మాత్రమే నిలిచినట్లు కనిపిస్తోంది. కపిలేశ్వరుడు తమిళదేశంపై చేసిన దండయాత్ర కేవలం దాడి చేసి వెళ్లిపోవడం కాదు. ఆ ప్రాంతాలను శాశ్వతంగా తన సామ్రాజ్యంలో చేర్చాలనే తలంపు ఉంది. మున్నూరు, తిరుక్కోయిలూర్ (Tirukkoyilur) శాసనాలు 10 సంవత్సరాలు వడ్డియన్ సైన్యాలు దేవాలయాలలో ఉత్సవాలు జరుగకుండా చేశాయని తెలుపుతున్నాయి. మున్నూరు శాసనం క్రీ.శ.1464వ సంవత్సరం వరకు కావేరీ నది వరకూ తూర్పు కోస్తా మొత్తం కపిలేంద్రుని ఆధిపత్యంలో ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ఈ శాసనాలను బట్టి హెచ్.కృష్ణశాస్త్రి ఈ ప్రాంతాలపై అంటే తిరుచినాపల్లి వరకు గజపతుల అధికారం ఆ ప్రాంతాలపై నిలుపుకోవాలని కపిలేశ్వరుడు తమ మనుమడు దక్షిణ కపిలేశ్వర మహాపాత్రుని ఆ ప్రాంతాలపై పరీక్షకునిగా నియమించాడు. అయితే ఈ తమిళ ప్రాంతాలన్నీ 10 సంవత్సరాలు గజపతుల ఆధిపత్యంలో ఉన్నాయా? లేవా? అనే విషయం మీదే తర్జనభర్జనలు ఉన్నాయి. ఆర్.డి.బెనర్జీ జంబై, తిరుక్కోయిలూర్ శాసనాల మీద ఆధారపడి తంజావూరు వరకు ఆ ప్రాంతాలన్నీ గజపతుల ఆధిపత్యంలో ఉన్నాయని అభిప్రాయ పడ్డాడు. కాని శక సంవత్సరం 1383 అంటే క్రీ.శ.1466 సంవత్సరానికి చెందిన ఒక శాసనం వల్ల సాళువ నరసింహరాయలు ఆ ప్రాంతాలను గజపతుల నుండి తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. కాని అతడు విజయం సాధించినట్లుగా లేదు. అందుకు కారణమేమంటే అదే ప్రాంతంలో లభించిన 1470-72 సంవత్సరాల నాటి విజయనగర శాసనాలు ఆ ప్రాంతంలో వడ్డియన్ అధికారం ఉందని, స్థానిక దేవాలయాలలో ఉత్సవాలు ఆగిపోయాయని తెలుపుతున్నాయి. కనుక ఈ ప్రాంతాల కోసం గజపతులు, నరపతుల మధ్య 10 సంవత్సరాల సుదీర్ఘకాలం పోరాటాలు జరిగినట్లు, అందులో 1472 వరకు విజయనగర సైన్యాలకు విజయం లభించలేదని తెలుస్తోంది. 1470-72 సంవత్సరాల మధ్య కపిలేశ్వర గజపతి మరణానంతరం అతని కుమారుల మధ్య జరిగిన వారసత్వ యుద్ధకాలంలో సాళువ నరసింహరాయలు గజపతులను పారదోలి తమిళ ప్రాంతాలను, చంద్రగిరి రాజ్యాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నట్లు కనిపిస్తోంది. కనుక తమిళ ప్రాంతాలు ఒక దశాబ్దం గజపతుల పాలనలో ఉన్నాయని అంగీకరించవచ్చును.

నవకోటి కర్ణాట కలవరగేశ్వర (Navakoti Karnata Kalavarageswara): గజపతులు నవకోటి కర్ణాట కలవరగేశ్వర అనే బిరుదు ధరించారు. ఈ బిరుదు మొట్టమొదటి సారిగా కపిలేంద్రుని క్రీ.శ.1458 శక సంవత్సరం 1380 నాటి వెలిగళని శాసనంలో కనిపిస్తుంది. సరస్వతీ విలాసంలోని ప్రతి అధ్యాయం చివరలో కూడా నవకోటి కర్ణాట కలవరగేశ్వర అనే బిరుదు ఉంది. ఇందులోని నవకోటి అనే పదానికి ఖచ్చితమైన అర్థం తెలియరాలేదు. మన్మోహన్ చక్రవర్తి, ఆర్.డి.బెనర్జీ ఇది 9 కోట్ల కర్ణాటక, గుల్బర్గా రాజ్యాధిపతి అని అర్థం చెప్పారు. జి. రామదాసు అనే పండితుడు కపిలేంద్రుడు నవకోటి దేశాల కర్ణాట, గుల్బర్గా ప్రభువు Ruler of the countries Navakoti Karnata అని చెప్పాడు. ఈ వాదనను సమర్థించుకోడానికి కపిలేంద్రుని గోపీనాథపూర్ శాసనంలోని శ్రీ ఖండాద్రి పయోధారోపరి కరమ్ నిర్మాయ అనే పదంతో పోల్చి, కపిలేంద్రుడు తొమ్మిది కోట్లకు అధిపతి అని భావించాడు. నవకోటిని నవకోటగా తీసుకున్నాడు. ఆ కోటలు -

1. బెల్లంకొండ	2. వినుకొండ	3. కొండవీడు
4. నాగార్జునకొండ	5. రాజమండ్రి	6. పెద్దాపురం
7. కలువలపల్లి	8. వడ్డాది	9. పొట్నూరు

నవకోటి అనే పదం సింహాచలం నుండి నెల్లూరు వరకు ఉన్న ప్రాంతాన్ని సూచిస్తుంది అని రామదాసు భావించారు. కాని ఆ అర్థం సమంజసంగా కనిపించదు. కారణమేమంటే ఈ ప్రాంతంలో ఇంకా ప్రసిద్ధి చెందిన ఆనాటి కోటలైన ఉదయగిరి, కందుకూరు, అద్దంకి, కేతవర, కొండపల్లి మొదలైన అనేక కోటలు ఉన్నాయి. కనుక నవకోటి అనే పదం నవకోటలు అని తీసుకోవడం చాలా తప్పు.

ఆంధ్రదేశంలో రాజ్యాలను పరిపాలనా విభాగాలను సంఖ్యతో చెప్పడం సాంప్రదాయంగా ఉండేది. వెలనాడు 6000, ములికినాడు 4000, పలనాడు 300, నోలంబవాడి 32000 ఈ విధంగా శాసనాలలో ఉన్నాయి. నన్నెచోడుడు తన కుమారసంభవంలో తన తండ్రి చోడబలి 21000 పాకనాటికి ప్రభువని రాసుకున్నాడు. కనుక ఈ సంఖ్య రాజ్యం యొక్క విస్తీర్ణాన్ని తెలియజేసే సంజ్ఞ. ఈ సంఖ్యా వాచకం ఆయా

రాజ్యాలు, ప్రాంతాలలోని గ్రామాలని పండితుల అభిప్రాయం. కనుక గజపతులు ధరించిన ఈ బిరుదు కర్ణాట కలవర రాజ్యాలలోని గ్రామాల సంఖ్య అని చెప్పవచ్చును. కర్ణాట అనేది విజయనగర రాజ్యం. కలవర అనేది గుల్బర్గా రాజ్యం అంటే బహమనీ రాజ్యం. ఈ రెండు రాజ్యాలలోని 9 కోట్ల గ్రామాలని ఆ బిరుదు అర్థం కావచ్చును. అయితే 9 కోట్ల గ్రామాలు ఉన్నాయా అనే అనుమానం కలుగవచ్చును. నోలంబవాడిలో 32000 గ్రామాలు ఉండగా, విజయనగర బహమనీ రాజ్యాలలో 9 కోట్లు ఉండటం ఆశ్చర్యకరం కాదు. విజయనగర సామ్రాజ్యంలో తమిళ, మళయాళ, కర్ణాటక ఆంధ్ర ప్రాంతాలు చేరి ఉండేవి. కపిలేశ్వర గజపతి కోస్తాను జయించే ముందు సింహాచలం వరకు కోస్తా కూడా విజయనగర రాజుల అధీనంలో ఉండేది. తెలంగాణ కూడా వారి కింద ఉండేది. ఇక బహమనీ సామ్రాజ్యంలో కొన్ని కర్ణాటక ప్రాంతాలు, మహారాష్ట్ర అంతా చేరి ఉండేది. ఒక్క నోలంబవాడిలోనే 32000 గ్రామాలు ఉంటే ఇంత విశాలంతో ఉన్న రెండు సామ్రాజ్యాలలో 9 కోట్ల గ్రామాలు ఉండి ఉండవచ్చని చెప్పవచ్చును. కపిలేశ్వర గజపతి విజయనగర, బహమనీ రెండు సామ్రాజ్యాలను ఓడించాడు. అటు విజయనగర రాజధానిని బహమనీ రాజధాని గుల్బర్గాను కూడా ముట్టడించారు. కోస్తా, తెలంగాణ ప్రాంతాలన్నింటిని తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. దాంతో దక్షిణదేశంలోనే గజపతి సామ్రాజ్యం ప్రథమ స్థానాన్ని సంపాదించిందని చెప్పవచ్చును. కనుక ఈ రెండు సామ్రాజ్యాధిపతులను ఓడించడం గజపతులు గర్వించదగిన ఘనకార్యంగా భావించి ఉండాలి. అందువలనే వారు నవకోటి·కర్ణాట, కలవరగేశ్వర అనే బిరుదులు ధరించి ఉంటారు.

ఆంధ్రదేశ చరిత్రలో కపిలేశ్వరుని స్థానం: ఈ విజయాలను పరిశీలించినట్లయితే కపిలేశ్వరుని కాలంలో ఆంధ్రదేశంలోని అన్ని దిక్కులలో గజపతి సైన్యాలు హోరెత్తించాయని స్పష్టపడుతోంది. ఆంధ్రదేశంలో నా అనే దిక్కులేకుండా పోయింది. కనుక గజపతి సైన్యం ఆంధ్రదేశంలో వీరవిహారం చేసింది. ఆంధ్రదేశంపై ఆధిపత్యాన్ని సాధించాలని భావించిన విజయనగర, బహమనీ సుల్తాన్‌లు కూడా పరాయి వంశస్తులే కనుక గజపతులు సునాయసంగా ఆంధ్రదేశాన్ని తమస్వంతం చేసుకొని నూరు సంవత్సరాలు పాలించారు. ఏ యుగంలో కూడా ఆంధ్రదేశం ఇంత ఘోరంగా పరాయివంశానికి పాదాక్రాంతం కాలేదు. రెండవ పులకేశి కాలంలో అలా జరిగింది. అతడు ఆంధ్రదేశంలోని ప్రతి రాజవంశాన్ని నిర్మూలించి దేశం అంతా స్వాధీనం చేసుకున్నాడు. దాంతో ఆంధ్రదేశ ప్రాచీన వంశాలన్నీ పోయి చాళుక్యవంశం ఆంధ్రదేశంలో స్థిరపడింది. పులకేశి తర్వాత ఆంధ్రదేశాన్నంతటిని ఆ విధంగా వశం చేసుకున్నవాడు ఒక్క కపిలేశ్వర గజపతి మాత్రమే. పులకేశి ఆంధ్రదేశాన్నంతటినీ ఏకం చేసినా దాని ఐక్యతను నిలుపలేదు. కోస్తా ఆంధ్రను తన తమ్ముడు కుబ్జవిష్ణువర్ధనునికి ఇచ్చివేశాడు. దాంతో ఆంధ్రదేశం చీలిపోయింది. కాని కపిలేశ్వరుడు అలా చీల్చకుండా ఆంధ్రదేశాన్ని ఏకంగా ఉంచాడు. కాకతీయుల తర్వాత ఆంధ్రదేశాన్ని తిరిగి ఏకం చేసినవాడు కాపయనాయకుడు అతని తర్వాత ఆంధ్రదేశాన్ని ఏకం చేసినవాడు కపిలేశ్వర గజపతి. అతని తర్వాత అతని వారసులు దాని ఐక్యతను కొనసాగించారు. మధ్యలో తాత్కాలికంగా కొన్ని అపజయాలు పొందినా గజపతుల హయాంలో 100 సంవత్సరాలు ఆంధ్రదేశం ఐక్యతగా నిల్చింది. ఈ ఘనతను సాధించినవాడు కపిలేశ్వర గజపతి. ఆంధ్రదేశ చరిత్రలో అంతటి ఘనస్థానాన్ని సంపాదించుకున్న కపిలేశ్వరునికి ఇంతవరకు ఆంధ్రదేశ చరిత్రలో తగిన స్థానాన్ని ఆంధ్ర చరిత్రకారులు ఇవ్వలేదు. ఈ గ్రంథంలో కపిలేశ్వరునికి, అతని వారసులకు తగిన ప్రాముఖ్యం ఇవ్వబడింది.

బహమనీ రాజ్యంపై కపిలేశ్వరుని దాడి: కపిలేంద్రుడు క్రీ.శ.1458వ సంవత్సరంలో వేయించిన తన వెలిగళని శాసనంలో తాను గుల్బర్గాకు వెళ్ళి వారి అశ్వాలను జయించానని చెప్పుకున్నాడు. 1458వ సంవత్సరం నాటి గుల్బర్గా బహమనీ సామ్రాజ్యానికి రాజధాని కాదు. అహమ్మద్‌షా రాజధానిని గుల్బర్గా నుండి బీదర్‌కు మార్చాడు. అయినప్పటికీ దక్షిణదేశ రాజులు వారిని గుల్బర్గా సుల్తాన్‌లుగానే వ్యవహరించేవారు. అలాగే వారిని అశ్వపతులు హయపతులు అనికూడా వ్యవహరించేవారు. కనుక 1458 నాటి వెలిగళని శాసనంలో కపిలేంద్రుడు వారిని గర్బర్గ హయపతులు అని రాయించి ఉంటాడు. బహమనీ రాజ్యం స్థాపించినప్పటి నుండి తూర్పుదిక్కున బంగాళాఖాతం వరకు తమ రాజ్యాన్ని వ్యాప్తిచేయాలని ప్రయత్నం చేశారు. కాని అహమ్మద్‌షా కాలం వరకు అది సాధ్యం కాలేదు. అతని కాలంలో వెలమ రాజ్యంపై దండెత్తి తెలంగాణ మొత్తాన్ని తన సామ్రాజ్యంలో చేర్చగలిగాడు. ఇదే సందర్భంలో రెండవ దేవరాయలు కోస్తాను ఆక్రమించాడు. రెండవ దేవరాయల మరణం తర్వాత కోస్తాలో గజపతులు ప్రత్యక్షం అయ్యారు. ఆంధ్రదేశంపై ఆధిపత్యం కోసం కపిలేశ్వరుడు, బహమనీలు

సంఘర్షణకు దిగారు. ఉభయులు ఖమ్మంమెట్టు యుద్ధంలో ప్రత్యక్షంగా తారసిల్లారు. ఇక్కడ జరిగిన యుద్ధాలలో సంజార్‌ఖాన్ మరణించాడు. సయ్యద్ ఆలీ, సంజార్‌ఖాన్ గొప్పవీరుడని, అతడు జీవించి ఉన్నంత వరకు గజపతులు తెలంగాణలోకి చొచ్చుకురాలేకపోయారని, 1448వ సంవత్సరం వరకు తెలంగాణకు అధిపతి కాలేకపోయారని రాశాడు కనుక సంజార్‌ఖాన్‌ను వధించి తెలంగాణను ఆక్రమించారని భావించాలి సంజార్‌ఖాన్‌ను వధించి తెలంగాణను ఆక్రమించారని భావించాలి. సంజార్‌ఖాన్ మరణం తర్వాత బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్, ఆజీమ్‌ఖాన్ అనే అతన్ని తెలంగాణ గవర్నరుగా నియమించాడు. కాని అతడు 1454వ సంవత్సరంలో మరణించినట్లుగా కనిపిస్తోంది. అల్లా ఉద్దీన్ తెలంగాణను కాపాడుకోవాలని విశ్వ ప్రయత్నం చేశాడు 1454లో సుల్తాన్‌కు పాదం మీద కురుపులేచి అది పెద్దదైందని, దాని వల్ల మరణించాడని వదంతులు లేచాయని ఫెరిష్టా రాశాడు.

జలాల్‌ఖాన్, సికిందర్ ఖాన్‌ల తిరుగుబాటు 1454: దుర్గాధిపతి జలాల్‌ఖాన్ తిరుగుబాటు చేసి నల్లగొండ పరిసర ప్రాంతాలను ఆక్రమించి వాటిని తన కుమారుడు సికిందర్‌ఖాన్‌కు అప్పగించాడు. అల్లాఉద్దీన్ వారిని అణచడానికి సైన్యాలతో బయలుదేరాడు అతని సైన్యంలో దక్కని వర్గం, విదేశీ వర్గం అని రెండు ముఠాలుండేవని ఫెరిష్టా రాశాడు సుల్తాన్ సైన్యాలను ఎదిరించడానికి జలాల్‌ఖాన్, సికిందర్‌ఖాన్‌ను మాళ్వా సుల్తాన్ మహమూద్ ఖిల్జీని సహాయం అర్థించడానికి పంపాడు. సికిందర్‌ఖాన్‌ను ఖిల్జీకి సుల్తాన్ అల్లావుద్దీన్ మరణించాడని ప్రముఖమైన సర్దారులు అతని రాజ్యాన్ని పంచుకుంటున్నారని నమ్మించి తమకు సహాయపడమని అర్థించాడు ఖిల్జీ అతని మాటలు నమ్మి తన సైన్యంతో బయలుదేరాడు మాళ్వా సుల్తాన్ సైన్యాలతో వస్తున్నాడని తెలిసి అల్లావుద్దీన్ తన సైన్యాలను రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని ఖ్వాజా మహుముద్ గాలని (ఇతడే తర్వాత గవాన్) నాయకత్వంలో జలాల్‌ఖాన్‌పైకి పంపి తాను సికిందర్, ఖిల్జీల సైన్యాలను ఎదుర్కొనడానికి వెళ్లాడు. అల్లావుద్దీన్ జీవించి ఉన్నాడని తెలిసి ఖిల్జీ తన సైన్యాలతో వెనక్కి వెళ్లిపోయాడు. సికిందర్‌ఖాన్ ఒంటరిగా సుల్తాన్‌తో పోరాడటానికి ధైర్యం చాలక నౌల్‌కొండ కోటలో దూరాడు. మహమ్మద్ గవాన్ నౌల్‌కొండపై దాడి చేసి కోటను పట్టుకున్నాడు. సికిందర్‌ఖాన్ లొంగిపోయాడు. సుల్తాన్ అతనిని క్షమించి నౌల్‌కొండ పాళెగాడుగా ఉండటానికి అనుమతించాడు.

సికిందర్‌ఖాన్‌తో పోరాడటానికి అల్లావుద్దీన్ తీసుకువచ్చిన సైన్యంలో దక్కని, విదేశీ అని రెండు ముఠాలున్నాయని ఫెరిష్టా రాశాడు. అందువల్ల తను సికిందర్‌ఖాన్‌ను జయించలేనని హిందూరాజు సహాయం అర్థించి వారి సహాయంతో సికిందర్‌కాన్‌ను ఓడించాడనే సూచన ఫెరిష్టా రచనలలో కనిపిస్తోంది. ఈ యుద్ధంలో అల్లావుద్దీన్‌కి వెలమనాయకులు సహాయం చేశారని వెలుగోటివారి వంశావళి తెలుపుతోంది. డా॥ వెంకటరమణయ్య అల్లావుద్దీన్ కపిలేశ్వరుని సహాయం తీసుకున్నాడని భావించాడు. ఈ సందర్భంలోనే కపిలేశ్వరుడు సికిందర్‌కు సహాయంగా వచ్చిన మాళ్వసుల్తాన్‌తో పోరాడి ఉంటారు. కనుక వెలిగళని శాసనం మాళ్వ సుల్తాన్‌పై కపిలేశ్వరుడు విజయం సాధించాడని తెలుపుతోందని వివరించాడు. ఈ శాసనంలో మాళ్వ సుల్తాన్‌తో పోరాడినట్లు లేదు. కాని మాళ్వ తనకు భయపడ్డాడని వర్ణింపబడింది. అయినప్పటికీ డా॥ వెంకటరమణయ్య కపిలేశ్వరుడు మాళ్వసుల్తాన్‌తో పోరి ఉండవచ్చునని భావించాడు. ఒక చాటు పద్యంలో గజపతి సేనాని దామెరతిమ్మ బెజవాడ, ఓరుగల్లు, తొండమారయగుళ్ళు, బెదదకోట, మాదేస్, మాహూర్, కంభం, ఢిల్లీ దేవరకొండ, కొండవీడులను జయించాడని, చిరుప్రోలు శాసనం కూడా కపిలేశ్వరుడు ఈ కోటలను జయించాడని తెలుపుతోంది. సికిందర్‌ఖాన్‌కు సహాయంగా వచ్చిన మాళ్వ సుల్తాన్ మహమ్మద్ ఖిల్జీ మాహూర్‌ను ముట్టడించగా క్రీ.శ.1455 హిజారా 860లో సుల్తాన్ అల్లాఉద్దీను అతనిని ఓడించాడు. వెంకటరమణయ్య ఈ యుద్ధంలో సుల్తాన్ అల్లాఉద్దీన్‌కు సహాయంగా కపిలేశ్వరుడు మాళ్వసుల్తాన్‌తో పోరాడి ఉంటాడని, అందువల్లనే మాహూర్‌ను కపిలేంద్రుడు జయించినట్లు చాటుపద్యం ఉందని వ్యాఖ్యానించాడు. కాని ఆయన ఊహలు సరిఅయినవి కాదని చెప్పవచ్చును. కపిలేశ్వరుడు మొదటి నుండి బహమనీ సుల్తాన్‌లతో వైరభావంతోనే ఉన్నారు. కంభం మెట్టును జయించే సందర్భంలో గజరావుతిప్ప యవనులపై అనేక విజయాలు సాధించాడు. ఆ యుద్ధాలలో బహమనీ సేనాని సంజార్‌ఖాన్ మరణించాడు. అలాంటి విరోధ సంబంధాలు కలిగిన బహమనీ రాజ్యం తరఫున కపిలేశ్వరుడు యుద్ధం చేశాడని చెప్పడం సమంజసం కాదు. చాటువుగా చెప్పబడిన బెదదకోట బీదర్ అని గజపతి బీదర్‌పై దండయాత్ర సాగించాడని ఆ సమయంలోనే మాహూర్ కోటను కూడా జయించి ఉంటాడని

చిరుప్రోలు శాసనం చాటుపద్యంలో వీటి ప్రస్తావన ఉందని కపిలేశ్వరుడు బహమనీ సుల్తాన్‌తో బాహాటంగా పోరాడి విజయాలు సాధించాడని మరికొందరు భావించారు. కనుకనే అతనికి కలభర అనే బిరుదు వచ్చిందని వారు భావించారు.

సుల్తాన్ అల్లావుద్దీన్ హిజారా 862 అంటే క్రీ.శ.1457లో మరణించాడు తర్వాత అతని కుమారుడు హుమాయూన్ సింహాసనమెక్కి తెలంగాణ పరిపాలనలో మార్పులు తెచ్చాడు అతడు చెంగీజ్‌ఖాన్ వారసుడనని చెప్పుకొనే మాలిక్‌షా అనే సర్దారుని తెలంగాణ గవర్నరుగా నియమించాడు అతనికి క్వాజా ఐజహాన్ అని కూడా బిరుదునిచ్చాడు. ఈ నియామకం సికిందర్‌ఖాన్‌కు అసంతృప్తి కలిగించింది. తెలంగాణ గవర్నరు పదవిని అతడు ఆశించాడు. మాహూర్ విజయం తర్వాత సుల్తాన్ అల్లావుద్దీన్ మాహూర్ కోటను స్వాధీనం చేసుకొని Furhut-UI-Mulk అనే అతన్ని దుర్గాధిపతిగా నియమించాడు. మాహూర్ పరిసరం ప్రాంతాలపై Fukr-UI-Mulk అనే అతన్ని నియమించాడు. జలాల్‌ఖాన్‌ను నౌల్‌గొండ అధిపతిగా నియమించాడు. అతని కుమారుడు సికిందర్‌ఖాన్‌ను తన ఆస్థాన ఉద్యోగిగా నియమించాడు. అసంతృప్తి చెందిన సికిందర్‌ఖాన్ సుల్తాన్ అనుమతి తీసుకోకుండా నౌల్‌గొండలోని తన తండ్రి వద్దకు చేరి తిరుగుబాటు చేశాడు హుమాయూన్ బేరారు గవర్నరు అయిన ఖాన్‌యిజహాన్‌ను సికిందర్‌ను అణచటానికి పంపాడు కాని సికిందర్‌ఖాన్ దేవరకొండను పాలించిన లింగమనేడు సహాయంతో సుల్తాన్ సైన్యాన్ని ఓడించాడు దాంతో సుల్తానే స్వయంగా పెద్దసైన్యంతో తరలివచ్చి యుద్ధానికి దిగాడు. కాని సికిందర్‌ఖాన్ సుల్తాన్‌ను కూడా ఓడించాడు. కాని హుమాయూన్ కూర్చున్న ఏనుగు సికిందర్‌ఖాన్‌ను తొండంతో పట్టుకొని నేలకేసికొట్టింది. దాంతో సికిందర్‌ఖాన్ ఊహించని విధంగా మరణించాడు అతని మరణంతో అతని సైన్యం చెదరిపోయింది. తర్వాత సుల్తాన్ నౌల్గొండకోటను ముట్టడించి ఒక వారం రోజులలో కోటను లొంగదీశాడు సికిందర్ తండ్రి జలాల్‌ఖాన్ బందీగా చిక్కాడు. అతనిని జైల్లో బంధించి కోటను స్వాధీనం చేసుకున్నాడు.

దేవరకొండ యుద్ధం: నల్లగొండ లేక నౌల్గొండ విజయం తర్వాత హుమాయూన్ షా దేవరకొండను ముట్టడించాడు. దేవరకొండను పాలించే వెలమ నాయకుడు లింగమనేడు సికిందర్‌ఖాన్‌కు సహాయం చేసినందుకు దండించటానికి ఈ ముట్టడి చేశాడు. అల్లావుద్దీన్ కాలంలో దేవరకొండ లింగమనేడు సికిందర్‌ఖాన్ తన సహాయం కోరగా తిరస్కరించి తన రాజ్యం నుంచి వెళ్లగొట్టి అల్లావుద్దీన్‌కు సహాయపడ్డాడు కాని తర్వాత లింగమనేడు హుమాయూన్‌షా సుల్తాన్ అయిన తర్వాత తన విధానాన్ని మార్చుకున్నాడు. అందుకు కారణం స్పష్టంగా తెలియదు. కాని హూమాయూన్‌షా నిరంకుశుడని ముస్లిం చరిత్రకారులు రాశారు. కనుక లింగమనేడు హుమాయూన్ వల్ల తన రాజ్యానికి ముప్పు వస్తుందని భావించి సికిందర్‌ఖాన్‌ను సమర్థించి ఉండవచ్చును అందువల్ల అతడు సుల్తాన్ హుమాయూన్‌కు విరోధి అయ్యాడు. సుల్తాన్ 20 వేల గుర్రపుదళం, 40 ఏనుగులు, అంతులేని పదాతి దళాన్ని క్వాజ ఐజహాన్, నిజాం ఉల్ ముల్క్ అనే సేనాధిపతులు నాయకత్వంలో దేవరకొండను ముట్టడించటానికి పంపాడు. సుల్తాన్ స్వయంగా వరంగల్లుకు బయలుదేరాడు. దేవరకొండ, లింగమనేడు తాను బహమనీయుల ధాటికి తట్టుకోలేనని భావించి కపిలేశ్వరగజపతిని సహాయం కోసం వార్తాహరుని పంపాడు. సహాయం చేసినందుకు పెద్దమొత్తాన్ని యుద్ధ ఖర్చుగా చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. కపిలేంద్రుడు స్పందించి వెంటనే కొంత సైన్యాన్ని, కొన్ని యుద్ధ ఏనుగులను పంపి త్వరలో తాను స్వయంగా మరికొంత సైన్యంతో వస్తానని వాగ్దానం చేశాడు. ఒరిస్సా సైన్యం రాకముందే సుల్తాన్ ముట్టడి ప్రారంభించాడు వెలమసైన్యం బాహ్యయుద్ధంలో ఓడిపోయి చివరకు దేవరకొండ కోటలో దూరి ద్వారాలు బంధించుకున్నారు ఈ పరిస్థితిలో గజపతిసైన్యం హంవీరుని నాయకత్వంలో దేవరకొండ చేరింది. గజపతి సైన్యం రాకతెలుసుకొని వెలమసైన్యం బయటికి వచ్చి ఒరిస్సా సైన్యంతో కలిసిపోయింది. ఉభయసైన్యాలు హంవీరుని నాయకత్వంలో బహమనీ సైన్యంపై దాడులు చేసి పూర్తిగా ఓడించాయి. అపజయ వార్త తెలుసుకొని హుమాయూన్ కొత్త సైన్యాన్ని దేవరకొండకు పంపాలని ప్రయత్నించాడు. కాని తన రాజధానిలో అలజడులు చెలరేగినందు వల్ల రాజధానికి వెళ్లిపోయాడు. తాను వెళుతూ క్వాజా మహమ్మద్ గవాన్‌ను దేవరకొండపై దాడిచేయమని క్రీ.శ.1458లో జరిగిందని పేర్కొన్నాడు కనుక దేవరకొండ ముట్టడి అంతకు ముందు సంవత్సరం మొట్టమొదటిసారిగా కపిలేశ్వరుడు నవకోటి కర్ణాట కలవరగేశ్వర అనే బిరుదు వహించినట్లు తెలుపుతోంది. 1458 సంవత్సరం ముందు విడుదల చేయబడిన ఏ శాసనంలో కూడా ఈ బిరుదు లేదు. ఈ సంవత్సరం నాటికి అతడు విజయనగర మల్లికార్జునరాయుని ఓడించి

కొండవీటి రాజ్యాన్ని జయించాడు. తెలంగాణలో బహమనీ సుల్తాన్‌ను ఓడించాడు. కనుక నరపతి, అశ్వపతులపై తాను సాధించిన ఘనవిజయాలకు చిహ్నంగా నవకోటి కర్ణాట కలవరగేశ్వర అనే బిరుదును ధరించి ఈ వెలిగళని శాసనంలో పేర్కొన్నాడు. బహమనీ, విజయనగర సామ్రాజ్యంలో నవకోటి గ్రామాలుండేవని, అందువల్ల ఆ బిరుదులో నవకోటి అనే బిరుదు చేర్చబడిందని పండితులు అభిప్రాయపడ్డారు అంతకుముందు విడుదల చేసిన క్రీ శ 1450 నాటి సింహాచలం, జగన్నాథం శాసనాలలో గజపతి గౌడేశ్వర అని, క్రీ.శ.1455 సంవత్సరంలో వేయించిన శ్రీకూర్మం శాసనంలో వీర శ్రీ గజపతి గౌడేశ్వర అని మాత్రమే ఉంది. వెలిగళని శాసనంలో గజపతి గౌడేశ్వర నవకోటి కర్ణాట కలవరగేశ్వర అనే బిరుదు రాయబడింది.

కపిలేశ్వరుడు వెలమలకు సహాయంగా బహమనీ సుల్తాన్‌లపై ఎందుకు పోరాడాడు అని కొందరు తర్కించారు. అందుకు కారణం సులభంగా తెలుసుకొనవచ్చును. బహమనీ సుల్తాన్ కోస్తాను జయించాలనే కోరిక గలవాడు దేవరకొండ యద్ధం నాటికి కోస్తా అంతా కపిలేశ్వరుని వశం అయింది. దేవరకొండ యుద్ధంలో బహమనీ సుల్తాన్ విజయం సాధిస్తే అతడు తప్పకుండా కోస్తాపై దండెత్తుతాడు. అది తన రాజ్యానికి ముప్పు కనుక బహమనీ సుల్తాన్‌ను నిరోధించడానికి కపిలేశ్వరుడు గొప్ప ముందుచూపుతో దేవరకొండ యుద్ధంలో వెలమలకు సహాయంగా వెళ్లాడు దీని వల్ల బహమనీ సుల్తాన్‌ను కోస్తాలో అడుగు పెట్టనివ్వకుండా నిరోధించగలగడమే గాక బహమనీ సామ్రాజ్యం భాగాలు కూడా ఆక్రమించి గజపతి సామ్రాజ్యాన్ని గుల్బర్గా వరకు విస్తరించడానికి వీలు కలిగింది ఇది రాజ్యలాభం కల్గించడమే గాక గజపతుల కీర్తి దేశం మొత్తంలో మారు మోగిపోయేట్లు చేసింది కపిలేశ్వరుడు తీసుకున్న ఈ నిర్ణయం గొప్ప రాజనీతి చతురతకు, దూరదృష్టికి తార్కాణం. దేవరకొండ విజయం తర్వాత గజపతి సైన్యాలు విజయ పరంపరతో గుల్బర్గా, బీదర్ వరకు నడిచాయి. తెలుగు ప్రాంతాలన్నీ గజపతుల వశం అయ్యాయి దేవరకొండ ప్రభువు వెలమ లింగమనేడు కూడా కపిలేశ్వరుని సామంతుడయ్యాడు. దేవరకొండ యుద్ధాన్ని ఇతివృత్తంగా తీసుకొని సరళదాసు అనే ఒరిస్సా కవి ఒరియా మహా భారతాన్ని రాశాడని, అందు కపిలేశ్వర గజపతిని అర్జునుని పాత్రలో చిత్రించాడని డా కృష్ణచంద్రపాణిగ్రహి అనే పండితుడు Battle of Devarakonda as described in a story of Oriya Mahabarata అనే వ్యాసంలో రాశాడు.

తర్వాత విజయాలు - ఓరుగల్లు ఆక్రమణ: దేవరకొండ విజయం తర్వాత హంవీరుడు తెలంగాణ మొత్తం జయించాలని సంకల్పించాడు. అందుకు పరిస్థితులు కూడా అనుకూలించాయి. బహమనీ రాజధానిలో రాజకుమారుడు హుస్సేన్ తిరుగుబాటు చేశాడు. సుల్తాన్ హుమాయూన్ ఆ తిరుగుబాటును అణచడంలో నిమగ్నుడయ్యాడు. అతడు తెలంగాణకు ఎలాంటి సైన్యాన్ని పంపకలిగిన పరిస్థితిలో లేదు. తెలంగాణను కాపాడటానికి క్వాజా మహమ్మద్ గవాన్‌ను ఓడించి తరిమివేసి కోటను ఆక్రమించాడు. అదే రోజున అక్కడ శాసనం వేయించాడు. ఈ శాసనం క్రీ శ 1460 ఫిబ్రవరి 2వ తేదీన వేయబడింది. అంటే అదే రోజున ఓరుగల్లు కోట గజపతుల స్వాధీనం అయింది. ఓరుగల్లులో కలిశకం 4561 శక సంవత్సరం 1382 ప్రమాది మాఘ 10 శుక్రవారం తేదీతో అంటే క్రీ.శ.1460వ సంవత్సరం నాటి మరొక శాసనం కూడా ఉంది. ఈ శాసనంలో పరశురాముని కుమారుడు రఘుదేవ నరేంద్ర పేరు ఉంది. ఇతడు కపిలేశ్వరుని సోదరుని కుమారుడు. రాజమహేంద్రవర పరీక్షకుడు. ఓరుగల్లు కోట ముట్టడిలో అతడు కూడా పాల్గొని ఉండవచ్చును.

బీదరుపై దండయాత్ర: ఈ స్థితిలో క్రీ.శ.1461 సెప్టెంబరు 3వ తేదీన హుమాయూన్ షా మరణించాడు. అతని 8 సంవత్సరాల కుమారుడు నిజాంషా సుల్తాన్‌గా ప్రకటింపబడ్డాడు. అతని తల్లి జహన్ రీజంటుగా వ్యవహరించసాగింది. ఆమె మహమ్మద్ గవాన్‌ను వజీరుగా నియమించింది. బాలుడు బహమనీ సుల్తాన్ అయ్యాడని గ్రహించి సామ్రాజ్యంలోని అమీరులు, సామంతులు, హిందూ ముస్లిం భేదం లేకుండా తిరుగుబాటు చేశారని, ఎవరికి చిక్కిన ప్రాంతాన్ని వారు కబళించాలని ప్రయత్నించారని పెరిష్టా రాశాడు. బహమనీ రాజ్యంపై దాడి చేసిన మొదటిరాజు ఒరిస్సా రాయలని, అతనితో వెలమలు చేరారని, బహమనీ రాజ్యాన్ని దోచుకుంటూ ధ్వంసం చేసుకొంటూ వారి సైన్యాలు రాజధాని బీదర్‌కు 15 కిలోమీటర్ల దూరానికి చేరాయని పెరిష్టా రాశాడు. వెంటనే ఇద్దరు బహమనీ వజీర్లు 40 వేల సైన్యాన్ని పోగుచేసి బాలసుల్తాన్‌ను వెంటపెట్టుకొని గజపతి సైన్యాన్ని ఎదిరించడానికి బయలుదేరారు ముందుగా వారు షా మోహిబ్ ఉల్లా అనే దూతను పంపారు. అతడు 160 మంది రక్షణదళంలో బయలుదేరి గజపతి సైన్యం వద్దకు వచ్చి తమ సుల్తాన్ సందేశాన్ని వినిపించాడు. సుల్తాన్ ఒరిస్సాపై దండెత్తాలని భావిస్తున్నాడు, అంతదూరం వెళ్లనవసరం లేకుండానే గజపతి ఇక్కడికి వచ్చాడు, కనుక గజపతి తన

రాజ్యానికి చేసిన నష్టాన్ని పూడ్చి నష్టపరిహారం చెల్లిస్తే వదులుతాను, లేకపోతే ఒక మనిషిని కూడా తిరిగిపోనివ్వను, అందరినీ మట్టు పెడతాను అని తమ సుల్తాన్ చెప్పమన్నాడని చెప్పాడు. ఆ సందేశం వినగానే గజపతి తన సైన్యాలతో వెళ్లి పోసాగాడు. అలా వెనుదిరిగిన గజపతి సైన్యంపై ఖ్వాజా జహాన్ దాడులు చేసి రోజుకు రెండు మూడు వేల గజపతిసైన్యాన్ని మట్టుపెట్టసాగాడు. దాంతో గజపతి ఆ పరిసరాలలోని కోటలోకి వెళ్లి దాగుకొని తమను వెళ్లనీయమని సుల్తాన్ వద్దకు రాయబారం పంపగా వజీర్లు దీర్ఘంగా చర్చించి వెళ్లిపోవడానికి అనుమతి ఇచ్చారని, దాంతో గజపతి వెళ్లిపోయాడని ఫెరిష్టా, సయ్యద్ ఆలీలు రాశారు. కాని ఇవి ముస్లిం చరిత్రకారులు రాసిన అతిశయోక్తులని బ్రిగ్స్ అనే పండితుడు కొట్టిపారవేశాడు. గజపతి యుద్ధం చేయకుండా వెళ్లడానికి బాలసుల్తాన్ సందేశం కాదు, క్వాజా జహాన్ పరాక్రమం కాదు. అవన్నీ కట్టుకథలు, అసలు బహమనీ సేనలు గజపతి మీద దాడులే చేయలేదు. అందుకు మరొక కారణం ఉంది.

ఒరిస్సాపై జౌన్‌పూర్ సుల్తాన్ దాడి: ఇదే సమయంలో కొంత గజపతి సైన్యం విజయనగర సామ్రాజ్యపు దక్షిణ ప్రాంతాలపై దాడులు చేస్తోంది. ఒరిస్సాలో ఎక్కువసైన్యం లేదు. దానిని గమనించిన జౌన్పూరు సుల్తాన్ హుస్సేన్ షార్ఖి ఒరిస్సాపై దాడిచేసి కొల్లగొట్టడానికి వ్యూహం పన్నాడు. అతడు మూడు లక్షల గుర్రపుదళాన్ని, 1400 ఏనుగులను సమకూర్చుకొని ఒరిస్సాపై దాడిచేశాడని నిజాముద్దీన్ అనే ముస్లిం చరిత్రకారుడు రాశాడు. హుస్సేన్‌షార్ఖి తిర్‌హుట్‌పై కూడా దాడిచేశాడని రాశాడు. తర్వాత ఒరిస్సాపై దండెత్తాడు. కపిలేశ్వరుడు తన సొంత రాజ్యాన్ని కాపాడుకోడానికి హుటాహుటిన బహమనీ రాజ్యం నుండి తన సైన్యాన్ని ఉపసంహరించాడు. తబకత్ ఐ అక్బరిలో కూడా ఈ దాడి ప్రస్తావించబడింది. క్రీ.శ.1460-66 మధ్య ఈ దాడి జరిగిందని తబకత్ తెలుపుతోంది. కపిలేశ్వరుడు 30 ఏనుగులు, 100 అశ్వాలు ఇచ్చి హుస్సేన్‌తో సంధి చేసుకున్నాడని కూడా తబకత్ తెలిపింది. అయితే గజపతి జౌన్‌పూర్ సుల్తాన్ చేతిలో ఓటమి చెందాడని అందులో రాయలేదు.

గజపతిసైన్యం బహమనీ రాజ్యం నుండి వెళ్లిపోగానే మాళ్వసుల్తాన్ మహమూద్ ఖిల్జీ 28 వేల అశ్వదళంతో ఖాందేష్ గుండా వచ్చి బహమనీ రాజ్యంపై దాడిచేశాడు. సయ్యద్ ఆలి గజపతి దండయాత్ర వల్ల బహమనీ రాజ్యం దెబ్బతిని ఉందని తెలుసుకొని మాళ్వసుల్తాన్ దండెత్తాడని రాశాడు దీనిని బట్టి అంతకుపూర్వం గజపతి సైన్యం భయపడి వెనుదిరగలేదని, అది బహమనీ రాజ్యాన్ని దెబ్బ తీసిందని తనకు తెలియకుండానే నిజం చెప్పాడని బ్రిగ్స్ అనే పండితుడు అన్నాడు.

జౌన్పూరు సుల్తాన్ వెళ్లిపోగానే గజపతి తిరిగి బహమనీ రాజ్యంపై దండెత్తాడు. ఫెరిష్టా, సయ్యద్ ఆలీలు కూడా గజపతి, వెలమలు మళ్లీ దండెత్తి వచ్చారని రాశారు. ముందు భయపడిపోతే తిరిగి మళ్లీ ఎలారాగలడు. కనుక అంతకుముందు భయపడి వెళ్లిపోయాడన వారు రాసిన రాతలు పక్షపాతంతో రాసినవని చెప్పవచ్చును. మాళ్వా సుల్తాన్ గజపతి ఒకేసారి దండెత్తడంతో బహమనీ సుల్తాన్ తెలంగాణలోని బహమనీ సైన్యాన్ని గజపతిని ఎదిరించమని ఆదేశించాడు. మహమ్మద్ గవాన్, క్వాజా జహాన్‌లను మాళ్వా సుల్తాన్ పైకి పంపాడు. బహమనీ సైన్యాలను కపిలేశ్వరుడు సునాయసంగా ఓడించాడు. మాహుర్, బీదర్ దుర్గాలను జయించాడు. తెలంగాణలోని తెలుగు ప్రాంతాలన్నింటిని వశం చేసుకొని తన సామ్రాజ్యాన్ని గుల్బర్గా వరకు విస్తరించాడు. దాంతో అతడు ధరించిన కలవరగేశ్వర అనే బిరుదు సార్థకం అయింది.

కపిలేశ్వరుని సామ్రాజ్యం: ఈ విజయాలతో కపిలేశ్వరుడు దక్షిణ భారతదేశంలో తిరుగులేని చక్రవర్తి అయ్యాడు. విశాలమైన సామ్రాజ్యాన్ని దేశమంతటా గొప్ప యశస్సును పొందాడు. దక్షిణదేశంలో కళింగ సామ్రాజ్యం ప్రప్రథమ స్థానాన్ని పొందింది. బీదరు విజయం తర్వాత అతని సామ్రాజ్యం ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన తిరుచిరాపల్లి వరకు, తూర్పున బంగాళాఖాతం నుండి పశ్చిమాన గుల్బర్గా వరకు వ్యాపించి ఉంది. ఒక్క అనంతపూరు జిల్లా తప్ప యావదాంధ్రదేశం కపిలేశ్వరుని సామ్రాజ్యంలో భాగం అయిపోయింది. పెనుగొండ రాజ్యం అంటే అనంతపూర్ జిల్లా ప్రాంతం మాత్రం విజయనగర సామ్రాజ్యంలో ఉంది. ఎందువల్లనో పెనుగొండ రాజ్యాన్ని మాత్రం రాష్ట్రానికి గణదేవుడు, కొండపల్లికి విద్యాధరుడు, చంద్రగిరి, తిరుచరాపల్లి ప్రాంతాలకు కుమార దక్షిణ కపిలేశ్వరుడు పరీక్షకులుగా పనిచేస్తున్నారు.

కపిలేశ్వరుని చివరిరోజులు-తిరుగుబాట్లు-అశాంతి: ఇంతటి విశాల సామ్రాజ్యాన్ని స్థాపించి కపిలేశ్వరుడు తన చివరిదశలో అశాంతికి గురయ్యాడు. మనోవేదనను అనుభవించాడు. క్రీ.శ.1464 నాటి జగన్నాథం శాసనం అతని మనోవేదనను తెలుపుతోంది. తన ఆవేదనను పూరీ జగన్నాథస్వామికి మొర పెట్టుకున్నాడు. ఓ జగన్నాథా,

రాజ్యంలోని సామాన్య సైనికుని నుండి ఉన్నత ఉద్యోగుల వరకు అందరినీ బాగానే చూశాను. కాని ఇప్పుడు వారందరూ నన్ను ధిక్కరిస్తూ ఉన్నారు, చిన్నచూపు చూస్తూ ఉన్నారు. వారిని ఏమి చేయాలో తెలియడం లేదని విన్నవించుకున్నాడు. ఈ శాసనం 35వ అంక సంవత్సరంలో వేయబడింది. అదే సంవత్సరంలో కుండజోరిలో తిరుగుబాటు జరిగిందని మాదలపంజి తెలుపుతోంది. కుండజోరి అంటే కృష్ణాతీరం అని అర్ధం అట. కృష్ణాతీరం అత్యంత ఉన్నత అధికారులు తిరుగుబాటు చేశారని జగన్నాథ శాసనం సూచిస్తోంది. మున్నూరు జంబై శాసనాలు దక్షిణ రాష్ట్రాలను కుమార దక్షిణ కపిలేశ్వరుడు పరీక్షకునిగా పాలిస్తున్నాడని తెలుపుతున్నాయి. అతడు హంవీరుని కుమారుడు అంటే కపిలేశ్వరునికి మనవడు. అతడు తన తండ్రి హంవీరుడుతో కలసి కపిలేశ్వరునిపై తిరుగుబాటు చేశాడని స్పష్టం అవుతోంది వారు కుమారుడు, మనవడు అయినందున ఏమీ చేయలేక ఆవేదన చెంది తన ఇష్టదైవం జగన్నాథునికి మొరపెట్టుకున్నట్లుగా కనిపిస్తోంది. అంతేగాక వారియందు నేను తీసుకొనే నిర్ణయంలోని మంచిచెడ్డలను నీవే నిర్ణయించు అని కూడా జగన్నాథునకు నివేదించుకున్నాడు. వారసత్వ సమస్య వల్ల ఈ తిరుగుబాటు జరిగినట్లు తెలుస్తోంది.

వారసత్వ సమస్య: కటకరాజవంశావళి, జగన్నాథం కైఫీయత్తులు కపిలేశ్వరునికి అనేక మంది కుమారులున్నారని, వారిలో ఎవరిని తన వారసునిగా చేయాలో నిర్ణయించుకోలేక పోయాడని, అందువల్ల అతని కుమారులు అతని చివరి కాలంలోను, మరణించిన తర్వాత కూడా తగాదాలు పడ్డారని తెలుపుతున్నాయి వారసత్వ యుద్ధంలో పురుషోత్తమ గజపతి విజయం సాధించాడని, అతడు అందరికన్న చిన్నవాడని ముఖలింగం కైఫీయత్తు తెలుపుతోంది. క్రీ.శ.1466 వరకు పురుషోత్తముని గురించి తెలియదు. ఏ శాసనాలు అతనిని ప్రస్తావించలేదు. కాని హంవీరుని గురించిన ప్రస్తావనలు అనేక శాసనాలలో ఉన్నాయి. క్రీ.శ 1460 సంవత్సరంలోని వరంగల్లు శాసనం అతడు కపిలేశ్వరుని కుమారుడని, ఓరుగల్లు కోటను జయించాడని తెలుపుతోంది ఒక సంవత్సరం తర్వాత అంటే క్రీ శ.1461లో వేయించిన చిరుప్రోలు శాసనం అతడు కపిలేశ్వర గజపతి కుమారుడు, గొప్ప యుద్ధవీరుడని తెలుపుతోంది. క్రీ.శ.1466 తర్వాత శాసనాలు పురుషోత్తముడు ఒరిస్సా రాజని తెలియజేస్తున్నాయి కొంతమంది పండితులు పురుషోత్తముడు, హంవీరుడు ఒకరేనని అభిప్రాయ పడ్డారు. కాని అది వాస్తవం కాదు. ప్రతాపరుద్రుని అనంతరం శాసనం కపిలేశ్వరునికి పురుషోత్తముడు ఒకే కుమారుడని తెలుపుతోంది. అదే విషయం సరస్వతీ విలాసంలో కూడా ఉంది. కాని దక్షిణ దేశాన్ని జయించింది కుమార హంవీరవిభు అని అదే అనంతవరం శాసనంలో ఉంది. అయితే అతనికి, కపిలేశ్వరునికి ఉన్న బాంధవ్యాన్ని వదిలివేయబడింది. కపిలేశ్వరుని కాలం నాటి శాసనాలలో 'దక్షిణ కపిలేశ్వర కుమార హంవీర మహాపాత్ర, దక్షిణ దిగ్విజయం చేసిన సైన్యాలకు సేనాధిపతి అని, అతడు హంవీరుని కుమారుడని స్పష్టంగా పేర్కొంటున్నాయి. కనుక అనంతవరం శాసనంలో పేర్కొనబడిన కుమార హంవీరుడు తప్పకుండా కపిలేశ్వరుని కుమారుడు గాని, మనుమడు గాని అయి ఉంటాడు.

కపిలేశ్వరుని మరణ కాలం: మాదలపంజి కపిలేశ్వరుడు కృష్ణానది ఒడ్డున మూడవ మంగళవారం నాడు మరణించాడని చెబుతోంది కాని సంవత్సరం ఇవ్వలేదు. పెరిష్టా అతడు హిజారా 876 క్రీ.శ.1471-72 సంవత్సరంలోని మరణించాడని, అంబుర్‌రాయ్ బహమనీ సుల్తాన్ మహమ్మద్‌షాకు తెలిపాడు. నిముంగల్‌రాయ్ అనే బ్రాహ్మణదత్తు కుమారుడు తన వారసత్వహక్కును తోసిరాజని సింహాసనాన్ని కాజేశాడని తెలియజేశాడని రాశాడు. బుర్‌హన్ ఐ మాసిర్ రికార్డులు ఇదే సంవత్సరంలో అంటే హిజారా 875 క్రీ.శ.1470 సంవత్సరంలో సుల్తాన్ తల్లి queen mother Makhdumah మరణించిదని, సుల్తాన్ పరిపాలను చేపట్టాడని తెలియజేస్తున్నాయి అదే సందర్భంలో తెలంగాణ నుండి వార్తాహరుడు వచ్చి ఒరిస్సారాయ్ మరణించాడని కబురు చెప్పాడు కపిలేంద్రుని పేర్కొన్న చివరి శాసనం 1466 డిసెంబర్ 14వ తేదీకి చెందింది. దానిని ఆధారంగా తీసుకొని Stirling అనే పండితుడు కపిలేశ్వరుడు 27 సంవత్సరాల పాలన తర్వాత కొండపల్లిలో కృష్ణానది ఒడ్డున మరణించాడని రాశాడు. కాని ఇతర శాసనాల ద్వారా అతడు 33 సంవత్సరాలు పాలించాడని తెలుస్తోంది. మన్మోహన్ చక్రవర్తి స్టిర్లింగ్‌తో విభేదించి, అతడు జగన్నాథం శాసనంలో కపిలేశ్వరుడు 41వ అంక సంవత్సరంలో మరణించినట్లు ఉందని కనుక అతడు 33 సంవత్సరాలు పాలించాడని వివరించాడు. మాదలపంజి చెప్పే తేదీని కూడా అతడు తిరస్కరించి కపిలేశ్వరుడు 1469-70 సంవత్సరంలో మరణించాడని నిర్ణయించాడు. ఆర్.డి.బెనర్జీ చక్రవర్తి అభిప్రాయంతో ఏకీభవించాడు. బెనర్జీ బుర్‌హన్ మాసిర్‌లో ఇచ్చిన 1470 సంవత్సరం సరైనదని

నిర్ణయించాడు. కనుక వీరిద్దరూ అంతకుముందు పండితులైన హంటర్, స్టిర్లింగుల అభిప్రాయాలు తప్పని తేల్చారు. జి. రామదాస్ అనే మరొక పండితుడు 1466 నవంబర్ 25వ తేదీ అని నిర్ణయించాడు. అందుకు అతడు పురుషోత్తముడు తండ్రికి ప్రతి సంవత్సరం జరిపిన శ్రాద్ధకర్మల తేదీలు తీసుకొని నిర్ణయించాడు. జీవదేవాచార్యుడు రచించిన భక్తి భాగవత మహాకావ్యంలోని ఒక ప్రశస్తిని కూడా ఆధారంగా తీసుకొని నిర్ణయించాడు. బహమనీ ఆస్థానంలో ఒరిస్సా రాయలు మరణించాడని చెప్పినది కపిలేశ్వరుడు కాదు, అతని మనుమడు కుమార దక్షిణ కపిలేశ్వర మహాపాత్రుడు అని కూడా నిర్ణయించాడు. కాని రామదాస్ వాదనను అంగీకరించడానికి వీలులేదు. క్రీ.శ.1446 సంవత్సరంలో జగన్నాథునికి కొన్ని దానాలు చేసినప్పుడు కపిలేశ్వరుడు స్వయంగా హాజరయ్యాడని ఒక శాసనం తెలుపుతోంది. బహమనీ ఆ స్థానంలో ఒరిస్సారాయలు మరణించాడని చెప్పినప్పుడు ఒరిస్సా సింహాసనం కోసం వారసత్వ తగాదా వచ్చిందని కూడా తెలిపారు. కనుక కపిలేశ్వర గజపతే గాని కుమార దక్షిణ కపిలేశ్వరుడు కాదు. కుమార దక్షిణ కపిలేశ్వరుడు మరణిస్తే రాష్ట్ర పదవి ఖాళీ అవుతుందిగాని, ఒరిస్సా సింహాసనం కాదు. కనుక రామదాస్ అంతకు ముందు పండితులను తప్పు పట్టి తాను కూడా తప్పు తేదీ ఇచ్చారని కొందరు వ్యాఖ్యానించారు.

కపిలేశ్వరుని మరణతేదీని ఖచ్చితంగా తెలుసుకోవాలంటే ముస్లింల రచనలు, మాదలపంజి ఇచ్చే వివరాలను లోతుగా పరిశీలించాలి. అంతేకాదు, అతడు ఏ పరిస్థితులలో మరణించాడో కూడా అధ్యయనం చేయాలి. క్రీ.శ.1464వ సంవత్సరం నాటికి కపిలేశ్వరుని అధికారం తారాస్థాయికి స్పష్టం చేస్తోంది. మాదలపంజి కపిలేశ్వరుని 35వ అంక సంవత్సరంలో కృష్ణానదీ తీరాన తిరుగుబాటు జరిగిందని తెలుపుతోంది. జగన్నాథం శాసనంలో కపిలేశ్వరుడు విన్నవించుకున్న ఆవేదన ఈ తిరుగుబాటు ఫలితం కావచ్చును. కపిలేంద్రుడు స్వయంగా పెద్దసైన్యంతో ఆ ప్రాంతానికి వెళ్లాడు అతడు కృష్ణానదీ తీరంలో విడిది చేసినట్లు శక 1387 క్రీ.శ.1465-66 సంవత్సరం నాటి బెజవాడ శాసనం తెలుపుతోంది. మూడు పూరీ శాసనాలపై ఆధారపడి మన్మోహన చక్రవర్తి 1469-70 శాసనాలు, బాలాసూర్ శాసనం అతడు క్రీ.శ.1465-66 లోనే రాజ్యానికి వచ్చినట్లు తెలియజేస్తున్నాయి. పూరీ శాసనాలు తప్ప మిగిలిన అన్ని శాసనాలు శ్రీకూర్మం శాసనాలతో ఏకీభవిస్తున్నాయి. కనుక పూరీ శాసనాల తేదీలు నిర్ణయించడంలో తప్పు జరిగినట్లుగా ఉంది. మిత్రా పండితుడు కూడా పూరీ శాసనాల సంవత్సరాల విషయంలో చక్రవర్తితో విభేదించాడు. కనుక చక్రవర్తి నిర్ణయం సరైనది కాదని వెంకట రమణయ్య అభిప్రాయపడ్డారు. మాదలపంజి పురుషోత్తముని కృష్ణానదీ తీరంలో రాజుగా అభిషిక్తుడయ్యాడని తెలుపుతోంది. కపిలేంద్రునికి పద్దెనిమిది మంది కుమారులున్నారని వారిలో ఎవరిని రాజు చేయాలో నిర్ణయించుకోలేకపోయి జగన్నాథుని ప్రార్థించాడని, జగన్నాథుడు కలలో కనిపించి పురుషోత్తముని ఎన్నిక చేశాడని ఆ విషయం కపిలేశ్వరుడు మంత్రులకు చెప్పి పురుషోత్తముని తీసుకొని కృష్ణా తీరానికి వచ్చి పట్టాభిషిక్తుని చేసి అక్కడే 3న మరణించాడని మాదలపంజి తెలుపుతోంది. ఈ అభిషేకం క్రీ.శ.1465-66వ సంవత్సరంలో జరిగి ఉంటుందని నిర్ణయింపబడింది. కనుక పురుషోత్తముని పట్టాభిషేకం కపిలేశ్వరుని మరణం రెండూ ఒకే సంవత్సరంలో సంభవించాయని భావించారు.

జగన్నాథుడు పురుషోత్తముని రాజును చేయమని చెప్పినప్పుడు కపిలేశ్వరుడు పురుషోత్తముని కృష్ణా తీరానికి తీసుకువచ్చి అభిషేకం చేయవలసిన అవసరం ఏముంది. కటకంలోనే పట్టాభిషిక్తుని చేయవచ్చు గదా! కనుక అతడు పురుషోత్తముని అభిషేకుని చేయడానికి కృష్ణాతీరానికి రాలేదు. తిరుగుబాటును అణచడానికి వచ్చాడు. తోడుగా పురుషోత్తముని కూడా తీసుకొనివెళ్లి ఉండవచ్చును. చిన్నతనంలోనే రాజకుమారులను యుద్ధభూములకు తీసుకువెళ్లడం రాజధర్మం. వారికి యుద్ధానుభవం రావడానికి తీసుకువెళతారు. కనుక పురుషోత్తముని తనతో తీసుకువెళ్లి ఉండవచ్చును. పైగా తాను వృద్ధుడు, ఆరోగ్యం సరిగాలేదు కనుక యువకుడైన పురుషోత్తమునికి సైనిక బాధ్యతలు అప్పగించి ఉండవచ్చును. కృష్ణాతీరం చేరిన తర్వాత అక్కడి పరిస్థితులు సరిగాలేవు. హంవీరుడు, అతని కుమారుడు తిరుగుబాటు దారులతో కలిసిపోయారు. దక్షిణాన సాళువ నరసింహరాయలు గజపతులను పారదోలే కార్యక్రమం చేపట్టాడు. క్రీ.శ.1466వ సంవత్సరంలో మున్నూరులో సాళువ నరసింహరాయలు శాసనం వేయించాడు. అంటే మున్నూరు అతని స్వాధీనమై ఉండవచ్చును. సాళువాభ్యుదయం సాళువ నరసింహరాయుని యుద్ధాలను తెలుపుతోంది. అతడు చంద్రగిరి చేరగానే కళింగరాజుతో యుద్ధానికి దిగాడని తెలుపుతోంది. సాళువ నరసింహుని యుద్ధ ప్రయత్నాలు దక్షిణ ప్రాంతాలలో

గజపతి అధికారానికి ప్రమాదాన్ని తెచ్చిపెట్టింది. ఆ సందర్భంలో హంవీరుడు తండ్రిపై తిరుగుబాటు చేయడం, కపిలేశ్వరుని మనసును కలతపెట్టి ఉంటుంది. కనుక కృష్ణాతీరంలోనే పురుషోత్తముని తన వారసునిగా ప్రకటించి ఉంటాడు. కనుక పురుషోత్తముడు కపిలేశ్వరుని అభిమతంవల్లనే హంవీరుని వారసత్వానికి వ్యతిరేకంగా రాజు కాగలిగాడని చెప్పవచ్చును. పురుషోత్తముడు తన శాసనాలలో జగన్నాథుని ఆదేశం వలన తాను రాజయ్యానని కూడా చెప్పుకున్నాడు. కపిలేశ్వరుడు పురుషోత్తమునికి పట్టాభిషేకం చేసి మరణించాడో లేక తన వారసునిగా ప్రకటించి మరణించాడో స్పష్టంగా తెలియదు. బహుశా తన ఆరోగ్యం క్షీణిస్తూ ఉండగా తనకు మరణం దగ్గరికి వచ్చిందని తెలుసుకొని తన వారసునిగా ప్రకటించి పట్టాభిషేకం జరిపిఉండవచ్చును. తర్వాత మరణించి ఉండవచ్చును. అతని చివరి శాసనం క్రీ.శ.1466 డిసెంబర్ 14వ తేదీ కనుక ఆ తేదీ తర్వాత మరణించి ఉండవచ్చును. అతని మరణవార్త 1470వ సంవత్సరంలో బహమనీ ఆస్థానానికి చేరింది. మాదలపంజిలోని తిథి, మాసం ప్రకారం అతడు క్రీ.శ.1468 జనవరి 12వ తేదీన మరణించాడు. 1470లో అతని మరణవార్త చేరడానికి కారణం హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయం పొందటానికి తన తండ్రి మరణించాడని, తన సింహాసనాన్ని అర్హత లేనివాడు కాజేశాడని తెలియబరచాడు. అందువల్ల రెండు సంవత్సరాల తర్వాత బహమనీ ఆస్థానానికి అతని మరణవార్త చేరి ఉంటుంది.

అయితే 1468లో తన తండ్రి మరణించగానే ఎందుకు బహమనీ సుల్తాన్ సహాయం అర్థించలేదు. రెండు సంవత్సరాల తర్వాత ఎందుకు కోరాడు అని సందేహం కలగవచ్చును. తనతండ్రి మరణించిన తర్వాత అతడు పురుషోత్తమునితో వారసత్వ యుద్ధానికి దిగిఉంటాడు. తాను అనేక విజయాలు సాధించిన వీరుడు కనుక సునాయాసంగా పురుషోత్తముని పారదోలి సింహాసనాన్ని సంపాదించగలననే ఆత్మవిశ్వాసం కలిగి ఉండవచ్చును కాని అతడు అనుకున్నట్లు జరుగలేదు. కపిలేశ్వరుని ఇష్ట పూర్వకంగా రాజు అయినవాడు గనుక పురుషోత్తమునికి సైన్యం, సేనాధిపతులు, ప్రజల సహకారం లభించి ఉంటుంది. కనుక అతడు హంవీరుని ఓడించి తన సింహాసనాన్ని దక్కించుకొని ఉంటాడు. అదే సందర్భంలో దక్షిణ ప్రాంతాల నుండి సాళువ నరసింహుడు గజపతుల ప్రాంతాలను ఆక్రమిస్తూ ముందుకు సాగివస్తున్నాడు. తన ఉనికికి ముప్పు ఏర్పడింది. కనుక గత్యంతరం లేక హంవీరుడు 1470వ సంవత్సరంలో బహమనీ సుల్తాన్ సహాయం అర్థించి ఉంటాడు కపిలేశ్వరుని చేతిలో ఘోరంగా ఓడిపోయి తెలంగాణ ప్రాంతాలన్నీ పోగొట్టుకున్న బహమనీ సుల్తాన్‌కు అన్నదమ్ముల వారసత్వయుద్ధం మంచి అవకాశాన్ని ఇచ్చింది. తాను పొందిన అవమానానికి ప్రతీకారం చేయడానికి, తాను పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి రాబట్టడానికి అవసరమైతే కోస్తాను కూడా జయించి తూర్పు సముద్రం వరకు బహమనీ సామ్రాజ్యాన్ని విస్తరించి తమ చిరకాల వాంఛని నెరవేర్చుకోడానికి చక్కని అవకాశం వచ్చిందని తలచి బహమనీ సుల్తాన్ వెంటనే హంవీరునికి సహాయం చేయడానికి అంగీకరించి గజపతి సామ్రాజ్యంలో జోక్యం చేసుకున్నాడు. అయితే హంవీరుడు కృష్ణాతీరంలో తండ్రికి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎందుకు చేసినట్లు తన తండ్రి తనను వారసునిగా నిర్ణయించాడని ముందే ఊహించాడా లేక కపిలేశ్వరుడు పురుషోత్తముని వారసునిగా ప్రకటించమని జగన్నాథుడు ఆదేశించాడని కటకంలో ప్రకటించిన తర్వాత హంవీరుడు తనకు రాజ్యం రాదని నిరాశ చెంది తిరుగుబాటుకు పూనుకున్నాడా? అసలు హంవీరుని తన వారసునిగా కపిలేశ్వరుడు ఎందుకు ఎంచుకోలేదు? హంవీరుడు మొదటి నుంచీ తన బాహుబలంతో సామ్రాజ్యాన్ని అన్ని దిక్కులకు విస్తరించాడు. అలాంటి వానిని వారసుడుగా ఎందుకు కపిలేశ్వరుడు తిరస్కరించాడు మొదలైన విషయాలు తెలుసుకోడానికి తగిన సమాచారం లేదు.

పురుషోత్తమ గజపతి క్రీ.శ.1466-1469

క్రీ.శ.1465-66, 1496-97 మధ్య కాలం నాటి శాసనాలు వీర శ్రీ గజపతి గౌడేశ్వర, శ్రీ పురుషోత్తమ దేవ మహారాయ ఒరిస్సా పాలకుడని తెలుపుతున్నాయి. కపిలేశ్వరునికి, పురుషోత్తమునికి మధ్య ఉన్న సంబంధాలను సమీక్షించవలసిన అవసరం ఉంది. వారి మధ్య సంబంధాలను గురించి శాసనాలకు, ప్రచారంలో ఉన్న కథలకు పొంతన లేకుండా ఉంది. బముందరాజ్యపు రాజవంశావళి అతనిని భోగినీ నందనుడని తెలుపుతోంది. ప్రజలలో కూడా అతడు దాసీపుత్రుడు అని ప్రచారంలో ఉంది. కాని అనంతవరం, ఇదుపులపాడు, రాజవోలు, వెలిచర్ల శాసనాలు అతడు కపిలేంద్రుని కుమారుడని వర్ణిస్తున్నాయి. అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి రాసిన సరస్వతీ విలాసం అతడు పార్వతి వలన కపిలేంద్రునికి కలిగిన కుమారుడని పురుషోత్తముని తల్లి పేరు కూడా ఇస్తోంది ముస్లిం చరిత్రకారులు కూడా తమ రచనలలో పురుషోత్తముని ప్రస్తావించారు. కాని అతనిపేరు మంగల్‌రాయ్ అని, అతని తల్లి ఒక బ్రాహ్మణ స్త్రీ అని, అతనిని కపిలేశ్వరుడు దత్తుతీసుకున్నాడని రాశారు. వీరి రచనలు క్రీ.శ.1470-71 సంవత్సరాల నాటివి. ఆ సంవత్సరంలో పురుషోత్తముడు ఒరిస్సాను పాలిస్తున్నాడు. అతనిని బ్రాహ్మణ స్త్రీ కుమారుడని, దత్తత తీసుకున్నాడని, అతని పేరు మంగల్‌రాయ్ అని ఎందుకు రాశారో తెలియడంలేదు. పురుషోత్తముని శాసనాలు అతని పూర్వపు స్థితిని గురించి ఏమీ తెలపడం లేదు. అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి శాసనాలు అతడు రాసిన సరస్వతీ విలాసం మాత్రం అతడు పార్వతి, కపిలేశ్వరుల కుమారుడని స్పష్టంగా తెలియజేస్తుంది. కనుక ప్రజలు చెప్పుకొనే వాడుక కథలను నమ్మవలసిన పనిలేదు. కనుక ముఖర్జీ అనే పండితుడు అతడు కపిలేశ్వరుని ప్రియభార్య కుమారుడని, ఈ కుమారుడంటే కపిలేశ్వరునికి అమిత ప్రేమ అని, అందువల్ల జగన్నాథుడు అతనిని రాజుగా చేయమని ఆదేశించాడని కథ కల్పించి, అతనిని తన వారసునిగా నియమించాడని వ్యాఖ్యానించాడు. పురుషోత్తముడు స్వయంగా రాసిన భువనేశ్వరీ దండకంలో తనను తన తండ్రి కపిలేశ్వరుడు తన వారసునిగా నిర్ణయించినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. కపిలేశ్వరుని భార్యల్లోకెల్లా పార్వతి అతనికి ప్రియమైంది. కనుక ప్రజలు అలా చెప్పుకొని ఉండవచ్చును. ప్రజల కథల మీద ఆధారపడి ఫెరిష్టా కపిలేశ్వరుని అసలు కుమారునిగా గుర్తించక దత్తకుమారుడని రాసి ఉండవచ్చును అలాగే పార్వతి కులాన్ని గురించి కూడా అపోహలు ఉండి ఉండవచ్చును. ఏమైనా పురుషోత్తముడు కపిలేశ్వరుని సొంత కుమారుడే అని భావించవచ్చును. లేకపోతే హంవీరుని వంటి వీరుడైన కుమారుని వదిలివేసి పురుషోత్తమునికి పట్టం కట్టాడు.

హంవీరుని స్వతంత్ర ప్రకటన: కపిలేశ్వరుడు కృష్ణానదీతీరంలో పురుషోత్తముని తన వారసునిగా ప్రకటించి మరణించాడు. పురుషోత్తముడు కళింగ సింహాసనం అధిష్టించాడు. అది సహించని హంవీరుడు స్వతంత్ర ప్రకటన చేశాడు. దాంతో 20 సంవత్సరాలు కష్టించి అనేక యుద్ధాలు చేసి కపిలేశ్వరుడు నిర్మించిన కళింగ సామ్రాజ్యం రెండు ముక్కలై పోయింది. హంవీరుడు అంతటితో తృప్తిపడక ఒరిస్సా సింహాసనాన్ని కూడా కైవసం చేసుకోవాలని తలచాడు. కనుక అతడు కృష్ణానది వరకే పరిమితం కాకుండా ఉత్తరంగా దండెత్తి సింహాచలం వరకు తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నట్లుగా కనిపిస్తోంది. పురుషోత్తముని తొలి సంవత్సరంలో సింహాచలానికి దిగువన అతని శాసనాలు లేవు. అంత వరకు హంవీరుని ఆధిపత్యంలోకి వచ్చిందని స్పష్టపరుస్తోంది. కనుక ఆంధ్రప్రాంతాలన్నీ హంవీరుని వశమయ్యాయి. ఒరిస్సా మాత్రమే పురుషోత్తమునికి నిలిచిందని భావించవచ్చును ఒరిస్సాను దక్కించుకోడానికి కూడా అతడు అనేక చర్యలను తీసుకున్నాడు. ఆ రోజులలో బ్రాహ్మణులపైన చౌక్‌దారి అనే పన్ను ఉండేదట. బ్రాహ్మణుల అభిమానాన్ని సంపాదించడానికి పురుషోత్తముడు ఆ పన్నును రద్దుచేశాడు. అనేక మందికి భూములను దానాలు చేశాడు. ఆ చర్యల వల్ల అతడు ఒరిస్సా ప్రజల అభిమానాన్ని, సేనాధిపతులు, స్థానిక పాలెగాళ్ల సహాయాన్ని సంపాదించి హంవీరుని ఎదుర్కొని తన సింహాసనాన్ని కాపాడుకున్నాడు అందువల్ల ఆంధ్రదేశానికి హంవీరుడు, ఒరిస్సాకు పురుషోత్తముడు అధిపతులయ్యారు. చంద్రగిరి రాజ్యం నుండి సింహాచలం వరకు హంవీరుడు ఆంధ్రదేశానికి అధిపతి అయ్యాడు. కాని ఈ పరిస్థితి స్థిరంగా నిలబడలేదు.

సాళువ నరసింహరాయల దండయాత్ర క్రీ.శ.1466-70: కపిలేశ్వరుడు మరణించే నాటికి కళింగ సామ్రాజ్యం దక్షిణాన తిరుచిరాపల్లి వరకు విస్తరించి ఉంది. తమ రాజ్య భాగాలు కళింగ గజపతులు ఆక్రమించడం

విజయనగర రాజ్యానికి తలవంపులైంది. తమ రాజ్యంలో గజపతి అధికారాన్ని వారు సహించలేకపోయారు. రెండవ దేవరాయలు కళింగ గంగచక్రవర్తి నాల్గవ భానుదేవుని ఓడించి సింహాచలం వరకు విజయనగర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. మల్లికార్జునరాయలు రాజ్యానికి వచ్చేనాటికి విజయనగర సామ్రాజ్యం సింహాచలం వరకు ఉంది. అంత విశాల సామ్రాజ్యానికి క్రీ.శ.1446లో మల్లికార్జునరాయలు పట్టాభిషిక్తుడయ్యాడు. కాని తండ్రి సంపాదించిన ఆ సామ్రాజ్యమంతా మల్లికార్జునరాయలు కాలంలో పోయింది. ఆంధ్ర ప్రాంతాలు పోగొట్టుకోవడమే గాక తిరువారూరు, తిరుచిరాపల్లి వరకు తమిళ ప్రాంతాలను కూడా పోగొట్టుకున్నాడు. తిరుచిరాపల్లి వరకు విజయనగర సామ్రాజ్యానికి భరించరాని అవమానంగా తయారైంది. ఈ స్థితిలో క్రీ.శ.1465లో మల్లికార్జున రాయలు మరణించాడు. విరూపాక్షరాయలు సింహాసనానికి వచ్చాడు. అతడు విషయలోలుడైన సాళువ నరసింహరాయలను పెనుగొండ నుండి చంద్రగిరికి పంపి గజపతుల నుండి విజయనగర ప్రాంతాలను విముక్తి చేయడానికి నడుం బిగించాడు. నరసింహరాయలు దక్షిణ ఆర్కాటు జిల్లా ప్రాంతాల నుండి విముక్తి యుద్ధం ప్రారంభించాడు. మున్నూరులో క్రీ.శ.1466లో డిసెంబర్ నాటి అతని శాసనం లభించింది. అదే ప్రదేశంలో క్రీ.శ.1464 నాటి కుమార దక్షిణ కపిలేశ్వరుని శాసనం ఉంది. అంటే 1466 నాటికే ఆ ప్రాంతం సాళువ నరసింహరాయల వశమైందని ఆ శాసనం స్పష్టపరుస్తోంది. కాని 1470 వరకు అతనికి పూర్తి విజయం లభించినట్లు లేదు. 1470-72వ సంవత్సరం వరకు అక్కడ ఒడ్డెరాజుల అధికారం ఉన్నట్లు మరికొన్ని శాసనాలు లభించాయి. కనుక సాళువ నరసింహరాయలు గజపతులను ఓడించి తరమడానికి నాలుగైదు సంవత్సరాల సుదీర్ఘ పోరాటం జరిపినట్లు కనిపిస్తుంది. ఈ నాలుగు, ఐదు సంవత్సరాలలో గజపతులను ఓడించి తరుముతూ ఒక్కొక్క ప్రాంతాన్ని ఆక్రమిస్తూ ముందుకు సాగాడు. సాళువాభ్యుదయం అతడు కళింగ గజపతులపై సాధించిన విజయాలను వర్ణిస్తోంది. యుద్ధాన్ని వర్ణిస్తూ గజపతులు బహిఃప్రదేశంలో నరసింహునితో పోరాడి లాభం లేదని కోటలో దూరారని, నరసింహుడు కోటను ముట్టడించి అతి కష్టం మీద దానిని స్వాధీనం చేసుకున్నాడని వివరించింది. ఈ కోట పేరు ఇవ్వలేదు. చరిత్రకారులు దానిని ఉదయగిరి దుర్గం అని భావించారు సాళువాభ్యుదయమే గాక ఆకాలం నాటి అనేక కావ్యాలు నరసింహరాయల విజయాలను వర్ణిస్తున్నాయి. వరాహ పురాణం అతని సేనాధిపతి ఈశ్వరనాయకుడు ఉదయగిరి, హుట్టరి కోటను జయించినట్లు తెలుపుతోంది. జైమినీ భారతం సాళువ నరసింహరాయలు తిగుల (ఇది కన్నడంకు తమిళపదం) అంటే కన్నడ ఒడ్డె ప్రాంతాలను జయించినట్లు వర్ణిస్తోంది. సాళువ నరసింహరాయలు 1466లో మొదలుపెట్టిన దండయాత్రలు క్రీ.శ.1470 వరకు సాగాయి. ఈ దండయాత్రలలో అతడు దక్షిణ ఆంధ్రను మొత్తం జయించి మచిలీపట్టణం వరకు చేరాడు అతడు మచిలీపట్టణంలో విడిసి ఉన్నట్లు స్థానిక రికార్డులు తెలుపుతున్నాయి.

హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయం అర్థించడం: సాళువ నరసింహుని దండయాత్ర కృష్ణాతీరం వరకు హంవీరుని రాజ్యాన్ని హరించింది. కొండపల్లి రాజమహేంద్రవర రాజ్యాలు మాత్రమే హంవీరునికి మిగిలాయి. సాళువ నరసింహరాయలు గోదావరీ ప్రాంతంపై దండెత్తే ప్రయత్నంలో ఉన్నాడు. రెండవదేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యం సింహాచలం వరకు విస్తరించి ఉండేది. కనుక అంతవరకు జయించాలనే సంకల్పంతో ఉన్నాడు. కనుక హంవీరుని పరిస్థితి తల్లక్రిందులైంది. గత రెండు సంవత్సరాల నుండి అటువైపు పురుషోత్తముని తొలగించలేక పోయాడు. ఒరిస్సా లేక గౌడదేశ సింహాసనాన్ని సంపాదించలేకపోయాడు. ఆ స్థితిలో గత్యంతరం లేక తమకు ఆగర్భశత్రులైన బహమనీ సుల్తాన్ సహాయం అర్థించాడు. అంతకు పూర్వం గజపతుల చేతిలో ఓడి తెలంగాణ ప్రాంతాలను పోగొట్టుకొని అవమాన భారంతో కృంగిపోయే సుల్తాన్‌కు మంచి అవకాశం లభించింది.

బహమనీ సుల్తాన్ జోక్యం క్రీ.శ.1470-72: ఈ కాలం నాటి బహమనీ గజపతి సంబంధాలను పెరిష్టా సయ్యిద్ ఆలీలు వర్ణించారు. హిజూరా 876లో ఒరిస్సా రాజు మరణించాడని, తన సింహాసనాన్ని దత్తకుమారుడు మంగల్‌రాయ్ ఆక్రమించాడనీ, అంబార్ మహమ్మద్‌షా బహమన్‌కు ఫిర్యాదు చేశాడని పెరిష్టా రాశాడు. తన రాజ్యాన్ని సంపాదించుకోడానికి సుల్తాన్ తనకు సహాయం చేస్తే తాను సుల్తాన్‌కు సామంతుడుగా ఉండి కప్పం చెల్లిస్తానని వాగ్దానం చేశాడని కూడా పెరిష్టా రాశాడు. ఆ రాయబారం వినగానే సుల్తాన్ తన వజీర్ మహమ్మద్ గవానుతో సంప్రదించిన వెంటనే తన ఆమోదం తెలిపాడు. అంబర్‌రాయ్ గౌడ రాజు అయిన తర్వాత కొండపల్లి రాజమహేంద్రవరాలను తమకు ఇవ్వాలని షరతు పెట్టాడు. తర్వాత మల్లిక్ హుస్సేన్ భెయిరికి నిజాం ఉల్ ముల్క్

అనే బిరుదు ఇచ్చి అతనికి తగినంత సైన్యాన్ని ఇచ్చి హంవీరునికి సహాయంగా పంపాడు సరిహద్దులలో అంబార్‌రాయ్ ఆ సైన్యంతో తన సైన్యాన్ని కలిపి ఒరిస్సాపై దండెత్తి పురుషోత్తముని ఓడించారు తర్వాత రాజమహేంద్రవరం, కొండపల్లి కోటలను జయించి అక్కడ ముస్లిం సైనికులను నిలిపారు. తర్వాత నిజాం ఉల్ ముల్క్ అంబార్‌రాయ్‌ని ఒరిస్సా వెళ్ళి సింహాసనం అధిష్ఠించమని చెప్పాడు. అంబార్‌రాయ్ గౌడ దేశ సింహాసనం అధిష్ఠించాడు. కొండపల్లి, రాజమహేంద్రవరం రాష్ట్రాలు సుల్తాన్ సామ్రాజ్యంలో భాగాలు అయ్యాయి తర్వాత సుల్తాన్ తల్లి నర్గస్ బేగం దయతో నిజాం ఉల్ ముల్క్ తెలంగాణ గవర్నరుగా నియమించబడ్డాడని పెరిష్టా వర్ణించాడు. బుర్హాన్-ఐ-మాసిర్ రాసిన సయ్యద్ అలీ మరొక విధంగా రాశాడు. అతడు, తెలంగాణ రాయ్ మరణవార్త వినగానే సుల్తాన్ తెలంగాణను జయించాలని నిర్ణయించుకొని హిజారా 875 సంవత్సరంలో మాలిక్ నిజాం ఉల్ ముల్క్ బహ్రీని పంపాడు. అతడిని చీమలదండు లాగా కాఫిర్‌లు చుట్టుముట్టారు కాని చివరకు వారందరిని ఓడించి బహ్రీ రాజమండ్రి, కొండవీడులను జయించాడని రాశాడు. పెరిష్టా, సయ్యద్ రచనలలో భేదాలు ఉన్నాయి. పెరిష్టా హిజారా 876 అంటే క్రీ శ 1471 అని, కొండపల్లి అని రాశాడు అలీ హిజారా 875 అంటే క్రీ.శ.1470 అని, కొండవీడు అని రాశాడు. పెరిష్టా సుల్తాన్ తల్లి నర్గీస్ బేగం జీవించి ఉండని రాయగా అలీ ఆమె మరణించిన తర్వాత అని రాశాడు. వీటిలో పెరిష్టా ఇచ్చిన సంవత్సరం సరైనదని భావిస్తారు అందుకు కారణం ఏమిటంటే, క్రీ శ.1469-72 సంవత్సరాల మధ్య మహమ్మద్ గవాన్ గోవాను జయించడానికి వెళ్ళి పశ్చిమ ప్రాంతాలలో మూడు సంవత్సరాలు ఉన్నాడని పెరిష్టా రాశాడు గవాన్ 1472లో తిరిగి రాజధానికి వచ్చి ఉంటాడు. అతడు వచ్చిన తర్వాత అతని సలహాపై నిజాం ఉల్ ముల్క్‌ను పంపాడు కనుక ఈ సంఘటన క్రీ శ.1471-72లో జరిగి ఉంటుంది. సయ్యద్ అలీ మంటల లాగా మండిపోయే ఎండాకాలంలో ఈ యుద్ధాలు జరిగాయని రాశాడు. కనుక క్రీ.శ.1471-72 వేసవికాలంలో ఈ దండయాత్ర జరిగి ఉంటుందని పండితులు భావించారు. పురుషోత్తమ గజపతి శాసనాలు కూడా ఈ తేదీని సమర్థిస్తున్నాయి. అతడి శాసనాలు 1472 అక్టోబర్ వరకు, అతడు గౌడదేశపు రాజుగా ఉన్నట్లు తెలిపే శాసనాలు లభించాయి. కాని ఆ తర్వాత 1476 జూన్ వరకు అతడి శాసనాలు లభించలేదు. కనుక 1472 మే, జూన్ నెలలో యుద్ధం జరిగి పురుషోత్తముడు ఓడిపోయి రాజ్యం పోగొట్టుకొని ఉంటాడని ఊహించారు. కనుక హంవీరుడు తన సోదరుని పారదోలి 1472 అక్టోబర్ తర్వాత ఒరిస్సా సింహాసనం అధిష్ఠించి ఉంటాడు

ఆంధ్రదేశం గజపతుల చేజారిపోవడం: హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయం అర్థించే నాటికి అంటే 1471వ సంవత్సరం నాటికి ఆంధ్రదేశం మూడు ముక్కలైంది. ఒరిస్సా పురుషోత్తముని ఆధీనంలో ఉండి సింహాచలం నుండి కొండపల్లి వరకు హంవీరుని చేతిలో ఉంది. మచిలీపట్టణం నుండి చంద్రగిరి, ఉదయగిరిల వరకు సాళువ నరసింహరాయులచే జయింపబడి విజయనగర సామ్రాజ్యం కింద ఉండి. క్రీ శ 1472లో పురుషోత్తముని ఓటమి తర్వాత మరికొన్ని మార్పులు వచ్చాయి. హంవీరుని ఒరిస్సా సింహాసనం ఎక్కించినందుకు బహమనీ సుల్తాన్ రాజమహేంద్రవరం, కొండపల్లి సుభాలను కోరాడు. అవి రెండూ హంవీరుడు సుల్తాన్‌కు ఇచ్చి వేశాడు. వాటితో పాటు ఓరుగల్లు, రాచకొండ, దేవరకొండ, ఖమ్మంమెట్టు మొదలైన తెలంగాణ ప్రాంతాలను కూడా సుల్తాన్ తీసుకున్నట్లుగా కనిపిస్తోంది సయ్యద్ అలీ రచన నిజమైనట్లయితే కొండవీడును కూడా హంవీరుడు సుల్తాన్‌కు ఇచ్చినట్లుగా ఉంది. కాని 1472 నాటికి కొండవీడు రాజ్యం సాళువ నరసింహ రాయుల చేతిలో ఉంది. కనుక సయ్యద్ అలీ కొండపల్లికి బదులుగా పొరపాటున కొండవీడు అని వ్రాసి ఉంటాడు ఏదైనా 1472 నాటికి గజపతి యావదాంధ్రదేశాన్ని కోల్పోయాడు సింహాచలం నుండి కృష్ణానది వరకు తెలంగాణ ప్రాంతం బహమనీ సుల్తాన్ కింద ఉంది. కృష్ణానదికి దక్షిణ ఆంధ్ర ప్రాంతమంతా విజయనగర సామ్రాజ్యం కింద ఉంది. ఒరిస్సా ఒక్కటే గజపతికి మిగిలింది. ఆంధ్రదేశంపై గజపతుల అధికారం పోవడమే కాదు, అది రెండుగా చీలిపోయింది. సగం బహమనీ సామ్రాజ్యంలో, సగం విజయనగర సామ్రాజ్యంలో భాగాలు అయ్యాయి.

History of Orissa ను రాసిన ఆర్.డి బెనర్జీ పురుషోత్తమునికి, హంవీరునికి జరిగిన వారసత్వ యుద్ధం వాస్తవం కాదు. అది పెరిష్టా కల్పించిన కథ అని తిరస్కరించాడు. కపిలేశ్వరుడు మరణించేనాటికి పుర్షో[illegible] వయస్సు 18 సంవత్సరాల కన్నా ఎక్కువ ఉండదు. అంత చిన్న వయసులో బలవంతుడైన గజపతి రాజ్యంలో వారసత్వ వివాదంలో జోక్యం చేసుకొని ఉండదు. అంతేగాక పూరీ జగన్నాథ ఆలయంలోని ఒక శాసనం పురుషోత్తముని

2వ అంక సంవత్సరంలో ఉంది. ఈ శాసన కాలం నుండి 1496 వరకు పురుషోత్తమ గజపతి నిరాటంకంగా పాలించాడని, అతడు మధ్యలో రాజ్యం కోల్పోలేదని రాశాడు. కాని అతడు సయ్యద్ ఆలీ రచనను అంగీకరించాడు సుల్తాన్ పురుషోత్తముని ఓడించి రాజమండ్రి, కొండపల్లి ప్రాంతాలను ఆక్రమించాడని అంగీకరించాడు ఈ ఆక్రమణకు, వారసత్వ యుద్ధానికి సంబంధంలేదని అన్నాడు. అలాగే జి. రామదాస్ అనే పండితుడు కూడా వారసత్వ యుద్ధం లేదన్నాడు హంవీరుడు అనే వ్యక్తి లేడన్నాడు. సుల్తాన్ రాజమండ్రిని జయించమని పంపిన బేగ్రో ముస్లిం సర్దారుడు ముస్లిం సర్దారులను అమీర్ అని కూడా అంటారు. అమీరు అనే పదాన్ని సరస్వతీ విలాసంలో సంస్కృతంలో హంవీర్ అని వర్ణించాడని, కనుక ఆ పదాన్ని హంవీరుడు అని అనుకొని హంవీరుడు వారసత్వ యుద్ధం చేశాడని పండితులు దురభిప్రాయ పడ్డారని వివరించాడు. కాని బెనర్జీ, రామదాసు వాదనలను పలువురు పండితులు తిరస్కరించారు. 1472-76 సంవత్సరాల మధ్య పురుషోత్తముని శాసనాలు ఒరిస్సాతో సహా వారి సామ్రాజ్యంలో మొత్తంలో ఎక్కడా లేవు కనుక అతడు 1472లో రాజ్యభ్రష్టుడయ్యాడని వాస్తవం అని తీర్మానించారు

కనుక పురుషోత్తముడు రాజ్యానికి వచ్చిన ఆరు సంవత్సరాల తర్వాత తన రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు నాల్గు సంవత్సరాలు అతనిని గురించి తెలియదు. ఈ నాల్గు సంవత్సరాలు హంవీరుడు ఒరిస్సాలో రాజ్యం చేశాడు నాల్గు సంవత్సరాల తర్వాత పురుషోత్తముడు తిరిగి తన సోదరుని ఓడించి తరిమివేశాడు. హంవీరుడు రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు తిరిగి పురుషోత్తముడు ఒరిస్సా గద్దెనెక్కాడు. సరస్వతీ విలాసం పురుషోత్తముడు హంవీరుని తన పాదాల వద్దకు వచ్చే విధంగా చేశాడని తెలుపుతోంది. ఈ సంఘటన 1476వ సంవత్సరంలో జరిగి ఉంటుందని నిర్ణయించారు అందుకు కారణాలు కూడా ఉన్నాయి. ఒరిస్సా దండయాత్ర తర్వాత సుల్తాన్ మహమ్మద్ షా తన దృష్టిని పశ్చిమ ప్రాంతాలపై సారించాడని పెరిష్టా రాశాడు. బెల్గాం పాలకుడు Birkana Roy తిరుగుబాటు చేశాడు గోవాను కూడా ఆక్రమించాడు. అతనికి విజయనగర రాజు మద్దతు ఉంది. సుల్తాన్ సైన్యసమేతంగా వెళ్లి బెల్గాంను జయించి మహమ్మద్ గవాన్ ఆధిపత్యంలో ఉంచాడు. తర్వాత సుల్తాన్ తన రాజ్యానికి బీదరు చేరాడు ఈ సమయంలో దక్కనులో పెద్ద కాటకం వచ్చింది. అది 2 సంవత్సరాలు వ్యవసాయం సాగులేదు. ఆ కరువులో ఆకలి బాధకు తట్టుకోలేక బహమనీ రాజ్య ప్రజలు గుజరాతు, మాళ్వ, జాజినుగ్గూరులకు తరలివెళ్లిపోయారని పెరిష్టా రాశాడు. సయ్యద్ ఆలీ కూడా ఈ కరువును గురించి వర్ణించాడు. ఇది 1472 నుండి 1475 వరకు కొనసాగింది బహమనీ హంవీరుని ఓడించి తన అధికారాన్ని పునరుద్ధరించుకున్నాడు. బహమనీ సుల్తాన్ హంవీరునికి ఎలాంటి సహాయం పంపలేకపోయాడు. ఇది 1476 జూన్ మాసానికి ముందు జరిగి ఉండవచ్చని భావించారు. కారణం, ఆ తేదీ తర్వాత నుండి పురుషోత్తముని శాసనాలు లభించాయి. కనుక దక్కనులో సంభవించిన కాటకం పురుషోత్తముడు తన రాజ్యం తిరిగి పొందడానికి అనుకూలించింది. అపజయం పొందిన హంవీరుడు కటకం వదలి కిమిడి చేరాడు. పురుషోత్తముని అధికారం స్థిరపడింది. పురుషోత్తముడు 1496 వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా రాజ్యపాలన చేశాడు. తర్వాత హంవీరుడు, పురుషోత్తముల కుటుంబాలు సఖ్యతతో మెలిగాయి హంవీరుని కుటుంబం కిమిడి పాలకులుగా కొనసాగారు. వారిలో కొందరు పురుషోత్తముని కుమారుడు ప్రతాపరుద్రుని చేత ఆదరింపబడ్డారు వారిలో నరహరిపాత్రులు ఒకరు. అతడు హంవీరుని కుమారుడుగాని, మనుమడు గాని అయి ఉండవచ్చును. నరహరిపాత్రుని పేరు కొండవీటిలోని ఒక శాసనంలో పేర్కొనబడింది.

పురుషోత్తముని పునరాక్రమణలు: పురుషోత్తముడు తిరిగి సింహాసనం అధిష్టించగానే తాను పోగొట్టుకున్న దక్షిణ ప్రాంతాలన్నీ తిరిగి సంపాదించాలని ఆశించాడు. అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. త్వరలోనే అవకాశం వచ్చింది. హంవీరుడు ఒరిస్సా రాజుగా ఉన్నపుడు ఆంధ్రప్రాంతాలలో అనేక మార్పులు జరిగాయి. సాళువ నరసింహ రాయలు బలవంతుడయ్యాడు. మచిలీపట్టణం వరకు దక్షిణ కోస్తా అంతా ఆక్రమించాడని పెరిష్టా కూడా రాశాడు. 1476లో పురుషోత్తముడు తిరిగి ఒరిస్సా సింహాసనం ఎక్కేనాటికి కృష్ణ దిగువ ప్రాంతం అంతా నరసింహరాయలు ఆధిపత్యం కింద ఉంది. తన సరిహద్దుకు పశ్చిమంగా ఉన్న తెలంగాణలో హిందూ పాలెగాండ్ర చేత సుల్తాన్‌పై తిరుగుబాట్లను చేయిస్తున్నాడు. కరువు కాటకాలతో సతమతమవుతూ సుల్తాన్ ఏమీ చేయలేకపోయాడని కూడా పెరిష్టా రాశాడు.

కొండపల్లి తిరుగుబాటు: అదే సమయంలో కొండపల్లిలో సైనిక తిరుగుబాటు జరిగిందని పెరిష్టా రాశాడు.

కొండపల్లిలో హిందూ సైనికులు ముస్లిం గవర్నర్‌ను వధించి కోటను హమ్మీరునకు అప్పగించారని, అతడు ఒరిస్సా రాయకు వార్తపంపి, తాము బహమనీ సుల్తాన్‌కు కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సంపాదించాడని మంచి అవకాశం వచ్చిందని, వెంటనే సైన్యంతో రావలసిందని, తాను పూర్తిగా సహాయం చేస్తానని, అందు తనకూ కొంత భాగం ఇవ్వాలని కోరుతూ వర్తమానం పంపాడని కూడా పెరిష్టా వివరించాడు. ఈ విధంగా వర్తమానం పంపిన హంవీరుడు ఎవరు? ఇతడు కుమార దక్షిణకపిలేశ్వర మహాపాత్రుడని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. క్రీ.శ.1464వ సంవత్సరంలో కపిలేశ్వర గజపతి తనమనుమని కొండపల్లి చంద్రగిరి తిరుచిరాపల్లి రాష్ట్రాలకు పరీక్షకునిగా నియమించాడు. తాత మరణించిన తర్వాత తన తండ్రి హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయంతో ఒరిస్సా సింహాసనం ఎక్కాడు. అందుకు ప్రతిఫలంగా రాజమండ్రి, కొండపల్లి రాష్ట్రాలను హంవీరుడు సుల్తాన్‌కు ఇచ్చాడు. సుల్తాన్ బెహ్రీని తెలంగాణ గవర్నరుగా నియమించాడు. ఇదే సందర్భంలో కొండపల్లి రాష్ట్రానికి పరీక్షకునిగా ఉన్న కుమార కపిలేశ్వరుని అదే పదవిలో సుల్తాన్ కొనసాగించాడని, అతడు సుల్తాన్ సామంతుడుగా కొనసాగాడని, అతడే ఇప్పుడు పురుషోత్తమ గజపతికి కబురు పంపిన హంవీరుడని వారు భావించారు. ఇతడు 1470లో మరణించాడని, అతని మరణమే బహమనీ సుల్తాన్‌కు నివేదింపబడిందని మరికొందరు ఊహించారు. కాని ఆ మరణవార్త ఇతనిది కాదు. కపిలేశ్వర గజపతి మరణవార్త. కనుక ఇతడు జీవించే ఉన్నాడని మరికొందరు భావించారు. తన తండ్రి పురుషోత్తముని చేతిలో ఓడిపోయి కిమిడికి వెళ్లిపోయిన తర్వాత రెండు కుటుంబాలు సఖ్యతపడ్డాయి. కనుక కొండపల్లిలోని కుమార దక్షిణ కపిలేశ్వరుడు తన పినతండ్రికి సహకరించాలని తలచి కబురు పెట్టాడని భావించారు. తనకు కూడా కపిలేశ్వర హంవీర కుమార అని సంబోధిస్తున్నాయి. కనుక పెరిష్టా అతనిని అంతకు పూర్వం సుల్తాన్ అధికారాన్ని అంగీకరించిన వాడని కూడా రాశాడు. కనుక ఈ హంవీరుడు కుమార కపిలేశ్వర హంవీరుడని పండితులు భావించారు. ఏమైనా కొండపల్లి తిరుగుబాటు చేసి పురుషోత్తముని ఆహ్వానించిందని పెరిష్టా రాతలు స్పష్టపరుస్తున్నాయి. ఇదే సమయంలో తెలంగాణలోని జమీందారులు కూడా సుల్తాన్‌పై తిరుగుబాటు చేసి పురుషోత్తముని ఆహ్వానించారు. అవకాశం కోసం ఎదురుచూస్తున్న పురుషోత్తముడు వెంటనే సైన్యంతో బయలుదేరాడు. మార్గమధ్యంలో క్రీ.శ.1476 జూన్ 23వ తేదీన సింహాచలం చేరి అక్కడ దేవుని దర్శించి దానాలు చేసి శాసనం వేయించాడు. తర్వాత అతడు రాజమండ్రి చేరి దుర్గాన్ని ముట్టడించాడు.

రాజమండ్రి, కొండపల్లిలు ఆక్రమణ క్రీ.శ.1476-77: గజపతి రాజమండ్రి యుద్ధాన్ని గురించి పెరిష్టా, సయ్యద్ ఆలీ, నిజాముద్దీన్ అహమ్మద్ అనే ముగ్గురు ముస్లిం చరిత్రకారులు తమ రచనలలో ప్రస్తావించారు. గజపతి పెద్ద సైన్యంతో రాజమండ్రిని ముట్టడించగానే అక్కడ రక్షణ కోసం నియమింపబడిన నిజాం ఉల్ ముల్క్ బెహ్రీ ఆ దాడి తట్టుకోలేక కోటను వదలి వజీరాబాద్‌కు పలాయనం చిత్తగించాడని సయ్యద్ ఆలీ రాశాడు. నిజాముద్దీన్ కూడా అదే విషయం రాస్తూ ఈ దాడి హిజారా 880లో జరిగిందని రాశాడు. కనుక గజపతి రాజమహేంద్రవరాన్ని జయించాడు. ఈ విజయాన్ని అతని సేనాపతి రాయ్‌మాన్ అనే అతడు సాధించాడట. తర్వాత గజపతి కొండపల్లి చేరి దానిని కూడా వశం చేసుకున్నాడు. పెరిష్టా ఒరియా వారు క్రీ.శ.1476-77 సంవత్సరాలలో కోస్తా ఆంధ్రపై దండెత్తారని రాశాడు. కనుక పురుషోత్తముడు కృష్ణానది వరకు తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడని చెప్పవచ్చును.

సాళువ నరసింహరాయల యాత్ర: బహమనీ సుల్తాన్ పరిస్థితిని ఆసరాగా తీసుకొని పురుషోత్తమ గజపతి ఒక్కొక్క ప్రాంతాన్నే ఆక్రమించి ముందుకు సాగుతూ ఉండగా కృష్ణానదికి దక్షిణ ప్రాంతాన్ని ఆక్రమించుకొని ఉన్న సాళువ నరసింహరాయలకు కూడా సుల్తాన్ ఆధీనంలోని కృష్ణా, గోదావరీ నదుల మధ్య ప్రాంతాన్ని అంటే కొండపల్లి, రాజమహేంద్రవర రాష్ట్రాలను జయించాలనే కోరిక కలిగినట్లుగా ఉంది. అతడు పెద్ద సైన్యంతో కృష్ణానదిని దాటి రాజమండ్రి వద్దకు వచ్చి గోదావరి దక్షిణ ఒడ్డున విడిది చేశాడు. రాజమండ్రి దుర్గం కోసం అతడు గజపతితో పోరాడాలని తీర్మానించుకున్నట్లుంది. ఒరిస్సాలో ఒక కథ ప్రచారంలో ఉంది. దానికి పురుషోత్తముని కంచి కావేరీ దండయాత్ర అని పేరు. ఆ కథ ప్రకారం పురుషోత్తముడు కంచిపై దండెత్తి కంచిరాజును ఓడించి అతని కుమార్తె పద్మావతిని బలవంతంగా వివాహమాడి తీసుకొని వచ్చాడని, ఆమెతో పాటు కంచి నుండి అనేక దేవతావిగ్రహాలు కూడా తెచ్చాడని, వాటిలో సాక్షిగోపాలుని విగ్రహాలతో కంచి నుండి బయలుదేరగానే కంచిరాజు గజపతిని తరుముతూ వెంటపడ్డాడు. గజపతి సైన్యాలు గోదావరీ తీరం చేరాయి. అక్కడ ఉన్న గజపతుల పురోహితుడు మంత్రవిద్యలో గొప్పవాడట. అతనిని కంచిరాజును గోదావరి దాటకుండా

చేయమని అర్థించి, తాను తన సైన్యంతో గోదావరిని దాటాడు. వెంటనే పురోహితుడు మంత్రం చదువగా గోదావరి ఉప్పొంగింది. అదే సమయంలో అక్కడకు చేరిన కంచి రాజు పొంగిన గోదావరిని చూసి దాటలేక వెనుదిరిగి వెళ్లిపోయాడని, ఆ కంచి రాజు తర్వాత కర్ణాటక రాజయ్యాడని ఆ కథ సారాంశం. ఈ కథలోని వాస్తవాన్ని కొందరు చరిత్రకారులు పరిశీలించి, ఇది కొంత వరకు నిజమేనని అంగీకరించారు. కంచి పరిసర ప్రాంతాలు ఆ రోజులలో చంద్రగిరి రాజ్యంలో ఉండేవి. చంద్రగిరి రాజ్యానికి సాళువ నరసింహరాయలు రాజుగా ఉండేవాడు తర్వాత అతడు విజయనగర సింహాసనం ఎక్కి కర్ణాటక సామ్రాజ్యానికి చక్రవర్తి కూడా అయ్యాడు. పురుషోత్తముడు సాళువ నరసింహరాయలపై సాధించిన విజయాన్ని ఒరియాలో కంచికావేరీ దండయాత్ర అనే కథగా చెప్పుకొనే వారని వారు భావించారు. అందులో కొన్ని అతిశయోక్తులు ఉన్నా అది చారిత్రక అంశమేనని వారు అంటారు అయితే ఈ సంఘటన సాళువ నరసింహరాయలు గోదావరి తీరం చేరినప్పుడు జరిగినది కాదు. ఆ తర్వాత పురుషోత్తముడు కావేరీ దాకా దండెత్తాడు. ఆ సమయంలో జరిగిన యుద్ధాలలో సాళువ నరసింహరాయలు ఉదయగిరి కోటలో గజపతికి బందీగా చిక్కాడు. కనుక నరసింహరాయలపై తమ ప్రభువుకు లభించిన విజయాన్ని ఒరియా ప్రజలు కథగా చెప్పుకొని ఉండవచ్చును.

సుల్తాన్ దండయాత్ర క్రీ.శ.1477: ఉత్తరకోస్తా సుల్తాన్ చేజారి పోయింది. కోస్తా చేజారిపోవడంతో సుల్తాన్ హడావిడిగా సైన్యాన్ని సమకూర్చుకొని రాజమండ్రి చేరాడు. సుల్తాన్‌ను చూడగానే ముట్టడిని విరమించి తన రాజ్యం వైపు వెళ్లాడని ఫెరిష్తా రాశాడు. అప్పటికే రాజమహేంద్రవరం గజపతి స్వాధీనం అయింది. కోటలో గజపతి సేనాధిపతి రాయిమన్ కోటను పటిష్టంగా కాపాడుతున్నాడు. అతి కష్టం మీద అతనిని ఓడించి సుల్తాన్ రాజమండ్రి దుర్గాన్ని తిరిగి స్వాధీనం చేసుకోగలిగాడని సయ్యద్ అలీ రాశాడు. గజపతి సైన్యం అతని రాజ్యం వరకు తరిమివేయబడింది. తర్వాత సుల్తాన్ గజపతి సంధి చేసుకున్నారు. గజపతి 25 ఏనుగులను సుల్తాన్‌కి ఇచ్చాడు. తెలంగాణ జమీందారులకు గజపతి సహాయం చేయరాదని సంధి షరతులలో భాగంగా సుల్తాన్ గజపతిని కోరాడు. గజపతి అంగీకరించాడు.

సాళువ నరసింహరాయల తిరోగమనం: సుల్తాన్ సైన్యం వచ్చేటప్పటికి సాళువ నరసింహరాయల సైన్యం కూడా గోదావరికి దక్షిణంగా విడిచి ఉంది. అతడు బహుశా గోదావరిని దాటి రాజమహేంద్రవరాన్ని ముట్టడించేవాడేమో. ఇంతలో సుల్తాన్ సైన్యం వచ్చింది. రాజమండ్రిని సుల్తాన్ వశపరచుకొని గజపతితో సంధి చేసుకున్నాడు. కనుక సాళువ నరసింహరాయలు యుద్ధం చేయకుండా వెనుదిరిగాడు. అంతదూరం వచ్చి నరసింహుడు యుద్ధం చేయకుండా వెనుదిరగడానికి కారణం ఉంది. గజపతి సుల్తాన్ సంధి చేసుకొని మిత్రులయ్యారు. ఉభయులను ఎదిరించడం కష్టమని తలచి ఉండవచ్చును. తాను ఓడి చాలా నష్టపడవలసి ఉంటుందని గ్రహించి ఉంటాడు. కనుక నరసింహుడు వెళ్లిపోయాడు. కాని గజపతి, నరపతి అశ్వపతుల మూడు సైన్యాలు ఏకకాలంలో ఒకేచోట విడిది చేయడం ఎప్పుడూ జరుగలేదు. ఇది రాజమండ్రి వద్ద జరిగిన అపురూప విడిది అని చెప్పవచ్చును. చివరకు గజపతి, నరపతులు వెళ్లిపోయారు. రాజమహేంద్రవర రాష్ట్రం తిరిగి సుల్తాన్ ఆధీనంలోకి వచ్చింది. తర్వాత కొండపల్లి కూడా సుల్తాన్ పరమైంది. కృష్ణాగోదావరి నదుల మధ్య ప్రాంతంపై తిరిగి ముస్లింల అధికారం ఏర్పడింది. ఈ యుద్ధం తర్వాత సుల్తాన్ రాజమహేంద్రవరంలో మూడు సంవత్సరాలు ఉండి పటిష్టమైన సైనిక స్థావరాలు ఏర్పాటు చేశాడని ఫెరిష్తా రాశాడు. కాని సయ్యద్ అలీ రాజమండ్రి, కొండపల్లి రాష్ట్రాలపై నిజాం ఉల్‌ముల్కు బెహ్రీని గవర్నరుగా నియమించి వెంటనే వెళ్లిపోయాడని రాశాడు. కొండపల్లి విజయం తర్వాత సుల్తాన్ కొండవీటిని కూడా జయించినట్లు కనిపిస్తోంది.

తెలంగాణ - ఓరుగల్లు: ఓరుగల్లు, ఇతర తెలంగాణ ప్రాంతాలను గజపతి క్రీ.శ.1460లో జయించాడు దేవరకొండ, వెలమరాజు లింగ కపిలేశ్వరగజపతి సామంతుడయ్యాడు. అప్పటి నుండి 1472 వరకు ఆ ప్రాంతాలన్నీ గజపతుల ఆధిపత్యంలో ఉండేవి. 1472లో హంవీరుడు ఆ ప్రాంతాలను సుల్తాన్‌కు ఇచ్చాడు కొండపల్లి తిరుగుబాటు చేయగానే తెలంగాణలోని హిందూ పాలెగాండ్రు కూడా తిరుగుబాటు చేసి గజపతిని ఆహ్వానించారు. గజపతి రాజమహేంద్రవరం వద్ద ఓడిపోయి, తాను తెలంగాణ పాలెగాండ్రకు సహాయం చేయననే షరతుతో సుల్తాన్‌తో సంధిచేసుకోవడంతో తెలంగాణ పాలెగాళ్లకు ఇక్కట్లు వచ్చాయి. సుల్తాన్ కొండపల్లిలో కూడా స్వాధీనం చేసుకోవడంతో తెలంగాణ ప్రాంతాలన్నీ ఆక్రమించి, అక్కడ పాలించిన వంశాలన్నిటిని తొలగించాడు ముఖ్యంగా హిందూ వంశాలన్నీ తొలగించబడ్డాయి. వారి జాగీరులు తన సేనాధిపతులకు పంచి ఇచ్చాడు

ఓరుగల్లుపై ఆజిమ్‌ఖాన్‌ను గవర్నరుగా నియమించాడు. ఈ కాలంలోనే దేవరకొండ వెలమవంశం కూడా పూర్తిగా తమ ప్రాంతాలను కోల్పోయింది. 1458 నాటి దేవరకొండ యుద్ధం తర్వాత వెలమలు మరుగున పడిపోయారు. వారిని గురించి ఏమీ తెలియదు 1477లో దేవరకొండను కూడా సుల్తాన్ తన సేనాధిపతులకు జాగీరుగా ఇచ్చాడు. దాంతో తెలంగాణలో వెలమరాజ్యం పూర్తిగా నశించింది. ఆ వంశస్తులు క్రీ శ 1478లో తెలంగాణను వదలి విజయనగర ఆస్థానం చేరి వారి కొలువులో సేనాధిపతులుగా చేరిపోయారు. దాంతో తెలంగాణ పూర్తిగా బహమనీ సామ్రాజ్యంలో ప్రత్యక్ష భాగం అయిపోయింది. తెలంగాణలో హిందూరాజులను తొలగించడానికే తెలంగాణ జమీందారులకు సహాయం చేయరాదని సుల్తాన్ గజపతిపై షరతు విధించాడు ఆ షరతువల్లనే సుల్తాన్ తెలంగాణలో హిందూ రాజ్యాలను పూర్తిగా నిర్మూలించగలిగాడు మొత్తం మీద కోల్పోయిన తమ సామ్రాజ్య భాగాలను జయించాలని పురుషోత్తమ గజపతి చేసిన మొదటి ప్రయత్నం విఫలమైంది.

సుల్తాన్ మహమ్మద్‌షా విజయనగర సామ్రాజ్యంపై దాడి క్రీ.శ.1480-81: తెలంగాణను పూర్తిగా స్వాధీనం చేసుకున్న తర్వాత సుల్తాన్ నరసింహరాయలను దండించాలని తలచాడు. సాళువ నరసింహరాయలు తెలంగాణలోని పాలెగాళ్లను సుల్తాన్‌పై తిరుగుబాటు చేయడానికి ప్రోత్సహించడమే గాక రాజమహేంద్రవరాన్ని జయించడానికి గోదావరీ తీరాం వరకు వచ్చాడు. కనుక అతనిని దండించాలని భావించాడు. క్రీ.శ.1480వ సంవత్సరంలో కొండవీడు తిరుగుబాటు చేసింది. అక్కడి పాలకుడు సాళువ నరసింహరాయల సహాయం అర్థించాడు. అది తెలిసి సుల్తాన్ కొండవీటిపై దండెత్తాడు. కోట లొంగిపోయింది తర్వాత సుల్తాన్ విజయనగర సామ్రాజ్యంపై సాగి నెల్లూరు చేరి కోటను ఆక్రమించాడు. నెల్లూరును మాలూర్ అని రాశారు. ఈ కోట ఆనాడు చాలా పెద్దది, ప్రముఖమైనది. ఇది కొండవీడుకు 40 ఫర్లాంగులు అంటే 136 మైళ్ల దూరం ఉంటుంది. నరసింహరాయలు సుల్తాన్‌తో పోరాడ లేదు. ముస్లిం రచయితలు సుల్తాన్ కంచిపై 1481 మార్చి 12వ తేదీన హఠాత్తుగా దాడి చేశాడని రాశారు. విజయనగర సామ్రాజ్యంతో యుద్ధం చేయడం అంత తేలికకాదని గ్రహించి ఏదో ఒక ప్రాంతంపై దెబ్బతీసి వెళ్లిపోదామని నిశ్చయించుకొని కంచిపై దాడి చేసి కొల్లగొట్టి ధనరాసులతో తిరిగి మాలూరు అంటే నెల్లూరు చేరాడట. సుల్తాన్ నెల్లూరులో ఉండగా మహమ్మద్ గవాన్‌పై కుట్ర జరిగిందట. ఖ్వాజా మహమ్మద్ జహన్ నరసింహరాయలతో కుట్రపన్నుతున్నట్లు లేఖను సృష్టించి సుల్తాన్ చేతిలో పడేటట్లు చేశారట. దాంతో సుల్తాన్ ఎక్కడలేని ఆగ్రహంతో నిజానిజాలు విచారించకుండా అప్పటికప్పుడే గవాన్‌ను ఉరితీయించాడట. గవాన్‌ను కొండపల్లిలో ఉరితీయించాడని కొందరు అంటారు. సయ్యద్ ఆలీ ఆ ప్రదేశాన్ని మాలూర్ అని అన్నాడు. ఇది నెల్లూరని కొందరి అభిప్రాయం. సుల్తాన్ తాను కంచిని కొల్లగొట్టి తెచ్చిన ధనరాసులతో తన రాజధానికి బయలుదేరాడు. కంచిని దోచుకోగానే నరసింహరాయలు సుల్తాన్‌ను ఎదిరించడానికి తన సేనాధిపతి ఈశ్వరనాయకుని పెద్ద సేనతో పంపాడు. మాలూర్ నుండి వెళ్లిపోతున్న సుల్తాన్‌పై కందుకూరు వద్ద 1481 మార్చిలో తెచ్చిన మొత్తాన్నే గాకుండా సుల్తాన్ సొంత ధనం కూడా ఈశ్వర నాయకుడు దోచుకొని వెళ్లిపోయాడు. సుల్తాన్ ఖిన్నుడయ్యాడు. చేయగలిగింది లేక విచారంతో తన రాజధానికి వెళ్లిపోయాడు. ఈ విధంగా సుల్తాన్ విజయనగర రాజ్యంపై చేసిన దాడి విఫలమై అప్రతిష్టపాలయ్యాడు. అంతేగాక నమ్మకస్తుడైన వజీర్ మహమ్మద్ గవాన్‌ని కూడా పోగొట్టుకున్నాడు. తర్వాత నిజం తెలిసి చాలా విచారించాడు గవాన్ స్థానాన్ని నిజాం ఉల్ ముల్క్ బహ్రీ భర్తీచేయగలడని అతనిని వజీరుగా నియమించాడు. గవాన్ జాగీరైనా బీజాపూరును యూసఫ్ ఆదిల్‌ఖాన్‌కు ఇచ్చాడు. ఫతే ఉల్ జాహ్, ఇమాద్ ఉల్ ముల్క్, ఖుదావాండ్‌ఖాన్‌లను వారి వారి జాగీరులలో ఖాయం చేశాడు. కాని గవాన్ మరణం, సాళువ నరసింహ రాయల సేనాని ఈశ్వర నాయకుని చేతిలో ఓటమి బహమనీ రాజ్యాన్ని బలహీనపరిచాయి. గవాన్ లేనిలోటు స్పష్టంగా కనిపించింది. వజీరులు ముఠాలుగా చీలి తమలో తాము కలహించుకోసాగారు. బహ్రీని వజీరు చేయడం ప్రతి వారికి అసూయ కలిగించింది. సర్దారులలో ఐక్యత తీసుకురావడానికి సుల్తాన్ విజయనగర రాజ్యంపై దాడికి సన్నాహాలు చేసి సర్దారులందరినీ కూడగట్టి బయలుదేరాడు. కాని మార్గమధ్యంలో సుల్తాన్ 1482 మార్చి 27వ తేదీన మరణించాడు. అతని మరణంతో బహమనీ సామ్రాజ్యపతనం ప్రారంభమైంది. అతని తర్వాత అతని కుమారుడు మహమ్మద్ షా 12 సంవత్సరాల వయస్కుడు సింహాసనం ఎక్కాడు. ఆ సమయంలో నిజాం ఉల్ ముల్క్ బహ్రీ కలామ్ ఉల్ ముల్క్ కాశింబరీద్‌లు ప్రమాణాలు చేశారు. యూసఫ్ ఆదిల్‌ఖాన్ రాలేదు. ఇతడు సింహాసనం ఎక్కిన నాటి నుండి బహమనీ దర్బార్ రెండు కూటాలుగా చీలిపోయింది. విదేశీ ముస్లింలు, దక్కనీ ముస్లింలు అనే రెండు ముఠాలు ఏర్పడ్డాయి. యూసఫ్

ఆదిల్‌ఖాన్ విదేశీ ముస్లింలకు, నిజాం ఉల్ ముల్క్ బ్రహ్రీ దక్కన్ ముస్లింలకు నాయకత్వం వహించారు. సుల్తాన్ మురాల చేతిలో కీలుబొమ్మ అయిపోయాడు. దాంతో బహమనీ రాజ్యం బాగా బలహీనం అయింది. బహమనీ రాజ్యపు ఈ పరిస్థితులు పురుషోత్తమ గజపతికి మంచి అవకాశాన్ని ఇచ్చాయి.

పురుషోత్తమ గజపతి రెండవ దిగ్విజయ యాత్ర: ఈ స్థితిలో పురుషోత్తమ గజపతి తన సామ్రాజ్య భాగాలను రాబట్టాలని మళ్లీ దండయాత్రకు పూనుకున్నాడు. రాజమండ్రి కొండపల్లి, కొండవీడు రాష్ట్రాలను పూర్తిగా జయించాడు. క్రీ.శ.1484 నాటికి ఈ ప్రాంతాలన్నీ అతని స్వాధీనం అయ్యాయి. క్రీ.శ.1484వ సంవత్సరం అక్టోబర్ మాసంలో వినుకొండ తాలూకాలోని ముటుకుమిల్లి గ్రామాన్ని పురుషోత్తమ గజపతికి శుభాలు కలగాలని అతని సేనాధిపతి ఆజిమ్ ఖానా Azım Khana or Azım Khan దానం చేసి శాసనం వేయించాడు. దీనిని బట్టి గజపతి వద్ద ముస్లిం వీరులు పనిచేశారని తెలుస్తోంది. ఈ ఆజిమ్‌ఖానా అంతకు ముందు సుల్తాన్ చేత వినుకొండ దుర్గానికి అధిపతిగా నియమింపబడి, ఓటమి తర్వాత గజపతికి లొంగిపోయి గజపతి అధికారిగా అక్కడ కొనసాగుతున్నాడా? లేక గజపతి సైన్యంతో సైన్యాధిపతిగా పని చేస్తూ కోట స్వాధీనం అయిన తర్వాత గజపతి చేత దుర్గాధిపతిగా లేక ఆ ప్రాంతపు పాలెగాడుగా నియమింపబడ్డాడా, తెలియదు విజయనగర చక్రవర్తులు రెండవ దేవరాయల కాలం నుంచీ తమ సైన్యంలో ముస్లిం దళాన్ని పోషించారు. అలాగే గజపతి కూడా ముస్లిం దళాన్ని రూపొందించుకొని ఉండవచ్చును. మొత్తం మీద ఆజిమ్‌ఖానా గజపతి సేనాధిపతిగా శాసనంలో పేర్కొనబడ్డాడు. ఈ శాసనం వల్ల వినుకొండ వరకు పురుషోత్తముని ఆధీనంలోకి వచ్చిందని స్పష్టపడుతోంది.

సుల్తాన్ మహమూద్ సింహాసనం అధిష్టించగానే రాజమండ్రి దుర్గాధిపతిగా దిలావర్‌ఖాన్‌ను నియమించాడని ఫెరిష్టా రాశాడు. అతనిని ఓడించి 1484లో పురుషోత్తమ గజపతి రాజమండ్రిని జయించి ఉండవచ్చును. ఓడిపోయిన దిలావర్‌ఖాన్ బీదరుచేరి వజీర్ నిజాం ఉల్‌ముల్కు బ్రహ్రీపై హత్యాప్రయత్నం చేశాడు కాని విఫలమై ఖాందేష్‌లోని బరహన్‌పూర్‌కు పారిపోయాడు. దీనిని బట్టి దిలావర్‌ఖాన్ రాజమండ్రికి తిరిగి రావడానికి వీలులేక బరహన్‌పూర్ వెళ్లిపోయి ఉంటాడు. రాజమండ్రి గవర్నర్‌గా ఉండేవాడని, అది పోగొట్టుకొని వరంగల్ చేరి ఆక్రమించుకొని తెలంగాణకు తానే ప్రతినిధినని ప్రకటించుకున్నాడని, అందుకు కోపించి వజీర్ నిజాం ఉల్‌ముల్కు సుల్తాన్‌తో సహా బయలుదేరి వరంగల్లు చేరగానే అతడు తిరిగి రాజమండ్రి వెళ్లిపోయాడని రాశాడు. అంటే రాజమండ్రి ముస్లింల చేతిలోనే ఉన్నదని అతడు రాశాడు. సయ్యద్ ఆలీ కూడా సుల్తాన్ వరంగల్లుపై దాడికి వచ్చాడని రాశాడు. కాని ఇవేమీ లెక్కలోకి తీసుకోవలసినవి కావు. ఇవన్నీ క్రీ.శ.1484కు ముందు జరిగి ఉండవచ్చును. రాజమండ్రి గవర్నర్ పారదోలి రాజమండ్రిని ఆక్రమించాడని గంటి శాసనం స్పష్టంగా తెలుపుతోంది. పురుషోత్తముడు రాజమండ్రి వద్ద ఉన్న గంటి గ్రామాన్ని దానం చేసి శాసనం వేయించాడు. కనుక ఆ ప్రాంతం పురుషోత్తముని ఆధిపత్యం కింద ఉంది. వినుకొండ రాజ్యంలోని ముటుకుమిల్లి శాసనం ఆ ప్రాంతంపై పురుషోత్తమని అధికారం ఉన్నట్లు స్పష్టం చేస్తోంది. కనుక ముస్లిం గవర్నర్‌లను పారదోలి కొండవీటి వరకు గల ప్రాంతాన్ని గెలుచుకున్నాడు. కోస్తాలో బహమనీ రాజ్యాధికారం నశించింది.

హిందూరావు సురత్రాణ: కోస్తాలోని బహమనీ రాజ్యభాగాలు వశం అయిన తర్వాత పురుషోత్తముడు ఇంకా ముందుకు సాగాడు. ఈ కాలంలో వినుకొండ, ఒంగోలు మధ్య ఒక స్వతంత్ర రాజ్యం ఉన్నట్లు శక 1404, క్రీ.శ.1482 నాటి చదలవాడ శాసనం తెలుపుతోంది. ఈ శాసనంలో సరియపల్లి తిమ్మారెడ్డి అనే అతడు హిందూరావు అనే బిరుదుతో వర్ణించబడ్డాడు. ఇతడు ఒక అగ్రహారాన్ని పునరుద్ధరించాడు. ఆ శాసనంలో ఆ అగ్రహారాన్ని ప్రౌఢదేవరాయలు ఇచ్చాడని, అది కాలపరిమితి అయిపోయినందు వల్ల తిరిగి తాను ఆ అగ్రహారాన్ని మళ్లీ ఇస్తానని చెప్పుకున్నాడు. అతనికి హిందూరావు సురత్రాణ అనే బిరుదు ఉంది. రావు అనుపదం రాయ అనే పదం నుండి పుట్టింది. రాయ అనే పదం రాజ అనే పదానికి పర్యాయ పదం. రాజుకు బదులుగా విజయనగర చక్రవర్తులు రాయలు అని రాయడం పరిపాటి అయింది. తర్వాత రాయ అనే పదానికి పర్యాయపదంగా రావు అని వాడే సాంప్రదాయం వచ్చింది. ముస్లిం చరిత్రకారులు తమ రచనలలో కొన్నిచోట్ల విజయనగర రాజులను రావు అని కూడా రాశారు. బుక్కరాయ కృష్ణారావు అని కూడా రాశారు. కనుక పేర్లలో రావు అని పెట్టుకొనే ఆచారం తెలుగు ప్రజలలో ఏర్పడింది. రావు అని పెట్టుకోవడం చాలా గొప్ప రాజహోదాను సూచిస్తుంది. అందుకే కొందరు జమీందారులకు రావు బహద్దూర్ అనే బిరుదులు ఏర్పడ్డాయి. ఈ శాసనంలోని సరియపల్లి తిమ్మారెడ్డికి

హిందూరావు సురత్రాణ అని ఉంది. కనుక ఇతడు మొదట సైన్యాధిపతిగా ఉండి తర్వాత రాజ్యాధికారం పొంది ఉంటాడు ఇతని శాసనాలలో సార్వభౌముని పేరు లేదు అది అతని స్వతంత్ర హోదాను తెలుపుతోంది. బహమనీ సుల్తాన్ మూడవ మహమ్మద్‌షా దక్షిణకోస్తాపై దండెత్తినప్పుడు నెల్లూరు వరకు జయించాడు. అతడు తిరిగి వెళ్లిపోయిన తర్వాత ఈ తిమ్మారెడ్డి స్వతంత్రం ప్రకటించుకొని హిందూరావు సురత్రాణ అనే బిరుదు ధరించి ఉండవచ్చును. సురత్రాణ అంటే రక్షించినవాడు అని అర్థం. ఇలాంటి బిరుదును మొట్టమొదట కాపయనాయకుడు ధరించాడు. ముస్లింల నుండి ఆంధ్రదేశాన్ని కాపాడినందుకు అతడు ఆంధ్రసురత్రాణ అనే బిరుదు పెట్టుకున్నాడు. అంటే ఆంధ్రదేశాన్ని విముక్తి చేశానని లేక విడిపించానని అర్థం. అలాగే బహమనీ సుల్తాన్ నుండి ఆ ధరించి ఉండవచ్చును. ఇదే తిమ్మారెడ్డి క్రీ.శ.1496 శక 1415 శాసనంలో పురుషోత్తముని సామంతుడుగా శాసనం వేయించాడు. అంటే ఇతనిని పురుషోత్తముడు 1484 తర్వాత అంటే చదలవాడ శాసనం వేయించిన తర్వాత జయించి సామంతుడుగా చేసుకున్నాడు కనుక ఈ ప్రాంతం కూడా గజపతి కిందకు వచ్చింది. దాంతో గజపతి అధికారం గుండ్లకమ్మ వరకు విస్తరించింది. గుండ్లకమ్మ సరిహద్దుగా ఉందని పోతవరం శాసనం తెలుపుతోంది ఆ తర్వాత విజయనగర రాజ్యం ఉంది. క్రీ.శ.1485 నుండి 1489 వరకు పురుషోత్తముడు తాను జయించిన ప్రాంతంలో చక్కని పరిపాలనా వ్యవస్థను ఏర్పాటు చేసి వివాహ సుంకం వంటి పన్నులు తీసి వేసి ప్రజల అభిమానాన్ని సంపాదించి తన రాజ్యాన్ని సుస్థిరం చేసుకున్నాడు తర్వాత విజయనగర రాజ్యంపై దండెత్తాడు.

పురుషోత్తముడు-సాళువ నరసింహరాయలు-ఉదయగిరి రాజ్య ఆక్రమణ: తిమ్మారెడ్డి రాజ్యం జయించిన తర్వాత పురుషోత్తముడు ఉదయగిరి రాజ్యంపై దండెత్తాడు ఉదయగిరి రాజ్యం విజయనగర రాజ్యానికి అతిముఖ్యమైనది. కపిలేశ్వరుడు ఉదయగిరిని జయించిన తర్వాత పూసపాటి తిమ్మనను పరీక్షకునిగా నియమించాడు. అతని తర్వాత అతని కుమారుడు పూసపాటి బసవ భూపాలుడు అధిపతి అయ్యాడు హంవీరుని వారసత్వయుద్ధ కాలంలో సాళువ నరసింహరాయలు ఉదయగిరిని జయించాడు కాని బసవభూపాలుని తొలగించలేదు. అతనిని తన సామంతునిగా చేసుకొని కొనసాగనిచ్చాడు. సరస్వతీ విలాసం పురుషోత్తముడు ఉదయగిరిపై దండెత్తి సాళువ నరసింహుని బందీగా పట్టుకున్నాడని, నరసింహుడు ఉదయగిరి రాజ్యాన్ని ఇచ్చి సంధిచేసుకుని తనను తాను రక్షించుకున్నాడని, నంది మల్లయ, గంట సింగయ తమ ప్రబోధ చంద్రోదయంలో పేర్కొన్నారు. వారు తమ కావ్యాన్ని బసవ భూపాలుని మంత్రి అయిన గంగమంత్రికి అంకితం చేశారు. అందులో వారు బసవభూపాలుని కీర్తించారు. తిమ్మరాయని కుమారుడు వీరబసవ తన చాకచాక్యంతో ఉదయగిరి కోట నుండి శత్రువులు వెళ్లిపోయేటట్లు చేశాడని వర్ణించారు. బసవభూపాలుడు తన మంత్రి గంగయకు నృసింహనృపతి విశాకరనయ విద్యాకరణ అనే బిరుదును ఇచ్చాడు అంటే నరసింహుని సాగనంపడంలో అతని మంత్రి గంగయ కూడా కీలకపాత్రను నిర్వహించాడని భావించాలి. ఉదయగిరిని ఏ సంవత్సరంలో జయించినదీ స్పష్టంగా తెలియదు. సాళువ నరసింహరాయులు క్రీ.శ.1486వ సంవత్సరంలో సంగమ వంశాన్ని తొలగించి సకల లాంఛనాలతో విజయనగర సింహాసనాన్ని అధిష్టించాడు. క్రీ.శ.1489లో వేయించిన పోతవరం శాసనం పురుషోత్తముని రాజ్యానికి గుండ్లకమ్మ నది సరిహద్దని తెలుపుతోంది. కనుక 1489 నాటికి పురుషోత్తముడు ఉదయగిరిని జయించలేదు. ఆ తర్వాత జయించి ఉండాలి సరస్వతీ విలాసం అనంతవరం శాసనంలో పేర్కొన్న నరసింహరాయలు సాళువ నరసింహరాయలు కాదు, అతడు అతని కుమారుడు ఇమ్మడి నరసింహరాయలని అంటారు. కాని సరస్వతీ విలాసంలో సాళువ నరసింహరాయలు స్వయంగా యుద్ధంలో పోరాడి గజపతి సైన్యానికి బందీగా చిక్కాడని ఉంది. కనుక అతడు సాళువ నరసింహరాయలేనని స్పష్టంగా చెప్పవచ్చును. ఏమైనా 1490 నుండి ఉదయగిరి రాజ్యం తిరిగి శ్రీకృష్ణదేవరాయలు జయించే వరకు గజపతి రాజ్యంలో భాగంగా ఉంది. నరసింహరాయలకు సమృద్ధిగా ధనం ఉండి, తుళువ నరసనాయక, ఆరవీటి బుక్క మొదలగు యోధాను యోధులైన సేనాధిపతులుండి గజపతి నుండి ఉదయగిరి మొదలైన ప్రాంతాలను తిరిగి జయించలేక పోయాడు. అదే విషయాన్ని న్యూనిజ్ రాశాడు. నరసింహరాయలు గొప్పయోధుడే గాని అతడు మూడు కోటలను జయించలేకపోయాడు. అవి ఓడగార్య (ఉదయగిరి), కొనడొల్గి (కొండవీడు), రాచోల్ (రాయచూరు) అని రాశాడు. వాటిని జయించలేకపోవడం అతడు చాలా అవమానంగా భావించాడు. వాటిని జయించమని తన సేనాధిపతి నరస నాయకునికి ఆదేశించి 1491లో మరణించాడు. ఆ విధంగా విజయనగర రాజులు కోల్పోయిన ఉదయగిరి రాజ్యం శ్రీకృష్ణదేవరాయలు తిరిగి జయించే వరకు గజపతుల ఆధీనంలోనే ఉంది. ఈ విజయం వల్ల విజయనగర

గజపతి రాజ్యానికి పెన్నానది సరిహద్దు అయింది.

పురుషోత్తమ గజపతి కంచికావేరి దండయాత్ర: మాదలపంజి, కటక రాజవంశావళి, కంచి కావేరీ కథలలో పురుషోత్తమ గజపతి కంచిపై దండెత్తి కంచి రాజకుమార్తె పద్మావతిని వివాహం ఆడినట్లు ఒక కథను తెలుపుతోంది ఈ కథ ప్రకారం పురుషోత్తమ గజపతి కంచి రాజధానిగా పాలించే కర్ణాటక రాజు కూతురిని వివాహం చేసుకోవాలని భావించి కంచిరాజుకు కబురు చేశాడు కాని కంచిరాజు తన కుమార్తెను పురుషోత్తమునికి ఇవ్వడానికి ఇష్టపడలేదు. అందుకు కారణం ఏమిటంటే ఒరియారాజు ప్రతి సంవత్సరం పూరీ జగన్నాధదేవుని ఊరేగింపు సందర్భంలో జగన్నాధ విగ్రహాన్ని బయటకు తీసుకువచ్చేటపుడు విగ్రహం ముందు ఊడ్చుతాడని, అలా ఊడ్చేవాడికి తన కూతురునివ్వనని సమాధానం పంపాడు. అందుకు కోపగించి పురుషోత్తముడు కంచిపై దండెత్తాడు కాని యుద్ధంలో ఓడిపోయాడు దాంతో అతడు పూరీజగన్నాధుని ప్రార్ధించాడట. పూరీ జగన్నాధుడు తన భక్తుని ఓటమి తన ఓటమిగా భావించి బలరామకృష్ణుల రూపంలో ఒరియా సైన్యాలకు నాయకత్వం వహించి కంచిపై దండెత్తి కంచిరాజును ఓడించారు. విజయం తర్వాత రాజకుమార్తెను తీసుకొని కంచిలోని సాక్షిగోపాలుని విగ్రహంతో సహా అనేక దేవతావిగ్రహాలను సంగ్రహించి పురుషోత్తముడు తన రాజధానిని చేరాడు. తర్వాత అతడు పూరీ విశ్వనాధుని రథం ఊడుస్తూ కంచి రాజకుమార్తెను వివాహం చేసుకున్నాడని కంచికావేరీ కథ తెలుపుతోంది కటక రాజవంశావళి అదనంగా మరొక విశేషాన్ని కూడా తెలుపుతోంది. రాజకుమార్తెను తీసుకొని వెళ్లిపోయే పురుషోత్తముని కంచిరాజు తన సైన్యాలతో వెంబడించాడని, గోదావరినది తీరంచేరగానే పురుషోత్తమ గజపతి తన రాజగురువును తన మంత్రశక్తితో తన సైన్యాలను కాపాడమని అర్ధించాడట. పురోహితుడు రాజగురువు ఒక మంత్రాన్ని చదవగానే గోదావరి పొంగిందట. దాంతో శత్రువు ఆ వరదలకు తట్టుకోలేక వెనుదిరిగి వెళ్లాడని, పురుషోత్తముడు తన రాజధానిని చేరి తనతో తెచ్చిన సాక్షిగోపాలుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాడని వివరిస్తోంది. చైతన్య చరితామృతం రాసిన కృష్ణదాస్ కవిరాజుకూడా తన కావ్యంలో పురుషోత్తముడు కర్ణాటకరాజును ఓడించి మణులు రత్నాలతో పొదిగిన కర్ణాటకరాజు మాణిక్య సింహాసనాన్ని తీసుకున్నాడని, తర్వాత అక్కడ ఉన్న సాక్షి గోపాలుని తనతో రమ్మనమని ప్రార్ధించగా అతని భక్తికి మెచ్చి భగవంతుడు అంగీకరించాడనీ, దాంతో సాక్షిగోపాలుని విగ్రహాన్ని కూడా తీసుకొనివచ్చి తన రాజధాని కటకంలో ప్రతిష్టించాడు. మాణిక్య సింహాసనాన్ని పూరీ జగన్నాధునకు సమర్పించాడని పేర్కొన్నాడు.

ఈ కథను గురించి చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వెల్లడించారు. ఆర్.డి.బెనర్జీ ఈ కథను ఒక శృంగారకథగా కొట్టిపారవేశాడు. కాని కృష్ణదాస కవిరాజు రాసిన చైతన్య చరితామృతంలోని సాక్షిగోపాలుని విగ్రహం, మాణిక్య సింహాసనం తీసుకురావడం వాస్తవం కావచ్చని భావించాడు. పూరీజగన్నాధుని గుడిలో చేసిన మార్పు విజయనగరంలోని హజారా రామస్వామి దేవాలయంలోని నిర్మాణాన్ని పోలి ఉందని వ్యాఖ్యానించాడు బెనర్జీ వ్యాఖ్యానాన్ని అంగీకరించిన పక్షంలో పురుషోత్తముడు విజయనగరంపై దాడిచేశాడని చెప్పాలి. కాని పై కథలో సాక్షిగోపాలుని విగ్రహం కంచి నుండి తెచ్చాడని తరిణిచరణరథ్ అనే పండితుడు పద్మావతికథ నిజమేనని ఆమెను పురుషోత్తముని భార్య రూపాంబికతో పోల్చాడు. పి.ముఖర్జీ అనే మరొక పండితుడు కూడా కంచికావేరి దండయాత్ర వాస్తవమేనని, ఈ సంఘటన క్రీ.శ.1469వ సంవత్సరంలో జరిగిందని భావించాడు.

కాని మరికొందరు ఈ సంఘటన వాస్తవమేగాని 1469లో కాదని భావించారు. కారణమేమిటంటే క్రీ.శ.1469వ సంవత్సరంలో పురుషోత్తమ గజపతి రాజమండ్రికి దిగువప్రాంతాలన్నీ పోగొట్టుకున్నాడు. అతని సోదరుడు హంవీరుడు తిరుగుబాటు చేశాడు. మూడవ మహమ్మద్ షా అతని మంత్రి గవాన్ ఈ ప్రాంతాలన్నీ ఆక్రమించారు. వారి మరణం తర్వాత 1475లో పురుషోత్తముడు కావేరీ వరకు తాను పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి జయించాడు. ఈ కాలంలో విజయనగర చక్రవర్తి సాళువ నరసింహరాయలు. సాళువ నరసింహరాయలు మొదట చంద్రగిరి రాజ్యానికి సామంతుడుగా పాలించేవాడు. అతని రాజ్యంలో కంచి, ఆర్కాటు, చంగల్పట్టు జిల్లా అయ్యాడు అంటే కర్ణాట సామ్రాట్టు అయ్యాడు. కనుక సాళువ నరసింహరాయలు చంద్రగిరిని పాలించేటప్పుడు ఈ సంఘటన జరిగి ఉండాలని భావించారు.

కటక రాజవంశావళి సాళువ నరసింహుడు గోదావరి వరకు తరుముకుంటూ వచ్చాడని తెలుపుతోంది ముస్లిం చరిత్రకారులు కూడా క్రీ.శ.1476వ సంవత్సరంలో సాళువ నరసింహరాయలు సైన్యాలతో గోదావరి నది ఒడ్డున విడిసి ఉన్నాడని రాశారు. అదే సమయంలో ఒరియా సైన్యాలు గోదావరికి ఉత్తరపుగట్టున ఉన్నాయని

కూడా తెలిపారు. ఆ సమయంలో మూడవ మహమ్మద్‌షా గజపతిని ఓడించాడని, సాళువ నరసింహరాయలు వీరిద్దరితో పోరకుండా వెళ్లిపోయారని ముస్లిం చరిత్రకారులు రాశారు. బహమనీ సుల్తాన్ రాకతో సాళువ నరసింహరాయలు గజపతితో పోరాడకుండా వెనుతిరిగి కటక రాజవంశావళి తెలుపుతోంది అంతేగాక కంచి దండయాత్ర రెండుసార్లు సాగినట్లు కూడా అవి చెబుతున్నాయి. ఈ ఆధారాలను బట్టి పురుషోత్తముడు విజయనగర సామ్రాజ్యంపై రెండు పర్యాయాలు దండెత్తి ఉంటాడు మొదటి పర్యాయం కంచివద్ద సాళువ నరసింహరాయలు చేతిలో ఓడిపోయి వెనుదిరిగి ఉండవచ్చును. అదే సందర్భంలో మహమ్మద్‌షా గజపతిరాజ్యంపై దండెత్తి పురుషోత్తముని ఓడించి ఉండవచ్చును. మహమ్మద్‌షా మరణానంతరం పురుషోత్తముడు విజృంభించి విజయనగర రాజ్యంపై దండెత్తి కంచి కావేరీ పర్యంతం తిరిగి ఆక్రమించి ఉంటాడు. ఈ రెండవ దండయాత్ర సందర్భంలోనే సాళువ నరసింహరాయలు ఉదయగిరి కోటలో గజపతులకు బందీగా చిక్కాడు గజపతులు అతనిని వదిలివేయగా విజయనగరం వెళ్లిపోయాడు. ఆ అపజయ అవమానాన్ని మరచిపోలేకపోయాడు. తాను మరణించే సమయంలో తన సేనాని తుళువ నరసనాయకుని ఉదయగిరిని తిరిగి జయించమని కోరి మరీ మరణించాడు. కనుక ఈ అంశాలన్నీ పరిశీలించినట్లయితే పురుషోత్తముని కంచి కావేరీ దండయాత్ర వాస్తవచరిత్రకాంశమని స్పష్టపడుతోంది.

కాని పద్మావతిని వివాహం ఆడటం కూడా వాస్తవమా అనేది స్పష్టంగా చెప్పలేము. కాని శ్రీ కృష్ణ దేవరాయల కాలంలో ప్రతాపరుద్ర గజపతి ఓడిన తర్వాత సంధిషరతులలో గజపతి రాకుమార్తెను రాయలకు ఇవ్వాలని తిమ్మరుసు ఒక షరతుగా విధించాడు. దీనిని బట్టి చూడగా పురుషోత్తమ గజపతి ఎవరో ఒక కర్ణాటక రాజకుమారిని వివాహం చేసుకొని ఉండవచ్చని, దానికి ప్రతీకారంగా శ్రీకృష్ణదేవరాయలు ప్రతాపరుద్ర గజపతి కుమార్తెను వివాహం చేసుకున్నాడేమోననే భావన కలుగుతోంది. పద్మావతి వివాహం ఏమైనా పురుషోత్తముని కంచికావేరీ దండయాత్ర యదార్థ చారిత్రక సంఘటన అని భావించవచ్చును.

పురుషోత్తముని చివరి రోజులు - మరణం 1497: పురుషోత్తముడు తన తొలిదశలో తండ్రి ఇచ్చిన రాజ్యాన్ని కోల్పోయినా చివరకు అతడు మొత్తాన్ని తిరిగి జయించాడు. తన తండ్రి తనకు అప్పగించిన రాజ్యం మొత్తాన్ని సంపాదించి తన కుమారుడు ప్రతాపరుద్ర గజపతికి వారసత్వంగా ఇచ్చాడు. అందువల్ల అతడు చాలా అదృష్టవంతుడని చెప్పాలి. పురుషోత్తముడు తన చివరి రోజులు ప్రశాంతంగా గడిపాడు. కవి పండితులను పోషించాడు. తాను స్వయంగా కవి, కావ్యాలు రాశాడు. కటకరాజవంశావళి పురుషోత్తముడు 24 సంవత్సరాలు రాజ్యం చేశాడని చెబుతోంది. జగన్నాథం కైఫీయత్తు అతడు 30 సంవత్సరాలు పాలించాడని తెలుపుతోంది. పురుషోత్తముని చివరి శాసనం క్రీ.శ.1497వ సంవత్సరానికి చెందింది. కనుక పురుషోత్తమ గజపతి 1497లో మరణించాడని చెప్పవచ్చును. పురుషోత్తముని పేరుతో ఆంధ్రదేశంలో కొన్ని గ్రామాలు నిర్మింపబడ్డాయి. ఆ గ్రామాలలో ఒకటి గుంటూరు జిల్లా చిలకలూరిపేట వద్ద ఉంది. ఆ గ్రామం నేటికీ చెక్కుచెదరకుండా ఉండి పురుషోత్తమ గజపతి పేరును చిరస్థాయిగా నిలిపింది.

ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ.1497-1538

పురుషోత్తమ గజపతి మరణానంతరం అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి సింహాసనానికి వచ్చాడు అతడు రాజ్యానికి వచ్చేనాటికి అతని సామ్రాజ్యం ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన నెల్లూరుజిల్లా వరకు విస్తరించి అతి విశాలంగా ఉంది దానికి దక్షిణంగా విజయనగర సామ్రాజ్యం ఉంది. సాళువ నరసింహ రాయలు 1491లో మరణించాడు మరణదశలో తన సేనాధిపతి నరస నాయకునికి రాజ్యాన్ని, తన కుమారులను అప్పగించాడు. తాను జయించలేకపోయిన రాచోల్ (రాయచూర్), ఓడెగెరి (ఉదయగిరి), కొనడొల్గి, కొండపల్లిలను జయించవలసిందని నరసనాయకుని ఆదేశించి మరణించాడని న్యూనిజ్ రాశాడు. నరస నాయకుడు ఈ ప్రాంతాలను జయించడానికి తన శక్తి వంచన లేకుండా ప్రయత్నించాడు· ఇదే సమయంలో బహమనీ రాజ్యంలో సర్దారులు స్వార్థంతో ప్రవర్తిస్తూ ఉన్నారు. ఒకరితో ఒకరికి సరిపడటం లేదు. ముఠాలుగా చీలి తగవులాడుకుంటున్నారు. ఆ నేపథ్యంలో యూసఫ్ ఆదిల్‌ఖాన్ సుల్తాన్‌పై సర్వాధికారాలు చెలాయిస్తూ ఉన్నాడు అది సహించని కాశిమ్ బరీద్ నరసనాయకునికి కబురంపి యూసఫ్ ఆదిల్‌ఖాన్ రాజ్యం అయిన బీజాపూర్ మీదకు దండెత్తి, సుల్తాన్‌కు ఆదిల్‌ఖాన్ బెడద లేకుండా చేస్తే రాయచూరు, ముద్గల్ కోటలను సుల్తాన్ విజయనగర రాజ్యానికి ఇస్తాడని కబురు పంపాడు సాళువ నరసింహరాయలు మరణ సమయంలో కోరిన కోర్కె తీర్చే అవకాశం వచ్చిందని సంతోషించి తిమ్మరాజు పెద్ద సైన్యంతో తుంగభద్రను దాటి ఆదిల్‌ఖాన్ రాజ్యాన్ని ధ్వంసం చేసి రాయచూరు, ముద్గల్ కోటలను ఆక్రమించాడని పెరిష్టా రాశాడు. అతడు పేర్కొన్న తిమ్మరాజు నరసనాయకుడని చరిత్రకారుల అభిప్రాయం. తన రాజ్యం దాడికి గురైందని తెలిసి యూసఫ్ ఆదిల్‌ఖాన్ కాశింబరీద్‌తో ఒక అంగీకారానికి వచ్చి తన రాజ్యాన్ని రక్షించుకోడానికి తన సేనలతో రాయచూరు వద్దకు వచ్చాడు. అక్కడ విజయనగర సేనలకు బీజపూర్ సేనలకు హిజారా 898 శనివారం రోజు (క్రీ.శ.1498 ఏప్రిల్ అని లెక్కించారు) యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో తిమ్మరాజు ఓడిపోయి తన కొడుకు బాలరాజుతో సహా విజయ నగరానికి పారిపోయాడని పెరిష్టా కథనం. కాని విజయనగర శాసనాలు, ఆనాటి సాహిత్యం నరసనాయకుడు ఆదిల్‌ఖాన్‌ను ఓడించాడని తెలుపుతున్నాయి. నరసనాయకుడు రాయచూర్, ముద్గల్ కోటలను జయించబట్టే ఆదిల్‌ఖాన్ యుద్ధానికి వచ్చాడు. కాన నరసనాయకుడు ఆ దుర్గాలను నిలుపుకోలేకపోయాడు. ఈ రెండు కోటలు తిరిగి శ్రీకృష్ణదేవరాయల క్రీ.శ.1521లో జయించేటంత వరకు అవి బీజాపూర్ రాజ్యం లోనే ఉండిపోయాయి నరసనాయకుడు బీజాపూరు నుండి రాయచూరు, ముద్గల్ కోటలను సాధించలేకపోయినా తూర్పున గజపతులు చొచ్చుకొని రాకుండా రాజ్యాన్ని కాపాడాడు.

ప్రతాపరుద్ర గజపతి తొలి దండయాత్ర క్రీ.శ.1500: వీరనరసింహరాయలు ఒక తామ్రశాసనంలో తన తండ్రి నరసనాయకునికి గజపతిరాయ గండభేరుండ అని బిరుదు ఉన్నట్లు తెలిపాడు. సాళువ నరసింహ రాయల చివరి కాలంలో పురుషోత్తమ గజపతి ఉదయగిరిపై దండెత్తి అతనిని ఓడించాడు. ఆ యుద్ధంలో నరస నాయకుడు కూడా పాల్గొని ఉండవచ్చును. కాని ఆ యుద్ధలో విజయనగర సైన్యాలు ఓడిపోయాయి. కనుక నరస నాయకుడు గజపతిరాయ గండభేరుండ అనే బిరుదు పొందడానికి వీలులేదు. కనుక సాళువ నరసింహ రాయలు మరణించిన తర్వాత మళ్లీ గజపతులకు నరస నాయకునికి యుద్ధం వచ్చి ఉండాలి. అందులో సాధించిన విజయానికి నరస నాయకుడు ఆ బిరుదు ధరించి ఉంటాడు. నరసనాయకునికి గజపతులకు ఎప్పుడు యుద్ధం జరిగి ఉంటుంది అని పండితులు పరిశీలించి క్రీ.శ.1500 సంవత్సరంలో జరిగి ఉండవచ్చని ఊహించారు. రాయచూర్ వద్ద ఆదిల్ ఖాన్‌తో పోరాటం ముగిసిన తర్వాత గజపతులకు, నరస నాయకునికి యుద్ధం జరిగినట్లు భావించారు.

విజయనగర రాజకీయాలు - తిరుగుబాటు: నరసనాయకుడు రాయచూరు యుద్ధం తర్వాత తన ప్రభువైన ఇమ్మడి నరసింహుని కట్టడి చేయడానికి ప్రయత్నించాడు. క్రీ.శ.1491లో సాళువ నరసింహరాయలు మరణించే సరికి ఇమ్మడి నరసింహుడు బాలుడు. క్రీ.శ.1498లో రాయచూరు యుద్ధం జరిగేనాటికి అతడు యుక్తవయస్కుడు అయి ఉండవచ్చును. కనుక అధికారం అప్పగించమని కోరుతాడని నరసనాయకుడు అనుమానించి అతనిని పెనుగొండకోటకు తరలించాడు. ఇది క్రీ.శ.1499-1502 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చని జయంతి రామయపంతులు పేర్కొన్నారు. రాజును పెనుగొండ తరలించడంతో నరసనాయకునికి వ్యతిరేకంగా అనేకచోట్ల

తిరుగుబాట్లు జరిగాయని న్యూనిజ్ రాశాడు. నరసనాయకుడు తిరుగుబాట్లను అణచివేశాడు. నరసనాయకుడు తిరుగుబాట్లను అణచడంలో నిమగ్నమైనప్పుడు ప్రతాపరుద్ర గజపతి విజయనగరంపై దాడి చేసినట్లు తెలుస్తోంది.

ప్రతాపరుద్రుని దండయాత్ర క్రీ.శ.1500-1502: ప్రతాపరుద్రుడు కృష్ణానది ఒడ్డుకు చేరినట్లు క్రీ.శ.1500ల నాటి అనంతవరం శాసనం తెలుపుతోంది. 1501 ఏప్రిల్, మే నెలల్లో అతడు పెన్నానది ఒడ్డున సంగం వద్ద ఉన్నట్లు మరొక శాసనం తెలుపుతోంది. ఈ శాసనంలో అతడు దేవుళ్లకు, బ్రాహ్మణులకు దానాలు చేసి వారి ఆశీస్సులు తెలుపుతోంది. ఇదే సందర్భంలో క్రీ.శ.1424 క్రీ.శ.1502వ సంవత్సరం నాటి సేలం శాసనంలో నరసనాయకునికి విజయాలు చేకూరాలని ఒక దేవాలయంలోని భక్తులకు భూదానాలు చేసినట్లు ఉంది. ఈ శాసనాల కథనాన్ని పరిశీలించిన ప్రతాపరుద్ర గజపతి నరసనాయకునిపై దండెత్తి తమిళనాడులోని సేలం జిల్లా వరకు సాగినట్లు భావింపవచ్చును. నరసనాయకునిపై తిరుగుబాట్లు జరిగినప్పుడు విజయనగర సామ్రాజ్యంలోని తమిళ ప్రాంతాలను సులభంగా ఆక్రమించవచ్చని ప్రతాపరుద్ర గజపతి తలచి కటకం నుండి బయలుదేరి దక్షిణ ప్రాంతాలవైపు నడిచాడు. ఆ సమయంలో కృష్ణాతీరం పెన్నానదీ ప్రాంతాలలో తనకు విజయం కలగాలని దానాలు చేసి శాసనాలు రాయించాడు. అలాగే తమిళదేశంలోని సేలం దేవాలయంలో నరస నాయకునికి విజయాలు కలగాలని దానశాసనాలు వేయబడ్డాయి. కనుక నరసనాయకునికి, ప్రతాపరుద్ర గజపతికి పోరాటం జరిగిందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. కాని ఈ యుద్ధాలలో ప్రతాపరుద్ర గజపతికి విజయం లభించినట్లుగా లేదు. నరసనాయకుడు గజపతిని తరిమివేసి విజయనగర ప్రాంతాలను కాపాడినట్లుంది. కనుక అతడు గజపతిరాయ గండభేరుండ అనే బిరుదు ధరించాడు. ఆ బిరుదును వీరనరసింహరాయలు తన శాసనంలో రాయించి ఉంటాడు.

రెండవ దండయాత్ర క్రీ.శ.1509: క్రీ శ.1503వ సంవత్సరంలో నరసనాయకుడు మరణించాడు. అతని పెద్ద కుమారుడు వీరనరసింహ రాయలు సింహాసనం అధిష్టించాడు. అతడు పెనుగొండలో నిర్బంధంలో ఉన్న ఇమ్మడి నరసింహుని చంపించాడు. రాజ్యాన్ని సొంతం చేసుకున్నాడు. అందువల్ల సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాలలో అతనిపై తిరుగుబాట్లు జరిగాయి. పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ వీరనరసింహరాయలు 6 సంవత్సరాలు పాలించాడని, నరసనాయకుడు మరణించగానే సామ్రాజ్యం అంతటా తిరుగుబాట్లు చెలరేగాయని, వీరనరసింహరాయల కాలం అంతా తిరుగుబాట్లతో ఉన్నందు వల్ల ప్రతాపరుద్ర గజపతి అది తగిన అవకాశం అని మరొక కుమారు విజయనగరంపై దండెత్తాలని ఆశించాడని రాశాడు. గజపతి రాజ్యంలో పెద్ద కరువు వచ్చి లక్షలాది ప్రజలు మరణించారని కటక రాజవంశావళి వక్కాణిస్తోంది. రెండు సంవత్సరాల తర్వాత క్షామం తగ్గిపోయింది. కనుక అతడు వీర నరసింహరాయలు చివరికాలంలో అంటే క్రీ.శ.1509వ సంవత్సరంలో విజయనగరంపై రెండవదాడి చేశాడని నిర్ణయించారు. అందుకు ఒక ఆధారం ఉంది. చైతన్య ప్రభువు క్రీ.శ.1509 ఫాల్గుణమాసం అంటే మార్చి 20 ఏప్రిల్ 20వ తేదీ మధ్యన పూరీ వచ్చాడు. ఆ సమయంలో ప్రతాపరుద్రుడు రాజ్యంలో లేదు. దక్షిణ ప్రాంతాలలో యుద్ధాలలో నిమగ్నుడయ్యాడని చైతన్య భాగవతం తెలుపుతోంది. దీక్షపుచ్చుకొని సన్యసించి పూరీ చేరాడు. చైతన్యుడు పూరీ వచ్చిన తర్వాత ప్రతాపరుద్రుడు తన రాజధానికి తిరిగివచ్చాడు. కనుక గజపతి రెండవ దండయాత్ర క్రీ.శ.1509వ సంవత్సరంలో జరిగిందని నిర్ణయింపబడింది.

కృష్ణదేవరాయలు యువరాజుగా విజయాలు - క్రీ.శ.1509: విజయనగర సామ్రాజ్యంలో సామంతుల తిరుగుబాట్లు జరుగుతూ ఉండగా గజపతి కూడా విజయనగర రాజ్యంపై దాడిచేశాడు. అలాంటి పరిస్థితులలో వీరనరసింహరాయలు తన తమ్ముడు కృష్ణదేవరాయలను పిలిచి ఇలా చెప్పాడట. సామ్రాజ్యంలోని సామంతులందరూ మన సేవకులు. వారు మనకి కప్పం కట్టాలి. కాని వారు మనని లెక్కచేయడం లేదు. కారణం మనం చిన్నవారం. మన తండ్రి మహావీరుడు. కనుక అతనికి అందరూ కప్పం కట్టారు. మనకు చెల్లించడం లేదు, కనుక వారిని లొంగదీసి కప్పం వసూలు చేయడానికి నేను వెళతాను. నీవు రాజధానిలో ఉండి నగరాన్ని కాపాడు అని చెప్పాడట. అప్పుడు కృష్ణ దేవరాయలు ముకుళిత హస్తాలతో, మీరు వెళ్లడం ఎందుకు, నేను వెళ్లి అందరి వద్ద కప్పాలు వసూలు చేస్తానని చెప్పి విజయనగర సైన్యంతో బయలుదేరి సామంతులపై దండయాత్రకు వెళ్లాడట. ఈ విషయం ఒక రచయిత పేరు లేని గ్రంథంలో ఉందని శ్రీ గురజాడ రామమూర్తి పంతులు తమ తెలుగుకవులు చరిత్రలో రాశారు. ఈ దండయాత్రా కాలంలోనే కృష్ణరాయలు గజపతిని ఓడించి, అతని రాజ్యంలోకి పారదోలాడు. గజపతిపై అతడు సాధించిన విజయాలకు చిహ్నంగా శక 1431 అంటే క్రీ.శ.1509వ

సంవత్సరంలో దానాలు చేసినట్లు నిడుముక్కల శాసనం తెలుపుతోంది. అతడు రాజ్యానికి వచ్చిన తొలి సంవత్సరంలో క్రీ.శ.1510వ సంవత్సరం జనవరిలో హంపీలో వేయించిన శాసనం కూడా ఈ విజయాలను ప్రస్తావించింది. యువరాజుగా అతడు ప్రతాపరుద్ర గజపతి చేసిన రెండవ దండయాత్రను ఎదుర్కొని రాజ్యాన్ని కాపాడాడు. కనుక వీరనరసింహరాయల కాలంలో కూడా గజపతికి పరాజయం ఎదురైంది.

బెంగాలు హుస్సేన్ షా కటక దండయాత్ర క్రీ.శ.1509: ప్రతాపరుద్ర గజపతి రెండవసారి కూడా విజయనగర సేనల చేతిలో ఓడిపోవడానికి మరొక కారణం ఉంది. గజపతి విజయనగరంపై పోరాడే సమయంలో క్రీ.శ.1509వ సంవత్సరంలో బెంగాలు నవాబు హుస్సేన్‌షా కటకంపై దండెత్తాడు. తర్వాత పూరీపై దాడిచేశాడు అక్కడ పరీక్షకునిగా ఉన్న అనంత సామంత ముస్లింలతో పోరలేక సారంగగడ అనే కోటలో దూరాడు. ముస్లిం సైనికులు ఆ కోటను ముట్టడించారు. ఇదే సమయంలో ప్రతాపరుద్రుడు తన రాజ్యంపై బెంగాలు నవాబు దండెత్తాడని తెలిసి విజయనగరంతో యుద్ధం ముగించి వెనుదిరిగివచ్చి బెంగాలు నవాబును ఓడించి తరిమి తన రాజ్యాన్ని రక్షించుకున్నాడు. అంతేగాక బెంగాలు సైన్యాలను తరుముతూ వెళ్లి మందారమ్ అనే కోటను ముట్టడించాడు. కాని అతని మంత్రి గోవింద విద్యాధరుడు మోసం చేసి శత్రుపక్షంలోకి వెళ్లిపోయాడు. అందువల్ల గజపతి ముట్టడిని వదలివేసి తన రాజ్యంలోకి తిరిగివచ్చాడు. తర్వాత గజపతి బెంగాలులోని గౌర్‌పై దండయాత్ర చేయాలని సంకల్పించాడు. కాని సేనాధిపతులు అంగీకరించలేదు. ఆ దాడివల్ల బెంగాలులోని హిందువులకు చాలా కష్టాలు వస్తాయని వివరించారు అందువల్ల గజపతి బెంగాలుపై దండెత్తే ఉద్దేశాన్ని విరమించుకున్నాడు కటకరాజ వంశావళి పూరీపై జరిగిన ముస్లిందాడిని తెలుపుతోంది. కాని ఆ ముస్లింలను మొగలులు అని వర్ణిస్తోంది. అప్పటికి మొగల్ సామ్రాజ్యం ఏర్పడలేదు. కటకరాజ వంశావళి మొగలుల కాలంలో రాయబడింది కనుక అంతకుముందు ముస్లింలను కూడా మొగలులుగా వర్ణించి ఉండవచ్చును. మొగల్ అనే పదాన్ని ముస్లింలు అనే అర్థంలో ఉపయోగించి ఉండవచ్చును. ముస్లింలు పూరీలో ప్రవేశిస్తున్నారని తెలియగానే మొగలులు కటకం కోటలో ప్రవేశించి తమ పతాకాన్ని ప్రతిష్ఠించి తర్వాత పూరీ చేరారని, అది తెలిసి జగన్నాథ ఆలయ పూజారి జగన్నాథుని విగ్రహాన్ని ఒక గుహలో దాచాడని, ఇంతలో పురుషోత్తమ గజపతి తన సేనలతో వచ్చి మొగలులను బెంగాలులోకి పారదోలాడని కటకరాజవంశావళి వివరించింది. ఇందులో చెప్పిన అంశాలను వెలిచర శాసనం బలపరుస్తోంది. ఈ శాసనాన్ని క్రీ.శ.1510వ సంవత్సరంలో ప్రతాపరుద్రగజపతి విడుదల చేశాడు. ఇది గజపతి బెంగాలు నవాబును ఓడించినట్లు తెలుపుతోంది. రక్తపాతాలు మంచిది కాదని చైతన్యుడు సలహా ఇచ్చాడట అందువలన ప్రతాపరుద్ర గజపతి బెంగాలుపై దండెత్తాలనే ఆలోచనకు స్వస్తి చెప్పాడని చైతన్యామృత చరిత్ర అనే గ్రంథం తెలుపుతోంది. ఈ ఆధారాలను బట్టి బెంగాలు నవాబు గజపతి రాజ్యంపై దండెత్తాడని స్పష్టంగా విశదమవుతోంది.

గజపతి రాజ్యంపై దండెత్తిన హుస్సేన్‌షాను గురించి కొన్ని సందేహాలు ఉన్నాయి. ఈ కాలంలో బెంగాలు నవాబు అల్లావుద్దీన్ అబుల్ ముజఫర్ హుస్సేన్ షా. అతడు చాలా బలవంతుడని, అతడు ఒరిస్సా వరకు అన్ని ప్రాంతాలు జయించి కప్పం వసూలు చేశాడని అనే గ్రంథం తెలుపుతోంది. ప్రతాపరుద్ర గజపతి రాసిన సరస్వతీ విలాసంలోని ప్రతి అధ్యాయం చివరలోని పద్యంలో శరణాగత యమునా పురాధీశ్వర హుసానిసాహి సురత్రాణ శరణరక్షణ అనే బిరుదు ప్రతాపరుద్రునికి ఉన్నట్లు తెలుపుతోంది. ఈ బిరుదు ప్రకారం ప్రతాపరుద్ర గజపతి జౌన్పూరు సుల్తాన్ హుసేన్‌షాను ఓడించి శరణు అనగానే రక్షించాడని అర్థం. తబకత్-ఐ-అక్బరి, పెరిష్తా, నిజాముద్దీన్ రచనలు అన్నీ జౌన్పూర్ రాజ్యాన్ని గురించి తెలియజేస్తున్నాయి. ఈ రాజ్యాన్ని క్రీ.శ.1393వ సంవత్సరంలో మాలిక్ సార్వర్ క్వాజాజహన్ అనే సర్దారుడు స్థాపించాడు. అతని తర్వాత అతని వంశస్తులు ఐదుతరాలు సుమారు 100 సంవత్సరాలు జౌన్పూరును పాలించారు. ఈ వంశస్తులను షార్టిసుల్తాన్‌లు అని కూడా పిలిచేవారు. వీరిలో చివరివాడు హుస్సేన్ షా. అతడు క్రీ.శ.1457-58లో రాజ్యానికి వచ్చాడు. ఈ వంశస్తులు జౌన్పూరు రాజ్యాన్ని స్థాపించుకున్న నాటి నుండి ఢిల్లీ సుల్తాన్‌లపై దాడులు చేసేవారు. ఢిల్లీ సింహాసనంపై తమకే ఎక్కువ హక్కు ఉందని వీరి వాదన. క్రీ.శ.1414తో తుగ్లక్ సామ్రాజ్యం అంతరించింది. సయ్యద్‌లు ఢిల్లీని ఆక్రమించారు. వారిని కూల్చి 1451లో బహులుల్ లోడీ ఢిల్లీలో లోడీ రాజ్యాన్ని స్థాపించాడు. అతడు సింహాసనం అధిష్ఠించగానే జౌన్పూరు సుల్తాన్ షారిఖ్ లాల్‌లోడీ అతనిని ఓడించి తరిమాడు. అతని తర్వాత అతని కుమారుడు హుసేన్‌షారిఖ్ 1458లో రాజ్యానికి వచ్చి తండ్రిబాటలోనే నడిచి ఢిల్లీపై దండెత్తాడు. బహులుల్‌లోడీ జౌన్పూరు

తమ రాజ్యానికి ప్రమాదకారి అని గ్రహించి హుసేన్‌షాను ఓడించడమే గాక అతని రాజ్యం జౌన్పూరును ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశాడు. ఈ సంఘటన క్రీ.శ.1493లో జరిగింది. అప్పటికి పురుషోత్తమ గజపతి సింహాసనం ఎక్కలేదు. కనుక స్వతంత్ర సుల్తాన్ హోదాలో హుస్సేన్‌ను ప్రతాపరుద్ర గజపతి ఓడించే అవకాశం లేదు. దాంతో రాజ్యం పోగొట్టుకున్న జౌన్పూరు చివరి సుల్తాన్ హుసేన్‌షా షారిఖ్ క్రీ.శ.1494-900 హిజారాలో బెంగాలు చేరి బెంగాల్ నవాబు అల్లావుద్దీన్ హుస్సేన్ షా వద్ద కొలువులో చేరాడు. ఇతడు బహులుల్ లోడీ మరణం తర్వాత సికిందర్ లోడీ కాలంలో తన రాజ్యాన్ని సంపాదించాలని చూశాడు కాని అది సాధ్యం కాలేదు. సికిందర్ లోడీ జౌన్పూరు రాజ్యాన్ని నిలబెట్టుకోగలిగాడు. బెంగాలులో నివసించే జౌన్పూరు హుసేన్ ఈ యుద్ధకాలంలో బెంగాలు సేనలకు నాయకత్వం వహించి గజపతిపై దండెత్తాడు. అతనిని ఓడించి ప్రతాపరుద్ర గజపతి శరణాగత యమునా పురాధీశ్వర హుసానిసాకి సురత్రాణ అనే బిరుదు ధరించాడు. ఇతని పేరు బెంగాల్ నవాబు పేరు కూడా హుస్సేన్ గనుక ఈ బిరుదు గురించి తర్కం జరిగింది. మొత్తం మీద బెంగాలు దండయాత్రవల్ల ప్రతాపరుద్ర గజపతి విజయ నగరంతో పోరాడలేక తన రాజధానికి వచ్చాడు.

శ్రీకృష్ణదేవరాయలు-ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ.1513-1519: తర్వాత శ్రీకృష్ణదేవరాయలే గజపతి రాజ్యంపై దండెత్తి కటకం వరకు వచ్చాడు. ప్రతాపరుద్ర గజపతి, కృష్ణదేవరాయలకు జరిగిన యుద్ధాలు గజపతి రాజ్యానికి జరిగిన నష్టాలను గురించి విజయనగర శాసనాలు, విజయనగర రాజులచే పోషింపబడిన కవుల సాహిత్యం విరివిగా వర్ణిస్తున్నాయి. కాని ఒరిస్సా శాసనాలు గాని, వారి సాహిత్యం గాని, ప్రతాపరుద్రునికి జరిగిన అపజయాలు, రాజ్యం నష్టపోవటాన్ని గురించి ఎలాంటి వివరాలు రాయలేదు. అవన్నీ మౌనాన్ని ప్రదర్శించాయి. కటక రాజవంశావళి జగన్నాథం కైఫీయత్తులు మాత్రం చూచాయగా ఒక యుద్ధాన్ని గురించి వర్ణించాయి. ఒరిస్సా రాజు తన 20వ సంవత్సరాలలో మహేంద్రకటక అనే రాజ్యంపై సంధి చేసుకొని తన రాజధాని కటకానికి తిరిగివచ్చాడు అని వర్ణించాయి. ఈ కథ ప్రతాపరుద్రునికి, కృష్ణదేవరాయలకు జరిగిన యుద్ధానికి సంబంధించింది కావచ్చును. కృష్ణదేవరాయలు పట్టాభిషిక్తుడు కాగానే ఒకటిన్నర సంవత్సరం బయటికి ఎక్కడికీ వెళ్లకుండా రాజధానిలోనే ఉన్నాడు. ఈ సంవత్సరంన్నర కాలంలో అంతకు ముందు పాలించిన రాజుల ఘనకార్యాలు, ఓటములు, వారి ఆశయాలు, వారు చేసిన ప్రయత్నాలు అన్నీ సవ్యంగా అధ్యయనం చేశాడట. రాజధాని ధప్తరులోని కవెలల నుండి కొన్ని విషయాలు, పెద్దల వల్ల మరికొన్ని విషయాలు తెలుసుకొని రాజ్యాన్ని పరిపాలించే పరిజ్ఞానాన్ని సంపాదించాడు ముఖ్యంగా సాళువ నరసింహరాయల మరణకాలంలో మోదెగుల్, రాచోల్, ఓడగరెలను జయించాడని ఇచ్చిన సందేశాన్ని గూర్చి తెలుసుకున్నాడు. దాంతో తాను నిర్వర్తించవలసిన కర్తవ్యాలు బోధపడ్డాయి. ఇదే సమయంలో ఉమ్మత్తూరు గంగరాజు తిరుగుబాటు చేశాడు. గంగరాజుపై దండెత్తి అతనిని ఓడించి శ్రీరంగపట్నం, ఉమ్మతూరు, శివసముద్రాలను జయించాడు. గంగరాజు కావేరీలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత రాయలు గజపతి మీదకు దండెత్తాలని సైన్యాన్ని ధనాగారాన్ని తయారు చేసుకున్నాడు. అతడు చేసిన ఈ ప్రయత్నాలన్నింటిని కుమార ధూర్జటి తన కృష్ణరాయ విజయంలో వర్ణించాడు. గజపతులపై యుద్ధానికి తయారవుతుండగా బీజాపూరు నుంచి వచ్చిన గూఢచారులు రాయలను కలుసుకొని బీజాపూర్ సుల్తాన్ మాట్లాడిన కొన్ని అవమానకరమైన మాటలు చెప్పారు. ఆ మాటలు విని కోపోద్రిక్తుడై బీజాపూరుపై దండెత్తాడని కూడా రాయవాచకం తెలుపుతోంది. ఒడ్డున బీజాపూరు సైన్యాన్ని చిత్తుగా ఓడించి తరిమాడు. తర్వాత ముందుకుసాగి బహమనీ రాజ్యాలపై దిగ్విజయ యాత్ర చేయాలని సంకల్పించాడని, కాని సాళువ తిమ్మ అలాంటి పని వద్దని, బహమనీ రాజ్యంతో దండయాత్ర సాగించే పక్షంలో తూర్పు నుండి గజపతి విజయనగరంపై దండెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించాడని, అందువల్ల రాయలు ఆ ప్రయత్నం మాని, రాజధానికి తిరిగి వచ్చి గజపతి రాజ్యంపై దండయాత్రకు సిద్ధపడ్డాడని రాయవాచకం వివరించింది.

గజపతి రాజ్యంపై కృష్ణదేవరాయలు దండెత్తడానికి కారణాలు: కృష్ణరాయలు హఠాత్తుగా గజపతిరాజ్యంపై దండెత్తాడని కుమార ధూర్జటి తన కావ్యంలో పేర్కొన్నాడు. అతడు పేర్కొన్నట్లు ఆ సమయంలో ప్రతాపరుద్ర గజపతి యుద్ధ ప్రయత్నంలో లేడు. విజయనగరంపై దండెత్తాలనే కోరిక కూడా లేదు. అదే కాలంలో అతని రాజ్యంలో చైతన్యుడు తన బోధనలు చేస్తున్నాడు. ప్రతాపరుద్రుడు కూడా అతని వద్ద దీక్షపుచ్చుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. రాచకార్యాల కంటె ఆధ్యాత్మిక కార్యకలాపాలకే ఎక్కువ ప్రాతినిధ్యం ఇస్తున్నాడు. ఆ స్థితిలో కృష్ణరాయలు హఠాత్తుగా ఉదయగిరిపై దండెత్తి గజపతిని యుద్ధంలోకి లాగాడు. అందుకు చాలా లోతైన

కారణాలు ఉన్నాయి. ఆనాటి శాసనాలు, తెలుగు సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే గజపతి, విజయనగర వైరానికి ఉన్న కారణాలు బోధపడతాయి. రాయలు రచించిన ఆముక్తమాల్యదలో గజపతి, విజయనగర రాజుల సంబంధాలను ప్రజలు నిత్యం చర్చించుకొనేవారని వివరించాడు. అంతకు ముందు గజపతులు విజయనగర రాజ్యానికి కలిగించిన కష్టాలు, నష్టాలు, అవమానాలు ప్రజల మనసులలో ఇంకా చెక్కుచెదరకుండా నిలిచి ఉన్నాయి. వీటన్నిటి పూర్వాపరాలు కృష్ణపరాలు కృష్ణరాయలు తెలుసుకున్నాడు.

రెండవ దేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యాన్ని సింహాచలం వరకు విస్తరించాడు. సామ్రాజ్యానికి గొప్ప కీర్తిని తెచ్చాడు. ,అలాంటి ఉచ్ఛదశలో ఉన్న సామ్రాజ్యంపై కపిలేశ్వర గజపతి దండెత్తి మొత్తం ఆక్రమించాడు. రామేశ్వరం వద్ద ఉన్న సేతువు వరకు గజపతి సైన్యాలు వీరవిహారం చేశాయి. తమిళదేశంలోని దేవాలయాలలో 10 సంవత్సరాలు పూజాపునస్కారాలు ఆగిపోయాయని శాసనం తెలుపుతోంది. అంతటితో తృప్తిపడక రాజధాని విజయనగరాన్ని ముట్టడించాడు. విజయనగర సామ్రాజ్యపు కీర్తిని పూర్తిగా మంటకలిపాడు. తర్వాత పురుషోత్తమ గజపతి కాలంలో కూడా దండెత్తి కుమార్తె పద్మినిని తీసుకువెళ్లాడని విజయనగరం నుండి సాక్షిగోపాల విగ్రహాన్ని తీసుకువెళ్లి గౌడ దేశంలో ప్రతిష్టించాడని తెలుపుతోంది. దాని వాస్తవం ఏమైనా పురుషోత్తమ గజపతి ఉదయగిరి కోటను జయించి సాళువ నరసింహరాయలను బందీగా పట్టుకొని దయతో వదలివేశాడు. గజపతి దయాభిక్షతో బయటపడవలసి వచ్చిందని సాళువ నరసింహరాయలు తన చివరి కాలంలో ఎంతో విచారించాడు. అతడు జీవితమంతా పోరాడినా కొండవీడు, ఉదయగిరి, రాయచూరులను జయించలేక పోయాడు. వాటిని జయించండి అని ఘోషిస్తూ మరణించాడు. అతని ఘోష విజయనగరంలో ఇంకా మారు మోగుతూనే ఉంది. తర్వాత పురుషోత్తమ గజపతి కుమారుడు ప్రతాపరుద్ర గజపతి తన తండ్రి నరసనాయకుని మీద ఒక పర్యాయం, తన అన్న మీద మరొక పర్యాయం దండెత్తాడు. ఈ విధంగా గజపతులు మల్లికార్జున రాయలు, విరూపాక్షరాయలు, సాళువ నరసింహరాయలు, నరసనాయకుడు, వీరనరసింహరాయల కాలాలలో విజయనగర రాజ్యానికి ఎనలేని కష్టాలు, నష్టాలు అవమానాలు కలిగించారు. కపిలేశ్వర గజపతి కాలంలో జరిగిన విషయాలను అంటే అప్పటి 50 సంవత్సరాల కింద జరిగిన విషయాలను కూడా ప్రజలు మరచిపోకుండా కృష్ణదేవరాయల కాలంలో కూడా చెప్పుకునేవారట. అదే విషయాన్ని రాయలు తన ఆముక్త మాల్యదలో ప్రస్తావించాడు. ఇవన్నీ తెలుసుకొన్న కృష్ణరాయలకు హృదయం దహించుకొని పోయి ఉంటుంది. కనుక తన సామ్రాజ్యానికి జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయాలని, పోయిన రాజ్య భాగాలు తిరిగి సంపాదించాలని రాయలు కృతనిశ్చయుడై గజపతులపై దండయాత్రకు పూనుకున్నాడు. విజయనగర సామ్రాజ్య ప్రజలు కూడా గజపతులకు బుద్ధి చెప్పాలని కోరినట్లు కనిపిస్తుంది. ఆనాడు ప్రజల పాడుకున్న పాటలు కొన్ని నేటికీ నిలిచి ఉన్నాయి. కొండవీడు మనదే, కొండపల్లి మనదే, కాదుకూడదంటే కటకం దాకా మనదేరా అని పాడుకొన్నారట. ఇది తెలుగుపాట. కనుక తెలుగువారు కూడా గజపతులకు సానుభూతి చూపినట్లు కనిపించడం లేదు. రాయలనే అభిమానించినట్లు కనిపిస్తోంది. ఈ కారణాల వల్ల కృష్ణరాయలు తానే ముందు గజపతి రాజ్యంపై దండెత్తాడు.

ఉదయగిరి ఆక్రమణ క్రీ.శ. 1514: ఉదయగిరి ఆ కాలంలో బలిష్టమైన ఉభయ రాజ్యాల మధ్య కీలకమైన స్థానంలో ఉంది. అది శత్రు దుర్భేధ్యమైన కోట అని న్యూనిజ్ రాశాడు. కోట ఉనికి, దాని పటిష్టమైన నిర్మాణ పద్ధతులను న్యూనిజ్ వర్ణించాడు. ఈ కోట అధిరోహించడానికి వీలులేని ఎత్తయిన కొండ పర్వతం మీద ఉంది. పైకి వెళ్లడానికి ఒకేవైపు ఇరుకైన మార్గం ఉంది. ఆ మార్గంలో ఒకేసారి ఇద్దరు మనుషులు వెళ్లలేరు. ఒకరి తర్వాత ఒకరు వెళ్ల వలసిందే. మిగిలిన మూడు వైపులా ఆ పర్వతపు శిఖరాలున్నాయి. కోటను దిగ్బంధం చేసి లోపలి వారికి ఆహార పదార్థాలు లేకుండా చేసి వారిని లొంగదీస్తే తప్ప కోటను జయించే అవకాశమే లేదు. అంత బలిష్టమైన స్థితిలో ఉంది. ఈ కాలంలో ఈ కోటను తిరుమల రౌతురాయ అనే గజపతి పరీక్షకుడు పాలిస్తున్నాడు. ఇతడు ప్రతాపరుద్ర గజపతి పినతండ్రి. కృష్ణదేవరాయలు తన సైన్యంతో విజయనగరం నుండి బయలుదేరి గుత్తి గండికోటల గుండా ప్రయాణించి ఉదయగిరి చేరి కోటను ముట్టడించాడు. రౌతురాయ వారిని ఎదిరించాడు. విజయనగర సేనాధిపతులు కోటను జయించలేకపోయారని న్యూనిజ్ రాశాడు. దాంతో కృష్ణరాయలు స్వయంగా నాయకత్వం వహించాడు. అతడు కొండపైన ఉన్న బురుజుల వద్దకు తను చేరడానికి అడ్డంగా ఉన్న పెద్ద పెద్ద కొండరాళ్లను పగులగొట్టించి మార్గం చేసి తన సైన్యాన్ని పైకి నడిపి కోటను ముట్టడించాడని న్యూనిజ్ ఉదయగిరి యుద్ధాన్ని గురించి వివరంగా రాశాడు. తర్వాత అతికష్టం మీద రౌతురాయని ఓడించి కోటను వశపరచుకున్నాడు.

రౌతురాయని బందీగా పట్టుకొన్నాడు. ఉదయగిరి కోట ముట్టడికి గురైందని తెలిసిన ప్రతాపరుద్ర గజపతి పెద్ద సేనతో ఉదయగిరి చేరాడు రాయలు కోట బయట గజపతిని ఎదుర్కొని ఓడించి తరిమివేశాడు. ఓడిన ప్రతాపరుద్ర గజపతి కొండవీడు చేరాడు. గజపతి వెళ్లిపోయిన తర్వాత రాయలు ఉదయగిరి కోటలోకి ప్రవేశించి అక్కడ కొన్ని రోజులు ఉన్నాడు. ఆ సమయంలో నెల్లూరుసీమలోని ఒక గ్రామాన్ని కోనవల్లభరాయ అనే దేవునికి దానం చేశాడని ఒక శాసనం తెలుపుతోంది. ఈ శాసనమేగాక తిరుమలలోని మూడుభాషలలో ఉన్న మరొక శాసనం కూడా కృష్ణదేవరాయల ఉదయగిరి విజయాన్ని తెలుపుతోంది. రాయలు ప్రతాపరుద్ర గజపతిని ఓడించి కొండవీటి వరకు తరిమి ఉదయగిరి కోటను ఆక్రమించి తిరిగివెళుతూ తిరుమల వచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించి తులాభారం తూగి 3000 బంగారు వరహాలను దేవునికి దానం చేశాడని ఆ శాసనం తెలుపుతోంది. శాసనం వల్ల అతడు ఉదయగిరిని జయించిన తర్వాత తిరపతి వెళ్లి స్వామిని సేవించి తర్వాత విజయనగరం చేరాడని తెలుస్తోంది. ఇవేకాక విజయనగరంలోని కృష్ణాపురంలో నిర్మించిన కృష్ణస్వామి ఆలయంలోని మరి రెండు శాసనాలు కూడా కృష్ణదేవరాయలు ఉదయగిరి విజయాన్ని తెలుపుతున్నాయి. ఉదయగిరిని జయించిన తర్వాత ఆ కోటలోని ఒక సుందరమైన బాలకృష్ణ విగ్రహాన్ని చూసి కృష్ణరాయలు ముగ్ధుడై తీసుకువచ్చి విజయనగరంలోని కృష్ణాపురంలో నూతన ఆలయాన్ని నిర్మించి, అందులో క్రీ.శ.1515 ఫిబ్రవరి 16వ తేదీన ఆ కృష్ణ విగ్రహాన్ని ప్రతిష్టించాడని ఈ కారణం అంతకుముందు పురుషోత్తమ గజపతి విజయనగరం నుండి సాక్షిగోపాలుని విగ్రహాన్ని తీసుకువెళ్లాడని ప్రజలు చెప్పుకొనే దానికి బదులు చేయడానికి గజపతులు ఉదయగిరిలో పూజించే తొలి కృష్ణ విగ్రహాన్ని విజయనగరం తీసుకు వెళ్లాడని వ్యాఖ్యానించారు.

ఉదయగిరి రాజ్యంలో లభించిన ప్రతాపరుద్ర గజపతి చివరిశాసనం క్రీ శ 1513 జనవరి 24వ తేదీకి చెందింది. న్యూనిజ్ కృష్ణదేవరాయలు ఉదయగిరి కోటపై ఒకటిన్నర సంవత్సరం పోరాడాడని, కీ.శ.1514లో జరిగినదని రాశాడు. డా హెచ్.కృష్ణస్వామి, రాయలు శక 1434 క్రీ శ.1512లోనే ఆలయాలలోని కష్ణరాయల శాసనాలను బట్టి చెప్పాడు. ఈ దేవాలయాలకు దానాలు చేసి రాయలు శాసనాలు వేయించాడు. ఈ శాసనాలు శక 1435 క్రీ.శ.1513 సంవత్సరానికి చెందినవి. అందులో ఉదయగిరి జయించిన ప్రస్తావనలేదు. కనుక కోటముట్టడి ఇంకా సాగుతూ ఉండి ఉండవచ్చును ఉదయగిరిలోని కృష్ణదేవరాయల శాసనాలను బట్టి ఉదయగిరికోట క్రీ.శ.1514 జూన్ 9వ తేదీన స్వాధీనం అయిందని పండితులు నిర్ణయించారు.

ఉదయగిరి కోటలో బంధింపబడిన వారు: ఉదయగిరి కోటలో కొందరు గజపతి కుటుంబసభ్యులు కోటను రక్షించే సేనాధిపతి కృష్ణ రాయలకు బందీలుగా చిక్కారు. వారిలో గజపతి మామ కూడా ఒకరని నాటి రచనలు చెబుతున్నాయి. ఒకరు బందీగా చిక్కారని రాశాడు కనుక ఆమె గజపతి అత్త అని అనుకున్నారు. ఇక కృష్ణరాయలకు చిక్కిన కోట రక్షణ సేనాధిపతి గురించి కూడా పండితుల మధ్య ఏకాభిప్రాయం లేదు వీరేశలింగం పంతులు తన కవుల చరిత్రలో ఉదయగిరిలో చిక్కిన సేనాధిపతి ప్రహరేశ్వరపాత్రుడు అని, అతడు ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్ర గజపతి మామ అని రాశారు. కాని ఆముక్తమాల్యద ప్రహరేశ్వర పాత్రుడు ఉదగిరిలో కాదు కొండపల్లిలో ఉండేవాడని తెలుపుతోంది. శాసనాలు మామ. కనుకనే గజపతి మామ బందీగా చిక్కాడని కొందరు రాశారు. యస్. సుబ్రహ్మణ్యశాస్త్రి తిరుపతి-తిరుమల శాసనాలపై ఆధారపడి తిరుమల కాంతారాయ కృష్ణరాయలకు చిక్కిన ఉదయగిరి రక్షణ సేనాధిపతి అని తీర్మానించారు. అంతేగాక అతనికి తిరుమల కాంతారాయ, తిరుమల రౌతురాయ, తిరుమల రాఘవరాయ, తిరుమల ప్రేయతరాయ మహాపాత్ర అని కూడా పేర్లున్నాయని రాశారు. అంతేగాక సుబ్రహ్మణ్యం శక 1432 ప్రజాపతి క్రీ.శ 1510-11 సంవత్సరాల్లో మేల్‌నాడును పాలించే పర్వత రాహుత్తర్ కూడా ఇతడేనని పోల్చారు. అతడు ప్రతాపరుద్ర గజపతి సామంతుడుగా మేల్‌నాడును పాలిస్తున్నాడని తీర్మానించాడు. మేల్‌నాడు కర్ణాటక రాష్ట్రంలోని కొంగుమండలంలో ఉంది. దానికి మేల్‌క్కరైనాడు అని కూడా పేరుంది. అక్కడి ఈ రోడ్ శాసనంలో పర్వత్ రౌత్తర్ పాలకుడుగా పేర్కొనబడ్డాడు. ఇతని సిద్ధాంతం ప్రకారం కపిలేశ్వర గజపతి కొంగునాడును కూడా జయించాడని, ఆప్రాంతం గజపతుల సామ్రాజ్యంలో కొనసాగుతుందని ప్రతాపరుద్ర గజపతి కాలంలో దానికి పర్వతరౌత్తర్ అధిపతిగా ఉండేవాడని వివరించాడు. కృష్ణదేవరాయలు క్రీ.శ.1510లో పర్వతరౌత్తర్‌ను ఓడించి తరిమాడని, అప్పటి నుండి అతడు ఉదయగిరి దుర్గపాలకునిగా నియమింపబడ్డాడని వివరించాడు. ఈరోడ్ శాసనంలోని పర్వతరాహుత్తర్ ఉదయగిరిలోని తిరుమల రౌతురాయ ఒకరేనని చెప్పే సుబ్రహ్మణ్యం వాదన తిరస్కరించబడింది. కారణమేమిటంటే కపిలేశ్వరుని

మరణం తర్వాత పురుషోత్తముని కాలంలో హంవీరుని ఓడించి సాళువ నరసింహుడు కొండవీటి వక్క ప్రాంతాలకు విముక్తి చేశాడు. పురుషోత్తముని చివరికాలంలో తిరిగి ఆక్రమించిన నెల్లూరు, ఉదయగిరి వక్క మాత్రమే తిరిగి సంపాదించాడు. చంద్రగిరి రాజ్యం విజయనగరరాజుల కిందనే ఉంది. కృష్ణదేవరాయల సింహాసనానికి రాగానే అతని సోదరుని చంద్రగిరి పంపాడు. కనుక నెల్లూరు జిల్లాను దాటి దక్షిణంగా గజపతుల అధికారం లేదు. కనుక మేల్‌నాడులోని పర్వతరౌత్తర్ గజపతి సామంతుడని చెప్పడం సరికాదు. ఉకోట్ శాసనంలోని పర్వత రాహుత్తర్ స్వతంత్రం ప్రకటించిన స్థానికరాజు. శివసముద్రంలో స్వతంత్రం ప్రకటించిన రాహుత్తర్ స్వతంత్రం ప్రకటించిన స్థానికరాజు. శివసముద్రంలో స్వతంత్రం ప్రకటించిన గంగరాజుతోపాటు పర్వత రాహుత్తర్ స్వతంత్రం ప్రకటించి ఉంటాడు. అతనిని కృష్ణరాయలు జయించి ఉంటాడు. అతనికి ఉన్న రాహుత్తర్ అనే పేరును గజపతి సామంతుడైన రౌతురాయతో పోల్చి, అతడు గజపతి సామంతుడని సుబ్రహ్మణ్యం భ్రమపడ్డారు. ఉదయగిరిలో పట్టుబడింది తిరుమల రౌతురాయ అని శాసనాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. కనుక తిరుమల రౌతురాయనే కృష్ణదేవరాయలు బందీగా పట్టుకున్నాడని స్పష్టంగా చెప్పవచ్చును. ఉదయగిరి వశం అయిన తర్వాత రాయసం కొండ మరుసయ్య అనే అతన్ని శ్రీకృష్ణదేవరాయలు ఉదయగిరి పాలకుడుగా నియమించాడు. రాయవాచకం ఉదయగిరిపై సాళువ కంపణను అధిపతిగా నియమించినట్లు తెలుపుతోంది. బహుశా ఇతడు సాళువ అభల కుమారుడు కావచ్చును. వీరిద్దరిలో ఎవరు ఉదయగిరి దుర్గాధిపతిగా పని చేశారో స్పష్టంగా తెలియదు.

కందుకూరు ఆక్రమణ: కృష్ణదేవరాయలు ఉదయగిరిని జయించిన తర్వాత సాళువ తిమ్మను పిలచి ఈ విజయాలతో తాను తృప్తిపడదలచలేదని మరొక 100 లీగుల గజపతి రాజ్యాన్ని జయించాలని, దానికి తగిన ఏర్పాట్లు చేయమని, సైనికులకు జీతభత్యాలు చెల్లించి దండయాత్రకు కావలసిన ఆయుధాలు, ఆహారపదార్థాలు, ఇతర సామాగ్రిని సేకరించమని ఆదేశించాడని కూడా న్యూనిజ్ రాశాడు. రాయలు క్రీ.శ.1514 జూన్ 9వ తేదీన ఉదయగిరి వశమైన తర్వాత 26 రోజులకు అంటే క్రీ.శ.1514 జూలై 6వ తేదీన తిరపతిని దర్శించి అక్కడి నుండి రాజధాని విజయనగరం చేరి తిరిగి సెప్టెంబర్‌లో ఉదయగిరి వచ్చాడు. అతడు వచ్చే లోపల తిమ్మరుసు దండయాత్రకు కావలసిన ఏర్పాట్లు చేసి ఉన్నాడు. వెంటనే బయలుదేరిపోయి కందుకూరును ముట్టడించాడు. కందుకూరు నెల్లూరు రాజ్యంలోని మరొక ముఖ్యమైన కోట. క్రీ.శ.1514 సెప్టెంబర్‌లో కందుకూరు వశం అయింది. దాంతో ఉదయగిరి సీమ పూర్తిగా రాయల ఆధిపత్యంలోకి వచ్చింది. తర్వాత కొండవీటి సీమపై దండెత్తాడు.

కృష్ణదేవరాయల కాలం నాడు కొండవీటిసీమ పరిస్థితులు: కృష్ణదేవరాయల కాలం నాడు ఆంధ్రదేశంలో కొండవీటిసీమ చాలా ప్రఖ్యాతిలో ఉంది. ఈ సీమకు ప్రధాన కేంద్రం కొండవీడు దుర్గం. ఈ సీమ రక్షణకు చుట్టూ అనేక ఉప కోటలు నిర్మింపబడ్డాయి. అద్దంకి, వినుకొండ, నాగార్జునకొండ, తంగెడ, బెల్లంకొండ, కేతవరం అనే కోటలు ఉండేవి. ఇవికాక తుమ్మకోట, కారెంపూడిలో కూడా చిన్న కోటలు ఉండేవి. ఈ కోటలలో కొండవీడు, అద్దంకి, వినుకొండ కోటలను కొండవీడుపాద అని పిలిచేవారు. ఇవికాక మిగిలిన కోటలన్నీ కృష్ణానది ఒడ్డున నిర్మింపబడ్డాయి. ఆ కోటలకు వెనుకవైపు కృష్ణానది రక్షణగా ఉండేది. ఈ కోటలన్నీ కొండవీటి సీమకు రక్షణ కవచం లాగా ఉండి కాపాడుతుండేవి. ఈ కోటలన్నీ రెడ్డిరాజుల కాలంలో నిర్మించబడ్డాయి. వారి తర్వాత ఈ కోటలన్నీ కపిలేశ్వర గజపతి ఆధీనంలోకి వచ్చాయి. అతడు తన కుమారుడు హంవీరుని కొండవీటి సీమలో పరీక్షకునిగా నియమించాడు. హంవీరుడు ఈ కోటల్నే మరమ్మత్తులు చేయించాడు. రాతిగోడలతో పునర్నిర్మాణం చేశాడు. ముఖ్యంగా కొండవీటి కోటను చాలా విస్తృతపరచాడు. నేడు కొండవీటిపై కన్పించే కోటశిథిలాలు హంవీరుడు నిర్మించిన కోటవే. అంతకుముందు రెడ్డిరాజులు నిర్మించిన కోట చాలా చిన్నది. దాని జాడ నేడు లేదు. కొండవీటి సీమలో ఉన్న కోటల ఉనికి వల్ల కొండవీటిసీమ సైనికపరంగా అతిబలిష్టంగా ఉండేది. కపిలేశ్వరుడు కొండవీటిసీమను యువరాజ పరిపాలనా విభాగంగా చేశాడు. గజపతి సామ్రాజ్యపు దక్షిణభాగానికి కేంద్రస్థానం చేశాడు. రాజకుటుంబానికి చెందినవారినే కొండవీటిసీమకు పరీక్షకునిగా నియమించే విధానాన్ని ప్రవేశపెట్టాడు. అదే పద్ధతి చివరి దాకా కొనసాగింది. ఈ కాలంలో ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్ర గజపతి కొండవీటి సీమ అధిపతిగా ఉన్నాడు. లభించిన శాసనాల వలన ఇక్కడ ఉపకోటలను గురించి కూడా కొంత సమాచారం తెలుస్తోంది.

అద్దంకి: శ్రీకృష్ణదేవరాయలు కందుకూరు నుండి అద్దంకి చేరాడు. అద్దంకి కూడా చాలా ప్రాచీనమైన కోట. వేంగిచాళుక్యుల కాలం నుండి అది ప్రసిద్ధి చెందిన కోట. గుణగ విజయాదిత్యుడు పాండురంగని స్థావరంగా ఉండేది. కాకతీయ సామ్రాజ్యం తర్వాత ప్రోలయ వేమారెడ్డికి రాజధాని అయింది. రెడ్డి తర్వాత గజపతుల కిందికి వచ్చింది. రాయలు అద్దంకిని సులభంగానే జయించాడు. ఆ తర్వాత దండయాత్ర జరిపే విషయంలో జాగ్రత్తగా ఆలోచించాడు. అద్దంకి నుండి సరాసరి కొండవీడు చేరి కోటను ముట్టడించవచ్చును. కాని రాయలు కొండవీటి సీమ రక్షణ విధానాన్ని పరిశీలించి తన ఉద్దేశ్యాన్ని మార్చుకున్నాడు. సరాసరి కొండవీడును ముట్టడించడం ప్రమాదమని గ్రహించాడు. అలా చేస్తే ఉప కోటలలోని సైన్యం వెనుక నుండి దాడి చేసే ప్రమాదం ఉందని గ్రహించాడు. కనుక ముందు ఉప కోటలన్నింటిని జయించి, తర్వాత కొండవీడు కోటను ముట్టడించాలని తీర్మానించుకొని తన దండయాత్రా మార్గాన్ని మార్చుకున్నాడు. ఇది రాయల యుద్ధ వ్యూహరచనా చాతుర్యాన్ని తెలుపుతుంది. అద్దంకి నుండి కొండవీడు పోకుండా వినుకొండ మీదకు దండెత్తాడు.

వినుకొండ: కపిలేంద్రుని మరణం తర్వాత కృష్ణకు దక్షిణ భాగం పోయింది. పురుషోత్తమ గజపతి ఆ ప్రాంతాలన్నీ తిరిగి జయించాడు. ఆ సమయంలో వినుకొండను సాగివంశస్థులు పాలిస్తున్నారు. వారు పురుషోత్తమ గజపతికి లొంగిపోయారు. వారి వంశాన్ని తొలగించకుండా తన సామంతులుగా కొనసాగించాడు. వినుకొండలో లభించిన శాసనం వల్ల వారి వంశవృక్షం తెలుస్తోంది.

అన్నమనాయక
↓
పెదగన్న
↓
గాద
↓
గన్నమనాయక

వీరిలో చివరి వాడైన గన్నమ నాయకుడు పురుషోత్తమ గజపతికి లొంగిపోయి సామంతుడయ్యాడు. అతడు గొప్ప వీరుడు. అతనికి కరవాలభైరవ, పులిదు మార్కొలుగండ, గంజభేరుండ అనే బిరుదులున్నాయి. ఇతడు వినుకొండలో లక్ష్మీనరసింహ ఆలయాన్ని నిర్మించాడు. వినుకొండ పర్వతం మీద బలమైన కోటను నిర్మించాడని సీవెల్ అనే పండితుడు అన్నాడు. గన్నమనాయకుని వారసులను ఏ శాసనం పేర్కొనడం లేదు. కాని అతనికి బైక మహాపాత్ర అనే కుమారుడు ఉన్నాడని, అతడు గొప్పవీరుడని, అనేక యుద్ధాలు చేశాడని, అతనికి రాయరౌహుత మిండ పులిదుమార్కొలుగండ, గండభేరుండ, రణరంగ వీరభద్ర అనే బిరుదులు కూడా ఉన్నాయని చాటు పద్యాలు వర్ణిస్తున్నాయి. బహుశా ఇతడు ప్రతాపరుద్ర గజపతి కాలంలో వినుకొండను పాలించి ఉంటాడు. కృష్ణరాయలు ఇతనితోనే యుద్ధం చేసి ఉండవచ్చును. రాయలు వినుకొండను ముట్టడించి అక్కడ గజపతి సేనను ఓడించి కోటను ఆక్రమించాడు. ఈ ముట్టడి క్రీ.శ.1515 జూన్‌లో జరిగిందని భావించారు. విజయం తర్వాత భాసరయ్య అనే అతన్ని వినుకొండ దుర్గాధిపతిగా నియమించాడని రాయవాచకం తెలుపుతోంది. రాయలు సాగి వంశాన్ని తొలగించినందువల్లనే గన్నమ నాయకుని తర్వాత అతని వారసుల పేర్లు ఏ శాసనంలో లేకుండాపోయాయని భావించవచ్చును.

బెల్లంకొండ-కేతవరం దుర్గాలు: తర్వాత ప్రసిద్ధి చెందిన కోట బెల్లకొండ. ఈ దుర్గం రెడ్డి కాలం నుండి ప్రఖ్యాతిలోకి వచ్చింది. కృష్ణదేవరాయల కాలం నాటి ఇది కొండవీడు, వినుకొండల స్థాయి కోటగా అభివృద్ధి చెందింది. కొంత కాలానికి అద్దంకి దాని ప్రాధాన్యతను పోగొట్టుకొని బెల్లంకొండ, కొండవీడు దండపాదలో చేరింది. కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ కూడా కొండవీడు దండపాద అని ప్రసిద్ధి చెందాయి. బెల్లంకొండ ఆనాడు పలనాటిసీమకు ప్రధాన దుర్గంగా వెలుగొందుతోంది. పలనాటిసీమలో నాగార్జునకొండ, తంగెడ, కేతవరం మరి మూడు పెద్ద దుర్గాలు ఉండేవి. పూర్వం ఈ ప్రాంతాన్ని గురిందాలసీమ అని పిలిచేవారు. ఈ నాలుగు దుర్గాలు శాసనాలలో పేర్కొనబడ్డాయి. కేలవరంలో లభించిన ఒక శాసనంలో శక 1430 క్రీ.శ.1508లో బెల్లంకొండసీమను శ్రీనాథరాజు రామయ్య దేవమహారాయ అనే వ్యక్తి పాలిస్తున్నట్లు తెలుపుతోంది. ఆ శాసనం వల్ల మూడు తరాల వారి పేర్లు తెలుస్తున్నాయి.

శ్రీనాధరాజు రామయలింగార మహాపాత్ర
↓
లక్ష్మీపతిరాజు
↓
శ్రీనాధరాజు రామయదేవ

ఈ శాసనంలోని లక్ష్మీపతిరాజు శ్రీనాధరాజు రామయదేవులు ప్రతాపరుద్ర గజపతి సామంతులుగా పాలిస్తున్నట్లు సూచిస్తున్నట్లు లక్ష్మీపతిరాజు కేతవరంలో శ్రీనాధరాజరామయదేవ బెల్లంకొండ, గురిందాలలో అధికారిగా ఉన్నట్లు భావింపబడింది. కృష్ణదేవరాయలు వినుకొండ నుండి నాయకురాలి కనుమగుండా ప్రయాణించి బెల్లంకొండ చేరి దుర్గాన్ని ముట్టడించాడు. శ్రీనాధరాజు రామయ్య ఓడిపోయాడు. రాయలు బెల్లంకొండ కూడా ఆనాడు శత్రు దుర్భేధ్యమైన దుర్గంగానే పరిగణింపబడింది. ఇది చాలా ఎత్తయిన కొండ మీద నిర్మింపబడింది కనుక జయించదానికి రాయలు చాలా కష్టపడి ఉంటాడు. అందుకు ఆగ్రహం కలిగి గోడలు కూల్చి లోపల ప్రవేశించి ఉంటాడు. కనుకనే బెల్లంకొండ దుర్గాన్ని నేలపట్టం చేశాడని శాసనాలు వర్ణించి ఉండవచ్చును. విజయం తర్వాత వీరభద్రయ్య అనే అతడ్ని అక్కడ ప్రతినిధిగా నియమించాడు. కేతవరం కూడా లొంగిపోయింది. శ్రీనాధరాజు కుటుంబం అనగా లక్ష్మీపతిరాజు, అతని కుమారుడు రామయ్య దేవుల కొండవీడు చేరారు. కొండవీడు జయించినప్పుడు వీరి కుటుంబం కృష్ణరాయలకు బందీగా చిక్కింది. రాయలు వారిని క్షమించి వారి పూర్వపు ప్రాంతాలైన బెల్లంకొండ, కేలవరాలలో తన ప్రతినిధులుగా నియమించాడు. వారు రాయలను కొలిచారు.

తంగెడ, నాగార్జునకొండ: తర్వాత రాయలు గురిందాలసీమపై దాడి చేసి తంగెడ నాగార్జునకొండ కోటలను కూడా స్వాధీనం చేసుకున్నాడు. నాగార్జునకొండ కోటకు అయ్యలయ్య అనే వ్యక్తిని నియమించాడు. ఆ విజయంతో కొండవీటి సీమలోని ఉపదుర్గాలన్నీ రాయల వశం అయ్యాయి. తర్వాత కొండవీడు దుర్గంచేరి ముట్టడి చేశాడు. ఉపదుర్గాలన్నీ తన స్వాధీనంలో ఉండటంతో వెనుక నుండి ఎటువంటి ప్రమాదం లేకుండా కొండవీటిని ముట్టడించగలిగాడు.

కొండవీడు యుద్ధం క్రీ.శ. 1515: కృష్ణరాయలు తన సైన్యంతో వచ్చి కొండవీటిని ముట్టడించాడు ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్రగజపతి కొండవీటి దుర్గాధిపతిగా రక్షణకు పూనుకున్నాడు. ఇంతలో ప్రతాపరుద్ర గజపతి పెద్ద సేనతో వచ్చాడని న్యూనిజ్ రాశాడు. ప్రతాపరుద్ర గజపతి రాకతో కృష్ణరాయలు కోట ముట్టడిని ఆపివేసి బహిర్ యుద్ధంలో ప్రతాపరుద్ర గజపతితో తలపడాలని కోటను జయించడం కన్నా గజపతితో ప్రత్యక్ష యుద్ధం చేయడమే తనకు ఆమోదయోగ్యం అని ప్రకటించాడు. కొండవీటి కోట నుండి ఎవరూ తప్పించుకొని పోకుండా కొద్దిసేనను అక్కడ వదిలి మిగిలిన సైన్యంతో నాలుగు లీగులు ముందుకు నడిచి ఒక నది ఒడ్డుకు చేరాడు. ఆ నది నీళ్లు ఉప్పుగా ఉన్నాయట. దానికి అవతలవైపు గజపతి సైన్యం విడిచి ఉంది. కృష్ణరాయలు కోట వద్దనే ఉండకుండా ముందుకు రావడం చాలా మంచిపని చేశాడు. అదే కోటముట్టడిలో నిమగ్నమైనా, లేక కోట వద్దనే ప్రతాపరుద్ర గజపతి కోసం వేచి ఉన్నా మధ్యన పడిపోయేవాడు. కోటలో నుండి వీరభద్రుడు వెనుక నుండి ప్రతాపరుద్రుడు రాయల సైన్యాన్ని చీల్చి చెండాడి ఉండేవారు. కనుక తండ్రీ కొడుకులకు అలాంటి అవకాశం ఇవ్వకుండా కోట ప్రాంతం నుండి 4 లీగులు ముందుకు వెళ్లడంతో రాయల సైన్యానికి అపాయం తప్పింది. రాయలు ఉప్పు నదిని దాటిరమ్మని కబురంపి తగిన సమయం ఇచ్చాడు. కాని గజపతి నదిని దాటలేదు. కనుక రాయలే నదిని దాటి గజపతితో తలపడ్డాడు. ఉభయ సైన్యాలకు భీకరమైన పోరాటం జరిగింది. ఉభయ సైనికులు అనేక మంది మరణించారు. చివరకు రాయలు గజపతిని ఓడించి తరిమివేశాడు. తర్వాత రాయల సైన్యం ఉప్పు నదిని దాటి తిరిగి కొండవీటి కోట వద్దకు వచ్చింది. అని న్యూనిజ్ ఈ యుద్ధాన్ని గురించి వర్ణించాడు. రాయలు దాటిని ఉప్పునీటి నది ఏదో తెలియదు. కొండవీటి వద్ద అనేక వాగులు నేటికీ ఉన్నాయి. వాటిలో ఏది దాటాడో చెప్పలేము. తర్వాత కొండవీడు దుర్గాన్ని ముట్టడించాడు. ప్రతాపరుద్ర గజపతి అమిత పరాక్రమంగా పోరాడాడు. మూడు నెలలు గడిచినా రాయలు దుర్గాన్ని జయించలేకపోయాడు. కొండవీటి ముట్టడిని రాయలు ప్రధానమంత్రి సాళువ తిమ్మరుసు నిర్వహించాడని శాసనాలు, నాటి సాహిత్యం తెలుపుతున్నాయి. అతడు యుద్ధం ద్వారా లాభం లేదని వ్యూహం ద్వారానే జయించాలని కోటలోని వారికి

ఎలాంటి ఆహార పదార్థాలు బయటి నుండి వెళ్లకుండా దిగ్బంధం చేశాడు. రహస్యంగా రాయల సైన్యంపై దాడి చేయాలని గజపతి కొందరు సామంతులను ఆదేశించాడట. కాని వారు ఆకలి దప్పికతో కొండలలో, గుట్టలలో అహార పదార్థాలు వెతుక్కోవడానికి వెళ్లారట! అది గమనించి సాళువ తిమ్మ వారిని బంధించాడని మంగళగిరి స్తంభ శాసనం తెలుపుతోంది. ఆహార పదార్థాల లోటుతో ఉన్న సందర్భంలో కోటగోడల ఎత్తుకు సరిపోయే విధంగా కృష్ణరాయలు పెద్దకొయ్య లగ్గలను తయారు చేయించి వాటిపై తన సైనికులను ఎక్కించి కోటగోడలను పగుల గొట్టించాడని, తర్వాత విజయనగర సైన్యాలు అవలీలగా కోటలో ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకున్నాయని శాసనం తెలుపుతోంది. వీరభద్ర గజపతి తన అనుయాయులతో బందీగా చిక్కాడు. వీరభద్రునితో పాటు బందీలుగా చిక్కిన ఇతర పాత్రులు, సామంతుల పేర్లు కొన్ని అమరావతి, తిరువణ్ణామలై, కాళహస్తి శాసనాలలో పేర్కొనబడ్డాయి. ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్రరాయ లేక వీరభద్రసేన, హంవీరుని కుమారుడు నరహరిపాత్రుడు, రాయచూరుకు చెందిన మల్లుఖాన్, ఉద్దండఖాన్‌లు, పూసపాడు రాచిరాజు, బెల్లంకొండ, కేతవరం శ్రీనాథరాజు, లక్ష్మీపతిరాజు, రామయ్యదేవుడు, జన్యాల కేశవపాత్రుడు, బాలచంద్ర మహాపాత్రుడు, ఇంకా అనేక మంది సామంతులు పట్టుబడ్డారని పైమూడు శాసనాలు తెలుపుతున్నాయి. కొండవీడు దుర్గం క్రీ.శ.1515 జూన్ 23వ తేదీన వశమైనదని కొండవీడు, మంగళగిరి శాసనాలు తెలుపుతున్నాయి. కొండవీడు సీమకు రాయలు సాళువ తిమ్మరసును అధిపతిగా నియమించాడు. అతడు రాయలతో ఇంకా ముందుకు అంటే గజపతి రాజ్యంపై దండయాత్రకు వెళ్లవలసి ఉన్నందున కొండవీటి పరిపాలనను చూడటానికి తన తమ్ముడు, మేనల్లుళ్లను నియమించుకున్నాడు. కొండవీటి పతనంతో క్రీ.శ.1515వ సంవత్సరం మధ్యకాలానికి ప్రతాపరుద్ర గజపతి కృష్ణకు దక్షిణ భాగాలన్నీ పోగొట్టుకున్నాడు. కొండవీడు విజయం తర్వాత క్రీ.శ.1515 జూలై 8వ తేదీన కృష్ణరాయలు అమరావతిలోని అమరేశ్వరస్వామిని దర్శించి తులాపురుష దానాలు చేశాడు. తర్వాత తన రాజధాని విజయనగరం వెళ్లిపోయాడు. మార్గమధ్యంలో శ్రీశైలంలోని మల్లికార్జున స్వామిని అర్చించి దానాలు చేశాడు.

వీరభద్ర గజపతిని విజయనగరం తీసుకెళ్లడం: బందీగా చిక్కిన వీరభద్రగజపతిని రాయలు విజయనగరం తీసుకొనివెళ్లాడు. కాని అతనిని ఏమీ చేయలేదు. సాటిరాజుగా గౌరవించి, తన రాజ్యంలోని మాలెబెన్నూరుసీమకు పాలెగాడుగా నియమించాడు. అతడు ఆ సీమను పాలించుకొంటూ కాలం గడిపాడు. అతడు శక 1438 క్రీ.శ.1515-16 సంవత్సరంలో తన జాగీరులో తనకు పెళ్లి సుంకంగా వచ్చే ఆదాయాన్ని తన తండ్రి ప్రతాపరుద్ర గజపతికి, తన సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలకు శుభాలు కలగాలని దానం చేశాడు.

శ్రీకృష్ణదేవరాయల విధానంలో మార్పు: మొదట ఉదయగిరిపై దండెత్తేటప్పుడు అంతవరకే జయించాలని భావించినట్లుగా ఉంది. ఉదయగిరి జయించిన తర్వాత మరొక 100 లీగులు గజపతి రాజ్యాన్ని జయించాలని తిమ్మరుసుతో అన్నాడు. కొండవీటిని జయించిన తర్వాత అతడు యుద్ధ విరమణ చేయాలని భావించినట్లు ఉంది. అందువల్ల రాయలు కొన్ని మాసాలు యుద్ధ ప్రయత్నం చేయలేదు. పుణ్యక్షేత్రాలు దర్శిస్తూ కాలక్షేపం చేశాడు. కొండవీడు విజయం తర్వాత తన ఇద్దరు రాణులు చిన్నాదేవి, తిరుమలదేవితో కలసి ధరణికోటలోని అమరేశ్వరుని దర్శించి తులాపురుష, రత్నధేను, సప్తసాగర మొదలైన మహాదానాలు చేశాడు. అగ్ని పురాణం ప్రకారం మహా దానాలు 10 రకాలు. బంగారం అశ్వాలు, గజాలు, రథాలు, భూమి, గృహం, పెళ్లి కుమార్తె, కన్యలు, ఆవు, నువ్వులు. కాని మత్స్యపురాణం మహా దానాలు 16 అని చెబుతోంది. అందులో 400 విధానాలు ఇంకా వివరంగా రాశారు. తులాపురుషదానం దానం చేసే వ్యక్తి తన బరువుకు సరిపడే విధంగా బంగారం గాని, వెండిని గాని తూచి బ్రాహ్మణులకు దానంగా ఇస్తాడు. ఇందులో కూడా అనేక రకాలు ఉన్నాయి. హిరణ్యగర్భ, బ్రహ్మాండ, కల్పవృక్ష, సప్తసాగర, రత్నధేను, మహాభూత ఘట్ట మొదలైనవి చెప్పబడ్డాయి. లింగపురాణంలో పేర్లు తేడాగా ఉన్నాయి. రాయలు దానాలు చేస్తూ దేవాలయాలు దర్శించాడు. అమరావతి తర్వాత అతడు తన దేవేరులతో శ్రీపర్వతాన్ని దర్శించి మల్లికాంబ భ్రమరాంబలను అర్చించి రెండు గ్రామాలను దేవునికి దానం చేశాడు. తర్వాత రాజధాని విజయనగరం చేరి కొంత కాలం విశ్రాంతి తీసుకున్నాడు. తర్వాత తిరిగి గజపతి రాజ్యంపై దండెత్తాలనే ఆలోచన వచ్చినట్లుగా ఉంది. రాయవాచకం, కృష్ణరాయల విజయం, గజపతితో పోరాడిన కారణాలు తెలుపుతున్నాయి. గజపతిని అంతటితో వదిలివేస్తే భవిష్యత్తులో కొండవీడు, గజపతి విజయనగర రాజ్యం వైపు తిరిగి చూడకుండా చేయాలని సంకల్పించి తన పూర్వపు ఉద్దేశ్యాన్ని మార్చుకొని కొండపల్లిపై దండెత్తాలని

.తీర్మానించుకున్నాడని తెలుపుతున్నాయి.

కొండపల్లి దండయాత్ర క్రీ.శ. 1516: కొండపల్లిపై దాడికి క్రీ.శ.1515 డిసెంబర్ నెలలో బయలదేరినట్లు అహోబిళం శాసనం తెలుపుతుంది. యుద్ధానికి వస్తూ మార్గమధ్యలో క్రీ.శ.1515 డిసెంబర్ 21వ తేదీన అహోబిల స్వామిని దర్శించి శాసనం వేయించాడు. ఆ శాసనం ప్రకారం అంతకు కొద్దిరోజుల ముందు కళింగ దండయాత్రకు బయలు దేరినట్లు ఉంది. కొండవీడు యుద్ధంలో ఓడిపోయిన ప్రతాపరుద్ర గజపతి కొండపల్లి చేరి తన బలగాలన్నింటిని కేంద్రీకరించి కొండపల్లికి రక్షణ ఏర్పాటుచేశాడు. కొండవీడు ఆక్రమణ తర్వాత రాయల కొండపల్లిపై దండెత్తుతాడని భావించి తన సైన్యాలను కూరుకొని రాయల రాక కోసం ఎదురు చూశాడు. కాని రాయలు రాలేదు. విజయనగరం వెళ్లిపోయాడు. దాంతో గజపతి కొండపల్లి రక్షణకు ప్రహరేశ్వర శిరశ్చంద్ర మహాపాత్రుని నియమించి తాను కటకం వెళ్లిపోయాడు. ఆరుమాసాల తర్వాత రాయలు తన సేనతో వచ్చి కొండపల్లిని ముట్టడించాడు. ప్రహరేశ్వర పాత్రుడు వీరోచితంగా పోరాడాడు. కాని ఓడిపోయాడు. కోట రాయల వశం అయింది. రాయల సైన్యం కోటలో ప్రవేశించి ప్రముఖులనందరినీ బంధించారు. అక్కడ బంధింపబడిన వారి పేర్లు కాళహస్తి శాసనంలో లిఖించబడ్డాయి. ప్రహరాజు శిరశ్చంద్ర మహాపాత్ర (ఇతడు గజపతి మంత్రి భూపతి అహ్లాదన శిరశ్చంద్రుని కుమారుడని భావించారు), బొజ్జన్న మహాపాత్ర, బిజిలీఖాన్ అనే వారి పేర్లు ఆ శాసనంలో ఉన్నాయి. రాయవాచకం మరికొన్ని విశేషాలను తెలుపుతోంది ఈ కొండపల్లి యుద్ధ కాలంలో గోల్కొండ నవాబు గజపతికి మిత్రుడని, రాయలు కొండపల్లికి బయలుదేరగానే సరిహద్దుకోటలకు మంచి రక్షణ ఏర్పాటు చేయమని గోల్కొండ నవాబు గజపతికి సలహా ఇచ్చాడని, సహాయం కూడా చేస్తామన్నారని, కాని గజపతి వారితో కలవడానికి ఇష్టపడలేదని పూరీ జగన్నాథునిపై తన ఆశలన్నీ పెట్టుకున్నాడని తెలుపుతోంది. కనుక కొండపల్లి కోటలో చిక్కిన బిజిలీకాన్ గోల్కొండకు చెందిన సర్దారుడై ఉండవచ్చునని కొందరు భావించారు. కాని గజపతి కూడా ముస్లింలను సైన్యంలో చేర్చుకున్నాడు, ఇది పురుషోత్తముని కాలం నుండి ప్రారంభమైందని మరికొందరు భావించారు ఏమైనా బిజిలీకాన్ ముస్లిం. అతడు ప్రతాపరుద్ర గజపతి తరపున కొండపల్లిలో కృష్ణదేవరాయలపై పోరాడి బందీగా చిక్కాడు. న్యూనిజ్ మరికొన్ని విశేషాలు రాశాడు. కొండపల్లి కోటలో ఒరియా రాజు భార్య, అతని కుమారుడు కూడా బందీలుగా చిక్కారని, వారితోపాటు ఏడుగురు ప్రముఖ సేనాధిపతులు బందీలయ్యారని రాశాడు. ఇక్కడ చిక్కిన కుమారుడే వీరభద్ర గజపతి అని కొందరు అన్నారు. కానీ వీరభద్ర గజపతి కొండవీటిలో బందీ అయ్యాడని శాసనాలు తెలుపుతున్నాయి. కనుక ఇతడు మరొక కుమారుడు కావచ్చును. ప్రతాపరుద్రునికి రామచంద్ర అని మరొక కుమారుడు ఉన్నట్లు గోల్కొండ చరిత్ర రాసిన ఒక రచయిత పేర్కొన్నాడు. గజపతి కొండపల్లి నుండి కటకం వెళ్లినప్పుడు తన భార్యను, కుమారుని అక్కడ వదిలివెళ్లాడేమో అందువల్ల వారు కూడా కృష్ణరాయలకు బందీగా చిక్కి ఉండవచ్చును. వారందరినీ రాయలు విజయనగరం పంపాడు.

తెలంగాణ కోటలను ఆక్రమించడం: కొండపల్లి ఓటమి తర్వాత ప్రతాపరుద్ర గజపతి నిర్వీర్యుడయ్యాడు తర్వాత అతడు కృష్ణరాయలను ఎదిరించలేదు. దాంతో రాయలు ఎలాంటి ప్రతిఘటన లేకుండా తెలంగాణలో ప్రవేశించి, ఒకే దండయాత్రలో అనేక కోటలు జయించాడు. అనంతగిరి, ఉరవకొండ, ఉర్లగొండ, అరువపల్లి జల్లిపల్లి, కందికొండ, కప్పలవాయి, నల్లగొండ, దేవరకొండ, ఖమ్మంమెట్టు, కనకగిరి, శంకరగిరి మొదలైన కోటలను అవలీలగా జయించి స్వాధీనం చేసుకున్నాడు. ఈ విజయాలతో గజపతి రాజ్యం మధ్యలోకి రాయలు అడుగుపెట్టాడు. అంతటితో ఆగక వేంగిలో ప్రవేశించాడు. రాయవాచకం, పారిజాతాపహరణం రాయల విజయాలను ఘనంగా పేర్కొంటున్నాయి. ఈ విజయాలన్నింటినీ ఈ రెండు కావ్యాలు వివరంగా పేర్కొన్నాయి ఈ యుద్ధాలలో ప్రతాపరుద్రుడు కోల్పోయిన ప్రాంతాల పట్టికను ఇచ్చింది రాయవాచకం. కృష్ణరాయలు కందుకూరును జయించిన తర్వాత కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ, వినుకొండ, నాగార్జునకొండలను జయించాడని రాయవాచకం పట్టికను ఇచ్చింది. ఈ పట్టిక వరుసక్రమంలో లేదు. ముందు జయించింది వెనుక, వెనుక జయించింది ముందు ఇవ్వబడింది. అలాగే పారిజాతాపహరణం కూడా ముందు వాటిని వెనుక, వెనుక వాటిని ముందు ఇచ్చింది. రాయలు ఉదయగిరిని జయించిన తర్వాత వినుకొండ, తర్వాత కొండవీడు, తర్వాత బెల్లంకొండ, తర్వాత దేవరకొండ, జల్లిపల్లి, అనంతగిరి, ఖమ్మంమెట్టులను జయించి కటకంవైపు బయలుదేరాడు అని వర్ణించింది. ఈ రెండు కావ్యాలు జయించిన ప్రాంతాల పట్టీలను ఇస్తున్నాయి. కాని ఆ కవులు వాటిని జయించిన వరుసక్రమంలో ఇవ్వలేదు. వారు కవిత్వధోరణిలో రాశారు. కనుక రాయల విజయాల కవితావర్ణనని

చెప్పవచ్చును. మొత్తం మీద ఈ కావ్యాలు రెండూ కృష్ణరాయలు గజపతిపై సాధించిన విజయాలను పేర్కొన్నాయి.

వేంగి రాజమహేంద్రవరాలు ఆక్రమణ క్రీ.శ.1516: తెలంగాణ ప్రాంతాలను జయించిన తర్వాత రాయలు జమ్మిలోయగుండా వేంగిలో ప్రవేశించి వేంగిని జయించాడు. తర్వాత గోదావరినదిని దాటి రాజమహేంద్రవరాన్ని ముట్టడించి కోటను స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత కోనసీమ, కిమ్మూరు సీమలను జయించి ఏలేరు, తాండవ, వరాహ, శారదా నదులను దాటి సింహాచలం చేరాడు. కొండపల్లి యుద్ధం తర్వాత గజపతి, రాయలను ఎక్కడా ఎదిరించలేదు. ఎదురు లేకుండా సునాయాసంగా తెలంగాణ, వేంగి ఉత్తరాంధ్ర లేక దక్షిణ కళింగ ప్రాంతాలను జయించుకుంటూ సింహాచలం వరకు ఆంధ్ర ప్రాంతాలన్నీ తన వశం చేసుకున్నాడు. దాంతో అంతకు పూర్వం రెండవ దేవరాయల కాలం నాటి విజయనగర సామ్రాజ్య సరిహద్దుల వరకు సామ్రాజ్యాన్ని విస్తరించినట్లు అయింది. సింహాచలం నుండి పొట్నూరు వరకు సాగి గజపతిని తనతో యుద్ధానికి రమ్మనమని సవాల్ చేశాడు. కాని గజపతి యుద్ధానికి రాలేదు. రాయలు ఆరునెలలు ఎదురుచూసి విసిగిపోయి, సింహాచలం దేవాలయం గోడ మీద గజపతిని గురించి అవమానకరంగా ఒక శాసనం రాయించాడని న్యూనిజ్ రాశాడు కాని అలాంటి శాసనం ఏదీ సింహాచలంలో లేదు. అయినప్పటికీ గజపతి యుద్ధానికి రాలేదు. కనుక రాయలు అది ఈయన విజయంగా భావించి పొట్నూరులో విజయస్తంభం నాటించి సింహాద్రి చేరి అక్కడ కూడా సింహాచలం కొండ మీద మరొక విజయస్తంభం ప్రతిష్టించాడు. కృష్ణరాయల ఆముక్తమాల్యద, అల్లసాని పెద్దన మనుచరిత్రలు కూడా పొట్నూరు వద్ద తాటి చెట్టు అంత ఎత్తు గల జయస్తంభం ప్రతిష్టించబడిందని తెలుపుతున్నాయి. తర్వాత స్వామిని దర్శించి తన భార్యలతో సహా కానుకలు సమర్పించి శాసనాలు రాయించాడు. నేటికి కూడా ఆ శాసనాలు చెక్కుచెదరకుండా ఉన్నాయి. అందులో ఒకటి దేవాలయపు ముందు ద్వారం పునాది గోడ మీద ఉంది. మరొకటి దేవాలయపు ప్రాకారపు లోపలి వరండాలోని స్తంభం మీద ఉంది. ఈ శాసనాలు కృష్ణరాయల విజయాలను, అతడు, అతని భార్య చిన్నాదేవి, తిరుమలదేవిలు చేసిన దానాలు, వారు సింహాచలంలో కొన్నాళ్లు ఉన్నట్లు తెలుపుతున్నాయి. ఈ శాసనాలలో ఒకటి 29-3-1561 శక 1438 ధాత చైత్రమాసంలో చెక్కించింది. మరొకటి 8-8-1519 శక 1441 ప్రమాధి శావణ బహుళ 13 సోమవారం రోజున చెక్కించింది. సింహాచలం, పొట్నూరులలో ఆరుమాసాలు ఉన్నాడని న్యూనిజ్ రాశాడు. కాని శాసనాలు రాయలు అక్కడ రెండు మాసాలు మాత్రమే ఉన్నట్లుగా తెలుపుతున్నాయి. 29-3-1516న రాయలు సింహాచలనాధునికి దానాలు చేసి తర్వాత విజయనగరం వెళ్లిపోయినట్లు 29-6-1516 నాటి కనెక్కల్ శాసనం తెలుపుతోంది. ఆ రోజున తుంగభద్రానది ఒడ్డున ఉన్న కొన్ని భూములను దేవబ్రాహ్మణులకు దానం చేసి ఆశాసనం వేయించాడు. అంటే 29-3-1516న సింహాచలంలో ఉన్నాడు. 29-6-1561న విజయనగరంలో ఉన్నాడు. కనుక 29-3-1516వ తేదీకి కొద్దిగా ముందు విజయనగరం చేరి ఉంటాడు. తర్వాత చోళ మండలాన్ని దర్శించి అన్ని శైవవైష్ణవ దేవాలయాలకు దానాలు చేసినట్టు క్రీ.శ.1516 సంవత్సరం నాటి కాళహస్తి, చిదంబరం శాసనాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. సెండ మంగళం శాసనం అతడు దానాలు చేసిన దేవాలయాలు నాలుగు దిక్కులలో ఉన్నాయని తెలుపుతోంది. క్రీ.శ.1516వ సంవత్సరం కళింగ తొలిదండయాత్ర తర్వాత దక్షిణదేశంలో అనేక దేవాలయాలకు దానాలు చేసి కొన్నింటిని పునర్నిర్మాణం చేసినట్టు అనేక శాసనాలు లభించాయి. కనుక అతడు సింహాచలంలో రెండు మాసాలకంటే ఎక్కువ కాలం గడిపినట్లుగా లేదు. ఏమైనా పొట్నూరు యుద్ధం తర్వాత రాయలు తన రాజధానికి తిరిగి వెళ్లిపోయాడు. కాని గజపతితో యుద్ధం ముగియలేదు. గజపతి సంధికి రాలేదు. తాత్కాలికంగా ప్రతిష్టించిన తర్వాత రాయలు కటకంపై దండెత్తి కటకాన్ని దహించివేశాడని అనేక ఆధారాలున్నాయి. అయితే పొట్నూరు నుండి సరాసరి క్రీ.శ.1516వ సంవత్సరంలోనే కటకంపై దండెత్తాడా, లేక పొట్నూరులో విజయ స్తంభం నాటి విజయనగరం వెళ్లి, మళ్లీ రెండవసారి వచ్చి కటకం మీద దండెత్తాడా అనే విషయంపై అనేక వాదోపవాదాలు జరిగాయి. చివరకు రాయలు రెండోసారివచ్చి కటకంపై దండెత్తి సింహాచలనాధుని దర్శించి క్రీ.శ. 8-8-1519న తేదీన శాసనం వేయించాడని, ఈ శాసనం రెండవసారి వేయించినదని తీర్మానించారు. ఈ రెండు శాసనాలలో మొదటి శాసనం 29-3-1516వ తేదీన వేయించినది. రెండవసారి 8-8-1519న వేయించాడు. ఈ రెండిటి మధ్య సుమారు మూడు సంవత్సరాల వ్యవధి ఉంది. కనుక రాయలు రెండుసార్లు సింహాచలాన్ని దర్శించాడని తీర్మానించి, ఆ మధ్యకాలంలో కటకం దండయాత్ర జరిగి ఉంటుందని, బహుశా క్రీ.శ.1518-19 సంవత్సరాలలో జరిగి ఉంటుందని నిర్ణయించారు. కనుక పొట్నూరు విజయస్తంభం ప్రతిష్టించిన తర్వాత రాయలు

సరాసరి కటకంపై దండెత్తలేదు. విజయనగరం వెళ్లిపోయాడు.

వీరభద్ర గజపతి ఆత్మహత్య-తిరిగియుద్ధం: రాయలు విజయనగరం వెళ్లిన తర్వాత క్రీ.శ.1516వ సంవత్సరంలో వీరభద్ర గజపతి ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూనిజ్ వీరభద్ర గజపతి ఆత్మహత్య గురించి వివరంగా రాశాడు. కొండపల్లి యుద్ధం తర్వాత రాయలు వీరభద్ర గజపతిని కొండవీటి పాలకుడుగా నియమించాడు. అతడు కత్తిసాములో గొప్పవీరుడుగా ప్రసిద్ధి చెందాడని న్యూనిజ్ రాశాడు. ఒకరోజు రాయలు తీరికగా ఉండి కత్తియుద్ధ ప్రదర్శన ఏర్పాటు చేశాడు. అందులో వీరభద్ర గజపతిని తన కత్తిసాము ప్రదర్శించవలసిందని కోరాడట. అతనిపై పోటీచేయడానికి మరొక వీరుని ఎన్నిక చేశాడు. వీరభద్ర గజపతి తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఉవ్విళ్లూరాడట. కాని అతనితో పోటీ చేసే వ్యక్తి క్షత్రియుడు కాదని తెలిసి, అతనితో పోరాడమనడం అవమానంగా భావించి తనకత్తితో పొడుచుకొని ప్రాణాలు వదిలాడని న్యూనిజ్ వర్ణించాడు. న్యూనిజ్ రాసిన రాతలను హెచ్. కృష్ణశాస్త్రి మొదలైన అనేక మంది పండితులు తిరస్కరించారు. వీరభద్రుని గురించి న్యూనిజ్ చాలా తప్పులు రాశాడని వారు అన్నారు. వీరభద్రుడు కొండపల్లిలో బందీగా చిక్కాడని న్యూనిజ్ రాశాడు. కాని అతడు కొండవీటిలో బందీగా చిక్కాడని ఆముక్తమాల్యద, పారిజాతపహరణం స్పష్టంగా పేర్కొన్నాయి. రాయలు అతనిని కొండవీటి పాలకునిగా నియమించాడని రాసిన విషయం కూడా తప్పు అని వారు అన్నారు. శాసనాలు అతను రాసిన విషయాలకు విరుద్ధంగా ఉన్నాయి. శక 1438 యువ క్రీ.శ.1515-16 సంవత్సరం నాటి దావనగెరె శాసనం రాయలు మాలె బెన్నూరుసీమ నాయంకరాన్ని వీరభద్ర గజపతికి ఇచ్చాడని తెలుపుతోంది. కొండవీడును జయించిన నాలుగు నెలల తర్వాత వీరభద్రుడు కృష్ణదేవ రాయల కింద స్థానిక పాలకునిగా పాలిస్తున్నట్లు ఈ శాసనం తెలుపుతోంది. ఈ శాసనం వేయించిన మూడు రోజుల తర్వాత కృష్ణదేవ రాయలకు శుభాలు కలగాలని ఆకాంక్షిస్తూ వీరభద్ర గజపతి అనంతపురం జిల్లాలోని మడకసిరిలో తిరు వెంగళనాథ దేవునికి ఒక చెరువును దానం చేశాడు. ఈ రెండు శాసనాలను బట్టి కొండవీడు యుద్ధం తర్వాత వెంటనే వీరభద్ర గజపతికి నాయంకరం ఇచ్చి గౌరవించాడని, అతనిని బందీగా చూడలేదని స్పష్టమవుతోంది. అంతేగాక గజపతితో యుద్ధ కొనసాగుతుండగా కీలకమైన కొండవీటికి శత్రువైన వీరభద్ర గజపతిని అధిపతిగా నియమిస్తాడా? అది అసంభవం. కాకపోతే సాటిరాజుగా ఒక నాయంకరాన్ని ఇచ్చి, అక్కడి నుండి ఎక్కడికీ వెళ్లకుండా చేసి, అంటే స్వేచ్ఛలేని సామంతరాజును చేసి ఉంటాడు. అని కృష్ణస్వామి అయ్యంగార్ వ్యాఖ్యానించారు. అయితే కొందరు వీరభద్రుని కత్తిసాము చేయమని రాయలు కోరడం వాస్తవం అయి ఉండవచ్చును. అతడు అది అవమానంగా భావించి ఆత్మహత్య చేసుకొనడం వాస్తవం కావచ్చును అని అన్నారు. అందుకు కారణం అతడు జీవించి ఉన్నట్లయితే క్రీ.శ.1519లో గజపతితో సంధి కుదిరిన తర్వాత గజపతి రాణితో సహా రాయలు వీరభద్ర గజపతిని కటకానికి పంపి ఉండేవాడు. అతడు ఒరిస్సాకు రాజై ఉండేవాడని అన్నారు. కాని వీరభద్రుని విషయం తర్వాత ఏమీ తెలియటం లేదు. అంటే అతడు విజయనగరంలో మరణించి ఉంటాడు. అని వారు భావించారు.

కటక దండయాత్ర క్రీ.శ.1519: వీరభద్రుని మరణవార్త ఒరిస్సా చేరింది. ప్రతాపరుద్ర గజపతి కుమారుని మరణవార్తకు ఆగ్రహం చెంది సింహాచలంలో ఉన్న రాయల సైన్యంపైకి దాడికి పంపినట్లుగా కనిపిస్తోంది. కృష్ణ దేవరాయలు పొట్నూరులో విజయస్తంభం ప్రతిష్ఠించి తిరిగి వచ్చేటప్పుడు అక్కడ మరుసయ్యను తన ప్రతినిధిగా నిలిపినట్లు తెలుస్తోంది. శక 1439 క్రీ.శ.1517వ సంవత్సరం నాటి చోళసముద్రం వద్ద లభించిన ఒక శాసనంలో రాయల తరపున సింహాద్రి, శ్రీకూర్మాల వద్ద విజయస్తంభాలు ప్రతిష్ఠించిన వీరుడు కొండ మరుసయ్య అని రాసి ఉంది. రాయలు రెండవసారి చేసిన దండయాత్రా కాలంలో సింహాద్రి, శ్రీకూర్మంలో విజయ స్తంభాలు వేయించినట్లు ఈ శాసనాలు తెలుపుతున్నాయి. రెండవ దండయాత్రలో కొండ మరుసయ్య ప్రధాన పాత్ర పోషించి ఉంటాడు. అలాగే బాపట్ల తాలుకా కొమ్మూరులో క్రీ.శ.1517 మార్చి 12వ తేదీ నాటి మరొక శాసనం కూడా కృష్ణరాయలు కటకం వరకు సాగించిన కళింగ దండయాత్రను గురించి పేర్కొన్నది. అలాగే శక 1439 అంటే క్రీ.శ.1517వ సంవత్సరంలో కృష్ణానది ఒడ్డున ఉన్న ఉండవల్లి అనంతశయన స్వామి బెజవాడ మల్లేశ్వర స్వాముల దేవాలయాలను దర్శించి దానాలు చేశాడు. శాసనాలు వేయించాడు. పొట్నూరు నుండి శక 1438 అంటే క్రీ.శ.1516వ సంవత్సరంలో విజయనగరం వెళ్లిపోయాడు. అప్పుడు ఈ దేవాలయాలను దర్శించలేదు. 1517వ సంవత్సరంలో దర్శించి దానాలు చేసి శాసనాలు వేయించాడు. అంటే 1517లో తిరిగి రెండవసారి

కళింగకు బయలుదేరాదని స్పష్టంగా తెలుపుతున్నాయి. వెళ్లే మార్గంలో ఉన్న ఈ దేవాలయాలకు దానాలు చేశాడు. సింహాచలంలోని క్రీ.శ.1517వ సంవత్సరం శాసనాన్ని కూడా అతడు రెండవ దండయాత్ర తర్వాత చెక్కించిందని, మొదటి శాసనానికి, దానికి మధ్య ఉన్న కాలవ్యవధిని బట్టి చెప్పవచ్చును. కనుక రాయలు కళింగపై రెండుమార్లు దండయాత్ర సాగించాడని స్పష్టపడుతోంది. తన కుమారుడు వీరభద్ర గజపతి మరణవార్తను విని పంపిన గజపతి సైన్యాన్ని కొండ మరుసయ్య ఎదుర్కొన్నాడు. మరొకవైపు రాయలకు విజయనగరం వార్త పంపి ఉంటాడు. రాయలు వెంటనే సైన్యంతో క్రీ.శ.1517వ సంవత్సరంలో కళింగపై రెండవమారు దండెత్తాడు. రాయల సైన్యాలు సింహాచలం చేరిన తర్వాత యుద్ధవ్యూహాన్ని గురించి చర్చించినట్లు రాయవాచకం, కృష్ణరాయ విజయం తెలుపుతున్నాయి.

చితాబ్‌ఖాన్: శక సంవత్సరం 1425 అంటే క్రీ.శ. 1504వ సంవత్సరానికి చెందిన ఓరుగల్లు శాసనం (ఆదిరాజు వీరభద్రరాజు ప్రకటించిన Sii Vol. V No.33 శాసనం) చితాబ్‌ఖాన్ గురించి తెలుపుతుంది. అతడు భోగి కులస్తుడని వర్ణించబడింది. భోగికులస్తులు నాగజాతికి చెందినవారని చరిత్రకారులు భావిస్తారు. అతడు బోయ వంశస్తుడని కొందరు భావిస్తారు. అతడు నాగమ నాయకుని పౌత్రుడు యాదవనాయకుని కుమారుడు. చితాబ్‌ఖాన్ అసలు పేరు సీతాపతి. అతడు తన బాహుబలం చేత ఓరుగల్లును స్వాధీనం చేసుకొని పాడుబడి ఉన్న పాంచాలరాయ అని పిలువబడే పాంచాల రామకృష్ణ ఆలయాన్ని, ప్రసిద్ధి చెందిన కాకతి దేవాలయాలను పునరుద్ధరించాడు. అతడు తన పరాక్రమం చేత ముస్లింలను అనేక యుద్ధాలలో ఓడించాడు. అందువల్ల వారు అతని పరాక్రమాన్ని గుర్తించి అతనిని చితాబ్‌ఖాన్ అని పిలిచేవారు. ఇతడే ప్రతాపరుద్ర గజపతి సామంతునిగా తెలంగాణను తర్వాత రాజమండ్రి, బెల్లంకొండ, కొండవీడు, కొండపల్లిలను పాలించాడు. 1503లో భోగి లేక బోయ వంశస్తుడు నాగమ నాయకుని పుత్రుడు యాదవనాయకుని కుమారుడు అనే సీతాబ్‌ఖాన్ ఓరుగల్లును స్వాధీనం చేసుకొని అక్కడ పాడుబడిన పాంచాల రామకృష్ణుని ఆలయం, కాకతిదేవి ఆలయాన్ని పునఃప్రతిష్ఠ చేశాదని, అక్కడ గల క్రీ.శ.1504వ సంవత్సరం నాటి శాసనం తెలుపుతోంది. క్రీ.శ.1466 నుండి 1520 వరకు ఓరుగల్లు గజపతుల ఆధీనంలో ఉంది. ఈ కాలంలోనే ఏకామ్రనాథుడు ప్రతాపరుద్ర చరిత్ర రాశాడు.

ఓరుగల్లులో ప్రతాపరుద్ర గజపతి నాణేలు: ఇటీవల ఓరుగల్లులో ప్రతాపరుద్ర అనే ఆఖ్య (Legend) కలిగిన నాణేలు లభించాయి. చరిత్రకారులు మొదట అవి కాకతి ప్రతాపరుద్రుని నాణేలు అని భావించారు. కాని తర్వాత లోతుగా పరిశీలించి అవి ప్రతాప రుద్రగజపతి నాణేలని నిర్ధారణ చేశారు. ఈ నాణేలు కూడా ఓరుగల్లు గజపతుల ఆధీనంలో ఉండేదని స్పష్టం చేస్తున్నాయి.

చితాబ్‌ఖాన్ యుద్ధం: కృష్ణరాయలు కటకంపై దండెత్తి గజపతిని సంధికి దిగివచ్చేటట్లు చేద్దామని అన్నాడు. కాని తిమ్మరుసు అంగీకరించలేదు. సింహాచలం నుండి గజపతి రాజ్యంలోకి వెళ్లడం ప్రమాదమని హెచ్చరించాడు. అది అతని స్వస్థలం. వెనుక మనం జయించిన ప్రాంతాలలో ఇంకా మన స్థితి బలపడలేదు. అది కూడా ఒక రకంగా శత్రురాజ్యమే. మధ్యపడిపోతాము, ఆహార పదార్థాలు సమకూర్చుకోలేము, అక్కడే ఉండి సంధి ప్రయత్నాలు చేద్దామని సలహా ఇచ్చాడట. కాని రాయలు వినలేదు. సైన్యంతో ముందుకు సాగాడు. సింహాచలం నుండి అడవులలో నుండి విజయనగర సైన్యం వెళుతూ ఉండగా తిమ్మరసు ఊహించినట్లు హఠాత్తుగా చితాబ్‌ఖాన్ అనే గజపతి సేనాని 60 వేల విలుకాండ్ర పటాలంతో విజయనగర సైన్యంపై పడ్డాడు. రాయల సైన్యానికి అమిత నష్టం కలిగించాడని రాయవాచకం వివరించింది. ఇతడు వరంగల్లును పాలించిన చితాబ్‌ఖాన్ అని గుర్తించారు. తెలంగాణలో రాయల చేతిలో ఓడిపోయిన చితాబ్‌ఖాన్ కటకం చేరి గజపతి ఆదేశంపై మార్గమధ్యంలో రాయల సైన్యంపై దాడి చేసి ఉంటాడు. అతికష్టం మీద రాయలు చితాబ్‌ఖన్‌ను ఓడించి తరిమాడు. అతడు పారిపోయి కోటలో దాక్కున్నాడు అని రాయలవాచకం తెలుపుతోంది. కాని అతడు ప్రవేశించిన కోట పేరు రాయవాచకం ఇవ్వలేదు. చితాబ్‌ఖాన్ పారిపోయిన తర్వాత శ్రీకృష్ణదేవరాయల సైన్యాలు కటకాన్ని చేరాయి.

కటక దండయాత్రా కాలంలో రాయల సైన్యం గజపతి రాజ్యాన్ని ఏ విధంగా ధ్వంసం చేసిందీ నాటి తెలుగు సాహిత్యం, ముఖ్యంగా మనుచరిత్ర, ఆముక్తమాల్యద వర్ణించాయి. ఉదయగిరి, కొండవీడులను జయించి, జమ్మిలోయలో నుండి వేంగిలో ప్రవేశించి వేంగి, కోనసీమ, కొట్టాం, మత్స్య రాజధాని వడ్డాది, కనకగిరి, పొట్నూరు, వీరఘట్టం, సప్తమాడెములను జయించుకుంటూ కటకం చేరామని వర్ణిస్తున్నాయి. వడ్డాది రాజ్యాన్ని రాయల సేనలు ధ్వంసం చేశాయట. మార్గంలో పూరీలో (నీలాచలం) జగన్నాథస్వామిని రాయలు సేవించాదని

ఆముక్తమాల్యద తెలుపుతోంది. ఈ దండయాత్రా కాలంలోనే కొండ మరుసయ్య శ్రీకూర్మంలో విజయస్తంభం ప్రతిష్టించి ఉంటాడు. తర్వాత కటకాన్ని జయించి దగ్ధం చేశాడని కృష్ణరాయల ప్రతాపం మొత్తం గౌడదేశాన్ని భస్మీపటలం చేసిందని సాహిత్యం వర్ణిస్తోంది. తన యుద్ధ సైనికుల యుద్ధభేరి మోత వినగానే గజపతి పారిపోయాడని ఆముక్తమాల్యద వర్ణించింది. ఈ విధంగా విజయఘోషలతో విజయనగర సైన్యం కటకాన్ని చేరిందని సాహిత్యం ఘోషిస్తోంది. యుద్ధాన్ని గురించి రాయవాచకం, కృష్ణరాయ విషయం మరికొన్ని వివరాలను ఇస్తున్నాయి. రాయల సైన్యం తన రాజధాని కటకం చేరగానే గజపతి తన సామంతులైన మహాపాత్రులనందరిని రప్పించి పెద్ద సేనను తయారుచేసి యుద్ధానికి సిద్ధపడ్డాడు. పొట్నూరులో రాయలు సవాలు చేసినా గజపతి యుద్ధానికి రాలేదు. కాని రాయల సైన్యం తన రాజధానిని ముట్టడించడంతో చివరిసారిగా ప్రత్యక్షంగా తలపడ్డాడు. గజపతి సైన్యాన్ని చూసి మహామంత్రి తిమ్మరసు వారిని గెలవడం కష్టమని గ్రహించాడు. కనుక గజపతి సైన్యంపై భేదోపాయాన్ని ప్రయోగించి విజయం సాధించాలని తలచి వ్యూహం పన్నాడు. గజపతి సేనాధిపతులు 16గురు పాత్రులు రాయలతో కలసిపోవడానికి సిద్ధంగా ఉన్నారని లేఖలు సృష్టించి గజపతికి అందేలా చేశాడు. దాంతో తన సేనాధిపతులు తనపై కుట్రకు పూనుకున్నారని అనుమానించి యుద్ధం చేయకుండా వెళ్లిపోయాడని, దాంతో రాయలు కటకంపై దాడి చేసి నగరాన్ని దగ్ధం చేశాడని ఆ కావ్యాలు చెబుతున్నాయి. కనుక తిమ్మరుసు వ్యూహమే ఈ విజయానికి కారణమనే జానపద గాథ కూడా ఉంది. న్యూనిజ్ గజపతితో సంధి జరిగిన తర్వాత కృష్ణరాయలు కాటూరును జయించాడని రాశాడు. కృష్ణశాస్త్రి దానిని కటకంతో పోల్చాడు. యస్. కృష్ణస్వామి అయ్యంగార్ దానిని శివసముద్రంతో పోల్చారు. కొందరు దానిని చిత్తూరు జిల్లా కార్వేటినగర్ జమీందారీలో ఉన్న కాదవర్‌గా పోల్చారు. ఈ పేరు పల్లవులు పెట్టారు. శివసముద్రంపై రాయలు చేసిన దాడిని తెలుగు సాహిత్యంలో వర్ణించారు. సరిగ్గా ఆ వర్ణన న్యూనిజ్ వర్ణించిన కాటూరుకు సరిపోతోంది. కనుక దానిని శివసముద్రంతో పోల్చారు. అది చోళమండలంలో ఉందని భావిస్తారు. శివసముద్రం, ఉమ్మత్తూరు, శ్రీరంగ పట్టణాలలో గంగరాజు కృష్ణరాయల తొలిరోజులలో తిరుగుబాటు చేశాడు. అతనిని రాయలు ఓడించాడు. కాని ఈ కాటూరు తమిళదేశంలో కొయట్టూర్ అని గుర్తించారు. కనుక ఇది కటకం కాదు. కాని కటకాన్ని ముట్టడించి దగ్ధం చేసింది వాస్తవమే. ఈ విధంగా కృష్ణదేవరాయలు క్రీ.శ.1513 నుండి 1519 వరకు ఆరేడు సంవత్సరాల కాలంలో ఆరు దశలుగా గజపతి రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించాడు.

1. ఉదయగిరి రాజ్యం ఆక్రమణ మొదటిదశ
2. కొండవీడు రాజ్య ఆక్రమణ రెండవదశ
3. కొండపల్లిని ఆక్రమించడం మూడవదశ
4. తెలంగాణను జయించడం నాల్గవదశ
5. వేంగి రాజమహేంద్రవరాలను జయించుకుంటూ సింహాచలం, పొట్నూరు వరకు ఆక్రమించడం ఐదవదశ
6. కటకం దండయాత్ర ఆరవదశ. ఈ ఆరుదశలలో గజపతిరాజ్యం పూర్తిగా రాయలవశం అయింది.

సంధి: తర్వాత సంధి ప్రయత్నాలు జరిగాయి. తన రాజ్యానికి ఎంత నష్టం జరిగినా అంతవరకు సంధికి అంగీకరించక భీష్మించుకొని కూర్చున్న ప్రతాపరుద్ర గజపతి గొప్ప మానధనుడు. కాని చివరకు సంధికి అంగీకరించక తప్పలేదు. తన కుమారుడు వీరభద్ర గజపతి మరణించడం, తన భార్య శత్రువు చేతికి చిక్కడం, తన రాజధాని కటకం అగ్నికి ఆహుతి కావడం, తన రాజధానిలోనే తనకు భద్రతలేకపోవడం, ఇవన్నీ గజపతిని సంధికి అంగీకరింపజేసి ఉండవచ్చును. ప్రతాపరుద్ర గజపతి సంధికి అంగీకరిస్తూ తన కుమారుడు ఎలా మరణించాడు? తన రాణి ఏమైనదీ తెలియదు. ఏ విధంగా సంధి చేసుకోవాలి అని సాళువ తిమ్మరసుకు లేఖ రాశాడు. తిమ్మరుసు నీ కుమార్తెను కృష్ణరాయలకు ఇచ్చి వివాహం చేయాలి, తర్వాత గజపతి రాజ్యభాగాలన్నీ అతనికి తిరిగి ఇచ్చివేయబడతాయి. నీ రాణి కూడా రాచ మర్యాదలతో కటకం పంపబడుతుందని తమ షరతులు వివరించాడు. గజపతికి తన కుమార్తెను ఇవ్వడం ఇష్టం లేదు. కాని తూర్పువైపు విజయనగర సామ్రాజ్యానికి శాశ్వత రక్షణ ఉండాలంటే గజపతితో గట్టి సంధి జరగాలి. అందుకు గజపతి కుమార్తెను వివాహం ఆడటం ఒక్కటే మార్గమని కృష్ణరాయలు, తిమ్మరుసు నిర్ణయించుకున్నారు. కనుక వివాహషరతు తప్పనిసరి అని అన్నారని న్యూనిజ్ రాశాడు. అందుకోసం ఎంతో కష్టపడి గెలుచుకున్న రాజ్యాన్ని వదులుకోవడానికి కూడా సిద్ధపడ్డాడు. చివరకు గజపతి అంగీకరించాడు. గజపతిని పెండ్లి షరతుకు ఒప్పించడానికి క్రీ.శ.1519 ఆగస్టు మాసంలో సంధి

జరిగింది. గజపతి తన కుమార్తెను రాయలకు ఇచ్చి వివాహం చేశాడు. కృష్ణదేవరాయలు కృష్ణానదికి ఉత్తర ప్రాంతమంతా తిరిగి ప్రతాపరుద్ర గజపతికి తిరిగి ఇచ్చివేశాడు. వివాహం తర్వాత గజపతి రాయలకు కొన్ని గ్రామాలు ఇచ్చినట్లుగా ఉంది. రాయలు ఆ గ్రామాలను క్రీ.శ.1519వ సంవత్సరంలో సింహాచల నరసింహునికి దానం ఇచ్చి శాసనాలు రాయించాడు. తర్వాత తన రాజధానికి బయలుదేరాడు. మార్గమధ్యలో అతడు శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు దేవాలయాన్ని దర్శించాడు. అక్కడ రాయలకు ఆంధ్రమహావిష్ణువు కలలో కనిపించి ఆముక్తమాల్యద రచించమని ఆదేశించాడట. ఈ సంఘటన క్రీ.శ.1519 నవంబర్ 3వ తేదీన జరిగిందని అక్కడి శాసనాన్ని బట్టి నిర్ణయించారు. ఆంధ్ర మహావిష్ణువు ఆదేశం ప్రకారం అతడు తన రాజధాని చేరిన తర్వాత ఆముక్తమాల్యదను రచించి తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితం ఇచ్చాడు. ఆంధ్రమహావిష్ణువు ఆదేశం ప్రకారం రచించిన ఆ కావ్యాన్ని శ్రీకాకుళ దేవునికి అంకితం ఇవ్వలేదు. అందుకు కారణం శ్రీకాకుళం తన రాజ్యంలో లేదు. అందువల్ల అంకితం ఇచ్చి ఉండకపోవచ్చును. కనుక తన ఇష్టదైవమైన తిరుపతి వేంకటేశ్వరస్వామికి అంకితం చేశాడు.

గజపతి రాకుమారి వివాహ చర్చ: కృష్ణరాయలు గజపతి కుమార్తెను వివాహమాడలేదని కొందరు పండితులు తిరస్కరించారు. వారు చూపిన కారణమేమిటంటే శ్రీకృష్ణరాయలు అనేక దేవాలయాలలో దానాలు చేశాడు. కాళహస్తి, తిరుమల, సింహాచలం శాసనాలలో ఇద్దరు భార్యల పేర్లే ఉన్నాయి. చిన్నాదేవి, తిరుమలదేవిల పేర్లు మాత్రమే ఉన్నాయి. మూడవ భార్య పేరులేదు. కనుక ఈ వివాహం జరుగలేదు. ఇది ఒక కథ మాత్రమే. అంతేగాక విజయనగరానికి చెందిన ఏ పత్రాలలో ఆమె పేరు గాని, వివాహం జరిగినట్లుగాని నమోదుకాలేదు అని అన్నారు. కాని వారు చెప్పేది వాస్తవం కాదు. పై శాసనాలలో గజపతి రాకుమారి పేరు లేకపోవడానికి కారణం, ఆ శాసనాలు వివాహానికి ముందు చెక్కించినవి. విజయనగర పత్రాలలో ఆమె వివాహం నమోదు కాకపోవడం అంటే, పురుషోత్తమ గజపతి, కంచి రాజకుమార్తె వివాహం కూడా విజయనగర పత్రాలు నమోదు చేయలేదు. గజపతుల పత్రాలు కూడా నమోదు చేయలేదు. అలాగే ఈ వివాహాన్ని నమోదు చేసి ఉండకపోవచ్చును. ఏమైనా గజపతి కుమార్తెకు కృష్ణరాయలతో వివాహం జరిగిందనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. రాయవాచకం, కృష్ణరాయల విజయం, న్యూనిజ్ రచనలు, లక్ష్మీనారాయణ సంగీత సూర్యోదయం, అల్లసాని పెద్దన చాటువులు, చామర్లకోట కైఫీయత్తు, ప్రభోద చంద్రోదయం, తమిళ కవికుమార సరస్వతి రచించిన తమిళ నవలార్ చరిత్రై, ఇంకా అనేక గ్రంథాలు ఈ వివాహాన్ని గురించి పేర్కొన్నాయి. కాని వీరిలో ఎవరూ ఆమె పేరు రాయలేదు. ప్రభోద చంద్రోదయం రాసిన నాదెండ్ల గోప (ఇతడు తిమ్మరుసు మేనల్లుడు) మాత్రం ఆమె పేరు భద్ర అని రాశాడు. ఆమెకు తుక్కాంబ అని పేరుందని తుక్క పంచకం అనే గ్రంథం తెలుపుతోంది. ట్రైలర్ అనే పండితుడు ఆమె పేరు రుకిదేవి అని రాశాడు. కనుక ఈ వివాహం జరిగిందని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. కాని ఆమెను రాయలు సరిగా ఆదరించలేదని కథలు వాడుకలో ఉన్నాయి. తన కుమార్తెను రాయలకు ఇవ్వడం ఇష్టం లేక గజపతి రాయలను పొడవమని ఆదేశించాడని, కాని తిమ్మరసు ప్రజ్ఞవలన రాయలు ఆ ప్రమాదం నుండి తప్పించుకున్నాడని, అందువల్ల రాయలు ఆమెను ఆదరించలేదని నిరాదరణకు గురైన ఆమె ప్రకాశంజిల్లాలోని కంభంలో నివసించిందని ఒక కథ ప్రచారంలో ఉంది. అలాగే మరొక కథ కూడా ప్రచారంలో ఉంది. ఆమె రాయలతో బయలుదేరి కంభం వరకు వచ్చేటప్పటికి రాయలు క్షత్రియుడు కాదని తెలిసిందని, కనుక ఆమె విజయ నగరం రానని, అక్కడే, అంటే కంభంలోనే ఉండిపోతానని రాయలకు చెప్పిందని, అందుకు రాయలు ఆమెను అక్కడ వదిలిపెట్టి తాను విజయనగరం చేరాడని మరొక కథ ఉంది. ఆమె కంభంలో నివసిస్తూ ఉండగా తండ్రి ఆమెకు ధనం పంపేవాడని, చివరిదశలో ఆమె తన ఆభరణాలన్నీ అమ్మి కంభం చెరువు నిర్మించిందని మరొక కథ ఉంది. ఆమె నిర్మించిన కంభం చెరువు నేడు కూడా ఉంది. ఆంధ్రదేశంలోని చెరువులన్నింటిలోను అది పెద్ద చెరువని అంటారు. ఆ చెరువు అలుగే గుండ్లకమ్మ నది. ఆమెను గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

కృష్ణరాయల రాజకీయ అవివేక చర్య: గజపతి కుమార్తెను వివాహం ఆడటంతో మల్లికార్జునరాయల కాలం నుండి విజయనగర రాజ్యానికి గజపతులు చేసిన అవమానాలన్నీ ఒక దెబ్బతో బదులుకు బదులు తీర్చాడు. గజపతులు విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేసినట్లు రాయలు కూడా కళింగ రాజ్యాన్ని ధ్వంసం చేశాడు. కపిలేశ్వరుడు విజయనగరాన్ని ముట్టడించినట్టు రాయలు కటకాన్ని ముట్టడించాడు. పురుషోత్తముడు విజయనగరంలో సాక్షి గోపాలుని విగ్రహాన్ని తీసుకొనిపోయినందుకు రాయలు ఉదయగిరిలో బాలకృష్ణుని

విగ్రహం తెచ్చాడు. పురుషోత్తముడు కర్ణాటక రాజకుమార్తెను వివాహం ఆడినందుకు రాయలు గజపతి కుమార్తెను వివాహం ఆడాడు. సాళువ నరసింగరాయని మరణ ఘోషను ఎవరూ తీర్చలేకపోయారు. అది కూడా తీర్చి కొండవీటి రాజ్యాన్ని ఉదయగిరి రాజ్యాన్ని సామ్రాజ్యంలో కలిపాడు. కాని ఇవన్నీ రాయల రాజకీయ అవివేక చర్యలు అని చెప్పవచ్చును. రాయలు తన దండయాత్ర వలన గజపతిరాజ్యం తిరిగి కోలుకోలేనంతగా బలహీనపరచాడు. గజపతుల బలహీనతను ఆసరాగా తీసుకొని గోల్కొండ నవాబులు ఆంధ్రదేశాన్ని సునాయాసంగా ఆక్రమించారు. గజపతి రాజ్యం బలంగా ఉంటే ఆంధ్రదేశ చరిత్రలో గోల్కొండ యుగం ఉండేది కాదు. బహమనీ రాజ్యం విచ్ఛిన్నం కాగానే గోల్కొండ స్వతంత్ర రాజ్యంగా ఏర్పడింది. దానిని అవలీలగా గజపతులు జయించి గోల్కొండ కోటతో సహా తమ సామ్రాజ్యంలో కలుపుకొని ఉండేవారు. కృష్ణరాయలు జరిపిన అనేక దాడులు గజపతులను నిర్వీర్యం చేశాయి. ఈ కాలంలో దేశం మొత్తంలో కృష్ణరాయలు ప్రతాపరుద్ర గజపతులు అత్యంత శక్తిమంతులు. వారికి సాటి ఎవరూ లేరు. వారిద్దరూ కలసికట్టుగా వ్యవహరించి ఉంటే దక్కనులోని బహమనీ రాజ్యం నామరూపాలు లేకుండా చేయగలిగేవారు. వింధ్యపర్వతాల వరకు వారి సామ్రాజ్యం విస్తరించి ఉండేది. అంతేగాదు. గజపతులు అనేక పర్యాయాలు బెంగాలు, జౌన్పూరు, మాళ్వా, బహమనీ సుల్తాన్లను ఓడించి తమశక్తిని చాటి ఉన్నారు. విజయనగర రాజ్యం అండదండలు వారికి ఉంటే వారి సామ్రాజ్యం ఉత్తర హిందూస్థానంలోకి కూడా చొచ్చుకొని పోయి ఉండేది. వీరి కాలంలో ఢిల్లీ సింహాసనంపై అతి బలహీనుడైన ఇబ్రహీం లోడీ ఉన్నాడు. అతనిని రాజస్థాన్లోని సంగ్రామ సింహుడు ఓడించి ఉన్నాడు. ఈ ముగ్గురు కలసినట్లయితే భారతదేశం మొత్తంలోనే ముస్లిం రాజ్యం ఉండేది కాదు. కాని వారికి అలాంటి తలంపు రాలేదు. కనీసం దక్షిణదేశంలోనైనా వారు కలసికట్టుగా వ్యవహరించినట్లయితే బహమనీ రాజ్యాలు అంతరించి ఉండేవి. ఈ రెండు రాజ్యాలకు సంధి జరిగిన తర్వాత గోల్కొండ నవాబు కులీకుతుబ్షా గజపతి రాజ్యంపై దండెత్తాడు. బీజాపూర్ సుల్తాన్ రాయచూర్, ముద్గల్పై దండెత్తాడు. అప్పుడైనా వారు కలసికట్టుగా వ్యవహరించలేదు. అప్పటికి వారు బంధు రాజ్యాలు కూడా అయ్యాయి. కాని వారికి కలసి ఉండాలనే తలంపు రాలేదు. వారి శక్తి ఒకరి మీద ఒకరు ప్రదర్శించుకొని ఉభయ రాజ్యాలు నష్టపడేలా చేసుకొన్నారు. కృష్ణరాయలు ఎంతో ధనం ఖర్చు పెట్టి ఉంటాడు. గజపతుల యుద్ధంలో ఎంతో మంది విజయనగర వీరులు మరణించి కూడా ఉంటారు. ఆ శక్తినంతా గజపతిపై చూపాడు అదే శక్తి బహమనీలపై చూపినట్లయితే దక్షిణ భారతదేశ చరిత్ర మరొక విధంగా ఉండేది. పైగా గుల్బర్గాను జయించి కూడా తిరిగి వారికే ఇచ్చివేశాడు. రెండు శతాబ్దాలుగా విజయనగరాన్ని అంతం చేయాలనే తలంపులో ఉన్న బహమనీ రాజ్యానికి అది జీవనం పోయడమే. అది మరొక చేశాయి. ఎప్పుడు తమ రాజ్యాల మీదపడతాడోనని వారు గడగడలాడి, వారు ఐక్యంగా ఉండటానికి కూడా దారితీసింది. ఇది ఆ తర్వాత విజయనగర రాజ్య పతనానికి దారి తీసింది. గజపతులకు మరొక నష్టం కూడా కలిగింది. వీరభద్ర గజపతి మరణించకుండా ఉంటే గజపతి రాజ్యం మరొక తరం అయినా నిలచి ఉండేది. కనుక గజపతులపై కృష్ణరాయల దండయాత్ర రాజకీయ అవివేక చర్య అని స్పష్టంగా చెప్పవచ్చును.

ప్రతాపరుద్ర గజపతి-సుల్తాన్ కులీకుతుబ్షా క్రీ.శ.1520-1538: కృష్ణదేవరాయలతో సంధి జరిగిన తర్వాత గజపతి సామ్రాజ్యపు దక్షిణ సరిహద్దులో శాంతి ఏర్పడింది. రాయలు కృష్ణకు ఉత్తరపు ప్రాంతాలన్నీ గజపతికి ఇచ్చివేశాడు. ఖమ్మంమెట్టు, కొండపల్లి, రాజమహేంద్రవర కోటలు తిరిగి గజపతి ఆధీనంలోకి వచ్చాయి గజపతి తన అధికారులను ఆ ప్రాంతాలపై నియమించాడు. వారు ఆ ప్రాంతాలను పరిపాలించసాగారు. దాంతో కొండపల్లి గజపతి సామ్రాజ్యానికి దక్షిణపు రాష్ట్రం అయింది. అంతకు పూర్వం కొండవీడు దక్షిణ వైస్ రాయల్టీగా ఉండేది. అది కృష్ణరాయలు తన సామ్రాజ్యంలో కలుపుకొన్నాడు. అందువల్ల ఇప్పుడు కొండపల్లి దక్షిణపు వైస్ రాయల్టీ అయింది. కృష్ణరాయల ప్రమాదం తప్పిపోయింది కాని, గజపతికి మరొక ప్రమాదం ముంచుకు వచ్చింది ఇదే కాలంలో గోల్కొండ కుతుబ్షాహీ వంశస్థుడైన కులీకుతుబ్షా గజపతిరాజ్యంపై దాడులు ప్రారంభించాడు కృష్ణరాయలు, ప్రతాపరుద్ర గజపతి యుద్ధకాలంలో బహమనీ రాజ్యంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. మూడవ మహమ్మాద్ కుమారుడు మహమూద్షా కాలంలో బహమనీ సామ్రాజ్యం శీఘ్రగతిన క్షీణించసాగింది. అతని బలహీనతను ఆసరాగా తీసుకొని బహమనీ సర్దారులు సొంత రాజ్యాలు ఏర్పాటు చేసుకొనే ప్రయత్నాలు ప్రారంభించారు. వారిలో గోవా పాలకుడైన బహుదూర్ జిలాని ప్రధముడు. అతడు స్వతంత్రం ప్రకటించాడు. అతడు జంబుఖండి దుర్గాన్ని కేంద్రంగా చేసుకొని సుల్తాన్ను ప్రతిఘటించాలని నిర్ణయించుకున్నాడు. అతనిని

అణచడానికి సుల్తాన్ తెలంగాణ గవర్నర్ అయిన కుతుబుల్ ముల్క్ దక్కని నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. అతనితోపాటు సుల్తాన్ కూడా యుద్ధానికి తరలివెళ్లాడు. కాని ఆ యుద్ధంలో కుతుబుల్ ముల్క్ మరణించాడు. దాంతో కులి హందాని అనే సరదారుని గోవా యుద్ధ నిర్వహణకు సేనాధిపతిగా నియమించాడు. కులీహందాని పర్షియా లేక ఇరాన్ దేశానికి చెందినవాడు. అతడు బహమనీ రాజ్యం చేరి మూడువ మహమ్మద్‌షా కుమారుడైన మహమూద్ కాలంలో బీదరు కొలువులో చేరాడు. అతడు తన యుద్ధనైపుణ్యంతో త్వరితగతిన ఎదిగి ఖవాస్‌ఖాన్ అనే బిరుదు పొందాడు. క్రీ.శ.1487వ సంవత్సరంలో బీదర్‌నగరంలో అషాకీ దక్కనీ ముస్లింల మధ్య సంఘర్షణ జరిగి సుల్తాన్‌పై హత్యాప్రయత్నం జరిగింది. ఆ సమయంలో కులీ సుల్తాన్ ప్రాణాలను రక్షించి అతనికి ప్రీతిపాత్రుడయ్యాడు. దాంతో కులీ ప్రాభవం ప్రారంభమైంది కులీని యుద్ధసేనాధిపతిగా నియమించి అతనికి సుల్తాన్ కుతుబుల్‌ముల్క్ అనే బిరుదు ఇచ్చి యుద్ధానికి పంపాడు. కులీగోవాయుద్ధంలో విజయం సాధించాడు ఆ యుద్ధంలో అతడు జంబుఖండినే గాక మిరాజ్ మొదలైన దుర్గాలను కూడా జయించి జిలాని తిరుగుబాటును పూర్తిగా అణచివేశాడు. అందుకు ప్రతిఫలంగా సుల్తాన్ అతనికి కొల్కార్, గుర్గి, మరికొన్ని తెలంగాణ ప్రాంతాలు జాగీరుగా ఇచ్చాడు. ఆ తర్వాత కూడా క్రీ శ.1493లో అతడు ఇతర ప్రాంతాలలో కూడా అనేక మంది అవిధేయ సరదారులను ఓడించి అనేక విజయాలు సాధించాడు. దోపిడీ దొంగలను అణచి తెలంగాణలోని గోల్కొండకోటను, దాని పరిసర ప్రాంతాలన్నింటినీ కులీ జాగీరులో చేర్చాడు. అంతేగాక తెలంగాణలోని అన్ని జాగీరుదారులపై అమీరుగా నియమించి అమీర్ ఉల్ ఉమ్మా అనే బిరుదును కూడా ఇచ్చి సత్కరించాడు. దాంతో కులీ బహమనీ రాజ్యపు అత్యంత ప్రముఖ సర్దారులలో ఒకడు అయ్యాడు. దాంతో దక్షిణభారతదేశపు చరిత్రలో గోల్కొండ రాజ్యం జన్మించింది. సుల్తాన్ అతనికి ఇచ్చిన కుతుబ్ ఉల్‌ముల్కు బిరుదువల్లనే అతని వంశానికి కుతుబ్‌షాహి వంశం అని పేరు వచ్చింది.

కులీ తెలంగాణ గవర్నర్ అయిన తర్వాత అతడు తెలంగాణలోని తెలుగు ప్రాంతాలన్నీ జయించాలని సంకల్పించాడు. క్రీ.శ.1513-1519 సంవత్సరాల మధ్య గజపతి, కృష్ణరాయలకు యుద్ధాలు జరిగే కాలంలో అతడు తెలంగాణలోని అనేక ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. అతడు రాచకొండపై దండెత్తి రాజా వెంకట్టినాయగ్‌ను ఓడించి బందీగా పట్టుకొని కోటను ఆక్రమించాడు. ఇదే సమయంలో ఎలుంగూర్, ములుగూర్‌లను స్వతంత్రంగా పాలించే కవామ్ ఉల్‌ముల్కుతుర్క్ అనే సర్దారుడు కులీ రాజ్యంపై దండెత్తాడు. ఈ కాలంలో బహమనీ సుల్తాన్ బలహీనత వల్ల అనేక మంది సర్దారులు స్వతంత్రం ప్రకటించారు. స్వతంత్రులైన సరాదారులు ఎవరికివారే తమ రాజ్యాలను విస్తరించుకోవాలనే దురాశతో ఒకరి జాగీరులపై ఒకరు దండెత్తసాగారు. సుల్తాన్ స్వతంత్రించిన సర్దారులను అదుపులో పెట్టగలిగిన స్థితిలో లేదు. ఆ విధంగా స్వతంత్రం ప్రకటించుకున్న సర్దారులలో కవామ్ ఉల్ ముల్క్ ఒకడు. అతడు కులీ జాగీరులోని భాగాలను కబళించాలని కులీ రాచకొండ రాజుతో పోరాడే సమయంలో గోల్కొండరాజ్యంపై దండెత్తాడు. కులీ వెంటనే అతనిపై దండెత్తి ఓడించి తరిమాడు. ఓడిపోయిన కువామ్ బేరారువెళ్లి అక్కడ తన లాగా స్వతంత్రం ప్రకటించిన అల్లావుద్దీన్ ఇమద్‌షా అక సుల్తాన్ దర్యా ఇమాద్ ఉల్ ముల్కు సహాయం అర్థించాడు. అల్లావుద్దీన్ అంగీకరించి కులీరాజ్యంపైకి వచ్చాడు. వారిని కులీ రామ్‌గిర్ వద్ద ఓడించి తరిమి తన రాజ్యాన్ని దక్కించుకున్నాడు. తర్వాత నల్లగొండ పాలకుడు హరిచంద్‌ను ఓడించి నల్లగొండను ఆక్రమించాడు. ఈ విధంగా కులీకుతుబ్‌షా తాను తెలంగాణ గవర్నర్‌గా నియమింపబడిన తర్వాత ఒకవైపు హిందూరాజులతో మరొకవైపు తన సాటి బహమనీ సర్దారులతో పోరాడుతూ తన రాజ్యాన్ని, అధికారాన్ని పటిష్టపరచుకున్నాడు.

ఒక అజ్ఞాత చరిత్రకారుడు కులీకుతుబ్‌షా అతడు కత్తి పట్టిన నాటి నుండి తన 60 సంవత్సరాలలో వరంగల్లు నుండి మచిలీపట్నం వరకు, అక్కడి నుండి రాజమహేంద్రవరం వరకు 60-70 కోటలను జయించాడని రాశాడు. అందులో రాజుకొండ, కోవెలకొండ, దేవరకొండ, పానుగల్లు, గుణపూర్, జిర్‌కొండ, యెల్ గుండెల్, ములంగూర్, ఎట్‌గార్, మెదుక్‌బొవున్‌గర్, బెలుమ్‌కొండ, ఉరుంగోల్, కుమ్మమెట్టు, ఇంద్రకొండ, రామ్‌గర్, కొండపల్లి, ఎల్లార్, చికాకోల్ మొదలైన దుర్గాలను కులీ కుతుబ్‌షా స్వయంగా సాధించాడని ఆ అజ్ఞాత చరిత్రకారుడు వర్ణించాడు. ఈ కోటలన్నీ జయించానని సుల్తానే స్వయంగా ఒక చరిత్రకారునికి తెలిపాడని, వానిని ఆ చరిత్రకారుడు తన గ్రంథంలో రాశాడని ఆ గ్రంథం నుండి తాను ఈ విషయాలను తీసుకున్నానని ఈ అజ్ఞాత చరిత్రకారుడు తెలిపాడు. కాని ఈ కోటలను కులీ ఎప్పుడు జయించినదీ స్పష్టంగా తెలియదు.

శ్రీ హరూన్‌ఖాన్ షేర్వాణీ క్రీ.శ.1504వ సంవత్సరంలో ఖమ్మంమెట్టు రాయసీతాపతి ఒరిస్సా రాజైన రామచంద్రరాజు సహాయంతో ఓరుగల్లుపై దండెత్తి ఆక్రమించాడని, అప్పుడు కులీ ఓరుగల్లుపై దాడిచేసి సీతాపతి రామచంద్రరాజులను ఓడించాడని, అందువల్ల బహమనీ రాజ్యానికి ఒరిస్సా రాజ్యానికి గోదావరి సరిహద్దు అయిందని, కనుక ఏలూరు, రాజమహేంద్రవరాలు కొన్నాళ్లు కుతుబుల్ ముల్కు ఆధీనంలో ఉన్నాయనీ రాశాడు. కాని షేర్వాణి రాతలను చాలా మంది పండితులు అంగీకరించలేదు. కృష్ణరాయలు గజపతి రాజ్యంపై దండెత్తే నాటికి ఈ ప్రాంతాలన్నీ ప్రతాపరుద్ర గజపతి ఆధీనంలో ఉన్నాయి. రాయలు కొండపల్లిని స్వాధీనం చేసుకున్న తర్వాత తెలంగాణపై దండెత్తి గజపతి ఆధీనంలోని అన్నికోటలను జయించాడు. వాటిలో దేవరకొండ, నల్లగొండ, ఖమ్మంమెట్టు, శంకరగిరి, ఇవ్వబద్దాయి. కనుక ప్రతాపరుద్ర గజపతి రాజ్యానికి వచ్చిన క్రీ.శ.1496వ సంవత్సరం నుండి ఈ ప్రాంతాలన్నీ అతని ఆధీనంలోనే ఉన్నాయి. కనుక క్రీ.శ.1504వ సంవ్సరంలో కులీ ఈ ప్రాంతాలన్నింటినీ జయించాడని, రాజమహేంద్రవరం వరకు అతని ఆధీనంలో ఉందని చెప్పడం సమంజసంగా లేదు అని ఇతర పండితులు షేర్వాణి వాదనను ఖండించారు. సీతాపతి కులీ సంఘర్షణ కుతుబ్‌షాహి రాజ్య విస్తరణ క్రీ.శ.1519వ సంవ్సతరం తర్వాత అయి ఉండాలిగాని క్రీ.శ.1504-05 సంవత్సరాలలో జరగటానికి ఎలాంటి పరిస్థితులలోనూ వీలుకాదని వారివాదన. క్రీ.శ.1505వ సంవత్సరంలో ఒకవేళ సీతాపతికి కులీకి ఘర్షణ జరిగి ఉంటే అందులో కులీ ఓడిపోయి ఉండాలి. అంతేగాక గజపతిరాజ్యం తెలంగాణలోకి విస్తరించి ఉండాలి. కారణమేమిటంటే 1513లో కృష్ణదేవరాయల దండయాత్రా కాలం నాటికి ఆ ప్రాంతాలన్నీ ప్రతాపరుద్ర గజపతి ఆధీనంలో ఉన్నాయి. ఒకవేళ కులీ రాజమహేంద్రవరం వరకు విజయాలు సాధించడం వాస్తవం అయితే అతడు యువకుడుగా మూడు మహమ్మద్‌షా కాలంలో అంటే పురుషోత్తమ గజపతి కాలంలో గజపతిరాజ్యంపై జరిగిన దండయాత్రలో కులీ యువసైనికుడిగా పాల్గొని ఉండవచ్చును. ఒకవేళ క్రీ.శ.1505లో వాస్తవంగానే చితాబ్‌ఖాన్‌తో పోరాటం జరిగి ఉంటే కులీ ఆ యుద్ధంలో ఓడిపోయి ఉండాలి. కనుక ఈ విజయాలన్నీ అతడు బహమనీ సర్దారుగా ఉన్నప్పుడు జరిగినవని భావింపవచ్చును. కాని అవన్నీ తెలంగాణకు మాత్రమే పరిమితమైనవని స్పష్టంగా చెప్పవచ్చును. కులీ అధికారం రాజమహేంద్రవరం వరకు విస్తరించడం క్రీ.శ1519వ సంవత్సరం తర్వాతనే అయి ఉండాలి. అందుకు కారణమేమిటంటే క్రీ.శ.1518వ సంవత్సరంలో బహమనీ సుల్తాన్ మహమూద్ మరణించాడు. అతని మరణంలో అంతకుముందు స్వతంత్రవైఖరిని అవలంబించిన ఆదిల్‌ఖాన్ మొదలైన సర్దారులు పూర్తి స్వతంత్రం ప్రకటించారు. వారితోపాటు కులీకుత్‌బ్‌షా కూడా స్వతంత్రుడయ్యాడు. ఇదేకాలంలో కృష్ణరాయలకు, గజపతికి జరిగిన ఆరు సంవత్సరాల యుద్ధంలో గజపతిరాజ్యం బాగా బలహీనపడింది. కనుక గజపతి రాజ్యభాగాలను సులభంగా వశపరచుకోవచ్చునని కులీ తలచి ఉండవచ్చును. అంతకుముందు హిజారా 918, క్రీ.శ. 1512వ సంవత్సరంలో సుల్తాన్ పేరును ఖుద్బా నుండి తొలగించాడు. సుల్తాన్‌కు పేష్కస్ పంపడం మానివేశాడు. గోల్కొండ కోటను పటిష్టంగా నిర్మించి తన రాజ్యాన్ని సుస్థిరపరచుకొన్నాడు. ఈ సమయంలో క్రీ.శ.1518వ సంవత్సరంలో సుల్తాన్ మరణించాడు. ఇతర సర్దారులతోపాటు కులీ కూడా పూర్తిగా స్వతంత్రుడయ్యాడు. ఇదే సమయంలో శ్రీకృష్ణదేవరాయల గజపతి రాజ్య దిగ్విజయ యాత్ర తర్వాత క్రీ.శ.1520-21వ సంవత్సరంలో రాయచూరు, అంతర్వేది ప్రాంతాల ఆధిపత్య విషయంలో రాయలకు బీజాపూరు సుల్తాన్‌తో యుద్ధం వచ్చింది. కృష్ణదేవరాయలు రాయచూరు యుద్ధంలో నిమగ్నుడయ్యాడు. బలహీనమైన గజపతిరాజ్యంపై దండెత్తడానికి అది మంచి అవకాశంగా భావించి కులీ తన రాజ్య విస్తరణకు పూనుకొని ఉండవచ్చును.

కులీ స్వతంత్రుడైన సమయంలో అంటే క్రీ.శ.1518వ సంవత్సరంలో అతని రాజ్యం కోహిర్, ఓరుగల్లు మధ్య ప్రాంతానికి మాత్రమే పరిమితమైంది. ఓరుగల్లు నుండి తూర్పు తీరం వరకు గజపతుల సామంతులైన సీతాపతి పరిపాలిస్తున్నాడు. రాచకొండ, దేవరకొండ, నల్లగొండ దుర్గాధిపతులు స్వతంత్రంగా పాలిస్తున్నట్లు కులీ తెలంగాణ దండయాత్ర రాచకొండతో ప్రారంభమైందని చెప్పవచ్చును. ఆనాడు రాచకొండను వెంకుట్టినాయగ్ పాలిస్తున్నాడు. అతనిని ఓడించి బందీగా పట్టుకొని కోటను స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత దేవరకొండ, పానుగల్లు, ఘనాపూర్‌లు స్వాధీనమయ్యాయి. తర్వాత హరిచంద్‌ను ఓడించి నల్లగొండను ఆక్రమించాడు. తర్వాత ఇస్మాయిల్ ఆదిల్‌షాతో పోరాడి కోవెలకొండను ఆక్రమించాడు. ఈ యుద్ధాల కాలంలో కవామ్ ఉల్ ముల్కు బీరార్ సుల్తాన్ దర్యా ఇమాద్ ఉల్ ముల్కు లేక అల్లావుద్దీన్ ఉమాద్ ఉల్ ముల్కులతో యుద్ధం వచ్చింది. వారిని రాంగార్

వద్ద ఓడించి తరిమి ఎల్లందల మల్లంగూర్ మొదలైన ప్రాంతాలను ఆక్రమించాడు. దాంతో ఉత్తర తెలంగాణలో చాలా భాగం అతని రాజ్యంలో చేరిపోయింది. తర్వాత అతడు గజపతి రాజ్యంపై దృష్టిని మరల్చాడు.

చితాబ్‌ఖాన్‌తో యుద్ధం క్రీ.శ.1521-24: ప్రతాపరుద్రగజపతి కాలంలో ఆంధ్రదేశ చరిత్రలో ప్రసిద్ధి చెందిన సేనాధిపతి చితాబ్‌ఖాన్. ఇతని అసలు పేరు సీతాపతి. ఇతని పుట్టుపూర్వోత్తరాలు తెలియదు. కాని ఇతనిని గురించి తెలంగాణ, గుంటూరు జిల్లాలలోని అనేక గ్రామ కైఫీయత్తులలో అనేక ప్రస్తావనలు ఉన్నాయి. అతడు గజపతి ఆస్థానంలో సేనాధిపతిగా ఎలా పదవిని సంపాదించింది కూడా తెలియదు. కాని అతడు ఆనాడు గొప్ప సైన్యాధిపతిగా కీర్తిగాంచాడు. అతడు భోగికులస్తుడని ప్రతీతి. ఇతడు ప్రతాపరుద్రగజపతి కాలంలో అతని వద్ద సేనాధిపతిగా చేశాడు. ఆనాడు అతడు గొప్పవీరాధివీరుడుగా ప్రసిద్ధిచెందాడు. అతడు ముస్లింలపై అనేక విజయాలు సాధించి వారిచే యోధుడుగా గుర్తింపబడ్డాడు. అందువల్ల వారు అతనిని చితాబ్‌ఖాన్ అని పిలిచేవారు. ఇతడు క్రీ.శ.1504వ సంవత్సరం నుండే ఖమ్మం మెట్టు, ఓరుగల్లు పాలకుడు ఉన్నట్లు శాసనాధారం ఉంది. అతడు 1504వ సంవత్సంరలో ఓరుగల్లులో శిధిలావస్థలో ఉన్న దేవాలయాలను బాగుచేయించి శాసనం వేయించాడు. ఆ శాసనం వల్ల అతడు అక్కడ పాలకుడుగా ఉన్నట్లు రుజువైంది. కృష్ణదేవరాయలు కొండపల్లిని జయించిన తర్వాత తెలంగాణపై దండెత్తినప్పుడు ఖమ్మంమెట్టును కూడా జయించాడు. ఆ సందర్భంలో సీతాపతి ఓడిపోయి కటకం చేరినట్లుగా కనిపిస్తోంది. రాయలు కటకంపై దండెత్తినప్పుడు మార్గమధ్యంలో పర్వతమార్గంలో 60వేల విలుకాండ్రతో రాయలసైన్యంపై విరుచుకొనిపడ్డాడు. రాయలు అతికష్టంపై అతనిని ఓడించి తరిమివేసి ముందుకుసాగాడు. గజపతితో సంధి చేసుకున్న తర్వాత కృష్ణకు ఉత్తర ప్రాంతాలన్నీ తిరిగి ఇచ్చివేసిన తర్వాత ప్రతాపరుద్ర గజపతి సీతాపతిని తిరిగి ఖమ్మంమెట్టు అధిపతిగా నియమించాడు. కులీకుతుబ్‌షా గజపతిరాజ్యంపై దండెత్తేనాటికి చితాబ్‌ఖాన్ తెలంగాణలోని గజపతి రాజ్యభాగాలకు పరీక్షకునిగా పనిచేస్తున్నాడు. క్రీ.శ.1518వ సంవత్సరంలో సుల్తాన్ మహమూద్ మరణంలో బహమనీ రాజ్యంలోని సర్దారులు స్వతంత్రం ప్రకటించారు. దాంతో బహమనీ రాజ్యం అల్లకల్లోలానికి గురైంది. ఆ సందర్భంలో సీతాపతి ఓరుగల్లుపై దండెత్తాడు. కులీకుతుబ్‌షా బహమనీ రాజ్యంలోని తెలంగాణ ప్రాంతాలన్నింటికి తాను వారసుడిగా భావించుకొని ఓరుగల్లును పునరాక్రమించడానికి ఓరుగల్లుపై దండెత్తాడు. దాంతో కులీకుతుబ్‌షా గజపతితో యుద్ధాన్ని ప్రారంభించినట్లయింది. ఓరుగల్లు వద్ద చితాబ్‌ఖాన్ ఓడి ఖమ్మంమెట్టు చేరి తిరిగి యుద్ధప్రయత్నం చేశాడు. అతడు కొండపల్లి, ఇంద్రకొండ, వాడపల్లి, ఎటగిర్, బెల్లంకొండ మొదలైన దుర్గపాలకులకు కబురంపి సైన్యాలను రప్పించాడు. సీతాపతి వల్ల తన రాజ్యానికి ముప్పు వస్తోందని కులీ గ్రహించి ఖమ్మంమెట్టును కూడా జయించాలని పెద్ద సేనతో వచ్చాడు. వారిరువురికి ఖమ్మంమెట్టు వద్ద మరొక యుద్ధం జరిగింది. అందులో చితాబ్‌ఖాన్ ఓడిపోయాడు. ఖమ్మం మెట్టు కులీ స్వాధీనం అయింది. అప్పుడు చితాబ్‌ఖాన్ రాజమహేంద్రవరం చేరి ప్రతాపరుద్ర గజపతికి కబురంపాడు. ఈ లోపల కులీ తెలంగాణనంతను స్వాధీనం చేసుకొని తూర్పు కోస్తాలోకి దండెత్తి కొండపల్లిని కూడా ఆక్రమించాడు. దాంతో కులీరాజ్యం తూర్పున బంగాళాఖాతం వరకు విస్తరించింది. అతడు కోస్తాలో విజయాలు సాధించి ఆ ప్రాంతాన్ని అతని ఆధిపత్యంలోకి తెచ్చుకున్నట్లు మల్కాపురం శాసనం తెలుపుతోంది. క్రీ.శ.1523-24వ సంవత్సరంలో బెజవాడ తాలూకాలోని మల్కాపురం రెండు గ్రామాలను ఒక లంగర్‌హౌస్ పోషణకు దానం ఇచ్చి మల్కాపురంలో శాసనం వేయించాడు. ఈ లంగర్‌హౌస్ ఖ్వాజా ఖిజీర్ అనే వ్యక్తి గౌరవార్థం నిర్మింపబడింది. ఈ శాసనం వలన క్రీ.శ.1523-24వ సంవత్సరం నాటికి ఆ ప్రాంతం కులీ ఆధీనంలో ఉందని స్పష్టమవుతోంది. కొండపల్లి స్వాధీనం అయిన తర్వాత కులీ కొండవీటిపై దండెత్తాడు. కాని అక్కడి విజయనగర సేనాధిపతి వెలుగోటి తిమ్మానాయకుడు లేక గన్నానాయకుడు అతనిని ఓడించి తరిమివేశాడు. ఈ లోపల ప్రతాపరుద్రగజపతి కటకం నుండి పెద్దసేనతో కృష్ణాతీరం చేరి కులీని ఓడించి తరిమి కొండపల్లి, ఖమ్మం మొదలైన ప్రాంతాలన్నింటినీ తిరిగి ఆక్రమించాడు. కనుక తీరాంధ్రదేశంలోని కులీ విజయాలు తాత్కాలికమయ్యాయి. గజపతి కులీని ఓడించి తరిమాడని ఉండవల్లి శాసనం తెలుపుతోంది. క్రీ.శ.1525-26వ సంవత్సరంలో ప్రతాపరుద్రగజపతి కృష్ణాతీరంలో ఉండి మంగళగిరిలో ఒక దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు ఉండవల్లి శాసనం తెలుపుతోంది. కనుక గజపతి కొండపల్లి రాష్ట్రాన్ని తిరిగి జయించి విజయ సూచకంగా మంగళగిరిలో దేవాలయాన్ని నిర్మించాడని ఆ సందర్భంలో ఉండవల్లిలో అనంతపద్మనాభస్వామి ఏకశిలా గుహాలయాన్ని దర్శించాడని స్పష్టమవుతోంది. కనుక గజపతి రాజ్యం బలహీనంగా ఉందని చులకన భావంతో వచ్చిన కులీని

సునాయాసంగా జయించి ప్రతాపరుద్ర గజపతి తన రాజ్యాన్ని రక్షించుకున్నాడని ఉండవల్లి శాసనం రుజువు గజపతి రాజ్యాన్ని సులభంగా జయించవచ్చని ఆశపడి దండెత్తిన కులీ ఆశలు అడియాసలయ్యాయి. కులీ గజపతి రాజ్యంపై చేసిన తొలి దండయాత్ర విఫలమైందని చెప్పవచ్చును.

ప్రతాపరుద్ర గజపతి విజయనగర సామ్రాజ్య దండయాత్ర క్రీ.శ.1530: కృష్ణదేవరాయల మరణానంతరం ప్రతాపరుద్రగజపతి తనప్రాంతాలను రాబట్టుకోడానికి విజయనగర సామ్రాజ్యంపై దండెత్తాడని ప్రతీతి. ఆ సందర్భంలో అల్లసాని పెద్దన గజపతిని ఆక్షేపిస్తూ ఒక పద్యం చెప్పాడని, అందులో కృష్ణరాయల చేతిలో ఓడి భంగపడిన విజయాన్ని గుర్తుచేశాడని, ఆ పద్యం వినగానే ప్రతాపరుద్ర గజపతి వెనుతిరిగి వెళ్లిపోయాడని ఒక గాథ ప్రచారంలో ఉంది. గజపతి ఎప్పుడు దాడి చేసిందీ స్పష్టంగా తెలియదు. క్రీ.శ.1529 డిసెంబర్ 28న తేదీన అచ్యుతదేవరాయలు కదలడిలో వేయించిన శాసనం కృష్ణదేవరాయలు మరణించినట్లు స్పష్టంగా తెలుపుతోంది. కర్నూలు జిల్లాలోని నందికొట్కూర్ శాసనం 1529 అక్టోబర్ 27వ తేదీన కృష్ణదేవరాయలు జీవించి ఉన్నట్లు, సింహాసనంపై ఉండి రాజ్యం చేస్తున్నట్లు తెలుపుతోంది. కనుక కృష్ణరాయలు క్రీ.శ.1529 అక్టోబర్ 27వ తేదీ, డిసెంబర్ 28వ తేదీ మధ్యకాలంలో మరణించి ఉండాలి. కొమర్రాజు వెంకట లక్ష్మణరావు ఆంధ్రసాహిత్య పరిషత్ పత్రికలోని లక్షణరాయ వ్యాసావళి 48వ పేజిలో ఆంధ్రకవుల చరిత్ర రెండవ వాల్యూంలోని ఒకచాటువును ఆధారంగా తీసుకొని కృష్ణరాయలు 1525-26వ సంవత్సరంలో మరణించాడని తీర్మానించారు. చాటువులో శక 1447 తారణ జ్యేష్ఠ ఆదివారం నాడు మరణించినట్లు ఉంది. తన నిర్ణయాన్ని సమర్థించుకోడానికి శక 1448 పూర వైశాఖ 15వ తేదీన రామరాయలు విడుదల చేసిన శాసనం తిరమలలోని శక 1448 అచ్యుతరాయల శాసనాలను ఆధారాలుగా పేర్కొన్నారు. ఆ శాసనాలలో వారు రాజులుగా పేర్కొనబడింది. కాని వారు ఆ సంవత్సరాలలో స్థానికపాలకులని కృష్ణరాయలు మరణించలేదని లక్ష్మణరావు సిద్ధాంతాన్ని ఆధునిక పండితులు తిరస్కరించారు. రాయలు క్రీ.శ.1529 వరకు జీవించి ఉన్నట్లు చాలా శాసనాలు ఉన్నాయి. అతడు మరణించగానే శత్రువులు విజయనగర రాజ్యంపై దండెత్తారు. అచ్యుతదేవరాయలు భోగలాలసుడని, నిరంకుశుడని, బలహీనుడని పోర్చుగీసు వారి రచనలలో పేర్కొన్నారు. బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిషా రాయచూరును పునరాక్రమించడానికి దండయాత్ర సాగించాడు. అదే సమయంలో గజపతి కూడా దండెత్తి ఉండవచ్చును. అంతకుముందు క్రీ.శ.1525-26వ సంవత్సరంలో కులీకుతుబ్‌షాను ఓడించి ఉన్నాడు, గనుక ఆ ఉత్సాహంతో కృష్ణరాయలు తీసుకున్న ప్రాంతాలను కూడా తిరిగి ఆశపడి ఉండవచ్చును. అయితే అచ్యుతరాయలకు, ప్రతాపరుద్రగజపతికి యుద్ధం జరిగిందా లేదా అనే విషయం స్పష్టంగా తెలియదు. కాని అచ్యుతదేవరాయలకు గజపతిని ఓడించిన వీరుడని తురుష్కులకు సింహస్వప్నమని బిరుదులున్నాయని క్రీ.శ.1451 నాటి శాసనం తెలుపుతోంది. క్రీ.శ.1452 శాసన అచ్యుతదేవరాయల స్థిరంగా సింహాసనంపై రాజ్యం చేస్తున్నట్లు తెలుపుతోంది. కనుక అచ్యుతదేవరాయలు గజపతిని ఓడించి తరిమి తన రాజ్యభాగాలు దక్కించుకొని రాజ్యపాలన చేశాడని చెప్పవచ్చును. కనుక వీరి మధ్య యుద్ధం క్రీ.శ.1530వ సంవత్సరం తొలి మాసాలలో జరిగి ఉండవచ్చును. ఈ యుద్ధ సందర్భంలో అల్లసాని పెద్దన గజపతిని ఆక్షేపిస్తూ పద్యం చెప్పి ఉండవచ్చును. పెద్దన ఆక్షేపానికో, అచ్యుతదేవరాయల పరాక్రమం వల్లనో తెలియదుగాని, మొత్తం మీద ప్రతాపరుద్రగజపతి వెనుకకు వెళ్లిపోయాడు. కృష్ణరాయలు సంపాదించిన కొండవీటిరాజ్యం వరకు అచ్యుతదేవరాయల చివరికాలం వరకు విజయనగర రాజ్యంలో భాగంగానే నిలిచి ఉంది.

కులీ కుతుబ్‌షా రెండవ దండయాత్ర క్రీ.శ. 1531-43: ప్రతాపరుద్రగజపతి కటకం తిరిగివెళ్లిన తర్వాత కులీకుతుబ్‌షా తిరిగి విజృంభించాడు. క్రీ శ.1523-26 సంవత్సరాల మధ్య కృష్ణరాయల చేతిలోను, ప్రతాపరుద్ర గజపతి చేతిలోను ఓడిపోవడంతో కృష్ణరాయలు, ప్రతాపరుద్రగజపతి జీవించి ఉన్నంత కాలం తన ఆటలు సాగవని గ్రహించి మిన్నకున్నాడు. క్రీ.శ.1529లో కృష్ణరాయలు మరణించడం, ప్రతాపరుద్రగజపతి విజయనగర సామ్రాజ్యంపై దండయాత్ర చేసి పరాజయంతో తిరిగి వెళ్లిపోవడంతో కులీలో ఆశలు చిగురించాయి. కనుక రెండవసారి కోస్తాపై దండయాత్రకు బయలుదేరాడు. ఈసారి అతనికి విజయం లభించింది. కోస్తా ప్రాంతం స్వాధీనం అయింది. గోల్కొండ చరిత్ర రాసిన అజ్ఞాత చరిత్రకారుని రచనలోని విషయాలను పరిగణనలోకి తీసుకొని పెరిష్టా కులీకుతుబ్‌షా విజయయాత్రను వివరించాడు. కుతుబ్‌షా చితాబ్‌ఖాన్‌ను ఓడించి ఖమ్మంమెట్టును ఆక్రమించాడని, తన రాజ్యాన్ని కోల్పోయిన చితాబ్‌ఖాన్ కొండపల్లి చేరి అక్కడ పాలించి గజపతి కుమారుడు

రామచంద్రరాజుకు కులీ తన రాజ్యాన్ని ఆక్రమించాడని, అతడు కొండపల్లిపై దండెత్తే ప్రయత్నంలో ఉన్నాడని కబురు చేశాడు. వారందరూ తమ తమ సైన్యాలతో వచ్చారు మూడు లక్షల పదాతిదళం, 30 వేల గుర్రపుదళం గల సైన్యం సమీకరించబడింది సీతాపతి, రాజాహరిశ్చందర్ రాయారామచందుర్, విదియాద్రి ఇంకా అనేక మంది రాజులు కలిసి సుల్తాన్ కులీపై దండెత్తారు. కులీ ఐదువేల సైన్యంతో వీరిని ఎదిరించాడు పలుంకిమార అనే నదిఒడ్డున వీరికి యుద్ధం జరిగింది. యుద్ధంలో కులీ, అతని కుమారుడు హైదర్‌ఖాన్‌లు వీరోచితంగా పోరాడి శత్రువులను ఓడించారు. రాయరామచందర్‌ని బంధించారు అతని మేనల్లుడు విదియాద్రి యుద్ధంలో మరణించాడు. తర్వాత కులీ తన సైన్యాలతో కొండపల్లి చేరి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. దాంతో సముద్రతీరం వరకు కోస్తా కులీ ఆధీనం అయింది ఆ తర్వాత అతడు ఏలురు, రాజమహేంద్రవరాలపై దండెత్తి జయించాడు. ఈ దండయాత్ర రెండు సంవత్సరాలు పట్టిందని పెరిష్టా రాశాడు. ఈ దండయాత్రా కాలంలో కొండపల్లి దుర్గాధిపతిగా ఉన్న రామచంద్రదేవుడు గజపతి కుమారుదని అజ్ఞాత చరిత్రకారుడు రాశాడు. అతడు బెంగాలు నుండి తెలంగాణ వరకు రాజని కూడా రాశాడు. అతడు క్రీ.శ.1512వ సంవత్సరంలో చైతన్యునికి పరిచయం చేయబడిన ప్రతాపరుద్రగజపతి కుమారుడని భావించబడింది. కాని ఇతడు ప్రతాపరుద్రగజపతి మరణం తర్వాత ఒరిస్సా సింహాసనం అధిష్టించలేదు. కొండపల్లి యుద్ధంలో మరణించినట్లు చెప్పబడిన విదియాద్రి మరణించినట్లు కనిపించదు. అతడు క్రీ.శ.1572 వరకు జీవించి ఉన్నట్లు, ఆ సంవత్సరంలో అతడు రాజమండ్రి యుద్ధంలో ఇబ్రహీం కుతుబ్‌షాతో పోరాడినట్లు ఆధారాలున్నాయి. అంతేగాక అజ్ఞాత చరిత్రకారుడు బెంగాలు నుండి తెలంగాణ వరకు కోస్తాలో రాజ్యం విస్తరించి ఉందని గజపతి ఉస్‌నాథ్‌దేవ్ రాయారమచందూర్ ఓటమిని తెలుసుకొని కులీ వద్దకు తన రాయబారులను పంపి సంధి చేసుకున్నాడు, దాంతో గజపతి కులీ రాజ్యాలకు గోదావరి సరిహద్దు అయిందని కూడా రాశాడు. ఇబ్రహీం కుతుబ్‌షా ఆస్థానకవి అయిన అద్దంకి గంగాధరుడు కూడా తన తపతీసంవరనోపాఖ్యాన కావ్యంలో కులీ విజయాలను పేర్కొన్నాడు. కులీ కటకరాజును దక్షిణ రాష్ట్రంలో అతని ప్రతినిధియైన హరిశ్చందర్‌ను పూర్తిగా ఓడించాడని అతని కుమారుడు హైదర్‌ఖాన్, గజపతి ప్రతినిధియైన హరిశ్చంద్రుని బందీగా పట్టుకున్నాడని, చితాబ్‌ఖాన్ గోదావరి దాటి ఒరిస్సా రాజ్యంలోకి తప్పించుకొని పారిపోయాడని వర్ణించాడు. వీరి వర్ణనలు వాస్తవమేనని క్రీ.శ 1513 మార్చి 20వ తేదీన కులీ కొండపల్లిలో వేయించిన శాసనం బలపరుస్తోంది. కులీ విజయానంతరం కిదారాబాద్‌లో ఒక లంగర్ హౌస్‌ని నిర్మించి దాని పోషణకు కవులూరు అమీనాబాద్ గ్రామాలను ఇచ్చినట్లు కొండపల్లి శాసనం తెలియజేస్తోంది. కనుక కొండపల్లి వద్ద గజపతి సామంతులు సేనానులు పెద్ద సేనతో వచ్చి వీరోచితంగా పోరాడినప్పటికీ కులీ వారిని ఓడించి కొండపల్లిని ఆక్రమించినట్లు స్పష్టమవుతోంది. కనుక 1531 మార్చి 20వ తేదీ ముందు కొండపల్లి అతని వశం అయి ఉంటుంది. 1530వ సంవత్సరంలో ప్రతాపరుద్రగజపతి అచ్యుతరాయలపై దండెత్తి తిరిగి వెళ్ళిపోయాడు. గజపతి కటకం వెళ్ళిపోగానే కులీ దండయాత్ర ప్రారంభమై ఉంటుంది. మొదట చితాబ్‌ఖాన్‌ను ఓడించి, ఖమ్మం మెట్టును తర్వాత రాయరామచంద్రుని ఓడించి కొండపల్లిని స్వాధీనం చేసుకొని ఉంటాడు. కొండపల్లిని జయించడానికి ప్రతాపరుద్రగజపతి ఎలాంటి చర్యలు తీసుకున్నట్లుగా లేదు. అందువల్ల అది శాశ్వతంగా గజపతి రాజ్యం నుండి విడిపోయి గోల్కొండ రాజ్యంలో భాగమైంది.

కొండపల్లి జయించిన తర్వాత కులీ వెంటనే ఏలూరు, రాజమహేంద్రవరాలను కూడా జయించాడని అజ్ఞాత చరిత్రకారుడు రాసిన రాతలను చరిత్రకారులు అంగీకరించలేదు. ఈ దండయాత్ర 7, 8 సంవత్సరాల తర్వాత జరిగిందని నిర్ణయించారు. అందుకు కారణమేమిటంటే అజ్ఞాత చరిత్రకారుడు రాసింది వాస్తవం అయి ఉంటే కులీతో సంధి చేసుకొని గోదావరి నదిని సరిహద్దుగా అంగీకరించిన వ్యక్తి ప్రతాపరుద్రగజపతి అయి ఉండాలి. అందుకు కారణం ప్రతాపరుద్రగజపతి క్రీ.శ.1538 వరకు జీవించి ఉన్నాడని ఆధారాలున్నాయి. కాని అజ్ఞాత చరిత్రకారుడు కులీతో సంధి చేసుకున్న కటకరాజును విస్‌నాథ్‌దేవ్ అని రాశాడు. అందుకు కారణాలు ఉన్నాయి. కులీ కొండపల్లిని జయించిన తర్వాత కొండవీటిపై దండెత్తాడు. అచ్యుతదేవరాయల సేనాధిపతులు అతనిని ఓడించి తరిమారు. కొండవీటియుద్ధంలో కులీ అమితంగా నష్టపడ్డాడట. కొండవీడు దండయాత్రలు జరిపేటప్పుడు బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా కోవెలకొండను ముట్టడించాడు. కులీ కోవెలకొండను కాపాడుకోవడానికి వెళ్ళి ఇస్మాయిల్‌తో క్రీ.శ.1533-34 సంవత్సరాలలో పోరాడాడు. తర్వాత క్రీ.శ.1534-35 సంవత్సరాల మధ్య కాశింబరీద్ ఇబ్రహీం ఆదిల్‌పాల్‌తో పోరాడవలసి వచ్చింది. కనుక క్రీ.శ.1535 వరకు అతడు

దక్కను యుద్ధాలలో మునిగి తేలుతున్నాడని స్పష్టపడుతోంది. అలాంటి స్థితిలో అతడు ఏలూరు, రాజమహేంద్రవరాలపై దండెత్తి ఉంటాడా? వీలై ఉండదు. అంతేగాక విస్నాథ్‌దేవ్ అని పేరు కలిగిన రాజు ఎవరూ ఒరిస్సాను పాలించలేదు. గోవింద విద్యాధరుడు అనే అతడు పాలించాడు. కనుక యం.ఆర్. సుబ్రహ్మణ్యం విద్యాధరుడినే అజ్ఞాత చరిత్రకారుడు విస్నాథ్‌దేవ్‌గా రాసి ఉంటాడు అని భావించి కులీతో సంధి చేసుకున్న ఒరిస్సా రాజు విద్యాధరుడుగాని, ప్రతాపరుద్రగజపతి కాదు అని తీర్మానించారు. ప్రతాపరుద్రగజపతి తర్వాత అతని కుమారులు కలువదేవ, ఖరదేవులు రెండు సంవత్సరాలు పాలించారు. వారిని వధించి క్రీ.శ.1540వ సంవత్సరంలో విద్యాధరుడు ఒరిస్సా సింహాసనాన్ని అధిష్టించి 7 సంవత్సరాలు పాలించాడు. మాదలపంజి విద్యాధరుని 7వ అంక సంవత్సరంలో గోల్కొండ నవాబులు ఒరిస్సాపై దండెత్తారు అని తెలుపుతోంది. దీనిని ఆధారంగా తీసుకొని డా॥ ఆర్.డి.బెనర్జీ ఒరిస్సాను జంషీద్ కులీ జయించాడని భావించాడు. కాని జంషీద్ తన కాలంలో ఎలాంటి దండయాత్రలు చేసినట్లు ఆధారాలు లేవు. కనుక అతని సిద్ధాంతాన్ని తిరస్కరించారు. మాదలపంజి తెలిపే దండయాత్ర కులీ కుతుబ్‌షా చేసిన దిగ్విజయ యాత్రగా గుర్తించారు.

కనుక కులీ సాధించిన ఏలూరు, రాజమహేంద్రవర విజయాలు ప్రతాపరుద్రగజపతి మరణించిన తర్వాత విద్యాధరుని కాలంలో కొండపల్లిని జయించిన 7 లేక 8 సంవత్సరాల తర్వాత జరిగి ఉండాలి. ఇదే విషయాన్ని మరికొన్ని ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. కొండపల్లిని జయించిన తర్వాత కులీ కొండవీటిపై దాడిచేశాడు. అచ్యుతదేవరాయల సేనాధిపతులు కులీని ఓడించి తరిమారు. కొండవీటి దండయాత్రలో కులీ అమితంగా నష్టపడ్డాడట. కులీ కొండవీటి దండయాత్రా కాలంలో బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ అదిల్‌షా కోవెలకొండను ముట్టడించాడు. దానిని కాపాడుకోవటానికి కులీ తిరిగి వెళ్లిపోయి క్రీ.శ.1533-34వ సంవత్సరం ఇస్మాయిల్‌తో పోరాడాడు. తర్వాత మల్లు ఆదిల్‌షాను తొలగించి బీజాపూరులో అధికారం చేపట్టిన కాశింబరీద్ ఇబ్రహీం ఆదిల్‌షాలతో క్రీ.శ.1534-35వ సంవత్సరం వరకు పోరాటాలు జరిపాడు. కనుక క్రీ.శ.1535 వరకు బీజాపూరుతో జరిగే యుద్ధాలలో నిమగ్నుడై ఉన్న కులీ ఏలూరు, రాజమహేంద్రవరాలను జయించడానికి ఎలాంటి పరిస్థితులలోను వీలుకాదు. కనుక ప్రతాపరుద్రగజపతి మరణం తర్వాత విద్యాధరుని కాలంలో ఏలూరు, రాజమహేంద్రవరాలను జయించి విద్యాధరునితో దశలుగా సాగిందని చెప్పవచ్చును. మొదటిదశలో క్రీ.శ.1531వ సంవత్సరంలో ఖమ్మం మెట్టు, కొండపల్లిలను ఆక్రమించాడు. రెండవదశలో ప్రతాపరుద్రగజపతి మరణం తర్వాత విద్యాధరుని కాలంలో క్రీ.శ.1540-42 సంవత్సరాల మధ్య ఏలూరు, రాజమహేంద్రవరాలను జయించాడని చెప్పవచ్చును. రాజమహేంద్రవరాన్ని తిరిగి విద్యాధరునికి ఇచ్చి ఉభయ రాజ్యాలకు గోదావరీనదిని సరిహద్దుగా అంగీకరించి ఉంటారు. గోదావరీ నదికి ఉత్తర ప్రాంతమంతా క్రీ.శ.1578వ సంవత్సరం వరకు స్థిరంగా గజపతుల ఆధీనంలో ఉందని ద్రాక్షారామంలోని భీమేశ్వరాలయపు స్తంభంపై ఉన్న ఒక చిన్న శాసనం స్పష్టంగా తెలుపుతోంది. కనుక కృష్ణా, గోదావరీ నదుల మధ్య ఉన్న పూర్వపు వేంగి ప్రాంతం కులీ వశమై గోల్కొండ రాజ్యంలో భాగమయిందని చెప్పవచ్చును. ఈ విధంగా కులీకుతుబ్‌షా తన 60 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో బహమనీ సేనాధిపతిగా తెలంగాణ గవర్నుగా, స్వతంత్ర గోల్కొండ నవాబుగా అనేక విజయాలు సాధించి గజపతిరాజ్యంపై రెండవ దండయాత్రలో తన రాజ్యాన్ని గోదావరీ, కృష్ణానదుల మధ్య కోస్తా ప్రాంతాన్ని ఆక్రమించి బంగాళాఖాతం వరకు తన రాజ్యాన్ని విస్తరించాడు. కులీ క్రీ.శ.1543లో హత్యకు గురయ్యాడు.

ప్రతాపరుద్రుని చివరికాలం-మరణం క్రీ.శ.1538: ప్రతాపరుద్రుని చివరి కాలంలో కులీకుతుబ్‌షా చేతిలో ఓడి కొండపల్లిని పోగొట్టుకున్నాడు. తిరిగి అతడు దానిని జయించలేదు. దాంతో అతని సామ్రాజ్యం త్వరితగతిన క్షీణించసాగింది. ఆ స్థితిలో అతడు మరణించాడు. అతడు ఎప్పుడు మరణించిందీ స్పష్టంగా తెలియదు. అతని చివరి శాసనం 41వ అంక సంవత్సరంలో శ్రీకూర్మంలో వేయించబడింది. కటక రాజవంశావళి జగన్నాథ కైఫీయత్తులు అతడు 28 సంవత్సరాలు పాలించాడని, అతని చివరి సంవత్సరం క్రీ.శ.1454 క్రీ.శ.1532వ సంవత్సరం అని తెలుపుతున్నాయి. సి.పి.బ్రౌన్ సేకరించిన తెలుగు, కన్నడ రాజవంశపట్టికలు కూడా అదే చెబుతున్నాయి. చైతన్యుని చరిత్ర రాసిన బెంగాలు కవుల చైతన్యుని మరణం తర్వాత కూడా ప్రతాపరుద్రగజపతి జీవించి ఉన్నాడని తెలియజేశారు. చైతన్యుడు శక 1455 క్రీ.శ.1533వ సంవత్సరంలో మరణించాడని జయానంద చైతన్యమంగళ అనే బెంగాలీ రచన పేర్కొంటోంది. ఈ రచనలన్నీ ప్రతాపరుద్రగజపతి మరణాన్ని

గురించిన సమాచారంలో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి మాదలపంజి ప్రతాపరుద్రుని తర్వాత అతనికుమారుదు కులవదేవ్ సింహాసనానికి వచ్చి ఒక సంవత్సరం ఐదుమాసాలు పాలించాడని, అతని తర్వాత అతని తమ్ముడు ఖారదేవ్ రాజ్యానికి వచ్చి మూడుమాసాలు పాలించాడని తెలుపుతోంది. సి పి బ్రౌన్ సేకరించిన తెలుగు, కన్నడ రాజవంశాల పట్టికలు మాదలపంజితో ఏకీభవిస్తున్నాయి. కాని పేర్లలో తేడాలున్నాయి. ప్రతాపరుద్రుని కుమారుల పేర్లు కౌశికరాయ, ప్రతాపదేవరాయ అని తెలుపుతున్నాయి. వారిద్దరిని ఒకరి తర్వాత ఒకరిని గోవింద విద్యాధరుడు చంపి గజపతి రాజ్యాన్ని అపహరించాడు. అతడు 7 సంవత్సరాలు పాలించాడు అతని తర్వాత చక్రప్రతాప అనే అతడు రాజ్యానికి వచ్చి 8 సంవత్సరాలు పాలించాడు. అతని తర్వాత నరసింగదేవరాయ రాజ్యానికి వచ్చిన తర్వాత ఒక్క సంవత్సరంలో ముకుందదేవుడు రాజ్యానికి వచ్చాడని నిర్ణయించాడు ప్రతాపరుద్రదేవుని తర్వాత 6గురు రాజులు 19 సంవత్సరాల కాలం పాలించారు కనుక క్రీ.శ.1551-19= 1532 అని హంటర్ నిర్ణయానికి వచ్చాడు ఈ తేదీ సి పి బ్రౌన్ తయారు చేసిన రాజవంశావళి పట్టికలతో ఏకీభవిస్తోంది. కాని హంటర్ నిర్ణయం సరైనది కాదని ఇతర ఆధారాలు నిరూపిస్తున్నాయి ముఖ్యంగా బెంగాలీ రచనలు చైతన్యుని మరణం తర్వాత అంటే క్రీ.శ 1533 వరకు గజపతి జీవించి ఉన్నాడని తెలుపుతున్నాయి. గోవింద విద్యాధరుని నాల్గవ అంక సంవత్సరానికి చెందిన శాసనం లభించింది అందులో శకకాలం కూడా ఇవ్వలేదు. కేవలం 4వ అంక వైశాఖశుద్ధ 3 మంగళవారం అని పేర్కొనబడింది కనుక శక, క్రీ.శ. కాలం నిర్ణయించడానికి వీలుకలగలేదు. కొందరు ఇది క్రీ.శ.1536 అక్టోబర్ 17వ తేదీగా నిర్ణయించారు. దాని ప్రకారం గోవింద విద్యాధరుని 4వ అంక సంవత్సరం 1536-3=1533వ సంవత్సరంలో విద్యాధరుడు రాజ్యాన్ని కాజేసి ఉంటాడు. విద్యాధరునికి, ప్రతాపరుద్రునికి మధ్య అతని ఇద్దరి కుమారుల పాలన ఒక సంవత్సరం 8 మాసాలు ఉంది. ఇది క్రీ.శ 1532లో తీసివేస్తే క్రీ శ 1531వ సంవత్సరంలో ప్రతాపరుద్రుడు మరణించి ఉండాలి ఇది శ్రీకూర్మం శాసన కాలానికి సరిపోతోంది. కాని గజపతి 1533 వరకు జీవించి ఉన్నట్లు తెలుపుతోంది కనుక ఈ వాదన తిరస్కరించబడింది మరికొందరు విద్యాధరుని 4వ అంక సంవత్సరాన్ని క్రీ.శ 1543 అక్టోబర్ 30వ తేదీగా నిర్ణయించారు. వీరివాదన ప్రకారం 1543-3=1540 విద్యాధరుని రాజ్య ఆక్రమణ అందులో గజపతి కుమారుల 1 సంవత్సరం 8 మాసాలు తీసివేస్తే 1540-2=1538వ సంవత్సరంలో ప్రతాపరుద్రగజపతి మరణించి ఉండవచ్చని తీర్మానించారు మాదలపంజి గజపతి మరణించిన రోజు కార్తీకశుద్ధ 4వ రోజుగా చెబుతోంది. ఈ రోజు క్రీ.శ 1538 అక్టోబర్ 27వ తేదీగా తేలుతుంది. కనుక ఆ తేదీన ప్రతాపరుద్రగజపతి మరణించి ఉండాలని పండితులు నిర్ణయించారు. దీని ప్రకారం ప్రతాపరుద్రగజపతి 41 క్రీ.శ.1497 నుండి 1538 వరకు అంటే 41 సంవత్సరాలు పాలించాడు. ఇదే విషయాన్ని ముకుందదేవుని శాసనాలు బలపరుస్తున్నాయి. మాదలపంజి ముకుందదేవుడు శక 1481 క్రీ.శ.1558-59 సంవత్సరంలో సింహాసనానికి వచ్చాడని తెలిపింది. అతని 3వ అంక సంవత్సరం నాటి శాసనం లభించింది. అందులో రౌద్ర చైత్రశుద్ధ 15 బుధవారం అని ఇవ్వబడింది. ఇది క్రీ.శ.1560 ఏప్రిల్ 10వ తేదీగా గుణించారు. ఇది కూడా 1560-2= 1558వ సంవత్సరం ముకుందదేవుని రాజ్యకాల ప్రారంభమని తేలుతోంది. ప్రతాపరుద్రుని తర్వాత 19 సంవత్సరాలకు ముకుందదేవుడు రాజ్యానికి వచ్చాడని ఉంది. గనుక క్రీ.శ.1558-19=1538-39వ సంవత్సరం ప్రతాపరుద్రుని మరణంగా తేలుతోంది. కనుక క్రీ.శ 1538-39 సంవత్సరాల మధ్య ప్రతాపరుద్రగజపతి మరణించాడని చరిత్రకారులు నిర్ణయించారు. అంటే అతడు క్రీ.శ.1497 నుండి 1538 వరకు అంటే 41 సంవత్సరాలు పాలించి మరణించాడు. అతని మరణం తర్వాత కూడా ఆంధ్రదేశం గోదావరీ తీరం వరకు గజపతుల సామంతుల ఆధీనంలోనే ఉంది. 1572వ సంవత్సరంలో గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌సా కుమారుడు నాల్గవ సుల్తాన్ అయిన ఇబ్రహీం కుతుబ్‌షా గజపతుల సామంతులైన వేదాద్రి, చితాబ్‌ఖాన్‌లను ఓడించి రాజమండ్రి నుండి శ్రీకాకుళం వరకు ఆక్రమించి గోల్కొండ రాజ్యంలో కలిపాడు. దాంతో ఆంధ్రదేశంలో గజపతుల పాలన పూర్తిగా అంతరించింది. ఆంధ్రదేశం మొత్తం గోల్కొండ నవాబుల ఏలుబడిలోకి వెళ్లిపోయింది. మొత్తం మీద గజపతుల పతనం వల్లనే ఆంధ్రదేశం గోల్కొండ నవాబుల వశం అయింది.

కళింగ గజపతులకు పొరుగు రాజ్యాలతో సంబంధాలు

కపిలేశ్వర గజపతి క్రీ.శ.1432-35 గజపతి రాజ్యాన్ని స్థాపించడంతో దక్షిణ భారతదేశ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. కపిలేశ్వరుడు రాజ్యాన్ని స్థాపించే నాటికి ఆంధ్రదేశంలో రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం, దాని దిగువన విజయనగర రాజ్యం, తెలంగాణలో దేవరకొండ వెలమరాజ్యం, దానికి ఉత్తరంగా బహమనీ రాజ్యం ఉన్నాయి. గజపతులు ఈ రాజ్యాలన్నింటితో పోరాడి తమ ఆధిక్యతను ప్రతిష్ఠించారు.

రాజమహేంద్రవర రెడ్డిరాజ్యంతో సంబంధాలు: కపిలేశ్వరుడు గంగవంశాన్ని తొలగించి కళింగరాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత గంగాసామంతులు గజపతికి లోబడకుండా స్వతంత్రం ప్రకటించారు. కపిలేశ్వరుడు 1443 నాటికి వారినందరినీ ఓడించి తన అదుపులోకి తెచ్చుకున్నాడు. దాంతో అతని రాజ్యం రాజమహేంద్రవర రెడ్డి రాజ్యం వరకు విస్తరించింది. తర్వాత అతడు రాజమహేంద్రవర రాజ్యాన్ని కూడా జయించాలని సమకట్టాడు. అందుకు కారణముంది. అంతకుముందు గంగరాజు నాల్గవ భానుదేవుడు రాజమహేంద్రవరం కొండవీటి రెడ్డి రాజ్యాలను జయించి పాకనాటి వరకు గంగసామ్రాజ్యాన్ని విస్తరించాడు. కాని రెండవ దేవరాయలు భానుదేవుని తరిమివేసి సింహాచలం వరకు విజయనగర అధికారాన్ని ప్రతిష్ఠించాడు. కపిలేశ్వరుడు అది కళింగరాజ్యానికి అవమానంగా భావించాడు. అంతేగాక భానుదేవుని వారసునిగా ఆ ప్రాంతాలపై తనకు హక్కు ఉందని కూడా భావించాడు. కనుక అతడు 1443లో రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు. కాని రాజమహేంద్రవర రాజ్యానికి రక్షణగా రెండవ దేవరాయలు తన సేనాధిపతి మల్లప్ప వడయార్‌ను పంపాడు. అతడు గజపతిని ఓడించి తరిమి క్రీ.శ.1444లో ద్రాక్షారామంలో శాసనం వేయించాడు. కనుక కపిలేశ్వర గజపతి మొదటి దండయాత్ర విఫలమైంది. క్రీ.శ.1446లో రెండవ దేవరాయలు మరణించాడు. కనుక 1448లో గజపతి రెండవ పర్యాయం రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాడు. రాజమహేంద్రవర పాలకులు వేమ, వీరభద్రా రెడ్లు గజపతి సైన్యంతో పోరాడుతూ యుద్ధంలో మరణించారు. దాంతో రాజమహేంద్రవరంలో రెడ్డి రాజ్యం అంతరించింది. రాజమహేంద్రవర రాజ్యం 1448లో గజపతి రాజ్యంలో అంతర్భాగం అయిపోయింది.

విజయనగర రాజ్యంతో గజపతుల సంబంధాలు: గజపతులకు విజయనగర రాజ్యంతో 1443 నుండే సంబంధాలు ప్రారంభమయ్యాయి. 1443లో కపిలేశ్వరుడు రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తినప్పుడు రెండవ రాయలు సేనాధిపతి మల్లప్ప వడయారు అతనిని ఓడించి తరిమాడు. తర్వాత 1448 నుండి మళ్ళీ విజయనగర రాజ్యంతో ఘర్షణకు దిగాడు. రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత కపిలేశ్వరుడు తన కుమారుడైన హంవీరుని విజయనగర రాజ్యంపైకి దండయాత్రకు పంపాడు. కృష్ణకు దక్షిణ భాగం అంతా రెండవ దేవరాయల ప్రత్యక్ష పాలనలో ఉంది. కనుక హంవీరుడు కృష్ణను దాటి విజయనగర రాజ్యంతో తలపడ్డాడు. ఎన్నాళ్ళు యుద్ధం జరిగిందీ తెలియదు కాని, 1454 ఏప్రిల్ నాటికి కొండవీడు రాజ్యం స్వాధీనం అయింది. 1454 ఏప్రిల్ 12వ తేదీ నాటి గజపతుల శాసనం ఒకటి కొండవీడులో ఉంది. ఆ శాసనంలో కొండవీడు, వినుకొండ, అద్దంకి దుర్గాలకు గజపతి ప్రతినిధి గణదేవుడు అనే అతడు సంరక్షకునిగా అంటే రాజప్రతినిధిగా ఉన్నట్లు ఆ శాసనం తెలుపుతోంది. కొండవీడు రాజ్య ఆక్రమణ తర్వాత కపిలేశ్వరుని ఉత్సాహం పెరిగిపోయింది. అందువల్ల అతడు ఇంకా ముందుకుసాగి ఉదయగిరిని జయించాడు. అక్కడ అతని సేనాధిపతి తమ్మ భూపాలుని తన ప్రతినిధిగా నియమించాడు. అక్కడి నుండి సరాసరి గజపతి సైన్యాలు రాజధాని విజయనగరంపై దాడిచేశాయి. విజయనగర చక్రవర్తి మల్లికార్జునరాయలు కొదమసింగంలాగ వచ్చి గజపతి సైన్యాలను ఓడించాడని గంగాధరకవి తాను రాసిన గంగదాస ప్రతాపవిలాసంలో వర్ణించాడు. కనుక రాజధాని వద్ద జరిగిన యుద్ధంలో గజపతి సైన్యాలు ఓడిపోయి ఉండవచ్చును. కాని ఇతర ప్రాంతాలలో విజయాలు సాధించాయి. హంవీరుడు ఒకే సైన్యాలు తూర్పు కోస్తాలో వదునించి చంద్రగిరిని ఆక్రమించాడు. తర్వాత తమిళదేశంపై దండెత్తి క్రీ.శ.1464 నాటికి తిరుచినాపల్లి వరకు జయించాడు. దాంతో కావేరీనది వరకు తూర్పుకోస్తా ప్రాంతాలన్నీ గజపతి సామ్రాజ్యంలో భాగాలయ్యాయి. కపిలేశ్వరుని కీర్తి మారుమోగిపోయింది.

పురుషోత్తమ గజపతి కాలం: కపిలేశ్వరుడు క్రీ.శ.1468లో మరణించాడు. గజపతి సింహాసనం కోసం హంవీరునికి, పురుషోత్తమ గజపతికి వారసత్వం యుద్ధం ప్రారంభమైంది. ఆ సమయంలో విజయనగర సేనాని సాళువ నరసింహరాయలు తూర్పుకోస్తాను తిరిగి జయించి మచిలీపట్నం వరకు వచ్చాడు. ఉదయగిరి కొండవీడులు తిరిగి విజయనగర అధికారం కిందికి వచ్చాయి. కాని ఆ విజయాలు తాత్కాలికమైనవే. పురుషోత్తమ గజపతి అంతర్యుద్ధంలో విజయం సాధించి తన స్థితిని బలపరుచుకొన్నాడు. తిరిగి విజయనగర రాజ్యంపై దండెత్తి ఉదయగిరి వరకు జయించాడు. ఉదయగిరి కోటలో సాళువ నరసింహరాయలు ఓడి బందీగా చిక్కి సంధి చేసుకొని వెళ్లిపోయాడు. తిరిగి కోస్తా అంతా గజపతుల కిందికి వచ్చింది.

ప్రతాపరుద్ర గజపతికాలం: పురుషోత్తమ గజపతి తర్వాత అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1513-1518 సంవత్సరాల మధ్య గజపతి రాజ్యంపై దండెత్తి ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి, రాజమహేంద్రవరం, సింహాచలాలను జయించి కటకం వరకు దండెత్తి గజపతి రాజ్యాన్ని నిర్వీర్యం చేశాడు. దాంతో గజపతి రాజ్యం క్షీణించి క్రీ.శ.1538లో అంతమైంది. ఈ విధంగా విజయనగర గజపతి రాజ్యాల సంఘర్షణ చివరకు గజపతి రాజ్య అంతానికి దారితీసింది.

గజపతులకు దేవరకొండ పద్మనాయకులతో గల సంబంధాలు: కపిలేశ్వర గజపతి రాజ్యానికి వచ్చేనాటికి రాచకొండ పద్మనాయకరాజ్యం అంతరించింది. బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షా 14355లో రాచకొండ రాజ్యాన్ని జయించి బహమనీరాజ్యంలో కలిపాడు. కాని దాని అవశేషమైన దేవరకొండ రాజ్యం మిగిలి ఉంది దానిని లింగమనేడు పాలిస్తున్నాడు. క్రీ.శ.1458వ సంవత్సరంలో బహమనీ సుల్తాన్ హుమాయూన్‌షా 22వేల సైన్యాన్ని దేవరకొండను జయించడానికి పంపాడు. లింగమనేడు వారి ధాటికి తట్టుకోలేక కపిలేశ్వర గజపతి సహాయం అర్థించాడు. కపిలేశ్వరుడు లింగమనేడుకు సహాయంగా గజపతి సైన్యాన్ని పంపాడు. గజపతి, వెలమ సైన్యాలు సంయుక్తంగా పోరాడి బహమనీ సైన్యాలను ఓడించి తరిమాయి. దేవరకొండ రాజ్యం కూడా గజపతి సామంత రాజ్యమైంది. 1435లో రాజ్యం పోగొట్టుకున్న మూడవ సింగమనాయకుడు కపిలేశ్వరుని ఆశ్రయించి బెల్లంకొండ దుర్గపాలకునిగా నియమింపబడ్డాడు. సింగమనాయకుడు కపిలేశ్వరుని ఆశ్రయించి బెల్లంకొండ దుర్గపాలకునిగా నియమింపబడ్డాడు. దాంతో పద్మనాయక వంశం మొత్తం కపిలేశ్వరుని సామంతులుగా మారిపోయారు. కపిలేశ్వరుడు 1468లో మరణించాడు. అతని తర్వాత హంవీరునికి పురుషోత్తమ గజపతికి వచ్చిన వారసత్వం యుద్ధంలో హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయం అర్థించాడు. సుల్తాన్ మూడవ మహమ్మద్ హంవీరునికి సహాయంగా వచ్చి పురుషోత్తముని ఓడించాడు. ఆ సమయంలో బహమనీ సుల్తాన్ తెలంగాణ అంతనూ తిరిగి ఆక్రమించాడు. దాంతో తెలంగాణలో పద్మనాయకరాజ్యం బహమనీ సుల్తాన్ రాజ్యంలో భాగమైపోయింది. పద్మనాయకులకు నిలువ నీడ లేకపోయింది. మూడవ సింగమనాయకుడు విజయనగర రాజ్యంలోకి వెళ్లి చిన్న జాగీరును సంపాదించాడు. లింగమనేడు వంశస్తులు బహమనీ రాజ్యంలో స్థానిక పాలెగాళ్లుగా నియమింపబడ్డారు. దాంతో పద్మనాయకులకు, గజపతులకు సంబంధాలు అంతమైపోయాయి.

గజపతులకు బహమనీ సుల్తాన్‌లతో సంబంధాలు: దక్షిణ భారతదేశ చరిత్రలో 15వ శతాబ్దంలో గజపతి, నరపతి, అశ్వపతుల సంఘర్షణగా ప్రసిద్ధి చెందింది. గజపతులు ఒకవైపు విజయనగర రాజ్యంతోపాటు బహమనీ సుల్తాన్‌లతో కూడా పోరాడారు. కపిలేశ్వర గజపతి కాలం నుండే బహమనీ, గజపతి యుద్ధాలు ప్రారంభం అయ్యాయి. కపిలేశ్వరుడు 1448లో రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని జయించిన తర్వాత గజపతి సైన్యాలు ఖమ్మంమెట్టు ప్రాంతంపై దాడి చేశాయి. ఈ ప్రాంతాలు పూర్వం రాజమహేంద్రవర రాజ్యంలో ఉండేవి. కాని అవి బహమనీ సుల్తాన్ చేత జయింపబడి ఉన్నాయి. ఆ ప్రాంతానికి సుల్తాన్ అల్లావుద్దీన్ సంజార్‌ఖాన్ అనే అతన్ని బహమనీ ప్రతినిధిగా నియమించాడు. గజపతి సైన్యంతో సంజార్‌ఖాన్ యుద్ధానికి దిగాడు. కాని అతనిని గజపతి సేనాని గజరావుతిప్ప ఓడించాడు. దాంతో ఖమ్మంమెట్టు ప్రాంతం అంతా గజపతి సామ్రాజ్యంలో చేరిపోయింది. ఖమ్మంమెట్టు యుద్ధం గజపతి అశ్వపతుల తొలి సంఘర్షణ. తర్వాత రెండవ సంఘర్షణ క్రీ.శ.1458లో దేవరకొండ యుద్ధం వల్ల జరిగింది. 1458లో సుల్తాన్ హుమాయూన్ దేవరకొండపై దాడిచేశాడు. ఆ సమయంలో లింగమనేడు కపిలేశ్వరుని సహాయం అర్థించాడు. కపిలేశ్వరుడు తన కుమారుడు హంవీరుని పంపాడు. దేవరకొండ యుద్ధంలో గజపతి వెలమసేనలు బహమనీ సుల్తాన్ సైన్యాలను ఓడించి తరిమివేశాయి. తర్వాత హంవీరుడు తెలంగాణ మొత్తం జయించాలని తలచాడు. ఓరుగల్లులో 1460 ఫిబ్రవరి 2వ తేదీన

వేయబడిన గజపతి శాసనం ఉంది. ఓరుగల్లుతో సహా తెలంగాణ అంతా గజపతుల ఆధీనంలోకి వచ్చింది. కపిలేశ్వరుడు ఆప్రాంతాన్ని పాలించడానికి తన సోదరుని కుమారుడైన వీరభద్ర రఘుదేవ నరేంద్రుని తన ప్రతినిధిగా నియమించాడు.

బీదరుపై దండయాత్ర క్రీ.శ.1461: ఈ విజయం తర్వాత బహమనీ సుల్తాన్ హుమాయూన్ 1461 సెప్టెంబర్ 3వ తేదీన మరణించాడు. అతని మరణం తర్వాత అతని 8 సంవత్సరాల కుమారుడు నిజాంషా సుల్తాన్‌గా ప్రకటింపబడ్డాడు. అదే తగిన సమయమని కపిలేశ్వరుడు బహమనీ రాజధాని బీదరుపై దండెత్తాడు. రాజధాని వరకు కొల్లగొడుతూ బీదరు చేరాడు. కాని సుల్తాన్ అక్కడ సుల్తాన్ వజీర్లు మంతనాలు జరిపి గజపతి తిరిగి వెళ్లిపోయేటట్లు చేశారు.

పురుషోత్తమ గజపతి కాలం: కపిలేశ్వరుని మరణం తర్వాత హంవీరుడు తాను కటక సింహాసనం అధిష్టించడానికి సుల్తాన్ సహాయం అర్థించాడు. గజపతిని నిర్బంధించడానికి అదే తగిన సమయమని సుల్తాన్ మూడవ మహమ్మద్ హంవీరునికి సహాయం పంపాడు. పురుషోత్తమ గజపతి ఓడిపోయాడు. హంవీరుడు రాజై కొండపల్లి, రాజమహేంద్ర వరాలను సుల్తాన్‌కు ఇచ్చాడు. కాని త్వరలో పురుషోత్తముడు బలం పుంజుకొని హంవీరుని ఓడించి తిరిగి సింహాసనాన్ని అధిష్టించాడు. 1476-77 సంవత్సరాలలో పురుషోత్తమ గజపతి బహమనీ సుల్తాన్‌ను ఓడించి తరిమి రాజమండ్రి, కొండపల్లిలను తిరిగి జయించాడు. ఆ తర్వాత మూడవ మహమ్మద్ 1482లో మరణించాడు. అతని మరణంతో బహమనీ రాజ్యం క్షీణించింది. అందువలన బహమనీ సుల్తాన్‌లు తిరిగి గజపతులపై దండెత్తలేదు. తెలంగాణ ఓరుగల్లు, ఖమ్మంమెట్టులతోసహా 1518 వరకు గజపతుల రాజ్యంలోనే భాగంగా ఉండిపోయింది.

ప్రతాపరుద్ర గజపతికాలం-గోల్కొండ సుల్తాన్‌లతో సంబంధాలు: ప్రతాపరుద్రగజపతి కాలంలో బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. తెలంగాణలో 1518లో కులీకుతుబ్‌షా గోల్కొండ రాజ్యాన్ని స్థాపించాడు. అప్పటి నుండి బహమనీ సుల్తాన్‌ల స్థానంలో గోల్కొండ రాజ్యం గజపతులతో పోరాటానికి దిగింది. కులీ స్వతంత్రుడైన సంవత్సరం అతని రాజ్యం కోహిద్, ఓరుగల్లుల మధ్య ప్రాంతం వరకే ఉంది. ఓరుగల్లు, ఖమ్మం మొదలైన తెలంగాణ ప్రాంతాలన్నీ గజపతుల సామంతుడైన చితాబ్‌ఖాన్ పరిపాలనలో ఉన్నాయని 1504 నాటి ఓరుగల్లు శాసనం తెలుపుతోంది. కులీకుతుబ్‌షా స్వతంత్రుడైన తర్వాత అంతకుముందు బహమనీ రాజ్యంలో ఉన్న తెలంగాణ ప్రాంతాలన్నింటికీ తాను వారసుడనని భావించాడు. కనుక చితాబ్‌ఖాన్ ఆధీనంలోఉన్న ఓరుగల్లుపై దండెత్తాడు. ఓరుగల్లు వద్ద చితాబ్‌ఖాన్ ఓడిపోయి ఖమ్మంమెట్టు చేరాడు. ఖమ్మంమెట్టు చేరి తిరిగి యుద్ధ ప్రయత్నం చేశాడు. అతడు కొండపల్లి, ఇంద్రకొండ, వాడపల్లి, ఎట్‌గర్, బెల్లంకొండ దుర్గాలలో ఉన్న గజపతి సామంతులందరినీ. రప్పించి కులీతో యుద్ధానికి దిగాడు. కులీ చితాబ్‌ఖాన్ వలన తన రాజ్యానికి ముప్పు వస్తోందని గ్రహించి పెద్ద సేనతో వచ్చి ఖమ్మంమెట్టు వద్ద చితాబ్‌ఖాన్‌తో పోరాడి చితాబ్‌ఖాన్‌ను ఓడించాడు. ఖమ్మంమెట్టు కులీ స్వాధీనమైంది. అప్పుడు చితాబ్‌ఖాన్ రాజమహేంద్రవరం చేరి ప్రతాపరుద్ర గజపతికి కబురు పంపాడు. ఈ లోపల కులీ తెలంగాణ అంతటినీ తన ఆధీనంలోకి తెచ్చుకొని కొండపల్లిపై దండెత్తాడు. అతడు కొండపల్లి ప్రాంతాన్ని జయించిన తర్వాత 1523-24 సంవత్సరంలో బెజవాడ తాలూకాలోని మల్కాపురంలో శాసనం వేయించాడు. ఈ శాసనం కొండపల్లి రాజ్యం కులీ ఆధీనమైనట్లు రుజువు చేస్తోంది. చితాబ్ ఖాన్ పంపిన వార్త విని ప్రతాపరుద్ర గజపతి పెద్ద సేనతో వచ్చి కులీకుతుబ్‌షాను ఓడించి తరిమి తిరిగి కొండపల్లి ప్రాంతాన్నంతటినీ తన స్వాధీనం చేసుకున్నాడు. క్రీ.శ.1525-26 సంవత్సరంలో ప్రతాపరుద్ర గజపతి మంగళగిరిలో ఉండి అక్కడ ఒక దేవాలయాన్ని నిర్మిస్తున్నట్లు ఉండవల్లి శాసనం తెలుపుతోంది. కనుక ప్రతాపరుద్ర గజపతి తిరిగి అక్కడ గజపతి అధికారాన్ని పునఃప్రతిష్ట చేశాడని స్పష్టపడుతోంది.

క్రీ.శ.1529లో కృష్ణరాయలు మరణించాడు. అతని మరణం తర్వాత రాయలు తనను ఓడించి ఆక్రమించిన తన రాజ్యభాగాలు జయించవచ్చుని తలచి క్రీ.శ.1530లో విజయనగర రాజ్యంపై దండెత్తాడు. కాని అతనిని అచ్యుతదేవరాయలు ఓడించి తరిమాడని అల్లసాని పెద్దన చాటుపద్యాల వల్ల తెలుస్తోంది.

దక్షిణాంధ్ర చరిత్ర-దక్షిణాంధ్రపై ఆధిపత్యం కోసం సంఘర్షణ

పల్లవుల కాలం నుంచీ రాయచూరు, అంతర్వేది ప్రాంతాల కోసం పల్లవులు, బాదామి చాళుక్యులు, తర్వాత పల్లవుల వారసులు చోళులు, బాదామి చాళుక్యుల వారసులు రాష్ట్రకూటులు, కళ్యాణీ చాళుక్యులు, తర్వాత హొయసాలులు, దేవగిరి యాదవులు, తర్వాత విజయనగర చక్రవర్తులు, బహమనీ సుల్తాన్‌ల సంఘర్షణలను ప్రతి చరిత్రకారులు గుర్తించి అద్భుతంగా వర్ణించారు. కాని దక్షిణ ప్రాంతాల కోసం అంటే కృష్ణాతీరం వరకు ఉన్న తూర్పు కోస్తా, రాయలసీమ ప్రాంతమైన రేనాడుల కోసం వేంగి రాజవంశాలు, తమిళదేశ వంశాలు జరిపిన పోరాటాలను, వారి సంఘర్షణను చాలా మంది గుర్తించలేదు. ఎవరైనా గుర్తించినా దానికి తగినంత ప్రాధాన్యత ఇవ్వలేదు. రాయచూరు, అంతర్వేదిలలో మాదిరిగానే దక్షిణాంధ్రలో కూడా ప్రతీ తరంలో అలాంటి సంఘర్షణ జరిగింది. ఆ సంఘర్షణను ఇక్కడ వివరించాం.

పూర్వం కృష్ణానది వద్ద నుంచి కంచి వరకు ఆంధ్రదేశం విస్తరించి ఉండేది కంచికవాటం ఛేదిస్తేగాని ఆంధ్రదేశపు దక్షిణ సరిహద్దును తొక్కినట్లు కాదని కాకతి గజపతిదేవుడు కంచిపై దండెత్తాడు. అంటే కంచి వరకు ఆంధ్రదేశమే అనే భావం ఉండేది. అందుకు కారణం పల్లవులు పలనాటివారు. కమ్మనాటిలోని అమరావతి, నాగార్జునకొండల మధ్యప్రాంతాన్ని పలనాడు అని అంటారు. ఆ ప్రాంతాన్ని నాగార్జునకొండకు రాజధానిగా చేసుకొని ఇక్ష్వాకులు పాలించారు. ఇక్ష్వాకులను అంతం చేసి పల్లవులు తమ రాజ్యాన్ని స్థాపించారు. ఆ ప్రాంతానికి తర్వాత పలనాడు అని పేరు వచ్చింది. కంచి వరకు జయించివారు కంచిని రాజధానిగా చేసుకొని కంచి నుండి కృష్ణానది వరకు ఏలారు. కనుక పల్లవుల కాలం నుండి కృష్ణానది నుంచి కంచి వరకు ఒకే రాజ్యం, అదే పల్లవ రాజ్యం అనే భావన కొనసాగుతుండేది. ఈ భాగంలో కమ్మనాడు, పూంగినాడు, తొండైమండలం ఉండేవి. పల్లవ సామ్రాజ్యంలో తమిళ, తెలుగు, కన్నడ ప్రాంతాలు ఉండేవి. తెలుగు ప్రాంతాలకు సంబంధించినంత వరకు తొండై మండలం, పూంగినాడు, కమ్మనాడు, రేనాడులు పల్లవరాజ్యం స్థాపించిన నాటి నుంచీ వారి రాజ్యంలో భాగాలుగా ఉంటూ ఉండేవి. పల్లవులు కంచిని తమ రాజధానిగా చేసుకున్నా తమ మాతృభూమి అయిన పలనాటిని అశ్రద్ధ చేయలేదు. దానిని ఒక ఉపరాజ్యంగా చేసి అక్కడ రాజకుమారులను వ్యాపృతునిగా నియమించేవారు. వారు ధరణికోటను రాజధానిగా చేసుకొని పాలించేవారు. పల్లవ రాజ్యాన్ని స్థాపించిన సింహవర్మ కుమారుడు శివస్కంధవర్మ, తర్వాత త్రిలోచన పల్లవుడు కమ్మనాటికి వ్యాపృతులుగా నియమింపబడ్డారు. చారుదేవి తన కుమారునికి రీజంటుగా ధరణికోటను ఏలింది. కనుక కృష్ణాతీరం మొదటి ఉప పల్లవ సామ్రాజ్యంలో ఒక ఉప రాజ్యంగా ఉండేది. ఇక్ష్వాకు వంశస్తులకు కొన్ని సామంత రాజ్యాలుండేవి. వారే బృహత్పలాయనులు, ఆనంద గోత్రీకులు. వారు తమ ప్రభువులైన ఇక్ష్వాకులను అంతం చేసినందుకు పల్లవులతో యుద్ధానికి దిగారు. ఇక్ష్వాకుల ప్రాంతమైన కృష్ణాతీరం నుండి పల్లవులను పారదోలాలని వారితో యుద్ధాలు చేశారు. కృష్ణా తీరాన్ని పల్లవుల నుండి విముక్తి చేయడమే వారి లక్ష్యం. కనుక పల్లవుల నుండి దక్షిణాంధ్ర దేశాన్ని విముక్తి చేయడానికి ఒకటిన్నర శతాబ్దం పాటు అనేక రాజవంశాలు పల్లవులతో పోరాటం జరిపాయి వారు బృహత్పలాయనులు, ఆనంద గోత్రీకులు, విష్ణుకుండినులు. బృహత్పలాయన జయవర్మ మహారాజు పల్లవులతో పోరాడి మైసోలియా, తెనాలి ప్రాంతాలలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. కాని తర్వాత 10 సంవత్సరాలకే అతని రాజ్యం అంతం అయింది. అతడు బహుశా పల్లవులతో పోరాడుతూ మరణించి ఉండి ఉండొచ్చు. ఇతని వద్ద అధికారిగా ఉన్న బాపమహాన వర్మ ఇక్ష్వాకుల బిరుదులైన మహాసేనాపతి, మహాదండనాయక, మహాతలవర అనే బిరుదులు ధరించాడు. దీనిని బట్టి అంతకుపూర్వం జయవర్మ మహారాజు ఇక్ష్వాకుల సామంతుడని, ఇక్ష్వాకులనంతం చేసిన పల్లవులతో పోరాడాడని పండితులు భావించారు. జయవర్మ మహారాజు మరణించిన తర్వాత కందరాపురంలో ఆనంద గోత్రీకులు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. అతని తర్వాత అతని వంశస్తుడు అత్తివర్మ కూడా పల్లవులతో పోరాడి విజయం సాధించాడు. పల్లవులు తమ మాతృభూమిని పోగొట్టుకోడానికి అంగీకరించలేదు. కనుక వారు ఆనంద గోత్రీకులలోని చివరివాడైన రెండవ కందర రాజును ఓడించి తిరిగి పల్లవులు కృష్ణాతీరం వరకు జయించారు.

విష్ణుకుండిన-పల్లవ సంఘర్షణ: తర్వాత వేంగిని పాలించి శాలంకాయనులను ఓడించి విష్ణుకుండినులు తమ రాజ్యాన్ని స్థాపించారు. వారు కూడా కృష్ణాతీరం నుండి పల్లవులను ఖాళీ చేయించి సాగనంపి దక్షిణాంధ్ర దేశం మొత్తం జయించాలని పల్లవులతో యుద్ధాలకు దిగారు. విష్ణుకుండినులకు, పల్లవులకు 200 సంవత్సరాలు సంఘర్షణ జరిగింది. మాధవవర్మ వాకాటకుల సహాయంతో పల్లవులను ఓడించి కమ్మ రాష్ట్రాన్ని ఆక్రమించాడు. అమరావతి ప్రాకృత శాసనంలో విష్ణుకుండినుల ప్రస్తావన ఉంది. రెండవ విక్రమేంద్రవర్మ, పల్లవ నరసింహను జయించానని తన శాసనంలో చెప్పుకున్నాడు. ఈ విధంగా పల్లవ బృహత్పలాయన, ఆనందగోత్రీక, విష్ణుకుండిన-పల్లవ సంఘర్షణకు కమ్మ రాష్ట్రం రణరంగంగా మారింది. వారి సంఘర్షణలో ఎన్ని యుద్ధాలు జరిగినా కమ్మ రాష్ట్రం వరకు మాత్రమే విష్ణుకుండినులు జయించగలిగారు. కాని అంతకుమించి దక్షిణంగా విస్తరించలేక పోయారు. నెల్లూరు జిల్లా మొత్తం, పశ్చిమాన శ్రీశైలం వరకు పల్లవుల ఆధిపత్యంలోనే ఉన్నాయి. విష్ణుకుండిన వంశం చివరిదశలో మొదటి మహేంద్రవర్మ తిరిగి కమ్మ రాష్ట్రాన్ని జయించి కృష్ణానది వరకు తన సామ్రాజ్యంలో భాగం చేసుకోగలిగాడు. చేజర్లలోను, అమరావతిలోను మహేంద్రవర్మ శాసనాలు ఉన్నాయి.

పల్లవ చాళుక్య సంఘర్షణ: విష్ణుకుండిన రాజ్యపతనం తర్వాత రెండవ పులకేశి ఆంధ్రదేశాన్ని జయించాడు. తర్వాత అతడు పల్లవరాజ్యంపై దండెత్తి పుల్లలూరు వద్ద మొదటి మహేంద్రవర్మను సంహరించి కంచి వరకు జయించాడు. విజయం తర్వాత పులకేశి కమ్మనాడు, పూంగినాడు, రేనాడులను తన సామ్రాజ్యంలో కలిపివేశాడు. దాంతో పల్లవులు తెలుగు ప్రాంతాన్నింటినీ పోగొట్టుకున్నారు. తమ మాతృభూమి అయిన తెలుగు ప్రాంతాలను ముఖ్యంగా పలనాడు, కమ్మనాడులను కోల్పోవడం సహించలేకపోయారు. కనుక వారు చాళుక్యులతో, ఆ ప్రాంతాలు తిరిగి కైవసం చేసుకోవడానికి వారు పల్లవులతో సంఘర్షణకు దిగారు. తమ మాతృభూమి అయిన పలనాడు, కమ్మనాడు తమవి గనుక కృష్ణానదే తమ రాజ్యానికి ఉత్తర సరిహద్దు అని మొదటి నుండి పల్లవులు భావించేవారు. కనుకనే వారు ఆ ప్రాంతాన్ని ఉపరాజ్యంగా చేసి వ్యావృతులను నియమించారు. కమ్మనాడు విష్ణుకుండినులు జయించారు గనుక అది వారి రాజ్యంలో భాగమైంది, కనుక విష్ణుకుండినుల రాజ్యానికి తాము వారసులం గనుక ఆ ప్రాంతాలు తమవేనని చాళుక్యులు భావించేవారు. అందువల్ల దక్షిణాంధ్ర ప్రాంతాలపై ఆధిపత్యం కొరకు పల్లవులకు, చాళుక్యులు 2 శతాబ్దాలు సంఘర్షణ జరిగింది. ఈ రెండు శతాబ్దాలలో వారి సంఘర్షణ ద్విముఖంగా సాగింది. రెండవ పులకేశి కోస్తా ఆంధ్రదేశాన్ని అంటే వేంగిరాజ్యాన్ని తన తమ్ముడు కుబ్జవిష్ణువర్ధనునికి ఇవ్వడంతో ఆంధ్రదేశంలో తూర్పుచాళుక్యులు, కర్ణాటకంలో పశ్చిమచాళుక్యుల పాలన ప్రారంభమైంది. పల్లవులు కృష్ణా తుంగభద్రా మధ్య ప్రాంతం కోసం పశ్చిమ చాళుక్యులతో కృష్ణాతీరం వరకు, తూర్పుకోస్తాను పునరాక్రమించడానికి తూర్పు చాళుక్యులతోను యుద్ధాలు చేశారు. కాని వీరి సంఘర్షణలో కమ్మనాడు, వేంగి రాజ్యంలోను, పూంగినాడు తొండైమండల రాజ్యంలో భాగాలైపోయాయి. మొదటి మహేంద్రవర్మ తర్వాత అతని కుమారుడు మొదటి నరసింహవర్మ పులకేశి క్రీ.శ.642లో పులకేశిని వధించి కృష్ణాతీరం వరకు దక్షిణాంధ్ర మొత్తాన్ని తిరిగి జయించాడు. విజయవాడలోని అక్కన్న, మాదన్న గుహలలోను, ఉండవల్లి గుహలలో ఉద్ఘాతిపిడుగు అనే పేరు రెండవ కుమారుడు విజయాదిత్యుడు కంచిపై దండెత్తి నరసింహను ఓడించినప్పుడు కుబ్జవిష్ణువర్ధనుని కుమారుడు జయసింహ వల్లభుడు తిరిగి కమ్మనాడు, పూంగినాడులను జయించాడు. పల్లవ రాజ్యంపై విజయాదిత్యుని దాడి జయసింహునికి అవకాశం కలిపించింది. తిరిగి నందివర్మ కాలంలో పల్లవులు పూంగినాటిని జయించారు. తిరిగి గుణగవిజయాదిత్యుడు ఆ ప్రాంతాలను జయించాడు. ఈ విధంగా పల్లవులకు, తూర్పు చాళుక్యులకు దక్షిణాంధ్ర ప్రాంతాల కోసం అంటే కృష్ణాతీరం కోసం అనేక పోరాటాలు జరిగాయి. తూర్పు చాళుక్యులు, పల్లవులతో ఎన్ని పోరాటాలు జరిపినా నెల్లూరు, చిత్తూరు జిల్లాలు చివరి వరకు పల్లవ రాజ్యంలోనే ఉన్నాయి. కనుక తెలుగు చోళుల కాలం నాటికి కమ్మ రాష్ట్రం వేంగి రాజ్యంలో భాగమని, నెల్లూరు రాజ్యం తొండై మండలంలో భాగమని అభిప్రాయం స్థిరపడిపోయింది.

చోళుల కాలం: ఆ తర్వాత పల్లవులను అంతం చేసి పల్లవ సామ్రాజ్యానికి వారసులైన చోళులు కూడా ఈ ప్రాంతాలు తమవేనని భావించారు. నెల్లూరు తెలుగు చోళుల కాలంలో కంచి వరకు తమ రాజ్యంలో భాగమేనని భావించి అంతవరకు జయించి కంచిని నెల్లూరు చోళుల ఆదిపత్యంలోనే ఉంచారు.

పాండ్య-కాకతీయ సంఘర్షణ: చోళులను ఓడించి పాండ్యులు చోళ సామ్రాజ్యానికి అధిపతులైన తర్వాత నెల్లూరు వరకు తమ రాజ్యంలో భాగమేనని భావించి జఠావర్మ సుందర పాండ్యుడు నెల్లూరు రాజ్యంపై దండెత్తి

గజపతిదేవుని ఓడించి తరిమి నెల్లూరులో వీరాభిషేకం చేయించుకున్నాడు కాకతీయులు యావత్ ఆంధ్రదేశానికి తాము వారసులమని భావించారు. వారు ఆంధ్రదేశానికి దక్షిణ సరిహద్దు కంచి అని భావించి కంచికవాటం ఛేదిస్తేనేగాని ఆంధ్రదేశపు దక్షిణ సరిహద్దును తొక్కినట్లు కాదని గజపతిదేవుడు కంచివరకు దండయాత్రలు సాగించాడు. అదే సందర్భంలో జరావర్మ సుందరపాండ్యుడు నెల్లూరు తెలుగుచోళుల రాజ్యం కూడా పూర్వపు చోళ సామ్రాజ్యంలో భాగం కనుక ఆ సామ్రాజ్యానికి ఇప్పుడు తాము వారసులం, కనుక ఆ ప్రాంతాలు తమవేనని కాకతీయ చక్రవర్తి గణపతిదేవునితో కయ్యానికి దిగాడు. అందువల్ల కాకతీయులకు, పాండ్యులకు ముద్దుకూరు వద్ద ఘోర యుద్ధం జరిగింది. అందులో కాకతీయసైన్యం చెల్లాచెదురైంది. కృష్ణానదికి దక్షిణ భాగమంతా పాండ్యుల అధికారం కిందికి వచ్చింది. తర్వాత రుద్రమదేవి పాండ్యులతో పోరాడి ఈ ప్రాంతాలను తిరిగి సంపాదించింది. కాని ఆమె సామంతుడు కాయస్త అంబదేవుడు స్వతంత్రించి కృష్ణానది వరకు తన రాజ్యం అన్నాడు తర్వాత ప్రతాపరుద్రుడు అంబదేవుని ఓడించి ఈ ప్రాంతాన్ని తిరిగి కాకతీయ సామ్రాజ్యంలో చేర్చాడు.

విజయనగర, రెడ్డిరాజ్యం సంఘర్షణ: కాకతీయ సామ్రాజ్యం విచ్ఛిన్నం తర్వాత కృష్ణానదికి దక్షిణాన అద్దంకి, కొండవీడులలో రెడ్డిరాజ్యం వేంగి నుండి ఉత్తరాంధ్ర వరకు ముసునూరి కమ్మరాజ్యం ఏర్పడింది. ఇదే సందర్భంలో హరిహర బుక్కరాయలు క్రీ.శ.1336లో విజయనగర రాజ్యాన్ని స్థాపించాడు. ఈ రాజ్యం అనతి కాలంలోనే మహాసామ్రాజ్యంగా రూపొందింది. కన్నడ, మళయాళ, తమిళ, తెలుగు నాలుగు దక్షిణాది ప్రాంతాల సామ్రాజ్యంగా రూపొందింది. బుక్కరాయల కాలంలో ఈ నాలుగు భాషా ప్రాంతాలను జయించి విజయనగర సామ్రాజ్యం తమ పూర్తి రూపురేఖలు దిద్దుకుంది. హొయసాల రాజ్య ప్రాంతాలన్నీ జయించిన తర్వాత బుక్కరాయలు తొండై మండలంపై దండెత్తి తమ సామ్రాజ్యంలో కలుపుకున్నాడు. తమిళదేశాన్ని పరిపాలించిన పల్లవ, చోళ, పాండ్య వంశాలు కృష్ణానది సరిహద్దు వరకు తమదేనని భావించారు. వారి రాజ్యం ఇప్పుడు విజయనగర సామ్రాజ్యం వారసురాలు అయింది. కనుక కృష్ణానది వరకు ఆ భూభాగమంతా విజయనగర సామ్రాజ్యానికే చెందుతుందని బుక్కరాయలు భావించాడు. కాని ఈ స్థానంలో అంటే కమ్మనాడులో ప్రోలయ వేమారెడ్డి స్వతంత్ర రాజ్యస్థాపన చేశాడు. కనుక బుక్కరాయలు ఆ తర్వాత అతని వారసులు కృష్ణా వరకు తమ రాజ్యాన్ని విస్తరించుకోటానికి కొండవీటి రెడ్డిరాజ్యంపై దాడులు సాగించారు. బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యానికి కృష్ణానదినే సరిహద్దుగా నిర్ణయించాడు. కనుక విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన సంగమ, సాళువ, తుళు, ఆరవీటి నాలుగు వంశాలు తమ సామ్రాజ్యాన్ని కృష్ణానదికి ఉత్తరంగా తమ రాజ్యం విస్తరించాలని, కృష్ణానదే తమ సామ్రాజ్యానికి సరిహద్దు చేశాయి. కృష్ణానదికి ఉత్తరంగా తమ రాజ్యం విస్తరించాలని, కృష్ణానదే తమ సామ్రాజ్యానికి సరిహద్దు అని వారు గాఢంగా నమ్మారు. శ్రీకృష్ణదేవరాయలు గజపతులపై పూర్తి విజయం సాధించి కటకం వరకు తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నా కూడా గజపతితో సంధి జరిగిన తర్వాత కృష్ణానదిని సరిహద్దుగా అంగీకరించి కృష్ణకు ఉత్తర భాగాన్నంతటిని తిరిగి గజపతికే ఇచ్చివేశాడు. కనుక కృష్ణా తుంగభద్ర నదుల మధ్య అంతర్వేది ప్రాంతాల కోసం పశ్చిమ చాళుక్యులకు, చోళ చాళుక్యులకు విజయనగర, బహమనీలకు ఎలా సంఘర్షణ జరిగిందో తూర్పుకోస్తాలో కంచి నుండి కృష్ణానది వరకు అంటే గుంటూరు, నెల్లూరు జిల్లాల ప్రాంతం కోసం వేంగిని పాలించిన రాజవంశాలకు, దక్షిణదేశ రాజవంశాలకు సంఘర్షణ జరిగింది. ఇందులో భాగంగానే తూర్పుగాంగ విజయనగర రాజ్యానికి గజపతి విజయనగర సామ్రాజ్యాలకు సంఘర్షణ జరిగింది.

విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1336-1680

విజయనగర సామ్రాజ్య స్థాపన దక్షిణ భారతదేశ చరిత్రలోనేగాక యావత్ భారతదేశ చరిత్రలోనే ఒక మహత్తర ఘట్టం కాకతీయ సామ్రాజ్య పతనానంతరం దిక్కుమొక్కులేక అల్లాడుతున్న హిందువులను రక్షించి హిందూ సంస్కృతిని ఉద్ధరించే పవిత్ర ఆశయంతో స్థాపింపబడింది ఈ లక్ష్యసాధనలో ఈ సామ్రాజ్యం సుమారు 3 $^{1}/_{2}$ శతాబ్దాల పాటు ముస్లిం దాడుల నుంచి దక్షిణదేశాన్ని రక్షించటమేగాక దక్షిణదేశంలో హిందూ ధర్మరక్షణలో కంకణం కట్టుకోవడానికి శివాజీని ఉత్తేజితుని చేసినది కూడా ఈ విజయనగర సామ్రాజ్యమే. శివాజీ మహారాష్ట్రుల ద్వారా తన పవిత్ర ఆశాయాన్ని బ్రిటిషు యుగం దాకా కొనసాగించిన ఘనత విజయనగర సామ్రాజ్యానిదే నేటికీ దక్షిణదేశంలో హిందూ సంస్కృతి చెక్కుచెదరకుండా నిలచి ఉందంటే అది విజయనగర సామ్రాజ్యపు చలవే ఈ సామ్రాజ్యం స్థాపించక పోయినట్లయితే నాటి ప్రజలు ఏమైపోయేవారో, హిందూ సంస్కృతి ఎలా నశించిపోయేదో విలస తామ్ర శాసనం, గంగాదేవి మధుర విజయ కావ్యం, తిరుక్కల శాసనం, 1376 నాటి కర్ణాటక శాసనం నాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు వర్ణించాయి.

ఆ కాలానికి చెందిన విలస తామ్రశాసనం నాటి హిందువుల పరిస్థితి కళ్లకు కట్టినట్లు వివరించింది ప్రతాప రుద్రుడనే భానుడు అదృశ్యం కాగా లోకంలో తురుష్క అంధకారం వ్యాపించింది. ధనవంతులు ధనం కోసం వధించబడ్డారు కొందరు పీడించబడ్డారు. కొందరు వారిని చూడగానే ప్రాణాలను వదిలారు. బ్రాహ్మణులు యజ్ఞకర్మలను వదులుకున్నారు దేవాలయాలు ధ్వంసమై పూజాపునస్కారాలు లేకుండా పోయాయి. అగ్రహారాలు రైతుల భూములు అన్నీ స్వాధీనం చేసుకున్నారు. బీద, ధనిక తారతమ్యం లేకుండా అంతా దరిద్రులయ్యారు స్త్రీలపై అత్యాచారాలకు లెక్కలేదు. ఈమె నా భార్య, ఇది నా ఆస్తి అనే భావం ఎప్పుడో పోయింది. ఇక జీవించటం ఎలా అని శాసనకర్త వాపోయాడు.

ఆంధ్రదేశం పరిస్థితి ఇలా ఉండగా తమిళదేశ ప్రజల పరిస్థితి మరింత ఘోరంగా దిగజారిపోయిందని గంగాదేవి కావ్యం వివరిస్తుంది. ముస్లిం పరిపాలనలో జంబుకేశ్వరం, శ్రీరంగం చిదంబరం, మధుర దేవాలయాలు పాడుబడ్డాయి. ధూప, దీపాల వాసనలు, మృదంగనాదాలకు బదులు నక్కల కూతలు వినబడుతున్నాయి ఏ పట్టణం చూసినా రమణీమణుల కనువిందుకు బదులు, బందీకృత వనితల కన్నీటిధారలతోను, దేశమంతా గోవధలతోను, పచ్చిమాంసపు వాసనలతోను నిండిపోయింది. వేదాలు, ధర్మమార్గాలు ఆచరించే మార్గమే లేదు రక్షించే దిక్కులేక ద్రావిడుల ముఖాలు వెలవెలబోతున్నాయని ఈ కావ్య కవయిత్రి నాటి ప్రజల బాధలు స్పష్టంగా వర్ణించింది.

మధుర సుల్తాన్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో తిరుక్కల శాసనం వర్ణించింది. అలాగే క్రీ.శ.1376 నాటి కర్ణాటక శాసనం ఈ భూమి మ్లేచ్ఛాక్రాంతమైనప్పుడు దానిని విముక్తి చేయటానికి శ్రీకృష్ణుడు తాను బుక్కరాయలుగా జన్మిస్తానని యశోదానందులకు చెప్పాడని వర్ణించింది. తమను రక్షించినందుకు కర్ణాటక ప్రజలు బుక్కరాయలను శ్రీకృష్ణావతారంగా భావించారని ఈ శాసనం తెలుపుతోంది

విజయనగర రాజ్యస్థాపన ఆశయం: కొందరు చరిత్రకారులు అన్ని రాజ్యాల మాదిరిగా విజయనగర సామ్రాజ్యం కూడా రాజకీయ లక్ష్యాలతోనే స్థాపించబడిందని భావించారు. ముఖ్యంగా బర్టన్‌స్టెయిన్ డా॥ బి యస్.యల్. హనుమంతరావులు విజయనగర రాజ్యస్థాపనలో ప్రధాన ఆశయం అంటూ ఏమీలేదని, దాని ప్రేరణ మానవ సహజమైన సాధారణ రాజ్యకాంక్ష తప్ప, హిందూమత రక్షణ ఆశయం గాని, ముస్లిం మతవ్యాప్తిని ప్రతిఘటించే ఉన్నత ఆదర్శంగాని లేదని వాదించారు. వారు తమవాదనను సమర్థించుకోవడానికి విజయనగర రాజులు సాటి హిందూ రాజ్యాలపై దండెత్తారని, అదేవిధంగా విజయనగర నిర్మాణాలలో ముస్లిం వాస్తును ప్రవేశపెట్టడం, విజయనగరంలో ముస్లింలకు పేటలు, మసీదులు నిర్మించుకోడానికి అనుమతినివ్వడం కారణాలుగా చూపారు. కాని వారి వాదన సరైనది కాదు. విజయనగరంలో ముస్లింలకు మసీదులు, పేటలు నిర్మించుకోవడానికి అనుమతినివ్వడం వారి ఔదార్యానికి, ప్రాచీన కాలం నుండి భారతదేశంలో వచ్చే పరమత సహనం, సాంప్రదాయానికి నిదర్శనమే తప్ప అన్యంగాదు. పైగా విజయనగర రాజుల పవిత్ర ఆశయం ముస్లింల ద్వేషం నుండి హిందువులను, హిందూ ధర్మాన్ని రక్షించడమేగాని, ముస్లింలను, ముస్లిం మతాన్ని నాశనం చేయడం

కాదు. కనుక వారు ముస్లింలను తమ రాజధానిలో నివసించడానికి అనుమతించారు. ముస్లిం వాస్తు ప్రభావం విజయనగర కట్టడాలలో ప్రవేశపెట్టినంత మాత్రాన వారికి హిందూధర్మ రక్షణాశయం లేదని చెప్పడం సరికాదు. ప్రతియుగంలో కాల ప్రభావం వల్ల మానవ జీవితంలో మార్పులు వస్తాయి. అలాగే ఆనాటి కాల ప్రభావం వలన ముస్లిం వాస్తు శిల్పకళా లక్షణాలను వారి నిర్మాణాలలో కూడా ప్రవేశపెట్టారు. కనుక ఈ వాదన కూడా నిలవదు. కనుక కృష్ణస్వామి అయ్యంగార్, శ్రీకంఠయ్య, పి.బి.దేశాయ్, మల్లంపల్లి సోమశేఖరశర్మ, నీలకంఠశాస్త్రి, శ్రీనివాసరిత్తి, ఆర్.సుబ్రహ్మణ్యం, బి.ఎ.సాలెటోర్, కృష్ణశాస్త్రి, హయవదనరావు, బి.ఆర్.గోపాల్ మొదలైన పలువురు పండితులు విజయనగర సామ్రాజ్యం అన్ని సామ్రాజ్యాలలాగా రాజ్యకాంక్షతో స్థాపింపబడింది కాదని, దక్షిణ దేశంలో ప్రవేశించిన ముస్లిం సామ్రాజ్య విస్తరణను అరికట్టి వారి అనాగరిక దాడుల నుండి హిందువులను, హిందూ ధర్మాన్ని రక్షించే పవిత్ర లక్ష్యంతో స్థాపింపబడిందని ముక్త కంఠంతో ఘోషించారు. కనుకనే విజయనగర చక్రవర్తులు ఈ సామ్రాజ్యం తమది కాదని, శ్రీ విరూపాక్షస్వామిదని, తాము ఆ రాజ్యానికి ధర్మకర్తలు మాత్రమేనని చెప్పుకొని, విరూపాక్షుని పేరుతోనే పరిపాలన సాగించి, ఆ దేవుని పేరుతోనే రాజముద్రికను, నాణేలను ముద్రించారని వర్ణించారు. నిశితంగా పరిశీలిస్తే వారివాదవ సరైనదనే భావన కలుగుతుంది. అల్లావుద్దీన్ కాలం నుండి మహమ్మద్ బిన్ తుగ్లక్ కాలం వరకు దక్షిణ భారతదేశంపై అనేకదాడులు జరిగాయి. ఒక్క కాకతీయ రాజ్యం మీదనే 8 దాడులు జరిగాయి. మహమ్మద్ బిన్‌తుగ్లక్ కాకతీయ, పాండ్య రాజ్యాలను ధ్వంసం చేసి ముస్లిం పాలన ఏర్పాటు చేసిన తర్వాత తెలుగు, తమిళ, కన్నడ ప్రజలు పడిన కడగళ్లను ముసునూరి ప్రోలయ నాయకుని విలస తామ్రశాసనం, గంగాదేవి మధుర విజయకావ్యం, తిరుక్కలి శాసనం కళ్లకు కట్టినట్లు వర్ణించాయి. ఆనాటి ప్రజల కడగండ్లను చూపి హరిహర బుక్కరాయలు హిందూ ధర్మరక్షణకు పూనుకొని విజయనగర రాజ్యాన్ని స్థాపించారని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. క్రీ.శ.1367 నాటి కర్ణాటక శాసనం ఈ భూమి మ్లేచ్ఛా క్రాంతమైనప్పుడు దానిని విముక్తి చేయడానికి తాను బుక్కరాయలుగా జన్మిస్తానని శ్రీకృష్ణుడు యశోదానందులకు చెప్పాడని వర్ణించింది. కనుకనే బుక్కరాయలు సంగమునికి, కామాంబకు జన్మించాడని నాటి ప్రజలు భావించారు. కనుక ముస్లిం దాడులను అరికట్టి, హైందవ ధర్మరక్షణకే ఈ రాజ్యం జన్మించిందని బోధపడుతుంది. పైగా విద్యారణ్య యతీంద్రులకు కలిగిన మహాసంకల్ప ఫలితమే విజయనగర రాజ్య అవతరణ. విద్యారణ్యయతీంద్రుల వారు విద్యాతీర్థయతీంద్రులని కూడా వ్యవహరింపబడ్డారు. సర్వసంగ పరిత్యాగి అయిన విద్యారణ్యయతీంద్రులు హరిహర బుక్కరాయలకు స్ఫూర్తినిచ్చి వారి ద్వారా ఈ రాజ్యాన్ని స్థాపించాడు. హిందూ ధర్మరక్షణకు విద్యారణ్య స్వామి హరిహర.బుక్కరాయల మహోన్నత సంకల్పమే దక్షిణదేశంలో విజయనగర సామ్రాజ్య రూపంలో హిందూ రాజకీయ శక్తి ఆవిర్భవించింది. మానవుని సహజసిద్ధమైన స్వార్థం, రాజకాంక్షతో స్థాపించి ఉంటే వారు ఆ రాజ్యం తమదేనని చెప్పుకోనేవారు. విరూపాక్షునిదని చెప్పేవారు కాదు. చివరి వంశాలైన తుళువ, ఆరవీటి వంశాలు వైష్ణవ మతానికి మారినా, రాజశాసనాలలో రామచంద్ర, వేంకటేశ్వర అనే పేర్లతోనే విడుదల చేశారు గాని తమ పేర్లతో శాసనాలు విడుదల చేయలేదు. వారు ఆ రాజ్యం దైవానిదని, ఆ దైవ ప్రతినిధులుగానే ఆ రాజ్యాన్ని పాలించామని గాఢంగా నమ్మారు గాని విజయనగర రాజ్యాన్ని పాలించిన ఏ ఒక్క రాజు కూడా రాజ్యం తనదని గాని, తన వంశానిదనిగాని చెప్పుకోలేదు. కనుక విజయనగర రాజ్యం హిందూ ధర్మరక్షణ అనే పవిత్ర లక్ష్యసాధన కోసమే జన్మించిందని దాదాపు చరిత్రకారులందరూ భావించారు. కొందరు కన్నడదేశంలో వ్యాప్తిలో ఉన్న వీరశైవ ఉద్యమ ప్రభావం విజయనగర స్థాపనకు దోహదం చేసిందని భావించారు. కాని అది వాస్తవం కాదు. వీరశైవ ఉద్యమం మత ఉద్యమం. పైగా ఆ మతం హిందూమతంలోని ఇతర శాఖలను, దురాచారాలను ఖండించిందే గాని ముస్లిం మతంపై ధ్వజమెత్తలేదు. ఆనాటి దక్షిణదేశ రాజకీయ పరిస్థితి ముస్లిం అధికారవ్యాప్తి విజయనగర రాజ్యాస్థాపనకు దారి తీసింది. తప్ప వీరశైవ ఉద్యమ ప్రభావం ఎంతమాత్రం కాదు. తుగ్లక్ పరిపాలనలో దక్షిణదేశ హిందూ ప్రజలను కాపాడటానికే ఈ రాజ్యం జన్మించింది. తుగ్లక్ పరిపాలన అంతమైంది. కాని 10 సంవత్సరాల్లో మరొక ప్రమాదం ముంచుకు వచ్చింది. క్రీ.శ.1347లో గుల్బర్గాలో బహమనీ రాజ్యం స్థాపించబడింది. ఆ రాజ్యం తుగ్లక్‌ల వారసత్వంగా దక్షిణదేశాన్నంతటినీ తన ఆధిపత్యంలోకి తీసుకురావాలని సంకల్పించింది. కనుక బహమనీ రాజ్యం దాడుల నుండి దక్షిణదేశాన్ని కాపాడవలసిన మాతన బాధ్యత, ప్రాచీన హిందూ సనాతన ధర్మాన్ని రక్షించవలసిన బాధ్యత విజయనగర రాజ్యం స్వీకరించింది. కనుకనే దక్కనులోని మహమ్మదీయ పాలకులకు దక్షిణ భారతదేశ హిందువులకు మధ్య జరిగిన తీవ్ర పోరాటమే విజయనగర చరిత్ర అని నేలటూరి వెంకటరమణయ్య

వ్యాఖ్యానించారు. ఆయన అభిప్రాయాల్ని బలపరుస్తూ నీలకంఠశాస్త్రి విజయనగర చక్రవర్తులు ఆత్మ చైతన్యంతో హిందూ రక్షణ ఆదర్శంతో మహమ్మదీయ విస్తరణను నిరోధించడానికి ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉండే రాజ్యాంగా విజయనగర రాజ్యం రూపొందిందని వర్ణించారు. అంతకుముందు ఏ హిందూ రాజ్యం ఈ విధంగా ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉండే సైనిక వ్యవస్థను నిర్మించలేదు అని కూడా ఒక ధర్మబద్ధమైన ఆదర్శం మొదటి రెండు వంశాలైన సంగమ, సాళువ వంశస్తుల పరిపాలనలో కనిపిస్తోందనే అభిప్రాయం వెలిబుచ్చాడు

హరిహర బుక్కరాయలు ముస్లింలుగా ఉండి తర్వాత విద్యారణ్యుల వారి వలన హిందువులుగా మార్చబడినందు వల్ల వారిని ప్రజలు నమ్మరని, కనుక వారు స్థాపించిన రాజ్యం విరూపాక్షునిదని ప్రకటించమని విద్యారణ్యుల వారు సలహా ఇచ్చారని నేలటూరి వెంకటరమణయ్య అన్నారు. కాని ఆ అవసరం తీరిన తర్వాత కూడా వారు రాజ్యం తమదని ప్రకటించలేదు. విరూపాక్షునిదేనని ఆ దేవుని పేరుతోనే శాసనాలు విడుదల చేశారు కనుక సోదరులు తమ రాజ్యకాంక్ష కోసం రాజ్యాన్ని స్థాపించలేదు. పైగా రాజ్యం స్థాపించిన కొద్ది కాలానికే వారు సాయణాచార్యుల చేత వేదాలకు భాష్యం రాయించడం, మాధవాచార్యుల చేత పరాశర మాధవీయవ్యాఖ్య రాయించడం, వారు ధరించిన హిందూ రాయసురత్రాణ అనే బిరుదులు ఇవన్నీ హరిహర బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని హిందూ ధర్మరక్షణకే స్థాపించారని సూచిస్తున్నాయి.

మూడు శతాబ్దాలపాటు దక్షిణదేశంలో వారు నిర్మించిన దేవాలయాలు సంస్కృత, తెలుగు, తమిళ, కన్నడ భాషలను పోషించిన తీరు, హిందూ సంస్కృతికి వారు చేసిన సేవలన్నీ ఆ రాజ్యపు ఆశయాలను చాటుతున్నాయి ముస్లిం మత ప్రభావానికి లోనుగాకుండా హిందూ సంస్కృతిని దక్షిణదేశ భాషలను చెక్కుచెదరకుండా నిలబెట్టింది. ఏమైనప్పటికీ దక్షిణ భారతదేశంలో బహమనీ రాజ్య విస్తరణను అరికట్టి హిందూ ప్రజలకు రక్షణ సుఖశాంతులను కలిగించి, హిందూ సాహిత్య కళారంగాలకు అద్భుత సేవ చేసి, హిందూ సంస్కృతి వారసత్వాలను హిందువులకు మిగిల్చింది. ఈ రాజ్యమే. కనుక దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర యుగం స్వర్ణ యుగం అని ప్రసిద్ధి చెందింది.

కాని ఇలాంటి మహోజ్వల చరిత్ర గల్గిన విజయనగర రాజ్యస్థాపన గురించి మనకు స్పష్టంగా తెలియక పోవడం వింతలలో వింత ఈ రాజ్యస్థాపనను గురించి రాజ్యస్థాపకులైన హరిహరబుక్కరాయల గురించి, జాతిని గురించి వారి తొలి జీవితాన్ని గురించి చరిత్రకారుల మధ్య అనేక వాదోపవాదాలు ఉన్నాయి.

విజయనగర చరిత్రకు ఆధారాలు: విజయనగర చరిత్రను తెలుసుకోవడానికి మనకు కోకొల్లలుగా ఆధారాలు లభ్యమవుతున్నాయి. అవి పురావస్తు ఆధారాలు, సాహిత్య ఆధారాలుగా విభజింపబడ్డాయి. పురావస్తు ఆధారాలలో ముఖ్యమైనవి. శాసనాలు, కట్టడాలు, నాణేలు. అలాగే సాహిత్యాధారాలు దేశ, విదేశీ రచనలు అని చెప్పవచ్చును. విజయనగర చక్రవర్తులు తమ ఆజ్ఞలను లిఖిత రూపంలో భద్రపరచారు. వాటిని తామ్రపేటిక శాసనాలని పిలుస్తారు. 17వ శతాబ్దంలో వారు కొన్ని ప్రత్యేక సందర్భాలలో బంగారు, వెండిరేకులపై రాజాజ్ఞలను రాయించి దచ్చి, ఇంగ్లిషు కంపెనీ వారికి ఇచ్చారు. ఇవేగాక విజయనగర రాజులు అనేక శిలాశాసనాలు కూడా రాయించారు.

శాసనాలు: విజయనగర చరిత్రకు చెందిన శిలా, తామ్ర శాసనాలు ఐదువేలకు పైగానే లభించాయి శ్రీరంగ రాయల కాలం నాటి ఒక వెండి నాణెం కూడా లభ్యమైంది. వారి శిలా శాసనాలు సంస్కృతం, తెలుగు తమిళ, కన్నడ భాషలలో రాయబడ్డాయి. తామ్ర శాసనాలు, నందినాగరి లిపిలో సంస్కృతభాషలో లిఖించబడ్డాయి కొన్ని శిలాశాసనాలు, ద్విభాషా శాసనాలు అంటే ఆ శాసనాలలో సంస్కృతం, తెలుగు భాష లేక స్థానిక భాషలో లిఖింపబడ్డాయి. విజయనగర శాసనాలు South Indian inscriptions Epigraphy of Indica, Annual reports Epigraphy లలో ప్రచురించబడ్డాయి.

వీరి శాసనాలలో వివాదగ్రస్తమైనది బుక్క రాయల కాలం నాటి గొౕలిజవీడు శాసనం. ఈ శాసనం క్రీ.శ.1314వ సంవత్సరానికి చెందిందని, దానిని బట్టి మొదటి బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి సామంతుడుగా నెల్లూరు జిల్లాను పాలించాడని, కనుక హరిహర బుక్కరాయలు ఆంధ్రులని నేలటూరి వెంకట్రామయ్య నిర్ణయించారు. కాని పి.బి.దేశాయ్ మొదలైన ఇతర పండితులు ఈ శాసనం క్రీ.శ.1374వ సంవత్సరానికి చెందిందని నిర్ణయించి, నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయాన్ని తిరస్కరించాడు. అందువల్ల ఈ శాసనం హరిహర బుక్కరాయల పూర్వచరిత్రను గురించి వాదోపవాదాలకు అవకాశం కల్పించింది. కాని పి.బి.

దేశాయ్ మొదలైన వారి అభిప్రాయమే సరైనదిగా కనిపిస్తుంది. కారణమేమిటంటే క్రీ.శ.1314లో తన అన్న హరిహరరాయలు ఉండగా తన పేరుతో బుక్కరాయలు శాసనం వేయించి ఉండడు. ఏమైనా ఈ శాసనం నెల్లూరు జిల్లా ప్రాంతం బుక్కరాయల అధికారంలో ఉందని చాటుతోంది. క్రీ.శ.1336 నాటి మొదటి హరిహరరాయల బాఘావల్లి తామ్రశాసనం, క్రీ.శ.1356 నాటి రెండవ సంగముని బిట్రగుంట తామ్రశాసనం సంగమ వంశ వృక్షాన్ని ఇస్తుంది. క్రీ.శ.1368 నాటి శ్రావణ బెళగొళలోని రామానుజ శాసనం జైన వైష్ణవుల సంఘర్షణ బుక్కరాయల మత సామరస్యాన్ని తెలుపుతోంది. బుక్కరాయల షికార్‌పూర్ శాసనం అతని బిరుదులను, అతని గురుక్రియాశక్తిని మంత్రి మాధవుని పేర్కొంటోంది. క్రీ.శ.1378 నాటి రెండవ హరిహరరాయల చెన్నపట్టణ శాసనం మొదటి బుక్కరాయల దిగ్విజయాలను పేర్కొని విజయనగరి అతని రాజధాని అని వర్ణిస్తోంది. క్రీ.శ.1399 నాటి రెండవ హరిహరరాయల నెల్లూరు తామ్రశాసనం, అతడు ధరించిన రాజాధిరాజు పరమేశ్వర బిరుదును తెలుపుతూ అతని చక్రవర్తిత్వాన్ని ఇతర బిరుదులను ఇస్తోంది. క్రీ.శ.1434 నాటి రెండవదేవరాయల శ్రీరంగ తామ్రపట్టికలు సంగమ వంశవృక్షాన్ని ఇస్తున్నాయి. అంతేగాక రెండవ దేవరాయలు విధించిన అనేక సుంకాల వివరాలను కూడా తెలుపుతోంది. క్రీ.శ.1504 నాటి సాళువ రెండవ నరసింహరాయల దేవులపల్లి శాసనం సాళువ వంశవృక్షాన్ని, సాళువ నరసింహరాయలు విజయనగర రాజ్యాన్ని ఆక్రమించిన విషయాన్ని వివరిస్తోంది. 1507 నాటి తుళవ వీర నరసింహరాయల కుడియాన్తండర్ శాసనం తుళువ వంశవృక్షాన్ని ఇస్తూ తుళవ నరసనాయకుని ఘనకార్యాలు, విజయాలను వర్ణించింది. క్రీ.శ.1510 నాటి శ్రీకృష్ణదేవరాయల హంపి శాసనం రాయల పట్టాభిషేక కాలంలో చేసిన దానధర్మాలను వివరిస్తోంది. ఈ శాసనం ద్విభాషాశాసనం. ఇది సంస్కృత, కన్నడ భాషలలో లిఖించబడింది. శ్రీకృష్ణరాయల కాలం నాటి తామ్రశిలా శాసనాలు ఇప్పటికీ దాదాపు 500 శాసనాలు లభించాయి. అవి కృష్ణరాయల జీవితానికి సంబంధించిన ప్రతి సంవత్సరపు వివరాలను తెలుపుతున్నాయి. రుద్రపురం, పెయ్యలబండ, సెట్టూరు, నాగులాపురం తామ్రశాసనాలు కృష్ణరాయల పట్టాభిషేకం, సింహాసనాన్ని అధిష్టించడం, అతడు సాధించిన విజయాలు, తీర్థయాత్రలు, అతడు చేసిన దానాలను తెలుపుతున్నాయి. ఉదయగిరి, కొండవీడు, అమరావతి, మంగళగిరి, సింహాచల శాసనాలు రాయల కళింగ దండయాత్రా విశేషాలను, గజపతి రాజ్యంపై జరిగిన దండయాత్ర దశలు, ఆ సమయాలలో అతడు తూర్పు తీరంలోని దేవాలయాలకు ఇచ్చిన దానాలను తెలియజేస్తున్నాయి. క్రీ.శ.1517-18 నాటి మంగళగిరి శాసనం రాయల తూర్పు దిగ్విజయ కాలంలో కళింగ దేశంలో జయస్తంభాన్ని ప్రతిష్టించినట్లు తెలుపుతోంది. క్రీ.శ.1520 నాటి కొండవీడు శాసనంలో ఆనాడు తెలుగు ప్రాంతంలో అమలులో ఉన్న సుంకాల వివరాలను ఇస్తోంది. అచ్యుతరాయల కడలాడి, తామ్రపట్టికలు అతడు 1530లో సింహాసనం అధిష్టించే సమయంలో ఏర్పడిన సమస్యలను తెలుపుతోంది. క్రీ.శ.1601 నాటి రెండవ వెంకటపతిరాయల ఎలపాకం శాసనం అతని రాజముద్రికపై విరూపాక్ష అని గాక వేంకటేశ అని ఉన్నట్లు కూడా తెలుపుతున్నాయి. దీనిని బట్టి విజయనగర చివరిదశలో వైష్ణవమతం ప్రాముఖ్యతను సంతరించుకుందని తెలుస్తోంది. ఇంకా అనేక తుళువ, ఆరవీటి వంశ శాసనాలు ఆయా వంశ చరిత్రల అధ్యయనానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

నాణేలు: విజయనగర నాణేలకు వరహాలు, పగోడాలు అని పేరు. అవి పరిమాణంలో చిన్నవి. కాని మందంగా ఉండేవి. అవి అచ్చులలో ముద్రింపబడ్డాయి. ఈ నాణేల మీద అక్షరాలు నాగరి లిపిలో లిఖింపబడ్డాయి. కృష్ణరాయల నాణేలు కూడా పరిమాణంలో చిన్నవే. విజయనగర రాజ్యంలో వేరువేరు విలువలు గలిగిన నాణేలు వాడుకలో ఉన్నట్లు విదేశీ రచనలు తెలుపుతున్నాయి. ఈ నాణేలలో అర్థ, పాతిక విలువగలిగిన నాణేలు కూడా ఉన్నాయి. ఈ నాణేలను బంగారు, వెండి లోహాలలో కూడా ముద్రించారు. విజయనగర నాణేల మీద ఒకవైపున హిందూ దేవతామూర్తులు, ఏనుగు, గండభేరుండం, వృషభం చిత్రాలు, మరొకవైపున రాజు పేరు, అతని బిరుదు ఉంటుంది. కృష్ణరాయల నాణేలలో ఒకదాని మీద బాలకృష్ణుని బొమ్మ చిత్రించబడింది. ఈ నాణెం ఉదయగిరిని జయించిన చిహ్నంగా ముద్రించాడు. ఈ నాణేల వల్ల ఆయా రాజుల కాలం నాటి ఆర్థిక, మత పరిస్థితులను తెలుసుకోవచ్చు.

కట్టడాలు: విజయనగర కాలం నాటి వాస్తు శిల్ప, చిత్రలేఖనాలు ఆ కాలం నాటి మత, సాంఘిక, సాంస్కృతిక శిల్పకళా విశేషాలను తెలుసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. విజయనగర చక్రవర్తులు వారి సామంతులు, రాజోద్యోగులు అనేక ప్రదేశాలలో దేవాలయాలు, కళ్యాణ మండపాలు, రాయగోపురాలు, ఏకశిలా

రథాలు, ఏకశిలా స్తంభాలు, రాజప్రాసాదాలు నిర్మించారు. అవి విజయనగర యుగం నాటి వైభవానికి అద్దం పడుతున్నాయి. హంపి, విజయనగరంలోని అనేక దేవాలయాల శిథిలాలు నేటికీ నిలచి ఉన్నాయి. అక్కడ విరూపాక్ష, హజారా రామస్వామి, విఠలస్వామి ఆలయం, అందులోని ఏకశిలారథం, సంగీత స్తంభాలు, వినాయక, ఉగ్రనారసింహ విగ్రహాలు, దశరాదిబ్బ, పద్మమహల్, గజశాల, లేపాక్షి, పెనుగొండ, చంద్రగిరి, తాడిపర్తి, పుష్పగిరి, శ్రీశైలం, వెల్లూరు, కుంభకోణం, కంచి, శ్రీరంగం దేవాలయాలు, ఆ దేవాలయాల మీద కుడ్యశిల్పాలు, సోంపాలెం లేపాక్షి వీరభద్రాలయంలోని వర్ణచిత్రాలు విజయనగర యుగం నాటి సంస్కృతిని, నాట్యశిల్ప చిత్ర, వాస్తు కళావైభవాన్ని చాటుతున్నాయి. క్రీ.శ.1950 నుండి హంపిలో జరుగుతున్న పురాతత్వ పరిశోధనలు అనేక చారిత్రకాంశాలను వెలుగులోకి తెచ్చాయి.

దేశీయ వాఙ్మయం: విజయనగర యుగంలో సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడ భాషలలో అనేక కావ్యాలు వంశావళులు, గేయకథలు, చాటువులు మొదలైన అనేక రకాల రచనలు చేయబడ్డాయి. విజయనగర చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నాయి.

సాహిత్య ఆధారాలు: సాహిత్యపరంగా అనేక కావ్యాలు విజయనగర చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నాయి. నాచనసోముని రచనలలో హరివంశం, హరిహర-బుక్కరాయలను గూర్చి తెలుపుతోంది. వల్లభరాముని క్రీడాభిరామంలో కూడా హరిహర బుక్కరాయలను గురించి ఉంది. వల్లభరాయుడు రెండవ హరిహరరాయల ఆస్థాన ఉద్యోగి. జక్కన రాసిన విక్రమార్క చరిత్రలో మొదటి దేవరాయల కాలంనాటి విశేషాలు పినవీరభద్రుని జైమినీభారతం జంటకవులైన నంది ఎల్లయ, ఘంట సింగయలు రచించిన వరాహపురాణం, రామరాజభూషణ లేక భట్టుమూర్తి రచించిన వసుచరిత్ర, రంగప్ప రచించిన శంఖోపాఖ్యానం, ఎల్లనార్యుని విష్ణుమాయావిలాసం విజయనగర యుగచరిత్రలను తెల్పుపుతున్నాయి. అలాగే కోనేరి నాథుడు రచించిన ద్విపద కావ్యం అయిన బాలభాగవతం సాళువ, తుళువ, ఆరవీటి వంశ చరిత్రలను తెలుపుతున్నాయి. సంస్కృతంలో ఉన్న విద్యారణ్య కాలజ్ఞానం భవిష్యద్వాణి పలికినట్లు విజయనగర రాజుల చరిత్రను తెలుపుతోంది. రాజకాల నిర్ణయం, గురువంశ కావ్యం, పితామహ సంహితులు కూడా మంచి ఆధారాలే. మాధవ, శాయణ, చౌండప మొదలైన భాష్యకారుల రచనలు సంగమ వంశస్తులను గూర్చి తెలియజేస్తున్నాయి. లక్షణ పండితుడు తన వైద్య రాజవల్లభంలో రెండవ బుక్కరాయలను గూర్చి రాశాడు.

గంగాదేవి రచించిన మధురావిజయం లేక కంపరాయచరిత్ర, తన భర్త అయిన కంపరాయలు మధురను జయించిన చరిత్రను తెలుపుతోంది. డిండిముని సాళువాభ్యుదయం సాళువ నరసింహుని విజయాలను వర్ణిస్తోంది. రాజనాథ డిండిముని అచ్యుతరామాభ్యుదయం కృష్ణరాయల కళింగ రచించిన సంగీత సూర్యోదయ పీఠికలలో కూడా కృష్ణరాయల కళింగ దిగ్విజయ యాత్ర ఆదిల్‌ఖాన్‌పై సాధించిన విజయాలు వర్ణింపబడ్డాయి.

తెలుగు అనేక గ్రంథాలు విజయనగర చరిత్రకాంశాలను తెలుపుతున్నాయి. అల్లసాని పెద్దన మనుచరిత్ర, నంది తిమ్మన పారిజాతపహరణం కృష్ణరాయల దిగ్విజయాలను, అతని వ్యక్తిత్వాన్ని వర్ణిస్తున్నాయి. రాయలు రచించిన ఆముక్తమాల్యద రాయల రాజనీతిని, దిగ్విజయాలను తెలపడమేగాక నాటి సాంఘిక, సాంస్కృతిక జీవనాన్ని కళ్లకు కట్టినట్లు వివరిస్తోంది. కృష్ణరాయలను గురించి రాయవాచకం వివరంగా తెలుపుతోంది. దానిని మార్గదర్శకంగా తీసుకొని కుమారధూర్జటి రాసిన కృష్ణరాయ విజయం కూడా రాయల చరిత్రకు మంచి ఆధారం. అలాగే కోనేరునాథర కవి రాసిన బాలభాగవతం ఆరవీటి వంశస్థుల చరిత్రకు ముఖ్య ఆధారం.

వరదాంబికా పరిణయం, సాహిత్య రత్నాకరాలు కూడా విజయనగర కాలం నాటి సంఘటనలను తెలుపుతున్నాయి. లక్ష్మీనారాయణుడు తన సంగీత సూర్యోదయంలో తుళువ వంశచరిత్రను రాశాడు. విరూపాక్ష రాజకుమారుని నారాయణీ విలాసం, గంగాధరుని గంగదాస ప్రతాప విలాసం కూడా కొన్ని వివరాలను తెలుపుతున్నాయి. రామరాజీయం, ఆరవీటి వంశచరిత్రలు కూడా విజయనగర చరిత్రపై వెలుగును ప్రసరిస్తున్నాయి. కన్నడ కావ్యాలైన విద్యారణ్య వృత్తాంతం విజయనగర రాజ్యస్థాపనను గూర్చి తెలుపుతుండగా, కన్నడంలో గేయ కథగా ఉన్న భల్లాలరాయని యుద్ధం, కుమార రమణకళలు, కంపిలిరాజులు హరిహర బుక్కరాయలు, హొయసాల మూడవ వీరభల్లాలునితో చేసిన యుద్ధాలను గురించి వివరించాయి. కన్నడ మరాఠీ భాషలలో రాయబడిన రామరాజనభ ఖాయిర్ అనే గ్రంథం, మెకంజీ సేకరించిన గ్రంథాలలోనిది. అందులో తళ్లికోట యుద్ధాన్ని గురించి వర్ణించబడింది. అలాగే తెలుగులో రాయబడిన వీరప్పయ్య, శివయ్య కాలజ్ఞానాలు

కూడా విజయనగర చరిత్ర గురించి వివరిస్తున్నాయి.

వెలుగోటివారి వంశావళి: వెలుగోటివారి వంశావళి కూడా ముఖ్య చారిత్రక ఆధారం. ఇది కాలక్రమేణా పెరుగుతూ వచ్చింది. ఇందులో కాకతీయ గజపతిదేవుని కాలం నుండి విజయనగర యుగానికి చెందిన మూడవ శ్రీరంగ రాయల కాలం వరకు వర్ధిల్లిన రేచర్ల పద్మనాయకుల చరిత్ర ఉంది. కన్నడ భాషలోని వంశావళులలో చిక్కదేవ రాయల వంశావళి, కేవళిది నృపవిజయం విజయనగర చరిత్రకు చెందిన అనేక చారిత్రకాంశాలను తెలుపుతున్నాయి. కన్నడంలో ఉన్న గేయకథలలో కుమారరామకథ కూడా విజయనగర చరిత్రకు మంచి ఆధారం.

బిరుదు గద్యలు: ఆ కాలంలో రాజాస్థానాలలో రాజుల విజయాలను, ఘనకార్యాలను ప్రతిరోజు కీర్తించే వందిమాగధులు అని పిలవబడే భట్టులుండేవారు. వారినే భట్రాజులు అని కూడా పిలిచేవారు. వారిలో కొందరు రాజులను గురించి పద్యాలు కూడా చదివేవారు, రాసేవారు. వారు రాసిన పద్యాలు, బిరుదు గద్యలు కలుపగా అవి ఆ రాజులను గురించిన చారిత్రకాంశాలుగాను, వంశచరిత్రలు వంశావళులుగా రూపొందాయి. అలాంటి ఆ రాజులను గురించిన చారిత్రకాంశాలుగాను, వంశచరిత్రలు వంశావళులుగా రూపొందాయి. అలాంటి వంశావళులు తెలుగులో కూడా ఉన్నాయి. వాటిలో ద్విపద బాలభాగవతానికి అనుబంధంగా రాయబడిన అవుకు రాజవంశావళి అతిముఖ్యమైనది. అందులో వెంకయ్య రచించిన రామరాజీయం, దానికే నరపతి విజయం అని కూడా పేరుంది. ఈ వంశావళి ఆరవీటి వంశ చరిత్రను వివరిస్తోంది.

చాటువులు: ఈ యుగంలో అనేక మంది తెలుగు కవులు చారిత్రక అంశాలు, సాంఘిక ఆచారాలు, సాంప్రదాయాలు, అనేక వ్యక్తులను గురించి చాటుపద్యాలు చెప్పారు. అలాంటి చాటువులు చాలా ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉన్నాయి. విజయనగర యుగంలో చాటువులు చెప్పిన వారిలో ప్రముఖుడు శ్రీనాథుడు. అతని చాటువులలో రెండవ దేవరాయల ఆస్థానం ప్రస్తావన, ఆ కాలం నాటి ప్రజల సాంఘిక, జీవన పరిస్థితులు వర్ణింపబడ్డాయి. తర్వాత అల్లసాని పెద్దన, ముక్కు తిమ్మన, తెనాలి రామలింగడు కూడా అనేక చాటువులు చెప్పారు. ఈ చాటువులు కూడా నాటి సాంఘిక రాజకీయ, సాంస్కృత అంశాలను తెలుపుతున్నాయి.

కైఫీయత్తులు: స్థానిక చరిత్రలను కైఫీయత్తులు అని వ్యవహరించేవారు. పూర్వం గ్రామోద్యోగులు తమ గ్రామాల పుట్టుపూర్వోత్తరాలు, ఆస్థిపాస్తులు, పన్నుల విధింపు వసూలు విధానాలను వివరించే లెక్కలు, వివరాలు రాసేవారు. వాటిని గుడికట్టు లెక్కలు, బబ్బైరులు, కవిలెలు, కడితెలు అనికూడా పిలిచేవారు. ఈ లెక్కలతో పాటు కాలానుగుణంగా వచ్చిన రాజకీయ పరిణామాలు కూడా అందులో రాశారు. ఒక వంశం పోయి మరొక వంశం వచ్చినా, ఒకరాజు పోయి మరొక రాజువచ్చినా ఆ వివరాలు కూడా ఈ కైఫీయత్తులలో నమోదు చేశారు. అందువలన రచనకు, ముఖ్యంగా, స్థానిక చరిత్రల రచనకు ఈ కైఫీయత్తులు చాలా అమూల్యమైన ఆధారాలు. కనుక వాటి విలువను గ్రహించి ఈస్టిండియా కంపెనీలో ఉన్నత ఉద్యోగిగా పనిచేసిన కల్నల్ మెకంజీ ఈ లోకల్ కైఫీయత్తులను సేకరించి వాటికి నకళ్లు రాయించి మద్రాసు ఆర్కైవ్స్‌లో భద్రపరిచాడు. వీటిలో 1799-1870 సంవత్సరాల మధ్య రాయించిన ఈ స్థానిక గ్రామచరిత్రలు విజయనగర చరిత్రకు సంబంధించిన అనేక చారిత్రక అంశాలను తెలయజేస్తున్నాయి. ఆనాటి సాంఘిక, ఆర్థిక, మత పరిస్థితులను కూడా తెలుపుతున్నాయి. ఈ కైఫీయత్తులు తెలుగు, కన్నడ, తమిళ, మరాఠీ భాషలో ఉన్నాయి. మెకంజీ రాయించిన రాతప్రతులలోని రామరాజ నబైర్‌లో 1565లో జరిగిన తళ్లికోట యుద్ధాన్ని గురించిన వివరాలు ఉన్నాయి. ఈ కైఫీయత్తు ప్రతులు కన్నడం, మరాఠీ భాషలను ఉన్నాయి.

విదేశీ రచనలు - ముస్లిం రచనలు: విదేశీ రచనలలో ముస్లిం రచనలు, విదేశీయాత్రికుల రచనలు అని రెండు రకాలుగా విభజింపవచ్చును. ముస్లింలు కూడా మంచి చరిత్రకారులే. కాని వారిలో చాలా మంది పక్షపాతంతో రాశారు. ముస్లిం రాజులను ఘనంగా వర్ణిస్తూ కొన్ని వాస్తవాలను సరిగా రాయలేదు. అయినా వారి రచనలు మంచి చారిత్రకాధారాలుగా ఉపయోగపడుతున్నాయి. వాటిలో ఇసామి రచించిన ఫుటుహ్ ఉస్ సలాటిన్, జియా, వుద్దీన్ బారాని, షంస్- ఇ- సిరాజ్ అఫీస్‌లు వేరువేరుగా ఒకేపేరుతో రచించిన తారీఖ్-ఇ-ఫిరోజ్‌షాహి, నిజాం ఉద్దీన్ అహమ్మద్ రచించిన తబకత్-ఇ-అక్బరి, తబతబ రచనలు, ఇంకా ఒక అజ్ఞాత చరిత్రకారుడు రచించిన తారిఖ్-ఇ-మహమ్మద్ కులీ కుతుబ్‌షాహీ, ఫెరిష్టా రచించిన తారీఖ్-ఇ-ఫెరిష్టా విజయనగర చరిత్ర రచనకు బాగా ఉపయోగపడుతున్నాయి. వీరిలో ఫెరిష్టా పూర్తిగా పక్షపాత బుద్ధితో, మత దురభిమానంతో రాశాడు. ఫెరిష్టా రచన సమకాలికం కాదు. అయినప్పటికీ అతని రచన కూడా మంచి సమాచారాన్ని ఇస్తోంది.

పర్షియన్ చక్రవర్తి షారూఖ్ రాయబారిగా దక్షిణదేశం వచ్చిన అబ్దుల్‌రజాక్ క్రీ.శ.1443లో విజయ నగరానికి వచ్చి 2 సంవత్సరాలు అంటే క్రీ.శ.1445 వరకు అక్కడ ఉండి రెండవ దేవరాయల కాలం నాటి సంఘటనలను తాను రాసిన మట్ల ఇస్ అదన్ గ్రంథంలో వివరించాడు. అంతేగాక అతడు ఆనాటి విజయనగర పట్టణ నిర్మాణాన్ని, వైభవాన్ని, అక్కడ ప్రజాజీవనాన్ని, పండుగలు, ముఖ్యంగా నవరాత్రులు, దీపావళి ఉత్సవాలను, సభా మర్యాదలను గురించి చాలా వివరంగా రాశాడు. క్రీ.శ.1470లో రష్యా వ్యాపారి అతనాసియన్ నికిటిన్ బహమనీ రాజ్యాన్ని దర్శించి, బీదరును గురించి, బహమనీ రాజ్యంలోని పరిస్థితులను గురించి రాశాడు. అదే సందర్భంలో సందర్భానుసారంగా విజయనగర చరిత్రను, ఆనాటి రాజకీయ పరిణామాలను కూడా వర్ణించాడు.

ముస్లిం రచనలు: విజయనగర చరిత్ర తెలుసుకోవడానికి మనకు లభ్యమైన ఆధారాలలో ముస్లిం చరిత్రకారుల రచనలు అతిముఖ్యమైనవి. వారిలో ఇబన్‌బటూటా, అబ్దుల్‌రజాక్‌లు అతిముఖ్యమైన వారు. ఇబన్‌బటూటా అసలు పేరు షేక్ అబు అబ్దుల్లా మహమ్మద్. అతని స్వస్థానం మొరాకో. అతడు హిజారా 734 అంటే 12 సెప్టెంబర్, క్రీ.శ.1333లో భారతదేశానికి వచ్చాడు. క్రీ.శ.1342 వరకు ఉన్నాడు. అతని రచనలు ఫ్రెంచిలోకి తర్జుమా చేయబడ్డాయి. ఇతడు మహమ్మద్ బిన్ తుగ్లక్ సమకాలికుడు. ఇతడు మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆస్థానంలో కొంతకాలం ఉండి చైనాకు రాయబారిగా వెళ్తూ పడవ ప్రమాదానికి గురై, ఢిల్లీ వెళ్లలేక మాల్దీవులు చేరాడు. అక్కడ నుండి క్రీ.శ.1341లో హోనోవార్ చేరి తర్వాత మధుర చేరాడు. అతడు కంపిలి నుండి ఢిల్లీకి తీసుకుపోబడిన ఖైదీలను గురించి హనోవర్‌రాజును గురించి, మధుర సుల్తాన్‌ను గురించి రాశాడు. కంపిలి నుండి తుగ్లక్ ఆస్థానానికి బందీలుగా తెచ్చిన హరిహరబుక్కరాయలను గురించి, వారు చేసిన విజయనగర రాజ్యస్థాపనను గురించి కూడా రాశాడు. అలాగే సెనార్‌లో పేస్ అనే అరబ్బీ పండితుడు బిస్నానాగరాజుల చరిత్ర రాశాడు. ఇందులో కూడా పేస్ న్యూనిజ్‌లు రచించిన పత్రాలను చేర్చాడు. సీవెల్ ఇతని రచనలను కూడా అధ్యయనం చేశాడు. ఇతని రచనల నుండి తాను ప్రేరణ పొందానని చెప్పుకున్నాడు. నికోల్‌కొంటి, వరైమా, సీజర్ ఫ్రెడరిక్ రచనలు కూడా చాలా ప్రామాణికమైనవి. కల్నల్ మెకంజీ సేకరించిన కైఫీయత్తులలో విజయనగర రాజుల చరిత్రతోపాటు కొండవీటి రెడ్లు, గజపతుల చరిత్రలు కూడా తెలుస్తున్నాయి.

అమీర్‌ఖుస్రూ, జియా ఉద్దీన్ బరని, షమ్-ఇ-సిరాజ్‌లు దక్షిణ భారతదేశంపై దండెత్తిన తొలి ముస్లిం దండయాత్రలను పేర్కొన్నారు. క్రీ.శ. 1350 నాటి అరబ్ రచయిత అయిన ఇసామి, ఫుతుస్‌ఉస్‌సలాతిన్ అనే పేరు భారతదేశంలోని ముస్లిం రాజుల చరిత్రను రాశాడు. అతడు క్రీ.శ.1350లో దక్షిణ భారతదేశాన్ని దర్శించి బహమనీ రాజ్యస్థాపకుడైన అల్లావుద్దీన్ హసన్‌గంగు చరిత్ర రాశాడు. బహమనీ రాజ్యస్థాపనకు దారితీసిన పరిస్థితులను గురించి కూడా వివరించాడు. కాశిమ్ ఫెరిష్టా భారతదేశంలో ముస్లిం విజృంభణ అనే గ్రంథం రాశాడు. కాని ఇతని రచన సమకాలీనం కాదు. కొన్ని విజయాలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి. కాని ఇతని రచనలో మరెక్కడా లభించని అనేక విషయాలు ఉన్నాయి. కనుక ఇతని రచన కూడా ముఖ్య ఆధారంగా ఉంది.

ముస్లిం చరిత్రకారులు వారి ముస్లిం పాలకుల ఆగ్రహానికి గురికాకుండా రాసినందువల్ల ముస్లింలను గురించి ఉత్ప్రేక్షలు, హిందువులను గురించి కొన్ని అవాస్తవాలు రాశారు. మొత్తం మీద నాటి ముస్లిం, యూరోపియన్, భారతీయ సాహిత్యం విజయనగర రాజుల చరిత్ర రచనకు ఉపయోగపడుతున్నాయి.

విదేశీ యాత్రికులు-ఐరోపావారి రచనలు: వివిధ కాలాలలో అనేక మంది ఐరోపా యాత్రికులు, మత ప్రచారకులు, వర్తకులు, రాయబారులు దక్షిణ భారతదేశం వచ్చి విజయనగర రాజ్యాన్ని దర్శించి ఆ కాలం నాటి రాజకీయ, ఆర్థిక సాంఘిక, సాంస్కృతిక, మత పరిస్థితులను, రాజుల వ్యక్తిత్వాలను, విజయనగర వైభవాన్ని గురించి రాశారు. వారి రచనలు విజయనగర చరిత్రకు గొప్ప ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయి. విజయ నగరాన్ని దర్శించిన మొట్టమొదటి ఐరోపావాసి ఇటలీ దేశానికి చెందిన నికోల్‌కొంటి. అతడు క్రీ.శ.1420-21 సంవత్సరంలో విజయనగరాన్ని దర్శించాడు. అతడు విజయనగరంలో జరుగుతున్న వేడుకలో రాజాస్థానానికి చెందిన విశేషాలను విపులంగా వర్ణించాడు.

పోర్చుగీసు వారు దక్షిణదేశంలో అడుగు పెట్టినప్పటి నుండి విజయనగర రాజ్యంతో స్నేహ సంబంధాలు పాటించారు. వారి తాలూకు రాజోద్యోగులు, వ్యాపారులు, మతప్రచారకులు తరచుగా విజయనగరాన్ని దర్శించేవారు. వారు విజయనగరానికి సంబంధించిన వివరాలను తమ రచనలలో, లేఖలలో, నివేదికలలో విపులంగా రాశారు. కొందరు ఇక్కడ రాజకీయ అంశాలను రాసి లిస్బన్‌కు కూడా పంపారు. ఆ విధంగా రాసిన

వారిలో వార్తెమా (1502-1508), ప్రయర్‌లూయి (1510), ద్యురెతే బార్బొసా (1500-1516), పేస్ (1520-1522), న్యూనిజ్ (1535-1537) ప్రముఖమైనవారు. వీరు కృష్ణదేవరాయల వ్యక్తిత్వాన్ని, నాటి సామ్రాజ్య వైభవాన్ని, ప్రజా జీవనాన్ని చక్కగా వివరించారు. ముఖ్యంగా న్యూనిజ్ విజయనగర రాజ్యస్థాపనాకాలం నుండి అచ్యుతదేవరాయల కాలం వరకు విజయనగర చరిత్రను వివరంగా రాశాడు. అతడు తాను విన్నదాన్ని బట్టి, కన్నదాన్ని బట్టి రాశానని స్వయంగా చెప్పుకున్నాడు. అతడు రాసిందే విజయనగర చరిత్రకు ఎన్నదగిన మొదటి ఆధారం రాబర్ట్ సీవెల్‌కు న్యూనిజ్ రచనే అతిముఖ్య ఆధారం. క్రీ.శ.1616లో కొచ్చిన్ నుండి బర్రదాస్ రాసిన లేఖలో 1614 నుండి విజయనగర సింహాసనం కోసం జరిగే వారసత్వ యుద్ధాన్ని, అంతర్యుద్ధాన్ని వివరంగా వర్ణించాడు. 1565లో జరిగిన రాక్షసతంగడి యుద్ధం తర్వాత రెండు సంవత్సరాలకు అంటే క్రీ.శ.1567లో విజయనగరాన్ని దర్శించిన సీజర్ ఫ్రెడరిక్ శిథిల విజయనగరాన్ని గురించి వర్ణించాడు. అలాగే 1583లో దర్శించిన వ్యాన్‌లిన్ షోటెన్, 1623లో దర్శించిన పెట్రో డెల్లివ్యాన్, 1606-1656 నాటి రాబర్ట్-డి-నొబిలి మొదలైన వారి రచనలు కడపటి విజయనగర చరిత్రను గురించి తెలియజేస్తున్నాయి.

ఈ విధంగా విజయనగర సామ్రాజ్య చరిత్రకు అనేక ఆధారాలున్నాయి. ఈ ఆధారాలన్నీ విస్తీర్ణతలోను, సిరిసంపదలు, సౌందర్యంలో విజయనగరానికి ప్రపంచంలో తాము చూసిన ఏ నగరం సాటిరాదని వర్ణించారు. ఈ నగరాన్ని పోర్చుగీసు వారు బిస్‌నగర్ అని, నికిటిన్ బిచినెగెర్ అని అబ్దుల్ రజాక్ బిడ్‌జానగర్ అని నికోల్‌కొంటి బిజినెగలియ అని ఉచ్చరించారు. ఇంకా బిస్‌నగర్, బీజనుగ్గూర్ అని కూడా ఉచ్చరింపబడింది.

సీవెల్ విజయనగర చరిత్ర రాయడానికి చేసిన కృషి: విజయనగర చరిత్రపై గొప్ప పరిశోధన చేసి విజయనగర చరిత్రను వెలుగులోకి తెచ్చిన మహావ్యక్తి రాబర్ట్ సీవెల్. అతడు విజయనగరం దర్శించినప్పుడు అక్కడి ప్రజలు 14-17 శతాబ్దాల మధ్య అత్యంత వైభవంగా వెలిగిన ఆ సామ్రాజ్యాన్ని గురించి పూర్తిగా మరచి పోయారని, ఆ సామ్రాజ్య చరిత్ర వారి స్మృతిపథం నుండి పూర్తిగా అదృశ్యమైందని పేర్కొన్నాడు. అందువల్ల తాను రచించిన విజయనగర చరిత్రకు విస్మృత సామ్రాజ్యం Forgotten Empire అని పేరు పెట్టాడు. అతడు విజయనగరాన్ని దర్శించే నాటికి అక్కడ శిథిల దేవాలయాలు, ముక్కలు ముక్కలుగా విరిగిపడి ఉన్న శిల్పాలు, గుట్టలతో ఉంది. వాటన్నింటినీ పరిశీలించి 15-16 శతాబ్దాలలో ఆ పట్టణం ఎంత మహోన్నతంగా వెలిగిందో కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. అలా అంత వివరంగా వర్ణించడానికి అతనికి పారిస్‌లోని నేషనల్ బిబ్లియోగ్రఫీలో నాలుగు ఒరిజినల్ డాక్యుమెంట్లు లభించాయి. అందులో మొదటి రెండింటిలో ఒకటి క్రీ.శ.1520లో విజయ నగరాన్ని దర్శించి స్వయంగా అన్నీ తన కళ్లతోచూసి రాసిన డామింగో పేస్‌ది. రెండవది క్రీ.శ.1336-37లో ఫెర్నావ్ న్యూనిజ్ రాసింది. వారి రచనలను ఎవరో కాపీ చేసి కవరింగు లెటర్‌తో లిస్బన్‌లోని బారోస్ అనే చరిత్రకారునికి పంపారు. బారోస్ ఇండియాను దర్శించలేదు. అతడు లిస్బన్‌లో ఇండియా వ్యవహారాలు చూసే అధికారి. ఇవే ప్రతులు Vascocalvo, brother of Diogo Calvo and Christovao Viegra వాస్కోకాల్వో, క్రిష్టొవోవీగ్రా అనే మరో ఇద్దరు పోర్చుగీసు వారు చైనా నుండి లిస్బన్‌కు పంపారు. వీరిద్దరూ చైనాలోని Canton (కాంటన్)లో ఖైదీలుగా ఉన్నారు. బహుశ వారు ఇండియా నుండి ఈ ప్రతులు తీసుకొని చైనా వెళ్లి అటునుండి లిస్బన్‌కు వెళ్లాలని అనుకొని ఉంటారు. కాని ఎందువల్లో వారు అక్కడ ఖైదు పాలయ్యారు. అయినా వారిద్దరి వద్ద ఉన్న ప్రతులను లిస్బన్ పంపారు. అవి బారోస్‌కు చేరాయి. ఈ నాలుగు ప్రతులలోని విషయాలను కూర్చి బారోస్ క్రీ.శ.1527లో విజయనగర చరిత్రను క్రీ.శ.1552, 1553, 1563 సంవత్సరంలో ప్రచురించాడు. బారోజ్ రచించిన చరిత్ర కాకుండా ఈ నాలుగు ఒరిజినల్ ప్రతులు సీవెల్‌కు లభించాయి. ఆ నాలుగు పోర్చుగీసు క్రానికల్స్ తన రచనకు చాలా ఉపయోగపడ్డాయని సీవెల్ రాశాడు. కారణమేమిటంటే ఈ నలుగురు స్వయంగా విజయనగరాన్ని దర్శించి అక్కడి విజయాలను కళ్లతో చూసి ఉన్నది ఉన్నట్లుగా రచించారు. ఆ నాలుగు పత్రాలు ఆ నాటి విజయనగర పట్టణ వైభవాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణిస్తున్నాయి. వీనిలో డామింగో రచన కృష్ణరాయల సమకాలీన రచన. అతడు కృష్ణరాయలను స్వయంగా చూసిన వ్యక్తి. నాటి రాజభవనాలు అన్నీ స్వయంగా చూసిన వ్యక్తి. తన రచనలో కృష్ణరాయలమూర్తిని వర్ణించాడు. అందువల్లే తాను చూసినవి, అక్కడి ప్రజల నుండి తాను తెలుసుకున్నవి రాశానని చెప్పుకున్నాడు. అందువల్ల విజయనగర చరిత్రకు పేస్ రచన చాలా ప్రామాణికమైనది. అలాగే విజయనగరాన్ని గురించి తెలిసిన వారి నుండి స్వయంగా తెలుసుకొని రాశానని న్యూనిజ్ రాశాడు. అలాంటి ప్రామాణికమైన ఈ నాలుగు పత్రాలను అధ్యయనం చేసి సీవెల్ విజయనగర పట్టణ వైభవాన్ని తన

గ్రంధంలో వర్ణించినందువల్ల నేడు మనం దానిని ఊహించగలుగుతున్నాం.

తర్వాత కౌటో (Couto) అనే అతడు ఇండియాను దర్శించి క్రీ.శ.1527-1539 మధ్య జరిగిన సంగతులను గ్రంధస్తం చేశాడు అతడు లిస్బన్ వెళ్లి బారోస్ ప్రకటించిన విషయాలతో తాను సేకరించిన విషయాలను కలిపి డి ఏషియా (De Asia) అనే పేరుతో క్రీ.శ 1602, 1614, 1652 సంవత్సరంలో తిరిగి ప్రకటించాడు ఇవన్నీ తర్వాత ఇంగ్లిషులోకి తర్జుమా చేయబడ్డాయి. ఈ రచనలు కూడా తనకు ఉపయోగపడ్డాయని సీవెల్ తన Forgotten empireలో రాసుకున్నాడు. అలాగే డ్యూరాట్ బార్బొసా (Duarate barbosa) క్రీ శ 1514లో భారతదేశాన్ని దర్శించాడు అతడుకూడా శ్రీకృష్ణరాయల కాలంలోనే విజయనగరాన్ని దర్శించి క్రీ.శ.1516వ సంవత్సరంలో ఒక గ్రంధాన్ని రాశాడు. అలాగే Correa అనే వ్యక్తి రచనలు కూడా సీవెల్‌కు ఉపయోగపడ్డాయి. సెన్‌హోర్ లోప్స్ (Senhor Lopes) బిస్నాగా రాజుల చరిత్రను ప్రచురించాడు ఇందులో పేస్, న్యూనిజ్ రాసిన పత్రాలు ఉన్నాయి. ఇటలీ యాత్రికులైన నికోల్‌కొంటి, వార్తెమా, ఫ్రెడరిక్ సీజర్‌లు కూడా తాము చూసినవి, విన్నవి రాశామని చెప్పుకున్నారు. కల్నల్ మెకంజీ సంపాదించిన ప్రాధమిక సామాగ్రి ఫెరిష్టా, ఇబన్‌బటూటా మొదలైన వారి రచనలు, కొన్ని స్థానిక గ్రంధాలు సేకరించి, ఇంకా అనేక కష్టనష్టాలకోర్చి హంపి శిధిలాలను పరిశోధించి తన సాధన సామాగ్రిని సేకరించుకొన్నాడు. వీటిన్నింటిని లోతుగా అధ్యయనం చేసి విస్మృత సామ్రాజ్యం Forgotten Empire అనే పేరుతో విజయనగర చరిత్రను రచించాడు. సీవెల్ తాను సేకరించిన ఆధారాల ద్వారా విజయనగర స్థాపనను గూర్చి 7 అభిప్రాయలు ప్రచారంలో ఉన్నాయని తెలిపాడు

సీవెల్ చెప్పిన దాన్ని బట్టి కంపిలి రాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత మహమ్మద్ బిన్ తుగ్లక్ అక్కడ మాలిక్‌నబి అనే అతడిని గవర్నర్‌గా నియమించాడని, కాని అతనిపై స్థానిక ప్రజలు తిరుగుబాటుచేశారని, అందువల్ల మహమ్మద్ బిన్‌తుగ్లక్ దేవరావ్ అనే హిందువును అక్కడ తన ప్రతినిధిగా నియమించాడు ఈ దేవరావ్ అంతకు పూర్వం కంపిలి రాజు యొక్క ప్రధాన మంత్రి అంటే కంపిలిదేవుని ప్రధానమంత్రి. దేవరావు లేక దేవరాయ 7 సంవత్సరాలు పాలించాడు తర్వాత ఒక రోజు అతడు సమీపంలోని కొండలలోని అడవికి వేటకు వెళ్లాడు అక్కడ అతని వేట కుక్కలను ఒక కుందేలు తరిమివేసింది. అందుకు ఆశ్చర్యపడి వెదకగా తుంగభద్రా నది ఒడ్డున మాధవాచార్య అనే మహాత్ముడు కనిపించాడు. ఆయనే విద్యారణ్యుడు. విద్యారణ్యుడు అక్కడే ఒక నగరాన్ని నిర్మాణం చేయమని ఆదేశించాడు. ఆ రోజునే అతడు అక్కడే నగర నిర్మాణాన్ని ప్రారంభించాడు. తర్వాత తన రాజధాని నాగుండియం నుంచి అక్కడకు రాజధానిని మార్చాడు. ఆ నగరానికి విద్యాజున నగరం అని పేరు పెట్టాడని న్యూనిజ్ రాశాడు. అదే విజయ నగరంగా ప్రసిద్ధి చెందింది. ఈ నగరం క్రీ.శ 1336లో ప్రారంభింపబడింది. క్రీ.శ.1343లో పూర్తయింది.

ఇదేగాక అనేక ఇతర గాధలు కూడా ప్రచారంలో ఉన్నట్లు సీవెల్ రాశాడు. హరిహర బుక్కరాయలు అనే సోదరులు ఓరుగల్లులో ప్రతాపరుద్రని ఆస్థానంలో ఉద్యోగులుగా పనిచేసేవారు. ఓరుగల్లు పతనం తర్వాత క్రీ.శ.1323వ సంవత్సరంలో ఈ సోదరులిద్దరూ ఒక చిన్న అశ్వికదళంతో ఓరుగుల్లు నుండి తప్పించుకొని అనెగొంది వైపు పారిపోయారు. వారితోపాటు మాధవాచార్య విద్యారణ్య అనే బ్రాహ్మణుడు కూడా కలసి వెళ్లిపోయాడు వారు ముగ్గురూ కలిసి విజయనగర పట్టాణాన్ని నిర్మించారు. మరొక గాధ ప్రకారం ఈ సోదరులిద్దరూ 1309వ సంవత్సరంలో వరంగల్లులో నియమింపబడిన మహమ్మదీయ గవర్నర్ వద్ద ఉద్యోగులుగా ఉండేవారు. వారు 1310వ సంవత్సరంలో మాలిక్ కఫూర్‌లతోపాటు హొయసాల భల్లాలుని పైకి యుద్ధానికి వెళ్లారు. ఆ యుద్ధంలో భల్లాలుని చేతిలో ఓడి అనెగొంది వద్ద ఉన్న పర్వతాలలోకి పారిపోయారు. ఆ అడవులలో వారు మాధవ విద్యారణ్యుని కలుసుకొని అతని సహాయంతో విజయనగర పట్టణాన్ని నిర్మించి నూతన రాజ్యాన్ని స్థాపించారు. మైసూరులోని రామప్పవర్మిక అనే అతడి దగ్గరున్న విద్యారణ్య సిక్క అనే సంస్కృత గ్రంధం కూడా హరిహరబుక్కలు వరంగల్లు ప్రతాపరుద్రుని కోశాధిపతులు అని తెలుపుతోంది. వారు విద్యారణ్యుని దయతో విజయ నగరాన్ని నిర్మించారని వివరిస్తోంది. 4వ కధ ప్రకారం మాధవ విద్యారణ్యుల వారికి ఒకనిధి లభించిందని దాంతో అతడు విజయనగర పట్టణాన్ని స్వయంగా నిర్మించి పాలించాడని, తర్వాత దానిని కురుబ వంశానికి చెందిన హరిహర బుక్కరాయలకు అప్పగించాడని ప్రచారంలో ఉంది. 5వ కధను కౌటో అనే అతడు వివరించాడు మాధవాచార్యుడు ఒక సన్యాసి. ఒక పర్వతంపై తపస్సు చేసుకొంటుండగా ఒక బీద గొర్రెల కాపరి ఆయనకు ప్రతిరోజూ ఆహారాన్ని తీసుకువచ్చి సమర్పించేవాడు. ఒక రోజున మాధవాచార్యుడు బుక్కను

హిందూస్థానమంతటికి చక్రవర్తివి అవుతావని ఆశీర్వదించాడు. అది విన్న మిగిలిన గొర్రెల కాపరులు ఆనాటి నుండి బుక్కను రాజుగా భావించారు. త్వరలోనే బుక్క పరిసర ప్రాంతాలైన కనరా, తలిగా, కంగ్యూవరావ్, నేగపటాట్, బడగ అనే 5 ప్రాంతాలను జయించి బుక్కరావ్ అనే పేరు ధరించాడు. అందువలన ఢిల్లీ సుల్తాన్ అతనిపై దండెత్తాడు. కాని సుల్తాన్‌ను బుక్క ఓడించి తరిమాడు. తర్వాత విశాజనగర్ అనే పట్టణాన్ని నిర్మించాడు. అదే బిస్‌నాగ అని పిలువబడింది. కాని స్థానికులు ఈ రాజ్యాన్ని కనరా అని పిలిచేవారు. కౌటో చెప్పిన ఈ కథలో అనేక గాథలు కలిసిపోయినట్లుగా భావింపబడింది.

మరొక కథనం ప్రకారం హరిహర బుక్కరాయలు హొయసాల భల్లాలుని సామంతులు. క్రీ.శ.1327-28 సంవత్సరంలో ఢిల్లీ సుల్తాన్ హొయసాల రాజ్యంపై దండెత్తి ద్వారసముద్రాన్ని ధ్వంసం చేశాడు. అందువలన మూడవ భల్లాలుడు తన రాజ్యం ఉత్తర సరిహద్దులో హోస్ పట్టణం లేక విరూపాక్ష పట్టణం నిర్మించి సరిహద్దుల రక్షణకుగాను అక్కడ తన సేనాధిపతులైన హరిహర బుక్కరాయలను నియమించి తాను దక్షిణాదిన ఉన్న తిరువణ్ణామలై పట్టణాన్ని రాజధానిగా చేసుకున్నాడు. భల్లాలుడు మరణించిన తర్వాత హరిహరబుక్కరాయలు స్వతంత్రం ప్రకటించారు. వారి రాజధాని హోస్ పట్టణమే విజయనగరంగా మారింది.

పెరిష్టా మరొక కథను చెప్పాడు హిజారి 749 అంటే క్రీ.శ.1344లో ఓరుగల్లును పాలించిన రుద్రదేవుని కుమారుడు కృష్ణనాయక్ ద్వారసముద్రం వచ్చి భల్లాలునితో కలసి దక్కను నుండి ముస్లింలను పారదోలడానికి అతని సహాయం అర్థించాడు. భల్లాలుడు అంగీకరించి తన రాజ్యపు ఉత్తర సరిహద్దున తన కుమారుని పేర విజయనగరం నిర్మించాడని, తర్వాత కృష్ణనాయక్, భల్లాలుడు కలసి ముస్లింలను పారదోలారని, అప్పుడు ఓరుగల్లు ముస్లింల చేతిలో ఉందని, కృష్ణనాయక్ ఓరుగల్లుపై దండెత్తి మాలిక్ నాయబ్‌ను పారదోలాడని తెలిపాడు. మాలిక్ నాయబ్‌ను పారదోలి ఓరుగల్లును ఆక్రమించాడు. తర్వాత భల్లాలుడు, కృష్ణనాయక్ కలిసి మలబారు, కనరా రాజులను తమతో చేరమని బలవంతపెట్టి చేర్చుకున్నారు. వారందరూ కలిసి కొన్ని మాసాలలోనే తుగ్లక్‌ల ఆధీనంలో ఉన్న ప్రాంతాన్నంతటినీ జయించారు. సుల్తాన్‌కు దౌలతాబాద్ తప్ప మరేమీ మిగలలేదు. దక్షిణదేశం అంతా స్వతంత్రమైంది. తర్వాత కొద్దికాలానికే అల్లావుద్దీన్ బహమనీ హిజారా 748 రబీ-అల్-అఖిర్ 24 శుక్రవారం రోజున అంటే 1344 ఆగస్టు 3వ తేదీ శుక్రవారం నాడు గుల్బర్గాలో బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. అని పెరిష్టా రాశాడు. కాని ఈ సంఘటన 1344లో జరిగిన సంఘటన కాదు. పెరిష్టా వర్ణించిన కృష్ణనాయక్ కాపయనాయకుడు. అతడు క్రీ.శ.1336లో ఓరుగల్లును ఆక్రమించాడు. 1344లో భల్లాలుడు లేడు. అతడు 1342లోనే మరణించాడు. 1344లో విజయనగరం హరిహరరాయలకు రాజధానిగా ఉంది. కనుక పెరిష్టా రాతలు వాస్తవం కాదు. విజయనగరాన్ని భల్లాలుడు నిర్మించలేదు.

అతనాసియస్ నికిటిన్ అనే రష్యా యాత్రికుడు క్రీ.శ.1474వ సంవత్సరంలో దక్షిణదేశాన్ని దర్శించాడు. అతడు విజయనగరాన్ని పాలించిన సంగమ వంశస్థులు కర్ణాటక దేశాన్ని పాలించిన ప్రాచీన రాజవంశం అయిన బనవాసికదంబ వంశానికి చెందిన వారని రాశాడు. అతడు తన గ్రంథంలో హిందూ సుల్తాన్ కదంబిచ్‌నగర్‌లో నివసిస్తున్నాడని రాశాడు.

రాబర్ట్ సీవెల్ ఈ విధంగా విజయనగర స్థాపనను గూర్చి 7 గాథలు ప్రచారంలో ఉన్నాయని చెబుతూ ఇవన్నీ నమ్మశక్యం గాని కట్టుకథలతో కూడి ఉన్నాయని, వీటిన్నింటిని సవిమర్శకంగా విశ్లేషించి వాస్తవాలను రాబట్టాలని సూచించాడు. సీవెల్ తన దృష్టిలో విజయనగర సామ్రాజ్యాన్ని కురుబ తెగకు చెందిన హరిహర బుక్కరాయలు స్థాపించారని చెప్పే విషయమే సమంజసమైనదని చెప్పుకున్నాడు. సీవెల్ ప్రకారం హరిహర (లేక హరియప్ప - ఇబన్‌బటూటా హరియబ్ అని రాశాడు), బుక్కరాయ సోదరులు కాకతీయ ప్రతాపరుద్రుని కోశాగార ఉద్యోగులు. క్రీ.శ.1323లో ఓరుగల్లు పతనం తర్వాత వారు ఓరుగల్లుని వదిలి కంపిలి రాజు నాశ్రయించి అతని కొలువులో ఉద్యోగులుగా చేరారు. క్రీ.శ.1334వ సంవత్సరంలో కంపిలిని కూడా సుల్తాన్ ఆక్రమించి మాలిక్‌నెబిని అక్కడ తన ప్రతినిధిగా నియమించాడు. కాని అతనిపై స్థానిక ప్రజలు తిరుగుబాటు చేయగా మహమ్మద్ బిన్ తుగ్లక్ కంపిలిరాయని మంత్రులైన హరిహరబుక్కరాయలను కంపిలిరాజ్యంపై తన ప్రతినిధులుగా నిలిపాడు. వారు తర్వాత స్వతంత్రం ప్రకటించి నూతన విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు అని సీవెల్ భావించాడు. ఆ సిద్ధాంతాన్ని నేడు పలువురు అంగీకరించారు. దాని ప్రకారం పూర్వపు కంపిలిరాజ్యమే విజయనగర రాజ్యంగా మారింది. కంపిలి రాజ్యపతనమే విజయనగర రాజ్యస్థాపనకు కారణమని ముస్లిం చరిత్రకారులు కూడా స్పష్టంగా

రాశారు. క్రీ.శ.1330 తర్వాత ఢిల్లీ సామ్రాజ్యం విచ్ఛిన్నం కావడానికి కారణమైన తిరుగుబాటును వర్ణించి ఫెరిష్ అనే ముస్లిం చరిత్రకారుడు కంపిలిలో జరిగిన సంఘటనలను వివరించాడు. తిలాంగులో తిరుగుబాటు జరిగినప్పుడే కంపిలిదేవుని బంధువులలో ఒకతనిని కంపిలి పంపగా అతడు ఇస్లాం మతాన్ని వదిలివేసి తిరిగి హిందూమతాన్ని స్వీకరించి కంపిలిలో కూడా తిరుగుబాటును లేపాడు. దాంతో కంపిలి కూడా పోయింది; కంపిలి మళ్లీ హిందువులకు దక్కిందని రాశాడు. ఇస్సామి అనే మరొక ముస్లిం చరిత్రకారుడు కూడా ఇస్లాం మతం పుచ్చుకున్న హిందువు ఒకడు ఇస్లాం మతాన్ని మరొక ముస్లిం చరిత్రకారుడు కూడా ఇస్లాం మతం పుచ్చుకున్న హిందువు ఒకడు ఇస్లాం మతాన్ని వదిలివేసి తిరిగి హిందూమతంలోకి మారిపోయి కన్నడ దేశాన్ని జయించి గుత్తి నుండి మాబారు వరకు ఆక్రమించాడని రాశాడు. అతడే తిలింగ తిరగబడింది, కంపిలి చేయిజారి పోయింది అని రాశాడు. దీనిని బట్టి ఆంధ్రదేశంలో కాపయనాయకుడు ఓరుగల్లుపై దండెత్తి మాలిక్‌మగ్‌బూల్‌ను పారదోలి ఓరుగల్లును ఆక్రమించిన సమయంలోనే కాపయనాయకుని చూసి హరిహర బుక్కరాయలు కూడా స్ఫూర్తిని పొంది కంపిలి రాజ్యంలో స్వతంత్రం ప్రకటించారని భావించవచ్చు.

తర్వాత క్రీ.శ.1336లో విజయనగర పట్టణాన్ని నిర్మించి రాజధానిగా చేసుకున్నాడు. ఆ పేరుతోనే రాజ్యం కూడా ప్రఖ్యాతి వహించింది. న్యూనిజ్ రచనలను, ఇబన్‌బటూటా రచనలను క్రీ.శ.1340 సంవత్సరం నాటి హరిహరరాయల శాసనాన్ని పరిగణనలోకి తీసుకొని సీవెల్ విజయనగర నిర్మాణం క్రీ.శ.1336లో ప్రారంభింపబడిందని ధృవీకరించాడు. కనుక విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1336లో స్థాపించబడిందని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని అందరూ ఆమోదించారు. అతి త్వరలో విజయనగరం గొప్ప పట్టణంగా అభివృద్ధి చెందింది. రాజ్యం నలుదిక్కులకూ విస్తరించింది. విజయనగరంలో విద్యారణ్యుని గౌరవార్థం హరిహరరాయలు పెద్ద దేవాలయాన్ని నిర్మించాడని న్యూనిజ్ రాశాడు. ఈ దేవాలయం నేటికీ పంపాపతి అనే పేరుతో పూజలందుకొంటోంది. కాని ఈ హంపి అనే ప్రదేశం క్రీస్తు శకం 7వ శతాబ్దం నుండే ఉందని, అది అక్కడ ఒక గ్రామం అని, అందులో విరూపాక్ష దేవాలయం ఉన్నట్లు బాదామిచాళుక్యుల కాలం నాటి శాసనం లభించింది. విరూపాక్ష అనే దేవుని ఉనికి మొట్టమొదటిసారిగా మనకు నాగార్జునకొండలో బయల్పడింది. ఇక్ష్వాకు శాంతిమూలుడు విరూపాక్షుని భక్తుడు. నాగార్జుకొండ శాసనంలో లభించిన చెలికి రెమ్మణ చాళుక్యులకు మూలపురుషుడు అని భావింపబడింది. కనుక చాళుక్యులు విరూపాక్ష ఆరాధనను నాగార్జునకొండ నుండే గ్రహించారని చెప్పవచ్చును. బాదామి చాళుక్యులు పట్టడికల్‌లో ఒక విరూపాక్ష దేవాలయం నిర్మించారు. అలాగే వినయాదిత్యుని కాలంలో హంపిలో విరూపాక్ష దేవాలయం నిర్మించినట్లు అక్కడ లభించిన శాసనం ధృవపరుస్తోంది. కనుక బాదామి చాళుక్యుల కాలం నుండి హంపి విరూపాక్ష క్షేత్రంగా వర్ధిల్లుతోందని స్పష్టంగా చెప్పవచ్చును. ఈ విరూపాక్ష ఆలయంలో కంపిలిదేవుని శాసనం ఒకటి లభించింది. కనుక విజయనగర రాజ్యస్థాపనకు పూర్వమే అక్కడి విజయనగర చక్రవర్తులు తమ రాజ్యానికి విరూపాక్షుడే అధిపతి అని ప్రకటించుకున్నారు. కనుకనే విజయనగర ప్రభువులు తమ రాజ్యం విరూపాక్షునిదని చెప్పుకున్నారు. 1886వ సంవత్సరంలోనే మద్రాసు ఆర్కలాజికల్ డిపార్టుమెంటులోని సూపరింటెండెంటు Mr.Ray మద్రాసు క్రిష్టియన్ కాలేజీ మాగజైన్‌లో ఆ దేవాలయం విజయనగర రాజ్యాని కంటే ముందుదనే అనుమానాన్ని వ్యక్తం చేస్తూ వ్యాసం రాశాడు. ఇప్పుడు అక్కడ లభించిన బాదామీ చాళుక్య శాసనం దాని ప్రాచీనత్వాన్ని తెలుపుతోంది.

విద్యారణ్యుని పాత్ర: విజయనగర రాజ్యస్థాపన విజయనగర పట్టణ నిర్మాణంలో విద్యారణ్యుల వారి పాత్ర ఉందా, లేదా అనే విషయంలో పండితులలో ఏకాభిప్రాయం లేదు. శృంగేరి పీఠాధిపతులు విద్యారణ్యుడు విజయనగర స్థాపనలో ప్రధాన పాత్ర వహించాడని కల్పించి రాశారని ఫాదర్ హీరాస్ అభిప్రాయం వెలిబుచ్చాడు. విజయనగర శాసనాలలో విజయనగర రాజ్యస్థాపన ప్రసక్తి లేదు. బుక్కరాయల కోడలు గంగాదేవి తన కావ్యంలో విజయనగరాన్ని మూడుమార్లు పేర్కొంది. కాని అందులో విద్యారణ్యుల ప్రస్తావనగాని, విద్యానగరం అనే పేరు గాని లేవు. విద్యారణ్యుడు విజయనగర స్థాపకుడు అయితే గంగాదేవి తప్పకుండా విద్యారణ్యుల వారి పేరును పేర్కొని ఉండేది. అంతేగాక గంగాదేవి విద్యారణ్యుడు హరిహర బుక్కరాయల గురువుగా కూడా తెలపలేదు. సంగమ వంశస్థులకు క్రియాశక్తి పండితుడు, కాలాముఖాచార్యులను గురువులుగా పేర్కొన్నది. హరిహర బుక్కరాయలు క్రీ.శ.1346, క్రీ.శ.1356 శాసనాలు హరిహర బుక్కరాయలు భారతీ తీర్థులను సేవించినట్లు తెలుపుతున్నాయి. క్రీ.శ.1376 వరకు భారతీ తీర్థులు శృంగేరి పీఠాధిపతిగా ఉన్నట్లు శృంగేరి రాతలు

స్పష్టపరుస్తున్నాయి. క్రీ.శ.1356 నాటి శాసనం కాశీలో ఉన్న విద్యారణ్యుల వారిని దక్షిణదేశానికి రప్పించవలసిందిగా బుక్కరాయలు భారతీ తీర్థులను కోరినట్లు తెలుపుతోంది. క్రీ.శ.1365లో బుక్కరాయలు ప్రపంచాన్ని జయించిన తర్వాత విజయనగరాన్ని నిర్మించినట్లు తెలుపుతోంది. రెండవ హరిహరరాయలు క్రీ.శ.1380, 1384, 1386 సంవత్సరాలలో విద్యారణ్యులను కీర్తిస్తూ శాసనాలు రాయించాడు. కాని విద్యానగర ప్రసక్తిలేదు. ఈ ఆధారాలన్నింటిని బట్టి చూడగా 1336లో స్థాపించబడిన విజయనగర రాజ్యానికి, విజయనగర పట్టణ నిర్మాణానికి విద్యారణ్యుల వారికి ఎలాంటి సంబంధం ఉన్నట్లుగా కనిపించదు. విద్యారణ్యుల వారికి విజయనగర రాజ్యంతో క్రీ.శ.1356 తర్వాతనే సంబంధాలు ఏర్పడ్డట్లుగా కనిపిస్తోంది. కనుకనే ఫాదర్ హీరాస్ విద్యారణ్యుల వారికి విజయనగర రాజ్యస్థాపనకు సంబంధం లేదని అభిప్రాయపడి ఉంటారు.

కాని నేలటూరి వెంకటరమణయ్య ఫాదర్ హీరాస్ సిద్ధాంతాన్ని అంగీకరించలేదు. విద్యారణ్యుల వారికి విజయనగర స్థాపనలో పాత్ర ఉందని భావించారు. వారి సిద్ధాంతాన్ని రాయప్రోలు సుబ్రహ్మణ్యం, గొర్తి వెంకట్రావు, కుందూరి ఈశ్వరిదత్తు, M.H. రామశర్మలు బలపరిచారు. విజయనగర రాజ్యస్థాపన కాలం నాటికి విద్యారణ్యుల శృంగేరి పీఠాధిపతి అని స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. న్యూనిజ్ కూడా విద్యారణ్యుల వారిని తన రచనలలో విద్యాజున అని పేర్కొన్నాడు. నాగుండిని పాలించడానికి సుల్తాన్ పంపిన దేహోరావ్ విద్యాజున మహర్షి సలహాపై నాగుండి నదీ తీరంలో నూతన నగరాన్ని నిర్మించాడని న్యూనిజ్ తన రచనలలో పేర్కొన్నాడు. క్రీ.శ.1336-37 నాటి కావలూరు శాసనం కూడా విద్యారణ్యుని ఆజ్ఞ ప్రకారం హరిహరరాయలు విద్యానగరాన్ని నిర్మించాడని తెలుపుతోంది. అందు విద్యారణ్యుడు హరిహరుని సంభోదిస్తూ విద్యా అనే పేరుతో నగరాన్ని నిర్మించు అని ఆదేశించాడని, అది కుబేరుని అలకాపురికి దీటుగా గొప్పనగరమై విద్యలకు నిలయం అవుతుందని చెప్పాడని తెలుపుతోంది. కాని క్రీ.శ.1368 నాటి శాసనంలో బుక్కరాయలు నిర్మించినట్లు ఉంది. దానిని ఫ్లీట్, హీరాస్, రైస్ గోపీనాథరావు, నరసింహారావు మొదలైన పండితులు అంగీకరించలేదు. డా॥ రాయప్రోలు సుబ్రహ్మణ్యం 1338లో ప్రారంభించబడిన విజయనగర నిర్మాణం బుక్కరాయల పర్యవేక్షణలో జరిగింది కనుక, 1368లో బుక్కరాయలే నిర్మించాడని శాసనం వేయించి ఉండవచ్చును అని వ్యాఖ్యానించారు. గంగాదేవి క్రియాశక్తి ఆచార్యులు సంగమ వంశస్తుల గురువులని రాసినప్పటికీ హరిహర బుక్కరాయలు శృంగేరీ పీఠాధిపతులను కూడా గౌరవించారు. కనుక విజయనగర రాజ్యస్థాపనాకాలానికి ముందు విద్యారణ్యుల వారు శృంగేరీ పీఠాధిపతిగా ఉండి, తర్వాత ఆ పదవిని త్యజించి తుంగభద్రాతీరంలో తపస్సు చేసుకొంటుండగా హరిహరబుక్కరాయలు చూసి ఆయనను కొలిచారు. విద్యారణ్యులు వారిని ఆశీర్వదించి కృష్ణకు దక్షిణభాగం అంతా విరూపాక్ష స్వామి భూమి అని దానిని రక్షించమని ఆదేశించి విజయనగరాన్ని నిర్మించమని ప్రోత్సహించారు. ఆయన ఆదేశంతో హరిహరరాయలు విజయనగరాన్ని నిర్మించి విజయనగర రాజ్యాన్ని స్థాపించాడని, అందువల్లనే తమ రాజ్యానికి అధిపతి విరూపాక్షస్వామి అని చెప్పుకున్నారని వెంకటరమణయ్య భావించారు. హరిహర బుక్కరాయలు మహమ్మదీయ మతస్తులుగా మార్చబడినందున వారికి హిందువులు సహకరించలేదు. కనుక విద్యారణ్యులు వారిని శుద్ధి చేసి తిరిగి హిందువులుగా మార్చి వారికి సంఘంలో గౌరవం కల్పించి విజయనగర రాజ్యస్థాపనకు ప్రోత్సహించాడని, అందువల్లనే విద్యారణ్యులపై గొప్ప భక్తిభావంతో తాను నిర్మించిన నగరానికి విద్యానగరం అని పేరు పెట్టి, అందులో విద్యారణ్యుల వారి పేరు హరిహరరాయలు దేవాలయాన్ని కూడా నిర్మించాడని, విద్యారణ్యుని మార్గదర్శకత్వంలో రాజ్యం పాలించాడని నేలటూరి వెంకటరమణ్య భావించారు. విరూపాక్ష చంపూకావ్య రచయిత అహోబలపతి తన గ్రంథంలో సాధుపుంగవుడైన విద్యారణ్యుడు నిర్మించిన నగరానికి దేవనృపతి రాజన రాశాడు. అంతేగాక ఈ దేవనృపతి హరిహరరాయలు న్యూనిజ్ పేర్కొన్న దేహోరావ్. వసంతోత్సవాల కాలంలో శిష్యగణంతో విరూపా పంపాంబికలను పూజించడానికి విద్యారణ్యుడు వచ్చాడని, అతడు విద్యారణ్యుడే విద్యానగరాన్ని నిర్మించాడని రాశాడు. కనుక విజయనగర నిర్మాణంలో విద్యారణ్యుని పాత్ర ఉందని విరూపాక్ష చంపూకావ్యం కూడా ధృవపరుస్తోంది. వాస్తవం ఏమైనా విద్యారణ్యుల వారు చాలా కాలం జీవించి ఉన్నట్లు, వారికి విజయనగర రాజ్యంతో సంబంధం ఉన్నట్లు అనేక శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1368-69 నాటి ఒక శాసనం అతడు జీవించి ఉన్నట్లు తెలుపుతోంది. అలాగే విద్యారణ్యుడు రెండవ దేవరాయల కాలంలో కూడా జీవించి ఉన్నట్లు క్రీ.శ.1386 మొదలైన అతని శాసనాలు తెలుపుతున్నాయి. అతడు నూరు సంవత్సరాలు జీవించి క్రీ.శ.1386లో మరణించాడని ప్రతీతి. విద్యారణ్యుల వారిని గురించి మరొక సందేహం కూడా ఉంది. మాధవాచార్యులు,

విద్యారణ్యులు ఒకరేనా లేక వేరు వేరు వ్యక్తులా అని కూడా సందేహాలున్నాయి. కాని వాటికి సరైన సమాధానాలు లభించలేదు.

హరిహర బుక్కరాయలు మతాంత్రీకరణ: విద్యారణ్యుల పాత్రపై సందేహాలున్నట్లే హరిహర బుక్కరాయల మతాంత్రీకరణను గురించి కూడా చరిత్రకారుల మధ్య భేదాభిప్రాయాలున్నాయి. మహమ్మద్ బిన్ తుగ్లక్ సైన్యం కంపిలిని జయించిన తర్వాత హరిహరబుక్కరాయలను బంధించి ఢిల్లీ తీసుకువెళ్లి బలవంతంగా మతం మార్చారని, వారు అనెగొందికి తుగ్లక్ ప్రతినిధులుగా వచ్చిన తర్వాత విద్యారణ్యుల వారిద్వారా హిందూమతంలోకి మారి స్వతంత్ర రాజ్యస్థాపన చేశారని నేలటూరి వెంకటరమణయ్య మొదలైన పండితులు భావించారు. కాని డా॥ బి.యస్.యల్. హనుమంతరావు ఈ వాదనను అంగీకరించలేదు. హరిహర బుక్కరాయలు ఇస్లాం మతం పుచ్చుకున్నారని ఇసామీ అనే రచయిత రాశాడు. అతని రాతలు నమ్మనక్కరలేదు. అని బి.యస్.యల్. అంటారు. ఆనాడు హిందువులను ముస్లింలుగా మార్చడం జరుగుతూనే ఉంది. కాని ముస్లింలుగా మారిన హిందువులపై ప్రజలకు సానుభూతి ఉండేదిగాని ద్వేషం ఉండేదికాదు. కనుక ముస్లింలుగా మారిన హరిహరబుక్కరాయలను ద్వేషించవలసిన పనిలేదు. అంతేగాక స్థానిక హిందూ గ్రంధాలలో ఎక్కడా కూడా వారు ముస్లింలుగా మార్చబడ్డారనే ప్రస్తావనే లేదు. కనుక ముస్లిం చరిత్రకారుల రచనలు వాస్తవం కాదు. అందుకు కారణమేమిటంటే మహమ్మద్ బిన్ తుగ్లక్ మత దురభిమాని కాదు. అతడు హిందువుల పట్ల చాలా ఉదారంగా ఉండేవాడు అందువల్ల సుల్తాన్‌ను చంపినా పాపం లేదని ఛాందస ముస్లిం వాదులు అంటుండేవారు. అలాంటి మహమ్మద్ బిన్ తుగ్లక్ హరిహరబుక్కరాయలను ముస్లింలుగా మార్చాడంటే నమ్మశక్యం కాదు. అంతేగాక కంపిలి పతనానంతరం బందీలుగా చిక్కిన 11 మంది కంపిలిరాయల కుటుంబ సభ్యులను చాలా గౌరవించాడు. కనుక అతడు హరిహర బుక్కరాయలను నిర్బంధంగా మతం మార్చి ఉండడు. అంతేగాక మరొక కారణం కూడా ఉంది. అనెగొందిలో తన ప్రతినిధి అయిన మాలిక్‌నబికి వ్యతిరేకంగా హిందువులు తిరుగుబాటు చేశారు. వారిని అణచడానికి తుగ్లక్ హరిహరబుక్కరాయలను పంపాడు. వారు ముస్లింలైతే స్థానిక హిందువుల తిరుగుబాటును అణచడానికి సాధ్యపడదుగదా! హిందూ గవర్నరులైతేనే హిందువులను సులభంగా అదుపులోకి తీసుకురావచ్చును కనుక హరిహరబుక్కరాయలను ముస్లింలుగా మార్చలేదు. అనెగొంది తిరుగుబాటు విషయం తెలియగానే సోదరులిద్దరూ సచ్ఛీలురని, విశ్వాసపాత్రులని గ్రహించి వారిని హిందువులుగానే తన ప్రతినిధులుగానే అనెగొంది పంపాడని విద్యారణ్య వృత్తాంతం తెలుపుతోంది. కనుక వారు హిందువులుగానే అనెగొంది చేరారు. విద్యారణ్య కాలజ్ఞానం, విద్యారణ్య వృత్తాంతాలు విజయనగర రాజ్యస్థాపనను గురించి వివరిస్తున్నాయి. సంగముని కుమారులు హరిహర, బుక్క, కంపన, మారప, ముద్దప్పలు ఓరుగల్లు ప్రతాపరుద్రుని ఆస్థానం హరిహర బుక్కలు కోశాగార ప్రతీహారులుగా కొలువు చేశారు. ఓరుగల్లు పతనానంతరం వారు కంపిలిచేరి రామనాధుని ఆస్థానంలో ఉద్యోగులుగా చేరారు. కంపిలి పతనం తర్వాత వారు పట్టుపడి ఢిల్లీకి బందీలుగా తీసుకువెళ్లబడ్డారని విద్యారణ్య కాలజ్ఞానం తెలిపింది. కాని విద్యారణ్య వృత్తాంతం కంపిలి రాజ్యాన్ని ప్రస్తావించకుండా సోదరులిద్దరూ ఓరుగల్లు నుండే బందీలుగా ఢిల్లీ తీసుకువెళ్లబడ్డారని తెలుపుతోంది. ఈ రెండు విషయ వివరణలో విభేదించినా వారు ముస్లింలుగా మార్చబడ్డారని చెప్పలేదు. కనుక వారు మతాంతీకరణ చెందారని భావించడం తప్పని బి.యస్.యల్. భావించారు. కనుక మతం మార్పిడి అనే ప్రశ్నలేదు అని బి.యస్.యల్. హనుమంతరావు తీర్మానించారు కాని వీరి సిద్ధాంతాన్ని పలువురు ఆమోదించలేదు.

హిందూ గ్రంధాలు వారు ముస్లింలుగా మార్చబడ్డారని చెప్పకపోయినా ముస్లిం చరిత్రకారులు రాసిన తారీఖ్-ఇ-ఫిరోజ్ షాహి, ఫుతూ ఉస్ సలాతిన్ మొదలైన సమకాలీన గ్రంధాలు హరిహర బుక్కరాయలు ఇస్లాం పుచ్చుకున్నారని చెబుతున్నాయి. మతం మార్చుకున్నవాడొకడు తిరిగి మొదటి మతాన్నే స్వీకరించి కంపిలిని జయించి సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడని ఇసామీ, బరని అనే ముస్లిం రచయితలు స్పష్టంగా రాశారు. కనుక వారు మతం మార్చుకున్నారని స్పష్టంగా తెలుస్తోంది. అంతేగాక జునాఖాన్ ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత అనేక మందిని ముస్లింలుగా మార్చాడు. అనేక మంది కాకతీయ సేనానులు, సైనికులు, ప్రజలు బలవంతంగా మార్చబడ్డారని నాటి సంఘటనలు తెలుపుతున్నాయి. గన్నా నాయకుడు మాలిక్ మక్బూల్‌గా మారిపోయాడు. కనుక కంపిలి రాజ్యం పతనం తర్వాత కూడా అనేక మంది ముస్లింలుగా మార్చబడ్డారని చెప్పడానికి సందేహించవలసిన పనిలేదు. బందీలుగా చిక్కిన హరిహర బుక్కరాయలు ఢిల్లీలో ముస్లింలుగా మార్చబడటం

వాస్తవమేనని, వారిని విద్యారణ్యుడు తిరిగి హిందువులుగా ముస్లింలుగా మార్చబడటం వాస్తవమేనని, వారిని విద్యారణ్యుడు తిరిగి హిందువులుగా మార్చాడని వెంకటరమణయ్య ఖచ్చితమైన అభిప్రాయాన్ని ప్రకటించారు. కంపిలి రాజ్యంలో బందీలుగా చిక్కిన 11 మంది కంపిలిరాయుని కుటుంబ సభ్యులను ముస్లింలుగా మార్చారని, వారిలో ఒకరితో తాను మాట్లాడానని ఇబన్ బటూటా రాశాడు. తుగ్లక్ సైన్యాలకు బందీలుగా చిక్కిన 11 మందిలో హరిహర బుక్కరాయలు కూడా ఉన్నారు. ఇబన్ బటూటా ముస్లింలుగా మారిన హరిహర బుక్కరాయలను తాను చూశానని రాశాడు. ముస్లింగా మారిన తర్వాత హిందువుగా మారినవాడొకడు కంపిలిలో తిరుగుబాటు చేశాడని వీరు రాశారు. కనుక హరిహర బుక్కరాయలు ముస్లింలుగా మార్చబడ్డారని చెప్పవచ్చును. అంతేగాదు, దక్కనులోని ముస్లింలతో హిందువులు జరిపిన పోరాటమే విజయనగర చరిత్ర అని కూడా వెంకటరమణయ్య స్పష్టంగా చెప్పారు. నీలకంఠశాస్త్రి కూడా మహమ్మదీయుల వలన హిందువులకు కలిగే ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి సర్వవేళలా సిద్ధంగా ఉండే సైనిక వ్యవస్థను నిర్మించుకొని ఉందని విజయనగర రాజ్యం అని వ్యాఖ్యానించారు. బర్టన్‌స్టెయిన్ కూడా ధార్మిక ఆదర్శపాలన సంగమ, సాళువ వంశస్తుల పాలనలో కనిపిస్తోందని అన్నాడు. విజయనగర రాజులు తమ రాజ్యం విరూపాక్షునిదని చెప్పకోవడం, మహమ్మదీయుల దండయాత్రల వలన నష్టపడిన దేవాలయాలను పునరుద్ధరించడం, బ్రాహ్మణులను ఆదరించడం, హిందూ వేదాంత గ్రంథాలు రాయడం, దేవాలయాలను నిర్మించడం, హిందూ సంస్కృతిని పోషించడం, కవి పండితులకు బ్రాహ్మణులకు అంతు లేని దానాలు చేయడం, ఆ దానాలు కూడా వారు విరూపాక్షుని సన్నిధిలో చేయడం, దసరా ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించడం, మిగిలిన పండుగలను జరపడం, ఇవన్నీ వారు హిందూ ధర్మరక్షణకు ఎంతగా పాటుబడ్డారో తెలుపుతోంది. వారికి హిందూ ధర్మంపై ఎంతటి ప్రగాఢ విశ్వాసం ఉందో తెలియజేస్తోంది. ఇవన్నీ విద్యారణ్యుల వారి ఆదేశంతో జరిగి ఉండవచ్చును. అంతేగాకుండా హిందువులు గృహ నిర్మాణం చేసినా, గ్రామ నిర్మాణం చేసినా బ్రాహ్మణులను సంప్రదించి వారి ఆదేశం ప్రకారం చేస్తారు. కనుక విజయనగర నిర్మాణానికి హరిహరరాయలు, విద్యారణ్యులను సంప్రదించి ఆయన ఆదేశం ప్రకారం చేసి ఉండవచ్చును. నగర నిర్మాణాలకు బ్రాహ్మణులే ముహూర్తాలు నిర్ణయిస్తారు. కనుక విద్యారణ్యులు ముహూర్తం నిర్ణయించి విజయనగర నిర్మాణంలో పాలుపంచుకొని ఉండవచ్చును. కనుక హరిహరరాయలు ముస్లింలుగా మార్చబడి, తిరిగి హిందువులుగా శుద్ధి చేయబడటం వాస్తవం అని, విజయనగర రాజ్యస్థాపన విజయనగర పట్టణ నిర్మాణంలో విద్యారణ్యుల పాత్ర ఉందని చెప్పడానికే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి.

విజయనగరం విద్యారణ్యులు, హరిహర బుక్కరాయలు నిర్మించారనే కథ ప్రచారంలో ఉన్నప్పటికీ ఈ సిద్ధాంతాన్ని కొందరు పండితులు తిరస్కరించారు. అలాగే హరిహర బుక్కరాయల జాతిని గురించి కూడా భిన్నాభిప్రాయలున్నాయి. అందువల్ల విజయనగర రాజ్యస్థాపనను, నగర నిర్మాణాన్ని గురించి చరిత్రకారుల మధ్య రెండు సిద్ధాంతాలు ఏర్పడ్డాయి. విజయనగర రాజ్యాన్ని కన్నడ దేశస్తుడైన మూడవ భల్లాలుడు స్థాపించాడని కొందరు, తెలుగువారైన హరిహరబుక్కరాయలు స్థాపించారని మరి కొందరు భావించారు.

కన్నడ సిద్ధాంతం: ఫాదర్ హీరాస్, యస్.శ్రీకాంతయ్య బి.ఎ.శాంటోర్, హెచ్.యస్.కృష్ణశాస్త్రి, లూయీరైస్, యస్.కృష్ణస్వామి అయ్యంగార్, సత్యనాథ అయ్యర్, పి.బి.దేశాయ్, యమ్.హెచ్.రామశర్మ, ఆర్. నరసింహాచారి, విజయనగర రాజ్యాన్ని విజయనగర పట్టణాన్ని హొయసాల రాజైన మూడవ భల్లాలుడు స్థాపించాడని సిద్ధాంతీకరించారు. ఫెరిష్టా న్యూనిజ్ రచనలు వీరి ఊహకు ఆధారాలు. ఫెరిష్టా తన రచనలలో హొయసాల మూడవ భల్లాలుడు క్రీ.శ.1344లో తన కుమారుడైన బిజన్‌రాయ్ పేరుతో బిజన్‌నగర్‌ని నిర్మించాడని పేర్కొన్నాడు. న్యూనిజ్ రచనలలో దేవరాయ అని పేర్కొన్నాడు. ఈ దేవరాయల మూడవ భల్లాలుడని ఈ పండితుల అభిప్రాయం. భల్లాలుడు నిర్మించిన బిజన్‌నగర్ విజయనగరం అని కూడా వారి నమ్మకం. ఫాదర్ హీరాస్ **Beginnings Vijayanagara History** అనే గ్రంథంలో విజయనగర సామ్రాజ్య స్థాపనను గురించి సీవెల్ తెలిపిన గాథలను పరిశీలించి, వ్యాఖ్యానించి, విజయనగరాన్ని హొయసాల మూడవ భల్లాలుడు నిర్మించాడని తీర్మానించాడు. **The never to Forgotten Empire** రాసిన బి.సూర్యనారాయణ కూడా ఈ కథలన్నీ నమ్మశక్యం కావని అన్నాడు. లూయీ రైస్ విజయనగర నిర్మాతలు హొయసాలుల సామంతులుగా కనిపిస్తున్నారు అని అన్నాడు. హెచ్.కృష్ణశాస్త్రి హరిహర బుక్కరాయలు నిస్సందేహంగా మూడవ భల్లాలుని సామంతులని తేల్చి చెప్పారు. మూడవ భల్లాలుని కాలంలోనే హరిహర బుక్కరాయలు బలపడ్డారు. కనుక భల్లాలుడు తన రాజధానిని

[illegible]

భల్లాలుడు తన కుమారుని పేరుతో బిజ్‌నగరాన్ని నిర్మించాడని రాశాడు. రచనలలో క్రీ.శ.1344లో భల్లాలుడు తన కుమారుని పేరుతో బిజ్‌నగరాన్ని నిర్మించాడని రాశాడు. కాని భల్లాలుడు క్రీ.శ.1342లోనే మధుర సుల్తాన్‌తో పోరాడుతూ మరణించాడు. కనుక 1344లో భల్లాలుడు విజయనగరాన్ని నిర్మించడం అసంభం. పైగా విజయనగరం 1336లోనే ప్రారంభమైందని రుజువైంది. అంతేగాకుండా విజయనగరం పూర్వపు కంపిలి రాజ్యంలో ఉంది. కంపిలిరాయలు అతని తండ్రి సింగయ నాయకుడు క్రీ.శ.1314-15 సంవత్సరాలలోనే కంపిలి రాజ్యాన్ని రూపొందించారు. కంపిలిరాయల పతనం తర్వాత ఆ రాజ్యం తుగ్లక్ సామ్రాజ్యంలో భాగం అయింది. కనుక ఆ ప్రాంతంలో వీరభల్లాలుడు నగరాన్ని నిర్మించడం జరగని పని. పైగా విరూపాక్షుని దేవాలయం అంతకు పూర్వం నుండే అక్కడ ఉంది. కనుక ఆ ప్రాంతానికి విరూపాక్ష పట్టణం అని పేరు వచ్చి ఉండవచ్చును. కాని భల్లాలుడు పట్టణం నిర్మించినందువలన కాదు. కనుక పెరిష్టా రాతలు ఉండవచ్చును. కనుక పెరిష్టా రాతలు సరైనవి కావని పలువురు పండితులు పేర్కొన్నారు. అలాగే హరిహర బుక్కరాయలు భల్లాలుని కొలువులో ఉద్యోగం చేసినట్లు ఎక్కడా నిదర్శనాలు లేవు. పైగా వారు క్రీ.శ.1328 నుండి 1340 వరకు భల్లాలునితో పోరాడి తమ రాజ్యాన్ని దక్షిణంగా విస్తరించుకున్నట్లు శాసనాలున్నాయి. మల్లినాథ వడయారు హొయసాల సైన్యాలను జయించాడు. తిప్పరాజనే మరొక సేనాని ఉచ్చంగి దుర్గాన్ని జయించాడని దానిని హరిహరరాయలు పాలించాడని శాసనాలు తెలుపుతున్నాయి. ఉచ్చంగి హొయసాల జయించాడని దానిని హరిహరరాయలు ఈ ప్రాంతాన్ని హొయసాలుల నుండి జయించాడని స్పష్టంగా చెప్పవచ్చును. కనుక హరిహర సోదరులు భల్లాలుని ఉద్యోగులని చెప్పడం హాస్యాస్పదం. హరిహరుని సోదరులు మద్దప్ప, మారప్పటు మాలెనాడును పాలించిన మాట వాస్తవమే. కాని అక్కడ లభించిన శాసనాలు క్రీ.శ.1352 నాటివి. ఆ సంవత్సరానికి హొయసాల రాజ్యం విజయనగర రాజ్యంలో భాగం శాసనాలు క్రీ.శ.1352 నాటివి. ఆ సంవత్సరానికి హొయసాల రాజ్యం విజయనగర రాజ్యంలో భాగం అయిపోయింది. హరిహరరాయలు మరణించి బుక్కరాయలు పాలిస్తున్నాడు. కనుక బుక్కరాయలు తన సోదరులను మాలెనాడులో స్థానిక పాలకులుగా నియమించి ఉంటాడు. పైగా అంతకు పూర్వం కూడా మాలెనాడు హొయసాల రాజ్యంలో భాగం అని చెప్పడానికి వీలులేదు. అది అంతకు పూర్వమే కంపిలి రాజ్యంలో భాగం కూడా అయి ఉండవచ్చును. క్రీ.శ.1327-28లో మహ్మద్ బిన్ తుగ్లక్ ద్వారసముద్రాన్ని ధ్వంసం చేశాడని చెప్పడం సరైన అభిప్రాయం కాదు. కంపిలి రాజ్య పతనం తర్వాత బహుద్దీన్ గుష్టాస్పను భల్లాలుడు సుల్తాన్‌కు అప్పగించి సుల్తాన్ అభిమానానికి పాత్రుడయ్యాడని ఇబన్‌బటూటా స్పష్టంగా రాశాడు. కనుక సుల్తాన్ ద్వార సముద్రాన్ని నాశనం చేయవలసిన పనిలేదు. అంతేగాక భల్లాలుడు క్రీ.శ.1327-28 నుండి 1340 వరకు ద్వారసముద్రంలోనే ఉండి పాలించినట్లు శక 1250, 1257, 1258, 1261, 1262 సంవత్సరాల శాసనాలు లభించాయి. ఆ శాసనాలలో ఎక్కడా అతడు నూతన నగరాన్ని నిర్మించినట్లు పేర్కొలేదు. క్రీ.శ.1329లో కొద్దికాలం క్రీ.శ.1335-1340 సంవత్సరాల మధ్య అతడు మధుర సుల్తాన్‌తో పోరాడుతూ తిరువణ్ణామలైలో ఉన్నాడు తప్ప అతడు తన రాజధానిని మార్చలేదు. దేశం కన్నడ అయినంత మాత్రాన హరిహర బుక్కరాయలు కన్నడిగులు అని చెప్పడానికి వీలులేదు. క్రీ.శ.1328 నుండి తుగ్లక్ సామ్రాజ్యంలో భాగమైన కంపిలి రాజ్యంలో హరిహరబుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. కనుక వారు భల్లాలుని సామంతులు కాదని, కన్నడిగులు అంతకంటే కాదని నేలటూరి వెంకటరమణయ్య మొదలైన పండితులు నిరూపించారు.

తెలుగువారైన హరిహర బుక్కరాయలు స్థాపించారు: రాబర్ట్ సీవెల్, యన్.రంగాచారి, బి.సూర్యనారాయణరావు మొదలైన పండితులు బరని, ఇసామి మొదలైన ముస్లిం చరిత్రకారుల రచనలు, విద్యారణ్య, వీరప్పయ్య కాలజ్ఞానాలు, న్యూనిజ్ రచనలు, ఇంకా కొన్ని సంస్కృత, కర్ణాటక ఆంధ్రాభాషలలోని స్థానిక చరిత్రలు కొన్ని శాసనాలను మంగళనిళయ వాసులని ఆంధ్రుడైన సంగముని కుమారులని తెలిపారు. హరిహర బుక్కరాయలు తెలుగువారని, విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన ఘనత తెలుగు వారికే దక్కుతుందని ఘంటా పథంగా చెప్పిన వారిలో నేలటూరి వెంకటరమణయ్య అగ్రగణ్యులు. వెంకటరమణయ్య సిద్ధాంతం ప్రకారం హరిహర బుక్కరాయలు మొదట కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉద్యోగులు. కనుక వారు తెలుగు వారు కాకతీయ రాజ్య పతనానంతరం వారు కంపిలి చేరి అక్కడ ఉద్యోగులుగా చేరారు. కాని కంపిలిని కూడా మహమ్మద్ బిన్ తుగ్లక్ ఆక్రమించి వారిని బందీలుగా ఢిల్లీ తీసుకొని వెళ్లాడు. కంపిలిలో మాలిక్‌నెబిపై తిరుగుబాటు జరిగినప్పుడు వారిని సుల్తాన్ అనెగొంది పంపాడు. కాపయనాయకుని తిరుగుబాటు కాలంలో

సోదరులు స్వతంత్రం ప్రకటించి విద్యారణ్యుని ఆశీర్వాదంతో విజయనగర పట్టణాన్ని నిర్మించారు. వారి రాజ్యం అదే పేరుతో విజయనగర సామ్రాజ్యంగా రూపొందిందని తీర్మానించారు. వీరు పరిశీలించిన శాసనాలు, గ్రంథాలు కూడా వారి వాదనను సమర్థిస్తున్నాయి. విజయనగర రాజ్యం స్థాపించిన నాటి పరిస్థితులను గురించి విద్యారణ్య కాలజ్ఞానం, విద్యారణ్య వృత్తాంతం తెలిపాయి. ఈ రెండు గ్రంథాలు మంగళ నిలయపు నివాసులైన సంగమ కుమారులు హరిహర బుక్కరాయలు ఓరుగల్లు చక్రవర్తి ప్రతాపరుద్రుని ఆ స్థానంలో కోశాగార, ప్రతీహారులుగా ఉన్నారని ఓరుగల్లు పతనం తర్వాత వారు కంపిలిదేవ రామనాథుని ఆస్థానంలో ఉద్యోగులుగా చేరారని. కంపిలి పతనం తర్వాత వారు కంపిలి దేవ రామనాథుని ఆస్థానంలో ఉద్యోగులుగా చేరారని. ఓరుగల్లు పతనం తర్వాత వారు ఖైదీలుగా ఢిల్లీ తీసుకెళ్ళబడ్డారని విద్యారణ్య కాలజ్ఞానం వివరించింది. కాని విద్యారణ్య వృత్తాంతం విద్యారణ్య కాలజ్ఞానంతో విభేదించి హరిహర బుక్కరాయలు రామనాథుని ఆస్థానానికి రాలేదని. ఓరుగల్లులోనే ఖైదీలుగా ఢిల్లీకి తీసుకెళ్ళబడ్డారని. కంపిలి తిరుగుబాటు తర్వాత వారిని సుల్తాన్ ఆనెగొందికి పంపాడని సుల్తాన్ పంపిన తర్వాతనే వారు మొదటిసారిగా ఆనెగొంది వచ్చారని విద్యారణ్య వృత్తాంతం తెలుపుతోంది. ఈ రెండూ ఈ విషయంలో విభేదించిన రెండు కావ్యాలు. హరిహర బుక్కరాయలు కాకతీయుల కొలువులోని ఉద్యోగులని మాత్రం చెబుతున్నాయి. కనుక వారు తెలుగువారే. తర్వాతనే వారు కంపిలి ప్రాంతానికి అధిపతులయ్యారని ఈ గ్రంథాలు నిరూపిస్తున్నాయి. ఇతర కథలు, వంశావళులు, కావ్యాలు కూడా సంగమవంశం తెలుగువారని తెలుపుతున్నాయి. జియావుద్దీన్ బరనీ కంపిలిని పాలించడానికి సుల్తాన్ పంపిన వ్యక్తి ఓరుగల్లును పాలించిన కన్నానాయకుని బంధువు అని రాశాడు. న్యూనిజ్ రచనల ప్రకారం అతడే విజయనగర స్థాపకుడు. కన్నడ రచయిత సర్వజ్ఞ తన కాలజ్ఞానంలో బుక్కరాయలను ఓరుగల్లు బుక్క అని సంబోధించాడు. సంగమ వంశస్థులు కన్నడ బిరుదులతోపాటు మహామండలేశ్వర, మూరురాయరగండ అనే కాకతీయుల బిరుదులు కూడా ధరించారు. సంగముల పోషించిన మొదటి కవి నాచన సోమన తెలుగుకవి. అతను తన గ్రంథాన్ని హరిహరనాథునికి అంకితం ఇచ్చాడు. ఇది పరోక్షంగా హరిహరరాయలకు అంకితమిచ్చినట్లేనని మధురా విజయంలో ప్రతాపరుద్రుని ఆస్థాన కవులైన అగస్త్య విశ్వనాథులనేగాక కవిబ్రహ్మ తిక్కనను కూడా స్తుతించింది. హరిహరుని సోదరుడు మారప్ప చంద్రగుత్తిలో ఒక అగ్రహారాన్ని తెలుగు బ్రాహ్మణునికి దానం చేశాడు. కెలది బసవరాజు రచించిన శివతత్త్వ రత్నాకరం, 17వ శతాబ్దం నాటి రాజకాల నిర్ణయం అనే సంస్కృత గ్రంథం హరిహర బుక్కరాయలు కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలో కోశాధికారి, దౌవారికులుగా పనిచేశారని వక్కాణిస్తున్నాయి. బరనీ రచన ఈ అభిప్రాయాన్ని బలపరుస్తోంది. ఇవన్నీ వారు తెలుగువారని, కాకతీయులతో సంబంధం ఉన్నవారని రుజువు చేస్తున్నాయి. లింగన్న రచించిన కెలదినృప విజయం, సంగములు ఉత్తరాది క్షత్రియులని, వారు దక్షిణాదికి చేరి కురుబ తెగతో సంబంధాలు కలుపుకున్నారని తెలుపుతున్నాయి. శాసనాలు, అనేక తెలుగు గౌడ కుటుంబాలు కర్ణాటకకి వలసపోయాయని తెలుపుతున్నాయి. రచించిన భల్లాలరాయన యుద్ధమనే గ్రంథం హరిహర బుక్కరాయలు కంపిలిదేవుని కొలువులో కోశాధికారులని తెలుపుతోంది. న్యూనిజ్ రచనలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. నాగుండి లేక ఆనెగొందిలో తన ప్రతినిధిగా సుల్తాన్ పంపిన దేవరావ్ అంతకుముందు నాగుండిని పాలించిన రాజు వద్ద మంత్రిగా పనిచేశాడని రాశాడు. విద్యారణ్య వృత్తాంతం సంగముడు మంగళ నిలయాధిపతి అని పేర్కొంటోంది. మంగళ నిలయం గుంటూరు జిల్లాలోని మంగళగిరి కావచ్చని డా॥ బి.యస్.యల్. హనుమంతరావు భావించారు. దక్షిణ భారతదేశ పరిస్థితుల్ని సమీక్షించడానికి లార్డ్ వెల్లస్లీ నియమించిన అధికారి ఫ్రాన్సిస్ బుకానన్ విజయనగరాన్ని స్థాపించి హరిహర బుక్కరాయలు త్రిలింగ నుండి వచ్చినవారు అని అన్నాడు. కల్నల్ మార్క్ విలియమ్స్ అనే మరొక ఆంగ్ల పండితుడు కర్ణాటక రాజధానిలో తెలుగుభాషా ప్రాబల్యానికి తెలుగువారు పదవులలో ఉండటానికి కారణం ఆ రాజ్యస్థాపకులు తెలుగువారు కావడమేనని వ్యాఖ్యానించాడు. అలాగే డా॥ విలియం స్మిత్ హరిహర బుక్కరాయ సోదరులు ఓరుగల్లు నుండి పారిపోయి వచ్చినవారే అని రాశాడు. కనుక హరిహర బుక్కరాయలు కన్నడిగులు కాదని, తెలుగువారని తెలుపుతున్నాయని, కనుక ఈ ఆధారాలు పరిశీలించిన నేలటూరి వెంకటరమణయ్య సంగమవంశస్థులు తెలుగువారని నిరూపించారు. దక్షిణ భారతదేశ చరిత్ర రచించిన నీలకంఠశాస్త్రి కూడా హరిహర బుక్కరాయలు తెలుగువారనే రాశారు.

కంపిలి రాజ్యం: కంపిలి రాజ్య పతనమే విజయనగర రాజ్యస్థాపనకు దోహదం చేసిందని మస్తి చరిత్రకారులు రాశారు. కుమార రమణకథ కంపిలి రాజ్య చరిత్ర పతనాలను తెలుపుతున్నారు. కంపిలి రాజ్యానికి

మూలపురుషుడు ముమ్మడి సింగేయ నాయకుడు. ఇతడు దేవగిరి యాదవరాజు రామచంద్ర దేవుని వద్ద సేనాధిపతిగా పనిచేశాడు. ఇతని ప్రస్తావన క్రీ.శ.1280 సంవత్సరం నాటి శాసనంలో ఉంది. ఆ శాసనంలో అతడు చౌండవరస అనే వ్యక్తితో యుద్ధం చేసి, అతనిని యుద్ధంలో చంపినట్లుగా ఉంది. క్రీ.శ.1281వ సంవత్సరంలోని మరొక శాసనంలో సింగయ చితల్‌దుర్గలోని ఒక కోటను ముట్టడించినట్లు ఉంది. ఈ శాసనాలను బట్టి సింగయ దేవగిరి యాదవరాజుల సేనానిగా ఉండి, వారు హొయసాలులతో పోరాడి యుద్ధాలలో పాల్గొని హొయసాల భల్లాలునితో పోరాడి, విజయాలు సాధించినట్లుగా తెలుస్తోంది. సింగయ కుమారుడు కంపిలిదేవుడు. అతడు కూడా యదవ రామచంద్రదేవుని తరపున హొయసాల భల్లాలునితో యుద్ధాలు చేశాడు. కాని రామచంద్రదేవునికి సింగయతో అభిప్రాయ భేదాలు వచ్చి క్రీ.శ.1307వ సంవత్సరంలో సింగయ ఖైదు చేశాడు. ఖైదు నుండి విడుదలైన తర్వాత సింగయ దేవగిరి కొలువు మానేసి దక్షిణంగా వెళ్లి రాయదుర్గాన్ని పాలించే మల్లదేవుని ఆశ్రయించాడు. అతడు సింగయను తన సేనలోకి తీసుకొని అనేయధరా అనే ప్రాంతంపై అధికారిగా నియమించాడు. ఆ ప్రాంతాన్ని మాలెనాడు అని పిలిచేవారు. కంపిలి ఈ ప్రాంతానికి దగ్గరలోనే ఉండేది. కృష్ణా తుంగభద్రానదీ ప్రాంతమే కంపిలిరాజ్యం. ఈ ప్రాంతాన్ని శాతవాహనుల కాలంలో కుంతల దేశం అని పిలిచే వారు. ఈ కుంతలదేశాన్నే కృష్ణా తుంగభద్రా నదుల మధ్య ప్రదేశమని, రాయచూరు దోఆబ్ అని, కంపిలి రాజ్యం అని పిలిచేవారు. కనుకనే గంగాదేవి తన మధురావిజయకావ్యంలో తన మామ బుక్కరాయలు కుంతల భూమి పాదుడని వర్ణించింది. బాదామీచాళుక్యుల కాలంలో విరూపాక్ష క్షేత్రంగా ఉండేది. కళ్యాణీచాళుక్యుల కాలంలో కూడా కంపిలిలో వారు ఒక భవనాన్ని నిర్మించారు. కాని చోళచాళుక్య సంఘర్షణ కాలంలో చోళులు ఆ భవనాన్ని తగుల బెట్టారు. తిరిగి కంపిలిరాయుని కాలంలో ఈ ప్రాంతం వెలుగులోకి వచ్చింది. క్రీ.శ.1307లో రామచంద్ర దేవుని అల్లావుద్దీన్ సేనాని మాలిక్ కపూర్ ఓడించాడు. ఆ ఓటమి తర్వాత రామచంద్రదేవుని రాజ్యంలో అస్థిర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సమయంలో సింగయ కంపిలి ప్రాంతాన్ని ఆక్రమించి స్వతంత్ర రాజ్యం స్థాపించాడు.

అతని తర్వాత అతని కుమారుడు కంపిలి దేవుడు క్రీ.శ.1312 సంవత్సరంలో కంపిలి రాజ్యాధిపతి అయ్యాడు. ఇతడు గొప్పవీరుడు. అతడు యాదవ రామదేవుని సామంతుడైన గుజ్జల కత్తినాయకుని కుమార్తె అరియాలదేవిని వివాహమాడాడు. కంపిలి దేవుని శాసనం ఒకటి హంపిలోని విరూపాక్ష ఆలయంలో ఉంది. తెలుగు బాల భారతంలో కొటికంటి రాఘవునికి కంపిలిదేవుడు శత్రువుగా పేర్కొనబడ్డాడు. హొయసాల శాసనాలలో కంపిలిదేవుని ప్రస్తావన ఉంది. భల్లాలరాయనా యుద్ధ అనే గ్రంథంలో మూడవ భల్లాలునికి కంపిలి దేవునికి జరిగిన యుద్ధాల వర్ణన ఉంది. కుమార రమణచరిత్ర ముమ్మడి సింగేయుని వంశస్తులందరి చరిత్ర పూర్తిగా తెలుపుతోంది. కంపిలిదేవుడు తుంగభద్రా నది ఒడ్డున మురానేయ సంధి అనేచోట ఒక కోటను నిర్మించి దానిని హోసమల అని పేరు పెట్టాడు. ఈ దుర్గమే అనెగొంది అని చరిత్ర కారులు భావించారు. నంజుడయ్య, గంగయ్య అనే వారు మురానినేయ సంధివద్ద హోసమల్ దుర్గాన్ని నిర్మించినట్లు చెప్పారు. మురారినేయ సంధి అంటే మూడు ఏనుగుల ఆకారంలో ఉన్న కొండలు కలిసేచోటు అని అర్థమట. కాలక్రమంలో మురారినేయసంధి అనేయసంధిగా మారి అదే అనెగొందిగా మారిందని అభిప్రాయం. అనెగొందిని సంస్కృతంలో హస్తినావతి, హస్తికుంజరకోన అని పిలిచేవారు. ఇవన్నీ ఏనుగునకు పర్యాయపదాలు, కర్ణాటక శాసనాలలో హరిహరుడు హస్తి నగరం నుండి పాలించినట్లు రాసి ఉంది. కనుక అనెగొందికి హరిహరరాయల కాలం వరకు హస్తిన అని పేరున్నట్లు ఈ శాసనాలు తెలుపుతున్నాయి. కంపిలి రాజ్యంలో కుమ్మట అనే మరొక కోట కూడా ఉండేది. ఈ కోటను న్యూనిజ్ క్రినమట అని పేర్కొన్నాడు. హోసమల దుర్గ నిర్మాణం తర్వాత కంపిలిదేవుడు దేవగిరి రాజ్యంపై దండెత్తి తోరగల్ బాదామి, రాయచూరు, ముద్గల్, హంగల్ లేక హొవగల్‌లను జయించాడు. దాంతో దేవగిరి యాదవ రాజ్యంలోని కృష్ణాతుంగభద్రా నదుల మధ్య ప్రాంతమంతా కంపిలి రాజ్యంలో భాగం అయింది. హొయసాల రాజ్యం నుండి చతల్‌దుర్గ, బళ్లారి, ధార్వాడ్ ప్రాంతాలు ఆక్రమించాడు. తర్వాత కాకతీయ రాజ్యంపై దండెత్తి కందనవోలు లేక కర్నూలు, నిడుగల్లు, పెనుగొండ, అనంతపూరు, హిందూపూరులను కూడా జయించాడు. తర్వాత గుత్తిని పాలించే జగతాపిరాయుని ఓడించి సామంతునిగా చేసుకున్నాడు. తర్వాత గండికోట గంగరాజు ఉదయగిరిని పాలించే సంగముడు కూడా సామంతులయ్యారని భట్టర్ కైఫీయత్తు తెలుపుతోంది. ఈ విజయాలతో కంపిలిదేవుని రాజ్యం తుంగభద్రకు ఇరువైపులా విస్తరించింది. అచిరకాలంలో బలమైన రాజ్యంగా అవతరించింది. తర్వాత కంపిలిదేవుడు తన పేరుతో కంపిలి నగరాన్ని నిర్మించి రాజధానిని చేసుకున్నాడు. దాంతో

అతని రాజ్యానికి కంపిలి రాజ్యం అని పేరు వచ్చింది. కంపిలి నిర్మాణంతో ఈ రాజ్యంలో ఆనెగొంది, కుమ్మట, కంపిలి అనే మూడు బలమైన దుర్గాలు ఏర్పడ్డాయి. ఈ రాజ్యానికి ఉత్తరాన దేవగిరి యాదవ రాజ్యం, దక్షిణాన హొయసాల రాజ్యం, తూర్పున కాకతీయ రాజ్యం చుట్టుకొని త్రికోణంగా అభివృద్ధి చెందిన కంపిలి రాజ్యాన్ని చూసి మూడు రాజ్యాలు ఈర్ష్యపడేవి. తన రాజ్యభాగాలు ఆక్రమించినందున హొయసాల బల్లాలుడు కంపిలి రాజ్యంపై దండెత్తాడు. కంపిలిదేవుడు భాగాపూర్ కనుమ వద్ద హొయసాలులను ఓడించి తరిమాడు. ఈ సందర్భంలో కంపిలిదేవుడు కాకతీయుల సహాయం అర్థించడానికి తన కుమారుడు రామనాథుని ఓరుగల్లు పంపాడు. కంపిలిదేవునికి రామనాథుడు ఒక కుమారుడు ఉన్నాడు. అతడు కూడా గొప్పవీరుడే, కాని అహంకారి. కంపిలి వద్ద ఉన్న హూనాపల్లిలోని ఒక శాసనంలో రామనాథుని ప్రసక్తి ఉంది. మరొక శాసనంలో ఇతని శౌర్యప్రతాపాలు కీర్తించబడ్డాయి. ఇతడు ఓరుగల్లులో ప్రతాపరుద్రుని దర్శించి సహాయం అర్థించాడు. కాని ప్రతాపరుద్రుడు వారి రాజకీయాలలో జోక్యం చేసుకోడానికి తిరస్కరించాడు. దాంతో ఆగ్రహం చెంది, కాకతీయ రాజ్యం దాటగానే ప్రతాపరుద్రుని బిరుదులైన మూరురాయరగండ, వీరరుద్రగండ అనే బిరుదులను తాను ధరించాడు. ఇది తెలిసి అవమానంగా భావించి, ప్రతాపరుద్రుడు తన మంత్రి బెండపూడి అన్నమయ్య, రేచర్ల సింగమ నాయకులను దండు పంపాడు. వారిని కంపిలిరాయలు కుమ్మట వద్ద ఎదిరించాడు. కాని ఓడిపోయి ఆరు వేల గుర్రాలను కానుకగా ఇచ్చి సంధి చేసుకున్నాడు. తర్వాత క్రీ.శ.1314లో మాలిక్‌కపూర్ కంపిలిపై దండెత్తాడు. కంపిలిరాయల కుమారుడు రామనాథుడు ముస్లిం సైన్యాలను ఎదిరించి ఓడించాడు. మాలిక్ కపూర్ రెండవ ప్రయత్నం చేయకుండా ఢిల్లీకి వెళ్ళిపోయాడు. ఈ విధంగా కంపిలి రాయలు హొయసాలులు, దేవగిరి యాదవులు, కాకతీయులు, ఢిల్లీ సుల్తాన్‌లతో పోరాడి కంపిలి రాజ్యాన్ని నిలబెట్టాడు. కంపిలి రాజ్య విస్తరణను గురించి బుక్కరాయల కాలంలో కూడా ప్రస్తావన వచ్చింది. బుక్కరాయల కాలంలో బహమనీ సుల్తాన్ అయిన ముజాహిద్ బుక్కరాయలను అంతర్వేదిని ఖాళీ చేయమని ఆదేశించాడు. అందుకు సమాధానంగా బుక్కరాయలు రాయచూరు, ముద్గల్, అంతర్వేది అంతా పూర్వం ఆనెగొంది కుటుంబానికి చెందిందని, కనుక అది విజయనగరానికి చెందుతుందని కనుక సుల్తానే అంతర్వేదిని వదిలి వెళ్ళాలని చెప్పాడు. ఈ విధంగా విస్తరించిన కంపిలి రాజ్యం అనతి కాలంలోనే పతనమైంది.

కంపిలి రాజ్య పతనం: క్రీ.శ.1325లో మహమ్మద్ బిన్ తుగ్లక్ ఢిల్లీ సుల్తానయ్యాడు. అతడు తండ్రి ఘియాజుద్దీన్ తుగ్లక్‌ను చంపి సుల్తాన్ అయ్యాడు. అందువల్ల చాలా మంది సర్దారులు అతని చర్యను హర్షించలేదు. వారిలో బహావుద్దీన్ గుష్టాస్ప ఒకరు. ఇతడు తుగ్లక్‌కు అతి సమీప బంధువు. అతడు తుగ్లక్ చర్యలను గర్హించినా కూడా అతనిని మధ్యప్రదేశ్‌లోని సాగర్ గవర్నర్‌గా నియమించాడు. కాని గుష్టాస్ప అక్కడ తిరుగుబాటు చేశాడు. సుల్తాన్ సాగర్‌పై దండెత్తి గుష్టాస్పను ఓడించాడు. గుష్టాస్ప దౌలతాబాద్ పారిపోయాడు. సుల్తాన్ దౌలతాబాద్‌పై కూడా దండెత్తాడు. దాంతో గుష్టాస్ప భయపడి కంపిలి పారిపోయి కంపిలిదేవుని ఆశ్రయించాడు. కంపిలిదేవుడు ముందువెనుకలు ఆలోచించకుండా అవివేకంగా గుష్టాస్పకు ఆశ్రయం ఇచ్చాడు దాంతో సుల్తాన్ ఉగ్రుడై కంపిలిపై దండు పంపాడు. సుల్తాన్ బహదూర్‌ఖాన్ లేక మాలిక్ రుక్నుద్దీన్ అనే వ్యక్తి నాయకత్వంలో సేనను పంపాడు. ఆ సేన కుమ్మట దుర్గాన్ని ముట్టడించింది. కంపిలి రాయలు, అతని కుమారుడు రామనాథుడు సుల్తాన్ సైన్యాన్ని ఓడించి తరిమారు. ఈ అపజయం సుల్తాన్ ప్రతిష్ఠను దిగజార్చింది. కనుక పట్టుదలతో మళ్ళీ మరొక సేనను మాలిక్‌కుతుబ్ ఉల్ ముల్క్ అనే వ్యక్తి నాయకత్వంలో పంపాడు. ఈ సేనను కూడా కంపిలిరాయలు ఓడించాడు. తిరిగి పట్టుదల పెరిగి మహమ్మద్‌బిన్ తుగ్లక్ మూడవ పర్యాయం మాలిక్ జదా ఖ్వాజా-ఇ-జహాన్ నాయకత్వంలో పెద్ద సేనను పంపాడు. ఈ సైన్యం కంపిలిని చుట్టుముట్టింది. కంపిలిలో తగిన రక్షణలేదని కంపిలిరాయుడు ఆనెగొంది కోటలోకి వెళ్ళిపోయాడు. కంపిలికోట ముస్లిం సైన్యాల వశం అయింది. తర్వాత ముస్లిం సైన్యం ఆనెగొందిని ముట్టడించింది. అక్కడ కూడా వారికి విజయం లభించింది. తర్వాత కంపిలిరాయుడు కుమ్మటకోట చేరాడు. ముస్లిం సైన్యం కుమ్మటను కూడా ముట్టడించింది అపజయం తప్పదని గ్రహించిన కంపిలిదేవుడు తనను ఆశ్రయించిన గుష్టాస్పను హొయసాల రాజ్యంలోకి పంపాడు. తర్వాత తన యొక్క తన బంధువుల యొక్క స్త్రీలను అగ్నికి ఆహుతి చేసి తన కుమారుడు, మిగిలిన వీరులతో కోట బయటకు వచ్చి వీరోచితంగా ముస్లిం సైన్యంతో పోరాడి యుద్ధంలో అందరూ మరణించారు. అతని మరణంతో కుమ్మటకోట కూడా ముస్లిం సైన్యాల వశం అయింది. ఈ మూడు యుద్ధాలు క్రీ.శ.1327-28 సంవత్సరాల మధ్య

జరిగాయని చరిత్రకారులు అంటారు. ఈ యుద్ధాలను గురించి ఇసామి, ఇబన్‌బటూటా, న్యూనిజ్, పెరిష్టాలు వర్ణించారు. చివరి యుద్ధం తర్వాత కోటలో కంపిలిదేవుని కుటుంబ సభ్యులు, రాకుమారులు అయిన 11 మంది బందీలుగా పట్టుబడ్డారని, వారిని ఢిల్లీకి పంపారని వారందరిని సుల్తాన్ ముస్లింలుగా మార్చాడని రాశారు. బరనీ ఈ వివరాలు, యుద్ధవివరాలు ఇవ్వకుండా కంపిలిని జయించాడు అని రాశాడు. పెరిష్టా కంపిలి రాజును కూడా బందీగా పట్టుకున్నారని రాశాడు. అందువల్ల కొందరు కంపిలిరాయలు యుద్ధంలో మరణించలేదని భావించారు. కుమ్మెట ధ్వంసం అయిన తర్వాత కంపిలిదేవుడు సజీవుడని భట్టర్ కైఫీయత్తు కూడా తెలుపుతోంది. పెరిష్టా కూడా కంపిలిదేవుడు సజీవుడని రాశాడు. కాని ఇబన్‌బటూటా, న్యూనిజ్ కంపిలిదేవుడు యుద్ధంలో మరణించాడని రాశారు. ఇబన్‌బటూటా, న్యూనిజ్ రచనలనే ఎక్కువ మంది ఆమోదించారు. ఇంకా న్యూనిజ్ ముస్లిం రచయితలకు భిన్నంగా రాశాడు. అతడు బందీలుగా చిక్కిన వారిలో చాలా మందిని చంపారని, వారిలో ఆరుగుర్ని మాత్రం చంపకుండా ఢిల్లీకి బందీలుగా తీసుకొని వెళ్లారని, వారిలో ఒకడు మంత్రి, రెండవవాడు కోశాధికారి అని కూడా రాశాడు. వీరిద్దరే హరిహరబుక్కరాయలని పండితుల అభిప్రాయం. కంపిలి రాజ్యం వశమై కంపిలి రాజ్యం ఢిల్లీ కంపిలి సామ్రాజ్యంలో భాగమైందని, ముస్లిం సైన్యానికి కుమ్మెటకోట సైనిక శిబిరంగా మరింది. భట్టర్, కంపిలి కైఫీయత్తులు ధృవపరుస్తున్నాయి. అంతేగాదు క్రీ.శ.1323-1335 సంవత్సరాల మధ్య దక్షిణ భారతదేశం అంతా ఢిల్లీ సామ్రాజ్యంలో చేరిపోయినట్లు దక్షిణ భారతదేశంలో దేవగిరి, తిలింగ్, కంపిలి, ద్వార సముద్రం, మాబార్ అనే ఐదు రాష్ట్రాలుగా చేయబడ్డాయని భట్టర్ కంపిలి కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ఈ కైఫీయత్తులు ఇచ్చే సమాచారాన్ని పర్షియన్ చరిత్ర గ్రంథాలు బలపరుస్తున్నాయి. కంపిలిని జయించిన తర్వాత దానిని ప్రత్యేక రాష్ట్రంగా చేసి ఢిల్లీ సామ్రాజ్యంలో సుల్తానే కలిపివేశాడు. కంపిలిని పాలించడానికి సుల్తాన్ మాలిక్‌నెబి క్రీ.శ.1328లో గవర్నర్‌గా నియమించాడు. మాలిక్‌నెబి యువరాజు మహమ్మద్ అని నేలటూరి వెంకటరమణయ్య భావించారు. ఈ విధంగా కంపిలి రాజ్యం క్రీ.శ.1328లో పతనమైంది. ఆ తర్వాత కొద్దికాలానికే కంపిలి రాజ్యం శిధిలాల మీద విజయనగర సామ్రాజ్యం జన్మించింది.

విజయనగర రాజ్యస్థాపన: మహమ్మద్ బిన్ తుగ్లక్ అవివేకపు పరిపాలనవల్ల దక్షిణదేశంలోని హిందూ రాజులు, ముస్లిం గవర్నర్‌లు ఏకకాలంలో తిరుగుబాటు చేశారు. ఇదేకాలంలో మహమ్మద్ బిన్ తుగ్లక్ క్రీ.శ.1329లో రాజధానిని దౌలతాబాదు నుండి ఢిల్లీకి మార్చాడు. ఇదే తగిన సమయమని దక్షిణదేశంలో హిందూ వంశ రాజ్యాలన్నీ స్వతంత్రం ప్రకటించాయి. ఆంధ్రదేశంలో ప్రోలయనాయకుని సారధ్యంలో స్వాతంత్ర్య సమరం ప్రారంభమైంది. ఆ ఉద్యమం కంపిలికి పాకింది. ఆరవీటి సోమయరాజు క్రీ.శ.1330లో కంపిలి రాజ్య ప్రాంతంలో తిరుగుబాటు చేసి ఆ ప్రాంతాలను తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. కాకతీయుల కాలం నాటి దక్షిణ ప్రాంతాలను కూడా ఆక్రమించాడు. తర్వాత 7 కోటలను జయించాడు. గంగినేని కొండ, కందవోలు, కలువకొలను, కోటరచూరు, మొసలిమడుగు, యాదగిరి, సాతిని కోటలను జయించి తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఈ ప్రాంతాలన్నీ పూర్వపు కాకతీయ సామ్రాజ్యంలోని దక్షిణ రాష్ట్రాలుగా ఉండేవి. ఆకులపాడు, నుడుగల్లుల వద్ద ముస్లింలను ఓడించాడు. ఈ ప్రాంతాలన్నీ పూర్వపు కంపిలి రాజ్యంలోని భాగాలు. రాయచూరునే ఇతని కాలంలో కొట్టరచూరుగా వ్యవహరించారు. సోమదేవుని అద్భుత విజయం కంపిలి గవర్నరైన మాలిక్ మహమ్మద్‌ను ఓడించి తరిమివేయడం. ఈ విజయంలో ప్రజలు కూడా పాలుపంచుకున్నారు. కంపిలిరాజ్య ప్రజలు సుల్తాన్‌కు పన్నుకట్టడం మానేయడమే కాక రాజధాని కుమ్మటను ముట్టడించి అక్కడ ఉన్న ముస్లిం గవర్నర్ మాలిక్ నెబికి, అతని సైన్యానికి ఎలాంటి వస్తువులు అందకుండా చేసి కోటలో నిర్బంధించారు. దానికి ఏమి చేయాలో తోచని మాలిక్ మహమ్మద్ భూమి అంతా తనకు వ్యతిరేకంగా లేచిందని సుల్తాన్‌కు ఉత్తరం రాశాడని న్యూనిజ్ రాశాడు. నెబి తన పరిమిత సైన్యంతో కంపిలిని కాపాడలేనని కూడా గ్రహించాడు. చివరకు కంపిలి గవర్నర్ ఈ విమోచన యుద్ధానికి తట్టుకోలేక కంపిలి వదిలి పారిపోయాడు. కంపిలి స్వతంత్రమైంది. ఇదే సమయంలో హొయసాల భల్లాలుడు తిరుగుబాటు చేసి సుల్తాన్ ప్రాంతాలపై దాడులు ప్రారంభించాడు.

కంపిలి తిరుగుబాటు సమాచారం అందిన వెంటనే మహమ్మద్ బిన్ తుగ్లక్ తన మంత్రులను సమావేశపరచి సలహాను కోరాడు. వారు అంతకు పూర్వపు కంపిలి పాలకునికి దగ్గర బంధువులను గవర్నర్‌గా నియమిస్తే పరిస్థితి అదుపులోకి రావచ్చునని సలహా ఇచ్చారు. అందువల్ల ఖైదులో ఉన్న కంపిలిరాయని ఆస్థాన ఉద్యోగులైన హరిహర బుక్కరాయలను విడుదల చేసి ముస్లింలుగా మారే షరతు మీద తనకు సామంతులుగా

ఉంటామని వారి చేత ప్రతిజ్ఞలు చేయించి వారికి సైన్యాలనిచ్చి అనెగొందికి పంపాడు. ముస్లిం రచయితలు ఈ సంఘటనకు పెద్ద ప్రాముఖ్యత ఇవ్వలేదు. కాని బారాని మాత్రం దానిని ఒక అప్రధానాంశంగా వివరించి, కంపిలి గవర్నర్‌గా నియమింపబడినవారు ఓరుగల్లులో తిరుగుబాటుదారుడైన కన్యానాయక్ బంధువులని రాశాడు విద్యారణ్య కాలజ్ఞానం, విద్యారణ్య వృత్తాంతాలు హరిహరబుక్కరాయలు కంపిలి దేవుని ఆస్థాన ఉద్యోగులని, వారిని సుల్తాన్ కంపిలి గవర్నరుగా నియమించాడని పేర్కొన్నాయి. హరిహర బుక్కరాయలు కంపిలి రాజ్యం చేరారు మాలిక్ నెబి అధికారం వీరి వశమైంది. కాని అనెగొంది స్వాధీనం కాలేదు. వారు ఒకవైపు హొయసాల భల్లాలుడు కంపిలి రాజ్యభాగాలపై దాడులు ప్రారంభించాడు. హరిహర బుక్కరాయల రాకతో భల్లాలుని కోరికకు విఘాతం ఏర్పడింది. కనుక అతడు హరిహర సోదరులను ఎదిరించాడు. విద్యారణ్య వృత్తాంతం ప్రకారం హరిహర సోదరులు మొదట భల్లాలుని చేతిలో ఓడిపోయారు. విద్యారణ్య వృత్తాంతం ప్రకారం హరిహర సోదరులు మొదట భల్లాలుని చేతిలో ఓడిపోయారు. కంపిలిదేవుని బంధువులు కూడా హరిహర బుక్క సోదరులకు అనెగొంది రాజ్యంలో స్థానం లభించలేదు. బుక్కరాయలను ఎదిరించారు. అందువల్ల సోదరులకు అనెగొంది రాజ్యంలో స్థానం లభించలేదు. కనుక వారు గుత్తినాక్రమించి తమ కేంద్రంగా చేసుకున్నారని డా బి.యస్.యల్.హనుమంతరావు రాశారు. గుత్తి నుండి వారు ఒకవైపు భల్లాలునితోను, మరొక ఆరవీటి వంశస్తులతో పోరాటాలు సాగించారు క్రీ.శ.1335 నాటికి ఆరవీటి వంశస్తులను ఓడించి అనెగొందిని ఆక్రమించగలిగారు. అనెగొందిని ఆక్రమించినట్లు అది క్రీ శ.1342 వరకు అంటే మూడవ భల్లాలుడు మరణించే వరకు భల్లాలునిపై పోరాటాలు కొనసాగించారు కాని అంతగా ఫలితం పొందినట్లు కనిపించదు. ఇలాంటి స్థితిలో ఢిల్లీ సుల్తాన్ మహమ్మద్ బిన్ తుగ్లక్ పరిపాలనపై ముస్లిం సర్దారులకు తీవ్రమైన అసంతృప్తి కలిగింది. తుగ్లక్ సామ్రాజ్యమంతటా తిరుగుబాటు జరిగింది. ఆ సందర్భంలో క్రీ.శ.1335వ సంవత్సరంలో మధుర సుల్తాన్ తిరుగుబాటు చేశాడు. మధుర సుల్తాన్‌ను అణచటానికి సుల్తాన్ స్వయంగా బయలుదేరి ఓరుగల్లు వరకు వచ్చాడు. ఆ సమయంలో దక్కనులో ప్లేగు వ్యాధి ఉంది. సుల్తాన్‌కు, సుల్తాన్ సైనికులకు ప్లేగు వ్యాధి సోకింది. దాంతో సుల్తాన్ మధుర సుల్తాన్‌పై దండెత్తలేక వెనుతిరిగి ఢిల్లీ వెళ్లిపోయాడు. దాంతో దక్షిణ దేశంలోని హిందూ పాలకులకు ధైర్యం కలిగింది. క్రీ.శ.1336లో కాపయ నాయకుడు ఓరుగల్లుపై దండెత్తి మాలిక్ మగ్బూల్‌ను పారదోలి ఓరుగల్లును ఆక్రమించాడు. కాపయ నాయకుని విజయవార్త విన్న హరిహరబుక్కరాయలు ఉత్సాహం పొంది అదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1336లో అనెగొందిలో స్వతంత్రం ప్రకటించాడు. బారాని తన రచనలలో ఈ విషయాన్నే త్రిలింగ తిరగబడింది. కంబల భూమి చేయిజారి పోయిందని రాశాడు. మాలిక్ మగ్బూల్ నాయబ్ ఢిల్లీ పారిపోగానే ఓరుగల్లును హిందువులు ఆక్రమించారు. కంబల హిందువుల హస్తగతమైందని వర్ణించాడు. హరిహరుడు అదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1336వ సంవత్సరంలో విద్యారణ్యుని ఆశీర్వాదంతో విజయనగర నిర్మాణానికి పునాదిని వేశాడు. అదే రోజున విరూపాక్ష దేవుని సన్నిధిలో విక్రమాదిత్యుని వజ్రసింహాసనంపై హరిహరరాయలకు పట్టాభిషేకం జరిగిందని స్థానిక రచనలు తెలుపుతున్నాయి. శక సంవత్సరం 1258 ధాత్రి వైశాఖశుద్ధ సప్తమి పుష్యనక్షత్రాన హరిహరుని పట్టాభిషేకం జరిగిందని స్థానిక రచనలు తెలిపాయి. ఈ రోజు 1336 మే నెల 4వ తేదీ అని నిర్ధారణ పట్టాభిషేకం చేయబడింది. కాని కొందరని 1336 ఏప్రిల్ 18వ తేదీ అని నిర్ణయించారు. తన పట్టాభిషేక కాలం నాడే హరిహరరాయలు ఆ రాజ్యం విరూపాక్షదేవునిదని, తాను ఆ రాజ్యానికి విరూపాక్షదేవుని ప్రతినిధిని మాత్రమేనని ప్రకటించాడు. అందుకు కారణమేమిటంటే విద్యారణ్యుడు కృష్ణానదికి దక్షిణ ప్రాంతమంతా విరూపాక్షదేవునిదని, దానికి రక్షకులుగా ఉండమని హరిహర బుక్కరాయలను కోరాడు. విద్యారణ్యుని ఆజ్ఞను శిరసావహించి రాజ్యాధిపతి విరూపాక్షుని నిర్ణయించాడు. విజయనగరాన్ని పరిపాలించిన నాలుగు వంశాల వారు హరిహరుని ప్రకటనకు బద్ధులై విరూపాక్షదేవుని రాజ్యంగానే పాలించారు. ఈ విధంగా క్రీ.శ.1336వ సంవత్సరంలో విజయనగర రాజ్యానికి పునాది వేయబడింది. దాంతో పూర్వపు కంపిలిరాజ్యమే విజయనగర రాజ్యంగా మారింది. విజయనగర పట్టణ నిర్మాణం క్రీ.శ.1343 దాకా కొనసాగింది. అప్పటివరకు హరిహర రాయలకు అనెగొందే రాజధానిగా కొనసాగింది. అంటే క్రీ.శ.1335 నుండి 1343 వరకు 8 సంవత్సరాలు రాజధానిగా కొనసాగింది.

బిస్‌నగర్‌ని నిర్మించేముందు దిమోరావు నాగుండి పాలించాడని న్యూనిజ్ రాశాడు. కాపలూరు, బెస్తరహళ్లి శాసనాలు కూడా కుంజరకోన హరిహరుని రాజధాని అని పేర్కొంటున్నాయి. క్రీ.శ.1347 నాటి మద్దప్ప శాసనం

హస్తిన హరిహరుని రాజధాని అని తెలుపుతోంది. మరి రెండు కర్ణాటక శాసనాలు, హరిహరుని సోదరులు యదువంశస్తులని, సంగముని కుమారులని, యాదవ కులస్తులని సంగముని ఐదుగురు సోదరులలో బుక్క పాండవ మధ్యముడని, సోదరులతో కలసి హరిహరుడు గొప్ప నగరమైన హస్తిన నుండి పాలిస్తున్నాడని తెలిపాయి. రాజ్య కాలనిర్ణయ అనే కావ్యం విజయనగరానికి ముందు హస్తిన నుండి పాలించాడని తెలిపింది. కనుక వెంకటరమణయ్య అనెగొందికి కుంజరకోన, హస్తినారతి, హస్తినకోన, హస్తి అని పేర్లున్నాయని కనుక హరిహరుని మొదటి రాజధాని అనెగొంది అని నిర్ణయించారు. క్రీ.శ.1343లో విద్యానగర నిర్మాణం పూర్తి అయింది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన నగరంగా రూపొందింది. విద్యానగరం నిసర్గ రక్షణతో అభేద్యమైన దుర్గంగా నిర్మింపబడింది. నగరానికి తూర్పు, పడమర దిక్కులలో పర్వతాలున్నాయి. దక్షిణాన రామదుర్గ అనే గుట్టలు, ఉత్తరాన తుంగభద్రా నది రక్షణగా ఉన్నాయి. అందువల్ల ఇది గిరదుర్గంగా ప్రసిద్ధి చెందింది. నగరం చుట్టూ ఏడు శిలాప్రాకారాలు నిర్మింపబడ్డాయి. కొండల మధ్య ఉండే స్థలాలను బలిష్టమైన రాతిగోడలతో సంధించినందువల్ల ఈ ఏడు శిలాప్రాకారాలు ఏర్పడ్డాయి. దక్షిణ నైరుతీ దిక్కులలో రక్షణశ్రేణులు లేవు. అందువల్ల అటువైపు నుండి శత్రువులు నగరంలో ప్రవేశించడానికి వీలులేకుండా నైరుతీ దిక్కున ఆరు కిలోమీటర్ల వైశాల్యం గల ఒక పెద్ద చెరువును తవ్వించి దాని కట్టలను కోటగోడలుగా రూపొందించారు. దక్షిణ దిక్కున ఒక కోటను నిర్మించి దానిని నగరంలోని పర్వతపంక్తులలో కలిపివేశారు. సప్తప్రాకారాలమధ్య ఒకగుట్టపై రాజమందిరం, టంకశాల, సైన్యాధిపతి నివాసం నిర్మింపబడింది. నగరం 14 మైళ్ల పొడవు, 10 మైళ్ల వెడల్పున ఉండేది. ఈ నగరం అనతి కాలంలో సప్త ఐశ్వర్యాలకు, సకల విద్యలకు నెలవైంది. అనేక విజయాలు సాధించింది. అనేక విజయాలకు నిలయమైనందున విద్యానగరం విజయనగరంగా పేరు మారింది. అచిర కాలంలో విజయనగరం ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. నాడు విజయనగరాన్ని దర్శించిన విదేశీ యాత్రికులు తాము అలాంటి పట్టణాన్ని ఎప్పుడూ చూడలేదు, అలాంటి పట్టణ ప్రపంచంలో ఎక్కడైనా ఉందని వినలేదు అని శ్లాఘించారు. పై విషయాలను బట్టి హరిహర బుక్కరాయలు సంగముని కుమారులు. మంగళ నిలయవాసులు. వారు కాకతీయ ప్రతాపరుద్ర చక్రవర్తి ఆస్థానంలో చేరి ఒకరు కోశాధికారిగాను, మరొకరు సువారికునిగా పనిచేశారు. క్రీ.శ.1323వ సంవత్సరంలో ప్రతాపరుద్రుని ఓటమి తర్వాత వారు కంపిలిచేరి కాంపిల్యదేవుని కొలువులో కోశాధికారులుగా చేశారు. కంపిలిదేవుని మరణానంతరం వారు మహమ్మద్ బిన్ తుగ్లక్ సైన్యాలకు బందీలుగా చిక్కి ఢిల్లీ తీసుకెళ్లబడ్డారు. కంపిలి రాజ్యంలో మాలిక్‌నెబిపై తిరుగుబాటు జరిగిన తర్వాత సుల్తాన్ బందిఖానా నుండి సోదరులను విడుదల చేసి ముస్లింలుగా మార్చి తన సామంతులుగా ఉండేటట్లుగా ప్రమాణాలు చేయించి అనెగొందికి పంపాడు. వారు ఒక వైపు భల్లాలునితోను, మరొకవైపున ఆరవీటి వంశస్తులతో పోరాడి అనెగొందిని ఆక్రమించారు. అక్కడి ప్రజలను సమాధానపరచి సుల్తాన్ సామంతులుగా పరిపాలన ప్రారంభించారు. కాని వారు ముస్లిం మతాన్ని పుచ్చుకొని ఉన్నందున వారికి ప్రజలు సహకరించలేదు. ఈ స్థితిలో వారికి విద్యారణ్యుని దర్శనమైంది. అతడు వారిని విజయనగర నిర్మాణానికి ప్రోత్సహించాడు. వారిని శుద్ధి చేసి తిరిగి హిందువులుగా మార్చి, ప్రజల ఆదరాభిమానాలు పొందేటట్లు చేశాడు. దాంతో వారు తిరిగి ప్రజాభిమానం పొంది క్రీ.శ.1336లో స్వతంత్రం ప్రకటించి హరిహరుడు విజయనగర రాజ్యస్థాపకుడయ్యాడు. ఈ విధంగా దక్షిణ భారతదేశ చరిత్రలో విజయనగర సామ్రాజ్యం జన్మించింది.

విజయనగర రాజవంశాల పట్టిక: 95 సంవత్సరాల క్రితం అప్పటికి లభించిన ఆధారాల ప్రకారం రాబర్ట్ సీవెల్ విజయనగర రాజవంశాల పట్టికను, వరుసక్రమాన్ని రూపొందించాడు. కాని తర్వాత అధ్యయనం చేయబడిన విద్యారణ్య, వీరప్పయ్య, శివయ్య కాలజ్ఞానాలు, కెళడి నృపవిజయం, గౌరగల్లు కవిలెలు, విజయనగర సామ్రాజ్యం రెండవ వెంకటపతిరాయల కాలంలో తయారుచేయబడ్డ అరవణ నివేదికల వలన నూతన సమాచారం లభ్యమైంది. అందువల్ల సీవెల్ ఇచ్చిన పట్టీలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. విద్యారణ్య కాలజ్ఞానంలో పేర్కొనబడిన అంశాలు, ఇతర ఆధారాలు ఇచ్చే సమాచారంతో సరిపోతోంది. శివయ్య కాలజ్ఞానంలో సాళువ వంశంలో ఇమ్మడి నరసింహ దేవరాయలు పేరును తొలగించి అతని స్థానంలో తుళువ నరసనాయకుని పేరును పేర్కొంది. అది మినహా మిగిలిన విషయాలన్నీ సరిగానే ఉన్నాయి. ఈ కాలజ్ఞానం ఆరవీటి శ్రీరంగరాయల కాలం వరకు అన్ని వివరాలను విజయనగర సామ్రాజ్యం బుకకడిత నివేదిక, రెండవ వెంకటపతిరాయల కాలంలో అతని అరవణ నివేదికలో శ్రీకృష్ణదేవరాయలు సింహాసనమెక్కిన రోజు, మరణించిన రోజులను ఖచ్చితంగా పేర్కొన్నారు. గౌరుగల్లు కవిలె కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతాన్ని పాలించిన రాజుల వంశక్రమాన్ని తెలుపుతోంది. వీరప్పయ్య

కాలజ్ఞానం రెండవ రామదేవరాయల వరకు బాగా వివరించింది. కాని ఆ తర్వాత వారిని గురించి తక్కువ వివరాలనిచ్చింది. కేళడి నృపవిజయంలో సమాచారం సరిగాలేదు. అస్తవ్యస్తంగా ఉంది. అయినప్పటికీ అది కూడా కొంత వాస్తవ సమాచారాన్ని అందిస్తోంది. న్యూనిజ్ 10 మంది సంగమరాజుల పేర్లు మాత్రమే తెలిపాడు విద్యారణ్య కాలజ్ఞానం 13 పేర్లను ఇస్తోంది. రాబర్ట్ సీవెల్ 14 పేర్లను ఇచ్చాడు. రాబర్ట్ సీవెల్ రెండవ దేవరాయలు, మల్లికార్జునరాయల మధ్య మరొక పాలకుని పేర్కొని, మొత్తం 14 మంది పేర్లు ఇచ్చాడు. వీరప్పయ్య కాలజ్ఞానం ఈ పేర్లతోపాటు వారు పట్టాభిషేకం చేసుకొన్న రోజులను కూడా పేర్కొంది. విద్యారణ్య కాలజ్ఞానం సంగమ వంశస్తులు 150 సంవత్సరాలు పాలించారని తెలుపుతోంది. కాని వీరప్పయ్య కాలజ్ఞానం 155 సంవత్సరాలని పేర్కొంది. కేళడి నృపవిజయం సంగమవంశస్తులు 232 సంవత్సరాలు పాలించారని వివరించింది వీటిలో విద్యారణ్య కాలజ్ఞానం ఇచ్చే 150 సంవత్సరాలే సరైనవని శాసనాలు, ఇతర ఆధారాలు రుజువు చేస్తున్నాయి. సంగమ వంశీయులలో జరిగిన వారసత్వయుద్ధాలను కూడా ఈ గ్రంథాలు పేర్కొంటున్నాయి క్రీ.శ.1404లో రెండవ హరిహరరాయల మరణానంతరం రెండవ బుక్క, విరూపాక్షుడు వారసత్వానికై పోటీ పడ్డారు. రెండవ విరూపాక్షుని అతని పెద్ద కుమారుడు చంపాడు. కాని అతడు రాజ్యం చేయలేదు. అతని తమ్ముడు రెండవ ప్రౌఢదేవరాయలు రాజ్యానికి వచ్చాడు. అతనిని న్యూనిజ్ వడియరావు అని పేర్కొన్నాడు. కాలజ్ఞానాలు సాళువ, తుళువ వంశాలను గురించి ఎక్కువగా రాశాయి. అందులో సాళువ నరసింహరాయలు ఎన్ని సంవత్సరాలు పాలించినదీ ఇవ్వలేదు. గాని మిగతా విషయాలన్నీ వివరంగా మొదటివాడు వీరనరసింహరాయలని అతడే సాళువ ఇమ్మడి నరసింహుని చంపించాడని, 5 సంవత్సరాలు పాలించాడని వీరప్పయ్య కాలజ్ఞానం ఖచ్చితంగా పేర్కొంది. ఈ విషయాలన్నీ పోర్చుగీసు వారి రచనలు, శాసనాలు, ఇతర ఐరోపా యాత్రికులు, ముస్లిం చరిత్రకారుల రచనలు బలపరుస్తున్నాయి.

సంగమ వంశం క్రీ.శ. 1336-1485 = 150 సంవత్సరాలు
సాళువ వంశం క్రీ.శ. 1385-1505 = 20 సంవత్సరాలు
తుళువ వంశం క్రీ.శ. 1505-1570 = 65 సంవత్సరాలు
ఆరవీటి వంశం క్రీ.శ. 1570-1680 = 110 సంవత్సరాలు

మొత్తం = 345 సంవత్సరాలు

విజయనగర సామ్రాజ్యం ఈ నాలుగు వంశాలు పాలించిన కాలం అంతా ఒకేరీతిగా సాగలేదు. సమర్థులు పాలించిన కాలంలో ఉచ్ఛదశను, అసమర్థుల కాలంలో క్షీణదశను అనుభవించింది. రాజకీయ ప్రారంభం సమాంతర రేఖవలె సాగిపోక అనేక ఆటుపోట్లకు గురైంది. కాని సాంస్కృతికంగా దక్షిణ భారతదేశానికి అపారసేవ చేసి చరిత్రలో స్థిరస్థాయి అయిన స్థానాన్ని సంపాదించుకుంది.

సంగమ వంశం క్రీ.శ.1336-1485

- సంగముడు
  - మొదటి హరిహరరాయలు 1336-1357
  - కంపణ శ్యామన్న-సంగముడు
  - మొదటి బుక్కరాయలు 1357-1377
    - రెండవ హరిహరరాయలు 1377-1404
      - రెండవ బుక్కరాయలు 1404-1406
      - మొదటి విరూపాక్షరాయలు 1404-1405
      - మొదటి దేవరాయలు 1406-1422
        - రామచంద్ర రాయలు 1422
        - మొదటి వీర విజయరాయలు 1422-26 లేక వీరవిజయ బుక్కరాయలు
          - రెండవ దేవరాయలు 1426-1446
            - మల్లికార్జున రాయలు 1446-1465
              - రాజశేఖర రాయలు 1465
          - పర్వతరాయలు
          - హరిహరాంబ
          - ప్రతాపదేవ రాయలు లేక రెండవ విజయరాయలు
            - రెండవ విరూపాక్షరాయలు 1465-1485
              - పెద్ద కుమారుడు
              - మూడవ ప్రౌఢదేవ రాయలు 1485-1486
        - హరిహరరాయలు
        - వీరమల్లన్న
      - చిక్కరాయలు
    - కంపరాయలు
    - సంగముడు
    - విరూపన్న
    - భాస్కరుడు
    - మల్లినాథుడు
    - చెన్నప్పవడయార్
    - నారాయణదేవుడు
    - హరిహరుడు
    - వీరమల్లన్న
  - మారప్ప శ్యామన్న
  - ముద్దప్ప

విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన హరిహర బుక్కరాయలు సంగముని కుమారులైనందువల్ల వారి వంశానికి సంగమ వంశం అని పేరు వచ్చింది. సంగమ వంశస్తుల పుట్టుపూర్వోత్తరాలను గురించి మనకు పెద్దగా తెలియదు. శాసనాలు హరిహర సోదరులు సంగముని కుమారులని, యాదవ కులస్తులని తెలుపుతున్నాయి. కాని వారి పుట్టుపూర్వోత్తరాలను గురించి ఎలాంటి సమాచారం ఇవ్వడంలేదు. చంద్రవంశ యదు కుటుంబంలో బుక్క అనే అతడు జన్మించాడు. అతని భార్య మేగాంబిక. వారి కుమారుడే సంగముడు. సంగముని భార్య మానాంబిక. వీరికి ఐదుగురు కుమారులు; హరిహరరాయలు, కంపరాయలు, బుక్కరాయలు, మారప్ప, ముద్దప్పలు. ఆ కాలపు శాసనాలలోను, సాహిత్యంలోను సంగముని ప్రస్తావన ఉంది. అతడు అనేక ఘనకార్యాలు సాధించినట్లు చెప్పబడింది. కాని అవి వాస్తవం అని చరిత్రకారులు నమ్మలేదు. తర్వాత రాజ్యం చేసిన తుళువ నరసనాయకుని విజయాలు సంగమునికి ఆపాదింపబడ్డాయని చరిత్రకారులు భావిస్తారు. ఏమైనా సంగముడు అతని తండ్రి బుక్కలు చరిత్రలో ఛాయామాత్రులే. విద్యారణ్య వృత్తాంతం ఎప్పుడు రచించబడిందీ స్పష్టంగా తెలియదు. ఆ కావ్యం సంగముడు మంగళనిలయవాసి అని తెలుపుతున్నాయి. ఈ మంగళనిలయం గుంటూరు జిల్లాలోని మంగళగిరి అని డా। బి యస్.యల్.హనుమంతరావు భావించారు. ఈ మంగళనిలయం నుండే సంగముని కుమారులు హరిహర బుక్కరాయలు ఓరుగల్లు చేరి కాకతీయ ప్రతాపరుద్రుని ఆస్థానంలో ఉద్యోగులుగా చేరి ఉండవచ్చును. క్రీ.శ.1374-నాటి గొలిజవీడు శాసనాన్ని బట్టి బుక్కరాయలు చిన్న వయసులోనే ప్రతాపరుద్రుని ఆస్థానంలో చేరి ఉండవచ్చని పండితులు భావించారు. హరిహర బుక్కరాయలు ఢిల్లీకి ఖైదీలుగా తీసుకువెళ్లబడి

తిరిగి కంపిలి చేరే వరకు సంగముని చరిత్ర మనకు తెలియదు. కనుక కుమారులు ఢిల్లీ ఖైదులో ఉండగానే సంగముడు మరణించి ఉండవచ్చును అని భావించబడింది. తండ్రి మరణానంతరమే హరిహర బుక్కరాయలు విజయనగర రాజ్యాన్ని స్థాపించారు. ఆ తర్వాతనే సంగముని కుమారులు ప్రఖ్యాతిలోనికి వచ్చి, వారి వంశానికి సంగమ వంశం అని పేరు వచ్చిందని చెప్పవచ్చును.

హరిహర రాయలు క్రీ.శ.1336-1357: క్రీ.శ.1336 మే 4వ తేదీన హరిహర రాయలు తుంగభద్రానదీ తీరాన ఉన్న పంపా విరూపాక్షుని సన్నిధిలో పట్టాభిషేకం చేసుకోవడంతో విజయనగర రాజ్యచరిత్ర ప్రారంభం అయింది. హరిహరుని పట్టాభిషేక కాలం నాటికి విజయనగర రాజ్యం చాలా చిన్నది. అతని రాజ్యంలో కర్ణాటకంలోని చితల్‌దుర్గ, కోలారు, శివమొగ్గ, కదూరు, ధార్వాడ్ ప్రాంతాలు, ఆంధ్రదేశంలోని రాయచూరు, కర్నూలు లేక కందనవోలు, అనంతపూరు, కడప ప్రాంతాలు చేరి ఉన్నాయి. ఈ ప్రాంతాలను హరిహరుడు జయించినట్లు దాఖలాలు లేవని నేలటూరి వెంకటరమణయ్య అన్నారు. బహుశా ఇవన్నీ ఆరవీటి వంశస్థులు జయించి ఉంటారు. ఆరవీటి వారిని ఓడించి అనెగొందిని ఆక్రమించినందువలన వారు జయించిన ప్రాంతాలన్నీ హరిహరుని ఆధిపత్యంలోకి వచ్చి ఉండవచ్చును. ఇంత చిన్నరాజ్యం అనతికాలంలోనే విస్తరించి దక్షిణదేశం అంతా హరిహరరాయల ఆధిపత్యంలోకి వచ్చింది. అందుకు కారణం ఆనాటి రాజకీయ పరిస్థితులు అనుకూలించాయి

హరిహరరాయలు సింహాసనం అధిష్టించిన నాటి దక్షిణదేశ రాజకీయ పరిస్థితులు: క్రీ.శ.1336 నాటికి దక్షిణదేశంలో తుగ్లక్ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. తత్ఫలితంగా అనేక నూతన రాజ్యాలు ఏర్పడ్డాయి. గుల్బర్గాలో మహారాష్ట్ర, ఉత్తర కర్ణాటకాలు సుల్తాన్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. కాని సుల్తాన్ సర్దారులు స్వతంత్ర వైఖరిని అవలంబించి ఉన్నారు. చివరకు అక్కడ జాఫర్‌ఖాన్ నాయకత్వంలో సుల్తాన్ ఆధిపత్యాన్ని తృణీకరించి క్రీ.శ.1347 ఆగస్టు నెలలో గుల్బర్గాలో బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. ఆంధ్రదేశం కాపయ నాయకుని ఆధిపత్యంలో ఉంది కాని మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలలో పద్మనాయక సింగమనీడు, కాపయ నాయకుని కాదని స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించే ప్రయత్నంలో ఉన్నాడు. తూర్పుకోస్తాలో కృష్ణానదికి దక్షిణంగా అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి రెడ్డిరాజ్యాన్ని స్థాపించాడు. ఇతని రాజ్యంలో నెల్లూరు జిల్లా, కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, అహోబిల ప్రాంతాలు ఉన్నాయి. ఉత్తరాన కృష్ణానది ఈ రాజ్యానికి సరిహద్దుగా ఉంది. చంద్రగిరిలో ఒక యాదవ నాయకరాజ్యం ఉంది దానికి దిగువన కంచిలో శంభువరాయ రాజ్యం ఉంది. ఈ రాజ్యానికి కంచి రాజధాని. దానికి పడైవీడు లేక రాజగంభీర దుర్గం మరొక రాజధానిగా ఉండేది. చంద్రగిరి, కంచి రాజ్యాలు భల్లాలుని సామంత రాజ్యాలుగా ఉండేవి. తమిళదేశంలో మధురా రాజ్యం మధుర సుల్తాన్ ఆధిపత్యంలో ఉంది. తంజావూరు, తిరుచునాపల్లి రామనాథపురం, కోయంబత్తూరులు మధురా రాజ్యంలో భాగాలుగా ఉన్నాయి. మధుర సుల్తాన్ ద్రావిడ దేశాన్నంతటినీ తన రాజ్యంలో చేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. కర్ణాటక దేశ హొయసాల భల్లాలుని ఆధిపత్యంలో ఉంది. అతని రాజధాని ద్వారసముద్రం, హొయసాల గుల్బర్గా రాజ్యాల మధ్య హరిహరుని విజయనగర రాజ్యం ఉంది. సుల్తాన్ దండెత్తి వస్తాడని ఈ రాజ్యాలన్నింటికి భయం ఉన్నా, ఐకమత్యత లేక తమలో తాము కలహించుకొంటూ తమ రాజ్యాలను విస్తరించుకోవాలని ప్రయత్నించాయి. కర్నూలు జిల్లాలోని ఆటకలగుండు వద్ద ఉన్న క్రీ.శ.1339 నాటి శాసనం హరిహరరాయలకు పూర్వ పశ్చిమ సముద్రాధిపతి అనే బిరుదు ఉన్నట్లు తెలుపుతోంది. దానిని బట్టి హరిహరుని రాజ్యం 1339 నాటికే బంగాళాఖాతం నుండి అరేబియా సముద్రం వరకు విస్తరించినట్లు తెలుస్తోంది. క్రీ.శ.1340 నాటి బాదామీ శాసనం తుంగభద్రకు ఉత్తరంగా బీజాపూరు జిల్లాలోని బాదామి వరకు హరిహరుని రాజ్యం విస్తరించినట్లు తెలుపుతోంది. మలప్రభానదికి ఉత్తరంగా ఉన్న కాల్గడి వరకు అతని ఆధీనం అయినట్లు సీవెల్ కూడా రాశాడు. అంతేగాక బాదామిలో హరిహరుని ఆజ్ఞతో ఒక కోట కూడా నిర్మింపబడిందని కూడా రాశాడు. అంతకుముందు ఈ ప్రాంతాలన్నీ మహమ్మద్ బీన్ తుగ్లక్ జయించినవి. 1340 నాటికి ఈ ప్రాంతాలన్నీ హరిహరునిచే జయింపబడ్డాయి. క్రీ.శ.1342వ సంవత్సరంలో పశ్చిమతీరంలోని హెనోవరును హరియబ్ అనే హిందువు కులోపడి ఐబక్ అనే ముస్లిం పాలిస్తున్నట్లు ఇబన్‌బటూటా రాశాడు. క్రీ.శ.1336లో హరిహరుడు బారాకూర్‌లో కూడా ఒక కోట కట్టించినట్లు అనుశృతి ఉంది. కాని ఆ ప్రాంతం క్రీ.శ.1341 వరకు భల్లాలుని ఆధీనంలో ఉన్నట్లు శాసనాలున్నాయి. కనుక క్రీ.శ.1342 తర్వాత ఆ ప్రాంతం హరిహరుని స్వాధీనంలోకి వచ్చి ఉంటుందని భావింపబడింది.

ఆంధ్రదేశంపై దండయాత్ర-ఉదయగిరి ఆక్రమణ: కృష్ణకు దక్షిణ భాగమంతా విరూపాక్షుని భూమి అని

విద్యారణ్యుడు చెప్పి ఉన్నాడు. కనుక కృష్ణానది వరకు ఉన్న దక్షిణ దేశమంతా జయించి తమ రాజ్యానికి కృష్ణా నదిని ఉత్తర సరిహద్దుగా చేయాలని హరిహర బుక్కరాయలకు సంకల్పం కలిగింది ఆంధ్రదేశంలోని గుంటూరు జిల్లా వరకు కృష్ణానదికి దక్షిణంగానే ఉంది. కనుక ఈ ప్రాంతాలను జయించాలని హరిహరుడు రెడ్డిరాజ్యంపై దాడులు ప్రారంభించాడు. తన రాజ్యానికి పశ్చిమోత్తర సరిహద్దులో ఉన్న ఉదయగిరిపై తన తమ్ముడు బుక్క రాయలను పంపాడు. బుక్కరాయలు క్రీ.శ.1343వ సంవత్సరంలో సునాయసంగా ఉదయగిరిని జయించాడు. ఉదయగిరిని జయించిన తర్వాత తూర్పు ప్రాంతాలకు ఉదయగిరిని ప్రధాన కేంద్రంగా చేసి దుర్గాన్ని బలిష్ఠంగా రూపొందించారు. విజయనగర శాసనాలు రాయదుర్గానికి మొదటి దుర్గం ఉదయగిరి దుర్గం అని, దాని ప్రాముఖ్యతను తెలుపుతున్నాయి. కనుక రాజకుమారులే ఈ దుర్గాధ్యక్షులుగా నియమింపబడ్డారు. దుర్గం స్వాధీనం కాగానే క్రీ.శ.1343లో బుక్కరాయల కుమారుడు విరూపణ్ణ ఒడయారు లేక విరూపాక్షరాయలను ఉదయగిరి అధిపతిగా నియమించారు అతని శాసనం క్రీ.శ.1343 నాటిది ఉదయగిరిలో ఉంది. అదే సంవత్సరంలో మోపురి కంపరాయల శాసనం ఉంది. కోడవులూరు, బుగ్గబాలి శాసనాలు ఉదయగిరి ప్రాంతాన్ని జయించినట్లు తెలుపుతున్నాయి. తర్వాత బుక్కరాయల కుమారుడు విరూపణ్ణ బహుశ కడప ప్రాంతంలో కంపరాయలు స్థానిక పాలకుడుగా నియమింపబడి ఉండవచ్చును. ఆ తర్వాత కంపరాయలు, ఉదయగిరికి కూడా అధిపతిగా నియమింపబడ్డాడు. క్రీ.శ.1347 నాటి నెల్లూరు జిల్లాలోని కోడవలూరు శాసనం, ఉదయగిరి దుర్గాన్ని కంప రాయలు పాలిస్తునట్లు తెలుపుతున్నాయి. అలాగే బుగ్గబాలి శాసనం కూడా ఉదయగిరి విజయనగర రాజ్యంలో ఉందని తెలుపుతోంది. ఉదయగిరి ఆక్రమణతో ఆంధ్రదేశంపై దండెత్తడానికి పునాది వేయబడిందని నేలటూరి వెంకటరమణయ్య వ్యాఖ్యానించారు. దాంతో విజయనగర రాజ్యానికి రెడ్డి రాజ్యానికి విరోధం ప్రారంభమైంది.

హొయసాల భల్లాలునితో పోరాటాలు: తర్వాత బుక్కరాయలు పెనుగొండపై దండెత్తాడు. పెనుగొండ హొయసాల భల్లాలుని రాజ్యంలో భాగంగా ఉండేది. హొయసాల రాజ్యాన్ని జయించి దక్షిణంగా తమ రాజ్య విస్తరణ చేసుకోవాలని సోదరులు సంకల్పించి భల్లాలునితో యుద్ధాలకు దిగారు. క్రీ.శ 1340వ సంవత్సరంలో బుక్కరాయలు పెనుగొండను స్వాధీనం చేసుకున్నాడు. ఈ కాలంలో హొయసాల భల్లాలుడు తొండైమండలాన్ని తమిళదేశంలోని మధుర రాజ్యాన్ని జయించాలని, అక్కడ సుల్తాన్ రాజ్యాన్ని అంతం చేసి తమిళదేశాన్ని అంటే పూర్వపు పాండ్యదేశాన్ని తన రాజ్యంలో కలుపుకోవాలని గొప్ప ఆశతో ఉన్నాడు. అందువల్ల అతడు మధుర సుల్తాన్‌తో పోరాటాలకు దిగాడు. అందువల్ల హొయసాల సైన్యం అంతా దక్షిణాదిన ఉంది. ఆ అవకాశాన్ని వినియోగించుకొని హరిహర బుక్కరాయలు హొయసాల రాజ్య ఉత్తర సరిహద్దులపై దాడులు ప్రారంభించి హొయసాల రాజ్యభాగాలను కైవసం చేసుకోనారంభించారు. క్రీ.శ.1340లో వేయబడిన బాదామీ శాసనం హరిహరరాయలకు మహామండలేశ్వర, అరిరాయవిభాలు, రాయరగండ, భాసగెతుప్పువ అనే బిరుదులున్నట్లు తెలుపుతోంది. అంతేగాక పూర్వ పశ్చిమ సముద్రాధిపతి అని కూడా వర్ణించింది కనుక 1340 నాటికే అతడు కెనరాను జయించి అరేబియా సముద్రం వరకు రాజ్యాన్ని విస్తరించాడని చెప్పవచ్చును. అంతేగాక అతడు బాదామిలో ఒక కోటను కూడా నిర్మించాడు. భల్లాలుడు మధుర సుల్తాన్‌తో జీవన్మరణంగా పోరాడుతున్నందువల్ల తన దృష్టిని వీరిపైకి తిప్పలేకపోయాడు. అంతేగాక క్రీ.శ.1342లో భల్లాలుడు తిరుచునాపల్లి, కన్ననూరు, కొప్పం వద్ద మధుర సుల్తాన్‌తో పోరాడుతూ ఓడి బందీగా చిక్కాడు. మధుర సుల్తాన్ భల్లాలుని దారుణంగా వధించాడు. భల్లాలుని మరణం తర్వాత అతని కుమారుడు విరూపాక్షుడు యుద్ధాన్ని కొనసాగించాడు. కాని ఓడి ద్వార సముద్రానికి తిరిగివచ్చి క్రీ.శ.1443లో పట్టాభిషేకం చేసుకున్నాడు. ఇతనికి నాల్గవ భల్లాలుడని కూడా పేరుంది విరూపాక్షరాయలు తమ రాజ్యభాగాలు ఆక్రమిస్తూ ఉన్న హరిహర బుక్కరాయలతో పోరాడలేదు. విజయనగర సైన్యాలు తన రాజ్యంలో ప్రవేశించగానే అతడు భయపడి బనవాసకు పారిపోయి అక్కడ పాలించే కదంబుల వద్ద తలదాచుకున్నాడు. కాని తర్వాత తిరిగి వచ్చి మధుర సుల్తాన్‌పై దండెత్తి క్రీ.శ.1346లో అతడు కూడా మరణించాడు. విరూపాక్షుని మరణంతో హొయసాల వంశం అంతరించింది. హరిహర బుక్కరాయలకు ఎదురు లేకుండాపోయింది. బుక్కరాయల హొయసాల రాజ్యంపై దండెత్తి వారి రాజధాని ద్వారసముద్రాన్ని కూడా ఆక్రమించారు. తుళువదేశం కూడా విజయనగర రాజ్యంలో భాగం అయిపోయింది. క్రీ.శ.1344 నాటి శాసనం హొయసాల వంశానికి చెందిన భూవలయం అంతా హరిహరరాయల ఆధీనం అయినట్లు తెలుపుతోంది. తర్వాత విరూపాక్షరాయలకు ఆశ్రయం ఇచ్చినందుకు కదంబులను దండించడానికి హరిహరుడు తన తమ్ముడు మారప్పను

పంపాడు. అతడు కోడూరు జిల్లాలోని కాలస నుండి సైన్యాలతో బయలుదేరి క్రీ.శ.1347లో బనవాసిపై దండెత్తి బనవాసి పాలకుని ఓడించి ఆ ప్రాంతాన్ని విజయనగర ఆధిపత్యం కిందికి తెచ్చాడు. హరిహరుని సోదరులు, వారి కుమారులు ఈ విజయాలను సాధించారు. మారప్ప ఉత్తర కెనరా, షిమోగా జిల్లాలను జయించాడు. హరిహర బుక్కరాయలు, మైసూర్, కదూర్, హసన్ ప్రాంతాలలోకి సైన్యాలను నడిపారు. ముద్దప్ప కోలారు, బెంగుళూరు ప్రాంతాలను ఆక్రమించాడు. అదేసమయంలో మారప్ప చంద్రగుప్తి నుండి బయలుదేరి బనవాసి కదంబరాజ్య ప్రాంతాలను కూడా జయించాడు. ఈ విధంగా క్రీ.శ.1345 నాటికి హొయసాల రాజ్యం మొత్తమేగాక తుళువ దేశం కూడా విజయనగర సామ్రాజ్యంలో భాగం అయిపోయింది. బుక్కరాయల శాసనాలలో హొయసాల రాజ్యాన్ని జయించడాన్ని ప్రత్యేకంగా పేర్కొనబడింది. ద్వారసముద్రంతో మొదలుపెట్టి నూరు పట్టణాలను విడిపించాడని, సప్తాంగాలతో కూడిన రాజ్యాన్ని పాలించాడని అతని శాసనాలు తెలుపుతున్నాయి. హొయసాల రాజ్యాన్ని జయించిన విధానాన్ని ఇబన్‌బటూటా కూడా పేర్కొన్నాడు. తర్వాత కోయంబత్తూరు, సేలం జిల్లాలను కొంగు దేశాన్ని కూడా జయించారు. దాంతో విజయనగర రాజ్య సరిహద్దులు మధుర సుల్తాన్ రాజ్య సరిహద్దులను తాకాయి. అనెగొందిలో స్వతంత్రం ప్రకటించినవాడు గుత్తి నుండి మాబార్ వరకు జయించాడని ఇసామీ కూడా రాశాడు. కనుక హొయసాల రాజ్య ఆక్రమణే విజయనగర రాజ్యప్రాభవానికి కారణమైందని చెప్పవచ్చును. హొయసాల రాజ్య ఆక్రమణ పూర్తి అయిన తర్వాత సోదరులు శృంగేరీలో విజయోత్సవం జరుపుకున్నారని శృంగేరి శాసనం తెలుపుతోంది. ఆ ఉత్సవానికి హరిహరుని సామంతులందరూ హాజరయ్యారు. వారిలో మూడవ భల్లాలుని భార్య, తుళువ రాజ్యపు రాణి అయిన కిక్కాయితాయి కూడా హరిహరుని సామంతురాలిగా హాజరైంది. కనుక హొయసాల రాజ్యం యావత్తూ హరిహరుని ఆధీనం కావడమేగాక హొయసాల బంధుగణం కూడా హరిహరునికి లొంగిపోయారని స్పష్టపడుతోంది.

మధుర సుల్తాన్‌తో పోరాటం: హొయసాల భల్లాలుడు, అతని కుమారుడు విరూపాక్షుని మరణం తర్వాత మధుర సుల్తాన్ తన రాజ్యానికి ఉత్తర దిక్కులో ఉన్న కంచి రాజ్యంపై దండెత్తాడు. రాజు శంభువరాయుని ఓడించి బందీగా తెచ్చి మధురలో ఖైదు చేశాడు. ఈ స్థితిలో హరిహర బుక్కరాయల రాజ్యం మధుర సుల్తాన్ రాజ్యాన్ని తాకింది. కనుక హరిహరరాయలు మధురపై కూడా దండెత్తాడు. ఈ దండయాత్ర శంభూరాయుని విడిపించడానికి జరిగిందని కొందరు అంటారు. ఉదయగిరిలో హరిహరుని సామంతునిగా ఉన్న సాళువ మంగి అనే వాడి నాయకత్వంలో విజయనగర సైన్యం మధురపై దండెత్తింది. ఉదయగిరి నుండి కంపరాయల కుమారుడు సావణ్ణ ఒకసైన్యంతో కోలారు జిల్లాలోని ముల్బగుల నుండి బుక్కరాయల కుమారుడు కంపరాయలు ఏకకాలంలో బయలుదేరి మధుర రాజ్యంపై దండెత్తారు. మధుర సుల్తాన్ విజయనగర సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. వారికి భీకర యుద్ధం జరిగింది. అందులో సుల్తాన్ విజయనగర సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. వారికి భీకర యుద్ధం జరిగింది. అందులో సుల్తాన్ ఓడిపోయి బందీగా చిక్కాడు. మధురలో బందీగా ఉన్న శంభువరాయలను విడిపించి కంచి సింహాసనం ఎక్కించారు. అందువల్ల సాళువ మంగికి శంభువరాయ స్థాపనాచార్య అనే బిరుదు వచ్చింది. హరిహరుని మొదటి సోదరుడైన కంపని కుమారుడు వీరశావణ కూడా అదే బిరుదు ధరించాడు. ఈ యుద్ధం క్రీ.శ.1352-53లో జరిగింది. మధుర రాజ్యంలో క్రీ.శ.1343-44, 1353-54 సంవత్సరాల మధ్య మధుర సుల్తాన్ నాణేలు కన్పించడం లేదు. కనుక క్రీ.శ.1353-54లో మధుర రాజ్యం హరిహరరాయల చేతికి వచ్చినట్లు భావించవచ్చని లేదా మధుర రాజ్యం మరుగునపడిపోయిందని చెప్పవచ్చని యన్. సుబ్రహ్మణ్యన్, పి.యస్.చోప్రా, టి.కె.రవీంద్రన్ అనే పండితులు వ్యాఖ్యానించారు. మధుర సుల్తాన్ బందీ అయిన తర్వాత మధుర అమర్‌లు గుల్బర్గాలో నూతనంగా బహమనీ రాజ్యాన్ని స్థాపించిన హసన్‌గంగును సహాయం అర్థించారని, అందుకు అంగీకరించి హసన్‌గంగు తన అల్లుడైన కుర్బతేహసన్‌గంగును మధుర రాజ్యానికి తన ప్రతినిధిగా ప్రకటించి అతనిని సైన్యంతో పంపాడని, అందవల్ల మధురకు వస్తున్న బహమనీ సైన్యాన్ని ఎదుర్కోడానికి హరిహరరాయలు మధుర దండయాత్రను నిలిపివేసి తన రాజ్యపు ఉత్తర సరిహద్దుకు తన సైన్యాన్ని తరలించాడని, అందువల్ల మధుర సుల్తానత్ పూర్తిగా శాసనం కాకుండా నిలవ గలిగిందని నేలటూరి వెంకటరమణయ్య రాశారు. లేకపోతే హరిహర రాయల కాలంలోనే మధుర సుల్తానత్ కూడా విజయనగర రాజ్యంలో భాగం అయి ఉండేది. ఏది ఏమైనా మధుర రాజ్యంతో యుద్ధం నిలిచిపోయింది.

బహమనీ రాజ్యంతో యుద్ధం క్రీ.శ.1356: గుల్బర్గా సుల్తాన్ హసన్‌గంగు మధుర సుల్తాన్‌కు మద్దతుగా

విజయనగర రాజ్యంపై దాడికి రావడంతో బహమనీ విజయనగర సంఘర్షణ ప్రారంభమైంది. అంతకుముందే క్రీ.శ.1347లో సరిహద్దులో ఉన్న సాగరు ప్రాంతంలో సిద్ధపడ్డాడు. బహమనీ సేనాని ముబారక్ ఖాన్ పెద్ద సైన్యంతో వచ్చాడు. కాని విజయనగర సైన్యం అతనిని ఓడించి తరిమేసింది. అది మొదటి దండయాత్ర. ఇప్పుడు రెండవసారి మధుర సుల్తాన్‌కు అండగా వచ్చాడు. విజయనగర రాజ్యంతో సంఘర్షణకు మరొక కారణం కూడా ఉంది. బహమనీ రాజ్యస్థాపనకు ముందు దౌలతాబాద్ అమీరుగా పనిచేసిన అమీరాన్-ఇ-సదాహు కాలంలో రాయచూర్, ముద్గల్, గుల్బర్గా, బీజాపూర్ మొదలైన ప్రదేశాలు దౌలతాబాద్ రాజ్యంలో చేరి ఉండేవి. వారిలో రాయచూర్, ముద్గల్‌లను హరిహర బుక్కరాయలు జయించి తమ రాజ్యంలో కలుపుకున్నారు. బహమనీ రాజు హసన్‌గంగు తాను స్వతంత్ర రాజ్యం స్థాపించిన తర్వాత దక్షిణదేశంలో మహమ్మద్‌బిన్ తుగ్లక్ సామ్రాజ్య భాగాలన్నింటికీ తనను వారసునిగా భావించుకొని తుంగభద్రానది వరకు ఉన్న ప్రాంతం తనదేనని తీర్మానించుకొని ఆ ప్రాంతాలను తనకు దఖలు పరచాలని హరిహరరాయలను కోరాడు. హరిహరరాయలు అందుకు తిరస్కరించి ఆ ప్రాంతాలు పూర్వపు కంపిలి రాజ్యానికి చెందినవని, తమకే చెందుతాయని సమాధానమిచ్చాడు. అందులో కోపించిన హసన్‌గంగు రాయచూర్, ముద్గల్ ప్రాంతాలను తన వశం చేసుకోవడానికి విజయనగర రాజ్యంతో సంఘర్షణకు దిగాడు. ఈ సంఘర్షణ క్రీ.శ.1358లో ప్రారంభమైంది. హసన్‌గంగు సేనాధిపతి ముబారక్ ఖాన్ క్రైచూర్ వరకు నడచి అక్కడి కోటను ఆక్రమించాడు. వెంటనే విజయనగర సేనలు బహమనీ సేనలను ఎదుర్కొని తీవ్రంగా పోరాడాయి. దాంతో బహమనీ సేనలు వెనుకకు మళ్లిపోయాయి. ఈ యుద్ధంలో హసన్‌గంగు విజయం పొందాడని ముస్లిం రచయితలు రాశారు. కాని విజయనగర శాసనాలు హరిహరరాయలు కృష్ణ, తుంగభద్రా నదుల మధ్య కొంత భాగాన్ని హరిహరరాయలు కోల్పోయినట్లు ఉందని నేలటూరి వెంకటరమణయ్య రాశాడు. ఈ యుద్ధకాలంలో విజయనగర రాజ్యం ఉత్తరాన ఉన్న బహమనీ రాజ్యం, దక్షిణాన ఉన్న మధుర సుల్తాన్ రాజ్యాల మధ్య నలిగిపోయి క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొందని యన్. సుబ్రహ్మణ్యం, పి.యన్.చోప్రా, టి.కె.రవీంద్రన్ అనే వారు రాశారు. అందువల్ల మధుర రాజ్యాన్ని జయించే ఆశ వదులుకోవలసి వచ్చిందని రాశారు. బహమనీ విజయనగర యుద్ధం పెద్దగా జరగలేదని, వారి ఘర్షణ సరిహద్దు ప్రాంతాలైన రాయచూర్ సాగర్ వద్ద ఉన్న కింహకు మాత్రమే పరిమితమైందని, విజయనగరానికి పెద్ద నష్టం జరుగలేదని కూడా వారు రాశారు. ఏమైనప్పటికీ హరిహరరాయల కాలంలోనే బహమనీ, విజయనగర సంఘర్షణ ప్రారంభమైదని స్పష్టమవుతోంది.

హరిహరరాయల మరణం క్రీ.శ.1357: హరిహరరాయల మరణాన్ని గురించి అభిప్రాయభేదాలున్నాయి. రాబర్ట్ సీవెల్ హరిహరరాయలు క్రీ.శ.1343లో మరణించాడని రాశారు. అందుకు కారణమేమిటంటే న్యూనిజ్ హరిహరరాయలు 7 సంవత్సరాలు, బుక్కరాయలు 37 సంవత్సరాలు పాలించారని రాశాడు. ఇబన్‌బటూటా కూడా హరియబ్ లేక హరిబ్ 1342లో పాలించాడని రాశాడు. కనుక సీవెల్ హరిహరరాయలు క్రీ.శ.1336 నుండి 1343 వరకు 7 సంవత్సరాలు బుక్కరాయలు క్రీ.శ.1343 నుండి 1379 వరకు పాలించారని భావించాడు. కాని సీవెల్ తర్వాత న్యూనిజ్ రాతకు విరుద్ధంగా ఒక శాసనం లభించిందని, ఆ శాసనాన్ని రెండవ సంగముడు క్రీ.శ.1358లో వేయించాడని అందులో మొదటి హరిహరుడు సుల్తాన్‌ని ఓడించాడని పేర్కొన్నాడని రాశాడు. ఈ శాసనంలో పేర్కొనబడిన సుల్తాన్ బహమనీ సుల్తాన్ అని, కనుక హరిహరరాయలు క్రీ.శ.1356లో బహమనీ సుల్తాన్ హసన్‌గంగుతో పోరాడిన విషయమే ఇందులో పేర్కొనబడిందని, మిగిలిన పండితులు భావించారు. ఉడిపిలో లభించిన ఒక శాసనం హరిహరరాయలు క్రీ.శ.1357 వరకు జీవించి ఉన్నట్లు తెలుపుతోంది. కనుక హరిహరరాయలు క్రీ.శ.1357లో మరణించాడని, అదే సంవత్సరంలో బుక్కరాయలు రాజ్యానికి వచ్చాడని భావిస్తారు. కనుక క్రీ.శ.1336 నుండి 1356 వరకు హరిహరరాయలు 20 సంవత్సరాలు పాలించాడు. నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆఫీసులో ఉన్న శాసనం మరొక కథను తెలుపుతోంది. ఈ శాసనాన్ని రెండవ సంగముడు క్రీ.శ.1356 మే నెల 3వ తేదీన నెల్లూరు జిల్లాలోని ఒక గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేసి ఈ తామ్ర శాసనాన్ని విడుదల చేశాడు. ఈ శాసనంలో తాను ఈ దాన శాసనం ఇవ్వడానికి ఒక సంవత్సరం ముందు తన తండ్రి తర్వాత రాజ్యానికి వచ్చినట్లు చెప్పుకున్నాడు. అంటే రెండవ సంగముడు క్రీ.శ.1355లో రాజ్యానికి వచ్చాడని అర్థం. దీనిని బట్టి హరిహరరాయల మరణానంతరం అతని పెద్ద తమ్ముడు కంపన జీవించి ఉండగా రెండవ తమ్ముడు బుక్కరాయలు ఎలా రాజ్యానికి వస్తాడు. కనుక హరిహరరాయల తర్వాత కంపన రాజ్యానికి వచ్చి క్రీ.శ.1543 నుండి 1355 వరకు అంటే 12 సంవత్సరాలు పాలించాడని, అతని తర్వాత క్రీ.శ.1355లో అతని

కుమారుడు పెద్ద సాయణ సింహాసనానికి వచ్చాడని వాదించారు. కాని బుక్కరాయల కొన్ని శాసన క్రీ.శ.1354 నాటికి లభించింది. కనుక అతడు తన అన్న కంపరాయలతో సామంతుడుగా ఉండి ఉండాలి. పిమ్మట క్రీ.శ.1354లో విజయ నగర సింహాసన మెక్కాడు. కాని క్రీ.శ.1343 నుండి హరిహర రాయలతో రాజ్య పాలన శాసనాలలో కన్పిస్తున్నాడు. కనుక బుక్కరాయలు కంపరాయలు సింహాసనాన్ని ఆక్రమించారని చరిత్రకారులు వాదించారు. కాని వారి వాదనను చరిత్రకారులు అంగీకరించలేదు. హరిహరరాయలు మొదటి తమ్ముడు కంపరాయలు. అతని కుమారుడు పెద్ద సాయణ నెల్లూరు జిల్లాలో స్థానిక పాలకుడుగా నియమింపబడి ఉండవచ్చని భావించారు. కనుక వారు విజయనగర సింహాసనాన్ని ఆక్రమించారని చెప్పడానికి వీలులేదు. పైగా సాయణ శాసనం హరిహరుని సర్వాధిపత్యం ఉండడాన్ని తెలుపుతోంది. కనుక క్రీ.శ.1356 దాకా హరిహరరాయలు జీవించి ఉన్నాడు. అతనికి సామంతులుగా కంపరాయలు, పెద్ద సాయణ నెల్లూరు ప్రాంతాన్ని పాలిస్తున్నారని భావించాలి. క్రీ.శ.1356లో హరిహరరాయలు మరణం తర్వాత బుక్కరాయలే విజయనగర సింహాసన మెక్కాడని ఈ పండితుల వాదించారు. దీనికి కూడా తగిన ఆధారాలున్నాయి. మహమ్మద్ బిన్ తుగ్లక్ హరిహర బుక్కరాయలను బందీ ఆమోదించి పాలకులుగా పంపాడు. కనుక రాజ్యంలో బుక్కరాయలకు సగభాగం ఉంది. కనుక హరిహరుని పాలన కాని రాజ్యంలోని ఆమోదించి రాజ్యంలోని రాయచూరు ప్రాంతాల బుక్కరాయలు ఆధీనంలో ఉన్నట్లు అతడు అక్కడ పాలకుడుగా ఉన్నట్లు అతనికి పూర్తి రాజరికా ఉన్నట్లు సత్తి మదుం వద్ద శాసనం లభించింది. ఈ శాసనంలో తేదీ లేదు. క్రీ.శ.1355 నాటి ఒక శాసనంలో హరిహరరాయలు సింహాసనానికి బుక్కరాయలు మూల స్తంభం లాగా ఉన్నట్లు మహామండలేశ్వర అనే బిరుదుతో బుక్కరాయలు వర్ణింపబడ్డాడు. అదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1355లో హరిహరరాయలు స్వయంగా బుక్కరాయలను తన వారసునిగా ప్రకటించి యువరాజు పట్టాభిషేకం జరిపాడు. క్రీ.శ.1352-1355 సంవత్సరాల మధ్య హరిహరబుక్కరాయలు ఉమ్మడిపాలన ఉన్నట్లు వారి శాసనాలు తెలుపుతున్నాయి. 1356లో హరిహరరాయలు మరణానంతరం బుక్కరాయలు 1357 నుండి పూర్తి స్వాతంత్ర్యంగా విజయనగర రాజ్యాన్ని పాలించాడు. కనుక తన అన్న కంపరాయలకు బుక్కరాయలకు వారసత్వ యుద్ధం జరిగిందనడం వాస్తవం కాదు. కంపరాయలు బుక్కరాయల అధికారాన్ని అంగీకరించి ఉండాలని నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు. బుక్కరాయలు తాను విజయనగరంలో హరిహరునితోపాటు పాలకునిగా ఉన్నప్పుడు కంపరాయలను నెల్లూరు ప్రాంతానికి మారప్పను మలెనాడు ప్రాంతానికి స్థానిక పాలకులుగా నియమించి ఉండవచ్చును. కంపన మరణానంతరం కంపన కుమారుడు సాయణ పెద్ద సాయణ ఉదయగిరి రాజ్యాన్ని విభజించి స్వతంత్రంగా పాలించసాగాడు. ఈ స్వతంత్ర వైఖరిలో పెద్ద సాయణ నెల్లూరి శాసనాన్ని వేయించి ఉండాడు. అలాగే మలెనాడులో మారప్ప కుమారులైన శావణ్ణ మాయణ్ణలు కూడా స్వతంత్ర వైఖరినవలంబించారు. కనుక రాజ్య ఐక్యతను కాపాడటం కోసం బుక్కరాయలు వారందరినీ తొలగించి తన కుమారులను ఆయా ప్రాంతాలలో స్థానిక పాలకులుగా నియమించాడు. సామ్రాజ్య ఐక్యతని నిలబెట్టుకున్నాడు. అన్నదమ్ముల కుమారులను తొలగించాడు. కనుక బుక్కరాయలు తన అన్న కంపని అతని కుమారుడు పెద్ద సాయణని తొలగించి రాజ్యానికి వచ్చాడని భావించబడింది. కాని అది వాస్తవం కాదు. హరిహర రాయలు స్వయంగానే బుక్కరాయలను తన వారసునిగా నియమించాడని భావించవచ్చును. కనుక హరిహరరాయలు క్రీ.శ.1336 నుండి 1356 వరకు 20 సంవత్సరాలు పాలించాడని భావించబడింది. హరిహర రాయలకు రాజ్య విస్తరణలో, పరిపాలనలో అతని సోదరులు, సోదరుల కుమారులు అండదండలుగా నిలిచారు. పెద్ద తమ్ముడు కంపణ్ణ అతని కుమారుడు సాయణ్ణ, ఇమ్మడి సంగముడు. రెండవ తమ్ముడు బుక్కరాయలు అతని కుమారులు విరూపణ్ణ కుమార కంపన, హరిహర, భాస్కర, భవదూర, శాయణ్ణ. మూడవ తమ్ముడు మారప. నాల్గవ తమ్ముడు ముద్దప్పలు హరిహరరాయలకు అనేక విధాలుగా సహాయపడ్డారు. వీరు వివిధ ప్రాంతాలలో పాలకులుగా నియమింపబడ్డారు. కంపరాయలు ఉదయగిరి రాజ్యానికి, బుక్కరాయలు పెనుగొండ రాజ్యానికి, మారప్ప అరగ మలెనాడుకు, ముద్దప్ప ములబాగిలు రాజ్యానికి పాలకులుగా నియమింపబడ్డారు. బుక్కరాయలు యువరాజుగా కూడా వ్యవహరించాడు. బుక్కరాయలు హరిహరునితో సహపాలకుడుగా కూడా పాలించాడని వెంకట రమణయ్య అభిప్రాయపడ్డారు. హరిహర రాయలు గొప్ప సమర్థుడైన పాలకుడు. అతడు ఒక చిన్న రాజ్యాన్ని తన చివరి కాలం నాటికి గొప్ప సామ్రాజ్యంగా

రూపొందించాడు. అంతగాక గొప్ప పరిపాలనాదక్షుడు. అతని మంత్రి అనంతరసు చంద్రభూషణ, క్రియాశక్తి రాజగురువు- మాధవ విద్యారణ్యులు మార్గదర్శకులు. వారి సహకారంతో అతడు చక్కగా రాజ్యపాలన చేశాడు. రాజ్యానికి ఆర్థిక సౌష్టవం కలిగించాడు. శాంతిభద్రతలను నెలకొల్పాడు. సామ్రాజ్యాన్ని పరిపాలన సౌలభ్యం కోసం సీమలు, నాడులు, స్థలాలుగా విభజించి స్థలకరణాలను, నాడు అధిపతులను, గ్రామాలలో కరణీక మిరాసీలను ఏర్పాటు చేశాడు. ప్రజారక్షణకు కావలిగార్లను కూడా నియమించాడు. హరిహరుని మంత్రి అనంతరసు, హరిహరుని పరిపాలనా ఏర్పాట్లు నిర్వహణలో కుడిభుజంగా నిలిచాడు. అందువల్ల అతడు అనేక చెరువులు తవ్వించి, వ్యవసాయాన్ని వృద్ధి చేశాడు. అడవులను నరికించి నూతన గ్రామాలు వ్యవసాయ క్షేత్రాలను అభివృద్ధి చేశాడు. ముఖ్యంగా కడప జిల్లాలో అనేక నూతన వ్యవసాయ క్షేత్రాలు ఏర్పడ్డాయి. అనంతరసు సేవలకు మెచ్చిన హరిహరుడు అతనికి సర్వశిరః ప్రధాని పదవినిచ్చి, చిక్క ఉదయుడు అనే బిరుదు ఇచ్చాడు. హరిహర బుక్కరాయలు స్వతంత్రం ప్రకటించి తమ రాజ్యాన్ని పాలించుకున్నా, వారు మహారాజ అనే బిరుదు వహించలేదని, మహా మండలేశ్వర అని మాత్రమే బిరుదు వహించారని, బుక్కరాయల కుమారుడు రెండవ హరిహరరాయల నుండే వారు మహా రాజాధిరాజ అనే బిరుదులు ధరించారని, కనుక మొదటి ఇద్దరూ మండలేశ్వరులుగానే పరిగణించాలని సీవెల్ అన్నాడు. 1340 నాటి శాసనం హరిహరరాయలను హరియప్ప అని పేర్కొంది. ఇది తక్కువస్థాయి పేరు అని క్రీ.శ.1342లో ఇబన్‌బటూటా హరియబ్, హరిబ్ అని పేర్కొన్నాడు. కనుక వారు సుల్తాన్‌కు భయపడి మహారాజ అనే బిరుదు ధరించలేదని సీవెల్ వ్యాఖ్యానించాడు. కంభంపాటి సత్యనారాయణ హరిహరరాయలు బహమనీ హసన్‌గంగుకు బహమనీ రాజ్యస్థాపనా కాలంలో సహాయపడ్డాడని, తన తమ్ముని సైన్యంతో పంపాడని రాశారు. కాని అది ఎంత వరకు వాస్తవమో తెలియదు. రాయలు 21 సంవత్సరాలు పాలించాడు. అతనికి పుత్రులు లేరు. అందువలన అతని తర్వాత బుక్కరాయలు రాజ్యానికి వచ్చాడు.

బుక్కరాయలు క్రీ.శ. 1357-1377: హరిహరరాయలకు సంతానం లేనందువల్ల అతని మరణానంతరం అతని రెండవ తమ్ముడు బుక్కరాయలు సింహాసనానికి వచ్చాడు. కాని బుక్కరాయల వారసత్వం విషయంలో వివాదం ఉంది. బుక్కరాయలు సోదరులలో హరిహర రాయల తర్వాత వాడు కంపరాయలు. పెద్దవాడు కంపరాయలు ఉండగా రెండవ తమ్ముడైన బుక్కరాయలు రాజు కావడానికి వీలులేదు. కనుక హరిహరరాయలు, కంపరాయలు, అతని తర్వాత అతని కుమారుడు రెండవ సింగముడు పాలించాడని, వారిని తొలగించి బుక్క రాయలు విజయనగర వజ్ర సింహాసనం అధిష్టించి తన అన్న హరిహరరాయల తర్వాత తనకే వారసత్వం వచ్చిందని ప్రకటించుకొని ఉంటాడని కొందరు భావించారు. కాని వాస్తవానికి క్రీ.శ.1346 నుండే బుక్కరాయలు హరిహరరాయలతో కలసి సహపాలకునిగా పాలించాడు. రాజ్య విస్తరణకు అన్నతోపాటు మొదటి నుండి పాటుపడుతున్నాడు.

తొండైమండల ఆక్రమణ: హరిహరరాయల కాలంలో హొయసాల రాజ్యం మొత్తం విజయనగర సామ్రాజ్యంలో కలసిపోయింది. కాని కోరమండల తీరంలోని రాజ్యాలు స్వతంత్రంగా ఉన్నాయి. బుక్కరాయల కాలంలో కోరమండల తీరంలో మూడు రాజ్యాలు ఉన్నాయి. మధుర సుల్తానత్, కంచి రాజ్యం - దీనికి తుండీర రాజ్యం అని, రాజగంభీర రాజ్యం అని కూడా పేర్లున్నాయి. చంద్రగిరి రాజ్యం, కంచి, చంద్రగిరి రాజ్యాలు యాదవ వంశస్తులు పాలించేవారు. ఈ రెండు రాజ్యాలు హొయసాల భల్లాలుని సామంత రాజ్యాలుగా ఉండేవి.

తుండీర రాజ్యం లేక రాజగంభీర లేక కంచి రాజ్యం: మహమ్మద్ బిన్ తుగ్లక్ క్రీ.శ.1323లో మాబారును జయించిన తర్వాత కోరమండల తీరం అంతా అరాచకానికి గురైంది. మధుర సుల్తాన్ కంచి వరకు జయించి తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. కంచి ప్రాంతాన్ని తొండైమండలం అని పిలిచేవారు. ఆ స్థితిలో కాపయనాయకుడు క్రీ.శ.1336లో ఓరుగల్లుపై దండెత్తి ముస్లింలను పారదోలి ఓరుగల్లును ఆక్రమించాడు. తర్వాత భల్లాలునితో స్నేహం చేసి తిరుగుబాటుకు ప్రోత్సహించాడు. భల్లాలుడు కూడా తిరుగుబాటు చేసి సుల్తాన్ ప్రాంతాలు ఆక్రమించడం మొదలుపెట్టాడు. ఆ సందర్భంలో తొండైమండలాన్ని జయించడానికి కాపయనాయకుని సహాయం అర్థించాడు. కాపయనాయకుడు భల్లాలునికి కొంతసేనను పంపాడు. ఓరుగల్లు, ద్వారసముద్ర సైన్యాలు తొండై మండలాన్ని జయించి, శంభువరాయల అనే అతన్ని కంచిలో తమ ప్రతినిధిగా నిలిపారు. అప్పటి నుండి కంచిలో ఒక నూతన రాజ్యం జన్మించింది. ఈ రాజ్యానికి తుండీర రాజ్యం, రాజగంభీర రాజ్యం అని పేరు వచ్చింది. హరిహరరాయల కాలంలో మధుర సుల్తాన్ తుండీర రాజ్యంపై దండెత్తి శంభువరాయుని ఓడించి ఖైదీగా

మధురకు తీసుకువెళ్లాడు. హరిహరరాయలు శంభువరాయుని విడిపించడానికి మధుర సుల్తాన్‌పై దండెత్తాడు. ఉదయగిరి సేనాధిపతి సాళువమంగు, కంపరాయల కుమారుడు సావణ్ణ, బుక్కరాయల కుమారుడు కుమార కంపరాయలు క్రీ.శ.1352-53లలో దండెత్తి మధుర సుల్తాన్‌ను ఓడించి బందీగా పట్టుకొన్నారు. తర్వాత అతనిని సాళువమంగు ద్వంద్వ యుద్ధంలో ఓడించి తర్వాత వధించాడు. శంభువరాయను ఖైదు నుండి విడిపించి కంచి సింహాసనంపై ప్రతిష్ఠించారు. అందువల్ల సాళువమంగుకు సావణ్ణకు శంభూరాయ స్థాపనాచార్య అనే బిరుదు వచ్చింది. క్రీ.శ.1353 నుండి శంభువరాయలు హరిహరుని సామంతునిగా పాలించాడు.

బుక్కరాయలు రాజ్యానికి వచ్చిన తర్వాత క్రీ.శ.1357లో శంభువరాయలు పక్కనే ఉన్న చంద్రగిరి రాజు యాదవ రాయలు స్వతంత్రం ప్రకటించారు. దాంతో ఈ రెండు రాజ్యాలను అదుపులోకి తీసుకురావడానికి బుక్క రాయల తన కుమారుడు కుమార కంపరాయలను నియమించాడు. అతనికి సాళువమంగు, గోపన సేనానుల సహాయంగా యుద్ధానికి వెళ్లారు.

చంద్రగిరి రాజ్య ఆక్రమణ: కుమార కంపణ మొదట చంద్రగిరి రాజ్యంపై దండెత్తాడు. యాదవరాయలు ఓడిపోయాడు. చంద్రగిరి రాజ్యం విజయనగర రాజ్యంలో భాగమైంది. తర్వాత చంద్రగిరి సామ్రాజ్యంలో ఒక ముఖ్య పరిపాలనా కేంద్రంగా చేయబడింది. చివరిదశలో ఆరవీటి వంశస్థుల కాలంలో విజయనగర సామ్రాజ్యానికి రాజధాని కూడా అయింది. చంద్రగిరి రాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత కంపణ తుండీర రాజ్యాంపై దండెత్తాడు.

తుండీర రాజ్య ఆక్రమణ క్రీ.శ.1359-60: తుండీర రాజ్య అధిపతి రాజనారాయణ శంభువరాయలు క్రీ.శ.1357 వరకు విజయనగర రాజ్యానికి విధేయుడుగా ఉన్నాడు. హరిహరరాయల మరణానంతరం అతడు స్వతంత్రం ప్రకటించాడు. అంతేకాక విజయనగర రాజ్యభాగాలను ఆక్రమించసాగాడు. అంతేగాక తనపై విజయనగర సేన దండెత్తుతుందని ఊహించి మధుర సుల్తాన్‌తో చేతులు కలిపి తొండైమండలంలో విజయనగర రాజ్యాన్ని జయించవలసివచ్చిన కారణాలను వివరించింది. మధుర సుల్తాన్ రాజ్యంలోకి విజయనగర సైన్యాలను నడపడానికి తుండీర రాజ్యం అవరోధంగా ఉన్నందువల్ల తుండీర రాజ్యాన్ని జయించవలసి వచ్చిందని పేర్కొంది. కాని శంభురాయల అవిధేయత వల్లనే ఈ రాజ్యంపై దండయాత్ర జరిగిందని పండితుల అభిప్రాయం. కంపరాయలు చంద్రగిరి రాజ్యం జయించిన తర్వాత తుండీర రాజ్యంపై దండెత్తాడు. రాజనారాయణ శంభువరాయలు అతని కుమారుడు వెనుకొండాన్ విజయనగర సేనలతో పోరాడుతూ యుద్ధంలో మరణించారు. వారి మరణంతో రాజగంభీర రాజ్యం లేక తుండీర రాజ్యం క్రీ.శ.1360లో అంతమైపోయింది. వారి రాజ్య ప్రాంతమైన దక్షిణ పెన్న, కొల్లిదం నదుల మధ్య భూమి అంతా విజయనగర రాజ్యంలో కలసిపోయింది. విజయనగర రాజ్య సరిహద్దు మధుర సుల్తాన్ రాజ్యాన్ని తాకింది.

బుక్కరాయల కోడలు కంపరాయల భార్య అయిన గంగాదేవి తన మధుర కావ్యంలో తుంధీర రాజ్యాన్ని జయించవలసి వచ్చిన కారణాలను వివరించింది. మధుర సుల్తాన్ రాజ్యంలోకి విజయనగర సేనలను నడపడానికి రాజగంభీర రాజ్యం అవరోధంగా ఉన్నందున దానిని జయించవలసి వచ్చిందని రాసింది. ఈ వృత్తాంతాన్ని ఆధారంగా తీసుకొని శంభువరాయలు యుద్ధంలో మరణించలేదు. తర్వాత అతనినే తుండీర రాజ్యాధిపతిగా చేసి బుక్కరాయల సామంతుని చేశారని; ఈ సంఘటన క్రీ.శ.1362లో జరిగిందని కొంత మంది పండితులు భావించారు. కాని శంభువరాయలు మరణించాడని తుండీర రాజ్యం విజయనగర రాజ్యంలో కలసిపోయిందనే ఎక్కువ మంది చరిత్రకారులు అంగీకరిస్తారు. ఏమైనా చంద్రగిరి, తుండీర రాజ్యాల ఆక్రమణలలో తొండైమండలం అంతా విజయనగర సామ్రాజ్యంలో చేరిపోయింది.

మధుర సుల్తాన్ అంతం క్రీ.శ.1371-77: గంగాదేవి రచించిన మధురావిజయంలో మధుర రాజ్యంపై దండెత్తడానికి కంపరాయలకు కలిగిన సంకల్పాన్ని గురించి వివరించింది. తుండీర రాజ్యాన్ని జయించిన తర్వాత కంపరాయలు కొన్నాళ్లు కంచిలో ఉన్నాడని, ఆ సమయంలో పాండ్యదేశ దేవత కంపరాయలకు కలలో కనిపించి పాండ్య ఖడ్గాన్ని బహూకరించి మధుర రాజ్యాన్ని జయించమని ఆదేశించిందని అప్పుడు ముస్లిం గవర్నర్ పాలనలో తమిళ దేశంలో హిందూ ప్రజలు పడిన బాధలను కూడా ఆమె వర్ణించింది. హిందూ దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. వేలాది హిందువులు వధింపబడ్డాయి. గోవధ నిరంతరంగా సాగింది. మతాచారాలు ఆగిపోయాయి. దేవాలయాలలో పూజలు ఆగిపోయాయి. హిందువుల ఆస్తులు లాక్కోబడ్డాయి. స్త్రీలపై అత్యాచారాలకు అంతులేదు. ప్రజలు భయభ్రాంతులై తమను రక్షించే వారి కోసం అలమటించారని ఆ కావ్యంలో వర్ణింపబడింది. గంగాదేవి

వర్ణనలను తిరుక్కంకూడి శాసనం కూడా బలపరుస్తోంది. అందువల్ల మధుర రాజ్యాన్ని విముక్తి చేయడానికి కంపరాయలు పూనుకున్నాడు.

మధుర సుల్తాన్ రాజ్యం క్రీ.శ.1323-1372: క్రీ.శ.1323లో జునాఖాన్ మధుర రాజ్యాన్ని జయించి తన సేనాధిపతి అయిన జలాలుద్దీన్ ఎహస్సాషాను మధుర గవర్నర్‌గా నియమించాడు. మధుర రాజ్యాన్ని ముస్లింల మాబార్ అని పేరు పెట్టి పిలువసాగారు. జలాలుద్దీన్ 10 సంవత్సరాలు తుగ్లక్‌లకు విధేయుడుగా పాలించాడు. తర్వాత క్రీ.శ.1335వ సంవత్సరంలో స్వతంత్రం ప్రకటించాడు. సుల్తాన్ అతనిని దండించడానికి ఢిల్లీ నుండి బయలుదేరి ఓరుగల్లు వరకు వచ్చి ప్లేగువ్యాధిలో చిక్కుకుని నక్కి మరలిపోయాడు. దాంతో మధుర రాజ్యం స్వతంత్ర ముస్లిం రాజ్యంగా వెలసింది. జలాలుద్దీన్ సొంత నాణేలు ముద్రించి వాటిపై అల్ హుస్సేన్ అనే బిరుదును రాయించాడు. అల్ హుస్సేన్ మహమ్మద్ ప్రవక్త మనుమడు జలాలుద్దీన్ అల్ హుస్సేన్ వంశస్తుడుగా ప్రకటించుకున్నాడు. అంతే స్వతంత్ర హోదాలో చక్రవర్తిగా ప్రకటించుకొని షా అనే బిరుదు కూడా ధరించాడు. జలాలుద్దీన్ స్వతంత్ర హోదాలో 5 సంవత్సరాలు అంటే క్రీ.శ.1340 వరకు పాలించాడు. క్రీ.శ.1340లో అల్లావుద్దీన్ ఉజాజీ అనే సర్దారు జలాలుద్దీన్‌ను కుట్రతో చంపి మధుర సుల్తాన్ అయ్యాడు. కాని అతడు తనను అమీరులు సుల్తాన్‌గా ఎన్నుకున్నారని ప్రకటించుకున్నాడు. అల్లావుద్దీన్ ఒక్క సంవత్సరం మాత్రమే పాలించాడు. అతడు గొప్పవీరుడు. అనేక హిందూ రాజ్యాలను జయించి అపార ధనరాశులు కానుకలుగా పొందాడు. కాని ఒక యుద్ధంలో అతడు మంచినీరు తాగడానికి శిరస్త్రాణం తీయగా శత్రువుల బాణం అతని తలకు తగిలి మరణించాడట. అతని తర్వాత అతని అల్లుడు కుతుబుద్దీన్ సింహాసనమెక్కి ఫిరోజ్‌షా అనే బిరుదును ధరించాడు. అతడు 40 రోజులు మాత్రమే పాలించాడు. తర్వాత అమీరులు కుట్రతో అతనిని వధించి జలాలుద్దీన్ అల్లుడు గయాజ్ ఉద్దీన్‌ను సుల్తాన్‌ను సుల్తాన్‌గా చేశారు. అతడు ఘాజీదమ్గాన్ షా అనే బిరుదుతో రాజ్యం చేశాడు. అతడు హొయసాల మూడవ భల్లాలుని సమకాలికుడు. భల్లాలుడు మధురలోని సుల్తాన్ రాజ్యాన్ని అంతం చేయాలని మధుర రాజ్యంపై దండెత్తాడు. క్రీ.శ.1342లో భల్లాలుడు తిరుచునాపల్లి దగ్గర ఉన్న కుప్పం వద్ద పోరాడుతూ బందీగా చిక్కాడు. బందీగా ఉన్న భల్లాలుని సుల్తాన్ సోదరుని తమ్ముడు క్రూరంగా వధించాడు. గయాజుద్దీన్ క్రీ.శ.1344 వరకు పాలించాడు. అతడు కుటుంబంతో సహా ప్లేగువ్యాధి సోకి మరణించాడు. 1344 వరకు అతని నాణేలు లభించాయి. తర్వాత అతని మేనల్లుడు నాసిక్ ఉద్దీన్ అనే అతని నాణేలు లభించాయి. కనుక గయాజుద్దీన్ తర్వాత నాసిక్ ఉద్దీన్ సుల్తాన్ అయ్యాడు. అతడు క్రీ.శ.1348 వరకు 4 సంవత్సరాలు పాలించాడు. తర్వాత షన్స్ ఉద్దీన్ ఆదిల్‌షా సుల్తాన్ అయి క్రీ.శ.1359 వరకు పాలించాడు. ఇతని కాలంలో విజయనగర బుక్కరాయల కుమారుడు కుమార కంపణ మధుర రాజ్యంపై దండెత్తాడు. విజయనగర సేనాని సాళువమంగు ద్వంద్వ యుద్ధంలో సుల్తాన్‌ను ఓడించాడని జైమినీ భారతం తెలుపుతోంది. తర్వాత వధించాడని రామాభ్యుదయ కావ్యం వర్ణించింది. అందువల్ల సాళువ మంగుకు వరపక్షి సాళువ అనే బిరుదు ఇవ్వబడింది. మధుర సుల్తాన్ రాజ్యానికి వారసులు లేకపోవడంతో అమీరుల గుల్బర్గా బహమనీ సుల్తాన్ హసన్‌గంగు బహుమన్‌షా వంశంలోని ఫక్రుద్దీన్ క్రీ.శ.1360 నుండి 1372 వరకు పాలించాడు. అతని తర్వాత అల్లావుద్దీన్ సికిందర్‌షా సింహాసనానికి వచ్చాడు. వీరిద్దరి కాలంలో కూడా విజయనగర కంపరాయలు మధురను జయించాడు. కాని రాజ్యం పూర్తిగా స్వాధీనం కాలేదు. సికిందర్‌షా మరికొన్నాళ్లు ప్రతిఘటించాడు. చివరకు అతను కూడా ఓడి తిరుప్పనకుండ్రం కొండలలో తలదాచుకున్నాడు. కుమార కంపణ వెదికి సికిందర్‌షాను పట్టుకొని వధించాడు. దాంతో మధుర సుల్తానత్ అంతమైంది. మధుర రాజ్యం విజయనగర రాజ్యంలో భాగం అయిపోయింది. మధురలో 50 సంవత్సరాల ముస్లిం పాలన అంతమైంది. మధురా విజయం ఏ సంవత్సరంలో జరిగింది అనే విషయంలో కె.ఎ.నీలకంఠశాస్త్రి, టి.వి.మహాలింగం, ఫాదర్ హీరాస్, యన్.కృష్ణస్వామి అయ్యంగార్, ఎ.రంగాచారి, టి.వి. యన్. పండరత్తార్ అనే పండితులలో భేదాభిప్రాయాలున్నాయి. బర్టన్ స్టెయిన్, ఎ.కృష్ణస్వామి క్రీ.శ.1371 మే నెలలో ఫక్రుద్దీన్ ముబారక్‌ను ఓడించి మధుర రాజ్యాన్ని సాధించారని అన్నారు. మధురైత్తంవారు అనే గ్రంథం శక 1293 విరోధికృత్ సంవత్సరంలో మధుర రాజ్యం జయించబడిందని తెలుపుతోంది. ఇది కలియుగ క్రీ.శ.1371వ సంవత్సరం, కాని ఫక్రుద్దీన్ ముబారక్ షాను ఓడించి కంపరాయలు మధురను ఆక్రమించినా, పాండ్య రాజ్యం మాబారు మొత్తం కంపరాయల ఆధీనంలోకి వచ్చినట్లుగా లేదు. ముబారక్ వారసుడు సికిందర్ క్రీ.శ.1378 వరకు ప్రతిఘటిస్తూనే వచ్చాడు. చివరకు రెండవ దేవరాయల కాలంలో అతడు తిరుకుండ్రం కొండలో చిక్కి

వధింపబడ్డాడు. కనుక మధుర సుల్తాన్ రాజ్యం పూర్తిగా క్రీ.శ.1378లో అంతమైనట్లుగా కొందరు భావిస్తారు ఏమైనా మధురావిజయం విజయనగర చరిత్రలో చాలా ప్రాధాన్యతను సంతరించుకుంది. అనిశ్చిత పునాదులపై స్థాపించబడిన విజయనగర రాజ్యం హొయసాలులు సాధించలేని విజయాన్ని సాధించి మధుర దక్షిణదేశ ద్వీపకల్పాన్ని మొత్తం తమ అధీనంలోకి తెచ్చుకొని పాండ్య, చోళ, పల్లవ రాజ్యభాగాలకు విజయనగర ప్రభువులు వారసులయ్యారు. ఇది వారికి తప్పనిసరి అయింది. పైగా బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షా ఓరుగల్లు కాపయనాయకునితో సంధి చేసుకోవడంతో బహమనీ సామ్రాజ్యానికి విజయనగర రాజులు ఏకైక శత్రువులయ్యారు. అంతకు పూర్వం కాపయ నాయకుడు విజయనగరంతో మైత్రిని నెరపాడు. కాని ఇప్పుడు విజయనగరం ఒంటరిగా బహమనీ సుల్తాన్‌లతో పోరాడవలసి వచ్చింది. ఆ స్థితిలో తమకు వెనుక కూడా శత్రువులుంటే నాశనం కావడం ఖాయం. పైగా మధుర కూడా ముస్లిం రాజ్యం కనుక వెనుక ఎవరూ శత్రువులు లేకుండా చేసుకోవడానికి మధురపై 20 సంవత్సరాలు పోరాడి జయించారు. కనుక మధుర దండయాత్ర కాలంలోనే పశ్చిమకోస్తాపై కూడా బుక్కరాయలు సైన్యాలను పంపి జయించకుండా మిగిలి ఉన్న ప్రాంతాలను జయించాడు. ఆ సందర్భంలో మాధవ మంత్రి క్రీ.శ.1369లో గోవాపై దండెత్తి గోవాను కూడా జయించాడు దాంతో తూర్పు పశ్చిమ దిశలలో విజయనగరానికి శత్రుభయం లేకుండా పోయింది. గోవాను ఆనాడు రేవాద్వీపం అని పిలిచేవారు. తమిళదేశం విజయనగ రాజ్యంలో భాగం కావడంతో తెలుగువారు అనేక కుటుంబాలు తమిళ దేశంలోకి వలస వెళ్లాయి. అంతకు పూర్వం చోళుల కాలంలో తమిళులు ఆంధ్రదేశంలోకి వలసవచ్చారు.

మధుర రాజ్యాన్ని జయించిన తర్వాత బుక్కరాయలు కంపరాయలను మధుర రాజ్య ప్రతినిధిగా నియమించాడు కంపరాయల పాలనలో తమిళదేశంలో దేవాలయాలను పునరుద్ధరించబడ్డాయి. మాలిక్ కఫూర్ దండయాత్రా కాలంలో శ్రీరంగంలోని శ్రీరంగనాథుని విగ్రహాన్ని రహస్యంగా తిరపతికి చేర్చారు. అప్పటి నుండి ఆ విగ్రహం తిరుపతిలోనే ఉంది. మధురా విజయం తరువాత తిరుపతిలోని శ్రీరంగనాథుని విగ్రహాన్ని శ్రీరంగానికి తరలించి పునఃప్రతిష్ఠ చేశారు. అలాగే శ్రీరంగం, మధుర, చిదంబరం, రామేశ్వరాలలో దేవాలయాలు తెరిపించి పూజా పునస్కారాలు ఏర్పాటు చేశారు ద్రావిడ దేశం సంతోషంతో ఓలలాడింది. కాని క్రీ.శ.1374వ సంవత్సరంలో కంపరాయలు అకాల మరణానికి గురయ్యాడు. భర్త మరణం తర్వాత గంగాదేవి తన భర్త విజయాలకు కావ్యరూపం ఇవ్వడానికి మధురావిజయాన్ని రచించింది.

తమిళదేశాన్ని జయించిన తర్వాత బుక్కరాయలకు, ఆ తర్వాత విజయనగర రాజులకు దక్షిణ దిక్కువైపు దృష్టి పెట్టవలసిన అవసరం లేకుండా పోయింది. వారి దృష్టి పూర్తిగా తమ ఉత్తర సరిహద్దులలోని రాజ్యాలపై మళ్లింది.

ఉత్తర సరిహద్దు రాజ్యాలు: తమిళ దేశాన్ని జయించడంతో విజయనగర సరిహద్దులు ఈశాన్య దిక్కులో రెడ్డిరాజ్య సరిహద్దులను తాకాయి. తెలంగాణలో వెలమరాజ్యం, పశ్చిమ దక్కనులో బహమనీ రాజ్యం సరిహద్దు రాజ్యాలుగా ఉన్నాయి. తెలంగాణలో క్రీ.శ.1368లో కాపయనాయకుడు పద్మనాయకులతో యుద్ధం చేస్తూ భీమవరం వద్ద మరణించాడు. ఓరుగల్లు పద్మనాయక అనపోతానాయకుని వశమైంది. బహమనీ సుల్తాన్‌లతో స్నేహ సంధి చేసుకొన్నాడు. బహమనీ రాజ్యం విజయనగర రాజ్యానికి బద్ధశత్రువు. వారితో పద్మనాయక రాజ్యం చేరిపోవడంతో పద్మనాయక రాజ్యం కూడా విజయనగరానికి శత్రు రాజ్యంగా మారిపోయింది. తూర్పుకోస్తాలో ఉన్న రెడ్డిరాజ్యం పద్మనాయక బహమనీ రాజ్యలను ఎదుర్కోగల స్థాయిలోలేదు. కనుక పద్మనాయక బహమనీ రాజ్యాలు తీరాంధ్రదేశంలోని రెడ్డిరాజ్యాన్ని కబళించినట్లయితే రాయచూర్, అంతర్వేది ప్రాంతాలలో లాగ ఈశాన్య దిక్కు నుండి కూడా విజయనగరానికి ప్రమాదం ముంచుకు రావచ్చని బుక్కరాయలు ఊహించాడు. రెడ్డి రాజ్యం విజయనగర రాజ్యానికి శత్రువు కాకపోయినా రెడ్డి రాజ్యాన్ని తన అదుపులో ఉంచుకోవాలని, ఇంకా వీలయితే కృష్ణా నది వరకు దక్షిణాంధ్ర మొత్తాన్ని విజయనగర సామ్రాజ్యంలో కలిపివేసి మొత్తం మహాబళేశ్వరం నుండి తూర్పున కృష్ణానది సముద్రంలో కలిసే వరకు కృష్ణానదినే తన రాజ్యానికి సరిహద్దుగా చేయాలని బుక్కరాయలు సంకల్పించాడు. ఈ సంకల్పం బుక్కరాయలు రెడ్డి రాజ్యంపై దండెత్తడానికి దోహదం చేసింది. అంతేగాక మరొక కారణం కూడా ఉంది. పల్లవుల కాలం నుండి దక్షిణాంధ్ర దేశం కోసం వేంగి రాజవంశాలకు తమిళదేశ వంశాలకు సంఘర్షణ జరుగుతూ వస్తుంది. పల్లవుల వారి తర్వాత వారికి వారసులైన చోళులు, తర్వాత వారికి వారసులైన పాండ్యులు కృష్ణానది పర్యంతం వరకు దక్షిణాంధ్రదేశాన్ని ఆక్రమించడానికి అనేక యుద్ధాలు చేశారు

కనుక మొదటి నుండి తొండై మండలాన్ని ఏలిన రాజ వంశాలన్నీ కృష్ణాతీరం వరకు తొండై మండల రాజ్యంలోదే, అంటే పూర్వపు పల్లవ రాజ్యంలోని భాగం అనే భావనతో ఉండేవి. అందువల్ల వారు వీలయినప్పుడల్లా కృష్ణాతీరం వరకు తమ రాజ్యాన్ని విస్తరించడానికి ప్రయత్నం చేసేవారు. వేంగి రాజ్యం ఒకటే ఆంధ్ర రాజ్యంగా భావించబడేది. కనుక వేంగి ఆధిపత్యం వహించిన వంశాలన్నీ తొండైమండల రాజ వంశాలతో తలపడేవి. ఈ విధంగా వేంగి వంశాలకు, తొండై మండలాన్ని పాలించిన రాజ వంశాలకు దక్షిణాంధ్రపై ఆధిపత్యం కోసం సంఘర్షణ జరుగుతూ వచ్చింది. ఇప్పుడు బుక్కరాయలు తొండై మండలానికి వారసుడయ్యాడు. కనుక కృష్ణా తీరం వరకు తన ఆధిపత్యంలోకి రావాలని తలచాడు. అంతేగాక విద్యారణ్యులు కృష్ణకు దక్షిణ భాగం అంతా విరూపాక్షునిదని చెప్పాడు. కనుక కృష్ణానది వరకు తూర్పుకోస్తా కూడా తమకే చెందుతుందని విజయనగర రాజులు భావించారు. కృష్ణదేవరాయలు ప్రతాపరుద్ర గజపతిని ఓడించి కటకం వరకు జయించినా, కృష్ణానది ఉత్తర భాగమంతా తిరిగి గజపతికి ఇచ్చాడు. కృష్ణానదికి దక్షిణ భాగాన్ని మాత్రమే విజయనగర రాజ్యంలో కలుపుకున్నాడు. కనుక బుక్కరాయల కాలం నుండి చివరి వరకు విజయనగర రాజులు దక్షిణాంధ్ర మొత్తం కృష్ణానది వరకు తమదేనని భావించాడని స్పష్టంగా తెలుస్తోంది కనుక రెడ్డి రాజ్యాన్ని జయించి విజయనగర ఆధిపత్యం కిందికి తీసుకురావాలని బుక్కరాయలు సంకల్పించి రెడ్డి రాజ్యంపై దండయాత్రను పంపాడు

రెడ్డిరాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1363-1372: బుక్కరాయలు కొండవీటి రాజులైన అనపోతారెడ్డి, అనమేమారెడ్డి సమకాలికుడు. తొండైమండలంలోని చంద్రగిరి, కంచి రాజ్యాలను జయించిన మధుర సుల్తాన్‌తో పోరాటం ప్రారంభమైన తర్వాత బుక్కరాయలు రెడ్డిరాజ్యంపై కూడా సైన్యాలను పంపాడు. ఈ సైన్యాలు రెడ్డి రాజ్యంలోని శ్రీశైలం, త్రిపురాంతకం మొదలైన అనేక ప్రాంతాలు జయించి వినుకొండ వరకు వచ్చాయి. ఈ దండయాత్ర క్రీ.శ.1363-64లో జరిగిందని భావిస్తారు. ఆ కాలంలో అనపోతారెడ్డి రెడ్డిరాజ్యాన్ని పాలిస్తున్నాడు. వినుకొండ అతని రాజధాని అద్దంకికి అతి సమీపంలో ఉంది దాంతో అనపోతారెడ్డి తన రాజ్యానికి భద్రతలేదని భయపడి క్రీ.శ.1364లో రాజధానిని కొండవీటికి మార్చాడు. క్రీ.శ.1364లోనే అనపోతారెడ్డి మరణించాడు. అతని తర్వాత అతని తమ్ముడు అనవేమారెడ్డి రాజ్యానికి వచ్చి క్రీ.శ.1386 వరకు పాలించాడు ఇతని కాలంలో కూడా వినుకొండ, నర్సరావుపేట వరకు దక్షిణ ప్రాంతాలన్నీ విజయనగర రాజ్యంలోనే ఉన్నాయి. చాంగలవీడులో క్రీ.శ. సంవత్సరం 1294 అంటే క్రీ.శ. 1372 నాగి శాసనం ఉంది. ఈ శాసనాన్ని విజయనగర సేనాధిపతి నర్సరావుపేట ప్రాంతంలోని ఒక గ్రామాన్ని దానం చేసి వేయించాడు. ఈ శాసనాన్ని బట్టి క్రీ.శ.1372 వరకు ఈ ప్రాంతాలు విజయనగర సామ్రాజ్యంలో భాగాలుగానే ఉన్నాయని స్పష్టపడుతుంది. కనుక బుక్కరాయల మరణం వరకు ఈ ప్రాంతాలన్నీ విజయనగర సామ్రాజ్యంలోనే ఉన్నాయని చెప్పవచ్చును. ఈ విజయాలతో బుక్కరాయలు యావత్ దక్షిణా పథానికి చక్రవర్తి అయ్యాడు.

బహమనీ రాజ్యంతో యుద్ధాలు: క్రీ.శ.1358 ఫిబ్రవరి 2వ తేదీన హసన్‌గంగు బహమన్ మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు మొదటి మహమ్మద్‌షా బహమనీ గద్దెనెక్కాడు. ఇతని కాలంలో బుక్కరాయలు, అంతకుముందు బహమన్‌షా కాలంలో పోగొట్టుకున్న రాజ్యభాగాలను సంపాదించాలని భావించాడు. బహమన్‌షా మరణించినందువల్ల నూతనంగా రాజ్యానికి వచ్చిన మహమ్మద్‌షా కాలంలో ఆ ప్రాంతాలు సంపాదించడం సులభమని భావించాడు. అలాగే హసన్‌గంగు చేతిలో రెండు పర్యాయాలు ఓడిపోయి ఉత్తర తెలంగాణ ప్రాంతాలు పోగొట్టుకున్న కాపయనాయకుడు కూడా అదేవిధంగా ఆశించాడు. వీరిద్దరూ కలసి ఏకకాలంలో మహమ్మద్‌షాను బెదిరించారు. బుక్కరాయలు బహమనీ రాజ్యంతో పోరాడాడు. ఫెరిష్టా ఈ యుద్ధానికి రెండు కారణాలు చెప్పాడు, ఏకకాలంలో వరంగల్లు కాపయనాయకుడు విజయనగర బుక్కరాయలు, అతని తండ్రి కాలంలో ఆక్రమించిన వారి భూభాగాలను తిరిగి అప్పగించాలని, లేకపోతే తాము బహమనీ రాజ్యంపై దండెత్తుతామని రాయబారాలు పంపారు. అప్పుడు ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షా తుగ్లక్ దక్కనుపై దండెత్తే ప్రయత్నంలో ఉన్నాడు. ముహమ్మద్‌షా తుగ్లక్ దండయాత్రకు బయపడి కాపయనాయకుడు, బుక్కరాయల రాయబారులకు ఏమీ చెప్పకుండా 18 మాసాలు వారిని గుల్బర్గాలో ఉంచి అతిథి మర్యాదలు చేశాడు. ఒకటిన్నర సంవత్సరాల తర్వాత ఫిరోజ్ తుగ్లక్ దక్కనుపై దండెత్తడం లేదని తెలిసింది. తన రాజ్యంపై ఢిల్లీ దండయాత్ర లేదని తెలిసిన తర్వాత కాపయనాయకుడు, బుక్కరాయలు తమకు కప్పం చెల్లించాలని చెప్పి రాయబారులను పంపించి వేశాడు. అందుకు కోపగించి కాపయనాయకుడు, బుక్క రాయలు యుద్ధానికి సిద్ధపడ్డారు. మరొక కారణం కూడా ఉంది. బహమనీ సుల్తాన్‌లు

బంగారు నాణేలను విడుదల చేసేవారు. ఆ నాణేలను హిందూ వర్తకులు కరిగించేవారు. దానికి హిందూ వ్యాపారులు అనేక మందిని సుల్తాన్ వధించమని ఆజ్ఞ జారీ చేశాడు. అంతేగాక అరబ్బు వ్యాపారులు తాము బహమనీ రాజ్యానికి తెచ్చే మేలు రకపు గుర్రాలను ఓరుగల్లు, విజయనగరరాజులు బలవంతంగా లాక్కొంటున్నారని సుల్తాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కారణాలన్నిటివల్ల సుల్తాన్ బుక్కరాయలు 20 వేల సైన్యాన్ని ఓరుగల్లు పంపాడు. కాపయనాయకుని కుమారుడు వినాయక దేవుడు విజయనగర సేనను ఓరుగల్లు సేనను కలిపి బహమనీ రాజ్యంపై దండెత్తి కౌలాస్ దుర్గాన్ని ఆక్రమించాడు. దాంతో సుల్తాన్‌కు ఓరుగల్లు రాజ్యానికి యుద్ధం ప్రారంభమైంది. ముహమ్మద్‌షా పెద్ద సైన్యంతో దండెత్తి వినాయకదేవుని ఓడించి కౌలాస్ దుర్గాన్ని పునరాక్రమించాడు. వినాయక దేవుడు ఓడి వెనుదిరిగి వెలమ పట్టణం అనే దుర్గంలోకి ప్రవేశించాడు. సుల్తాన్ అది తెలుసుకొని వెలమపట్టణాన్ని ముట్టడించి వినాయకదేవుని ఓడించి, వినాయకదేవుని అతిక్రూరంగా వధించాడట. కుమారుని మరణవార్త విని కృంగిపోయిన కాపయ నాయకుడు ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్‌షాను బహమనీ రాజ్యంపై దండెత్తమని, తాను సహాయపడతానని రాయబారిని పంపాడు. కాని ఫిరోజ్‌షా తుగ్లక్ కాపయనాయకుని ఆహ్వానాన్ని తిరస్కరించాడు. అది తెలిసి ముహమ్మద్‌షా మండిపడి మళ్లీ ఓరుగల్లు రాజ్యంపై దండెత్తి కాపయనాయకుని ఓడించాడు. గత్యంతరం లేక కాపయనాయకుడు సంధి చేసుకొని 13 లక్షల హోన్నులు, మూడు వందల ఏనుగులు, రెండు వందల గుర్రాలు, గోల్కొండ కోటను, నీలి వజ్రపు సింహాసనాన్ని ముహమ్మద్‌షాకు సమర్పించాడు. అంతేగాక భవిష్యత్తులో ఓరుగల్లు రాజ్యంపై సుల్తాన్ దండెత్తనని వాగ్దానం చేశాడు. కాని ఈ సంధితో బుక్కరాయలకు ఎలాంటి ప్రమేయం లేదు.

బహమనీ రాజ్యంతో యుద్ధం క్రీ.శ.1366: ముహమ్మద్‌షా, కాపయనాయకుడు ఇచ్చిన నీలివజ్రపు సింహాసనాన్ని తన రాజధానికి తీసుకువెళ్లి క్రీ.శ.1365 మార్చి 21వ తేదీన అధిష్టించాడు. ఆ సమయంలో ఉత్సవాలు జరిపాడు. ఆ ఉత్సవాలకు ఢిల్లీ నుండి గాయకులను పిలిపించి గానా బజానా జరిపించాడు. ఆ సంతోష సమయంలో విపరీతంగా తాగి ఆ మైకంలో గాయకులకు విజయనగర ఖజానా నుండి నజరానాలు ఇవ్వవలసిందిగా ఆజ్ఞా పత్రాన్ని జారీ చేశాడు. అది ప్రమాదమని తెలిసిన అతని వజీరు ఆ పత్రాన్ని విడుదల చేయలేదు. మరుసటి రోజు అది తెలిసిన సుల్తాన్ వజీరును పిలిచి తాను ఉద్దేశ పూర్వకంగానే ఆజ్ఞాపత్రాన్ని జారీ చేశానని చెప్పాడు. దాంతో వజీరు ఆ పత్రంపై రాజముద్రను వేసి రాయబారిని విజయనగరం పంపాడు. అది చూసి బుక్కరాయలు మండిపడి పత్రాన్ని తెచ్చిన రాయబారిని గాడిదపై ఊరేగించి గుల్బర్గా పంపాడు. ముహమ్మద్ యుద్ధానికి వస్తాడని తలచి తానే ముందుగా సైన్యాలతో బయలుదేరి ముద్గల్‌ను ముట్టడించి ఆక్రమించాడు. దాంతో బహమనీ రాజ్యంతో యుద్ధం వచ్చింది. బుక్కరాయలు ముద్గల్‌ను ఆక్రమించాడని తెలుసుకున్న సుల్తాన్ తన సేనను ముద్గల్ వైపు నడిపాడు. సుల్తాన్ సైన్యం అక్కడికి బుక్కరాయల సైన్యం ఓడి ఆదవాని పారిపోయిందని పెరిష్టా రాశాడు. యుద్ధం తర్వాత చిక్కిన 70 వేల మంది హిందువులను స్త్రీ పురుష భేదం లేకుండా సుల్తాన్ నరికించాడని కూడా రాశాడు.

ఆదోని కౌథాల్ యుద్ధం క్రీ.శ.1366 జూలై 23 వ తేదీ: సుల్తాన్ గుల్బర్గా నుండి మరికొంత సేనను తెప్పించుకొని ఆదవానివైపు నడిచాడు. ఉభయ సైన్యాలు కౌథాల్ వద్ద తారసిల్లాయి. విజయనగర సైన్యానికి బుక్కరాయలు మేనల్లుడు నడిగొంట మల్లనాథుడు నాయకత్వం వహించి అద్భుతంగా పోరాడాడు. గుల్బర్గా సేనాధిపతులైన ఇసాఖాన్ మూసాఖాన్‌లు యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. దాంతో ముహమ్మద్‌షా స్వయంగా యుద్ధరంగంలో పోరాటానికి వచ్చాడు. అతడు తన శతఘ్ని దళాన్ని నడిపే ముకారిజ్‌ఖాన్‌ను విజయనగర సైన్యంపై గుళ్లవాన కురిపించమని ఆజ్ఞాపించాడు. ఆ గుండ్లధాటికి విజయనగర సైన్యం చెల్లాచెదురైంది. తర్వాత చెదురుమదురుగా పోరాటం జరిగిందట. దానిని విజయనగర సైనికులు గాయపరచారట. అది ఘీంకరిస్తూ వారిని తొక్కివేయసాగింది. ఆ సందర్భంలో విజయనగర సేనాధిపతి మల్లనాథుడు తన ఏనుగుపై నుండి కిందపడ్డాడు. సైనికులు వెంటనే అతనిని మోసుకొని దూరంగా వెళ్లిపోయారు. దాంతో విజయనగర సేన పారిపోతుందని వారిని వెంటాడి వధించమన్నాడు. ఆ స్థితిలో బుక్కరాయలు తన సైన్యంతో దగ్గరలోని అడవులలోకి ప్రవేశించాడు. తర్వాత అతడు విజయనగరం వైపు వెళ్లిపోయాడు. అది గమనించిన సుల్తాన్ తన సైన్యంతో వచ్చి హిందూ ప్రజలను ఐదు లక్షల మందిని వధించాడని పెరిష్టా వివరించాడు. ప్రజల హాహాకారాలు తెలిసిన బుక్కరాయలు సంధికి దిగివచ్చాడని ముహమ్మద్‌షా తను జారీచేసిన ఆజ్ఞాపత్రంలోని ధనాన్ని చెల్లించాలని

పట్టుబట్టాడని, అందుకు బుక్కరాయలు అంగీకరించడంతో సంధి కుదిరిందని ఫెరిష్తా రాశాడు. సంధికి వచ్చి బుక్కరాయల రాయబారులు యుద్ధ సమయాలలో అమాయక ప్రజలను వధించడం అన్యాయమని చెప్పగా సుల్తాన్ అందుకు అంగీకరించి భవిష్యత్తులో ప్రజలను వధించనని వాగ్దానం చేశాడట వారికి జరిగిన సంధి ప్రకారం ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా అంగీకరించారు. కాని కృష్ణానదికి దక్షిణాన కొన్ని మహలులు ఉభయ రాజ్యాల ఉమ్మడి పర్యవేక్షణలో ఉండాలి యుద్ధ ఖైదీలను ఉభయులూ విడుదల చేయాలి. భవిష్యత్తులో యుద్ధాలు జరిగినా ప్రజలను వధించరాదని అంగీకరింపబడింది. ఫెరిష్తా ఈ యుద్ధాలను వర్ణిస్తూ ప్రతి యుద్ధంలో బుక్కరాయలు ఓడిపోయాడని బహమనీ సేనలు విజయాలు సాధించాయని అతిశయోక్తులుగా రాశాడు. అలాగే సయ్యద్ ఆలీతబుతబ అనే అతడు కూడా అలాగే రాశాడు అతడు సుల్తాన్ బుక్కరాయలనోడించి అతని భూములు ఆక్రమించి అనేక దేవాలయాలను ధ్వంసం చేశాడని రాశాడు. కాని వీరి రచనలను చరిత్రకారులు నమ్మలేదు బుక్కరాయలు ఓడిపోయి ఉంటే సుల్తాన్ కృష్ణానదిని సరిహద్దుగా అంగీకరించడు. కనుక అతడు బుక్కరాయలపై విజయాలు సాధించి రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించి ఉండాలి. అతనిని కదిలించలేకనే సుల్తాన్ కృష్ణానదిని సరిహద్దుగా అంగీకరించి ఉంటాడు. అంతర్వేదిలోని కొన్ని ప్రాంతాలలోనైనా తనకు పట్టు ఉండాలని, కొన్ని మహళ్లు ఉమ్మడి రచనలను తిరస్కరించారు. అది వాస్తవమని కొన్ని ఆధారాలున్నాయి. నడిమిదొడ్డిపాలెం రాజుల చరిత్ర విజయనగర సేనాధిపతి మేసా తిమ్మానాయుడు సుల్తాన్ సేనను ఓడించి అనేక మంది ముస్లిం సేనానులను చంపి విజయం సాధించాడని, అందువల్ల విజయలక్ష్మితో బుక్కరాయలు విజయనగరం చేరుకున్నాడని వర్ణిస్తోంది. అలాగే శాలివాహన శకం 1286లో అంటే క్రీ శ 1364లో బుక్కరాయలు ఉత్తరాదిన ముస్లింలతో యుద్ధాలు చేసి విజయాలు సాధించినట్లు స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. కనుక బుక్కరాయలు యుద్ధంలో ఓడిపోలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఈ సంధి తర్వాత ముహమ్మద్‌షా కాలంలో యుద్ధాలు లేవు. తిరిగి అతని కుమారుడు ముజాహిద్ కాలంలో మళ్లీ యుద్ధం వచ్చింది.

ముజాహిద్ కాలంలో సంఘర్షణ క్రీ.శ.1375-77: ముహమ్మద్‌షా క్రీ శ.1375లో మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు ముజాహిద్‌షా గుల్బర్గా సింహాసనం అధిష్టించి మూడు సంవత్సరాలు పాలించాడు. అతడు రాజ్యానికి రాగానే సరిహద్దు వివాదాన్ని లేవదీశాడు, అతడు బుక్కరాయలకు ఒక లేఖను రాసి కృష్ణా తుంగభద్రా నదుల మధ్య ప్రాంతంలోని కోటలు ఉభయ రాజ్యాల ఉమ్మడి పర్యవేక్షణలో ఉన్నందువల్ల సంఘర్షణ అనివార్యమవుతుంది, గనుక ఆ ప్రాంతమంతా ఖాళీ చేసి వెళ్లాలనీ, అందులో కోటలన్నీ బంకాపూర్‌తోసహా బహమనీ రాజ్యానికి అప్పగించాలనీ రాశాడు. అందుకు సమాధానంగా బుక్కరాయలు రాయచూరు, ముద్గల్, అంతర్వేది ప్రాంతం అంతా పూర్వపు అనెగొంది వంశానికి చెందుతుంది. కాబట్టి అవి విజయనగర రాజ్యానికే చెందుతాయనీ కనుక సుల్తానే ఆ ప్రాంతాల నుండి వైదొలగాలని సమాధానం పంపాడు. అంతేగాక అతని తండ్రి ముహమ్మద్‌షా తీసుకెళ్లిన ఏనుగులను కూడా తిరిగి ఇవ్వాలని రాశాడు దాంతో ముజాహిద్‌షా విజయనగర రాజ్యంపై దండెత్తాడు. ముజాహిద్‌షా దౌలతాబాద్, బీదర్, బీరార్ సైనికులతో పెద్ద సేనను పోగుచేసి దానిని మూడు విభాగాలుగా విభజించి వాటిలో ఒక భాగాన్ని విజయనగరాన్ని ముట్టడించడానికి, రెండవ భాగాన్ని ఆదవానిని ముట్టడించడానికి, మూడవ భాగాన్ని గంగావతికి పంపాడు. బుక్కరాయలు బహమనీ సేనతో ప్రత్యక్షంగా తలపడకుండా తన సేనతో విజయనగరానికి దక్షిణంగా ఉన్న అడవులలోకి రామేశ్వరం కాదు. హోస్పేటకు 23 కిలోమీటర్ల దూరంలో తుంగభద్రానది ఒడ్డున హడగల్లి ఉండగా బుక్కరాయల ఆరోగ్యం పాడైపోయింది. అందువల్ల అతడు విజయనగరం చేరి కోట తలుపులు మూయించాడు. ముజాహిద్ కోట వద్దకు చేరి రాయల నివాసం చుట్టూ ఉన్న కోట సమీపంలో ఉన్న చెరువు వద్దకు చేరాడు. అక్కడ ఉన్న దేవాలయాన్ని ముస్లిం సైనికులు దోచుకున్నారు. అది చూసిన విజయనగర సేనాధిపతి సుల్తాన్‌పైకి తన సైన్యాన్ని పంపాడు. ఇంతలో రాష్ట్రాల నుండి మరొక 20 వేల సైన్యం వచ్చి విజయనగర సేనను చేరింది. అక్కడ బహమనీ, విజయనగర సేనలు భయంకరంగా పోరాడాయి. విజయనగర సేనల శౌర్యప్రతాపాలతో ముస్లిం సైనికులు వేలాదిగా మరణించాడు. దాంతో భయపడిపోయిన సుల్తాన్ పిన తండ్రి దావూద్ తాను పోరాడే స్థానాన్ని వదిలి ముజాహిద్ ఉన్న వైపుకు పారిపోయాడు. దాంతో విజయనగర సైన్యం వెంటపడింది. ప్రమాదాన్ని గ్రహించిన ముజాహిద్ కూడా తన సేనతో వెనుకకు పారిపోయాడు. ఈ విధంగా విజయనగర కోట వద్ద జరిగిన యుద్ధంలో బహమనీ సేన ఓడి పలాయనం చిత్తగించింది. తర్వాత ముజాహిద్ ఆదవాని కోటకు చేరి కోటను ముట్టడించాడు.

కాని ఆదవాని లొంగలేదు. ఇక లాభం లేదని ముజాహిద్ ముట్టడి మానివేసి గుల్బర్గా బయలుదేరాడు. కాని మార్గ మధ్యంలో అతని పిన తండ్రి దావూద్ క్రీ.శ.1378 ఏప్రిల్ 16వ తేదీన సుల్తాన్ గుడారంలో ప్రవేశించి నిద్రలో ఉన్న సుల్తానును వధించాడు. తర్వాత దావూద్ గుల్బర్గా చేరి తనను సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. ఈ విధంగా మూడు సంవత్సరాల పాలనతో ముజాహిద్ పరిపాలన ముగిసింది. ముజాహిద్ విజయనగర కోట వద్ద ఓడిపోయి వెనుదిరిగిన కొన్ని రోజులకే క్రీ.శ.1377లో బుక్కరాయలు మరణించాడు.

బుక్కరాయలు కడుసమర్థుడు. అతడు తన అన్న హరిహరరాయలు ప్రారంభించిన విజయ యాత్రలు పూర్తి చేసి విజయనగర రాజ్యాన్ని బలిష్టంగా రూపొందించాడు. రాజ్యం ఉత్తరాన కృష్ణానది వరకు విస్తరించింది. మిగిలిన మూడువైపుల సముద్రాలే హద్దులయ్యాయి. బుక్కరాయలు దక్షిణదేశానికంతటికీ అధిపతి అయ్యాడు. కాని అతడు కూడా మహారాజ అనే బిరుదు వహించలేదు. న్యూనిజ్ అతనిని బుక్కరావు అని పేర్కొన్నాడు. కనుక రాబర్ట్ సీవెల్ బుక్కరాయలు ఛీఫ్ కూడా అని వర్ణించాడు. బుక్కరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని విశాలపరచడమేగాక పటిష్టమైన పరిపాలనను విభజించాడు. విజయనగర సామ్రాజ్యంలో రాష్ట్రాలను రాజ్యాలని పిలిచేవారు.

1. ఉదయగిరి రాజ్యం. ఇందులో నెల్లూరు, కడప జిల్లాలుండేవి.
2. బళ్లారి, మైసూరు ప్రాంతంలోని ఉత్తర భాగాలు, అనంతపురం ప్రాంతాలను కలిపి పెనుగొండ రాజ్యంగా రూపొందించాడు.

పెనుగొండ దుర్గాన్ని బుక్కరాయలు ప్రధానమంత్రి అనంతరాయలు నిర్మించాడు. మైసూరులో కొంతభాగం సేలం, దక్షిణ ఆర్కాటు జిల్లాలను కలిపి ముళువాయి రాజ్యం ఏర్పాటు చేశాడు. బనవాసి, గోవా, చంద్రగుప్తిలను కలిపి అరగ మాలెనాడు అనే రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు. బారాకూరు మంగుళూరు ప్రాంతాలను కలిపి తుళువ రాజ్యంగా చేశాడు. తిరుపతి తిరుమల పరిసర ప్రాంతాలను కలిపి చంద్రగిరి రాజ్యం రూపొందింది. చెంగల్పట్టు, కంచి, ఉత్తర ఆర్కాటు జిల్లాలు కలిపి రాజగంభీర రాజ్యంగా చేయబడింది. ఈ రాజ్యాలకు రాజకుమారులు, సమర్థులు, విశ్వాసపాత్రులైన దండనాయకులను మంత్రులను పాలెగాండ్రుగా నియమించాడు.

బుక్కరాయలు అన్న హరిహరరాయలతోనే రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సేనాధిపతిగా, రాష్ట్రపాలకునిగా, రాజుగా తన బాధ్యతను చక్కగా నెరవేర్చాడు. బహమనీ రాజ్యంతో జరిగిన యుద్ధాలలో కష్టనష్టాలు, అపజయాలు వచ్చినా కృంగిపోక దృఢ దీక్షతో పోరాడి విజయనగర రాజ్యాన్ని కాపాడాడు. బహమనీ రాజ్యాన్ని ఎదిరించి నిలబడగలిగిన సైనిక శక్తిని తన రాజ్యానికి సమకూర్చాడు. కాకతీయ, హొయసాల సామ్రాజ్య భారాన్ని తన భుజస్కంధాలపై వేసుకొని విజయనగర రాజ్యాన్ని హిందూధర్మ రక్షక రాజ్యంగా తీర్చిదిద్దాడు. అందువల్ల బుక్కరాయలకు హిందూరాయ సురత్రాణ త్రిసముద్రాధిపతి అనే బిరుదులు వచ్చాయి. ఒక శాసనంలో అతడు కృష్ణావతారం అని వర్ణింపబడింది. నాశనం చేయగా హిందూ శాఖలన్నీ సమానమని, ఉభయుల ఐకమత్యంతో ఉండాలని చెప్పి వైష్ణవుల చేత తిరిగి జైన దేవాలయాన్ని పునర్నిర్మాణం చేయించాడు. జైన, వైష్ణవ ధర్మ శాసనాన్ని చెక్కించి రాజ్యంలో అనేక ప్రదేశాలలో ప్రతిష్టించాడు. వైదికమతాన్ని పటిష్టపరచడానికి విద్యారణ్యులను కాశీ నుండి రప్పించి వేదాలకు భాష్యాలు రాయించాడు. విద్యారణ్యుల ఆధ్వర్యంలో అనేక పండితులు హిందూ గ్రంథాలను పునఃసమీక్షించి రాశారు. విద్యారణ్యుడు శాయణుడు, భోగనాథుడు, సర్వదర్శన సంగ్రహం, పరాశరమాధవీయం, సుభాషిత సుధానిధి మొదలైన అనేక గ్రంథాలు రచించాడు. అవి చాలా ప్రామాణికమైన గ్రంథాలు. బుక్కరాయల కాలంలో అనేక దేవాలయాలు పునరుద్ధరించబడ్డాయి. వాటికి అనేక అగ్రహారాలు దానాలు ఇవ్వబడ్డాయి. బుక్కరాయలకు వేద భాష్య కారుడైన శాయణాచార్యులు, ఉపనిషన్మార్గ ప్రవర్తకుడైన మాధవుడు మంత్రులు. వైదిక మతాన్ని ఆదరించినందువల్ల బుక్కరాయలకు వైదికమార్గ ప్రవర్తక అనే బిరుదు కూడా వచ్చింది. గంగాదేవి బుక్కరాయలు ధర్మపాలనలో మనువు రాసింది. బుక్కరాయలు నాచనసోముని పోషించి తెలుగు భాషకు విజయనగర ఆస్థానంలో స్థానం కల్పించాడు. అతనికి పెంచుకందిన్నె అగ్రహారంగా ఇచ్చాడు. బుక్కరాయలు విదేశాలతో సంబంధాలు నెరపాడు. అతడు క్రీ.శ1374లో చైనాకు రాయబారాన్ని పంపాడు. ఆ కాలంలో చైనాను మింగ్ చక్రవర్తి తాయ్‌త్సుకు పాలిస్తున్నాడు. మింగ్ ఆస్థాన రాతలలో బుక్కరాయల రాయబారి ప్రస్తావన ఉంది.

రెండవ హరిహరరాయలు (క్రీ.శ.1377-1404: బుక్కరాయలకు అనేక మంది కుమారులు ఉన్నారు. పట్టమహిషి గౌరాంబికకు జన్మించిన రెండవ హరిహరరాయలను బుక్కరాయలు తన వారసునిగా నియమించాడు.

బుక్కరాయల మరణానంతరం క్రీ.శ 1377లో రెండవ హరిహరరాయలు విజయనగర వజ్ర సింహాసనం అధిష్టించి క్రీ.శ.1404 వరకు అలాంటి బిరుదులు ధరించిన మొట్టమొదటి విజయనగర చక్రవర్తి ఇతడే. వీరకంపరాయల అభిషేక నామమే రెండవ దేవరాయలని బి.యస్ యల్.హనుమంతరావు భావించాడు. కాని కంపరాయలు క్రీ శ.1374లో మరణించాడు. కనుక అతడు కాదని భావించడానికే వీలుంది

రెండవ హరిహరరాయలు సింహాసనం అధిష్టించడానికి కొంత మంది దాయాదులు వ్యతిరేకించారు. కొందరు తిరుగుబాటు చేశారు. ఉద్దగిరి విరూపణ్ణ అరగ రాజ్యంలో రెండవ తిరుగుబాటు చేశారు. తుండీర, చోళ, పాండ్య రాజ్యాధిపతులు, మరికొందరు సామంతులు కూడా తిరుగుబాటు చేశారు. తుండీర, చోళ, పాండ్య రాజ్యాధిపతులు, మరికొందరు సామంతులు కూడా తిరుగుబాటు చేసి రాయల అధికారాన్ని ధిక్కరించారు. కనుక రాయలు త్వరితగతిన తిరుగుబాట్లను అణచాడు అని నేలటూరి వెంకటరమణయ్య రాశారు. తనపై తిరుగుబాటు చేసిన రాష్ట్రాధిపతులు, దాయాదులను, వారిని సమర్ధించిన కుమారులను తొలగించి వారిస్థానాలలో తన కుమారులను నియమించి రాజ్యాన్నంతటినీ కట్టుదిట్టం చేసి తన ఆధిపత్యంలోకి తెచ్చాడు ఈ చర్యలో భాగంగా తమిళ ప్రాంతాలపై అధిపతిగా ఉన్న కంపరాయల కుమారుడైన జమ్మనను తొలగించి తన కుమారుడైన విరూపాక్ష రాకుమారుని తమిళ దేశంపై అధిపతిగా నియమించాడు. అతడు స్వతంత్రులు కావడానికి ప్రయత్నించిన తుండీర, చోళ, పాండ్య రాజ్యాధిపతులను ఓడించి వారిని అదుపులోకి తెచ్చి సామ్రాజ్యం ఐక్యతను కాపాడాడు. తర్వాత అతడు సింహళంపై దండెత్తి సింహళరాజును ఓడించి కప్పం వసూలు చేశాడు ఇతని కాలంలోనే మొదటిసారిగా సింహళ రాజ్యానికి విజయనగర రాజ్యానికి పోరాటం జరిగింది అలాగే ఉదయగిరి యువరాజు రెండవ బుక్కరాయలను అధిపతిని నియమించాడు. మిగిలిన ప్రాంతాల్లో కూడా తనకు విశ్వాసపాత్రులైనవారు, సమర్థులైన వారిని నిమించాడు. ఈ విధంగా సామ్రాజ్యంలోని అన్ని ప్రాంతాలను తన ఆధిపత్యంలోకి తెచ్చుకొని సామ్రాజ్యాన్ని పటిష్టపరచాడు. అతడి అధికారానికి ఎదురులేకుండా పోయింది.

రెండవ హరిహరరాయలు రాష్ట్ర పరిపాలకులుగా దాయాదులను తొలగించి రాష్ట్రపాలనలో నూతన విధానం ప్రవేశపెట్టినట్లే భూమిశిస్తు విధానాన్ని కూడా మార్చాడు. పరాశర మాధవీయం మొదలైన శాస్త్ర గ్రంధాల ప్రకారం తన భూమిశిస్తు విధానాన్ని సవరించాడు. అతడు భూమిని సర్వే చేయించాడు. పొలంలో నాటే విత్తనాలను ఆధారంగా చేసుకొని పండే పంటను ఊహించి ఆ పంటకు వెలను నిర్ణయించి శిస్తును నిర్ణయించారు. భూమిశిస్తు పంటలో 2 $^1/_2$ వంతుగా నిర్ణయించారు. కొలమానమైన కుర్తికి 1 పగోడాగా సువర్ణ ఆదాయంగా నిర్ణయించాడు. దేవాలయాల భూముల నుండి బ్రాహ్మణ అగ్రహారాల నుండి 4వ వంతు పంటను శిస్తుగా నిర్ణయించాడు. సాధ్యమైనంత వరకు శిస్తు సువర్ణాదాయంగానే వసూలు చేయమని ఆదేశించాడు. ఒక కుర్తికి ఒక పగోడాగా నిర్ణయింపబడింది.

రెండవ హరిహరరాయల కాలంలో ఉత్తర సరిహద్దులోని రాజ్యాల రాజకీయలలో మార్పు వచ్చింది. కనుక అతడు ఆ మార్పులకు తగిన విధంగా తన విదేశీ విధానాన్ని కూడా మార్చుకున్నాడు. బుక్కరాయల కాలంలో క్రీ శ.1368వ సంవత్సరంలో కాపయనాయకుడు పద్మనాయకులతో జరిగిన యుద్ధంలో మరణించాడు. అతని మరణం తర్వాత అనపోతానాయకుడు ఓరుగల్లును స్వాధీనం చేసుకొని తెలంగాణ అంతటికీ ప్రభువయ్యాడు. అతడు బహమనీ సుల్తాన్‌లతో సంధి చేసుకొని వారికి మిత్రుడయ్యాడు. అంతేగాక ఉత్తరాంధ్రలో కాపయ నాయకునికి చెందిన పిఠాపురం, కోరుకొండ, రాజమహేంద్రవరం, వేంగి ప్రాంతాలు తమ అధికారంలోకి రావాలని భావించాడు. కాని ఆ ప్రాంతాలపై కొండవీటి అనపోతారెడ్డి, అనవేమారెడ్లు దండెత్తి తమ ఆధిపత్యంలోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. అనపోతానాయకుడు కాపయ నాయకునికి వారసుడయ్యాడు కనుక ఆ ప్రాంతాలు తనకు చెందాలని ఆశించాడు. అందువల్ల ఓరుగల్లు రాచకొండ వెలమ రాజ్యానికి కొండవీటి రెడ్డి రాజ్యానికి తీవ్ర సంఘర్షణ ప్రారంభమైంది. వెలమ రాజ్యానికి బహమనీ రాజ్యం అండదండలున్నాయి. కనుక రెడ్డి రాజ్యం వారి దాడుల నుండి తట్టుకోలేకపోతే కోస్తా ఆంధ్ర బహమనీ వెలమ రాజ్యాల కూటమి చేతిలోకి పోవచ్చుని, అందువల్ల తూర్పు కోస్తా నుండి విజయనగర రాజ్యానికి ముప్పు తప్పదని రెండవ హరిహరరాయలు భావించి రెడ్డి రాజ్యాన్ని తన ఆధిపత్యంలోకి తీసుకురావాలని కోరాడు. అవసరమైతే రెడ్డిరాజ్యాన్ని జయించి కృష్ణానది వరకు విజయనగర రాజ్యంలో కలపాలని కూడా యుద్ధాలకు దిగాడు. బహమనీ రాజ్యంతో వైరం ఉండనే ఉంది. కనుక ఇతని కాలంలో బహమనీ, వెలమ, రెడ్డిరాజ్యాలతో విజయనగర రాజ్యానికి అనేక పోరాటాలు జరిగాయి.

పద్మనాయక, బహమనీ మైత్రి విజయనగరానికి విచ్ఛిన్నకరమైనది. కనుక వారి మైత్రి విచ్ఛిన్నం చేయాలని హరిహర రాయలు సంకల్పించి పద్మనాయక రాజ్యంపై దండయాత్ర చేయాలని తీర్మానించుకున్నాడు. అందువల్ల విజయనగర రాజ్యానికి, రాచకొండ పద్మనాయక రాజ్యానికి మధ్య రెండు యుద్ధాలు జరిగాయి.

రెడ్డి రాజ్యంపై దండయాత్ర: బుక్కరాయల కాలంలో రెడ్డిరాజ్యంపై దండెత్తి వినుకొండ వరకు జయించారు. వినుకొండ, రెడ్డి రాజ్యానికి రాజధాని అయిన అద్దంకి అతి సమీపంలో ఉంది. కనుక అనపోతారెడ్డి తన రాజధానికి భద్రతలేదని భయపడి తన రాజధానిని కొండవీటికి మార్చుకున్నాడు. కాని పోయిన ప్రాంతాలను సాధించలేక పోయాడు అనపోతారెడ్డి క్రీ.శ.1364లో మరణించాడు. అతని తమ్ముడు అనవేమారెడ్డి సింహాసనానికి వచ్చాడు 1377లో బుక్కరాయలు మరణించాడు. అతని కుమారుడు రెండవ హరిహరరాయలు సింహాసనానికి వచ్చాడు అతడు సింహాసనానికి వచ్చిన తొలి రోజులలో అతనిపై అతని దాయాదులు తిరుగుబాటు చేశారు. అదే అదనుగా తీసుకొని అనవేమారెడ్డి విజయనగర రాజ్యంపై దండెత్తి శ్రీశైలం వరకు తిరిగి జయించాడు. శ్రీశైలంలో వీరశిరో మండపాన్ని నిర్మించి అక్కడ శాసనం వేయించాడు. హరిహరరాయలు తన రాజ్యంలో తిరుగుబాట్లను అణచి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఇదే సమయంలో క్రీ.శ.1386వ సంవత్సరంలో అనవేమారెడ్డి మరణించాడు రెడ్డి రాజ్యంలో కుమారగిరిరెడ్డికి, పెదకోమటి వేమారెడ్డికి వారసత్వ యుద్ధం వచ్చింది. ఆ సమయంలో హరిహర రాయలు, అనవేమారెడ్డి జయించిన ప్రాంతాలను తిరిగి వశం చేసుకోవడానికి రెడ్డిరాజ్యంపై దండయాత్ర చేశాడు. ఉదయగిరిలో ప్రతినిధిగా ఉన్న తన పెద్ద కుమారడు దేవరాయలను రెడ్డిరాజ్యంపై దండెత్తమని ఆదేశించాడు దేవరాయలు తన సైన్యంపై దండెత్తి శ్రీశైలం, త్రిపురాంతకం, వినుకొండ, అద్దంకిలను జయించాడు. ఈ విజయాలు క్రీ.శ.1386-1390 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చును.

పద్మనాయక వెలమ రాజ్యంపై దండయాత్రలు క్రీ.శ. 1390-1397: విజయనగర సైన్యాలు రెడ్డిరాజ్యంపై దండెత్తి శ్రీశైలం, త్రిపురాంతకాలను ఆక్రమించడం వెలమరాజ్యానికి కన్నెర్ర అయింది. ఆ ప్రాంతాలను వారు ఆక్రమించాలని కోరిక ఉంది. హరిహరరాయలకు కూడా పద్మనాయకులు బహమనీ రాజ్యంతో స్నేహసంబంధాలు పెట్టుకోవడం ఇష్టం లేదు. అది విజయనగర రాజ్యానికి ముప్పు అని భావిస్తున్నాడు. కనుక అతడు వెలమ రాజ్యంపై దండయాత్ర చేయాలని తీర్మానించుకున్నాడు. దాని ఫలితంగా వెలమ రాజ్యంపై విజయనగరం రెండు దాడులు చేసింది.

మొదటి దండయాత్ర క్రీ.శ.1390: మొదటి దండయాత్ర క్రీ.శ.1390కి ముందు జరిగింది. అంటే రెడ్డిరాజ్య ఆక్రమణ తర్వాత వెంటనే జరిగింది. ఈ దండయాత్రకు యువరాజు ఇమ్మడి బుక్కరాయలు సాళువ రామదేవుడు, నాయంకరుడు కంపణ నాయకత్వం వహించారు. వీరిసైన్యం కృష్ణను దాటి తెలంగాణలో అడుగుపెట్టి కొత్తకొండ వరకు పురోగమించాయి. వెలమరాజు అనపోతానాయకుడు విజయనగర సేనకు భయపడి బహమనీ సుల్తాన్ సహాయం అర్థించాడు. బహమనీ సుల్తాన్ అతనికి సహాయంగా కొంత సేనను పంపాడు. వారి సంయుక్తసేన కొత్త కొండ వద్ద విజయనగర సేనను ఎదుర్కొన్నాయి. అక్కడ యుద్ధంలో విజయనగర సేనలు ఓడిపోయాయి. విజయనగర సేనాధిపతి సాళువ రామనాథుడు మరణించాడు. కాని యువరాజు బుక్కరాయలు బహమనీ సైన్యాన్ని ఓడించి తరిమాడు అని వైద్య రాజవల్లభం అనే కావ్యం తెలుపుతోంది. అయినప్పటికీ విజయనగర రాజ్యానికి ఈ యుద్ధం వల్ల ఎలాంటి ప్రయోజనం కలుగలేదు. వెలమలు, బహమనీ మైత్రిని వదులుకోలేదు.

రెడ్డిరాజ్యంపై రెండవ యుద్ధం: ఇంతలో హరిహరునికి రెడ్డిరాజ్యంతో యుద్ధం వచ్చింది. రెడ్డిరాజ్యంలో కుమారగిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి ఒక అంగీకారానికి వచ్చారు. దాని ప్రకారం కుమారగిరిరెడ్డి కొండవీటి సింహాసనం అధిష్ఠించాడు. కుమారగిరి తన బావ మరిది కాటమవేమారెడ్డిని తన ప్రధాన మంత్రిగా చేసుకొని విజయనగరం ఆక్రమించిన భాగాలను తిరిగి జయించమని పంపాడు. కాటయ వేమారెడ్డి విరోధం కన్నా మైత్రి మంచిదని భావించి యుద్ధ విరమణ చేసి సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం శ్రీశైలాన్ని తాను ఉంచుకొని త్రిపురాంతకం వరకు, అంతకుముందు జయించిన అంటే అద్దంకి, వినుకొండలను రెడ్డిరాజ్యానికి తిరిగి ఇచ్చివేశాడు. దాంతో రెడ్డిరాజ్యానికి, విజయనగర రాజ్యానికి త్రిపురాంతకం సరిహద్దు అయింది. కోస్తాలో నెల్లూరు జిల్లా కావలి వద్ద ఉన్న కృష్ణపట్నం వరకు విజయనగరంలోను, దానికి ఉత్తర ప్రాంతమంతా రెడ్డిరాజ్యానికి చెందేటట్లు అంగీకరించారు. ఆ తర్వాత హరిహరరాయలు రెడ్డిరాజ్యంతో బంధుత్వం కూడా ఉంటే మంచిదని తన

కుమార్తె హరిహరాంబికను కాటయ వేమారెడ్డికిచ్చి వివాహం చేశాడు. దాంతో విజయనగర రెడ్డిరాజ్యాలు బంధుమిత్ర రాజ్యాలయ్యాయి.

వెలమరాజ్యంపై రెండవ దండయాత్ర క్రీ.శ.1397: రెడ్డిరాజ్యంతో సంధి ముగిసిన తర్వాత హరిహర రాయలు వెలమరాజ్యంపై తిరిగి దృష్టిని నిలిపాడు. కొత్త కొండవద్ద జరిగిన పరాజయానికి ప్రతీకారంగా రెండవ దండయాత్రను క్రీ.శ.1397లో పంపాడు ఈసారి విజయనగర సైన్యానికి ఇరుగప్ప దండనాథుడు, దండనాథ గుండ, యువరాజు దేవరాయలు నాయకత్వం వహించారు. ఈ సైన్యం ఆలంపూరుపై దండెత్తి ఆక్రమించి తర్వాత కృష్ణను దాటి దేవరకొండ రాజ్యంపై దండెత్తింది. అనపోతానాయకుని తమ్ముని పెద్ద వేదగిరిని ఆక్రమించింది. తర్వాత విజయనగర సైన్యం నల్లగొండ జిల్లాలోని పానుగల్లు దుర్గాన్ని ముట్టడించింది అనపోతానాయకుడు బహమనీ సుల్తాన్‌కు సహాయం అర్థించాడు. కాని అదే సమయంలో ముజాహిద్‌షా తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ మహమ్మద్ షా క్రీ.శ.1397లో మరణించాడు. బహమనీ సైన్యం రాలేదు. దాంతో విజయనగర సేనాని ఇరుగప్ప దండనాథుడు పానుగల్లు జయించాడు తర్వాత విజయనగరసేన కరీంనగర్ జిల్లాలోని కాళేశ్వరం వరకు విజయపరంపరలతో నడిచింది. కాళేశ్వరం వద్ద క్రీ.శ.1397నాటి విజయనగర శాసనం ఉంది ఈ విధంగా రెండవ దండయాత్రలో పద్మనాయక రాజ్యాన్ని విజయనగర సేనలు అల్లకల్లోలం చేశాయి. దానికి ప్రతీకారంగా తర్వాత వెలమలు ఉదయగిరిపై దండెత్తారు కాని విజయనగర సేనలు వారిని తరిమివేశాయి ఈ యుద్ధంలో దేవరాయల కుమారుడు రామచంద్రరాయలు ప్రముఖ పాత్ర నిర్వహించాడు

బహమనీ రాజ్యంతో యుద్ధాలు క్రీ.శ.1377-1399: ముజాహిద్‌కి, రెండవ హరిహరరాయలకు పోరాటం జరిగిందని కొందరు భావిస్తారు. కాని అది వాస్తవం కాదు. కాకపోతే రెండవ హరిహరరాయలు యువరాజుగా ఉన్నాడు. బుక్కరాయల మరణానంతరం క్రీ.శ.1378లో ముజాహిద్ హత్యకు గురయ్యాడు విజయనగర ముట్టడి కాలంలో దావూద్ పారిపోయి తప్పు చేశాడని సుల్తాన్ ముజాహిద్ ఆక్షేపించినందుకు పగ బట్టి ముజాహిద్‌ను క్రీ.శ.1398 ఏప్రిల్ 16వ తేదీన దావూద్ హత్య చేశాడు తర్వాత అతడు గుల్బర్గా చేరి తనను సుల్తాన్‌గా ప్రకటించుకున్నాడు. కాని అతడు ఒక్క నెల మాత్రమే రాజ్యం చేశాడు. అతనికి వ్యతిరేకంగా ముజాహిద్ సోదరి రుహుపర్వర్ ఆగా రహస్యంగా కుట్ర చేసి దావూద్‌ను చంపించింది దావూద్ కుమారుని గుడ్డివాడిగా చేసింది తర్వాత అల్లావుద్దీన్ చివరి కుమారుడైన మహమ్మద్‌ను సింహాసనం ఎక్కించింది. అతడు క్రీ.శ 1378లో రెండవ మహమ్మద్‌గా సుల్తానయ్యాడు. అతడు శాంతికాముకుడు. దానిని ఆసరాగా తీసుకొని హరిహరరాయుల రాయచూరు అంతర్వేది మీదకు దండెత్తాడు. తర్వాత అతని సేనాని మాధవమంత్రి గోవాపై దండెత్తి గోవాను ఆక్రమించాడు. దాంతోపాటే చౌల్, దేభల్‌లు కూడా వశమయ్యాయి. అందువల్ల అతనికి భువనైక వీరుడు అనే బిరుదు వచ్చింది. పశ్చిమతీరం విజయనగర ఆధీనంలోకి రావడంతో విజయనగర సామ్రాజ్యానికి విదేశీ వ్యాపారం పెరిగి సుంకాల రూపంలో ఆదాయం పెరిగింది. పశ్చిమతీరంలో కూడా కృష్ణా నది సరిహద్దు అయింది. క్రీ.శ.1397లో రెండవ మహమ్మద్ మరణించాడు. అతని మరణం తర్వాత ఫిరోజ్‌షా సుల్తాన్ అయ్యాడు. అతడు రాజ్యానికి రాగానే రెండవ మహ్మద్‌షా కాలంలో బహమనీ రాజ్యానికి వచ్చిన మచ్చను తొలగించడానికి కృష్ణాతీరంపై దండెత్తి విజయనగర సేనలను ఓడించి తరిమాడని, అనేక మంది హిందువులను వధించాడని, 10 లక్షల హొన్నులను నష్ట పరిహారంగా వసూలు చేశాడని ఫెరిష్తా రాశాడు. అంతేగాక వారు సంధి చేసుకున్నారని, ఆ సంధిలో పూర్వం లాగా ఉభయ రాజ్యాలకు కృష్ణానదే సరిహద్దుగా ఉండాలని, యుద్ధకాలంలో సామాన్య ప్రజలను వధించరాదని అంగీకరించారని కూడా రాశాడు. కాని రెండు సంవత్సరాల తర్వాత రాయలకు గుజరాత్ మాళ్వా సుల్తాన్‌ల స్నేహం లభించి కప్పం కట్టడం మానివేశాడని కూడా రాశాడు. ఫెరిష్తా రచనలు ఎంత వరకు వాస్తవమో తెలియదు. అదే వాస్తవం అయితే రెండవ హరిహరరాయలు తన చివరి కాలంలో బహమనీ సుల్తాన్ చేతిలో పరాజయం పొందాడని భావించాలి. ఈ సంఘటన క్రీ.శ.1399లో జరిగిందని భావించారు.

రెడ్డి రాజ్యంపై మూడవ దండయాత్ర క్రీ.శ.1400-1402: రెడ్డిరాజ్యంలో కుమారగిరిరెడ్డి కుమారుడు అనపోతారెడ్డి మరణించాడు. ఆ దుఃఖంలో కుమారగిరిరెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని కాటయ వేమునికి ఇచ్చాడు. అది సహించక పెదకోమటి వేమారెడ్డి కుమారగిరిపై తిరుగుబాటు చేశాడు. రెడ్డిరాజ్యంలో తిరిగి వారసత్వ యుద్ధం మొదలైంది. పరిస్థితులు పెద్దకోమటి వేమారెడ్డికి అనుకూలంగా మారాయి. కాటయ వేమారెడ్డికి ప్రతికూలంగా ఉన్నాయి. కనుక హరిహరరాయలు ఆగ్రహం చెంది తనకు వ్యతిరేకి అయిన పెదకోమటి

వేమారెడ్డిని దెబ్బతీయడానికి కొండవీటి రాజ్యంపై మూడవ దండయాత్రను పంపాడు. ఈ దండయాత్రను యువరాజు ఉదయగిరి పాలకుడు అయిన దేవరాయలు నడిపాడు. అతడు రెడ్డిరాజ్యంలోని మోటుపల్లిని ఆక్రమించాడు. ఈ లోపల పెదకోమటి వేమారెడ్డి కుమారగిరిని తరిమివేశాడు. కనుక క్రీ.శ.1402వ సంవత్సరంలో హరిహరరాయలు తన సేనాని అయిన చౌండసేనానిని పంపాడు. పెదకోమటి వేమారెడ్డి సేనాని గజరావుతిప్ప విజయనగర సేనలను ఎదుర్కొని కొండవీటిని కాపాడాడు. దాంతో పెదకోమటి వేమారెడ్డి నిలదొక్కుకున్నాడు.

తీవ్రక్షామం: రెండవ హరిహరుని కాలంలో దేశంలో తీవ్రమైన క్షామం వచ్చింది. మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలు విపరీతంగా నష్టపడ్డాయి. లక్షలాది ప్రజలు మరణించారు. దీనిని దుర్గాదేవి కరువు అని పేర్కొన్నారు ఇది క్రీ.శ.1391 నుండి 1403 వరకు 12 సంవత్సరాలు కొనసాగింది. మహారాష్ట్రంలో అతి తీవ్రంగా వ్యాపించి బహమనీ సుల్తాన్ రెండవ మహమ్మద్‌షా తన సొంత ఖర్చులతో 10 వేల ఎద్దబండ్లతో మాళవ, గుజరాత్‌ల నుండి ధాన్యం తెప్పించి చౌకగా ప్రజలకు సరఫరా చేశాడట. కృష్ణాగోదావరి మధ్య భాగంలో 30 సంవత్సరాలు ఆదాయం పడిపోయిందట. ఈ కరువు విజయనగర రాజ్యంపై పెద్దగా ప్రభావం చూపలేదు.

విజయనగర తొలి రాజులలో రెండవ హరిహరాయల స్థానం చాలా గొప్పది. అతని కాలంలో విజయనగర సామ్రాజ్యం నలు దిక్కులకు విస్తరించి మహా సామ్రాజ్యంగా రూపొందింది. కృష్ణా, తుంగభద్ర అంతర్వేది, ఉత్తర కర్ణాటక కొంకణ దేశాలు ఆంధ్రదేశంలో శ్రీశైలం, త్రిపురాంతకం, అద్దంకి, మోటుపల్లి ప్రాంతాలు విజయనగర సామ్రాజ్యంలో భాగాలయ్యాయి. పశ్చిమతీరం స్వాధీనం కావడంతో రేవు పట్టణాల ద్వారా విదేశీ వ్యాపారం అభివృద్ధి చెందింది. రెండవ హరిహరరాయలు విద్యారణ్యుడు అతనికి క్రీ.శ.1386 వరకు ప్రధాన మంత్రిగా పని చేశాడు. తర్వాత అతని సోదరుడు శాయణాచార్యులు ప్రధాన మంత్రిగా పని చేశాడు. శైవమత గురువు కాశీవిలాస క్రియాశక్తి అతని కుల గురువు. ఇరుగప్ప దండనాయకుడు ప్రధాన సేనాధిపతి ఆ తర్వాత రెండవ హరిహర రాయలు క్రీ.శ.1404లో మరణించాడు. అతని మరణానంతరం అతని కుమారుల మధ్య విజయనగర చరిత్రలో మొట్టమొదటిసారిగా వారసత్వ కలహం జరిగింది.

రెండవ బుక్కరాయలు క్రీ.శ.1404-1406: రెండవ హరిహరరయాల మరణం తర్వాత యువరాజుగా ఉన్న బుక్కరాయలని తోసిరాజని విరూపాక్షుడు సింహాసనం ఆక్రమించాడు. కొద్ది కాలంలోనే బుక్కరాయలు విరూపాక్షుని తొలగించి సింహాసనానికి వచ్చి రెండు సంవత్సరాలు పాలించాడు. క్రీ.శ.1406వ సంవత్సరంలో రెండవ హరిహరరాయల చిన్న కుమారుడైన దేవరాయలు బుక్కరాయలను తొలగించి విజయనగర సింహాసనం అధిష్టించాడు.

మొదటి దేవరాయలు క్రీ.శ.1406-1422: మొదటి దేవరాయలు 16 సంవత్సరాలు పాలించాడు. ఇతనిని శాసనాలు ప్రతాపదేవరాయలు, ప్రౌఢ దేవరాయలని పేర్కొంటున్నాయి. రాజకుమారునిగా ఉన్నకాలంలో పౌర సైనిక శాఖలలో శిక్షణ పొందాడు. సమరనీతిలో, దౌత్యనీతిలో ప్రజ్ఞావంతునిగా కీర్తి పొందాడు. ఉదయగిరి పాలకునిగా గొప్ప పరిపాలనానుభవం సంపాదించాడు. కనుక ఇతని కాలంలో విజయనగర రాజ్యం ఇంకా బలపడింది. ఇతడు బహమనీ రెడ్డిరాజ్యాల విషయంలో తన తండ్రి విధానాన్నే అవలంబించాడు.

బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో యుద్ధం క్రీ.శ.1406: మొదటి దేవరాయలు రాజ్యానికి రాగానే బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో యుద్ధం వచ్చింది. బహమనీ సుల్తాన్‌లలో ఫిరోజ్‌షా గొప్పవాడు. ఇతడు బహుభాషా కోవిదుడు. గొప్ప యుద్ధవీరుడు గుల్బర్గా నుండి పాలించిన బహమనీ సుల్తాన్‌లలో ఇతడే చివరివాడు. ఫిరోజ్‌షా విజయనగరంపై దండెత్తడానికి ముస్లిం చరిత్రకారులు మూడు కారణాలు రాశారు. ఇది హిందూ రాజ్యంపై ఫిరోజ్‌షా ప్రకటించిన జీహాద్ అని సయ్యద్ అలీ తబతబ రాశాడు. దేవరాయలు గుజరాత్ మాళ్వా సుల్తాన్‌ల స్నేహం సంపాదించి సుల్తాన్‌ను లెక్కచేయకుండా రెండవ హరిహరరాయల కాలంలో అంగీకరించిన కప్పం చెల్లించలేదని, దానిని వసూలు చేయడానికి యుద్ధం చేశాడని నిజాముద్దీన్, ఫెరిష్టాలు రాశారు. ఫెరిష్టా ప్రత్యేకంగా మరొక కారణం రాశాడు. ముద్గల్‌లో పెర్తాల్ అనే ఒక అందమైన కంసాలి అమ్మాయిని స్వంతం చేసుకోవాలని దేవరాయలే ముద్గల్‌పై దాడి చేశాడని, అందువల్ల ఫిరోజ్ యుద్ధానికి దిగాడని ఫెరిష్టా ఒక కథను రాశాడు ముద్గల్‌లో ఒక స్వర్ణకారునికి పెర్తాల్ అనే కూతురు ఉంది. ఆమె గొప్ప సౌందర్యవతి. ఆమెకు విద్యను బోధించడానికి ఆ కంసాలి ఒక బ్రాహ్మణుని నియమించాడు. ఆ బ్రాహ్మణుడు ఆమె సౌందర్యానికి అచ్చెరువొంది

విజయనగరం వెళ్లి ఆ అమ్మాయి సౌందర్యాన్ని వర్ణించి దేవరాయలకు ఆమె తన అంతఃపురంలో ఉండదగిందని చెప్పాడట. దాంతో ఆమెను తనకు వివాహం చేయించమని బహుమతులిచ్చాడట అతడు ముద్గల్ చేరి పెర్తాల్ తల్లితండ్రులకు ఆ వార్త చెప్పగా వారు చాలా సంతోషించి వివాహానికి అంగీకరించారు. కాని పెర్తాల్ రాయలతో వివాహాన్ని అంగీకరించలేదు. అందుకు కారణం రాయల అంతఃపురం చేరితే తన స్నేహితులను, బంధువులను కలుసుకోవడానికి వీలులేదని బందిఖానా అవుతుందని ఆమె వివాహాన్ని తిరస్కరించిందట దాంతో బ్రాహ్మణుడు తిరిగి విజయనగరం చేరి రాయలకు ఆ మాట చెప్పాడు దాంతో రాయలు నిరాశపడ్డాడు కాని అంత అందమైన అమ్మాయిని ఎలాగైనా తన సొంతం చేసుకోవాలని 30 వేల సైన్యంతో ముద్గల్‌పై దండెత్తాడు. కాని ఆ కంసాలి కుటుంబం రాయల రాకను తెలుసుకొని ముద్గల్ విడిచి వెళ్లిపోయింది రాయలకు పెర్తాల్ కనిపించకపోవడంతో అక్కడ రాయల సైన్యం అల్లకల్లోలం చేయసాగింది. అది తెలిసి సుల్తాన్ ఫిరోజ్ విజయనగరంపై దండెత్తాడు. సుల్తాన్ బంకాపూర్, ఆదవాని కోటలను జయించి విజయనగర కోటను ముట్టడించాడు. తన రాజధానిపై దండెత్తాడని తెలిసిన దేవరాయలు తన రాజధాని చేరి సుల్తాన్‌తో పోరాడి ఓడిపోయాడని, కప్పం చెల్లించడమేగాక తన కూతురినిచ్చి సుల్తాన్‌కు వివాహం చేసి బంకాపురాన్ని అరణంగా ఇచ్చాడని పెరిష్టా రాశాడు. అంతేగాక సుల్తాన్ రాయలు మర్యాదగా వెంటరాలేదని కోపగించి సుల్తాన్ మళ్లీ యుద్ధం చేశాడని కూడా రాశాడు. తర్వాత సుల్తాన్ తన రాజ్యం చేరి పెర్తాల్‌ని పిలిపించుకొని చూసి ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను తన కుమారుడు హసన్‌కు ఇచ్చి వివాహం జరిపించాడని రాశాడు. కాని పెరిష్టా రచనలను ఎవరూ నమ్మలేదు. న్యూనిజ్ దేవరాయలు, బహమనీ సుల్తాన్ ఎడతెగని యుద్ధాలు చేశాడని రాశాడుగానీ, తన కుమార్తెను సుల్తాన్‌కిచ్చి వివాహం చేశాడని గాని, కప్పం చెల్లించాడని గాని రాయలేదు. కాని చరిత్రకారులు ఫిరోజ్‌కు దేవరాయలకు యుద్ధం జరిగింది, ఈ యుద్ధంలో రాయలు ఓడిపోయాడని, రాయచూర్ జిల్లాలోని వాయవ్య సరిహద్దులోని ముసలికల్లు, ఖానూరు దుర్గాలను దేవరాయలు కోల్పోయినట్లు కనిపిస్తోందన్నారు మొత్తం మీద దేవరాయలకు, ఫిరోజ్‌షాకు క్రీ.శ.1406-1407 సంవత్సరాల మధ్య మొదటి యుద్ధం జరిగిందని అంగీకరించవచ్చును

కొండవీటి రెడ్డి రాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1410-1411: దేవరాయలు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా పోరాడే సమయంలో కొండవీడును పాలించే పెద్దకోమటి వేమారెడ్డి విజయనగర రాజ్యంపై దండెత్తి రెండవ హరిహర రాయల కాలంలో ఆక్రమించిన రెడ్డిరాజ్య భాగాలను జయించాలని విజయనగర రాజ్యంపై దండెత్తాడు. మోటుపల్లి మొదలైన ప్రాంతాలను తిరిగి జయించాడు అందువల్ల దేవరాయలు తిరిగి ఆ ప్రాంతాలు జయించడానికి సైన్యాన్ని పంపాడు. ఈ దండయాత్రకు వెలగోటి తిప్పానాయకుడు అనే సేనాని నాయకత్వం వహించాడు. అతడు రెడ్డి రాజ్యంపై దండెత్తి కొచ్చర్లకోట వద్ద రెడ్డి సైన్యాన్ని ఓడించి కొన్ని ప్రాంతాలను తిరిగి ఆక్రమించాడు. కొచ్చర్ల కోట వద్ద శక 1332 అంటే క్రీ శ 1410 సంవత్సరం నాటి శాసనం ఉంది కొచ్చర్లకోట అద్దంకి దగ్గరగా ఉంది. కనుక విజయనగర సైన్యాలు తిరిగి అద్దంకి వరకు పెదకోమటి- వేమారెడ్డి రాజ్యాన్ని ఆక్రమించాయని చెప్పవచ్చును.

కందుకూరు రెడ్లు విజయనగరంపై దండయాత్ర క్రీ.శ.1413-1414: కొచ్చర్లకోట యుద్ధానికి ప్రతీకారంగా పెదకోమటి వేమారెడ్డి తన సామంతులైన కందుకూరు రెడ్డి పాలెగాండ్రను విజయనగరంపై దండు పంపినట్లుగా కనిపిస్తోంది. కందుకూరు సేన ఉదయగిరి రాజ్యంపై దండెత్తి పొత్తపినాడు, పులుగునాడులను ఆక్రమించారు. దాంతో దేవరాయలు మళ్లీ రెడ్డి రాజ్యంపై రెండవ దండయాత్ర చేసి కందుకూరు రెడ్లను ఓడించి కందుకూరు రాజ్యాన్ని విజయనగర సామ్రాజ్యంలో కలిపాడు. దాంతో కందుకూరు రెడ్డి రాజ్యం విజయనగర సామంత రాజ్యంగా మారిపోయి చివరి వరకు కొనసాగింది. దాంతో పెదకోమటి వేమారెడ్డి తన రాజ్యంలోని దక్షిణ భాగాలను కోల్పోయాడు.

కొండవీడు-రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాల సంఘర్షణ క్రీ.శ.1415-1417: కుమారగిరిరెడ్డి మరణానంతరం రెడ్డి రాజ్యం రెండుగా చీలిపోయింది. కొండవీడులో సింహాసనం ఎక్కిన పెదకోమటి వేమారెడ్డిని కాటయవేమారెడ్డి రాజుగా గుర్తించలేదు. దాంతో పెదకోమటి వేమారెడ్డి రాజమహేంద్రవర రెడ్డి రాజ్యాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకోవాలని తీర్మానించాడు. ఇదే సందర్భంలో వేంగిరాజ్యంలో అన్నెదేవచోడుడు కాటయ వేమారెడ్డి అధికారాన్ని సవాలు చేశాడు. పెదకోమటి వేమారెడ్డి అన్నెదేవుని సమర్థించాడు. అన్నెదేవుడు, పెదకోమటి వేమారెడ్డి ఒకటి అయిపోయారు. వారి నుండి తన రాజ్యాన్ని రక్షించుకోవడానికి కాటయవేమారెడ్డి

విజయనగరం వెళ్లి దేవరాయలను దర్శించి సహాయం చేయమని కోరాడు. దేవరాయలు అంగీకరించాడు విజయనగరం కాటయ వేమారెడ్డికి సహాయంగా వస్తుందని తెలుసుకున్న పెదకోమటి వేమారెడ్డి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా, కొండవీడు పెదకోమటి వేమారెడ్డి, అన్నెదేవుడు ఒక కూటమిగా ఏర్పడ్డారు. కాటయవేమారెడ్డి విజయనగర దేవరాయలు ఒక కూటమిగా అయ్యారు. రెండు కూటాలకు యుద్ధం ప్రారంభమైంది. యుద్ధాలు క్రీ.శ.1415లో ప్రారంభమై క్రీ.శ.1417లో ముగిసినట్లుగా కనిపిస్తోంది. ఫిరోజ్‌షా కోస్తా రాజకీయాలను తనకు అనుకూలంగా మలచుకోవాలని తన సేనను పంపాడు. ఈ సైన్యం తెలంగాణ గుండా కోస్తా చేరింది. సుల్తాన్ మిత్రులైన పద్మనాయక వెలమలు సుల్తాన్‌కు సహాయం చేశారు. సూల్తాన్ సైన్యం మార్గ మధ్యంలో చాలా ప్రాంతాలు జయించుకుంటూ రాజమహేంద్రవరం చేరింది. కృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాలోని ప్రాంతాలు జయించుకుంటూ రాజమహేంద్రవరం చేరింది. కృష్ణాజిల్లాలోని నందిగామ తాలూకాలోని వేదాద్రిలో క్రీ.శ 1417 జులై 18న తేదీ నాటి శాసనం ఒకటి ఉంది ఆ శాసనం సుర్ఖుమల్ల జైనాది బదయలు ఓదపల్లి వజీరాబాద్‌లను పాలిస్తున్నాడని నిడమలుమంక సింగరాజుకొండను పాలిస్తున్నాడని తెలుపుతోంది. వీరిద్దరూ ముస్లిం పాలకులు ఫిరోజ్‌షా సర్దారులు క్రీ శ 1415-17 సంవత్సరాల మధ్య ఫిరోజ్‌షా ఈ ప్రాంతాలు జయించి తన సరదారులను నియమించాడని భావించబడింది. తర్వాత ఫిరోజ్‌షా సైన్యాలు గోదావరీ తీర్మాన్ని చేరాయి. అదే సమయంలో విజయనగర సేనలు కూడా గోదావరీ తీరాన్ని చేరాయి.

అత్తిలి, కాకరపర్తి గుండుగొలను యుద్ధాలు: ఉభయ కూటాలకు అత్తిలి, కాంకరపర్తి, గుండుగొలను అనే ప్రదేశాలలో భీకర పోరాటాలు జరిగాయి. ఈ యుద్ధాలలో గుండుగొలను వద్ద జరిగిన యుద్ధంలో కొప్ప మల్లగజతిప్పారావు కాటయ వేమారెడ్డిని సంహరించాడు. విజయనగర సైన్యాలు పరాజయం పొందాయి ఈ యుద్ధ వివరాలను అన్నెదేవచోదుని రాజమండ్రి మ్యూజియం తామ్రశాసనం వర్ణిస్తోంది. తీరాంధ్రదేశంలో విజయనగర ప్రభువులు జోక్యం చేసుకున్నారు. కాటయ వేమారెడ్డికి సహాయంగా దేవరాయలు వచ్చాడు. ఫిరోజ్‌షా పెదకోమటి వేమారెడ్డి, అన్నెదేవచోదులకు సహాయంగా వచ్చాడు. ఈ యుద్ధాలలో తాను జయించానని, కాటయ వేమారెడ్డి యుద్ధంలో మరణించగా కాటయవేముని కుటుంబం తనను శరణువేడగా తాను రక్షించానని అన్నెదేవ చోదుడు ఈ శాసనంలో చెప్పుకున్నాడు. ఈ విధంగా గోదావరీ తీర యుద్ధంలో ఫిరోజ్‌షా పెదకోమటి వేమారెడ్డి అన్నెదేవ చోదుని కూటానికి విజయం సిద్ధించింది.

పానుగల్లు-మోటుపల్లి యుద్ధాలు క్రీ.శ.1417: దాంతో దేవరాయలు ఫిరోజ్‌షాను, పెదకోమటి వేమారెడ్డిలను ఓడించడానికి నూతన వ్యూహం పన్నాడు. విజేతలు రాజమహేంద్రవరాన్ని ఆక్రమించకుండా చేయాలంటే వారిని అక్కడి నుండి కదిలించాలి. అందుకోసం విజయనగరసేనను గోదావరీతీరం నుండి వెనుకకు మళ్లించి మార్గమధ్యంలో తన సేనను రెండు భాగాలుగా చీల్చి, ఒక సైన్యాన్ని కొండవీటి రాజ్యం మీదకు, మరొక భాగాన్ని తెలంగాణలోని పానుగల్లు దుర్గాన్ని ముట్టడించడానికి పంపాడు. పానుగల్లును ఆక్రమించినట్లయితే గోదావరీ తీరంలోని ఫిరోజ్‌షా సైన్యం తిరిగి తన రాజ్యంలోకి వెళ్లలేదు. సుల్తాన్ పరిస్థితి భయానకంగా మారుతుంది. దేవరాయల వ్యూహం ప్రకారం అనుకున్నట్లుగానే ఫిరోజ్‌షా గోదావరీ తీరాన్ని వదిలి పానుగల్లును కాపాడుకోవడానికి పరుగు పరుగున వచ్చాడు. ఫిరోజ్‌షా వెనుకకు వెళ్లగానే రాజమహేంద్రవర రాజ్య సైన్యాలకు అల్లాడరెడ్డి నాయకత్వం వహించి పెదకోమటి వేమారెడ్డితోను, అన్నెదేవ చోదునితోను పోరాడి, అన్నెదేవచోదుని ఓడించి యుద్ధభూమిలో వధించాడు. అదే సమయంలో రామేశ్వర యుద్ధంలో పెదకోమటి వేమారెడ్డిని ఓడించి తరిమాడు. రాజమహేంద్రవరపు రాజ్యశత్రువులను తరిమి ద్రోహి కులాన్నంతటిని నాశనంచేసి కాటయవేమారెడ్డి వారసులకు అల్లాడరెడ్డి రాజమహేంద్రవర రాజ్యాన్ని పునరుద్ధరించాడని పలివెల శాసనం తెలుపుతోంది ఓడిపోయిన పెదకోమటి వేమారెడ్డి కొండవీడుచేరి పానుగల్లులో సుల్తాన్ సహాయంగా సైన్యాన్ని పంపాడు. అది గమనించి దేవరాయలు ఓరుగల్లు, రాచకొండ వెలమలతో సంప్రదింపులు ప్రారంభించాడు. తమ శత్రువు పెదకోమటి వేమారెడ్డితో సఖ్యతను ఏర్పాటు చేసుకొన్న ఫిరోజ్‌షాతో మీకు స్నేహమేమిటని ప్రశ్నించి వారిని ఒప్పించి తనవైపు చేరేటట్లు చేసుకొన్నాడు. వారు సుల్తాన్ మైత్రిని వదిలివేసి విజయనగరం వైపు చేరిపోయారు దాంతో రాచకొండ పద్మనాయకులు విజయనగరం ఒకటైపోయాయి. ఇది ఊహించని ఫిరోజ్ షా చిక్కునపడ్డాడు. సుల్తాన్ సైన్యాన్ని ముందు నుండి విజయనగర సేన, వెనుక నుండి వెలమ సేన ముట్టడించాయి. మధ్య ఇరుక్కొన్న గుల్బర్గా సేన ఊచకోతకు గురైంది. మిగిలిన సేన పలాయనం చిత్తగించింది. అదంతా చూసి సుల్తాన్‌కు పిచ్చి

ఎక్కినంత పనయిపోయి గుల్బర్గా వైపు పరిగెత్తాడట. ఈ విధంగా క్రీ.శ.1417లో పానుగల్లు, నల్లగొండ ప్రాంతం విజయనగర సేనల వశమైంది. తర్వాత దేవరాయలు కృష్ణా తుంగభద్రా నదుల మధ్య అంతర్వేదిని కూడా ఆక్రమించాడు. అంతేగాక బహమనీ రాజ్యంలో అనేక ప్రదేశాలను కూడా ధ్వంసం చేశాడని కొండవీటి వద్ద ఉన్న పొత్తూరును జయించాయి. ఈ విషయం పొన్నూరు శాసనం ధృవపరుస్తోంది. ఈ విధంగా క్రీ.శ.1417లో మోటుపల్లి, పానుగల్లు రెండూ విజయనగర రాజ్యం వశమయ్యాయి. పానుగల్లు వద్ద జరిగిన అపజయంతో ఫిరోజ్ షా కీర్తి ప్రతిష్ఠలు పటాపంచలైపోయాయి. ఈ విధంగా మొదటి దేవరాయలు ఏకకాలంలో బహమనీ, రెడ్డి రాజ్యాలపై విజయం సాధించాడు. దేవరాయల కీర్తి ప్రతిష్ఠలు మిన్నుముట్టాయి.

తూర్పుగాంగ విజయనగర సంఘర్షణ క్రీ.శ.1420: పెదకోమటి వేమారెడ్డి పరిస్థితి బలహీనమైంది. పానుగల్లు యుద్ధంలో ఫిరోజ్‌షాకు సహాయం చేసినందుకు వెలమలు కొండవీటి రాజ్యంపై దండెత్తారు. వారితో జరిగిన యుద్ధాలలో పెదకోమటి వేమారెడ్డి మరణించాడు. క్రీ.శ.1419 నాటి రుద్రవర శాసనం పెదకోమటి వేమారెడ్డి చివరి శాసనం. తర్వాత అతని కుమారుడు రాచవేమారెడ్డి రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో ఒరిస్సానేలే కళింగగాంగులు కొండవీటిపై దండెత్తారు. కొండవీటిని లాంగూల గజపతి ఆక్రమించినట్లు స్థానిక గాంగులను తరమడానికి దేవరాయలు తన సైన్యాన్ని పంపాడు. ఉభయ సైన్యాలు అల్లాడరెడ్డి పాలించే రాజమహేంద్రవర రాజ్యంలో ప్రవేశించాయి. అల్లాడరెడ్డి వారి యుద్ధాల వల్ల తన రాజ్యం దెబ్బతింటుందని భయపడి గాంగ విజయనగర రాజులను సమాధానపరచి యుద్ధం లేకుండా నివారించాడని వేమవరం శాసనం తెలుపుతోంది. కనుక దాదాపు వంద సంవత్సరాలు తీరాంధ్రదేశాన్ని సంక్షోభం పాలు చేసిన గజపతి, నరపతి సంఘర్షణకు ఇదే అంకురార్పణ, ఇది ఒక నూతన యుగానికి నాంది అని నేలటూరి వెంటకరమణయ్య వ్యాఖ్యానించారు.

అహోబలుని తిరుగుబాటు-మైసూరు తిరుగుబాటు: దేవరాయల చివరి కాలంలో పుష్పగిరి ప్రాంతంలో దేవరాయల సామంతునిగా ఉన్న అప్రతిమల్ల వంశానికి చెందిన తెలుగుచోళ వంశానికి చెందిన అహోబలుడు తిరుగుబాటు చేశాడు. దేవరాయల కుమారుడు విజయరాయలు అహోబలుని తిరుగుబాటును అణచివేశాడు. అలాగే మైసూరు ప్రాంతంలో ఒక తిరుగుబాటు జరిగింది. దానిని రామచంద్రరాయల కుమారుడు అంటే దేవరాయల మనుమడు మూడవ బుక్కరాయలు అణచి శాంతిభద్రతలను నెలకొల్పాడు.

మొదటి దేవరాయలు గొప్పవీరుడు పరిపాలనాదక్షుడు. దౌత్యనీతి దురంధరుడు. అతని తండ్రి రెండవ హరిహరరాయలు యుద్ధాలు చేసి కూడా బహమనీ వెలమల మైత్రిని విచ్ఛిన్నం చేయలేకపోయాడు. కాని దేవరాయలు తన దౌత్యనీతితో పద్మనాయకులను బహమనీ రాజ్యం నుండి విడదీసి ఫిరోజ్‌షాను చావుదెబ్బతీశాడు. రాజ్యపు సైనిక బలాన్ని బాగా అభివృద్ధి చేశాడు. ధనవ్యయాన్ని లెక్కచేయకుండా అరబ్బీ పారశీక దేశాల నుండి ఉత్తమజాతి అశ్వాలను తెప్పించి తన అశ్వికదళ పాటవాన్ని పెంచాడు. ముస్లిం సైనికులను కూడా చేర్చుకున్నాడని అంటారు. విజయనగర కోటను పటిష్టపరచాడు. ప్రాకారాలను బలపరచి నూతన బురుజులను కూడా నిర్మించాడు. విజయనగర పట్టణాన్ని ఎక్కువగా అభివృద్ధి చేసినవారు రెండవ బుక్కరాయలు, మొదటిదేవరాయలని న్యూనిజ్ రాశాడు. అనేక దేవాలయాలు గోపురాలను కూడా నిర్మించి నగర శోభను పెంచాడు. నగర వైశాల్యం కూడా ఇతని కాలంలో పెరిగింది. దేవరాయల కాలంలో చెప్పుకోదగిన నిర్మాణం తుంగభద్రానదిపై నిర్మించిన ఆనకట్ట ఆనకట్ట నుండి విజయనగర పట్టణంలోకి నీటి సరఫరాను ఏర్పాటు చేశాడు. అందుకోసం 15 మైళ్ల దూరం కొండ ప్రాంతాన్ని తొలిపించి నగరంలోకి నీరు వచ్చే విధంగా కాలువలు తవ్వించాడు. కఠిన శిలలను తొలిచి కాలువను నిర్మించిన విధానాన్ని న్యూనిజ్ శ్లాఘించాడు. అది అసాధారణ నిర్మాణం అని రాబర్ట్ సీవెల్ కూడా కీర్తించాడు. ఈ కాలువ నేడు కూడా ఉంది. హంపిలోని పొలాలకు ఇప్పుడు కూడా ఈ కాలువ గుండా నీరు ప్రవహిస్తోంది.

నికోల్‌కొంటి క్రీ.శ.1420-21: మొదటి దేవరాయల కాలంలో ఇటలీ యాత్రికుడు నికోల్‌కొంటి క్రీ.శ.1420-21లో విజయనగరాన్ని దర్శించాడు. ఇతడు విజయనగరాన్ని దర్శించిన మొట్టమొదటి ఐరోపా యాత్రికుడు. పోప్ కార్యదర్శి అయిన పగ్గియోబ్రాక్సిలోని నికోల్‌కొంటి రచనలను లాటిన్ భాషలోకి తర్జుమా చేశాడు. ఈ రచనలు తర్వాత క్రీ.శ.1723లో పోర్చుగీసు, ఇటాలియన్ భాషలలోకి కూడా తర్జుమా చేయబడ్డాయి. నికోల్‌కొంటి మొదట గుజరాత్ చేరి పశ్చిమకోస్తా గుండా ప్రయాణించి పచ్చిమూరియా చేరి తర్వాత విజెంగాలియా

అంటే విజయనగరం చేరాడు. అతడు విజయనగరం ఎత్తయిన కొండ వద్ద నిర్మింపబడి, కొండల కింద ఉన్న లోయలన్నింటిని నగరంలో కలిపి నిర్మించినందున నగర వైశాల్యం బాగా పెరిగిందని, నగరంలో ఎల్లప్పుడూ 90 వేల మంది సైనికులు కాపలా కాస్తూ ఉంటారని వర్ణించాడు. దేవరాయలు గొప్ప పండిత పోషకుడు. జక్కనకవి విక్రమార్క చరిత్ర రచించి సిద్దన అనే వ్యక్తికి అంకితమిచ్చాడు. సిద్ధనను దేవరాయల మంత్రి అయిన చామన దండనాయకుడు ఆదరించాడు. దేవరాయలకు లక్ష్మీధరుడను మరొక మంత్రి ఉన్నాడు. ఒక పర్యాయం దేవరాయలు ఆపదలో చిక్కుకొనగా లక్ష్మీధరుడు కాపాడాడు. మొదటి దేవరాయలకు చాలా మంది కుమారులు ఉన్నారు. వారిలో ప్రసిద్ధి చెందిన వారు రామచంద్రరాయలు, విజయరాయలు. దేవరాయలు క్రీ.శ.1422లో మరణించాడు. అతని మరణం తర్వాత రామచంద్రరాయలు సింహాసనం అధిష్టించాడు. కాని అతడు కొన్ని నెలల మాత్రమే పాలించాడు. అతనిని తొలగించి సోదరుడు విజయరాయలు సింహాసనం ఎక్కాడు.

విజయరాయలు క్రీ.శ.1422-1426: విజయరాయలు చిన్నతనం నుండే తండ్రితోపాటు యుద్ధాలలో పాల్గొనేవాడు. తండ్రి పాల్గొన్న అన్ని యుద్ధాలలో ఇతడు పాల్గొన్నాడట. ఇతనికి వీరవిజయరాయలు విజయభూపతి, వీరబుక్క, విజయబుక్క అని కూడా పేర్లున్నాయి. ఇతడు ఎన్ని సంవత్సరాలు పాలించాడో ఖచ్చితంగా తెలియదు. న్యూనిజ్ 6 సంవత్సరాలని రాశాడు. హయవదనరావు రెండు సంవత్సరాలు పాలించాడని అంటే వెంకోబరావు, గోపీనాథరావులు ఆరునెలలు పాలించాడని అన్నారు. కాని ఇతడు 4 సంవత్సరాలు పాలించాడని ఎక్కువ మంది చరిత్రకారులు భావిస్తారు. ఇతని కాలంలో కూడా బహమనీ రాజ్యంతో యుద్ధం జరిగింది. ఫిరోజ్‌షా పానుగల్లు యుద్ధంలో పరాజయం పొందడంతో అతని కీర్తిప్రతిష్టలు మంటగలిసి అతని రాజ్యంలో కూడా అతనికి భద్రత లేకుండా పోయింది. ఫెరిష్టా పానుగల్లులో ఫిరోజ్‌షా ఓడిపోయిన విషయాన్ని వర్ణించకుండా వదిలివేశాడు. ఫిరోజ్‌షాపై అతని సోదరుడు అహమ్మద్‌ఖాన్ తిరుగుబాటుచేసి గీజుదరాజు అనే ముస్లిం పెద్ద సహాయంతో అన్నను ఖైదు చేసి సింహాసనానికి వచ్చి అహమ్మద్‌షా అనే బిరుదుతో రాజ్యం చేశాడు అహమ్మద్‌షా తన అన్న ఫిరోజ్‌షాకు పానుగల్లు వద్ద జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయడానికి విజయనగరంపై దండెత్తాడు. విజయరాయలు ఓరుగల్లు వెలమల సహాయం కోరాడు. వెలమలు సహాయంగా వచ్చారు. వారు బహమనీ సేనల్ని అనేక చోట్ల ఓడించారు. చివరకు బహమనీ సైన్యం తుంగభద్రానది ఒడ్డుకు చేరి అమాయక ప్రజలను ఊచకోత కోసిందని, కొందరు ప్రజలను బానిసలుగా మార్చారని, దేవాలయాలను పడగొట్టారని గోవులను చంపి గోమాంసం భక్షించారని ఫెరిష్టా రాశాడు. అంతేగాక అతడు రెండు విచిత్రమైన సంఘటనలను కూడా వర్ణించాడు. అందులో ఒకటి విజయరాయలకు సంబంధించింది. రెండవది అహమ్మద్‌షాకు సంబంధించింది. విజయరాయలు ఒంటరిగా ఒక చెరుకు తోటలో నిద్రిస్తుండగా బహమనీ సైనికులు కొందరు ఆ తోటలో ప్రవేశించి కొన్ని చెరకుగడలు కొట్టి మూటగట్టి నిద్రిస్తున్న విజయరాయలను లేపి మూటను అతని నెత్తిన పెట్టి మోసుకురమ్మన్నారట. విజయరాయలు తనను గుర్తించనందుకు సంతోషించి వారు తెమ్మన్నచోటికి మూటను చేర్చాడు. వారు వెళ్లమనగానే అతడు విజయనగరంలోకి దౌడు తీశాడట. రెండవ కథలో అహమ్మద్‌షాని గుర్తించి విజయనగర సైనికులు వెంటపడ్డారట. అతడు పారిపోయి ఒక ఇంటిలో దూరాడు, విజయనగర సైనికులు ఇంటిని చుట్టుముట్టారు. అది తెలిసి కొందరు ముస్లిం సైనికులు వచ్చి అహమ్మద్‌షాను కాపాడారు. ఆ కాపాడిన వారు అఫాకీలు అని, ఆ తర్వాత బహమనీ దర్బారులో అఫాకీలకు గొప్ప పదవులు లభించాయని రాశాడు. ఫెరిష్టా రాసిన ఈ కథలను చరిత్రకారులు కట్టు కథలుగా తీసిపారవేశారు. కాని విజయరాయల కాలంలో అహమ్మద్‌షా విజయనగరంపై దండెత్తాడని భావించారు. కాని జయాపజయాలు తెలియదు. ఈ సంఘటన క్రీ.శ.1422-24 సంవత్సరాల మధ్య జరిగి ఉండవచ్చును. విజయరాయలు పాలించిన నాలుగు సంవత్సరాలు అతని కుమారుడు రెండవ దేవరాయలు సహాయంగా ఉన్నాడు. తండ్రి కాలంలోనే రెండ దేవరాయల శాసనాలు ఇమ్మడి ప్రౌఢ దేవరాయల అనే పేరుతో శాసనాలు లభించాయి. ఇతడు ఇమ్మడి ప్రౌఢదేవరాయలే రెండవ దేవరాయలని చరిత్రకారుల నమ్మకం. కనుక రెండవ దేవరాయలు తండ్రితో కలసి సహపాలన చేశాడని భావించారు. తండ్రి తర్వాత రెండవ దేవరాయలు క్రీ.శ.1426లో సింహాసనానికి వచ్చాడు. సంగమ వంశస్తులలో రెండవ దేవరాయలు అగ్రగణ్యుడు.

రెండవ దేవరాయలు క్రీ.శ.1426-1446: రెండవ దేవరాయలు క్రీ.శ.1426లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1446 వరకు అంటే 20 సంవత్సరాలు పాలించాడు. ఇతడు సంగమ వంశస్తులలో అతి గొప్పవాడు. ఇతనికి

ప్రతాపరాయలు, ప్రౌఢప్రతాపరాయలు, ప్రౌఢదేవరాయలు, గజకేటకార అనే బిరుదులు ఉన్నాయి. గజకేటకార అంటే గజములను వేటాడు వాడని అర్థం. కాని ఈ పదానికి గజాల మాదిరిగా మథించిన రాజులను జయించిన వాడని కూడా మరొక అర్థం ఉంది. ఇతని కాలంలో విజయనగర రాజ్యం అతి బలిష్టంగా రూపొంది ప్రపంచ ప్రఖ్యాతి పొందింది.

బహమనీలతో యుద్ధం: బహమనీ సుల్తాన్ అహమ్మద్ షా క్రీ.శ.1422-1436 అతని కుమారుడు రెండవ అల్లావుద్దీన్ క్రీ.శ.1436-1458 ఇతని సమకాలికులు. వీరిద్దరూ విజయనగరంతో మూడు యుద్ధాలు చేశారు.

అహమ్మద్ షా దండయాత్ర క్రీ.శ.1423-24: ఫిరోజ్ షాకు పానుగల్లు వద్ద జరిగిన పరాభవానికి ప్రతీకారంగా అహమ్మద్‌షా సింహాసనం ఎక్కగానే విజయనగర రాజ్యంపై దండెత్తాడు. అప్పుడు రెండవ దేవరాయల తండ్రి విజయరాయలు పరిపాలిస్తున్నాడు. రెండవ దేవరాయలు తండ్రితో సహపాలకునిగా ఉన్నట్లుగా కనిపిస్తోంది. కనుక ఈ యుద్ధంలో రెండవ దేవరాయలు పాల్గొని ఉండవచ్చును. కనుక ఫెరిష్టా రెండవ దేవరాయలపై అహమ్మద్ షా దండెత్తి ఓడించాడని రాశాడు. కాని వాస్తవానికి ఆ దండయాత్ర అతని తండ్రి విజయరాయల కాలంలో జరిగింది. దేవరాయలు తండ్రి పాలనలో భాగస్తుడుగా ఉన్నాడు. కాబట్టి ఇది రెండవ దేవరాయలపై జరిగిన మొదటి దండయాత్ర అని కొందరు భావించారు. ఈ దండయాత్రా కాలంలో అహమ్మద్ షా విజయం సాధించి నష్టపరిహారం వసూలు చేశాడని ఫెరిష్టా రాశాడు. కాని అది వాస్తవం కాదు. ఈ యుద్ధం జరిగే సమయంలోనే క్రీ.శ.1423-24 సంవత్సరంలో అహమ్మద్ షా తన రాజధానిని గుల్బర్గా నుండి బీదర్‌కు మార్చాడు. అది విజయనగరానికి భయపడి దూరంగా రాజధానిని మార్చాడని భావించారు. అంతేగాదు యుద్ధంలో చివరకు విజయనగరం విజయం సాధించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. కనుక నేలటూరి వెంకట రమణయ్య మొదట విజయనగర సేనలు పరాజయం పొంది ఉండవచ్చును. చివరకు విజయం సాధించాయని అన్నారు.

తీరాంధ్ర దేశంపై దండయాత్ర క్రీ.శ.1428-29: రెండవ దేవరాయలు సింహాసనం ఎక్కిన కాలంలో తీరాంధ్రదేశ పరిస్థితులలో చాలా మార్పులు వచ్చాయి. పెదకోమటి వేమారెడ్డి మరణం తర్వాత అతని కుమారుడు రాచవేమారెడ్డి రాజ్యానికి వచ్చి నాలుగు సంవత్సరాలు పాలించాడు. ఇతడు తన రాజ్యంలో అధిక పన్నులు విధించాడు. అందువల్ల రాచ వేమారెడ్డిని సౌరము ఎల్లనయ్య అనే బలిజ వర్తకుడు పట్టపగలు నట్టనడిబజారులో ముత్యాలమ్మ గుడి వద్ద అందరూ చూస్తూ ఉండగా పొడిచాడట. దాంతో రాచవేమారెడ్డి క్రీ.శ.1424లో మరణించాడు. అతని మరణంతో కొండవీటి వంశం అంతరించింది. సామంతులంతా స్వతంత్రాలు ప్రకటించారు. పొదిలి ప్రాంతంలో సాళువ శంభువరాయుని కుమారుడు తెలుంగరాయలు ఒంగోలు, నర్సరావుపేట మధ్య ప్రాంతాన్ని, పంట ముమ్మడి రెడ్డికుమారుడు మైలారురెడ్డి మొదలైన అనేక మంది సామంతులు స్వతంత్ర రాజ్యాలు స్థాపించారు. శ్రీనాథుడు రాచవేమారెడ్డి మరణానంతరం కొండవీడు రాజ్యపు దైన్యస్థితిని వర్ణించాడు. కొండవీటిని పాలించే నాయకులు నది నుండి నీటిని తీసుకువెళ్లే కాలువలంత మంది, పాముల రంధ్రాలంత మంది, ఎలుగొడ్డు చర్మంపై ఉండు రోమాలంత మంది ఉన్నారు అని వర్ణించాడు. కొండవీటి రాజ్యం చిన్నాభిన్నమై అనేక మంది స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకొని ఉన్నారని భావించాలి.

నాల్గవ భానుదేవుని దండయాత్ర క్రీ.శ.1425-28: ఈ పరిస్థితులలో కళింగనేలిన తూర్పు గాంగవంశ నాల్గవ భానుదేవుడు తీరాంధ్ర దేశంపై దండెత్తాడు. అతడు మొదట రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించి వీరభద్రారెడ్డి అనితల్లులను తొలగించాడు. తర్వాత కొండవీటి రాజ్యంపై దండెత్తి జయించి ఇంకా దక్షిణంగా సాగి నెల్లూరు జిల్లాను కూడా జయించి తీరాంధ్ర దేశాన్నంతటినీ గాంగ సామ్రాజ్యాలతో కలిపాడు. క్రీ.శ.1425 నుండి 1428 వరకు తీరాంధ్ర దేశం అంతా మూడు సంవత్సరాలు గాంగ భానుదేవుని అధీనంలో ఉంది. గ్రామ కైఫీయత్తులు భానుదేవుడు 12 సంవత్సరాలు తీరాంధ్ర దేశాన్ని పాలించాడని తెలుపుతున్నాయి. ఆ స్థితిలో రెండవ దేవరాయలు తీరాంధ్రదేశాన్ని జయించాలని పెద్ద సేనతో దండెత్తాడు. సాళువ తెలుంగురాయలు, పంట మైలారు రెడ్డిలను ఓడించి తన సామంతులుగా చేసుకొని కొండవీటిపై దండెత్తి గాంగ సైన్యాన్ని ఓడించి తరిమాడు. తర్వాత వారిని వెంబడించి రాజమహేంద్రవరాన్ని ఆక్రమించి వీరభద్రారెడ్డి అనితల్లులను తిరిగి రాజమహేంద్రవర సింహాసనంపై పునఃప్రతిష్ట చేశాడు. వారు అతని సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు. తర్వాత సాళువ తెలుంగ రాయలు విజయనగర సైన్యానికి నాయకత్వం వహించి సింహాచలం దాకా జయించి విజయనగర రాజ్యంలో

కలిపాడు సాళువ తెలుంగ రాయలు క్రీ.శ.1428లో సింహాచలంలో శాసనం వేయించాడు. వీరభద్రారెడ్డి విజయనగర సైన్యాల సహాయంతో కళింగ రాజ్యంపై దండెత్తి కళింగను యావత్తూ జయించి కళింగ రాజపరమేశ్వర అనే బిరుదు ధరించాడు. ఈ విజయాలతో విజయనగర సామ్రాజ్యం కళింగదేశ సరిహద్దును తాకింది. ఈ విజయాల ప్రస్తావన రెండవ దేవరాలయ ముదబిరుదె శాసనంలో ఉంది.

కపిలేశ్వర గజపతితో యుద్ధం క్రీ.శ.1444: నాల్గవ భానుదేవుడు దక్షిణ కళింగలో తాను కోల్పోయిన భాగాలను తిరిగి జయించడానికి క్రీ.శ.1333-34లో వీరభద్రారెడ్డి రాజ్యపు ఉత్తరపు సరిహద్దుపై దండయాత్ర చేశాడు. ఆ సమయంలో భానుదేవుని మంత్రి కపిలేశ్వర గజపతి గాంగ సింహాసనాన్ని కాజేసి గజపతి వంశాన్ని స్థాపించాడు. కపిలేశ్వరుడు క్రీ.శ.1442లో విశాఖపట్టణం వద్ద ఉన్న కోరుకొండను ఆక్రమించి క్రీ.శ 1444లో వీరభద్రారెడ్డి రాజ్యంపై దాడి చేశాడు రెండవదేవరాయలు గజపతి దండయాత్రను అరికట్టడానికి తన సేనాధిపతి మల్లప్ప ఒడయారును పంపాడు. అతడు గజపతి సైన్యాలను ఓడించి తరిమివేసి క్రీ.శ.1444లో శాసనం వేయించాడు.

వెలమల దండయాత్ర: ఫిరోజ్‌షాకు వ్యతిరేకంగా క్రీ.శ 1417లో రాచకొండ వెలమలు మోసానికి పాల్పడి విజయనగరం వైపు చేరారు. అందువలన ఫిరోజ్‌షా ఓడిపోయాడు. అందుకు ప్రతీకారంగా అహమ్మద్‌షా క్రీ.శ.1424-25 వెలమ రాజ్యంపై దండెత్తి ఓరుగల్లు రాచకొండ రాజ్యాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకొన్నాడు. ఆ సమయంలో దేవరాయలు వారికి సహాయం చేయలేదు. అందువల్ల రాజ్యం పోగొట్టుకున్న వెలమలు విజయనగర రాజ్యంలో ప్రవేశించి అలజడులు సృష్టించి దోపిడీలు చేశారని వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. వారు రాజమహేంద్రవరంపై కూడా దండెత్తారని పానుగల్లు, కొండవీడును కూడా దోచుకున్నారని దేవరాయల సామంతులైన సంబెట సోముని సారెపల్లి తిమ్మనను ఓడించినట్లు కూడా వెలుగోటి వారి వంశావళి వివరిస్తోంది. కాని వారి దోపిడీలను రెండవ దేవరాయలు అరికట్టాడు. చివరకు రాచకొండ రాజు మూడవ సింగమనేడు దేవరాయల దయతో బెల్లంకొండలో పాలెగాడుగా నియమింపబడ్డాడు.

బహమనీలతో యుద్ధం క్రీ.శ.1436: క్రీ.శ.1436 అహమ్మద్‌షా మరణించి అతని కుమారుడు రెండవ అల్లావుద్దీన్ సింహాసనానికి వచ్చాడు. అతడు రాజ్యానికి రాగానే విజయనగరంపై యుద్ధం ప్రకటించాడు ఈ యుద్ధానికి కారణం గత ఐదు సంవత్సరాలుగా దేవరాయలు కప్పం చెల్లించలేదని, దానిని వసూలు చేయడానికి యుద్ధం ప్రకటించాడని పెరిష్టా రాశాడు. అల్లావుద్దీన్ తన సోదరుడైన మహమ్మద్‌ఖాన్ నాయకత్వంలో బహమనీ సేనను విజయనగర రాజ్యంపైకి పంపాడు. ఆ సైన్యం అంతర్వేదిపై దండెత్తి ముద్గల్ కోటను ఆక్రమించిందని ముస్లిం చరిత్రకారులు రాశారు. అంతేగాక బహమనీ సేనలు విజయనగర రాజ్యం భూములను పాడు చేశాయని దాంతో రెండవ దేవరాయలు సంధికి అంగీకరించి 20 ఏనుగులను, 200 మంది నాట్యకత్తెలను నగదు బహుమతులను మహమ్మద్‌ఖాన్‌కు ఇచ్చాడని కూడా రాశారు. ఇవన్నీ వాస్తవం కాదు. ముద్గల్ కోటలోని క్రీ.శ.1435-36 సంవత్సరం నాటి ఒక శాసనం ముద్గల్‌కోట దేవరాయలు అధీనంలో ఉన్నట్లు, దానిని అతని ప్రతినిధి వరదన్న నాయకుడు పాలిస్తున్నట్లు తెలుపుతోంది. కనుక ఈ యుద్ధంలో అల్లావుద్దీన్‌కు విజయం లభించలేదని స్పష్టంగా చెప్పవచ్చును. కనుకనే అతడు తిరిగి క్రీ.శ.1443లో రెండవసారి యుద్ధం చేశాడు

రెండవ యుద్ధం క్రీ.శ.1443: క్రీ.శ.1442లో రెండవ దేవరాయలపై హత్యాప్రయత్నం జరిగింది. రాయల సోదరుడొకడు రాయలను మోసంతో చంపబోయాడు. ఈ వృత్తాంతాన్ని గురించి అబ్దుల్ రజాక్, న్యూనిజ్‌లు ఇద్దరూ పేర్కొన్నారు. హత్య చేయబోయిన వాడు రాయల సోదరుడని రజాక్ రాశాడు. సోదరుని కుమారుడని న్యూనిజ్ రాశాడు. రాయల సోదరుడు రాయలని విందుకు పిలిచి చంపడానికి ప్రయత్నించాడని వారు రాశారు ఆ కుట్ర నుండి రాయలు బయటపడ్డాడు. తర్వాత ఆ కుట్ర చేసిన వారినందరినీ, ఆఖరికి విందుకు లేఖలు పట్టుకొచ్చిన వారితో సహా కుటుంబాలనన్నింటినీ రాయల సర్దారులు అతిక్రూరంగా వధించారని కూడా రాశారు కాని చివరకు రాయలు తన మేనల్లుని చేతిలో మరణించాడని న్యూనిజ్ రాశాడు. దేవరాయలను విషం పూసిన కత్తితో అతని మేనల్లుడు పొడిచాడని, రాయలు వెంటనే తన కత్తితో మేనల్లుడిని చంపివేశాడట, కాని విషపు కత్తి దిగబడినందున ఆరు నెలల తర్వాత రాయలు మరణించాడని న్యూనిజ్ వివరించాడు. కాని ఇది వాస్తవం కాదు రాయలు క్రీ.శ.1446 వరకు జీవించాడు. అంటే హత్యా ప్రయత్నం నుండి రాయలు బయటపడి ఉండాలి. అతనికి ఏ అపకారం జరిగి ఉండదు. తరువాత 4 సంవత్సరాలు జీవించాడు. రాయలపై హత్యా ప్రయత్నం జరిగిందని

అల్లావుద్దీన్‌కు తెలిసింది. రాయలను ఓడించడానికి ఇదే తగిన సమయం అని అల్లావుద్దీన్ ఏడు లక్షల వరహాలను తనకు చెల్లించాలని లేకపోతే తాను దండెత్తుతానని వర్తమానం పంపాడట. అందుకు రాయలు తిరస్కరించడంతో అల్లావుద్దీన్ విజయనగర రాజ్యంపై దండెత్తి ముద్గల్‌ను ముట్టడించాడు. అక్కడ మూడు యుద్ధాలు జరిగాయి. మొదటి యుద్ధంలో విజయనగర సేనకు విజయం లభించింది రెండవ యుద్ధంలో సుల్తాన్ సేనకు విజయం లభించింది. మూడవ యుద్ధంలో దేవరాయల కుమారుడు మరణించాడు. కాని ఈ యుద్ధ సమయంలో సుల్తాన్ సేనానులిద్దరూ రాయల సైన్యానికి పట్టుబడ్డారు. వారిని వదలకపోతే తిరిగి యుద్ధం ప్రారంభిస్తానని సుల్తాన్ వార్త పంపగా రాయలు వారిని వదలి సంధి చేసుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా సుల్తాన్ విజయనగర సరిహద్దులు దాటనని వాగ్దానం చేశాడు అని ఫెరిష్టా ఈ యుద్ధాన్ని వర్ణించాడు. రాబర్ట్ సీవెల్, షేర్వానీలు రాయలు కప్పం కట్టడానికి అంగీకరించాడని భావించారు. కాని ఫెరిష్టా కప్పం గాని, నష్టపరిహారాన్ని గురించి గాని రాయలేదు. కనుక ఫెరిష్టా వర్ణనలు, షేర్వానీ, సీవెల్ ఊహలు వాస్తవాలు కాదని చెప్పవచ్చును అందుకు కారణమేమిటంటే ఆ యుద్ధకాలంలో విజయనగరంలో నివసించిన అబ్దుల్ రజాక్ మరొక విధంగా రాశాడు. ఈ యుద్ధంలో రాయల సైన్యాలు గుల్బర్గా వరకు నడిచి విజయాలు సాధించి అనేక మంది ఖైదీలను పట్టుకొని విజయనగరం చేరాయని రాశాడు. ఫెరిష్టా కూడా ఒకచోట దేవరాయలు బహమనీ రాకుమారులను అకారణంగా ముట్టడించాడని రాశాడు. విజయనగర సేనలు బీజాపూర్ దాకా నడిచి బహమనీ రాజ్య భూములను పాడు చేశాయని కూడా రాశాడు. గుల్బర్గా రాజ్యంలోకి రాయల దండనాధుడు సైన్యాన్ని నడిపాడని రజాక్ రాశాడు. రాయల సైన్యం బంకాపురం రాయచూరు, ముద్గల్ కోటను ఆక్రమించాయని రాశాడు. కనుక క్రీ.శ.1443లో జరిగిన యుద్ధంలో దేవరాయలే యుద్ధం ప్రారంభించాడని, బహమనీ సైన్యాలను ఓడించి గుల్బర్గా, బీజాపూరు, సాగర్‌ల వరకు వీరి సైన్యాలు నడిచాయనీ అల్లావుద్దీన్ దౌలతాబాద్, తెలంగాణల నుండి సైన్యాలను రప్పించి రాయల సైన్యాలతో రెండు మాసాలు పోరాడాడని, కాని రాయలు అల్లావుద్దీన్ సేనలను ఓడించి అనేక మందిని బందీలుగా పట్టుకొని వారిని తీసుకొని విజయ పరంపరలతో విజయనగరానికి మరలి వచ్చాడని చరిత్రకారులు భావించారు. నేలటూరి వెంకట రమణయ్య అబ్దుల్ రజాక్ సమకాలికుడు కాబట్టి అతని రచనలే వాస్తవం అని చెప్పి, ఈ యుద్ధంలో రెండవ దేవరాయలు అఖండ విజయం సాధించాడని వ్యాఖ్యానించారు.

సైన్యం పునర్ వ్యవస్థీకరణ: క్రీ.శ.1443వ సంవత్సరంలో జరిగిన బహమనీలతో జరిగిన యుద్ధాన్ని గురించి రాయలు ఒకనాడు సభలో సమీక్షిస్తూ విస్తీర్ణంలోను, జన సంఖ్య, ఆదాయాలలో ఐశ్వర్యంతో విజయనగర రాజ్యం బహమనీ రాజ్యానికన్నా మిన్నగా ఉన్నా, బహమనీ సైన్యాల చేతిలో విజయనగర సైన్యాలు అడుగుడుగునా ఓడిపోవడానికి కారణం ఏమిటి అని ప్రశ్నించాడట! అందుకు దండనాయకులు, మంత్రులు బహమనీ అశ్వాలు దృఢమైనవి, విజయనగర గుర్రాలు బలహీనమైనవి అని ముస్లిం సైనికులు టర్కీ మొదలైన విదేశీ యుద్ధ పద్ధతులను అనుసరిస్తారని, వారు ధనుర్విద్యలో గొప్ప ఘటికులని చెప్పారట. అందువలన రాయలు తన సైన్యంలో అనేక మార్పులు ప్రవేశపెట్టాడని ఫెరిష్టా రాశాడు. అంతేగాక విజయనగర సైన్యంలో ముస్లిం వీరులను చేర్చుకోమని కూడా ఆదేశించాడని ఫెరిష్టా రాశాడు. ముస్లిం సరదారులకు జాగీరులు ఇచ్చి వారి కోసం విజయనగరంలో మసీదులు నిర్మించి ఆస్థానంలో ఒక వేదికపై ఖురాన్‌ను ఉంచి ముస్లింలను గౌరవించాడట. రెండు వేల మంది ముస్లిం సైనికులను చేర్చుకొని, వారిని ఒక ప్రత్యేక పటాలంగా ఏర్పాటు చేశాడట. వారి వద్ద హిందూ సైనికులను విలు విద్య నేర్చుకొమ్మని ఆదేశించి, త్వరితగతిన 60 వేల మంది హిందూ విలుకాండ్రను తయారు చేసుకున్నాడని ఫెరిష్టా రాశాడు. తర్వాత అరబ్బు వర్తకుల నుండి మేలు జాతి గుర్రాలను కొని అశ్వికదళ సామర్థ్యాన్ని పెంచాడట. విజయనగర సేనలో ముస్లింలు ఉన్నారని కైఫీయత్తులు కూడా తెలుపుతున్నాయి. కాని విజయనగర సైన్యంలో ముస్లింలను మొదట చేర్చినవాడు రెండవ దేవరాయలు కాదు. మొదటి దేవరాయల కాలంలోనే ముస్లింలను చేర్చుకున్నాడని శాసనాధారాలు లభించాయి. పాడెం కైఫీయత్తు పాడెం జాగీరును క్రీ.శ.1393 నుండి 1497 వరకు పాలించిన ముస్లిం పాలెగాండ్ర పట్టీని ఇస్తోంది. క్రీ.శ 1393లో పాడెం జాగీరును ప్రౌఢ దేవరాయలు సబత్ ముల్క్ అనే ముస్లిం సర్దారికి ఇచ్చినట్లు ఆ కైఫీయత్తు వివరిస్తోంది. ఈ కైఫీయత్తులో పేర్కొన్న ప్రౌఢ దేవరాయలు రెండవ దేవరాయలు కాదు, అతడు మొదటి దేవరాయలు. క్రీ శ.1378 నాటి శాసనంలో ప్రౌఢ దేవరాయలనే ఉంది. క్రీ.శ.1414లో సబత్‌ఖాన్ కుమారునికే ఆ జాగీరుని వారసత్వంగా వచ్చింది. అతని తర్వాత అతని కుమారునికే క్రీ.శ.1445లో ఖాయం అయింది. 1398 శాసనం కైఫీయత్తులను

సమర్థిస్తోంది. కనుక మొదటి దేవరాయలే ఈ సాంప్రదాయాన్ని పాటించాడని, రెండవ దేవరాయలు ఇంకా ఎక్కువగా ముస్లింలను ప్రోత్సహించి తన సైన్యంలో చేర్చుకున్నాడని చెప్పవచ్చు. రెండవ దేవరాయల సైన్యంలో 2 లక్షల కాల్బలం, 80 వేల అశ్వదళం, 60 వేల విలుకాండ్రు ఉండేవారు. వేయి ఏనుగులు కూడా ఉన్నాయి పదాతిదళం 11 లక్షలని కొందరు భావించారు. అవసర సమయాలలో 11 లక్షల కాల్బలాన్ని సమీకరించే శక్తి రాయలకుందని కొందరు అన్నారు.

సింహళ దండయాత్ర క్రీ.శ.1442-1443: రెండవ దేవరాయలు అల్లావుద్దీన్‌తో పోరాడే సమయంలోనే సింహళం మీదకు రెండు దండయాత్రలను పంపాడు. సింహళ దండయాత్రకు రాయల ప్రధాన మంత్రి దండనాథుడు అయిన లక్కణ్ణ దండనాయకుడు నాయకత్వం వహించాడని అబ్దుల్ రజాక్ రాశాడు రెండవ హరిహరరాయల కాలంలోనే సింహళంపై దండయాత్ర జరిగింది. తిరిగి రెండవ దేవరాయల కాలంలో రెండవ దండయాత్ర జరిగింది. సముద్రాధిపత్యం సింహళం, విజయనగర రాజ్యాల మధ్య ఈ యుద్ధం జరిగి ఉండవచ్చును. ఈ యుద్ధంలో విజయనగర సేన విజయం సాధించింది. లక్కణ్ణ సింహళాధిపతి నుండి కప్పం వసూలు చేశాడు ఈ విజయసూచకంగా లక్కణ్ణ దండనాయకుడు దక్షిణ సముద్రాధీశ్వర అనే బిరుదు ధరించాడు తర్వాత విజయనగర చక్రవర్తులకు ఈ బిరుదు మామూలైంది. కొన్ని శాసనాలు ఇమ్మడి దేవరాయలను ఇలంతిరై కొండ అని వర్ణిస్తున్నాయి. అంటే సింహళం నుండి కప్పం పొందినవాడు అని అర్థం. ఈ దండయాత్రతో సింహళం విజయనగర సామంతరాజ్యం అయింది. తర్వాత లక్కణ్ణ జాఫ్నా మీదకు దండెత్తి అక్కడ కూడా కప్పం వసూలు చేశాడు. ఇంకా కొల్లం, పెను, దానాసరి అనే దీవులు కూడా రాయలకు కప్పం చెల్లించాయని న్యూనిజ్ రాశాడు

కేరళను జయించడం: రెండవ దేవరాయల కాలం వరకు విజయనగర చక్రవర్తులు కేరళపై దండయాత్రలు చేసినట్లు కనిపించదు. రెండవ దేవరాయలు కేరళపై దండెత్తి కేరళలోని రాజ్యాలను జయించి కప్పం వసూలు చేసినట్లు కేరళ పలను తెలుపుతోంది. క్విలన్ (కుల్లోవా) రాజు రాయలను సార్వభౌమునిగా గుర్తించి కప్పం చెల్లించే వాడని న్యూనిజ్ రాశాడు. కాలికట్ రాజు సామంతుడు కాకపోయిన సరన్దీప్ నుండి గుల్బర్గా వరకు, బెంగాలు నుండి మలబార్ వరకు విస్తరించి ఉన్నదని అబ్దుల్ రజాక్ రాశాడు. సామ్రాజ్యంలో 300 రేవు పట్టణాలున్నాయని కూడా రజాక్ రాశాడు. మొత్తం మీద కృష్ణానది నుండి సింహళం వరకు, బంగాళాఖాతం నుండి అరేబియా సముద్రం వరకు విస్తరించి ఉన్న దక్షిణ భారతదేశానికంతటికీ రెండవ దేవరాయలు చక్రవర్తి. సామ్రాజ్యంలోని రాష్ట్రాల నుండి వచ్చే ఆదాయంగాక రేవుపట్టణాల నుండి సుల్కరూపంలో కోట్లాది హొన్నులు ఆదాయంగా వచ్చేది ఇంకా సింహళం, కొల్లం, పెగు, దానాసరి కేరళ రాజ్యాల నుండి కప్పాలు వసూలయ్యేవి. రెండవ దేవరాయల ఖజానాలో ఎప్పుడూ 80 కోట్ల వరహాలు నిల్వ ఉండేవని విదేశస్తులు రాశారు.

అబ్దుల్ రజాక్, నికోల్‌కొంటి రచనలు: రెండవ దేవరాయల కాలంలో ఇటలీ యాత్రికుడు నికోల్‌కొంటి 1422లో పర్షియాలోని హీరాట్ వాస్తవ్యుడు అబ్దుల్ రజాక్ క్రీ.శ.1443లోను విజయనగరాన్ని దర్శించారు. వారు ఆనాటి విశేషాలను, విజయనగర సామ్రాజ్య స్థితిగతులను, విజయనగర పట్టణ వైభవాన్ని, రాయలను గుర్తించి తమ రచనలలో కళ్లకు గట్టినట్లు వర్ణించారు. నికొల్‌కొంటి విజయనగరం చుట్టుకొలత 60 మైళ్లు అని కొండలను తుంగభద్రా నదిని కలుపుతూ నగరం చుట్టూ 7 ప్రాకారాలున్నాయని, ప్రాకారాల మధ్య పంటపొలాలు, అంగళ్లు ప్రజల నివాస గృహాలున్నాయని, ఏడో ప్రాకారంలో రాజప్రాసాదం, ఉన్నతోద్యోగుల గృహాలు ఉన్నాయని, 90 వేల మంది సైనికులు నగరాన్ని కాపలా కాస్తుంటారని న్యూనిజ్ రాశాడు. అతడు నాటి ఆచారాలను కూడా పేర్కొన్నాడు. ప్రజలలో బహుభార్యాత్వం ఉందని, సతీసహగమనం అమలులో ఉందని, దీపావళి, శివరాత్రి, దసరా బాగా జరుపుతారని, శివరాత్రి రోజున రథోత్సవాలు జరుగుతాయని, ఇనుప గాలాలు గుచ్చుకొని శ్విడి తిరుగుతారని కూడా రాశాడు. ఇక రాయలను గురించి రాస్తూ అతడు భారతదేశ రాజులందరిలో బలవంతుడని, అతనికి 12000 మంది భార్యలున్నారని, వారిలో 2000 మంది సహగమనానికి సిద్ధంగా ఉండేవారని కూడా రాశాడు. అబ్దుల్ రజాక్ పర్షియా నుండి కాలికట్‌కు రాజు జామెరిన్ ఆస్థానానికి రాయబారిగా వచ్చాడు. జామెరిన్ అతనిని రాయల ఆస్థానానికి పంపాడు. రజాక్ విజయనగరంలో క్రీ.శ.1443 ఏప్రిల్ నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు ఉండి విజయనగర విశేషాలను వర్ణించాడు. అతడు రాయలు చాలా బలవంతుడని, దూరదేశాలైన పెగు, టెన్సిరిక్‌లు కూడా అతనికి కప్పం చెల్లిస్తాయని, అతని రాజ్యంలో 300 రేవుపట్టణాలున్నాయని, గొప్ప ఐశ్వర్యాన్ని అనుభవిస్తున్నారని, విజయనగరం లాంటి వైభవ నగరాన్ని మరొక దానిని చూడలేదని, అలాంటి నగరం ఎక్కడైనా

ఉందని కూడా వినలేదని, రాజప్రాసాదం మనోహరంగా ఉందని, నగర వీధులలో రత్నాలు, వజ్రవైఢూర్యాలు, ముత్యాలు, బంగారం రాశులుగా పోసి అమ్మేవారని రాశాడు. ప్రజలు విలాస పురుషులని, గులాబీలు, పన్నీరు ఎక్కువగా వాడతారని, విజయనగరంలో వేశ్యలు అద్భుత సౌందర్యరాశులని, వారి అందానికి తాను ముగ్ధుడనయ్యానని రాశాడు వారి రాతల వలన ఆనాడు విజయనగరం ఎంత వైభవంగా ఉండేదో తెలుస్తోంది.

రెండవ దేవరాయలపై హత్యా ప్రయత్నం క్రీ.శ.1443: అబ్దుల్ రజాక్ తాను విజయనగరంలో ఉన్నప్పుడు రెండవ దేవరాయలపై హత్యాప్రయత్నం జరిగిందని రాశాడు రాయల సోదరుడొకడు నూతనంగా గృహం నిర్మించుకొని, గృహప్రవేశ మహోత్సవానికి రాయలను ఆహ్వానించి కుట్రతో చంపాలని చూశాడని రాశాడు రాయలకు కత్తిపోట్లు తగిలి కిందపడిపోయాడని, అది చూసి రాయలు మరణించాడని వారు వెళ్లిపోయారని, కొంతసేపటికి స్పృహ వచ్చి రాయలు అక్కడ నుండి వెళ్లిపోయి తర్వాత సైనికులను పంపి తనను హత్య చేయటానికి ప్రయత్నించిన అందరినీ వధించాడని, చివరకు ఆహ్వానం తీసుకువచ్చిన వ్యక్తిని కూడా వధించాడని, రజాక్ తన రచనలో వర్ణించాడు. ఈ సంఘటన క్రీ.శ.1443లో జరిగి ఉంటుందని చరిత్రకారులు నిర్ణయించాడు. రెండవ దేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడు యుద్ధవీరుడు. ఏకకాలంలో రాయచూరు, అంతర్వేది, తూర్పు తెలంగాణ, తీరాంధ్రదేశం, సింహళాలలో యుద్ధతంత్రాలను నడిపి విజయం పొందాడు మొదటి దేవరాయలు ప్రారంభించిన తూర్పు తీరాంధ్రదేశ ఆక్రమణను పూర్తి చేశాడు. రాయల నిరంతరం పోరాటాలలో ఉన్నప్పటికీ ప్రజాక్షేమం విస్మరించలేదు. ప్రజలు సుఖశాంతులతో జీవించారు రాజ్యం సంపన్నమై అనేక నగరాలతో, పట్టణాలతో వర్ధిల్లింది దేవరాయలు స్వయంగా కవి బాదరాయణుడు రచించిన బ్రహ్మసూత్రాలకు భాష్యం రాశాడు దానిని వృత్తి అని కూడా అంటారు అలాగే మహానాటక సుధానిధి అనే పేరుతో రామాయణాన్ని చంపూ కావ్యంగా రాశాడు. కవిసార్వభౌముడైన అరుణగిరినాథ డిండిమభట్టు ఇతని ఆస్థాన కవి తెలుగు కవి శ్రీనాథుడు విజయనగరాన్ని దర్శించి డిండిమభట్టును ఓడించాడు. రాయలు విజేతకు కవిసార్వభౌమ అనే బిరుదునిచ్చి తన ముత్యాల మందిరంలో శ్రీనాథుని సన్మానించి కనకాభిషేకం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు. ఇంకా రాయల ఆస్థానంలో అనేక మంది సంస్కృత, తెలుగు, కన్నడ తమిళ కవులుండేవారు వీలయినప్పుడల్లా పండిత గోష్ఠితో కాలక్షేపం చేసేవాడు. రాయలు శైవమతాభిమాని. కాని అన్నిమతాలను సమానంగా ఆదరించాడు. అతడు గొప్ప ఉదార పాలకుడు. వీరశైవుడైన చామరసును రాయలు పోషించాడు అతడు కన్నడంలో ప్రభులింగలీల అనే కావ్యాన్ని రాశాడు. పాన్‌సుపారి బజార్‌లో ఒక జైన ఆలయాన్ని నిర్మించాడు. రాయలు గొప్ప నిర్మాత. తన అంతః పురంలో అందమైన భవనాలను నిర్మించాడు. హజారా రామస్వామి దేవాలయం ఇతడు నిర్మించిందని ప్రతీతి. అలాగే విఠలస్వామి ఆలయం కూడా ఇతని కాలంలోనే ప్రారంభమైందని, దానికి అతని మంత్రి ప్రోలుగంటి తిప్పన భోగమంటపాన్ని నిర్మించాడని కూడా ప్రతీతి. ముస్లింలకు మసీదును నిర్మించాడు. విజయనగరంలో తురకవాడ అని ప్రత్యేకంగా ఒక వీధి కూడా ఉండేది. ఈ విధంగా అతడు పరమతసహనం చూపాడు. ఇంత గొప్ప చక్రవర్తి కనుకనే అతడు కీర్తి నలుమూలలకు విస్తరించింది. భారతదేశంలో విజయనగర సామ్రాజ్యం ప్రథమ శ్రేణి రాజ్యంగా రూపొందింది.

దేవరాయల మరణం-అనిశ్చిత స్థితి-రెండవ విజయరాయలు క్రీ.శ.1446: రెండవ దేవరాయలు క్రీ.శ.1446లో మరణించాడు. అతని మరణానంతరం అతనికి పొన్నలదేవితో జన్మించిన మల్లికార్జునరాయలు సింహాసనానికి వచ్చాడని ఇటీవల వరకు భావించేవారు కాని దేవరాయల మరణానంతరం అతని తమ్ముడు రెండవ విజయరాయలు రాజ్యానికి వచ్చి, సింహాసనం అధిష్ఠించినట్లు సాక్ష్యాధారం లభించింది. ఇతడు ఎవరు అనే విషయం స్పష్టంగా తెలియడంలేదు. ఇతనికి ప్రతాపదేవరాయలనే పేరు ఉంది. శ్రీశైల తామ్రశాసనం విజయ భూపతి రాణి నారాయణాంబికలకు ప్రతాప దేవరాయలనే కుమారుడున్నాడని, ఈ ప్రతాపదేవరాయలు తన అన్న నుంచి ఘనాది రాజ్యాన్ని అంటే పెనుగొండ రాజ్యాన్ని పొందాడని తెలుపుతోంది. శ్రీశైల తామ్రశాసనం రెండవ దేవరాయలు, ప్రతాపదేవరాయల సంబంధాలను తెలుపుతోంది. విజయభూపతికి నారాయణాంబిక ద్వారా జన్మించిన రెండవ దేవరాయల కీర్తిని, మహేంద్రుడి కీర్తిని ఉపేంద్రుడు పెంచినట్లు, అతని తమ్ముడు ప్రతాప దేవరాయలు ఇనుమడించాడని తెలుపుతోంది. కనుక ప్రతాపదేవరాయలు రెండవ దేవరాయల తమ్ముడని బోధపడుతోంది. అతడు రాజప్రతినిధిగా పెనుగొండ రాజ్యం ఏలాడు. అన్న మరణానంతరం అతడు విజయ రాయలనే పేరుతో విజయనగర సింహాసనాన్ని ఆక్రమించాడు. కాని అన్న కుమారుడు మల్లికార్జునరాయలు

అతనితో పోటీపడ్డాడు. అప్పటి శాసనాలు, సాహిత్యం కూడా రెండవ దేవరాయల మరణానంతరం అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడినట్లు తెలుపుతున్నాయని కందూరు ఈశ్వరదత్తు, నేలటూరి వెంకటరమణయ్య కూడా వివరించారు కాని విజయరాయలు ఏ విధంగా సింహాసనాన్ని ఆక్రమించాడో మాత్రం తెలియదని నేలటూరి వెంకట రమణయ్య అన్నారు. మల్లికార్జున రాయలు చిన్నవాడైనందువల్ల విజయరాయలు సింహాసనం ఎక్కి ఉండవచ్చును కాని విజయ రాయలు రాజ్యం చేస్తున్న కాలంలోనే మల్లికార్జున రాయలు కూడా పృథ్వీరాజ్యం చేస్తున్నట్లు కూడా శాసనాలు ఉన్నాయి. కాని వారు సహపాలన చేసినట్లు అంగీకరించడానికి ఆధారాలు లేవు. కనుక రెండవ విజయ రాయలు, మల్లికార్జున రాయలు వారసత్వానికి పోటీపడ్డారని భావించవచ్చును. మొదటిదశలో విజయ రాయలు విజయం సాధించి విజయనగర వజ్ర సింహాసనం అధిష్టించి ఉంటాడు. కాని అతడు కొన్ని నెలలు మాత్రమే రాజ్యం చేశాడు. ఆ కొద్ది కాలంలో అతడు ప్రజానురంజకమైన పాలన చేశాడు. తన అన్న రెండవ దేవరాయల కాలంలోనూ కులసిద్ధాయం అనే పన్నులు వసూలు చేశారు. కాని ప్రజలు ఆ పన్నులను రాష్ట్ర పాలకులుగాని, రాయల వారి మంత్రులు గాని ఇతర రాజోద్యోగులు గాని ఆ పన్నులు వసూలు చేయకుండా కట్టుదిట్టం చేసి శాసనాన్ని వేయించి ప్రజాభిమానాన్ని పొందాడు. అతడు ప్రజానురంజకంగా పాలించినప్పటికీ కొద్ది నెలలలోనే మల్లికార్జున రాయలు అతనిని తొలగించి విజయనగర వజ్రసింహాసనం అధిష్టించాడు. అందువల్ల రెండవ విజయ రాయలు విజయనగరం నుండి పెనుగొండకు వెళ్లిపోయాడు. మల్లికార్జున రాయలు పిన తండ్రిని పెనుగొండ పాలకునిగా కొనసాగనిచ్చాడు. కనుక చివరిలో వారిద్దరూ సయోధ్యకు వచ్చినట్లు భావించవచ్చును. నేలటూరి వెంకట రమణయ్య, కందూరి ఈశ్వరదత్తులు, వారి మధ్య పోరాటం జరిగి ఓడిపోయిన తర్వాత రెండవ విజయ రాయలు పెనుగొండకు వెళ్లిపోయాడా లేక మంత్రాంగంతో వారు సయోధ్యకు వచ్చారా, అనే విషయం స్పష్టంగా చెప్పలేమని వ్యాఖ్యానించారు. ఏమైనప్పటికీ వారు చివరలో సయోధ్యకు వచ్చారని భావించవచ్చును. రెండవ విజయ రాయలకు ప్రతాపదేవరాయలకు పేరేగాక ఇమ్మడి విజయరాయలని కూడా పేరుంది.

న్యూనిజ్ రెండవ దేవరాయలకు విరూపాక్షరాయలకు మధ్య పిన్నారావు అనే పేరు కలిగిన రాజకుమారుడు పాలించాడని రాశాడు. కాని ఈ పిన్నారావు ఎవరో తెలియదు. రెండవ దేవరాయల తర్వాత మల్లికార్జున రాయలు రాజ్యానికి వచ్చాడని శాసనాలు తెలుపుతున్నాయి. కనుక న్యూనిజ్ రాతలను లెక్కలోకి తీసుకొనవలసిన పనిలేదని డా రాయప్రోలు సుబ్రహ్మణ్యం అన్నారు. ఒకవేళ మల్లికార్జున రాయలనే పిన్నారావు అని న్యూనిజ్ రాశాడేమో తెలియదు.

మల్లికార్జున రాయలు క్రీ.శ.1446-1465: మల్లికార్జునరాయలు క్రీ.శ.1446లో రాజ్యానికి వచ్చి సుమారు 20 సంవత్సరాలు పాలించాడు. తండ్రి దేవరాయలు శ్రీశైల మల్లికార్జునిని భక్తుడు. అందువల్ల తన కుమారునికి మల్లికార్జున రాయలని పేరు పెట్టాడు. ఇతనికి మూడవ దేవరాయలని, మూడవ ప్రౌఢ దేవరాయలని కూడా పేర్లున్నాయి. మల్లికార్జున రాయల కాలంలో దక్షిణ భారతదేశంలో నూతన అధ్యాయం ప్రారంభమైంది కళింగ రాజ్యంలో కపిలేశ్వర గజపతి గాంగవంశాన్ని తొలగించి గజపతి వంశాన్ని ప్రతిష్టించాడు. గజపతి రాజ్య అవతరణతో దక్షిణ భారతదేశంలో నరపతి, గజపతి, అశ్వపతుల సంఘర్షణ ప్రారంభమైంది. ఆంధ్రదేశంపై ఆధిపత్యం కోసమే వారి సంఘర్షణ జరిగింది. ముఖ్యంగా కొండవీటి రాజ్యం ఆక్రమణ కోసం నరపతి, అశ్వపతి, గజపతులు పోటీ పడ్డారని శ్రీనాధుని చాటు పద్యాలు కూడా చాటుతున్నాయి. కొండవీడు ముగ్గురు రాజులకు మోహంబు బుట్టించు అని శ్రీనాధుడు వర్ణించాడు. కపిలేశ్వరుడు మహావీరుడు. అతడు విజయనగర రాజ్యం, బహమనీ రాజ్యం రెండింటినీ ఓడించాడు. గజపతుల రాకతో విజయనగర రాజులు తూర్పు కోస్తాను కోల్పోవలసి వచ్చింది. అదే విధంగా రెండవ దేవరాయల కాలంలో బహమనీ రాజ్యానికి జరిగిన పరాభవానికి ప్రతీకారంగా బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ కూడా విజయనగర రాజ్యంపై దాడిచేశాడు. మల్లికార్జున రాయలు చిన్నవాడైనందువల్ల విజయనగరాన్ని సులభంగా జయించవచ్చని బహమనీలు, గజపతులు ఏకకాలంలో రాజధానిపై దండెత్తారు. కొందరు వారుభయులూ కలసి దండయాత్ర చేశారని భావించారు. కాని అందుకు సాక్ష్యాధారాలు లేవు. అంతేగాకుండా తర్వాత గజపతులు బహమనీ రాజ్యంపై కూడా దండెత్తారు. కనుక వారు ఒకరికొకరు విరోధులే గాని మిత్రులనడానికి ఎలాంటి ఆధారాలు లేవు. కనుక వారు విడివిడిగానే విజయనగరంపై దాడి చేసి ఉండవచ్చును. ఈ దాడి క్రీ.శ.1450లో జరిగిందని భావింపబడింది. ఈ దాడిలో విజయం ఎవరిని వరించిందీ అనే విషయంపై భిన్న కథనాలు ఉన్నాయి. కపిలేశ్వరుడు క్రీ.శ.1448లో రాజమహేంద్రవరాన్ని

జయించి క్రీ.శ.1450లో కొండవీటిని వశపరచుకున్నాడు. తర్వాత విజయనగరంపై దాడికి వెడలి బెల్లంకొండ, వినుకొండ, వెలగోడు, అద్దంకి, శ్రీశైలం ప్రాంతాలను ఆక్రమించి విజయనగరం చేరి కోటను ముట్టడించాడు. అక్కడ జరిగిన యుద్ధంలో మల్లికార్జునరాయలు ఓడిపోయి కప్పం చెల్లించడానికి అంగీకరించాడని పూరీజగన్నాథం కైఫీయత్తులు, కపిలేశ్వరుని మనుమడు కుమార కపిలేశ్వరుని తామ్రశాసనాలు తెలుపుతున్నాయి. అలాగే కపిలేశ్వరుడు క్రీ.శ.1448లో తీరాంధ్రదేశంపై దాడి జరిపినట్లు అతని పెనుగొండ శాసనం కూడా సూచిస్తోంది. అదే విధంగా క్రీ.శ.1500 సంవత్సరం నాటి ప్రతాపరుద్ర గజపతి అనంతవరం శాసనం కూడా కపిలేశ్వర గజపతి విజయ నగరాన్ని ముట్టడించి విజయం సాధించాడని తెలుపుతోంది ఇదే విధంగా రష్యా యాత్రికుడైన అతనాసియస్ నికిటిన్ బహమనీ సుల్తాన్ విజయనగర కోటను పట్టుకున్నాడని రాశాడు. వీరి రచనల ప్రకారం మల్లికార్జునరాయలు గజపతి, బహమనీ సైన్యాల చేతిలో ఓడిపోయాడని చెప్పవలసి ఉంటుంది. కాని మల్లికార్జునరాయల సమకాలికుడైన గంగాధరకవి గంగదాస ప్రతాప విలాసం అనే నాటకాన్ని రాశాడు. అందులో ఈ దండయాత్రల ప్రస్తావన ఉంది. దక్కను సుల్తాన్, గజపతి పెద్ద సేనలతో విజయనగరాన్ని ముట్టడించారని, మల్లికార్జున రాయలు తన గుహ నుండి బయల్పడి కొదమసింగం లాగా కోట నుండి శాసనాలు, కైఫీయత్తులు, నికిటిన్ రాత వలన క్రీ.శ.1450లో విజయనగరంపై దాడి జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది. కాని గజపతులు, అశ్వపతులు విజయం సాధించలేదు. గంగాధరుని రాతలే వాస్తవం అని చెప్పవచ్చును. అందుకు కారణమేమిటంటే కొండవీడు రాజ్యం క్రీ.శ.1449 వరకు విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉన్నట్లు శాసనాలున్నాయి. ఆ తర్వాత అంటే క్రీ.శ.1450లో కొండవీటిని గజపతులు ఆక్రమించారు. కాని విజయనగర కోట వద్ద క్రీ.శ.1450లో జరిగిన ఓటమి వలన గజపతి కొండవీటిని కోల్పోయాడు. తిరిగి కొండవీడు 1454లోనే గజపతుల కిందికి వచ్చింది. కనుక క్రీ.శ.1450 నాటి విజయనగర యుద్ధంలో మల్లికార్జునరాయలు విజయం సాధించి గజతిని పారదోలి కొండవీడు వరకు తిరిగి పునరాక్రమించాడని స్పష్టపడుతోంది. అలాగే బహమనీ సుల్తాన్ కూడా 1453 వరకు విజయనగర రాజ్యంపై ఎలాంటి విజయాన్ని సాధించలేదు. పెరిష్టా క్రీ.శ.1443-54 సంవత్సరాల మధ్య సంఘటనలను రాయలేదు. సుల్తాన్ విజయనగరం వద్ద విజయం సాధించి ఉంటే అతడు తప్పకుండా వర్ణించి ఉండేవాడు. కనుక ఈ యుద్ధంలో మొదట గజపతి అశ్వపతులు విజయం సాధించినా చివరకు మల్లికార్జునరాయలు వారిని ఓడించి తరిమాడని భావించవచ్చును. అయితే మల్లికార్జున రాయల మొదటిదశలో గజపతి, అశ్వపతులు విజయనగర రాజ్యాన్ని కబళించాలని ప్రయత్నించారని అంగీకరించ వచ్చును. కాని వారి ప్రయత్నం విఫలమైంది. కనుక గంగాధరుని రాతలే వాస్తవమని భావించవచ్చును.

వెలమల అలజడి: మల్లికార్జునరాయల కాలంలో జరిగిన మరొక ప్రముఖ సంఘటన రాచకొండ, ఓరుగల్లు పద్మనాయకులు రాజ్యం పోగొట్టుకొని విజయనగర రాజ్యంలో ప్రవేశించి కొన్ని అలజడులు సృష్టించారు. క్రీ.శ.1425లో బహమనీ సుల్తాన్ ఓరుగల్లు, రాచకొండ వెలమ రాజ్యాన్ని ఆక్రమించాడు. దాంతో రాజ్యం పోగొట్టుకున్న పద్మనాయకులు విజయనగర రాజ్యంలో ప్రవేశించి అనేక అలజడులను సృష్టించారు. రెండవ దేవరాయలు వారిని అదుపులో పెట్టాడు. వారు తిరిగి మల్లికార్జునరాయల కాలంలో విజయనగర భూభాగంలో తమ సొంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నించి స్థానిక పాలెగాండ్రతో యుద్ధానికి దిగారు. ఆ స్థితిలో గండికోట సేనాధిపతి పోలేపల్లి బుక్కరాజు, పెదసింగమ అన్నమ అనే వెలమనాయకుని చంపి విజయనగర భూభాగాలను రక్షించాడు. మల్లికార్జున రాయల ఆజ్ఞతో బుక్కరాజు వెలమలతో పోరాడినాడో లేక తనకు తానుగానే వారితో యుద్ధం చేసి వెలమనాయకుని సంహరించాడో స్పష్టంగా తెలియదు. వెలమల ఆగడాలను స్థానిక నాయకులే కట్టించినట్లుగా కనిపిస్తోంది. అయినప్పటికీ ఈ కర్నూలు జిల్లా తూర్పు భాగంలోని వెలగోడును వెలమలు ఆక్రమించి దానికి తమ స్థావరంగా చేసుకొన్నారని వెలగోటి వంశావళి తెలుపుతోంది. తర్వాత వారు మల్లికార్జున రాయల సార్వభౌమాధికారాన్ని అంగీకరించి విజయనగర కొలువులో సేనాధిపతులుగా చేరారు.

బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ దండయాత్ర క్రీ.శ.1453: విజయనగర రాజ్యంపై క్రీ.శ.1450లో చేసిన దాడి విఫలం అయిన తర్వాత సుల్తాన్ అల్లావుద్దీన్ మూడు సంవత్సరాలు విజయనగరం వైపు చూడలేదు. అందుకు కారణం తెలంగాణలో సుల్తాన్‌పై తిరుగుబాట్లు జరిగాయి భోనగిరి పాలకుడు జలాల్‌ఖాన్, అతని కుమారుడు సికిందర్‌ఖాన్‌లు తిరుగుబాటు చేశారు. వారిని అణచడానికి సుల్తాన్ తన సేనాధిపతి అయిన మహమ్మద్ గవాన్‌ను పంపాడు. గవాన్ వారిని ఓడించి అదుపులోకి తెచ్చాడు. ఈ విజయం తర్వాత సుల్తాన్ అల్లావుద్దీన్ విజయనగర

రాజ్యంలోని పశ్చిమ ప్రాంతాలపై దాడిచేయాలని సంకల్పించి తన సేనాని మాలిక్ ఉల్‌తుజార్ అనే వాడిని పంపాడు. అతడు చౌల్‌దెబాల్‌ను ఆక్రమించాడు. ఆ విజయాలతో ఉత్సాహం కలిగిన తుజార్ ఇంకాముందుకు సాగాడు బహమనీ సేనను అడ్డగించమని మల్లికార్జున రాయలు విశాల్‌ఘడ్ రాజును ఆదేశించాడు. విశాల్‌ఘడ్ రాజు బహమనీ సేనను ఎదుర్కొని ఓడించి బహమనీ సైన్యాన్ని నాశనం చేశాడు. దాంతో బహమనీ సుల్తాన్ రెండవసారి కూడా పరాజయం పొందాడు. రెండవ అల్లావుద్దీన్ క్రీ.శ.1458 ఫిబ్రవరిలో మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు హుమాయూన్ సింహాసనం అధిష్టించి క్రీ.శ.1461 సెప్టెంబర్ వరకు రాజ్యం చేశాడు అతడు క్రూరుడని పేరు పొందాడు. కాని విజయనగర రాజ్యంతో యుద్ధాలు చేయలేదు. అతని తర్వాత నిజామ్‌షా అనే 8 సంవత్సరాల బాలుడు సింహాసనం అధిష్టించాడు. అతడు రెండు సంవత్సరాలు పాలించాడు. అతని తర్వాత అతని సోదరుడు మూడవ మహమ్మద్‌షా క్రీ.శ.1463 జూలై 30వ తేదీన సింహాసనం ఎక్కాడు. వీరెవరూ మల్లికార్జునరాయలతో పోరాడలేదు. అందువల్ల అల్లావుద్దీన్ చేసిన క్రీ.శ.1450-53 నాటి రెండు యుద్ధాలే మల్లికార్జునరాయల కాలం నాటి బహమనీ విజయనగర సంఘర్షణ అని చెప్పవచ్చును.

సామంతుల తిరుగుబాటు : బహమనీ దండయాత్ర తర్వాత రాయల బలహీనతను చూసి తమిళదేశంలో సామంతులు తిరుగుబాటు చేశారు. పాండ్యుల ప్రోద్బలంతో బాణ ప్రభువైన భువనైక సమరకోలాహల మావలిభాగాది రాయలు స్వతంత్రించి కంచిపై దండెత్తి ఆక్రమించాడు. వారిని అణచడానికి రాయలు సాళువ నరసింహ రాయలను పంపాడు. అతడు వారిని క్రీ.శ.1462లో అణచివేశాడు. ఈ విజయాల తర్వాత సాళువ నరసింహ రాయలు ప్రఖ్యాతుడు కాజొచ్చాడు.

గజపతి దండయాత్ర క్రీ.శ.1454-66: బహమనీ సుల్తాన్ విజయనగర పశ్చిమకోస్తాపై దండెత్తడాన్ని చూసి కపిలేశ్వర గజపతి తూర్పు కోస్తాను ఆక్రమించడానికి తన సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి రెండవ ప్రయత్నం చేశాడు. క్రీ.శ.1448 నుండి 1450 వరకు జరిగిన యుద్ధాలలో రాజమహేంద్రవర రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో చేర్చగలిగాడు. కొండవీటిని కూడా జయించి పోగొట్టుకున్నాడు. కాని నాలుగు సంవత్సరాల తర్వాత తాను పోగొట్టుకున్న అన్ని ప్రాంతాలను తిరిగి సంపాదించాడు. క్రీ.శ.1454వ సంవత్సరంలో కొండవీటి రాజ్యాన్ని జయించడానికి కపిలేశ్వరుడు తన కుమారుడు హంవీరుని పంపాడు. హంవీరుడు కొండవీటిని జయించి అక్కడి విజయనగర సామ్రాజ్యపు పాలెగాడిని తరిమివేశాడు. తర్వాత అద్దంకి, శ్రీశైల ప్రాంతం వరకు జయించాడు. ఈ విజయం తర్వాత కపిలేశ్వరుడు హంవీరుని కొండవీడు దండపాటకు అధిపతిగా నియమించి, ఇంకా దక్షిణంగా దండయాత్ర చేసి తమిళ దేశాన్ని కూడా జయించమని ఆదేశించాడు. అందువల్ల హంవీరుడు తమిళదేశంపై కూడా దండెత్తాడు. కాని మల్లికార్జునరాయలె హంవీరుని ఎదిరించి ఓడించి తమిళ దేశాన్ని రక్షించుకున్నాడు. తమిళ దేశాన్ని జయించలేకపోయినా కొండవీటి రాజ్యం గజపతి సామ్రాజ్యంలో భాగమైంది. ఈ విజయం తర్వాత కపిలేశ్వరుడు క్రీ.శ.1458-60 సంవత్సరాల మధ్య వెలమలకు సహాయంగా తెలంగాణలో బహమనీ సుల్తాన్‌తో యుద్ధానికి దిగాడు. ఆ యుద్ధాలలో హంవీరుడు ప్రముఖ పాత్ర నిర్వహించి సుల్తాన్‌ను ఓడించి ఓరుగల్లును ఆక్రమించాడు. దాంతో తెలంగాణ కూడా గజపతి సామ్రాజ్యంలో భాగమైంది. ఆ విజయం తర్వాత మూడవసారి విజయనగర రాజ్యంపై దండయాత్రను నిర్వహించాడు. ఈ దండయాత్రకు కపిలేశ్వరుని మనుమడు, హంవీరుని కుమారుడు అయిన కుమార కపిలేశ్వరుడు నాయకత్వం వహించాడు. కుమార కపిలేశ్వరుడు క్రీ.శ.1460-64 సంవత్సరాల మధ్య నిరాటంకంగా విజయనగర సామ్రాజ్యంపై దండెత్తి ఉదయగిరి, చంద్రగిరి, పడైవీడు, కంచి వలుదలంపట్టి, తిరుచానూరు, తిరుచనాపల్లిలను ఏకధాటిగా ఆక్రమించాడు. గజపతి సైన్యాలు రామేశ్వరం వరకు ఎదురులేకుండా నడిచాయి. గజపతి సేనలను నిరోధించడానికి మల్లికార్జునరాయలు, అతని సేనాని సాళువ నరసింహ రాయలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. తమిళదేశం కూడా గజపతి సామ్రాజ్యంలో చేరిపోయిందవి. కొండపల్లి, కృష్ణకు దక్షిణభాగం మొత్తానికి కుమార కపిలేశ్వరుడు అధిపతిగా నియమింపబడ్డాడు. అతడు క్రీ.శ.1464 నాటి దక్షిణ ఆర్కాట్‌లోని మున్నూరు శాసనాలు హంవీరుని కుమారుడైన కుమార దక్షిణ కపిలేశ్వరుడు కొండపల్లి, అద్దంకి, వినుకొండ, చంద్రగిరి, పడైవీడు, వదుదలంపట్టు సావడి, తిరుచానూరు, తిరుచురాపల్లి ప్రాంతాలను పాలిస్తున్నట్లు తెలుపుతున్నాయి. ఈ విధంగా క్రీ.శ.1448-64 సంవత్సరాల మధ్య తీరాంధ్రదేశం యావత్తూ గజపతుల వశమైంది. మూడు యుద్ధాల ద్వారా ఈ ప్రాంతాన్నంతటినీ స్వాధీనం చేసుకోగలిగారు. 1448లో రాజమహేంద్రవర రాజ్యాన్ని, 1454లో కొండవీటి

రాజ్యాన్ని, 1464లో తిరుచునాపల్లి వరకు తమిళదేశాన్ని జయించారు. దాంతో కళింగదేశం రామేశ్వరం వరకు గజపతి సామ్రాజ్యంలో భాగమైంది. గజపతుల దక్షిణదేశ ఆక్రమణను గురించి చరిత్రకారుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. నేలటూరి వెంకటరమణయ్య తిరుచునాపల్లి వరకు గజపతులు చేసిన దండయాత్ర వట్టి దండయాత్ర మాత్రమే, ఆ ప్రాంతాలు గజపతుల సామ్రాజ్యంలో చేరలేదు అని భావించారు. కృష్ణశాస్త్రి, సుబ్రహ్మణ్యం, బెనర్జీ మొదలైన వారు తమిళదేశం గజపతి సామ్రాజ్యంలో భాగమైందని భావించారు. వారి అభిప్రాయమే సరైనదిగా కనిపిస్తోంది. తమిళ దేశాన్ని కుమార హంవీరుడు జయించిన తర్వాత కనీసం 10 సంవత్సరాలు గజపతుల స్వాధీనంలో ఉందని అక్కడి శాసనాలు తమిళ సాహిత్యం తెలుపుతున్నాయి. ఓడ్రపాలనలో దక్షిణాదిన చిదంబరం, శ్రీరంగం మొదలైన ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో పూజాపునస్కారాలు ఆగిపోయాయని బడ్డియన్‌గబై తెలుపుతోంది. దానిని బట్టి అక్కడ విజయనగర సేనలకు గజపతులకు దీర్ఘకాలిక పోరాటాలు జరిగాయని, ఆ పోరాట సమయాలలో దేవాలయాలకు పూజాపునస్కారాలు చేయడానికి కూడా వీలుకాలేదని, కనుక తమిళదేశంలో గజపతుల ఆధిపత్యం కనీసం 10 సంవత్సరాలు కొనసాగిందని పండితులు భావించారు. తమిళ దేశ దండయాత్ర తర్వాత మల్లికార్జునరాయలు ఎక్కువ కాలం జీవించలేదు. కుమార దక్షిణ కపిలేశ్వరుని విజయాల తర్వాత మరు సంవత్సరమే అంటే క్రీ.శ.1465లో మల్లికార్జునరాయలు మరణించాడు.

రాజశేఖర రాయలు క్రీ.శ.1465: సామ్రాజ్యపు తూర్పుకోస్తాపై గజపతి సాధించిన విజయాలను అడ్డుకోలేక మనోవ్యాకులతతో మల్లికార్జునరాయలు క్రీ.శ.1465లో మరణించాడు. అతని మరణానంతరం సింహాసనానికై అతని కుమారుడు రాజశేఖరరాయలకు, తన పిన తండ్రి రెండవ విజయరాయల కుమారుడైన రెండవ విరూపాక్షరాయలకు వారసత్వ వివాదం వచ్చింది. మల్లికార్జునరాయల మరణానంతరం అతని కుమారుడు రాజశేఖరరాయల సింహాసనానికి వచ్చాడు. శాసనాలు అతడు సామ్రాజ్యాధిపతి అయినట్లు తెలుపుతున్నాయి. విద్యారణ్య కాలజ్ఞానం కూడా రాజశేఖరరాయలను సంగమవంశస్థుల వంశ పట్టీలో చేర్చింది. కాని అతని అధికారాన్ని విరూపాక్షరాయలు అడ్డుకున్నాడు. విరూపాక్షరాయలు రాజకుటుంబంపై కుట్రలు పన్ని ఒక రాత్రిపూట రాజభవనంపై దాడి చేసి నిద్రిస్తున్న రాజబంధువులను సంహరించాడని వైష్ణవప్రసన్నామృతం అనే కావ్యం తెలుపుతోంది. ఈ విధ్వంసంలో రాజశేఖరరాయలు తప్పించుకొని విజయనగరం నుండి పారిపోయి చంద్రగిరి పాలెగాడైన సాళువ నరసింహరాయలను ఆశ్రయించినట్లుగా కనిపిస్తోంది. అందువల్ల శాసనాలు రాజశేఖర రాయలను విజయనగర చక్రవర్తిగా తెలుపుతున్నప్పటికీ అతడు విజయనగరం నుండి పాలించలేదు. సాళువ నరసింహరాయలు రాజశేఖరరాయలను విజయనగర సామ్రాట్టుగా ప్రకటించాడు. రాజధానిని విరూపాక్షరాయలు ఆక్రమించుకున్నందువల్ల రాజశేఖరరాయలు, అతని సంతతివారు తంజావూరు, మధుర, తిరుచినాపల్లి, కోయంబత్తూరు ప్రాంతాలలో స్వతంత్రంగా పాలించారు. రాజశేఖరరాయలు ఎంతకాలం పాలించిందీ స్పష్టంగా తెలియదు. సాళువ నరసింహరాయల శాసనాలలో మాత్రమే అతని పేరు ఉంది. అంతకుమించి అతనిని గురించి వివరాలు తెలియటం లేదు. అతడు క్రీ.శ.1471 వరకు జీవించి ఉన్నట్లు భావింపబడింది. రాయలు విజయ నగరాన్ని వదిలిపెట్టిన నాటినుండి విరూపాక్షరాయలు విజయనగర సింహాసనం అధిష్టించి విజయనగర చక్రవర్తిగా పాలించాడు.

రెండవ విరూపాక్ష రాయలు క్రీ.శ.1465-1485: శ్రీశైల తామ్రశాసనం రెండవ విరూపాక్షుడు ప్రతాపదేవ రాయల కుమారుడని తెలుపుతోంది. రెండవ విజయరాయలకే ప్రతాపదేవరాయలనే పేరుంది. కనుక ఇతడు రెండవ విజయరాయల కుమారుడని స్పష్టమవుతోంది. ఇతడు తన తండ్రిని తొలగించి సింహాసనం అధిష్టించిన మల్లికార్జున రాయలను తన బద్ధశత్రువుగా భావించాడు. కపిలేశ్వర గజపతి సహాయంతో రెండవ విరూపాక్ష రాయలు మల్లికార్జున రాయలను వధించి విజయనగర వజ్రసింహాసనాన్ని అధిష్టించాడని కొందరు పండితులు భావించారు. కానీ అది వాస్తవంగా కనిపించదు. ప్రసన్నామృతం అనే వైష్ణవకావ్యం నిద్రలో దాయాదులను చంపి విరూపాక్ష రాయలు రాజ్యానికి వచ్చాడని మాత్రమే తెలుపుతోంది. కాని మల్లికార్జునరాయలను చంపినట్లు తెలుపుటలేదు. కనుక మల్లికార్జునరాయల మరణానంతరం అతని కుమారుడు రాజశేఖరరాయలు సింహాసనానికి రాగానే అతనిని చంపడానికి రాజభవనంపై దాడి చేసి ఉండవచ్చును. ఆ ఘటనలో రాజశేఖరరాయలు తప్పించుకొని పోగా మిగిలిన రాజ కుటుంబ సభ్యులు మరణించి ఉంటారు. అదే విషయాన్ని ప్రసన్నామృత కావ్యం చెబుతోంది. కనుక రెండవ విరూపాక్షరాయలు రాజశేఖరరాయలను పారదోలి క్రీ.శ.1465లో విజయనగర

వజ్రసింహాసనాన్ని కైవసం చేసుకున్నాడని భావించవచ్చును. విరూపాక్షుడు విజయనగర చక్రవర్తి అయినప్పటికీ సామ్రాజ్యం అంతా అతని అధికారానికి లోబడినట్లుగా కూడా కనిపించడం లేదు. అనేక మంది సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంభించారు. వారిలో సాళువ నరసింహరాయలు అతిముఖ్యుడు. సాళువ వంశస్తులు గుండ్లకమ్మ నుండి కావేరీనది వరకు తూర్పున బంగాళాఖాతం నుండి కర్ణాటక వరకు విస్తరించిన భూభాగాన్ని పాలించారు. ఆర్కాటు దక్షిణ కర్ణాటకలో కొంత భాగం కూడా వీరి రాజ్యంలో ఉండేది. వీరి రాజధాని చంద్రగిరి సాళువ నరసింహరాయలు నామమాత్రంగా విజయనగర రాయల అధికారాన్ని అంగీకరించి దాదాపు స్వతంత్రంగానే పాలించాడు. సాళువ రాజ్యానికి దక్షిణంగా తంజావూరు, మధుర, తిరుచినాపల్లి, కోయంబత్తూరు ప్రాంతాలను రాజశేఖరరాయుల సంతతి వారు కూడా స్వతంత్రంగానే పాలించేవారు. అలాగే తుళువ కొంకణ ప్రాంతాలలో కూడా స్థానిక పాలెగాండ్రు స్వతంత్రవైఖరిని అవలంబించారు. అందువలన పశ్చిమ సముద్ర తీర ప్రాంతం కూడా స్వతంత్రంగానే ఉంది. ఇంక మిగిలిన కర్ణాటక పశ్చిమ ఆంధ్ర ప్రాంతాలలో మాత్రమే విరూపాక్షరాయుల అధికారం కొనసాగింది. స్వతంత్ర వైఖరి అవలంభించిన సామంతులను లొంగదీయదానికి గాని, సామ్రాజ్య ఐక్యతను సాధించదానికి గాని అతదు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అతదు విషయలోలుదు, స్త్రీలోలుదు, దుర్వ్యసనపరుదు, తాగుబోతు అని న్యూనిజ్ వర్ణించాదు. అతని లోపభూయిష్టమైన ప్రవర్తనవల్ల సామంతులు, సేనాధిపతులెవరూ అతని అధికారాన్ని అంగీకరించలేదు. అందువలన అతదు ఇంకా తాగుదు, స్త్రీల మొదలైన వ్యసనాలలో కూరుకొనిపోయి ఇంకా క్రూరుదుగా మారిపోయాదు. చివరకు మనశ్శాంతిలేక ఏటూరి నరసింహాచార్యులవారి బోధనలతో వైష్ణవమతాన్ని పుచ్చుకున్నాదు. వైష్ణవమతంలోకి మారిన మొట్టమొదటి విజయనగర చక్రవర్తి విరూపాక్షుదు.

బహమనీ సుల్తాన్ దాడులు-ముస్లిం వర్తకుల సమస్య-గవాన్ దాడి: విరూపాక్షుదు రాజ్యానికి వచ్చిన మొదటి ఐదు సంవత్సరాలు ఎలాంటి అంతఃకలహాలు విదేశీ దందయాత్రలు లేక ప్రశాంతంగా గడిచిపోయింది క్రీ.శ.1469లో బట్కల్ సంఘటన జరిగింది. విజయనగర పశ్చిమకోస్తాలో బట్కల్, గోవా, చౌల్, దేబాల్ మొదలైన రేవుపట్టణాలుండేవి. ఈ రేవుల ద్వారా అరబ్బులు దక్షిణ భారతదేశంతో వ్యాపారం చేసేవారు ముఖ్యంగా గుర్రాల వ్యాపారం జరుగుతుండేది. మూరులని పిలువబడే అరబ్బులు మేలు జాతి గుర్రాలను ఓడలపై తీసుకొనివచ్చి ఇటు విజయనగర రాజ్యానికి, అటు బహమనీ రాజ్యానికి అమ్ముతుండేవారు. కాని మేలు జాతి అశ్వాలను బహమనీ సుల్తాన్‌లకు అమ్మి బహమనీ సుల్తాన్ వదలివేసిన పనికిమాలిన గుర్రాలను విజయనగరానికి అమ్మేవారు. అందువల్ల విజయనగర అశ్వదళం, బహమనీ అశ్వదళానికి దీటు కాలేకపోతూ ఉండేది. అది తెలుసుకొన్న విరూపాక్షరాయలు బట్కల్‌లోని మూరు వర్తకులను మందలించాదు. కాని వారు లెక్కచేయలేదు దాంతో క్రోధం వచ్చిన విరూపాక్షరాయలు వారిని దండించమని హెనోవర్‌లోని తన సామంతుని ఆజ్ఞాపించాదు హెనోవర్ పాలెగాదు క్రీ.శ.1469లో బట్కల్‌పై దందెత్తి 10 వేల మంది మూరులను వధించాదని పర్షాన్ అనే అతదు రాశాదు. మిగిలిన వారు గోవాకు పారిపోయారు. కొందరు బహమనీ సుల్తాన్ మూదవ మహమ్మద్‌షాకు మొర పెట్టుకున్నారు. మహమ్మదీయులను వధించినందుకు ప్రతీకారంగా మహమ్మద్‌షా తన వజీరైన ఖ్వాజా మహమ్మద్ గవాన్‌ను పశ్చిమకోస్తాపై దాడిచేయమని పంపాదు. గవాన్ పశ్చిమతీరంపై దందెత్తి క్రీ.శ.1469లో గోవా, ఖేల్నా, దేబాల్, చౌల్ మొదలైన రేవులను ఆక్రమించాదు. పెరిష్టా గవాన్ విజయాలను వర్ణించాదు. ఈ రేవు పట్టణాలను తిరిగి జయించదానికి విరూపాక్షరాయలు బెల్గాం పాలకుదైన వీరకృష్ణనాయకుని ఆదేశించాదు. ఇతనికి బర్కానారేసు అని కూడా పేరుంది. బర్కానారేసు గోవాపై దందెత్తాదు. కాని గవాన్ అతనిని ఓడించాదు. విరూపాక్ష రాయలు గోవాను జయించదానికి రెండవ పర్యాయం కూడా ప్రయత్నించాదు. కాని విజయం లభించలేదు. దాంతో గోవా, చౌల్, దేబాల్, ఖేల్నాలు శాశ్వతంగా పోయాయి. విరూపాక్షరాయల వ్యసనపరత్వం వలన ఈ రేవులను పోగొట్టుకున్నాదని న్యూనిజ్ రాశాదు. ఈ రేవు పట్టణాలు పోయినందువల్ల విజయనగర సామ్రాజ్యానికి విదేశీ వ్యాపారంపై వచ్చే ఆదాయం తగ్గిపోయింది. అంతేగాక అశ్వాలు లభించక విజయనగర సైన్య శక్తి కూడా క్షీణించింది.

సాళువ నరసింహుని విజయాలు క్రీ.శ.1470-77: బట్కల్ సంఘటన జరిగిన మరు సంవత్సరం అంటే క్రీ.శ.1470లో కపిలేశ్వర గజపతి మరణించాదు. కటక సింహాసనం కోసం అతని కుమారుల మధ్య వారసత్వం యుద్ధం ప్రారంభమైంది. వారి అంతఃకలహాల కాలంలో కపిలేశ్వరుదు విజయనగర రాజ్యంలో జయించిన

భూభాగాలను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి మంచి అవకాశం వచ్చింది. కాని విరూపాక్షరాయలు ఆ అవకాశాన్ని వినియోగించుకొని విజయనగర రాజ్య పరువుప్రతిష్టలను పునరుద్ధరించడానికిగాని, ప్రజానురంజకంగా పరిపాలన చేయడానికి గాని ఎలాంటి ప్రయత్నం చేయలేదు ఆ స్థితిలో చంద్రగిరి పాలకుడైన సాళువ నరసింహరాయలు తీరాంధ్ర దేశంపై దండెత్తి గజపతుల కింద ఉన్న ప్రాంతాలను జయించడానికి పూనుకున్నాడు. క్రీ శ 1470లో ఉదయగిరిని జయించాడు. ఆ కాలంలో ఉదయగిరి గజపతుల ప్రతినిధి అయిన కాటంరాజు తమ్మరాజు ఆధిపత్యంలో ఉంది. అతనిని ఓడించి నరసింహరాయలు ఉదయగిరిని ఆక్రమించాడు. రాజనాథ ఢిండిముడు సాళువ నరసింహరాయలు ఉదయగిరిని ఆక్రమించాడని రాశాడు. తర్వాత అద్దంకి, కొండవీడు, మచిలీ పట్టణాలను జయించి గోదావరీ తీరం వరకు చేరాడు. దాంతో సాళువ నరసింహరాయల కీర్తిప్రతిష్టలు మారుమోగి పోయాయి విరూపాక్షరాయల ఉదాసీనత సాళువ నరసింహరాయల అభ్యుదయానికి కారణమైంది.

మూడవ మహమ్మద్‌షా కంచి దండయాత్ర క్రీ.శ.1481: గజపతి రాజ్యంలోని అంతఃకలహాలను ఆసరాగా తీసుకొని మూడవ మహమ్మద్‌షా గజపతి రాజ్యంలో జోక్యం చేసుకొని హంవీరుని కటకసింహాసనం ఎక్కించాడు. కాని హంవీరుడు సింహాసనాన్ని దక్కించుకోలేకపోయాడు. పురుషోత్తమగజపతి కళింగాధిపతి అయ్యాడు. తిరిగి రాజమహేంద్రవరాన్ని జయించడానికి పూనుకున్నాడు. ఆ స్థితిలో మూడవ మహమ్మద్‌షా రాజమండ్రిపై దండెత్తి దానిని రక్షించుకున్నాడు. అదే కాలంలో సాళువ నరసింహరాయలు మచిలీపట్నం వరకు ఆక్రమించి తెలంగాణలోని పాలెగాండ్రను సుల్తాన్‌కు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి ప్రోత్సహిస్తున్నాడు. అందుకు కోపించి మహమ్మద్‌షా విజయనగర రాజ్యంపై దండెత్తాడు. కొండవీడును జయించి మాలూర్ అంటే నెల్లూరు వరకు నడిచాడు. అక్కడ కంచి దేవాలయ సంపదను గురించి విన్నాడు. దానిని దోచుకోవాలని సంకల్పించి తన కుమారుడు, తను బయలుదేరి వెళ్లి క్రీ.శ.1481 మార్చి 12వ తేదీన కంచి దేవాలయాన్ని దోచుకొని విలువైన ఆభరణాలు, రత్నాలతో కొండవీటికి బయలుదేరాడు కంచిని దోచిన సంగతి తెలిసి నరసింహరాయలు తన సేనాధిపతి తుళువ ఈశ్వరనాయకుని పంపాడు. ఈశ్వరనాయకుడు కందుకూరు వద్ద సుల్తాన్ సేనను చీల్చి చెండాడాడు. దాంతో ప్రాణాలు దక్కించుకోడానికి సుల్తాన్ తను కంచిలో దోచిన సంపదను వదిలి వేసి పారిపోయాడు. కంచి దేవాలయ సంపదేగాక సుల్తాన్ వస్తువాహనాలు కూడా ఈశ్వరనాయకుని వశమయ్యాయి.

రెండవ దండయాత్ర క్రీ.శ.1481: కందూరులో జరిగిన ఊహించని ఓటమికి ప్రతీకారంగా సుల్తాన్ కొత్త సేనను సమీకరించి విజయనగర రాజ్యంపై రెండవ దాడి చేశాడు ఈసారి అతడు తన సేనను రెండు దళాలుగా చేసి ఒక దళాన్ని యూసఫ్ ఆదిల్‌ఖాన్, ఫకీర్ ఉల్‌ముల్క్ అనే సేనానుల నాయకత్వంలో పెనుగొండపైకి పంపాడు. రెండవ దళానికి తాను నాయకత్వం వహించి కొండపల్లి, మచిలీపట్టణాలపై దండెత్తాడు. పెనుగొండపై దండెత్తిన సైన్యాన్ని ఈశ్వరనాయకుడు చిత్తుగా ఓడించి తరిమివేశాడు. వరహపురాణం, జైమినీ భారతాలు ఈశ్వరనాయకుని విజయాన్ని తెలుపుతున్నాయి. పెనుగొండ అపజయాలను గురించి పెరిష్టాగాని, సయ్యద్ ఆలీగాని రాయలేదు. విజయం సాధించి ఉంటే వారు తప్పక పేర్కొనేవారే. కనుక అక్కడ సుల్తాన్ సైన్యం ఓడిపోయిందని చెప్పవచ్చును. పెనుగొండ వద్ద పరాజయం పొందినా బహమనీ సేనలు మచిలీపట్టణాన్ని ఆక్రమించాయి. తర్వాత సుల్తాన్ కొండపల్లి చేరి విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో క్రీ.శ.1481లో మహమ్మద్ గవాన్‌పై కుట్ర జరిగింది. సుల్తాన్ గవాన్‌ను కొండపల్లి కోటలో ఉరితీయించాడు. తర్వాత నిజం తెలుసుకున్న సుల్తాన్ పశ్చాత్తాపంతో క్రీ.శ.1482 మార్చి 2వ తేదీన మరణించాడు.

బెల్గాంను పోగొట్టుకోవడం: ఒరిస్సా అంతఃకలహాల కాలంలో గోవాను తిరిగి సంపాదించాలని విరూపాక్షుడు బెల్గాం అధిపతి బర్కానారే ప్రోత్సహించాడు. బర్కానారే గోవాకు బయలుదేరగానే మహమ్మద్‌షా బెల్గాంను ముట్టడించడానికి గవాన్‌ను పంపాడు. బర్కానారే ధైర్యంగా సుల్తాన్ సేనను ఎదుర్కొన్నాడు. కాని విరూపాక్షుడు ఎలాంటి సహాయాన్ని పంపలేదు. అందువల్ల బర్కానార్ ఓడి బెల్గాం కోటను సుల్తాన్‌కు సమర్పించాడు. సుల్తాన్ తీరాంధ్రదేశంపై దాడికి బయలుదేరినప్పుడు బెల్గాం తిరగబడింది. కాని సుల్తాన్ వెంటనే సైన్యాలను పంపి దానిని అదుపులోకి తెచ్చాడు. కందుకూరు వద్ద సుల్తాన్ ఓడిపోయి పారిపోయినప్పుడు గోవాను జయించాలని అక్కడి విజయనగర సేనాధిపతులు ప్రయత్నించారు గాని విజయం లభించలేదు. తన రాజ్యంలో ఇన్ని సంఘటనలు జరిగినా విరూపాక్షరాయలు ఏమీ పట్టించుకోలేదు. తన విలాసాలలో మునిగిపోయి ఉన్నాడు.

- **విరూపాక్షరాయల హత్య క్రీ.శ.1485:** అంతేగాక అతిక్రూరుడుగా మారాడు. విచిత్రంగా ప్రవర్తింప

సాగాడు. తన శయనాగారంలో ఫలానా నాయకుడు ప్రవేశించాడని ఆరోపించి సేనాధిపతులకు మరణశిక్ష విధించసాగాడు. రాజ్యాన్ని రక్షించలేకపోగా అలాంటి క్రూరకృత్యాలకు పాల్పడటంతో ప్రజలకు సామంతులకు, సేనాధిపతులకు అతనిపై విపరీతమైన ద్వేషం కలిగింది. న్యూనిజ్ కూడా అతడు దుశ్చంత్రుడు, పాపకర్ముడు అని నిందిస్తూ రాశాడు. ఆ స్థితిలో తమ వంశానికి అపకీర్తి వస్తోందని తలచి విరూపాక్షుని పెద్ద కుమారుడు తండ్రిని హత్య చేశాడు. అందుకు సంతసించిన ప్రజలు నాయకులు అతనిని సింహాసనం అధిష్టించమని కోరగా, అతడు పితృహంతకునికి రాజ్యార్హత లేదని చెప్పి, అతని తమ్ముడు అంటే విరూపాక్ష రాయలు రెండవ కుమారుడైన మూడవ ప్రౌఢదేవరాయలను సింహాసనాధీశుని చేశాడు. అతనినే న్యూనిజ్ వడియరావు అని వర్ణించాడు. ఈ విధంగా అనేక శత్రుదాడులు అల్లకల్లోలాల మధ్య 20 సంవత్సరాలు పాలించి రెండవ విరూపాక్షరాయలు హత్యకు గురై క్రీ.శ.1485లో మరణించాడు.

మూడవ ప్రౌఢదేవరాయలు క్రీ.శ.1485: తండ్రి మరణానంతరం రాజ్యానికి వచ్చిన మూడవ ప్రౌఢదేవరాయలు తండ్రిని మించిన ఘనుడు. తనను సింహాసనాధీశుని చేసిన తన అన్నను హత్య చేయించాడు బహుశా తన తండ్రిని చంపినట్లే తనను కూడా తన అన్న చంపవచ్చని భయపడి ఉండవచ్చును లేదా తన సింహాసనాన్ని లాక్కుంటాడని అనుమానపడి ఉండవచ్చును. ఏమైనా కృతఘ్నుడై తన అన్నను చంపించాడు. కాని రాజ్య రక్షణకు ఎలాంటి ప్రయత్నం చేయలేదు. తన తండ్రి లాగే విషయలోలుడై పొద్దుపుచ్చసాగాడు. అదే సమయంలో పురుషోత్తమ గజపతి తీరాంధ్రదేశంపై దండెత్తాడు. సామ్రాజ్య పరిస్థితులు విషమించసాగాయి పితృహంతకులు, భాతృహంతకులైన రాజులను ప్రజలు ప్రజాకంటకులుగా ఏవగించసాగారు. సామంతులు స్వతంత్రులు కావడానికి ఉద్యుక్తులయ్యారు. శతృవులు రాజ్యంపై దండెత్తడానికి పన్నాగాలు పన్నుతున్నారు. రాజ్యం విచ్ఛిన్నమయ్యే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఆ స్థితిలో పరిస్థితులు చేయి జారిపోతున్నాయని గ్రహించి సాళువ నరసింహరాయలు నిర్వీర్యుడు, దుష్టుడు అయిన రాయలను బాగు పరచడం సాధ్యం కాదని గ్రహించి ప్రౌఢ దేవరాయలను సింహాసన భ్రష్టుణ్ణి చేయాలని సంకల్పించి ముఖ్యమైన సామంతులను కూడగట్టాడు. తర్వాత తన సేనాధిపతి తుళువ నరసనాయకుని విజయనగరంపైకి పంపాడు. నరసనాయకుని ఎవరూ ఎదుర్కోలేదు. కొందరు స్త్రీలు అడ్డురాగా వారిని సంహరించాడు. నరసనాయకుని దండయాత్రను ఎదుర్కోడానికి కూడా సిద్ధపడకుండా మూడవ ప్రౌఢ దేవరాయలు క్రీ.శ 1485లో దొడ్డిదారిన రాజభవనం వదలి బయటపడి జన బాహుళ్యంలో కలసిపోయి నగరం వదలిపెట్టి పొరుగుదేశానికి పారిపోయాడు. రాయలు పారిపోయాడని తెలియగానే నరస నాయకుడు ఎవరినీ వధించకుండా రాజప్రాసాదంలో ప్రవేశించి రాజ్యాన్ని స్వాధీనం చేసుకొని సాళువ నరసింహ రాయలను విజయనగర చక్రవర్తిగా ప్రకటించాడు. దాంతో 185 సంవత్సరాల సంగమ వంశం పాలన అంతమైంది. విద్యారణ్య కాలజ్ఞానంలో తొమ్మిదవరాజైన రెండవదేవరాయల మరణానంతరం రాజ్యం దుస్థితిపాలై ఈ వంశంలోని చివరిరాజు శత్రువులచేత తరమబడి తుంగభద్రానది దాటి శతృదేశంలో ప్రవేశించి వారిని శరణువేడి అక్కడే మరణిస్తాడని చెప్పింది. అది వాస్తవంగా జరిగింది. మూడవ ప్రౌఢదేవరాయలు సాళువ నరసింహుని సైన్యాలచే తరుమబడి పరాయి రాజ్యాలకు పోయి మరణించాడు. అతని పలాయనంతో సంగమ వంశం అంతరించింది.

సంగమ వంశం అస్తమయం: రెండవ దేవరాయల మరణానంతరం విజయనగర చరిత్రలో గడిచిన 40 సంవత్సరాలు సంక్షోభాలతో గడిచిన కాలం. రాజ్యాధికారం ఒకరి చేతి నుండి మరొకరికి మారి అసంతృప్తి, ద్వేషాలకు నిలయమైంది. కుట్రలు, హత్యలు, బహమనీ, గజపతి దండయాత్రలతో సామ్రాజ్యం సతమతమైంది సామ్రాజ్య వైభవం శక్తి క్షీణించాయి. ఆ స్థితిలో సాళువ నరసింహరాయలు నిర్వీర్యం అయిన సంగమ వంశాన్ని బలవంతంగా తొలగించి క్రీ.శ.1485 చివరలో తాను విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్టించాడు. దాంతో విజయనగర చరిత్రలో మొదటి వంశం అయిన సంగమ వంశం అంతమై రెండవ వంశమైన సాళువ వంశం పాలన ప్రారంభమైంది.

సాళువ వంశం క్రీ.శ.1485-1505

గుండరాజు- భార్య కమలాదేవి

రెండవ గుండరాజు | సాళువమంగి-సావిత్రి 1363 (కుమార కంపణుని సేనాధిపతి) | వీరహోబలుడు | గౌతరాజు | ఆదిరాజు

(సాళువమంగి సంతానం:) సింగరాజు | మూడవగుండ | గౌతరాజు | సారదక్షితీశుడు | హనుమరాజు | మల్లినాధుడు

(సారదక్షితీశుని సంతానం:) గుండరాజు (భార్య మల్లాంబ) | సాళువరాజు | బొప్పరాజు | తిప్పరాజు (భార్య హరిహరాంబ) (రెండవ దేవరాయల చెల్లెలు)

(గుండరాజు సంతానం:) సాళువ నరసింహరాయలు (భార్య శ్రీరంగాంబ) 1486-1491 | తిమ్మరాజు

(సాళువ నరసింహరాయల సంతానం:) తిమ్మరాజు 1491 | చిన్నరాయళ్ళు 1491 | రెండవ (ఇమ్మడి) నరసింహరాయలు 1492-1505

సాళువ వంశ చరిత్ర తెలుసుకోవడానికి మనకు అనేక ఆధారాలున్నాయి. కాలజ్ఞానం, రాజనాథ డిండిముని సాళువాభ్యుదయం, శోభనాద్రినాయుడి రచన రామాభ్యుదయం, పోతరాయల ప్రసంగ రత్నావళి, పిల్లలమర్రి పినవీరభద్రుని జైమినీ భారతం, నంది మల్లయ్య, ఘంట సింగయ్యల వరాహ పురాణం, నంది తిమ్మన పారిజాతాపహరణం, రాజనాథ డిండిముని అచ్యుతాభ్యుదయం, తిరుమలాంబ వరదాంబికా పరిణయం కావ్యాలు, గోరకల్లు, పుత్తూరుపాలెం, పెరణిపాడు, సిద్ధవటం, బొమ్మవరం, ఆదవాని, దువ్వూరు, మొనాలచింత, కడప జిల్లాలోని రామేశ్వరం, అనంతపురం, కొండవీడు, అల్లూరు, గంగరాజపురం, సిరివెళ్ల గ్రామ కైఫీయత్తులు, ముస్లిం చరిత్రకారులైన ఫెరిష్టా మొదలైన వారి రచనలు, పోర్చుగీసువారైన న్యూనిజ్, బార్బొసా, డామింగోపేస్, ఇటలీ యాత్రికుడైన వార్డేమా రచనలు, చకన్‌హళ్లి, దేవులపల్లి, ఓన్‌కట్టి తామ్రశాసనాలు (వీటిలో సాళువ నరసింహుని, ఇమ్మడి నరసింహుని విజయాలు, వారి వంశావళి యివ్వబడ్డాయి.) గోరంట్ల, జంబుకేశ్వరం, కంచి, శ్రీరంగం, తిరుపతి, శ్రీశైలం, నెమలి, వేలూరు, చింతకుంట, విరంజపురం, ఇదయారు, దేవికాపురం, అత్తిరాల, తిరుకోమలూరు, నగర్, చిదంబరంలలోని శిలాశాసనాలు ముఖ్య ఆధారాలు. కంచి దళవానూరులలో లభించిన శాసనాలు, విల్లయనూరు తిరుమలైలలోని శాసనాలు సాళువవంశ పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవడానికి, గోరంట్ల శాసనం వారి వంశావళిని తెలుసుకోవడానికి ఉపయోగపడుతున్నాయి.

సాళువ వంశ పుట్టుపూర్వోత్తరాలు: సాళువ వంశస్తులు తాము యదుసంతతి వారమని, చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. సాళువాభ్యుదయం వారు కళ్యాణీ నగర వాసులని తెలుపుతోంది. కాని వారు కళ్యాణీపురంలో ఏ కాలంలో నివసించిందీ తెలియదు. దేవగిరి యాదవరాజు కొలువులో తిక్కమ మొదలైన కొందరు సాళువ సేనాధిపతులు ఉండేవారని నేలటూరి వెంకటరమణయ్య పేర్కొన్నారు. విజయనగర రాజ్య స్థాపనకు ముందు ఆంధ్రదేశంలో సాళువ వంశస్తుల జాడలేదని, విజయనగర సామ్రాజ్య స్థాపన తర్వాత వారు కళ్యాణీ నగరం నుండి ఆంధ్రదేశానికి వచ్చి ఉంటారని నేలటూరి వెంకటరమణయ్య మొదలైన పండితుల అభిప్రాయం. ముస్లింల దండయాత్రా కాలంలో వారు ఆంధ్రదేశానికి వచ్చి ఉంటారని కొందరు భావించారు. కాని క్రీ.శ.1038 నుండే సాళువ వంశస్తుల ప్రస్తావన ఉంది. క్రీ.శ.1038లో ఒక సాళువ వంశం కార్వేటి నగరాన్ని పాలించినట్లు శాసనాలున్నాయి. ఈ వంశం పిఠాపురం ప్రాంతం నుండి కార్వేటి నగరానికి తరలి వెళ్లిందని ప్రతీతి. ఈ కుటుంబం చాలా కాలం అక్కడ పాలించింది. వీరిలో ఒక సాళువరాజు తన కుమార్తెను క్రీ.శ.1314లో అద్దంకి రాజైన ప్రోలయ వేమారెడ్డికిచ్చి వివాహం జరిపాడట. తర్వాత 14-15 శతాబ్దాలలో ఆంధ్రదేశంలోని

అనేక ప్రాంతాలలో సాళువ వంశాలు మాండలీకులుగా పాలించారు. పొదిలి, గుంటూరు, చిత్తూరు, శ్రీశైలంలలో సాళువ వంశాలు పాలించాయి. ఈ వంశస్తులందరూ మిసరగండ, కఠారి అనే బిరుదులు ధరించారు. ఈ వంశాలన్నీ విజయనగర రాజ్య సామంతవంశాలే. కాని ఆంధ్రదేశపు సాళువ వంశాలకు, సాళువ నరసింహ రాయల వంశానికి ఎలాంటి సంబంధాలున్నాయో తెలియదు. కర్నూలు, చంద్రగిరి ప్రాంతాలలో వీరి ప్రాబల్యం ప్రారంభమైందని భావిస్తారు. చంద్రగిరి శాఖ అయిన సాళువ నరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించడంతో సాళువ వంశాలు గొప్ప కీర్తి ప్రతిష్టలను అనుభవించాయి. సాళువ వంశానికి మూల పురుషుడు మొదటి గుండరాజు. అతని కుమారుడు సాళువ మంగి. ఇతనికి ప్రతిపక్ష సాళువ అనే బిరుదు ఉంది. సాళువాభ్యుదయం సాళువ మంగి పూర్వీకులు కళ్యాణీపురాన్ని పాలించారని తెలుపుతోంది. వారు తాము కళ్యాణీ పురాధీశులమని కూడా చెప్పుకున్నారు. ఈ వంశస్తులు కటారి సాళువ అనే బిరుదు కూడా ధరించారు. దీనిని బట్టి సాళువ అనేది బిరుదు అని, వంశ నామం కాదని డా॥ బి.యస్.యల్.హనుమంతరావు అభిప్రాయపడ్డారు. సాళువ అంటే గ్రద్ద అని అర్థం అని, అది ఐరోపా దేశాలలో గ్రద్ద బిరుదు వంటిదని మంగి-సాళువ అనే బిరుదు పొందాడని, అదే వారి వంశనామం అయిందని, మంగి బిరుదైన సాళువనే వారి వంశస్తులందరూ వంశనామంగా స్వీకరించారని, అందువల్ల వారందరూ సాళువ వంశస్తులుగా పిలువబడ్డారని పి.శ్రీరామమూర్తి కూడా అభిప్రాయపడ్డారు. అంతేగాక తూర్పు తీరపు సాళువ వంశస్తులకు, పశ్చిమతీర సాళువ వంశస్తులకు సంబంధం లేదని, విజయనగర సేనలో చేరిన సాళువ వంశస్తులు రాజ్యం అంతటా ప్రాకారని, శ్రీరామశర్మ అన్నారు. కాని సాళువాభ్యుదయం వారిని కళ్యాణీపురాధీశులుగా పేర్కొంటోంది. కనుక వారు కర్ణాటకం నుండే ఆంధ్రదేశానికి వచ్చి ఉండవచ్చును. ఏమైనా సాళువ నరసింహరాయలు విజయనగర రాజ్యాధికారం చేపట్టిన తర్వాత సాళువవంశం రాజవంశంగా మారింది.

వంశ వృక్షం: సాళువ వంశస్తులకు మూలపురుషుడు మొదటి గుండరాజు. అతడు మొదటి హరిహర రాయలకు సమకాలికుడు. అతడు రాజ్యపు ఉత్తర సరిహద్దులోని రామదుర్గాన్ని జయించి హరిహరరాయల మెప్పు పొందాడు. అతని తర్వాత అతని కుమారుడు మంగి బుక్కరాయల కొలువులో సేనాధిపతిగా చేరి మధుర దండయాత్రలలో కుమారకంపరాయలకు సహాయంగా వెళ్లి విజయాలు సాధించి సాళువ అనే బిరుదు పొందాడు. సాళువ మంగి పలుకుబడి పెరిగి అతని వంశస్తులు సంగమ వంశస్తులతో వియ్యం కూడా పొందారు. సాళువ రాకుమారి సంగమ రాకుమారుని వివాహం చేసుకుంది. తర్వాత సంగమ రాకుమారి హరిహరాంబిక సాళువ తిప్పరాజుకు ఇవ్వబడింది. దాంతో ఈ రెండు వంశాలు బంధువులయ్యాయి. అందువలన సంగమ వంశస్తులు సాళువ వంశస్తులకు అధికార హోదా, గౌరవ మర్యాదలు ఇచ్చారు. కనుక వారు యదువంశస్తులని, చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. సాళువ నరసింహరాయలు మూడవ పౌఢ దేవరాయలు లేక వడియరావుకు బంధువని న్యూనిజ్ కూడా రాశాడు. కనుక సాళువ వంశస్తులు సంగముల బంధువుల హోదా అనుభవించారని చెప్పవచ్చు. కనుకనే సాళువ నరసింహరాయలు రాజకుటుంబ బంధువు హోదాలోనే సంగమ వంశాన్ని తొలగించి విజయనగర సింహాసనం అధిష్టించగలిగాడు. విజయనగర రాజ్యాధికారాన్ని సంపాదించడంతో సాళువ వంశం వాస్తవ రాజవంశంగా మారింది. మంగు కుమారుడు గౌతరాజు. అతనికి ఇద్దరు కుమారులు. రెండవ గుండరాజు, తిప్పరాజు. తిప్పరాజు కుమారుడు రెండవ గుండరాజు. రెండవ గుండరాజు మొదటి దేవరాయల మనుమరాలు హరిహరమ్మను వివాహం చేసుకున్నాడు. రెండవ గుండరాజు కుమారుడే సాళువ నరసింహరాయలు. ఈ నరసింహరాయలే సాళువ రాజ్యస్థాపకుడైన సాళువ నరసింహరాయలు. సాళువ వంశస్తులు మొదట కర్నూలు ప్రాంతంలో అధికారం సంపాదించారని స్థానిక చరిత్రలు, శాసనాలు సూచిస్తున్నాయి. తర్వాత మంగు మధుర రాజ్య యుద్ధంలో పాల్గొని విజయం సాధించినందువల్ల బుక్కరాయలు అతనికి చంద్రగిరి రాజ్యానికి చెందిన నారాయణ వన ప్రాంతాన్ని బహుమానంగా ఇచ్చాడు. ఆ సందర్భంలో శ్రీరంగనాథుని పునఃప్రతిష్ఠ చేసేటప్పుడు మంగు 60000 మాడలు, 8 గ్రామాలను శ్రీరంగనాథునికి కానుకగా ఇచ్చాడట. సాళువమంగు సంతతివారు తమకు బుక్కరాయలు ఇచ్చిన ప్రాంతాన్ని పెంచుకొని చివరకు చంద్రగిరిని రాజధానిగా చేసుకొని విజయనగర సామంతులుగా పాలించారు. సాళువాభ్యుదయం నరసింహరాయల తండ్రి గుండరాజు కళ్యాణీని పాలించాడని, అతని మరణానంతరం కళ్యాణీ నగరానికి విపత్తు సంభవించగా నరసింహరాయలు తన రాజధానిని చంద్రగిరికి మార్చాడని తెలుపుతోంది. కాని సాళువాభ్యుదయ కథనాన్ని నమ్మవలసిన పని లేదు. సాళువ నరసింహరాయలు

ధైర్యసాహసాలు కలిగిన సమర్థుడైన దండనాయకుడు. చంద్రగిరి పాలకుడుగా నరసింహుడు సాటి పాలెగాండ్రలో మేటిగా నిలచి పలుకుబడిని సంపాదించాడు. విపత్కర పరిస్థితులలో సామ్రాజ్యాన్ని కాపాడి చివరకు సామ్రాజ్యాధిపతి అయ్యాడు.

సాళువ నరసింహరాయల తొలి రాజకీయ జీవితం: మల్లికార్జునరాయల కాలంలో సాళువ నరసింహ రాయలు చంద్రగిరి దుర్గాధిపతిగా ఉండేవాడు. క్రీ.శ.1450లో కపిలేశ్వర గజపతి కొండవీడును ఆక్రమించిన తర్వాత పశ్చిమంగా కదలి కర్నూలును జయించి, పెనుగొండపై దండెత్తాడు. పెనుగొండను కాపాడటానికి మల్లికార్జున రాయలు పరాక్రమవంతుడైన సాళువ నరసింహ రాయలను పెనుగొండకు మార్చాడు. అతని స్థానంలో సాళువ రామచంద్ర రాయలను చంద్రగిరి దండ నాయకునిగా నియమించాడు. కాని గజపతుల పురోగమనాన్ని ఆపలేకపోయాడు. గజపతి ముందుకు చొచ్చుకొనివచ్చి విజయనగరాన్ని ముట్టడించాడు.

తమిళ దేశంపై దండయాత్ర-మల్లికార్జునరాయల కాలం: కపిలేశ్వర గజపతి దండయాత్రను ఆసరాగా తీసుకొని తమిళ దేశంలోని సామంతులు తిరుగుబాటు చేశారు. పాండ్యులు, బాణ ప్రభువైన భువనైక సమర కోలాహల మావలి, బాగాదిరాయలు స్వతంత్రులయ్యారు. వారిలో బాణప్రభువు కంచి కూడా ఆక్రమించాడు. వారిని అణచడానికి మల్లికార్జునరాయలు నరసింహుని పంపాడు. నరసింహుడు క్రీ.శ.1462లో తమిళదేశంపై దండయాత్ర చేశాడు. ఈ దండయాత్రలో తిగుళు (తమిళులు), చెవులపోతు (బాణుని) లను నిర్బంధించి శాంతిని నెలకొల్పాడని సాళువాభ్యుదయం తెలుపుతోంది.

విరూపాక్షరాయల కాలంలో ...: క్రీ.శ.1465లో మల్లికార్జునరాయలు మరణించాడు. మల్లికార్జునరాయల కుమారుడు రాజశేఖరరాయలను విరూపాక్షరాయలు తరిమివేసి విజయనగర సింహాసనాన్ని అధిష్టించాడు. ఆ సమయంలో సాళువ నరసింహరాయలు రాజశేఖరరాయలకు అండగా నిలిచాడు. నరసింహుని అండతో రాజశేఖర రాయల సంతతి వారు తంజావూరు, మధుర, తిరునల్వేలి, తిరుచినాపల్లి, కోయంబత్తూరులను స్వతంత్రంగా పాలించారు. విరూపాక్షరాయల కాలంలో విచ్ఛిన్నమైపోతున్న సామ్రాజ్యాన్ని కాపాడటానికి శతవిధాల ప్రయత్నించాడు. క్రీ.శ.1470లో కపిలేశ్వరగజపతి మరణానంతరం తీరాంధ్రదేశంపై దండెత్తి గోదావరి తీరం వరకు జయించాడు. ఈ దండయాత్రా కాలంలో అతని సేనాధిపతి తుళువ ఈశ్వరనాయకుడు ఉదయాద్రి, నెల్లూరు, పామూరు, కోవెల, కుందాణి, పెనుగొండ, గండికోట, శ్రీరంగపట్నం, నాగమండలాన్ని జయించాడు. నరసింహుడు స్వయంగా భోనగిరి, చెంజి, కొంగు, ధారాపురాలను జయించినట్లు వరాహపురాణ పీఠికలో వర్ణించబడింది. నెల్లూరు ఉదయగిరిలను క్రీ.శ.1470లో ఆక్రమించాడు. మిగిలిన దుర్గాలను ఏ సంవత్సరంలో జయించిందీ స్పష్టంగా చెప్పలేము. క్రీ.శ.1477 నాటికి గోదావరీ పర్యంతం అతని ఆధీనం అయింది. అంతేగాక నరసింహుడు తెలంగాణపై దండెత్తి బాలకొండ వద్ద సుల్తాన్ సైన్యాలను ఓడించి నర్మదానది వరకు దండెత్తాడని సాళువాభ్యుదయం తెలుపుతోంది. సాళువ నరసింహుడు తెలంగాణపై దండెత్తినందుకు ప్రతీకారంగా సుల్తాన్ విజయనగర రాజ్యంపై దండెత్తి కంచిని కొల్లగొట్టాడు. ఈ విజయాలతో అతని బలదర్పాలు పెరిగాయి. రాయమహరసు అనే బిరుదు కూడా వచ్చింది.

విజయనగర సింహాసనం అధిష్టించడం క్రీ.శ.1485: విరూపాక్షరాయల క్రూరకృత్యాలను సహించలేక అతని పెద్ద కుమారుడు అతనిని చంపడం, మూడవ ప్రౌఢ దేవరాయలు రాజ్యానికి రావడం, అతడు కూడా తండ్రి లాగే ప్రవర్తించడంతో సామ్రాజ్య రక్షణ కోసం ప్రౌఢదేవ రాయలను తొలగించి విజయనగర వజ్ర సింహాసనాన్ని అధిష్టించాడు. సాళువ నరసింహుడు విజయనగర సింహాసనాన్ని అధిష్టించడానికి దారి తీసిన పరిస్థితులను న్యూనిజ్ విపులంగా వర్ణించాడు. విరూపాక్షుని చివరి శాసనం క్రీ.శ.1485 జులై 25 తేదీకి చెందినది లభించింది. క్రీ.శ.1486 నవంబర్ 1వ తేదీకి చెందిన సాళువ నరసింహరాయల మొదటి శాసనం లభించింది. అందులో సాళువ నరసింహుని సామ్రాజ్యపు బిరుదులు వర్ణించబడ్డాయి. కనుక నరసింహరాయలు క్రీ.శ.1485 జులై, 1486 అక్టోబర్ మాసాల మధ్యలో సింహాసనం అధిష్టించి ఉంటాడని రాయప్రోలు సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.

విజయనగర సామ్రాట్టుగా నరసింహరాయలు క్రీ.శ.1485-91: సాళువ నరసింహరాయలు క్రీ.శ.1485 నుండి 1491 వరకు ఆరు సంవత్సరాలు మాత్రమే పాలించాడు. ఈ ఆరు సంవత్సరాలలో నిరంతర యుద్ధాలు చేస్తూ విజయనగర సామ్రాజ్యం మల్లికార్జున రాయలు, విరూపాక్షరాయల కాలంలో కోల్పోయిన ప్రాంతాలను తిరిగి సంపాదించడానికి, విజయనగర వైభవాన్ని బలదర్పాలను పునరుద్ధరించడానికి అనుక్షణం కృషి చేశాడు.

సామంతులను అణచడం: అతను సింహాసనం అధిష్టించగానే అతని అధికారాన్ని తృణీకరించి అనేక మంది స్వతంత్రం ప్రకటించారు. చివరి సంగమ వంశస్థుల కాలంలో స్వతంత్రంగా వ్యవహరించడానికి అలవాటు పడిన సామంతులు సాళువ నరసింహుని అధికారాన్ని అంగీకరించదలచుకోలేదు. అందువల్ల విజయనగర సింహాసనం అధిష్టించడం ఒక ఎత్తు, దాని ఐక్యతను కాపాడటం మరొక ఎత్తు అయింది. కనుక అతను వెంటనే స్వతంత్రం ప్రకటించిన సామంతులను అణచడానికి పూనుకున్నాడు. స్వతంత్రం ప్రకటించిన సామంతుల్లో ఉమ్మత్తూరు (మైసూరు ప్రాంతం), సంగీతపురం (తుళునాడు) పాలెగాళ్లు, బొమ్మవరం పాలెగాడైన మల్లిదేవుడు, పెరని (కడప ప్రాంతం)ని పాలించిన సంబెట వారు ముఖ్యులు. సంబెట శివరాజు, అతని బంధువు వీరనరసింహుడు విజయనగరాన్ని ధిక్కరించి పరిసర ప్రాంత ప్రజలను భయభ్రాంతులను చేశారు. అలాగే వినుకొండ ఉదయగిరి రాజ్యాల మధ్య సరియపల్లి తిమ్మారెడ్డి అనే అతడు స్వతంత్రం ప్రకటించి హిందూరాయ సురత్రాణ అనే బిరుదు ధరించాడు. అప్పుడు వినుకొండ, కొండవీడుల మధ్య అజమ్‌ఖాన్ అనే గజపతి సేనాధిపతి పాలించాడు. అతను వినుకొండ తాలూకాలోని ముతుకుమల్లిని క్రీ.శ.1484లో దానం చేశాడు. రాజమండ్రి తరఫ్‌దారులుగా దిలావర్‌ఖాన్, కాహమ్ ఉల్ ముల్క్‌లు పాలించారు. సాళువ నరసింహరాయలు సింహాసనం అధిష్టించిన తరుణంలో దేశ పరిస్థితి ఈ విధంగా ఉంది.

సామంతులను అదుపులోకి తేవడం: నరసింహరాయలు మూడవ ప్రౌఢదేవరాయలను తరిమికొట్టినప్పుడు సామంతులందరూ సహకరించారు. అందువల్ల నరసింహరాయలు కృతజ్ఞతగా తమ స్వాతంత్ర్యాన్ని కూడా గుర్తిస్తాడని ఆశించారు. అంతేగాక తాము కొత్తగా ఆక్రమించుకొన్న భూములను తమకే దాఖలు పరుస్తాడని కూడా ఆశించారు. వారి కుటిల పన్నాగాలను అతడు అంగీకరించలేదు. నూతన భూములపై తమ హక్కులను రుజువు చేయమని కోరాడు. రుజువు చేయలేని వారు తాము ఆక్రమించిన భూములను వదలుకోవలసిందేనని అన్నాడు. అందువలన సామంతులు చాలా మంది నరసింహరాయల ఆధిపత్యాన్ని అంగీకరించబోమని స్వాతంత్ర్యాలు ప్రకటించారు. వారిని అదుపు చేయటానికి వారిపై దండయాత్రను నడిపాడు.

పెరనిపాడు సంబెట శివరాజు: కడప జిల్లాలో పెరనిపాడు ప్రాంతాన్ని పాలించిన సంబెట శివరాజు, అతని బంధువైన వీరనరసింహుడు తిరుగుబాటు చేసి పరిసర ప్రాంతాలను ఆక్రమించి ప్రజలను భయభ్రాంతులను చేస్తూ తమ ఇష్టం వచ్చినట్లు పన్నులు వసూలు చేయసాగారు. వర్తకులకు, వ్యాపారస్తులకు రక్షణ లేకుండా పోయింది. ఊళ్లకు ఊళ్లనే దోచుకోనారంభించారు. వారిని అణచడానికి నరసింహరాయలు వంకర కుమార ధూళి బసివినాయుని నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. బసివినాయుడు పెరనిపాడు కోటను ముట్టడించి కోటగోడలను కూల్చి లోపలకు ప్రవేశించి సంబెట శివరాజును, అతని అనుచరులను నరికి పారవేశాడు. అతని బంధువు వీర నరసింహుడు ఉదయగిరి వైపు పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నాడు. కడప ప్రాంతం అదుపులోకి వచ్చింది.

బొమ్మవరపు పాలవనాయకులు: తర్వాత తిరుగుబాటు చేసిన వారిలో ప్రముఖుడు బొమ్మవరపు మల్లిదేవుడు. గజపతి ఉదయగిరి కోటపై దండెత్తడానికి సిద్ధంగా ఉన్నాడని తెలిసి అదే తగిన సమయం అని స్వాతంత్ర్య ప్రకటన చేశాడు. నరసింహరాయలు ఉదయగిరి కోట రక్షణకు వెళ్తూ వెనుక నుండి మల్లిదేవుడు దెబ్బ తీయకుండా ఉండటానికి ఒక సైన్యాన్ని మల్లిదేవుని పైకి పంపాడు. ఆ సైన్యం బొమ్మవరం చేరి కోటను ముట్టడించి దానిని నేల మట్టం చేసింది. మల్లిదేవుడు, అతని అనుచరులు ఓడిపోయి రాజభవనం ముందు ఉన్న తటాకంలోకి దూకి ప్రాణాలు వదిలారు. తర్వాత రాజభవనం కూడా కూలగొట్టబడింది. కోట మొత్తం స్వాధీనమైంది.

మైసూరు ప్రాంత తిరుగుబాట్లు: మైసూరు ప్రాంతంలో ఉమ్మత్తూరు, తుళు ప్రాంత పాలకులు కూడా తిరుగుబాటు చేశారు. నరసింహరాయలు సైన్యాలను పంపి వారిని ఓడించి బారాకూరు పరిసర ప్రాంతాలను తన ప్రత్యక్ష ఆధిపత్యంలోకి తెచ్చాడు. ఈ విజయాలను శాసనాలు తెలుపుతున్నాయి.

పశ్చిమ తీరప్రాంత రేవుల ఆక్రమణ: కేరళ వలమ అనే మళయాళ స్థానిక చరిత్ర సాళువ నరసింహ రాయలు పశ్చిమతీరంలోని రేవు పట్టణాలను ఆక్రమించాడని తెలుపుతుంది. హెనోవర్, భట్కల్, బాక్కనూరు, మంగళాపురం రేవులను జయించి తన ఆధీనంలోకి తెచ్చాడు. 1490-1506ల మధ్యకాలపు శాసనాలు కూడా ఈ రేవు పట్టణాలను నరసింహుడు జయించాడని తెలుపుతున్నాయి. ఆ రేవుల రక్షణ కోసం సైనిక దళాలను నిలిపాడు. ఈ రేవులను జయించినందువల్ల విజయనగరానికి అశ్వాలు కొనడానికి వీలు కలిగింది. మధ్యాసియా దేశాలతో వ్యాపారం తిరిగి పునరుద్ధరించబడింది. ఆర్ముజ్, ఏడెన్‌ల నుండి మేలుజాతి గుర్రాలను తెప్పించి తన

అశ్వదళ పాటవాన్ని పెంచాడు. ఆ గుర్రాలు తెచ్చిన వర్తకులకు రక్షణ కల్పించి వారు కోరిన ధర ఇచ్చి వారిని సంతోషపరచాడని న్యూనిజ్ రాశాడు. ఒక చరిత్రకారుడు నరసింహరాయల వారసులకు సుశిక్షిత అశ్వదళం లభించింది అని రాశాడు. ప్రజలలో ధైర్య సాహసాలు పెంచి సాముగరిడీలు నేర్పించాడు కనుకనే తర్వాత విజయనగర రాజుల సైన్య పటిమ పెరిగి అనేక విజయాలు సాధించారు. ముఖ్యంగా కృష్ణదేవరాయలు అద్భుత విజయాలు సాధించాడు. దానికంతటికి సాళువ నరసింహరాయలు నిర్మించిన పునాదియే కారణం.

ఉదయగిరిని కోల్పోవడం క్రీ.శ.1490: ఇన్ని విజయాలు సాధించినా చివరలో నరసింహరాయలు గజపతుల చేతిలో అపజయం పొంది అవమానం పాలయ్యాడు. క్రీ.శ.1482లో బహమనీ సుల్తాన్ మూడవ మహమ్మద్‌షా మరణించాడు. అతని మరణంతో బహమనీ రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో పురుషోత్తమ గజపతి తాము పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి సాధించాలని సైన్యాన్ని సమాయత్తం చేసుకొని తీరాంధ్రదేశంపై దండెత్తాడు. క్రీ.శ.1489లో రాజమహేంద్రవరం, కొండపల్లి, కొండవీడులను జయించాడు. గుండ్లకమ్మనది ఒడ్డున ఉన్న చదలవాడ లింగోద్భవ మహదేవునికి అమ్మనబ్రోలు సీమలోని పోతవరం గ్రామాన్ని దానం చేసి శాసనం వేయించాడు. ఈ శాసనం క్రీ.శ.1489 నాటిది. కనుక 1489 నాటికి గుండ్లకమ్మ వరకు గజపతి స్వాధీనం అయిందని స్పష్టంగా తెలుపుతోంది. తర్వాత గజపతి సైన్యాలు ఉదయగిరికి నడిచాయి. ఉదయగిరిని రక్షించుకోవడానికి సాళువ నరసింహరాయలు స్వయంగా బయలుదేరి వచ్చాడు. మార్గమధ్యంలో బొమ్మవరపు మల్లిదేవుని తిరుగుబాటు అణిచి ఉదయగిరి దుర్గం చేరాడు. అప్పుడు ఉదయగిరి దుర్గపాలుడుగా ఉన్న పూసపాటి బసవభూపాలుడు సాళువనరసింహరాయల వైపు ఉన్నట్లే నటించి గజపతికి సహాయపడే ఉద్దేశంలో ఉన్నాడు. అతని మంత్రి గంగన యుద్ధ ప్రమాదం లేదని నరసింహరాయలకు పలుమార్లు చెప్పి నమ్మేటట్లు చేశాడు. రాయలు అజాగ్రత్తగా ఉండగా పురుషోత్తమ గజపతి సేన వచ్చి ఉదయగిరిని ముట్టడించింది. ఆ సమయంలో బసవభూపాలుడు గజపతి వైపు చేరిపోయాడు. నృసింహరాయలు ఓడి గజపతులకు బందీగా చిక్కాడు. లొల్ల లక్ష్మీధరుడు రాసిన సరస్వతీ విలాసం కర్ణాటక రాజు నృసింహుని ఓఢ్రులు బందీ చేసి ప్రాణం కోసం యాచించగా వదలేశారని తెలుపుతోంది. క్రీ శ.1500 సంవత్సరం నాటి ప్రతాపరుద్ర గజపతి అనంతవరం శాసనం కర్ణాటక రాజు నృసింహుడు భయంతో వణుకుతూ పురుషోత్తమునికి తన రక్షణ కోసం విజయనగర కోటను సమర్పించి విడుదల పొందాడని తెలుపుతోంది. కనుక ఉదయగిరి యుద్ధంలో సాళువ నరసింహరాయలు ఓడిపోయి ఉదయగిరి పోగొట్టుకున్నాడని ఆధారాలు తెలుపుతున్నాయి. కాని అతడు మోసంలో ఓడిపోయినట్లుగానే కనిపిస్తోంది. పూసపాటి బసవభూపాలుడు తన మంత్రి గంగయ్య చేసిన ఘనకార్యానికి మెచ్చి అతనికి నృసింహనృపతి వశీకరణ నయవిద్యాకరణ అనే బిరుదునిచ్చినట్లు ప్రబోధచంద్రోదయం తెలుపుతోంది. కనుక గంగయ్య మంత్రి మాయోపాయం వల్లనే సాళువ నృసింహుడు ఓడిపోయాడని తెలుస్తోంది. ఉదయగిరి ఓటమి వలన కలిగిన అవమాన భారాన్ని నరసింహ రాయలు భరించలేకపోయాడు. అందువల్ల అతడు ఆ మరు సంవత్సరమే అంటే క్రీ.శ.1491లో మరణించాడు. అతడు మరణించేనాటికి విజయనగర సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించాలనే అతని సంకల్పం నెరవేరలేదు. కొండవీడు, ఉదయగిరి రాజ్యాలు గజపతుల ఆధీనంలోకి వెళ్లాయి. రాయచూరు, అంతర్వేది, బహమనీ సుల్తాన్ ఆధీనంలో ఉన్నాయి. ఇవి మూడూ చేరితేనే విజయనగర రాజ్యం పరిపూర్ణం అవుతుంది. సాళువ నరసింహరాయలు మరణించేనాటికి రాచోల్, ఓదగిరి, కొండొల్లి మూడు కోటలు అతని అధికారం నుండి తప్పుకున్నాయి. అన్నిటినీ జయించాడు గాని ఆ మూడింటిని జయించలేక పోయాడు అని న్యూనిజ్ కూడా రాశాడు.

మరణం-అంతిమ సందేశం క్రీ.శ.1491: నరసింహరాయలు తన మరణ కాలంలో తనకు నమ్మకస్తుడైన తుళువ నరసనాయకుని పిలిపించుకొని తన మరణానంతరం తన కుమారులలో అర్హత కలిగిన వాడిని సింహాసనాధీశుని చేసి రాయచూరు, ఉదయగిరి, కొండవీడులను జయించమని తన అంతిమ సందేశం ఇచ్చి మరణించాడు. నరసింహరాయలు పాలించిన ఐదు సంవత్సరాల స్వల్ప వ్యవధిలో సామ్రాజ్యానికి చాలా వరకు పూర్వపు ఔన్నత్యాన్ని, సైనిక శక్తిని సాధించాడు. సంగముల కాలం నాటి సాంస్కృతిక సాంప్రదాయాలను పరిరక్షించాడు. సంస్కృతాంధ్ర కవి పండితులను పోషించి సాహిత్యాభివృద్ధికి కృషి చేశాడు. అభిరామ రామనాథ డిండిముడు అతని ఆస్థాన కవి. అతడు సాళువాభ్యుదయాన్ని రచించి నరసింహరాయలకు అంకితమిచ్చాడు. ఈ కావ్యం సాళువ వంశ చరిత్రను అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతోంది. నరసింహుడు స్వయంగా కవి.

అతడు రామాభ్యుదయం అనే సంస్కృత కావ్యాన్ని రచించాడు. పిల్లలమర్రి పినవీరభద్రకవి. తెలుగులో శృంగార శాకుంతలం, సంస్కృతంలో జైమినీ భారతాన్ని రచించాడు. ఇది ఉత్తమ కావ్యం అని అంటారు. ఇది కొత్త పుంతలతో ప్రబంధ కావ్యాలకు మార్గదర్శకమైనదట. తిరుమల శ్రీనివాసుని భక్తుడు, సంకీర్తనాచార్యుడు అయిన తాళ్లపాక అన్నమాచార్యుడు నరసింహరాయల సమకాలికుడు. మొదట రాయలు అన్నమాచార్యుని కోపగించుకున్నా తర్వాత అతని గొప్పదనాన్ని గుర్తించి క్షమాభిక్ష వేడి ఆదరించాడు. నరసింహరాయలే కాదు అతని సామంతులు, మంత్రులు కూడా సాహిత్యాన్ని పోషించారు. సాహిత్యాభివృద్ధే కాక నరసింహరాయలు అనేక దేవాలయాలకు దానాలు చేశాడు. గజపతుల కాలంలో పాడుపడిన శ్రీరంగం, చిదంబరం దేవాలయాలను పునరుద్ధరించి పూజా పునస్కారాలను ఏర్పాటు చేశాడు.

సాళువ నరసింహరాయలు దురాక్రమణదారుడా!: నరసింహరాయలు తన దీర్ఘకాల జీవితంలో సామంతునిగా, సేనాధిపతిగా, చక్రవర్తిగా తన ధర్మాన్ని నెరవేర్చి విచ్ఛిన్నమైపోతున్న విజయనగర సామ్రాజ్యాన్ని పునరుజ్జీవింపజేయటానికి నిరంతర కృషి చేశాడు. అశ్వపతులు, గజపతుల సమ్మెట దెబ్బల నుండి సామ్రాజ్యాన్ని కాపాడి నిలబెట్టాడు. సామంతుల ఆటలను కట్టించాడు. అతని తపన అంతా ఒక్కటే. విజయనగర సామ్రాజ్య రక్షణ, ఉన్నతి. మరణ కాలంలో కూడా నరసనాయకుని పిలిచి తాను సాధించలేని మూడు దుర్గాలను సాధించి సామ్రాజ్యపు పరిపూర్ణతను పూర్తి చేయమని కోరాడు. విజయనగర సామ్రాజ్య రక్షణకు అతడు ఎంతగా తన జీవితాన్ని అర్పించుకున్నాడో, అతని తుది పలుకులే నిదర్శనాలు. అతడి కృషి వల్లనే విజయనగర సామ్రాజ్యం నశించకుండా తళ్లికోట యుద్ధం దాకా మరొక 80 సంవత్సరాలు దృఢంగా నిలబడిందని నేలటూరి వెంకటరమణయ్య మొదలైన పండితులు అన్నారు. ఆ దృఢత్వాన్ని తెచ్చినవాడు నరసింహరాయలేనని పలువురు పండితులు ప్రశంసించారు. కాని కొందరు పండితులు సాళువ నరసింహరాయలు దురాక్రమణదారుడు అని వర్ణించారు. ఆ వర్ణన సమంజసం కాదు అని చెప్పడానికే ఎక్కువ అవకాశం ఉంది. కారణమేమిటంటే సాళువ నరసింహ రాయల జీవితాన్ని పరిశీలిస్తే దురాక్రమణదారుడు అనే వ్యాఖ్యానం అసమంజసమని స్పష్టపడుతుంది నరసింహరాయలు మొదటి నుండి సామ్రాజ్య రక్షణకే పాటు పడ్డాడు. అతడు సామ్రాజ్యాన్ని కాపాడటానికి ఎంత ప్రయత్నించినా విరూపాక్షరాయలు సహకరించలేదు. తర్వాత మూడవ ప్రౌఢ దేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్య మనుగడకే ముప్పు వాటిల్లింది. ఆ స్థితిలో సాళువ నరసింహరాయలు మూడవ ప్రౌఢదేవరాయలను తొలగించకుండా తనకేమని ఊరుకున్నట్టయితే ప్రతాపరుద్ర గజపతి యావత్ విజయనగర సామ్రాజ్యాన్ని కబళించి ఉండేవాడు. నరసనాయకుని ఎదిరించలేక దొడ్డితోవన పారిపోయిన రాజు ప్రమాదకరమైన శత్రువుల మధ్య ఉన్న రాజ్యాన్ని రక్షించగలడా? తప్పకుండా అతడు శత్రువులకు రాజ్యాన్ని కోల్పోయి ఉండేవాడు. రాజ్యం వీరభోజ్యం కడపటి సంగమ వంశస్తుల వంటి రాజులకు రాజ్యం దక్కదు. అలాంటి స్థితిలో నరసింహరాయలు నిర్వీర్య నిరర్థక వంశాన్ని తొలగించడం ఎంతో సమంజసమైనది. ఒక వేళ దురాక్రమణే అనుకున్నా ఆ పరిస్థితులలో అది తప్పనిసరి అయిన చర్యే. మధ్యయుగంలో రాజ్యాలను కాపాడుకోవడానికి ప్రతాపం తప్పక కావాల్సి వచ్చింది చివరి సంగమ వంశస్తులకు వీరత్వం లోపించింది. ఆ క్లిష్టపరిస్థితులలో సాళువ నరసింహరాయలు ఒక్కడే సామ్రాజ్యాన్ని కాపాడగలడని ప్రజలు కూడా విశ్వసించారు. అంతకు ముందు అనేక యుద్ధాలలో అతడు తన ప్రతాపాన్ని నిరూపించుకున్నాడు. కనుకనే విజయనగర ప్రజలు, సామంతులు, సేనాధిపతులు నరసింహరాయలు సింహాసనం అధిష్టించడాన్ని ఆమోదించారు. నరసింహరాయలు సింహాసనం ఎక్కిన తర్వాత కూడా అతడు ఒక్క రోజు కూడా విందులు, వినోదాలు, విలాసాలలో గడపలేదు. ప్రతిక్షణం సామ్రాజ్య రక్షణకే శ్రమించాడు. భూములు కాజేసి అవిధేయులుగా ఉన్న సామంతులతో పోరాడాడు. బహమనీ సుల్తాన్‌లతో పోరాడి భట్కల్ మొదలైన రేవులను జయించాడు. అరబ్బులకు రక్షణ కల్పించి అశ్వబలాన్ని పెంచాడు. గజపతితో పోరాడాడు. అతడు ఒక్క క్షణం కూడా విశ్రమించలేదు. ఆఖరికి తన మరణశయ్య మీద కూడా అతడు తాను రాయచూరు, ఉదయగిరి, కొండవీడు జయించలేకపోయానే అని ఎంతగానో విచారించాడు. అతని తపన అంతా సామ్రాజ్య రక్షణ కోసమే తన మరణానంతరం సామ్రాజ్యం ఏమైపోతుందోనని తపించిపోయాడు. రాజ్యాన్ని రక్షించాలి అంటే సమర్థుడు కావాలి. తన కుమారులు చిన్నవారు. వారు రాజ్యాన్ని కాపాడుకోలేరు. కనుక రాజ్య రక్షణకు సమర్థుడు కావాలి అందుకు తగినవాడు నరసనాయకుడేనని నిర్ణయించి వీరునికే రాజ్యరక్షణ బాధ్యత అప్పగించాడు. కాని తన కుమారులకు రాజ్యాన్ని అప్పగించలేదు. తాను ఆ క్షణంలో తలచుకుంటే తన కుమారునికి పట్టాభిషేకం జరిపించి

ఉండేవాడు. కాని జరుపలేదు కుమారులు పెద్దవారైన తర్వాత వారిలో సమర్థుడు ఎవరో నిర్ణయించి అతనికే పట్టాభిషేకం చేయాలని నరసనాయకుని ఆదేశించాడు. అంటే తన కుమారులలో ఎవరు సమర్థుడో నిర్ణయంచే అధికారాన్ని కూడా నరసనాయకునికి అప్పగించాడు. అంటే సాళువ నరసింహరాయలు ఎంతటి దేశభక్తుడో తన దేశం ఎంత క్షేమంగా ఉండాలని కోరుకున్నాడో బోధపడుతుంది. అతడు మహావీరుడు. వీరుడు వీరుణ్ణి గౌరవిస్తాడు. కనుక నరసనాయకుని సమర్థతను గ్రహించి అతనినే రాజ్య రక్షకుడుగా నియమించాడు. సాళువ నరసింహరాయల నిర్ణయం ఎంతో గొప్పది. కనుక సాళువ నరసింహరాయలు విజయనగర సామ్రాజ్యాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకోవడం తన స్వార్థ ప్రయోజనాల కోసం కాదు. ముస్లిం పాలనలో దిక్కులేని హిందువులకు దిక్కుగా ఉన్న విజయనగర సామ్రాజ్యం కలకాలం సురక్షితంగా నిలిచి ఉండాలనే దీర్ఘమైన ఆకాంక్ష అతనిలో ఉంది. కనుక సాళువ నరసింహరాయలు సంగమ వంశస్తులను తొలగించినా, దురాక్రమణదారుడు అనడం సమంజసం కాదు. సాళువ నరసింహరాయలే లేకపోతే మల్లికార్జున రాయల కాలంలోనే రాజ్యం పోయి ఉండేది. మల్లికార్జునరాయలు కొంత వరకు పోరాడాడు విరూపాక్షరాయలు ఏ మాత్రం పట్టించుకోలేదు నరసింహరాయలే గజపతుల మీద దండెత్తి గోదావరీ తీరం వరకు జయించాడు మొదటి నుండి చివరి వరకు అతడు సంగమ వంశస్తులను భక్తి విశ్వాసాలతో కొలిచాడు. కనుకనే తిరుపతి తిరుమల శాసన సంపుటిని తయారు చేసిన సాధు సుబ్రమణ్యశాస్త్రి - నరసింహరాయలు చివరి వరకు సంగమ వంశస్తులను భక్తి ప్రపత్తులతో కొలిచాడు అని వ్యాఖ్యానించారు అలాంటి సంగమ వంశాన్ని ఎందుకు తొలగిస్తాడు? మూడవ ప్రౌఢదేవరాయలను కొనసాగనిస్తే క్షణాలలో సామ్రాజ్యం కూలిపోయేది. కనుక ఆ స్థితిలో సాళువ నరసింహరాయలు సంగమ వంశాన్ని తొలగించి అధికారాన్ని హస్తగతం చేసుకోవడం చాలా సమంజసమైన చర్య. కనుక నరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించడం దురాక్రమణ అని అనడం కంటే విజయనగర సామ్రాజ్యపు మంచి కోసం జరిగిన రాజవంశాల మార్పిడి అని అనడం ఎంతో సమంజసంగా ఉంటుంది.

నరసనాయకుడు, సాళువ రెండవ నరసింహరాయల కాలంలో జరిగిన మరొక ప్రముఖ సంఘటన పోర్చుగీసు వారు ఇండియాకు సముద్రమార్గం కనిపెట్టడం, పోర్చుగల్ రాజు కింగ్‌జాన్ క్రీ.శ.1484లో ఇండియాలోని సంపద గురించి కొద్దిగా తెలుసుకున్నాడు అతడు ఇండియా చేరాలని ఆఫ్రికాను చుట్టి స్వయంగా బయలుదేరాడు. కాని గుడ్‌హోప్ వరకు వచ్చి దానికి కేఫ్ ఆఫ్ స్టార్మ్స్ అని పేరు పెట్టి వెనక్కి మళ్లాడు. తర్వాత బెర్తెల్‌మోవ్ డయాజ్ వచ్చి అతడు కూడా కేఫ్ ఆఫ్ గుడ్‌హోప్‌కు వచ్చి దానికి కేఫ్ ఆఫ్ గుడ్‌హోప్ అని పేరు మార్చి వెనుకకు వెళ్లాడు. చివరకు అదే మార్గంలో ప్రయాణించిన వాస్కోడిగామా విజయవంతంగా క్రీ.శ 1498 ఆగస్టు 26వ తేదీన కాలికట్‌లో అడుగుపెట్టాడు దాంతో ఐరోపాకు, ఇండియాకు సముద్ర మార్గం ఏర్పడింది. వాస్కోడిగామా రకరకాలైన ఐరోపా సరుకులతో మూడు ఓడలలో వచ్చాడు. అక్కడి రాజు జామెరిన్ అతనిని ఆదరించాడు. తర్వాత అరబ్బు వర్తకుల మాటలు విని పోర్చుగీసు వారిని తన రాజ్యం నుండి బహిష్కరించాడు. వాస్కోడిగామా కాననూరు వెళ్లి అక్కడి పాలకునితో వ్యాపార సంధి చేసుకున్నాడు. తర్వాత వాస్కోడిగామా విజయనగర సామ్రాజ్యంలోని అంజనీదీవికి చేరాడు. అక్కడ విజయనగర ప్రతినిధిగా ఉన్న తిమ్మోజీ-గెర్సొప్పా పాలకుని సామంతుడు. గెర్సొప్పా విజయనగర సామంతుడు. తిమ్మోజితో పోర్చుగీసు వారు తాము ముస్లింలకు వ్యతిరేకంగా విజయనగర రాజ్యానికి సహాయం చేస్తామని చెప్పారు కాని వారి మాటలు నమ్మక తిమ్మోజీ వారి పడవలను దోచుకున్నాడు. అయినప్పటికీ ఇండియాతో వ్యాపారం లాభసాటిగా ఉంటుందని గ్రహించి పోర్చుగీసు రాజు ప్రతి సంవత్సరం ఇండియాకు ఓడలను పంపాడు. క్రీ.శ.1500 సంవత్సరంలో సెప్టెంబర్ 13వ తేదీన కాబ్రల్ వచ్చాడు. అతడు రాగానే జామెరిన్‌తో వివాదానికి దిగాడు. ఉభయులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దాని వలన వారి వ్యాపారం దెబ్బతింది. ఈ కాలంలోనే డ్యూరటె బార్బొసా ఇండియా వచ్చాడు. క్రీ.శ.1501లో పెడ్రో ఆల్వారెజ్, 1502లో గోవాదనోవా, 1503లో రెండవసారి వాస్కోడిగామా వచ్చారు. వాస్కోడిగామా రాగానే పోర్చుగీసు రాజు సముద్రాధిపతి అని ప్రకటించి అక్కడ కనిపించిన ఒక స్థానిక ఓడను ధ్వంసం చేశాడు. అందులో ఉన్న వారందరూ మరణించారు. తర్వాత 1503 అక్టోబర్ 29వ తేదీన కాలికట్ చేరి తీరంలో నివసిస్తున్న 800 మంది బెస్తవారిని సకుటుంబంగా వధించాడు. తర్వాత కొచ్చిన్ చేరి అక్కడ ఒక గిడ్డంగిని నిర్మించి 1503 చివరలో లిస్బన్ వెళ్లిపోయాడు. అతని తర్వాత 1504లో లెపోసోర్వజ్, 1505లో ఫ్రాన్సిస్ డి ఆల్మేడియా పోర్చుగీసు గవర్నర్లుగా వచ్చారు. ఆల్మీడియా అంజనీదీవికి వచ్చాడు. ఆ విషయం

విజయనగర రాజులకు తెలిసింది. ఆల్మీడియా పెద్ద నౌకాదళంతో 1500 పోర్చుగీసు సైనికులతో ఇండియా వచ్చాడు. హెనోవర్ పాలకునితో యుద్ధం చేశాడు.

తిమ్మరాజు క్రీ.శ.1491, చిన్నరాయలు క్రీ.శ.1492: మరణశయ్య మీద సాళువ నరసింహరాయలు తన కుమారులలో రాజ్యరక్షణ చేయగలిగిన సమర్థత వచ్చేవరకు రాజ్య రక్షణ భారాన్ని నరసనాయకుడే నిర్వహించాలని ఆదేశించాడు. సాళువ నరసింహరాయలకు ముగ్గురు కుమారులున్నారని తిరుమల శాసనాలు తెలుపుతున్నాయి కాని మనకు తిమ్మరాజు, నరసింహుడు అనే ఇద్దరి కుమారుల పేర్లు మాత్రమే తెలిశాయి. నరసనాయకుడు పెద్దవాడైన తిమ్మరాజును తండ్రి మరణానంతరం సింహాసనాధీశుని చేశాడు. తిమ్మరాజు సింహాసనమెక్కిన కొద్ది రోజులకే అకాల మరణానికి గురయ్యాడు. ఇతని మరణాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. నరసనాయకుని అపఖ్యాతి పాలు చేసే ఉద్దేశ్యంతో నాదెండ్ల తిమ్మరసు అనే మంత్రి తిమ్మరాజును హత్య చేశాడని న్యూనిజ్ రాశాడు బహమనీలతో జరిగిన యుద్ధంలో మరణించాడని పెరిష్టా రాశాడు. వీరి రచనలు పరస్పర విరుద్ధంగా ఉన్నాయి న్యూనిజ్ సమకాలికుడు, పెరిష్టా తర్వాత వాడు కనుక న్యూనిజ్ రాతలే నమ్మదగినవని నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు. తిమ్మరాజు మరణానంతరం నరసనాయకుడు సాళువ నరసింహరాయల రెండవ కుమారుని సింహాసనమెక్కించాడు. అతనినే న్యూనిజ్ చిన్నరాయలు అని పేర్కొన్నాడు. చిన్నరాయలు రాజ్యానికి రాగానే బీజాపూర్ సుల్తాన్‌తో యుద్ధం వచ్చింది. చిన్నరాయల కాలంలో బహమనీ రాజ్యంతో రెండు యుద్ధాలు జరిగాయి ఈ కాలంలో బహమనీ రాజ్యంలో అరాచకత్వం ప్రబలింది. సర్దారులు స్వతంత్రులయ్యారు. విదేశ ముస్లిం నాయకుడైన యూసఫ్ ఆదిల్‌ఖాన్ బీజాపూరులో స్వతంత్రం ప్రకటించాడు. బీదర్‌లో అధికారం చెలాయించిన కాశింబరిద్, యూసఫ్ ఆదిల్‌ఖాన్ బలాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో రాయచూరు, ముద్గల్ దుర్గాలను విజయనగర రాయలు ఆక్రమించగలిగితే వాటిని విజయనగర రాజ్యానికి ఇవ్వడానికి బహమనీ సుల్తాన్ రెండవ మహమ్మద్‌షా సిద్ధంగా ఉన్నాడని రాయబారం పంపాడు.

మొదటియుద్ధం క్రీ.శ.1491: దాంతో సాళువ నరసింహరాయల చివరి కోర్కెను తీర్చడానికి చక్కని అవకాశం వచ్చిందని నరసనాయకుడు సంతోషించి అప్పుడే పట్టాభిషిక్తుడైన చిన్నరాయలను తీసుకొని పెద్ద సేనతో రాయచూరుపై దండెత్తాడు. విజయనగర సేనలు తుంగభద్రానదిని దాటి రాయచూరు, ముద్గల్ దుర్గాలను క్రీ.శ.1491లో ముట్టడించి జయించాయి ఆ సమయంలో యూసఫ్ ఆదిల్‌ఖాన్ విజయనగర సైన్యంతో పోరాడే స్థితిలో లేడు. కాశింబరీద్, బహుదూర్ గిలాని అనే వాడిని కూడా యూసఫ్ ఆదిల్‌ఖాన్ పైకి ఉసిగొలిపాడు. కనుక యూసఫ్ ఆదిల్‌ఖాన్ విజయనగర సైన్యాలతో పోరాడకుండా రాయచూరు, ముద్గల్ దుర్గాలను వదలివేశాడు దాంతో అంతర్వేది ప్రాంతం విజయనగర అధికారంలోకి వచ్చింది. రాయచూర్, ముద్గల్‌లను పోగొట్టుకున్న యూసఫ్ ఆదిల్‌ఖాన్ బహుదూర్ గిలానీపై దండయాత్ర చేశాడు. అహమ్మద్ బహ్రీని నిజాం ఉల్ ముల్క్ సహాయంతో యూసఫ్ ఆదిల్‌ఖాన్ బహుదూర్ గిలాని, కాశింబరీద్‌లను ఓడించాడు. ఆ తర్వాత విజయనగర సేన ఆక్రమించిన రాయచూరు, ముద్గల్‌లను పునరాక్రమించాలని తలచాడు. దాంతో రెండవ యుద్ధం వచ్చింది.

రెండవ యుద్ధం (క్రీ.శ.1492): యూసఫ్ ఆదిల్‌ఖాన్ అంతర్వేదిని పునరాక్రమించడానికి తన సేనతో కృష్ణానది ఒడ్డుకు చేరాడు. కాని జబ్బునపడి రెండు నెలలు యుద్ధం ఆరంభం చేయలేకపోయాడు. రెండు నెలల తర్వాత రాయచూరు, ముద్గల్ దుర్గాలను ముట్టడించాడు. నరసనాయకుడు స్వయంగా సైన్యాధిపత్యం వహించి యూసఫ్ ఆదిల్‌ఖాన్‌తో పోరాడి ఓడించాడు ఓడిపోయిన యూసఫ్‌ఖాన్ తన రక్షణ కోసం మానువ కోటలోకి ప్రవేశించాడు. తర్వాత లొంగినట్లు నటించి నరసనాయకుని సంధికి రమ్మన్నాడు. అది నమ్మిన నరస నాయకుడు తన ముఖ్యులతో కలిసి శాంతి సమావేశానికి వెళ్లాడు. వెంటనే యూసఫ్ ఆదిల్‌ఖాన్ సైనికదళం వారి మీద దాడి చేసి 70 మంది విజయనగర నాయకులను సంహరించింది. ఆ సమయంలో చిన్నరాయలకు కూడా దెబ్బలు తగిలాయి. ఇదంతా తెలిసి విజయనగర సేన వెనుకంజ వేసింది. దాంతో యూసఫ్‌ఖాన్‌కు విజయం లభించింది అందువల్ల చివరకు సంధి జరిగి నరసనాయకుడు మానువకోటను యూసఫ్ ఆదిల్‌ఖాన్‌కు వదలివేశాడు రాయచూరు, అంతర్వేది మాత్రం దక్కించుకున్నాడు. మానువ వద్ద జరిగిన యుద్ధంలో గాయాలపాలైన చిన్నరాయలు తిరిగి వచ్చే సమయంలో మార్గంలో మరణించాడు. చిన్న రాజకుమారుని మరణం ప్రజలకు, ఇతర సామంతులకు నరసనాయకునిపై అనుమానాలు రేకెత్తించింది. కనుక వెంటనే అతడు మిగిలి ఉన్న సాళువ నరసింహరాయల మూడవ కుమారుడైన నరసింహుని క్రీ.శ.1492లో సింహాసనాధీశుని చేశాడు.

ఇమ్మడి నరసింహరాయలు క్రీ.శ.1492-1505: సాళువ నరసింహుని మూడవ కుమారునికి ఇమ్మడి నరసింహరాయలకు తమ్మ లేక తమ్మరాయుడు అని కూడా పేర్లున్నాయి. ఇమ్మడి నరసింహుడు రాజు కాకముందు క్రీ శ 1491 నవంబర్ 28వ తేదీన చెంగలమర్రులో శాసనం వేయించాడు. రాజయిన తర్వాత క్రీ.శ.1493 ఫిబ్రవరిలో చకహళ్లి తామ్ర ఫలకాన్ని విడుదల చేశాడు కనుక అతడు క్రీ శ 1492లో సింహాసనం అధిష్టించాడని చెప్పవచ్చును. అతడు 16 సంవత్సరాలు పాలించాడని శాసనాలు తెలుపుతున్నాయి. అతడు క్రీ.శ.1492 నుండి 1505 వరకు 14 సంవత్సరాలు పాలించినట్లుగా తెలుస్తోంది. తమ్మారావుని రాజుగా చేశాడని న్యూనిజ్, పెరిష్టా రచనలు, శాసనాలు కూడా బలపరుస్తున్నాయి. ఇమ్మడి నరసింహరాయలు రాజైన తర్వాత అతడు నరస నాయకునితో వివాదపడ్డాడు. తన సోదరుడైన తిమ్మరాజును వధించిన నాదెండ్ల తిమ్మరుసును శిక్షించమని నరస నాయకుడు కోరాడు. కాని నరసింహరాయలు నరసనాయకుని కోర్కెను మన్నించలేదు ఇమ్మడి నరసింహరాయలు నరస నాయకుని ప్రాబల్యాన్ని సహించలేదు అతడే స్వయంగా సామ్రాజ్య పాలన నిర్వహించడానికి పూనుకొన్నాడు. అందువలన నరసనాయకుని ప్రధాన మంత్రి పదవి నుండి తొలగించి నాదెండ్ల తిమ్మరు అనే ఆరువేల నియోగి బ్రాహ్మణుని తన ప్రధాన మంత్రిగా నియమించాడు. నాదెండ్ల తిమ్మరుసును గౌరవించి బహుమతులిచ్చి తన ప్రధాన మంత్రిగా నియమించుకొన్నాడని న్యూనిజ్ కూడా రాశాడు దాంతో నరసనాయకునికి ఆగ్రహం కలిగి వేటకు వెళ్లే నెపంతో పెనుగొండకు వెళ్లిపోయి సైన్యాన్ని సమకూర్చుకొని విజయనగరంపై దండెత్తాడు. రాయలు భయపడి తిమ్మరుసును శిక్షించి తలకొట్టించాడు. నరస నాయకునితో సయోధ్య చేసుకొని తిరిగి నరసనాయకుని తన ప్రధాన మంత్రిగా, దండనాయకునిగా నియమించాడు. ఈ సంఘటనను ఆస్థాన కవులు విద్యాపురి ఆక్రమణగా వర్ణించారు. కనుక తుళువ వంశస్తులు తమ కత్తి బలంతోనే సింహాసనం తమకు దక్కిందని చెప్పుకున్నారు. కాని వాస్తవానికి నరస నాయకుడు సింహాసనం ఎక్కలేదు. చివరి వరకు సాళువ వంశస్తుల సేనాధిపతిగానే కొనసాగాడు. కాని ఆ తర్వాత కూడా ఇమ్మడి నరసింహరాయలు నరసనాయకునికి అవాంతరాలు కలిగించాడు. అందువల్ల నరసనాయకుని ఇమ్మడి నరసింహరాయలను పెనుగొండకు పంపి అక్కడ బందీగా చేసి అధికారాన్ని అపహరించి తానే రాజుగా పాలించాడని, అతడు అధికార అపహరణ చేసిన దురాక్రమణదారుడు అని కొందరు వర్ణించారు.

నరస నాయకుడు దురాక్రమణదారుడా?: నరస నాయకుడు దురాక్రమణదారుడా, కాదా అనే విషయంలో పండితుల మధ్య వాదోపవాదాలున్నాయి. నేలటూరి వెంకటరమణయ్య, బి యస్ యల్.హనుమంతరావులు నరసనాయకుడు దురాక్రమణదారుడు అని భావించగా, ఓరుగంటి రామచంద్రయ్య, గొర్తి వెంకట్రావు, డా॥ కృష్ణస్వామి అయ్యంగారు, పీసపాటి శ్రీరామశర్మ మొదలైన పండితులు నరసనాయకుడు దురాక్రమణదారుడు కాదని వాదించారు. నరసనాయకుడు రక్షకరస్వామి, సేనాధిపతి, కార్యకర్త మహాప్రధాన అనే బిరుదులతో మొదటి శాసనాలు పేర్కొన్నాయి. కాని తర్వాత కాలం నాటి శాసనాలు అతనిని మహామండలేశ్వర, భాసగే తప్పన రాయరగండ, అరిరాయవిభాడ, రాజాధిరాజ, రాజపరమేశ్వర అనే విజయనగర రాజులు ధరించిన బిరుదులను పేర్కొన్నాయి. కనుక అతడు అధికారాన్ని హస్తగతం చేసుకొని సింహాసనం అధిష్టించాడని డా బి.యస్.యల్. హనుమంతరావు స్పష్టంగా చెప్పారు. నేలటూరి వెంకటరమణయ్య, సాళువ నరసింహరాయల పుత్రులు పేరుకు మాత్రమే సామ్రాజ్యాధిపతులు, సామ్రాజ్యమంతటికీ నరసనాయకుడే వాస్తవమైన అధిపతి, అతని అజ్ఞానుసారమే పరిపాలన నడిచింది. సామ్రాజ్యానికి రక్షణకర్త, మహాప్రధాని, సర్వసేనాధిపతి, కార్యకర్త అన్న పదవులు అతనొక్కడికే ఉన్నాయి. రాయలను పెనుగొండ దుర్గంలో చెరలో పెట్టి సామ్రాజ్యానికంతటికి తానే సర్వాధికారిగా వెలిగాడు. అందువల్లే ఇమ్మడి నరసింహరాయలు రాజ్యాధిపతి అయినప్పటికీ నరసనాయకుడు యజమానిని లెక్క చేయకుండా రాజ బిరుదులు ధరించి, విజయనగర వజ్రసింహాసనాన్ని అధిష్టించాడని, రాయల మాదిరిగా ప్రజల చేత స్వామి అని పిలిపించుకున్నాడని, కాని ఇమ్మడి నరసింహరాయల స్థానాన్ని మాత్రం ఆక్రమించలేదని వివరించారు. ఇమ్మడి నరసింహరాయలు నామమాత్రంగా రాజ్యం చేయడానికి ఇష్టపడలేదని, నరసనాయకుని అధికారాన్ని సహించలేదని, అందువల్లనే అతనిని తొలగించి నాదెండ్ల తిమ్మరుసును ప్రధాన మంత్రిగా నియమించాడని న్యూనిజ్ రాశాడు. ఇమ్మడి నరసింహరాయలు రాజ్యాధిపత్యం చేపట్టడం యాదృచ్ఛికమని రాయప్రోలు సుబ్రమణ్యం అన్నారు. వీరి అభిప్రాయాలకు భిన్నంగా ఓరుగంటి రామచంద్రయ్య, కృష్ణస్వామి అయ్యంగార్, గొర్తి వెంకట్రావులు నరస నాయకుడు దురాక్రమణదారుడు కాదు, రాజహంతకుడు కాదు, అతడు

క్రమశిక్షణ కలిగిన సేనాధిపతి, అతడు సింహాసనాన్ని ఆక్రమించలేదు.. కాని అధికారాన్ని హస్తగతం చేసుకొని కిరీటం ధరించకుండా రాజ బిరుదులు ధరించకుండా సామ్రాజ్యాన్ని కాపాడాడు అని అన్నారు. సాళువ వంశంపై సిద్ధాంత గ్రంథం రాసిన పీసపాటి శ్రీరామశర్మ నరసనాయకుడు రాజద్రోహం చేసినట్లు గాని, అధికారాన్ని అపహరించినట్లు గాని, దురాక్రమణ చేసినట్లు గాని ఎక్కడా ఆధారాలు లేవు, ఇమ్మడి నరసింహరాయలు సింహాసనంపై ఉండి పాలించాడు; నరసనాయకుడు అతనికి విధేయుడుగానే రాజ్యరక్షణ పరిపాలనా భారాన్ని స్వీకరించాడు, అని చెపుతూ శక 1427 అంటే క్రీ.శ.1505లో ఇమ్మడి నరసింహరాయలు స్వయంగా కొయిలూరు దేవాలయాన్ని దర్శించి శాసనం వేయించాడు అని చెప్పారు. అంతేగాక క్రీ.శ.1505 ఫిబ్రవరి 28వ తేదీన రక్తాక్షి సంవత్సరంలోని ఒక శాసనం నరసనాయకుని కుమారుడు వీరనరసింహరాయలు ఇమ్మడి నరసింహరాయల ప్రధాన మంత్రిగా ఉన్నట్లు తెలుపుతోంది. నరసనాయకుడు రాజ్యాన్ని అపహరించి ఉంటే అతని మరణానంతరం వెంటనే తన కుమారుడు వీరనరసింహరాయలు సింహాసనం ఎక్కి ఉండేవాడు. కాని అతడు 1505 ఫిబ్రవరి వరకు ఇమ్మడి నరసింహరాయల ప్రధానమంత్రిగా ఉన్నాడంటే ఇమ్మడి నరసింహరాయలు సింహాసనం మీద ఉన్నాడన్నమాట. ఇమ్మడి నరసింహరాయల పేరుతోనే పరిపాలన సాగిందన్నమాట. కనుక నరసనాయకుడు ఇమ్మడి నరసింహరాయలను పెనుగొండలో బంధించలేదు. నరసింహరాయలు సింహాసనాన్ని అధిష్టించి ఉన్నాడని స్పష్టం అవుతోంది. నరస నాయకుడు అతనికి విధేయుడిగానే రాజకార్యాలు నిర్వహించాడని భావించాలి కనుక నరస నాయకుడు దురాక్రమణ దారుడు కాదు. నరసనాయకుడు 1503లో మరణించాడు. అతని మరణానంతరం అతని పెద్దకుమారుడు వీరనరసింహరాయలు తండ్రి స్థానంలో విజయనగర సామ్రాజ్యానికి ప్రధాన మంత్రి అయ్యాడు. వీర నరసింహరాయలు కొంత కాలం ఇమ్మడి నరసింహరాయలకు మహా ప్రధానిగా, మహా సేనాధిపతిగా విధేయుడుగా కొనసాగి, ఇమ్మడి నరసింహరాయలను పెనుగొండ పంపి అక్కడ బంధించి చంపి రాజ్యాధికారాన్ని చేపట్టాడని వీరప్పయ్య కాలజ్ఞానం తెలుపుతోంది. కనుక వీరనరసింహరాయలు దురాక్రమణదారుడుగా భావించవచ్చును గాని, నరసనాయకుడు కాదని స్పష్టంగా చెప్పవచ్చును. నరసనాయకుడు మరణ కాలంలో సాళువ నృసింహరాయలకిచ్చిన మాట ప్రకారం నిజాయితీగా అతని కుమారులకు అండగా నిలిచి విజయనగర సామ్రాజ్యాన్ని కాపాడి తన మాటను నిలబెట్టుకున్నాడు. అంతేగాక సాళువ నరసింహరాయల తుది కోర్కెను తీర్చడానికి తన శాయశక్తులా కృషి చేశాడు కాకపోతే ఇమ్మడి నరసింహరాయల పట్ల కఠినంగా వ్యవహరించినందువల్ల నిందలపాలయ్యాడు

నరసనాయకుని విజయాలు: ఇమ్మడి నరసింహరాయలను నామమాత్రపు రాజుగా చేసి నరసనాయకుడు అధికారం అంతా స్వంతం చేసుకున్నాడనే నెపంతో దక్షిణదేశంలోని సామంతులు స్వతంత్రం ప్రకటించారు. వారిని అణచడానికి నరసనాయకుడు దక్షిణ దండయాత్రను జరిపాడు. నరసనాయకుని దక్షిణ దండయాత్రను వరదాంబికా పరిణయం, పారిజాతాపహరణ కావ్యాలు పేర్కొన్నాయి. ఈ దండయాత్రా కాలంలో చోళ, పాండ్య చేర రాజ్యాలను జయించి మధుర రాజైన మానభూషుణ్ణి ఓడించి కప్పం వసూలు చేశాడు. కోనేటి రాజును జయించాడు. ఈ రాజులను గుర్తించడం కష్టం. ఆనాడు పూర్వపు చోళ, పాండ్య రాజ్య ప్రాంతాలను పాలించే గవర్నర్లను కూడా చోళ, పాండ్య రాజులని పిలచేవారు. వీరిలో మానభూషణుడు చోళ సామంతుడుగా మధురను పాలించాడు `కోయిలోలుగును బట్టి కోనేటి రాజు తిరుచినాపల్లి ప్రాంతాన్ని పాలించేవాడు అతనికి మహా మండలేశ్వర రాయబసువశంకర, రాజరాజగండ మొదలైన బిరుదులున్నాయి. అతడు శ్రీరంగంలోని శ్రీవైష్ణవులను హింసిస్తూ ఉండగా వారు నరసనాయకుని తోటి మొర పెట్టుకున్నారు. నరసనాయకుడు కోనేటి రాజుపై దండెత్తి ఓడించి అతనిని పదవీభ్రష్టుడిని చేశాడు. దాంతో తమిళ దేశం అదుపులోకి వచ్చింది. దక్షిణ దేశంలో నరస నాయకుడు సాధించిన విజయాలను శాసనాలు కూడా బలపరుస్తున్నాయి. పుదుకోట్టై సంస్థానంలోను, మధుర రామనాడు జిల్లాలలోను ఇమ్మడి నరసింహరాయల ఆధీన ఉద్యోగులు వేయించిన శాసనాలు ఈ విజయాలను పేర్కొన్నాయి. తర్వాత నరసనాయకుడు కావేరీ నదిని దాటి శ్రీరంగ పట్టణ కోటను క్రీ.శ.1496లో ముట్టడించాడు. ఆ ప్రాంతాన్ని డింగవంశస్తుడనని చెప్పుకున్న నంద్యరాజు అనే అతడు పాలించేవాడు. ఇతనికి హొయసణేంద్రుడు అని కూడా పేరుంది. అతడు ఓడి లొంగిపోయాడు. కొంకణ దేశ రాజుల వృత్తాంతం అనే కావ్యంలో శ్రీరంగ పట్టణ కోట స్వాధీనమైన తర్వాత ఆ కోటాధిపతి నంద్యరాజుని బంధించిన విధానాన్ని వర్ణించింది. క్రీ.శ.1497లో శ్రీరంగపట్టణ కోటను నంద్యరాజుకే పునరుద్ధరించి సామంతునిగా నియమించాడు

తర్వాత కుడి నుండి బయలుదేరి పశ్చిమతీరంపై దండెత్తి దమకార నేటి తుంకూరు ప్రాంతాన్ని, తరసాంగి కోటలను ఆక్రమించాడు. తర్వాత నరసనాయకుడు గోకర్ణక్షేత్రం దర్శించి అక్కడ తులాపురుష దానం చేశాడని దాంతో పాటు షోడశ దానాలు కూడా చేసినట్లు వరదాంబికా పరిణయం చెబుతుంది. తర్వాత చేర రాజ్యంపై దండెత్తి కాయల్ నాక్రమించాడు. దాంతో దక్షిణ దిగ్విజయ యాత్ర పూర్తి అయింది. ద్రావిడ, దక్షిణ, పశ్చిమ కర్ణాటక, కేరళ ప్రాంతాలు పూర్తిగా స్వాధీనంలోకి వచ్చాయి. నరసనాయకుడు విజయనగరం చేరాడు.

గజపతితో పోరాటం: ఇంచుమించు ఇదే కాలంలో అంటే క్రీ శ.1496లో పురుషోత్తమ గజపతి మరణించి అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి కళింగ సింహాసనమధిష్టించాడు. అతడు దక్షిణ దిగ్విజయ యాత్ర చేయాలని సంకల్పించి, తమిళ ప్రాంతాలను జయించాలని విజయనగర రాజ్యంపై దండెత్తి పెన్నా నది వరకు సాగి వచ్చాడు. క్రీ.శ.1500 నాటి అనంతవరం తామ్రశాసనం దక్షిణ దిగ్విజయయాత్రకు బయలుదేరిన ప్రతాపరుద్ర గజపతి కృష్ణాతీరంలో విడిది చేసినట్లు తెలుపుతోంది. తర్వాత అతడు క్రీ.శ.1501లో పెన్నానది ఒడ్డున ఉన్న సంగమం వరకు సాగినట్లు రాజవోలు శాసనం ధృవపరుస్తోంది. నరస నాయకుడు గజపతిని ఎదిరించి ఓడించి తరిమినట్లు అందువల్ల నరసనాయకునికి గజపతి గండభేరుండ అనే బిరుదు వచ్చినట్లు అతని కుమారుడు వీరనరసింహ రాయలు విడుదల చేసిన తామ్రశాసనం వల్ల తెలుస్తోంది. కనుక నరస నాయకుడు గజపతితో పోరాడి తరిమివేసి రాజ్యాన్ని రక్షించాడని చెప్పవచ్చును. తుళువ శాసనాలు నరస నాయకుడు గజపతిని ఓడించినట్లు తెలుపుతున్నాయి. అందులో పేర్కొనబడిన గజపతి ప్రతాపరుద్ర గజపతి అని చరిత్రకారులు నిర్ధారించుకున్నారు

బహమనీలతో యుద్ధం క్రీ.శ.1502: మానువ యుద్ధం జరిగిన 8 సంవత్సరాలకు బహమనీ సుల్తాన్ రెండవ మొహమ్మద్‌షా ప్రతి సంవత్సరం విజయనగర రాజ్యంపై జీహాద్ లేక పవిత్ర యుద్ధం జరపాలని తీర్మానించాడు. ఆ తీర్మానం తర్వాత అతడు క్రీ.శ.1502వ సంవత్సరంలో మొదటి జీహాద్‌ను నడిపాడు. ఈ దండయాత్రలో బీదర్, అహమ్మద్ నగర్, బీరారు, గోల్కొండ, బీజాపూరు సేనలన్నీ పాల్గొన్నాయి. సుల్తాన్ రాయచూర్, అంతర్వేది ప్రాంతాన్ని పూర్తిగా ఆక్రమించాడు. తర్వాత అతడు ఆ ప్రాంతాన్ని యూసఫ్ ఆదిల్ ఖాన్‌కు ఇచ్చినట్లు పెరిష్టా రాశాడు. ఇది వాస్తవంగానే కనిపిస్తోంది కారణమేమిటంటే నరస నాయకుడు పోగొట్టుకున్న రాయచూరు, అంతర్వేది ప్రాంతాన్ని అతని కుమారుడు కృష్ణదేవరాయలు తిరిగి 1510లో జయించాడు. నరస నాయకుడు బహమనీలతో పోరాడిన విజయాన్ని తుళువ శాసనాలు కూడా బలపరుస్తున్నాయి.

నరస నాయకుని మరణం: నరస నాయకుని జీవితంలో చివరి పోరాటం బహమనీలతో జరిగిన యుద్ధం. ఆ యుద్ధం తర్వాత అతడు మరు సంవత్సరం అంటే క్రీ.శ.1503లో మరణించాడు. తన యజమాని సాళువ నరసింహరాయల ఆజ్ఞ మేరకు విజయనగర రాజ్య భద్రతకు సౌష్టవం చేకూర్చటానికి సాళువ నరసింహుడు జరిపిన కృషిని కొనసాగించి, అంతరంగిక కల్లోలాలను అణచి సామ్రాజ్యానికి పటిష్టతను చేకూర్చాడు. కాని సాళువ నరసింహుడు సాధించమని కోరిన ఉదయగిరి, రాయచూరు, కొండవీడులను జయించలేకపోయినప్పటికీ మిగిలిన సామ్రాజ్యాలన్నింటినీ బలపరిచి పుష్టి కలిగించి సైనిక పాటవాన్ని పెంచి సామ్రాజ్యానికి నవ యవ్వనాన్ని ప్రసాదించాడు. సాళువ నరసింహరాయల కాలం నాటి సామ్రాజ్యపు హద్దుల వరకు చెక్కు చెదరకుండా నిలబెట్టాడు. అతని పర్యవేక్షణలో విజయనగర సేన గొప్ప శక్తి సామర్థ్యాలను పెంచుకొన్నది. సామంతులను పూర్తిగా అణచి వేశాడు. నరస నాయకుడు చేసిన కృషి అతని కుమారుడు కృష్ణదేవరాయల కాలం నాటి విజయనగర వైభవానికి, బలదర్పాలకు పునాదిని వేసింది.

రెండవ దురాక్రమణ లేక అధికార అపహరణ క్రీ.శ.1505: నరసనాయకునికి ముగ్గురు భార్యలు. వారిలో తిప్పాంబకు వీర నరసింహుడు, నాగలింబికకు శ్రీకృష్ణదేవరాయలు, ఓబాంబికకు రంగరాజు, అచ్యుతదేవరాయలు అనే నలుగురు కుమారులు కలిగారు. శాసనాలు నరసనాయకునికి ఐదుగురు కుమారులని తెలుపుతున్నాయి. కాని ఈ నలుగురు కుమారుల పేర్లు మాత్రమే తెలిశాయి. నరస నాయకుని మరణానంతరం అతని పెద్ద కుమారుడు వీరనరసింహుడు తండ్రి స్థానాన్ని పొందాడు. అతనిని ఇమ్మడి నరసనాయకుడు అని కూడా పిలిచేవారు. వీరనరసింహుడు విజయనగర సామ్రాజ్యానికి మహా ప్రధానిగా, మహాసేనాధిపతిగా పదవులు పొందాడు. అతడు 1505వ సంవత్సరం వరకు సాళువ ఇమ్మడి నరసింహ రాయల యందు ప్రభుభక్తితో వ్యవహరించినట్లు అతడు వేయించిన క్రీ.శ.1504 నాటి శాసనం తెలుపుతోంది. ఈ శాసనాన్ని బట్టి సాళువ నరసింహరాయలు 1505

వరకు రాజ్యాధిపతిగా ఉన్నాడని అతనికి తుళువ వీరనరసింహుడు ప్రధానిగా సేనాధిపతిగా వ్యవహరించాడని స్పష్టమవుతుంది. తర్వాత వీరనరసింహరాయలు కోడమారాడ్ లేక కొండమరసు అనే సలహాదారుని మాటలకు లొంగిపోయి, తన యజమానిని వధించి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని అతనికి సంకల్పం కలిగిందని తెలుస్తోంది. అందుకోసం రాజధాని నగరంలో శాంతిభద్రతలు లేవని ఇమ్మడి నరసింహరాయలను ఒప్పించి పెనుగొండ దుర్గానికి పంపాడు. అక్కడ కుట్ర పన్ని కొండమరసు చేత ఇమ్మడి నరసింహరాయలను హత్య చేయించాడని, తర్వాత ఎవరికీ తెలియకుండా శవాన్ని పూడ్చి వేశాడని అన్ని వివరాలను న్యూనిజ్ వర్ణించాడు హత్యానంతరం కొండమరసు విజయనగరం చేరి ఇమ్మడి నరసింహరాయల మరణ వార్తను వీర నరసింహునికి తెలిపాడు. ఆ వార్త వినగానే వీరనరసింహుడు మూర్ఛిల్లినట్లు నటించాడని, అయినా ప్రజలు అతనిని దోషిగా భావించారని, హత్య వెనుక అతని అదృశ్య హస్తం ఉందని నమ్మి రాజ్యమంతటా సామంతులు తిరుగుబాటు చేశారని న్యూనిజ్ రాశాడు. సామంతులను ఎదుర్కోటానికి వీర నరసింహుడు చతురంగ బలాలను సిద్ధపరచి అల్లర్లను అణచి తర్వాత వీర నరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించాడని కూడా న్యూనిజ్ రాశాడు. ఈ వాదనకు అనుగుణంగా న్యూనిజ్ రాజహత్యను, దురాక్రమణ చేసిన వాడు నరసనాయకుడు అని రాశాడు. అందువలన కొందరు ఈ దురాక్రమణను నరసనాయకునికి ఆపాదించారు. వీర నరసింహునికి కూడా నరస నాయకుడు అని పేరుంది. కనుక పొరపాటున నరసనాయకుడే ఇమ్మడి నరసింహరాయలను హత్య చేయించి సింహాసనాన్ని దురాక్రమణ చేశాడని భావింపబడింది. కాని వాస్తవానికి రాజహత్యను చేయించి సింహాసనాన్ని దురాక్రమణ చేసింది నరసనాయకుని కుమారుడు వీరనరసింహరాయలు. సాళువ వంశస్థుల అధికారాన్ని అపహరణ చేసి సింహాసనం ఆక్రమించింది వీరనరసింహరాయలు కనుక వీరనరసింహరాయలనే దురాక్రమణదారునిగా భావించాలి. గొర్తి వెంకట్రావు-వీరనరసింహరాయలే దురాక్రమణదారుడు అని చెబుతూ అతడు రాజ్యం తన కుమారునికి దక్కాలని, తన తమ్ముడు శ్రీకృష్ణదేవరాయల కండ్లు పీకించమని తన మంత్రి తిమ్మరుసును ఆదేశించాడు; అలాంటి వాడు సింహాసనం కొరకు సాళువ రెండవ నరసింహరాయలను హత్య చేయించాడంటే ఆశ్చర్యపడనక్కరలేదు. కనుక అతడే సాళువ సింహాసనాన్ని అపహరించిన దురాక్రమణదారుడు నరసనాయకుడు కాదని వివరించారు. ఈ విధంగా స్వల్పకాలంలోనే విజయనగర సామ్రాజ్య చరిత్రలో రెండుసార్లు అధికార అపహరణ జరిగింది. సంగమ వంశస్తుల నుండి సాళువ వంశస్తులు, సాళువ వంశస్తుల నుండి తుళువ వంశస్తులు దురాక్రమణ చేసి అధికారాన్ని అపహరించారు. కాని వారు అధికారాన్ని చేజిక్కించుకున్నందు వల్ల సామ్రాజ్యానికి ఉపకారమే జరిగింది కాని, అపకారం జరుగలేదు. ఉభయవంశాలు సామ్రాజ్య ఔన్నత్యానికి పాటుపడ్డాయి. సాళువ నరసింహరాయల కాలంలో సామ్రాజ్యం యావద్భారత కీర్తి గడించింది. బలహీనులు రాజ్యార్హులు కారు, వారిని పారదోలి ఎవరో ఒకరు రాజ్యాన్ని అపహరిస్తారు. బలహీనుడైన ప్రౌఢదేవరాయలను తొలగించి సాళువ వంశం రాజ్యాన్ని ఆక్రమించకపోయినట్లయితే బహమనీ సుల్తాన్‌లో, గజపతులో విజయనగర సామ్రాజ్యాన్ని ఎప్పుడో కైవసం చేసుకొని ఉండేవారు. కనుక ఈ రెండు వంశాలు చేసిన దురాక్రమణను దురాక్రమణ అనడం కన్నా విజయనగర సామ్రాజ్యపు మంచి కోసం జరిగిన రాజవంశాల మార్పు అనడం సమంజసంగా ఉంటుంది.

సాళువ వంశం అంతరించడం: సాళువ నరసింహరాయల కుమారులు ముగ్గురూ విషాద పరిస్థితులలో మరణించారు. నాయకుల కుట్ర కుతంత్రాలు, స్వార్థాలు వారి మరణానికి కారణాలు. సాళువ వంశం 20 సంవత్సరాలు మాత్రమే పాలించింది. కాని వారి హయాం అంతకుముందు దిగజారుతున్న సామ్రాజ్య శక్తిని పెంచుకొంది. సైన్యం నూతన శిక్షణ పొంది శత్రు రాజులపై గొప్ప విజయాలు సాధించగల స్థాయికి చేరి సామ్రాజ్యానికి ఆయుర్దాయాన్ని పెంచింది. ఇమ్మడి నరసింహరాయల మరణాన్ని గురించి తెలుసుకోడానికి మనకు ఆధారాలు ఉన్నాయి. మంత్రి హోదాలో వీరనరసింహుడు క్రీ.శ.1505 ఫిబ్రవరి 28వ తేదీన దేవికాపురంలో శాసనం వేయించాడు. తుళువ వీరనరసింహరాయల రాజబిరుదులతో ఉన్న శాసనం మైసూరు రాష్ట్రంలోని నగరగరెలో క్రీ.శ.1505 జులై 16వ తేదీన వేయించబడింది. కనుక క్రీ.శ.1505 ఫిబ్రవరి 28-1505 జులై 16వ తేదీల మధ్య సాళువ రెండవ నరసింహరాయలు లేక సాళువ ఇమ్మడి నరసింహరాయలు హత్య జరిగి ఉండాలి అతని మరణంతో సాళువ వంశం అంతరించింది.

తుళువ వంశం క్రీ.శ. 1505-1570

చంద్రుడు
|
బుధుడు
|
తిమ్మరాజు (భార్య దేవకి)
|
ఈశ్వరరాయలు (భార్య బుక్కాంబ)

నరసనాయకుడు (ముగ్గురు భార్యలు) — తిమ్మనాయకుడు

తిప్పాంబ వలన — నాగలాంబ వలన — ఓబాంబిక వలన

- తిప్పాంబ వలన: వీరనరసింహరాయలు 1505-1509
- నాగలాంబ వలన: శ్రీకృష్ణదేవరాయలు 1509-1529
  - తిరుమలాంబ (మోహనాంగి) అళియ రామరాయల భార్య
  - వెంగళాంబ అరవీటి తిరుమల రాయల భార్య
  - తిరుమల రాయలు 1517-1524
  - 18 నెలల పసిబాలుడు 1528-1536
- ఓబాంబిక వలన:
  - రంగరాయలు భార్య తిమ్మాంబ
    - సదాశివరాయలు 1543-1576
  - అచ్యుతరాయలు 1530-1542
    - మొదటి వెంకటపతి రాయలు 1542
      - చిన్న తిరుమలయ్య 1542

వీరనరసింహరాయలు క్రీ.శ.1505లో విజయనగర వజ్ర సింహాసనం అధిష్టించడంతో విజయనగర చరిత్రలో మూడవ వంశం అయిన తుళువ వంశ పరిపాలన ప్రారంభమైంది. ఈ వంశం క్రీ.శ.1505 నుండి క్రీ.శ.1570 వరకు 65 సంవత్సరాలు పాలించింది. తుళువ వంశం హయాంలో విజయనగర సామ్రాజ్యం వైభవ, పతనాలను రెండింటిని చవిచూసింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామ్రాజ్యం మహోన్నత శిఖరాలను అందుకోగా, సదాశివరాయల కాలంలో తళ్లికోట యుద్ధంలో ఘోర పరాజయాన్ని పొంది పతనం కూడా అయింది. తుళువ వంశస్తులు తాము చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. వారి వంశ ప్రశస్తి మొట్టమొదటి సారిగా వీరనరసింహరాయల కాలంలోనే వేయించిన నగరగెరె శాసనంలో కనిపిస్తుంది. అందులో బ్రహ్మ నుండి అత్రి, అత్రి నుండి చంద్రుడు, అతని నుండి పురూరవుడు, అతని నుండి నహుషుడు, వారి సంతతిలో తిమ్మనాయకుడు, అతనికి ఈశ్వర నాయకుడు, అతనికి నరసనాయకుడు, అతనికి వీరనరసింహరాయలు జన్మించారని తెలుపుతోంది. ఈ వంశవృక్షంలో పురాణ పురుషులను తొలగించితే తుళువ వంశానికి మూల పురుషుడు తిమ్మా నాయకుడు. అతడే మొదటి చారిత్రక పురుషుడు.

మైసూరు రాష్ట్రంలోని తుళువ ప్రాంతం జన్మస్థలమైనందున వారికి తుళువ వంశం అని పేరు వచ్చింది. క్రీ.శ.1342లో మొదటి హరిహరరాయలు తుళువ రాష్ట్రాన్ని జయించాడు. నాటి నుండి తుళువ వంశస్తులు విజయనగర ఆస్థానంలో ఉద్యోగాలు నిర్వహించారు. తిమ్మరాజు కుమారుడు ఈశ్వర నాయకుడు సాళువ నరసింహరాయల వద్ద సేనాధిపతిగా చేరాడు. అతడు కందుకూరు వద్ద క్రీ.శ.1481లో మూడవ మహమ్మద్‌షాను ఓడించి సుల్తాన్ శిబిరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. నాటి నుండి ఈ వంశానికి విజయనగర సామ్రాజ్యంలో గొప్ప హోదా ఏర్పడింది. ఈశ్వర నాయకుని దేవకీపురాధీశ్వరుడని వరాహ పురాణం వర్ణించినది. దేవకీపురం వద్ద తుళువ వంశస్తుల శాసనాలున్నాయి. ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని ఆరణి తాలూకాలో దేవికాపురం అనే గ్రామం ఉంది. అదే ఈశ్వర నాయకుని దేవికాపురం అయి ఉండవచ్చని కొందరు పండితులు భావించారు. విజయనగర కొలువులో చేరిన తర్వాత తుళువ వంశస్తులు ఆర్కాట్ జిల్లాలోని దేవికాపురానికి తమ మకాం మార్చుకొని

ఉండవచ్చు. ఆ ప్రాంతం సాళువ నరసింహరాయల రాజ్యంలోనిది. కనుక ఈశ్వరనాయకుడు సాళువ నరసింహ రాయల వద్ద సేనాధిపతిగా చేరి ఉంటాడు. ఈశ్వర నాయకుని కుమారుడు నరసనాయకుడు కూడా తండ్రి తర్వాత తండ్రి స్థానంలో నృసింహరాయల వద్ద సేనాధిపతిగా చేరి అతని విశ్వాసాన్ని పొంది సాళువ వంశానికి రక్షకుడయ్యాడు. తర్వాత అతని కుమారుడు వీరనరసింహరాయలు తండ్రి పదవిని చేపట్టి సాళువ వంశాన్ని అంతం చేసి క్రీ.శ.1505లో తుళువ వంశాన్ని స్థాపించాడు. తుళువ వంశస్తులు కన్నడిగులు. వారి మాతృభాష కన్నడం. తెలుంగు రాయుడైన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు తనను కన్నడరాయ అని కలలో సంబోధించాడని శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో చెప్పుకున్నాడు. శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు ఆనతితోనే తాను ఆముక్తమాల్యద రాసానని కూడా చెప్పుకున్నాడు. కనుకనే కృష్ణరాయలు ఆముక్తమాల్యదను తెలుగులో రాశాడు నరస నాయకుని కాలం నుండి తుళువ వంశస్తులు తెలుగు భాషను ఆదరించారు. నంది మల్లయ్య, గంట సింగయ్యలు వరాహపురాణాన్ని రచించి నరసనాయకునికి అంకితం ఇచ్చారు. నాటి నుంచీ వారికి తెలుగు భాష అభిమాన భాషగా మారి ఉండవచ్చును.

వీరనరసింహరాయలు క్రీ.శ.1505-1509: క్రీ.శ.1505 మే నెలలో వీరనరసింహరాయలు విజయనగర వజ్ర సింహాసనం అధిష్టించాడు. దాంతో తుళువ వంశం ప్రారంభమైంది. కాని వీరనరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించడాన్ని సామంతులు హర్షించలేదు. అందువల్ల సామ్రాజ్యం అంతటా తిరుగుబాట్లు చెలరేగాయి. వారిలో ఆదోని పాలకుడు కాశప్ప ఒడయారు, ఉమ్మతూరును పాలించిన దేవరాజు శ్రీరంగ పట్టణ పాలెగాడు గుండరాజు ముఖ్యులు. వారికి తోడు బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్ కూడా విజయనగర సామ్రాజ్యంపై దండెత్తాడు.

యూసఫ్ ఆదిల్‌ఖాన్ దండయాత్ర: విజయనగర సామ్రాజ్యంలోని సామంతుల తిరుగుబాట్లను ఆసరాగా తీసుకొని బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్ విజయనగర సామ్రాజ్య భాగాలను ఆక్రమించాలని సంకల్పించాడు. అదే సమయంలో ఆదోని పాలెగాడు కాశప్ప ఒడయార్ స్వతంత్రం ప్రకటించి యూసఫ్ ఆదిల్‌ఖాన్ అండను సంపాదించదలచి యూసఫ్‌తో కలిసిపోయాడు. వారిద్దరూ ఒకరికొకరు సహకరించుకొనేలా అంగీకారానికి వచ్చారు. వారికి అంగీకారం కుదిరిన తర్వాత యూసఫ్ ఆదిల్‌ఖాన్ తుంగభద్రా నదిని దాటి విజయనగర సామ్రాజ్యంలోని కందనవోలు కోటను ముట్టడించారు. ఆనాడు అరవీటి రామరాజు, అతని కుమారుడు తిమ్మరాజు కందనవోలు కోట పాలకులుగా ఉన్నారు. వారు యూసఫ్ ఆదిల్‌ఖాన్‌ను ఓడించి కోటను రక్షించారు. ఓటమి తర్వాత ఖాన్ సైన్యం ఆదవాని వైపు సాగాయి. ఆదవాని చేరి కాశప్ప ఒడయారుతో చేరితే ప్రమాదమని గ్రహించిన రామరాజు, తిమ్మరాజుల కోట నుండి బయటకు వచ్చి తమ సైన్యాలతో బీజాపూరు సైన్యాన్ని వెంబడించి మరొకసారి ఓడించి తరిమివేసి, బీజాపూరు, ఆదవాని సైన్యాలు కలువకుండా చేశారు.

ఆదవాని కోట ముట్టడి: తర్వాత రామరాజు, తిమ్మరాజులు తమ సైన్యంతో ఆదవాని చేరి కోటను ముట్టడించారు. అక్కడ కాశప్ప ఒడయార్‌ను చంపి ఆదవానిని స్వాధీనం చేసుకున్నారు. ఆదవాని కోట పతనం తెలిసి యూసఫ్ ఆదిల్‌ఖాన్ తుంగభద్రానదిని దాటి తన రాజ్యంలోకి వెళ్లిపోయాడు. సామ్రాజ్యానికి ప్రమాదం తప్పింది. రామరాజు, తిమ్మరాజులు సాధించిన ఈ విజయాలను బాలభాగవతం వర్ణించింది. వారి విజయాలకు సంతోషించి వీర నరసింహరాయలు వారికి గండపెండేరం తొడిగి స్వామిద్రోహర గండ అనే బిరుదునిచ్చాడు అంతేగాక వారికి ఆదోని కోటపై కూడా అధికారం ఇచ్చాడు. వారు సామంతులుగా కందనవోలు, ఆదోని రెండు దుర్గాలను పరిపాలించారు.

ఉమ్మత్తూరు శ్రీరంగ పట్టణ దండయాత్ర: తర్వాత వీరనరసింహరాయలు ఉమ్మత్తూరు శ్రీరంగపట్టణాలపై దండెత్తాలని తీర్మానించుకున్నాడు. తాను రాజధానిలో లేని సమయంలో విజయనగర రక్షణకు తగిన శ్రద్ధ తీసుకున్నాడు. తన తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలను పిలిచి తాను దక్షిణ దేశంపై దాడికి వెళుతున్నానని, రాజధానిని జాగ్రత్తగా కాపాడమని ఆదేశించాడు. అందుకు కృష్ణదేవరాయలు తానే దక్షిణ దండయాత్రకు వెళ్తానని, అన్నగారే రాజధానిలో ఉండాలని కోరాడు. కాని వీరనరసింహరాయలు అందుకు అంగీకరించకుండా రాజధాని రక్షణను తమ్మునికి అప్పగించి, తానే మిగిలిన తమ్ములైన అచ్యుత దేవరాయలు, రంగరాయలను తోడుగా తీసుకొని శ్రీరంగ పట్టణం, ఉమ్మత్తూరుపైకి దాడికి బయలుదేరాడు. ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణాలను హూణ వంశస్తులు పాలించేవారు. ఉమ్మత్తూరు సామంత వంశం 15వ శతాబ్దపు చివరి దశకంలో ప్రాముఖ్యతలోకి వచ్చింది. వారి

వంశంలో మొదటివాడు ఇమ్మడి రాయలు. అతనికి దేవన్న, నంజరాజు అనే ఇద్దరు కుమారులున్నారు దేవన్నకు ఇమ్మడి దేవన్న, చిక్కరాయలు అనే ఇద్దరు కుమారులున్నారు. నంజరాయునికి వీరనంజరాయుడను ఒకే కుమారుడున్నాడు. కొంకణ దేశ రాజుల వృత్తాంతం, విజయనగరంపై మొదట తిరగబడినవాడు దేవన్న అని తెలుపుతోంది. దేవన్న కప్పం కట్టడానికి నిరాకరించాడు అతనిని అదుపులోకి తీసుకురావడానికి వీర నరసింహరాయలు ఉమ్మత్తూరు చేరి కోటను ముట్టడించాడు. మూడు నెలలైనా కోట వశం కాలేదు. దాంతో కోట ముట్టడిని ఆపి శ్రీరంగపట్టణంపైకి దండెత్తాడు శ్రీరంగపట్టణానికి సహాయంగా తలకాడు, ఉమ్మత్తూరుల నుండి సైన్యాలు వచ్చాయి. దాంతో ధైర్యం తెచ్చుకొని శ్రీరంగపట్టణ రాజు నంజరాజు కోట బయటికి వచ్చి రాయలను ఎదుర్కొన్నాడు. మూడు సైన్యాలు అతడికి సహకరించినందువల్ల వీరనరసింహరాయలకు ఓటమి తప్పలేదు. ఈ దండయాత్రను కొంకణ దేశ రాజుల వృత్తాంతమే గాక సమకాలీన శాసనాలు, పోర్చుగీసు వారి రచనలు కూడా ధృవపరుస్తున్నాయి. క్రీ.శ.1510లో విజయనగరాన్ని దర్శించిన ఫ్రెయిర్ లూయిస్ అనే అతడు నరసింగరాజు 5 వేల అశ్వదళం, 5 వేల కాల్బలంతో ఒక సామంతునిపై యుద్ధానికి వెళ్లాడని రాశాడు. ఈ సామంతుడు ఉమ్మత్తూరు రాజని భావింపబడినది. ఈ దండయాత్ర వీరనరసింహ రాయల చివరి కాలంలో అంటే క్రీ శ 1507- 1509 సంవత్సరాల మధ్య జరిగినట్లుగా నిర్ణయించారు.

పశ్చిమ కోస్తాపై దండయాత్ర: వీరనరసింహరాయలు శ్రీరంగపట్టణ యుద్ధం తర్వాత పశ్చిమ కోస్తాపై దండెత్తాడు. అతడు పశ్చిమ కనుమలను దాటి తుళువ రాజ్యంలోని రేవు పట్టణాలను ఆక్రమించాడు. మంగుళూరును జయించాడు తర్వాత కలశ, కరకల రాజ్యంపై దండెత్తాడు దాని రాజు ఇమ్మడి భైరస ఓడయారు విజయనగర సేనలను చూసి బెదిరి పారిపోయాడు. తర్వాత వీరనరసింహరాయలు గోవాపై దండెత్తాడు. గోవాను పాలించిన ముస్లిం గవర్నర్ క్రీ.శ.1506లో విజయనగర రాజుతో యుద్ధం చేస్తున్నాడని ఇటలీ యాంత్రికుడు రాశాడు. కాని విజయం లభించినదీ లేనిదీ తెలియదు. గోవాను పునరాక్రమించాలని వీరనరసింహరాయలు ప్రయత్నించి ఉండవచ్చును.

వీరనరసింహరాయలు క్రీ.శ.1505 మే నెల నుండి క్రీ.శ.1509 జూలై వరకు ఐదు సంవత్సరాలు పాలించాడు. ఈ ఐదు సంవత్సరాల కాలమంతా యుద్ధాలలోనే గడిచిపోయింది అయినప్పటికీ అతడు రాజ్య రక్షణకు అనేక చర్యలు తీసుకున్నాడు

పోర్చుగీసు వారితో ఒప్పందం: తన సైనిక శక్తిని పెంచడానికి గోవాలోని పోర్చుగీసు వారితో ఒక ఒప్పందం చేసుకొని వారు దిగుమతి చేసే గుర్రాలన్నింటినీ విజయనగర రాజ్యానికి అమ్మాలని ఒక ఒప్పందం చేసుకున్నాడు. అప్పటి పోర్చుగీసు గవర్నర్ ఆల్మెడా విజయనగర రాజు నరసింహరాజును గురించి, విజయనగర రాజ్య శక్తిని గురించి ఒక స్థానికుని ద్వారా తెలుసుకున్నాడు కావనూరులో ఉన్న ఆల్మెడా కుమారుడు లారెన్‌కో విజయనగర రాజు నరసింహుని గురించి మరికొంత సమాచారాన్ని తెలుసుకున్నాడు. ఈ కాలంలో ఇటాలియన్ యాత్రికుడు వార్తెమా విజయనగర రాజ్యాన్ని దర్శించాడు. అతడు విజయనగర రాజ్యాన్ని గురించి లారెన్‌కోకు వివరంగా చెప్పాడు. దాంతో పోర్చుగీసు వారు విజయనగరంతో వ్యాపార సంబంధాలు పెట్టుకోవాలని భావించారు. అలాంటి స్థితిలో వీరనరసింహరాయలు పోర్చుగీసు రాజప్రతినిధి అయిన ఆల్మెడా వద్దకు కానుకలతో ఒక రాయబారిని పంపాడు. విజయనగర రాయబారి తమ రాజు పోర్చుగీసు వారితో వర్తక సంధి కోరుతున్నాడని చెప్పాడు. ఆల్మెడా అంజనీదీవి, భట్కల్‌లో తమకు కోటలను నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరాడు. కాని భట్కల్‌ను మరొకరికి ఇచ్చినందువల్ల అది సాధ్యం కాదని చెప్పాడు. అంజనీదీవిలో కోట నిర్మించుకోవచ్చుని చెప్పాడు. అంతేగాక విజయనగర రాయబారి పోర్చుగీసు, విజయనగర వంశాల మధ్య వైవాహిక సంబంధాలు ఉంటే బాగుంటుందని కూడా చెప్పాడట. దాని ఫలితం తెలియదు. కాని తర్వాత వీరనరసింహరాయల నౌకాదళాధిపతి తిమ్మోజీ పోర్చుగీసు వారితో అంజనీదీవిలో వర్తక సంధిని కుదుర్చుకున్నాడు. వీరనరసింహ రాయల ఆజ్ఞతో ఈ సంధి జరిగి ఉంటుంది. పోర్చుగీసు వారు విజయనగర రాజ్యానికి మిత్రులయ్యారు. వారి సహకారంతో మంచి గుర్రాలను సేకరించి వీరనరసింహరాయలు తన గుర్రపుదళ పాటవాన్ని పెంచుకున్నాడు. తర్వాత కూడా పోర్చుగీసు వారు విజయనగర రాజ్యానికి మేలుజాతి గుర్రాలను సరఫరా చేశారు. ఈ విధంగా పోర్చుగీసు వారితో మొదటిసారిగా సంధి చేసుకున్న ఘనత వీరనరసింహరాయలదే.

ప్రజాసంక్షేమం-దానాలు: వీరనరసింహరాయలు రైతుల అభ్యుదయానికి కృషి చేశాడు. రైతుల సమస్యలను

శ్రద్ధగా వినేవాడు వారి సమస్యలను చక్కబెట్టేవాడు. విజయనగర సామ్రాజ్యంలో వివాహ సుంకం వసూలు చేసేవారు ప్రజలలో ఆ సుంకంపై తిరుగుబాటు వచ్చింది. ప్రజాభిప్రాయాన్ని మన్నించి వీర నరసింహరాయలు పెండ్లి సుంకాన్ని తొలగించాడు. కాని పూర్తిగా తొలగించడానికి సాహసించలేదు. కొన్ని ప్రాంతాలలో మాత్రమే తొలగించాడు ఆ తర్వాత కృష్ణదేవరాయల కాలంలో పూర్తిగా రద్దు చేశారు. పెండ్లి సుంకమే గాక పాలెగాండ్రు వసూలు చేసే అన్యాయపు పన్నులను కూడా రద్దు చేశాడు. పాలెగాండ్ర దురంతాలను అరికట్టాడు. ఇతని కాలంలో రాయలసీమలో సంబెట గురవరాజనే స్థానిక పాలెగాడు ప్రజాపీడన చేసి అనేక అన్యాయపు పన్నులను వసూలు చేశాడు. స్త్రీల స్థనాలను కొలిచి పన్నులు వసూలు చేసేవాడట. పన్నులు చెల్లించని వారి భార్యలను బలాత్కారంగా లాక్కొని వచ్చి వారి స్థనాలకు చిడతలు పట్టించేవాడట. అతని దౌర్జన్యాలను కూచిపూడి కళాకారులు వీరనరసింహ రాయల దృష్టికి తెచ్చారు. వారు రాయలసీమ గుండా ప్రయాణం చేస్తూ అక్కడ సమ్మెట గురవరాజు చేసే దురంతాలను చూసి విజయనగరం చేరి రాయల ముందు తమ నాటకాన్ని ప్రదర్శించి మధ్యలో గురవరాజు పాత్రను ప్రవేశపెట్టి అతని దురంతాలను వీరనరసింహరాయలకు చూపించారు. వెంటనే వారిని వివరాలు అడిగి తెలుసుకొని మరు రోజు ఒక దండనాధుని పంపి సమ్మెట గురవరాజు తలకొట్టించి విజయనగరం తెప్పించాడట తర్వాత అతడు విధించిన అక్రమమైన పన్నులను రద్దు చేయించాడని మాచుపల్లి కైఫీయత్తు తెలుపుతోంది. అతడు శ్రీరంగం, చిదంబరం, కుంభకోణం, తిరుమల, కంచి మొదలైన అనేక దేవాలయాలకు భూరి విరాళాలు, దానాలు చేసి శాసనాలు రాయించాడు. అతడు చేసిన దానాలను గురించి అనేక శాసనాలు అతనిని కీర్తిస్తున్నాయి. రాజ్యాన్ని అపహరించినందుకు పాపపరిహారంగా అన్ని దానాలు చేశాడేమోనని కొందరు వ్యాఖ్యానించారు. కాని విజయనగర రాజులు మొదటి నుండి దేవాలయాలకు అనేక దానాలు చేస్తూ దేవాలయాలను పెంపొందిస్తూ వచ్చారు. కృష్ణదేవ రాయలు ఇంకా ఎన్నో రెట్లు దానాలు చేశాడు. కనుక వీరనరసింహరాయలు కూడా సాంప్రదాయంగా వచ్చే పద్ధతి ప్రకారమే దానాలు చేశాడు గాని అన్యధా భావించడానికి వీలు లేదు. ప్రజలలో నీతి నిజాయితీలను పెంచాడు వివాదాల్ని ద్వంద్వ యుద్ధంలో తేల్చుకొనే పద్ధతిని ప్రవేశపెట్టాడు. ప్రజల ధైర్యసాహస గుణాలు అభివృద్ధి అయ్యే విధంగా చర్యలు తీసుకున్నాడు ప్రజలకు సాము గరిడీలు నేర్పించి దేహదారుఢ్యం పెంచి సైన్యంలో చేరే విధంగా కూడా చర్యలు చేపట్టి పదాతిదళం బాగా పెరిగే విధంగా చేశాడు. అన్న చేసిన ఈ చర్యల వల్ల కృష్ణదేవరాయల కాలంలో విజయనగర పదాతిదళం విపరీతంగా పెరగటానికి అవకాశం కలిగింది. ఆ విధంగా ప్రజలను యుద్ధాలకు సిద్ధపరచి కృష్ణదేవరాయల కాలం నాటి సైనిక బలానికి, విజయాలకు పునాదిని వేశాడు. ఆ విధంగా వీరనరసింహరాయలు కొద్ది కాలమే పాలించినా సామ్రాజ్య పురోభివృద్ధికి కృషి చేసి క్రీ.శ.1509లో మరణించాడు

వారసత్వం: వీరనరసింహరాయలు తన చివరి కాలంలో ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణాలపై దండెత్తాలని సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. కాని ఆరోగ్యం చెడి మరణించాడు. మరణించే ముందు తన ప్రధానమంత్రి అయిన తిమ్మరుసును పిలిపించుకొని తన తర్వాత తన 8 సంవత్సరాల కుమారుడే రాజు కావాలని, అందుకు తన తమ్ముడు కృష్ణదేవరాయలు అడ్డు అని, కనుక అతని గుడ్లు పీకించాలని ఆదేశించాడని, కాని తిమ్మరుసు కృష్ణదేవ రాయలను దాచి, ఒక ఆడ మేక కండ్లు పీకించి వీరనరసింహరాయలకు చూపించి అతని తృప్తిపరచాడని, తర్వాత కుమారుని పట్టాభిషేకం చేయమని ఆదేశించి మరణించాడని న్యూనిజ్ రాశాడు. కాని వీరనరసింహ రాయలు కృష్ణదేవరాయలను ద్వేషించాడని చెప్పడానికి ఆధారాలు లేవు వీరనరసింహరాయలే తన రాజముద్రికను శ్రీకృష్ణదేవరాయలకు అందించాడని దేశీయ కధలు చెబుతున్నాయి.

శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1509-1529: విజయనగర చక్రవర్తులలో శ్రీకృష్ణదేవరాయలు అగ్రగణ్యుడు అసమాన ప్రతిభాశాలి. ఉత్తమోత్తముడు. దక్షిణ భారతదేశ చరిత్రలోనే గాక యావత్ భారతదేశ చరిత్రలో అతనికొక విశిష్ట స్థానం ఉంది. అతడు భారతదేశాన్ని ఏలిన అతి గొప్పవారైన అశోక, చంద్రగుప్త, సముద్రగుప్త హర్ష, భోజులతో పోల్చదగిన వ్యక్తి, మహావీరుడు. జీవితంలో అపజయం ఎరుగని అప్రతిహత యోధుడు. అతను తన జీవితంలో 28 యుద్ధాలు చేశాడు. అన్నీ విజయాలే అంతకు మించి గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతి విశారదుడు. అంతకుమించి సాహితీస్రష్ట, రసజ్ఞుడు, కవి, పండితుడు, కవి పండిత పోషకుడు, సకల విద్యా పారంగతుడు, కళాపోషకుడు, భవన నిర్మాత. ఇన్ని సుగుణాలు ఒక్క వ్యక్తిలోనే మూర్తీభవించి ఉండటం ప్రపంచ చరిత్రలోనే అరుదు. అతని కాలంలో క్రీ.శ.1520లో విజయనగరాన్ని దర్శించిన డామింగోపేస్ రాయల మూర్తిని వర్ణించాడు. పేస్ రాయలను స్వయంగా చూసిన వ్యక్తి. రాయలు అంత పొడుగరి కాదు, అంత పొట్టి గాదు

నిండుగా బొద్దుగా ఉంటాడు. తెల్లవారుజామున లేచి వంటికి నూనె రాసుకొని అది ఆవిరి అయ్యేదాకా వ్యాయామం చేస్తాడని, కత్తిసాముగరిడీలు కూడా చేస్తాడని రాశాడు. ఇంకా గుర్రపు స్వారీలో గొప్ప నేర్పుగలవాడు, ముఖం మీద మచ్చలు ఉండేవి. ఉత్సాహవంతుడు, ఎల్లప్పుడూ చిరునవ్వుతో ఉండేవాడు విదేశీయులను ప్రేమతో ఆదరించేవాడు. అతనితో పరిచయం అయిన వారందరికీ అతని ఉదాత్తత, వర్చస్సు మనస్సులో నిలిచిపోతాయి. మాట్లాడేవారు ఏ స్థితికి చెందిన వారైనా అందరితో మాట్లాడుతాడు వారి విషయాలు తెలుసుకుంటాడు రాజు అంటే ఇలా ఉండాలి అని అనిపించే వ్యక్తి అతడంటే అందరికీ అభిమానం. స్త్రీలకు అతనంటే ఎంతో ఇష్టం. అతడు రూపంలోను, ధైర్య సాహసాలలోను అన్నిటిలోనూ పరిపూర్ణుడే. అతని పేరు చెబితే హిందూదేశంలో రాజులందరికి హడల్ అని వర్ణించాడు. ఇవన్నీ పరిశీలించిన రాయలు గొప్ప అదృష్టశాలి అని వేరే చెప్పనవసరం లేదు. అతని రాకతో విజయనగర సామ్రాజ్య చరిత్ర మహోన్నత శిఖరాలనందుకొని స్వర్ణయుగాన్ని సృష్టించింది.

శ్రీకృష్ణదేవరాయల చరిత్రను తెలుసుకోడానికి కోకొల్లలుగా ఆధారాలు లభించాయి. సమకాలీన దేశీయ, విదేశీయ రచనలు, శాసనాలు, కైఫీయత్తులు, చాటువులు ఎంతో సమాచారాన్ని ఇచ్చాయి. పోర్చుగీసు, ముస్లిం రచనలు కూడా గొప్ప సమాచారాన్ని అందిస్తున్నాయి. సంస్కృత కావ్యాలైన అచ్యుతరామాభ్యుదయం, సంగీత సూర్యోదయాలు, రాయల కళింగ దండయాత్ర కలుబరిగె దండయాత్ర, ఎదులఖాన్‌పై విజయాన్ని తెలుపుతున్నాయి తెలుగు కావ్యాలైన మనుచరిత్ర, పారిజాతాపహరణం, ఆముక్తమాల్యద, కుమార ధూర్జటి కృష్ణరాయ విజయం, రాయవాచకాలు అనేక చారిత్రాకాంశాలను చెబుతున్నాయి. తారకీపరిస్తా, బుర్హన్-ఇ-మఅంసేర్, తారీఖ్-ఇ-మహమ్మద్ కులీ కుతుబ్‌షాహి గ్రంధాలు బహమనీ విజయనగర సంబంధాలు కృష్ణరాయలు గోల్కొండ రాజ్యస్థాపకుడైన కులీకుతుబ్‌షాకు జరిగిన యుద్ధాలను తెలుపుతున్నాయి పోర్చుగీసు యాత్రికులు తాము చూసినవి, విన్న వాటిని గ్రంధస్తం చేశారు వారు రాసిన వాటిలో కామెంటరీస్ ఆఫ్ ద గ్రేట్ అషాం షో, అల్ఫకర్కు దురాతి బార్బొసా రచించిన ఈస్ట్ ఆఫ్రికా అండ్ మలబార్, క్రానికల్ ఆఫ్ దామింగోపేస్, క్రానికల్ ఆఫ్ ఫెర్నాబన్ న్యూనిజ్ అతి ముఖ్యమైనవి. ఇతర ఆధారాలలో లేని నూతన విషయాలు వీటిలో ఉన్నాయి. ముఖ్యంగా కృష్ణదేవరాయల ఉమ్మత్తూరు దండయాత్ర, బహమనీ సుల్తాన్‌లతో జరిగిన యుద్ధాలలో నూతన విషయాలను తెలియజేస్తున్నాయి. బార్బొసా సామాన్య ప్రజల స్థితిగతులు ఆచార వ్యవహారాల గురించి ఎక్కువగా రాశాడు దామింగో పేస్ కృష్ణదేవరాయల వ్యక్తిగత విషయాలను గురించి రాశాడు. న్యూనిజ్ విజయనగర రాజ్యస్థాపనా కాలం నుండి అచ్యుత దేవరాయల కాలం వరకు రచించాడు పేస్, న్యూనిజ్ రచనలు సమకాలీనమైనవి. లింగన రచించిన కన్నడ చంపూకావ్యం కెళదినృపవిజయం మాలెనాడు ప్రాంత విశేషాలను తెలుపుతోంది. ఇంకా స్థానిక గాధలు, చాటువులు కూడా కృష్ణరాయల కాలం నాటి విశేషాలను తెలుపుతోంది రాయలు బీదరు లేక బెదర కోటను జయించినట్లు అల్లసాని పెద్దన చాటువు తెలుపుతోంది. బీదరు కోట విజయాన్ని తెలిపే మరే ఆధారం లేదు. ఈ చాటువు ఒక్కటే ఆ విషయాన్ని తెలియజేస్తోంది. కైఫీయత్తులు గ్రామ కవిలెలు కూడా అనేక వివరాలను ఇస్తున్నాయి. 1511 నాటి నెర్లకరె తామ్రశాసనం కృష్ణరాయలు చంద్రవంశానికి చెందిన మర్త్యుని సంతతికి చెందిన క్షత్రియుడని చెబుతోంది. ఈ శాసనంలో ఇవ్వబడిన వారి వంశవృక్షం కొద్ది తేడాలతో ఆనాటి సంస్కృత, ఆంధ్ర గ్రంధాలలో ఇవ్వబడిన వారి వంశవృక్షంతో సరిపోతోంది. నందిమల్లయ్య, ఘంట సింగయ్యలు రాసిన వరాహపురాణ పీఠికలో తుళువ వంశానికి మూలపురుషుడైన తిమ్మధాత్రి రమణుడు తుళుదేశస్తుడని స్పష్టంగా పేర్కొనబడినది. కొందరు పండితులు తుళువ వంశస్తులు శూద్రులని భావిస్తారు. వెంకటరమణయ్య వారు క్షత్రియులనే భావించారు. కృష్ణరాయల తల్లి కులకాంత కాదని, భోగకాంత అని కనుక రాయలు శూద్రుడని వీరేశలింగం పంతులు మొదలైన కొందరు భావించారు. కాని శాసనాలు, రాయవాచకం, న్యూనిజ్ రచనలు నాగాంబిక నరసనాయకుని దేవేరి అని చెబుతున్నాయి. కృష్ణరాయలు జన్మించిన సంవత్సరాన్ని గురించి కూడా భేదాభిప్రాయాలున్నాయి. అతడు క్రీ.శ.1465లో జన్మించాడని కొందరు, 1478లో జన్మించాడని మరికొందరు, 1484 అని మరికొందరు, వెంకటరమణయ్య 1466లో జన్మించాడని, ఓరుగంటి రామచంద్రయ్య 1487 ఫిబ్రవరి 16వ తేదీన జన్మించాడని నిర్ణయించారు. రాయలు ఆంధ్రుడని వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు. కాని అది వాస్తవం కాదు. రాయలు కన్నడిగుడే. ఆముక్తమాల్యదలో తనను కర్ణాటక రాయా అని తెలుంగు రాయుడయిన శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు సంబోధించాడని స్వయంగా చెప్పుకున్నాడు. పట్టాభిషేకానికి ముందు రాయలు చంద్రగిరి, పెనుగొండ దుర్గపాలకుడిగా పని చేశాడని కొందరు భావించారు.

కాని అతడు విజయనగరంలో ఉండి అన్న వీరనరసింహరాయలకు పరిపాలనలో సహాయపడుతుండేవాడని కొంగుదేశ రాజాక్కళి చెబుతోంది. కృష్ణరాయల రాజ్యాభిషేకాన్ని గురించి కూడా కథలు ప్రచారంలో ఉన్నాయి చిన్న వయస్సులోనే కృష్ణరాయలు ప్రదర్శించిన సామర్థ్యాలకు అచ్చెరువంది వీర నరసింహరాయలు అతనిని చంప ప్రయత్నించాడని గాధలు ప్రచారంలో ఉన్నాయి. తన తర్వాత తన 8 సంవత్సరాల కుమారుడు సింహాసనం అధిష్ఠించాలని, అందుకు కృష్ణరాయలు అడ్డు అని, అతని గుడ్లు పీకించమని తన మంత్రి తిమ్మరుసును వీర నరసింహ రాయలు తన మరణ కాలంలో కోరాడని, తిమ్మరుసు ఆడ మేక కళ్లు పీకించి చూపి వీర నరసింహ రాయలను తృప్తి పరచాడని, తర్వాత వీర నరసింహరాయలు మరణించాడని న్యూనిజ్ రాశాడు. వీర నరసింహ రాయలే స్వయంగా తన రాజముద్రికను తమ్ముడు కృష్ణరాయలకందించి పట్టాభిషేకం జరిపించమని తన దళ నాయకులను కోరాడని రాయవాచకం చెబుతోంది. శాసనాలు రాయవాచకాన్ని బలపరుస్తున్నాయి. కౌసల్యా సుమిత్రలకు రామలక్ష్మణులు ఉదయించినట్లు తిప్పాంబ, నాగలాంబికకు వీరనరసింహరాయలు, కృష్ణదేవరాయలు జన్మించారని వీరనరసింహరాయలు శాసనాలు వర్ణిస్తున్నాయి. వీరనరసింహరాయలు కృష్ణదేవరాయల తల్లి నాగాంబికను ఎంతో గౌరవించినట్లు ఈ శాసనాలు రుజువు చేస్తున్నాయి. అంతేగాక వీరనరసింహరాయలు దక్షిణ దండయాత్రకు వెళ్లినప్పుడు రాజధాని రక్షణ శ్రీకృష్ణదేవరాయలకు అప్పగించాడు. కనుక వారిద్దరి మధ్య తత్సంబంధాలున్నాయని వీరనరసింహరాయలే కృష్ణరాయలను వారసునిగా ప్రకటించాడని చెబుతున్న రాయవాచక కధనమే వాస్తవంగా కన్పిస్తోంది. వీరనరసింహరాయల అభీష్టానికి వ్యతిరేకంగా తిమ్మరుసు కృష్ణరాయలని సింహాసనాధీశుని చేశాడని న్యూనిజ్ రాశాడు కనుక తర్వాత రాయలు తిమ్మరుసును తన ప్రధాన మంత్రిగా నియమించుకొని అభిమానంతో అప్పాజీ అని పిలిచాడు, కనుక న్యూనిజ్ రాతలను కొట్టి పారేయడానికి వీలు లేదని బి.యస్.యల్.హనుమంతరావు మొదలైన పండితులు అభిప్రాయపడ్డారు. కృష్ణదేవరాయలు ఎప్పుడు పట్టాభిషిక్తుడు అయినదీ కూడా స్పష్టంగా తెలియదు. క్రీ.శ.1509 జూలై 22 వరకు వీరనరసింహరాయలు పాలించినట్లు శాసనాధారం ఉంది. కృష్ణదేవరాయల తొలి శాసనం క్రీ.శ.1509 జూలై 26వ తేదీకి చెందింది లభించింది. రెండవ వెంకటపతిరాయలు తన రెవిన్యూ ఉద్యోగుల చేత తయారు చేయించిన నివేదిక కృష్ణరాయలు క్రీ.శ.సంవత్సరం 1432 శుక్ల సంవత్సర జయంతి రోజున పట్టాభిషిక్తుడయ్యాడని పేర్కొంది. కనుక 1509 జూలై 22వ తేదీన రాజుగా ప్రకటింపబడి 1509 ఆగస్టు 8వ తేదీన పట్టాభిషేకం జరిగి ఉంటుంది. పట్టాభిషేక కాలంలో రాయలు పంపావతి దేవాలయ ముఖద్వారంపై పెద్ద గోపురాన్ని నిర్మించాడని హంపి శాసనం చెబుతోంది. పట్టాభిషేక కాలంలో అతని మారు తమ్ముడు అచ్యుతదేవరాయలు, వీరనరసింహరాయల అనుచరులు కృష్ణరాయలు సింహాసనమధిష్టించడం సహించలేక ఘర్షణకు సిద్ధపడ్డారు. వారిని తిమ్మరుసు బంధించాడు. తర్వాత కృష్ణరాయలు వారి వల్ల తనకు ఇబ్బంది కలుగకుండా ఉండటానికి రంగరాయలు, అచ్యుతరాయలు, వీరనరసింహరాయల కుమారుని, ఇతర దాయాదులను రాజధానికి 250 మైళ్ల దూరంలో ఉన్న చంద్రగిరికి బందీలుగా పంపాడని న్యూనిజ్ రాశాడు. కాని వారికి ఎలాంటి హాని చేయలేదు. తర్వాత సింహాసనం అధిష్ఠించడంలో తనకు సహాయం చేసిన సాళువ తిమ్మరుసును తన ప్రధానమంత్రిగా నియమించాడు. దాంతో తిమ్మరుసు స్థానం పటిష్టమైంది. తిమ్మరుసు మీద గౌరవం వల్ల రాయలు అతనిని అప్పాజీ అని పిలిచేవాడు. తిమ్మరుసు మహామేధావి, అతని సలహాలతో రాయలు తన వ్యూహరచన చేసేవాడు.

రాయలు సింహాసనానికి వచ్చిన కాలంలో సామ్రాజ్య పరిస్థితి: కృష్ణరాయలు సింహాసనానికి వచ్చే నాటికి సామ్రాజ్యపు పరిస్థితి అల్లకల్లోలంగా ఉంది. వీరనరసింహరాయలు పాలించిన 5 సంవత్సరాలు తిరుగుబాట్లను అణచడంలోనే సరిపోయింది. కాని అన్ని తిరుగుబాట్లు అణిగిపోలేదు. ముఖ్యంగా ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణ పాలెగాండ్రు, బంకాపూరు, గార్సొప్పా, భట్కల్, బారాకూర్ రాజులు ఇంకా తిరుగుబాటు ధోరణిలోనే ఉన్నారు. ఉమ్మత్తూరు గంగరాజు పెనుగొండ రాజుగా కూడా ప్రకటించుకున్నాడు. అంతేగాక విజయనగర సింహాసనంపై తనకు హక్కు ఉందని కూడా వాదించసాగాడు. బహమనీ రాజ్యం ముక్కలయ్యే దశలో ఉన్నా ఉత్తర సరిహద్దు భద్రంగా లేదు. బీజాపూర్ పాలకుడు యూసఫ్ ఆదిల్‌ఖాన్ రాయచూరు, అంతర్వేదిలను ఆక్రమించుకొని ఉన్నాడు. గోవా, బెల్గాంలు కూడా అతని ఆధీనంలోనే ఉన్నాయి. బహమనీ సుల్తాన్ రెండవ ముహమ్మద్‌షా విజయనగరం జీహాద్ ప్రకటించి ఉన్నాడు. తూర్పు వైపున గజపతి విజయనగరంపై దాడి చేసే ఉద్దేశ్యంతో ఉన్నాడు. పశ్చిమ కోస్తాలో పోర్చుగీసు వారి బలం పెరుగుతోంది. వారు భట్కల్, హెనోవర్ ప్రభువుల అధికారం ధిక్కరించారు.

కాలికట్ పాలకుడు జామొరిన్‌తో యుద్ధానికి దిగారు. వారు అప్పటికే కొచ్చిన్, కాననూర్‌లలో కోటలు నిర్మించి ఉన్నారు. విజయనగర రాజ్యంతో స్నేహ సంబంధాలను పెంచుకోవాలని చూస్తున్నారు. కాని అప్పుడప్పుడు విరోధం ప్రకటిస్తున్నారు. జామొరిన్‌ను, బీజాపూర్ యూసఫ్ ఆదిల్‌ఖాన్‌ను ఓడించి బీజాపూరు రాజ్యంలోని గోవాను ఆక్రమించాలని నాటి గవర్నర్ అల్బుకర్క్ ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇలాంటి స్థితిలో తన 22వ ఏట రాయలు రాజ్యానికి వచ్చాడు. రాయలు గొప్ప రాజనీతి పారంగతుడు. అతడు శత్రువుల బలాన్ని తక్కువగా అంచనా వేయలేదు. ఆదాయపట్టీలు తనిఖీ చేసి సామంతుల వద్ద నుండి కప్పాలు వసూలు చేశాడు. అన్ని జాగ్రత్తలు తీసుకొని ముందుకు అడుగు వేశాడు. నవీన ఆయుధాలను సమకూర్చుకున్నాడు. 7 లక్షల పదాతి దళాన్ని, 82000 అశ్విక దళాన్ని, 551 గజదళాన్ని సమీకరించి దిగ్విజయయాత్రకు పూనుకున్నాడు.

గజపతి-బహమనీలతో యుద్ధాలు క్రీ.శ.1509-1510: కృష్ణరాయలు రాజ్యానికి వచ్చినప్పుడు ఉన్న అనిశ్చిత పరిస్థితులను అవకాశంగా తీసుకొని గజపతి, బహమనీ సుల్తాన్‌లు ఏక కాలంలో విజయనగర రాజ్యంపై దండెత్తారు. బహమనీ సుల్తాన్ రెండవ ముహమ్మద్‌షా ఏకంగా విజయనగరంపై జీహాద్‌ను ప్రకటించారు. క్రీ.శ.1510 జనవరి 28వ తేదీన వేయించిన హంపి శాసనం కృష్ణరాయలు గజపతి, సుల్తాన్‌లపై సాధించిన విజయాలను పేర్కొంది. ఈ శాసనాన్ని బట్టి క్రీ.శ.1510 జనవరి లోపలనే ఈ యుద్ధాలు జరిగి ఉండాలి. అంటే రాయలు రాజ్యానికి రాగానే వారు దండెత్తి ఉండాలి. కనుక ఈ యుద్ధాలు క్రీ.శ.1509లోనే జరిగి ఉండవచ్చును. అయితే గజపతిలో రాయలు పోరాడిన వివరాలు తెలియదు కాని అదే శాసనంలో గజపతి గజకూట పాకసేన అని వర్ణించబడింది. కనుక 1509లో గజపతిని కృష్ణరాయలు ఓడించి ఉండవచ్చని భావింపబడింది. జయానందుని చైతనమంగళం, చైతన్య భాగవత గ్రంధాలు ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ.1510లో విజయనగరంపై దండెత్తాడని తెలుపుతున్నాయి. చైతన్య భగవానుడు పూరీ వచ్చినప్పుడు ప్రతాపరుద్ర గజపతి దక్షిణదేశ దండయాత్రలలో ఉన్నందువల్ల కలుసుకోలేకపోయాడని స్పష్టంగా తెలుపుతోంది. అందులో వర్ణించిన దక్షిణదేశ దండయాత్ర విజయనగరంపై జరిపిన దాడి అని భావింపబడింది. ఈ ఓటమి తర్వాత ప్రతాపరుద్ర గజపతి తెలంగాణపై దండెత్తి క్రీ.శ.1510 నాటికి తెలంగాణలో చాలా భాగాన్ని జయించినట్లు ఉండ్రకొండ శాసనం తెలుపుతోంది. తెలంగాణలో చితాబ్‌ఖాన్ అనే గజపతి సామంతుడు ప్రబలుడయ్యాడు. అతని పుట్టుపూర్వోత్తరాలు తెలియవు. అతడు పురుషోత్తమ గజపతి సామంతుడని రాయవాచకం చెబుతోంది. అతని సహాయంతో క్రీ.శ.1510 నాటికి ఓరుగల్లుతో సహా తెలంగాణ మొత్తం గజపతి తన సామ్రాజ్యంలో చేర్చగలిగాడు. కనుక గజపతి 1509లో కృష్ణరాయలతో పోరాడి ఓడి తెలంగాణపై తన దృష్టిని సారించి ఉండవచ్చును.

దివానీ యుద్ధం క్రీ.శ.1509-1510: విజయనగరంపై జీహాద్‌ను ప్రకటించిన రెండవ ముహమ్మద్‌షా తన సామంతులైన బీజాపూరు అహమ్మద్‌నగర్ గోల్కొండ పాలకులను కలుపుకొని పెద్ద సేనతో విజయనగర రాజ్యంపై దండెత్తి విజయనగర సరిహద్దులలో "దోని" అనే ప్రదేశం చేరాడు. ఈ యుద్ధంలో సుల్తాన్‌తో మాలిక్ అహమ్మద్ బహ్రి, కుతుబ్ ఉల్ ముల్క్, నూరిఖాన్ ఖ్వాజా-ఇ-జహాన్, కుతుబ్ ఉల్ ముల్క్, ఇమాద్ ఉల్ ముల్క్, యూసఫ్ ఆదిల్‌ఖాన్‌లు కలిసి పోరాడారు. దోని వద్ద రాయలు బహమనీ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. విజయనగర సేనలను రామరాజతిమ్మ నడిపాడు. ఇక్కడ ఉభయ సైన్యాలకు ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో సుల్తాన్ తన గుర్రాలపై నుండి కింద పడి గిట్టల కింద నలిగిపోయే ప్రమాదంలో పడ్డాడు. అంతలో అతని సైనికులు అతనిని రక్షించారు. దాంతో బహమనీ సేన ఓడిపోయి బీజాపూరు వైపు పారిపోయింది. యుద్ధం జరిగిన దోనీ ప్రదేశానికి దేవలి లేక దివానీ అని కూడా పేర్లున్నాయి. కనుక ఈ యుద్ధానికి దివానీ యుద్ధం అని పేరు వచ్చింది.

కోవెలకొండ యుద్ధం: దోని వద్ద ఓడి పారిపోతున్న సైన్యాన్ని విజయనగర సేనలు వెంటపడి తరిమాయి. విజయనగర సేన వారి వెంటపడి కోవెలకొండ వరకు చేరాయి. ఓడి పారిపోతున్న బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్ వెనుదిరిగి నిలబడి విజయనగర సేనలను అటకాయించాడు. అందువల్ల కోవెలకొండ వద్ద బీజాపూరు సేనలకు, విజయనగర సేనలకు మళ్లీ యుద్ధం జరిగినది. ఆ యుద్ధంలో విజయనగర సేనలు బీజాపూరు సేనలను ఓడించడమే గాక యూసఫ్ ఆదిల్‌ఖాన్‌ను కూడా వధించాయి. అతనితో పాటు పాల్గొన్న అహమ్మద్ ఇబ్రహీమ్, నిజాం-ఉల్-ముల్క్ కూడా మరణించాడు. అతడు అలీహిజ్రా 916లో అంటే 1510లో మరణించినట్లు రాయబడింది. కనుక దివాని కోవెలకొండ యుద్ధం రాయలు పట్టాభిషేకం జరిగిన 1509 ఆగస్టు 8వ తేదీ, హంపీ శాసనం వేయించిన 1510 జనవరి 28వ తేదీల మధ్య జరిగి ఉండాలని నిర్ణయించారు. దివానీ, కోవెలకొండ

విజయాలు సాధించిన తర్వాత కృష్ణరాయలు రాజధానికి తిరిగి వచ్చి తన విజయసూచకంగా క్రీ.శ.1510 జనవరి 28వ తేదీన హంపి శాసనం వేయించాడు. హంపి శాసనం రాయలను పరిభూత సురత్రాణ అని వర్ణించినది నేలటూరి వెంకటరమణయ్య ఓరుగంటి రామచంద్రయ్య 1510 జనవరికి ముందే ఈ విజయాలు సాధించాడని అంగీకరిస్తూ సురత్రాణ అనేది బహమనీ సుల్తాన్ ముహమ్మద్‌ను ఓడించినందుకు ధరించాడని వెంకటరమణయ్య అంటే, కాదు బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్‌పై సాధించిన విజయానికి చిహ్నం అని రామచంద్రయ్య అన్నారు. అప్పటికి బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నం కాలేదు. గనుక అది బహమనీ సుల్తాన్‌ను ఓడించినందువల్లనే ధరించాడని భావించడం సమంజసంగా ఉంటుంది.

పోర్చుగీసు వారితో సంబంధాలు: పోర్చుగీసు వారి రచనల ప్రకారం పోర్చుగీసు రాయబారులు రెండు పర్యాయాలు కృష్ణరాయలను దర్శించారని చెబుతున్నాయి. రాయలు సింహాసనానికి వచ్చిన రోజులలో ఆల్మెడా పోర్చుగీసు వారి గవర్నర్‌గా ఉన్నాడు. అతడు విజయనగరంతో స్నేహ సంబంధాలు పెట్టుకుంటే తమకు లాభసాటిగా ఉంటుందని గ్రహించి వీరనరసింహరాయలను భట్కల్‌లో కోట నిర్మించుకోడానికి అనుమతి అడిగాడు. కాని అతడు ఇవ్వలేదు. తర్వాత కొద్ది రోజులకే అంటే 1509 చివరలో ఆల్బుకర్క్ పోర్చుగీసు గవర్నర్ అయ్యాడు. అతడు కళ్లికోట రాజు జామొరిన్‌తో పోరాడి ఓడిపోయాడు. అలాంటి స్థితిలో విజయనగర రాజుల సహాయం ఉంటే తమకు విజయాలు సిద్ధిస్తాయని లూయిస్ అనే రాయబారిని విజయనగరం పంపాడు.

క్రీ.శ.1506లో కళ్లికోట రాజు జామొరిన్‌కు చెందిన చిన్న చిన్న పడవలను ధ్వంసం చేశారు. కాననూరులో కూడా పోర్చుగీసు వారు అలాంటి విధ్వంసానికి పూనుకున్నారు. అందువల్ల కాననూరు రాజు పోర్చుగీసు వారి ఫ్యాక్టరీని నాశనం చేశాడు. ఆ క్లిష్ట పరిస్థితులలో Tristanda Cunha మరొక పోర్చుగీసు నౌకాదళంతో వచ్చి వారిని కాపాడారు. 1507లో Cunha, Alemedia లు కలిసి మళ్లీ కళ్లికోట రాజుపై దండెత్తారు. అదే సమయంలో ఆల్బుకర్క్ పర్షియన్ గల్ఫ్‌లో మూరులతో యుద్ధాలు చేశాడు. 1509 చివరలో ఆల్బుకర్క్ పోర్చుగీసు గవర్నర్ అయ్యాడు.

అతని కాలంలో అరబ్బు వర్తకులను పూర్తిగా పారదోలి పశ్చిమతీర వ్యాపారం అంతా తమ చేతుల్లోకి తీసుకోవాలని ప్రయత్నించాడు. అరబ్బు వర్తకులకు కళ్లికోట రాజు జామొరిన్ అండగా నిలిచాడు. ఈజిప్టు సుల్తాన్ నుండి కూడా అరబ్బులకు సైనిక సహాయం వచ్చింది. కళ్లికోట ఈజిప్టు సంయుక్త సైన్యాన్ని ఆల్మెడా క్రీ.శ.1509 ఫిబ్రవరి 3వ తేదీన ఓడించాడు. దాంతో పశ్చిమతీరంలోని వ్యాపారం, ముఖ్యంగా గుర్రాల వ్యాపారం పోర్చుగీసు వారి గుత్త వ్యాపారంగా మారింది. సముద్రాధిపత్యం వారి పరమైంది. అరబ్బు వ్యాపారులు బహమనీ రాజ్యానికి గుర్రాలను సరఫరా చేయలేకపోయారు. కనుక బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్ కళ్లికోట జామొరిన్‌తో కలిసి కూటమిగా ఏర్పడ్డారు. వారు పోర్చుగీసు వారి సముద్రాధిపత్యాన్ని నాశనం చేయాలని సంకల్పించారు. ఈ స్థితిలో 1509 చివరలో ఆల్బుకర్క్ ఆల్మెడియా స్థానంలో పోర్చుగీసు గవర్నర్ అయ్యాడు. అతడు జామొరిన్ బీజాపూర్ సుల్తాన్‌ల కూటమిపై యుద్ధం ప్రకటించాడు. కాని జామొరిన్ అతనిని ఓడించాడు. యుద్ధభూమిలో ఆల్బుకర్క్ గాయపడ్డాడు. పోర్చుగీసు సైనికులు వెంటనే అతనిని రక్షించారు. ఈ ఓటమి తర్వాత ఆల్బుకర్క్ విజయనగర సహాయం అర్థించాలని లూయిస్ ఫ్రెయిర్‌ను (ఇతనిని లూయిస్ ఫ్రాన్సిస్ అని కూడా పేరుంది) క్రీ.శ.1510 ఫిబ్రవరిలో పోర్చుగీసు రాయబారిగా విజయనగరం పంపాడు. నరసింగ రాజ్యం జామొరిన్‌కు వ్యతిరేకంగా తమకు యుద్ధంలో సహాయపడాలని అర్థించాడు. ఆ రోజులలో పోర్చుగీసు వారు విజయనగర రాజ్యాన్ని నరసింగరాజు రాజ్యం అని పిలిచేవారు. సాళువ నరసింహరాయల కాలం నుండి అలా పిలిచారు. తమ రాజు మూరులను జయించమన్నాడని విజయనగర సేన భూయుద్ధంలో జామొరిన్‌పై దండెత్తితే పోర్చుగీసు వారు నౌకా యుద్ధం ద్వారా జామొరిన్ రాజ్యంపై దాడి చేస్తామని, కళ్లికోట రాజును ఓడించిన తర్వాత విజయనగర రాజ్యం తమ శత్రువులైన దక్కనులోని మూరులతో చేసే యుద్ధాలలో పోర్చుగీసువారు సహాయం చేస్తారని, అంతేగాక తాము విదేశాల నుండి తెచ్చే గుర్రాలను అన్నింటిని విజయనగర రాజ్యానికే అమ్ముతామని, బహమనీ రాజ్యానికి ఒక్క అశ్వాన్ని కూడా అమ్మమని కూడా వాగ్దానం చేశారు. ఆనాడు పోర్చుగీసువారు ముస్లింలను మూరులని పిలిచేవారు. కాని జామొరిన్ తనకు విరోధి కాదని, అతనిపై తాను దండెత్తవలసిన అవసరం లేదని కృష్ణరాయలు పోర్చుగీసు వారికి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దాంతో వారి మొదటి రాయబారం విఫలం అయింది. విజయనగర సహాయం లేకపోయినా ఆల్బుకర్క్ బీజాపూరు రాజ్యానికి చెందిన గోవాపై దండెత్తి

క్రీ.శ.1510 మార్చి 1వ తేదీన ఆక్రమించాడు. వెంటనే గాస్పర్ చనోకా అనేవాడితో రెండవ రాయబారం పంపి భట్కల్‌లో కోటను నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వవలసిందిగా కోరాడు. కాని రాయలు అంగీకరించలేదు. కాని వారు గోవాను జయించినందుకు అల్బుకర్కుకు అభినందనలు తెలపడానికి ఒక విజయనగర రాయబారిని గోవా పంపాడు. ప్రస్తుతం బహమనీలతో తనకు సంధి ఉందని, భవిష్యత్తులో పోర్చుగీసు వారికి సహాయం చేస్తామని కూడా వాగ్దానం చేశాడు. కాని ఏమీ చెయ్యలేదు. ఇది జరిగిన తర్వాత 1510 మే నెలలో బీజాపూరు సుల్తాన్ గోవాను తిరిగి జయించడానికి తన సైన్యాలను పంపాడు. ఆ సైన్యం అల్బుకర్కును ఓడించింది. గోవాను వదిలిపోతూ పోర్చుగీసు వారు అక్కడ నివసించిన 50 401 మంది ముస్లిం పెద్దలను వారి భార్యా బిడ్డలను వధించి వెళ్లిపోయారు. అదే సంవత్సరంలో నవంబర్ నెలలో బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా తన రాజ్యంలో కొన్ని ఇబ్బందులనెదుర్కొన్నాడు. దానిని అవకాశంగా తీసుకొని అల్బుకర్కు గోవాపై దండెత్తి బీజాపూరు ప్రతినిధి రసూల్‌ఖాన్‌ను ఓడించి తరిమి 1510 డిసెంబర్ 1వ తేదీన మళ్లీ గోవాను ఆక్రమించాడు. తర్వాత బీజాపూరు మంత్రి కమాల్‌ఖాన్ పోర్చుగీసు వారికి గోవాను వదిలివేశాడని పెరిష్టా రాశాడు. కాని రసూల్‌ఖాన్ తిరిగి మరోసారి గోవాను జయించాలని ప్రయత్నించాడు, కాని విఫలుడయ్యాడు. దాంతో గోవా శాశ్వతంగా పోర్చుగీసు వారి స్థావరం అయిపోయింది. ఈ వార్త తెలిసి కృష్ణరాయలు అల్బుకర్కుకు అభినందనలు తెలుపుతూ గోవాకు తన రాయబారిని పంపాడు. ఆ సమయంలో లూయిస్ ఫ్రెయిర్ విజయనగరంలో ఉన్నాడు. అతడు అల్బుకర్కుకు ఉత్తరం రాస్తూ రాయలు మనకు ఏమీ చేయలేదు. కనుక జాగ్రత్తగా ఉండాలని రాశాడు. లూయిస్ ఆనాటి విజయనగర పరిస్థితులను రాస్తూ రాయలు దక్షిణదేశంలో ఒక సామంతునిపైకి దండయాత్రకు బయల్దేరుతున్నాడని రాశాడు. ఈ దండయాత్ర ఉమ్మత్తూరు గంగరాజుపై జరిపిన దండయాత్ర. గోవా విజయం తర్వాత బంకాపూరు రాజు కూడా అల్బుకర్కుని అభినందిస్తూ దూతలను పంపి తనకు సాలుకు 300 గుర్రాలను సరఫరా చేయమని కోరాడు. బంకాపూరు విజయనగరం, భట్కల్‌లకు వెళ్లే మార్గంలో ఉంది. దానిని ఆనాడు వెంగపోర్ అనే రాజు పాలిస్తూ ఉన్నాడు. అతనిని న్యూనిజ్ Guym de Bengapor అని రాశాడు. అల్బుకర్కు అతడు స్వతంత్రుడని భావించాడు. కాని బంకాపూర్ రాజ్యం విజయనగర సామ్రాజ్యపు సామంతరాజ్యం. క్రీ.శ.848 నుండి క్రీ.శ.1573 వరకు హిందూ రాజులు పాలించేవారు. క్రీ.శ.1573లో అలీ ఆదిల్‌షా జయించి అక్కడి దేవాలయాన్ని ధ్వంసం చేసి దానిపై స్వయంగా మసీదును నిర్మించాడని పెరిష్టా రాశాడు. పెరిష్టా దానిని బీకాపూర్ అని పేర్కొన్నాడు. గోవా ఒకప్పుడు విజయనగర రాజులదే. విరూపాక్షరాయల కాలంలో బహమనీ సుల్తాన్ మంత్రి గవాన్ జయించాడు. కృష్ణరాయలు దానిని జయించదలచుకోలేదు. పశ్చిమతీరంలో ఒక విదేశీ స్థావరం ఉన్నందువల్ల నష్టమేమీలేదని భావించాడు. పైగా వారు అరబ్బు ఈజిప్టుల నుండి మేలుజాతి గుర్రాలను తెచ్చి తమకు అమ్ముతామంటున్నారు. ఫిరంగులు మొదలైన నవీన ఆయుధాలు కూడా ఇస్తామంటున్నారు. కనుక వారితో స్నేహం చేయడం మంచిదని తీర్మానించుకొని చివరకు వారికి తన స్నేహహస్తం అందించాడు. క్రీ.శ.1514లో రాయలకు, అల్బుకర్కుకు సంధి కుదిరింది. సాలుకు రాయలు 20000 క్రూజడాస్ ఇస్తానన్నాడు. కాని అల్బుకర్కు 30000 Cruzados రాయలను పోర్చుగీసు వారికి చెల్లించవలసిందిగా కోరాడు. అందుకు రాయలు అంగీకరించాడు. దాంతో పోర్చుగీసు వారు అశ్వాలను విజయనగరానికి సరఫరా చేసేటట్లు ఒప్పందం కుదిరింది. అంతేగాక బహమనీలతో రాయలు చేసే యుద్ధాలలో కూడా పోర్చుగీసు వారు సహాయంగా పాల్గొంటారని, కాని వారికి అయ్యే ఖర్చును భరించాలని షరతు పెట్టారు. దానికి రాయలు అంగీకరించాడు. తర్వాత అల్బుకర్కు గోవా పరిసర ప్రాంతాలను పోర్చుగీసు వారికి బీజాపూరు సుల్తాన్ ఇవ్వకపోతే, పోర్చుగీసువారు సుల్తాన్‌కు అశ్వాలు సరఫరా చేసేది లేదని రాశాడు. విజయనగరంతో సంధి కుదిరింది కనుక బీజాపూరు సుల్తాన్‌తో అల్బుకర్కు ఈ విధంగా సంబంధాలను రద్దు చేసుకున్నాడు. రాయలకు, పోర్చుగీసు వారికి కుదిరిన ఒప్పందం చాలా కాలం కొనసాగింది. తళ్లికోట యుద్ధం దాకా విజయనగర రాజులతో పోర్చుగీసు వారి సంబంధాలు కొనసాగాయి. కృష్ణదేవరాయల కాలం క్రీ.శ.1520-22 సంవత్సరాల మధ్య బీజాపూరు సుల్తాన్‌తో జరిగిన రాయచూరు యుద్ధంలో తమ షరతు ప్రకారం పోర్చుగీసు వారు రాయల తరఫున పోరాడారు. Christovao de Frguevudo తన శతఘ్నిదళంతో రాయచూరు కోట గోడలను కూల్చి రాయలకు రాయచూరు కోట వశం అయ్యేవిధంగా సహాయపడ్డాడు. తర్వాత Ruy de Mello గోవా పరిసర ప్రాంతాలను ఆక్రమించాడు. ఇంచుమించు ఇదే కాలంలో విజయనగరంలో ఉన్న పోర్చుగీసు రాయబారి లూయిస్ ఫ్రెయిర్‌ను ఎవరో హత్య

చేశారు. దాని వల్ల విజయనగరానికి, పోర్చుగీసు వారికి విరోధం వస్తుందని ఆశించారు. కాని వారి మధ్య సంబంధాలు చెడిపోలేదు. వారి సంధి కొనసాగింది.

బహమనీలతో రెండవ యుద్ధం-గుల్బర్గా విజయం: యూసఫ్ ఆదిల్‌ఖాన్ మరణంతో బహమనీ రాజ్యం మరింత అల్లకల్లోలానికి గురైంది. అతని మరణానంతరం అతని కుమారుడు ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ బీజాపూరు గద్దెనెక్కాడు. అతడు చిన్నవాడైనందున అతని తండ్రికి నమ్మకస్తుడైన కమాల్‌ఖాన్ అనే సరదారు ఇస్మాయిల్‌కు సంరక్షకునిగా నియమింపబడ్డాడు. కాని అతడు స్వార్థపరుడు. అతనికి తనను సుల్తాన్‌గా ప్రకటించుకోవాలని కోరిక లోపల ఉంది. రాజ్య విస్తరణ నెపంతో అతడు గుల్బర్గాపై దండెత్తి అక్కడ పాలిస్తున్న మాలిక్ దస్తూర్ దీనార్ అనే సరదారుని ఓడించి గుల్బర్గాను ఆక్రమించాడు. ఓడిపోయిన దస్తూర్ దీనార్ బీదరుకు వెళ్లి బరిద్-ఇ-మామూలిక్ అనే సర్దారుని కలిశాడు. అతడు సుల్తాన్ మామూద్‌ను ఒప్పించి దీనార్‌కు సహాయంగా పెద్ద సేనను కమాల్ ఖాన్‌ను ఓడించడానికి పంపాడు. కమాల్‌ఖాన్ ఆ సేనను కూడా ఓడించి బీదరుపై దండెత్తాడు. అక్కడ అతడు బరీద్‌ను సుల్తాన్ మమ్మూద్‌ను ఓడించి బీదరు కోటను కూడా స్వాధీనం చేసుకొని సుల్తాన్ మమ్మూద్‌ను బంధించాడు. అతనికి కాపలాగా అజమత్ ఉల్ ముల్క్ అనే బీజాపూరు సరదారుని కాపలా పెట్టాడు. దాంతో గుల్బర్గా, బీదర్, బీజాపూరు రాజ్యాలలో కమాల్‌ఖాన్ తిరుగులేని నాయకుడయ్యాడు. బహమనీ రాజ్యంలో అతని కీర్తి ప్రతిష్ఠలు విపరీతంగా పెరిగాయి. అది సహించని మిగిలిన బహమనీ సరదారులు బరీద్-ఇ-మమూలిక్, మాలిక్ అహమ్మద్ బహ్రీ కుతుబ్ ఉల్ ముల్క్ ఓడిపోయి లొంగిపోయాడు. బీదరు బరీద్-ఇ-మామూలిక్ ఆధిపత్యంలోకి వచ్చింది. తర్వాత బరీద్ కూటమి గుల్బర్గాను కూడా జయించి ఇంకా ముఖ్య కోటలను కొన్నింటిని కూడా ఆక్రమించి బీజాపూరుపై దండెత్తారు. బీదరుసేనలు బీజాపూరు రాజ్యంపై దాడి చేయనున్నాయని ప్రజలు భయపడ్డారు. కొందరు ప్రజలు అల్లర్లకు దిగారు. ముఖ్యంగా బెల్గాంలోని హిందూ ప్రజలు తిరుగుబాటు చేసి తమ నగరాన్ని ఆక్రమించాలని శ్రీకృష్ణదేవరాయలకు కబురు పంపారు. దివానీ కోవెలకొండ యుద్ధాల తర్వాత రాయలు కొన్నాళ్లు విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో తన సేనను పునర్వ్యవస్థీకరించాడు. బెల్గాం ప్రజల కోరిక ప్రకారం రాయలు క్రీ.శ.1510 ఆగస్టులో బీజాపూరు రాజ్యంపై దండెత్తి రాయచూరు, ముద్గల్, అంతర్వేదిని ఆక్రమించాడు. కమాల్‌ఖాన్ రాయలను ఎదిరించలేదు. రాయలకు, పోర్చుగీసు వారికి సంధి కుదిరిందని తెలిసి రాయలను ఎదిరించడం ప్రమాదకరమని భావించాడు. అంతేగాక తాను సుల్తాన్ కావాలని కలలు కంటున్నాడు. ఆ స్థితిలో రాయలతో పోరాడి తన వినాశనాన్ని తెచ్చుకోదలచుకోలేదు. ఈ లోపల ఆలీబరీద్ సేనలు బీజాపూర్‌లో ప్రవేశించాయి. కమాల్‌ఖాన్ బరీదుతో కూడా యుద్ధానికి దిగకుండా ఒప్పందం చేసుకున్నాడు. గుల్బర్గా దుర్గాన్ని అతనికి ఇచ్చి వేశాడు. ఉభయులు తమ ప్రభువులను తొలగించి తాము సుల్తాన్‌లు కావాలని అంగీకారానికి వచ్చారు. దాంతో బరీద్ బీదరు చేరి తన ప్రభువైన రెండవ మమ్మూద్‌ను ఖైదు చేసి అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకున్నాడు. తర్వాత సాగర్‌లో ఒక తిరుగుబాటు జరగగా, దానిని అణచడానికి వెళ్లి అక్కడ తిరుగుబాటును అణచివేశాడు. తనను సుల్తాన్‌గా ప్రకటించుకోవాలని సంతోషంతో బీజాపూరు వచ్చాడు. కాని అతని సంకల్పాన్ని గ్రహించిన బాబూజీఖాన్ అనే సర్దారు కుట్ర చేసి సుల్తాన్ తల్లి సహకారంతో క్రీ.శ.1511 మే నెలలో హత్య చేయించాడు. దాంతో బీజాపూరు కమాల్‌ఖాన్ నుండి విముక్తి చెందింది. సుల్తాన్ ఇస్మాయిల్‌ఖాన్‌కు స్వేచ్ఛ లభించింది. కాని దర్బారులోని కమాల్‌ఖాన్ అనుచరులు కురాసనీటర్కీ సర్దారులు రెండు వర్గాలుగా చీలిపోయి ఒకరితో ఒకరు పోట్లాడుకోసాగారు.

గుల్బర్గా బీదరుల దండయాత్ర క్రీ.శ.1511-12: ఈ పరిస్థితులలో రాయలు క్రీ.శ.1511లో గుల్బర్గాపై దండెత్తాడు. అక్కడ ఆలీబరీద్ సైన్యాలను ఓడించి గుల్బర్గా దుర్గంలో ప్రవేశించాడు. ఈ దండయాత్రలో గుల్బర్గా దుర్గం నేలమట్టం అయిందని చెపుతారు. తర్వాత బీదరుపై దండెత్తి ఆలీబరీద్‌ను పూర్తిగా ఓడించి ఖైదులో ఉన్న సుల్తాన్ మామూద్‌ను సింహాసనంపై ప్రతిష్టించాడు. రాయలు రాజ్యానికి వచ్చిన మూడు సంవత్సరాలలో బహమనీలపై అద్భుత విజయం సాధించాడని వెంకటరమణయ్య వ్యాఖ్యానించారు. ఓరుగంటి రామచంద్రయ్య-సురత్రాణ అనే బిరుదు బహమనీ సుల్తాన్‌ను ఓడించినందుకుగాదు, బీజాపూర్ సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌ఖాన్‌ను ఓడించినందుకు ధరించాడని అన్నారు. కాని ఆయన వ్యాఖ్య సరైనది కాదు. గుల్బర్గాను జయించిన తర్వాతనే ధరించాడు. కనుక అది బహమనీ సుల్తాన్‌ను బందిఖానా నుండి విడుదల చేసి సింహాసనం అధిష్టించేటట్లు చేసినందుకే ధరించాడు. బహమనీ సుల్తాన్ నామమాత్రంగా సింహాసనం మీద ఉన్నట్లయితే సర్దారులు సుల్తాన్‌కు

విధేయులుగా ఉండే విషయంలో పరస్పరం అంతఃకలహాలలో మునిగి ఉంటారని, అందువల్ల బహమనీ రాజ్యం బలహీనపడిపోయి విజయనగర రాజ్యానికి ప్రమాదం తప్పిపోతుందని అవసరమైతే విజయనగర రాజ్యమే బహమనీ రాజ్యంలో జోక్యం కలిగించుకొని శాసించవచ్చని ఆశించి సుల్తాన్‌ను ప్రతిష్ఠించాడు. కాని రాయల ఊహ సరైనది కాదు.

రాజకీయ తప్పిదం: విజయనగర రాజ్యానికి జన్మవిరోధులైన సుల్తాన్‌లను జయించి కూడా వారిని ఎవరి రాజ్యంలో వారినే పునఃప్రతిష్ఠ చేయడం శ్రీకృష్ణదేవరాయ విశాల హృదయానికి నిదర్శనమే గాని రాజనీతిజ్ఞత కాదు. పునఃప్రతిష్ఠ పొందిన ఈ సుల్తాన్‌ల వంశాలు క్రీ.శ.1565 తళ్లికోట యుద్ధంలో విజయనగర సామ్రాజ్యాన్ని ధ్వంసం చేశాయి. ఆనాడు రాయలు ఆ రాజ్యాలను జయించగానే తన సామ్రాజ్యంలో కలిపివేస్తే విజయనగరం సురక్షితంగా ఉండటమే దక్షిణ భారతదేశ చరిత్ర వేరుగా ఉండి ఉండేది. రాయలు సుల్తాన్‌ను పునః ప్రతిష్ఠించినందున అతనికి యవనరాజ్యస్థాపనాచార్య అనే బిరుదు వచ్చింది. అల్లసాని పెద్దన తన మనుచరిత్రలో రాయలను కలుబరిగా కటక క్షితిరక్ష యవనక్షోణీ ధవస్థాపనా అని వర్ణించాడు. బహమనీ రాజ్య రాజధానులైన గుల్బర్గా, బీదరులలో అడుగుపెట్టిన విజయనగర ప్రభువు కృష్ణరాయలు ఒక్కడే. తన ప్రతాపంతో గొప్ప ఘనకార్యాన్ని సాధించి కూడా నిష్ప్రయోజనం చేశాడు.

దక్షిణ దిగ్విజయయాత్రలు క్రీ.శ.1512-1513: బహమనీ రాజ్యాలపై దండయాత్ర సాగించినప్పుడు సర్వశిరః ప్రధాని తిమ్మరుసు తన మంత్రాలోచనతో అమర నాయకులు చెల్లించవలసిన కప్పాలకు బదులు వారు తమ సైన్యాలను రాయలకు అప్పగించాలని ఏర్పాటు చేశాడు. అందువల్ల రాయలకు రెండు ప్రయోజనాలు కలిగాయి. సైన్యం రాయల అధీనంలో ఉంటే సామంతులు తిరుగుబాటు చేయలేరు. రాయలు తన కోసం ప్రత్యేక సైన్యాన్ని వేరుగా రూపొందించవలసిన అవసరం లేదు. కనుక ఈ పద్ధతి రాజ్య రక్షణకు మంచిదని తిమ్మరుసు ఈ ఏర్పాటు చేశాడు. ఆ విధంగా అమరనాయక సైన్యాన్ని తాను పోషించే భృత్యసైన్యాలను మొత్తం రాయలు తన అధీనంలోకి తెచ్చుకున్నాడు. ఈ విధంగా సైన్యాన్ని తయారు చేసుకొని దక్షిణ దేశంలో స్వతంత్రం ప్రకటించిన సామంతులపై దండెత్తాడు.

ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణాలపై దండయాత్ర: దక్షిణదేశంలో తిరుగుబాటు చేసిన వారిలో అతి ముఖ్యుడు శివసముద్రం, ఉమ్మత్తూరు, శ్రీరంగపట్టణం పాలకుడైన గంగరాజు. అతడు పెనుగొండను కూడా ఆక్రమించి విజయనగర సింహాసనంపై కూడా తనకు హక్కు ఉందని వాదించసాగాడు. అతనిపై రాయల అన్న వీరనరసింహరాయలు దండెత్తాడు. కాని పూర్తిగా నిర్మూలించలేకపోయాడు. అతనికి గర్వం పెరిగి కృష్ణరాయలతో యుద్ధానికి సిద్ధపడ్డాడు. అతనిని అనేక మంది సామంతులు అనుసరించారు. అందువలన దక్షిణదేశంపై అదుపు తప్పింది. గంగరాజు బలం అంతా శివసముద్రం, ఉమ్మత్తూరు కోటలు అతి బలిష్ఠమైనవి. అందులో శివసముద్రం కావేరీ నది మధ్యలో ఉన్న శత్రుదుర్భేద్యమైన కోట. గంగరాజు బలం అంతా ఆ రెండు కోటలలోనే ఉంది. ఆ కోటలను చూసుకొనే అతడు రాయలపై కాలుదువ్వాడు. అందువల్ల రాయలు గంగరాజుపై దండెత్తాడు. రాయలు ముందు 7వేల సైన్యంతో పెనుగొండపై దండెత్తి కోటను స్వాధీనం చేసుకొన్నాడు. అక్కడ రాయసము కొండమరసును తన ప్రతినిధిగా నిలిపాడు. ఈ కాలంలో విజయనగరాన్ని దర్శించిన పోర్చుగీసు రాయబారి ల్యూయిస్ ఫ్రేయర్ రాయలు 5 వేల కాల్బలం, 2 వేల అశ్వదళంతో శివసముద్రంపై దండెత్తాడని రాశాడు. రాయవాచకం శ్రీరంగపట్టణం, శివసముద్రాన్ని ఒక్క రోజులో జయించాడని వర్ణించింది. కాని అది వాస్తవం కాదు. గంగరాజును ఓడించడానికి రెండు సంవత్సరాలు పట్టింది. రెండు సంవత్సరాలలో ఉమ్మత్తూరు, శివసముద్రం కోటలను రాయలు నేలమట్టం చేశాడు. ఓడిపోయిన గంగరాజు కోటగోడలపై నుండి కావేరీ నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అతని మరణం తర్వాత శ్రీరంగపట్టణంతోసహా మూడు కోటలను రాయలు స్వాధీనం చేసుకున్నాడు. రాయలు ఆ ప్రాంతాన్నంతటిని ఏకం చేసి ఒక రాష్ట్రంగా ఏర్పాటు చేసి దానికి శ్రీరంగపట్టణాన్ని రాజధానిగా చేశాడు. అక్కడ కెంపెగౌడ, వీరప్పగౌడ అనే వారిని తన సామంతులుగా నియమించాడు. ఇదే శ్రీరంగపట్టణ రాజ్యానికి నాంది ప్రస్తావన అయింది. తర్వాత మైసూరు ప్రాంతాన్ని పాలించిన గంగరాజు దాయాది చిక్కరాయలను తన సామంతునిగా చేసుకున్నాడు. వారందరిపై సాళువ గోవిందరాజును అజమాయిషీకి నియమించాడు. దాంతో కర్ణాటకం అంతా అదుపులోకి వచ్చింది. శివసముద్రం శ్రీరంగపట్టణాల విజయం, ఆ కోటలను ధ్వంసం చేసిన విధానాన్ని పారిజాతాపహరణం కూడా వర్ణించింది. ఉమ్మత్తూరు విజయం రాయలకు

గొప్ప శక్తినిచ్చింది. తర్వాత సామంతులందరూ త్వరితగతిన లొంగిపోయారు.

మధుర, తంజావూరులపై విజయం: తర్వాత దక్షిణ తీరప్రాంతం, అంటే మధుర, తంజావూరులను జయించడానికి తన సేనానులైన విజయప్ప, వీరరాఘవ, వెంకటప్పలను పంపాడు. వారు మధుర, తంజావూరు, చిత్తూరు, తొండైమండలాల్ని జయించి తిరునగరు, తిరుచునాపల్లి, తంజావూరు, మధురలలోని తిరుగుబాటుదార్లను ఓడించారు. మధురలో పాండ్యులు తిరుగుబాటు చేయగా నాగమనాయకుడనే కమ్మసేనానిని పంపాడని, అతడు మధురను జయించి తన సొంతం చేసుకున్నాడని, అందుకు ఆగ్రహించి రాయలు అతనిపై ఎవరు దండెత్తారని సభలో అడుగగా, నాగమనాయకుని కుమారుడు విశ్వనాథనాయకుడు ముందుకు వచ్చి రాయల అనుమతితో తన తండ్రిపై దండెత్తి ఓడించి తండ్రిని బంధించి విజయనగరం తోడ్కొని వచ్చి రాయలకు అప్పగించాడని, అందుకు సంతోషించి మధుర రాజ్యంపై విశ్వనాథ నాయకుని అధిపతిగా నియమించాడని కథ ఒకటి ప్రచారంలో ఉంది. కాని విశ్వనాథనాయకుడిని మధుర అధిపతిగా నియమించింది అచ్యుత దేవరాయలని చరిత్రకారులు భావిస్తున్నారు. తమిళ తీరాన్ని జయించిన తర్వాత నెల్లూరు, కొల్లడం మధ్య ప్రాంతాన్ని ఒక రాజ్యంగా చేసి జింజిని రాజధానిగా చేసి కృష్ణప్పనాయకుని అధిపతిగా నియమించాడు. దాంతో జింజిరాజ్యం ఏర్పడింది.

మలబారు కోస్తా, సింహళ విజయాలు: అదే సమయంలో రాయలు స్వయంగా కూర్గు, మలబారు ప్రాంతాలపై దండెత్తి జయించాడు. కొడుగు మళయాల ప్రాంతాలపై వెంకటప్పను పాలెగాడుగా నియమించాడు. ఈ విజయాలతో దక్షిణదేశం యావత్తూ అదుపులోకి వచ్చింది. తర్వాత సింహళంపై దండెత్తి కొంత భాగాన్ని ఆక్రమించాడు. సింహళ విజయంతో కృష్ణరాయలు దక్షిణ సముద్రాధీశ్వర అనే బిరుదు ధరించాడు.

గజపతిపై దండయాత్ర క్రీ.శ.1513-1519: తర్వాత రాయలు గజపతి రాజ్యంపై దండెత్తి 7 సంవత్సరాలు పోరాడి గజపతి రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించాడు. గజపతి మీదకు దండయాత్ర చేయడానికి రాయలు పెద్ద ఎత్తున సైనిక సమీకరణ చేశాడు. మహామంత్రి తిమ్మరుసుకు సైన్యంపై పూర్తి అధికారం ఇచ్చాడు. అతడు చక్కని వ్యూహరచన చేసి సైన్యాన్ని 7 దళాలుగా విభజించాడు. ఒక్కొక్క దళంలో 30 వేల కాల్బలం, 4 వేల అశ్వదళం, 200 ఏనుగులు ఉన్నాయి. ప్రతిదళానికి ఒక నాయకుడు నియమింపబడ్డాడు. కందనవోలునేలిన ఆరవీటి శ్రీరంగరాజు, నంద్యాలను పాలించిన ఆరవీటి నారపరాజు, ఆరవీడును పాలించిన ఇమ్మరాజు, రాయసము కొండమరసు, పెమ్మసాని రామలింగన్న నాయకుడు, గండికోట కుమార తిమ్మానాయకుడు, వెలుగోడు గంగాధర రెడ్డి ఈ దళాలకు నాయకత్వం వహించారు. మొత్తం మూడు లక్షల సైన్యాన్ని గజపతి రాజ్యంపై మోహరించారు. ఉదయగిరి ముట్టడితో గజపతి రాజ్య దండయాత్ర ప్రారంభమైంది.

ఆరు దశలుగా గజపతిపై విజయం సాధించడం: రాయలు గజపతి రాజ్యంపై ఆరు దశలుగా దండయాత్ర చేసి క్రీ.శ.1513 నుండి 1519 నాటికి పూర్తి విజయం సాధించాడు. అవి ఆరు దశలు.

1. ఉదయగిరి ఆక్రమణ
2. కొండవీడు ఆక్రమణ
3. కొండపల్లి ఆక్రమణ
4. తెలంగాణ ఆక్రమణ
5. వేంగి, రాజమహేంద్రవరాల నుండి సింహాచలం, పొట్నూరు వరకు ఆక్రమణ
6. కటక దండయాత్ర

మొదటి దశలో క్రీ.శ.1513లో ఉదయగిరిపై దండెత్తి ఒకటిన్నర సంవత్సరాల పోరాటం తర్వాత ఉదయగిరి కోటను స్వాధీనం చేసుకున్నాడు. రెండవ దశలో కొండవీటిపై దండెత్తి ఆరు నెలల పోరాటంతో వినుకొండ, బెల్లంకొండ దుర్గాలతోసహా మొత్తం కొండవీటిపై దండెత్తి ఆరు నెలల పోరాటంతో వినుకొండ, బెల్లంకొండ దుర్గాలతోసహా మొత్తం కొండవీటిసీమను, కొండవీటి కోటను జయించాడు. మూడవ దశలో కొండపల్లి కోటను జయించాడు. నాల్గవ దశలో రాయలు తెలంగాణపై దండెత్తి తెలంగాణలోని గజపతి కోటలన్నింటిని జయించాడు. ఐదవ దశలో వేంగిలో ప్రవేశించి వేంగి, రాజమహేంద్ర వరాలను జయించుకుంటూ సింహాచలం చేరి, తర్వాత పొట్నూరు వద్ద విజయస్తంభం నాటాడు. ఆరవదశలో కటకంపై దండెత్తి క్రీ.శ.1519లో గజపతిని పూర్తిగా ఓడించి లొంగదీశాడు.

తెలంగాణ దండయాత్ర: కొండపల్లిని జయించిన తర్వాత రాయలు తెలంగాణ వైపు నడిచాడు. అప్పుడు తెలంగాణలో అధిక భాగం ప్రతాపరుద్ర గజపతి సామంతుల చేతిలో ఉంది. కళింగను జయించడానికి ముందు తెలంగాణను జయించడం అవసరమని భావించాడు. అందువల్ల వెనుక నుండి ప్రమాదం లేకుండా ఉంటుందని తలచాడు. రాయల సైన్యం మొదట ఖమ్మం మెట్టు పైకి నడిచింది. చితాబ్‌ఖాన్ ఓరుగల్లు నుండి బెల్లంకొండ వరకు పాలించాడు. మునుజర్ నది ఒడ్డున ఉన్న ఖమ్మం మెట్టు అతనికి బలమైన కోట. అందువల్ల రాయలు ఆ కోటపై దాడి చేశాడు. చితాబ్‌ఖాన్ ఓడిపోయాడు. తర్వాత తెలంగాణలోని ఓరుగల్లును కూడా స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత అనంతగిరి, ఉర్లుగొండ, ఉంద్రుకొండ, కప్పలవాయి, అర్వపల్లి, చిట్యాల, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, జల్లపల్లి, కందికొండ, కనకగిరి, శంకరగిరి దుర్గాలను ఏకధాటిగా ఆక్రమించాడు. దాంతో గజపతి సామ్రాజ్యంలోని తెలంగాణ అంతా రాయలవశమైంది. తర్వాత జమ్మిలోయ (గోదావరీ లోయ) గుండా కనుమను దాటి వేంగి దేశంలో ప్రవేశించాడు. అక్కడ రాయలు తన సైన్యం రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని వేంగి దేశాన్ని జయించి, గోదావరిని దాటి రాజమహేంద్రవర కోటను ముట్టడించమని ఆదేశించి, తాను మరొక సైనిక విభాగంతో పోలవరం చేరి అక్కడ గోదావరిని దాటాడు. ఆ కాలంలో వేంగి రాజ్యం నుండి రాజమహేంద్రవర ప్రాంతంలోకి వెళ్లడానికి పోలవరం దగ్గరనే గోదావరిని దాటేవారట. గోదావరి తూర్పు ఒడ్డున ఉన్న రంపచోడవరం మండలంలోని రామగిరిని – దానికే రామదుర్గం అని కూడా పేరుంది. – నీలకోటను జయించి కోరుకొండ మీదుగా రాజమహేంద్రవరం చేరాడు. ఈ లోపల తన రెండవ సైన్యం వేంగిని జయించి రాజమహేంద్రవరం చేరింది. అప్పుడు రాయలు రాజమహేంద్రవర దుర్గాన్ని జయించి ఉత్తరంగా సాగి కిమ్మూరు సీమను జయించి, సీలేరు, తాండవ, వరాహ, శారదా నదులను దాటుకుంటూ, ఈ నదుల మధ్య ఉన్న కొట్టాం, వజ్రగడ, మాడుగుల, పాంచదార్ల, వడ్డాదిలను జయించుకుంటూ సింహాచలం చేరాడు. తర్వాత పొట్నూరు చేరి విజయస్తంభం ప్రతిష్టించాడు. చివరగా ఆరవ దశలో కటకంపై దండెత్తి గజపతిని లొంగదీశాడు. శాశ్వత సంధిని సాధించడానికి రాయలు గజపతితో యుద్ధం చేశాడని రాయవాచకం, న్యూనిజ్ తెలిపారు. అది సాధించిన విధానాన్ని కూడా వివరించారు. ప్రతాపరుద్రగజపతి తన కుమారుడు వీరభద్ర గజపతి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిసి తిమ్మరుసుకు ఉత్తరం రాసి విజయనగరంలో ఉన్న తన భార్యను పంపాలని అందుకు ప్రతిఫలం చెల్లిస్తానని రాశాడు. అందుకు తిమ్మరుసు ప్రత్యుత్తరం ఇస్తూ గజపతి తన కుమార్తెను రాయలకిచ్చి వివాహం చేయాలని కోరాడు. అందుకు గజపతి సమ్మతించాడు. గజపతి రాజకుమార్తెను పంపాడు. ఆమె రాగానే గజపతి, రాయలు మిత్రులైనారు. రాయలు కృష్ణానదికి ఉత్తరంగా ఉన్న ప్రాంతాలను గజపతికిచ్చి వేసి క్రీ.శ.1519 ఆగస్టులో సంధి చేసుకున్నాడని న్యూనిజ్ రాశాడు.

కాటూర్ దండయాత్ర: సింహాచలం నుంచి క్రీ.శ.1516లో రాయలు విజయనగరం చేరిన తర్వాత కాటూరును జయించాడని న్యూనిజ్ రాశాడు. న్యూనిజ్ రచించిన క్రానికల్‌లో కాటూర్‌ను జయించిన విధానం విపులంగా రాశాడు. కృష్ణరాయలు ఒరిస్సా రాజుతో సంధి చేసుకొని ఆయన కుమార్తెను వివాహం ఆడిన తర్వాత కాటూర్‌ను జయించాలని పెద్ద సైన్యాన్ని సమీకరించి వెళ్లి కోటను ముట్టడించాడు. ఆ కోట రాజు 50 సంవత్సరాల నుండి విజయనగర రాజును ధిక్కరిస్తున్నాడు. ఈ కాటూరు కోరమండల తీరంలో ఉంది. ఆ రాజు నివసించే కోటను చుట్టుకొని ఒక నది ఉంది. కృష్ణారావు కోటను ముట్టడించినప్పుడు చలికాలం. నదిని దాటడానికి ఏ మాత్రం వీలులేకుండా ఉంది. అప్పుడు రాయలు నదిలోని నీరు వెళ్లిపోవడానికి నది నుండి 50 కాలువలు తవ్వించాడు. ఆ కాలువల గుండా నీరంతా వెళ్లిపోయింది. నదిలోని అడుగు భాగం కనిపించింది. అప్పుడు రాయలు తన సైన్యంతో నీరు లేని నదిలో నుండి వెళ్లి కోటను ముట్టడించాడు. కోటలో లక్ష కాల్బలం, మూడు వేల గుర్రపు దళం ఉంది. ఆ రాజు ధైర్య సాహసాలతో పోరాడాడు. కాని ఓడిపోయి పక్క కోటకు పారిపోయాడు. తర్వాత రాయలు కాటూయిర్ కోటను ధ్వంసం చేసి లోపల ప్రవేశించాడు. ఆ కోటలో కృష్ణారావుకు బంగారు పరదాలు, ఇంకా అనేక ఆభరణాలు, ఏనుగులు లభించాయి. కోటను సాధించిన తర్వాత కృష్ణారావు ఆ రాజ్యాన్ని తన సేనాధిపతులకు పంచి ఇచ్చాడు. తర్వాత కృష్ణారావు రాజు పారిపోయిన కోటను కూడా జయించి రాజును బంధించి విజయ నగరానికి తీసుకొచ్చాడు. అతడు విజయనగరం ఖైదులో మరణించాడని న్యూనిజ్ వర్ణించాడు. ఈ కాటూరును గురించి పండితులు అనేక విధాలుగా గుర్తించారు. రావు బహదూర్ హెచ్.కృష్ణశాస్త్రి అది కటకంగా గుర్తించాడు. రాబర్ట్ సీవెల్ దానిని వెల్లూరుగా భావించాడు. యస్.కె.అయ్యంగారు శివ సముద్రకోటగా

గుర్తించాడు. మరికొందరు దానిని పల్లైయుంకొట్టయి అని వాదించారు. క్రీ.శ.1935లో నేలటూరి వెంకట రమణయ్య దానిని కాయుట్టూరుగా గుర్తించారు. పాండ్యవంశస్తులలో ఒక శాఖ కాయట్టూరును పాలించారు. కాయట్టూరు తిరునల్వేలి పట్టణానికి 25 మైళ్ల దూరంలో ఉంది. కాటూరు నుండి రాజు పారిపోయిన కోట కాయల్ రేవుగా గుర్తించారు. కాటూయిర్, కాయల్ రేవులను జయించిన తర్వాత ఆ ప్రాంతాన్ని రాయలు ఎవరికి ఇచ్చాడు అని కూడా పండితులు తర్కించి రాయలు ఆ ప్రదేశాన్ని తెలుగు వారికి ఇచ్చాడు అని తీర్మానించారు. ఆ విధంగా వచ్చి తెలుగు కుటుంబం ఎట్టియపురాన్ని రాజధానిగా చేసుకొని పాలించారు. ఎట్టియపురాన్ని క్రీ.శ.1567లో నిర్మించారని ప్రతీతి. ఈ కుటుంబం చంద్రగిరి నుండి వచ్చిందని కూడా ప్రతీతి. అనేక తెలుగు కుటుంబాలు ఈ రాజ్యానికి వచ్చి స్థిరపడ్డాయి. ప్రస్తుతం కూడా తెలుగు వారు ఉన్నారు. బ్రిటిష వారి కాలంలో ఈ వంశానికి చెందిన 30వ తరపు రాజు ముత్తుజగవరె రామనాయక్ ఆరు వేల సైన్యంతో పాలిగార్ల యుద్ధంలో బ్రిటిష వారికి సహాయపడ్డాడు. అందువల్ల బ్రిటిష వారు వీరి రాజ్యాన్ని జమీందారిగా గుర్తించారు. బ్రిటిష వారిని ఎదిరించిన వీరపాండ్య కట్టబ్రహ్మన్నను వారు క్రీ.శ.1797లో కాయట్టూరులోనే ఉరితీశారు. కాయట్టూరు చిన్న గ్రామం ఇప్పుడు కూడా దానిని చూడగానే తమిళులు కట్టబ్రహ్మన్నను గుర్తు తెచ్చుకుంటారట. ఆ గ్రామ ఉత్తర ప్రాంతంలో కోట శిథిలాలు, పెద్ద పెద్ద మట్టి దిబ్బలు ఉన్నాయి. అదే కృష్ణరాయలు నాశనం చేసిన కోట అని అంటారు. కనుక వెంకటరమణయ్య గుర్తించిన కాయట్టూర్ రాయలు జన్మించిన కాటూరు అని రావుబహదూర్ సి. హయవర్ధనరావు అని అన్నారు. కాటూరును జయించిన తర్వాత రాయలు సింహళంపై దండెత్తి కొంత భాగాన్ని జయించి కప్పం వసూలు చేశాడని కొందరు పండితులు భావించారు.

గోల్కొండ నవాబు పరాభవం: రాయలు గజపతితో పోరాడి వచ్చిన తర్వాత గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా కొండవీటిపై దండెత్తాడు. క్రీ.శ.1518లో సుల్తాన్ రెండవ మహమ్మద్‌షా మరణించాడు. అప్పటికే స్వతంత్ర వైఖరినవలంబించిన బీజాపూరు, బేరార్, అహమ్మద్ నగర్, గోల్కొండల సర్దారులు వారి వారి రాజ్యాలను పూర్తిగా స్వంతం చేసుకున్నారు. ఈ నాలుగు రాజ్యాలు స్థిర రూపం ధరించాయి. గోల్కొండ రాజ్యాన్ని సొంతం చేసుకుని కులీకుతుబ్‌షా తన రాజ్యాన్ని విస్తరించుకోవాలని కొండవీటిపై దండెత్తాడు. కృష్ణరాయలు తన సేనాధిపతి పాండురంగని పంపగా అతడు కుతుబ్‌షాను ఓడించి పరాభవించి పారదోలాడు. కుతుబ్‌షా చాలా కష్టపడి గోల్కొండ పారిపోయాడు.

బహమనీలతో తిరిగి యుద్ధాలు క్రీ.శ.1516: కృష్ణరాయలు ప్రతాపరుద్ర గజపతితో పోరాడిన సమయంలో క్రీ.శ.1516లో బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ గోల్కొండ కుతుబ్‌షా అహమ్మద్‌నగర్ నిజాంషాలను కలుపుకొని కోవెలకొండ, పానుగల్లు, దేవరకొండ, గణపురాలను ఆక్రమించాడు. అంతేగాక వారు రాయలకు వ్యతిరేకంగా ప్రతాపరుద్ర గజపతికి సహాయం చేయడానికి కూడా సిద్ధపడ్డారు. అందువల్ల రాయలు క్రీ.శ.1516లో కళింగరాజ్య దండయాత్రా కాలంలోనే బహమనీ సుల్తాన్‌లతో మరొక యుద్ధం చేయవలసి వచ్చింది. అతడు తన సైన్యాన్ని రెండు భాగాలు చేసి ఒక భాగాన్ని కోవెలకొండ మీదకు పంపి, మరొక సైన్యాన్ని బీజాపూరుపైకి పంపాడు. కోవెలకొండను ముట్టడించడంతో గోల్కొండ కుతుబ్‌షా కోవెలకొండను కాపాడుకోవటానికి వారి కూటమి నుండి వైదొలగిపోయాడు. మిగిలిన బీజాపూరు, అహమ్మద్‌నగర్ సైన్యాలు రాయల సైన్యాలతో కెంబాలి అనే ప్రదేశంలో పోరాడి ఓడిపోయాయి. కెంబాలి విజయం తర్వాత రాయలు అహమ్మద్ నగరంపై దండెత్తి అహమ్మద్‌నగర్ కోటను నేల మట్టం చేశాడని ఆముక్తమాల్యద తెలుపుతోంది.

బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ రాయచూరును ఆక్రమించడం: గజపతిని పూర్తిగా ఓడించడంతో కృష్ణదేవరాయలకు ఎనలేని కీర్తి వచ్చింది. అది బహమనీ సుల్తాన్‌లకు ఈర్ష్య కలిగించింది. అతని విజయం వారికి కంటగింపయింది. లూయిస్ ఫ్రెయిర్ విజయనగరంలో హత్య గావింపబడిన తర్వాత విజయనగర పోర్చుగీసు సంబంధాలు చెడిపోతాయని తలచి బీజాపూరు సుల్తాన్ హెనోవరును జయించి గోవాను పునరాక్రమించాలని తలచాడు. కాని పోర్చుగీసు వారు విజయనగర స్నేహసంబంధాలను వదులుకోదలచుకోలేదు. హెనోవర్‌పై దాడి చేయాలని సంకల్పించిన ఇస్మాయిల్‌ను అల్బుకర్క్ తీవ్రంగా మందలించాడు. దాంతో ఇస్మాయిల్ రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఆక్రమించాలని భావించాడు. ఆ సమయంలో రాయలు గజపతితో యుద్ధంలో నిమగ్నుడై ఉన్నాడు. కనుక ఇస్మాయిల్ రాయచూరుపై దండెత్తి అంతర్వేది ప్రాంతాన్ని సులభంగానే జయించి తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు.

రాయలు బీజాపూరుపై దండయాత్ర: ఇస్మాయిల్ ఆక్రమించిన రాయచూరు, అంతర్వేదిలను తిరిగి జయించడానికి రాయలు బృహత్తర పథకాన్ని తయారు చేశాడు. న్యూనిజ్ రాయల దండయాత్రను విపులంగా వర్ణించాడు. సయ్యద్ మెర్కార్ అనే విదేశీ ముస్లిం వర్తకుడు రాయలను దర్శించి మేలు జాతి గుర్రాలను తెచ్చి ఇవ్వగలనని నమ్మించి 40 వేల పర్దావుల ధనాన్ని రాయల నుండి తీసుకొని బీజాపూరు పారిపోయాడు. అది తెలిసి అతనిని పట్టి అప్పగించమని రాయలు ఇస్మాయిల్‌కు లేఖ రాశాడు. కాని సయ్యద్ మెర్కార్ గొప్ప ఇస్లామిక్ న్యాయశాస్త్ర పండితుడని, అతనిని రాయలకు అప్పగించలేదు. దాంతో రాయలు తన మంత్రులతో చర్చించాడు. కొందరు మంత్రులు యుద్ధం వద్దని చెప్పారు. కాని తిమ్మరుసు యుద్ధం చేసి సుల్తాన్‌కు బుద్ధి చెప్పాలని సలహా ఇచ్చాడు. దాంతో రాయలు బీజాపూర్ సుల్తాన్‌తో యుద్ధానికి దిగాడు. ఈ యుద్ధాన్ని గురించి న్యూనిజ్, పెరిష్టాలు ఇద్దరూ రాశారు. యుద్ధానికి ముందు రాయచూరు రాయల ఆధీనంలో ఉందని, దానిని జయించడానికి ఇస్మాయిల్ బయలు దేరాడని, ఇస్మాయిల్‌ను ఎదుర్కోడానికి రాయలు తన సైన్యంతో బయలుదేరాడని ఫెరిష్టా రాశాడు. రాయచూరు ఇస్మాయిల్ ఆక్రమించాడు. దానిని తిరిగి జయించడానికి రాయలు బయలుదేరాడు. యుద్ధం ముందు రాయచూరు, అంతర్వేది ఇస్మాయిల్ ఆధీనంలో ఉన్నాయి అని న్యూనిజ్ రాశాడు. వీరిద్దరిలో ఎవరి రాత సరైనదో తెలుసుకోడానికి ఇతర ఆధారాలను పరిశీలించవలసిన అవసరం ఏర్పడింది. రాబర్ట్ సీవెల్ సమకాలీన పోర్చుగీసు వారి రచనలను పరిశీలించాడు. క్రీ.శ.1520లో కాప్టన్ హెడా అనే పోర్చుగీసు రచయిత భారతదేశంలో ఉండి రాయచూర్ యుద్ధాన్ని గురించి రాశాడు. అతడు సెక్విరా అనే గోవా గవర్నర్ 1520లో స్వదేశానికి బయలుదేరాడు. అతని ప్రయాణాన్ని వివరించుతూ సెక్విరా ఎర్రసముద్రం దగ్గరకు చేరిన తర్వాత కృష్ణరాయలు అంతర్వేది మీదకు దండెత్తాడని రాశాడు. సెక్విరా క్రీ.శ.1520 ఫిబ్రవరి 13వ తేదీన గోవాను వదలి వెళ్లాడు. అలాగే రాయచూరు యుద్ధంలో క్రిస్టోవోడె ఫిగోరిడో నాయకత్వంలో పోర్చుగీసు ఫిరంగిదళం రాయచూరు కోటగోడలను కూల్చిందని, పోర్చుగీసు వారు రాశారు. ఫిగోరిని రాయలు సత్కరించాడని వారైమా రాశాడు. రాయచూరు కోట ఇస్మాయిల్ ఆధీనంలో ఉందని, దానిని సాధించడానికి రాయలు దండెత్తాడని, కనుక న్యూనిజ్ రాసిన రాతలే వాస్తవమని సీవెల్ భావించాడు. పైగా న్యూనిజ్ రాయచూరు యుద్ధం జరిగిన 15 సంవత్సరాలకు క్రానికల్ రాశాడు. పెరిష్టా 65 సంవత్సరాల తర్వాత రాశాడు. అంతేగాక పెరిష్టా పక్షపాతి. తాను రాసిన బహమనీ, విజయనగర చరిత్రలో ఎప్పుడూ సుల్తాన్‌లే జయించారని రాశాడు. కనుక పెరిష్టా రచనను నమ్మవలసిన పనిలేదని న్యూనిజ్ రాతలే వాస్తవమని రాబర్ట్ సీవెల్ తీర్మానించాడు. న్యూనిజ్ కాస్టన్‌హెడెలో చెప్పిన విషయాన్ని కృష్ణదేవరాయల ఆస్థాన సంగీత విద్వాంసుడు లక్ష్మీనారాయణ తన రచనలో ధృవపరిచాడు. రాయలు గజపతిని జయించి, గజపతి రాకుమారిని వివాహం ఆడిన తర్వాత గొబ్బూరు వద్ద విడిసి ఉన్న బీజాపూరు సుల్తాన్ యవనప్రభువు సపాద లేక సవాయిని ఓడించి తరిమి రాయచూరు కోటను వశపరచుకున్నాడని లక్ష్మీనారాయణ పేర్కొన్నాడు. కనుక రాయలు అంతర్వేదిపై దండెత్తినప్పుడు రాయచూరు ఇస్మాయిల్ ఆదిల్‌షా ఆధీనంలో ఉందని స్పష్టంగా చెప్పవచ్చు.

రాయల యుద్ధ ప్రయత్నం: రాయచూరు యుద్ధానికి రాయలు పెద్ద ప్రయత్నాలు చేశాడు. పెద్ద సైన్యాన్ని సమీకరించాడు. రాయలు 7,03,000 పదాతిదళం, 32,600 గుర్రాలు, 551 ఏనుగులతో బయలుదేరాడు. వీరుగాక రాయచూరు సమీపంలోకి చేరుకున్న తర్వాత మరికొంత అమరనాయక సైన్యం కూడా చేరింది. మొత్తం 10 లక్షల సేన అంతర్వేదిలో మొహరించిందని న్యూనిజ్ రాశాడు. యుద్ధవీరులే గాక వారికి సపర్యలు చేసే సైనికులు, వంటవారు, వ్యాపారులు ఇతర ప్రజలు కలిసి ఒక పట్టణం కదిలినట్లు ఉంది. ఆ దండయాత్ర అని న్యూనిజ్ వర్ణించాడు. రాయలు తన సైన్యాన్ని 11 భాగాలుగా విభజించి సమర్థులైన సేనాధిపతుల ఆధిపత్యంలో ఉంచాడు. కామానాయకుడు-30వేల పదాతిదళం, 1000 గుర్రాలు, 16 ఏనుగులు; త్రయంబకరావు-50 వేల పదాతిదళం, 2000 అశ్వాలు, 20 ఏనుగులు; తిమ్మప్ప నాయకుడు-6 వేల పదాతిదళం, 3500 గుర్రాలు, 30 ఏనుగులు; ఆదెప్ప నాయకుడు- 100000 పదాతిదళం, 5000 అశ్వాలు, 50 ఏనుగులు; కొండమరెడ్డి - 120000 పదాతిదళం, 6000 అశ్వాలు, 60 ఏనుగులు; కొండమరెడ్డి కుమారుడు - 80000 పదాతిదళం, 2050 గుర్రాలు, 40 ఏనుగులు; సాళువ గోవిందరాజు-30000 పదాతిదళం, 1000 అశ్వాలు, 10 ఏనుగులు; మధుర నాయకుడు- 15000 పదాతిదళం, 200 అశ్వాలు; కుమార శ్యామరాయలు లేక కుమార వీరయ్య - 8000 పదాతిదళం, 400 గుర్రాలు (తురగాలు); రాయలు స్వయంగా 4000 పదాతిదళం, 1000 గుర్రాలు, 15

ఏనుగులు; రాయల వ్యక్తిగత సేనానులు 40000 పదాతిదళం, 6000 గుర్రాలు, 300 ఏనుగులు (గజములు).

ఈ విధంగా 11 భాగాల ప్రచండ సైన్యంతో రాయలు అంతర్వేదిపై దండెత్తాడని న్యూనిజ్ వర్ణించాడు రాయలు ఇంత పెద్ద సైన్యంతో దండెత్తాడా అనే సందేహం కలుగవచ్చు. కాని రాబర్ట్ సీవెల్ భారతదేశంలో రాజులు పెద్ద సేనతో యుద్ధానికి వెళ్లడం ఆది నుండి ఉంది అని చెపుతూ అతడు రచించిన ఎ ఫర్ గాటెన్ ఎంపైర్‌లో అనేక ఉదాహరణలను పేర్కొన్నాడు. అలెగ్జాండర్ భారతదేశంపై దండెత్తినప్పుడు మగధకు 6 లక్షల సైన్యం ఉందని అబ్దుల్ రజాక్, రెండవ దేవరాయలకు 11 లక్షల సైన్యం ఉందని మహమ్మద్ బిన్ తుగ్లక్ 370000 సైన్యాన్ని చైనాను జయించడానికి పంపాడని, మొగల్ సైన్యం లక్షలలో ఉండేదని, మహారాష్ట్రులకు లక్ష అశ్వదళం, లక్షలాది పదాతిదళం ఉండేదని, కనుక న్యూనిజ్ వర్ణన అతిశయోక్తి కాదని సమర్థించాడు. కృష్ణరాయల కాలంలో విజయనగర సైన్యం 200 మంది అమర నాయకులపై సైన్యంతో కలిపి 1717000 కాల్బలం, 19000 అశ్వదళం, 633 గజదళం ఉండేదని రాశాడు. రాయలు తనకు ఉన్న 17 లక్షల కాల్బలంలో 10 లక్షలను మాత్రమే రాయచూరుకు కదిలించాడు. ఇక ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ సైన్యాన్ని గురించి కూడా వివరణ ఇవ్వబడింది పెరిష్టా ఇస్మాయిల్ 7000 అశ్వదళం అంటే అతి చిన్న దళంతో వచ్చి ఓడిపోయాడని పేర్కొన్నాడు. కాని ఇస్మాయిల్ 14000 అశ్వదళం, 1 లక్ష పదాతిదళం, 150 గజదళంతో యుద్ధానికి వచ్చాడని న్యూనిజ్ రాశాడు. అంతేగాక సుల్తాన్ శతఘ్నిదళాన్ని కూడా తెచ్చాడు.

పెరిష్టా వర్ణన: ఇస్మాయిల్‌ఖాన్ తన సైన్యంతో రాయచూరు కోటకు తొమ్మిది మైళ్ల దూరంలో విడిశాడు. అతని వెనుక 5 మైళ్ల దూరంలో కృష్ణానది ఉంది. పెరిష్టా సుల్తాన్ ఏ విధంగా యుద్ధానికి వచ్చిందీ వివరించాడు సుల్తాన్ అంతర్వేదిలోకి వచ్చినప్పుడు అతని వద్ద 50000 అశ్వదళం, లక్ష పదాతిదళం ఉంది. అతడు యుద్ధానికి బయలు దేరే ముందు రాత్రి గానా బజానా ఏర్పాటు చేసుకొని తప్పతాగాడు. ఆ మైకంలో 7000 అశ్వదళాన్ని తనతో రమ్మన్నాడు. అతడు ఒక ఏనుగును ఎక్కి కృష్ణానదిలోకి దిగాడు. మిగిలిన 7000 అశ్వదళం అతనిని అనుసరించింది. అతడు అవతల ఒడ్డుకు చేరి రాయల సైన్యంతో పోరాడి రాయల సైన్యాన్ని సగం మందిని చంపాడు. కాని చివరకు ఓడి వెనుదిరిగాడు. కాని కృష్ణానదిలో అతడి సైనికులు, అశ్వాలు మునిగిపోయాయి అతడు ఎక్కిన ఏనుగు, 7గురు సైనికులు తప్ప అందరూ మరణించారు అని రాశాడు. సుల్తాన్ తన తప్పును తెలుసుకొని తిరిగి విజయం సాధించే వరకు తాను తాగనని శపథం చేశాడని రాశాడు. పెరిష్టా రాతలను బట్టి చూడగా సుల్తాన్ ఓడిపోయాడు. కాని ఆ ఓటమిని స్పష్టంగా రాయకుండా కృష్ణా నదిలో సైనికులు మునిగి పోయారని రాశాడు.

గొబ్బూరు యుద్ధం క్రీ.శ.1520 మే నెల 19వ తేదీ: సుల్తాన్ తన స్థావరానికి చుట్టూ కందకాలు తవ్వుకొని రక్షణ ఏర్పాటు చేసుకొని యుద్ధానికి సిద్ధపడ్డాడు. రాయల సైన్యం క్రీ.శ.1520 మే నెల 19వ తేదీ ఉదయాన సుల్తాన్ సైన్యంపై దాడి చేసింది. చెవులు చిల్లులు పడే తప్పెట్లమోతలతో రాయల సైన్యం బీజాపూరు సైన్యంపై బడి వీరవిహారం చేసింది. రాయల సైన్యం దెబ్బకు తట్టుకోలేక ఇస్మాయిల్ సైన్యం వారి స్థావరం కందకాల వరకు పారిపోయింది. ఆ స్థితిలో సుల్తాన్ తన ఫిరంగి దళాన్ని ముందుకు నడిపాడు. సుల్తాన్ దళం శతఘ్నులు పేల్చుకుంటూ విజయనగర సైన్యం వైపు దూసుకుంటూ వచ్చింది. శతఘ్ని గుండ్లు విజయనగర సేనపై బడి వేల కొలది సైనికులు మరణించారు. మిగిలిన దళాలు వెనుదిరిగి పారిపోసాగాయి. పారిపోయే విజయనగర సైన్యంపై సుల్తాన్ అశ్వదళం దాడి చేసి అందిన వారిని అందినట్లు వధించింది. కొద్ది సేపటికి విజయనగర సేన ప్రధాన యుద్ధ రంగం నుండి వెనుకకు పారిపోయింది. తన సేనకు పట్టిన గతిని కళ్లారా చూస్తూ ఉన్న కృష్ణదేవరాయలకు ఆవేశం పెరిగి వెంటనే ఒక సైనికుని పిలిచి తన వేలి ఉంగరాన్ని అతనికిచ్చి దానిని తన రాణుల కందిచ్చి తాను మరణిస్తే సహగమనానికి సిద్ధంగా ఉండమని చెప్పమని పంపి తాను తన అశ్వాన్ని అధిరోహించి యుద్ధభూమిలో మిగిలి ఉన్న తన సేనలనుద్దేశించి గంభీరంగా ఆవేశంగా ప్రసంగించాడు. యుద్ధంలో వెన్నిచ్చి పారిపోయేవారు పిరికిపందలేగాక, దేశద్రోహులు, ఎప్పుడైనా చావ వలసిందే, ఆ చచ్చేది ఇప్పుడే దేశం కోసం, తమ రాజ్య ప్రజల కోసం చావడం మేలని అరిచాడు. దాంతో సైనికులు ధైర్యం తెచ్చుకొని ముందుకు ఉరికారు. రాయలు స్వయంగా ఆ సేనకు నాయకత్వం వహించి తిరిగి సుల్తాన్ సేనపై పడ్డాడు. తమ ప్రాణాలపై ఆశ వదిలి విజయమో వీరస్వర్గమో అన్నట్లు ఎక్కడలేని తెగింపుతో విజయనగర సేన సుల్తాన్ సైన్యాన్ని ఢీకొంది. ఆ వీరావేశంలో రాయల సైన్యం సుల్తాన్ సైనికులను నరకసాగారు. ఆ ధాటికి తట్టుకోలేక మిగిలిన సుల్తాన్ సైనికులు వెనుదిరిగి

పారిపోయారు. రాయల సైన్యం వెంటపడింది. దాంతో బీజాపూరు సేనాని మీరాజహంగీర్‌ను సంహరించింది. మరొక సేనాధిపతి సలాబత్‌ఖాన్ విజయనగర సైన్యాన్ని ఎదిరించి వీరోచితంగా పోరాడాడు. కాని ఓడిపోయి బందీగా చిక్కాడు. దాంతో సుల్తాన్ కూడా ప్రాణభయంతో తన గుడారానికి పరిగెత్తాడు. అక్కడ అతని మరొక సేనాని అయిన అసద్‌ఖాన్‌తో ఈ క్లిష్ట పరిస్థితులలో ఏం చేయడం మంచిదని సలహా అడిగాడు. అసద్‌ఖాన్ ఇప్పుడు మన ప్రాణాలు దక్కితే చాలు, కనుక బీజాపూరు పారిపోవడం మంచిదని సలహా ఇచ్చాడు. వెంటనే సుల్తాన్ ఏనుగు ఎక్కి బీజాపూరు వైపు పారిపోయాడు. ఈ లోపల రాయల సైన్యం గుడారానికి చేరుకొంది. అక్కడ ఒక్క బీజాపూరు సైనికుడూ లేడు. గుడారంలో విలువైన సంపద, ఆయుధాలు, అశ్వాలు, గజాలు రాయలకు లభించాయి. ఈ యుద్ధం తర్వాత ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ తన జీవితంలో విజయనగరం వైపు కన్నెత్తి చూడలేదు. ఈ విధంగా తన ధైర్య సాహసాలతో ఓటమిని విజయంగా మార్చుకున్న ధీశాలి కృష్ణరాయలు.

రాయచూరు ఆక్రమణ: గొబ్బూరు యుద్ధానంతరం రాయలు రాయచూరు చేరి కోటను ముట్టడించాడు. కోటలోని సుల్తాన్ సేనాధిపతి కోటను రక్షించడానికి రాయల సైన్యాన్ని ఎదిరించాడు. ముస్లిం సైనికులు కోటగోడలపై నుంచి రాయల సైన్యంపైకి ఆయుధాలు ప్రయోగించారు. ఆ తరుణంలో పోర్చుగీసు వారి శతఘ్ని దళం రాయలకు సహాయంగా వచ్చింది. పోర్చుగీసు శతఘ్ని దళ సేనాధిపతి Christovao de Figueiredo తన శతఘ్నులతో కోటపై ఉన్న ముస్లిం సైనికులపై పేల్చాడు. పైన ఉన్న సైనికులు మరణించడమే గాక కోటగోడలు కూడా కూలాయి. రాయల సైన్యం కోటగోడల వద్దకు చేరి కోటను కూల్చి లోపలకు ప్రవేశించారు. సుల్తాన్ సేనాధిపతి యుద్ధంలో మరణించాడు. కోట స్వాధీనమైంది. రాయలు కోటలో ప్రవేశించి లోపల ఉన్న సైనికులను, ప్రజలను ఆదరణతో చూశాడు. రాయచూరు విజయంతో తాను పోగొట్టుకున్న అంతర్వేది ప్రాంతంపై తిరిగి రాయల అధికారం ఏర్పడింది. అక్కడ రాయలు కాటమరాజు సింగమరాజును తన ప్రతినిధిగా నియమించాడు.

రాయచూరు యుద్ధం జరిగిన తేదీ 1520 మే 19వ తేదీ: రాయచూరు యుద్ధం ఎప్పుడు జరిగింది అనే విషయంపై అనేక సందేహాలున్నాయి. న్యూనిజ్ క్రీ.శ.1522 మే నెలలో శనివారం రోజున యుద్ధం జరిగిందని రాశాడు. అంతేగాక రాయలు శుక్రవారం యుద్ధం ప్రారంభిద్దామని చెప్పగా సేనాధిపతులు శుక్రవారం మంచిరోజు కాదని వాదించారని, అందువల్ల శనివారంనాడు యుద్ధం జరిగిందని కూడా న్యూనిజ్ వివరించాడు. యుద్ధం తర్వాత రాయలు మహార్నవమి రోజున విజయసభ జరిపి అందు కిస్టొబొ దె ఫిగొరిడోను సన్మానించాడని పేస్ రాశాడు. ఆ సన్మానసభకు పేస్ హాజరయ్యాడు. తాను హాజరైన మహార్నవమి పండుగ సెప్టెంబర్ నెలలో జరిగిందని కూడా రాశాడు. మహార్నవమి అశ్వని నెల మొదటి రోజున వస్తుంది. అలాగే పేస్ నూతన సంవత్సర పండుగ కూడా జరిపారని రాశాడు. నూతన సంవత్సరం కార్తీక మాసంలోని మొదటి రోజున వస్తుంది. పేస్ ఇచ్చిన రెండు తేదీలు పంచాంగం ప్రకారం లెక్కకడితే అశ్వని మొదటిరోజు సెప్టెంబర్ 12, కార్తీకమాస మొదటి రోజు అక్టోబర్ 12వ తేదీగా వచ్చాయి. ఈ తేదీలు 1520లో మాత్రమే ఇలా వచ్చాయి. అశ్వని, కార్తీక మొదటి రోజులు 1521లో సెప్టెంబర్ 2, అక్టోబర్ 1వ తేదీన వచ్చాయి. 1522లో సెప్టెంబర్ 20, అక్టోబర్ 20వ తేదీన వచ్చాయి. కనుక పేస్ రాతల ప్రకారం క్రిస్టావొ దె ఫిగొరిడొకు సన్మానం జరిగింది 1520 సెప్టెంబర్ 12వ తేదీన. అంటే రాయచూరు యుద్ధం 1520 సెప్టెంబర్ మాసానికి ముందుగా జరిగి ఉండాలి. 1520లోనే యుద్ధం జరిగిందని చెప్పడానికి మనకు మరొక ఆధారం కూడా ఉంది. రాయచూరును జయించిన తర్వాత గోవాకు ఎదురుగా ఉన్న ప్రధాన భూమిని కృష్ణరాయలు ప్రోద్బలంతో గోవా గవర్నర్ Diogo Lofes do Sequeira ఎర్ర సముద్రాన్ని చేరిన సమయంలో అతని స్థానంలో గవర్నర్‌గా పని చేస్తున్న Ruy de-Mello ఆక్రమించాడు. డైయోగా లోప్స్‌డి సీక్వారియో ఎర్రసముద్రం చేరిన కాలంలో కృష్ణరాయలు రాయచూరు యుద్ధం చేశాడని కష్టాన్ హెడొ అనే పోర్చుగీసు రచయిత రాశాడు. డైయోగా లోప్స్ డి సీక్వారియో క్రీ.శ.1520 ఫిబ్రవరి 13వ తేదీన గోవా నుండి బయలుదేరి 1521 ఫిబ్రవరి 9వ తేదీన దయ్యూకి వచ్చాడు. కనుక 1520లోనే రాయచూరు యుద్ధం జరిగిందని కష్టాన్ హెడా రచనలు బలపరుస్తున్నాయి. పెరిష్టా హిజ్రా 927లో రాయచూరు యుద్ధం జరిగిందని రాశాడు. అది కూడా క్రీ.శ.1520-21 సంవత్సరానికి సరిపోతోంది. రాయలు రాయచూరును జయించిన తర్వాత అక్కడ అధిపతిగా కంటమరాజు, సింగమరాజు, రాయచూరులో ఒక దేవాలయాన్ని నిర్మించి అక్కడ ఒక శాసనం వేయించాడు. ఆ శాసనం క్రీ.శ.1521 జూలై 21వ తేదీగా నమోదు చేయబడింది. కనుక 1521 జూలై లోపలనే రాయచూరును జయించి ఉండాలి. ఆధారాలన్నింటిని పరిశీలించి The Forgotten Empire రాసిన రాబర్ట్ సీవెల్

రాయచూరు యుద్ధం క్రీ.శ.1520 మే నెల 19వ తేదీన జరిగిందని నిర్ణయించాడు. కాని ఈ తేదీని ఓరుగంటి రామచంద్రయ్య అంగీకరించలేదు. సీవెల్ నిర్ణయం దురదృష్టకరమైనదని రాశాడు. తంజావూరు జిల్లాలో తిరుక్కిగ్రెయారు శాసనంలో అపత్యహయార్ అనే బ్రాహ్మణుడు తాను రాయచూరు యుద్ధంలో పాల్గొన్నాడని చెప్పుకొన్నాడని, ఆ శాసనం ప్రకారం రాయచూరు యుద్ధం క్రీ.శ.1521 డిశంబర్ 20-క్రీ.శ.1522 మే మధ్య కాలంలో జరిగిందని రామచంద్రయ్య భావించారు. అతడు - రాయచూరు క్రీ.శ.1520 వరకు రాయల ఆధీనంలో ఉందని, ఆ సంవత్సరంలో ఇస్మాయిల్ రాయచూరును జయించడానికి ప్రయత్నించి కృష్ణాయుద్ధంలో ఓడిపోయాడు. కాని తిరిగి సైన్యాన్ని సమకూర్చుకొని క్రీ.శ.1521లో రాయచూరును జయించాడు. అంటే క్రీ.శ.1520-21లో కృష్ణ, రాయచూరు అనే రెండు యుద్ధాలు జరిగాయి అని రామచంద్రయ్య తీర్మానించారు కనుక రాయచూరును తిరిగి జయించడానికి రాయలు క్రీ.శ.1522లో దండెత్తాడు. అతడు 20 రోజుల యుద్ధం తర్వాత క్రీ.శ.1522 జూన్ 13వ తేదీన రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించాడని నిర్ణయించాడు.

రాయచూరు యుద్ధం తర్వాత పరిణామాలు: రాయచూరు ఆక్రమణ బహమనీ సుల్తాన్‌లందరికీ విపరీతమైన భయాన్ని కలుగజేసింది. విజయనగర రాజ్యాన్ని అదుపులో ఉంచాలని గోల్కొండ, అహమ్మద్‌నగర్, బీదర్, బేరార్ సుల్తాన్‌లందరూ రాయలవద్దకు రాయబారులను పంపి ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్‌కు తగిన శాస్తి జరిగింది, అది తమకు కూడా ఆమోదమే, కాని యుద్ధంలో స్వాధీనం చేసుకున్న అశ్వాలు, గజాలు, శతఘ్నులను అతని భూములను అతనికి తిరిగి అలా ఇవ్వనీ పక్షంలో తామంతా కలసి రాయలపై దండెత్తగలమని రాయబారం పంపారు. అప్పుడు రాయలు రాయచూరులోనే ఉన్నాడు. వారి బెదిరింపులకు రాయలు ఆగ్రహోదగ్రుడై వారి బెదిరింపులకు భయపడేది లేదని, అందరూ కలసి వచ్చినా ఎదుర్కోటానికి సిద్ధంగా ఉన్నానని అవసరమైతే తానే వారి భూములలోకి వచ్చి వారిని ఎదిరించగలనని, అలాంటి బెదిరింపులు మానుకోమని వారి రాయబారి చేతనే చెప్పి పంపాడు. దానికి వారు కిమ్మనలేదు. తర్వాత రాయలు తన రాజధానికి వెళ్లిపోయాడు.

ఇస్మాయిల్ రాయబారం: బెదిరింపులకు రాయలు లొంగిపోయేవాడు కాదని, ఎలాగైనా తాను పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి సంపాదించాలని రాయల వద్దకు ఇస్మాయిల్ తన రాయబారిని పంపాడు. ఆ సమయంలో రాయలు నాగలాపురాన్ని నిర్మిస్తూ అక్కడ ఉన్నాడు. రాయబారి రాయలను నాగలాపురంలోనే దర్శించాడు. రాయలు రాయబారిని గౌరవించి ఒక నెల రోజులు తన రాజధానిలో ఉంచుకొని అతనికి గౌరవ మర్యాదలు చేసి చివరకు ఇస్మాయిల్ ఆదిల్‌షా వచ్చి నా పాదాలను ముద్దు పెట్టుకుంటే అతని భూములన్నీ అతనికి తిరిగి ఇస్తానని చెప్పాడు. ఆ రాయబారి బీజాపూరు వెళ్లి సుల్తాన్‌కు రాయల సందేశం వినిపించాడు.

అసద్‌ఖాన్ లారా రాయబారం-బీజాపూర్‌తో మళ్లీ యుద్ధం: ఇస్మాయిల్ ఎలాగైనా తన భూములను తాను పొందాలని తన ముఖ్య సలహాదారుడైన అసద్‌ఖాన్ లారాని విజయనగరం పంపి రాయలు ఎలా చేయమంటే అలా చేస్తాను, కాని రాయలను ఎక్కడ కలుసుకోవాలో తెలుసుకొని రమ్మని పంపాడు. అసద్‌ఖాన్ బెల్గాం పాలకుడు. అతనికి రాయలకు బందీగా చిక్కిన బీజాపూరు సేనాని సలాబత్‌ఖాన్ అంటే పడదు అతడే యుద్ధానికి కారకుడు. సుల్తాన్ మీరు ఎక్కడికి రమ్మనమంటే అక్కడికి వచ్చి తమ కాళ్లను ముద్దు పెట్టుకుంటాడు, ఆయనతో పాటు ఆయన తల్లి కూడా వస్తారు అని చెప్పాడు. అతని మాటలు నమ్మి రాయలు తన ఖైదులో ఉన్న సలాబత్‌ఖాన్‌కు మరణదండన విధించాడు. రాయలు తాను త్వరలో సరిహద్దులలోని ముద్గల్‌కోటకు వస్తానని అక్కడికి వచ్చి సుల్తాన్‌ను తనను కలుసుకొనమని అసద్‌ఖాన్‌కు చెప్పాడు. కొద్ది కాలం తర్వాత కృష్ణరాయలు సుల్తాన్‌కు దర్శనం ఇవ్వడం కోసం ముద్గల్ కోటకు వెళ్లాడు. కాని సుల్తాన్ గాని, అతని తల్లి గాని రాలేదు. దాంతో తాను మోసపోయాయని రాయలు గ్రహించి ఇస్మాయిల్‌కు బుద్ధి చెప్పాలని క్రీ.శ.1523లో గుల్బర్గాపై దండెత్తాడు. ఫిరోజాబాద్, హసనాబాద్, సాగర్‌కోటను జయించి వాటిని ధ్వంసం చేసి బీజాపూరు చేరాడు. బీజాపూరు కూడా సులభంగానే వశమైంది. ఇస్మాయిల్ ఆదిల్‌షా రాయలతో పోరాడలేదు. కాని రాయల సైన్యానికి ఆహార పదార్థాలు, నీళ్లు అందకుండా చేశాడు. దాంతో రాయల సైన్యం అక్కడ ఉండటానికి వీలు లేక రాయచూరు తిరిగి వచ్చింది. రాయలు బీజాపూరును ఆక్రమించిన సందర్భంలో ఇస్మాయిల్ ఖైదులో ఉన్న ముగ్గురు బహమనీ రాజకుమారులను విడిపించి ఒకరిని గుల్బర్గా రాజుగా చేశాడు. మిగిలిన ఇద్దరిని తనతో విజయనగరం తీసుకొని వచ్చి వారికి అన్ని వసతులు ఏర్పాటు చేసి గౌరవించాడు. బహమనీ సుల్తాన్ రెండవ మహమ్మద్ క్రీ.శ.1518లో మరణించాడు. అతనికి అహమ్మద్, అల్లావుద్దీన్ వలి ఉల్లా అహమ్మద్, అల్లావుద్దీన్ వలి ఉల్లా అనే ముగ్గురు కుమారులున్నారు.

వారిలో పెద్దవాడు క్రీ.శ.1517లోను, రెండవవాడు 1521లోను, మూడవవాడు 1521లోను నామమాత్రంగా రాజ్యం చేశారు. వారిని ఇస్మాయిల్ 1522లో ఖైదు చేశాడు. వారిని రాయలు విడిపించాడు. తెలుగు సాహిత్యం రాయలు పంచగడ, శంకరధార నవదా పాలకులను జయించాడని తెలుపుతోంది. రాయల ప్రధాన మంత్రి తిమ్మరుసు క్రీ.శ.1523లో పాండ్య రాజ్యంపై దండెత్తాడని పోర్చుగీసు వారు రాశారు. నవదా విజయాన్ని వసు చరిత్ర కూడా పేర్కొన్నది. శంకరధారను కె.వి.లక్ష్మణరావు గుజరాత్ సికిందర్‌షాతో పోల్చారు. ఈ విజయాలు ఎంతవరకు వాస్తవాలో తెలియదు. రాయల జీవితంలో చేసిన చివరి యుద్ధం ఈ రాయచూరు యుద్ధం. ఆ తర్వాత అతడు ఎవరితోను యుద్ధం చేయవలసిన అవసరం రాలేదు. సామంతులు గాని, సాంప్రదాయక శత్రువులైన గజపతులు, బహమనీలుగాని విజయనగరంపై కన్నెత్తి కూడా చూడలేకపోయారు. శ్రీకృష్ణదేవరాయలు శత్రువులకు సింహస్వప్నంగా నిలిచాడు. అతడు రాజ్యానికి వచ్చిన 10 సంవత్సరాలలో శత్రువులందరినీ ఓడించి విజయనగర సామ్రాజ్యాన్ని దక్షిణ భారతదేశంలో ప్రథమశ్రేణి రాజ్యంగా అతి బలిష్టంగా రూపొందించాడు. భారతదేశం అంతటా అతని కీర్తిప్రతిష్టలు మారుమోగాయి. క్రీ.శ.1526లో ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యాన్ని అంతం చేసి మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించిన బాబరు కూడా శ్రీకృష్ణదేవరాయల కీర్తిని తన బాబర్‌నామాలో విజయనగర రాజ్యశక్తిని, బలిమిని గురించి వర్ణించాడు. ఆ విధంగా రాయలు యావద్భారత దేశచరిత్రలో ప్రథమరాజుగా కీర్తి పొందాడు.

రాయచూరు యుద్ధ ఫలితాలు: రాయచూరు యుద్ధం వల్ల రాయలకు అంతర్వేది ప్రాంతం స్వాధీనమైంది. తర్వాత కొద్ది కాలానికి పోర్చుగీసు గవర్నర్ Ruy de Mello గోవాకు ఎదురుగా ఉన్న బీజాపూరు సుల్తాన్‌కు చెందిన ప్రధాన భూభాగాన్ని ఆక్రమించాడు. విజయనగర రాజ్యం, పోర్చుగీసు వారు లబ్ధి పొందారు. కాని రాజ్యం సరిహద్దులు నిర్ధారణ కాలేదు. అంతేగాకుండా ఆ యుద్ధం భవిష్యత్తులో విజయనగర రాజ్యానికి నష్టం చేకూరింది. రాయల విజయాలు బహమనీ సుల్తాన్‌లకు విపరీతమైన భయాన్ని కలుగజేశాయి. భవిష్యత్తులో తమ రాజ్యాలకు భద్రత లేదనే భావన వారికి కలిగింది. వారికి విజయనగరంపై అసూయ ద్వేషాలను కూడా కలిగించింది. అందువల్ల బీజాపూరు సుల్తాన్ తన స్థితిని బలపరచుకోవాలని తన ఇద్దరు సోదరీమణులలో ఒకరిని అహమ్మద్‌నగర్ బుర్హాన్‌షాకు మరొక సోదరిని బేరారు అల్లావుద్దీన్ ఇమద్‌షాకు ఇచ్చి వివాహం చేసి తన బలాన్ని పెంచుకొని బీదరు పాలకుడైన బరీద్‌ను ఓడించాడు. అదే కాలంలో అతని సేనాధిపతి బెల్గాం పాలకుడైన అసద్‌ఖాన్ గోవాపై దండెత్తి వారి గవర్నర్ Dom Duarte de Menezes ను ఓడించి గోవా ఎదురుగా ఉన్న భాగాన్ని ఆక్రమించాడు. కాని తిరిగి పోర్చుగీసు వారు అతనిని ఓడించి తరిమారు. మొత్తం మీద బీజాపూరు సుల్తాన్ తన బలదర్పాలను పెంచుకొని ఎప్పుడు రాయచూరు, అంతర్వేదిని ఆక్రమిస్తానా అని కాసుకొని కూర్చునే విధంగా చేసింది. అంతేగాక బహమనీ సుల్తాన్‌లందరూ ఏకమై క్రీ.శ.1565 సంవత్సరంలో విజయనగరాన్ని ధ్వంసం చేశారని, కనుక రాయచూరు యుద్ధం రాయల తప్పిదం అని ఓరుగంటి రామచంద్రయ్య వ్యాఖ్యానించాడు. కాని అది వాస్తవం కాదు. అంతర్వేది ప్రాంతం కోసం మొదటి నుండి యుద్ధాలు జరుగుతూనే ఉన్నాయి. కనుక ఆ యుద్ధాలలో ఇది కూడా ఒకటి. ఓరుగంటి రామచంద్రయ్య అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవలసిన పనిలేదు.

సామ్రాజ్య విస్తరణ: రాయచూరు యుద్ధ విజయంతో రాయల విజయనగర సామ్రాజ్యం ఉత్తరాన కృష్ణానది వరకు, దక్షిణాన సింహళం వరకు, తూర్పు, పడమరలలో బంగాళాఖాతం, అరేబియా సముద్రం వరకు విస్తరించినది. గజపతులు, బీదరు, గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లు ఆయనకు లోబడి ఉన్నారు.

సామ్రాజ్య వైభోగం-పరిపాలన: రాయలు తన ప్రధానమంత్రి తిమ్మరుసు సహాయంతో చక్కని పరిపాలనను ఏర్పరచి ధర్మపాలకుడు, ఉదారశీలుడు, న్యాయశీలుడు అని కీర్తి వహించాడు. ఆముక్తమాల్యదలో తాను చెప్పిన రాజనీతి సూత్రాలను పరిపాలనలో పాటించాడు. ఇవి సాంప్రదాయ హిందూ రాజనీతి సూత్రాలే అయినా అందులో రాయల స్వానుభవం ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను పటిష్ఠంగా ఏర్పాటు చేశాడు. రాయలు యోధాగ్రేసరుడు, విజేత, గొప్ప పరిపాలనాదక్షుడు, రాజనీతి పారంగతుడు, అంతకు మించి గొప్ప సేనాని. సాధారణంగా రాయలు యుద్ధంలో స్వయంగా తన సైన్యాలను తానే నడుపుకొంటాడు. శత్రువులను ఓడించడంలో అతడు హిందూ ముస్లిం భేదం చూపలేదు. అందరి మీదా ఒకే పట్టుదల చూపాడు. అతని సైన్యాలు శత్రురాజుల అందరి రాజ్యాలలో ప్రవేశించి వీరవిహారం చేశాయి. ప్రమాద సమయాలలో, ఓటమి కలిగే సమయాలలో కూడా అమిత ధైర్యసాహసాలు ప్రదర్శించి విజయాలు సాధించాడు. ఓడిన శత్రువుల మీద హిందూ సాంప్రదాయ

విధానమైన ఔదార్యాన్ని చూపి వారిని ఆదరించాడు. యుద్ధంలో గాయపడిన సైనికులను పరామర్శించి వారికి కావలసిన వైద్య ఆహారాది అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశాడు. యుద్ధంలో మరణించిన సైనికులను దగ్గర ఉండి దహన క్రియలు చేయించేవాడని న్యూనిజ్ రాశాడు. శౌర్యాన్ని ప్రదర్శించిన సైనికులను సత్కరించాడు. సైనికుల అభిమానాన్ని సంపాదించి ఉత్తమ సేనాధిపతిగా కీర్తి పొందాడు. రాజసేవలోకి మనుషులను ఎంచుకొనే సమయంలో అతడు శక్తి సామర్థ్యాలకే ప్రాధాన్యతనిచ్చాడు. మనుషుల శక్తిసామర్థ్యాలను అంచనా వేయడంలో రాయలు గొప్ప ప్రజ్ఞాశాలి. సమర్థులను, రాజభక్తులను మాత్రమే రాజసేవలోకి తీసుకున్నాడు. దుర్గాధ్యక్షులుగా బ్రాహ్మణులను నియమించాడు. బ్రాహ్మణులను దుర్గాధ్యక్షులుగా నియమించడం చాలా మంచిదని ఆముక్త మాల్యదలో కూడా రాశాడు. రాయలకు 10 లక్షల కాల్బలం, 35 వేల అశ్వదళం ఉండేది. అవసర సమయాలలో అమర నాయకులు, మరొక 10 లక్షల సైన్యాన్ని సమకూర్చగలరు. రాయలసైన్యంలో బోయల విభాగం ఉండేది. గజపతిపై దండయాత్ర చేసినప్పుడు అతని బోయసైన్యం కొండవీడులో బీభత్సం సృష్టించింది. రాయలసేనలు అంతకు ముందెన్నడూ ఎరుగని అద్భుత విజయాలు సాధించాయి. రాయలు నిత్యం ప్రజాక్షేమాన్ని కోరేవాడు. అతని కాలంలో ప్రజలు పెళ్లి సుంకాన్ని నిరసించగా దానిని రద్దు చేసి ప్రజలను సంతోషపరిచాడు. అతడు అనేక చెరువులు తవ్వించి వ్యవసాయాన్ని పెంచాడు. విదేశీ వాణిజ్యాన్ని ప్రోత్సహించి దేశాన్ని ఐశ్వర్యవంతం చేశాడు అనేక ప్రజాహిత కార్యాలను చేపట్టాడు. రాయల కాలంలో రాజధాని విజయనగరం విపరీతంగా పెరిగింది. విజయనగరంలో నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజులు జరిపేవారు. ఆ ఉత్సవాలకు దేశ విదేశీయులు అనేక మంది హాజరయ్యేవారు. అప్పుడు జరిగే కార్యక్రమాలు విదేశస్తులను సమ్మోహన పరిచేవట. ఆ రోజున విజయనగర సైన్యాలు విన్యాసాలు జరిపే వారని, సామంతులు రాయలకు కప్పాలు కట్టేవారని విదేశీ యాత్రికులు రాశారు. విజయనగర సామ్రాజ్యం అతి విశాలమైనది. 900 మైళ్ల తీర రేఖ ఉండేది. 300 రేవు పట్టణాలుండేవి. రాజ్యపు వార్షిక ఆదాయం 240 కోట్లు. 25 మంది రాజప్రతినిధులు, 200 మంది అమరనాయకులు రాష్ట్ర పాలకులుండేవారు. రాజధాని సమస్త సౌకర్యాలతో భూలోక స్వర్గం లాగా ఉండేదని, రాజభవనంలో బంగారు, వెండి పాత్రలు మెరిసిపోతూ ఉండేవని, అంతఃపురం స్వర్ణమయంగా ఉండేదని, విశాలమైన వీధులు, సమస్త వస్తు సముదాయాలు, నవరత్నాల రాశులతో నిండిన అంగళ్లు దేశ విదేశీ వర్తకులతో కళకళలాడుతుండేదని, ఉద్యానవనాలతో, సరోవరాలతో విజయనగరం రోమ్ నగరాన్ని మించిన వైభవంతో వెలుగుతుండేదని పేస్ వర్ణించాడు. అలాంటి రాజధానిలో నివసించే రాయల కీర్తి విశ్వవ్యాప్తంగా వ్యాపించి ఉందని కూడా రాశాడు.

కళాపోషణ-సాహిత్యసేవ: రాయచూరు యుద్ధం తర్వాత రాయలకు విరామం లభించింది. ఆ విరామ కాలంలో అతడు కవి పండిత గోష్ఠులతో కాలక్షేపం చేశాడు. ఈ కాలంలోనే అతడు ఆముక్తమాల్యదను రచించాడు. తాను ఈ కావ్యాన్ని శ్రీకాకుళ ఆంధ్రమహావిష్ణువు ఆనతిన రాశానని చెప్పుకున్నాడు. ఆ కావ్యంలో తాను తన జీవితంలోని సంపాదించిన రాజకీయ అనుభవ సారాన్నంతటిని రాజనీతిగా వివరించాడు. గజపతిపై సాధించిన విజయానికి చిహ్నంగా అతడు తన రాజధానిలో భువనవిజయం అనే భవనాన్ని నిర్మించి దానిని కవి పండిత చర్చలకు కేటాయించాడు. అందులో ఎల్లప్పుడూ కవి పండితుల గోష్ఠులు జరిపేవాడు. అందువలన శ్రీకృష్ణదేవరాయల కాలంలో అమోఘమైన సాహిత్య సృష్టి జరిగింది. కనుక అతనికి సంగీత, సాహిత్య, సమరాంగణ సార్వభౌమ అని బిరుదు వచ్చింది. అతడు సంస్కృత, ఆంధ్రభాషకు, తెలుగు సాహిత్యానికి, కన్నడ భాషలకు ఎనలేని సేవ చేశాడు. అందువల్ల ఈయన కాలం రాజకీయంగానే గాక సాహిత్యపరంగా కూడా స్వర్ణయుగమని ప్రసిద్ధి చెందింది.

స్వయంగా కవి: అతడు స్వయంగా కవి. సంస్కృతం, తెలుగు, కన్నడ భాషలలో పండితుడు. తెలుగులో ఆముక్తమాల్యద అనే గ్రంథాన్ని రాశాడు. అది తెలుగులో పంచకావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. సంస్కృతంలో జాంబవతీ పరిణయం, మదాలస చరిత్ర, సత్యావధు ప్రీతకం అనే కావ్యాలు రాశాడు. అందులో జాంబవతీ కళ్యాణం, ఆముక్తమాల్యద కావ్యాలు నేటికినీ నిలచి ఉన్నాయి.

భువన విజయం-అష్టదిగ్గజాలు: రాయలు తాను స్వయంగా కవి. కనుక కవిత్వ మాధుర్యం తెలుసు. కనుక ఎల్లప్పుడూ కవి పండిత గోష్ఠులు జరిపేవాడు. ఆయన ఆస్థానంలో అష్టదిగ్గజాలనే పేరు పొందిన కవులుండేవారు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుడు, మాదయగారి మల్లన, పింగళి సూరన్న, ధూర్జటి, భట్టుమూర్తి, తెనాలి రామకృష్ణుడు. కాని వీరు అందరూ రాయల ఆస్థానంలోని వారు కాదని చరిత్రకారుల

అభిప్రాయం. అల్లసాని పెద్దన మనుచరిత్ర, నంది తిమ్మన పారిజాతాపహరణం అనే గ్రంధాలు రాసి రాయలకు అంకితమిచ్చారు. పెద్దనకు గండపెండేరం తొడిగి పల్లకీమోసి కొకట గ్రామాద్యనేక అనే అగ్రహారాన్ని యిచ్చి సత్కరించాడు. ఈ కవులు వెలయించినవన్నీ ప్రబంధాలే కనుక ఈ యుగానికి ప్రబంధయుగమని పేరు వచ్చింది. ఆంధ్ర సాహిత్యంలో ప్రబంధాలు అనేకం వెలసి ఆంధ్రభాష అపూర్వమైంది. కనుక రాయల కాలంలో తెలుగు భాషకు దేశభాషలందు లెస్సయనే కీర్తి కలిగి, రాయలకు చిర యశస్సును కలిగించింది. తెలుగు భాషకు స్వర్ణయుగం అని చెప్పబడింది. ఈ విధంగా ఆయన తెలుగుభాషకు, సంస్కృతానికి భోజుడు సేవ చేసినట్లు చేసి ఆంధ్రభోజుడని కీర్తి పొంది ప్రసిద్ధి చెందాడు.

ఇతర కావ్యాలు: లక్ష్మీనారాయణ కవి సంగీత సూర్యోదయమనే సంగీత కావ్యాన్ని సంస్కృతంలో రాసి దానిని రాయల కంకితం చేశాడు. ఇంకా వ్యాసరాయ అనే ద్వైతమతాచార్యుడు, తిమ్మన అనే కన్నడ కవి రాయల ఆస్థానంలో ఉండేవారు.

భువన విజయం సార్థక నామధేయం: ఇలాంటి కవుల చేత పరివేష్టితమైన రాయల ఆస్థానానికి భువన విజయమనే పేరు ఉండేదంటే ఆశ్చర్యం కాదు. అనేక కవులు దేశ దేశాల నుండి భువన విజయానికి వచ్చి సాహిత్య చర్చలలో పాల్గొని రాయలచే బహుమానాలు అందుకునే వారు.

మతం: రాయలు వైష్ణవుడు. ఈయన గురువు తాతాచార్యులు. కాని గొప్ప పరమత సహనం కలిగినవాడు. శివకేశవులకు ఎప్పుడూ భేదం చూపలేదు. వ్యాసతీర్థ అనే మధ్వమత పండితుని, వల్లభాచార్య అనే వైష్ణవ మతాచార్యుని, అప్పయ దీక్షిత అనే శైవ పండితుని ఆదరించాడు. ముస్లింలకు తన రాజ్యంలో స్వేచ్ఛను ప్రసాదించాడు. కాళహస్తి, అహోబిలం, తిరుపతి, సింహాచలం, శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణు దేవాలయాలు దర్శించి దానధర్మాలు చేశాడు. సింహాచలనాధునికి బహూకరించిన పచ్చల పతకం గొప్ప విలువ కలిగింది. ఈ సందర్భంలో పొట్నూరు వద్ద విజయస్తంభం కూడా నాటించాడు. అతడు దేవాలయాలకు చేసినన్ని దానధర్మాలు మరెవరూ చేయలేదు.

పరమత సహనం: ఇతర దేశాల మతాల పట్ల కూడా సామరస్య ధోరణిని ప్రదర్శించాడు. నీవు యూదువా, అరబ్బీవా, క్రైస్తవుడవా అని ఎవరూ అడిగేవారు కాదని బార్బోసా రాశాడు. రాయలే కాదు ప్రజలు కూడా పరమత సహనాలు ప్రదర్శించే వారని కూడా రాశాడు. శ్రీశైలంలో శాంత లింగయ్య అనే శైవుడు అక్కడ జైనులను హింసిస్తున్నాడని తెలిసి అతనిని దండించి రాయలు తన పరమత సహనాన్ని చాటుకున్నాడు.

శిల్పకళాసేవ: రాయలు గొప్ప నిర్మాత. విజయనగరంలో అనేక దేవాలయాలు, భవనాలు నిర్మించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాడు. విజయనగరం అనేక సరోవరాలతో, ఉద్యానవనాలతో ఎంతో రమణీయంగా రోమ్ లాగా వెలుగుతోందని పేస్ వర్ణించాడు. కృష్ణరాయలు తాను పట్టాభిషిక్తుడైన కొత్తలో హంపిలోని పంపావతి విరూపాక్ష దేవాలయానికి ఒక గోపురాన్ని నిర్మించాడు. అంతకు పూర్వం మాధవ విద్యారణ్యుని గౌరవార్థం హరిహరబుక్కరాయలు నిర్మించిన ఆలయగోపురం శిధిలం కాగా దానికి మరమ్మత్తులు చేశాడు. ఒక రంగ మంటపాన్ని కూడా నిర్మించాడు. విజయనగరంలో హజారా రామస్వామి, విరల్‌స్వామి, కృష్ణస్వామి దేవాలయాలను నిర్మించాడు. క్రీ.శ.1513లో ఉదయగిరిని ఆక్రమించిన తర్వాత అక్కడ లభించిన కృష్ణ విగ్రహం ఎంతో మనోహరంగా ఉండగా దానిని తెచ్చి విజయనగరంలో కృష్ణస్వామి ఆలయాన్ని నిర్మించాడు. అదే సంవత్సరంలో రాజప్రాసాదం వద్ద హజరా రామస్వామి ఆలయాన్ని ప్రారంభించాడు. కాని దానిని పూర్తి చేయలేదని సీవెల్ మద్రాసు క్రిష్టియన్ కాలేజీ మ్యాగజైనులో 1886 డిశంబర్‌లో ప్రకటించిన Mr. Rea ఆర్టికల్‌ను బట్టి రాశాడు. తర్వాత రాయలు విజయనగరంలో నీటి వనరులను నిర్మించడానికి కృషి చేశాడు. హిందూరాజులు వ్యవసాయానికి, నీటి పారుదల సౌకర్యాలకు ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరని గ్రిబెల్ అనే పండితుడు రాశాడు. నదులకు, ఆనకట్టలు కట్టి మైళ్ల కొలది కాలువలు తవ్వి మాగాణి భూములకు అందించే వారని కూడా రాశాడు. కనుక భారతీయ సాంప్రదాయాన్ని అనుసరించి శ్రీకృష్ణదేవరాయలు కూడా నీటిపారుదల సౌకర్యాలకై కృషి చేశాడు. అతడు క్రీ.శ.1521వ సంవత్సరంలో తుంగభద్రానదిపై కోరగల్లు డామ్ (Korragal Dam)ను నిర్మించాడు. ఇది కరినశిలలపై 15 మైళ్ల దూరం నిర్మింపబడింది. ఇది విజయనగరానికి మంచి నీటిని సరఫరా చేసింది. అలాగే బసవన్న కాలువను కూడా తవ్వించాడు. ఈ రెండూ నేటికి కూడా ఉపయోగపడుతున్నాయి. విజయనగరంలో అతడు ఒక పెద్ద చెరువును నిర్మించాడు. ఈ చెరువు పోర్చుగీసు ఇంజినీరు పర్యవేక్షణలో

నిర్మింపబడింది. పేస్, న్యూనిజ్‌లు ఇద్దరూ ఈ చెరువును గురించి రాశారు. వారిలో పేస్ తాను ఆ చెరువు నిర్మాణాన్ని స్వయంగా చూశానని రాశాడు. ఈ చెరువు నగరానికి వాయవ్యంగా ఉన్న సందూర్ పర్వతాల వద్ద ఉన్న చెరువుగా సీవెల్ గుర్తించాడు. ఈ చెరువు గట్టు హోస్‌పేటకు వెళ్ళే మార్గంగా ఉపయోగిస్తున్నారు. ఈ చెరువు రెండు పనులకు ఉపయోగపడింది. రాయలు నూతనంగా నిర్మించిన నాగలాపురానికి తాగునీటికి, ఆ పరిసర పొలాలకు వ్యవసాయానికి ఈ చెరువు ఉపయోగపడిందని సీవెల్ భావించాడు. ఈ చెరువు గట్టు దక్షిణ ప్రాంతాలకు రహదారిగా కూడా ఉపయోగింపబడింది. పేస్, న్యూనిజ్‌లు ఇద్దరూ ఈ చెరువును వర్ణించారు. ఆ చెరువు నిర్మించేటప్పుడు 60 మందిని బలి ఇచ్చారని, అక్కడ అనేక వేల మంది పని చేస్తున్నారని పేస్ రాశాడు.

క్రీ.శ.1520కి ముందు రాయలు నాగలాపుర పట్టణాన్ని ప్రారంభించి 1523 నాటికి దానిని పూర్తి చేశాడు ఈ పట్టణం విజయనగరానికి దక్షిణంగా రెండు మైళ్ళ దూరంలో ఉంది. రాయలు ఆ పట్టణాన్ని తన తల్లి నాగలాదేవి జ్ఞాపకార్థం నిర్మించి దానిని తన నివాసంగా చేసుకున్నాడని విదేశీ యాత్రికులు రాశారు. విదేశీ యాత్రికులు, దక్షిణ దేశ ప్రజలు నాగలాపురం నుంచే విజయనగరంలోకి ప్రవేశించేవారట. అంటే ఈ పట్టణం విజయనగరం నుండి దక్షిణ దేశానికి వెళ్ళే మార్గంలో నిర్మింపబడింది. రాయచూరు యుద్ధానంతరం ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ పంపిన రాయబారి విజయనగరం చేరేటప్పుడు రాయలు నాగలాపురంలో ఉన్నాడని తెలిసి అక్కడికి వచ్చి రాయలును కలుసుకున్నాడు. ఈ నాగలాపురాన్ని నేడు హోస్‌పేట అని పిలుస్తున్నారు.

తర్వాత రాయలు తుంగభద్రానది ఒడ్డున విఠల్‌స్వామి దేవాలయాన్ని ప్రారంభించాడు. Mr. Rea ఇది చాలా అద్భుత దేవాలయం అని వర్ణించాడు. ఇది కృష్ణరాయల కాలంలో పూర్తి కాలేదు. దాని నిర్మాణాన్ని అచ్యుతదేవరాయలు, సదాశివరాయలు కొనసాగించారు. క్రీ.శ.1561 నాటి ఒక శాసనం అక్కడ ఉంది. కనుక దాని నిర్మాణం క్రీ.శ.1565 తళ్లికోట యుద్ధం దాకా కొనసాగింది. రాయలు క్రీ.శ.1528లో విజయనగరంలో అద్భుతమైన అతి పెద్ద ఉగ్రనారసింహ విగ్రహాన్ని చెక్కించాడు. ఇది ఒకే పెద్ద గ్రానైట్ రాతితో చెక్కించిన విగ్రహం ఇది కృష్ణస్వామి ఆలయానికి నైరుతి దిశలో ఉంది. ఈ విగ్రహ పోషణకు రాయలు గ్రామాలను దానం చేసి శాసనాలు వేయించాడు. క్రీ.శ.1565లో తళ్లికోట యుద్ధం తర్వాత ముస్లింలు ఈ విగ్రహాన్ని కొంత విరగ్గొట్టారు అయినా అది నేటికీ నిలిచి ఉన్న పెద్ద విగ్రహం. రాయలు విఠల్ ఆలయంలో నిర్మించిన సప్తసంగీత స్వరస్తంభాలు ప్రపంచ వింతని చెప్పవచ్చును. విఠలాలయం ప్రాంగణంలో ఉన్న ఏకశిలారథం మరొక వింత. ఇంకా కాళహస్తి తిరుపతి, కంచి, అహోబిలం, శ్రీరంగం దేవాలయాలను మరమ్మత్తు చేసి అనేక మండపాలను, గోపురాలను నిర్మించాడు. క్రీ.శ.1516లో కాళహస్తిలో శతస్తంభ మంటపం, ఒక గోపురాన్ని నిర్మించాడు. అలాగే తిరుమల వెంకటేశ్వరాలయపు గర్భగృహాన్ని, దానికి ఒక సహస్ర మంటపాన్ని, దాని ఎదురుగా తటాకాన్ని 11 అంతస్థుల గోపురాన్ని నిర్మించాడు. వాటిలో కాళహస్తిలోని గోపురం, తిరుపతిలోని కళ్యాణమండపం అద్భుతంగా ఉంటాయి. రాయల కాలంలో తయారు చేయబడిన నరసింహ, హనుమంత, వినాయక విగ్రహాలు అత్యంత సుందరంగా నాటి శిల్పకళకు మచ్చుతునకలుగా నేటికీ ఉన్నాయి. సోమ్‌పేట, లేపాక్షి దేవాలయాలలోని అద్భుత శిల్పాలు నేటికీ ఆయన ఘనతను చాటుతున్నాయి. తన తల్లి నాగాంబిక గౌరవార్థం నిర్మించిన నాగలాపురం వద్ద ఉన్న నాగలాంబయను చెరువు నేటికి తిరుమల దేవస్థానంలో తన దేవేరులు తిరుమల డివియర్, చిన్న డివియర్‌ల విగ్రహాలతో ఉన్న రాయల కంచు విగ్రహాలు నేటికీ వన్నె చెదరకుండా ఉన్నాయి. ఈ విధంగా శిల్పకళకు అమోఘ సేవ చేశాడు. ఇతని కాలంలోనే లేపాక్షిలో విరూపన్న ప్రసిద్ధి చెందిన లేపాక్షి దేవాలయాన్ని నిర్మించాడు. రాయలు దేవాలయాలకు దానం చేసిన అనేక శాసనాలు లభించాయి. వాటిలో క్రీ.శ.1510 నాటి హంపి శాసనం, 1513-14 నాటి శంకలిపుర శాసనం (ఈ శాసనం రాజధానిలో రాజభవనం వద్ద ఉన్న వినాయక విగ్రహ పోషణకు దానం చేసిన భూములను నమోదు చేసింది), ఇంకా 1509-10, 1512-13, 1514-15, 1522-23, 1527-28 శాసనాలు ముఖ్యమైనవి. రాయల చివరి శాసనం క్రీ.శ.1529 ఏప్రిల్ 23వ తేదీ శుక్రవారం నాటిది. ఈ శాసనం ఉగ్రనారసింహుని విగ్రహానికి ఎదురుగా ఉంది. ఆ దేవునికి దానం చేసి వేయించిన శాసనం. ఇవన్నీ దాన శాసనాలు. ఈ విధంగా రాయలు అనేక దేవాలయాలకు దానాలు చేసి శాసనాలు వేయించాడు.

అసాధారణమైన వ్యక్తిత్వం-ఘనత: రాయలు మహావ్యక్తి. అతడు సమస్త రాజ్యలక్షణ పరిపూర్ణుడని, ఎల్లప్పుడూ చిరునవ్వుతో, హుందాగా ఇష్టాగోష్ఠిలో ఉండేవాడని, ఔదార్యంలోను, దానధర్మాలలోను, అతిధి

మర్యాదలలో అతనిని మించిన వారు లేరని పాశ్చాత్యులు రాశారు. విజయనగర చరిత్ర రాసిన సీవెల్ రాయలు దేహ సౌష్టవం కోసం వంటికి నూనె రాసుకొని అది ఇంకిపోయే వరకు వ్యాయామం చేసేవాడని రాశాడు. ప్రతి రోజు సాముగరిడీలు కూడా చేసేవాడని రాశాడు.

ప్రజల యోగక్షేమాలు: ప్రజల యోగక్షేమాలు చూడటంలోను, ప్రజోపయోగకార్యాలు చేపట్టడంలోను, సామంతులను అదుపు పెట్టడంలోను, ఓడిన శత్రువుల మీద ఔదార్యం ప్రదర్శించటంలోను, శత్రువులను భయభ్రాంతులను చేయటంలోను అసామాన్య వ్యక్తిత్వంతో ఇతరులను ఆకర్షించడంలోను, సాహిత్యకళలలో విశేష అభిమానం చూపడంలోను, దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానధర్మాలు చేయడంలోను ఆయనకు ఆయనే సాటి అని ఆచార్య కృష్ణశాస్త్రి, ఈశ్వరీ ప్రసాద్ ఘనంగా వర్ణించారు. రాయలు బహుముఖ ప్రజ్ఞాశాలి అని పేస్ ప్రశంసించాడు. ఒక్క మాటలో చెప్పాలంటే శ్రీకృష్ణదేవరాయలు భూమిపై అవతరించిన మహోన్నత పురుషులలో మహోన్నతుడు.

రాయల చివరి దశ- విషాధ మరణం క్రీ.శ.1529: ఇంత మహోజ్వలంగా వెలిగిన రాయల జీవితం చివరి దశలో మానసిక వేదనతో విషాధాంతంగా ముగిసింది. రాయలకు 12 మంది భార్యలు. వారిలో పట్టమహిషి తిరుమల దేవి. రెండవ భార్య చిన్నాదేవి. మూడవ భార్య తుక్కాంబ, గజపతి కుమార్తె. ఈమెకు తుక్కాంబ, భద్రాదేవి, జగన్మోహిని, తుష్క, లక్ష్మీదేవమ్మ, లక్ష్మీదేవి అని అనేక పేర్లున్నాయి. ఆముక్తమాల్యదలో లక్ష్మీకసుగంధనిగా వర్ణింపబడిందని వెంకటరమణయ్య అన్నారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. పెద్ద కుమార్తె ఆరవీటి రామరాయలను, రెండవ కుమార్తె అతని తమ్ముడు తిరుమల రాయలను వివాహం చేసుకున్నారు. కుమారుడు తిరుమల రాయలు. అతనికి ఆరేళ్ల ప్రాయంలో క్రీ.శ.1524లో పట్టాభిషేకం జరిపి తాను చిన్న రాజుకు ప్రధాన మంత్రిగా వ్యవహరించాడని న్యూనిజ్ రాశాడు. తిరుమల రాయలను ఎవరో విషప్రయోగం చేసి చంపారు. అందుకు రాయలు తన ప్రధాన మంత్రి తిమ్మరుసు విషప్రయోగం చేశాడని అనుమానించాడు. రాయలు మంత్రి తిమ్మరుసును దర్బారుకు పిలువనంపి నిండు దర్బారులో అతనిపై హత్యానేరం మోపి అతని కుటుంబాన్ని ఖైదు చేశాడని న్యూనిజ్ రాశాడు. కొంతకాలం తర్వాత తిమ్మరుసు కుమారుడు తిమ్మ దండనాయకుడు ఖైదు నుండి తప్పించుకొనిపోయి విజయనగరానికి దక్షిణంగా ఉన్న సందూర్ పర్వతం మీద ఉన్న కోటలో చేరి రాయలపై తిరుగుబాటు చేసి దేశంలో అల్లర్లను లేవదీశాడు. ఆ దుర్గాన్ని రామదుర్గం అని పిలిచేవారు. అందుకు కోపోద్రిక్తుడైన రాయలు చెరసాలలో ఉన్న తిమ్మరుసు, అతని తమ్ముడు గోవిందరాజును, వారి పుత్రులను చిత్రహింసలు చేసి వారి గుడ్లు పీకించాడట. కాని తర్వాత నిజం తెలిసి కృంగిపోయాడట. తీవ్రంగా అస్వస్థుడయ్యాడు. ఆ స్థితిలో బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా రాయచూరు, ముద్గల్‌లను ఆక్రమించడానికి తన సేనను నడిపాడు. అది తెలిసి సుల్తాన్‌ను ఎదుర్కోడానికి రాయలు తన అనారోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా సైన్యాన్ని సమాయత్తం చేసి స్వయంగా బయలుదేరాడు. రాయలు స్వయంగా యుద్ధానికి వస్తున్నాడని తెలిసి ఇస్మాయిల్‌కు దడపుట్టి వెనుక్కు వెళ్లిపోయాడు. రాయలు వెనుదిరిగి వస్తూ బెల్గాంపై దండెత్తాలని తలచాడు. అందుకోసం గోవాలోని పోర్చుగీసు వారి వద్ద ఆరువందల మేలు జాతి అశ్వాలను ఖరీదు చేశాడు. కాని ఆరోగ్యం ఇంకా దిగజారిపోయింది. కనుక అతడు బెల్గాంపై దాడి చేయకుండా విజయనగరం చేరాడు. రోజు రోజుకు ఆరోగ్యం క్షీణించిపోవడం ప్రారంభమైంది. తనకు మరణం సమీపించిందని తెలుసుకున్నాడు. కనుక తన వారసుని నిర్ణయించాలని భావించాడు. ఆనాడు రాజ్యానికి వారసత్వ హక్కు కలిగిన వారు నలుగురున్నారు. క్రీ.శ.1524లో పట్టాభిషిక్తుడైన తన ఆరేళ్ల కుమారుడు మరణించిన తర్వాత రాయలకు మరొక కుమారుడు కలిగాడు. అతని వయసు 18 మాసాలు. అతడు పట్టాభిషేకార్హుడు కాదు. తర్వాత తన అన్న వీరనరసింహరాయల కుమారుడున్నాడు. తర్వాత మరొక సోదరుడు రంగరాజు కుమారుడు సదాశివరాయలు ఉన్నాడు. తన మారు తమ్ముడు అచ్యుత దేవరాయలున్నాడు. వీరిలో అచ్యుత దేవరాయలు రాజ్యార్హుడని తలచి చంద్రగిరిలో బందీగా ఉన్న అచ్యుతరాయలను తన వారసునిగా ప్రకటించి శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ.1529లో మరణించాడు. రాయలు తన చిట్టచివరి శాసనం క్రీ.శ.1529 ఏప్రిల్ 23వ తేదీన శుక్రవారం నాడు వేయించాడు. ఈ శాసనం హంపిలోని ఉగ్రనారసింహుని విగ్రహం ఎదురుగా చెక్కించబడింది. కనుక రాయలు 1529 ఏప్రిల్ 23 తర్వాత మరణించి ఉండాలి. ఈ శాసనమేగాక రాయలు క్రీ.శ.1529లో మరణించాడని కొండపల్లి శాసనం కూడా ధృవపరుస్తోంది. అప్పటికి రాయల వయస్సు 45 సంవత్సరాల లోపుగా ఉంటుంది.

మహామంత్రి తిమ్మరుసు: శ్రీకృష్ణదేవరాయల కాలంలో స్మరించదగిన వ్యక్తులలో మహామంత్రి తిమ్మరుసు ముఖ్యుడు. తిమ్మరుసు అసలు పేరు సాళువ తిమ్మయ్య. ఇతడు చంద్రగిరి వాస్తవ్యుడు. చిన్నతనం నుంచీ గొప్ప మేధావి. అతని తెలివితేటలు గమనించిన సాళువ నరసింహరాయలు తన ఆస్థానంలోకి తీసుకున్నాడు నరసింహరాయల తర్వాత వీరనరసింహరాయలకు మంత్రి అయ్యాడు. నరసింహరాయలు అతని సవతి తమ్ముడైన శ్రీకృష్ణదేవరాయలను చంపించి గుడ్లు తెచ్చి చూపమని తిమ్మరుసును ఆదేశించాడు. తిమ్మరుసు శ్రీకృష్ణ దేవరాయలను కాపాడి మేక కళ్లను తెచ్చి వీరనరసింహరాయలకు చూపాడట. కృష్ణదేవరాయల శక్తి సామర్థ్యాలను గమనించి, అతనిని విజయనగర సింహాసనానికి తగిన వాడని అతనిని చంపకుండా కాపాడి వీరనరసింహుని మరణానంతరం శ్రీకృష్ణదేవరాయలకు పట్టాభిషేకం చేశాడు. ఆయన భావించినట్లుగానే శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని మహోన్నత శిఖరాలకు చేర్చాడు.

శ్రీకృష్ణదేవరాయలు సింహాసనానికి రాగానే తనను కాపాడిన తిమ్మరుసును ప్రధాన మంత్రిగా నియమించాడు. చిన్న తనం నుంచీ ఆయన తన మీద చూపిన ప్రేమకు కృతజ్ఞతగా అప్పాజీ అని పిలిచేవాడు గజపతులను జయించడంలో తిమ్మరుసు ప్రదర్శించిన ప్రజ్ఞ వర్ణనాతీతం. ముఖ్యంగా ప్రతాపరుద్ర గజపతికి, అతని సామంతులకు మిత్రభేదం కలిగించి నిర్వీర్యున్ని చేసి రాయలకు పాదాక్రాంతుడయ్యేలా చేశాడు. ఆ తర్వాత ప్రతాపరుద్ర గజపతి కూతురుని వివాహం చేసుకోమని రాయలకు సలహా ఇచ్చింది తిమ్మరుసే. గజపతితో వియ్యం రాయలకు ఇష్టం లేదట. కాని అది రాజ్య క్షేమానికి అత్యవసరమని తిమ్మరుసు అన్నపూర్ణాదేవితో రాయల వివాహం జరిపించాడు. కాని ఈ వివాహం వల్లనే తిమ్మరుసు జీవితం విషాదాంతమైంది.

మరణం: అన్నపూర్ణాదేవికి జన్మించిన రాయల కుమారుని శత్రువులు చాలా తెలివిగా చంపి, ఆ నేరం తిమ్మరుసుపై పడేలా చేశారు. రాయల కుమారుడు తిరుమల దేవి కుమారుడని కొందరు భావించగా గజపతి కుమార్తె అన్నపూర్ణాదేవి కుమారుడు అని కొందరు భావించారు. ఈ హత్య చేసింది గజపతి మనుషులని ప్రతీతి కాని దుఃఖంలో నిజానిజాలు విచారించకుండానే రాయలు తిమ్మరుసు గుడ్లు పీకించాడు. అప్పాజీకి చేసిన ద్రోహానికి కుమిలి మంచం పట్టి రాయలు మరణించాడు. ఆ తర్వాత తిమ్మరుసు ఎంత కాలమో జీవించలేదు. ఈ విధంగా మహామేధావి, అనన్య సామాన్య రాజనీతి దురంధరుడైన తిమ్మరుసు జీవితం విషాదాంతంగా ముగిసింది. దక్షిణ భారతదేశానికే వన్నె తెచ్చిన మహావ్యక్తులు రాయలు, తిమ్మరుసులు దాదాపు ఒకే కాలంలో లోకాన్ని వీడిపోయారు. అంతకుముందు బహమనీ సామ్రాజ్యంలో కూడా మూడవ మహమ్మద్‌షా తన ప్రధాన మంత్రి ఖ్వాజా మహమ్మద్ గవాన్‌ను రాజద్రోహిగా అనుమానించి కొండపల్లి కోటలో ఉరి తీయించాడు. తర్వాత నిజం తెలిసి కుమిలిపోయి ఆ మరుసటి సంవత్సరమే సుల్తాన్ కూడా మరణించాడు. ఈ యుగంలో ఇద్దరు మహామంత్రులు అనుమానింపబడి మరణదండనకు గురయ్యారు. నిజం తెలిసి ఇద్దరు చక్రవర్తులు కూడా కుమిలి మరణించారు. ఇదీ ఒక విశేషమే.

అచ్యుతదేవరాయలు క్రీ.శ.1530-1542: శ్రీకృష్ణదేవరాయలు తన మారు తమ్ముడైన అచ్యుత దేవరాయలను తన వారసునిగా ప్రకటించి అతనిని విజయనగర సింహాసనంపై అభిషేకం చేయాలని, అప్పుడు సర్వశిరః ప్రధానిగా ఉన్న చెల్లప్ప అనే పేరు గల సాళువ నరసింగ దండనాయకుని ఆదేశించి మరణించాడు తిమ్మరుసును తొలగించిన తర్వాత క్రీ.శ.1523లో సాళువ నరసింగ దండనాయకుని మంత్రిగా నియమించాడు చంద్రగిరి కోటలో బందీగా ఉన్న అచ్యుతదేవరాయలు విజయనగరం రావటానికి కొంత కాలం పట్టింది. ఆ సమయంలో సాళువ వీరనరసింగ దండనాయకుడు రాజ్యపాలన చేపట్టాడు. శ్రీకృష్ణదేవరాయలు అచ్యుత దేవరాయలను తన వారసునిగా ప్రకటించడం రాజకుటుంబానికి అసంతృప్తిని కలిగించింది. రాణులు తిరుమల దేవి, చిన్నాదేవిలు మౌనం వహించినా రాయల అల్లుడు అళియరామరాయలు కృష్ణరాయల కుమారుడైన 18 మాసాల పసి బిడ్డను సింహాసనంపై కూర్చోబెట్టి తాను అధికారం చలాయించాలని భావించాడు. కాని కృష్ణదేవరాయల ఆదేశం ప్రకారం ప్రధాని అయిన చెల్లప్ప రామరాయల ఆటలను సాగనివ్వలేదు. విజయనగరంలో జరుగుతున్న ఈ పరిణామాలు చంద్రగిరిలో బందిఖానా నుండి విడుదలైన అచ్యుతరాయలకు తెలిశాయి. అతడు విజయనగరంలో తన పట్టాభిషేకం నిర్విఘ్నంగా జరగదని గ్రహించాడు. కనుక అతడు చంద్రగిరి నుండి తిరుపతికి చేరి శ్రీ వేంకటేశ్వరుని సన్నిధానంలో క్రీ.శ.1529లో పట్టాభిషేకం జరుపుకున్నాడు. తర్వాత శ్రీకాళహస్తి చేరి అక్కడ తేదీ 21-10-1529లో రెండవమారు పట్టాభిషేక మహోత్సవం జరుపుకున్నాడు. అతడు రాజధానిని

చేరకుండానే రెండు పర్యాయాలు పట్టాభిషేకాలు జరుపుకోడానికి కారణం ఉంది. రాజధానిలో తనకు బలం లేదు. తిరుపతి, కాళహస్తిలలో జరిగిన తన పట్టాభిషేకానికి సామంతులు హాజరవుతారా లేదా అని తెలుసుకొని తనకున్న బలాన్ని గుర్తించదలిచాడు. తాను ఆశించినట్లుగానే అక్కడ జరిగిన పట్టాభిషేకానికి పరిసర ప్రాంతాల నుండి కొంత మంది సామంతులు హాజరయ్యారు. విజయనగరంలో కూడా అతనిని సాళువ వీరనరసింగ దండనాధుని అనుచరులు బలపరిచినట్లు వార్తలు వచ్చాయి. కనుక అతడు విజయనగరం చేరాడు. కాని అక్కడ రామరాయలకు తగినంత పలుకుబడి ఉందని గ్రహించాడు. రాజధానిలోనే గాక రాష్ట్రాలలో కూడా రామరాయలను సమర్ధించే అమర నాయకులున్నారని తెలుసుకున్నాడు. ముఖ్యంగా అనంతపురం, కందనవోలు, ఆలూరు, అరుకు దుర్గాధిపతులు అతనికి అండగా ఉన్నారు. కనుక రామరాయలతో విరోధం మంచిది కాదని అతనితో సఖ్యత పొందాలని నిర్ణయించుకున్నాడు. కాని అచ్యుతరాయల నిర్ణయాన్ని ప్రధాన మంత్రి సాళువ వీరనరసింగ దండనాధుడు వ్యతిరేకించాడు. అతని వ్యతిరేకతలను తోసిపుచ్చి అచ్యుతరాయలు రామరాజుతో చర్చలు జరిపి కృష్ణరాయల కుమారుని తనతో సమాన అధికారం కలవానిగా అంగీకరించి ఆ బాలుని తరపున రామరాయలు రాచకార్యాలు జరుపవచ్చని ఒప్పుకొని రామరాయలను కూడా పరిపాలనలో భాగస్వామి చేశాడు. వారి మధ్య అంగీకారం కుదిరిన తర్వాత దేవరాయలు విజయనగరంలో క్రీ.శ.1529 నవంబర్ 20వ తేదీన మూడవసారి పట్టాభిషేక మహోత్సవం జరుపుకున్నాడు. దాంతో సామ్రాజ్యం అంతటా అచ్యుతదేవరాయలు విజయనగర రాయలుగా గుర్తింపబడ్డాడు. రామరాయలతో అచ్యుతదేవరాయలు సఖ్యతపడటాన్ని అంత వరకు అచ్యుత దేవరాయల సింహాసనాన్ని శత్రుగతం కానివ్వకుండా కాపాడిన ప్రధాన మంత్రి సాళువ నరసింగ దండనాయకుడు సహించలేకపోయాడు. అతడు కుపితుడై ద్రావిడ దేశానికి పోయి తిరుగుబాటు లేపాడు. తిరువడి, తుంబిచ్చి పాలకులు అతనితో చేరిపోయారు. అదే తగిన సమయమని ఉమ్మత్తూరు పాలెగాండ్రు స్వతంత్రం ప్రకటించారు. విజయనగర రాజ్యంలోని పరిస్థితులను గమనించి బీజాపూరు సుల్తాన్ గజపతి రాజ్యంపై దండెత్తారు.

గజపతితో యుద్ధం: క్రీ.శ.1529 చివరి మాసాలలో వేయబడిన అచ్యుతదేవరాయల శాసనం ఒకటి అతడు ఓఢ్ర సేనలను జయించాడని, తులుకారులను అంటే తురకలను భయభ్రాంతులను చేశాడని వర్ణిస్తోంది. ఈ శాసనం వల్ల గజపతులు, ముస్లింలు ఒకేసారి సామ్రాజ్యంపై దండెత్తారని స్పష్టమవుతోంది. విజయనగర పరిస్థితులు తాను కృష్ణదేవరాయల కాలంలో పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి సంపాదించటానికి అనుకూలంగా ఉన్నాయని భావించి ప్రతాపరుద్ర గజపతి కృష్ణదేవరాయలు మరణించగానే విజయనగర రాజ్యంపై దండెత్తినట్లు కనిపిస్తోంది. అచ్యుతదేవరాయలు గజపతిని ఓడించి తరిమి 1529 చివరలో ఉరట్టూర్ శాసనం వేయించినట్లుగా కనిపిస్తోంది. ఆ శాసనమేగాక తారకబ్రహ్మ రాజీయ రచయిత రాధామాధవీ కూడా తన గ్రంథ పీఠికలో ఉత్కళ రాజుపై అచ్యుత దేవరాయలు విజయం సాధించినట్లు చెప్పాడు. శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానకవి అల్లసాని పెద్దన గజపతిని ఆక్షేపిస్తూ ఒక చాటువు రాశాడని అందులో కృష్ణరాయల చేతిలో ఘోర పరాజయాలు పొందిన గజపతి, రాయలు మరణించగానే కర్ణాటక సామ్రాజ్యంలోకి ఏ ధైర్యంతో ప్రవేశించావని అధిక్షేపించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. వీటన్నింటిని బట్టి చూడగా అచ్యుతదేవరాయలు రాజ్యానికి వచ్చిన తొలి రోజులలో తన రాజ్యంపై దండెత్తిన గజపతిని ఓడించి తరిమివేశాడని చెప్పవచ్చును. గజపతిపై విజయం సాధించిన తర్వాతనే 1529 చివరి మాసాలలో ఉరట్టూరు శాసనం వేయించాడు. అందులో గజపతిని తురకలను ఓడించినట్లు పేర్కొనబడింది. గజపతితో జరిగిన యుద్ధాలలో అప్పరసయ్య, సలకం పెదతిరుమలుడు విరల దేవరాయలనే సేనానులు పోరాడారు. విజయం తర్వాత సలకం పెద్ద తిరుమలదేవ రాయలకు కొండవీడు పాలనను అప్పగించాడు. కొందరు పండితులు అచ్యుతరాయలు తిరుపతి, కాళహస్తిలలో పట్టాభిషేకం జరుపుకొనే సమయంలోనే గజపతి కొండవీడుపై దండెత్తాడని, అది తెలిసి అచ్యుతరాయలు అటునుండి అటే కొండవీడు చేరి గజపతితో పోరాడి ఓడించి తరిమి తర్వాత విజయనగరం చేరి క్రీ.శ.1530 తొలి మాసాలలో మూడవసారి విజయనగరంలో పట్టాభిషేక మహోత్సవం జరుపుకున్నాడని భావించారు. కాని అది వాస్తవంగా కనిపించదు. విజయనగరంలో రామరాయల వైఖరి వలన అచ్యుత దేవరాయల కిరీటమే స్థిరపడలేదు. తనకు సింహాసనం దక్కుతుందో లేదో తెలియదు. తిరుపతి నుండే గజపతిపై యుద్ధానికి వెళ్లాడంటే నమ్మశక్యం కాని విషయం. పైగా గజపతిని జయించడానికి సైన్యం ఎక్కడి నుండి వచ్చింది. కనుక అతడు కాళహస్తి నుండి విజయనగరం వెళ్లి రామరాయలతో సఖ్యతపడి తన పదవిని స్థిరపరుచుకున్న తర్వాతనే తగిన సైన్యంతో గజపతిపై దండెత్తి ఉంటాడు.

కనుక విజయనగరంలో మూడవసారి పట్టాభిషేకం కూడా క్రీ.శ.1529లోనే జరిగి ఉంటుంది. కాని క్రీ.శ.1530లో అయి ఉండదు. కనుక మూడు పట్టాభిషేకాలూ ఉరట్టూరు శాసనం వేయించకముందే అంటే క్రీ.శ.1529లోనే జరిగాయని భావించాలి. విజయనగరంలో పట్టాభిషేకం జరుగగానే అచ్యుతరాయలు కంచిలోని కామేశ్వర, వరదరాజస్వామి దేవాలయాలకు అగ్రహారాలు ఇచ్చి కృష్ణరాయల ఆజ్ఞతో విజయనగర సింహాసనం అధిష్ఠించినట్లు శాసనాలు వేయించాడు.

గోల్కొండ నవాబు దండయాత్ర: ఉరట్టూరు శాసనంలో అచ్యుత దేవరాయలు తురకలను జయించినట్లు ఉంది. ఇందులో పేర్కొనబడిన తురక రాజు గోల్కొండ సుల్తాన్ అని భావింపబడింది. గజపతి దండయాత్ర తర్వాత గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా గోల్కొండపై దండెత్తాడు. ఈ కాలంలో కుతుబ్‌షా బలవంతుడై కోస్తాను జయించాలని కృష్ణకు ఉత్తరంగా గజపతి రాజ్యంపైన, కృష్ణకు దక్షిణంగా విజయనగర సామ్రాజ్యంపైన దాడులు ప్రారంభించాడు. అంతకు ముందు కృష్ణరాయల కాలంలోనే కొండవీడుపై దాడి చేసి పరాభవం పొందాడు. కృష్ణరాయల మరణంతో కొండవీటిని సులభంగా జయించవచ్చని కుతుబ్ ఉల్ ముల్క్ లేక కుతుబ్‌షా క్రీ.శ.1529లో కొండవీటిపై దండెత్తాడు. తన బలపరాక్రమాలతో ముస్లిం సైన్యాలను ఓడించానని బాచరసుడు అక్కడి శాసనంలో చెప్పుకున్నాడు. ముస్లిం పదాతిదళాన్ని వెలుగోటి తిమ్మనాయకుడు నాశనం చేశాడట. ఈ యుద్ధంలో బాచరసుడు, వెలుగోటి తిమ్మనాయకులు కుతుబ్‌షాతో పోరాడి తరిమివేసి కొండవీటిని కాపాడారు కొండవీడు అచ్యుతదేవరాయల అధికారంలోనే ఉంది. కనుక కుతుబ్‌షా ఓడిపోయాడని స్పష్టపడుతోంది.

రాయచూరు, అంతర్వేదిని పోగొట్టుకోవడం క్రీ.శ.1531: విజయనగరంలోని పరిస్థితిని గమనించిన బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ బీదర్ పాలకుడు, అమీర్ బరీద్‌ను, బేరారు పాలకుడైన ఇమాద్ ఉల్ ముల్క్‌ను కలుపుకొని అంతర్వేదిపై దండెత్తాడు. అచ్యుతరాయలు ఆరవీటి రామరాజు, తిమ్మని కుమారుడు అప్పలరాజు నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. వారు కూకరచర్ల వద్ద బీజాపూరు సైన్యంతో పోరాడారు. ఆ యుద్ధంలో అప్పలరాజు మరణించాడు. దాంతో అచ్యుతరాయలు స్వయంగా వచ్చి యుద్ధంలో పాల్గొన్నాడు అయినప్పటికీ మూడు నెలల పోరాటం తర్వాత ఇస్మాయిల్ రాయచూరు, ముద్గల్, అంతర్వేదిలను ఆక్రమించాడు. దాంతో క్రీ.శ.1531లో అంతర్వేది చేజారిపోయింది.

చెల్లప్ప లేక సాళువ నరసింగ దండనాథుని తిరుగుబాటు-దక్షిణదేశ దండయాత్ర: అచ్యుతరాయలు రామరాయలతో సఖ్యపడటాన్ని సహించలేని సాళువ నరసింగ దండనాథుడు విజయనగరం వదలి చోళమండలం చేరి తిరుగుబాట్లు ప్రారంభించాడు. అతనిని ఓడించటానికి అచ్యుతరాయలు నాగమనాయకుడనే కమ్మసేనానిని పంపాడు. నాగమనాయకుడు చెల్లప్పను ఓడించాడు. చెల్లప్ప ఓడిపారిపోయి చేరమండలాధీశుని ఆశ్రయించాడు చేరరాజు భూతలవీర శ్రీఉదయమార్తాండవర్మ విజయనగర సామంతుడు. అతడు శ్రీకృష్ణదేవరాయల మరణానంతరం స్వతంత్రం ప్రకటించి పాండ్య రాజ్యాన్ని కూడా జయించే ప్రయత్నంలో ఉన్నాడు. అతనితో సాళువ నరసింగడు చేరాడు. వారితో పాటు రామనాథ పాలకుడు తుంబచ్చి నాయకుడు, తిరువడి పాలెగాడు చేరారు. వీరందరి సహాయంతో మార్తాండవర్మ పాండ్యులు పాలించిన తెంకాసి రాజ్యంపై దండెత్తి నాటి పాండ్య రాజులైన కులశేఖర, సుందరపాండ్య, పరాక్రమ పాండ్యులను ఓడించి వారి రాజ్యాన్ని ఆక్రమించాడు. రాజ్యం పోగొట్టుకున్న కులశేఖర పాండ్యుడు అచ్యుతదేవరాయలను ఆశ్రయించాడు. ఇలాంటి స్థితిలో దక్షిణదేశాన్ని అదుపులోకి తేవడానికి అచ్యుతదేవరాయలు దక్షిణ దేశ దండయాత్రకు పూనుకున్నాడు. క్రీ.శ.1531లో అచ్యుతరాయలు తన బావమరుదులు సకలరాజు, పెదతిరుమలయ్య, చినతిరుమలయ్య, తిరుపతిరాజు పల్లవరాయ విరలదేవరాయ, నాగమనాయక మొదలైన సైన్యాధిపతులతో దక్షిణదేశంపై దండెత్తాడు. రాజనాథ డిండిముడు రచించిన అచ్యుతాభ్యుదయం ఈ దక్షిణదేశ దండయాత్రను విపులంగా వర్ణించింది. వారు మొదట చంద్రగిరి చేరి అక్కడ కొంత సైన్యాన్ని ఉంచి తర్వాత కాళహస్తి, తిరువణ్ణామలై, శ్రీరంగ క్షేత్రాలను దర్శించి ముందుకు సాగారు. తర్వాత అచ్యుతరాయలు తన సైన్యాన్ని రెండు భాగాలుగా చేసి ఒక భాగాన్ని తన పెద్ద బావమరిది పెద తిరుమలయ్య నాయకత్వంలో చేరదేశంపై పంపి తాను శ్రీరంగపట్టణం వైపు నడిచాడు. పెద తిరుమలయ్య చేరదేశంపై దండెత్తి ఉదయమార్తాండవర్మను ఓడించాడు. సాళువ నరసింహుడు తిరువడి పారిపోయాడు. తిరుమలయ్య తిరువడిపై దండెత్తి ఓడించాడు. అతడు ఓడిపోయి కానుకలను సమర్పించి నరసింహ దండనాథుని అప్పగించాడు. అతని కాళ్లు చేతులు కట్టి తెచ్చి శ్రీరంగంలో ఉన్న అచ్యుతరాయల ముందు

పదవేశాడు. చేర, చోళాధిపతులు కూడా అచ్యుతరాయలను దర్శించి తమ విధేయతను ప్రకటించారు. పెద తిరుమలయ్య తన ఈ విజయాలన్నింటికి చిహ్నంగా తామ్రపర్ణి నదీతీరంలో విజయస్తంభం నాటించాడు. తర్వాత అచ్యుతరాయలు తెంకాసిలో పాండ్య రాజైన శ్రీవల్లభపాండుని పునఃప్రతిష్ట చేశాడు. అతడు తన కుమార్తెను అచ్యుతదేవరాయలకిచ్చి వివాహం చేశాడు. తర్వాత అచ్యుతదేవరాయలు ఉమ్మత్తూరుపై దండెత్తి అక్కడ తిరుగుబాటు చేసిన పాలెంగాండ్రను ఓడించి కప్పాలు వసూలు చేశాడు. శ్రీరంగపట్టణ పాలెగాడు లొంగిపోయాడు. ఇదే సమయంలో అచ్యుతదేవరాయల సైన్యాలు సింహళం, తెంబులై, ఇరాడయార్నాయన్, కంబలం యార్పాణం జాఫ్నాలను కూడా జయించాయట. బాణరాజైన సుందరత్తోళుడైయార్ మావలి వాణదిరాయరు తిరుగుబాటు చేశాడు. అచ్యుతరాయలు అతనిని ఓడించడానికి నాగమనాయకుని కుమారుడైన విశ్వనాథ నాయకుని పంపాడు. విశ్వనాథనాయకుడు అతనిని ఓడించాడు. దాంతో దక్షిణ దిగ్విజయ యాత్ర పూర్తి అయింది. అచ్యుతదేవరాయలు విజయనగరం చేరాడు. మార్గమధ్యంలో అనేక మంది సామంతులు రాయలను కలిసి తమ విధేయతను ప్రకటించారు.

అచ్యుతరాయలు దక్షిణదేశ దండయాత్రలో ఉండగా కృష్ణదేవరాయల కుమారుడు క్రీ.శ.1534-35లో మరణించాడు. దాంతో రామరాయల అధికారానికి విఘాతం ఏర్పడింది. తిరిగి వచ్చిన అచ్యుతరాయలు రామరాయల అధికారాన్ని తీసిపారేసి తన బావమరుదులకు సర్వాధికారాలు అప్పగించాడు. వారిలో పెద్ద తిరుమలయ్యను సర్వశిరః ప్రధానిగా, చిన తిరుమలయ్యను సేనాధిపతిగా నియమించాడు. అధికారాన్ని పోగొట్టుకున్న రామరాయలు తగిన సమయం కోసం ఎదురుచూడసాగాడు.

రాయచూరు, అంతర్వేది పునరాక్రమణ క్రీ.శ.1534: క్రీ.శ.1534లో బీజాపూరు రాజ్యంలో పరిస్థితులు మారాయి. ఇస్మాయిల్ ఆదిల్‌షా గోల్కొండ రాజ్యంలోని కోవెలకొండను ముట్టడించాడు. అక్కడ యుద్ధం పూర్తికాక ముందే అతడు మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు మల్లు ఆదిల్‌ఖాన్ బీజాపూరు సింహాసనానికి వచ్చాడు. కాని అతనితో అతని తమ్ముడు ఇబ్రహీం ఆదిల్‌షా సింహాసనానికి పోటీ పడ్డాడు. అదే సమయంలో అసద్‌ఖాన్ లహరి కూడా మల్లు ఆదిల్‌ఖాన్‌తో వివాదపడి కొందరు సర్దారులను కూడగట్టి తిరుగుబాటు చేశాడు. అది తగిన సమయమని అచ్యుతదేవరాయలు అంతర్వేదిపై దండెత్తాడు. మల్లు ఆదిల్‌ఖాన్ విజయనగర సేనను ఎదిరించాడు, కాని ఓడిపోయాడు. దాంతో అతడు రాయచూరు, అంతర్వేదిని అచ్యుతరాయలకు అప్పగించి సంధి చేసుకున్నాడు. ఈ విజయంతో క్రీ.శ.1531లో పోగొట్టుకున్న అంతర్వేది తిరిగి అచ్యుతరాయల వశమైంది. అచ్యుతదేవరాయలు రాజధానికి తిరిగి వచ్చాడు. కాని వెంటనే గుత్తిలో తిరుగుబాటు జరిగింది. గుత్తి తిరుగుబాటు అణచడానికి అచ్యుతరాయలు సైన్యంతో గుత్తిపై దండయాత్రకు వెళ్లిపోయాడు. అతడు గుత్తిపాలకుని ఓడించి లొంగదీశాడు. తర్వాత అచ్యుతరాయలు క్రీ.శ.1537లో తిరుపతి యాత్రకు వెళ్లాడు.

రామరాయలు రాజ్యాన్ని ఆక్రమించడం క్రీ.శ.1537: అచ్యుతరాయలు గుత్తిపై దాడికి వెళ్లినప్పుడు రామరాయలు రాజ్యాన్ని ఆక్రమించాలని కుట్ర చేశాడు. అతడు రాజధానిలో పదవులలో ఉన్న అచ్యుతరాయల అధికారులను తొలగించాడు. వారి స్థానాలలో తన బంధువులను నియమించాడు. బీజాపూరులో సైనిక ఉద్యోగాల నుండి తొలగింపబడి విజయనగరం వచ్చిన మూడు వేల మంది ముస్లిం సైనికులను తన సైన్యంలో చేర్చుకున్నాడు. ఆ విధంగా తన బలాన్ని పెంచుకొని తిరుపతి నుండి రాజధానికి వస్తున్న అచ్యుతరాయలను బంధించాడు. రాజ్యాన్ని ఆక్రమించాడు. తర్వాత అతడు పట్టాభిషేకం చేసుకోవాలని ప్రయత్నించాడు. కాని అమరనాయకుడు అంగీకరించలేదు. వారు అతని ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అతడు అచ్యుతదేవరాయల అన్న రంగరాజు కుమారుడైన సదాశివరాయలను రాజుగా ప్రకటించి అచ్యుతదేవరాయలకన్నా సదాశివరాయలకే సింహాసనంపై ఎక్కువ హక్కు ఉందని వాదించాడు. సదాశివరాయల పేరుతో రామరాయలు రాజ్యం పాలించసాగాడు. ఈ విధంగా రామరాయలు క్రీ.శ.1537లో అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు.

దక్షిణదేశ దిగ్విజయ యాత్ర: కాని రాజ్యంలోని అమర నాయకులు, సామంతులు అతని అధికారాన్ని అంగీకరించలేదు. ముఖ్యంగా దక్షిణదేశంలోని మధుర, కొచ్చిన్ రాజ్యాల సామంతులు అతని అధికారాన్ని తృణీకరించి తిరుగుబాటు చేశారు. వారిని అణచడానికి రామరాయలు దక్షిణదేశంపై దండెత్తాడు. వెళ్తూ ఒక నమ్మకస్తుని అచ్యుత రాయలున్న చెరసాలకు అధికారిగా నియమించి వెళ్లిపోయాడు. రామరాయలు దక్షిణాదికి వెళ్లిపోయిన తర్వాత చెరసాల అధికారి అచ్యుతరాయలను విడుదల చేశాడు. దక్షిణాదిలో సామంతులను

అణచడంలో రామరాయలు చాలా కాలం అక్కడ ఉండవలసి వచ్చింది. కనుక అచ్యుతరాయలు తిరిగి సింహాసనం అధిష్ఠించి తనను విడిపించిన చెరసాల అధికారిని ప్రధాన మంత్రిగా నియమించాడు. కాని రాయల బావమరిది అది సహించలేక ప్రధానమంత్రిని హత్య చేయించి తాను అధికారాన్ని స్వీకరించాడు. అచ్యుతరాయలు బావ మరిదిని కాదనలేక అన్ని అధికారాలు అతనికే అప్పగించాడు. దాంతో సలకం పెద తిరుమలయ్య అచ్యుతరాయల పేరుతో విజయనగరాన్ని పాలించసాగాడు. ఈ లోపల రామరాయలు దక్షిణ దిగ్విజయ యాత్ర నుండి తిరిగి వచ్చాడు. కాని అతని సైన్యంలోనే కొందరు అచ్యుతదేవరాయలతో చేరిపోయారు. దాంతో రామరాయలు తన అధికారాన్ని పోగొట్టుకున్నాడు. నగరంలోకి కూడా అడుగుపెట్టలేక నగరం వెలుపలే ఉండిపోయాడు.

గోల్కొండ నవాబు కొండవీడు దాడి: అచ్యుతరాయలు దక్షిణదేశ దండయాత్రలలో ఉండగా గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా కొండపల్లిని జయించి కొండవీడుపై దండెత్తాడు. అతనిని ఎదుర్కోడానికి అచ్యుత దేవరాయలు మల్లినాయుని చిన బ్రహ్మానాయుడు, రాయభాస్కరుడు, కొండమరుసయ్య లేక అయ్యపరుసయ్య, తిమ్మానాయుడు అనే సేనానులను పంపాడు. వారు కులీకుతుబ్ ఉల్ ముల్క్‌ను ఓడించి తరిమి కొండవీడును కాపాడారు.

ఇబ్రహీం ఆదిల్‌ఖాన్ దండయాత్ర క్రీ.శ.1538: ఇదే సందర్భంలో బీజాపూరులో మరొకసారి పరిస్థితులు మారాయి. సుల్తాన్ మల్లు ఆదిల్‌ఖాన్‌ను అతని తమ్ముడు ఇబ్రహీం ఆదిల్‌ఖాన్ తొలగించి సుల్తాన్ అయ్యాడు అతడు అంతర్వేదినాక్రమించడానికి విజయనగరంపై దండెత్తి నాగలాపురం చేరి నాగలాపురాన్ని ధ్వంసం చేశాడు అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయలు బీజాపూరుపై దండెత్తి ధ్వంసం చేసినట్లు ఇబ్రహీం నాగలాపురాన్ని ధ్వంసం చేశాడు. ఆ స్థితిలో అచ్యుతదేవరాయలు గాని, అళియ రామరాయలు గాని అతనిని ఎదిరించలేదు. అతడు ఎవరిని సమర్థిస్తాడోనని ఎవరికి వారే మిన్నకున్నారు. అదే సమయంలో బీజాపూరు రాజ్యంలో బెల్గాం పాలకుడైన అసద్ ఖాన్ లహరీకి ఇబ్రహీం ఆదిల్‌షా విజయం తెలిసి భయపడ్డాడు. ఇబ్రహీం బలవంతుడైతే తనకు ముప్పు వస్తుందని, ఇబ్రహీంను ఓడించడానికి అహమ్మద్‌నగర్ పాలకుడైన బుర్హాన్ నిజాంషాను బీజాపూరుపై దండెత్తమని ప్రోత్సహించాడు. అదే సమయంలో రామరాయలకు ఒక లేఖను రాసి ఇబ్రహీంను ఎదిరించలేని అశక్తుడవయ్యావా అని ఆక్షేపించాడు. ఇదంతా తెలుసుకున్న ఇబ్రహీం ఆదిల్‌షా తన సింహాసనానికి ముప్పు వస్తోందని గ్రహించి విజయనగరంతో యుద్ధం నిలిపివేసి రామరాయలకు, అచ్యుతదేవరాయలకు సంధి కుదిర్చాడు. ఆ సంధి ప్రకారం రామరాయల ఆధీనంలో ఉన్న ప్రాంతాలకు అతడు అధిపతి, మిగిలిన సామ్రాజ్యానికంతటికీ అచ్యుతరాయలు సార్వభౌమాధికారాలతో ఏలుకోవచ్చు. ఈ సంధికి అచ్యుతరాయలు, రామరాయలు ఉభయులూ అంగీకరించారు ఆ సంధి కుదిర్చినందుకు అచ్యుతరాయలు, రామరాయలు ఇద్దరూ ఇబ్రహీం ఆదిల్‌షాకు అనేక కానుకలు సమర్పించారు. యుద్ధం చేయకుండా ఇబ్రహీం ధనరాసులతో బీజాపూరు వెళ్లిపోయాడు. ఈ సంధికి కట్టుబడి రామరాయలు, అచ్యుతరాయలు ఒకరి విషయంలో ఒకరు జోక్యం చేసుకోలేదు. అందువల్ల క్రీ.శ.1542లో అచ్యుతదేవరాయలు మరణించే వరకు సామ్రాజ్యంలో అంతఃకలహాలు ఆగిపోయాయి. ఆ సంధి తర్వాత అచ్యుత రాయలు పరిపాలనా భారాన్ని తన బావమరిది సలకం తిరుమలయ్యకు అప్పగించి తాను అంతఃపురంలో కాలక్షేపం చేశాడు.

న్యూనిజ్ కథనం: అచ్యుతదేవరాయల కాలంలో పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ విజయనగరాన్ని దర్శించి అక్కడ క్రీ.శ.1535 వరకు ఉండి విజయనగర చరిత్రను రాశాడు. అతడు అచ్యుతదేవరాయలు క్రూరుడని, దుష్టుడని, వ్యసనలోలుడని రాశాడు. అతని పరిపాలనపై ప్రజలకు, ఉద్యోగులకు, అమరనాయకులకు తీవ్ర అసంతృప్తి ఉందని రాశాడు. అతని రాతలను బట్టి రాబర్ట్ సీవెల్ కూడా అచ్యుతరాయలు అసమర్థుడు, పిరికివాడు, అతని కాలంలోనే రాజ్యం ముక్కలైపోవడం ప్రారంభమైంది అని రాశాడు. అచ్యుతదేవరాయలు రాయచూరు, ముద్గల్‌లను పోగొట్టుకున్నాడని, రాజ్యం విచ్ఛిన్నం అయితే అతని కాలంలోనే విచ్ఛిన్నం కావాలని కూడా న్యూనిజ్ రాశాడు. కాని వారి రాతలు వాస్తవాలు కాదు. శ్రీకృష్ణదేవరాయలంతటి సమాంగ సార్వభౌముడు కాకపోవచ్చును, రామరాయల లాగా శక్తి సామర్థ్య సంపన్నుడు కాకపోవచ్చును. కాని అచ్యుతరాయలు వారు రాసినంత అసమర్థుడు, దుష్టుడు కాదు. అతడు దైవభక్తిపరుడు, దేవాలయాలు నిర్మించాడు, కవిపండిత పోషకుడు. అతడు దక్షిణదేశంలో అనేక దేవాలయాలకు భూరి విరాళాలు ఇచ్చి దానశాసనాలు వేయించాడు. అతడు శత్రువులతో పోరాడాడు. కాని రామరాయల కుట్రల వల్ల అతడు బాధలపాలయ్యాడు తప్ప స్వతహాగా పిరికివాడు, అసమర్థుడు

కాదు. అప్పటికి కృష్ణరాయల భార్యలు చిన్నాదేవి, తిరుమలదేవిలు జీవించి ఉన్నారు. కనుక రామరాయలపై యుద్ధానికి దిగితే రాజకుటుంబంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని అతడు ఓర్పు చూపి ఉండవచ్చును. కాని అతడు పిరికివాడు కాదు. చివరలో మాత్రం అతడు రాజ్యపాలనను అశ్రద్ధ చేసిన మాట వాస్తవం. తన బావమరిదికి అధికారం అప్పజెప్పి అంతఃపురంలో కాలక్షేపం చేసినందువల్ల న్యూనిజ్ అలా రాసి ఉండవచ్చును. అందువల్ల రాజ్యానికి కొంత నష్టం జరిగింది. చివరలో అచ్యుతరాయల ఉదాసీనత వల్ల అమర నాయకులు, రాజోద్యోగులు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. దొంగల ముఠాలు స్వైరవిహారం చేశాయి. రాచమార్గంలోనే బందిపోటు దొంగలు, వర్తకులను, యాత్రికులను దోచుకున్నారు. కొందరు సామంతులు కూడా దొంగలలో చేరిపోయి వర్తకులను దోచుకున్నారు. అలాంటి వారిలో చేబ్రోలు తిమ్మానాయకుడు ఒకడు. అందువల్ల వ్యాపారులు, యాత్రికులను రక్షణ కరువై బాధలుపడ్డారు. దొంగలను, సామంతులను అణచడానికి అచ్యుతరాయలు తగిన శ్రద్ధ తీసుకోలేదు. అందువల్ల పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. రాజ్య అవసరాల దృష్ట్యా అధిక పన్నులు విధింపబడ్డాయి. కనుక ప్రజలకు రాజుపై భయభక్తులు పోయి అసంతృప్తి ఏర్పడింది. ఇదే సమయంలో పశ్చిమకోస్తాలో పోర్చుగీసు వారి ఆగడాలు మితిమీరిపోయాయి. వారు విజయనగరంతో స్నేహ సంబంధాలు పాటిస్తూనే వారి సామంతులతో యుద్ధాలకు దిగేవారు. వారు అనేక కోటలు, గిడ్డంగులు నిర్మించారు. క్రీ.శ.1540లో వారు బీజాపూరు, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లతో సంధులు చేసుకున్నారు. విజయనగర అధిపతులు గాని, వారి సామంతులు గాని పోర్చుగీసు వారికి ఇచ్చిన మాటను ఎప్పుడూ తప్పలేదు. కాని వారు మాత్రం సంధులను ఉల్లంఘించి విజయనగర రాజ్యానికి ఇబ్బందులు కలిగించారు. అనేక మంది హిందువులను క్రైస్తవులుగా మార్చి వారు పోర్చుగీసు రాజుకు విధేయులుగా ఉండాలి గాని విజయనగర రాజులకు విధేయులుగా ఉండనవసరం లేదని బోధించసాగారు. మొత్తం మీద అచ్యుతదేవరాయల కాలంలో వారి ఆగడాలు హెచ్చాయి. సంధి కుదిరిన తర్వాత రామరాయలు విజయనగరాన్ని వదిలిపెట్టి గుత్తి, పెనుగొండ తూర్పు ప్రాంతాలను పాలించడానికి వెళ్లాడు. అతడు ప్రళయకావేరి లేక పులికాట్‌ను కొంతకాలం రాజధానిగా చేసుకొని పాలించాడు. అచ్యుతరాయలు మిగిలిన సామ్రాజ్యాన్నంతటిని క్రీ.శ.1542 వరకు 12 సంవత్సరాలు పాలించి మరణించాడు.

మధుర, తంజావూరు రాజ్యాల పుట్టుక: తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర అనే గ్రంథంలో తంజావూరు రాజ్య పుట్టుకను గురించిన కథ ఉంది. పాండ్యరాజ్యాన్ని చంద్రశేఖర పాండ్యుడనే రాజు శ్రీకృష్ణదేవరాయల సామంతుడుగా పాలించేవాడు. అతని రాజ్యంపై వీరశేఖర చోళుడు దండెత్తి చంద్రశేఖర పాండ్యుని ఓడించి తరిమివేశాడు. చంద్రశేఖర పాండ్యుడు విజయనగరం వచ్చి రాయలకు మొర పెట్టుకున్నాడు. రాయలు తన సేనాధిపతి అయిన కొటకం నాగమనాయకుని వీరశేఖర చోళుని దండించడానికి పంపాడు. నాగమనాయకుడు వీరశేఖరుని ఓడించి చోళ పాండ్య రాజ్యాలను ఆక్రమించాడు. తర్వాత ఆ ప్రాంతానికి తననే రాజుగా ప్రకటించుకున్నాడు. తన ఆజ్ఞను ధిక్కరించిన నాగమనాయకుని శిక్షించడానికి కృష్ణరాయలు తన సేనాధిపతులలో ఎవరు వెళతారని దర్బారులో ప్రశ్నించాడు. అందుకు నాగమనాయకుని కుమారుడు విశ్వనాధనాయకుడు ముందుకు వచ్చాడు. రాయలు తనలో ఊగిసలాడాడు. అనుమానాలను పక్కనబెట్టి అతనినే పంపాడు. విశ్వనాధ నాయకుడు తండ్రి అని కూడా చూడకుండా నాగమనాయకుని ఓడించి కట్టి తెచ్చి రాయలకు అప్పగించాడు. విశ్వనాధ నాయకుని రాజభక్తికి మెచ్చి రాయలు నాగమనాయకుని క్షమించి చోళ, పాండ్య దేశాలకు విశ్వనాధుని రాజుగా నియమించాడని, అతని సంతతి వారే మధుర నాయక రాజులని తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర చెబుతోంది. కృష్ణరాయల తర్వాత అచ్యుతరాయలు రాజు అయ్యాడు. అతని భార్య వరదాంబిక. ఆమెకు మూర్తిమ్మ అనే చెల్లెలు ఉండేది. ఆమె చెవ్వప్పనాయకుని వివాహం చేసుకుంది. అచ్యుతరాయలు తన తోడల్లునికి విశ్వనాధనాయకుని రాజ్యంలోని చోళమండలాన్ని విడగొట్టి చెవ్వప్పకు ఇచ్చాడు. అతని సంతతి వారే తంజావూరి నాయకవంశం అని తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర చెబుతోంది. కాని ఈ కథలను ధృవపరిచే సాక్ష్యం లభించలేదు. మధుర రాజ్యాధిపతిగా విశ్వనాధుని నియమించింది శ్రీకృష్ణదేవరాయలు కాదు, అచ్యుతదేవరాయలని కొందరు పండితులు అన్నారు. మధురై త్తలవరలారులో లభించిన సమాచారం ప్రకారం శక 1481 రౌద్రి నామ సంవత్సరంలో అంటే క్రీ.శ.1559-60లో కొటియమ్ నాయక్కర్ రాయల ఆజ్ఞనే రౌద్రి మార్గశిర నుండి అంగీరస వైశాఖి వరకు అంటే (1559-1592) పాలించి మరణించాడని తెలుస్తోంది. ఆ ప్రాంతంలోని శాసనాలను పరిశీలిస్తే తిరునల్వేలి జిల్లాలోని అంబా సముద్రం ప్రాంతాన్ని విశ్వనాధ నాయకుడు క్రీ.శ.1557 వరకు సాధారణ

అమర నాయకునిగా పాలించినట్లు తెలుస్తుంది. క్రీ.శ.1564 వరకు అతడు గాని, అతని కుమారుడు కృష్ణప్ప గాని అమర నాయకుని హోదాకు మించి ఉన్నట్లు సాక్ష్యం లేదు. విశ్వనాథ నాయకుని కృష్ణరాయలు గాని, అచ్యుతదేవరాయలు గాని మధుర రాజుగా నియమించినట్లు ఒక్క ఆధారం కూడా లభించలేదు. కనుక క్రీ.శ.1565 తళ్లికోట యుద్ధం తర్వాత అంబా సముద్రంలో అమర నాయకుడుగా ఉన్న విశ్వనాథ నాయకుని కుమారుడు కృష్ణప్ప మధుర రాజ్యాన్ని ఆక్రమించి స్వంత రాజ్యంగా ఏర్పరచుకొని సామంతుని హోదా పొంది ఉండవచ్చును. ఏమైనా మధుర, తంజావూరు రాజ్యాలు తళ్లికోట యుద్ధం తర్వాత పుట్టాయని భావించడానికే ఎక్కువ అవకాశం ఉంది.

అచ్యుతరాయల సైన్యం-సామంతులు-ఇతర విశేషాలు: అచ్యుతరాయలకు 50 వేల సిద్ధ సైన్యం ఉండేది. వారిలో 6 వేల అశ్వదళం రాజభవనానికి కాపలాగా ఉండేది. వారిలో రెండు వందల మంది రాజుకు రక్షణగా ఉండేవారు. 20 వేల మంది బల్లాలు డాలులతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. మూడు వందల మంది ఏనుగులకు రక్షణగా ఉండేవారు. సైన్యానికి పని చేయడానికి 2 వేల మంది రకరకాల పనివారుండేవారు. చాకలి, మంగలి, వడ్రంగి మొదలైన పని వారు సైనికులకు సేవలు చేస్తుండేవారు. వారికి ఏ రోజుకారోజు రాజభవనం వద్ద వేతనాలే చెల్లించేవారు. అచ్యుతదేవరాయల కాలంలో గుర్రపుదళానికి మదన నాయక్ అనే అతడు అధిపతిగా ఉండేవాడు. అచ్యుతరాయలు ప్రతి సంవత్సరం 13 వేల మేలుజాతి అశ్వాలను కొనేవాడట. వాటిలో మంచివి తాను ఉంచుకొని మిగిలిన వాటిని సామంతులకు ఇచ్చేవాడట. అశ్వాల ఖరీదు అంతా సామంతుల నుండి వసూలు చేసేవాడట. అందువల్ల రాజఖజానా నుండి తాను తీసుకున్న గుర్రాలకు ఏమీ ఖర్చు అయ్యేది కాదట. అచ్యుతరాయల కాలంలో కూడా 200 మంది అమరనాయకులు ఉండేవారు. వారు వివిధ ప్రాంతాలకు అధిపతులుగా ఉండి రాజుకు సైనిక సేవ చేసేవారు. వారిలో కొందరు రాజధానిలో మంత్రులుగా, ఉన్నత ఉద్యోగులుగా ఉండేవారు. అలాంటి వారిలో ప్రథముడు ప్రధాన మంత్రి, తర్వాత హోదా ఖజానాదారునిది. తర్వాత హోదా రాజభవన కాపలాదారునిది. రాయల ఆస్థానంలో ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులుండేవారు కాదట. మంత్రులే రెవెన్యూ వసూళ్లు చూసేవారట. అచ్యుతరాయల కాలంలో సాళువ నాయక్ మంత్రిగా రెవెన్యూ వసూళ్లు చూసేవాడట. అతడు చోళమండలం, నాగపట్టణం, తంగోరు, Bomgarin, apatao, Truguel, Caullim మొదలైన పట్టణాలకు అమరనాయకుడు. అతని నాయంకరం సింహళం వరకు విస్తరించి ఉండేది. అతడు రాజధానిలో నివసిస్తూ ఉండేవాడు. అతనికి ఒక మిలియన్ ఒక వేయి బంగారు పరదావోల ఆదాయం వచ్చేది. అందులో 1/3వ వంతు రాయలకు చెల్లించి మిగిలిన 1/3వ వంతు తన ఖర్చులకు ఉంచుకొనేవాడు. అతడు రాజధానిలో నివసిస్తూ సామ్రాజ్యపు రెవెన్యూ వసూళ్లు చూసేవాడు. అతనికి మంత్రి హోదా కూడా ఉండేది. తర్వాత చెప్పుకోవలసిన అమరనాయకుడు అజపర్క తిమ్మప్ప. అతడు హుడోగరి, కండోవిమ్‌ల అధిపతి. తర్వాత మధుర నాయకుడైన విశ్వనాథ నాయకుడు. తర్వాత రోసిల్, తిపర్, తికాలో, బిగోలో ప్రాంతాల అమర నాయకుడు గణపనాయక్. తర్వాత వంగాపూర్ అధిపతి Lepapayque. ఇంకా Ondegema అధిపతి నరవర, Calay అధిపతి చిన్నప్పనాయక్, ఓసోల్ అధిపతి కృష్ణప్పనాయక్, బోడియల్ బాజపనాయక్, అవలీ అధిపతి మల్లప్పనాయక్, గేట్ అధిపతి అదెపనాయక్, మందగుల్ అధిపతి బాజపనాయక్‌ల పేర్లు న్యూనిజ్ తన క్రానికల్‌లో పేర్కొన్నాడు. రాజ్యం మొత్తం 200 మంది అమరనాయకుల కింద ఉండేది. వారందరూ దసరా ఉత్సవాలప్పుడు విజయనగరం చేరి రాయలకు తాము చెల్లించవలసిన కప్పం చెల్లించేవారు. రాయలు వారికి రసీదులు ఇచ్చేవాడు కాదని రాశాడు. ఉత్సవాలలో పాల్గొని తర్వాత తమ ప్రాంతాలకు వెళ్లేవారు. రాజధానిలో ఎల్లప్పుడూ 20 వేల పల్లకీలు ఉండేవని, వాటిని మనుషులు మోసేవారని, ఉన్నతోద్యోగులు వాటిపై ఎక్కే వారని కూడా న్యూనిజ్ రాశాడు.

ఒకటవ వెంకటపతి రాయలు క్రీ.శ.1542: అచ్యుతదేవరాయల మరణానంతరం అతని కుమారుడు వెంకటపతిరాయలు సింహాసనమధిష్టించాడు. అచ్యుతరాయలు తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తుడు. అందువలన తన కుమారునికి వెంకటపతి అని పేరు పెట్టుకున్నాడు. అతడు క్రీ.శ.1452లో మొదటి వెంకటపతి రాయలుగా విజయనగర సింహాసనానికి వచ్చాడు. అప్పుడతని వయసు 16 సంవత్సరాలు. అచ్యుతరాయల అంత్యక్రియలకు రాజధానికి వచ్చిన అమర నాయకులు అతని వయసు చూసి నిరుత్సాహపడి పరిపాలనలో అతని పెద్దవారెవరైనా తోడు ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల అచ్యుతరాయల చిన్న బావమరిది సలకం చిన తిరుమలయ్య సంరక్షకత్వాన్ని వహించాడు. అప్పటికే అచ్యుతరాయలు పెద్ద బావమరిది సలకం పెద తిరుమలయ్య

మరణించాడు. కనుక అతని తమ్ముడు చిన తిరుమలుడు విజయనగర పరిపాలనను తన చేతిలోకి తీసుకున్నాడు. కాని అతడు దుష్టస్వభావుడని తెలిసిన అచ్యుతరాయల భార్య, వెంకటపతి తల్లి అయిన వరదాంబిక అతని రక్షకత్వాన్ని ఆమోదించలేదు. కాని అతడు కొందరు అమరనాయకుల మద్దతు సంపాదించి తన స్థానాన్ని పదిల పరుచుకున్నాడు. కాని వరదాంబిక తన కుమారుని భద్రత కోసం ఆరాటపడి బీజాపూరు సుల్తాన్ దర్బారుకు తన మనుషులను పంపి తన కుమారునికి అండగా నిలువమని కోరింది. ఇబ్రహీం ఆదిల్‌షా మళ్లీ విజయనగర రాజకీయాలలో జోక్యం చేసుకోటానికి మంచి అవకాశం వచ్చిందని తన సేనతో విజయనగరం బయలుదేరాడు. అది తెలుసుకున్న సలకం తిరుమలుడు మార్గమధ్యంలో సుల్తాన్‌ను కలుసుకొని కళ్లు చెదిరిపోయే ధనరాసులను సమర్పించాడు. అవి తీసుకొని సుల్తాన్ తిరుమలునే సమర్థించి వెనుదిరిగి వెళ్లిపోయాడు. వరదాంబిక నిరాశ చెందింది. తిరుమలుడు అధికారాన్నంతటినీ తన చేతులలోకి తీసుకున్నాడు. వరదాంబిక నిస్సహాయంగా మిగిలిపోయింది.

రామరాయల జోక్యం: అచ్యుతదేవరాయల కాలంలో రాజధానిని విడిచి వెళ్లిన ఆరవీటి రామరాజుకు విజయనగర అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి మంచి అవకాశం వచ్చిందని భావించి గుత్తి కోటలో బందీగా ఉన్న సదాశివరాయలను విడిపించి విజయనగర సామ్రాజ్యానికి వారసునిగా ప్రకటించాడు. రాజ్యానికి నిజమైన వారసత్వ హక్కు సదాశివరాయలదేనని స్పష్టం చేశాడు. దాంతో విజయనగర రాజ్యంలో వారసత్వ యుద్ధం వచ్చింది. దానివల్ల తిరుమలరాయలు, రామరాయల మధ్య ఒక సంవత్సరం అంతర్యుద్ధం జరిగింది. సదాశివరాయలకు సహాయం చేయమని రామరాయలు బీజాపూర్ ఆదిల్‌షా వద్దకు రాయబారం పంపాడు. సుల్తాన్ రామరాయలకు సహాయం చేయడానికి తిరస్కరించాడు. వ్యక్తిగత స్వార్థం మనిషిని ఎంత అజ్ఞానిగా మారుస్తుందో ఈ సంఘటన తార్కాణం. విజయనగర సామ్రాజ్యానికి ఆగర్భశత్రువైన బీజాపూరు సుల్తాన్‌ను వరదాంబిక, రామరాయలు, చిన తిరుమలయ్య ముగ్గురూ సహాయం కోరారు. వారి స్వార్థాన్ని బీజాపూరు సుల్తాన్ తనకు అనుకూలంగా మలచుకొని యుద్ధం లేకుండా విలువైన కానుకలు పొంది బలపడ్డాడు. రామరాయల ఆహ్వానాన్ని తిరస్కరించినా విజయనగరంపై దండెత్తి మళ్లీ దోచుకోవచ్చని ఆశించి తన సేనతో బయలుదేరాడు. అది తెలిసిన ప్రజలు, అమరనాయకులు వెంకటపతిరాయలు రాజ్యాన్ని రక్షించలేడని భావించి చినతిరుమలయ్యను సింహాసన మధిష్ఠించాలని కోరారు. ప్రజల కోరికకు ఆనందపడి తిరుమలుడు వెంటనే క్రీ.శ.1543 జనవరి నెలలో తిరుమలదేవ మహారాయలను పేరుతో పట్టాభిషేకం జరుపుకున్నాడు. తర్వాత విజయనగర సేనతో వెళ్లి ఇబ్రహీం ఆదిల్‌షాను ఎదుర్కొని ఓడించి తరిమివేశాడు. పరాజయం పొందిన సుల్తాన్ బీజాపూరుకు పారిపోయాడు. విజయంతో తిరిగి వచ్చిన తిరుమలరాయలకు రాజధానిలో ఎదురు లేకుండాపోయింది. తన సింహాసనాన్ని శాశ్వతంగా దక్కించుకోవాలనే దుష్టతలంపుతో మేనల్లుడని కూడా చూడకుండా వెంకటపతి రాయలను గొంతుపిసికి చంపివేశాడు. వెంకటపతిరాయల మరణంతో తిరుమలుడు విజయనగర సామ్రాజ్యానికి నిజమైన చక్రవర్తి అయ్యాడు. కాని ప్రజలు, అమరనాయకులు అతని చర్యలను సమర్థించలేదు. వారు రామరాయలకు మద్దతు ఇచ్చి విజయనగరం రమ్మని ఆహ్వానించారు.

పెనుగొండ ఆక్రమణ-సమావేశం: ప్రజలు, అమరనాయకుల ఆహ్వానం రామరాయలకు నూతన ఉత్సాహాన్ని కలిగించింది. అతడు గుత్తి నుండి బయలుదేరి పెనుగొండపై దండెత్తి జయించాడు. అక్కడ సామంతరాజులను ఆహ్వానిస్తూ ఒక సమావేశం జరిపాడు. రామరాయలను సమర్థించే అమర నాయకులు ఆ సమావేశానికి హాజరై సలకం తిరుమలరాయలతో పోరాడి ఓడించి తరిమి సదాశివరాయలను రాజుగా చేయాలని తీర్మానించారు.

కొమలి యుద్ధం: పెనుగొండ సమావేశం తీర్మానం ప్రకారం రామరాయలు తిరుమలయ్యపై యుద్ధానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆనాడు గండికోటను కమ్మసేనాధిపతులైన పెమ్మసాని చినతిమ్మానాయకుడు పాలిస్తున్నాడు. రామరాయలు గండికోట చేరి తిమ్మానాయకుని సహాయం అర్థించాడు. తిమ్మానాయకుడు రామరాయల వైపు చేరిపోయాడు. అది తెలిసిన తిరుమలరాయలు తనకు ప్రమాదం ముంచుకొని వస్తోందని గ్రహించి రామరాయల ఆట కట్టించాలని రామరాయలపై యుద్ధానికి తయారై తన సేనతో గండికోటను చేరి రామరాయలను తనకు అప్పగించమని తిమ్మానాయకునికి కబురు పంపాడు. కాని పెమ్మసాని తిమ్మానాయకుడు తిరుమల రాయల కోర్కెను తిరస్కరించాడు. అంతేగాక తన సేనతో కోట బయటకు వచ్చి కొమలి అనే ప్రదేశం

చేరాడు. అక్కడ తిరుమలరాయల సైన్యానికి, పెమ్మసాని వారి సైన్యానికి యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో తిరుమల రాయులు ఓడిపోయి వెనుకకు తిరిగాడు. వెనుకకు తిరిగిన ఆ సేనను తరుముతూ రామరాయలు, పెమ్మసాని తిమ్మానాయకుడు తమ సైన్యాలతో కందనవోలు రాజ్యంలో ప్రవేశించారు. అక్కడ వారి సేన రాయల సేనను మళ్లీ బేతంచర్ల, జూటూరుల వద్ద ఓడించారు. కందనవోలు కోట రామరాయల వశమైంది. కందనవోలు ఆరవీటి వంశస్తుల పూర్వపు స్థావరం. తన పూర్వీకుల కోట రామరాయలకు లభించింది.

బెడగల్ల యుద్ధం: ఓడిపోయిన విజయనగర సైన్యం ఆదవాని రాజ్యంలోని బెడగల్ల వైపుకు వెళ్లింది. రామరాయలు, పెమ్మసాని తిమ్మానాయకుని సైన్యం బెడగల్ల వద్దకు చేరి మళ్లీ తిరుమల రాయలతో తలపడ్డాయి. రాయల సైన్యం మళ్లీ ఓడి పారిపోసాగింది. వారిని తరుముతూ పెమ్మసాని వారి సైన్యం ముందుకు దూసుకుపోతూ ఉండగా ఆదవాని కోట అధిపతి సంజర్‌ఖాన్ తన సేనతో రాయలకు సహాయంగా వచ్చి రామరాజు పెమ్మసాని వారి సైన్యాన్ని అడ్డగించాడు. పెమ్మసాని తిమ్మానాయకుడు శౌర్యప్రతాపాలతో పోరాడి సంజర్‌ఖాన్‌ను ఓడించి ఆదవాని కోటను ఆక్రమించాడు. రామరాయలు ఆదవానికోటలో నాలుగు మాసాలుండి కర్నూలు, గద్వాల ప్రాంతాలను కూడా తన స్వాధీనం చేసుకొని నూతన సైన్యాలను పోగుచేసి క్రీ.శ.1543 జూన్ నెలలో విజయనగరంపై దాడికి బయలుదేరాడు.

బీజాపూరు సుల్తాన్ రాక: రామరాయలు సైన్యాలతో విజయనగరం వస్తున్నాడని తెలిసి సలకం తిరుమల దేవ మహారాజు హడలిపోయాడు. తనకు సింహాసనం దక్కదని గ్రహించి దానినెలాగైనా నిలుపుకోవాలని బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా సహాయం అర్థించాడు. సుల్తాన్ సైనిక ఖర్చు కింద రోజుకు మూడు లక్షల హొన్నులు చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. డబ్బు ఆశతో ఇబ్రహీం వెంటనే వచ్చి విజయనగరం చేరాడు. తిరుమలరాయలు అతనిని ఆహ్వానించి విజయనగరంలోకి తీసుకువెళ్లి విజయనగర సింహాసనంపై కూర్చోబెట్టాడు. అప్పటివరకు బహమనీ సుల్తాన్‌లు ఎన్ని యుద్ధాలు చేసినా నగరంలోకి ప్రవేశించలేదు. సింహాసనాన్ని కళ్లతో కూడా చూడలేదు. తిరుమల రాయలు చేసిన హీనాతిహీనమైన చర్యకు సామంతులు, అమరనాయకులు, ప్రజలు భగ్గున మండిపోయారు. తిరుమల రాయలు రాజుగా పనికిరాడని నిర్ణయించుకున్నారు. అమరనాయకులు ముందు ఆదిల్‌ఖాన్‌ను బయటకు పంపాలని, అవసరమైతే రాజ్యం కోసం తమ ప్రాణాలు ఇస్తామని సుల్తాన్ సహాయం అక్కరలేదని తిరుమల రాయలకు నచ్చజెప్పారు. అదే సమయంలో రామరాయలు ఇబ్రహీం ఆదిల్‌ఖాన్‌ను బయటకు పంపాలని, తాను కూడా రాయలకు విధేయుడనని అతని అధికారాన్ని అంగీకరిస్తానని ముందు సుల్తాన్‌ను వెంటనే పంపించి వేయవలసిందని కబురు పంపాడు. అందరి మాటలు నమ్మి తిరుమలరాయలు ఇబ్రహీంకు 50 లక్షల హొన్నులు ధనాన్ని, ఇతర బహుమతులు బహూకరించి వెళ్లిపొమ్మని కోరాడు. ఇబ్రహీం విజయనగరం వదలి వెళ్లాడు. సుల్తాన్ కృష్ణానదిని దాటాడో లేదో వెంటనే రామరాయల సేన తిరుమల రాయల సైన్యంపై విరుచుకుబడింది. సుల్తాన్‌ను సాగనంపటానికి బయటికి వచ్చిన రాయలు తన సేనపై రామరాయల సైన్యంపై పడటాన్ని చూసి, నగరంలోని తిరుమలరాయలకు అది తెలిసి తాను మోసపోయానని గ్రహించి రాజభవనంలో తలుపులు మూసుకొని రాజధాని వైపు పరిగెత్తి కోటలో ప్రవేశించి రాజభవనం చేరి తలుపులు మూసుకొని ఏమి చేయాలో తెలియక పిచ్చిపట్టిన వాడి లాగా ప్రవర్తించాడు. తాను ఓడిపోతే విజయనగరం రామరాయల వశం అవుతుందని భావించి విజయనగరంలో ఉన్న ఏనుగుల సంపద, సైన్యం రామరాయల వశం కాగూడదని భావించి రాజధానిలో ఉన్న ఏనుగుల, గుర్రాల కండ్లు పొడిపించి అవి పనికి రాకుండా చేశాడట. ధనాగారంలో ఉన్న తరతరాలుగా సంపాదించిన రత్నాలు, మణులను, వజ్రాలు, పచ్చలను పగులగొట్టి పిండి చేశాడట. తర్వాత ఒక స్థంభానికి కత్తిని బిగించి, తాను దానికి బలంగా తగిలి తన పొట్టలో నుండి వెన్నులోకి దిగిపోయేటట్లు పొడుచుకొని ఆత్మహత్య చేసుకొని మరణించాడని పెరిష్టా రాశాడు. న్యూనిజ్ కూడా అతని మరణాన్ని గురించి రాశాడు. కాని అతనిని రామరాయల సైన్యాలు యుద్ధంలో వధించి అతని తలను బల్లానికి గుచ్చి అందరికీ చూపారని కొందరు పండితులు భావించారు. ఈ లోపల రామరాయల సైన్యం తిరుమల రాయల సైన్యాన్ని చీల్చి చెండాడింది. అమరనాయకులు కొందరు యుద్ధం చేయకుండానే వెళ్లిపోయారు. రామరాజుకు విజయం లభించింది. సదాశివరాయలను ముందు పెట్టుకొని రామరాయలు సైన్యంతో విజయనగరం కోట ముఖద్వారం చేరాడు. అది తెలిసి శ్రీకృష్ణదేవరాయల భార్యలు తిరుమలదేవి, చిన్నాదేవిలు కోట తలుపులు తీయించమని కాపలాదారులను ఆదేశించారు. ఊరేగింపుగా రామరాయలు తన సేనతో సదాశివరాయలతో

క్రీ.శ.1543లో శోభాకృతు కార్తీక శుద్ధ ఏకాదశి నాడు రాజధానిలో ప్రవేశించాడు. కొన్నాళ్ల తర్వాత సదాశివరాయలకు పట్టాభిషేకం జరిగింది. సదాశివరాయలు సింహాసనాన్ని అధిష్టించిన తర్వాత చిన్న రాయలు సింహాసనం ఎక్కడం, తొలగించడం జరుగలేదు. అలాంటి సంఘటనలు వినలేదు అని ఫెరిష్టా రాశాడు. రామరాయలు సర్వాధికారి అయ్యాడు అని కూడా రాశాడు.

సదాశివరాయలు: సదాశివరాయలు సింహాసనం అధిష్టించడంతో 30 సంవత్సరాలు విజయనగర చరిత్రలో వారసత్వ యుద్ధాలు లేకుండా పోయాయి. అధికారం ఉన్నా లేకపోయినా సదాశివరాయలు విజయనగర చక్రవర్తిగా సుమారు 30 సంవత్సరాలు కొనసాగాడు. అచ్యుతదేవరాయల చివరి శాసనం క్రీ.శ.1541 జనవరి 25వ తేదీ నాటిది లభించింది. సదాశివరాయల మొదటి శాసనం క్రీ.శ.1542 జూలై 27వ తేదీది లభించింది. కనుక ఈ రెండు తేదీల మధ్య అచ్యుతరాయలు మరణించి ఉంటాడు. రామరాయలు సదాశివరాయలను రాజుగా ప్రకటించినా అతడు క్రీ.శ.1543లోనే రాజధానిలోనికి అడుగు పెట్టగలిగాడు. కాని క్రీ.శ.1542 జూలై 27 నుంచే అతడు శాసనాలను విడుదల చేయసాగాడు. కనుక అతని శాసనాలు క్రీ.శ.1542 నుండి 1576 వరకు లభిస్తున్నాయి. సదాశివరాయలు అసమర్థుడు, వ్యక్తిత్వం లేనివాడు. అతడు పేరుకు మాత్రమే రాజు. సర్వాధికారాలు రామరాయలు, అతని తమ్ములు తిరుమలరాయలు, వెంకటాద్రిలు చెలాయించేవారు. సోదరులు సంవత్సరానికొకసారి అంతఃరాజభవనంలో నివసించే సదాశివరాయలను దర్శించి సాష్టాంగ ప్రమాణాలు మాత్రం ఆదరించేవారు. తర్వాత వారి ఇష్టం ప్రకారం పరిపాలన సాగించారు. అయినప్పటికీ సామ్రాజ్యం అంతా సదాశివరాయలను చక్రవర్తిగా అందరూ గుర్తించారు. రామరాయలు సర్వాధికారాలు చెలాయించినా రాజాజ్ఞలు, శాసనాలు అన్నీ సదాశివరాయల పేరుతోనే విడుదల అయ్యాయి. సదాశివరాయల శాసనాలు క్రీ.శ.1542 నుండి 1570 వరకు నిరాటంకంగా వేయబడ్డాయి. తర్వాత 1576 వరకు కూడా అతడు విజయనగరంలో జీవించినట్లు శాసనాలు లభ్యమయ్యాయి. శాసనాలు సదాశివరాయల పేరుతోనే వేయించినప్పటికీ ప్రజలు సదాశివరాయలను మరచిపోయారు. రామరాయలే రాజుగా భావించేవారు. విదేశస్తులు కూడా రామరాయలే రాజు అన్నట్లుగా రాశారు. ఈ విధంగా రామరాయలు సదాశివరాయలను మరపింపజేసి విజయనగర రాజ్యాన్ని క్రీ.శ.1543 నుండి 1565 వరకు అంటే 22 సంవత్సరాలు పాలించాడు. కనుక ఈ కాలాన్ని విజయనగర చరిత్రలో రామరాయల యుగం అని పిలిచారు. సాళువయుగంలో నరసనాయకుడు ఏ పాత్రను పోషించాడో, తుళువయుగంలో రామరాయలు అదే పాత్రను పోషించాడు. సాళువ రెండవ నరసింహరాయలకు అధికారాలు ఇవ్వకుండా పాలించినందుకు నరసనాయకుని దురాక్రమణదారుడన్నారు. అలాగే సదాశివరాయలకు అధికారాన్ని ఇవ్వకుండా రాజ్యం చేసిన రామరాయలు కూడా దురాక్రమణదారుడు గానే భావింపవచ్చును. విజయనగర అధికారం మూడవసారి అపహరణకు గురైందని కూడా చెప్పవచ్చును. తళ్లికోట యుద్ధం తర్వాత సదాశివరాయలు హత్యకు గురి అయ్యాడు. సదాశివరాయలను తిరుమలరాయల చిన్న కుమారుడు రెండవ వెంకటపతిరాయలు హత్య చేశాడని వాడుకలో ఉంది. సదాశివరాయల హత్య తర్వాత రామరాయల తమ్ముడు పెనుగొండలో క్రీ.శ.1570లో పట్టాభిషేకం చేసుకొని అరవీటి వంశాన్ని స్థాపించాడు. అంటే వీరనరసింహరాయల పాత్రను తిరుమల రాయలు పోషించాడు. కనుక విజయనగరం సింహాసనం మూడవసారి దురాక్రమణకు గురైందని చెప్పవచ్చును.

రామరాయల పాలన క్రీ.శ.1543-65: రామరాయలు ఆరవీటి వంశానికి చెందినవాడు. అతని తండ్రి రంగరాజు, తల్లి తిమ్మాంబ. అతడు క్రీ.శ.1485లో జన్మించాడు. అతని బాల్యాన్ని గురించి మనకు ఏమీ స్పష్టంగా తెలియదు. అతడు చంద్రవంశ క్షత్రియుడు. రామరాజుకు ఎరతిరుమల లేక తిరుమల రాయలు, వెంకటాద్రి అనే ఇద్దరు తమ్ములున్నారు. వారు అతనికి రాచకార్యాలలో కుడి ఎడమ భుజాలుగా నిలిచారు. అతడు మొదట గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా వద్ద ఉద్యోగంలో చేరి రాయలసీమలోని కందనవోలు మొదలైన కొన్ని ప్రాంతాలకు పాలెగాడుగా నియమింపబడ్డాడు. ఆ ప్రాంతాలపై బీజాపూరు సుల్తాన్ దండెత్తి రామరాయలను ఓడించాడు. ఓడిన తర్వాత రామరాయలు గోల్కొండ చేరగా సుల్తాన్ అతనిని అవమానించాడు. అప్పుడు రామరాయలు విజయనగరం చేరి శ్రీకృష్ణదేవరాయలను ఆశ్రయించాడు. రాయలు అతనిలోని ప్రతిభను గుర్తించి తన కుమార్తె తిరుమలదేవినిచ్చి (ఈమెకు మోహనాంగి అని కూడా పేరుంది) వివాహం చేసి తన సేవలో నియోగించాడు. రామరాయలు గోల్కొండ రాజ్యంలో సేవ చేశాడని చెప్పడానికి ఆధారాలు లేవు. కన్నడంలో అల్లుడు అంటే అళియ కనుక అప్పటి నుండి అతడు అళియ రామరాయలుగా ప్రసిద్ధి చెందాడు. రామరాయలు

శ్రీకృష్ణదేవరాయల కూతురుని కాదు అతని సోదరుడు రంగరాయల కూతురుని అంటే సదాశివరాయల సోదరిని వివాహమాడాడని కొందరు అంటారు. రామరాయలకు ఇంకా భార్యలున్నారు. అతని రెండవభార్య అప్పలాంబ. ఆమె జక్కెళ్ల పెదనందిరాజు కుమార్తె. మూడవ భార్య కొండమాంబ, నాల్గవ భార్య లక్ష్మాంబ. వీరిద్దరూ పొచిరాజు తిమ్మరాజు కుమార్తెలు. రామరాయలకు తిరుమలాంబ వల్ల కృష్ణరాజు, పెదతిమ్మరాజు అనే కుమారులు, కొండమాంబిక వలన కొండరాజు, చిన చిమ్మరాజు అనే కుమారులు, లక్ష్మాంబకు శ్రీరంగరాజు అనే కుమారుడు కలిగారు. అప్పలాంబకు కుమారులు లేరు. కుమారులేగాక అతనికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. వారిలో ఒక కుమార్తె జ్యోతమరాజును, మరొక కుమార్తె జస్వంత రాజును వివాహమాడారు. కొండరాజును అనెగొందికి, చిన్న తిమ్మరాజును రాయచూరుకు పాలకులుగా నియమించాడు. మిగిలిన వారు సేనాధిపతులుగా ఉండేవారు. వారిలో పెదతిమ్మరాజు గొప్పవీరుడు. అతడు అహమ్మద్‌నగర్ హుస్సేన్‌షాను ఓడించాడు. కృష్ణరాయలు మరణించిన తర్వాత అంతఃపుర స్త్రీల సహకారంతో కృష్ణరాయల 18 మాసాల కుమారుని రాజుగా ప్రకటించి అధికారం నెరపాలని ప్రయత్నించాడు. కాని అది విఫలమైంది. తర్వాత అచ్యుత దేవరాయలు గుత్తిదుర్గం తిరుగుబాటును అణచడానికి వెళ్లినప్పుడు సదాశివరాయలను రాజుగా ప్రకటించి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అది కూడా విఫలమైంది. చివరకు చినతిరుమలయ్యపై దండయాత్ర చేసి విజయనగరాన్ని ఆక్రమించి సదాశివరాయలను క్రీ.శ.1543లో పట్టాభిషిక్తుని చేసి అధికారాన్ని సొంతం చేసుకున్నాడు. దాంతో విజయనగర చరిత్రలో రామరాజు యుగం ప్రారంభమైంది. అతడు 22 సంవత్సరాలు దేదీప్యమానంగా వెలిగాడు. విజయనగర చరిత్రలోనేగాక దక్షిణ భారతదేశ చరిత్రలోనే అతి బలవంతుడుగా, ప్రఖ్యాత రాజుగా గొప్ప పాత్రను పోషించాడు.

రామరాయలు కృష్ణదేవరాయల ఆస్థానంలో ప్రవేశించకముందు అతడు గోల్కొండ నవాబు వద్ద కొలువు చేసే వాడని తారిఖ్ మహమ్మద్ కులీకుతుబ్‌షా అనే గ్రంథం తెలుపుతోంది. కులీకుతుబ్‌షా రామరాజును విజయనగర రాజ్య సరిహద్దులోని ఒక దుర్గానికి అధిపతిగా నియమించాడు. శ్రీకృష్ణదేవరాయలు ఆ దుర్గంపై దాడి చేశాడు. రామరాయలు కృష్ణరాయలతో అద్భుతంగా పోరాడాడు. అతని పోరాటపటిమకు కృష్ణరాయలు ఆశ్చర్యం చెందాడు. రామరాయలు ఎంత శౌర్యంగా పోరాడినా ఓడిపోయి దుర్గాన్ని కృష్ణరాయలకు ఆధీనం చేసి గోల్కొండ వెళ్లి జరిగిన విషయం సుల్తాన్‌కు తెలిపాడు. ఓటమికి సుల్తాన్ రామరాయలను నిందించి తన కొలువు నుండి వెళ్లగొట్టాడు. దాంతో రామరాయలు విజయనగరం చేరి కృష్ణరాయలను ఆశ్రయించాడు. రాయలు అంతకుముందే రామరాజు శక్తి సామర్థ్యాలను తెలుసుకొని ఉన్నవాడైనందున అతనిని ఆదరించి, తన కుమార్తెనిచ్చి వివాహం చేసి తన కొలువులో ఉద్యోగం ఇచ్చాడు. పోర్చుగీసు రచయిత ఫాదర్ ఖైరాస్ రాసిన సింహళ ద్వీప చరిత్రలో రామరాజు శ్రీకృష్ణదేవరాయల మంత్రి అని రాశాడు. అంతేగాక అర్వాచీన తెలుగు సాహిత్యం వలన, పోర్చుగీసు, ముస్లిం చరిత్రకారుల రచనల ద్వారా రామరాజు కృష్ణదేవరాయల కాలంలో విజయనగర దర్బారులో రాజసేవలో ఉన్నట్లు తెలుస్తోంది. కాని అతని పేరు ఏ శాసనంలో ప్రస్తావించబడలేదు. రామరాజు గోల్కొండ సుల్తాన్ కొలువులో దుర్గాధిపతిగా ఉన్నప్పుడు ఆ దుర్గంపై దండెత్తింది కృష్ణరాయలు కాదని, బీజాపూర్ సుల్తాన్ అని, అతని చేతిలో ఓడి దుర్గాన్ని బీజాపూరు సుల్తాన్ వశం చేసి గోల్కొండ వెళ్లి, గోల్కొండ సుల్తాన్ వెడలగొట్టిన తర్వాత విజయనగరం చేరి శ్రీకృష్ణదేవరాయలను ఆశ్రయించాడని కొందరు భావించారు. కాని రామరాజు వంశస్తులు మొదటి నుండి విజయనగర రాజ్యంలో సామంతులుగా, సేనాధిపతులుగా పని చేశారు. అలాంటి వంశానికి చెందిన రామరాజు తన తొలి జీవితంలో గోల్కొండ సుల్తాన్ వద్ద కొలువులో చేరాడా అనేది పెద్ద సందేహం.

రామరాయలకు బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా, తర్వాత అతని కుమారుడు అలీ ఆదిల్‌షా, అహమ్మద్‌నగర్ బురహాన్‌షా, తర్వాత అతని కుమారుడు హుస్సేన్ నిజాంషా, గోల్కొండ జంషీద్ కుతుబ్‌షా, తర్వాత అతని సోదరుడు ఇబ్రహీం కుతుబ్‌షాలు, బీదర్‌లో అలీబరీద్‌లు సమకాలికులు.

రామరాయలు క్రీ.శ.1543లో అధికారం చేపట్టే నాటికి వయోవృద్ధుడు. కాని శరీర పటిమ తగ్గలేదు. అతనికి 70 సంవత్సరాల వయస్సు ఉందని ఒకరు, 60 సంవత్సరాలని ఒకరు రాశారు. అప్పటికే రాజకీయాలలో ఆరితేరిన మేధావి, యుద్ధ నైపుణ్యాన్ని సంపాదించిన యోధాగ్రేసరుడు, పరిపాలనాదక్షుడు, రాజనీతి పారంగతుడు. శ్రీకృష్ణదేవరాయల నాటి సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించమే అతని ఏకైక లక్ష్యం. రామరాయల పరిపాలనా కాలాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. క్రీ.శ.1543 నుండి 1552 వరకు ప్రథమ దశలో అతడు తాను

సదాశివరాయల సైన్యాధ్యక్షునిగా, రాయలకు పరిపాలనలో తోడ్పతున్నట్లు చెప్పుకున్నాడు. తర్వాత క్రీ.శ.1552 నుండి 1565 వరకు 12 సంవత్సరాలు అతడు రాయలు అనే బిరుదు వహించి తానే సర్వాధికారిగా పాలించాడు. అతడు కిరీటం పెట్టుకొనలేదు, సింహాసనం అధిష్టించలేదు కాని నిజమైన రాజ్యాధిపతిగానే ప్రవర్తించాడు.

బీజాపూరు సుల్తాన్ ఆదోని దండయాత్ర: అచ్యుతదేవరాయల కాలంలో విజయనగరాన్ని దర్శించిన న్యూనిజ్ క్రీ.శ.1535లో వెళ్లిపోయాడు. దాంతో న్యూనిజ్ క్రానికల్ అచ్యుతదేవరాయల చరిత్రతో ఆగిపోయింది. తర్వాత విశేషాలు పెరిష్టా రచనల నుండి గ్రహించబడ్డాయి. రామరాయలు సదాశివరాయలను రాజుగా చేసి అధికారాన్ని చేపట్టగానే బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగ్గర రాజ్యంలోని ఆదోని దుర్గాన్ని జయించమని తన సామంతుడైన బెల్గాం పాలకుడు అసద్‌ఖాన్‌ను పంపాడని పెరిష్టా ఆ యుద్ధాన్ని వర్ణించాడు. అసద్‌ఖాన్ క్రీ.శ.1543లో ఆదోని దుర్గాన్ని ముట్టడించాడు. రామరాయలు అసద్‌ఖాన్‌ను ఎదిరించడానికి తన తమ్ముడు వెంకటాద్రిని పెద్ద సేనతో పంపాడు. వెంకటాద్రి అసద్‌ఖాన్‌ను ఓడించి తరిమాడు. అసద్‌ఖాన్ 14 మైళ్లు వెనక్కి వెళ్లిపోయాడు. వెంకటాద్రి ఖాన్ సైన్యాన్ని తరుముతూ వెళ్లి అతనికి రెండు మైళ్ల దూరంలో విడిశాడు. ఆ రాత్రి విజయనగర సైనికులు తమ గుడారాలలో నిద్రించే సమయంలో అసద్‌ఖాన్ హఠాత్తుగా దాడి చేశాడు. ఆ చికాకులో విజయనగర సైనికులు పారిపోయారు. వెంకటాద్రి కూడా తన గుడారంలోని సంపదను, ఏనుగులు, గుర్రాలు తన కుటుంబ సభ్యులను వదలి పారిపోయాడని, అతడు రామరాజుకు కబురు పెట్టి మరికొంత సైన్యాన్ని పంపమన్నాడని, బందీలుగా చిక్కిన తన కుటుంబ సభ్యులను విడిపించుకోడానికి వెంకటాద్రి యుద్ధం చేయకుండా సంధి చేసుకున్నాడని పెరిష్టా రాశాడు. ఉభయులకు సంతృప్తినిచ్చే విధంగా సంధి జరిగిందని, తర్వాత అసద్‌ఖాన్ ఇబ్రహీం ఆదిల్‌షాలు తమ రాజ్యానికి వెళ్లిపోయారని వెంకటాద్రి విజయనగరం చేరాడని కూడా రాశాడు. కాని ఆదోని విజయనగర ఆధీనంలోనే ఉంది. కనుక విజయనగర రాజ్యానికి ఈ యుద్ధం వల్ల ఎలాంటి నష్టం జరుగలేదు.

అధికారాన్ని స్థిరపరచుకోవడం: ఆదోని యుద్ధం తర్వాత రామరాయలు తన స్థానాన్ని సుస్థిరపరచుకోవడానికి కొన్ని చర్యలను చేపట్టాడు. సామ్రాజ్యంలో అంతకు పూర్వం నుండి ఆస్థానంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన సాళువ వంశస్తులను తొలగించాడు. వారే కాక మరికొందరు సామంతులను, అమర నాయకులుగా ఉన్న కొంతమందిని కీలక స్థానాల నుండి తొలగించాడు. ముఖ్యంగా కృష్ణరాయల కాలం నుండి దుర్గాధిపతులుగా ఉన్న బ్రాహ్మణులను తొలగించాడు. తనకు విశ్వాసపాత్రులైన వెలుగోటి, పెమ్మసాని, రావెల, కటకం మొదలైన కుటుంబాల వారిని కీలక పదవులలో నియమించాడు. వీరిలో వెలుగోటి వారు వెలమవారు, మిగిలిన కుటుంబాల వారు కమ్మకులస్తులు. దాంతో విజయనగర సైన్యంలో బ్రాహ్మణుల పాత్ర తగ్గిపోయి కమ్మ వెలమ నాయకుల పాత్ర పెరగసాగింది. తమ కుటుంబీకులైన ఆరవీటి వారికి ఉన్నత ఉద్యోగాలు ఇచ్చాడు. అలాగే కొందరు తెలుగుచోళ కుటుంబాల వారిని కూడా ఉన్నత ఉద్యోగాలలో నియమించాడు. అతని చర్యలను వ్యతిరేకించిన అందరినీ తొలగించాడు. బ్రాహ్మణులలో కొందరు అతనిని సమర్థించి తమ పదవుల్ని నిలుపుకున్నారు. అలాంటి వారిలో రామయామాత్యుడు రామభట్లయ్య, పులిగడ్డ పాపనరసయ్యలు ముఖ్యులు. వారిలో మొదటి ఇద్దరూ క్రీ.శ.1550 వరకు పదవులలో కొనసాగారు. చివరి పులిగడ్డ పాపనరసయ్య రామరాయలు మరణించే వరకు పదవిలో కొనసాగాడు.

ముస్లింలను అధికంగా సైన్యంలో చేర్చుకొనడం: తర్వాత ముస్లింలను అధిక సంఖ్యలో సైన్యంలో చేర్చుకున్నాడు. ముస్లింలను సైన్యంలో చేర్చుకొనే ఆచారం మొదటి దేవరాయల కాలంలోనే ప్రారంభమైంది. కాని వారి సంఖ్య తక్కువ. పైగా వారిని సైనికులుగా మాత్రమే చేర్చుకున్నారు గాని మిగిలిన కీలక పదవులలో నియమించలేదు. కాని రామరాయలు హద్దు దాటి వారిని ఉన్నత పదవులలో కూడా నియమించాడు. క్రీ.శ.1535లో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా తన సైన్యం నుండి మూడు వేల మంది షియా సైనికులను తొలగించాడు. వారు రామరాయలను ఆశ్రయించగా వారిని తన సైన్యంలో చేర్చుకొని ఆరు భాగాలు చేసి వారిలోని ఆరుగురిని సేనాధిపతులుగా నియమించాడు. క్రీ.శ.1543లో అధికారం చేపట్టిన తర్వాత ఇంకా ముస్లిం సైనికులను పెంచాడు. తళ్లికోట యుద్ధం జరిగే నాటికి అతని సైన్యంలో 80 వేల మంది ముస్లిం సైనికులు ఉన్నారని సీవెల్ రాశాడు. డా॥ వై. శ్రీరామమూర్తి 150000 ముస్లిం సైనికులు ఉన్నారని రాశారు. వారికి విజయనగరంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాడు. వారి కోసం ప్రత్యేకంగా తురకవాడ ఉండేది. అక్కడ

రామరాయలు వారికి ఒక మసీదును కూడా నిర్మించాడు. అక్కడ వారు గోవధ చేయడానికి కూడా అనుమతించాడు. దర్బారులో ఒక వేదికపై ఖురాన్ ఉపయోగపడుతుందని ఖురాన్‌ను దర్బారులో ఉంచాడు. ముస్లింలు సేనాధిపతులుగా, విజయనగర రాజ్య అధికారులుగా స్వేచ్ఛగా సంచరించి రాజ్యపు రహస్యాలన్నీ తెలుసుకున్నారు. చివరకు తళ్లికోట యుద్ధంలో ఈ 80 వేల మంది ముస్లిం సేన బహమనీ సుల్తాన్‌లతో చేరిపోయి రామరాయలకు తీరని ద్రోహం చేశారు. వీరిలో ఒక సైనికుడే వెనుక నుండి రామరాయలను పొడిచి చంపాడని ప్రతీతి. రామరాయలు తురక సైన్యంతో అత్యంత విధ్వంసక శక్తిగా తన సైన్యాన్ని తయారు చేయవచ్చని ఆశించాడు. కాని వారి విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వారి వల్ల రాజ్యానికి ప్రమాదం వస్తుందేమో దూరదృష్టితో ఆలోచించకుండా పెద్ద తప్పు చేశాడు.

దక్షిణదేశ దిగ్విజయ యాత్ర: రామరాయలు అధికారం స్వీకరించిన సమయంలో దక్షిణదేశంలో చాలా మంది సామంతులు తిరుగుబాటు ధోరణిలో ఉన్నారు. అదే సమయంలో పోర్చుగీసు వారు దురంతాలకు పాల్పడ్డారు. వారందరినీ అదుపులోకి తీసుకురావడానికి రామరాయలు తన పినతండ్రి కుమారుడు అవుకు చిన తిమ్మానాయకుడు విరల రాజుల నాయకత్వంలో పెద్ద సేనను పంపాడు. దక్షిణ దండయాత్రకు నాలుగు కారణాలు ఉన్నాయి. చంద్రగిరికి దక్షిణంగా ఉన్న తమిళ ప్రాంతాలలో అల్లర్లు లేచాయి. వాటిని అణచడం మొదటి లక్ష్యం .తర్వాత ట్రావెన్‌కూర్ పాలకుడైన నింక్విటిబిరామ్ లేక తిరువడి, కాయత్తార్‌ను పాలించిన పాండ్యరాజును తరిమి కాయత్తార్‌ను ఆక్రమించాడు. అతనిని దండించడం రెండవ లక్ష్యం. పోర్చుగీసు వారి ఆగడాలను కట్టించడం మూడవ లక్ష్యం. పోర్చుగీసు వారి చర్యల వల్ల బాధలకు లోనైన ప్రజలను కాపాడటం నాల్గవ లక్ష్యం. విజయనగర సేన మొదట చంద్రగిరిపై దండెత్తి అక్కడ తిరుగుబాటు ధోరణిలో ఉన్న వారిని ఓడించి వారిని తొలగించి కోటను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత చోళమండలంలో ప్రవేశించి భువనగిరి కోటను ముట్టడించి ఆక్రమించాడు. తర్వాత కావేరీ నది దాటి తంజావూరు పుదుక్కోటై నాయకులను లొంగదీసి కప్పం వసూలు చేశాడు. తర్వాత సముద్రం తీరం వెంట నడచి కాయత్తార్, ట్యూటికోరన్‌లను ఆక్రమించిన బెట్టు పెరుమాళ్లను ఓడించి పాండ్యరాజుకు అతని రాజ్యాన్ని అప్పగించాడు. తర్వాత ట్రావెన్‌కోర్ లేక తిరువనంతపురం రాజ్యంపై దండెత్తారు. మార్గమధ్యంలో తోవల్ కనుమ వద్ద పంచతిరువాడి సేనలు ఎదుర్కొన్నాయి. ఆ సైన్యాలను ఓడించి ట్రావెంకూర్ చేరి ఇంకిత్విబిరియన్‌ను లేక తిరువడిని ఓడించారు. అతడు శరణుజొచ్చి కప్పం చెల్లించి తన రాజ్యంలో పునఃప్రతిష్ఠుడయ్యాడు. ఈ విజయం తర్వాత చిన తిమ్మానాయకుడు తిరువనంతపురంలోని అనంతపద్మనాభస్వామి దేవాలయాన్ని దర్శించి పూజలు చేసి దానం చేశాడు. తర్వాత కన్యాకుమారి వద్ద విజయ స్తంభం నాటి రాజధానికి తిరిగి వచ్చాడు. ఈ దండయాత్రతో దక్షిణదేశమంతా అదుపులోకి వచ్చింది. ఈ విజయాలు సాధించినందుకు విరలరాజును ద్రావిడ, కేరళ దేశాలకు పాలకునిగా నియమించాడు. అతడు క్రీ.శ.1558 వరకు ఆ పదవిలో కొనసాగాడు.

పోర్చుగీసు వారితో యుద్ధం: విజయనగర రాజులు పోర్చుగీసు వారిని ఎంతగా ఆదరించినా వారు విశ్వాసం లేని వారై విజయనగర రాజ్యంలో దురంతాలకు దిగారు. గోవాలోని పోర్చుగీసు గవర్నర్ మార్టిన్ అండదండలతో ఫ్రాన్సిస్ జేవియర్ అనే కాథలిక్ మత ప్రచారకుడు మధుర రాజ్యంలో మన్నారుఖాతంలోని ముత్యాలవేట తీరంలో నివసించే పరవలు అని పిలువబడే బెస్తవారిని క్రైస్తవులుగా మార్చాడు. దాదాపు మూడు వేల మంది బెస్తవారు పోర్చుగీసు వారి మాయమాటలు నమ్మి క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. క్రైస్తవులుగా మారిన బెస్తవారు విజయనగర రాజును తమ ప్రభువుగా భావించనవసరం లేదని, వారికి పోర్చుగల్ రాజే ప్రభువని, వారిని విజయనగర రాజ్యానికి అవిధేయులుగా చేయాలని బోధించసాగారు. పశ్చిమతీరంలో కూడా అనేక మంది హిందువులను క్రైస్తవమతంలోకి మారమని, అలా మారితే హిందూ రాజులకు పన్ను చెల్లించనవసరం లేదని, ముస్లిం వర్తకుల దోపిడీ వ్యాపారం నుండి బయటపడవచ్చని, వారందరినీ తమ రాజు రక్షిస్తాడని ప్రచారం చేయసాగారు. తూర్పు తీరంలో అనేక దేవాలయాలు పడగొట్టి చర్చిలు నిర్మింపసాగారు. ఫ్రాన్సిస్ జేవియర్ ఇంకా అనేక మంది జేసూటుల తమ మత ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శ్రీరంగం దేవాలయాన్ని పోర్చుగీసు వారు అపవిత్రం చేశారు. కంచి దేవాలయాన్ని దోచుకోవాలని ప్రయత్నించారు. పశ్చిమకోస్తాలో అనేక దేవాలయాలను దోచుకొని నాశనం చేశారు. అలాంటి స్థితిలో క్రీ.శ.1545లో తిరుపతి తిరుమల దేవాలయ సంపదను విని దానిని దోచుకోవాలని గోవా గవర్నర్ మార్టిన్ అఫాన్ డిసౌజా స్వయంగా 3000 సైన్యాన్ని తయారు చేసి సముద్రంపై

ప్రయాణించి మద్రాసు దగ్గర ఉన్న శాంతోమ్ చేరాడు. కాని ఆ సమయంలో పెద్ద తుఫాను వీచి అతని ప్రయత్నం విఫలమైంది. తర్వాత అతడు వెనుకకు తిరిగి వెళ్లి పశ్చిమకోస్తాలో అనేక దేవాలయాలను దోచుకొని భాగ్యవంతుడయ్యాడు. ఆ స్థితిలో ప్రజలు రామరాయలకు పోర్చుగీసు వారి ఆగడాలను తెలిపారు. అందువలన రాయలు దక్షిణదేశ దిగ్విజయ యాత్రకు బయలుదేరిన తిమ్మ, విఠల రాజులకు పోర్చుగీసు వారిని దండించే కార్యక్రమాన్ని కూడా అప్పగించాడు. వారు ఆ సమయంలో నాగూరులో ఉన్న రోమన్ కాథలిక్‌ల స్థావరంపై దండెత్తి వారిని ఓడించి బుద్ధి చెప్పారు. అక్కడ ఉన్న రంగనాథ దేవాలయాన్ని వారు పాడు పెట్టారు. కనుక విఠలరాజు వారు పాడు పెట్టిన దేవాలయాన్ని తిరిగి తెరిపించి పూజా పునస్కారాలు ఏర్పాటు చేశాడు. ఇలాంటి స్థితిలో పోర్చుగీసు గవర్నర్ మార్టిన్ అఫాన్ డిసౌజా పదవీ కాలం అయిపోయింది. అతని స్థానంలో జాన్‌డకాస్ట్రో అనే అతడు గవర్నర్‌గా నియమింపబడ్డాడు.

పోర్చుగీసు వారితో రామరాయల వర్తక సంధి క్రీ.శ.1547: నూతనంగా వచ్చిన గవర్నర్ జాన్‌డకాస్ట్రో విజయనగర సామ్రాజ్యంతో విరోధం మంచిది కాదని గ్రహించాడు. అందువల్ల అతడు 1547 సెప్టెంబర్ 19వ తేదీన విజయనగర రాజు సదాశివరాయలతో సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం పోర్చుగీసు వారు గోవాలో దిగుమతి అయిన గుర్రాలన్నింటిని విజయనగర రాజ్యానికే అమ్ముతామని మరెవరికీ అమ్మమని షరతును అంగీకరించారు. అలాగే విజయనగర వర్తకులు తమ వర్తక సరుకులను పోర్చుగీసు వారి ఫ్యాక్టరీలు ఉన్న రేవులకే పంపుతారు, బీజాపూర్ రేవులకు పంపరు. విజయనగర వర్తకులు ఇనుము, సూరేకారం, బీజాపూర్ రేవుల నుండి దిగుమతి చేసుకోరు. పోర్చుగీసు వారి రేవుల నుండి ఖరీదు చేస్తారు. అరబ్బుల వ్యాపార నౌకలు గాని, నౌకాదళాన్ని గాని విజయనగర రేవులలోకి ప్రవేశం ఇవ్వరు అనే షరతులతో వర్తక సంధి జరిగింది. ఈ వర్తక సంధి వల్ల పోర్చుగీసు వారికే అధిక ప్రయోజనాలు కలిగాయి. ఈ సంధి క్రీ.శ.1547 నుండి 1558 వరకు ఎలాంటి విఘాతాలు లేకుండా కొనసాగింది 1558లో మళ్లీ పోర్చుగీసు వారితో యుద్ధం వచ్చింది.

గోవా-శాంథోమ్‌లపై దాడి: విజయనగర సామ్రాజ్యం వల్ల అన్ని ప్రయోజనాలు పొంది లాభాలు గడిస్తూ ఉన్నప్పటికీ వారికి విశ్వాసం లేకపోయింది. పోర్చుగీసు మత ప్రచారకులు వారి దుండగాలను ఆపలేదు. హిందువులను క్రైస్తవులుగా మార్చడం, దేవాలయాలను దోచుకోవడం కొనసాగించారు. ఆ స్థితిలో ప్రజలు వారిపై చర్య తీసుకోమని రామరాయలను కోరారు. రామరాయలు వారి దుశ్చర్యలను అరికట్టడానికి క్రీ.శ.1558వ సంవత్సరంలో మద్రాసు వద్ద ఉన్న శాంథోమ్, మైలాపూర్‌లలో స్థావరం ఏర్పాటు చేసుకొని దుండగాలు చేసే పోర్చుగీసు వారిపై దండెత్తాడని ఆజ్ఞాపించాడు. శాంథోమ్‌పై దండెత్తిన రామరాయలు పోర్చుగీసు వారిని ఓడించాడు. మైలాపూరు, శాంథోమ్ పట్టణాలను ఆక్రమించాడు. ఓడిపోయిన పోర్చుగీసు వర్తకులు రామరాయలను శరణు వేడారు. అందుకు లక్ష పగోడాలు కప్పంగా చెల్లించమన్నాడు. అందుకు పోర్చుగీసు వారు అంగీకరించి తక్షణమే 50 వేల పగోడాలు చెల్లించారు. మిగిలిన 50 వేల పగోడాలు చెల్లించటానికి ఒక సంవత్సరం గడువు కోరారు. ఆ మొత్తం చెల్లించే వరకు 5గురు పోర్చుగీసు వారు తమ వద్ద హామీగా ఉండాలని చెప్పి, 5గురు వర్తక ప్రముఖులను బందీలుగా తీసుకెళ్లారు. గోవాపై దండెత్తిన విఠల్‌రాయలు గోవాను జయించలేదు కాని గోవా నుండి, శాంథోమ్ నుండి పోర్చుగీసు వారికి ఎలాంటి సహాయం అందకుండా చేయగలిగాడు. తాత్కాలికంగా పోర్చుగీసు వారు తమ దుండగాలను ఆపు చేశారు. ఆ తర్వాత కొద్ది కాలానికి మళ్లీ ఎప్పటిలాగానే వారి దుశ్చర్యలు కొనసాగించారు.

బహమనీ రాజ్యాలతో రామరాయల సంబంధాలు: రామరాయలు విజయనగర అధికారం చేపట్టిన తర్వాత సామ్రాజ్యపు విదేశీ విధానంలోను, బహమనీ రాజ్యాల సంబంధాలలో చాలా మార్పు వచ్చింది. అంతకుముందు బహమనీ సుల్తాన్‌లు విజయనగరం రాజ్యంపై దండెత్తడం, విజయనగర రాజులు ఎదుర్కోవడం తప్ప బహమనీ రాజులతో ఎప్పుడూ స్నేహ సంబంధాలను పాటించలేదు. బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై క్షీణించి బీదరు, బీరార్, అహమ్మద్‌నగర్, బీజాపూరు, గోల్కొండ రాజ్యాలుగా చీలిపోయిన తర్వాత వారిలో వారికి ఈర్ష్యాద్వేషాలు కలిగి విజయనగర రాజ్య సహాయం పొంది మిగిలిన రాజ్యాలను నాశనం చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నాయి. మొదటిసారిగా కృష్ణరాయలు వారి అంతఃకలహాలలో జోక్యం చేసుకున్నాడు. కాని చాలా పరిమితంగా జోక్యం చేసుకున్నాడు. కాని రామరాయలు ఆ రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో కూడా జోక్యం చేసుకున్నాడు. అంతకు పూర్వం రామరాయలు గోల్కొండ నవాబుల కొలువులో ఉండి సుల్తాన్‌ల మనస్తత్వం బాగా అవగాహన చేసుకొని

ఉన్నాడు. కనుక వారి వివాదాలలో జోక్యం చేసుకొని విస్తరించి విజయనగర రాజ్య వైభవాన్ని ఇనుమడింపజేయవచ్చని ఆశించాడు. అందువల్ల రామరాయలు బహమనీ రాజకీయాలలో లోతుగా పాల్గొన్నాడు. క్రీ.శ.1543-1564 సంవత్సరాలు మధ్య జరిగిన బహమనీ రాజ్యాల అంతఃకలహాలలో విజయనగర రాజ్యం, బీజాపూరు ఆదిల్‌షా రాజ్యం, అహమ్మద్‌నగర్, నిజాంషామీ రాజ్యం ప్రముఖ పాత్ర నిర్వహించాయి. కుతుబ్‌షాహీ రాజ్యమైన గోల్కొండ, బరీద్‌షాహి రాజ్యమైన బీదరు ఉపపాత్రలు పోషించాయి. వారు ఒకరి ప్రాంతాలను ఒకరు ఆక్రమించి తమ రాజ్యాలను విస్తరించుకోవాలని ఈర్ష్యాద్వేషాలతో పోరాటాలు జరిపారు. ఈ పోరాటాలలో కళ్యాణీ, షోలాపూర్, రాయచూరు, అంతర్వేది, కోవెలకొండ, పానుగల్లు, గణాపూర్, ఇటీగర్, బగ్రాకోట లేక భగల్ ప్రాంతాలు వశం చేసుకోవాలని ఆరాటపడ్డారు. ఈ ప్రాంతాల ఆక్రమణలకే ఆ యుద్ధాలు జరిగాయని చెప్పవచ్చు. ఈ యుద్ధాలను రెండు దశలుగా విభజింపవచ్చును. క్రీ.శ.1543 నుండి 1557 వరకు మొదటి దశ. ఈ దశలో రామరాయలు అహమ్మద్‌నగర్ నిజాంషాహీతో స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకొని బీజాపూరు రాజ్యంపై దాడులు చేశాడు. ఈ దశలో రాయచూరు, అంతర్వేదిలను ఆక్రమించి విజయనగరానికి లాభం చేకూర్చాడు. క్రీ.శ.1557 నుండి 1564 వరకు రెండవదశ. ఈ దశలో రామరాయలు అహమ్మద్‌నగర్‌తో స్నేహ సంబంధాలను వదలుకొని బీజాపూర్ ఆల్‌షాహితో చేరిపోయి అహమ్మద్‌నగర్ రాజ్యంపై దాడి చేశాడు. ఇది నిష్ప్రయోజనమైన యుద్ధం. ఈ యుద్ధమే సుల్తాన్‌లు ఏకం కావడానికి దోహదం చేసి తళ్లికోట యుద్ధానికి కారణమైంది. రామరాయల, బహమనీ సుల్తాన్‌ల సంబంధాలు ముస్లిం చరిత్రకారుల రచనల ద్వారానే గాక శివతత్వ రత్నాకరం, వెలుగోటి వారి వంశావళి, కేళడిన్నప విజయం కావ్యాలు కూడా తెలుపుతున్నాయి.

అహమ్మద్‌నగర్ బీజాపూరు రాజ్యాల ఒడంబడిక క్రీ.శ.1542: సలకం చిన తిరుమలుడు మరణించిన తర్వాత బీజాపూరు అహమ్మద్‌నగర్ రాజ్యాలు ఒక ఒడంబడికను చేసుకున్నాయని గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు తెలిపాడు. ఆ ఒడంబడిక ప్రకారం అహమ్మద్‌నగర్ రాజ్యం బీదరును కలుపుకొనేటట్లు, బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యాన్ని జయించి తనలో కలుపుకొనేటట్లు ఒప్పందం చేసుకొన్నారు. అందుకు ఒకరినొకరు సహాయం చేసుకోవాలని కూడా తీర్మానించారు. ఆ ఒడంబడిక తర్వాత బీజాపూర్ సుల్తాన్ విజయనగరంపై దండెత్తి చాలా ప్రాంతాలు ఆక్రమించాడని అజ్ఞాత చరిత్రకారుడు రాశాడు. ఈ దండయాత్రను గురించి కేళడిన్నప విజయం కూడా పేర్కొంది. సుల్తాన్ సైన్యాలను విజయనగర సేనానాయకుడైన సదాశివనాయకుడు ఎదుర్కొని ఓడించి తరిమివేశాడని కేళడిన్నప విజయం తెలుపుతోంది. ఈ రెండు వృత్తాంతాలను బట్టి బీజాపూరు సైన్యాలు విజయనగరంపై దండెత్తాయని ఫాదర్ హీరాస్ భావించాడు. కాని అజ్ఞాత చరిత్రకారుడు పేర్కొన్నట్లు విజయనగరం తన ప్రాంతాలను కోలుపోలేదని ఈ దండయాత్ర విఫలమైందని వివరించాడు. ఈ దండయాత్ర తర్వాత రామరాయలు బహమనీ రాజ్యాలతో తాను అనుసరించవలసిన విధానాలు రూపొందించుకున్నాడు. బహమనీ సుల్తాన్ రాజకీయాలలో జోక్యం చేసుకొని బీజాపూరు, అహమ్మద్‌నగర్‌లను వేరు చేయాలని తలచాడు. ఈ ధ్యేయంతో రామరాయలు అహమ్మద్‌నగర్ రాజ్యంతో స్నేహ సంబంధాలను ఏర్పరచుకోవాలని తలచాడు. అహమ్మద్‌నగర్ నిజాంషా కూడా బీజాపూరు, బీదర్‌లతో ఉన్న విరోధం వల్ల విజయనగరంతో స్నేహాన్ని వాంఛించాడు. కనుక బురహాన్ నిజాంషా విలువైన కానుకలతో తన రాయబారులను విజయనగరం పంపాడు. రామరాయలు ఆ కానుకలను స్వీకరించాడు. అది తెలిసి బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా రామరాయలపై మండిపడి తన రాజ్యంలో ఉన్న విజయనగర రాయబారులను వెళ్లగొట్టాడు. అందువల్ల రామరాయలకు బీజాపూరుపై ఆగ్రహం కలిగింది.

మొదటి దశ క్రీ.శ.1543-57: అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్‌షా ఇదే తగిన సమయమని బీదరు మీద దండెత్తి కళ్యాణీదుర్గాన్ని ముట్టడించాడు. మొదటి నుండి కళ్యాణీదుర్గం బీదరు రాజ్యంలో ఉంది. దానిని ఆక్రమించాలని అహమ్మద్‌నగర్ కోరిక. ఈ దండయాత్రతో మొదటిదశ ప్రారంభమైంది. ఈ యుద్ధంలో రామరాయలు అహమ్మద్‌నగరానికి సహాయం చేశాడు. బీదర్ సుల్తాన్ అలీబరీద్ బీజాపూరు సహాయం అర్థించాడు. బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా బీదర్‌కు సహాయంగా వెళ్లాడు.

రామరాయలు రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించటం: ఇదే తగిన సమయం అని రామరాయలు తన తమ్ముడు వెంకటాద్రిని సైన్యంతో పంపాడు. వెంకటాద్రి రాయచూరు, ముద్గల్, అంతర్వేదిని ఆక్రమించాడు. ఈ లోపల అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్ నిజాంషా కళ్యాణీ దుర్గాన్ని జయించాడు. ఈ మొదటి యుద్ధంలో

అహమ్మద్‌నగర్ విజయనగరం ఒక వైపు, బీదర్ బీజాపూరు మరొక వైపున పోరాడాయి. ఈ యుద్ధంలో అహమ్మద్‌నగర్, విజయనగర కూటమి విజయం సాధించింది. కళ్యాణీ, అహమ్మద్‌నగర్ వశం కాగా రాయచూరు, అంతర్వేది విజయనగరం వశమయ్యాయి. బీదరు, బీజాపూరులు నష్టపోయాయి. క్రీ.శ.1553 బురహాన్ నిజాంషా మరణించేవరకు కళ్యాణీకోట అహమ్మద్‌నగర్ ఆధీనంలోనే ఉంది.

రెండవ యుద్ధం క్రీ.శ.1551-52: బీజాపూరు, బీదర్‌లు నష్టపోవడంతో తిరిగి అహమ్మద్‌నగరంతో యుద్ధం చేయాలని సంకల్పించాయి. బీజాపూరు సుల్తాన్ తన నష్టానికి అహమ్మద్‌నగరం కారణమని భావించాడు. కోల్పోయిన కళ్యాణీ నగరాన్ని బీజాపూరు జయించుకోవచ్చని కూడా బీదరు రాజ్యం పేర్కొంది. కనుక బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం అహమ్మద్‌నగరంపై దండెత్తాడు. కొన్ని దుర్గాలను జయించాడు. దాంతో అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్‌షా రామరాయల సహాయం అర్థించడానికి విజయనగర రాజ్యానికి వచ్చాడు. రామరాయలు బురహాన్‌షాలు క్రీ.శ.1551లో రాయచూరు వద్ద కలుసుకొన్నారు. ఉభయులూ రక్షణ సంధి చేసుకున్నారు. తర్వాత ఇద్దరూ బీజాపూరుపై దండెత్తి ఓడించారు. ఓడిపోయిన బీజాపూరు సుల్తాన్ తన రాజ్యంలోని షోలాపూర్‌ను అహమ్మద్‌నగరానికి ఇచ్చేసి సంధి చేసుకున్నాడు. అంతర్వేది రాయచూరులను రామరాయలకు వదలుకున్నాడు. ఈ విధంగా రెండవ యుద్ధంలో కూడా అహమ్మద్‌నగర్ విజయనగర కూటమి జయించింది. క్రీ.శ.1553లో అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్ నిజాంషా మరణించాడు. అతని కుమారుడు హుసేన్ నిజాంషా గద్దెనెక్కాడు. ఆ సమయంలో తాను కోల్పోయిన షోలాపూర్‌ను జయించాలని బీజాపూరు ఇబ్రహీం ఆదిల్‌షా అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తాడు. కాని షోలాపూర్ వద్ద ఓడిపోయాడు.

ఐనుల్‌ముల్క్ సైఫాఖాన్ క్రీ.శ.1555-56: బీజాపూర్ ఇబ్రహీం ఆదిల్‌షా షోలాపూర్ వద్ద యుద్ధం చేసినప్పుడు బీజాపూర్ రాజ్యంలో ఐనుల్‌ముల్క్ అనే సర్దార్ తిరుగుబాటు చేశాడు. షోలాపూర్ వద్ద ఓడిపోయి తిరిగి తన రాజ్యం చేరిన ఇబ్రహీం ఆదిల్‌షా అతనితో పోరాటానికి దిగాడు. కాని ఐనుల్‌ముల్క్ అతనిని ఓడించి బీజాపూరు రాజ్యాన్ని ఆక్రమించాడు. రాజ్యం పోగొట్టుకున్న బీజాపూరు సుల్తాన్ ఏమిచేయాలో తోచక రామరాయలను శరణువేడాడు. 7 లక్షల పగోడాలు ధనం ఇచ్చి తన రాజ్యాన్ని కాపాడమన్నాడు. రామరాయలు దయతలచి తన తమ్ముడు వెంకటాద్రిని పంపాడు. వెంకటాద్రి బీజాపూరుపై దండెత్తి ఐనుల్‌ముల్క్‌ను ఓడించి తరిమేసి రాజ్యాన్ని ఇబ్రహీం ఆదిల్‌షాకు అప్పగించాడు. ఐనుల్‌ముల్క్ అహమ్మద్‌నగరం పారిపోయాడు. కాని అక్కడ అతడు దారుణహత్యకు గురయ్యాడు. ఈ విధంగా ఇబ్రహీం ఆదిల్‌షా రామరాయల సహాయంతో తన రాజ్యాన్ని దక్కించుకున్నాడు. దాంతో బీజాపూరు రాజ్యం విజయనగరానికి చేరువ అయింది.

అబ్దుల్లా తిరుగుబాటు క్రీ.శ.1555-56: ఐనుల్‌ముల్క్ తిరుగుబాటు అంతమైన తర్వాత ఇబ్రహీం మరొక కష్టాన్ని ఎదుర్కోవలసివచ్చింది. అతని సోదరుడు అబ్దుల్లా తిరుగుబాటు చేసి పశ్చిమకోస్తాలోని పొందాలో స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. ఇబ్రహీం ఆదిల్‌షా మళ్లీ రామరాయల సహాయంతో సోదరుని ఓడించి రాజ్యాన్ని కాపాడుకున్నాడు. దాంతో బీజాపూరు రాజ్యం రామరాయలకు మరీ దగ్గరైంది. తర్వాత క్రీ.శ.1557 లో ఇబ్రహీం కుతుబ్‌షా మరణించాడు. అతని కుమారుడు అలీ ఆదిల్‌షా బీజాపూరు గద్దెనెక్కాడు. అదే సమయంలో విజయనగరంలో రామరాయల కుమారుడు ఒకడు మరణించాడు. అలీ ఆదిల్‌షా విజయనగరం దర్శించి రామరాయలకు తన సంతాపం తెలిపాడు. అందుకు రామరాయలు సంతసించాడు. అది అదనుగా తీసుకొని ఆదిల్‌షా తనను కుమారునిగా చూసుకొమ్మనీ, తన రాజ్యం నుండి అహమ్మద్ నగరం జయించిన కళ్యాణీ, షోలాపూరులను ఇప్పించమని కోరాడు. రామరాయలు పొంగిపోయి అలీ ఆదిల్‌షాను తన కుమారునిగా చూసుకుంటానని వాగ్దానం చేశాడు. రామరాయల భార్య కూడా అలీ మన కుమారుడే అన్నదట. దాంతో మూడు రోజులు విజయనగరంలో గడిపి అలీ ఆదిల్‌షా సంతోషంగా తన రాజ్యానికి వెళ్లిపోయాడు. రామరాయల అండ తనకు ఉందని భావించి కళ్యాణీ, షోలాపూర్‌లను తనకు అప్పగించమని అహమ్మద్ నగరానికి కబురు పంపాడు.

రెండవ దశ క్రీ.శ.1557-1564: బీజాపూరు రాజ్యం రామరాయలకు దగ్గర కావడం, అలీ ఆదిల్‌షా కళ్యాణీ, షోలాపూర్‌లను అప్పగించమని కోరడంతో అహమ్మద్‌నగర్ రాజ్యం రామరాయలకు దూరమైపోయింది. బీజాపూరు రాజ్యం ఎప్పుడైనా తనపై దండెత్తవచ్చని హుసేన్ నిజాంషా గోల్కొండ ఇబ్రహీం కుతుబ్‌షాతో స్నేహ సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. వారు ఉభయులు కలసి బీజాపూరు రాజ్యంలో ఉన్న గుల్బర్గాను ముట్టడించారు. బీజాపూరు అలీ ఆదిల్‌షా రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు తన సైన్యంతో స్వయంగా

బీజాపూరు రాజ్యంలోకి వచ్చాడు. రామరాయలు తన సైన్యాలతో బీజాపూరు రాజ్యానికి సహాయంగా వచ్చాడని తెలిసి భయపడి అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లు ముట్టడిని విరమించి వెనక్కు వెళ్లిపోవాలని నిర్ణయించారు. అదే సమయంలో వారికి రామరాయల వద్ద నుండి సంధికి రావలసిందని కబురు వచ్చింది.

నాలుగు రాజ్యాల సంధి క్రీ.శ.1557-58: రామరాయల ఆహ్వానాన్ని అందుకొని బీజాపూరు, గోల్కొండ, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లు రామరాయల వద్దకు వచ్చారు. అప్పుడు రామరాయలు కృష్ణాభీమా నదులు కలిసేచోట విడిసి ఉన్నాడు. అనవసర రక్తపాతం మంచిది కాదని, యుద్ధాలు మాని సఖ్యతగా ఉండమని సుల్తాన్‌లకు హితవు చెప్పాడు. తర్వాత అక్కడ వారందరూ కలసి అన్ని విషయాలు మాట్లాడి ఒక సంధి చేసుకున్నారు. దీనినే **నాలుగు రాజ్యాల సంధి అని అంటారు.** ఆ సంధి ప్రకారం - ఇక ముందు ఎవరూ ఇతరుల రాజ్యాలపై దురాక్రమణ చేయరాదు. ఎవరైనా దురాక్రమణ చేస్తే మిగిలిన మూడు రాజ్యాలు కలసి దురాక్రమణ చేసిన రాజ్యంపై దండెత్తి గుణపాఠం చెప్పాలని తీర్మానించి నలుగురూ ఒప్పందంపై సంతకం చేశారు..

రామరాయల ఘనత: ఈ సంధి చేయించిన కాలానికి రామరాయల అధికారం తారాస్థాయికి చేరిందని చెప్పవచ్చు. రామరాయల స్థానాన్ని ఏ విజయనగర చక్రవర్తి సాధించలేదు. సుల్తాన్‌లందరిని తన ముందుకు పిలిపించుకొని శాసించింది విజయనగర రామరాయలు తప్ప మరెవరూ లేరు. కృష్ణదేవరాయలు కూడా అలాంటి ఘనతను సాధించలేదు. ఆ సంధి తర్వాత రామరాయలకు తనకు ఎదురులేదని గర్వం కలిగి ఉంటుంది అందువల్ల ఆ తర్వాత బహమనీ సుల్తాన్‌లకు జరిగిన యుద్ధాల్లో తనకు అవసరం లేకపోయినా పాల్గొన్నాడు వాస్తవానికి తనకు ఎటువంటి సమస్యలు లేవు. రాయచూరు, అతర్వేదిపై బీజాపూరు సుల్తాన్ హక్కులను వదులుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా విజయనగర చక్రవర్తులు సాధించలేని సరిహద్దుల స్థిరత్వాన్ని సాధించాడు. సరిహద్దులు స్థిరపడ్డాయి. తనకు ఇక బహమనీ సుల్తాన్‌లతో యుద్ధాలు చేయవలసిన అవసరం లేదు. కాని నాలుగు రాజ్యాల సంధి కుదిరిన తర్వాత సంధిని ధిక్కరించిన అహమ్మద్ నగరంపై అనవసరంగా దండయాత్ర చేశాడు. అంటే విజయనగర రాజ్య అవసరాలకు గాక తన వ్యక్తిగత అహంతో తన మాటే సాగాలనే పట్టుదలతో వారి యుద్ధాలలో పాల్గొన్నాడు. బీజాపూరు సుల్తాన్ పిలిచినంత మాత్రాన వెళ్లనవసరం లేదు. కాని తనకు తాను ఒక పెద్దగా ఊహించుకొని సంధి షరతులను అమలు జరపవలసిన బాధ్యత తనపై ఉందని భావించుకొని అహమ్మద్‌నగరంపై దండయాత్ర చేశాడు. ఈ విధంగా అతడు ఐచ్ఛికంగానో, పరిస్థితుల ప్రభావం వల్లనో, అనాలోచితంగా వారి యుద్ధాలలో తల దూర్చి విజయనగర రాజ్యానికి చేటు తెచ్చాడు. తను సాధించిన ఘనతను కొద్ది కాలంలోనే పోగొట్టుకోవడమే గాక తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నాడు. విజయనగర విధ్వంసానికి కారకుడయ్యాడు.

మొదటి అహమ్మద్‌నగర్ యుద్ధం క్రీ.శ.1560: క్రీ.శ.1560లో అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్‌షా నాలుగు రాజ్యాల సంధిని ఉల్లంఘించి బీజాపూరు రాజ్యంపై దాడి చేశాడు. అల్ ఆదిల్‌షా విజయనగరం చేరి రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షాకు ఉత్తరం రాసి అహమ్మద్‌నగర్‌ను దండించాలనీ, సైన్యాలతో బయలుదేరమనీ ఆదేశించాడు. ఇబ్రహీం కుతుబ్‌షాకు అహమ్మద్‌నగర హుసేన్‌షాకు రహస్య మైత్రి ఉన్నందువల్ల అహమ్మద్‌నగరంపై దండెత్తడం ఇష్టం లేదు. కాని రామరాయలకు ఎదురు చెప్పలేక అయిష్టంగా తన సేనలతో బయలుదేరాడు. దాంతో విజయనగర సేన, గోల్కొండ సేన బీజాపూరు చేరి మూడు సైన్యాలు కలిసి అహమ్మద్‌నగరంపై దండెత్తారు. విజయనగర సైన్యానికి వెంకటాద్రి, సదాశివ నాయకుడు నాయకత్వం వహించారు. మిత్రపక్షం సైన్యం వస్తోందని తెలిసి హుసేన్‌షా కళ్యాణీదుర్గ రక్షణ భారాన్ని తన సేనాధిపతి అయిన భోపాలరాయునికి అప్పగించి హడావిడిగా తాను తన రాజధాని అహమ్మద్‌నగరానికి వెళ్లిపోయాడు. మిత్రపక్షాలు తమ సైన్యంలో ఒక భాగాన్ని కళ్యాణీదుర్గాన్ని జయించడానికి పంపి, మిగిలిన సేన హుసేన్‌షాను తరుముతూ అహమ్మద్‌నగరంపై దండెత్తాయి. ఆ సమయంలో తాను అహమ్మద్‌నగరంలో కూడా ఉండటం క్షేమం కాదని హుసేన్‌షా కోట రక్షణను తన సేనాధిపతులకు వదిలేసి గోదావరి నదిని దాటి పైఠాన్‌కు వెళ్లిపోయాడు. విజయనగర సేనలను నడిపిన సదాశివనాయకుడు జంఖండి లేక జంబుఖండి వద్ద (ఈ ప్రదేశం అహమ్మద్‌నగర్ జిల్లాలో ఉంది) నిజాంషా సేనల్ని చిత్తుగా ఓడించాడు. తర్వాత మిత్రపక్షాల సేనలు ముందుకుసాగి అహమ్మద్‌నగర్ కోటను ముట్టడించాయి. ఈ విధంగా విజయనగర సేనలు విజయపరంపరలతో ముందుకు సాగడం గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్‌షాకు విపరీతమైన అసూయ

కలిగించి ద్రోహానికి తలపడ్డాడు. అహమ్మద్‌నగర్ కోటను రక్షించడానికి పోరాడే హుసేన్‌షా సేనలకు రహస్యంగా సహాయం చేశాడు. అయినప్పటికీ విజయనగర సేనలు అహమ్మద్‌నగర్ సేనలను ఓడించి కోటలో ప్రవేశించాయి. ఈలోపల విజయనగర సైన్యాలలో ఒక భాగం గోదావరి నదిని దాటి దౌలతాబాద్ కోటను కూడా జయించాయి. హుసేన్‌షా సైన్యం మరికొన్ని చోట్ల కూడా పోరాడి ఓడిపోయింది. కళ్యాణీ, అహమ్మద్‌నగర్, దౌలతాబాద్ కోటలు మిత్రపక్షాల వశమయ్యాయి. ఇక తాను గెలవడం అసాధ్యమని తలచి హుసేన్‌షా సంధి రాయభారం పంపాడు. నిజాంషా స్వయంగా రామరాయలను దర్శించి కళ్యాణీ కోట తాళాలు అప్పగించి, బీజాపూరుకు ఆ కోటను వదులుకున్నానని చెప్పాడు. యుద్ధ సమయంలో హుసేన్‌షా తరపున పోరాడి మిత్రపక్షాల సేనకు నష్టం కలిగించిన ఇమాద్‌షా సేనాధిపతి అయిన జహంగీర్‌ను వధించడానికి హుసేన్‌షా అంగీకరించాడు. రామరాయల చేతితో ఇచ్చిన తాంబూలాన్ని స్వీకరించడానికి కూడా హుసేన్‌షా అంగీకరించాడు. కాని ఆ సమయంలో రామరాయలు హుసేన్‌షా చేతిని ముద్దు పెట్టుకున్నాడట. వెంటనే హుసేన్‌షా నీళ్లు తెప్పించి రామరాయలు ముద్దుపెట్టుకున్న చేతిని కడుగుకున్నాడట. అందుకు రామరాయలకు కోపం వచ్చి తాను కూడా నీళ్లు తెప్పించి తన చేతులు కడుగుకొని నీవు చేసిన అవమానానికి అతిథి గనుక బతికిపోయావు, ఫో అని అన్నాడట. ఈ సందర్భంలోనే హుసేన్‌షాకు రామరాయలపై విపరీతమైన ద్వేషం కలిగిందట. రామరాయలకు అహమ్మద్‌తో సుదీర్ఘ సంఘర్షణ జరిగినట్లు కేళడినృప విజయం, బాలభాగవతాలు కూడా తెలుపుతున్నాయి. కనుక రాయల అహమ్మద్‌నగర్ దండయాత్ర విజయం వాస్తవమేనని స్పష్టమవుతోంది.

బీదరు దండయాత్ర: అహమ్మద్‌నగర్ దండయాత్ర తర్వాత విజయనగర సేనలు బీదర్‌పై దండెత్తి బీదర్ సుల్తాన్‌ను ఓడించి బందీ చేశాయని శివతత్వ రత్నాకరం, కేళడినృప విజయాలు పేర్కొన్నాయి. బీదరు సుల్తాన్ సేనలు అహమ్మద్‌నగర్ సుల్తాన్‌కు సహాయం చేశాయి. అందుకుగాను శిక్షించడానికి దండయాత్ర జరిగింది. ఓడిపోయిన బీదరు సుల్తాన్ మిత్రపక్షాలవైపు చేరతానని, అహమ్మద్‌నగర్ సైన్యంతో పోరాడతానని చెప్పి స్వేచ్ఛను పొందాడని శివతత్వ రత్నాకరం, కేళడినృప విజయం తెలుపుతున్నాయి.

యుద్ధానంతరం రామరాయలు గోల్కొండ కుతుబ్‌షాను అహమ్మద్‌నగర్ కోట వద్ద హుసేన్‌షా సైనికులకు సహాయం ఎందుకు చేశావని ప్రశ్నించాడు. అందుకు ఇబ్రహీం కుతుబ్‌షా ఏ సమాధానం చెప్పకుండా తన సేనలతో గోల్కొండ వెళ్లిపోయాడని ఫెరిష్టా రాశాడు. కాని గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు రామరాయలు అహమ్మద్‌నగర్ కోట ముట్టడిని విరమిస్తే తాను కొండపల్లి కోటను ఇస్తానని కుతుబ్‌షా వాగ్దానం చేశాడని, అందువల్ల రామరాయలే కోట ముట్టడి ఆపు చేశాడని రాశాడు. కాని అది వాస్తవం కాదు. అదే నిజమైతే కుతుబ్‌షా కొండపల్లిని రామరాయలకు ఇవ్వాలి. అతడు ఇవ్వలేదు. రామరాయలు అడుగనూలేదు. మొత్తం మీద మొదటి అహమ్మద్‌నగర్ దండయాత్ర విజయవంతమైంది.

జగదేకరావుకు ఆశ్రయం ఇవ్వడం-గోల్కొండతో సంబంధాలు: గోల్కొండ రాజ్య స్థాపకుడైన కులీకుతుబ్‌షా మరణానంతరం అతని కుమారుడు జంషీద్‌షా సింహాసనం అధిష్టించి అతని తమ్ముడైన ఇబ్రహీంను చంపించడానికి ప్రయత్నించాడు. ప్రాణభయంతో ఇబ్రహీం విజయనగరం చేరి రామరాయలను ఆశ్రయించాడు. రామరాయలు, అతనిని 7 సంవత్సరాలు విజయనగరంలో ఉంచుకొని కన్నబిడ్డ లాగా చూసుకొని పోషించి కాపాడాడు. అంతేగాక గోల్కొండ సింహాసనం అధిష్టించడానికి సహాయం కూడా చేస్తానన్నాడు. తర్వాత ఇబ్రహీం గోల్కొండ సింహాసనం అధిష్టించాడు. అందువల్ల అతనికి రామరాయల మీద గౌరవ భావం ఉంది. ఒక పర్యాయం రామరాయలపై అతని సోదరులు తిరుగుబాటు చేయగా రామరాయలు వారిని అదుపులోకి తేవడానికి ఇబ్రహీం కుతుబ్‌షా సహాయం అర్థించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా అందుకు సాయపడగా, రామరాయల సోదరులు లొంగిపోయి అన్నను శరణువేడారు. రామరాయలు వారిని క్షమించాడు. ఈ విధంగా రామరాయలకు, ఇబ్రహీం కుతుబ్‌షాకు మంచి సంబంధాలు కొనసాగాయి. అప్పటివరకు ఎంతో సయోధ్యగా ఉన్న వారికి అహమ్మద్‌నగర్ కోట ముట్టడి సందర్భంలో అభిప్రాయభేదాలు వచ్చాయి. అంతేగాక అక్కడ రామరాయలకు లభించిన విజయానికి కుతుబ్‌షాకు ఈర్ష్య కలిగింది. ఇది జరిగిన కొద్ది కాలానికే గోల్కొండలో ఇబ్రహీం దగ్గర సేనాధిపతిగా పని చేసిన ఇమ్మడి జగదేకరావు తిరుగుబాటు చేశాడు. అతనిని కుతుబ్‌షా వెళ్లగొట్టాడు. జగదేకరావు అహమ్మద్‌నగర్ చేరి సుల్తాన్‌ను ఆశ్రయించాడు. కాని అక్కడ ఇమడలేక అతడు విజయనగరం చేరి రామరాయల ఆశ్రయం పొందాడు. తన శత్రువైన జగదేకరావుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఇబ్రహీంషాకు రామరాయలపై ఆగ్రహం కలిగింది. అప్పటి

నుండి ఇబ్రహీం కుతుబ్‌షా బహిరంగంగానే రామరాయలపై శతృత్వం వహించాడు. ఈ విధంగా గోల్కొండ, విజయనగర సంబంధాలు చెడిపోయాయి.

రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం క్రీ.శ.1563-64: రామరాయల ఎడ శతృత్వం వహించిన గోల్కొండ ఇబ్రహీంషా అహమ్మద్‌నగర్ హుసేన్ నిజాంషాతో చేతులు కలిపాడు. వారి స్నేహబంధాన్ని ధృఢపరచుకోడానికి హుసేన్‌షా తన కుమార్తె బీబీజమాన్‌ను ఇబ్రహీం కుతుబ్‌షాకు ఇచ్చి వివాహం చేసి కళ్యాణీదుర్గాన్ని అరణంగా ఇవ్వాలని సంకల్పించాడు. వివాహం కూడా కళ్యాణీదుర్గంలోనే జరగాలని నిర్ణయించారు. కళ్యాణీదుర్గం ఆ సమయంలో బీజాపూరు సుల్తాన్ ఆధీనంలో ఉంది. కనుక ఆ కోటను జయించడానికి హుసేన్‌షా ఇబ్రహీంషాలు కళ్యాణీకోటపై దండెత్తారు. దాంతో రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం వచ్చింది. అహమ్మద్‌నగర్, గోల్కొండ సైన్యాలు కళ్యాణీదుర్గాన్ని ముట్టడించడంతో బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు యుద్ధంలోకి దిగాడు. వారితో బీదరు సుల్తాన్ ఆలీబరీద్ కూడా చేరాడు. దాంతో ఈ రెండవ యుద్ధంలో విజయనగరం, బీజాపూరు, బీదరు ఒక వైపు, అహమ్మద్ నగరం, గోల్కొండ మరొక వైపు చేరి పోరాడాయి. రామరాయలు తన తమ్ముడు వెంకటాద్రి, జగదేకరావు నాయకత్వంలో ఒక సేనను గోల్కొండ రాజ్యంపైకి పంపాడు. తాను, ఆలీ బరీద్, ఆలీ ఆదిల్‌షాలు కలసి అహమ్మద్‌నగరంపై దండెత్తారు. వారు వచ్చే సంగతి తెలిసి హుసేన్‌షా, ఇబ్రహీంషాలు కళ్యాణీదుర్గ ముట్టడిని వదలేసి ఎవరి రాజ్యాల వైపు వారు వెళ్ళిపోసాగారు. మిత్రపక్షాలు అహమ్మద్‌నగరం వైపు సాగిపోయారు. ఆ సమయంలో సేనానది వరదలు ఉధృతంగా ఉన్నందువలన ముట్టడిని విరమించవలసి వచ్చిందని ఫెరిష్టా రాశాడు. అందువల్ల బీజాపూరు సేన గోల్కొండ వైపుకు నడిచి ఇబ్రహీంను వెంటాడింది. వరదలు తగ్గగానే విజయనగర సేన నదిని దాటి అహమ్మద్‌నగరాన్ని ముట్టడించింది. అహమ్మద్‌నగర సేనను ఓడించి కోటలో ప్రవేశించి నగరంలో బీభత్సాన్ని సృష్టించాయి. అహమ్మద్‌నగర్ సేనలు పూర్తిగా ఓడిపోయాయి.

గోల్కొండతో యుద్ధం: అహమ్మద్‌నగరం నుండి ఒక 30 వేల సైన్యం గోల్కొండ చేరింది. ఆ సేన బీజాపూరు సేన, అంతకు ముందే వెంకటాద్రి, జగదేకరావుల నాయకత్వంలో వెళ్లిన సేన గోల్కొండ రాజ్యంలో అనేక చోట్ల ఇబ్రహీంషాను ఓడించినా అతడు అతికష్టంపై తన రాజధాని గోల్కొండకి చేరుకోగలిగాడు. ఇదే సమయంలో కొండవీడు లోని విజయనగర ప్రతినిధి స్థిరాజు తిమ్మరాజును 50 వేల సైన్యంతో కొండపల్లి, మచిలీపట్టణాలపై దాడి చేయమని రామరాయలు ఆజ్ఞాపించాడు. అదే సమయంలో పూర్వపు గజపతి సేనానులైన చితాబ్‌ఖాన్, విద్యాధరులు కూడా గోల్కొండపై యుద్ధం ప్రకటించారు. వారికి రామరాయలు మద్దతునిచ్చాడు. చితాబ్‌ఖాన్ ఏలూరు మీద, విద్యాధరుడు రాజమహేంద్రవరం మీద దండెత్తారు. వారిని గోల్కొండ సైన్యాలు చారపల్లి వద్ద ఓడించినప్పటికీ ఇబ్రహీం కుతుబ్‌షా రాజ్యం అన్ని వైపుల నుండి ముట్టడించింది. తాను రామరాయలతో పోరాడటం అసాధ్యమని గ్రహించి రాయలతో సంధి చేసుకొని కోవెలకొండ, ఘనాపూర్ లేక గణపురం, పానుగల్లు కోటలను రామరాయలకు ఇచ్చాడు. దాంతో గోల్కొండతో యుద్ధం ముగిసింది. అహమ్మద్ నగరంపై అంతకు ముందే ఘనవిజయం సాధించాడు. ఈ రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం రామరాయలను దక్షిణదేశంలో తిరుగులేని మహారాజును చేసింది. అతని కీర్తి దేశమంతటా పాకింది. సుల్తాన్‌లకు ఎక్కడ లేని భయాన్ని కలుగజేసింది. యుద్ధంలో ఓడిపోయిన అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లు తమకు కలిగిన పరాభవాల్ని ఎంతో అవమానంగా భావించారు.

రామరాయలకు వ్యతిరేకంగా సుల్తాన్‌ల కూటమి ఏర్పడటం క్రీ.శ.1564: రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధంలో తమ రాజ్యాలకు జరిగిన నష్టం, తమకు కలిగిన పరాభవాలు హుసేన్‌షాను, ఇబ్రహీంషాను దహించి వేశాయి. రామరాయలు అందనంత ఎత్తుకు ఎదిగిపోయాడని, విజయనగర రాజ్యం అతి బలిష్టంగా రూపొందిందని, ఇక తమ రాజ్యాలకు భద్రత లేదని తమ రాజ్యాలను ఎప్పుడైనా ఆక్రమించవచ్చని వారు భావించారు. కనుక రామరాయలపై పగ సాధించాలని పట్టుదల కలిగింది. కాని తాము బలహీనులు. ఏ ఒక్కరూ రామరాయలను జయించలేరు. కనుక సుల్తాన్‌లందరినీ ఏకం చేయాలనే భావన కలిగింది. అహమ్మద్‌నగర్ సుల్తాన్ తన దూతను గోల్కొండకు పంపి సుల్తాన్‌ల ఐక్యతకు కృషి చేయమని కోరాడు. ఆ వార్త ఇబ్రహీంషాకు అమిత సంతోషం కలిగించింది. వెంటనే అహమ్మద్‌నగర్, బీజాపూరు సుల్తాన్‌ల మధ్య ఉన్న విరోధం పోతే తప్ప సుల్తాన్‌ల ఐక్యత సాధ్యం కాదని గుర్తించిన ఇబ్రహీం తన సేనాధిపతి అయిన ముస్తఫాఖాన్‌ను అందుకు

నియోగించాడు. అతడు అహమ్మద్‌నగర్, బీజాపూరు సుల్తాన్‌ల దర్బారులను దర్శించి వారి మధ్య రాయబారం చేసి వారు కలసిపోయే విధంగా చేశాడు. బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రామరాయలతో కలసి ఉన్నా మనసులో రాయలు పెరిగిపోయాడని ఈర్ష్య ఉంది. రాయలంటే భయం కూడా ఉంది. కనుక అతడు అహమ్మద్‌నగర్‌తో స్నేహం చెయ్యడానికి అంగీకరించాడు. వారి స్నేహం వివాహ బంధంగా ఉంటే శాశ్వతంగా ఉంటుందని ముస్తఫాఖాన్ సలహా ఇచ్చాడు. అందువల్ల బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన చెల్లెలు ఛాలాబీబీని హుసేన్‌షా పెద్ద కుమారుడు మూర్తజాకు ఇచ్చి వివాహం చెయ్యడానికి, అలాగే హుస్సేన్‌షా తన కుమార్తె చాంద్‌బీబీని ఆలీ ఆదిల్‌షాకిచ్చి వివాహం చేయడానికి ఇద్దరు సుల్తాన్‌లను ముస్తాఫాఖాన్ ఒప్పించాడు. తర్వాత వారు ఈ రెండు వివాహాలను అత్యంత వైభవంగా జరిపారు. హుసేన్‌షా అల్లుడు ఆదిల్‌షాకు షోలాపూర్‌ను అరణంగా ఇచ్చాడు. అంతకు ముందే ఇబ్రహీం కుతుబ్‌షా హుసేన్‌షా అల్లుడై ఉన్నాడు. కనుక ఈ వివాహ బంధాలతో మూడు వంశాలకు విడదీయరాని బంధుత్వం ఏర్పడింది. వివాహాల అనంతరం వారు ఒక కూటమిగా ఏర్పడ్డారు. వారితో బీదర్ సుల్తాన్ ఆలీ బరీద్ చేరాడు. ఏ కారణం వల్లనో బీరారు సుల్తాన్ వారితో చేరలేదు. కనుక నలుగురు సుల్తాన్‌లు మాత్రమే కూటమిగా చేరారు. కాని కొన్ని స్థానిక రచనలు బీరారు సుల్తాన్ బుర్హన్ ఇమాద్‌షా ఉల్‌ముల్క్ కూడా చేరాడని, అందువల్ల వారిని పంచపాదుషాలు అని వ్యవహరించారని తెలిపాయి. గుత్తి కైఫీయత్తు దక్కన్ సుల్తాన్‌లతో ఢిల్లీ పాదుషా అక్బర్ కూడా చేరాడని తెలుపుతోంది. కాని అక్బర్ బీరార్ సుల్తాన్‌లతో చేరలేదు. నలుగురు సుల్తాన్‌లు మాత్రమే రామరాయలకు వ్యతిరేకంగా కూటమిగా ఏర్పడ్డారు. స్థానిక రచనలు బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షాను బెదిరించి తమ కూటమిలో చేర్చుకున్నారని రాశాయి. అహమ్మద్‌నగర్ యుద్ధాల వల్ల లబ్ధి పొందిన వాడు బీజాపూరు సుల్తాన్. రామరాయల వల్ల అతనికి ఎలాంటి నష్టాలు కలుగలేదు. పైగా లాభం పొందాడు. అతడు కూడా రామరాయలకు వ్యతిరేకంగా చేరాడు. అందుకు ఫెరిష్టా ఒక కారణం చూపాడు. అతని రాజ్యంలోని యాద్గిరి, భాగల్ కోటలను రామరాయలు బలవంతంగా లాక్కున్నాడని, వాటిని తిరిగి సంపాదించడానికి కూటమిలో చేరాడని రాశాడు. కాని రామరాయలు ఆ కోటలను బలవంతంగా లాక్కున్నాడని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అహమ్మద్‌నగర యుద్ధం తర్వాత బహుమానంగా సుల్తానే ఆ రెండు ప్రాంతాలను రామరాయలకు ఇచ్చి ఉండవచ్చును. రామరాయల వల్ల అతడు పొందిన లాభంతో పోలిస్తే అవి చాలా చిరు కానుకలు. ఆలీని బెదిరించి తమ కూటమిలో చేర్చుకున్నారని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. కాని అది కూడా వాస్తవం కాదు. రామరాయల వల్ల ఎంత ప్రయోజనం పొందినా అతనికి లోపల రామరాయలపై ద్వేషం, భయం రెండూ ఉన్నాయి. ఎంత స్నేహితంగా ఉన్నా అతడు హిందువు అనే భావం ఉంది. కనుకనే ముస్తాఫాఖాన్ మాటలకు అతి సునాయాసంగా తలొగ్గి అహమ్మద్‌నగర్‌తో వియ్యం పొందాడు. కనుక అతడు తన బద్ధ శత్రువులతో అతి సునాయసంగా కలిసిపోగలిగాడు. కూటమిలో అతడు ఇష్టపూర్వకంగానే చేరాడు. అందువల్లనే కూటమి ఏర్పడటానికి తమ సుల్తానే కారణం అంటే, తమ సుల్తానే కారణమని మూడు దర్బారులకు చెందిన ముగ్గురు ముస్లిం చరిత్రకారులు రాశారు. ఫెరిష్టా అహమ్మద్‌నగర్ అభిమాని. గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు గోల్కొండ అభిమాని. సయ్యద్ తబతబ బీజాపూరు అభిమాని. ఈ నాలుగు రాజ్యాలు తమ సైన్యాన్ని సమీకరించి రామరాయలపై యుద్ధానికి దిగారు.

తళ్లికోట యుద్ధానికి కారణాలు: తళ్లికోట యుద్ధానికి ముస్లిం చరిత్రకారులు పలు కారణాలు చెప్పారు. రామరాయలు ఇస్లాం మతాన్ని అగౌరవపరిచి మహమ్మదీయుల మనసుల్ని గాయపరచాడని వారు పేర్కొన్న మొదటి కారణం. విజయనగర సైన్యాలు అహమ్మద్‌నగరంపై దండెత్తినప్పుడు వారు చేయని ఘోరం లేదని రాశారు. మసీదులను నాశనం చేశారని, ముస్లిం స్త్రీలను చెరపట్టారని, ఖురాన్‌ను అగౌరవపరచారని, మసీదులలో తమ గుర్రాలను కట్టి వేశారని, అక్కడ పనికిమాలిన పూజలు చేశారని, తమ మూఢాచారాలను పాటించి పాటలు పాడుతూ నాట్యాలు చేశారని ఫెరిష్టా రాశాడు. కాని ఫెరిష్టా రచనలను మిగిలిన చరిత్రకారులు అంగీకరించలేదు. గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు రామరాయల సైన్యాలు తాత్కాలికంగా మసీదు ఆక్రమించటం వల్ల అవి మైలపడ్డాయని మాత్రమే రాశాడు గాని, వారు కిరాతక చర్యలు జరిపారని రాయలేదు. హిందువుల దాడుల వల్ల అహమ్మద్‌నగర్ రాజ్యం పాడుపడిపోయిందని, చాలా మంది మహమ్మదీయులను హిందువులు చంపారని సయ్యద్ తబతబ రాశాడు. కాని ఖురాన్‌ను అవమానించినట్లుగాని, ముస్లిం స్త్రీలను చెరపట్టారని గాని రాయలేదు. కనుక ఫెరిష్టా రాతలు ఊహకు అందేవి కావని, అతడు ప్రతి సందర్భంలో పక్షపాతంగానే రాశాడని పండితులు

అభిప్రాయపడ్డారు. రామరాయలు తన సైన్యంలో ముస్లింలను చేర్చుకున్నాడు. వారికి తురకవాడను ఏర్పరచి అన్ని సౌకర్యాలు అమర్చాడు. గోవధను కూడా అనుమతించాడు. తన దర్బారులో ఖురాన్ ప్రతిని వేదికపై ఉంచాడు. అలాంటి వాడు మసీదులను పడగొట్టి ఖురాన్‌ను అవమానించాడంటే అర్థం లేని మాట. ఒక వేళ అతడు అలా చేసి ఉంటే అహమ్మద్‌నగర్ యుద్ధం తర్వాత అతని ముస్లిం సైనిక విభాగం తళ్లికోట యుద్ధానికి ముందే అతనిని వదలిపెట్టి వెళ్లిపోయేది. కాని ఆ ముస్లిం సైన్యం తళ్లికోట యుద్ధంలో కూడా రామరాయల తోనే ఉంది. చివరలోనే వారు మోసగించారు. అలాగే బీజాపూరు అలీ ఆదిల్‌షా కూడా మొదట అహమ్మద్‌నగర్ యుద్ధంతో తానే రామరాయల స్నేహం మానుకొని ఉండేవాడు. ముస్లిం సైనికులను వధించారు, ఆస్తులను దోచుకున్నారనే ఆరోపణలు నిలవవు. కారణమేమిటంటే మధ్యయుగంలో ఏ ప్రాంతంలోనైనా ఓడిపోయిన శత్రు రాజ్యాన్ని ధ్వంసం చేసేవారు. అగ్నికి ఆహుతి చేసేవారు. కొల్లగొట్టేవారు. స్త్రీలపై అత్యాచారాలు జరిగేవి. అలాంటి యుద్ధ విధ్వంసకాండకు మత భేదాలు లేవు. ఒక హిందూ రాజు మరొక హిందూ రాజ్యంపై దండెత్తినా అలాంటి దమనకాండ జరిగేది. కృష్ణరాయలు కటకంపై దండెత్తినప్పుడు కటకాన్ని దహనం చేశాడు. ముస్లింలు హిందూ రాజ్యాలపై దాడులు చేసినప్పుడు వారు జరిపే దమనకాండకు హద్దులు ఉండేవి కావు. దేవాలయాలు నేలమట్టం అయ్యేవి. స్త్రీలపై అత్యాచారాలు జరిగేవి. హిందూ గ్రంథాలు భస్మీపటలం అయ్యేవి. పెరిష్టాకు ఆ దమనకాండ గుర్తుకు రాలేదు. కాని విజయనగర సైనికులు దుర్మార్గాలు చేశారని రాశాడు. అతని రాతలు వాస్తవాలు కాదు. పక్షపాతంలో రాసినవని పండితుల అభిప్రాయం.

ఇక వారు చూపిన రెండవ కారణం రామరాయలు అతిగర్విష్టి అని, రాయబారులను అవమానించాడు అని రాశారు. అనేక విజయాలు సాధించిన ఏ వ్యక్తికైనా కొంత గర్వం ఉంటుంది. అతడు గర్వంతో సుల్తాన్‌లకు అపకారం ఏమీ చేయలేదు. రాయబారులను ఎవరినీ చంపలేదు. ఎలాంటి అపకారం తలపెట్టలేదు. రాయలు పరుషంగా మాట్లాడినంత మాత్రాన అది రాయబారులను అవమానించినట్లు కాదు. అది శత్రువుకు ఇచ్చిన సమాధానం. రామరాయలు తన మిత్రుడైన బీజాపూరు సుల్తాన్‌ల భూములను లాక్కున్నాడు అని రాశారు. బీజాపూరు నుండి ఇట్గీర్, తనకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా ఇచ్చాడు. ఆనాడు రాయల సహాయమే లేకపోతే బీజాపూరు సుల్తాన్ తన రాజ్యాన్ని ఎప్పుడో పోగొట్టుకొని ఉండేవాడు. అంతటి సహాయానికి ఆ రెండు కోటలు అతి చిన్న కానుక.

గోల్కొండ నవాబు దగ్గర నుండి కోవెలకొండ, ఘనాపూర్, పానుగల్లు కోటలను ఆక్రమించాడు అనేది మరొక ఆరోపణ. ఇబ్రహీం కుతుబ్‌షా యుద్ధంలో ఓడిపోయి నష్టపరిహారం కింద వాటిని సమర్పించుకున్నాడు. రాయలు తలచుకొంటే గోల్కొండ రాజ్యం మొత్తాన్ని కూడా కలుపుకోగలిగేవాడు. కాని రామరాయలు ఆ పని చేయలేదు. ఏ విధంగా చూసినా రామరాయలు సుల్తాన్‌ల పట్ల అన్యాయంగా ప్రవర్తించిన ఉదాహరణలు లేవు. సుల్తాన్‌లు కలహించుకొనవద్దని వారి హితువు కోరాడు. దక్కనులో యుద్ధాలు లేకుండా చేయాలని నాలుగు రాజ్యాల కూటమిని ఏర్పాటు చేశాడు. కాని సుల్తాన్‌లు వారి స్వార్థబుద్ధితో కలహాలు, ఒకరి మీద మరొకరు దాడులు చేసుకోవడం మానలేదు. సుల్తాన్‌లు సహజంగానే కలహప్రియులు. ఈర్ష్యాసూయలతో ఒకరి రాజ్య భాగాలను మరొకరు ఆక్రమించాలని నిరంతరం పోరాడుతుండేవారు. వారు తమస్వార్థం కోసం కుక్కలవలె పోరాడుతూ ఉండేవారని పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ రాశాడు. వారి పోరాటాలలో తనను సహాయం కోరిన వారికి సహాయం చేశాడే తప్ప వారిలో కలహాలు సృష్టించి ఎలాంటి లాభం పొందలేదు. రామరాయల వల్లనే సుల్తాన్‌లు లాభం పొందారు. సుల్తాన్‌లలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో రామరాయల వలన లబ్ధి పొందినవారే. మొదట అహమ్మద్‌నగర్ సుల్తాన్ లాభం పొంది కళ్యాణి దుర్గాన్ని పొందాడు. తర్వాత ఇబ్రహీం ఆదిల్‌షా తన అన్న చంపబోతే విజయనగరం చేరి ప్రాణాలు దక్కించుకున్నాడు. బీజాపూరు సుల్తాన్ రామరాయల వల్లనే కళ్యాణీ షోలాపూరులను పొందాడు. అందరూ రామరాయల వల్లనే లబ్ధి పొందారు. కాని వారి వల్ల రామరాయలు ఎలాంటి లాభం పొందలేదు. అన్ని లాభాలు పొంది చివరకు సుల్తాన్‌లే విశ్వాసహీనులై రామరాయలకు ద్రోహం చేశారు.

కనుక ముస్లిం చరిత్రకారులు ఆరోపించిన ఆరోపణలు అన్నీ అసత్యాలు. రాయరాయలు అతి బలవంతుడైనాడు, విజయనగరం రాజ్యం అతిబలిష్టమైనది. కనుక దానిని నాశనం చేయాలనే ఏకైక సంకల్పంతో సుల్తాన్‌లు అందరూ ఏకమై కూటమిగా ఏర్పడి తళ్లికోట యుద్ధం చేశారు తప్ప మరే ఇతర కారణం లేదు.

విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేయడమే వారి ఏకైక లక్ష్యం.

తక్షణ కారణం: యుద్ధానికి ఏదో ఒక కారణం ఉండాలి కనుక బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన ప్రాంతాలను ఇవ్వమని కోరమని సలహా ఇచ్చారు. అతడు రాయచూరు, ముద్గల్, అంతర్వేది, ఇటీవల తాను ఇచ్చిన ఎట్గీర్, భాగల్ కోటలను తనకు స్వాధీనం చేయమని కోరుతూ రాయబారిని పంపాడు. రాయబారిని పరుషంగా మాట్లాడాడని, సుల్తాన్‌లు శత్రువులైనందున తనకేమీ నష్టం లేదని అన్నాడని పెరిష్తా రాశాడు. రాయబారి ఆలీ కోరికను చెప్పగా రామరాయలు బిగ్గరగా నవ్వి అతను వెళ్లవచ్చని ఆదేశించాడని, రాయబారి వెళ్లగానే దర్బారులో ఉన్న అమర నాయకులకేసి చూసి యుద్ధానికి సిద్ధం కండని ఆదేశించాడని కూడా రాశాడు. క్రీ.శ.1564 సెప్టెంబర్ 15వ తేదీన ఈ సంఘటన జరిగిందని నిర్ణయింపబడింది. బీజాపూరు రాయబారి వెళ్లి సుల్తాన్‌లకు రాయల సమాధానం చెప్పగానే నలుగురు సుల్తాన్‌లు తమ సైన్యాలను సమాయత్తపరచి తళ్లికోటకు చేరారు. సుల్తాన్‌ల సైన్యం తళ్లికోట చేరిందని తెలియగానే రామరాయలు ఎలాంటి జంకూ లేకుండా తన సేనలను సమాయత్తం చేసుకొని యుద్ధానికి బయలుదేరాడు. దాంతో క్రీ.శ.1565 జనవరి నెలలో తళ్లికోట యుద్ధం జరిగింది.

సుల్తాన్‌ల సైన్యం-విడిది: నలుగురు సుల్తాన్‌ల సైన్యం ఎంత ఉందో ఎవరూ స్పష్టంగా రాయలేదు. 10 వేల అశ్వదళం, లక్షల సంఖ్యలో కాల్బలం, కొన్ని వేల మంది ధనుష్కులు, ఫిరంగిదళం, గజదళం ఉందని భావించారు. సుల్తాన్‌ల అందరి సైన్యం కలసి మూడు లక్షలు ఉంటుందని పెరిష్తా రాశాడు. గోల్కొండ సైన్యాలను ముస్తాఫాఖాన్, అహమ్మద్‌నగర్ సేనను ఇనయతుల్లా, బీజాపూరు సేనను ఖిజీర్‌ఖాన్, సేనానులు నడిపారు. వీరేగాక బీజాపూరు సేనలో యశ్వంతరావు, దేవనాయక్, భోజమల్లునాయక్, విశ్వాసరావు, కొళ్లేరావు మొదలైన మహారాష్ట్ర వీరులు కూడా ఉన్నారు. ఈ సైన్యం క్రీ.శ.1564 డిసెంబర్ 25వ తేదీన కృష్ణానది ఒడ్డున ఉన్న తళ్లికోటకు చేరి విడిశాయి. ఆ ప్రాంతం బీజాపూరు సుల్తాన్ రాజ్యంలో ఉంది కనుక అతడు మిత్రుల సైన్యాలకు భోజనాది అన్ని వసతులు ఏర్పాటు చేశాడు. అక్కడ ఆ సైన్యాలు చాలా రోజులు విడిది చేసి ఉన్నాయి. వారి విడిది కృష్ణానదికి ఉత్తరంగా కృష్ణానది, ద్రోణానదుల సంగమ ప్రాంతానికి 25 మైళ్ల దూరంలో ఉంది.

రామరాయల సైన్యం విడిది: సుల్తాన్‌ల సైన్యం తళ్లికోట వద్ద విడిది చేసిందని తెలిసిన రామరాయలు తన తమ్ముడు తిరుమల రాయలను, మరొక సేనాని ఎత్‌టుమ్ రాజును 20 వేల గుర్రపు దళాన్ని, లక్ష కాల్బలాన్ని 500 ఏనుగులను పంపి శత్రు సైన్యం కృష్ణానదిని దాటకుండా చేయమని ఆదేశించాడు. తర్వాత తన ఇంకొక తమ్ముడు వెంకటాద్రిని మరొక పెద్ద సైన్యంతో పంపాడు. తర్వాత తాను పెద్ద సైన్యాన్ని సమకూర్చాడు. సామ్రాజ్యంలోని అన్ని భాగాలకు అమరనాయకులు తమ సైన్యాలతో రావాలని ఆదేశించాడు. తూర్పున మధుర, తంజావూరు అంటే పాండ్య, చోళ మండలాల నుండి, పశ్చిమ దిశ నుండి మైసూరు, మలబారుల నుండి, సరిహద్దులలో తెలుగు, కన్నడ ప్రాంతాల నుండి అనేక మంది సామంతులు తమ సేనలతో విజయనగరం చేరారు. ఆ సైన్యం అంతా 6 లక్షల పదాతిదళం, లక్ష అశ్వదళం ఉండవచ్చని కౌటో రాశాడు. క్రీ.శ.1554 నుండి కౌటో అనే పోర్చుగీసు రచయిత ఇండియాలో ఉండి దక్కను చరిత్ర రాశాడు. తారిఖ్-ఇ-గోల్కొండ గ్రంథాన్ని రాసిన అజ్ఞాత చరిత్రకారుడు 3 లక్షల కాల్బలం, లక్ష అశ్వదళం ఉందని రాశాడు. పెరిష్తా 9 లక్షల కాల్బలం, 70 వేల గుర్రపుదళం, 2000 ఏనుగులు, 15000 ఫిరంగిదళంతో విజయనగర రాయలు వచ్చాడని రాశాడు. రామరాయలు తాను సమకూర్చుకున్న ఈ ప్రచండసేనతో కృష్ణాతీరంలోకి వచ్చిచేరాడు. తాను అక్కడికి వచ్చే లోపల తమ్ములు ఇద్దరూ శత్రువులను కృష్ణానది దాటకుండా నిరోధించారు. సుల్తాన్ సైన్యాలు కృష్ణానదికి ఉత్తరంగాను, రాయలసైన్యాలు కృష్ణానదికి దక్షిణంగా విడిశాయి. ముద్గల్ కోట నుండి ఇంగలగిరికి వెళ్లే మార్గంలో ఉన్న బోయపూరు లేక భోగాపురం అనే గ్రామం దగ్గర రాయల సైన్యం విడిది చేసిందని సీవెల్ రాశాడు. అక్కడే యుద్ధం జరిగిందని రాశాడు.

యుద్ధం ఎక్కడ జరిగింది?: ఉభయ సైన్యాలకు యుద్ధం ఎక్కడ జరిగింది అనే విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. సీవెల్ కృష్ణానదికి దక్షిణంగా జరిగింది అని రాశాడు. సుల్తాన్ సేనలు కృష్ణానదిని దాటి 12 మైళ్ల దూరంలో ఉన్న హుకరనది వద్దకు వచ్చాయని, అక్కడే రాయలు తన సైన్యంతో ఎదుర్కొన్నాడని అక్కడే యుద్ధం జరిగిందని పెరిష్తా రాశాడు. సయ్యద్ ఆలీ తబతబ ఇబ్రహీం జుచేరీలు కూడా సుల్తాన్ సైన్యాలు కృష్ణానదిని దాటి వచ్చాయి. కృష్ణానదికి దక్షిణంగానే యుద్ధం జరిగిందని రాశారు. ముస్లిం రచనలపై ఆధారపడి

సుల్తాన్ సేనలకు, రాయల సేనలకు కృష్ణానదికి 12 మైళ్లు దక్షిణంగా ఉన్న బన్నిహట్టి అనే గ్రామం వద్ద యుద్ధం జరిగిందని, ఆ యుద్ధం నాలుగు గంటలలోనే ముగిసిందని ఆచార్య షేర్వాణి నిర్ణయించారు. కనుక ఈ యుద్ధాన్ని తళ్లికోట యుద్ధం అనడానికి వీలులేదు. దానిని బన్నిహట్టి యుద్ధం అని పిలవాలని కూడా షేర్వాణి వ్యాఖ్యానించారు. కాని ముస్లిం చరిత్రకారుల అభిప్రాయాన్ని ఎక్కువ మంది చరిత్రకారులు అంగీకరించలేదు. కారణమేమిటంటే ఈ యుద్ధం రాక్షసతంగడి అనే ప్రదేశంలో జరిగిందని హిందూ గ్రంధాలు, స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. రామరాజనబఖాయిర్ రామరాయలసేన రాక్షసి తంగడి గ్రామాల మధ్య విడిసిందని అక్కడే యుద్ధం జరిగిందని తెలుపుతోంది. నంద్యాల కైఫీయత్తు ముస్లిం సైన్యం రామరాయల సైన్యాన్ని కృష్ణానది మల్హారి లేక మలప్రభనది సంగమస్థానంలో వధించిందని, అక్కడే రామరాయలను కూడా చంపారని కూడా స్పష్టంగా పేర్కొంది. రాక్షస తంగెడ గ్రామాలు కృష్ణానదికి ఉత్తరంగా ఉన్నాయి. రెండు ఊళ్లు కృష్ణానది ఉత్తరపు ఒడ్డున హునుగొండ పరగణాలలో ఉన్నాయి. రెండు ఊళ్లకు మధ్యన 10 మైళ్ల దూరం ఉంది. తంగెడ గ్రామం కృష్ణానది, మలప్రభానదులు కలిసేచోట మలప్రభానదికి ఎదుర ఒడ్డున ఉంది. రామరాయలు ఇక్కడ కృష్ణను దాటి అవతల ఒడ్డుకు చేరాడు. యుద్ధ వ్యూహం రీత్యా ఈ ప్రదేశం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించి రామరాయలు అక్కడికి తన సైన్యాలను తరలించాడు. ఆ స్థానానికి 20 మైళ్ల దూరంలో తళ్లికోట ఉంది. అక్కడ సుల్తాన్‌ల సైన్యాలు విడిసి ఉన్నాయి. సుల్తాన్‌ల సైన్యాలు రామరాయల సైన్యాల వద్దకు వచ్చాయి. అక్కడ వారికి యుద్ధం జరిగింది. కనుకనే ఈ యుద్ధం రాక్షసి, తంగడి గ్రామాల వద్ద జరిగిందని అనేక గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. సుల్తాన్ సైన్యాలు రామరాయల రాజ్యంలోకి చొచ్చుకొనిపోయి అతనితో యుద్ధం చేశాయని గొప్పలు చెప్పడానికి ముస్లిం రచయితలు సుల్తాన్‌ల సేనలు కృష్ణనుదాటాయని, కృష్ణకు దక్షిణంగా యుద్ధం జరిగిందని రాశారు. కనుక వారి రచనలను నమ్మవలసిన పనిలేదు. తళ్లికోట వద్ద ముస్లిం సైన్యం, రాక్షసి తంగడి గ్రామాల మధ్య రాయల సైన్యం విడిశాయి. ఉభయ సైన్యాలకు యుద్ధం తళ్లికోట రాక్షసి తంగడి గ్రామాల మధ్య జరిగే ఉంటుంది. కనుక ఈ యుద్ధాన్ని రాక్షస తంగడి యుద్ధం అని గాని, తళ్లికోట యుద్ధమని గాని పిలువవచ్చును. షేర్వాణి రాసినట్టుగా ఈ యుద్ధానికి బన్నిహట్టి యుద్ధం అని పిలిచినా ఈ యుద్ధానికి మూడు పేర్లు అవుతున్నాయి. కనుక ఈ యుద్ధాన్ని తళ్లికోట యుద్ధం, రాక్షసితంగడి యుద్ధం, బన్నిహట్టి యుద్ధం అని మూడు పేర్లతో పిలువవలసి ఉంటుంది. పిసుపాటి శ్రీరామశర్మ మరొక విధంగా చెప్పారు. యుద్ధం కృష్ణానదికి ఉత్తరాన, దక్షిణాన కూడా 1565 జనవరి 24 వరకు నెల రోజులు జరిగిందని, యుద్ధం ఒకే రకంగా కాక పలు రంగాలలో జరిగిందని రాశారు. రాయల సైన్యం ఒకేచోట లేదు. కొంత సైన్యం కృష్ణానదికి దక్షిణంగా ఉండి సుల్తాన్ సైన్యాలను నదిని దాటనీయకుండా బలీయంగా కాపలా కాసింది. తన రాజ్యంలో యుద్ధం జరగకుండా ఉండటానికి ప్రధాన దళాన్ని తీసుకొని రామరాయలు కృష్ణనుదాటి రాక్షసితంగడికి చేరాడు. మొదట అక్కడ యుద్ధం జరిగింది. మొదటి యుద్ధంలో బీజాపూరు సేన పాల్గొన లేదు. గోల్కొండ అహ్మద్‌నగర్ సైన్యాలు మాత్రమే పాల్గొని ఓడిపోయాయి. తర్వాత రామరాయలతో సంధి చేసుకుంటామని రాయబారులను నమ్మించారు. రాయలు యుద్ధ విరమణ చేశాడు. అప్పుడు కృష్ణకు దక్షిణంగా కాపలా కాసే సైన్యం కూడా కాపలా వదలివేసి విశ్రమించింది. ఆ సమయంలో సుల్తాన్‌ల సైన్యాలు కృష్ణానదిని దాటి రాయల భూభాగంలోకి వచ్చాయి. ఆ విషయం రామరాయలకు తెలియదు. అతడు విందు ఆరగించేటప్పుడు చారులు వచ్చి చెప్పారని కౌటో రాశాడు. కనుక కృష్ణను దాటిన సుల్తాన్ సేనతో రామరాయల సైన్యం పోరాడింది. కనుకనే కృష్ణకు దక్షిణంగా జరిగిందని ముస్లిం చరిత్రకారులు రాసి ఉంటారు. అదే సమయంలో కృష్ణకు ఉత్తరంగా రామరాయలు రాక్షసతంగడి యుద్ధంలో పోరాటం జరిపి ఉంటాడు. బీజాపూరు సేన, సంధి చేసుకుంటామని చెప్పిన గోల్కొండ, అహ్మద్‌నగర్ సుల్తాన్‌లు తాము జయించిన భూభాగాలు తిరిగి ఇస్తామని చెప్పారని, కాని రామరాయలు తిరస్కరించారని ఫెరిష్టా రాశాడు. అంటే మోసంతో సుల్తాన్ సైన్యాలు కృష్ణను దాటాయి కనుక అక్కడ కొన్ని భూములు వారి స్వాధీనమై ఉండవచ్చును. వాటిని తిరిగి ఇస్తామని చెప్పి ఉండవచ్చును. ఈ లోపల బీజాపూరు సుల్తాన్‌ను బుజ్జగించి తిరిగి రామరాయలపై యుద్ధానికి దిగారు. ఆ యుద్ధంలోనే రామరాయలు వారికి చిక్కి వధించబడ్డాడు. కనుక కౌటో చెప్పింది చివరి యుద్ధం. అతడు చెప్పిన దానికి కెళడినృప విజయం వర్ణించిన దానికి సరిపోతుంది. ఫెరిష్టా రాసిన దానిపై ఆధారపడి షేర్వాణి యుద్ధం కృష్ణకు దక్షిణంగా బన్నిహట్టి వద్ద షేర్వాణి చెప్పిన యుద్ధం కూడా చివరి యుద్ధం అయి ఉండవచ్చును. చివరి రోజు నాలుగు గంటలు యుద్ధం జరిగిన తర్వాత రామరాయలు బందీగా

చిక్కి ఉంటాడు. కనుక ఆచార్య పీసుపాటి శ్రీరామశర్మ రాసిన ప్రకారం యుద్ధం కృష్ణకు దక్షిణంగా, ఉత్తరంగా రెండు రంగాలలో జరిగింది. ఆయన ఊహ ఎంత వరకు వాస్తవమో తెలియదు.

ఇంకా పలువురు పండితులు సుల్తాన్‌లకు, రామరాయలకు మధ్య ఎప్పుడు, ఎక్కడ, ఎంతకాలం యుద్ధం జరిగింది అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ప్రకటించారు. గ్రామ కైఫీయత్తులు రామరాజు భకైర్‌లు చెప్పే సమాచారం మీద ఆధారపడి నీలకంఠశాస్త్రి, డా॥ నేలటూరి వెంకటరమణయ్య ఈ యుద్ధం రాక్షస, తంగెడ గ్రామాల మధ్య జరిగిందని అన్నారు. స్థానిక చరిత్రలు ఈ యుద్ధం ఆరు మాసాలు జరిగిందని చెబుతున్నాయి. ఈ యుద్ధంలో మొదట ముస్లిం సైన్యాలు ఓడి 20 మైళ్లు వెనుకకు వెళ్లాయని, అందువల్ల సుల్తాన్‌లు మోసంతో శాంతి సంప్రదింపులు జరిపి, విజయనగర సైన్యాలు అజాగ్రత్తగా ఉన్నప్పుడు ముస్లిం సైన్యాలు విజయనగర సైన్యాలను చుట్టుముట్టాయని కెళడి నృపవిజయం తెలుపుతోంది. రామారాయల సైన్యంలోని ముస్లిం సైనికదళాలు యుద్ధం మధ్యలో తప్పుకొని శత్రువుల వైపు చేరిపోయారు. ఇద్దరు ముస్లిం సేనాధిపతుల నాయకత్వంలో చేరి ఒక 80 వేల సైన్యం ఉందని అంచనా. వారి సైన్యం హఠాత్తుగా రాయల సైన్యానికి ఎదురు నిలిచి చికాకుపరిచింది. విజయనగర సైన్యాలు కాల్బలం, గజదళంపై ఆధారపడగా, ముస్లిం సైన్యం అశ్వదళం, ఫిరంగి దళాల మీద ఆధారపడింది. సుల్తాన్‌ల సైన్యాలు కృష్ణను దాటి వచ్చి రాయల సైన్యాలను ఎదుర్కోవాలని భావించారు. కాని రామరాయలు వారికి ఆ అవకాశం ఇవ్వకుండా తన సైన్యాలతో కృష్ణను దాటి రాక్షస తంగడి వద్ద విడిది చేశారు. కనుక అక్కడే యుద్ధం జరిగిన స్థలాన్ని గురించి అభిప్రాయభేదాలు ఉన్నాయి.

యుద్ధ గమనం: రాబర్ట్ సీవెల్ కూడా యుద్ధం కృష్ణకు దక్షిణంగా భోగాపూర్ దగ్గర జరిగిందని భావించి యుద్ధ గమనాన్ని తన **A Forgotten Empire** లో వర్ణించారు. రాబర్ట్ సీవెల్ వర్ణనకు సీజర్ ఫ్రెడరిక్, కౌటోల రచనలు ఆధారాలు. క్రీ.శ.1565 జనవరి 23వ తేదీన ఉదయాన ఉభయసైన్యాలు తలబడ్డాయి. విజయనగర సైన్యం ఎడమవైపున అంటే పడమటి వైపున తిరుమల రాయలు, అతని కుమారుడు రఘునాథుడు నాయకత్వం వహించారు. వారికి ఎదురుగా బీజాపూరు సైన్యాలు నిలబడ్డాయి. కుడివైపున అంటే తూర్పువైపున వెంకటాద్రి నాయకత్వం వహించాడు. అతకి ఎదురుగా గోల్కొండ సైన్యం, ఆలీబరీద్ అహమ్మద్‌బాద్ నగరం సైన్యం నిలబడింది. తిరుమలరాయలు రఘునాథుడు బీజాపూర్ ఆలీ ఆదిల్‌షాతోను, రామరాయలు అహ్మద్‌నగర్ సుల్తాన్ హుస్సేన్ నిజాంషాతోను, వెంకటాద్రి గోల్కొండ ఇబ్రహీం కుతబ్‌షా, బీదర్ సుల్తాన్ ఆలీబరీద్‌తో తలపడ్డారు. సుల్తాన్‌ల సైన్యాలు వరుసగా ఒకే లైనులో నిలబడి మధ్యలో శతఘ్నిదళాన్ని పెట్టుకున్నారు. నిజాంషా దళానికి ముందు 6 వందల ఫిరంగులు మూడు వరుసలుగా ఒక్కొక్క వరుసకు రెండు వందలు చొప్పున నిలబెట్టారు. మొదటి వరుసలో పెద్ద ఫిరంగులు ఉన్నాయి. అవి కనిపించకుండా ఫిరంగుల ముందు రెండువేల మంది విదేశీ విలుకాండ్రను నిలబెట్టారు. రామరాయల సైన్యం ముందుకు నడిచింది. వారు దగ్గరకు రాగానే ఫిరంగుల ముందు ఉన్న విలుకాండ్రు తప్పుకున్నారు. ఫిరంగులు పేల్చబడ్డాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి విజయనగర సేనల్లో వేలాది మంది మరణించి సైన్యాలలో కలవరం ఏర్పడింది. అలాంటి స్థితిలో రామరాయలు ఏ మాత్రం జంకకుండా వారి మధ్యకు వెళ్లి చెల్లాచెదురైన సైన్యాన్ని తిరిగి సమీకరించాడని చెబుతూ కౌటో రామరాయలకు అప్పుడు 96 సంవత్సరాల వయస్సు ఉందని, కాని 30 సంవత్సరాల యువకుని లాగా అతిబలంగా ధృఢ శరీరంతో ఉన్నాడని వర్ణించాడు. అప్పుడు అతడు ఒక పల్లకి ఎక్కి కూర్చొని తన సైనికులందరనీ తిరిగి సుల్తాన్‌ల సైన్యాన్ని ఢీకొనేటట్లు చేశాడని కౌటో వర్ణించాడు. అప్పుడు విజయనగర సైన్యాలకు, ముస్లిం సైన్యాలకు ముఖాముఖి యుద్ధం జరిగింది. అందులో వెంకటాద్రి గోల్కొండ సైన్యాన్ని చీల్చిచెండాడగా, తిరుమలరాయలు, అతని కుమారుడు రఘునాథుడు బీజాపూర్ సైన్యాలను చెండాడారు. కాని ఆ యుద్ధంలో రఘునాథుడు మరణించాడు. వెంకటాద్రికి కంటికి దెబ్బతగిలింది. ఆ స్థితిలో రామరాయలు తన గుడారం నుండి బంగారు నాణేలు తెప్పించి రాసులుగా పోయించి తన సైనికులకు చూపి ధైర్యసాహసాలతో పోరాడిన వారికి ఈ ధనాన్ని బహుమానంగా ఇస్తానని ప్రకటించాడు. యుద్ధరంగం మధ్యలోనే సింహాసనం వేయించుకొని కూర్చున్నాడట. అంతేగాక యుద్ధంలో నిజాంషా తలను కొట్టి తెమ్మన్నాడు. ఇబ్రహీం కుతుబ్‌షాను, ఆలీ ఆదిల్‌షాలను చంపకుండా బందీలుగా తీసుకురమ్మని ఆదేశించాడు. ఆ మాటలు విన్న విజయనగర సైన్యం అమిత ఉత్సాహంతో అహమ్మద్‌నగర్ సైన్యంపై దూకారు. ఆ సమయంలో మళ్లీ పల్లకీ ఎక్కి వారిని ఉత్సాహపరచాడట. అప్పుడు అహ్మద్‌నగర్ సేనానులు అక్లాస్‌ఖాన్, జల్పబిరూమీఖాన్ అనే సేనానులు ఫిరంగీలలో రాగినాణేలు, లోహపు

ముక్కలను కూర్చి విజయనగర సేనలపై పేల్చారు. ఆ పేలుళ్లకు వేలాది విజయనగర సైనికులు మరణించారు ఆ చికాకులో ఖిజీర్‌ఖాన్ అనే బీజాపూరు సేనాని 5 వేల అశ్వదళంతో విజయనగర సేనపై పడి వేల మందిని హతమార్చాడు. ఇలాంటి క్లిష్టదశలో రామరాయల సైన్యంలోని ముస్లిం సేనాధిపతులు హఠాత్తుగా సుల్తాన్ సైన్యంలో చేరిపోయారు. దాంతో విజయనగర సైన్యం యుద్ధరంగంలో తన క్రమపద్ధతిని కోల్పోయింది ఆ స్థితిలో ఫిరంగి పేలుళ్లకు బెదిరిన నిజాంషా ఏనుగు ఒకటి రామరాయలు ఉన్న పల్లకీవైపుకు వచ్చి పల్లకీ మోసే బోయలను తనతొండంతో కొట్టింది. వారు పల్లకీని వదలి పారిపోయారు. ఆ స్థితిలో రామరాయలు పల్లకీ దిగి దగ్గరలో ఉన్న గుర్రాన్ని ఎక్కబోతుండగా శత్రుసైనికులు వచ్చి రామరాయలను బంధించారు.

రామరాయల మరణం: రామరాయల మరణాన్ని గురించి రకరకాల అభిప్రాయాలున్నాయి. యుద్ధం మధ్యలో రామరాయల కొలువులో ఉన్న ముస్లిం సర్దార్ ఒకడు వెనుకనించి బల్లెంతో పొడిచి చంపాడని ఒక అభిప్రాయం ఉంది. రామరాయల తల నరికి బల్లానికి గుచ్చి తలను పైకెత్తి చూపగా విజయనగర సైనికులు అది చూచి పారిపోయారని వర్ణింపబడింది. నిజాముద్దీన్ అహమ్మద్ అనే సమకాలీన అనే ముస్లిం చరిత్రకారుడు యుద్ధంలో విజయం రామరాయల వైపు మొగ్గుతుండగా హుస్సేన్ నిజాంషా సైనికులు కాల్చిన ఫిరంగి గుండు రామరాయల తలకు తగిలి తల ముక్కలైందని, దాంతో విజయనగర సైనికులు భయపడి చెల్లాచెదురై పారిపోవడం మొదలుపెట్టారని, కాని వారిని పారిపోకుండా సుల్తాన్‌ల సైన్యం చుట్టుముట్టి అందరినీ సంహరించిందని రాశాడు పల్లకీ దిగి గుర్రాన్నెక్కే సమయంలో అతడు నిజాంషా సైన్యానికి చిక్కాడని, వారు అతనిని నిజాంషా ఫిరంగీదళ నాయకుని వద్దకు తీసుకెళ్లారని అతడు వెంటనే రామరాయలను నిజాంషా ముందు పడవేశాడని సయ్యద్ అలీ జబీరెలు రాశారు. ఆ సమయంలో హుస్సేన్ నిజాంషాకు స్నేహితుడు బేగ్ అనే వాడు రామరాయలను వెంటనే చంపు లేకపోతే అతని కుమారుడిని పిలిపించుకునే అలీ ఆదిల్షా వచ్చి అల్లరి చేసి రామరాయలను విడిపించుకొని వెళ్లిపోతాడని సలహా ఇచ్చాడు. దీనిని బట్టి అలీ ఆదిల్‌షాను మిగిలిన సుల్తాన్‌లు నమ్మలేదని తెలుస్తోంది. బేగ్ సలహా విని వెంటనే హుస్సేన్ నిజాంషా స్వయంగా తన కత్తితో రామరాయల తల నరికి అల్లా నన్నేమి చేసినా ఫరవాలేదు, నా పగ తీర్చుకున్నాను అని ప్రకటించాడని సయ్యద్ అలీ తబతబ, జబీరేలు రాశారు. అంతేగాక రామరాయల మెడలో ఉన్న విలువైన రత్నాల హారాన్ని కూడా హుస్సేన్‌షా సంగ్రహించాడట. అదే విషయాన్ని రామరాయనభకాయిర్ కేళదినృప విజయాలు కూడా తెలుపుతున్నాయి. తల నరికిన తర్వాత దానిని బల్లానికి గుచ్చి ఎత్తి చూపారని దాంతో రామరాయలు మరణించాడని విజయనగర సైనికులు తెలుసుకొని యుద్ధ రంగం నుండి పారిపోసాగారు. కాని సుల్తాన్ సైన్యం వారి వెంటబడి ఎవరినీ వదిలిపెట్టకుండా దారుణంగా వధించిందని వారి రక్తంతో అక్కడ నది నీళ్లు ఎర్రగా మారాయని కూడా రాశాడు. సుల్తాన్ సైనికులు చుట్టుముట్టిన తర్వాత కూడా విజయనగర సైనికులు ఒకటిగా నిలిచి పోరాడటానికి ప్రయత్నించలేదు. అందరూ వారి చేతులలో దారుణంగా మరణించారు. ఈ విధంగా రామరాయల మరణంతో క్రీ.శ.1565 జనవరి 23వ తేదీన విజయనగర సైన్యాలు ఘోర పరాజయాన్ని పొందాయి. అంతటితో తళ్లికోట యుద్ధం ముగిసింది. యుద్ధంలో వెంకటాద్రి కూడా మరణించాడు. తిరుమల రాయలు తప్పించుకొని పరుగు పరుగున విజయనగరం పారిపోయాడు. యుద్ధానంతరం విజయనగర శిబిరాన్ని సుల్తాన్‌లు దోచుకున్నారు. అక్కడ 1,23,57,411 ఫణముల విలువ కలిగిన బంగారు వస్తు సంపద సుల్తాన్‌లకు చిక్కింది. మరణించిన సైనికుల వద్ద, ఇతర సేనా నాయకుల గుడారాలలో సుల్తాన్ సైనికులకు అపార ధనం లభించింది. ఆ దోపిడీలో సుల్తాన్ సైన్యంలోని ప్రతి ఒక్కడూ భాగ్యవంతుడయ్యాడని, ఎవరు దోచుకుంది వారికే ఉండనిచ్చి ఏనుగులను మాత్రం సుల్తాన్ తీసుకున్నాడని ముస్లింలు రాశారు. ఇంకా ఆయుధాలు, వస్తు వాహనాలు, అశ్వాలు కూడా వారికి లభించాయి. ఈ విధంగా ఈ యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం తన సైనికశక్తి సర్వస్వాన్ని కోల్పోయింది. ఈ యుద్ధానంతరం విజయనగరాన్ని రక్షించటానికి సైనికులే లేకుండాపోయారు. అందువల్ల తిరుమల రాయలు విజయనగరాన్ని రక్షించటం అసాధ్యమని నగరాన్ని వదిలిపెట్టి వెళ్లిపోవలసి వచ్చింది.

తళ్లికోట యుద్ధం దుర్వార్త విజయనగరం చేరింది. విజయనగర వాసులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. సుల్తాన్ సైన్యాలు నగరంలో ప్రవేశించనున్నాయని కూడా తెలిసింది. దాంతో వారు భయభ్రాంతులయ్యారు. అంతకు పూర్వం గత 200 సంవత్సరాల నుండి ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఒకప్పుడు విజయనగర సేనలు గెలిచాయి. మరొకప్పుడు సుల్తాన్ సేనలు విజయాలు సాధించాయి. కాని వారెప్పుడూ విజయనగరంలోకి కాలు

పెట్టలేకపోయారు. ఈ యుద్ధానికి రామరాయలు బయలుదేరే ముందు విజయనగర సేనలు విజయంతో వస్తాయని భావించారు. కాని అంత ఘోరంగా ఓడిపోయి విజయనగరానికి ముప్పు వస్తుందని వారు కలలో కూడా ఊహించలేదు. ఇప్పుడు ఏమిచేయాలో తోచక ప్రజలు కూడా నగరం వదిలిపెట్టి పారిపోవలసిన పరిస్థితి వచ్చింది.

యుద్ధ రంగం నుండి తప్పించుకొని విజయనగరం చేరిన తిరుమలరాయలు నగరాన్ని రక్షించటం అసాధ్యమని గ్రహించాడు. కనుక అతడు విజయనగర ఖజానాలోని ధనరాసులను 1550 ఏనుగులపై ఎక్కించి అంతఃపుర జనంతోను, రాజు సదాశివ రాయలతోను పెనుగొండ కోటకు తరలి వెళ్లిపోయాడు. ఆ సమయంలో రాజ ఖజానా నుండి 100 మిలియన్ల స్టెర్లింగుల బంగారం, రత్నాలు, వజ్రాలు, వైఢూర్యాలు మరియు విజయనగర వజ్ర సింహాసనాన్ని పెనుగొండకు తరలించాడట. తిరుమలరాయలు విజయనగరం వదలివెళ్లటంతో రాజధానిని రక్షించే నాథుడే లేకుండాపోయాడు. దాంతో ప్రజలు భయభ్రాంతులై తమ ధన, మాన, ప్రాణాలకు రక్షణలేక చాలా మంది ప్రజలు కూడా తమ సొత్తును తీసుకొని నగరం వదలి పారిపోయారు పారిపోలేని వారు తమ సొత్తును భూమిలో పాతి పెట్టి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారు. మరుసటిరోజు రక్షణలేని విజయనగరంపై దొంగల మురాలు దాడి చేశాయి. పరిసర అడవులలో నివసించే లంబాడీలు, కురుబతెగవారు, బ్రింజారీలు మొదలైన దొంగల గుంపులు నగరంపై బడి దోపిడీ చేశాయి. షాపులు, వర్తకుల ఇళ్లు దోచుకున్నారు విజయనగర వీధులలో రత్నాలు రాసులుగా పోసి అమ్మే వారని కథలు ఉన్నాయి. అలాంటి అంగళ్లు, వర్తకులు నిలువు దోపిడీకి గురయ్యారు. ఒకే రోజు నగరం ఆరుసార్లు దోపిడీకి గురైందని కౌటో రాశాడు. మూడవ రోజు సుల్తాన్ సైన్యాలు నగరం మీదకు వచ్చిపడ్డాయి. వారు 5 నెలలు తిష్టవేసి నగరాన్ని నిలువు దోపిడి చేసి నిర్దాక్షిణ్యంగా ప్రజలను వధించారు. రాజభవనాలు, దేవాలయాలను పడగొట్టారు. దేవతా విగ్రహాలను విరగ్గొట్టారు. అతి పెద్ద ఏకశిలా విగ్రహమైన ఉగ్రనరసింహుని పెదాలను విరగ్గొట్టారు. ఎంతో వైభవంగా విజయనగర రాజులు ఆసీనులై దసరా ఉత్సవాలను నిర్వహించే వేదికను పగులగొట్టారు. అనేక శిల్పాలను నాశనం చేశారు. ఏదీ వారి చేతి నుండి తప్పించుకోలేకపోయింది. రాజ ప్రాసాదాలను, దేవాలయాలను పెద్దపెద్ద గునపాలతో కూలగొట్టారు. కొన్ని శిల్పాలను విరగ్గొట్టారు. ప్రజలను, రాజ ప్రాసాదాలను దోచుకున్నారు. అడ్డం వచ్చిన వారిని కిరాతంగా వధించారు. మాటలకు వర్ణనలకు అందని విధంగా విజయనగరాన్ని నాశనం చేశారు. విజయనగర చరిత్రను రాసిన రాబర్ట్ సీవెల్ ప్రపంచ చరిత్రలో ఏ నగరం ఇంత ఆకస్మాత్తుగా ఇటువంటి ఘోర విధ్వంసానికి గురి కాలేదని తన గ్రంథంలో వర్ణించాడు. అంతులేని సిరిసంపదలతో, గొప్ప జనాభాతో అత్యంత వైభవంగా వెలిగిన విజయనగర పట్టణం ఒక్క రోజులో సర్వనాశనమైందని వర్ణించాడు. Never perhaps ın the Hıstory of the world has such have been wrought and wrought so suddenly on so splendıda cıty ın the full plenıtude of prosperıty ın one day అని రాశాడు. ఈ విధ్వంసం తర్వాత రెండు సంవత్సరాలకు 'సీజర్ ఫ్రెడరిక్ క్రీ.శ.1567లో విజయనగరాన్ని దర్శించి ఆ విధ్వంసాన్ని స్థానిక కైఫీయత్తులు పేర్కొన్నాయి. నిరంకుశోపాఖ్యాన గ్రంథకర్త రుద్రకవి విజయనగరం అనుభవించిన దుస్థితిని వర్ణించాడు. సుల్తాన్‌ల 6 నెలలుగా దోచుకొని బోలెడంత సంపదను పోగు చేసుకున్నారు. ఈ దోపిడీలో రాజ ఖజానాలో బీజాపూరు సుల్తాన్ ఆదిల్‌షాకు కోడిగుడ్డంత పరిమాణం కలిగిన వజ్రం దొరికిందని దానిని అతడు తన పట్టపు గుర్రం తల తురాయి దిమ్మెగా అలంకరించాడని కౌటో రాశాడు. ఈ యుద్ధం వలన సుల్తాన్‌లు అనేక విధాలుగా లాభం పొందారు. బీజాపూర్ సుల్తాన్‌కు రాయచూర్, ముద్గల్, అంతర్వేది ప్రాంతాలు వశమయ్యారు. గోల్కొండ సుల్తాన్‌కు పానుగల్లు, కోవెలకొండ, ఘనాపూర్‌లు వశమయ్యాయి. అహమ్మద్‌నగర్ నిజాంషాకు, బీదర్ బరీద్‌షాకు రాజ్యలాభం కలుగలేదు గాని దోపిడీలో కొంత ధనం లభ్యమైంది. 6 నెలల దోపిడీ తర్వాత వారిలో వారికి విభేదాలు కలిగి విజయనగరం వదిలి వారి రాజధానికి వెళ్లిపోయారు. తళ్లికోట యుద్ధ విజయం, రామరాయల వధను అతి ఘనకార్యంగా భావించారు. రామరాయల తలను అహ్మద్‌నగర్ సుల్తాన్ తన రాజధానికి తీసుకువెళ్లి దానిని చెడిపోకుండా పసరు నూనెలలో ఉంచి ప్రతి సంవత్సరం తళ్లికోట విజయ ఉత్సవాలు జరిపి ఆ సందర్భంలో రామరాయల తలను ప్రదర్శించేవాడట. అతని తర్వాత అతని వారసులు 250 సంవత్సరాలు అంటే క్రీ.శ.1829 వరకు అలాగే ప్రదర్శించారని రాబర్ట్ సీవెల్ రాశాడు. బీజాపూర్ కోట దగ్గర రామరాయల రాతి తలను చెక్కించారట. దానిని బట్టి రామరాయలను జయించటం సుల్తాన్‌లు ఎంత గొప్పగా భావించారో బోధపడుతుంది.

సుల్తాన్‌లు 6 నెలలు విజయనగరాన్ని ధ్వంసం చేసినప్పటికీ అది పూర్తిగా ధ్వంసం కాలేదు చాలా దేవాలయాలు, చాలా ఇళ్లు నిలబడి ఉన్నాయి. తర్వాత పారిపోయిన ప్రజలు తిరిగి వచ్చి అక్కడ నివసించారు సుల్తాన్‌లు వెళ్లిపోయిన తర్వాత అరవీటి తిరుమలరాయలు విజయనగరానికి తిరిగి వచ్చి పట్టణాన్ని బాగుచేయించి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నించాడు విగ్రహ ప్రతిష్ట చేసి పూజాదికాలు జరిగేటట్లు చేశాడు పోర్చుగీసు వర్తకులు విజయనగరంలో తిరుమలరాయలను దర్శించి వాణిజ్యం యధావిధిగా సాగించేటట్లు ఒప్పందం చేసుకున్నారు. కాని కుటుంబ కలహాల వల్ల తిరుమలరాయల ప్రయత్నాలు సఫలం కాలేదు. సదాశివ రాయలు తిరుమలరాయల అధికారాన్ని తిరస్కరించి అతనిని తొలగించటానికి సుల్తాన్‌ల సహాయాన్ని కోరటానికి కూడా సంశయించలేదు ఈ కుటుంబ కలహాల ఫలితంగా రాజ్యంలోని సామంతులు స్వతంత్రాలు ప్రకటించారు ఆదోని, బంకాపురం, మధుర రాజ్యాల సామంతులు స్వతంత్రులయ్యారు. ఆ స్థితిలో విజయనగరంలో నివసించటం తనకు క్షేమం కాదని, విజయనగర వైభవాన్ని పునరుద్ధరించటం సాధ్యం కాదని నిరాశపడి మిగిలిన ప్రాంతాలకు సదాశివరాయలు రాజుగా కొనసాగాడు. అతడు 1576 వరకు జీర్ణ విజయనగరంలోనే నివసించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. వెల్లూరులో క్రీ.శ.1567 ఫిబ్రవరి 5వ తేదీ నాటి సదాశివరాయల శాసనం ఉంది పెనుగొండలో తిరుమలరాయలు స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేసినా అతడు సదాశివరాయలను తన సార్వభౌముడుగానే తన శాసనాలలో రాయించాడు. 1570 వరకు తిరుమలరాయలు సదాశివరాయలు సార్వభౌముడుగా అంగీకరించాడు. కాని 1570లో సదాశివరాయలు హత్యకు గురయ్యాడని ప్రతీతి అందువల్ల తిరుమలరాయలు పెనుగొండలో పట్టాభిషేకం చేసుకున్నాడు దాంతో తుళువ వంశపు అధికారం అంతమై ఆరవీటి వంశపాలన ప్రారంభమైంది. కాని సదాశివరాయలు క్రీ.శ 1576 వరకు విజయనగరంలో జీవించి ఉన్నట్లు శాసనాధారాలు ఉన్నాయి. 1576లో సదాశివరాయలు మరణించాడు. అంతటితో తుళవవంశం అంతరించింది. సదాశివరాయల మరణానంతరం విజయనగరం కూడా పాడుబడిపోయింది. ప్రజలందరూ వెళ్లిపోయారు. శిధిలమైన ఇళ్లలో పులులు, ఇతర అడవి జంతువుల నివసించాయని విదేశస్తులు రాశారు.

విజయనగర సైన్యాలు - ఓటమికి కారణాలు: విజయనగర సైన్యాలకు ముస్లింలకు ఉన్నంత మత దీక్ష పట్టుదల లేవు. ముస్లిం సేనలు కక్షతో పోరాడాయి ముస్లిం సేనలలో ఐకమత్యం హిందువులలో లేదు విజయనగర సేనలలోని ముస్లిం సైనికులు విశ్వాసంతో పోరాడలేదు. రామరాయలు యుద్ధ రంగం మధ్యలో శత్రువులకు అందుబాటులో ఉండి చాలా తప్పు చేశాడు అతని హఠాన్మరణం అతని సైనికులకు భీతిని కలిగించి పారిపోయేలా చేసింది. ముస్లింల గుర్రపుదళం అద్భుత రణకౌశల్యం చూపింది. ముస్లింలు ఆ యుద్ధంలో కూడా మిన్నగా ఉన్నారు. ముస్లిం సేనానులు తమ సైన్యాలను సమర్థవంతంగా నడిపారు. దానికి తగిన వ్యూహాన్ని రామరాయలు పన్నలేకపోయాడు తన రాజ్యంలో ఉన్న పోర్చుగీసు వారి సహాయాన్ని రామరాయలు సద్వినియోగం చేసుకోలేదు. ఈ కారణాల వల్ల విజయనగర సైన్యాలు ఓటమి పాలయ్యాయి.

రాక్షసతంగడి యుద్ధ ఫలితాలు: తళ్లికోట యుద్ధం విజయనగర సామ్రాజ్యానికి వజ్రఘాతం వంటిది. ఈ యుద్ధం విజయనగర సామ్రాజ్యాన్ని చావు దెబ్బ తీసింది. దాంతో దక్షిణదేశంలో హిందూ అధికారం ఈ యుద్ధంతోనే అంతరించింది కొందరు చరిత్రకారులు ఈ యుద్ధాన్ని వాటర్లూ యుద్ధంతో పోల్చారు. కాని దీనిని చాలా మంది అంగీకరించరు. కారణమేమిటంటే వాటర్లూ యుద్ధంతో నెపోలియన్ సామ్రాజ్యం అస్తమించింది కాని ఈ యుద్ధం తర్వాత కూడా విజయనగర సామ్రాజ్యం కొనసాగింది. కనుక సథియనాథ అయ్యర్ తళ్లికోట యుద్ధం విజయనగర చరిత్రలో క్లిష్టమైన ఘట్టంగాని అత్యంత ప్రమాదకరమైంది కాదని అన్నాడు. చీమకుర్తి శేషగిరిరావు తళ్లికోట యుద్ధం దక్షిణభారతదేశ చరిత్రలోనే గాక యావద్భారతదేశ చరిత్రలోనే ఒక మలుపుకు దారి తీసిన సంఘటన, ఈ యుద్ధం భారతీయ రాజకీయ వ్యవస్థలో ఒక శూన్యతను ఏర్పరచిందని వ్యాఖ్యానించాడు ఈ యుద్ధం దక్షిణ హిందూదేశపు సింహద్వారాలను బద్దలుకొట్టింది. గోల్కొండ, బీజాపూరు రాజ్యాలు దక్షిణంగా విస్తరించడానికి చక్కని అవకాశం కలిగింది. ఈ యుద్ధంతో పోర్చుగీసు వారి ప్రాబల్యం కూడా అంతరించింది. పోర్చుగీసు వారు విజయనగర చక్రవర్తుల సహాయంతో దక్షిణదేశంలో గొప్ప వ్యాపారం చేసుకొనేవారు. దీంతో వారి వ్యాపారం దెబ్బతిని బలహీనులయ్యారు. దక్షిణదేశంలో ముస్లిం మతాన్ని వ్యాప్తి చేయదానికి సుల్తాన్‌లకు మంచి అవకాశం లభించింది. కాని దాన్ని వారు వినియోగించుకోలేదు. విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత సుల్తాన్‌ల ఐక్యత నశించింది. ఈ యుద్ధం తర్వాత వారికి హిందువుల భయం పోయింది. కనుక వారు తమ

బేధాలను బయటపెట్టుకొని తమలో తాము కీచులాడుకోసాగారు అందువల్ల వారి రాజ్యాలపై దాడి చేసి ఆక్రమించగలిగారు. తళ్లికోట యుద్ధం జరగకుండా ఉంటే విజయనగర రాజ్యం అతిబలిష్టంగా ఉండేది అందువల్ల మొగలులు దక్షిణ భారతదేశాన్ని ఆక్రమించడం అంత తేలికగా జరిగేది కాదు. విజయనగర రాజ్యం మొగల్ చక్రవర్తులను ఎదిరించి పోరాడి ఉండేది. ఈ యుద్ధం తుళువ వంశాన్ని అంతం చేసి విజయనగర సామ్రాజ్య అధికారాన్ని ఆరవీటి వంశస్తులపరం చేసింది. దాంతో తళ్లికోట యుద్ధం తర్వాత నాల్గవ వంశం అయిన అరవీటి వంశం పరిపాలన ప్రారంభమైంది.

రామరాయల స్థానం: విజయనగర సామ్రాజ్యంలో రామరాయల స్థానాన్ని, అతడు నిర్వహించిన పాత్ర, విజయనగర పతనానికి అతని బాధ్యతను గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. అతడు సామ్రాజ్యాన్ని అక్రమంగా చేజిక్కించుకున్న స్వార్థపరుడని, కుతంత్రాలలో ఆరితేరిన వాడని, దక్కను సుల్తాన్‌లలో ఒకరితో ఒకరికి తగవులు పెట్టి వారితో పక్షాలు మార్చి యుద్ధాలు చేసి వారి రాజ్య భాగాలను ఆక్రమించాడని, ముస్లింల పట్ల మతద్వేషం కనబరచి, వారి మసీదులను పాడు చేసి ఖురాన్‌ను అగౌరవపరచి ముస్లిం స్త్రీలను చెరపట్టి సుల్తాన్‌లకు ఆగ్రహం కలిగించాడని, అందువల్ల రామరాయల దుండగాలను సహించలేక వారు తమ వైరాన్ని విస్మరించి ఒకటై రాక్షసతంగడి యుద్ధంలో అతనిని వధించి ప్రతీకారంగా విజయనగరాన్ని నేలమట్టం చేశారని, అతని కుతంత్రాలే విజయనగర సామ్రాజ్య వినాశనానికి ప్రధాన కారణమని, రామరాయల ప్రవర్తనను కొందరు చరిత్రకారులు తీవ్రంగా విమర్శించారు. కాని ఈ ఆరోపణలు వాస్తవాలుగా కనిపించవు. కారణమేమిటంటే రామరాయలకు బహమనీ సుల్తాన్‌లతో గల సంబంధాలన్నీ ముస్లిం చరిత్రకారులు రాసిన గ్రంథాల నుంచే తెలుస్తున్నాయి. ఈ ముస్లిం చరిత్రకారులు సుల్తాన్‌ల ఆశ్రితులు. వారు నిజాలు రాస్తే వారి సుల్తాన్‌లు వారి రచనలను ఆదరించకపోగా వారి కోపానికి గురికావలసి రావచ్చు. పైగా వారు కూడా ముస్లిం మత పక్షపాతులు అందువల్ల రామరాయలు కుతంత్రీకుడనే అర్థాలు వచ్చే విధంగా రాశారు అందరికన్నా పెరిష్టా చాలా పక్షపాతంగా రాశాడు. శ్రీకృష్ణదేవరాయల తర్వాత సామ్రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాంటి స్థితిలో అతడు సాళువ నరసింహరాయల లాగా, తుళువ నరసనాయకుని లాగ వ్యవహరించి సామ్రాజ్యాన్ని కాపాడాడు. కాని అతడు సదాశివరాయలను హత్య చేయలేదు. కిరీటం ధరించలేదు. సింహాసనం అధిష్టించలేదు. తన ప్రభువును ముందు ఉంచుకొని అతని పేరుతోనే అన్నీ చేశాడు. సామంతుల తిరుగుబాట్లతో, బహమనీ సుల్తాన్ దురాక్రమణలతో కూలిపోయే సామ్రాజ్యాన్ని నిలబెట్టాడు. ఆ దృష్టితో చూసినట్లయితే అతడు అధికారాన్ని చెలాయించడం తప్పని అనిపించదు. అలాగే దక్కను సుల్తాన్‌ల మధ్య కలతలు సృష్టించి వారు యుద్ధాలకు దిగేలా చేసి వారి రాజ్యాలు ఆక్రమించాడనే వాదన కూడా వాస్తవం కాదు వారే తమలో తాము కలహించుకొని రామరాయల సహాయం అర్థించారు. అయినా వారి మధ్య తగవులను మాన్పించి దక్కనులో శాంతిని స్థాపించడానికి తన వంతు కృషి చేశాడు. కాని అహ్మద్‌నగర్ బీజాపూరు సుల్తాన్‌లు దానిని సాగనీయలేదు. అలాగే ముస్లిం స్త్రీలను చెరబట్టాడని, ఖురాన్‌ను అవమానపరచాడని మసీదులను పాడు చేశాడని పెరిష్టా రాసిన రాతలు కూడా వాస్తవం కాదు. తన సైన్యంలో ముస్లింలు ఉన్నారు, వారికి మసీదులు కట్టించి తన దర్బారులో ఖురాన్‌ను వేదికపై ఉంచాడు. కనుక నేలటూరి వెంకటరమణయ్య దక్షిణ భారతావని నుంచి ఆసేతు నర్మదా నది వరకు భూమండలాన్ని శాసించి దక్కనులోని పంచపాదుషాలను తన ఆజ్ఞలకు బద్ధులయ్యేలా చేసి విజయనగర సామ్రాజ్యాన్ని 22 సంవత్సరాలు మహా వైభోగంతో పాలించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి మరొకరు లేరు, అతడు వారిలో అగ్రగణ్యుడని చెప్పాలని రామరాయలను శ్లాఘించారు. అలాగే మరికొందరు కూడా ఆనాడు భారత ఖండాన్ని పాలించిన హిందూ రాజులలోకెల్లా అతిదొడ్డవాడని అన్నారు. సమకాలీన ఆంధ్రదేశం అతనిని రామరాజని, బదేరామప్పయ్య అని ఘనంగా చూసుకున్నారు. రంగప్పరాజు అనే అతడు రామరాయలు అతి ధైర్యశాలి, మహ్మదీయ విస్తరణ తరంగాలకు అడ్డుకట్టలు వేశాడు. రాజనీతి బాగా తెలిసినవాడు అని తెలిపాడు. అతడు జయాపజయాలకు బెదరనివాడు, ఎత్తులు వేయడంలో ఆరితేరిన వాడు, శత్రుభయంకరుడు, ఆశ్రితులకు కల్పవృక్షం, బంధుప్రియుడు, విద్యావంతుడు, విచక్షణా జ్ఞానసంపన్నుడు, కనుకనే ప్రజలు, అమరనాయకులు అతనిపై ప్రేమతో తమ జీవితాలు త్యాగాలు చేయడానికి ముందుకు వచ్చారు. అలాంటి రాజస గుణాలు కలిగిన వాడు కనుకనే శ్రీకృష్ణదేవరాయలు తన కుమార్తెనిచ్చి వివాహం చేసి తన అల్లునిగా చేసుకున్నాడు. రామరాయలు గొప్ప భాషాభిమాని. సర్వమత కళానిధి రాసిన రామయామాత్యుడు, వసుచరిత్ర

రాసిన భట్టుమూర్తి అతని ఆస్థాన కవులు భట్టుమూర్తికి రామరాజ భూషణుడని పేరు. ఆ పేరును బట్టి అతడు రామరాయలకు ఎంత ప్రీతిపాత్రుడో తెలుస్తుంది. రామయామాత్యుడు రామరాయల మంత్రిగా కూడా పని చేశాడు. అతడు తాను సంస్కృతంలో రాసిన సర్వమేళ కళానిధిని రామరాయలకు అంకితం చేశాడు

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం రామరాయల తప్పిదమా?: ఎంతమాత్రం కాదు బహమనీ రాజ్యం విజయనగరానికి జన్మవిరోధి మొదటి నుండి విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేయడానికే తనశక్తినంతా వినియోగిస్తూ వచ్చింది. అవకాశం లభించినప్పుడు ఆ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం తప్పుకాదు కనుకనే మొట్టమొదటిసారిగా శ్రీ కృష్ణదేవరాయలు జోక్యం చేసుకున్నాడు.

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం రామరాయలతోనే ప్రారంభం కాలేదు అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయలే ప్రారంభించాడు. విజయనగర చరిత్రలో మొట్టమొదటిసారిగా కృష్ణరాయలు జోక్యం చేసుకొని బీదరులో బందిఖానాలో ఉన్న బాలసుల్తాన్‌లను విడిపించి సింహాసనం ఎక్కించాడు. ఆ చర్య రాయలు విజయనగర రాజ్య రక్షణ కోసం తీసుకున్నాడు. బీదరులో కేంద్ర ప్రభుత్వం అనేది ఒకటి ఉంటే స్వతంత్రవైఖరిని అవలంబించిన బీజాపూరు, గోల్కొండ, అహ్మద్‌నగర్ సర్దారులు తమ స్వతంత్రాలు సాధించడానికి బీదరు రాజకీయలతోనే తల మునకలైపోతారు. అందువల్ల వారు విజయనగరంపై దండయాత్రలు సాగించలేరు. కనుక విజయనగర రాజ్యం శాంతంగా ఉండగలుగుతుందని కృష్ణరాయలు ఆశించాడు. బహమనీ సుల్తాన్‌ల దృష్టిని విజయనగరంపై లేకుండా చేయడమే రాయల ఏకైక లక్ష్యం. కనుక అతడు రూపొందించుకున్న విధానం కేవలం విజయనగర రాజ్యక్షేమం కోసం ఉద్దేశించినది. కాని రామరాయలు అలా చేయలేదు. అతనిలో వ్యక్తిత్వ లోపాలు ఉన్నాయి పొగడ్తలకు పొంగిపోయి లొంగిపోయే గుణం ఉంది. అతడు తన రాజ్య క్షేమానికి కాక తన Vims and Fancies కే అధిక ప్రాధాన్యతనిచ్చాడు ఎవరు వచ్చి తనను ఆశ్రయిస్తే వారినే సమర్ధించేవాడు. అది రాజ్యానికి మంచిది కాదని ఆలోచించలేదు ఇబ్రహీం కుతుబ్‌షా వచ్చి ఆశ్రయించగానే అతనిని ఆదరించాడు. బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన కుమారుడు మరణించినప్పుడు పలకరించడానికి విజయనగరం వస్తే పొంగిపోయి అహ్మద్‌నగరంతో సంబంధాలు వదలుకొని బీజాపూరు వైపు చేరిపోయాడు. వీరిద్దరే చివరకు అతని పతనానికి కారకులయ్యారు బహమనీ సుల్తాన్‌లను ఏకం చేసిన వాడు ఇబ్రహీం కుతుబ్‌షా. రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఇవ్వమని లేదంటే యుద్ధానికి సిద్ధమని కబురు పంపి యుద్ధానికి తక్షణ కారణమైనవాడు ఆలీ ఆదిల్‌షా. మొదట అతడు యుద్ధంలో చేరటానికి ఇష్టపడలేదని, మిగిలిన వారు బెదిరించి అతనిని కలుపుకున్నారని ముస్లిం చరిత్రకారులు రాశారు. కాని అది వాస్తవం కాదు. అతడే యుద్ధాన్ని ప్రారంభించాడు. ఎవరిని ఆదరించినా వారికి విజయనగరంపై ఎప్పుడూ జాలిలేదు తమ స్వార్ధాల కోసం తమ అవసరాలు తీర్చుకోవడం కోసం రామరాయలను ఆశ్రయించారే తప్ప విజయనగర రాజ్యం మీద ఎవరికీ అభిమానం లేదు. అది రామరాయలు గ్రహించలేక పోయాడు. ఎవరు ఆశ్రయించినా తన కుమారుని లాగా చూసుకుంటానని మాట ఇచ్చి వారి కోసం పోరాడేవాడు జగదేకరావుకు ఆశ్రయం ఇచ్చి గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌సాను విరోధిని చేసుకున్నాడు. రాజకీయాలలో ఒకప్పుడు తనవాడైనా ఆశ్రయం ఇవ్వరాదు ఏ శత్రువుకు, ఏ వ్యక్తికి ఆశ్రయం ఇస్తే వచ్చే ముప్పులు, కష్టనష్టాలు ఏమిటని రామరాయలు ఎప్పుడూ ఆలోచించలేదు.

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోకముందు అహమ్మద్‌నగర్, బీజాపూరు రాజ్యాలు ఒక ఒప్పందం చేసుకొన్నాయి. అహ్మద్‌నగర్ రాజ్యం బీదరును ఆక్రమించేటట్లు, బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యాన్ని ఆక్రమించేటట్లు, అందుకు ఒకరికొకరు సహకారం చేసుకొనేటట్లు అంగీకరించారు. అంటే రామరాయలు బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోకపోయినా వారి వల్ల విజయనగర రాజ్యానికి ప్రమాదం ఉందనే మాట వాస్తవం. ఆ తర్వాత వారి స్వార్ధాల వల్ల విడిపోయి ఉభయులు వేరు వేరు కాలాలలో రామరాయలను ఆశ్రయించారు. కనుక అలాంటి ఆగర్భ శత్రురాజ్యాలలో జోక్యం చేసుకొని వాటిని నాశనం చేయడం తప్పుకాదు కాకపోతే రాయరాయలు ఆ రాజ్యాల విషయంలో అనుసరించవలసిన విధానాన్ని రూపొందించుకోవడంలో మాత్రమే తప్పు చేశాడు. అతడు మొదటిదశలో సరైన పద్ధతినే అనుసరించాడు. మొదటిదశలో అంటే క్రీ శ 1543 నుండి 1557 వరకు అతడు అహ్మద్‌నగరంతో స్నేహ సంభదాలు పాటించాడు. అది చాలా మంచి విధానం. మన శత్రువు యొక్క శత్రువు మనకు మిత్రుడు అని చెప్పే కౌటిల్యుని నీతిని అనుసరించాడు. అందువల్ల బీజాపూరు రాజ్యం మధనపడి విజయనగరంపై దాడి చేయలేకపోయింది. అహ్మద్‌నగరం విజయనగరానికి సరిహద్దు రాజ్యం

కాదు కనుక ఏనాడూ విజయనగర, అహ్మద్‌నగర రాజ్యాలకు యుద్ధం వచ్చే అవకాశమే లేదు. బీజాపూరు రాజ్యం సరిహద్దు రాజ్యం. రాయచూరు, అంతర్వేది కోసం ఉభయ రాజ్యాలకు వివాదం ఉంది. ఎప్పుడైనా వారి మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉంది. అలాగే అహ్మద్ నగరానికి, బీజాపూరుకు సరిహద్దు వివాదాలున్నాయి వారిద్దరూ కలిసిపోయే ప్రశ్నేలేదు. రామరాయలు అహ్మద్‌నగర్‌తో స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడం వల్ల బీజాపూరు రాజ్యాన్ని తన రాజ్యంపై దండెత్తడానికి వీలులేకుండా చేయవచ్చు. ఆ విధానంలో ఎంతో రాజనీతి ఉంది అహ్మద్ నగరంతో రక్షణ సంధి ఉన్నంత వరకు విజయనగర రాజ్యం సురక్షితంగా ఉంది. రాయచూరు, అంతర్వేది ప్రాంతం విజయనగర రాజ్యంలో భాగమైపోయింది అలాంటి స్థితిలో రామరాయలు తన విధానాన్ని మార్చుకొని అహ్మద్‌నగర్‌తో తన సంబంధాలను తెంచుకొని బీజాపూరు వైపు చేరిపోవడం ఘోరమైన రాజకీయ తప్పిదం. ఆ తప్పిదమే విజయనగర రాజ్య వినాశనానికి కారణమైంది. బహమనీ రాజ్యాలు వారికి ఎన్నిభేదాలు, ఈర్ష్యాద్వేషాలు ఉన్నా అవసరమైతే ఏకం కాగలరు, విజయనగర రాజ్యాన్ని దెబ్బ తీయగలరని శ్రీకృష్ణదేవరాయల కాలం నాడే రుజువైంది కృష్ణరాయలు బీజాపూరు సుల్తాన్‌ను రాయచూరు యుద్ధంలో ఓడించి రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత సుల్తాన్‌లందరూ బీజాపూరు ప్రాంతాలను తిరిగి ఇచ్చివేయాలని, లేకపోతే తామంతా ఏకమై దండెత్తుతామని బెదిరిస్తూ రాయబారిని పంపారు. అప్పుడు వారిలో సయోధ్య లేదు ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే ఉన్నారు. అయినా కృష్ణరాయలను బెదిరించారు. కృష్ణరాయల చేతిలో ఓటమి పొందవలసివస్తుందని మిన్నకున్నారే తప్ప ఏ మాత్రం తమకు శక్తి ఉన్నా ఆనాడే అందరూ కలసి రాయచూరుపై దండెత్తేవారు కనుక వారి వల్ల విజయనగర రాజ్యానికి ఎప్పుడైనా ప్రమాదం ఉంది అది గ్రహించక రామరాయలు అటు ఇటు పక్షాలు మార్చి అందరినీ విరోధులను చేసుకొని విజయనగర రాజ్యానికి అపకారం చేశాడు అలా పక్షాలు మార్చకుండా ఉంటే వారి అంతఃకలహాలతో వారే నాశనమయ్యేవారు కనుక రాక్షసతంగడి యుద్ధానికి రామరాయల స్వయంకృతాపరాధమే ప్రధాన కారణమని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు తద్వారా విజయనగర వినాశనానికి కారకుడయ్యాడని చెప్పవచ్చు.

ఆరవీటి వంశం క్రీ.శ.1570-1680: రాక్షసతంగడి యుద్ధం తర్వాత విజయనగర పట్టణం ధ్వంసం అయింది కాని విజయనగర రాజ్యం అంతరించలేదు. పూర్వవైభవం రాకపోయినప్పటికీ ఆరిపోయే దీపం మరొక 110 సంవత్సరాలు కొనసాగింది. కాని అధికారం తుళువ వంశం నుండి ఆరవీటి వంశం కైవసం చేసుకుంది విజయనగర చరిత్రలో మూడవసారి అధికార అపహరణ జరిగింది. అయినప్పటికీ ఆరవీటివంశం మరొక శతాబ్దం పాటు విజయనగర సామ్రాజ్యాన్ని నిలబెట్టడానికి తన శాయశక్తులా పోరాడింది.

ఆరవీటి వంశస్తులు తాము చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని చిత్రావతీ నదీతీరంలో ఆరవీడనే గ్రామం ఉంది. కనుక వారు అనంతపూర్ జిల్లాకు చెందిన వారని కొందరు భావించారు. మరికొందరు ఆరవీడు కర్నూలు జిల్లాలో ఉందని భావించారు. కర్నూలు జిల్లా వారని చెప్పారు కడపజిల్లాలోని రాయచోటి తాలూకాలో ఆరవీటిపురం ఉందని, అక్కడ కొన్ని కోట శిథిలాలు కూడా ఉన్నాయని దివాన్ బహుదూర్ టి.భుజంగరావు అన్నారు. అంతేగాక రాయలసీమ అనే పేరు ఆ ప్రాంతాలకు 16వ శతాబ్దం నుండే ఉందని కూడా అన్నారు. 16వ శతాబ్దం నాటి అనేక సామంతుల శాసనాలు ఆ ప్రాంతాన్ని రాయలసీమ అని వ్యవహరించాయని దివాన్ బహద్దూర్ తెలిపారు. ఆరవీడు ఉదయగిరి రాజ్యంలో ఉండేది ఉదయగిరి రాజ్యాన్ని గజపతులు జయించినందువల్ల ఆరవీటి వారు తమ ప్రాముఖ్యాన్ని పోగొట్టుకున్నారు. ఉదయగిరిని శ్రీకృష్ణదేవరాయలు తిరిగి జయించడంతో ఆరవీటి వారు తిరిగి విజయనగర సామ్రాజ్యంలో ప్రాముఖ్యంలోకి వచ్చారు. కర్నూలు, కడప జిల్లాలో నేడు కూడా అనేక ఆరవీటి కుటుంబాల వారున్నారు. కనుక కడప జిల్లా వారి స్వస్థానం అని దివాన్ బహద్దూర్ నిర్ణయించారు. రాష్ట్రం నుంచి కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం వచ్చారని బి.యస్.యల్. హనుమంతరావు అన్నారు. కాని అందుకు ఆధారాలు లేవు ఆరవీటి వారు స్వచ్ఛమైన తెలుగువారు. కాకతీయుల కాలం నుంచి వారు మాండలిక వంశంగా ఆరవీటిని పాలించినట్లు కనిపిస్తోంది వీరిలో ఒక శాఖ నంద్యాల, కర్నూలు ప్రాంతాలను కూడా పాలించింది ఆరవీటి వంశానికి మూల పురుషుడు తాత పిన్నమరాజు. అతడు రెండవ ప్రతాపరుద్రుని సామంతుడు. అతడు కాయస్థ అంబదేవుని సామంతుడైన చెరకురాజు రుద్రుని ఓడించాడు. అతని సోదరుడు కోగంటి రాఘవుడు ప్రతాపరుద్రుని ఆదేశం ప్రకారం కంపిలి రాజ్యంపై దండెత్తాడు. పిన్నమరాజు కుమారుడు ఆరవీటి సోమరాజు. ప్రతాపరుద్రుని

మరణానంతరం సోమరాజు కంపిలి రాజ్యంపై దండెత్తి ఏకంగా ఏడు దుర్గాలను జయించి తుగ్లక్ ప్రతినిధి అయిన మాలిక్ నెబిని ఓడించి తరిమి, అనెగొందిని ఆక్రమించాడు. అప్పటినుండి ఆరవీటి వంశానికి అనెగొంది కేంద్రం అయింది. కాని సోమరాజు తర్వాత వారు హరిహరబుక్కరాయల చేతిలో ఓడిపోయి విజయనగర సామ్రాజ్యానికి సేవలు చేశారు. ఆరవీటి సోమరాజు కుమారుడు రాఘవేంద్రుడు, అతని కుమారుడు పిన్నశౌరి, అతని కుమారుడు బుక్కరాజు. ఈ వంశంలో బుక్కరాజు గొప్పవీరుడుగా ప్రసిద్ధి చెందాడు. అతడు సాళువ నరసింహరాయల సేనాధిపతి. అతడు అనేక యుద్ధాలలో సాళువ నరసింహునికి సహాయం చేసి సాళువరాజ్య ప్రతిష్ఠాపనాచార్య అనే బిరుదు పొందాడని రామరాజ విజయం తెలుపుతోంది. అతడు ఆరవీటిలో చిన్నపాలెగాడు అయి ఉంటాడు. సాళువ నరసింహుని కొలువులో చేరిన తర్వాత అతడు చంద్రగిరిలో నివసించి ఉంటాడు. అతని సేవలకు మెచ్చి అతనికి కర్నూలు జిల్లాలో జాగీరును ఇచ్చాడు. అందువల్ల బుక్క కుమారుడు రామరాజు తన మకాంను కర్నూలు జిల్లాకు మార్చాడు. అప్పటి నుండి వారి వంశస్తులు కర్నూలు ప్రాంతంలో సామంతరాజులుగా అమర నాయకులుగా కొనసాగారు. వీరనరసింహ రాయల కాలంలో ఈ వంశస్తులు కందనవోలు అమర నాయకులుగా ఉండేవారు. సుల్తాన్ ఆదవాని కోటపై దండెత్తినప్పుడు వారు కోటను కాపాడి వీరనరసింహ రాయలకు అప్పగించారు. బుక్కరాజు కుమారుడు రామరాజు. అతనికి తిమ్మరాజు, కొండరాజు, శ్రీరంగరాజు అనే ముగ్గురు కుమారులు కలిగారు. వారిలో శ్రీరంగరాజుకు ఐదుగురు కుమారులు కొనరాజు, తమ్మరాజు, రామరాజు, తిరుమల దేవరాజు, వెంకటాద్రి. వీరిలో మూడవ కుమారుడైన రామరాజు శ్రీకృష్ణదేవరాయల కుమార్తెను వివాహమాడినందువల్ల అతనికి అళియ రామరాజ అనే పేరు వచ్చింది. అళియ అంటే కన్నడభాషలో అల్లుడు అని అర్థం. ఆరవీటి వంశస్తుడైనందున ఆరవీటి రామరాజు అని కూడా పిలిచేవారు. ఇతడు కృష్ణరాయల కుమార్తెను వివాహమాడినందువల్ల ఈ పునాది వేసినవాడు రామరాయలే. అతడు సదాశివరాయలను రాజును చేసి సర్వాధికారియై 22 సంవత్సరాలు విజయనగర రాజ్య చక్రాన్ని తిప్పాడు. అప్పటి నుండే విజయనగర అధికారం ఆరవీటి వంశస్తుల చేతిలోకి వచ్చింది. కాని అతడు సింహాసనం అధిష్ఠించలేదు. తళ్లికోట యుద్ధంలో అతడు మరణించాడు. కనుక అతని తమ్ముడు తిరుమలరాయలు విజయనగర సామ్రాట్టు సదాశివరాయల రక్షణను చేపట్టి రాజ్యాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆరవీటి వంశానికి తుళువ వంశంతో వివాహబంధం ఉన్నందువల్ల వారి వారసత్వాన్ని ఎవరూ వ్యతిరేకించలేకపోయారు. తర్వాత తానే క్రీ.శ.1570లో పెనుగొండలో పట్టాభిషేకం చేసుకున్నాడు. దాంతో విజయనగర సామ్రాజ్యాధికారం తుళువ వంశం నుండి ఆరవీటి వంశానికి బదిలీ అయింది. విజయనగరాన్ని పాలించిన నాల్గవ వంశంగా రంగంలోకి వచ్చింది.

సదాశివరాయల చివరిదశ క్రీ.శ.1565-76: తండ్రి శ్రీరంగరాయల కాలంలో తిరుమలరాయలు పెనుగొండ రాజ్యాన్ని రాజప్రతినిధిగా పాలించేవాడట. తండ్రి ఆదేశానుసారం అతడు తన సైన్యాలతో తళ్లికోట యుద్ధంలో పాల్గొన్నాడు. తళ్లికోట యుద్ధంలో తన అన్న రామరాయలు మరణించగానే తిరుమలరాయలు పరుగు పరుగున విజయనగరం చేరి రాజధానిని రక్షించడం అసాధ్యమని గ్రహించి రాజ ఖజానాను రాజ కుటుంబాన్ని, రాణివాసాన్ని, రాజు సదాశివరాయలను తీసుకొని పెనుగొండ పారిపోయాడు. అందువల్ల రాజకుటుంబం రాజసంపద కాపాడబడింది. అతడు విజయనగరాన్ని రక్షించలేకపోయినా రాజ కుటుంబాన్ని, రాజ భాండాగారాన్ని శత్రువుల పాలపడకుండా కాపాడగలిగాడు. అందువల్ల రాజ్యాన్ని నిలబెట్టడానికి కొంతవరకు వీలైంది.

సుల్తాన్‌ల అరాచకాలు: తిరుమలరాయలు నిష్క్రమించిన తర్వాత సుల్తాన్‌ల సేనలు విజయనగరంలో ప్రవేశించి 5 మాసాలు తిష్టవేసి నగరాన్ని ధ్వంసం చేసి ప్రజలను వధించారు. నగరమే గాక పరిసర గ్రామాలు కూడా వారి దమనకాండకు గురయ్యాయి. రాయలసీమలోని అనేక గ్రామాలు కూడా వారి రాక్షస కృత్యాలకు బలయ్యాయి. సాధారణ ప్రజలకు సుల్తాన్‌ల సైన్యాన్ని ఎదిరించగల శక్తి లేదు. కనుక వారు తమ గ్రామాలు వదలి అరణ్యాలలో తలదాచుకొని ముస్లిం సైన్యాలు వెళ్లిపోయిన తర్వాత తిరిగి వచ్చారు. కాని రామరాయల కాలంలో తన బంధువులకు అనేక ఉన్నతోద్యోగాలు ఇచ్చాడు. ఇప్పుడు వారందరూ తమ ఇష్టారాజ్యంగా నడువసాగారు. సైన్యంలోని రామరాయల బంధువులు ఎవరినీ లెక్క చేయకుండా అవిధేయులయ్యారు. ఆ పరిస్థితులలో రాజ్యంలో అరాచకత్వం ప్రబలి ప్రజలకు శాంతి భద్రతలు లేకుండా పోయాయి. ఆ విధంగా విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1565 నుండి 1570 వరకు ఐదారు సంవత్సరాలు సంక్షోభానికి గురైంది. పరిస్థితులన్నీ అస్తవ్యస్తంగా మారాయి.

పెదతిరుమలయ్య కుట్ర: అలాంటి పరిస్థితులలో రాజ్యాన్ని అదుపులోకి తీసుకురావాలని తిరుమలరాయలు చక్రవర్తి అయిన సదాశివరాయలను తీసుకొని క్రీ.శ.1568వ సంవత్సరంలో విజయనగరం వచ్చాడు. అతడు రాగానే తళ్లికోట యుద్ధం తర్వాత తమ వ్యాపారాన్ని పోగొట్టుకున్న పోర్చుగీసు వారు విజయనగరం వచ్చి తిరుమలరాయలను కలిసి పూర్వం లాగా వ్యాపారసంధి చేసుకొని ఉభయులు ఒకరినొకరు రక్షించుకుందామని కోరారు. తిరుమల రాయలు అందుకు అంగీకరించాడు. అప్పటికే పారిపోయిన ప్రజలు చాలా వరకు విజయనగరం చేరుకున్నారు. రామరాయల కుమారులు విజయనగరంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తిరుమల రాయలు విజయనగరం రాగానే ఆరవీటి కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. రామరాయలు పెద్ద కుమారుడు కృష్ణప్ప తళ్లికోట యుద్ధంలో మరణించాడు. రెండవ కుమారుడు పెదతిమ్మ లేక పెదతిరుమలుడు తన తండ్రి తర్వాత అధికారం తనకు రావాలన్నాడు. సదాశివరాయల సంరక్షకత్వాన్ని తాను నిర్వహించాలని భావించాడు. దాంతో సేనాధిపతులలో చీలిక వచ్చింది. ఎక్కువ మంది పెదతిరుమలను సమర్థించారు. కొంత మంది తిరుమలరాయలను సమర్థించారు. వారిలో ఇమ్మడి జగదేకరావు ముఖ్యుడు. తర్వాత తిరుమల రాయలు సింహాసనం అధిష్టించడానికి తాను సహాయపడ్డానని చెప్పుకున్నాడు. కనుక తిరుమలరాయలను సమర్థించిన వారిలో అతిముఖ్యుడు జగదేకరావు. అయినప్పటికీ విజయనగరంలో పెదతిమ్మకే అధికమద్దతు లభించింది. కనుక పెదతిమ్మ తన పినతండ్రిని అధికారం నుండి తొలగించటానికి కుట్రలు ఆరంభించాడు. దాంతో తిరుమలరాయలు తాను విజయనగరంలో ఉండటం అంత శ్రేయస్కరం కాదని, తనకు ప్రమాదం జరిగే అవకాశముందని గ్రహించాడు. అంతేగాక విజయనగరం శత్రువులకు అతి సమీపంగా ఉంది. ఎప్పుడైనా సుల్తాన్‌లు దండెత్తవచ్చునని, శిథిలమైన ఆ నగరాన్ని పునరుద్ధరించి పూర్వవైభవానికి తీసుకురావడం కూడా తనకు సాధ్యం కాదని భావించాడు. కనుక తిరిగి పెనుగొండ వెళ్లిపోదామని సదాశివరాయలను తనతో రమ్మన్నాడు. కాని సదాశివరాయలు పెనుగొండ రావడానికి తిరస్కరించాడు. దాంతో తిరుమలరాయలు క్రీ.శ.1568లోనే పెనుగొండకు తిరిగి వెళ్లిపోయాడు. విజయనగరంలో సదాశివరాయల పేరుతో పరిపాలన కొనసాగింది. బహుశా పెద తిరుమలయ్య అధికారం నెరపి ఉండవచ్చును. పెనుగొండలో తిరుమల రాయలు పరిపాలన చేశాడు. కాని క్రీ.శ.1570 వరకు సదాశివరాయల పేరుతోనే రాజ్యపాలన చేశాడు. పెనుగొండలో పరిపాలన చేసిన పినతండ్రి తిరుమల రాయల అధికారాన్ని అంతం చేయాలని పెద తిరుమలయ్య బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా సహాయం కోరాడు.

సామంతుల తిరుగుబాటు క్రీ.శ.1568-70: ఈ స్థితిలో రాజకుటుంబంలోని అనైక్యతను గ్రహించిన సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. ఎవరికి వారు స్వంత రాజ్యాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నాలు ఆరంభించారు. అలాంటి వారిలో ఆదవాని కోట అధిపతి కోనేటి కొండరాజు మొదటివాడు. అతడు క్రీ.శ.1568లో స్వతంత్రం ప్రకటించాడు. తర్వాత బంకాపూర్ పాలకుడు వెలపరే కూడా స్వతంత్రం ప్రకటించాడు. ఇదే సమయంలో దక్షిణదేశంలో అంటే ద్రావిడ దేశంలో కూడా స్వతంత్ర ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి. తిరువడి దేశానికి అధిపతిగా ఉన్న విశ్వనాథనాయకుని కుమారుడు కృష్ణప్ప పొరుగు ప్రాంతాలను ఆక్రమించి మధురను స్వాధీనం చేసుకొని కావేరీనదికి దక్షిణంగా ఉన్న పూర్వపు పాండ్య రాజ్యం అంతా నాదేనన్నాడు. జింజినాయకుడు కృష్ణప్ప కూడా వారిబాటలోనే నడచి తొండైమండలాన్ని ఆక్రమించాడు. ఆ స్థితిలో వారిని అణచి అదుపులోకి తీసుకువచ్చే శక్తి తిరుమలరాయలకు లేదు. దాంతో రాజ్యంలో పాలెగాళ్లు విచ్చలవిడిగా ప్రజల నుండి పన్నులు వసూలు చేయసాగారు. బందిపోటు దొంగలు విజృంభించారు. దేశంలో నేరాలు పెరిగాయి. దోపిడీ గాండ్రు, పాలెగాండ్ర దౌర్జన్యాలు, దుర్మార్గాలు ప్రబలిపోయాయి. వారిని ఎవరినీ తిరుమల రాయలు అణచలేకపోయాడు. వారి దౌర్జన్యాలకు తట్టుకోలేని ప్రజలు గ్రామాలు వదలి వెళ్లిపోసాగారు. ఈ విధంగా ఆరు సంవత్సరాలు విజయనగర రాజ్యంలో పాలకుడనేవాడు. లేకుండా పోయాడని, రాజ్యం అంతటా అరాచకత్వం తాండవించిందని ఒక కైఫీయత్తు తెలిపింది. మరొక కైఫీయత్తు దొంగలు పెట్టే బాధలకు ప్రజలు గగ్గోలు పెట్టారని పేర్కొంది. ఆ స్థితిలో తిరుగుబాటు చేసిన సామంతులు పెదతిరుమలయ్యను సమర్థించే ప్రమాదం ఉందని గ్రహించి, తిరుమలరాయలు తన స్థానాన్ని సుస్థిరం చేసుకోడానికి ద్రావిడదేశంలో సామంతులు ఆక్రమించిన భూములన్నీ వారికే చెందేటట్లు ఆమోదించాడు. దాంతో మధుర, తంజావూరు, జింజి పాలకులు సంతోషించి తిరుమల రాయలను సమర్థించి తిరుమలరాయలే విజయనగర ప్రభువుగా గుర్తించారు. దాంతో పెద

తిరుమలుడు నిస్సహాయుడయ్యాడు. తిరుమలరాయలు పరిస్థితి మెరుగుపడింది. కాని పెద తిరుమలుడు తన ప్రయత్నాన్ని విరమించకుండా బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తనకు సహాయం చేయాలని కోరాడు.

పోర్చుగీసు వారి నుండి అశ్వాలను సంపాదించడం: బీజాపూరు సుల్తాన్ పెదతిరుమలునికి సహాయంగా వస్తాడని తిరుమలరాయలు తన సైనికశక్తిని పెంచుకోడానికి ప్రయత్నాలు చేశాడు. అంతేగాక జీర్ణించిపోతున్న సామ్రాజ్యాన్ని నిలబెట్టాలని తీర్మానించుకున్నాడు. గోవాకు కబురు చేసి మంచి గుర్రాలను తెమ్మన్నాడు. అలాగే ఇతర రేవు పట్నాలకు కూడా కబురుపెట్టి వర్తకులను ఆహ్వానించాడు. వారు సరఫరా చేసే గుర్రాలకు మంచి ధర ఇస్తానని కూడా ప్రకటించాడు. పెద్ద ధరలకు ఆశపడి అనేక మంది వ్యాపారులు మంచి గుర్రాలను పెనుగొండకు తెచ్చారు. వాటిని పరీక్షించే నెపంతో రాచదొడ్డలోకి తోలారు. డబ్బు అడగ్గా తిరుమలరాయలు తర్వాత ఇస్తానన్నాడు. వాస్తవానికి అతని దగ్గర ధనం లేదు. సైన్యం అవసరం, అందునా అశ్వదళం అత్యవసరం. కనుక వర్తకులకు ధనం చెల్లించకుండా ఆ గుర్రాలను తన సొంతం చేసుకున్నాడు. తర్వాత కాల్బలాన్ని కూడా తయారు చేసుకున్నాడు. ఈ విధంగా సైన్యాన్ని సమీకరించుకొంటుండగానే పెదతిరుమలుని ఆహ్వానాన్ని అందుకున్న బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా పెనుగొండపై దండెత్తాడు.

బీజాపూరు దండయాత్ర: పెనుగొండ సింహాసనం నుండి తిరుమలరాయలను తొలగించి పెదతిరుమలయ్యను సింహాసనాధిష్టుని చేయడానికి ఆలీ ఆదిల్‌షా పెనుగొండపై దండెత్తాడని ఫెరిష్టా రాశాడు. ఖిజీర్‌ఖాన్ అనే తన సేనాధిపతికి పెద్ద సైన్యం ఇచ్చి పెనుగొండ మీదకు పంపాడు. ఖిజీర్‌ఖాన్ వచ్చి పెనుగొండను ముట్టడించాడు. ఆలీ ఆదిల్‌ఖాన్ మరొక సైన్యంతో అనెగొందిపై దాడి చేశాడు. తిరుమలరాయలు తన సైన్యానికి సవరం చెన్నప్పను నాయకునిగా నియమించాడు. అతడు ఖిజీర్‌ఖాన్‌ను ఓడించి పెనుగొండ కోటను కాపాడాడు. ఈ పోరాట సమయంలో తిరుమలరాయలు బీజాపూర్ సుల్తాన్‌కు వ్యతిరేకంగా అహమ్మద్‌నగర్ సుల్తాన్ సహాయం అర్థించాడు. తళ్లికోట యుద్ధానంతరం హుసేన్ నిజాంషా మరణించాడు. అతని కుమారుడు మూర్తజా సింహాసనానికి వచ్చాడు. కాని అతడు చిన్నవాడు. కనుక అతని తల్లి ఖున్‌జాసుల్తానా రాజ్యపాలన చేపట్టింది. తిరుమల రాయల దూతవచ్చి సహాయం అర్థించగా ఆమె అహమ్మద్‌నగర్ సేనలతో బీజాపూరు రాజ్యంపై దండెత్తింది. దాంతో తన రాజ్యాన్ని రక్షించుకోడానికి బీజాపూరు సుల్తాన్ పెనుగొండ, ఆనెగొంది ముట్టడిని విరమించి తిరిగి వెళ్లిపోయాడు. ఆదిల్‌షా తిరిగి వెళ్లిపోవడంతో పెదతిరుమలయ్య అధికారంపై తన ఆశ వదలుకొని ఉండవచ్చును. తర్వాత అతని ప్రస్తావన లేదు. తిరుమలరాయల అధికారం స్థిరపడింది.

బీజాపూరు రాజ్యంపై నిజాంషా కుతుబ్‌షాల దాడి: అహమ్మద్‌నగర్ రాణి ఖున్‌జా సుల్తాన్ తన సేనాధిపతి ముల్లా ఇనయతుల్లాను తమ సైన్యాధిపతిగా నియమించింది. అతడు గోల్కొండ, పెనుగొండ రాజ్యాల సహాయం తీసుకొని బీజాపూర్‌పై దండెత్తడం మంచిదని సలహా ఇచ్చాడు. అందువల్ల రాణి గోల్కొండ, పెనుగొండలను తనకు సహాయంగా రావాలని కోరింది. గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం తన సైన్యంతో వచ్చాడు. తిరుమలరాయలు తన కుమారునికి 10 వేల సైన్యాన్ని ఇచ్చి పంపాడు. దండయాత్ర చేసినందువల్ల తిరుమలరాయలకు లాభం కనుక అతడు రెండు లక్షల హొన్నులు యుద్ధ ఖర్చుకుగాను ఇవ్వాలని కోరింది. ఆ విషయం తెలిసిన తిరుమలరాయలు అంగీకరించలేదు. ఈ లోపల ఆలీఆదిల్‌షా వారితో సంప్రదింపులు జరిపి యుద్ధం లేకుండా పరిష్కరించుకున్నాడు. తర్వాత తిరుమలరాయల కుమారుడు తన సైన్యంతో పెనుగొండ తిరిగి వచ్చాడు. తనపై యుద్ధానికి గోల్కొండ, అహమ్మద్‌నగర్‌లతో కలిసినందుకు ఆలీఆదిల్‌షాకు తిరుమలరాయలపై ఆగ్రహం కలిగింది.

ఆదవానిపై దండయాత్ర: తన ఆగ్రహాన్ని చూపడానికి ఆలీ ఆదిల్‌షా క్రీ.శ.1568లో విజయనగర రాజ్యానికి చెందిన ఆదవాని కోటపై దండెత్తాడు. మరొక సేనను అతని సేనాని మలీఖాన్ నాయకత్వంలో పెనుగొండకు పంపాడు. పెనుగొండకోట వద్ద విజయనగర సేనాని సవరం చెన్నప్ప మలీఖాన్‌ను ఓడించి తరిమాడు. కాని తిరుమలరాయలు ఆదవాని కోటకు ఎలాంటి సహాయం పంపలేకపోయాడు. అందువల్ల ఆదవాని కోటలో దండనాయకుడు కోనేటి కొండమరాజు ఓడిపోయి కోటను బీజాపూర్ సుల్తాన్‌కు స్వాధీనం చేశాడు. ఆ కోటను తిరిగి విజయనగర రాజులు జయించలేకపోయారు. ఆదవాని శాశ్వతంగా పోయింది. ఆదవాని కోటపై ఆలీ ఆదిల్‌షా క్రీ.శ.1568లో మాలిక్ రహిమాన్ ఖాన్ అనే వ్యక్తిని అధిపతిగా నియమించాడు. అతడు అక్కడ 39 సంవత్సరాలు పాలించాడు. అతడు మరణించిన తర్వాత అతని సమాధి నిర్మించారు. అది నేటికీ ఉంది. తర్వాత నవాబ్ సిద్ధిమసూబ్ అనే వ్యక్తి క్రీ.శ.1662లో అక్కడ జమ్మామసీదు నిర్మించాడు. దానికి చివరి బీజాపూర్ సుల్తాన్

సికిందర్ ఒక పాలరాతి ఫలకాన్ని పంపాడు. అది ఆ మసీదుపై ఇప్పుడు కూడా ఉంది. తర్వాత క్రీ.శ.1686లో ఔరంగజేబు బీజాపూరును జయించడంతో ఆదవాని మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. అతడు నవాబ్ గాజీ ఉద్దీన్‌ఖాన్ అనే అతన్ని ఆదోని గవర్నర్‌గా నియమించాడు. అప్పటి వరకు ఆదవాని బీజాపూర్ రాజ్యంలో ఉంది. నవాబ్ గాజీ ఉద్దీన్‌ఖాన్ వంశం క్రీ.శ.1752 వరకు ఆదవానిని పాలించింది. తర్వాత నిజాం ఆదవానిని బసాలత్‌జంగ్‌కు ఇచ్చాడు. అతడు 1777లో మరణించగా నిజాం అలీ ఆదవానిని ఇంగ్లిషు వారికి దత్తమండలాలతో పాటు ఇచ్చివేశాడు.

సదాశివరాయల దండయాత్ర క్రీ.శ.1568-75: తిరుమలరాయలు బీజాపూర్ సుల్తాన్‌తో పోరాటం సాగించినప్పుడు సదాశివరాయలు విజయనగరం నుండి సేనతో బయలుదేరి ద్రావిడ దేశంపై దండెత్తి తిరుగుబాటు చేసిన సామంతులను ఓడించి కప్పాలు వసూలు చేశాడు. తర్వాత దేవాలయాలకు దానాలు చేశాడు. కావేరీ తీరంలోని కృష్ణాపుర గ్రామాన్ని తిరుపతిదేవునికి దానం చేసి శాసనం వేయించాడు. పెనుగొండను తిరుమల రాయలు పాలిస్తున్నా 1570 వరకు సదాశివరాయల పేరుతోనే శాసనాలు వేయించాడు. కనుక అప్పటివరకు విజయనగర రాజ్యానికి ప్రభువు సదాశివరాయలేనని స్పష్టంగా తెలుస్తోంది.

పరిపాలనా విభాగాలు: తిరుమలరాయలు ఆదవానికోటను పోగొట్టుకున్నా మిగిలిన సామ్రాజ్యాన్ని నిలబెట్టాడు. పరిపాలనా సౌలభ్యం కోసం అతడు తన రాజ్యాన్ని మూడు పెద్ద రాష్ట్రాలుగా చేశాడు. తిరుమల రాయలకు నలుగురు కుమారులు. పెద్దకుమారుడు రంగనాథ్ అంతకు ముందే మరణించాడు. మిగిలిన ముగ్గురులోని పెద్ద కుమారుడు శ్రీరంగరాయలు పెనుగొండ రాజధానిగా తెలుగు ప్రాంతానికి రాజప్రతినిధి అయ్యాడు. తర్వాత తన రాజధానిని ఉదయగిరికి మార్చాడు. శ్రీరంగపట్టణం రాజధానిగా రెండవ కుమారుడు రామరాజును కన్నడ ప్రాంతానికి రాజప్రతినిధిగా నియమించాడు మూడవ కుమారుడు వెంకటపతిని చంద్రగిరి రాజధానిగా తమిళ దేశానికి రాజప్రతినిధిగా నియమించాడు. భాష ప్రాతిపదిక మీద ఈ విభాగాలు చేసినట్లు కనిపిస్తోంది. ఈ విభజన సామ్రాజ్యాన్ని బలహీనపరిచిందని కొందరి అభిప్రాయం కాని అది వాస్తవం కాదు. అవి రాష్ట్రాలే గాని వేరు వేరు రాజ్యాలు కాదు. ఇవేగాక జింజి, తంజావూరు, మధుర నాయక రాజ్యాలు కూడా పరిపాలనా విభాగాలే. వారు కప్పాలు చెల్లిస్తూ సామంతులుగా పాలించారు. తిరుమల తన శక్తియుక్తులన్నింటినీ వినియోగించినట్లు కనిపిస్తోంది. తిరుమలరాయలకు వెంగళాంబ, చెన్నమదేవి అనే ఇద్దరు భార్యలు. వారిలో వెంగళాంబకు రఘునాథరాజు, శ్రీరంగరాయలు, రామరాజు, వెంకటపతి అనే కుమారులు. వారిలో పెద్దవాడు, రఘునాథుడు తళ్లికోట యుద్ధంలో మరణించాడు. మిగిలిన ముగ్గురినీ పరిపాలనలో భాగం చేసి మూడు రాష్ట్రాలకు రాజ ప్రతినిధులుగా చేశాడు.

ఆరవీటి వంశం క్రీ.శ. 1570-1680

ఆరవీటి వంశం

చంద్రుడు

తాత పిన్నమ రాజు

సోమదేవుడు

రాఘవ దేవరాజు

పిన్నశౌరి

బుక్కరాజు

రామరాజు

శ్రీరంగరాజు

కొసరాజు | తిమ్మరాజు | అళియరామరాజు | తిరుమలరాయలు | వేంకటాద్రి

రంగ (భార్య బంగారమ్మ) | 1570-72 | రామరాజు | శ్రీరంగరాజు

పెదవేంకట (1634-42) | చినవేంకట (పినవేంకట) | వేంకటరాజు | గోపాలరాజు

వీరవెంకట | తిరుమల | మూడవ శ్రీరంగరాయలు (క్రీ.శ.1642-1678) (దత్తు కొడుకు) | మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ 1642-1678

రంగనాథ్ (రఘునాథ్) (తండ్రికంటే ముందే గతించాడు) | మొదటి శ్రీరంగరాయలు 1572-1586 | రామరాజు 1586 | రెండవ వెంకటపతియలు 1586-1614

తిరుమలరాజు | రెండవ శ్రీరంగరాయలు (రెండవ వెంకటపతి దత్తుకుమారుడు) 1614

చిక్కరాయలు (1614-1616) (జగ్గారాయుని మేనల్లుడు)

రామదేవరాయలు (1616-1630) (రెండవ శ్రీరంగరాయల కుమారుడు)

రామ

రంగ

రామ | తిరుమల

రామ | గోపాల

వీరవెంకట



(ఇతని కాలంలో టిప్పుసుల్తాన్ అనెగొంది రాజ్యాన్ని ఆక్రమించాడు. టిప్పు సుల్తాన్ మరణానంతరం ఈ రాజ్యం ఇంగ్లిషు వారికి వచ్చింది. వారు ఆ ప్రాంతాన్ని సైన్య సహకార పద్ధతి ప్రకారం నిజాంకు అప్పగించి అనెగొంది వంశానికి పెన్షను ఏర్పాటు చేశారు. వారి రాజ్యం పోయినప్పటికీ వారి సంతతి వారు నేడు కూడా అనెగొందిలో జీవించి ఉన్నారు.)

తిరుమల రాయలు క్రీ.శ.1570-1572

పట్టాభిషేకం క్రీ.శ.1570: తళ్లికోట యుద్ధం తర్వాత అల్లకల్లోలానికి గురైన విజయనగర సామ్రాజ్యం క్రీ శ 1570 నాటికి స్థిమితపడింది. కనుక తిరమలరాయలు క్రీ.శ.1570లో తన 90వ ఏట పెనుగొండలో పట్టాభిషేకం జరుపుకున్నాడు. దాంతో విజయనగర సామ్రాజ్యానికి ఆరవీటివంశం రాజవంశమైంది. అప్పటికే 90 సంవత్సరాల వృద్ధుడు కనుక పరిపాలన కుమారులకు అప్పగించాడు. అప్పటికి రాజ్యం మొత్తంలో అతని అధికారం స్థిరపడింది. సామంతులందరూ అతనిని విజయనగర ప్రభువుగా అంగీకరించి విధేయులయ్యారు.

సదాశివరాయల మరణం క్రీ.శ.1576: క్రీ.శ.1570లో తిరుమలరాయలు 'పట్టాభిషేకం జరుపుకొనేటప్పుడు సదాశివరాయల పరిస్థితి ఏమిటి? అతనిని క్రీ.శ.1568లో తిరుమలరాయలు చంపించి రాజ్యాన్ని వశం చేసుకున్నాడని రాబర్ట్ సీవెల్ రాశాడు. కాని తర్వాత తన అభిప్రాయం మార్చుకొని సదాశివరాయలు ఎప్పుడు మరణించిందీ తెలియదని రాశాడు. కాని 1570లో అతడు మరణించి ఉండవచ్చు లేదా అధికారాన్ని త్యజించి పరిపాలన నుండి తప్పుకొని ఉండవచ్చు అని అన్నాడు. అందువల్లనే తిరుమలరాయలు పట్టాభిషేకం చేసుకొని ఉండవచ్చు. సీజర్ ఫ్రెడరిక్, తిరుమలరాయల కుమారులలో ఒకడు క్రీ.శ.1567లో

చెరసాలలో ఉన్న సదాశివరాయలను సంహరించాడని రాశాడు. ఆ కుమారులలో చిన్నవాడైన రెండవ వెంకటపతి సదాశివరాయలను హత్య చేశాడని పుకారు ఉంది. కనుక తిరుమలరాయలను హత్య చేయలేదని, ఒకవేళ హత్యను ప్రోత్సహించాడేమో అని ఫాదర్ హీరాస్ వ్యాఖ్యానించాడు. కాని ఇవేవీ వాస్తవాలు కాదు. సదాశివరాయలు క్రీ.శ.1576 వరకు జీవించి ఉన్నట్లు శాసనాలు లభించాయి. దక్షిన ఆర్కాట్ జిల్లాలోని సెంబేదులో క్రీ శ 1575 మే 9వ తేదీన వేయించిన ఒక శాసనం సదాశివరాయలని ప్రభువుగా పేర్కొంటోంది. కనుక అతడు అప్పటివరకు జీవించి ఉన్నాడని స్పష్టంగా భావించవచ్చును. కనుక అతడు హత్య చేయబడలేదనే తెలుస్తోంది. పైగా అతనిని హత్య చేయవలసిన అవసరంలేదు. మొదటి నుండి అంటే క్రీ.శ.1543 నుండి అతడు ఎలాంటి అధికారాన్ని చెలాయించలేదు సర్వాధికారాలు రామరాయలకే అప్పగించాడు. చివరిదశలో ముసలితనంలో అతడు అధికారం కోసం తిరుమలునికి అడ్డు తగిలాడని భావించవలసిన పనిలేదు. కనుక హత్య చేయవలసిన ఆగత్యం లేదు కనుక ఆరవీటి వంశాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కల్పించి ఉండవచ్చును. అయితే తిరుమలరాయలు క్రీ శ.1570లో పట్టాభిషేకం చేసుకున్నాడంటే సదాశివరాయలు జీవించి ఉండగానే అతని అధికారాన్ని తోసిరాజని పట్టాభిషేకం చేసుకొని ఉంటాడు. ఆ తర్వాత కూడా సదాశివరాయలు క్రీ శ.1576 వరకు విజయ నగరంలోనే జీవించి 1576లో మరణించి ఉండవచ్చు. ఒకవేళ అతడు హత్యకు గురైనా 1575 మే నెల తర్వాతనే అయి ఉండాలి ఏమైనా అతడి జీవితకాలంలోనే సామ్రాజ్యాధికారం ఆరవీటి వంశస్తుల పరమైంది. అతని మరణంతో క్రీ.శ.1576లో తుళువ వంశం అంతరించింది తిరుమలరాయలు దైవభక్తి పరుడు. అనేక దేవాలయాలకు దానాలు ఇచ్చాడు క్రీ.శ.1569లో ఉదయగిరిలోని ఆంజనేయస్వామి దేవాలయానికి దానాలు చేశాడు. కంచి శ్రీరంగం, శేషాచల దేవాలయాలకు దానాలు చేశాడు. పెనగలూరు విప్రులకు అగ్రహారాలు ఇచ్చాడు తిరుమల రాయలు కవిపండిత పోషకుడు. రామరాజభూషణుడనే పేరు గల భట్టుమూర్తి అతని ఆస్థాన కవి. అతడు వసుచరిత్ర అనే ప్రబంధాన్ని రాసి తిరుమలరాయలకు అంకితం ఇచ్చాడు. తిరుమలరాయలు స్వయంగా కవి పండితుడు. జయదేవుని గీతగోవిందానికి శృతిరంజిని అనే మరొక వ్యాఖ్యానాన్ని రచించాడు. అతనికి ఆంధ్రభోజ అనే బిరుదు కూడా ఉంది.

తిరుమలరాయలు కొద్దికాలంలోనే అల్లకల్లోలానికి గురైన సామ్రాజ్య పరిస్థితులను చక్కదిద్ది జీర్ణ కర్ణాటక సామ్రాజ్యానికి ఒక రూపం ఇచ్చాడు. జీర్ణ కర్ణాటక సామ్రాజ్యోద్ధారక అనే బిరుదు పొందాడు. కాని అది కృష్ణరాయల కాలం నాటి కర్ణాటక సామ్రాజ్యం కాదు. కృష్ణరాయలు ఏకఛత్రాధిపతి. కాని తిరుమల రాయల కాలంలో అది అర్ధ సామ్రాజ్యం మాత్రమే. సామంతులు అర్ధస్వతంత్రులు. వారికి అతని పట్ల పూర్తి విధేయతగాని ప్రభు భక్తిగాని లేవు. అయినప్పటికీ విజయనగర సామ్రజ్యం పూర్తిగా కూలిపోకుండా నిలబెట్టి మరొక శతాబ్దం పాటు హిందూధర్మం నిలబడేటట్లు చేశాడు. పట్టాభిషేక కాలానికే తిరుమల రాయలు 90 ఏళ్ల వృద్ధుడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక్క సంవత్సరం పాలించి క్రీ.శ.1571లో పరిపాలన కుమారులకు అప్పగించి విశ్రాంతి పొందాడు. తర్వాత క్రీ.శ.1572లో తన 92వ ఏట మరణించాడు.

మొదటి శ్రీరంగరాయలు క్రీ.శ.1572-1585: తిరుమలరాయల తర్వాత అతని పెద్దకుమారుడు శ్రీ రంగారాయలు రాజ్యభారం చేపట్టాడు. గంగాధర రామేశ్వరుని దేవాలయ స్థంభాలపైన చెక్కిన శాసనంలో శక 1494 అంగీరస నామ సంవత్సరం వైశాఖ మాస శుద్ధ ద్వాదశి అంటే 1572 ఏప్రిల్ 24వ తేదీన తిరుమల రాయలు పృధ్వీపాలన చేస్తున్నట్లు, అదే సంవత్సరంలో అతని పాలన ముగిసినట్లు ఉంది. కొండవీడు కైఫీయత్తు కూడా ఆ విషయాన్ని ధృవపరుస్తోంది. కనుక తిరుమలరాయలు క్రీ.శ.1572లో పరిపాలన నుండి తప్పుకొని తన పెద్ద కుమారుడు శ్రీ రంగరాయలకు పట్టాభిషేకం చేసినట్లుగా కనిపిస్తుంది. అయినప్పటికీ తిరుమలరాయలు క్రీ.శ.1578 వరకు జీవించి ఉన్నాడు. వీరప్పయ్య కాలజ్ఞానం ఆంగీరస నామ సంవత్సరం వైశాఖ శుద్ధ ద్వాదశి అంటే క్రీ.శ.1572 మే నెల 11వ తేదీన పట్టాభిషేకం జరిగినట్లు తెలుపుతోంది. చంద్రగిరి నేలిన వెంకటపతి తన అన్న శ్రీరంగరాయల సార్వభౌమాధికారాన్ని గుర్తించినట్లు క్రీ.శ.1572 జులై 9వ తేదీ శాసనం తెలుపుతోంది. పై సమాచారాన్ని బట్టి వీరప్పయ్య కాలజ్ఞానం సరైన తేదీని ఇచ్చిందని స్పష్టపడుతుంది. శ్రీరంగరాయలను శాసనాలు రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీరంగరాయ దేవమహారాజులని పేర్కొన్నాయి. అతనికి తిరుమలదేవి, కృష్ణాంబ అనే ఇద్దరు భార్యలు ఉండేవారు. పెమ్మసాని పెదతిమ్మరాజు, తిమ్మయ, వెలుగోటి తిమ్మానాయుడు అతని మంత్రులు. మంత్రి తిమ్మయకు రాయలు గజతురగ పల్లకీలనిచ్చి గౌరవించాడు. వెంకటప్పనాయకుడు,

ఓబళరాజులు అతని సర్వసేనాధిపతులు రాయసం వెంకటపతి అనే ఉద్యోగి రాచకార్యాలను చేసేవాడు. అతడు శ్రీరంగరాయ అభిమానాన్ని సంపాదించాడు. అందువలన అతనికి ఒక గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చి అనేక ఇతర బహుమతులు ఇచ్చాడు.

సామంతుల తిరుగుబాటు: శ్రీరంగరాయల పాలనలో మొదటి నాలుగు సంవత్సరాలలో పశ్చిమకోస్తాలోని చిన్నచిన్న పాలెగాండ్రు తిరుగుబాటు చేశారు. వారిని అణచివేశాడు. తర్వాత దక్షిణ ప్రాంతంలో మాలెనాడులోని మార్వారులు, నీలగిరి కోయంబత్తూరు ప్రాంతాలైన కొంగునాడులు కూడా తిరుగుబాటు చేయగా, అణచివేశాడు. కేసరా పాలకుడు శంకరనాయక్ స్వతంత్రుడై బీజాపూరు సుల్తాన్ సహాయం కోరాడు సుల్తాన్ అతనికి సహాయం చేశాడు గాని సుల్తాన్‌కు సామంతుడు కావలసి వచ్చింది. అందువలన షిమోగా, కైకరా జిల్లాలు బీజాపూరు ఆధీనంలో వెళ్లిపోయాయి.

బంకాపూర్, ధార్వార్ పోగొట్టుకోవడం: శ్రీరంగారాయులు రాజ్యానికి రాగానే బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా ధార్వార్, బంకాపూరులపై దండెత్తాడు. ఆ కాలంలో బంకాపురాన్ని వీరప్పనాయకుడు పాలిస్తున్నాడు. అతనిని ఓడించి సుల్తాన్ బంకాపురాన్ని ఆక్రమించాడు తర్వాత అక్కడ బంకాపురాన్ని క్రీ శ 789 నుండి విరామం లేకుండా హిందూ రాజులు పాలిస్తున్నారని దానిని ఆక్రమించిన తర్వాత అక్కడున్న ఒక అందమైన దేవాలయాన్ని ధ్వంసం చేసి ఆ స్థానంలో సుల్తాన్ మసీదు నిర్మించాడని ఆ మసీదు నిర్మాణానికి స్వయంగా సుల్తాన్ తన చేతితో మొదటి రాయిని వేశాడని పెరిష్టా రాశాడు. బంకాపురం ఆక్రమణ తర్వాత కొంకణ తీరాన్ని కూడా జయించాడు.

బీజాపూరు సుల్తాన్ రెండవ దండయాత్ర క్రీ.శ.1576: తిరిగి బీజాపూరు సుల్తాన్ క్రీ శ.1576లో పెనుగొండపై దండెత్తాడు. సుల్తాన్ ఆదవాని కోటలో సైన్య సమీకరణ చేసి పెనుగొండకు బయలుదేరాడు. మార్గంలో అనంతపురంలోని హండె తిమ్మా నాయకుడు అతనితో చేరాడు ఉభయ సైన్యాలు పెనుగొండ చేరి కోటను ముట్టడించాయి. ఒక సైన్యాన్ని బెల్లంకొండను జయించడానికి పంపాడు. బీజాపూరు సైన్యం వస్తోందని తెలిసి శ్రీ రంగరాయలు ధనరాశులను చంద్రగిరికి మార్చి పెనుగొండ రక్షణను సవరం చెన్నప్పకు అప్పజెప్పాడు. తాను చంద్రగిరిలో ఉండి అనేక కానుకలతో తన రాయబారిని గోల్కొండ పంపి తనకు సహాయం చేయవలసిందిగా అర్థించాడు. కుతుబ్‌షా ఫజల్‌ఖాన్ అనే రాయబారిని చంద్రగిరికి పంపి తాను సహాయం చేస్తానని వాగ్దానం చేశాడు. మాట ప్రకారం కుతుబ్‌షా మహమ్మద్ అంజు అనే సేనానిని బీజాపూరు రాజ్యంపై దండు పంపాడు. కుతుబ్‌షా మరకొంత సేనతో స్వయంగా పెనుగొండ బయలుదేరాడు. ఈ లోపల పెనుగొండ వద్ద చెన్నప్ప బీజాపూరు సేనతో వచ్చిన హండే తిమ్మానాయకుని ఆపివేసి బీజాపూరు సేనలను ఓడించాడు. మూడు నెలలు ముట్టడించిన పెనుగొండ వశం కాలేదు. అదే సందర్భంలో గోల్కొండసేన వస్తుందని తెలిసింది మరొక గోల్కొండ సేన తన రాజ్యంపై దండెత్తిందని కూడా తెలసింది. బీజాపూరుపై దండెత్తి కొన్ని ప్రాంతాలను ఆక్రమించి పెనుగొండకు బయలుదేరింది ఈ విషయాలన్నీ తెలిసిన బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా భయపడ్డాడు. అదే సందర్భంలో సవరం చెన్నప్పనాయకుడు కోట బయటకు వచ్చి క్రీ.శ.1576 డిసెంబర్ 21వ తేదీన బీజాపూరు సేనలతో ప్రత్యక్షంగా తలపడి ఓడించాడు. దాంతో బీజాపూరు సుల్తాన్ పెనుగొండ మార్గముట్టడిని మానుకొని బీజాపూరు వెళ్లిపోయాడు. ఇదే సందర్భంలో బెల్లంకొండను ముట్టడించడానికి వెళ్లిన బీజాపూరు సేన కూడా ఓడిపోయి వెనుదిరిగింది. మొత్తం మీద గోల్కొండ సుల్తాన్ సహాయంతో శ్రీ రంగరాయలు బీజాపూరు దండయాత్ర నుండి తన రాజ్యాన్ని రక్షించుకున్నాడు. పెనుగొండ వచ్చిన ఇబ్రహీం కుతుబ్‌షాకు పెనుగొండ రాజమహల్‌లో విడిది ఏర్పాటు చేయించి గౌరవించి మైత్రిసంధి చేసుకొన్నాడు. తర్వాత కుతుబ్‌షా గోల్కొండ వెళ్లిపోయాడు.

మూడవ దండయాత్ర క్రీ.శ.1577: కాని బీజాపూరు సుల్తాన్ క్రీ శ.1577లో మళ్లీ పెనుగొండపై దండెత్తాడు. శ్రీ రంగరాయలు సుల్తాన్‌ను ఎదుర్కొని పోరాడి ఓడిపోయి బందీగా చిక్కాడు. ఆ సమయంలో విజయనగర సామంతులు స్వతంత్రులు కావడానికి ప్రయత్నించారు. బుక్కపట్న పాలెగాడు మలికప్పనాయకుడు సుల్తాన్‌తో చేరిపోయాడు. సుల్తాన్ అతనిని తన సామంతునిగా గుర్తించి అనంతసాగరం మొదలైన ప్రాంతాలను అతనికి ఇచ్చి షాదుషా వజీర్ అనే బిరుదును ఇచ్చాడు. బందీగా చిక్కిన శ్రీ రంగరాయలు సంధి చేసుకొని విడుదల పొంది పెనుగొండ చేరాడు.

నాల్గవ దండయాత్ర క్రీ.శ.1578: తిరిగి మళ్లీ బీజాపూరు సుల్తాన్ నాల్గవసారి పెనుగొండను జయించడానికి షుజాదత్‌ఖాన్, చోటాఖాన్ మూర్తజాఖాన్ అనే సేనాధిపతులను పంపాడు. వారు పెనుగొండ

దుర్గాన్ని ముట్టడించారు. ఈసారి విజయనగర సేనాని శ్రీ రంగరాయల అల్లుడైన జగదేకరాయుడు వారితో పోరాడాడు. ఆ యుద్ధంలో షుజాదత్‌ఖాన్ మరణించాడు చోటాఖాన్ బందీగా చిక్కాడు. మిగిలిన సేన ముట్టడిని విరమించి వెళ్లిపోయింది. విజయం సాధించిన జగదేకరాయుని శ్రీ రంగరాయలు బారామహల్ నుండి పశ్చిమ కనుమల వరకు ఉన్న ప్రాంతానికి అధిపతిగా నియమించాడు ఈ విధంగా బీజాపూరు సుల్తాన్ నాలుగు పర్యాయాలు విజయనగర రాజ్యంపై దండెత్తి పెనుగొండను ఆక్రమించాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

గోల్కొండ దండయాత్రలు క్రీ.శ.1578-80: గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా పెనుగొండలో క్రీ శ.1576లో చేసుకున్న సంధికి మూడు సంవత్సరాలు కట్టుబడి ఉన్నాడు. కాని ఆ తర్వాత అతడు ఆ సంధిని విచ్ఛిన్నం చేసి విజయనగర రాజ్యంపై దండయాత్రలు చేశాడు.

అహోబిలంపై దాడి క్రీ.శ.1578: కుతుబ్‌షా తన సేనాధిపతి మురహరిరావు అనే మరాఠీ బ్రాహ్మణ సేనానిని పంపాడు అతడు కందనవోలు రాజ్యంపై దండెత్తి జయించి అక్కడ పాలించిన హండేనాయకులు మలకప్ప కంచిరాయలను తనతో కలుపుకున్నాడు. వారందరూ కలిసి తర్వాత అహోబిలంపై దాడి చేసి అహోబిల నరసింహస్వామి దేవాలయాన్ని దోచుకున్నారు దేవాలయానికి నష్టం కలిగించారు. ప్రజలను హింసించారు ఆ ప్రాంతాలపై సుల్తాన్ హండేనాయకులను తన ప్రతినిధులుగా నియమించాడు. సుల్తాన్ సేనలు వెళ్లిపోయిన తర్వాత అహోబిలం శ్రీనివాసమరం అధిపతి శరగోప జియ్యరుస్వామి పెనుగొండ చేరి శ్రీ రంగరాయలను దర్శించి అహోబిళానికి జరిగిన నష్టాన్ని తెలిపి దేవాలయాన్ని కాపాడమని అర్థించాడు అందుకు రాయలు స్వయంగా రానక్కరలేదని రాయలు అనతి ఇస్తే తెలుగుచోళ ప్రభువు కొండ్రాజు వెంకటరాజు సుల్తాన్ సేనలను ఓడించి తరమగలడని చెప్పాడు. రాయలు కొండ్రాజు వెంకటరాజుకు అహోబిళాన్ని సాధించవలసిందని ఆదేశించాడు అప్పుడు కొండ్రాజు తన సేనలను ఆయత్తపరచి హండే నాయకులపై దండెత్తి ఓడించి వారిని తరిమి అహోబిల ప్రాంతాన్ని తిరిగి రాయల ఆధిపత్యం కిందికి తెచ్చాడు. తర్వాత కొండ్రాజు వెంకటరాజు అహోబిల దేవాలయానికి మరమ్మత్తులు చేయించి పూజా పునస్కారాలు ఏర్పాటు చేశాడు.

కుతుబ్‌షా రెండవ దండయాత్ర క్రీ.శ.1579-ఉదయగిరి రాజ్యం ఆక్రమణ: అహోబిలంలో కొండ్రాజు వెంకటరాజు తన సైన్యాలను ఓడించి తరమడంతో ఇబ్రహీం కుతుబ్‌షాకు ఆగ్రహం కలిగింది. అతడు విజయనగర రాజ్య భాగాలను జయించాలని తీర్మానించాడు. అందుకు హైదర్ ఉల్ ముల్క్ అనే సేనాధిపతి నాయకత్వంలో కొండవీటి రాజ్యంపైకి దండయాత్రకు పంపాడు. గోల్కొండ సైన్యం కృష్ణానదిని దాటి బెల్లంకొండ కేతవరం, తంగెడ, గురజాల, మాచెర్ల, నాగార్జుకొండ, కారంపూడి, వినుకొండ కోటలను జయించింది. గోల్కొండ సేనను అడ్డుకోడానికి విజయనగరం సేన కస్తూరి రంగప్ప, మాదన్న చిన్నయ్యల నాయకత్వంలో కొచ్చర్లకోట వద్దకు వచ్చి విడిది చేసి ఉన్నారని తెలసింది గోల్కొండసేన వారిపైకి నడచింది. కాని వారు యుద్ధం చేయకుండా కొచ్చర్లకోటను వదలివేసి వెళ్లిపోయారు. గోల్కొండసేన కొచ్చర్లకోటను స్వాధీనం చేసుకొని ముందుకు సాగి వరుసగా కోటలను జయించుకొంటూ ఉదయగిరివైపు నడచింది మార్గంలో అద్దంకి, అమ్మనబ్రోలు, పొదిలి, దర్శి కంభం, కాకర్ల, ధూపాడు కోటలను ఆక్రమించింది. వారి దండయాత్రను అరికట్టాలని గండి తిమ్మన, ముద్దన, చిన్నప్ప, కస్తూరి రంగప్ప 30 వేల సైన్యంతో ఎదిరించారు. కాని ఓడిపోయారు. తర్వాత గోల్కొండసేన కందుకూరు చేరింది. అక్కడి దుర్గాధ్యక్షుడు కావరి తిమ్మరాజు వారిని ఎదిరించి ఓడిపోయి బందీగా చిక్కాడు అప్పుడు కందుకూరు కోటను స్వాధీనం చేసుకొని గోల్కొండసేన ఉదయగిరి చేరింది. ఈ లోపల గోల్కొండ సుల్తాన్ అమీర్ షామీర్ అనే వ్యక్తి నాయకత్వంలో మరికొంత సేనను ఉదయగిరి పంపాడు. షామీర్, హైదర్‌లు సునాయాసంగా ఉదయగిరిని జయించారు. దాంతో బలిష్టమైన ఉదయగిరి రాజ్యం గోల్కొండ రాజ్యంలో చేరిపోయింది

కొండవీడు ఆక్రమణ క్రీ.శ. 1580: ఆ తర్వాత గోల్కొండ సేనలు వెనుదిరిగి వచ్చి కొండవీటి కోటను ముట్టడించాయి. కొండవీటి కోటను అళియరామరాయల అల్లుడు గొబ్బూరి తిమ్మరాజు, వెలుగోటి తిమ్మానాయకుడు పాలిస్తున్నారు. వారు గోల్కొండ సేనను ఎదిరించి వీరోచితంగా పోరాడారు. దాంతో గోల్కొండ సేనాధిపతి హైదర్ ఉల్ ముల్క్ మరికొంత సేనను ఎదిరించి వీరోచితంగా పోరాడారు. దాంతో గోల్కొండ సేనాధిపతి హైదర్ ఉల్ ముల్క్ మరికొంత సేనను పంపమని గోల్కొండకు కబురు చేశాడు. సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా, సయ్యద్‌షాటకి, మురారిరావు సేనాధిపతులను పెద్ద సేనతో పంపి హైదర్ ఉల్ ముల్క్‌ను గోల్కొండ

రప్పించాడు. నూతన సేనాధిపతులు కూడా గొప్పగా పోరాడారు. కాని కొండవీడు లొంగలేదు. చివరకు మురారిరావు, సయ్యద్ షాటకీలు వెలుగోటి తిమ్మానాయకునికి లంచం ఇచ్చారు. అతడు ద్రోహం చేసి కోటను వారికి స్వాధీనం చేశాడు. దాంతో కొండవీడు క్రీ.శ.1580 ఏప్రిల్ 29న గోల్కొండ నవాబు స్వాధీనం అయింది. క్రీ.శ.1592 ఏప్రిల్ 4వ తేదీన కొండవీటిలోని గోల్కొండ ప్రతినిధి అయిన అమీన్ ఉల్ ముల్క్ అమీనాబాద్‌లో శాసనం వేయించాడు ఆ శాసనం క్రీ.శ.1580లోనే కొండవీటిని జయించినట్లు తెలుపుతుంది ఈ విజయాలతో ఉదయగిరి, కొండవీడు రెండు రాజ్యాలు గోల్కొండ రాజ్యంలో భాగాలయ్యాయి. కృష్ణదేవరాయలు గజపతుల నుండి జయించిన ఈ రెండు రాజ్యాలను విజయనగర రాజ్యం కోల్పోయింది. అహోబిల ప్రాంతం, చంద్రగిరి రాజ్యం, గండికోట, నంద్యాల రాజ్యాలు తప్ప దాదాపు తెలుగు ప్రాంతాలన్నీ విజయనగర రాజ్యం కోల్పోయింది. ఆదోని మొదలైన ప్రాంతాలు, బీజాపూరు రాజ్యంలో మిగిలిన ప్రాంతాలు గోల్కొండ రాజ్యంలో భాగాలయ్యాయి.

సామంతుల తిరుగుబాటు-కోడూరు యుద్ధం క్రీ.శ.1579: సామ్రాజ్యంపై బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌లు దండయాత్రలు సాగిస్తుండగా శ్రీ రంగరాయలకు సహాయం చేయవలసిన సామంతులు స్వార్థపరులై స్వతంత్ర రాజ్యాలు ఏర్పాటు చేసుకోడానికి ప్రయత్నాలు చేశారు. అంతేగాక తమ రాజ్యాలను విస్తరించుకోవాలని ఒకరి ప్రాంతాలపై ఒకరు దండయాత్రలు చేసుకున్నారు దాని ఫలితంగా క్రీ.శ.1579 సెప్టెంబర్ 27న కోడూరు యుద్ధం జరిగింది. హండే నాయకులు అనంతపురం ప్రాంతాన్ని పాలించేవారు. వారు బీజాపూరు సుల్తాన్‌తో చేరిపోయారు వారితో సారె కుటుంబం వారు చేరిపోయారు. కనుక అహోబిళాన్ని రక్షించిన కొండ్రాజు వెంకటరాజు హండే, సారె వారి రాజ్యాలపై దండెత్తాడు. సారె కుటుంబానికి చెందిన ఓబనరాజు ఏరువ రాజ్యాన్ని ఏలుతున్న వెలుగోటి రంగప్ప సహాయం అర్థించాడు. అతడు తన బావమరిది దామెర్ల వెంకటపతిని సహాయంగా తీసుకొని సారె ఓబనరాజుకు సహాయంగా బయలుదేరాడు మధ్యలో ఉన్న మట్ల తిమ్మా నాయకుని రాజ్యం గుండా తమ సేనలను నడిపారు. తన రాజ్యం గుండా వెలుగోటి వారి సైన్యం నడచినందుకు కోపించి మట్ల తిమ్మానాయకుడు కొండ్రాజు వెంకట్రాజుతో చేరిపోయాడు. వారందరూ కడప జిల్లాలోని కోడూరు దగ్గరకు చేరారు. అక్కడ కొండ్రాజు వెంకటరాజు, వెలుగోటి తిమ్మానాయకుడు ఒకవైపు, హండే నాయకులు, సారె ఓబన రాజు, వెలుగోటి రంగప్ప, అతని బావ మరిది దామెర్ల వెంకటపతి మరొకవైపు చేరి క్రీ.శ.1579 సెప్టెంబర్ 27వ తేదీన ఘోర యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో మట్ల తిమ్మానాయకుడు మొదలైన కొందరు సామంతులు మరణించారు. చివరకు సారె ఓబన, వెలుగోటి రంగప్పలకు విజయం లభించింది ఈ యుద్ధం విజయనగర రాజ్యాన్ని బాగా బలహీనపరచింది. ఇదే సమయంలో గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా సైన్యాలు ఉదయగిరి రాజ్యంపై దండయాత్ర చేస్తున్నాయి. ఆ సైన్యాలను ఎదిరించడానికి శ్రీ రంగరాయలకు కోడూరి యుద్ధం వలన బలమైన సైన్యం లేకుండాపోయింది. కనుక అతడు ఉదయగిరి రాజ్యాన్ని పోగొట్టుకోవలసి వచ్చింది. ఇదే సమయంలో శ్రీ రంగపట్టణ ప్రాంతంలో ఒడయార్ అనే అతడు తిరుగుబాటు చేశాడు. శ్రీ రంగరాయల తమ్ముడు రామరాజు అసమర్థత వల్ల ఆ తిరుగుబాటును అణచలేకపోయాడు. అదే శ్రీ రంగపట్టణ ఒడయారు రాజ్యానికి నాందిప్రస్తావన చేసింది. ఆ ఒడయారే నేటి మైసూరు ఒడయార్ వంశానికి మూలపురుషుడు. శ్రీరంగరాయలు సమర్థుడైనప్పటికీ సామంతుల తిరుగుబాట్ల వల్ల విజయనగర రాజ్య విచ్ఛిన్నాన్ని ఆపలేకపోయాడు. తన తమ్ములు రామరాజు, వెంకటపతులు కూడా అతనికి తగిన సైనిక సహాయం చేయలేదు. భాషా ప్రాతిపదికపై తన తండ్రి తిరుమల రాయలు చేసిన విభాగాలు ద్రావిడ, కర్ణాటక తెలుగు ప్రాంతాలుగా విడివిడిగా ఏర్పడి ఐక్యతగా నడవలేక పోయారు. బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌ల దాడులన్నీ తెలుగు ప్రాంతాలపైనే సాగాయి. తెలుగు ప్రాంతాలకు తన తండ్రి కాలంలో శ్రీరంగరాయలే రాజప్రతినిధి. తాను సింహాసనం అధిష్ఠించిన తర్వాత తాను రాజప్రతినిధిగా పాలించిన తెలుగు ప్రాంతాలనే పోగొట్టుకున్నాడు. కోడూరు యుద్ధంలో సామంతులు ప్రదర్శించిన శౌర్యాన్ని, శక్తిని గోల్కొండ సుల్తాన్‌పై ప్రదర్శించినట్లయితే ఉదయగిరి, కొండవీడు రాజ్యాలు పోయి ఉండేవి కావు. కనుక సామంతుల అవివేకపు చర్యలు, తన తమ్ముల సాయం లేకపోవడం వల్ల శ్రీరంగరాయలు ఏమీ సాధించలేక పోయాడు. అందువల్ల సామ్రాజ్య క్షీణత అతని కాలం నుంచే ప్రారంభమైంది. అతని తండ్రి తిరుమలరాయల కాలంలో కోస్తాలో కృష్ణానది వరకు రాజ్యం చెక్కుచెదరకుండా ఉంది. శ్రీరంగరాయలు రాజకీయ విజయాలు సాధించలేక పోయినా తన పూర్వీకుల బాటలో నడిచి అనేక దేవాలయాలకు దానాలు చేశాడు. కవి పండితులను పోషించాడు. పెనుగొండ పట్టణంలో ఒక కేశవ ఆలయాన్ని నిర్మించాడు. మొగుళ్లూరులో ఒక చెన్నకేశవ

ఆలయాన్ని నిర్మించాడు. అతడు విష్ణుభక్తుడు. రాయసం వెంకటపతి అతని ఆస్థాన కవి. అతడు లక్ష్మీ విలాసం అనే కావ్యాన్ని రచించాడు అతని మంత్రి రాయసం అహోబలపతి కువలయ విలాసం అనే సంస్కృత నాటకాన్ని రచించాడు. భట్టకలంక అనే కవి సారత్రయ అనే గ్రంధాన్ని రాశాడు. భట్టకలంకను రాయసం అహోబలపతి ప్రోత్సహించాడు. శ్రీ రంగరాయలు సుమారు 14 సంవత్సరాలు పాలించి క్రీ.శ.1585లో మరణించాడు

రామరాజు క్రీ.శ.1585: శ్రీరంగరాయల మరణానంతరం అతని చిన్న తమ్ముడు, చంద్రగిరి పాలకుడైన వెంకటపతి రాజ్యానికి వచ్చాడని అంటారు. కారణమేమిటంటే రామరాజు కన్నడ ప్రాంతానికి రాజప్రతినిధిగా ఉన్నప్పుడు అక్కడ జరిగిన తిరుగుబాట్లను అణుస్తూ పోరాటాలలో మరణించాడని వాదన ఉంది. కాని వెంకటపతి రాయల కుంభకోణ శాసనం శ్రీ రంగరాయల తర్వాత అతని పెద్ద తమ్ముడు అంటే శ్రీ రంగపట్టణ రాజప్రతినిధి అయిన రామరాజు రాజ్యానికి వచ్చాడని తెలుపుతోంది. అతనికి వీరప్రతాప రామరాజయ్య, శ్రీ దేవరాయలు తిరుమల దేవరాయలు అనే పేర్లున్నాయి. ఇతడు క్రీ.శ.1585వ సంవత్సరంలో కొన్ని నెలలు మాత్రమే పాలించాడు. తర్వాత అతని తమ్ముడు వెంకటపతిరాయలు క్రీ.శ.1586 జనవరిలో సింహాసనానికి వచ్చాడు రామరాజుకు తిరుమలరాజు, రంగరాజు అనే ఇద్దరు కుమారులున్నారు. వారిని కాదని ప్రజలు, అమరనాయకులు వెంకటపతిరాయలను రాజుగా ప్రకటించారని నాటి విదేశీ రచనలు చెబుతున్నాయి. అతడే రాజ్యాన్ని రక్షించగల సమర్థుడని వారు భావించారని కూడా సాహిత్యం తెలిపింది. దానిని బట్టి ఆరవీటి వంశస్థాపకుడైన తిరుమల రాయల తర్వాత అతని కుమారులు ముగ్గురూ ఒకరి తర్వాత ఒకరు సింహాసనమధిష్టించి రాజ్యాన్ని పాలించారని తెలుస్తోంది.

రెండవ వెంకటపతిరాయలు క్రీ.శ.1586-1614: రామరాజు మరణానంతరం అతని అంత్యక్రియలకు విజయనగరం వచ్చిన సామంతులు, అమరనాయకులు అతని కుమారులను చూసి వారు చిన్నవారని, రాజ్యాన్ని రక్షించలేరని భావించారు. కనుక రాజ కుమారుల మరణానంతరం రాజ్యంలోని అన్ని వర్గాల వారు చనిపోయిన రాయల తమ్ముని అంటే అప్పుడు పాలించే రాజును ఏకగ్రీవంగా రాజుగా ఎన్నుకున్నారని, ఒక సమకాలీన జేసూట్ల రచయిత రాశాడు. అంతేగాక రామరాజు కుమారులు బాలురని, వారి హక్కులను తోసిపుచ్చారని కూడా అతడు వివరించాడు. వెంకటపతిరాయలను రాజుగా ఎన్నుకోవడంలో చెన్నపట్టణ ప్రతినిధి జగ్గదేవరాయలు ప్రముఖపాత్ర నిర్వహించాడు. అతడు మిగిలిన సామంతులను కూడగట్టి వారిని అంగీకరింపచేశాడట. సామ్రాజ్యంలో చెలరేగుతున్న అరాచకశక్తులను అణచి బహమనీ సుల్తాన్‌ల దండయాత్రల నుండి సామ్రాజ్యాన్ని కాపాడగల దక్షత వెంకటపతిరాయలకొక్కడికే ఉందని అమర నాయకులంతా భావించి అతనికి పట్టం కట్టారని కూడా పోర్చుగీసు వారు రాశారు. పార్థివనామ సంవత్సరంలో రెండవ వెంకటపతిరాయల పట్టాభిషేకం జరిగిందని విజయనగర సామ్రాజ్యం అనే గ్రంధం చెబుతుంది. వీరప్పయ్య కాలజ్ఞానం పార్థివ సంవత్సరం మాఘమాసం శుద్ధ ఏకాదశి అంటే క్రీ.శ.1586 జనవరి 21వ తేదీన రెండవ వెంకటపతిరాయలు సింహాసనం అధిష్టించాడని తెలుపుతుంది శాసనాలు కూడా వీరప్పయ్య కాలజ్ఞానం ఇచ్చిన సమాచారాన్ని బలపరుస్తున్నాయి. వెంకటపతిరాయల గురువు తాతాచార్యులు. అతడు చంద్రగిరిలో వెంకటపతిరాయల పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించాడు ఆ సమయంలో అతడు అనేక దానాలు చేశాడు. తర్వాత అతడు పెనుగొండకు వచ్చి అధికారాన్ని చేపట్టాడు వెంకటపతిరాయలకు రెండవ వెంకటపతిరాయలని, చినవెంకటపతిరాయల పేర్లున్నాయి. సింహాసనం అధిష్టించిన తర్వాత అతడు తన అన్న రామరాజు కుమారులైన తిరుమలుడు శ్రీరంగరాయలను అన్న పాలించిన కర్ణాటక రాజ్యానికి పాలకులుగా నియమించాడు. దాంతో రాజకుటుంబంలో ఎలాంటి వివాదాలు లేకుండాపోయాయి ఆరవీటి వంశంలో రెండవ వెంకటపతిరాయలు అగ్రగణ్యుడు. అతడు గొప్ప ప్రతాపశాలి, సమర్థుడు శ్రీరంగరాయల కాలంలో పోగొట్టుకున్న చాలా ప్రాంతాలను పునరాక్రమించి సామ్రాజ్య ఐక్యతను నిలబెట్టి అమరనాయకుల అంచనాను వాస్తవం చేశాడు. తళ్లికోట యుద్ధానంతరం దిగజారిపోయిన విజయనగర సామ్రాజ్య వైభవాన్ని అనేక విజయాల ద్వారా సాధించాడు. తాతాచార్యులు, మట్ల అనంతుడు, తరిగొప్పల దత్తమంత్రి, తిమ్మయ వెంకటపతిరాయల మంత్రులు. గొబ్బూరి ఓబరాజు అతని సర్వసైన్యాధిపతి. ఇతనికి ఓబలరాజు అని కూడా పేరుంది. ఇతడు వెంకటపతి బావ. పిల్లను ఇచ్చిన మామ కూడా. అందువల్ల అతవికి సామ్రాజ్యంలో గొప్ప పేరు ప్రతిష్టలుండేవి. అతడే సమస్త రాచకార్యాలను నిర్వహించేవాడు. సామ్రాజ్యం రాష్ట్రాలుగా విభజింపబడి ఉండేది. ఒక్కొక్క రాష్ట్రంలో మూడు నాలుగు రాజ్యాలు కూడా కలిసి ఉండేవి. ఉదాహరణ తమిళ వైస్రాయల్టీలో

పాండ్య, చోళ రాజ్యాలుండేవి. కన్నడ వైస్రాయల్టీలో శ్రీరంగపట్టణం, మైసూరు, కూర్గు, తుళువ రాజ్యాలుండేవి. వెంకటపతిరాయల కాలం నాటికి అంటే క్రీ శ.1601-02 నాటి ఒక తామ్రశాసనాన్ని Hultzsch ప్రకటించాడు.

తమిళ రాజప్రతినిధిగా వెంకటపతిరాయలు: తన తండ్రి కాలంలో అతడు చంద్రగిరిలో ఉండి ద్రావిడ దేశానికి రాజప్రతినిధిగా పని చేశాడు. ఆ కాలంలో అతడు అనేక విజయాలు సాధించాడు. సింహళంపై దండెత్తి సింహళరాజును ఓడించి కప్పం వసూలు చేశాడు. మధుర నాయకరాజును పాండ్యదేశపు రాజు అని పిలిచేవారు. అప్పుడు రాజ్యం చేసిన వీరప్ప నాయకుడు కప్పం చెల్లించకుండా తిరుగుబాటు చేశాడు. వెంకటపతి అతనితో యుద్ధం చేసి లొంగదీశాడు. వెంకపతి చక్రవర్తిగా పట్టాభిషేకం చేసుకున్న తర్వాత మధుర, తంజావూరు నాయకరాజులు వెంకటపతిని చక్రవర్తిగా గుర్తించారు. అన్న రామరాజు శ్రీరంగపట్టణంలో కన్నడ ప్రాంతాలకు రాజప్రతినిధిగా ఉండేవాడు. అతని మరణానంతరం ఆ ప్రాంతాలకు అన్న కుమారులు తిరుమలుదు, రంగరాయలు అధిపతులయ్యారు. వారు కూడా వెంకటపతిరాయల సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు. వాస్తవానికి వీరిద్దరికే సామ్రాజ్య వారసత్వం రావాలి. కాని అమరనాయకులు వారు చిన్నవారని సామ్రాజ్యాన్ని కాపాడలేరని వెంకటపతిరాయలను రాజుగా ఎన్నుకున్నారు. రెండవ వెంకటపతిరాయలు రాజ్యానికి రాకముందు క్రీ శ 1580లో బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా హత్య చేయబడ్డాడు. ఫెరిష్టా హిజ్రా 987 సఫర్ 23 గురువారం అని రాశాడు. కాని అది 988 సఫర్ 24 సోమవారం అంటే క్రీ శ. 1580 ఏప్రిల్ 11వ తేదీ అని సమకాలికుదు రఫీ ఉద్దీన్ షిరాజి రాశాడు. అతని తర్వాత అవితని కుమారుడు రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా సుల్తాన్ అయ్యాడు. 1580 లోనే గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా మరణించాడు. అతని కుమారుడు సుల్తాన్ కులీ కుతుబ్‌షా గోల్కొండ సుల్తానయ్యాడు. కనుక ఇబ్రహీం కులీలు వెంకటపతి సమకాలికులు వెంకటపతిరాయలు మధుర, జింజి, చోళ సామంతులతోను, గోల్కొండ, బీజాపూర్ సుల్తాన్‌లతోను పోరాడి సామ్రాజ్య వైభవాన్ని చాలా వరకు పునరుద్ధరించాడు.

ఉదయగిరి పునరాక్రమణ క్రీ.శ.1586-89: శ్రీరంగరాయల కాలంలో క్రీ.శ 1580లో గోల్కొండ సుల్తాన్ కొండవీడు, ఉదయగిరి రాజ్యాలను ఆక్రమించాడు. వెంకటపతిరాయలు రాజ్యానికి రాగానే గోల్కొండ సుల్తాన్ ఆక్రమించిన ప్రాంతాలను తిరిగి జయించాలని ఉదయగిరిపై వెంకటపతిరాయల సామంతుడు కొలానందుదు మధ్య జయించి ఉండాలి. తన అన్న పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి జయించే ప్రయత్నంలో ఉదయగిరి పునరాక్రమణ తొలి చర్య అయి ఉండవచ్చును. తళ్లికోట యుద్ధం తర్వాత సుల్తాన్‌లు విజయనగర రాజ్యంపై దండెత్తడం, ఆ దండయాత్రలను ఎదుర్కొనే రక్షణస్థితిలోనే విజయనగర రాజులు ఉండిపోయారు. కాని సుల్తాన్‌ల రాజ్యాలపై దండెత్తలేదు. కాని తళ్లికోట యుద్ధం తర్వాత సుల్తాన్ రాజ్యాలపై వెంకటపతిరాయలు దండెత్తి defensiv స్థితిలో ఉన్న రాజ్యాన్ని Offensive స్థితిలోకి మార్చాడు. అది వెంకటపతిరాయల ఘనతకు, శక్తి సామర్థ్యాలకు నిదర్శనం.

కొండవీటిపై దండయాత్ర క్రీ.శ.1589: ఇదే కాలంలో గోల్కొండ రాజ్యంలో మహమ్మద్ కులీ కుతుబ్‌షా, అతని సేనాని ఆలీఖాన్ లూరు అనే అతడు తిరుగుబాటు చేసి గోల్కొండ రాజ్యంలో అల్లరులు సృష్టించి పెనుగొండ చేరి వెంకటపతి రాయలతో చేరిపోయాడు. అతడు తనకు సైన్యాన్ని ఇచ్చినట్లయితే కొండవీటి కోటను జయించి రాయలకిస్తానని చెప్పాడు. వెంకటపతి అతని మాటలు నమ్మి తన అల్లుడు మేకూరు తిమ్మానాయకుని, అతనితో కలిపి కొంత సేనను ఇచ్చి పంపాడు. వారు కొండవీటి రాజ్యంలో ప్రవేశించి కంభాన్ని ముట్టడించారు. కాని' ఆలీఖాన్‌లూర్ కంభం వద్ద ఓడిపోయి తిరిగి పెనుగొండ వచ్చాడు. రాయలు అతనిని ఆదరించకుండా తన రాజ్యం నుండి పంపివేశాడు. గోల్కొండ, ఉదయగిరి రాజ్యాలను ఇబ్రహీం కుతుబ్‌షా జయించినప్పటికీ ఆ ప్రాంతాలలో చాలా మంది సామంతులు గోల్కొండ సుల్తాన్‌లకు సరిగ్గా కప్పాలు చెల్లించడం లేదు. కారణమేమిటంటే తిరిగి తమ రాజ్యాలను విజయనగర రాజ్యం జయిస్తుందని భావించారు. కొండవీటి రాజ్య దండయాత్ర విఫలమైంది.

గోల్కొండ దండయాత్ర: వెంకటపతిరాయలు తనపై తిరుగుబాటు చేసిన తన సేనాధిపతి ఆలీఖాన్‌లూర్‌కు ఆశ్రయం ఇవ్వడమేగాక కొండవీటి రాజ్యంపై దండెత్తినందుకు గోల్కొండ సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్‌షాకు ఆగ్రహం కలిగింది. అందుకు ప్రతీకారం చేయాలని తన సేనాధిపతి అయిన అమీన్ ఉల్ ముల్క్‌కు పెద్ద సేనను ఇచ్చి విజయనగర రాజ్యంపైకి పంపాడు. అమీన్ ఉల్ ముల్క్ తన సైన్యంతో కర్నూలు జిల్లా నందకొట్కూర్ తాలూకా వద్ద కృష్ణానదిని దాటి ముసలిమడుగు కోటను ముట్టడించారు. కోట లొంగిపోయింది. తర్వాత గోల్కొండ

సేన నంద్యాల ప్రాంతంలో ప్రవేశించింది. అక్కడ రాజబంధువులైన నంద్యాల బలవంతరాజు, అతని మేనల్లుడు నరసింగరాజు కుతుబ్‌షా సేనను ఎదుర్కొన్నారు. కాని వారు ఓడిపోయారు. వారి ఆధీనంలోని నంద్యాల, కలగూర్ కోటలు సుల్తాన్ వశమయ్యాయి. అందువల్ల వారు సుల్తాన్‌కు లొంగిపోయి అతని సామంతులుగా కప్పాలు కడతామని అంగీకరించారు. తర్వాత గోల్కొండసేన జమ్మలమడుగు, జాదూరు, నందవరం, సిరవెళ్ల, చెన్నూరు, డోన్, కర్నూలు కోటలపై దాడులు చేసింది. ఆ కోటలను రక్షించే అమర నాయకులు ఓడిపోయి వారు కూడా సుల్తాన్‌కు కప్పాలు అంగీకరించారు. తర్వాత అమీన్ ఉల్ ముల్క్ కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాలో ఉన్న గండికోటపై దండెత్తాడు. రాయలబంధువు నందేల నరసింహరాజు గండికోటను పాలిస్తున్నాడు. అతడు గోల్కొండ సేనతో వీరోచితంగా పోరాడాడు. కాని ఓడిపోయాడు. కనుక అతడు కూడా సాలీనా కప్పం కడతానని అంగీకరించాడు. గండికోట వశమైందని తెలియగానే సుల్తాన్ మరికొంత సైన్యాన్ని తీసుకొని స్వయంగా గండికోట వచ్చాడు. అక్కడ నుండి సుల్తాన్ అమీన్ ఉల్ ముల్క్‌తో కలిసి ముందుకు సాగి గుత్తికోటను జయించి పెనుగొండకు చేరి కోటను ముట్టడించారు. అప్పుడు వెంకటపతిరాయలు యుద్ధానికి సిద్ధంగా లేడు. అంతేగాక అతడు అంత త్వరగా సుల్తాన్ తన రాజ్య ప్రాంతాలు జయించి పెనుగొండను ముట్టడిస్తాడని ఊహించలేదు. కనుక కొంత కాలయాపన చేయడానికి సుల్తాన్‌తో సంధి సంప్రదింపులు ప్రారంభించాడు. సుల్తాన్ యుద్ధాన్ని విరమించాడు సంధి సంప్రదింపులు జరపడానికి తన సేనానులైన గోవింద తిమ్మరాజు (ఇతనికి గోపరాజు అని కూడా పేరుంది) పాపయ్యశెట్టిలను పంపాడు. వారు సంధి సంప్రదింపులకు కొంత కాలం పడుతుంది. గనుక యుద్ధాన్ని విరమించాలని కోరారు. సుల్తాన్ వారి కోరిక సమంజసమేనని, కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న విజయనగరం తనను శాంతిభిక్ష వేడుతుందని భావించి యుద్ధ విరమణ చేశాడు. తర్వాత రాయబారానికి వచ్చిన సేనానులు సంప్రదిస్తున్నట్లు రాయల వద్దకు, సుల్తాన్ వద్దకు తిరగసాగారు. అందువల్ల కొన్ని రోజులు గడిచిపోయాయి ఆ కొద్ది రోజులలో వెంకటపతి యుద్ధసామాగ్రిని పెనుగొండ కోటలోకి చేరవేశాడు. దీర్ఘకాల ముట్టడికి కావలసిన ఏర్పాట్లన్నీ చేశాడు రాష్ట్రాలలోని అమరనాయకులను సైన్యాలతో రమ్మనమని కబురుచేశాడు. జగదేకరావు 30 వేల సైన్యంతో పెనుగొండకు వచ్చాడు. తంజావూరు యువరాజు రఘునాథ నాయకుడు కొంత సైన్యంతో వచ్చాడు మట్ల అనంతనాయకుడు మరికొంత సేనతో చేరాడు. ఈ విధంగా సిద్ధం చేసుకొని వెంకటపతి రాయల సంధి ముసుగు తీసి వేసి యుద్ధానికి కాలు దువ్వాడు. సుల్తాన్ మోసాన్ని గ్రహించి పెనుగొండ దుర్గాన్ని మళ్లీ ముట్టడించాడు. జగదేకరావు, రఘునాథ నాయకుడు కోట నుండి బయటకు వచ్చి సుల్తాన్ సైన్యాన్ని చీల్చి చెండాడారు. యుద్ధంలో సుల్తాన్ సేనాని సుజాత్‌ఖాన్ మరణించాడు. అనేక మంది సుల్తాన్ సేనానులు బందీగా చిక్కారు. అదే సమయంలో కృష్ణానదికి వరదలు వచ్చాయి. కనుక తిరిగి వెళ్లడానికి కూడా వీలు ఉండదని గత్యంతరం లేక ముట్టడిని విరమించి సుల్తాన్ గోల్కొండకు వెళ్లిపోయాడు. అప్పుడు వర్షాలు కురిసినందువల్ల కృష్ణానది వరదల వల్ల ముట్టడికి తగిన సమయం కాదని తలచి సుల్తాన్ పెనుగొండ ముట్టడిని విరమించి అమీన్ ఉల్ ముల్క్ తిరిగి వెళ్లిపోవలసి వచ్చిందని గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు రాశాడు. కాని అతడు సుల్తాన్ అపజయాన్ని కప్పిపుచ్చడానికి ప్రయత్నించాడు. పెనుగొండ నుండి సుల్తాన్ సైన్యం పారిపోయిన తర్వాత అమీన్ ఉల్ ముల్క్ జయించిన కోటలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకోవాలని విజయనగర సేన ముందుకు కదిలింది అది తెలిసి గండికోట మొదలైన వాటిని కాపాడుకోవాలని సుల్తాన్ గండికోటకు కొంత అదనపు సైన్యాన్ని పంపమని కొండవీటి దుర్గాధిపతిగా ఉన్న ఆఫల్‌ఖాన్‌ను ఆదేశించాడు. కొండవీటి నుండి కొంతసేన గండికోటకు బయలుదేరింది. ఆ విషయం తెలిసి గండికోటకు వచ్చే గోల్కొండ సేనను ఎదిరించమని వెంకటపతిరాయలు ఉదయగిరి పాలకుడు కొలానందునికి కబురుపంపాడు. గుర్రంకొండ ప్రాంతంలో మట్ల అనంతనాయకుడు రేవళ్ల నాయకుని ఓడించాడు. కనుక గోల్కొండసేన గండికోటను చేరడానికి వీలులేకపోయింది. కమలాపురం వద్ద కూడా సుల్తాన్ సైన్యాన్ని విజయనగర సేన ఓడించింది. తర్వాత విజయనగర సైన్యం గండికోటవైపు సాగింది. ఆ స్థితిలో సుల్తాన్ ముర్తజా అనే మరొకరి సేనాధిపత్యంలో మరికొంత సేనను పంపి పెనుగొండ దుర్గాన్ని ముట్టడించమని ఆదేశించాడు. ముర్తజా తన సైన్యంతో కడప వరకు వచ్చాడు. అక్కడ ఒక విజయనగర సేన అతనితో తలపడింది. కాని ఓడిపోయింది. ముర్తజా విజయం తర్వాత కడప పట్టణాన్ని స్వాధీనం చేసుకొని అనేక మందిని సంహరించి అక్కడి ఒక దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. తర్వాత ముర్తజా గండికోట వైపు నడిచాడు.

పెన్నార్ యుద్ధం: ఆ సైన్యం చాలదని రుస్తుంఖాన్ అనే మరొక సేనాధిపతికి 5000 అశ్వదళాన్ని ఇచ్చి

ముర్తజాకు సహాయంగా పంపాడు. ఈ సైన్యం గండికోటను చేరగానే ముర్తజాకు, రుస్తుంఖాన్ నాయకత్వ వివాదం వచ్చింది. నేను సర్వసేనాదినంటే నేను సర్వసేనానిని, కనుక నా మాట ప్రకారం జరగాలి అంటే నామాట ప్రకారం జరగాలి అని పోట్లాడుకున్నారు. కాని ఇద్దరికీ మాటకుదరక ఎవరికి వారు తమ సైన్యాలతో విడివిడిగా విజయనగర సైన్యాలతో పోరాటానికి దిగారు. రెండు నెలలు వారు పరిసర ప్రాంతాలను జయించాలని చూశారు. కాని జయించలేదు. ఈ సైన్యాలను ఎదిరించడానికి వెంకటపతిరాయలు పది వేల సైన్యాన్ని చెన్నప్ప, యాచమ నాయకుని నాయకత్వంలో పంపాడు. ఆ సైన్యాన్ని చూడగానే సుల్తాన్ సైన్యాలు పెన్నానదిని దాటి తమ గుడారాలు వేశారు. మట్టి భూములపై ముర్తజా తన సైన్యాలను నిలిపాడు. రుస్తుంఖాన్ తడిసిన రేగడినేలపై తన సైన్యాన్ని నిలుపుకున్నాడు. అప్పుడు విజయనగర సేనలు కూడా పెన్నానదిని దాటి వారిపై పడ్డాయి. విజయనగర సేనలు విచిత్ర వర్ణాలు గలిగిన ఒక వృషభాన్ని సుల్తాన్ సైన్యాలపైకి తోలారట. దానిని చూసి రుస్తుంఖాన్ తన అశ్వాన్ని ఎక్కి పారిపోయాడట. తర్వాత చిత్తడిరేగడి నేలలో ఉన్న సుల్తాన్ సైన్యం సరిగా పోరాడలేకపోయిందట. అప్పుడు విజయనగర సైన్యం వారిపై బడి ఊచకోత కోసిందట. దాంతో ముర్తజా మిగిలిన సైనికులను తీసుకొని సురక్షిత ప్రాంతాలవైపు వెళ్లిపోయాడు. ఈ యుద్ధాన్ని పెన్నార్ యుద్ధం అంటారు. ఈ పెన్నార్ యుద్ధంలో విజయనగర సేనకు అఖండ విజయం లభించింది. ఈ యుద్ధంలో వెలుగోటి చెన్నప్ప అద్భుత ప్రతాపశౌర్యాలను ప్రదర్శించాడు. పెన్నారు యుద్ధంలో గోల్కొండ సైన్యాలను విజయనగర సైన్యాలు ఓడించి తరిమాయని రామరాజ విజయం తెలుపుతుంది.

గండికోట యుద్ధం: తర్వాత విజయనగర సేన గండికోటపై దండెత్తి కోటలో ఉన్న సుల్తాన్ సైన్యాలను ఓడించి తరిమి గండికోటను స్వాధీనం చేసుకున్నాయి. తర్వాత సుల్తాన్ సైన్యాలు ఆక్రమించిన అన్ని దుర్గాలను తిరిగి స్వాధీనం చేసుకున్నాయి. గుత్తి, గుర్రంకొండ మొదలైన దుర్గాలన్నీ తిరిగి వెంకటపతిరాయల వశం అయ్యాయి. ఈ కోటల నుండి బయటకు వచ్చిన గోల్కొండ సేనలు కృష్ణానదిని దాటి గోల్కొండ రాజ్యంలోకి పారిపోయే వరకు తరిమివేశారు. విజయనగర రాజ్యంపై దండయాత్ర చేస్తే ఏమి జరుగుతుందో వెంకటపతిరాయలు నిరూపించాడు. కులీ కుతుబ్‌షా తర్వాత వెంకటపతిరాయలతో సంధి చేసుకొని ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దు అని అంగీకరించాడు. ఆ తర్వాత గోల్కొండ సుల్తాన్ విజయనగరంవైపు తేరిపార చూడలేదు. గోల్కొండ సుల్తాన్‌ను అనేక పర్యాయాలు ఓడించినందువల్ల అతడు కృష్ణానది సరిహద్దుగా అంగీకరించాడని రామరాజ విజయం అనే కావ్యం వర్ణించింది. అదే విధంగా తూర్పుకోస్తాలో రెండు రాజ్యాలకు కశింకోట సరిహద్దు అయింది. కశింకోట పాలకుడు వెంకటపతి సామంతుడయ్యాడు. ఈ విజయాల తర్వాత వెంకటపతి తెలుగు ప్రాంతాలన్నీ కలిపి ఒక రాష్ట్రంగా చేసి ముద్దయదేవ అనే వ్యక్తిని ఆ ప్రాంత పాలెగాడుగా నియమించాడు.

రాజధాని చంద్రగిరికి మార్చడం క్రీ.శ.1592: గోల్కొండ యుద్ధం తర్వాత వెంకటపతిరాయలు తన రాజధానిని పెనుగొండ నుండి చంద్రగిరికి మార్చాడు. పెనుగొండ సుల్తాన్‌లకు సమీపంలో ఉందని, వారు దాడులు చేయడానికి సులభంగా అందుబాటులో ఉందని, తన రాజధానిని క్రీ.శ.1592లో శాశ్వతంగా చంద్రగిరికి మార్చాడు. కాని రాజధాని మార్చినందున పెనుగొండ సామ్రాజ్యపు పశ్చిమ ప్రాంతంపైన, పెనుగొండ మీద సుల్తాన్‌లు దాడులు చేయడానికి ఇంకా సులభతరమైంది. రాజధాని మార్చిడిని ఆసరాగా తీసుకొని బీజాపూరు సుల్తాన్ విజయనగరపు పశ్చిమ ప్రాంతాల మీద దండెత్తాడు.

బీజాపూరు దండయాత్ర: క్రీ.శ.1593లో బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా మైసూరు ప్రాంతంపై దండెత్తాడు. మూడు నెలల ముట్టడి తర్వాత అతడు మైసూరును జయించాడు. అదే సమయంలో సుల్తాన్ సోదరుడైన ఇస్మాయిల్ బెల్గాంలో తిరుగుబాటు చేశాడు. కాని అతనిని ఓడించి సుల్తాన్ వధించాడు. ఆ సమయంలో ఆ పరిసర ప్రాంతాలలో అల్లర్లు చెలరేగాయి. ఆ సమయంలో వెంకటపతిరాయలు ఆదవాని కోటను జయించాలని సైన్యాలను పంపాడు. కాని బీజాపూరు సైన్యాలు విజయనగర సైన్యాలను ఓడించి తరిమి ఆదవానిని దక్కించుకున్నాయి.

పెనుగొండ ముట్టడి: ఆదవాని కోటను ముట్టడించినందుకు ప్రతీకారంగా బీజాపూరు సుల్తాన్ పెద్ద సేనతో పెనుగొండపై దండయాత్ర చేశాడు. పెనుగొండను రక్షించడానికి వెంకటపతి 7 లక్షల పదాతిదళం, 40 వేల గుర్రపుదళం, 500 ఏనుగులను పంపాడు. మట్ల అనంతుడు విజయనగర సేనకు నాయకత్వం వహించాడు.

ఇతనికి మల్లు అనంతుడు అని కూడా పేరుంది. ఈ సమయంలో వెంకటపతిరాయలు పెనుగొండలో ఉన్న అమూల్య సంపదను చంద్రగిరికి తరలించాడు. దాంతో చంద్రగిరి సామ్రాజ్యానికి అసలు రాజధాని అయింది పెనుగొండ రాజధానిగా దాని స్థానాన్ని కోల్పోయింది. విజయనగర సేనాని మల్లు అనంతుడు సుల్తాన్ సైన్యాలతో కలిసి పోరాడుతున్న హండెనాయకులను రహస్యంగా సంప్రదించి వారిని చీలదీశాడు. తర్వాత బీజాపూరు సుల్తాన్ సైన్యంతో తలపడి చిత్తుగా ఓడించాడు. సుల్తాన్ విపరీతంగా నష్టపడి యుద్ధ విరమణ చేసి బీజాపూరు తిరిగి వెళ్లిపోయాడు. ఈ లోపల బీజాపూరు సుల్తాన్ జయించిన మైసూరు ప్రాంతంలో కూడా సుల్తాన్ సైన్యాన్ని ఓడించి తరిమారు. దాంతో మళ్లీ బీజాపూరు సుల్తాన్ విజయనగర రాజ్యంపై దండయాత్ర తలపెట్టలేదు. అందుకు మరొక కారణం కూడా ఉంది అతనికి అహమ్మద్‌నగర్ రాజ్యంతో యుద్ధం వచ్చింది. దాంతో తలమునకలై విజయనగరంపై దండయాత్ర చేయలేకపోయాడు మొత్తం మీద వెంకటపతి రాయలు తన అన్న శ్రీరంగరాయల కాలంలో పోగొట్టుకున్న చాలా ప్రాంతాలను తిరిగి జయించాడు. ఒక్క ఆదవాని, కొండవీడు రాజ్యం తప్ప మిగిలిన భూములన్నీ తిరిగి అతని వశమయ్యాయి ఆంధ్ర ప్రాంతాలలో శ్రీశైలం వరకు అతని ఆధిపత్యంలోకి వచ్చాయి కొండవీటి రాజ్యాన్ని మాత్రం జయించలేకపోయాడు అది గోల్కొండ రాజ్యంలో ఉండిపోయింది. అలాగే ఆదవానిని తిరిగి జయించలేకపోయాడు. అది బీజాపూరు రాజ్యంలో ఉండిపోయింది. ఈ రెండూ తప్ప మిగిలిన ప్రాంతాలన్నింటినీ తిరిగి జయించాడు. అవి కూడా జయించి ఉండేవాడే కాని దక్షిణదేశంలో సామంతులు తిరుగుబాటు చేసి అతని దృష్టిని మరల్చారు. అయితే ఆ తర్వాత అతని కాలంలో విజయనగర రాజ్యంపై ముస్లింలు దండయాత్రలు లేవు.

సామంతుల తిరుగుబాట్లు క్రీ.శ.1597-1603: వెంకటపతిరాయలు గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లతో పోరాటాలు జరిపినప్పుడు తెలుగు, తమిళ, కన్నడ ప్రాంతాలలో సామంతులు తిరుగుబాట్లు చేశారు రాయలు బీజాపూరుతో యుద్ధం తర్వాత సామంతులను అదుపులోకి తీసుకురావడానికి అనేక యుద్ధాలు చేయవలసి వచ్చింది. కోలారును పాలించిన తిమ్మనగౌడ వెంకటపతిరాయల అధికారాన్ని ధిక్కరించి కప్పం చెల్లించలేదు ఆ ప్రాంతంలో అధికంగా పన్నులు వసూలు చేయసాగాడు. అతని ధిక్కరణ ధోరణిని సహించలేక రాయలు తన సేనాని కస్తూరి రంగప్ప నాయకత్వంలో విజయనగర సైన్యాన్ని పంపాడు. మట్ల అనంతసేనానిని కోలారు దుర్గంపైకి పంపాడు తిమ్మగౌడ విజయనగర సేనలను ఎదుర్కోడానికి ముందు బయలుదేరి కొత్త కనుమ దగ్గరకు చేరాడు. అక్కడ విజయనగర సేనలు తిమ్మగౌడ సేనలను ఎదుర్కొన్నాయి అక్కడ జరిగిన యుద్ధంలో కస్తూరి రంగప్ప అద్భుత శౌర్యప్రతాపాలను ప్రదర్శించి తిమ్మగౌడను ఓడించి బందీని చేశాడు. ఈ లోపల మల్లు అనంతుని సేన కోలారు కోటను జయించింది. కారాగారంలోని తిమ్మగౌడను, వెంకటపతిరాయలను వేడి క్షమాభిక్ష పెట్టమని అర్థించాడు. తాను వసూలు చేసిన ధనం మొత్తాన్ని కప్పంగా చెలిస్తామని అంగీకరించాడు. రాయలు క్షమించి వదలివేశాడు.

నంద్యాల కృష్ణమరాజు తిరుగుబాటు క్రీ.శ.1597-98: వెంకటపతిరాయలను ధిక్కరించిన మరొక సామంతుడు నంద్యాల కృష్ణమరాజు. అతడు నంద్యాల నరసింహరాజు కుమారుడు. అతడు నంద్యాల పాలకుడు అతనిని ఆదర్శంగా తీసుకొని పొత్తపి, సిద్ధవటం పాలకుడు కొండ్రాజు తిరుపతిరాజు కూడా తిరుగుబాటు చేశాడు అంతేగాక వెంకటపతిరాయల అభిమాన సేనాని మట్ల వంశం వారి ప్రాంతాలను కూడా ఆక్రమించాడు కందనవోలును పాలించే గోపాలరాజు కూడా తిరుగుబాటుదారులతో చేయి కలిపాడు అతడు ఆరవీటి రామరాయల తమ్ముడు, వెంకటాద్రి మనుమడు, రాజ కుటుంబీకుడు. వారి తిరుగుబాట్లతో రాయలసీమ అంతా స్వతంత్రమైంది. వెంకటపతిరాయలు వారిని అణచడానికి స్వయంగా బయలుదేరాడు. అతనికి సహాయంగా హండే దేవప్ప, గండికోట తిమ్మానాయకుడు, మట్ల ఎల్లమరాజు వెళ్లారు. నంద్యాల కృష్ణమరాజు జమ్మలమడుగు వద్ద రాయలసేనను ఎదుర్కొన్నాడు. అక్కడ జరిగిన భీకరయుద్ధంలో నంద్యాల కృష్ణమ్మరాజు ఓడిపోయి నంద్యాల కోటలోకి పారిపోయాడు. రాయలు అతనిని తరుముతూ వెళ్లి నంద్యాల కోటను ముట్టడించారు. విజయనగర సేన ధాటికి తట్టుకోలేక కృష్ణమరాజు లొంగిపోయాడు. కాని అతనిని దయతలచక చంద్రగిరి కోటకు బందీగా తీసుకువెళ్లి ఖైదు చేశాడు. అతడు ఖైదులోనే మరణించాడు. తర్వాత కందనవోలు రాజు రాజబంధువు అయిన గోపాలరాజును కూడా ఓడించి చంద్రగిరిలో ఖైదు చేశాడు. కృష్ణంరాజు, గోపాలరాజులు కొంతకాలం ఒకే ఖైదులో ఉన్నారు. కొంతకాలానికి గోపాలరాజును విడుదల చేసి క్షమించాడు. ఊటకూరు వద్ద విజయనగర సేనాని

ఎల్లమరాజు, కొండ్రాజు తిరుపతిరాజును చిత్తుగా ఓడించి అతన్ని యుద్ధంలో వధించాడు. అంతటితో రాయలసీమ మొత్తం వెంకటపతిరాయల అధికారానికి తలొగ్గింది. తెలుగు ప్రాంతంలోని తిరుగుబాట్లు అంతమయ్యాయి. యుద్ధాల తర్వాత నంద్యాల, కందనవోలు ప్రాంతాలు పెమ్మసాని తిమ్మానాయకుని ఆధిపత్యంలో ఉంచాడు. అవి గండికోట రాజ్యంలో భాగాలయ్యాయి. కొండ్రాజు పాలించిన పులుగునాడు, అంటే పొత్తపి, సిద్ధవటాలపై మట్ల ఎల్లమనాయకుని పాలెగాడుగా నియమించాడు.

ద్రావిడ దేశంలో తిరుగుబాట్లు క్రీ.శ.1599-1610: ఆంధ్రదేశంలో తిరుగుబాట్లను ఆదర్శంగా తీసుకొని తమిళదేశంలోని సామంతులు కూడా తిరుగుబాట్లు సాగించారు. ఆంధ్రదేశంలోని తిరుగుబాట్లను అణచిన తర్వాత వెంకటపతిరాయలు ద్రావిడ దేశంలోని తిరుగుబాట్లను అణచడానికి పూనుకున్నాడు. క్రీ.శ.1599లో మధుర నాయకుడు కృష్ణప్ప నాయకుడు కప్పం కట్టడం నిలిపివేశాడు. వెంకటపతిరాయలు మట్ల అనంతనాయకునితో కలసి కృష్ణప్పను ఓడించి కప్పం వసూలు చేశాడు. జింజి పాలకుడు కృష్ణప్పనాయకుడు కూడా కప్పం చెల్లించడం మాని వేశాడు. రాయలు కాళహస్తి పాలకుడైన అంకభూపాలుని సోదరుడైన నాయకత్వంలో జింజిపైకి సైన్యాన్ని పంపాడు. అతడు జింజి కృష్ణప్పను ఓడించి బంధించాడు. రాయలు వెంకటరాజును జింజి పాలకునిగా నియమించాడు. అతడు అక్కడ తన తండ్రి పేరుతో చెన్నసాగర తటాకాన్ని నిర్మించాడు. తంజావూరు పాలెగాడు రఘునాథ నాయకుడు జంజి కృష్ణప్పను ఖైదు నుంచి విడిపించి వెంకటపతిరాయలను అర్థించి అతని రాజ్యాన్ని అతనికి ఇప్పించాడు. అందుకు సంతోషించి జింజి కృష్ణప్ప తన కుమార్తెను రఘునాథ రాయలకు ఇచ్చి వివాహం చేయించాడు.

రాయవెల్లూరు లింగమనేడు తిరుగుబాటు క్రీ.శ.1601: వెంకటపతిరాయలు యుద్ధాలలో శౌర్యప్రతాపాలు చూపిన సేనాధిపతులకు అమరభూములను ఇచ్చే విషయంలో దక్షిణాది అమర నాయకులకు కోపాలు కలిగి అవి తిరుగుబాట్లకు దారితీశాయి. తనకు అనేక యుద్ధాలలో విజయం సాధించిపెట్టిన కస్తూరి రంగప్ప కుటుంబానికి అమర భూములు ఇవ్వాలని రాయలు సంకల్పించి అతని కుమారుడు యాచమనాయకునికి పెరుంబేడు సీమను అమరంగా ఇచ్చాడు. ఆ ప్రాంతం వెల్లూరు ప్రాంత పాలకుడైన లింగమనాయకుని రాజ్యంలోది. తన రాజ్యంలోని ప్రాంతాన్ని యాచమనాయకునికిచ్చినందులకు అతనికి ఆగ్రహం కలిగింది. కాని వెంకటపతిరాయలు లెక్క చేయలేదు. సామంత రాజులకు ఇచ్చే అమరాల విషయంలో తనకు సంపూర్ణమైన అధికారాలు ఉన్నాయని, ఏ ప్రాంతాన్నయినా ఎవరికైనా ఇచ్చే అధికారం తనదేనని రాయలు చెప్పాడు. తర్వాత యాచమనాయకుడు ఉత్తర మల్లూరు కోటపై దండెత్తి దానిని ఆక్రమించాడు. ఆ కోట లింగమనేడు రాజ్యంలోది. అతని అధీనోద్యోగి అయిన నాగనాయకునిది. అతడు తన కోటను తిరిగి సాధించటానికి లింగమనేడు సహాయం అర్థించాడు. కాని వెంకటపతిరాయలకు జడిసి ఒక్కడూ యుద్ధానికి సిద్ధపడలేదు. అందుకు ఇతర సామంతుల సహాయం పొందాలని భావించి ఇతరుల సహాయం అర్థించాడు. అందుకు అతడు రాయల అధికారాలు పెరుగుతున్నాయి, అతని అధికారాలు తగ్గించి తమ తమ రాజ్యాలపై పూర్తి హక్కులు నిలుపుకోవాలంటే రాయలకు గుణపాఠం చెప్పాలి, అందుకు తనతో చేరాలని మధుర తంజావూరు, జింజి నాయకులు లింగమనేడుతో చేరిపోయారు. వారితోపాటు తిరువాడి, నందవాసి, తిండివనం పాలకులు కూడా చేరిపోయారు. లింగమనేడు తన అధీనోద్యోగులనందరినీ పోగు చేసి తనకు సహాయంగా వచ్చిన పాలెగాండ్ర సైన్యంతో కలిపి యుద్ధానికి తయారయ్యాడు. ఈ మిత్రరాజ్య సైన్యాలకు నాగనాయకుని బావ దావుల పాపానాయకుని సైన్యాధిపతిగా నియమించి క్రీ.శ.1601 మే నెల 11వ తేదీన ఉత్తర మల్లూరు కోటపై దండెత్తారు. అంత పెద్ద సేన తనపైకి వచ్చినప్పటికీ యాచమనాయకుడు జంక కుండా తమ బంధువులైన వెలమ సైన్యంతో కోట బయటకు వచ్చి వారిని ఎదుర్కొన్నాడు. ఇరుసైన్యాలకు ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో యాచమనాయకుడు విజయం సాధించాడు. యుద్ధంలో పాపా నాయకునితో పాటు అనేక మంది శత్రుసేనా నాయకులు మరణించారు. మిగిలిన సేన పారిపోయింది. లింగమనేడు ప్రాణాలతో పారిపోయాడు. యాచమనాయకుడు సాధించిన ఘనవిజయం అతనికి గొప్ప కీర్తిప్రతిష్టలను తెచ్చింది. వెంకటపతిరాయలు అతనిని ఆహ్వానించి సన్మానించి అతనికి వస్త్రాలు, ఆభరణాలు బహూకరించి గౌరవించడమే గాక అతడు జయించిన కోటలను కూడా అతని పరం చేశాడు. వెంకటపతి రాయలు యాచమనాయకుని సన్మానించడం ఓడిపోయిన రాజుల హృదయాలను భగ్గున మండించింది. వారు మళ్లీ కొత్త సైన్యాలను పోగు చేసి మళ్లీ యుద్ధానికి తయారయ్యారు. కాని వెంకటపతిరాయలు వారి నిరసనలను లెక్కచేయలేదు. వారిని శాశ్వతంగా

అణచివేయాలని నిశ్చయించాడు. వారిని దండించడానికి మట్ల అనంతనాయకుని, దామెర్ల చెన్నసేనానిని పంపాడు. వారు మిన్నాల్ మైదానంలో లింగమనేడు సైన్యాన్ని ఎదిరించి ఓడించారు. తర్వాత వారు లింగమనేడు రాజధాని అయిన వెల్లూరుని ఆక్రమించారు. అతడు వెల్లూరు నుండి పారిపోగా అతని వెన్నంటి తరిమారు. లింగమనేడు. మరికొంత మంది నాయకులను కలుపుకొని లాటూరులో తిరిగి విజయనగర సైన్యాలను ఎదిరించాడు. అక్కడ జరిగిన యుద్ధంలో దామెర్ల చెన్నడు లింగమనీడి సైన్యాన్ని ఓడించి అతనిని బందీగా పట్టుకున్నాడు. వెంకటపతిరాయలు అతనిని పదభ్రష్టుణ్ణి చేశాడు. లింగమనాయకుని భూములన్నీ వెంకటపతిరాయలు తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

రాయవెల్లూరికి రాజధానిని మార్చడం క్రీ.శ.1606: వెల్లూరు స్వాధీనమైన తర్వాత వెంకటపతిరాయలు తన రాజధానిని వెల్లూరుకు మార్చాలని నిర్ణయించాడు. వీలయినప్పుడల్లా తిరుగుబాటు చేసే ద్రావిడదేశంలోని సామంతులను ముఖ్యంగా మధుర, జింజి నాయకులను అదుపులో పెట్టాలంటే వారికి సమీపంలో ఉండాలని భావించాడు. అంతేగాక తరచూ విజయనగర రాజ్యంపై దండెత్తు గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లకు రాజధాని అందకుండా దూరంగా ఉండటం శ్రేయస్కరంగా ఉంటుందని కూడా భావించాడు. ఉభయ సుల్తాన్‌ల దాడులను సామంతుల తిరుగుబాట్లను వెల్లూరు నుండి ఎదుర్కొనవచ్చని, ఉభయుల వల్ల కలిగే ఉపద్రవాల నుండి రాజధాని సురక్షితంగా ఉంటుందని ఆశించి తన రాజధానిని చంద్రగిరి నుండి వెల్లూరుకు మార్చాడు. వెల్లూరు రాయల రాజధాని అయింది. కనుక అప్పటి నుండి దానికి రాయవెల్లూరు అని పేరు వచ్చింది.

జింజి, మధుర రాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1608-1610: లింగమనేడుతో చేరి తిరగుబాటులో పాల్గొని కప్పాలు చెల్లించడం మానివేసిన జింజి, మధుర నాయకులను శిక్షించడానికి వెంకటపతిరాయలు సైన్యాలను పంపాడు. వెలుగోటి యాచమనాయకుని నాయకత్వంలో ఒకసేనను జింజిపైకి, మట్ల అనంతుని నాయకత్వంలో ఒక సైన్యాన్ని మధురపైకి పంపాడు. యాచమనాయకుడు జింజిపై దండెత్తి కృష్ణప్పనాయకుని ఓడించి చెరసాలలో పెట్టాడు. వెంకటపతిరాయలు జింజికి వచ్చి యాచమనాయకుని అభినందించాడు. కృష్ణప్పనాయకుడు రాయల పాదాలపైబడి క్షమాభిక్షను వేడాడు. రాయలు అతనిని క్షమించి తిరిగి రాజ్యం ఇచ్చాడు. అయినప్పటికీ అతడు రాజ్యాన్ని పాలించలేకపోయాడు. వెంకటపతిరాయలు అతని నుండి అధికమొత్తంలో కప్పం వసూలు చేశాడు కనుక కృష్ణప్ప ఆర్థిక ఇబ్బందుల నెదుర్కొన్నాడు. రాజ్యం ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది. అతడు ప్రభుత్వాన్ని నడపలేక రాజ్యాన్ని వదలి శ్రీరంగం చేరి శ్రీరంగనాధుని సాన్నిధ్యంలో జీవితాన్ని గడపసాగాడు. ఆ స్థితిలో మధుర, తంజావూరు నాయకరాజులు అతనికి ధనాన్ని పంపి అతనిని శ్రీరంగం నుండి తిరిగి జింజి వచ్చేటట్లు చేశారు. ఆ తర్వాత అతడు వెంకటపతిరాయలపై తిరుగుబాటు చేయలేదు. మధుర రాజ్యంపైకి నడిచిన మట్ల అనంతుడు కావేరీ నదిని దాటి మధురకోటను ముట్టడించారు. అప్పుడు మొత్తం ముత్తు వీరప్పనాయకుడు మధురను పాలిస్తున్నాడు. అతడు కూడా లింగమనేడుతో చేరి కప్పం కట్టడం మానివేశాడు. మట్ల వెంగళనాధుడు, మట్ల అనంతుడు ముత్తు వీరప్పను ఓడించాడు. వీరప్ప ఓడి తన పాండ్యరాజ్య చిహ్నాలను పోగొట్టుకొని వెంకటపతిరాయలకు కప్పం చెల్లించాడు. తమిళదేశమంతా అదుపులోకి వచ్చింది.

మైసూరు ఒడయారు: వెంకటపతిరాయల కాలంలో మొదటి నుండి ప్రముఖ పాత్ర నిర్వహించిన వారిలో మైసూరు ఒడయారు ఒకడు. అతడు క్రీ.శ.1585లో తిమ్మరాజు అనే స్థానిక పాలకునితో పోరాడి 12 గ్రామాలను జయించాడు. దాంతో ఒడయారు రాజకీయ జీవితం ప్రారంభమైంది. తర్వాత క్రీ.శ.1590లో కెంబలి అనే ప్రదేశాన్ని జయించాడు. క్రీ.శ.1600 అర్రకెర్ర అనే ప్రాంతాన్ని ఆక్రమించాడు. క్రీ.శ.1606లో బన్నూరును కూడా ఆక్రమించాడు. ఈ విజయాలన్నింటిని చూసి శ్రీరంగపట్టణంలో పాలించే తిరుమలరాయలకు అనుమానం కలిగింది. కన్నడదేశంలోని ముస్లింలను పారదోలడానికి ఒడయారు వెంకటపతిరాయల సహాయం అర్థించాడు. వెంకటపతిరాయల సహాయంతో ముస్లింలను పారదోలి కన్నడ ప్రాంతాలన్నీ తన వశం చేసుకున్నాడు. తర్వాత పెద్ద సైన్యాన్ని కూర్చుకొని శ్రీరంగపట్టణంపై దండెత్తి తిరుమలుని పారదోలి శ్రీరంగపట్టణాన్ని ఆక్రమించాడు. ఈచర్య చక్రవర్తి వెంకటపతిరాయల అనుమతితో జరిగిందని అనుమానింపబడింది. ఏమైనా తిరుమలుడు అసమర్థత వలన తన రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. వెంకటపతిరాయలు జీవించి ఉన్నంతవరకు ఒడయారు అతనికి విధేయుడిగా, సామంతుడిగా కొనసాగాడు. ఆ తర్వాత వెంకటపతిరాయల కాలంలో ఏ సామంతరాజు తిరుగుబాటు చేయలేదు. సుల్తాన్‌లు దాడులు చేయలేదు. విజయనగర సామ్రాజ్యానికి నిలకడ చిక్కింది. రాజ్యం

బలపడింది. శీఘ్రగతిన ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందింది. తన తండ్రి, అన్నల కాలంలో పోయిన చాలా ప్రాంతాలను జయించి సామ్రాజ్యం విచ్ఛిన్నం కాకుండా నిలబెట్టాడు. రాయచూరు, అంతర్వేది, కొండవీడు రాజ్య ప్రాంతాలు తప్ప మిగిలిన విజయనగర ప్రాంతాలన్నీ అతని అధీనంలోకి వచ్చాయి అతని రాజ్యం ఉత్తరాన శ్రీశైలం నుండి దక్షిణాన కన్యాకుమారి అగ్రం వరకు, తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రాల మధ్య విస్తరించి ఉంది. ఈవిధంగా తళ్లికోట యుద్ధానంతరం దిగజారిపోయిన విజయనగర వైభవాన్ని పునరుద్ధరించాడు. వెంకటపతిరాయల కాలంలో జరిగిన మరొక ప్రముఖ సంఘటన అక్బరు దక్షిణదేశాన్ని జయించడం. అక్బరు చాందిబీబీని, ఆమె తర్వాత అమీరులను ఓడించి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని జయించి తన సామ్రాజ్యంలో కలిపాడు. అలాంటి రాయబారం క్రీ.శ.1601లో వెంకటపతిరాయల దర్బారుకు వచ్చింది. వెంకటపతి రాయలు ఆ రాయబారాన్ని తిరస్కరించి తన రాజ్యరక్షణకు యుద్ధానికి కూడా సిద్ధమని తిరుగు జవాబు చెప్పి పంపాడు. అయినప్పటికీ అక్బరు క్రీ.శ.1603లో మరొక రాయబారం పంపాడు. దాంతో అక్బరు దక్షిణదేశంపై దండెత్తుతాడని భావించాడు కనుక దక్షిణదేశ రాజులను ఐక్యపరచి అక్బరును ఎదిరించాలని ప్రయత్నించాడు బీజాపూరు సుల్తాన్ కూడా అలాగే తలచి, తన రాయబారులను చంద్రగిరికి పంపాడు వారితో రాయలు రహస్యంగా చర్చించి పోర్చుగీసు వారు, బీజాపూరు, విజయనగర రాజ్యాలు కలిసి సంయుక్తంగా అక్బరును ఎదిరించాలని తీర్మానించాడు. అందుకు తగిన వ్యూహాన్ని రూపొందించాడు కాని అక్బరు క్రీ శ 1605లో మరణించాడు. దాంతో మొగల్ సామ్రాజ్యంతో పోరాటం తప్పిపోయింది

ఆర్థిక ప్రగతికి గైకొన్న చర్యలు: సామ్రాజ్యపు శక్తి, వైభవం దేశపు ఆర్థిక పరిస్థితిపై ఆధారపడి ఉందని గ్రహించి వ్యవసాయ, విదేశ వాణిజ్యాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకున్నాడు. వ్యవసాయాభివృద్ధికి పాటు పడమని తన ఉద్యోగులను ఆజ్ఞాపించాడు. వారు గ్రామలను దర్శించి క్షీణదశలో ఉన్న వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి కావలసిన పనులు చేశారు. అరాచక పరిస్థితులలో గ్రామాలు వదలిపెట్టిపోయిన రైతులను, వారి వారి ప్రాంతాలకు రప్పించారు. వారిపై విధించిన అధిక పన్నులను రద్దుచేశారు. వారికి కావలసిన అన్ని సౌకర్యాలు సమకూర్చారు. సామంతరాజులు, అమరనాయకులు కూడా తమ రాజ్యాలలో అవే పద్ధతులను అవలంబించారు. అందువల్ల గ్రామసీమలు తిరిగి అభివృద్ధి చెంది సామ్రాజ్యం తిరిగి సిరిసంపదలకు నిలయంగా మారింది గ్రామాలలో గ్రామపంచాయితీలను బలపరచి న్యాయసభలకు తగిన అధికారాలు ఇచ్చి గ్రామాలలో నిష్పక్షపాతంగా న్యాయనిర్వహణ జరిగేటట్లు కూడా ఏర్పాట్లు చేయించాడు.

విదేశీ వ్యాపారాన్ని ప్రోత్సహించడం - ఐరోపా స్థావరాలు: వెంకటపతిరాయల కాలంలో జరిగిన మరొక ముఖ్య సంఘటన తూర్పుతీరంలో ఐరోపా వారు తమ వ్యాపార స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం ఇతని కాలం నాటికి డచ్చివారు, ఇంగ్లిషు వారు కూడా భారతదేశంలో ప్రవేశించి వ్యాపారాన్ని ప్రారంభించారు. మొదటి నుండి పోర్చుగీసు వారు విజయనగర సామ్రాజ్యంలో వ్యాపార సంధులు చేసుకొని తమ వ్యాపారాన్ని నడుపుకుంటున్నారు. డచ్చివారు గోల్కొండ సుల్తాన్‌ల అనుమతితో మచిలీపట్నం, నిజాంపట్టణాలలో కర్మాగారాలు నిర్మించుకోడానికి అనుమతిని సంపాదించారు. తర్వాత విజయనగర సామ్రాజ్యంలో వ్యాపారాన్ని చేయాలని వెంకటపతిరాయల అనుమతిని కోరారు. కాని విజయనగరానికి పోర్చుగీసు వారికి వ్యాపార సంధి ఉన్నందున తాను ఆ సంధిని ఉల్లంఘించలేనని, అందువల్ల డచ్చి వారికి తాను అనుమతి ఇవ్వజాలనని తెలిపాడు. వెంకటపతిరాయలు పోర్చుగీసు వారికిచ్చిన మాటకు కట్టుబడి వారికి అనేక వసతులు కల్పించాడు. రాయలు వారికి పులికాట్ ప్రాంతాన్ని ఇచ్చాడు. పోర్చుగీసు వారు అక్కడ ఒక ఫ్యాక్టరీని నిర్మించుకొని లాభసాటిగా వ్యాపారం నిర్వహించారు. ఆ కాలంలో నికొలస్ ఫిమెంటు పోర్చుగీసు మతగురువు. అతడు క్రీ.శ.1597లో మైలాపూరులోని సెయింట్ థోమ్‌కు వచ్చి అతడు వెంకటపతిరాయల మామ ఓబలిరాయుడిని కలుసుకొని తనకు రాయలచే కొన్ని వసతులు ఇప్పించమని కోరాడు. ఓబలిరాయుడు అతనిని చంద్రగిరి తోడ్కొని వెళ్లాడు. అక్కడ ఉన్న పోర్చుగీసు రాయబారి నికొలస్ ఫిమెంటులు కలసి విజయనగర రాజ్యంలో కొన్ని చర్చిలు నిర్మించుకోడానికి అనుమతి ఇవ్వవలసిందని వెంకటపతిరాయలను కోరారు. ఓబలిరాయుడు అనుమతి ఇవ్వమని సలహా ఇచ్చాడు. దాంతో విజయనగర రాజ్యంలో చర్చిలు నిర్మించుకోడానికి, క్రైస్తవమత ప్రచారం చేసుకోడానికి కూడా అనుమతి ఇచ్చాడు. వారు చంద్రగిరిలో ఒక చర్చిని, సెంట్‌థామస్‌లో ఒక చర్చిని నిర్మించారు. సెంట్‌థామస్‌లో నిర్మించిన చర్చి పోషణకు సాలుకు 1000 పగోడాల ఆదాయం వచ్చే రెండు గ్రామాలను కూడా ఆ చర్చికి దానం చేశాడు.

వెంకటపతిరాయలు అన్ని వసతులు ఇవ్వడానికి ఓబలరాయలు కారణమని అతనికి విలువైన కానుకలు ఇచ్చారు. వెంకపతిరాయలు రాజధానిని చంద్రగిరి నుండి రాయవెల్లూరుకు మార్చినప్పుడు పోర్చుగీసు మతప్రచారకులైన కౌటిన్‌హో రుబినో అనే వారు రాయవెల్లూరులో వెంకటపతిరాయలను దర్శించి కానుకలను సమర్పించారు. రాయలు సంతసించి వారికి రాయవెల్లూరులో నివసించడానికి కొంత స్థలాన్ని, చర్చిని నిర్మించుకోడానికి మరింత స్థలాన్ని ఇచ్చాడు. వెంకటపతిరాయల ఔదార్యాన్ని వారు తమ ప్రభువైన రెండవ ఫిలిప్పీకి రాయబారుల ద్వారా తెలియచేశారు. అతడు క్రీ.శ.1607వ సంవత్సరంలో రాయలకు కృతజ్ఞతలను తెలియజేస్తూ లేఖ రాయించి పంపాడు. ఈ విధంగా వెంకటపతిరాయలు పోర్చుగీసు వారితో మంచి స్నేహసంబంధాలు పాటించాడు. వారు తూర్పుకోస్తాలో వ్యాపారాభివృద్ధి చేసుకొని లాభాలు గడించారు. క్రైస్తవమతాన్ని ప్రచారం చేసుకున్నారు. డిబోలి అనే పోర్చుగీసు మతాచార్యుడు హిందూ సన్యాసివలె వేషం వేసుకొని హిందువులను క్రైస్తవులుగా మార్చాలని విజయనగర రాజ్యం అంతా పర్యటించాడు. అయినప్పటికీ వెంకటపతిరాయలు పోర్చుగీసు వారి మత ప్రచారాన్ని నిషేధించలేదు. ఆ రోజుల్లో తూర్పు తీరం నుండి సుమిత్రా, జావా ద్వీపాలతో విరివిగా వ్యాపారం జరుగుతుండేది. ముఖ్యంగా దక్షిణభారతదేశంలో తయారయ్యే నూలు వస్త్రాలకు, అచ్చులు వత్తించిన చీరలకు తూర్పుదీవులలో మంచి గిరాకీ ఉండేది. విజయనగరం తూర్పుతీరం నుండి పోర్చుగీసు వారు నూలు వ్రస్తాలను తూర్పుదీవులకు చేరవేస్తూ మంచి లాభాలు గడించేవారు. అది గమనించిన డచ్చివారు ఎలాగైన విజయనగర సామ్రాజ్యంలోని తీర ప్రాంతాలలో వర్తక గిడ్డంగులను నిర్మించుకోవాలని గట్టిగా ప్రయత్నించారు. కాని వెంకటపతిరాయలు ససేమిరా అంగీకరించలేదు. అందువల్ల వారు క్రీ.శ.1608లో జింజి పాలకుడైన కృష్ణప్పనాయకుని ఆశ్రయించారు. అతడు వారికి దేవపట్టణంలోని గిడ్డంగిని నిర్మించుకోడానికి అనుమతిని ఇచ్చాడు. వారు పూర్వపు కోట ఉన్న స్థలంలో ఒక గిడ్డంగిని నిర్మించారు. పోర్చుగీసు వారు డచ్చి వారికి అనుమతి ఇచ్చినందుకు వెంకటపతి రాయలకు ఫిర్యాదు చేశారు. అంతట రాయలు డచ్చివారిని దేవీపట్టణం నుండి పంపించివేయాలని కృష్ణప్పకు కబురు పంపాడు. కాని కృష్ణప్ప దానిని అంత తీవ్రంగా తీసుకోలేదు. అందువల్ల పోర్చుగీసు మత గురువు అయిన నికొటిస్ లెవంట్ క్రీ.శ.1609లో రాయవెల్లూరులో వెంకటపతి రాయలను కలిసి పోర్చుగీసు వారిని వెళ్లగొట్టమని ఉత్తరం రాయించుకొని జింజి పాలకునికి సమర్పించాడు. జింజి కృష్ణప్ప నాయకుడు దేవీపట్టణం నుండి డచ్చివారిని వెడలగొట్టి దేవీపట్టణాన్ని పోర్చుగీసు వారి అధీనం చేశాడు. ఆ విషయం సెంట్ థామస్‌కు కబురు కూడా పెట్టాడు. ఈ విధంగా పోర్చుగీసు వారికి వెంకటపతిరాయలు అనేక రక్షణలను ఇచ్చాడు. కాని వారికి రాయల యందు విశ్వాసం లేదు. తన రాజ్యంలో చర్చిలు నివాస గృహాలు నిర్మించుకున్నందుకు, అనుమతి ఇచ్చినందుకు ప్రభుత్వానికి కొంత అదనంగా ధనం చెల్లించాలని వెంకటపతిరాయలు పోర్చుగీసు వారిని కోరాడు. కాని వారు ధనం చెల్లించడానికి నిరాకరించారు. దాంతో రాయలు వారిని గట్టిగా మందలిచాడు. అందుకు కినిసి పోర్చుగీసు వారు రాయలతో యుద్ధానికి సిద్ధపడ్డారు. దాంతో రాయలు పోర్చుగీసు వారిపైకి సైన్యాన్ని పంపాడు. రాయల సైన్యం సెంట్‌థోమ్‌పై దండెత్తి పోర్చుగీసు వారిని ఓడించి కోటను ఆక్రమించి వారిని బంధించింది. అప్పుడు వారు తమ తప్పు తెలుసుకొని 401 పగోడాలు చెల్లించి చెరసాల నుండి విడుదల అయ్యారు. ఈ విధంగా పోర్చుగీసు వారితో వెంకటపతిరాయల సంబంధాలు చెడిపోయాయి.

డచ్చివారికి అనుమతివ్వడం: ఆ స్థితిలో ఎలాగైనా విజయనగరంలో తమ గిడ్డంగులను నిర్మించుకోవాలని సమయం కోసం కనిపెట్టుకొని ఉన్న డచ్చి వారికి అవకాశం లభించింది. వారు రాయలను దర్శించి అనుమతిని అర్థించారు. రాయలు వారికి పులికాట్‌లో ఫ్యాక్టరీలు నిర్మించుకోడానికి అనుమతి ఇచ్చాడు. దాంతో క్రీ.శ.1609 నుండి విజయనగర రాజ్యంలో వ్యాపారం చేసుకోడానికి డచ్చి వారికి అవకాశం కలిగింది. అది పోర్చుగీసు వారికి కంటగింపు అయింది. అందువల్ల వారు క్రీ.శ.1612లో డచ్చివారిపై దండెత్తి వారిని పులికాట్ నుండి తరిమి వేశారు. అది తెలిసి వెంకటపతిరాయలు డచ్చి వారిని మళ్లీ రప్పించి అక్కడ వారు శాశ్వతంగా ఉండటానికి అనుమతిని మంజూరు చేశాడు. వారికి రక్షణగా ఒక కోటను కూడా నిర్మిస్తానని రాయలు వాగ్దానం చేశాడు. కాని కోట నిర్మాణం ఆలస్యమైనందున డచ్చివారు తమ సొంత డబ్బుతో అక్కడ కోటను నిర్మించుకున్నారు. ఆ తర్వాత పోర్చుగీసు వారు డచ్చి వారిని ఏమీ చేయలేకపోయారు.

ఇంగ్లిషువారి ప్రయత్నం: క్రీ.శ.1611లో ఇంగ్లిషు వారు గ్లోబ్ అనే ఓడపై ఆంధ్రకోస్తాలోని మచిలీపట్టణం చేరి గోల్కొండ నవాబు అనుమతి సంపాదించి ఆంధ్రదేశంలో వ్యాపారాన్ని ప్రారంభించారు. తర్వాత వారు

విజయనగర రాజ్య తూర్పు తీరంలో వ్యాపారం ప్రారంభించాలని వెంకటపతిరాయలతో సంప్రదింపులు ప్రారంభించారు. కాని వెంకటపతిరాయలు వారికి అనుమతి ఇవ్వలేదు. తర్వాత కొద్దికాలానికే క్రీ.శ.1614లో వెంకటపతిరాయలు మరణించాడు. తర్వాత క్రీ.శ.1621లో ఇంగ్లిషు వారు డచ్చి వారు ఐరోపాలో వ్యాపార ఏర్పాటు చేసుకున్నారు. అందువల్ల వారు డచ్చివారితో భాగస్వాములుగా క్రీ.శ.1621లో పులికాట్‌లో తమ వ్యాపారాన్ని ప్రారంభించారు. వారు అదే సంవత్సరంలో ట్రాంకిబార్‌లో తమ స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దాంతో విజయనగర రాజ్యంలో ఇంగ్లిషు వారు కూడా వ్యాపారులుగా స్థిరపడినారు. మొత్తం మీద పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లిషు వారి వ్యాపారాల వలన చివరలో కూడా విజయనగర సామ్రాజ్యానికి మంచి ఆదాయమే వచ్చింది.

వెంకటపతిరాయలు సాంప్రదాయ సిద్ధంగా వచ్చే పద్ధతిని పాటించి కవిపండితులను పోషించి అనేక దేవాలయాలకు దానధర్మాలు చేశాడు. పరమత సహనం పాటించాడు. వెంకటపతిరాయలు వైష్ణవుడు. అందునా అతడు శ్రీ వెంకటేశ్వరస్వామి భక్తుడు. తన రాజధాని పెనుగొండ నుండి చంద్రగిరికి మార్చిన తర్వాత శ్రీ వెంకటేశ్వరునిపై భక్తి ఇంకా పెరిగింది. వెంకటేశ్వర దేవాలయానికి క్రీ.శ.1588లో, చిదంబర దేవాలయానికి అతడు క్రీ.శ.1588,1598, 1603 సంవత్సరాలలో అనేక దానాలు చేసి దాన శాసనాలు రాయించాడు. ఇంకా అనేక ఆలయాలకు దానాలు చేశాడు. తిరుపతి ఆలయంలో తన ప్రతిమను చెక్కించాడు. ద్వైతమత సిద్ధాంతాలను ప్రచారం చేసిన సుధాంద్రాచార్యులను ఆదరించాడు. తాతాచార్యులు అతని గురువు. తాతాచార్యులు వేదవేదాంగ వేత్త. ముస్లిం క్రైస్తవమతాల యందు పరమత సహనాన్ని పాటించాడు. తన దర్బారులో మేరీ మాత చిత్రపటాన్ని నిలిపాడు. హిందూ ఆచార్యులు వ్యతిరేకించినా రాయలు ఆ పటాన్ని తొలగించలేదు. వెంకటపతిరాయలు పండితుడు, వదాన్యుడు. విద్యలను ప్రోత్సహించాడు. అతని కాలంలో గొప్ప కవితాశక్తి, పాండిత్యం గల కవులు ఉండేవారు. మట్ల అనంతుడు, తరిగొప్పుల మల్లన, తెనాలి రామకృష్ణుడు, పింగళి సూరన కళాపూర్ణోదయాన్ని రచించాడు. తాతాచార్యులు, అప్పయ్యదీక్షితులు, చెన్నమరాజు ఆనాటి గొప్ప తత్వజ్ఞానులు, వేదవిద్వాంసులు. వారిలో చెన్నమరాజు గండికోట పెమ్మసాని తిమ్మానాయకుని ఆస్థానంలో ఉండేవాడు. రెట్టమతశాస్త్ర గ్రంథాన్ని అయ్యల భాస్కరుడు కన్నడం నుండి తెలుగులోకి అనువాదం చేశాడు. ఎర్రా మాధవాచార్యుడు శ్రీపదోద్యోతినీ అనే కావ్యాన్ని రాశాడు. బట్టలంక దేవుడు శబ్దాను శాసనమనే జైన వ్యాకరణాన్ని రాశాడు. విరూపాక్ష పండితుడు చెన్న బసవపురాణం రాశాడు. వెంకటపతిరాయలు ఈ కవులందరినీ ఆదరించాడు. ఇంకా అతడు అనేక విద్యాపీఠాలకు దానాలు చేశాడు. అనేక మంది చిత్రకారులను కూడా ఆదరించాడు.

మరణం క్రీ.శ.1614: కాని వెంకటపతిరాయలు చివరిదశలో మానసిక వేదనను అనుభవించాడు. వెంకటపతిరాయలకు ఆరుగురు భార్యలు ఉన్నారు. వారిలో భాయ్యమ్మ, జగ్గరాయని చెల్లెలు. మరొక భార్య నారపరాయుని చెల్లెలు. మిగిలిన వారి వివరాలు తెలియవు. కాని వారిలో ఏ ఒక్కరికీ సంతానం కలుగలేదు. అందువల్ల సంసార జీవితంలో అతడు సంతోషాన్ని పొందలేకపోయాడు. భార్యలలో భాయమ్మ అనే ఆమెపై రాయకులకు ఎక్కువ మక్కువగా ఉండేదట. చివరిదశలో అతడు జబ్బుపడి బాధపడ్డాడు. ఆ సమయంలో రాజ్య విషయాలలో తన మామ ఓబలరాయుని భార్య, భాయమ్మ అధికారాన్ని చెలాయించారు. ఆ విధంగా మానసిక వేదనపడి చివరకు తన అన్న కుమారుడైన శ్రీరంగరాయులను తన వారసునిగా ప్రకటించి వెంకటపతిరాయులు క్రీ.శ.1614 అక్టోబర్ మాసంలో మరణించాడు. కొందరు చరిత్రకారులు వెంకటపతిరాయలలో మూడు దోషాలు ఉన్నాయని అంటారు. అతడు సదాశివరాయలను వధించాడని, చివరిదశలో భార్య చేతిలో కీలుబొమ్మ అయి, ఆమె దగ్గర బంధువుకు పరిపాలన అప్పగించాడని, శ్రీరంగరాయలను తన వారసునిగా ప్రకటించినందువల్ల అంతర్యుద్ధం వచ్చిందని, అందుకు అతడే బాధ్యుడని వారు వర్ణించారు. వాస్తవం ఏమైనా వెంకటపతిరాయలు ఆరవీటి వంశస్తులలో అగ్రగణ్యుడు, ధీశాలి. కార్యదీక్షాపరుడు. తళ్లికోట యుద్ధం తర్వాత సామ్రాజ్యం క్షీణించి ముక్కముక్కలు కావడానికి సిద్ధంగా ఉన్న సమయంలో సింహాసనం అధిష్టించి సామ్రాజ్యాన్ని రక్షించి మరికొంత కాలం నిలిచేటట్లు చేసిన మహావ్యక్తి వెంకటపతిరాయలు.

రెండవ శ్రీరంగరాయలు క్రీ.శ.1614: వెంకటపతి మరణ కాలం, అతడు శ్రీరంగరాయలను తన వారసునిగా ప్రకటించడం, అంతకు ముందు జరిగిన సంగతులన్నింటినీ పోర్చుగీసు యాత్రికుడు Manuel Barradas క్రీ.శ.1616 డిసెంబర్ 12వ తేదీన కొచ్చిన్‌లో రాశాడు. దాని ప్రతి పోర్చుగల్లుకు పంపబడింది. అది లిస్బన్ లైబ్రరీలోని ఉత్తరాల మధ్యన సేన్‌హోర్ లోప్సు (Senhor Lopes) కు కనిపించింది. రాబర్ట్ సీవెల్ దానిని

గ్రహించి ఇంగ్లిషులోకి తర్జుమాచేశాడు. అందువల్ల వెంకటపతిరాయల మరణం, రెండవ శ్రీరంగరాయల చరిత్ర మరణాన్ని గురించి వివరంగా మనకు తెలియవచ్చింది. వెంకటపతిరాయలు బాయమ్మ అనే పేరు గల జగ్గారావు కుమార్తెను వివాహం చేసుకొన్నాడు. భాయమ్మ లేక బయ్యాంబ జగ్గారావు చెల్లెలని వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. కాని బర్రదాస్ ఆమె జగ్గారావు కుమార్తె అని రాశాడు. ఆమె అళియరామరాజుకు మనుమరాలు గొబ్బూరి ఓబరాజు కుమార్తె అని బి యస్.యల్.హనుమంతరావు రాశారు. భాయమ్మకు సంతానం కలుగలేదు అందుకు ఆమె చాలా బాధపడుతుండేది. ఒక పర్యాయం తన తండ్రి తరుపు ఒక బ్రాహ్మణ స్త్రీ భాయమ్మ దిగులును తెలుసుకొని ఒక సలహా ఇచ్చింది. తాను ఒక నెల గర్భిణినని రాణి కూడా ఒక నెల గర్భిణీగా నటించమని, తాను పుత్రుని కనగానే ఆ శిశువును రహస్యంగా తనకు పంపుతానని అప్పుడు ఆ శిశువు తన కుమారుడని ప్రకటించమని సలహా ఇచ్చింది ఆ సలహా రాణికి బాగా నచ్చింది. వెంటనే ఆమె తాను ఒక నెల గర్భవతినని వెంకటపతిరాయలకు తెలిపింది. ఆమె గర్భిణీగా నటించసాగింది. 9 నెలలకు బ్రాహ్మణ స్త్రీ ప్రసవించి పుత్రుని కన్నది. ఆ పుత్రుని రాణికి పంపింది ఆమె ఆ శిశువును తన కుమారునిగా ప్రకటించింది. రాజ్యం అంతా వెంకటపతిరాయలకు పుత్రుడు ఉదయించాడని తెలిసింది. కాని వెంకటపతిరాయలకు వాస్తవం తెలుసును కాని రాణి మీద ఉన్న ప్రేమ వల్ల మౌనం వహించి ఆ శిశువుకు చిక్కరాయలు అని పేరు పెట్టి పెంచాడు. కాని అతనిని బహిరంగంగా తిరగనివ్వలేదు. చంద్రగిరి కోటలో ఉంచి పెంచాడు ఆ శిశువుకు 14 సంవత్సరాలు వయస్సు వచ్చిన తర్వాత తన బావమరిది ఓబలరాయుని కుమార్తెనిచ్చి వివాహం కూడా జరిపించాడు. కాని అతనిని తన వారసునిగా చేయదలచుకోలేదు. రాయలు మూడు రోజులకు చనిపోతాడనగా తన అన్న రామరాజు చిన్న కుమారుడైన శ్రీరంగరాయలను పిలిపించాడు. అందరు సామంతులు, అమరనాయకులు, రాజబంధువులను కూడా పిలిపించాడు. వారందరి సమక్షంలో తన రాజ ఉంగరం ఉన్న కుడిచేతిని శ్రీరంగ రాయలవైపుకు చాపి ఉంగరాన్ని తీసుకోమన్నాడు. అలా తీసుకుంటే అతని వారసుడవుతాడు. కాని రంగరాయలు ఆ ఉంగరాన్ని తీసుకోలేదు. నాకు సింహాసనం అధిష్టించాలని కోరికలేదు. దానిని మీ ఇష్టం వచ్చిన మరొకరికి ఇవ్వమని చెప్పి వెంకటపతి రాయల పాదాల మీద తల వాల్చి కళ్ల నీళ్లను విడిచాడు. వెంకటపతిరాయలు తన చుట్టూ ఉన్న వారిని రంగరాయలను పైకిలేపమని ఆజ్ఞాపించాడు వారు రంగరాయలను పైకి లేపి వెంకటపతిరాయల కుడిచేతి వద్ద నిలబెట్టారు. వెంకటపతి మళ్లీ తన కుడిచేతిని రంగరాయల వైపు చాచాడు. రంగరాయలు వెంకటపతిరాయల చేతిని తన చేతిలోకి తీసుకొని తన తలపై పెట్టుకున్నాడు. తర్వాత ఉంగరాన్ని తీసుకోనందుకు క్షమించమని అన్నాడు. అప్పుడు వెంకటపతిరాయలు తన వేలి ఉంగరాన్ని కొనవేలి దాకా తెచ్చి తీసుకోమని మరొకసారి చెప్పాడు. అప్పుడు అక్కడ ఉన్న వారంతా ఆ ఉంగరాన్ని తీసుకోమని చెప్పారు. అప్పుడు రంగరాయలు ఆ ఉంగరాన్ని తీసుకొని ముందు తన తలపై పెట్టుకొని తర్వాత తన వేలికి తొడుగుకొని కన్నీరు కార్చాడు తర్వాత వెంకటపతి తన రాజవస్త్రాన్ని తెప్పించాడు. అది 2 లక్షల క్రూజడోలు విలువ కలిగింది తన చెవిలో ఉన్న 6 లక్షల క్రూజడోల వజ్రాన్ని 2 లక్షల విలువ చేసే తన చెవి పోగులను, లక్షల విలువ చేసే మెడలోని ముత్యాల హారాన్ని అన్నింటినీ శ్రీరంగరాయలకు ఇచ్చి అతనిని తన వారసునిగా ప్రకటించాడు. ఆ ప్రకటనకు కొందరు సంతోషించారు. కొందరు విచారించారు. ఆ రోజులలో రాజు తన వారసుని ప్రకటించే విధానం ఇది. మూడు రోజుల తర్వాత వెంకటపతిరాయలు తన 67వ ఏట మరణించాడు. రాయవెల్లూరులోని తన సొంత ఉద్యానవనంలో గంధపు చెక్కలు, ఇతర పరిమళ ద్రవ్యాలతో దహన సంస్కారం జరిగింది. రాణులలో ముగ్గురు సహగమనం చేశారు. వారిలో ఒకరికి రాజు వయసు ఉంటుంది. మిగిలిన ఇద్దరూ 35 సంవత్సరాల వయసు వారు. వారు ఎలాంటి భయం, విచారం లేకుండా సహగమనానికి సిద్ధపడ్డారు. వారు అతి ఖరీదైన దుస్తులు ధరించి, వళ్లంతా బంగారు నగలు ధరించి చితి వద్దకు వచ్చారు. అక్కడ తమ నగలను కొన్నింటిని బంధువులకు, కొన్నింటిని బ్రాహ్మణులకు, మరికొన్నింటిని చుట్టూ ఉన్న ప్రజలకు ఇచ్చి వేసి పెద్ద వేదికను ఏర్పరచుకొని దానిపై నుండి భగభగమండే చితి మధ్యలోకి దూకారు. ముగ్గురూ రాజుతోపాటు కాలిపోయారు.

రాయల దహన కర్మకాండ అంతా జరిగిపోయిన తర్వాత శ్రీ రంగరాయలు సింహాసనం అధిష్టించి రాజ్యపాలన చేపట్టాడు. పట్టాభిషేక కాలంలో అందరు సామంతులు, అమరనాయకులు వచ్చారు. కాని ముగ్గురు రాలేదు. మొదటివాడు జగ్గరాయుడు. అతనికి 6 లక్షల క్రూజడోల ఆదాయం వచ్చే నాయంకరం ఉంది. అతడు రాజసేవకు 20 వేల సైన్యాన్ని పోషించాలి. రెండవవాడు తిమ్మానాయకుడు అతనికి 4 లక్షల క్రూజడోల ఆదాయం,

12 వేల సైన్యానికి అధిపతి. మూడవవాడు మాకరాయుడు. అతనికి 2 లక్షల క్రూజడోలు ఆదాయం, 6 వేల సైన్యానికి అధిపతి వారు నూతన రాజుకు ఎప్పుడూ విధేయత చూపించలేదు. పైగా వారు భాయమ్మ కుమారుని అంటే జగ్గారావు మేనల్లుడిని రాజుగా భావించారు. అతనిని రాజుగా చేయాలనే తలంపుతో ఉన్నారు. వారికి త్వరలోనే తగిన సమయం వచ్చింది నూతనరాజు ముగ్గురు వీరుల మనసులను గాయపర్చాడు వారిలో మొదటివాడు దళవాయి. అతడు 5 లక్షల క్రూజడోలు కప్పంగా చెల్లించేవాడు. అతని కింద ఉన్న రెండు దుర్గాలను తన కుమారులకు వదలివేయమని ఆదేశించాడు. రెండవవాడు మంత్రి అతనిని లక్షల క్రూజడోలను చెల్లించమన్నాడు. ఎందుకంటే మంత్రి రాజఖజానా నుండి కాజేశాడని అన్నాడు మూడవ వ్యక్తి నారపరాయుడు. ఇతడు వెంకటపతిరాయల భార్యలలో ఒక భార్యకు అన్న అవుతాడు. అతని చెల్లెలు కొన్ని బంగారు వస్తువులు నారపరాయునికి ఇచ్చింది. వాటిని తిరిగి ఇవ్వమన్నాడు. ముగ్గురూ రెండు రోజులలో రాజుకోరినవి అప్పగిస్తామని చెప్పి వెళ్లిపోయి జగ్గారావుతో చేరి కుట్రకు దిగారు. జగ్గారాయుడు తాను రాజుకు విధేయత ప్రకటించడానికి వస్తున్నానని వార్త పంపాడు. అలాగే తిమ్మానాయకుడు, మాకానాయకుడు కూడా వార్తలు పంపారు. అది నిజమని నమ్మి వారిని కోటలోకి రావడానికి అనుమతి ఇచ్చాడు ఈ సేనాధిపతులు ముగ్గురూ తమ సేనతో వచ్చి కోటకు ఉన్న రెండు ద్వారాల వద్ద తమ సేనలను మొహరించి కొంతసేనతో కోటలోకి ప్రవేశించారు జగ్గారాయుడు 5 వేల సైన్యంతో కోటలో ప్రవేశించాడు. దళవాయి తన సేనలతో రెండు ద్వారాలను ముట్టడించాడు వెంటనే రాజు కోట తలుపులు మూయించాడు. కాని శత్రుసేన తలుపులను బద్దలు కొట్టింది వారిలో మాకరాయుడు ముందుగా ద్వారాలు పగులగొట్టగలిగాడు. అంతేగాక రాజు తమకు లొంగిపోవాలని, జగ్గరాయుని మేనల్లుని రాజుగా చేయడానికి అంగీకరించాలని రాజుకు తెలిపాడు. ఎలాంటి రక్షణ లేకుండా శత్రుసేనల మధ్యన చిక్కుకున్న శ్రీరంగరాయలు మాకరాయుడు చెప్పిదానికి అంగీకరించి తన కుటుంబ సభ్యులతో కోట బయటకు బయలుదేరాడు శత్రు సైన్యం మధ్యగా తలవంచుకొని బయటికి వెళ్లిపోయాడు సేనాధిపతులు, అమరనాయకులు అందరూ జగ్గారాయుని వైపు వెళ్లిపోయారు. రాజు వెళ్లిపోగానే జగ్గారాయుడు కోటను స్వాధీనం చేసుకున్నాడు. తన విధేయత ప్రకటించమని ఆదేశించాడు. తర్వాత రాజాంతఃపురం ప్రవేశించి సమస్త రాజసంపదను తన ఆధీనం చేసుకున్నాడు. రత్నరాశులు, వజ్రాలు, బంగారం లభిచాయి వజ్రాలే మూడు పెద్ద భాండాగారాల నిండా ఉన్నాయట. ఈ విధంగా విలువకట్టలేని సంపద జగ్గారావు పరమైంది తర్వాత పదభ్రష్టుడైన శ్రీరంగరాయలను ఒక భవనంలో బంధించాడు. జగ్గరాయలు ఆదేశం మేరకు అందరు నాయకులు వచ్చి కొత్తరాజుకు విధేయత ప్రకటించారు. కాని వెలుగోటి కస్తూరి రంగప్ప కుమారుడు యాచమనాయకుడనే ఒకే ఒక్క సేనాధిపతి రాలేదు. అతడు 8 వేల సైన్యానికి అమరనాయకుడు. వచ్చి రాజుకు విధేయత చూపకపోతే నాశనం చేస్తానని జగ్గారాయుడు యాచమనాయకునికి కబురు చేశాడు. కాని యాచమనాయకుడు తాను రానని, కులం తెలియని, ఎవరి కుమారుడో తెలియని వానిని రాజుగా అంగీకరించడానికిగాని, అలాంటి వాడికి విధేయత ప్రకటించడానికి గాని తాను సిద్ధంగా లేనని, ఇక నన్ను నాశనం చేయదలచుకుంటే యుద్ధానికి రమ్మని తిరుగు సమాధానం చెప్పాడు. యాచమనాయకుడు గొప్పవీరుడు. కనుక అతనిని ఎలాగైనా లోబరుచుకోవాలని అనేక బహుమతులు, భూములు ఇస్తానని మళ్లీ కబురు పంపాడు. కాని యాచమనాయకుడు అన్నింటినీ తిరస్కరించాడు. జగ్గారాయుడు యాచమనాయకుని తప్ప మిగిలిన నాయకులనందరిని తన వైపుకు తిప్పుకున్నాడు.

జగ్గారాయుడు తన స్థానాన్ని దృఢపరుచుకొంటూ ఉండగా యాచమనాయకుడు బంధింపబడిన రాజును విడిపించడానికి ప్రయత్నాలు ఆరంభించాడు. కనీసం రాజు కొడుకులలోనైనా ఒకనిని బయటకు రప్పించాలని భావించాడు. రాజు కుటుంబానికి బట్టలు ఉతికే చాకలి వానిని రప్పించి అతనికి అనేక బహుమతులను ఆశపెట్టి రాజకుమారులలో రెండవ వానిని తీసుకురమ్మనమని చెప్పాడు. చాకలి రాజుకు బట్టలు తీసుకువెళ్లేటప్పుడు తమలపాకు మీద ఉత్తరం రాసి తన ముగ్గురు కుమారులలో ఒకరినైనా పంపమని కోరాడు. రాజు 12 సంవత్సరాల వయసు కలిగిన తన రెండవ కుమారుని చాకలి వాడికి అప్పగించాడు. రెండవ కుమారుని పేరు రామదేవుడు. పెద్ద కుమారునికి 18 సంవత్సరాలు ఉన్నాయి. అంత వయసు వానిని తాను మోసుకు వెళ్లలేనని, రెండవ కుమారుని తన బుట్టలో కూర్చొబెట్టుకొని, పిల్లవాడిపై మురికి గుడ్డలు వేసి బుట్టనెత్తిన బెట్టుకొని వెళ్లాడు. కాపలావాళ్లు కూడా దగ్గరకు రాకుండా వాసన వచ్చే గుడ్డలను పైన వేశాడు. దాంతో అతడు పిల్లవాడిని సురక్షితంగా బయటకు తీసుకువెళ్లి మూడు రోజులు తన ఇంటిలో దాచి యాచమనాయకునికి అప్పగించాడు.

రాజకుమారుని చూడగానే యాచమనాయకునికి, అతని సైనికుల సంతోషానికి హద్దులు లేకుండాపోయాయి ఈ వార్త అందరికీ తెలిసిపోయింది జగ్గారావుకు కూడా తెలిసి వెంటనే బందిఖానాకు వచ్చి చూసి అది వాస్తవం అని తెలుసుకున్నాడు. రాజకుటుంబానికి గట్టి కాపలా పెట్టాడు. రాజుకు మంచి ఆహారం కూడా ఇవ్వవద్దని ఆదేశించాడు. రాజకుమారుడు యాచమనాయకుని దగ్గర ఉన్నాడని తెలిసి నలుగురు సేనాధిపతులు యాచమ నాయకుని వైపు చేరిపోయారు వారి వద్ద 8 వేల సైన్యం ఉంది యాచమనాయకుని దగ్గర 8 వేలు ఉంది మొత్తం 16 వేల సైన్యం తయారైంది తర్వాత తన సైనికులతో మంచి విశ్వాసపాత్రులను 20 మందిని దళవాయి వద్ద సైనికులుగా చేరమని పంపి వారిని రాజు బంధింపబడిన గృహం నుండి సొరంగం తవ్వి రాజును విడిపించి తీసుకురమ్మని ఆదేశించాడు. వారు దళవాయిని నమ్మబలికి అతని సేనలో చేరి రహస్యంగా ఒక రోజు సొరంగం తవ్వి రాజును కలుసుకున్నారు. రాజు ఆశ్చర్యచకితుడయ్యాడు. వారు యాచమనాయకుడికి ఇచ్చిన తమలపాకు ఉత్తరాన్ని ఇచ్చాడు. అందు వారితో తప్పించుకొని రమ్మనమని ఉంది రాజు భార్యాబిడ్డలకు ధైర్యం చెప్పి తాను బయటకు వెళ్ళి వారిని విడిపిస్తానని చెప్పి వెంటనే సొరంగంలోగుండా బయలుదేరాడు కాని అతని దురదృష్టవశాన, అదే సమయంలో కాపలావాడొకడు ఆ సొరంగంలో పడి వీరిని చూసి కేకలు పెట్టాడు వెంటనే కాపలావాళ్లు వచ్చి రాజును పట్టుకొని బందిఖానా భవనంలోకి తీసుకువెళ్లి జగ్గారావుకు విషయం చెప్పారు. అతడు రాజకుటుంబాన్ని మరొక భవనంలోకి మార్చి అసలు తప్పించుకోడానికి వీలులేకుండా కాపలా పెట్టాడు. తన ప్రయత్నం విఫలం కావడంతో యాచమనాయకునికి బాగా లంచం పెట్టి కాపలాదారులను అందరినీ చంపి రాజును విడిపించమని చెప్పాడు. ఆ కాపలాదారుని కింద 500 మంది సైనికులున్నారు. ఒకరోజు జగ్గారాయుడు తన పరివారంతో ఒక సామంతుని కలుసుకోడానికి బయటకు వెళ్లినప్పుడు అతడు తన పరివారం సహాయంతో కాపలాదారులనందరినీ సంహరించి యాచమనాయకునికి వచ్చి కోటను స్వాధీనం చేసుకోమని కబురు పెట్టాడు కాని యాచమనాయకుని కంటే ముందే జగ్గారావుకు తెలిసి పరుగున వచ్చి ఈటి ఓబలరాయుని, అతని 500 మంది అనుచరులను సంహరించి కోటను మళ్లీ తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు. ఈ విధంగా రాజకుటుంబాన్ని విడిపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నందున జగ్గారాయుడు రాజ కుటుంబాన్ని సంపూర్ణంగా వధించడం మంచిదని భావించి ఆ పనిని తన చిన్న తమ్ముడు చిన ఓబులేసునికి అప్పగించాడు.

రెండ శ్రీరంగరాయల మరణం క్రీ.శ.1614: ఓబ్రేయ లేక ఓబలరాయుడు రాజకుటుంబం దగ్గరికి వచ్చి నీవు తప్పించుకోడానికి ప్రయత్నించావు కనుక నిన్ను అంతం చేయదలచుకున్నాం. కనుక నీ చేతితో కత్తితో పొడుచుకొని చావాలి లేదా మరొకిరి కత్తిపోట్లకు గురై చావవలసి వస్తుందని చెప్పాడు. రాజు తనకు చావు తప్పదని గ్రహించి తన భార్యను పిలిచి ఏదో మాట్లాడి తన కత్తితో ఆమె తల నరికాడు. తర్వాత తన చిన్న కుమారుని నరికివేశాడు. తర్వాత తన ఇద్దరు కూతురులలో ఒక కూతురిని నరికివేశాడు. తర్వాత తన పెద్ద కుమారుని పిలిచాడు. అతనికి అప్పటికే వివాహం అయింది. కనుక తనలాగే చేయమన్నాడు. అతడు తన ఖడ్గంతో తన భార్యను నరికివేశాడు. ఇదంతా చూసి శ్రీరంగరాయలు నాలుగు కొనలు కలిగిన ఒక పెద్ద కత్తిని నిలబెట్టి దానిపై పడ్డాడు. అది పొట్టలో గుచ్చుకొని ప్రాణాలు వదిలాడు. తర్వాత పెద్ద కుమారుడు అదే విధంగా చేసుకొని ప్రాణాలు వదిలాడు. ఇక చిన్నకుమార్తె మిగిలింది. శ్రీరంగరాయలు ఆ కుమార్తెను చంపలేకపోయాడు. కనుక ఓబ్రేయుడు తన కత్తితో ఆ పసిపాపను నరికాడు దాంతో రాజకుటుంబం అంతా అంతమైంది తన మేనల్లుని రాజ్యానికి ఎవరూ అడ్డు వచ్చేవారు లేరని జగ్గారావు, ఓబలరాయుడు తలచారు. ఈ విధంగా అతి దారుణంగా రాజకుటుంబాన్ని జగ్గారాయుడు చంపించాడు. శ్రీ రంగరాయల జీవితం ఇలా అతి దారుణంగా ముగిసింది సింహాసనం ఎక్కిన నాలుగు నెలలకే సింహాసనం పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత కొద్దికాలానికే కుటుంబసహితంగా దారుణ వధకు గురై మరణించాడు. ఆ విధంగా శ్రీరంగరాయల రాచరికం కొద్ది నెలలోనే ముగిసింది

శ్రీ రంగరాయల మరణానంతర పరిస్థితి: హృదయ వికారంగా రక్తపుమడుగులో పడి ఉన్న రాజకుటుంబపు మృతదేహాలను చూసిన వారికి కళ్లు తిరిగిపోయాయి జగ్గారాయుని సేవకులకే అతనిపై జుగుప్స కలిగింది హత్యావార్త సామ్రాజ్యమంతటా దావానలం లాగా వ్యాపించింది. ప్రజలను భయకంపితులను చేసింది. వారందరికీ జగ్గారాయుని మీద విపరీతమైన కోపం కలిగింది. చాకలి రక్షించి తెచ్చిన శ్రీరంగరాయల రెండవకుమారుడైన రామదేవునిపై ప్రజలకు విపరీతమైన జాలికలిగింది. ఆ స్థితిలో యాచమనాయకుడు రామనాధుని చక్రవర్తిగా ప్రకటించాడు. జగ్గారాయుని క్రూరకృత్యాన్ని యాచమనాయకుడు సహించలేకపోయాడు. తాను చావటానికైనా

సిద్ధపడ్డాడు. తన వద్ద ఉన్న కొద్ది సైన్యంతో జగ్గారావుతో యుద్ధానికి సిద్ధపడ్డాడు జగ్గారావు ప్రజాభిప్రాయానికి కొంత భయపడి యుద్ధాన్ని వాయిదా వేయాలని చూశాడు. కాని యాచమనాయకుడు యుద్ధానికి రమ్మని సవాలు చేశాడు. జగ్గారాయుని 60 వేల సైన్యం ఉంది. తన సేనతో యాచమనాయకుని ఓడించడమేగాక, యాచమ నాయకుని, చిన్నరాయలను కూడా బంధించవచ్చని జగ్గారావు యుద్ధానికి సిద్ధపడ్డాడు. అతడు తన సోదరులైన శింగప్ప, రామప్ప, అయ్యప్పలతో సైన్యాన్ని నడిపాడు. ఉభయ సైన్యాలు రాయవెల్లూరు కోటముందు తారసిల్లాయి. యాచమనాయకుడు తన సైన్యంతో 10 వేల మందిని చిన్న రాజకుమారునికి కాపలాగా పెట్టి 10 వేల సైన్యంతో జగ్గారావు సైన్యంపై విరుచుకుపడ్డాడు. 60 వేల సైన్యం కలిగి జగ్గారాయుడు దాడి చేయవలసింది పోయి యాచమ నాయకుడే ముందు దాడి చేశాడు. యాచమనాయకుడు, అతని సైన్యం జగ్గారాయుడు చేసిన క్రూరకార్యానికి రక్తం ఉడికిపోయి చావూ బతుకూ తెలియకుండా జగ్గారాయుని సైన్యంపై పడ్డారు అంత దృఢదీక్షలేని జగ్గారాయుని సైన్యం యాచమనాయకుని సైన్యం దూకుడు చూసి ఒకపక్కకు పోయింది. యాచమనాయకుని సైన్యం వారి మధ్యకు చొచ్చుకొనిపోయి అందిన వారిని అందినట్లు నరికిపారేశారు. జగ్గారాయుని సైన్యం భయభ్రాంతులకులోనై దిక్కులకు పారిపోయింది విజయం యాచమనాయకునికి లభించింది. జగ్గారాయుడు ఓడి పారిపోవడంతో అక్కడ అతడు వదిలివేసిన రాజ చిహ్నాలు, సంపద అంతా యాచమనాయకునికి లభించింది. 20 లక్షల పర్దొవాల విలువ గల్గిన సంపదను జగ్గారావు వదలి వెళ్లిపోయాడు. ఈ విజయంతో యాచమనాయకుని కీర్తిప్రతిష్టలు సామ్రాజ్యం అంతటా మారుమోగాయి. తర్వాత అనేక మంది సామంతులు, అమరనాయకులు యాచమనాయకుని వైపు చేరిపోయారు. కొద్దికాలంలోనే యాచమనాయకునికి 50 వేల సైన్యం సమకూరింది. జగ్గారాయుని పక్షంలోని మాట్ల తిరువెంగళరాయుడు యాచమనాయకుని పక్షంలో చేరిపోయాడు. అతనికి జగ్గారాయుడు రాజకుటుంబాన్ని వధించిన తీరు దిగ్భ్రాంతి కలిగించింది జగ్గారావు 15 వేల సైన్యంతో మిగిలిపోయాడు. దాంతో భయపడి రాయవెల్లూరు వదిలి అడవులకు పారిపోయాడు. వెల్లూరుకు నైరుతి దిశలో ఉన్న గొబ్బూరి కుటుంబానికి చెందిన భూములన్నీ యాచమనాయకుని సహాయంతో యాచమ నాయకునితో యుద్ధం కొనసాగించాడు ఆ విధంగా అతడు రెండు సంవత్సరాలు పోరాడాడు కాని ప్రతీ దఫా విజయం యాచమనాయకునికే లభించింది.

తోపూరు యుద్ధం క్రీ.శ.1616: ఎన్ని పరాజయాలు సంభవించినా జగ్గారావు తన పట్టుదలను వదలలేదు అతడు అనేక మంది సామంతులను సహాయం అర్థించాడు జింజి, మధుర తిరువాన్కూరు పాలకులు జగ్గారావుకు తమ మద్దతును ప్రకటించారు. మధుర, జింజిలు జగ్గారావుకు సహాయపడనున్న విషయం తెలుసుకున్న యాచమనాయకుడు మధుర, జింజి నాయకులకు వ్యతిరేకమైన తంజావూరు రఘునాధరాయల సహాయం అర్థించడానికి తంజావూరు ఆస్థానాన్ని దర్శించి స్వయంగా అన్ని వివరాలు తెలిపి రాజకుమారుడు రామదేవునికి సహాయపడవలసిందిగా అర్థించాడు. రఘునాధరాయలు యాచమనాయకునికి అండగా నిలుస్తానని వాగ్దానం చేశాడు. శ్రీరంగపట్టణాన్ని పాలించిన ఒడయారు తటస్థంగా ఉన్నాడు. తర్వాత జగ్గారావును ఎదుర్కోడానికి తన సేనను ఆయత్తపరచడానికి యాచమనాయకుడు వెల్లూరు వచ్చి సైనిక సన్నాహాలు పూర్తి చేశాడు. ఈ లోపల జగ్గారావు తనను బలపరిచే మధుర, జింజి, తిరువాన్కూరు సైన్యాలను కలుపుకొని తిరుచినాపల్లి వద్దకు చేరాడు. జగ్గారావు సైన్యం తిరుచినాపల్లి వద్దకు చేరిందని యాచమనాయకునికి తెలిసి తన సేనతో బయలుదేరాడు. మార్గమధ్యంలో తంజావూరు సేన యాచమనాయకుని సేనతో కలిసింది. వారి సైన్యాలు తిరుచినాపల్లి వైపుకు నడిచాయి. పలమార్నేదికి సమీపంలో ఉన్న తోపూరు వద్ద జగ్గారావు సైన్యం విడిచి ఉందని వారికి తెలిసి వీరి సేనలు తోపూరు వద్దకు నడిచాయి. నేడు తిరుచినాపల్లి వద్ద ఉన్న తోపూరే నాటియుద్ధం జరిగిన తోపూరు అక్కడ ఉభయ సైన్యాలు యుద్ధానికి తారసిల్లాయి జగ్గారావు సైన్యం శతఘ్నులను పేల్చడంతో యుద్ధం ప్రారంభించింది. శతఘ్నులతో భీకరయుద్ధం జరిగింది. అంత పెద్ద ఎత్తున ఫిరంగులతో దక్షిణదేశంలో జరిగిన యుద్ధాలలో తోపూరు యుద్ధం మొట్టమొదటిది అని అంటారు. ఆ సమయంలో తంజావూరు అశ్వదళం మధుర సేనపైకి దూకింది మధురసేన తంజావూరు అశ్వదళంతో ఉక్కిరిబిక్కిరిగా పోరాడుతుండగా యాచమనాయకుని పదాతిదళం కూడా మధుర సైన్యంపై దాడి చేసింది. దాంతో మధురసేన తట్టుకోలేక చిందరవందరై పారిపోయింది. ఆ స్థితితో జగ్గారావుసేన ముందుకు వచ్చింది. వెంటనే తంజావూరు సేన జగ్గారావు సేనను చుట్టుముట్టింది. జగ్గారావు విజయమో, వీరస్వర్గమో అన్నట్లుగా పోరాడాడు. కాని యుద్ధరంగంలో మరణించాడు. అతని మరణంతో అతని సేన, అతని మిత్రుల సేనలు పూర్తిగా ఓడిపోయాయి. మధురనాయకుడు ముత్తు వీరప్ప

పారిపోయాడు. జింజి పాలకుడు కృష్ణప్ప బందీగా చిక్కాడు. జగ్గారాయుని మేనల్లుడు రాజు అయిన బాలుడు కూడా బందీగా చిక్కాడు. అనేక మంది సేనానులు మరణించారు. మిగిలిన వారు పారిపోయారు. ఈ విధంగా తోపూరు యుద్ధంలో యాచమనాయకునికి పూర్తిగా విజయం లభించింది. గొబ్బూరి వారి భూములన్నీ యాచమ నాయకుని వశమయ్యాయి. జింజి పాలకునికి జింజి పట్టణం తప్ప మిగిలిన ప్రాంతాలన్నీ యాచమనాయకుని పాదాక్రాంతం అయింది. తోపూరు యుద్ధాన్ని గురించి వెలగోటి వారి వంశావలి వివరంగా వర్ణించింది. తోపూరు యుద్ధంలో యాచమనాయకుడు విజయం సాధించినందువల్ల విజయనగర సింహాసనానికి ఏర్పడిన వారసత్వ సమస్య అంతమైంది.

తోపూరి యుద్ధ ఫలితాలు: విజయనగర చరిత్రలో తోపూరి యుద్ధం అత్యంత అనర్ధదాయకమైనది. తళ్లికోట యుద్ధానికంటే ఘోరమైనది. తళ్లికోట యుద్ధం వల్ల నష్టం జరిగినా, రాజధాని నాశనమైందేగాని సామ్రాజ్యం విచ్ఛిన్నం కాలేదు, నశించలేదు. కాని తోపూరు యుద్ధం విజయనగర సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసి త్వరితగతిన నశించిపోవడానికి దోహదం చేసింది. యుద్ధం తర్వాత మధుర, జింజి, తిరువాన్కూరు నాయకులు రామదేవుని చక్రవర్తిగా గుర్తించలేదు. స్వతంత్రాన్ని ప్రకటించారు. వారిని రామదేవుడు లొంగదీయలేకపోయాడు. తర్వాత వచ్చిన వారు కూడా వారిని తిరిగి సామంతులుగా లొంగదీయలేకపోయారు. దాంతో సామ్రాజ్యం ముక్కలైంది సైనిక శక్తి, ఆర్థిక పటుత్వాన్ని కోల్పోయింది. దాంతో చక్రవర్తి నిర్వీర్యుడయ్యాడు. ఏ సామంతుని కూడా దండించలేకపోయాడు. ఎవరు దండయాత్ర చేసినా ఓడిపోయి ఒక్కొక్క ప్రాంతాన్ని కోల్పోయే దుస్థితి సంభవించింది. దాంతో ఉత్తరం నుండి గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లు సునాయాసంగా విజయనగర ప్రాంతాలను కబళించగలిగారు. ఈ అంతర్యుద్ధాన్ని ఆసరాగా తీసుకొని విజయనగర రాజ్యం ఆధీనంలోని శాంథోమ్‌ను ఆక్రమించారు. కనుకనే రాక్షసతంగడి యుద్ధానికంటే తోపూరు యుద్ధమే విజయనగర రాజ్య విచ్ఛిన్నానికి ఎక్కువగా దోహదం చేసిందని గొర్తి వెంకట్రావు అభిప్రాయపడ్డారు. రెండవ వెంకటపతిరాయలు పునరుద్ధరించిన విజయనగర సామ్రాజ్యపు శక్తి గౌరవ ప్రతిష్టలు మంటగలసిపోయాయి. ఈ విధంగా తోపూరు యుద్ధం విజయనగర సామ్రాజ్యపు పునాదులను కదిలించింది.

రామదేవుడు క్రీ.శ.1616-1630: తోపూరు యుద్ధానంతరం యాచమనాయకుడు రామదేవుని సింహాసనాధీశుని చేశాడు. కాని వారసత్వయుద్ధం సమాప్తం కాలేదు. వారసత్వ యుద్ధానికి కారకుడైన రాజ కుమారుడు చెరసాలలో ఉన్నప్పటికీ జగ్గారాయుని సోదరుడు గొబ్బూరి యతిరాజు అంతర్యుద్ధాన్ని కొనసాగించాడు. అతడు కొన్ని సైన్యాలను పోగుచేసుకొని మళ్లీ పోరాటం మొదలుపెట్టాడు. జగ్గారాయుడు మరణించిన తర్వాత అతని బంధువుల అనుచరులు వెలమలకు పరమశత్రువులుగా మారారు. అందువల్ల వారందరూ యతిరాజును సమర్థించి అతనితో చేరిపోయారు. వారి సహాయంతో యతిరాజు యాచమనాయకునితో అనేక పోరాటాలు జరిపాడు. కాని ఓడిపోయాడు. అయినప్పటికీ అతని బలం తగ్గలేదు. ఇదే సమయంలో మధుర జింజి, తంజావూరు నాయకులు ఎవరినీ సార్వభౌమునిగా గుర్తించాలనే విషయంలో ఏ నిర్ణయానికి రాలేకపోయినారు. ఆ స్థితిలో క్రీ.శ.1619వ సంవత్సరంలో చెరసాలలో ఉన్న వారస యువరాజు మరణించాడు అతని మరణంతో యతిరాజు బలం క్షీణించింది. అతడు వారసత్వ యుద్ధాన్ని కొనసాగించటం అర్థం లేని పనిగా అయింది. దాంతో అంతర్యుద్ధం ముగిసింది. ఆ స్థితిలో రామదేవుడు తన కుమార్తె కొండమాంబను ఇచ్చి వివాహం చేసి అల్లునిగా చేసుకున్నాడు. రామదేవునికి మరొక భార్య కూడా ఉంది. ఆమె పేరు ఓచమాంబ. ఆమె పోచిరాజు రామరాజు కుమార్తె. కాని ఈ పరిణామం యాచమనాయకునికి గిట్టలేదు. గొబ్బూరి వారి కుటుంబం రామదేవునికి దగ్గరవటంతో అతడు రామదేవునికి దూరమయ్యాడు. యతిరాజు రామదేవునికి సన్నిహితుడవటంతో అంతవరకు అతనికి మిత్రులుగా ఉన్న మధుర, జింజి నాయకులు యతిరాజుకు దూరమయ్యారు. అంతేగాక వారు రామదేవుని సార్వభౌమత్వాన్ని తిరస్కరించి స్వతంత్రం ప్రకటించారు. అందువల్ల రామదేవుని అధికారం కర్ణాటకానికి మాత్రమే పరిమితమైంది. స్వతంత్ర వైఖరిని అవలంబించిన సామంతులను అదుపులోకి తేవడానికి రామదేవులు జీవితమంతా పోరాడవలసి వచ్చింది.

సామంతులను అదుపులోకి తేవడం: యాచమనాయకుడు రామదేవునికి దూరం అవటం వల్ల దర్బారు మళ్లీ రెండు పక్షాలుగా చీలిపోయింది. యాచమనాయకుని కొడుకు వెలుగోటి కస్తూరి రంగప్ప తిరుగుబాటు చేశాడు. దానిని ఆసరాగా తీసుకొని కాళహస్తి పాలకుడు దామెర్ల వెంకటపతి కూడా తిరుగుబాటు చేశాడు. వారితో

మరికొందరు చేరారు. అలాంటి క్లిష్టపరిస్థితులలో రామదేవునికి తన మామ యతిరాజు, తంజావూరు రాజు రఘునాథ నాయకుడు మరికొందరు అమరనాయకులు అండగా నిలిచారు. ఉభయపక్షాలకు అనేక యుద్ధాలు జరిగాయి. ఆ యుద్ధాలలో చివరకు క్రీ.శ.1629లో రామదేవుడు, యతిరాజు దామెర్ల వెంకటపతిని ఓడించి అదుపులోకి తెచ్చారు. దాంతో యాచమనాయకుడు, అతని కుమారుడు వెలుగోటి కస్తూరి రంగప్పలు కూడా లొంగిపోయారు. దాంతో జింజి నాయకుడు కూడా భయపడి రామదేవుని మీద వైరం విసర్జించి రామదేవుని తన సార్వభౌమునిగా గుర్తించాడు. పులికాట్, దాని పరిసరాలు అంతకుముందు యాచమనాయకుడు ఆక్రమించిన గొబ్బూరి వారి భూములన్నీ యతిరాజుకు లభించి సామ్రాజ్యంలో చేరిపోయాయి. దాంతో 15 సంవత్సరాలుగా సాగిన అంతర్యుద్ధం ముగిసి రామదేవునికి విజయం సిద్ధించింది. అతని అధికారం స్థిరపడింది.

బీజాపూరు దండయాత్ర-కందనవోలు ఆక్రమణ: విజయనగర సామ్రాజ్యంలో అంతర్యుద్ధం జరిగే కాలంలో బీజాపూర్ సుల్తాన్, రెండవ ఇబ్రహీంషా విజయనగర సామ్రాజ్యంలోని తెలుగు ప్రాంతాలలో పశ్చిమ దిక్కున ఉన్న కందనవోలు లేక కర్నూలును జయించటానికి రెండుసార్లు దండయాత్రకు పంపాడు. మొదటి దండయాత్ర క్రీ.శ.1619-1621లో జరిగింది. అబ్దుల్ వహబ్ అనే అతని నాయకత్వంలో బీజాపూరు సైన్యం కర్నూలుపై దాడి చేశాడు. కర్నూలును రాయల సామంతులుగా పాలించే గోపాలరాజు గోల్కొండ సుల్తాన్ సహాయంతో అబ్దుల్ వహబ్‌ను ఎదుర్కొని ఓడించి తరిమి కర్నూలును కాపాడాడు. వహబ్ శాంతి సంధి చేసుకొని వెళ్లిపోయాడు కాని మళ్లీ క్రీ.శ.1624లో అబ్దుల్ వహబ్ కర్నూలుపై దండెత్తాడు. గోపాలరాజు తన పొరుగున ఉన్న నాయకుల సహాయాన్ని అర్థించాడు పెమ్మసానినాయకుడు, హండేనాయకుడు, మాట్ల తిరువెంగళనాథుడు అతనికి సహాయంగా వచ్చారు. కర్నూలు కోట వద్ద జరిగిన యుద్ధంలో విజయనగర సైన్యాలు ఓడిపోయాయి. ఆ యుద్ధంలో మాట్ల తిరువెంగళనాథుడు మరణించాడు. హండే పెమ్మసానినాయకుడు వారి కోటలకు పారిపోయారు. గోపాలరాజు కోటను వదిలి ఎటో పారిపోయాడు. దాంతో కర్నూలు కోట దాని అధీన ప్రాంతాలన్నీ బీజాపూర్ సుల్తాన్ రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా ఆధిపత్యం కిందికి వెళ్లిపోయాయి. ఆ సమయంలో కష్టాలలో మునిగితేలు రామదేవుడు గోపాలరాజుకి ఎలాంటి సహాయం చేయలేకపోయాడు క్రీ.శ.1629లో రామదేవుని పరిస్థితి బాగుపడింది కాని అతడు ఆ తర్వాత ఎంతో కాలం జీవించలేదు కర్నూలును జయించకుండానే రామదేవుడు క్రీ శ 1630 మే 24 తేదీనా తన 30 ఏళ్ల ప్రాయంలో మరణించాడు. అందువల్ల కందనవోలు రాజ్యం శాశ్వతంగా బీజాపూరు రాజ్యంలో కలిసిపోయింది.

మూడవ వెంకటపతిరాయలు క్రీ.శ.1630-1642: రామదేవునికి సంతానం లేదు. అందువల్ల అతడు తనకు పిన తండ్రి అళియరామరాయల మనుమడు అయిన వెంకటపతిరాయలను తన వారసునిగా నియమించాడు. వెంకటపతిరాయలకు పెదవెంకటపతి, గోపాలరాజని రెండు పేర్లున్నాయి. రామదేవుని నిర్ణయం సామ్రాజ్యంలో మరొక అంతర్యుద్ధానికి దారితీసింది. క్రీ.శ.1635 దాకా కొనసాగింది. మూడవ వెంకటపతిరాయల పిన తండ్రి తిమ్మరాజు వ్యతిరేకించాడు. తర్వాత అతడు సింహాసనాన్ని దక్కించుకోవడానికి సామంతులను సహాయం అర్థించాడు. కాని చాలా మంది అతనిని దురాక్రమణదారునిగా భావించి సహాయం చేయలేదు. అతి కొద్ది మంది. అతనికి సహాయపడ్డారు. ఆ కొద్ది మంది సహాయంతోనే అతడు పెదవెంకటపతిని అనెగొంది నుండి రాకుండా చేశాడు. కాని మధుర, తంజావూరు, జింజి నాయకులు పెదవెంకటపతిని సమర్థించారు. మొదట తిమ్మరాజు కొన్ని విజయాలు సాధించాడు. వెల్లూరు తాలూకాలోని కురుంగపాలెం కోట పులికాట్ వద్ద ఉన్న కాటూరు కోటలను జయించాడు. ఇటువంటి పరిస్థితులలో పెదవెంకటపతి తమ్ముడు చిన్న వెంకటపతి కుమారుడు శ్రీరంగరాయలు పెదతండ్రికి మద్దతుగా యుద్ధంలోకి దిగాడు. కాటూరుకు సమీపంలో ఉన్న కరూర్‌లో తిమ్మరాజు సైన్యం ఉందని తెలుసుకొని శ్రీరంగరాయలు అతనిపై యుద్ధానికి వెళ్లాడు. పులికాట్‌లో ఉన్న డచ్చి వారి సహాయంతో తిమ్మరాజును ఓడించాడు. ఓడిపోయిన తిమ్మరాజు పెదవెంకటపతిని విజయనగర చక్రవర్తిగా గుర్తించాడు. తిమ్మరాజు జయించిన కోటలను అతనికే ఉండనిచ్చాడు కాని మళ్లీ తిమ్మరాజు తలెత్తాడు. అప్పుడు జింజి పాలకుడు క్రీ శ.1635లో తిమ్మరాజును ఓడించి యుద్ధంలో వధించాడు. దాంతో అంతర్యుద్ధం అంతం అయింది. పెదవెంకటపతి అధికారం మూడవ వెంకటపతిరాయలు అని వ్యవహరిస్తారు. జింజి లేక చింజి నాయకునిపై రాయలు అభిమానంగా ఉంటున్నాడని భావించి తంజావూరు, మధుర నాయకులు క్రీ.శ.1637లో వెంకటపతిని బంధించాలని తలచారు. కాని వారి కుట్ర బయటపడింది. వారితో వెంకటపతి యుద్ధానికి దిగాడు.

కాని అదే సందర్భంలో బీజాపూరు సుల్తాన్ పెనుగొండపై దండెత్తాడు. అందువల్ల రాయలు వారితో సంధి చేసుకొని తన దృష్టిని పెనుగొండపై మరల్చాడు.

బీజాపూరు సుల్తాన్ పెనుగొండపై దండెత్తడం: బీజాపూరు సుల్తాన్ పెనుగొండను ఆక్రమించాలని క్రీ.శ 1637లో దండెత్తాడు. అంతకుముందే బీజాపూరు సుల్తాన్ దృష్టి పెనుగొండపై ఉందని గ్రహించి క్రీ.శ.1636లో చంద్రగిరి కోనేటి నాయకుని పెనుగొండ కోట రక్షణాధికారిగా నియమించాడు. కోనేటినాయకుడు బీజాపూరు సుల్తాన్‌ను ఓడించి తరిమి కోటను కాపాడాడు. అందుకు సంతోషించి వెంకటపతి పెనుగొండ, దాని పరిసర ప్రాంతాలను కోనేటి నాయకునికి అమరంగా ఇచ్చాడు. అతని సంతతి వారు విజయనగర రాజ్యం ఉన్నంత వరకు దానిని నిలిపారు.

బీజాపూరు సుల్తాన్ కర్ణాటక ప్రాంతాలు ఆక్రమించడం క్రీ.శ.1638-41: పెనుగొండ దగ్గర ఓడిపోయిన బీజాపూరు సుల్తాన్ కర్ణాటకాన్ని జయించాలని భావించాడు. ఇదే సందర్భంలో చినవెంకటపతి కుమారుడు శ్రీరంగరాయలకు పెదవెంకటపతి రాయలతో అభిప్రాయభేదాలు వచ్చాయి. అందువల్ల అతడు రాయవెల్లూరు నుండి తన స్వస్థానమైన అనెగొందికి వచ్చాడు. బీజాపూరు సుల్తాన్ కర్ణాటకాన్ని జయించాలని ఆశిస్తున్నాడని తెలిసి శ్రీరంగరాయలు సుల్తాన్‌తో చేరిపోయాడు. శ్రీరంగరాయల కందనవోలు నేలే గోపాలరాజు దత్తపుత్రుడు గోపాలరాజు క్రీ.శ.1624 నుండి బీజాపూరు సుల్తాన్ సామంతుడు. కనుక శ్రీరంగరాయలకు సుల్తాన్‌తో అందకుముందు నుండే పరిచయం ఉంది. కనుక అతనితో చేరాడు. అదే సమయంలో తినికేరె, బసవపట్టణాలను పాలించి కెంగె హనుమప్ప బీజాపూరు సుల్తాన్‌ను ఆహ్వానించాడు. దాంతో ఉత్సాహం పెల్లుబికిన బీజాపూరు సుల్తాన్ తన సేనాధిపతి అయిన రణదుల్లాఖాన్‌ను అనే వ్యక్తి నాయకత్వంలో బీజాపూరు సైన్యాలను కర్ణాటకంపైకి దండు పంపాడు. రణదుల్లాఖాన్ శ్రీరంగరాయల సహాయంతో ఇక్కేరి మీద దండెత్తాడు. అక్కడ పాలించే వీరభద్రనాయకుని ఓడించి తన అధిపత్యంలోకి తెచ్చుకున్నాడు. తర్వాత మల్నాడుపై దండెత్తి అక్కడ చాలా కోటలను ఆక్రమించాడు. అక్కడి నుండి తూర్పుగా నడిచి తుంగభద్రానదిని దాటాడు. పెమ్మసాని వారి భూములున్నాయి. మొదట వాటిని జయించాలనుకున్నాడు. కాని ఆ ప్రయత్నం విరమించి అతడు బెంగుళూరుపై దండెత్తాడు. బెంగుళూరుని కెంపెగౌడ పాలిస్తున్నాడు. అతనిని ఓడించి రణదుల్లాఖాన్ బెంగుళూరును స్వాధీనం చేసుకున్నాడు. కెంపెగౌడకు వెంకటపతిరాయలు సహాయం చేయలేకపోయాడు. బెంగుళూరులో తన వద్ద పని చేసే షాజీభోన్స్లేను పాలకుడిగా నియమించాడు. ఈ షాజియే శివాజీ తండ్రి. అక్కడి నుండి రణదుల్లాఖాన్ శ్రీరంగపట్టణం చేరి కోటను ముట్టడించాడు. రంగపట్టణాన్ని ఏలిన ఓడయారు కంఠీరవనరస రణదుల్లాఖాన్‌ను ఓడించాడు. దాంతో రణదుల్లాఖాన్ బీజాపూరు తిరిగి వెళ్ళిపోయాడు.

మద్రాసును ఇంగ్లిషు వారికి ఇవ్వడం క్రీ.శ.1639: క్రీ.శ.1621 నుండి ఇంగ్లిషు వారు విజయనగర రాజ్యంలో వ్యాపారం చేసుకొంటున్నారు. వారు విజయనగర రాజ్యంలోని తూర్పుతీరంలో ఒక కోటను నిర్మించుకోవాలని తగిన ప్రదేశం కోసం తీరాన్ని గాలించి చివరకు నేటి మద్రాసు ప్రాంతాన్ని తగిన స్థలంగా గుర్తించారు. నాటి ఈస్టిండియా కంపెనీ అధికారి ఫ్రాన్సిస్‌డే అక్కడ స్థానిక పాలెగాడుగా ఉన్న దామెర్ల వెంకటాద్రిని దర్శించి ఆ స్థలాన్ని కౌలుకు ఇవ్వమని అర్థించాడు. దామెర్ల వెంకటాద్రి తన ప్రభువైన వెంకటపతి రాయల అనుమతితో అక్కడ 5 మైళ్ళ పొడవు, ఒక మైలు వెడల్పు కలిగిన భూభాగాన్ని క్రీ.శ.1639 మార్చిలో రెండు సంవత్సరాలకు కౌలుకు ఇచ్చాడు. అక్కడ ఆంగ్లేయులు నిర్మించే పట్టణానికి తన తండ్రి చెన్నప్ప పేరు పెట్టాలని తెలిపాడు. వారు అదే పేరు పెట్టారు. కాని అక్కడ ఒక మదర్సా ఉండేదట. దాని పేరుతో ఇంగ్లిషు వారు తమ పట్టణాన్ని మద్రాస్ అని పిలిచేవారు. ఆ పేరే స్థిరపడింది.

బీజాపూరు రెండవ దండయాత్ర క్రీ.శ.1641: బీజాపూరు సేనాధిపతి రణదుల్లాఖాన్ రెండవసారి క్రీ.శ.1641లో విజయనగర రాజ్యంపై దండెత్తాడు. అప్పుడు కూడా శ్రీరంగరాయలు అతనితో చేరాడు. ఖాన్ కొన్ని కోటలను ఆక్రమించి రాయవెల్లూరుపై దండయాత్ర చేశాడు. వెంకటపతిరాయలు దక్షిణాది అమర నాయకులైన మధుర, తంజావూరు, జింజి సైన్యాల సహాయంలో తన రాజధానిని రక్షించుకున్నాడు.

గోల్కొండ దండయాత్ర క్రీ.శ.1642: బీజాపూరు సుల్తాన్ విజయనగర రాజ్యంలోని కర్ణాటక ప్రాంతాలను ఆక్రమించడంతో గోల్కొండ నవాబుకు కూడా విజయనగర రాజ్య ప్రాంతాలు ఆక్రమించాలని ఆశ కలిగింది. అందువల్ల గోల్కొండ క్రీ.శ.1642 ఏప్రిల్‌లో తన సైన్యాన్ని విజయనగర రాజ్యంపైకి పంపాడు. గోల్కొండ సైన్యం

తూర్పు తీరం నుండి నడిచి ఆర్మగం చేరింది. ఆర్మగాన్ని పాలించే వెలుగోటి తిమ్మానాయకుడు, పూనమల్లి పాలెగాడు దామెర్ల వెంకటపతి గోల్కొండ సేనలను ఎదిరించారు. కాని ఓడిపోయి, చిత్తూరు కొండలలోకి పారిపోయారు. తర్వాత గోల్కొండ సేనలు విజయనగర రాజ్యంలో వీరవిహారం చేసి పులికాట్ శ్రీహరికోట, ఆర్మగం ప్రాంతాలను ఆక్రమించాయి. ఈ దాడులకు తట్టుకోలేక వెంకటపతిరాయలు చిత్తూరు జిల్లాలోని నారాయణవన అడవులకు పారిపోయి అక్కడే క్రీ.శ.1642 అక్టోబర్ 10వ తేదీన మరణించాడు. శ్రీరంగరాయలు మరణించే నాటికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో ఎక్కువ భాగం గొల్కొండ, బీజాపూర్ రాజ్యాల స్వాధీనం అయ్యాయి.

మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ.1642-1680: మూడవ వెంకటపతిరాయలు నారాయణ వన అడవులకు పారిపోగానే అంతవరకు బీజాపూరు సేనాని రణదుల్లాఖాన్‌ను సమర్థించిన మూడవ శ్రీరంగరాయలు అతనిని వదిలివేసి రాయవెల్లూరు చేరి సింహాసనాన్ని అధిష్టించాడు. క్రీ.శ.1642 అక్టోబర్ 29న అతని పట్టాభిషేకం జరిగింది. విజయనగర చక్రవర్తులలో ఇతడే చివరివాడు. ఇతనికి ముగ్గురు భార్యలు గొబ్బూరి వెంగళరాజు కుమార్తె పాపమాంబ, బోచిరాజు కుమార్తె రాఘవాంబ, బోచిరాజు వెంకటపతిరాజు కుమార్తె వెంగమాంబ ఇతని భార్యలు. శ్రీరంగరాయలు మూడవ వెంకటపతి తమ్ముడు చినవెంకటపతి కుమారుడు ఇతడు మొదట పెదతండ్రికి సహాయంగా నిలిచాడు. కాని తర్వాత తాను రాజు కావాలని పెదతండ్రిని భయపెట్టడానికి అతడు బీజాపూరుతో కుమ్మక్కై బీజాపూరు సేనలతో కలసి పెదతండ్రికి అనేక ఇబ్బందులు కలిగించాడు. చివరకు పెదతండ్రి మూడవ వెంకటపతిరాయలు రాజ్యం వదిలిపోగా తాను సింహాసనాన్ని దక్కించుకున్నాడు. పెదతండ్రిని భయపెట్టడానికి అతడు బీజాపూరుతో కలిశాడు. కాని ఇప్పుడు అతడే రాజయ్యాడు. శత్రువుల వల్ల రాజ్యాన్ని ఏ విధంగా కాపాడుకోవాలో అతనికి అర్థం కాలేదు. అతడు సింహాసనం ఎక్కేనాటికి విజయనగర సామ్రాజ్యం కూలిపోవడానికి సిద్ధంగా ఉంది. అతడు ఏ విధంగా తన పినతండ్రికి ద్రోహం చేశాడో అదే విధంగా సామంతులందరూ స్వార్థపరులై స్వతంత్రులు కావడానికి సిద్ధంగా ఉన్నారు. వారిలో ఏ ఒక్కరికీ శ్రీరంగరాయలపై అభిమానంలేదు. సామంతులు, అమరనాయకులు తిరుగుబడ్డారు. తంజావూరు, జింజి నాయకులు ఒకటై అతనిని ఎదిరించారు. శత్రు రాజ్యాలపైన బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌లు సామ్రాజ్యంపై దండెత్తి ఎవరికి చిక్కిన ప్రాంతాన్ని వారు సొంతం చేసుకొనే ప్రయత్నంలో ఉన్నారు. కనుక సామంతులను అదుపులోకి తెచ్చి సుల్తాన్‌లను ఎదిరించాలని అతడు తలచాడు. కనుక ముందు సామంతులను తనకు విధేయులుగా చేయడానికి ప్రయత్నాలు ఆరంభించాడు. మూడవ శ్రీరంగరాయలకు గోల్కొండ సుల్తాన్‌నులైన అబ్దుల్లా కులీకుతుబ్‌షా (క్రీ.శ.1626-72) బీజాపూరు అబుల్‌హసన్ లేక తానీషా (క్రీ.శ.1672-1687) బీజాపూర్ సుల్తాన్‌లైన మహమ్మద్ ఆదిల్‌షా (క్రీ.శ 1624-1656) రెండవ అలీ ఆదిల్‌షాలు సమకాలికులు.

మద్రాసు కౌలును పొడిగించడం: ఇతని కాలంలో జరిగిన ముఖ్యసంఘటన క్రీ.శ.1639లో దామెర్ల వెంకటపతి మద్రాసును రెండు సంవత్సరాలు మాత్రమే ఇంగ్లిషు వారికి కౌలుకు ఇచ్చాడు. ఇంగ్లిషు వారు రంగరాయలను దర్శించి తమ కౌలును పొడిగించమని కోరారు. అందువల్ల అతడు వారి కౌలును పొడిగించి పట్టణానికి తన పేరుతో శ్రీరంగరాయల పట్టణం అని పేరు పెట్టమని కోరారు. కాని అప్పటికే అది చెన్నపట్టణంగా పిలువబడుతూ అదే ఖాయమైంది.

ఉదయగిరిపై గోల్కొండ సుల్తాన్ దండయాత్ర క్రీ.శ.1643: శ్రీరంగరాయలు సామంతులను అణచివేసే ప్రయత్నంలో ఉండగా గోల్కొంగ సుల్తాన్ ఉదయగిరి దుర్గాన్ని ముట్టడించాడు. బీజాపూరు సుల్తాన్ సహాయంతో గోల్కొండ సుల్తాన్‌ను ఓడించి తన రాజ్యాన్ని రక్షించుకోవాలని భావించాడు. కాని మాలెనాడులోని ఇక్కేరి పాలకుడు స్వతంత్రం ప్రకటించడంతో అతనిని అణచడానికి బీజాపూరు సైన్యాలు ఇక్కేరిలో ఉన్నాయి. కనుక బీజాపూరు సుల్తాన్ శ్రీరంగరాయలకు సహాయం పంపలేదు. కనుక శ్రీరంగరాయలు తనకు ఉన్న కొద్దిపాటి సైన్యంతో ఉదయగిరిని రక్షించాలని బయలుదేరి తిరుపతి వద్దకు వచ్చాడు. కాని అదే సమయంలో కాళహస్తి పాలకుడు దామెర్ల వెంకటపతి తిరుగుబాటు చేశాడు. దాంతో ఆ సమయంలో ఉదయగిరి వైపు వెళ్లడం ప్రమాదమని శ్రీరంగరాయలు వెనుదిరిగి వెల్లూరు చేరాడు. గొల్కొండ సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా సైన్యాలు ఉదయగిరి చేరి సునాయాసంగా దుర్గాన్ని ఆక్రమించాయి. బీజాపూరు సుల్తాన్ అయిన మహమ్మద్ ఆదిల్‌షా గోల్కొండ సుల్తాన్ ఉదయగిరిని ఆక్రమించడం సహించలేకపోయాడు. కాని అతడు కర్ణాటక దండయాత్రలో ఉన్నాడు. కర్ణాటకంలోని

మాలెనాడులోని ఇక్కెరి పాలకుడు వీరభద్రనాయకుడు బీజాపూరు సుల్తాన్‌పై తిరుగుబాటు చేసి స్వతంత్రుడు కావడానికి ప్రయత్నం చేశాడు. ఇక్కెరికి బెదెద్నూర్ అని కూడా పేరుంది. అందువల్ల అతనిని అణచడానికి బీజాపూరు సుల్తాన్ తన సేనాధిపతి అయిన రణదుల్లాఖాన్‌ను పంపాడు. ఇతనిని కొందరు రణదేలాఖాన్ అని పేర్కొన్నారు. ఇక్కడ సర్ దేశాయ్ రాతను అనుసరించడమైంది. రణదుల్లాఖాన్ ఇక్కెరి తిరుగుబాటును అణచి అక్కడి నుండి షిమోగాకు నడిచారు. కాని షిమోగా కోట వద్ద జరిగిన యుద్ధంలో బీజాపూరు సేన ఓడిపోయింది. ఇదే సందర్భంలో శివప్పనాయకుడు ఇక్కెరిని పునరాక్రమించాడు. ఆ అపజయాలు తెలిసి బీజాపూరు సుల్తాన్ అవమానంగా భావించి పెద్ద సేనతో తాను స్వయంగా కర్ణాటకంపై దండెత్తాడు. అతడు క్రీ.శ.1644లో బంకాపురం చేరాడు. అతడు అక్కడ విడిది చేసి ఒక సైన్యాన్ని ముస్తాఫాఖాన్, ముజఫరుద్దీన్‌ల నాయకత్వంలో మాలెనాడు అంటే ఇక్కెరికి పంపాడు. వారు మాలెనాడును జయించారు. ఆ విజయవార్త రాగానే సుల్తాన్ క్రీ.శ.1644 మార్చిలో బీజాపూరు వెళ్లిపోయాడు.

బీజాపూరు సహాయం-ఉదయగిరి పునరాక్రమణ: బీజాపూరు సుల్తాన్ కర్ణాటకం నుండి తిరిగి రాగానే శ్రీరంగరాయలు తనకు 20 వేల పదాతి దళాన్ని, 6 వేల అశ్వదళాన్ని సహాయంగా పంపాలని అందుకు ప్రతిఫలంగా 15 లక్షల పగోడాలు, 15 ఏనుగులను ఇస్తానని రాయబారం పంపాడు. బీజాపూరు సుల్తాన్ వెంటనే శ్రీరంగరాయలకు కొంత సైన్యాన్ని సహాయంగా పంపాడు. ఆ సైన్యంతో శ్రీరంగరాయలు ఉదయగిరిపై దండెత్తి గోల్కొండ సైన్యాన్ని ఓడించి తరిమి ఉదయగిరిని పునరాక్రమించాడు.

సామంతులపై దండయాత్ర-గోల్కొండ రెండవ దండయాత్ర క్రీ.శ.1644: ఉదయగిరి జయించిన తర్వాత శ్రీరంగరాయలు తనను ధిక్కరించిన సామంతులను అదుపులోకి తీసుకురావడానికి పూనుకున్నాడు. గోల్కొండ సేనలు ఉదయగిరిపై దండెత్తే సమయంలో కాళహస్తి పాలకుడు దామెర్ల వెంకటపతి శ్రీరంగరాయలకు సహాయం చేయకపోగా అతడు జింజి పాలకునితో చేతులు కలిపి స్వతంత్రం ప్రకటించాడు. వారిని చూసి మధుర, తంజావూరు నాయకులు కూడా స్వతంత్రం ప్రకటించారు. శ్రీరంగరాయలు ఇప్పుడు వారందరిపై దండెత్తి ఓడించి వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో కప్పాలు వసూలు చేశాడు. ఆ ధనంతో బీజాపూరు సుల్తాన్‌కు చెల్లించవలసిన 15 లక్షల పగోడాలు చెల్లించాడు. ఇంకా తిరుగుబాటు సామంతులను పూర్తిగా లొంగదీయక ముందే గోల్కొండ సుల్తాన్ మళ్లీ విజయనగరంపై దండెత్తాడు. దాంతో శ్రీరంగరాయలు తన సామంతులపై దండయాత్రను మధ్యలో విరమించి తన రాజధానికి వచ్చాడు. తర్వాత వెలుగోటి సింగమనాయకుని సహాయంగా తీసుకొని శ్రీరంగరాయలు గోల్కొండ సైన్యంతో పోరాడటానికి ఎదురువెళ్లాడు. ఉభయ సైన్యాలు క్రీ.శ.1644 ఆగస్టు 21వ తేదీనా వెంగల్లు వద్ద తారసిల్లాయి. అక్కడ జరిగిన యుద్ధంలో శ్రీరంగరాయలు గోల్కొండ సేనలను ఓడించడమేగాక గోల్కొండ సేనాధిపతిని యుద్ధంలో చంపాడు. ఓడిన గోల్కొండసేన వెనుదిరిగింది. వారి సైన్యాన్ని శ్రీరంగరాయలు కందుకూరు వరకు వెంటబడి తరిమివేశాడు. ఇది శ్రీరంగరాయల జీవితంలోని గొప్ప విజయం.

బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌ల సంయుక్త దండయాత్ర క్రీ.శ.1645: కాని శ్రీరంగరాయలు వెంగల్లు వద్ద సాధించిన విజయం ఎంతో కాలం నిలువలేదు. శ్రీరంగరాయలు బలపడతాడేమోనని బీజాపూరు సుల్తాన్ మహమ్మద్ ఆదిల్‌షా భావించాడు. అదే సమయంలో గోల్కొండ సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా బీజాపూరు సుల్తాన్‌తో సంప్రదింపులు జరిపి ఉభయులూ కలిసి విజయనగర రాజ్యంపై దండెత్తి జయించి ఆ రాజ్యాన్ని పంచుకోవాలని తీర్మానించారు. వారు ఉభయులూ క్రీ.శ.1645లో హఠాత్తుగా విజయనగర రాజ్యంపై దండెత్తారు. శ్రీరంగరాయలు వారితో పోరాడటానికి ధైర్యం చాలక కందుకూరును వదులుకొని సామ్రాజ్యం అంతర్భాగంలోకి వెళ్లిపోయాడు. అందువలన వారు ప్రతిఘటన లేకుండా కొన్ని ప్రాంతాలను ఆక్రమించారు. గోల్కొండ సైన్యాలు మీర్జుమ్లా నాయకత్వంలో కృష్ణానదిని దాటి కర్నూలుకు తూర్పుగా ఉన్న దద్దకోల, కంభం, ఎర్రగొండపాలెం దుర్గాలను ఆక్రమించాయి. శ్రీరంగరాయలు వారితో సంధి చేసుకున్నాడు. వారి సైన్యాలు యుద్ధాన్ని నిలిపివేసి వెనుదిరిగి పోయాయి. తాత్కాలికంగా వినాశనం తప్పిపోయింది.

సామంతుల ద్రోహం క్రీ.శ.1645: సుల్తాన్‌లతో సంధి చేసుకోవడంతో శ్రీరంగరాయల బలహీనత బయటపడింది. దానిని ఆసరాగా తీసుకొని మధుర, తంజావూరు, జింజి నాయకులు ఒకటైపోయి స్వతంత్రం ప్రకటించారు. వారిని దండించడానికి శ్రీరంగరాయలు ఉత్తర సరిహద్దులలో ఉన్న తన సేనలను రాజధానికి రప్పించాడు. రాయలు తమపై దండెత్తుతాడని, తాము విజయం సాధించలేమోనని భయపడి సామంతులు

గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లకు తమకు సహాయంగా రావాలని పెద్ద మొత్తం ధనాన్ని ఇస్తామని ఆశపెట్టారు.

మొగల్ చక్రవర్తి షాజహాన్ ఆజ్ఞ: ఇదే సందర్భంలో మొగల్ చక్రవర్తి షాజహాన్ బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌లను తన సామంతులుగా చేసుకొని దక్షిణాన ఉన్న విజయనగర రాజ్యాన్ని జయించమని ఆదేశించాడు. దాంతో వారు విజయనగర రాజ్యాన్ని కబళించాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఆ సందర్భంలో తంజావూరు, మధుర, జింజి పాలకుల సందేశం అందింది. బీజాపూరు సేనాధిపతి ముస్తాఫాఖాన్ అనంతపురం జిల్లాలోని పెనుగొండ, గుర్రకొండ, బుక్క పట్టణాలను జయించి బెంగుళూరు వైపు నడిచి శివగంగను జయించి కోలారుపై దాడి చేసి రాయవెల్లూరు వైపుకు నడిచాడు. అది తెలిసిన శ్రీరంగరాయలు ముస్తాఫాఖాన్‌తో సంప్రదింపులు ప్రారంభించాడు. అతనితో సంప్రదింపులు జరుపుతూ సుల్తాన్‌ల సేనలను దక్షిణాది నాయకులతో కలవకుండా చేసి వారిని దండించాలని రాయలు వ్యూహం పన్నాడు. అతడు జింజిపైకి తన సేనలను పంపి జింజి నాయకుడైన అప్పా నాయక్‌ను ఓడించి అదుపులోకి తెచ్చాడు. తర్వాత తంజావూరు. మధుర నాయకులపై దండెత్తాడు. వారిని కూడా ఓడించేవాడు. కాని శ్రీరంగరాయల వ్యూహాన్ని ముస్తాఫాఖాన్ గ్రహించి తన సేనలను వెల్లూరుపైకి నడిపించాడు అది తెలిపి శ్రీరంగరాయలు గత్యంతరం లేక మధుర, తంజావూరు నాయకులను దండించకుండా తన రాజధానిని రక్షించుకోడానికి వెనుదిరిగి వచ్చాడు.

గోల్కొండ ఆక్రమణలు: అదే సమయంలో గోల్కొండ సేనాధిపతి మీర్జుమ్లా పెద్ద సేనతో బయలుదేరి వినుకొండను ఆక్రమించాడు. తర్వాత ఉదయగిరిపై దండెత్తాడు. ఉదయగిరిని రక్షించుకోడానికి శ్రీరంగరాయలు సైన్యాలను పంపాడు. కాని అక్కడ దుర్గపాలకుడుగా ఉన్న మల్లయ్య ద్రోహం చేసి క్రీ.శ.1645 మార్చిలో దుర్గాన్ని మీర్జుమ్లాకు స్వాధీనం చేశాడు. తర్వాత మీర్జుమ్లా ఉదయగిరికి పడమరగా నడిచి మల్లనాయకులు పాలించే భూభాగాలలో ప్రవేశించి చిట్వేలు, బద్వేలులను జయించాడు. తర్వాత ఆ పరిసర ప్రాంతాలన్నింటినీ ఆక్రమించాడు. అతనిని ఎదిరించలేక మల్లనాయకులు గోల్కొండ సామంతులుగా మారిపోయారు. అన్ని వైపుల నుండి శత్రువులు చుట్టుముట్టారు. శ్రీరంగరాయలు నిస్సహాయుడయ్యాడు. తమ మతాన్ని, దేవాలయాలను, బ్రాహ్మణులను, గోవులను రాజ్యాన్ని రక్షించుకోడానికి ముందుకు రావాలని ప్రజలను కోరాడు. కాని ఎలాంటి ఫలితం కపిపించలేదు.

నాయకరాజుల దండయాత్ర: ఇలాంటి సమయంలో జింజి, తంజావూరు, మధుర నాయకరాజులు శ్రీరంగరాయలను వదిలించుకోవాలని వారు ఏకమై వెల్లూరుపై దండెత్తారు. వారితో జరిగిన యుద్ధంలో రాయలు క్రీ శ 1645లో ఓడిపోయి. వారితో సంప్రదింపులు ప్రారంభించాడు గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లు ఏకమై విజయనగర రాజ్యంపై దండెత్తడంతో తమ రాజ్యాలపై కూడా సుల్తాన్ సైన్యాలు వచ్చిపడతాయని కొందరు నాయకరాజులకు భయం కలిగి శ్రీరంగరాయలను సమర్థించడానికి అంగీకరించారు ఒక్క మధుర నాయక రాజైన తిరుమల నాయకుడు తప్ప మిగిలిన వారందరూ శ్రీరంగరాయలతో చేరారు. తంజావూరు నాయకరాజు విజయ రాఘవుడు, జింజినాయకుడు అప్పానాయక్ శ్రీరంగరాయలకు సహాయం పంపుతామని వాగ్దానం చేశారు. వారి సహాయం లభిస్తుందని శ్రీరంగరాయలు శివగంగ నుండి వెల్లూరుపైకి వచ్చే బీజాపూరు సేనాని ముస్తాఫాఖాన్ ఎదుర్కొని ఒక యుద్ధంలో ఓడించాడు. కాని ఆ యుద్ధం జరిగిన తర్వాత మైసూరు కంగుది నాయకులు రాయలను వదిలిపోయారు. ముస్తాఫాఖాన్ మళ్లీ యుద్ధానికి తయారయ్యాడు. తంజావూరు, జింజి నాయకులు తమ సైన్యాలను ఇంకా పంపలేదు. వారిలోవారు తగవులాడుకొని శ్రీరంగరాయలకు ఎలాంటి సహాయం చేయలేదు. వారు ఇచ్చిన మాటను నిలుపుకోలేదు. శ్రీరంగరాయలు ముస్తాఫ్‌ఖాన్‌తో ఒంటరిగా పోరాడవలసివచ్చింది. క్రీ శ 1646 ఏప్రిల్ 5వ తేదీన వెల్లూరుకు సమీపంలో యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో శ్రీరంగరాయలు ఓడిపోయి వెల్లూరు కోటలోకి పారిపోయి తలుపులు బిగించుకున్నాడు. తర్వాత ముస్తాఫ్‌ఖాన్ వెల్లూరు కోటను ముట్టడించాడు. కాని ఆ సమయంలో అక్కడ తీవ్రమైన క్షామపరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ సమయంలో యుద్ధం కొనసాగించాలా లేదా అనే విషయంలో బీజాపూరు సేనలలో అభిప్రాయభేదాలు వచ్చి ముట్టడిని వదిలివేసి బీజాపూరు వెళ్లిపోయారు. దాంతో తాత్కాలికంగా వెల్లూరుకు ప్రమాదం తప్పిపోయింది. కాని అది శ్రీరంగ రాయలకు ఏ మాత్రం ఊరట ఇవ్వలేదు.

మీర్జుంలా విజయాలు క్రీ.శ.1646: ఉదయగిరిని ఆక్రమించిన తర్వాత మీర్జుంలా నెల్లూరు, కడప జిల్లాలలోని ప్రధాన దుర్గాలను జయించి ముందుకు సాగాడు. తర్వాత తూర్పు తీరం వెంబడి నడిచి తొండమాన్

నాడు, తిరుపతి, చంద్రగిరులను ఆక్రమించి పులికాట్ చేరాడు. అతడు అక్కడ ఉన్న డచ్చివారిని తనకు కప్పాలు కట్టమని గోల్కొండ సుల్తాన్ అధికారాన్ని గుర్తించమని ఆజ్ఞాపించాడు. కాని డచ్చివారు అతని ఆజ్ఞలను తిరస్కరించారు. వారితో సయోధ్య కుదరలేదు. వారితో పోరాటం పెట్టుకోకుండా అక్కడి నుండి బయలుదేరి పొన్నేరు, పూనమల్లి, కాంచీపురం, చెంగల్పట్టులను జయించాడు. తర్వాత వెల్లూరు వద్దకు చేరాడు శ్రీరంగరాయలు తన రాజ్యాన్ని రక్షించుకోడానికి తెరుమలం చేరి సామంతులనందరినీ పిలిపించి సమావేశం ఏర్పాటు చేశాడు. కాని వారెవరూ అతనికి సహాయపడటానికి ముందుకు రాలేదు. దాంతో శ్రీరంగరాయలు తుఫాను లాగా వచ్చే ముస్లిం సేనలను వందవాసి వద్ద ఎదిరించి, ఓడిపోయి తంజావూరు చేరి విజయరాఘవుల వద్ద తలదాచుకున్నాడు మీర్జుంలా వెల్లూరుని జయించి ముందుకు సాగి జింజిపై దండెత్తాడు. తిరుమలరాయలు జింజిని తాను ఆక్రమించాలని బీజాపూరు సుల్తాన్ సహాయం అర్థించాడు. బీజాపూరు సుల్తాన్ ముస్తాఫ్ఖాన్ పంపాడు. అతడు వచ్చి మీర్జుంలా జింజిని ఆక్రమించకుండా అడ్డుపడ్డాడు అప్పుడు మీర్జుంలా ముస్తాఫ్ఖాన్‌లు ఒక ఒప్పందానికి వచ్చారు. ఆ ఒప్పందం ప్రకారం వారు విజయనగర రాజ్యంలో ఆక్రమించే ప్రాంతాలు కొల్లగొట్టి సంపదలో బీజాపూరుకు 2 వంతులు, గోల్కొండకు 1 వంతు పంచుకోవాలని తీర్మానించారు జింజిని బీజాపూరుకు వదిలేసి మీర్జుంలా వెళ్లిపోయాడు. అతడు వెళ్లగానే ముస్తాఫాఖాన్ క్రీ.శ.1649లో జింజిపై దండెత్తి దానిని జయించాడు. జింజి రాజ్యం అంతా ముస్తాఫా స్థానంలో వచ్చిన షాజి (శివాజి తండ్రి) జింజి రాజ్య భాగాలను బీజాపూరు రాజ్యంలో భాగం చేశాడు. జింజిని జయించిన తర్వాత బీజాపూరు సేనాని షాజీ తంజావూరుపై దండెత్తాడు. తంజావూరు కూడా లొంగిపోయింది. ఆ సమయంలో అక్కడ తలదాచుకున్న శ్రీరంగరాయలు తంజావూరు వదలి మైసూరు రాజ్యంలోకి వెళ్లిపోయి ఒడయారు కంఠరవనరసను ఆశ్రయించాడు. జింజిని వదలిపెట్టి వెళ్లిపోయి మీర్జుంలా క్రీ.శ 1652 నాటికి సిద్ధవటం, మట్లి సామంతుల భూములు, గండికోట పెమ్మసాని వారిని జయించి ఆ దుర్గాలన్నీ స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత గోల్కొండ పోయి వెంటనే తిరిగివచ్చి చోళ మండలం తీరంలోని రేవు పట్టణాలను ఆక్రమించాడు. దాంతో విజయనగర రాజ్యంలో ఆంధ్ర ప్రాంతాలు కోరమండలం తీరంలోని పట్టణాలు గోల్కొండ రాజ్యంలో భాగాలయ్యాయి కర్ణాటక ప్రాంతాలన్నీ బీజాపూరు సుల్తాన్ వశమయ్యాయి. ఈ విధంగా విజయనగర రాజ్యం పూర్తిగా సుల్తాన్‌ల ఆధీనం అయింది క్రీ.శ 1652 నాటికి విజయనగర రాజ్యం పూర్తిగా సుల్తాన్‌ల స్వాధీనమైందని సుగమంచిపల్లి కైఫీయత్తు తెలుపుతోంది శ్రీరంగరాయలు రాజ్యాన్ని, రాజధానిని కోల్పోయి మైసూరు రాజ్యంలో శరణార్థిగా తిరుగుతున్నాడని కూడా తెలిసింది ముస్తాఫాఖాన్ నాయకత్వాన బీజాపూరు సైన్యం మీర్జుంలా నాయకత్వంలో గోల్కొండసేన విజయనగర రాజ్యాన్ని పాడుబెట్టి వెల్లూరుతోబాటు అనేక కోటలను జయించాయని చిప్పొగా రాజు రాజ్యం లేకుండా మిగిలి పోయాడని ఫ్రెంచి యాత్రికుడు దేవేపాట్ రాశాడు శివతత్వాకరం కూడా వెల్లూరును శత్రువులు ఆక్రమించారని శ్రీరంగరాయలు రాజ్యం లేకుండా తిరుగుతున్నాడని తెలుపుతోంది

వెల్లూరును శ్రీరంగరాయలు క్రీ.శ.1653: మైసూరు చేరిన శ్రీరంగరాయల దుస్థితికి విచారించి ఒడయారు ప్రభువు కంఠరవనరసను శ్రీరంగరాయలకు సహాయం చేయదలచాడు. ఇదే సమయంలో మీర్జుంలా గోల్కొంద సుల్తాన్‌ను ఎదిరించి వెల్లూరు రాజ్యాన్ని తన సొంతం చేసుకున్నాడు అందుకు గోల్కొండ సుల్తాన్ కోపించి గోల్కొండలోని అతని కుటంబాన్ని నిర్బంధించాడు. మీర్జుంలా తన కుటుంబాన్ని రక్షించుకోడానికి ఆనాటి మొగల్ గవర్నర్ ఔరంగజేబు సహాయం అర్థించాడు. ఆ సమయంలో అబ్దుల్లా కుతుబ్‌షా శ్రీరంగరాయలను బలపరచాడు అందువల్ల కంఠరవనరస తన సైన్యాలతో వచ్చి క్రీ.శ.1652లో వెల్లూరును జయించి శ్రీరంగరాయలను తిరిగి తన రాజ్యాన్ని సంపాదించుకోడానికి ఉపయోగపడింది. తర్వాత శ్రీరంగరాయలు క్రీ.శ.1653లో తిరుపతి, చంద్రగిరి, పులికాట్‌లను కూడా ఆక్రమించాడు.

ముక్కుల యుద్ధం: జింజి, తంజావూరును జయించిన బీజాపూరు సైన్యాలు మధుర రాజ్యంపై దండెత్తాయి మధుర నాయకరాజు తిరుమలరాయలు మైసూరు రాజు కంఠరవసరను తనకు సహాయం చేయవలసిందిగా అర్థించాడు. యుద్ధ ఖర్చులకు ధనాన్ని ఇస్తామని వాగ్దానం చేశాడు. కంఠరవసరన మధుర రాజ్యానికి సహాయంగా పోయి ముస్లిం సైన్యాలను ఓడించి తరిమివేశాడు. కాని ఆ తర్వాత మధుర తిరుమలరాయలు కంఠరవనరసకు తాను ఇస్తానన్న యుద్ధ ఖర్చులు ఇవ్వలేదు. తనను మోసగించినందుకు కంఠరవసరస కోపించి మధుర రాజ్యంపై దండెత్తి మధుర రాజ్య ప్రజలను, చిక్కిన సైనికుల ముక్కులు కోయించాడు. ముక్కులు కోసేటప్పుడు ముక్కేగాక పై

పెదవి కూడా తెగిపోయేదట ముక్కు పై పెదవిలేని ముఖాలు వికృతంగా దెయ్యాల లాగా కనబడేవారట. అందువల్ల మధుర సైనికులు, ప్రజలకు తమ ముక్కులను కాపాడుకోవడం ఒక పెద్ద సమస్య అయిపోయిందట. ప్రాణం పోయినా ఫరవాలేదు. ముక్కు, పెదాలు పోకూడదని ప్రాణాలొడ్డి పోరాడారట. అయినా ఆ యుద్ధంలో కంఠీరవనరస విజయం సాధించి మధుర రాజ్యాన్ని కొల్లగొట్టి తిరుమలరాయలకు బుద్ధి చెప్పాడట ఈ యుద్ధాన్ని ముక్కుల యుద్ధం అని ఆ నాటి పోర్చుగీసు వారు తమ రికార్డులలో రాశారు.

శ్రీరంగరాయలు మళ్లీ రాజ్యాన్ని పోగొట్టుకోవడం: ఆదే సమయంలో ఔరంగజేబు బీజాపూర్, గోల్కొండ రాజ్యాలపై దండెత్తాడు మీర్జుంలా ఔరంగజేబు వైపు చేరాడు బీజాపూరు సుల్తాన్ మహమ్మద్ ఆదిల్‌షా క్రీ శ 1656లో మరణించాడు అతని కుమారుడు రెండవ ఆలీ ఆదిల్‌షా రాజ్యానికి వచ్చాడు అతడు ఔరంగజేబుతో సంధి చేసుకున్నాడు అలాగే గోల్కొండ అబ్దుల్లా కూడా సంధి చేసుకున్నాడు మీర్జుంలా మొగల్ దర్బారులో చేరి ఢిల్లీ వెళ్లిపోయాడు దాంతో గోల్కొండ సుల్తాన్‌కు మీర్జుంలా బెడద తీరిపోయింది అందువల్ల గోల్కొండ సుల్తాన్ తన సైన్యాలను విజయనగర రాజ్యంపైకి పంపాడు గోల్కొండ సైన్యాలు క్రీ శ 1658లో చంద్రగిరిని జయించాడు ఇదే సమయంలో బీజాపూరు సేనలు రాయవెల్లూరుపై దండెత్తాడు పెనుగొండ కూడా వారి స్వాధీనమైంది శ్రీరంగరాయలు ఓడిపోయి మళ్లీ తన రాజ్యాన్ని కోల్పోయాడు రాయవెల్లూరు, పెనుకొండలు బీజాపూరు స్వాధీనంలోకి, చంద్రగిరి, గోల్కొండ వశమయ్యాయి. క్రీ శ.1659లో శ్రీరంగరాయలు తన రాజ్యాన్ని పోగొట్టుకొని అడవులలో నికృష్ట జీవితాన్ని గడుపుతున్నాడని ఒక పోర్చుగీసు మతాధికారి రాశాడు అలాంటి స్థితిలో ఇక్కేరి పాలకుడు శివప్పనాయకుడు శ్రీరంగరాయల పరిస్థితికి జాలిపడి బేలూరు, వేలాపూరులను జయించి శ్రీరంగరాయలకు ఇచ్చాడు. శ్రీరంగరాయలు వేలాపూరు, బేలూరులను పాలించుకొంటూ కొన్నాళ్లు కాలం గడిపాడు ఇదే కాలంలో మహారాష్ట్రంలో శివాజీ విజృంభించాడు అఫ్జల్‌ఖాన్‌ను వధించి బీజాపూరు ప్రాంతాలను కైవసం చేసుకున్నాడు శివాజీ విజృంభణతో బీజాపూరు రాజ్యం అల్లకల్లోలానికి గురైంది. అదే సమయంలో క్రీ.శ.1666-67లో రాజా జయసింగ్ బీజాపూరు రాజ్యంపై దండెత్తాడు. బీజాపూరు రాజ్యం బలహీనపడింది ఆ స్థితిలో శ్రీరంగరాయలు బీజాపూరు స్వాధీనంలో ఉన్న పెనుగొండను క్రీ.శ.1669లో జయించాడు. క్రీ శ.1669 నుండి పెనుగొండలో శ్రీరంగరాయల శాసనాలు కనిపిస్తున్నాయి. అక్కడ తన చివరి కాలం దాకా నామమాత్రంగా పాలించి మరణించాడు. ఈ విధంగా అతని పరిపాలనా కాలం అంతా అంతర్గతమైన తిరుగుబాట్లను బయటి శత్రువుల దండయాత్రలను ఎదుర్కొని కూడా తన 38 సంవత్సరాల కాలంలో ఏమీ సాధించలేక విజయనగర సామ్రాజ్యాన్ని నిలబెట్టలేక నిస్సహాయుడై చివరకు పెనుగొండలో అతిదయనీయమైన జీవితం గడిపి అక్కడ మరణించాడు. ఓరుగంటి రామచంద్రయ్య శ్రీరంగరాయలు క్రీ శ.1678 వరకు పాలించాడని ఆ తర్వాత ఏమైనదీ తెలియదని భావించగా, కె ఎ నీలకంఠశాస్త్రి శ్రీరంగరాయలు క్రీ శ 1672లో మరణించాడని రాశారు క్రీ శ.1669లో శ్రీరంగరాయల శాసనం అతడు విజయనగర చక్రవర్తి అని పేర్కొంటోంది. కాని ఆ తర్వాత అతడు ఎన్నాళ్లు జీవించిందీ తెలియదని రాయప్రోలు సుబ్రమణ్యం పేర్కొన్నారు. శ్రీరంగరాయలు క్రీ.శ.1675-1680 సంవత్సరాల మధ్య మరణించినట్లు కనిపిస్తోంది. అతని మరణానంతరం అతని కుమారుడు వెంకటపతి తన కుటుంబంతో అనెగొంది వెళ్లిపోయాడు. శ్రీరంగరాయల భార్య తన కుటుంబానికి సహాయం చేయమని శివాజీని అర్థించినట్లు ఒక శాసనం వలన తెలుస్తోంది. అందుకు సంతోషించి శివాజీ ఆమెకు సహాయం చేశాడని సర్ దేశాయ్ తన మరాఠీ చరిత్రలో రాశాడు. మొత్తం మీద శ్రీరంగరాయల మరణంతో ఆరవీటి వంశం పరిపాలన అంతరించింది విజయనగర సామ్రాజ్యం అదృశ్యమైంది. బీజాపూర్, గోల్కొండ సుల్తాన్‌లు కొన్ని ప్రాంతాలు ఆక్రమించగా, మిగిలిన ప్రాంతాలు మధుర, తంజావూరు, జింజి శ్రీరంగపట్టణం ఒడయార్లు సొంతం చేసుకున్నారు. ఈ విధంగా మూడు శతాబ్దాలు దక్షిణదేశాన్ని తేజోమయంగా పాలించి హిందూ సంస్కృతికి అఖండసేవ చేసి మహోజ్వలంగా వెలిగిన విజయనగర సామ్రాజ్యం చివరకు దాని సామంతుల స్వార్థం వల్ల క్రీ.శ.1680లో కాలగర్భంలో కలసిపోయింది.

ఆరవీటి వంశస్తులు నేటికీ అనెగొందిలో జీవిస్తున్నారు: శ్రీరంగరాయలు మరణించినప్పటికీ ఆరవీటి వంశం అంతరించలేదు. అతని మరణానంతరం అతని వంశస్తులు అనెగొందికి తరలివెళ్లి మొగల్ చక్రవర్తి ఔరంగజేబుకు సామంతులుగా కొనసాగారు. ఆ తర్వాత కూడా వారి వంశం అనెగొందిలో కొనసాగింది. మూడవ శ్రీరంగరాయల కుమారుడు వెంకటపతి క్రీ.శ.1678-80 వరకు పాలించాడు. అతని తర్వాత నాల్గవ రంగరాయలు క్రీ.శ.1680-

1692 వరకు, తర్వాత రెండవ మహదేవ క్రీ శ 1692-1706 వరకు ఐదవ రంగ క్రీ.శ.1706 నుండి 1716 వరకు, తర్వాత మహదేవ క్రీ శ.1716 నుండి 1724 వరకు, ఆరవ రంగ క్రీ.శ.1724 నుండి 1729 వరకు తర్వాత మూడవ వెంకట క్రీ శ 1739 నుండి 1744 వరకు రామ 1732 నుండి 1739 వరకు తర్వాత నాల్గవ వెంకట క్రీ శ.1739 నుండి 1744 వరకు, ఐదవ వెంకట క్రీ.శ.1791 నుండి 1793 వరకు పాలించారని మద్రాసు ప్రెసిడెన్సీ ప్రభుత్వ రికార్డులు తెలుపుతున్నాయి. సర్‌థామస్ మన్రో కాలం నాటి ప్రెసిడెన్సీ రికార్డులు అనెగొంది ఆరవీటి వంశం చరిత్రను తెలుపుతున్నాయి. క్రీ.శ.1749 వరకు మొగల్ చక్రవర్తుల సామంతులుగా కొనసాగారని, క్రీ.శ.1749లో అనెగొందిని మహారాష్ట్రులు జయించి, వారి సామంతులుగా చేసుకున్నారని 1775లో హైదరలీ అనెగొందిని వశం చేసుకున్నాడని ఆరవీటి వంశం అతని సామంత వంశంగా కొనసాగిందని క్రీ.శ 1786ల అతని కుమారుడు టిప్పుసుల్తాన్ అనెగొంది రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకున్నాడని, కాని టిప్పుసుల్తాన్ క్రీ.శ.1799లో మరణించగా ఇంగ్లిషు వారు అనెగొంది రాజ్యాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారని తర్వాత నిజాంతో చేసుకొన్న ఒప్పందం వల్ల ఈ ప్రాంతం నిజాంకు వెళ్లగా అనెగొంది కుటుంబానికి ఇంగ్లిషు వారు పెన్షన్ ఇచ్చారని, తర్వాత పెన్షన్‌ను కూడా రద్దు చేశారని. మద్రాసు ప్రెసిడెన్సీ రికార్డులలో రాయబడి ఉంది ఈనాడు కూడా ఈ ఆరవీటి వంశస్తులుగా అనెగొందిలో నివసిస్తున్నారు. కాకతీయుల కాలం నుండి నేటి వరకు అంటే 700 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆరవీటి వంశస్తులు నేటికీ నిలిచి ఉండటం గొప్ప చారిత్రక విశేషం

విజయనగర సామ్రాజ్య పతనానికి కారణాలు

క్రీ.శ.1336లో హరిహర బుక్కరాయలచే స్థాపించబడి రెండవ దేవరాయలు, శ్రీకృష్ణదేవరాయల కాలంలో అత్యంత వైభవాన్ని అనుభవించిన విజయనగర సామ్రాజ్యం తళ్లికోట యుద్ధంతో క్షీణించడం ప్రారంభించి 1680లో అంతరించింది. ఇందుకు అనేక కారణాలు దోహదం చేశాయి. ఆ కారణాలను బాహ్య కారణాలని, అంతరంగిక కారణాలని రెండు విధాలుగా విభజింపవచ్చు.

బహమనీ రాజులతో నిరంతర యుద్ధాలు: విజయనగర రాజ్యస్థాపనాకాలం నుండి బహమనీ రాజులు విజయనగర సామ్రాజ్యంపై దాడులు సాగించారు. బుక్కరాయల కాలంలో మూడు యుద్ధాలు, రెండవ హరిహర రాయల కాలంలో రెండు యుద్ధాలు, మొదటి దేవరాయల కాలంలో మూడు యుద్ధాలు, రెండవ దేవరాయల కాలంలో రెండు యుద్ధాలు జరిగాయి. సాళువ, తుళువవంశాల కాలంలో అనేక యుద్ధాలు జరిగాయి. ఈ విజయనగర సంఘర్షణలో విజయనగర ప్రభువులు కొన్ని విజయాలు సాధించినా ఖజానాకు ఎంతో నష్టం వాటిల్లింది. రాజ్యం నిరంతరం యుద్ధాల వల్ల బలహీనమైంది. అందువల్లనే దాక్షిణాత్య హిందువులకు, దక్కను ముస్లింలకు జరిగిన దీర్ఘకాలిక సంఘర్షణే బహమనీ విజయనగర సంఘర్షణ అని కె.నీలకంఠశాస్త్రి, నేలటూరి వెంకటరమణయ్యలు వర్ణించారు. ఈ సంఘర్షణ రాక్షసి తంగడి యుద్ధం నాటికి తారాస్థాయికి చేరింది. ఆ తర్వాత సుల్తాన్‌లు పదే పదే దాడులు చేసి విజయనగర సామ్రాజ్యం అంతరించే వరకు నిద్రపోలేదు.

శ్రీకృష్ణదేవరాయల తప్పిదాలు: విజయనగర సామ్రాజ్యానికి బహమనీ రాజ్యం జన్మవిరోధి. ఆ విషయం తెలిసి కూడా శ్రీకృష్ణదేవరాయలు బహమనీ రాజులనందరినీ ఓడించి కూడా వదిలివేశారు. ఆనాడే బహమనీ రాజ్యాలను విజయనగర రాజ్యంలో కలిపి ఉన్నట్లయితే విజయనగర సామ్రాజ్యం ముప్పు లేకుండా కొనసాగి ఉండేది.

గజపతి రాజ్యాన్ని నిర్వీర్యం చేయడం గొప్ప రాజకీయ తప్పిదం: శ్రీకృష్ణదేవరాయలు చేసిన మరొక ఘోరమైన తప్పిదం గజపతి రాజ్యాన్ని ధ్వంసం చేయడం. గజపతి రాజ్యం నిర్వీర్యం కాకపోయినట్లయితే దక్కనులోని ముస్లిం రాజ్యాలు అంత సులభంగా విస్తరించేవి కావు. గజపతులు వారి రాజ్యాలపై దాడులు చేస్తూ వారిని అదుపులో పెట్టగలిగే వారు. కనుక బహమనీ సుల్తాన్‌లు విజయనగర రాజ్యంపై తమ దృష్టిని పూర్తిగా సారించలేకపోయే వారు. విజయనగర రాజ్యంపై దాడులు చేయగలిగేవారు కాదు. విజయనగర భూభాగాలను ఆక్రమించగలిగి ఉండేవారు కాదు. రాయలు చేసిన ఈ పెద్ద తప్పిదం విజయనగర రాజ్యానికి పెనుముప్పును తీసుకువచ్చింది.

బలహీనమైన వారసులు - వారసత్వ యుద్ధాలు: అంతరంగికంగా రాజకుటుంబంలోని విభేదాలు వారసత్వ యుద్ధాలు సామ్రాజ్యాన్ని బలహీనపరిచాయి. కృష్ణదేవరాయల తర్వాత రాజ్యానికి వచ్చినవారు అసమర్థులు, బలహీనులు. వారి కాలంలో మంత్రులు, సామంతులు విజృంభించి తిరుగుబాటు ధోరణిని ప్రదర్శించారు. అచ్యుతదేవరాయలు, మొదటి వెంకటపతిరాయలు, సదాశివరాయలు అందరూ అసమర్థులు. అందువల్ల వారి కాలంలో వారసత్వ యుద్ధాలు జరిగి విజయనగర రాజ్యం అధోగతిపాలైంది

రాజకీయ ముఠాలు: అచ్యుతదేవరాయల కాలంలో ముఠాతగాదాలు రాజ్యాన్ని గౌరవమర్యాదలు లేకుండా చేశాయి. రామరాయలు సదాశివరాయలను, సలకం తిమ్మయ అచ్యుతదేవరాయలను బలపరిచారు. అలాగే ఆరవీటి యుగంలో జగ్గారావు చిక్కరాయలను, వెలుగోటి యాచమనాయకుడు రామదేవుని బలపరిచారు. అలాగే ఆరవీటి యుగంలో జగ్గారావు చిక్కరాయలను, వులుగోటి యాచమనాయకుడు రామదేవుని బలపరచి సామ్రాజ్యపు బలాన్ని క్షీణింపజేశారు. వారి చర్యలు సామంతుల తిరుగుబాట్లను ప్రోత్సహించాయి. కృష్ణదేవరాయలు సాధించిన విజయాలు సామ్రాజ్యానికి కీర్తిప్రతిష్టలను పెంచాయి. కాని అవి విజయనగర వంశానికి గర్వాన్ని, అహంకారాన్ని తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా రామరాయలు అహంతో అధిక ఆత్మవిశ్వాసంతో అజ్ఞానంగా విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి. సుల్తాన్‌ల విషయంలో అతిగా జోక్యం చేసుకొని వారిలో గొప్ప భయాన్ని కలిగించాడు. వారందరూ ఏకం కావడానికి కారకుడయ్యాడు. అందువల్ల వారందరూ ఏకమై విజయనగరాన్ని నాశనం చేశారు. అచ్యుత రాయలు సలకం తిమ్మయ చేతిలో, సదాశివరాయలు రామరాయల చేతిలో కీలుబొమ్మలై వారి ఇష్టారాజ్యం

నడుచుకోనిచ్చారు. వారు చేయగలిగినంత అపకారం వీరు బలహీనతల వల్ల దక్షిణాది సామంతులు, పాలెగాండ్రు తిరుగుబాట్లు చేశారు. వారిని వీరు అణచలేకపోయారు.

లోపభూయిష్టమైన వైదేశిక విధానం: అచ్యుతదేవరాయ బలహీనతను ఆసరాగా తీసుకొని బీజాపూరు సుల్తాన్ అంతర్వేది రాయచూరులను ఆక్రమించాడు. అతడు క్రీ.శ.1535లో నాగలాపురం వరకు వచ్చి నాగలా పురాన్ని నేల మట్టం చేశాడు. ఆ సమయంలో అచ్యుతరాయలు అతనిని ఎదిరించలేదు. రామరాయల కాలంలో అతడు బహమనీ రాజ్యాలను తన రాజ్యంలోకి రానీయకుండా చేయగలిగినా, వారిపై అతని విధానాలు సామ్రాజ్యానికి అపకారం చేశాయి.

రామరాయల మూర్ఖపు విధానాలు-లోపభూయిష్టమైన విదేశీ విధానం: శ్రీకృష్ణదేవరాయల తర్వాత ప్రఖ్యాతి వహించిన అళియ రామరాయలు మూర్ఖంగా ప్రవర్తించి సామ్రాజ్యపు శక్తిని దుర్వినియోగం చేసి ముప్పు తెచ్చాడు. అతడు బహమనీ రాజుల ఆంతరంగిక సమస్యలలో జోక్యం చేసుకొని వారి అంతఃకలహాలలో పాల్గొని, వారిని నొప్పించడమేగాక విజయనగర రాజ్యం తమ రాజ్యాలను కబళించటం ఖాయం అనే భావాన్ని వారిలో కలిగించాడు. వారిపై అతడు సాగించిన అనవసరపు దండయాత్రలు వారిని ఏకమయ్యేటట్లుగా చేసి సామ్రాజ్యానికి తీరని హానిని కలిగించాయి. తత్ఫలితంగా రాక్షస తంగడి యుద్ధం వచ్చి సామ్రాజ్యం చావు దెబ్బతినింది.

రాక్షస తంగడి యుద్ధం: విజయనగర సామ్రాజ్యం క్షీణతకు ముఖ్యకారణం రాక్షస తంగడి యుద్ధం. ఈ యుద్ధంలో జరిగిన ఓటమి వల్ల విజయనగరం కొల్లగొట్టబడి దాని వైభవం, సైనిక, ఆర్థికశక్తులు నశించాయి. ఆ దెబ్బ నుండి సామ్రాజ్యం తర్వాత కోలుకోలేకపోయింది. మూడవ పానిపట్టు యుద్ధం తర్వాత మహారాష్ట్రులు తమ సర్వస్వాన్ని కోల్పోయినట్లు ఈ యుద్ధంలో విజయనగర రాజ్యం తన సర్వశక్తుల్నీ కోల్పోయింది.

తిరుమలరాయల పలాయనం-తప్పిదం: తళ్లికోట యుద్ధంలో ఓడిపోయిన తర్వాత తిరుమలరాయలు విజయనగరాన్ని వదలి పారిపోయి గొప్ప తప్పు చేశాడు. అతడు విజయనగరంలో ఉండి సైనిక సమీకరణ చేసుకొని రాజధాని రక్షణకు నిలిచి పోరాడినట్లయితే సుల్తాన్‌లు బహుశా రాజధానిపైకి వచ్చి ఉండేవారు కాదేమో! అతడు భయపడి పారిపోయినందుకు మహావైభోగంతో వెలిగిన రాజధాని సర్వనాశనం కావడమే గాక విజయనగర రాజ్యానికి చెందిన అపార ధనసంపదలు సుల్తాన్‌ల పరమై వారు శక్తిమంతులయ్యారు. సంపదలు కోల్పోయి విజయనగరం బాగా బలహీనమై దీనావస్థకు చేరింది. శత్రువు దృష్టిలో విజయనగర రాజ్యం అతి చులకనై పోయింది. రాజధాని ధ్వంసంతోనే సామ్రాజ్యపు అదృష్టం తొలగిపోయింది. రాజధాని విధ్వంసం కావడంతో సామ్రాజ్యం తన రూపురేఖలను పోగొట్టుకుంది. ఆ తర్వాత సుల్తాన్‌లకు విజయనగర సామ్రాజ్యంపై దండెత్తడం మంచినీళ్లప్రాయం అయిపోయింది. కనుకనే శత్రువులు జెరూసలెం పట్టణాన్ని నాశనం చేసినట్లు విజయనగరాన్ని రాక్షసతంగడి యుద్ధం నాశనం చేసిందని ఒక హిబ్రూ మతప్రవక్త వ్యాఖ్యానించాడు.

ఆరవీటి వంశస్తుల బలహీనత: తర్వాత విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన ఆరవీటి వంశస్తులలో ఒక్క చిన వెంకటపతిరాయలు తప్ప అందరూ అసమర్థులే, వారు సామ్రాజ్యపు పూర్వవైభవాన్ని పునరుద్ధరించలేక పోయారు.

అంతఃకలహాలు-తోపూరు యుద్ధం: వెంకటపతిరాయల మరణానంతరం సామ్రాజ్యంలో సింహాసనానికి అధికారం కోసం అంతఃకలహాలు బయలుదేరి తోపూరు యుద్ధానికి దారి తీశాయి. ఈ యుద్ధంలో యాచమ నాయకుడు ఒకవైపు, జగ్గారాయుడు మరొకవైపు పోరాడారు. అందులో జగ్గారావు మరణించాడు. కాని జగ్గారావు పక్షం అవలంబించిన మధుర, జింజి, తిరువాన్కూరు మొదలైన సామంతులు విజయనగర చక్రవర్తి అధికారాన్ని తిరస్కరించారు. అందువల్ల సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. కనుక తోపూరు యుద్ధం తళ్లికోట యుద్ధానికంటే సామ్రాజ్యానికి ఎక్కువ చేటు తెచ్చిందని, అదే సామ్రాజ్య పతనం చేసిందని చరిత్రకారులు అంటారు.

అమరనాయక పద్ధతి: విజయనగర పాలనావ్యవస్థ సైనికావసరాలకు అనుగుణంగా రూపొందింపబడింది. అందువల్ల రాజ్యపు సైనిక వ్యవస్థతో మూడువంతులు సైన్యం అమరనాయకుల ఆధిపత్యంలో ఉండేదని రాయవాచకం తెలుపుతోంది. వారికి సైన్యాల పోషణకు జాగీరులివ్వబడేవి. అందువల్ల వారికి ఇచ్చిన భూములపై రాజుకు పరిమిత అధికారాలు మాత్రమే ఉండేవి. అంతేగాక రాజ్యపు సైన్యం మొత్తం చక్రవర్తి ఆధీనంలో ఉండేది కాదు. పైగా అమర నాయకులనే దుర్గాధిపతులుగా సామంతులుగా నియమించేవారు. కాలక్రమేపీ అమర నాయకులు బలవంతులై, చక్రవర్తిని ధిక్కరించేవారు. వారిని అదుపులో పెట్టడం చక్రవర్తికి పెద్ద సమస్యగా

ఉండేది వీలయినప్పుడల్లా వారు స్వతంత్రం ప్రకటించేవారు. వారిపై చక్రవర్తి యుద్ధాలు చేయవలసి వస్తుండేది అందువల్ల సామ్రాజ్యపు సైనికశక్తి వృధా అవుతుండేది. సుల్తాన్‌లపై చూపవలసిన శక్తిని తన సామంతులపై చూపవలసి వచ్చేది. ప్రతి తరంలో సామంతుల తిరుగుబాట్లు జరిగాయి. శ్రీకృష్ణదేవరాయలంతటి వాడికి కూడా సామంతుల బెడద తప్పలేదు. వారి తిరుగుబాట్ల వల్ల సామ్రాజ్యం బలహీనమైంది

సామంతుల తిరుగుబాట్లు-స్వామి ద్రోహం: రాక్షసతంగడి యుద్ధంతో కేంద్ర ప్రభుత్వం బలహీనపడగా దానిని ఆసరాగా తీసుకొని సామంతులు స్వామి ద్రోహం చేసి తిరుగుబాట్లు ప్రారంభించారు. మైసూరు ఒడయారు స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించాడు. అతడు. క్రీ.శ.1610లో తన రాజధానిని శ్రీరంగపట్టణానికి మార్చి తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. మధుర, తంజావూరు, జింజి నాయకులు కూడా పూర్తిగా స్వతంత్ర వైఖరిని అవలంబించారు. వారిని చూసి ప్రతి పాలెగాడు తమ తమ ప్రాంతాలలో తామే రాజులుగా మారారు. దాంతో సామ్రాజ్యం ముక్కలైపోయింది.

సామంతుల కీచులాటలు: సామంతులు చక్రవర్తిని ధిక్కరించడమేగాక తమలో తాము కలహించుకొని ఒకరి ప్రాంతాలు మరొకరు ఆక్రమించి తమలో తాము యుద్ధాలు చేసుకొనేవారు. సంగమ, తుళువ వంశాల కాలంలో వారు సామంతులను అణచి అదుపులో పెట్టగలిగారు. కాని ఆరవీటి వంశస్తులు సామంతులను అదుపులో పెట్టలేకపోయారు. మొదటి శ్రీరంగరాయల కాలంలో హండే, మట్ల, వెలుగోటి తెలుగుచాళుక్య కుటుంబాలు చక్రవర్తిని ధిక్కరించారు. వారు రెండు వర్గాలుగా చీలి క్రీ.శ.1579లో ఘోరయుద్ధం చేసి ఉభయులూ నశించారు ఈ యుద్ధం వారిని అదుపులో పెట్టలేని రాయల బలహీనతను బయటపెట్టింది సామ్రాజ్యపు పునాదులను కదలించింది. దానిని ఆసరాగా తీసుకొని గోల్కొండ సుల్తాన్ అహోబిళాన్ని దోచుకొని ఉదయగిరి, కొండవీడులను ఆక్రమించగలిగాడు. మూడవ శ్రీరంగరాయల కాలంలో మధుర, జింజి నాయకులు ద్రోహం చేసి సుల్తాన్‌లను ఆహ్వానించారు. గోల్కొండ నవాబు వందవాసి వరకు భూములను ఆక్రమించగా, బీజాపూరు సుల్తాన్ పెనుగొండ, కోలారు, బెంగుళూరులను ఆక్రమించాడు. ఆ స్థితిలో వారిని ఎదిరించడానికి రాయలకు శక్తివంతమైన సైన్యం లేకుండాపోయింది.

సైనిక నిర్వీర్యత: మధ్యయుగంలో ఏరాజ్యం అయినా దాని సైనిక శక్తి మీదనే ఆధారపడి ఉండేది. మొదటి నుండి విజయనగర రాజులు గొప్ప సైన్యాన్ని పోషించారు. తళ్లికోట యుద్ధం తర్వాత వారి సైనిక శక్తి ఛిన్నాభిన్నమైంది. మూడవ శ్రీరంగరాయల కాలంలో సామంతుల తిరుగుబాటులతో విజయనగర చక్రవర్తికి సొంత సైన్యం అంటూ లేకుండాపోయింది. ఈ సైనిక లోపం సామ్రాజ్య పతనానికి బలమైన కారణంగా పరిణమించింది.

విజయనగర సైన్యంలో లోపాలు: అంతేగాకుండా విజయనగర సైన్యంలో అనేక లోపాలు ఉన్నాయి. బహమనీ సుల్తాన్‌ల సైన్యాలు యుద్ధతంత్రంలో గొప్ప నేర్పు గలిగినవి. వారు టర్కీ యుద్ధ పద్ధతులను అనుసరించేవారు. మధ్యయుగంలో టర్కీ సైన్యం ప్రపంచ ప్రఖ్యాతి చెందింది. వారు గొప్ప యుద్ధవీరులు, వారి యుద్ధ వ్యూహం అద్భుతం, దక్కనులోని ముస్లిం సేనానులను టర్కీ పర్షియా నుండి వచ్చేవారు. అక్కడి పద్ధతులు విజయనగరంపై ప్రయోగం చేశారు. అలాంటి పద్ధతులు విజయనగర సైన్యాలకు తెలియదు. విజయనగర సైనికులు వ్యక్తిగతంగా గొప్ప పరాక్రమవంతులే, కాని యుద్ధ వ్యూహ రచనలో, క్రమశిక్షణలో వారు ముస్లిం సైన్యాలకు దీటుకాలేక పోయారు. రెండవ దేవరాయల కాలంలో ఎందుకు ముస్లిం సైన్యాలు విజయం సాధిస్తున్నాయని సమీక్ష చేసుకొని ముస్లిం సైన్యాలకు తమ సైన్యం ధీటు కాదని తెలుసుకొని ముస్లిం సైనికులను చేర్చుకున్నారు. కాని క్రమేపీ ముస్లిం సైనికుల సంఖ్య పెరిగి, విజయనగర సైన్యంలో రాజభక్తి, దేశభక్తికి ముప్పు వచ్చింది రాయరాయలు ముస్లిం సైన్యాలను విపరీతంగా పెంచాడు. కాని తళ్లికోట యుద్ధంలో వారే ద్రోహం చేశారు సుల్తాన్‌ల సైన్యంలో అశ్వదళానికి ఎక్కువ ప్రాముఖ్యత ఉండేది. అశ్వాలు అతివేగంగా వచ్చి విజయనగర సైన్యాలను చెల్లాచెదురు చేసేవి. వారికి అరబ్బు దేశాల నుండి మేలైన గుర్రాలు లభించేవి. కాని విజయనగర రాజులకు ఉత్తమ అశ్వాలు లభించేవి కావు. ఒకవేళ ఉన్నా వాటిని ముస్లింలు నడిపినంత సమర్ధవంతంగా హిందూ రౌతులు నడపగలిగే వారు కాదు. వారికంత నేర్పు లేదు. అశ్వదళమేగాక ముస్లింలకు ఫిరంగి దళం, తుపాకులు కూడా ఉండేవి, వారికి అవి ముస్లిం రాజ్యాలైన టర్కీ పర్షియాల నుంచి వచ్చేవి. కాని విజయనగర రాజులకు ఫిరంగిలను గురించి ఎక్కువగా తెలియదు. విజయనగర రాజ్యానికి పదాతిదళం ఎక్కువగా ఉండేది, వారికి కవచాలు ఉండేవి కావని, వంటికి నూనె మర్దన చేసుకొనేవారని ఫెరిష్టా రాశాడు. చర్మకవచాలు,

శిరస్త్రాణాలు ధరించేవారని పేస్, బర్రాసులు రాశారు. వారు యుద్ధానికి వెళ్లేటప్పుడు. మొగల్ సైన్యం ఒక పట్టణం కదిలిపోతున్నట్లుగా ఉండేది వారితోపాటు వస్తు సామాగ్రి పనివారు. స్త్రీలు కూడా వెళ్లేవారు. అందువల్ల సంఖ్యాపరంగా అధికంగా ఉండి యుద్ధాలలో క్లిష్టపరిస్థితులలో త్వరగా కదలటానికి వీలులేకుండా అనర్థకంగా తయారయ్యేది ముస్లిం గుర్రపుదళాలు వారిపై బడి సునాయాసంగా వధిస్తూ ఉండేవి. ముస్లింలు యుద్ధనీతిని పాటించేవారు కాదు. శత్రువు ఓడిపోగానే వారిని పూర్తిగా నాశనం చేసి వారి రాజ్యాలను కొల్లగొట్టుకొని పోయేవారు. కాని విజయనగర రాజులు భారతంలో చెప్పిన యుద్ధ ధర్మాలను పాటించేవారు. శత్రువును పూర్తిగా నాశనం చేసేవారు కాదు. కనుక ముస్లింలు ఓడిపోయినా సురక్షితంగా ఉండేవారు. బలాన్ని పుంజుకొని తిరిగి పదేపదే దాడులు చేసి శత్రువుని నాశనం చేసేవారు. అలాగే ముస్లింలకు మత దీక్ష ఎక్కువ. విజయనగర సైన్యానికి లేదు. హిందూ సైన్యంలో కులాలుండేవి. వారిలో ఐక్యత ఉండేది కాదు. హిందువులకు సహజంగా పరమత సహనం ఉంటుంది. ముస్లింలు చూపినంత పట్టుదల హిందూ సైనికులు చూపేవారు కాదు. అలాగే రాజు గాని సేనా నాయకుడుగాని యుద్ధరంగంలో మరణిస్తే హిందూ సైన్యం మరొక సేనాధిపతి నాయకత్వంలో సంఘటితం కాకుండా పారిపోయేది. తళ్లికోట యుద్ధంలో రామరాయలు మరణించగానే విజయనగర సేన పారిపోయి దారుణంగా వధింపబడింది.

విజయనగర సైన్యం, సుల్తాన్‌ల సైన్యాల పరిస్థితి పోర్చుగీసు యాత్రికుడు డ్యూరాటె బార్బొసా వర్ణించాడు యుద్ధాలకు వెళ్లేటప్పుడు ముస్లిం సరదారులు తమతో గుడారాలను తీసుకువెళ్లారు. వారి భార్యలు కూడా వారి వెంట వెళ్లారు. ఎత్తుగా అమర్చిన జీనులపై కూర్చొని కొరదాలను చేత బట్టి తమ గుర్రాలపై స్వారీ చేస్తారు పొడుగుపాటి సన్నని తాళ్లు జీనులకు కడతారు. వారు కురుచ కోట్లను ధరిస్తారు. ఉక్కు కవచాలను ధరిస్తారు గుర్రాలకు కూడా కవచాలు తొడుగుతారు. గుర్రపు శిరస్సులపై ఉక్కు పట్టీ ఉంటుంది. రెండు కత్తులు, గదలు గండ్రగొడ్డళ్లు, నాలుగు మొనలు కలిగిన ఖడ్గాలు ఉపయోగిస్తారు. రెండు టర్కీ అమ్ములపొదులు గుర్రాల జీనులకు వేలాడగట్టి తీసుకుపోతారు. దక్కనులోని హిందువులు నల్లగా ఉంటారు. కాని దృఢశరీరులు. విజయనగర రాజుకు ఎక్కువ పదాతి దళం ఉంటుంది. వారిలో కొంత మంది మాత్రమే రౌతులు, వారు కత్తులు, పిడిబాకులు అమ్ములపొదులు, బాణాలను తమ వెంట తీసుకువెళతారు. ఒక చేతిలో డాలు మరొక చేతిలో కత్తి ఉంటుంది వారు మంచి విలుకాండ్రు. వారి బాణాలు ఇంగ్లిషు వారి బాణాల లాగా బాగా పొడవుగా ఉంటాయి. హిందూ సైనికులు నడుమ భాగాన ఎలాంటి ఆచ్ఛాదన ఉండదు. నడుము కింద ఉడుపులు మాత్రమే ఉంటాయి. పాదాలకు జోళ్లు కూడా ఉండవు. తలలపై పాగాలు ధరిస్తారని రాశారు. రష్యా యాత్రికుడు అసనాసియన్ నికికిన్ కూడా అదే విధంగా రాశాడు. బార్బొసా వర్ణనలను బట్టి హిందూ సైన్యాలకన్నా ముస్లిం సైన్యాలు అనేక విధాలుగా పటిష్టంగా సమర్థవంతంగా రూపొందింపబడ్డాయని స్పష్టంగా తెలుస్తోంది. పటిష్టమైన సైన్యం అద్భుత విజయాలు సాధించడం ఆశ్చర్యం కాదు. కనుకనే ముస్లిం సైన్యాలు విజయనగర రాజ్యంలో వీరవిహారం చేసి విజయనగర రాజ్యాన్ని అంతం చేయగలిగాయి.

ఆర్థిక దుస్థితి: సామ్రాజ్య నిర్వహణకు, సైనిక పోషణకు ధనం అత్యంత ముఖ్యమైంది. విజయనగర సామ్రాజ్యం మొదటి నుండి సిరిసంపదలతో తులతూగింది. కాని తళ్లికోట యుద్ధంలో సామ్రాజ్యం సర్వనాశనమైంది. ముస్లిం సైన్యాలు విజయనగర పట్టణాన్ని, సామ్రాజ్యాన్ని సమూలంగా దోచుకున్నారు. ఆ దెబ్బ నుండి సామ్రాజ్యం తిరిగి కోలుకోలేదు. సామంతుల తిరుగుబాటుతో విజయనగర చక్రవర్తులకు కప్పం వసూలు కాలేదు. తళ్లికోట యుద్ధకాలం నుండి అరాచక పరిస్థితులు నెలకొని ఉన్నందువల్ల పన్నులు సవ్యంగా వసూలు కాలేదు. పన్నులు కూడా అధికంగా ఉండేవి. అందువల్ల ప్రజలు కూడా కష్టకాలంలో సహకరించకుండా క్లిష్టపరిస్థితుల్లో పన్నులు చెల్లించకుండా తప్పించుకోడానికి ప్రయత్నించేవారు. అందువల్ల విజయనగర సామ్రాజ్య ఖజానా ఒట్టి పోయింది.

బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌ల నిరంతర దండయాత్రలు: తళ్లికోట యుద్ధం తర్వాత బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌లు నిరంతరం విజయనగర రాజ్యంపై దండెత్తి ఒక్కొక్క ప్రాంతాన్నే ఆక్రమించసాగారు. ఆరవీటి వంశస్థులు వారి దండయాత్రను అరికట్టలేకపోయారు. చివరి విజయనగర సార్వభౌముడు మూడవ శ్రీరంగరాయల రాజధాని వెల్లూరును క్రీ.శ.1646లో గోల్కొండ సేనాని మీర్జుంలా ఆక్రమించాడు. తర్వాత శ్రీరంగరాయలు తన రాజధానిని పునరాక్రమించాడు. కాని మళ్లీ బీజాపూరు సైన్యాలు వెల్లూరును ఆక్రమించాయి

మూడవ శ్రీరంగరాయల నిస్సహాయత: పరిస్థితులలో మూడవ శ్రీరంగరాయలకు అతని సామంతులు సహాయం చేయలేదు. అయినప్పటికీ అతడు సామ్రాజ్యాన్ని పునరుద్ధరించడానికి తన జీవితాంతం ప్రయత్నించాడు కాని విఫలుడై అతడు క్రీ.శ.1675-80 సంవత్సరాల మధ్య మరణించాడు. అతని మరణంతో విజయనగర సామ్రాజ్యం అంతరించింది. ఆ విధంగా మూడున్నర శతాబ్దాలపాటు దేదీప్యమానంగా వెలిగిన విజయనగర సామ్రాజ్యం అస్తమించింది.

విజయనగర సామ్రాజ్య పతన ఫలితాలు: విజయనగర సామ్రాజ్య పతనం దక్షిణ భారతదేశ చరిత్రలో పెను మార్పులను తెచ్చింది. హిందువులు తమ రాజకీయ అధికారాన్ని కోల్పోయారు. బహమనీ సుల్తాన్‌లు విజయం సాధించినప్పటికీ ఆ తర్వాత విజయనగరం భయం పోయినందున వారిలో ఐక్యత త్వరలోనే నశించి వారు అంతఃకలహాలపాలయ్యారు. అయినప్పటికీ వారి రాజ్యాలు త్వరితగతిని కర్ణాటకం, తమిళనాడులోకి విస్తరించాయి. కాని ఉత్తరదేశం నుండి వారిపై మొగలులు దాడి చేశారు. విజయనగర సామ్రాజ్య పతనం మొగల్ సామ్రాజ్యం దక్షిణదేశంలోకి త్వరగా విస్తరించడానికి దోహదం చేసింది. విజయనగర సామ్రాజ్యం ఉండి ఉంటే మొగల్ సామ్రాజ్యం దక్షిణదేశంలోకి విస్తరించి ఉండేది కాదు. విజయనగర సామ్రాజ్య పతనం వల్ల ఇండియాలో పోర్చుగీసు వారు కూడా పతనమయ్యారు. వారి వ్యాపారం కూలిపోయింది. ఆదాయం పడిపోయింది. అందువల్ల ఇతర ఐరోపా జాతులు ఇండియాలో తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోగలిగారు. తర్వాత డచ్చి, ఇంగ్లిషు, ఫ్రెంచి కంపెనీలు బాగా విస్తరించాయి. తళ్లికోట యుద్ధం ఇంగ్లిషు వారు విజయనగర రాజ్యంలో వ్యాపార స్థావరాలు నెలకొల్పుకోవడానికి అవకాశాన్ని ఇవ్వగా, విజయనగర రాజ్య పతనం ఇంగ్లిషు వారు అచిర కాలంలోనే కర్ణాటక రాజ్యాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోడానికి వీలైంది. తత్ఫలితంగా ఇంగ్లిషు వారు ఇండియాకు పాలకులు కాగలిగారు ఈ విధంగా విజయనగర రాజ్యపతనం భారతదేశ చరిత్ర గతిని మార్చివేసింది.

బహమనీ విజయనగర సంఘర్షణ లేక సంబంధాలు

మహమ్మద్ బిన్ తుగ్లక్ నిరంకుశం వల్ల తుగ్లక్ సామ్రాజ్యం ఛిన్నాభిన్నమైంది. తత్ఫలితంగా దక్షిణదేశంలో విజయనగర బహమనీ రాజ్యాలు స్థాపించబడ్డాయి. విజయనగర రాజ్యం హిందూ రాజ్యం దీనిని హరిహర బుక్కరాయలు 1336లో తుంగభద్రానది ఒడ్డున స్థాపించాడు. దీని రాజధాని విజయనగరం బహమనీ రాజ్యం ముస్లిం రాజ్యం దానిని అల్లావుద్దీన్ హసన్‌గంగు 1347లో దక్కన్‌లో స్థాపించాడు. దాని రాజధాని గుల్బర్గా ఈ రెండు రాజ్యాలు స్థాపించబడిన నాటి నుండి నశించే వరకు ఆగర్భ శత్రువుల్లాగ నిరంతర పోరాటాలు జరిపి ప్రజలకు శాంతిభద్రతలు లేకుండా చేశాయి

సంఘర్షణకు కారణాలు: ఈ రెండు రాజ్యాల మధ్య సుదీర్ఘ సంఘర్షణ జరగడానికి కొన్ని కారణాలు ఉన్నాయి. అవి ఏమిటంటే మతభేదం, రాజ్య విస్తరణ కాంక్ష, రాయచూరు, అంతర్వేదులపై ఆధిపత్యం, ఉభయులు ఎల్లప్పుడూ యుద్ధ ప్రయత్నాలలో ఉండటం ఆర్థిక కారణాలు.

మతం: స్వభావ సిద్ధంగా ఈ రెండు రాజ్యాలు రెండు విరుద్ధ మతాలకు చెందినవి. బహమనీ సుల్తాన్‌లు దక్షిణదేశంలో హిందూ మతాన్ని తుడిచివేసి ఇస్లాంను వ్యాపింపచేయాలని కోరుతుండేవారు విజయనగర ప్రభువులు ఇస్లాం మతవ్యాప్తిని అరికట్టి హిందూధర్మాన్ని రక్షించాలని కంకణం కట్టుకున్నారు ధర్మ రక్షణే వారి విధి అని విద్యారణ్యులు విజయనగరాన్ని స్థాపించేటప్పుడు. స్పష్టంగా చెప్పారు. కనుక ఈ రెండు రాజ్యాల మధ్య ఉన్న తీవ్ర మతభేదం వారి విరోధానికి సంఘర్షణకు మొదటి కారణం, కాని కొందరు మతభేదమే ప్రధాన కారణం కాదు అని భావించారు

రాజ్యవిస్తరణ కాంక్ష: బహమనీ సుల్తాన్‌లు తమ రాజ్యాన్ని దక్షిణంగా విస్తరించుకోవాలని ఆశించేవారు విజయనగర ప్రభువులు బహమనీ రాజ్యాన్ని దక్షిణంగా విస్తరించనివ్వరాదని పట్టుపట్టారు. ఇంకా అవకాశం లభిస్తే తమ రాజ్యాన్ని కృష్ణను దాటి ఉత్తరంగా విస్తరించాలని ప్రయత్నిస్తూ ఉండేవారు. సహజంగా ఉన్న వారి రాజ్య కాంక్షే వారి సంఘర్షణకు ప్రధాన కారణం కనుకనే గొర్తి వెంకట్రావు మత భేదం ప్రధాన కారణం కాదు, వారి మధ్య రాజ్య కాంక్ష వల్ల కలిగిన సంఘర్షణను తీవ్రతరం మాత్రమే చేసిందని చెప్పాడు.

రాయచూరు, అంతర్వేదిలపై ఆధిపత్యం: రాజ్య విస్తరణలో కృష్ణ, తుంగభద్రా నదుల మధ్య ఉన్న రాయచూరు, అంతర్వేది, ముద్గల్‌లు చాలా కీలకపాత్రను వహించాయి. ఈ ప్రాంతం ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఉభయ ప్రాంతాలను అదుపులో ఉంచుకోవచ్చును. దక్షిణదేశంలోకి తమ రాజ్యాన్ని విస్తరించాలనీ రాయచూరు తమ ఆధీనంలో ఉండాలని బహమనీ సుల్తాన్‌లు తలంచారు. ఆ ప్రాంతాలు తమ ఆధీనంలో లేకపోతే తమ రాజ్యానికి రక్షణ లేదని విజయనగర ప్రభువులు తలంచారు. కనుక అతికీలక స్థానమైన ఈ ప్రాంతాల కోసం దాదాపు ప్రతి తరంలో యుద్ధం జరిగింది. పైగా ఈ ప్రాంతాలపై ఎవరికీ నిర్దిష్టమైన హక్కులేదు. ఉభయులూ ఆ ప్రాంతాలు తమవేనని వాదించారు. బుక్కరాయలు ఆ ప్రాంతం తమదనగా, ముజాహిద్‌షా తమదని వాదించాడు ఈ ప్రాంతాలు ఈ యుగంలోనే గాక పల్లవుల కాలం నుండి కీలకపాత్ర వహించాయి. ఈ ప్రాంతాల కోసమే పల్లవులకు, చాళుక్యులకు, చోళులకు, కళ్యాణీ చాళుక్యులకు, దేవగిరి యాదవులకు, హోయసాలులకు భయంకర యుద్ధాలు జరిగాయి. ఈ యుగంలో ఈ రెండు రాజ్యాలు పోరాడాయి. ధనగిరి యాదవులు స్థానంలో బహమనీ రాజ్యం ద్వారసముద్ర హోయసాలుల శిథిలాలపై విజయనగర రాజ్యం వెలసింది. ఈ రెండు రాజ్యాల మధ్య పూర్వపు సంఘర్షణ పునరావృతమైంది.

ఆర్థిక కారణాలు: బహమనీ రాజ్యం ఉన్న దక్కను పీఠభూమి నిస్సారమైంది. బహమనీ సుల్తాన్‌లు తమ రాజ్యం నుండి తగినంత ఆర్థిక వనరులను పొందలేకపోయే వారు. కాని విజయనగర సామ్రాజ్యం వెలసిన దక్షిణ దేశం సారవంతమైంది ఐశ్వర్యాలతో తులతూగుతూ ఉండేది. కనుక విజయనగరంపై దాడి చేసిన కావలసినంత ధనాన్ని కొల్లగొట్టవచ్చు అని బహమనీ సుల్తాన్‌లు ఆశించేవారు. అంతేగాక రాయచూరు, అంతర్వేది కూడా సారవంతమైన ప్రాంతం. దానిని కలుపుకున్నా ఒకవైపు రాజ్య విస్తరణకు, మరొకవైపు ఆర్థికపుష్టిని పొందటానికి

వీలు కలుగుతుందని భావించారు.

ఉభయులు సర్వవేళలా యుద్ధసన్నద్ధులై ఉండేవారు: ఈ ఉభయ రాజ్యాలు ఒకరిని చూసి ఒకరు భయపడుతూ వారు దాడి చేస్తారని మరొకవైపు వీలైన తమ లక్ష్యాలను సాధించుకోవచ్చునని సర్వవేళలా సైన్యాలను సమీకరించుకొని యుద్ధసన్నద్ధులై ఉండేవారు ఈ కవ్వింపు చర్యలు కూడా వారి సంఘర్షణను తీవ్రతరం చేశాయి. ఈ సంఘర్షణలో ఉభయులూ తీవ్రంగా నష్టపడ్డారు. ఉభయ రాజ్యాల ప్రజలు అనేక హింసలకు గురయ్యారు. చివరకు తళ్లికోట యుద్ధంలో విజయనగరం ధ్వంసమై సామ్రాజ్యం పతనమైంది బహమనీ రాజ్యాలు దక్షిణంగా విస్తరించాయి.

సంఘర్షణ స్వరూపం సంగమ యుగం క్రీ.శ.1336-1485: మొదటి హరిహరరాయలు హసన్ గంగు ఈ రెండు రాజ్యాలు స్థాపించగానే మొదటి తరంలోనే అంటే హరిహరరాయల కాలంలోనే ఈ రాజ్యాలకు మధ్య సంఘర్షణ ప్రారంభమైంది. బహమనీ రాజ్యాన్ని స్థాపించిన హసన్‌గంగు రెండు పర్యాయాలు విజయనగరంపై దండెత్తాడు. మొదటిసారి రాయచూరు, అంతర్వేదిని ఆక్రయించాడు. రెండవ దాడిని హరిహరుడు తిప్పికొట్టాడు.

మొదటి బుక్కరాయలు: మొదటి మహమ్మద్‌షా ముజహిద్‌షా క్రీ.శ (1358-78) మొదటి హరహర రాయల కాలంలోనే బహమనీ దాడులు మొదలైనప్పటికీ సుదీర్ఘ బహమనీ విజయనగర సంఘర్షణ బుక్కరాయల కాలం నుండి ప్రారంభమైందని చరిత్రకారులు భావిస్తారు. కారణమేమిటంటే హసన్‌గంగు కుమారుడు మొదటి మహమ్మద్‌షా తన సంగీత విద్వాంసులకు విజయనగర ఖజానాపై ఒక హుండీని ఇచ్చాడు. దాంతో ఈ రెండు రాజ్యాలకు విరోధం ప్రారంభమైంది. మొదటి బుక్కరాయలు తుంగభద్రను దాటి రాయచూరు, ముద్గల్‌ను ఆక్రమించాడు. కాని తర్వాత మహమ్మద్‌షా అతనిని రెండుసార్లు ఓడించాడు. ఈ మూడు యుద్ధాలలో ఎవరూ ఖచ్చితమైన విజయం సాధించలేదు జనం అనేక బాధలకు గురయ్యారు. కనుక ఉభయులూ ఇకముందు జనాన్ని హింసించరాదని అంగీకరించి సంధి చేసుకున్నారు. మహమ్మద్‌షా మరణానంతరం అతని కుమారుడు రాయచూరు తమదేనని వాదించి దండెత్తాడు. కాని బుక్కరాయల కుమారుడు రెండవ హరిహరరాయలు అతనిని ఓడించి తరిమాడు.

రెండవ హరిహరరాయలు-ఫిరోజ్‌షా (క్రీ.శ.1377-1404): ముజాహిద్‌షా తర్వాత రాజ్యానికి వచ్చిన మహమ్మద్‌షా శాంతికాముడైనందువల్ల రెండవ హరిహరరాయలు బహమనీ రాజ్యంపై దండెత్తి అంతర్వేది, తెలంగాణ, పానుగల్లు, మహారాష్ట్రలో రంగణి దుర్గాన్ని ఆక్రమించాడు. తర్వాత సుల్తాన్ అయిన ఫిరోజ్ దండెత్తి సాగరు వద్ద హరిహరుని ఓడించి ఆ ప్రాంతాలనే గాక రాయచూరును కూడా వశపరచుకున్నాడు. ఇంకా నష్టపరిహారం కూడా వసూలు చేశాడు.

మొదటి దేవరాయలు-ఫిరోజ్‌షా (క్రీ.శ.1404-1422): రెండవ హరిహరరాయల తర్వాత రాజ్యానికి వచ్చిన మొదటి దేవరాయలు ఫిరోజ్‌తో యుద్ధం చేశాడు. వీరిద్దరికీ యుద్ధం రావడానికి కారణం ముద్గల్‌లోని ఒక కంసాలి యువతి. ఆమెకు పరాల్ అని, నేహల్ అని రెండు పేర్లు ఉన్నాయి. ఆ యువతిని దేవరాయలు ప్రేమించి ఆమె కోసం ముదల్గ్‌పై దండెత్తాడు. కాని ఆమె కనిపించకపోవడంతో అక్కడ ప్రజలను హింసిస్తుండగా ఫిరోజ్‌షా వచ్చి దేవరాయలను ఓడించి రాయల కుమార్తెను వివాహం చేసుకొని బంకాపురాన్ని కట్నంగా పొందాడని ఫెరిష్టా రాశాడు కాని ఈ కథను చరిత్రకారులు తిరస్కరించారు. ఈ యుద్ధం ఫిరోజ్ ప్రకటించిన జీహాద్ అని సయ్యద్ అలీ అనే పండితుడు అన్నాడు. ముద్గల్ యుద్ధం తర్వాత ఫిరోజ్ పానుగల్లును ముట్టడించగా రాయలు అతనిని ఓడించి తరిమాడు. దాంతో ఫిరోజ్ యుద్ధాలు మాని విషయలోలుడై చివరకు సోదరునిచే బంధింపబడి మరణించాడు

రెండవ దేవరాయలు-రెండవ అహమ్మద్‌షా (క్రీ.శ.1422-35): రెండవ దేవరాయల కాలంలో కూడా ఉభయ రాజ్యాలకు యుద్ధాలు జరిగాయి. ఈ యుద్ధాలలో రెండవ అహమ్మద్‌షా విజయనగరంపై దండెత్తి రాయలను ఓడించి ధనరాసులతో తిరిగివచ్చాడని ఫెరిష్టా రాశాడు. కాని అదే కాలంలో విజయనగరాన్ని దర్శించి పారశీక రాయబారి అబ్దుల్‌రజాక్ రాయల సైన్యం గుల్బర్గా వరకు నడచి అనేక మంది ముస్లింలను బందీలుగా తెచ్చారని రాశాడు. రజాక్ సమకాలికుడు, కనుక అతని రాతలే సత్యాలని నమ్మవచ్చును.

మల్లికార్జున విరూపాక్షరాయలు-మూడవ మహమ్మద్‌షా (క్రీ.శ.1440-1485): రెండవ దేవరాయలు తర్వాత రాజ్యానికి వచ్చిన మల్లికార్జున విరూపాక్షులు అసమర్థులైనందువల్ల మూడవ మమహ్మద్‌షా మంత్రి గవాన్

విజయనగరంపై దండెత్తి గోవా, బెల్గాం, రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించి కంచి వరకు కొల్లగొట్టాడు. విరూపాక్షరాయల తర్వాత సాళువ నరసింహరాయలు సంగమ వంశాన్ని తొలగించి సింహాసనాన్ని అధిష్టించాడు.

సాళువ యుగం (క్రీ.శ.1485-1505): సాళువ నరసింహుడు రాజ్యానికి రాగానే బహమనీ రాజ్యంపై దండెత్తి గోవా, చౌల్, దేబల్‌లను జయించాడు. తూర్పుతీరంలోను పోగొట్టుకున్న ప్రాంతాన్ని సంపాదించాడు.

తుళువ యుగం (క్రీ.శ.1505-1570): ఈ యుగంలో బహమనీ, విజయనగర సంఘర్షణ తీవ్రస్థాయిని అందుకుంది. విజయనగర రాజ్యం విజృంభించి బహమనీ నడిగడ్డన అఖండ విజయాలు సాధించి బహమనీ సుల్తాన్‌లను భయంకపితులను చేసి తనకు లోబడేటట్లు చేసుకుంది. ఆ తర్వాత తళ్లికోట యుద్ధం కూడా ఈ యుగంలోనే జరిగింది. తుళువ యుగంలో బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై ఐదు రాజ్యాలుగా చీలిపోయింది. కాని తుళువ వంశం హయాంలో విజయనగరంపై దండెత్తగా వీరనరసింహరాయలు వారిని ఓడించాడు.

శ్రీకృష్ణదేవరాయలు-ఇస్మాయిల్ (క్రీ.శ.1509-1530): కృష్ణదేవరాయల రాకతో బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై ఐదు రాజ్యాలుగా చీలిపోయింది. రాయలు బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్‌ను దివాని, కోవెలకుంట్ల వద్ద ఓడించి రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించాడు. తర్వాత బీదరు బాలసుల్తాన్‌ను, అతని సేనాని బరీద్ బంధించగా గుల్బర్గా వరకు నడచి బరీద్‌ను శిక్షించి బాల సుల్తాన్‌ను సింహాసనంపై కూర్చుండబెట్టి యవన రాజ్య స్థాపనాచార్య అనే బిరుదు పొందాడు. గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా కొండవీటిని ముట్టడించగా రాయలు తన సేనాధిపతి పాండురంగని పంపించి కులీకుతుబ్‌షాను ఓడించి తరిమివేశాడు. బహమనీ సుల్తాన్‌లతో జరిగిన యుద్ధాలలో రాయలు సుల్తాన్‌లను గడగడలాడించాడు.

అచ్యుతదేవరాయల కాలం (క్రీ.శ.1530-1542): అచ్యుతదేవరాయలు కాలంలో బహమనీ సుల్తాన్‌లతో మూడు పర్యాయాలు సంఘర్షణ జరిగింది. అచ్యుతరాయలు రాజ్యానికి రాగానే బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ రాయచూరు, అంతర్వేదిలపై దండెత్తాడు. అతడిని ఆరవీటి తిమ్మరాజు కుమారుడు అప్పలరాజు ఎదిరించి మరణించాడు. ఇస్మాయిల్ రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించాడు. క్రీ.శ.1534లో ఇస్మాయిల్ మరణించాడు. అతని కుమారుల మధ్య వారసత్వయుద్ధం వచ్చింది. బెల్గాం పాలకుడు అసద్‌ఖాన్ తిరుగుబాటు చేశాడు. ఆ సమయంలో అచ్యుతరాయలు అంతర్వేదిపై దండెత్తి రాయచూరు ముద్గల్‌ను ఆక్రమించాడు. బీజాపూరు రాజ్యంలో అంతర్యుద్ధం తర్వాత ఇబ్రహీం ఆదిల్‌షా సింహాసనానికి వచ్చాడు. అతడు విజయనగర రాజ్యపై దండెత్తి నాగలాపురంలోని కొన్ని భవనాలను నేల మట్టం చేశాడు. తర్వాత తిరిగి వెళ్లిపోయాడు.

రాయరాయలు-తళ్లికోట యుద్ధం (క్రీ.శ.1565): అచ్యుతదేవరాయల తర్వాత రాజ్యానికి వచ్చిన సదాశివరాయలు బలహీనుడైనందువల్ల రామరాయలు సర్వాధికారాలు చెలాయిస్తూ సుల్తాన్‌ల అంతఃకలహాలలో జోక్యం చేసుకున్నాడు. మొదట అది లాభంగా కనబడినా తర్వాత విజయనగర సామ్రాజ్య నాశనానికి దారితీసింది. రామరాయలు మొదట అహమ్మద్‌నగర్, గోల్కొండ నవాబులతో చేరి బీజాపూరు సుల్తాన్‌ని ఓడించాడు. తర్వాత బీజాపూరుతో చేరి అహమ్మద్‌నగర్‌పై తండెత్తాడు. గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్‌షాకు సింహాసనానికి రావడానికి సహాయపడిన అతని సామంతుడు జగదేకరావు తిరుగుబాటును సమర్థించగా ఇబ్రహీం కూడా విరోధి అయి అహమ్మద్‌నగర్ సుల్తాన్‌తో చేరి సుల్తాన్‌లందరినీ ఏకం చేసి విజయనగరంపై దండెత్తి తళ్లికోట యుద్ధంలో రామరాయలను వధించాడు. అపజయం తెలిసి సదాశివరాయలు, తిరుమలరాయలు పెనుగొండకు చేరగా సుల్తాన్‌లు విజయనగరంలో ప్రవేశించి నగరాన్ని ధ్వంసం చేసి దోచుకున్నారు. దాంతో విజయనగర సామ్రాజ్యం పతనం ప్రారంభమైంది. ప్రపంచంలో సాటిలేని వైభవాన్ని అనుభవించిన విజయనగర పట్టణం మట్టిపాలైంది.

ఆరవీడు యుగం (క్రీ.శ.1570-1680): తళ్లికోట యుద్ధం తర్వాత బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌లు విజయనగర రాజ్య భాగాలపై దాడులు చేస్తూ దక్షిణంగా తమ రాజ్యాలు విస్తరించకోసాగారు. వారిని నిరోధించి రాజ్యాన్ని కాపాడుకోవటానికి ఆరవీటి వంశస్తులు తమ శక్తి కొలదీ పోరాడారు. పెనుగొండను ముట్టడించగా తిరుమల రాయలు వారిని ఓడించి తరిమాడు. తర్వాత రెండవ వెంకటపతిరాయలు గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లను ఓడించి కోల్పోయిన చాలా భాగం రాజ్యాన్ని సంపాదించాడు. కాని ఆయన మరణానంతరం రాజవంశంలో వచ్చిన వారసత్వ యుద్ధాల వల్ల, సామంతుల తిరుగుబాట్ల వల్ల రాజ్యం మరీ బలహీనమైంది. దీనిని ఆసరాగా తీసుకొని మూడవ శ్రీరంగరాయల కాలంలో బీజాపూరు, గోల్కొండ సుల్తాన్‌ల శ్రీరంగరాయలపై దండెత్తారు. 1647లో బీజాపూరు మైసూరు ప్రాంతాన్ని, గోల్కొండ సేనాని మీర్జుంలా చంద్రగిరి, తిరుపతి

పులికాట్, నెల్లూరులను ఆక్రమించాడు. శ్రీరంగరాయలు రాజ్యం కాపాడుకోటానికి తన యావత్‌శక్తిని వినియోగించాడు. కాని సాధ్యం కాలేదు. నిరాశతో 1680లో మరణించాడు. ఆయన మరణంతో విజయనగర రాజ్యం అస్తమించింది. ఆ తర్వాత 7 సంవత్సరాలకు అంటే 1686-87లలో బీజాపూరు, గోల్కొండలను ఔరంగజేబు జయించి మొగల్ సామ్రాజ్యంలో కలిపాడు. దాంతో బహమనీ రాజ్య అవశేషాలు నశించాయి.

సంఘర్షణ ఫలితాలు: బహమనీ విజయనగర సంఘర్షణలో ఉభయ రాజ్యాలు విపరీత నష్టాన్ని పొందాయే గాని ఏ ఒక్కరూ లాభపడలేదు. ఎంతో ధనం యుద్ధాలకు ఖర్చు అయింది. ఉభయ రాజ్యాల ప్రజలు 3 శతాబ్దాల పాటు నిరంతరం పోరాటాలతో మునిగి ఉన్నందువల్ల ఉత్తరదేశ రాజకీయాలతో జోక్యం కలిగించుకోలేక పోయాయి. అందువల్ల బాబరు ఢిల్లీ సుల్తాన్‌ల నోడించి మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బహమనీలు ఢిల్లీ సుల్తాన్‌లకు సహాయం చేసినట్లయితే మొగలులు ఇండియాలో సామ్రాజ్యం స్థాపించలేకపోయేవారు. అంతే గాకుండా మొగలులు దక్కనుపై దండయాత్రలు ప్రారంభించిన తర్వాత కూడా వారు విజయనగరంపై దాడులు మానలేదు. ఐకమత్యం పాటించలేదు. ఒంటరిగా పోరాడి మొగలులకు పాదాక్రాంతులయ్యారు. విజయనగర సామ్రాజ్యం బహమనీలతో నిరంతరం పోరాటాలు సాగించి దక్షిణదేశంలో హిందూధర్మాన్ని కాపాడి చరితార్థులయ్యారు. హిందూ సంస్కృతికి ఎనలేని సేవ చేసి, హిందువుల మనో వీధులలో చిరస్మరణీయంగా నిలిచి విజయనగర సామ్రాజ్యం ప్రతి వారికి ఉత్తేజాన్ని, గర్వాన్ని కలిగిస్తోంది. అదే ఉత్తేజాన్ని శివాజీకి కలిగించి విజయనగర రాజ్యపతనం తర్వాత హిందూధర్మ రక్షణా దీక్షను చేపట్టేటట్లు చేసి ఆయనను ముందుకు నడిపించింది.

బహమనీ - విజయనగర సంఘర్షణ స్వభావం: బహమనీ - విజయనగర సంబంధాలను గురించి వారి సంఘర్షణ స్వభావాన్ని గురించి ముస్లిం చరిత్రకారులైన ఫెరిష్టా, సయ్యద్ అలీలు వాస్తవ విరుద్ధంగా రాశారు. వారు విజయనగర రాజులు కప్పం ఎగ్గొట్టేవారని, కప్పం వసూలు చేయడానికి బహమనీలు వారితో యుద్ధాలు చేసి వారిని ఓడించి కప్పాలు వసూలు చేసేవారని, కప్పం సక్రమంగా చెల్లించినంత కాలం వారి మధ్య యుద్ధాలు ఉండేవి కావని, ఎప్పుడు కప్పం చెల్లించకపోతే అప్పుడు యుద్ధం వచ్చేదని, యుద్ధం రావడం, రాకపోవడం అనేది విజయనగర రాజులు కప్పం చెల్లించే విషయంలో ప్రదర్శించే వైఖరిని బట్టి ఉండేదని రాశారు. అంతేగాకుండా ప్రతిసారి యుద్ధంలో విజయనగర రాజులు ఓడిపోయి కప్పం చెల్లించే వారని రాశారు. ఇది వాస్తవమా! అని ఆధునిక చరిత్రకారులు లోతుగా పరిశీలించి వారి రాతలు సరైనవి కావని, కేవలం మత పక్షపాతంతో రాసినవని కూడా పేర్కొన్నారు. ఆధునిక చరిత్రకారులు బహమనీ, విజయనగర యుద్ధాలు కేవలం మత యుద్ధాలు కావని, రాజకీయ ఆర్థికపరమైన కారణాల వల్ల జరిగాయనీ, కాకపోతే ఉభయులూ వేరు వేరు మతాలకు చెందినవారు కావడం వల్ల వారి మతాలు కొంత వరకు యుద్ధ తీవ్రతను పెంచి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. విజయనగర బహమనీ రాజ్యాలు దాదాపుగా ఏక కాలంలోనే స్థాపించబడ్డాయి. మొదటితరం నుండే సంఘర్షణకు దిగాయి. బహమనీ రాజ్యస్థాపకుడైన అల్లావుద్దీన్ హసన్‌గంగు తన సేనాధిపతులను కర్ణాటకంలోకి పంపి హిందూ రాజులను ఓడించి అంతులేని ధనంతో రాజధాని గుల్బర్గాకు తెప్పించుకున్నాడని రాశాడు. ఆ విధంగా ఓడిపోయిన రాజులలో హరిహర బుక్కరాయలు కూడా ఉన్నారని సయ్యద్ అలీ రాశాడు. వారి ప్రాంతాలను హసన్‌గంగు ఆక్రమించాడని, ధనాన్ని సమర్పించి వారి రాజ్యాన్ని హరిహరబుక్కరాయల దక్కించుకున్నారని కూడా వారు రాశారు. హసన్‌గంగు క్రీ.శ.1358లో మరణించగా, అతని కుమారుడు, మొదట మహమ్మద్‌షా బహమనీ సుల్తాన్ అయ్యాడు. తెలంగాణ రాజు కాపయనాయకుడు. విజయనగరరాజు బుక్కరాయలు మొదట మహమ్మద్‌షాను బెదిరిస్తూ తమ ప్రాంతాలు తమకు ఇవ్వాలని రాయబారాలు పంపారు. సుల్తాన్ తెలంగాణపై దండెత్తి కాపయనాయకుని ఓడించి కౌలాస్ దుర్గాన్ని పొందాడు. వారు సంధి చేసుకున్నారు. కాని బుక్కరాయలు ఆ సంధిలో భాగస్తుడు కాడు. కనుక బుక్కరాయలు తన సామంతునిగా లెక్కించి సుల్తాన్ తాగి తన సంగీత విద్వాంసులకు విజయనగర ఖజానాపై తాగుబోతు హుండీని జారీ చేశాడు. దాంతో బుక్క రాయలు రాయచూరు, ముద్గల్‌లపై దండెత్తాడు. దాంతో సుల్తాన్‌తో యుద్ధం వచ్చింది. సుల్తాన్ ముద్గల్‌ను తిరిగి ఆక్రమించి విజయనగరానికి వచ్చి రాజధానిని ముట్టడించాడు. ఈ యుద్ధంలో సుల్తాన్ సేనాధిపతులు ఇద్దరు మరణించారు. అందుకు కోపించి మహమ్మద్‌షా విజయనగర పరిసర గ్రామాలలోని హిందువులను ఊచకోత కోశారు. ఈ సమయంలో ఐదు లక్షల హిందువులు అంతమయ్యారు. దాంతో బుక్కరాయలు సంధి చేసుకొని సుల్తాన్ సంగీత

విద్వాంసులకు హుండీని చెల్లించాడు. సుల్తాన్‌కు నష్టపరిహారం చెల్లించాడు. తర్వాత ఉభయులూ యుద్ధాలలో ప్రజలను వధించరాదని అంగీకరించారని పెరిష్టా రాశాడు. కాని అందులో కప్పం అనేమాట లేదు. నష్టపరిహారం ఇచ్చాడని రాశాడు. తర్వాత మహమ్మద్‌షా మరణించి అతని కుమారుడు ముజాహిద్‌షా సింహాసనానికి వచ్చి తుంగభద్రా కృష్ణ, అంతర్వేది ప్రాంతాన్ని తన పరం చేయమన్నాడు. అందుకు బుక్కరాయలు రాయచూరు అంతర్వేది తమదేనన్నాడు. దాంతో మళ్లీ యుద్ధం వచ్చింది. క్రీ.శ.1376లో సుల్తాన్ ఒక సైన్యాన్ని ఆదోనిపైకి పంపి ఒక సైన్యంతో తాను స్వయంగా విజయనగరంపై దాడికి బయలుదేరాడు. యుద్ధం ఆరుమాసాలు జరిగింది చివరకు సుల్తాన్ తన వజీర్ మల్లిక్ సీఫ్ గోరీ సలహాపై బుక్కరాయలతో సంధి చేసుకున్నాడు. బుక్కరాయలు పెద్ద మొత్తం సుల్తాన్‌కు చెల్లించాడు అని పెరిష్టా వర్ణించాడు. కాని అది వాస్తవం కాదు. సుల్తాన్ ఓడిపోయి వెళ్లిపోయాడు. ఆదోని, బంకాపురం, గోవాలు విజయనగర రాజ్యంలోనే ఉన్నాయి. అనేక శాసనాలు బుక్కరాయలు ముస్లింలను ఓడించి తరిమివేశాడని తెలుపుతున్నాయి. అంతేగాక తిరిగి వెళ్లేటప్పుడు సుల్తాన్ హత్యకు గురయ్యాడు. ఆ సమయంలో గుల్బర్గాలో అరాచక పరిస్థితులు నెలకొన్నాయి. ఆ సందర్భంలో బుక్కరాయలు తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ హరిహరరాయలు రాయచూరును ఆక్రమించాలని ప్రయత్నించాడు కాని విరమించుకున్నాడు. రెండవ మహమ్మద్‌షా శాంతికాముకుడు. అతని కాలంలో సుమారు 20 సంవత్సరాలు యుద్ధాలు లేవు. అతని తర్వాత బహమనీ రాజ్యంలో అంతర్యుద్ధం జరిగి చివరకు ఫిరోజ్‌షా బహమనీ గద్దెనెక్కాడు ఇతడు హసన్‌గంగు మనుమడు. ఇతని కాలంలో విజయనగరంతో మూడు పర్యాయాలు యుద్ధాలు జరిగాయి బహమనీ రాజ్యంలో జరిగే అంతర్యుద్ధ కాలంలో రెండవ హరిహరరాయలు రాయచూరు, ముద్గల్‌ను ఆక్రమించడానికి తన సామంతుడైన ఖేర్ల నరసింగరాయుని బహమనీ రాజ్యపు సరిహద్దులకు పంపి తన కుమారుడు దేవరాయలను 30 వేల సైన్యంతో రాయచూరు, ముద్గల్‌లను ఆక్రమించడానికి పంపాడు. ఆ వార్త విని ఫిరోజ్‌షా ఒక సైన్యాన్ని నరసింగరాయుని ఎదిరించడానికి పంపి, తాను మరొక సైన్యంతో విజయనగర యువరాజును ఎదిరించడానికి బయలుదేరాడు. ఆ సమయంలో కృష్ణానది వరదలతో ఉంది. నదికి అవతల పక్కన శత్రువులు కాపు వేసి ఉన్నారు. అప్పుడు ఫిరోజ్ మంత్రి ఖాజీసిరాజ్ అతని అనుచరులు మోసంతో దేవరాయల కుమారుని చంపారు. దాంతో హిందూ సైన్యం పారిపోయింది. అప్పుడు ఫిరోజ్ కృష్ణానదిని దాటాడు. అతడు కృష్ణానదిని దాటగానే హిందువులు విజయనగరం వైపు పారిపోయారు. సుల్తాన్ వారి వెంటపడ్డాడు. వారు కోటలో దూరి తలుపులు వేసుకున్నారు. సుల్తాన్ అక్కడికి చేరి నగరానికి దక్షిణంగా ఉన్న ప్రాంతాలలో అనేక మంది హిందువులను బందీలుగా పట్టుకున్నారు. వారిలో అనేకులు బ్రాహ్మణులు. బందీలైన వారి బంధువులు డబ్బు చెల్లించి తమ బంధువులను విడిపించమని రాయలను బలవంతపెట్టారని, అందువల్ల రాయలు బహమనీ సేనాధిపతితో సంప్రదించాడని, అతడు సుల్తాన్‌కు 10 లక్షలు, మధ్యవర్తిత్వం చేసినందుకు తనకు ఒక లక్ష హొన్నులు చెల్లించమన్నాడు. అప్పుడు బుక్కరాయలు ఐదు లక్షలు, బ్రాహ్మణులు 6 లక్షలు చెల్లించారని, సుల్తాన్ బందీలను విడిచిపెట్టి యుద్ధానికి ముందు ఏ సరిహద్దులు ఉన్నాయో ఆ సరిహద్దులను గుర్తించాడని యుద్ధాలలో ప్రజలను వధించరాదని అంగీకరించాడని పెరిష్టా రాశాడు. కాని ఇందులో కప్పం అనేమాట లేదు. పైగా సరిహద్దు తగాదాలు కూడా లేవు. అంతకు పూర్వపు సరిహద్దులను ఉభయులు అంగీకరించారు. కాని సయ్యద్ అలీ మరొక విధంగా రాశాడు. రాయలు 33 లక్షల టంకాలు చెల్లించాడని, ప్రతి సంవత్సరం అంతే మొత్తం చెల్లించడానికి అంగీకరించడానికి రాశాడు. క్రీ.శ.1410లో జరిగిన సంఘటనలను తెలుపుతూ పెరిష్టా కూడా కప్పం చెల్లించలేదని రాశాడు. గుజరాత్, మాళ్వా, ఖాందేష్ సుల్తాన్‌ల ప్రోద్బలంతో నాలుగు సంవత్సరాల నుండి రాయలు కప్పం చెల్లించడం మానివేశాడని రాశారు.

క్రీ.శ.1406లో రెండవ హరిహరరాయలు, రెండవ బుక్కరాయలు మరణించారు. మొదటి దేవరాయలు విజయనగర వజ్రసింహాసనం అధిష్టించాడు. పెరిష్టా క్రీ.శ.1406లో మొదటి దేవరాయలు ముద్గల్‌లో నివసించిన అందగత్తె అయిన పర్తాల్ లేక నెహాల్‌ను తన పరం చేసుకోడానికి దండయాత్ర చేశాడని రాశాడు. ఫిరోజ్‌షా దేవరాయలకు బుద్ధి చెప్పడానికి కృష్ణా, తుంగభద్రా నదులు దాటి వచ్చి విజయనగరాన్ని ముట్టడించాడు దేవరాయలు గుజరాత్, మాళ్వా సుల్తాన్‌లను తనకు సహాయంగా రావాలని వర్తమానాలు పంపాడు. కాని వారు ఎలాంటి సహాయం పంపకపోవడంతో సంధి చేసుకున్నాడని, సంధి ప్రకారం తన కుమార్తెను సుల్తాన్‌కు ఇచ్చి వివాహం చేసి బంకాపురాన్ని అరణంగా ఇచ్చాడని, ఇంకా పెద్ద మొత్తాన్ని నష్టపరిహారంగా చెల్లించాడని.

బంకాపూర్ విలువ 10 లక్షలుగా నిర్ణయించారని ఫెరిష్టా కథనం. ఇంకా ఐదు మణుగులు రత్నాలు, 50 ఏనుగులు, 2 వేల మంది స్త్రీ పురుష సేవకులు, సంగీత నాట్యబృందాన్ని బహూకరించాడని ఫెరిష్టా రాశాడు. సయ్యద్ ఆలీ వివాహాన్ని గురించి రాయలేదు. ఫిరోజ్ బాగా పోరాడి రాయల నుండి 33 లక్షల హొన్నుల కప్పాన్ని వసూలు చేసి యుద్ధంలో కొల్లగొట్టిన ధనంతో వెళ్లిపోయాడని రాశాడు. కాని ఇద్దరు రచయితలు అతకుముందు చెల్లించవలసిన కప్పం బకాయి గురించి పేర్కొనలేదు. ఫిరోజ్‌షా కాలంలో జరిగిన 3వ యుద్ధం క్రీ.శ.1417లో పానుగల్లు వద్ద జరిగింది. ఈ యుద్ధంలో మొదటి దేవరాయలు తెలంగాణను పాలించే పద్మనాయకులను కలుపుకొని ఫిరోజ్‌షాను ఘోరంగా ఓడించి తరిమాడు సుల్తాన్ సేనాధిపతి యుద్ధభూమిలో మరణించాడు. ఈ ఓటమితో ఫిరోజ్ కీర్తిప్రతిష్టలు మంటగలిసి తన సింహాసనాన్ని వదులుకున్నాడు. తర్వాత కొద్ది కాలానికే క్రీ.శ.1422 సెప్టెంబర్‌లో మరణించాడు. అతని తర్వాత రాజ్యానికి వచ్చిన మొదటి అహమ్మద్‌షా క్రీ.శ.1424లో 40 వేల అశ్వదళంతో విజయనగరంపై దండెత్తాడు ఆ కాలానికి దేవరాయలు మరణించి అతని కుమారుడు విజయరాయలు సింహాసనానికి వచ్చాడు. అతడు గొప్పవీరుడు కాదు. కనుక అహమ్మద్‌షా విజయనగరాన్ని ముట్టడించి పూర్వపు కప్పం బకాయిలను వసూలు చేశాడని ఫెరిష్టా రాశాడు. కాని సయ్యద్ ఆలీ కప్పం అని పేర్కొనకుండా రాజ్యాన్ని నాశనం చేసి అనేక కోటలను పట్టుకొని యుద్ధఖైదీలుగా ప్రజలను బంధించి, దేశాన్ని దోచుకొని గొప్ప మొత్తంతో సుల్తాన్ వచ్చాడని రాశాడు. కాని వారు భవిష్యత్తులో కప్పం చెల్లించే షరతును రాయలు అంగీకరించాడని రాయలేదు. సుల్తాన్ దోచుకుపోయిన సొత్తునే బకాయి కప్పంగా ఫెరిష్టా వర్ణించి ఉంటాడు. అహమ్మద్‌షా పానుగల్లు యుద్ధంలో విజయనగరం వైపు చేరిన రాచకొండ వెలమలపై దండెత్తి వారి రాజును చంపి వారి రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో కలిపాడు. ఈ విజయాలకు చిహ్నంగా అతడు బీదరు పట్టణాన్ని నిర్మించి తన రాజధానిగా చేసుకున్నాడు. తర్వాత అతడు మాహుర్ కొంకణం గుజరాత్ పాలకులతో పోరాడుతూ విజయనగరంపై దాడులు చేయలేదు. కనుక 10 సంవత్సరాలు విజయనగరం శాంతిగా ఉంది. అతడు క్రీ శ 1435లో మరణించాడు. అతని కుమారుడు రెండవ అల్లావుద్దీన్ రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో నాలుగు యుద్ధాలు జరిగాయి. రెండవ అల్లావుద్దీన్ తన పట్టాభిషేకం కాగానే తన సోదరుడు మహమ్మద్ ఖాన్ నాయకత్వంలో పెద్ద సైన్యాన్ని విజయనగరంపైకి పంపాడు. అందుకు కారణం గత 5 సంవత్సరాల నుండి కప్పం చెల్లించడం లేదని, మామూలుగానే రెండవ దేవరాయలు ఓడిపోయి 20 ఏనుగులు, 200 మంది నాట్యగత్తెలు, పెద్ద మొత్తంలో ధనాన్ని ఇచ్చాడని, ప్రతి సంవత్సరం కప్పం చెల్లిస్తానని అంగీకరించాడని ఫెరిష్టా రాశాడు. కాని ఆలీ ఈ యుద్ధాన్ని పేర్కొనలేదు. ఈ యుద్ధం జరిగిన కొద్ది రోజులకు సుల్తాన్ సోదరుడు మహమ్మద్‌ఖాన్ తిరుగుబాటు చేసి రాయలతో కలిసిపోయాడు. అందువల్ల రాయలు ముద్గల్, రాయచూరులను జయించాడని ఫెరిష్టా రాశాడు. కాని తన సోదరుని తిరుగుబాటు అణచిన తర్వాత అల్లావుద్దీన్ ముద్గల్‌ను పునరాక్రమించి రాయల వద్ద నుండి నష్టపరిహారం వసూలు చేశాడని ఫెరిష్టా రాశాడు. కాని ఏ విధంగా యుద్ధం ముగిసిందీ రాయలేదు. ఈ యుద్ధంలో జరిగిన పరాజయం వలన రెండవ దేవరాయలు తన మంత్రులను, సలహాదారులను సమావేశపరచి విజయనగర సైన్యాలు ఎందుకు బహమనీ సైన్యాల చేతిలో ఓడిపోతున్నాయని సమీక్షించాడని, అపుడు వారు బహమనీ అశ్వాలు చాలా దృఢమైనవని, కర్ణాటక అశ్వాలు చాలా బలహీనమైనవని, రెండవ కారణం ముస్లిం సైనికులు గొప్ప విలుకాండ్రని, వారు గొప్ప యుద్ధవీరులని అంగీకరించారని, కనుక తమ సైన్యంలో ముస్లింలను చేర్చుకున్నాడని, 60 వేల మంది హిందూ విలుకాండ్రను కూడా తయారు చేసుకున్నాడని, 2 లక్షల పదాతిదళాన్ని సమీకరించుకున్నాడని, వారందరికీ మంచి ఆయుధాలు తయారు చేయించి తన సైనికశక్తిని పెంచాడని కూడా ఫెరిష్టా రాశాడు. ఈ విధంగా పెంచుకున్న సైనికబలంతో రాయలు హఠాత్తుగా క్రీ.శ.1443లో తుంగభద్రా నదిని దాటి ముద్గల్‌ను ఆక్రమించి తన కుమారులను రాయచూరును ముట్టడించడానికి పంపాడని ఫెరిష్టా రాశాడు. ఈ కాలంలో క్రీ.శ.1442 నవంబర్, 1443 ఏప్రిల్ మధ్యకాలంలో విజయనగరంలో ఉన్న అబ్దుల్‌రజాక్ రాయలపై హత్యాప్రయత్నం జరిగినదని రాశాడు. అది తెలిసి రెండవ అల్లావుద్దీన్ సంతోషించి తనకు 7 లక్షల వరహాలు చెల్లించాలని, లేకపోతే యుద్ధానికి తయారని విజయనగరానికి రాయబారిని పంపాడు. రాయలు అందుకు కోపించి తానే ముందు యుద్ధంలోకి దూకాడని, రెండు నెలలో మూడు యుద్ధాలు జరిగాయని ఫెరిష్టా రాశాడు. మొదటియుద్ధంలో హిందువులు గెలిచారని రెండవ యుద్ధంలో ముస్లింలు విజయం సాధించారని, మూడవ యుద్ధంలో రాయల పెద్దకుమారుడు మరణించాడని, తర్వాత హిందూ సైన్యం ముద్గల్

కోటలోకి పారిపోయిందని, వారిని తరుముతూ ముస్లిం సైన్యం వెంటపడిందని, వారిలో ఇద్దరు సేనాధిపతులు ముద్గల్ కోటలోకి చొరబడి బందీలయ్యారని ఫెరిష్తా రాశాడు. సుల్తాన్ తన సేనాధిపతులకు అపకారం జరిగితే సహించనని కబురు పెట్టాడని, సుల్తాన్ శక్తి తెలుసును గనుక రాయలు వారిని వదిలివేసి సంధి చేసుకొని కప్పం చెల్లించాడని, తర్వాత ప్రతి సంవత్సరం కప్పం చెల్లించాడని రాశాడు ఆ తర్వాత యుద్ధాలు లేవని ఫెరిష్తా రాశాడు సయ్యద్ ఆలీ ఈ యుద్ధాన్ని గురించి వివరంగా రాయలేదు. కాని అబ్దుల్ రజాక్ ఈ యుద్ధంలో దేవరాయలు బహమనీ సామ్రాజ్యంపై దండెత్తి ఓడించి అనేక మందిని బందీలుగా పట్టుకొని విజయంతో విజయనగరం చేరాడని రాశాడు. దీని వల్ల ఈ యుద్ధంలో విజయనగర సేనలు అఖండ విజయం సాధించాయని భావించారు రాయలు కుమారుడు మరణించలేదని అలా జరిగి ఉంటే విజయనగరంలో విచారించే వారని ఆ సంఘటనను అబ్దుల్ రజాక్ తప్పకుండా ప్రస్తావించేవాడని భావించారు. అల్లావుద్దీన్ చివరి యుద్ధం క్రీ.శ.1449లో జరిగింది రెండవ దేవరాయలు మరణించిన తర్వాత అతని కుమారుడు మల్లికార్జునరాయలు సింహాసనానికి వచ్చాడు. అతని కాలంలో కపిలేశ్వరగజపతి, రెండవ అల్లావుద్దీన్ ఒకే పర్యాయం విజయనగరంపై దండెత్తారు మల్లికార్జునరాయలు సింహం పిల్ల లాగా దూకి ఓడించి తరిమాడని గంగదాస ప్రతాపవిలాసం అనే సంస్కృత నాటకం తెలుపుతోంది. ఫెరిష్తా ఈ కాలంలో అల్లావుద్దీన్ దర్బారులో సరదారులు రెండు వర్గాలుగా చీలిపోయారు అల్లావుద్దీన్ మానసిక వేదనతో ఉన్నాడు. అందువల్ల మల్లికార్జునరాయలు బహమనీ సైన్యాలను ఓడించి తరిమాడని ఫెరిష్తా రాశాడు. ఇతర ముస్లిం చరిత్రకారులు ఈ దండయాత్ర విషయాన్ని గురించి మౌనం వహించారు ఈ యుద్ధం తర్వాత 25 సంవత్సరాలు బహమనీ, విజయనగర రాజ్యానికి సంఘర్షణ జరుగలేదు. అందుకు కారణం తూర్పున ఒక గొప్ప నూతన రాజకీయశక్తి ఉద్భవించింది. కళింగలో కపిలేశ్వరగజపతి గంగ వంశాన్ని స్థాపించాడు అతడు ప్రచండమైన సైన్యాన్ని తయారు చేసుకొని బహమనీ విజయనగర రెండు రాజ్యాలపై దండెత్తాడు. ఉభయ రాజ్యాలు గజపతి దండయాత్రల నుండి తమ రాజ్యాలను రక్షించుకొనే ప్రయత్నంలో పడిపోయారు. జగన్నాథంలోని ఒక శాసనం కపిలేశ్వరుడు కర్ణాటక రాజు అనే గొర్రెకు సింహం వంటివాడని కలబర అంటే గుల్బర్గా రాజుపై విజయం సాధించాడని తెలుపుతోంది. అల్లావుద్దీన్ క్రీ.శ.1457లో మరణించగా అతని కుమారుడు హుమయూన్ బహమనీ సుల్తానయ్యాడు. అతడు గొప్ప క్రూరుడని ప్రసిద్ధి చెందాడు నీరో కాలిగులకు సాటియైనవాడని పోల్చారు. క్రీ.శ.1459లో కపిలేశ్వరుని సైన్యాలు తెలంగాణను ఆక్రమించి గుల్బర్గా బీదరు పట్టణాలకు 19 మైళ్ల దూరం వరకు వచ్చాయి. క్రీ.శ.1461లో హుమాయూన్ మరణించాడు తర్వాత అతని పెద్ద కుమారుడు నిజాంషా 8 సంవత్సరాల బాలుడు రెండు సంవత్సరాలు పాలించాడు. బహమనీ రాజ్యం ఇంకా దిగజారిపోయింది. గజపతి బహమనీ రాజ్యంపై దోపిడీ చేసి కౌలాస్ దుర్గం వరకు అంటే రాజధాని బీదర్‌కు 10 మైళ్ల దూరంలో విడిది చేశాడు. అదే సమయంలో మాళ్వా సేనాధిపతి మహమ్మద్ ఖిల్జీ బహమనీ సైన్యాలను ఓడించి బీదర్‌ను ఆక్రమించాడు. అప్పుడు మహమ్మద్ గవాన్, గుజరాత్ సుల్తాన్‌లు బహమనీ రాజ్యాన్ని రక్షించారు. లేకపోతే అప్పుడు మహమ్మద్ బహమనీ రాజ్యం అంతరించిపోయేది. బహమనీ రాజ్యం ఇలా ఉండగా, విజయనగర రాజ్య పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కపిలేశ్వర గజపతి విజయనగర సామ్రాజ్యంలోని తిరుచినాపల్లి వరకు తూర్పు తీర ప్రాంతాలన్నీ జయించాడు. క్రీ.శ.1466లో మల్లికార్జునరాయలు మరణించాడు విరూపాక్షరాయలు సింహాసనానికి వచ్చాడు. క్రీ.శ.1443 జులైలో నిజాంషా మరణించి మూడవ మహమ్మద్‌షా బహమనీ సుల్తానయ్యాడు. క్రీ.శ.1469లో కపిలేశ్వరగజపతి మరణించాడు. ఈ కాలంలో మహమ్మద్ గవాన్ సహకారంతో మూడవ మహమ్మద్‌షా బహమనీ రాజ్య వైభవాన్ని పునరుద్ధరించాడు. అతడు పురుషోత్తమ గజపతిని ఓడించి రాజమహేంద్రవరం వరకు జయించాడు. తర్వాత విజయనగర రాజ్యంపై దండెత్తి గోవాను జయించాడు తర్వాత బెల్గాంను జయించాడు. తర్వాత తూర్పు కోస్తాలో కంచి వరకు సాగి కంచిని దోచుకున్నాడు. సాళువ నరసింహుడు తన సేనాని ఈశ్వరనాయకుని పంపి, కందుకూరు వద్ద సుల్తాన్‌ను ఓడించాడు. అయినప్పటికీ మూడవ మహమ్మద్ కాలంలో రెండు హిందూ రాజ్యాలపై దాడులు చేసి విజయాలు సాధించగలిగారు. కాని కప్పాల ప్రసక్తిలేదు. కాని ఇవన్నీ తాత్కాలిక విజయాలు, ఆరిపోయే దీపం వెలిగినట్లు బహమనీ రాజ్యం ఒక్కసారిగా వెలిగింది. మూడవ మహమ్మద్ మరణం తర్వాత బహమనీ రాజ్యం ఐదు రాజ్యాలుగా చీలిపోయింది. బహమనీ వంశం నరసింహరాయలు సంగమ వంశాన్ని తొలగించి సాళువ వంశాన్ని ప్రతిష్టించారు. దాంతో సంగమ, బహమనీ సుల్తాన్‌లపై అఖండ విజయాలు సాధించింది. శ్రీకృష్ణదేవరాయలు సుల్తాన్‌లను గడగడలాడించాడు

సదాశివరాయలు మరణించడంతో విజయనగరాన్ని సుల్తాన్‌లు నాశనం చేశారు. ఆ తర్వాత ఉభయ రాజ్యాలు క్షీణించాయి. బహమనీ రాజ్యాలను జయించారు. క్రీ.శ.1686-87లలో ఔరంగజేబు బీజాపూరు, గోల్కొండ రాజ్యాలను మొగల్ సామ్రాజ్యంలో కలిపాడు. అంతటితో బహమనీ విజయనగర సంఘర్షణ అంతమై దక్షిణ భారతదేశ చరిత్ర మొగల్ యుగం ప్రారంభమైంది. పైవిషయాల వల్ల పెరిష్టా, సయ్యద్ ఆలీ రచనలు వాస్తవాలు కావని రుజువు అవుతోంది. విజయనగర సామ్రాజ్యం బహమనీ సామ్రాజ్యపు సామంతరాజ్యం కాదన్నది నిర్వివాదాంశం, కాకపోతే ఓడిపోయినప్పుడల్లా బహమనీ సుల్తాన్‌లు నష్టపరిహారం వసూలు చేశారు. విజయనగర రాజ్యం ఆర్థికంగా నష్టపోయిందే తప్ప ఎప్పుడూ బహమనీలకు సామంత రాజ్యంగా ఉండలేదు. ప్రతీ యుద్ధంలో బహమనీ రాజ్యం విజయం సాధించింది. విజయనగర రాజ్యం ప్రతియుద్ధంలో ఓడిపోయి కప్పాలు చెల్లించింది. అనే మాట కూడా వాస్తవం కాదు. విజయనగరం అనేక పర్యాయాలు బహమనీ సేనలను ఓడించింది. కృష్ణరాయలు, రామరాయల కాలంలో విజయనగర సేనలు అద్భుత విజయాలు సాధించాయి. గుల్బర్గా, బీదరు, అహమ్మద్ నగరాలలో ప్రవేశించి ఆ దుర్గాలను నేల మట్టం చేశాయి. కనుక పెరిష్టా, సయ్యద్ ఆలీల రచనలు కేవలం పక్షపాతంలో రాసినవేగాని వాస్తవాలు కాదని స్పష్టంగా చెప్పవచ్చును.

విజయనగర సామ్రాజ్యానికి పోర్చుగీసుతో గల సంబంధాలు

క్రీ.శ.1498లో వాస్కోడిగామా కాలికట్‌లో అడుగుపెట్టడంతో ఇండియాకు ఐరోపాకు వ్యాపార సంబంధాలు ప్రారంభమయ్యాయి. వాస్కోడిగామా కాలికట్‌లో అడుగుపెట్టినప్పుడు కాలికట్‌ను జామొరిన్ విజయనగరాన్ని సాళువ నరసింహరాయలు కుమారుడు రెండవ నరసింహరాయలు పాలిస్తున్నారు. పోర్చుగీసు వారు కొచ్చిన్ రాజును దర్శించి అక్కడ ఒక ఫ్యాక్టరీని నిర్మించారు. పోర్చుగీసు వారు పశ్చిమతీరంలో స్థిరపడటానికి కొంత కాలం పట్టింది. తుళువ వీరనరసింహరాయలు. (క్రీ.శ.1505-1509) సింహాసనానికి వచ్చేనాటికి పోర్చుగీసు వారు పశ్చిమతీరంలో స్థిరపడ్డారు. అంతవరకు వారు జామొరిన్‌తో యుద్ధాలు చేశారు. క్రీ.శ.1505లో పోర్చుగీసు గవర్నర్‌గా వచ్చిన ఆల్మెడా స్థానికులతో యుద్ధాలు, సంఘర్షణల వలన పోర్చుగీసు వారి వ్యాపారం సాగదని గ్రహించి అతడు స్థానిక రాజులతో స్నేహ సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు స్థానికుల వల్ల అతడు విజయనగర రాజ్యాన్ని గురించి తెలుసుకున్నాడు. అతని కుమారుడు లారెంకో కన్ననూరులో ఉండి ఇటలీ యాత్రికుడైన వరైమా ద్వారా విజయనగర రాజ్య పరిస్థితులను వివరంగా తెలుసుకున్నాడు ఆ వివరాలన్నీ తన తండ్రికి నివేదించాడు కనుక ఆల్మెడా విజయనగర రాజ్యంతో స్నేహ సంధి, వ్యాపార సంధులు చేసుకోవాలని తీర్మానించుకొన్నాడు. ఆనాడు విజయనగర రాజ్యాన్ని నరసింహరాయలను పేరు కలిగిన రాజులు పాలించారు సాళువ నరసింహరాయలు, రెండవ నరసింహరాయలు లేక ఇమ్మడి నరసింహరాయలు వీరనరసింహరాయలు వరుసగా పాలించారు. కనుక పోర్చుగీసు వారు విజయనగర సామ్రాజ్యాన్ని నరసింగ రాజ్యం అని పిలిచారు. చివరి వరకు వారు ఆ పేరుతోనే పేర్కొన్నారు విజయనగర రాజ్యానికి చెందిన భట్కల్‌లో ఒక ఫ్యాక్టరీని నిర్మించుకోడానికి ఆల్మెడా వీరనరసింహరాయలు అనుమతి కోరుతూ ఒక రాయబారిని పంపాడు కాని వీరనరసింహరాయలు అందుకు అంగీకరించలేదు కాని పోర్చుగీసు వారితో వర్తక సంధికి అంగీకరించాడు ఆ సంధి ప్రకారం పోర్చుగీసు వారు తీసుకువచ్చే అశ్వాలన్నింటిని విజయనగరానికి విక్రయించడానికి ఆల్మెడా అంగీకరించాడు. ఆనాడు బహమనీ, విజయనగర యుద్ధాలవల్ల మేలుజాతి అశ్వాలకు మంచి గిరాకీ ఉండేది అది గ్రహించిన పోర్చుగీసు వారు గుర్రాల వ్యాపారాన్ని ప్రారంభించారు. అది లాభసాటిగా మారింది. కనుక వారు భారతదేశ రాజ్యాలతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంలో గుర్రాల వ్యాపారాన్ని ఒక సాధనంగా వాడుకున్నారు.

క్రీ.శ.1509లో శ్రీకృష్ణదేవరాయలు విజయనగర వజ్రసింహాసనం అధిష్టించాడు. అదేకాలంలో గోవాలో అల్బుకర్కు కాలికట్ రాజైన జామొరిన్‌తో యుద్ధానికి దిగి శ్రీకృష్ణదేవరాయలు సహాయం పొందాలని ఫ్రయర్ లూయి అనే రాయబారిని విజయనగరం పంపాడు. తమకు కళ్లికోట జామొరిన్‌తో యుద్ధం వచ్చిందని ఆ యుద్ధంలో తమకు రాయలు సహాయం చేస్తే తాము విజయనగర రాజుకు దక్కను పాలకునితో వచ్చే యుద్ధాలలో అంటే బీజాపూరు సుల్తాన్‌తో జరిగే యుద్ధాలలో రాయలకు సహాయం చేస్తామని, అంతేగాక తాము అరేబియా, పర్షియాల నుండి తెచ్చే అశ్వాలన్నింటిని విజయనగర రాజ్యానికే అమ్ముతామని, ఒక్క అశ్వాన్ని కూడా బహమనీ సుల్తాన్‌లకు అమ్మమని సందేశం పంపాడు. కాని జామొరిన్‌తో రాయలకు ఎలాంటి విరోధం లేదు. జామొరిన్ కూడా రాయలకు ఎలాంటి అపకారం తలపెట్టలేదు. పైగా జామొరిన్‌కు రాయలంటే భయం, గౌరవం రెండూ ఉన్నాయి. కనుక రాయలు పోర్చుగీసు వారికి సమాధానం ఇవ్వలేదు. అయినప్పటికీ అల్బుకర్క్ గస్పర్‌చనోకా అనే వ్యక్తిని విజయనగరం పంపి భట్కకల్ వద్ద గిడ్డంగిని నిర్మించుకోవడానికి అనుమతిని కోరాడు. కాని రాయలు సమాధానం ఇవ్వలేదు. అందుకు కారణమేమిటంటే ' బీజాపూరు ఇస్మాయిల్, రాయలతో స్నేహసంబంధాలను పెట్టుకున్నాడు. పోర్చుగీసు వారికి రాయలు సహాయం చేయకుండా ఉండటానికి రాయలతో ఇస్మాయిల్ స్నేహం నటించాడు. అయినప్పటికీ రాయలు గోవా విజయానికి అల్బుకర్క్‌ను అభినందిస్తూ, భవిష్యత్తులో పోర్చుగీసు వారికి తన సహాయం ఉంటుందని సందేశం పంపాడు. క్రీ.శ.1510 మే నెలలో ఇస్మాయిల్ గోవాను తిరిగి జయించడానికి సైన్యాలను పంపి గోవాను పునరాక్రమించాడు. తర్వాత బీజాపూరు రాజ్యంలో కొన్ని అంతః

కలహాలు రేగాయి. ఆ సమయంలో ఆల్బుకర్క్ మళ్లీ 1510 డిసెంబర్‌లో గోవాపై దండెత్తి ఆక్రమించాడు. క్రీ శ 1512లో బీజాపూరు సుల్తాన్ తిరిగి గోవాను జయించడానికి ప్రయత్నించాడు కాని విఫలవమైంది. గోవా శాశ్వతంగా పోర్చుగీసు వారి స్థావరం అయిపోయింది. ఆల్బుకర్కు గోవాను తిరిగి జయించాడని తెలియగానే రాయలు తన రాయబారులను గోవాకు పంపాడు. ఆ రాయబారుల ద్వారానే విజయనగరంలో ఉన్న ఫ్రేయిర్ లూయి ఆల్బుకర్క్‌కు కొన్ని లేఖలు రాసి పంపాడు. అందులో తాను రాయలను తప్ప అందరినీ కలుసుకున్నానని, వారందరూ తనను ఆదరించారనీ, రాయలు భట్కల్‌లో కోటను నిర్మించుకోడానికి అనుమతిని ఇచ్చాడని రాశాడు. అప్పటికి రాయలకు పోర్చుగీసు వారి శక్తి మీద విశ్వాసం కుదిరింది. కనుక వారి స్నేహం తనకు ఉపయోగపడవచ్చని భావించి భట్కల్‌లో కోటను నిర్మించుకోడానికి అనుమతి ఇచ్చాడని రాశాడు. ఆ తర్వాత ఫ్రేయిర్ లూయిని విజయనగరంలో ఒక ముస్లిం చంపాడు. అందువల్ల విజయనగరానికి, పోర్చుగీసువారికి విరోధం వస్తుందని బీజాపూరు సుల్తాన్ ఆశించాడు. కాని పోర్చుగీసు వారు రాయలను తప్పు పట్టలేదు. వారు విజయనగరంతో స్నేహసంబంధాలు దృఢం చేసుకున్నారు క్రీ శ 1512 ఏప్రిల్ 1వ తేదీన లిస్బన్‌లోని Don Manoel కు ఉత్తరం రాస్తూ నరసింగరాజు పోర్చుగీసు దొర వారితో స్నేహం కోరుతున్నాడు, కాని అతడు సబయోకు సహాయం చేస్తున్నాడని రాశాడు. సబయో అంటే బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా బిరుదు క్రీ శ 1514లో శ్రీకృష్ణరాయలు పోర్చుగీసు వారితో గుర్రాల దిగుమతి సంధి చేసుకోదలచి సాలుకు 20 వేల పర్దావోలు ఇస్తానన్నాడు. కాని ఆల్బుకర్క్ అంగీకరించలేదు. కొన్ని మాసాల తర్వాత రాయలు బీజాపూరుపై దండయాత్ర చేయడానికి సంకల్పించి మళ్లీ గోవాకు తన రాయబారులను పంపి తనకు అశ్వాలను అమ్మాలని కోరాడు ఆ విషయం తెలుసుకొని బీజాపూరు సుల్తాన్ ఆదిల్‌షా కూడా గోవాకు తన రాయబారులను పంపాడు. రాయబారాలు పూర్తికాకముందే ఆల్బుకర్క్ క్రీ.శ.1515లో మరణించాడు. తర్వాత పోర్చుగీసు గవర్నర్ అయిన లోపొసొరెస్ విజయనగరానికి మాత్రమే అశ్వాలను అమ్మాలని తీర్మానించి రాయలతో స్నేహసంబంధాలను కొనసాగించారు. అతడు క్రీ శ 1517లో క్రిష్టావో ఫిగరిదోకు కానుకలను ఇచ్చి విజయనగరం పంపాడు. రాయలు ఫిగరిదోను అతని అనుచరులను సత్కరించాడు. క్రీ.శ 1520లో బీజాపూరు సుల్తాన్‌తో జరిగిన రాయచూరు యుద్ధంలో క్రిష్టావో ఫిగరిదో తన శతఘ్నుదళంలో పాల్గొని రాయచూరు కోటగోడలను కూల్చి కోట రాయల వశం అయ్యేటట్లు సహాయం చేశాడు. క్రీ.శ 1522 దసరా ఉత్సవాలలో క్రిష్టావో ఫిగరిదోకు రాయలు బహుమతులు ఇచ్చాడు కృష్ణరాయలు తర్వాత అచ్యుతరాయల కాలంలో పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ విజయనగరం వచ్చి క్రీ శ 1535 వరకు అక్కడ నివసించి అచ్యుతదేవరాయలను గురించి రాశాడు. అచ్యుతరాయల పాలనపై ప్రజలకు, మంత్రులకు అసంతృప్తి ఉందని రాశాడు.

మొదటి నుండి స్నేహంగా కొనసాగుతున్న పోర్చుగీసు, విజయనగర సంబంధాలకు మొట్టమొదటిసారిగా సదాశివరాయల కాలంలో విఘాతం ఏర్పడింది. క్రీ.శ.1542-1545 సంవత్సరాల మధ్య పోర్చుగీసు గవర్నర్‌గా పని చేసిన మార్టిన్ అఫాన్సోడ సూజా తూర్పు తీరంలోని దేవాలయాలను కొల్లగొట్టాలని కుట్ర పన్నాడు అదే కాలంలో కోరమండల తీరంలో రోమన్ కాథలిక్కు క్రిస్టియన్ మిషనరీలు హిందువులను క్రైస్తవులుగా మతాంతీకరణ చేయసాగారు. ముత్యాల తీరంలో నివసించే సరవలు అనే బెస్త వారిని మూడు వేల మందిని ఒకేసారి క్రైస్తవులుగా మార్చారు. అంతేగాక వారికి విజయనగర ప్రభువు రాజు కాదని, పోర్చుగీసు రాజే వారి రాజని, వారు విజయనగర ప్రభువు ఆజ్ఞలను శిరసావహించవలసిన పనిలేదని, పోర్చుగీసు రాజు ఆజ్ఞలకు బద్ధులై ఉండాలని ప్రచారం చేశారు. అంతేగాక శాంథోమ్, నాగపట్టణాలలో తమ స్థావరాలు ఏర్పాటు చేసుకొని పరసర ప్రాంతాలలో దేవాలయాలను కూల్చి చర్చిలు నిర్మింపసాగారు. నాగపట్టణంలోని రంగనాథ దేవాలయాన్ని ధ్వంసం చేసి, అక్కడ రెండు చర్చిలు నిర్మించారు. కాంచీపుర దేవాలయాన్ని దోచారు ఇదే సందర్భంలో డిసూజాకు తిరుపతి దేవాలయంలో అనంత సంపదలున్నాయని తెలిసింది. తిరుపతి దేవాలయాన్ని దోచుకోవాలని అతడు స్వయంగా పోర్చుగీసు నౌకాబలంతో మద్రాసు వద్ద ఉన్న శాంథోమ్‌కు చేరుకున్నాడు. కాని అదే సమయంలో తీవ్రమైన తుఫాను చెలరేగినందువల్ల అతని ప్రయత్నం విఫలమైంది. కాని అతడు పశ్చిమతీరంలో కొన్ని దేవాలయాలను కొల్లగొట్టి సంపదను దోచుకున్నాడు. రామరాయలకు పోర్చుగీసు వారి దుండగాలు తెలిసి వారిని దండించడానికి తన సేనాధిపతులైన చినతిమ్మరాజు, విఠల్ రాజులను పంపాడు. వారు క్రీ.శ.1542లో నాగూరుపై దండెత్తి పోర్చుగీసు వారి ఆగడాలను అరికట్టారు. డిసూజా తర్వాత డికాస్ట్రో (క్రీ.శ.1547-1548) పోర్చుగీసు గవర్నర్

అయ్యాడు. అతడు డిసూజా విధానాలు తప్పని గ్రహించి మళ్ళీ రామరాయలతో సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం పోర్చుగీసు వారు వారి గుర్రాలన్నింటినీ విజయనగరానికి అమ్మాలి. కాని అదే సంవత్సరం అక్టోబర్‌లో అహమ్మద్‌నగర్ రాజ్యంతో కూడా సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం బీజాపూరు రాజ్యంతో ఎవరికి యుద్ధం వచ్చినా ఒకరికొకరు సహాయం చేసుకోవాలి. ఈ విధంగా పోర్చుగీసు వారు బీజాపూరు రాజ్యానికి వ్యతిరేకంగా ఒక కూటమిని ఏర్పాటు చేయగలిగారు. కాని డికాస్ట్రో రామరాయలతో చేసుకున్న సంధి నిలువలేదు. చోళమండల తీరంలో క్రైస్తవ మిషనరీలు తిరిగి వారి మతాంతీకరణలు ప్రారంభించారు. హిందువులపై అత్యాచారాలు ప్రారంభించారు. అది తెలిసి రామరాయలు ఆగ్రహావేశుడై క్రీ.శ.1557లో ఒక సైన్యాన్ని పోర్చుగీసు వారిపైకి పంపాడు. ఆ సైన్యం హఠాత్తుగా పోర్చుగీసు వారి స్థావరమైన మైలాపూరు మీద దండెత్తి పట్టణాన్ని ధ్వంసం చేసి పోర్చుగీసు వారిని బందీలుగా పట్టుకొంది. రామరాయలు వారిపై లక్ష హొన్నులు అపరాధం విధించాడు వారు 50 వేలు చెల్లించి, మిగిలిన 50 వేలు మరు సంవత్సరం చెల్లిస్తామని చెర నుండి విముక్తులయ్యారు. అంతవరకు వారిలో కొందరిని బందీలుగా విజయనగరం తెచ్చారు.

సదాశివరాయల తర్వాత ఆరవీటి రెండవ వెంకటపతిరాయల కాలంలో పోర్చుగీసు వారితో మళ్ళీ వివాదం వచ్చింది. మొదట పోర్చుగీసు వారితో వెంకటపతిరాయలు మంచి స్నేహసంబంధాలను పాటించాడు. వారు తన రాజ్యంలో చర్చిలు నిర్మించుకోడానికి, తమ మత ప్రచారం చేసుకోడానికి కూడా అనుమతించాడు చర్చిలకు గ్రామాలను దానం కూడా చేశాడు. అందుకు స్పెయిన్ రాజు రెండవ ఫిలిప్పీ కృతజ్ఞతలు కూడా తెలిపాడు వెంకటపతిరాయల కాలంలో డచ్చివారు విజయనగర రాజ్యంలో తమ స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని భావించి రాయల అనుమతిని అర్థించారు. కాని పోర్చుగీసువారు వారికి అనుమతి ఇవ్వవద్దని రాయలను కోరారు. వారి కోరికను మన్నించి రాయలు డచ్చి వాకిరి అనుమతిని ఇవ్వలేదు. అందువల్ల డచ్చివారు జింజి పాలకుని అనుమతితో దేవకీపట్నంలో ఫ్యాక్టరీని నిర్మించుకున్నారు. అది సహించని పోర్చుగీసు వారు వెంకటపతిరాయలను దర్శించి దేవకీపట్నంలో డచ్చి ఫ్యాక్టరీని మూయించమని కోరారు. రాయలు జింజి పాలకునికి ఉత్తరం రాసి డచ్చి వారిని వెళ్లగొట్టించాడు. తర్వాత రాయలు పోర్చుగీసు వారిపై అదనంగా వ్యాపార సుంకం విధించాడు. కాని అదనంగా చెల్లించడానికి తిరస్కరించారు. అందుకు కోపించి రాయలు డచ్చివారిని ఆహ్వానించి పులికాట్‌లో ఫ్యాక్టరీని నిర్మించుకోడానికి అనుమతి ఇచ్చాడు. దాంతో పోర్చుగీసు వారికి వెంకటపతిరాయలపై ఆగ్రహం వచ్చింది. కానీ ఏమీ చేయలేక ఊరుకున్నారు. అయితే క్రీ.శ.1612లో వారు పులికాట్‌పై దండెత్తి డచ్చివారిని తరిమివేశారు. డచ్చివారు వెంకటపతిరాయలకు మొరపెట్టుకున్నారు. అతడు మళ్ళీ వారికి పులికాట్‌లో పునరావాసం కల్పించాడు. వారి రక్షణకు కోటను కూడా నిర్మిస్తానని వాగ్దానం చేశాడు. కాని రాయలు కోట నిర్మించడానికి ఆలస్యం చేశాడు. అందువల్ల డచ్చివారే తమ సొమ్ముతో అక్కడ తమకు రక్షణగా కోటను నిర్మించుకున్నారు. దాంతో పోర్చుగీసు వారు ఏమీ చేయలేకపోయారు. విజయనగర సామ్రాజ్యంలో పోర్చుగీసు వారు ఏకైక ఐరోపా వ్యాపారస్థులుగా నిలిచి విపరీతంగా లాభాలు గడించారు. తర్వాత క్రీ.శ.1639లో మూడవ వెంకటపతిరాయల కాలంలో అతని మంత్రి దామెర్ల వెంకటాద్రి మద్రాసు వద్ద 5 మైళ్ల పొడవునా 1 మైలు వెడల్పున స్థలాన్ని కౌలుకి ఇచ్చాడు. దాంతో విజయనగర సామ్రాజ్యంలో ఇంగ్లిషువారు కూడా వ్యాపారులయ్యారు క్రీ.శ.1642లో మూడవ శ్రీరంగరాయలు మద్రాసు కౌలును ఇంగ్లిషు వారికి శాశ్వతంగా ఇచ్చేశాడు. దాంతో విజయనగర రాజ్యంలో పోర్చుగీసు వారి వ్యాపారం ఇంకా దిగజారిపోయింది. ఇంగ్లిషు వారు పోర్చుగీసు వారికి ప్రత్యర్థులుగా తయారయ్యారు.

వెంకటపతిరాయల మరణం తర్వాత విజయనగర సామ్రాజ్యం క్షీణించింది. దాంతోపాటే పోర్చుగీసు వారి ప్రాభవం కూడా క్షీణించింది. పోర్చుగీసు వారి ప్రాభవం విజయనగర రాజ్య ప్రాభవంతో ముడిపడి ఉంది. తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగరం క్షీణించినట్లే నాటి నుండే పోర్చుగీసు వ్యాపారం కూడా తగ్గసాగింది. కాని ఇతర ఐరోపా వారి పోటీ లేనందువల్ల క్రీ.శ.1600 వరకు పోర్చుగీసు వారి వ్యాపారం పోటీ లేకుండా సాగింది సముద్రాధిపత్యంలో వారికి ఎదురులేదు. స్పెయిన్ రాజు ఫిలిప్పీ పోర్చుగల్‌ను ఐరోపా రాజ్యాలతో తాను చేసే యుద్ధాలలోకి లాగి పోర్చుగీసు వారిని బలహీనపరిచాడు. అతడు ఇండియాలోని పోర్చుగీసు వారికి ఎలాంటి సహాయం పంపలేదు. క్రీ.శ.1600 సంవత్సరంలో ఇంగ్లండు వర్తకులు ఈస్టిండియా కంపెనీని స్థాపించి పోర్చుగీసు వారికి ప్రత్యర్థులయ్యారు. డచ్చివారు, ఇంగ్లిషువారు విజయనగర రాజ్యంతో వ్యాపారం చేసుకోడానికి

అనుమతిని సంపాదించారు. కనుక పోర్చుగీసు వారి ప్రాభవం త్వరితగతిన అంతమైంది. అంతవరకు వారికి భారతదేశంలో అనుకూల పరిస్థితులున్నాయి. కనుకనే కొందరు చరిత్రకారులు పోర్చుగీసు వారి ఉన్నతి తుళువ వంశంతో ఆరంభమై తుళువ వంశ పతనంతో గోవా పతనం కూడా జరిగిందని అన్నారు. ఆల్బుకర్క్ విజ్ఞతతో విజయనగరంతో పాటించిన స్నేహసంబంధాలను తర్వాత గవర్నర్లు విస్తరించినందువల్ల ఎంతో లాభం జరిగింది. క్రీ శ 1569-70 సంవత్సరాలలో బీజాపూరు అహమ్మద్‌నగర్ రాజ్యాలు రెండూ ఏకమై పోర్చుగీసు వారికి వ్యతిరేక కూటమిగా ఏర్పడి యుద్ధానికి దిగినప్పుడు వారికి విజయనగర స్నేహం ఎంతటి గొప్పదో అర్థమైంది. కనుకనే ఒక పోర్చుగీసు రచయిత విజయనగర సామ్రాజ్య పతనంతో భారతదేశంతో పాటు మనదేశం కూడా అంటే పోర్చుగల్ బాగా దెబ్బతింది, మనవారు అంటే పోర్చుగీసు వారు ఆ రాజ్యంతోనే వ్యాపారం చేస్తారు. ఆ రాజ్యానికి గుర్రాలు, సన్నని పట్టు, ముఖమల్ వస్త్రాలు సరఫరా చేసి ఇతర సరుకులను అందించి అంతులేని లాభాలు గడించాయి. విజయనగర సామ్రాజ్య పతనంతో గోవాకు సుంకాల ఆదాయం పూర్తిగా తగ్గిపోయింది. పర్షియా గుర్రాల దిగుమతి వల్ల వచ్చే ఆదాయం నూటికి 96 శాతం పోయింది. క్రీ.శ.1614 తర్వాత గోవా వాసులు వెనుకటంత సుఖంగా జీవించటం లేదని పోర్చుగీసు రచయితలు వాపోయారు. ఈ విధంగా విజయనగర సామ్రాజ్యపతనంతో పోర్చుగీసు వారి సామ్రాజ్యం, రెండూ పతనమయ్యాయి. క్రీ.శ.1680లో విజయనగర సామ్రాజ్యం అదృశ్యమైంది. నాటి నుండి పోర్చుగీసు వారు గోవాకు మాత్రమే పరిమితమయ్యారు. కనుకనే క్రీ.శ.1578-1588 సంవత్సరాల మధ్య ఇండియాలో Sassetti అనే పోర్చుగీసు రచయిత విజయనగర రాజ్యపతనం వలన పోర్చుగీసు వారు ఎంత నష్టపోయిందీ రాశాడు. తళ్లికోట యుద్ధానికి సాలుకు 120 నుండి 150 వేల డ్యూకాట్స్ ఆదాయం వచ్చేది. ఇప్పుడు 6 వేలకు పడిపోయిందని రాశాడు. కౌట్ కూడా అదే విషయం రాశాడు.

విజయనగర సామ్రాజ్యానికి గోల్కొండ రాజ్యంతో గల సంబంధాలు

తుళువ వంశ సంబంధాలు-శ్రీకృష్ణదేవరాయల కాలం: గోల్కొండ రాజ్యం క్రీ.శ.1518వ సంవత్సరంలో కులీకుతుబ్‌షా స్థాపించాడు. అతడు స్వతంత్ర కుతుబ్‌షాహీ రాజ్యం స్థాపించే నాటికి విజయనగర సామ్రాజ్యాన్ని శ్రీకృష్ణదేవరాయలు పాలిస్తున్నాడు. కృష్ణరాయలు గజపతిని ఓడించిన తర్వాత క్రీ.శ.1518లో సంధి చేసుకొని ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా అంగీకరించాడు. అందువల్ల కొండవీడు విజయనగర సామ్రాజ్యంలో శాశ్వతంగా భాగమైంది. తర్వాత కృష్ణరాయలకు క్రీ.శ.1521వ సంవత్సరంలో రాయచూరు, అంతర్వేది ప్రాంతాల కోసం బీజాపూరుతో యుద్ధం వచ్చింది. ఆ సమయంలో కొండవీటిని జయించవచ్చని కులీకుతుబ్‌షా కొండవీడుపై దండెత్తాడు. రాయలు పాండురంగడు అనే సేనానిని పంపగా అతడు కులీని ఓడించి తరిమాడు.

అచ్యుతదేవరాయలు క్రీ.శ.1529: క్రీ.శ.1529లో శ్రీకృష్ణదేవరాయలు మరణించాడు. అతని తర్వాత అతని సోదరుడు అచ్యుత దేవరాయలు విజయనగర సింహాసనం అధిష్టించాడు. ఆ సమయంలో సులభంగా కొండవీటిని జయించవచ్చని కులీ మళ్లీ కొండవీటిపై దండెత్తాడు. అచ్యుతదేవరాయలు తన సేనాధిపతులైన బాచరుసుడు, వెలుగోటి తిమ్మానాయకులను పంపాడు. వారు కులీని ఓడించి తరిమి కొండవీటిని కాపాడారు. కులీ జీవితకాలంలో విజయనగర రాజ్యంలోని ఒక్క అంగుళ భూభాగాన్ని కూడా ఆక్రమించలేకపోయాడు. అతని మరణం తర్వాత రాజ్యానికి వచ్చిన జంషిద్ విజయనగర రాజ్యంతో పోరాటాలకు దిగలేదు. తర్వాత రాజ్యానికి వచ్చిన ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నుండి విజయనగరంతో పోరాటాలు ప్రారంభమయ్యాయి.

రామరాయలు-సదాశివరాయలు క్రీ.శ.1550-1570: రామరాయలు ఆరవీటి వంశస్తుడు. రామరాయలు తన తొలి జీవితంలో గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా కొలువులో చేరాడని ప్రతీతి. కులీ అతనిని విజయనగర రాజ్యపు సరిహద్దులలోని ఒక దుర్గ పాలకునిగా నియమించాడు. శ్రీకృష్ణదేవరాయలు దండెత్తి వచ్చి ఆ దుర్గాన్ని ముట్టడించగా రామరాయలు ఓడి దుర్గాన్ని రాయల పరం చేశాడట. అందుకు కోపించి కులీ రామరాయలను తన కొలువు నుండి వెళ్లగొట్టాడు. రామరాయలు విజయనగరం చేరి కృష్ణరాయలను ఆశ్రయించాడు. రాయలు అతని యుద్ధ కౌశల్యాన్ని అంతకుముందే గమనించి ఉన్నాడు. గనుక అతనికి తన కుమార్తెనిచ్చి వివాహం చేసి తన ఆస్థానంలో ప్రవేశం కల్పించాడు. కృష్ణరాయల అల్లుడైనందున అప్పటి నుండి అతడు అళియ రాయలు (అంటే కన్నడ భాషలో అల్లుడు అని అర్థం) అని ప్రసిద్ధి చెందాడు. తర్వాత అచ్యుత దేవరాయల మరణానంతరం వారసత్వ యుద్ధంలో సదాశివరాయలను సమర్థించి విజయనగర చక్రవర్తిని చేశాడు. సదాశివరాయలు పరిపాలన అంతటినీ రామరాయలకు అప్పగించాడు. దాంతో రామరాయలు విజయనగర రాజ్యానికి సర్వాధికారి అయ్యాడు.

గోల్కొండ రాజ్యంతో సంబంధాలు: రాయరాయలు సదాశివరాయలను సింహాసనం ఎక్కించిన సంవత్సరంలోనే గోల్కొండలో కులీకుతుబ్‌షాను వధించి అతని కుమారుడు జంషీద్ గోల్కొండ సింహాసనం ఎక్కాడు. అతనికి భయపడి అతని సోదరుడు ఇబ్రహీం కుతుబ్‌షా పారిపోయి విజయనగరం వచ్చి రామరాయలను ఆశ్రయించాడు. రామరాయలు అతనికి ఆశ్రయం కల్పించి తన కుమారుని లాగా చూసుకున్నాడు. 7 సంవత్సరాలు అతడు విజయనగరంలో నివసించి జంషీద్ మరణించిన తర్వాత అతడు గోల్కొండ చేరి సుల్తాన్‌గా సింహాసనం ఎక్కాడు. కొంత కాలం ఇబ్రహీం కుతుబ్‌షా రామరాయల యందు గొప్ప మర్యాదలతో ఉన్నాడు. కాని తర్వాత దక్కను రాజకీయాలలో రామరాయలు జోక్యం కలిగించుకొన్నందువల్ల వచ్చిన రాజకీయ మార్పుల వల్ల వారిద్దరూ విరోధులుగా మారిపోయారు.

బహమనీ రాజ్య విచ్ఛిన్నం తర్వాత ఏర్పడిన ఐదు ముస్లిం రాజ్యాలు తమలో తాము పోరాడుతుండేవి. ముఖ్యంగా బీజాపూరు, అహమ్మద్ రాజ్యాల మధ్య కళ్యాణీ, షోలాపూరుల కోసం యుద్ధాలు జరుగుతుండేవి. ఈ యుద్ధంలో అహమ్మద్‌నగర్ సుల్తాన్ రామరాయల సహాయంతో బీజాపూరును ఓడించి కళ్యాణీ, షోలాపూరులను ఆక్రమించాడు. తర్వాత క్రీ.శ.1557లో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా మరణించి అతని కుమారుడు అలీ ఆదిల్‌షా బీజాపూరు సింహాసనం అధిష్టించాడు. అతడు సుల్తాన్ కాగానే విజయనగరం దర్శించి రామరాయల

సహకారం సంపాదించాడు. రామరాయల సహాయంతో అతడు అహమ్మద్‌నగర్‌పై యుద్ధానికి దిగాడు ఈ యుద్ధంలో రామరాయలు అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి, ఆ రాజ్యాన్ని ధ్వంసం చేసి నిజాంషాను ఓడించి కళ్యాణీ, షోలాపూర్‌లను బీజాపూరు సుల్తాన్‌కు ఇప్పించాడు. ఈ యుద్ధంలో ఓడిపోయిన అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుస్సేన్ నిజాంషా బీజాపూరు రాజ్యంపై ప్రతీకారం చేయాలని గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షాతో స్నేహ సంధి చేసుకున్నాడు. ఇదే సమయంలో గోల్కొండ రాజ్యంలో సేనాధిపతిగా పనిచేసే జగదేకరావు ఇబ్రహీం కుతుబ్‌షాపై తిరుగుబాటు చేసి ఇబ్రహీం ఆగ్రహానికి గురై గోల్కొండ రాజ్యం నుండి పారిపోయి విజయనగరం చేరాడు అతనికి రామరాయలు ఆశ్రయం ఇచ్చాడు. తన విరోధికి ఆశ్రయం ఇచ్చినందుకు ఇబ్రహీం రామరాయలపై విరోధం పెంచుకొని అహమ్మద్‌నగర్ సుల్తాన్‌తో చేరిపోయాడు ఇప్పుడు నిజాంషాలు కుతుబ్‌షా కలసి బీజాపూరుపై దండెత్తారు. బీజాపూరుకు సహాయంగా రామరాయలు వచ్చాడు. మళ్లీ రెండవసారి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో రామరాయల సైన్యం అహమ్మద్‌నగరంపై దాడి చేసి నానా బీభత్సం సృష్టించింది. నిజాంషా తన రాజధానిని వదలి పారిపోయాడు. విజయనగర సైన్యాలు అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని నిర్వీర్యం చేశాయి. తర్వాత బీజాపూరు విజయనగర సైన్యాలు గోల్కొండ రాజ్యంపై దండెత్తి గోల్కొండ రాజ్యాన్ని కూడా ధ్వంసం చేశాయి. ప్రమాదాన్ని గుర్తించిన ఇబ్రహీం కుతుబ్‌షా రామరాయలతో సంధి చేసుకొని పానుగల్లు, ఘనాపూర్, కొండపల్లి దుర్గాలను రామరాయలకు ఇచ్చాడు. యుద్ధకాలంలో రామరాయలు ఆక్రమించి గోల్కొండ రాజ్య భాగాలను వదలివేశాడు. ఈ యుద్ధం తర్వాత సుల్తాన్‌లు అందరూ రామరాయల వలన తమ రాజ్యాలకు భద్రతలేదని గ్రహించారు. తాము ఈ విధంగా అంతః కలహాలలో మునిగి ఉంటే త్వరలోనే విజయనగర రాజ్యం తమ రాజ్యాలను కబళించగలదని వారికి భయం కలిగింది ఇదే సమయంలో గోల్కొండ రాజ్యానికి తూర్పున ఉన్న గజపతి సామంతులైన చితాబ్‌ఖాన్, విద్యాధరుడు ఏలూరు, రాజమహేంద్రవరాలను ముట్టడించారు. రామరాయలు వారికి తన సహకారాన్ని అందించాడు. అంతేగాక గోల్కొండ రాజ్యంలోని ఇబ్రహీం సామంతులను తిరుగుబాటు చేయడానికి ప్రోత్సహించసాగాడు. ఇబ్రహీంను చంపించడానికి కూడా కుట్రలు పన్నసాగాడని వదంతులు మొదలయ్యాయి. ఆ స్థితిలో రామరాయలను నాశనం చేయాలని ఇబ్రహీం కుతుబ్‌షా మిగిలిన సుల్తాన్‌ల అందరినీ ఏకం చేసి వారందరినీ క్రీ.శ.1546లో ఒక కూటమిగా ఏర్పాటు చేశాడు. ఇబ్రహీం ఈ కూటమిని ఏర్పాటు చేశాడని ఫెరిష్టా రాశాడు. బేరారు సుల్తాన్ తప్ప మిగిలిన నలుగురు అంటే అహమ్మద్‌నగర్, బీజాపూరు, బీదర్, గోల్కొండ రాజ్యాలు కూటమిగా ఏర్పడి విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేయడానికి బద్ధకంకణులయ్యారు. వారు క్రీ శ 1565లో దండెత్తి రాక్షసతంగడి లేక తళ్లికోట యుద్ధంలో రామరాయలను వధించి, విజయనగరంపై దండెత్తి పట్టణాన్ని ధ్వంసం చేసి దోచుకున్నారు. దాంతో విజయనగర రాజ్యం కోలుకోలేని దెబ్బతినింది. తత్ఫలితంగా తుళువ వంశం పోయి ఆరవీటి వంశం విజయనగర అధికారాన్ని చేపట్టింది.

ఆరవీటి వంశం నాటి సంబంధాలు క్రీ.శ.1570-1680: సదాశివరాయలను తొలగించి రామరాయల సోదరుడు తిరుమలరాయలు పెనుగొండలో పట్టాభిషేకం చేసుకొని క్రీ.శ 1570లో ఆరవీటి వంశాన్ని స్థాపించాడు. తళ్లికోట యుద్ధంలో బలహీనపడిన విజయనగర రాజ్యంపై గోల్కొండ, బీజాపూరు రాజ్యాలు దాడులు ప్రారంభించాయి. వారి దాడులను ఎదుర్కొని విజయనగర రాజ్యాన్ని కాపాడటానికి ఆరవీటి వంశస్థులు తమ శక్తివంచన లేకుండా పోరాడారు. కాని రాజ్యాన్ని కాపాడలేకపోయారు. అయినప్పటికీ జయాపజయాల మధ్య వారు 100 సంవత్సరాలు పాలించారు. ఈ 100 సంవత్సరాలలో ఆరవీటి వంశస్థులు ఒకవైపు గోల్కొండ రాజ్యంతో, మరొకవైపు బీజాపూరు రాజ్యంతోను అనేక పోరాటాలు జరిపారు.

తిరుమలరాయలు క్రీ.శ.1570-71: తిరుమలరాయల పట్టాభిషేకం చూసుకొని రాజుగా ప్రకటించుకోవడం రామరాయల కుమారుడు పెదతిరుమలయ్య సహించలేక పినతండ్రిని పదభ్రష్టుణ్ణి చేయాలని బీజాపూరు సుల్తాన్ ఆదిల్‌షా సహాయం అర్థించాడు. ఆదిల్‌షా సైన్యాలు అనెగొంది దుర్గాన్ని పట్టుకొని పెనుగొండపై దండెత్తాయి. తిరుమలరాయలు అహమ్మద్‌నగర్ సుల్తాన్ సహాయం అర్థించాడు. నిజాంషా తన సైన్యాలతో బీజాపూరు రాజ్యంపై దండెత్తాడు. దాంతో ఆదిల్‌షా తన రాజ్యాన్ని కాపాడుకోడానికి పెనుకొండ నుండి వెనుదిరిగి వెళ్లిపోయాడు. తన రాజ్యంపై దండెత్తినందుకు ప్రతీకారంగా ఆలీ ఆదిల్‌షా అహ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తాడు. అతనిని ఎదిరించడానికి నిజాంషా గోల్కొండ ఇబ్రహీంషా సహాయం అర్థించాడు. అతడు అంగీకరించాడు. వారిద్దరూ కలసి తిరుమలరాయలను కూడా తమకు సహాయంగా రావలసిందిగా కోరారు.

తిరుమలరాయలు వారికి సహాయంగా తన కుమారుని నాయకత్వంలో 10 వేల సైన్యాన్ని పంపాడు. కాని అందువల్ల తిరుమలరాయలకు ఎలాంటి ప్రయోజనం కలగకపోగా కొత్త సమస్యలు వచ్చాయి. అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లు బీజాపూరుతో సంధి చేసుకొని యుద్ధ విరమణ చేశారు. తనపైకి సైన్యాలు పంపినందుకు ఆదిల్‌షా కోపించి విజయనగర రాజ్యంపై దండెత్తి రాయచూరు, అంతర్వేది, ఆదోనిలను ఆక్రమించాడు. రాయచూరు, అంతర్వేదికి తానే అధిపతినని ప్రకటించుకున్నాడు. తిరుమలరాయలు ఆదోనిని కాపాడుకోలేక పోయాడు. ఆ సంవత్సరంలోనే అతడు మరణించాడు. అతని కుమారుడు మొదటి శ్రీరంగరాయలు విజయనగర సింహాసనం అధిష్ఠించాడు.

శ్రీరంగరాయలు క్రీ.శ.1579-1584: శ్రీరంగరాయల కాలంలో అతని సామంతులే ఎదురు తిరిగారు. వారిలో హండే నాయకులు తమ ప్రభువుకు వ్యతిరేకంగా బీజాపూరు సుల్తాన్‌ను ఆహ్వానించారు. ఆదిల్‌షా హండే నాయకులకు సహాయంగా వచ్చి పెనుగొండను ముట్టడించారు. శ్రీరంగరాయలు చంద్రగిరి చేరి తనకు సహాయం చేయవలసిందిగా గోల్కొండ సుల్తాన్‌ను కోరారు. ఇబ్రహీం కుతుబ్‌షా విజయనగర రాజ్యానికి సహాయం చేయదలచి కొంత సైన్యాన్ని బీజాపూరుపైకి పంపి శ్రీరంగరాయలతో సంభాషించడానికి ఒక దూతను చంద్రగిరికి పంపాడు. క్రీ.శ.1579లో ఇబ్రహీం కర్ణాటకంపైన దండెత్తాడు. అతనికి హండే నాయకులు సహాయపడ్డారు. విజయనగర సామంతులైన మల్లు వంశం, సరివంశ నాయకులు పరస్పరం ఒకరిపై ఒకరు యుద్ధాలకు దిగారు. వారి వైరం ఇబ్రహీం కుతుబ్‌షాకు అనుకూలించింది. అతడిని ఎదిరించేవారు లేకపోయారు. ఇబ్రహీం సైన్యాలు నరహరి అనే సేనా నాయకుని ఆధిపత్యంలో హండే నాయకులైన మలకప్ప, కతాంబరాయుని కలుపుకొని ఒక సైన్యం కర్నూలు ప్రాంతంపై దాడి చేసి దానిని ధ్వంసం చేసి అహోబిల నరసింహస్వామి దేవాలయంపైబడి దోపిడీ చేసింది. అంతేగాక జయించిన కర్నూలు, అహోబిల ప్రాంతాలు గోల్కొండ రాజ్యంలో చేర్చబడ్డాయి. ఆ ప్రాంతానికి సుల్తాన్ హండే నాయకులను తన ప్రతినిధులుగా నియమించాడు. అయితే శ్రీరంగరాయలు ఆ ప్రాంతాలను తిరిగి కైవసం చేసుకోడానికి కొండ్రాజు వెంకట్రాజు అనే సేనాధిపతిని పంపాడు. అతడు హండే నాయకులను, గోల్కొండ సైన్యాలను ఓడించి తరిమి కర్నూలు ప్రాంతాన్ని అహోబిళాన్ని తిరిగి ఆక్రమించాడు. హండే నాయకులు తమ అధికారాన్ని కోల్పోయారు.

కొండవీడును ఆక్రమించడం క్రీ.శ.1579-80: కర్నూలు ప్రాంతాలు చేజారి పోగానే ఇబ్రహీం కుతుబ్‌షా కొండవీటిని జయించి తన రాజ్యంలో కలుపుకోవాలని సంకల్పించాడు. అందుకు హైదర్ ఉల్‌ముల్క్ అనే సేనాధిపతిని క్రీ.శ.1579 మార్చి నెలలో పంపాడు. అతడు కృష్ణానదిని దాటి బెల్లంకొండ, నాగార్జునకొండ, మాచెర్ల, ఉదయగిరి దుర్గాలను, కొచ్చెర్లకోటను ఆ ప్రాంతాలలోని మరికొన్ని చిన్న దుర్గాలను జయించాడు. అప్పుడు కొచ్చెర్లకోటకు వెలమనాయకుడు కస్తూరి రంగప్ప దుర్గాలను జయించాడు. అప్పుడు కొచ్చెర్లకోటకు వెలమలనాయకుడు కస్తూరి రంగప్ప దుర్గాధిపతిగా ఉన్నాడు. అతడు హైదర్ ఉల్‌ముల్క్‌తో పోరాడకుండా కోటను వదలివేసి పారిపోయాడు. కొచ్చెర్లకోటను ఆక్రమించిన తర్వాత హైదర్ కొండవీడుపై దండెత్తాడు. ఆ కాలంలో కొండవీడును అళియరామరాయల అల్లుడైన గొబ్బూరి తిమ్మరాజు పాలిస్తున్నాడు. అతడు వెలుగోటి తిమ్మానాయకుని సహాయంతో ముస్లిం సేనను ఎదుర్కొన్నాడు. ముస్లిం సైన్యం ఎంతో వీరోచితంగా పోరాడినా కొండవీడు స్వాధీనం కాలేదు. కనుక ఇబ్రహీం కుతుబ్‌షా హైదర్ ఉల్‌ముల్క్‌ను గోల్కొండకు పిలిపించి అతని స్థానంలో సయ్యద్‌షా తకీ అనే సరదారుని నియమించాడు. అయినా అతడు కూడా కోటను జయించలేక పోయాడు. అందువల్ల చివరకు నరహరి సలహాతో వెలుగోటి తిమ్మానాయకునికి లంచం పెట్టి అతని సహకారంతో కోటను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన క్రీ.శ.1580 ఏప్రిల్ 9వ తేదీన జరిగింది. దాంతో కృష్ణరాయలు గజపతుల నుండి జయించిన కొండవీడు విజయనగర రాజ్యం నుండి జారిపోయి శాశ్వతంగా గోల్కొండ రాజ్యంలో చేరిపోయింది. తిరిగి ఆరవీటి రాజులు దానిని జయించలేకపోయారు.

రెండవ వెంకటపతిరాయలు క్రీ.శ.1584-1614: ఆరవీటి వంశస్తులలో రెండవ వెంకటపతిరాయలు అత్యంత సమర్థుడు. తన సోదరుడు శ్రీరంగరాయల కాలంలో కోల్పోయిన విజయనగర ప్రాంతాలను తిరిగి సంపాదించాలని సంకల్పించాడు. అదే సమయంలో శ్రీరంగరాయల కాలంలో జయించగా మిగిలిన విజయనగర రాజ్య భాగాలను కూడా జయించాలని ఇబ్రహీం కుతుబ్‌షా తర్వాత రాజ్యానికి వచ్చిన సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్‌షా (1580-1612) నిర్ణయించుకున్నారు. అందుకుగాను అతడు అమీన్ ఉల్‌ముల్క్ గండికోటపై

దండెత్తి కోటను ఆక్రమించాడు. తర్వాత నంద్యాలపై దండెత్తాడు. నంద్యాలను పాలించే రాజు బంధువులు అయిన బస్వంత రాయలను, నరసింగరాజును ఓడించి వారు గోల్కొండ సామంతులుగా ప్రతి సంవత్సరం కప్పం చెల్లించేటట్లు ఒప్పించాడు. తర్వాత గోల్కొండ సైన్యం కర్నూలును జయించి గుత్తిపై దండెత్తింది. గుత్తి కూడా వారి వశమైంది. ఇదే సందర్భంలో సుల్తాన్ స్వయంగా మరొక సైన్యంతో బయలుదేరి పెనుగొండ దుర్గాన్ని ముట్టడించాడు. వెంకటపతిరాయలు అంత త్వరగా వచ్చి పెనుగొండను ముట్టడిస్తారని ఊహించలేదు. కనుక అతడు సుల్తాన్‌తో మంతనాలు చేస్తూ కాల హరణం చేసి తన సైన్యాలను రప్పించుకోవాలని ఎత్తు వేసి మూడు రోజులు శాంతి సంప్రదింపుల పేరుతో కాలం గడిపాడు. ఈ లోపల తన ప్రయత్నాలను రహస్యంగా కొనసాగించి దక్షిణ దేశం నుండి అమరనాయకులు, సామంతుల సైన్యాలను రప్పించుకొన్నాడు. తన సైన్యాలు పెనుగొండ చేరగానే సంధి ప్రయత్నాలు వదలి వేసి సుల్తాన్ సైన్యంతో యుద్ధానికి దిగాడు. సుల్తాన్ ఊహించని ఈ పరిణామానికి ఖంగుతిన్నాడు. యుద్ధంలో ఓడిపోయి వెనుదిరిగి తన రాజధానికి వెళ్లిపోయాడు. ఆ విజయం తర్వాత విజయనగర సైన్యాలు గుత్తి వైపు పోయి కోటను స్వాధీనం చేసుకొని అక్కడి నుండి గండికోట వైపు నడిచాయి. గండికోటను కాపాడుకోడానికి సుల్తాన్ కొండవీటి దుర్గాధిపతి అఫ్‌జుల్‌ఖాన్‌ను గండికోటకు వెళ్లమని ఆదేశించాడు. అఫ్‌జుల్‌ఖాన్ గండికోటకు సహాయంగా బయలుదేరాడు. అది తెలిసిన వెంకటపతిరాయలు ఆ సైన్యాన్ని మార్గమధ్యంలోనే అడ్డుకోడానికి మట్ల అనంతరాజు నాయకత్వంలో విజయనగర సైన్యాన్ని పంపాడు. అనంతరాజు మార్గమధ్యంలో గుర్రంకొండ వద్ద అఫ్‌జుల్‌ఖాన్‌ను ఎదిరించి ఓడించి తరిమాడు. ఈ లోపల గండికోట కూడా స్వాధీనం అయింది. తర్వాత విజయనగర సైన్యం పెన్నానది వద్ద కుతుబ్‌షాహీ సైన్యంతో మరొక యుద్ధం చేసి ఓడించింది. అయినప్పటికీ విజయనగర సైన్యం గోల్కొండ సైన్యాన్ని తరుముతూ కృష్ణానదిని దాటి గోల్కొండ రాజ్యంలో ప్రవేశించింది. దాంతో సుల్తాన్ విజయనగర సైన్యాన్ని ఓడించడం సాధ్యం కాదని తెలుసుకొని సంధికి దిగివచ్చి కృష్ణానది ఉభయ రాజ్యాల సరిహద్దుగా అంగీకరించాడు. ఈ విజయాలతో శ్రీశైలం వరకు భూభాగాలన్నీ తిరిగి విజయనగర రాజ్యంలో చేరిపోయాయి. ఉత్తరాన శ్రీశైలం విజయనగర రాజ్యానికి సరిహద్దు అయింది. ఈ విధంగా ఒక్క కొండవీడు మినహా శ్రీరంగరాయల కాలంలో పోయిన ప్రాంతాలన్నీ తిరిగి వెంకటపతి రాయలు తిరిగి జయించాడు.

వెంకటపతిరాయల తర్వాత పరిస్థితి: క్రీ.శ.1614లో వెంకటపతిరాయలు మరణించాడు. అతని మరణం తర్వాత సింహాసనం కోసం అంతఃకలహాలు జరిగి విజయనగర రాజ్యం బలహీనమైపోయింది. అందువల్ల మూడవ వెంకటపతిరాయల (క్రీ.శ.1630-1664) కాలంలో కుతుబ్‌షాహీ సైన్యాలు మళ్లీ విజయనగరంపై దండెత్తాయి. ఈ కాలంలో అబ్దుల్లా కుతుబ్‌షా గోల్కొండ సుల్తాన్ అయ్యాడు. అతడు విజయనగర రాజ్యపు తూర్పు తీర ప్రాంతాలను ఆక్రమించడానికి సైన్యాన్ని పంపాడు. ఆ సైన్యం తూర్పు తీర ప్రాంతాలన్నింటిని జయించింది. ఆ సైన్యాన్ని ఎదిరించిన వెలుగోటి, దామెర్లవంశ విజయనగర సేనానులు ఓడిపోయి గిరి దుర్గాలలో తలదాచుకున్నారు.

మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ.1642-1680: మూడవ వెంకటపతిరాయల తర్వాత రాజ్యానికి వచ్చిన మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ.1642-46 కాలంలో గోల్కొండ సైన్యాలు మళ్లీ విజయనగర రాజ్యంపై దండెత్తి వీరవిహారం చేశాయి. క్రీ.శ.1642లో శ్రీరంగరాయలు వారితో పోరాడలేక వెల్లూరు నారాయణ వనాలకు పారిపోయాడు. సుల్తాన్ సైన్యాలు అతనిని తరుముతూ పోయి ఉదయగిరి దుర్గాన్ని ముట్టడించాయి. రాయలు ఆ దుర్గాన్ని కాపాడుకోడానికి ఏమీ చెయ్యలేకపోయాడు. కోట సుల్తాన్ స్వాధీనం అయింది. సుల్తాన్ సైన్యం క్రీ.శ.1644లో గోల్కొండ సైన్యాలు విజయనగర రాజ్యంపై దాడి చేశాయి. రాయలు వెలుగోటి సింగమ నాయకుడనే సేనాధిపతితో కలసి గోల్కొండ సైన్యాన్ని ఎదుర్కోవడానికి బయలుదేరాడు. ఉభయ సైన్యాలు క్రీ.శ.1644 ఆగస్టు 42వ తేదీన వెగల్లు అనే చోట తలపడ్డాయి. అక్కడ విజయనగర సైన్యాలు గోల్కొండ సైన్యాలను ఓడించి గోల్కొండ సైన్యాధిపతిని చంపివేసి వారి సైన్యాన్ని కందుకూరు వరకు తరిమివేశాయి.

గోల్కొండ, బీజాపూరు రాజ్యాల సంయుక్త దండయాత్ర క్రీ.శ.1644: కందుకూరు విజయం రాయలకు శాశ్వతం కాలేదు. గోల్కొండ సుల్తాన్ బీజాపూరుతో కలసి మళ్లీ విజయనగర రాజ్యంపై దండెత్తాడు. గోల్కొండ, బీజాపూరు సంయుక్త సైన్యాలను ఎదిరించలేక శ్రీరంగరాయలు కందుకూరును వదలివేసి వెళ్లిపోయాడు. గోల్కొండ సైన్యాలు మీర్జుంలా నాయకత్వంలో కర్నూలు జిల్లా తూర్పు ప్రాంతాలను జయించాయి. అదే సమయంలో

బీజాపూరు సైన్యాలు కర్నూలుకు ఈశాన్యంగా ఉన్న నంద్యాల, కనిగిరి, సిరువెళ్ళ, వాటి పరిసర కోటలను జయించాయి. మూడవ శ్రీరంగరాయలు గోల్కొండ, బీజాపూరు రాజ్యాలతో ఒప్పందం చేసుకున్నాడు. దాంతో వారు యుద్ధ విరమణ చేశారు.

దక్షిణ సామంత రాజ్యాల తిరుగుబాటు క్రీ.శ.1645-46: ఇదే సమయంలో విజయనగర సామంతులైన తంజావూరు, మధుర, జింజి నాయకులు తిరుగుబాటు చేసి స్వతంత్రం ప్రకటించారు. వారిని అదుపులోకి తీసుకురావడానికి శ్రీరంగరాయలు వారిపై దండెత్తాడు. దక్షిణ సామంతులు శ్రీరంగరాయలను ఓడించలేమని భావించి గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లను తమకు సహాయంగా రావలసిందిగా ఆహ్వానించారు. వారికి పెద్ద మొత్తంలో ధనం చెల్లిస్తామని వాగ్దానం చేశారు. అదే సమయంలో ఢిల్లీ సుల్తాన్ షాజహాన్ విజయనగర రాజ్యాన్ని జయించమని గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లకు ఆదేశం పంపాడు. కనుక ఉభయ సుల్తాన్‌లు మళ్ళీ విజయనగర రాజ్యంపై దండెత్తారు. బీజాపూరు సైన్యం ముస్తాఫా నాయకత్వంలో విజయనగర సామ్రాజ్యంలో ఉన్న పశ్చిమాంధ్ర ప్రదేశాలను ఆక్రమించి కన్నడ ప్రాంతాలపై దండెత్తాయి. ఆ ప్రాంతాలను కూడా ఆక్రమించి విజయనగర రాజధాని రాయవెల్లూరు వైపు నడిచాయి. అదే సమయంలో గోల్కొండ సైన్యాలు మీర్జుంలా నాయకత్వంలో తూర్పు తీరం వెంట నడచి వినుకొండను జయించి ఉదయగిరిపై దండెత్తాయి. రాయలు ఉదయగిరికి సహాయంగా సైన్యాలను పంపాడు. కాని ఉదయగిరి దుర్గాన్ని పాలించే విజయనగర ప్రతినిధి మల్లయ్య ద్రోహం చేసి 1645 మార్చిలో ఉదయగిరిని మీర్జుంలా తూర్పుగా నడిచి అతి కొద్దికాలంలో అనేక కోటలను జయించాడు. ఈ దండయాత్రలో అతను పొన్నేరి, పూనమల్లి, కంచి, చెంగల్పట్టు ప్రాంతాలన్నీ వశమయ్యాయి. తర్వాత అతడు విజయనగర రాజధాని రాయవెల్లూరు చేరి అక్కడ సైనిక శిబిరాన్ని నెలకొల్పాడు.

సామంతులు తమ తప్పును గ్రహించడం: బీజాపూరు, గోల్కొండ సైన్యాలు రాయవెల్లూరును చేరడంతో శ్రీరంగరాయలను ఓడించి తర్వాత ముస్లిం సైన్యాలు తమ రాజ్యాలను కూడా ఆక్రమించగలవని తంజావూరు, జింజి, మధుర నాయకులు గ్రహించారు. వారు తమ వైరాన్ని మాని శ్రీరంగరాయలకు సహాయం చేద్దామని నిర్ణయించుకున్నారు. కాని వారంతా కలసి తమ సైన్యాలను పంపే లోపలే గోల్కొండ సైన్యాలు వారిపై దండెత్తాయి జింజి, మధుర, తంజావూరు, మైసూరు రాజులు ప్రయత్నాలు తెలుసుకొన్న మీర్జుంలా వెంటనే వారిపై దండెత్తి వారందరిని ఓడించాడు. తర్వాత జింజికోటను ముట్టడించాడు.

బీజాపూరు ఈర్ష్య: మీర్జుంలా మధర, మైసూరు సైన్యాలను ఓడించడం, జింజిని ముట్టడించడం గమనిస్తూ ఉన్న బీజాపూరు సేనాధిపతులకు మీర్జుంలా విజయాలపై ఈర్ష్య కలిగింది. కనుక బీజాపూరు సేనానులైన ముస్తాఫా ఖాన్ ఖాన్-ఇ-ఖానాన్‌లు తమ సైన్యంతో బయలుదేరి జింజి చేరి మీర్జుంలా జింజిని ఆక్రమించకుండా అడ్డుకున్నారు. మీర్జుంలా గత్యంతరంలేక జింజి ముట్టడిని విరమించి వారితో సంధి చేసుకున్నాడు. దాని ప్రకారం విజయనగర రాజ్యంలో జయించిన ప్రాంతాలను ఆదిల్‌షాహి అనే బీజాపూరు రాజ్యం 2 వంతులు, కుతుబ్‌షాహీ అంటే గోల్కొండ రాజ్యం 1 వంతు అంటే 1:2 చొప్పున విభాగం చేసుకోవాలని నిర్ణయించుకొన్నారు. దాంతో మీర్జుంలా జింజికోట ముట్టడి విరమించి వెళ్లిపోయాడు. తర్వాత బీజాపూరు సైన్యాలు జింజికోటను ఆక్రమించాయి. జింజి రాజ్యం మొత్తం బీజాపూరు రాజ్యంలో విలీనం చేయబడింది.

విజయనగర రాజ్యపతనం క్రీ.శ.1646-1680: తర్వాత బీజాపూరు సైన్యాలు రాయవెల్లూరుపై దండెత్తాయి. అక్కడ 1646 ఏప్రిల్ 4వ తేదీనా జరిగిన యుద్ధంలో శ్రీరంగరాయలు పూర్తిగా ఓడిపోయి వెల్లూరు కోటలో తలదాచుకున్నాడు. ముస్తాఫా ఖాన్ ఎందువల్లనో రాయవెల్లూరును ఆక్రమించకుండా కర్ణాటక వెళ్లిపోయాడు. కాని రాయలకు వెల్లూరు దక్కలేదు. ఈ లోపల మీర్జుంలా మళ్లీ వచ్చి రాయలను ఓడించి రాయవెల్లూరును ఆక్రమించాడు. దాంతో శ్రీరంగరాయలకు రాజ్యం లేకుండాపోయింది. దేవ్‌నాట్ బిస్సాగా రాజు రాజ్యం లేకుండా మిగిలాడని రాశాడు. తిరిగి శ్రీరంగరాయల కన్నడ సామంతుల సహాయంతో చంద్రగిరి మొదలైన కొన్ని ప్రాంతాలు జయించినా అది తాత్కాలికమే. 1658లో తిరిగి గోల్కొండ రాజ్యం చంద్రగిరి మొదలైన ప్రాంతాలన్నింటిని ఆక్రమించింది. శ్రీరంగరాయలు 1669లో పెనుగొండ చేరి తన చివరి కాలంలో అక్కడనే మరణించాడు. దాంతో విజయనగర రాజ్యం అంతమైంది. విజయనగర రాజ్యంలో ఉన్న తెలుగు ప్రాంతాలన్నీ గోల్కొండ రాజ్యంలో కలసిపోయాయి. మొత్తం మీద అరవీటి వంశస్తులను ఓడించి తెలుగు ప్రాంతాలను గోల్కొండ రాజ్యం తన సొంతం చేసుకోగలిగింది. ఆ తర్వాత కోరమండల తీరంలోని రేవు పట్టణాలన్నింటినీ కూడా గోల్కొండ

రాజ్యం ఆక్రమించింది. అదే సమయంలో బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యానికి చెందిన కన్నడ ప్రాంతాలన్నింటిని తన స్వాధీనం చేసుకుంది. దాంతో విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1680 నాటికి పూర్తిగా అదృశ్యమైంది.

విజయనగర రాజ్యానికి, బీజాపూరు రాజ్యానికి గల సంబంధాలు: క్రీ.శ.1490లో యూసఫ్ ఆదిల్‌షా స్వతంత్ర బీజాపూరు రాజ్యాన్ని స్థాపించాడు. యూసఫ్ రాజ్యానికి బీజాపూరు రాజధాని గనుక దానికి బీజాపూరు రాజ్యం అని పేరు వచ్చింది. బీజాపూరు రాజ్యం జన్మించిన తర్వాత విజయనగర సామ్రాజ్యాన్ని సాళువ వంశం, తుళువ, ఆరవీటి వంశం పాలించాయి.

సాళువ వంశ కాలం క్రీ.శ.1505 వరకు: సాళువ నరసింహరాయ కుమారుడు రెండవ నరసింహరాయలు క్రీ.శ.1505 వరకు విజయనగర చక్రవర్తి. కాని అధికారం అంతా తుళువ నరసనాయకుడు చెలాయించాడు. అతడు రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను జయించడానికి బీజాపూరు రాజ్యంతో యుద్ధాలు చేశాడు. కాని అవి అంతగా ఫలించలేదు.

తుళువ వంశ కాలం క్రీ.శ.1505-1570: 1505లో వీరనరసింహరాయలు సాళువ నరసింహరాయలను చంపించి తుళువ వంశాన్ని స్థాపించాడు. అతని కాలంలో బీజాపూరుతో యుద్ధాలు చేయలేదు. అతని తమ్ముడు కృష్ణరాయల కాలం నుండి విజయనగర రాజ్యానికి, బీజాపూరు రాజ్యానికి తీవ్ర సంఘర్షణ జరిగింది. కృష్ణరాయలు 1509లో రాజ్యానికి వచ్చాడు.

శ్రీకృష్ణదేవరాయల కాలం క్రీ.శ.1509-1529: బీజాపూరు, విజయనగర రాజ్యాల మధ్య సంఘర్షణకు ప్రధాన కారణం రాయచూరు, అంతర్వేది ప్రాంతాలపై ఆధిపత్యం. బహమనీ రాజ్య విచ్ఛిన్నం తర్వాత రాయచూరు, అంతర్వేది ప్రాంతం బీజాపూరు రాజ్యంలో భాగాలయ్యాయి. ఈ ప్రాంతాలపై విజయనగర సామ్రాట్టులు దాడులు సాగించినందువల్ల బీజాపూరు, విజయనగరంతో పోరాడవలసి వచ్చింది. క్రీ.శ.1510వ సంవత్సరంలో యూసఫ్ ఆదిల్‌షా బహమనీ సుల్తాన్ రెండవ మహమ్మద్‌ను రెచ్చగొట్టి విజయనగరంతో యుద్ధం రావడానికి కారణమయ్యాడు. సుల్తాన్ తన సామంతులైన బీజాపూరు, అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లతో కలసి రాయచూరుపై దండెత్తాడు. వారిని రాయలు 1510లో దోడి అనే ప్రదేశంలో ఎదుర్కొని ఘోరంగా ఓడించాడు. క్రీ.శ.1510 జనవరి 28వ తేదీన రాయలు హంపిలో వేయించిన శాసనంలో ఈ విజయ ప్రస్తావన ఉంది. ఆచార్య షేర్వాణీ 1510లో రాయలు చేతిలో ఓడిపోయిన బహమనీ సుల్తాన్ 1482 నుండి 1518 వరకు పాలించిన షహబుద్దీన్ మహమ్మద్ అని అభిప్రాయపడ్డాడు. ఈ యుద్ధంలో ఓడిపోయిన బహమనీ సైన్యాలు తిరోగమించాయి. విజయనగర సైన్యాలు వారిని తరుముతూ కోవెలకొండ వద్దకు వెళ్లాయి. యూసఫ్ ఆదిల్‌ఖాన్ ఎదిరించి యుద్ధంలో మరణించాడు. కాని ఆచార్య షేర్వాణీ యూసఫ్ క్రీ.శ.1510లో తన 75వ ఏట సహజ మరణం పొందినట్లు రాశాడు. కాని అది వాస్తవం కాదు. తారీఖ్-ఇ-మహమ్మద్ కులీకుతుబ్ అనే గ్రంథం యూసఫ్ కోవెలకొండలో మరణించాడని తెలుపుతోంది. అలాగే బుర్హాన్ - ఇ - మఆసిర్ అనే గ్రంథం కూడా అతడు కోవెలకొండకు సమీపంలో మరణించాడని తెలుపుతోంది. యూసఫ్ తర్వాత అతని కుమారుడు ఇస్మాయిల్ శ్రీకృష్ణదేవరాయలతో యుద్ధం కొనసాగించాడు. ఇస్మాయిల్ కాలంలో బెల్గాంలో అల్లర్లు జరిగాయి. అక్కడి ప్రజలు శ్రీకృష్ణదేవరాయలను ఆహ్వానించారు. రాయలు బీజాపూరు రాజ్యంపై దండెత్తి కృష్ణా, తుంగభద్ర నదుల మధ్య ఉన్న రాయచూరు, అంతర్వేదిలను ఆక్రమించి అక్కడ నుండి ఉత్తరంగా సాగి గుల్బర్గాపై దాడి చేశాడు. అక్కడ కాశింబరీదును ఓడించి దుర్గాన్ని వశపరచుకొని బీదరుపై దండెత్తాడు. అక్కడ కాశింబరీదు ఖైదు చేసిన బహమనీ యువరాజును విడుదల చేసి సింహాసనాధీశుని చేసి యవన రాజ్యస్థాపనాచార్య అనే బిరుదు ధరించాడు. అల్లసాని పెద్దన కూడా రాయలను యవనక్ష్మోధనస్థాపనా అని సంభోదించాడు. చాటువులు, కైఫీయత్తులు కూడా రాయలు బీదరు, గుల్బర్గాల విజయాలను చాటుతున్నాయి. కాని ఆచార్య షేర్వాణీ పక్షపాతంలో రాయలు గుల్బర్గా, బీదరు విజయాలు వాస్తవాలు కాదని రాశారు. నేలటూరి వెంకటరమణయ్య బహమనీ సుల్తాన్‌పై సాధించిన విజయం క్రీ.శ.1510 జనవరి ముందు జరిగి ఉండాలని అన్నారు. ఆచార్య ఓరుగంటి రామచంద్రయ్య రాయలు సాధించిన ఈ విజయం, అతడు ధరించిన బిరుదు సురత్రాణ బహమనీ సుల్తాన్‌పైన కాదు, బీజాపూరు సుల్తాన్ యూసఫ్ ఆదిల్‌షాఖాన్ అని అన్నారు. మొత్తం మీద ఈ తొలి యుద్ధాలు క్రీ.శ.1510-1512 మధ్యకాలంలో అంటే రాయల కళింగ దండయాత్రకు ముందు జరిగి ఉండవచ్చును.

రాయలు కళింగ దండయాత్రలో నిమగ్నుడై ఉండగా బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ గోల్కొండ, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లను కలుపుకొని దండెత్తాడు. వారు కోవెలకొండ, ఘనాపూర్, పానుగల్లు, దేవరకొండలను ఆక్రమించారు. కనుక రాయలు ఒకవైపు కళింగ దండయాత్ర సాగిస్తూనే, ఈ సుల్తానులపై దండెత్తి కెంబాలి అనే ప్రదేశంలో వారినందరినీ ఓడించాడు. తర్వాత అహమ్మద్‌నగరంపై దండెత్తి ఆ నగరాన్ని ధ్వంసం చేశాడు. అహమ్మద్‌నగరాన్ని నాశనం చేసినట్లు ఆముక్తమాల్యద వర్ణిస్తోంది. తారీఖ్-ఇ-మహమ్మద్ కుతుబ్‌షా కూడా ఈ యుద్ధాన్ని పేర్కొంది. కాని యుద్ధ కాలాన్ని తెలపలేదు.

రాయచూరు యుద్ధం క్రీ.శ.1520: బహమనీ సుల్తాన్‌లతో కృష్ణరాయలు చేసిన యుద్ధాలలో ప్రసిద్ధి చెందింది క్రీ.శ.1520వ సంవత్సరాలలో జరిగిన రాయచూరు యుద్ధం. ఈ యుద్ధాన్ని గురించి పెరిష్టా, న్యూనిజ్‌లు వేరు వేరుగా రాశారు. విజయనగర స్వాధీనంలో ఉన్న రాయచూరు, అంతర్వేదిని జయించడానికి ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ పెద్ద సేనతో వచ్చి యుద్ధం ప్రారంభించి యుద్ధం చేశాడని పెరిష్టా రాశాడు. న్యూనిజ్ ముస్లింలు ఆక్రమించిన రాయచూరును తిరిగి సాధించడానికి రాయలు దండెత్తి వచ్చాడని రాశాడు. న్యూనిజ్ రాయల కాలానికి అతి దగ్గర వాడైనందున ఎక్కువ మంది న్యూనిజ్ రాతలు వాస్తవమని నమ్ముతారు. వీరేగాక పోర్చుగీసు వారు కూడా ఈ యుద్ధంలో రాయల తరపున పాల్గొన్నారు. 1529లో భారతదేశాన్ని దర్శించిన కాప్టన్ హెడ్ అనే వ్యక్తి సెన్వెయిరా అనే గోవాలోని పోర్చుగీసు గవర్నర్ గోవా నుండి పోర్చుగీసుకు వెళుతూ ఎర్ర సముద్రంపై ఉన్నప్పుడు రాయచూరు యుద్ధం జరిగిందని రాశాడు. సెన్వెయిరా 1520 ఫిబ్రవరి 13వ తేదీన గోవా నుండి బయలుదేరాడు. కనుక ఆ తేదీ తర్వాత ఈ యుద్ధం జరిగి ఉండాలి. కనుక వెంకటరమణయ్య క్రీ.శ.1520 మే 19వ తేదీన కృష్ణానదికి దక్షిణ తీరంలో గొబ్బూరు వద్ద గొప్ప యుద్ధం జరిగిందని, అందులో బీజాపూరు సైన్యం పూర్తిగా ఓడిపోయిందని, అనేక మంది ముస్లిం సరదారులు రాయలకు బందీలుగా చిక్కారని నిర్ణయించారు. ఈ యుద్ధంలో పోర్చుగీసు ఫిరంగి దళపతి క్రిష్టావా పాల్గొని రాయలకు విజయం చేకూర్చాడు. పోర్చుగీసు వారు కూడా ఈ యుద్ధంలో ఇస్మాయిల్ ఆదిల్‌ఖాన్ ఓడి పారిపోయాడని రాశారు. కాప్టన్ హెడ్ కూడా ఆదిల్‌ఖాన్ ఓడి పారిపోయాడని, హిందువులను రాయచూరుతోపాటు మరికొన్ని ఇతర ప్రాంతాలను కూడా ఆక్రమించారని రాశాడు. కనుక గొబ్బూరు యుద్ధం తర్వాత కృష్ణా, తుంగభద్రానదుల మధ్య ప్రాంతం అంతా విజయనగర అధీనంలోకి వచ్చింది. రాయల కీర్తి దేశమంతటా పాకింది.

కలుబరె లేక గుల్బర్గా దండయాత్ర - క్రీ.శ.1522-23: ఈ యుద్ధం తర్వాత బీజాపూరు సుల్తాన్ రాయలతో సంధి చేసుకొంటానని రాయబారిని పంపాడు. కాని సంధి చేసుకోడానికి వస్తానన్న ప్రదేశానికి సుల్తాన్ రాలేదు. అందుకు కోపించి రాయలు మళ్లీ బీజాపూరుపై దండెత్తి బీజాపూరు నగరంలో ప్రవేశించాడు. ఇస్మాయిల్ రాయలను ఎదిరించకుండా రాయల సైన్యానికి నీరు అందకుండా చేయగలిగాడు. అందువల్ల రాయలు అక్కడ ఉండలేక వెనుదిరిగి ముద్గల్ కోటకు వచ్చి చేరాడు. అప్పుడు ఇస్మాయిల్ రాయలతో సంధి చేసుకోడానికి అసద్‌ఖాన్ లారి అనే సరదారుని పంపాడు. కాని అసద్‌ఖాన్ కుట్ర వల్ల సంధి కుదరలేదు. రాయలు మళ్లీ బీజాపూరుపై దండెత్తి క్రీ.శ.1523లో గుల్బర్గా, ఫిరోజ్‌బాద్, సాగర్ దుర్గాలను ధ్వంసం చేశాడు. దాంతో ఇతర బహమనీ సుల్తాన్‌లు రాయలను రాయచూరు ప్రాంతాలను ఇస్మాయిల్‌కు తిరిగి ఇచ్చివేయవలసిందిగా రాయబారం పంపారు. ఇస్మాయిల్ ఆదిల్‌షా వచ్చి తన కాళ్లకు మొక్కితే రాయచూరును తిరిగి ఇస్తానని ఆ రాయబారికి రాయలు సమాధానం చెప్పాడు. కాని ఆదిల్‌షా రాలేదు. కనుక జయించిన రాయచూరు, అంతర్వేది ప్రాంతాలు రాయలు చివరి కాలం వరకు విజయనగర సామ్రాజ్యంలో ఉండిపోయాయి. రాయచూరు యుద్ధాన్ని గురించి పండితులు వివిధ రకాలుగా వ్యాఖ్యానించారు. యుద్ధపరంగా రాయచూరు యుద్ధం రాయలకు గొప్ప కీర్తిని తెచ్చింది కాని రాజకీయపరంగా ఎలాంటి ప్రయోజనం లేదు. పైగా గుల్బర్గాపై దండెత్తడం వల్ల బహమనీ సుల్తాన్‌లకు విపరీతమైన భయాన్ని కలిగించి, విజయనగరంపై ద్వేషాన్ని పెంచి, తర్వాత వారందరూ ఏకం కావడానికి దోహదం చేసిందని ఓరుగంటి రామచంద్రయ్య వ్యాఖ్యానించారు.

అచ్యుతదేవరాయలు క్రీ.శ.1530-1542: క్రీ.శ.1529లో శ్రీకృష్ణదేవరాయలు తమ్ముడు అచ్యుత దేవరాయలను తన వారసునిగా నియమించి మరణించాడు. కాని అచ్యుతదేవరాయల నియామకం అంతఃపురంలో చాలా మందికి రుచించలేదు. ముఖ్యంగా కృష్ణరాయల కుమారుడైన 18 నెలల పసికందును వారసునిగా ప్రకటించి అధికారం చేజిక్కించుకోడానికి అళియ రామరాయలు ప్రయత్నించాడు. ఈ అంతఃకలహాల సమయంలో

కళింగ పాలకుడు ప్రతాపరుద్ర గజపతి బీజాపూరు సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షాలు అంతకు ముందు కృష్ణరాయల వల్ల కలిగిన పరాజయాలకు ప్రతీకారంగా తాము కోల్పోయిన రాజ్య భాగాలను తిరిగి కైవసం చేసుకోడానికి వారు ఏక కాలంలో విజయనగర రాజ్యంపై దండెత్తారు. బేరారు సుల్తాన్ ఇమద్ ఉల్-ముల్క్ బీదరు పాలకుడు అమీర్‌బరీద్‌ల సహాయంతో ఇస్మాయిల్ ఆదిల్‌షా రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఆక్రమించాడు. వారిని ఎదిరించి విజయనగర సేనాధిపతి ఆరవీటి తిమ్మరాజు కుమారుడు అప్పలరాజు కూరకచర్ల వద్ద మరణించాడు. రాయచూరు, అంతర్వేది ఇస్మాయిల్ వశమయ్యాయి. క్రీ.శ.1334లో ఇస్మాయిల్ ఆదిల్‌షా మరణించాడు. బీజాపూరు సింహాసనానికి అతని కుమారులు మల్లూ ఆదిల్‌ఖాన్ ఇబ్రహీంలకు వారసత్వ యుద్ధం వచ్చింది. ఈ సమయంలో బీజాపూరు సరదారుడు అసద్‌ఖాన్ లారి తిరుగుబాటు చేశాడు. అది అవకాశం తీసుకొని రాయచూరు, అంతర్వేదిలపై దండెత్తి ఆక్రమించాడు. మల్లూ ఆదిల్‌ఖాన్ అచ్యుతదేవరాయలతో సంధి చేసుకున్నాడు. రాయచూరు, అంతర్వేది ప్రాంతాలు తిరిగి విజయనగర రాజ్యంలో చేరాయి.

కాని విజయనగరంలో అళియ రామరాయలకు, అచ్యుతదేవరాయలకు అంతర్యుద్ధం కొనసాగుతూనే ఉంది. ఇంతలో 1538లో బీజాపూరులో రాజకీయాలు మారాయి. మల్లూ ఆదిల్‌ఖాన్‌ను తొలగించి అతని సోదరుడు ఇబ్రహీం సుల్తానయ్యాడు. అతడు 1538లో విజయనగరంపై దండెత్తి నాగపురాన్ని ధ్వంసం చేశాడు. ఆ సమయంలో రామరాయలు గాని, అచ్యుతదేవరాయలు గాని అతనిని ఎదిరించలేదు. కాని బీజాపూరు రాజ్యంలో అసద్‌ఖాన్ లారి మళ్లీ తిరుగుబాటు చేశాడు. అంతేగాక అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహన్ నిజాంషాను బీజాపూరు రాజ్యంపై దండెత్తమని ప్రోత్సహించాడు. తన రాజ్యానికి ముప్పు వస్తోందని గ్రహించి ఇబ్రహీం ఆదిల్‌షా రామరాయలకు సంధి కుదిర్చి వెళ్లిపోయాడు. క్రీ.శ.1542లో అచ్యుతదేవరాయలు మరణించాడు.

అంతర్యుద్ధం క్రీ.శ.1542-43: మళ్లీ సింహాసనానికి అంతర్యుద్ధం ప్రారంభమైంది. అచ్యుతదేవరాయల బావమరిది సలకం తిరుమలరాజుకు అళియరామరాయలకు సంఘర్షణ జరిగింది. ఈ సమయంలో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా రెండు మూడు పర్యాయాలు విజయనగర రాజ్యంపై దండయాత్రలు సాగించాడు. చివరకు రామరాయలు అంతర్యుద్ధంలో విజయం సాధించి సదాశివరాయలను విజయనగర చక్రవర్తిగా ప్రతిష్టించాడు. కాని సదాశివరాయలు పేరుకే రాజు, సర్వాధికారాలు రామరాయలు చెలాయించాడు. దాంతో విజయనగర చరిత్రలో రామరాయల పరిపాలన ప్రారంభమైంది.

రామరాయలు-సదాశివరాయలు క్రీ.శ.1543-1565: సదాశివరాయలు సింహాసనం అధిష్టించిన మొదటి రోజు నుండే బీజాపూరు రాజ్యంతో యుద్ధాలు ప్రారంభమయ్యాయి. విజయనగర రాజ్యంలో అంతర్యుద్ధాన్ని ఆసరాగా తీసుకొని ఆదోని దుర్గాన్ని ఆక్రమించాలని ఇబ్రహీం ఆదిల్‌షా తన సేనాని అసద్‌ఖాన్‌ను పంపాడు. అసద్‌ఖాన్‌ను ఎదుర్కోడానికి రామరాయలు తన తమ్ముడు వెంకటాద్రిని పంపాడు. వెంకటాద్రి మొదట విజయం సాధించినప్పటికీ తర్వాత జరిగిన యుద్ధంలో అతనిని అసద్‌ఖాన్ ఓడించి సంధికి దిగివచ్చేటట్లు చేయగలిగాడు. తాత్కాలికంగా యుద్ధం ఆగిపోయింది. 1543లో ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగర రాజ్యంపై దండెత్తాడు.

రామరాయల వ్యూహం-అహమ్మద్‌నగర్‌తో స్నేహం: తరచూ బీజాపూరు సుల్తాన్ విజయనగరంపై దండెత్తుతూ ఉండగా అది రాజ్యానికి క్షేమకరం కాదని సుల్తాన్‌లలో విభేదాన్ని సృష్టించి వారిని తన రాజ్యంపై రాకుండా చేసుకోవాలని రామరాయలు ఆలోచించాడు. ఈ ఆలోచనే రామరాయలను బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోడానికి దారి తీసింది. ఈ వ్యూహ ఫలితంగా బీజాపూరు రాజ్యానికి అవతల ఉత్తర సరిహద్దులో ఉన్న అహమ్మద్‌నగరంతో రాజకీయ రక్షణ సంధి ఉంటే బాగుంటుందని తలచాడు. అహమ్మద్‌నగర్ సుల్తాన్ నిజాంషాకు గేదా బీజాపూరుతో సరిహద్దు వివాదాలున్నాయి. కనుక అహమ్మద్‌నగరం కూడా విజయనగరంతో మైత్రిని కాంక్షించింది. దాంతో విజయనగరం అహమ్మద్‌నగరం క్రీ.శ.1551లో ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అహమ్మద్‌నగర రాజ్య సహకారంతో రామరాయలు మూడు పర్యాయాలు బీజాపూరు రాజ్యంపై దండెత్తి ఓడించి రాయచూరు, ముద్గల్, అంతర్వేదిలను ఆక్రమించాడు. బీజాపూరుకు విజయనగర రాజ్యం వైపు చూపుపెట్టడానికే ధైర్యం చాలకుండా పోయింది. అదే విధంగా అహమ్మద్‌నగరం కూడా బీజాపూరు రాజ్యంపై దండెత్తి బీదరు, కళ్యాణీ దుర్గాన్ని ఆక్రమించింది. అందుకు రామరాయలు సహాయం చేశాడు. అలాగే బీజాపూరుపై దండెత్తి షోలాపూరు ఆక్రమించాడు. అహమ్మద్‌నగర్, విజయనగర కూటమి తమపై రెండు పర్యాయాలు విజయం సాధించడంతో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం విజయనగరానికి దగ్గర కావాలని భావించాడు. ఇంతలో

అహమ్మద్‌నగర్‌లో నిజాంషా మరణించి అతని కుమారుడు హుసేన్‌షా గద్దెనెక్కాడు. ఈ సమయంలో బీజాపూరు సుల్తాన్ అహమ్మద్ షోలాపూరును జయించవచ్చని అహ్మాద్‌నగర రాజ్యంపై దండెత్తాడు కాని ఓడిపోయాడు. తర్వాత ఇబ్రహీం ఆదిల్‌షా కూడా 1557లో మరణించాడు. అతని కుమారుడు రెండవ ఆలీ ఆదిల్‌షా రాజ్యానికి వచ్చాడు అతడు రాజ్యానికి రాగానే విజయనగరం దర్శించి రామరాయల అనుగ్రహం సంపాదించాడు. రామరాయల అండ చూసుకొని బీజాపూరు, అహమ్మద్‌నగర రాజ్యంపై దండయాత్రకు పూనుకుంది. బీజాపూరుతో బీదరు కూడా చేతులు కలిపింది. అది చూసి అహమ్మద్‌నగర్ రాజ్యం గోల్కొండ సహాయం కోరింది. దాంతో అహమ్మద్‌నగర్, గోల్కొండ ఒక కూటమి, బీదరు బీజాపూరు ఒక కూటమిగా ఏర్పడ్డాయి. అహమ్మద్‌నగర్, గోల్కొండ కూటములు బీజాపూరు రాజ్యంలోని గుల్బర్గాను క్రీ.శ.1557లో ముట్టడించాయి. బీజాపూరు సుల్తాన్ ఆలీ రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు పెద్దసేనతో వచ్చాడు. కాని యుద్ధం చేయలేదు. తన దౌత్య నీతితో వారికి రాజీ కుదిర్చి ఎవరి రాజ్యాలకు వారిని పంపివేశాడు. ఈ రాజీలో ఈ సారి ఎవరు దురాక్రమణకు పూనుకుంటే మిగిలిన అన్ని రాజ్యాలు కలసి దురాక్రమణదారుపై దండెత్తి బుద్ధిచెప్పాలని క్రీ.శ.1558లో నిర్ణయించారు. అందుకు అందరూ ఆమోదించారు.

కాని కొద్దికాలానికే ఈ సంధి నియమాన్ని తృణీకరించి అహమ్మద్‌నగరం క్రీ.శ.1560లో బీజాపూరు రాజ్యంపై దాడి చేసింది. బీజాపూరు రామరాయల సహాయం అర్థించింది. సంధిని ఉల్లఘించినందుకు కోపించి రామరాయలు బీజాపూరు తరపున యుద్ధంలోకి దిగి అమహ్మాద్‌నగరంపై దండెత్తాడు. హుసేన్ నిజాంషాను ఓడించి అతని నుండి కళ్యాణీ, షోలాపూరులను బీజాపూరు ఆదిల్‌షాకు ఇప్పించాడు. ఈ ఓటమి తర్వాత అహమ్మద్‌నగర్ హుసేన్‌షా గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్‌షా సహాయంతో మళ్లీ బీజాపూరుపై యుద్ధం ప్రకటించి కళ్యాణీ దుర్గాన్ని ముట్టడించారు. బీజాపూరు ఆదిల్‌షా మళ్లీ రామరాయల సహాయం కోరాడు రెండవసారి రామరాయలు అహమ్మద్‌నగరంపై దండెత్తాడు. ఈ దాడిలో విజయనగరం సేనలు కొన్ని మసీదులను ధ్వంసం చేశాయి. మళ్లీ హుసేన్‌షా ఓడిపోయాడు. తర్వాత బీజాపూరు, విజయనగర సేనలు గోల్కొండ రాజ్యంపై దండెత్తి నానా బీభత్సం చేశాయి. గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా రామరాయలతో సంధి చేసుకొని కోవెలకొండ, పానుగల్లు, ఘనాపూర్‌లను రామరాయలకు ఇచ్చివేశాడు.

రాక్షస తంగడి యుద్ధం క్రీ.శ.1565: రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం తర్వాత సుల్తాన్‌లందరికీ రామరాయలంటే అమితమైన భయం పట్టుకుంది. విజయనగరం రాజ్యాన్ని ధ్వంసం చేయనిదే తమకు భద్రత లేదని భావించారు. గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా చొరవ తీసుకొని బహమనీ సుల్తాన్‌లందరినీ ఏకం చేశాడు. రామరాయలతో మైత్రి బంధం గల బీజాపూరు ఆలీ ఆదిల్‌షాను కూడా నయానా, భయానా తమవైపుకు తిప్పుకున్నారు. కాని బేరారు సుల్తాన్ వీరిలో చేరలేదు. అయినప్పటికీ అహమ్మద్‌నగర్, బీజాపూరు. బీదరు, గోల్కొండ నలుగురు సుల్తాన్‌లు ఏకమై ఒక కూటమిగా చేరి రామరాయలపై యుద్ధం ప్రకటించారు. బీజాపూరు రాజ్యం తాలూకు రాయచూరు, ముద్గల్, అంతర్వేది, ఎట్గీర్, భాగల్‌కోటలను తమకు అప్పగించాలని విజయ నగరానికి రాయబారం పంపారు. రామరాయలు వారి కోర్కెలను తిరస్కరించాడు. రాయబారిని అవమానించి పంపాడు. అది సాకుగా నలుగురు సుల్తాన్‌లు విజయనగర రాజ్యంపై యుద్ధం ప్రకటించి తమ సైన్యాలకు 1565 జనవరి 28వ తేదీన ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో రామరాయలు మరణించాడు. సుల్తాన్‌లకు విజయం లభించింది. విజయం సాధించిన సుల్తాన్‌లు విజయనగర రాజధాని మీద పడి 5 మాసాలు విచ్చలవిడిగా దోచుకొని నగరాన్ని ధ్వంసం చేసి వెళ్లిపోయారు. ఈ తళ్లికోట యుద్ధంలో విజయనగర రాజ్య ఐశ్వర్యం, సైనికశక్తి పూర్తిగా నశించిపోయింది. ఆ తర్వాత ఆ రాజ్యం కోలుకోలేదు.

ఆరవీటి వంశస్తుల కాలంలో బీజాపూరు సంబంధాలు క్రీ.శ.1570-1680: తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర చరిత్రలో తుళువ యుగం అంతమైంది. రామరాయల తమ్ముడు తిరుమలరాయలు సదాశివ రాయలను తోసిరాజని 1570లో పట్టాభిషిక్తుడయ్యాడు. అతనితో ఆరవీటి వంశం ప్రారంభమైంది. తిరుమల రాయలు అప్పటికే వృద్ధుడు. 1571లో అతడు మరణించగా అతని కుమారుడు శ్రీరంగరాయలు సింహాసనానికి వచ్చాడు.

శ్రీరంగరాయలు క్రీ.శ.1571-1584: అతని కాలంలో బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను పూర్తిగా ఆక్రమించి పెనుగొండపై దండెత్తాడు. శ్రీరంగరాయలు గోల్కొండ సుల్తాన్

సహాయం కోరాడు. అందుకు అంగీకరించి గోల్కొండ సుల్తాన్ తన సైన్యాన్ని బీజాపూరుపైకి పంపాడు. దాంతో అలీ ఆదిల్‌షా పెనుగొండ ముట్టడిని విరమించి తన రాజ్యానికి వెళ్లిపోయాడు. కాని తర్వాత 1573లో మళ్లీ బీజాపూరు సుల్తాన్ విజయనగరపు పశ్చిమ ప్రాంతాలపై దండెత్తి షిమోగా, కైకరా జిల్లాలు బంకాపూర్, ధార్వాలను ఆక్రమించాడు. మళ్లీ బీజాపూరు రాజ్యం 1576లో పెనుగొండను ముట్టడించింది. శ్రీరంగరాయలు తన ధనరాశులను చంద్రగిరికి పంపి పెనుగొండ రక్షణను సవరం చెన్నప్ప అనే సేనానికి అప్పగించాడు. చెన్నప్ప బీజాపూరు సేనను ఓడించి తరిమాడు. కాని మళ్లీ 1577-1578 సంవత్సరంలో బీజాపూరు సుల్తాన్ మళ్లీ పెనుగొండను ముట్టడించాడు. రెండుసార్లు ముట్టడించాడు, కాని జయించలేకపోయాడు.

రెండవ వెంకటపతిరాయలు క్రీ.శ.1584-1614: వెంకటపతిరాయల కాలంలో బీజాపూరు సుల్తాన్ అలీ ఆదిల్ షా 1593లో మైసూరు ప్రాంతంపై దండెత్తాడు. కాని తన రాజ్యంలో అతని తమ్ముడు ఇస్మాయిల్ తిరుగుబాటు చేయడంతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. అదే మంచి అవకాశమని వెంకటపతిరాయలు సుల్తాన్ ఆధీనంలో ఉన్న ఆదవానిని జయించడానికి విజయనగర సైన్యాన్ని పంపాడు. సుల్తాన్ తన తమ్ముని అణచిపారవేసి మళ్లీ విజయనగర రాజ్యంపై దండెత్తి పెనుగొండను ముట్టడించాడు. బీజాపూరు రాజ్యం కోరిక ఎలాగైనా పెనుగొండను ముట్టడించాలని అందుకే అన్ని పర్యాయాలు పెనుగొండపై దండెత్తింది. కాని జయించలేక పోయింది. వెంకటపతిరాయలు 7 లక్షల సైన్యంతో వచ్చి బీజాపూరును ఓడించి తరిమాడు.

మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ.1642-1680: మూడవ శ్రీరంగరాయల కాలంలో బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యంపై దండెత్తి కన్నడ ప్రాంతాలన్నీ తూర్పు తీరం జింజి, తంజావూరు మొదలైన ప్రాంతాలను జయించింది. దాంతో విజయనగర రాజ్యం అంతమైంది. కాని ఆ తర్వాత కొద్ది కాలానికే క్రీ.శ.1686లో బీజాపూరు రాజ్యాన్ని ఔరంగజేబు ఆక్రమించాడు. దాంతో బీజాపూరు రాజ్యం కూడా కాలగర్భంలో కలిసిపోయింది.

పద్మనాయక వంశవృక్షం-రాచకొండ ప్రధాన శాఖ

చెవ్విరెడ్డి (భేతాళనాయకుడు)

దామానాయకుడు | ప్రసాదిత్య నాయకుడు | రుద్రనాయకుడు

సబ్బినాయకుడు

వెన్నమనాయుడు | నలదాచానాయకుడు

ఎరదాచానేని | మాదానేని | రామానేని

మొదటి సింగమనాయకుడు | యాచమనాయుడు

నాగానాయుడు

మొదటి అనపోతానాయుడు | మాదానాయుడు

రెండవ అనపోతానాయుడు | దాచానేడు | వల్లభనేడు | వేదగిరి | దామానేడు | రుద్రమాదానేడు

మూడవ సింగభూపాలుడు | వసంతానేడు | కేశవనాయుడు | రుద్ర ధర్మానేడు

దేవరకొండ శాఖ

చెవ్విరెడ్డి (భేతాళనాయకుడు)

దామానాయకుడు | ప్రసాదిత్యనాయుడు | రుద్రనాయకుడు

వెన్నమనాయకుడు | సబ్బినాయకుడు

ఎఱదాచానేని | నలదాచానేని

మొదటి సింగమనాయకుడు | వెన్నమనేడు | యాచమనాయకుడు | మాదానేని | రామానేని

నాగానాయుడు

మొదటి అనపోతానేడు | మాదానేడు

పెదవేదగిరి

రెండవ మాదానేడు | రామచంద్రానేడు

సూరానాయడు | వేదగిరినాయడు | లింగమనేడు

పర్వతనాయడు

రెండవ లింగమనేడు

రేచర్ల పద్మనాయక రాజ్యాల చరిత్ర: కాకతీయ సామ్రాజ్య పతనానంతరం నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలలో వెలసిన రాజ్యమే రేచర్ల పద్మనాయక రాజ్యం. అంతకు పూర్వం కళ్యాణీ చాళుక్యుల కాలంలో కుందూరు చోళులు పాలించిన ప్రాంతమే రేచర్ల పద్మనాయక రాజ్యం అని చెప్పవచ్చును. కాపయనాయకుని మరణానంతరం తెలంగాణలోని ముసునూరు రాజ్యాన్ని కూడా ఆక్రమించి మొత్తం తెలంగాణకు అధిపతులయ్యారు. వారి చరిత్ర తెలుసుకోదానికి వారు విడుదల చేసిన రాచకొండ, దేవరగిరి, భువనగిరి, దేవులమ్మ నాగారం, గార్ల, ఐనవోలు, బెల్లంకొండ, ఉమామహేశ్వరం, ఓరుగల్లు, సింహాచలం, శ్రీకూర్మం మొదలైన ప్రదేశాలలో శాసనాలు, వారి కాలం నాటి సాహిత్యం, సంగీత రత్నాకరం, రసార్ణవ సుధాకరం, మదన విలాస బాణము, భోగినీదండకం, హరిశ్చంద్రోపాఖ్యానం. సింహాసన ద్వాత్రింశిక, వెలుగోటివారి వంశావళి, చాటువులు, దండకవిలెలు, సురభి వంశ చరిత్ర, తారఖీ, పెరిష్టా వంటి రచనలు ఉపయోగపడుతున్నాయి. ఇంకా సమకాలీన చరిత్రలు, రెడ్డిరాజులు, గణపతులు, విజనయగర రాజవంశాల శాసనాలు కూడా ఉపయోగపడుతున్నాయి.

వెలుగోటి వారి వంశావళి ప్రకారం రేచర్ల పద్మనాయక వంశానికి మూలపురుషుడు భేతాళ నాయకుడు. ఇతనికి చెవిరెడ్డి అనే మరొక పేరు కూడా ఉంది. ఇతని జన్మస్థలం నల్గొండ జిల్లా మిర్యాలగూడెం ప్రాంతంలోని అనుమగల్లు. ఈ కాలంలో వారు కాకతీయ సామంతులుగా అనుమగల్లు, పిల్లలమర్రిని పాలిస్తుండేవారు. క్రీ.శ.1252-53 ప్రాంతంలో కాకతీయ గణపతి చక్రవర్తి భేతాళ నాయకుని అనుమగంటి ప్రాంతానికి స్థానిక పాలకునిగా నియమించాడు. అతనికి భేతాళనాయకుడనే బిరుదును కూడా కాకతి గణపతియే ఇచ్చాడు.

పద్మనాయకులని గురించి అనేక గాధలు కలవు. పలనాటి బ్రహ్మనాయుడు పద్మనాయకుల మూల పురుషుడని, అతని అనుచరులంతా పద్మనాయకులయ్యారని, ఒక గాధ ప్రచారంలో ఉంది. వైష్ణవ భక్తులు గనుక తాము విష్ణు పాదాల నుండి జన్మించామని భావించుకొని పద్మనాయకులని పేరు పెట్టుకున్నారని ఒక అభిప్రాయం. బ్రహ్మనాయుడు కూడా రేచర్ల గోత్రీకుడే. పలనాటి యుద్ధం తర్వాత పద్మనాయకులు ఓరుగల్లు, అనుమగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలకు చేరి కాకతీయుల ప్రాపకం సంపాదించి క్రమేపీ వారి కొలువులో అమర నాయకులయ్యారని కొందరు అభిప్రాయపడ్డారు. పలనాడులోని గురజాలకు సమీపంలో గల పొందుగల వద్ద కృష్ణానది దాటితే అవతలవైపు మిర్యాలగూడెం తాలూకా ఉంది. ఆ తాలూకాలోనే అనుమగల్లు, పిల్లలమర్రి ఉన్నాయి. కృష్ణానదికి ఇవతలవైపు పలనాడు, అవతలవైపు మిర్యాలగూడెం తాలూకా ఉంది. కనుక వారు పలనాటి యుద్ధంలో పరాజయం పొందిన తర్వాత కృష్ణను దాటి అనుమగల్లు ప్రాంతానికి వెళ్ళి ఉండవచ్చును. భేతాళ నాయకుడే పలనాటి బ్రహ్మ అని మరొక అభిప్రాయం ఉంది. కాని అది వాస్తవం కాదు. పలనాటి యుద్ధంలో ఓడిపోయిన తర్వాత బ్రహ్మనాయుడు గుత్తికొండబిళం చేరి అక్కడే మరణించాడని పలనాటిలో చెప్పుకుంటారు. ఏమైనా బ్రహ్మనాయుని సంస్కరణల తరువాత పద్మనాయకుల కుల ప్రస్తావన కనిపిస్తోంది. పద్మనాయకులు వెలమలు వేరువేరని కూడా అభిప్రాయం ఉంది. వెలనాటి వారే వెలమలని ప్రతీతి. పద్మనాయకులు బ్రహ్మనాయుని సంస్కరణల వల్ల వల్ల జన్మించిన కులం అని, వారు వెలమ కులస్తులుగా భిన్నమైన వారని కొందరు భావిస్తారు. మహాపద్మనందుని చెర నుండి వదలిపెట్టినవారు పద్మనాయకులయ్యారని మరొక కధ ఉంది. మొదట కమ్మవారు వెలమ వారు ఒకటే కులం అట. ప్రతాపరుద్రునికి ముస్లింలతో పోరాడిన చివరి యుద్ధం ముందు యుద్ధంలో పాల్గొనకుండా కొందరు తనకు ద్రోహం తలపెట్టారని తెలిసిందట. అందువల్ల యుద్ధానికి వెళ్ళబోయే ముందు తనతో పోరే వారు ఈ కమ్మపై పేర్లు రాయండి అని చెప్పాడట. కొందరు రాశారట. మరికొందరు రాయలేదట. రాయకుండా వెళ్ళిపోయినవారు వెలమ వారు. కమ్మ మీద రాసిన వారు కమ్మవారు అయ్యారని, తర్వాత ఈ ఉభయవర్గాలు కమ్మవారుగా, వెలమలవారుగా చీలిపోయి రెండు కులాలుగా మారారని ఒక కధ ప్రచారంలో ఉంది. అలాగే భేతాళనాయకుని గురించి కూడా అనేక గాధలు ఉన్నాయి. అతడు ఒక రోజున పొలం దున్నుతుండగా నాగలికి ఏదో అడ్డుతగిలిందట. దానిని తొలగించి చూడగా అక్కడ నిధి ఉందని, అది బలి కోరిందని, అప్పుడు అతని రేచడనే వాడు తన ప్రాణాలు అర్పించాడని, దాంతో చెవిరెడ్డికి నిధి లభ్యమైందని భేతాళుడు కూడా ప్రత్యక్షమై వరాలు ఇచ్చాడని, దాంతో అతడు రాజ్యం స్థాపించాడని మరొక కధ ఉంది. ఇవన్నీ కట్టుకధలు, కుల్పకుర్తికి 8 కిలోమీటర్ల దూరంలో ఒక శిథిలనగర చిహ్నాలున్నాయి. అక్కడ ఒక స్మశానవాటిక ఉంది. అక్కడ భయంకరమైన భేతాళ విగ్రహం ఉంది. కనుక ఆనాడు భేతాళపూజ ఉండి ఉంటుంది. కనుక చెవిరెడ్డికి భేతాళనాయకుడు అని పేరు పెట్టి ఉండవచ్చును. ఇతడు కాకతీయుల కొలువులో సేనానిగా చేరి తన

పరాక్రమంతో గణపతిదేవుని మెప్పించి అనుమగల్లు అమరాన్ని పొంది భేతాళ నాయకుడని బిరుదును పొంది ఉంటాడు.

భేతాళనాయకునికి దామానాయుడు, ప్రసాదిత్యనాయడు, రుద్రనాయడు అనే ముగ్గురు కుమారులు పద్మనాయక చరిత్ర వీరితోనే ప్రారంభమవుతోంది. వీరి ముగ్గురూ కాకతీయుల కొలువులో సేనాధిపతులు. వీరిలో ప్రసాదిత్యుడు రుద్రమదేవి కాలంలో ప్రసిద్ధి చెందాడు. రుద్రమదేవి కాలంలో జరిగిన తిరుగుబాట్లను అణచి కాకతీయ రాజ్య స్థాపన, రాయపితామాంగ అనే బిరుదులు ధరించాడు. దామానాయకుని కుమారుడు వెన్నమ నాయకుడు ప్రసాదిత్యుని కుమారుడు సబ్బినాయకుడు. అల్లావుద్దీన్ కాలంలో వచ్చిన ముస్లిం దండయాత్రలలో తురుష్కులపై విజయం సాధించారట. వెన్నమనాయకుని కుమారుడు ఎరదాచానాయకుడు. అతడు ప్రతాపరుద్రుని కాలంలో సేనాధిపతి. క్రీ.శ.1316లో ప్రతాపరుద్రుడు పాండ్యులపై దండయాత్రను చేసినప్పుడు ఎరదాచా నాయడు ముప్పిడినాయకుడు, కొలనిద్రులతో పాటు కంచిపై దండెత్తి తన పరాక్రమం చూపాడు. అందువల్ల పంచ పాండ్యదళవిభాళ అనే బిరుదు పొందాడు. ఇంకా అతడు కంచి కవాట చూరకార, పాండ్యగజకేసరి అనే బిరుదులను పొందాడు. నాటి నుండి ఈ బిరుదులు వారి వంశస్తులందరూ వారసత్వంగా ధరించారు. అతని కుమారులు సింగమనాయకుడు, యాచమనీడులు కూడా యుద్ధాలలో పాల్గొనేవారు. యాచమనీడు మెదక్ మండలం దగ్గరున్న పటాన్‌చెరువు వద్ద తురుష్కులతో జరిగిన యుద్ధంలో గొప్ప పరాక్రమాన్ని ప్రదర్శించాడు పెద్దకుమారుడు సింగమనాయకుడే పద్మనాయకరాజ్య స్థాపకుడు. ఈ యుద్ధంలో సబ్బినాయకుని కుమారుడు నలదాచానాయడు కూడా పాల్గొన్నాడు.

సింగమనాయకుడు క్రీ.శ.1426-1461: ఎరదాచానాయకుని పెద్ద కుమారుడు సింగమనాయకుడు. తండ్రితోపాటు ఇతడు కూడా కంచి దండయాత్రలో పాల్గొన్నాడు. తర్వాత ప్రతాపరుద్రుని ఆజ్ఞతో క్రీ.శ.1320లో కంపిలి దండయాత్రలో కూడా పాల్గొన్నారు. క్రీ.శ.1323వ సంవత్సరంలో జునాఖాన్‌తో జరిగిన చివరి యుద్ధంలో ఇతడు కూడా పోరాడాడు. 72 మంది కాకతీయ సేనానులు ఆ యుద్ధంలో మరణించగా సింగమనాయకుడు బతికి బయటపడ్డాడు. తర్వాత ముసునూరి ప్రోలయనాయకుడు, కాపయనాయకులతో కలసి ఆంధ్రస్వాతంత్ర్యోద్యమంలో పోరాడాడు. తర్వాత అతడు తన స్వస్థానమైన అనుమగల్లు, పిల్లలమర్రి ప్రాంతాలలో స్వంత రాజ్యం ఏర్పాటు చేసుకున్నాడు. అతను స్థాపించిన రాజ్యానికే రేచర్ల పద్మనాయక రాజ్యం అనే పేరు వచ్చింది. విముక్తి యుద్ధం తర్వాత సింగమనాయకుడు కాపయనాయకునికి లొంగి ఉండదలచుకోలేదు. అతడు స్వతంత్రం ప్రకటించాడు అది సహించని కాపయనాయకుడు సింగమనాయకునిపై దండెత్తాడు. సింగమనాయకుడు కాపయనాయకునితో పోరాడి గెలిచాడని వెలుగోటివారి వంశావళి తెలుపుతోంది. కాని అది వాస్తవం కాదు. కాపయనాయకుడు అతనిని ఓడించి అతని రాజ్యాన్ని ఆక్రమించి అతని సేనాధిపతి ఎరపోతు లెంకను పిల్లలమర్రిలో తన ప్రతినిధిగా నియమించాడు. అతడు క్రీ.శ.1357లో పిల్లలమర్రిలో శాసనం వేయించి అందులో కాపయనాయకుని ఆంధ్రాధీశ్వరా, చోడరాయస్థాపనాచార్య, అనుగంటి పురవరాధీశ్వర అనే బిరుదులు రాయించాడు. కనుక సింగమ నాయకుడు కాపయనాయకుని చేతిలో ఓడి సామంతుడయ్యాడని చెప్పవచ్చును. కాపయనాయకుడు బహమనీలతో పోరాడే సమయంలో సింగమనాయకుడు తిరిగి విజృంభించాడు. అతడు దక్షిణంగా కృష్ణా, తుంగాభద్రానదుల ప్రాంతంపై దండెత్తి అక్కడి అంతర్వేది, ఏలేశ్వరం మొదలైన ప్రాంతాలను జయించాడు. దాంతో అతడు మళ్లీ బలం పుంజుకున్నాడు. క్రీ.శ.1360 ప్రాంతంలో కాపయ ప్రతినిధిని ఓడించి తరిమి అనుమగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని కూడా తిరిగి జయించాడు. ఆ తర్వాత నిర్భయంగా రాజ్య విస్తరణకు పూనుకున్నాడు. ఆ కాలంలో నల్లగొండ జిల్లాలో కృష్ణానదీ తీరాన చాళుక్య వంశానికి చెందిన కొన్ని చిన్న చిన్న రాజ్యాలున్నాయి. జీలుగుపల్లి, జల్లపల్లి, మగదల మొదలైన చిన్నచిన్న రాజ్యాలున్నాయి. వాటిని సోమ కులానికి చెందిన క్షత్రియులు పాలిస్తున్నారు. వారు పూర్వపు చాళుక్య వంశానికి చెందినవారు. ఆరవీటి సోమరాజు వంశానికి చెందిన కుటుంబాల వారని ప్రతీతి. సింగమ నాయకుడు ఈ రాజ్యాలను జయించి తన రాజ్యంలో కలపాలని వారిపై దాడులు ప్రారంభించాడు. ఈ యుద్ధంలో సింగమనాయకుని బావమరిది చింతపల్లి సింగమనాయకుడు జల్లపల్లి కోటలో బందీగా చిక్కాడు. అతడు పోతుగంటి మైలి వంశస్తుడు. తన బావమరిదిని విడిపించుకోడానికి రేచర్ల సింగమనాయకుడు పెద్ద సేనతో జల్లపల్లి కోటను ముట్టడించాడు. ఈ కోట ఓరుగల్లు మండలంలో ఉంది. సింగమనాయకుని ఆగమనం చూసి కాపయ నాయకుని సహాయం అర్థించారు. అలాగే అద్దంకి రెడ్డిరాజుల సహాయం అర్థించారు. వారు సహాయం

పంపి ఉండవచ్చును. కాని సింగమనాయకుడు సోమ వంశస్తులను ఓడించాడు. సోమ వంశస్తులు తంబళ్లజియ్య అనే వ్యక్తిని రాయబారిగా పంపారు. అతనితో సింగమనాయకుడు మంతనాలు చేస్తున్నప్పుడు ఏమరిపాటుగా ఉన్న సింగమ నాయకుని తంబళ్ల జియ్య పొడిచి చంపాడు. ప్రాణం పోయే ముందు సింగమ నాయకుడు తన కుమారులను తన పగతీర్చమని ఆదేశించి మరణించాడట. ఈ సంఘటన క్రీ.శ.1361లో జరిగింది. ఈ విధంగా సింగమనాయకుడు మరణించాడు. అతడు మరణించే నాటికి అంతకు పూర్వం కందూరు చోళులు పాలించిన ప్రాంతమంతా అతని ఆధీనంలోకి వచ్చింది. రేచర్ల రాజ్యం స్థిరపడింది.

సింగమనాయకుని సోదరుడు యాచమనీడు, అతని కుమారుడు నాగానాయకుడు, సింగమనాయని పిన తండ్రి నలదాచానేని పుత్రులు మాదానేని, దామానేనిల కూడా సింగమనాయకునికి అండగా నిలిచారు. వారి బలపరాక్రమాలతో సింగమనాయకుడు సొంత రాజ్యాన్ని స్థాపించగలిగాడు.

అనపోతా మాదానాయకులు క్రీ.శ.1361-1384: సింగమ నాయకునికి అనపోతా నాయకుడు, మాదా నాయకుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి మరణించే సమయంలో చిన్న కుమారుడు మాదానాయకుడు తండ్రి వద్దనే ఉండి తండ్రి చెప్పిన తుది పలుకులు విని తన అన్న అనపోతానాయకునికి చెప్పాడు. తండ్రిని చంపిన వారిపై పగ తీర్చుకోడానికి సోదరులిద్దరూ తమ తండ్రిని చంపిన సోమకుల క్షత్రియులను హతమార్చి తండ్రికి వారి రక్తతర్పణం చేస్తామని ప్రతిజ్ఞ చేశారట. తర్వాత సైన్యాలను కూర్చుకొని క్రీ.శ.1316లో జల్లిపల్లి కోటపై దండెత్తి కోటలో ఉన్న క్షత్రియులను వధించారు. కొందరు అక్కడి నుండి తప్పించుకొని హుజూరాబాద్ మండలంలోని మొలంగూరు కోటలో తలదాచుకున్నారు. వారు చుట్టుపక్కల ఉన్న వారి సహాయంతో పద్మ నాయకులను ఎదిరించాలని సహాయం అర్థించారు. కొందరు దుర్గాధిపతులు వారికి సహాయంగా వచ్చి మొలంగూరు సమీపంలోని చెంజర్ల వద్దకు చేరారు. ఈ విధంగా సహాయంగా వచ్చిన వారిలో అద్దంకి, కొండవీటి రెడ్ల సైన్యం కూడా కొంత ఉందని భావింపబడింది. తమను ఎదిరించడానికి సోమకుల క్షత్రియులు పెద్ద ప్రయత్నాలు చేస్తున్నారని తెలిసి తమ సైన్యంతో అనపోతా, మాదానాయకులు బయలుదేరి చెంజర్ల చేరారు. అక్కడ ఉభయులకు భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో సోదరులు శత్రువులందరినీ చిత్తుగా ఓడించి అక్కడ సోమకుల క్షత్రియులందరినీ అతిఘోరంగా వధించి వారి రక్తాన్ని పట్టి తమ తండ్రి తర్పణం పెట్టి తమ ప్రతిజ్ఞ నెరవేర్చుకున్నారు. ఈ యుద్ధం క్రీ.శ.1361 శార్వరి సంవత్సరం కార్తీకమాసంలో జరిగింది. సోమకుల క్షత్రియులకు సహాయంగా వచ్చిన పాలకులు కొంత మంది మొలంగూరు యుద్ధంలో మరణించారు. మరికొందరు పారిపోయారు. క్షత్రియులకు సహాయంగా వచ్చిన అద్దంకి రెడ్డినాయకులు, కాపయనాయకుని సైన్యం కూడా పద్మనాయకుల పరాక్రమానికి ఆశ్చర్యం చెంది యుద్ధ రంగం నుండి పారిపోయారు. పరశురాముడు క్షత్రియుల సంహారం చేసినట్లు అనపోత, మాదానాయకులు సోమవంశ క్షత్రియులను వారికి సహాయంగా వచ్చిన వారిని సంహరించి సోమకుల పరశురామ, జల్లిపల్లి రణక్షోణీ భారతీక మల్ల అనే బిరుదులు ధరించారు. ఈ యుద్ధంలో సోమవంశ క్షత్రియుల ప్రాంతాన్నీ అనపోతా నాయకుని వశమయ్యాయి. జల్లిపల్లి, మొలంగూరు, మగదల, జీలుగుపల్లి మొదలైన దుర్గాలన్నీ పద్మనాయక రాజ్యంలో చేరిపోయాయి.

అనపోతారెడ్డితో పోరాటం క్రీ.శ.1361: మొలంగూరు, చెంజర్ల యుద్ధ భూమి నుండి పారిపోయే రెడ్డి నాయకులను మాదానాయకుడు, అతని పిన తండ్రి కుమారుడు నాగానాయుడు వెన్నంటి తరిమారు. రెడ్డి సైన్యం చేజర్ల, మొగళ్లూరు వద్ద ఎదిరించింది. అక్కడ పద్మనాయకులు వారిని ఓడించారు. తర్వాత మాదానాయుడు, నాగానాయుడు కృష్ణను దాటి రెడ్డి రాజ్యంలో భాగంగా ఉన్న శ్రీశైలం ప్రాంతంపై దండెత్తి ఆక్రమించారు. శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాలు వెలమల వశమయ్యాయి. శ్రీశైలం పర్వతానికి అనపోతానాయకుడు మెట్లు కట్టించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. శ్రీశైలం ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత మాదానాయకుడు, నాగానాయకుడు ధరణికోట మీద దండెత్తారు. రెడ్డి రాజ్యంలో ధరణికోట అతి కీలకమైన ప్రాంతం. పద్మనాయకుల తరఫున పోరాడిన రావు కేశభూపాలుని ఓడించాడని విష్ణు పురాణం తెలుపుతోంది. కాని చివరలో అనపోతారెడ్డి ఓడిపోయాడు. నాగానాయకుడు అనపోతారెడ్డిని ఓడించాడని, యుద్ధ రంగం నుండి ఆయుధాలు వదలిపెట్టి పరుగెత్తే అనపోతారెడ్డిని కటారి నాగానాయకుడు వెంబడించి పట్టుకొని తన ఖడ్గంతో వీపున దాగు పెట్టి అవమానించి వదిలివేశాడని వెలుగోటివారి వంశావళి తెలుపుతోంది. ఈ విజయం తర్వాత పద్మనాయకులు రెడ్డి రాజుల బిరుదులైన జగనొబ్బగవట, రాయవేశ్యాభుజంగ మొదలైన బిరుదులు ధరించారు. ధరణికోట యుద్ధంలో

పద్మనాయకులు అనపోతారెడ్డిని ఓడించినప్పటికీ ధరణికోట పద్మనాయకుల వశం కాలేదు. ఈ యుద్ధం చెంజర్ల యుద్ధం తర్వాత క్రీ.శ.1361లో జరిగింది.

భువనగిరి-ఇంద్యాల సోమకులతో యుద్ధం క్రీ.శ.1361: చెంజర్ల, మొలంగూరు యుద్ధాల తర్వాత మిగిలిన సోమకుల క్షత్రియులు భువనగిరి చేరారు. వారు పద్మనాయకుల శత్రువులను కూడగట్టి అనపోతానాయకునితో యుద్ధం చేయాలని ప్రయత్నాలు ఆరంభించాయి. అది తెలిసి అనపోతానాయకుడు వారిపై దండెత్తాడు. ఉభయ సైన్యాలు భువనగిరి ప్రాంతంలోని మూసీనది తీరాన ఉన్న ఇంద్ర్యాల గ్రామం వద్ద యుద్ధానికి దిగాయి. అక్కడ పద్మనాయకులకు, సోమవంశ కుల చాళుక్యులకు చివరి యుద్ధం క్రీ.శ.1361 చివరిలో జరిగింది. ఆ యుద్ధంలో కూడా అనపోతానాయకుడు వారిని ఓడించి క్రూరంగా వధించాడు. శత్రువుల కంఠాల నుండి కారిన రుధిరధారలు ఇంద్ర్యాల గ్రామాన్ని ముంచి వరదలై ప్రవహించి, మూసీనదిలోకి ప్రవహించి, నది ఎర్రగా మారిందని వెలుగోటి వారి వంశావళి వర్ణించింది. ఈ యుద్ధం తర్వాత తెలంగాణలోని క్షత్రియ రాజ్యాలన్నీ నశించిపోయాయి. జల్లిపల్లి, ములంగూరు, ఇంద్ర్యాల యుద్ధాల తర్వాత అనపోతానాయకుడు చక్రవర గ్రామాన్ని ఒక భట్టుకు దానం చేశాడు. క్రీ.శ.1361 నాటికి సోమకుల చాళుక్య వంశస్తులను, అద్దంకి రెడ్లను ఓడించి తమ పగను తీర్చుకున్నాడు. ఆ తర్వాత జల్లిపల్లి, మొలంగూరు యుద్ధాలలో సోమకుల క్షత్రియులకు సహాయం చేసిన కాపయనాయకునిపై పగతీర్చుకోవాలని ప్రయత్నాలు ఆరంభించాడు.

రాజధాని మార్పిడి-రాచకొండ దుర్గ నిర్మాణం: కాపయనాయకుడు బలవంతుడు. అంతకుముందు అతడు తన తండ్రి రాజ్యాన్ని రాజధాని అనుమగల్లును ఆక్రమించాడు. కాపయనాయకునితో యుద్ధం చేయడానికి తన రాజధాని సురక్షితమైనది కాదని అనపోతానాయకుడు గ్రహించి తన రక్షణకు బలమైన కోట ఉండాలని భావించాడు. అందుకు తగిన ప్రదేశం రాచకొండ అని నిర్ణయించుకొని తన రాజధానిని అక్కడికి మార్చాడు. రాచకొండ అసలు పేరు రాజాచలం. రాజకొండ అని కూడా పిలిచేవారు. దానిని శత్రు దుర్భేద్యంగా నిర్మించాడు అందులో తాటాకాలు నిర్మించాడు. మంచినీటి బావులు తవ్వించాడు. అన్ని కట్టుదిట్టాలు చేసుకొని కాపయనాయకుని ధిక్కరించాడు. కాపయనాయకుడు బహమనీ సుల్తాన్‌లతో పోరాడి బలహీనుడై ఉన్నాడు. అది తగిన అదునని తలచి కాపయనాయకునిపై దండెత్తాడు.

కాపయనాయకునితో భీమవర యుద్ధం క్రీ.శ.1368: క్రీ.శ.1368లో గొప్ప సైన్యాన్ని తయారు చేసుకొని ఓరుగల్లు రాజ్యంపై దండెత్తాడు. కాపయనాయకుడు అనపోతానాయకుని ఎదిరించడానికి తన సైన్యాలతో బయలుదేరాడు. ఉభయ సైన్యాలు హనుమకొండ వద్ద భీమవరం అనే ప్రదేశంలో తారసిల్లాయి. అక్కడ ముసునూరు, రేచర్ల సైన్యాలకు గొప్ప యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కాపయనాయకుడు వీరమరణం పొందాడు. అతని మరణంతో ఓరుగల్లు రాజ్యం మొత్తం అనపోతానాయకుని వశమైంది. తెలంగాణ అంతా అతని రాజ్యంలో చేరిపోయింది. ఈ విజయం తర్వాత ఓరుగల్లు రాజ్యంలోని బలమైన దుర్గాలైన ఓరుగల్లు, శృంగవరం లేక సింగవరం, త్రిభువనగిరి మొదలైన దుర్గాలు అనపోతానాయకుని వశమయ్యాయి. వానిలో త్రిభువనగిరి దుర్గం చాలా కీలకమైంది. దానిని ఆక్రమించినందుకు అతడు త్రిభువనరాయ అనే బిరుదు పొందాడు. త్రిభువనగిరి, భువనగిరి అని కూడా పేర్లు ఉన్నాయి. ఈ విధంగా కాపయనాయకుని రాజ్యాన్ని తన రాజ్యంలో చేర్చి కాపయ నాయకుని బిరుదులైన ఆంధ్రసురత్రాణ, ఆంధ్రాధీశ్వర, ఖడ్గనారాయణ, హిందూరాయసురత్రాణ, గాయగోవాళ అనే బిరుదులు అతడు ధరించాడు. ఈ బిరుదులన్నీ ఐనవోలు శాసనంలో లిఖింపబడ్డాయి. కాపయ నాయకునితో జరిగిన యుద్ధంలో అనపోతానాయకునికి బహమనీ సుల్తాన్ మొదటి మహమ్మద్‌షా పరోక్ష మద్దతు ఉంది. ఆ తర్వాత పద్మనాయకులు బహమనీలు ఒకరి రాజ్యంపై ఒకరు దండెత్తలేదు. ఓరుగల్లు రాజ్యం రాచకొండ రాజ్యంలో విలీనం చెందిన తర్వాత, అంతకుముందు కాపయనాయకునితో చేసుకొన్న ఒప్పందాన్ని గౌరవించి ఆ ఒప్పందాన్ని రాచకొండ రాజ్యంతో చేసుకున్నట్లుగానే భావించి కాపయరాజ్యపు సరిహద్దులనే రాజకొండ రాజ్యపు సరిహద్దులుగా గుర్తించాడు. అందువల్ల బహమనీ, పద్మనాయకులు మిత్రులయ్యారు. వారి మైత్రి 50 సంవత్సరాలు కొనసాగింది. అందువల్ల ఈ మైత్రి పద్మనాయకులకు లాభించింది, వారి రాజ్యం బహమనీ రాజ్యపు దాడులకు గురికాకుండా సురక్షితంగా ఉండగలిగింది. బహమనీ రాజ్యానికి ఇది ఒక రకంగా నష్టదాయకం. విస్తరించగలిగిన శక్తి ఉండి కూడా బహమనీ రాజ్యం తెలంగాణలోకి విస్తరించకుండా ఆగిపోయింది.

భీమవరం యుద్ధం తర్వాత అనపోతానాయకుడు పుణ్యక్షేత్రమైన ఐనవోలును దర్శించాడు. అక్కడ తన

విజయ సూచకంగా శాసనం వేయించాడు. ఆ శాసనంలో అనపోతానాయకుడు ఓరుగల్లు, భువనగిరి, రాజకొండ, సింగపుర దుర్గాలకు అధిపతి అని రాసి ఉంది. ఈ శాసనం క్రీ.శ.1369లో వేయించబడింది. కనుక కాపయ నాయకుని మరణం క్రీ.శ.1368-69లో సంభవించి ఉంటుంది. కాపయనాయకుని రాజ్యం అనపోతానాయకుని రాజ్యంలో కలిసిపోయినందువల్ల రేచర్ల వారి రాజ్యం ఉత్తరాన గోదావరి నది వరకు, దక్షిణాన శ్రీశైలం వరకు, తూర్పున కొండవీటి రెడ్డి రాజ్యం వరకు, పశ్చిమాన బహమనీ రాజ్యంలోని గోల్కొండ, కౌలాస్ దుర్గాల వరకు విస్తరించింది. పద్మనాయకులు తెలంగాణ మొత్తానికి అధిపతులయ్యారు. రాజ్యం బలిష్టంగా రూపొంది స్థిరరూపం పొందింది. కనుకనే కొందరు అనపోతానాయకుడే రేచర్ల రాజ్య నిర్మాత అని వ్యాఖ్యానించారు. తన తండ్రి సింగమ నాయకుడు రాజ్యస్థాపకుడైనా దానికి స్థిరరూపం ఇచ్చింది. అనపోతా నాయకుడే. ఈ కాలంలో ఈ సోదరులిద్దరూ ఎదురులేని నాయకులుగా యుద్ధంలో అపజయం ఎరుగని వీరాధివీరులుగా ప్రసిద్ధి చెందారు.

కళింగ దండయాత్ర క్రీ.శ.1375-80: కొండవీటి రెడ్డి రాజ్యంలో క్రీ.శ.1364లో అనపోతారెడ్డి మరణించి, అతని తమ్ముడు అనవేమారెడ్డి సింహాసనానికి వచ్చాడు. అతడు క్రీ.శ.1370లో ఉత్తరాంధ్రపై దండయాత్ర చేశాడు. క్రీ.శ.1375లో సింహాచలం వరకు జయించాడు. రెడ్డి రాజ్య విస్తరణను అరికట్టడానికి అతడు కళింగపై దండెత్తినట్లు కనిపిస్తోంది. ఆ దండయాత్రా వివరాలు తెలియవు. వెలుగోటివారి వంశావళి ఈ దండయాత్రను ప్రస్తావించలేదు. కాని సింహాచలంలో అనపోతానాయకుని శాసనం ఉంది. అనవేమారెడ్డి చివరి కాలంలో దక్షిణాంధ్రపై కొండవీటి అధికారం నశించింది. బహుశా అనపోతానాయకుని దండయాత్రా ఫలితమే కావచ్చును. ఈ దండయాత్ర క్రీ.శ.1375 తర్వాత జరిగి ఉంటుంది.

అనవేమారెడ్డి దండయాత్ర క్రీ.శ.1375-80: అనపోతానాయకుడు కళింగపై దండెత్తినందుకు ప్రతీకారంగా, అనవేమారెడ్డి శ్రీశైల ప్రాంతంపై దండెత్తాడు. అనపోతారెడ్డిని ఓడించి ఆ ప్రాంతాలను మాదానాయకుడు రేచర్ల రాజ్యంలో కలిపాడు. కనుక తన అన్నకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా కూడా ఈ దండయాత్ర జరిపాడు. ఈ దండయాత్రలో శ్రీశైలం, త్రిపురాంతకాలను జయించడమేగాక కృష్ణానదిని దాటి వెలమ రాజ్యంలో ప్రవేశించి నల్గొండ జిల్లాలోని ఓడమల్లి లేక వజీరాబాద్, బూరుగుగడ్డలను జయించాడు. వజీరాబాద్‌లో అనవేముని అధికారి కడియం పోతినాయకుని శాసనం ఉంది. బూరుగుగడ్డలో కూడా దేసట్ల రెడ్ల శాసనం ఉంది. వెలుగోటి వారి వంశావళి మాదానాయకుడు అనవేమారెడ్డిని ఓడించినట్లు వర్ణిస్తోంది. కనుక అనవేమారెడ్డికి అనపోత, మాదానాయకులకు యుద్ధం జరిగిందని స్పష్టంగా చెప్పవచ్చును. కాని వెలుగోటివారి వంశావళి వర్ణన ఉత్ప్రేక్ష మాత్రమే. ఈ యుద్ధంలో అనవేమారెడ్డి విజయం సాధించి ఓడమల్లి, బూరుగుగడ్డ ప్రాంతాలను రెడ్డి రాజ్యంలో కలిపాడు.

దేవరకొండ రాజ్యం: అనవేమారెడ్డి చేతిలో అపజయం తర్వాత ఆగ్నేయ ప్రాంతంలో రాజ్యానికి రక్షణ ఉండాలని తలంచి రాచకొండ రాజ్యంలోని దక్షిణ ప్రాంతాలను ఒక రాష్ట్రంగా చేసి దానికి దేవరకొండను రాజధానిగా చేసి తన తమ్ముడు మాదానాయకుని అక్కడ తన ప్రతినిధిగా నియమించాడు. ఈ విభాగం చివరి దాకా కొనసాగింది. ఆ విధంగా ఏర్పడ్డ దేవరకొండ రాష్ట్రం దేవరకొండ రాజ్యంగా రూపొందింది. ఆ రాచకొండ రాజ్యాన్ని అనపోతానాయకుని సంతతి వారు పాలించుకొనగా, దేవరకొండ రాజ్యాన్ని మాదానాయకుని సంతతి వారు వారసత్వంగా పాలించారు. కాని ఉభయ రాజ్యాలు పరస్పరం సహకరించుకొన్నారు. దేవరకొండ రాజ్యం అంతరంగిక వ్యవహారంలో స్వేచ్ఛను అనుభవించినప్పటికీ రాచకొండ సామంతరాజ్యం కిందనే లెక్క. శత్రు రాజులతో యుద్ధాలు వచ్చినప్పుడు ఎలాంటి భేదాలు లేకుండా కలసికట్టుగా పోరాడాయి. రెండు రాజ్యాల మధ్య ఏనాడూ అంతఃకలహాలు కలుగలేదు. ఐక్యత చెడిపోలేదు. అనపోతానాయకుడు గొప్ప యుద్ధవీరుడు. పరిపాలనా దక్షుడు. అతని మంత్రి చిలమరాజు తిప్పరాజు. అతని సహకారంతో తన రాజ్యాన్ని దక్షతతో పాలించాడు. యుద్ధాలు ముగిసిన తర్వాత తన రాజధానిపై గొప్ప శ్రద్ధ తీసుకొని దానిని మరింత బలపరచాడు. అన్ని సౌకర్యాలు సమకూర్చాడు. రామసముద్రం, అనపోత సముద్రం అనే రెండు చెరువులు తవ్వించాడు. రామస్వామి, వీరభద్రస్వామి దేవాలయాలను నిర్మించాడు. అంతకు పూర్వం ఉన్న దుర్గాలయాన్ని పునరుద్ధరించాడు. రాజమందిరాలు, ఇతర సౌధాలను నిర్మించాడు. సంకెళ్ల బావి, కొలువు కూటపు బావులనే పేరుతో రెండు మంచినీళ్ల నూతులను తవ్వించాడు. నాగాయనికొండ దుర్గాలను కలుపుతూ ప్రాకారాలను నిర్మించాడు. దుర్గంలో భైరవాలయాన్ని నిర్మించాడు. శివాలయాలను కూడా నిర్మించి గొప్ప శివలింగాలను ప్రతిష్టించాడు.

అనపోతానాయకుడు కవిపండిత పోషకుడు. అతని ఆస్థానంలోని విశ్వేశ్వర కవి చమత్కారచంద్రిక అనే కావ్యాన్ని రచించాడు. అందు అనపోతానాయకుని ప్రశంస ఉంది. ఈ కవి శిష్యుడు నాగనాథుడు శాసన లేఖకుడు. కాపయనాయకుని మరణానంతరం అనపోతానాయకుడు వేయించిన అయ్యనవోలు లేక ఐనవోలు శాసనాన్ని అతడే లిఖించాడు. ఐనవోలులోని మైలారుదేవుని అంగరంగ భోగాలకు ధూపదీప నైవేద్యాలకు క్రీ.శ.1369లో ఐనవోలు గ్రామాన్ని దానం చేసి ఈ శాసనం వేయించాడు. అనపోతానాయకుని రాజ్యవిస్తరణకు బహమనీ సుల్తాన్ మొదటి మహమ్మద్‌షా ఈర్ష్య చెందినట్లు కనిపిస్తోంది. అది గ్రహించిన అనపోతానాయకుడు కాపయనాయకుని నాటి ఒప్పందాన్ని ధృవీకరించుకున్నట్లు తెలుస్తోంది. అందువల్ల బహమనీ రాజ్యం వల్ల తన రాజ్యానికి ప్రమాదం లేకుండా పోయింది. అనపోతుని రాజ్యం వింధ్య పర్వతాల నుండి శ్రీశైలం పర్వతాల వరకు విస్తరించి ఉన్నట్లు రసార్ణవ సుధాకరమనే కావ్యం వర్ణించింది. కాని అది వాస్తవం కాదు. అది కవితావర్ణన మాత్రమే. అనపోతా నాయకుడు క్రీ.శ.1384 వరకు పాలించి మరణించాడు.

దేవరకొండ రాజ్యం-మాదానాయకుడు: అనపోతానాయకుడు తన తమ్ముడు మాదానాయకుని దేవరకొండ పాలకునిగా నియమించాడు. రాజ్య రక్షణ కోసం ఏర్పరచిన విధానమేగాని ఇది అన్నదమ్ములు రాజ్యాన్ని పంచుకున్నట్లు కాదు. అతని తర్వాత అతని సంతతి వారు దేవరకొండ రాజ్యాన్ని వారసత్వంగా పాలించారు. మాదా నాయకుడు తన అన్న లాగా గొప్ప వీరుడు. అన్నతోపాటు అన్ని యుద్ధాలలో పాల్గొని అనేక విజయాలు సాధించాడు. ముఖ్యంగా అనపోతారెడ్డి మీద అద్భుత విజయం సాధించాడు. అన్న లాగా ఇతడు కూడా శివభక్తుడు. అనేక శివాలయాలు నిర్మించాడు. శ్రీశైలంలోని ఉత్తర ద్వారాన్ని నిర్మించాడు. ఉమామహేశ్వరంలో ఒక శివాలయాన్ని, ఒక మండపాన్ని నిర్మించి శాసనం వేయించాడు. దేవరకొండ దుర్గాన్ని బలిష్టంగా రూపొందించాడు. అక్కడే దేవరకొండ సమీపంలో తన పేరుతో మాధవపురమనే పేరుతో రాజపురాన్ని నిర్మించాడు అందులో గొప్ప రాజ భవనాన్ని నిర్మించి అక్కడ నివసించాడు. మాదానాయకుని మంత్రి చిలమరాజు పోతరాజు. అతని సహకారంతో మాదానాయకుడు దేవరకొండ రాజ్యాన్ని చక్కగా పాలించాడు. పోతన తమ్ముని కుమారుడు గారన హరిశ్చంద్రోపాఖ్యానం రాశాడు.

రెండవ సింగమ నాయకుడు క్రీ.శ.1384-1399: అనపోతానాయకునికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుని పేరు సింగమ నాయకుడు. తన తండ్రి పేరు పెట్టుకున్నాడు. రెండవ కుమారుని పేరు ధర్మానాయుడు. అనపోతు మరణానంతరం పెద్ద కుమారుడు రెండవ సింగమనాయకుడు రాచకొండ సింహాసనానికి వచ్చాడు. అతనికి కుమార సింగభూపాలుడు అనే పేరు కూడా ఉంది. అతని ఆస్థాన కవులు తమ గ్రంథాలలో కుమార సింగభూపతి అని సంబోధించారు. శాసనాలు అతనిని పెదసింగమనాయకుడు అని పేర్కొంటున్నాయి. అతడు క్రీ.శ.1384 నుండి 1399 వరకు 15 సంవత్సరాలు పాలించాడు. ఇతనికి సమకాలికంగా దేవరకొండలో మాదానాయకుని కుమారుడు పెదవేదగిరి పాలించాడు. విజయనగరంలో రెండవ హరిహరరాయలు, కొండవీటి రెడ్డి రాజ్యంలో కుమారగిరి, బహమనీ రాజ్యంలో రెండవ మహమ్మద్‌షా అతని సమకాలికులు. ఇతడు యువరాజుగా ఉండగానే తండ్రితో కలసి యుద్ధాలలో, పరిపాలనా వ్యవహారాలలో పాల్గొని గొప్ప అనుభవాన్ని సంపాదించాడు. ఇతని కాలంలో వారి రాజ్యానికి బహమనీలతో స్నేహసంబంధాలు బలపడ్డాయి. కాని విజయనగరం, రెడ్డి రాజ్యాలతో విరోధం పెరిగిపోయింది. యువరాజుగానే ఇతడు బహమనీలతో కలసి కళ్యాణీ దుర్గాన్ని జయించి అక్కడ విజయస్తంభం నాటించి కళ్యాణభూపతి అనే బిరుదు పొందాడని అతని ఆస్థానకవి విశ్వేశ్వరుడు రాసిన చమత్కార చంద్రిక అనే కావ్యం వర్ణిస్తోంది. అంతేగాక అతడు బహమనీలతో మైత్రిని నెరుపుతున్నట్లు కూడా ఆ కావ్యం వివరించింది. ఈ కళ్యాణీదుర్గం గుల్బర్గా జిల్లాలోది కావచ్చును.

విజయనగర దండయాత్ర క్రీ.శ.1384: ఇతడు సింహాసనానికి వచ్చిన మొదటి సంవత్సరంలోనే విజయనగర సామ్రాజ్యంతో యుద్ధం వచ్చింది. కాపయనాయకుని వధించడం బహమనీలతో స్నేహం చేయడం పద్మనాయకులపై విజయనగర చక్రవర్తులకు ఆగ్రహం కలిగించింది. వారు పద్మనాయకులను కూడా శత్రువులుగానే భావించారు. కనుక పద్మనాయక రాజ్యం ఆధీనంలో ఉన్న మహబూబ్‌నగరం జిల్లాలో ఉన్న కొత్త కొండను, అంతర్వేది ప్రాంతంలో ఉన్న ఐజ మండలాన్ని జయించడానికి రెండవ హరిహరరాయలను పంపాడు. వెలమలకు సహాయంగా బహమనీ సైన్యం కొత్తకొండ యుద్ధానికి వచ్చింది. అక్కడ యుద్ధంలో విజయనగర సేనాని సాళువ రామదేవరాయలు మరణించాడని క్రీ.శ.1384 నాటి విజయనగర శాసనాలు తెలుపుతున్నాయి. ఆ

యుద్ధంలో వెలమలకే విజయం లభించింది.

కళింగ దండయాత్ర క్రీ.శ.1387: కొత్తకొండ విజయం తర్వాత సింగ నాయకుడు దేవగిరి పాలకుడై పెదవేదగిరితో కలసి దక్షిణ కళింగపై దండెత్తి గోదావరీ తీరప్రాంతాన్ని జయించాడు. ఆ కాలంలో ఈ ప్రాంతాలు కొండవీటి రెడ్డి రాజ్యంలో ఉన్నాయి. ఈ దండయాత్రలో పెదవేదగిరి బెండపూడి, పూములకొండ మొదలైన దుర్గాలను జయించి సింహాచలం చేరి అక్కడి నుండి శ్రీకూర్మం వరకు సాగిపోయాడు. సింహాచలంలోను, శ్రీకూర్మంలోను పెదవేదగిరి శాసనాలు ఉన్నాయి. పద్మనాయకులు చేసిన ఈ దండయాత్ర వల్ల గోదావరి తీరంలో రెడ్డి, కొండవీటి వారి అధికారం అంతరించింది. ఈ దండయాత్ర క్రీ.శ.1387లో జరిగిందని భావింపబడింది. తిరిగి ప్రాంతాలను జయించడానికి కుమారగిరి తన బావ కాటయ వేమారెడ్డిని పంపవలసి వచ్చింది. క్రీ.శ.1390 నాటికి కాటయ వేమారెడ్డి సింహాచలం వరకు తిరిగి జయించాడు.

విజయనగర రాజ్యంతో మళ్లీ యుద్ధం క్రీ.శ.1397: బహమనీ రాజ్యంలో క్రీ.శ.1397లో రెండవ మహమ్మద్‌షా మరణించాడు. సింహాసనం కోసం షమ్సుద్దీన్‌కు, ఫిరోజ్‌ఖాన్ అతని సోదరుడు, అహమ్మద్‌ఖాన్‌లకు అంతర్యుద్ధం సాగింది. అందులో ఫిరోజ్‌ఖాన్ లేక ఫిరోజ్‌షాకు క్రీ.శ.1398 నాటికి విజయం లభించింది. బహమనీ అంతర్యుద్ధ సమయంలో అంటే క్రీ.శ.1397లో రెండవ హరిహరరాయలు కొత్తకొండ యుద్ధంలో జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయడానికి తన సేనాధిపతి గుండదండనాథుని పంపాడు. అతడు బహమనీ రాజ్యంలో ప్రవేశించి బహమనీ సైన్యాలను వారికి సహాయంగా వచ్చిన పద్మనాయక సైన్యాన్ని ఓడించాడు. గుండ దండనాథుడు యవన తురుష్క ఆంధ్ర సైన్యాలను ఓడించి బహమనీ సేనాధిపతులైన సైన్‌ఖాన్, ఫతేఖాన్‌లను బంధించాడని విజయనగర శాసనాలు తెలుపుతున్నాయి. ఈ సమయంలో బహమనీ సైన్యాలపై విజయనగర సైన్యాల ఒత్తిడి తగ్గించడానికి విజయనగర సైన్యాల దృష్టి మరల్చడానికి సింగమనాయకుడు పెదవేదగిరి నాయకుని కుమారుడైన రామచంద్రనాయకుని విజయనగర రాజ్యంపై దాడికి పంపాడు. రామచంద్రనాయకుడు కృష్ణను దాటి కందనవోలు లేక కర్నూలు ప్రాంతాలపై దాడి చేసి కొల్లగొట్టనారంభించాడు. రామచంద్రనాయకుని ఎదుర్కోడానికి రెండవ హరిహరరాయలు తన కుమారుడు వీరబుక్కరాయలను పంపాడు. బుక్కరాయలకు, రామచంద్రరాయలకు జరిగిన యుద్ధంలో రామచంద్రదేవరాయలు, సింగమనాయకుని కుమారుడు అనపోతానేడు, మాదానాయకుడు అనేక సాహసకృత్యాలతో విజయనగరసేనపై విజయాలు సాధించారని వెలుగోటివారి వంశావళి వర్ణించింది. కాని అది వాస్తవం కాదు. ఈ యుద్ధంలో వీరబుక్కరాయలు, అతని సేనాధిపతి ఇరుగవ దండయానాథుడు రామచంద్ర రాయలను తరిమివేసి పద్మనాయక రాజ్యంలోకి ప్రవేశించారు.

పానుగల్లు ఆక్రమణ క్రీ.శ.1397: కృష్ణను దాటి విజయనగర సైన్యంలో ఒక విభాగం ఎర కృష్ణమ నాయకుని నాయకత్వంలో దేవరకొండపై దాడి చేసి పద్మనాయకులను ఓడించిందని విజయనగర శాసనాలు తెలుపుతున్నాయి. కాని దేవరకొండ వద్ద విజయనగర సైన్యాలను రెండవ కుమార మాదానాయకుడు ఓడించి విజయనగర సేనాని ఎర కృష్ణమనాయకుని వధించాడని వెలగోటివారి వంశావళి తెలుపుతోంది. కాని అది వాస్తవం కాదు. విజయనగర సేనలు విజయం సాధించాయి. మరొక సేన వీరబుక్కరాయల నాయకత్వంలో ఓరుగల్లుపై దండెత్తి జయించి అక్కడి నుండి మెదక్ వరకు దండయాత్ర జరిపింది. ఓరుగల్లు దండయాత్రను బుక్కరాయల ఆస్థానకవి లక్ష్మణాచార్యుడు తన వైద్యరాజవల్లభం అనే గ్రంథంలో వర్ణించాడు. మరొక విజయనగర సేన బుక్కరాయల కుమారుడైన అనంతమహపతి నాయకత్వాన పానుగల్లు కోటను ముట్టడించింది. పానుగల్లు మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఉంది. పద్మనాయకులకు బహమనీ సైన్యం కూడా సహాయంగా వచ్చింది. అక్కడ జరిగిన యుద్ధంలో విజయనగరసేనలు బహమనీ, పద్మనాయక సంయుక్త సైన్యాలను ఓడించి క్రీ.శ.1397లో పానుగల్లును ఆక్రమించాయి. ఆనాటి నుంచి పానుగల్లు విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉండిపోయింది. ఈ విధంగా రెండవ సింగమనాయకుని కాలంలో పద్మనాయక రాజ్యం విజయనగర దండయాత్ర వల్ల బాగా నష్టపడిపోయింది. పానుగల్లు యుద్ధం జరిగిన తర్వాత రెండు సంవత్సరాలకు అంటే క్రీ.శ.1399లో రెండవ సింగమనాయకుడు మరణించాడు.

సింగమనాయకుని చివరి జీవితం పరాజయాల వల్ల ఆవేదనతో గడిచింది. అతడు రాజకీయంగా అపజయాలు పొందినా అతడు కవిపండిత పోషకుడు. కవి పండితుడు. సంస్కృతాంధ్ర భాషలలో పండితుడు. సర్వజ్ఞ చక్రవర్తి అనే బిరుదులు పొందారు. అతని ఆస్థాన కవులు సర్వజ్ఞుడనీ సర్వజ్ఞ చూడామణీ అని కీర్తించారు.

అతడు స్వయంగా కవి. రత్నపాంచాలిక, రసార్ణవసుధాకరం, రత్నాకర సుధాకర వ్యాఖ్యానం మొదలైన కావ్యాలు రచించి గొప్ప పండితుడుగా ప్రసిద్ధి చెందాడు. అతడు అనేక మంది కవులను పోషించాడు. విద్వద్గోష్ఠులతోను, పండిత సన్మానాలతోను కాలం గడిపేవాడు. అతని ఆస్థానంలో విశ్వేశ్వరకవి చమత్కారచంద్రిక అనే కావ్యం రాశాడు. సింగమనాయకునికి ఆంధ్రమండలాధీశ్వర, ప్రతిదండ భైరవ, ఖడ్గనారాయణ అనే బిరుదులున్నాయి. అతనికి అనపోత, దాచ, వల్లభ, మాదవ లేక మాదానీడు, వేదగిరి, దామయ అనే ఆరుగురు కుమారులు ఉన్నారు వారిలో పెద్దవాడైన అనపోత రెండవ అనపోతానాయకుని సింహాసనానికి వచ్చాడు.

. దేవరకొండ రాజ్యం-పెదవేదగిరి క్రీ.శ.1384-1410: రెండవ సింగమనాయకునికి సమకాలికంగా దేవరకొండ రాజ్యంలో మాదానాయకుని కుమారుడు పెదవేదగిరి రాజ్యానికి వచ్చాడు. అతడు క్రీ.శ.1384 నుండి 1410 వరకు పాలించాడు. అతడు గొప్ప వీరుడు. రెండవ సింగమనాయకుని యుద్ధాలలో తనశక్తి కొద్దీ పోరాడాడు. క్రీ.శ.1387లో అతడు కళింగపై దండెత్తి బెండపూడి కోటను జయించి బెండపూడి కోట విభాళ అనే బిరుదు పొందాడు. సింహాచలం, శ్రీకూర్మాలలో అతని శాసనాలు ఉన్నాయి. కొండవీటి అనవేమారెడ్డి కాలంలో వేంగి రాజ్యాన్ని పోగొట్టుకున్న అన్నెదేవచోడునికి ఆశ్రయం ఇచ్చాడు. అతడు త్రిపురాంతక ప్రాంతాన్ని జయించడానికి సహాయపడ్డాడు. క్రీ.శ.1399లో రాచకొండతో రెండవ అనపోతానాయకుడు సింహాసనానికి వచ్చాడు., అతనికి సమకాలికంగా పెదవేదగిరి క్రీ.శ.1410 వరకు దేవరకొండను పాలించాడు. పెదవేదగిరి శివభక్తుడు. కవిపండిత పోషకుడు. శాకల్య అయ్యలార్యుడు ఇతని ఆస్థాన కవి. అతడు భాస్కర రామాయణాన్ని పూర్తి చేశాడు.

రాచకొండ రాజ్యం-రెండవ అనపోతానాయకుడు క్రీ.శ.1399-1421: రెండవ సింగమనాయకుడు లేక కుమార సింగభూపాలుని తర్వాత అతని పెద్దకుమారుడు రెండవ అనపోతానాయకుడు క్రీ.శ.1399లో రాచకొండ సింహాసనాన్ని అధిష్టించి క్రీ.శ.1421 వరకు సుమారు 22 సంవత్సరాలు పాలించాడు. ఇతని కాలంలో దేవరకొండను పెదవేదగిరి క్రీ.శ.1410, తర్వాత అతని కుమారుడు రెండవ మాదానీడు పరిపాలించారు. కొండవీటిలో క్రీ.శ.1420 వరకు కుమారగిరి, క్రీ.శ.1402 నుండి 1429 వరకు పెదకోమటి వేమారెడ్డి, రాజమహేంద్రవర రాజ్యంలో కాటయ వేమారెడ్డి తర్వాత అల్లాడరెడ్డి, బహమనీ రాజ్యంలో ఫిరోజ్‌షా, విజయనగరంలో మొదటి దేవరాయలు సమకాలికులు. రెండవ అనపోతానాయకునికి కుమారాన్నపోతానేడు, పిన అన్నమనాయకుడు, ఇమ్మడి అనపోతా నాయకుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇతడు యువరాజుగా అనేక యుద్ధాలలో పాల్గొని విజయాలు సాధించాడు. ఇతని కాలంలో దక్షిణ భారతదేశ రాజ్యాల సంబంధాలలో పెను మార్పులు సంభవించాయి. రెడ్డి రాజ్యం కొండవీడు, రాజమహేంద్రవర రాజ్యాలుగా చీలిపోయింది. పెదకోమటి వేమారెడ్డి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం సంపాదించాడు. కొండవీడుతో బహమనీ రాజ్యానికి స్నేహం ఏర్పడటంతో ఆగ్రహం చెంది రేచర్ల వారు విజయనగరం వైపు చేరిపోయారు. దాంతో పద్మనాయక, బహమనీ రాజ్యాల మధ్య పగ ఏర్పడి చివరకు పద్మనాయక రాజ్య పతనానికి దారి తీసింది. ఇతని కాలంలో అన్నెదేవచోడుడు దేవరకొండ రాజ్య సహాయం సంపాదించి రాజమహేంద్రవర రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈ సందర్భంలో కాటయ వేమునికి అంటే రాజమహేంద్రవర రాజ్యానికి విజయనగర రాజ్య అండదండలు లభించాయి. అంతవరకు విజయనగర రాజ్యం కొండవీటి రెడ్డి రాజ్యంతో సన్నిహితంగా ఉండేది. ఈ విధంగా రెండవ అనపోతానాయకుని కాలంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి.

అనపోతానాయకుని యుద్ధాలు: అనపోతానాయకుడు రాజ్యానికి వచ్చేనాటికి పద్మనాయక రాజ్యంపై విజయనగర రాజ్యం దాడి కొనసాగుతూనే ఉంది. కనుక అతడు సింహాసనం ఎక్కగానే తన రాజ్యాన్ని రక్షించుకోవలసిన బాధ్యత నెత్తినపడింది. ఈ సమయంలో విజయనగర యువరాజు మెతుకు దుర్గాన్ని ముట్టడించి ఉన్నాడు. ఓరుగల్లు ముట్టడి సాగుతూనే ఉంది. పానుగల్లు విజయనగర సేనల వశమైంది. కనుక అనపోతా నాయకుడు విజయనగర సేనలతో యుద్ధానికి దిగాడు. మొదట మెతుకు సీమకు సైన్యంతో పోయి విజయనగర సేనలను తరిమివేశాడు. అక్కడ విజయనగర సైన్యంతో పోరాడుతున్న 10 వేల పద్మనాయక సైన్యాన్ని కాపాడుకొని విజయనగర సేనను ఓడించి తరిమి మెదక్ కోటను రక్షించుకున్నాడు. తర్వాత పారిపోతున్న విజయనగర సైన్యాన్ని తరుముతూ పానుగల్లు చేరి దానిని కొల్లగొట్టాడు. ఇదే సమయంలో దేవరకొండ పాలకుడు పెదవేదగిరిని ఓరుగల్లు పైకి పంపాడు. అతడు ఓరుగల్లు వద్ద విజయనగర సేనాని గుండదండనాధుని సంహరించి ఓరుగల్లును

సాధించాడు. అనపోతానాయకుని విజయాలను వెలుగోటివారి వంశావళి ఘనంగా వర్ణించింది. అనపోతా నాయకుడు కొండవీటి వద్ద సంబెటసోమని సరిపల్లి తిమ్మని జయించాడు, పానుగల్లును కొల్లగొట్టాడని, రాజమహేంద్రవరం వరకు నడిచి రెడ్డి రాజ్యాన్ని కల్లోలపరచాడని చెన్నపట్టణం వరకు తిగుళ రాజ్యాన్ని దెబ్బ తీశాడని, బోయ రాజ్యాన్ని పొడిచివేశాడని, రాయలను నిగ్రహించాడని, యుద్ధంలో సంబెట్ల వారిని ఓడించాడని వెలుగోటివారి వంశావళి వర్ణిస్తోంది. ఈ విజయాలు ఎప్పుడు సాధించాడో స్పష్టంగా తెలియదు. తిగుళ, బోయ రాజ్యాలు కూడా విజయనగర సామంత రాజ్యాలే. సమ్మెట దేవరాజు, పిన్నమరాజు క్రీ.శ.1428లో కర్నూలు ప్రాంతాన్ని పాలించిన విజయనగర సామంతులు. అలాగే సరిపల్లి తిమ్మడు, తిమ్మారెడ్డి కటాధిపతులైన గాంగవంశ గజపతుల సామంతులు. కనుక అనపోతానాయకుడు బహమనీ సుల్తాన్‌లు విజయనగరంపై జరిపిన దాడులలో పాల్గొని ఉంటాడు. ఇతని కాలంలో ఫిరోజ్‌షాకు, మొదటి దేవరాయలకు అనేక యుద్ధాలు జరిగాయి. ఆ విజయాలను గొప్పగా వారి వంశావళి వర్ణించి ఉంటుంది. క్రీ.శ.1402-1408 మధ్యకాలంలో వెలమలు అన్నెదేవ చోడునికి సహాయంగా కళింగ మీద దండెత్తారు. ఆ సమయంలో గంగ సామంతులైన సరిపల్లి తిమ్మడు మొదలైన వారిని ఓడించి ఉంటారు. ఆ విజయాలను వెలుగోటివారి వంశావళి వర్ణించి ఉంటుంది.

అన్నెదేవచోడునికి సహాయంగా కళింగ దండయాత్ర క్రీ.శ.1402-1408: క్రీ.శ.1402లో పెదకోమటి వేమారెడ్డి కుమారగిరి తరిమివేసి కొండవీటి సింహాసనం ఎక్కాడు. తన రాజ్యాన్ని సంపాదించుకోవడానికి అదే తగిన సమయమని భావించి అన్నెదేవచోడుడు దేవరకొండ పెదవేదగిరిని అర్థించాడు. అతడు సహాయం చేయలేక పోయాడు. కాని పెదవేదగిరి కుమారుడు కుమార మాదానాయకుడు సైన్యంతో అన్నెదేవచోడునికి సహాయంగా కళింగ మీదుగా రెడ్డి రాజ్యంపై దండెత్తాడు. వారిని రెడ్ల సామంతుడు చాళుక్య విశ్వేశ్వరభూపతి సర్వసిద్ధి వద్ద క్రీ.శ.1402లో ఓడించాడు. తర్వాత క్రీ.శ.1404 అన్నెదేవచోడుడు మళ్లీ రెడ్డి రాజ్యంపై దండెత్తి వేంగి రాజ్యాన్ని ఆక్రమించాడు. ఈ యుద్ధాలలో రెండవ అనపోతా నాయకుడు పాల్గొనలేదు.

పానుగల్లు యుద్ధం క్రీ.శ.1417-దాని ప్రభావం: పెదకోమటి వేమారెడ్డి అల్లాడరెడ్డిని ఓడించడానికి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా సహాయం పొందాడు. ఫిరోజ్‌షా రాజమహేంద్రవరం దండెత్తుతూ వాడపల్లి, వేదాంద్రి, చిలుకూరులను జయించాడు. రాజమహేంద్రవరం వద్ద అల్లాడరెడ్డి చేతిలో ఓడిపోయి తిరిగివచ్చి పానుగల్లును ముట్టడించాడు. క్రీ.శ.1397లో వీరబుక్కరాయలు పానుగంటిని జయించాడు. అప్పటి నుండి పానుగల్లు విజయనగర రాజ్యంలో భాగంగా ఉంది. ఫిరోజ్‌షాకు సహాయంగా అనపోతానాయకుడు కూడా పానుగల్లుపై దండెత్తి దోచుకున్నాడు. బహమనీ వెలమ సైన్యాలు సంయుక్తంగా పోరాడటంతో విజయనగర సైన్యాలు జయాపజయాల మధ్య పోరాడుతున్నాయి. ఆ స్థితిలో పద్మనాయకులను ఫిరోజ్‌షా నుండి చీలదీయాలని తలచి వారితో రాయబారాలు నడిపాడు. ఫిరోజ్‌షా కొండవీటి పెదకోమటి వేమారెడ్డితో స్నేహసంబంధాలు చేసుకోవడం పద్మ నాయకులకు ఇష్టం లేదు. కారణం కొండవీటి రెడ్లు, పద్మనాయకులకు జన్మవిరోధులు. కాని ఫిరోజ్‌ను వారు నిరోధించలేకపోయారు. ఇప్పుడు విజయనగరం వైపు చేరిపోవడం ద్వారా ఫిరోజ్‌షాకు బుద్ధి చెప్పవచ్చని దేవరాయల రాయబారానికి స్పందించి చిరకాలంగా వారికి బహమనీ రాజ్యంతో ఉన్న రాజకీయ తుల్య ప్రాబల్యం మారిపోయింది. అంతకు ముందు శత్రువులుగా పోరాడుకున్న పద్మనాయకులు, విజయనగరాధీశులు ఒకటైపోయారు. అంతవరకు మిత్రులుగా ఉన్న బహమనీలు, పద్మనాయకులు విడిపోయి ఒకరితో ఒకరు యుద్ధాలకు దిగారు. ఈ పరిణామం చివరకు రేచర్లవారి రాజ్యపతనానికి దారితీసింది. ఫిరోజ్‌షా పానుగల్లు కోటను ముట్టడి జరుపుతున్నాడు. ఫిరోజ్‌షాకు సహాయంగా కొండవీటి పెదకోమటి వేమారెడ్డి కూడా తన తమ్ముడు మాచారెడ్డితో సైన్యాన్ని పంపాడు. ఈ స్థితిలో హఠాత్తుగా అనపోతానాయకుడు తన సోదరుని కుమారులతో వచ్చి బహమనీ సైన్యాలపై వెనుక నుండి దాడి చేశాడు. లోపల నుంచి విజయనగర సేనలు, బయట నుంచి వెలమ సేనలు బహమనీ సైన్యాలను నుగ్గు చేశాయి. బహమనీ సైనికులు వేలాదిగా మరణించారు. సుల్తాన్ ఫిరోజ్‌షా కూడా గాయపడ్డాడు. చివరకు పూర్తిగా ఓడిపోయి పారిపోయాడు. పానుగల్లు యుద్ధం తెలంగాణ చరిత్రపై గొప్ప ప్రభావాన్ని చూపింది. ఆ తర్వాత బహమనీలు పద్మనాయకులను బద్ధ శత్రువులుగా భావించి వారి రాజ్యాన్ని నాశనం చేయడానికి దాడులు చేసి కొద్ది కాలంలోనే పద్మనాయక రాజ్యాన్ని అంతం చేశారు. తెలంగాణ బహమనీ సుల్తాన్‌ల చేతిలోకి పోయింది. ఈ విధంగా పానుగల్లు యుద్ధం పద్మనాయక రాజ్యపతనానికి నాంది పలికింది. తెలంగాణలో ముస్లిం పరిపాలన ప్రారంభం కావడానికి కూడా తోవదీసింది. అంతేగాక పానుగల్లు యుద్ధం

పద్మనాయకులకు, రెడ్లతో మళ్లీ యుద్ధాలను తెచ్చింది.

కొండవీటి రెడ్డి రాజ్యంతో యుద్ధం క్రీ.శ.1417-1420: పానుగల్లు యుద్ధంలో రెడ్డి సేనాధిపతిగా వచ్చిన మాచారెడ్డిని దేవరకొండ పినవేదగిరి చంపాడు. అందుకు ప్రతీకారంగా పెదకోమటి వేమారెడ్డి దేవరకొండపై దండెత్తి పినవేదగిరిని చంపి అతని బొమ్మ పెట్టాడు. అందుకు ప్రతీకారంగా పినవేదగిరి తమ్ముడు లింగమనేడు క్రీ.శ.1420లో కొండవీటిపై దండెత్తి పెదకోమటి వేమారెడ్డిని సంహరించి అతని శిరస్సును తమ్మపడగలో పెట్టాడట. ఈ యుద్ధంలో రెండవ అనపోతానాయకుడు దేవరకొండ వారికి సైనిక సహాయం చేసి ఉండవచ్చును పెదకోమటి వేమారెడ్డి మరణం తర్వాత 4 సంవత్సరాలకే కొండవీటి రెడ్డి రాజ్యం కూడా అంతమైంది. పానుగల్లు యుద్ధ ఫలితంగా అన్నదమ్ములు పెదకోమటి వేమారెడ్డి, మాచారెడ్డి ఇద్దరూ మరణించారు. ఈ పరిణామాలన్నీ పానుగల్లు యుద్ధ ఫలితమేనని చెప్పవచ్చును. పానుగల్లు యుద్ధం పద్మనాయక, కొండవీటి రెడ్డిరాజ్య పతనాలకు కారణమైంది. అనపోతానాయకుని జీవితమంతా యుద్ధాలతోనే గడచిపోయింది, అతని యుద్ధాలలో అతని కుమారులు, దేవరకొండ పెదవేదగిరి కుమారులు తమ సహాయ సహకారాలను అందించారు. అతని కాలంలో పద్మనాయక రాజ్య పతనానికి బీజం పడింది. అతడు క్రీ.శ.1421లో మరణించాడు.

దేవరకొండ రాజ్యం-రెండవ మాదానీడు క్రీ.శ.1410-1425: రెండవ అనపోతానాయకుని సమకాలికంగా క్రీ.శ.1410 వరకు పెదవేదగిరి పాలించాడు. క్రీ.శ.1410 నుండి అతని కుమారుడు రెండవ మాదానేడు సింహాసనం అధిష్టించి క్రీ.శ.1425 వరకు పాలించాడు. ఇతని సోదరులు రామచంద్రనాయకులు, పినవేదగిరి, లింగమనేడులు. వీరంతా గొప్ప వీరులు. మాదానాయకుడు క్రీ.శ.1402లో అన్నెదేవచోడునికి సహాయంగా కళింగపై దండెత్తాడు. క్రీ.శ.1403లో ఓరుగల్లు యుద్ధంలో పాల్గొని తన తండ్రి పెదవేదగిరికి విజయనగర సైన్యాలను పారదోలటంలో సహాయపడ్డాడు. క్రీ.శ.1404లో అన్నెదేవచోడునికి సహాయంగా వెళ్లి వేంగిని జయించి అన్నెదేవచోడుని సింహాసనాధీశుని చేసి అతనికి సహాయంగా మూడు సంవత్సరాలు అతని రాజధానిలో నివసించాడు. పానుగల్లు యుద్ధంలో పాల్గొని బహమనీ సేనలను ఓడించాడు. తన తమ్ముడు పినవేదగిరిని సంహరించినందుకు ప్రతీకారంగా కొండవీటి రాజ్యంపై తన తమ్ముడు లింగమనేడును పంపి పెదకోమటి వేమారెడ్డిని వధించి తమ పగ తీర్చుకున్నాడు. రాచకొండ రెండవ అనపోతానాయకునికి అన్ని యుద్ధాలలో అండగా నిలిచాడు. రెండవ అనపోతానాయకుని కాలం నుంచి రాచకొండ రాజ్యానికంటే దేవరకొండ రాజ్యం ప్రముఖ పాత్ర నిర్వహించసాగింది. రెడ్డి రాజ్యంపై చేసిన దాడులన్నీ దేవరకొండ రాజ్యమే నిర్వహించింది. తద్వారా ప్రఖ్యాతిలోకి వచ్చింది.

రావు మాదానాయకుడు క్రీ.శ.1421-1430: రెండవ అనపోతానాయకుని కుమారుడు. మూడవ సింగభూపాలుడు చిన్నవాడైనందువల్ల అనపోతానాయకుని మరణానంతరం అతని కనిష్ట సోదరుడు రావు మాదానాయకుడు క్రీ.శ.1421లో రాజ్యానికి వచ్చి 10 సంవత్సరాలు పాలించాడు. విజయనగర మొదటి దేవరాయలు, అతని కుమారుడు రామచంద్రరాయలు, విజయరాయలు. విజయరాయలు కుమారుడు రెండవ దేవరాయలు ఇతని సమకాలికులు. బహమనీ రాజ్యంలో ఫిరోజ్‌షా క్రీ.శ.1422లో మరణించాడు. తరువాత అతని తమ్ముడు అహమ్మద్‌షా, కొండవీటిలో రాచవేమారెడ్డి, రాజమహేంద్రవరంలో మూడవ కుమారగిరి, మూడవ అనపోతారెడ్డి, అనితల్లి, వీరభద్రారెడ్డి ఇతని సమకాలికులు. ఇతని కాలంలో పద్మనాయకులకు విజయనగరంతో స్నేహం వృద్ధి చెందింది. బహమనీలతో వైరం తీవ్రరూపం దాల్చింది. క్రీ.శ.1424లో అహమ్మద్‌షా విజయనగర రాజ్యంపై దండెత్తాడు. ఆ యుద్ధంలో మాదానాయకుడు విజయనగరం పాలకులైన విజయరాయలు, అతని కుమారుడు ప్రౌఢదేవరాయల వైపు చేరాడు. దేవరకొండ లింగమనేడు వెలమ సైన్యాలను నడిపాడు. యుద్ధంలో బహమనీ సేనలు ఓడిపోయాయి. బాదామీ, దేవగిరి, తోరుగల్లు, విజయనగర రాజుల వశమయ్యాయి. ఓడిపోయిన అహమ్మద్‌షా విజయనగరంతో సంధి చేసుకొని వెళ్లాడు. కాని తన ఓటమికి పద్మనాయకులు కారణమని వారి మీద పగ బట్టి తర్వాత పద్మనాయక రాజ్యంపై దండయాత్రలు చేశాడు.

బహమనీ సుల్తాన్ దండయాత్ర క్రీ.శ.1425: పద్మనాయకులను శిక్షించే ఉద్దేశంతో అహమ్మద్‌షా తన సేనాని అజిమ్‌ఖాన్‌ను ఓరుగల్లుపై దండు పంపాడు. అతడు ఓరుగల్లులోని పద్మనాయక సేనానిని చంపి కోటను ఆక్రమించాడు. అనేక దేవాలయాలను ధ్వంసం చేశాడు. విజయం తర్వాత అహమ్మద్‌షా స్వయంగా ఓరుగల్లు దర్శించి భాండాగారంలోని ధనాన్ని స్వాధీనం చేసుకొని అజమ్‌ఖాన్‌ను ఓరుగల్లు పాలకునిగా నియమించి మిగిలిన

రాచకొండ రాజ్య భాగాలు ఆక్రమించమని ఆదేశాలు ఇచ్చి తన నూతన రాజధాని బీదరుకు వెళ్లిపోయాడు. క్రీ.శ.1425లోనే అహమ్మద్ షా తన రాజధానిని గుల్బర్గా నుండి బీదరుకు మార్చాడు. అజమ్‌ఖాన్ రాచకొండ రాజ్యంపై దండెత్తి అనేక దుర్గాలను జయించి పద్మనాయకులను భయభ్రాంతులను చేసి నాలుగు మాసాలకు ఓరుగల్లు చేరాడు. తమ రాజ్యానికి ముప్పు ఏర్పడిందని మాదానాయకుడు అహమ్మద్ షా దగ్గరకు రాయబారులను పంపి సంధి చేసుకున్నాడు. తాత్కాలికంగా బహమనీ రాజ్యంతో యుద్ధం వచ్చింది. ఆ తరువాత కొద్దికాలానికే అహమ్మద్ షాకు మాళ్వా, గుజరాత్ సుల్తాన్‌లతో యుద్ధం వచ్చింది. సుల్తాన్ ఆ యుద్ధంలో మునిగి ఉండగా మాదానాయకుడు అజమ్‌ఖాన్‌పై దండెత్తి అతనిని ఓడించి పోయిన దుర్గాలన్నింటిని తిరిగి జయించాడు. ఏమైనా ఇతని కాలంలో పద్మనాయక రాజ్య విచ్ఛిన్నం ప్రారంభమైంది.

మాదానాయకుడు గొప్ప కవి. పండితుడు. తాను స్వయంగా రామాయణానికి రాఘవీయం అనే పేరుతో క్రీ.శ.1427లో వ్యాఖ్యానం రాసి శ్రీరామునికి అంకితం చేశాడు. అతడు శ్రీశైల వంశీయుడైన రామానుజాచారి కుమారుడైన వెంకటాచార్యుని శిష్యుడు. అతని సారథ్యంలో వైష్ణవభక్తుడైన తాడూరు లేక తొర్లూరు అనే గ్రామాన్ని శ్రీరంగపుర అగ్రహారం అనే పేరుతో శ్రీరంగనాథస్వామికి దానం చేశాడు. ఇతని భార్య నాగాంబిక. ఆమె క్రీ.శ.1429లో రాజగిరి పాదంలో నాగసముద్రం అనే తటాకాన్ని తవ్వించి అక్కడ శిలాశాసనం వేయించింది. ఆ శాసనంలో మాదానేడు రాఘవీయం వ్యాఖ్య రాసినట్లు పేర్కొంది. ఈ తటాకానికి దేవులమ్మ నాగారం చెరువు అని కూడా పేరుంది. ఆ చెరువు కట్ట మీద ఈ శాసనం ఉంది. దానికి దేవులమ్మ నాగారం చెరువుకట్ట శాసనం అని పేరు. ఇదిగాక ఇతని కాలం నాటి మరో మూడు శాసనాలు కూడా లభించాయి.

దేవరకొండ రాజ్యం: దేవరకొండ రాజ్యంలో రావు మాదానేని కాలంలో పెదవేదగిరి కుమారుడు రెండవ మాదానాయకుడు క్రీ.శ.1425 వరకు పాలించాడు. ఈ కాలంలో ఉభయరాజ్యాలను అంటే రాచకొండ, దేవరకొండ రాజ్యాలను ఒకే పేరు గల వారు పాలించారు. రాచకొండలో రావు మాదానాయకుడు, దేవరకొండలో రెండవ మాదానాయకుడు మరణించాడు. అతని స్థానంలో అతని కనిష్ట సోదరుడు లింగమనేడు సింహాసనం అధిష్టించాడు. ఇతడు పద్మనాయకులందరిలోకీ సాహసోపేతుడు. ఇతనికి వేదగిరి నాయకుడు, సూరానాయకుడు అనే సోదరులు కూడా ఉన్నారు. వీరు, రావు మాదానాయకునికి, తర్వాత రాచకొండ సింహాసనం అధిష్టించిన సర్వజ్ఞసింగనకు అంటే మూడవ సింగభూపాలునికి సమకాలికులు. క్రీ.శ.1428లో లింగమనేడు రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తినట్లుగా కనిపిస్తోంది. అతడు కళింగ దండయాత్ర చేసి సప్తమాడెములు, వేములకొండ, అవంభగంగవరం, మామిడాల మొదలైన ప్రాంతాలు జయించినట్లు వెలుగోటివారి వంశావళి కీర్తిస్తోంది. ఇదే కాలంలో రెండవ దేవరాయల సేనాని తెలుంగురాయుడు కొండవీటి రాజ్యాన్ని ఆక్రమించి సింహాచలం వరకు వెళ్లి అక్కడ శాసనం వేయించాడు. రాచవేమారెడ్డి మరణం తర్వాతనే నాల్గవ భానుదేవుడు కొండవీటి రాజ్యన్ని ఆక్రమించాడు. అతనిని తరిమి కోస్తాను ఆక్రమించగానే లింగమనేడు కూడా ప్రయత్నించి ఉండవచ్చును. రెండవ దేవరాయలు సైన్యం కోస్తాలో ప్రవేశించగానే లింగమనేడు తన ప్రయత్నం మానుకొని దేవరకొండకు తిరిగి వెళ్లి ఉండవచ్చును. దీనివల్లనే గావచ్చు క్రీ.శ.1428 తర్వాత పద్మనాయకులకు విజయనగరంతో భేదాభిప్రాయాలు వచ్చాయి.

మూడవ సింగభూపాలుడు క్రీ.శ.1430-1475: రావు అనపోతానాయకుని తర్వాత ఇతడు క్రీ.శ.1430లో రాజ్యానికి వచ్చి క్రీ.శ1475 వరకు సుమారు 45 సంవత్సరాలు పాలించాడు. ఇతడు రాచకొండనేలిన చివరి పద్మనాయక ప్రభువు. ఇతనికి సర్వజ్ఞ రావు సింగమనాయకుడు, ముమ్మడి సింగమ నాయకుడు అనే పేర్లు కూడా ఉన్నాయి. ఇతని కాలమంతా యుద్ధాలతో, అపజయాలతో గడిచిపోయింది. చివరకు రాజ్యం పోగొట్టుకొని క్రీ.శ.1475లో దీనస్థితిలో మరణించాడు. ఇతని సోదరులు వసంతానేడు క్రీ.శ.1437లో కంచిలో శాసనం వేయించాడు. మరొక సోదరుడు రావు ధర్మానేడు క్రీ.శ.1464లో శాయంపేటలో శాసనం వేయించాడు. మరొక సోదరుడు కేశవనాయకుడు క్రీ.శ.1437లో కంచిలో శాసనం వేయించాడు. సింగభూపాలుని శాసనాలు రెండు లభించాయి. ఒకటి క్రీ.శ.1453లో బెల్లంకొండలో, మరొకటి క్రీ.శ.1475లో తిరుపతిలో వేయించాడు. ఈ శాసనాలను బట్టి చూడగా అతడు తన సొంత రాజ్యం పోగొట్టుకొని అక్కడక్కడ తాత్కాలికంగా రాజ్యాలు సంపాదించి పాలించాడని, చివరకు తిరుపతిలో అంటే విజయనగర రాజ్యంలో దయనీయంగా జీవించాడని తెలుస్తోంది. మొత్తం మీద ఇతని జీవితం ఆటుపోట్లకు గురైంది. విజయనగరంలో

రెండవ దేవరాయలు, మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు, సాళువ నరసింహరాయలు, బహమనీ రాజ్యంలో అహమ్మద్‌షా, రెండవ అల్లావుద్దీన్, హుమాయూన్‌షా, నిజాంషా, మూడవ ముహమ్మద్‌షాలు సమకాలికులు. ఇతని కాలంలో రాజమహేంద్రవర రాజ్యాన్ని అనితల్లి, వీరభద్రారెడ్డిలు క్రీ.శ.1448 వరకు పాలించారు. ఇతని కాలంలో కళింగలో గాంగవంశం అంతరించి కపిలేశ్వరుడు గజపతి రాజ్యాన్ని స్థాపించాడు. కపిలేశ్వరుడు, అతని కుమారులు హంవీరుడు, పురుషోత్తమ గజపతి ఇతని సమకాలికులు. ఇతడు రాజ్యానికి వచ్చేనాటికి పద్మనాయకులకు విజయనగర రాజ్యానికి భేదాభిప్రాయాలు వచ్చాయి. లింగమనేడు క్రీ.శ.1427-28లో కళింగపై చేసిన దండయాత్ర వల్ల భేదాభిప్రాయాలు వచ్చి ఉండవచ్చును. విజయనగర రాజ్యం అండ లేదని తెలిసిన బహమనీ సుల్తాన్‌లు పద్మనాయక రాజ్యంపై దాడులు మొదలుపెట్టారు.

అహమ్మద్‌షా దండయాత్ర క్రీ.శ.1433: ఇతడు సింహాసనానికి వచ్చేనాటికి అహమ్మద్‌షా జయించిన కోటలన్నీ ఓరుగల్లుతో సహా పద్మనాయకుల వశమయ్యాయి. కాని సుల్తాన్ మాళవ దండయాత్ర తర్వాత తెలంగాణపై దండెత్తాడు. ఓరుగంటి దుర్గాధిపతి మరికొందరు ఎదిరించారు గాని బహమనీ సైన్యాల ధాటికి ఆగలేక బహమనీ సామంతులై కప్పం కట్టడానికి అంగీకరించారు. లొంగకుండా ఎదిరించిన వారు హతులై పోయారు. తర్వాత అహమ్మద్ షా రామగిరి, భువనగిరి మొదలగు కోటలన్నీ జయించాడు. తర్వాత భువనగిరి దుర్గాన్ని కేంద్రంగా చేసి జయించిన ప్రాంతాలన్నింటినీ దాని కిందజేరి ఒక జాగీరుగా రూపొందించి సంజీర్‌ఖాన్ అనే తన సేనాధిపతిని భవనగిరి పాలకునిగా నియమించి మిగిలిన తెలంగాణను జయించాడు. మూడవ సింగమ నాయకుని ఓడించి తరిమి క్రీ.శ.1435లో రాచకొండను ఆక్రమించాడు. దాంతో రాచకొండ పద్మనాయక రాజ్యం అస్తమించింది. మొదటి అనపోతానాయకుడు నిర్మించిన రాచకొండ దుర్గం క్రీ.శ.1435లో బహమనీ రాజ్యంలో భాగమైపోయింది. సుల్తాన్ బహమనీ రాజకుమారులలో ఒకడైన దాసూర్‌ఖాన్‌ను రాచకొండలో బహమనీ ప్రతినిధిగా నియమించాడు. క్రీ.శ.1435లో అహమ్మద్‌షా మరణించాడు. అతని కుమారుడు రెండవ అల్లావుద్దీన్ బహమనీ సింహాసనమెక్కాడు. అల్లావుద్దీన్ దాసూర్‌ఖాన్‌ను తొలగించి తన సోదరుడైన ముహమ్మద్‌ఖాన్‌ను రాజాచల అధిపతిగా నియమించాడు. అతడు రాజాచలం లేక రాచకొండను జాగ్రత్తగా కాపాడాడు. అందువల్ల పద్మనాయకులు ఎంత ప్రయత్నించినా తిరిగి రాజాచలం లేక రాచకొండను తిరిగి జయించలేకపోయారు. దాంతో రాచకొండ వంశానికి రాజ్యం లేకుండా పోయింది. దేవరకొండ మినహా వెలమ రాజ్య భాగాలన్నీ బహమనీల వశమయ్యాయి. ఆ తర్వాత మూడవ సింగమనాయకుని పరిస్థితి ఏమైందీ స్పష్టంగా తెలియడం లేదు. క్రీ.శ.1453 నాటి అతని శాసనం గుంటూరు జిల్లా బెల్లంకొండలో ఉంది. క్రీ.శ.1435-53 మధ్యకాలంలో అతడు ఎక్కడ ఉందీ, ఏమి చేసిందీ తెలియలేదు.

గజపతి రాజ్య అవతరణ - తెలంగాణపై దండయాత్ర క్రీ.శ.1450: ఇంచుమించు ఇదే కాలంలో అంటే అహమ్మద్‌షా రాచకొండ రాజ్యాన్ని ఆక్రమించే కాలంలో కళింగలో కపిలేశ్వరుడు గాంగ వంశ చివరి పాలకుడైన నాల్గవ భానుదేవుని తొలగించి కటకంలో గజపతి రాజ్యాన్ని స్థాపించాడు. ఆతడు క్రీ.శ.1448లో రాజమహేంద్రవరాన్ని, క్రీ.శ.1450లో కొండవీడును జయించాడు. తర్వాత అతడు విజయనగరంపై దాడి చేశాడు. తర్వాత క్రీ.శ.1450లో బహమనీ రాజ్యంపై దండెత్తి వారి రాజధాని బీదర్ వరకు చేరాడు. బహుశా ఈ కాలంలో రాచకొండ రాజ్యం పోగొట్టుకున్న మూడవ సింగమ నాయకుడు కపిలేశ్వర గజపతిని ఆశ్రయించి ఉంటాడు. అతడు దయతలచి తాను జయించిన బెల్లంకొండను పాలించుకొంటూ ఆ శాసనం వేయించి ఉంటాడు. అతడు అక్కడ కపిలేశ్వరుని మరణం వరకు అంటే క్రీ.శ.1470 వరకు పాలించి ఉంటాడు. ఈ విజయం తర్వాత గజపతి సైన్యాలు విజయనగర సామ్రాజ్యంపై దాడి చేసి తిరుచానాపల్లి వరకు వీరవిహారం చేశాయి. ఈ దండయాత్రలో దేవరకొండ లింగమనేడు, నాగార్జునకొండ, తంగెడ, శ్రీశైలం ప్రాంతాలను ఆక్రమించాడట. అక్కడ అతనిని అడ్డగించిన విజయనగర సేనానులు కొల మల్లారెడ్డి, శ్రీనాథరాజు, సంబెట పిన్నరాజు, సాళువ తిప్పలను ఓడించాడట. తర్వాత మూడవ సింగమ, అతని సోదరుడు వసంత నాయకులతో కలసి కర్నూలు, నెల్లూరు ప్రాంతాలు జయించి కంచిపై దండెత్తాడట. కంచిని ఆక్రమించిన సందర్భంలో వసంత నాయకుడు అక్కడ శాసనం వేయించాడు.

దేవరకొండ రాజ్యం-లింగమనేడు క్రీ.శ.1425-1480: మూడవ సింగమనాయకుడు లేక సర్వజ్ఞసింగనకు సమకాలికంగా దేవరకొండలో లింగమనేడు పాలించాడు. అతడు మహా పరాక్రమవంతుడుగా ప్రసిద్ధి చెందాడు.

12 సంవత్సరాల వయసులోనే అతడు కొండవీడుపై దండెత్తి పెదకోమటి వేమారెడ్డిని చంపాడు. అతని దండయాత్ర వల్లనే కొండవీటి రాజ్యం పతనమైంది. బహమనీ సైన్యాలు క్రీ.శ.1435లో రాచకొండ, ఓరుగల్లు కోటలపై దాడి చేసినప్పుడు అతడు కూడా పోరాడి ఉంటాడు. సింగమనేడు రాచకొండను కోల్పోయిన తర్వాత అతడు సింగమనాయకునికి ఆశ్రయం ఇచ్చిందీ లేనిదీ తెలియదు. రాచకొండ రాజ్యాన్ని అహమ్మద్‌షా ఆక్రమించినా, దేవరకొండను ఆక్రమించలేకపోయాడు. బహుశా లింగమనేడు తన రాజ్యాన్ని రక్షించుకొని ఉంటాడు. అంతేగాక రెండవ అల్లావుద్దీన్‌షా కాలంలో అతని సోదరుడు మహమ్మద్‌ఖాన్ బాలకొండ పాలకులు జలాల్‌ఖాన్, సికిందర్‌ఖాన్‌లు తిరుగుబాటు చేయగా వారిని అణచడంతో సుల్తాన్‌కు సహాయంగా లింగమనేడు పోరాడి సుల్తాన్ మెప్పుపొంది భువనగిరి దుర్గాన్ని సంపాదించాడు. ఈ సంఘటన క్రీ.శ.1455-58 మధ్యన జరిగి ఉండవచ్చును.

హుమాయూన్ షా దండయాత్ర క్రీ.శ.1458-60: రెండవ అల్లావుద్దీన్ తర్వాత హుమాయూన్ షా క్రీ.శ.1458లో బహమనీ సింహాసనం అధిష్టించాడు. ఇతడు క్రూరుడు. అతని కాలంలో బహమనీ రాజ్యంలో తిరుగుబాట్లు చెలరేగాయి. తెలంగాణలో బాలకొండ పాలకులైన బహమనీ సర్దారులు జలాల్‌ఖాన్, అతని కుమారుడు సికిందర్‌ఖాన్‌లు మళ్లీ తిరుగుబాట్లు చేశారు. వారికి దేవరకొండరాజు లింగమనేడు సహాయం చేశాడు. అందుకు కోపించి సుల్తాన్ ఖ్వాజాజహన్, నిజాం-ఉల్-ముల్క్ అనే సేనాధిపతుల నాయకత్వంలో క్రీ.శ.1458లో 22 వేల అశ్వదళం, నలభై ఏనుగులు, వేలాది కాల్బలాన్ని దేవగిరిపై పంపాడు. లింగమనేడు వారి దాడికి తట్టుకోలేక కపిలేశ్వర గజపతి సహాయం అర్థించాడు. అతడు సహాయంగా తన సేనను పంపాడు. బహమనీ సుల్తాన్ ఓడిపోయాడు. తన సేనానుల అసమర్థత వల్ల అపజయం కలిగిందని కోపించి నిజాం-ఉల్-ముల్క్‌ను సంహరించి, జలాల్‌ఖాన్‌ను బంధించాడు.

హంవీరుని దండయాత్ర క్రీ.శ.1461-64-తెలంగాణ ఆక్రమణ: హుమాయూన్‌షా క్రీ.శ.1461లో మరణించాడు. అతని కుమారుడు నిజాంషా క్రీ.శ.1461లో సింహాసనానికి వచ్చాడు. అతడు 8 సంవత్సరాల బాలుడు. కనుక అతని తల్లి ముక్దుమా ఇజహన్ పరిపాలన చేపట్టింది. తెలంగాణను ఆక్రమించడానికి ఇది తగిన సమయమని కపిలేశ్వరుడు రెండవ పర్యాయం బహమనీ రాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్రలో కపిలేశ్వరుడు తన కుమారుడు హంవీరుని నాయకత్వంలో గజపతి సైన్యాన్ని పంపాడు. హంవీరుడు దేవరకొండ వద్ద లింగమనేడుతో కలసి బహమనీ సైన్యాలను ఓడించి తరిమి ఓరుగల్లు, రాచకొండ, భువనగిరి, ఖమ్మంమెట్టు మొత్తం తెలంగాణను ఆక్రమించాడు. ఈ విజయయాత్రలో లింగమనేడు విజృంభించి భువనగిరి, స్తంభగిరి, ఓరుగల్లులను ఆక్రమించి సుల్తాన్ సైన్యాలను బీదరు వరకు తరిమి వేశాడని వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. ఓరుగల్లులో క్రీ.శ.1464 నాటి హంవీరుని శాసనం ఉంది. తెలంగాణ బహమనీ సుల్తాన్‌ల కబంధ హస్తాల నుండి విముక్తి చెందింది. హుమాయూన్ తానే స్వయంగా తెలంగాణపై దండెత్తాలని ఆశించాడు. కాని రాజధానిలో తిరుగుబాట్లు జరిగినందువల్ల అతడు రాలేక తన ప్రధానమంత్రి ఖ్వాజా మహమ్మద్ గవాన్‌ను పంపాడు. కాని అతడు గజపతి సైన్యాన్ని ఓడించలేక తిరిగి వెళ్లిపోయాడు. దాంతో పద్మనాయకులకు బహమనీ సుల్తాన్‌ల బెడద వదిలిపోయింది. కాని వారు తమ స్వాతంత్ర్యం కోల్పోయారు. గజపతులు సామంతులయ్యారు. తెలంగాణను జయించిన తర్వాత రాచకొండ రాజ్యాన్ని మూడవ సింగమనాయకునికి ఇచ్చిందీ లేనిదీ తెలియదు. కాని గజపతులు అతని సోదరుడు ధర్మారాయుడిని ఓరుగల్లు పాలకునిగా నియమించినట్లు కనిపిస్తోంది. క్రీ.శ.1464 నాటి ధర్మానాయకుని శాసనం ఓరుగల్లు సీమలోని శాయంపేటలో ఉంది. ఓరుగంటి సీమలోని కొత్తగట్టు స్థలంలోని మచ్చర్ల గ్రామంలోని తిరువెంకటేశ్వరునికి వైశాఖపూర్ణిమ చంద్రగ్రహణం రోజున మచ్చెర్ల, ముందపల్లెను దానంగా ఇచ్చి ఈ శాయంపేట శాసనం వేయించాడు. కనుక క్రీ.శ.1464లో అతడిని అక్కడ పాలకునిగా గజపతులు నియమించారని భావించవచ్చును. దేవరకొండలో లింగమనేడు, ఓరుగల్లుసీమలో ధర్మానాయుడు, బెల్లంకొండలో మూడవ సింగమనాయకుడు గజపతుల సామంతులుగా పాలించారని భావించవచ్చును. ఈ సమయంలోనే మోతుకూరు మండలంలో ఉన్న పోడిచేటి కోటను పోలేపల్లి బుక్కరాజు పాలించేవాడు. అతనిని లింగమనేడు ఓడించి గజపతుల మెప్పు పొందాడు. బుక్కరాజు గజపతులపై తిరుగుబాటు చేసి ఉంటాడు. గజపతుల తరపున లింగమనేడు అతనిని ఓడించి ఉంటాడు. కనుక లింగమనేడు తన చివరి జీవితంలో గజపతుల సామంతునిగా జీవించాడని ఈ సంఘటన తెలుపుతోంది.

మూడవ సింగమ నాయకుని చివరి రోజులు: క్రీ.శ.1468లో కపిలేశ్వర గజపతి మరణించాడు. అతని మరణంతో పద్మనాయకులకు చివరి కాలం ప్రాప్తించింది. కపిలేశ్వర గజపతి కమారుడు హంవీరుడు, పురుషోత్తమ గజపతి వారసత్వ యుద్ధానికి దిగారు. హంవీరుడు బహమనీ సుల్తాన్ సహాయం అర్ధించాడు. క్రీ.శ.1463లో నిజాంషా మరణించగా అతని తమ్ముడు మూడవ మహమ్మద్‌షా బహమనీ సుల్తాన్ అయ్యాడు. తన తండ్రి కాలంలో పోగొట్టుకున్న తెలంగాణ ప్రాంతాన్ని తిరిగి సంపాదించడానికి అది తగిన అవకాశం అని తలచి సుల్తాన్ మాలిక్ నిజాం ఉల్ ముల్క్ ఖైరీ అనే సర్దారుని హంవీరునికి సహాయంగా పంపాడు. వారు పురుషోత్తముని ఓడించాడు. హంవీరుడు తెలంగాణ, కొండపల్లి, రాజమహేంద్రవర రాజ్యాలను సుల్తాన్‌కు ఇచ్చాడు. తెలంగాణ మళ్లీ బహమనీ సుల్తాన్‌ల వశమైంది. దాంతో మూడవ మహమ్మద్ కాలంలో పద్మనాయకులకు తెలంగాణలో చోటు లేకుండాపోయింది. వారు విజయనగర రాజ్యంలో ప్రవేశించి కందనవోలు సీమలోని కొన్ని ప్రాంతాలు ఆక్రమించడానికి ప్రయత్నించారు.

ముమ్మడి సింగమ నాయకుడు విజయనగర కొలువులో ప్రవేశించడం క్రీ.శ.1470-75: సాళువ నరసింహరాయలు గజపతి రాజ్యంపై దండెత్తి కొండవీడు, మచిలీపట్టణాలను జయించాడు. ఈ సందర్భంలో వెలమల సాళువ నరసింహరాయలను ఆశ్రయించి విజయనగర కొలువులో ప్రవేశించి ఉండవచ్చును. అప్పటి వరకు బెల్లంకొండను ఏలిన మూడవ సింగమనాయకుడు కూడా సాళువ నరసింహరాయల అనుమతితో తిరుపతి ప్రాంతం చేరి ఉంటాడు. అక్కడ క్రీ.శ.1475లో శాసనం వేయించాడు. అందులో ముమ్మడి సర్వజ్ఞ సింగమ నాయకుడు పాండ్యభూపాల శుండాల ఖండనోద్దండ కేసరి, ఖడ్గనారాయణ, ప్రాచ్య కాకతీయప్రతిష్ఠాపనదేశిక సర్వజ్ఞ అనే బిరుదులతో వర్ణించబడ్డాడు. అతడు ఈ శాసనాన్ని ఏ హోదాలో వేయించాడో తెలియదు. అతని పూర్వస్థితిని బట్టి గౌరవంతో సాళువ నరసింహరాయలు గాని, అతని ప్రభువు రెండవ విరూపాక్షరాయలు గాని అమరనాయక పదవిని ఇచ్చి ఉండవచ్చును. ఇతనినే కొందరు నృశింహ ప్రభువు అని అన్నారు. అక్కడే ఉన్న మరొక శాసనంలో కేశవ లేక కేశవనాయకుడు ఇతని సోదరుడు కావచ్చును కనుక రాచకొండ పద్మనాయకులలో చివరివాడైన మూడవ సింగభూపాలుడు లేక సర్వజ్ఞ భూపాలుడు తన సోదరులతో సహా విజయనగర కొలువులో ప్రవేశించాడని చెప్పవచ్చును.

మరణం క్రీ.శ.1484-85: పురుషోత్తమ గజపతి తన సోదరుని ఓడించి తిరిగి కటక సింహాసనం అధిష్టించి పోయిన ప్రాంతాలు జయించడానికి విజయనగర రాజ్యంపై క్రీ.శ.1484లో దండెత్తాడు. ఆ దండయాత్రా కాలంలో సర్వజ్ఞ సింగమనాయకుడు విజయనగరం తరపున యుద్ధంలో పోరాడుతూ గజపతి సేనాని కంరమ రాజవంశానికి చెందిన తమ్మభూపాలుని చేతిలో పెదవీటి యుద్ధంలో మరణించాడు. విష్ణుభక్తి సుధాకరం అనే కావ్యం రేచర్ల సింగమనాయకుని పెదవీడు యుద్ధంలో తమ్మభూపాలుడు వధించాడని తెలుపుతోంది. ఈ తమ్మభూపాలుడు పురుషోత్తమ గజపతి సామంతుడు. కనుక పురుషోత్తమ గజపతి విజయనగర సామ్రాజ్యంపై దండెత్తినప్పుడు సర్వజ్ఞసింగన తమ్మభూపాలునితో పోరాడుతూ మరణించి ఉండవచ్చును. అతని మరణంతో రాచకొండ పద్మనాయక వంశం అంతరించింది. ఈ తర్వాత పద్మనాయకులు విజయనగర కొలువులో సేనాధిపతులుగా చేరిపోయారు. సింగమభూపాలుడు గొప్ప కవి, పండితుడు. అతనికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. అనేక మంది కవులను పోషించాడు. బమ్మెర పోతన ఇతని ఆస్థాన కవి. క్రీ.శ.1430-35 సంవత్సరాల మధ్య అతని చేత భోగినీ దండకాన్ని రాయించాడు. తర్వాత పోతన భాగవతాన్ని రాశాడట. దానిని తనకు అంకితం ఇవ్వమనగా అందుకు పోతన తిరస్కరించాడట. అందుకు సింగమనాయకుడు కోపించి ఆ గ్రంథాన్ని బలత్కారంగా తీసుకురమ్మని తన సైనికులను పంపాడు. అది తెలిసి పోతన ఆ గ్రంథాన్ని భూమిలో పాతిపెట్టాడట. అది కనిపించనందువల్ల సింగభూపాలుడు పోతనను బంధించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. శ్రీనాధుడు సర్వజ్ఞ అస్థానాన్ని దర్శించి అతనిని మెప్పించి పెదకోమటి వేమారెడ్డి నుండి సంపాదించి లింగమనేడు తీసుకువెళ్లిన పోతురాజు కటారిని, రెడ్డిరాజుల లాంఛనాలను తెచ్చి రాజమహేంద్రవర రెడ్డిరాజులకిచ్చాడని మరొక కథ ఉంది.

దేవరకొండ రాజ్యం-లింగమనేడు: తెలంగాణ మూడవ మహమ్మద్ షా వశమైన తర్వాత తెలంగాణ అంతటినీ ఒక రాష్ట్రంగా ఏర్పరచి దానికి ఓరుగల్లును రాజధానిగా చేసి క్రీ.శ.1480లో అజమ్‌ఖాన్‌ను పాలకునిగా నియమించాడు. అప్పుడు లింగమనేని పరిస్థితి ఏమైందో తెలియదు. కాని అతని సోదరుడు సూరానాయుడు, కుమారుడు పర్వతరావు, మనుమడు లింగమనేడులు, తర్వాత వారి వంశస్థులైన రావు ధర్మారావు, రావు

మాధవరావు, లక్షారావులు సామాన్య దుర్గాధిపతులుగా పాలించినట్లు సనద్‌లు ఉన్నాయి. కనుక తెలంగాణ మూడవ మహమ్మద్‌షా వంశంలోకి వచ్చిన తర్వాత వారు దయతలచి స్థానిక పాలకులుగా కొనసాగించినట్లు కనిపిస్తోంది. అందువల్ల అతని తర్వాత కూడా వారు బహమనీ రాజ్యంలో కొనసాగారు. కనుక రాచకొండ సర్వజ్ఞసింగన, అతని వంశస్తులు విజయనగర రాజ్యం పదవులు సంపాదించుకోగా, లింగమ దేవరకొండ, లింగమనేని వంశస్తులు తెలంగాణలోనే ఉండి బహమనీ సుల్తాన్‌ల కొలువులో చిన్నచిన్న ఉద్యోగాలు సంపాదించుకొని జీవించారని చెప్పవచ్చును.క్రీ.శ.1490 నాటి పురుషోత్తమ గజపతి తెలంగాణను కూడా జయించి అక్కడ తన ప్రతినిధిగా చితాబ్‌ఖాన్‌ను నియమించాడు. అతడు ఓరుగల్లును రాజధానిగా చేసుకున్నాడు. అతని కాలంలో కూడా దేవరకొండ పద్మనాయక వంశస్తులు స్థానిక ఉద్యోగాలలో కొనసాగి ఉండవచ్చును.

పద్మనాయకులకు విజయనగర రాజ్యంతో గల సంబంధాలు: పద్మనాయకులు మొదటి నుండి విజయనగరంతో వైరిసంబంధాలే కొనసాగించారు. పద్మనాయక రాజ్యస్థాపకుడైన మొదటి సింగమనాయకుడు మొదట కాపయనాయకునికి అనుకూలంగా ఉన్న తర్వాత అతనిని ధిక్కరించి స్వతంత్రం ప్రకటించాడు. జల్లిపల్లి యుద్ధంలో అతడు మరణించడానికి కాపయనాయకుడు కూడా కారణమని భావించి అతని కుమారులు మొదటి అనపోతానాయకుడు, మాదా నాయకుడు బహమనీ సుల్తాన్‌తో రహస్య ఒప్పందం చేసుకొని కాపయనాయకునిపై దండెత్తి క్రీ.శ.1368 భీమవరం యుద్ధంలో వధించారు. కాపయనాయకునికి మొదట మహమ్మద్ షాకు అంతకు ముందు సంధి జరిగి ఉంది. ఆ సంధి ప్రకారం గోల్కొండ ఉభయ రాజ్యాలకు సరిహద్దుగా అంగీకరించారు. కాపయ నాయకుని మరణానంతరం కాపయనాయకుని రాజ్యమంతా పద్మనాయక సుల్తాన్‌తో ఒప్పందం చేసుకొని కాపయ నాయకునితో చేసుకున్న సంధిని ఖాయం చేసుకొని ఒకరికొకరు మిత్రులుగా ఉండే విధంగా అంగీకరించారు. ఈ ఒప్పందం క్రీ.శ.1368-69లో జరిగింది. అప్పటి నుండి వారు బహమనీలకు మిత్రులుగా ఉంటూ, వారు విజయనగర రాజ్యంతో చేసే యుద్ధాలలో బహమనీల తరుపున విజయనగర రాజ్యంతో యుద్ధాలు చేస్తూ ఉండేవారు.

పానుగల్లు యుద్ధం క్రీ.శ.1417: పానుగల్లు యుద్ధం వరకు వారు విజయనగర రాజులతో విరోధాన్ని కొనసాగించారు. కాని క్రీ.శ.1417లో జరిగిన పానుగల్లు యుద్ధంలో విజయనగర పద్మనాయక రాజ్య సంబంధాలలో మార్పు వచ్చింది. మొదటి దేవరాయలు పద్మనాయకులను బహమనీల నుండి వేరు చేశాడు. అందువల్ల పద్మనాయకులు మొదటిసారిగా విజయనగరంతో కలిసి బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాతో పోరాడారు. దాంతో పద్మనాయక రాజ్య భవిష్యత్తు కూడా మారిపోయింది. ఫిరోజ్‌షా తర్వాత రాజ్యానికి వచ్చిన మొదటి అహమ్మద్‌షా రాచకొండ రాజ్యంపై దండెత్తి రావు సింగమనాయకుని ఓడించి రాచకొండను ఆక్రమించాడు. మూడవ సింగమనాయకుడు లేక రావు మాదానేడు తన రాజ్యాన్ని కోల్పోయాడు. ఆ సమయంలో విజయనగర రెండవ దేవరాయలు అతనికి సహాయం చేయలేదు. తాము పానుగల్లు యుద్ధంలో విజయనగరానికి బహమనీలు పగబట్టి తమ రాజ్యానికి హరించారని, ఆపత్కాలంలో తమకు విజయనగరం సహాయం చేయలేదని భావించాడు. అతడు తన రాజ్యాన్ని పోగొట్టుకున్న తర్వాత కృష్ణానదిని దాటి విజయనగర రాజ్యంపై బడి కొంత అల్లకల్లోలం చేశాడు. కాని రెండవ దేవరాయలు వాటిని అరికట్టాడు. తర్వాత కపిలేశ్వర గజపతిని ఆశ్రయించి మూడవ సింగమ నాయకుడు బెల్లంకొండ దుర్గాన్ని పొంది కొంత కాలం అక్కడ పాలించాడు. క్రీ.శ.1453నాటి మూడవ సింగమనాయకుని శాసనం బెల్లంకొండలో ఉంది. గజపతులకు సహాయంగా సింగమనాయకుడు దేవరకొండ లింగమనేడు, రెండవ విరూపాక్షరాయల కాలంలో విజయనగర రాజ్యంపై దండెత్తారు. తిరుపతిలో మూడవ సింగమనాయకుని శాసనం ఉంది. కంచిలో లింగమనేని శాసనం ఉంది. కాని తర్వాత సాళువ నరసింహరాయలు గజపతి సైన్యాన్ని ఓడించి తరిమివేశాడు. ఆ సందర్భంలో మూడవ సింగమనేడు సాళువ నరసింహరాయలను ఆశ్రయించి విజయనగర రాజ్యంలోనే స్థిరపడ్డాడు. అతని సేనాధిపతులు విజయనగర సైన్యంలో చేరిపోయారు. లింగమనేని సంతతివారు తెలంగాణలోనే ఉండి బహమనీ సుల్తాన్‌ల వద్ద చిన్నచిన్న ఉద్యోగులుగా చేరిపోయారు. ఈ విధంగా చివరకు పద్మనాయకులు విజయనగరం వారి దయకు పాత్రులై వారి రాజ్యంలో సేనాధిపతులయ్యారు. విజయనగర రాజ్యంలో సేనాధిపతులుగా కొలిచి చిన్న చిన్న అమరనాయకులై చివరకు వారే వెలమ జమీందారులయ్యారు. వారిలో వెంకటగిరి జమీందార్ వంశస్తులు ఒకరు విజయనగర రాజ్యం పోయినా వారి జమీందారీలు మిగిలాయి.

గోండు రాజ్యం క్రీ.శ.1220-1750

భారతదేశంలో షెడ్యూల్ జాతుల్లో గోండు జాతి వారొకరు గోదావరి నదికి ఉత్తర ప్రాంతం నుండి వింధ్య, సాత్పూరు పర్వతాలలోని నర్మదా తపతీ నదుల లోయ వరకు, మధ్యప్రదేశ్‌లోని చత్తీస్‌గఢ్. బస్తర్ అడవులలోను, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలోను గోండుజాతి వారు నివసిస్తున్నారు. గోండు భాషను, కోయితూరు భాష మాట్లాడే ప్రజల్ని గోండులని పిలుస్తున్నారు. వీరిలో శాఖలు కూడా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని ధుర్వే గోండులు కాక మిగిలిన గోండులను రాజగోండులని వ్యవహరిస్తున్నారు. ఈ రాజగోండులు ఒకప్పుడు రాజ్యం చేశారు. కనుక వారు రాజగోండులని పిలువబడుతున్నారు. మహారాష్ట్రలోని చందా, బల్హార్షా యాత్మాల్ జిల్లాలోని గోండులు, ఆంధ్రప్రదేశ్‌లోని ఆదిలాబాద్ జిల్లాలోని గోండులు ఒకే సంతతి వారు. వీరి పూర్వీకులు చాందా, బల్హార్షా జిల్లాల్లో ఒక రాజ్యాన్ని ఆదిలాబాద్ జిల్లాలో మరొక రాజ్యాన్ని స్థాపించి పాలించారు. మధ్యప్రదేశ్‌లోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మరొక గోండు రాజ్యం ఉండేది. నర్మదా నదీ తీర ప్రాంతంలోని జబల్‌పూర్ వద్ద ఉన్న గార్హలో మరొక గోండు రాజ్యం ఉండేది. ఈ రాజ్యాలు క్రీ.శ.15వ శతాబ్దంలో స్థాపించబడ్డాయి. అందువల్ల మధ్యయుగంలో ఆ ప్రాంతాలకు గోండువన అని పేరుండేది. 16వ శతాబ్దంలో గోండువన రాజ్యాన్ని రాణి దుర్గావతి పాలించింది. అక్బర్ సేనాధిపతులు అజయాఖాన్, అసఫ్‌ఖాన్‌లు రాణి దుర్గావతి రాజ్యంపై దండెత్తారు. మహారాష్ట్రంలోని చంద్రపూర్‌లో మరొక గోండు రాజ్యం ఉండేది. దాని పాలకుడు నీలకంఠషాను 18వ శతాబ్దంలో నాగపూరునేలిన రఘూజీ భోన్స్లే ఓడించి ఆ రాజ్యాన్ని మరాఠా రాజ్యంలో విలీనం చేశాడు. బస్తరు ప్రాంతంలోని గోండు రాజ్యాలను కూడా రఘూజీ భోన్స్లే తన రాజ్యంలో కలుపుకున్నాడు. ఆ ప్రాంతంలో జాకుట్ అనే గోండురాజు, మహారాష్ట్రులకు సహాయంగా వారి యుద్ధాలలో పాల్గొనేవాడు. అతడు ఐదు వందల అశ్వదళాధిపతిగా ఉండేవాడు. ఇంకా ఉట్నూరు. మాణిక్‌గడ్, దేవగడ్, రాజూర, సిర్పూర్, అసీబాద్, చెన్నూరు, తాండూరు, లక్సెట్టిపేట, బోద్,-ఆదిలాబాద్ జిల్లా, మహారాష్ట్రంలోని చాందా జిల్లాల మధ్య ఉండేవి. ఇంగ్లిషు వారి కాలంలో భోన్స్ రాజ్యం పోయిన తర్వాత ఈ ప్రాంతాలన్నీ బేరారు రాష్ట్రంలో చేరి నిజాంకు అప్పగించారు. నిర్మల్‌లో ఉండే నిజాం ప్రతినిధి ఉట్నూరు మొదలైన గోండు రాజ్యాలపై అజమాయిషీ చేసేవాడు. ఉట్నూరు దుర్గ గోండురాజు నిజాంల తరపున యుద్ధాలు కూడా చేసేవాడు. గోండు రాజ్యాలపై మరాఠీ, ఉర్దూ భాషలతో కూడా పరిచయం ఏర్పడింది. నేడు గోండు జాతివారిలో గోండి, తెలుగు, మరాఠీ, ఉర్దూ నాలుగు భాషలను మాట్లాడగలిగిన వారున్నారు. బస్తర్, చత్తీస్, జబల్‌పూర్ ప్రాంతాలలో గోండుజాతివారు హిందీ మాట్లాడతారు. ఆదిలాబాద్ జిల్లాలో స్థాపించబడిన గోండురాజ్య చరిత్ర ఇక్కడ వివరించాం.

ఆదిలాబాద్ గోండు రాజ్యం క్రీ.శ.1220-1750

కోల్‌ఖిల్ క్రీ.శ.1220-1240: ఆదిలాబాద్ జిల్లాలో క్రీ.శ.1220లో ఒక గోండు రాజ్యం స్థాపించబడింది. గోండులలో నాయక వ్యవస్థ క్రీ.శ.870లోనే ఏర్పడినట్లు తెలుస్తోంది. కాని క్రీ.శ.1220 నుండి ప్రారంభమైన రాజ్య చరిత్ర మనకు స్పష్టంగా తెలుస్తోంది. ఈ రాజ్యస్థాపకుడు కోల్‌ఖిల్ అనే పేరు గల వ్యక్తి. గోండులు ఎప్పుడు ఆదిలాబాద్ జిల్లాలో నివాసం ఏర్పరచుకున్నారో తెలియదు. 12వ శతాబ్దంలో మహారాష్ట్రం నుండి కొన్ని జాతుల వారు వచ్చి అక్కడ నివాసం ఏర్పరచుకోసాగారు. పరాయివారు తమ ప్రాంతంలోకి ఇష్టం లేనందు వల్ల కోల్‌ఖిల్ ఆదాలాబాద్ జిల్లాలోని గోండులందరినీ ఏకం చేసి క్రీ.శ.1220లో రాజ్యాన్ని స్థాపించాడు. ఈ రాజ్యానికి రాజధాని ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూరు. కోల్‌ఖిల్ గోండు యువకులకు ఆయుధ శిక్షణ ఇచ్చి యుద్ధవీరులుగా మార్చాడు. వీరి రాజ్యానికి పక్కన వైరాఘర్‌లో మానవంశానికి చెందిన నాగజాతి వారు అక్కడ అంతకు పూర్వం రెండు వందల సంవత్సరాల నుండి ఒక రాజ్యం ఏర్పాటు చేసుకొని పాలిస్తున్నారు. కోల్‌ఖిల్ ఆ రాజ్యంపై దండెత్తి వారిని ఓడించి, వారి రాజ్య ప్రాంతాన్ని తన రాజ్యంలో విలీనం చేశాడు. దాంతో సిర్పూరు గోండు రాజ్యం బలపడింది. ఈ రాజ్యం గోండ్వానా రాజ్యంగా పేరులోకి వచ్చింది. ఇతడు క్రీ.శ.1240 వరకు పాలించాడు. అతడు కాకతిగణపతిదేవునికి సమకాలికుడు. ఇతడు స్థాపించిన గోండు రాజ్యం ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయులు, ముసునూరు, రేచర్ల, పద్మనాయక, బహమనీ, గోల్కొండ, మొగల్ అసఫ్‌జాహీ వంశాలకు సమకాలికుడు. ఇతడు స్థాపించిన గోండు రాజ్యం ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయులు, ముసునూరు, రేచర్ల, పద్మనాయక, బహమనీ, గోల్కొండ, మొగల్

అసఫ్‌జాహీ వంశాలకు సమకాలికంగా క్రీ.శ.1750 వరకు వర్ధిల్లింది. దాదాపు 530 సంవత్సరాలు ఆదిలాబాద్ జిల్లా ప్రాంతాన్ని పాలించింది. ఆదిలాబాద్ జిల్లా చరిత్ర అంటే ఈ గోండు రాజ్యం చరిత్ర అనే చెప్పాలి. ఈ వంశస్థుల రాజ లాంఛనం సింహం. ఆంధ్రదేశాన్ని ఏలిన విష్ణుకుండినుల రాజలాంఛనం కూడా సింహమే. వీరి వంశనామం సింగ్. కనుక ఈ గోండు రాజ్య చరిత్ర కూడా ఆంధ్రదేశ చరిత్రలో అంతర్భాగమే.

భీంభల్లాల్సింగ్ క్రీ.శ.1240-1262: కోల్‌ఖిల్ తర్వాత భీంభల్లాల్సింగ్ రాజ్యానికి వచ్చాడు. ఇతడు రాజధాని సిర్పూర్‌లో బలమైన కోటను నిర్మించాడు. రాజ ప్రాసాదాలు నిర్మించాడు. గోండు యువకులను ఎక్కువగా సైన్యంలో చేర్చుకొని సైన్యాన్ని పెంచాడు. ఆదిలాబాద్ జిల్లాలోని పరిసర ప్రాంతాలను జయించి గోండ్వానా రాజ్యాన్ని విస్తృత పరచాడు. అతని కాలంలో రాజ్యం స్థిరపడి శక్తివంతమైంది. అందువల్ల అతడే నిజమైన గోండ్వానా రాజ్య నిర్మాత అని కొందరు అన్నారు. అతడు క్రీ.శ.1262 వరకు పాలించాడు. ఇతడు కూడా కాకతి గణపతిదేవుని సమకాలికుడు.

ఖుర్దా భల్లాల్సింగ్ క్రీ.శ.1262: భీంభల్లాల్సింగ్ తర్వాత అతని కుమారుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు శాంతికాముకుడు. ఇతని కాలంలో యుద్ధాలు జరుగలేదు. కాని గోండు జాతి ఆచారాలను ఉన్నతస్థితికి తెచ్చాడు. ఆర్థిక, సామాజిక. సాంస్కృతిక రంగాలలో అభివృద్ధిని సాధించాడు. గోండుల జీవన విధానం ఇతని కాలంలో క్రమబద్ధం చేయబడింది. గోండుల పర్వదినాలను, పండుగలను క్రమం తప్పకుండా జరిపించాడు. ఇతడు కాకతి రుద్రమదేవి సమకాలికుడు.

హీరాసింగ్: ఖుర్దా బాల్లాల్సింగ్ తర్వాత అతని కుమారుడు హీరాసింగ్ రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో రాజ్యాన్ని చిన్న చిన్న సీమలుగా విభజించి సీమ కేంద్రాలలో దుర్గాలు నిర్మించి దుర్గాధిపతులను నియమించాడు. రాజ్య రక్షణకు పటిష్ట చర్యలు తీసుకున్నాడు. భూమిని సర్వే చేయించి వ్యవసాయ భూములు, వ్యవసాయేతర భూములు అని వర్గీకరించి భూమి శిస్తు విధించాడు. దుర్గాధిపతులు వారి ఉద్యోగులు శిస్తును వసూలు చేసి రాజకోశాగారానికి పంపే ఏర్పాట్లు చేశాడు. దాంతో రాజ్యానికి నికర ఆదాయం వచ్చి రాజ్యపు ఆర్థికపరిస్థితి బాగా అభివృద్ధి చెందింది. ప్రజల సౌకర్యార్థం పరిపాలనా సంస్కరణలను కూడా ప్రవేశపెట్టాడు. అందువల్ల ఇతడు గోండు రాజులలో గొప్ప కీర్తిప్రతిష్టలను పొందాడు. ఇతడు కాకతి ప్రతాపరుద్ర చక్రవర్తి సమకాలికుడు.

ఆండియా భల్లాల్సింగ్: హీరాసింగ్ తర్వాత అతని కుమారుడు ఆండియా భల్లాల్సింగ్ రాజ్యానికి వచ్చాడు. ఇతడు క్రూరుడు. విలాస జీవితానికి అలవాటుపడి అధికపన్నులు విధించి ప్రజలను పీడించాడు. తండ్రి పేరు చెడగొట్టాడు. గర్విష్టి. అతడి దుష్టపాలనపై ప్రజలు తిరుగుబాటు చేశారు. అతడు అకాల మరణం పొందాడు.

తల్వార్సింగ్: ఆండియా కుమారుడు సింహాసనమెక్కాడు. ఇతడు సౌమ్యుడు. తండ్రి కాలంలో ప్రజలు పడ్డ బాధలు చూసి అతడు ప్రజలకు స్వేచ్ఛనిచ్చాడు. పరిపాలన మంత్రులకు అప్పగించాడు. కాని అతడి మంచితనాన్ని దుర్వినియోగపరచి దుర్గాధ్యక్షులు ప్రజలను పీడించి పన్నులు వసూలు చేసి తాము కాజేశారు. వారు సొంత సైన్యాలను పెంచుకొని స్వతంత్రం ప్రకటించడానికి తయారయ్యారు. సౌమ్యుడైనందువల్ల తల్వార్సింగ్ వారిని దండించలేక పోయాడు. తాను వారిని అదుపు చేయలేనని గ్రహించి సమర్థుడైన తన రెండవ కుమారుడైన కేసర్సింగ్‌కు రాజ్యం అప్పగించి తాను పరిపాలన నుండి తప్పుకున్నాడు.

కేసర్సింగ్: కేసర్సింగ్ పరాక్రమవంతుడు. తండ్రి కాలంలో చెలరేగిన దుర్గాధ్యక్షులను అణచివేశాడు. పరిపాలనా సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలలోని అసంతృప్తిని తొలగించాడు. దుర్గాధ్యక్షులను అదుపులో పెట్టి వారు విధించిన అధిక పన్నులు తగ్గించాడు. సైనిక బలాన్ని పెంచి దుర్గాధిపతులను భయకంపితులను చేశాడు. పరిసర ప్రాంతాలను జయించాడు. వ్యవసాయం మీద శ్రద్ధ తీసుకొని కుంటలు, చెరువులు తవ్వించాడు. తాగునీటి బావులను తవ్వించాడు. దాంతో అతడు ప్రజాభిమానం పొందాడు.

దిన్కర్సింగ్: కేసర్సింగ్ తర్వాత అతని కుమారుడు దిన్కర్సింగ్ రాజ్యానికి వచ్చాడు. అతడు సాహిత్యకళలను పోషించాడు. గోండు పండుగలను జరిపించాడు. సంగీత కళానిపుణులను ఆదరించాడు. ఇతని కాలంలో మహారాష్ట్ర నుండి మరాఠీ కవులు ఇతని ఆస్థానానికి వచ్చారు. వారిని అతడు ఆదరించాడు. అందువల్ల ఇతని కాలంలో మరాఠీ సాహిత్యం అభివృద్ధి చెందింది. గోండు రాజులలో ఇతని కాలం స్వర్ణయుగంగా కీర్తిపొందింది.

రాంసింగ్: దినకర్‌సింగ్ తర్వాత అతని కుమారుడు రాంసింగ్ రాజ్యానికి వచ్చి దుర్గాలను బలపరచాడు. నూతన దుర్గాలను నిర్మించాడు. సైన్యాన్ని పెంచాడు. అటవీ భూములను వ్యవసాయ క్షేత్రాలుగా మార్చాడు.

నూతన గ్రామాలను నిర్మించాడు. నూతన గ్రామాలను నిర్మించమని దుర్గాధ్యక్షులను ఆదేశించాడు. వ్యవసాయ క్షేత్రాలను పెంచే బాధ్యత దుర్గపాలకులకు అప్పగించాడు. అందువల్ల ఇతని కాలంలో నూతన గ్రామాలు, నూతన వ్యవసాయ క్షేత్రాలు అభివృద్ధి చెంది రాజ్యం ఆర్థికప్రగతిని సాధించింది. సిర్పూర్ పట్టణాన్ని సుందరనగరంగా తీర్చిదిద్దాడు. సిర్పూర్ దుర్గాన్ని ఇంకా దృఢంగా నిర్మించాడు. ఇదే నేటి సిర్పూర్ కాగజ్‌నగర్. రాజ్యం విశాలమైంది. అందువల్ల సామంతులు పెరిగారు. రాంసింగ్ తన సామంతులకు తార్వేకలు అని పేరు పెట్టాడు.

నూర్జబల్లాల్‌సింగ్ క్రీ.శ.1405-1437: రాంసింగ్ తర్వాత అతని కుమారుడు నూర్జబల్లాల్‌సింగ్ క్రీ.శ.1405లో సింహాసనం అధిష్టించి క్రీ.శ.1437 వరకు పాలించాడు. ఇతడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షాకు అహమ్మద్‌షాకు సమకాలికుడు. రాచకొండను ఏలిన పద్మనాయక ప్రభువులు రెండవ అనపోతానాయకుడు, మాదా నాయకుడు, సర్వజ్ఞసింగన నాయకుడు సమకాలికులు.

ఇతడు అసమాన ప్రతిభాశాలి. అతడు కాశీ, లక్నో పట్టణాలకు వెళ్లి సైనిక శిక్షణ పరిపాలనా రహస్యాలలో శిక్షణ పొందాడు. ఇతడు అక్కడ నివసించినప్పుడు, అతని అనుచరులు దోపిడీలు సాగించారు. అది తెలిసి ఢిల్లీ సుల్తాన్ వారిని బంధించమని ఆజ్ఞాపించాడు. ఢిల్లీ సైనికులు బల్లాల్‌సింగ్ అనుచరులతో పోరాడి ఓడించి భల్లాసింగ్‌ను బందీగా పట్టుకొని ఢిల్లీకి తీసుకెళ్లారు. అతని అనుచరులు సిర్పూర్ వచ్చి రాజ్యాన్ని రక్షించడానికి నియమింపబడిన జర్బాకి తెలిపారు. జర్బా కొంత సైన్యాన్ని తీసుకొని ఢిల్లీ చేరాడు. ఈ లోపల ఢిల్లీ సుల్తాన్ కుమార్తె చెరసాలలోని నూర్జా బల్లాల్‌సింగ్ మీద దయతలచి ఖైదు నుండి విడిపించమని తండ్రిని కోరింది. ఇంతలో జర్బా తన సైనికులతో ఢిల్లీ చేరాడు. సుల్తాన్ భల్లాల్‌సింగ్ తన శత్రువులతో పోరాడితే విడుదల చేస్తానని అన్నాడు. భల్లాల్‌సింగ్ జర్బా తెచ్చిన సైన్యంతో సుల్తాన్ శత్రువులపై దండెత్తి ఓడించి సుల్తాన్‌ను మెప్పించాడు. సుల్తాన్ సంతోషించి అతనికి షేర్షా అనే బిరుదు ఇచ్చి విడుదల చేశాడు. అంతేగాక గోండ్వానా రాజ్యానికి మరికొంత ప్రాంతాన్ని అనుబంధంగా ఇచ్చాడు. బల్లాల్‌సింగ్ తన రాజ్యం చేరి షేర్షా బల్లాల్‌సింగ్‌గా బిరుదు వహించి తన విశాల రాజ్యాన్ని క్రీ.శ.1437 వరకు పాలించాడు. ఆ తర్వాత అతడు ధరించిన షేర్షా బిరుదును అతని సంతతి వారు వారసత్వంగా ధరించారు.

ఖండియా భల్లాల్‌షా క్రీ.శ.1437-1462: నూర్జా బల్లాల్‌షా తర్వాత అతని కుమారుడు ఖండియా బల్లాషా క్రీ.శ.1437లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1462 వరకు పాలించాడు. కొంత కాలానికి ఇతని రాణికి జబ్బు చేసింది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. వైద్యులు సిర్పూర్ వాతావరణం ఆమెకు పడలేదు, కొంతకాలం ఇతర ప్రదేశాలలో ఉంటే తగ్గవచ్చని సలహా ఇచ్చారు. అందువల్ల అతడు వైన్‌గంగానదికి ఆవల ఒడ్డున తన పేరుతో భల్లాల్‌పూర్ అనే పట్టణాన్ని నిర్మించి అక్కడ తన భార్యతో నివసించాడు. ఆ భల్లాల్‌పూర్ నగరమే నేటి బల్హార్షా. ఇప్పుడది మహారాష్ట్రలో ఉంది. తర్వాత కొంతకాలానికి అతడు చంద్రపూర్ అనే మరొక నగరాన్ని నిర్మించి తన రాజధానిని సిర్పూర్ నుండి అక్కడికి మార్చాడు. అదే నేటి చాందా. ఇది కూడా మహారాష్ట్రలో ఉంది.

హీర్షా క్రీ.శ.1462: ఖండియా తర్వాత అతని కుమారుడు హీర్షా రాజయ్యాడు. అతడు అంతకుముందు రాజ్యంలో ఉన్న తార్వేల్ పద్ధతిలో కొన్ని మార్పులు ప్రవేశపెట్టాడు. అటవీ భూములు సాగులోకి తెచ్చే తార్వేలకు సామంత పదవులు ఇస్తానని ప్రకటించాడు. ఈ సామంత ప్రభువులకు నాయకులు అనే బిరుదు ఇచ్చాడు. అడవి భూములను సాగులోకి తేలేని తార్వేలను పదవుల నుండి తొలగిస్తానని కూడా ప్రకటించాడు. అందువల్ల తమ పదవులు పోతాయని తార్వేలు స్వయంగా దగ్గర ఉండి అడవులను నరికించి వ్యవసాయ క్షేత్రాలను విస్తరించారు. అందువల్ల రాజ్యంలో వ్యవసాయ క్షేత్రాలు పెరిగి ఆర్థికంగా అభివృద్ధి చెందింది. రాజ్యానికి ఆదాయం పెరిగింది. తన ఆజ్ఞలను పాటించి, వ్యవసాయ క్షేత్రాలు పెంచినందుకు సామంతుల ప్రాంతాలను తాను స్వయంగా పర్యటించి వారి రాజ్యాల సరిహద్దులను స్థిరపరచి ఆ ప్రాంతాలపై వారి అధికారాన్ని ధ్రువపరుస్తూ సన్నద్దులను జారీ చేశాడు. దాంతో సామంతుల అధికారాలు స్థిరపడ్డాయి. అంతేగాక వ్యవసాయ క్షేత్రాలకు నీరు అందించడానికి చెరువులను తవ్వమని ప్రజలను, నాయకులను ప్రోత్సహించాడు. ఎవరు చెరువు తవ్వితే అది నీరు పారేటంత దూరం ఆ భూములపై అధికారాన్ని ఇస్తానని రాజ శాసనం చేశాడు. అందువల్ల శక్తి ఉన్న చాలా మంది చెరువులు, కుంటలు తవ్వించారు. దాంతో అరణ్య ప్రాంతాలలో కూడా నీటికి కరువు లేకుండా వ్యవసాయం అభివృద్ధి చెందింది. అడవి ప్రాంతాలను బాగు చేసి వ్యవసాయం చేసిన వారికి ఆ భూములపై చేసుకున్న వాటికి పట్టాలు ఇచ్చాడు. ఈ విధంగా ప్రజలలో, నాయకులలో, సామంతులలో ఉత్సాహాన్ని పెంచి రాజ్యాన్ని సుభిక్షం

చేశాడు. ఇది హీర్షా ప్రత్యేకత. అందువల్ల అతడు అంతులేని ప్రజాభిమానాన్ని పొందాడు. హీర్షా తర్వాత చంద్రాపూర్‌ను రాజధానిగా చేసుకొని తొమ్మిది మంది పాలించారు.

చంద్రాపూర్‌లో హీర్షా తర్వాత -

1. భూమా లేక భీమ
2. లోక్బ లేక లోఖా
3. కరన్‌షా లేక కర్నషా
4. బాబాజీ బల్లాల్‌షా లేక బల్లార్‌షాలు పాలించారు.

సిర్పూరు నుండి -

5. డిండియా రాంషా
6. కృష్ణషాని భార్‌షాలు
8. రాంషా
9. నీలకంఠషాలు వరుసగా పాలించారు.

వీరిలో బాబాజీ భల్లాల్‌షా క్రీ.శ.1572 నుండి 1592 వరకు, రాంషా క్రీ.శ.1672 నుండి 1735 వరకు, నీలకంఠషా క్రీ.శ.1735 నుండి 1751 వరకు పాలించారు. నీలకంఠషా చివరివాడు. మహారాష్ట్రులతో వచ్చిన యుద్ధాలలో రఘూజీ భోన్స్ నీలకంఠషాను ఓడించి బందీని చేసి గోండ్వానా రాజ్యాన్ని మరాఠా రాజ్యంలో కలిపాడు. దాంతో 530 సంవత్సరాలుగా పాలించిన గోండు రాజవంశం అంతమైంది. ఆ తర్వాత గోండు సామంతులు, నాయకులు కొందరు జమీందార్లుగా మారారు. కొందరిని మహారాష్ట్రులు దేశ్‌ముఖ్‌లు, దేశ్ పాండేలుగా నియమించారు. వారు చౌట్ సర్దేశ్ ముఖిలను వసూలు చేసి మహారాష్ట్రం పీష్వాలకు చెల్లిస్తూ మరాఠా సామ్రాజ్యంలో ఉద్యోగులుగా జీవించారు. ఆంగ్ల మహారాష్ట్ర యుద్ధాలలో మహారాష్ట్రులు ఓడిపోయి ఇంగ్లిషు వారి సామంతులయ్యారు. అప్పుడు ఈ ప్రాంతాలన్నీ బేరారు రాష్ట్రంగా చేసి నిజాం నవాబుకు ఇచ్చారు. దాంతో గోండు రాజ్యభాగమైన ఆదిలాబాద్ జిల్లా నిజాం రాజ్యంలో భాగమైపోయింది. నేటికీ ఉట్నూరు, కంచనపల్లి గ్రామాలలో రాజగోండు వంశస్తులు నివసిస్తున్నారు.

గోండులు అశోకుని శిలాశాసనాలలో చెప్పిన పుళిందజాతి వారని కొందరు భావిస్తారు. గోండులు వారి గోండ్వానా రాజ్యంలో చెన్నూరు, ఆసిఫాబాద్, లక్సెట్టిపేట, బోథ్, ఆదిలాబాద్, ఉట్నూరు, సిర్పూరు, తాండూరు, మానిక్‌గర్, బల్హార్షా, చంద్రపూర్, యాత్మాల్, నిర్మల్, జకుట్ ఖానాపూర్ మొదలైన 22 ప్రదేశాల్లో బలమైన దుర్గాలు నిర్మించారు. వాటి శిథిలాలు నేటికీ నిలిచి ఉన్నాయి. నేడు ఉట్నూరు కోటలో ఫిరంగి కూడా ఉంది. ఈ విధంగా 22 దుర్గాలతో ఆదిలాబాద్, బల్హార్షా చాందా జిల్లాల్లో వ్యాపించిన గోండ్వానా రాజ్యం క్రీ.శ.1220 నుండి క్రీ.శ.1751 వరకు అంటే 531 సంవత్సరాలు కొనసాగి కాలగర్భంలో కలిసిపోయింది. ఆ తర్వాత 1948 వరకు ఆదిలాబాద్ జిల్లా మీద నిజాం పరిపాలన కొనసాగింది.

ఆంధ్రదేశంలో ముస్లిం పరిపాలన

ఆంధ్రదేశంలో ముస్లిం పరిపాలన కాకతీయ సామ్రాజ్య పతనానంతరం క్రీ.శ.1323లో ప్రారంభమైంది. కాని అది తాత్కాలికమే. ఆంధ్రవీరులు ముస్లింలను పారదోలి ఆంధ్రదేశానికి విముక్తి కలిగించారు. క్రీ.శ.1347లో గుల్బర్గాలో స్థాపింపబడిన బహమనీ రాజ్యం ఆంధ్రదేశాన్ని జయించాలని ప్రయత్నించినా సాధ్యం కాలేదు. కాకతీయ రాజ్యం పోయిన తర్వాత ముసునూరి వీరుల స్వాతంత్ర్య సమరం సుమారు 250 సంవత్సరాలు ఆంధ్రదేశం ముస్లింల పాలవకుండా నిలదొక్కుకోగలిగింది. క్రీ.శ.1565లో జరిగిన తళ్లికోట యుద్ధం తర్వాత గోల్కొండ నవాబులు బలవంతులై ఆంధ్రదేశాన్నంతటినీ జయించి క్రీ.శ.1687 వరకు పాలించారు. వారిని కూలదోసి మొగలులు క్రీ.శ.1724 వరకు పాలించారు. క్రీ.శ.1724లో మొగలుల అధికారాన్ని అంతంచేసి నిజాం ఉల్‌ముల్క్ అసఫ్‌జాహీ రాజ్యాన్ని స్థాపించాడు. గోల్కొండ కుతుబ్‌షాహీలు క్రీ.శ.1518-1687, మొగల్ వంశం క్రీ.శ.1687-1724 వరకు పాలించాయి. అసఫ్‌జాహీ వంశం క్రీ.శ.1724 నుండి 1766 వరకు మొత్తం ఆంధ్ర దేశాన్ని, క్రీ.శ.1766 నుండి 1800 వరకు రాయలసీమ, తెలంగాణలను క్రీ.శ.1800 -1948 వరకు కేవలం తెలంగాణను మాత్రమే పాలించింది.

మొత్తం మీద ఆంధ్ర దేశాన్ని ఐదు ముస్లిం వంశాలు పాలించాయి.

1. తుగ్లక్ వంశం
2. బహమనీ వంశం
3. గోల్కొండ కుతుబ్‌షాహీ వంశం
4. మొగల్ వంశం
5. అసఫ్‌జాహీ వంశం.

తుగ్లక్ వంశం క్రీ.శ.1323 నుండి 1325 వరకు మొత్తం ఆంధ్రదేశాన్ని పాలించింది. క్రీ.శ.1325లో ముసునూరి ప్రోలయనాయకుడు ఆంధ్ర స్వాతంత్ర్య సమరం సాగించి క్రీ.శ.1325 నాటికి కోస్తా ఆంధ్ర మొత్తం ఖమ్మం జిల్లాను విముక్తి చేశాడు. కనుక క్రీ.శ.1325 నుండి క్రీ.శ.1335వరకు తుగ్లక్‌లు తెలంగాణ, రాయల సీమలను మాత్రమే పాలించారు. రెండవ దశలో క్రీ.శ.1329-30లో చాళుక్య వంశానికి చెందిన అరవీటి సోమరాజు అనెగొంది, కంపిలిలో స్వాతంత్ర్య సమరం జరిపి ఆ ప్రాంతాన్ని విముక్తి చేశాడు. కాపయనాయకుడు క్రీ.శ.1330-35ల మధ్య ఓరుగల్లును ఆక్రమించి తెలంగాణను విముక్తి చేశాడు. దాంతో 10 సంవత్సరాల్లోనే తుగ్లక్‌ల అధికారం అంతరించింది. బహమనీ సుల్తాన్‌లు కాపయనాయకునితో సంధి చేసుకొని ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, హైదరాబాద్ జిల్లాలను పొందారు. ఆ ప్రాంతాలు మాత్రమే వారు పాలించారు. మిగతా ఆంధ్రదేశంపై వారు అప్పుడప్పుడు దాడులు చేయడం తప్ప జయించలేదు. వారు ఆంధ్రదేశ చరిత్రలో ఎలాంటి పాత్రా నిర్వహించలేదు. గోల్కొండ నవాబులు తళ్లికోట యుద్ధం వరకు అంటే క్రీ.శ.1565 వరకు తెలంగాణ, కొండపల్లి సర్కారును మాత్రమే పాలించారు. తళ్లికోట యుద్ధం తర్వాత ఇబ్రహీం కుతుబ్‌షా కోస్తాను, కొండవీటి రాజ్యాన్ని జయించి కుతుబ్‌షాహీ వంశాన్ని ఆంధ్ర దేశపు రాజ్యంగా మార్చాడు. నాటినుంచి వారు క్రీ.శ.1687 వరకు యావదాంధ్ర దేశాన్ని పాలించారు. క్రీ.శ.1687లో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని జయించి ఆంధ్రదేశాన్ని మొగల్ సామ్రాజ్యంలో కలిపివేశాడు. కనుక క్రీ.శ.1687 నుండి క్రీ.శ.1724 వరకు 37 సంవత్సరాలు ఆంధ్ర దేశం మొగలుల చేత పాలింపబడింది. క్రీ.శ.1724లో నిజాం ఉల్‌ముల్క్ మొగల్ అధికారాన్ని అంతం చేసి హైదరాబాద్‌లో అసఫ్‌జాహీ వంశాన్ని స్థాపించాడు. అసఫ్‌జాహీలు క్రీ.శ.1766 వరకు యావదాంధ్ర దేశాన్ని పాలించారు. క్రీ.శ.1766లో నిజాం అలీ ఇంగ్లిషు వారితో ఒప్పందం చేసుకొని సర్కారులను వారికి ఇచ్చేయడంతో కోస్తా మీద అసఫ్ జాహీల అధికారం అంతమైంది.. క్రీ.శ.1800 సంవత్సరంలో నిజాం అలీ వెల్లస్లీతో సైన్య సహకారం సంధి చేసుకొని దత్తమండలాలను ఇంగ్లిషు వారికి ఇచ్చేయడంతో రాయలసీమపై అసఫ్‌జాహీల అధికారం అంతరించింది. కనుక క్రీ.శ.1800 నుండి 1948 వరకు అసఫ్ జాహీలు ఒక్క తెలంగాణను మాత్రమే పాలించారు. అదీ ఇంగ్లిషు వారికి సామంతులుగానే పాలించారు. కనుక అసఫ్‌జాహీ వంశం క్రీ.శ. 1724 నుండి 1766 వరకు మొత్తం ఆంధ్రదేశాన్ని, 1766 నుండి 1800 వరకు రాయలసీమ, తెలంగాణలను, క్రీ.శ.1800 నుండి 1948 వరకు తెలంగాణను మాత్రమే పాలించారు. ఈ విధంగా ఆంధ్ర దేశంలో ముస్లింల పాలన దశలు దశలుగా సాగింది.

బహమనీ రాజ్యానికి ఆంధ్రదేశంతో గల సంబంధాలు

బహమనీ వంశవృక్షం

అల్లావుద్దీన్ హసన్ బహమన్ షా క్రీ.శ.1347-1358

మొదటి మహమ్మద్ షా క్రీ.శ.1358-1375 భార్య షాబీగం | మహమూద్ | అహమ్మద్ దావూద్

ముజాహిద్ 1375-1378 | మొదటి దావూద్‌ఖాన్ 1378-1378 | రెండవ మహమ్మద్ 1378-1397

ఘియాజుద్దీన్ (తహంతన్) 1397 ఏప్రిల్-జూన్ | రెండవ దావూద్ (షంశుద్దీన్) 1397 జూన్-నవంబర్ | కుమార్తె | కుమార్తె

ఫిరోజ్ షా 1397-1422 | మొదటి అహమ్మద్ షా (షహబుద్దీన్) 1422-1436

రెండవ అల్లావుద్దీన్ రెండవ అహ్మద్ షా 1436-1458

హుమాయూన్ 1458-1461

నిజాముద్దీన్ (మూడవ అహమ్మద్) 1461-1463 | మూడవ మహమ్మద్ 1463-1482

మహమూద్ 1482-1518

నాల్గవ అహమ్మద్ 1518-1520 | మూడవ అల్లావుద్దీన్ 1520-1523 | వలీముల్లా 1523-1526 | కలీముల్లా 1526-1538

మధ్యయుగంలో దక్కనులో వెలిసిన రాజ్యాలలో గుల్బర్గా, బీదరులను రాజధానులుగా చేసుకొని పాలించిన బహమనీ రాజ్యం ఒకటి. ఈ రాజ్యం దేవగిరి యాదవరాజ్య శిథిలాలపై వెలిసిన రాజ్యం. మహారాష్ట్ర దేశం, కన్నడ దేశాల్లో కొంత భాగాన్ని పాలించింది. ఇది ఆంధ్రదేశ రాజవంశం కాదు. కాని ఈ రాజ్యం జన్మించిన దగ్గర నుండి అప్పుడప్పుడు ఆంధ్రదేశంపై దండయాత్రలు జరిపింది. తెలంగాణలో కొంత భాగాన్ని కొంతకాలం తన ఆధిపత్యంలో ఉంచుకోగలిగింది. కనుక బహమనీ రాజ్యానికి కూడా ఆంధ్రదేశంతో కొద్దిగా సంబంధం ఏర్పడింది.

మహ్మద్ బిన్ తుగ్లక్ కాలంలో జరిగిన అనేక తిరుగుబాట్ల పరిణామం బహమనీ రాజ్యస్థాపన. క్రీ.శ.1344లో మహమ్మద్ బిన్ తుగ్లక్‌కు అమీశానిజుదా అనే పేరు గల శిస్తు వసూలు చేసే అమీర్ల మీద అనుమానం కలిగి మాళవ షిగ్దార్ అయిన అజీజ్ ఉద్దీన్‌కు ఆజ్ఞలు జారీ చేసి మాళ్వ రాష్ట్రంలోని 80 మంది అమీర్లను ఉరి తీయించాడు. అది తెలిసిన గుజరాతు, దౌలతాబాద్ అమీర్లు భయపడి తమను కూడా ఉరి తీయిస్తాడేమోనని తిరుగుబాట్లు చేశారు. దౌలతాబాద్ అమీరులు ఇస్మాయిల్‌మఖ్ అనే సరదారుని తమ నాయకునిగా ఎన్నుకున్నారు. కాని అతనిని సుల్తాన్ సైన్యాలు ఓడించాయి. ఆ క్లిష్టపరిస్థితులలో జాఫర్‌ఖాన్ అనే

సర్దారు సుల్తాన్ సైన్యాలను ఒకేసారి యుద్ధంలో ఓడించారు. అందువల్ల అమీరులందరూ దౌలతాబాద్‌లో జాఫర్‌ఖాన్‌ను తమ సుల్తాన్‌గా ఎన్నుకున్నారు. అతడే హసన్‌గంగు బహమన్. అతడు నాసిరుద్దీన్ అల్లావుద్దీన్ బహమన్‌షా అనే బిరుదుతో గుల్బర్గాలో క్రీ.శ.1347లో బహమనీ రాజ్యాన్ని స్థాపించాడు. అతనికి [illegible] అనే బిరుదు కూడా ఉంది. బహమనీ రాజ్యం క్రీ.శ.1347 నుండి క్రీ.శ.1528 వరకు కొనసాగింది.

బహమనీ వంశం సుమారు రెండు శతాబ్దాలు పరిపాలన చేసింది. ఈ వంశంలో 18 మంది సుల్తాన్‌లు రాజ్యపాలన చేశారు. కాని వీరి పాలనలో చెప్పుకోదగిన విశేషం ఒక్కటీ కూడా లేదు. ఈ వంశ చరిత్ర అంతా కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, విద్రోహాలతో నిండిపోయింది. 18 మంది సుల్తాన్‌లలో సగంమంది హత్య గావించబడ్డారు. ఇద్దరు అంధులుగా చేయబడ్డారు. ఏడుగురు మంది మాత్రమే సుల్తాన్‌లు. వీరిలో చాలా కూడా విషయలోలురు, తాగుబోతులు. ఓర్పు అంతటివారు విషయలోలురై చెడిపోయారు. ఈ సుల్తాన్‌లకు పరిపాలన మీద ఆసక్తి లేదు. పరిపాలనా యంత్రాంగం అంతకన్నా లేదు. అల్లావుద్దీన్ హసన్ పరిపాలనా సంస్కరణలు కొన్ని చేసినా అవి నాశనమైపోయాయి. పైగా అందరూ మత ద్వేషులు. పరిపాలనా వ్యవస్థ గాక, వంశక పోయినట్టైన రెండవ మహమ్మద్ కూడా మతద్వేషాన్ని విడువ లేదు. వీరి పాలనలో హిందువులు అనేక హింసలకు గురయ్యారు. జిజియా పన్ను చెల్లించారు. వారి కోశమంతా వారి దేవాలయాలు నాశనం చేయబడ్డాయి. ప్రజల ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉండేది. మూడవ మహమ్మద్‌షా కాలంలో అథనాసియస్ నికిటిన్ అనే రష్యా యాత్రికుడు బహమనీ రాజ్యాన్ని దర్శించి అక్కడి ప్రజలు, రైతులు, మిక్కిలి దరిద్రాన్ని అనుభవిస్తున్నారని, సర్దారులు మాత్రం మిక్కిలి భోగాలలో తేలిపోతున్నారని, దేశంలో బానిస వ్యాపారం, పల్లెల్లో నివసించే ప్రజల దుస్థితి చెప్పనలవి కానిది రాశాడు. ఈ విధంగా ఉన్న పరిస్థితులు చూసి హెచ్.కె. షేర్వానీ బహమనీ సుల్తాన్‌లు ఒకరినొకరు వంశపారం పర్యానికి వచ్చిన కక్షలతోను, మత్సరాలతోను, ద్వేషాలతోను అల్లాడే వారు దేశానికి ఏం చేశారని చెప్పాలో అర్థం కావటంలేదని అన్నారు. ఈ రాజ్యం ఐదు ముక్కలుగా విచ్ఛిన్నమైనప్పటికీ ఆ రాజ్యం విస్తరించిన ప్రాంత మంతా ఇది అంధకారమైన. ఆ విజయనగర రాజ్యంపైనా నిరంతర దాడులు జరిపి దక్షిణదేశంలో శాంతి భద్రతలు లేకుండా చేసింది. వాస్తవానికి ఈ రాజ్యం మొదట ఆంధ్రుల సహాయ సహకారాలతోనే నిలిచింది.

హసన్‌గంగు బహమనీ-కాపయనాయకుని కాలం క్రీ.శ.1347-1358: బహమనీ రాజ్యస్థాపనలో ఆంధ్రుల హస్తం ఉంది. కాపయనాయకుడు మాలిక్ మక్బూల్‌ను పారదోలి ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత ఢిల్లీ ప్రభుత్వంలోనైనా మహమ్మద్‌బిన్ తుగ్లక్ తన రాజ్యంపై దండెత్తుతాడేమోనని అనుమానంతో ఉండేవాడు. ఆ స్థితిలో తన రాజ్యానికి ఉత్తరంగా దౌలతాబాద్‌లో ఒక ముస్లిం రాజ్యం ఉంటే అది తనకు రక్షణ అని భావించి సుల్తాన్‌కి తిరుగుబాటు చేసిన జాఫర్‌ఖాన్‌కు 15,000 సైన్యాన్ని సహాయంగా పంపాడు. జాఫర్‌ఖాన్ విజయం సాధించి బహమనీ సుల్తాన్‌గా గుల్బర్గాలో పట్టాభిషేకం చేసుకున్నాడు. కాని ఆ తర్వాత బహమన్‌షా తన విధానాన్ని మార్చుకున్నాడు. అతడు దక్షిణ భారతదేశంలో ఉన్న అన్ని రాజ్యాలకు ఢిల్లీ సుల్తాన్ స్థానంలో తానే అధిపతినని అందరూ తనకు కప్పం చెల్లించాలని ఆశించాడు. తెలంగాణ, కంపిలి, మధుర రాజ్యాలు ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యంలో భాగాలు కనుక తెలంగాణలో వెలసిన కాపయనాయకుని రాజ్యం, కంపిలి శిథిలాలపైన వెలసిన విజయనగర రాజ్యాలు తన సామంతులని, వారు తనకు కప్పాలు కట్టాలని ప్రకటించాడు. అందుకు వారు తిరస్కరించగా రెండు రాజ్యాలపై దాడులకు దిగాడు. కాపయనాయకుని లొంగదీసి తన సామంతునిగా చేయాలని రెండు పర్యాయాలు ఓరుగల్లు రాజ్యంపై దండెత్తాడు. ఆ యుద్ధంలో కాపయనాయకుడు ఓడిపోయి క్రీ.శ.1350లో కౌలాస్ దుర్గాన్ని ఇచ్చి సంధి చేసుకున్నాడు. క్రీ.శ.1350లో చేసిన సంధివల్ల కాపయ బహమనీ షా ఢిల్లీ రాజ్యంలోని ఆధారపీఠంపై దండెత్తి దేవగిరికి నష్టం కలిగించాడు.

మొదటి మహమ్మద్‌షా-కాపయనాయకుని కాలం క్రీ.శ.1358-1363: హసన్‌గంగు క్రీ.శ.1358లో మరణించాడు. అతని కుమారుడు మొదటి మహమ్మద్‌షా రాజ్యానికి వచ్చాడు. ఆ సమయంలో కాపయ పోగొట్టుకున్న కౌలాస్ దుర్గాన్ని తిరిగి సంపాదించడానికి విజయనగరంతో కలిసి అతని తండ్రి తమ రాజ్యం నుండి తీసుకున్న ప్రాంతాలను తిరిగి ఇవ్వాలని, లేకపోతే తాము బహమనీ రాజ్యంపై దండెత్తగలమని బెదిరించారు కాపయనాయకుడు. విజయనగర రాయలు సంధి పంపారు. దానికి కోపించిన మహమ్మద్‌షా కాపయనాయకుని రాజ్యంపై దండెత్తి పెద్ద పట్టణం వద్ద వినాయకదేవుని పట్టించాడు. అందుకు క్షమాపణలు కోరిన కాపయనాయకుడు

ఢిల్లీ సుల్తాన్ ఫిరోజ్ షా సహాయం అర్థించాడు. అది తెలిసి క్రోధంతో మహమ్మద్ షా రెండవసారి దండెత్తి కాపయనాయకుని పూర్తిగా ఓడించాడు. దాంతో కాపయ సంధి చేసుకొని గొల్లకోటి దుర్గాన్ని, 30 లక్షలు విలువ చేసే రత్నసింహాసనాన్ని సమర్పించుకున్నాడు. ఉభయులూ భవిష్యత్తులో యుద్ధాలు చేయరాదని, ఆనాడు అంగీకరించిన సరిహద్దులు ఎవరూ దాటరాదని నిర్ణయించుకున్నారు. దానికి సుల్తాన్ కట్టుబడి ఉన్నాడు. తర్వాత ఓరుగల్లు రాజ్యానికి, బహమనీలకు యుద్ధాలు జరగలేదు. ఈ సంధి ద్వారా బహమనీ సుల్తాన్‌కు కాపయ నాయకుడు ఇచ్చిన గొల్లకోటి తర్వాత గోల్కొండగా మారి నేటి హైదరాబాద్ నగరంగా రూపొందింది. ఈ యుద్ధం తర్వాత బహమనీలు రెడ్డి రాజ్యంపై దండెత్తి అమరావతి దేవాలయానికి నష్టం కలిగించారు.

పద్మనాయక వెలమలకు బహమనీలతో సంబంధాలు: బహమనీ యుద్ధం తర్వాత రేచర్ల వెలమలకు, కాపయనాయకునికి విరోధం వచ్చింది. క్రీ.శ.1368 భీమవరం యుద్ధంలో కాపయనాయకుడు మరణించాడు. ఓరుగల్లు రాజ్యం వెలమల స్వాధీనమైంది. తర్వాత వారు బహమనీ సుల్తాన్ మొదటి మహమ్మద్ షాతో సంధి చేసుకున్నారు. అతడు కాపయనాయకునితో చేసుకున్న సంధి షరతులను గౌరవిస్తానని వాగ్దానం చేశాడు. అందువల్ల బహమనీ, ఓరుగల్లు రాజ్యాల మధ్య 50 సంవత్సరాలు ఎలాంటి దాడులు జరగకుండా అవే సరిహద్దులు కొనసాగాయి. క్రీ.శ.1416లో బహమనీ పద్మనాయక రాజ్యాల మధ్య సంబంధాలు చెడిపోయాయి. కొండవీటి పెదకోమటి వేమారెడ్డి అల్లాడ రెడ్డిని సాధించడానికి ఫిరోజ్ షా సహాయం కోరాడు. సుల్తాన్ 1416లో రాజమహేంద్రవరంపై దాడి చేశాడు. కాని విజయనగర చక్రవర్తి మొదటి దేవరాయలు సుల్తాన్ దృష్టి మరల్చడానికి పానుగల్లు వద్ద సుల్తాన్‌తో యుద్ధానికి దిగాడు. సుల్తాన్ రెడ్డిరాజులతో కలిసిపోవడం ఇష్టం లేని రాచకొండ పద్మనాయక రాజు మాదా నాయకుడు విజయనగరం వైపు చేరి పానుగల్లు వద్ద సుల్తాన్‌ను ఓడించాడు. దాంతో బహమనీ సుల్తాన్‌లు కక్షగట్టి పద్మనాయక రాజ్యంపై దాడులు మొదలుపెట్టి తెలంగాణలోని ఒక్కొక్క ప్రాంతాన్నే ఆక్రమించి చివరకు వెలమ రాజ్యాన్ని అంతం చేశారు. క్రీ.శ.1422లో గద్దెనెక్కిన అహమ్మద్ షా క్రీ.శ.1425లో తన సేనాని ఆజమ్‌ఖాన్‌ను పంపి ఓరుగల్లును ఆక్రమించాడు. మళ్లీ క్రీ.శ.1433లో సుల్తాన్ తెలంగాణపై దండెత్తి రావు సర్వజ్ఞసింగనను ఓడించి భువనగిరి, రామగిరి మొదలైన దుర్గాలను జయించి భువనగిరి కోటను కేంద్రంగా ఒక జాగీరును ఏర్పాటు చేసి సంజర్‌ఖాన్ అనే అతడిని పాలకునిగా నియమించాడు. తర్వాత సంవత్సరం జాఫర్‌ఖాన్ క్రీ.శ.1435లో రాచకొండ రాజ్యాన్ని పూర్తిగా జయించాడు. రాచకొండపై దస్తూర్‌ఖాన్ అనే బహమనీ రాకుమారుడు పాలకునిగా నియమింపబడ్డాడు. దాంతో రాచకొండ వెలమ రాజ్యం అస్తమించింది. ఇక దేవరకొండ రాజ్యం మిగిలింది. హుమాయూన్ షా కాలంలో తెలంగాణలో ముస్లిం సర్దారులైన జలాల్‌ఖాన్, అతని కుమారులు సికిందర్‌ఖాన్‌లు తిరుగుబాట్లు చేశారు. వారికి దేవరకొండ లింగమనేడు సహాయం చేశాడు. అందుకుగాను అతనిని శిక్షించడానికి సుల్తాన్ హుమాయూన్ షా దేవరకొండపైకి పెద్ద సేనను పంపాడు. లింగమనేడు కపిలేశ్వర గజపతి సహాయంతో క్రీ.శ.1461లో సుల్తాన్‌ను ఓడించి తరిమాడు. క్రీ.శ.1464లో హంవీరుడు ఓరుగల్లు, ఖమ్మం మొదలైన దుర్గాలను ఆక్రమించాడు. ఓరుగల్లులో క్రీ.శ.1464 నాటి హంవీరుని శాసనం ఉంది. తెలంగాణ బహమనీల చేతి నుండి జారిపోయింది. గజపతుల కిందికి వచ్చింది. వెలమలు, గజపతి సామంతులయ్యారు.

గజపతులు-బహమనీల సంబంధాలు క్రీ.శ.1461-1538: కపిలేశ్వర గజపతి మరణానంతరం అతని కుమారులకు వారసత్వ యుద్ధం వచ్చింది. అందులో హంవీరుడు సుల్తాన్ సహాయం కోరాడు. అందుకు ప్రతిఫలంగా కొండపల్లి, రాజమహేంద్రవర రాష్ట్రాలు ఇస్తానని వాగ్దానం చేశాడు. తన తండ్రి హుమాయూన్ షా కాలంలో పోగొట్టుకున్న తెలంగాణను తిరిగి సంపాదించవచ్చని మూడవ మహమ్మద్ షా, అతని మంత్రి మహమ్మద్ గవాన్‌లు హంవీరునికి సహాయం చేయాలని నిర్ణయించి మహమ్మద్ నిజాం ఉల్‌ముల్క్ ఖైరి అనే సర్దారుని పంపారు. హంవీరుడు కటకం రాజయ్యాడు. మాట ప్రకారం కొండపల్లి, రాజమహేంద్రవర రాష్ట్రాలను సుల్తాన్‌కు ఇచ్చాడు. సుల్తాన్ ఖైరిని సర్‌లష్కర్-ఇ-తిలింగ్ అనే బిరుదుతో రాజమహేంద్రవరం గవర్నర్‌గా నియమించాడు. కొండపల్లిపై మరొక సర్దారుని నియమించాడు. కాని కొద్ది కాలానికి కొండపల్లిలో తిరుగుబాటు జరిగి, అక్కడి ప్రజలు పురుషోత్తముని ఆహ్వానించారు. కాని సుల్తాన్, అతని మంత్రి గవాన్ స్వయంగా వచ్చి పురుషోత్తముని ఓడించి క్రీ.శ.1478 నుండి 1480 వరకు రాజమహేంద్రవరంలో మకాం చేసి తన అధికారాన్ని స్థిరపరచుకున్నాడు. తెలుగు ప్రాంతాలను తూర్పు తెలంగాణ, పశ్చిమ తెలంగాణలుగా విభజించాడు. తూర్పు

తెలంగాణకు రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా చేసి నిజాం ఉల్‌ముల్క్ ఖైరిని పాలకునిగా చేశాడు. పశ్చిమ తెలంగాణకు ఓరుగల్లును రాజధానిగా చేసి ఆజీమ్‌ఖాన్‌ను అధిపతిగా నియమించాడు. దాంతో ఆంధ్ర ప్రాంతాలైన తెలంగాణ, పూర్వపు వేంగి రాజ్యం బహమనీ సామ్రాజ్యంలో భాగాలు అయిపోయాయి. కాని ఇది తాత్కాలికమే. తర్వాత సుల్తాన్ విజయనగర రాజ్యంపై దండెత్తి కొండవీటిని ఆక్రమించి అక్కడ ఒక దేవాలయాన్ని కూల్చి మసీదు నిర్మించాడు. అక్కడి పూజారులను తానే స్వయంగా నరికి గాజ అనే బిరుదు పొందాడట. తర్వాత నెల్లూరుపై దాడి చేశాడు. అక్కడి నుండి కంచిపై దండెత్తి కంచిని కొల్లగొట్టాడు. సాళువ నరసింహరాయుల సేనాధిపతి ఈశ్వరనాయకుడు కందుకూరు వద్ద సుల్తాన్‌ను చిత్తుగా ఓడించి తరిమివేశాడు. సుల్తాన్ మరణం తర్వాత పురుషోత్తమ గజపతి బహమనీ రాజ్యంపై దండెత్తి కోస్తా మొత్తం తెలంగాణలోని తమ ఆధిపత్యంలో ఉన్న అన్ని ప్రాంతాలు ఖమ్మం, ఓరుగల్లు, దేవరకొండ, రాచకొండ మొదలైన దుర్గాలన్నీ సాధించి గజపతి సామ్రాజ్యంలో కలిపివేశాడు. దాంతో ఆంధ్ర ప్రాంతాలపై బహమనీల అధికారం తొలగిపోయింది. తర్వాత మహమ్మద్ షా క్రీ.శ.1482లో బహమనీ గద్దెనెక్కాడు. అతడు 1518 వరకు పాలించాడు. ఇతని కాలంలో అహమ్మద్‌నగర్, బేరార్, బీజాపూర్, గోల్కొండ తరఫ్‌దారులు స్వతంత్రం ప్రకటించారు. దాంతో బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. బహమనీ వంశంలో చివరివాడు కలీముల్లా. అతడు క్రీ.శ.1524-1527 సంవత్సరాల మధ్య పాలించాడు. అతడు క్రీ.శ.1528లో మరణించాడు. అతనితో బహమనీ రాజ్యం అంతరించిపోయింది. తెలంగాణ ప్రాంతంలో బహమనీ రాజ్యం స్థానంలో క్రీ.శ.1518లో గోల్కొండ రాజ్యం జన్మించింది. తర్వాత ఆ రాజ్యం ఆంధ్ర దేశ చరిత్రలో గొప్ప పాత్రను నిర్వహించింది. ఆంధ్రదేశాన్ని పాలించిన పూర్తిస్థాయి ముస్లిం రాజ్యం గోల్కొండ రాజ్యం మాత్రమేనని చెప్పవచ్చు.

గోల్కొండ-కుతుబ్‌షాహి రాజ్యచరిత్ర క్రీ.శ.1518-1686

బహమనీ సామ్రాజ్య శిథిలాలపై వెలసిన ఐదు స్వతంత్ర రాజ్యాలలో గోల్కొండ రాజ్యం ఒకటి. ఈ రాజ్యస్థాపకుడు కులీకుతుబ్‌షా. అతడు మధ్యాసియాలో టర్కీ జాతికి చెందిన ఖారాకుయుల్ వంశానికి చెందిన వాడు. ఇతడు స్థాపించిన గోల్కొండ రాజ్యం క్రీ.శ.16-17 శతాబ్దాలలో ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించింది. గజపతి, విజయనగర సామ్రాజ్యాల పతనం తర్వాత యావదాంధ్ర దేశాన్ని జయించి ఆంధ్ర దేశాన్ని ఏకపాలన కిందికి తెచ్చి ఆంధ్రదేశపు పాలక రాజవంశంగా రూపొందింది. ఈ రాజ్యం క్రీ.శ.1512లో స్వతంత్ర రాజ్యంగా వెలిసి, క్రీ.శ.1687 వరకు సుమారు 175 సంవత్సరాలు కొనసాగి ఆంధ్రదేశ చరిత్రలోనే గాక దక్కను-దక్షిణ భారతదేశ చరిత్రలో కూడా ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఈ వంశస్తులు ముస్లింలైనప్పటికీ మతసహనాన్ని పాటించి హిందువులను ఉన్నత పదవులలో నియమించి, హిందూ సంస్కృతిని ఆదరించి భారత దేశాన్ని పాలించిన ముస్లింలందరికన్నా వారు ప్రాజ్ఞులైన పాలకులని, వారి పాలితులైన ఆంధ్రుల లాగే వారు కూడా ఆంధ్రులేనని డాక్టర్ వెంకట రమణయ్య అభిప్రాయపడ్డారు.

కుతుబ్‌షాహీల చరిత్రను తెలుసుకోవడానికి అనేక ఆధారాలున్నాయి. వారి కాలంనాటి 37 సంస్కృతాంధ్ర శాసనాలు, 37 ఉర్దూ, అరబ్బీ, పారశీక శాసనాలు, సమకాలీన బీదరు, బీజాపూరు అహమ్మద్‌నగర్, విజయనగర శాసనాలు, ఖాదిర్‌ఖాన్ రచించిన కుతుబ్‌షాహీల చరిత్ర- తారీఖ్ కుతుబ్‌షాహి, పెరిష్టా రాసిన గుల్షనీ ఇబ్రహీమ్ మాసిరేదక్కన్, హదీకతుల్ ఆలం, బసాతీమల్ సలాతిన్, గోల్కొండ ఆస్థానకవులైన కందుకూరు రుద్రకవి రచనలు, మరిగంటి కవుల కావ్యాలు, యమాలచరిత, తపతీ సంవరణం, ఐరోపా వాసులైన బెర్నియర్, ట్రావెర్నియర్, దీస్‌నాట్, సీవెల్, టైలర్ మొదలైన వారి రచనలు, మొగల్ ఆస్థానీకులైన రుఖ్కాత అలంగిరి, మాసిరె అలంగీరె, బాదుషానామాలు, గోల్కొండ సుల్తాన్‌లు నిర్మించిన భవనాలు, సమాధులు వాటిపై లిఖింపబడిన శాసనాలు, వారు విడుదల చేసిన నాణేలు ఉపయోగపడుతున్నాయి.

పూర్వచరిత్ర-ఖరాకుయున్లు వంశం: కుతుబ్‌షాహీ వంశస్తుల పూర్వచరిత్ర తెలుసుకోడానికి అతిముఖ్యమైన ఆధారం సాలార్‌జంగ్ మ్యూజియంలో లభించిన సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా స్వయంగా రాసిన ఒక పత్రం. ఇది ఒక అపురూపమైన ఆధారం. ఆ పత్రంలో వారి పూర్వీకుల వంశవృక్షం ఉంది. ఆ పత్ర సహాయంతో వారి పూర్వీకుల వంశ వృక్షం రూపొందింపబడింది.

ఖరాకుయున్ల వంశవృక్షం

మీర్ సాదత్ ఆలీరజ్వీ కలాముల్ముల్కు

ఖుర్బాన్‌ఖాన్

అగర్‌ఖాన్

తుర్రాబేగ్

ఖరాపీరం

ఖరా ఉల్‌మాన్యూర్

ఖరాతూర్‌సన్

ఖరామహమ్మద్

ఖరాయూసిఫ్

జహన్ షా 1438-1473 | మీర్జదా సికిందర్ 1420-1438

యూసఫ్

ఖతీజాబేగం కైకుబద్ మీర్జా అల్విండ్

పీర్‌కులి - భార్య ఖలీజాబేగం

అల్లాకులీ యువైస్ కులి - మర్యంఖాటూమ్

ఫతేఖాన్ సుల్తాన్ కులీ కుతుబ్‌షా
గోల్కొండ రాజ్యస్థాపకుడు
సయీద్‌ఖాన్ 1512-1543

అబుల్‌హసన్ తానీషా
క్రీ.శ.1672-1687
చివరి కుతుబ్‌షా

గోల్కొండ కుతుబ్ షాహీ వంశ వృక్షం

సుల్తాన్ కులీ కుతుబ్ ఉల్‌ముల్క్

హైదర్‌ఖాన్ | కుతుబుద్దీన్ షామహ్మద్‌పీష్వా షా కుంద్‌కర్ | యార్‌కులి (జంసీద్ కులి) 1543-50 | అబ్దుల్ కరీం | దౌలత్‌ఖాన్ | ఇబ్రహీం కులీ కుతుబ్‌షా క్రీ.శ.1550-80

భార్యలు బిల్‌ఖుస్ జమాని - ఖాదీజా - ఐ - దౌరాన్ భార్యలు - భాగీరథి
సుభాన్ కులి క్రీ.శ.1550 జమాల్ బీబీ లేక చాంద్ బీబీ
అజరత్ జేసు దరాజీ

పీర్‌మన్ సాహెబి (హుస్సేన్ షావలీ భార్య) | అబ్దుల్ ఖాదర్‌సాహెబి (బీజాపూర్ రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా భార్య) | చాంద్ సుల్తాన్ | హసన్ కులి | మీర్ అబ్దుల్ ఫతా | మీర్ ఖుదా బందా | మహమ్మద్ కులీకుతుబ్‌షా 1580-1611 భార్య మీర్‌షా భార్య భాగ్యమతి కుమార్తె హయత్ భక్షి బీగం | మీర్జా మహమ్మద్ అమీర్‌ఖాన్ ఆగా

సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా 1611-1626 (హయత్ భక్షి బీగం భర్త) | దక్తర్ షా ఖుందర్ కుమార్తె

ఖుదా బంద | ఖాదీజా సుల్తాన్ (బీజాపూర్ ఆదిల్‌షా భార్య) | కల్ మీర్జా | ఖులీ మీర్జా (ఖుల్‌తుం (బీగం) | ఖైరియా టున్ (నిషా బీగం, మాన్‌షాహిబా) | ఇబ్రహీం మీర్జా | మీర్జా కమాల్ | అబ్దుల్లా కుతుబ్‌షా 1626-1672

మొదటి కుమార్తె (భర్త మహమ్మద్) | ఫతిమా ఖానమ్ (భర్త సయ్యద్ నిజాముద్దీన్ అహమ్మద్) | పాదుషా బీబీ (భర్త అబుల్ హసన్ 1672-1687)

మొదటి కుమార్తె భర్త సికిందర్ ఆదిల్‌షా | రెండవ కుమార్తె భర్త ఇనాయత్‌ఖాన్ | మూడవ కుమార్తె భర్త మహమ్మద్ అమీర్ నక్షబంది | ఖుదాబంద భర్త బంద్-ఐ-సుల్తాన్ | అబ్దుల్లా కుమారుడు

ఖరాకుయున్ల వంశస్తులు 5వ శతాబ్దంలో ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఈ మతాన్ని బట్టి ఖరానీ వంశానికి మూలపురుషుడు మీర్‌సాదత్ అలీరజ్వీ కలాముల్ముల్క్. ఈ వంశంలో రాజ్యం స్థాపించిన వ్యక్తి మూడవ వాడైన అగర్‌ఖాన్. అతడు టర్కిస్థాన్‌లో రాజ్యస్థాపన చేశాడు. అతడు 70 సంవత్సరాలు రాజ్యం చేశాడట. తర్వాత తురాబేగ్ రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో వీరి రాజ్యంపై చంఘీజ్‌ఖాన్ దండెత్తి ఓడించాడు. కనుక ఇతడు చంఘీజ్‌ఖాన్ సమకాలికుడు. ఇతని తర్వాత వీరి వంశస్తులు ఇరాన్‌లోని పశ్చిమ ప్రాంతాలను జయించి హందాన్‌ను రాజధానిగా చేసుకున్నారు. తురాబేగ్ తర్వాత వరుసగా ఖరాపీరం, ఖరా ఉల్‌మన్స్యూర్, ఖరాతూర్సన్, ఖరామహమ్మద్‌లు పాలించారు. అతడు ఆర్మేనియా, అజర్ బెజాన్‌లను కూడా జయించాడు. ఇతని తర్వాత ఇతని కుమారుడు ఖరాయూసిఫ్ రాజ్యానికి వచ్చాడు. అతడు తైమూర్ సమకాలికుడు. తైమూర్ ఇతని రాజ్యంపై దండెత్తాడు. యూసిఫ్ రాజ్యాన్ని ఆక్రమించాడు. తైమూర్ క్రీ.శ.1405లో మరణించాడు. అతని మరణం తర్వాత యూసఫ్ తైమూరు వారసుల నుండి హందాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లనే గాక ఇష్పహన్, క్వాజ్విన్‌లను కూడా జయించి రాజ్యాన్ని విస్తరించాడు. ఇతడు క్రీ.శ.1420లో మరణించాడు. ఇతనికి మీర్జాదా సికిందర్, జహన్ షా అనే ఇద్దరు కుమారులు. తండ్రి తర్వాత మీర్జాదా సికిందర్ హందాన్ సింహాసనం అధిష్టించాడు. అతడు ఫార్స్, కిర్‌మాన్, ఖురాసన్‌లను జయించాడు. అతడు క్రీ.శ.1438లో మరణించాడు. అతనికి మీర్జా ఆల్వంద్, కైకుబాద్ అనే ఇద్దరు కుమారులు. వారి వారసత్వాన్ని కాదని సికిందర్ తమ్ముడు సింహాసనాన్ని అధిష్టించాడు. కాని అన్న కుమారులను ఏమీ చేయలేదు. వారికి హందాంలో అన్ని సౌకర్యాలు కలిగించాడు. జహన్ షా గొప్ప వీరుడు. హీరాట్ వరకు జయించి అతడు సొంత రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అతని రాజధాని మీరాబ్. తర్వాత అతడు ఇరాన్ అరబ్బు రాజ్య ప్రాంతాలను జయించి అమ్మాన్ వరకు రాజ్యాన్ని విస్తరించాడు. మొత్తం ఇరాన్‌కు ప్రభువయ్యాడు. ఆ కాలంలో బాగ్దాద్‌ను షారూక్ మీర్జా పాలిస్తుండేవాడు. షారూక్ క్రీ.శ.1446లో మరణించాడు. అతని మరణం తర్వాత జహన్ షా క్రీ.శ.1457లో బాగ్దాద్‌ను ఆక్రమించి బాగ్దాద్ సింహాసనం అధిష్టించాడు. ఖరాకుయుల్ వంశ చరిత్రలో ఇది గొప్ప సంఘటన. కొంత కాలానికి సికిందర్ కుమారుడు కైకుబాద్ మరణించాడు. మిగిలిన మీర్జా అల్వీందకు పీర్‌కులీ అనే కుమారుడు కలిగాడు. జహన్ షాకు యూసఫ్ అనే కుమారుడు ఉన్నాడు. యూసఫ్‌కు ఖలీజాబేగం అనే కుమార్తె ఉంది. ఆమెను పీర్‌కులీకిచ్చి వివాహం చేశారు. అంటే ఆమె జహన్‌షా మనుమరాలు. అతడు తన అన్న అల్వీంద్ కుమారుడైన పీర్‌కులీకిచ్చి వివాహం చేసి అతనికి హందం రాజ్యాన్ని అప్పగించాడు. తాను హీరాట్‌లో రాజ్యం చేశాడు. పీర్‌కులీ ఖలీజా దంపతులకు యువైస్ కులీన, అల్లాకులీ అనే ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో యువైస్‌కులీకు హందాన్‌కి చెందిన మాలిక్‌పాలె అనే అతని కుమార్తె మర్యంఖాటూన్‌తో వివాహం జరిగింది. ఈ దంపతుల కుమారుడే గోల్కొండ రాజ్యస్థాపకుడైన కులీకుతుబ్‌షా. పీర్‌కులీ రెండవ కుమారుడైన అల్లా కులీకు ఫతేఖాన్, అతనికి సయీద్‌ఖాన్, అతనికి అబుల్‌హసన్ తానీషా జన్మించారు. ఇతడు చిట్టచివరి గోల్కొండ సుల్తానయ్యాడు. కాని పెరిష్టా రచనలలో ఈ వంశక్రమం లేదు. అతడు కులీకుతుబ్‌షా వంశం బహర్లు వంశం అని, ఆ వంశానికి మూలపురుషుడు మీర్ అలీషేర్ అని పేర్కొన్నాడు. కాని సుల్తాన్ మహమ్మద్ స్వయంగా రాసుకున్న పత్రమే వాస్తవం అయి ఉంటుంది.

కులీకుతుబ్ షా దక్కనుకు రాక: ఖారాకుయున్లు అంటే నల్లగొర్రె అని అర్థమట. ఈ వంశస్తులు నల్లగొర్రెను తమ వంశ సంకేతంగా స్వీకరించి అదే పేరుతో ఖారాకుయున్లు వంశం అని ప్రసిద్ధి చెందారు. వీరిలాగే ఇరాన్‌లో ఆక్‌కుయున్లు అనే మరొక తెగ ఉంది. ఆక్‌కుయున్లు అంటే తెల్లగొర్రె అని అర్థమట. వారు తెల్లగొర్రెను తమ వంశపు చిహ్నంగా స్వీకరించి ఆక్‌కుయున్లు అనే తెగగా ప్రసిద్ధి చెందారు. ఈ రెండు తెగలకు బద్ధవైరం. ఖారాకుయున్లులో జహన్‌షా చాలా గొప్పవాడు. అతడు హీరాట్ నుండి అమ్మన్ వరకు జయించి ఖారాకుయున్లు తెగకు గొప్ప కీర్తిని తెచ్చాడు. అది సహించలేని ఆక్‌కుయున్లు నాయకుడు అమీర్ హసన్‌బేగ్ జహన్‌షాపై దండెత్తి క్రీ.శ.1473లో అతని వంశాన్ని సమూలంగా సంహరించాడు. ఖారాకుయున్లు వంశంలో ఒక్క పురుషుని కూడా బతకనివ్వలేదట. హందంలో పీర్‌కులీ వంశజులు మాత్రం పోలేదట. జహన్ షా వంశం అంతరించిపోయింది. అమీర్ హసన్‌బేగ్ జహన్‌షా రాజ్య సింహాసనాన్ని అధిష్టించాడు. అతని తర్వాత అతని కుమారుడు ఖలీల్, అతని తర్వాత అతని కుమారుడు యాకూబ్ రాజయ్యారు. అతడు హందంలోని ఖరాకుయున్లను కూడా అంతం చేయాలని తలచాడట. ఆ కాలం నాటికి పీర్‌కులీ కూడా మరణించాడు. అతని కుమారులు యువైస్ కులీ, అల్లాకులీ, వారి కుమారులు జీవించి ఉన్నారు. వారికి ప్రాణ రక్షణ లేకుండా పోయింది. ఆ స్థితిలో యువైస్ కులీ

తన కుమారుడైన కులీకుతుబ్‌షాను తన తమ్ముడు అల్లాకులీని భారతదేశం వెళ్లి ప్రాణరక్షణ చేసుకోమని పంపాడు. వారికి కొంత ధనం ఇచ్చి దాంతో వ్యాపారం చేసుకోమని చెప్పి పంపాడట. అప్పుడు కులీకుతుబ్‌షా తన పినతండ్రితో కలిసి గుర్రాల వ్యాపారం చేసుకొని జీవించడానికి ఢిల్లీ వచ్చారట. అక్కడ తమ వ్యాపారం సరిగ్గా జరగలేదట. అందువల్ల వారు క్రీ.శ.1486లో బహమనీ రాజ్యానికి వచ్చి బీదరులో సుల్తాన్ షిహాబుద్దీన్ మహమ్మద్‌ను దర్శించారట. బహమనీ సుల్తాన్ వారు ఇరాన్ రాజవంశానికి చెందినవారని తెలిసి గౌరవించి వారికి తన రాజధానిలో ఆశ్రయం ఇచ్చాడట. ఈ విధంగా కులీ దక్కను చేరాడు. అప్పటికి కులీ 20 సంవత్సరాల వయస్కుడు. ఆ రోజుల్లో బహమనీ రాజ్యానికి ఇరాన్, టర్కీలకు రాకపోకలున్నాయి. ఆ దేశాలలో జీవనం లేని ముస్లింలు అనేకులు భారత దేశానికి వచ్చేవారు. కొందరు ఢిల్లీ సుల్తాన్‌ల కొలువులో ఉద్యోగాలు సంపాదించేవారు మరికొందరు దక్కను చేరి బహమనీ సుల్తాన్ కొలువులో చేరేవారు. కొందరు వ్యాపారం చేసుకోవడానికి వచ్చేవారు వారి బాటననుసరించి కులీ కూడా దక్కను చేరాడు. కొందరు అతడు బానిసగా బహమనీ రాజ్యం చేరాడని అంటారు. వాస్తవం తెలియదు. కొంతకాలం తర్వాత ఇరాన్‌లో యాకూబ్ మరణించాడని వార్త తెలిసింది. అది విని కులీ పినతండ్రి అల్లా అలీ తిరిగి మాతృదేశం వెళదామని అన్నాడు. కానీ కులీ తిరస్కరించి తాను బహమనీ రాజ్యంలోనే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటానని చెప్పాడట. అందువల్ల అల్లా కులీ ఒక్కడే ఇరాన్ వెళ్లిపోయాడు కులీ ఇక్కడే ఉండి తన అదృష్టం కొద్దీ బహమనీ రాజ్యంలో ఉన్నతోద్యోగం సంపాదించి చివరకు క్రీ.శ.1518లో స్వతంత్ర గోల్కొండ రాజ్యాన్ని స్థాపించాడు.

ఉన్నత స్థితికి ఎదగడం (క్రీ.శ.1486-1494): కులీ ఉన్నత స్థితికి ఎదగడాన్ని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. కులీ యుద్ధవీరుడు, గణితశాస్త్రంలో మంచి ప్రవేశం ఉన్నవాడు. మంచి రాతకాడు పర్షియన్ భాషలో నిష్ణాతుడు. కనుక అతనికి రాజప్రాసాదంలో గణాంకాధికారిగా సుల్తాన్ షహాబుద్దీన్ మహమ్మద్ నియమించాడు. అతడు ఆ పదవి సమర్థవంతంగా నిర్వహించి సుల్తాన్ అభిమానాన్ని చూరగొన్నాడు. కులీ రాజోద్యోగం పొందడానికి ఒక వేట కారణమని తారీఖీ-కుతుబ్‌షాహి అనే గ్రంథం వల్ల తెలుస్తోంది. అతడు ఒక పర్యాయం సుల్తాన్‌తో వేటకు వెళ్లాడు. వేటాడటంలో కులీ గొప్ప నేర్పును ప్రదర్శించాడట. అందుకు ముగ్ధుడైన సుల్తాన్ అతనిని 150 అరబ్ అశ్వదళానికి ఖిల్లత్ ఇచ్చి వాటి పోషణకు క్రీ.శ.1486లో కొడంగల్ జాగీరునిచ్చి ఖవాస్‌ఖాన్ అనే బిరుదును ఇచ్చాడని తారిఖ్-ఇ-కుర్బియా అనే గ్రంథం తెలుపుతోంది. షంషుద్దీన్ మహమ్మద్ లష్కరి, ఇతడు మూడవ మహమ్మద్, అతని ప్రధాన మంత్రి ఖ్వాజామహమ్మద్ గవాన్ మరణించిన తర్వాత బహమనీ రాజ్యం క్షీణించసాగింది. రాష్ట్ర గవర్నర్లు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. రాజ్యంలో దొంగలదోపిడీలు మొదలయ్యాయి. శాంతిభద్రతలు కరువయ్యాయి. ఆ స్థితిలో తెలంగాణలో దోపిడీ దొంగలు విచ్చలవిడిగా దోపిడీలు సాగించారు. రైతులు పన్నులు చెల్లించడం లేదు. దోపిడీ దొంగలను అణచడానికి సుల్తాన్ మూడు నాలుగు వేల సైన్యాన్ని పంపాలని ఆలోచిస్తూ సైన్యాధిపతిగా ఎవరిని పంపాలో నిశ్చయించుకోలేక పోయాడట. ఆ సంగతి తెలిసి కులీ తాను వెళ్లి దొంగలను అణిచివేస్తానని, అనుమతి ఇవ్వవలసిందిగా అర్జీ పెట్టాడట. కులీకి అంతఃపుర స్త్రీల వద్ద గొప్ప గౌరవ ప్రతిష్టలు ఉండేవి. కనుక అంతఃపుర స్త్రీలు కూడా అతని అభ్యర్థిత్వాన్ని సిఫార్సు చేశారట. దాంతో తెలంగాణలోని అల్లర్లు అణచడానికి, పన్నులు వసూలు చేయడానికి సుల్తాన్ కులీకి ఆజ్ఞ ఇచ్చాడు. కులీ అతి తక్కువ పరివారంతో బయలుదేరి, దారి దొంగలను అణిచివేసి, తిరుగుబాటు చేసిన జమీందార్లు, సర్దారులను అదుపులోకి తెచ్చి వారు చెల్లించవలసిన పేష్కస్‌లను వసూలు చేసి సుల్తాన్ మన్ననలకు పాత్రుడయ్యాడు. అతడు ఇంకా ఉన్నతస్థితికి రావడానికి మరొక కారణం దోహదం చేసింది. బహమనీ దర్బారులోని సర్దారులు స్వదేశీ, విదేశీ అనే రెండు వర్గాలుగా చీలిపోయారు. స్వదేశీ సర్దారులను దక్కన్‌లని, హబ్షీలని పిలిచేవారు. విదేశీయులు (అంటే) టర్కీ, పర్షియా అరేబియాల నుండి వచ్చి బహమనీ ఆస్థానంలో ఉన్నతోద్యోగాలలో నియమింపబడిన వారిని అఫాక వర్గం అని పిలిచేవారు. సుల్తాన్‌లు అఫాక వారికి ఎక్కువ గౌరవ మర్యాదలిచ్చేవారు. అది దక్కనీలకు కంటకప్రాయమైంది. దక్కనీలు హబ్షీలు హఠాత్తుగా సుల్తాన్‌పై కుట్రచేసి 12-11-892 హిజ్రా క్రీ.శ.8-12-1487వ తేదీన హఠాత్తుగా బీదరు దుర్గంపై దాడి చేశారు. కనిపించిన వారినందరినీ సంహరిస్తూ రాజప్రాసాదంలో సుల్తాన్ నివాసంపైకి దాడికి వచ్చారు. అలాంటి ప్రమాదకర పరిస్థితిలో కులీ అక్కడే ఉన్నాడు. అతడు సుల్తాన్ ప్రాణరక్షణకు పూనుకున్నాడు. అక్కడే ఉన్న హసన్ అలీ సబ్జువారి, సయ్యద్ మీర్జా ముషయది అతనితో సహకరించారు. వారి సహాయంతో ప్రాణాలకు తెగించి విప్లవ

నాయకులు వారి సైన్యంతో తలపడి వారిని ఓడించి తరిమి సుల్తాన్ ప్రాణాలు రక్షించాడు. తర్వాత సుల్తాన్ తిరుగుబాటుదారులైన దక్కన్ హబ్షీల గృహాలపై తన సైనికులచే దాడులు చేయించి వారిని వధించి వారి ధనధాన్యాలు, జాగీరులు స్వాధీనం చేసుకొని కఠినంగా శిక్షించాడు. దాంతో దక్కనీల తిరుగుబాటు పూర్తిగా అణిగిపోయింది. ప్రమాద సమయంలో తన ప్రాణాలు కాపాడి తిరుగుబాటుదారులను అణిచివేసిన కులీపై సుల్తాన్‌కు అపార అభిమానం కలిగింది.

బహుదూర్ గిలాని తిరుగుబాటు క్రీ.శ.1493: కులీ ఇంకా పైకి ఎదగడానికి మరొక అవకాశం వచ్చింది. గోవాను కేంద్రంగా చేసుకొని పశ్చిమ బహమనీ రాజ్యానికి గవర్నర్‌గా ఉన్న బహుదూర్ గిలాని స్వతంత్రం ప్రకటించాడు. అంతేగాక అతడు పశ్చిమ తీరప్రాంతంలోని ధాబోల్ లేక దేభల్ వరకు ఉన్న ప్రాంతం ఆక్రమించాడు. బహమనీ రాజ్యభాగాలు ఆక్రమించడమే గాక గుజరాత్ సుల్తాన్‌కు చెందిన పశ్చిమ తీరంలోని చౌల్ మాహిమ్ రేవులను కూడా ఆక్రమించాడు. అది తెలిసి గుజరాత్ సుల్తాన్ బహమనీ సుల్తాన్ మహమూద్‌కు కబురు పెట్టి గిలానీని శిక్షించమని కోరాడు. సుల్తాన్ తన సర్దారులను పిలిపించుకొని స్వయంగా గిలానీపై దండెత్తాడు. సుల్తాన్‌తో కులీ, కాశింబరీద్, ఫతేపుల్లా ఇమాదుల్ముల్క్, యూసఫ్ ఆదిల్‌ఖాన్, మాలిక్ అహమ్మద్ బహరి, తెలంగాణ లేక దక్కన్ తఫ్‌దార్ కుతుబ్ ఉల్ ముల్క్‌లు బయలుదేరారు. వారు గిలానీకి చెందిన జాంఖండి దుర్గాన్ని ముట్టడించారు. దక్కన్ తరఫ్‌దార్ కుతుబ్ ఐ ఉల్ ముల్క్ నాయకత్వంలో కోట ముట్టడి జరిగింది. ఈ యుద్ధంలో గిలానీ సైన్యం దక్కన్ తఫేదార్ కుతుబ్ ఐ ఉల్ ముల్క్‌ను సంహరించారు. తర్వాత కులీ సైన్యానికి నాయకత్వం వహించి గిలానీ సైన్యాన్ని ఓడించి జాంఖండి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. తర్వాత గిలానీ వెంటబడి అనేక చోట్ల ఓడించాడు. గిలానీ చివరకు పన్హాలాకు పారిపోయాడు. కులీ పన్హాలాను ముట్టడించి భీకరమైన పోరు జరిపి బహదూర్ గిలానీని 5-2-900 హిజ్రా, క్రీ.శ.5-11-1494లో సంహరించాడు. గిలానీని ఓడించినందుకు సంతోషించి గుజరాత్ సుల్తాన్ మహమ్మద్‌కు నజరానాలు పంపించాడు. గిలానీతో యుద్ధం జరుగుతున్నప్పుడు మిర్చీఖిలా దుర్గ పాలకుడైన పూటానాయక్ అనే మరారా దుర్గాధీశుడు సుల్తాన్‌పై తిరుగుబాటు చేశాడు. కులీ అతనిపై దండెత్తి అతనిని ఓడించి కోటను, ధనాగారాన్ని స్వాధీనం చేసుకొని సుల్తాన్‌కు అప్పగించాడు. సుల్తాన్ కులీ విజయాలకు, పరాక్రమానికి మెచ్చుకొని అతనికి యుద్ధంలో మరణించిన దక్కన్ తరఫ్‌దారు బిరుదు అయిన కుతుబ్ ఐ ఉల్ ముల్క్ బిరుదునిచ్చి ఖాళీగా ఉన్న తెలంగాణ రాష్ట్రానికి క్రీ.శ.1496లో తరఫ్‌దార్ పదవిలో నియమించాడు. అందువల్ల కులీ తెలంగాణ తరఫ్‌దారు అయ్యాడు. అతని రాజకీయ స్థితి తారాస్థాయికి వచ్చింది. తెలంగాణలో అతి ముఖ్యమైన దుర్గం గోల్కొండ. దానికి కులీ అధిపతి అయ్యాడు.

వంశనామం - కుతుబ్ షా వంశం మారటం: కులీకి ఇచ్చిన కుతుబ్ ఉల్ముల్క్ అనే బిరుదులోని కుతుబ్ చివరకు అతని వంశనామమైంది. దానికి ముందు కులీ చేర్చుకొని అతడు కులీ కుతుబ్ షా అయ్యాడు. కులీ అనే పదం అతని వంశం నుంచి వారసత్వంగా వచ్చింది. అతని తాత పీర్‌కులీ, అతని పినతండ్రి అల్లాకులీ, అతని తండ్రి యువైస్ కులీ. కనుక కులీ అనే పదం వారి నుండి వచ్చింది. కుతుబ్ అనే పదం సుల్తాన్ ఇచ్చిన హోదా రెండూ కలిసి అతని పేరు కులీ కుతుబ్ షా అయింది. కనుక అతని వంశం కుతుబ్‌షా వంశంగా ప్రసిద్ధి చెందింది. అతని వారసులు తమ పేర్లలో కులీ-కుతుబ్ షా అనే రెండు పదాలు జోడించుకున్నారు. సుల్తాన్ కులీకుతుబ్ షా, సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్ షా అనే పేర్లు ధరించారు. ఈ విధంగా ఒక నూతన వంశం ఆంధ్రదేశ చరిత్రలో అవతరించింది.

బహమనీ రాజ్య విచ్ఛిన్నం క్రీ.శ.1490: బీదరులో కాశింబరీద్ ప్రబలుడై సుల్తాన్ మహమ్మద్‌ను తన అదుపాజ్ఞలలో పెట్టుకున్నాడు. దాంతో మిగిలిన తరఫ్‌దారులకు సుల్తాన్‌తో సంబంధాలు తెగిపోయాయి. మిగిలిన సర్దారులకు కాశింబరీద్‌కు లోబడటం ఇష్టం లేదు. ఒక్కొక్క తరఫ్‌దార్ స్వతంత్ర ప్రకటనకు పూనుకున్నారు. మొదటగా స్వతంత్ర ప్రకటన చేసింది బేరార్ తరఫ్‌దార్. గవాలీఘర్‌లో బహమనీ గవర్నర్‌గా ఉన్న ఇమద్ ఉల్‌ముల్క్ 1490లో స్వతంత్రుడై ఎలిచ్‌పూర్‌ను రాజధానిగా చేసుకున్నాడు. అతని చర్య మిగిలిన తరఫ్‌దారులకు ఉత్సాహాన్నిచ్చింది. అదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1490లో బీజాపూరు, అహ్మద్‌నగర్ పాలకులు స్వతంత్రం ప్రకటించారు. వారు తమ పేరుతో ఖుదున్‌బత్తులను ప్రకటించారు. తమ పేర నాణేలు ముద్రించారు. తామే సుల్తాన్ పేరు లేకుండా శాసనాలు వేయించారు. ఇవన్నీ స్వతంత్ర ప్రకటనా లక్షణాలు. దాంతో క్రీ.శ.1490లో బహమనీ సామ్రాజ్యం విచ్ఛిన్నమైందని చెప్పవచ్చు. క్రీ.శ.1492లో కాశింబరీద్ సుల్తాన్ మహమ్మద్‌ను ఖైదు చేసి

బీదరు రాజ్యాన్ని సొంతం చేసుకున్నాడు. 24-12-924 హిజ్రా- క్రీ.శ. 27-12-1518లో సుల్తాన్ మహమ్మద్ ఖైదులోనే మరణించాడు. అతని మరణం తర్వాత బహమనీ రాజ్యం బీజాపూర్, అహమ్మద్‌నగర్, బేరార్, గోల్కొండ, బీదర్ అనే ఐదు రాజ్యాలుగా చీలిపోయింది. దాంతో బహమనీ రాజ్యం పూర్తిగా విచ్ఛిన్నమై పోయింది.

కులీ కుతుబ్‌షా స్వతంత్ర ప్రకటన క్రీ.శ.1518: చరిత్రకారుల మధ్య కులీకుతుబ్‌షా స్వతంత్ర ప్రకటన మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. ఫెరిష్తా కులీ స్వతంత్రం ప్రకటించాడని రాశాడు. తారిఖీ-ఇ-మహమ్మద్ కుతుబ్షా గ్రంథం కంజాల్ కుషాట్ అనే మరొక గ్రంథం క్రీ.శ.1518 నాటి జామే మసీదు శాసనం కులీ స్వతంత్రం ప్రకటించలేదని తెలుపుతోంది. క్రీ.శ.1490 నాటికి బీజాపూర్ అహమ్మద్‌నగర్ స్వతంత్రం ప్రకటించుకున్నాయి. వారితోపాటు కులీ కూడా క్రీ.శ.1489లోనే స్వతంత్రం ప్రకటించాడని కొందరు భావించారు. కాని అది వాస్తవం కాదు. కారణమేమిటంటే- ఆనాటికి అతడు తెలంగాణ తరఫ్‌దారునిగా నియమింపబడలేదు. తెలంగాణ తరఫ్‌దార్ కుతుబ్ ఉల్‌ముల్క్ గిలానీతో జరిగిన యుద్ధంలో క్రీ.శ.1494లో మరణించాడు. ఆ తర్వాత రెండు సంవత్సరాలకు అంటే క్రీ.శ.1496లో కులీ తెలంగాణ తరఫ్‌దారుగా నియమింపబడ్డాడు. కనుక అతనికి రాజ్యమే లేదు. క్రీ.శ.1490 నాటికి అతడు కొడంగల్లు జాగీరుదారు మాత్రమే.. కనుక అతడు 1489లో స్వతంత్రం ప్రకటించడానికి అవకాశమే లేదు. క్రీ.శ.1496లో అతడు తెలంగాణ తరఫ్‌దారుగా నియమింపబడిన తర్వాత అతడు ఇంకా సుల్తాన్‌ను విశ్వాసంగా కొలిచాడు. అంతేగాదు సుల్తాన్ బీజాపూరును లొంగదీయాలని దండయాత్రకు బయలుదేరినప్పుడు కులీ సుల్తాన్‌కు సహాయంగా బీజాపూర్‌పై యుద్ధానికి తరలివెళ్లాడు. అతడు క్రీ.శ.1512లో స్వతంత్రం ప్రకటించాడని మరొక వాదన ఉంది. కాని అది కూడా వాస్తవం కాదు. ఆనాటి సుల్తాన్ కాశింబరీద్ ఆధీనంలో ఉన్నాడు. కులీ అతనిని విడిపించడానికి చాలా ప్రయత్నం చేశాడు. మిగిలిన తరఫ్‌దారులను సహాయంగా రమ్మన్నాడు. బీజాపూర్, అహమ్మద్‌నగర్, బేరారుల సహకారం లభించలేదు. తాను ఒక్కడూ ఏమీ చేయలేకపోయాడు. బరీద్ సుల్తాన్ మంచిచెడ్డలు కూడా చూడలేదు. సుల్తాన్ నిత్యజీవితానికి ధనం చాలక అవస్థలు పడుతున్నాడని తెలిసి ప్రతినెలా 5 వేల హొన్నులు ధనాన్ని సుల్తాన్‌కు రహస్యంగా పంపేవాడు. కనుక బరీద్ బందిఖానాలో చిక్కుకున్నందుకు సుల్తాన్‌పై అతనికి చాలా జాలి ఉంది. అంతేగాక బీజాపూర్, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లు తమతోపాటు స్వతంత్రం ప్రకటించమని కోరారు. కులీ వారి కోరికను తిరస్కరించాడు. సుల్తాన్ 1518లో మరణించే వరకు అతడు సుల్తాన్‌కు విధేయుడుగానే ఉన్నాడని గోల్కొండ దుర్గంలోని నిజామీ మసీదు శాసనం తెలుపుతోంది. ఆ శాసనం మహమ్మద్ పేరుతో ప్రకటింపబడింది. కనుక అతడు సుల్తాన్ మరణించిన తర్వాత క్రీ.శ.1518లో స్వతంత్రుడయ్యాడు. అయినప్పటికీ అతడు స్వతంత్ర ప్రతిపత్తిని సూచించే షా బిరుదును ధరించలేదు. కుతుబ్ ఉల్‌ముల్క్ అనే బిరుదుతోనే తృప్తిపడ్డాడు. ప్రజలు కూడా అతనిని బడేమాలిక్ అని పిలిచారేగానీ సుల్తాన్‌గా పిలిచినట్లు కనిపించదు. ఇతడు ఢిల్లీనేలిన ఇబ్రహీం లోఢీ, బాబరు, హుమాయూన్ షేర్షాలకు సమకాలికుడు.

గోల్కొండకు రాజధానిని మార్చటం క్రీ.శ.1518: కులీకుతుబ్ షాకు క్రీ.శ.1518 వరకు కొడంగల్లు రాజధాని. అతడు కొడంగల్లు జాగీరు తనకు రాగానే అక్కడ ఒక కోటను నిర్మించాడు. నివాసగృహాలు, మసీదులు, ఉద్యానవనాలతో అందంగా నిర్మించాడు. రెండు హమ్మమ్‌లు, ఒకటి తన సమాధి వద్ద పురుషులకు, మరొకటి కోట లోపల స్త్రీలకు నిర్మించాడు. తన సమాధిని కూడా తానే నిర్మించుకున్నాడు. ఈ నిర్మాణంలో అతడు కుతుబ్ షాహి వాస్తువును ప్రారంభించాడు. అవసర సమయాల్లో సుల్తాన్‌కు సహాయంగా బీదర్‌లో ఉండేవాడు. కొడంగల్ వద్ద కులీ హసనాబాద్ అనే గ్రామాన్ని నిర్మించి అక్కడ బారా అమాములు పేరుతో ఒక లంగరుఖానాను నిర్మించాడు. దాని పోషణకు కొన్ని గ్రామాలను ఈనాముగా ఇచ్చి క్రీ.శ.1514లో అక్కడ శాసనం వేయించాడు. ఇది కులీ వేయించిన మొదటి శాసనం. నేడు కొడంగల్ వద్ద కోట శిథిలాలు కనిపిస్తున్నాయి. క్రీ.శ.1518లో సుల్తాన్ మహమ్మద్ మరణించిన తర్వాత అతడు తన రాజధానిని గోల్కొండకు మార్చాడు.

గోల్కొండ కోట నిర్మాణం: గోల్కొండకు పూర్వం కళ్యాణీ చాళుక్యుల కాలంలో మానుగల్లు అనే పేరుండేది. కొందరు దానిని మంగళవరం అనే వారని భావించారు. కాకతీయుల కాలంలో అక్కడ గొల్లవారు పశువులను మేపుకొనేవారట. కనుక దానిని కాకతీయుల కాలంలో గొల్లకొండ అని పిలిచేవారట. కాకతీయులు అక్కడ ఒక చిన్న కోటను నిర్మించారు. కాపయనాయకుడు బహమనీ సుల్తాన్ మొదటి మహమ్మద్‌షా చేతిలో ఓడిపోయి గొల్లకొండ బహమనీ సుల్తాన్ పరం చేశాడు. నాటి నుండి గొల్లకొండ బహమనీ రాజ్యంలో భాగంగా కొనసాగింది.

కులీ కుతుబ్‌షా తనకు వచ్చిన తెలంగాణ రాజ్యానికి ఆ కోట తగిన రాజధాని అని నిర్ణయించుకుని తన రాజధానిని అక్కడికి మార్చుకొని పటిష్టమైన కోటను నిర్మించాడు. అతడు నిర్మించిన బాలహిసార్ దర్వాజా చెప్పుకోదగింది. అతడు తన రాజ్యాన్ని, రాజధానిని, బీజాపూర్, అహమ్మద్‌నగర్‌లకు దీటుగా ఉండాలని బలమైన దుర్గాన్ని నిర్మించాడు. అతని కాలంలో కోట వెలుపల ప్రాకారం నిర్మింపబడింది. లోపల రాజప్రాసాదాలు, స్నానవాటికలు, ముసాఫిర్‌ఖాన్‌లు నిర్మించి అన్ని సదుపాయాలు చేకూర్చాడు. పట్టణానికి మహమ్మద్‌నగరం అని పేరు పెట్టాడు. కాలక్రమేణా సామంతులు, మాండలికులు, దండనాయకులు, విదేశస్తులు, వ్యాపారులు వచ్చి నివసించినందున త్వరితగతిన జనాభా పెరిగి నగరం అభివృద్ధి చెందింది. కులీ తన హయాంలోనే తన రాజ్యాన్ని బీజాపూర్, అహ్మద్‌నగర్ రాజ్యాలకు దీటుగా తయారు చేశాడు. సైన్యాలను సమకూర్చుకున్నాడు. అన్ని విధాలా రాజ్యాన్ని పటిష్టంగా రూపొందించాడు. తర్వాత తన రాజ్య విస్తరణకు పూనుకున్నాడు.

కులీ స్వతంత్రం ప్రకటించే నాటికి ఆంధ్రదేశ పరిస్థితి క్రీ.శ.1518: కులీ స్వతంత్రం ప్రకటించే నాటికి తూర్పు కోస్తాలో శ్రీకృష్ణదేవరాయలకు, ప్రతాపరుద్ర గజపతికి యుద్ధాలు ముగిశాయి. వారు సంధి చేసుకొని వారి రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా నిర్ణయించుకున్నారు. కొండవీడు రాజ్యం వరకు విజయనగర సామ్రాజ్యం, కృష్ణానదికి ఉత్తర భాగమంతా గజపతి రాజ్యంగా ఉంది. ఉత్తర కోస్తాతోపాటు తెలంగాణలోని ఓరుగల్లు వరకు ప్రతాపరుద్ర గజపతి అధీనంలో ఉంది. తెలంగాణలో గజపతి చితాబ్‌ఖాన్‌ను తన ప్రతినిధిగా నియమించాడు. చితాబ్‌ఖాన్ ఓరుగల్లును తన రాజధానిగా చేసుకొని పాలిస్తున్నాడు. అతని రాజ్యంలో ఖమ్మంమెట్టు అతి బలిష్టమైన దుర్గం. అతని రాజ్యంలో ఉర్లుగొండ, కనకగిరి, అనంతగిరి, అరువపల్లి, చిట్యాల, బెల్లంకొండ మొదలైన దుర్గాలున్నాయి. తెలంగాణలోని రాజులందరిలో చితాబ్‌ఖాన్ గొప్ప బలవంతుడు. రాచకొండ, దేవరకొండ, నల్లగొండలలో స్వతంత్ర పాలకులు పాలిస్తున్నారు. రాచకొండను వెంగుట్టినాయబ్ పాలిస్తున్నాడని ముస్లిం చరిత్రకారులు రాశారు. అతని పేరు వెంకటనాయకుడు అయి ఉంటుంది. నల్లగొండ దుర్గానికి యేరువ సింహాసనమని పేరు. దానిని ఈ కాలంలో హరిశ్చంద్రరాజు పాలిస్తున్నాడు. కులీ గోల్కొండ జాగీరుగా నియమింపబడి ఉన్నప్పుడు అతని రాజ్యం అతి చిన్నది. అది కోహీర్ నుండి ఓరుగల్లు వరకు విస్తరించి చితాబ్‌ఖాన్ రాజ్యానికి తాకి ఉంది. ఈ స్థితిలో అతడు రాజ్య విస్తీర్ణానికి పూనుకున్నాడు. కాని తీరాంధ్రదేశం మహావీరులైన కృష్ణదేవరాయలు, ప్రతాపరుద్ర గజపతుల అధీనంలో ఉంది. దానిని జయించడం అసాధ్యం అని భావించి తెలంగాణ వరకు తన రాజ్యంలో కలుపుకోవాలని తెలంగాణలోని చిన్న రాజ్యాలపై దాడులు ప్రారంభించాడు. తెలంగాణను నాలుగు దశలుగా జయించాడు.

తెలంగాణను నాలుగు దశలుగా జయించటం-మొదటి దశ క్రీ.శ.1519: కులీ తెలంగాణను జయించాలని తీర్మానించుకున్న తర్వాత అతని దండయాత్ర రాచకొండ దాడితో ప్రారంభమైంది. రాచకొండ పాలకుడు వెంకట్‌నాయబ్ కులీ సైన్యాలతో భీకరంగా పోరాడాడు. చివరకు ఓడిపోయాడు. రాచకొండను స్వాధీనం చేసుకొని తన సైన్యాలను పునర్నిర్మాణం చేసుకొని దేవరకొండపై దండెత్తాడు. దేవరకొండ ఏడుకొండల చేత చుట్టబడి ఉన్న బలమైన దుర్గం. దానిని కూడా జయించాడు. తర్వాత నల్లగొండపై దండెత్తి ఆ దుర్గాన్ని పాలించే రాజారామచందర్‌ని ఓడించి సామంతునిగా చేసుకున్నాడు. నల్లగొండ, దేవరకొండ ఆక్రమణలతో కులీ రాజ్యం విజయనగర సరిహద్దును తాకింది. దేవరకొండ తర్వాత పానుగల్లు దుర్గం ఉంది. అది విజయనగర రాజ్యంలో భాగం. కులీ పానుగల్లును ముట్టడించాడని, అచ్యుతదేవరాయలు తన కోట రక్షణకు రాగా కులీ అతనిని ఓడించి పానుగల్లు స్వాధీనం చేసుకున్నాడని ప్రొఫెసర్ హెచ్‌కె షేర్వాణి రాశారు. కాని అది వాస్తవం కాదు. దేవరకొండ విజయ కాలం నాటికి అచ్యుత దేవరాయలు రాజ్యానికి రాలేదు. కృష్ణదేవరాయలు రాజ్యం చేస్తున్నాడు. దేవరకొండ తర్వాత అతడు ఘనాపురాన్ని జయించాడు. ఘనాపురాన్ని జయించడంతో కులీ రాజ్యం పశ్చిమాన బీజాపూర్ రాజ్యపు సరిహద్దుల వరకు విస్తరించింది. ఘనాపురంలో శక 1451 అంటే క్రీ.శ.1529 నాటి శాసనం ఉంది. ఆ శాసనం కులీ కుమారుడు యార్‌కులీ కుమారుడు మాలుక్ అంటే కులీ మనుమడు అక్కడ ఒక బావిని తవ్వించి తన పుత్ర పౌత్రాదులకు శుభాలు కలగాలని శాసనం వేయించాడు.

కొండవీటిపై దండయాత్ర క్రీ.శ.1521: కృష్ణదేవరాయలు క్రీ.శ.1521లో రాయచూరుపై దండెత్తాడు. ఆ సమయంలో కులీ కొండవీటిపై దండెత్తాడు. రాయలు రాయచూరు యుద్ధం తర్వాత తన సేనాధిపతి వెలుగోటి గని తిమ్మానాయుడి నాయకత్వంలో సైన్యాన్ని పంపి కులీని ఓడించి తరిమాడు.

తెలంగాణ దండయాత్ర రెండో దశ-ఎల్లందల మలంగూర్‌ల ఆక్రమణ: ఈ సందర్భంలో బహమనీ సరదారుడైన క్వానామ్ ఉల్‌ముల్క్ Qiwam-ul-Mulk తెలంగాణలోని ఎల్లందల, మలంగూరులను ఆక్రమించాడు కులీ ఎల్లందలపై దండెత్తి క్వావామ్‌ను ఓడించి ఎలంగూరు, మలంగూరులను ఆక్రమించాడు.

బేరారుపై దండయాత్ర-హప్పతప్పా (Haft Tappa) ఆక్రమణ: ఎల్లందల వద్ద ఓడిపోయిన క్వావామ్ బేరారు రాజ్యంలో ప్రవేశించి బేరారు దర్యా ఇముడ్‌షాను సహాయం అర్థించాడు. అది తెలిసి కులీ బేరారు సుల్తాన్‌కు రాయబారిని పంపి కువామ్‌ను తన రాజ్యం నుండి వెళ్లగొట్టాలని కోరాడు. అంతేగాక తన రాజ్యంలోని హప్పాతప్పా పొరపాటున బేరారు రాజ్యంలో కలిసిపోయిందని, దానిని అప్పగించాలని కూడా కోరాడు. కాని బేరారు సుల్తాన్ అంగీకరించలేదు. దాంతో కులీ బేరారు రాజ్యంపై దండెత్తి రాంగిరిని ముట్టడించాడు. అక్కడ 2000 వేల తన సైన్యాన్ని రిజర్వుగా ఉంచుకొని కొంత సేనతో బేరారు సైన్యాలను ఓడించి హప్పాతప్పాను ఆక్రమించాడు. అతడి యుద్ధ వ్యూహం ఫలించింది. విజయం లభించింది.

తెలంగాణ ఆక్రమణ-మూడవ దశ-చితాబ్‌ఖాన్‌తో పోరాటం: తర్వాత అతడు చితాబ్‌ఖాన్ రాజ్యంపై దండెత్తాడు. చితాబ్‌ఖాన్ అసలు పేరు సీతాపతి. ఆ కాలంలో అతడు గొప్ప వీరుడుగా ప్రసిద్ధి చెందాడు. అందువల్ల ముస్లింలు అతనిని సితాబ్‌ఖాన్, చితాబ్‌ఖాన్ అని పిలిచేవారు. కులీ చితాబ్‌ఖాన్‌కు చెందిన ఓరుగల్లుపై దండెత్తి కోటను పట్టుకున్నాడు. చితాబ్‌ఖాన్ అప్పుడు అక్కడ లేడు. విషయం తెలిసి తన సైన్యంతో వచ్చి కులీతో తలపడ్డాడు. కాని ఓడిపోయి ఖమ్మంమెట్టు చేరాడు. ఖమ్మంమెట్టుకు స్తంభగిరి అని పేరుంది. అది బలిష్టమైన కోట. చితాబ్‌ఖాన్ కొండపల్లి, రాజమండ్రి, బెల్లంకొండల నుండి కొత్త సైన్యాన్ని తెప్పించి మళ్లీ యుద్ధానికి సిద్ధపడ్డాడు చితాబ్‌ఖాన్ మూడు లక్షల పదాతి దళాన్ని, ముప్పై వేల గుర్రపు దళాన్ని సమీకరించాడని ముస్లిం చరిత్రకారులు రాశారు. ఈ యుద్ధానికి మొత్తం గజపతి సైన్యం కదిలి వచ్చిందని ముఖ్యారామ్ రామచంద్రుడు, హరిశ్చంద్రుడు కూడా వచ్చారని ముస్లిం రాతల ద్వారా తెలుస్తోంది. వారిద్దరూ కొండపల్లి, రాజమహేంద్రవరాల దుర్గ పాలకులు కొందరు రామచంద్రుని ప్రతాపరుద్ర గజపతి కుమారుడు కావచ్చని భావించారు. అక్కడ జరిగిన యుద్ధంలో కులీ అపూర్వ విజయం సాధించాడు. ఖమ్మంమెట్టు స్వాధీనం అయింది. రామచంద్రుడు, చితాబ్‌ఖాన్‌లు కొండపల్లికి పారిపోయారు. ఈ యుద్ధం క్రీ.శ.1522లో జరిగి ఉండవచ్చు.

కొండపల్లిపై దండయాత్ర క్రీ.శ. 1523-24: కులీ ఖమ్మంమెట్టును సాధించిన తర్వాత గజపతి సైన్యాలను తరుముతూ పోయి కొండపల్లి దుర్గాన్ని ముట్టడించి దానిని కూడా జయించాడు. బెజవాడ తాలూకాలోని మల్కాపురంలో క్రీ.శ.1523-24 నాటి కులీ శాసనం ఉంది. కనుక క్రీ.శ.1523-24 నాటికి కొండపల్లి కులీ అధీనంలోనే ఉందని ఈ శాసనం స్పష్టం చేస్తోంది. కాని ఆ విజయం తాత్కాలికమే. పరాజయ వార్తలన్నీ తెలిసి ప్రతాపరుద్ర గజపతి స్వయంగా బయలుదేరి కొండపల్లిచేరి కులీ సైన్యాలను ఓడించి తరిమివేశాడు. ప్రతాపరుద్ర గజపతి మంగళగిరిలో దేవాలయాన్ని నిర్మిస్తున్నట్టు ఆ సమయంలో ఉండవల్లిని దర్శించినట్లు ఉండవల్లిలో క్రీ.శ.1526 నాటి శాసనం ఉంది. గజపతి కులీని ఓడించి తరిమి ఆ ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకున్నట్టు ఉండవల్లి శాసనం స్పష్టం చేస్తోంది. ఇదే సంవత్సరంలో అంటే క్రీ.శ.1526లో బాబరు మొదటి పానిపట్టు యుద్ధంలో ఇబ్రహీం లోడీని ఓడించి ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యాన్ని అంతం చేసి ఢిల్లీలో మొగల్ రాజ్యాన్ని స్థాపించాడు. అదే సంవత్సరంలో కులీ దక్కనులో తన రాజ్య విస్తరణానికి పాటుపడుతున్నాడు.

బీజాపూరుతో యుద్ధం-కోవెలకొండ ఆక్రమణ-కోహిర్ ఆక్రమణ: కులీ కొండపల్లి వద్ద గజపతితో పోరాడే సమయంలో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షా గోల్కొండ రాజ్యంపై దండెత్తి కళ్యాణిని ఆక్రమించి తర్వాత కోవెలకొండపై దండెత్తాడు. కులీ తన సైన్యాలతో చేరి నాలుగు రోజుల ముట్టడితో బీజాపూరు సైన్యాలను ఓడించి తరిమి కోవెలకొండను కాపాడుకున్నాడు. అతని కుమారుడు హైదర్‌ఖాన్ సాహసంగా పోరాడి తర్వాత ఘనాపూర్‌పై దండెత్తాడు. అక్కడ ఆదిల్షాహీ సైన్యంతో జరిగిన పోరాటంలో కులీకి అంటే కుతుబ్ ఉల్‌ముల్క్‌కు మొఖం మీద దెబ్బలు తగిలాయి. అవి గాయాలై కొంతకాలం బాధించాయి. ఈ యుద్ధాలలో బీజాపూరు సుల్తాన్‌కు బీదర్ సుల్తాన్ ఆలీబరీద్ సహాయం చేశాడు. కోవెలకొండ యుద్ధం తర్వాత ఆలీబరీద్‌ను దండించడానికి బీదర్ రాజ్యంపై దండెత్తి కోహిర్ దుర్గాన్ని ముట్టడించాడు. మూడునెలల ముట్టడి తర్వాత బరీద్ కులీతో సంధి చేసుకొని కోహిర్ దుర్గాన్ని కులీ పరం చేశాడు.

నల్లగొండ తిరుగుబాటు: కులీ బీజాపూరు, బీదరు యుద్ధాలలో ఉండగా నల్లగొండలోని సామంతుడు రాజా

హరిచంద్ తిరుగుబాటు చేశాడు. కులీ నల్లగొండపై దండెత్తి హరిచంద్‌ను ఓడించి అతని అధీనంలో ఉన్న చిట్యాల, నల్లగొండలను స్వాధీనం చేసుకొని హరిచంద్‌ని తొలగించి తన సరదారులను పాలకులుగా నియమించాడు.

కొండవీడు దండయాత్ర క్రీ.శ.1529-30-పానుగల్లు విజయం: క్రీ.శ.1529లో శ్రీకృష్ణదేవరాయలు మరణించాడు. రాయల మరణం తర్వాత ప్రతాపరుద్ర గజపతి విజయనగర రాజ్యంపై దండెత్తాడు. అల్లసాని పెద్దన ఒక పద్యం పాడి గజపతిని అవహేళన చేశాడట. దాంతో గజపతి తిరిగి రాజ్యం వెళ్లిపోయాడు. గజపతి తిరిగి వెళ్లిపోగానే కులీకి కొండవీడు, కొండపల్లిలను జయించాలనే కోరిక కలిగి పెద్ద సేనతో వచ్చాడు. తన సైన్యాన్ని మూడు భాగాలు చేసి బెల్లంకొండ, కొండవీడు, కొండపల్లిలపై ఒకేసారి దాడిచేశాడు. కృష్ణరాయల మరణానంతరం అతని తమ్ముడు అచ్యుతదేవరాయలు విజయనగర వజ్రసింహాసనం అధిష్ఠించాడు. అతడు కొండవీడు, బెల్లంకొండ కోటలను రక్షించుకోడానికి తన సేనానులైన అయ్యరుసయ్య, తిమ్మానాయుడు, రాయన భాస్కరుడు, మలర్లనాయని చినబొమ్మానాయుడు అనే సేనాధిపతులను పంపాడు. వారు కులీని ఓడించి తరిమి వేశారు. తర్వాత వారు కృష్ణ ఒడ్డున ఉన్న తెలంగాణలోని మరికొన్ని ప్రాంతాలు కూడా జయించారు. కనుక కులీ ఆ ప్రాంతాలను తిరిగి జయించడానికి వెళ్లి పానుగల్లు దుర్గాన్ని ముట్టడించాడు. అంతవరకు పానుగల్లు దుర్గం విజయనగరాధీశుల రాజ్యంలో ఉంది. పానుగల్లు వద్ద విజయనగర సేనలు అపజయం పొందాయి. దాంతో పానుగల్లు దుర్గంతో పాటు కొండవీటి విజయం సాధించిన తర్వాత విజయనగర సేనలు జయించిన ప్రాంతాలన్నీ తిరిగి కులీ వశమయ్యాయి. కొండవీడు విజయనగరం ఆధీనంలోనే ఉంది.

కొండపల్లి దండయాత్ర క్రీ.శ.1530-1531: కొండవీటి దండయాత్ర విఫలమైన తర్వాత పానుగల్లును సాధించాడు. ఆ ఉత్సాహంలో అతడు కొండపల్లిపై దండెత్తి గజపతి సైన్యాలను ఓడించి క్రీ.శ.1530లో కొండపల్లి కోటను ఆక్రమించాడు. ప్రతాపరుద్ర గజపతి తిరిగి కొండపల్లిని జయించడానికి ప్రయత్నించలేదు. ఈ కాలం నాటికి ప్రతాపరుద్ర గజపతికి వైరాగ్యం కలిగింది. తన తాత, తండ్రి సంపాదించిన రాజ్యాన్ని పోగొట్టుకొని అనేక యుద్ధాలలో ఓడిపోయి అవమానాలు పొంది, అతనికి వైరాగ్యం కలిగి చైతన్యుని భక్తుడుగా మారిపోయాడట. కనుక కొండపల్లి విజయం నిలిచింది. కొండపల్లిలో కులీ కాలానికి చెందిన క్రీ.శ.1530 సంవత్సరానికి చెందిన రెండు శాసనాలు ఉన్నాయి. మొదటి శాసనం క్రీ.శ.1530 చైత్రమాసం సోమవారం నాటిది. ఈ శాసనంలో కొండపల్లికి దక్షిణాన ఒక లంగరును నిర్మించి దాని పోషణకు కవులూరు, కిదరాబాద్ అనే గ్రామాలను దానం చేసినట్టు ఉంది. కుతుమనముల్క్ ఒడయులు అని పేర్కొనబడ్డాడు. రెండవ శాసనం క్రీ.శ.1530 వైశాఖ మాసంలో బుధవారం నాటిది. అందులో సుల్తాన్ కులీ ఆజ్ఞ ప్రకారం కొండపల్లి దాదారు అలూమియ్య, నాయబ్ రానేదార్ అదిరిజాల, కొండపల్లి స్థలకరణం గోపరాజు మహాపాత్రుడు, సుంకాలు వసూలు చేయటం లేదని శాసనం రాయించారు. శాసన రచయిత తవార కేదారమాని గోవిందరాజ మహాపాత్రుని కుమారుడు గోపరాజు మహాపాత్రుడు. ఈ శాసనాలనుబట్టి క్రీ.శ.1530 నాటికి కొండపల్లి దండపాద కులీ వశమైందని స్పష్టమవుతోంది.

ఏలూరు-రాజమండ్రిపై దండయాత్ర: ఫెరిష్టా ఏలూరు, రాజమహేంద్రవరాలను జయించారని రాశాడు. ఫెరిష్టా రాతలను పరిగణనలోకి తీసుకుంటే కులీ ఏలూరు, రాజమహేంద్రవరాలపై దండెత్తి గజపతిని పలన్‌క్విపురం వద్ద ఓడించి ఆ ప్రాంతాలను ఆక్రమించి కొంత కాలమైనా నిలబెట్టుకొని ఉంటాడు అని భావించారు. కాని అది వాస్తవంగా కనిపించడం లేదు. కారణమేమిటంటే ఫెరిష్టా రాతలో మరొక విషయం ఉంది. ఉస్నాద్ సుల్తాన్ కులీ వద్దకు తన రాయబారిని పంపి ఉభయ రాజ్యాలకు గోదావరి నదిని సరిహద్దుగా అంగీకరించాడని రాశాడు. ఈ ఉస్నాద్‌ను డాక్టర్ ఆర్.సుబ్రహ్మణ్యం ప్రతాపరుద్ర గజపతి తర్వాత గజపతి రాజ్యాన్ని కాజేసిన విద్యాధరుడు అని భావించారు. విద్యాధరుని కాలంలో ఈ సంఘటన జరిగి ఉంటే అది కులీకుతుబ్‌షా సాధించిన విజయం కాదు. కారణమేమిటంటే, ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ.1538లో మరణించాడని కొందరు, క్రీ.శ.1534-35లో మరణించాడని మరికొందరు భావించారు. గజపతి తర్వాత అతని కుమారులు ఒకటిన్నర సంవత్సరాలు పాలించారు. తర్వాత విద్యాధరుని రాజ్యం ప్రారంభమైంది. కనుక క్రీ.శ. 1535+1 1/2+7 = క్రీ.శ.1543-44 సంవత్సరం అవుతోంది. క్రీ.శ. 1538+1 1/2+7 = క్రీ.శ.1547 అవుతోంది. కులీ కుతుబ్‌షా క్రీ.శ.1543లో మరణించాడు. కనుక కులీ కాలంలో ఈ సంఘటన జరగలేదని చెప్పాలి. 1543 నుండి జంషీద్ షా పరిపాలించాడు. కాని అతడు కోస్తా మీద దండెత్తినట్టు ఎలాంటి ఆధారం లేదు. ఒకవేళ కులీ ఆ ప్రాంతాల మీద దండెత్తినా విజయం సాధించి ఉండడు. ఒకవేళ విజయం సాధించినా

రాజమహేంద్రవరం అతని వశం కాలేదు. అందుకు కారణమేమిటంటే, గోదావరి నదికి ఉత్తరభాగం మొత్తం క్రీ.శ.1572 వరకు గజపతి అధీనంలో ఉందని ద్రాక్షారామ శాసనం తెలుపుతోంది. రాజమహేంద్రవరంలో క్రీ.శ.1578 నాటి కులీ కుతుబ్‌షాల శాసనం ఉంది. కాని అంతకుముందు కాలానికి చెందిన కుతుబ్‌షాహీల శాసనాలు లేవు. కనుక పెరిష్టా వర్ణించిన దండయాత్ర అనుమానాస్పదం అని చెప్పాలి. ఆ తర్వాత కాలానికి చెందిన సంఘటనను కులీ కాలంనాటిదిగా పొరపాటున రాసి ఉండవచ్చు. కులీ చివరి కాలంలో బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా, బీదర్ సుల్తాన్ అలీబరీద్‌లు కలిసి గోల్కొండ రాజ్యంపై దండెత్తారు. కులీ అలీబరీద్ రాజ్యంలో ఉన్న కౌలాస్, మెదక్ ప్రాంతాలు తనకు చెందుతాయని కబురు పంపాడు. బరీద్ అహమ్మద్‌నగర్ సుల్తాన్ సహాయం అర్థించాడు. అతడు తాను జోక్యం చేసుకోకుండా, షాతహీర్ అనే పవిత్ర వ్యక్తిని రాజీ కుదర్చడానికి పంపాడు. షాతహీర్ మెదక్, తెలంగాణలోనిదేనని తీర్పు చెప్పాడు. దాంతో మెదక్ కులీ రాజ్యంలో భాగం అయిపోయింది. తన విజయాలను గురించి కులీకుతుబ్ షా 25 సంవత్సరాలు కాఫిర్లకు చెందిన 60-70 దుర్గాలను ముట్టడించాననీ, దేవరకొండ, పానుగల్లు, నల్లగొండ, ఖమ్మం మొదలైన దుర్గాలు తన వశమైనాయనీ అల్లా దయవల్ల వరంగల్లు నుండి మచిలీపట్టణం వరకు, గోల్కొండ నుండి రాజమహేంద్రవరం వరకు జయించి సుస్థిర రాజ్యాన్ని స్థాపించానని స్వయంగా చెప్పుకున్నాడని అంటారు. కులీ గొప్ప యోధుడే కాక దూరదృష్టి కలిగిన రాజకీయవేత్త. రాజకీయాలలో, యుద్ధ నియమాలలో అతడు హిందువా, ముస్లింవా, షియాయా, సున్నీయా అనే విచక్షణ చూపలేదు. అందరిపట్లా ఒకేవిధంగా ప్రవర్తించేవాడు. శత్రువులను పెంచుకునే తత్వం కాదు. ద్రోహం చేసిన వారిని కూడా క్షమించేవాడు. గొప్ప ఉదార స్వభావం కలవాడని అద్దంకి గంగాధర కవి ప్రశంసించాడు అయినప్పటికీ అతడు తన రాజ్యాన్ని షియా రాజ్యంగా ప్రకటించాడు. క్రీ.శ.1501లో తన రాజ్యంలో పర్షియా లేక ఇరాక్ షియారాజు షా ఇస్మాయిల్ సఫారి పేరును కుల్బాలో చేర్చాడు. ఇరాన్‌షా 1507లోనే ఇరాన్ సింహాసనం అధిష్టించాడు. ఆ సంవత్సరంలోనే గోల్కొండ రాజ్యం షియా రాజ్యంగా ప్రకటించబడింది. అప్పటి నుండి క్రీ.శ.1687లో గోల్కొండ పతనం వరకు షియా రాజ్యంగానే కొనసాగింది. అయినా వారు పరమత సహనం పాటించారు.

కులీకుతుబ్‌షా మరణం క్రీ.శ.1543: కులీకుతుబ్‌షా మరణాన్ని గురించి రెండు అభిప్రాయాలున్నాయి తబకతె ఐ అక్బర్ షాహి 24 సంవత్సరాలు పాలించిన తర్వాత కులీకుతుబ్ ఐ ముల్క్ మరణించాడని పేర్కొంది ఈ గ్రంథం క్రీ.శ.1593లో రాయబడింది. క్రీ.శ.1591లో రాయబడిన బుర్‌హన్ ఐ మాతిర్ కుతుబ్ ఐ ముల్క్‌ను అతనీ సహచరుడు చంపాడని తెలుపుతోంది. పెరిష్టా కులీని తండ్రి సేవకుని చేత జంషీద్ చంపించాడని రాశాడు ఆ హత్య కూడా జంషీద్ కళ్లముందే జరిగిందని, అతడు వెంటనే తన తండ్రిని చంపిన హంతకుని అక్కడే వధించాడని కూడా రాశాడు. చివరగా పేరు తెలియని రచయిత రాసిన తారీఖి మహమ్మద్ కుతుబ్‌షా అనే గ్రంథం గోల్కొండ కోట బయట ఉన్న మసీదులో క్రీ.శ.1543 సెప్టెంబర్ 2వ తేదీ శుక్రవారం రోజున నమాజు చేసుకునే సమయంలో కులీ హత్య చేయబడ్డాడని తెలుపుతోంది. ఈ గ్రంథం 1616లో రాయబడింది. అందులో రెండు జమాది 950 హిజ్రా రోజున చంపబడ్డాడని రాయబడింది. బురహన్‌గాని, తబకత్‌గాని, జంషీద్ తండ్రిని చంపించాడని గాని, చంపటానికి కుట్ర చేశాడని గానీ పేర్కొనలేదు. ఈ రెండు గ్రంథాలు సంఘటన జరిగిన 50 సంవత్సరాలకు రాయబడ్డాయి. జంషీద్ తండ్రిని చంపించాడని మొట్టమొదట రాసినవాడు పెరిష్టా. తారీఖి మహమ్మద్ కుతుబ్‌షా గ్రంథం ఇంకా ఎక్కువగా వివరాలిస్తూ జంషీద్ కుట్ర చేసి తండ్రిని చంపించాడని తెలుపుతోంది. ఇబ్రహీం కుతుబ్‌షా కుమారుడు మహమ్మద్ కులీ కాలంలో రాయబిన తవారీఖి కుతుబ్‌షాహీ హంతకుడు పట్టుబడగానే నూతన రాజు చేత శిక్షింపబడ్డాడని చెబుతోంది. ఈ వివరాలన్నీ పరిశీలిస్తే జంషీద్ తండ్రిని చంపించాడని స్పష్టంగా చెప్పటానికి వీలులేదు. కులీ కుతుబ్‌షాకు హైదర్‌కులీ, కుతుబుద్దీన్, యార్‌కులీ లేక జంషీద్‌కులీ, అబ్దుల్‌కరీమ్, దౌలత్‌కులి, ఇబ్రహీం కులి అనే ఆరుగురు కుమారులు ఉన్నారు. వారిలో మొదటివాడైన హైదర్ కులీని గోల్కొండ సింహాసనానికి వారసుడుగా తండ్రి ప్రకటించాడు. కాని అతడు తండ్రికి ముందే మరణించాడు. రెండవ కుమారుడు కుతుబుద్దీన్ యువరాజ పదవిని అలంకరించాడు గాని అతనికి పరిపాలనా దక్షత లేదు. మూడవ కుమారుడు జంషీద్ సమర్థుడు, వీరుడు కాని క్రూరుడు, కఠిన హృదయం కలిగిన కుటిలుడు. నాల్గవ కుమారుడైన అబ్దుల్ కరీం పరిపాలనా విషయాలు తెలిసినవాడే గానీ కోపిష్టి. తీవ్ర స్వభావుడు. అయిదవ కుమారుడు దౌలత్ కులీ సమర్థుడేగానీ ఆవేశపరుడు. ఆరవ కుమారుడైన ఇబ్రహీం కులీ

సమర్థుడు, ఉన్నత స్వభావం కలవాడు, ఆలోచనాపరుడు, పరిపాలనాదక్షుడు. తండ్రి మరణించె నాటికి అతడు దేవరకొండ దుర్గానికి అధిపతిగా ఉన్నాడు. తండ్రి తర్వాత సింహాసనం అధిష్టించాలని సోదరులు ఎవరికి వారే నిర్ణయించుకొని పరస్పర ఘర్షణలకు దిగారు. అబ్దుల్ కరీం తండ్రిపై తిరుగుబాటు చేసి బీజాపూర్ సుల్తాన్ సహాయంతో గోల్కొండ కోటను ఆక్రమించదలచాడు. కాని ఆ కార్యక్రమం నెరవేరకుండానే అతను బీజాపూరు సరిహద్దుల్లోనే మరణించాడు. యార్‌కులీ, దౌలత్‌కులీలు కలహించుకోసాగారు. సుల్తాన్‌కులీ వారి ప్రవర్తనకు మానసిక వ్యథకు గురయ్యాడు. దౌలత్‌కులీని భువనగిరి దుర్గానికి, యార్‌కులీని గోల్కొండ కోటకు పంపి వారిని నిర్బంధించాడు.

జంషీద్ తండ్రిని వధించడానికి కుట్ర చేయడం: గోల్కొండలో బంధింపబడిన యార్‌కులీ తన తండ్రి తనను బంధించినందుకు కోపించటమేగాక తండ్రి తనకు సింహాసనం అప్పగించడని భావించాడు. తండ్రిని వధించి సుల్తాన్ కావాలని భావించాడు. అందుకు మీర్ మహమ్మద్ హందాని అనే వ్యక్తి సహాయం అర్థించాడు. అతను అందుకు అంగీకరించాడు. క్రీ.శ.1543 సెప్టెంబర్ 2వ తేదీ శుక్రవారం నాడు సుల్తాన్ కులీ తాను నిర్మించిన జామే మసీదులో నమాజు చేసి బయటకు వచ్చి అక్కడ జరుగుతున్న ఒక కట్టడ నిర్మాణానికి కూలీలకు ఆదేశాలిస్తూ ఉన్నాడు. ఆ సమయంలో మీర్ మహమ్మద్ హందాని కరవాలంతో వచ్చి హఠాత్తుగా కులీ కుతుబ్ తల నరికివేశాడు. తర్వాత జంషీద్ వద్దకు వెళ్లి ఆ సంతోష వార్త తెలిపాడు. హందాని జీవించి ఉంటే తన కుట్ర బయటపడుతుందని జంషీద్ తన కరవాలంతో అతనిని సంహరించాడు. తండ్రి మరణించగానే అతనిని విడుదల చేశారు. బయటపడిన తర్వాత అంతఃపురాన్ని ఆక్రమించి అన్న కుతుబుద్దీన్ కళ్లు పీకించి అందరినీ బెదిరించి అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు.

నిర్బంధం నుండి బయటపడిన తర్వాత అతడు ప్రవర్తించిన తీరును పరిశీలిస్తే అతడు తండ్రిని కుట్రతో హత్య చేయించాడనే భావం కలుగుతుంది. ఏమైనా తండ్రి మరణానంతరం అతడు క్రీ.శ.1543లో గోల్కొండ సింహాసనం అధిష్టించాడు. కులీకుతుబ్‌షా ఎక్కడో ఇరాన్‌లో జన్మించి ఇండియా వచ్చి గోల్కొండ రాజ్యాన్ని సంపాదించి ఆంధ్రదేశానికి వారసుడవటం, అతని వంశస్తులు 170 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించటం ఆంధ్రదేశ చరిత్రలో ఆశ్చర్యకరమైన సంఘటన.

జంషీద్ క్రీ.శ.1543-1550: జంషీద్‌కు హిజ్రా 2-6-850 అంటే క్రీ.శ.2-9-1543వ తేదీన పట్టాభిషేకం జరిగింది. రాజ్యానికి వచ్చేనాటికే జంషీద్ 60 సంవత్సరాల వయసుగలవాడు. తన జీవితమంతా ఒడిదుడుకులతో గడిచిపోయింది. తండ్రి చివరి కాలంలో అతనిని చెరసాలలో ఉంచాడు. చెరసాలలో మగ్గి, ఏకాంత జీవితం గడిపి జీవితంపై రోసి దురాలోచనలు కలిగి క్రూరస్వభావం అలవడింది. సింహాసనానికి వచ్చిన తర్వాత కూడా అతని స్వభావం మారలేదు. సోదరులు, దాయాదులు రాజ్యం కాజేస్తారేమోననే అనుమానంతో క్రూరంగా ప్రవర్తించాడు. చిన్న నేరాలకు కూడా మరణశిక్ష విధించేవాడని ఫెరిష్టా రాశాడు. ఆస్థానంలో సరదారులకు గాని, ప్రజలకు గాని అతనిపై సదభిప్రాయం లేదు. పట్టాభిషేక కాలంలో అహమ్మద్‌నగర్ పాలకుడు నిజాంషా మాత్రమే అభినందనలు పంపాడు. అందువలన తారీఖ్-ఇ-కుతుబ్‌షాహీలో అతడు జంషీద్‌ఖాన్‌గా ప్రస్తావించబడ్డాడు. కాని జంషీద్ కుతుబ్‌షాగా రాయలేదు. అతని కాలంలో గోల్కొండ రాజ్యం అభివృద్ధి చెందలేదు. కాని అతని మనస్తత్వం వల్ల రాజ్యం క్షీణించకపోవడం కూడా ఆశ్చర్యకరమేనని చరిత్రకారులు అంటారు. అతనిలో దుష్టగుణాలతోపాటు కొన్ని సుగుణాలు కూడా ఉన్నాయి. అతడు గొప్పవీరుడు. యుద్ధంలో స్వయంగా పోరాడేవాడు. విద్యావంతుడు. చక్కని కవిత్వం చెప్పగలిగేవాడు. కాని అతని దుర్గుణాల ముందు సుగుణాలు వన్నెకురాకుండా పోయాయి. ఇతని కాలంలో ఆంధ్రదేశానికి సంబంధించిన సంఘటనలు ఏమీ జరగలేదు. అతని తమ్ముడు ఇబ్రహీం చేసిన తిరుగుబాటును ఎదుర్కొనడంలోనూ, దక్కను సుల్తాన్‌లతో వచ్చిన యుద్ధాలు చేయడంలోనే అతను పాలించిన ఏడు సంవత్సరాల కాలం సరిపోయింది. ఇతడు ఢిల్లీనేలిన షేర్షా కుమారుడైన ఇస్లాంషాకు సమకాలికుడు.

సోదరుడు ఇబ్రహీం తిరుగుబాటు క్రీ.శ.1543: జంషీద్ సింహాసనానికి వచ్చేనాటికి తన చిన్నసోదరుడు ఇబ్రహీం దేవరకొండ పాలకుడుగా ఉన్నాడు. జంషీద్ తన సోదరులు తన రాజ్యానికి అడ్డు అని తలచాడు. పెద్ద సోదరుడు కుతుబుద్దీన్ కళ్లు పీకించాడు. మరొక సోదరుడు దౌలత్‌ఖాన్ భువనగిరి నుండి తప్పించుకొని పోకుండా కాపలా కట్టుదిట్టం చేశాడు. చివరి సోదరుడు ఇబ్రహీంను రాజధానికి రప్పించాలని దేవరకొండకు కబురు

పంపాడు. ఆ కబురు రాగానే ఇబ్రహీం తన సరదారులైన దిలావర్‌ఖాన్, సయ్యద్ జునవేదార్, కామాజబ్రహ్మ, హమీద్ హబ్షీఖాన్‌లతో చర్చించాడు. వారు అతనిని వధించడానికే పిలిపించి ఉంటాడని, గోల్కొండ వెళ్లడం క్షేమకరం కాదని, బీదర్ వెళ్లి బరీద్ సహాయం పొందటం మంచిదని సలహా ఇచ్చారు. దాంతో ఇబ్రహీం నూరు మంది అశ్వికులు, కొద్ది మంది పదాతి దళంతో బీదరు చేరి ఆలీబరీద్‌ను కలిసి తనకు సహాయం చేయాల్సిందిగా అర్థించాడు. ఇబ్రహీం అక్కడ రెండు వారాలున్నాడు. ఆలీబరీద్ ఇబ్రహీంకు సహాయం చేయడం ద్వారా గోల్కొండ రాజ్యంలో కొంత భాగం ఆక్రమించవచ్చని తలరి కొంత సైన్యంతో ఇబ్రహీంకు సహాయంగా బయలుదేరి వచ్చి గోల్కొండను క్రీ.శ.1543లో ముట్టడించాడు. జంషీద్ ఇబ్రహీంకు అనేక వాగ్దానాలు చేసి తన వైపుకు తిప్పుకుందామని ప్రయత్నించాడు. కాని ఇబ్రహీం మెత్తబడలేదు. బరీద్ సైన్యాల వల్ల తనకు ఇబ్బంది వచ్చే ప్రమాదముందని తలచి అహమ్మద్‌నగర్ నిజాంషాను తనకు సహాయం చేయవలసిందిగా అభ్యర్థిస్తూ రాయబరం పంపాడు. షాతాహీరు సలహాపై బురహాన్ నిజాంషా వెంటనే బయలుదేరి బీదర్ రాజ్యంపై దండెత్తి కోహిర్ కోటను ముట్టడించాడు. తన రాజ్యం దండయాత్రకు గురైందని తెలుసుకొని ఆలీబరీద్ గోల్కొండ వదిలేసి వెళ్లిపోయాడు కోహిర్ వద్ద ఓడిపోయి తన రాజధాని బీదర్ చేరాడు. యుద్ధం మధ్యలో వదిలివేయబడిన ఇబ్రహీంకు ఏంచేయాలో తోచక విజయనగరం వెళ్లిపోయాడు. విజయనగర సరిహద్దులలో సర్దార్ నారాయణ మామా అనే రాజు పాలిస్తున్నాడు. అతడు తన రాజ్యం గుండా ప్రయాణించే ఇబ్రహీంను బంధించి జంషీద్‌కు కబురు పంపాడు జంషీద్ అందుకు సంతోషించి 200 గుర్రాలు, ఒక ఏనుగు, ఐదువేల హొన్నులు నారాయణ మామాకు కానుకగా పంపి ఇబ్రహీంను తనకు అప్పగించమని కోరాడు. బహుమతులు, కానుకలను స్వీకరించి మామా ఇబ్రహీంను గోల్కొండ పంపే ఏర్పాట్లు చేస్తున్నాడు. ఇదే సమయంలో ఇబ్రహీం అనుచరులైన సయ్యద్, హమీద్‌ఖాన్‌లు రామరాయలుకు రాయబారం పంపి తమ దుస్థితిని తెలిపారు. రామరాయలు మామాకు ఇబ్రహీంను వదిలివేయమని, లేకపోతే అతని రాజ్యంపై దాడి చేయవలసి వస్తుందని కబురు పంపాడు. అందుకు భయపడి నారాయణ మామా ఇబ్రహీంను వదిలివేశాడు. ఇబ్రహీం విజయనగరం చేరాడు.

ఆ కాలంలో విజయనగరంలో సదాశివరాయలు రాజుగా ఉన్నాడు. కాని అధికారమంతా అళియ రామరాయల చేతిలో ఉంది. గోల్కొండ రాజ్యంలో ఉద్యోగిగా సరిహద్దు ప్రాంతంలో జాగీరుదారునిగా కులీకుతుబ్ షా రామరాయలను నియమించాడని కుతుబ్‌షాహీ చరిత్ర గ్రంథం తెలుపుతోంది. అది వాస్తవమని చెప్పలేం గాని రామరాయలు ఇబ్రహీంను ఆదరించాడు. ఇబ్రహీం తన సోదరుడు జంషీద్ మరణించే వరకు ఏడు సంవత్సరాలు విజయనగరంలో గడిపాడు. ఈ కాలం ఇబ్రహీం జీవితంలో హిందూ సంస్కృతిని గురించి లోతైన అవగాహన తెచ్చిందని, తెలుగు సాహిత్యంపై అభిరుచిని, ఆదరాభిమానాలను కలిగించిందని, అది అతని జీవితంలో ఎంతో మార్పు తెచ్చిందని, ఆ మార్పే తరువాత గోల్కొండ రాజ్య చరిత్రను మార్చిందని హిందువులకు ఉన్నతోద్యోగాలు ఇచ్చి తెలుగు భాషా సంస్కృతులు పోషింపబడి గోల్కొండ రాజ్యంలో హిందూ-ముస్లిం మిశ్రమ సంస్కృతిక దోహదం చేసి సాంస్కృతిక పరిణామానికి దారి తీసిందని ఆచార్య షేర్వాణి అభిప్రాయపడ్డారు. అంతకుముందే హిందువులను ఉద్యోగాలలో నియమించే పద్ధతి వచ్చింది. కులీకుతుబ్ షా రామరాయలను సరిహద్దులో జాగీరుదారుగా నియమించాడు. జంషీద్ జగదేకరాయలని కౌలాస్ దుర్గాధిపతిగా నియమించాడు. అయినప్పటికీ ఇబ్రహీం ఏడు సంవత్సరాలు విజయనగరంలో నివసించినందు వల్ల భట్టుమూర్తి మొదలైన తెలుగు కవులతో పరిచయం ఏర్పడి తెలుగు భాషను పోషించే ఆచారం గోల్కొండలో ప్రారంభం అయిందని కూడా ప్రొఫెసర్ షేర్వాణి వివరించారు.

ఇబ్రహీం విజయనగరం వెళ్లిపోయిన తర్వాత జంషీద్‌కు వ్యతిరేకంగా ఎలాంటి తిరుగుబాట్లు జరగలేదు ఇబ్రహీం తిరుగుబాటు విఫలం కావడానికి సహాయపడిన అహమ్మద్‌నగర్ బురహాన్ నిజాంషాకు కృతజ్ఞతలు తెల్పడానికి జంషీద్ స్వయంగా అహమ్మద్‌నగర్ దర్శించాడు. అందుకు సంతోషించి నిజాంషా జంషీదుకు షాహి అనే బిరుదునిచ్చాడు. కాని జంషీద్ ఆ బిరుదును తిరస్కరించి ఒక కవితను చెప్పి నిజాంషా ఇచ్చిన విందు వినోదాలతోనే తృప్తిపడి గోల్కొండ తిరిగి వచ్చాడు. జంషీద్ అహమ్మద్‌నగర్ దర్శనంతో గోల్కొండ అహమ్మద్‌నగర్ స్నేహసంబంధాలు బలపడ్డాయి.

గోల్కొండ, అహమ్మద్‌నగర్, బేరారుల కూటమి క్రీ.శ.1544: బీజాపూరు, అహమ్మద్‌నగర్ రాజ్యాలకు సరిహద్దు వివాదాలున్నాయి. ముఖ్యంగా షోలాపూర్ నగరం తమదంటే తమదని వివాదం ఉంది. షోలాపూర్

బీజాపూర్ రాజ్యంలో ఉంది. కనుక దానిని ఆక్రమించాలని అహమ్మద్‌నగర్ నిజాంషా జంషీద్ సహాయం అర్థించాడు. అంతకుముందు తనకు నిజాంషా సహాయం చేసి ఉన్నాడు. కనుకు ప్రతిసహాయంగా జంషీద్ అహమ్మద్‌నగరానికి సహాయం చేయడానికి అంగీకరించాడు. ఇదే సమయంలో బీదర్‌తో సరిహద్దు వివాదాలున్న బేరార్ సుల్తాన్ దరియా ఇమాద్‌షా అహమ్మద్‌నగర్ వైపు చేరిపోయింది. దాంతో అహమ్మద్‌నగర్, బేరార్, గోల్కొండ రాజ్యాలు ఒక కూటమిగా చేరాయి. బీజాపూరు, బీదరు రెండవ కూటమిగా ఏర్పడ్డాయి. అహమ్మద్‌నగర్ కూటమి బీజాపూరుపై దండెత్తి షోలాపూర్‌ను ముట్టడించింది. ముగ్గురు సుల్తాన్‌లు తన రాజ్యంపై దండెత్తడంతో భయపడిన బీజాపూరు సుల్తాన్ బీదరు సుల్తాన్‌ను తనకు సహాయంగా రమ్మని కబురు పెట్టాడు. ఈ లోపల అతడు అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి బాడ్ పట్టణాన్ని ముట్టడించాడు. ఆలీబరీద్ తన సేనలతో బీజాపూరు రాజ్యంలో ప్రవేశించి పరెండాను ముట్టడించాలని అటువైపు రాసాగాడు. ఆలీ బరీదును ఎదిరించడానికి అహమ్మద్, గోల్కొండ కూటమి తమ సైన్యాలను మోహరించింది. ఉభయ సైన్యాలు పరెండాకు మూడు మైళ్ల దూరంలో ఉన్న ఖాస్‌పురి అనే గ్రామం వద్ద తారసిల్లాయి. అక్కడ జరిగిన యుద్ధంలో బీజాపూరు, బీదరు సైన్యాలు ఓడిపోయాయి. తర్వాత అహమ్మద్‌నగర్, గోల్కొండ, బీరార్ కూటమి బీదరు రాజ్యభాగాలు ఆక్రమించడానికి ప్రయత్నించగా బీజాపూరు, బీదర్ కూటమి గోల్కొండ రాజ్యభాగాలు ఆక్రమించడానికి ప్రయత్నించాయి. కాని చివరకు ఉభయ కూటాలు యుద్ధ విరమణ చేసి ఎవరి రాజ్యాలకు వారు వెళ్లిపోయారు.

బీదరుతో జంషీద్ యుద్ధం క్రీ.శ.1545: బీజాపూరు రాజ్యంతో జరిగిన యుద్ధాల వల్ల బీదరుకు, గోల్కొండకు తీవ్రమైన విరోధం ఏర్పడింది. బీదర్ సుల్తాన్ ఆలీబరీద్ జంషీద్‌పై పగ తీర్చుకోడానికి క్రీ.శ.1545లో గోల్కొండ రాజ్యంపై దండెత్తి కల్సాపూర్, పటాన్ చెరువు వద్దకు చేరాడు. జంషీద్ తన సైన్యంతో అక్కడికి చేరి తూముల వద్ద బీదరు సైన్యాలను ఓడించి తరిమాడు. ఈ ఓటమి తర్వాత ఆలీబరీద్ బీజాపూర్ సుల్తాన్ సహాయంతో మరుసటి సంవత్సరం అంటే క్రీ.శ.1546లో మళ్లీ గోల్కొండ రాజ్యంపై దండెత్తి మెదక్ దుర్గాన్ని ఆక్రమించాడు. అక్కడ బరీద్‌కు 7000 హొన్నుల ద్రవ్యం, 40 గజాలు లభించాయి. జంషీద్ మెదక్ నుండి ఆలీబరీద్‌ను ఉపసంహరించేలా చేయడానికి జంషీద్ తన సైన్యాలతో బీదరు రాజ్యంపై దండెత్తాడు. అది తెలిసి బరీద్ 8 వేల సైన్యాన్ని మెదక్ రక్షణకు ఉంచి మిగిలిన సైన్యంతో తన రాజధాని రక్షణకు బయలుదేరాడు. కానీ బీదర్‌కు వెళ్లకుండా కౌలాస్‌ను ముట్టడించాడు. అది తెలిసి జంషీద్ కౌలాస్‌వైపు వచ్చాడు. మధ్యలో నారాయణఖేడ్ వద్ద ఎదురుపడ్డారు. అక్కడ జరిగిన చిన్న యుద్ధంలో జంషీద్ సేనాని జగదేవరావు గొప్ప పరాక్రమం చూపాడు. బీదరు సైన్యాలు ఓడిపోయాయి. ఈ ఓటమి తర్వాత అలీబరీద్ సేనాధిపతి ఇనుల్ముల్క్ కుమారుడు గోల్కొండ సైన్యంలో చేరిపోయాడు. ఆలీబరీద్ తన రాజధానికి వెళ్లిపోయాడు. కౌలాస్‌దుర్గం జంషీద్ వశమైంది. జంషీద్ తన సేనాధిపతి జగదేకరావును కౌలాస్ దుర్గాధిపతిగా నియమించాడు. అంతకుముందు జగదేకరావు కోలార్ ప్రాంతపు పర్వతశ్రేణుల మధ్య ఒక కోటను నిర్మించాడు. నారాయణఖేడ్ యుద్ధానంతరం జంషీద్ కోలారు దుర్గాన్ని చూడటానికి వెళ్లాడు. ఈ సమయంలో ఆలీబరీద్ హఠాత్తుగా గోల్కొండ సైన్యంపై దాడి చేశాడు. ఆ యుద్ధంలో ఇనుల్ముల్క్ కుమారుడు మరణించాడు. గోల్కొండ సైనికులు కోలార్‌వైపు పరిగెత్తారు. ఆ వార్త విని జంషీద్ వచ్చి ఆలీబరీద్‌ను ఓడించి తరిమి నారాయణఖేడ్, హసనాబాద్‌లను ఆక్రమించి తన రాజ్యంలో కలుపుకొని అక్కడ తన ప్రతినిధిని నియమించాడు. ఈ యుద్ధాలలో జంషీద్ విజయుడైనా ధనం చాలా ఖర్చయింది. కనుక బీదరు పారిపోతున్న బీదరు సైన్యాల వెంటపడి బీదరు రాజ్యంపై దండెత్తడం అనవసరమని భావించి గోల్కొండకు తిరిగి వచ్చాడు. ఈ సమయంలో తన తండ్రిని చంపిన హందానిని పట్టుకొని వధించి శిక్షించాడని ప్రొఫెసర్ షేర్వాణి రాశారు. దీనిని బట్టి హందానీని మొదటనే చంపలేదని షేర్వాణి అభిప్రాయం.

మళ్లీ కూటమి యుద్ధం క్రీ.శ.1546: జంషీద్‌కు యుద్ధాలపై విముఖత్వం కలిగింది. కాని ఆలీబరీద్ గోల్కొండను వదలదలచుకోలేదు. జంషీద్‌పై పగ సాధించడం అతని ధ్యేయంగా పెట్టుకొని బీజాపూరు సహాయం సంపాదించడానికి బీజాపూర్ సుల్తాన్ వద్దకు వెళ్లి గోల్కొండ, అహమ్మద్‌నగర్ కూటమి వల్ల తనకే గాక బీజాపూరుకు కూడా చాలా ప్రమాదమని చెప్పి జంషీద్‌పై అనేక చాడీలు చెప్పి అతని సహాయం సంపాదించాడు. ఆలీబరీద్ ప్రయత్నాలు తెలిసి జంషీద్ అహమ్మద్‌నగర్ నిజాంషాకు లేఖ రాసి బరీద్‌ను అదుపు చేయలేకపోతే ఈ యుద్ధాలు ఆగవని తెలిపాడు. అందుకు అహమ్మద్‌నగర్ సుల్తాన్ ఆలీబరీద్ దురాగతాలు తమకు తెలుసునని, అతని రాజ్యాన్ని నాశనం చేయడానికి బేరార్ పాలకుడు దరియా ఇమద్‌షా, తాను సిద్ధంగా ఉన్నామని, జంషీద్

తమతో చేరాలని కోరుతూ బదులు ఉత్తరం రాసి పంపాడు. జంషీద్ వారితో కలిసి బీదర్ రాజ్యంపై దండెత్తాడు దరియా ఉమాద్‌షా నిజాంషాలు ఆసా, ఉద్గిర్‌లను ఆక్రమించగా, జంషీద్ మెదక్‌ను ఆక్రమించాడు. ఆలీబరీద్‌కు సహాయంగా బీజాపూర్ సైన్యాలు వచ్చాయి. బీజాపూర్ సైన్యాల సహాయంతో బరీద్ కౌలాస్‌ను ఆక్రమించాలని తలచాడు. కాని జంషీద్ అతని సేనానులు షపత్‌ఖాన్ ఇనుల్ముల్కు జగదేకరావులు ఆలీబరీద్‌ను, అతని సేనాధిపతి ఆక్లాస్‌ఖాన్‌లను నారాయణఖేడ్ వద్ద ఎదిరించి, ఓడించి తరిమివేశారు. జంషీద్ సేనలు వారిని బీదరు వద్దకు తరిమి బీదరు రాజ్యాన్ని కొల్లగొట్టి వచ్చారు.

బహమనీ రాజ్య కూటాల విచ్ఛిత్తి క్రీ.శ.1547: క్రీ.శ.1547లో బహమనీ రాజ్యాల కూటమిలలో గొప్ప మార్పు వచ్చింది. బీజాపూర్ సుల్తాన్ తన ఆలోచనను మార్చుకున్నాడు. తాను బీదర్ సుల్తాన్ ఆలీబరీద్‌ను సమర్థించడం తప్పని తెలుసుకున్నాడు. ఆలీబరీద్ తనకు గోల్కొండతో గల విరోధంలో తనను వినియోగించు కుంటున్నాడని, అందువల్ల జంషీద్ తనకు వ్యతిరేకంగా అహమ్మద్‌నగర్ నిజాంషాలకు సహాయపడుతున్నాడని, తాను బీదర్‌తో సంబంధాలు తెంచివేసుకుంటే అహమ్మద్‌నగరంతో విరోధం పోతుందని భావించి అహమ్మద్‌నగర్‌కు పాంజ్‌తప్పా అనే ప్రాంతాన్ని ఇచ్చి సంధి చేసుకున్నాడు. తర్వాత తన సేనాధిపతి అసద్‌ఖాన్‌ను గోల్కొండ రాజ్యంపై దండు పంపాడు. జంషీద్ యాద్గిరిని ముట్టడించాడు. కాని అసద్‌ఖాన్ అతనిని కాక్ని వరకు తరిమి తాను గోల్కొండ కోట వరకు వచ్చాడు. కాని గోల్కొండను జయించలేక తిరిగి వెళ్లిపోయాడు. ఈ దండయాత్రలో అహమ్మద్‌నగరం జంషీద్‌కు సహాయం రాలేదు. దాంతో జంషీద్‌కు అహమ్మద్‌నగరంతో సైనిక రక్షక ఒప్పందం పోయింది. బీజాపూరు, అహమ్మద్‌నగర్‌లు దగ్గరకు వచ్చాయి. బీజాపూరు విజయనగర రాజ్యంపై దండెత్తేటట్లు అహమ్మద్‌నగర్ రాజ్యం బీదరుపై దండెత్తేటట్లు ఒప్పందం చేసుకున్నారు. అలాగే అహమ్మద్‌నగరం బీదరుపై దండెత్తి కాందహార్ కోటను ముట్టడించింది. ఆలీబరీద్ అహమ్మద్‌నగర సైన్యాన్ని ఎదుర్కోలేక సహాయం అర్థించడానికి బీజాపూర్ స్వయంగా వెళ్లాడు. బీజాపూర్ సుల్తాన్ మనసు మార్చుకుంది తెలియక జంషీద్ తండ్రిని చంపిన హంతకుడు, అతనిని క్షమించరాదు, కనుక తనకు సహాయం చేయాలని చెప్పబోయాడు. వెంటనే బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా జంషీద్ వధించలేదు, ఎవరో హందానీ అనే అతను వధించాడు అని చెప్పి, వెంటనే ఆలీబరీద్‌ను ఖైదు చేసి, తాను విజయనగరంపై దండెత్తాడు. ఊహించని ఈ పరిస్థితికి ఆలీబరీద్ ఆశ్చర్యచకితుడై పోయాడు.

జంషీద్ అగ్రస్థానం-మధ్యవర్తిత్వం క్రీ.శ.1547: బీజాపూర్ సుల్తాన్ విజయనగరంపై దండెత్తగానే బీదర్‌పై దండెత్తిన అహమ్మద్‌నగర్ సుల్తాన్ తన మనసు మార్చుకున్నాడు. విజయనగర రాజ్యభాగాలు జయిస్తే బీజాపూరు బలపడి తర్వాత తన రాజ్యంపై దండెత్తుతాయని తలచి నిజాంషా కాందహార్ దుర్గముట్టడిని విరమించి బీజాపూరులోని షోలాపూర్‌పై దండెత్తాడు. దాంతో బీజాపూర్ సుల్తాన్ తన రాజ్యాన్ని కాపాడుకోడానికి విజయనగర దండయాత్రను వదిలివేసి తిరిగి వచ్చాడు. ఈ సమయంలో తనకు సహాయం రావలసిందని బీజాపూరు, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లు రాయబారం పంపారు. అదే సమయంలో తనను విడుదల చేయించమని అర్థిస్తూ ఖైదులోని ఆలీబరీద్ కూడా రాయబారం పంపాడు. ముగ్గురి విన్నపాలతో క్రీ.శ.1547లో జంషీద్ దక్కను రాజకీయాలలో ప్రధాన పాత్రను పోషించాడు. అతడు 60000 సైన్యంతో షోలాపూర్ చేరి ఉభయ సైన్యాల మధ్య విడిది చేశాడు. బీజాపూర్ సుల్తాన్‌కు కబురు చేసి తన సహాయం కావాలంటే ముందు ఆలీబరీద్‌ను విడుదల చేయాలని షరతు పెట్టాడు. అందుకు అంగీకరించి ఇబ్రహీం ఆదిల్ షా ఆలీబరీద్‌ను విడుదల చేశాడు. తర్వాత అహమ్మద్‌నగర్, బీజాపూర్ సుల్తాన్‌లకు రాజీకుదిర్చి యుద్ధం జరగకుండా చేశాడు. ఈ విధంగా ముగ్గురు సుల్తాన్‌లకు మధ్యవర్తిత్వం వహించి ఆ సమయంలో గోల్కొండకు అగ్రస్థానం సంపాదించాడు. తర్వాత ఆలీ బరీద్‌తో బీదరు వెళ్లి అతనిని సింహాసనాధీశుని చేసి బరీద్ చేత బహుమానాలు పొంది తిరిగి గోల్కొండ చేరాడు.

మరణం క్రీ.శ.1550: జంషీద్ బీదర్ నుండి తిరిగి వచ్చిన తర్వాత వ్యాధిగ్రస్తుడయ్యాడు. మూడు సంవత్సరాలు బాధపడి హిజ్రా 3-1-957 అంటే క్రీ.శ.1550 జనవరి 22వ తేదీన మొహరం రోజున మరణించాడు. అతడు క్షయరోగ పీడితుడై మరణించాడని ఫెరిష్టా రాయగా, ఉబ్బసవ్యాధితో మరణించాడని గోల్కొండ చరిత్రకారుడు రాశాడు. కాని అతడు క్యాన్సర్ లేక రాచపుండు వ్యాధితో మరణించాడని షేర్వాణీ రాశారు. మొత్తం మీద జంషీద్ ఏడు సంవత్సరాల పాలన తర్వాత తన 67వ సంవత్సరంలో మరణించాడు.

సుభాన్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1550: జంషీద్ మరణానంతరం గోల్కొండ రాణులు బిల్‌ఖైస్ జమాన్ ఖతీజా

దౌరాన్‌లు జంషీద్ కుమారుడైన సుభాన్‌కులీని సింహాసనమెక్కించాలని తలచారు. ప్రముఖ సరదారులైన సలాబత్‌ఖాన్ ముస్తాఫాఖాన్, అర్ధసతానిలు రాణులకు అండగా నిలిచారు. ఆ సరదారులు జంషీద్ మరణించిన రోజు అంటే 22-1-1550న సుభాన్ కులీని గోల్కొండ సింహాసనంపై అభిషేకించారు. రాణులు సంరక్షకులుగా ముస్తాఫాఖాన్, సలాబత్‌ఖాన్‌లు పరిపాలనలో సహాయకులుగా సుభాన్‌కులీ పరిపాలన మొదలైంది. కాని రాణి బిల్‌కైస్ జమాన్‌కు ముస్తాఫాఖాన్, సలాబత్‌ఖాన్‌లపై విశ్వాసం లేదు. సింహాసనం దాయాదుల పాలుకాకుండా ఉండాలంటే సమర్థుడు, నమ్మకస్తుడు అయిన వకీల్ పేష్కార్ కావాలని భావించి సయిఫ్‌ఖాన్ ఇనుల్ముల్క్ అనే అతన్ని ఆహ్వానించారు. అతడు గోల్కొండ నివాసి. జంషీద్ కాలంలో అతని పరిపాలనా విధానాలు నచ్చక అహమ్మద్‌నగర్ సుల్తాన్‌ను ఆశ్రయించాడు. రాణి ఆహ్వానాన్ని అందుకొని అతడు గోల్కొండకు బయలుదేరాడు.

రాజ్యంలోని సరదారులలో జగదేకరావు, జగపతిరావు, బహిరఖాన్ మొదలైన కొంతమంది సరదారులకు సుభాన్‌కులీ సుల్తాన్ కావడం ఇష్టం లేదు. వారు భోనగిరి దుర్గంలో ఉన్న దౌలత్ కులీని సుల్తాన్‌గా చేయాలని నిశ్చయించుకున్నారు. జగదేకరావు తన అనుచరులతో భువనగిరి దుర్గం చేరి దౌలత్ కులీని చెర నుండి విముక్తి చేసి పరిసరాలలోని రాచకొండ, నల్లకొండ, అరువపల్లి, పొడిచేడు, ఇంద్రపురి దుర్గాలను ఆక్రమించి దౌలత్‌కులీని గోల్కొండ సుల్తాన్ ప్రకటించాడు. గోల్కొండ కోటను ముట్టడించడానికి బేరారు సుల్తాన్ సహాయం అర్థించాడు. దాంతో సింహాసనం కోసం గోల్కొండలో అంతర్యుద్ధం వచ్చింది.

ఈ లోపల సయిఫాఖాన్ అహమ్మద్‌నగర్ నుండి గోల్కొండ చేరి పేష్కారుగా పదవీ బాధ్యతలు చేపట్టాడు. ముస్తాఫాఖాన్‌ను మీర్జుం లాగా నియమించాడు. రాణి బిల్‌ఖైస్ జమాన్, సుల్తాన్ సుభాన్‌కులీలకు భద్రతా ఏర్పాట్లు చేశాడు. సాధారణ పరిపాలనా విధానాలన్నింటినీ చక్కదిద్దాడు. తర్వాత జగదేకరావును ఓడించడానికి సైన్యాన్ని తయారు చేసి భువనగిరికి బయలుదేరాడు. ఈ లోపల బేరార్ పాలకుడు తుఫాల్‌ఖాన్ అనే సేనాధిపతి నాయకత్వంలో జగదేకరావుకు 3,000 సైన్యాన్ని సహాయంగా పంపాడు. అది తెలిసి సైఫాఖాన్ బేరారు సేనను భువనగిరికి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుని గ్రామం వద్ద అటకాయించాడు. అక్కడ జరిగిన యుద్ధంలో తుఫాల్‌ఖాన్ ఓడిపోయి భువనగివరి కోటవైపు వెళ్లిపోయాడు. సైఫ్‌ఖాన్ వారిని వెన్నంటి పోయి భోనగిరి కోటను ముట్టడించాడు. కోటను వశం చేసి లొంగిపొమ్మని జగదేకరావుకు కబురుపెట్టాడు. కాని జగదేకరావు తిరస్కరించాడు. కోట లోపలికి ఎలాంటి పదార్థాలు అందకుండా చేసి త్వరలోనే కోటను లొంగదీశాడు. దౌలత్ కులీని అక్కడే బంధించి, జగదేకరావును గోల్కొండకు బందీగా తీసుకొని వెళ్లిపోయాడు.

ఈ విజయంతో సైఫాఖాన్‌కు ఎక్కడలేని గర్వం వచ్చింది. దర్బారులోని సరదారులనెవ్వరినీ లెక్క చేయకుండా తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించసాగాడు. ప్రజా సంక్షేమం కూడా సరిగా చూడలేదు. దాంతో రాజ్యంలోని సరదారులు, ప్రజలు విజయనగరంలో నివసించే ఇబ్రహీం కులీని తమ సుల్తాన్‌గా చేయాలని భావించసాగారు. సుభాన్‌కులీని సింహాసనంపై అభిషేకం చేసిన ముస్తాఫాఖాన్ సలాబత్‌ఖాన్‌లు కూడా ఇబ్రహీం వైపు తిరిగిపోయారు. ఇబ్రహీం విజయనగరంలో 7 సంవత్సరాలు కాలం గడిపాడు. ఆ సమయంలో అతడు రామరాయల యుద్ధతంత్రం, రాజకీయ చాతుర్యం, సైనిక నిర్వహణ, యుద్ధ రచనా కౌశల్యం, పరిపాలనా సామర్థ్యం అన్నీ నేర్చుకున్నాడు. రామరాయలు అతనిని పుత్ర వాత్సల్యంతో చూశాడు. కాని కొందరికి అది గిట్టలేదు. అలాంటి వారిలో ఇనుల్ముల్క్ అనే విజయనగర సేనాధిపతి ముఖ్యుడు. రామరాయలు ముస్లింలను తన సేనలో చేర్చుకున్నాడు. ఆ విధంగా చేర్చుకున్న ముస్లిం సేనాధిపతులలో ఈ ఇనుల్ముల్క్ ఒకడు. ఇతని అసలు పేరు అంబర్‌ఖాన్. అతడు బీజాపూరు రాజ్యం నుంచి వచ్చి రామరాయల కొలువులో చేరాడు. రామరాయలు అతనిని 4 వేల అశ్వదళానికి అధిపతిని చేసి తన సోదరుని లాగా చూసుకున్నాడు. మొదట అంబర్‌ఖాన్ ఇబ్రహీంను గౌరవించాడట. తనకు తెలిసిన యక్షిణీ విద్యను కూడా ఇబ్రహీంకు నేర్పాడని పెరిష్టా రాశాడు. కాని తర్వాత రామరాయలు తనకు చెందిన కొన్ని జాగీరు భూములను ఇబ్రహీంకు ఇచ్చాడట. దాంతో ఇనుల్ముల్క్‌కు ఇబ్రహీంపై విరోధం ఏర్పడిందట. అందువల్ల ఇనుల్ముల్క్ ఇబ్రహీంతో అప్పుడప్పుడు తగవులాడుకొనేవారు. ఒక రోజు తమ పరివారాలతో ఉభయులు ఒక ఇరుకు సందులో ఎదురుపడ్డారట. ఎవరికి వారే తాము అధికులమని తలచి ఎదుటి వారు పక్కకు తప్పుకొని తమకు దారి ఇవ్వాలని భావించారు. చివరకు ఇబ్రహీం సేనాధిపతులు సయ్యద్, హమీద్‌ఖాన్‌లు ముందుకురికి అంబర్‌ఖాన్ సైనికులను పక్కకు నెట్టి ఇబ్రహీంకు దారిని ఏర్పాటు చేశారు. అది అంబర్‌ఖాన్ అవమానంగా భావించి తర్వాత ఇబ్రహీంను అంతం చేయడానికి అతనిపై దాడి చేశాడు.

ఇబ్రహీం అతని తలనరికాడు. అది తెలిసి అంబర్‌ఖాన్ సోదరులు ఇబ్రహీంపై దాడి చేశారు. వారిని కూడా ఇబ్రహీం సైనికులు అంతం చేశారు. రామరాయలు అతనిని ఏమీ అనలేదు. ఈ స్థితిలో గోల్కొండ నుండి తనకు ఆహ్వానం వచ్చింది. తక్షణమే వచ్చి అతని తండ్రి కులీకుతుబ్‌షా నిర్మించిన గోల్కొండ రాజ్యాన్ని రక్షించమని కోరుతూ ఆహ్వానం చేరింది. రామరాయలు 50 వేల పదాతిదళాన్ని, 10 వేల అశ్వదళాన్ని తీసుకొని ఇబ్రహీంకు సహాయంగా గోల్కొండ రాజ్యంలోకి 40 కిలోమీటర్ల దూరం నడిచాడు. ఎక్కడా ప్రతిఘటన లేదు గనుక రామరాయలు తన సేనతో వెనక్కి వెళ్లిపోయాడు. ఇబ్రహీం తన సేనాధిపతులైన హమీద్‌ఖాన్, సయ్యద్‌లతో పానుగల్లు కోటను చేరాడు. అక్కడ నుండి తాను వచ్చినట్లు గోల్కొండ ప్రజలకు తెలియజేశాడు. అది తెలిసి గోల్కొండ నుండి ముస్తాఫాఖాన్ అంటే మీర్జుమ్లా పానుగల్లు వచ్చి ఇబ్రహీంను కలిశాడు. అతడు వ్యాపారుల నుండి 2 లక్షల హొన్నులు ధనాన్ని వసూలు చేసి ఇబ్రహీంకు ఇచ్చాడు. తర్వాత వారంతా కలిసి కోవెలకొండ చేరారు. దుర్గాధ్యక్షుడు, ప్రజలు ఇబ్రహీంకు స్వాగతం పలికారు. అక్కడ ముస్తాఫాఖాన్ తన పలుకుబడితో 5 వేల కాల్బలాన్ని, 3 వేల అశ్వదళాన్ని సమకూర్చాడు. ఇంతలో పరిసరాలలోని మరికొంత మంది అమీరులు వచ్చి చేరారు. మొత్తం 7 వేల సైన్యం పోగైంది. కోవెలకొండ సేనాధిపతులు అంతా ఇబ్రహీంతో చేరారు. ఇబ్రహీం అక్కడ రెండు మాసాలున్నాడు. ఇబ్రహీం ఆగమన వార్త విని రాజధానిలో సైఫాఖాన్ అతనిని ఎదుర్కోటానికి సైన్యంతో బయలుదేరాడు. రాజధాని రక్షణకు బహురఖాన్, హజాఖాన్, సర్‌నౌబత్, ఎక్లాస్ఖాన్ అనే సేనాధిపతులను ఉంచి తాను ఇబ్రహీంను ఓడించడానికి బయలుదేరాడు. అతడు గోల్కొండను వదలిపెట్టి వెళ్లగానే ఇబ్రహీం అనుచరులు కొందరు ఖైదులోని జగదేకరావుని విడిపించారు. అతడు బహుదూర్‌ఖాన్, హజాఖాన్, ఎక్లాస్‌ఖాన్‌ల తలలు నరికి 27-7-1550లో సుభాన్ కులీని జైలులో బంధించి గోల్కొండ దుర్గాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకొని ఇబ్రహీంను రాజధానికి రమ్మని ఆహ్వానం పంపాడు. సైఫాఖాన్ ఈ లోపల ఘనాపూర్ చేరాడు. అక్కడ గోల్కొండ తన గుప్పిట్లో నుండి తప్పిపోయిన విషయం తెలిసింది. ఇబ్రహీంతో పోరాడటం తప్పని భావించి సేవకునికి తమ ఆస్థానంలో ప్రవేశించటానికి అనుమతి ఇవ్వవలసిందని ఒక వినతి పత్రాన్ని కోవెలకొండలోని ఇబ్రహీంకు పంపాడు. ఇబ్రహీం అతనికి తమను గోల్కొండలో కలుసుకోమని తిరుగు జవాబు పంపాడు. కాని సైఫాఖాన్‌కు ఇబ్రహీంను కలుసుకోవడానికి ధైర్యం చాలక బీదర్‌కు పారిపోయాడు. అమీర్‌ఖాన్ దబీర్ అనే అతడు కోవెలకొండకు వచ్చి సైఫాఖాన్ పారిపోయినట్లు తెలిపాడు. అప్పుడు ఇబ్రహీం తన పరివారంతో గోల్కొండ కోటకు వచ్చాడు. అతడు రాగానే జగదేవరావు, ఇతరసేనానులు, గోల్కొండ దుర్గపు తాళపు చెవులు అప్పగించారు. గోల్కొండ ప్రజలు అతనికి ఘనస్వాగతం ఇచ్చారు. ఇబ్రహీం కులీ హిజ్రా 12-7-957 లేక 12వ రజబ్ 957 క్రీ.శ.27-7-1550వ తేదీన గోల్కొండ సింహాసనమధిష్టించాడు. అతడు ఆ సమయంలో హజ్రత్ ఖ్వాజా బందాముస్నద్ ఐ అలిమన్నబ్ ఐమాలిమాలిక్ ఇబ్రహీంషా కుతుబ్ ఉల్‌ముల్క్ వోదయె అనే బిరుదు ధరించాడు. ఇతడు మొగల్ చక్రవర్తి అక్బరుకు సమకాలికుడు. ఏక కాలంలో ఇద్దరూ తమ రాజ్యాలను విస్తరించారు.

ఇబ్రహీం కులీకుతుబ్‌షా క్రీ.శ.1550-1580: ఇబ్రహీం హిజ్రా 1-10-1936, క్రీ.శ.29-5-1530లో జన్మించాడు. అతడు కులీకుతుబ్‌షా చిన్న కుమారుడు. తన తండ్రి హత్య చేయబడిన తర్వాత 1550 జూలైలోనే తొలిసారిగా గోల్కొండలో అడుగుపెట్టాడు. అడుగు పెట్టగానే తన చిన్ననాటి సంగతులు గుర్తుకొచ్చాయి. తన తండ్రి సమాధిని దర్శించి మూడు రోజులు అక్కడే ఉన్నారట. తన తండ్రి చిన్నతనంలో తన మీద చూపిన ప్రేమానురాగాలు గుర్తుకు వచ్చాయి. ఆ రాత్రి కలలో తన తండ్రి తన పక్కనే నిలబడి తనను ధర్మం తప్పకుండా పాలించమని ఆదేశించాడట. తర్వాత అతడు పరిపాలనపై దృష్టి పెట్టాడు. తనకు సహాయంగా నిలిచిన ముస్తాఫాఖాన్‌కు తన సోదరినిచ్చి వివాహం జరిపి పీష్వానిగా నియమించాడు. అతనికి ఖానె ఆజం రుకునె సల్తనత్ అనే బిరుదు కూడా ఇచ్చాడు.

దోపిడీ దొంగలను అణచటం: ఇబ్రహీం రాజ్యానికి వచ్చే నాటికి రాజ్యపు పరిస్థితులు బాగాలేవు. జంషీద్, సుభాన్ కులీకాలంలో పరిపాలనా వ్యవస్థ సరిగా లేనందువల్ల దోపిడీ దొంగలు విజృంభించారు. సామంతులు, సరదారులు అవిధేయులై ఉన్నారు. ఇబ్రహీం అవిధేయులు, స్వామిద్రోహులైన సరదారులను అదుపులోకి తెచ్చుకున్నాడు. దారిదోపిడీగాండ్రపై సైనికులను పంపి వారిని పట్టి కఠినంగా శిక్షించాడు. శాంతిభద్రతలను నెలకొల్పాడు. గూఢచారి దళాన్ని ఏర్పాటు చేసుకొని అందరిపై నిఘా ఏర్పాటు చేశాడు. న్యాయశాఖను

సంస్కరించాడు. ఆలీబన్ అజీజుల్లా ఇబ్రహీంను గొప్ప న్యాయప్రదాతగాను, ప్రపంచ రాజులందరికీ ఆదర్శప్రాయుడని కీర్తించాడు. షిరాజ్ మొదలైన రచయితలు, ఇబ్రహీం గొప్ప పరిపాలనా దక్షుడని సర్వసమర్థుడని వర్ణించారు.

దక్కను సుల్తాన్‌లతో సంబంధాలు క్రీ.శ.1550-1565: ఇబ్రహీం తన రాజ్య పరిస్థితులన్నింటినీ సరైన స్థితికి తెచ్చుకొని దక్కను సుల్తాన్‌ల వైపు తన దృష్టిని మరల్చాడు. ఇబ్రహీం శాంతికాముకుడని, అవసరమైతేనే యుద్ధాలు చేశాడని, దక్కను సుల్తాన్‌ల మధ్య మధ్యవర్తిత్వం నెరపి సాధ్యమైనంత వరకు యుద్ధాలు రక్తపాతం లేకుండా చేయాలని ప్రయత్నించాడని సమకాలీన రచయితలు రాశారు.

ఇబ్రహీం కుతుబ్‌షాకు ముందు పరిస్థితి క్రీ.శ.1548-1557: ఇబ్రహీం కుతుబ్ షా రాజ్యానికి రాకముందు జంషీద్ కాలంలో క్రీ.శ.1548లో బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగర రాజ్యంపై దాడి చేయడానికి ప్రయత్నించాడు. అది తెలిసి రామరాయలు అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్ నిజాంతో సంధి చేసుకున్నాడు. ఆ సంధి తర్వాత అహమ్మద్‌నగరం, విజయనగర రాజ్యాలు రెండు పర్యాయాలు క్రీ.శ.1547లో బీజాపూరు రాజ్యంపై దండెత్తాయి. అహమ్మద్‌నగర్ రాజ్యం బీజాపూరులోని కళ్యాణీ షోలాపూర్‌లను ఆక్రమించగా రామరాయలు రాయచూరు, అంతర్వేదిలను ఆక్రమించాడు. క్రీ.శ.1550లో ఇబ్రహీం కుతుబ్‌షా గోల్కొండ సింహాసనానికి వచ్చేనాటికి అహమ్మద్‌నగర్, విజయనగరాలు ఒక కూటమిగాను, బీజాపూరు, బీదరు రాజ్యాలు మరొక కూటమిగాను ఉన్నాయి.

ఇబ్రహీం అహమ్మద్‌నగరంతో రక్షణ సంధి: బీజాపూరు రాజ్యం విశాలమైంది, బలమైంది. ఆ రాజ్యం ఒక వైపు అహమ్మద్‌నగర్ రాజ్యంతోను మరొకవైపున గోల్కొండ రాజ్యంపైన యుద్ధాలు చేస్తోంది. జంషీద్ కాలంలో అతడు అహమ్మద్‌నగర్ రాజ్యంతో సఖ్యతగా ఉండేవాడు. ఇబ్రహీం కూడా తన రాజ్య రక్షణకు తన అన్న అనుసరించిన విధానాన్నే అవలంబించి అహమ్మద్‌నగర్‌తో రక్షణ సంధి చేసుకోవడం మంచిదని తలచి హుసేన్ నిజాంషాతో సంధి చేసుకున్నాడు.

బీజాపూర్ రామరాయలతో సంధి చేసుకొనుట: బీజాపూరు రాజ్యంలో ఇబ్రహీం ఆదిల్ షా మరణించి అతని కుమారుడు ఆలీ ఆదిల్ షా సింహాసనానికి వచ్చాడు. అతడు తన తండ్రి కాలంలో పోగొట్టుకున్న కళ్యాణీ, షోలాపూర్‌లను జయించడానికి రామరాయల సహాయం ఉంటే బాగుంటుందని విజయనగరం దర్శించి రామరాయల అభిమానాన్ని సంపాదించాడు. దాంతో దక్కను రాజ్యాల తుల్య ప్రాబల్యంలో మార్పు వచ్చి రాజకీయ పరిస్థితి మారిపోయింది. బీజాపూరు, విజయనగరం ఒక కూటమిగా, గోల్కొండ, అహమ్మద్‌నగర్ మరొక కూటమిగా ఏర్పడ్డాయి.

గుల్బర్గా యుద్ధం క్రీ.శ.1557: క్రీ.శ.1557లో అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్ నిజాంషా గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షాతో తాను బీజాపూరు రాజ్యంపై దండెత్తి గుల్బర్గా, యాద్గిరిలను ఆక్రమించి, గుల్బర్గాను తాము తీసుకొనేటట్టు, యాదగిరి ఇబ్రహీం కుతుబ్‌షా తీసుకొనేటట్టు ప్రతిపాదించాడు. అందుకు అంగీకరించి ఉభయులు గుల్బర్గాపై దండెత్తారు. బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్ షా రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు స్వయంగా గుల్బర్గా వచ్చి యుద్ధం ఆపు చేయించి విజయనగరం, బీజాపూర్, అహమ్మద్‌నగర్, గోల్కొండ నాలుగు రాజ్యాల సంధి కుదిర్చాడు. ఇకముందు ఎవరూ దాడులకు పాల్పడ కూడదని, ఎవరైనా ముందు దాడికి పాల్పడితే ఆ రాజ్యంపై మిగిలిన మూడు రాజ్యాలు సంయుక్తంగా దండెత్తి ఓడించి అదుపులో పెట్టాలని ఒప్పించాడు. దాంతో అందరూ యుద్ధ విరమణ చేసి ఎవరి రాజ్యాలకు వారు వెళ్లిపోయారు.

మొదటి అహమ్మద్‌నగర్ యుద్ధం క్రీ.శ.1559: కాని అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్ ఆలీ సంధి షరతులను అతిక్రమించి క్రీ.శ.1560లో బీజాపూర్‌పై దండెత్తాడు. బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్ షా రామరాయలకు మొరపెట్టుకున్నాడు. రామరాయలు సంధి ప్రకారం ఇబ్రహీం కుతుబ్‌షాను కూడా కలుపుకొని బీజాపూర్‌తోసహా అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి పరెందా నుండి జున్నార్ వరకు అహమ్మద్‌నగర్ నుండి దౌలతాబాద్ వరకు వీరవిహారం చేసి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని ధ్వంసం చేశాడు. హుసేన్ నిజాంషా రాజధానిని వదిలి పైరాన్‌కు పారిపోయాడు. అతని తల్లి అమీనాబి ఇబ్రహీం కుతుబ్‌షాకు కబురుపంపి యుద్ధాన్ని ఆపమని అర్థించింది. ఇబ్రహీంకు వాస్తవంగా అహమ్మద్‌నగర్‌పై దండెత్తడం ఇష్టం లేదు. అందువల్ల అతడు రామరాయల వద్దకు వెళ్లి యుద్ధాన్ని ఆపితే తన రాజ్యంలోని కొండపల్లి దుర్గాన్ని ఇస్తానని వాగ్దానం చేశాడని, అందుకు

రామరాయలు సమ్మతించి కొండపల్లి దుర్గాన్ని తీసుకొని ముట్టడి మాని వెళ్లిపోయాడని ప్రొ॥ షేర్వాణి రాశారు.

ఇమ్మడి జగదేవరావు తిరుగుబాటు క్రీ.శ.1560: తర్వాత కొద్ది కాలానికి గోల్కొండ రాజ్యంలో ఒక చిన్న సంఘటన జరిగింది. ఇబ్రహీం కుతుబ్‌షాను బలపరిచిన జగదేవరావు కొద్దికాలం తర్వాత ఇబ్రహీం కుతుబ్‌షాకు వ్యతిరేకంగా మనసు మార్చుకున్నాడు. అతనికి ఇబ్రహీం పరిపాలన నచ్చలేదు. అతడు భువనగిరి దుర్గంలో ఉన్న దౌలత్ కులీని గోల్కొండ సింహాసనమెక్కించాలని తిరుగుబాటు చేసి ఎల్లందల దుర్గాన్ని ఆక్రమించాడు. అతనికి ధైర్యం చాలక బేరారు వెళ్లి దరియా ఇమద్‌షా సహాయం అర్థించాడు. దరియా అతనికి సహాయం చేయడానికి తిరస్కరించాడు. జగదేవరావు తిరిగి ఎల్లందల చేరాడు. ఇబ్రహీం అతనిని ఓడించడానికి ముస్తాఫాఖాన్ ముజాహిద్ ఖాన్‌లను పంపాడు. ఎల్లందల వద్ద జరిగిన యుద్ధంలో జగదేవరావు తమ్ముడు వెంకటరావు మరణించాడు. జగదేవరావు ఓడిపోయి విజయనగర రాజ్యం చేరాడు. రామరాయలు అతనిని ఆదరించి తన వద్ద సేనాధిపతిగా చేర్చుకున్నాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా అహమ్మద్‌నగర్ సుల్తాన్‌తో చేరటం క్రీ.శ.1560: జగదేవరావుకు రామరాయలు ఆశ్రయం యివ్వడంతో ఇబ్రహీం కుతుబ్‌షాకు రామరాయలపై ఆగ్రహం కలిగింది. కనుక అతడు అహమ్మద్‌నగర్ సుల్తాన్‌తో తన మైత్రిని బలపరుచుకోదలిచాడు. సంప్రదింపులు జరిగాయి. హుసేన్ నిజాంషా కుమార్తె బీబీజమాల్‌ను ఇబ్రహీంకు ఇచ్చి క్రీ.శ.1563లో షోలాపూర్ వద్ద వివాహం జరిపాడు. ఉభయ రాజ్యాల సంబంధాలు బలపడ్డాయి.

రెండవ అహమ్మద్‌నగర్ దండయాత్ర క్రీ.శ.1563: తర్వాత గోల్కొండ, అహమ్మద్‌నగర్ సేనలు కళ్యాణీ దుర్గాన్ని ముట్టడించాయి. బీజాపూర్ - ఆలీ ఆదిల్ షా మళ్లీ రామరాయల సహాయం కోరాడు. బీజాపూర్ విజయనగర సైన్యాలు కళ్యాణీపై దండెత్తాయి. ఆ సైన్యాలను చూసి అహమ్మద్‌నగర్, గోల్కొండ సైన్యాలు దుర్గం ముట్టడిని మానేసి తమ రాజ్యాల వైపు వెళ్లిపోయాయి. తర్వాత విజయనగరం, బీజాపూర్ సంయుక్త సైన్యాలు రెండవసారి అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి పట్టణాన్ని సర్వనాశనం చేశాయని జేబరి రాశాడు. ఈ దండయాత్రలో విజయనగర సైన్యాలు మసీదులను నాశనం చేసి మహమ్మదీయ స్త్రీలపై అత్యాచారాలు చేశాయని ఫెరిష్టా రాశాడు. రాజధాని నాశనమైనందువల్ల హుసేన్ నిజాంషా తన రాజధానికి ఐసా, జున్నార్‌లకు మార్చుకున్నాడట. ఈ దండయాత్రలో షేర్‌ఖాన్ అజీజుఖాన్, హుసేన్‌ఖాన్, దౌలత్‌ఖాన్, షీకు మహమ్మద్ మొదలైన బీజాపూర్ సేనానులు అహమ్మద్‌నగర్ సేనాని మూర్తజాఖాన్‌ను ఓడించి అహమ్మద్‌నగరాన్ని దోచి నిజాంషాహి రాజలాంఛనాన్ని, వారి కుటుంబానికే పరిమితమైన సజ్జలం అనే చిహ్నాన్ని తెచ్చి ఆలీ ఆదిల్షాకు ఇచ్చాడట.

గోల్కొండ రాజ్యంపై దండయాత్ర-బీభత్సం క్రీ.శ.1563: రామరాయలు ఆలీ ఆదిల్‌షాలు అహమ్మద్ నగర్‌పై దండెత్తుతూ మరొక సైన్యాన్ని జగదేవరావు, ఇన్ముల్క్, కన్వాని, మియాబద్దూ, చందూఖాన్, రామరాయల తమ్ముడు వెంకటాద్రి నాయకత్వాన గోల్కొండ రాజ్యంపై దండు పంపారు. బీజాపూర్ విజయనగర సైన్యాలు గోల్కొండ సైన్యాలను చీల్చి చెండాడాయి. ఇబ్రహీం కుతుబ్‌షా వారి దాడికి తట్టుకోలేక గోల్కొండకు పారిపోయాడట. రామరాయలు ఆలీ ఆదిల్‌షాలు గోల్కొండకు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడిపల్లి దగ్గరకు చేరారట. గోల్కొండ రాజ్య రహస్యాలను తెలిసిన జగదేకరావు కోయలకొండ, ఘనాపూర్, పానుగల్లు దుర్గాలను ఆక్రమించాడు. ఇంద్రగంటి కేశవరావును గోల్కొండ సరదారు స్వంత రాజ్యం స్థాపించాలని ప్రయత్నించాడు రామరాయలు కొండవీటి దుర్గాధిపతిగా ఉన్న సిద్ధరాజు తిమ్మరాజును 50 వేల సైన్యంతో కొండపల్లి మచిలీపట్టణాలను కొల్లగొట్టమని ఆజ్ఞాపించాడు. ముస్తాఫానగర్ నుండి సుద్ది తిమ్మయ, రాజమండ్రి నుండి సాబ్‌ఖాన్‌లు గోల్కొండ రాజ్యాన్ని ధ్వంసం చేయడానికి బయలుదేరారు. గజపతి సామంతులు విద్యాధరుడు చితాబ్‌ఖాన్‌లు రాజమండ్రి నుండి ఏలూరుపై దండెత్తారు. వారికి రామరాయలు మద్దతు ఇచ్చాడు. శత్రువులు ఒక్కొక్క కోటనే ఆక్రమించసాగారు. సొంత రాజ్యంలో సామంతులు తిరుగుబాటు ధోరణిలో ఉన్నారు. గోల్కొండ రాజ్యం అంతరించే పరిస్థితులు ఏర్పడ్డాయి. రాజ్యం అల్లకల్లోలమైంది. రాజ్యం అంతటా అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆ స్థితిలో మంత్రులు, సరదారులు రామరాయలతో సంధి చేసుకోవడం మంచిదని ఇబ్రహీంకు సలహా ఇచ్చారు. ఇబ్రహీం ముస్తాఫాఖాన్‌ను సంధి చేసుకోవడానికి పంపాడు. అతడు రామరాయలను కలిసి రామరాయలు ఆక్రమించి ఉన్న ఘనాపూర్, కోవెలకొండ, పానుగల్లును విజయనగర రాజ్యంలో విలీనం చేసేటట్లు రామరాయలు ఆక్రమించిన మిగతా కోటలను వదిలివేసేటట్లు, అలాగే బీజాపూర్ సుల్తాన్ ఆక్రమించిన ప్రాంతాలు

అతనికిచ్చేటట్లు సంధికి ఒప్పించాడు. అప్పుడు బీజాపూర్, విజయనగర సైన్యాలు గోల్కొండ రాజ్యాన్ని వదిలిపోయాయి. ఇబ్రహీం ఊపిరి పీల్చుకున్నాడు. ఈ సంధి జరగకపోతే ఇబ్రహీం రాజ్యాన్ని కోల్పోయి ఉండేవాడు. ముస్తాఫాఖాన్ చేసిన మేలుకు అతనిని మీర్జుమ్లా పదవి నుండి పీష్వా పదవిలో నియమించాడు.

ఇబ్రహీం రాజ్యాన్ని పునర్నిర్మాణం చేసుకోవడం: విజయనగర - బీజాపూర్ సైన్యాలు వెళ్లిపోయిన తర్వాత ముస్తాఫాఖాన్ యుద్ధకాలంలో నాశనమైన దుర్గాలను బాగు చేయించమని సలహా ఇచ్చాడు. ఇబ్రహీం ఆ సలహాను పాటించాడు. తర్వాత 20 లక్షల హొన్నులు ఖర్చుపెట్టి 9 నెలల్లో గోల్కొండ దుర్గాన్ని దృఢపరిచాడు. బలమైన బురుజులు నిర్మింపబడ్డాయి. దుర్గం చుట్టూ రెండు వరుసల ప్రాకారాలను కట్టించాడు. ఆ గోడలు 24 వేల అడుగుల కొలత కలిగి, 400 బురుజులతో నిర్మింపబడ్డాయి. ఈ ప్రాకార కుడ్యాలు సున్నం రాళ్ళు గచ్చుతో అతి దృఢంగా నిర్మింపబడ్డాయి. బాలాసాహెబ్ నిర్మాణం పూర్తి చేశాడు. రాజభవనాలు అంతఃపురాలు, ఇతర సౌధాలు, దర్బారు భవనాలు, వీధులు, స్నానవాటికలు నిర్మించి అందమైన ఉద్యానవనాలను వేయించాడు. రాజభవనాలు చుట్టేకాకుండా ప్రజా నివాసాల చుట్టూ మరొక కోట గోడను నిర్మించాడు.

ఆంతరంగిక తిరుగుబాట్లు క్రీ.శ.1563-64: రామరాయలు గోల్కొండను వదలి వెళ్లినా గోల్కొండ రాజ్యంలో తిరుగుబాట్లను ప్రోత్సహించాడు. శరద్‌రావ్ అనే సేనాధిపతి ఇబ్రహీంకు వ్యతిరేకంగా పని చేయటం ప్రారంభించాడు. అతడు అదను చూసి గోల్కొండ దుర్గాన్ని రామరాయలకు స్వాధీనం చేయాలని కుట్రను జరిపాడు. ఇబ్రహీంకు రక్షకుడుగా ఉన్న ముస్తాఫా ఖాన్‌ను తమకు అప్పగించమని ఇబ్రహీంను కోరాడు. ముస్తాఫాఖాన్ కూడా తనని అప్పగించి రాజ్యాన్ని కాపాడుకోమని చెప్పాడు. కాని ఇబ్రహీం అందుకు అంగీకరించక శరద్‌రావు అనుచరులను చీలదీసి ఒక్కొక్కరినే అంతం చేసి వారి కుట్రను భగ్నం చేశాడు. తెలంగాణలో కుట్రలు, తిరుగుబాట్లు ముగిశాయి. తరువాత రఫత్‌ఖాన్ లారీకి మలిక్ నాయబ్ అనే బిరుదు ఇచ్చి ఏలూరు, రాజమండ్రి ప్రాంతాలను తిరిగి జయించమని పంపాడు. అతనితోపాటు అజీజుల్ముల్క్, ముల్క్‌షేరీస్, ఆదమ్‌ఖాన్, తాజ్‌ఖాన్ మొదలైన వీరులు బయలుదేరారు. బారాపల్లి వద్ద చితాబ్‌ఖాన్‌ను ఓడించి వారు రాజమండ్రి వరకు జయించారు. రాజ్యంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడ్డాయి.

తళ్లికోట యుద్ధం క్రీ.శ.23-1-1565 లేక బన్నిహట్టి యుద్ధం: తన రాజ్యంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడిన తర్వాత ఇబ్రహీం, రామరాయల వలన తన రాజ్యానికి జరిగిన పరాభవానికి ప్రతీకారం చేయదలచాడు. ఇదే సమయంలో మిగిలిన సుల్తాన్‌లకు కూడా రామరాయలంటే అమిత భయం కలిగింది. దాంతో సుల్తాన్‌లు అందరూ రామరాయలకు వ్యతిరేకంగా ఒక కూటమిగా ఏర్పడ్డారు. అహమ్మద్‌నగర్‌తో ఉన్న విభేదాల వల్ల బేరారు పాలకుడు బుర్హన్ ఇమాద్‌షా చేరలేదు. మిగిలిన బీజాపూర్, బీదరు, అహమ్మద్‌నగర్, గోల్కొండ- నలుగురు సుల్తాన్‌లు ఏకమై తమ సైన్యాలతో ద్రోణా నది కృష్ణా నదుల సంగమ ప్రాంతంలో ఉన్న తళ్లికోట వద్దకు చేరారు. అది తెలిసి రామరాయలు గొప్ప సైన్యంతో వచ్చాడు. ఉభయులకు అక్కడ ఘోర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో రామరాయలు మరణించాడు. ఈ యుద్ధం ఎక్కడ జరిగిందనే విషయంలో ఏకాభిప్రాయం లేదు. రాబర్ట్ సీవెల్ తళ్లికోట వద్ద జరిగిందని భావించి దానిని తళ్లికోట యుద్ధం అని వ్యవహరించాడు. ప్రొ॥ హీరాస్ రాక్షసి తంగడి గ్రామాల మధ్య జరిగిందని, కనుక దానిని రాక్షసతంగడి యుద్ధం అని పేర్కొన్నాడు. ఆచార్య షేర్వాణీ ఈ యుద్ధం బన్నిహట్టి అనే గ్రామం వద్ద జరిగింది కాబట్టి దానిని బన్నిహట్టి యుద్ధంగా పేర్కొన్నాడు. యుద్ధానంతరం సుల్తాన్‌లు విజయనగర పట్టణంపై దాడి చేసి నగరాన్ని దోచుకొని ధ్వంసం చేశారు. విజయనగర రాజ్యం తన ప్రాభవాన్ని పోగొట్టుకుంది. తర్వాత సుల్తాన్‌ల వైపు కన్నెత్తి చూడలేకపోయింది.

సుల్తాన్‌ల కలహాలు: తళ్లికోట యుద్ధంలో ఏకమైన సుల్తాన్‌ల మధ్య ఐక్యత తర్వాత కొనసాగలేదు. వారు మళ్లీ ఒకరిపై ఒకరు ఎప్పటిలాగే దాడులు చేసుకున్నారు. బన్నిహట్టి యుద్ధం ముగియగానే గోల్కొండ సేనాని ముస్తాఫాఖాన్ రాయచూరు, అంతర్వేదిని బీజాపూర్ ఆలీ ఆదిల్ షా పరం చేశాడు. దానికి అహమ్మద్‌నగర్ సుల్తాన్ ఆగ్రహించాడు. అతని కోపాగ్నిని తగ్గించడానికి తన పేష్వా ముస్తాఫాఖాన్‌ను పదవి నుండి తొలగించి రఫత్‌ఖాన్ లారాని పేష్వాగా నియమించాడు. అతడు బీజాపూర్ చేరి అక్కడే ఒక స్థానిక కలహంలో హత్యకు గురయ్యాడు. అహమ్మద్‌నగర్‌లో హుసేన్ షా మరణించి అతని కుమారుడు మూర్తజా సుల్తానయ్యాడు. బేరారు తళ్లికోట యుద్ధంలో పాల్గొనలేదని శిక్షించడానికి, అహమ్మద్‌నగర్, బీజాపూర్‌లు బేరారుపై దండెత్తాయి. కాని వారి సఖ్యత ఎంతకాలమో నిలవలేదు. మూర్తజా బీజాపూర్ మీద దండెత్తాడు. తర్వాత గోల్కొండ మీద దండెత్తి 150

ఏనుగులను సంగ్రహించాడని ఫెరిష్టా రాశాడు. బీజాపూర్ విజయనగరంపై దండెత్తి బంకాపూర్, ఆదోని, ధార్వార్ జిల్లాలను ఆక్రమించాడు. అతనిని అరికట్టడానికి మూర్తజా కలిసి రాలేదు. పైగా మూర్తజా బేరారును కలుపుకోవాలని ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇబ్రహీం తుల్య విధానం విఫలమైంది. సుల్తాన్‌లు ఎవరూ అతని మాట వినలేదు. అహమ్మద్‌నగర్, బీజాపూర్ రాజ్యాలు తమ రాజ్యాలను విస్తరించుకొని పెద్దవి అవుతున్నాయి కనుక వారి రాజ్యానికి దీటుగా తన రాజ్యాన్ని కూడా విస్తరించి బలపరచుకోవడమే మంచిదని నిర్ణయించుకున్నాడు. బీజాపూర్, విజయనగర పశ్చిమ ప్రాంతాలను ఆక్రమించి పెరుగుతుండగా, తాను ఉత్తర కోస్తాలోని కళింగ రాజ్యాన్ని, దక్షిణాంధ్రలో విజయనగర రాజ్య భాగాలను జయించి తన రాజ్యాన్ని కూడా వారిలాగే పెంచాలని తీర్మానించుకొని కోస్తా ఆంధ్రదేశంపైకి తన దృష్టిని మరల్చాడు.

తళ్లికోట యుద్ధం తర్వాత ఆంధ్ర దేశ రాజకీయ పరిస్థితి: తెలంగాణ మొత్తం గోల్కొండ రాజ్యంలో ఉంది ఉత్తరాంధ్రలో కొండపల్లి, ఏలూరు సుభాలు కూడా గోల్కొండ రాజ్యంలో భాగాలుగా ఉన్నాయి. కళింగ దేశంలో గజపతి సామ్రాజ్యం అస్తమించింది. వారి సామంతులు స్వతంత్రులయ్యారు. గోదావరి నదికి ఉత్తరంగా సింహాచలం వరకు గజపతి సామంతులు పాలిస్తున్నారు. రాజమహేంద్రవరాన్ని వేదాద్రి అనే గజపతి సామంతుడు ఏలుతున్నాడు. రాజమండ్రి పరిసరాలలోని పట్నపూరు, రాజపుండి అనే కోటలను చితాబ్‌ఖాన్ పాలిస్తున్నాడు పెద్దాపుర ప్రాంతంలో వత్సవాయి వంశస్తులు పాలిస్తున్నారు. క్రీ.శ.1442 సంవత్సరానికి చెందిన పెద్దాపురం వద్దనున్న తిరుపతిలో వత్సవాయి అయ్యప్పదేవ మహారాజు శాసనం ఒకటి ఉంది. ఈ శాసనాన్ని బట్టి ఇందులో పేర్కొనబడిన వత్సవాయి అయ్యప్పదేవ మహారాజు క్రీ.శ.1555లో పెద్దాపుర సంస్థానాన్ని స్థాపించిన వత్సవాయి ముసలి లేక తిమ్మరాజుకు ముందువాడు కావచ్చు. ఇబ్రహీం కుతుబ్‌షాకు సమకాలికంగా వత్సవాయి వంశానికి చెందిన వత్సవాయి ముసలి లేక తిమ్మరాజు పెద్దాపురం, కిమ్మూరుసీమను పాలిస్తున్నాడు. అనకాపల్లి వద్దనున్న కశింకోటను ముకుందరాజు అనే అతను పాలిస్తున్నాడు. దక్షిణ కళింగలో చంద్రజార్ అనే ప్రదేశాన్ని నరసింగ, నరసింగు అనే ఇద్దరు సోదరులు పాలిస్తున్నారు. కళింగ రాజ్యాన్ని వసున్‌దేవ అనే వ్యక్తి పాలిస్తున్నాడు. కృష్ణకు దక్షిణంగా ఉన్న తెలుగుదేశం అంతా అంటే కొండవీడు రాజ్యం నుండి చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి వరకు రాయలసీమ ప్రాంతాలైన గండికోట మొదలైన ప్రాంతాలన్నీ విజయనగర సామ్రాజ్యంలో భాగాలై ఉన్నాయి.

ఉత్తర కోస్తాను జయించటం క్రీ.శ.1570-78: ఈ పరిస్థితులలో ఇబ్రహీం ముందు ఉత్తర కోస్తా మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకోవాలని మాలిక్‌నాయబ్, రఫత్‌ఖాన్ లహరాలను నియమించాడు. వారి వెంట అమీనుల్ముల్కు, సలాబత్‌ఖాన్, మాలిక్ షేర్‌ఖాన్, అమీన్‌జుమ్లా అనే వీరులు కూడా ఉన్నారు. తళ్లికోట యుద్ధానికి ముందే అజీముల్ముల్క్, ముల్కి పేరస్‌ల నాయకత్వాన రాజమహేంద్రవరాన్ని జయించడానికి పంపాడు అజీముల్ముల్క్ కోనసీమలోని తాటిపాక ప్రాంతాన్ని జయించి రాజమహేంద్రవర రాజ్యంపై దండెత్తాలని భావించాడు. ఇంతలో తళ్లికోట యుద్ధం వచ్చింది. కనుక అజీముల్ముల్క్ గోల్కొండకు రప్పించబడ్డాడు. దాంతో ఉత్తరాంధ్రను జయించే కార్యక్రమం ఆగిపోయింది. తళ్లికోట యుద్ధానికి ముందు క్రీ.శ.1563లో రామరాయలు గోల్కొండ రాజ్యంపై దండెత్తి బీభత్సం చేసినప్పుడు, వేదాద్రి, సీతాబ్‌ఖాన్‌లను గోల్కొండ రాజ్యంపై దండెత్తమని కోరాడు. ఆ సమయంలో వేదాద్రి, చితాబ్‌ఖాన్ పెద్దాపుర పాలకుడు వత్సవాయి ముసలితిమ్మ ఏలూరు మీద దండెత్తి కోటను ముట్టడించారు. మాలిక్ నాయబ్ క్రీ.శ.1570లో ఏలూరు మీద దండెత్తి వేదాద్రిని, చితాబ్‌ఖాన్‌ను ఓడించి తరిమివేశారు. మాలిక్‌నాయబ్ చితాబ్‌ఖాన్‌ను ఓడించనిదే తన విజయం సాధ్యం కాదని చితాబ్‌ఖాన్‌కు చెందిన పట్నపూర్, రాజపుండిలను ముట్టడించి చితాబ్‌ఖాన్‌ను ఓడించాడు. అతడు పెనుగొండకు పారిపోయాడు వేదాద్రి చితాబ్‌ఖాన్‌ను రప్పించాడు.

రాజమహేంద్రవరం ఆక్రమణ క్రీ.శ.1571: మాలిక్‌నాయబ్, రఫత్‌ఖాన్‌లు ధవళగిరి చేరి అక్కడి నుండి రాజమహేంద్రవరం చేరి కోటను ముట్టడించారు. అక్కడ చివరిసారిగా వేదాద్రి, చితాబ్‌ఖాన్‌లు చావో, బ్రతుకో అని యుద్ధం చేశారు. కాని ఈ యుద్ధ సమయంలో పెద్దాపుర వత్సవాయి ముసలి తిమ్మరాజు రఫత్‌ఖాన్‌తో చేరి పోయాడు. ఆ తర్వాత ముస్లిం సైన్యాలు సులభంగా వేదాద్రిని, చితాబ్‌ఖాన్‌ను ఓడించి క్రీ.శ.1572లో రాజమహేంద్రవరం కోటను ఆక్రమించాయి. ఆ తరువాత రాజమండ్రి తిరిగి హిందువుల వశం కాలేదు. అది శాశ్వతంగా గోల్కొండ రాజ్యంలో భాగం అయిపోయింది. క్రీ.శ.1578 సంవత్సరానికి చెందిన మహమ్మద్ కులీకుతుబ్ షా శాసనం రాజమహేంద్రవరంలో ఉంది. ఈ శాసనం ఆ ప్రాంతం మీద గోల్కొండ అధికారాన్ని

ధృవపరుస్తోంది. తర్వాత గోల్కొండ సైన్యాలు పెద్దాపురంపై దాడిచేశాయి. వత్సవాయి ముసలయ్య వారితో సంధి చేసుకొని గోల్కొండ సామంతుడయ్యాడు. దాంతో పెద్దాపురంలో వత్సవాయి వారి రాజ్యం నిలదొక్కుకుంది. ఈ అపజయాల తర్వాత వేదాద్రి, చితాబ్‌ఖాన్‌లు కశింకోట చేరారు. అమీన్‌జుమ్లా, అమీనుల్ముల్క్‌లు కశింకోట ముట్టడికి నాయకత్వం వహించారు. వారు అతికష్టం మీద అక్కడ వేదాద్రి, చితాబ్‌ఖాన్‌లను, వారికి ఆశ్రయం ఇచ్చిన ముకుందరాజును ఓడించి కశింకోటను వశపరచుకున్నారు. ఆ తర్వాత వేదాద్రి చితాబ్‌ఖాన్‌లు ఏమైనదీ తెలియదు. తర్వాత వీరఘట్టాన్ని ఆక్రమించారు.

కళింగ దండయాత్ర క్రీ.శ.1578: తర్వాత గోల్కొండ సేనలు ముందుకు సాగి చంద్రభార్ చేరి నరసింగ, సారసింగులను ఓడించాయి. తర్వాత కళింగపై దండెత్తాయి. మాలిక్‌నాయబ్ వస్సదేవు రాజ్యాన్ని జయించాడు. ఆ రాజ్యంలోని పొట్నూరు మొదలగు అనేక కోటలను ఆక్రమించాడు. వస్సదేవుడు తన కుమారుని పంపి సంధి చేసుకొని సాలుకు 30వేల హొన్నులు కప్పం చెల్లించే షరతు మీద గోల్కొండ సామంతుడయ్యాడు. దాంతో ఉత్తరాంధ్ర కళింగ దండయాత్ర పూర్తయింది. శ్రీకాకుళం జిల్లా వరకు ఉత్తరాంధ్ర మొత్తం గోల్కొండ రాజ్యంలో భాగమైంది. ఇబ్రహీం ఆ ప్రాంతాలలో తన సరదారులను ఫౌజ్‌దార్లుగా నియమించాడు. కళింగ వరకు తన ఆధిపత్యంలో స్థిరంగా ఉండాలని శ్రీకాకుళంలో ఒక ఫౌజ్‌దార్‌ని నియమించాడు. శ్రీకాకుళం అసలు పేరు చిక్కాఖోల్. చిక్కా అంటే సంచి, ఖోల్ అంటే తెరువు అని అర్థం. ఆ పరిసర ప్రాంతాలపై పేష్కస్ వసూలు చేసి సంచులలో తెచ్చి అక్కడ ఉండే గోల్కొండ ఫౌజ్‌దార్ ముందు సంచులు తెరిచి పేష్కస్ ధనాన్ని పోసేవారట. కనుక ఆ రాజాకు చిక్కాఖోల్ అని పేరు వచ్చిందట. అదే కాలక్రమంలో శ్రీకాకుళం అని రూపాంతరం చెందింది. అలాగే కశింకోటలో మరొక ఫౌజ్‌దార్‌ను నియమించాడట. అందువల్ల దానికి ముస్లిం పేరుతో కశింకోట అని పేరు వచ్చింది. బహుశ కాశిం అనే ఫౌజ్‌దార్‌ని మొదట నియమించి ఉండవచ్చును. ఆ కోటకు అతని పేరు వచ్చి ఉంటుంది.

కొండవీడు ఆక్రమణ క్రీ.శ.1578-79: ఉత్తరాంధ్ర దండయాత్ర జరిగిన కాలంలోనే విజయనగర రాజ్యపు అమరనాయకుడు హందడె మలకప్పనాయుడి ఆహ్వానంపై మురహరిరావను గోల్కొండ సేనాని క్రీ.శ.1578లో అహోబిలంపై దండెత్తి నరసింహస్వామి దేవాలయాన్ని కొల్లగొట్టాడు. విజయనగరరాజు శ్రీరంగరాయలు గోల్కొండ సైన్యాలపై తన సేనానులను పంపాడు. దాంతో గోల్కొండ రాజ్యానికి విజయనగర రాజ్యానికి యుద్ధం వచ్చింది. ఇబ్రహీం సైన్యాలను పంపి ఉదయగిరిని ఆక్రమించాడు. తర్వాత కొండవీడు రాజ్యాన్ని జయించడానికి హైదర్ ఉల్‌ముల్క్ అనే సేనాధిపతిని, మీర్‌షామీర్ అనే మరొక సేనాధిపతిని పంపాడు. వారు తమ సైన్యాలతో క్రీ.శ.1579 మార్చి 29న కృష్ణానది దాటి వినుకొండ, కొచ్చెర్లకోట, కంభాలను జయించారు. తర్వాత కొండవీడును ముట్టడించి దుర్గాన్ని ఆక్రమించాయి. ఈ విజయంతో దక్షిణాంధ్ర మొత్తం గోల్కొండ రాజ్యంలో భాగం అయింది. క్రీ.శ.1579 చివరకు ఉత్తరాన శ్రీకాకుళం నుండి దక్షిణాన ఉదయగిరి వరకు తీరాంధ్ర ఆంధ్ర దేశమంతా గోల్కొండ రాజ్యంలో చేరిపోయింది. కుతుబ్‌షాహి రాజ్యం ఆంధ్రదేశ రాజ్యంగా మారిపోయింది.

బీజాపూర్ రాజ్యంపై దండయాత్ర క్రీ.శ.1579-80: ఇదే సమయంలో దక్కనులో అనేక మార్పులు వచ్చాయి. అహమ్మద్‌నగర్ సుల్తాన్ మూర్తజా తుఫాల్ ఖాన్‌ను ఓడించి బేరారు రాజ్యాన్ని జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. తర్వాత అతడు బీజాపూర్‌పై దండెత్తాడు. ఆ సమయంలో తనకు సహాయంగా రావలసిందిగా ఇబ్రహీం కుతుబ్‌షాను కోరాడు. బీజాపూర్ రాజ్యంలోని యాద్గిరి, సాగర్, కాక్ని, నవాల్కిలను, జునాకన్ ప్రాంతాన్ని జయించవచ్చని ఇబ్రహీం మూర్తజా ఆహ్వానాన్ని అంగీకరించాడు. కాక్ని నవాల్కి ప్రదేశాలపై కులీకుతుబ్‌షా కాలం నుండి వివాదముంది. ఇబ్రహీం మీర్‌జైనల్ నాయకత్వంలో సైన్యాన్ని పంపాడు. మిత్ర సైన్యాలు బీజాపూరు రాజ్యంలోని నల్ దుర్గాన్ని ముట్టడించి ఆక్రమించాయి. తర్వాత మిరాజ్, రాయ్‌భాగ్, సతారా, గుల్బర్గాలపై దండెత్తి కొల్లగొట్టాయి. తర్వాత గోల్కొండ సేనలు కాక్ని, నవాల్కిలను క్రీ.శ.1580 నాటికి పూర్తిగా ఆక్రమించాయి. నల్ దుర్గ ముట్టడిలో గోల్కొండ సేనాని అమీర్‌షామీర్ పాల్గొన్నాడు. యుద్ధం జరుగుతుండగా హిజ్రా 21 రబి 988 అంటే క్రీ.శ.5-5-1580లో ఇబ్రహీం కుతుబ్‌షా మరణించాడు. అతని సేనాని మురహరిరావు అహోబిళాన్ని దోచుకొని వచ్చి ఆభరణాలను తెచ్చి ఇబ్రహీంకు చూపగా అవి చూసిన తర్వాత అతనికి టైఫాయిడ్ జ్వరం వచ్చి మరణించాడని బ్రిగ్స్ రాశాడు. నల్ దుర్గ యుద్ధంలో స్వయంగా పాల్గొనమని ఆహ్వానించడానికి అమీర్‌షామీర గోల్కొండ వెళ్లాడు. ఇబ్రహీం మరణించిన సంగతి తెలిసి తిరిగి నల్ దుర్గకు వచ్చాడు. కాని తన సాటి

సేనాధిపతులకు ఇబ్రహీం మరణవార్తను చెప్పలేదు. కుతుబ్‌షాహి నిజాంషాహీ సేనానులైన జంషీద్‌ఖాన్, బెహజాదుల్ముల్క, ఖుదావంద్‌ఖాన్, సయ్యద్ మూర్తజాలను సమావేశపరుచి తనకు కాబోయే అల్లుడు హుసేన్‌ను గోల్కొండ సింహాసనాన్ని అధిష్టించడానికి తనకు సహాయం చేసేలా వారిచేత ప్రమాణాలు చేయించాడు. కాని ఇదే సమయంలో గోల్కొండలో మహమ్మద్ కులీకుతుబ్ షా క్రీ.శ.1580లో సింహాసనం అధిష్టించాడు. ఇబ్రహీం మరణవార్త తెలిసి అహ్మద్‌నగర్ సుల్తాన్ మూర్తజా మెయీామిర్కి సబ్జ అనే సరదారుని ద్వారా సంతాప సందేశం పంపించాడు.

ఇబ్రహీం కాలంలో గోల్కొండ రాజ్యంలో హిందూ ముస్లిం భేదం పాటించలేదు. ఈ పద్ధతి మిగిలిన దక్కను రాజ్యాలలో లేదు. కాని గోల్కొండలో ఉన్నత ఉద్యోగాలలో గాని, సేనాధిపతులలో గాని సామంత రాజులలో గాని హిందూ ముస్లిం భేదం లేకుండా అందరూ సమానంగా చూడబడ్డారు. జగదేకరావు, మురారిరావుల వంటి హిందువులు ముస్లిం సరదారులతో సమాన హోదా గౌరవ మర్యాదలను పొందారు. గోల్కొండ రాజ్యం విజయనగర రాజ్యంపై దాడులు చేస్తున్నప్పటికీ హిందూ ముస్లిం భేదం కనిపించకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. ముస్తాఫాఖాన్, మాలిక్‌నాయబ్, అమీర్‌షా మహమ్మద్ అంజు, ఇబ్రహీం అల్లుడు హజరత్ హుసేన్‌వలి, రఫత్‌ఖాన్ లహరి, ఐనుల్ముల్క, జగదేకరావు, మురారిరావుల వంటి సాహసవంతులైన సేనాధిపతుల సహకారంతో ఇబ్రహీం అనేక విజయాలు సాధించడమేగాక మంచి పరిపాలనను కూడా ఏర్పాటు చేయగలిగాడు. దక్కను రాజ్యాలతో దౌత్యపరమైన సంబంధాలను సాగించాడు. ఆ కార్యంలో ముస్తాఫాఖాన్‌ల వంటి వారు గొప్ప పాత్రను నిర్వహించారు. రాజ్యంలో వ్యవసాయాభివృద్ధికి నీటి పారుదల సౌకర్యాలను కలిగించాడు. చెరువులు, కుంటలు, బావులు తవ్వించాడు. రహ్మతుల్లా అనే సర్దారు పానుగంటి ఉదయ సముద్ర తటాకానికి కాలువ కట్టించి క్రీ.శ.1560లో పానుగంటి శాసనం వేయించాడు. క్రీ.శ.1577నాటి మల్కాపురం శాసనం పన్నులు తగ్గించినట్లు తెలుపుతోంది. అందులో బ్రాహ్మణులు, కాపులు పూర్తి పన్ను, మహమ్మదీయులు అర్ధపన్నులు చెల్లించనక్కరలేదని రాయించబడింది. దీనిని బట్టి ప్రజల సాదక బాధకాలను దృష్టిలో పెట్టుకొని పన్నులు కూడా తగ్గించాడని తెలుస్తోంది. కొలంపూడి, ఈపూరులలో స్థానిక వ్యక్తుల దాన శాసనాలున్నాయి. ఆ శాసనాలలో ఇబ్రహీం పేరుంది. ఇబ్రహీం విద్యావంతుడు, కవి పండిత పోషకుడు. తెలుగు భాషను పోషించాడు. అతని కాలంలో రాజ్యం అన్ని విధాలా అభివృద్ధి చెందింది. రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పాడు. వృద్ధురాలైన స్త్రీ వంటి నిండా నగలు ధరించి గోల్కొండ నుండి బెంగాలు వరకు అటు వైపు బీజాపూరు వరకు అర్ధరాత్రి అయినా నిర్భయంగా వెళ్లగలిగేదని ఫెరిష్టా రాశాడు. అతడు సాహిత్యాభిమాని. ఉర్దూ, పారశీక, తెలుగు భాషలను ఆదరించి మల్కిభరాం అనే బిరుదు పొందాడు. ఇతని పరాక్రమాన్ని, ఔదార్యాన్ని వర్ణిస్తూ అనేక చాటుపద్యాలు రాయబడ్డాయి. ఇతని కాలంలో మొదటి గోల్కొండ నాణెం ముద్రింపబడింది. దీనిని బట్టి గోల్కొండ సుల్తాన్‌లలో సర్వస్వతంత్ర ప్రతిపత్తిని అనుభవించిన మొదటి సుల్తాన్ ఇబ్రహీం షా అనే బిరుదు ధరించిన మొదటి సుల్తాన్ కూడా అతడే. కులీకుతుబ్ షా స్వతంత్రుడైనప్పటికీ తాను బహమనీ సామంతునిగానే భావించుకున్నాడు. కుతుబ్‌షాహీలు స్వతంత్రులైనప్పటికీ తమ సమకాలికులైన మొగల్ చక్రవర్తులు వారిని స్వతంత్రులుగా గాని, తమతో సమానులుగా గాని చూడలేదు. వారి పత్రాలలో వారిని కుతుబ్-ఐ-ఉల్‌ముల్క్ అని సంబోధించారు. బీజాపూర్ సుల్తాన్‌లు కూడా అంతే. దక్కను సుల్తాన్‌లను వారు జమీందారులగానే గుర్తించారు.

మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ.5-5-1580-క్రీ.శ.11-1-1612: ఇబ్రహీం కుతుబ్‌షాకు ఆరుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు అబ్దుల్ ఖాదర్ 22 సంవత్సరాల వయస్సువాడు. రెండవ కుమారుడు హుస్సేన్ కులీ 20 సంవత్సరాల వయస్సు, మూడవ కుమారుడు మహమ్మద్ కులీ 14 సంవత్సరాల వయస్సు, నాల్గవ కుమారుడు మీర్జా అబ్దుల్ షతాకు 13 సంవత్సరాలు. ఐదవ కుమారుడు మీర్జా ఖుదాబందా 12 సంవత్సరాలు, ఆరవ కుమారుడు మహమ్మద్ మీన్ వయసు 9 సంవత్సరాలు. ఏకైక కుమార్తె చాంద్ సుల్తానా. తండ్రి మరణించే నాటికి పెద్ద కుమారుడు గోల్కొండలో లేడు. బీదర్ పట్టణంలో ఉన్నాడు. అతని తల్లి బీదర్‌లోని హజరత్‌షా కలీముల్లా బుత్‌షాకు ముషాయక్ వంశస్తురాలు. రెండవ కుమారుడు మీర్జాహుసేన్ గోల్కొండలో ఉన్నాడు. షామీర్ తబతబ అనే సేనాధిపతి ఇతనికి తన కుమార్తెనిచ్చి వివాహం చేసి గోల్కొండ సింహాసనం ఎక్కించాలని భావించి నల్దుర్గం వద్ద తన సాటి సేనాధిపతులచే ప్రమాణం కూడా చేయించాడు. కాని అతడు రాజధానికి దూరంగా ఉన్నందువల్ల గోల్కొండలో హుసేన్‌కు తగిన మద్దతులేకుండా పోయింది. మూడవ

కుమారుడు మహమ్మద్‌కులీ తల్లి భాగీరథి. ఆమె ఇబ్రహీం కుతుబ్‌షాకు ప్రియమైన భార్య. ఇబ్రహీం కుతుబ్‌షా దగ్గర రాయరావు అనే సరదారు పనిచేసే వాడు. అతడు భాగీరథిని ఎక్కువగా గౌరవించేవాడు. ఆమె కుమారుడు మహమ్మద్ కులీపై ప్రేమాభిమానాలున్నవాడు. కనుక అతడు ఇబ్రహీం మరణానంతరం తన పలుకుబడిని ఉపయోగించి మహమ్మద్ కులీని సుల్తాన్‌గా చేశాడు. మహమ్మద్‌కులీ కుతుబ్‌షా సింహాసనానికి వచ్చే నాటికి 14 సంవత్సరాల 7 నెలల వయస్సువాడు. అతడు అప్పటికే పరిపాలనా పద్ధతులలోను, యుద్ధ తంత్రంలోను శిక్షణ పొంది ఉన్నాడు. తండ్రి ఇతనినే తన వారసుడు కావాలని కోరినట్లు తెలుస్తోంది. ఇద్దరు పెద్ద వారు ఉండగా మూడవ కుమారుడు రాజ్యానికి రావడం అంతఃపుర కుట్రల వల్ల జరిగి ఉండవచ్చునని ఆచార్య షేర్వాణి అభిప్రాయపడ్డారు. ఇతని కాలంలో సోదరులు, సామంతులు తిరుగుబాట్లు చేశారు. వాటిని అణచి రాజ్యాన్ని సుస్థిరం చేశాడు. ఇతని కాలంలో విజయనగర చక్రవర్తి వెంకటపతి రాయలతో అనేక యుద్ధాలు జరిగాయి. ఇతడు అక్బరు సమకాలికుడు. ఇతని కాలంలోనే అక్బరు దక్కనులో మొగల్ సామ్రాజ్యం విస్తరణకు పూనుకున్నాడు. మొగలుల సామ్రాజ్య విస్తరణ ప్రభావం గోల్కొండపై కూడా ప్రసరించింది. మహమ్మద్ కులీ, పేష్వా మీర్ ముమిన్, అర్దిస్తాని మీర్జుమ్లా, మీన్ ఉల్ముల్క్ మొదలైన సరదారుల సహాయంతో ఆ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని తన రాజ్యాన్ని కాపాడుకున్నాడు. రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పాడు. విద్యలు, కళలను పోషించాడు. అతడు దక్కన్ భాషలో గ్రంథాలు రాశాడు. తెలుగులో కవిత్వం చెప్పేవాడు. హైదరాబాద్ నిర్మాత. అందువల్ల ఇతని కాలాన్ని గోల్కొండ చరిత్రలో స్వర్ణయుగం అని అంటారు.

ఇతని కాలం నాటి ఆంధ్ర దేశ చరిత్ర తెలుసుకోవడానికి ఇతని కాలంలో వేయబడిన 11 సంస్కృతాంధ్ర శాసనాలు, 5 అరబ్బీ పారశీక శాసనాలు ఉపయోగపడుతున్నాయి. అవి క్రీ.శ.1583 జుత్తిగ శాసనం, 1590 అమీనాబాద్ శాసనాలు, 1593 మంగళగిరి శాసనం, 1598 జాగర్లమూడి శాసనం, 1599 శ్రీకూర్మం శాసనం, 1600 ధర్మవరం శాసనం, 602 జాగర్లమూడి శాసనం, 1604 సింహాచలం శాసనం, 1604 శ్రీకూర్మ శాసనం- ఇవి సంస్కృతాంధ్ర శాసనాలు. 1596 మీర్జా మహమ్మద్ సమాధి శాసనం, 1597-98 జామెమసీదు శాసనం, 1599 సాజర్‌ఖానామ్ మసీదు శాసనం, 1612లో మహమ్మద్ కులీ సమాధి శాసనం, అరబ్బీ, పారశీక శాసనాలు. చివరి శాసనం మహమ్మద్ కులీకుతుబ్ షా 11-1-1612వ తేదీన మరణించినట్లు తెలుపుతోంది.

నల్‌దుర్గ ముట్టడి విరమణ క్రీ.శ.1581: మహమ్మద్ కులీకుతుబ్ షా సింహాసనానికి వచ్చేనాటికి నల్‌దుర్గ దగ్గర బీజాపూర్ రాజ్యంతో యుద్ధం జరుగుతోంది. అంతేగాక అంతకుముందు ఇబ్రహీం కుతుబ్‌షా జయించిన కాక్ని, నదాల్కి దుర్గాలను కూడా బీజాపూరు సైన్యం ముట్టడించింది. ఆ యుద్ధంలో పాల్గొన్న గోల్కొండ సేనాని మీర్‌షామీర్ తన కుమార్తెను హుసేన్ కులీకిచ్చి వివాహం చేసి గోల్కొండ నవాబును చెయ్యాలని భావించాడు. కాని ఈ లోపలనే మహమ్మద్ కులీ సింహాసనం అధిష్టించాడు. చేసేది లేక అతడు గోల్కొండ వచ్చి నూతన సుల్తాన్‌కు శుభాకాంక్షలు తెల్పి అతనిని నల్‌దుర్గ యుద్ధంలో స్వయంగా పాల్గొనవలసిందిగా కోరాడు. మహమ్మద్ కులీ నల్‌దుర్గ్ చేరి స్వయంగా యుద్ధంలో పాల్గొన్నాడు. ఇదే సందర్భంలో అంటే క్రీ.శ.1580లో బీజాపూర్లో అలీ ఆదిల్‌షా మరణించాడు.

చాంద్‌బీబీ ప్రతిఘటన క్రీ.శ.1580- ఇబ్రహీం ఆదిల్‌షా చాంద్ సుల్తానాల వివాహం 1581: బీజాపూర్ పట్టణంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. మహమ్మద్ కులీ కొద్ది సైన్యాన్ని నల్‌దుర్గ్ వద్ద ఉంచి మిగిలిన సైన్యాన్ని బీజాపూర్‌పై దాడికి పంపాడు. ఆ సైన్యాన్ని మీర్‌జమైల్ అనే సేనాని నడిపాడు. అతనికి కులీ ముస్తాఫాఖాన్ అనే బిరుదునిచ్చి సేనాధిపతిగా పంపాడు. అతనిని అలీ ఆదిల్ షా భార్య చాంద్‌బీబీ ఎదుర్కొని ఓడించి తరిమివేసింది. దాంతో మహమ్మద్ కులీకి విసుగుపుట్టి తాను గోల్కొండ వచ్చి తనను తప్పుదోవ పట్టించిన మీర్‌షామీర్‌ను ఉద్యోగం నుండి తొలగించి అతని జన్మస్థానమైన పర్షియా పంపాడు. వెంటనే తన సైన్యాలను బీజాపూర్ నుండి వెనక్కు పిలిపించాడు. తర్వాత కొద్ది నెలలలోనే క్రీ.శ.1580లో బీజాపూర్‌లో రెండవ ఇబ్రహీం ఆదిల్ షా సింహాసనానికి వచ్చాడు. అతడు గోల్కొండతో వివాహ సంబంధాలు ఏర్పాటు చేసుకోవాలని తలచాడు. అందువల్ల ఖ్వాజా అశా షిరాజ్ అనే అతన్ని రాయబారిగా పంపి మహమ్మద్ కులీ సోదరి చాంద్ సుల్తానాను వివాహమాడగోరుతున్నానని తెలిపాడు. అందుకు సంతోషించి కులీ వివాహానికి అంగీకరించాడు. చాంద్‌సుల్తానా అమీర్ జంబీబ్, మాలిక్ అమీనుల్ముల్క్, మలిక్ ఫకారుల్ముల్క్, అమీర్‌ఖాన్, ముస్తాఫాఖాన్‌ల రక్షణలో నల్‌దుర్గ్ చేరింది. బీజాపూర్ నుండి అలీ ఇబ్రహీం ఆదిల్ షా నల్‌దుర్గ్ చేరి క్రీ.శ.1581లో నిఖా చేసుకున్నాడు. దాంతో

బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు బంధు రాజ్యాలయ్యాయి. నల్‌దుర్గ యుద్ధం విరమించబడింది.

అలీఖాన్ లూరి తిరుగుబాటు క్రీ.శ.1582-1584: మహమ్మద్‌నగర్ నల్‌దుర్గ్ యుద్ధంలో నిమగ్నుడై ఉండగా కొండవీటి వద్ద ఒక తిరుగుబాటు జరిగింది. కొండవీటిని రాయ్‌రావ్ అనే దుర్గాధ్యక్షుడు పాలించేవాడు. అతని స్థానంలో మహమ్మద్ కులీ అలీఖాన్ లూరి అనే సర్దారును కొండవీటి ఫౌజ్‌దారుగా నియమించాడు. కాని రాయ్‌రావు అతనికి కోటను అప్పగించలేదు. అందుకు కోపించిన లూరి తిరుగుబాటు చేసి నేలకొండపల్లి, నిజాంపట్నం, అద్దంకిలను ఆక్రమించి దోచుకున్నాడు. అతనిని అణచడానికి కుతుబ్‌షా తాహర్ మహమ్మద్‌ఖాన్ రహీందార్‌ఖాన్ అనే వారలను పంపాడు. వారు అతనిని ఓడించి తరిమివేశారు. లూరీ పెనుగొండ చేరి విజయనగర చక్రవర్తి రెండవ వెంకటపతిరాయల సహాయం అర్థించాడు. తనకు తగిన సైన్యాలను ఇస్తే కొండవీటిని జయించి విజయనగర సామ్రాజ్యంలో చేరుస్తానని బీరాలు పల్కాడు. అతని మాటలు నమ్మి రాయలు అతనికి సహాయంగా విజయనగర సైన్యాన్ని పంపాడు. ఆ సైన్యం కొండవీటి మీద దాడి చేసింది. కాని రాయ్‌రావ్ వారిని ఓడించి తరిమి వేశాడు. ఓడిపోయిన లూరి తిరిగి పెనుగొండ చేరాడు. కాని వెంకటపతిరాయలు అతనిని ఆదరించలేదు. దాంతో లూరి గోల్కొండ రాజ్యంపై దోపిడీలు చేయసాగాడు. గోల్కొండ సైన్యాలు అతనిపై దాడులు చేసి క్రీ.శ.1586లో వధించాయి. దాంతో అతని తిరుగుబాటు అంతమైంది. తర్వాత అతడు హైదరాబాద్ నగర నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నుడయ్యాడు. నగర నిర్మాణం కొంత పూర్తి అయిన పిదప కుతుబ్‌షా విజయనగర రాజ్యంపై దండయాత్ర చేశాడు.

విజయనగర రాజ్యంతో పోరాటం క్రీ.శ.1593-1595: విజయనగర చక్రవర్తి రెండవ వెంకటపతిరాయలు తనపై తిరుగుబాటు చేసిన అలీఖాన్ లూరికి సహాయం చేసినందుకు కుతుబ్‌షాకు ఆగ్రహం కలిగింది. కనుక అతడు రెండవ వెంకటపతి రాయలతో క్రీ.శ.1593లో యుద్ధాలకు దిగాడు. ఈ యుద్ధాలు రెండు సంవత్సరాలు సాగాయి. కుతుబ్‌షా తన సైన్యాలకు మీర్‌జుమ్లా అమీనుల్ముల్క్‌ను సేనాధిపతిగా నియమించాడు. అతడు కృష్ణానదిని దాటి ముసలిమడుగును ఆక్రమించాడు. తర్వాత నంద్యాలనేలే బస్వంత్‌రాజ్‌ను ఓడించాడు. తర్వాత కర్నూలు పాలించే తిరుమల రాయలను ఓడించాడు. గుత్తినాక్రమంచి గండికోటను ముట్టడించాడు. గండికోటను వెంకటపతిరాయల మేనల్లుడు నరసింహరాయలు పాలిస్తున్నాడు. ఇదే సందర్భంలో మహమ్మద్ కులీకుతుబ్‌షా కొంత సైన్యంతో స్వయంగా గండికోట యుద్ధంలో పాల్గొనటానికి వచ్చాడు. నరసింహరాయలు ఓడిపోయి గండికోటను అప్పగించి వెళ్లిపోయాడు. తర్వాత గోల్కొండ సైన్యాలు ఉదయగిరిని ఆక్రమించాయి. దాంతో పశ్చిమ దక్షిణ ఆంధ్ర ప్రాంతాలన్నీ మహమ్మద్ కులీ వశం అయ్యాయి. ఈ విజయోత్సాహంలో గోల్కొండ సైన్యాలు పెనుగొండ చేరి కోటను ముట్టడించాయి. వెంకటపతిరాయలు చంద్రగిరి నుండి స్వయంగా పెనుగొండ కోట రక్షణకు వచ్చాడు. అతడు సుల్తాన్‌కు లొంగినట్లు నటించి సంధి చేసుకోవడానికి మూడు రోజులు గడువు అడిగాడు. కులీ సమ్మతించాడు. ఆ మూడు రోజులలోనే వెంకటపతి రహస్యంగా కోటలోకి ఆయుధాలు, ఆహార పదార్థాలు చేర్చుకొని యుద్ధానికి తయారయ్యాడు. నాల్గవరోజు అతడు హఠాత్తుగా గోల్కొండ సేనపై దాడి చేశాడు అది ఊహించిన కుతుబ్‌షా సేనాధిపతుల సలహా అడిగాడు. వర్షాకాలం రాబోతుంది. కృష్ణానదికి వరదలు వచ్చే అవకాశం ఉంది. వరదలు వస్తే ఇక ప్రాణాలతో తప్పించుకొనిపోయే అవకాశం కూడా లేదు. కనుక ప్రస్తుతం యుద్ధ విరమణ చేసి వెళ్లిపోవడం మంచిదని సలహా ఇచ్చారు. దాంతో కులీ నంద్యాల దుర్గాధిపతిగా జగపతిరావును, గండికోట దుర్గాధిపతిగా సంజర్‌ఖాన్‌ను, ముసలిమడుగు దుర్గ రక్షకుడుగా ఆశీర్‌రావును నియమించి గోల్కొండ వెళ్లిపోయాడు. కుతుబ్‌షా కృష్ణా నదిని దాటగానే వెంకటపతిరాయలు పై దుర్గాలపై నడిచి గోల్కొండ సైన్యాలను తరిమివేసి శ్రీశైలం వరకు ఆక్రమించాడు. ఉదయగిరి పాలకుడు వ్యాసరాయలను కొండవీటిపై దండెత్తమని రాయలు ఆదేశించాడు. కాని అజ్దహర్‌ఖాన్ అనే అతడు విజయనగర సైన్యాలను ఓడించి తరిమాడు. వెంకటపతిరాయలు లక్ష సైన్యంతో గండికోటను ముట్టడించాడు. అదే సమయంలో గోల్కొండ సేనాని మూర్తజాఖాన్ విజయనగరానికి చెందిక కరపాక పట్టణాన్ని ఆక్రమించాడు. మూర్తజాను ఓడించడానికి రాయలు మనోహర రాయలు తిరుమల రాయలు అనే వారిని పంపాడు. ఈ లోపల గోల్కొండ నుండి మూర్తజాకు సహాయంగా రుస్తుంఖాన్ వచ్చాడు. కాని వారిలో వారికి ఐక్యత లేకపోయింది. రాయలు వారిని ఓడించి తరిమివేశాడు. శ్రీశైలం వరకు రాయల వశమైంది. ఒక్క కొండవీడు సర్కారు తప్ప పశ్చిమ దక్షిణ ఆంధ్రదేశం అంతా తిరిగి విజయనగర సామ్రాజ్యంలో చేరిపోయింది. మొత్తం మీద వెంకటపతిరాయలతో జరిగిన యుద్ధాలలో

మహమ్మద్ కులీ చాలా నష్టపోయాడు. తన తండ్రి సంపాదించిన భూభాగం కొంత కోల్పోయాడు. తిరిగి ఆ ప్రాంతాలను సంపాదించడానికి గుంటూరు సర్కార్ హవల్దారైన ఎతెబార్‌ఖాన్ ఇలింఖాన్ భావేరావు మెహిదీ కులీబేగ్ షాబాజి అనే సేనానులను పంపాడు. కాని వారిని వెంకటపతిరాయలు వారందరినీ ఓడించి తరిమివేసి తాను జయించిన ప్రాంతాలను దక్కించుకున్నాడు.

ఉత్తరాంధ్ర తిరుగుబాట్లు: గోల్కొండ సైన్యాలు విజయనగర రాజ్యంతో పోరాడిన సమయంలో ఉత్తరాంధ్రలో కుతుబ్‌షాకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు జరిగాయి. విజయనగరంతో యుద్ధం తర్వాత గోల్కొండ సేనాధిపతులైన భావేరావ్ ఆలంఖాన్‌లు గుంటూరు సర్కారులో తిరుగుబాటు చేశారు. వారిని అమీన్ ఉల్ముల్క్ అణచివేసి కొండవీటి ప్రాంతాన్ని కాపాడాడు. క్రీ.శ.1590లో కృష్ణానదికి ఉత్తరంగా అన్ని ప్రాంతాల్లో తిరుగుబాట్లు జరిగాయి. ఏలూరు, నిడదవోలు, రాజమహేంద్రవరం సర్దారులు తిరుగుబాటు చేశారు. కశింకోట నేలిన బలందరాయ్ కుమారుడు ముకుందరాయలు స్వతంత్రం ప్రకటించాడు. అంతేగాక అతడు కుతుబ్‌షా రాజ్య ప్రాంతాలపై దండెత్తి తన రాజ్యాన్ని విస్తరించసాగాడు. ఆ ప్రాంతంలోని కుతుబ్‌షా హవల్దార్, బిల్లాస్‌ఖాన్ ముకుందరాయల తిరుగుబాటును కుతుబ్‌షాకు తెలియపరిచాడు. ముకుందరాయల తిరుగుబాటుతో శ్రీకాకుళం వరకు ఉత్తరాంధ్రలో కుతుబ్‌షా అధికారం నశించిపోయింది. ఈ ప్రాంతాలను అదుపులోకి తీసుకురావడానికి కుతుబ్‌షా సైన్యాలను పంపాడు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా క్రీ.శ.1596లో కశింకోటను ఆక్రమించడానికి జైనులోబుద్దీన్ నాయకత్వంలో ఒక సైన్యాన్ని పంపాడు. మరొక సైన్యాన్ని కృష్ణా గోదావరీ నదుల మధ్య ప్రాంతాన్ని, రాజమహేంద్రవర ప్రాంతాన్ని అంటే ఏలూరు, నిడదవోలు, రాజమహేంద్రవరాలను జయించడానికి అమీనుల్ముల్క్ గుంటూరు హవల్దారు చంఘీజ్‌ఖాన్‌ల నాయకత్వంలో పంపాడు.

కృష్ణా గోదావరి ప్రాంతాలు అదుపులోకి రావడం: అమీనుల్ముల్క్ చంఘీజ్‌ఖాన్‌లు ఏలూరు, నిడదవోలును జయించి ముందుకు సాగారు. అది తెలిసి రాజమహేంద్రవరంలో తిరుగుబాటు చేసిన అమీరులు గోదావరి దాటి వచ్చి గోల్కొండ సైన్యాలను ఎదిరించారు. వారిని చంఘీజ్‌ఖాన్ ఓడించాడు. ఓడిన అమీరులు తమను మన్నించవలసిందిగా కుతుబ్‌షాను అర్థిస్తూ రాయబారం పంపారు. వారిని కులీ క్షమించాడు.

ఇలంఖాన్ తిరుగుబాటు: అంతకు పూర్వం ఈ ప్రాంతాలను పాలించిన సరదారుడైన ఆలీఖాన్‌ను ఇలంఖాన్ అనే అతనిని ఓడించాడు. అందుకు సంతోషించి ఆలీఖాన్ జాగీరును కులీ ఇలంఖాన్‌కు ఇచ్చాడు. అతని అసలు పేరు తాహిర్ మహమ్మద్‌ఖాన్. అతని జాగీరుపై అధిక పన్నులు విధించారని ఈ సమయంలో తిరుగుబాటు చేశాడు. అమీనుల్ముల్క్ ఇలంఖాన్‌పై దండెత్తి అతనిని ఓడించాడు. ఏలూరు, నిడదవోలు, రాజమహేంద్రవరాలు తిరిగి కుతుబ్‌షా అధికారంలోకి వచ్చాయి.

కశింకోట యుద్ధం క్రీ.శ.1596: ఇదే సమయంలో జైనుల్ముల్క్ కశింకోటపై దండెత్తి కోటను ముట్టడించాడు. ముకుందరాయలు తన పరిసర రాజుల సహాయంతో 20 వేల సైన్యాన్ని సమకూర్చుకొని గోల్కొండ సైన్యాన్ని ఎదిరించాడు. కాని అమీనుల్ముల్క్ కశింకోటను జయించాడు. ముకుందరాయలు కోట నుండి తప్పించుకొని శ్రీకాకుళం దగ్గరున్న పెన్నలూరు దుర్గం చేరాడు. ఆ దుర్గాన్ని పాలించే రామచంద్రరాజు ముకుందరాజుకు ఆశ్రయం ఇచ్చాడు. అది తెలిసి అమీనుల్ముల్క్ పెన్నలూరు దుర్గాన్ని ముట్టడించాడు. రామచంద్రరాజు ఓడిపోయి శరణన్నాడు. అతనిని మన్నించి పెన్నలూరు అతనికే ఉండనిచ్చాడు. అమీనుల్ముల్క్ కశింకోటకు తిరిగి వచ్చాడు.

సోదరుడు అబ్దుల్ ఖాదిర్ తిరుగుబాటు క్రీ.శ.1595-96: మహమ్మద్ కులీకుతుబ్ షా ఉత్తరాంధ్రలో తిరుగుబాట్లను అణచే సమయంలో తెలంగాణలో తన పెద్దసోదరుడు అబ్దుల్ ఖాదిర్ తిరుగుబాటు చేశాడు. ఇతడు బీదరు పట్టణంలో ఉండేవాడు. రెండవ సోదరుడు హుసేన్ కులీ చెరసాలలో పెట్టబడ్డాడు. అతడు చెర నుండి తప్పించుకొని తన 26వ సంవత్సరంలో చెరువులో పడి మరణించాడు. కొందరు అతడు చెరలోనే మరణించాడని అంటారు. ఇబ్రహీం నాల్గవ కుమారుడైన అంటే మహమ్మద్ కులీ మొదటి తమ్ముడు మీర్జా అబ్దుల్ ఫతా క్రీ.శ.1594లో అన్నపై తిరుగుబాటు చేశాడు. అతనిని కూడా మహమ్మద్ కులీ చెరసాలలో బంధించాడు. అతడు క్రీ.శ.1612లో చెరసాలలోనే మరణించాడు. ఇప్పుడు బీదరులో ఉన్న పెద్ద సోదరుడు ఖాదర్ తాను నిజమైన వారసుడనని తిరుగుబాటుకు పూనుకున్నాడు. బీదరుకు చెందిన షా మహిబుల్లా అతనికి సహాయం చేశాడు. మహమ్మద్ కులీ తన సోదరుడు మరణించాడని ప్రకటించి, అతని మరణాన్ని స్వయంగా చూశామని కొందరి చేత

గోల్కొండ ప్రజలు నమ్మేలా పలికించాడు. ఈ లోపల బీదరు బరీద్‌షాను తన అన్నను బంధించి రహస్యంగా తనకు అప్పగించాలని రాయబారం పంపాడు. కాని బరీద్ ఆ పని చేయలేదు. నిజం గోల్కొండ ప్రజలకు తెలిసింది. పెద్దవాడే సింహాసనం అధిష్టించడం న్యాయం అని అన్నారు. గోల్కొండ సరదారులలో బంద్‌ఖాన్ హబ్షి ఖైరాత్‌ఖాన్‌లు ఖాదర్‌ను బలపరిచారు. వారు అతనికి సహాయం బీదరు సరిహద్దుల వరకు చేరారు. ఖాదర్ బీదరు నుండి అక్కడికి వచ్చి వారిని కలుసుకొని వారి సహాయంతో పానుగల్లు దుర్గాన్ని ఆక్రమించాడు. కులీ ఎతెబార్‌ఖాన్, గాజాఖాన్, మామూర్‌ఖాన్, హుసేన్ ఆలీఖాన్, అబ్దుల్లా కులీబేగ్, ఎక్‌జహత్‌ఖాన్ అనే వారిని పానుగల్లుపైకి పంపాడు. పానుగల్లు వద్ద ఆరువేల సైన్యంతో ఖాదర్ ఖుదాబంద్‌ఖాన్ హబ్షి సహాయంతో తమ్ముని సైన్యాలను ఎదిరించాడు. కాని ఆ యుద్ధంలో హబ్షి మరణించాడు. ఖాదర్‌ఖాన్ ఓడిపోయి బీజాపూర్ పారిపోయాడు బీజాపూర్ సుల్తాన్ అతనిని గౌరవించి అక్కడ నివసించడానికి అన్ని సదుపాయాలు కల్పించాడు. అతడు అక్కడే జీవించి మరణించాడు. దాంతో సోదరుని తిరుగుబాటు అంతరించింది.

రౌతురావు తిరుగుబాటు క్రీ.శ.1599: రౌతురావు గోల్కొండ రాజ్యంలో ఒక సర్దారు. అతడు కుతుబ్‌షా అమీనుల్ముల్క్‌ను అతిగా గౌరవిస్తున్నాడని ఈర్ష్యతో రాజధానిని వదిలి పెన్నలూరు .దుర్గం చేరాడు. అక్కడ రామచంద్రరాయలతో కలిసి కుతుబ్‌షాపై తిరుగుబాటును లేవదీశాడు. అతనితో ముకుందరాయలు చేరాడు వారు 10 వేల సైన్యాన్ని పోగుచేశారు. కశింకోటలో దుర్గాధిపతిగా ఉన్న అమీనుల్ముల్క్, పెన్నలూరు కోటను ముట్టడించాడు. అక్కడ జరిగిన యుద్ధంలో రౌతురాయకు బాణం తగిలి గాయపడ్డాడు. అతని సైన్యం ఓడిపోయి పారిపోయారు. వారు ఆ తర్వాత కళింగనేలు వస్నదేవుని సహాయం అర్థించారు. ముకుందరాయలు, రౌతురాయలు, చిలుమూరు దుర్గంలో ఉన్నారని తెలిసింది. చంఘీజ్‌ఖాన్, జైలాబుద్దీన్‌ల నాయకత్వంలో కుతుబ్‌షా .మరియొక సైన్యాన్ని పంపాడు. ఆ సైన్యం చిలుమూరును ముట్టడించి కోటను ధ్వంసం చేసింది. తర్వాత వస్నదేవుడు ముకుందరాయల మేనల్లుడు హరిశ్చంద్రదేవుడు మరికొంత సైన్యాన్ని సంపాదించి కుతుబ్‌షాహి సైన్యాన్ని ఎదిరించారు. కాని మళ్లీ ఓడిపోయారు. వస్నదేవుడు సంధి చేసుకొని సామంతునిగా కొనసాగాడు. ముకుందరాయలు బెంగాలు పారిపోయాడు.

కృష్ణమరాజు తిరుగుబాటు క్రీ.శ.1600: క్రీ.శ.1600 సంవత్సరంలో రౌతురాయల కుమారుడు కృష్ణంరాజు నూతనంగా సైన్యాలను సమకూర్చుకొని తన తండ్రికి జరిగిన పరాభవానికి ప్రతీకారంగా తిరుగుబాటును ప్రారంభించాడు. అది తెలిసి బెంగాలు లోపల దాక్కున్న ముకుందరాయలు వచ్చి కృష్ణంరాజుతో చేరాడు. వారి సైన్యాలు పొట్నూరు, మద్వాడ దుర్గాలను ఆక్రమించి ఆ పరిసర ప్రాంతాలను దోచుకోసాగారు. ఈ లోపల కశింకోటలో అమీనుల్ముల్క్ మరణించాడు. అతని స్థానంలో జైనులోబుద్దీన్ కుతుబ్‌షాహీ సైన్యాధిపతిగా నియమింపబడ్డాడు. అతనికి తోడుగా చంఘీజ్‌ఖాన్, ముజాహిద్‌ఖాన్, సయ్యద్ తాజ్‌రజాఖాన్, ఆశీర్రావు, ధర్మారావు అనే సేనానులు కూడా కదిలి వచ్చారు. వారు ముకుందరావు కృష్ణంరాజుల సైన్యాలను ఓడించారు. వారు మద్వాడ దుర్గంలో తలదాచుకున్నారు. ఆ దుర్గం భయంకరమైన అడవుల మధ్య ఉంది. దానిని జయించడం కష్టం కనుక ముకుందరాయలకు మనోవర్తినిచ్చి సంధి చేసుకోవడం మంచిదని ధర్మారావు జైనలాబుద్దీన్‌కు చెప్పాడు. కాని అతడు అంగీకరించలేదు. ఇదే సమయంలో జైనలాబుద్దీన్‌ను గోల్కొండ రమ్మని కబురు వచ్చింది. అతని స్థానంలో ముస్తాఫాఖాన్ కుమారుడు సయ్యద్ మసన్ నియమింపబడ్డాడు. అతడు ఆ పరిసరాలలోని ముస్తాఫాబాద్, మహమ్మదాబాద్, కుతుబ్‌షాబాద్ దుర్గాలను బాగుచేయించి తన సైన్యంతో నింపి ముకుంద రాయలు ఎటూ తప్పించుకు పోకుండా కట్టుదిట్టం చేశాడు. అతని వ్యూహాన్ని భగ్నం చేయడానికి కృష్ణంరాజు కొద్ది సైన్యంతో వచ్చి మహమ్మదాబాద్ కోటను ముట్టడించాడు. కాని ఆ యుద్ధంలో కృష్ణంరాజు మరణించాడు. ముకుందరాయలు ఓడిపోయాడు. సయ్యద్ హసన్ చిలుమూరు మొదలైన కోటలను వశపరచుకొని తిరుగుబాటుదారులకు స్థావరం లేకుండా చేశాడు. దాంతో ఉత్తరాంధ్రలో మరలా శాంతిభద్రతలు ఏర్పడ్డాయి. తీరాంధ్ర దేశంలో మరలా తిరుగుబాట్లు జరగకుండా శాశ్వతమైన సైనిక స్థావరాలు ఏర్పాటు చేశాడు. శ్రీకాకుళం, రాజమహేంద్రవరంలో కొండవీటిలో సైనిక శిబిరాలను ఏర్పాటు చేసి అక్కడ సైన్యాలను నిలిపాడు. అక్కడ జరిగే తిరుగుబాట్లను వారు వెంటనే అణచాలని వారికి ఆదేశాలిచ్చాడు. అలాంటి రేవు పట్టణాలైన మచిలీపట్నం, ఇబ్రహీంపట్టణాలలో కూడా ప్రత్యేక సైనిక శిబిరాలను నిలిపాడు.

హయత్ భక్షిబేగం వివాహం-ఖుదాబందా తిరుగుబాటు: ఉత్తరాంధ్ర తిరుగుబాట్లు అణిగిపోయిన తర్వాత

మహమ్మద్ కులీ ఎనిమిది సంవత్సరాలు అంటే క్రీ.శ.1608 వరకు ప్రశాంతంగా పాలించాడు. హైదరాబాద్ నగర నిర్మాణం పూర్తయింది. హైదరాబాద్‌లో టంకసాలను ఏర్పాటు చేసి దారుల్‌సల్తనత్ హైదరాబాద్ అనే పేరుతో క్రీ.శ.1603-1604వ సంవత్సరంలో మొదటి నాణేన్ని కూడా ముద్రించాడు. ఈ కాలంలోనే తన ఏకైక కుమార్తె హయత్ భక్షీ బేగంకు సుల్తాన్ మహమ్మద్‌తో వివాహం జరిపి తన వారసునిగా ప్రకటించాడు. దాంతో తన చిన్న సోదరుడైన ఖుదాబందా తిరుగుబాటు చేశాడు. అతడు ఇబ్రహీం కుతుబ్‌షా చివరి కుమారుడు. తండ్రి మరణించే నాటికి అతని వయస్సు 9 సంవత్సరాలు. కనుక మహమ్మద్ కులీ సింహాసనానికి వచ్చిన తర్వాత చిన్నతమ్ముని ఏమీ చేయక ప్రేమగా పెంచి పెద్ద చేశాడు. అతడు కూడా అన్నకు విధేయుడుగా ఉన్నాడు. అన్నకు మగ సంతానం లేదు. కనుక అన్న తర్వాత తాను సుల్తాన్ అవుతానని భావిస్తుండేవాడు. కాని తన సోదరుడు తన అల్లుని వారసునిగా ప్రకటించగానే అన్నపై ఆగ్రహం కలిగి తిరుగుబాటుకు పూనుకున్నాడు. అతడు విదేశీ ముస్లింలను ద్వేషించి స్వదేశీ ముస్లింలను చేరదీసి వారి మద్దతు పొందాడు. బీదరు షాహరాజీ అనే అతడు ఖుదాబంద్ తరపున సైన్యాన్ని సమీకరించాడు. కాని మహమ్మద్ కులీ వారిని ఓడించి ఖుదాబంద్‌ను గోల్కొండ కోటలో ఖైదు చేశాడు. అతడు అక్కడే మరణించాడు. షాహరాజ్ బీజాపూర్ పారిపోయాడు. దాంతో అల్లుని సింహాసనానికి అడ్డు లేకుండా పోయింది.

బస్తరు రాజాప్రతాప్‌షాహి దోపిడీలు క్రీ.శ.1610-1612: గోల్కొండలో ఖుదాబంద్ తిరుగుబాటు సమయంలో బస్తరులో రాజాప్రతాప్ షాహి గోల్కొండ రాజ్యంపై బడి దోపిడీలు చేయసాగాడు. మీర్జా మహమ్మద్ మీర్జుమ్లాను పంపుదామని కులీ భావించాడు. కాని అతని ప్రవర్తన బాగాలేదని తెలుసుకొని తానే స్వయంగా గోల్కొండలో పరిపాలనా బాధ్యతలు చేపట్టాడు. కనుక సయ్యద్ హైదర్, అమీదుల్ముల్క్, ఆశీరరావు అనే సేనాధిపతులను పంపాడు. వారు ప్రతాప్‌షాహిని గోల్కొండ రాజ్యభాగాల నుండి పారదోలి అతని దోపిడీలను అరికట్టారు. తర్వాత బస్తరు రాజ్యాన్ని ఆక్రమించుకొని కుతుబ్‌షా మీర్జా మహమ్మద్‌మీన్, జబర్దస్త్‌ఖాన్, ఖైరాత్‌ఖాన్, పతెబార్‌ఖన్‌లను పంపాడు. వారు బస్తరు రాజ్యంలోని కొన్ని కోటలను ఆక్రమించారు. తర్వాత బస్తరు కోటను ముట్టడించాలని భావించారు. కాని అది కీకారణ్యం. దారులు తెలియవు. పైగా అది వర్షాకాలం. చిత్తడి భూములలో యుద్ధాలు చేసే అనుభవం గోల్కొండ సైన్యాలకు లేదు. కనుక మీర్జా మహమ్మద్ అమీన్‌ఖాన్ గోల్కొండకు బస్తరు పరిస్థితులు తెలిపి మరింత సైన్యాన్ని పంపమని కోరాడు. సుల్తాన్ నఫరత్యఖాన్ నాయకత్వంలో ఐదువేల తుపాకీ దళాన్ని పంపాడు. కాని బస్తరు కోటను ముట్టడించకముందే క్రీ.శ.1612లో మహమ్మద్ కులీ కుతుబ్‌షా మరణించాడు. ఆ విషయం తెలిసి సేనాధిపతులందరూ గోల్కొండ వెళ్లిపోయారు. తర్వాత క్రీ.శ.1612లో నూతన సుల్తాన్ సయ్యద్ కమాలుద్దీన్ మీజెదరాని సయ్యద్ హైదర్ అరబ్ చతియాఖాన్‌ల నాయకత్వంలో పెద్ద సేన వెళ్లి బస్తరు కోటను ముట్టడించింది. ప్రతాప్‌షాహి ఓడిపోయి సంధి చేసుకొని గోల్కొండ సామంతుడయ్యాడు. ఈ విజయంతో మహమ్మద్ కులీ రాజ్యం బస్తరు వరకు విస్తరించింది. అతని రాజ్యంలో 84 దుర్గాలుండేవట. అంతేగాక అతని స్వీయ కవితలో అతడు తనను అధిరాజ అని వర్ణించుకున్నాడు.

దక్కను రాజ్యాలతో సంబంధాలు-మొగలులతో సంబంధాలు: ఇతని కాలంలో దక్కను రాజకీయాలలో పెనుమార్పులు సంభవించాయి. మొగల్ చక్రవర్తి దక్కను రాజ్యాలను జయించడానికి పూనుకున్నాడు. మొగలులకు దక్కనుతో సంబంధాలు, బాబరు భారత దేశంలో అడుగుపెట్టిన క్రీ.శ.1526లోనే ప్రారంభం అయ్యాయి. చివరి బహమనీ సుల్తాన్ కులీముల్లాఖాన్ క్రీ.శ.1526లో తనను అమీర్ బరీద్ చెర నుండి విడిపించమని తన దూత ద్వారా మొరపెట్టుకున్నాడు. కాని బాబరు తన సమస్యలతో సతమతమవుతూ ఏమీ చేయలేకపోయాడు. తర్వాత అతని కుమారుడు హుమాయూన్ క్రీ.శ.1535-36లో సాత్పురా పర్వతాలు దాటి ఖాందేష్‌లోకి వచ్చాడు. అతని రాక దక్కను సుల్తాన్‌లకు అనుమానాలు కలిగించింది. క్రీ.శ.1572లో అక్బరు గుజరాత్‌ను జయించాడు. అప్పుడే అతని కళ్లు దక్కనుపై పడ్డాయి. తర్వాత కొద్దికాలానికే ఖాందేష్ అతని సామంత రాజ్యం అయింది. దాని పాలకుడు అలీఖాన్ ఫరూకి మొగల్ సామంతునిగా 26-1-1597న సోన్‌పట్టు యుద్ధంలో మొగలుల తరపున పోరాడుతూ మరణించాడు. ఖాందేష్ తనకు లోబడిపోయిన తర్వాత అక్బరు దక్షిణ దేశపు రాజులందరికీ, విజయనగర చక్రవర్తి రెండవ వెంకటపతిరాయలతో సహా తనకు సామంతులు కమ్మని రాయబారులను పంపాడు. కానీ అందరూ తిరస్కరించారు.

గోల్కొండ రాజ్యానికి సంబంధించినంత వరకు క్రీ.శ.1580లోనే కుతుబ్ ఐముల్క్ కాలంలోనే అక్బరు తన

ఆధిపత్యాన్ని అంగీకరించమని అంటే తాను Marzbanan-I-Dakan అని అనిపించుకోవాలని చూశాడు. కాని దానికి కుతుబ్ షా అంగీకరించలేదు. మళ్లీ క్రీ.శ.1591లో అక్బరు నలుగురు దక్కను సుల్తాన్‌ల ఆస్థానాలకు తన అధికారం అంగీకరించమని రాయబారులను పంపాడు. గోల్కొండకు మీర్జా మసూద్ అబుల్ సజుల్ రాయబారిగా వచ్చాడు. అతనిని మహమ్మద్ కులీ గౌరవించాడు. కాని తాను అక్బరు సామంతునిగా ఉండజాలనని బదులు చెప్పి అక్బరుకు కొన్ని కానుకలు పంపాడు. బీజాపూరుకు మహమ్మద్ రజ్వి, అహమ్మద్‌నగర్‌కు ఫైజీలను రాయబారులుగా పంపాడు. వారు కూడా అదే సమాధానాలు పంపారు. వారందరూ క్రీ.శ.1593లో ఆగ్రా చేరి అక్బరుకు దక్కను సుల్తాన్‌లు మాటలతో లొంగరని చెప్పారు. అహమ్మద్‌నగర్‌లో ఉన్న మొగల్ రాయబారి ఫైజి కూడా అహమ్మద్‌నగర్ అక్బరు ఆధిపత్యాన్ని అంగీకరించడం లేదని, అయితే అక్కడ దర్బారులో ఐక్యత లేదని ఆగ్రాకు వర్తమానం పంపాడు.

అహమ్మద్‌నగర్ రాజ్య ఆక్రమణ క్రీ.శ.1595-1600: దక్షిణాది రాజులెవరూ తన ఆధిపత్యాన్ని అంగీకరించకపోవడంతో అక్బరు దక్కనుపై దండెత్తాలని తీర్మానించాడు. ఖాందేష్ తర్వాత రాజ్యం అహమ్మద్‌నగర్ రాజ్యం. కనుక ఆ రాజ్యంపై దండెత్తడానికి అక్బరు ఏర్పాట్లు చేశాడు. అందుకు అహమ్మద్‌నగర్ రాజ్యపరిస్థితులు కూడా అనుకూలించాయి. మొదటి మూర్తజా కాలంలో బేరారును ఆక్రమించి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని బలమైన రాజ్యంగా తీర్చిదిద్దాడు. అతడు క్రీ.శ.1588లో మరణించాడు. ఆ తర్వాత 1595 వరకు కొందరు మైనర్ రాజకుమారులు పాలించారు. క్రీ.శ.1595లో ఇబ్రహీం నైజాం మరణించాడు. అతనికి రెండవ ఇస్మాయిల్ బహదూర్ షా అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఇస్మాయిల్ ఖాన్ ముందే మరణించాడు. అతనికి రెండవ అహమ్మద్ షా అనే కుమారుడు ఉన్నాడు. ఇస్మాయిల్ కుమారుడైన రెండవ అహమ్మద్ షాను గద్దెనెక్కించాలని అహమ్మద్‌నగర్ పీష్వా మియామంజు భావించాడు. కాని అతని నిర్ణయాన్ని ఆక్లాస్‌ఖాన్ అనే సర్దారు వ్యతిరేకించి ఇబ్రహీం చిన్నకుమారుడైన బహదూర్‌షాను సుల్తాన్ చేయాలని తలచాడు. దాంతో అహమ్మద్‌నగర సర్దారులు రెండు వర్గాలుగా చీలిపోయారు. మియామంజు అహమ్మద్ రాజకుమారుని సింహాసనం ఎక్కించడానికి మొగలుల సహాయం అర్థించాడు. అదను కోసం వేచి ఉన్న అక్బరుకు అతని ఆహ్వానం అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తడానికి గొప్ప సాకుగా దొరికింది. అతడు తన కుమారుడు మురాద్‌ను అహమ్మద్‌నగర్‌పై దండెత్తమని ఆదేశించాడు. అబ్దుల్ రహీం ఖాన్ఖాఖాన్, షారుక్‌మీరాల నాయకత్వంలో మొగల్ సైన్యం క్రీ.శ.1595 సెప్టెంబర్‌లో అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి ఒక్కొక్క ప్రాంతాన్నీ ఆక్రమించసాగారు.

చాంద్ బీబీ యుద్ధం క్రీ.శ.1595-97: ఈ పరిస్థితులలో అహమ్మద్‌నగర్ సర్దారులు ప్రజలు బీజాపూర్‌లో ఉన్న చాంద్‌బీబీని అహమ్మద్ రాజ్యాన్ని రక్షించడానికి ఆహ్వానించారు. చాంద్‌బీబీ రామరాయల తల నరికిన హుస్సేన్ నిజాం షా కుమార్తె. అహమ్మద్‌నగర్ సుల్తాన్ మూర్తజా సోదరి. తళ్లికోట యుద్ధానికి ముందు ఆమెను బీజాపూర్ సుల్తాన్ ఆలీ ఆదిల్షాకు ఇచ్చి వివాహం చేశాడు. ఆమె అప్పటినుండి బీజాపూర్ రాణిగా ఉంటూ వస్తోంది. క్రీ.శ. 1580లో ఆమె భర్త ఆలీ ఆదిల్‌షా మరణించాడు. ఆ సమయంలో గోల్కొండ సైన్యాలు బీజాపూరు పైకిరాగా ఆమె ధైర్యంగా గోల్కొండ సైన్యాలను ఎదిరించి రాజధానిని కాపాడింది. తర్వాత రెండవ ఇబ్రహీం ఆదిల్‌షా బీజాపూరు గద్దెనెక్కాడు. అతడు గోల్కొండ రాజకుమారి చాంద్ సుల్తానాను వివాహం చేసుకున్నాడు చాంద్‌బీబీ బీజాపూరు రాజకీయాల నుండి వైదొలగింది. ఆ స్థితిలో తన మాతృరాజ్యం నుండి తనకు ఆహ్వానం వచ్చింది. అప్పుడు అహమ్మద్ నగరం చేరి ఆక్లాస్‌ఖాన్ బలపరచిన బహదూర్‌షాను సుల్తాన్‌గా ప్రకటించింది. ఆమె తనకు సహాయం చేయవలసిందిగా గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌లకు రాయబారాలు పంపినది. అహమ్మద్‌నగర రాజ్యాన్ని అక్బరు జయిస్తే తర్వాత అతడు తమ రాజ్యాలపై దండెత్తుతాడని గ్రహించి వారిద్దరూ చాంద్‌బీబీకి సహాయంగా తమ సైన్యాలను పంపారు. సూజమాన్, మెహిద్‌కులీలు గోల్కొండ సైన్యాలను నడిపారు. మౌలానా మహమ్మద్ అస్సహని అనే సర్దారుని కుతుబ్‌షా చాంద్ బీబీకి సహాయంగా అహమ్మద్‌నగర్ పంపాడు. బీజాపూరు గోల్కొండ సైన్యాలు కలిసి నల్‌దుర్గం వరకు సాగాయి. ఈ లోపల మొగల్ సైన్యాలు అహమ్మద్‌నగర్ కోటను ముట్టడించాయి. చాంద్‌బీబీ అప్పటికే 70వేల సైన్యాన్ని సమకూర్చుకుని ధైర్యంగా పోరాడింది. కాని దురదృష్టవశాత్తూ ఆమె ఓడిపోయింది. మొగల్ రాకుమారుడు మురాద్ బీజాపూరు, గోల్కొండ సైన్యాలు వస్తున్నాయని తెలిసి వెంటనే 16-3-1596లో చాంద్‌బీబీతో సంధి చేసుకొని ఆమె బలపరచిన బహదూర్‌షాను అహమ్మద్‌నగర సుల్తాన్‌గా గుర్తించాడు. చాంద్‌బీబీ బేరారు రాష్ట్రాన్ని మొగలులకు దత్తత చేసింది. దాంతో మొదటి

అహమ్మద్ నగర యుద్ధం ముగిసింది.

రెండవ అహమ్మద్ నగర యుద్ధం క్రీ.శ.1597: కాని అంతటితో మొగలుల దక్కను యుద్ధాలు ఆగలేదు. మొగలులకు ఇచ్చిన బేరారు రాష్ట్రంలో మొగలుల దుష్టపాలనను అక్కడి ప్రజలు భరించలేకపోయారు. కొందరు అహమ్మద్ సరదారులు బేరారు రాష్ట్రాన్ని తిరిగి ఆక్రమించాలని తీర్మానించారు. కొందరది ప్రమాదం, మళ్లీ మొగలులతో యుద్ధం వస్తుంది అని అన్నారు. ఆ స్థితిలో చాంద్‌బీబీ బీజాపూరుకు రాయబారిని పంపి ఇబ్రహీం ఆదిల్షాను వచ్చి అహమ్మద్ నగరంలోని సరదారుల మధ్య సఖ్యతను సాధించమని కోరింది. అతడు అహమ్మద్ నగరం చేరి వారి మధ్య ఏకాభిప్రాయానికి ప్రయత్నించాడు. చాంద్‌బీబీ సమర్థించిన బహదూర్‌షాను అహమ్మద్ నగర్ సుల్తాన్‌గా గుర్తించాడు. దాంతో కొందరు సరదారులు ఏకీభవించకుండా మళ్లీ మొగలులను దండెత్తి రమ్మని ఆహ్వానించారు. మొగల్ రాకుమారుడు మురాద్ పెద్దసేనతో అహమ్మద్‌నగరంపై దండెత్తాడు. చాంద్‌బీబీ మరలా గోల్కొండ బీజాపూరుల సహాయం కోరింది. ఉభయ రాజ్యాలు తమ సైన్యాలను పంపాయి. అవి అహమ్మద్‌నగర్ సేనతో కలిసి మొగలులతో యుద్ధానికి తలపడ్డాయి. 27-1-1597వ తేదీన సోన్‌పట్ అనేచోట యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో దక్కను సైన్యాలు ఓడిపోయాయి. ఈ యుద్ధంలో మొగలుల తరఫున ఖాందేశ్ సుల్తాన్ ఆలీఖాన్ అతని సేనాధిపతి సహీల్‌ఖాన్‌లు మరణించారు. దక్కను సైన్యంలో అనేక మంది వీరులు మరణించారు. ఈ యుద్ధం తర్వాత మురాద్ ఎందువల్లో అహమ్మద్ నగరాన్ని ఆక్రమించలేదు. మొగల్ సేనాని ఖాన్‌ఖాన్ ఆగ్రా వెళ్లిపోయాడు.

మూడవ దండయాత్ర క్రీ.శ.1600: క్రీ.శ.1599లో మురాద్ మరణించాడు. క్రీ.శ.1600లో ఖాందేష్ పాలకుడు బహదూర్‌షా స్వతంత్రం ప్రకటించాడు. అక్బరు స్వయంగా ఖాందేష్‌పై దండెత్తాడు. ఆశీర్‌ఘర్, బురహన్‌పూర్‌లను ఆక్రమించాడు. అదే కాలంలో తన కుమారుడు దనియాల్‌ను అహమ్మద్‌నగరంపైకి పంపాడు. దనియాల్ అహమ్మద్‌నగర సైన్యాన్ని ఓడించి కోటలో ప్రవేశించాడు. చాంద్‌బీబీ మొగలులతో సంధి చేసుకోవాలని తలిస్తే ఆమె వ్యతిరేకులు ఆమె నివాసంపై దాడి చేసి ఆమెను హత్య చేశారు. కాని ఆమె మరణం మొగలులను ఆపలేదు. దనియాల్ అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని క్రీ.శ.1601లో స్వాధీనం చేసుకొని మొగల్ సామ్రాజ్యంలో కలిపేశాడు.

మాలిక్ అంబర్ పోరాటం క్రీ.శ.1610 అహమ్మద్‌నగర్ రాజ్య పునరుద్ధరణ: ఆ తర్వాత కొద్దికాలానికి అహమ్మద్‌నగర్ సర్దారు మాలిక్ అంబర్ నిజాంషాహీ వంశానికి చెందిన మూర్తజా అనే కుర్రవాడిని పెరందా జున్నార్లలో అహమ్మద్‌నగర్ సుల్తాన్‌గా ప్రకటించి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని తిరిగి ఆక్రమించాలని గెరిల్లా పోరాటం ప్రారంభించాడు. అతడు బీజాపూరు, గోల్కొండ రాజ్యాలను సహాయం అర్థించాడు. ఉభయులూ కొంత ధనం, కొంత సైన్యాలను సహాయంగా పంపడానికి అంగీకరించారు. గోల్కొండ 16 లక్షల హొన్నుల ధనాన్ని సహాయం చేయాలని నిర్ణయింపబడింది. మహమ్మద్ కులీ తన కోటా 16 లక్షల హొన్నులు మాలిక్ అంబర్‌కు పంపాడు. క్రీ.శ.1605లో అక్బరు మరణించాడు. జహంగీరు మొగల్ సింహాసనం అధిష్టించాడు. జహంగీర్ కాలంలో క్రీ.శ.1610లో మాలిక్ అంబర్ హఠాత్తుగా అహమ్మద్‌నగరంపై దాడి చేసి కోటను వశపరచుకొని మూర్తజాను అహమ్మద్‌నగర్ సింహాసనంపై కూర్చోబెట్టి క్రీ.శ.1627 వరకు అహమ్మద్ నగర రాజ్యాన్ని కాపాడాడు. అంబర్‌కు అవసరం వచ్చినప్పుడల్లా గోల్కొండ రాజ్యం సహాయం చేసింది. అహమ్మద్ రాజ్యం పునరుద్ధరింపబడటం చూస్తే మహమ్మద్ కులీ క్రీ.శ.1612లో మరణించాడు. ఇతడు అహమ్మద్‌నగర రాజ్యానికి చేసిన సహాయం సత్ఫలితాలను ఇచ్చిందని చెప్పవచ్చు.

విదేశ సంబంధాలు: ఇతని కాలంలో ఇరాన్ అంటే పర్షియాతో స్నేహ సంబంధాలు నడిచాయి. ఇరాన్ షా షియా మతస్థుడు. అతని రాజ్యానికి రెండువైపులా బలమైన సున్నీ రాజ్యాలున్నాయి. పశ్చిమంగా ఖలీఫాలైన ఆటొమన్ టర్కీ సుల్తాన్‌లు, తూర్పువైపున బలమైన మొగల్ సామ్రాజ్యం ఉంది. అక్బరు పర్షియా రాజైన అబ్బాస్‌పై దండెత్తి క్రీ.శ.1595లో ఖాందహార్‌ను ఆక్రమించాడు. అలాగే పశ్చిమాన అటామన్ టర్కులు పర్షియా మీద దాడులు చేస్తూ ఉండేవారు. వారి నుంచి తమ రాజ్యాన్ని కాపాడుకోడానికి పర్షియా సుల్తాన్‌లు దక్కను సుల్తాన్‌లతో స్నేహాన్ని వాంఛించారు. కారణం దక్కను సుల్తాన్‌లు కూడా షియా మతస్తులే. కనుక పర్షియా సుల్తాన్ షా అబ్బాస్ సఫ్వీ, మీర్ మెమిన్ సబ్జవారి అనే అతనిని గోల్కొండ కుతుబ్ షా రాజ్యానికి తన రాయబారిగా పంపాడు. అతడు పండితుడు. అతని రాకతో గోల్కొండ ఇరాన్‌ల మధ్య స్నేహసంబంధాలు అభివృద్ధి చెందాయి. తర్వాత షా అబ్బాస్

రాచకుటుంబానికి చెందిన అగలూ సుల్తాన్‌ను క్రీ.శ.1603లో గోల్కొండకు పంపాడు. అతడు గోవా రేవులో దిగాడు. అతనిని ఆహ్వానించడానికి మహమ్మద్ కుతుబ్ షా అమీర్ జియా ఉద్దీన్ మహమ్మద్ నిసాన్ అనే వ్యక్తిని గోవాకు పంపాడు. అతడు అగలూను తోడ్కొని వస్తుండగా కుతుబ్ షా స్వయంగా ఎదురేగి కాలేచబూత్ర వద్ద అగలూను కలుసుకొని రాజధానికి తోడ్కొని వచ్చాడు. ఇరాన్ షా అతని ద్వారా కుతుబ్ షాకు బంగారు ఖడ్గం, ముత్యాల కిరీటం, బంగారు జీనులు కలిగిన 40 మేలుజాతి అశ్వాలను కానుకగా పంపాడు. అగలూ కుతుబ్‌షా కుమార్తె హయత్‌బక్షి బేగంను తన కుమారునికిచ్చి వివాహం చేసి ఇరాన్ రాజకుటుంబంతో బంధుత్వం కలుపుకోమని కోరాడు. కాని హయత్‌బేగంకు అప్పటికే సుల్తాన్ కులీతో వివాహం కుదిరినందువల్ల అది సాధ్యం కాలేదు. లేకపోతే గోల్కొండ వంశం ఇరాన్ షాతో బంధు వంశమై ఉండేది. అగలూ 6 సంవత్సరాలు గోల్కొండలో ఉండి క్రీ.శ.1609లో ఇరాన్ వెళ్లిపోయాడు. అతనితోపాటు తన రాయబారులుగా హాజీకంబార్ ఆలీ మహమ్మద్ కులీలను ఇరాన్ పంపాడు. వారితో రత్నాలతో చేసిన బంగారు ఆభరణాలు, సన్నని నూలు వస్త్రాలు, ఇంకా విలువైన కానుకలను ఇరాన్ షాకు పంపాడు. మొగలులు జహంగీర్ కాలంలో దక్కను రాజ్యాలపై దండెత్తినప్పుడు క్రీ.శ.1622లో ఇరాన్ షా అబ్బాస్ తాను పోగొట్టుకున్న ఖాందహార్‌ను జయించాడు.

మహమ్మద్ కులీకుతుబ్ షా కాలంలో పర్షియా, టర్కీ మొదలైన ముస్లిం రాజ్యాల నుండి అనేక మంది కవులు, సరదారులు వచ్చి గోల్కొండలోనే ఉద్యోగాలు సంపాదించి స్థిరపడ్డారు. పారశీకం ఉర్దూలతో పాటు తెలుగు కవులను కూడా పోషించాడు. మహమ్మద్ కులీకి శాశ్వత కీర్తిని తెచ్చింది అతడు నిర్మించిన హైదరాబాద్ నగరం ఇంకా చార్మినార్, దాద్‌మహల్, నద్దిమహల్, భాగ్యమహమ్మద్, ఖుదాదార్‌మహల్, కొహితూర్, బన్నత్‌ఘాట్ మొదలైన భవనాలు నిర్మింపబడ్డాయి. ఇతని కాలంలో అనేక మంది పేరు మోసిన సర్దారులు అనేక దుర్గాధిపతులుగా, సేనాధిపతులుగా ఉండి అనేక దానాలు చేసి శాసనాలు కూడా వేయించారు. ఇతని కాలంలో పేరు మోసిన సరదారులు మీర్‌మోమిన్ అస్తరాబాద్. ఇతడు గొప్ప పండితుడు. అతడు రిసాల మెగ్దారియా అనే గ్రంధాన్ని రాశాడు. పారశీక భాషలో కసీదాలు అనేవి కూడా రాశాడు. అతని నివాసం షామిమహల్. అతడు దాదురెమోమిన్ అనే సమాధిని నిర్మించాడు. తరువాత వారు అమీర్‌షా తబతబ. ఇతడు మీర్జుమ్లా పదవిని నిర్వహించాడు. తర్వాత ముఖ్యుడు అల్పఖాన్ ముల్క్ అమీనుల్ముల్క్. చార్మినార్ దగ్గర ఉన్న జామె మసీద్ ఇతని ఆధ్వర్యంలో నిర్మింపబడింది. ఆ మసీదుపై ఉన్న రెండు శాసనాలలో ఇతని పేరుంది. తర్వాత ప్రముఖుడు మీర్జా మహమ్మద్ మీన్ షేహర్‌స్థాని. ఇతడు గణితశాస్త్ర పండితుడు. ఇతడు రాజ్యంలో గణాంక పదవిని నిర్వహించి 2 లక్షల హొన్నులు అంటే 8 లక్షల రూపాయలు వేతనంగా పొందాడు. సూర్యారావనే గణాంకుడు తప్పు లెక్కలతో ప్రభుత్వ సొమ్మును కాజేసినట్లు ఇతని లెక్కల్లో బయటపడిందట. ఇతడు జచిఖాన్‌ను నిర్మించాడు. మూసీనది తీరాన అమీన్‌భాగ్ అనే పేరుతో సుందరమైన తోటను వేయించాడు. వీరంతా విదేశాల నుండి వచ్చి గోల్కొండలో ఉద్యోగాలు సంపాదించారు. ఇంకా ఆలీ అఖా కొత్వాల్, జైనులాబుద్దీన్, సద్‌లష్కర్ మీర్ అబూతాలబ్ నాజర్‌లు సయ్యద్ కుటుంబానికి చెందినవారు. షామాజి, ఆశీర్‌రావు, ధర్మారావు, జగపతిరావు, భావేరావు అనే హిందూ ఉద్యోగులు ఉన్నత పదవులను అధిష్టించారు. వీరి సహకారంతో అతడు రాజ్యాన్ని దక్షతతో పాలించాడు. ఇంకా మహమ్మద్ కులీ ముస్లిం పండుగలకు విరివిగా దానాలు చేసేవాడు. మొహరం పండుగ ఘనంగా జరిపేవాడు పవిత్రస్థలాలలో ఉత్సవాలు జరిపి అన్నదానం చేయబడేది. 12 మంది ఇమాములపేర 60 వేల హొన్నులు దానం చేసేవాడట. రైతులపై ధాన్యంపై సుంకాలు తొలగించాడట. తీర్పులు న్యాయంగా ఉండేవట. ఇతని కాలంలో ఉరిశిక్ష అమలు జరుపలేదట. ఇతని కాలం నాటి శాసనాలు కొన్ని దానాలను తెలుపుతున్నాయి. జుత్తిగ శాసనం వాసుకి రవి సోమేశ్వరాలయం శిధిలం కాగా దానిని పునర్నిర్మాణం చేసి వినాయక దుర్గ భైరవ విగ్రహాలను ప్రతిష్టించినట్లు తెలుపుతోంది. బొడగు శాసనం ప్రకారం ఉత్కళ దేశంలో బాహుబలేంద్రుని వంశస్థుడైన సింగభూపాలుడు సింగర తటాకాన్ని నిర్మించి శాసనం వేయించాడు. మంగళగిరి శాసనం ఖాజా ఆలీ కొన్ని రాయితీలు ఇచ్చినట్లు తెలుపుతోంది. జాగర్లమూడి శాసనం అక్కడ సంగమేశ్వరస్వామికి భూదానం చేసినట్లు తెలుపుతోంది. ధర్మవర శాసనంలో ఎక్లాస్‌ఖాన్ కొండవీడు, అద్దంకి ప్రాంతాలలో భూసంబంధమైన విషయాలను రాయించాడు. సింహాచల శాసనం దానశాసనం శ్రీ కూర్మశాసనం అశ్వారాయనింగారు బహుబలేంద్రుని ఓడించి శ్రీ కూర్మనాధుని దర్శించి అక్కడ పూజా పునస్కారాలను శ్రీకూర్మ గ్రామాన్ని సర్వమాన్యంగా ఇచ్చి క్రీ.శ.1604లో శాసనం వేయించాడు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా 1612-1-11వ తేదీన మరణించినట్లు అతని సమాధిపైన

ఉన్న శాసనం తెలుపుతోంది. మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలంలోనే డచ్చి, ఇంగ్లిష్ వారు గోల్కొండ రాజ్యంలో తమ వ్యాపార స్థావరాలు నిర్మించుకున్నారు. క్రీ.శ.1608లో డచ్చివారికి, క్రీ.శ.1611లో ఇంగ్లిష్ వారికి కుతుబ్‌షా మచిలీపట్టణంలో ఫ్యాక్టరీలు నిర్మించుకోవడానికి గోల్కొండ రాజ్యంలో వ్యాపారం చేసుకోడానికి అనుమతిని ఇచ్చాడు.

సుల్తాన్ మహమ్మద్ కులీ-క్రీ.శ.11-1-1612-30-1-1626: సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ. 1592లో జన్మించాడు. ఇతని తండ్రి మహమ్మద్ అమీన్, తల్లి ఖనిం కాగా. ఈమె హజరత్ ఇమాం ముసాకాజిం వంశస్తురాలు. ఆమె తండ్రి పేరు మీర్‌మక్సూద్ అలిబిన్ మీర్ అల్లా ఉద్దీన్ తబతబ. అతనికి గోల్కొండ అమీరు సర్‌లష్కర్ కమాలుద్దీన్‌తో స్నేహ సంబంధాలున్నాయి. కనుక అతడు గోల్కొండకు వచ్చి ఉద్యోగం సంపాదించాడు. ఆమెకు గోల్కొండ రాజకుమారుడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా సోదరుడైన మహమ్మద్ అమీన్‌తో వివాహం అయింది. వారికి జన్మించిన కుమారుడే సుల్తాన్ మహమ్మద్ కులీ. కుతుబ్‌షాకు క్రీ.శ. 1594లో హయత్‌బక్షి బేగం జన్మించింది. ఆమె తప్ప మరి ఇతర సంతానంలేదు. క్రీ.శ.1595లో తన సోదరుడు మహమ్మద్‌మీన్ మరణించాడు. అప్పుడు సుల్తాన్ స్వయంగా వారి ఇంటికి వెళ్లి అతని కుమారుని తెచ్చి పెంచి పెద్ద చేశాడని తారీఖీ కుతుబ్‌షాహీ గ్రంథం తెలుపుతోంది. అప్పుడు అతని పేరు సుల్తాన్ మీరా. తర్వాత సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్‌షా అని పేరు మార్చి తన కుమార్తె హయత్ బేగంని ఇచ్చి క్రీ.శ.1607లో వివాహం చేసి తన వారసునిగా ప్రకటించాడు. ఆ సమయంలో 30 వేల హొన్నులు బహుమానాలుగా ఇవ్వబడ్డాయి. వివాహపు ఖర్చు ఖజానె ఆమ్ నుండి తీసి ఖర్చుపెట్టారట. అతని తర్వాత వారసత్వ వివాదం కాగూడదని తన సరదారులనందరినీ పిలిచి వారి సమక్షంలో అతనిని తన వారసునిగా ప్రకటించాడు. అంతకుముందే ఖాజినమ్దాని, హరజత్‌షా యూసిఫ్ సాహెబ్‌లను గురువులుగా నియమించి అతనికి విద్యాభ్యాసం చేయించి కుతుబ్‌షాహీ రాచరికపు పద్ధతులన్నీ నేర్పించారు. పరిపాలనలో, యుద్ధతంత్రంలో శిక్షణ ఇప్పించాడు. తరచు తన ఆరోగ్యం చెడిపోతోందని తన అల్లుడు తాను జీవించి ఉండగానే పట్టాభిషేకం జరుపుకోవాలని కోరుతుండేవాడట. పీష్వా మీర్‌మోమిన్ అస్త రాయబారిని పిలిచి పట్టాభిషేకం ఏర్పాట్లు కూడా చేయమని చెప్పాడట. కాని అది జరుగుకుండానే అతడు 11-1-1612వ తేదీన మరణించాడు. అతడు మరణించిననాడే ఆలస్యం చేయకుండా పీష్వా మీర్‌మోన్ సుల్తాన్ మహమ్మద్‌ని గోల్కొండ సింహాసనం ఎక్కించి తన ప్రభువు కోర్కెను తీర్చాడు. మీర్‌మెమిన్ కవి, పండితుడు. పట్టాభిషేక కాలంలో కొత్త సుల్తాన్‌కు శుభాశీస్సులు, అభినందనలు తెలుపుతూ కవిత్వం కూడా చెప్పాడట. ఇతని పట్టాభిషేక కాలంలో అహమ్మద్‌నగర్ బీజాపూర్ సుల్తాన్‌లే గాక పర్షియా సుల్తాన్ షా అబ్బాస్ కూడా అభినందలను తెలిపారట. ఇతని కాలంలో పర్షియా రాయబారి మీర్ జయినుల్ అబదీన్ క్రీ.శ.1614లో గోల్కొండ ఆస్థానాన్ని దర్శించాడు. ఇతడు శాంతికాముకుడు. దైవభక్తిపరుడు, ప్రతిదినం అతడు ముల్లాలను పిలిపించుకొని ఖురాన్ చదివించుకొని వినేవాడట. అతడు నియమం తప్పకుండా నమాజులు చేసేవాడట. అతడు రాచకార్యాల కంటే దైవభక్తికే అధిక ప్రాధాన్యతను ఇచ్చాడు. అందువల్ల ఇతని కాలంలో యుద్ధాలు జరగలేదు. ప్రజలు సుఖశాంతులు అనుభవించారు. కవిపండితులను పోషించి ప్రశాంత జీవనం గడిపాడు. ఇతడు రాజ్యానికి వచ్చేముందు బస్తరు యుద్ధం జరుగుతోంది. దానిని అతడు పూర్తి చేశాడు. విజయనగర చక్రవర్తి రెండవ వెంకటపతిరాయలు గోల్కొండ రాజ్యంపై దండెత్తి కొన్ని భాగాలు ఆక్రమించాలని తలచాడు. కాని క్రీ.శ.1414 నుండి అతని ఆరోగ్యం చెడిపోయి ఏమీ చేయలేకపోయాడు. అందువల్ల ఇతని కాలంలో ఎవరితోను యుద్ధాలు జరగలేదు.

దక్కను సుల్తాన్‌లతో సంబంధాలు: ఇతడు తన రాజ్యానికి సంబంధించి ఎలాంటి యుద్ధాలు చేయకపోయినా అహమ్మద్ నగర రాజ్యం ప్రశాంతంగా ఉన్నంత కాలం గోల్కొండ రాజ్యానికి మొగలుల బెడద ఉండదని భావించి సహాయం చేశాడు. మాలిక్ అంబర్ ఎప్పుడు సహాయం అడిగితే అప్పుడు ధనసహాయం చేశాడు. తన సైన్యాలను పంపాడు. క్రీ.శ.1617-21లో అంబర్‌కు మొగలులకు జరిగిన యుద్ధంలో గోల్కొండ సేనాని సయ్యద్ కమాల్‌ఖాన్ నాయకత్వంలో గోల్కొండ సైన్యం అహమ్మద్ నగరానికి అండగా పోరాడింది.

మొగలులతో సంబంధాలు: క్రీ.శ.1616 మొగల్ రాయబారి మీర్‌మక్కి గోల్కొండ రాజ్యాన్ని దర్శించాడు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా మొగలులతో తన స్నేహానికి చిహ్నంగా 15 లక్షల విలువైన బహుమానాలను మొగల్ చక్రవర్తి జహంగీర్‌కు పంపాడు. క్రీ.శ.1621లో మాలిక్ అంబర్ మొగలులతో సంధి చేసుకున్న తర్వాత గోల్కొండ రాజ్యం కూడా మొగల్ చక్రవర్తికి 20 లక్షల హొన్నులు సమర్పించిందట. అలాగే ప్రతి సంవత్సరం

చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. అంటే పరోక్షంగా అతడు మొగలుల సార్వభౌమాధికారాన్ని అంగీకరించినట్లే క్రీ.శ.1622లో ఖుర్రం రాజకుమారుడు జహంగీర్ చక్రవర్తిపై తిరుగుబాటు చేశాడు. అతనిని శిక్షించడానికి నూర్జహాన్ మహబత్‌ఖాన్‌ను పంపించింది. ఆ సమయంలో ఖుర్రం దక్కను చేరి మహమ్మద్ కులీని సహాయం అర్థించాడు. రాకుమారునికి సహాయం చేసినట్లయితే తాను జహంగీర్ చక్రవర్తికి విరోధి అవుతాడని గ్రహించి రహస్యంగా కొంత ధనాన్ని అందించి తన రాజ్యం నుండి పంపివేశాడు. ఆ సమయంలో ఖుర్రం గోల్కొండ రాజ్యంలో గుండా ప్రయాణించి మచిలీపట్టణం చేరి అక్కడి నుండి బెంగాలు వెళ్లిపోవడానికి అనుమతినిచ్చాడు అంతేగాక దోవలో అతనికి కావలసిన సౌకర్యాలు మర్యాదలు చేయవలసిందిగా గ్రామాధికారులను ఆజ్ఞాపించాడని ఇక్బల్ నామా జహంగీరి మొదలైన గ్రంథాలు తెలుపుతున్నాయి. ఏమైనా అది సున్నితమైన విషయం. అటు నూర్జహాన్‌కు, ఇటు ఖుర్రానికి ఆగ్రహం రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాడు.

మక్కా మసీదు శంకుస్థాపన: సుల్తాన్ మహమ్మద్ 12 సంవత్సరాల పాటు క్రమం తప్పకుండా నమాజు చేశాడట. అలాంటి వారు మసీదు నిర్మాణానికి పునాదిరాయి వేయవచ్చునట. అందువల్ల గోల్కొండలో చార్‌మీనార్ పక్కన మసీదు నిర్మించాలని సంకల్పించి మక్కా నుండి రాయిని తెప్పించి ఆ రాతిని తన చేతులతో పునాదిగా వేసి మసీదు నిర్మాణాన్ని మొదలుపెట్టాడట. కాని అది అతని జీవితకాలంలో పూర్తికాలేదు. ఇతని మరణం తర్వాత హైదరాబాద్ దర్శించిన టావెర్నియర్ అనే ఫ్రెంచి నగల వర్తకుడు మక్కామసీదు భారతదేశపు గొప్ప నిర్మాణాలలో ఒకటని, దానిని నిర్మించే కాలంలో 8 వేల మంది పనిచేశారని, వారిలో 4 వేలు కూలీలు, 2 వేలు రాళ్లు కొట్టేవారు, 2 వేల మంది తాపీ మేస్త్రీలని రాశాడు. దాని నిర్మాణానికి 70 సంవత్సరాలు పట్టింది. అతడు హైదరాబాద్ తూర్పుభాగంలో సుల్తాన్‌పూర్ నగర్ అనే నగరాన్ని నిర్మించాలని దుర్గం ప్రహరీగోడలను ప్రారంభించాడు. క్రీ.శ 1624లో పునాదిరాయి వేసి ఈద్గాను కూడా నిర్మించాడు. కాని ఈ నగరం కూడా పూర్తికాలేదు. అమ్మాన్ భవనాన్ని నాలుగు అంతస్తులుగా నిర్మించాడు. దాద్‌మహల్, మహమ్మద్ మహల్‌లలో కొన్ని నూతన మార్పులను చేయించి ఆ కట్టడాలను పూర్తి చేశాడు. ఇతడు నబీబాగ్‌ను నిర్మించాడు. ఇతని కాలంలో మాచర్లలోని చెన్నకేశవ ఆలయంలో విశ్వకర్మ వంశానికి చెందిన రామచంద్రుడనే ఒక వ్యక్తి రామడక అనే గ్రామంలో తనకు ఉన్న మాన్యాన్ని దేవాలయ దీపారాధనకు శక 1541 సిద్దార్ధి ఆషాఢశుద్ధ ఏకాదశినాడు దానం చేసి శాసనం వేయించాడు. ఇది క్రీ.శ.1619 సంవత్సరానికి చెందిన శాసనం. మహమ్మద్ కులీ కవి అతని ఆస్థానంలో ప్రష్యన్ దక్కనీ భాషలలో గ్రంథాలు రాయబడ్డాయి. మీర్ మహమ్మద్ ముమీన్ తూనికలు కొలతల మీద రిసాలామిక్దరియా అనే గ్రంథాన్ని రాశాడు. హకంతకయుద్దీన్ మిజానుత్ తబాయి అనే వైద్యగ్రంథాన్ని రాశాడు. తారీఖ్-ఇ-మహమ్మద్ కుతుబ్‌షా అనే చారిత్రక గ్రంథం ఇతని కాలంలోనే రాయబడింది. అతని కాలంలో హైదరాబాద్ గొప్ప భవనాలతో తటాకాలతో మన్‌సాహిబ్ కా తాలాబ్ అనే పేరుతో సుందర నగరంగా రూపొందింది.

విదేశీ వ్యాపారం: ఇతని కాలంలో ఐరోపా వారి వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. ఇండిగో, సన్నని వస్త్రాలు, దూది, సిల్కు, సీసం, వెండి మొదలైన వస్తువులకు గిరాకీ పెరిగింది. గనులకు కూడా గిరాకీ పెరిగింది. అందువల్ల మహమ్మద్ కులీ క్రీ.శ.1623 నుండి గనులను అద్దెకు ఇవ్వలేదు. వజ్రాల గనుల నుండి రాజ్యానికి మంచి ఆదాయం వచ్చేది. ఐరోపా వారి డాగ్ రిజిష్టర్ల వల్ల ఆనాటి వస్తువుల ధరలు కూడా తెలుస్తున్నాయి. సీసం 20 మణుగులు 65 మొగల్ రూపాయలట. లాంగ్ క్లాత్ 3000 ముక్కలు 50 రూపాయలు, వెండి ఒక పౌండు నాలుగున్నర షిల్లింగులట. నౌకా రేవులపై తగిన శ్రద్ధ తీసుకొనబడింది. రేవులపై షాబిందర్ అనే గోల్కొండ అధికారి ఉండేవాడు. అతడు బ్రాహ్మణుల సహాయంతో రేవు లెక్కలు తయారు చేయించేవాడు. ఐరోపా వారిని పాస్ లేకుండా గోల్కొండ పట్టణంలోనికి రానిచ్చేవారు కాదట. హైదరాబాద్ నుండి బయటకు వెళ్లవలసినా రాజోద్యోగుల పాస్ తీసుకొని వెళ్లవలసిందేనట.

సుల్తాన్ మహమ్మద్ కులీ జహంగీరు, నూర్జహాన్, మాలిక్ అంబర్‌లకు సమకాలికుడు. వీరు ముగ్గురూ ఇంచుమించు ఒకే కాలంలో మరణించారు. సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1626లో వ్యాధి పీడితుడయ్యాడు. అతని తల్లి ఖానింఅగా జీవించే ఉంది. ఆమె, అతని, భార్య హయ్యత్‌భక్షి బేగం అతనికి గట్టిగా వైద్యం చేయించారట. కాని అతడు 1085 జమాలవ్వల్ 14వ తేదీన అంటే 30-1-1626లో మరణించాడు. మాలిక్ అంబర్ 11-5-1626లో మరణించగా జహంగీర్ 28-19-1627 మరణించాడు. వీరు ముగ్గురూ నాటి రాజకీయాలలో ముఖ్యపాత్ర నిర్వహించినవారు. ముగ్గురూ ఇంచుమించు ఒకే కాలంలో మరణించడం ఒకవిశేషం.

అబ్దుల్లా కుతుబ్‌షా క్రీ.శ. 1626-1672: సుల్తాన్ మహమ్మద్ కులీకి నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మీర్జా అనే పేరు కలిగిన అబ్దుల్లా కుతుబ్‌షా పెద్దవాడు. రెండవ వాడి పేరు ఇబ్రహీం మీర్జా, మూడవ వాని పేరు కులీ మీర్జా, నాల్గవ కుమారుడు కమాల్ మీర్జా కులీమీర్జా / కమాల్ మీర్జా కుర్షీద్ బీబీ కుమారులు. ఇబ్రహీం మీర్జా బీజాపూర్, ఇబ్రహీం ఆదిల్‌షా కుమార్తెకు జన్మించాడు. హయత్‌బక్షి బేగంకు అబ్దుల్లా కుతుబ్‌షా జన్మించాడు. ఆమెకు ఖదీ అబ్దుల్లా కుతుబ్‌షా జన్మించాడు. ఆమెకు ఖదీజా సుల్తాన్ అనే కుమార్తె కూడా ఉంది. అబ్దుల్లా కుతుబ్‌షా 21-11-1614న జన్మించాడు. అతడు జన్మించిన ఘడియలు మంచివి కావని, అతని తండ్రి 12 సంవత్సరాలు చూడకూడదని చూసినట్లయితే తండ్రి మరణిస్తాడని జ్యోతిష్యులు చెప్పారట. అందువల్ల అతనిని రాజబంధువులు కుతుబుద్దీన్ నియమతుల్లా, మీర్జా షరీఫ్ సెవర్సిర్దాణి, ఖాజా ముజఫరలీలు తమ ఇళ్లలో పెంచారు. 12 సంవత్సరాల తర్వాత అబ్దుల్లాను రాచమందిరానికి తెచ్చారు. అతనిని చూడగానే తండ్రికి వ్యాధి కలిగి మరణించాడు. అతడు 31-1-1626వ తేదీన గోల్కొండ సింహాసనం అధిష్టించాడు. అతని పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరుపబడింది. రాజ్యమంతటా వేడుకలు జరిగాయి. బహుమతులు ఇవ్వబడ్డాయి. అతని పేర నాణేలు ముద్రింపబడింది. బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా, అహమ్మద్‌నగర్ సుల్తాన్ మూర్తజాలు, మొగల్ రాకుమారుడు ఖుర్రంలు అభినందనలను పంపారు. ఇరాన్‌షా కూడా అభినందనలు తెలిపాడు. ఇరాన్‌షా పేరును తన పేరుతో కలిపి శుక్రవార ప్రార్థనలు చేయించాడు. రనౌలి అనే ఆస్థాన కవి ఘకర్‌సిరాజ్‌లు అబ్దుల్లా రాజ్యం వర్ధిల్లాలని ఆశీర్వదించారు. అప్పటికి అతని వయస్సు 12 సంవత్సరాలు అయినందువల్ల అతని తల్లి హయత్‌భక్షీ బేగం, నాయనమ్మ ఖానిం అగాలు పరిపాలనా భారం వహించారు. వారికి పరిపాలనలో మన్సూర్‌ఖాన్ హబ్షి, మాలిక్ యూసిఫ్, ఖాసింబేగ్ కొత్వాల, షా మహమ్మద్ అరబ్‌షా పేష్వా, ఇబీన్ ఖాయాన్ లేక గులామి షేక్ మహమ్మద్ నాయబ్ పేష్వా, మన్సూర్‌ఖాన్ మీర్జుంలాలు, మీర్ ఖాశిం, ఖ్వాజా అహమ్మద్ తుర్కులు సహాయపడ్డారు. హిందువులైన ఎతెమాద్‌రావు రాయసకాడుగా సర్వారావు, నారాయణరావులు చిన్న ఉద్యోగులుగా ఉండి రాణులకు సహాయపడ్డారు. కాని ఈ ఉన్నతోద్యోగులంతా స్వార్థపరులై ప్రభుత్వ ధనాన్ని కాజేసేవారట. 'మన్సూర్‌ఖాన్‌కు, పీష్వా షా మహమ్మద్‌కు సరిపడలేదట. ఖాసిబేగ్ స్థానంలో మచిలీపట్టణం హవల్దారు ముల్లా తాకీని నియమింపబడ్డాడు. మన్సూర్‌ఖాన్ మరణానంతరం క్రీ.శ.1628లో మహమ్మద్ తఖీ 'మీరాలం పదవిలో నియమింపబడ్డాడు. అతడు సమర్థుడు, గొప్ప గణితశాస్త్ర సారంగతుడు. అతడు రాజ్యపు లెక్కలన్నీ లోతుగా పరిశీలించి అందరి మోసాలు బయటపెట్టాడు. నారాయణరావు 13000 హొన్నులు కాజేసినట్లు లెక్క తేల్చి రాబట్టాడు. మిగిలిన వారి వద్ద నుండి కూడా వసూలు చేశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతని ప్రతిభకు మెచ్చుకొని అతనికి షరీఫుల్ముల్క్ అనే బిరుదునిచ్చాడు. అతని ప్రతిభ వల్ల రాజ్యపు ఆర్థిక కార్యకలాపాలు క్రమబద్ధం అయ్యాయి. పీష్వా పదవి చేసే షా మహమ్మద్ మొగలులతో జరిపిన సంభాషణలలో తన అసమర్థతను చాటుకున్నాడు. అందువల్ల అతనిని తొలగించి షేక్ మహమ్మద్‌ని పీష్వాగా నియమించాడు. పీష్వా సలహాపై మౌలాన అబీస్‌ను దబీర్‌గా నియమించాడు. ఇంకా పీష్వా సిఫార్సుపై అబ్దుల్లా కుతుబ్ షా మీర్జాఖాసిం, హకీం నిజాముద్దీన్, అహమ్మద్ హకి, జిబ్రయల్ ఆగాఖాన్ తదితరులను రాజోద్యోగులుగా నియమించాడు. ఈ విధంగా అబ్దుల్లా రాజ్యానికి వచ్చిన మొదటి రెండు సంవత్సరాలు ఆస్థాన ఉద్యోగులను నియమించడం, తొలగించడంతో సరిపోయింది. అతడు యుక్తవయస్కుడు అయ్యే వరకు ఆస్థానోద్యోగులు వారి ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. అతని తల్లి హయాత్ బక్షీబేగం ఉద్యోగులను అదుపులో పెడుతూ రాజ్యపాలన చేసింది. ఈ కాలంలో అబ్దుల్లా రాజ్యపాలనను తన తల్లి, రాజోద్యోగులకు వదలివేసి విలాస జీవితం గడిపాడు. రైజన మొదటి సంవత్సరంలో బాగ్ లింగంపల్లి, బన్నత్ ఘూట్‌ల వద్ద విలాస మందిరాలలో సుఖజీవనం గడిపాడు. సింహాసనం అధిష్టించిన రెండవ సంవత్సరంలో తన పుట్టినరోజును వైభవంగా ఉత్సవం లాగా జరుపుకున్నాడు. వేలహొన్నులు ఖర్చుపెట్టి నాట్యగాన కళా ప్రదర్శనలను నిర్వహించాడు. క్రీ.శ.1627లో కొహితూరు వెళ్లి అక్కడ కొన్నాళ్లు విలాస జీవితం గడిపాడు. షికార్లు చేయడం, యాత్రలు చేయడం అతని నిత్యకృత్యాలు. క్రీ.శ.1630లో హైదరాబాద్‌లో మూతరాషి ఉత్సవాలను అతివైభవంగా జరిపాడు. హయతాబాద్ వరకు ఊరేగింపుగా వెళ్లి అక్కడ దర్బారు ఏర్పాటు చేసి నాట్యగానాలతో పొద్దుపుచ్చి వారికి అనేక నజరానాలు ఇచ్చాడు. హయత్‌బేగం తన కుమారుని సంతోషానికి ధనాన్ని ఖర్చుచేసింది. అబ్దుల్లా కాలంలో పండుగలు, పర్వదినాలు బ్రహ్మాండంగా నిర్వహించబడేవి. రబ్బీలవ్వల్ పర్వదిన ఉత్సవాలలో అబ్దుల్లా స్వయంగా పాల్గొనేవాడు. రాజప్రాసాదంలో దీపాలు వెలిగించేవారు. పేదసాదలకు

దానధర్మాలు చేసేవాడు. అతడు చేసే ఖర్చులన్నీ తల్లి హయత్‌బేగం భరించింది. ఆమె కుమారుని సంతోషాన్ని కాదనలేదు.

మొగలులతో సంబంధాలు క్రీ.శ.1636-1656: క్రీ.శ.1628లో షాజహాన్ మొగల్ సింహాసనం అధిష్టించడంతో దక్కను రాజ్యాల భవిష్యత్తు మారిపోయింది. అతడు దక్కను సుల్తాన్‌లను తన సామంతులుగా చేయాలని లేదా వారి రాజ్యాలు మొగల్ సామ్రాజ్యంలో కలిపివేయాలని తీర్మానించుకున్నాడు. క్రీ.శ.1630లో అతడు దక్కను రాజ్యాలపై దండయాత్ర ప్రారంభించాడు. మొదట అతడు అహమ్మద్ నగర్ రాజ్యంపై దండెత్తి 17-6-1633 నాడు దౌలతాబాద్ కోటను ఆక్రమించి చివరి నిజాంషా వంశస్థుడైన మూడవ మూర్తజా నిజాంషాను బంధించి గ్వాలియర్ కోటకు బందీగా పంపి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని మొగల్ సామ్రాజ్యంలో కలిపేశాడు. దాంతో అహమ్మద్‌నగర్ రాజ్యం అంతరించిపోయింది. దక్కనులో బీజాపూరు గోల్కొండ రెండు రాజ్యాలు మాత్రమే మిగిలాయి. అహమ్మద్‌నగర్ రాజ్య విలీనం తర్వాత బీజాపూరు, గోల్కొండ రాజ్యాలకు తన రాయబారులను పంపి వారిని తన సామంతులుగా కమ్మని కోరాడు. గోల్కొండ రాజ్యానికి షా ఆలీబేగ్ రాయబారిగా వచ్చాడు. కాని అతని రాయబారం విఫలమైంది. అబ్దుల్లా చక్రవర్తికి ఏమీ చెల్లించలేదు. దాంతో షాజహాన్ చక్రవర్తి గోల్కొండపై సైన్యాన్ని పంపాడు. అలాగే బీజాపూరు మీదకు కూడా దాడికి పంపాడు. అందువల్ల కుతుబ్‌షా ముల్లా తఖియ అనే అతని ద్వారా షాజహాన్ కొన్ని కానుకలు పంపాడు. అయినా షాజహాన్ యుద్ధాన్ని ఆపలేదు.

గోల్కొండ రాజ్యంపై దండయాత్ర: ఇదే సమయంలో షాజహాన్ నజీర్‌ఖాన్ అనే మొగల్ సేనానిని కుతుబ్‌షాహి రాజ్యంపైకి పంపాడు. అతడు ఖందార్ కోటను 18-5-1630లో జయించాడు. మరొక సైన్యాన్ని ఉత్తర కోస్తాపై దండెత్తమని పంపాడు. అక్బరు కాలంలో ఒరిస్సా మొగల్ సామ్రాజ్యంలో భాగం అయిపోయింది. అక్కడ మొగల్ గవర్నర్ నియమింపబడ్డాడు. షాజహాన్ కాలంలో బాఖర్‌ఖాన్ మొగల్ గవర్నరుగా పనిచేస్తున్నాడు. అతనిని గోల్కొండ రాజ్య భాగాలైన ఉత్తరాంధ్రపై దండెత్తమని ఆదేశించాడు. బాఖర్‌ఖాన్ ఉత్తరాంధ్రపై దండెత్తి క్రీ.శ. 1530 డిసెంబర్‌లో మన్సూర్‌నగర్‌ను ఆక్రమించాడు. తర్వాత రాజమహేంద్రవరం సర్కారుపై దండెత్తాలని తలచాడు.

మొగల్ ఫర్మానాను అబ్దుల్లా కుతుబ్‌షాకు పంపటం: ఇదే సమయంలో షాజహాన్ బీజాపూరు రాజ్యంపై కూడా మొగల్ సేనాని అసిఫ్‌ఖాన్‌ను పంపాడు. తనకు సహాయం చేయమని బీజాపూరు సుల్తాన్ షేక్‌వబెల్ అనే వ్యక్తిని గోల్కొండకు రాయబారిగా పంపాడు. కాని కుతుబ్‌షా మొగల్ చక్రవర్తికి భయపడి సహాయం చేయలేదు. ఈలోపల మళ్లీ షాజహాన్ తన ఆధిపత్యం అంగీకరించమని మఖ్‌మత్‌ఖాన్‌ను బీజాపూరుకు, అబ్దుల్ లతీఫ్ గుజరాతీని క్రీ.శ.1636లో గోల్కొండకు పంపాడు. అబ్దుల్‌లతా లైబ్య ఫర్మానాలో కఠినమైన షరతులున్నాయి. కుతుబ్‌షా అనేక పోరాటాలు చేశాడని అందులో మొదటిది శుక్రవారం ప్రార్థనలో షియా మతానికి చెందిన 12 ఇమాంల పేర్లను చదవడం అని, చక్రవర్తి సార్వభౌమత్వాన్ని అంగీకరించకపోవడం రెండవపాపం అని రాసి ఉంది. కనుక మొగల్ సార్వభౌమాధికారం అంగీకరించి, ప్రతి సంవత్సరం కప్పం చెల్లించాలని లేకపోతే మొగల్ సేనలు గోల్కొండ రాజ్యంపై దండెత్తుతాయని, కనుక ఇంకియాత్ నామాలో కుతుబ్‌షా సంతకం చేయాలని ఆదేశింపబడింది. లతీఫ్ గోల్కొండ చేరాడు. అతనిని పీష్వా షేక్ మహమ్మద్ స్వాగతం పల్కి మీర్జుమ్లా భవనంలో విడిది యేర్పాటుచేశారు. రాజదర్శన సందర్భంలో అతనికి విలువైన కానుకలు కూడా ఇవ్వబడ్డాయి. ఈ లోపల షాజహాన్ ఖాన్ దౌరాన్ అనే సేనాధిపతి నాయకత్వంలో గోల్కొండ రాజ్యానికి సైన్యాన్ని పంపాడు. కుతుబ్‌షాను లొంగదీసి తన సామంతునిగా చేయాలని ఖాన్ దౌరాన్‌కు ఆదేశం ఇచ్చాడు. అతడు నాందేడ్ చేరాడు. అది తెలిసి అబ్దుల్లా గోల్కొండ కోటను బాగుచేయించి మొగల్ సేనలను ఎదుర్కోడానికి జనీరుల్ముల్క్ అయినల్ముల్క్ అనే సేనానులను నియమించాడు. ఇదంతా గమనించిన లతీఫ్. యుద్ధం అక్కరలేదు, కుతుబ్‌షా లొంగివస్తాడు, తొందరపడవద్దని షాజహాన్‌కు కబురు పంపాడు. తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షా షాజహాన్ ఫర్మానాలోని షరతులను అంగీకరిస్తూ క్రీ.శ.1630 మే నెలలో ఇంకియాద్ నామాపై సంతకం చేశాడు. దాని ప్రకారం అబ్దుల్లా కుతుబ్‌షా మొగల్ సార్వభౌమాధికారాన్ని అంగీకరించాడు. మొగల్ చక్రవర్తి పేరుతో నాణేలు ముద్రించడానికి అంగీకరించాడు. సాలుకు 2 లక్షల హొన్నులు కప్పంగా చెల్లించాలి. మొగల్ సిక్కాకు గోల్కొండ హొన్నుకు తేడాగా ఉన్న ధనాన్ని చెల్లించాలి. బకాయిపడిన 30 లక్షల హొన్నులు మూడు వాయిదాలలో చెల్లించాలి. బీజాపూరు,

గోల్కొండపై దండెత్తితే మొగల్ చక్రవర్తి తన సైన్యాలను సహాయంగా పంపిస్తాడు: అనే షరతులతో ఇంకియాద్ నామా రాయబడింది. దానిపై అబ్దుల్లా సంతకం చేశాడు. తర్వాత అబ్దుల్‌లతీఫ్ గౌరవార్థం పీష్వా మహమ్మద్ తన ఇంటిలో విందు ఇచ్చాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అతనికి 6 లక్షల విలువైన కానుకలు ఇచ్చాడు. చక్రవర్తి ఆజ్ఞలను శిరసావహిస్తానని ప్రమాణ పత్రాన్ని ఇచ్చి పంపాడు. లతీఫ్ వెంట గోల్కొండ ప్రతినిధిగా మహమ్మద్ తాహెర్‌ను పంపాడు. లతీఫ్ తాహెర్‌లు దౌలతాబాద్ చేరారు. వారిని అక్కడ మీర్జాకులీబేగ్, షా ఆలీబేగ్, అఫ్జల్ ఖాన్‌లు స్వాగతం చెప్పి షాజహాన్ వద్దకు తీసుకొని వెళ్లారు. వారు తెచ్చిన పత్రాన్ని చూసి తమకు విధేయుడైనందువల్ల అబ్దుల్లా కుతుబ్‌షా చేసిన పాపాలు పోయాయని, అతడు తన రాజ్యాన్ని ఏలుకోవచ్చని తన సమ్మతి పత్రాన్ని రాయించాడు. దానిపై క్రీ.శ.1636 సెప్టెంబర్‌లో సంతకం చేశాడు. ఆ షరతులు బంగారు ఫలకంపై చెక్కించాడు. దాంతోపాటు కుతుబ్‌షాకు బంగారు చట్రంలో బిగించిన ఒక చిత్రం నూతన వస్త్రాలు, ఏనుగులు, బంగారు ఫలకంలో తాను ఆమోదించిన షరతులను రాయించి దస్కతు చేసి పంపాడు. అబ్దుల్లా చక్రవర్తి పంపిన కానుకలు స్వీకరించి అందుకు తన ధన్యవాదాలు తెలుపుతూ గజమౌతి అనే పేరు గల ఒక ఏనుగును వజ్రాలు పొదిగిన ఒక పల్లకీని షాజహానుకు పంపాడు. దాంతో గోల్కొండ రాజ్యానికి మొగల్ చక్రవర్తికి యుద్ధాలు ఆగిపోయాయి. షాజహాన్ దౌలతాబాద్ నుండి ఆగ్రా వెళ్లిపోయాడు. కాని గోల్కొండ రాజ్యం తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి మొగలుల సామంత రాజ్యం అయింది. ఈ సంధి కుదిరిన తర్వాత అంటే క్రీ.శ.1636 నుండి క్రీ.శ.1656 వరకు 20 సంవత్సరాలు రెండు రాజ్యాల మధ్య శాంతి నెలకొంది.

దక్షిణదేశ దండయాత్ర లేక కర్ణాటక దండయాత్ర క్రీ.శ.1642: తళ్లికోట యుద్ధానంతరం విజయనగర సామ్రాజ్యం త్వరితగతిన క్షీణించింది. సామంతులైన మధుర, జింజి, తంజావూరు, శ్రీరంగపట్టణ పాలకులు స్వతంత్రులయ్యారు. చివరి విజయనగర చక్రవర్తి మూడవ శ్రీరంగరాయలు వారిని అదుపులో పెట్టలేక నిస్సహాయంగా ఉండిపోయాడు. అతని దీన పరిస్థితిని గమనించి బీజాపూరు సుల్తాన్ విజయనగర రాజ్యంపై దండెత్తి అనేక ప్రాంతాలు ఆక్రమించాడు. ఆస్థితిలో అబ్దుల్లా కుతుబ్‌షా కూడా విజయనగర రాజ్యంపై దండెత్తి తన రాజ్యాని విస్తరించాలని తలచి సైన్యాలను పంపాడు. గోల్కొండ సైన్యాలు తూర్పుకోస్తాలో పులికాట్, ఆర్మగం వరకు ఎదురులేకుండా నడిచాయి. కాని అక్కడి నుండి ముందుకు సాగలేకపోయాయి. కనుక అబ్దుల్లా తన సేనాని మీర్జుమ్లా సైద మహమ్మద్ సైద్ మీర్జుమ్లా 40 వేల పదాతిదళం, 4 వేల గుర్రపుదళంతో 1645లో కర్ణాటక దండ యాత్రకు పంపాడు. మార్గమధ్యంలోని సామంతులు అతనితో చేరాలని తాకీదులు పంపాడు. మహమ్మద్ సైద్ మీర్జుమ్లాను పంపాడు.

సైద్ మీర్జుమ్లా దండయాత్ర క్రీ.శ. 1642-1652: ఇతని అసలు పేరు అజ్‌సాదాత్ అర్దిస్టాన్ అస్తహన్. ఇతడు అర్దిస్టాన్ నివాసి. ఇతని తండ్రి అర్దిస్టాన్‌లో నూనె వ్యాపారి. అజ్‌సాదాత్ పెద్దవాడైన తర్వాత ఒక గుర్రాల వ్యాపారి వద్ద ఉద్యోగిగా చేరాడు. యజమాని మరణించిన తర్వాత అతనికి కొంత ధనం లభించిందట. ఆ ధనంతో భారతదేశంలో వ్యాపారం చేయవచ్చని గోల్కొండ వచ్చాడు. అక్కడ వజ్రాల వ్యాపారం చేసి ధనాన్ని ఆర్జించాడు. వ్యాపారిగా కుతుబ్‌షాహి దర్బాను ప్రదర్శించేవాడు. కుతుబ్‌షాకు చీనా, ఐరోపా వస్తువులు, ఏనుగులు, గుర్రాలు, వజ్రాలు బహూకరించేవాడు. అందుకు కుతుబ్‌షా అతనిని క్రీ.శ.1639లో ఆస్థాన ఉద్యోగిగా నియమించాడు. అతడు తన సామర్థ్యంతో కుతుబ్‌షాను మెప్పించి క్రీ.శ.1639లో మీర్జుమ్లా ఉన్నత పదవిని పొందాడు. కుతుబ్‌షా అతనిని కుంభంలో స్థానిక పాలకునిగా నియమించాడు. తర్వాత కొండవీడుపై కూడా అధికారం ఇచ్చాడు. తనను కర్ణాటక దండయాత్రకు వెళ్లమనగానే మీర్జుమ్లా తన సైన్యంతో కొండవీడు నుండి బయలుదేరి మూడు రోజులలో నెల్లూరు చేరాడు. నెల్లూరు నాక్రమించి ముందుకుసాగి 11-4-1642 దుగ్రములు అనే మరొక కోటను ఆక్రమించాడు. ఈ విజయం తర్వాత విజయనగర సేన సైద్‌ను ఎదిరించింది. కాని ఆ సైన్యాన్ని ఓడించి మందుకుపోయి శ్రీహరికోట ప్రాంతాన్ని ఆక్రమించాడు. తర్వాత 31-12-1642లో రావూరు కోటను జయించాడు. తర్వాత కుల్లూరును జనవరి 1643లో జయించాడు. తర్వాత కుతుబ్‌షా సైన్యం ఉదయగిరిపై దండెత్తింది. అది విజయనగర రాజ్యానికి బలమైన కోట. మల్లయ్య అనే వ్యక్తి దుర్గరక్షకుడుగా ఉన్నాడు. మీర్జుమ్లా అతనిని తనవైపు తిప్పుకొని కోటలో ప్రవేశించాడు. ఉదయగిరిని జయించినట్లు 18-6-1643న గోల్కొండకు వార్త వచ్చింది. అందుకు సంతోషించి అబ్దుల్లా కుతుబ్‌షా మహమ్మద్ సైద్‌కు మీర్జుమ్లా అనే బిరుదునిచ్చాడు. కాని ఉదయగిరి విజయం తాత్కాలికమైంది. బీజాపూరు సుల్తాన్ సహాయంతో విజయనగర చక్రవర్తి మూడవ

శ్రీరంగరాయలు తిరిగి ఉదయగిరిని జయించాడు. కుతుబ్‌షా చక్రవర్తి అనుమతి లేకుండా విజయనగర రాజ్య భాగాలను ఆక్రమిస్తున్నాడని బీజాపూరు సుల్తాన్ షాజహాన్ చక్రవర్తికి ఫిర్యాదు కూడా చేశాడు. అయినప్పటికీ మీర్జుమ్లా పట్టువదలకుండా ముట్టడించి క్రీ.శ.1645లో తిరిగి-జయించాడు. రెండవసారి ఉదయగిరిని జయించిన తర్వాత మిగిలిన ప్రాంతాలు జయించడం సులభమైపోయింది. తర్వాత కడప కోట, దాని పరిసర ప్రాంతాలు జయించాడు. అక్కడ అధికారం నెరపిన మాట్ల అమరనాయకులను గోల్కొండ సామంతులుగా చేసి కప్పం చెల్లించేటట్లు ఒప్పించాడు. అక్కడి నుండి సరాసరి దక్షిణంగా సాగి తిరుపతి, చంద్రగిరిలను ఆక్రమించాడు చంద్రగిరి రాయల రాజధాని. దానిని ఆక్రమించడంతో విజయనగర రాజ్యం చాలా భాగం అతని వశమైంది తర్వాత అక్కడి నుండి చెంగల్పట్టు జిల్లాను జయించి శాంథోమ్ చేరాడు. మద్రాసు చేరాడు. క్రీ.శ.1647లో సెంట్ జార్జికోటలో ప్రవేశించాడు. ఈ విజయాలతో విజయనగర రాజ్యంలోని 300 మైళ్ల విస్తీర్ణం గల భూభాగం మీర్జుమ్లా వశమైంది. దానిని ఖిల్లాపట్టి అని పిలిచేవారు. ఆ ప్రాంతాలపై సాలుకు 40 లక్షల హొన్నుల ఆదాయం వచ్చేది.

ఇంగ్లీష్ వారితో ఒప్పందం క్రీ.శ.1647: క్రీ.శ.1636లో ఇంగ్లిష్ వారు గోల్కొండ రాజ్యంలో వ్యాపారం చేసుకోవచ్చునని అబ్దుల్ కుతుబ్‌షా బంగారు ఫర్మానా ఇచ్చాడు. తర్వాత వారు విజయనగర రాజ్యంలో కూడా వ్యాపారానికి అనుమతి సంపాదించాలని క్రీ.శ.1639లో వారు మూడవ వెంకటపతిరాయల మంత్రి దామెర్ల వెంకటాద్రిని అభ్యర్థించి అతని ద్వారా మద్రాసును పొంది అక్కడ కోటను నిర్మించారు. నేటికి ఆ ప్రాంతమంతా మీర్జుమ్లా ఆధీనంలోకి వచ్చింది. అప్పటికే విజయనగర చక్రవర్తి ఇచ్చిన కౌలు కాలం చెల్లిపోయింది. కనుక తమ కౌలును పొడిగించమని మీర్జుమ్లాకు అర్జీ పెట్టారు. మీర్జుమ్లా వారి దగ్గర అనేక నజరానాలు, ఫిరంగులు తీసుకొని కొన్ని షరతులతో వారికి కౌలును పొడిగించి ఫర్మానా ఇచ్చాడు.

బీజాపూరు, గోల్కొండల అంగీకారం-గండికోట ఆక్రమణ క్రీ.శ.1652: ఇంత వరకు బీజాపూరు, గోల్కొండలు విడివిడిగా విజయనగర రాజ్యభాగాలుగా ఆక్రమిస్తున్నాయి. బీజాపూర్, గోల్కొండకు వ్యతిరేకంగా ఉదయగిరి వద్ద విజయనగరానికి అనుకూలంగా సహాయం చేసింది. ఇప్పుడు గోల్కొండను నిరోధించడం సాధ్యం కాదని గ్రహించి మీర్జుమ్లాలో ఒక అంగీకారానికి వచ్చింది. ఉభయులు విజయనగర రాజ్యంపై దండెత్తి 21 వంతును ఆక్రమిద్దామని అంగీకరించారు. అంటే తెలుగు ప్రాంతాలు గోల్కొండ, కన్నడ ప్రాంతాలు బీజాపూరు, ఆక్రమించాలని ఉభయులు అంగీకరించారు. ఆ తర్వాత మీర్జుమ్లా క్రీ.శ.1652లో గండికోటను ఆక్రమించాడు గండికోట శత్రుదుర్భేద్యమైన కోట. మీర్జుమ్లాకు తన స్వశక్తి మీద ఆత్మవిశ్వాసం కలిగింది. సొంత రాజ్యం ఏర్పాటు చేసుకోవాలని అతనికి ఆశ కలిగింది.

స్వతంత్రం ప్రకటించాలని ప్రయత్నం: తరవాత అతడు కర్ణాటక ప్రాంతంలో రెండు వజ్రపు గనులను తవ్వించి రత్నాలు సంపాదించి అమ్మి ధనాన్ని సంపాదించాడు. ఫ్రెంచి, ఇంగ్లీష్, డచ్చి వారి వద్ద నుండి ఫిరంగులు సంపాదించాడు. ఐరోపా వారి చేత తన సైన్యానికి శిక్షణ ఇప్పించాడు. 20 వేల కాల్బలాన్ని, 5 వేల గుర్రపుదళాన్ని ఫిరంగిదళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. దాంతో అతడు అమిత బలవంతుడయ్యాడు. గండికోటను తన కేంద్రంగా చేసుకొని కుతుబ్‌షాను వ్యతిరేకించి సొంత రాజ్యం ఏర్పాటు చేసుకోవాలని కుట్రలు ప్రారంభించాడు. మీర్జుమ్లా కుట్రలను కొందరు అబ్దుల్లా కుతుబ్‌షాకు తెలియపరచారు. కర్ణాటక ప్రాంతంలో వసూలైన ధనం గోల్కొండ ఖజానాకు చేరలేదు. ధనాన్ని పంపమని కుతుబ్‌షా మీర్జుమ్లాకు కబురు చేశాడు. కాని ఆ ధనం కుతుబ్‌షాకు ఇవ్వనవసరం లేదని కబురు పంపాడు. తరవాత అతనిని గోల్కొండకు రమ్మని ఆజ్ఞాపించాడు. గోల్కొండకు వెళ్లినట్లయితే కుతుబ్‌షా తనను శిక్షిస్తాడని భావించి ఇరాన్ షాకు, బీజాపూర్ ఆదిల్ షాకు తనకు సహాయం చేయమని కోరుతూ రాయబారాలు పంపాడు. కాని ఎలాంటి ప్రయోజనం లేదు. ఇదంతా జరిగేటప్పుడు మీర్జుమ్లా కుటుంబం గోల్కొండ కోటలోనే ఉంది. అతని కుమారుడు మహమ్మద్ మీన్. అతడు కర్ణాటకంలో తన తండ్రి సాధించిన విజయాలకు గర్వం కలిగి కుతుబ్‌షాను ధిక్కరించసాగాడు. అతడు ఒకరోజు తప్పతాగి కుతుబ్‌షా సింహాసనంపై కూర్చున్నాడు. దర్బారులోనే వాంతి చేసుకున్నాడు. అతని చర్యలు సహించలేని కుతుబ్‌షా అతనిని కోవెలకొండ కోటలో బంధించి మీర్జుమ్లా ఆస్తిపాస్తులను స్వాధీనం చేసుకున్నాడు. ఈ సమయంలో గోల్కొండ రాజ్యపు పరిస్థితులు తెలుసుకొని శ్రీ రంగరాయలతో తాను పోగొట్టుకున్న ప్రాంతాలను తిరిగి జయించాలని పూనమల్లి, పులికాట్‌లపై దండెత్తాడు. కాని విజయం సాధించలేకపోయాడు. ఇదే సమయంలో గోల్కొండ

రాజ్యంలో కాటకం ఏర్పడింది. కుతుబ్‌షా ఇబ్బందులు పడ్డాడు.

మొగలుల సహాయం అర్ధించడం: గోల్కొండ కోటలో తన కుటుంబం బందీ అయిందని తెలిసి దక్కనులో మొగల్ గవర్నర్‌గా ఉన్న ఔరంగజేబు ద్వారా షాజహాన్‌కు తనకు సహాయం చేయాలని, తన కుటుంబాన్ని విడిపించాలని అలా చేస్తే తాను మొగలుల కొలువులో చేరతానని రాయబారం పంపాడు. షాజహాన్ తన సేనాధిపతి అయిన మహమ్మద్ మెయిన్‌ను మీర్జుమ్లా వద్దకు పంపాడు. అతడు తిరిగి వెళ్లి మీర్జుమ్లా పరిస్థితి చక్రవర్తికి నివేదించాడు. చక్రవర్తి అరిఫ్ కస్నేరిని పంపి అతని మధ్యవర్తిత్వంలో 3-12-1655వ తేదీన మీర్జుమ్లాను ఐదువేల మన్సబ్‌దార్‌గాను, అతని కుమారుడు అమీన్‌ను 2 వేల మన్సబ్‌దారుగాను నియమించాడు. అంతేగాకుండా మీర్జుమ్లా కుమారుని వదిలివేయమని అతని కుటుంబానికి ఎలాంటి హాని చేయరాదని చక్రవర్తి కుతుబ్‌షాకు ఆజ్ఞను జారీచేశాడు. మహమ్మద్ అమీన్‌ను సర్‌లష్కర్ ద్వారా తమకు అప్పగించాలని కూడా ఆజ్ఞాపించాడు. చక్రవర్తి ఆజ్ఞను అమలు జరుపడానికి ఔరంగజేబు తన కుమారుడైన మహమ్మద్‌ను నాందేడ్‌కు పంపి కుతుబ్‌షా మీర్జుమ్లా కుటుంబాన్ని బాధిస్తే గోల్కొండపై దండెత్తి కుతుబ్‌షాను బంధించి తీసుకురమ్మని 26-12-1655వ తేదీన ఆదేశించాడు. రాజకుమారుడు నాందేడ్ చేరి 7-1-1656వ తేదీన చక్రవర్తి ఆజ్ఞను కుతుబ్‌షాకు తెలియపరచాడు. ఆ వార్త విని భయపడి కుతుబ్‌షా మీర్జుమ్లా కుటుంబాన్ని వదిలివేయాలని నిర్ణయించుకున్నాడు. కాని కుతుబ్‌షా అల్లుడు సయ్యద్ అహమ్మద్ అందుకు అంగీకరించలేదు. ఈ లోపల మొగల్ రాజకుమారుడు గోల్కొండ రాజ్యంపై దండెత్తాడు. అది విని కుతుబ్‌షా మీర్జుమ్లా కుమారుడైన మహమ్మద్ మీనును వదలివేశాడు. అతడు గోల్కొండ నుండి బయలుదేరి అప్పటికే నగరానికి 24 మైళ్ల దూరం వరకు వచ్చి ఉన్న మొగల్ రాకుమారుడు మహమ్మద్ వద్దకు వెళ్లి మొగలులతో చేరిపోయాడు.

మొగలులతో యుద్ధం క్రీ.శ. 1656: మొగల్ సైన్యం ముందుకు కదలివచ్చి 22-1-1656న హుసేన్ సాగర్ చెరువుకట్టపై విడిది చేసింది. అక్కడ బాగాలేదని హైదరాబాద్ నగరంలో ప్రవేశించి కొల్లగొట్టసాగారు. ప్రజలు భయభ్రాంతులయ్యారు. మొగలుల దుండగాలను అరికట్టడానికి కుతుబ్‌షా మహమ్మద్‌బేగ్, మహమ్మద్ సుల్తాన్ అనే వారిని నియమించి తాను గోల్కొండ కోటకు పారిపోయాడు. మొగల్ సైన్యం గోల్కొండకోటను ముట్టడించింది. ఈ లోపల 28-1-1656న ఔరంగజేబు స్వయంగా గోల్కొండ చేరాడు. గోల్కొండకు తూర్పున ఉన్న కొండపైకి ఎక్కి మొగలులు పోరాటం మొదలు పెట్టారు. కోటలో మూసా బురుజుపై నుండి గోల్కొండ సేనాని మూసాకాన్ వారిపైన ఫిరంగిని పేల్చాడు. ఆ దెబ్బకు మొగల్ సేనాధిపతి మీరా మరణించాడు. అందుకు కోపించి మొగలులు కోటపై విజృంభించి దాడి చేశారు. కోటముట్టడి రెండు నెలలు సాగింది. అబ్దుల్లా సంధి చేసుకోవాలని బహుమతులతో తన హయత్‌బక్షీబేగం, అల్లుడు సయ్యద్ అహమ్మద్‌ను, మీర్‌ఫిసీ అనే మరొక సర్దారుని పంపాడు. కాని ఔరంగజేబు రాణి మాటకు కూడా దర్శనం ఇవ్వలేదు. సంధికి అంగీకరించలేదు. అబ్దుల్లాకు ఏమిచేయడానికి పాలుపోలేదు. ఢిల్లీలో ఉన్న గోల్కొండ రాయబారి అబ్దుల్ సయద్ షాజహాన్ మొదటి కుమారుడు ధారాషకొవ్ దయను సంపాదించి షాజహాన్‌కు చెప్పించి యుద్ధవిరమణ చేయమని ఔరంగజేబుకు వార్త పంపేలా చేయగలిగాడు. చివరకు కుతుబ్‌షా తన కుమార్తెను మొగల్ రాకుమారుడు ఔరంగజేబు కుమారుడు అయిన మహమ్మద్ సుల్తాన్‌కిచ్చి వివాహం చేసి రామ్‌గిరిను అరణంగా ఇస్తామని, 40 లక్షలు నష్టపరిహారంగా ఇస్తామని హయత్‌భక్షీ వాగ్దానం చేసిన తర్వాత ఆమెకు ఔరంగజేబు దర్శనం ఇచ్చాడు. తర్వాత 8-3-1656న వారి మధ్య సంధి కుదిరింది. ఔరంగజేబు కోటి రూపాయలు నష్టపరిహారంగా కోరాడు. కాని 70 లక్షలు, 5 వేల అశ్వాలు ఇవ్వబడ్డాయి. యుద్ధం నిలిచిపోయింది. తర్వాత 4-4-1656న ఔరంగజేబు కుమారుడు మహమ్మద్ సుల్తాన్‌కు అబ్దుల్లాకుతుబ్‌షా కుమార్తెతో వివాహం జరిగింది. రామ్‌గిరి దుర్గం అరణంగా ఇవ్వబడింది. అబ్దుల్లా మరణానంతరం గోల్కొండ రాజ్యానికి మహమ్మద్‌ను సుల్తాన్‌గా చేసేలా అంగీకరించబడింది. ఈ లోపల 18-3-1656న మీర్జుమ్లా కర్ణాటకం నుండి బాలారం వద్దకు వచ్చి ఔరంగజేబును కలిసాడు. అతనికి ముజ్జమ్‌ఖాన్ అనే బిరుదునిచ్చి మొగల్ మన్సబ్‌దారుగా అంగీకరించి దక్కనులోని మొగల్ సైనిక విడిదికి పంపబడ్డాడు. దాంతో అతనికి గోల్కొండ రాజ్యంతో సంబంధాలు ముగిశాయి. సంధి తర్వాత అబ్దుల్లా కూడా ప్రశాంతంగా ఉన్నాడు. ఈ యుద్ధ విరమణను గుర్తిస్తూ అతడు ఖతంబల్ ఖైరవాల సాదతా అంటే అక్షరాలున్న రాజముద్రికను తయారు చేయించాడట. అంటే కుతుబ్‌షాహి రాజ్యం ప్రమాదం నుండి తప్పించుకుందని అర్థమట. ఈ ముద్రను అతడు ఫర్మానాల మీద ముద్రించాడు. అబుల్ హసన్ కూడా తన ఫర్మానాల మీద అదే

ముద్రను వేయించాడు.

కర్ణాటక ప్రాంతం: మహమ్మద్ సైద్ లేక మీర్జుమ్లా మొగలులతో వెళ్లిపోయిన తర్వాత అతడు కర్ణాటకంలో జయించిన ప్రాంతాలు ఎవరికి చెందుతాయన్న ప్రశ్న వచ్చింది. మీర్జుమ్లా గోల్కొండ తరపున జయించాడు. గనుక ఆ ప్రాంతాలు గోల్కొండకే చెందుతాయని అబ్దుల్లా వాదించాడు. కాని మీర్జుమ్లా మొగలుల కొలువులో చేరాడు గనుక అవి అతనితోపాటే మొగల్ సామ్రాజ్యంలో భాగం అవుతాయని ఔరంగజేబు భావించాడు. అంతేగాదు కర్ణాటకంలో మీర్జుమ్లా జయించిన ప్రాంతాలన్నింటినీ మొగల్ సామ్రాజ్యంలో చేర్చాలని అక్కడ మొగల్ గవర్నర్‌ను నియమించాలని తన తండ్రి షాజహాన్‌కు సూచించాడు. కాని ఇంతలో షాజహాన్ జబ్బున పడ్డాడు. అతని నలుగురు కుమారులు సింహాసనానికై వారసత్వ యుద్ధాలకు దిగారు. ఔరంగజేబు ఆగ్రా వెళ్లి పోయాడు. అతనితో పాటే మీర్జుమ్లా కూడా వెళ్లిపోయాడు. కనుక అబ్దుల్లా కుతుబ్‌షా కర్ణాటక ప్రాంతాలను తన ఆధిపత్యంలోకి తెచ్చుకోవడానికి రిజాకులీబేగ్ అనే అతన్ని పంపాడు. ఇతనికి నేక్‌నాంఖాన్ అని కూడా పేరుంది. ఇతడు కర్ణాటకం చేరాడు. అతడు రాజ్యాన్ని విస్తరించడానికన్నా అంతకుముందు జయించిన ప్రాంతాలలో కుతుబ్‌షాహీ అధికారాన్ని స్థిరపరచడానికి ప్రాధాన్యత ఇచ్చాడు. అక్కడి పాలెగాండ్రు ఐరోపా కంపెనీవారు చెల్లించిన సుంకాలు స్థిరపరచి గోల్కొండ అధికారాన్ని బలపరిచాడు.

రజాక్ కులీ నెక్నంఖాన్ క్రీ.శ.1662: ఇతడు ఇరాన్ వాసి. షా అబ్బాస్ వద్ద కొలువు చేసి పరిపాలనలో గొప్ప అనుభవం సంపాదించి ఉన్నాడు. తర్వాత గోల్కొండ వచ్చి మహమ్మద్ సైద్‌ను ఆశ్రయించాడు. అతడు ఇతనికి రాజాఖాన్ అనే బిరుదునిచ్చి కర్ణాటకంలో తన వద్ద ఉద్యోగిగా నియమించుకున్నాడు. మీర్జుమ్లా వెళ్లిపోయిన తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షా అతనికి నెక్నంఖాన్ అనే బిరుదునిచ్చి మీర్జుమ్లా స్థానంలో కర్ణాటక పాలకునిగా నియమించాడు. ఇతడు కర్ణాటకంలోని మాండలీకులపై దాడులు చేసి వారిని అదుపులోకి తెచ్చాడు. వారి వద్ద నుండి బకాయిలు వసూలు చేశాడు.

ఇంగ్లిష్ వారిని అదుపులో పెట్టడం క్రీ.శ.1663-1672: మీర్జుమ్లా కుతుబ్‌షాపై తిరుగుబాటు చేసిన సందర్భంలో ఇంగ్లిష్ వారు గోల్కొండ రాజ్యానికి సుంకాలు చెల్లించలేదు. పైగా వారు పోర్చుగీసు వారిపై దండెత్తి వారి ఆధిపత్యంలోని శాంథోమ్‌ను ఆక్రమించారు. వారిని అదుపులో పెట్టడానికి నెక్నంఖాన్ 40 వేల సైన్యంతో శాంథోమ్ వద్దకు చేరాడు. ఎడ్వర్డు వింటర్ అనే ఇంగ్లిష్ అధికారి 11-2-1663లో తన పై అధికారికి రాస్తూ నెక్నంఖాన్ 40 వేల సైన్యంతో వచ్చాడని, అతడు మన కోటలను ఆక్రమించవచ్చని రాశాడు. ఆంగ్లేయులు సాలుకు కరోడ్గిరి 4200 హొన్నులు చెల్లించాలి. కాని వారు 380 హొన్నులు మాత్రమే చెల్లిస్తున్నారు. నెక్నంఖాన్ బకాయిలన్నీ చెల్లించాలని పట్టుబట్టాడు. కాని ఇంగ్లిష్ వారు లెక్కచేయలేదు. అందువల్ల అతడు మద్రాసుకు వెళ్లే మార్గాలన్నీ మూయించివేసి ట్రిప్లికేన్‌పై దండెత్తి ఆ ప్రాంతాన్ని ఆక్రమించాడు. క్రీ.శ.1670లో బ్రిటిష్ అధికారి ఫాక్స్ క్రాఫ్టును బకాయిలను చెల్లించమని ఒత్తిడి చేశాడు. కాని అతడు చెల్లించలేదు. కనుక ఇంగ్లిష్ వారికి ఎలాంటి వసతులు లేకుండా చేశాడు. ఇదే సందర్భంలో నెక్నంఖాన్‌ను కుతుబ్‌షా దివానుగా నియమించాడు. అతడు గోల్కొండ వెళ్లి తిరిగి క్రీ.శ.1672లో కర్ణాటక వచ్చాడు. అదే సమయంలో ఫాక్స్ స్థానంలో క్రీ.శ.1672లో ఆక్సెన్‌డెన్ బ్రిటిష్ అధికారిగా వచ్చాడు. అతడు నెక్నంఖాన్ షరతులన్నీ అంగీకరించి బకాయిలన్నీ లెక్క చూసి చెల్లించాడు. కరోడ్గిరి 4200 హొన్నులు సంవత్సరానికి భూమి అద్దె 1200 హొన్నులు, వెనుకటి బకాయిలు 5600 హొన్నులు మొత్తం 11000 హొన్నులు చెల్లించాడు. దాంతో బ్రిటిష్ వారి హక్కులను పునరుద్ధరించాడు. మద్రాసు పట్టణంలో ఇంగ్లిష్ వారు సంపూర్ణ హక్కులు అనుభవిస్తారు. గోల్కొండ ప్రతినిధులు వారి విషయాలలో జోక్యం చేసుకోరు. కాని చెన్నపట్టణంలో మాత్రం గోల్కొండ ప్రతినిధులు ఉంటారు. వ్యాపార వస్తువులను తనిఖీ చేస్తారని నిబంధన పెట్టాడు. ఆ షరతును ఆంగ్లేయులు అంగీకరించారు. దాంతో వారి కౌలును స్థిరపరుస్తూ 23-2-1672లో నెక్నంఖాన్ పట్టా రాసి ఇచ్చాడు. నెక్నంఖాన్ క్రీ.శ.1672లో మరణించాడు. అతని సమాధి కుతుబ్‌షాహీల సమాధుల పక్కనే ఉంది. అతని స్థానంలో మూసాఖాన్ కర్ణాటక గవర్నరుగా నియమింపబడ్డాడు.

జైసింగ్‌తో యుద్ధం క్రీ.శ.1666-67: ఔరంగజేబు శివాజీని ఓడించడానికి జైసింగును పంపాడు. శివాజీని ఓడించి క్రీ.శ.1666లో పురంధర్ సంధి చేసుకున్నారు. తర్వాత శివాజీ, జైసింగులిద్దరూ బీజాపూరుపై దండెత్తారు. బీజాపూరు కుతుబ్‌షా సహాయం అర్థించింది. కుతుబ్‌షా తన సేనాని షర్జాఖాన్‌తో సైన్యాన్ని పంపాడు. అతడు బీజాపూర్ సేనాని ఖవాస్‌ఖాన్‌తో కలసి ఐదు పర్యాయాలు మొగల్ సైన్యాలను ఓడించారు. అందువల్ల జైసింగ్

యుద్ధ విరమణ చేసి బరహన్‌పూర్ వెళ్లిపోయాడు. అతడు అక్కడే క్రీ.శ.1667లో మరణించాడు. గోల్కొండ సహాయం వల్ల బీజాపూరు విజయం సాధించగలిగింది.

సైనిక వ్యవస్థలో మార్పులు: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మొగలులతో కర్ణాటకంలోనూ అనేక యుద్ధాలు జరిగాయి. అందువల్ల అతని సైనిక వ్యవస్థలో కొన్ని మార్పులు జరిగాయి. ఐరోపా వారి రాతల వల్ల మనకు అబ్దుల్లా కుతుబ్‌షా సైనిక వ్యవస్థను గురించి కొంత సమాచారం తెలుస్తోంది. మొగల్ చరిత్రకారుల వల్ల కూడా కొంత సమాచారం తెలుస్తోంది. Hadiqatus–Salatin గ్రంథం కూడా గోల్కొండ రాజ్యంలోని కోటలను, సైన్యాన్ని పేర్కొంటుంది. ఆ కాలంలో కొంత సైన్యం జీతాలతో పోషించబడేది. కొంత సైన్యం జాగీరుదారులు పోషించేవారు. వారికి జాగీరులివ్వబడేవి. Thevenot సైనిక నిర్వహణకు జాగీరుదారులకు 5 లక్షలు ఆదాయం వచ్చే భూభాగాన్ని జాగీరుగా ఇచ్చేవారని రాశాడు. కొందరికి ధనాన్ని ఇచ్చేవారు. రెండు గుర్రాలను పోషించే రౌతుకు 10 chequins ఇచ్చేవారని కూడా రాశాడు. Travenier సైనికులు హిందువుల లాగే తమ తల వెంట్రుకలను తలపైన మధ్యభాగంలో ముడివేసుకొనేవారట. వారి ప్రధాన ఆయుధం బారుఖడ్గం Musket. రౌతు విల్లంబులు, బాణాలు ధరించేవారు. ఒక గొడ్డలి ఉండేదట. శిరస్త్రాణం ధరించేవారు. క్రమశిక్షణ పాటింపబడేది. సైన్యంలో టర్కీవారు ఐరోపా వారిని చేర్చుకొనేవారు. ఫిరంగిదళాన్ని పోషించేవారు. ఫిరంగుల ప్రయోగంలో ఐరోపా వారి చేత శిక్షణ ఇప్పించేవారు. కోటలను ఫిరంగీ గుళ్ల నుండి తట్టుకొనే విధంగా పెద్దపెద్ద బండలతో నిర్మించేవారు. కోస్తాలో ఆనాడు కొండపల్లి గొప్ప కోట. అతిదృఢంగా నిర్మింపబడింది. అటు మచిలీపట్టణం వెళ్లడానికి, ఉత్తరకోస్తాలో రాజమండ్రి, శ్రీకాకుళం వెళ్లడానికి ఈ కోట విడిదిగా ఉండేది. ఆ రోజులలో మచిలీపట్టణం గొప్ప రేవుపట్టణం. అక్కడ ఐరోపా వారు ఫ్యాక్టరీలు నిర్మించుకొని విదేశీవ్యాపారం సాగించేవారు. ఆ రేవు నుండి గోల్కొండ రాజ్యానికి లక్షలాది హొన్నులు సుంకాలు వస్తుండేవి. ఆ రేవుకు సుల్తాన్ రాకపోకలు కొండపల్లి కోట నుండి జరిగేవి. రాయలసీమలో గండికోట ప్రధాన దుర్గం. అది కూడా చాలా బలిష్ఠమైనది. ఫిరంగిదాడులకు కూడా అలవి కానిది. మీర్జుమ్లా ఫిరంగులతో కూడా జయించలేక ఆ కోటను మోసంతో జయించాడట. ఈ కోట లోపలనే పంట పొలాలున్నాయట. అందువల్ల ఆహార పదార్థాలకు ఇబ్బంది పడకుండా ఎన్ని సంవత్సరాల ముట్టడికైనా గండికోట తట్టుకొని నిలబడగలదట. అందువల్లనే మీర్జుమ్లా కుతుబ్‌షాహీని ఎదిరించి స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేసుకోడానికి గండికోటను తన కేంద్రంగా చేసుకున్నాడు. కోట లోపల కుతుబ్‌షాహీలు పండ్లతోటలు, పూదోటలు కూడా వేయించేవారట.

ఇతని కాలంలో అంతకుముందు ఉన్న అసంపూర్ణ కట్టడాలు పూర్తి చేయబడ్డాయి. మూసా బురుజు పునర్నిర్మాణం చేయబడింది. అతని తల్లి హయత్‌బేగం హయతాబాద్ పట్టణాన్ని నిర్మించి అందు కారవాను సత్రాలు, మసీదులు, విద్యాసంస్థలు కట్టించింది. యేమైనప్పటికీ అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో గోల్కొండ రాజ్యం గౌరవ మర్యాదలను కోల్పోయింది. మొగల్ సరదారులు రాయబారులు గోల్కొండలో నివసించి విలాస జీవితం గడుపుతూ గోల్కొండ రాజ్యం మీద, రాజోద్యోగుల మీద అధికారం చెలాయించారు. ఆ పరిస్థితులలో అబ్దుల్లా పరిపాలనపై శ్రద్ధ చూపలేకపోయాడు. గోల్కొండ కోటలో అంగణామణుల మధ్య కాలక్షేపం చేశాడు. ఆ విధంగా జీవిస్తూ అతడు 21-4-1672వ తేదీన మరణించాడు. అతని తర్వాత అబుల్ హసన్ తానీషా క్రీ.శ.1672లో గోల్కొండ సింహాసనం అధిష్టించాడు. అతడు అతి విచిత్ర పరిస్థితులలో గోల్కొండ సుల్తాన్ అయ్యాడు.

అబుల్‌హసన్ తానీషా క్రీ.శ. 1672-1687 (21-4-1672-17-9-1687): అబ్దుల్లా కుతుబ్‌షాకు మగ సంతానం లేదు. ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్దకుమార్తె మాసాహెబాను మక్కా నివాసి అయిన మీర్జా నిజాముద్దీన్ అహమ్మద్‌కు ఇచ్చి వివాహం చేశాడు. అతనిని సయ్యద్ అహమ్మద్ అని కూడా పిలుస్తారు. మాసాహెబాను బడేసాహెబ్ అని పిలిచేవారు. రెండవ కుమార్తెను క్రీ.శ.1656లో ఔరంగజేబు కుమారుడు మహమ్మద్ సుల్తాన్‌కిచ్చి వివాహం చేశాడు. అతడు తండ్రి ఔరంగజేబు ఆగ్రహానికి గురై చెరసాల పాలయ్యాడు. భార్యాభర్తలు ఇద్దరూ చెరసాలలోనే మరణించారు. చిన్నకుమార్తె బాదుషా బీబీని మక్కాలో పవిత్రంగా భావించే సయ్యద్ వంశానికి చెందిన సయ్యద్ సుల్తాన్ నజాఫ్‌కు ఇచ్చి వివాహం చేయాలని అబ్దుల్లా తలచాడు. ముహూర్తం కూడా పెట్టించాడు. కాని పెద్ద అల్లుడు సయ్యదహమ్మద్, పెద్ద కుమార్తె బడేసాహెబ్ వ్యతిరేకించారు. అప్పుడు అనుకోకుండా అబుల్ తానీషా కుతుబ్‌షాహీ వంశానికి చెందిన దాయాది అని తెలిసి అతనిని తీసుకొనివచ్చి మూడవ కుమార్తె బాదుషా బీబీనిచ్చి వివాహం జరిపించాడు. తానీషాను గురించి అనేక కథలు ప్రచారంలో

ఉన్నాయి. అతడు సిద్ధిపేటకు చెందిన సాలె కులస్తుడని, అనంతగిరికి చెందిన దూదేకుల కులస్తుడని, అతనిని అక్కన్న మాదన్నలు పెంచి పెద్దచేశారని రకరకాల కథలు ప్రచారంలో ఉన్నాయి. కాని అవి వాస్తవం కాదు. అతడు కుతుబ్‌షాహీ వంశానికి చెందినవాడు. హయత్‌బక్షి బేగంవైపు బంధుత్వం ఉంది. సుల్తాన్ కులీ కుతుబ్‌షా పిన తండ్రి సంతతిలోని వాడు. అతడు వ్యాపార నిమిత్తం గోల్కొండ వచ్చాడు. కాని అతనికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. గోల్కొండ వద్ద నివసిస్తున్న షారాజా కాంఖా అనే సూఫీ గురువు ఉండేవాడు. ఆ గురువు అతనికి తానీషా అంటే బాలయోగి అనే బిరుదు నిచ్చాడట. అబ్దుల్లా కుతుబ్‌షా పెద్ద అల్లుని ప్రోత్సాహంతో తానీషా అబ్దుల్లా చిన్న అల్లుడైనాడు. విచిత్రంగా వివాహం జరిగినట్లే విచిత్రంగానే తానీషా గోల్కొండ సుల్తానయ్యాడు. పెద్దల్లుడు సయ్యదహమ్మద్ సింహాసనానికి వారసుడు కావాలని కలలు కనేవాడు. గోల్కొండ దర్బారులో అబ్దుల్లా తర్వాత అతడే అధికారాలన్నీ చెలాయిస్తూండేవాడు. అబ్దుల్లా పెద్ద కుమార్తె మాసాహెబా అంతఃపుర అధికారాన్నంతటినీ తన ఆధిపత్యంలో ఉంచుకొంది. కాని వారి ప్రవర్తన చాలా మంది అమీరులకు నచ్చలేదు. అబుల్‌హసన్ సౌమ్యుడు. అతడు అందరి అభిమానాన్ని పొందాడు. సయ్యద్ ముజఫర్, మూసాకాన్ అనేవారు అతనిని సుల్తాన్‌ని చేయాలని భావించారు. హసన్‌షా అందరి అభిమానానికి పాత్రుడయ్యాడని గ్రహించిన పెద్దల్లుడు ఈర్ష్య చెందాడు ఇలాంటిస్థితిలో అబ్దుల్లా అనారోగ్యపీడితుడయ్యాడు. మామగారిని చూడటానికి తానీషా బయలుదేరాడు కాని అతనిని రాజభవనంలోకి రాకుండా పెద్దల్లుడు కాపలా పెట్టాడు. తానీషా ముజఫర్ ఇంటికివెళ్లి తన గోడు చెప్పుకున్నాడు. అతడు తొందరపడవద్దని ఓర్పు వహించాలని చెప్పాడు. ఈ స్థితిలో 2-4-1672వ తేదీన అబ్దుల్లా మరణించాడు. వెంటనే ముజఫర్, మూసాఖాన్‌లు తానీషాను సుల్తాన్‌గా ప్రకటించారు. పెద్దల్లుడు, సయ్యద్ హమద్ పెద్దకుమార్తె మాసాహెబా తిరుగుబాటు చేద్దామని ప్రయత్నించారు గాని వారిని ఎవరూ సమర్ధించలేదు వారిని ముజఫర్ బంధించాడు. వారు బందిఖానాలోనే క్రీ.శ.1674లో మరణించారు.. సయ్యద్ అహమ్మద్‌కు తొలిభార్య వలన సయ్యదాలి అనే కుమారుడు కలిగాడు. తండ్రి మరణానంతరం అతడు మొగల్ చక్రవర్తి ఔరంగజేబు నాశ్రయించి మన్సబ్‌దార్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. అబ్దుల్లా మొహర్రం పండుగ ఐదవ రోజున మరణించాడు. తర్వాత మొహర్రం పండుగ 13వ రోజున అంటే 21-4-1672న తానీషా సింహాసనం అధిష్టించాడు. తనను సుల్తాన్‌గా చేసిన సయ్యద్ ముజఫర్‌కు అమీరులు మాడ అనే బిరుదునిచ్చి మీర్జుమ్లా పదవిలో నియమించాడు. మూసాఖాన్ హవల్దార్ ఖాన్‌ఖానాన్ అనే బిరుదుతో ప్రధాన వ్యవహారవేత్తగా నియమింపబడ్డాడు. మాదన్న ముజఫర్ వద్ద పేష్కార్‌గా నియమింపబడ్డాడు. అతనికి అతని సోదరుడు అక్కన్న కార్యదర్శి అయ్యాడు. తమ సింహాసనం అధిష్టించడానికి సహాయపడిన అందరినీ సత్కరించాడు. నజరానాలు ఇచ్చాడు. ఆ విధంగా విచిత్ర పరిస్థితులలో తానీషా గోల్కొండ సింహాసనానికి వచ్చాడు.

ఔరంగజేబు ఫర్మానా: తానీషా సింహాసనానికి రాగానే చక్రవర్తి ఔరంగజేబుకు కానుకలు పంపి తాను మొగల్ సామంతుడనని తెలియపరుచుకొన్నాడు. ఔరంగజేబు అతని వారసత్వాన్ని అంగీకరించి సాలుకు 5 లక్షలు పేష్కస్ చెల్లించాలని దానిని దౌలతాబాద్ ఖజానాలో జమకట్టాలని, శివాజీకి సహాయం చేయరాదని, అల్లా సాక్షిగా అబుల్ హసన్ రాచరికాన్ని అంగీకరించామని తెలియజేస్తూ ఫర్మానా రాయించి అబ్దుల్ రహమాన్ అనే దూత ద్వారా గోల్కొండకు పంపాడు. ఔరంగజేబు తానీషా రాచరికాన్ని గుర్తించాడు. చక్రవర్తి ఫర్మానాకు జవాబుగా తాను ప్రతి సంవత్సరం పేష్కస్ చెల్లిస్తానని జీవితాంతం ఒప్పందానికి కట్టుబడి ఉంటానని జాబు రాసి హజరి 1986 సఫ్రా 16న తేదీన సంతకం చేసి ఖాన్‌జహన్ ద్వారా చక్రవర్తికి పంపుకున్నాడు. దాంతో తానీషా రాచరికం స్థిరపడింది.

మీర్జుమ్లా సయ్యద్ ముజఫర్‌ఖాన్ తొలగింపు క్రీ.శ.1674: మీర్జుమ్లా ముజఫర్‌ఖాన్ రాజ్యంలో సర్వాధికారాలు చెలాయిస్తూ గర్విష్టిగా మారాడు. తానే తానీషాను గద్దెనెక్కించానని ఎవరినీ లెక్కచేయకుండా ప్రవర్తించసాగాడు. క్రీ.శ.12-6-1672లో కర్ణాటక గవర్నర్ నెక్నంఖాన్ మరణించాడు. అతని స్థానంలో తానీషా మూసాఖాన్‌ను నియమించాడు. ఈ కాలానికి ఫ్రెంచి వారు బలవంతులయ్యారు. వారు శాంధోమ్‌ను ఆక్రమించాలని ప్రయత్నాలు చేస్తున్నారు. డీలా అనే ఫ్రెంచి గవర్నర్ మీర్జుమ్లా సయ్యద్ ముజఫర్‌ను సంప్రదించి శాంధోమ్‌ను ఆక్రమించాలని తలచాడు. కాని మూసాఖాన్ శాంధోమ్‌ను ఫ్రెంచి వారి పరం చేయడానికి అంగీకరించలేదు. దాంతో ఫ్రెంచి వారు మూసాఖాన్‌ను ఓడించి శాంధోమ్‌ను ఆక్రమించారు. తరువాత ఫ్రెంచి వారు ముజఫర్ ద్వారా తానీషాకు లక్ష క్రౌన్లు ధనాన్ని పంపారు. ఈ లోపల మూసాఖాన్ చెన్నపల్లి మీర్జుమ్లా ఫ్రెంచి

వారిని శాంథోమ్ నుండి పారదోలటానికి పంపాడు. చెన్నపల్లి సైన్యానికి బాబాసాహెబ్ నాయకత్వం వహించాడు. ఇదంతా తెలిసి ముజఫర్‌ఖాన్ మూసాఖాన్‌ను కర్ణాటకంలో బలపడటం ఇష్టం లేక ముజఫర్ అతనిని వెనక్కి పిలిపించాడు. కాని ఈ లోపలే బాబాసాహెబ్ ఫ్రెంచి వారిని ఓడించి క్రీ.శ.1674లో శాంథోమ్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ముస్తాఫాఖాన్ వద్ద పేష్కారుగా ఉన్న బ్రాహ్మణ గణాంకుడు లెక్కలలో మోసం చేశాడు. అది గ్రహించిన ముజఫర్ లెక్కలు చేసి అతడు 5 లక్షలు కాజేశాడని తేల్చాడు. ఆ గణకుని ఇంటిని సోదా చేయగా 5 లక్షల హొన్నులు బంగారు ఆభరణాలు దొరికాయి. గణకుని ఖైదు చేశాడు. ఈ విధంగా తానీషాకు చెప్పకుండా ముజఫర్ మీర్జుమ్లా హోదాలో సర్వాధికారిగా ప్రవర్తింపసాగాడు. ఇదంతా తానీషా గ్రహించి ముజఫర్‌పై చర్య తీసుకోవాలని తలచాడు. ముజఫర్ వద్ద మాదన్న పేష్కార్‌గా ఉన్నాడు. అతనికి కార్యదర్శిగా అతని సోదరుడు అక్కన్న పనిచేస్తున్నాడు. వారికి ముజఫర్ రహస్యాలన్నీ తెలుసు. ముజఫర్ ఆజ్ఞలను అమలు జరిపేది వారే. కనుక తానీషా వారి నుండి ముజఫర్ సమాచారాన్ని సేకరించాడు. క్రీ.శ.1674లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి అందులో అందరి సమక్షంలో ముజఫర్ ప్రవర్తన అధికార దుర్వినియోగాన్ని ప్రకటించి అతనిని మీర్జుమ్లా పదవి నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించాడు. కాని అతడు అంతకుముందు తాను సింహాసనం అధిష్టించడానికి ఎంతో సహాయం చేసి ఉన్నాడు గనుక అతనికి ఎలాంటి శిక్ష విధించకుండా అంతకు పూర్వం అతడు నిర్వహించిన బక్షీ ఉల్ముల్క్ పదవిలో నియమించాడు. అతని జాగీరులు అతనికే ఉంచబడ్డాయి.

మాదన్నను మీర్జుమ్లాలాగా నియమించటం క్రీ.శ.1674: ముజఫర్ స్థానంలో తానీషా మాదన్నను నియమించాడు. ఇది మాదన్న ఊహించని విషయం. అనుకోకుండా మాదన్న గోల్కొండ రాజ్యానికి మీర్జుమ్లా అయ్యాడు. మాదన్న నిర్వహించిన పేష్కారు పదవి అక్కన్నకు ఇవ్వబడింది. మూసాఖాన్‌ను సైన్యాధికారిగా నియమించాడు. సైనికుల జీతభత్యాలు ప్రభుత్వ ఖజానా నుండి నేరుగా చెల్లించే ఏర్పాట్లు చేశాడు. హఠాత్తుగా తానీషా చేసిన ఈ మార్పులకు సయ్యద్ ముజఫర్ అతని అనుయాయులు ఆశ్చర్యపోయారు.

మాదన్న అక్కన్నల వృత్తాంతం: అక్కన్న మాదన్నలు హనుమకొండలో దస్తు వసూలు చేసే ఉద్యోగస్తుడైన భానోజ పంతులు కుమారులని మెకంజీ రాతప్రతులు తెలుపుతున్నాయి. వారి తల్లి భాగమ్మ. బాల్యం నుండే వారు అరబ్బీ, పర్షియన్ తెలుగు, సంస్కృత భాషలు చదువుకొని రాజఫర్మానాలు చదవటం రాయటం బాగా నేర్చుకున్నారు. వారి తండ్రి అబ్దుల్లా కుతుబ్‌షా యొక్క ఉద్యోగి. కనుక వారు పరిపాలనకు సంబంధించి అన్ని విద్యలు నేర్చి తర్వాత గోల్కొండకు వచ్చి ఉద్యోగాలు సంపాదించారు. క్రీ.శ.1672లో ముజఫర్ మీర్జుమ్లా అయినప్పుడు అతని వద్ద మాదన్న పేష్కారు పదవిని అక్కన్న కార్యదర్శి పదవిని పొందారు. మాదన్న పేష్కారుగా గొప్ప ప్రతిభను చూపి తానీషాకు ప్రీతిపాత్రుడయ్యాడు. తర్వాత క్రీ.శ.1674లో మీర్జుమ్లా అయ్యాడు. దాంతోపాటే అతడు ముజుందార్ పదవిని కూడా నిర్వహించాడు. గోల్కొండ ముస్లిం రాజ్యంలో తొలి ప్రధాన మంత్రి పదవి చేపట్టిన మాదన్న గొప్ప పరిపాలనాదక్షుడు, ప్రతిభావంతుడు. అతడు పరిపాలనా వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించి తన దక్షతను చాటుకున్నాడు. మాదన్న తాను మీర్జుమ్లా అయిన తర్వాత తన బంధువులను ఉన్నతోద్యోగాలలో నియమించాడు. అతని సోదరుడు అక్కన్నను సైన్యాధిపతిగా అంటే సర్‌లష్కర్‌గా నియమించాడు. తర్వాత అతనిని బీజాపూరు రాయబారిగా నియమించాడు. మరొక తమ్ముని పుత్రుడు వెంకన్నకు రుస్తుంరావు అనే బిరుదునిచ్చి సైన్యాధికారిగా నియమించాడు. మరొక సోదరుడు ఆశన్నను వరంగల్లు అమీల్దార్‌గా నియమించాడు. మేనల్లుడు పొదిలి లింగన్నను పూనమల్లి వ్యవహారవేత్తగా నియమించాడు. తర్వాత అతనిని కర్ణాటక గవర్నర్‌గా నియమించాడు. మరొక మేనల్లుడు కంచర్ల గోపన్నను భద్రాచలంపై తరఫ్‌దార్‌గా నియమించాడు. ఇంకా అతని అభిమానులకు కూడా అనేక పదవులిచ్చాడు. ఇబ్రహీం అనే అతన్ని సర్‌ఖేల్‌గా చేసి ఖలిలు ఐ లాహన్‌ఖాన్ అనే బిరుదునిచ్చాడు. ఇతని ఖలీలుల్లాఖాన్ ఫింగ్ హంమ్లా అని కూడా అంటారు. అతడు కర్ణాటక సుబేదార్‌గా నియమింపబడ్డాడు. తర్వాత సర్వసైన్యాధిపతి చేయబడ్డాడు. ఈ పదవిని పొందడానికి మాదన్న అతని బంధువులకు మహమ్మద్ ఇబ్రహీం 11000 హొన్నులు నజరానాగా ఇచ్చాడని వదంతి లేచింది. ఇతడు మాల్ఖేడ్ యుద్ధంలో గోల్కొండ సేనలకు నాయకత్వం వహించాడు. అతడు ముస్లింల మీద ద్వేషం చూపాడని, లంచగొండి, స్వార్థపరుడని, జదునాథ్ సర్కార్, కృష్ణస్వామి అయ్యంగారు, ఆచార్య షేర్వాణీలు రాశారు. కాని అది వాస్తవం కాదు. ముస్లిం రాజ్యంలో ముస్లింలను ద్వేషించి ఎవరూ బతికి బట్టకట్టలేదు. ఆ ప్రవర్తన ఉంటే తానీషా ఎప్పుడో అతనిని పదవి నుండి తొలగించి ఉండేవాడు. ఔరంగజేబు అక్కన్న మాదన్నలను తొలగించమన్నా

కూడా తానీషా తొలగించలేదు. అంటే వారు ఎంత నిజాయితీపరులో, స్వామిభక్తి పరాయణులో చెప్పవసరంలేదు ముస్లింలకు, ముస్లిం సంస్థలకు అనేక దానధర్మాలు చేశాడు. హిందూ దేవాలయాలను పునరుద్ధరించాడు బెజవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతంలోని గుహలకు అక్కన్న మాదన్న గుహలని పేరు పెట్టబడ్డాయి. హిందూ దేవాలయాలకు విరివిగా దానాలు చేసినందువల్ల హిందువులకు ఉద్యోగాలు ఇచ్చినందువల్ల కొందరు ముస్లింలకు సహింపుకాక వారిపై దుష్ప్రచారం చేసి ఉండవచ్చును. కాని వారు మరణించే వరకు తానీషాను అత్యంత భక్తి విశ్వాసాలతో కొలిచారు.

రాజ్యపర్యటన క్రీ.శ.1674-75-75-78: మాదన్న మీర్జుమ్లా అయిన తర్వాత మొగల్ చక్రవర్తికి చెల్లించవలసిన పేష్కస్‌ను పూర్తిగా చెల్లించి వేశాడు. దాంతోపాటే చక్రవర్తికి గోల్కొండ రాజ్యం విధేయంగా ఉంటుందని ఒక పత్రం రాసి పంపాడు. మొగల్ చక్రవర్తితో ఇబ్బందులు రాకుండా ఈ పనిచేశాడు. తర్వాత తానీషాను వెంటబెట్టుకొని రాజ్యాన్ని పర్యటించాడు. రాజ్యంలోని పరిస్థితులను స్వయంగా తెలుసుకొని తగిన చర్యలు తీసుకున్నాడు. కర్ణాటక ప్రాంతంలో ఐరోపా వర్తకులు అనేక అలజడులను సృష్టిస్తున్నారు. మాదన్న, తానీషాలు కర్ణాటకాన్ని పర్యటించారు. మద్రాసు శాంథోమ్, మచిలీపట్టణాలలో విదేశీ వర్తకుల కార్యకలాపాలను పరిశీలించారు. తర్వాత కొండవీడు, కొండపల్లి దుర్గాలను దర్శించారు. మాదన్న ఈ రెండు దుర్గాలను బలపరచాలని తానీషాకు సూచించాడు. అవసరం అయితే కొండపల్లిని రెండవ రాజధానిగా చేసి ఖజానాను అక్కడ దాచాలని సలహా ఇచ్చాడు. మొగలులు ప్రమాద దండయాత్రలు చేస్తే ఈ రెండు దుర్గాలు తమను కాపాడతాయని చెప్పి అక్కడే కొన్నాళ్లు ఉండి ఆ రెండు దుర్గాలకు మరమ్మత్తులు చేయించాడు. కొన్ని నూతన నిర్మాణాలు చేపట్టాడు ఈ పర్యటన సందర్భంలో తానీషా కృష్ణాజిల్లాలోని కూచిపూడిని దర్శించి అక్కడ కూచిపూడి భాగవతుల కళాపాటవాన్ని తిలకించాడు. వారికి కూచిపూడి అగ్రహారాన్ని ఇచ్చాడు. దేశ పర్యటన వలన తానీషాకు తన రాజ్యపు పరిస్థితులన్నీ అర్థమయ్యాయి.

బ్రిటిష్ కంపెనీతో సంబంధాలు: కర్ణాటకంలో నమ్దార్‌ఖాన్, మహమ్మద్ ఇబ్రహీం కలీముల్లా మస్కిమియాన్ అనే సర్దారులు గోల్కొండ ఉద్యోగులుగా ఉండేవారు. వారందరికీ ఐరోపా వ్యాపారులు కానుకలను ఇచ్చేవారు మస్కిమియాన్‌కు 98 1/2 అక్కన్నకు 52 1/2, మాదన్నకు 184, తానీషాకు 495 హొన్నులు కానుకగా ఇచ్చారు. ఇబ్రహీం కుమారుడు సికిందర్. అతనికి నంబర్‌ఖాన్ అని కూడా పేరుంది. అతని వివాహం మద్రాసులో జరిగింది. ఆ సమయంలో అతనికి 400 హొన్నులు చదివించారు. క్రీ.శ.1676 అక్కడి ఉద్యోగులందరికీ నజరానాలు చెల్లించారు. క్రీ.శ.1676లో తానీషా మాదన్నలు కర్ణాటకాన్ని దర్శించినప్పుడు డిలందరాజులు 10 వేలు, ఇంగ్లిష్ వారు 3 వేల హొన్నులు సమర్పించారు. అక్కన్న మాదన్న కుమార్తెల వివాహసమయంలో 100 హొన్నులు కట్నంగా చదివించారు. క్రీ.శ.1677లో స్ట్రెటన్ హోమ్ అనే బ్రిటిష్ అధికారి తమపై విధించిన కౌళ్లలో రాయితీలు ఇవ్వమని అడిగాడు. మాదన్న కౌళ్లను రద్దుచేశాడు. క్రీ.శ.1675లో పొదిలి లింగన్న పూనమల్లి వ్యవహర్తగా నియమింపబడ్డాడు.. ఇంగ్లిష్ వారి సొంతానికి ఉపయోగించే వస్తువులపై పన్నును నెక్నంఖాన్ రద్దు చేశాడు. కాని స్వదేశీ వర్తకుల వస్తువులపై సుంకం వసూలు చేయబడుతోంది. క్రీ.శ.1677లో స్ట్రెటన్ హోమ్ స్వదేశీ వర్తకులపై పన్ను విధించాడు. ఆ ధనాన్ని సెంట్ జార్జికోట మరమ్మత్తులకు ఖర్చుపెట్టాడు. లింగన్న అందుకు కోపించి మద్రాసుపై దాడి చేసి స్వదేశీ వర్తకుల నుండి పన్నులు వసూలు చేసినందుకు క్షమాపణ చెప్పించాడు వారు వాడే వస్తువులపై కూడా పన్నులు వసూలు చేశాడు. ఇంగ్లిష్ వారు సాలుకు 1200 పగోడాలకు శాశ్వత కౌలుతో మద్రాసును సంపాదించారు. ట్రిప్లికేనును 50 పగోడాలకే సొంతం చేసుకున్నారు. కాశీ వీరన్న అనే అతడు 1300 పగోడాలకు శాంథోమ్‌ను కౌలుకు తీసుకున్నాడు. లింగన్న అది చాలా తక్కువ అద్దె అని చెప్పి మద్రాసులో గోల్కొండ అధికారి ఉండి సుంకాలు వసూలు చేసే ఏర్పాట్లు చేస్తామని అన్నాడు. అంతేగాక మద్రాసులోకి వచ్చే బియ్యం, గచ్చు సున్నం, ఇటుకలు అన్నీ పూనమల్లి ద్వారా రావాలని ఆంక్షలు విధించాడు పూనమల్లి నుండి వచ్చేటప్పుడు అతడు అక్కడ సుంకాలు వసూలు చేస్తాడు. ఇవన్నీ చూసి లింగన్న వల్ల తమకు చాలా నష్టం వస్తుందని ఇంగ్లిషు వారు భావించారు. అందువల్ల వారు లింగన్న చర్యలను తానీషాకు తెలిపారు క్రీ.శ.1681 జూన్‌లో గైఫర్డ్ ఇంగ్లిష్ గవర్నర్‌గా వచ్చాడు. అతడు లింగన్న విధించిన ఆంక్షలను కొన్నింటిని ఆమోదించాడు. క్రీ.శ.1682లో లింగన్న కర్ణాటక గవర్నర్‌గా నియమింపబడ్డాడు. అతని స్థానంలో అబ్దుల్ నబీఖాన్ నియమింపబడ్డాడు. అయినప్పటికీ మద్రాసులోని ఇంగ్లిష్ కంపెనీ వారిపై చర్యతీసుకొనే అధికారం

లింగన్నకే ఇవ్వబడింది. నబీఖాన్ లింగన్న ఆదేశాల ప్రకారం ఇంగ్లిషు వారియందు కఠినంగా వ్యవహరించి వారిని అదుపులోకి తెచ్చాడు. క్రీ.శ. 1684లో ఫోర్డు అనే అతడు ఇంగ్లిష్ కంపెనీకి అధికారిగా వచ్చాడు. అతడు తానీషా నుండి కుతుబ్‌షా నాణేలకు సరితూగే నాణేన్ని బ్రిటిష్ వారు స్వతంగా ముద్రించి విడుదల చేసే అధికారాన్ని పొందాడు. కుతుబ్‌షా స్వదేశీ వ్యాపారులకు కొన్ని రాయితీలు కల్పించాడు. మాల్గేడ్ యుద్ధం వరకు బ్రిటీష్ కంపెనీ వారు తానీషాకు విధేయులుగా ఉన్నారు. మాల్గేడ్ యుద్ధంలో తానీషా పరాజయం పొందాడని తెలియగానే వారు సుంకాలు కట్టడం మానివేశారు. మాల్గేడ్ యుద్ధం తర్వాత అక్కన్న మాదన్నలు హత్య గావింపబడ్డారు. ఆ తర్వాత లింగన్నను కర్ణాటక గవర్నర్‌గా తీసిపారవేశారు. అది తెలిసి మద్రాసులోని ఇంగ్లిష్ వారు కౌన్సిల్ మీటింగ్ జరుపుకొని తమ సంతోషాన్ని తెలుపుకొనే రిజల్యూషన్ రాసుకున్నారట. అపుడు ఇంగ్లిష్ గవర్నర్ Elihu Yale. మొత్తం మీద మద్రాసులోని ఇంగ్లిష్ వారు, పులికాట్‌లోని ఫ్రెంచి వారు వీలయినప్పుడల్లా సుంకాలు, అద్దెలు ఎగగొట్టి గోల్కొండ రాజ్యానికి ఇబ్బందులు కలుగజేశారు.

తానీషా కాలంలో రైతులపై శిస్తులు తగ్గించబడ్డాయి. శిస్తు వసూలు చేయడానికి నెలసరి జీతాలు తీసుకొని ఉద్యోగులను నియమించారు. వారు దళారీలలాగా కాకుండా రైతుల వద్ద ఎంత వసూలు చేయాలో అంతే చేశారు. అందువల్ల రైతులు ఎలాంటి బాధలు లేకుండా జీవించారు. గోల్కొండ రాజ్యాలలో అగ్రహారాలు ఎక్కువ. అందువల్ల ప్రభుత్వ ఆదాయం తగ్గిపోయింది. కనుక దేవాదాయ అగ్రహారాల మీద కొద్దిగా శిస్తు విధించబడింది. గనుల పరిశ్రమ అభివృద్ధి చేయబడింది. గనుల నుండి ఆదాయం పెంచబడింది. గనుల కార్మికులకు జీతాలు పెంచబడ్డాయి. మొత్తం మీద మాదన్న రాజ్యపు ఆదాయాన్ని పెంచాడు.

ఆంధ్రదేశంలో శివాజీ క్రీ.శ.1677-78: దక్కను రాజకీయాలలో షాజహాను కాలంలో క్రీ.శ.1444 నుండి శివాజీ సాహసకృత్యాలు ప్రారంభమయ్యాయి. క్రీ.శ.1672లో తానీషా గోల్కొండ సింహాసనం అధిష్టించేనాటికే శివాజీ దక్కను రాజకీయాలలో అత్యంత ప్రముఖమైన రాజుగా ఎదిగాడు. అదే సంవత్సరంలో బీజాపూర్‌లో ఆలీ ఆదిల్షా మరణించి బాలుడైన సికిందర్ ఆదిల్షా సింహాసనానికి వచ్చాడు. బీజాపూరు గోల్కొండ ఉభయరాజ్యాలలో నూతన సుల్తాన్‌లు సింహాసనానికి వచ్చినందువల్ల ఆ రాజ్యాలను కొల్లగొట్టి వారిని బెదిరించి ధనం వసూలు చేసుకోవచ్చునని శివాజీ భావించి ఆ రాజ్యాలపై క్రీ.శ.1672లో దాడిచేయగా వారు హడలిపోయి బీజాపూరు 3 లక్షల హొన్నులు, అబుల్‌హసన్ తానీషా కుతుబ్‌షా 20 లక్షల పగోడాలు చెల్లించి మరాఠా సైన్యాన్ని పంపివేసినట్లు ఆచార్య షేర్వాణీ రాశారు. 1674 జూన్ 6వ తేదీన శివాజీ రాయఘడ్‌లో ఛత్రపతి అనే బిరుదు వహించి పట్టాభిషేకం చేసుకొని తన రాజ్యానికి స్వరాజ్యం అని పేరు పెట్టారు. దాంతో దక్కను రాజకీయాలలో స్వరాజ్యం అనే నూతన మరాఠా రాజ్యం ఏర్పడింది. ఇక్కడ ఛత్రపతి పేరుతో పట్టాభిషేకం జరుపుకొనే కాలంలోనే గోల్కొండలో మాదన్న సూర్యప్రకాశరావు అనే బిరుదుతో గోల్కొండ రాజ్యానికి మీర్జుమ్లా పదవిలో తానీషా చేత నియమింపబడ్డాడు. శివాజీ, మాదన్నలు ఏక కాలంలో అంటే క్రీ.శ.1674లో నూతన పదవులను అధిరోహించారు. స్వరాజ్య అవతరణానంతరం శివాజీ బీజాపూరు, గోల్కొండలతో కలసి మొగలాయులను ఎదిరించడానికి ప్రయత్నించాడు. మొగలులకు, బీజాపూరులకు జరిగిన యుద్ధాలలో శివాజీ బీజాపూరుకు తాను సహాయం చేసేటట్లు ఒప్పందం కూడా చేసుకున్నాడు. కాని బీజాపూరు రాజ్యం శివాజీని నమ్మలేదు. కనుక అతడు ఆ ప్రయత్నం విరమించి కర్ణాటకంలో తన రాజ్యాన్ని విస్తరించుకోవాలని భావించాడు. అందుకు అతడు 1677లో గోల్కొండ తానీషాతో ఒక ఒప్పందం చేసుకొన్నాడు. కర్ణాటకంలో తన రాజ్య విస్తరణకు పూనుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. అతని తండ్రి షాజిభోన్సెలె బీజాపూరు సుల్తాన్‌వద్ద సేనానిగా పని చేసి కర్ణాటకంలో కోలారు, బెంగుళూరు, జింజి, తంజావూరు, ఆర్ని మొదలైన ప్రాంతాలను జయించాడు. తండ్రి మరణానంతరం అతని మారు తమ్ముడు ఏకోజి ఆ ప్రాంతాలకు అధిపతి అయ్యాడు. అతని వద్ద రఘునాథనారాయన్ హనుమంతె అనే ఉన్నతోద్యోగి ఉండేవాడు. అతనిని ఏకోజి తన ఆ స్థానం నుండి తరిమివేశాడు. అతడు శివాజీ వద్దకు చేరి ఏకోజి తండ్రి రాజ్యాన్ని సరిగా పాలించడం లేదని చెప్పాడు. కనుక తండ్రి రాజ్యంలో తన వాటా తీసుకోవాలని భావించాడు. అది మొదటి కారణం. దాంతోపాటే కర్ణాటకంలోకి బీజాపూర్ రాజ్యవిస్తరణను అరికట్టి మరాఠా రాజ్యాన్ని విస్తరించాలని కూడా భావించాడు. అది రెండవ కారణం. తన ఆశయాలు నెరవేర్చుకోవటానికి బీజాపూరుతో పోరాడాలి. కనుక అందుకు గోల్కొండ రాజ్యం సహాయంగా ఉంటే తన కార్యం సులభమవుతుందని భావించి క్రీ.శ.1677లో తానీషాతో ఒప్పందం చేసుకున్నాడు. శివాజీతో ఒప్పందం జరగటంలో మీర్జుమ్లా

మాదన్న కీలకపాత్ర వహించాడు. శివాజీ ఒప్పందం చేసుకోవాలని కబురు పంపగానే మాదన్న అంగీకరించి శివాజీని గోల్కొండ రాజ్యానికి ఆహ్వానించాడు. శివాజీ హైదరాబాద్‌ను దర్శించి తానీషాతో సమావేశమయ్యాడు మాదన్న సలహాతో తానీషా శివాజీతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఆ ఒప్పందం ప్రకారం కర్ణాటకంలో జరిగే యుద్ధాల ఖర్చు కింద ఒక రోజుకు తానీషా శివాజీకి మూడువేల హొన్నులు చెల్లించాలి. కర్ణాటకంలో జయించిన ప్రాంతాలలో శివాజీ తండ్రికి చెందిన భాగాలు తప్ప మిగిలిన ప్రాంతాలన్నీ ముఖ్యంగా తెలుగు ప్రాంతాలు తానీషాకు అప్పగించాలి. ఈ ఒప్పందం కుదిరిన తర్వాత శివాజీ కర్ణాటకలపై దండెత్తి సిరి, కోలారు, ఆర్కాటు బెంగుళూరు, జింజి ప్రాంతాలను జయించి తమ్ముని రాజధాని అయిన తంజావూరును జయించాడు. తమ్ముడు అన్నను శరణువేడగా దయదలచి అతడే తన ప్రతినిధిగా తంజావూరును ఏలుకోవడానికి అంగీకరించాడు. తర్వాత బళ్లారిపై దాడి చేశాడు. తర్వాత కోపల్‌ను జయించి కృష్ణా, తుంగభద్రా మధ్యభాగాన్ని కూడా తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. బీజాపూరు సేనానులు నజీర్ అహమ్మద్ షంషేర్‌ఖాన్‌లు శివాజీని ఎదిరించలేదు. సాలుకు 40 లక్షల హొన్నుల ఆదాయం వచ్చే భూభాగం అతని పరమైంది. ఆ తర్వాత అతడు తూర్పుగా తిరిగి ఆంధ్ర ప్రాంతాలపై దండెత్తాడు. ఈ విధంగా అనుకోకుండా శివాజీ ఆంధ్రదేశంలో అడుగుపెట్టాడు.

ఆంధ్ర ప్రాంతాలను జయించటం క్రీ.శ.1678: ఆనాడు ఆంధ్ర ప్రాంతాలన్నీ గోల్కొండ రాజ్యంలో భాగాలుగా ఉన్నాయి. గోల్కొండతో ఒప్పందం ఉన్నప్పటికీ శివాజీ ఆంధ్రదేశంలో అనేక కోటలను జయించాడు కర్నూలు, నెల్లూరు, సర్వేపల్లి మొదలైన కోటలను జయించి శ్రీశైలం చేరాడు. శ్రీశైల క్షేత్రం పరిస్థితి బాగాలేదు కనుక అతడు కొన్ని శిథిల కట్టడాలను పునర్నిర్మాణం చేసి కొన్నాళ్లు నివసించాడు. తర్వాత అతడు శ్రీశైల రక్షణకు కొంత సైన్యాన్ని నిలిపి క్రీ.శ.1678లో తన రాజ్యానికి వెళ్లిపోయాడు. శివాజీ కర్ణాటక దండయాత్రలో కన్నడ తమిళ, తెలుగు ప్రాంతాలపై దాడుల చేసి దాదాపు నూరుకోటలను జయించాడు. ఇది శివాజీ జీవితంలో అద్భుత దండయాత్ర. కర్ణాటక దండయాత్రలో అతడు జయించిన ప్రాంతాలలో చాలా భాగాలు తానీషాకు ఇవ్వాలి కాని అతడు ఇవ్వలేదు. ఈ దండయాత్రలో శివాజీ ఒక దెబ్బకు నాలుగు పిట్టలను కొట్టాడని ఆచార్య షేర్వాణీ వ్యాఖ్యానించారు. మొదటిది బీజాపూర్ ప్రాంతాలను ఆక్రమించి దాని విస్తరణ అరికట్టాడు. రెండవది తన తమ్ముడు ఏకోజీని లొంగదీసి తన అధిపత్యం కిందకు తెచ్చుకున్నాడు. మూడవది తనకు ఖర్చు లేకుండా గోల్కొండ రాజ్యం ఖర్చుతో ఈ ప్రాంతాలను జయించి గోల్కొండకు ఏమీ ఇవ్వలేదు. అంతేగాక గోల్కొండ రాజ్యంలో భాగాలుగా ఉన్న కొన్ని తెలుగు ప్రాంతాలను కూడా ఆక్రమించాడు. నాల్గవది కర్ణాటకంలో మొగలులకు స్థానం లేకుండా చేశాడు అంతకు పూర్వం మీర్జుమ్లా జయించిన ప్రాంతాలు మొగలు సామ్రాజ్యానికి చెందాలని ఔరంగజేబు వాదించేవాడు ఇప్పుడు శివాజీ మొగలులకు అలాంటి అవకాశం లేకుండా చేశాడు.

మాదన్న తన తప్పును సరిదిద్దుకోవడం: శివాజీ ఒప్పందాన్ని తోసివేసి గోల్కొండ రాజ్యపు ఖర్చుతో జయించిన ప్రాంతాలన్నీ అతనే సొంతం చేసుకొన్నందువల్ల మాదన్నపై నిందపడింది. ముస్లిం సరదారుల హిందువు, హిందువుకు సహాయం చేశాడని నిందవేశారు. అందుకు ఖిన్నుడైన మాదన్న తగిన చర్యలు చేపట్టాడు వెంటనే సైన్యాలను పంపి శ్రీశైలం, సర్వేపల్లి, నెల్లూరు ప్రాంతాలలో ఉన్న శివాజీ సైన్యాన్ని పారదోలి ఆ ప్రాంతాలను తిరిగి గోల్కొండ ఆధిపత్యం కిందికి తెచ్చి తన తప్పును సరిదిద్దుకున్నాడు. ఆ తర్వాత ఇబ్రహీం లష్కర్, తన మేనల్లుడు లింగన్నను పంపి నెల్లూరు, జింజిలను జయించమన్నాడు. కాని ఆ కోటలు స్వాధీనం కాలేదు.

బీజాపూర్ రాజ్యానికి సహాయం చేయడం: 1679లో మొగల్ సైన్యం బీజాపూరు మీదకు దండెత్తింది బీజాపూరుకు సహాయంగా తానీషా మాదన్నలు 20 వేల సైన్యాలను సహాయంగా పంపారు. కాని బీజాపూర్ పేష్వా అయిన పహిల్వాన్ ఖాన్ అనే సరదారు కుట్రవల్ల బీజాపూర్ గోల్కొండ సైన్యంలో అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి అందువల్ల గోల్కొండ సైన్యం తిరిగి వచ్చింది. గోల్కొండ సైన్యం మరలిపోగానే పహిల్వాన్ ఖాన్ మొగలుల సేనతో కలసిపోయి నల్‌దుర్గ్, గుల్‌బర్గ, ఆకలు కోటలను జయించాడు. కాని మొగల్ సేనానులైన దిలీర్ ఖాన్, బహదూర్ ఖాన్‌ల మధ్య విభేదాలు వచ్చి యుద్ధం ఆగిపోయింది. బీజాపూర్ రాజ్యం నష్టం నుండి బయటపడింది ఈ సమయంలో శివాజీ కూడా బీజాపూర్ రాజ్యానికి సహాయం చేశాడు. అందుకు ప్రతిఫలంగా తాను కర్ణాటకంలో బీజాపూర్ రాజ్యానికి చెందినవి, తాను జయించినవి అయిన బళ్లారి, కోపల్‌ను తనకు స్థిరపరచమని కోరాడు అతని కోర్కెను బీజాపూర్ రాజ్యం అంగీకరించింది. ఔరంగజేబు చక్రవర్తి బహదూర్‌ఖాన్‌ను వెనుక్కు పిలిపించి

అతని స్థానంలో దిలేర్‌ఖాన్‌ను దక్కను సుబేదారుగా నియమించాడు. దిలేర్‌ఖాన్ బీజాపూర్‌కు సహాయం చేసినందుకు తానీషాను శిక్షించదలచాడు. అందుకు సాకుగా రెండు కారణాలు చూపుతూ వార్త పంపాడు. తానీషా క్రీ.శ.1677లో శివాజీకి సహాయం చేయడం మొదటి తప్పుగా చూపాడు. షేక్ మిన్హాజ్ అనే అతడు మొగల్ సరదారుడు. అతడు మొగల్ కొలువును వదలి గోల్కొండ కొలువులో చేరాడు. అతనికి తానీషా ఆశ్రయం ఇవ్వడం రెండవ తప్పుగా చూపాడు. అందుకుగాను శిక్షగా కోటి రూపాయలు చెల్లించాలని, లేకపోతే గోల్కొండపై దండెత్తగలనని తెలిపాడు. కాని తానీషా ధనం చెల్లించలేదు. దాంతో దిలేర్‌ఖాన్ గోల్కొండ రాజ్యంపై దండెత్తాడు. యుద్ధ విరమణ చేసినట్లయితే 5 లక్షల రూపాయలు నష్టపరిహారంగా ఇస్తానని రాయబారం పంపాడు. కాని దిలేర్‌ఖాన్ అంగీకరించలేదు. యుద్ధం మొదలైంది. రెండు వైపులా 6 గురు సేనానులు, 7 వందల మంది సిపాయిలు, 7 ఏనుగులు మరణించాయి. గోల్కొండ సేనానులు సంజార్‌ఖాన్, షేక్ మిన్హాజ్, రుస్తుంరావ్ సాహసంగా పోరాడి మొగల్ సైన్యాన్ని ఓడించి తరిమివేశారు. మొగల్ సైనికులకు ఆహార పానీయాలు కూడా లభించలేదు. అందువల్ల వారు వెనుదిరిగి గుల్బర్గా వెళ్లిపోయారు.

బీజాపూర్ రాజ్యానికి సహాయం: ఈ యుద్ధాల తర్వాత సలాబత్‌ఖాన్ అల్లుడైన సిద్దిజోహన్ ఖాన్ మరొక సర్దారు సిద్ధి మసూద్‌ఖాన్ బీజాపూర్ బాలసుల్తాన్ సికిందర్‌షాకు సహాయం చేసి అతని రాజ్యాన్ని రక్షించమని తానీషాను కోరారు. అందుకు స్పందించి తానీషా బీజాపూర్ రాజ్య పరిస్థితులను సరిదిద్దటానికి నడుం కట్టాడు. మొగలులతో చేరిపోయిన బీజాపూర్ పీష్వా పహిల్వాన్ ఖాన్‌ను తొలగించి అతని స్థానంలో సిద్ధిమసూద్‌ఖాన్‌ని పీష్వాగా నియమించాడు. ఆర్థికంగా దిగజారిపోయి ఉన్న బీజాపూరు రాజ్యానికి 6 లక్షల రూపాయలు ధనసహాయం చేయటానికి తానీషా అంగీకరించాడు. బీజాపూర్ రాజ్యంలో అక్కన్నను గోల్కొండ రాయబారిగా తానీషా నియమించాడు. తర్వాత ఉభయ రాజ్యాలు కలిసి మొగల్ చక్రవర్తి ఔరంగజేబుతో శాంతి సంధి చేసుకోవాలని నిర్ణయించారు.

సిద్ధి మసూద్‌ఖాన్ దిలేర్‌ఖాన్‌తో సంధి చేసుకోవటం: కాని తానీషా నిర్ణయానికి వ్యతిరేకంగా సిద్ధి మసూద్‌ఖాన్ మరొక సరదారు కరీంఖాన్‌లు కలసి గుల్బర్గాలో ఉన్న మొగల్ సుబేదార్ సేనాధిపతి అయిన దిలేర్‌ఖాన్‌తో సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం బీజాపూరు రాజ్యం శివాజీకి వ్యతిరేకంగా మొగలులతో కలిసి యుద్ధం చేయాలి. సికిందర్ ఆదిల్‌షా సోదరి బాదుషాబీబీని మొగల్ రాజకుమారునకిచ్చి వివాహం చేసి బీజాపూర్ రాజ్యం మొగల్ వంశానికి బంధువుగా మారాలి. ఈ సంధితో బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు మళ్లీ దూరం అయిపోయాయి. తానీషా తాను బీజాపూర్ రాజ్యానికి సహాయం చేస్తానన్న 6 లక్షల రూపాయలు ఆపివేశాడు. తన రాయబారి అక్కన్నను గోల్కొండకు పిలిపించుకున్నాడు. దాంతో బీజాపూర్ రాజ్యం సైనికులకు జీతాలు ఇవ్వలేని దుస్థితిలో పడిపోయింది.

శివాజీ మరణం-దక్కను రాజకీయ పరిస్థితిలో పెనుమార్పు: పరిస్థితులలో క్రీ.శ.1680 ఏప్రిల్ 3వ తేదీన శివాజీ మరణించాడు. శివాజీ మరణం దక్కను దేశ చరిత్రను సమూలంగా మార్చివేసింది. శివాజీ మరణం నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయమే చివరకు బీజాపూర్, గోల్కొండ రాజ్యాల పతనానికి దారి తీసింది. శివాజీ మరణం తర్వాత అతని కుమారుడు శంభాజీ రాజ్యానికి వచ్చాడు. అతడు యుద్ధవీరుడే గాని దుర్వ్యసనపరుడు. ఇదే సమయంలో రాజపుత్ర యుద్ధాలలో ఔరంగజేబుకు, అతని పెద్దకుమారుడు అక్బర్‌కు అభిప్రాయభేదాలు వచ్చి తండ్రి నుండి విడిపోయి మహారాష్ట్ర దేశం చేరి శంభాజీని ఆశ్రయించాడు. అక్బర్ తాను, శంభాజీ, బీజాపూర్, గోల్కొండ రాజ్యాలు కలసి సంయుక్తంగా తన తండ్రిని ఎదిరించి పదభ్రష్టుడిని చేయాలని కోరాడు. అక్బర్ రాకుమారుడు అక్కడే కొన్నాళ్లు ఉన్నాడు. తన కుమారునికి ఆశ్రయం ఇచ్చినందుకు ఔరంగజేబు శంభాజీని శిక్షించాలని రాజపుత్రులతో సంధి చేసుకొని యుద్ధ విరమణ చేసి పెద్ద సైన్యంతో 22-3-1682లో దక్కను చేరి ఔరంగాబాదులో మకాం పెట్టాడు. తర్వాత 13-11-1682లో అహమ్మద్‌నగర్ చేరాడు. తండ్రి రాక తెలిసి అక్బర్ రాకుమారుడు పర్షియా వెళ్లిపోయాడు. ఔరంగజేబు శివాజీ స్వరాజ్యాన్ని ముట్టడించాడు. కాని మరాఠా సేనలు ఔరంగజేబును ఓడించాయి. నాలుగు సంవత్సరాలు ప్రయత్నించినా శంభాజీ లొంగలేదు. ఆ సమయంలో మొగలులకు సహాయం రావలసిందిగా బీజాపూర్ సేనాని సయ్యద్ మక్దూమ్ షార్జాఖాన్ పేరుతో గోల్కొండ బీజాపూరులకు ఫర్మానా పంపబడింది. కాని వారు మొగలులకు సహాయంగా సైన్యాలను గాని, ధనాన్ని గాని పంపలేదు. పైగా వారు శంభాజీకి రహస్యంగా సహాయం చేశారు. బీజాపూర్, గోల్కొండ సుల్తాన్‌లు శంభాజీకి

ధన సహాయం చేయడం వాస్తవమని మొగల్ చారులకు తెలిసింది. కనుక బీజాపూర్ గోల్కొండ రాజ్యాలను నాశనం చేయనిదే మరాఠా రాజ్యాన్ని ధ్వంసం చేయుట సాధ్యం కాదని ఔరంగజేబే గ్రహించాడు. కనుక ముందు గోల్కొండ, బీజాపూర్ రాజ్యాలను అంతం చేసి తన సామ్రాజ్యంలో కలిపేయాలని నిర్ణయించాడు.

దక్కను రాజ్యాలను అంతం చేయటానికి గల కారణాలు: దక్కను రాజ్యాలను అంతం చేయటానికి రెండు కారణాలున్నాయి. ఈ రాజ్యాలు షియామతానికి చెందినవి. ఔరంగజేబు పరమత ద్వేషి, హిందువులను ద్వేషించుటమే గాక, సున్నీలు, ముస్లింలను కూడా ద్వేషించేవాడు. అతడు సున్నీ మతస్థుడు. సున్నీమతం తప్ప ఇతర ముస్లిం శాఖ కూడా ఉండకూడదని భావించేవాడు. సున్ని మతస్థుడుగా షియారాజ్యాలైన బీజాపూర్, గోల్కొండలను అంతం చేయడం తన పవిత్ర కర్తవ్యంగా ఔరంగజేబు భావించాడు. ఇది మొదటి కారణం ఔరంగజేబు మత దురహంకారియేగాక గొప్ప సామ్రాజ్య వాది. భారతదేశాన్నంతటినీ జయించి ఇస్లామిక్ దేశంగా మార్చాలనే ధృడమైన కోరిక గలవాడు. దానినే దార్‌సలాం అని అనే వారు. కనుక తన సామ్రాజ్యవాదనలో భాగంగా ఈ రెండు షియా రాజ్యాల నిర్మూలనకు పూనుకున్నాడు. ఇది రెండవ కారణం. ఈ రెండు రాజ్యాలు హిందువులకు ఉన్నతోద్యోగాలు ఇచ్చి ఆదరిస్తున్నాయి. అది కూడా ఔరంగజేబు సహించలేకపోయాడు. అది మూడవ కారణం. గోల్కొండ రాజ్యాన్ని అంతం చేయటానికి మరికొన్ని ప్రత్యేక కారణాలున్నాయి. గోల్కొండ రాజ్యంలో మాదన్న మీర్జుమ్లా పదవిని నిర్వహిస్తున్నాడు. తర్వాత మహమ్మద్ ఇబ్రహీం హోదా తగ్గించబడింది. అతను నిర్వహించే మజుందార్ పదవిలో క్రీ.శ.1684లో మాదన్న సోదరుడు అక్కన్న నియమించబడ్డాడు. అదే కాలంలో మాదన్న మేనల్లుడు లింగన్న చక్‌నాయకపల్లిని జయించి తానీషా అభిమానానికి పాత్రుడై కర్ణాటక సుబేదారుగా నియమింపబడ్డాడు. అప్పటి నుండి గోల్కొండ రాజ్య పరిపాలన యావత్తూ ఈ సోదరుల చేతుల మీదుగా జరుగుతోంది. వారి ఔన్నత్యం కొందరు ముస్లింలకు కంటగింపు అయింది. ముఖ్యంగా సయ్యద్ ముజఫర్ అతని కుమారుడు సయ్యద్ హషింలు ఔరంగజేబు వైపు చేరి మాదన్న, అక్కన్నలపై అనేక చాడీలు చెప్పారు. వారు బ్రాహ్మణులని, మహమ్మదీయులను హింసిస్తున్నారని రాజ్యంలో అన్ని ఉన్నత పదవులలో హిందువులను నియమిస్తున్నారని, లంచగొండులని, ముస్లింలకు ఉద్యోగాలివ్వటానికి లంచాలు వసూలు చేయిస్తున్నారని గోల్కొండ రాజ్యమంతటా దేవాలయాలు పునరుద్ధరిస్తున్నారని ఇస్లాం మతాన్ని దూషిస్తున్నారని, ఒకప్పుడు మీరు మా దేవాలయాలు పడగొట్టారని, ఇప్పుడు మా వాళ్లు మసీదులు పడగొడతారని అన్నాడని, హిందూముస్లింలకు తగాదా వచ్చినట్లయితే హిందువులను వదిలి వేసి ముస్లింలకు శిక్షలు వేస్తున్నారని ఆ విధంగా తగాదా పడిన హిందూముస్లింల తగాదాలలో జోక్యం చేసుకొని ముస్లిందలది తప్పని చేతులు నరికించాడని, వారిపాలనలో ముస్లింలు అనేక బాధలు పడుతున్నారని, తానీషా వారి చేతులో కీలుబొమ్మ అయ్యాడని ఔరంగజేబుకు ఎక్కించారు గోల్కొండ రాజ్యం సిరిసంపదలతో తులతూగుతోంది. గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించినట్లయితే అనంతమైన సిరిసంపదలు తన వశమవుతాయని మహమ్మద్ సయ్యద్ ఔరంగజేబుకు ఆశలు కల్పించారు. ఔరంగజేబు గత 20 సంవత్సరాల నుండి చేస్తున్న యుద్ధాల వల్ల అతని ధనాగారం ఖాళీ అయింది. గోల్కొండ రాజ్యాన్ని జయిస్తే ఆ రాజ్యపు ధనరాసులు తన ఆర్థిక లోటును పూడుస్తాయని భావించాడు. అంతేగాక గోల్కొండ రాజ్యానికి, పర్షియాకు స్నేహ సంబంధాలున్నాయి. వారు ఉభయులు షియా మతస్థులు. అటు ఇరాన్‌కు చెందిన కాందహార్ మీద మొగలులు దండెత్తారు. ఇటు దక్కను రాజ్యాల మీదా దండెత్తుతున్నారు. అవసరమైతే వారు ఒకరికొకరు సహాయపడటానికి సిద్ధపడ్డారు. ఇరాన్ సఫ్వి వారి మధ్య స్నేహాన్ని బలపరిచాడు. ఆ రాజ్యాలలో వారు తమ రాయబారులను కూడా నియమించుకున్నారు. ఈ రాజ్యలు హిందూ రాజ్యమైన శివాజీ రాజ్యానికి సహాయం చేస్తున్నాయి. అది పెద్ద నేరంగా భావించాడు. ఈ కారణాల వల్ల ఔరంగజేబు బీజాపూర్, గోల్కొండ రాజ్యాలను అంతం చేయటానికి పూనుకున్నాడు.

బీజాపూర్‌పై దండయాత్ర క్రీ.శ.1685-86: ఔరంగజేబు శంభాజీతో పోరాడే సమయంలో బీజాపూర్ గోల్కొండ రాజ్యాల విషయాలు చూడటానికి బహుదూర్‌ఖాన్, ఖాన్‌జహాన్ కోకల్‌తాష్‌లను నియమించాడు. ఇప్పుడు ఔరంగజేబు కుమారుడు ఆజమ్‌ను బీజాపూర్ రాజ్యంపై దండెత్తడానికి నియమించాడు. అతను 14-7-1685వ తేదీన బీజాపూర్ రాజ్యంపై దండెత్తాడు. అదే సమయంలో బీజాపూర్‌కు సహాయం చేయరాదని తానీషాను ఆదేశిస్తూ ఔరంగజేబు తానీషాకు కబురు చేశాడు. ఈ లోపల బీజాపూర్ రాయబారి గోల్కొండ సైన్యాన్ని బీజాపూర్‌కు సహాయంగా పంపాడు. కాని అది తెలిసి బహరామంద్‌ఖాన్ అనే అతని నాయకత్వంలో మొగల్

సైన్యం బయలుదేరి మార్గమధ్యంలోనే గోల్కొండ సైన్యాన్ని ఓడించి వారిని బీజాపూర్ చేరకుండా చేశాడు. ఆ సమయంలో వారి వద్ద ఒక లేఖ దొరికింది. అందులో ఇబ్రహీం సర్‌లష్కర్ నాయకత్వంలో 40 వలే గోల్కొండ సేన బీజాపూర్‌కు సహాయంగా పంపబడుతుందని ఉంది. ఆ లేఖ ఔరంగజేబుకు సమర్పించబడింది. తన ఆజ్ఞను ధిక్కరించి బీజాపూర్‌కు సైన్యం పంపినందుకే మండిపడుతున్న ఔరంగజేబు ఆ లేఖను చదివి ఆగ్రహావేశుడై తన కుమారుడు షా అలం రాకుమారుని గోల్కొండ రాజ్యంపై దండెత్తమని ఆదేశించాడు. మజ్జం రాకుమారునకు షా ఆలం అని మరొక పేరు కూడా ఉంది.

అబుల్‌హసన్ తానీషా గర్జింపు: బీజాపూర్‌పై మొగల్ సైన్యం విరుచుకుపడటం తెలిసి తానీషాకు ఔరంగజేబుపై ఎక్కడలేని ఆగ్రహం కలిగింది. బీజాపూర్ సుల్తాన్ బాలుడు. సికిందర్ ఆదిల్‌షా వంటి బాలునిపై మొగల్ చక్రవర్తి దండయాత్ర చేయడం తుచ్ఛమైన పని అని, తాను ఇటువైపు నుండి, శంభాజీ అటువైపు నుండి మొగలులను ఎదుర్కొంటూ ఔరంగజేబు బీజాపూర్ రాజ్యాన్ని ఎలా ఆక్రమించగలడో చూస్తాననీ గర్జించాడట. అంతేగాక తానీషా ఖలీలుల్లా నాయకత్వంలో 40 వేల సైన్యాన్ని బీజాపూరుకు సహాయంగా పంపాడు. ఆ సైన్యం మార్గమధ్యంలోనే ఆపివేయబడింది. అప్పుడే తానీషా మొగల్ దర్బారులోని తన రాయబారికి పంపిన లేఖ వారికి దొరికింది. అది ఔరంగజేబుకు సమర్పించబడింది. అది తెలిసి ఔరంగజేబు మండిపడి గోల్కొండ రాజ్యంపైకి మొగల్ సేనను పంపాడు. అంతకుముందే చక్రవర్తి తానీషా బీజాపూర్‌కు సహాయంగా వస్తాడని ఊహించాడు. తాను అనుకున్నట్లే తానీషా యుద్ధంలోకి దిగాడు. కనుక ఔరంగజేబు ఏక కాలంలో రెండు రాజ్యాలపై సమరం సాగించాలని నిర్ణయించి మవుజం లేక మజ్జం లేక షా ఆలం రాకుమారుని నాయకత్వంలో పెద్దసేనను గోల్కొండ రాజ్యంపైకి పంపాడు. అతనితోపాటు మల్తిఫ్‌ఖాన్, బహుదూర్‌ఖాన్, ఎతెబర్‌ఖాన్, సయ్యద్ అబ్దుల్లాఖాన్, బాహియా, సబ్దర్‌ఖాన్, నిసార్‌ఖాన్ మొదలైన సరదారులు వచ్చారు.

మాల్ఖేడ్ యుద్ధం క్రీ.శ.1686: మొగలులతో ఎప్పుడైనా యుద్ధాలు రావచ్చని రాజధాని ముట్టడి జరిగితే రక్షణకు మరొక దుర్గం ఉండటం మంచిదని మాదన్న క్రీ.శ.1676లోనే విన్నవించాడు. మాదన్న సలహా ప్రకారం అతడు రెండవ రాజధానిగా కొండపల్లి.కోటను ఎన్నుకొని దానిని క్రీ.శ.1679లో పటిష్ఠపరిచాడు. లింగన్న పరాక్రమం వల్ల కర్ణాటకంలో తానీషా అధికారం స్థిరంగా ఉంది. 12 వేల హొన్నుల తుపాకి మందు, 20 పుట్ల సీసం బ్రిటీష్ వారి నుండి సంపాదించి గోల్కొండ కోటలో దాచాడు. అలాగే గోల్కొండ మొగల్ రాజ్యానికి మాల్ఖేడ్ సరిహద్దుగా ఉంది. మాల్ఖేడ్ ఒకప్పుడు రాష్ట్రకూటుల రాజధాని. అది బలిష్ఠమైన దుర్గం. అందులో 40 వేల కుతుబ్‌షా సైన్యం ఉండేది. మొగలులు గోల్కొండ రాజ్యంపై దండెత్తాలంటే ముందు మాల్ఖేడ్ కోటను జయించాలి. కనుక మొగల్ సైన్యం ఖాన్‌జహాన్ కొకతాష్ నాయకత్వంలో తరలివచ్చి మాల్ఖేడ్ కోటను ముట్టడించింది. దాంతో మొగలులకు గోల్కొండ కుతుబ్‌షాహీ రాజ్యానికి జీవన్మరణ పోరాటం ప్రారంభమైంది.

మాల్ఖేడ్ వద్ద గోల్కొండ మొగల్ సేనలకు రెండు పర్యాయాలు యుద్ధం జరిగింది. మొదటి యుద్ధంలో గోల్కొండ సైన్యాలు విజయం సాధించాయి. రెండవ పర్యాయం జరిగిన యుద్ధంలో మొగల్ సైన్యాలు గోల్కొండ సైన్యాలను ఓడించి మాల్ఖేడ్ దుర్గాన్ని ఆక్రమించాయి. మరలి హైదరాబాద్ చేరాయి.

మొదటి మాల్ఖేడ్ యుద్ధం: మొగల్ రాజకుమారులు షా ఆలం తన సైన్యంతో వచ్చి మాల్ఖేడుకు రెండు మైళ్ల దూరంలో విడిది చేశాడు. మరికొద్ది రోజులలో ఖాన్‌జహాన్ కోకతాష్ మరికొంత మంది సైన్యంతో మాల్ఖేడ్ చేరాడు. మరికొంత సైన్యం నిసార్‌ఖాన్ నాయకత్వంలో గోల్కొండ రాజ్యాన్ని కొల్లగొట్టడానికి బయలుదేరింది. ఆ సైన్యాన్ని మాల్ఖేడ్ దుర్గానికి 8 మైళ్ల దూరంలో కుతుబ్‌షా సైన్యం అడ్డగించి ఓడించి తరిమింది. మొగల్ సైన్యం సేదం అనే కోటలోకి దూరింది. గోల్కొండ సైన్యానికి నాయకులు ఖలీలుల్లాఖాన్, మిన్‌హాజ్‌రుస్తుం రావులను సేనాధిపతులుగా మాదన్న పంపాడు. వారు తమ సైన్యాలతో మాల్ఖేడు దుర్గాన్ని రక్షించటానికి పూనుకున్నారు. ఉభయసైన్యాలకు మాల్ఖేడ్, సేదంల మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కుతుబ్‌షా సేనాని బారీఖాన్ ఒడిశెలరాళ్లను రువ్వి మొగల్ సైన్యాన్ని చికాకుపరచాడు. అందువలన మొగల్ సైన్యం ఓడి వెనక్కుపోయింది. ఆ అపజయంతో మవుజం రాకుమారుడు యుద్ధ విముఖుడై తానీషాతో సంధి చేసుకోవాలని భావించాడు.

రెండవ మాల్ఖేడు యుద్ధం: మవుజం లేక షా ఆలం రాకుమారుని అపజయ వార్త విని ఔరంగజేబు రాకుమారుని చర్యలు తమకు నచ్చలేదని వెంటనే యుద్ధం మొదలుపెట్టి మాల్ఖేడును ఆక్రమించి గోల్కొండ వైపు సాగిపొమ్మని ఆదేశాలు పంపాడు. షా ఆలంకు యుద్ధం చేయడం ఇష్టం లేకపోయినప్పటికీ తండ్రి ఆజ్ఞను

శిరసావహించి తిరిగి యుద్ధం ప్రారంభించాడు. ఈ యుద్ధంలో మొగల్ సేనానులైన ఖాంజహాన్, హిమ్మత్‌ఖాన్, సయ్యద్ అబ్దుల్లా మొదలైన వారు ప్రాణాలకు తెగించి గోల్కొండ సేనలతో పోరాడారు. గోల్కొండ సేన కొద్ది వెనుకంజ వేసింది. అది గోల్కొండ సేనల అపజయంగా భావించి షా ఆలం రాజకుమారుడు గోల్కొండ సర్‌లష్కర్ అయిన ఖలీలుల్లాఖాన్ వద్దకు రాయబారం పంపాడు. సేడం, మాల్ఖేడ్, హొహియర్, హుడ్కి దుర్గాలను మొగలులకు సమర్పించినట్లయితే తన తండ్రిని సంధికి ఒప్పిస్తానని ఆ రాయబారి ద్వారా సంధి పత్రం పంపాడు. ఆ సంధి పత్రాన్ని నాజర్ జమురుద్ద్ అనే అతడు తానీషా దగ్గరకు తీసుకొని వెళ్ళాడు. సంధికి అంగీకరించమని మహమ్మద్ ఇబ్రహీం సేనాధిపతి కుతుబ్‌షాకు సలహా ఇచ్చాడు. షేక్ మీన్‌హాజిలి, రుస్తుం రావ్ సేనానులు సంధికి అంగీకరించలేదు. గోల్కొండ సైన్యానికి సహాయంగా మాదన్న మరొక 10వేల సైన్యాన్ని మాల్ఖేడుకు పంపాడు అదనంగా వచ్చిన సైన్యంతో గోల్కొండ సేనానులు యుద్ధానికి తయారయ్యారు. మొగల్ సేనలు తిరిగి యుద్ధం ప్రారంభించాయి. సేనానుల నాయకత్వంలో మరికొంత సైన్యం వచ్చింది. షేక్ మిన్‌హజ్, రుస్తుంరావు బారీఖాన్‌లు గోల్కొండ సైన్యానికి నాయకత్వం వహించి వీరోచితంగా పోరాడారు. బారీఖాన్ తన పటాలంతో ఒడిశెలరాళ్లను మొగలులపై రువ్వించాడు. కాని మొగలులు విసిరిన ఒక బాణం అతనికి తగిలి యుద్ధరంగంలో మరణించాడు. గోల్కొండ సేనాధిపతి అయిన ఖలీలుల్లాఖాన్ హృదయ పూర్వకంగా పోరాడలేదు. చివరకు ఈ యుద్ధంలో గోల్కొండ సైన్యం ఓడిపోయి గోల్కొండవైపు మరలిపోయాయి. మాల్ఖేడు, సేలం, కహిర్, అదితి దుర్గాలు మొగలుల సేనల వశమయ్యాయి. తర్వాత మొగల్ సైన్యం గోల్కొండ సేనలను తరుముతూ వెంటవచ్చి హైదరాబాద్ నగరం చేరాయి. చేరి గగన్‌పహాడ్‌వద్ద విడిదిచేశాయి. షా ఆలం ఘోషామహల్ వద్ద విడిది చేశాడు

హైదరాబాద్‌ను అల్లకల్లోలం చేయటం క్రీ.శ.1686: మొగల్ సైనికులు హైదరాబాద్ నగర వాసులపై పడి దోపిడీ చేయసాగారు. ప్రజలు తమ సర్వస్వాన్ని కోల్పోయారు. పట్టణం ధ్వంసం కాసాగింది. ప్రజల యొక్క ధన, మాన, ప్రాణులకు రక్షణలేకుండాపోయింది. వేలకొలది ప్రజలు నగరం వదలి పరిసరాలలోని పల్లెలకు వెళ్లిపోయారు. కొందరు మొగల్ సైనికులు రాజమహలుపై దాడి చేశారు. తమకు రక్షణ లేకుండా పోయిందని తానీషా హైదరాబాద్ నగరం వదలి కుటుంబ సమేతంగా గోల్కొండ కోటలో ప్రవేశించి తలదాచుకున్నాడు హైదరాబాద్ నగరాన్ని తన సైనికులు ధ్వంసం చేయడం, ప్రజలపై దోపిడీలు, హత్యాచారాలు సాగించడం షా ఆలం రాకుమారునికి తెలిసింది. వెంటనే అతడు నగర రక్షణకు ఖాన్‌జహాన్ అనే సేనాధిపతిని నియమించాడు అతను అల్లర్లను అణచాడు. హైదరాబాద్ మొగల్ రాకుమారుని ఆధీనంలోకి వచ్చింది.

గోల్కొండ సరదారులు మొగలులతో చేరడం: ఈ స్థితిలో గోల్కొండ సరదారులు ఒక్కొక్కరే తానీషాను వదలివేసి మొగలుల వైపు చేరిపోవటం మొదలు పెట్టారు. ఆ విధంగా మొట్టమొదట చేరిన వాడు గోల్కొండ సర్వసేనాధిపతి సర్ లష్కర్ ఖలీలుల్లాఖాన్. మాల్ఖేడ్ యుద్ధంలో గోల్కొండ సేనలు పరాజయం పొందటానికి అతడే కారణం. అతడు 1686 నవంబర్ 8వ తేదీన ఘోషామహల్ వద్ద విడిది చేసి ఉన్న మొగల్ రాకుమారుడు షా ఆలంను దర్శించి అతనికి లొంగిపోయాడు. షా ఆలం అతనిని మొగలుల కొలువులోకి తీసుకొని మహబత్‌ఖాన్ అనే బిరుదునిచ్చి 6 వేల మనసబ్‌కు, 4 వేల సవారీకి అధిపతిని చేశాడు. అతని తర్వాత మహమ్మద్‌తఖీ, మహ్మద్ దావూద్ మొదలైన గోల్కొండ సేనానులు మొగల్ సేనలో చేరారు. వారిని 2000 మన్సబ్, 200 అశ్వదళానికి అధిపతులుగా చేశాడు. తానీషా మేనల్లుడు షరీఫ్ ఉల్‌ముల్క్ కూడా షా ఆలంను ఆశ్రయించాడు. అతనిని 3 వేల మన్సబ్‌దార్, 300 గుర్రాలకు అధిపతిని చేశాడు. గోల్కొండ సర్‌లష్కర్ మహమ్మద్ ఇబ్రహీం కూడా మొగల్ కొలువులో చేరి 41 గుర్రాలు, కొన్ని ఏనుగులు 5000 హొన్నుల ధనాన్ని బహుమతిగా పొందాడు. తానీషా సన్నిహితుడు సలహాదారుడు అయిన జైనులోబుద్దీన్ కూడా మొగల్ కొలువులో చేరాడు. ఈ విధంగా మామూలు సేనాధిపతులేగాక తానీషా బంధువులు కూడా మొగలుల వైపు చేరిపోసాగారు. ఆ సమయంలో మాదన్న హైదరాబాద్‌ను వదలి ఓరుగల్లు దుర్గానికి వెళ్లిపోదామని సలహా ఇచ్చాడు. అక్కడి నుండి రాజ్యంలోని సైన్యాన్నంతటిని తెప్పించుకొని మొగలులతో పోరాడుదామని సలహా ఇచ్చాడు. ఓరుగల్లులో నూతనంగా హిందువులను సైన్యంలో చేర్చుకొని కొత్త సైన్యంతో యుద్ధం చేద్దామని చెప్పాడు. కాని షేక్ మిన్హాజీ మాదన్న సలహాను పడనీయలేదు. ముస్లిం సరదారులు మొగల్ సైన్యంలో చేరిపోతున్నారు. ఎవరిని నమ్మాలో, ఎవరిని నమ్మకూడదో తెలియని స్థితిలో మాదన్న ఓరుగల్లు వెళ్లి హిందూ సైనికుల మీద ఆధారపడమని ఇచ్చిన సలహా చాలా గొప్పది. కానీ తానీషా మిన్హాజీ సలహాను పాటించాడు. అతడు ఆ తర్వాత ఔరంగజేబుతో చేరిపోయాడు.

సంధి రాయబారాలు: ఇలాంటి పరిస్థితులలో తానీషా నిస్తేజితుడయ్యాడు. సంధి చేసుకొంటానని మీర్‌హాషి ద్వారా షా ఆలం రాకుమారునికి కబురు పంపాడు. షా ఆలమ్ సంధికంగీకరించి, సంధి షరతులను రూపొందించి పంపాడు. బకాయిల కింద కోటి హొన్నుల ద్రవ్యం చెల్లించాలి. సాలుకు 2 లక్షల హొన్నులు కప్పం చెల్లించాలి. మాల్ఖేడ్, సేదర్ కోటలను మొగల్ చక్రవర్తికి ఇచ్చివేయాలి. అక్కన్న, మాదన్నలను కొలువు నుండి తొలగించాలి. ఈ షరతులను తానీషా అంగీకరించాడు. తానీషా అంగీకారాన్ని బీజాపూర్ వద్ద ఉన్న ఔరంగజేబుకు తెలపబడింది. అతడు సంతోషించి తన కుమారుడు షా ఆలంకి 10 వేల మన్సబ్‌దారుగా పదోన్నతినిచ్చాడు. షా ఆలం యుద్ధ విరామంలో కోహీర్ దుర్గానికి వెళ్లి తిరిగి వచ్చాడు. మహమ్మద్ నియామత్‌ఖాన్ సంధి గీతాన్ని ఆలాపించాడు.

మాదన్న అక్కన్నల సంహారం: షా ఆలం పెట్టిన షరతులలో మాదన్న, అక్కన్నలను తొలగించటం గోల్కొండలో చర్చనీయాంశమైంది. కొందరు సేనాధిపతులు వారిని తొలగించడానికి ఇష్టపడలేదు. కొందరు తొలగించాలని అన్నారు. మొదటి నుండి ఎంతో విశ్వాసంతో కొలిచి దక్షతతో గోల్కొండ రాజ్యాన్ని పటిష్టపరచిన మాదన్నను మొగలుల కోరిక ప్రకారం తొలగించదానికి తానీషా మాదన్నను తొలగించదని అభిప్రాయానికి వచ్చారు. కనుక మాదన్న, అక్కన్నలను చంపివేయాలని కుట్రపన్నబడింది. ఈ కుట్రకు షేక్ మిన్హాజ్ అనే సర్దారు సారధ్యం వహించారు. తానీషా రాణులు జానీసాహెబ్, సరుమ అనే వారు షేక్ మిన్హాజ్‌కు మద్దతునిచ్చారు. 1686 మార్చి 16వ తేదీన మాదన్న, అక్కన్నలు దర్బారు పని ముగించుకొని రాజవీధి నుండి తమ గృహాలకు వస్తుండగా మార్గమధ్యంలో మిన్హాజ్ అనుచరుడు జంషీద్, మరికొందరు హఠాత్తుగా వారిపై బడి వారి తలలు నరికారు. వారు ఆ తలలను షా ఆలం రాకుమారునికి పంపారు. రాజకుమారుడు ఆ తలలను బహదూర్ ఆలీ అనే వాడు ఔరంగజేబుకు పంపాడు. కాని కొందరు ఆ తలలను హైదరాబాద్‌లోనే ఏనుగుల చేత తొక్కించాడని భావించారు. ఏమైనా తమ జీవితాలను గోల్కొండ రాజ్యానికి అంకితం చేసిన సోదరులు చివరకు దారుణంగా వధింపబడ్డారు. వారు చేసిన తప్పు ఏమిటి? ఏమీ లేదు, వారు హిందువులు కావడమే. జదునాథ్ సర్కార్, కృష్ణస్వామి అయ్యంగార్, షేర్వాణీ మొదలైన పండితులు వారు స్వార్థంగా వ్యవహరించారని, ముస్లింల ఎడల ద్వేషభావంతో వ్యవహరించారని రాశారు. కాని అది వాస్తవం కాదు. వారి హయాంలో గోల్కొండ రాజ్యం విస్తరించింది. సైనికంగా బలిష్టంగా రూపొందింది. ఆర్థికస్థితి మెరుగుపడింది. శాంతిభద్రతలు నెలకొల్పబడ్డాయి. రాజ్యం సుస్థిరంగా ఉంది. డచ్చి అధికారి హోవెర్ట్ కూడా మాదన్న ప్రతిభను ప్రశంసించాడు. అలాంటి మాదన్నను వధించడం అంటే మహమ్మద్ గవాన్‌ను వధించి మూడవ మహమ్మద్ ఏ తప్పుచేశాడో అదే తప్పు ఇప్పుడు జరిగింది. మహామంత్రి తిమ్మరుసుకు సాటియైన మాదన్న జీవితం అలాగే చిరవకు విషాదంగా ముగిసింది. మాదన్న అక్కన్నలను తొలగిపొమ్మని చెప్పలేక తానీషాయే రహస్యంగా చంపించాడని కూడా ఒక అభిప్రాయం ఉంది. కాని అది వాస్తవం కాకపోవచ్చును. ఏమైనా మాదన్న అక్కన్నల వధ గోల్కొండ రాజ్య పతనాన్ని ఆపలేదు. వారిని వధించిన తర్వాత ముస్లింలు రుస్తుం రావు ఇంటిలోకి జొరబడి అతని కుటుంబాన్నంతటినీ వధించి అతని ఇల్లు దోచుకున్నారు. తర్వాత అనేకమంది హిందువులు, బ్రాహ్మణుల ఇళ్లలోపడి కొందరిని చంపి వారి ఆస్తులు దోచుకున్నారు. మాదన్న వధ తర్వాత అశాంతి చెలరేగింది. తానీషా కల్పించుకొని అల్లర్లను అదుపు చేశాడు. వాస్తవానికి హిందూ సోదరుల వధ తర్వాత ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించకూడదు. కానీ ఆక్రమించాడు. అంటే మాదన్ననను మీర్జుమ్లా పదవి నుండి తప్పించాలని మొగలులు పెట్టిన షరతు, గోల్కొండ రాజ్యాన్ని బలహీన పరచదానికి పన్నిన రాజకీయ వ్యూహమేగాని, తానీషా రాజ్యాన్ని వదిలి వేయదానికి కాదు. మాదన్న బహుముఖ ప్రజ్ఞాశాలి. అతడు మీర్జుమ్లా పదవిలో ఉన్నంతకాలం గోల్కొండను ఆక్రమించడం సాధ్యం కాకపోవచ్చును. అతడు తన రాజనీతి వ్యూహాలతో, సైనిక వ్యూహరచనలతో గోల్కొండ రాజ్యాన్ని రక్షించవచ్చును. అతనిని తొలగిస్తే ఆ రాజ్యాన్ని జయించడం సులభం కావచ్చునని ఔరంగజేబు తలచి ఉండవచ్చును. కారణం ఏమిటంటే అంతటి మేధావి గోల్కొండ దర్బారులో మరెవరూ లేరు. తానీషా విషయలోలుడు. వ్యూహారచన తెలియనివాడు. అంతఃపురంలో కాలం గడిపేవాడు. అలాంటి రాజ్యాన్ని ఎక్కువ కాలం కాపాడుకోలేదు. అదే మాదన్న జీవించి ఉంటే ప్రతిక్షణం కోటనంతా కలియదిరుగుతూ క్షణక్షణం యుద్ధగమనాన్ని పరిశీలిస్తూ రక్షణ బాధ్యతను స్వీకరించి ఉండేవాడు. కనుక సులభంగా గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించదానికి ఔరంగజేబు ఈ షరతును పెట్టాడని భావించవచ్చును. ఆ తర్వాత మాదన్న లేని లోటు స్పష్టంగా కనిపించింది. గోల్కొండ రాజ్యపతనం అయింది. మాదన్న మరణించిన ఆరునెలల్లో 1686 సెప్టెంబర్ 12వ తేదీన బీజాపూర్ రాజ్యం

పతనమైంది. బీజాపూర్ బాలసుల్తాన్ సికిందర్‌ను బందీగా దౌలతాబాద్ కోటకు పంపాడు. బీజాపూర్ పతనం, మాదన్న మరణంతో గోల్కొండ రాజ్యాన్ని జయించడానికి అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. చక్రవర్తి, సాదత్‌ఖాన్ అనే వ్యక్తిని తానీషా ఇవ్వవలసిన బకాయి ధనాన్ని వసూలు చేయమని ఆదేశించాడు. అతడు అతని తమ్ముడు నియామత్‌ఖాన్‌ను పంపాడు. ఇతడు 16-9-1686న గోల్కొండ చేరాడు. తానీషా బకాయి కింద రత్నఖచిత స్వర్ణాభరణాలు ఇచ్చాడు. అవి చక్రవర్తికి చేరలేదు. ఈ లోపల ఔరంగజేబు చక్రవర్తి 1686 నవంబర్ 3వ తేదీన షోలాపూర్ చేరాడు. నవంబర్ 26వ తేదీన బీదర్ చేరాడు. తర్వాత అతడు 5-12-1686 గుల్బర్గా చేరి మొహరం రోజున హజరత్‌బందా నవాజ్ దగ్గర పూజలు జరిపాడు. తర్వాత 1687 జనవరి 8వ తేదీన హైదరాబాద్ చేరి నౌబత్ పహాడ్ వద్ద విడిది చేశాడు.

ఔరంగజేబుతో రాయబారం-యుద్ధ ప్రయత్నాలు: చక్రవర్తి హైదరాబాద్ వచ్చాడని తెలియగానే తానీషా తన రాయబారిని పంపాడు. అంతకుముందు తనపై విధించిన షరతులన్నీ అమలు జరిగాయని విన్నవించాడు. మాదన్న, అక్కన్నలు మరణించారు. బకాయి ధనాన్ని యామత్‌ఖాన్ ద్వారా సాదత్‌ఖాన్ పరం చేశాను. మాల్ఖేడ్, సేదం దుర్గాలు మొగలుల వశంలోనే ఉన్నాయి. కనుక షరతులన్నీ పూర్తి అయినట్లే కనుక తన రాజ్యంపై యుద్ధం చేయడం అన్యాయమని మొరపెట్టుకున్నాడు. కాని ఔరంగజేబు మనసు కరుగలేదు. తానీషా రాయబారాన్ని తిరస్కరించాడు. తానీషా స్త్రీ లోలుడని, కాఫిరులను పోషించాడని, అలాంటి దర్బారులో ప్రవేశించుటకు ఇస్లాం న్యాయసూత్రాలు అంగీకరించమని తన ఇష్టం వచ్చినట్లు దూషించాడు. అతని ఏకైక లక్ష్యం సిరిసంపదలతో ఉన్న గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించడమే. ఔరంగజేబు కోటచుట్టూ ఉన్న కందకాలను పూడ్పించడానికి 3,75,000 ఇసుకబస్తాలు సేకరించి కందకాల వద్ద పేర్చారు. 5,809 మణుగుల తుపాకీ మందు, 106 ఫిరంగులు, 1,644 గుండ్లు మొగలులు సమకూర్చుకున్నారు. అందులో 18 ఫిరంగులు, $4^1/_2$ శేర్ల బరువుగల గుండ్లను సంధించగల శక్తి గలవి. మొగలుల ప్రయత్నాలు చూసి తానీషా కూడా యుద్ధానికి సిద్ధమయ్యాడు.

గోల్కొండ కోట ముట్టడి క్రీ.శ.1687 జనవరి 28: ఔరంగజేబు హైదరాబాద్ చేరిన 20 రోజులకు అంటే 28-12-1687 తేదీన గోల్కొండ కోట ముట్టడి ప్రారంభమైంది. ముట్టడి 8 నెలలు సాగింది. ఈ 8 మాసాలు అనేక లోపాలున్నా గోల్కొండ సైన్యం అత్యంత పరాక్రమంతో పోరాడింది. మాదన్నను వధించిన షేక్ మిన్హాజ్, షార్జాఖాన్, అబ్దుర్‌రజాక్ అనే సేనానులను తానీషా గోల్కొండ కోట రక్షణకు నియమించాడు. మొగల్ సేనలు ఓడిపోతే చక్రవర్తిని సగౌరవంగా తన వద్దకు తోడ్కొని రమ్మని ఆదేశించాడు. మొగల్ సేనలకు ఫిరోజ్‌జంగ్ సైన్యాధిపత్యం వహించాడు. అతని తండ్రి ఖాజీ అబీద్ వృద్ధుడు. అతడు కూడా యుద్ధంలో పాల్గొన్నాడు. ఇంకా సర్దార్ అబుల్ మక్‌రాం, సయద్ అబ్దుల్లా బరెహాలు, కిషోర్‌సింగ్, కృష్ణ సింగులు పాల్గొన్నారు. మొగల్ సైన్యంలో నక్షభాక్ అనే అతడు కాగడాలు విసరడంలో గొప్ప ప్రజ్ఞాశాలి. అతని నాయకత్వంలో కాగడాలు విసిరే సైనికశాఖ నిర్వహించబడుతోంది. అతడు తన సిబ్బందితో గోల్కొండ కోటపై కాగడాలు విసరడంతో 1687 జనవరి 28వ తేదీన యుద్ధం ప్రారంభమైంది. గోల్కొండ కోట బురుజులపై నిలబెట్టిన ఫిరంగులను పేల్చడంతో గోల్కొండ సైనికులు మొగలుల కాగడాలకు సమాధానం చెప్పారు. గోల్కొండ ఫిరంగీ దెబ్బలకు మొగల్ సైన్యం అల్లకల్లోలం అయింది. ఆ స్థితిలో షా ఆలం రాకుమారుడు తన 10 వేల సైన్యంతో యుద్ధభూమిలోకి దూకాడు. అతనితోపాటు కిశోర్‌షింగ్, కృష్ణసింగ్‌లు వీరవిహారం చేశారు. కాని ఏమీ ప్రయోజనం లేకపోయింది. కనుక సంధి చేసుకోవడం ఉత్తమమని అతడు తండ్రికి సూచించాడు. అందుకు ఔరంగజేబు ఉగ్రుడైపోయి షా ఆలంను, అతని కుటుంబాన్ని నిర్బంధించాడు. యుద్ధాన్ని కొనసాగించాడు. ముస్తాఫాఖాన్, షేర్ నిజాంల నాయకత్వంలో 40 వేల గోల్కొండ సైన్యం కోట వెలుపలికి వచ్చి మొగల్ సైన్యంతో ముఖాముఖిగా తలపడింది. ఈ యుద్ధంలో మొగల్ సైనికులు వేల సంఖ్యలో మరణించారు. మొగలులు చాలా నష్టపడ్డారు. ఈ విధంగా ఐదు మాసాలు యుద్ధం సాగింది. మొగల్ సేనాధిపతి ఫిరోజ్‌జంగ్ రాత్రి పూట తాళ్లనిచ్చెనల సహాయంతో కోట గోడలెక్కించి తన సైనికులను కోట లోపలికి దించాలని పథకం తయారు చేశాడు. 16-5-1687వ తేదీనాటి రాత్రి తన పథకాన్ని అమలు జరిపాడు. మొగల్ సైనికులు అర్ధరాత్రి గోడల నెక్కసాగారు. గోల్కొండ సైనికుల గాఢనిద్రలో ఉన్నారు. ఆ సందర్భంలో గోల్కొండ సైనికుల వద్ద ఉన్న కుక్క గట్టిగా అరవసాగింది. దాని అరుపులకు గోల్కొండ సైకులు మేల్కొని మొగల్ సైనికులపై తుపాకులు పేల్చి చాలా మంది మొగల్ సైనికులకు చంపారు. ఫిరోజ్‌జంగ్ వ్యూహం బెడిసికొట్టింది. మరురోజు తానీషా కుక్కను తన వద్దకు తీసుకొని దాని మెడలో బంగారు గొలుసు వేసి సెతబకా అనే బిరుదు

నిచ్చాడట. దానికి ఆ బిరుదు ఇవ్వడం ఫిరోజ్‌జంగు తనకు జరిగిన అవమానంగా భావించాడట. మరురోజు గోల్కొండ సైనికులు మొగల్ సైన్యంపైబడి కొన్ని ఫిరంగులను ధ్వంసం చేశారు. ఇంతలో వర్షాకాలం ప్రారంభమైంది. మొగల్ గుడారాల వద్ద వర్షం ఏరులుగా పారసాగింది. వారికి ధాన్యసేకరణ పెద్ద కష్టమై పోయింది. ఫిరంగులు, మందుగుండు సామాను తడిసి ముద్దయింది. అది మంచి అదనుగా భావించి గోల్కొండ సైన్యం 15-6-1687వ తేదీన మొగల్ సైన్యంపైబడి వారి ఫిరంగులలో కూర్చిన మందును తొలగించి మేకులు బిగించి ఫిరంగులు పేలకుండా చేశారు. కొన్నింటిని ధ్వంసం చేశారు. తర్వాత మొగల్ సైన్యంపైబడి చాలా మందిని వధించారు. మొగల్ సేనానులు సలీల్‌ఖాన్, సపత్‌ఖాన్, అజీజ్‌ఖాన్‌లు బురదగుంటలోకి దిగి ముఖానికి బురద పూసుకున్నారట. జంషీద్‌ఖాన్ పారిపోయాడు. గోల్కొండ సైన్యం అజీజ్‌ఖాన్, సబ్దర్‌ఖాన్‌లను మొగల్ సైన్యాధిపతులను బంధించి తానీషా ముందు నిలబెట్టారు. అతడు వారిని గౌరవించి ఒక గృహంలో నిర్బంధించాడు. ఈ అపజయం తర్వాత ఖాజీషెకుల్ సలాను ఖాజీ గోల్కొండపై దాడి చేయడం ఇస్లాంపై దాడిచేయడమేనని ఔరంగజేబుకు విన్నవించాడట. అందుకు కోపించి అతనిని మక్కాకు పంపించాడు. అతని స్థానంలో ఖాజీఅబ్దుల్లా అనే ఖాజీని నియమించాడు. అతడు కూడా తానీషాపై యుద్ధం తప్పని చెప్పాడు. ఇంతలో తానీషా "యుద్ధ నష్టపరిహారం కింద కోటి హొన్నులు, బకాయిల కింద మరొక కోటి హొన్నులు ఇస్తానని యుద్ధ విరమణ చేయమని, మీరు జయించినా ఎవరికో ఒకరికి దుర్గాన్ని ఇవ్వాలిగదా, అది నాకే ఇవ్వండి, నా రాజ్యం నా ప్రజలపై నాకున్న ప్రేమాభిమానాలు మరెవరికీ ఉండవు. నేనే రాజ్యం పాలించుకుంటాను" అని ప్రాధేయపడుతూ దూతను పంపాడు. కాని ఔరంగజేబు తన మొండిపట్టును విడువలేదు. యుద్ధం కొనసాగింది. తానీషాను బంధించి తన వద్దకు తెమ్మని, అదీ వీలుకాకపోతే అతని శిరస్సును ఖండించి తెమ్మని తన సేనాధిపతులను ఆదేశించాడు. మొగల్ సైన్యం యుద్ధాన్ని పెంచారు. మందుపాతర్లు పేర్చి కోట గోడలు కూల్చివేయాలని ప్రయత్నించారు. గోల్కొండ సేనాని అబ్దుర్ రజాక్ అది చూసి తన పరివారంతో వచ్చి ఆ మందును బయటికి తీసి మొగల్ సైనికుల మీదనే విసిరాడు. 1100 మంది మొగల్ సైనికులు చనిపోయారు. ఇంకా అనేక మందికి గాయాలయ్యాయి. అది తెలిసి ఔరంగజేబు స్వయంగా అక్కడికి వచ్చి మొగల్ సైనికులను లోపలికి చొచ్చుకొని పొమ్మని ఆదేశించాడు. గోల్కొండ సైన్యం వారిని అడ్డగించి భీకరంగా పోరాడింది. అందులో మొగల్ సేనానులైన ఫిరోజ్‌జంగ్, గాజీయుద్దీన్, రుస్తుంఖాన్, దళ్పత్‌రావు బుందేలా వంటి వీరాధివీరులు గాయపడ్డారు. గోల్కొండ సైన్యాలు మొగలులకు చెందిన ఫిరంగులను కోటలోకి లాక్కుపోయారు. అదే సమయంలో వర్షం ప్రారంభమైంది. మొగల్ సైన్యం వర్షంలో చిక్కుకుంది. కంబక్ష అసద్‌ఖాన్‌లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోసాగారు. ఆజం రాకుమారుడు రహుల్లాఖాన్‌లు వర్షంలోనే పోరాటం సాగించారు. కాని గోల్కొండసేన వారిపై సమర్థవంతంగా దాడులు నిర్వహించి చాలా మందిని చంపారు. కందకాలలో నీటి ప్రవాహంలో, బురద గుంటలలో ఎక్కడ పడితే అక్కడ మొగల్ సైనికుల శవాలు తేలియాడసాగాయి. ఆ స్థితిలో ప్రాణభయంతో కొందరు మొగల్ సైనికులు గోల్కొండ సైన్యాన్ని ఆశ్రయించి వారితో చేరి పోయి ప్రాణాలు దక్కించుకున్నారు. దాంతో గోల్కొండను జయించడం అసాధ్యం అని తేలిపోయింది.

షేక్ మిన్హాజ్ - అబ్దుల్లాఖాన్ పన్నిన ద్రోహం: యుద్ధం ద్వారా గోల్కొండకోట వశం కాదని తెలుసుకున్న ఔరంగజేబు మాయోపాయం ద్వారా దుర్గాన్ని ఆక్రమించాలని కుట్రలు ప్రారంభించాడు. గోల్కొండ సేనానులకు ధనాన్ని, పదవులను ఆశ చూపించాడు. దానికి ఆశపడి షేక్ మిన్హాజ్ ఔరంగజేబు పక్షంలో చేరిపోయాడు. మాదన్న అక్కన్నలను సంహరించింది ఇతడే. గోల్కొండ రాజ్యరక్షణ కోసం అక్కన్న మాదన్నలను సంహరించానని చెప్పుకున్న అతడు చివరకు తన రాజుకు స్వామిద్రోహం చేసి మొగలుల పంచన చేరాడు. అతని సారథ్యంలో అనేక మంది తానీషాను వదలి మొగలుల వైపు చేరి జాగీరులు సంపాదించారు. కాని అబ్దుల్ రజాక్ లారీ తానీషా యందు విశ్వాసంతో గోల్కొండ కోట రక్షణకు నిలబడ్డాడు. మిన్హాజ్ మధ్యవర్తిత్వంలో అబ్దుల్ ఖాన్‌కు లంచం పెట్టి కోట ద్వారం తెరిచే ఏర్పాట్లు జరిగాయి. అబ్దుల్లాఖాన్ పన్ని ఫతే దర్వాజా రక్షకుడు. అతడు స్వామి ద్రోహానికి పాల్పడి 21-9-1687వ తేదీన తెల్లవారు ఝామున 3 గంటలకు ద్వారం తెరిచాడు. మొగల్ సైన్యం కోట లోపలకు ప్రవేశించింది. ఆజం రాకుమారుడు కోట ద్వారం వద్ద ఏనుగుపై నిలిచి రుహుల్లాఖాన్, జానిసార్‌ఖాన్, రహ్మత్‌ఖాన్, సఫజర్‌ఖాన్ ముక్తార్‌ఖాన్‌లను కోటలోకి పంపాడు. వారు రాజమహల్ వైపు సాగిపోయారు. రాజమహల్ వద్ద 500 మంది హబ్షీలు రక్షణ దళంగా ఉన్నారు. వారు తమను చంపి ముందుకు సాగండని మొగలులను ఎదిరించారు. వారిని వధించి మొగల్ సైన్యం రాజభవనాన్ని చుట్టుముట్టింది. కోట మొగలుల

వశమైందనే వార్త త్వరితగతిని విస్తరించింది. కోటలోని వారు గడగడా వణకసాగారు. అది తెలిసి అబ్దుల్ రజాక్ లహరి మొగలులను ఎదిరించడానికి తన 12 మంది అనుచరులతో బయలుదేరాడు.

అబ్దుల్ రజాక్ లహరి వీరోచిత పోరాటం 21-9-1687: రజాక్ లహరీ కత్తి, డాలు ధరించి తన అశ్వాన్ని అధిరోహించి మొగల్ సైనికులపై పడ్డాడు. ఆ రోజు యుద్ధంలో అతడు చూపిన ధైర్యసాహసాలు శత్రువైన ఔరంగజేబును కూడా ఔరా అనిపించాయట. తన సైనికులందరూ మరణించినా కూడా తన ప్రాణాలను లెక్కచేయకుండా ఒంటరిగా మొగల్ సైన్యంపై బడి వీరవిహారం చేసి అనేక మందిని వధించాడు. మొగల్ సైనికులు అతనిని చుట్టుముట్టి ఇష్టానుసారంగా గాయాలు చేశారు. అతని వంటిపై 70 గాయాలు తగిలాయి. ఒక్క మొఖం మీదనే 12 గాయాలయ్యాయి. నుదిటిపై చర్మం చీలి ఆ చర్మం రెండవ వైపు వాలిపోయింది. అయినా అతడు పోరాడుతూ తన గుర్రంపై స్పృహ తప్పి వాలిపోయాడు. యజమాని వాలిపోగానే గుర్రం అక్కడి నుండి పరుగుతీసింది. దూరంగా నగీనాబాగ్‌కు తీసుకువెళ్లి ఒకచెట్టు కింద పడేసిందట. మరురోజు అతని అనుచరులు వెదికి అతనిని ఇంటికి తీసుకువచ్చారు. ఔరంగజేబు అతని అద్భుత పోరాటాన్ని విని తన వైద్యుని పంపి అతను ఎక్కడ ఉన్నా వెదకి వైద్యం చేయమన్నాడట. వెదకి అతనికి వైద్యం చేసి బతికించారట. 13 రోజుల యునాని వైద్యం చేసిన తర్వాత స్పృహలోకి వచ్చి హీనస్వరంతో మాట్లాడాడట.

అబుల్ హసన్ తానీషాను బంధించటం: రజాక్ పోరాటం ముగిసిన తర్వాత మరెవరూ మొగలులను ఎదిరించలేదు. గోల్కొండ కోట మొగలుల వశమైంది. అదే సమయంలో తానీషా నిద్ర మేల్కొని కాలకృత్యాలు తీర్చుకొని ఫలహారానికి కూర్చోబోతున్నాడు. రాజభవన కాపలాదారులు పరుగున వచ్చి కోట మొగలుల వశం అయిందని, మొగల్ సేనాధిపతులు రాజభవనంలోకి వస్తున్నారని తెలిపారట. అది విని ఈ సమయంలో సంతోషంగా ఉండాలని వెంటనే రాజదిరుసు ధరించి దర్బారుకు వచ్చి సింహాసనంపై కూర్చొని మొగల్ సేనానాయకులకు భోజనాలు తయారు చేయమని ఆదేశించాడట. ఇంతలో రుహుల్లాఖాన్, యుక్తయార్ ఖాన్‌లు వచ్చి తానీషాను బంధించబోయారు. తానీషా ముందు "మీరు భోజనం చేయండి, తర్వాత బంధిచవచ్చు" అన్నాడు వారు తానీషా ఇచ్చేవిందును ఆరగించడానికి సందేహించారు. కాని చివరకు విందు ఆరగించి తానీషాను తమతో రమ్మన్నారు. తానీషా మహబత్‌ఖాన్‌తో కలిసి ఏనుగునెక్కి ఫతేదర్వాజా గుండా కోట వెలుపలికి వచ్చి అక్కడ ఉన్న హజరత్‌షా సమాధికి నమస్కరించాడట. అదేమిటని మొగల్ సేనానులు అడుగగా, హజరత్ వారు నా తలపై కిరీటం పెట్టారు. ఇప్పుడు తీసివేస్తున్నారు. కనుక వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని చెప్పి బయలుదేరాడు. రహుల్లాఖాన్ తానీషాను తెచ్చి ఆజం రాకుమారుని ముందు నిలబెట్టాడు.

తానీషా హుందాతనం: తన రాజ్యం పోగొట్టుకొని బంది అయి శత్రువు ముందు నిలబడినా అతడు ఏ మాత్రం భయపడలేదు. తల వంచి ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోలేదు. మొగల్ సేనానులు అతనిని ఆజం రాకుమారుని వద్దకు తీసుకెళ్లారు. అతడు ఆజంకు నమస్కరించలేదు. తన మెడలోని ముత్యాల హారాన్ని ఆజం మెడలో వేసి హుందాగా నిలబడ్డాడు. ఆజం అతనిని ఫిరోజంగ్ ద్వారా చక్రవర్తి వద్దకు పంపాడు. కాని అక్కడ కూడా ఔరంగజేబుకు నమస్కరించలేదు. ఎందుకు నమస్కరించలేదని అడిగితే ఇప్పటి వరకు గోల్కొండ రాజ్యం నా ఆధీనం, ఇప్పటి నుండి అంగరు చక్రవర్తి ఆధీనం అవుతోందని బదులు చెప్పాడట. తర్వాత ఖజానా ఎక్కడ ఉందని చక్రవర్తి అడిగితే నాకు తోచిన విధంగా ఖర్చు చేశాను, ఖజానా ప్రత్యేకంగా లేదని బదులు చెప్పగా చక్రవర్తి కోపించి తానీషాను కొట్టించి బందీ చేశాడని రాశాడు. దాంతో తానీషా తనకు ఈ మట్టితో రుణం తీరిపోయినదని బందిఖానాకు వెళ్లిపోయాడట. తానీషాను బందీ చేశారని తెలియగానే రాజభవనంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్త్రీలు కొందరు బావులలో, చెరువులలో దూకి ప్రాణత్యాగం చేసుకున్నారట. చక్రవర్తి రుహుతుల్లాను ఖజానాను వశం చేసుకోమని పంపాడు. అతడు ఖజానాను తెలుసుకొని అందులో ఉన్న 6 కోట్ల 80 లక్షల హొన్నుల ధనాన్ని, వజ్రాలను, రత్నఖచిత ఆభరణాలు, రాజభవనంలోని బంగారు పాత్రలను వశం చేసుకున్నాడు. 7 కోట్ల ధనం, అంతులేని ఇతర సంపద మొగలుల వశమైంది. ఔరంగజేబు తర్వాత తానీషా కుటుంబాన్ని పరామర్శించాడు. తానీషాకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె బీజాపూరు సుల్తాన్ సికిందర్‌షాను వివాహమాడింది. రెండవ కుమార్తె షేక్ మహమ్మద్ బక్షీ బందిసద్‌హింద్ కుమారుడైన మహమ్మద్ ఉమర్‌ను పెళ్లాడింది. మూడవ కుమార్తె జనాయతుల్‌ముల్క్ అనద్‌ఖాన్ కుమారుడైన ఇనాయత్‌ఖాన్‌ను వివాహమాడింది. నాల్గవ కుమార్తెకు ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వివాహం జరుపబడింది. పెద్ద కుమార్తె తండ్రికి

సేవలు చేస్తూ దౌలతాబాద్ బందిఖానాలో జీవించింది. ఔరంగజేబు తానీషా కుమారులను మన్సబ్‌దారులుగా నియమించాడు. తానీషా ప్రియకుమారుడు అబ్దుల్లాకు 4 వేల మన్సబ్, 4 వేల అశ్వాలకు అధిపతిని చేశాడు. తర్వాత చాలా మంది గోల్కొండ సరదారులను తన కొలువులో చేరమని తాఖీదు పంపాడు. కాని అతడు ఆ తాఖీదును చించి తాను తానీషా మనిషినని సమాధానం చెప్పాడు. కాని అందరి వత్తిడి వల్ల సంవత్సరం తర్వాత అంగీకరించాడు. అతనికి 4 వేల మన్సబ్‌గాను, 3 వేల అశ్వదళానికి అధిపతిగా చేశాడు. గజదళాన్ని కూడా ఇచ్చాడు. అతనిని కొంకణ దేశానికి సేనాధిపతిగా పంపాడు. అతని కుమారులు అబ్దుల్ ఖాదర్, అబ్దుల్‌కరీం, అబ్దుల్‌రజాక్, అబ్దుల్‌ఖలీల్ అహమ్మద్ అందరికీ ఔరంగాబాదు దగ్గర జాగీరులిచ్చాడు. దాంతో గోల్కొండ రాజ్యంలో తానీషా కుటుంబం తరఫున అభిమానులుగా ఎవరూ లేకుండాపోయారు. గోల్కొండ రాజ్యంలో మొగలులపై కుట్రలు, తిరుగుబాట్లు జరుగుతాయేమోనని భయం లేకుండాపోయింది. ఈ విధంగా గోల్కొండ పతనమై మొగల్ సామ్రాజ్యంలో చేరిపోయింది. న్యామత్‌ఖాన్ గోల్కొండపై తన గీతాన్ని ఆలపించాడు. ఔరంగజేబు గోల్కండ రాజ్యంలో తన అధికారం స్థిరపరుచుకున్నాడు. హైదరాబాద్‌లోని జామెమసీదు వద్ద నిలిచి చార్మినార్‌ను, పట్టణాన్ని చూసి దాని అందానికి ముగ్ధుడై నగరానికి దురుల్ జీహద్ అని పేరు పెట్టాడు. గోల్కొండ రాజ్యానికి రూహుల్లాఖాన్‌ను తాత్కాలికి గవర్నరుగా నియమించాడు. తర్వాత సయ్యద్ బహుదూద్ దిల్‌ఖాన్‌ను సుబేదారుగా నియమించాడు.

తానీషా చివరి రోజులు: తర్వాత ఔరంగజేబు బీదరుకు బయలుదేరాడు. అతనితోపాటే తానీషాను కుటుంబ సహితంగా తీసుకెళ్లారు. తనకు ఏకాంతాన్ని ప్రసాదించవలసిందిగా చక్రవర్తిని తానీషా కోరాడు. అతని కోర్కెను మన్నించి జాన్‌సఫద్‌ఖాన్ వెంట దౌలతాబాద్ కోటకు పంపాడు. అక్కడ అతనికి ఒక భవనం ఇవ్వబడింది. అదే అతని బందిఖానా. అక్కడే అతడు తన కుటుంబంతో కొంతకాలం నివసించాడు. అతనికి ఒక కుమారుడు కూడా కలిగాడు. అతనికి ఖుదాబందా అని పేరు పెట్టాడు. దౌలతాబాద్ కోటలో ఉండగా మరాఠా నాయకుడు రాజారామ్ అతనిని తప్పించడానికి ప్రయత్నించాడు. అది తెలిసి ఔరంగజేబు తానీషాను గ్వాలియర్ కోటకు పంపాడు. అందులో అతనికి తగిన మర్యాదలు ఇవ్వలేదు. బొఖార అనే ఖిలేదారుడు తానీషాకు మంచి భోజనం కూడా పెట్టలేదు. వారు పెట్టిన భోజనం తినలేక ఆహారం కూడా ముట్టకుండా తానీషా క్రీ.శ.1700 సంవత్సరంలో గ్వాలియర్ కోటలో మరణించాడు. అతనిని ఖుల్దాబాద్‌లోని షారాజ్ క్వొట్టాల్ అనే గురు ఆశ్రమస్థానంలో ఖననం చేసి సమాధిని నిర్మించారు. ఇదే కాంపౌండులో గోల్కొండను జయించిన మొగల్ సేనాని ఫిరోజ్‌జంగ్ కుమారుడు నిజాం ఉల్‌ముల్క్ అసఫ్‌జా సమాధి ఉంది. దానికి దగ్గరలోనే ఉన్న హజరత్ జైనుద్దీన్ మౌసోలియంలో ఔరంగజేబు సమాధి ఉంది. ఈ విధంగా తానీషా జీవితం ముగిసింది. అతనితో గోల్కొండ వంశం అంతరించింది.

గోల్కొండ రాజ్య పతనానికి కారణాలు: సాధారణంగా ఏ రాజ్య పతనానికైనా బలహీనమైన వారసులు, సైనిక నిర్వీర్యత, సామంతుల తిరుగుబాట్లు, ఆర్థిక దుస్థితి అని చెబుతాము. కాని గోల్కొండ రాజ్యపతనానికి ఇవి ఏవీ కారణాలు కావు. రాజ్యం సైనికంగా, ఆర్థికంగా బలిష్టంగా ఉంది. 7 కోట్ల ధనం ఖజానాలో ఉంది. రజాక్‌లారీ వంటి సాహసులైన సేనాధిపతులు ఉన్నారు. తానీషా విలాస పురుషుడైనా రాజ్యపాలన యందు శ్రద్ధ తీసుకొని విదేశీ పర్యటనలు చేసి ప్రజలను చక్కగా పాలించాడు. కనుక గోల్కొండ రాజ్యం ఒకే ఒక కారణం వల్ల పతనమైంది. అదే మొగలుల దండయాత్ర. అనేక యుద్ధాలలో ఆరితేరిన మొగలుల సైన్యానికి గోల్కొండ సైన్యం దీటు కాలేకపోయింది. పదేపదే మొగలులు చేసే దాడులకు గోల్కొండ సైన్యం తట్టుకోలేకపోయింది. కొందరు గోల్కొండ సేనాధిపతులు ఔరంగజేబుతో కలిసిపోయి ద్రోహం చేశారు. కనుక సైనిక ద్రోహం వల్లనే గోల్కొండ రాజ్యం పతనమైంది.

కుతుబ్‌షాహీ రాజ్యానికి పొరుగు రాజ్యాలతో సంబంధాలు

కుతుబ్‌షాహీలకు ఇతర దక్కను సుల్తాన్‌లతో సంబంధాలు: బహమనీ సామ్రాజ్య శిధిలాల మీద వెలసిన దక్కను సుల్తాన్ రాజ్యాలు ఐదు. క్రీ.శ.1490లో మొదటగా ఫతుల్లా ఇముద్ ఉల్ ముల్క్ ఎలిచేపూర్‌లో స్వతంత్రం ప్రకటించి బీరారులో ఇమద్‌షాహి వంశాన్ని స్థాపించాడు. అతడు మిగతా వారికి మార్గదర్శకుడయ్యాడు. అతని తర్వాత అదే సంవత్సరంలో క్రీ.శ.1490లో అహమ్మద్‌నగరంలో మాలిక్ అహమ్మద్ నిజాం ఉల్‌ముల్క్ స్వతంత్రం ప్రకటించి నిజాం షాహీ రాజ్యాన్ని స్థాపించాడు. అదే సంవత్సరంలో బీజాపూర్‌లో యూసఫ్ ఆదిల్‌షా కూడా స్వతంత్రం ప్రకటించి ఆదిల్‌షాహి వంశాన్ని స్థాపించాడు. క్రీ.శ.1492లో బీదర్‌లో బహమనీసుల్తాన్‌ను బంధించి అధికారం హస్తగతం చేసుకొని కాశింబరీద్ స్వతంత్రుడై బీదరులో బరీద్‌షాహి వంశాన్ని స్థాపించాడు. చివరగా క్రీ.శ.1518లో గోల్కొండలో కులీకుతుబ్‌షా స్వతంత్రం ప్రకటించి కుతుబ్‌షాహీ వంశాన్ని స్థాపించాడు. ఈ ఐదు రాజ్యాలు తమ చక్రవర్తిని ధిక్కరించి తమ ప్రాంతాలను సొంతం చేసుకున్నందున ఎవరికి వారే ఎక్కువ భాగం కొట్టేయాలనే తలంపుతో ఒకరి ప్రాంతంపై మరొకరు దాడులు చేసుకొని తమ రాజ్య విస్తరణ చేసుకోవాలని ఒకరితో ఒకరు సంఘర్షణలకు దిగి తమలో తాము యుద్ధాలు చేసుకొనేవారు. ఈ రాజ్యాల మధ్య సంబంధాలు అతి విచిత్రంగా ఉండేవి. ఒకరి ప్రాంతాలను ఒకరు ఆక్రమించడానికి యుద్ధాలకు దిగేవారు. అంతలోనే రాయబారాలు జరుపుకొనేవారు. మళ్లీ అంతలోనే సంధులు మరచి యుద్ధాలకు దిగేవారు. యుద్ధాల మధ్యలో ఒకరితో ఒకరు వియ్యాలు అంది తమ పిల్లలకు నిఖా చేసేవారు. నిఖా అయిపోగానే మళ్లీ వెంటనే యుద్ధాలకు దిగేవారు. వారిలో వారు ముఠాలు కట్టేవారు. అంతలోనే ముఠాలు మార్చేవారు. ఒకవైపు తమలో తాము పోట్లాడుకొనేవారు. మరొక వైపున విజయనగర రాజ్యంతో యుద్ధాలు చేస్తూ ఉండేవారు. ఈ విధంగా దక్కను ముస్లిం రాజ్యాల సంబంధాలు అతివిచిత్రంగా సాగాయి. మొదటితరంలో వారందరూ తాము గవర్నర్లుగా పనిచేస్తూ ఆయా భాగాలలో స్వతంత్రం ప్రకటించారు. కనుక ఆయా భాగాలలో తమ అధికారం స్థిరపరచుకొని అది తమ రాజ్యంగా గుర్తింపు తెచ్చుకోడానికి ఎవరికి వారు గట్టిగా కృషి చేశారు. రెండవ తరం నుండి ఎవరి రాజ్యానికి వారు సుల్తాన్‌లుగా స్థిరపడి తమ తమ హోదాలో ఒకరితో ఒకరు వ్యవహరించారు.

కులీకుతుబ్‌షా క్రీ.శ.1518-1543: గోల్కొండ రాజ్యస్థాపకుడైన కులీకుతుబ్‌షా స్వతంత్ర సుల్తాన్ హోదా ప్రకటించుకోకుండా తన రాజ్యాన్ని పటిష్టపరచుకోవడానికి ప్రయత్నించాడు. అతడు ఎవరితోనూ ఘర్షణ పడదలచుకోలేదు. సాధ్యమైనంత వరకు ఓర్పు చూపి సంప్రదింపులతో తన రాజ్యాన్ని స్థిరపరచాలని చూశాడు కాని అవతల వారి దుందుడుకు తనం వల్ల వారితో యుద్ధాలు చేయవలసివచ్చింది.

బేరారుతో సంబంధాలు: కులీ క్రీ.శ.1521లో కొండవీడుపై దాడిచేసినప్పుడు బహమనీ సరదారుడు కువామ్ ఉల్‌ముల్క్ ఎల్లందలపై దండెత్తాడు. కులీ అతనిని ఓడించి తరమగా అతడు బేరారు చేరి దర్యా ఇమాద్ ఉల్‌ముల్క్ ఆశ్రయం పొందాడు. కులీ బేరారుకు రాయబారం పంపి అతనికి ఆశ్రయం కల్పించవద్దని అంతేగాక తనకు చెందిన హప్పుతప్పా పొరపాటున బేరార్ రాజ్యంలో కలిసింది, అది కూడా తనకు అప్పగించాలని కోరాడు కాని దరియా ఇమాద్‌షా సమాధానం ఇవ్వకపోవడంతో కులీ బేరారు రాజ్యంపై దండెత్తి హప్పుతప్పాను ఆక్రమించాడు.

బీజాపూరుతో సంబంధాలు: కులీ గజపతితో పోరాడేటప్పుడు బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా కోవెలకొండను ఆక్రమించాడు. కులీ బీజాపూరుతో పోరాడి కోవెలకొండను తిరిగి స్వాధీనం చేసుకున్నాడు. కులీ తన హయాంలో ఎవరితోనూ ఎక్కువ స్నేహం చేయలేదు. ఎవరితోనూ ఎక్కువగా విరోధాన్ని పెంచుకోలేదు.

జంషీద్ క్రీ.శ. 1543-1550: జంషీద్ కాలంలో అతడు అహమ్మద్‌నగర్‌తో స్నేహం చేశాడు. అహమ్మద్‌నగర్ రాజ్యం బీజాపూర్‌తో చేసిన యుద్ధాలలో అతడు అహమ్మద్‌నగర్‌కు సహాయం చేశాడు. ఇతని కాలంలో గోల్కొండ అహమ్మద్‌నగర్ రాజ్యం ఒకటిగా, బీజాపూరు, బీదరు రాజ్యాలు ఒక కూటమిగా ఉండేవి. కాని చివరలో అహమ్మద్‌నగర్ బీజాపూరు, బీదరు సుల్తాన్‌లు ఒకరితో ఒకరు పోరాడుకొని జంషీద్ మధ్యవర్తిత్వాన్ని

కోరారు. వారిని క్రీ.శ.1547 సఖ్య పెట్టాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా క్రీ.శ.1550-1580: ఇతడు రాజ్యానికి రాగానే తన అన్న విధానాన్ని అనుసరించి అహమ్మద్‌నగర్‌తో స్నేహం చేశాడు. క్రీ.శ.1563 అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్‌షా తన కుమార్తె బీబీజమాల్‌ను ఇబ్రహీం కుతుబ్‌షాకిచ్చి వివాహం చేశాడు. దాంతో రెండు రాజ్యాల సంబంధాలు బంధు రాజ్యాలుగా మారాయి. రామరాయలతో విభేదాలు వచ్చి బేరారు తప్ప మిగిలిన నలుగురు సుల్తాన్‌లు ఏకమై తళ్లికోట యుద్ధంలో రామరాయలను వధించి విజయనగరాన్ని ధ్వంసం చేశారు. కాని తర్వాత ఎప్పటిలాగే మళ్లీ ఒకరితో ఒకరు కయ్యాలకు దిగారు. అందువల్ల ఇబ్రహీం కుతుబ్‌షా దక్కను రాజకీయాలను వదిలేసి కోస్తా ఆంధ్రను జయించాలని తన దృష్టిని తీరాంధ్రపైకి మళ్లించాడు. కాని చివరలో క్రీ.శ.1580లో బీజాపూరుతో నల్‌దుర్గం వద్ద యుద్ధం వచ్చింది. ఆ యుద్ధం పూర్తి కాకుండానే ఇబ్రహీం మరణించాడు.

మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1580-1612: మహమ్మద్ కులీకుత్‌బ్‌షా నల్‌దుర్గ యుద్ధాన్ని ఆపి తన చెల్లెలు చాంద్ సుల్తానాను బీజాపూరు సుల్తాన్ రెండవ ఇబ్రహీం ఆదిల్షాకు ఇచ్చి వివాహం చేశాడు. ఇతని తరంలో బీజాపూరు, గోల్కొండ రాజ్యాలు బంధు రాజ్యాలయ్యాయి. ఇతని కాలంలో మొగల్ చక్రవర్తి రాయబారిని పంపి గోల్కొండ రాజ్యం తనకు సామంత రాజ్యం కావాలని కోరాడు. కాని మహమ్మద్ కులీ అక్బర్ కోరికను తిరస్కరించి కొన్ని కానుకలనిచ్చి పంపాడు. ఇతని కాలంలో అక్బర్ అహమ్మద్‌నగర రాజ్యంపై దండెత్తాడు. చాంద్ బీబీ ఇతని సహాయం అర్థించింది. అతడు గోల్కొండ సైన్యాన్ని అహమ్మద్‌నగర్ రాజ్యానికి సహాయంగా పంపాడు. కాని అక్బరు చాంద్ బీబీని ఓడించి అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని మొగల్ సామ్రాజ్యంలో కలిపివేశాడు. అక్బరు మరణం తర్వాత మాలిక్ అంబర్ అహమ్మద్‌నగర రాజ్యాన్ని పునరుద్ధరించాడు. అతనికి మహమ్మద్ కులీ 16 లక్షల హొన్నుల ధన సహాయం చేశాడు.

సుల్తాన్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1612-1626: ఇతని కాలంలో ఎలాంటి యుద్ధాలు జరగలేదు. కాని అహమ్మద్‌నగర్ రాజ్య రక్షణకు మాలిక్ అంబర్‌కు ధన సహాయం చేశాడు.

అబ్దుల్లా హుసేన్ కుతుబ్‌షా క్రీ.శ.1626-1672: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో దక్కను సుల్తాన్‌లలో ఒకరికొకరితో పోరాటాలు జరగలేదు. కాని మొగలులను ఎదుర్కోవలసి వచ్చింది. ఇతని కాలంలో షాజహాన్ అహమ్మద్‌నగర రాజ్యాన్ని పూర్తిగా జయించి క్రీ.శ.1633లో మొగల్ సామ్రాజ్యంలో కలిపాడు. బీజాపూరు, గోల్కొండ రాజ్యాలను సామంత రాజ్యాలుగా చేసుకున్నాడు. అబ్దుల్లా సాలుకు 2 లక్షల హొన్నులు కప్పం మొగల్ చక్రవర్తికి చెల్లించడానికి అంగీకరించాడు.

అబుల్‌హసన్ తానీషా క్రీ.శ.1672-87: గోల్కొండ నవాబులలో తానీషా చివరివాడు. ఇతని కాలంలో దక్కనులో రెండే రాజ్యాలు మిగిలాయి. బేరారు, అహమ్మద్‌నగర్, బీదరులు మొగల్ సామ్రాజ్యంలో భాగాలై పోయాయి. బీజాపూరు, గోల్కొండ రాజ్యాలు మాత్రమే మిగిలాయి. మొగలులతో జరిగిన యుద్ధాలలో రెండు రాజ్యాలు ఒకరికొకరు సహాయం చేసుకున్నారు. అంతకు పూర్వం బీజాపూరు రాజ్యం బలంగా ఉండేది కాని ఈ కాలానికి బీజాపూరు రాజ్యం తగ్గిపోయి, గోల్కొండ రాజ్యం బలిష్టంగా తయారైంది. ఔరంగజేబు బీజాపూరు రాజ్యంపై రెండుసార్లు క్రీ.శ.1679లో, 1685లో దండెత్తాడు. రెండు పర్యాయాలు తానీషా బీజాపూరు రాజ్యానికి సహాయం చేశాడు. కాని ప్రయోజనం లేకపోయింది. తానీషా తన కుమార్తెను బీజాపూరు చివరి సుల్తాన్ అయిన సికిందర్ ఆదిల్‌షాకు ఇచ్చి వివాహం చేశాడు. ఇతని కాలంలో కూడా బీజాపూరు గోల్కొండ రాజ్యాలు బంధుత్వాన్ని కొనసాగించాయి. రెండు బంధు రాజ్యాలను ఔరంగజేబు జయించి ఆదిల్‌షా, కుతుబ్‌షా వంశాలను తొలగించి మొగల్ సామ్రాజ్యంలో కలిపేశాడు. దాంతో క్రీ.శ.1686లో బీజాపూరు, 1687లో గోల్కొండ రాజ్యాలు దక్కను చరిత్ర నుండి అదృశ్యమయ్యాయి.

గోల్కొండ కుతుబ్‌షాలకు మొగల్ చక్రవర్తులతో గల సంబంధాలు: మొగలులు మొదటి నుండి దక్కను సుల్తాన్‌లతో విరోధ భావాన్నే ప్రకటించారు. ఉత్తర హిందూ స్థానంలో వారి అధికారం స్థిరపడిన దగ్గర నుండి దక్కను సుల్తాన్‌లను తమ సామంతులుగా చేసుకోవాలని ప్రయత్నాలు ఆరంభించారు. దక్కను విధానాన్ని ప్రారంభించింది అక్బరు. అతడు ఖాందేష్ అహమ్మద్‌నగర్ రాజ్యాలను జయించాడు. తర్వాత షాజహాన్ బీజాపూరు, గోల్కొండలను లొంగదీసి తన సామంతులుగా చేసుకొన్నాడు. చివరకు ఔరంగజేబు రెండు రాజ్యాలను జయించి పూర్తిగా మొగల్ సామ్రాజ్యంలో కలిపి వేశాడు. గోల్కొండ రాజ్యాన్ని మొగలులు ఆక్రమించడంలో మూడు

ఘట్టాలు ఉన్నాయి.

1526లో బాబర్ ఢిల్లీ సుల్తాన్ సామ్రాజ్యాన్ని అంతం చేసి మొగల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. బాబర్ హుమాయూన్ కాలాలలో మొగల్ సామ్రాజ్యంలో అనేక ఆటుపోటులకు గురైనా అక్బరు కాలం నాటికి స్థిరపడి ఉత్తర భారతదేశమంతా మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. అక్బరు తర్వాత తన దృష్టిని దక్షిణదేశంపై నిలిపి, తన ఆధిపత్యాన్ని అంగీకరించమని దక్షిణదేశ ప్రభువులకు రాయబారులను పంపాడు. ఆ కాలంలో గొల్కొండనేలిన మహమ్మద్ కులీ కుత్‌బ్‌షా (1580-1612) అక్బరు రాయబారాన్ని తిరస్కరించి కొన్ని కానుకలిచ్చి పంపాడు అక్బరు దండయాత్రల ద్వారా దక్షిణదేశాన్ని జయించ సమకట్టి అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తి జయించాడు తర్వాత బీజాపూర్ గోల్కొండలను జయించాలని తలచాడు. కాని తన కుమారుడు సలీం తిరుగుబాటు చేసినందుకు అక్బరు గోల్కొండను జయించడానికి తగిన సమయం దొరకలేదు. ఆ తర్వాత కొద్దికాలానికే 1605లో అక్బరు మరణించాడు. తర్వాత సింహాసనానికి వచ్చిన జహంగీరు కాలంలో తండ్రి జయించిన అహమ్మద్‌నగర్ రాజ్యం కూడా స్వతంత్రమైంది. అందువల్ల గోల్కొండ మొగలులకు దూరంగా ఉండిపోయింది.

మొదటి ఘట్టం: షాజహాను కాలంలో గోల్కొండ రాజ్యంపై మొగలుల ఆధిపత్యం మొదలైంది. ఇది మొదటి ఘట్టం. షాజహాను రాజ్యానికి రాగానే తండ్రి కాలంలో స్వతంత్రం ప్రకటించిన అహమ్మద్‌నగర్ రాజ్యాన్ని జయించి 1636లో మొగల్ సామ్రాజ్యంలో భాగంగా చేశాడు. దాంతో మొగల్ సామ్రాజ్యం గోల్కొండ రాజ్య సరిహద్దుల వరకు విస్తరించింది. యుద్ధకాలంలో అహమ్మద్‌నగర్ సుల్తాన్‌కు గోల్కొండ నవాబు సహాయం చేశాడనే నెపంతో నాటి గోల్కొండ సుల్తాన్ అబ్దుల్లాహుస్సేన్ కుతుబ్‌షాను తన ఆధిపత్యం అంగీకరించమని బెదిరించాడు. అందుకు భయపడి హుస్సేన్ సాలుకు 20 లక్షల కప్పం కట్టే షరతుతో 1636లో షాజహాన్ సార్వభౌమాధికారాన్ని అంగీకరించాడు. దాంతో గోల్కొండ రాజ్యంపై మొగలుల ఆధిపత్యం ప్రారంభమైంది. ఇది గోల్కొండ రాజ్య పతనంలో మొదటి మెట్టు అయింది.

రెండవ ఘట్టం: షాజహాన్ తన కుమారుడు ఔరంగజేబును దక్కను గవర్నర్‌గా నియమించడంతో (1652-58) రెండవ ఘట్టం ప్రారంభమైంది. ఔరంగజేబు సామ్రాజ్యవాది. అతడు గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించాలని భావించి సమయం కోసం ఎదురు చూశాడు. దానికి తగినట్లు మరో అవకాశం కలిగింది.

ఔరంగజేబుకు అనుకూలించిన పరిస్థితులు: 1634లో హుస్సేన్‌షా అంగీకరించిన షరతు ప్రకారం కప్పం చెల్లించలేకపోయాడు. గోల్కొండ నవాబు మొగల్ చక్రవర్తి అనుమతి లేకుండా కడప, కర్నూలు, నెల్లూరు, పులికాట్, రాయవెల్లూరు, చెంగల్పట్టు, ఆర్కాగం ప్రాంతాలను జయించాడు. దానికి ఔరంగజేబు తప్పుగా భావించి సంజాయిషీ అడిగాడు.

మీర్జుమ్లా కుట్ర: గోల్కొండ సేనాని మీర్జుమ్లా (ఇతని అసలు పేరు మీర్ మహమ్మద్ సయీద్) పర్షియా దేశస్థుడు. అతడు ఒక వజ్రాల వ్యాపారి. వ్యాపారంపై దక్కను చేరి చివరకు గోల్కొండ కొలువులో చేరి చివరకు అతడు దానిని జయించి స్వతంత్రం ప్రకటించాడు. అందుకు హుసేన్‌షా కోపించి గోల్కొండలోని మీర్జుమ్లా కుటుంబాన్ని బంధించి అతని ఆస్తిపాస్తుల్ని స్వాధీనం చేసుకున్నాడు. మీర్జుమ్లా దక్కను గవర్నర్‌గా ఉన్న ఔరంగజేబు సహాయం అర్థించాడు. ఔరంగజేబు మీర్జుమ్లా కుటుంబాన్ని విడిపించమని హుస్సేన్ షాను ఆదేశించాడు. హుసేన్ షా అందుకు అంగీకరించకపోవడంతో ఔరంగజేబు 1656లో గోల్కొండపై యుద్ధం ప్రకటించాడు.

హైదరాబాద్ ముట్టడి క్రీ.శ.1656: ఔరంగజేబు తన కుమారుడైన మహమ్మద్‌కు పెద్ద సైన్యాన్నిచ్చి గోల్కొండ రాజ్యంపైకి పంపాడు. అతడు మీర్జుమ్లా సహాయంతో గోల్కొండ సైన్యాన్ని ఓడించి హైదరాబాదు నగరాన్ని స్వాధీనం చేసుకున్నాడు. హుస్సేన్ షా సంధిని అంగీకరించని ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని పూర్తిగా ఆక్రమించాలని యుద్ధాన్ని కొనసాగించాడు. అందువల్ల హుసేన్‌షా షాజహాన్‌కు మొర పెట్టుకోగా షాజహాను జోక్యంతో యుద్ధం ముగిసి 1658లో సంధి కుదిరింది.

సంధి షరతులు: ఈ సంధి ప్రకారం -

1. పాత కప్పం బకాయిలు చెల్లించాలి.
2. యుద్ధ నష్టపరిహారంగా 15 లక్షల పన్నులు చెల్లించాలి.
3. తన కుమార్తెను యువరాజు మహమ్మద్‌కిచ్చి వివాహం చేయాలి.
4. మీర్జుమ్లా ఆస్తిపాస్తులు మీర్జుమ్లా పరం చేయడానికి హుస్సేన్‌షా అంగీకరించాడు.

ఈ సంధితో గోల్కొండ రాజ్యం పూర్తిగా మొగలుల సామంత రాజ్యం అయింది.

చివరి ఘట్టం లేక మూడవ ఘట్టం: షాజహాను కుమారుల మధ్య వారసత్వ యుద్ధం జరిగి అందులో ఔరంగజేబు విజయం సాధించి 1658లో మొగల్ చక్రవర్తి అయ్యాడు. చక్రవర్తి అయిన తర్వాత ఔరంగజేబు తనపై తిరుగుబాటు చేసిన తన కుమారుడు అక్బరును బంధించడానికి దక్కను చేరాడు. గోల్కొండలను పూర్తిగా జయించాలని భావించాడు.

గోల్కొండ రాజ్యంపై దండెత్తడానికి గల కారణాలు: ఔరంగజేబు గోల్కొండ రాజ్యంపై దండెత్తడానికి అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి. అవి -

1. వారసత్వ యుద్ధం అప్పుడు బీజాపూర్ సుల్తాన్‌తోపాటు గోల్కొండ నవాబు కూడా మొగలులకు కప్పం కట్టడం మానేశాడు.
2. హుసేన్‌షా తర్వాత గోల్కొండ నవాబు అయిన తానీషా అక్కన్న, మాదన్న అనే హిందువులను తన మంత్రి సేనాధిపతులుగా నియమించాడు. వారు హిందువులైనందు వల్ల ఔరంగజేబు వారి నియామాకాన్ని సహించలేదు.
3. గోల్కొండ రాజ్యం ఔరంగజేబు విరోధి అయిన శివాజీతో మైత్రి సంధి చేసుకుంది. వారు కలసి కర్ణాటకపై దండెత్తి రాజ్యం సంపాదించాడు. శివాజీతో మిత్రత్వం నడపటం ఔరంగజేబుకు ఆగ్రహం కలిగించింది.
4. ఔరంగజేబు సున్నీ మతస్తుడు. గోల్కొండ నవాబు షియా మతస్తుడు.
5. తానీషా పరమత సహనం ఔరంగజేబుకు కంటకప్రాయమైంది.
6. మొగలులు 1666, 1679లలో బీజాపూర్‌తో చేసిన యుద్ధాలలో గోల్కొండ రాజ్యం బీజాపూర్‌కు సహాయం చేసింది.
7. మీర్జుమ్లా జాగీరు నుండి వచ్చే ఆదాయం గోల్కొండ సుల్తాను అనుభవిస్తున్నాడు.
8. గోల్కొండ రాజ్యం సిరిసంపదల నిలయం. దానిని ఆక్రమిస్తే ఆ సిరిసంపదలు తనవి కాగలవని ఔరంగజేబు తలంచాడు.
9. ఔరంగజేబు గొప్ప సామ్రాజ్యవాది. గోల్కొండ రాజ్య ఆక్రమణతో మొగల్ సామ్రాజ్యం విస్తరిస్తుందని తలచాడు.
10. ఔరంగజేబు బీజాపూర్‌ను ఆక్రమించినందుకు తానీషా ఔరంగజేబును తుచ్ఛమైనవాడని నిందించాడు. దాంతో ఔరంగజేబు గోల్కొండపై దండెత్తాడు.

షా ఆలం దండయాత్ర క్రీ.శ.1685: ఔరంగజేబు మొదట తన కుమారుడు షా ఆలంను గోల్కొండపైకి పంపాడు. కాని మాల్ఖేడ్ వద్ద గోల్కొండసేన మహమ్మద్‌ను అడ్డగించింది. మహమ్మద్ ముందుకు సాగలేక పోయాడు. అందువల్ల అతడు 1685 అక్టోబర్‌లో గోల్కొండ సేనాని మీర్‌మహ్మద్ ఇబ్రహీంకు లంచమిచ్చి హైదరాబాదును ఆక్రమించాడు. ఇప్పుడు సుల్తాన్ తానీషా హైదరాబాదును వదలి గోల్కొండ కోటకు పారిపోయి షా ఆలంతో సంధి చేసుకున్నాడు.

సంధి షరతులు: ఆ సంధి ప్రకారం -

1. అక్కన్న, మాదన్నలను ఉద్యోగాల నుండి తొలగించాలి.
2. మాల్ఖేడ్, దాని పరిసర ప్రాంతాలను మొగలులకు ఇవ్వాలి.
3. యుద్ధ నష్టపరిహారం కింద కోటి 20 లక్షల హోన్నులు చెల్లించాలి.
4. సాలుకు రెండు లక్షల హొన్నులు కప్పంగా చెల్లించడానికి తానీషా అంగీకరించాడు.

కాని అక్కన్న, మాదన్నలను తొలగించడం తానీషాకు ఇష్టం లేదు. పైగా ఔరంగజేబు కుమారుడు షా ఆలం, తానీషా మిత్రులయ్యారు. అతడు గోల్కొండకోటలో తానీషా అతిథిగా ఉన్నాడు. దాంతో ఔరంగజేబుకు తానీషాపై ఆగ్రహం, తన కుమారునిపై అనుమానం కలిగి తానే స్వయంగా గోల్కొండపై 1687 ఫిబ్రవరిలో దండెత్తాడు. మొదట తన కుమారుడు షా ఆలంను బంధించాడు.

గోల్కొండ పతనం క్రీ.శ.1687 అక్టోబరు 3: తర్వాత గోల్కొండ కోటను ముట్టడించాడు. కాని అక్కన్న, మాదన్నలు వీరోచితంగా పోరాడుతూ కోటను కాపాడారు. కాని అంతఃపురం రాణుల ప్రోద్బలంతో వారిని కొందరు దుండగులు హత్య చేశారు. వారి మరణానంతరం కూడా దుర్గం స్వాధీనం కాలేదు. 8 నెలలు ముట్టడి సాగింది.

చివరికి ఔరంగజేబు అబ్దుల్లా అనే ఆఫ్ఘన్ నౌకరుకు లంచం ఇచ్చి 1687 అక్టోబర్ 3వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు గోల్కొండ కోట తూర్పు ద్వారాన్ని తెరిపించాడు. మొగలు సైన్యం లోపలికి చొరబడింది గోల్కొండ సైనికులు వీరోచితంగా పోరాడారు.

అబ్దుల్ రజాక్ లారీ పోరాటం: ఈ పోరాటంలో అబ్దుల్ రజాక్ లారీ అనే సైనికుడు చూపిన పరాక్రమం వర్ణనాతీతం. లారీకి తానీషాపై అమిత ప్రభు భక్తి ఉంది. తానీషాను దైవంగా భావించేవాడు. మొగల్ సైన్యం కోటలో ప్రవేశించగానే ఒంటరిగా వారిని ఎదుర్కొన్నాడు. అందులో అతనికి 70 గాయాలయ్యాయి. నుదుటిపై చర్మం తెగి కండ్లకు అడ్డు పడింది. అయినప్పటికీ పోరాటం కొనసాగించాడు. అతని ప్రభు భక్తికి, పరాక్రమానికి మొగల్ సైనికులే గాక ఔరంగజేబు సహితం అచ్చెరువొందాడు. గాయాలతో స్పృహ తప్పి గుర్రంపై దౌడు తీసిందట. అతనిని వెదికి వైద్యం చేయించాలని ఔరంగజేబు భావించాడట. కాని ఆరోజు మధ్యాహ్నానికి అతని శవం ఒక చెట్టు కింద కనిపించగా ఖననం చేశారట.

తానీషాను బంధించడం: మొగల్ సేనలు కోటలో ప్రవేశించి రాజప్రసాదాన్ని ముట్టడించాయి. అప్పుడు తానీషా ఫలహారం చేస్తున్నాడు. వెంటనే మొగల్ సేనలు అతనిని బంధించి కోటను స్వాధీనం చేసుకున్నాయి ఔరంగజేబు సాలుకి 50 వేలు భరణంతో తానీషాను దౌలతాబాదు కోటకు బందీగా పంపాడు. ఆ కోటలోనే తానీషా 1700 సంవత్సరంలో మరణించాడు. అంతటితో కుతుబ్‌షాహీ వంశం అంతరించింది.

ఆంధ్రదేశం మొగలుల వశమవడం: 1687లో గోల్కొండ పతనంతో కుతుబ్ షాహీల అపార ధనరాసులు మణిమాణిక్యాలు, వజ్ర వైఢూర్యాలు, బంగారం, ఖజానా అంతా మొగలుల వశమైంది. వారి సామంత రాజ్యాలైన బెల్గాం, ఆదోని, సాగర్, కర్నూలు, రాయచూరి, బెంగుళూరు, కంచి, రాయవెల్లూరు, కర్ణాటక మొగలుల వశం అయ్యాయి. యావదాంధ్రదేశం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. ఆ విధంగా గోల్కొండ రాజ్యం అస్తమించింది

ఆంధ్రదేశంలో మొగలుల పాలన క్రీ.శ.1687-1724

కుతుబ్‌షాహి రాజ్యాన్ని కూలదోసి ఆంధ్రదేశాన్ని ఆక్రమించిన మొగలులు క్రీ.శ.1687 నుండి 1724 వరకు 37 సంవత్సరాలు పాలించారు. మొగలుల కాలం నాటి చరిత్ర తెలుసుకోవడానికి మహమ్మద్ సాకి ముస్తబద్ రాసిన మాసిరె అలంగీర్ గ్రంథం చాలా బాగా ఉపయోగపడుతోంది. ఈ గ్రంథం బీజాపూరు, గోల్కొండ ముట్టడులను గురించి అందులో అలంగీర్ బిరుదాంకితుడైన ఔరంగజేబు సాధించిన విజయ పరంపరల గురించి వివరిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్కీవ్స్ డిపార్టుమెంటులో భద్రపరచబడిన మొగల్ వంశానికి చెందిన సమాచార పత్రాలు కూడా మొగలుల నాటి ఆంధ్రదేశచరిత్రను రాసుకోడానికి ఉపయోగపడుతున్నాయి. అందులో షాజహాన్ కాలం నుండి బహదూర్ షా కాలం వరకు జరిగిన సంఘటనల సమాచారం ఉంది. కలిమాల్-ఇత్తయ్యబాతె అనే గ్రంథం దక్కనులో సుభాలు, వాటి పరిపాలనా విధానాలను గురించి సమాచారాన్ని తెలుపుతోంది. ఈ గ్రంథం ప్రకారం ఔరంగజేబు తాను మరణించే నాటికి అంటే క్రీ.శ.1707 నాటికి దక్కనును ఆరు సుభాలుగా విభజించాడు. ఖాన్‌దేశ్, బేరారు, ఔరంగాబాద్, బీజాపూరు, హైదరాబాద్, మచిలీపట్నం. పశ్చిమాంధ్ర దేశం హైదరాబాద్ సుభాలోను, తీరాంధ్రదేశం తూర్పు ఆంధ్రప్రాంతాలు మచిలీపట్టణం సుభాలో ఉండేవి. నల్లగొండ జిల్లా కూడా మొదట మచిలీపట్నం సుభాలో ఉండేది. కాని తర్వాత హైదరాబాద్ సుభాలో చేర్చారు. ఇవేగాక మొగలులు ఆంధ్రదేశాన్ని పాలించిన కాలంలో వివిధ ప్రాంతాలలో దర్గాలు, మసీదులు నిర్మించి వాటి నిర్వహణకు దానాలు చేసి శాసనాలు వేయించారు. ఆ శాసనాలలో రాజకీయ అంశాలు లేకపోయినా ఆయా ప్రాంతాలు మొగలుల వశంలో ఉన్నాయని ధృవపరుస్తున్నాయి. అలాగే కొన్ని ప్రదేశాలలో స్థానిక వ్యక్తులు దేవాలయాలకు దానాలు చేసి శాసనాలు వేయించారు. ఆ శాసనాలలో కూడా మొగల్ పాలకుల ప్రస్తావన ఉంది. కనుక ఆ ప్రాంతాలలో మొగలులు పాలించినట్లు ధృవపరుస్తున్నాయి. ఇలాంటి శాసనాలు ఆంధ్రదేశం అంతటా లభించాయి. అవి ఆంధ్రదేశం అంతా మొగలుల వశంలో ఉందని స్పష్టం చేస్తున్నాయి. చిత్తూరు జిల్లా మదనపల్లి మండలంలోని కొండమర్రిపల్లి గ్రామంలో సానిచెరువు తెగిపోగా చెరువుగండ్లు పూడ్చడానికి బసివికొండ బ్రాహ్మణులకు, వర్తకులకు మొగల్ ఫౌజ్‌దారు కౌలుకు ఇచ్చినట్లు క్రీ.శ.1691లోనే వేయించిన శాసనం ఉంది. అలాగే కడపజిల్లా పులివెందుల గ్రామంలో 1691 హజరత్ మహమ్మద్ జాఫర్ సాహెబ్‌గారి ఆజ్ఞతో అక్కడ కౌలుకు సంబంధించిన శాసనంగా వేయబడింది. క్రీ.శ.1692లో బసివికొండలోని చెరువు తెగిపోగా దానిని పునర్నిర్మాణం చేయడానికి యుసకనూలుపల్లె బోయనాయకులకు కౌలుకు ఇచ్చినట్లు మొగల్ హవల్దార్ నరసాచంద్రయ్య పంతులు వేయించిన శాసనం క్రీ.శ.1696 పులివెందుల మండలంలోని బుర్రకాయ కోటలో గుర్రంకొండ ఫౌజ్‌దార్ ఇనాయత్ ఖాన్ అక్కడ భూమిని కొలిపించినట్లు తెలుపుతోంది. ఈ శాసనం చివరలో ఒక తెలుగుపద్యం కూడా ఉంది. క్రీ.శ.1697 సంవత్సరం నాటి శాసనంలో బోలవరం స్థలకరణం రెండు ఇద్దుముల రేగడి, భూమిని వాస్తుశిల్పికి దానం చేసినట్లు వేయబడింది. ఈ శాసనంలో ఔరంగజేబు పాదుషా హస్తినాపురంలో రత్న సింహాసనారూఢుడై పృధ్వీరాజ్యం చేస్తున్నాడని ఉంది. ఆ నాడు ఢిల్లీని హస్తినాపురం అని వారు శాసనాలలో రాయించారని తెలుస్తోంది. అలాగే అముదానగరంలో రాజ్యం చేస్తున్నాడని కూడా ఉంది. అముదానగరం అంటే అహమ్మద్‌నగరం కావచ్చును. లేక ఢిల్లీనే అముదానగరం అని రాశారేమో. కంచి దగ్గర ఉన్న పుట్టిరి గ్రామ కాపులు రజబ్‌ఖాన్ ఫౌజ్‌దార్ పాలించే కాలంలో తిమ్మభట్టు 1 కాణి 700 గుంటలు, 244 అడుగుల భూమిని దానం చేసి శాసనం వేయించారు. గుంటూరుజిల్లా నర్సరావుపేట మండలంలోని ముక్తేశ్వరం తేజోఖాన్ మసీదు మాన్య శాసనం ఉంది. అక్కడే బలూలాఖాన్ మసీదుకు మాన్యం ఇచ్చినట్లు మరొక శాసనం ఉంది. మదరాసు వద్ద పల్లవరంలో షేక్ ముసామియా సాహెబ్ ఒక పేటను నిర్మించి బావులు తవ్వించి అంగడిని ఏర్పాటు చేశాడని తెలుగుపద్యంలో శాసనం రాయించబడింది. ఈ శాసనాలన్నీ ఆంధ్రదేశం అంతటా మొగలుల ఆధిపత్యంలో ఉందని చాటుతున్నాయి. క్రీ.శ.1736 నాటికి అంటే అసఫ్‌జాహీ కాలం నాటి శాసనం ఒకటి విశాఖపట్టణం జిల్లాలోని చోడవరంలోని కేశవస్వామి దేవునికి దానం చేసినట్లు తెలుపుతోంది. ఈ శాసనంలో పూసపాటి

సీతారామరాజు కుమారుడు విజయరామరాజు ఆ ప్రాంతాన్ని పాలిస్తున్నట్లు తెలుపుతోంది. అతడు అసఫ్జా సామంతుడు. అలాగే శక 1662 అంటే క్రీ.శ.1740 అసఫ్జా కాలానికి చెందిన శాసనం ఒకటి అనంతపురం జిల్లా గుత్తిమండలంలోని కొనకొండ్ల భోగేశ్వరాలయంలో ఉంది. ఈ శాసనం గౌతమ గోత్రీకుడైన తిమ్మాజి దేవాలయ ధర్మకర్త కొండమయ్య అనే అతనికి కేశవనాధునికి అర్చనకు ఆ గ్రామాలను భూదానం ఇచ్చి ఈ శాసనం వేయించాడు.

అందులో అబుల్హసన్ తానీషా ప్రశంస ఉంది. 1687 నాటికే తానీషా రాజ్యం పోయింది. క్రీ.శ.1740లో ఈ శాసనంలో తానీషా ప్రస్తావన ఎందుకు చేయబడిందో తెలియదు. మొగలుల పాలనాకాలంలో ఆంధ్రదేశంలో తపాల పద్ధతిని ప్రవేశపెట్టారు. వారు ఆంధ్రదేశంలో దండు బాటలను నిర్మించారు. హైదరాబాద్ మచిలీపట్నం రోడ్డును పునర్నిర్మాణం చేసి రోడ్డు పక్కన బావులు తవ్వారు. సరాయిలు నిర్మింపబడ్డాయి. మసీదులు, లంగురు ఖానాలు నిర్మింపబడ్డాయి. రాచబాటలను గుర్తించడానికి మైలు మైలుకు గుమ్మటాలు, విశ్రాంతి భవనాలు, మసీదులు నిర్మించారు. వాటి శిధిలాలు నేడు కూడా కనిపిస్తున్నాయి. హైదరాబాద్ నుండి పెద అంబరుపేట, బాటసింగారం, తూఫ్రాన్పేట, దండుమల్కాపురం, కోయల గూడెం, చౌటుప్పల్, గుండ్రాంపల్లి చిట్యాల, నార్కాట్పల్లి, పామనుగుండ్ల, సూర్యపేట, మునగాల, మిర్యాలగూడెం, వాడపల్లి వరకు మరొక దండుబాట నిర్మింపబడింది. ఈ బాట కిరువైపులా సరాయిలు, బావులు, మసీదులు నిర్మింపబడ్డాయి. అవి నేడు కూడా ఉన్నాయి. దండుబాట అంటే సైన్యం నడిచేబాట అని అర్థం. మొగలులు తమ సైన్యాలను అన్ని ప్రాంతాలకు సులభంగా త్వరగా నడుపుకొని ఆయా ప్రాంతాలపై తమ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి నిర్మించుకొన్న బాటలవి

మొగలుల కాలం నాడు ఆంధ్రదేశంలో ఉత్తరసంస్కృతి వ్యాపించింది. 14వ శతాబ్దం నుండే ముస్లిం సంపర్కం వల్ల సంస్కృతి, మరాఠీ, హిందీభాషల సంపర్కంతో అపభ్రంశ రూపంలో దక్కన్ భాష జన్మించింది. ఈ భాష మెదట ముస్లిం సైనిక గుడారాలలో జన్మించింది. దానిని ఆ కాలంలో లష్కర్ భాష అని పిలిచేవారు బీజాపూరు, గోల్కొండ సుల్తాన్ల ఆదరాభిమానాలతో ఈ భాష అభివృద్ధి చెంది దక్కను భాషగా వ్యవహరించబడింది. తర్వాత ఈ భాషలో అరబ్బీ, పారశీక భాష పదాలు చేరి నూతన భాషగా రూపొందింది దానిని ముహావరె-షాజహానాబాద్ అని పిలిచేవారు. అదే చివరకు ఉర్దూ భాష అయింది. ఉర్దూ భాష కావ్య భాషగా మారింది. మొగల్ యుగంలో కావ్య భాషగా రూపొంది అసఫ్జాహీల కాలంలో రాజభాషగా మారింది మొగల్ సంస్కృతి, దక్కను సంస్కృతిలో మిళితమై ఆంధ్రదేశంలో నూతన సంస్కృతి ఆవిర్భవించింది. చిత్ర లేఖనం, వాస్తు నిర్మాణాలలో ఈ నూతన ఒరవడి ప్రవేశించింది. హైదరాబాద్ నగరానికి నూతన శోభ వచ్చింది

క్రీ.శ.1687లో గోల్కొండ రాజ్య పతనంతో ఆంధ్రదేశం తన స్వంత వ్యక్తిత్వాన్ని కోల్పోయి మొగల సామ్రాజ్యంలో భాగమై అంతర్లీనంగా యావద్భారతదేశ చరిత్రలో ఒక భాగంగా మారి నడవసాగింది. మొగలులు దూర ప్రాంతాలకు చెందిన వారైనందువల్ల వారు ఆంధ్రదేశంపై తగిన శ్రద్ధ తీసుకోలేకపోయారు. అందువల్ల ఆంధ్రదేశం ఆర్థికంగా, సాంస్కృతికంగా క్షీణించసాగింది. మొగల్ సామ్రాజ్యం భౌగోళికంగా చాలా విశాలమైంది క్రీ.శ.1707లో ఔరంగజేబు మరణానంతరం మొగల్ సామ్రాజ్యమంతటా తిరుగుబాట్లు, అరాచకత్వం తాండవించాయి. మహారాష్ట్రులు మొగల్ సామ్రాజ్య భాగాలలో దోపిడీలు చేయసాగారు. వారిని ప్రతిఘటించే శక్తి మొగల్ సరదారులలో లేకపోయింది. మొగల్ సింహాసనం కోసం మొగల్ రాకుమారులు అంతర్యుద్ధంలో మునిగిపోయారు. వారి సర్దారుల చేతులలో కీలుబొమ్మలయ్యారు. తత్ఫలితంగా మొగల్ దర్బారు కుట్రలకు, కుతంత్రాలకు నిలయమై పోయింది. సామంతులు జమీందారులు స్వార్థపరులై కప్పాలు, శిస్తులు చెల్లించడం మానేశారు. ప్రజలపై విపరీతమైన పన్నులు వసూలు చేశారు. వారే గ్రామాలపైబడి దోచుకోసాగారు. దీనికి తోడు మహారాష్ట్రులు హఠాత్తుగా వచ్చి గ్రామాలు దోచి ప్రజలకు కడగళ్లు కలిగించారు. దొంగల గుంపులు కూడా విజృంభించాయి. ప్రజల ధన మాన ప్రాణాలకు రక్షణ లేకుండాపోయింది. కనుక గోల్కొండ పతనం తర్వాత ఏర్పడిన మొగల్ రాచరికాన్ని ఆంధ్రదేశ చరిత్రలో అరాచకయుగమని చెప్పవచ్చును. మొగలులు ఆంధ్రదేశాన్ని క్రీ.శ.1687 నుండి 1724 వరకు 37 సంవత్సరాలు పాలించారు. ఈ 37 సంవత్సరాల పాలనలో ఆంధ్రదేశ చరిత్రలో పరిపాలనపరంగా, రాజకీయపరంగా అనేక మార్పులు వచ్చాయి. పరిపాలనపరంగా ఆంధ్రదేశంలో మొగల్ పరిపాలనా విధానం ప్రవేశపెట్టబడింది. రాజకీయంగా జమీందారులు బలపడి స్థానిక జమీందారీ వ్యవస్థ ఏర్పడటానికి దారి తీసింది.

గోల్కొండ రాజ్యపు వ్యక్తిత్వాన్ని నాశనం చేయడం: బీజాపూరు, గోల్కొండ రాజ్యాలను జయించడంతో దక్కను మొత్తం తుంగభద్రానది వరకు మొగలుల స్వాధీనమైంది. కోస్తాలో రాయవెల్లూరు వరకు మొగలుల ఆధిపత్యంలోకి వచ్చింది. ఆ విధంగా వచ్చిన ప్రాంతం మొత్తాన్ని ఔరంగజేబు ఖాన్‌దేశ్, బీరార్, ఔరంగాబాద్, బీదర్, బీజాపూరు, హైదరాబాద్ అనే ఆరు భాగాలుగా విభజించాడు. గోల్కొండ రాజ్యంలో తెలుగు సాంప్రదాయాలు, పూర్వపు తెలుగు పరిపాలనా పద్ధతులు ఉండేవి. వాటికి సొంత వ్యక్తిత్వం ఉంటే భవిష్యత్తులో ఏ మాత్రం వీలైనా స్వతంత్రం ప్రకటించవచ్చని, అవి తిరిగి పూర్వపు ఔన్నత్యాన్ని సాధిస్తే మొగల్ సార్వభౌమాధికారానికి భంగం ఏర్పడుతుందని భావించి వాటి సొంత వ్యక్తిత్వాలను నిర్మూలించాలని తలచాడు. గోల్కొండ రాజ్యంలో పరిపాలన వికేంద్రీకరించి ఉండేది. ప్రాచీన కాలం నుండి గ్రామపరిపాలన, స్థానిక పరిపాలన స్థానికుల చేతిలో ఉండేది. గోల్కొండ నవాబులు కూడా స్థానిక పరిపాలనలో జోక్యం పెట్టుకోలేదు. మొగలు చక్రవర్తులది కేంద్రీకృత పరిపాలన. కనుక గోల్కొండ రాజ్యంలోని వికేంద్రీకృత పరిపాలనను తొలగించి మొగల్ పరిపాలన విధానాన్ని ప్రవేశపెట్టడానికి వ్యవధి లేకపోయింది. అందువల్ల కుతుబ్‌షాహీల దర్బారులో పని చేసిన ఉద్యోగులను కూడా మొగల్ సేవలోకి తీసుకున్నాడు. వారు షియా వారైనా తీసుకోక తప్పలేదు. వారితోపాటు కొందరు హిందువులను కూడా ఉన్నతోద్యోగాలలో నియమించాడు. బాబూ పండిత మొదలైన హిందువులు మొగలుల దర్బారులో చేరారు. కాని ఇదంతా తాత్కాలికమే. మొగల్ అధికారం స్థిరపడిన దాకా వారి సేవలను వినియోగించుకోదలచాడు. వారిని తీసుకోకపోతే వారు తిరుగుబాట్లు చేస్తారని భావించాడు. మొగల్ అధికారం స్థిరపడిన తర్వాత పూర్వపు గోల్కొండ ఉద్యోగులను ఉత్తర దేశానికి బదిలీ చేసి స్థానికులను లేకుండా చేశాడు. అంతకుముందు గోల్కొండలో కూడా ఎక్కువ సైన్యాన్ని ఉంచలేదు. నియమింపబడిన ఉన్నతోద్యోగులంతా ఉత్తర దేశస్తులు. ఈ విధంగా హైదరాబాద్ వ్యక్తిత్వాన్ని నాశనం చేశాడు. తర్వాత కేంద్రీకృత పరిపాలనను కూడా ప్రవేశపెట్టాడు.

మొగలుల పరిపాలన విధానం: అక్బరు కాలం నుండి మొగలుల పరిపాలన విధానం పటిష్ఠమైనది. అతడు సామ్రాజ్యాన్ని సుభాలుగా, సుభాలను సర్కారులుగా, సర్కారులను పరగణాలుగా విభజించాడు. సుభాకు అధిపతిగా సుబేదార్ అనే అధికారిని నియమించాడు. సుబేదార్‌ను నిజాం అని కూడా పిలిచేవారు. సుబేదార్ సుభారక్షణ, యుద్ధాలు నిర్వహించేవాడు. అతనికి సహాయంగా రెవెన్యూ వసూలుకు దివాన్ అనే అధికారిని నియమించాడు. సర్కార్‌లలో ఫౌజ్‌దార్లు, పరగణాల పాలనకు షిక్‌దార్లను నియమించాడు. ఔరంగజేబు కాలంలో దివాన్ అధికారాలు తగ్గించబడ్డాయి. సర్కారునే జిల్లా అని కూడా పిలిచేవారు. అక్కడ రెవెన్యూ అధికారిని అమీల లేక అమల్ గుజార్ అని పిలిచేవారు. అతనికి శిస్తు వసూలులో బిటిక్చి, ఖజాన్‌దార్, అనే ఉద్యోగులు సహాయంగా ఉండేవారు. బిటిక్చి రెవెన్యూ రికార్డులు రాసేవాడు. పరగణాల అధికారి షిక్దార్. అతనికి కర్కున్ అనే రికార్డు రాతగాడు సహాయపడేవాడు. కర్కున్ పరగణా కరణం కావచ్చును. స్థానిక కైఫీయత్తుల వల్ల ఆ నాడు ఆంధ్రదేశంలో నియమింపబడిన కొందరు ఉద్యోగుల పేర్లు తెలుస్తున్నాయి. దేవరకొండ సర్కారులోని సిరికొండ పరగణాకు మీర్‌మహమ్మద్ షరీఫ్ షిక్దార్‌గా నియమింపబడ్డాడు. అదే పరగణాకు గురుదాస్ అనే అతడు కర్కున్‌గా నియమింపబడ్డాడు. గోల్కొండ రాజ్యానికి సంబంధించిన ఆదాయాన్ని గురించి మనకు తెలుస్తోంది. Gulzarilal Ahquar రాసిన Tarikhi-Zafarah గ్రంథం క్రీ.శ.1685లో గోల్కొండ రాజ్యానికి వచ్చిన ఆదాయ పట్టికను ఇచ్చింది. దాని ప్రకారం ఆదాయం 1,68,69065-6 అని తెలిపింది. అలాగే Lachhmi Narayan Shafiq రాసిన Haquqat-I-Hindustan 1789-90 సంవత్సరంలో మొగల్ సుభాల నుండి వచ్చిన ఆదాయపట్టికను ఇచ్చింది.

సుభా	సర్కారులు	పరగణాలు	ఆదాయం
ఔరంగాబాద్	12	147	127,78498 - 6 1/2
ఖాందేష్	6	138	58,80022 - 10 1/2
బికాకె	5	252	122,68762 - 12
బీదరు లేక ముహమ్మదాబాద్	7	83	69,42102 - 0
బీజాపూరు - బీజాపూరు కర్ణాటకతో సహా	18	252	784,40142 - 12
హైదరాబాద్	46	411	660,11227 - 3/4

బాల్గాఘాట్, పైన్‌ఘాట్ కర్నాటకలతోసహా	94	1281	1823,20756 - 9 1/2

మొగల్ దక్కన్ వైస్రాయ్‌లు

ఖాన్ ఐ జహన్ జఫర్‌జంగ్ కొకల్‌టాఫ్	1-3-1680
గాజు ఉద్దీన్ ఖాన్ ఫిరోజ్ జంగ్	-3-1707
ముజ్జమ్ లేక మవుజమ్ రాకుమారుడు	1708
దుల్ఫిజర్ ఖాన్	15-3-1709
నిజాం-ఉల్-ముల్క్	2-3-1713
హుసేన్ ఆలీఖాన్	3-2-1724
ముజా రిజ్ ఖాన్	3-2-1724
నిజాం-ఉల్-ముల్క్	20-6-1725

ఆంధ్రదేశంలో మొగల్ సుబేదారుల పరిపాలన

రాహుల్లాఖాన్ క్రీ.శ.1687: ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని జయించి తర్వాత దానిని హైదరాబాద్ సుభాగా రూపొందించి క్రీ.శ.1687లో రాహుల్లాఖాన్‌ను హైదరాబాద్ సుబేదారుగా నియమించాడు. ఇతడు హైదరాబాద్‌కు మొదటి సుబేదార్. ఇతని కాలంలో ఔరంగాబాద్‌లో ఉండే దక్కన్ వైస్రాయ్ ఖాన్ అయిజహాన్ జఫర్‌జంగ్ కొకల్‌టాష్ అతడు ఇతనిపై అజమాయిషీ చేసేవాడు. రాహుల్లాఖాన్ కొద్దికాలమే హైదరాబాద్ సుబేదార్‌గా పని చేశాడు. ఇతని కాలంలో హైదరాబాద్ రాజ్యంలో అశాంతి ప్రబలింది. దర్బారులో హిందువులనందరినీ తీసిపారేశారు. స్థానిక ముస్లింలకు కూడా గౌరవమర్యాదలు లేవు. హిందూ జమీందార్ల అధికారాలు తగ్గించివేశారు. గోల్కొండ యుద్ధం సుదీర్ఘకాలం సాగినందువల్ల ఆ పరిసర ప్రాంతాలలో వ్యవసాయం సాగలేదు. పంటలు పండలేదు. స్థానిక పరిశ్రమలు, వృత్తులు నశించిపోయాయి. ప్రజలు దరిద్రులయ్యారు. వజ్రాల గనులు మూతపడిపోయాయి. దక్షిణదేశంలోనే అతి పెద్ద వ్యాపారకేంద్రమైన గోల్కొండ దివాలా తీసింది. దక్కనుకు రాజధాని ఔరంగబాద్ అయినందువల్ల దేశపు సంపద అంతా పన్నుల రూపంలో ఔరంగాబాద్‌కు తరలిపోయింది. గోల్కొండ నామమాత్రపు రాజధానిగా ఉంది. ఎవరికీ ఉద్యోగాలు లేవు. పూర్వపు గోల్కొండ ఉన్నత ముస్లిం వర్గాలకు కూడా ఆదాయాలు లేకుండాపోయాయి. దొంగలు స్వైరవిహారం ప్రారంభించారు. పట్టపగలే దారులుకాచి ప్రజలను, వ్యాపారులను దోచుకోసాగారు. ఈ దొంగలకు తోడు మరాఠీ దండు దక్కనులో గ్రామాలపైబడి దోచుకోసాగారు. ప్రజలను రక్షించవలసిన స్థానిక జమీందారులు కూడా ప్రజలను దోచుకో సాగారు. అంతకుముందు సుభిక్షంగా ఉన్న గోల్కొండ రాజ్యం ఈ విధంగా ఒక్క సంవత్సరంలోనే అరాచకానికి నిలయం అయిపోయింది. దానికి తోడు క్రీ.శ.1688లో మానవ కళేబరాలతో నిండిపోయాయట. బ్రతికిన మిగిలిన వారు తమ గ్రామాలను వదలేసి వలస పోయారట. క్షామం తర్వాత మసూచి వ్యాధిన పడి మరికొంత మంది మరణించారట. ఈ విధంగా విలయతాండవం చేసిన క్షామం, మసూచి వ్యాధులను గురించి ఫ్రెంచి వర్తకుడు మార్టిన్ వర్ణించాడు. ఈ స్థితిలో మరాఠా దండు హైదరాబాద్ రాజ్యంపై బడింది. ప్రజలను ఇష్టానుసారంగా దోచుకున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రవేశించి గందరగోళం సృష్టించారు. వారిని ఎదిరించడానికి చాలినంత సైన్యం లేకపోవడంతో సుబేదార్ రాహుల్లాఖాన్ గోల్కొండ కోటకు పారిపోయి తలదాచుకున్నాడు. అతడు సుబేదార్ పదవిని నిర్వహించలేక క్రీ.శ.1687 చివరలో ఢిల్లీ వెళ్లిపోయాడు. అతని స్థానంలో ఖాన్ సిఫిర్‌ఖాన్ సుబేదార్‌గా నియమింపబడ్డాడు.

ఖాన్ సిఫిర్‌ఖాన్ క్రీ.శ.1688-1700: ఖాన్ సఫిర్‌ఖాన్ బీజాపూర్ సుబేదార్‌గా కొన్నాళ్లు పనిచేశాడు. అతడు సమర్థుడు. మంచి సేనాధిపతిగా పరిపాలనాదక్షుడుగా పేరు తెచ్చుకున్నాడు. ఇతని కాలంలో కూడా ఔరంగాబాద్‌లో వైశ్రాయిగా ఖాన్ ఐజహాన్ కొకల్‌టాష్ పనిచేశాడు. సిఫిర్‌ఖాన్ మరాఠీదాడులను అరికట్టి శాంతిభద్రతలను నెలకొల్పే బాధ్యతను చేపట్టాడు. అందుకు కొన్ని ముఖ్యప్రదేశాలలో కోటలను బాగుచేయించి అందులో బలమైన సుశిక్షితమైన ఫౌజును నిలిపాడు. సమర్థులైన ఫౌజ్‌దార్లను ఆ కోటల రక్షణకు నియమించాడు. తన ఫౌజ్‌దారీ ప్రాంతాలలో దొంగలను అణచి శాంతిభద్రలతను కాపాడటం, మరాఠా దండు వస్తే వారిని ఎదుర్కొని తరిమివేయడం వారి విధులు. కౌలాస్, ఎల్లందల, మెదక్ జిల్లాలోని నర్సపూరు, కొహిర్, భొనగిరి, వరంగల్లు, ఖమ్మంమెట్టు మెదలైన తెలంగాణ ప్రాంతాలు ఉత్తరకోస్తాలో (చికాకోల్) శ్రీకాకుళం, రాజమండ్రి, పశ్చిమగోదావరి జిల్లాలో నర్సపూరు, రాయలసీమలో కడప, కర్నూలు, ఆదోని, నెల్లూరులోని కోటలను బాగుచేయించి ఫౌజులను నిలిపాడు. దాంతో రాజ్యానికి రక్షణ ఏర్పడింది. మచిలీపట్నం, నిజాం పట్టణాలు ఆ నాడు గొప్ప రేవులు. అక్కడ నుండి విదేశీ వ్యాపారం జరిగేది హైదరాబాద్ రాజ్యానికి సుంకాల రూపంలో పెద్దగా ఆదాయం వచ్చేది. కనుక ఆ రెండు ప్రదేశాలలో గట్టి రక్షణ ఏర్పాటు చేశాడు. సుంకాలు వసూలు చేయడానికి దేశ్‌ముఖ్‌లను నియమించాడు. సైనికంగా రక్షణ ఏర్పాటుకు మంచి శిక్షణ పొందిన ఫౌజ్‌దార్లను నియమించాడు. దాంతో అక్కడి ఖమ్మంమెట్టులోను గుర్రపుదళంతో, ప్రత్యేకదళాలతో రాణాలను నెలకొల్పాడు. ఇవి ఏజెన్సీ ప్రాంతాలు. తరచూ తిరుగుబాట్లు, అల్లర్లు జరుగుతుండేవి. వాటిని అణచడానికి గుర్రపు దళాన్ని ఉంచాడు.

హవేలీ భూములు: ఈ దుర్గాలలో పని చేసే సైన్యాలకు, ఉద్యోగుల పోషణకుగాను ఆ దుర్గాల చుట్టూ 15

కిలోమీటర్ల దూరంలో ఉన్న భూములన్నీ రాజక్షేత్రాలుగా మార్చాడు. ఆ రాజక్షేత్రాలనే హవేలీ భూములని పిలిచేవారు. ఆ భూముల మీద వచ్చే ఆదాయం దుర్గాల నిర్వహణకు సరిపోయేది. ఈ భూములపై వచ్చే శిస్తును ఫౌజుదార్లే వసూలు చేసేవారు.

దక్కను మొత్తానికి అంటే ఆరు సుభాలకు ఔరంగాబాద్ రాజధాని చేయబడింది. దక్కను వైస్రాయి ఔరంగాబాద్‌లో ఉండేవాడు. ప్రతి సుభాలో ఒక సుబేదార్, ఒక ఫౌజ్‌దార్ ఉండేవాడు. అతడు ఔరంగాబాద్‌లోని సుబేదార్‌కు లోబడి తన సుభాను పాలించేవాడు. గోల్కొండను ఒక సైనిక స్థావరంగా చేశారు. దాంతో పూర్వపు గోల్కొండ రాజ్యం తన వ్యక్తిత్వాన్ని కోల్పోయింది.

హైదరాబాద్ సుభా పరిపాలన: హైదరాబాద్‌లో ఒక సుబేదార్ నియమింపబడ్డాడు. అతడు ఔరంగాబాద్‌లోని వైస్రాయి ఆజ్ఞలలో ఉండేవాడు. హైదరాబాద్ నగర రక్షణకు ఒక ఫౌజ్‌దార్, శాంతిభద్రతల పరిరక్షణకు కొత్వాల్, గూఢచారి శాఖను నిర్వహించడానికి భక్షీ అనే ఉద్యోగులు నియమింపబడ్డారు. ఔరంగజేబు మొగలుల ఏకీకృత పాలన ప్రవేశపెట్టాలని తలచాడు గాని హైదరాబాద్ రాజ్యంలో అది సాధ్యం కాలేదు అందువల్ల కొన్ని మొగల్ పరిపాలనా విధానాలు, కొన్ని పూర్వ కుతుబ్‌షాహి పరిపాలనా విధానాలను జోడించి మిశ్రమ పరిపాలనా విధానాన్ని రూపొందించారు. అందువల్ల హైదరాబాద్ రాజ్యాన్ని ఎక్కువగా 21 సర్కారులుగా విభజించారు. దక్కను సుభాలన్నింటిలో హైదరాబాద్ సుభాలోనే సర్కారులు ఎక్కువ.

తెలంగాణలో

1. కౌలాస్	2. ఎల్లందల	3. మెదక్	4. మలంగూర్
5. వరంగల్	6. కోయిలకొండ	7. గోల్కొండ	8. భోనగిరి
9. ఘనాపూర్	10. నల్లగొండ	11. దేవరకొండ	12. పానగల్లు
13. ఖమ్మం మెట్టు			

కోస్తాలో

14. చిక్కాకోల్	15. రాజమహేంద్రవరం	16. ఏలూరు	17. కొండపల్లి
18. మచిలీపట్నం	19. కొండవీడు లేక గుంటూరు	20. నిజాంపట్నం	21. కంభం

అనేవి మొగలులు ఏర్పాటు చేసిన సర్కారులు.

బహుదూర్‌షా కాలంలో దక్కను వైస్రాయి ధుల్ఫిర్ ఖాన్ నియమింపబడ్డాడు. ఇతనికే జుల్ఫిర్‌ఖాన్ అని కూడా పేరుంది. అతని ప్రత్యర్థి మరొక సర్దారైన మునిమ్‌ఖాన్ దుల్ఫిర్‌ఖాన్ అధికార హోదాను తగ్గించడానికి ఖాందేష్ బేరార్‌లో సగభాగం చేయమన్నాడు. ఇవి ఏ నాడూ దక్కనులో లేవు. ఆ ప్రాంతాన్ని పైన్‌ఘాట్ అని అంటారు. అవి ఉత్తరదేశానికి చెందిన ప్రాంతాలు. కనుక పైన్‌ఘాట్ ప్రాంతాన్ని దక్కను నుండి చీల్చి మరొక సుభాగా చేసి తన కుమారుడు మహబత్‌ఖాన్‌ను సుబేదార్‌గా నియమించాలని కోరాడు. కాని బహుదూర్‌షా అతని ప్రతిపాదనను తిరస్కరించి ఖాందేష్‌ను బేరారులను కూడా దక్కను వైస్రాయి ప్రాంతంగానే ఉంచాడు. అందువల్ల హైదరాబాద్ రాజ్యంలోని ఉత్తర ప్రాంతానికి పైన్‌ఘాట్ అని, దక్షిణ ప్రాంతానికి బాల్‌ఘాట్ అని పేరు వచ్చింది. బాల్గాట సుభాలో గండికోట, గుర్రంకొండ, గుత్తి, కంభం సర్కారులుండేవి. కాలక్రమంలో గండికోట, సిద్ధవటం కంభం ప్రాంతాలు కలిసి కడప రాజ్యంగా ఏర్పడ్డాయి. రెండవ సుభా గుంటూరు నుండి కోరమండల తీరంలోని కలెరూన్ వరకు విస్తరించింది. ఈ సుభాయే చివరకు ఆర్కాటు రాజ్యంగా రూపొందింది. ఈ సుభాలోనే రాయవెల్లూరు, జింజి, తిరుచునాపల్లి ప్రాంతాలు కూడా చేరి ఉండేవి. పైన్‌ఘాట్, బాల్‌ఘాట్ రెండు ప్రదేశాలలో కలసి 46 సర్కారులు ఉండేవి. 411 పరగణాలుండేవి. అందువల్ల అది దక్కనులోని అన్ని సుభాలకన్నా పెద్దది. దానికి మెట్టు దరోగా నియమింపబడ్డాడు. ఇతనిని వఖియానిగార్ అని కూడా అంటారు. అలాగే ప్రతి సర్కారులో కొన్ని జిల్లాలు ఉండేవి. జిల్లాలలో దేశ్‌ముఖ్‌లను అధికారులు పన్నులను వసూలు చేసేవారు. శిస్తు చిట్టాలను దేశ్‌పాండేలు అనే ఉద్యోగులు రాసేవారు. దేశ్‌ముఖ్‌లు, ఫౌజ్‌దార్లు తమ ప్రాంతాలలో పన్నులు వసూలు చేయడానికి హావల్దారులను నియమించారు. వారికి జమీందార్లు సహాయపడుతుండేవారు.

జమీందారులు: ఉత్తరకోస్తా జిల్లాలలో చాలా మంది జమీందార్లుండేవారు. వారు కుతుబ్‌షాహీల కాలంలో ఇజారా అంటే పన్నులు వసూలు చేసే అధికారం సంపాదించారు. వారిని ఇజారాదార్లు అని పిలిచేవారు. కాలక్రమేణా వారు బలపడి మన్నెసుల్తాన్ అనే బిరుదులు కూడా ధరించారు. జమీందార్లలో ఎక్కువ మంది కష్మ

రెడ్డి, వెలమ కులాలకు చెందినవారు. వారు స్థానికంగా బలవంతులు. గోల్కొండ రాజ్యం పోయిన తర్వాత ఈ జమీందారులు మొగలులతో సహకరించకుండా తమ ఇష్టం వచ్చినట్లు ప్రజల వద్ద పన్నులు వసూలు చేసి ప్రజలను పీడించారు. వారిని అదుపు చేయడం మొగల్ ఫౌజుదార్లకు వీలుకాలేదు. వారి మీద దాడులు చేస్తే ప్రజా తిరుగుబాట్లు వస్తాయని భయపడ్డారు. కనుక సుబేదార్ సిఫిర్‌ఖాన్ వారితో ఒక అంగీకారానికి వచ్చాడు. ఆ ఒప్పందం ప్రకారం ప్రతి జమీందారుకు తమ పరగణాలలో వసూలయ్యే శిస్తులో కొంత నిర్దిష్ట శాతం ఇవ్వబడుతుంది. వారు శిస్తు వసూలు చేయకపోయినా వారి శాతం వారికి ముట్టుతుంది. శిస్తు వసూలు చేసే పనిని చేపట్టి వసూలు చేసి మొగల్ అధికారులకు చెల్లించినట్లయితే వసూలు అయిన మొత్తంలో వారి వాటా వస్తుంది. అంతేగాక వారి ప్రాంతాలలో న్యాయాధికారాలు కూడా వారే చెలాయించవచ్చును. అక్కడ శాంతిభద్రతలను కాపాడటానికి వారు కోటలను నిర్మించుకోవచ్చును. కొంత సైన్యాన్ని పోషించవచ్చును. ఈ షరతులన్నీ జమీందార్లకు అనుకూలంగా ఉండటంతో వారు మొగలులకు లోబడి పోయారు. మొగలుల తరపున పని చేయసాగారు. తమ జమీలు దక్కినవని సంతోషించారు. రాయలసీమలో పాలెగాండ్రు ఉండేవారు. వారి హక్కులను కూడా సిఫిర్‌ఖాన్ గుర్తించాడు. వారు కూడా మొగలులకు విధేయులయ్యారు. దాంతో ఆంధ్రదేశం మొత్తంలో మొగలుల అధికారం స్థిరపడింది. ఈ విధంగా సిఫిర్‌ఖాన్ పరిపాలనా దక్షతతో త్వరలోనే మొగలుల అధికారం స్థిరపరచి రాజ్యంలో శాంతిభద్రలను నెలకొల్పాడు. ఇతడు జమీందార్లతో చేసుకొన్న ఒప్పందం వల్ల అనేక జమీందారీ కుటుంబాలు ప్రఖ్యాతిలోకి వచ్చాయి. తెలంగాణలో కొలాస్, జటప్రోలు, గద్వాల్, పాల్వంచ, నూర్‌కొయిల్ జమీలు ఈ కాలంలోనే స్థిరపడ్డాయి. తీరంధ్రదేశంలో విజయనగర, పెద్దాపురం, మొగలితుర్రు, నూజివీడు సంస్థానాలు ముఖ్యమైనవి. గోల్కొండ నవాబు కాలంలో శ్రీకాకుళ సర్కారును షేర్‌ఖాన్ అనే అతడు పాలించేవాడు. అతని వద్ద ఇజారా సంపాదించి పెదరాయుడు అనే వెలమ వీరుడు క్రీ.శ.1652లో అతని పేరు వచ్చేటట్లు తెలుగులో బొబ్బిలి అనే పేరుతో కోటను నిర్మించి నూతన జమీని స్థాపించాడు. బొబ్బిలి జమీని కూడా సిఫిర్‌ఖాన్ గుర్తించాడు. గుంటూరు జిల్లాలో కొండపల్లి జమీందారులైన వాసిరెడ్డి వారు మొగలుల నుండి గుంటూరు జిల్లాలోని చింతపల్లి జమీని సంపాదించారు. అలాగే మలరాజు వారు వినుకొండ, బెల్లంకొండ, నర్సారావుపేట, పలనాడులపై జమీని సంపాదించారు. నెల్లూరు జిల్లాలో వెంకటగిరి వెలమ జమీందారులను కూడా మొగలులు గుర్తించారు. ఈ జమీందారీలన్నీ కుతుబ్‌షాహీల కాలంలో ప్రారంభమై మొగలుల కాలంలో వారి చేత గుర్తించబడ్డాయి. బ్రిటిష్ యుగం దాకా కొనసాగాయి. రాయలసీమలో పాలెగాండ్రు అతిసాహసులు. వారిని అదుపులోకి తీసుకురావడానికి సిఫిర్‌ఖాన్ రుస్తుందిక్‌ఖాన్ అనే సేనాధిపతిని పంపాడు. అతడు పాలెగాండ్రను ఓడించి అదుపులోకి తెచ్చాడు. వారు కూడా మొగలులతో ఒప్పందం చేసుకొని తమ ప్రాంతాలలోని పరిపాలనా బాధ్యతలు స్వీకరించారు. ఈ విధంగా సిఫిర్‌ఖాన్ కృషి వలన గోల్కొండ రాజ్యం పతనమైన 15 సంవత్సరాలకు ఆంధ్రదేశంలో మొగలుల అధికారం స్థిరపడింది. తర్వాత ఆర్థిక స్థిరీకరణకు కృషి చేశాడు.

సిఫిర్‌ఖాన్‌కు రెవిన్యూ పరిపాలనలో సహాయపడటానికి మహమ్మద్‌షా అనే దివానును ఔరంగజేబు నియమించాడు. మొగల్ పరిపాలనలో ప్రతి సుబేదార్, దివాన్ అనే సమానహోదా గల అధికారులను నియమిస్తారు. అలాగే షాఫీ నియామకం జరిగింది. అతడు గొప్ప ఆర్థికవేత్త. హైదరాబాద్ రాజ్యంలో చిరకాలంగా ఉన్న ఇజారా పద్ధతిని రద్దుచేశాడు. ప్రతి జిల్లా నుండి ప్రభుత్వానికి రావలసిన శిస్తు మొత్తాన్ని నిర్ణయించి ఒక కేంద్ర చిట్టాను తయారు చేశాడు. ఆ చిట్టాకు జామ్-ఇ-కమీర్ అనే పేరు. ఈ చిట్టావల్ల రాజ్యపు ఆదాయం హెచ్చుతగ్గులు లేకుండా నికరంగా ఉండేది. ఈ పద్ధతి సక్రమంగా అమలు జరిగింది. రెవెన్యూ పరిపాలనలో అవకతవకలు జరగకుండా పోయింది. కనుక ఈ పద్ధతి దాదాపు నూరు సంవత్సరాలు హైదరాబాద్ రాజ్యంలో అమలులో ఉంది. బ్రిటిష్ వారికి కూడా ఈ పద్ధతి మార్గదర్శకమైంది. కొన్నాళ్ళు వారు ఈ పద్ధతిని కోస్తా ఆంధ్ర ప్రాంతాలలో అమలు జరిపారు. ఈ పద్ధతి ప్రకారం జిల్లాలో రైతులపై 10 నుండి 13 శాతం వరకు శిస్తు పెరిగింది. వాణిజ్య సుంకాలు కూడా పెరిగాయి. అమ్మకం పన్ను, రహదారి సుంకం, సంత సుంకాలు చౌదర్లు వసూలు చేసేవారు. అవన్నీ ఈ పద్ధతి ప్రకారం నిర్దిష్ట రూపం పొందాయి.

కడప జిల్లాలోని పులివెందులలోని వర్తకులు తైలాలు తీసేవారు పన్నులు ఎక్కువయ్యాయని పట్టణాన్ని వదలిపోయారట. అక్కడ స్థానిక పాలకుడు మొహమ్మద్ జాఫర్ అనే అతడు వారికి మినహాయింపులు ఇచ్చి వెనక్కు రప్పించాడని పులివెందులలో ఉన్న క్రీ.శ.1691 నాటి శాసనం తెలుపుతోంది. ఈ పన్నుల పెంపకం వల్ల

బీజాపూరు, హైదరాబాద్ సుభాలలో మొగల్ చక్రవర్తికి సాలుకు 2 కోట్ల 20 లక్షలు ఆదాయం పెరిగిందట. ఒక్క మచిలీపట్టణం పరిసరాలలోని పల్లెలలో నుండే 4 లక్షల 86 వేల రూపాయల ఆదాయం వచ్చేదట. మచిలీపట్టణంలో ఎగుమతి దిగుమతి వ్యాపారం ఉండేది. దాని పరిసర పల్లెలలో ఎగుమతి చేసే వస్తువులు తయారయ్యేవి. అందువల్ల ఆ పల్లెల నుండి కూడా ఆ పని వారి నుండి వృత్తి పన్నుల రూపంలో ఆదాయం వచ్చేది ఔరంగజేబు గోల్కొండను జయించిన తర్వాత ఆంధ్రదేశంపై జిజియా పన్ను విధించాడట. కాని ప్రజలు నిరసన తెలియజేశారట. దాంతో చక్రవర్తి జిజియా పన్ను రద్దుచేశాడట.

మొగలుల కాలంలో ఖిలేదార్లు, ఫౌజుదార్లు ఆంధ్రదేశంలో అనేక దురాగతాలు జరిపారు. ప్రజలను హింసించి, దోచుకున్నారు. అత్యాచారాలు చేశారు. దేవాలయాలను పడగొట్టి వాటి స్థానంలో ఈద్‌లు, దర్గాలు నిర్మించారు. ప్రజలను అధిక పన్నులతో పీడించారు. అందువల్ల ప్రజలు గ్రామాలు వదిలి వెళ్లిపోయారని క్రీ.శ.1691 నాటి పులివెందుల శాసనం తెలుపుతోంది. ఈ విధంగా సాగిన మొగలుల దురంతాలను అరికట్టడానికి ఆనాడు సర్వాయి పాపన్న అనే తెలుగువీరుడు తిరుగుబాటుచేసి మొగల్ సరదారులకు నిద్రలేకుండా చేశాడు. నల్లగొండ, ఓరుగల్లు, కరీంనగర్ ప్రాంతాలను స్వాధీనం చేసుకొని తాటికొండ, షాపురం, సర్వాయిపేట, వేములకొండ మొదలైన దుర్గాలు నిర్మించి సుమారు 20 సంవత్సరాలు పాలించాడు. మొగల్ యుగంలో ఆంధ్రదేశ చరిత్రలో జరిగిన ప్రధాన సంఘటన సర్వాయి పాపన్న తిరుగుబాటని చెప్పవచ్చును. కాని మొగల్ యుగంలో ఇతడు దోపిడీగాడుగా చిత్రించబడ్డాడు.

సర్వాయిపాపన్న తిరుగుబాటు-అరాచకత్వం: సర్వాయి పాపన్నను సార్వాయి పాపారాయుడు అని కూడా అంటారు. ఇతని సాహసకృత్యాలను తెలంగాణలో వీరముష్టివారు, పిచ్చుక గుంటలవారు, శారదకాండ్రు వీరావేశంలో గేయ, పద్య రూపంలో అతి ఉద్రేకంగా కళ్లకు కట్టినట్లు కథ చెబుతారు. పాపన్న జీవితాన్ని గురించి రెండు కథలు ప్రచారంలో ఉన్నాయి. అతని జన్మస్థలం బెల్లాం అని, జగ్గయ్యపేట అని రెండు అభిప్రాయాలు ఉన్నాయి. అతని ఇంటి పేరు నాశనోళ్లు. అతడు గౌడకులస్తుడు. పాపన్న తల్లి పేరు సర్వమ్మ. పాపన్న చిన్నతనంలో అతని తండ్రి కల్లు అంగడి నడిపేవాడని, తండ్రి వృత్తిని అతడు నిరసించేవాడని ఆ నాటి అరాచక పరిస్థితులను అవకాశంగా తీసుకొని సొంతరాజ్యాన్ని స్థాపించాలని ప్రయత్నించాడని కొందరు అంటారు. తండ్రి మరణానంతరం అతడు జనగాం తాలూకాలోని తాటికొండలో పెరిగాడు. అక్కడ పశువులను కాచుకొనేవాడు. ఒకనాడు అతడు పశువులను బీటిలో తోలి ఒక చెట్టు కింద పడుకొని నిద్రపోయాడట. అతడు నిద్రలో ఉండగా ఒక తాచుపాము అతనికి ఎండతగలకుండా తలపై పడగపెట్టింది. అదే సమయంలో ఆ తోవన పోతున్న బ్రాహ్మణులు కొందరు చూసి అతని దగ్గరకు వచ్చారట. వారిని చూసి పాము వెళ్లిపోయింది. వారు అతనిని లేపి నీకు రాజయోగం ఉందని చెప్పి దీవించి వెళ్లిపోయారట. అతడు ఇంటికి వెళ్లి తన తల్లికి జరిగింది చెప్పి ఇక నుండి తాను పశువులను కాయనని తాను రాజునవుతానని చెప్పాడట. తల్లి అది జరిగేది కాదని మందలించిందట. కాని పాపన్న తల్లిమాట వినక ఇంటి పని మాని స్నేహితులతో తిరగసాగాడు. అప్పుడు ఎరుకలనాంచారి తటస్థపడి ఏడు ఘడియలు గోల్కొండ రాజ్యాన్ని ఏలుతావని చెప్పిందట. అతనిని చూసి తాడిచెట్లు వంగాయట. దాంతో అతనికి తాను రాజవడం తథ్యమని నమ్మాడట. ఇంటికి వచ్చి తల్లిని తన పూర్వీకులు ధనాన్ని ఎక్కడ దాచిపెట్టారో చెప్పమని నిర్బంధించి తల్లిని హింసించి నిక్షిప్తమై ఉన్న ధనాన్ని సంగ్రహించాడట. ఆ ధనంతో నల్లగొండ మండలంలోని వేములకొండల నడుమ ఒక కోటను నిర్మించాడు. వేములకొండలో దుర్గాన్ని నిర్మించి పాలించే కాలంలో పాపన్న ఒక పర్యాయం షాపుర ప్రాంతంలోని అడవికి వచ్చాడట. అక్కడ కుందేళ్లు కుక్కలను తరిమాయట. అది చూసి అది గొప్ప ప్రదేశమని భావించి అక్కడ ఒక మట్టికోటను నిర్మించాడట. తర్వాత ఆ మట్టికోట స్థానంలో గట్టి రాతి కోటను నిర్మించాడట. తన స్నేహితులు, సాటి యువకులను, బంధువులను సమీకరించి 12 వేల సైన్యాన్ని పోగుచేసుకొని వారికి సైనిక శిక్షణ ఇచ్చాడట. అతని సైన్యానికి మీరాసాహెబ్ అనే అతడు సర్వసైన్యాధ్యక్షుడు అతడే కొత్వాలు కూడా. ఇంకా ఇతని సైన్యంలో హుసేన్, హసన్, ఇమాం దూదేకులపీరు, చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు మొదలైన వారు ఉండేవారు. ఈ సైన్యంతో అతడు గోల్కొండ కోటపై దండెత్తి ఆక్రమించి ఏడు ఘడియలు పాలించాడట. అది తెలిసి మొగల్ సుబేదార్ పాపన్నపై దండెత్తి వచ్చి పాపన్నను ఓడించాడు. ఓటమి తర్వాత పాపన్న తనను తానే కత్తితో పొడుచుకొని మరణించాడని శారదకాండ్రు, వీరముష్టివాండ్రు తెలంగాణలో వీరావేశంతో పాపన్న కథను చెపుతారు.

మహమ్మదీయ చరిత్రకారుల రచనలలో కూడా ముఖ్యంగా ఖాసింఖాన్ రచనలలో పాపన్న చరిత్ర ప్రస్తావించబడింది. టి.డబ్ల్యు.హేగ్ రాసిన Historic Land Mark of Deccan అనే గ్రంథంలో కూడా పాపన్న కథ వర్ణించబడింది. వారు పాపన్నను గురించి మరొక విధంగా రాశారు.

గౌడ కులంలో జన్మించిన పాపన్న యౌవనవంతుడైన తర్వాత మొగలుల పాలనలో తెలుగు ప్రజలు పడే బాధలను చూసి మొగలులను పారదోలి స్వతంత్ర రాజ్యం స్థాపించాలని కోరిక కలిగిందట. కాని డబ్బు లేదు. అతనికి భర్త మరణించిన సోదరి ఉన్నదట. ఆమె భాగ్యవంతురాలట. ఆమెను హింసించి ఆ ధనాన్ని కాజేసి చిన్న దళాన్ని పోగు చేశాడు. ఆ దళంతో దారులు కాచి ప్రయాణికులను పెద్ద పెద్ద ధనికులను, జమీందారులను, సరదారులను దోచుకొనేవాడు. అక్కడి జమీందారులు, సరదారులు సిఫీర్‌ఖాన్‌కు, ఔరంగజేబుకు మొరపెట్టుకొని పాపన్నను దండించమని కోరారట. సిఫీర్‌ఖాన్ అతనిని బంధించాలని ప్రయత్నించగా అతడు అక్కడి నుండి కరీంనగర్ జిల్లాలోని ఎల్లందల దుర్గానికి చేరాడు. ఆ కాలంలో అక్కడ అతనికి హనుమంతు, కొండలరాయులు అనే వారితో పరిచయం అయింది. ఆ కాలంలో బలమూరును కొండల రాయుడునే జమీందారు పాలించాడు. పాలవాన మాన్యాలను వెలమ జమీందారులు పాలించేవారు. వీరి మధ్య తరచు వివాదాలు రేగి చిన్నచిన్న యుద్ధాలు జరుగుతుండేవి. ఒక పర్యాయం బలమూరు కొండల రాయునికి, ఎల్లందల వెంకటరావుకు యుద్ధం వచ్చింది. అందులో పాపన్న వెంకటరావు తరపును పోరాడాడు. వెంకటరావుకు విజయం లభించింది. యుద్ధం తర్వాత పాపన్న కొండలరావుతో స్నేహం చేశాడు. పాపన్న, హనుమంతు, కొండల రాయుడు ముగ్గురూ కలసి పరిసర గ్రామాలను దోచుకోసాగారు. వారి దోపిడీలను గురించి పరగణా ప్రజలు జమీందారు వెంకట్రావు దృష్టికి తెచ్చారు. జమీందారు పాపన్నను బంధించి జైలులో పెట్టాడు. కొన్ని రోజులకు జమీందారు కుమారునికి జబ్బు చేసిందట. ఆ జబ్బు తగ్గితే జైలులోని ఖైదీలను విడుదల చేయిస్తానని జమీందారు భార్య దేవునికి మొక్కుకుందట. కుమారునికి జబ్బు నయమైంది. కనుక ఆమె భర్తను ఒప్పించి ఖైదీలను విడుదల చేయించిందట. వారితోపాటు పాపన్న కూడా విడుదలయ్యాడు. విడుదలైన తర్వాత అతడు భోనగిరి వెళ్లాడట. అక్కడ అతనికి సర్వాయి అనే మరొక దోపిడీదారుడు పరిచయమయ్యాడు. అతనితో కలసి జనగాం తాలూకాలోని తిరుగొండ ప్రాంతంలో హైదరాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాహపురం చేరి అక్కడ ఒక మట్టికోటను నిర్మించారు. ఇద్దరూ కలసి కొంత మంది అనుచరగణాన్ని సంపాదించి పూర్వం వలె దోపిడీలు సాగించారు. సర్వాయితో కలసి దోపిడీలు చేసినందున అతనికి సర్వాయి పాపన్న, సర్వాయి పాపారాయుడు అనే పేర్లు వచ్చాయి.

సుబేదార్ గిరి-కంబక్ష క్రీ.శ.1700-1708: ఈ స్థితిలో క్రీ.శ.1700 సంవత్సరంలో ఖాన్ సిఫీర్‌ఖాన్ మరణించాడు. అతని మరణానంతరం ఔరంగజేబు తన చిన్న కుమారుడైన కంబక్షను హైదరాబాద్ సుబేదారుగా నియమించాడు. అతనికి పరిపాలనలో సహాయంగా సిఫీర్‌ఖాన్ కుమారుడు రుస్తుంఖాన్‌ను నాయబ్‌గా నియమించాడు. కంబక్ష నియామకం రుస్తుంఖాన్‌కు నిరాశ కలిగించింది. అతడు తన తండ్రి సిఫీర్‌ఖాన్ మరణానంతరం హైదరాబాద్ సుబేదార్ పదవి తనకు వస్తుందని ఆశించాడు. కనుక పరిపాలనలో కంబక్షకు సహాయం చేయకుండా ఉపేక్షాభావం ప్రదర్శించాడు. ఇదే సమయంలో క్రీ.శ.1701-1702 సంవత్సరంలో దక్కనులో తీవ్ర అనావృష్టి ఏర్పడి ప్రజలు తిండిగింజలు దొరకక అష్టకష్టాలుపడ్డారు. తర్వాత ప్లేగు వ్యాధి సంభవించి 20 లక్షల మంది చనిపోయారు. ఇదే సందర్భంలో అహమ్మద్‌నగర్‌లో ఉండి మహారాష్ట్రులతో పోరాడుతున్న ఔరంగజేబు ఆరోగ్యం క్షీణించసాగింది. అదే సమయంలో మరాఠా ఛత్రపతి రాజారామ్ మరణించి అతని భార్య తారాభాయి మహారాష్ట్రులకు నాయకత్వం వహించి మొగలులపై విజృంభించింది. ఆమె దెబ్బకు తట్టుకోలేక ఔరంగజేబు అహమ్మద్‌నగర్ నుండి ఔరంగాబాదుకు తమ మకాంను మార్చాడు. దాంతో తారాబాయి దక్కనులోని అన్ని మొగల్ సుభాలపై మెరుపుదాడులు చేసి దోచుకోనారంభించింది. ఆ దాడులలో భాగంగా తారాభాయి ఒక మరాఠా దండును క్రీ.శ.1702లో హైదరాబాద్‌పైకి పంపింది. ఆ దండు మూడు రోజులపాటు హైదరాబాద్‌ను సమూలంగా దోచుకున్నారు. ఔరంగజేబు హిందువులకు చేసిన ద్రోహాలకు ప్రతీకారంగా మరాఠీలు తమ మత సంస్థలకు, తమ స్త్రీలకు హాని చేస్తారేమోననీ ముస్లింలు భయభ్రాంతులయ్యారు. హైదరాబాద్‌లో మహమ్మద్ ప్రవక్త పాదచిహ్నం ఉండేదట. ఆ చిహ్నానికి షేక్ మొహమ్మద్ షా అనే అతడు ధర్మకర్తగా ఉండేవాడట. అతడు మరాఠీలకు భయపడి ఆ చిహ్నాన్ని హైదరాబాద్ నగర శివార్లలో ఉన్న అంబర్‌పేటకు రహస్యంగా తరలించి చాలా కాలం దాచి ఉంచాడట. ఇంత జరుగుతున్నా రుస్తుంఖాన్ మరాఠీలను ఎదిరించడానికి బదులు వారితో

రహస్య ఒప్పందం చేసుకొని ఖజానా నుండి 7 లక్షల హొన్నుల ధనం సమర్పించి వారిని పంపి కంబక్ష ప్రభుత్వాన్ని బలహీనపరిచాడు. ప్రజల దృష్టిలో కంబక్షను పనికిమాలిన వాడుగా చూపించాడు. రుస్తుంఖాన్ వైఖరివల్ల స్థానిక జమీందారులు, ఉన్నతోద్యోగులకు కూడా భద్రతా లేకుండా పోయింది. వారు కూడా మరారీలను ఎదిరించలేక తాము కూడా వారికి కొంత ముట్ట జెప్పి తమ ఆస్తులను దోపిడి చేయకుండా కాపాడుకున్నారు. మొత్తం మీద రుస్తుంఖాన్ ఉపేక్షాభావం వల్ల హైదరాబాద్ రాజ్యంలో పరిపాలనా యంత్రాంగం స్థంభించిపోయింది. మొగల్ సరదారులు కూడా విసిగిపోయి ఎవరి ఇష్టంవచ్చినట్లు వారు ప్రవర్తించసాగారు. అలాంటివారిలో రిజాఖాన్ ఒకడు అతనిని ఔరంగజేబు బీదరు రాజ్యంలోని రామగిరి ప్రాంతానికి ఫౌజ్‌దారుగా నియమించాడు. ఈ సందర్భంలో అతడు తన ఫౌజ్‌దార్ గిరిని వదలుకొని 10 వేల సైన్యాన్ని పోగుచేసుకొని మొగల్ చక్రవర్తిపై తిరుగుబాటుచేసి హైదరాబాద్, మచిలీపట్టణాల మధ్య ప్రాంతాన్ని దోపిడీ చేయసాగాడు. మరారీ దాడులతో రిజాఖాన్ దుండగాలతో రాజ్యపు ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. పరిపాలనా వ్యవస్థ పట్టు తప్పిపోయింది.

సర్వాయి పాపన్న విజృంభణ: ఈ పరిస్థితులలో సర్వాయి పాపన్న తిరిగి విజృంభించాడు. పాపన్న తన స్థావరమైన షాహాపూర్ నుండి పరిసర గ్రామాలపైబడి దోచుకోసాగాడు. అతనితో సర్వారాయుడు పాల్గొన్నాడు వారు లంబాడీ తండాలపైబడి వారి పశువులను, ధనాన్ని కాజేసేవారు. లంబాడీలు బిదారులుగా ఆ రోజులలో వ్యాపారం చేసేవారు. వారి ధనాన్ని కాజేయడమేగాక వారిని బందీలుగా పట్టుకొని వచ్చి వారి చేత కోటలను కట్టించేవాడట. వారి స్త్రీలను చెరపట్టేవారట. గ్రామాలపైబడి దోచుకొనేటప్పుడు అందమైన స్త్రీలు కనిపిస్తే పట్టుకొని తన కోటకు తెచ్చుకొనేవాడట. ఓరుగల్లు, నల్లగొండ, కరీంనగర్, ఖమ్మంమెట్టు జిల్లాలు హైదరాబాద్ జిల్లాలో కొంతభాగంలో అతడు దోపిడీలు చేశాడు. పాపన్న దుశ్చర్యలతో ఆనాడు తెలంగాణలో ధనికుల జమీందార్లు, వ్యాపారులు, గగ్గోలెత్తిపోయారట. ప్రజలు మొగల్ సుబేదార్లకు అర్జీలు పంపుకున్నారు. రుస్తుంఖాన్ ప్రజల అర్జీలను పరిశీలించి పాపన్నపై చర్య తీసుకున్నాడు. అతనిని పట్టి బంధించమని నల్లగొండ జిల్లాలోని కొలనుపాక ఖిలేదార్ రుస్తుందిల్‌ఖాన్‌ను ఆదేశించాడు. రుస్తుంఖాన్ ఖాసింఖాన్ అనే సరదారుని పంపాడు అతడు పెద్ద సేనతో వచ్చి షాహాపురం కోటను ముట్టడించాడు. పాపన్న అతనిని ఓడించి యుద్ధంలో చంపాడు. ఖాసింఖాన్ మరణవార్త విని రుస్తుందిల్‌ఖాన్ స్వయంగా పెద్ద సేనతో వచ్చి షాహీపురాన్ని ముట్టడించాడు. అంత పెద్ద మొగల్‌సైన్యాన్ని ఎదిరించలేక పాపన్న రహస్య మార్గం గుండా తప్పించుకొనిపోయాడు. రుస్తుంఖాన్ షాహీపుర దుర్గాన్ని నేలమట్టం చేసి కొలనుపాక వెళ్లిపోయాడు. రుస్తుంఖాన్ వెళ్లిపోగానే పాపన్న షాహాపూర్ తిరిగివచ్చి మళ్లీ కోటను నిర్మించాడు. ఈసారి మట్టి కోట స్థానంలో గట్టి రాతి కోటను నిర్మించాడు. తుపాకులు, మందుగుండు సామాను సంపాదించి కోటలో అమర్చుకున్నాడు. ఈ విషయం తెలిసి రుస్తుంఖాన్ మళ్లీ షాహాపురంపైకి యుద్ధానికి వచ్చాడు. ఇరు వర్గాలు ఘోరంగా పోరాడాయి. పాపన్న వైపు చాకలి సర్వన్న, రుస్తుం తరపున పుర్దిల్‌ఖాన్‌లు ఒకరితో ఒకరు పోరాడి ఉభయులూ మరణించారు. మూడు మాసాలు యుద్ధం జరిగినా కోట స్వాధీనం కాలేదు రుస్తుంఖాన్‌కు విసుగు వచ్చింది. అది కనిపెట్టి పాపన్న రుస్తుంఖాన్‌కి కొన్ని కానుకలు పంపి యుద్ధ విరమణ చేయమని కోరాడు. చేసేది లేక రుస్తుంఖాన్ కానుకలు స్వీకరించి యుద్ధ విరమణ చేసి కొలనుపాక వెళ్లిపోయాడు పాపన్న బలపడి ఆ పరిసర ప్రాంతాలన్నింటినీ కొల్లగొట్టి ధనం సంపాదించి షాపూర్ పరిసరాలను రాజు లాగా పాలించసాగాడు.

పాశ్చాత్య లేక ఐరోపా వర్తక కంపెనీల ధిక్కారం క్రీ.శ.1704: ఈ కాలంలో తూర్పుకోస్తా రేవుపట్టణాలలో ఐరోపా కంపెనీల వ్యాపారం వృద్ధి చెందుతోంది. మొగలుల పాలనలో రక్షణ లేకపోయినందు వల్ల మరారీ దాడుల వల్ల, రిజాఖాన్ వంటి సరదారుల దుండగాల వల్ల, మొగల్ ఉద్యోగుల దోపిడి వల్ల ప్రజలు దరిద్రులయ్యారు అదే స్థితిలో క్షామాలు, దుర్భిక్ష పరిస్థితి ఏర్పడి ప్రజల జీవనం కరువైంది. బ్రతుకుదెరువు కోసం ప్రజలు తమ గ్రామాలను వదలి తూర్పు తీరంలో స్థావరాలు ఏర్పరచుకొన్న ఐరోపా వర్తక సంఘాల వారిని ఆశ్రయించారు వారు స్థానిక ప్రజలకు తమ స్థావరాలలో ఆశ్రయం ఇచ్చి వారి చేత తక్కువ కూలీకి పనులు చేయించుకొని తమ వాణిజ్యాన్ని విస్తరింపసాగారు. దాంతో దేశంలోని వాణిజ్యం మొత్తం వారి స్థావరాలకు బదిలీ కాసాగింది. విశాఖపట్టణం, మచిలీపట్టణం, పులికాట్, మద్రాస్, పాండిచ్చేరి పట్టణాలలో జనసమర్ధం పెరిగిపోయింది. పారిశ్రామిక వాణిజ్య కేంద్రాలు గల ఆ పట్టణాలు దినదినాభివృద్ధి చెందసాగాయి. క్రమేపీ దేశీయ వాణిజ్యం మొత్తం ఇంగ్లిషు, డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసు వర్తకసంఘాల పరమైంది. క్రీ.శ.1704వ సంవత్సరంలో

మరాఠీదండు మరొకసారి హైదరాబాద్ నగరంపైబడి దోచుకొని మచిలీపట్టణం వైపు పురోగమించింది. మచిలీపట్టణం ఆ నాడు అతిభాగ్యవంతుల నగరం. అక్కడ జరిగే విదేశీ వ్యాపారాల వలన అది సిరిసంపదలతో తులతూగసాగింది. మహారాష్ట్రులు పశ్చిమతీరంలోని సూరత్‌రేవు పట్టణాన్ని అనేకసార్లు దోచుకున్నారు. అదే విధంగా మచిలీపట్టణాన్ని కూడా దోచుకోవాలని బయలుదేరారు. ఆ వార్త తెలియగానే అక్కడ ఉన్న ఇంగ్లిషు, డచ్చి కంపెనీల వారు అక్కడి మొగల్ ఫౌజుదార్ పట్టణాన్ని రక్షింపలేడని భావించారు. అందువల్ల అతనిని తరిమివేసి పట్టణాన్ని తమ ఆధిపత్యం కిందికి తెచ్చుకొని రక్షణ బాధ్యతను స్వీకరించారు. తర్వాత వారు పట్టణం చుట్టూ 5 బురుజులను నిర్మించి వాటిపై 25 ఫిరంగులను నిలబెట్టారు. వారి రక్షణ చర్యలకు దేశీయవర్తకులు కూడా పూర్తి సహకారాన్ని అందించారు. వారి రక్షణ ఏర్పాట్లు తెలుసుకొని మరాఠీ దండు మచిలీపట్నంపై దాడిచేయకుండా తిరిగి వెళ్లిపోయింది. ఈ సంఘటన క్రీ.శ.1704వ సంవత్సరంలో జరిగింది. ఇది దక్షిణ భారతదేశ చరిత్రగతినే మార్చింది. ఆంధ్రదేశంలో విదేశీ కంపెనీలు స్వదేశరాజులను ధిక్కరించిన మొదటి సంఘటన ఇది. వారు స్వదేశీ రాజులపై ఆధారపడకుండా తమ స్థావరాలను తామే రక్షించుకోవాలనే భావానికి అంకురార్పణ చేసింది. దానికి తగినట్లే మొగలుల పరిపాలనా కాలంలో రాజకీయ అస్థిర పరిస్థితులు వారి ఆలోచనకు బలాన్ని చేకూర్చాయి. మొగల్ ఫౌజుదారులు వారిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు కూడా చేయలేదు. కనుక వారు త్వరిత గతిన బలపడ్డారు. ఆ తర్వాత వారు స్వదేశీ రాజకీయాలలో అంటే ఆర్కాటు, హైదరాబాద్ వారసత్వయుద్ధాలలో తలదూర్చి రాజకీయశక్తిగా ఎదిగారు. వారి ఎదుగుదలకు ఈ మొగల్ యుగం పరిపాలనే దోహదం చేసింది.

మొగల్ వారసత్వ యుద్ధం: ఈ పరిస్థితులలో ఔరంగజేబు క్రీ.శ.1707లో ఔరంగాబాద్‌లో మరణించాడు. అతని కుమారులు షా ఆలం, ఆజం షా, కంబక్షలు వారసత్వ యుద్ధానికి దిగారు. ఔరంగజేబు మరణించే నాటికి అజం గుజరాత్‌లో, షా ఆజం లేక మౌజం కాబూలు పంజాబులలో రాజ ప్రతినిధులుగా ఉన్నారు. ఔరంగజేబు తన మరణానంతరం తన కుమారులు వారసత్వయుద్ధానికి దిగుతారని ముందే ఊహించాడు. అందువల్ల అతడు తన కుమారుల మధ్య సామ్రాజ్యాన్ని పంపకం చేస్తే బాగుంటుందని భావించాడు. ఉత్తరదేశం ఆజం, మౌజియంలు పంచుకొనేట్లు చేసి కంబక్షను దక్కను పాదుషాగా చేయాలని తలచి క్రీ.శ.1700 సంవత్సరంలో దక్కను సుబేదారుగా నియమించాడు. కంబక్ష కుమారుడైన ముమియల్ సున్నికి మలంగు, ఏలూరు సర్కారులను కలిపి ఒక జాగీరుగా చేసి ఇచ్చాడు. ఆ జాగీరు నుండి 5.7 లక్షల ఆదాయం వచ్చేది. కాని అతని మరణానంతరం అతని ఉద్దేశాలను కుమారులు లక్ష్య పెట్టలేదు. ఎవరికి వారే అవిభాజ్య మొగల్ సామ్రాజ్యానికి చక్రవర్తి కావాలని ఆశించారు.

కంబక్ష దక్కనులో తన అధికారాన్ని సుస్థిరం చేసుకోడానికి రుస్తుంఖాన్ ఆటంకంగా పరిణమించాడు. రుస్తుం కంబక్షకు వ్యతిరేకంగా తాను దక్కను రాజ్యానికి అధిపతి కావాలని స్థానిక జమీందారులు, జాగీరుదారుల నుండి 35 లక్షల మొహరులు అనేక వజ్రవైఢూర్యాలు సంపాదించాడు. మహారాష్ట్రులతో రహస్య ఒప్పందం చేసుకున్నాడు. రిజియాఖాన్‌ను తన వైపుకు తిప్పుకున్నాడు. ఉత్తరాంధ్ర జమీందారైన విజయనగరం పూసపాటి ఆనందగజపతి సహాయం సంపాదించాడు. కంబక్షను ప్రతిఘటించి గోల్కొండ దుర్గాన్ని ఆక్రమించాలని కుట్రపన్నాడు.

ఈ సందర్భంలో ఉత్తరదేశంలో ఆజియం, మౌజియంల మధ్య వారసత్వ యుద్ధం ప్రారంభమైంది. ఆగ్రా వద్ద ఔజా సమీపంలో వారి మధ్య యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఆజంషా మరణించాడు. మౌజం బహుదూర్ షా అనే బిరుదుతో 1708లో ఆగ్రాలో సింహాసనం అధిష్టించాడు. ఉత్తరదేశమంతా అతని అధికారంలోకి తెచ్చుకున్నాడు. ఇదే సందర్భంలో హైదరాబాద్‌లో క్రీ.శ.1708లో కంబక్ష తనను పాదుషాగా ప్రకటించుకున్నాడు. ఢిల్లీ సింహాసనం అధిష్టించిన బహదూర్ షా దక్కన్‌లోని కంబక్షను కూడా తొలగించి దక్షిణ దేశాన్ని కూడా తన ఆధిపత్యంలోకి తెచ్చుకోనే ప్రయత్నాలు మొదలుపెట్టాడు. అతను తమ్మునికి వ్యతిరేకంగా రుస్తుంఖాన్ హోదాను పెంచి అతనికి అతని తండ్రి బిరుదు అయిన ఖాన్ సిఫిర్‌ఖాన్ అనే బిరుదును ఇచ్చి హైదరాబాద్‌లో తన ప్రతినిధిగా నియమించి ఫర్మానాను పంపాడు. బహుదూర్‌షా తనను సమర్థించడంతో రుస్తుంఖాన్ కంబక్షను వ్యతిరేకించి గోల్కొండ కోటను ఆక్రమించడానికి ప్రయత్నించాడు. కంబక్ష అతనిని రాజద్రోహిగా ప్రకటించి, అతనిని పట్టుకొని సంహరించి అతని ఆస్తిని అతని సొంత ఖజానాను స్వాధీనం చేసుకున్నాడు. వ్యాపారులపైన, ప్రజలపైన అధిక పన్నులు విధించాడు. హిందువులపై జిజియా పన్ను విధించాడు. హైదరాబాద్ వర్తకుల నుండి నిర్బంధంగా

రుణాలు తీసుకున్నాడు. అందుకు నిరసనగా హైదరాబాద్ వర్తకులు బందుచేశారు. హైదరాబాదు రాజ్యం మొత్తం హిందూ ముస్లింలు మొత్తం కంబక్ష పరిపాలనపై తిరుగుబాటు ధోరణి అవలంబించారు. రాజోద్యోగులు కూడా కంబక్ష అధికారాన్ని ధిక్కరించారు. జమీందారులు కప్పాలు కట్టడం మానేశారు. రాజ్యంలో అరాచక పరిస్థితులు ఏర్పడ్డాయి. కంబక్ష పూర్తిగా ప్రజాభిమానాన్ని కోల్పోయాడు.

ఈ స్థితిలో ఢిల్లీలో అధికారాన్ని స్థిరపరుచుకొన్న బహుదూర్‌షా పెద్ద సైన్యంతో హైదరాబాద్‌పై దండెత్తాడు క్రీ.శ.1708వ సంవత్సరం చివరలో హైదరాబాద్ వద్ద జరిగిన యుద్ధంలో కంబక్ష గాయాలు తగిలి బందీగా చిక్కాడు. అతని సైన్యం ఓడిపోయింది. ఆ గాయాలతోనే అతను బందిఖానాలో మరణించాడు. దక్కన్‌లోని 6 సుభాలు బహుదూర్‌షా వశమైంది. దక్కను కూడా బహుదూర్‌షా సామ్రాజ్యంలో భాగమైపోయింది. అతడు కొన్నాళ్లు హైదరాబాదులో ఉన్నాడు. ఈ సమయంలో సర్వాయి పాపన్న షాపూర్ నుండి హైదరాబాద్ చేరి షాను సందర్శించాడు. 14 లక్షల కప్పం చెల్లించే షరతు మీద తన ఆధిపత్యంలో ఉన్న షాపూర్, తిరుగొండ జహనాబాద్, వేములకొండ మొదలైన ప్రాంతాలకు తనను జాగీరుదారుగా నియమింపమని అర్థించాడు. అతని అభ్యర్థనను బహదూర్‌షా అంగీకరించాడు. అతడు క్రీ.శ.1708వ సంవత్సరంలో మొగలు జాగీరుదారులలో ఒకడుగా గుర్తింపబడ్డాడు.

జుల్ఫికర్‌ఖాన్ లేక ధుల్ఫిఖర్‌ఖాన్-సుబేదార్ గిరి క్రీ.శ.1708-1713 దావూద్‌ఖాన్ పన్ని: బహుదూర్‌షా ఢిల్లీ తిరిగి వెళుతూ తన ప్రధాని జుల్ఫికర్‌ఖాన్‌ను దక్కన్ వైస్రాయిగా నియమించాడు. అతడు ఢిల్లీలో ఉంటూ దావూద్‌ఖాన్ పన్నిని దక్కనులో తన ప్రతినిధిగా నియమించాడు. దావూద్‌ఖాన్ పన్నిని హైదరాబాద్ సుబేదారుగా క్రీ.శ.1709 మార్చిలో తన భాధ్యతలను చేపట్టాడు. అతనికి సహాయంగా ఆఫ్ఘన్ మన్సబ్‌దార్ అయిన యూసఫ్ ఖాన్‌ను హైదరాబాద్ ఫౌజుదారుగా నియమించాడు. యూసఫ్‌ఖాన్‌కు ఇబ్రహీంఖాన్ అనే మరొక పేరు ఉంది అతను కర్నూలు ఫౌజుదారుగా మంచి అనుభవం సంపాదించాడు. మంచి న్యాయశీలిగా కూడా పేరు పొందాడు

సర్వాయి పాపన్న పోరాటాలు

యూసఫ్‌ఖాన్, దిలేర్‌ఖాన్‌ల పోరాటం: దావూద్‌ఖాన్, యూసఫ్‌ఖాన్‌ల కాలంలో సర్వాయి పాపన్న మళ్లీ దురంతాలకు దిగాడు. అతడు క్రీ.శ.1708 మొహరం పండుగ రోజులలో తన సైన్యంతో ఓరుగల్లుకోటపై దాడి చేసి 12,000 మంది ముస్లిం సైనికులను, జనాన్ని వధించి నగరాన్ని దోచుకొని చాలా మంది ముస్లిం ప్రజలను బందీలుగా తీసుకొని వెళ్లి ఖాజీ భార్యను తాను చెరపట్టి, ఆమె కూతురును భోగం మేళంలో చేర్చాడట. ఓరుగల్లు ఖాజీ అవమాన భారంతో మరణించాడు. తర్వాత కొద్దిరోజులకే భువనగిరిపై దండెత్తి దాని దుర్గపాలకుని ఓడించి అతని ధనాన్ని కొల్లగొట్టి భువనగిరిని ఆక్రమించాడు. భువనగిరి, ఓరుగల్లుల దోపిడీలలో తాను తెచ్చిన ధనంతో షాపురానికి 8 మైళ్ల దూరంలో ఉన్న తాడికొండ గ్రామంలో శత్రుదుర్భేధ్యమైన కోటను నిర్మించాడు. ఈ కోటల ప్రాంతాలను పరిపాలిస్తూ ముస్లిం పరిపాలకుల గుండెల మీద కుంపటి అయ్యాడు. అతని చర్యలను సహించలేక షాహ వినాయక్ అనే ముస్లిం ఫకీరు ఢిల్లీ చేరి మొగల్ చక్రవర్తి బహదూర్ షాను దర్శించి సర్వాయి పాపన్న దురంతాలను వివరించి చెప్పి అతనిపై చర్య తీసుకోమని కోరి 40 రోజులు నిరాహారదీక్ష చేసి అక్కడే మరణించాడట. పాపన్న దురంతాలను విన్న బహదూర్ షా మండిపడి హైదరాబాద్ ఫౌజ్‌దార్ యూసఫ్‌ఖాన్ రుస్ బహనీకి తాఖీదుపంపి సర్వాయిరాయుని వధించమని పంపాడు. యూసఫ్ ఖాన్ రెండు సంవత్సరాలు పాపన్నతో అనేక పోరాటాలు జరిపాడు.

షాపురం కోట ముట్టడి: యూసఫ్‌ఖాన్, దిలావర్‌ఖాన్ అనే వ్యక్తి నాయకత్వంలో 12 వేల అశ్వదళం, 20 వేల పదాతి దళాన్ని తరికొండపైకి పంపాడు. మరొక సైన్యాన్ని షాపురంపైకి పంపాడు. పాపన్న షాపురం, వరంగల్ కోట నుండి బందీలుగా తెచ్చిన ముస్లిం సైనికులను షాపురం కోటలో బంధించాడు. యూసఫ్‌ఖాన్ పంపిన సైన్యం కోటను ముట్టడించగానే లోపల బందీలుగా ఉన్న ముస్లిం సైనికులు తిరుగుబాటు చేసి పాపన్న సైనికులను వధించి కోట తలుపులు తెరచి యూసఫ్ సైనికులకు కోటను స్వాధీనం చేశారు.

తాటికొండ పతనం క్రీ.శ.1710: తర్వాత మొగలాయి సైన్యం తాటికొండను ముట్టడించింది. సర్వాయి పాపన్న తాటికొండ కోటలో ఉండి తొమ్మిది నెలలు మొగలు సైన్యంతో పోరాడాడు. కాని ఓడిపోయి కరీంనగర్ జిల్లాలోని హసనాబాద్ మండలంలోని సర్వాయిపేటకు పారిపోయాడు. దిలీవర్‌ఖాన్ తాడికొండను, తరిగొండను ఆక్రమించాడు. ఈలోపల పాపన్న సర్వాయిపేట వద్ద మరొక కోటను నిర్మించాడు. అది తెలసి దిలావర్‌ఖాన్ సర్వాయి పాపన్న తలగొట్టి హైదరాబాద్ కోటకు వేలాడగట్టాడు. అతని మొండాన్ని ఢిల్లీ పాదుషా బహదూర్‌షాకు పంపాడు. ఈ విధంగా క్రీ.శ.1710లో సర్వాయి పాపన్న జీవితం ముగిసింది.

అతని వంశస్థులు నాశగోనోళ్లు అనేవారు నేడు కూడా షాహ్‌పురంలో ఉన్నారు. అక్కడ ఒక వాగు ఉంది. అందులో నూనె ప్రవహించేదని పాపన్న సైనికులు ఆ వాగులో దివిటీలను ముంచి వెలిగించేవారని స్థానిక ప్రజలు చెప్పుకుంటారు. షాహ్‌పురంలోని ఒక దిగుడు బావి ఉంది. అందులో ఒక సొరంగం ఉంది. కోటలోని వారు ఈ సొరంగ మార్గం గుండా రాకపోకలు సాగించేవారని, ఆ సొరంగం ద్వారానే ఈ బావి నీరు లోపలికి వెళ్లేదని కూడా చెప్పుకుంటారు. పాపన్న వేములకొండ, షాపురం, తాటికొండ, సర్వాయిపేట గ్రామాలలో కోటలు నిర్మించాడు. వేములకొండ కోటను నిర్మించేముందు అక్కడ అరణ్య ప్రాంతానికి పాపన్న వెళ్లాడట. అక్కడ కుందేళ్లు కుక్కలను తరమటం చూసి ఆ ప్రదేశం పౌరుష ప్రతాపాలకు నిలయమని భావించి అక్కడ ఒక కోటను నిర్మించాడట. వేములకొండ కోట కొండల మధ్య బలిష్టంగా నిర్మింపబడింది. దాని శిధిలాలు నేటికీ కనిపిస్తున్నాయి. తాటికొండ కోట, సర్వాయిపేట కోట చిన్నవి. షాపురంకోట చాలా పెద్దది. బలిష్టమైంది. నాలుగు దిక్కులలో నాలుగు బురుజులు నిర్మింపబడ్డాయి. అవి 60×60 వైశాల్యం కలిగి ఉన్నాయి. మధ్య బురుజు 80 అడుగుల ఎత్తు ఉంది. కోట గోడలు రెండు గజాల వెడల్పుతో బలమైన రాళ్లతో నిర్మింపబడి ఉన్నాయి. ఈ కోటలో శిధిల దేవాలయాలు నివాస భవనాలు ధాన్యాగారాలు సైనిక ఆవాసాల శిధిలాలు కనిపిస్తున్నాయి. కోటకు పడమటి దిక్కున సింహ ద్వారం, ఉత్తర దిక్కున దొడ్డి ద్వారం ఉంది. సర్వాయిపేట అతని పేరుతో నిర్మింపబడింది. పాపన్న ఆ రోజులలో భాగ్యవంతులను కొట్టి బీదలకు దానం చేసే బీదల పాలిట దైవం అని పేరు పొందాడు. బ్రాహ్మణులకు, దేవస్థానాలకు కూడా దానాలు చేశాడు. సర్వాయిపేటలో ఒక చిన్న గడియ ఉంది. దానిని పాపన్న గడియ అని

ప్రజలు చెబుతారు. బైర్ల జియ్యరు అనే అతనికి కంచుతో తయారు చేసిన జమిడికను దానం చేసి దానిపై తన పేరును లిఖించాడు. సర్వాయి పాపడు ముస్లిం పాలకుల చేత దోపిడీదారునిగా చిత్రీకరించబడినప్పటికీ అతడు గొప్ప వీరుడుగా, అరవీర భయంకరుడుగా ఆంధ్ర పౌరుషాన్ని చాటి చూపించిన యోధునిగా తెలంగాణ ప్రజలు భావిస్తారు. అతడు గొప్ప దేశభక్తుడని ధనికులను దోచి పేదలను పోషించే మహావీరుడని జానపద సాహిత్యం తయారైంది. అతని కథను వీరముష్టివాండ్రు, శారదకాండ్రు జానపదగేయాలుగా వీరగాథగా ఇటీవల దాకా తెలంగాణ గ్రామాలలో గానం చేశారు.

యూసఫ్‌ఖాన్ క్రీ.శ.1711లో మరణించాడు. అతని మరణంతో తిరిగి హైదరాబాద్ రాజ్యంలో అరాచక పరిస్థితులు పునరావృతమయ్యాయి. మరాఠీలు మళ్లీ దండెత్తి వచ్చి హైదరాబాద్, షాహపూర్, పానుగల్లు, కర్నూలు మొదలగు దుర్గాలను దోచుకున్నారు. ఇదే సమయంలో మొగల్ ఫౌజ్‌దారులు కూడా స్థానిక జమీందారులను ప్రజలను పీడించి విపరీతంగా ధనాన్ని వసూలు చేశారు. దక్షిణాకోస్తా పరగణాల మీద ఫౌజ్‌దారుగా నియమింపబడిన ముహమ్మద్ అయిన మీర్జాబేగ్ నూజివీడు మొగలితుర్రు, పెద్దాపురం జమీందార్లను పీడించి ధనం వసూలు చేశాడు. అయినా అతడు తన సైనికులకు జీతాలు ఇచ్చేవాడు కాదు. వారు అతనిపై తిరుగుబాటు చేసి హైదరాబాద్ మచిలీపట్టణాల మధ్య గ్రామాలను దోచుకున్నారు. ఆ రోజులలో హైదరాబాద్ తర్వాత మచిలీపట్టణం సంపన్నమైంది. మీర్జా సైనికులు మచిలీపట్టణాన్ని దోచుకోడానికి మచిలీపట్టణంపై దండెత్తాయి. ఐరోపా వర్తక కంపెనీలు సంయుక్తంగా మొగల్ సైనికులను తమ ఫిరంగులతో ఎదుర్కొన్నాయి. ఫిరంగి గుండ్ల దెబ్బలకు తట్టుకోలేక పారిపోయారు. ఉత్తర కోస్తాలోని రాజమహేంద్రవరం ఫౌజ్‌దార్ అబిబ్‌ఖాన్ రాజమండ్రి నుండి శ్రీకాకుళం వరకు ఉన్న జమీందారులందరినీ నిలువు దోపిడీ చేశాడు. ఈ విధంగా ప్రజలు స్థానిక జమీందారుల మొగల్ ఫైజుదార్ల వలన అనేక ఇక్కట్ల పాలయ్యారు.

ఢిల్లీ రాజకీయాలు క్రీ.శ.1712: క్రీ.శ.1712లో ఢిల్లీ చక్రవర్తి బహదూర్‌షా మరణించాడు. అతని కుమారులు వారసత్వ యుద్ధానికి దిగారు. మొదట జహందర్‌షా క్రీ.శ.1712లో ఆగ్రాలో సింహాసనం అధిష్టించాడు. అతడు లాల్ కుమారి అనే తన ప్రియురాలి సహచర్యంలో రాజకీయాలను అశ్రద్ధ చేయడంతో హుసేన్ ఆలీ అబ్దుల్లాఖాన్ అనే పేరు గల సయ్యద్ సోదరుడు సహాయంతో ఫరూక్‌షైర్ ఢిల్లీ సింహాసనం అధిష్టించాడు. సయ్యద్ సోదరులకు కమ్రుద్దీన్ రహస్యంగా సహాయం చేశాడు. అందువల్ల సయ్యద్ సోదరులు దక్కనులోని వైస్రాయి అయిన దావూద్‌ఖాన్‌ను తొలగించి కమ్రుద్దీన్‌కు నిజాం ఉల్‌ముల్క్ అనే దక్కనులోని ఆరుసుభాలకు సుబేదార్‌గా పదవీ బాధ్యతలను చేపట్టాడు. ఇది ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రముఖ సంఘటన. అతడు ఆతర్వాత స్వతంత్ర హైదరాబాద్ రాజ్యస్థాపన చేశాడు.

నిజాం ఉల్ ముల్క్-సుబేదార్ గిరి క్రీ.శ.1713-15: నిజాం ఉల్‌ముల్క్ వంశస్తులు తాము మొదటి ఖలీఫా అయిన అబూబకర్ సంతతివారమని చెప్పుకున్నారు. వారు మధ్యాసియా వాసులు. ఈ వంశానికి మూలపురుషుడు ఖ్వాజా అబిద్ బుజారీ. అతడు సమర్కండ్ నివాసి. అతడు షాజహాన్ కాలంలో హిందూస్థానం వచ్చి మొగల్ కొలువులో చేరాడు. క్రీ.శ.1657-58 సంవత్సరాలలో జరిగిన వారసత్వ యుద్ధాలలో అతడు ఔరంగజేబు పక్షం వహించాడు. రాజపుత్రులతో జరిగిన యుద్ధాలలో అతడు ఔరంగజేబు తరపున పోరాడాడు. అందుకు మెచ్చి ఔరంగజేబు అతనికి చిన్ చిలిబ్‌ఖాన్ అనే బిరుదు ఇచ్చాడు. ఇతనికి ఐదుగురు కుమారులు. అతడు సమర్కండులో ఉన్నప్పుడే క్రీ.శ.1649లో పెద్ద కుమారుడు షిహాబుద్దీన్ ఖాన్ జన్మించాడు. అతడు అక్కడే పెరిగి క్రీ.శ.1669లో హిందుస్థాన్ చేరి ఔరంగజేబు కొలువులో చేరాడు. తండ్రితోపాటు రాజపుత్ర యుద్ధాలలో పోరాడాడు. అతని సాహస కృత్యాలకు మెచ్చి ఔరంగజేబు అతనికి ఘూజీ ఉద్దీన్, ఫిరోజ్‌జంగ్ అనే బిరుదు ఇచ్చాడు. ఇతడు బీజాపూరు, గోల్కొండ యుద్ధాలలో ప్రముఖపాత్ర నిర్వహించాడు. క్రీ.శ.1685-87 సంవత్సరాలలో జరిగిన గోల్కొండ యుద్ధంలో ఫిరోజ్‌జంగు మొగల్‌సేనలకు నాయకత్వం వహించాడు. అతడే తానీషాను ఔరంగజేబు వద్దకు తీసుకొనివచ్చాడు. గోల్కొండను ముట్టడించిన మొదటి రోజు యుద్ధంలో ఫిరోజ్‌తోపాటు అతని తండ్రి వృద్ధుడు అయినా అబిద్‌ఖాన్ పాల్గొని మొదటి ఫిరంగి గుండుకు ఆహుతి అయిపోయాడు. అతని రక్తంతో గోల్కొండ నేల తడిసింది. కనుకనే అతడి వంశస్తులు హైదరాబాద్ రాజ్యానికి వారసులయ్యారు. అతనిని హిమాయత్‌నగర్‌లో ఖననం చేసి సమాధిని నిర్మించారు. గోల్కొండ యుద్ధం తర్వాత ఫిరోజ్ సంగ్ ఆదోని గుల్షన్‌బాద్ అనే పేరు పెట్టబడిన మెదక్ దుర్గాలను ఆక్రమించాడు. అతని సేవలకు మెచ్చి ఔరంగజేబు

ఫిరోజ్‌జంగ్‌ను బేరారు పాలకునిగా నియమించాడు. ఇతనికి షాజహాన్ చక్రవర్తి వజీరైన సాదుల్లా కుమార్తె సఫియా ఖానమ్‌తో వివాహం జరిగింది. ఆ జంటకు క్రీ.శ.1671లో కమ్రుద్దీన్ జన్మించాడు. అతడు వారికి ఏకైక సంతానం. అతడు బాల్యం నుండి తండ్రితోపాటు యుద్ధంలో పాల్గొన్నాడు. క్రీ.శ.1691లో జరిగిన ఆదోని యుద్ధంలో తండ్రితోపాటు కమ్రుద్దీన్ కూడా పాల్గొన్నాడు. ఆ యుద్ధంలో అతడు 20 సంవత్సరాల యువకుడుగా అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. అందుకు మెచ్చుకొని ఔరంగజేబు అతనికి అతని తాత బిరుదైన చిన్‌ఖలిచ్‌ఖాన్ అనే బిరుదు ఇచ్చాడు. కమ్రుద్దీన్ క్రమేపీ మంచి సరదారునిగా ఎదిగి క్రీ.శ.1702లో బీజాపూర్ పాలకునిగా నియమింపబడ్డాడు. క్రమేపీ ఎదిగి ఢిల్లీ ఆస్థానంలో తురానీ వర్గ నాయకుడయ్యాడు. ఈ విధంగా అతడు మొగల్ దర్బారులో ఉన్నత స్థానానికి ఎదిగాడు. ఇతని తాత తండ్రిని, ఇతనిని ముగ్గురినీ ఔరంగజేబు ఆదరించాడు. ఔరంగజేబు మరణానంతరం జరిగిన వారసత్వ యుద్ధాలలో అతడు తటస్థంగా ఉన్నాడు. ఔరంగజేబు తర్వాత బహుదూర్‌షా చక్రవర్తి అయ్యాడు. అతడు జుల్ఫిర్‌ఖాన్ వజీరుగా నియమించాడు. జుల్ఫిర్‌ఖాన్‌కు కమ్రుద్దీన్ అంటే లోపల భయం ఉంది. అతనిని ఢిల్లీలో ఉంచడం మంచిది కాదని అతనికి ఖాన్-ఇ-దౌర్య అనే బిరుదు ఇచ్చి అయోధ్య రాజ్యంలో లక్నో ఫౌజ్‌దార్‌గా పంపాడు. ఫుల్ఫిర్‌ఖాన్ పథకాన్ని కమ్రుద్దీన్ పసిగట్టాడు. తాను ఢిల్లీ నుండి వెళ్లి పోతే జుల్ఫిర్‌ఖాన్ పెరిగిపోతాడని భయపడి లక్నో ఫౌజ్‌దార్ పదవిని తిరస్కరించి తాత్కాలికంగా రాజకీయాల నుండి వైదొలిగాడు. ఇంతలో క్రీ.శ.1710లో అతని తండ్రి ఫిరోజ్‌జంగ్ మరణించడంతో జహాందర్‌షా చక్రవర్తి అయ్యాడు. 10 నెలలలోనే అతడు పోయి ఫరుక్‌షైర్ చక్రవర్తి అయ్యాడు. అతని వజీర్ సేనాధిపతులైన సయ్యద్ సోదరులు దక్కనులో దావూద్‌ఖాన్ సున్నీని గుజరాత్‌కు మార్చారు. జుల్ఫిర్‌ఖాన్ అధికారాన్ని అంతం చేశారు. తర్వాత వారు తమకు రహస్య మద్దతు ఇచ్చిన కమ్రుద్దీన్ క్రీ.శ.1513లో సుబేదార్‌గా నియమించాడు. ఈ విధంగా కమ్రుద్దీన్ నిజాం ఉల్‌ముల్క్‌గా హైదరాబాద్ సుబేదార్ అయ్యాడు. అతని తాత అబీద్‌ఖాన్, తండ్రి ఫిరోజ్‌ఖాన్‌ల సేవల వల్ల అతడు అలాంటి ఉన్నతస్థితికి ఎదగగలిగాడు. చివరకు అతడు స్వతంత్ర హైదరాబాద్ రాజ్యస్థాపకుడై ఆంధ్రప్రదేశ్‌చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించాడు. నిజాం ఉల్‌ముల్క్‌ను దక్కను సుబేదారునిగా నియమించగానే అతడు సిరొంజి, ఉజ్జయిని, బురహాన్‌పూర్ పట్టణాల మీదుగా క్రీ.శ.1713లో ఔరంగాబాద్ చేరి తన పదవిని చేపట్టాడు.

ముబారిజ్‌ఖాన్ ఫౌజుదారునిగా నియమించటం క్రీ.శ.1713: ఇదే సమయంలో చక్రవర్తి పరుక్షయర్ క్వాజా మహమ్మద్ అనే సరదారుని హైదరాబాద్ ఫౌజుదారుగా నియమించాడు. ఇతడు కూడా టర్కీ జాతీయుడు. మధ్య ఆసియాలోని బలక్‌లో ఇతను జన్మించాడు. చిన్నతనంలోనే హిందుస్థానానికి వచ్చి మొగలుల కొలువులో చిన్న ఉద్యోగం సంపాదించాడు. తర్వాత కంబక్ష రాజకుమారుని వద్ద చేరి సైన్యాలకు జీతాలిచ్చే భక్షి ఉద్యోగిగా పదవిని పొందాడు. తర్వాత చిన్నఫౌజుదారు అయ్యాడు. సూరత్ ఫౌజుదారు పదవిని గుజరాత్ మాళ్వ సుబేదారు పదవులను కూడా నిర్వహించి సమర్థుడైన యుద్ధవీరుడుగా, మంచి పరిపాలకుడుగా కీర్తి తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఫరూఖ్‌సియర్ అతని హోదాను పెంచి ముబారిజ్‌ఖాన్ అనే బిరుదు ఇచ్చి హైదరాబాద్ ఫౌజుదారునిగా నియమించాడు. కోస్తా ప్రాంతంలోని ఫౌజుదార్లు జమీందారులందరిపై అతనికి అధికారం ఇవ్వబడింది. నిజాం ఉల్‌ముల్క్, ముబారిజ్‌ఖాన్‌లు హైదరాబాద్‌లో తమ పదవీ బాధ్యతలు చేపట్టేనాటికి దక్కన్ పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది. జుల్‌ఫిర్‌ఖాన్ మహారాష్ట్రులతో ఒప్పందం కుదుర్చుకున్న నాటి నుండి దక్కనులోని ఆరు సుభాలలో కమైష్‌దారులు అనే శిస్తు వసూలు చేసే మరాఠా ఉద్యోగులను నియమించి చౌత్‌సర్ దేశ్‌ముఖ్‌లను వసూలు చేయసాగారు. ఇంకా వాణిజ్య సుంకాలు, రహదారి సుంకాలు నిర్బంధంగా వసూలు చేశారు. కృష్ణయ లాల్ మొదలైన మరాఠీ దోపిడీ నాయకులు గ్రామాలపైపడి దోచుకునేవారు. ప్రజలకు, వ్యాపారస్తులకు రక్షణ లేకుండా పోయింది. జమీందారులు నాలుగు సంవత్సరాల నుండి కప్పం కట్టడం మానేశారు. పైగా వారు మొగలాయి ఉద్యోగులు కలసి ప్రజల మీద అరాచకాలు చేయసాగారు. ఇలాంటి పరిస్థితులో నిజాం ఉల్‌ముల్క్ మహారాష్ట్రులపై దృష్టిని నిలిపాడు. అదే సందర్భంలో మహారాష్ట్ర దేశంలో షాహు సతారాలో, తారాబాయి కొల్హాపూర్‌లో వేరు వేరు రాజ్యాలు ఏర్పాటు చేసుకున్నారు. మహారాష్ట్రంలోని అంతర్ యుద్ధాన్ని ఆసరాగా తీసుకొని నిజాం వారికి చైత్‌సర్ దేశ్‌ముఖిలను చెల్లించడం ఆపు చేశాడు. తర్వాత రాజ్యంలోని ముఖ్య ప్రాంతాలను దర్శించి కీలకస్థానాలలో సైన్యాలను నెలకొల్పాడు. అతడు చేపట్టిన ఈ కార్యక్రమాలలో అతని దివాన్ దియానత్‌ఖాన్ చాలా సహాయపడ్డాడు. కోస్తాలో జమీందారులను అణచి వారి వద్ద కప్పం వసూలు చేయదానికి ముబారిజ్ ఖాన్‌ను

పంపాడు. అతడు గుంటూరు సర్కార్‌లోని మల్రాజు, మానూరు, వాసిరెడ్డి జమీందారులను అదుపులోకి తెచ్చి కప్పం వసూలు చేశాడు. తర్వాత కృష్ణానదిని దాటి నూజివీడు, మొగలితుర్రు జమీందారులను కూడా అణచి కప్పం వసూలు చేశాడు. చికాకోల్ సర్కార్లో అబిద్‌ఖాన్ అరాచకాలు సాగిస్తూ ఉన్నాడు. ముబారిజ్‌ఖాన్ అతనిపై దండెత్తి ఓడించి గండికోటకు తరిమివేశాడు. దాంతో కోస్తా ఆంధ్ర మొత్తం అదుపులోకి వచ్చింది. ముబారిజ్‌ఖాన్ దివాన్ తువారాత్ కొండవీటి సర్కార్ పరిస్థితులను చక్కదిద్దాడు. ఈ విధంగా నిజాం ఉల్‌ముల్క్, ముబారిజ్‌ఖాన్‌లు దక్కన్‌లో శాంతి భద్రతలను నెలకొల్పారు. నిజాం ఉల్‌ముల్క్ అధికారం స్థిరపడింది. దక్కనులో నిజాం ఉల్‌ముల్క్ బలపడినట్లు ఢిల్లీలోని సయ్యద్ సోదరులకు తెలిసింది. అతని ప్రాబల్యం పెరగటం సయ్యద్ సోదరులకు ఇష్టం కాలేదు. కనుక క్రీ.శ.1715వ సంవత్సరంలో నిజాం ఉల్‌ముల్క్‌ను దక్కన్ గవర్నర్ పదవి నుండి తొలగించాడు అతని స్థానంలో సయ్యద్ సోదరులలో ఒకడైన ఉస్సేన్ ఆలీ దక్కన్ సుబేదారుగా నియమింపబడ్డాడు. సయ్యద్ సోదరులు తమ ఇష్టారాజ్యంగా ప్రవర్తించటానికి ఫరుక్‌షైర్ సహించలేకపోయాడు. కాని అతడు ప్రత్యక్షంగా వారిని ఏమీ చేయలేక హుస్సేన్ ఆలీ దక్కనుకు బయలుదేరగానే గుజరాత్, ఖాన్‌దేష్‌లను పాలించే ఫౌజుదారు అయినా దావుజిఖాన్ ఫన్నికి రహస్య సందేశం పంపి హుస్సేన్ ఆలీని వదిలించమని ఆదేశించాడు. దావూద్‌ఖాన్ ఫన్ని హుస్సేన్ ఆలీని క్రీ.శ.1716లో బురహంపూర్ వద్ద ఎదుర్కొని పోరాడి యుద్ధంలో మరణించాడు. హుస్సేన్ ఆలీ ఔరంగాబాద్ చేరి తన పదవిని చేపట్టాడు.

హుస్సేన్ ఆలీ సుబేదార్‌గిరి క్రీ.శ.1715-1720: హుస్సేన్ ఆలీ దక్కన్‌లో తన పరిస్థితి బలపరచుకొన్నాడు. మరాఠీలతో స్నేహం చేశాడు. ఢిల్లీలో సయ్యద్ సోదరుల ఆగడాలను అరికట్టడానికి ఫరుక్‌షైర్ నిర్ణయించుకున్నాడు. అది గ్రహించిన అబ్దుల్లా దక్కనుకు కబురుపెట్టి తన సోదరుడు హుస్సేన్ ఆలీని ఢిల్లీకి రమ్మన్నాడు. ఢిల్లీలో ఫరూఖ్‌సియర్‌ను సింహాసనం నుండి తొలగించదలచాడు. హుస్సేన్ ఆలీ చక్రవర్తిని తొలగించటానికి తన బలం చాలదని, మరాఠా ఛత్రపతి సాహుతో సంధి చేసుకొన్నాడు. ఆ సంధి ప్రకారం షాహు అయిన బాలాజీ విశ్వనాథ్ దక్కనులో 6 సుభాలపై చైత్‌సర్ దేశ్‌ముఖిలను వసూలు చేసుకొనే అధికారాన్ని కోరాడు దాంతోపాటు 3వ శాతం రహదారి సుంకాలను వసూలు చేసుకోడానికి కూడా అనుమతించాలని కోరాడు హుస్సేన్ ఆలీ అందుకు అంగీకరించాడు. అందుకు ప్రతిఫలంగా బాలాజీ విశ్వనాథ్ 15000 మరాఠా సైన్యంతో హుస్సేన్ ఆలీకి సహాయంగా ఢిల్లీ వెళ్లడానికి అంగీకరించబడింది. ఈ ఒప్పందంతో దక్కనులోని 6 మొగల్ సుభాలపై షాహుకు ఆర్థికపరమైన అధికారాలు లభించింది. దక్కనులోని 6 సుభాలలోని ప్రతి జిల్లాలో పన్ను వసూలు చేయటానికి తమ ఉద్యోగస్తులను నియమించాడు. వారందరిపై అజమాయిషీ చేయటానికి ఇద్దరు మరాఠా ఉన్నతోద్యోగులను షాహు ఔరంగాబాద్‌లో నియమించాడు. దాంతో దక్కనులోని మొగలు సుభాలపై ద్వంద్వ ప్రభుత్వం ఏర్పడింది. హుస్సేన్ ఆలీ మరాఠా సేనతో ఢిల్లీ వెళ్లిపోయిన తర్వాత హైదరాబాద్‌లోని ముబారిజ్‌ఖాన్ మహారాష్ట్రుల పోటీ ప్రభుత్వాన్ని ప్రతిఘటించాడు. కాని 1718వ సంవత్సరంలో మహారాష్ట్రులు గోల్కొండకోటను ముట్టడించి ముబారిజ్‌ఖాన్‌ను ఓడించారు. గత్యంతరం లేక అతడు మహారాష్ట్రులకు చౌత్ను చెల్లించాడు. హుస్సేన్ ఆలీ ఢిల్లీవెళుతూ తన కుమారుడైన ఆలం ఆలీఖాన్‌ను తన ప్రతినిధిగా ఔరంగాబాదులో నియమించాడు. ఆలీఖాన్ ముబారిజ్‌ఖాన్‌లు దక్కను పరిపాలనా వ్యవహారాలను చూస్తుండగా ఢిల్లీలో మార్పులు వచ్చాయి.

ఫరూక్ సియర్‌ను వధించటం: ఢిల్లీలో మొగల్ చక్రవర్తి ఫరూఖ్ సియర్ సయ్యద్ సోదరులను వదలించుకోవాలని గట్టిగా ప్రయత్నించాడు. కాని సోదరులిద్దరూ చక్రవర్తినే వధించారు. అతని స్థానంలో అబుల్ బరాకత్ రఫీ ఉద్‌దరాజ అనే కుర్రవాణ్ణి కొన్ని రోజులు సింహాసనంపై ఉంచి తర్వాత అతనిని తొలగించి రఫీ ఉద్దౌలా అనే బాలుని బాదుషాగా చేశారు. అతడు కొన్ని నెలలలోనే మరణించాడు. అతని మరణానంతరం మహమ్మద్‌షాను సింహాసనం ఎక్కించారు. ఈ పరిణామాలలో సయ్యద్ సోదరులు నిజాం ఉల్‌ముల్క్ సహాయం అర్థించారు. కాని అతడు తటస్థంగా ఉన్నాడు. కాని అతనిని ఢిల్లీలో ఉంచడం ఇష్టం లేక క్రీ.శ.1719లో మాళవ సుబేదారుగా నియమించారు. అతడు మాళవ చేరి అక్కడ తన స్థితిని పటిష్టం చేసుకున్నాడు. అప్పటికే సయ్యద్ సోదరుల నిరంకుశత్వాన్ని అందరూ గర్హించసాగారు. వారికి వ్యతిరేకంగా నిజాం ఉల్‌ముల్క్ పక్షంలో చేర సాగారు నిజాం శక్తి పెరుగుతుందని సయ్యద్ సోదరులు ఈర్ష్యతో క్రీ.శ.1720 మే నెలలో అతని మాళ్వా గవర్నర్ పదవిని తొలగించి ఫర్మానా జారీ చేశారు.

నిజాం ఉల్‌ముల్క్ తిరుగుబాటు క్రీ.శ.1720: అందుకు నిజాం ఉల్‌ముల్క్ మండిపడి సయ్యద్ సోదరులను ప్రతిఘటించడానికి నిర్ణయించుకున్నాడు. హైదరాబాద్ ఫౌజుదార్ ముబారిజ్‌ఖాన్, కొల్హాపూర్ రాజు రాణా రాజస్‌భాయి అతనికి మద్దతు ఇచ్చారు. వారి సహకారంతో అతడు దక్కను సుభాలను వశం చేసుకోవాలని బయలుదేరాడు. ఖాన్‌దేష్‌లోని అసీర్‌ఘర్ బురహంపూర్ దుర్గాలను ఆక్రమించి బురహంపూర్‌లో మకాం వేశాడు. ఈ విషయం తెలిసి సయ్యద్ సోదరులు దిలావర్ అలీఖాన్ అనే సరదారుని నిజాంను అడ్డగించమని తాఖీదు పంపారు. అతడు సైన్యంతో దండెత్తగా ఉభయులకు బురహంపూరుకు ఉత్తరంగా 32 మైళ్ల దూరంలో ఉన్న ఖాద్వా దగ్గర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దిలావర్ అలీఖాన్ మరణించాడు. నిజాంకు సంపూర్ణ విజయం లభించింది. ఖండ్వా విజయం నిజాంకు ఎనలేని ధైర్యాన్ని కలిగించింది. ఢిల్లీ అధికారం తనను ఏమీ చేయలేదని అతనికి నమ్మకం కలిగింది. ఆ ఆత్మవిశ్వాసమే అతని స్వతంత్ర అధికారానికి పునాది వేసిందని చెప్పవచ్చును. ఈ లోపల హుస్సేన్ ఆలీ కుమారుడు ఆలం ఆలీఖాన్ ఔరంగాబాద్ నుండి బురహంపూరుపై దండెత్తాడు. బాలాపూర్ అనే ప్రదేశంలో నిజాం అతనిని ఓడించి వధించాడు. ఆ విజయంతో నిజాంకు ఎదురులేకుండా పోయింది. అప్పుడు నిజాం ఔరంగాబాద్ చేరి దక్కను అధికారాన్ని చేజిక్కించుకున్నాడు. బీజాపూరు ఖిల్లాదారుడు రాహుల్లా ఖాన్ హైదరాబాద్ ఫౌజుదార్ ముబారిజ్‌ఖాన్, కర్నూలు ఫౌజ్‌దార్ ఇబ్రహీంఖాన్ ఫన్ని, కడప ఫౌజుదార్ అబ్దుల్ నబీఖాన్, నిజాం ఉల్‌ముల్క్‌కు తమ మద్దతు ప్రకటించి దక్కను సుబేదారుగా అంగీకరించారు

నిజాంపైన దండయాత్ర - హుస్సేన్ అలి హత్య: నిజాం ఉల్‌ముల్క్ తమ ఫర్మానాను ధిక్కరించి మాళ్వా నుండి దక్కను చేరి అధికారాన్ని చేజిక్కించుకోవడం చక్రవర్తిని ధిక్కరించడమేనని మహమ్మద్‌షాను ఒప్పించారు తర్వాత నిజాంను దండించటానికి హుస్సేన్ ఆలి మహమ్మద్‌షాను వెంటబెట్టుకొని బయలుదేరాడు. మహమ్మద్ షాకు ఇష్టం లేక పోయినా అతని వెంట బయలుదేరి జైపూర్ వరుకు వచ్చాడు. సయ్యద్ సోదరులను ఎలాగైనా వదిలించుకోవాలని చక్రవర్తికి మనసులో ఉంది. జైపూర్ వద్ద మజిలీ చేసిన సమయంలో నమ్మకస్తుల ద్వారా హుస్సేన్ ఆలీని హత్య చేయించాడు. తర్వాత తన సైన్యంతో ఢిల్లీకి వెనుదిరిగాడు. అది తెలిసి ఢిల్లీలో ఉన్న రెండవ సయ్యద్ సోదరుడు అబ్దుల్లా ఢిల్లీని తన అదుపులో పెట్టుకోటానికి సైన్యంతో నడిచాడు. మొగల్ సైన్యం అతనిని హసన్‌పూర్ వద్ద ఎదిరించి ఓడించి బందీగా పట్టుకుంది. తర్వాత కొద్ది రోజులకే అతడు జైలులో అంతం చేయబడ్డాడు. మొగల్ చక్రవర్తి మహమ్మద్‌షాకు సయ్యద్ సోదరుల పీడ విరగడయింది. అతడు స్వతంత్రుడయ్యాడు.

నిజాం ఉల్‌ముల్క్‌ను వజీరుగా నియమించడం క్రీ.శ.1722: మహమ్మద్‌షాకు నిజాం ఉల్‌ముల్క్‌పై అభిమానం ఉండేది. సయ్యద్ సోదరులు మరణించిన తర్వాత అతడు నిజాం ఉల్‌ముల్క్‌ను క్రీ.శ.1722లో వజీరుగా నియమించి ఢిల్లీకి రావలసిందిగా ఫర్మానా జారీ చేశాడు. పాదుషా ఆజ్ఞను పాటించి అతడు ఢిల్లీ చేరి వజీరు పదవిని చేపట్టాడు. అతడు సరదారులందరినీ క్రమశిక్షణలో పెట్టి దర్బారు నడపాలని ప్రయత్నించాడు. కాని ఎవరూ అతనిని లక్ష్యపెట్టలేదు. చక్రవర్తి కూడా అతను ప్రవేశపెట్టిన సంస్కరణలను పట్టించుకోలేదు. దాంతో అతడు విసిగిపోయి దక్కను వెళ్లిపోదామని నిర్ణయించుకున్నాడు. చక్రవర్తి అతను దక్కను వెళ్లడానికి అంగీకరించలేదు. కాని నిజాం చక్రవర్తి మాటలు కాదని తన బలగంతో దక్కనుకు బయలుదేరాడు.

ముబారిజ్‌ఖాన్ సుబేదారుగా నియమింపబడుట క్రీ.శ.1724: నిజాం తన ఆజ్ఞను ఖాతరు చేయకుండా దక్కనుకు వెళ్లిపోవటం మహమ్మద్‌షా అవిధేయతగా భావించాడు. వెంటనే హైదరాబాద్‌లోని ఫౌజుదార్ ముబారిజ్ ఖాన్‌ను దక్కను సుబేదారుగా అధికారాన్ని స్వీకరించి చక్రవర్తి ఆజ్ఞప్రకారం నిజాం ఉల్‌ముల్క్‌ను ఎదిరించటానికి సైన్యాన్ని తయారు చేశాడు. కర్ణాటక సాదుల్లాఖాన్, కడప అబ్దుల్‌ఫతేఖాన్, కర్నూలు ఇబ్రహీంఖాన్ ఫన్ని ఫౌజుదారులను వారి సైన్యాలతో రప్పించాడు. వారిని తన సైన్యంతో కలుపుకొని పెద్ద సైన్యంతో ముబారిజ్ ఖాన్ నిజాంకు ఎదురు నడిచాడు.

షకర్ ఖేరా యుద్ధం క్రీ.శ1724 అక్టోబర్ 7వ తేదీ: ఉభయ సైన్యాలు క్రీ.శ.1724లో బీరారు రాజ్యంలో ఔరంగాబాద్‌కు 120 కిలోమీటర్ల దూరంలో షకర్‌ఖేర్ అనే చోట తారసిల్లాయి. అక్కడ ఉభయ సైన్యాలకు 7-10-1724వ తేదీన భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ముబారిజ్‌ఖాన్ శౌర్యపరాక్రమాలతో పోరాడుతూ మరణించాడు. నిజాం ఉల్‌ముల్క్‌కు ఘనమైన విజయం లభించింది. భారతదేశచరిత్రలో ఈ షకర్‌ఖేర్ యుద్ధం చారిత్రాత్మకమైనది. కారణమేమిటంటే ఈ యుద్ధం నిజాం ఉల్‌ముల్క్ భవిష్యత్తుని, అదృష్టాన్ని నిర్ణయించింది. ఈ

యుద్ధం వల్లనే హైదరాబాద్ రాజ్యం నిజాం ఉల్ ముల్క్ సొంతం అయింది. దాని ఫలితంగానే భారతదేశ చరిత్రలో క్రీ.శ.1724లో స్వతంత్ర హైదరాబాద్ రాజ్యం వెలసింది. ఈ యుద్ధం తర్వాత ముబారిజ్‌ఖాన్ కుమారుడు క్వాజ్ అహమ్మద్‌ఖాన్ గోల్కొండను స్థావరంగా చేసుకొని నిజాంను ఎదిరించాడు. కాని ఓడి పారిపోయాడు. తర్వాత తెలంగాణలోని భువనగిరి ఫౌజుదారు ఖాసిం రజ్వీఖాన్, హిందూ జమీందార్ అప్పారావు మరికొందరు కలిసి నిజాంను ఎదిరించి ఓడిపోయారు. దాంతో దక్కనుసుభా పూర్తిగా నిజాం ఉల్ ముల్క్ వశమైంది. అతడు తన రాజధానిని ఔరంగాబాదు నుండి హైదరాబాదుకు మార్చాడు. నిజాం ఉల్‌ముల్క్ విజయాలు తెలిసి మొగల్ చక్రవర్తి అహమ్మద్‌షా ఏమీ చేయలేక నిజాంను దండించలేనని గ్రహించి నిజాంకు అసఫ్‌జా అనే బిరుదు ఇచ్చి దక్కను సుబేదారుగా గుర్తింపు ఫర్మానాను పంపాడు. ఆ ఫర్మానా 1725 జూన్ 20వ తేదీన నిజాంకు అందింది. అప్పటికే నిజాం స్వతంత్రుడయ్యాడు. ఆ ఫర్మానాతో దక్కన్ నిజాం ఉల్ ముల్క్ సొంతం అయిపోయింది. దక్కను మొగల్ సామ్రాజ్యం నుండి వేరుపడిపోయింది. దాంతో దక్కనులో స్వతంత్ర అసఫ్‌జాహీ రాజ్యం అవతరించింది. హైదరాబాదు రాజ్యం ఉత్తరాన తపతీ నది నుండి దక్షిణాన తిరుచునాపల్లి వరకు, తూర్పున తీరాంధ్రదేశం మొత్తం వరకు విస్తరించి ఉంది. మహారాష్ట్ర రాజ్యం దానికి పశ్చిమ సరిహద్దుగా ఉంది. కర్ణాటక నవాబు, తిరుచినాపల్లి రాజు అతనికి సామంతులుగా పాలించేవారు.

క్రీ.శ.1724లో స్వతంత్ర హైదరాబాద్ రాజ్యం అవతరించడంతో ఆంధ్రదేశంలో మొగల్ యుగం అంతరించింది. మొగల్ యుగం అంతరించడంతో ఆంధ్రదేశ చరిత్రలో మధ్యయుగ చరిత్ర ముగిసింది. అసఫ్‌జాహీ వంశ ప్రతిష్ఠాపనతో ఆంధ్రదేశ చరిత్రలో ఆధునిక యుగం ప్రవేశించందని చెప్పవచ్చును.

రెండవ భాగం
సామంత రాజవంశాల చరిత్ర

సామంత రాజవంశాల చరిత్ర

వెలనాటిచోడుల సామంత రాజ్యాలు

దుర్జయవంశాలు: వెలనాటి వారికాలం నాటి కొన్ని సామంతుల చరిత్రలు శాసనాల ద్వారా తెలుస్తున్నాయి. క్రీ.శ 1125 ప్రాంతంలో గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం మాదల ప్రాంతాన్ని దుర్జయ వంశస్థుడైన పిన్నమనాయుడు పాలించాడు. ఇతని తండ్రి విట్టనాయుడు, తాత నామినాయుడు. ఇతడు అక్కడ ఒక దేవాలయానికి దానం చేసి శాసనం వేయించినందువల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. అలాగే రాంకి, పరుచూరు ప్రాంతాలను నేటినాయుడు అనే అతడు పాలించాడు. అతడు పరుచూరు పురవరాధీశ్వర అనే బిరుదు ధరించాడు. ఇతడు వెలనాటి రెండవ చోడరాజు సామంతుడు. ఇతడు వార్తట్ల వంశజుడనని, బుద్ధవర్మ శాఖీయుడనని చెప్పుకున్నాడు. అలాగే క్రీ.శ.1163లో పరుచూరి కేతినాయుడు అనే అతడు పరుచూరిని పాలించాడు. ఇతని తండ్రి ఎర్రపనాయకుడు, తల్లి వెన్నసాని. ఇతడు రాంకి లేక రాయంకి పురవరాధీశుడైన మల్లయకు బావమరిది. ఇతడు వల్లూరుపై దండెత్తిన శత్రువులను తరిమికొట్టాడని ఒక పద్యంలో ఉంది. రాంకి గిరి పశ్చిమ రాజ్యంలోనిది. ఇతడు బుద్ధవర్మ సంతతిలోని వాడు, వారట్ల గోత్రీకుడు. మడపల్లి దుర్గాన్ని రాజధానిగా చేసుకొని దుర్జయ వంశస్తుడు దుర్జరాజు 12వ శతాబ్దంలో నతవాటి సీమను పాలించాడు. ఈ వంశస్తులు కాకతీయుల బంధువులు. కమ్మ రాష్ట్రంలోని ఈమనికంద్ర వాడిని మరొక దుర్జయ వంశం పాలించింది. ఆ వంశంలో మొదటివాడు పోతభూపతి. ఇతని కుమారుడు కంటభూపతి. అతడు వెలనాటి రెండవ చోడరాజు సామంతుడు. ఇతడు నెల్లూరు సిద్ధచోడునితో పోరాడాడు. అందువల్ల ఇతడు క్రీ.శ.1175-92 మధ్యలో పాలించి ఉండవచ్చు. ఇతని కుమారుడు గొంకనృపాలుడు. ఇతడు విప్పర్తి పోతరాజు కుమార్తె మేడాంబను వివాహమాడాడు. ఇతని తర్వాత ఈ వంశంలోని రెండవ కేతరాజు క్రీ.శ.1207-1234 ప్రాంతంలో పాలించాడు. ఇతడు వెలనాటి పృధ్వీశ్వరుని సామంతుడు. తర్వాత కాకతి గణపతి సామంతుడయ్యాడు. ఇతని శాసనం ఒకటి ముక్త్యాలలో ఉంది. అందులో అతడు భోగాపురానికి అధిపతి అని ఉంది. కనుక ఇతడు తన రాజధానిని ఈమని నుండి భోగాపురానికి మార్చి ఉండవచ్చును. ఇతని తర్వాత ఈమని కంద్రిక దుర్జయుల చరిత్ర తెలియదు.

అయ్యప వంశం-నారప నాయుడు: మధ్యయుగంలో ప్రసిద్ధి చెందిన సామంత వంశాలలో దివిసీమనేలిన అయ్యపవంశం కూడా ఒకటి. ఈ వంశస్తులు మొదట వెలనాటిచోడుల సామంతులుగా ఉండి ప్రఖ్యాతిలోకి వచ్చారు. కాకతిగణపతి దేవుడు వెలనాటి చోడులను జయించిన తర్వాత ఈ వంశస్తులు కాకతీయుల సామంతులుగా మారిపోయారు. వీరి చరిత్ర తెలుసుకోడానికి వారు వేయించిన దేవాలయ శాసనాలు ముఖ్య ఆధారాలు. ఈ వంశానికి మూలపురుషుడు నారపనాయకుడు. అతని రాజధాని దివిసీమలోని క్రొయ్యూరు. నారప నాయకుడు కృష్ణానదీ సాగరసంగమం దగ్గర కోటపురమనే ఒక కోటను నిర్మించాడు. అందులో సుందరమైన రాజ మందిరం నిర్మించి దానిచుట్టూ మంచితోటలు నాటించాడు. ఈ కోటపురమే దివిసీమకు రాజధాని అయింది. ఈ పురంలో కరాళభైరవాలయం, విష్ణాలయం అనే దేవాలయాలు నిర్మించాడు. అంతేగాక వట్టికూరనే గ్రామంలో తన తండ్రి పేరుతో భీమేశ్వరాలయాన్ని నిర్మించాడు. అక్కడే భీమ సముద్రం అనే చెరువును కూడా తవ్వించాడు. ఇతడు వెలనాటి మూడవగొంక సామంతుడు. నంబులకుంటనేలిన శంకర చోడుడు కూడా వీరి వంశస్తుడేనని అతని శాసనాలవల్ల తెలుస్తోంది. నారప నాయకునికి జల్లియ, సూరయ అనే సోదరులు ఉన్నారు. వారు వీరులు. వీరిలో జల్లియ తెలుగు చోడవంశానికి చెందిన కన్నర దేవుని జయించినట్లు తెలుస్తోంది. వెలనాటి చోడులకు, నెల్లూరునేలే తెలుగు చోడులకు యుద్ధాలు జరుగుతుండేవి. ఆ యుద్ధాలలో జల్లియ పాల్గొని ఉండవచ్చు.

పిన్నచోడుడు: నారపనాయకునికి పిన్నచోడుడనే కుమారుడు ఉన్నాడు. అతడు వెలనాటి పృధ్వీశ్వరుని సామంతుడు. ఇతని భార్య దామాంబ. వారికి జాయపసేనాని, పృధ్వీనాయకుడు, నారపనాయుడు అనే ముగ్గురు కుమారులు, నారాంబ, పేరాంబ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురు కుమారులు గొప్ప యుద్ధవీరులు. కాకతి గణపతిదేవుడు వెలనాటిపై దండెత్తునాటికి పిన్నచోడుడు మహావైభవంగా దివిసీమను పాలిస్తున్నాడు. గణపతి దివిసీమను జయించడానికి తన సేనాధిపతి అయిన మాల్యాల వంశానికి చెందిన చౌండసేనానిని పంపాడు. అతడు కాకతీయ సైన్యాన్ని దివిసీమపైకి నడిపాడు. పిన్నచోడుడు అత్యంత ధైర్యసాహసాలతో కాకతీయ

సేనను ఎదిరించి పోరాడాడు. కాని ఓడిపోయాడు. దివిసీమపై చౌండసేనాని సాధించిన విజయానికి సంతసించి గణపతిదేవుడు చౌండసేనానికి దివిచూరకార, దివిలుంటాక అనే బిరుదులు ఇచ్చాడు. పిన్నచోడుడు ఓడిపోయినప్పటికీ అతని శౌర్యప్రతాపాలు, అతని రాజ్యవైభవం చూసి గజపతిదేవుడు ఆ రాజవంశంతో బంధుత్వం కలుపుకోదలచి పిన్నచోడుని కుమార్తెలైన నారాంబ, పేరాంబలను వివాహమాడాడు దాంతో అయ్యవంశం కాకతీయుల బంధుకోటిలో చేరిపోయింది. బావమరిది జాయపసేనానిని కాకతిగణపతి తన గజసాహిణిగా నియమించాడు.

జాయప సేనాని: పిన్నచోడుని తర్వాత అతని పెద్ద కుమారుడు జాయపసేనాని దివిసీమ అధిపతి అయ్యాడు. ఇతని చరిత్ర తెలుసుకోవడానికి అతనిచే వేయించబడిన చేబ్రోలు శాసనం, అతడు రచించిన నృత్యరత్నావళి, నాట్యరత్నాకరం ముఖ్య ఆధారాలు. గజపతిదేవుడు జాయప సేనానిని దివిసీమ అధిపతిగా అంగీకరించడమే గాక అతనికి వెలనాటిపై కూడా అధికారాన్ని అప్పగించాడు. జాయపసేనాని కాకతీయ గణపతి సేనాధిపతిగా కళింగ, పాండ్య రాజ్యాలపై గణపతి జరిపిన దాడులలో పాల్గొన్నాడు. ఇతనికి గజసాహిణి వైరిగోధుమఘరట్ట అనే బిరుదులు ఉన్నాయి. ఇతడు తన సార్వభౌముడుగా గణపతిదేవుని పేరు శక 1153లో అంటే క్రీ.శ.1231లో గణపేశ్వరాలయాన్ని నిర్మించాడు. దాని పోషణకు అనేక గ్రామాలు దానం చేశాడు అంతేగాక పడవకొక ఫణం దేవాలయ పోషణకు వసూలు చేసుకొనే ఏర్పాటు కూడా చేశాడు. శక 1175 అంటే క్రీ.శ.1253వ కళింగ దండయాత్రా కాలంలో ఈ దానం చేసి ఉండవచ్చును. తన తండ్రి అయిన పిన్నచోడుని జ్ఞాపకార్థం అతడు గుంటూరు జిల్లా చేబ్రోలులో చోడేశ్వరాలయాన్ని నిర్మించాడు. దానికి అనుబంధంగా దేవదాసీలు నివసించడానికి గ్రామాన్ని దానం చేసి శాసనం రాయించాడు. చేబ్రోలు శాసనం వల్లనే అతని ధార్మిక విషయాలు తెలుస్తున్నాయి. అంతేగాక ఈ శాసనం జాయపసేనాని దక్షిణ దండయాత్ర నుండి మరలివచ్చినట్లుగా కూడా తెలుపుతున్నాయి. ఈ శాసనంలో పేర్కొన్న దక్షిణ దండయాత్ర కాకతి గణపతిదేవుడు పాండ్యులతో పోరాడిన యుద్ధం అయి ఉండవచ్చు. మొత్తం మీద జాయపనాయకుడు ఆనాటి కాకతీయ సేనానులలో ఒక గొప్ప సేనానిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు గొప్ప యుద్ధవీరుడేగాక కవి. సాహిత్య, నాట్యకళా ప్రవీణుడు. అతడు నృత్త రత్నావళి, నాట్యరత్నాకరం అనే రెండు నాట్య గ్రంథాలు రాశాడు. అతడు రచించిన ఈ నాట్య గ్రంథాలలో వర్ణించిన నాట్యభంగిమలనే రేచర్ల రుద్రుడు పాలంపేట రామప్పదేవాలయంలో నాట్యమదనిక శిల్పాలుగా చెక్కించాడని ప్రతీతి. ఆ దేవాలయాన్ని నిర్మించిన శిల్పి, జాయపసేనాని నాట్య గ్రంథాలలోని భంగిమలను అద్భుతంగా చెక్కించాడు. ఆ దేవాలయానికి సుందర శిల్పాలుగా గొప్పకీర్తిని తెచ్చిన అద్భుతాలు ఆ మదనిక శిల్పాలు. ఈ శిల్పాలనే కొందరు నాగని శిల్పాలని, సాలభంజకలని కూడా వర్ణిస్తున్నారు. అలాంటి అద్భుత శిల్పకళా ఖండాలకు జాయపసేనాని నాట్యశాస్త్ర విజ్ఞానమే కారణం. అంతేగాకుండా కాకతీయుల కాలంలో ప్రసిద్ధి చెందిన పేరిణి నృత్యం కూడా జాయపసేనాని రూపకల్పనే. ఆనాడు కాకతీయ సైన్యం యుద్ధానికి వెళ్లేటప్పుడు పేరిణి నాట్యం చేస్తూ యుద్ధగీతాలను ఆలాపిస్తూ వీరావేశంతో యుద్ధానికి కదిలిపోయేవట. ఈ ఘనత అంతా జాయపసేనానిదే. ఈ విధంగా జాయపసేనాని యుద్ధ కౌశల్యంలోనే గాక గొప్ప నాట్యశాస్త్ర పారంగతునిగా కూడా ఆనాడు ప్రసిద్ధి చెందాడు. అతని నాట్యకళ ఆ తర్వాత కూడా ఆంధ్రదేశంలో వర్ధిల్లింది. జాయప సేనాని తర్వాత ఈ వంశస్థుల చరిత్ర మనకు తెలియటం లేదు.

అయ్య వంశస్థులు కరికాలాన్వయులని నంబులకుంట ప్రాంతాన్ని ఏలిన శంకరచోడుడు కూడా వీరి వంశానికి చెందినవాడని శాసనాల వల్ల తెలుస్తోంది. బహుశ ఈ వంశం కూడా ఒక తెలుగుచోడ శాఖకు చెందినదై ఉండవచ్చును. ఈ వంశంతో సంబంధం పెట్టుకున్న తర్వాతనే కాకతీయులు తాము కూడా కరికాలాన్వయులమని చెప్పుకొని ఉండవచ్చు. అంతకుముందు వారి శాసనాలలో తామే దుర్జనాన్వయులమని చెప్పుకున్నారు.

గొల్లపూడి వంశం: గొల్లపూడిని ఒక చోళవంశం పాలించినట్లు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. వారు ఒరయూరి పురాధీశ్వరా అనే బిరుదులు ధరించారు. వీరిలో మొదటివాడు కేసిమనాయకుడు. అతనికి ఒరయూరి పురాధీశ్వరా అనే బిరుదుంది. అతని తర్వాత అతని కుమారులు కామానాయకుడు, దేవినాయకుడు అనే సోదరులు పాలించారు. వారు కూడా ఒరయూరి పురాధీశ్వరులమని చెప్పుకున్నారు. వీరు ఆత్మకూరు తాలూకాలోని చిరమన గ్రామాన్ని మల్లికార్జునస్వామికి దానం చేసి క్రీ.శ.1207లో శాసనం వేయించారు. వీరు పల్లవ వంశస్థుడైన విజయగండ గోపాలుని సామంతులు. వీరికి గండరగండ ప్రజమెచ్చుగండ అనే బిరుదులు ఉన్నాయి. వారి తర్వాత

గొల్లపూడి నాయకర్ అనే అతడు గొల్లపూడిని పాలించాడు. అతడు కుళోత్తుంగ చోళుని సామంతుడు. అతడు గొల్లపూడిలోని కేశవస్వామి ఆలయానికి పన్నులు దానం చేసి శాసనం వేయించాడు. ఈ శాసనం కుళోత్తుంగ చక్రవర్తి 18వ రాజ్యకాలానికి చెందింది.

ఆలూరి వంశం: 11వ శతాబ్దంలో వెలనాటిచోడుల సామంతులుగా ఆలూరి వంశం ఒకటి పాలించింది. ఈ వంశస్తులు తాము ఆలూరి పురవరాధీశ్వరులుగా చెప్పుకున్నారు. ఈ వంశానికి మూలపురుషుడు బోతయ్య. అతని కుమారుడు ఆలూరి ప్రోల భీముడు. అతడు తాను వెలనాటి గొంకరాజు బంటునని శాసనంలో చెప్పుకున్నాడు. ఇతడు ద్రాక్షారామ భీమలింగేశ్వరస్వామికి అఖండ దీపారాధనకు దానం చేసి శాసనం వేయించాడు. అతని కుమారుడు మలినాయుడు. అతని కుమారుడు పోతినాయుడు. పోతినాయుడు కూడా ఆలూరి పురవరాధీశ్వరుడనని చెప్పుకున్నాడు. ఇతడు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళనాథునికి దానం చేసి శాసనం రాయించాడు. అందులో ఇతనికి అనేక బిరుదులున్నట్లు చెప్పబడింది. సకల భువనరాజ్య లక్ష్మీనివాస చలమర్తిగండ, శౌచగాంగేయ, శిష్టసముద్ధరణ, పరనారీదూర, పతిమెచ్చుగండ, దుర్జయకుల అనే బిరుదులున్నాయి. అంతేగాకుండా చోడనారాయణ దేవ దివ్యపాద పద్మారాధకుండ అని చెప్పుకున్నాడు. కనుక ఇతడు మొదటి కుళోత్తుంగ చక్రవర్తి సామంతుడని భావింపబడింది.

తూంబర్తి లేక తూమాటి వంశం సిద్ధపనాయకుడు: గుంటూరు జిల్లా చిలకలూరిపేట మండలంలోని తూబాడు అనే గ్రామాన్ని పూర్వం తూంబర్తి అని పిలిచేవారని శాసనాలు తెలుపుతున్నాయి. ఆ గ్రామవాసులను తూంబర్తి వారని వ్యవహరించేవారు. ప్రస్తుతం ఆ గ్రామాన్ని తూంబాడు అని పిలుస్తున్నారు. వారినే నేడు తూమాటివారని పిలుస్తున్నారు. ఈ ప్రాంతాన్ని క్రీ.శ.1132లో దూంబర్తి సిద్ధనాయకుడనే వ్యక్తి పాలించినట్లు ఒక పద్యం వల్ల తెలుస్తోంది. బుద్ధవర్మచే అతనికి ఆ ప్రాంత పాలన ఇవ్వబడిందని ఆ పద్యం తెలుపుతోంది. కనుక ఇతడు కొండపడమటి వారి సామంతుడని చెప్పవచ్చును. ఇతని తాత కాపయనాయకుడు. అతడు కూడా తూంబర్తిని పాలించాడని అదే పద్యం తెలుపుతోంది. ఎర్రమండలరాజు ఆజ్ఞ చేత సిద్ధపనాయకుడు శత్రువులను జయించాడట. అందువల్ల అతనికి ఆతుకూరను గ్రామం ఇవ్వబడిందని అతడు శాసనం వేయించాడు. ఇతడు సేవడి సింగన, జగదేవులను వారలను జయించాడని ఆ శాసనం తెలుపుతోంది. వారెవరైనదీ తెలియదు. ఇతడు క్రీ శ 1054లో తూబాటిలోని శివాలయానికి దానం చేసి ఆ శాసనాన్ని రాయించాడు. ఇతని భార్య మండమాంబ. వారికి కాపయనాయకుడనే కుమారుడు జన్మించాడు. ఈ కాపయనాయకుడు వెలనాటి రెండవ గొంకరాజు వద్ద సేనాధిపతిగా చేశాడని ఒక పద్యం ద్వారా తెలుస్తోంది. ఇతడు తూంబాడులో ఒక శివాలయాన్ని నిర్మించాడు.

ఆనాటి దానశాసనాల వల్ల వెలనాటిచోడుల కాలం నాటి అనేక మంది స్థానిక పాలకులు సేనాధిపతులు, మంత్రులు, ఉద్యోగుల పేర్లు తెలుస్తున్నాయి. విప్పర్ల అమరినాయకుడు, విప్పర్ల రెండవ అమరినాయకుడు భండారి ముప్పినాయకుడు, నిడుబ్రోలు సబ్బినాయకుడు, కొట్టూరి ఎరియమనాయకుడు, మోరంపూడి పోతినాయకుడు, వింజమూరి పోతరాజు, పాములపాటి కొమ్మానాయకుడు, పాములపాటి కేతన కుమారుడు కొమ్మన, పాములపాటి వేమయ్య, పాములపాటి కొండయ్య, భట్టిప్రోలి చోడప నాయకుడు, ఈడుపుకంటి సేవకేతినాయుడు, నాదెండ్ల కేతినాయుడు, కొల్లూరి దుదియపనాయకుడు, కొల్లూరి భీమినాయకుడు, ద్రోణాది నారపనాయకుడు, కంకణాల మల్లికార్జునుడు, చిలుకూరి భీమానాయకుడు, ముసునూరి గొండయ్య, ముసునూరి ముచ్చినాయకుడు మొదలైనవారు వేయించిన దాన శాసనాల వల్ల తెలుస్తున్నారు. వీరందరూ వెలనాటి చోడుల కాలంలో వారివద్ద సేనాధిపతులుగా, స్థానిక పాలకులుగా పని చేసి ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులు. వీరంతా కమ్మవారని కొత్త భావయ్యచౌదరి తమ కమ్మవారి చరిత్రలో రాశారు. ఈనాడు ఈ ఇంటి పేర్లు గల వారు కమ్మవారిలో ఉన్నారు. చాళుక్య భీముని కాలంలో కమ్మనాటిలోని వెలనాటి ప్రాంతాన్ని ఏరియరాజు అనే అతడు పాలించాడు. ఇతడు దుర్జయ వంశస్తుడు.

కొనకంద్రివాడి దుర్జయవంశం: మధ్యయుగంలో బెజవాడ పరిసర ప్రాంతాలను కొనకంద్రివాడి అని వ్యవహరించేవారు. ఇందులో 370 గ్రామాలు ఉండేవి. ఈ రాజ్యాన్ని కొనకంద్రివాడి రాజ్యం అని పిలిచేవారు. ఈ ప్రాంతాన్ని పాలించిన వంశాన్ని కూడా కొనకంద్రివాడి వంశం అని పిలిచారు. వీరు తాము దర్జయ వంశస్తులమని చెప్పుకున్నారు. వీరు వేంగీ చాళుక్యుల సామంతులు. వీరిలో మొదటివాడు పోతభూపతి. అతని కుమారుడు వీర చోడుడు. తరువాత భీమరాజు క్రీ.శ.1135లో పాలించాడు. ఇతడు 25 పాడి ఆవులను బెజవాడ మల్లేశ్వరస్వామికి

దానం చేసి శాసనం వేయించాడు. అతని తరువాత రెండవ చోదరాజు పాలించాడు. అతని భార్య అయితమాంబ ఇతడు రాజరాజనరేంద్రుని సామంతుడు. అతని తరువాత సూర పోతరాజు క్రీ.శ.1157లో రాజ్యం చేశాడు అతనికి విజయకటక పురేశ్వర, చాళుక్య కటక వజ్రప్రాకార అనే బిరుదులు ఉన్నాయి. ఇతనికి పార్వతి, ప్రోలకదేవి అనే ఇద్దరు కుమార్తెలు కలరు. వారిలో పార్వతి ధరణికోట రెండవ బేతరాజును, ప్రోలకదేవి నతవాడి దుర్గరాజును వివాహం ఆడారు. అతని తరువాత ఈ వంశస్తుల చరిత్ర సరిగా తెలవడం లేదు.

ఈమని కంద్రివాడి దుర్జయవంశం: ఈమని ప్రాంతాన్ని మరొక కంద్రివాడి వంశం పాలించింది. ఈ వంశం కంద్రివాడి వంశంలోని శాఖ కావచ్చును. వారిలో మొదటివాడు పోతరాజు. అతని కుమారుడు కంటభూపతి. అతడు క్రీ.శ.1175 నుండి 1192 వరకు పాలించాడు. ఇతడు వెలనాటి రెండవచోడుని సామంతుడు. ఇతడు నెల్లూరు సిద్ధచోదుని ఓడించాడట. అతని కుమారుడు గొంకన్న పాలుడు. అతని భార్య మేదాంబ. ఈమె విప్పర్తి పోతరాజు కుమార్తె అని శాసనాలు తెలుపుతున్నాయి. అతని తరువాత అతని కుమారుడు రెండవ కేతరాజు క్రీ.శ.1207-1234 సంవత్సరాల మధ్య పాలించాడు. ఇతడు భోగాపురాధిపతి అని అతనిచే ముక్త్యాలలో వేయించిన శాసనం తెలుపుతుంది. ఇతడు వెలనాటి పృథ్వీశ్వరుని సామంతుడు. పృథ్వీశ్వరుని కాకతి గణపతి దేవుడు జయించిన తరువాత రెండవకేత కాకతీయుల సామంతుడయ్యాడు. అతని తరువాత ఈ వంశస్తుల చరిత్ర తెలియదు.

మాదల వంశం: గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలంలోని మాదల గ్రామంలోని కొన్ని శాసనాల వల్ల అక్కడ పాలించిన ఒక స్థానిక వంశస్తుల పేర్లు తెలుస్తున్నాయి. ఆ శాసనాలలో నామినాయుడు, విట్టపనాయుడు పిన్నమనాయుడు అనే వారి పేర్లు తెలుస్తున్నాయి. వీరిలో పిన్నమనాయుడు క్రీ.శ.1125వ సంవత్సరానికి చెందిన వాడు. అంటే ఈ వంశం వెలనాటి చోదుల కాలానికి చెందింది.

రాంకి పరుచూరు వంశం: అలాగే రాంకి పరుచూరు ప్రాంతానికి కేతినాయుడు పాలించినట్లు రాంకిలోని శాసనం తెలుపుతుంది. అతడు బుద్ధవర్మ శాఖీయుడు. వలరట్ల గోత్రీకుడు. ఇతడు వెలనాటి రెండవ చోదరాజు సామంతుడు.

కనపర్తి చోదవంశం: 1428లో బుక్కరాయల సామంతుడుగా ఆలమందల నూకయదేవ చోదరాజు గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట మండలంలోని కనపర్తిని పాలించినట్లు అక్కడి శాసనం తెలుపుతుంది అతని తరువాత అతని కుమారుడు వీర అవుకు భూదేవ చోదరాజు పాలించాడు. అలాగే నాగులపాటిలో ఆలమందల గంగయ్యదేవ చోదరాజు పాలించినట్లు అక్కడి శాసనం తెలుపుతోంది. ఇతడు కూడా కనపర్తి వంశస్తుడే కావచ్చును.

విప్పర్ల వంశం: గుంటూరు జిల్లా నకెరికల్లు మండలంలోని విప్పర్లలో మరొక వంశం పాలించినట్లు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. ఈ వంశంలో విప్పర్ల అమరినాయుడు మొదటివాడు. అతడు క్రీ.శ.1901లో ద్రాక్షారామ శాసనం వేయించాడు. తరువాత ఈ వంశంలో రెండవ అమరినాయుడు క్రీ.శ.1158లో బెజవాడ మల్లేశ్వరస్వామికి దానం చేసి శాసనం వేయించాడు.

పాములపాటి వంశం: చాళుక్యయుగంలో పాములపాటి వారు గ్రామోద్యోగులుగా పనిచేసినట్లు శాసనాలు ఉన్నాయి. ఈ వంశానికి చెందిన పాములపాటి కొమ్మానాయుడు. కేతన కొమ్మన, వేమయ్య, కొండయ్య అనే వారి పేర్లు శాసనాల్లో కనిపిస్తున్నాయి.

మరికొందరు స్థానికులు: మోరంపూడి పోతినాయుడు, వింజమూరి పోతరాజు, భట్టిప్రోలు చోదప నాయకుడు ఈద్పుగంటి సేవకేతినాయకుడు, నాదెండ్ల కేతినాయుడు, కొట్లూరి దుడియపనాయుడు, కొల్లూరి భీమనాయుడు, ద్రోణాది వేమనాయుడు, నారంనాయుడు ద్రోణాది వేమనాయుడు, నారం నాయుడు కంకణాలపల్లి మల్లినాయుడు, చిలుకూరి భీమానాయుడు, ముసునూరి గొండయ్య, ముక్రాపతి ఉప్పినేడు, కురుగంటి కొమ్మానాయుడు, ముసునూరి ముచ్చినాయుడు, నల్ల సూరప్పనాయుడు, విప్పర్ల కొండపనాయుడు, గుండప నాయుడు వీరందరూ కోట కేతరాజు సామంతులు. మందడి ప్రోలి నాయుడు, వెలనాటి గొంక సేనాధిపతి. అంతేగాకుండా అతడు తుంబర్తి పురాధీశ్వరుడు అతని సోదరుడు మట్టనాయకుడు. అతడు క్రీ.శ.1119లో వెల్లటూరులో త్రికోటేశ్వరాలయాన్ని నిర్మించాడు. మందడి ప్రోలినాయకుని కుమారుడు వాసినాయకుడు. తర్వాత మందడి కొండపనాయుడు, మందడికోటడు అనే వారు వెలనాటి గొంక భూపాలుని దగ్గర ఉద్యోగులుగా పనిచేశారు. వీరంతా కమ్మవారు.

ముసునూరు వంశస్తుల సామంత రాజ్యాలు

కోరుకొండ మంచికంటి రాజ్యం: కాపయనాయకుడు కోరుకొండ రాజ్యాన్ని పాలించడానికి మంచికంటి వంశానికి చెందిన కూనపనాయకుని నియమించాడు. ఇతడు కాపయ సోదరుని అల్లుడు. మంచికంటి వంశం చాలా ప్రాచీనమైంది. శక 1275 అంటే క్రీ.శ.1353 నాటి ముమ్మడినాయకుని కోరుకొండ శిలాశాసనం, శక 1280 అంటే క్రీ.శ.1358 నాటి ముమ్మడి నాయకుని శ్రీరంగం తామ్రశాసనం, శక 1290 అంటే క్రీ.శ.1368 న్నాటి అక్కలంపూడి సింగన తామ్రశాసనం, మరి రెండు ఇతర శాసనాలు వారి చరిత్రకు ముఖ్య ఆధారాలు. ఇవేగాక శక 1275, క్రీ.శ.1353 నాటి కోరుకొండ లక్ష్మీనారాయణ దేవాలయ స్తంభంపై ఉన్న ముమ్మడి నాయకుని మరొక శాసనం కూడా వీరి చరిత్రకు మంచి ఆధారం. ఆ శాసనం కోరుకొండ పర్వతంపై లక్ష్మీనారాయణ దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుపుతోంది. ఈ నరసింహుడు భట్టపరాశరుని అవతారం అని భావన ఉంది. ఈ శాసనం దేవాలయానికి దానం చేసిన గ్రామాలు ఇతర బహుమానాలను పేర్కొంటోంది.

ఈ శాసనాల ప్రకారం పల్లవ ముక్కంటి గంగాతీరం నుండి మంచి-కొండ అనే ఇద్దరు వీరులను తెచ్చాడు. వారు ఆంధ్రదేశంలో మంచికొండ అనే పట్టణాన్ని నిర్మించారు. అదే వారి గోత్రం- వంశ నామంగా మారింది. కనుక వారు మంచికొండ వంశస్తులుగా ప్రసిద్ధి చెందారు. ఈ వంశంలో కేసామినాయక లేక కేశవనాయక అనే అతడు జన్మించాడు. అతడు తెలంగాణలో రాజ్యాన్ని స్థాపించాడు. బహుశ అది మంచికొండ ప్రాంతం అయి ఉండవచ్చు. అతని కుమారుడు గణపతినాయకుడు. ఈ శాసనాల ప్రకారం మంచికంటి వంశంలో మొదటి వ్యక్తి కేశవనాయకుడు. అతడు రుద్రమదేవి సమకాలికుడు. కోరుకొండ శాసనం కేశవనాయకుడు లేక కేశాని నాయకుడు పాండ్యులను జయించాదని తెలుపుతోంది. రుద్రమదేవి సామంతునిగా అతడు పాండ్యులతో యుద్ధాలు చేసి ఉండవచ్చు. అతని కుమారుడు గణపతినాయకుడు. అతడు వీరప్రతాపరుద్రుని సమకాలికుడు. క్రీ.శ.1300-1325 నాటివాడు. అతడు ముసునూరి ప్రోలయ నాయకునికి ఆంధ్ర స్వాతంత్ర్య సమరంలో తోడుగా నిలిచాడు. అతని కుమారుడు కూననాయకుడు. అతడు కాపయనాయకునితో స్వాతంత్ర్య సమరంలోని రెండవ ఘట్టంలో పాల్గొన్నాడు. అతడు కాపయ నాయకుని సోదరుని కుమార్తెను వివాహమాడాడు. అతనిని కాపయనాయకుడు కోరుకొండ దుర్గాధిపతిగా నియమించాడు. ఇతడు క్రీ.శ.1325 నుండి 1340 వరకు కోరుకొండను పాలించాడు. భద్రాచలం వద్ద ఉన్న కూనవరం ఇతని పేరుతో నిర్మించి ఉండవచ్చును. ఆ ప్రాంతం కూడా వీరి పాలనలో ఉండేది. కూనప నాయకునికి ముమ్మడినాయక, సింగయనాయక, గన్నానాయక అనే ముగ్గురు కుమారులు. వారిలో పెద్దవాడైన ముమ్మడినాయకునికి కాపయనాయకుడు తన మేనకోడలిని అంటే చెల్లెలి కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడని అక్కలంపూడి శాసనం తెలుపుతోంది. ఈ వివాహంతో మంచికంటి వారి వంశం ప్రఖ్యాతిలోకి వచ్చింది. కూనపనాయకుని తర్వాత ముమ్మడినాయకుడు కోరుకొండ రాజ్య భారాన్ని చేపట్టాడు. కాని అతడు తండ్రి అభిమతానికి విరుద్ధంగా రాజ్య భారం స్వీకరించాడట. మంచికంటి వారి వంశంలో ఇతడు అగ్రగణ్యుడు. ఇతడు క్రీ.శ.1340 నుండి 1370 వరకు పాలించాడు.

ముమ్మడి నాయకుడు: మంచికంటి వారిలో ముమ్మడినాయకుడు గొప్ప పరాక్రమశాలి. ఇతని కాలంలో వీరి రాజ్యం నలు దిక్కులకూ విస్తరించి విశాలమైంది. ముఖ్యంగా తొయ్యేరు అనపోతానాయకుడు క్రీ.శ.1356లో మరణించడంతో, రాజమహేంద్రవర రాజ్యం మొత్తం ఇతని రాజ్యంలో భాగమైపోయింది. కాపయనాయకుడు తన పినతండ్రి కుమారుడైన ముసునూరి అనపోతానాయకుడిని తొయ్యేరు, రాజమహేంద్రవర ప్రాంతాలకు అధిపతిగా నియమించాడు. అతడు క్రీ.శ.1353లో మరణించాడు. అతని స్థానంలో కాపయనాయకుడు ముమ్మడి నాయకుని శక 127 అంటే క్రీ.శ.1353లో కోరుకొండ అధిపతిగా నియమించాడు. కోరుకొండ అరణ్య ప్రాంతం. అరణ్య ప్రాంతానికి తన కుమారుని అధిపతిగా నియమించడం కూనపనాయకునికి ఇష్టం లేక పోయి ఉండవచ్చు. అందువల్ల ముమ్మడి నాయకుడు తండ్రి అభీష్టానికి విరుద్ధంగా రాజ్య భారం చేపట్టాడని శాసనాలు తెలుపుతున్నాయి. కాపయనాయకుని అభీష్టం ప్రకారం ముమ్మడి నాయకుడు రాజ్య భారం పూని ఉంటాడు. ముమ్మడి నాయకుడు కోరుకొండ దుర్గాన్ని బలపరచి పటిష్టపరచాడు. కోరుకొండ దుర్గాన్ని అంతకుముందు కాపయ నాయకుడే నిర్మించాడని ప్రతీతి. ఆటవిక జాతులను అదుపులో పెట్టడానికి నిర్మింపబడిన గిరిదుర్గం.

ముమ్మడి నాయకుడు రాజ్యభారం పూని తర్వాత పానార, కోణ, కురవాట, చెంగరలను జయించాడని కోరుకొండ శాసనం తెలుపుతోంది. పానారకు పావునవార, పాగువ వర, పాగునార అని కూడా పేర్లున్నాయి. ఇది వశిష్ట గులంటిని లేక గోస్తని పాయల మధ్య ఉన్న ప్రాంతం అని తూర్పు చాళుక్యుల శాసనాలు తెలుపుతున్నాయి ఇది వశిష్ట, వృద్ధ గౌతమిల మధ్య ప్రాంతం. నర్సాపురం, భీమవరం, తణుకు తాలూకాలలోని కొంత ప్రాంతం ఈ పానార పరిధిలోకి వస్తాయి. కోణ ప్రాంతానికి రెండేరుల నడిమి విషయం అని కూడా పేరుంది. నేటి కోనసీమ, కుళోత్తుంగ చోళుని కాలంలో ఈ ప్రాంతాన్ని హైహయులు పాలించారు. తుగ్లక్‌లను పారదోలి ముసునూరి ప్రోలయనాయకుడు ఈ ప్రాంతాన్ని తన ఆధిపత్యంలోకి తెచ్చుకొని విలస గ్రామాన్ని దానం చేశాడు. కురవాట ప్రాంతం కాకినాడ ప్రాంతం. చెంగరకు చెంగరనాడు, చెంగూరునాడు అని పేర్లున్నాయి. ఇది నేటి తూర్పుగోదావరి జిల్లాలోని మగ్రిపూడి ప్రాంతమని భావించారు. ఈ ప్రాంతాలను ముమ్మడినాయకుడు జయించాడు.

అతడు తన తమ్ములలో సింగమనాయకుని కోటిపురం, గన్నానాయకుని తాడిపాక లేక తాటిపాక ప్రాంత పాలకులుగా నియమించాడు. సింగనాయకునికి గండగోపాల అనే బిరుదు ఉండేది. అతని రాజధాని ముమ్మడివీడు. అది నేటి ముమ్మిడివరం అయి ఉండవచ్చు. ముమ్మడినాయకుని శ్రీరంగం శాసనంలో కట్టల్లపత్రు అనే గ్రామాన్ని భట్టపరాశరుని తల్లికి దానం చేయగా, ఆమె ఆ గ్రామాన్ని శ్రీరంగంలోని శ్రీరంగనాథునికి దానం చేసినట్లుగా ఉంది. శింగనాయకుడు అక్కలపుండి గ్రామాన్ని ఆయుర్వేద వైద్యులైన పరరహిత పండితులకు దానం చేశాడు. తన రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం సీమలుగా విభజించాడు. అంగరసీమ, జాంగలునాటి సీమ కోనసీమ, కురవాటిసీమ, కొరంసీమలుగా విభజింపబడ్డాయి. ఇతడు కోరుకొండ కొండపై క్రీ.శ.1359లో లక్ష్మీనృసింహ ఆలయాన్ని నిర్మించి దాని పోషణకు రెండు గ్రామాలను దానం చేశాడు. ఇతడు పరాశరభట్టుకు శిష్యుడు. అతని ప్రేరణతో వైష్ణవ మతాభిమానియై కోరుకొండ నృశింహ ఆలయాన్ని నిర్మించాడట. పరిపాలనలో ఇతనికి ఇతని సోదరుడు సింగనాయకుడు సహాయపడేవాడు. ఇతడు కాపయనాయకుని సామంతుడుగా పాలించాడు. ఇతని కాలంలో క్రీ.శ.1356వ సంవత్సరం కొండవీటి రెడ్డిరాజు అనపోతారెడ్డి ఇతని రాజ్యంపై దండయాత్ర చేశాడు. అతడు తాత్కాలికంగా అనపోతారెడ్డికి లొంగిపోయినా అనపోతారెడ్డి తిరిగి వెళ్లిపోగానే స్వతంత్రుడయ్యాడు. తిరిగి ఇతని చివరి రోజులలో అనవేమారెడ్డి ఇతనిపై దండెత్తి ఓడించాడు. అప్పటి నుండి వీరు రెడ్ల సామంతులయ్యారు.

సింహాచలం వద్ద శక 1286 అంటే క్రీ.శ.1304-1310 సంవత్సరాలకు చెందిన మరి మూడు శాసనాలు మంగినిపూడి ముమ్మడినాయక అనే అతని పేర్లు తెలుపుతున్నాయి. ఇందులో శక 1304 అంటే క్రీ.శ.1382 నాటి శాసనంలో సింగయనాయక, అతని భార్య శ్రీరంగలక్ష్మిల పేర్లున్నాయి. ఇందలి సింగమనాయకుడు ముమ్మడి నాయకుని సోదరుడని కూడా ఉంది. కనుక ఈ మూడు శాసనాలలో పేర్కొనబడిన మంగినిపూడి ముమ్మడి నాయకుడు మంచికంటి ముమ్మడినాయకుడని చెప్పవచ్చు. ఇందులో మంగినపూడి ముమ్మడి నాయకుడు కోరుకొండ ముమ్మడినాయకుడు ఒకడేనని చెప్పడానికి మనకు మరొక ఆధారం లభించింది. శక 1317 అంటే క్రీ.శ.1395 సంవత్సరంలో కాటయ వేమారెడ్డి రాజమహేంద్రవరం వద్ద గోపవరం అనే గ్రామాన్ని అక్కడ ఉన్న గోపీనాథ ఆలయానికి దానం చేసి శాసనం వేయించాడు: ఆ శాసనంలో ఆ గ్రామం అసలు పేరు తడుకలేరి అని దానిని మంగిపూడి ముమ్మడి నాయకుడు కొందరు బ్రాహ్మణులకు దానం చేశాడని, దానిని తాను కొని గోపీనాథస్వామికి దానం చేశాడనని కాటయవేమారెడ్డి రాయించాడు. కుమరగిరి రెడ్డికి ముందు ఆ ప్రాంతాన్ని పాలించిన వాడు కోరుకొండ ముమ్మడినాయకుడే. కొన్ని శాసనాలలో మంగి పరికి అని ఉంది. కనుక నాలుగు శాసనాలలో పేర్కొనబడిన మంగిపుండి ముమ్మడినాయకుడు కోరుకొండ ముమ్మడి నాయకుడేనని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. సింహాచలంలోని మూడు శాసనాలను బట్టి ముమ్మడినాయకుని రాజ్యం సింహాచలం వరకు విస్తరించి ఉండవచ్చని భావించారు. అంతేగాకుండా శక 1310 అంటే క్రీ.శ.1388 వరకు అతడు జీవించి ఉన్నాడని కూడా రూఢి అయింది. కనుక ముమ్మడినాయకుని మరణానంతరం కుమరగిరిరెడ్డి సేనాధిపతిగా కాటయవేమారెడ్డి రాజమహేంద్రవరాన్ని జయించాడని చెప్పవచ్చు. సింహాచలంలోని శక 1286 అంటే క్రీ.శ.1364 శాసనం వల్ల ముమ్మడినాయకుడు కందాడ అయ్యంగార్ అనే వైష్ణవ మతగురువు శిష్యుడయ్యాడని తెలుస్తోంది. కనుక అతడు వైష్ణవుడు. అతడు మొదట భట్టుపరాశరుని శిష్యుడు. తర్వాత కందాడ అయ్యంగారి శిష్యుడయ్యాడు. పరాశరభట్టు శిష్యునిగా ఉండగా వైష్ణవమతం పుచ్చుకొని అతడు శ్రీరంగవర్ధన అనే బిరుదు

వహించినట్లు EP Ind. Vol XIV Page 94-V54 తెలుపుతోంది. ముమ్మడినాయకుడు క్రీ.శ.1359లో కోరుకొండ పర్వతంపై శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని నిర్మించి దానికి రెండు గ్రామాలను దానం చేశాడు.

లక్ష్మీదాసి: ముమ్మడినాయకుని కాలంలో లక్ష్మీదాసి అనే వేశ్య కోరుకొండ మీద ఉన్న నేటి నృసింహాలయాన్ని నిర్మించిందని అక్కడ ఉన్న ఒక శాసనం తెలుపుతోంది. పరాశరభట్టు కోరుకొండ వచ్చి ముమ్మడినాయకునికి వైష్ణవ దీక్ష ఇచ్చి కోరుకొండలోనే మరణించాడు. మరణానికి ముందు తాను మరణించిన తర్వాత కోరుకొండపై నరసింహునిగా అవతరిస్తానని, తనకు ఆలయం నిర్మించవలసిందని ఆదేశించి మరణించాడట. ఆయన చెప్పినట్లుగానే కోరుకొండపై నరసింహునిగా వెలిసాడట. కాని ఆ విషయం ముమ్మడి నాయకుడు మరచిపోయాడట. అందువలన పరాశరుడు లక్ష్మీదాసి అనే ముమ్మడి నాయకుని ఉంపుడుగత్తె కలలో కనిపించి తాను కోరుకొండపై వెలిశానని చెప్పాడట. ఆ విషయం లక్ష్మీదాసి ముమ్మడినాయకునికి తెలపగా అతడు తన మతిమరుపుకు విచారించి ఆమెనే దేవాలయాన్ని నిర్మించమని కోరాడట. అంతట ఆమె ఆ దేవాలయాన్ని నిర్మించి, శాసనం వేయించింది. ఆ దేవాలయానికి ముమ్మడినాయకుడు రెండు గ్రామాలు దానం చేశాడు. ఆ దేవాలయంలో ముమ్మడినాయకుడు, అతని దేవేరి శిల్పాలు ఉన్నాయి. అలాగే లక్ష్మీదాసి విగ్రహం కూడా ఈ దేవాలయంలో ఉంది. ఈ దేవాలయంలో ప్రతిష్టింపబడిన నరసింహస్వామికి పరాశర నృసింహుడని పేరుంది. అలాగే ఆ కొండకు పరాశర శైలం అని కూడా పేరుంది. ఈ దేవాలయం క్రీ.శ.1350లో నిర్మింపబడిందని అక్కడి శాసనం తెలుపుతోంది. ముమ్మడినాయకునికి రెండవ కూన, అన్న లేక అన్నవేమ, కాటమ, రామానాయుడు అనే నలుగురు కుమారులు ఉన్నట్లు, వారు 40 సంవత్సరాలు పాలించారని కోరుకొండ కైఫీయత్తు తెలుపుతోంది. వారి శాసనాలేవీ లభించలేదు. కాని పశ్చిమగోదావరి జిల్లాలోని పెనుగొండలో ఒక శిధిల శాసనంలో కూనభూపాల అనే పేరుంది. ఇతడు ముమ్మడినాయకుని కుమారుడు కావచ్చు. పానారను జయించినప్పుడు తన పెద్ద కుమారుడిని అక్కడ ప్రతినిధిగా నియమించి ఉండవచ్చు. ఈ శాసనంలో తేదీ లేదు. ముమ్మడినాయకుని మరణం తర్వాత క్రీ.శ.1370 నుండి 1385 సంవత్సరం వరకు వీరి చరిత్ర స్పష్టంగా తెలియటం లేదు. క్రీ.శ.1385 సంవత్సరంలో రెండవ కూనపనాయకుడు రాజ్యానికి వచ్చి క్రీ.శ.1394 వరకు పాలించాడు. ఇతడు శ్రీరంగనాయకస్వామి దేవాలయాన్ని నిర్మించి దానికి ప్రాకారాదులు ఏర్పరచి వైభవ రాయలను ప్రతిష్ఠించి దేవాలయ నిర్వహణకు భూదానాలు చేశాడు. అర్చకులకు, దేవుని అంగర వైభవానికి దేవతా ఉత్సవాలు నిర్వహించడానికి కూడా భూదానాలు చేశాడు. అతని తర్వాత క్రీ.శ.1394 నుండి 1395 వరకు ఒక్క సంవత్సరం అతని కుమారుడు రెండవ ముమ్మడి నాయకుడు పాలించాడు. అతని వద్ద సింహాద్రిశెట్టి, బలిశెట్టి అనే వారు కార్యకర్తలుగా ఉండేవారట. వారు రాజ్యపాలనను కూడా నిర్వహించారట. కోరుకొండ కైఫీయత్తు కూడా రెండవ కూన కుమారుడైన రెండవ ముమ్మడినాయకుడు బాలుడుగా ఉన్నప్పుడు సింహాద్రిశెట్టి ఓబలిశెట్టి అనే వారు సంరక్షకులుగా పాలించినట్లు తెలుపుతోంది. వారు శక 1317లో అంటే క్రీ.శ.1395లో దేవునికి దానం చేసి శాసనం వేయించారు. వారి తర్వాత అదే కైఫీయత్తు కాటయ వేమారెడ్డి కోరుకొండ పాలకునిగా తెలుపుతోంది. కనుక కాటయ వేమారెడ్డి రెండవ ముమ్మడి నాయకుని కాలంలో కోరుకొండను రెడ్డి రాజ్యంలో భాగం చేశాడని భావించవచ్చు. క్రీ.శ.1395లోనే కాటయ వేమారెడ్డి రాజమండ్రి వద్ద గోపవరాన్ని దానం చేశాడు. కనుక రాజమహేంద్రవరాన్ని కూడా మంచికొండ వారి నుండే జయించి ఉండాలి. అంతటితో మంచికొండ వారి కోరుకొండ రాజ్యం అస్తమించింది.

వంశవృక్షం

మంచికంటి కేశవనాయకుడు క్రీ.శ. 1270-1300

|

మంచికంటి గణపతినాయకుడు క్రీ.శ. 1300-1325

|

మొదటి కూనపనాయకుడు క్రీ.శ.1325-1340

(కాపయనాయకుని సోదరుని అల్లుడు)

మొదటి ముమ్మడి నాయకుడు క్రీ.శ.1340-1370	సింగానాయక	గన్నానాయక

(కాపయ నాయకుని మేనకోడలి భర్త)

|

చరిత్ర తెలియటం లేదు - క్రీ.శ.1370-1385

రెండవ కూనపనాయకుడు క్రీ.శ. 1385-1394 | అనవేమ | కాటమనాయక | రామానాయక

(ఈ నలుగురు అన్నదమ్ములు 40 సంవత్సరాలు పాలించారు)

|

రెండవ ముమ్మడి నాయకుడు క్రీ.శ.1394-1395

సింహాద్రిశెట్టి, ఓబలిశెట్టిల సంరక్షకత్వం

సబ్బి మండలం - రామగిరి గురజాల వంశం: కాపయనాయకుడు తన రాజ్యంలోని సబ్బి మండలానికి తెలుగు రాయుని కుమారుడు ముప్పభూపాలుని పరిపాలకునిగా నియమించాడు. గురజాల వంశస్తులు పలనాటి రాజధాని అయిన గురజాల వాస్తవ్యులని భావించవచ్చు. ప్రతాప కాకతీయుల కాలంలో ఈ వంశస్తులు ఓరుగల్లు చేరి కాకతీయ కొలువులో ప్రవేశించి సబ్బినాటిలో స్థానిక పాలకులుగా నియమింపబడినట్లు కనిపిస్తోంది వీరి ఆస్థాన కవి సింగన వాశిష్ఠ రామాయణం రాశాడు. ఆ కావ్యంలో వీరి వంశచరిత్రను వివరించాడు. దాని ప్రకారం గురజాల వంశానికి మూలపురుషుడు కూనయ్య. అతని కుమారుడు ముప్పరాజు. తని కుమారుడు తెలుగు విభుడు. ఈ వంశంలో తెలుగు విభుడు గొప్పవాడు. అతనికి తెలుంగురాయుడు అని కూడా పేరుంది. అతని కుమారుడు రెండవ ముప్పభూపతి. ఇతని మంత్రి వాణస కందనామాత్యుడు. అతనికి సింగన పద్మపురాణోత్తర ఖండం అనే గ్రంధాన్ని రాసి అంకితం ఇచ్చాడు. అందులో తెలుంగురాయడి గురించి వివరించాడు. అతడు గురజాల వంశస్తుడని, శత్రుభయంకరుడని, భూరిభోగాఢ్యుడని వర్ణించాడు. ఇతడు కాకతి ప్రతాపరుద్రుని కొలువులో సేనాధిపతిగా పని చేసి ఉండవచ్చు. అతని కుమారుడు రెండవ ముప్పభూపాలునికి నిరువెత్తుగండ గండగోపాల గోపాలకాంచి రక్షపాలక, చోడస్థాపనాచార్య, దొంతిమన్నియ విభాళ, చలమర్తిగండ, మూరురాయర గజదళవిభాళ, రాజగజకేసరి, రాజగంధ వారణ అనే బిరుదులున్నట్లు మడికి సింగన వర్ణించాడు. మడికి సింగన తొయ్యేటి అనపోతు మంత్రి అయిన అయ్యలార్యునికి కుమారుడు. సింగన సబ్బినాడు అరుదెంచి ముప్పభూపాలుని ఆస్థానంలో నివసించాడు. పై బిరుదులను బట్టి ముప్పభూపాలుడు రెండవ ప్రతాపరుద్రుని సేనాధిపతిగా నెల్లూరు కంచి దండయాత్రలలో పాల్గొని ఆ బిరుదులు ధరించినట్లు తెలుస్తోంది. కాపయనాయకుడు ఇతనిని సబ్బినాటి పాలకుడుగా నియమించాడు. నేటి కరీంనగర్ జిల్లా ప్రాంతమే నాటి సబ్బినాడు. రామగిరి సబ్బినాటికి రాజధాని ముప్పభూపాలుడు కవిపండితులను పోషిస్తూ దానధర్మాలు చేస్తూ దేవాలయాలను పునరుద్ధరిస్తూ రాజ్యపాలన చేశాడు. కాపయనాయకుని పతనానంతరం కూడా వీరి వంశస్తులు సబ్బినాటిని పాలించారు. క్రీ శ 1433వ సంవత్సరంలో అహమ్మద్ షా ఈ వంశస్తులను ఓడించి సబ్బినాటిని బహమనీ రాజ్యంలో కలిపాడు.

కొప్పులవారి పిఠాపుర రాజ్యం: కాపయనాయకుని కాలంలో పిఠాపురాన్ని రాజధానిగా చేసుకొని పాలించిన కొప్పుల వంశస్తుల రాజ్యం ఈ కాలం నాటి సామంత రాజ్యాలలో ఒకటి. వీరికి వీరి సామంతులని పేరుంది వీరి రాజ్యానికి ఆంధ్రఖండ మండలం అని కూడా పేరుంది. కాపయనాయకుని మరణానంతరం ఆంధ్ర సామ్రాజ్యం విచ్ఛిన్నమైంది. అందువల్ల ఆంధ్ర సామ్రాజ్యంలోని ఒక భాగాన్ని మాత్రమే తాము పాలించామని అర్థంలో తమ రాజ్యాన్ని ఆంధ్రఖండ మండలం అని వారు పిలుచుకున్నారు. వీరి వంశ చరిత్రను తెలుసుకోవడానికి ముఖ్య ఆధారం శక 1259 అంటే క్రీ.శ.1337 నాటి నామయనాయకుని శాసనం అతి ముఖ్యమైంది. ఈ శాసనం కొప్పులవారు గోదావరి నదికి ఉత్తర ప్రాంతంలో తమ అధికారాన్ని స్థాపించారని, వారి రాజ్యం గోదావరి నది నుండి కళింగ వరకు విస్తరించి ఉందని, దానికి ఆంధ్రఖండ మండలం అని పేరుందని తెలుపుతోంది ఈ శాసనమేగాక సింహాచలంలో ఉన్న మరికొన్ని శాసనాలు కూడా వారి చరిత్రను తెలుపుతున్నాయి.

ఈ వంశంలోని నామయనాయకుడు దోనేపూడి గ్రామాన్ని తన తండ్రి పేరుతో ప్రోలారం లేక ప్రోలవరం అని పేరుమార్చి భారద్వాజ గోత్రీకుడైన గణపతి అనే బ్రాహ్మణునికి అగ్రహారంగా దానం చేశాడు. అతడు వేదపండితుడు, ప్రశ్నాష్టకంలో పండితుడు. ఈ శాసనం ప్రకారం కొప్పుల వారిలో ప్రథముడు కాపయ

నాయకుడు. అతని కుమారుడు ప్రోలయనాయకుడు. ప్రోలయనాయకుని భార్య చోదమాంబ. వారి కుమారుడే దోనేపూడి శాసనాన్ని ఇచ్చి నామయనాయకుడు అతడు దోనేపూడిని తన తండ్రి ప్రోలయ నాయకుని పేరుతో ప్రోలవరంగా మార్చి దానం చేశాడు. నామయనాయకునికి పగమెచ్చు గండ అనే బిరుదు ఉన్నట్లు ఈ శాసనం తెలుపుతోంది. అతని రాజ్యంలో ఎల అనే నది ప్రవహిస్తోందని కూడా తెలుపుతోంది. ఇది నేటి ఏలేరు నది. ఇది ఇప్పటి తూర్పుగోదావరి జిల్లాలోని ఎల్లవరం, పిఠాపురం, పెద్దాపురం మండలాల గుండా ప్రవహిస్తోంది. శక 1189 అంటే క్రీ.శ.1267 సంవత్సరానికి చెందిన ఒక శాసనం బెజవాడ మల్లేశ్వర దేవాలయంలో ఉంది. అందులో పగమంచి గుండ, కొప్పుల ప్రోలినాయక ముప్పసాని, దొడ్డదేవర, నాగనబోయుడు, వారి తాత అయిన గొప్పమారెడ్డి, వారి తండ్రి నారెబోయిన, వారి తల్లి కామసాని. వారి అన్నలైన కొరునిపాటి ఎరపోతినాయక, దొమ్కెనల పుణ్యఫలానికై మల్లేశ్వరస్వామికి ఒక దీపదానం చేసి ఈ శాసనం వేయించబడింది. ఈ శాసనంలోని కొప్పుల పదం దోనేపూడి శాసనం వేయించిన నామయనాయకుని వంశమైన కొప్పుల పదం కావచ్చుని, వారికి పగమంచిగండ అనే బిరుదు ఉన్నందువల్ల అందులో పేర్కొనబడినవారు కొప్పుల వంశస్తులై ఉండవచ్చని మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయపడ్డారు. అది వాస్తవమైనట్లయితే కొప్పుల వంశస్తులు 13వ శతాబ్దం నుండే ప్రఖ్యాతి వహించారని భావించవచ్చు. బెజవాడ శాసనం దోనేపూడి శాసనానికన్నా 70 సంవత్సరాల ముందు కాలానికి చెందింది.

ఈ శాసనం కాకతి రుద్రమదేవి కాలం నాటిది. కనుక కొప్పుల వంశస్తులు కూడా కాకతీయుల వద్ద పని చేసినవారనే చెప్పవచ్చును. బెజవాడ శాసనంలో నారెబోయ, నాగబోయ అనే పేర్లున్నాయి. ఈ పేర్లను బట్టి వీరు బోయ కులస్థులై ఉండవచ్చని కొందరు భావించారు. కాకతీయుల కాలంలో వారు కృష్ణా తీరం నుండి పిఠాపుర ప్రాంతానికి వచ్చి కాకతీయ వంశస్తులకు సామంతులైనట్లు తెలుస్తోంది. తర్వాత వారు ప్రోలయ నాయకుని నాయకత్వం అంగీకరించి ఉంటారు. తర్వాత కాపయ నాయకుడు వారిని పిఠాపురం పాలకులుగా కొనసాగించి ఉంటారు. సింహాచలంలోని శిధిల దశలో ఉన్న కొప్పుల వారి శాసనం నాలుగు తరాల కొప్పుల వంశస్తుల వంశ వృక్షాన్ని తెలియజేస్తోంది. ఇందులో కాపయనాయక - ప్రోలయనాయక - కొప్పులనాయక లేక కొప్పులయ్య - రెండవ ప్రోలయనాయకల పేర్లు ఇవ్వబడ్డాయి. తర్వాత ఒక రాణి పేరు కూడా ఉంది. కాని ఆ పేరు ఉన్న భాగం శిధిలమైపోయింది. కనుక పేరు తెలియటం లేదు. ఆమె మద్విత్ అంటే విష్ణు, మహేశ్వరుల భార్యలతో పోల్చబడింది. ఈమె చివరగా పేర్కొనబడ్డ రెండవ ప్రోలయనాయకుని భార్య అయి ఉండవచ్చును. సింహాచలంలోనే ఉన్న శక 1310 అంటే క్రీ.శ.1388 నాటి మరొక శాసనంలో కొప్పులయ్య భార్య ముప్పాదేవి అదుంపల్లి లేక అమ్దులాపల్లి లేక పగమెచ్చుగండ భోగను దానం చేసింది. శక 1282 అంటే క్రీ.శ.1360, శక 1291, అంటే క్రీ.శ.1369కి చెందిన సింహాచలంలోని మరి రెండు శాసనాలలో కాపినాయక, నామభూపాల అనే పేర్లున్నాయి. ఈ శాసనాల ప్రకారం వారి వంశవృక్షం:

దోనేపూడి శాసనం ప్రకారం	**సింహాచల శాసనం ప్రకారం**
కాపయనాయక	కాపయనాయక
|	|
ప్రోలయనాయక	ప్రోలయనాయక
|	|
నామయనాయక	కొప్పులనాయక
	|
	రెండవ ప్రోలయనాయక

ఈ రెండు శాసనాల ప్రకారం వంశవృక్షంలోని రెండవ వాడైన ప్రోలయ నాయకునికి నామయనాయక, కొప్పులనాయక అనే ఇద్దరు కుమారులున్నట్లు తెలుస్తోంది. కనుక వారి వంశవృక్షం ఈ కింది విధంగా రూపొందించవచ్చు.

కాపయనాయక
|
ప్రోలయనాయక

నామయనాయక　　　　　　　　　　　　కొప్పులనాయక-భార్య ముప్పాదేవి

రెండవ ప్రోలయనాయక భార్య పేరు పోయింది

ముప్పాదేవి శాసనం ఆమె కొప్పులనాయకుని భార్య అని, కొప్పుల నాయకునికి కొప్పులయ్య అని కూడా పేరున్నట్లు తెలుపుతోంది. ఇక సింహాచలంలో శక 1282 అంటే క్రీ.శ.1360 శాసనంలో పేర్కొనబడిన కాపినాయక వంశవృక్షంలోని మొదటివాడైన కాపయనాయకుడై ఉంటాడు. రెండవ శక 1291 సరియగు క్రీ.శ.1369 నాటి రెండవ శాసనంలోని నామభూపాలుడు నామయనాయకుడై ఉంటాడు. ఈ శాసనాల వలన మొత్తం ఐదుగురు కొప్పుల వంశస్తుల పేర్లు తెలుస్తున్నాయి. ఈ శాసనాలను బట్టి కాపయ నాయకుడు కొప్పుల వంశంలో ప్రథముడు. అతడు కాకతీయుల వద్ద సేనాధిపతిగా పని చేసి ఉండవచ్చు. అతడు ప్రతాపరుద్రుని సామంతుడై ఉండవచ్చు. అతని కుమారుడు ప్రోలనాయకుడు ముసునూరి ప్రోలయనాయకుని సమకాలికుడై ఉండవచ్చు. ఇతడు కూడా ముసునూరి వంశస్తులతోపాటు ముస్లింలతో పోరాడి ఉండవచ్చు. అతని కుమారుడు నామయనాయకుడు శక 1259 అంటే క్రీ.శ.1337లో రాజ్యానికి వచ్చి ఉండవచ్చు. అతడు ముసునూరి కాపయనాయకుని సామంతుడై ఉండవచ్చు. కాపయనాయకుడు బహమనీ సుల్తాన్‌ల చేతిలో ఓడిపోయిన తర్వాత ఉత్తరాంధ్రపై అతని అధికారం బలహీనపడింది. ఆ సమయంలో అంటే 1350 తర్వాత నామయనాయకుడు స్వతంత్రం ప్రకటించి ఉండవచ్చు. ఈ వంశంలో ఇతడు మొదటి స్వతంత్ర ప్రభువు. అతడు తన రాజ్యానికి ఆంధ్రఖండ మండలం అని పేరు పెట్టుకొని ఉండవచ్చు. తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురం ఎల్లవరం, గృద్ధవాడి అని పిలువబడే రామచంద్రపురం, కాకినాడ, రాజోలు తాలూకాల ప్రాంతం అతని రాజ్యంలో భాగాలై ఉండవచ్చు. ఏలేరు ఇతని రాజ్యంలో గుండా ప్రవహిస్తుందని దోనేపూడి శాసనం తెలుపుతోంది. అతని రాజధాని పిఠాపురం. ఇతడు క్రీ.శ.1337 నుండి ఎంతకాలం పాలించిందీ తెలియదు.

నామయనాయకుని తర్వాత ఎవరు రాజ్యానికి వచ్చిందీ తెలియదు. కాని ముప్పాదేవి సింహాచల నాథునికి దానం చేసిన అండలపల్లి గ్రామం విశాఖపట్టణం జిల్లాలోని సర్వసిద్ధి తాలూకాలో ఉంది. అందువల్ల నామయనాయకుని తర్వాత పిఠాపురాన్ని వదిలి ఈ వంశస్తులు ఉత్తరంగా వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. వారి రాజధాని కోటనందూరు మండలంలోని కొట్టాం అని భావించారు. కొట్టాంకు కొప్పులవారి కొట్టాం అని పేరుండి. 17వ శతాబ్దం వరకు ఈ పేరు వాడుకలో ఉంది. ఇప్పుడు కూడా ఈ ప్రాంతంలో కొప్పుల వెలమ కులస్తులు ఉన్నారు. ముప్పాదేవి శాసనం ప్రకారం శక 1310 అంటే 1388 ప్రాంతంలో కొప్పులయ్య పాలించి ఉండాలి చోడ భక్తిరాజు సర్వసిద్ధి ప్రాంతంలోని పాంచదార్ల వద్ద గజపతిని ఓడించి కొప్పులపతిని సింహాసనాధీశుని చేశాడని అతని కుమారుడు అన్నెదేవచోడుడు తన శాసనంలో చెప్పుకున్నాడు. చోడ భక్తిరాజు క్రీ.శ.1366 వరకు పాలించాడు. కనుక ఈ సంఘటన నామయనాయకుని కాలంలో జరిగి ఉండాలి. క్రీ.శ.1353వ సంవత్సరంలో కళింగ తూర్పు గాంగరాజు మూడవ భానుదేవుడు పిఠాపురంపై దండెత్తాడు. అపుడు కొప్పుల వంశస్తులు తమ రాజ్యాన్ని కోల్పోయారు. గంగరాజు తిరిగి వెళ్లిపోయిన తర్వాత ఏరువ వంశానికి చెందిన భక్తీశ్వర చోడుడు. ఇతని రాజ్యం ఆక్రమించిన గణపతి అనే వ్యక్తిని పంచదార్ల యుద్ధంలో ఓడించి కొప్పులపతిని తిరిగి సింహాసనం ఎక్కించినట్లు అన్నెదేవచోడుని రాజమహేంద్రవర శాసనంలో సూచన ఉంది. తర్వాత అనపోతారెడ్డి క్రీ.శ.1356వ సంవత్సరంలో వీరి రాజ్యంపై దండెత్తాడు. అనపోతారెడ్డి వెనుదిరిగిన తర్వాత కొప్పుల వంశం స్వతంత్రం ప్రకటించింది. తర్వాత అనవేమారెడ్డి పిఠాపురంపై దండయాత్ర చేశాడు. కాని అతని విజయం కూడా తాత్కాలికమే. తర్వాత కాటయవేమారెడ్డి కాలంలో పిఠాపురం కొప్పుల వారి రాజ్యం రాజమహేంద్రవర రెడ్డి రాజ్యంలో భాగం అయిపోయినట్లుగా కనిపిస్తోంది. క్రీ.శ.1370 తర్వాత వీరి చరిత్ర స్పష్టంగా తెలియదు. తర్వాత కాలానికి చెందిన అంగర నరసింహకవి రాసిన రాజరాజాభిషేకం అనే తెలుగు కావ్యంలో కొట్టాపురం కొప్పుల వల్లభూపతి అనే అతన్ని పేర్కొన్నాడు. ఇతడు కూడా కొప్పుల వంశస్థుడై ఉండవచ్చు. ఇతనికి పట్టుతలాట కేలడిరాయ, గాయిగోవుల, జగనొబ్బగండ అనే బిరుదులున్నాయి. ఇవి పద్మనాయకులు ధరించిన బిరుదులు కనుక ఇతడు వెలమ కులస్తుడని చెప్పవచ్చు. ఈ కావ్యకర్త నరసింహకవి క్రీ.శ.1500 సంవత్సరం శ్రీరామకృష్ణ కవి అనే అతడు తన ప్రబంధ మణిభూషణం అనే కావ్యంలోని పీఠికలలో పేర్కొన్నాడు. కనుక కొప్పుల వల్లభూపతి క్రీ.శ.1500 ప్రాంతం కొట్టాంను పాలించి ఉండవచ్చు.

తొయ్యేరు రాజ్యం: ప్రోలయనాయకుడు ఉత్తరాంధ్రను విముక్తి చేసిన తర్వాత తన పినతండ్రి రాజా నాయకుని తొయ్యేరు నాయంకరానికి అధిపతిని చేశాడు. కాపయనాయకుడు సింహాసనం అధిష్టించిన తర్వాత వారి నాయంకరాన్ని ఖాయం చేసి రాజానాయకుని కుమారుడు అనపోతానాయకుడిని అతడు స్థానిక పాలకునిగా నియమించాడు. అనపోతానాయకుడు తొయ్యేరును రాజధానిగా చేసుకొని రాజమహేంద్రవర ప్రాంతాన్ని పాలించాడు. అందువలన అతనికి తొయ్యేరు అనపోతానాయకుడని పేరు వచ్చింది. ఇతనికి రాజమహేంద్రవరం రెండవ రాజధానిగా ఉండేది. అందువల్ల ఇతని రాజ్యాన్ని తొయ్యేరు రాజ్యం అని పిలిచేవారు. ఇతడు క్రీ.శ.1366 వరకు పాలించాడు. ఇతని తర్వాత ఇతని వారసులు తొయ్యేరు రాజ్యాన్ని పాలించలేదు. అతని మరణానంతరం తొయ్యేరు రాజమహేంద్రవర రాజ్యం మంచికొండ వంశస్తుల కోరుకొండ రాజ్యంలో భాగం అయిపోయింది.

ఏరువ చోడ వంశం క్రీ.శ.1330-1416: కమ్మ, రెడ్డి, వెలమ యుగం ఆంధ్రదేశ చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించిన సామంత వంశాలలో ఏరువ చోళ వంశం అతి ముఖ్యమైంది. ఈ వంశానికి చెందిన భక్తీశ్వర చోడుడు అన్నెదేవ చోడులు అనేక యుద్ధాలు చేసి గొప్పవీరులుగా ప్రసిద్ధి చెందారు. వీరి చరిత్రకు చోడభక్తిరాజు పెంటపాడు శాసనం, అతని కుమారుడు అన్నెదేవచోడుని రాజమహేంద్రవర శాసనం, మద్రాసు మ్యూజియంలోని మరొక శాసనం ఆధారాలు. ఇవేగాక ద్రాక్షారామం, పోలవరం, పాలకొల్లులో లభించిన మరికొన్ని శాసనాలు కూడా వీరి చరిత్రను తెలుపుతున్నాయి.

శ్రీశైలం వద్ద ఉన్న కాంద్వకొలను అనే గ్రామాన్ని శక 1278 అంటే క్రీ శ.1356లో విశ్వేశ్వర బ్రహ్మచారికి భక్తిరాజు దానం చేశాడు. అతడు నాలుగు దిక్కులను జయించాలని అక్కడికి వచ్చి ఈ దానం చేశాడని మద్రాసు మ్యూజియం శాసనం తెలుపుతోంది. అంటే విసరినాడులోని గంగ పిన్నసాని నదుల మధ్య ఉన్న ఉత్తమ గండచోడాన్ని దేవవరమ్ అనే గ్రామాన్ని కొందరు బ్రాహ్మణులకు దానం చేసినట్లు రాజమండ్రి మ్యూజియం శాసనం తెలుపుతోంది. ఈ శాసనం విడుదల చేసిన అన్నెదేవచోడుడు తన తండ్రి భక్తీశ్వరచోడుని విజయాలను గురించి రాయించాడు. అందువలన చోడభక్తిరాజు చరిత్ర వారి వంశవృక్షం మనకు తెలుస్తోంది అలాగే అన్నెదేవచోడుడు తన తల్లిదండ్రుల పుణ్యఫలానికి పాలకొల్లులో వేయించిన శాసనం కోనసీమలో రాజ్యాన్ని గురించి తెలుపుతూ వేయించిన పోలవరం శాసనాలు కూడా కొంత వరకు అన్నెదేవుని చరిత్రను తెలుపుతున్నాయి. ఈ శాసనాల సహాయంతో వారి వంశవృక్షం తయారు చేయబడింది.

అన్నెమాంబ

ఏరువ భీమ లేక నల్లభీమ

భార్య ప్రోలాంబిక

దామ - భార్య లక్ష్మి

సోమ - భార్య సూరాంబిక

గంగాధర - భార్య ఇరుగాంబిక

కామరాజు లేక భక్తిరాజు భార్య అన్నెమాంబ

అన్నెదేవచోడు భార్య ఇరుగాంబిక - ఉండి తమ్మరాజు కుమార్తె

వీరభద్రుడు

వీరభద్రుడు: కర్నూలు జిల్లాలో తురుమెళ్ల, త్రిపురాంతక ప్రాంతాలను పూర్వం ఏరువనాడు అని పిలిచేవారు. ఏరువ అంటే రెండు ఏరుల మధ్య ప్రదేశం అని అర్థం ఉందట. ముఖ్యంగా శ్రీశైలం, త్రిపురాంతక ప్రాంతాలను ఏరువనాడు అని పిలిచేవారు. ఈ వంశస్తులు తెలుగు చోళ శాఖీయులు. వారు ఏరువనాడును

పాలించినందువల్ల వారికి ఏరువ చోళులని పేరు వచ్చింది. క్రీ.శ.1121 ప్రాంతంలో ఈ వంశానికి చెందిన తొండయరాజు కళ్యాణీచాళుక్య చక్రవర్తి త్రిభువన మల్లుని సామంతునిగా ఉండేవాడు. ఇతనికి కోదూర్పురవశ్వేర అనే బిరుదు ఉంది. కనుక ఇతడు త్రిభువనమల్లుని సామంతునిగా కోదూరును పాలించి ఉండవచ్చు. ఇతని పట్టమహిషి మైలమదేవి ద్రాక్షారామ భీమేశ్వరస్వామికి దీపదానం చేసి శాసనం రాయించింది. క్రీ.శ.1250 ప్రాంతంలో ఈ వంశానికి చెందిన ఏరువ మల్లదేవుడు కాకతి గణపతిదేవుని ధిక్కరించి కాకతీయ సేనానుల చేతిలో మరణించాడట. ఈ కాలంలో వీరి వంశానికి చెందిన భీమరాజును మరొక ప్రస్తావన శాసనాలలో ఉంది. ఇతనికి ఏరువభీముడు అని కూడా పేరుంది. ఇతని తల్లి అన్నెమాంబ. ఇతడు కాకతి గణపతిదేవుని వద్ద సేనాధిపతిగా పనిచేసి ఉండవచ్చు. ఏరువభీముని గురించి కడప జిల్లాలోని తాళ్లెపొద్దుటూరు శాసనంలో ఉంది. అందులో అతని విజయాల వర్ణన ఉంది. అతడు విసరినాడు, చక్రగొట్టం, మన్నయ, వడ్డి, టెక్కలి, మంతెన, వేంగి, కళింగ మొదలైన రాజ్యాలు జయించాడని ఆ శాసనం వర్ణిస్తోంది. ఇతడు చిన్నరాజై ఉండి ఆ రాజ్యాలు జయించాడంటే నమ్మడానికి వీలులేదు. అన్నెదేవచోడుడికి అతడు ఐదు తరాలు ముందువాడు. కనుక అతడు 13వ శతాబ్దం మధ్యలోని వాడై ఉండవచ్చు. అంటే అతడు కాకతి గణపతి వద్ద సేనాధిపతిగా చేసి ఉండవచ్చు. గణపతిదేవుడు కళింగ దండయాత్ర చేశాడు. అతని సేనాధిపతి రాజానాయకుడు ద్రాక్షారామంలోను, వరంగల్లు జిల్లాలోని ఉప్పరపల్లి వద్ద వేయించిన రెండు శాసనాలు గణపతిదేవుని కళింగ దండయాత్రను ప్రస్తావిస్తున్నాయి కనుక గణపతిదేవుని సేనానిగా ఏరువభీముడు తాళ్ల ప్రొద్దుటూరు శాసనంలో చెప్పిన విజయాలు సాధించి ఉంటాడు ఇతని భార్య ప్రోలాంబ. ఆమెకు చౌహతానారాయణ అనే బిరుదుగల రామన్న పాలుడనే కుమారుడు జన్మించాడు అతనికి లక్ష్మీదేవి అనే భార్య వల్ల సోమభూపతి జన్మించాడు. అతని భార్య సోమాంబ. ఆమెకు అన్నెదేవచోడుడు అనే కుమారుడు కలిగాడు. అతనికి గంగాధరచోడుడనే మరొక నామాంతరం కూడా ఉంది. అతని భార్య ఇరుగాంబిక. ఆమె వేంగి ప్రభువైన వెంగభూపాలుని సోదరి. ఆమెకు కామభూపతి అనే పేరు గల భక్తీశ్వరచోడుడు జన్మించాడు. అతనికి రెండవ అన్నెదేవచోడుడు అనే కుమారుడు కలిగాడు. ఈ చివరి ఇద్దరూ కమ్మ రెడ్డి కాలం నాటి వారు. గంగాధరచోడుడు, అతని పూర్వీకులు ముమ్మడి ప్రోలవరంలో స్థానిక పాలకులుగా ఉన్నట్లు ఒక అభిప్రాయం ఉంది. భక్తిరాజు ఏరువనాడును పాలించేవాడని, అతడు వేంగి రాజైన వెంగ భూపాలుని చెల్లెలిని వివాహం ఆడాడని, దాంతో అతనికి వేంగి రాజ్యంతో సంబంధం ఏర్పడిందని మరొక అభిప్రాయం ఉంది.

భక్తీశ్వర చోళుడు క్రీ.శ.1335-55: ఆంధ్ర స్వాతంత్ర్యం సమర ప్రథమ ఘట్టంలో వేంగి ప్రభువు చంద్రవంశ క్షత్రియుడు, చాళుక్య వంశానికి చెందిన వెంగభూపాలుడు ముసునూరు ప్రోలయనాయకునితో చేరి ముస్లింలతో యుద్ధాలు చేశాడు. ఆ యుద్ధాలలో అతడు మరణించాడు. ప్రోలయనాయకుడు ముస్లింలను పారదోలి కోస్తా ఆంధ్రను విముక్తి చేశాడు. రాజ్యానికి పాలకులను నియమించినప్పుడు ప్రోలయనాయకుడు వేంగి రాజ్యానికి మరణించిన వెంగభూపాలుని మేనల్లుడైన భక్తీశ్వరచోడుని అధిపతిగా నియమించినట్లు కనిపిస్తోంది. కనుక ఈ ఏరువచోళ వంశం గోదావరీ తీరంలో రాజకీయంగా ప్రాముఖ్యతలోకి వచ్చింది. కాపయనాయకుడు రాజ్యానికి వచ్చిన తర్వాత గోదావరీనదికి ఇరుపక్కల ప్రాంతాలను తొయ్యేరు రాజ్యానికి అనుబంధం చేసి రాజమహేంద్రవరం, వేంగి దేశాలపై తన పినతండ్రి రాజానాయకుని కుమారుడు ముసునూరి అనపోతనాయకుని అధిపతిగా నియమించాడు. ఆ సందర్భంలో అనపోతానాయకునికి, భక్తిరాజుకు వివాదం వచ్చి అతడు వేంగి రాజ్యాన్ని కోల్పోయినట్లుగా కనిపిస్తోంది. అందువల్ల అతడు అద్దంకిని ఏలే ప్రోలయ వేమారెడ్డి సహాయం కోరాడు ప్రోలయవేమారెడ్డి అతనిని చేర దీసి అతని కుమారుడు భీమదేవరాజుకు తన కుమార్తెనిచ్చి వియ్యంకుని చేసుకున్నాడు. ప్రోలయవేమారెడ్డి సహాయంతో చోడభక్తిరాజు తిరిగి వేంగి రాజ్యాన్ని ఆక్రమించినట్లు కనిపిస్తోంది. తర్వాత కూడా తొయ్యేటి అనపోతా నాయకునితో వివాదం వచ్చి అతనిని యుద్ధంలో చంపినట్లుగా తెలుస్తోంది ఏమైనా అతడు వేంగి రాజ్యాన్ని నిలుపుకున్నాడు. అతడు కామపురి అనే నగరాన్ని నిర్మించి తన రాజధానిగా చేసుకొని పాలించాడు.

ఇతడు గొప్ప వీరుడని, అనేక యుద్ధాలు చేశాడని శాసనాలు తెలుపున్నాయి. యువరాజుగా ఉన్నప్పుడే గుల ఉండి వద్ద బొగ్గర యువరాజును ఓడించాడని, పంచదార్ల వద్ద గజపతిని, భరణిపాడు వద్ద సింగభూపతిని పెదకొండ వద్ద దిబర్ఖాన్‌ను, సూరవరం వద్ద వీరాన్నపోతును ఓడించాడని, ముస్లింలతో కలిసి కర్ణాటక రాజును ఓడించాడని, అత్తిలి యుద్ధంలో శత్రువులను ఓడించి 10 వేల సైన్యాన్ని కాపాడాడని, ఉండి రాజు సహాయంతో

కాకరపర్తి వద్ద జరిగిన యుద్ధంలో కన్నడ సైన్యాన్ని హతమార్చాడని, కాపయనాయకుని కుటుంబం శరణువేడగా రక్షించాడని వర్ణింపబడింది. పిఠాపురం కొప్పులనాయకుని పదభ్రష్టుణ్ణి చేసిన పాంచదార్లరాజు గణపతితో పోరాడి కొప్పుల కాపయనాయకుని సింహాసనంపై పునఃప్రతిష్ట చేశాడని అతని పెంటపాడు శాసనం తెలుపుతోంది.

పై విజయాలను గురించి పరిశీలించినట్లయితే భక్తిరాజు ముసునూరి ప్రోలయనాయకునికి సమకాలికుడని అర్థం అవుతోంది. అతనితో కలిసి భక్తిరాజు బొగ్గర మొదలైన ముస్లిం వీరులతో పోరాడి ఉండవచ్చు. బొగ్గర మహమ్మద్‌బీన్ తుగ్లక్ సేనానులలో ఒకరు కావచ్చు. ముసునూరి ప్రోలయ నాయకుని కాలంలో కళింగ గాంగవంశ గజపతి కోస్తా ఆంధ్ర దేశంపై దండెత్తాడట. ముసునూరి ప్రోలయ నాయకుడు గాంగ వంశ రాజును ఎదుర్కొన్నాడట. ఆ యుద్ధంలో ముసునూరి ప్రోలయనాయకుడు మరణించాడని ప్రతీతి. ఈ యుద్ధంలో గజపతి పాంచదార్లలోని కొప్పుల వంశానికి చెందిన రాజును ఓడించి ఉంటాడు. కనుక భక్తిరాజు గజపతిని ఓడించి తరిమి కొప్పుల పతిని తిరిగి పాంచదార్లలో సింహాసనాధీశుని చేసి ఉంటాడు. లేక 1353లో ఆంధ్రదేశంపై దండెత్తిన మూడవ నరసింహునితో పోరాడి ఉండవచ్చు. ఈ కాలంలో ఇద్దరు సింగనలున్నారు. వారిలో ఒకరు రాజు కొండనేలిన ముమ్మడినాయకుని తమ్ముడైన సింగమనాయకుడు. భరణిపురం వద్ద భక్తిరాజు ఓడించిన సింగమనాయకుడు ఎవరో చెప్పలేం. ఇతడు కోరుకొండ సింగమనాయకుడే అయి ఉండవచ్చు. కారణమేమిటంటే భక్తిరాజు తొయ్యేరు అనపోతా నాయకునితో పోరాడి అతనిని సంహరించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. తొయ్యేరు అనపోతానాయకుని సామంతుడు కోరుకొండ సింగమనాయకుడు. కనుక అతడు తొయ్యేరు అనపోతానాయకునికి సహాయంగా వచ్చి భక్తిరాజు చేతిలో ఓడిపోయి ఉండవచ్చు. పెదకొండపూరు వద్ద ఓడించిన దబూర్‌ఖాన్ కూడా గుర్తింపబడలేదు. పెదకొండాపూరు భద్రాచలం ప్రాంతంలో ఉంది. ప్రోలయనాయకుని రేకపల్లి కూడా అక్కడే ఉంది. భద్రాచలం ప్రాంతంపైకి దండెత్తిన ముస్లిం సైన్యాలను ఓడించి ఉండవచ్చు. సూరవరం వద్ద ఓడించిన వీరాన్నపోతు అద్దంకి రెడ్డిరాజు అనపోతారెడ్డి.

అనపోతానాయకుడు ఉత్తరాంధ్రపై దండయాత్ర సాగించిన సందర్భంలో చోడభక్తిరాజు రెడ్డి రాజ్యానికి వ్యతిరేకి అయ్యాడు. అనపోతారెడ్డి క్రీ.శ.1356లో ఉత్తరాంధ్రను జయించాడు. తిరిగి వెళ్లిపోయేటప్పుడు భక్తిచోడుడు అక్కడి ఇతర సామంతరాజులను కూడగట్టి అనపోతారెడ్డిని ఎదిరించాడు. అనపోతారెడ్డి ఓడి కొండవీడు చేరాడు. దాంతో భక్తీశ్వరుడు ఇతర సామంతులు, కొప్పులవారు, మంచికంటివారు స్వతంత్రులయ్యారు. రెడ్డిరాజ్య విస్తరణ ఆగిపోయింది. అనపోతారెడ్డి వెనుదిరిగి పోయిన 1356 నుండి తిరిగి అనవేమారెడ్డి ఉత్తరాంధ్రపై దండెత్తే వరకు ఇతడు వేంగి రాజ్యాన్ని స్వతంత్రంగా పాలించినట్లు కనిపిస్తోంది. అనవేమారెడ్డి ఉత్తరాంధ్రపై దండెత్తి సింహాచలం వరకు విజయయాత్ర చేశాడు. ఆ సందర్భంలో అతడు ఏరువవంశంతో వియ్యం పొందాడు. ఏరువ చోడ భక్తీశ్వరుని భార్య అన్నెమాంబ. ఆమె వల్ల అతనికి ఇద్దరు కుమారులు కలిగారు. భీమరాజు లేక భీమలింగచోడుడు, అన్నెదేవ చోడుడు. అనవేమారెడ్డి తన కుమార్తెను భీమరాజుకు ఇచ్చి వివాహం చేసి ఏరువ వంశాన్ని తన బంధుకోటిలోకి చేర్చుకున్నాడు. ఈ వివాహాన్ని గూర్చి శివలీలా విలాసం, కాశీఖండాలలో వర్ణింపబడింది. రెండవ కుమారుడు అన్నెదేవచోడునికి కృష్ణా జిల్లాలోని సూరవరాన్ని పాలించే సూర్యవంశ క్షత్రియుడైన పిన ఉండి రాజు తన సోదరినిచ్చి వివాహం చేశాడు. ఈ బాంధవ్యాల వల్ల భక్తీశ్వరుని పరిస్థితి మెరుగుపడి తిరిగి రాజ్యాన్ని సంపాదించగలిగాడు. భక్తీశ్వరచోడుడు గొప్ప శివభక్తుడు. అతడు రోజుకు ఆరు పర్యాయాలు శివుని ధ్యానించేవాడట. అతడు అనేక శివాలయాలకు దానాలు చేశాడు. శైవ క్షేత్రాలను దర్శించాడు. శాలి 1221లో అతడు శ్రీశైలాన్ని దర్శించాడు. అక్కడ నివసించే విశ్వేశ్వర బ్రహ్మచారికి కండడోల గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. అతడు శ్రీశైలంలో విద్యాసంస్థను స్థాపించి విద్యాబోధన చేసేవాడు. క్రీ.శ.1355లో త్రిపురాంతకాన్ని దర్శించి స్వామికి ఆముదాలపల్లి అనే గ్రామాన్ని దానం చేశాడు. ఇంకా ఇతర దానాలు కూడా చేశాడు. పర్వత స్వామికి చెరువాడు, ఆతుకూరు గ్రామాలను దానం చేశాడు. కాశీ విశ్వేశ్వరస్వామికి కొన్ని గ్రామాలు, పట్టిసంలోని బ్రాహ్మణులకు గోశతకాన్ని దానం చేశాడు. పట్టిస వీరభద్రాలయానికి, గోముఖ గిరీశ్వరాలయానికి బంగారు మలాం చేయించాడు. ఇతని గురించి శ్రీనాధుడు కూడా శివరాత్రి మహాత్మ్యంలో ప్రస్తావనలు చేశాడు. భక్తీశ్వరునికి గండభేరుండ, రాయవేశ్యాభుజంగ అనే బిరుదులు ఉన్నాయి. చోడ భక్తిరాజు ఎంతకాలం పాలించాడో, ఎప్పుడు మరణించాడో తెలియదు. అన్నెదేవుడుని రాజ మహేంద్రవరం శిలాశాసనం పోయింది. దాని కాపీ తీసి భద్రపరిచారు. అందులో అన్నెదేవచోడుని పట్టాభిషేకం

శక 1259 అని ఉంది. కాని అది తప్పు. అది శక 1289 అని మల్లంపల్లి సోమశేఖరశర్మ నిర్ధారణ చేశారు అది క్రీ.శ.1366 అవుతుంది. కనుక క్రీ.శ.1366లో చోడభక్తిరాజు మరణించగా అతని కుమారుడు అన్నెదేవచోడుడు పట్టాభిషేకం జరుపుకున్నాడని భావించవచ్చు.

అన్నెదేవచోడుడు క్రీ.శ.1365-1417: భక్తిరాజుకు ఇద్దరు కుమారులు. భీమలింగరాజు, అన్నెదేవ చోడుడు. వారు సింహాసనానికి పోటీపడ్డారు. అందులో అన్నెదేవచోడుడు విజయం సాధించి సింహాసనం అధిష్టించాడు. అది సహించని అతని సవతి సోదరుడు కొండవీటి అనవేమారెడ్డిని ఆశ్రయించాడు. అనవేమారెడ్డి భీమరాజుకు బావమరిది. కనుక అనవేమారెడ్డి వేంగిపై దండెత్తి అన్నెదేవచోడుని ఓడించి తరిమి భీమదేవచోడుని సింహాసనాధీశుని చేశాడు. రాజ్యం కోల్పోయిన అన్నెదేవచోడుడు త్రిపురాంతక ప్రాంతమైన ఏరువకు వెళ్లిపోయాడు. కాని ఆ ప్రాంతం విజయనగర రాజులు ఆక్రమించుకొని ఉన్నారు. కనుక అతడు రాచకొండ, దేవరకొండలను ఏలే వెలమరాజుల సహాయం అర్థించాడు. దేవరకొండ వెలమరాజు పెదవేదగిరి అన్నెదేవునికి సైనిక సహాయం చేశాడు. వేదగిరి సహాయంతో ఏరువనాడును ఆక్రమించి కొన్ని గ్రామాలను దానం చేశాడు తర్వాత వెలమ సైన్యం సహాయంతో అతడు సోదరుని నుండి తన రాజ్యాన్ని తిరిగి ఆక్రమించే ప్రయత్నం చేశాడు కాని అనవేమారెడ్డి భీమరాజుకు అండగా నిలిచాడు. వెలమలు అన్నెదేవచోడుడు ఒకవైపు, భీమరాజు అనవేమారెడ్డి మరొకవైపు చేరి రెండు యుద్ధాలు చేశారు. కాని అన్నెదేవునికి విజయం లభించలేదు. కుమారగిరి పెదకోమటి వేమారెడ్డికి అంతర్యుద్ధం వచ్చినప్పుడు అతడు వేంగిని జయించాలని తలచాడు. కాని క్రీ.శ 1402లో అతనిని ఎలమంచిలి చాళుక్యుడు విశ్వేశ్వరుడు తరిమివేశాడు. కనుక అతడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్ షాను ఆశ్రయించాడు. బహమనీ సైన్యంతో పాటు పాల్గొని విజయనగర రాజులతో యుద్ధాలు చేశాడు. సాగరు వద్ద బహమనీ విజయనగర సైన్యాలకు జరిగిన యుద్ధంలో తన పరాక్రమాన్ని ప్రదర్శించి ఫిరోజ్‌షా మన్ననలను పొందాడు. కుమారగిరి మరణం తర్వాత పెదకోమటి వేమారెడ్డికి, కాటయ వేమారెడ్డికి వచ్చిన వివాదంలో ఇతడు బహమనీ సుల్తాన్ ఫిరోజ్‌షా మరియు వెలమల సహాయంతో వేంగిపై దండెత్తాడు. ఆ సందర్భంలో వేదగిరి బెండపూడి కోటను పట్టుకొన్నాడట. అక్కడ లభించిన విజయాల వల్ల వేంగి రాజ్యం అన్నెదేవుని వశం అయింది తన పూర్వపు సింహాసనాన్ని అధిష్టించాడు. క్రీ.శ.1404లో ద్రాక్షారామం వచ్చి శాసనం వేయించి అందులో పూర్వ సింహాసనాధీశ్వరా అని చెప్పుకున్నాడు. అందువల్ల అతడు రాజాధిరాజ పరమేశ్వర పూర్వసింహాసనాధీశ్వర అనే బిరుదులు ధరించాడు. ఇతడు జగ్గవాయ అనే ఒక రాజును కూడా జయించినట్లు అతని శాసనం తెలుపుతోంది మొత్తం మీద అన్నెదేవచోడుని విజృంభణ వలన కాటయ వేమారెడ్డి తన రాజ్యాన్ని పోగొట్టుకున్నాడు. రాజమండ్రి కూడా వేదగిరి వశం అయినట్లుంది. రాజమండ్రిలో వేదగిరి తన ప్రతినిధిగా పినమాదానాయుని నియమించాడు కాటయ వేమారెడ్డి విజయనగర రాజుల సహాయం అర్థించాడు. విజయనగర సేనలు కాటయ వేమారెడ్డికి సహాయంగా వచ్చాయి. తిరిగి అన్నెదేవచోడుడు కాటయ వేమారెడ్డితో పోరాడవలసి వచ్చింది. అన్నెదేవచోడునికి ఫిరోజ్ షా సైన్యాలు, పెదకోమటి వేమారెడ్డి సైన్యాలు సహాయంగా వచ్చాయి. ఉభయ సైన్యాలకు క్రీ.శ.1413లో గుండుగొలను వద్ద యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో కాటయ వేమారెడ్డి మరణించాడు. కొప్పునూళ్ల తిప్పానాయుడు కాటయ వేమారెడ్డిని సంహరించాడని వారి వంశచరిత్ర తెలుపుతోంది. తర్వాత అత్తిలి, కాకరపర్తి వద్ద జరిగిన యుద్ధాలలో విజయనగర కాటయవేమారెడ్డి సంయుక్త సైన్యాలు పూర్తిగా ఓడిపోయాయి. కాకరపర్తి యుద్ధంలో అన్నెదేవచోడుని బావమరిది పిన్న ఉండి రాజు వీరవిహారం చేశాడట. కన్నడ సైన్యాలు వెళ్లిపోయాయి ఓడిపోయి ప్రాణభయంతో ఉన్న కాటయవేముని కుటుంబం 10 వేల సైన్యంతో అన్నెదేవుని శరణు వేడిందట వారికి అన్నెదేవచోడుడు ఆశ్రయం ఇచ్చాడు. తర్వాత వారు రాజమహేంద్రవరం చేరారు. ఈ విజయం తర్వాత అన్నెదేవచోడుడు పాలకొల్లు దర్శించి తన తల్లిదండ్రుల పుణ్యఫలానికి దానం చేసి శాసనాలు వేయించాడు.

తర్వాత అన్నెదేవచోడుడు తన రాజ్యాన్ని పాలించసాగాడు. కాని రాజమహేంద్రవరంలో అల్లాడరెడ్డి రాజ్యభారం స్వీకరించాడు. అతడు అన్నెదేవుని సోదరుడైన భీమరాజుకు అల్లుడు. భీమరాజుకు అనవేమారెడ్డి అల్లుడు. అతనికి వేమాంబ అనే కుమార్తె జన్మించింది. ఆమెను అల్లాడరెడ్డికిచ్చి వివాహం చేశాడు. అల్లాడరెడ్డి గొప్ప రాజనీతి విశారదుడు. అన్నెదేవచోడుడు జీవించి ఉంటే రాజమహేంద్రవర రాజ్యానికి రక్షణలేదని భావించి అన్నెదేవచోడునిపై దండెత్తాడు. ఉభయులకు క్రీ.శ.1417వ సంవత్సరంలో యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో అన్నెదేవచోడుడు వీరమరణం పొందాడు. అల్లాడరెడ్డి తరపున పోరాడిన అరియేటి లింగన చేతిలో మరణించాడని

శ్రీనాథుని భీమేశ్వర పురాణం తెలుపుతోంది. అన్నెదేవచోడుడు కూడా తండ్రి లాగా శివభక్తుడు. రోజుకు ఆరు పర్యాయాలు శివధ్యానం చేసేవాడట. అతడు కూడా తండ్రి లాగా అనేక శైవాలయాలకు దానాలు చేశాడు. ద్రాక్షారామ భీమేశ్వరునికి సువర్ణ ఖచితం, సువర్ణ వృషభం, సువర్ణ కలశాలను చేయించి దానం చేసి శాసనాలు రాయించాడు. శాలి. 1335లో తన తల్లిదండ్రుల పుణ్యం కోసం పాలకొల్లు క్షీరారామేశ్వరునికి భూదానం చేశాడు. క్రీ.శ.1388లో త్రిపురాంతకేశ్వరుని దర్శించి దానాలు చేసి శాసనం వేయించాడు. వీరభద్రాలయానికి కొన్ని గ్రామాలను దానం చేశాడు. విసిరినాడులో తన పేర ఒక అగ్రహారాన్ని నిర్మించి బ్రాహ్మణులకు దానం చేశాడు. అనేక మంది బ్రాహ్మణ యువతులకు, యువకులకు వివాహాలు చేసుకోడానికి దానాలు ఇచ్చాడట. ఇతని కాలంలో అతని రాజధాని కామపురి గొప్ప పట్టణంగా అభివృద్ధి చెందిందని అందులో నిత్యం కస్తూరి, నవరత్నాలు విక్రయించేవారని వర్ణింపబడింది. ఇతని భార్య, పిన్న ఉండి రాజు సోదరి అయిన ఇరుగాంబకు వీరభద్రుడను కుమారుడు కలిగాడు. క్రీ.శ.1417వ సంవత్సరంలో జరిగిన యుద్ధంలో కుటుంబమంతా ప్రాణాలు కోల్పోయారు. కనుక ఇతని కుమారుడు వీరభద్రుడు కూడా ఆ యుద్ధంలో మరణించి ఉంటాడు. అన్నెదేవచోడుడు, అతని కుమారుడు వీరభద్రుని మరణంతో ఏరువ చోళవంశం అంతరించింది. వేంగి రాజ్యం రాజమహేంద్రవర రాజ్యంలో భాగమైపోయింది. అన్నెదేవచోడుని సోదరుడు భీమరాజు మొదటి నుండి రెడ్డిరాజుల తరపున ఉన్నప్పటికీ అతడు ఎక్కడా రాజ్యం చేసిన దాఖలాలు లేవు. అతడు రెడ్డిరాజుల వద్ద సేనాధిపతిగా పనిచేసి ఉండవచ్చు. ఏమైనా అతడు తన వంశానికి తగిన పాత్రను పోషించలేదు.

సూరవరం సూర్యవంశ క్షత్రియుల రాజ్యం: కృష్ణా జిల్లా నూజివీడు వద్ద గల సూరవరాన్ని రాజధానిగా చేసుకొని పాలించిన సూర్యవంశ క్షత్రియుల రాజ్యం కూడా ముసునూరు, రెడ్డి రాజుల కాలం నాటి రాజ్యాలలో ఒకటి. వీరు హరిసట గోత్రానికి చెందినవారు. వీరి చరిత్ర తెలుసుకోవడానికి ఆ వంశంలోని రెండవ ఉండి రాజు విడుదల చేసిన రావులపర్తి శాసనం ముఖ్య ఆధారం. ఉండి రాజు శక 1304లో అంటే అందులోని తిథి సంవత్సరాలను బట్టి క్రీ.శ.1383 జనవరి 28వ తేదీన రావులపర్తి గ్రామాన్ని తన పేరున ఉండిశపురంగా పేరు మార్చి అంటే తన పేరున మార్చి దానం చేశాడు. ఈ దానశాసనంలో పెద ఉండి రాజు వెంగు అనేవారి సంతకాలున్నాయి. ఇది రెడ్డి అనవేమారెడ్డి కాలానికి చెందింది. కాని సార్వభౌముని పేరు లేదు. అందువల్ల అతడు స్వతంత్ర రాజని చెప్పవచ్చు.

అంతేగాక అతడు గోపవరం, త్రోతకపల్లి, చెరువుకన్మ, కేశపాదు, చింతపల్లి, విప్పర్రు, కట్టపర్రు, బందారుపల్లి, కరికార్లపల్లి, ఉంగుటూరు, కొండ్రుప్రోలు, కొడకట్ల, నిడమనూరు, పలవెద, పరుంబల్లి, గూడపర్రు, తండిపర్రు, కేటక, తండిపల్లి గ్రామాలను కూడా బ్రాహ్మణులకు దానం చేసినట్లు తెలుపుతోంది. ఈ గ్రామాలన్నీ పశ్చిమ గోదావరి జిల్లాలోనివి. కనుక అతడు పశ్చిమగోదావరి జిల్లాలోని తూర్పు భాగాలను పాలించాడని భావించారు. అతని రాజధాని సూరవరం. కనుక కృష్ణా జిల్లాలోని కొన్ని ప్రాంతాలు కూడా అతని రాజ్యంలో చేరి ఉన్నాయని చెప్పవచ్చు. ఈ శాసనంలో నాలుగు తరాల వారి పేర్లున్నాయి. అతడు మేము ఇక్ష్వాకు వంశానికి చెందిన సూర్య వంశస్తులమని శాసనంలో చెప్పుకున్నాడు.

వంశవృక్షం

దేవరాజు

|

ఉండిస - భార్య భిమ్మిదేవి

|

తమ్మరాజు - భార్య వీరమదేవి

|

ఉండిరాజు - భార్య రుద్రమదేవి, మానవ్యస గోత్రీకురాలు

శక 1304- క్రీ.శ.1383

వీరిలో దేవరాజు కాకతి ప్రతాపరుద్ర చక్రవర్తి సామంతుడు అయి ఉండవచ్చు. ఉండిస లేక మొదటి ఉండి రాజు ముసునూరి ప్రోలయనాయకుని సమకాలికుడు కావచ్చు. తమ్మరాజు ముసునూరి కాపయ నాయకుడు, అద్దంకి అనపోతారెడ్డి, చోడ భక్తిరాజుల సమకాలికుడు. ఉండిరాజు లేక రెండవ ఉండి రాజు అనవేమారెడ్డి

అన్నెదేవచోడుల సమకాలికుడు. ఇతడు నిడదవోలు చాళుక్యుల రాజకుమార్తె రుద్రమ దేవిని వివాహమాడాడు నిడదవోలు చాళుక్య వంశస్తుడైన ఇందుశేఖరుని కుమారుడు వీరభద్రుడు కాకతీయ రుద్రమదేవిని వివాహమాడాడు. కనుక ఆమె పేరును ఈ చాళుక్య రాజకుమార్తెకు పెట్టినట్లుగా ఉంది. తమ్మరాజు కాలంలో అనపోతారెడ్డి సూరవరంపై దండెత్తాడు. అన్నెదేవచోడుని రాజమండ్రి మ్యూజియం శాసనంలో తన తండ్రి భక్తిరాజు సూరవరం వద్ద వీరాన్నపోతును ఓడించాడని చెప్పుకున్నాడు. ఇందులో చెప్పబడిన వీరాన్నపోతు రెడ్డిరాజైన అనపోతారెడ్డి. తమ్మరాజుకు సహాయంగా చోడభక్తిరాజు వచ్చి సూరవరం వద్ద అనపోతారెడ్డిని ఓడించాడు. ఈ ఓటమితో అనపోతారెడ్డి తన తూర్పు దిగ్విజయ యాత్రలో సంపాదించిన ప్రాంతాలన్నీ పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన క్రీ.శ.1360లో జరిగి ఉండవచ్చు. అనపోతారెడ్డి క్రీ.శ.1361 అమరావతి శాసనం బహమనీ సుల్తాన్‌లతో, సైన్యాలతో పోరాడినట్లు తెలుపుతోంది. అనపోతారెడ్డి తూర్పు దిగ్విజయయాత్ర తర్వాత అమరావతి యుద్ధం జరిగింది. కనుక సూరవరం యుద్ధం అంతకుముందు సంవత్సరం అంటే క్రీ.శ.1360లో జరిగి ఉండవచ్చు. ఈ యుద్ధానికి ముందుగానో, తరవాతో తమ్మరాజు తన కుమార్తె ఇరుగాంబికను భక్తిచోడరాజు కుమారుడైన అన్నెదేవచోడునికి ఇచ్చి వివాహం చేసినట్లుగా కనిపిస్తోంది అన్నెదేవచోడుడు తన మామ చక్రవర్తి అని తన బావమరిది పిన ఉండి రాజని తన శాసనంలో చెప్పుకున్నాడు చక్రవర్తి తమ్మరాజు బిరుదు అయి ఉండవచ్చు. పిన ఉండి రాజు కుమారుడు రెండవ ఉండి రాజు. సూరవరం వంశం లాగానే చోడభక్తిరాజు కూడా సూర్యవంశ క్షత్రియుడు. కనుక ఉండి రాజు నిడదవోలు చాళుక్య రాజకుమారి రుద్రమదేవిని వివాహమాడి ఉన్నాడు. కనుక ఆమె మానవ్యస గోత్రీకురాలని అతని శాసనం తెలుపుతోంది. చాళుక్యులు మానవ్యస గోత్రీకులైన చంద్రవంశ క్షత్రియులు. కనుక నిడదవోలు సూరవరం, కామపురి రాజైన చోడ భక్తిరాజు, మూడు క్షత్రియ వంశాలు సంయుక్తంగా సూరవరం వద్ద అనపోతారెడ్డిని ఓడించి ఉండవచ్చు. తమ్మరాజు తర్వాత అతని కుమారుడు పిన ఉండి రాజు రాజ్యానికి వచ్చాడు. ఇతని కాలంలో అనవేమారెడ్డి తూర్పు దండయాత్ర చేసి ఉత్తరాంధ్రను జయించాడు. క్రీ.శ.1381 నాటికే అతడు ద్రాక్షారామ శాసనం వేయించాడు. క్రీ.శ.1383లో ఉండి రాజు తన రావులపర్తి శాసనం విడుదల చేశాడు. అందులో అనవేమారెడ్డి పేరు లేదు. కనుక అనవేమారెడ్డి ఉండి రాజును జయించినట్లుగా కనిపిస్తోంది. ఒకవేళ జయించినా, అనవేమారెడ్డి తిరిగి వెళ్లిపోగానే స్వతంత్రం ప్రకటించి ఉండవచ్చు. ఆ తర్వాత కుమారగిరిరెడ్డి కాలంలో అతని ప్రధాన మంత్రి సేనాని కాటయవేమారెడ్డి వీరి రాజ్యాన్ని జయించి ఉండవచ్చు. క్రీ.శ. 1390 నాటికి ఈ ప్రాంతాలన్నీ కాటయ వేమారెడ్డి జయించాడని కాటయవేముని సర్పవరం శాసనం తెలుపుతోంది. ఆ సందర్భంలో సూరవర రాజ్యాన్ని కూడా జయించి ఉండవచ్చు. రెండవ ఉండి రాజు తర్వాత వీరి చరిత్ర తెలియటం లేదు. కనుక వీరి రాజ్యం రెడ్డి రాజ్యంలో కలిసిపోయిందని చెప్పవచ్చు.

యలమంచిలి పాంచదార్ల చాళుక్యులు: ఈ వంశస్తులు తాము విష్ణువర్ధన చక్రవర్తులమని చెప్పుకున్నారు వారి రాజ్యంలో విశాఖపట్టణం జిల్లాలోని యలమంచిలి; పాంచదార్ల పరిసర ప్రాంతాలు చేరి ఉండేవి ఈ రాజ్యానికి యలమంచిలి ప్రధాన రాజధాని. కాని కొందరు రాజులు పాంచదార్లను కూడా రాజధానిగా చేసుకున్నారు. వారి శాసనాలు ఎక్కువ భాగం పాంచదార్ల పరిసర ప్రాంతాలలో లభించాయి. అందులో ఒక శాసనం ఎ.ఆర్.నెం.209 శాసనం. ఇది శక సంవత్సరం 1339 హేవళంబి సంవత్సరానికి చెందింది. ఇది పాంచదార్లలో లభించింది. ఈ శాసనాన్ని విష్ణువర్ధన చక్రవర్తి నరేంద్రదేవ చక్రవర్తి భార్య వేయించింది. అలాగే ఎ.ఆర్.నెం.213 గల మరొక శాసనం ఈ వంశస్తుల వంశవృక్షంలోని కొంతమంది పేర్లను ఇస్తోంది.

వంశవృక్షం

విష్ణువర్ధన
|
అతని వంశంలో
|
చాళుక్య భీమ
|
అతని వంశంలో

ఎర్రక్షమాపతి - భార్య సింగమాంబ

ఎ.ఆర్.నెం.215 (1899) శక సంవత్సరం 1354 పార్థివ శాసనం కుమార ఎర్రమయ్య చంద్ర వంశస్థుడైన నాగేంద్రదేవ చక్రవర్తి అతని భార్య భవాని దేవమ్మల కుమారుదు కుమార ఎర్రమయ్యను పేర్కొంటోంది. ఎ.ఆర్.నెం.209 1899 శక 1339 శాసనంలో పేర్కొనబడిన నాగేంద్రదేవ చక్రవర్తి ఎరమయ్య శాసనంలోని నాగేంద్ర చక్రవర్తి ఒక్కడే. అలాగే ఎ.ఆర్.నెం. 213 శాసనంలోని ఎర్రక్షమాపతి, ఎ.ఆర్.నెం. 215 శాసనంలోని ఎర్రక్షమాపతి ఒక్కరే. ఎ.ఆర్.నెం.219- 1899 శక 1356 పింగళ శాసనంలో ఉపేంద్ర చక్రవర్తి కుమారుదు నరసింహదేవ చక్రవర్తిని పేర్కొంటోంది. ఈ శాసనాల ప్రకారం వారి వంశవృక్షం ఈ విధంగా రూపొందించవచ్చు.

విష్ణువర్ధన
|
చాళుక్య భీమ
|
నాగేంద్రదేవ చక్రవర్తి - భవానీదేవమ్మ ఎ.ఆర్. 209 శక 1339, ఎ.ఆర్. 215 శక 1354 శాసనాలు
|
ఎర్ర క్షమాపతి - సింగమాంబ ఎ.ఆర్.213 శక 1350 శాసనం
(వీరు పాంచదార్ల శాఖ)
|
ఎ.ఆర్.219 శక సంవత్సరం - 1356 శాసనంలోని వంశం
ఉపేంద్ర చక్రవర్తి
|
నరసింహదేవ చక్రవర్తి
(వీరు యలమంచిలి శాఖలోని వారు)

గజపతుల సామంత రాజ్యాలు

రఘుదేవపురం తామ్రశాసనం శక సంవత్సరం 1378- సామంత రాజ్యం: రాజమండ్రికి ఉత్తరంగా 30 కిలోమీటర్ల దూరంలో గోదావరీ నది ఉత్తరపు గట్టు మీద ఉన్న అగ్రహారం రఘుదేవపురం. ఈ గ్రామంలో వెన్నంటి రామారావునే ఒక కో-ఆపరేటివ్ డిపార్ట్‌మెంట్‌లోని ఉద్యోగి ఒక తామ్రశాసనాన్ని రాళ్లబండి సుబ్బారావుకి ఇచ్చారు. అది ఐదు మందపాటి రాగి ఫలకాలతో ఉంది. ఈ శాసనాన్ని గజపతి వంశానికి చెందిన రఘుదేవ నరేంద్రుడు విడుదల చేశాడు. 41 మంది బ్రాహ్మణులకు రఘుదేవపుర గ్రామాన్ని అగ్రహారంగా దానం చేస్తూ ఈ శాసనం విడుదల చేయబడింది. ఈ శాసనం గజపతి వంశ వృక్షాన్ని రూపొందించడానికి బాగా ఉపయోగపడుతోంది. ఏ గజపతి శాసనాలలో లేని వివరాలు ఈ శాసనం ద్వారా తెలియవచ్చాయి. ఈ శాసనం వల్ల గజపతి సామ్రాజ్య స్థాపకుడైన కపిలేశ్వర గజపతికి ముందు రెండు తరాల వారి పేర్లు తెలుసుకోవడానికి వీలు కలిగింది. అందువల్ల గజపతుల వంశ చరిత్రకు ఈ శాసనం ప్రముఖ ఆధారంగా నిలిచింది. ఈ శాసనంలో 149 వాక్యాలు ఉన్నాయి. 16వ శతాబ్దపు తెలుగులో రాయబడ్డాయి.

వంశవృక్షం

కపిలేశ్వర
|
జాగేశ్వర
|
బలరామ — వీరశ్రీ కపిలేశ్వర — పరశురామ

వీరశ్రీ కపిలేశ్వర
|
కుమార్తె
కుమారుడు

పరశురామ
|
కుమార రఘుదేవ
శాసనం విడుదల చేసినవాడు

ఈ శాసనం సూర్యసోమవంశంలో కపిలేశ్వరుడు జన్మించాడని, అతనికి జాగశ్వేరుడు జన్మించాడని అతనికి బలరాముడు, వీరశ్రీ కపిలేశ్వరుడు, పరుశరాముడు అనే ముగ్గురు కుమారులు జన్మించారని తెలిపి, వారి గురించి మరికొన్ని వివరాలను ఇచ్చింది. బలరాముడు శత్రువులతో పోరాడుతూ స్వర్గస్తుడయ్యాని తెలిపింది. వీరకపిలేశ్వరుడు గొప్ప వీరుడని అతడు దిగ్విజయ యాత్ర చేసి అనేక మంది శత్రువులను వామపురికి పంపాడని అతనికి ఒక కుమార్తె ఉందనీ ఆమె నల్లగా ఉండేదనీ, గొప్ప వీరవనిత అని, ఆమె పురుష దుస్తులు ధరించి యద్ధాలు చేసి అనేక మంది శత్రువులను వధించిందని వివరించింది. వీరకపిలేశ్వరుని సోదరుడైన పరశురాముని కుమారుడు రఘుదేవకుమార అనీ అతనిని వీరకపిలేశ్వరుడు దత్తు తీసుకున్నాడనీ తెలిపింది. రఘుదేవ కుమారుడు శక సంవత్సరం 1378లో రఘుదేవపుర గ్రామాన్ని 41 మంది బ్రాహ్మణులకు దానం చేసి ఈ శాసనాన్ని రాయించి వారికి ఇచ్చాడు. శాసనంలో గ్రామానికి సరిహద్దులు స్పష్టంగా పేర్కొనబడ్డాయి. దానగ్రహీతలైన 41 మంది బ్రాహ్మణుల పేర్లు, గోత్రాలు కూడా లిఖించబడ్డాయి. ఇటీవల దాకా ఈ అగ్రహారం ఆనాటి దానపరిగ్రహీతల వారసుల హక్కు భుక్తంగానే ఉండేదట. దానం ఇచ్చిన రఘుదేవకుమారుని కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రాష్ట్రపు పరీక్షకునిగా నియమించాడు. అతడు చాలా కాలం రాజమహేంద్రవర రాష్ట్ర పాలకుడుగా పని చేశాడు కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రెడ్డి రాజాయన్ని జయించిన తర్వాత అక్కడ రఘుదేవనరేంద్ర అనే అతన్ని పరీక్షకునిగా నియమించాడు. అతడు చాలా కాలం రాజమహేంద్రవర పరీక్షకునిగా పని చేశాడు. రఘుదేవపుర దానకర్త అయిన రఘుదేవ కుమారుడు కపిలేశ్వర గజపతిచేత రాజ మహేంద్రవర పరీక్షకునిగా నియమింపబడిన రఘుదేవనరేంద్రుడు ఒకరేనని గుర్తించారు. ఈ రఘుదేవపురం రఘుదేవ నరేంద్రుని పేరుతో నిర్మించి, దానం చేసి ఉండవచ్చు. లేదా అంతకుపూర్వం ఉన్న పేరును మార్చి రఘుదేవపురం అని పేరు పెట్టి దానం చేసి ఉండవచ్చు.

గజపతుల సామంతరాజుల చరిత్ర: గంగరాజ వంశావళి కపిలేంద్రుడు చివరి గంగవంశ పాలకుని తొలగించి రాజ్యాన్ని కాజేశాడని తెలుపుతోంది. అందువల్ల కపిలేశ్వరునికి అనేకమంది శత్రువులు కూడా పెరిగారు

గంగ వంశంపై రాజభక్తి ఉన్న సామంత వంశాలు, కపిలేశ్వరునిపై తిరుగుబాటు చేశాయి. అతడు వారినందరినీ అణచివేశాడు. వారందరినీ అదుపులో పెట్టాడు. కాని వారు హృదయ పూర్వకంగా లోబడలేదు. కనుక వీలైతే వారు ఎప్పుడైనా తన వంశాన్ని అంతం చేస్తారని గ్రహించాడు. కనుక తనకు, తన వంశానికి విశ్వాసపాత్రులైన వీరులు ఉండాలని భావించి, తాను నూతనంగా జయించిన ప్రాంతాలలో తనకు నమ్మకస్తులైన వారిని సామంతులుగా నియమించాడు. వారి వంశస్తులు ఆ ప్రాంతాలలో సామంత రాజులుగా గజపతులను కొలిచారు.

ఈ విధంగా ఏర్పరచబడిన సామంత రాజ్యాలు ఎక్కువగా గంజాం జిల్లాలో ఉన్నాయి. గజపతి రాజ్యపతనం తర్వాత కూడా ఈ సామంత రాజవంశస్తులు జమీందారులుగా మనుగడ సాగించారు. ఈ వంశాల చరిత్రను తెలుసుకోవడానికి మనకు ముఖ్య ఆధారాలు నాటి గ్రామ కైఫీయత్తులు. సి.పి.బ్రౌన్ వీటిని సేకరించి మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీలో భద్రపరిచాడు. వాటిని పరిశీలించి ఈ జమీందారుల వంశవృక్షాలు తయారు చేయబడ్డాయి. ఈ జమీందారీ వంశాలలో ముఖ్యమైనవి: హుమ్మ, కిమిడి, చికటి, పాలూరు, ఖల్లికోట, అటగడ.

హుమ్మ రాజ్యం: హుమ్మ అనే ప్రదేశం గంజాం జిల్లాలోని అడవులలో ఉంది. ఈ ప్రదేశంలో గోండులు, శబరులు మొదలైన ఆటవిక జాతుల వారు నివసిస్తూ ఉండేవారు. ఆ ప్రాంతాల నుండి ప్రయాణం చేసే వారిని దోచుకుంటూ ఉండేవారు. రాజులు ఖజానాలు ఆ ప్రాంతాల గుండా ప్రయాణించినా దోపిడీకి గురవుతూ ఉండేవి. కపిలేంద్రుడు ఈ ప్రాంతాల రక్షణ కోసం ఆ ప్రాంతాన్ని ఒక జాగీరుగా చేసి తన అనుచరుడైన మదన మోహనశాంతో అనే అతన్ని జాగీరుదారుగా నియమించాడు. అతడు గొప్ప వీరుడు. ఒక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ ప్రాంతానికి రక్షణ కల్పించాడు. అతడు అక్కడే ఉన్న ఒక చిన్న గ్రామంలో నివసించేవాడు. అదే ఆ వంశానికి రాజధాని అయింది. ఆ పేరుతోనే రాజ్యాన్ని కూడా పిలిచేవారు. అదే పేరుతో హుమ్మా వంశం అని కూడా పిలిచేవారు. అతని వంశస్తులే ఆ రాజ్యానికి వారసులయ్యారు. అతని తర్వాత రాధాకరణశాంతో రాజయ్యాడు.

వంశవృక్షం

మదన మోహన్ శాంతో
|
రాధాకరుణ శాంతో
|
రఘునాథ్ — హరికృష్ణ శాంతో
|
నారాయణ సామంతరాయ
|
పరశురామ సామంతరాయ

వాసుదేవ సామంతరాయ

కుర్మాసింధు

రాధాకరణ శాంతోకు ఇద్దరు కుమారులు. వారిలో రఘునాథ రాజ్యానికి వారసుడయ్యాడు. అతని తమ్ముడు హరికృష్ణ శాంతో కపిలేశ్వర గజపతి కుమారుడు పురుషోత్తమ గజపతికి అంగరక్షకుడయ్యాడు. అతడు గొప్ప వీరుడు. గుర్రపుస్వారీలో ఆరితేరినవాడు. పురుషోత్తమ గజపతి దక్షిణదేశంలో చేసిన యుద్ధాలలో అతనికి కుడిభుజంగా నిలబడ్డాడు. పురుషోత్తమ గజపతి రుషికుల్య నదీ తీరానికి వెళ్లిన సందర్భంలో రఘునాథ వచ్చి రాజును దర్శించి తన విధేయతను చాటుకున్నాడు. అందుకు సంతోషించి పురుషోత్తముడు అతనికి సామంతరాయ మహాపాత్ర అనే బిరుదునిచ్చి సామంతరాజుగా గుర్తించాడు. దాంతో వారి వంశం సామంతరాయ అనే బిరుదును ధరించింది. రఘునాథకు బిరుదుతోపాటు 'ఒక గుర్రాన్ని, పల్లకీని ఇతర రాజలాంఛనాలను కూడా ఇచ్చాడు. రఘునాథ తన తమ్ముడు హరికృష్ణ శాంతోను కూడా తనతో తీసుకొని తన గ్రామానికి వచ్చాడు. తర్వాత ఒక

కోటను నిర్మించి అందులో రాజభవనాన్ని కూడా నిర్మించుకున్నాడు. ఆ గ్రామానికి హుమ్మా అని పేరు పెట్టాడు అతని తర్వాత అతని వారసులు గజపతి సామంత రాజులుగా కొనసాగారు. సామంతరాయ అనే బిరుదును కూడా కొనసాగించారు. ఈ వంశం చివరి వరకు గజపతులను విశ్వాసంతో కొలిచారు. గజపతి వంశం తర్వాత ఆ ప్రాంతం గోల్కొండ నవాబుల వశం అయింది. ఈ వంశం గోల్కొండ నవాబుల సామంతులుగా కొనసాగింది

కిమిడి రాజ్యం: ఇది కపిలేంద్రుని పెద్ద కుమారుడు హంవీరుని సంతతివారు పాలించిన రాజ్యం కపిలేంద్రుని కాలంలో హంవీరుడు కొండవీటి రాజ్యానికి పరీక్షకునిగా ఉండేవాడు. తండ్రి మరణానంతరం అన్నదమ్ములకు వారసత్వ యుద్ధం వచ్చింది. చివరకి హంవీరుడు ఓడి తమ్మునికి లొంగిపోయాడు. అందువల్ల కిమిడికి వెళ్లి తమ్మునికి సామంతునిగా చిన్న రాజ్యం ఏర్పాటు చేసుకున్నాడు. ఆ పరిసర ప్రాంతాలను అంటే పెదకిమిడి, పర్లాకిమిడి మొదలైన ప్రాంతాలను కలిపి ఒక రాజ్యంగా ఏర్పరచుకున్నాడు. ఈ రాజ్యాన్ని అతని వారసులు పాలించారు.

వంశవృక్షం

కపిలేంద్ర

హంవీర — పురుషోత్తమ

హంవీర: దక్షిణ కపిలేశ్వర — నరసింహరుద్రదేవ

నారాయణ రుద్రదేవ

|

అనంత రుద్రదేవ

|

జయ రుద్రదేవ

|

లక్ష్మీనరసింహ దేవ

|

మధుకర్ణ భానుదేవ

స్థానిక కైఫీయత్తులు హంవీరుని తర్వాత అతని కుమారుడు నరసింహ రుద్రదేవుడు రాజ్యానికి వచ్చాడని తెలుపుతున్నాయి. కాని శాసనాలు హంవీరునికి దక్షిణ కపిలేశ్వర కుమార హంవీర మహాపాత్ర అనే కుమారుడు ఉన్నట్లు, అతడు క్రీ.శ.1464లో కొండవీడు పరీక్షకునిగా పాలించినట్లు తెలుపుతున్నాయి. కాని కిమిడి స్థానిక రాతలు ఈ కుమార హంవీరుని గురించి ఏమీ చెప్పడం లేదు. కనుక అతడు సంతానం లేకుండా తండ్రికంటే ముందే మరణించి ఉండవచ్చుని, అందువల్ల హంవీరుని చిన్నకుమారుడు నరసింహ రుద్రదేవుడు రాజ్యానికి వచ్చాడని భావించారు. అతని వంశస్తులు ఈ రాజ్యాన్ని అనుభవించారు. వారిలో చివరివాడు మధుకర్ణ భానుదేవుడు. ఇతడు గొప్ప శైవభక్తుడు. అతనికి శివలింగ భానుదేవ అనే పేరు ఉంది. అతడు ముఖలింగంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు.

చికటి వంశం: కిమిడికి ఆగ్నేయంగా చికటి సంస్థానం ఉంది. ఈ సంస్థానానికి మూలపురుషుడు ఖాండాయత్. అతని కుమారుడు కేశవ. తూర్పుగంగ వంశస్తుల కాలంలో ఈ ఖాండాయత్ వంశం చికటి రాజ్యానికి అధిపతి అయింది. ఈ వంశంలో రామచంద్ర రౌతురాయ అనే అతడు తూర్పుగాంగ వంశంలోని చివరి రాజైన నాల్గవ భానుదేవుని సమకాలికుడు. అతడు వడపత్ర అనే ప్రదేశంలో ఒక కోటను నిర్మించాడు. ఇది హుమ్మంది కోటకు 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. విష్ణుపండ అనే బ్రాహ్మణునికి రామచంద్రాపురం అనే గ్రామంలో $1/_{10}$ వ వంతును రామచంద్ర రౌతురాయ అగ్రహారంగా ఇచ్చాడు. భువనగిరి అనే గ్రామంలో రౌతురాయ రామేశ్వరస్వామి దేవాలయం కూడా నిర్మించాడు. తూర్పు గాంగ వంశం అంతమైన తర్వాత రామచంద్ర రౌతురాయ కపిలేంద్రునికి సామంతుడై 42 సంవత్సరాలు పాలించాడు.

వంశ వృక్షం

ఖాండాయత్

|

కేశవ

|

రామచంద్రరౌతురాయ

|

నారాయణరౌతురాయ

నరసింహరౌతురాయ

|

లోకనాథ రౌతురాయ

పురుషోత్తమ గజపతి కాలంలో రామచంద్ర రౌతురాయ కుమారుడు నారాయణ రౌతురాయ రాజ్య భారం స్వీకరించాడు. అతడు తన ప్రభువుతో కలిసి వెళ్లి అనేక యుద్ధాలలో పాల్గొన్నాడు. అతని శౌర్య ప్రతాపాలకు మెచ్చి అతనికి బెహర ఖాండాయత్ అనే బిరుదు ఇచ్చి పల్లకి, ఏనుగు, గుర్రం, ఛత్ర చామరాదులను ఇచ్చి సామంత రాజ హోదాను ఇచ్చాడు. నారాయణ రౌతురాయ 60 సంవత్సరాలు ధర్మం తప్పకుండా పాలించాడు. అతని తర్వాత అతని కుమారుడు నరసింహ రౌతురాయ కోటకు వెలుపల మరొక నూతన కోటను నిర్మించాడు. దానికి బయటి కోట అని పేరు. నరసింహ రౌతురాయ తర్వాత అతని కుమారుడు లోకనాథ రౌతురాయ రాజ్యానికి వచ్చాడు. అతడు ముకుందదేవుని 27వ అంక సంవత్సరంలో గురుగోసాయి అనే అతనికి సూర్యగ్రహణం రోజు ఒక అగ్రహారాన్ని బహూకరించాడు. గజపతుల తర్వాత ఈ వంశం కూడా గోల్కొండ నవాబుల ఆధిపత్యాన్ని అంగీకరించి ఆరికి సామంతులుగా కొనసాగారు.

పాలూరు సంస్థానం: ఇది ఒక చిన్న సంస్థానం. ఇది చిలక సరస్సుకు దక్షిణంగా ఉండేది. ఇందులో 11 జరాయితీలు, 4 అగ్రహార గ్రామాలు ఉండేవి. గజపతుల కాలంలో ఈ పాలూరు సంస్థానం ప్రారంభమైంది. క్రీ.శ.1489వ సంవత్సరంలో దాశరధి అనే వీరుడికి పురుషోత్తమ గజపతి ఈ జాగీరును ఇచ్చాడు. ఆ పరిసరాలలోని ఆటవిక జాతుల వారిని అదుపు చేయవలసిన బాధ్యతను దాశరధికి అప్పగించాడు. గజపతి వంశం ఉన్నంత వరకు దాశరధి వంశస్తులు వారిని కొలిచారు. తర్వాత ఈ ప్రాంతం గోల్కొండ నవాబుల వశమైంది. వారికి సామంతులుగా మారారు.

ఖల్లికోట సంస్థానం: ఈ సంస్థానం చిలక సరస్సుకు పశ్చిమంగా ఉంది. ఇది 231 చదరపు మైళ్ల విస్తీర్ణం కలిగిన సంస్థానం. బాణాపూరు పక్కన ఉంది. పురుషోత్తమ గజపతి కాలంలో రామఖాండాయత్ అనే సేనాధిపతికి ఈ జాగీరును ఇచ్చాడు. రామఖాండాయత్‌కు పురుషోత్తముడు భయ్యా అనే బిరుదు కూడా ఇచ్చాడు. రామఖాండాయత్ తర్వాత అతని కుమారుడు గంగాధర భయ్యా ఈ జాగీరుకు అధిపతి అయ్యాడు. అతని తర్వాత అతని వంశస్తులు ఈ సంస్థానాన్ని అనుభవించారు. గజపతి రాజ్యం అంతమైన తర్వాత అందరిలాగే ఈ వంశం కూడా గోల్కొండ నవాబులకు సామంత వంశమైంది.

అటగడ సంస్థానం: ఖల్లికోట సంస్థానానికి తూర్పుగా అటగడ సంస్థానం ఉంది. దీనికి దక్షిణ సరిహద్దుగా రుషికుల్య నది ఉంది. కపిలేంద్రుని 12వ అంక సంవత్సరంలో ఈ జాగీరును బహుతపస్వి అనే వీరుడికి ఇచ్చాడు. బహుతపస్వి అనేది మనిషి పేరా లేక బిరుదా స్పష్టంగా తెలియదు. అతడు ఈ జాగీరును అభివృద్ధి చేశాడు. అతని కాలంలో అనేక దేవాలయాలు, పట్టణాలు నిర్మింపబడ్డాయి. అతనికి ఎనిమిది మంది కుమారులు. వారిలో పెద్దవాడైన జగన్నాధుడు క్రీ.శ.1458లో సంస్థానాధిపతి అయ్యాడు. అతడు గొప్ప విలుకాడుగా ప్రసిద్ధి చెందాడు. అతడు పురుషోత్తమ గజపతి చేసిన అనేక యుద్ధాలలో పాల్గొన్నాడు. గజపతి అతని కౌశల్యాన్ని మెచ్చుకొని జగన్నాథ హరిశ్చంద్ర జగదేవ్ అనే బిరుదునిచ్చాడు. అతడు ఎనిమిది కోటలు నిర్మించి, తన సోదరుల నాయకత్వంలో సైన్యాన్ని పెంచుకున్నాడు. అతడు 12 సంవత్సరాలు దక్షతతో పాలించాడు. అతని తర్వాత అతని వంశస్తులు గజపతులను విశ్వాసంతో కొలిచారు. వారి తర్వాత వారు గోల్కొండ నవాబులకు సామంతులయ్యారు.

తర్వాత మొగలులు, తర్వాత నిజాంలకు జాగీరుదారులయ్యారు. తర్వాత ఇంగ్లిషు వారి కింద జమీందారులుగా మారారు.

వంశవృక్షం

భూతపస్వి - క్రీ.శ.1440

జగన్నాథ హరిచంద్ర జగదేవ్

కృష్ణ నిశ్శంకు

ఒరిస్సా నిశ్శంకు

దాశరథి నిశ్శంకు

సింగోశాంత సింగార | కలిశాంత సింగార | గోపాలశాంత సింగార

గౌరినాధ హరిచందన

రఘునాధ హరిచందన జగదేవ్

రామచంద్ర

ధనుంజయ

ఈ వంశస్తులు నేటికీ ఉన్నారు.

గజపతుల కాలం నాటి కమ్మ సేనాధిపతులు: గజపతుల కింద అనేక కమ్మ సేనాధిపతులు దుర్గాధిపతులు, అధికారులుగా పనిచేసినట్లు అనేక శాసనాల ద్వారా స్థానిక చరిత్రల ద్వారా తెలుస్తోంది పురుషోత్తమ గజపతి కాలంలో ధూపాటి సీమను క్రీ.శ.1475లో రాజా సాయపనేని వెంకటపతినాయుడు పాలించాడు. ఇతనికి శాయపనాయని వెంకటపతి అని కూడా పేరుంది. ఇతడు త్రిపురరాంతకంలో ప్రతి సంవత్సరం 720 వరహాలు ఖర్చు పెట్టి ఉత్సవాలు చేసేవాడు. అక్కడ సంస్కృతంలో శాసనం వేయించాడు

సాగి గన్నమనీడు: ఇతడు ప్రతాపరుద్ర గజపతి సామంతుడుగా వినుకొండ రాజ్యాన్ని పాలించాడు. ఇతని వంశానికి మూలపురుషుడు గన్నమనాయకుడు. అతనికి అన్నమనాయకుడు అని కూడా పేరుంది. అతని తర్వాత పెదగన్న నృపతి, తర్వాత అతని కుమారులు తిప్పనృపతి, గాదభూపతి, చెన్ననృపతి అనేవారు పాలించారు. తర్వాత గాదనృపతి కుమారులైన పెదతిమ్మనృపతి, గన్నమనాయకుడు, లింగభూపతి, పినతిప్పనృపాలుడు వినుకొండలో ఉన్నారని వారిలో గన్నమనాయకుడు క్రీ.శ.1477వ సంవత్సరం నాటి వాడని వినుకొండలోని శాసనం వలన తెలుస్తోంది. ఇతనికి పులియ మార్కోలుగండ, కరవాలభైరవ, గండభేరుండ అనే బిరుదులున్నాయి.

అడపా కూనయ్య క్రీ.శ.1593-99: ఇతడు గజపతి రాజైన విద్యాధరుని నుంచి కొండపల్లి, కొండవీడు పాలనను పొందాడని బేతపూడి కృష్ణమంత్రి రాసిన జానకీ రాఘవం అనే గ్రంధం తెలుపుతోంది. వీరి వంశంలో అడపా నారనృపతి ఆ గ్రంధాన్ని రాయించి కృతి పొందాడు.

మేదరమెట్లవారు: గజపతుల కాలంలో ప్రసిద్ధి చెందిన మరొక వంశం మేదరమెట్ల వారి వంశం. 16వ శతాబ్దం నుండి మేదరమెట్ల వారి చరిత్ర తెలుస్తోంది. వీరు తమ్మలూరు గోత్రీకులు.

మేదరమెట్ల నరసభూపతి: శ్రీ కృష్ణదేవరాయల కాలంలో మేదరమెట్ల నరసభూపతి అనే సేనాధిపతి ప్రతాపరుద్ర గజపతి వద్ద పనిచేశాడు. అతడు పువునూరు పురాధీశ్వరుడని చాటువులలో పేర్కొనబడ్డాడు. కనుక ఇతనిని ప్రతాపరుద్రగజపతి పువునూరు స్థానిక పాలకునిగా నియమించి ఉండవచ్చును. ఇతని తండ్రి అయ్యలరాజు లేక ఔబలరాజు. ప్రతాపరుద్ర గజపతి శ్రీ కృష్ణదేవరాయల చేతిలో ఓడిపోయిన తర్వాత కొండవీటి

రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో భాగమైంది. కనుక ఇతడు శ్రీ కృష్ణదేవరాయల పాలెగాడుగా కొనసాగి ఉంటాడు. ఇతనికి గజపతి మన్నీడు, రాచూరుదుర్గపహరుండు, రాజవేశ్యా భుజంగుడు, కేళాదిరాయడు, గగ్గొలురామాంకుడు, కొడమనాయకుల మగడు, కోటలగంగ అనే బిరుదులు ఉన్నాయి. గజపతుల కింద సామంతుడుగా ఉన్నప్పుడు గజపతి మన్నీడు అనే బిరుదు వహించాడు. కృష్ణదేవరాయల సామంతుడైన తర్వాత అతడు క్రీ.శ.1520లో జరిపిన రాయచూరు యుద్ధంలో పాల్గొని రాచూరు దుర్గపహరుండు అనే బిరుదు పొంది ఉంటాడు. ముస్లింల గర్వమణచాడని చాటువులు చెబుతున్నాయి. నరసభూపతికి రమణభూపతి అనే కుమారుడు ఉన్నాయి. ఇతడు కూడా తండ్రి ధరించిన బిరుదులు ధరించాడు.

మేదరమెట్ల కొండ ప్రభువు: ఇతనికి నరసభూపతి రమణభూపతికి ఉన్న సంబంధం తెలియదు. కాని ఇతడు కూడా గజపతుల సేనాధిపతిగా పనిచేశాడని చాటుపద్యాలు తెలుపుతున్నాయి. ఇతనికి కేశాదిరాయ, సురుమాయి, గాంగేయశౌర్య మొదలైన బిరుదులున్నాయి. రొంపిచర్ల దుర్గం మేదరమెట్ల వారి అధీనంలో ఉండేదని రావెళ్లవారు రొంపిచర్లపై దండెత్తి వచ్చి కోటలోకి వారు వచ్చే మార్గాలను మూయించి కోటను ఆక్రమించుకున్నారని స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. అడపా గుండరాజనే అతడు రొంపిచర్లలో ఒక కోటను నిర్మించినట్లు స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. ఇతని కాలం తెలియదు.

ఇతర మేదరమెట్ల వారు: క్రీ.శ.1440 ప్రాంతంలో పొదిలి తాలూకా చిలమకూరు గ్రామస్తుడు ఆ సంవత్సరంలో ఆ గ్రామానికి పొలిమేర ఏర్పాటు చేయబడింది-ఆ సందర్భంలో ఆ గ్రామంలోని కైలాసనాధ భీమ సంస్థానీకులు 10 కుంటల వరి చేను ఇచ్చినట్లు శాసనం ఉంది. ఇది ఆనాటి ఆచారం క్రీ.శ.1493లో మేదరమెట్ల రామయ్య అనే వ్యక్తి ఓరుగంటి అమ్మవారికి పుట్టికి అద్దెడు ధాన్యం ఇచ్చేటట్లు నిర్ణయించి శాసనం వేయించాడు. కనుక ఈ మేదరమెట్ల రామయ్య ఓరుగల్లులో గజపతుల అధికారి అని తెలుస్తోంది.

అడపా నాగన్న: ఇతడు క్రీ.శ.1457 నాటివాడు. ఇతని తండ్రి తిమ్మానాయుడు తాత రంగప్పనాయుడు. ఇతనికి స్వామిద్రోహరగండ అనే బిరుదు ఉంది. కనుక ఇతడు గజపతుల సేనాధిపతులలో ఒకడు కావచ్చును. అతడు పట్నం గ్రామంలో ఒక రాతిస్తంభం ఎత్తించి అక్కడ శాసనం రాయించాడు. అందువల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. గజపతుల కాలంలో కొండవీటి సీమలోని పేరాల స్వర్ణ గ్రామాల సరిహద్దులను గురించి తగాదా వచ్చిందట. స్వర్ణ గ్రామానికి చెందిన పోతినేని గురువుల పేరాల వాసులతో వివాదపడ్డాడు. ఆ కాలంలో కారంచేడు గ్రామంలో ప్రసిద్ధి చెందిన యార్లగడ్డ పెదగురువులు, కారుమంచి బేదం, పంగులూరి రామన్నలు మధ్యవర్తులుగా ఉండి వారి వివాదాన్ని పరిష్కరించారని లోకల్ రికార్డులు తెలుపుతున్నాయి.

అట్లూరి వెంగళేంద్రుడు: గజపతుల కాలంలో కొండపల్లి దుర్గాన్ని కొన్నాళ్లు అట్లూరి వెంగళేంద్రుడు పాలించాడు. ఇతడు తురుష్కులను ఓడించాడు. కొండపల్లి దుర్గకువలయ దేశాహిరిభ ఉండు అని, కమ్మలందరూ కమ్మలా, కమ్మలరయ కమ్మలకు కీర్తి దెచ్చిన నీవే ప్రదితగుణహర అని చాటువులు ఇతనిని కీర్తించాయి. ఇతని కాలం స్పష్టంగా తెలియదు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో ఇతడు గజపతి సామంతులైన చితాబ్‌ఖాన్ విద్యాధరులతో కలిసి ముస్లింలతో పోరాడి ఉంటాడు. అంటే క్రీ.శ.1550-72 మధ్యకాలానికి చెందినవాడు. ఈ కాలంలో గజపతుల సామంతులైన హరిశ్చంద్రరాజు అనే సేనాధిపతి ముకుందరాజు అనే సర్వరాజు, విద్యాధరరాజు, చితాబ్‌ఖాన్‌లు ముస్లింలతో పోరాడి రాజమహేంద్రవరం, కొండపల్లి, కొండవీడు దుర్గాలను సాధించి కొంతకాలం పాలించారు. వీరు కశింకోట, విశాఖపట్నం, పొతనూరు, మదవాడ, ముస్తాఫాబాద్, రాజమహేంద్రవరం, కొండపల్లి ప్రాంతాలలో గోల్కొండ సైన్యాలతో పోరాదారు. ఈ ప్రాంతాలు వీరి అధీనంలోకి వచ్చిన తర్వాత అక్కడి స్థానిక వీరులను చౌదరీలుగా, దేశాయిలుగా నియమించారు. ఆ విధంగా నియమింపబడిన దేశాయిలలో అట్లూరి వెంగళనీడు ఒకడై ఉంటాడు. అతడు కొండపల్లి దేశాయిగా నియమింపబడి ఉండవచ్చును. గోల్కొండ సైన్యాలతో జరిగిన యుద్ధాలలో పోరాడి అతడు అలాంటి కీర్తిని పొంది ఉండవచ్చును. కానీ వీరి అధికారం తాత్కాలికమే. క్రీ.శ.1599లో చింతపల్లి గండి వద్ద జరిగిన యుద్ధంలో గోల్కొండ సేనాధిపతులు బైరామల్ అమన్ ఉల్ ముల్క్‌లు ఈ గజపతి సామంతులను ఓడించి తిరిగి కొండపల్లి, రాజమహేంద్రవర సర్కారులను ఆక్రమించారు. దాంతో గజపతి సామంతుల అధికారం పూర్తిగా నశించి పోయింది. ఈ ప్రాంతాలన్నీ గోల్కొండ రాజ్యంలో భాగాలయ్యాయి.

దాసరి చినగంగయ్య: ఇతడు పురుషోత్తపట్నం పాలెగాడు. పురుషోత్తమ గజపతి పేరున ఈ పట్నం

నిర్మించబడింది. ఇతడు వడ్డెపూడి పెద్దయ్య అనే కవిని పోషించి అతని చేత మాఘమహాత్యం అనే కావ్యాన్ని రాయించి కృతిని పొందాడు. ఆ కావ్యం వల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. ఇతడు హరిశ్చంద్ర గజపతి సేనాధిపతులలోని ముకుందదేవుని సామంతుడు. ఈ కావ్యంలో పేర్కొన్న హరిశ్చంద్ర గజపతి మహాపాత్రుడైన శ్రీ శంకర హరిశ్చంద్ర మహారాజని నిర్ణయింపబడింది. ఇతని శాసనం ఒకటి పాలకొల్లులో ఉంది. కనుక ఇతడు పాలకొల్లు ప్రాంతాన్ని పాలించిన గజపతుల మహాపాత్రుడని చెప్పవచ్చు. అతని సేనాధిపతి ముకుంద దేవుడు అతనిచే దాసరి గంగయ్య పురుషోత్తపట్నపు పాలెగాడుగా నియమింపబడి ఉండవచ్చు. ఈ పురుషోత్తపట్నం గోదావరి జిల్లాలో ఉంది. గుంటూరు జిల్లాలోని చిలకలూరిపేట వద్ద మరొక పురుషోత్తపట్నం ఉంది. ఈ రెండు గ్రామాలు పురుషోత్తమ గజపతి పేరుతో అతని కాలంలో నిర్మింపబడిన గ్రామాలు. ఈ దాసరి చినగంగయ్య గోదావరి జిల్లాలోని పురుషోత్తపట్నం అధిపతి. అతడు తన గ్రామంలో కోదండరామస్వామి ఆలయాన్ని నిర్మించి ఒక తటాకాన్ని తవ్వించాడు. గంగయ్య హరిశ్చంద్రపాత్రుడు ముకుంద దేవునితో కలిసి కశింకోట, ముస్తాబాద్, కొండపల్లిల వద్ద గోల్కొండ సేనలతో పోరాడాడు. తడు మద్దాళి తిరుమలాచార్యుల శిష్యుడని, మారుట్ల గోత్రీకుడని, అతని భార్య పేరు మల్లాంబ అని, ఈ దంపతులకు బాపినీడు, అంకన్న, సొబ్బినీడు, అక్కయ్య అనే నలుగురు కుమారులు కలిగారని మాఘమహత్య గ్రంధకర్త పేర్కొన్నాడు. గ్రంధకర్త తండ్రి వెంకట మంత్రి, తల్లి పేరమాంబ, గ్రంధకర్త తాను చినవొద్దపూడి గ్రామస్తుడనని చెప్పుకున్నాడు. క్రీ.శ.1572లో రాజమహేంద్రవర రాజ్యాన్ని గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షా ఆక్రమించడంతో దాసరి గంగయ్య అధికారం పోయి ఉంటుంది.

కొండవీడు, కొండపల్లిలను పాలించిన గజపతి సామంతులు- మహాపాత్రులు: కొన్ని శాసనాల వల్ల గజపతి యువరాజులు, వారి పని చేసిన మాండలీకులు, మహాపాత్రుల పేర్లు తెలుస్తున్నాయి. క్రీ.శ.1455 నాటి ఒక శాసనంలో కొండవీడును పాలించిన వారి వంశవృక్షం ఇవ్వబడింది. సూర్యవంశస్తుడైన కపిలేశ్వర గజపతి మహానది ఒడ్డున ఉన్న కటకంలో నివసించేవాడని, అతడు జగన్నాధ భక్తుడని తెలిపింది. ఆ వంశంలో చంద్రదేవుడనే వాడు జన్మించాడు. చంద్రదేవునికి గుహిదేవుడని పేరుంది. అతని కుమారుడు గణదేవుడు. అతనికి రౌతురాయ అని పేరుంది. రౌతురాయ జగన్నాధ భక్తుడు. గణదేవుడు కొండవీటి పాలకుడు. అతని శాసనం ఒకటి చింతలపల్లిపాడు వద్ద లభించింది. అది క్రీ.శ.1454 సంవత్సరానికి చెందింది. ఆ శాసనంలో గణదేవ రౌతురాడు మహాపాత్రులు అద్దంకి, వినుకొండ, కొండవీడులను పాలించారని తెలుపుతోంది. క్రీ.శ.1455లో గణదేవుడు చావలి గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం చేశాడు. గణదేవుడు ముస్లింలను ఓడించాడు. ఇతని సమకాలికుడు బహమనీ సుల్తాన్ అల్లావుద్దీన్ క్రీ.శ.1435-1457. క్రీ.శ. 1455 తర్వాత ఇతని పేరు కనిపించదు.

క్రీ.శ.1459 సింహాచలం శాసనంలో హంబీర కొమర మహాపాత్రుడు కొడవీడును పాలించినట్లు తెలుపుతోంది. గణదేవుని తర్వాత హంబీరదేవుని కపిలేశ్వర గజపతి కొండవీటి పాలకునిగా నియమించాడు కపిలేశ్వర గజపతి కాలంనాటికి చెందిన తేదీ లేని శాసనం ఒకటి జక్కంపూడిలో లభించింది. ఆ శాసనం ప్రకారం హంబీరదేవరాజు జక్కంపూడిపల్లెను పాపవినాశదేవుడు, రుద్రదేవుడికి దానం చేశాడు. అతనిచే వేయబడిన ఎనికెపాడు శాసనంలో కూడా తేదీ లేదు. అతడు బెజవాడలోని రాజనారాయణ దేవాలయంలో పని చేసే సేవకులకు ఎనికెపాడు గ్రామాన్ని దానం చేసి ఈ శాసనాలు రాయించాడు. ఈ శాసనంలో షాంబీరను హంబీర మహాపాత్ర అని రాశారు. శ్రీకృష్ణదేవరాయలు శ్రీశైల శాసనంలో ఇతనిని కుమార హంబీర పాత్ర అని పేర్కొన్నాడు ఇతడు కపిలేశ్వర గజపతి కుమారుడు. తండ్రి ఆజ్ఞతో మధ్యాంధ్ర, దక్షిణాంధ్రను జయించి రక్తమయమైన అతని ఖడ్గాన్ని దక్షిణ సముద్రంలో కడిగానని చెప్పుకున్నాడు. అతని కుమారుడు నరహరిదేవుడు ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్రుడు మొదలైన గజపతి సేనానులను క్రీ.శ.1515లో కొండవీటి దుర్గంలో కృష్ణదేవరాయలు సజీవంగా పట్టుకున్నాడు. కపిలేశ్వర కుమారపాత్రుడు హంబీరదేవుని కుమారుడు. మున్నూరు శాసనంలో కపిలేశ్వర కుమారుడు తాను పరీక్ష లేక కొండవీడు దుర్గాధిపతిగా పని చేశానని చెప్పుకున్నాడు. దాంతోపాటు మండపల్లి, అద్దంకి, వినుకొండ, వడ్డెవీడు, చంద్రగిరి, తిరుచునాపల్లి దుర్గాలు కూడా తన అధీనంలో ఉన్నాయని మున్నూరు శాసనంలో చెప్పుకున్నాడు. ప్రతాపరుద్ర గజపతి మామ తిరుమల రౌతురాయ మహాపాత్రుడు క్రీ.శ.1514లో ఉదయగిరి పాలకుడుగా ఉన్నాడు. అతనిని కూడా కృష్ణదేవరాయలు క్రీ.శ.1514లో బంధించాడు

మొగల్‌దేవ మహాపాత్రుని పేరు కొండపల్లి దగ్గర మలకవలూరులో లభించిన రెండు శాసనాలలో పేర్కొనబడింది. ఆ శాసనాలలో అతడు పురుషోత్తమ గజపతి సామంతుడుగా రాసి ఉంది. వీటిలో ఒక శాసనంలో

మొగల్ రాజసంగ్రామ, మొగల్ రాజాధిరాజ, పరీక్ష దండపథ, కదుమద్జియా దండరాజ్య అనే బిరుదులు ఉన్నాయి. వీటి అర్థాలు తెలియలేదు. అర్జునగిరిలో లభించిన మరొక సంవత్సరం లేని శాసనంలో సతోదా బేహార మహాపాత్ర ముకుంద భూపతిమహారాజ, మహాపాత్ర పేర్లు ఉన్నాయి. ముకుంద భోగదానాలు పేర్కొనబడ్డాయి. క్రీ.శ.1443 సంవత్సరానికి చెందిన ఒక శాసనం పెదగాదిలోని కోరుకొండలో లభించింది. అందులో గోవింద వీరమహాపాత్ర ముకుంద అనే అతడు కపిలేశ్వరుని సామంతుడుగా చెప్పబడ్డాడు. ఈ శాసనంలోని ముకుందుడు అర్జునగిరి శాసనంలోని ముకుందుడు ఒకరే కావచ్చు.

ఇతర గజపతి పాలకులు: క్రీ.శ.1294 నాటి అమరావతి శాసనంలో కిలమ మహాపాత్ర, అతని కుమారుడు మల్లవ మహాపాత్రుడు పేర్కొనబడ్డారు. వీరిలో మల్లవ కొండపల్లె, బెజవాడ మధ్య పాంచాననుడు ఆజ్ఞ ప్రకారం దానాలు చేశాడు. క్రీ.శ.1379 నాటి ఒక సింహాచల శాసనంలో రామన మహాపాత్ర, 1384 శాసనంలో స్వప్నేశ్వర మహాపాత్ర, అతని కుమారుడు శంకరజయన మహాపాత్రలు పేర్కొనబడ్డారు. క్రీ.శ.1414లో చందన మహాపాత్ర, 1455లో కుందలేశ్వర మహాపాత్రులు సింహాచలంలో దానాలు చేశారు. క్రీ.శ.1494 అమరావతి శాసనంలో మల్లమహాపాత్రుని పేరుంది. క్రీ.శ.1458లో కపిలేశ్వర గజపతి కాలంలో రాజమండ్రి పాలకుడు రఘుదేవ నరేంద్ర మహాపాత్ర అని తిరుపతి శాసనం తెలుపుతోంది. క్రీ.శ.1495 గుంటూరు శాసనంలో సంతేశ్వర కుమారగురవ మహాపాత్ర, అతని కుమారుడు తిరుమలదేవ మహాపాత్రులు పేర్కొనబడ్డారు. క్రీ.శ.1515లో కేశపాత్ర చంద్ర మహాపాత్రులు కొండవీటి కోటలో ఉన్నారు. వారిని కృష్ణదేవరాయలు బంధించాడు. కపిలేశ్వరునికి విద్యాధర గజపతి అనే కుమారుడు ఉన్నాడు. అతని భార్య భవానియమ్మ. ఆమె వల్ల ముత్యాయలమ్మ, పైడమ్మ అనే ఇద్దరు కుమార్తెలు కలిగారు. విద్యాధరుడు తన పేరుతో విద్యాధరపురాన్ని, అతని భార్య పేర భవానీపురాన్ని, కుమార్తెల పేర్లతో ముత్యాలంపాడు, పైడూరపాడులను నిర్మించాడని శృతి ఉంది. కపిలేశ్వర గజపతి పేరుతో కపిలేశ్వరపురం నిర్మించబడింది. ఇవన్నీ విజయవాడ దగ్గర ఉన్నాయి. విద్యాధరుని వారసులు హంవీరుడు, లాంగూల, పురుషోత్తమ, ప్రతాపరుద్ర గజపతులు.

చితాన్‌ఖాన్ - ఖమ్మంమెట్టు రాజ్యం: గజపతి యుగంలో స్ఫురించదగిన వ్యక్తులలో చితాబ్‌ఖాన్ కూడా చాలా ముఖ్యుడు. మధ్యయుగంలో ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన వీరులలో ప్రముఖంగా పేర్కొనదగినవాడు చితాబ్‌ఖాన్. ఇతని చరిత్రకు ప్రధాన ఆధారం అతనిచే ఓరుగల్లు కోటలో క్రీ.శ.1504లో వేయించబడిన శిలాశాసనం ప్రధానమైనంది. ఆ శాసనమేగాక అనేక కావ్యాలలో కైఫీయత్తులలో కూడా అతని ప్రస్తావన ఉంది. సుల్తాన్ కుతుబ్‌షా చరిత్ర, బురహనీ మాసీర్, తారీఖీ మహమ్మద్ కుతుబ్‌షాహీ అనే ముస్లిం రచనలలో చితాబ్‌ఖాన్‌ను గురించి రాయబడింది. అలాగే కిమ్మూరు కైఫీయత్తు, ఏకశిలా నగరం కైఫీయత్తు, చరిగొండ కైఫీయత్తు, మరొక కైఫీయత్తు కూడా చితాబ్‌ఖాన్‌ను పేర్కొంటున్నాయి. అలాగే చరిగొండ ధర్మన్న రాసిన చిత్రభారతం చితాబ్‌ఖాన్‌ను గురించి ఎక్కువగా తెలుపుతుంది. అద్దంకి గంగాధరకవి రచించిన తపతీ సంవరణోపాఖ్యానంలో కూడా చితాబ్‌ఖాన్‌ను గురించి రాశాడు. కుమార ధూర్జటి రాసిన కృష్ణరాయ విజయంలో చితాబ్‌ఖాన్ ప్రశంస ఉంది. విశ్వనాథనాయకుని స్థానాపతి రచించిన రాయవాచకంలో చితాబ్‌ఖాన్ శ్రీకృష్ణదేవరాయలపై 60 వేల విలుకాండ్రతో దాడిచేసినట్లు వర్ణించబడింది. గింప్లెస్ ఆఫ్ ది నిజాం డొమినియన్స్ అనే గ్రంథంలో వరంగల్లును జయించిన మొదటి మహమ్మదీయుడు చితాబ్‌ఖాన్ అని రాసి ఉంది. ఇన్ని కావ్యాలు, కైఫీయత్తులు, ముస్లిం గ్రంథాలు పేర్కొన్న చితాబ్‌ఖాన్ ఆ కాలంలో గొప్ప శూరుడని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు.

ఓరుగల్లులో చితాబ్‌ఖాన్‌చే ప్రతిష్ఠించబడిన శాసనం శకవర్ష 1425 రుధిరోద్గారి మాఘశుద్ధ 5 ఆదివారం నాడు విక్రమాదిత్య తుల్యుడైన చితాపఖాన క్షితిపతి తిలకుడు ముస్లింల ఆధీనంలో ఉన్న ఏకోపల అంటే ఏకశిలా నగరాన్ని పట్టుకున్నట్లు తెలుపుతుంది. ఇందులో చెప్పబడిన కాలం క్రీ.శ.1504 జనవరి 21వ తేదీ అవుతుంది. ముస్లింల ఆధీనంలో ఉన్న ఓరుగల్లును క్రీ.శ.1504 జనవరి 21వ తేదీన చితాబ్‌ఖాన్ ఆక్రమించాడని ఈ శాసనం స్పష్టం చేస్తుంది. అంతేగాక ముస్లింలు పాంచాల రాయుని అంటే శ్రీకృష్ణుని విగ్రహాన్ని స్థానభ్రష్టం చేయగా తాను దానిని పునఃప్రతిష్ఠ చేశానని శంభునిశుంభులను దానవులను నిర్మూలించిన లక్ష్మిని జగన్మాతను తురుష్కులు కాకతి రాజ్య పీఠం నుండి పెరికి వేయగా, తాను ధర్మశాస్త్ర విధి పూర్వకంగా ఏకశిలాపురం పునఃస్థాపితం చేశానని కాకతివంశ రక్షా చింతామణి అయిన స్వంభూః శివుని పూజించి నైశ్వర్యవంతుడైనానని కూడా చితాబ్‌ఖాన్ ఈ

శాసనంలో చెప్పుకున్నాడు. దీనిని బట్టి 1504 నాటికి కూడా అంటే ఓరుగల్లులో స్వయంభూః దేవాలయం మంచిస్థితిలో ఉందని స్పష్టపడుతుంది. ఆ తరువాత 1518లో కులీకుతుబ్‌షా గోల్కొండ రాజ్యాన్ని స్థాపించాడు గోల్కొండ సుల్తానుల కాలంలోనే స్వయంభూః దేవాలయం నాశనం చేయబడి ఉండాలి.

ఈ శాసనం 15వ శతాబ్దపు తెలుగులిపిలో రాయబడింది. కాని భాష సంస్కృతం. అంటే తెలుగు లిపిలో సంస్కృత భాషతో ఈ శాసనం లిఖించబడింది. ఈ శాసనం శిల నాలుగు వైపులా లిఖించబడింది. మొదటివైపు 35 పంక్తులు, రెండవవైపు 37 పంక్తులు, మూడవ వైపు 37 పంక్తులు, నాల్గవ వైపు 35 పంక్తులు మొత్తం 144 పంక్తులలో లిఖించబడింది. ఈ 144 పంక్తులు 36 పద్యాలుగా రాయబడ్డాయి. ఈ శాసనాన్ని రచించిన కవి ఆపస్థంభ సూత్రుడు, భరద్వాజ గోత్రుడు. అన్నార్య అనే వాని కుమారుడు, మాధవ అనే నామధేయం గలవాడు

ఈ శాసనంలో చితాబ్‌ఖాన్ చితాపఖాన, చిత్తాపుఖాన్, సిత్తపుఖాన, చిత్తాపనాయక అనే వేరు వేరు విధాలుగా పేర్కొనబడ్డాయి. ఈ శాసనం పద్యరచన కావున యతిప్రాసలకు అనుగుణంగా అలా రాసి ఉండవచ్చును. ఈ శాసనం చితాబ్‌ఖాన్ వంశం, కుటుంబ విశేషాలను ఇస్తుంది. దాని ప్రకారం చితాబ్‌ఖాన్ భోగి వంశస్తుడు. అతని తాత నాగాఖ్యుడనే నాయకేంద్రుడు. తండ్రిపేరు మానయాఖ్యుడు. తల్లి గౌరాంబ. ఈ దంపతులకు అనేక మంది పుత్రులు జన్మించారు. వారిలో చితాప్‌ఖాన్ పెక్కు రాజుల ప్రశంసలందాడు. చితాప్‌ఖాన్ ప్రియ భార్య దేవాంబిక. ఆమెకు అవధూతఖాన్, పురాంతకుడు అనే ఇద్దరు కుమారులు కలిగాడు. చితాబ్‌ఖాన్ రెండవ భార్య అనుమాంబ. ఆమెకు అమరుడు, భోగి, రాముడు అనే ముగ్గురు కుమారులు. వారిలో పెద్దవాడైన అమరయ్య వీరస్వర్గం అలంకరించాడు. ఈ శాసనం చితాబ్‌ఖాన్ శౌర్య పరాక్రమాలను శాత్రవభంజనాన్ని గురించి ఘనంగా వర్ణిస్తుంది. అతడు అనేక రాజ్యాలను జయించి తిరిగి వారికే ఇచ్చాడని, కొన్ని పేదలకు దానాలు చేశాడని కూడా ఈ శాసనం వర్ణిస్తుంది. ముస్లిం యుగంలో అతడు అనేక విజయాలు, అనేక యుద్ధాలు చేసి ఘన విజయాలు సాధించినందువల్ల ముస్లింలు అతనిని ఖాన్ అని పిలుచుకొని ఉండవచ్చును. ఖాన్ అంటే వీరుడు కనుక అతడు ఆ కాలంలో చితాబ్‌ఖాన్ అని ప్రసిద్ధికెక్కి ఉండవచ్చును. ఈ శాసనం అతని పూర్వచరిత్రను తెలపటం లేదు. అతని రాజ్య విస్తీర్ణాన్ని గురించి కూడా ఏమీ తెలపడం లేదు.

కిమ్మూరు కైఫీయత్తు తెలుపు చరిత్ర: కిమ్మూరు కైఫీయత్తు అతని పూర్వ వృత్తాంతాన్ని తెలుపుతుంది. ఈ కైఫీయత్తు ప్రకారం చితాబ్‌ఖాన్ సొంత ఊరు కిమ్మూరు గ్రామానికి 12 కి.మీ. దూరంలో ఉన్న రాజపూడి అనే గ్రామం. అతని అసలు పేరు సీతడు, బోయ కులస్తుడు. ఆ కాలంలో బోయజాతి వారు సైనికులుగా చేరి యుద్ధ వీరులుగా జీవిస్తున్నారు. అంతకు పూర్వం చాళుక్య యుగంలో బోయలు రాజ్యాలు చేశారు. వారి రాజ్యాలను బోయకొట్టాలనే వారు. ఆ కాలంలో అవసరాల పెద్దిరాజను నియోగి బ్రాహ్మణుని ఇంట్లో సీతడు పాలేరుగా చేరి పశువులను కాచేవాడు. ఒక రోజు మధ్యాహ్నం పెద్దిరాజు తన పాలేరుకు తానే అన్నం పట్టుకొని వెళ్లాడట. ఆ సమయంలో సీతడు ఎండలో నిద్రబోతుండగా సీతడికి ఎండతగలకుండా ఒక పాము పడగవిప్పి తలవద్ద నిలిచి ఉందట. పెద్దిరాజు అది చూసి అతడు గొప్పవాడవుతాడని భావించి అతనిని లేపి నీవు గొప్పవాడవైతే నాకేమి ఇస్తావు అని అడిగాడట. అలా అయితే తన భాగ్యాన్నంతటినీ పెద్దిరాజుకు దత్తత చేస్తానని అన్నాడట. దాంతో పెద్దిరాజు సీతడిని పాలేరు పని నుంచి తప్పించి బాగా చదివించడమే గాక యుద్ధ విద్యలు కూడా నేర్పించాడట తరువాత కొంత కాలానికి గోల్కొండ నుండి ఒక లష్కర్ రాజమహేంద్రవరం రాగా పెద్దిరాజు సలహాపై సీతడు ఆ లష్కర్‌ను దర్శించాడు. లష్కర్ అతనిని తన సైన్యంలోకి తీసుకొని 20 మంది సైనికులపై అధికారిగా నియమించాడు. తరువాత 200 మంది సైనికులపై అధికారి అయ్యాడు. జగ్గంపేట, పొదినికొండ ప్రాంతాల్లో కోయవారు తిరుగుబాటు చేయగా వారి తిరుగుబాటును అణచడానికి లష్కర్ సీతడిని పంపగా సీతడు వారిని అణచివేశాడు. అందుకు సంతసించి లష్కర్ అతనిని సితాబ్‌ఖాన్ అని బిరుదు ఇచ్చి 500 ఫౌజ్‌దార్‌గా నియమించి తన స్వస్థానమైన రాజపూడికి స్థానిక పాలకునిగా నియమించాడు. తరువాత అవసరాల పెద్దిరాజును పిలిపించుకొని అతనిని తన దివాన్‌గా నియమించుకొన్నాడు. తరువాత రాజపూడిలో రాతికోటను నిర్మించి ముస్లిం ప్రభుత్వాన్ని ధిక్కరించి స్వతంత్రం ప్రకటించాడు.

చితాబ్‌ఖాన్‌కు అప్పలమ్మ అనే కూతురు ఉంది. ఆమె పెద్దిరాజును చూసి మోహించింది. కాని పెద్ది రాజు తన ప్రభువు కూతురు తనకు సోదరిలాంటిదని ఆమె ప్రేమను తిరస్కరించాడు. అందుకు కోపించి అప్పలమ్మ పెద్దిరాజు .తనను వలచి నిర్బంధిస్తున్నాడని తండ్రికి చెప్పగా చితాబ్‌ఖాన్ ఆగ్రహంతో పెద్దిరాజును పిలిపించాడు.

అతడు ముందే విషయం గ్రహించి చితాబ్‌ఖాన్ ముందు తన కత్తితో తన రెండు కండ్లను పీకివేసుకున్నాడు. తనను తానే శిక్షించుకున్నానని చెప్పి అతని కొలువు వీడి రాజమహేంద్రవరం చేరి లష్కర్ ఆలీకులీఖాన్‌ను కలిసి చితాబ్‌ఖాన్‌పై పితూరీలు చెప్పి తనకు సైన్యం ఇస్తే చితాబ్‌ఖాన్‌ను వధించి రాజపూడి కోటను లష్కర్‌కు స్వాధీనం చేయగలనని చెప్పాడు. లష్కర్ సమ్మతించి అతనికి సేనను ఇవ్వగా పెద్దిరాజు సేనతో వచ్చి రాజపూడి కోటను ముట్టడించాడు. చితాబ్‌ఖాన్ కోట వదలి పారిపోగా పెద్దిరాజు సేనతో అతనిని వెంబడించి తాటపల్లిలొద్ది అనే చోట చితాబ్‌ఖాన్‌ను పట్టుకొని తల నరికి నాలుగు గడియలలో రాజమహేంద్రవరానికి వార్త పంపాడని కిమ్మూరు కైఫీయత్తు తెలుపుతుంది.

మరొక కైఫీయత్తు ఇదే కథను మరొక విధంగా వర్ణించింది. దాని ప్రకారం అవసరాల పెద్దిరాజు మతువెల్లపాలెం కాపురస్తుడు. అది రాజమండ్రి సర్కారులోని బిక్కవోలు పరగణాలో ఉంది. సీతడు సైన్యంలో చేరాలని బయలుదేరుతుండగా పెద్దిరాజు అతనికి వేయి రూకలు ఇచ్చి సహాయం చేశాడు. సీతడు ఓరుగల్లులో చేరి సైనిక ఉద్యోగం సంపాదించాడు. క్రమేపీ పైకి వచ్చి నాలుగు వేల దళపతి అయ్యాడు. అప్పటికే అతనికి చితాబ్‌ఖాన్ అనే బిరుదు వచ్చింది. తన కింద సైనిక పోషణకు జాగీరు కూడా ఇవ్వబడింది. ఇంతలో ముస్లింలు ఓరుగల్లును ఆక్రమించారు. దాంతో అతడు కటకం చేరి గణపతిని ఆశ్రయించాడు. ఆ కాలంలో రాజమండ్రి దుర్గపాలకుడుగా ఉన్న శిరశ్చంద్రుని కటకానికి మార్చాడు. చితాబ్‌ఖాన్ పూర్వం చాళుక్యులు నిర్మించిన వేమగిరి దుర్గంలో ఉండకుండా రాజమహేంద్రవరానికి ఉత్తర దిశగా ఉన్న కోటను బలపరచుకొని అందులో నివశించాడు. రాజమండ్రితోపాటు కస్బా ద్రాక్షారామం కూడా అతని అధికారం కింద ఉంచబడింది. అప్పుడు అతడు పెద్దిరాజును పిలిపించుకొని దివాన్‌గా నియమించుకొన్నాడు. తరువాత రాజమండ్రి కింద ఉన్న 18 మొహల్లాలకు పెద్దిరాజు అధికారిగా నియమింపబడ్డాడు.

తరువాత కిమ్మూరు కైఫీయత్తులో వర్ణించబడిన ప్రేమకథ వివరింపబడింది. ఐతే చితాబ్‌ఖాన్ కూతురు పేరు ఇక్కడ అప్పలమ్మకు బదులుగా నాగమ్మ అని పేర్కొనబడింది. పెద్దిరాజు కన్నులను పెకరించుకున్న తరువాత రాజమండ్రిని వదలివేసి పల్లకీలో గొల్కొండకు వెళ్లిపోయి గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్‌షాను కలుసుకొని రాజమండ్రిని జయించడానికి తాను సహాయం చేస్తానన్నాడు. అందుకు సంతసించి ఇబ్రహీం కుతుబ్‌షా సైనిక సన్నాహాలు చేసి సలాబత్‌ఖాన్, అమల్‌దార్ తోపుఖాన్, సయ్యద్ మీరా, షా మహమ్మద్‌ఖాన్ వజీర్, జూపల్లి సామంతరావు, కరం వీరమరావు, ముత్యాల ఎల్లపేశ్వరరావు, సెట్టిపల్లి భటరావు, మేదరాలమెట్టు గోపాలరేడు, భల్లమ చిన్నారావు, వెల్లన్ వీరమరావు అనే పదకొండు మంది సరదార్లను రాజమండ్రి దండయాత్రకు నియమించాడు. 80 వేల కాల్బలం, 11 వేల అశ్వదళం. పెద్దిరాజు ఈ సైన్యంతో బయలుదేరి నార్కటుపల్లి వద్ద గోదావరిని దాటించాడు. తరువాత సైన్యం ఈత కోట దుర్గాన్ని పట్టుకొని తాటపూడి రేవును దాటి నల్లూరు మదుగు వద్ద విడిదిచేసింది. నల్లూరిమదు చౌదరి అనే గంధం తిమ్మయ్య మహాపాత్రుడు. ఈ సేనకు భోజనాదులు ఏర్పాటు చేశాడు. తరువాత ఈ సైన్యంలో కొంత భాగం కస్బా ద్రాక్షారామాన్ని ముట్టడించింది. గంధం తిమ్మయ్య ఒక వైపు ముస్లిం సైన్యానికి భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తూ మరొకవైపున ముస్లిం సైన్యం రాకను గురించి ఉత్తరం రాసి సూరనేని కొండమాలి అనే వాని ద్వారా రాజమండ్రికి పంపాడు. కాని మార్గమధ్యలో సూరనేని ముస్లిం సైనికులకు చిక్కాడు. అతని వద్ద ఉన్న ఉత్తరాన్ని వజీర్‌షా మహమ్మద్‌ఖాన్ చూపారు. వెంటనే గంధం తిమ్మయ్యను బంధించి ద్రాక్షగుండం అనే చెరువు తూర్పు గట్టున అతని తల నరికి వేశారు. తరువాత ఎల్లో పండితుడనే వాని నాయకత్వంలో రాజమహేంద్రవరాన్ని పట్టుకోడానికి ముస్లిం సైన్యాన్ని మాలిక్ నాయబ్‌లు పంపారు. ఆ సైన్యం శక సంవత్సరం 1495 ఆషాఢ శుక్ల పంచమి గురువారం నాడు వేమగిరి కోటను ఆక్రమించింది. ఈ శక కాలం క్రీ.శ.1573. తరువాత ఆ సైన్యం రాజమండ్రి దుర్గాన్ని ఆక్రమించింది. చితాబ్‌ఖాన్ కోట వదలి వెళ్లిపోయాడు. కాని ముస్లిం సైన్యం అతనిని వెంటతరిమి తాటపల్లిలొద్ది వద్ద పట్టుకొని అక్కడనే అతని తల నరికి వేశారు. పెద్దిరాజు ఒక ఝాములో ఆ విజయవార్తను గోల్కొండ కోటకు తెలియజేశాడు. గోల్కొండ నుండి వచ్చేటప్పుడు రెండు క్రోసులకొక నగారాను ఏర్పాటుచేసి ఝాములో విజవార్తను అందిస్తానని పెద్దిరాజు గోల్కొండ నవాబుకు వచ్చేటప్పుడు చెప్పాడట. అలాగే నగారాలు ఏర్పాటు చేసి వానిని వరుసగా మోగించడం ద్వారా రాజమండ్రి విజయవార్తను గోల్కొండకు ఒక ఝాములోనే తెలియజేశాడట. ఈ కైఫీయత్తు పెద్దిరాజును అన్న రావణాసురునికి ద్రోహం చేసిన విభీషణుని లాగా పోల్చి వర్ణించింది.

చరిగొండ ధర్మన్న రాసిన చిత్రభారతంలో చితాబ్‌ఖాన్‌ను గురించి ఎక్కువగా రాయబడింది. ఈ తెలుగు కావ్యం ఎమ్మెలపల్లి పెద్దనామార్యుతనకు అంకితం చేయబడింది. ఇతడు చితాబ్‌ఖాన్ మంత్రి. కనుక ఈ కవి చితాబ్‌ఖాన్ సమకాలికుడు. ఈ పెద్దామాత్యుడే పెద్దన్నగాను, పెద్దిరాజు గాను కైఫీయత్తులలో వర్ణించబడి ఉంటాడని డాక్టర్ హీరానందశాస్త్రి భావించారు. హీరానందశాస్త్రి నిజాం ప్రభుత్వం ప్రకటించిన వరంగల్లు చితాబ్‌ఖాన్ అనే శాసన గ్రంథానికి వ్యాఖ్య రాశారు. చిత్రభారతంలోని వర్ణనలు చితాబ్‌ఖాన్‌ని గొప్ప వీరుడిగా వర్ణిస్తుంది. ఈ వర్ణనలు క్రీ.శ.1504 నాటి శాసనంలోని వర్ణనలతో ఏకీభవిస్తుంది.

అద్దంకి గంగాధర కవి రచించిన తపతీ సంవరణోపాఖ్యానం చితాబ్‌ఖాన్ ఉదంతం వర్ణించబడింది. ఈ కావ్యం గోల్కొండ నవాబ్ ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితం ఇవ్వబడింది. ఈ కావ్యంలో కంపమంది చితాపుఖానుడు గౌతమీతటిని లంఘించి పోబుటముపల్లె అని వర్ణించింది. ఈ వర్ణన ప్రకారం చితాబ్‌ఖాన్ ఇబ్రహీం కుతుబ్‌షా సమకాలికుడని స్పష్టపరుస్తోంది. చితాబ్‌ఖాన్ గోదావరీ నదిని దాటిపోవడం విజయవార్త దేవగజపతులకు ఇబ్రహీం కుతుబ్‌షాహీకి జరిగిన సంధిని సూచిస్తోందని హీరానందశాస్త్రి అభిప్రాయద్దారు.

కుమారధూర్జటి రచించిన కృష్ణరాయ విజయం విద్యానాధుని రాయవాచకం చితాబ్‌ఖాన్ 60 వేల విలుకాండ్రతో శ్రీకృష్ణదేవరాయలు పొట్నూరు నుండి కటకంపైకి దండయాత్ర సాగినప్పుడు చితాబ్‌ఖాన్ 60 వేల విలుకాండ్రతో మార్గమధ్యంలో, కొండలలో, అడవులలో రాయల సైన్యంపై విరుచుకుపడేవాడని, కాని రాయల సైన్యం అతనిని ఓడించి తరిమిందని తెలుపుతున్నాయి. ఈ రెండు కావ్యాలు చితాబ్‌ఖాన్ శ్రీకృష్ణ దేవరాయలు ప్రతాపరుద్ర గజపతిల సమకాలికుడని తెలుపుతున్నాయి.

చితాబ్‌ఖాన్ మహమ్మదీయుడు: ఏకశిలా నగర కైఫీయత్తు విరుద్ధ కథనాన్ని చెబుతోంది. చితాబ్‌ఖాన్ హిందూమతద్వేషి, కాకతీయ మతద్వేషి అని తెలుపుతోంది. చితాబ్‌ఖాన్ ఓరుగల్లులోని చతుర్ముఖేశ్వర ఆలయాన్ని, వేయి స్తంభాల గుడిని, ఇంకా కాకతీయులు నిర్మించిన అనేక దేవాలయాలను ధ్వంసం చేశాడని, ఆ ఆలయరాళ్లతో ప్రతాపరుద్రుడు అసంపూర్ణంగా వదలివేసిన రాతికోటను పూర్తిగా ధ్వంసం చేశాడని, పరుసవేది శంభులింగ దేవాలయానికి పశ్చిమాన కోనేరునకు దక్షిణంగా తనకు గొప్ప సౌధాన్ని నిర్మించుకున్నాడని, దాని పేరు ఖాన్‌మహల్ అని తెలుపుతోంది. అంతేగాక కొందరు రత్నకంబళ్లు నేసేవారు ఉత్తరదేశం నుంచి వచ్చి చితాబ్‌ఖాన్‌తో ఏకశిలా నగరంలో నిలిచిపోయారని కూడా తెలుపుతుంది. దీనినిబట్టి చితాబ్‌ఖాన్ ఉత్తరదేశం నుండి వచ్చిన ముస్లిం వీరుడని, అతడు ఓరుగల్లులోని అనేక దేవాలయాలను నాశనం చేశాడని భావించవలసి వస్తుంది. చరికొంగ కైఫీయత్తు ఓరుగల్లు కైఫీయత్తును బలపరుస్తుంది. సితాబ్‌ఖాన్ అనే తురక వంశం వారు ఈ దేశంలోని 74 దుర్గాలను శాలివాహన సంవత్సరం 1350 నుండి 1420 వరకు అంటే క్రీ.శ.1428 నుండి 1498 వరకు అంటే 70 సంవత్సరాలు పాలించారని తెలుపుతుంది. కాని ఈ కైఫీయత్తులో అనేక పొరపాట్లున్నాయి. ఇది పూర్వపు ప్రతిని బట్టి 1906లో రాయబడింది. ఈ రాతపతి లక్షణరాయ పరిశోధక మండలి వద్ద ఉంది. అలాగే వరంగల్లును జయించిన మొదటి మహమ్మదీయుడు. షితాబుఖాన్ షితాబెఖాన్ అని గ్లింప్సెస్ ఆఫ్ ది నిజాం డొమీనియన్స్ అనే గ్రంథంలో రాసి ఉంది. ఈ మూడు ఆధారాలు చితాబ్‌ఖాన్ మహ్మదీయుడని తెలుపుతున్నాయి. బురహనీమాషీర్ అనే ముస్లిం గ్రంథం క్రూర సుల్తాన్‌గా ప్రసిద్ధి చెందిన బహమనీ హుమాయూన్ కింది అమీర్లతో క్రీ.శ.1461లో షితాబుఖాన్ అనే సరదారుడున్నట్లు పేర్కొంటుంది. దాని ప్రకారం చితాబ్‌ఖాన్ హుమాయూన్ సమకాలికుడు. అంతేగాక షితాబుఖాన్ తన రాణివాస స్త్రీలను వదలివేసి బతుకుజీవుడా అని పారిపోవలసి వచ్చిందని సుల్తాన్ ఆజ్ఞ ప్రకారం సామ్యాజనుల సమక్షంలో సిగ్గులచేటుగా నారీజనం బాధింపబడ్డారని, ఈ విషయాలను పెరిష్టా కూడా రాశాడు. సుల్తాన్ కులీ కుతుబ్‌షా చరిత్ర షితాబ్‌ఖాన్ వరంగల్లు, ఖమ్మంమెట్టు రాజని నిర్భీతి కలిగిన కాఫిరుడని తెలుపుతుంది. ఈ గ్రంథాన్ని బ్రిగ్స్ దొర అనే అతడు ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేశాడు. అతడు తన గ్రంథంలో షితాబ్‌ఖాన్‌ను సీతాపతి అనే పేరుతో పేర్కొన్నాడు. అందుకు ఆధారాలను అతడు పేర్కొనలేదు. కాని మూలప్రతి అయిన తారీఖీ మొత్తం గ్రంథంలో షితాబ్‌ఖాన్ అనే పేర్కొనబడింది. ఎక్కడ కూడా సీతాపతి అని లేదు.

బ్రిగ్స్ దొర రాసిన సీతాపతి కథ: అల్లావుద్దీన్ ఇమాద్‌షాకు, కులీకుతుబ్‌షాకు ఎదుతుప్పల జిల్లాను గురించి వివాదం వచ్చింది. అందుకు కులీ కుతబ్‌షా ఇమాద్‌షాను తరిమివేసి ఎదుతుప్పల్ జిల్లాను ఆక్రమించి తన రాజధాని గోల్కొండకు వెళ్లిపోయాడు. గోల్కొండ చేరగానే సీతాపతి అనే రాజు అతని రాజ్యాన్ని ఆనుకొని ఉన్న

కుతుబ్‌షాహీ రాజ్య భాగాలను ఆక్రమించదానికి ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. సీతాపతి ఓరుగల్లు, ఖమ్మంమెట్టు, బెల్లంకొండలకు రాజు. అతని వద్ద 12 వేల సైన్యం ఉంది. ఆ సైన్యం మంచి విలుకాండ్రు. కులీకుతుబ్‌షా సీతాపతి రాజ్యాన్ని ఆక్రమించదానికి సైన్యంతో బయలుదేరి మొదట బెల్లంకొండను ముట్టడించాడు. యుద్ధంలో చాలా మంది ముస్లిం యోధులు చనిపోయారు. చివరకు ముస్లిం సైన్యం కోటగోడలకు ఎగబాకి దుర్గాన్ని ఆక్రమించారు. బెల్లంకొండ పతనాన్ని గురించి తెలిసిన సితాబ్‌ఖాన్ తన సైన్యంతో ఖమ్మంమెట్టు నుండి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఉభయులకు ఘోరయుద్ధం జరిగింది. అందు ముస్లింలు గెలిచారు. చితాబ్‌ఖాన్ ధనరాసులు, యుద్ధ సామగ్రి కులీకు వశం అయ్యాయి. సుల్తాన్ గోల్కొండ వెళ్లాడు. ఓడిపోయిన చితాబ్‌ఖాన్ ఖమ్మంమెట్టుకు పోయి తన పరిసర రాజులైన కొండపల్లి - ఇది నేలకొండపల్లి కావచ్చును, ఇంద్రకొండ, వాడపల్లి, ఎద్దీరు రాజుల సహాయం కోరాడు. వారు చితాబ్‌ఖాన్‌కు సహాయంగా తమ సైన్యాలతో వచ్చారు. అది తెలిసి కులీకుతుబ్‌షా వారిని ఎదిరించదానికి సైన్యాలతో వచ్చాడు. వారికి ఖమ్మంమెట్టు దుర్గం పరిసరాలలో యుద్ధం జరిగింది. వారందరినీ కులీ సైన్యం ఓడించింది. అంతటా అతదు ఎద్దీర్, వాడపల్లి, ఇంద్రకాండ, కొండపల్లి రాజ్యాలను వశం చేసుకొని ఖమ్మంమెట్టును ముట్టడించాడు. అక్కద మళ్లీ భీకరయుద్ధం జరిగింది. ముస్లిం సైనికులు తలలను డాళ్లతో కప్పుకొని నిచ్చెనలతో కోట గోడలనెక్కి లోపల ప్రవేశించారు. చితాబ్‌ఖాన్ తన కుటుంబాన్ని కూడా వదిలివేసి పారిపోయాడు. ముస్లింలు కోటలోని ప్రజలను నరికి చితాబ్‌ఖాన్ కుటుంబ స్త్రీలను అందరిముందు అవమానాల పాలు చేశారు. తరువాత వారిని సుల్తాన్ అంతఃపురానికి పంపారట.

పరాజయం పాలైన సీతాపతి కొండపల్లి చేరి అక్కడ పాలించే రామచంద్రగజపతి సహాయం అర్థించాడు. కులీకుతుబ్‌షాను అరికట్టకపోతే అతదు గజపతి రాజ్యంపై కూడా దండెత్తుతాదని చెప్పగా రామచంద్ర దేవుదు అది వాస్తవమని గ్రహించి తన సామంతులను తమ సైన్యాలతో రావలసిందిగా ఆజ్ఞాపించాడు. త్వరలోనే అతదు 3 లక్షల కాల్బలం, 30 వేల అశ్వదళాన్ని పోగుచేవాడు. రామచంద్ర దేవుని సామంతులు విదియాద్రి, హరిశ్చంద్ర, చితాబ్‌ఖాన్ అందరూ కలిసి యుద్ధానికి పూనుకొన్నారు. వారు సైన్యసమేతంగా కుతుబ్‌షాపైకి దందెత్తారు. ఉభయ సైన్యాలు పాలిచెన్నూరు వద్ద ఉన్న నది ఒద్దున ఎదురుపడ్డారు. మరురోజున యుద్ధానికి దిగారు.

యుద్ధం-1522: రామచంద్రగజపతి 1 లక్ష కాల్బలం, 10 వేల అశ్వదళం, 3 వందల గజదళంతో యుద్ధ భూమిలో మధ్యస్థానాన్ని తీసుకున్నాడు. అతని మేనల్లుదు విదియాద్రి 1 లక్ష కాల్బలం, 10 వేల అశ్వదళం, 2 వందల అశ్వదళంతో రామచంద్ర దేవుని కుడివైపు స్థానాన్ని తీసుకున్నాడు. హరిశ్చంద్రరాజు, చితాబ్ ఖాన్‌లు 1 లక్ష కాల్బలం, 10 వేల అశ్వదళం, 2 వందల గజదళంతో ఎదమ స్థానాన్ని తీసుకున్నారు. కులీకుతుబ్‌షాకు 5 వేల సైన్యం మాత్రమే ఉంది. ఆ చిన్న సైన్యంతోనే వారితో తలపడ్డాదని తారీఖీ మహమ్మద్ కుతుబ్‌షాహీ గ్రంథం వర్ణిస్తుంది. తన కుమారుదు హైదర్‌ఖాన్‌కు 15 వందల అశ్వదళాన్ని ఇచ్చి కుడివైపున నిలబెట్టాడు. అంతే బలగంతో ఫతేఖాన్‌ను ఎదవ వైపున నిలబెట్టి తాను 2 వేల సైన్యంతో మధ్య భాగాన నిలిపాడు. యుద్ధం ప్రారంభించబోయే ముందు తాను గుర్రం దిగి మోకరించి అల్లాకు నమాజు చేసి తనకు విజయం కలిగించమని, కాఫిరలను అంతం చేయమని మొక్కి లేచి గుర్రాన్ని అధిరోహించి యుద్ధం ప్రారంభించాడు. హిందువులను గొర్రెలను నరికినట్లు నరికి పారదోలాడు. విదియాద్రిని హైదర్‌ఖాన్ వధించాడు. రామచంద్ర దేవుదు బందీగా చిక్కాడు. విజయం లభించింది. తరువాత అతదు కొండపల్లి చేరి దుర్గాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. దాంతో తూర్పు సముద్ర పర్యంతం భూమి అతని వశం అయింది. తరువాత ముస్లిం సైన్యం ఏలూరుకు పోయి అక్కద అనేక మంది హిందువులను చంపి ఏలూరును ఆక్రమించింది. తరువాత రాజమహేంద్రవరం చేరి గోదావరీ తీరాన విడిచింది. శత్రువులు బహుళ సంఖ్యలో అదవిలో గుమిగూడి ఉందని, రాత్రివేళ తమపై పడటానికి సిద్ధంగా ఉందని వార్త తెలిసింది. వెంటనే కులీకుతుబ్‌షా ఫతేఖాన్, రుస్తుంఖాన్ అనే సేనానులను సైన్యంతో అక్కడికి పంపాడు. వారి మధ్య యుద్ధం జరిగింది. హిందువులు ఓడి పారిపోయారు. ఆ ప్రాంతం అంతా ముస్లింల వశమైంది. అంతలో కటకాన్ని ఏలే విజయనాధ దేవుదను గజపతిరాజు సుల్తాన్ కులీకుతుబ్‌షా వద్దకు రాయబారులను పంపాడు. ఒరిస్సాలోని హిందూ రాజ్యానికి తెలంగాణలోని మహమ్మదీయ రాజ్యానికి గోదావరినది సరిహద్దుగా ఉండటానికి ఉభయులు సమ్మతించారు. ఈ సంధి ఫలితంగా ఏలూరు దండపాద కుతుబ్‌షా రాజ్యంలో భాగమైపోయింది.

తారీఖీ కుతుబ్‌షాహీ గ్రంధ కధనం: తారీఖీ కుతుబ్‌షా అనే గ్రంథం ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో

షితాబ్‌ఖాన్ అనే పేరు గల వీరుడు ఉన్నట్లు తెలుపుతుంది. తళ్లికోట యుద్ధం జరుగకముందు మల్లినాయకుడని బిరుదు గల రప్పుతుఖాన్ లారీ అనే సరదారుని రాజమహేంద్రవర దండపాదను జయించడానికి ఇబ్రహీం కుతుబ్‌షా పంపాడు. అతడు రాజమహేంద్ర సర్కారులోని కొన్ని ప్రాంతాలు జయించాడు. అంతలో 1565లో తళ్లికోట యుద్ధం వచ్చింది. ఆ యుద్ధంలో పాల్గొనడానికి రప్పుతుఖాన్‌ను గోల్కొండ రమ్మని కబురు వచ్చింది అతడు వెళ్లిపోయాడు. తళ్లికోట యుద్ధంలో ముస్లింలు విజయం సాధించారు. తరువాత 12 నెలలకు రప్పుతుఖాన్ లారీ మళ్లీ రాజమహేంద్రవర దండపాదకు తిరిగి వచ్చాడు. రాష్ట్రాలను దండపాద అని గజపతులు వ్యవహరించేవారు. అప్పటికి అది గజపతి రాజ్యంలో ఉండి దండపాద అని పిలువబడుతుంది. ముస్లింలు జయించిన తరువాత దండపాదలకు సర్కారులని పేరు పెట్టారు. రప్పుతుఖాన్ లారీ ధవళేశ్వరం చేరి రాజమహేంద్రవరాన్ని ముట్టడించడానికి సన్నాహాలు చేశాడు. అయితే పెంటపురం, రాజపూడి దుర్గాలు సీతాపతి అనే షితాబుఖాన్ అధీనంలో ఉన్నాయి. షితాబుఖాన్ తన సైన్యాన్ని సైనిక సామాగ్రిలను రాత్రిపూట రాజమండ్రికి చేరవేస్తున్నాడు. అది తెలిసి ముందు షితాబ్‌ఖాన్‌ను జయించాలని పెంటపురంపై దాడికి బయలుదేరాడు మార్గమధ్యంలో ఎదురుపడి యుద్ధం చేసి ఓడిపోయి పెంటపుర కోటకు వచ్చి చేరారు. ముస్లిం సైన్యం వెంటపడి తరుముగూ వచ్చి కోటను ముట్టడించి కోటను ఆక్రమించారు. సీతాపతి కుటుంబంతో తప్పించుకొని అడవులగుండా రాజపూడి దుర్గం చేరారు. మరునాడు మహమ్మదీయ సైన్యం రాజపూడికి బయలుదేరింది. కాని మార్గం అంతా చోరశక్యం గాని కారడవి. రప్పుతుఖాన్ తన సైన్యానికి మార్గం చేయడానికి అడవిని తగులబెట్టించాడు. రోజుకు ముస్లింలు రెండు మైళ్లు మాత్రమే ముందుకు పోగలిగారు. మార్గమధ్యంలో హిందూ సైనికులు అడవిలో నుండి వచ్చే వారిపై దాడులు చేసి దాదాపు మూడు వందల మంది ముస్లిం సైనికులను చంపారు. అయినా ముస్లిం సైన్యం మార్గం చేసుకొని దుర్గం చేరింది. రాజపూడి దుర్గం ఒక గుట్టపైన ఉంది. ముస్లిం సైన్యం దుర్గం వద్దకు చేరగానే చితాబ్‌ఖాన్ యుద్ధం చేయకుండా దుర్గాన్ని వదలివేసి రాజమహేంద్రవరం చేరాడు. రాజమండ్రిని విదియాద్రి పాలిస్తున్నాడు. చితాబ్‌ఖాన్‌కు విదియాద్రి ఆశ్రయం ఇచ్చిన తన సామంతుడైన కశింకోట రాజును సైన్యాలతో రమ్మనమని కబురు చేశాడు. కశింకోట రాజు రాగానే వారికి మొత్తం 30 వేల కాల్బలం, 30 వేల అశ్వబలం కూడింది. ఆ సైన్యంతో వారు మహమ్మదీయ సైన్యాన్ని ఎదుర్కోటానికి పోయారు. మొదట వారు ముస్లిం సైన్యాలను దెబ్బతీశారు. కాని చివరకు ఓడిపోయి వెనుదిరిగి వచ్చి రాజమహేంద్రవరం కోటలో దూరారు. మహమ్మదీయ సైన్యం వచ్చి కోటను ముట్టడించింది. నాలుగు నెలలు ముట్టడి సాగింది ఇక లాభం లేదని విదియాద్రి సంధి చేసుకోడానికి రాయబారం పంపాడు. ముస్లిం సైన్యంలో ఉన్న ఎల్లో పండితుడనే వానిని కోటలోకి పంపితే తాము తమ షరతులను చెబుతానని రాయబారి చెప్పాడు. ఎల్లో పండితుడు కోటలోకి వెళ్లాడు. విదియాద్రి, సితాబ్‌ఖాన్‌లు తమను తమ కుటుంబాలతో సహా తమ ఇష్టం వచ్చిన చోటుకు వెళ్లడానికి అనుమతిస్తే కోటను ఖాళీ చేసి వెళతామని చెప్పారు. ఎల్లో పండితుడు వచ్చి చెప్పగా రప్పుతుఖాన్ అందుకు అంగీకరించాడు. విదియాద్రి కళింకోటకు వెళ్లిపోయాడు. చితాబ్‌ఖాన్ బీజాపూర్ వెళ్లిపోయాడు. ఈ సంఘటన హిజా 979లో జరిగింది. వారు వెళ్లగానే కోట కాఫిరుల దేవాలయాలు మా స్వాధీనమయ్యాయని తారీఖ్ కుతుబ్‌షాహీ గ్రంథం తెలుపుతుంది.

ఈ విధంగా గ్రంధాలు, కైఫీయత్తులు వివిధ రకాలుగా సితాబ్‌ఖాన్‌ను గురించి తెలుపుతున్నాయి ఈ వివరాలు షితాబ్‌ఖాన్ కాల నిర్ణయం చేయడానికి కొన్ని ఇబ్బందులను కలిగిస్తున్నాయి. క్రీ.శ.1461లో హుమాయూన్ అమీర్లలో చితాబ్‌ఖాన్ ఒకడు ఉన్నాడని బురహానీ మాషీర్ తెలుపుతుంది. అప్పటికి అతని వయసు ఒక సంవత్సరాలని అనుకుంటే 1504లో ఓరుగల్లును ఆక్రమించి అక్కడ శాసనం వేయించే నాటికి అతని వయసు 75 సంవత్సరాలై ఉండాలి. అలాగే అతడు శ్రీకృష్ణదేవరాయలతో పోరాడినట్లు రాయవాచకంలో ఉంది. కనుక ఆ దండయాత్ర 1517లో అయి ఉండాలి. అప్పుడు అతని వయసు 88 సంవత్సరాలు. తారీఖీ కుతుబ్‌షాహీ చితాబ్‌ఖాన్ ఇబ్రహీం కుతుబ్‌షాకు సమకాలికుడని తెలుపుతుంది. ఇబ్రహీం కుతుబ్‌షా 1573లో రాజమహేంద్రవరాన్ని జయించాడు. అంటే అప్పటికి అతని వయసు 146 సంవత్సరాలు అవుతుంది. ఇది సాధ్యమా? కాదు. కనుక హుమాయూన్ దర్బారులో ఉన్న చితాబ్‌ఖాన్ ఇతడు అయి ఉండడు. బహమనీ సుల్తానులు ఓరుగల్లును పద్మనాయకుల నుండి జయించారు. ఆ సందర్భంలో ఓరుగల్లును జయించిన సరదారు పేరు కూడా చితాబ్‌ఖాన్ అయి ఉంటుంది. అతడు హుమాయూన్ కొలువులోని చితాబ్‌ఖాన్ అయి ఉంటాడు

అతడు హిందూ దేవాలయాలను పడగొట్టాడు. ఓరుగల్లు కైఫీయత్తు చెప్పే చితాబ్‌ఖాన్ అతడై ఉంటాడు. తరిగొండ కైఫీయత్తు తెలిపే చితాబ్‌ఖాన్ కూడా అతడు అయి ఉండాలి. కనుక అతడు ముస్లిం.

ఓరుగల్లు శాసనంలోని చితాబ్‌ఖాన్ హిందువు. తాను దేవాలయాలు పునరుద్ధరించానని చెప్పుకున్నాడు. ఇతడు శ్రీకృష్ణదేవరాయలు, ప్రతాపరుద్ర గజపతి కులీకుతుబ్‌షాల సమకాలికుడు. 1504లో బహమనీ సరదారులు సొంత రాజ్యాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. తెలంగాణలో కులీకుతుబ్‌షా తన అధికారాన్ని స్థిరపరచుకుంటున్నాడు. అలాంటి రోజుల్లో చితాబ్‌ఖాన్ కులీకుతుబ్‌షా అధీనంలోని ఓరుగల్లును జయించి ఆ శాసనం వేయించి ఉంటాడు. అతడు గజపతుల సామంతుడుగా గాని, లేదా వారి సహాయంతో స్వతంత్రంగా గాని ఓరుగల్లు విజయం సాధించి ఉంటాడు. 1514-15 సంవత్సరాల శ్రీకృష్ణదేవరాయలు తన తూర్పు దిగ్విజయ యాత్రలో భాగంగా కొండపల్లిని జయించిన తరువాత తెలంగాణలో ప్రవేశించి చితాబ్‌ఖాన్ రాజ్యాన్ని జయించాడు. చితాబ్‌ఖాన్ కటకం చేరాడు. 1517లో శ్రీకృష్ణదేవరాయలు పొట్నూరు నుండి కటకంపై దండయాత్రకు బయలుదేరినప్పుడు గజపతులకు సహాయంగా చితాబ్‌ఖాన్ రాయల సైన్యంపై మార్గమధ్యంలో 60 వేల విలుకాండ్రతో దాడి చేశాడు. చివరకు 1519లో రాయలకు గజపతికి సంధి జరిగింది. కృష్ణానది వరకు తెలంగాణతో సహా రాయలు తిరిగి గజపతికి ఇచ్చాడు. ఆ సమయంలో ప్రతాపరుద్ర గజపతి చితాబ్‌ఖాన్‌ను తిరిగి ఖమ్మంమెట్టు, వరంగల్లు పాలకునిగా నియమించాడు.

1522లో కులీకుతుబ్‌షా బలవంతుడై చితాబ్‌ఖాన్ రాజ్యంపై దండెత్తి చితాబ్‌ఖాన్‌ను ఓడించి ఓరుగల్లు, ఖమ్మంమెట్టులను జయించాడు. తరువాత చితాబ్‌ఖాన్ గజపతి రాజ్యంలోకి వెళ్లి రాజమహేంద్రవరం వద్ద రాజపూడి దుర్గాధిపతిగా నియమింపబడినట్లు కనిపిస్తుంది. కిమ్మూరు కైఫీయత్తు మరొక కైఫీయత్తు చితాబ్‌ఖాన్ రాజపూడి దుర్గాలను పాలిస్తున్నట్లే తెలుపుతుంది. అద్దంకి గంగాధర కవి కూడా చితాబ్‌ఖాన్ రాజపూడి దుర్గాధిపతి అని, అతనిని ఇబ్రహీం కుతుబ్‌షా ఓడించాడని తెలుపుతున్నాయి. రాజమండ్రి దండపాదలో జరిగిన యుద్ధాలలోనే చితాబ్‌ఖాన్ మరణించి ఉంటాడు.

అయితే 1504 శాసనంలోని చితాబ్‌ఖాన్, ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నాటి చితాబ్‌ఖాన్ ఒకరేనా అనే సందేహం వస్తుంది. 1504 శాసనంలో చితాబ్‌ఖాన్‌కు నలుగురు కుమారులని, అందులో ఒకరు యుద్ధంలో వీరమరణం పొందారని తెలుపుతుంది. అప్పుడు అతని వయసు కనీసం 40 సంవత్సరాలు ఉండవచ్చును. ఆ కాలంలో చిన్నతనంలోనే వివాహం చేసుకొనేవారు. 20 సంవత్సరాలలో వివాహం చేసుకొని ఉండవచ్చును. వెంటనే కుమారులు కలిగి ఉండవచ్చును. ఆ కాలంలో రాజకుమారులు 15-16 సంవత్సరాలకే యుద్ధాలలో మరణించి ఉంటాడు. కనుక 1504 నాటి చితాబ్‌ఖాన్ వయసు 40 సంవత్సరాలైతే, 1573లో ఇబ్రహీం కుతుబ్‌షా రాజమహేంద్రవర దండపాదను జయించేటప్పుడు అతని వయసు 109 లేక 110 సంవత్సరాలు అవుతుంది. చితాబ్‌ఖాన్ 110 సంవత్సరాలు జీవించాడా అనే సందేహం వస్తుంది. కనుక కొందరు పండితులు వీరు వేర్వేరు వ్యక్తులు అని అభిప్రాయపడ్డారు. క్రీ.శ.1504 శాసనంలోని వ్యక్తి కృష్ణదేవరాయలు, ప్రతాపరుద్ర జగపతి కులీకుతుబ్‌షా సమకాలికుడని, గంగాధర కవి రాసిన తపతీసంవాదంలోని వ్యక్తి, కిమ్మూరు కైఫీయత్తులోని వ్యక్తి మరొక చితాబ్‌ఖాన్ అని భావించారు. అయితే 110 సంవత్సరాలు జీవించడం అసాధారణమే అయినా కొంద మంది అలా జీవించిన వారున్నారు. చోళ రాజమాత ఒకామె 100 సంవత్సరాలపైన జీవించింది. గోల్కొండ రాజ్యస్థాపకుడు అంటే చితాబ్‌ఖాన్ సమకాలికుడైన కులీకుతుబ్‌షా 98 సంవత్సరాలు జీవించాడు. అప్పుడు అతడు హత్యకు గురయ్యాడు. లేకపోతే మరెంత కాలం జీవించేవాడో తెలియదు. కనుక ఇద్దరు చితాబ్‌ఖాన్‌లు లేరు, ఒకరేనని నా అభిప్రాయం. అతడు ఖమ్మంమెట్టు రాజ్యాన్ని పోగొట్టుకున్న తరువాత గజపతులు అతనిని ఆదరించి రాజమహేంద్రవర దండపాదలోని రాజపూడి జాగీరు నిలిచి ఉంటారు. ఆ చిన్న జాగీరును అనుభవిస్తూ ప్రశాంతంగా సుదీర్ఘ కాలం జీవించి ఉంటాడు.

ఓరుగల్లు కోట: ఇప్పుడు వరంగల్లు అనే వ్యవహారంలో ఉన్న పట్టణం అసలు పేరు ఓరుగల్లు. ఓరుగల్లు ఏకశిలా నగరం, ఏకశిలాపురి,ర ఏకోపలా అనే పేర్లతో కూడా శాసనాలలో, కావ్యాలలో రాయబడింది. అది కాకతీయుల రాజధాని. దానికి ఆంధ్రనగరి అని కూడా పేరుంది. హనుమకొండ, మటేవాడ, ఓరుగల్లుకోట, ఉరుసు, కరీమాబాద్‌లు కలిపి వరంగల్ పట్టణంగా ఇప్పుడు పిలువబడుతుంది. ఇది హైదరాబాద్, బెజవాడ రైలు మార్గంలో హైదరాబాద్‌కు ఈశాన్యంగా సుమారు 130 కి.మీ. దూరంలో ఉంది.

ఈ పట్టణ నిర్మాణాన్ని గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. కాకతీయ వంశంలో 1115-1158 సంవత్సరాల మధ్య పాలించిన ప్రోలరాజు కాలంలో ధాన్యం తెచ్చే బండ్లు ఒక రాత్రి వేళ పడిపోయాయట మరురోజు బండ్లను లేవనెత్తటానికి కూలి వాళ్లు వెళ్లగా బండి పట్టాలు బంగారమై ఉన్నాయట. ఆ సమాచారం రాజుకు తెలియజేయగా ఆశ్చర్యపడి వచ్చి చూసి పండితుల సలహా ప్రకారం అక్కడ తవ్వించి చూశాడట. అక్కడ వారికి ఒక జ్యోతిర్లింగం కనిపించింది. ఆ లింగాన్ని హనుమకొండకు తీసుకురావడానికి ప్రయత్నించగా అది కదలలేదు. అక్కడనే ఆ లింగానికి ఆలయం కట్టించి దానికి ఏకశిలానగరం అని పేరు పెట్టాడట. మటెవాడ, రామన్నపేట, గిర్మాజీపేట, బాలానగరు, గోవిందునగరు అనే 5 గ్రామాలు ఒక కూటమిగా కలిపి ఓరుగల్లు కోట నిర్మించబడింది. ఓరుగల్లు సముద్ర మట్టానికి 1050 అడుగుల ఎత్తున కృష్ణా, గోదావరి నదుల మధ్య స్థలంలో ఒక పర్వత ప్రదేశం మీద ఉంది. ఈ కోట నిర్మాణాన్ని 1158-1196 సంవత్సరాల మధ్య పాలించిన రుద్రదేవుడు ప్రారంభించాడు. తరువాత దానిని గణపతి దేవుడు పూర్తి చేసి తన రాజధానిని అక్కడికి మార్చాడు. రుద్రమదేవి ఆ కోటను ఇంకా పటిష్టపరచింది. మధ్య యుగంలో అది శత్రుదుర్భేద్యమైన కోటగా రూపొందింది. ఓరుగల్లు చుట్టూ 7 కోటలు ఉండేవట. కంచుకోట, ఇటుకకోట, రాతికోట, పుట్టకోట, భూమికోట, కంపకోట, గవినికోట అని వాటికి పేర్లు ఉండేవట. కాని ప్రస్తుతం భూమికోట, రాతికోట అని రెండు కోటలు మాత్రమే కనిపిస్తున్నాయి లోపలి ప్రకారం రాతికోట, బహిఃప్రాకారం భూమికోట. మట్టితో కట్టబడిన భూమి కోట ఫిరంగి గుండు దెబ్బలకు కూడా చెక్కుచెదరనంతటి పటిష్టంగా నిర్మింపబడింది. పుట్టకోట హనుమకొండకు దక్షిణంగా జీర్ణావస్థలో కనిపిస్తుంది. రాతికోట వలయం సుమారు 12 కిలోమీటర్లు ఉండవచ్చును. దానికి నాలుగు దిక్కులలో నాలుగు సింహద్వారాలు నిర్మింపబడి ఉన్నాయి. తూర్పు, పశ్చిమ ద్వారాలు తెలిచి ఉండగా, ఉత్తర, దక్షిణ ద్వారాలు మూసి ఉన్నాయి. ప్రతి ద్వారమందున మూడు దారులు ఉన్నాయి. సింహద్వారం పాదంలో రాతి సింహం ఉంటుంది. ఈ ద్వారానికి రెండు వైపులా లోపలి భాగమందు 20 గజాల వరకు శిలలతో నిర్మించబడిన మెట్ల వరుస ఉంది. రాతిప్రాకారం వెంబడి ఎడం ఎడంగా 72 బురుజులు నిర్మింపబడి ఉన్నాయి. వీటి పైభాగాన విశాలంగా ఉంటుంది. లోపల మెట్లు ఉంటాయి. ఈ రాతి కోటకు ఉపయోగించిన శిలలు పెద్ద పెద్ద బండలు. వాటిని బాగా నునుపుచేసి ఒకదానిపై మరొకదానిని పేర్చారు. రాళ్లను అతికించడానికి సున్నం వాడారు. ఇది పూర్తిగా రాతి నిర్మాణం. కోట చుట్టూ అగాధమైన అగడ్త తవ్వబడింది.

ద్వారాల మీద స్తంభాల మీద శాసనాలు లిఖించబడి ఉన్నాయి. ఈ స్తంభాలలో రెండు నల్లరాతివి 35 అడుగుల ఎత్తు ఉన్నాయి. అవి కోట అంతర్భాగంలోని కాంచనిగూడ అనే ప్రదేశంలో ఉన్నాయి. వాటిలో ఒకటి మటేవాడలోని పటికవాని దొడ్డిలోను మరొకటి మటేవాడ ఓరుగల్లు మధ్య ఉన్న తాల్లవనంలోని బావి వద్ద ఉన్నాయి. అటువంటివే మరో రెండు, మూడు నల్లరాతి స్తంభాలు వరంగల్లులోని దక్షిణ కీర్తి స్తంభం వద్ద పడి ఉన్నాయట. ఈ విధంగా స్తంభాలు పాతడం, వాటిపై శాసనాలు లిఖించడం బౌద్ధ సాంప్రదాయం. హిందువులు, జైనులు కూడా అదే సాంప్రదాయాన్ని పాటించి స్తంభాలను పాతి శాసనాలను లిఖించారు. వరంగల్లు మధ్య భాగంలో 4 కీర్తి స్తంభాలు ప్రతిష్టించబడి ఉన్నాయి. వరంగల్లులోని 4 ద్వారాలు ప్రతాపరుద్రుని రాజప్రాసాదానికి మార్గాలని అక్కడి వారు చెబుతారు. కోట తూర్పు ద్వార సమీపంలో ఉన్న శిలాఖండాన్ని ఆనుకొని ఒక పెద్ద తటాకం ఉంది. ఆ శిలాఖండ శిఖరాన అష్టకోణాకృతి గల బురుజు నిర్మింపబడింది.

విజయనగర సామంత రాజ్యాలు

విజయనగర చరిత్రలో అత్యంత ప్రాధాన్యం వహించినవి వారి సామంత రాజ్యాలైన నాయక రాజ్యాలు. అవి రాజకీయంగా సాంస్కృతికంగా దక్షిణ దేశ చరిత్రలో ప్రముఖ పాత్ర నిర్వహించాయి. విజయనగర ప్రభువులు పరిపాలనా సౌలభ్యం కోసం తమ సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. వాటిని పాలించడానికి రాష్ట్ర పాలకులను నియమించారు. వారికి నాయకులని పేరు. నాయకులు విజయనగర సామ్రాట్టులకు సామంతులైనప్పటికీ వారు తమ తమ ప్రాంతాలలో దాదాపు సర్వస్వతంత్రులుగా వ్యవహరించారు. వారు పాలించిన రాజ్యాలకు నాయక రాజ్యాలని పేరు.

గండికోట పెమ్మసాని వంశం: విజయనగర సామ్రాజ్యంలో అనేక సామంత వంశాలు ప్రఖ్యాతి వహించాయి. వారిలో పెమ్మసాని కుటుంబం ఒకటి. పెమ్మసానివారు కమ్మ కులస్తులు. ముసళ్ల గోత్రీకులు. వీరి చరిత్ర తెలుసుకోవటానికి తాడిపర్తి, గండికోట కైఫీయత్తులు, కొన్ని చాటుపద్యాలు, కొన్ని శాసనాలు ఉపయోగపడుతున్నాయి. వాటిలో కూడా వారి వంశచరిత్రకు సంబంధించిన సమాచారం చాలా పరిమితంగా ఉంది. తాడిపర్తి కైఫీయత్తు గండికోటను పాలించిన పెమ్మసాని వంశస్తుల పేర్లను తెలుపుతోంది. చాటుపద్యాలు మాత్రం ఈ కుటుంబంలో ప్రఖ్యాతి వహించిన కొద్ది మంది పేర్లు పేర్కొంటున్నాయి. పెమ్మసాని రాజుల కాలం నాటి కవులెవరూ వారిని గురించి రాయలేదు. శాసనాలలో ఆ కుటుంబానికి చెందిన రాజుల చరిత్ర చాలా కొద్దిగా మాత్రమే లిఖించబడింది. అందువల్ల పెమ్మసాని వంశ చరిత్రను గురించి కొద్దిగా మాత్రమే తెలుస్తోంది. తాడిపత్రి కైఫీయత్తులో పెమ్మసాని తిమ్మానాయుడు రామలింగనాయుడు, యారా తిమ్మనాయుడు, చిన తిమ్మనాయుడు, నరసింహనాయుడుల పేర్లు పేర్కొన బడ్డాయి. కాని వారి మధ్య ఉన్న సంబంధాలు తెలియదు. గండికోట కైఫీయత్తులో ఈ వంశానికి చెందిన చివరివాడైన తిమ్మానాయుడును గూర్చి చాలా వివరంగా రాయబడింది. ఈ కైఫీయత్తులో వారి మధ్య సంబంధాలను తెలపకపోయినప్పటికీ శాసనాలు రామలింగనాయుడు, యారా తిమ్మనాయుడు, చిన్న తిమ్మనాయుడు ముగ్గురూ అన్నదమ్ములని, వారి తండ్రి పేరు తిమ్మానాయుడని, తల్లి పేరు మాచమ్మ అని తెలుపుతున్నాయి. వీరి తండ్రి తిమ్మనాయుడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు. రామలింగ నాయుడు, యారా తిమ్మానాయుడు ఇద్దరూ రామరాయలు, సదాశివరాయలకు సమకాలికులు. చిన తిమ్మానాయుడు రెండవ వెంకటపతిరాయల సమకాలికుడు. చిట్టచివరి తిమ్మానాయుడు మూడవ శ్రీరంగరాయల సమకాలికుడు. ఈ వంశం తుళువ వంశం. అరవీటి వంశాలకు సమకాలికంగా సుమారు 200 సంవత్సరాలు విజయనగర రాజులకు సామంతులుగా పాలించారు. వీరు ఆదివీర అనే బిరుదు ధరించారు.

పెమ్మసాని వంశం వారి పుట్టుపూర్వోత్తరాలు: పెమ్మసాని వంశస్తుల పుట్టుపూర్వోత్తరాల గురించి స్పష్టంగా తెలియదు. అలాగే ఈ వంశరాజ్య ప్రారంభ కాలాన్ని గురించి కూడా రెండు అభిప్రాయాలున్నాయి. ఈ వంశం శ్రీకృష్ణదేవరాయల కాలంలో ప్రారంభమైందని ఒక అభిప్రాయం ఉంది. ప్రౌఢ దేవరాయల కాలంలోనే ప్రారంభమైందని మరొక అభిప్రాయం ఉంది. తాడిపత్రి కైఫీయత్తు ఈ వంశానికి మూల పురుషుడు పెమ్మసాని తిమ్మానాయకుడని అతడు కృష్ణరాయల వద్ద పావురాళ్లను పెంచే ఉద్యోగిగా జీవితాన్ని ప్రారంభించాడని, కృష్ణరాయలు అతని సేవలకు మెచ్చి పెనుగొండ రాజ్యంలోని యాదంకి సీమకు పాలెగాడుగా నియమించాడని, అతడు గండికోటను నిర్మించి దానిని తన రాజధానిగా చేసుకున్నాడని తెలుపుతోంది. కాని యాదంకి కైఫీయత్తు పెమ్మసాని వారి రాజ్యం ప్రౌఢ దేవరాయల కాలంలోనే ప్రారంభమైందని వివరిస్తోంది. ఈ కైఫీయత్తు కూడా వంశానికి మూలపురుషుడు తిమ్మానాయకుడేనని తెలుపుతోంది. ఈ వంశంలోని వారిలో చాలా మంది పేర్లు తిమ్మానాయకుడే. బహుశా వారందరూ మూలపురుషుడైన తిమ్మానాయకుని పేరునే తమ సంతతి వారికి పెట్టుకొని ఉంటారు. అందువల్ల ఈ వంశంలో అనేక మందికి ఆ పేరు ఉంది. తిమ్మానాయకునికి వీరతిమ్మా నాయకుడనే కుమారుడు ఉన్నట్లు స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. పెరుసోముల కైఫీయత్తు చెన్న విభువని మరొక రాజును పేర్కొంటోంది. ఇతడు సాళువ నరసింహరాయలు, తుళువ నరసనాయకునికి సమకాలికుడు. ఇతని కుమారుడు పెమ్మసాని రాయలింగనాయకుడు. అతడు కృష్ణదేవరాయల సమకాలికుడు. తాడిపత్రి కైఫీయత్తు చెప్పినట్టు కృష్ణదేవరాయల సమకాలికుడు పేరు తిమ్మానాయకుడు కాదు. శ్రీకృష్ణరాయల కంటే ముందే ఉన్న పెమ్మసాని వారి

పేర్లు స్థానిక కైఫీయత్తుల ద్వారా తెలుస్తున్నాయి. కనుక పెమ్మసాని వంశం ప్రౌఢదేవరాయల కాలంలోనే ప్రారంభమైందని స్పష్టంగా చెప్పవచ్చు. కనుక ఈ వంశం రెండవ దేవరాయల కాలంలోనే ప్రఖ్యాతిలోకి వచ్చింది

మూల పురుషుడు - తిమ్మానాయకుడు: ఈ వంశస్తుల పూర్వనామం ఆలంవారు. వారు మొదట సామాన్య రైతులు. ఈ వంశానికి మూలపురుషుడు మొదటి తిమ్మానాయకుడు. అతని తండ్రి ఆలం వెంకటపతి నాయుడు తల్లి వెంకటమ్మ. తిమ్మానాయుడు జన్మించిన తర్వాత అతని తల్లిదండ్రులు మరణించి దిక్కులేనివాడయ్యాడు. అందువల్ల అతనిని పెమ్మసాని అనే బోనకత్తె పెంచిందట. అందువల్ల అతనికి పెంపుడు తల్లి పేరుతో పెమ్మసాని తిమ్మానాయకుడు అని పేరు వచ్చిందట. అతడు పావురెళ్లు వద్ద నివసించాడు. అందువల్ల అతనికి పావురేళ్ల తిమ్మానాయకుడని కూడా పేరుందని స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. ఇతడు రెండవ దేవరాయల సమకాలికుడు. పెరిగి పెద్దవాడైన తర్వాత అతడు ప్రౌఢ దేవరాయలను దర్శించి రాచకొలువు సంపాదించాడు రాయలు అతనిని యాడంకి పరగణాకు పాలెగాడుగా నియమించాడు. అతడు యాడంకిలో ఒక కోటను నిర్మించాడు. కోటను నిర్మించేటప్పుడు పునాదులు తవ్వేటప్పుడు గణపతి, వీరభద్ర విగ్రహాలు లభించాయట ఆ విగ్రహాలను ప్రతిష్టించి దేవాలయాలు నిర్మించాడు. వాటితోపాటు మరొక ఆంజనేయ దేవాలయాన్ని కూడా నిర్మించాడని యాడంకి కైఫీయత్తు తెలుపుతోంది. అప్పటి నుండి తిమ్మానాయుడు అనేక యుద్ధాలలో పాల్గొని తన శౌర్యప్రతాపాలను చూపి ప్రౌఢదేవరాయల అభిమానానికి పాత్రుడయ్యాడు. అందువల్ల రాయలు అతనికి గండికోటను కూడా ఇచ్చాడు.

విజయనగర రాజ్యంలో గండికోట ప్రసిద్ధి చెందిన దుర్గం. అక్కడ అంతకు పూర్వం జిల్లెళ్ల చలపతి రాజు అనే అతడు ఒక దుర్గ నిర్మాణం ప్రారంభించాడు. కాని అది పూర్తిగాకముందే అతడు మరణించాడు. కోట అసంపూర్ణంగా మిగిలి ఉంది. తిమ్మానాయకుడు గండికోట తన అధీనంలోకి రాగానే అసంపూర్ణంగా ఉన్న దుర్గాన్ని పూర్తిగా పునర్నిర్మాణం చేసి బలిష్టమైన దుర్గంగా తీర్చిదిద్దాడు. క్రీ.శ.1422లో రెండవ దేవరాయలు బహమనీ రాజ్యంపై దండెత్తి అహమ్మద్‌షా ఆధిపత్యంలో ఉన్న కల్బుర్గు దుర్గంపై దండెత్తినప్పుడు పెమ్మసాని తిమ్మానాయకుడు 8000 సైన్యంతో గండికోట నుంచి బయలుదేరి రాయల సైన్యంతో చేరాడని గుమ్మనాయక పాలెగాళ్ల చరిత్ర తెలుపుతోంది. తర్వాత గుత్తి, తాడిపత్రి దుర్గాలు కూడా తిమ్మానాయకునికి ఇవ్వబడ్డాయి. కనుక గుత్తి, తాడిపత్రి గండికోట సీమలకు రాయల సామంతుడుగా పాలించాడు. రాజ్యం బలపడిన తర్వాత అతడు తన తల్లి వెంకటమ్మ పేరుతో వెంకటాపురం అనే గ్రామాన్ని నిర్మించాడు. అక్కడ ఒక బావిని కూడా తవ్వించాడు. తర్వాత చక్రాపురం అనే మరొక గ్రామాన్ని కూడా నిర్మించాడు. మహాభాష్యం మహదేవభట్టు అనే పండితుని కుమారుడు చెన్నమరాజు ఇతని మంత్రి. పెమ్మసాని వారి రాజ్యం క్రమేపీ అభివృద్ధి చెందింది. అనంతపురం, నెల్లూరు జిల్లాల్లోని మరికొన్ని ప్రాంతాలు కూడా గండికోట రాజ్యంలో చేర్చబడ్డాయి. ఈ రాజ్యానికి సాలుకు 25 లక్షల హొన్నులు ఆదాయంగా వచ్చేది. అందులో 9 లక్షలు రాయలకు కప్పంగా చెల్లించేవారు. వీరివద్ద 25 వేల కాల్బలం, 15 వేల అశ్వదళం, 40 ఏనుగులుండేవి. వారు సొంత నాణేలను అంటే మాడలు, రస్యాలు, రూకలు, హొన్నులను ముద్రించారు. ఈ నాణేల మీద ఒకవైపు వారి ఇలవేల్పు వీరభద్రుని పేరు నాగరి లిపిలో రాయించారు. మరొకవైపున వెంకటరమణ బొమ్మను ముద్రించారని స్థానిక చరిత్రలు తెలుపుతున్నాయి. పెమ్మసాని వారు విజయనగరం దర్శించినప్పుడు విడిది చేయడానికి 1240 కుంటల వైశాల్యం గల భూమి ఉండేదని, అందులో భవనం నిర్మించారని విజయనగర సామ్రాజ్యం అనే ప్రాచీన కడితెలో రాయబడి ఉంది. క్రీ.శ.1454లో తిమ్మానాయకుడు కోడూరు అనే గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడని కోడూరు కైఫీయత్తు తెలుపుతోంది.

వీరతిమ్మానాయకుడు: తిమ్మానాయకునికి వీరతిమ్మానాయకుడని పేరు కలిగిన కుమారుడున్నాడని స్థానిక చరిత్ర తెలుపుతోంది. తాడిపత్రి చరిత్ర తిమ్మానాయకునికి రామలింగ నాయకుడను కుమారుడున్నట్లు తెలియజేస్తోంది. కాని చాటుపద్యాలు రామలింగనాయకుని తండ్రి చెన్నవిభుడు అని తెలుపుతున్నాయి. వీరిద్దరి సంబంధాలు సరిగా తెలియదు. వీరతిమ్మానాయకుని తర్వాత శ్రీకృష్ణదేవరాయల వరకు ఈ వంశస్తుల చరిత్ర స్పష్టంగా తెలియటం లేదు. వీరతిమ్మానాయకుడు రెండవ దేవరాయలు లేక ప్రౌఢదేవరాయల కుమారుడైన మల్లికార్జునరాయల సమకాలికుడు. ఇతడు క్రీ.శ.1465లో ఇమ్మూరి మృత్యుంజయశాస్త్రి అనే పండితునికి గొందెపల్లె అనే గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ఇతని కాలంలో మల్లెల అనే గ్రామంలోని మాదిగలు దారి దోపిడీలు చేసి జర్రపల్లె అనే గ్రామంలో హంసాకార్యాలు చేశారట. వీరతిమ్మానాయకుడు వారినందరినీ పట్టి

వధించి రాజ్యంలో ప్రజలకు రక్షణ కల్పించాడట. అంతకు మినహా వీరతిమ్మానాయకుని గురించి మనకు ఎక్కువగా తెలియదు.

చెన్నవిభుడు: వీరతిమ్మానాయకునికి చెన్నవిభుడు అనే కుమారుడున్నట్లు చాటుపద్యాల వల్ల తెలుస్తోంది. చెన్నవిభుడు కరమతి వీరాచిత్తుడు మొదలైన కొందరికి మాన్యాలిచ్చాడని పెరుసోముల గ్రామ కైఫీయత్తు తెలుపుతోంది. ఇతడు సాళువ నరసింహ, తుళువ నరసనాయక, వీరనరసింహ రాయల సమకాలికుడు కావచ్చు. చెన్నవిభునికి రామలింగనాయకుడు, పెదతిమ్మానాయకుడు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో అతని తర్వాత రామలింగనాయకుడు గండికోట రాజ్యాధిపతి అయ్యాడు. ఇతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు. అతడు రాజ్యానికి వచ్చేనాటికి చిన్నవాడు. 20 సంవత్సరాల యువకుడు. అప్పటికే శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సింహాసనంపై రాజ్యం చేస్తున్నాడు.

పెమ్మసాని రామలింగనాయకుడు: రామలింగ నృపాలుడు శ్రీకృష్ణదేవరాయల వద్ద 80 వేల సైన్యానికి అధిపతి అయి ఉన్నట్లు భారతి శుక్ల సంపటం 624 పేజీలో ప్రకటించబడింది. కల్బర్గను రాజధానిగా పాలించిన యేదల్‌ఖాన్‌తో కృష్ణరాయలకు యుద్ధం వచ్చింది. ఆ యుద్ధంలో అహమ్మద్‌నగర్ నిజాంషాహి, గోల్కొండ నవాబైన కుతుబ్ ఉల్ ముల్క్ యేదుల్‌ఖాన్‌కు సహాయంగా వచ్చారు. రాయలు అమరనాయకులందరూ మన్నీరులను పిలిపించి యుద్ధ సమావేశం జరిపారు. ఈ సమావేశంలో పెమ్మసాని రామలింగనాయకుడు కూడా పాల్గొన్నాడు. అతడు సుల్తాన్‌లతో యుద్ధం చేసే అవకాశం తనకు ఇవ్వమని కోరాడు. అపుడు కృష్ణరాయలు అతనికి తాంబూలం ఇచ్చాడు. పెమ్మసాని రామలింగడు విజయనగర సైన్యాలకు నాయకత్వం వహించి సుల్తాన్‌ల సైన్యాలపై దాడి చేశాడు. రామలింగనాయకుడు కొదమసింగం వలె తన పదివేల కమ్మ సైన్యంతో యుద్ధ భూమిలోకి దూకి తురుష్కుల దేరీజుత్రాళ్లను తెగగొట్టి ముగ్గురు వజీర్లను వధించి, అనేక ముస్లిం సైనికులను సంహరించి రాయలకు విజయం చేకూరేటట్లు చేశాడని కృష్ణరాయ విజయం అనే గ్రంథం వర్ణిస్తోంది. కృష్ణదేవరాయలు స్వయంగా ఏనుగునెక్కి యుద్ధభూమికి వచ్చి పర్యవేక్షణ జరిపాడు. రామలింగనాయకుడు సుల్తాన్‌ల సైన్యాలను చిత్తుగా ఓడించి తరిమివేశాడు. సుల్తాన్‌ల సేనాధిపతులు తమ దుస్తులు మార్చుకొని ఎవరూ గుర్తించకుండా చేసుకొని పారిపోయారు. వారు వదలివేసిన ఆయుధాలు, మందుగుండు సామాన్లురాయల వశమయ్యాయి. ఈ విజయం సాధించినందుకు రామలింగనాయకుడికి కృష్ణదేవరాయలు బంగారు వస్త్రాలను బహూకరించి ఘనంగా సన్మానించి గౌరవించాడు. అదేవిధంగా 10 వేల కమ్మ యోధులతో మరొక విజయం సాధించాడు. జూటూరు, పెదకల్లు, బేతంచర్లలో జరిగిన యుద్ధంలో చింతలగుంట రఘుపతిరాజు, సలకం తిమ్మరాజు, సహజయ్యాఖాన్ అనే శత్రువులను జయించి బేతంచర్ల కోటను నేలమట్టం కావించాడని చాటుపద్యాల వల్ల తెలుస్తోంది. కాని ఈ యుద్ధం ఏ సందర్భంలో జరిగిందీ తెలియదు. రామలింగనాయుడు యాదంకి సీమను అభివృద్ధి చేశాడు. పక్కన ఉన్న తాళ్లపల్లెకు తాడిపత్రి అనే పేరు పెట్టి అక్కడ ఒక కోటను నిర్మించాడు. అతడు అక్కడే ఎక్కువ కాలం నివసించాడు. రామలింగ నాయకుడు తాడిపత్రిలో తన పేరుతో రామలింగేశ్వరాలయాన్ని నిర్మించాడు. దాని పక్కన ఒక పూదోటను కూడా వేయించాడు. తాడిపత్రి పట్టణాన్ని బాగా అభివృద్ధి చేశాడు. తన పేరుతో రామలింగనాయక పల్లె అనే గ్రామాన్ని కూడా కట్టించాడు. ఇది తాడిపత్రికి 12 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎర్రమలకొండ బుగ్గవద్ద ఓబులేశ్వరాలయాన్ని కూడా నిర్మించాడు. నిట్టూరులో కొంత భూమిని దానం చేశాడు. బొడియమ్మ ఊరులో శావర్యతిమ్మన్న, నరసప్ప అనే బ్రాహ్మణులకు భూదానం చేశాడు. ఇతనికి రాజగోపాలమ్మ, గోవిందమ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాజగోపాలమ్మ రామలింగనాయనిపల్లెలో గోపాలస్వామి ఆలయాన్ని నిర్మించి దానికి 8 తూముల భూమిని దానం చేసింది. గోవిందమ్మ వత్రకేతయపల్లె అనే గ్రామాన్ని నిర్మించి అందులో ఆంజనేయస్వామి దేవాలయాన్ని కట్టించి అక్కడ ఒక చెరువును నిర్మించింది. వత్రకేతయ అనే పేరు గల వ్యక్తిని ఆ గ్రామపాలనకు నియమించిందట. అందువల్ల దానికి ఆ పేరు వచ్చింది. రామలింగ నృపతి శ్రీకృష్ణదేవరాయల తర్వాత కూడా జీవించాడు. అతడు క్రీ.శ.1560 వరకు జీవించినట్లు తెలుస్తోంది.

రామలింగనాయుడు కాలం నాటి రెండు శాసనాలు లభించాయి. అందులో ఒకటి తాళ్లపొద్దుటూరు వద్ద ఉంది. ఆ గ్రామం రామలింగనాయకునికి నాయంకరంగా ఇవ్వబడింది. అతడు అక్కడి రైతులతో ఒక ఖరారునామా చేసుకొని భూములను వ్యవసాయం చేయడానికి ఇచ్చాడు. రెండవ శాసనం తాడిపర్తి శాసనంలోని నిట్టూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా ఉన్న బల్లపై చెక్కబడింది. జక్కంముడి పెద్దినాయని

కుమారుడు నిట్టూరి చెన్నకేశవ ఆలయానికి చీరబాడిసీమలో ఒక గ్రామాన్ని దానం చేశాడు. తాను వల్లూ గోత్రీకుడనని తనకు ఆ గ్రామాన్ని రామలింగనాయనింగారు ఇచ్చారని, దానిని రామలింగనాయనింగార్లకు రామరాజ తిరుమలరాజయ్య దేవమహరాజు నాయంకరంగా ఇచ్చాడని, ఆ శాసనంలో వివరించాడు. ఆ శాసనంలో మరి రెండు దానాలను కూడా పేర్కొన్నారు. అవి అక్కడ భాగవత సేవ చేసే వారికి, మంత్రపుష్పం చదివే వారికి ఇవ్వబడ్డాయి.

పెమ్మసాని పెద తిమ్మానాయకుడు: రామలింగనాయకుని తర్వాత పెమ్మసాని పెదతిమ్మానాయకుడు రాజ్యానికి వచ్చాడు. ఇతడు రామలింగన్నృపతి కుమారుడని తాడిపత్రి కైఫీయత్తు తెలుపుతోంది. సోదరుడని చాటువులు తెలుపుతున్నాయి. ఇతడు అచ్యుతరాయల కాలానికి చెందినవాడు. ఇతని కాలంలో జరిగిన ఒక యుద్ధంలో అతడు దస్తూరికాన్ అనే వ్యక్తిని సంహరించినట్టు ఒక చాటువు వర్ణిస్తోంది. ఇతనికి నారసింహనాయకుడు, బలిచిన్న నాయకుడు, చినతిమ్మానాయకుడు అనే ముగ్గురు కుమారులున్నారు. ఇతడు తాడిపత్రిలో చింతలరామస్వామి దేవాలయాన్ని నిర్మించి దానికి అన్ని హంగులు ఏర్పాటు చేశాడు. గర్భగృహం సుకనాసిక, సూదిరె మధ్యన రంగమంటపం, ఆస్థానమంటపం, అంతరాళం గోపారం, స్థూపిక వచనాలయం యాగశాల, కళ్యాణమండపం, ఆళ్వారుల గరుడమంటపం, శయనశాల, హనుమాన్ మండపం, వరాహ మండపం, శ్రీ భాగవత, రామాయణాలలోని పుణ్యపురుషుల విగ్రహాలను, అష్టదిక్పాలుర విగ్రహాలను, శిల్పాలను చెక్కించాడు. గోపురం, ప్రాకారాలను నిర్మించి ఒక కోనేరును తవ్వించాడు. దేవునికి అన్ని ఉత్సవాలు జరిగేటట్టు ఏర్పాటు చేశాడని తాడిపత్రి కైఫీయత్తు తెలుపుతోంది. శక 1431లో తిమ్మానాయకుడు పులిమళ్ల గ్రామంలోని దేవాలయానికి గోపురం ప్రాకారాన్ని నిర్మించి మూడు గ్రామాలను దానం చేశాడు. ఇంకా పెద్దదుద్దెల, చినదుద్దెల గ్రామాలలో అక్కడ ఉన్న దేవాలయాలకు మూడు వంతుల భూమిని దానం చేసి అన్ని దేవతా ఉత్సవాలు జరిగేటట్టు ఏర్పాటు చేశాడు. తాడిపత్రి పాలనకు తన బంధువైన ఉద్దండనాయుని నియమించి తాను గండిలో ఉండేవాడు. ఉద్దండనాయుడు తన తల్లి పేర మదవంక పొలాన్ని ఇచ్చి దానికి గద్దకాల్వను తవ్వించాడు. దానికి తిమ్మానాయుని కాల్వ అని పేరు పెట్టారు. తిమ్మానాయకుని కాలంలో మాగాణి భూముల సాగు పెంచబడింది. తాడిపత్రిలోని ఏటి ఆవల పక్క నాలుగు కపిల బావులు తవ్వించబడ్డాయి. తాడిపత్రికి 3 కిలో మీటర్లలో చల్లావారిపల్లె అనే గ్రామం కూడా తిమ్మానాయుని కాలంలో నిర్మింపబడింది. ఆ గ్రామంలో ఇప్పుడు కూడా చల్లావారనే కమ్మవారున్నారు. ఏనుగుల చెన్నానాయకుడనే మరొక బంధువు క్రీ.శ.1530లో గాండ్లపాడు అనే గ్రామాన్ని కట్టించి అక్కడ ఒక చెన్నారాయణస్వామి దేవాలయాన్ని నిర్మించాడు. దారుమంటపం నిర్మించాడు. ఈ దేవాలయం చెన్నపిఛాని కాలంలో మొదట నిర్మించినట్లుగా ఉంది. అందులో ఇతడు దారుమంటపాన్ని నిర్మించాడు. వజ్రగిరి కొండపై నృసింహ దేవాలయాన్ని నిర్మించాడు. తాడిపత్రికి 8 కిలోమీటర్ల దూరంలో ఒక గ్రామాన్ని, ఒక చెరువును నిర్మించాడు. కాని ఆ చెరువులో నీళ్లు నిలవలేదట. అందువల్ల దానికి ఓడు తిమ్మానాయకుని చెరువు అని పేరు వచ్చింది. ఈ తిమ్మానాయకునికి శాయమ్మ అనే సోదరి ఉంది. ఆమె సాయపనేని వెంకటపతిని వివాహమాడింది. మిక్కిలినేని నలచెన్నానాయుడనే మరొక బంధువు నిర్మించిన గ్రామంలో ఆమె ఒక చెరువును తవ్వించింది. ఆ చెరువులో జమ్ము విస్తారంగా పెరిగిందట. అందువల్ల ఆ గ్రామానికి జంబులపాడు అనే పేరు వచ్చిందట పెద తిమ్మానాయకునికి అక్కభూపాలుడు అనే మరొక పేరు కూడా ఉంది. ఇతని కాలంలో తాడిపత్రి గుత్తి రాజ్యంలో భాగంగా ఉండేది. గుత్తిరాజ్యం సాళువ తిమ్మయ్య గోవిందయ్యల నాయంకరం కింద ఉన్నట్లు శాలి 1427-1435 సంవత్సరాల మధ్య వేయబడిన తాడిపత్రి శాసనాలు తెలుపుతున్నాయి. వీరనరసింహరాయలు, కృష్ణరాయలు, అచ్యుతరాయలు ముగ్గురికాలంలో ఆ శాసనాలు అమలులో ఉన్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ తాడిపత్రిలో పెదతిమ్మానాయుడు అనేక నిర్మాణాలు చేశాడు. ఇతని తర్వాత ఇతని కుమారులు రాజ్యభారం వహించారు. వారిలో పెద్దకుమారుడు పెమ్మసాని బలచిన్నానాయకుడు. మస్తఖాన్ అనే ముస్లిం సేనాని హతమార్చాడని తెలుస్తోంది. ఇతడు యుద్ధంలో చనిపోయాడని భావించారు. అతని గురించి ఎక్కువగా తెలియదు. తర్వాత అతని తమ్ముడు చిన తిమ్మానాయకుడు గండికోటాధ్యక్షుడయ్యాడు.

పెమ్మసాని యారతిమ్మానాయకుడు: ఇతనికి చిన్నతిమ్మానాయకుడనే పేరు ఉంది. పెమ్మసాని వారిలో ఇతడు అగ్రగణ్యుడు. ఇతనికి హత్తుమువ్వర గండ, వాడిచేకండ, గండికోట దుర్గాధ్యక్ష, గండరగండ, గరుడ నారాయణాంక విహార, శాత్రవ మదవిఫాల, హన్నిబ్బరగండ, చేపట్టుగండర, సూర్యభద్ర బ్రహ్మ, గండరాతిష్ఠ

మన్నెమార్తాండ అనే బిరుదులు ఉన్నాయి. ఇతని తల్లి మాచమమ్మ అని కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ఇతడు అచ్యుతదేవరాయలు, రామరాయల సమకాలికుడు. అచ్యుతదేవరాయల మరణానంతరం సలకం చిన్నతిమ్మయ్యకు రామరాయలకు జరిగిన అంతర్యుద్ధంలో చినతిమ్మానాయకుడు రామరాయల పక్షం వహించి పెమ్మసాని వంశం ప్రఖ్యాతిలోకి వచ్చేటట్లు చేశాడు.

సకలం తిమ్మయ్య రామరాయల సంఘర్షణ: తొలి సంఘర్షణలో సకలం తిమ్మయ్య రామరాయలను తరిమి వేశాడు. అచ్యుతదేవరాయల కుమారులు వెంకటాద్రిని సంహరించి సకలరాజు తిరుమల సామ్రాజ్యానికి సర్వాధికారి అయ్యాడు. ఇతనిని సకలం తిమ్మయ్య అని కూడా పిలుస్తారు. సకలరాజు తిరుమల తాను సర్వాధికారి అయినప్పటికీ సామంతులు తమపై తిరుగుబాటు చేస్తారని భయపడ్డాడు. అతడు భయపడినట్లే అతని చర్యలను సమర్థించని కొంత మంది సామంతరాజులు బీజాపూర్ సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్ షాను ఆహ్వానించారు. మరికొందరు రామరాయలను ఆహ్వానించారు. రామరాయలు ఆ కాలంలో గుత్తిలో నివసిస్తూ ఉండేవాడు. అతడు గుత్తికొండ బయలుదేరి పెనుగొండను ఆక్రమించాడు. పెనుగొండను ఆక్రమించినట్లు ఆనాటి శాసనాలు కూడా తెలుపుతున్నాయి. పెనుగొండలో ఉండి అతడు విజయనగర సామంతరాజులందరికీ ఆహ్వానాలు పంపి తనకు సహాయం చేయమని అర్థించాడు. సకలరాజు తిరుమలను వ్యతిరేకించే సామంతులందరూ పెనుగొండ చేరారు. గండికోట పాలకుడైన పెమ్మసాని యారతిమ్మనాయుడు కూడా పెనుగొండ చేరి తాను రామరాయలను సమర్థిస్తానని ప్రకటించాడు. తర్వాత రామరాయలు గండికోట వచ్చి యారతిమ్మనాయుని సహాయంతో సైన్యాలను సమీకరించాడు. ఈ వార్త తెలిసిన సకలరాజు తిరుమల ప్రమాదం ముంచుకొస్తోందని గ్రహించి సైన్యంతో బయలుదేరి గండికోటను ముట్టడించాడు. రామరాజును తనకప్పగించమని యారతిమ్మనాయుడిని ఆజ్ఞాపించాడు. యారతిమ్మ నాయుడు అతని ఆజ్ఞను తిరస్కరించి సకలరాజుతో యుద్ధానికి దిగాడు. గండికోట రాజ్యానికి పరిసరాలలో ఉన్న పాలెగాండ్ర సహాయంతో తాడిపత్రికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొమలి అనే చోట సకల రాజును ఓడించాడు. ప్రాణభయంతో సకలరాజు యుద్ధ భూమి నుండి వెళ్లిపోయాడు.

రామరాయల విజయం: కొమలి విజయం తర్వాత రామరాయలు కందనవోలును ఆక్రమించాడు. అక్కడికి సమీపంలోని జూటూరు, బేతంచర్లలో సకలరాజు సైన్యాలున్నాయి. వారిపై దాడి చేయటానికి బయలుదేరి మార్గమధ్యంలోని అవుకును జయించాడు. అవుకును తన రాజధానిగా చేసుకొని రామరాయలు యారతిమ్మనాయని సహకారంతో జూటూరు, బేతంచర్లపై దండెత్తాడు. ఈ యుద్ధంలో యారతిమ్మనాయని సోదరుడైన చినతిమ్మనాయుడు పాల్గొని అనేక విజయాలను సాధించాడు: అతడు బేతంచర్ల పాలకుడైన చింతగుంట రఘుపతిని ఓడించి బేతంచర్ల కోటను ధ్వంసం చేశాడు. తర్వాత రామరాయల సైన్యాలు జూటూరుపై దండెత్తాయి. అక్కడ సకలరాజు తిరుమల స్వయంగా తన సైన్యాలకు నాయకత్వం వహించి ఎదిరించాడు. ఈ యుద్ధంలో తాడిపత్రిలో నివసించే యారతిమ్మనాయకుని పెద్ద సోదరుడు రామలింగ నాయుడు కూడా పాల్గొన్నాడు. రామలింగనాయుడు చినతిమ్మనాయుడు జూటూరుపై దండెత్తి సకలరాజు తిరుమలను పూర్తిగా ఓడించారు. అతడు ఓడిపోయి బేదగల్లు చేరాడు. రామరాయలు పెమ్మసాని సోదరులతో కలిసి సకలరాజును తరుముతూ వెళ్లి బేడకల్లును ముట్టడించారు. పెమ్మసాని సోదరులు అక్కడ కూడా విజయం సాధించి సకలరాజును తరిమి బేడకల్లును ఆక్రమించారు. తర్వాత రామరాయలు ఆదవాని కోటను ముట్టడించాడు. ఆ కోటను సంజార్‌ఖాన్ అనే ముస్లిం సరదారుడు సకలరాజు తిరుమల తరపున పాలించే వాడు. అతడు గొప్ప యుద్ధవీరుడు. అతడు రామరాయల సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. చిన తిమ్మనాయుడు రామరాయల సైన్యానికి నాయకత్వం వహించి వీరోచితంగా పోరాడి సంజార్‌ఖాన్‌ను ఓడించి ఆదవాని దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఆదవాని రామరాయలకు తాత్కాలిక రాజధాని అయింది. అతడు అక్కడ కొన్నాళ్లుండి సైన్య సమీకరణ చేసుకున్నాడు. గద్వాల్, కర్నూల్ మొదలైన ప్రాంతాల నుండి పాలెగాండ్రు అతనికి సహాయంగా వచ్చారు. వారందరి సహాయంతో పెద్ద సైన్యాన్ని తయారు చేసుకొని క్రీ.శ.1543వ సంవత్సరంలో విజయనగరంపై దండెత్తాడు.

విజయనగర ఆక్రమణ-సకలరాజు తిరుమల మరణం: రామరాయల సైన్యం విజయనగరం చేరగానే సకలరాజు తిరుమల ఇబ్రహీం ఆదిల్‌షా సహాయం కోరాడు. అతనికి రోజుకు 3 లక్షల హొన్నులు కప్పం చెల్లిస్తూ అతని సామంతునిగా ఉంటానని కూడా తెలియజేశాడు. దాంతో ఇబ్రహీం ఆదిల్‌షా తన సైన్యాలతో బయలుదేరి విజయనగరం చేరాడు. సకలం తిరుమల ఇబ్రహీం ఆదిల్‌షాను ఆహ్వానించి తోడ్కొని వెళ్లి సింహాసనంపై

కూర్చోబెట్టి ఉత్సవం జరిపాడు. అది చూసి చాలా మంది విజయనగర సేనాధిపతులు, సామంతులు భరించలేకపోయారు. వారు సకలరాజు తిరుమలను కలిసి సుల్తాన్‌ను విజయనగరం నుండి పంపివేయాలని కోరారు. రామరాయలు కూడా సుల్తాన్‌ను బయటికి పంపివేస్తే తాను సకలరాజు తిరుమలకు సామంతునిగా ఉంటానని కబురు పంపాడు. ఇవన్నీ నమ్మి సకలరాజు తిరుమల ఆదిల్‌షాకు కొంత ధనాన్ని ముట్టజెప్పి బీజాపూరు వెళ్లవలసిందిగా కోరాడు. ఆదిల్‌షా విజయనగరం విడిచివెళ్లగానే రామరాయలు, పెమ్మసాని యారనాయుడు మిగిలిన అమర నాయకులు సకలరాజు తిరుమలపై యుద్ధం ప్రకటించారు. సకలరాజు తుంగభద్రా నది ఒడ్డున వారిని ఎదిరించి ఘోరంగా ఓడిపోయాడు. యుద్ధభూమి నుండి పారిపోతున్న సకలరాజు తిరుమలను పట్టుకొని సంహరించారు. దాంతో విజయనగరం అళియ రామరాయల స్వాధీనమైంది. అతడు సదాశివరాయలను సింహాసనమెక్కించి తాను రాజ్యరక్షణ భారాన్ని వహించాడు. విజయం తర్వాత రామరాయలు తిమ్మానాయకుని ఘనంగా సత్కరించాడని, నడిమిదొడ్డి పాలెగాండ్ల కైఫీయత్తు తెలుపుతోంది. తాడిపత్రి కైఫీయత్తు కూడా దానిని బలపరుస్తోంది.

పెమ్మసాని సోదరుల ఘనత-చాటుపద్యాలు: రామరాయలు, సకలరాజు తిరుమలకు జరిగిన సంఘర్షణలో పెమ్మసాని కుటుంబం ఘనమైన పాత్రను నిర్వహించారు. వారి వీరోచిత పోరాటాల వల్లనే రామరాయలు గండికోట నుండి విజయనగరం వరకు జరిగిన అన్ని యుద్ధాలలో ఘనవిజయం సాధించాడు. కనుక యారతిమ్మానాయుడు, రామలింగనాయుడు, చినతిమ్మనాయుడుల విజయాలను నాటి కవులు చాటు పద్యాలుగా రచించారు. యార తిమ్మనాయుడు తాడిపత్రిలో చింతల తిరువెంగళనాథ ఆలయాన్ని కట్టించాడు. ఇది విజయనగర శిల్పకళా శైలికి మచ్చుతునక అని పండితులు వర్ణిస్తారు. ఇది ఖచ్చితమైన ఆగమశాస్త్ర సూత్రాలపైన నిర్మింపబడింది. ఈ ఆలయపు గోడలపై రామాయణ, మహాభారత సంఘటనలను వర్ణచిత్రాలుగా చిత్రించారు ఆలయపు ఆవరణలో అందమైన కొలను కూడా తవ్వించాడు. తిరువెంగళనాథునికి భూములను దానం చేశాడు ప్రతి సంవత్సరం వైశాఖ మాసంలో రథోత్సవం, కార్తీకమాసంలో తెప్పోత్సవం జరిగేట్లు ఏర్పాటు చేశాడు. ఈ దేవాలయం నిర్మించటం ద్వారా యార తిమ్మనాయకుడు తన కీర్తిని శాశ్వతం చేసుకున్నాడు. అతడు వైష్ణవ మతాభిమాని కావచ్చు. ఈ దేవాలయాన్ని నేడు చింతల వెంకటరమణ ఆలయమని పిలుస్తున్నారు. శక సంవత్సరం 1473వ సంవత్సరం శాసనం పెమ్మసాని తిమ్మనాయుడు కుమారుడు చిన తిమ్మనాయుడు గుత్తి మాగాడిలో కలసి ఉన్న తాడ్ల పొదలూరి సీమలోని ఎనుమల చింతల గ్రామాన్ని దానంచేసినట్లు తెలుపుతోంది. ఈ దానం అళియ రామప్పయ్యకు పుణ్యఫలానికై చేసినట్లు తెలపబడింది. దీనిని బట్టి యార తిమ్మనాయుడు, చినతిమ్మనాయుడు సోదరులిద్దరూ అళియరామరాయల ఆధిపత్యం కింద ఉన్నట్లు తెలుస్తుంది. వారు అన్నదమ్ములిద్దరూ సదాశివరాయల సామంతులుగా క్రీ.శ.1565 వరకు పాలించినట్లు భావింపబడింది.

చింతల వెంకటరమణ ఆలయగాథ: చింతల వెంకటరమణ ఆలయ నిర్మాణాన్ని గురించి తాడిపత్రి కైఫీయత్తులో ఒక కథ పేర్కొనబడింది. తాడిపత్రిలో ఒక చింతతోపు ఉండేది. ఆ తోపులోని ఒక చింతచెట్టు మొదట ఒకరోజు హఠాత్తుగా రెండుగా చీలిపోయింది. మధ్యలో ఒక రాతి విష్ణువు విగ్రహం ప్రత్యక్షమైంది. దానిని చూసిన ప్రజలు యారతిమ్మానాయకునికి తెలియజేయగా అతడు వచ్చి స్వయంగా చూసి ఆ చెట్టు మొదలులో విష్ణువు విగ్రహం నిలబడి ఉండటం చూసి ఆశ్చర్యపడ్డాడు. అతడు తిరిగి వచ్చి జ్యోతిష్కులను సంప్రదించాడు. కాని వారేమీ చెప్పలేకపోయారు. ఆ రోజు రాత్రి యార తిమ్మనాయనికి విష్ణువు కలలో దర్శనమిచ్చి తాను తిరువెంగళ నాథుడనని, చింతచెట్టులో అవతరించాను కనుక తనను చింతల తిరువెంగళనాథుడు అనే పేరుతో పూజించుకోవాలనీ చెప్పాడు. తర్వాత వెంటనే యార తిమ్మానాయుడు దేవాలయం నిర్మించి ఆ విగ్రహాన్ని అందులో ప్రతిష్ఠించాడు.

చినతిమ్మానాయకుడు అనేక యుద్ధాలు చేసి శత్రువుల గుర్రాలను, వారి వస్తువాహనాలను హరించాడని చాటువులు చెబుతున్నాయి. అరతిమ్మానాయకుడు గొప్ప వీరుడే గాక గొప్ప దానశీలి. క్రీ.శ.1550లో సౌమ్య నామ సంవత్సరంలో అతడు తాడిపత్రిలోని చింతల రామస్వామి ఆలయానికి ఎనుముచింతల అనే గ్రామాన్ని దానం చేసి శాసనం వేయించాడు. ఇంకా ఇతడు పెదపొల్మ మడమలోను, ఖంకమలపాటిలోను, కనగాల గూడూరులోను, వెన్నపూసల పల్లెలోను ఏడుపుట్ల భూమిని ఆ దేవునికి సర్వమాన్యంగా ఇచ్చాడు. తన పేరుతో ఒక చెరువును కూడా తవ్వించాడు. ఒక బ్రాహ్మణుని వద్ద ఒక సాలి గ్రామం ఉన్నదట. దానిని తిమ్మానాయకుడు తనకు ఇవ్వమని కోరగా

ఆ బ్రాహ్మణుడు తిరస్కరించాడట. అందుకు కోపించి అతనిని చంపించగా నాయునికి బ్రహ్మహత్యాపాతకం వచ్చిందట. అందుకు పరిహారంగా క్రీ.శ.1552 తిమ్మానాయునిపేట అనే గ్రామాన్ని నిర్మించి బ్రాహ్మణాగ్రహారంగా ఇచ్చి అక్కడ ఒక చెరువును తవ్వించాడు. అంతేగాక హత్య చేయబడిన బ్రాహ్మణుని రూపం ఒకవైపు మరొకవైపున యాడికి వీరభద్ర అనే నాగాక్షరాన్ని చెక్కించి నాణేలను ముద్రించి చెలామణిలోకి తెచ్చాడని తాడిపత్రి కైఫీయత్తు తెలుపుతోంది. యాడికి తమ తొలి స్థావరం గనుక అక్కడ వెలసిన తమ కులదైవం వీరభద్రస్వామి వారి పేరుతో ఈ నాణేలు ముద్రించినట్లు తెలుస్తోంది.

పెమ్మసాని నరసింహనాయకుడు: ఇతడు పెద్ద తిమ్మభూపాలుని కుమారుడు. అళియ రామరాయల కాలంలో ఒక సేనాధిపతి. ఇతని కాలంలో శాలి శక 1472-1485 సంవత్సరంలో ఇతని అధీనోద్యోగులు కంటెన ఎల్లప్ప, కామరాజు, రామన్న మొదలైన వారు తాడిపత్రిలో ధర్మశాసనాలు రాయించారు. జమ్మలమడుగు వద్ద జరిగిన ఒక యుద్ధంలో సర్వారాయుడనే వాడిని ఓడించాడని చాటువులు తెలుపుతున్నాయి. తురుష్కుల తలలపై తన పాదాలను ఉంచిన వీరాగ్రేసరుడని అర్థం వచ్చే ముష్కర తురుష్క మస్తకన్యస్త చరణ సమస్త శస్త్ర అనే బిరుదు ఉన్నట్లు కూడా చాటువులు శ్లాఘిస్తున్నాయి. ఇతని తండ్రి, సోదరుడు జయించిన దస్తూరిఖాన్, మస్తఖాన్‌ను వెలుగోటి కుమార తిమ్మానాయుడు కూడా జయించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. దీనిని బట్టి చూడగా కమ్మనాయకుడు, వెలమ నాయకులు కలిసి దస్తర్‌ఖాన్, మస్తఖాన్‌లతో పోరాడి విజయం సాధించినట్లు ధ్రువపడుతోంది. నృసింహనాయకుడు వెల్లలూరు గ్రామంలోని కొంత భూమిని చెన్నమరాజు కృష్ణమరాజు కుమారుడు లింగమరాజు అనే పండితునికి ధారాగ్రహీత మొనర్చాడు. దానిని అతడు క్రీ.శ.1594వ సంవత్సరంలో ఆ గ్రామంలోని చింతల రాయస్వామి సూర్యగ్రహణ కాలాన సమర్పించినట్లు తాడిపత్రి కైఫీయత్తు తెలుపుతోంది. అలాగే వడ్డిరేల గ్రామంలోని కొన్ని సేద్యబడి మాన్యం వెట్టిమాన్యాలు కూడా ఆ దేవునికి దానం చేయబడ్డాయి.

పెమ్మసాని తిమ్మానాయకుడు - చిన తిమ్మానాయకుడు: వీరిద్దరూ నారసింహయ కుమారులు. వీరు క్రీ.శ.1584-1614 మధ్య పాలించిన చిన వెంకటపతి రాయల సమకాలికులు. వారు గండికోట యాడికి పరగణాలను పాలిస్తూ వెంకటపతిరాయల సామంతులుగా అనేక యుద్ధాలలో పాల్గొన్నారు. గండికోట, నంద్యాల రాజ్యంలో భాగంగా ఉంటూ ఉండేది. నంద్యాల పాలెగాడు అయిన కృష్ణమరాజు రెండవ వెంకటపతిరాయల కాలంలో క్రీ.శ.1598వ సంవత్సరంలో తిరుగుబాటు చేశాడు. రెండవ వెంకటపతి రాయలు అతనిని అణచటానికి సైన్యంతో దండెత్తాడు. ఆ యుద్ధంలో పెమ్మసాని చినతిమ్మనాయుడు కూడా పాల్గొన్నాడు. శక సంవత్సరం 1520 హేవిళంబి సంవత్సరంలో జంబులమడక వద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో నంద్యాల కృష్ణమనాయుడు ఓడి బందీగా చిక్కాడు. అతని అమరాన్ని స్వాధీనం చేసుకొని పెమ్మసాని తిమ్మనాయుడికి ఇచ్చారు. పెమ్మసాని కుటుంబం మొదటి నుండి అరవీడు వంశాన్ని విశ్వాసపాత్రంగా కొలుస్తోంది. దీంతో నంద్యాల సీమ మొత్తం పెమ్మసాని వారి రాజ్యంగా మారింది. వెంకటపతిరాయలు వారి సేవలకు మెచ్చి గరుడనారాయణ బిరుదును, ధ్వజాన్ని, బంగారు పువ్వుల చంద్రికాని పావడము, తురాయి ఏనుగు, మయరత్నం, వీరమలహారి, ఘనకంఠ మాలిక, తాళి చౌకట్ల, ముత్యాల కడియాలు, పల్లకీ మొదలైన రాజలాంఛనాలను బహూకరించాడని చారు చంద్రాయం అనే కావ్యంలో వర్ణించబడింది. ఈ కావ్యం పెమ్మసాని పెదతిమ్మరాజు మంత్రి, ఆస్థాన కవీశ్వరుడు అయిన చెన్నమరాజు శేషమంత్రి కుమారుడైన చెన్నరాజు రాశాడు. వెంకటపతి రాయలు తిమ్మానాయకునికి బహూకరించిన బహుమానాలలో కుళ్ళాయిమదసాగ, ధవళశంఖాలు, పల్లకి, తాళిచౌకట్లను తన మంత్రి చెన్నమరాజుకు బహూకరించి సత్కరించాడు. ఆ మంత్రి తాడిపత్రిలో గోపాలస్వామి దేవాలయాన్ని నిర్మించి దేవునికి కిరీటం, పీతాంబరాలను సమర్పించాడు. అంతేగాక అతడు యాడకి గ్రామంలో ఒక కోనేరును తవ్వించి వనాన్ని వేయించాడు. తన తల్లి పేరుతో సర్వమాంబాపురం అనే అగ్రహారాన్ని నిర్మించానని తన గ్రంథంలో చెప్పుకున్నాడు. పెదతిమ్మానాయకుడు క్రీ.శ.1578 వరకు పాలించినట్లు కనిపిస్తోంది.

సరిహద్దు తగాదా: వీరి రాజ్యానికి పక్కన మట్లి అనే మరొక నాయంకర రాజ్యం ఉండేది. ఆ రాజ్యాన్ని చిట్టివేలి అమరనాయకుడైన మట్లి కుమార అనంతరాజు పాలించేవాడు. రెండవ వెంకటపతిరాయల కాలంలో ఈ రెండు రాజ్యాలకు సరిహద్దు తగాదా వచ్చింది. వెంకటపతిరాయలు ఆ వివాదాన్ని పరిష్కరించి దువ్వూరు తాలూకాలోని చిలమకూరు గ్రామాన్ని సరిహద్దుగా నిర్ణయించారు. చిలమకూరుకు పశ్చిమాన పెమ్మసాని వారి

రాజ్యం, తూర్పువైపున మట్లి వారి రాజ్యం ఏర్పడ్డాయి. చినతిమ్మానాయుడు క్రీ.శ.1600 సంవత్సరం వరకు పాలించి ఉండవచ్చు.

పెమ్మసాని చినతిమ్మానాయకుడు: తర్వాత చినతిమ్మానాయుడు రాజ్యానికి వచ్చి 36 సంవత్సరాలు పాలించాడు. ఇతని ఆస్థానకవి చిత్రకవి అనంతకవి. తన ఇందుమతి పరిణయం అనే కావ్యంలో చిన తిమ్మానాయకుడు గండికోట దుర్గాధ్యక్షుడని పేర్కొన్నాడు. చినతిమ్మభూపాలుడు గొప్ప దానశీలి, బీద సాదలకు వివాహాలు జరిపేవాడు. అతడు క్రీ.శ.1579లో తాడిపత్రిలోని చింతల రామస్వామి ఆలయానికి ముప్పాతిక పుట్టిభూమిని దానం చేశాడు. 1585లో నైవేద్యాలు ఏర్పాటు చేసి శాసనాలు వేయించాడు. రంగనాథస్వామి ఆలయానికి తుంట గ్రామాన్ని దానం చేశాడు. ధూపాటి సీమను ఏలే సాయపనేని వారితో పెమ్మసాని వారికి బంధుత్వం ఉంది.

క్రీ.శ.1586లో గోల్కొండ నవాబు సంజరుఖాన్ అనే సేనాధిపతిని గండికోట జయించడానికి పంపాడని పెరిష్టా రాశాడు. ఆ విషయం తెలిసి విజయనగర ప్రభువు రెండవ వెంకటపతిరాయలు తన సైన్యంతో పెమ్మసాని వారికి సహాయంగా వచ్చాడు. గోల్కొండ నవాబు సంజరుఖాన్‌కు సహాయంగా మూర్తజా, రుస్తుంఖాన్ అనే సేనానులను పంపాడు. పెమ్మసాని తిమ్మానాయుడు, వెంకటపతిరాయలు ముస్లిం సైన్యాలను ఓడించి తరిమివేశారు. ఈ యుద్ధం తర్వాత విజయనగర సేనలు గోల్కొండ సైన్యాలను కృష్ణానది ఆవల ఒడ్డు వరకు పారదోలాయి. గోల్కొండ నవాబు ఉభయ రాజ్యాలకు కృష్ణానది సరిహద్దుగా అంగీకరించాడు. ఈ విజయం తర్వాత పెమ్మసాని చిన తిమ్మానాయకుడు క్రీ.శ.1593లో చినతాడిపత్రి భూమిని తాడిపత్రిలోని చింతల రామస్వామి దేవాలయానికి దానం చేసి దాన శాసనం రాయించాడు.

పెమ్మసాని తిమ్మానాయకుడు - చివరివాడు: చిన్నతిమ్మానాయకుని తర్వాత గండికోట పెమ్మసాని వారి చరిత్ర స్పష్టంగా తెలియటం లేదు. పెమ్మసాని వంశంలో చివరి వాడి పేరు కూడా తిమ్మనాయుడే. ఇతనికి చినతిమ్మనాయుడికి ఉన్న సంబంధం తెలియదు. అతని కుమారుడు గాని, మనుమడు గాని అయి ఉండవచ్చు. కాని అతడు ప్రధాన శాఖీయుడు కాదని, ఉపశాఖకు చెందిన వాడని ఒక వాదన ఉంది. అతని తండ్రి అంకప్ప, తాత గిరియ్య, ముత్తాత వెంకటపతి నాయకుడు. ఇతడు క్రీ.శ.1644లో తిరుమల బుక్కపట్నం తాతాచార్యుల వారికి హరిసేగురుసేవ మంత్రకానికి, గుడికట్నం, బసినిముద్ర, తప్పొప్పుల దండన, ఖండన్నపద్దు, పావడం మొదలైన హక్కులను ఇచ్చాడు. ఇతడు యర్రగుడిలో ఒక కోటను కూడా నిర్మించాడు. శ్రోత్రియం కట్టిన ఒక అగ్రహారాన్ని తన గురువుకు ఇచ్చాడు. తీగెల ఏరు వద్ద ఒక చెరువును తవ్వించాడు. సరిమెట్ల గ్రామాన్ని నంబి వారికి దానం చేశాడు. గండికోట రాజ్యంలో వజ్రాల గనులుండేవి. రోజుకు సవాసేరు వజ్రాలు లభించేవట మంచి ఆదాయం వస్తుండేది. ఇతని కాలంలో గండికోట సీమకు 4 లక్షల 50 వేల ఆదాయం వచ్చేది. నాలుగు వేల సైన్యం ఉండేది. 31 ఫిరంగులు ఉండేవి.

గండికోట ఆక్రమణ: గోల్కొండ సేనాని మీర్జుమ్లా పెమ్మసాని వంశం వారి నుండి గండికోటను స్వాధీనం చేసుకోవటం ఆంధ్రదేశ చరిత్రలో ఒక ప్రముఖ సంఘటన. ఈ కోటను స్వాధీనం చేసుకున్న విధానం ఆనాటి స్థానిక కైఫీయత్తులలో వివరంగా రాయబడింది. అంతేగాకుండా గండికోట ఆక్రమణ సమయంలో మీర్జుమ్లా దగ్గరే ఉన్న ఫ్రెంచి యాత్రికుడు టావెర్నియర్ ఈ కోటను ఆక్రమించిన విధానం చాలా వివరంగా రాశాడు. గండికోట అంటే ఇది ఎక్కటానికి వీలులేని ఒక కొండపై నిర్మింపబడిన అతి బలిష్టమైన కోట. ఇది కాకతీయుల కాలం నుంచే ప్రసిద్ధి చెందింది. వీరికాలం నాటికి ఇది ప్రఖ్యాతి వహించింది. ఈ కోటకు ఒక వైపున పెన్నానది ప్రవహిస్తుంది ఈ కోటకు ఎక్కే మార్గం చాలా ఇరుకైనది. పైకి ఎక్కడం చాలా కష్టమైన పని. టావెర్నియర్ కూడా అలాగే వర్ణించాడు. దీనికి ఎక్కే మార్గం 20-25 అడుగులు మాత్రమే వెడల్పు ఉంటుందని మరికొన్నిచోట్ల మరీ ఇరుకుగా 7-8 అడుగులు మాత్రమే ఉంటుందని, దానికి ఒకపక్క కొండ కింది వరకూ నిలువుగా చెక్కినట్లు ఉంటుందని, అక్కడ పాదం వద్ద పెద్ద నది ప్రవహిస్తుందని రాశాడు. పైన కొండమీద కొంత ప్రాంతంలో వరి, మొక్కజొన్న పండిస్తున్నారని రాశాడు. దానికి దక్షిణంగా పట్టణం నిర్మింపబడి ఉంది. ఈ పట్టణాన్ని రక్షించుకోటానికి 500 అడుగులు మాత్రమే ఖాళీ ఉంది. అటువైపు నుండి తప్పితే మరి ఎటువైపు నుండి లోపలకు ప్రవేశించటానికి వీలులేదు. అందువల్ల అక్కడ బలమైన కోట గోడ నిర్మించారు. అందువల్ల ఈ కోట శత్రు దుర్భేద్యంగా రూపొందింది.

గండికోట పాలకులైన పెమ్మసానివారు ధైర్యసాహసాలు కలిగిన సేనాధిపతులుగా ప్రఖ్యాతి వహించారు. వారికి రెండు ఫిరంగులున్నాయి. ఒక ఫిరంగి ముఖద్వారం వద్ద ఉంచారు. రెండవది ఒక బురుజుపై అమర్చారు. నవాబు సైన్యం కొండను ఎక్కటానికి ప్రయత్నించగా ముఖద్వారం వద్ద ఉన్న ఫిరంగితో పెమ్మసాని వారి సైన్యం కాల్పులు జరిపారు. అందులో చాలా మంది ముస్లిం సైనికులు మరణించారని టావెర్నియర్ రాశాడు. రాజు కోటలో ఉన్నాడు. కింద నవాబు పైకి చూస్తూ ఉన్నాడు. కోటను స్వాధీనం చేసుకోవాలంటే ఫిరంగులను కోట గోడలపై కాల్పులు జరపగలిగినంత దూరం వరకు కొండపైకి తీసుకుపోవాలి. కాని అది సాధ్యం కాలేదు. కొండకు ఒకవైపున కిందికి మీదకు చెక్కినట్లు ఒకే బండ ఉంది. మరొకవైపు పెన్నానది, ఇంకొకవైపు ఇరుకైన దోవ, ఆ దోవకు ఎదురుగా ముఖద్వారం ఉంది. ముఖద్వారం వద్ద ఉన్న ఫిరంగి పైకి ఎక్కటానికి వీలులేకుండా కాల్పులు జరుపుతోంది. ఈ విధంగా ఉన్న కోటను ఎన్ని రోజులు ప్రయత్నించినా ఆక్రమించటానికి సాధ్యం కాలేదు. ముస్లిం ఫిరంగులను పైకి ఎక్కించలేకపోయారు. కనుక మీర్జుమ్లా మోసంతో కోటను ఆక్రమించాలని ప్రయత్నించి పెమ్మసాని తిమ్మనాయునికి రాయబారం పంపాడు. అతడు కోట ఖాళీ చేసి తనకు స్వాధీనం చేస్తే దానికి బదులుగా గుత్తికోట ఇవ్వబడుతుందని తెలిపాడు.

గండికోటను స్వాధీనం చేసుకోవడం క్రీ.శ.1650: మీర్జుమ్లా పంపిన రాయబారానికి పెమ్మసాని తిమ్మనాయుడు అంగీకరించాడు. కాని గుత్తికోటనే తనకు ముందుగా స్వాధీనం చేయాలని షరతు విధించాడు. అందుకు బదులుగా మీర్జుమ్లా గోల్కొండ సుల్తాన్ ముందు గండికోటను ఖాళీ చేయమని కోరుతున్నాడని, ఖాళీ చేసిన తర్వాతే గుత్తి కోట ఇవ్వబడుతుందని తిరిగి రాయబారం పంపాడు. అందుకు అంగీకరించి తిమ్మనాయుడు తన బంధువులు, కుటుంబసభ్యులతోను, సైన్యంతోను కోటను వదిలి కిందికి దిగి వచ్చాడు. అతను కిందికి దిగి రాగానే మీర్జుమ్లా తన సైన్యంతో కోటలో ప్రవేశించి స్వాధీనం చేసుకున్నాడు. కోట స్వాధీనం అయిన తర్వాత పెమ్మసాని తిమ్మనాయుడు తనకు గుత్తికోటను ఇస్తూ ఫర్నామా ఇవ్వమని కోరాడు. కాని గుత్తి కోట ఇవ్వలేదు. దానికి పక్కనే ఉన్న హనుమగుత్తి అనే చిన్న శివారు ప్రాంతాన్ని ఇస్తూ ఫర్నామా ఇచ్చాడు. దానికి పెమ్మసాని తిమ్మనాయుడు అంగీకరించలేదు. వజీరు స్థానంలో ఉండి మోసగించటం తగదని, అన్న మాట ప్రకారం గుత్తి కోటను ఇవ్వమని కోరాడు. కాని గుత్తికోటను ఇవ్వలేదు. హనుమగుత్తిని తీసుకోకుండా పెమ్మసాని తిమ్మానాయుడు ఆ ప్రాంతాన్ని వదలి ధర్మపురం చేరి అక్కడ స్థిరపడ్డాడు. అంతటితో గండికోటలో పెమ్మసాని వారి రాజ్యం అంతరించింది. టావెర్నియర్ పెమ్మసాని తిమ్మనాయుడు గౌరవప్రదంగా కోట నుండి వైదొలిగాడు. కాని అతడు తొలగిపోకుండా ఎదిరించినట్లయితే గండికోట మీర్జుమ్లా స్వాధీనం అయి ఉండేది కాదని రాశాడు.

దేవతా విగ్రహాలను కదిలించటం: కోట స్వాధీనం అయిన తర్వాత మీర్జుమ్లా తన ఫిరంగులను పైకి తెప్పించాలని ప్రయత్నించాడు. కాని ఒక్క ఫిరంగిని కూడా పైకి తీసుకు రాలేకపోయాడు. కనుక కోటలో రక్షణకు ఫిరంగులు ఉండాలని తలచి కోటలోనే ఫిరంగులను పోతపోయించాలని మొయిలీ అనే ఫ్రెంచి వ్యక్తిని ఫిరంగుల తయారీకి నియమించాడు. అతడు ఫిరంగులకు కావలసిన రాగిని తెచ్చి ఇవ్వమని కోరాడు. అందుకు మీర్జుమ్లా సైనికులు ఆ పరిసర ప్రాంతాలలో ఉండే దేవాలయాలలోని లోహపు విగ్రహాలను పట్టుకొని వచ్చారు. గండికోటలో రెండు దేవాలయాలున్నాయి. ఆ దేవాలయాలలోని వెండి, రాగి, బంగారు విగ్రహాలను కూడా తెచ్చారు. అవన్నీ కరిగించారు. అన్నీ కరిగాయి కాని గండికోటలోని విగ్రహాలు కరగలేదట. మొయిలీ ఒక్క ఫిరంగీని కూడా తయారు చేయలేకపోయాడని స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. గండికోటను మీర్జుమ్లా ఆక్రమించాడని అనేక ఇతర రచనలు కూడా తెలుపుతున్నాయి. షాజహాన్ నామాను రాసిన కాఫీకాన్, మీర్జుమ్లా గజికోటను జయించాడని రాశాడు. తోళ్లమడుగు కవిలె వికృతినామ సంవత్సరంలో కుతుబ్షా గండికోటను ఆక్రమించాడని తెలుపుతోంది. ఉగుమంచిపల్లి కైఫీయత్తు కూడా శక సంవత్సరం 1571 వికృతనామ సంవత్సరంలో గోల్కొండ నవాబు గండికోటను జయించాడని పేర్కొంటోంది. కనుక గుత్తి తాలూకాలోని హనుమపల్లి శాసనం గండికోటలో గోల్కొండ అధికారి ఉన్నాడని తెలియజేస్తోంది. ఈ ఆధారం వల్ల క్రీ.శ.1650 వ సంవత్సరంలో గండికోట గోల్కొండ నవాబుల హస్తగతమైందని తెలుస్తోంది.

పెమ్మసాని కుటుంబం అంతమవడం: ఆ తర్వాత పెమ్మసాని వంశస్తులెవరూ గండికోటను తిరిగి ఆక్రమించటానికి ప్రయత్నించలేదు. వారి వంశస్తులు దక్షిణంగా కదిలిపోయి ధర్మవరంలో స్థిరపడ్డారు. దాంతో గండికోటను 200 సంవత్సరాలు పాలించిన పెమ్మసాని వంశస్తుల రాజ్యాధికారం అంతరించి పోయింది.

గండికోట పోయినా పెమ్మసాని వారు అక్కడ స్థానిక పాలకులుగా పాలించినట్లు శాసనాలు ఉన్నాయి. గండికోట ప్రాంతంలో పెమ్మసాని తిమ్మనాయుడుల పేర్లు, గండికోట ఆక్రమణ నేటికీ కథలుగా చెప్పుకుంటారు. నేటికీ ఆంధ్రదేశంలో కమ్మవారిలో పెమ్మసాని వారు ఉన్నారు.

కురవికుల రాజ్యం: తళ్లికోట యుద్ధానంతరం పెమ్మసాని వారి వంశంలోని పెదవీరనాయకుడనే అతడు దక్షిణ దేశానికి వలసపోయి మధుర రాజైన విశ్వనాథ నాయకుని ఆశ్రయించాడు. విశ్వనాథ నాయకుడు అతనిని ఆదరించి తన రాజ్యంలోని తిరునల్వేలి జిల్లాలోని కురివికుల జాగీరును ఇచ్చాడు. అప్పుడు దానిని కురివితలయనన్ అనే అతడు పాలిస్తున్నాడు. అతడు తన జాగీరును వదులుకోవడానికి ఇష్టపడలేదు వీరప్పనాయకుడు తలయన్‌ను ఓడించి కురివికుల జాగీరును ఆక్రమించాడు. ఈ జాగీరుతోపాటు ఇలైయరసనందల్ అనే జాగీరు ఆ కాలంలో ప్రఖ్యాతి వహించి ఉండేదని టైలర్ అనే అధికారి రాశాడు. మధుర రాజ్యం పోయిన తర్వాత కురివికుల జాగీరు ఈస్టిండియా కంపెనీ వారి కింద జమీదారుగా మారింది. వీరప్ప లేక వీరనృపాలుని సంతతి వారు అక్కడ వరుసగా పాలించారు. ఈ వంశస్థుల గురించి మధుర, తిరుచునాపల్లి రాజు మంత్రి అయిన విజయ మీనాక్షినాయుడు ఈస్టిండియా కంపెనీ వారికి తెలియజేస్తూ ఘనంగా రాశాడు. రోయరుల కాలంలో పెమ్మసానివారు గండికోట రాజులని, ఆ రాజ్యం పోయిన తర్వాత వారు విశ్వనాథ నాయకుని ఆశ్రయించారని, వారిని విశ్వనాథ నాయకుడు అమితంగా గౌరవించేవాడని రాశారు. విశ్వనాథ నాయకునికి ఉన్న 72 మంది సామంతులలో ఎవరు అతనిని దర్శించినా వారు కానుకలతో వెళ్లి అతని కాళ్ల మీద వాలి విధేయత చూపేవారని, కాని పెమ్మసాని వారు వచ్చినట్లయితే విశ్వనాథనాయకుడు ఎదురేగి వారిని తోడ్కొని తెచ్చి ఉచితాసనంపై కూర్చోబెట్టి సమాన హోదా ఇచ్చేవాడని ఇంగ్లిషు వారి రికార్డులలో ఉంది. దీనిని బట్టి విజయనగర యుగంలో చివరి దాకా పెమ్మసాని వారు ఘనమైన స్థానాన్ని కలిగి ఉన్నారని స్పష్టమవుతోంది.

రావెళ్లవారి సామంత రాజ్యం: విజయనగర సామంతులలో రావెళ్లవారు ఒకరని నాటి శాసనాలు, సాహిత్యం తెలుపుతున్నాయి. వీరి వంశ చరిత్ర తెలుసుకోవడానికి ప్రధాన ఆధారం రత్నాకం గోపాలకవి రాసిన సౌగంధికా ప్రసవాపహరణం అనే గ్రంథం. అతడు తన కావ్యంలో వారు కమ్మ కులస్తులని పేర్కొన్నాడు. అందులో ఒక పద్యంలో ఆ కమ్మ వంశ సుధాంబోధి- మల్లభూరమణుడని, మరొక పద్యంలో అల్లవెకమ్మ మూకలట భూవీరవల్లభ మల్లికార్జునవాడే జగదేకవీరుడన్ అని వర్ణించాడు. వీరు వాల్లుట్ల గోత్రీకులు. ఈ వంశస్థులు విజయనగర సామంతులుగా శ్రీశైలం, ధూపాటి సీమ, కొచ్చెర్లకోటను పాలించారు. ఈ వంశ ప్రస్తావన 13వ శతాబ్దం నుండి కనిపిస్తోంది. క్రీ.శ.1257వ సంవత్సరం నాటి ఒక శాసనం, చోళ మూడవ రాజరాజు కాలం నాటి ఒక శాసనంలో ఒక రావెళ్ల నాయకుడున్నట్లు తెలుపుతోంది. తర్వాత రావెళ్లవారి ప్రస్తావన ఎక్కడా కానరాదు. తిరిగి విజయనగరయుగంలో వారు ప్రఖ్యాతిలోకి వచ్చారు. మొదటి బుక్కరాయల కాలంలో పద్మనాయకులు రెడ్డిరాజులను ఓడించారు. రాచకొండ దేవరకొండ నేలిన పద్మనాయక అనపోతా నాయకుడు, అతని తమ్ముడు మాదానాయకుడు అద్దంకిని ఏలే అనపోతారెడ్డిని ఓడించి శ్రీశైల ప్రాంతాన్ని ఆక్రమించారు బుక్కరాయలు పద్మనాయకులను ఓడించి శ్రీశైల ప్రాంతాన్ని జయించి రావెల వారిని అక్కడ తన సామంతులుగా నియమించాడు. క్రీ.శ.1364లో రావెళ్లవారు శ్రీశైలం ధూపాటి సీమలను పాలిస్తున్నట్టు మెకంజీ మాన్యువల్స్ తెలుపుతున్నాయి. రావెళ్ల వారికి చలమర్తిగండ అనే బిరుదు ఉంది. ఈ బిరుదును బట్టి వారి వంశం వెలనాటి చోడుల కాలం నుండే ప్రసిద్ధి చెందినట్లుగా కనిపిస్తోంది.

రావెళ్ల వీరమల్లభూపతి క్రీ.శ.1485-1530: రావెళ్ల వారి వంశచరిత్ర సాళువ నరసింహరాయల కాలం నుంచి స్పష్టంగా తెలుస్తోంది. సాళువ నరసింహరాయల కాలంలో రావెళ్ల మల్లన్నపాలుడు గుడిపాటి కోట వద్ద విజయనగర సాళువ నరసింహరాయలకు ముస్లిం సేనలకు జరిగిన యుద్ధంలో పాల్గొని అమిత పరాక్రమం చూపి నరసింహరాయలచే రాజహృదయ భల్లప్రతాప ప్రభావుండ అనే బిరుదు పొందినట్లు సౌగంధిక ప్రసవాపహరణ కావ్యం తెలుపుతోంది. ఈ వీరమల్ల భూపతినే ఆ కవి ఆ కమ్మ వంశ సుధాంబోధి భూవీరవల్లభా జగదేకవీరుడ్ అని వర్ణించాడు. ఇతనికి మల్లికార్జునుడు అని కూడా పేరుంది. ఇతని రాజధాని పెదారికట్ల. ఈ వంశస్థులకు బసవశంకర టెక్కెం ఉంది. ఇతనికి సమర రఘురామ రావెళ్ల సార్వభౌమ వైరి హృద్భల్లయుద్దండ వీరమల్ల అనే బిరుదులున్నాయి. రావెళ్ల వారు విజయనగరం వెళ్లినప్పుడు అక్కడ మకాం చేయడానికి 1260 కుంటల భూమి ఇవ్వబడిందని విజయనగర సామ్రాజ్యం అనే ప్రాచీన కడితెలో పేర్కొనబడింది. ఇతడు సాళువ నరసింహరాయల

తర్వాత తుళువ వీరనరసింహ రాయలు, శ్రీకృష్ణదేవరాయల కాలంలో కూడా జీవించి ఉన్నట్లు తెలుస్తోంది. న్యూనిజ్ శ్రీకృష్ణదేవరాయల సామంతులలో ఒక మల్లపనాయకుడనే వ్యక్తి ఉన్నాడని పేర్కొన్నాడు. సీవెల్ కూడా అలాగే రాశాడు. న్యూనిజ్ పేర్కొన్న మల్లభూపతి ఇతడేనని చరిత్రకారుల అభిప్రాయం. ఇతని రాజ్యాదాయం 13000 వరహాలు. అతని కింద 6000 కాల్బలం, 400 అశ్వాలుండేవి. రాయలకు అతడు 2000 వరహాలు కప్పంగా చెల్లించేవాడని న్యూనిజ్ రాశాడు.

రావెళ్ల తిప్పభూపాలుడు: వీరమల్లభూపతికి తిప్పనాయకుడనే కుమారుడు ఉన్నాడు. అతడు తండ్రి కాలంలోనే సేనాధిపతిగా పని చేశాడు. అతడు వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయల కాలంలో గజపతులతో జరిగిన యుద్ధాలలో తిమ్మానాయకుడు పాల్గొని రాయల చేత బిరుదులు, రాజలాంఛనాలు, పట్టుగొడుగులు, హారాలు, అందలాలు, గుర్రాలు, ఏనుగులను పొందాడని సౌగంధిక ప్రసవాపహరణం తెలుపుతోంది. కృష్ణరాయలు గజపతితో చేసిన యుద్ధాలలో రావెళ్ల వారు ఉన్నట్లు ధూర్జటి రచించిన కృష్ణరాయ విజయంలో ఉంది. ఇతనికి అయ్యపరాజు, వెంకటాద్రి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో వెంకటాద్రి చరిత్ర తెలియదు. తండ్రి తర్వాత అయ్యపరాజు రాజ్యానికి వచ్చాడు.

రావెళ్ల అయ్యపరాజు: అయ్యపరాజుకు పాపరాజని కూడా పేరు ఉంది. ఇతడు కూడా తండ్రితోపాటు వీరనరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయల కాలంలో సేనాధిపతిగా పనిచేశాడు. క్రీ.శ.1506వ సంవత్సరంలో కందనవోలు కోట వద్ద జరిగిన యుద్ధంలో ఇతడు కోటను పట్టుకున్నాడు. అదే యుద్ధంలో అళియరామరాయల తాత అయిన రామరాజు కూడా వీరనరసింహరాయల సామంతునిగా పాల్గొన్నాడు. ఈ యుద్ధంలో అయ్యపరాజు చూపిన పరాక్రమాన్ని సౌగంధిక ప్రసవాపహరణంలో వర్ణింపబడింది. కందనవోలు యుద్ధాన్ని పద్య బాల భాగవతం, ద్విపద బాల భాగవతం, రామరాజీయం, వసుచరిత్రలు కూడా వర్ణించాయి. కందనవోలు యుద్ధంలో ముస్లింల తరపున 70 వేల అశ్వదళం పాల్గొంది. అయినా విజయనగర సైన్యం ముస్లిం సైన్యాన్ని ఓడించిందని బాల భాగవతం తెలుపుతోంది. ఇతని భార్య లక్ష్మమాంబ. ఈ దంపతులకు తిప్పభూపాలుడనే కుమారుడు ఉన్నాడు. ఇతడు తండ్రి తర్వాత రాయల సామంతునిగా పాలించాడు.

రావెళ్ల రెండవ తిప్పభూపాలుడు: ఇతనికి రెండవ తిప్పభూపాలుడని పేరు. ఇతని కాలంలో ముస్లింలు ఆదవాని కోటపై దండెత్తి దానిని జయింపజూశారు. ఈ యుద్ధంలో రెండవ తిప్పభూపాలుడు పాల్గొని వీరోచితంగా పోరాడి విజయం సాధించాడని సౌగంధికా ప్రసవాపహరణంలో వర్ణింపబడింది. ఈ యుద్ధంలో అళియరామరాయల తండ్రి అయిన తిమ్మరాజు కూడా పాల్గొన్నాడని బాలభాగవతం తెలుపుతోంది. కనుక తిమ్మరాజుకు సహాయంగా వెళ్లి రెండవ తిప్పనాయకుడు పాల్గొని ఉంటాడని కె.ఈశ్వరదత్తు అభిప్రాయపడ్డాడు. ఈ యుద్ధంలో అళియ రామరాయలు కూడా పాల్గొని ఆదవాని దుర్గాపహరుడని బిరుదు వహించినట్లు బాలభాగవతం వర్ణించింది. రెండవ తిప్ప భూపాలుని భార్య వెంగమాంబ. వారికి లింగన్నపాలుడనే కుమారుడు జన్మించాడు.

రావెళ్ల లింగభూపాలుడు: ఇతడు 1510 తర్వాత అంటే శ్రీకృష్ణదేవరాయల కాలంలో సామంతుడు. ఇతడు ధర్మాత్మునిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు నర్రావుల పర్వతాలు అనే అతడి కుమార్తె సిద్ధాంబను వివాహమాడాడు. వారికి కొండభూపతి, అయ్యపరాజు అనే కుమారులు కలిగారు. ఇతనిని గురించి ఎక్కువ వివరాలు తెలియదు.

రావెళ్ల కొండభూపాలుడు: లింగభూపాలుని తర్వాత అతని కుమారుడు కొండభూపాలుడు పరిపాలన చేపట్టాడు. ఇతడు గొప్ప పరాక్రమవంతుడు. శ్రీకృష్ణదేవరాయల పాండ్య దండయాత్రలో ఇతడు పాల్గొన్నాడు. ఆ యుద్ధంలో అతడు చూపిన పరాక్రమానికి రాయలు అతనికి భేతాళ అనే బిరుదు ఇచ్చాడు. మానప్పూరి వద్ద బీజాపూరు సుల్తాన్ సేనాధిపతి యేరుల్‌శాహితో జరిగిన యుద్ధంలో కూడా కొండభూపతి పోరాడినట్లు సౌగంధిక ప్రసవాపహరణం తెలుపుతోంది. అళియరామరాయల తండ్రి కూడా ఈ యుద్ధంలో పాల్గొన్నట్లు బాల భాగవతం తెలుపుతోంది. కృష్ణరాయలు క్రీ.శ.1512-20 సంవత్సరాల మధ్య బీజాపూరు సుల్తాన్‌తో జరిగిన యుద్ధాలలో కూడా కొండభూపతి పాల్గొన్నాడు.

రావెళ్ల రెండవ అయ్యప్ప నాయకుడు: ఇతడు కొండ భూపాలుని తమ్ముడు. ఇతనికి సహస్ర విక్రమార్కుడు, పరవీర కోలాహలుడు, చెంచుమల చూరకారుడు అనే బిరుదులున్నాయి. ఇతడు అళియరామరాయల వద్ద సైన్యాధిపతిగా పని చేశాడని ఒక ద్విపద పద్యం వల్ల తెలుస్తోంది. కనుక అతడు క్రీ.శ.1542-65 సంవత్సరాల మధ్య కాలం వాడని భావించవచ్చు. ఇతని భార్య వెంగమాంబ. వారికి కొండ భూపాలుడనే కుమారుడు కలిగాడు.

రావెళ్ల లింగన్నపాలుడు - తిరుమణికోట పాలన: ఇతడు రావెళ్ల మొదటి కొండభూపాలుని కుమారుడు ఇతని భార్య సాయపనేని వారి ఆడపడుచు. సాయపనేని అనంతభూపాలుడు శ్రీరంగమాంబల కుమార్తె అయిన భాస్కరాంబ కొండభూపాలుని భార్య. ఇతడు తిరుమణికోటను రాజధానిగా చేసుకొని పాలించాడు. అబ్దుల్ పాదుషా అనే అతడు ఇతని కోటను ముట్టడించాడు. అతనిని ఓడించి విజయనగర దళవాయి వెంకటరాయల మెప్పు పొందాడు. యుద్ధంలో చిక్కిన ముస్లిం ఖైదీలను పెనుగొండకు తీసుకు వెళుతూ మార్గమధ్యంలో దయతలచి వారిని వదిలివేశాడట. సౌగంధిక ప్రసవాపహరణం గ్రంథాన్ని రాసిన రత్నాకరం గోపాలకవి ఇతని ఆస్థానకవి గోపాలకవి తన సౌగంధికా ప్రసవాపహరణాన్ని ఇతనికి అంకితం చేశాడు. ఇతడు అనేక మంది కవులను పోషించాడు. ఇతనికి అనేక బిరుదులున్నాయని సౌగంధిక ప్రసవాపహరణం తెలుపుతోంది. నరపతి అంటే విజయనగర చక్రవర్తి అతని యుద్ధ కౌశలాన్ని మెచ్చుకొని అనేక రత్నభూషణాలను, కరితురంగాలను బహూకరించాడు. సింధురాజు ఉత్తర అశ్వాలను పూన్చిన శకటాన్ని ఇచ్చాడు. సౌరాష్ట్ర రాజు రత్నహారం ఇచ్చాడని సౌగంధిక ప్రసవాపహరణం వర్ణించింది. ఇతనికి అశ్వరేవంత రణధీర ఘంటానిరాంతకమల్ల ప్రజత సింహలలాట, వరబలభీమ, చలమర్తిగండ, ఆదవాని దుర్గ గర్వవిభాళ, హత్తుముప్వరగండ, హర్యక్షశౌర్య గగ్గొలురాయ అనే బిరుదులున్నాయని కూడా వర్ణించింది. అతడు ఓడించిన అబ్దుల్ పాదుషా గోల్కొండనేలిన అబ్దుల్లా కుతుబ్ షా అని భావించారు. ఇతనికి రామభద్ర భూపాలుడనే కుమారుడు ఉన్నాడు.

రావెళ్ల రెండవ కొండభూపాలుడు: ఇతడు రెండవ అయ్యపరాజు కుమారుడు. ఇతడు దయాశాలి యుద్ధంలో పారిపోయే శత్రువును దయతలచి వదలడమేగాక వారిని తగిన మర్యాదలతో ఆదరించేవాడట. ఇతనికి రామభద్రన్నపాలుడు, తిమ్మభూపతి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు.

రావెళ్ల రామభద్ర నృపతి: ఇతడు రెండవ కొండన్నపాలుని కుమారుడు. ఇతడు కూడా తండ్రి లాగా గొప్ప ధర్మాత్ముడు. కాని ఇతని కాలం నాటి విశేషాలు తెలియదు.

రావెళ్ల తమ్మభూపాలుడు: ఇతడు రామభద్ర నృపతి సోదరుడు. ఇతడు చేషష్టి విద్యలలో ప్రవీణుడని, గొప్ప వీరాగ్రేసరుడని సౌగంధిక ప్రసవాపహరణంలో వర్ణించబడింది. ఇతడు శ్రీరంగరాయల సామంతుడని భావించారు.

ఉదయగిరి- రావెల కోనేటి చినతిమ్మానాయుడు: ఇతడు రావెల వంశంలోని మరొక శాఖ వాడు. ఇతడు శక 1504 అంటే క్రీ.శ.1582లో ఉదయగిరిని పాలించినట్లు అతడు కోవూరు తాలూకా విడవలూరు గ్రామంలో వేయించిన శాసనం వల్ల తెలుస్తోంది. ఇతని తండ్రి తిరుమలయ్య, తాత రావెలకొంటి నాయకుడు. వారు కూడా ఉదయగిరిని పాలించి ఉండవచ్చు. ఇతడు విడవలూరు గ్రామంలోని పోలేరమ్మ మిట్ట మీద ఉన్న పోలేరమ్మ దేవతకు నూరుకుంటల భూమిని దానం చేసి అక్కడ శాసనం వేయించాడు. ఈ శాసనం వల్ల ఈ శాఖ చరిత్ర తెలుస్తోంది. ఇతడు కూడా మొదటి శ్రీరంగరాయల సామంతుడై ఉండవచ్చు.

పొదిలిసీమ - రావెల తిరుమలనాయనింగారు: పొదిలిసీమను మరొక రావెల శాఖ పాలించినట్లుగా కనిపిస్తోంది. ఇతని తండ్రి పేరు తిప్పానాయనింగారు. తాత పేరు కూడా తిప్పానాయనిం గారే. ఇతని తాత తండ్రులు కూడా పొదిలిసీమను పాలించారు. క్రీ.శ.1575లో నెల్లూరు జిల్లా ఈగలపాడులో ఇతని శాసనం ఉంది. ఈ శాసనం ప్రకారం అతడు ఒక అమరనాయకుడు. పొదిలి నాయంకరాన్ని పాలించాడు. ఈగలపాడులోని సంగమేశ్వరస్వామికి తన నాయంకరంలోని పుట్టెడు భూమిని దానం చేసి ఈ శాసనం వేయించాడు. ఇతడు కూడా మొదటి శ్రీరంగరాయల అమరనాయకుడై ఉండవచ్చు.

రావెళ్ల ముద్దునాయకుడు: ఇతడు రావెళ్ల లింగభూపాలుని సోదరుడు. తన భార్య కోటపాటి మాకవేంద్రుని కుమార్తె అయిన తిరుమలాంబ. ఇతడు, ఇతని మామ మాకరాజు క్రీ.శ.1616 సంవత్సరంలో తోపూరు యుద్ధంలో జగ్గారాయుని తరపున పోరాడి ఓడిపోయి పారిపోయారని రఘునాథాభ్యుదయంలో వర్ణించబడింది. ఇదే విషయం తంజావూరు ఆంధ్రనాయక చరిత్రలో కూడా పేర్కొనబడింది. ఇతనికి వెంగభూపాలుడను కుమారుడున్నాడు.

రావెళ్ల వెంగభూపాలుడు: ఇతడు ముద్దునాయకేంద్రుని కుమారుడు. ఇతనికి వెంకటపతి నాయుడని కూడా పేరుంది. ఇతడు రెండవ వెంకటపతిరాయల సామంతుడు. ఇతడు కూడా తండ్రితోపాటు తోపూరు యుద్ధంలో పాల్గొన్నట్లు విజయనగర చరిత్రాధారాలు అనే గ్రంథం ద్వారా తెలుస్తోంది. ఆ గ్రంథం 249-290 పేజీలలో ఈ విషయం ఉంది. ఇతడు భక్తితత్పరుడు. ఇతనికి రావుల వెంగళప్ప అనే సామంతుడున్నాడు. అతనికి వెంగభూపాలుడు వీరాన్నకనుపూరు అనే గ్రామాన్ని అమరంగా ఇచ్చాడు. వెంగళప్ప ఆ గ్రామంపై పన్ను

సుంకాలను అక్కడ ఉన్న విశ్వేశ్వరస్వామికి దానం చేసి శక 1538లో శాసనం వేయించాడు.

రావెల వెలిగొండ వెంకటాద్రి: విజయనగర చరిత్రాధారాలు అనే గ్రంథంలోని 240-290 పేజీలలో ఇతడు మట్ల అనంత భూపాలునితో యుద్ధం చేసి యుద్ధంలో మరణించినట్లు పేర్కొనబడింది. సామంతుల మధ్య జరిగిన కోడూరు యుద్ధంలో ఇతడు పాల్గొని ఉంటాడు.

రావెళ్ల పాపారాయనింగారు: ఇతడు క్రీ.శ.1660 కాలానికి అంటే మూడవ శ్రీరంగరాయల సమకాలికుడు. ఈ కాలంలో నారికట్ల సముతు గోల్కొండ నవాబు ఆధీనంలో ఉంది. మూడవ శ్రీరంగరాయలు ఓడిపోయి దానిని పోగొట్టుకున్నాడు. నారికట్లను అబ్దుల్లా కుతుబ్ షా జయించి అక్కడ హజరత్‌షేకు ఖాన్‌సాహెబ్ అనే అతన్ని నారికట్ల పాలకుడుగా నియమించాడు. ఖాన్‌సాహెబ్ వద్ద ఈ రావెళ్ల పాపారాయుడు ఒక ఇజారాదారునిగా పనిచేశాడు. పాపారాయుడు నారికట్ల సముతులోని బదుగులేరు అనే గ్రామాన్ని ఖరీదు చేసి అందులో 45 కుచ్చెళ్ల భూమిని ఒక కండ్రికగా చేసి దానిని పట్టాభిపురం అనే అగ్రహారంగా చేసి దానిని శక 1582లో చంద్రగ్రహణ కాలంలో అక్కడ ఉన్న శ్రీ వెంకటాచలపతిస్వామికి దానం చేసి శాసనం వేయించాడు.

పచ్చుగుళ్లపాడు రావెళ్లవారు: పచ్చుగుళ్లపాడును రాజధానిగా చేసుకొని అలంగీరు పాదుషాకు సామంతులుగా ఒక రావెళ్ల కుటుంబం పాలించినట్లు కొచ్చెర్లకోట స్థల పురాణంలో పేర్కొనబడింది. రావెళ్ల పాపారాయుడు పచ్చుగుళ్లపాడు రావెళ్లవారి చరిత్రను బట్టి చూడగా రావెళ్ల హరివంశం విజయనగర సామ్రాజ్యంలో సేనాధిపతులుగా పాలెగాండ్రుగా గొప్ప పాత్ర నిర్వహించారని విజయనగర సామ్రాజ్యం క్షీణించిన తర్వాత, గోల్కొండ నవాబుల కింద, తర్వాత మొగల్ వంశస్థుల కింద కూడా పాలెగాండ్రుగా కొనసాగినట్లు తెలుస్తోంది. మొత్తం మీద రావెళ్ల లేక రాయల వంశం ఆంధ్రదేశ చరిత్రలో సుదీర్ఘకాలం సామంతులుగా పాలించారని చెప్పవచ్చు.

రావెళ్ల మల్లానాయుడు-శ్రీగిరి మండలం-కొచ్చర్లకోట: ఇతడు క్రీ.శ.1662 నాటివాడు. వీరప్రతాపరాయ దేవరాయ వారి సామంతుడు. ఇతడు కొచ్చర్లకోట దుర్గాధ్యక్షుడు. అతడు ఆ సీమలోని సింగరికొండ, బత్తెపాడు అనే గ్రామాలను చెన్నారాయస్వామి దానం చేసి శాసనాలు వేయించాడు. ఆ శాసనంలో అతడు శ్రీగిరి మండల పాలకుడుగా వర్ణింపబడ్డాడు. కొచ్చెర్లకోట ప్రాంతానికి శ్రీగిరి మండలం అని పేరు ఉండి ఉండవచ్చు.

రావులవారు-రావుల వెంగళప్ప: రావెళ్లవారు గాక కమ్మకులానికి చెందిన రావులవారనే మరొక వంశం వారు కూడా విజయనగర సామంతులుగా పని చేశారు. వారు లోకపాల గోత్రీకులు. క్రీ.శ.1617లో రావుల వెంగళప్ప అనే అతడు రావెల వెంకటపతి నాయనింగారికి సామంతుడుగా ఉండేవాడు. అతని తండ్రి వెంకటప్ప, తాత వెంగళప్ప. వెంకటపతి నాయనింగారు రావుల వెంగళప్పకు నెల్లూరు జిల్లాలోని వీరాన్నకనుపూరు అనే గ్రామాన్ని అమరంగా ఇచ్చాడు. అతడు ఆ గ్రామంపై వచ్చే సుంకాలను ఆ గ్రామంలోని విశ్వేశ్వర ఆలయానికి దానం చేసి శాసనం వేయించాడు.

రావుల వెంకటాద్రి-సర్వేపల్లి సీమ: ఈ వంశానికి చెందిన రావుల వెంకటాద్రి అనే మరొక అమర నాయకుని పేరు కూడా తెలుస్తోంది. ఇతడు రావెళ్ల ముద్దుకృష్ణప్ప నాయనింగారి సామంతుడు. ముద్దుకృష్ణప్ప రావుల వెంకటాద్రికి నెల్లూరు జిల్లా,సర్వేపల్లి సీమలోని కోడూరు గ్రామాన్ని అమరంగా ఇచ్చాడు. వెంకటాద్రి ఆ గ్రామంలో ఒక చెరువును తవ్వించి శాసనం వేయించాడు. ఇంకా రావుల వెంకటాద్రి శాసనాలు మదవనూరు, నారికేళపల్లి అనే గ్రామాలలో కూడా ఉన్నాయి.

పొత్తపి, పులుగునాడు- దివాన్ గిరులు: కడప సుభాలోని పొత్తపి, పులుగునాడులు క్రీ.శ.1753 ప్రాంతాన మట్ల వెంకటరామరాజు అనే వ్యక్తి పాలనలో ఉండేవి. ఇతడు కడప నవాబు సామంతుడు. ఇతనికి మూడు వేల సైన్యం ఉండేది. ఆ సైన్యానికి కమ్మ కులస్థుడైన చందూరి ముసిలినాయుడు సైన్యాధిపతిగా ఉండేవాడు. కడప నవాబు మసీదుఖాన్ ఆజ్ఞ మేరకు చందూరు ముసిలినాయుడు వేముల వారి కోట మీదకు దండెత్తి కోటను స్వాధీనపరచుకున్నాడు. అందుకు ప్రతిఫలంగా నాయడుకు 5 గ్రామాలు ఇవ్వబడ్డాయి. తర్వాత కొద్ది కాలానికి ముసిలినాయుడుకు వెంకట్రామరాజుకు సరిపడక అతడు మహారాష్ట్రుడైన బలవంతరావు సైన్యంలో ఫౌజుదారుడుగా చేరాడు. ముసిలినాయుడు స్థానంలో అతని తమ్ముడు చక్రప్పనాయకుడు వెంకట్రామరాజు దివానుగా చేరాడు. ముసిలినాయుడు బలవంతరావు ఆదేశం మీద కడప రానా, సిద్ధవటం కోట మరికొన్ని జమీలను లూటీ చేశాడు. తర్వాత ముసిలినాయుడు వెంకటగిరి జమీలో చేరి జూపల్లెవారి ఆధీనంలోని పొదిలి,

మార్కెర్ సీమలను వెంకటగిరి జమీలో చేర్చారు. అందువల్ల అతనికి దేవరపల్లి జాగీరు ఇవ్వబడింది. ఈ స్థితిలో వెంకటరామరాజుకు, బసవంతరావుకు కడప నవాబుకు సంధి కుదిరింది. అందువల్ల మునినాయుడు తిరిగి వెంకటరామరాజు కొలువులోకి తిరిగి వచ్చాడు. సరదార్‌ఖాన్ కోసం సంస్థానాధిపతులు గ్రామాలను కేటాయించుకుండేవారు. కడప నవాబు అనతి పైన మునినాయుడు వారిని ఓడించి వారి కోటలు ఆక్రమించాడు. అందుకు ప్రతిఫలంగా నవాబు నాగసానిపల్లె జాగీరు మునినాయుడుకు ఇచ్చాడు. క్రీ.శ.1765లో తిప్పిరెడ్డిపల్లె సంస్థానాధీశుడు తిరుగుబాటు చేయగా అతనిని కూడా మునినాయుడు అణచివేశాడు. ఇతడు ఉదయగిరిలో ఒక చింతవనాన్ని వేయించాడు. ఈ కమ్మసేనాని మునినాయుడు క్రీ.శ.1769లో మరణించాడు. అతని తమ్ముడు చక్రపనాయుడు తన పేరుతో ఒక పేటను, తన తండ్రి సర్వప్ప పేరుతో మరొక పేటను నిర్మించాడు. తర్వాత మునివాడు రెండవ సర్వప్ప. పొత్తపి, ఫౌజుదారులకు దివాన్ అయ్యాడు. అప్పుడు మళ్ళ వెంకటరామరాజు మరణించి మళ్ళ అప్పయరాజు జాగీరుదారయ్యాడు. క్రీ.శ.1782లో అరణి వద్ద హైదరు సేనతో పోరాడుతూ అప్పయరాజు మరణించాడు. అతని పైనను కుమారుల తరఫున మునివాడి సర్వప్ప సంస్థానాన్ని పాలించాడు. ఇతని తమ్ముడు జంగమనాయుడు చిట్వేలి జాగీరుకు దివాన్ అయ్యాడు. చిట్వేలు అధిపతి పేరు వెంకటరామరాజు. అతనికి దివాన్‌గా జంగ నాయుడు చిట్వేలుని చక్కగా పాలించాడు. ఆ కాలంలో ఎవరు ఎక్కువ పేష్కష్ చెల్లిస్తే జాగీరులు వారికి ఇవ్వబడేవి. ఆ పద్ధతిని హైదరాబాద్ దివాన్ చందూలాల్ ప్రారంభించాడు. క్రీ.శ.1800 సంవత్సరంలో సైన్య సహకార పద్ధతి ప్రకారం నిజాం ఆలీ రాయలసీమ జిల్లాలు ఈస్టిండియా కంపెనీకి దత్తం చేశాడు. ఇంగ్లీషు గవర్నర్ మన్రో రాయలసీమలో పాలెగాండ్రను అణచివేసి తొలగించి వారి ఎస్టేట్లను ఆక్రమించాడు. దాంతో అందరు పాలెగాళ్ళతో పాటు పొత్తపి, ఫౌజుదారుల జమీలు కూడా వెంకటరాజు సంతతి వారు పోగొట్టుకున్నారు.

పెదక మంచి - నాయుడునాయుడు - అహోబలనాయుడు: వీరు కూడా కమ్మ వీరులే. వీరు కడప నవాబును ఆశ్రయించి క్రీ.శ.1770లో కలువాయిపాడు మొదలైన గ్రామాలతో కూడిన జమీని సంపాదించి పాలించారు. 1800లో వారి జమీ కూడా ఈస్టిండియా కంపెనీ వారి వశమైంది.

వెలిసేటివారు: వెలిసేటి వారు కూడా కమ్మ కులస్థులలో ఒక శాఖ వారు. ఈ వంశానికి చెందిన మల్లికార్జున దొర అనే అతడు క్రీ.శ.1660-67 సంవత్సరాల మధ్య కళింగ దేశం పోయి అక్కడ విజయనగరాధీశుడైన పూసపాటి ఆనందగజపతి వద్ద సేనాధిపతిగా చేరాడు. అతడు అక్కడ బంటుపల్లి అనే ఊరును కట్టించి అందులో మల్లికార్జునాలయాన్ని నిర్మించాడు. ఇతని కుమారులలో రెండవ తిరుపతి దొర క్రీ.శ.1687-1718 సంవత్సరాల మధ్య సేనాధిపతిగా చేసి సతివల్లి గ్రామాన్ని నిర్మించాడు. ఇతని కుమారుడు చినకొండ్రాయుడు క్రీ.శ.1712 నుండి 1757 వరకు సేనాధిపతిగా చేశాడు. ఇతని కాలంలో పెద విజయరామరాజు ఫ్రెంచి వారితో కలిసి బొబ్బిలి కోటను నాశనం చేశాడు. ఇతనితో పాటు బొల్ల గురప్పదొర అనే మరొక సేనాధిపతి ఉండేవాడు. గోల్కొండ నవాబు ఆజ్ఞపై అతని సేనానులు దావుద్‌ఖాన్, జాఫర్ అలీ శ్రీకాకుళ కోటను వశపరచుకోవాలని వచ్చారు. చినకొండ్రాయుడు, బొల్లగురప్ప వారిని ఎదిరించి మొదట ఓడిపోయారు. తర్వాత విజృంభించి గోల్కొండ సేనానులను ఓడించారు. కాని యుద్ధంలో గురప్పదొర మరణించాడు. విజయం సాధించినందుకు కొండ్రాయుడికి విజయరామరాజు అనేక బహుమతులు ఇచ్చాడు. ఇతని తర్వాత కామనాయుడు కృష్ణాయుడు విజయనగర గజపతుల వద్ద సేనాధిపతులుగా కొనసాగారు. ఆనందగజపతి కాలంలో ఫ్రెంచి వారికి, ఇంగ్లీషు వారికి మధ్య చెందుర్తి వద్ద జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు. క్రీ.శ.1790-1815 మధ్య పాలించిన నారాయణ గజపతి కాలంలో ఈ వంశానికి చెందిన గురునాయుడు గొప్ప సేనానిగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు కొక్కొండ గోపికాంత కవి చేత ధర్మనందన విలాసం అనే ప్రబంధాన్ని రాయించి కృతి పొందాడు. ఇప్పటికీ వెలిసేటి వారు విజయనగరం జిల్లాలో ఉన్నారు. 18వ శతాబ్దంలో బొమ్మినేని వారు, కొమ్మినేని వారు అనే వంశాలకు చెందిన కమ్మ సేనానులు విజయనగర గజపతుల వద్ద సేనానులుగా పని చేశారు.

పులివర్తి సీమ: క్రీ.శ.1560 ప్రాంతంలో పులివర్తి సీమను సూర్యదేవర పెదనాయునింప, చిననాయునింప అనే కమ్మనాయకులు పరిపాలించారు. 1579వ సంవత్సరంలో ఈ సీమలో సూర్యదేవర వారికి కుతుబ్‌షా సామంతుడైన మహారాష్ట్ర సేనాధిపతి రావుకే తనాన్ని ఇచ్చాడు. మాణిక్యరావు అనే అతనికి మన్నె పదవిని ఇచ్చాడు. రాచూరికోటను సూర్యదేవర వారు వశం చేసుకున్నందువల్ల కోపంతో మాణిక్యరావు వీరి జమీని ఆక్రమించాడు

సూర్యదేవర వారు నేటికీ గుంటూరు జిల్లాలో ఉన్నారు. చిరుమామిళ్ల నాయుడమ్మ, కోదండరామ, రామానాయుడులు వాసిరెడ్డి ప్రతిపద్మనాభుని కుమార్తె అయిన రమణమ్మ కుమారులైన వీరు ముగ్గురూ క్రీ.శ.1760 ప్రాంతానికి చెందినవారు. వీరు, వాసిరెడ్డి వారు రాజబంధువులైనందువల్ల వాసిరెడ్డి వారి సంస్థానంలో సేనాధిపతులుగా పనిచేశారు. ఈ వంశానికి చెందిన చిరుమామిళ్ల పాపయ్య చేత పూడి కృష్ణయ్యచేత శకుంతలా పరిణయం అనే గ్రంథం రాయించాడు. వీరి వంశంలో వీరికంటే ముందుతరానికి చెందిన చిరుమామిళ్ల వెంకటపతి 1748లో కమ్మ వారికి, వెలమ వారికి జరిగిన యుద్ధంలో పాల్గొన్నారు.

మేదూరి సీమ - కోనేరు రామచంద్రుడు: క్రీ.శ.1698వ సంవత్సరంలో కమ్మ కులానికి చెందిన కోనేరు రామచంద్రుడు వెలమ జమీందారు అయిన వెల్లంకి గోపాలరావు, వరికొండ వస్సంరాజులు కలిసి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు వద్ద మేదూరి సీమ జమలవారి పరగణాలకు సమిష్టిగా దేశపాండ్య సనద్‌ని పొంది పాలించారు.

కల్‌దిండి సీమ: 18వ శతాబ్దంలో కామినేని పెదబోగినేడు అనే కమ్మ కులస్తుడు పాలించాడు. ఇతనికి గండభేరుండ, దానరాధేయ అనే బిరుదులున్నాయని చాటువులు చెబుతున్నాయి. ఇతని తండ్రి గురవయ్య గురువు పెద్దింటి అప్పలాచార్య. ఇతని వంశంలోని చినబోగి నేడు కూడా దాతగా పేరు పొందాడు.

కొప్పర్రు సీమ: క్రీ.శ.1766 ప్రాంతంలో వాసిరెడ్డి రామన్నగారి వద్ద కొప్పర్రు గ్రామస్థులైన కమ్మవీరులు సర్దార్ బొల్లేపల్లి తిరువెంగళప్పనాయుడు, బత్తిని శింగరప్ప, నరసన్ననాయుడులు కొప్పర్రు పరిసర గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడుటకు సర్దారులుగా నియమింపబడ్డారని లోకల్ రికార్డు 57వ వాల్యూమ్ 66వ పేజీలో ఉంది. వీరిలో బత్తిని శింగరప్ప, నరసన్ననాయడులు అంతకు పూర్వం అద్దంకి పాలకులైన మందపాటి వారి వద్ద ఉద్యోగులుగా ఉండేవారట. వీరి తర్వాత క్రీ.శ.1770లో చల్లా వెంకటపతినాయుడు కొప్పర్రి, గొల్లపల్లి అప్పరాజుపల్లెలపై మన్నెకావలి రుసుముల హక్కును సాధించి పాలించాడు.

పెమ్మసాని కుమార తిమ్మానాయడు క్రీ.శ.1675 ప్రాంతంలో గోల్కొండ నవాబు అబ్దుల్లా కుతుబ్‌షా సామంతుడుగా చంగల్‌పట్టు జిల్లా ప్రాంతాన్ని పరిపాలించాడు. అతడు తిరునిన్ రాయూరులో కొన్ని పన్నులను చెరువు నిర్మాణానికి ఉపయోగించి ఒక శాసనాన్ని రాయించాడు. అందువల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. 1750 ప్రాంతంలో ఒక్కలగడ్డ వీరప్ప కొన్ని గ్రామాల ఇజారాదారుడుగా లోకల్ రికార్డు 10వ వాల్యూమ్‌లో ఉంది. క్రీ.శ.1676లో కూచి వెంకటగిరి, వెంకటాద్రి, వెంకటపతినాయుడు కొన్ని గ్రామాలను గుత్తకు తీసుకొని అందులో ఎలిపుట్ల గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం ఇచ్చినట్లు లోకల్ రికార్డులో ఉంది.

శాఖమూరి వారు: విజయనగర యుగంలో శాఖమూరి వంశానికి చెందిన కమ్మ సేనాధిపతులు ప్రసిద్ధిలోనికి వచ్చారు. శాఖమూరి వారు కొందరు క్రీ.శ.1616లో జరిగిన తోపూరు యుద్ధంలో గొగ్గారి జగ్గరాజు పక్షం వైపు నిలిచి పోరాడి వెలుగోటి మేచరు భూపతి చేతిలో ఓడి పారిపోయినట్లు వెలుగోటివారి వంశావళి తెలుపుతోంది. క్రీ.శ.1622లో శాఖమూరి అనంతప్ప ఉదయగిరిలో ఒక గ్రామ పెద్దగా ఉన్నట్లు నవాబు కరిణీకం మాన్యాన్ని ఇచ్చిన ఒక శాసనంలో పేర్కొనబడింది. ఈ వంశంలో శాఖమూరి రఘునాయక ప్రభువు కుమారుడు వెంకటనారసింహుడు మన్నెరాజని, అతడు కొన్ని యుద్ధాలలో పాల్గొన్నాడని చాటువులు తెలుపుతున్నాయి. తర్వాత కాలంలో శాఖమూరి వారు వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు వద్ద సేనాధిపతులుగా పని చేశారు.

సూర్యదేవరవారు - పులివర్రు సీమ: విజయనగర యుగంలో గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాను పులివర్రు సీమ అని పిలిచేవారు. అందులో 50 గ్రామాలుండేవి. ఇది ఒక చిన్న నాయంకరం. ఈ నాయంకరాన్ని సూర్యదేవర వారు అనే కమ్మ సేనానులు పాలించారు. వీరికి ఓరయూరు పురవిహార, పులియ తలాటరాయ, గంధబేరుండ, పులియమార్కొలు గండ, కరవాల భైరవ, గండరగండ, రాజీవ చూరకార, విశాఖపట్టణ తలగుండ గండర, కటక హన్నిబ్బరగండ మొదలైన బిరుదులున్నాయి. ఈ బిరుదులను బట్టి ఈ వంశం వెలనాటి చోడుల కాలం నుంచీ ఉన్నట్లు, వారు చోళ చాళుక్యుల సామంతులుగా తెలుస్తోంది. తర్వాత వారు విజయనగర సామంతులై ఉండవచ్చు. వీరికి వెండికోర తాంబూలం, పడిమిడికోర శస్త్ర, కనకదండ అందలం, హనుమంతుని ధ్వజాన్ని కలిగి ఉండే గౌరవ మర్యాదలుండేవని లోకల్ రికార్డులలో ఉంది. వీరిది తెప్పర్ల గోత్రం.

సూర్యదేవర తిమ్మ నృపాలుడు: ఈ వంశంలో మొదట తెలియవచ్చే పేరు సూర్యదేవర తిమ్మనృపాలుడు. అతడు పులివర్రు సీమలోని రాచూరు, పేటేరు కోటలను నిర్మించాడు. ఇతడు విరూపాక్షరాయల కాలం నాటివాడు. అతని కుమారులు ఎర్రనృపాలుడు, ముసలయనాయకుడు. వారు సాళువ నరసింహరాయల సామంతులుగాని,

శ్రీకృష్ణ దేవరాయల సామంతులు గాని అయి ఉండవచ్చు. ఈ వంశంలోని ఈ ముగ్గురు పేర్లు మాత్రమే తెలుస్తున్నాయి. వీరు గజపతులతో ఆరుట్ల కోట యుద్ధంలో పోరాడినట్లు చాటుపద్యాలు తెలుపుతున్నాయి. ఈ వంశస్తులు గజపతులతో పోరాడి విశాఖపట్టణ తలగొండుగండర, కటక హన్నిబ్బర గండ అనే బిరుదులు పొందారు. అత్తలూరు వద్ద గజపతుల ఏనుగుదళంతో వీరు పోరాడారు. అందువల్ల వారికి ఆ బిరుదులు వచ్చాయని తెలుస్తోంది. ఈ యుద్ధం సాలువ నరసింహరాయల కాలంలోగాని, శ్రీకృష్ణదేవరాయల కాలంలోగాని జరిగి ఉండవచ్చని భావింపబడింది. తిమ్మన్నపతి తర్వాత ఎర్రన్నపాలుడు పులివర్రుసీమకు పాలకుడయ్యాడు ఇతడు తిమ్మన్నపాలుని సోదరుడని కూడా ఒక భావన ఉంది.

ఎర్రనృపాలుడు- సూర్యదేవర ముసలయనాయకుడు: తిమ్మభూపాలుని తర్వాత ఎర్రనృపతి రాజ్యానికి వచ్చి నక్కెత్తురగండ, మహిమతొఖెడి కరవాలభైర, దుష్టగోగులమారిమర్దన మొదలైన బిరుదులు ధరించాడు. అతని తర్వాత సూర్యదేవర ముసలయనాయకుడు పులివర్రుసీమ అధిపతి అయ్యాడు. ఇతడు తిమ్మన్నపతి కుమారుడు ఇతడు ఆరుట్ల కోట యుద్ధంలో అమిత పరాక్రమం చూపాడు. ఇతడు కృష్ణదేవరాయల సమకాలికుడని భావింపబడింది. కనుక ఇతని కాలం క్రీ.శ.1520 అని చెప్పవచ్చు. ఆరుట్ల కోట వద్ద గజపతులకు శ్రీకృష్ణదేవరాయలకు యుద్ధం జరిగింది. అల్లసాని పెద్దన రచించిన ఒక చాటు పద్యంలో కూడా ఆరుట్ల కోట యుద్ధ ప్రశంస ఉంది. తర్వాత ఈ వంశస్తులను గురించిన వివరాలు తెలియవు. తళ్లికోట యుద్ధం తర్వాత ఈ ప్రాంతం గోల్కొండ నవాబుల వంశంలోకి వచ్చింది. క్రీ.శ.1600 సంవత్సరంలో పులివర్రు సీమను నరసింహన్నపాలుడు పాలిస్తున్నట్లు లోకల్ రికార్డులోని 41 సంపుటం, 471 పేజీలో ఉంది. దానిని బట్టి సూర్యదేవర వంశం గోల్కొండ నవాబుల సామంతుడుగా కొనసాగినట్లు ఊహించవచ్చు. క్రీ.శ.1687లో ఔరంగజేబు కాలంలో గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగం అయింది. కొండవీడు సర్కారు అంటే మూర్తిజానగర్‌పై మొగల్ అధికారం ప్రతిష్ఠించబడింది. క్రీ.శ.1690లో హైదరాబాద్‌లోని ఔరంగజేబు సేనాధిపతులు రోహల్లాఖాన్, బసరత్‌ఖాన్‌లు వెలమ వంశస్తుడైన మాణిక్యరావు రామారావుకు కొండవీడు సర్కారును ఇచ్చినట్లు ఒక ఫర్మానా ఉందని కృష్ణా జిల్లా మాన్యువల్‌లో ఉంది. కనుక సూర్యదేవర వంశస్తుల పులివర్రు సీమలో తమ అధికారం కోల్పోయినట్లు చెప్పవచ్చు.

ధూపాటిసీమ-సాయపనేని వారు: విజయనగర సామ్రాజ్యంలో ధూపాటి సీమ కూడా ఒక నాయంకరంగా ఉండేది. ఇందులో 533 గ్రామాలున్నాయని స్థానిక రికార్డు 33వ వాల్యూంలో ఉంది. ఈ సీమను సాయపనేని వారను మరొక కమ్మశాఖ పాలించింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఈ సీమను సాయపనేని సాయపనాయుడు అనే అతడు 20 సంవత్సరాలు పాలించాడు. క్రీ.శ.1564 ప్రాంతంలో అళియ రామరాయల కాలంలో సాయపనేని గంగపనాయకుడు పాలించాడు. అతని తర్వాత 1589లో గంగప నాయకుని కుమారుడు సాయపనేని వెంకటాద్రినాయకుడు పాలించాడు. అతడు రెండవ వెంకటపతి రాయల సామంతుడు. వెంకటాద్రి తర్వాత అతని కుమారుడు సాయపనేని రెండవ గంగప్పనాయకుడు క్రీ.శ.1614లో పాలించాడు. ఇతడు కూడా రెండవ వెంకటపతిరాయల సామంతుడు. ఇతడు క్రీ.శ.1614లో త్రిపురాంతకదేవునికి గార్లదిన్నె, గుర్రపుశాల, చిన్నరాయనిపల్లె మొత్తం నాలుగు గ్రామాలను దానం చేసి శాసనాలు వేయించాడు. గంగప్ప నాయకుని తర్వాత ధూపాటిసీమను అతని కుమారుడు సాయపనేని తిమ్మానాయుడు పాలించాడు. ఇతడు రామదేవరాయలకు సామంతుడు. తిమ్మానాయకుని అనుమతితో నాగిశెట్టి అనే అతడు సిద్ధాపురంలో కొన్ని దేవరలను ప్రతిష్ఠించి మాన్యాలు ఇచ్చినట్లు లోకల్ రికార్డు 15వ వాల్యూం 321వ పేజీలో ఉంది.

విజయనగర సామ్రాజ్య కాలం నాటి కమ్మ సేనాధిపతులు: లోకల్ రికార్డుల ద్వారా, దాన శాసనాల ద్వారా విజయనగర యుగం నాటి అనేక మంది కమ్మ సేనానుల పేర్లు తెలుస్తున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలంలో కొంత కాలం వాసిరెడ్డి మల్లికార్జునుడు అనే కమ్మ సేనాధిపతి కొండవీటిని పాలించాడు. అచ్యుతరాయల కాలంలో గోల్కొండ సేనాని హైదర్‌జంగ్ కొండవీటిపై దండెత్తాడు. వాసిరెడ్డి మల్లికార్జునుడు అతనితో పోరాడి అతనిని చంపి తను కూడా యుద్ధంలో మరణించాడని లోకల్ రికార్డులు తెలుపుతున్నాయి. ఇతనికి వాసిరెడ్డి మల్ల ప్రభువు అని కూడా పేరుంది. చిరుమామిళ్ల పెద్దన్నపాలుడు శ్రీకృష్ణదేవరాయల గజసైన్యాధిపతిగా ఉండే వాడని వీరి వంశంలోని చిరుమామిళ్ల పాపయ్య రాయించిన శకుంతలా పరిణయం అనే కావ్యం ఉంది. రావికొండ నాయనింగారు, రామినాయనింగారలు సదాశివరాయల కాలంలో ఒంగోలు ప్రాంతానికి పాలెగాండ్రుగా ఉండి

పొందూరు గ్రామాన్ని తిరువెంగళదేవునికి దానం చేశారు. ఈ దానాన్ని తాళ్లపాక తిరుమలయ్యగారి పుణ్యానికి చేశారు. ఇతడు వారికి గురువు కావచ్చని భావింపబడింది. గోళ్లచినరామ పెదరామ నృపాల అనే వారు నన్నెందల్, చంద్రగిరి పాలకులు. వీరు అచ్యుతదేవరాయల సామంతులు. వీరిలో పెదరామనృపాలుడు తిరువెంగళ కవి చేత చొక్కనాథ చరిత్ర అనే కావ్యాన్ని రాయించి కృతి పొందాడు. చినరామ, పెదరామ ఇద్దరూ తిరుపతి వెంకటేశ్వర తిరువీధి ఉత్సవానికి 15000 ఫణాలను దానం చేశారు. సూరనాయని తిమ్మసురయ్య క్రీ.శ.1511లో అమ్మనబ్రోలు సీమలోని కొచ్చర్లకోట, గొనుగుంట్ల మొదలైన గ్రామాల నాయంకరానికి పాలెగాడుగా ఉన్నాడు. అతడు గొనుగుంట్లలోని అమరేశ్వరస్వామికి దానం చేసి శాసనం రాయించాడు. ఆ శాసనం వల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. కూరపాటి అయ్యపనాయకుడు కృష్ణదేవరాయల కాలం నాటి వాడు. కూరపాటి గోపినీడు క్రీ.శ.1553లో పలనాడులోని దుర్గిలో వంకేశ్వరాలయానికి స్తంభాలు నిర్మించాడు. వెచ్చాని నారయ్య అనే అతడు క్రీ.శ.1536లో అచ్యుతదేవరాయల కాలంలో పెదవటం సీమ పాలెగాడుగా ఉండేవాడు. రావెళ్ల ముద్దుకృష్ణప్ప నాయకుడు పెందోటి పాలకుడుగా ఉండేవాడు. దాన శాసనాల వల్ల ఆ నాటి కొందరు కావ్యకర్తల పేర్లు కూడా తెలుస్తున్నాయి. గొడుగు భూమానాయకుడు, గొడుగు పాపినాయుడు, వేముల చెన్నమయ్య, దేవాభక్తుని కొండయ్య, ఏనుగుల కేశవనాయుడు, అబ్బనేని వెంకన్న, సుంకర బెన్నరసు, పీతాంబరయ్య, కంభాలపాటి మాదానాయుడు, దేవినేని కొండయ్య, పరుచూరి పాపారాయుడు, గంగినేని లింగమనేడు- వీరందరూ సదాశివరాయల కాలం నాటి వారు.

దొనకొండ రాజ్యం: నెల్లూరు జిల్లాలో పెన్న లేక పినాకిని, కండ్లేరు, మూసి, పాలేరు, మన్నేరు, స్వర్ణముఖి అనే చిన్న నదులు ఉన్నాయి. పూర్వం పూంగినాడు ఉత్తరం, పడమర- ఉదయగిరి, పడమర ముండైనాడు, మూసీ పెన్నా నదుల మధ్య, దానికి తూర్పు దక్షిణంగా పాకనాడు ఉదయగిరికి రక్షణంగా హిరణ్య రాష్ట్రం, దక్షిణంగా వెంగొ నాడులున్నాయి. రెండవ దేవరాయల నాటి ఒక శాసనం దొనకొండ పిన ఏరువలో భాగంగా ఉందని తెలుపుతోంది. కొచ్చెర్లకోట దర్శికి పశ్చిమంగా 23 మైళ్ల దూరంలో ఉందని, అది కొండవీటి రాజ్యంలో ఉందని అచ్యుతదేవరాయల తామ్రశాసనం తెలుపుతోంది. ఏరువనాడు కమ్మనాడుకు పశ్చిమంగా ఉండేది. ఇందులో పొదిలి, దర్శి, బద్వేలు, సిద్ధవటం, మార్కాపూరు తాలూకాలు ఉండేవి. విజయనగర రాజులు మొదట సాధించింది ఉదయగిరి సీమ. దీనిని మొదటి కంపన మొదటి హరిహరుని సోదరుడు క్రీ.శ.1346లో రెడ్డిరాజుల నుండి జయించాడు. అప్పటి నుంచి ఇది ఒక ముఖ్య రాజ్యంగా కొనసాగింది. రాజవంశస్తులు ఇక్కడ రాజప్రతినిధులుగా ఉండేవారు. 1390 నాటి అద్దంకి క్షేత్రంలోని పరుచూరు శాసనం మొదటి దేవరాయల కుమారుడు రామచంద్ర ఉదయగిరి రాజు అని తెలుపుతోంది. అదే కాలంలో దొనకొండను కప్రతిదేవ లేక చామె ఓడేయలు పాలిస్తున్నాడు. దొనకొండలో విష్ణు, గంగ, పలనాటి వీరుల దేవాలయాలు ఉన్నాయి.

దొనకొండ రాజ్యం

కప్రతిదేవ - చామె ఒడేయలు ↓ గుమ్మదూరి కామయదేవ మహారాజు తండ్రి రామయదేవ మహారాజు మహామండలేశ్వర అంత్యంభరగండ ↓ గుమ్మదూరి కొండరాజు మహామండలేశ్వర మహారాజాధిరాజ రాజపరమేశ్వర ↓ చిన్నరాజు తండ్రి దేవమహారాజు క్రీ.శ.1433

మొదటి దేవరాయలు 1406-22 సమకాలికుడు ↓ రెండవ దేవరాయలు 1426-46 సమకాలికుడు

కృష్ణదేవరాయల కాలంలో ఈ రాజ్యం దేవర దొనకొండ అని పిలువబడింది.

ఇక్కడి కృష్ణరాయల శాసనంలో వీరప్రతాప కృష్ణదేవరాయ, మహారాజాధిరాజ రాజపరమేశ్వర, మూరు రాయరగండ, అరిరాయ విభల అష్టదిగ్గజ మనోభయంకర, బానదప్పవరాయరగండ పూర్వ దక్షిణ పశ్చిమ సముద్రాధీశ్వర, యవనరాజ్య స్థాపనాచార్య, అశ్వపతి, గజపతి విభల-రాజధాని విద్యానగరం, సింహాసనం

వజ్రసింహాసనం అని పేర్కొనబడింది.

హండే నాయకుల వంశం: రామరాయల కాలంలో హండే నాయకులు అనే వంశం ప్రఖ్యాతిలోకి వచ్చింది. రామరాయలు చేసిన యుద్ధాలలో హనుమప్ప అనే హండే నాయకుడు సాధించిన విజయాలకు మెచ్చి రామరాయలు హనుమప్పను అనంతపురం పరిసర ప్రాంతాలకు పాలెగాడుగా నియమించాడు. మొదటి శ్రీరంగరాయల కాలంలో హనుమప్ప కుమారుడు తిమ్మప్పనాయకుడు విజయనగర రాజ్యానికి వ్యతిరేకంగా బీజాపూరు సుల్తాన్ అలీ ఆదిల్‌షాతో చేరి పెనుగొండ దాడిలో పాల్గొన్నాడు. తిమ్మప్ప కుమారుడు మలకప్ప నాయకుడు తిరిగి విజయనగర రాజ్యం వైపు చేరిపోయాడు. కానీ కొద్దికాలానికి బీజాపూరు సుల్తాన్‌తో చేరిపోయాడు. 1579లో అతడు గోల్కొండ నవాబు వైపు చేరి విజయనగర రాజ్యానికి చెందిన కర్నూలు జిల్లాలోని తూర్పు ప్రాంతాలు గోల్కొండ నవాబు జయించడానికి సహాయపడ్డాడు. శ్రీరంగరాయలు కొండ్రాజు వెంకటరాజు అనే సేనాధిపతిని పంపి మలప్పనాయకుని ఓడించి అతని జాగీరును ఆక్రమించాడు. అతని వారసుల విజయనగర చక్రవర్తిని అర్థించి తిరిగి తమ ప్రాంతాన్ని పొంది తమ జాగీరును పాలించారు. మలకప్ప తర్వాత ఈ వంశానికి చెందిన చాలామంది పాలెగాండ్రు పాలించారు. వారిలో హంపనాయుడు క్రీ.శ.1619-31, సిద్ధప్పనాయుడు క్రీ.శ.1631-59, పవడప్పనాయుడు 16569-71, సిద్ధప్పనాయుడు 1671-96, ప్రసన్నప్ప నాయుడు 1696-1720, పవారప్పనాయుడు 1720-37 ముఖ్యులు. ఈ పవారప్పనాయుడి కాలంలో రాయదుర్గ పాలెగాడు వీరి రాజ్యంపై దండెత్తి ధర్మవరాన్ని ఆక్రమించాడు. పవారప్ప మరణానంతరం అతని భార్య రామక్క రాజ్యాన్ని కొంతకాలం పాలించింది. ఆమె కుమారుడు సిద్ధప్ప 1737-40 సంవత్సరాల మధ్య మైనర్ బాలుడు మొగలుల కాలంలో వీరి రాజ్యం మొగలులకు సామంత రాజ్యం అయింది. తర్వాత వచ్చిన రామప్ప 1740-52 కాలంలో మహారాష్ట్రులు ఈ రాజ్యంపై దండెత్తారు. అతని చివరి కాలంలో బళ్లారి పాలెగాడు ఇతని రాజ్యంపై దండెత్తి ఇతనిని సంహరించాడు. అతని కుమారుడు సిద్ధప్పను బావమరిది బసప్పను ఖైదు చేశాడు. కాని వారు తప్పించుకొని పోయారు. 1753లో సిద్ధప్ప తన రాజ్యాన్ని తిరిగి పొందాడు. అతడు హైదరాలీ సామంతుడయ్యాడు. కాని పేష్కస్ సరిగా చెల్లించలేదని అతని రాజ్యంపై సైన్యాన్ని పంపి రాజ్యాన్ని ఆక్రమించి అతని ముగ్గురు కుమారులలో ఇద్దరిని తన సైన్యంలో చేర్చుకున్నాడు. కాని వారు ఒక యుద్ధంలో మరణించారు మూడవ కుమారుని శ్రీరంగపట్టణంలో ఖైదు చేశాడు. టిప్పుసుల్తాన్ కాలంలో సిద్ధప్ప తప్పించుకున్నాడు. అందుకు ప్రతీకారంగా టిప్పు అతని కుటుంబంలోని వారందరినీ ఉరితీయించాడు. టిప్పు మరణం తర్వాత సిద్ధప్ప మూడవ కుమారుడు తన రాజ్యాన్ని ఆక్రమించాడు. కాని 1799 సంధి ప్రకారం ఇతని రాజ్యం నిజాం ఆలీఖాన్‌కు వచ్చింది. నిజాం ఆలీ అతనికి సిద్ధరాంపురం అనే చిన్న జాగీరు ఇచ్చాడు. కాని 1800 సంవత్సరంలో మన్రో వీరి రాజ్యాన్ని బ్రిటిష్ రాజ్యంలో కలిపాడు. దాంతో విజయనగర యుగంనాటి హండె నాయకవంశం అంతమైంది.

కుందుర్పి నాయక వంశం: కళ్యాణీ దుర్గ తాలూకాలోని కుందుర్పి అనే గ్రామాన్ని రాజధానిగా చేసుకొని విజయనగర యుగం నాటి ఒక నాయకవంశం పాలించింది. ఆ వంశస్తులకు కుందుర్పి వంశం అని పేరు మూడవ వెంకటపతి రాయలు కోనేటినాయక అనే అతని పరాక్రమాన్ని మెచ్చుకొని పెనుగొండ దుర్గాధిపతిగా నియమించాడు. కాని కొద్దికాలంలోనే బీజాపూరు సుల్తాన్ పెనుగొండను ముట్టడించి కోనేటి నాయకుడు పెనుగొండను వదిలి వెళ్తే కుందుర్పినిస్తానని రాయబారం పంపాడు. అందుకు కోనేటి నాయకుడు అంగీకరించాడు. అందువల్ల 1652లో బీజాపూరు సుల్తాన్ అతనికి కుందుర్పినిచ్చాడు. అప్పుడు కోనేటినాయకుడు కుందుర్పిని తన రాజధానిగా చేసుకున్నాడు. తర్వాత అతడు రాయదుర్గంపై దండెత్తి అక్కడ నిరంకుశంగా పాలిస్తున్న బొమ్మల్ల నాయకుని ఓడించి అక్కడ కూడా తన అధికారాన్ని ప్రతిష్టించాడు. కోనేటినాయకుడు గొప్ప పరిపాలనా దక్షుడని, రైతులకు అనేక సౌకర్యాలు కల్పించాడని అతని శాసనాలు తెలుపుతున్నాయి. అతని తర్వాత అతని కుమారుడు వెంకటపతినాయక రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో చితల్‌దుర్గ పాలెగాడు రాయదుర్గంపై దండెత్తాడు. అతనిని ఓడించి రాయదుర్గాన్ని కాపాడుకున్నాడు. అతడు కూడా తన తండ్రిలాగే ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టాడు. అతని తర్వాత అతని మైనర్ కుమారుడు, అతని తల్లి లచ్చరామ అమ్మవారు రాజ్యపాలన చేపట్టినట్టు రాయదుర్గంలోని రంగసముద్రం శాసనం తెలుపుతోంది. అక్కడ ఆమె ఒక చెరువును తవ్వించి శక 1648 క్రీ.శ.1726వ సంవత్సరంలో శాసనాన్ని వేయించింది. తిమ్మప్ప పెద్దవాడైన తర్వాత రాజ్య భారం చేపట్టాడు. అతని కాలంలో చితల్‌దుర్గ పాలకుడు రెండు పర్యాయాలు దండెత్తాడు. తిమ్మప్ప అతనిని ఓడించి

మహారాజ అనే బిరుదు ధరించాడు. రాయదుర్గం, కళ్యాణీదుర్గం తాలూకాలలో లభించిన అనేక శాసనాలు ఇతనిని ప్రస్తావిస్తున్నాయి. అతని తర్వాత అతని కుమారుడు రెండవ వెంకటపతి అనేక శాసనాలలో ప్రస్తావించబడ్డాడు. కాని అతనిని ఆ శాసనాలు దళవాయి అని పేర్కొన్నాయి. అతని తర్వాత అతని పెద్దకుమారుడు కోనేటి నాయకుడు రాజ్యానికి వచ్చాడు. అతడు చాలా పరాక్రమవంతుడు. అతడు బెద్నూరు, హర్పనపల్లి పాలెగాళ్లను కలుపుకొని తమ రాజ్యానికి శత్రువైన చితల్‌దుర్గ పాలెగాడిపై దండెత్తి అతనిని యుద్ధంలో సంహరించాడు. క్రీ.శ.1753లో అతని సోదరులు అతనిని హత్య చేశారు. వారిలో రాజగోపాల్ అనే అతడు రాజ్యానికి వచ్చాడు. అతడు మూడు సంవత్సరాలు పాలించి మరణించాడు. అతని తర్వాత అతని సోదరుడు తిమ్మప్ప క్రీ.శ.1777 వరకు పాలించాడు. అతని తర్వాత రాజగోపాల్ కుమారుడు వెంకటపతి రాజ్యాధిపతి అయ్యాడు. కానీ క్రీ.శ.1787లో టిప్పుసుల్తాన్ ఇతని రాజ్యంపై దండెత్తి అతనిని కుటుంబంతో సహా శ్రీరంగపట్టణంలో ఖైదు చేశాడు. వెంకటపతి ఖైదులో మరణించాడు. క్రీ.శ.1799లో టిప్పు మరణం తర్వాత వెంకటపతి సోదరుని కుమారుడు రెండవ రాజగోపాల్‌ను పాలెగాడుగా నియమించారు. కాని అతడు నిజాంకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడు. అందువల్ల అతనిని హైదరాబాద్‌కు పంపారు. కావి నిజాం బళ్లారి జిల్లాను బ్రిటిష్ వారికి ఇచ్చినప్పుడు అతనిని గుత్తిలో ఖైదు చేశారు. కాని అతనికి పెన్షన్ ఇచ్చారు. ఆ పెన్షన్‌తో జీవిస్తూ అతడు ఖైదులోనే మరణించాడు. బ్రిటిష్ వారు అతని వారసులకు కూడా పెన్షన్ ఇచ్చారు. దాంతో కుందుర్పి వంశం వారి రాజ్యం పోయింది.

హరితి వంశం: విజయనగర చక్రవర్తి మూడవ వెంకటపతిరాయల కాలంలో నిడుగల్ దుర్గాన్ని క్రీ.శ.1640లో హరితి వంశానికి చెందిన హొట్టెన్ననాయక అనే వ్యక్తికి ఇచ్చాడు. అతడు హరితి, దొడ్డేరు అనే పట్టణాలను నిర్మించాడు. ఈ రెండు పట్టణాలకు వారి పూర్వీకుల స్వస్థానాల పేర్లు పెట్టాడు. కనుక ఇతని వంశస్థులకు హరితి వంశస్థులు అని పేరు వచ్చింది. అతనికి ఏడుగురు కుమారులు. తన రాజ్యాన్ని ఏడు భాగాలు చేసి కుమారులందరినీ పాలెగాళ్లుగా చేశాడు. కాని అతని మరణానంతరం బీజాపూరు సుల్తాన్ వారి రాజ్యాలపై దండెత్తాడు. ఈ కుమారులలో ఒకరు నిడుగల్‌కు వెళ్లి దానిని స్థావరంగా చేసుకున్నాడు. ఈ వంశస్థులలో చాలా మంది మహానాయకులు అని శాసనాలలో పేర్కొనబడ్డారు. ఒకరిద్దరు మాత్రమే మహారాజా, మహామండలేశ్వర అనే బిరుదులు ధరించారు. నిడుగల్‌ను పాలించిన వారిలో తిమ్మనృపుడు పేర్కొనదగినవాడు. అతడు హొట్టెన్నృప, చిక్కమాంబల కుమారుడని శాసనాలు తెలుపుతున్నాయి. అతడు మూడవ శ్రీరంగరాయల సమకాలికుడు. హరితి నాయకుల శాసనాలలో ఎక్కువ భాగం మడకశిర తాలూకాలో లభించాయి. ఆ శాసనాల వల్ల వారి వంశ వృక్షం తెలుస్తోంది.

వంశవృక్షం

సరజ రాయపరాజు

↓

వీర రాయపరాజు

↓

రంగపరాజు

వీరు తిమ్మనృపాలుని తర్వాత పాలించారు. తర్వాత వీరి వంశాన్ని గురించి తెలియదు.

వెలుగోడు వంశం: విజయనగర యుగంలో కర్నూలు జిల్లాలోని వెలుగోడు, నంద్యాల, అవుకు, కందనవోలు ప్రాంతాలను కొన్ని నాయక కుటుంబాలు పాలించాయి. వెలుగోడును పాలించినందువలన వారికి వెలుగోడు వంశంగా పేరు వచ్చింది. వెలుగోడు గ్రామం కర్నూలు జిల్లా ఆత్మకూరు తాలూకాలో ఉంది. ఈ వంశంలో మొదటివాడు రాయప్ప. అతనికే పెదరాయ అని కూడా పేరుంది. అతడు కపిలేశ్వర గజపతి సామంతుడు. గజపతి అతనికి వెలుగోడు రాజు అనే బిరుదునిచ్చాడు. రాయప్ప మహానందివద్ద జరిగిన ఒక యుద్ధంలో మరణించాడు. తర్వాత ఈ వంశంలో ప్రసిద్ధుడు గనితిమ్మ. ఇతని రాజధాని గని. అందువలన అతనికి గనితిమ్మ అని పేరు వచ్చింది. నంద్యాలకే గని అని మరొక పేరు ఉంది. రాచకొండ, దేవరకొండలలో పద్మనాయకులు తమ రాజ్యం కోల్పోయిన తర్వాత కపిలేశ్వర గజపతిని ఆశ్రయించారు. ఆ విధంగా ఆశ్రయించిన వారు పద్మనాయక వెలమ కులానికి చెందిన వ్యక్తులు అయి ఉండవచ్చు. గనితిమ్మ కాలం నాటికి ఈ ప్రాంతాలన్నీ తిరిగి విజయనగర రాజ్యంలో చేరాయి. కనుక గనితిమ్మ విజయనగర సామంతుడయ్యాడు. అతడు

శ్రీకృష్ణదేవరాయల సామంతుడు. అప్పటి నుంచి వెలుగోడు వంశస్తులు విజయనగర చక్రవర్తులను కొలిచారు శ్రీకృష్ణదేవరాయల కాలంలో శ్రీశైలంలో భిక్షువృత్తి మరానికి చెందిన శాంత లింగయ్య అక్కడ ఉన్న శ్వేతాంబర జైనులను హింసించాడు. అది తెలిసిన రాయలు గనితిమ్మానాయకుని లేక వెలుగోటి తిమ్మానాయకుని శాంత లింగయ్యను దండించడానికి పంపాడు. అచ్యుతదేవరాయల కాలంలో అతడు విజయనగరం తరపున గోల్కొండ, గజపతి రాజ్యాలతో పోరాడాడు. అందువల్ల అచ్యుతరాయలు అతనికి మన్నెదొర- మన్నెనాయక అనే బిరుదునిచ్చాడు. క్రీ.శ.1544లో గనితిమ్మ నంద్యాలను పాలించే అరవీటి వంశస్థులతో పోరాడాడు. ఆనాటి నంద్యాల అరవీటి రాజు ఆవాడి అహుబలరాజు. ఈ యుద్ధంలో గనితిమ్మానాయకుడు మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు యారతిమ్మ. తర్వాత కస్తూరిరంగ, చెన్న, కస్తూరి రంగ కుమారుడు యాచమ నాయకుడు, అతని కుమారుడు కుమార యాచమ, తర్వాత సింగ అనే వారు పాలించారు. విజయనగర రాజ్యం బలహీనపడిన తర్వాత వారి రాజ్యాన్ని గోల్కొండ కుతుబ్ షాహీలు ఆక్రమించారు.

నందేల నాయక వంశం: ఆరవీటి వంశంలోని ఒక శాఖ నంద్యాలను పాలించారు. నంద్యాలను నందేల అని కూడా పిలిచేవారు. నంద్యాలను పాలించారు గనుక వారికి నంద్యాల నాయకులు అని పేరు. ఈ వంశానికి చెందిన కొంత మంది పేర్లు తెలుస్తున్నాయి. మహామండలేశ్వర అహుబలేశ్వర సదాశివ రాయలకు సామంతునిగా కోయిలకుంట్ల ప్రాంతాన్ని పాలించాడు. అలాగే మహామండలేశ్వర నంద్యాల తిమ్మయదేవ మహారాజు గండికోట సీమను పాలించాడు. రామరాయల కాలంలో ఈ కుటుంబం పైకి వచ్చినట్లుగా కనిపిస్తోంది. మొదటి శ్రీరంగరాయల కాలం వరకు ఈ వంశం విజయనగర రాజులను భక్తిశ్రద్ధలతో కొలిచింది. కాని రెండవ వెంకటపతిరాయల కాలంలో ఈ వంశానికి చెందిన నందేల కృష్ణమరాజు వెంకటపతిపై తిరుగుబాటు చేసి కడప జిల్లాలోని సిద్ధవటం లేక సిద్ధేశ్వరం, పొత్తపి రాజైన కొండ్రాజు తిరుపతిరాజు, కందనవోలును ఏలే గోపాల రాజులతో చేరి కృష్ణమరాజు రాజ్యాన్ని వశం చేసుకొని రెండుగా చీల్చి ఒక భాగాన్ని హండే దేవప్పనాయకునికి మరొక భాగాన్ని పెమ్మసాని తిమ్మా నాయకునికి ఇచ్చాడు. వారిద్దరూ రాయలకు యుద్ధంలో సహాయం చేశారు కృష్ణమ నాయకుని చంద్రగిరి కోటలో బంధించాడు. అతడు ఖైదులోనే మరణించాడు. ఆ తర్వాత ఈ వంశస్థుల చరిత్ర తెలియదు.

అరవీడు నాయకుల అవుకు రాజ్యం: కోయిలకుంట్ల తాలూకాను, అవుకు లేక అవుకు సీమలను పాలించే మరొక వంశం కూడా అరవీడు వంశానికి చెందినదే. తిమ్మ లేక తిరుమల అనే అతడు అవుకు వంశానికి మూలపురుషుడు. అతడు వీరనరసింహ కృష్ణరాయల సామంతుడు. అతని మూడవ కుమారుడు మహామండలేశ్వర చినతిమ్మదేవ. తండ్రి తర్వాత అవుకు నాయంకరాన్ని లేక సీమను పాలించాడు. అతని తర్వాత ఈ వంశస్థుల చరిత్ర తెలియదు.

కందనవోలు గనిసీమ రాజ్యం: శక 1469 అంటే క్రీ.శ.1547వ సంవత్సరానికి చెందిన రెండు శాసనాలు కర్నూలు తాలూకాలో లభించాయి. ఈ శాసనాలు కందనవోలు, గనిసీమలను మహామండలేశ్వర రామరాజ వెంకటాద్రి అయ్యదేవ మహారాజ అనే అతడు పాలించినట్లు తెలుపుతున్నాయి. అతని తర్వాత రంగపరాజయ్య మహారాజు, గోపాల రాజు అనే వారు పాలించారు. వీరిలో గోపాలరాజు నంద్యాల కృష్ణమరాజు తిరుగుబాటులో చేరి ఓడిపోయి రెండవ వెంకటపతి రాయలచే చంద్రగిరి కోటలో ఖైదు చేయబడ్డాడు. తర్వాత విడుదల చేయబడ్డాడు. క్రీ.శ.1619-20, 1624 సంవత్సరంలో రెండు పర్యాయాలు బీజాపూరు సుల్తాన్ దండెత్తి అతని రాజ్యాన్ని ఆక్రమించాడు. వారి రాజ్యంలో అబ్దుల్ వహబ్ అనే వ్యక్తిని గవర్నర్‌గా నియమించారు.

మట్లి వంశం క్రీ.శ. 1500-1800: క్రీ.శ.1500 సంవత్సరంలో విజయనగర సామంతులుగా తమ రాజకీయ జీవితాన్ని ప్రారంభించి సుమారు 300 సంవత్సరాలు కడప జిల్లా పరిసర ప్రాంతాలను పాలించిన ప్రఖ్యాత సామంత రాజ్యం మట్ల వంశస్థుల రాజ్యం. వారికి మట్లి వారు అని కూడా పేరుంది. కడప జిల్లాలోని రాయచోటి తాలూకాలోని మట్ల వారి రాజధాని. కనుక వారి వంశానికి మట్లి లేక మట్ల వంశం అని పేరు వచ్చింది. మట్ల రాయచోటి తాలూకాలోని మదవి నది ఒడ్డున ఉంది. ఈ వంశస్తులు దేవచోడ వంశానికి చెందినవారు. బహుశా పూర్వపు చోళ వంశానికి చెందిన వారై ఉండవచ్చు. కడప పరిసర ప్రాంతాలలో వారు నిర్మించిన దేవాలయాలు, చెరువులు, వారి పేరును ఇప్పుడు కూడా గుర్తు చేస్తున్నాయి. వీరి వంశావళి మట్లి అనంతరాజ రాసిన కాకుత్స విజయంలో ఇవ్వబడింది. ఈ వంశస్తులు విజయనగర వంశస్తుల చివరి వరకు

వారిని విశ్వాసంతో కొలిచారు. రాజ కుటుంబానికి చాలా సన్నిహితం అయి, వీరిలో ఒకరు కృష్ణరాయల కుమార్తెను కూడా వివాహం చేసుకున్నారు. అరవీటి వంశస్తుల కాలంలో వారు చేసిన అన్ని యుద్ధాలలో పాల్గొని వారికి చాలా అండగా నిలబడ్డారు.

ఈ వంశానికి మూలపురుషుడు బొమ్మరాజు. అతనికి సోమరాజు, తిమ్మరాజు, మంగరాజు అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడైన సోమరాజుకు ఐదుగురు కుమారులు కలిగారు. వారిలో పెద్దవాడు పోతరాజు. అతనికి ఆరుగురు కుమారులు జన్మించారు. వారిలో పెద్దవాడు వరదరాజు. అతడు కృష్ణరాయల కుమార్తెలలో ఒకరిని వివాహం చేసుకున్నాడు.

మూలపురుషుని రెండవ కుమారుడైన తిమ్మరాజుకు కొణరాజు అనే కుమారుడు, గండు అతనికి ఎల్లమరాజు అనే కుమారుడు కలిగారు. ఎల్లమరాజుకు నలుగురు కుమారులు. తిరుమల, వరద, చినతిమ్మ, మట్లి అనంతరాజ అనే నలుగురు కుమారులు ఉన్నారు. వారిలో మట్లి అనంతరాజ కాకుత్స విజయం అనే కావ్యం రాశాడు. అందువల్ల వారి వంశవృక్షం మనకు తెలియవస్తోంది.

మూలపురుషుని మూడవ కుమారుడైన మంగరాజుకు గురువయదేవచోడ అనే కుమారుడు ఉన్నాడు.

బొమ్మరాజు

సోమరాజు ↓ పోతరాజు- మిగిలిన నలుగురు వరదరాజు, మరొక ఐదుగురు సోదరులు కృష్ణదేవరాయల అల్లుడు

తిమ్మరాజు ↓ కోణరాజు ఎల్లమరాజు

మంగరాజు ↓ గురుదేవయచోడ

ఎల్లమరాజు → తిరుమలవరద, చిన్నతిమ్మమట్ల అనంతరాజు 1590-1630 కాకుత్స విజయం రచయిత

↓

తిరువెంగళనాథ

↓

కుమార అనంతరాజ

↓

రెండవ కుమార అనంత

వరదరాజు క్రీ.శ.1543: వీరందరిలో వరదరాజు ప్రఖ్యాతి చెందినవాడు. అతని శాసనాలు అనేకం లభించాయి. అతడు కృష్ణదేవరాయల కుమార్తెలలో ఒకరిని వివాహం చేసుకున్నాడంటారు. కాని అది వాస్తవం అవునో కాదో తెలియదు. కృష్ణదేవరాయలకు అనేక మంది భార్యలు ఉన్నారు. రాయల మరణానంతరం అతని భార్యలలోని ఏ కుమార్తెనయినా వివాహం చేసుకొని ఉండవచ్చు. వరదరాజు శక 1465 అంటే క్రీ.శ.1544లో తిరుపతి దేవాలయానికి 312 రేఖయిపొన్ అనే బంగారు నాణేలను దానం చేసి శాసనం వేయించాడు. అలాగే శక 1493 అంటే క్రీ.శ. 1571లో పొత్తపిలో తన తల్లి చిన్నమ్మ పేరుతో అంతర గంగకాల్వను తవ్వించినట్లు అక్కడి శాసనం తెలుపుతోంది. ఈ శాసనం అతడు, అతని సోదరుడు ఎల్లమరాజు కలసి చేసిన మరొక దానాన్ని కూడా ప్రస్తావిస్తోంది. వరదరాజుకు కావేరి వల్లభ గయిబంది అనే బిరుదులు ఉన్నాయి. ఇతడు సదాశివరాయల సమకాలికుడు. ఇతని కాలంలోనే తళ్లికోట యుద్ధం జరిగింది.

ఎల్లమరాజు: ఈ వంశంలో తర్వాత ప్రఖ్యాతి వహించినవాడు ఎల్లమరాజు. అతడు కొణరాజు కుమారుడు. అతడు రెండవ వెంకటపతిరాయల సమకాలికుడు. ఇతని ఘన కార్యాలను చిట్వేలు కైఫీయత్తు తెలుపుతోంది. ఇతని కాలంలో రెండవ వెంకటపతిరాయలపై నందేల కృష్ణమరాజు సిద్దౌట్ పాలకులైన కొండరాజు తిరుపతిరాజు, కొండరాజు వెంకటరాజు- వీరిద్దరినీ కొండరాజు సోదరులు అని అంటారు. తిరుగుబాటు చేశారు. ఈ సమయంలో ఎల్లమరాజు రెండవ వెంకటపతి పక్షాన నిలిచి వారిని ఓడించడమేగాక తిరుపతి రాజును ఊటుకూరు వద్ద, వెంకటరాజును చెన్నూరు వద్ద సంహరించాడు. వారు పాలించిన సిద్ధవటం సీమను ఆక్రమించాడు. రెండవ

వెంకటపతి అతని ఘనకార్యాలకు సంతోషించి చంద్రగిరి రాజ్యంలోని పులుగునాటి సీమ, ఉదయగిరి రాజ్యంలోని సిద్ధవటం, పొత్తపినాడులను ఎల్లమరాజుకు అమరాలుగా ఇచ్చాడు. అంతేగాక చెన్నూరు, దువ్వూరు, కమలాపురం, పోరుమామిళ్ల, బద్వేల్ ప్రాంతాల పరిపాలనను కూడా ఎల్లమరాజుకు అప్పగించాడు.

తిరుమల: ఎల్లమరాజు కాలంలోనే అతని పెద్దకుమారుడు తిరుమల సిద్ధవటం సీమను పాలించినట్లుగా కనిపిస్తోంది. అతడు మొదటి శ్రీరంగరాయల సామంతునిగా సిద్ధవట సీమకు అమరనాయకుడుగా పాలిస్తున్నట్లు శక 1500 అంటే క్రీ.శ.1578వ సంవత్సరం నాటి కడప జిల్లాలోని గుర్రంపాడు శాసనం తెలుపుతోంది. పెనుగలూరు శాసనంలో తిరుమలుడు గొప్ప అందగాడని అనేక శక్తులు ఉన్నవాడని లిఖింపబడింది. అతని కోరికపై విజయనగర చక్రవర్తి మొదటి తిరుమలుడు పెనగలూరు గ్రామంతోపాటు ఎల్లంపాడు, చెన్నుపల్లి కొండూరు చెన్నుపల్లి అనే మూడు గ్రామాలను కొంత మంది పండితులకు దానం చేశాడు. ఈ శాసనంలో పేర్కొనబడిన పండితులు రుగ్వేద, యజుర్వేద పండితులు. వారికి ఈ గ్రామాలలో వృత్తులు ఇవ్వబడ్డాయి ఈ శాసనంలో తిరుమలుడు తన తండ్రి ఎల్లమ, తాత కొణరాజులతో పాటు తన సోదరులైన వరద, చినతిప్ప కాకుత్స విజయం రాసిన అనంతరాజుల పేర్లు కూడా పేర్కొన్నాడు. తిరుమలుడు సిద్ధాంత సార్వభౌమ వెంకట సోమయాజన్ అనే మహాపండితునికి సిద్ధవటం సీమలోని గుర్రంపాడు గ్రామాన్ని సర్వమాన్యంగా దానం చేసి గుర్రంపాడు శాసనాన్ని రాయించాడు. కర్నూలు ప్రాంతాన్ని పాలించే వెలుగోటి కస్తూరిరంగ తిరుగుబాటు చేసినప్పుడు తిరుమలుడు ఇతర విజయనగర సేనాధిపతులతో కలిసి రాజంపేట తాలూకాలోని ఎర్రగుంట్ల కోట నుండి బయలుదేరి కస్తూరి రంగను ఎదుర్కొని యుద్ధంలో పోరాడుతూ బద్వేల్ తాలూకాలోని కోడూరు వద్ద శక 1501 అంటే క్రీ.శ.1579లో మరణించాడు.

మట్లి అనంతరాజు క్రీ.శ.1590-1610: ఇతని విజయాలు అతడు రాసిన కాకుత్స విజయం వల్ల, శక 1527 అంటే క్రీ.శ.1605 నాటి ఒక శాసనం వల్ల తెలుస్తున్నాయి. ఇతడు గొప్ప వీరుడు. గొప్ప కవి. అతడు రాసిన కాకుత్స విజయం తెలుగులో గొప్ప క్లాసిక్. అతడు తన ప్రభువైన రెండవ వెంకటపతి రాయల ఆజ్ఞ ప్రకారం కుతుబ్‌షాహీలు ఆక్రమించిన గుర్రం కొండపై దండెత్తి పోరాడాడు. అతడు తన తండ్రి పేరుతో ఎల్లమరాజు చెరువు అనే పెద్ద తటాకాన్ని నిర్మించాడు. అతనికి పూర్వం సిద్ధవటంలో మట్టికోట ఉండేదట. దానిని పూర్తిగా తీసి వేసి రాతితో బలమైన దుర్గం నిర్మించాడు. ఇప్పుడు కనిపించే శిధిల కోట అతడు నిర్మించినదేనని అంటారు. అతని మనుమడు మట్ల కుమార అనంతరాజు రాసిన కుముద్వతి కల్యాణం అనే కావ్యంలో అనంతరాజు ఏ విధంగా రెండవ వెంకటపతి రాయలకు సహకరించిందీ చాలా వివరంగా వర్ణింపబడింది. అతడు కుతుబ్‌షాహీల సేనాధిపతిని గండికోట వద్ద ఉదయగిరి పాలెగాడైన కంపనైనప్ప మధుర నాయకరాజు అశ్వరాయుని గుర్రపు దళాన్ని తుపాకి మందుకు భయపడకుండా గుర్రం కొండ వద్ద పోరాడిన విధానాన్ని ఈ కావ్యం అద్భుతంగా వర్ణించింది. అలాగే బద్వేలు సీమపై దాడి చేసిన పంట సామంత మన్నె సామంతులను కమలకుర వద్ద ఓడించాడు. ఇతని కాలంలో సిద్ధవటంలోని ఒగురు కోట కోసం మట్లి వంశానికి, వెంకటగిరి వారికి అనేక యుద్ధాలు జరిగాయి. మెకంజీ సేకరించిన శక 1520 నాటి సిద్దొట్‌లోని చింతరాజుపల్లె శక 1522 అంటే క్రీ.శ.1589 నాటి ఒంటిమట్ట శాసనాలు అనంతరాజును గురించి తెలుపుతున్నాయి. ఒంటిమిట్ట శాసనం కార్పెంటర్లను, బ్లాక్స్మిత్స్‌ను బాగా ఆదరించినట్లు తెలుపుతున్నాయి. ఒంటిమిట్టలో రఘునాథ దేవుని ఉత్సవాలలో వారికి రథంపై కూర్చొనే హక్కును ఇచ్చాడట. తిరుపతిలో కూడా ఈ విధానం అమలులో ఉన్నదట. తిరుపతిలోని పద్ధతి ప్రకారం ఒంటిమిట్టలో వారికి ఆ హక్కు కల్పించబడిందని శాసనం తెలుపుతోంది.

తిరువెంగళనాథ దేవచోడ మహారాజు: కడప జిల్లాలోని గంగనాపల్లెలో శక 1528 అంటే క్రీ.శ.1606 నాటి శాసనం ఒకటి మట్లి అనంత రాజ కుమారుడైన తిరువెంగళనాథుని పేర్కొంటోంది. అతడు స్థానిక రాజులతో యుద్ధాలు చేసినట్లు తెలుస్తోంది. అతడు మాకనోలు వద్ద గంటికోట పాలెగాడిని ఓడించినట్లు, ఉదయగిరి దుర్గపాలకుని తరిమివేసినట్లు అతని కుమారుడు రెండవ అనంతరాజు రాసిన కుముద్వతి కల్యాణంలో వర్ణింపబడింది. అదే కావ్యం తిరువెంగళనాధుడు పందిళ్లపల్లి, పోరుమామిళ్ల, వెల్లాల, కొకటం, కల్లూరులను కూడా జయించినట్లు వివరిస్తోంది. బీజాపూరు సుల్తాన్ కర్నూలును ఏలే గోపాలరాజు కోటను ముట్టడించినప్పుడు తిరువెంగళ నాధుడు గోపాలరాజుకు సహాయంగా వెళ్లాడు. కానీ అక్కడ జరిగిన యుద్ధంలో తిరువెంగళనాధుడు మరణించాడు.

కుమార అనంత: తిరువెంగళనాధుడు కర్నూలు యుద్ధానికి వెళ్లేముందు తన కుమారుడు కుమార అనంతరాజుకు రాజ్య భారాన్ని అప్పగించాడు. తండ్రి మరణించినందువల్ల కుమార అనంత సింహాసనం అధిష్టించాడు. ఇతడు తన తాత లాగే వీరుడు, గొప్ప పండితుడు. ఇతడు కుముద్వతి కళ్యాణం అనే కావ్యం రాశాడు. అందులో మట్లి వారి వంశ చరిత్ర బాగా వివరింపబడింది. అతడు రామానుజాచారి విశిష్టాద్వైత మతాభిమాని. కాని పరమత సహని. ఇతని రాజ్యం తిరుపతి పర్వతాల నుండి కర్నూలు జిల్లాలోని అహోబిలం వరకు విస్తరించి ఉంది. కుమార అనంత ఘనకార్యాలను అతడు రాయించిన రెండు శాసనాలు తెలుపుతున్నాయి. అవి తిరుపతి పర్వత పాదాల వద్ద ఉన్న అలిపిరిలోని పాతాళ మండపం వద్ద శక 1550 అంటే క్రీ.శ.1628 సంవత్సరంలో రాయించబడ్డాయి. అతడు రాజ్యానికి వచ్చిన తొలి రోజుల్లో కొన్ని తిరుగుబాట్లు జరిగాయి. అతని తమ్ముడు కూడా తిరుగుబాటు చేశాడు. తిరుగుబాట్లను అణచాడు. తమ్ముని బంధించి సిద్దౌట్‌లో ఖైదు చేశాడు. తర్వాత క్షమించి వదిలి వేశాడు.

కడప జిల్లాలోని చెన్నూరులో ఒక చెరువును తవ్వించాడు. చెన్నమాంబపురం, చెన్నమాంబ సముద్రం అనే రెండు గ్రామాలను కూడా నిర్మించాడు. బహుశా చెన్నమాంబ అతని తల్లి అయి ఉంటుంది. సేతువు నుండి హిమాలయాల వరకు యాత్రికుల సౌకర్యార్థం ఒక డజను విశ్రాంతి గృహాలు, ఉచిత భోజనశాలలను నిర్మించాడు. అలాంటిదే ఒకటి తిరుపతిలో కూడా నిర్మించాడు. తిరుపతిలోని మొదటి కొండ శిఖరంపై అగ్రగోపురం అనే పేరుతో గాలి గోపురాన్ని నిర్మించాడు. కింది నుండి ఆ గోపురానికి మెట్లు కూడా కట్టించాడు. గోపురం వద్ద అన్నాటకేళీ మండపాన్ని అంటే గొప్ప సుందరమైన మండపాన్ని నిర్మించాడు. అదే పర్వత పాదం వద్ద మరొక గోపురాన్ని నిర్మించి దానికి కొత్త గోపురం అని పేరు పెట్టారు.

తిరుమలపై వరదరాజస్వామి ఆలయపు బయటి గోపురం కూడా అతడు నిర్మించినదేనట. అది 7 అంతస్థులు గల గోపురం. ఇంకా తిరుపతి దేవునికి రత్నాలు పొదిగిన కిరీటం కూడా చేయించి సమర్పించాడట. అలాగే కాళహస్తి దేవాలయానికి కూడా అనేక దానాలు చేశాడు. ఇంకా కడప జిల్లాలో అనేక ప్రదేశాలలో దేవాలయాలు, గోపురాలు, మండపాలు నిర్మించాడు. అతడు గొప్ప దానశీలియేగాక గొప్ప వీరుడు. అనేక యుద్ధాలు చేశాడు. అతడు గుండ్లూరు, అనిమెల, చెప్పలి పాలగిరి పాలెగాళ్లతో అనేక యుద్ధాలు చేశాడు. అతడు ఉదయగిరి చెంగల్పట్టులోని తిరువళ్లూరు, కాళహస్తి దేవాలయాలకు ఇచ్చిన దానాలను బట్టి అతని రాజ్యం తిరుపతి నుండి అహోబిలం వరకు విస్తరించి ఉన్నట్టు అతని దానాలు బలపరుస్తున్నాయి. ఇంకా అతడు దేవాలయాలకు తులాపురుష దానాలు కూడా చేశాడట. వీటన్నింటిని బట్టి మట్లి రాజ్యం ఇతని కాలంలో తారస్థాయికి ఎదిగిందని చెప్పుకోవచ్చు.

రెండవ కుమార అనంత: కుమార అనంతకు సంతానం లేదు. తన సోదరుడైన చిన్న అనంత కుమారుడైన రెండవ కుమార అనంతను దత్తు తీసుకున్నాడు. అతడు క్రీ.శ.1636లో రాజ్యానికి వచ్చి 1649 వరకు పాలించాడు. ఇతని కాలంలో వీరి రాజ్యంలో కలిటూరు, దువ్వూరు, చెన్నూరు, బద్వేల్, పోరుమామిళ్ల, కంభం మొదలైన ప్రదేశాలు పోగొట్టుకున్నారు. వాటిని క్రీ.శ.1644-45 సంవత్సరంలో గోల్కొండ సుల్తాన్ జయించాడు. ఈ ప్రాంతాలు పోయినా రెండవ కుమార అనంత పెద్ద రాజ్యాన్నే ఏలాడు. అతని రాజ్యంలో కడప జిల్లాలోని పొత్తపినాడు, సిద్ధవటం, చంద్రగిరి రాజ్యంలోని జిలుగునాడవు అతని రాజ్యంలో ఉన్నాయి. రెండోసారి గోల్కొండ సైన్యం మీర్జుంలా నాయకత్వంలో మట్లి రాజ్యంపై దండెత్తింది. అనంత గోల్కొండ సైన్యాలను ఓడించాడు. కాని గోల్కొండ సేనాని ప్రతీకారం చేస్తాడని భయపడి మైసూరులోని బసవపురం పారిపోయాడు. అంతట మీర్జుమ్లా మట్లి వారి రాజ్యంలో ప్రవేశించి సిద్ధవటం కోటను ఆక్రమించి త్రయంబక శంకరిజ అనే తన సేనానిని సిద్ధవటంలో గోల్కొండ ప్రతినిధిగా నియమించాడు. దాంతో మట్లి వారి రాజ్యం పోయింది. కాని కుమార అనంత కుమారులైన మూడవ కుమార అనంత, వెంకటరామరాజ, వెంకట రాఘవరాజులు తిరిగి రాజ్యాన్ని సంపాదించారు. గోల్కొండ రాజ్యపు చివరి కాలంలో వారు తమ రాజ్యంలో కొంత భాగాన్ని సంపాదించి రాజంపేట తాలూకాలో పాలించారు. రాజంపేట తాలూకాలోని పుల్లంపేట లోని శక 1672 అంటే క్రీ.శ.1690 నాటి తామ్ర శాసనం వెంకటరామరాజు వంశ వృక్షాన్ని తెలుపుతోంది. శక 1629 అంటే క్రీ.శ.1707 నుండి శక 1729 అంటే క్రీ.శ.1807వ సంవత్సరం వరకు అంటే ఒక వంద సంవత్సరాలకు చెందిన ఈ వంశస్తుల పేర్లు శాసనాలలో లభిస్తున్నాయి.

చివరి వారి వంశవృక్షం

మట్లి ఎల్లమరాజు 1572-1598
↓
పెద్ద అనంత 1581-1605
↓
తిరువెంగళనాథ 1606-1620
↓ ↓
మొదటి కుమార అనంత 1623-1636 — చిన్న అనంత
↓
రెండవ కుమార అనంత 1636-1649
↓ ↓
మూడవ కుమార అనంత — వెంకట రామరాజు

వీరిలో వెంకటరామరాజును గురించి మన్రో ఈ విధంగా రాశాడు. హైదరాలీ మరణించిన తర్వాత ఉత్తరం రాస్తూ అతడు 120000 పేష్కస్ చెల్లించాలని ఆదేశించాడు. అప్పుడు వెంకటరామరాజు చిట్వేల్‌లో ఉన్నాడు వెంకటరామరాజు రెండు సంవత్సరాలలో 60 వేలు మాత్రమే చెల్లించగలిగాడు. అందువల్ల టిప్పు అతని రాజ్యాన్ని ఆక్రమించడానికి సైన్యాన్ని పంపాడు. వెంకటరామరాజు కర్నాటకానికి పారిపోయాడు. చిట్వేలును టిప్పు ఆక్రమించాడు. కాని 1791లో ఈ ప్రాంతాలు నిజాం వాటాకు వచ్చాయి. నిజాం ఆలీ వెంకటరామరాజుకు తిరిగి అతని రాజ్యాన్ని అప్పగించాడు. సాలుకు 90 వేలు పేష్కస్‌గా నిర్ణయించారు. క్రీ.శ.1798లో అశుద్ అలీ వెంకటరామరాజు పరిపాలన బాగాలేదని, అతడిని తొలగించి అతని తమ్ముడు వెంకటరాఘవరాజును రాజుగా నియమించాడు. కాని నిజాం మంత్రి చందూలాల్ అతనిని తొలగించి మళ్లీ పెద్దవాడిని సింహాసనం ఎక్కించాడు కాని చిన్నతమ్ముడు చందూలాల్‌కు 10 వేల రూపాయలు నుజ్జర్ అంటే బహుమానంగా ఇస్తానని, పేష్కస్ కూడా పూర్తిగా చెల్లిస్తానని చెప్పగా పెద్ద వాడిని తొలగించి మళ్లీ చిన్నవాడిని గద్దెనెక్కించాడు. మొత్తం మీద ఈ సోదరులు ఇద్దరూ చందూలాల్‌కు 90 వేలు, పేష్కస్ కింద 65 వేలు, తర్వాత 10 వేలు నుజ్జర్ కింద మొత్తం 165000 చెల్లించారు. ఇంతలో 1800 సంవత్సరంలో కడప జిల్లాను నిజాం సైన్య సహకార పద్ధతి కింద ఇంగ్లిషు వారికి దత్తం చేశాడు. దాంతో మట్లి వారి రాజ్యం ఇంగ్లిషు వారి కిందకు వచ్చింది. ఆ కాలం నాటికి వెంకటరామరాజు బందిఖానాలో ఉన్నాడు. అతని సోదరుడు వెంకటరాఘవరాజు రాజ్యం చేస్తున్నాడు. ఇంగ్లిషు వారు ఒక లక్ష రూపాయలు పేష్కస్‌గా నిర్ణయించారు. కాని వారు అది చెల్లించలేకపోయారు. దాంతో మన్రో వారిని తొలగించి పెన్షన్ ఇచ్చి వారి రాజ్యాన్ని మద్రాసు ప్రెసిడెన్సీలో కలిపాడు. దాంతో మట్లి వారి రాజ్యం అంతరించింది.

మట్లి వారు గోల్కొండ నవాబులు, నిజాం నవాబుల వల్ల అనేక కష్టాలు పడ్డా వారు ఎప్పుడూ ఇంగ్లిషు వారి సహాయం కోరలేదు. ఇంగ్లిషు వారి వైపు చేరిపోలేదు. వెంకటరామరాజు కుమారుడు మట్లి తిరువెంగళనాథ దేవచోడ మహారాజు ఈ వంశంలో చివరివాడు. వీరి కుటుంబానికి ఇంగ్లిషు వారు కొన్నాళ్లు పెన్షన్ ఇచ్చారు. తర్వాత ఈ కుటుంబం ఏమైనదీ తెలియదు.

యాదవరాయ తొండై మండల రాజ్యం: విజయనగర యుగానికి చెందిన మరొక సామంత రాజ్యం తొండై మండలాన్ని పాలించిన యాదవరాయ రాజ్యం. ఈ వంశం విజయనగర రాజ్యం స్థాపించకముందు నుంచీ తొండై మండలాన్ని పాలిస్తోంది. ఈ వంశంలో మొదటిరాజు తిరుక్కలట్టి దేవయాదవరాయ. అతడు చాళుక్య నారాయణ అనే బిరుదు ధరించాడు. దానిని బట్టి వారి వంశం చాళుక్యుల కాలం నుండే ఉన్నదని స్పష్టపడుతోంది. అతని శాసనాలు ఉత్తర ఆర్కాట్, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో లభించాయి. ఈ ప్రాంతమే పూర్వపు తొండై మండలం అతడు తెలుగు చోళులతో వివాహ సంబంధాలు పొంది, తన రాజ్యాన్ని బలపరుచుకున్నాడు. అతని తర్వాత అతని కుమారుడు వీరరాక్షస యాదవరాయ రాజ్యానికి వచ్చాడు. అతని తర్వాత వీరనరసింగదేవ యాదవరాయ సింహాసనం అధిష్టించాడు. అతడు 51 సంవత్సరాలు పాలించాడు. అతడు చాళుక్య చోళరాజైన మూడవ రాజరాజుకు సామంతుడు. తన ప్రభువు తరఫున కాడవ కొప్పెరుంజింగునితో పోరాడాడు. అతడు పెద్దకాడవరాయ అలగియ సియన్‌తో కూడా పోరాడాడు. ఇతని కాలంలో తెలుగు పల్లవరాజు వీరగండ

గోపాలుడు మొదటి జటావర్మ సుందరపాండ్యునితో పోరాడి మరణించాడు. నరసింగ యాదవరాయ తర్వాత ఈ వంశంలో చెప్పుకోదగినవాడు తిరువెంకటనాథ యాదవరాయ. అతడు మొదటి హరిహరరాయల సమకాలికుడు. ఇతని కాలంలోనే విజయనగర సామ్రాజ్యం స్థాపించబడింది. అతడు క్రీ.శ.1322లో రాజ్యానికి వచ్చి 15 సంవత్సరాలు పాలించాడు. ఇతడు హొయసాల మూడవ భల్లాలుని సామంతుడు. అతని ఆదేశం ప్రకారం నల్లాల దేవరవారి పన్ను అనే పన్నును వసూలు చేసి భల్లాలునికి చెల్లించాడట. తన సేనాధిపతి సింగయదన్నాయకుని కోరిక ప్రకారం తిరువెంకటనాథ యాదవరాయ పొంగలూరు గ్రామంలో సగాన్ని తిరువెంకట ముడియం దేవాలయంలో జరిగే ఆది ఉత్సవానికి దానం చేశాడు. అతని తర్వాత శ్రీరంగనాథ యాదవరాయ రాజ్యానికి వచ్చాడు. వీరిద్దరి సంబంధం స్పష్టంగా తెలియదు కాని వారు తండ్రీ కుమారులని భావించారు. అలాగే తిరువెంకటనాథ యాదవరాయకు ముందు పాలించిన వారి వివరాలు కూడా స్పష్టంగా తెలియడం లేదు. ఈ తండ్రీ కొడుకుల కాలంలో నూతన పన్నులు వసూలు చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. బంగారు రూపంలో వసూలు చేసే నగదు పన్ను, ధాన్యరూపంలో వసూలు చేసే పన్ను, ఉచిత సేవ చేస్తే దానిని అమంజివాగ్రై పన్ను అని పిలిచేవారు. రాజకుమారుని, రాణి పోషణకు, రాజు శత్రువులకు పట్టుబడితే విడిపించడానికి మూడు రకాల పన్నులు కూడా వసూలు చేసేవారట. ఇక అన్ని వృత్తుల మీద, పొలాల మీద, పశువుల మీద పన్నులు ఉండేవి. వ్యాపార సుంకాలు, మార్గ సుంకాలు కూడా వసూలు చేసేవారు.

శ్రీరంగనాథ యాదవరాయుడు క్రీ.శ.1337 నుండి 1357 వరకు 20 సంవత్సరాలు పాలించాడు. ఇతడు విజయనగర చక్రవర్తి మొదటి హరిహరరాయల సామంతుడై విజయనగర యుద్ధాలలో కూడా పాల్గొన్నాడు. బుక్కరాయల కాలంలో వీరి వంశాన్ని తొలగించి తొండై మండలాన్ని విజయనగర రాజ్యంలో కలిపినట్లుగా తెలుస్తోంది. అందువల్ల వీరి రాజ్యం అదృశ్యమైంది.

తంజావూరి నాయకరాజ్యం క్రీ.శ.1535-1676: దక్షిణ దేశంలోని విజయనగర సామంతరాజ్యాలకు నాయక రాజ్యాలని పేరు. అలాంటి వాటిలో తంజావూరు, మధుర, జింజి, మైసూరు నాయక రాజ్యాలు అతి ముఖ్యమైనవి. నాయకరాజులలో మొదటినుండి విశ్వాసపాత్రంగా కొలిచిన వారు తంజావూరు నాయకరాజులు. ప్రాచీన చోళమండలమే తంజావూరు నాయక రాజ్యమని చెప్పవచ్చు. తంజావూరు, తిరుచునాపల్లి, పుదుక్కోట ప్రాంతాలు తంజావూరు రాజ్యంలో చేరి ఉండేవి. శ్రీకృష్ణదేవరాయల కాలంలో తంజావూరు, మధుర రాజ్యాలు రెండూ ఒకే రాష్ట్రంలో ఉండేవి. కాని అచ్యుతదేవరాయల కాలంలో తంజావూరు ప్రాంతంలో దోపిడీ దొంగలు స్వైరవిహారం చేశారు. వారి దోపిడీల వల్ల ప్రజలు అనేక బాధలుపడ్డారు. అందువల్ల ప్రజారక్షణ పటిష్టంగా ఏర్పాటు చేయడానికి అచ్యుతరాయలు తంజావూరును వేరు చేసి ప్రత్యేక రాజ్యంగా రూపొందించాడు. క్రీ.శ.1535లో అచ్యుతదేవరాయలు తన తోడల్లుడైన, అంటే తన భార్య తిరుమలాంబ చెల్లెలు మూర్తెమ్మ భర్త అయిన చెవ్వప్పను తంజావూరు పాలకునిగా నియమించాడు. అదే తంజావూరు రాజ్య ప్రారంభం. చెవ్వప్ప ఆంధ్రుడు, మన్నారు గోత్రీకుడు. తంజావూరు రాజ్యం మధుర, జింజి నాయక రాజ్యాల వలే స్వామి ద్రోహానికి పాల్పడక మొదటి నుండి విజయనగర చక్రవర్తులకు విశ్వాసపాత్రంగా ఉండేది. చక్రవర్తులు చేసే అన్ని యుద్ధాలలో వారికి అండగా నిలిచేది. అంతేగాక విజయనగర చక్రవర్తులు ఉదార పాలనను, సాహిత్య కళాపోషణను వారసత్వంగా కొనసాగించారు.

చెవ్వప్ప నాయకుడు క్రీ.శ.1535-1561: తంజావూరు నాయక రాజ్యానికి మొదటి పాలకుడు చెవ్వప్ప. అతడు గొప్ప పరాక్రమశాలి. సమర్థుడు. అతడు తంజావూరి రాజ్యంలోని కోటలను బాగు చేయించి రాజ్యానికి రక్షణ ఏర్పాట్లు చేశాడు. తర్వాత చోళ మండలంలో అలజడులను కలిగించే దొంగల మూరాలను పట్టి బంధించి కఠిన శిక్షలు విధించాడు. అరాచక కారకులైన చోళ నాయకులను అదుపులో పెట్టాడు. శాంతి భద్రతలను నెలకొల్పాడు. తన నాయక రాజ్యంలోని శివగంగ కోటను దృఢపరచాడు. ఆ కోట బృహదీశ్వరాలయం సమీపంలో ఉంది. తంజావూరు పట్టణంలో ఒక బావిని, పట్టణం వెలుపల ఒక పెద్ద చెరువును తవ్వించాడు. ఆ చెరువు నేటికీ చెవ్వప్ప చెరువు అని పిలువబడుతోంది. ప్రజాహితం కోసం అతడు మరికొన్ని చెరువులను కూడా తవ్వించాడు. అతడు గొప్ప దాత. బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చాడు. అనేక దేవాలయాలకు గోపురాలు నిర్మించాడు. దేవాలయాల పోషణకు గ్రామాలను దానాలు చేశాడు. గోవింద దీక్షితులు చెవ్వప్ప మంత్రి. అతని సహాయంతో రాజ్యంలో చక్కని పరిపాలన ఏర్పాటు చేసి ప్రజాభిమానం పొందాడు. చెవ్వప్ప రాజబంధువు అవడంవల్ల అతడు

సామ్రాజ్యంలో ప్రముఖ వ్యక్తిగా గౌరవ మర్యాదలు పొందాడు. చెవ్వప్ప అవసర సమయాలలో విజయనగర చక్రవర్తులకు అండగా నిలిచేవాడు. చెవ్వప్ప పరమత సహని. క్రైస్తవ ఫాదరీలకు తన రాజ్యంలో చర్చిలను నిర్మించుకోవడానికి అనుమతి ఇచ్చాడు. వారు అతని అనుమతితో తంజావూరులో చర్చిని నిర్మించారు.

అచ్యుతప్పనాయకుడు క్రీ.శ.1561-1614: చెవ్వప్ప తర్వాత అతని కుమారుడు అచ్యుతప్ప క్రీ.శ.1561లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1614 వరకు పాలించాడు. చెవ్వప్ప తనకు అచ్యుతదేవరాయలు రాజ్యం ఇచ్చినందువల్ల విశ్వాసంతో తన కుమారునికి అచ్యుతప్ప అని పేరుపెట్టాడు. అతనికి చిన్నతనం నుండే విద్యాబుద్ధులు సాముగరిడీలు నేర్పాడు. అచ్యుతప్ప కాలంలో తళ్లికోట యుద్ధం జరిగింది. అందులో ఇతడు పాల్గొన్నాడు. తరువత రాజ్యానికి వచ్చిన రెండవ వెంకటపతిరాయల కాలంలో అతనికి కష్టం వచ్చినప్పుడల్లా అండగా నిలిచాడు. ముస్లిం దాడులను తిప్పికొట్టడంలోను, స్వామిద్రోహులైన మధుర, జింజి నాయకులను అదుపులో పెట్టడంలోను వెంకటపతి రాయలకు ఎన్నోసార్లు సహాయపడ్డాడు. మధుర నాయకులు వెంకటపతి రాయలకు కప్పం కట్టడం మానేశారు. వెంకటపతి మధురపై దండెత్తడానికి అచ్యుతప్పను సహాయం రమ్మన్నాడు అచ్యుతప్ప సహాయంతో వళ్లం కోట యుద్ధంలో వెంకటపతిరాయలు మధుర ముత్తు వీరప్పనాయకుని ఓడించాడు వళ్లం కోట యుద్ధంలో అచ్యుతప్ప, వెంకటపతిరాయలకు సహాయం చేసినందుకు కోపించి క్రీ.శ.1611లో ముత్తు వీరప్ప తంజావూరు రాజ్యంపై దండెత్తాడు. ఆ యుద్ధంలో అచ్యుతప్ప కుమారుడు యువరాజు రఘునాథుడు వీరవిహారం చేసి మధుర నాయకుని ఓడించి తరిమివేశాడు. ఈ యుద్ధం తర్వాత మధుర, తంజావూరు రాజ్యాలు బద్ధవిరోధులయ్యాయి. అచ్యుతప్ప మంత్రి గోవింద దీక్షితుడు. ఇతడు చెవ్వప్ప కాలంలో మంత్రి పదవిని అలంకరించి చెవ్వప్ప, అచ్యుతప్ప, రఘునాధరాయలు ముగ్గురికీ మంత్రిగా కొనసాగాడు. అతడు గొప్ప పండితుడు, కవి, బహు గ్రంథకర్త, వేదవేదాంగ విద్యలలో మహాపండితుడు. అతడు అనేక యజ్ఞాలు చేశాడు అతని మంత్రిత్వంలో రాజ్యం బాగా అభివృద్ధి చెందింది. అతని సహాయంతో అచ్యుతప్ప రాజ్యాన్ని ప్రజానురంజకంగా పాలించాడు. అచ్యుతప్ప కాలంలో అగసాలులు తమపై అధిక పన్నులు విధింపబడ్డాయని మొరపెట్టుకున్నారు. అచ్యుతప్ప వారిపై పన్నులను రద్దు చేసి వారిని సంతోషపెట్టాడు. అచ్యుతనాయకుడు గొప్ప దైవభక్తుడు. అతడు శైవ వైష్ణవ భేదాలు పాటించకుండా రెండు రకాల దేవాలయాలకూ దానాలు చేశాడు శ్రీరంగంలోని ఎనిమిదవ ప్రాకారాన్ని నిర్మించాడు. ఆ దేవాలయానికి గోపురాలు, స్నానఘట్టాలు, దానికి సోపానాలు కూడా నిర్మించాడు. దేవుని సేవకు పూల తోటను కూడా వేయించాడు. శ్రీరంగనాధునికి రత్నకిరీటం కవచాలను చేయించాడు. తిరుపతి, కాళహస్తి, రామేశ్వర దేవాలయాలకు దానాలు చేశాడు. మరమ్మతులు చేపట్టాడు. తన తండ్రి లాగే ప్రజలకు మేలు చేయడానికి కావేరీ నదికి ఆనకట్టను బాగు చేయించి వ్యవసాయాన్ని పెంచాడు. తన భార్య పేర ఒక గ్రామాన్ని నిర్మించి దానిని బ్రాహ్మణులకు అగ్రహారంగా దానం చేశాడు. అయ్యప్ప దీక్షితుడనే పండితుని సన్మానించాడు. అచ్యుతప్ప పోర్చుగీసు వారితో స్నేహం చేశాడు. కాని వారు చోళుగుడు అనే బందిపోటు దొంగకు సహాయం చేశారు. అందువల్ల అచ్యుతప్ప చివరి కాలంలో పోర్చుగీసు వారి సహాయంతో చోళుగుడు బందిపోటు చర్యలు చేపట్టి రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులను సృష్టించాడు. ఆ సమయంలో అచ్యుతప్ప తన కుమారుడు రఘునాధునికి రాజ్యం అప్పగించి క్రీ.శ.1614లో మరణించాడు.

రఘునాథ రాయలు క్రీ.శ.1614-1633: అచ్యుతప్ప తర్వాత అతని కుమారుడు రఘునాథరాయలు రాజ్యానికి వచ్చాడు. అతని తల్లి మూర్తిమాంబ. అతడు తంజావూరు నాయకరాజులలో అగ్రగణ్యుడు. అతడు శ్రీకృష్ణదేవరాయల లాగే బహుముఖ ప్రజ్ఞాశాలి, గొప్పవీరుడు, సాహిత్యపోషకుడు. సంగీత, సాహిత్య సమరాంగణ సార్వభౌముడు. అందువల్ల అతడు తంజావూరు కృష్ణరాయలని, మరో భోజుడని ప్రసిద్ధి చెందాడు.

యువరాజుగా పాత్ర క్రీ.శ.1595: రఘునాథుడు చిన్నతనం నుండే క్షత్రియోచిత విద్యలలో తర్ఫీదు పొందాడు. అతని గురువైన గోవింద దీక్షితుల వారి శిక్షణలో నీతిశాస్త్రాలను అభ్యసించాడు. అశ్వ గజాది విద్యలలో కూడా ప్రవీణుడు. సకలనీతి పారంగతుడు. అతడు రాజనీతితోపాటు సంగీత, సాహిత్యాలను కూడా అధ్యయనం చేసి, గొప్ప వీరుడుగా, పండితుడుగా, పరిపాలనాదక్షుడుగా రూపొందాడు. విద్యాభ్యాసం తర్వాత అతడు తన 20వ సంవత్సరంలో క్రీ.శ.1594లో యువరాజుగా నియమింపబడ్డాడు. అదే సంవత్సరంలో గోల్కొండ సేనలు పెనుగొండపై దండెత్తాయి. ఆ నాడు విజయనగర చక్రవర్తి అయిన రెండవ వెంకటపతిరాయలు తన సామంతులను సైన్యాలతో రమ్మని ఆజ్ఞాపించాడు. అచ్యుతప్ప తన కుమారుడైన రఘునాధుని తంజావూరు

సైన్యాలకు నాయకునిగా చక్రవర్తికి సహాయంగా పంపాడు. వెంకటపతికి సహాయంగా వచ్చిన మట్ల అనంత రాజు, వెలుగోటి వంశస్తులతోటి కలిసి రఘునాధుడు గోల్కొండ సైన్యంతో పోరాడి తరిమివేసి పెనుగొండను కాపాడాడు. తర్వాత వెంకటపతిరాయలు తనను ధిక్కరించిన బళ్లాలపురం కోట అధిపతి తిమ్మయ్యగౌడును అణచివేయవలసిందిగా వెంకటపతిరాయలు రఘునాధుని ఆదేశించాడు. చక్రవర్తి ఆదేశానుసారం రఘునాధుడు తమ్మయ్యగౌడును ఓడించి బందీకృతుని చేసి వెంకటపతిరాయల పాదాలపై పడేశాడు. రఘునాధుని పరాక్రమానికి ముగ్ధుడై వెంకటపతి రాయలు నిండు సభలో రఘునాధుని అభినందించాడు.

వివాహం క్రీ.శ.1596: జింజి పాలకుడైన కృష్ణప్ప వెంకటపతిరాయలపై తిరుగుబాటు చేశాడు. రాయలు అతనిని ఓడించి కారాగారంలో పెట్టాడు. జింజి అంతఃపుర స్త్రీలు కృష్ణప్పను విడిపించమని రఘునాధుని కోరారు. వారి కోరిక మేరకు చక్రవర్తిని ఒప్పించి కృష్ణప్పను విడుదల చేయించాడు. రఘునాధుడు తనకు చేసిన ఉపకారానికి మెచ్చి కృష్ణప్ప నాయకుడు తన కుమార్తె లక్ష్మమ్మను రఘునాధునికిచ్చి క్రీ.శ.1596లో వివాహం చేశాడు. రఘునాధుడు పెనుగొండ కోట వద్ద విజయలక్ష్మిని సాధించి తంజావూరులో లక్ష్మమ్మను చేపట్టి తంజావూరు చేరి అఖండ స్వాగత సత్కారాలను అందుకున్నాడు. క్రీ.శ.1611వ సంవత్సరంలో మధుర ముత్తువీరప్ప నాయకుడు తంజావూరుపై దండెత్తాడు. యువరాజుగా రఘునాధుడు ముత్తు వీరప్పను ఓడించి తరిమాడు. కానీ ఈ యుద్ధం తర్వాత తంజావూరు, మధుర రాజ్యాలు బద్ద విరోధులయ్యాయి.

తంజావూరు సింహాసనం అధిష్టించడం క్రీ.శ.1597: అచ్యుతప్పకు రఘునాధుడు పెద్ద కుమారుడు కాదు. రఘునాధుడు సాధించిన విజయాల వల్ల అతనికి తంజావూరు రాజ్యంలో అఖండ కీర్తి ప్రతిష్టలు వచ్చాయి. అందుకు ఈర్ష్య చెంది అతని పెద్ద సోదరుడు తిరుగుబాటు చేశాడు. అచ్యుతప్ప అతనిని నిర్బంధించి క్రీ.శ.1597లో రఘునాధుని తన వారసునిగా ప్రకటించాడు. అచ్యుతప్ప క్రీ.శ.1597లో రాజ్యాన్ని పరిత్యజించి వానప్రస్థానానికి వెళ్లి క్రీ.శ.1600 సంవత్సరంలో మరణించాడని జెసూట్ ఫాదరీ నికలాయ్ ఫిమంటా అనే అతను రాశాడు. క్రీ.శ.1597-16000 సంవత్సరాల మధ్య రఘునాధుడికీ, అతని పెద్ద సోదరుడికీ సింహాసనం కోసం అంతర్యుద్ధం జరిగినట్లుగా కనిపిస్తోంది. అందులో రఘునాధుడు తన పెద్ద సోదరుని చంపి రాజ్యానికి వచ్చాడని రెవరెండ్ హెచ్.హీరాన్ అనే అతడు రాశాడు. కానీ సమకాలీన రచనలలో ఈ గాథ కనిపించదు. అంతేగాక రఘునాధుని ఆస్థాన కవులు అతనిని శ్రీరామునితో పోల్చారు. అందువల్ల రఘునాధుడు భ్రాతృ హత్య చేశాడని నమ్మలేమని కొందరు భావించారు. మరికొందరు పండితులు విదేశీ రచనలు వాస్తవం అయి ఉండవచ్చునని భావించారు.

రఘునాధుని విజయాలు: రఘునాధుడు రాజ్యానికి వచ్చిన తర్వాత 10 సంవత్సరాలు ప్రశాంతంగా గడిచిపోయింది. కాని తర్వాత అతడు పొరుగు రాజ్యాలతో అనేక యుద్ధాలు చేశాడు. మధుర రాజైన పాండ్య ముత్తు వీరప్ప నాయకుడు తన తండ్రి తంజావూరు రాజ్యంతో అనుసరించిన శాంతి విధానాన్ని వదిలివేసి ఎరుకై మల్లి నాయకునితో కలిసి తంజావూరుపై దండెత్తాడు. రఘునాధుడు అతనిని ఓడించి మధురలో ప్రవేశించి వీరప్పనాయకుని బొమ్మ పెట్టాడు. కావేరీ ముఖద్వారంలో దేవికోట అనే దుర్గం ఉంది. దానిని చోళగుడు అనే రాజు పాలించేవాడు. అతడు గజదొంగ. అతిక్రూరుడు. అతనికి పోర్చుగీసు వారితోను, జింజిరాజుతోనూ మైత్రి ఉంది. పోర్చుగీసు వారి అండతో అతడు తంజావూరు రాజ్యంలో అలజడులను సృష్టించాడు. రఘునాధుడు అతనిని అణచడానికి నిర్ణయించి డచ్చి వారి సహకారంతో పడవల వంతెనను నిర్మించి కావేరి నదిలో నుండి ప్రయాణించి దేవీ కోటను ముట్టడించాడు. దేవీ కోట వశమైంది. కాని చోళకుడు తప్పించుకొని పారిపోయాడు. దేవీ కోటను సాధించినందుకు రఘునాధుడు సాధిత సముద్రాంతర ద్వీప అనే బిరుదు ధరించాడు. దేవీ కోట యుద్ధంలో చోళగునికి జాఫ్నాలోని పోర్చుగీసు వారు సహాయం చేశారు. జాఫ్నా సింహళంలో ఒక ప్రాంతం. దానిని సంకిలి అనే రాజు పాలిస్తున్నాడు. కొందరు నాయకులు పోర్చుగీసు వారి సహాయంతో సంకిలిని రాజ్యభ్రష్టుని చేశారు. రాజ్యం పోగొట్టుకున్న సంకిలి అతని రాణులు తంజావూరు వచ్చి రఘునాధుని ఆశ్రయించారు. తనకు వ్యతిరేకంగా చోళగునికి పోర్చుగీసు వారు సహాయం చేసినందుకు కోపంగా ఉన్న రఘునాధుడు సంకిలికి సహాయం చేయాలని భావించి జాఫ్నాపై దండెత్తి పోర్చుగీసు వారిని ఓడించి సంకిలికి పట్టం గట్టాడు. ఈ విజయం వల్ల రఘునాధుడు సింహళం భూపాల స్థాపనాచార్య అనే బిరుదు వహించాడు. క్రీ.శ.1614లో రెండవ వెంకటపతి రాయలు మరణించిన తర్వాత విజయనగర సింహాసనం కోసం వారసత్వ

యుద్ధం ప్రారంభమైంది. రెండవ వెంకటపతిరాయలు తన అన్న కుమారుడైన రెండవ శ్రీరంగరాయలను తన వారసునిగా నియమించాడు. అది సహించలేని రాయల బావమరిది జగ్గారావు శ్రీరంగరాయలను చంపి తన మేనల్లుడైన చిక్కరాయలను సింహాసనమెక్కించాడు. అది సహించని వెలుగోటి యాచమనాయకుడు మరణించిన శ్రీరంగరాయల కుమారుడైన రామదేవరాయలను విజయనగర రాజ్య ప్రభువుగా ప్రకటించాడు. యాచమ నాయకుడు జగ్గారావుతో పోరాడటానికి రఘునాధుని సహాయం అర్థించాడు. రఘునాధుడు యాచమనాయకుని పక్షం అవలంబించాడు. జగ్గారాయునికి కార్వేటి నగరాధిపతి మాకరాజు, రావిళ్ల మాదన్న, జింజి కృష్ణప్ప నాయకుడు, పోర్చుగీసు వారు సహాయంగా వచ్చారు. రఘునాధరాయలు పోర్చుగీసు వారికి దీటుగా డచ్చి వారి సహాయం తీసుకొని క్రీ.శ.1616లో తోపూరు యుద్ధంలో జగ్గారాయుని వధించాడు. యుద్ధంలో మధుర పాలకుడు ముత్తు వీరప్ప బందీగా చిక్కాడు. కాని అతనిని సగౌరవంగా మధురకు పంపి తన ఔదార్యాన్ని చూపాడు. తర్వాత రామదేవరాయలను రాయవెల్లూరులో విజయనగర చక్రవర్తిగా ప్రతిష్టించి తన స్వామిభక్తిని చాటుకున్నాడు తన తాత తండ్రుల కాలం నుండి చక్రవర్తుల యందు పాటించే సాంప్రదాయాన్ని, మర్యాదను, రాజభక్తిని రామదేవరాయల యందు పాటించాడు. అందువల్ల రామదేవరాయలు రఘునాధుని ప్రశంసించి కర్ణాటక రాజపూజనీయ దౌరంధర్య అనే బిరుదు ఇచ్చాడు. ఇలాంటి విజయాలవల్ల రఘునాధ రాయల కీర్తి అన్ని దిక్కులకూ పాకింది. బీజాపూరు సుల్తాన్ కూడా ఆయన ఆస్థానానికి హనుమోజీ అనే రాయబారిని పంపాడు.

సాహిత్య పోషణ: రఘునాధుడు గొప్ప వీరుడే కాక గొప్ప సాహిత్య పోషకుడు. స్వయంగా కవి. అతడు 11 రచనలు చేశాడు. కాని నూరు గ్రంధాలు రాశాడని ప్రతీతి. సంగీత సుధ, కధాసారం, భారత కధా సంగ్రహం రఘునాధ రామాయణం అనే సంస్కృత కావ్యాలు రాశాడు. తెలుగులో శృంగార సావిత్రి అనే కావ్యం పారిజాతాపహరణం అనే నాటకాన్ని రచించాడు. తెలుగులో వాల్మీకి చరిత్ర రామాయణాలను ప్రబంధాలుగా రాశాడు. అచ్యుతాభ్యుదయం ద్విపద గజేంద్రమోక్షం, నలచరిత్రలను ద్విపదలుగా రాశాడు. వీటిలో అచ్యుతాభ్యుదయం, గజేంద్ర మోక్షం లభ్యం కాలేదు. ఇంకా అతడు జానకీపరిణయం, రుక్మిణీ కృష్ణ వివాహం అనే యక్షగానాలు కూడా రచించాడు. కాని అవి రెండూ లభ్యం కాలేదు. రామాయణాన్ని శ్రీరామునికి అంకితమిచ్చాడు. కాని ఇది కూడా పూర్తిగా లభ్యం కాలేదు. అందులో బాలకాండలో కొంత భాగం లభించింది రఘునాధుని పాండిత్య పటిమ అసాధారణమైనదని అరుదుగా కనిపించే కవులలో రఘునాధుడు ఒకడని ఆరుద్ర ప్రశంసించాడు. రఘునాధుడు అనేక మంది కవులను, పండితులను పోషించాడు. అతని ఆస్థానంలో గోవింద దీక్షితులు, అతని కుమారుడు యజ్ఞనారాయణ దీక్షితులు, మధురవాణి, రామభద్రాంబ అనే కవయిత్రులు, ప్రసిద్ధి చెందిన తెలుగు కవి చేమకూర వెంకటకవి అలంకరించారు. యజ్ఞనారాయణ దీక్షితులు రఘునాధ రాయల శిష్యుడట. అతడు రఘునాధ భూపాలీయం, అలంకార రత్నాకరం, సాహిత్య రత్నాకరం అనే గ్రంధాలు రాశాడు నాగభద్రాంబ రఘునాధాభ్యుదయం అనే పేరుతో రఘునాధ రాయల చరిత్రను రాసింది. మధురవాణి రఘునాధ రామాయణాన్ని సంస్కృతీకరణం చేసింది. తర్వాత చేమకూర వెంకటకవి విజయవిలాసం, సారంగధర అనే కావ్యాలను రాసి రఘునాధ రాయలకు అంకితమిచ్చాడు. రఘునాధ రాయల ఆస్థానంలోని మరొక కవి కృష్ణాధ్వరి అతడు నైషధ పారిజాతీయం, రఘునాధ భూపాలీయం అనే గ్రంధాలు రాసి రఘునాధునికి అంకితం ఇచ్చాడు కాశయ్య అనే ఇంకొక కవి మన్నారు యాత్ర మహాత్మ్యం, రాజగోపాల విలాసం అనే కావ్యాలు రాశాడు రఘునాధుని కాలంలో కవితా ప్రబంధ, ద్విపద మంజరి, యక్షగానాలు మంచి ప్రాచుర్యంలోకి వచ్చాయి. గోవింద దీక్షితులు వారు నిర్వహించిన వాజిపేయం, సాజ్ఞి, చిత్యం, సర్వతోముఖ సత్రయాగాలకు రఘునాధ రాయలు ధనసహాయం చేశాడు. ఈ విధంగా అతడు రాజకీయ, సాహిత్య రంగాలకు సేవ చేసినందువల్ల తంజావూరు శ్రీకృష్ణదేవరాయలు అని ప్రసిద్ధి చెందాడు. అంతేగాక అతడు గొప్ప పరిపాలనాదక్షుడని, ప్రజానురంజకంగా పాలించాడని సమకాలీన రచనలు తెలుపుతున్నాయి.

విజయ రాఘవుడు క్రీ.శ.1633-1673: రఘునాధరాయల తర్వాత అతని కుమారుడు విజయరాఘవుడు క్రీ.శ.1633లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1673 వరకు పాలించాడు. ఇతడు అసమర్ధుడు, చపలచిత్తుడు, కుత్సితుడు అతడు తన తాత తండ్రుల మాదిరిగా గాక విజయనగర చక్రవర్తులకు ద్రోహం తలపెట్టాడు. విజయనగర చక్రవర్తులకు, మధుర తిరుమల నాయకునకు జరిగిన యుద్ధాలలో పక్షాలు మార్చి ఉభయుల కోపానికి గురయ్యాడు. తన రాజ్యంలో వైష్ణవ మతాన్ని ఎక్కువగా అభిమానించి ఇతర మతస్థులను బాధించి ప్రజాభిమానాన్ని

కోల్పోయాడు. ఇతని కాలంలో బీజాపూర్, గోల్కొండ సుల్తాన్‌లు అనేక పర్యాయాలు తంజావూరు రాజ్యాలపై దండెత్తారు. వారి దాడులను అరికట్టలేక వారికి కానుకలను ఇచ్చేవాడు. అందువల్ల ఒట్టిపోయిన ధనాగారాన్ని నింపుకోవటానికి ప్రజలపై అధిక పన్నులు విధించి పీడించేవాడు. ఇందుకు తోడు క్రీ.శ.1622లో గొప్ప క్షామం సంభవించి ప్రజలు అనేక బాధలకు గురయ్యారు. తన రాజ్య పరిస్థితులు అధ్వానంగా ఉండగా మధుర చొక్కనాథునిపై తిరుగుబాటు చేసిన లింగమనేనికి ఆశ్రయమిచ్చాడు. తనకు మిత్రుడుగా ఉండి మోసం చేశాడని మధురనాయకుని కోపానికి గురయ్యాడు. విజయ రాఘవుడు అన్ని విధాలా రాజ్యాన్ని చెరిచాడు.

బీజాపూర్ సుల్తాన్ దండయాత్ర క్రీ.శ.1659: విజయ రాఘవుడు రాజ్యానికి వచ్చే నాటికే బీజాపూరు, గోల్కొండ రాజ్యాలు మధుర, తంజావూరు రాజ్యాలపై దాడులు మొదలు పెట్టాయి. బీజాపూరు సుల్తాన్ మధురపై దండయాత్రను తలపెట్టాడు. ఆ సందర్భంలో మధుర తిరుమల నాయకుడు ముస్లిం దండయాత్రలను అరికట్టడానికి విజయరాఘవుని సహాయం అర్థించాడు. కాని విజయరాఘవుడు తిరుమల రాయల కోర్కెను తిరస్కరించాడు. కనుక మధుర నాయకుడు తన సైన్యాన్ని సమీకరించుకొని యుద్ధానికి సిద్ధంగా ఉన్నాడు. బీజాపూరు సుల్తాన్ తన సైన్యాలతో బయలుదేరి వచ్చి మధుర రాజ్యంపై దాడి చేయకుండా విజయరాఘవుని రాజ్యంపై దండెత్తాడు. ఈ దండయాత్ర క్రీ.శ.1659 మార్చి 19వ తేదీన జరిగింది. విజయరాఘవుడు ముస్లింలను ఓడించలేక తంజావూరు విడిచి వళ్లం కోట చేరాడు. ముస్లిం సైన్యాలు తంజావూరుని దోచుకొని మన్నారుదేవుని ఆలయాన్ని కూడా దోపిడీ చేశాయి. తంజావూరిని స్వాధీనం చేసుకొని సుల్తాన్ అక్కడ కొంత సైన్యాన్ని ఉంచాడు. తర్వాత విజయరాఘవుడు వళ్లంకోటలో ఉన్నాడని తెలిసి సుల్తాన్ మరొక సైన్యాన్ని వళ్లంకోటపైకి పంపాడు. ముస్లిం సైన్యం వస్తుందని తెలిసి విజయరాఘవుని సైన్యం పారిపోయింది. విజయరాఘవుడు తన సైన్యాన్ని అదుపు చేయలేకపోయాడు. ఏమీ చేయలేక అతడు కూడా కోటను వదిలి అరణ్యాలలోకి పారిపోయాడు. కోటలోని ప్రజలు, కాపలా సైనికులు కలిసి రాజ కోశాగారాన్ని దోపిడీ చేశారు. ఈ లోపల బీజాపూరు సైన్యం కోట వద్దకు వచ్చింది. ప్రజలు వారికి కోటను అప్పగించారు. ఈ విధంగా విజయరాఘవుని కాలంలో క్రీ.శ.1659లో తంజావూరు రాజ్యం బీజాపూరు సుల్తాన్ వశమైంది. విజయరాఘవుని రాజ్యం 2 సంవత్సరాలు సుల్తాన్ కింద ఉంది. ఈ 2 సంవత్సరాలు విజయ రాఘవుడు అడవులలో కాలం గడిపాడు. 7 సంవత్సరాల తర్వాత తంజావూరు రాజ్యంలో క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలు పండలేదు. వేల కొలది ముస్లిం సైనికులు మరణించారు. సుల్తాన్ దోపిడీతోను, విధించిన విపరీతమైన పన్నులతో ప్రజలు అనేక బాధలు పడ్డారు. క్షామంలో ప్రజలు కూడా అధికంగా మరణించారు. ఆ స్థితిలో ముస్లిం సైన్యాలు తంజావూరును వదలి వెళ్లిపోయాయి. అప్పుడు విజయరాఘవుడు తిరిగి వచ్చి రాజ్యాన్ని ఏలసాగాడు. కాని బొక్కసం వట్టిపోయింది. కనుక అతడు ప్రజలపై విపరీతంగా పన్నులు విధించాడు. అధిక పన్నులు చెల్లించలేక ప్రజలు విజయరాఘవ నాయకుని ద్వేషించారు. ప్రజలు దరిద్రులయ్యారు. ఆ స్థితిలో నాగపట్టణంలో డచ్చి వారు ప్రజల బాధలను గమనించి వారికి పనులు ఇప్పిస్తామని నాగపట్టణానికి తీసుకువెళ్లి కొద్ది కూలీతో అధిక పనులు చేయించుకున్నారు. అంతకుముందు విజయ రాఘవుడు డచ్చి వారికి నాగపట్టణాన్ని ఇచ్చాడు.

మధుర చొక్కనాథుడు వళ్లం కోటను ఆక్రమించటం క్రీ.శ.1667: తర్వాత క్రీ.శ.1667లో బీజాపూరు సుల్తాన్ మధుర రాజ్యంపై దండెత్తాడు. అప్పుడు మధురను చొక్కనాథుడు పాలిస్తున్నాడు. అతడు విజయరాఘవుని సహాయం కోరాడు. కాని విజయరాఘవుడు సహాయం చేయలేదు. చొక్కనాథుడు ముస్లిం సైన్యాలను ధనాన్ని ఇచ్చి పంపి వేసి తన రాజ్యాన్ని కాపాడుకున్నాడు. కాని తనకు సహాయం చేయనందుకు కోపించి అతడు తంజావూరిపై దండెత్తి క్రీ.శ.1667లో వళ్లంకోటను ఆక్రమించాడు. విజయరాఘవుడు తన రాజ్యంలో ఉన్న డచ్చి వారి సహాయంతో మధుర సైన్యాలను ఓడించి తరిమి వళ్లం కోటను తిరిగి ఆక్రమించాడు. తర్వాత విజయరాఘవుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 6 సంవత్సరాలు పాలించాడు.

చొక్కనాథుడు తంజావూరును ఆక్రమించటం క్రీ.శ.1673: క్రీ.శ.1673వ సంవత్సరంలో మధుర రాజ్యం చొక్కనాథుని సామంతుడు లింగమనేని అనే అతడు తిరుగుబాటు చేశాడు. చొక్కనాథుడు అతనిని ఓడించి తరుమగా అతడు తంజావూరు చేరి విజయరాఘవుని ఆశ్రయించాడు. అందుకు కోపించిన చొక్కనాథుడు విజయ రాఘవునికి బుద్ధి చెప్పాలని తన సేనాధిపతి వెంకటకృష్ణప్ప నాయకునికి పెద్ద సైన్యాన్ని ఇచ్చి తంజావూరిపైకి పంపాడు. అతడు వళ్లం కోటను ఆక్రమించి విజయ రాఘవునికి రాయబారం పంపాడు. తంజావూరి కన్యను తన

ప్రభువు చొక్కనాధునికి ఇచ్చి వివాహం చేసినట్లయితే అతని రాజ్యం అతనికి అప్పగించి వెళ్లిపోతానని రాయబార సారాంశం. అందుకు విజయరాఘవుడు అంగీకరించలేదు. అందువల్ల మధుర సేనాని తంజావూరుపై దండెత్తాడు తంజావూరి కోట వద్ద ఘోర యుద్ధం జరిగింది. అందులో విజయరాఘవుని సైన్యాలు ఓడిపోయాయి. అపజయం తప్పదని గ్రహించిన విజయరాఘవ నాయకుని కుమారుడు మన్నారుదాసు అంతఃపుర స్త్రీలను వధించి తండ్రితో యుద్ధానికి వచ్చి వీరోచితంగా పోరాడాడు. కాని వారిద్దరినీ మధుర సేన్యాలు తంజావూరిని ఆక్రమించాయి అప్పుడు క్రీ.శ.1673లో చొక్కనాధుడు తంజావూరి రాజ్యాన్ని మధురరాజ్యంలో విలీనం చేశాడు. ఈ విధంగా విజయరాఘవుని జీవితం అంతమైంది.

విజయరాఘవుడు రాజ్యపాలనలో అసమర్ధుడైనా అతడు కూడా తన తండ్రిలాగే గొప్ప పండితుడు సాహితీస్రష్ట. అతడు 50 గ్రంధాలు రాశాడని ప్రతీతి. వీనిలో సుమారు 20 యక్షగానాలు ఉన్నాయి. అందులో రఘునాధాభ్యుదయం, విప్రనారాయణ చరిత్రలు ప్రసిద్ధి చెందాయి. విజయరాఘవుడు యక్షగానాలలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టి వాటిని నాటకతుల్యాలుగా రూపొందించాడు. అది అతని ప్రత్యేకత. ఇంకా అతడు రఘునాధాభ్యుదయం, పాదుకాసహస్రం మొదలైన ద్విపద కావ్యాలు, కొన్ని దండకాలు, సాంగత్యాలు, రగడలు రచించాడు. ఆనాడు విజయరాఘవుడేగాక మరికొందరు కవులు కూడా యక్షగానాలు రచించారు. వారిలో కోనేటి దీక్షితుడు, మన్నారుదేవుడు, వెంకటపతి సోమయాజి ముఖ్యులు. విజయరాఘవునికి సమకాలికుడైన చిననారాయణరాజు మార్కండేయ పురాణంలోని కధను తీసుకొని కువలయాశ్వచరిత్ర అనే కావ్యాన్ని రాశాడు ఆనాటి కవయిత్రులలో రంగాజమ్మ అగ్రగణ్యురాలు. ఆమె విజయరాఘవుని ఆస్థాన కవయిత్రి. ఆమె మన్నారుదాస విలాసం, సంగ్రహ భారతం, భాగవత రామాయణం, ఉషాపరిణయం అనే కావ్యాలను యక్షగానాలుగా రాసింది సుప్రసిద్ధుడైన క్షేత్రయ్య విజయరాఘవునిచే సత్కారం పొందాడు. అతడు మువ్వగోపాలస్వామి పదాలు రాశాడు త్యాగయ్య ఈయన శిష్యుడని కొందరు భావిస్తారు. త్యాగరాజు భక్తవిజయం, నౌకా విజయం అనే యక్షగానాలు రాశాడు. అతడు తంజావూరును ఏలిన మహారాష్ట్ర రాజైన శరభోజి ఆస్థానంలో ఉండేవాడని ప్రతీతి.

చెంగమలదాసు క్రీ.శ.1673-1676: జయించిన తంజావూరు రాజ్యాన్ని పరిపాలించడానికి చొక్కనాధుడు తన సవతి తమ్ముడు అళగిరిని పాలకునిగా నియమించాడు. అళగిరి రాజనీతిపరుడు కాదు, సమర్ధుడు కాదు దానిని ఆసరాగా తీసుకొని అంతకుముందు విజయరాఘవుని కొలువులో పనిచేసిన రాయసం వెంకన్న అనే ఉద్యోగి బీజాపూరు సేనాని ఏకోజి సహాయంతో అళగిరిని మధుర సైన్యాలను పారద్రోలి మన్నారుదాసుని కుమారుడు చంగమలదాసుని తంజావూరు సింహాసనమెక్కించాడు. కాని చెంగలదాసు దుష్టపరిపాలకుడు ప్రజాభిమానాన్ని సంపాదించుకోలేకపోయాడు. తనను సింహాసనం ఎక్కించిన రాయసం వెంకన్న అభిమానం కూడా కోల్పోయాడు. ఆ పరిస్థితిలో మరాఠా సేనాని ఏకోజి తంజావూరు పై దండెత్తి చెంగమలదాసుని ఓడించి తరిమివేసి క్రీ.శ.1676లో తంజావూరును ఆక్రమించాడు. అంతటితో తంజావూరు నాయక వంశం అంతరించింది. తంజావూరులో మహారాష్ట్రుల పరిపాలన ప్రారంభమైంది. తంజావూరును జయించిన ఏకోజి శివాజీ సవతి తమ్ముడు. అతడు షాజీ తుకాభాయిల కుమారుడు. అతడు బీజాపూరు సేనాని. కనుక తంజావూరు బీజాపూరు సామంతరాజ్యమైంది. ఏకోజి సంతతి వారు బ్రిటిష్ వారి కాలం దాకా తంజావూరు రాజ్యాన్ని పాలించారు.

మధుర నాయకరాజ్యం క్రీ.శ.1542-1739: ప్రాచీన పాండ్యరాజ్యమే మధుర నాయకరాజ్యం నేటి మధుర, రామనాధపురం, తిరునల్వేలి, తిరుచునాపల్లి, పుదుక్కోట, కోయంబత్తూరు, సేలం జిల్లా ప్రాంతం. తిరువాన్కూరులో కొన్ని ప్రాంతాలుండేవి. మొదటి బుక్కరాయల కుమారుడు కంపరాయలు మధుర సుల్తానును ఓడించి మధురను ఆక్రమించిన నాటి నుండి ఈ రాజ్యం విజయనగర సామ్రాజ్యంలో భాగంగా ఉంది. మధుర నాయక రాజ్యాన్ని స్థాపించిన వాడు విశ్వనాధ నాయకుడు. మధుర రాజ్యస్థాపనను గురించి ఒక ఇతిహాసం ఉంది విశ్వనాధ నాయకుని తండ్రి నాగమనాయకుడు శ్రీకృష్ణరాయల ఆస్థానంలో ఒక ప్రముఖ సేనాని విశ్వనాధ నాయకుని తండ్రి నాగమనాయకుడు శ్రీకృష్ణరాయల ఆస్థానంలో ఒక ప్రముఖ సేనాని. మధురలో పాండ్యరాజులు కప్పం చెల్లించకుండా రాయలపై తిరుగుబాటు చేశారు. వారిని అదుపులోకి తేవడానికి రాయలు నాగమనాయకుని పంపాడు. అతడు పాండ్యరాజులను ఓడించి మధుర రాజ్యాన్ని జయించాడు. కాని విజయం తర్వాత దానిని తన సొంతం చేసుకొని స్వతంత్రం ప్రకటించాడు. కృష్ణదేవరాయలు అది తెలుసుకొని అతనిని శిక్షింపదలచి కొలువులో

నాగమనాయకుని బంధించితేగల వీరుడు ముందుకు రావాలని కోరాడు. ఏ సేనానీ ముందుకు రాలేదు. అప్పుడు నాగమ నాయకుని కుమారుడు విశ్వనాథ నాయకుడు ముందుకు వచ్చి స్వామి ద్రోహం చేసిన తన తండ్రిని బంధించి తెస్తానని పలికాడు. రాయలు ఎలాంటి అనుమానాలు పడకుండా అతనికి సైన్యాన్నిచ్చి పంపాడు. విశ్వనాథ నాయకుడు తండ్రిని ఓడించి బంధించి తెచ్చి రాయల కాళ్లపై పడవేశాడు. అందుకు సంతోషించిన రాయలు విశ్వనాథ నాయకుడిని మధుర రాజుగా నియమించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. అంటే శ్రీకృష్ణదేవరాలయ కాలంలోనే విశ్వనాథ నాయకుడు మధుర రాజ్యాన్ని స్థాపించాడని ఈ కథ తెలుపుతోంది. కాని ఈ కథను చరిత్రకారులు తిరస్కరించారు. అచ్యుత దేవరాయల కాలంలో విశ్వనాథ నాయకుడు తాంబూలక దండవాహినిగా ఉన్నట్లు శాసనం ఉంది. కనుక అచ్యుతదేవరాయలు విశ్వనాథ నాయకుని మధుర ప్రాంతంలో అమర నాయకునిగా నియమించాడని భావించారు. తర్వాత సదాశివరాయల కాలంలో దక్షిణదేశ దండయాత్ర నడిపిన రామరాజు, విఠలులకు సహాయపడి అళియ రామరాయల అభిమానానికి పాత్రుడయ్యాడు. అందువల్ల రామరాయలు విశ్వనాథుని తిరువాడ పాలకునిగా నియమించాడు. అప్పుడు విశ్వనాథ నాయకుడు మధుర, తిరువాడులను పాలించాడు. క్రీ.శ.1564 వరకు పాలించాడు. అతని మంత్రి అరియనాథుడు. విశ్వనాథ నాయకుడు మధుర రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పి చక్కగా పాలించాడు. వ్యవసాయాభివృద్ధికి పాటుపడ్డాడు. అచ్యుతరామ రాయలను సదాశివరాయలను విశ్వాసపాత్రంగా కొలిచాడు. మధురలోని మీనాక్షి ఆలయాన్ని బాగు చేయించాడు. అతని తర్వాత అతని సంతతి వారు 2 శతాబ్దాలు క్రీ.శ.1739 వరకు మధుర రాజ్యాన్ని పాలించారు.

కృష్ణప్ప నాయకుడు క్రీ.శ.1564-1572: విశ్వనాథ నాయకుని తర్వాత అతని కుమారుడు కృష్ణప్ప నాయకుడు క్రీ.శ.1564లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1572 వరకు పాలించాడు. ఇతని కాలంలో తళ్లికోట యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఇతడు పాల్గొని విజయనగరం తరపున పోరాడాడు. తళ్లికోట యుద్ధం తర్వాత అనేక మంది సామంతులు స్వతంత్రవైఖరిని అవలంబించారు. కృష్ణప్పనాయకుడు కూడా తన రాజ్యాన్ని బలపరచుకున్నాడు. ఆరవీటి తిరుమలరాయల ఇబ్బందులు, నిస్సహాయతను ఆసరాగా తీసుకొని నామమాత్రంగా అతని సార్వభౌమాధికారాన్ని అంగీకరించిన కప్పం చెల్లించి దాదాపు స్వతంత్రుడుగా వ్యవహరించాడు. అందువల్ల కొందరు కృష్ణప్పనాయకుడే మధురరాజ్య స్థాపకుడు అని భావిస్తారు. కృష్ణప్పకు కూడా అరియనాథుడే మంత్రి. అతడే సేనాధిపతిగా వ్యవహరించాడు. అతని సహాయంతో మధుర రాజ్యంలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టి పరిపాలనను కట్టుదిట్టం చేశాడు. తన అధికారం బలపడిన తర్వాత సింహళంపై దండెత్తి ఖండి నగరాన్ని ఆక్రమించాడు. అతడు దానశీలి. అనేక దేవాలయాలకు బ్రాహ్మణులకు అగ్రహారాలు దానం చేశాడు.

వీరప్ప నాయకుడు (క్రీ.శ.1572-1596): కృష్ణప్ప తర్వాత అతని కుమారుడు వీరప్పనాయకుడు క్రీ.శ.1572లో రాజ్యానికి వచ్చి 1596 వరకు పాలించాడు. ఇతనికి స్వతంత్రుడు కావాలని కలిగింది. ఇతడు మొదటి శ్రీరంగరాయలకు సమకాలికుడు. ఇతనిని రెండవ వెంకటపతిరాయలు అదుపు చేశాడు. ఇతని కాలంలో ఫెర్నాడియన్ అనే పోర్చుగీసు మత ప్రచారకుడు మధురలో చర్చిని నిర్మించాడు.

రెండవ **కృష్ణప్పనాయకుడు క్రీ.శ.1596-1601:** వీరప్పనాయకునికి కృష్ణప్పనాయకుడు, విశ్వప్ప నాయకుడు, కస్తూరి రంగప్పనాయకుడు అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరప్పనాయకుని తర్వాత అతని పెద్ద కుమారుడు రెండవ కృష్ణప్పనాయకుడు క్రీ.శ.1596 నుండి క్రీ.శ.1601 వరకు పాలించాడు.

ముద్దుకృష్ణమ్మ నాయకుడు క్రీ.శ.1601-1609: రెండవ కృష్ణమ్మకు సంతానం లేనందున అతని తమ్ముడు విశ్వప్పనాయకుని కుమారుడు ముద్దు కృష్ణమ్మనాయకుడు క్రీ.శ.1601లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1609 వరకు పాలించాడు. ఇతని కాలంలో మధుర తీరప్రాంతాలలో ఉన్న మారవ దేశంలో పోర్చుగీసు వారు అనేక దురంతాలు చేశారు. వారిని అణచి రామేశ్వరం వెళ్లే తీర్థయాత్రీకులకు రక్షణ కల్పించాడు.

ముద్దు వీరప్పనాయకుడు క్రీ.శ.1609-1623: ముద్దు కృష్ణప్పనాయకుడు, ముద్దు వీరప్పనాయకుడు రాజ్యానికి రాగానే స్వతంత్రం ప్రకటించాడు. అందుకు కోపించి రెండవ వెంకటపతిరాయలు తంజావూరు యువరాజు రఘునాథరాయలను కలుపుకొని వెళ్లి వల్లంకోట యుద్ధంలో ముద్దువీరప్పను ఓడించాడు. వెంకటపతిరాయల మరణానంతరం ముద్దు వీరప్పజగ్గారావుతో కలిసి తోపూరు యుద్ధంలో పాల్గొని ఓడిపోయి తంజావూరు రాజు రఘునాథరాయలకు బందీగా చిక్కాడు. రఘునాథరాయలు అతనిని విడిపించి సగౌరవంగా

మధురకు పంపాడు. మొత్తం మీద ఇతని కాలమంతా పరాజయాలతోనే గడిచిపోయింది. ఇతడి రాజధాని తిరుచునాపల్లి. రాజ్య విస్తరణకు అతను చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

తిరుమలరాయలు క్రీ.శ.1623-1659: ముద్దు వీరప్ప తర్వాత అతని కుమారుడు తిరుమలరాయలు క్రీ.శ.1623లో సింహాసనానికి వచ్చి క్రీ.శ.1659 వరకు పాలించాడు. ఇతడు మధురనాయక రాజుల్లో అగ్రగణ్యుడు. ఇతని కాలంలో మధుర రాజ్యం గౌరవ ప్రతిష్టలు ఇనుమడించాయి. కాని ఇతడు స్వార్ధపరుడు. దురాశాపరుడు, కుటిలుడు, మాట నిలకడ లేనివాడు. అందువల్ల సాటిరాజులకు ఇతనియందు హేయభావం ఉండేది. ఇతని స్వార్ధం వల్ల విజయనగర సామ్రాజ్యం పతనం చెందడమేగాక మధుర రాజ్య ఉనికికి కూడా ముస్లింల వల్ల ముప్పు వచ్చింది. ఇతడు విజయనగర చక్రవర్తి మూడవ శ్రీరంగరాయలను పదభ్రష్టుణ్ణి చేయాలని జింజిపాలకుడైన అప్పాఆనాయక్‌తో లాలూచీపడి బీజాపూరు సుల్తాన్‌ను ప్రోత్సహించి రాయలతో యుద్ధానికి దిగాడు. కాని ఈ యుద్ధంలో ఓడిపోయాడు. కాని అతడు బీజాపూరు, గోల్కొండ నవాబుల పక్షం వహించాడు అందువల్ల బీజాపూరు సుల్తాన్ కర్ణాటకాన్ని, గోల్కొండ సుల్తాన్ ఆంధ్ర ప్రాంతాలను ఆక్రమించారు శ్రీరంగరాయలను ఓడించిన తర్వాత బీజాపూరు, గోల్కొండ సైన్యాలు మధుర రాజ్యంపై దండెత్తాయి. వారి నుండి తనను కాపాడుకోడానికి తిరుమలరాయలు మైసూరురాజు కంఠీరవ నరసనాయకుని సహాయం అర్థించాడు కంఠీరవనరస సహాయం చేశాడు.

ముక్కుల యుద్ధం క్రీ.శ.1654: యుద్ధం తర్వాత కంఠీరవ నరస నాయకుని కూడా తిరుమలరాయలు మోసం చేశాడు. అందుకు కోపించి కంఠీరవ నరస మధురరాజ్యంపై దండెత్తి విచక్షణ లేకుండా క్రీ.శ.1654లో సత్యమంగళం వద్ద తిరుమలరాయలను ఓడించి మధుర రాజ్యంలోకి చొరబడి రాజ్యాన్ని దోచుకున్నాడు. అదే సమయంలో విచక్షణ లేకుండా చిక్కిన మధుర సైనికులను, మధుర రాజ్య ప్రజలను స్త్రీపురుష విచక్షణ లేకుండా ముక్కులు కోయించాడు. ముక్కును కోసేటప్పుడు ముక్కుతోపాటు పైపెదవి కూడా కోయబడేదట. ముక్కు పైపెదవి లేకుండాపోయిన మనుషుల ముఖాలు చూడటానికి దెయ్యాలలాగా ఉండేవారట. వారి బతుకు దుర్భరమైపోయిందట. అందువల్ల మధుర సైనికులు, ప్రజలకు తమ ముక్కులను కాపాడుకోవడం గొప్ప ప్రాణాంతకమైపోయింది. యుద్ధంలో మరణించినా ఫరవాలేదుగాని, ముక్కు పెదవి పోగూడదని వారు తమ శాయశక్తులా పోరాడారట. అయినా మధుర సైన్యాలు ఓడిపోయాయి. మధుర రాజ్యంలోని పశ్చిమ ప్రాంతాలన్నీ కంఠీరవనరస స్వాధీనంలోకి వెళ్లిపోయాయి. ఈ యుద్ధాన్ని ఆనాటి పోర్చుగీసు రచయితలు 'ముక్కుల యుద్ధం' అని వర్ణించారు. ఈ ముక్కుల యుద్ధంలో తిరుమలరాయలు తన రాజ్యంలో చాలా భాగం పోగొట్టుకున్నాడు. అదిపోను మిగిలిన ప్రాంతాలను కాపాడుకొని పాలించాడు. పరరాజుల దండయాత్రలే గాక, అతని సామంతులు కూడా అతనిపై తరచూ యుద్ధాలు చేస్తూ ఉండేవారు. అతడు మారవ సేనాధిపతులతోను, ఇతర పాలెగాళ్లతోను అనేక యుద్ధాలు చేశాడు. మొత్తం మీద అతని కాలం అంతా యుద్ధాలతోనే గడిచిపోయింది. ముక్కుల యుద్ధంలో అతనికి పోర్చుగీసు వారు సహాయం చేశారు. అందువల్ల తిరుమల రాయలు వారికి చర్చిలు నిర్మించి ఇచ్చాడు ఇతని కాలంలోనే పోర్చుగీసు మతప్రచారకుడు రాబర్టు డినోబిలి హిందూ సన్యాసిలాగ వేషం వేసుకొని కీర్తనలు పాడుతూ క్రైస్తవమత ప్రచారం చేశాడు. డినోబిలి మధురను తన కేంద్రంగా చేసుకొని క్రైస్తవ మతప్రచారం సాగించినా తిరుమలనాయకుడు అతనిని ఏమీ అనలేదు. అతనికి స్వేచ్ఛను ఇచ్చాడు. కాని అతడు ఎన్ని మాయోపాయాలు పన్ని ప్రచారం చేసినా హిందువులు క్రైస్తవ మతాన్ని పుచ్చుకోలేదు. అతని ప్రచారం విఫలం అయింది.

తిరుమలరాయల రాజకీయ జీవితం కలుషితమైనదైనా అతడు సాహిత్యకళలను పోషించాడు. ఇతని ఆస్థానంలో నీలకంఠదీక్షితుడు, లింగనముఖి, కామేశ్వరకవి అనే వారు ఉండేవారు. నీలకంఠ దీక్షితులు శివలీలావర్ణనం, నీలకంఠ విజయం అనే కావ్యాలు రాశాడు. కామేశ్వరకవి సత్యభామాస్వాంతనం అనే కావ్యాన్ని రాశాడు. అందులో ఇతడు తిరుమల నాయకుడు తనకు ముక్తఛత్రచామర కలాచిక కనక ఆందోళికలను ప్రసాదించాడని వర్ణించుకున్నాడు. కామేశ్వర కవి ఆంధ్ర దేశం నుండి మధుర చేరి 25 సంవత్సరాలు తిరుమల రాయల ఆస్థానంలో జీవించాడు. తిరుమలరాయల కాలంలోనే మధుర ఆస్థానం తెలుగు సారస్వతానికి నిలయమైంది. తిరుమలరాయలు గొప్ప నిర్మాత. అతడు మధుర దేవాలయాన్ని నిర్మించాడు. ఇంకా అనేక దేవాలయాలలో నూతన మండపాలు, గోపురాలు నిర్మించాడు. మధురలో తిరుమలరాయల మహల్ అనే భవనాన్ని

నిర్మించాడు. ఇది పరిమాణంలో ప్రాచీన థేబుల కట్టడాల లాగా ఉందని పండితులు వర్ణించారు. ఇది తిరుమలరాయల రాజభవనం.

రెండవ ముద్దు వీరప్పనాయకుడు క్రీ.శ.1659: తిరుమలరాయల మరణానంతరం అతని మొదటి కుమారుడు రెండవ ముద్దు వీరప్పనాయకుడు కొన్ని నెలలు మాత్రమే రాజ్యం చేశాడు.

మొదటి చొక్కనాథ నాయకుడు క్రీ.శ.1659-1682: రెండవ ముద్దువీరప్ప తర్వాత అతని సోదరుడు తిరుమలరాయల చిన్నకుమారుడు క్రీ.శ.1659లో రాజ్యానికి వచ్చి క్రీ.శ.1682 వరకు పాలించాడు. ఇతని కాలంలో మధుర రాజ్యక్షీణత ప్రారంభమైంది. అతని ఆస్థాన ఉద్యోగులు కుట్రలు ప్రారంభించారు. ఈ పరిస్థితులలో క్రీ.శ.1663లో బీజాపూరు సైన్యాధిపతి రుస్తుంఖాన్ మధుర రాజ్యంపై దండెత్తాడు. ఆ సమయంలో అతడు తంజావూరు విజయరాఘవుని సహాయం అర్థించాడు. కాని అతడు సహాయం చేయలేదు. రుస్తుంఖాన్ దేశాన్ని కొల్లగొట్టి ప్రజలను హింసించాడు. అందువల్ల చొక్కనాథుడు బీజాపూరు సేనాధిపతికి ధనాన్ని చెల్లించి పంపివేశాడు. తంజావూరు తనకు సహాయం చేయలేదని తంజావూరు రాజ్యంపై దండెత్తి వళ్లం కోటను ఆక్రమించాడు. కాని విజయరాఘవుడు దచ్చి వారి సహాయంతో మధుర సైన్యాలను ఓడించి తరిమి తిరిగి వళ్లం కోటను ఆక్రమించాడు. తర్వాత మైసూరు ఒడయారు రాజు కంఠీరవనరస కుమారుడు దొడ్డ దేవుడు మధుర రాజ్యంపై దండెత్తి చిత్తూరు, కోయంబత్తూరులను ఆక్రమించాడు. ఈ ఓటముల తర్వాత అతడు క్రీ.శ.1673లో తంజావూరుపై దండెత్తాడు. అక్కడ జరిగిన యుద్ధంలో విజయరాఘవనాయకుడు, అతని కుమారుడు మన్నారుదాసు మరణించారు. చొక్కనాథుడు తంజావూరు రాజ్యాన్ని తన రాజ్యంలో కలుపుకొని తన సోదరుడు ముద్దు అతనిని రాజుగా నియమించాడు. కాని అతడు తంజావూరుని శాశ్వతంగా నిలుపుకోలేకపోయాడు. తంజావూరి రాజోద్యోగి రాయసం వెంకన్న అనే అతడు బీజాపూరు సేనాని ఏకోజీ సహాయంతో అళనిగిరిని పారదోలి మన్నారుదాసు కుమారుడు చెంగమలదాసును తంజావూరు రాజుగా చేశాడు. దాంతో జయించిన తంజావూరు రాజ్యం పోయింది. చొక్కనాథుడు కూడా కవి పండితపోషకుడు. ఇతని తొలికాలంలో కామేశ్వరకవి ధేనుమహాత్మ్యాన్ని రాశాడు. ఇది తెలుగుభాషలో వచన కావ్యంగా రాయబడింది. దానిని అతడు చొక్కనాథునికి అంకితం చేశాడు. అతడే సత్యభామాస్వాంతాన్ని రచించి చొక్కనాథుని సోదరుడు ముద్దళగిరికి అంకితమిచ్చాడు. అతడు చొక్కనాథుని సోదరుడు రెండవ ముద్దువీరప్ప రెండవ కుమారుడు, తిరుమలరాయల మనుమడు. అతడు కూడా సాహిత్యాభిమాని. సత్యభామాస్వాంతనం మధుర నాయకరాజుల చరిత్రను తెలుపుతోంది. నాగమ నాయకుని కాలం నుండి తాను అంకితమిచ్చిన ముద్దళగిరి వరకు వారి చరిత్రను వంశావళిని ఇస్తోంది. ముద్దళగిరి గణపవరపు వెంకటకవి అనే అతనిని పోషించాడు. అతడు వ్యాకరణ శాస్త్రవేత్త, గద్య పద్య ఆశు చిత్ర విస్తర మధురకవితలు అల్లగలిగిన నేర్పరి. అతడు ప్రబంధరాజ వేంకటేశ్వర విజయం, విద్యావతి దండక అనే కావ్యాలు రాశాడు. వెంకటపతి అనే మరొకకవి రాధామాధవం అనే కావ్యాన్ని రాశాడు. చొక్కనాథుడు కూడా కవి. తెలుగులో స్వయంగా కావ్యాలు రాశాడు. అతని మంత్రి దండనాథుడు వెంకటకృష్ణప్ప కూడా గొప్పకవి.

మూడవ ముత్తు వీరప్పనాయకుడు క్రీ.శ. 1682-1689: చొక్కనాథుని తర్వాత అతని కుమారుడు మూడవ ముత్తు వీరప్ప క్రీ.శ.1682లో సింహాసనానికి వచ్చి క్రీ.శ.1706 వరకు పాలించాడు. ఇతడు 7 సంవత్సరాలు పాలించాడు. ఇతనికి గిరప్ప అని కూడా పేరు ఉంది. అతడు మధుర రాజ్యం కోల్పోయిన ప్రాంతాలను జయించాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు.

విజయరంగ చొక్కనాథుడు క్రీ.శ.1689-1739: మూడవ ముత్తు వీరప్ప లేక గిరప్ప కుమారుడు విజయరంగ చొక్కనాథునికి వారసత్వం వచ్చింది. ఇతనికి రెండవ చొక్కనాథుడని పేరు. కాని ఇతడు పసివాడు. అందువల్ల అతని నాయనమ్మ అంటే మొదటి చొక్కనాథుని భార్య మంగమ్మ మనుమని తరపున రాజ్య భారం వహించింది. మంగమ్మ క్రీ.శ.1689 నుండి 1706 వరకు రాజ్యం చేసింది. ఆమె కాలంలో దక్షిణదేశ రాజకీయాలలో అనేక మార్పులు వచ్చాయి. శివాజీ స్వరాజ్యాన్ని అతని కుమారుడు శంభాజీని వధించి ఔరంగజేబు మహారాష్ట్రాన్ని ఆక్రమించాడు. క్రీ.శ.1689-1687లలో ఔరంగజేబు బీజాపూరు, గోల్కొండ రాజ్యాలను ఆక్రమించి దక్షిణదేశంపై దండెత్తాడు. మంగమ్మ ఔరంగజేబుకు కప్పం చెల్లించి రాజ్యాన్ని కాపాడింది. మధుర రాజ్యం మొగల్ చక్రవర్తి సామంత రాజ్యమైంది. దాంతో మొగలుల అధికారం కన్యాకుమారి అగ్రం వరకు విస్తరించింది. ఔరంగజేబు హైదరాబాద్ సుభాను ఏర్పాటు చేశాడు. దాని కింద ఉపరాజ్యంగా రాయవెల్లూరు

రాజ్యం ఆర్కాటు రాజ్యంగా మారిపోయింది. అక్కడ ఆర్కాట్ నవాబీ రూపొందింది. దాంతో ముస్లింల ప్రమాదం అతి దగ్గరకు వచ్చింది. మంగమ్మ ఉదార స్వభావురాలు. ఆమె అనేక సత్రాలు నిర్మించింది. ఆ సత్రాలలో కొన్ని నేటికీ మంగమ్మ పేరుతో కొనసాగుతున్నాయి. ఆమె అనేక దానాలు చేసింది. క్రీ.శ.1706లో చొక్కనాధుడు పెద్దవాడై రాజ్యభారం చేపట్టాడు. కాని అతనికి సాహిత్య గోష్ఠులలో ఉన్న ఆసక్తి రాచకార్యాలలో ఉండేది కాదు. ఎల్లప్పుడూ రాచకార్యాలయందు గాక పండితగోష్ఠులలో కాలం గడిపేవాడు. అందువల్ల ఆస్థానంలో ఉద్యోగుల దుండగాలు సాగించి ప్రజలను బాధించారు. అయినప్పటికీ చొక్కనాధుడు తన కవితాగోష్ఠులు మానలేదు. అతడు స్వయంగా కవి. అతడు శ్రీరంగమహాత్మ్యం అనే వచనకావ్యాన్ని, మాఘమహాత్మ్యం అనే మరొక గ్రంధాన్ని రాశాడు సముఖం వెంకటకృష్ణప్ప అనే అతని సామంతుడు అహల్యా సంక్రందనం, రాధికాస్వాంతనం అనే ప్రబంధాలు ఇంకా జైమినీ భారతం, అశ్వమేధ పర్వాలు అనే గ్రంధాలు రాశాడు. ఇతని కాలంలో భరతనాట్యం, సంగీతం బాగా అభివృద్ధి చెందాయి. తిరువెంగళాచార్యుడు అనే గొప్ప సంగీత కళానిధి ఉండేవాడు. అతడు వ్యాసతాత్పర్యం అనే సంగీత నిర్ణయ గ్రంధాన్ని రాశాడు. మధుర నాయకరాజుల కాలంలో తెలుగులో గద్య, పద్య, చారిత్రిక రచనలు అనే మూడు రకాలుగా రచనలు సాగాయి. రఘునాధ తొండమాన్ కూడా పార్వతీ పరిణయం రాశాడు. ఇంకా పుదుక్కోట ఆస్థానంలో గోనసూరినారాయణరావు, చిదంబరకవి అనేవారు ఉండేవారు. మధుర సామంతరాజ్యమైన పుదుక్కోటను పాలించిన వంశం తెలుగువారు కాకపోయినా వారు తెలుగు భాషను, రాశాడు. ఇది తెలుగులో ప్రధమకోశం అట. ఇంకా అతడు మల్లు పురాణం, రఘునాధీయం, రాజవంశ అలఘిరి, బద్దేపూరి ఎల్లిరాజు, శేషం వెంకటపతి, వంగలి సీనయ్య, తిరుమలకవి, శ్యామరామకవి, శ్రీపతిరామభద్రకవి అనే కవులు ఈ యుగానికి చెందిన వారు. చొక్కనాధుడు అనేక దానధర్మాలు చేసి బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చాడు. మధుర నాయక రాజులలో రెండవ చొక్కనాధుడే చివరివాడు. అతడు క్రీ.శ.1732లో మరణించాడు.

రాణి మీనాక్షి పాలన క్రీ.శ. 1732-1739: రెండవ చొక్కనాధునికి సంతానం లేదు. అతని తర్వాత అతని భార్య మీనాక్షి క్రీ.శ.1732లో రాజ్యభారం చేపట్టింది. ఆమె గొప్ప సమర్ధురాలు. ఆమెను కొందరు రాజపుత్ర స్త్రీతో పోల్చారు. అయినప్పటికీ ఆమె స్త్రీ అయినందువల్ల ఆస్థాన ఉద్యోగులు స్వార్ధపరులై ఆమె మీద కుట్రలు సాగించారు. సామంత, మాండలీకులు ఆమె పరిపాలనను వ్యతిరేకించారు. ఆ స్థితిలో మధుర రాజ్యాన్ని ఆక్రమించడానికి దక్కను సుబేదారు సామంతుడైన కర్ణాటక నవాబు దోస్తు అలీ తన మేనల్లుడు చందా సాహెబ్‌ను మధురపైకి పంపాడు. మీనాక్షి అతని సహాయంతో తన సామంతులు, రాజద్రోహులైన ఉద్యోగులను అదుపులోకి తీసుకురావచ్చని భావించి అతనికి లొంగిపోయి, కానుకలను సమర్పించి తన సామంతులను అణచడానికి సహాయం చేయమని కోరింది. చందాసాహెబ్ దుర్బుద్ధిగలవాడు. అతడు ఆమెకు సహాయం చేయగలనని నమ్మించి ఆమెను క్రీ.శ.1739లో తిరుచునాపల్లి కోటకు రప్పించి మోసగించి ఆమెను ఖైదు చేశాడు. తిరుచునాపల్లి మధురకోటలను ఆక్రమించాడు. మోసపోయిన మీనాక్షి ఆ అవమానాన్ని భరించలేక విషం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మరణం తర్వాత క్రీ.శ.1739లో మధుర నాయకరాజ్యం కర్ణాటక లేక ఆర్కాట్ రాజ్యంలో భాగమైపోయింది. అంతటితో మధుర నాయకరాజ్యం అంతరించింది.

మధుర, తంజావూరు నాయకరాజుల రాజకీయ జీవితం ఎలా ఉన్నప్పటికీ వారు తమిళదేశ పాలకులైనా వారు ఆంధ్రులవడం వల్ల, వారు పాలించిన దేశం ఆంధ్రదేశం కాకపోయినా వారు ఆంధ్రభాష సారస్వతాలకు తెలుగు సంగీత సాహిత్యాలకు నిరుపమానమైన సేవ చేశారు. వీరి కాలంలో దక్షిణదేశం అంతటా ఆంధ్ర సంస్కృతి విస్తరించింది. తెలుగు సంస్కృతికి గొప్ప గౌరవప్రతిష్టలు చేకూరాయి. కనుక మధుర, తంజావూరు నాయక యుగానికి దక్షిణాంధ్రయుగమని పేరు వచ్చింది. ఈ నాయకరాజులలో పలువురు వైష్ణవమతాభిమానులు. అందువలన వారి కాలంలో దక్షిణదేశంలో వైష్ణవమతం కూడా బాగా వ్యాప్తి చెందింది. మధుర, తంజావూరు రాజ్యాలలో అనేక దేవాలయాలకు మరమ్మత్తులు చేసి వాటి పోషణకు దానాలు చేశారు. వారి ఆదరణవల్లనే తమిళదేశంలో దేవాలయాలు పాడైపోకుండా నేటికీ నిలచి ఉన్నాయి.

జింజి నాయక రాజ్యం క్రీ.శ.1464-1670: విజయనగర సామంతులుగా పాలించిన జింజి పాలకులు కూడా తెలుగువారేనని కొందరంటారు. విజయనగర రాజ్యానికి ముందే జింజికోట నిర్మింపబడింది. ఉత్తర ఆర్కాటు జిల్లాలోని జింజికొండపై కోన్ తర్వాత కదరరాయ తెగకు చెందిన కోబిలింగమ్ అనే అతడు పాలించాడు కర్ణాటక రాజక్కల్ సవిస్తర చరిత్ర అతడు చోళరాజ్య పతనానికి ప్రముఖపాత్ర నిర్వహించాడని తెలుపుతోంది. అతని

రాజ్యానికి రాజధాని కడలూరు, దానిని కుడల్ అని పిలిచేవారు. 13వ శతాబ్దం చివరలోగాని, 14వ శతాబ్దం ప్రథమ దశలో జింజి ప్రాంతం ద్వార సముద్రాన్ని ఏలిన హొయసాలుల వశమైంది. హొయసాల రాజ్యపతనం తర్వాత వీరకంపణ బయలుదేరినప్పుడు జింజి పాలకుడు గోపనారయ కూడా అతనిని అనుసరించాడు. గోపనారయ కూడా పాల్గొన్నాడని గంగాదేవి మధుర విజయ కావ్యం తెలుపుతోంది. క్రమేపీ విజయనగర సామ్రాజ్యంలో జింజి రాజ్యం ప్రముఖ పాత్రను నిర్వహించింది. తూర్పు తీరంలో జింజి రాష్ట్రం పాలార్ నది నుండి కొలెరూన్ వరకు విస్తరించే ఉండేది. జింజిని చెంచి అని పిలవటం కూడా కద్దు. జింజి రాజ్య చరిత్ర తెలుసుకోవడానికి తిరుప్పరం కున్రం వద్ద లభించిన రెండు శాసనాలు ఉపయోగపడుతున్నాయి. జింజి రాజ్యాన్ని మొదటి కృష్ణప్పనాయక్ అనే అతడు పాలించాడు. అతని తర్వాత అతని వారసుడు బాల వెంకటపతినాయక్ క్రీ.శ.1464లో జింజి రాజ్యాన్ని పాలించాడు. అతడు టిండివనంలోని జైనులను బాధించాడట. అతని తర్వాత అతని వంశస్తులను గురించి వివరాలు తెలియవు.

వైయప్పనాయక్-తుబకి కృష్ణప్పనాయక్ క్రీ.శ.1490-1520: వైయప్పనాయక్ అనే అతడు ఉత్తర భారత దేశంలోని మనినాగపురం నుండి క్రీ.శ.1490లో విజయనగరానికి తరలివచ్చాడని స్థానిక రచనలు తెలుపుతున్నాయి. సూరప్పనాయక శాసనంలో తనను మనినాగపురాధీశ్వరునిగా పేర్కొన్నాడు. వైయప్ప నాయకుడు తుబకి కృష్ణప్పనాయక్‌లు విజయనగరంలో సేనాధిపతులుగా ఉండేవారు. శ్రీకృష్ణదేవరాయలు కర్ణాటక దండయాత్రకు బయలుదేరినప్పుడు వైయప్ప తబకి కృష్ణప్పలును కూడా తీసుకువెళ్లారు. కర్ణాటక దండయాత్ర తర్వాత వైయప్పనాయక్ రాజకీయాల నుండి వైదొలిగాడు. అందువల్ల రాయలు కృష్ణనాయకుని జింజి పాలకునిగా నియమించాడు. అతని నియామకంతో జింజి రాజ్య చరిత్ర ప్రారంభమైంది. అతని కాలంలో జింజి రాజ్యం తూర్పు తీరంలో నెల్లూరు నుండి కొలెరూన్ వరకు విస్తరించి ఉండేది. అతడు క్రీ.శ.1520 వరకు పాలించాడు.

అచ్యుత విజయరామచంద్రనాయక్ క్రీ.శ.1520-1540: కృష్ణప్పనాయకుని తర్వాత అచ్యుతప్పనాయక్ క్రీ.శ.1520లో రాజ్యానికి వచ్చి 1540 పాలించినట్లు మెకంజీ రాతలు తెలుపుతున్నాయి. ఇతడు అచ్యుత దేవరాయలను కొలిచాడు. అతని మహామండలాధీశులలో, సేనాధిపతులలో ఒకడు.

ముత్యాలనాయక్ క్రీ.శ. 1540-1550: అచ్యుతనాయకుని తర్వాత ముత్యాలనాయక్ రాజ్యానికి వచ్చాడు. అతడు గొప్ప భవన నిర్మాత. అతడు రాజగిరి పాదంలో వెంకటరమణ ఆలయం నిర్మించాడు. ఇతడు క్రీ.శ.1550 వరకు పాలించాడు.

వెంకటప్పనాయక్-సూరప్పనాయక్ క్రీ.శ.1550-1600: ముత్యాలనాయక్ తర్వాత అతని కుమారుడు వెంకటప్పనాయక్ జింజి రాజ్యానికి వచ్చాడు. కాని ఇతని పాలనా కాలంలో సూరప్పనాయక్ అనే అతడు ఆరవీటి తిరుమలరాయలకు, అతని కుమారుడు తిరుమలనాయకునికి కొన్ని గ్రామాలు సమర్పించి సేవించినట్లు సూరప్పనాయక్ శాసనం వల్ల తెలుస్తోంది. కనుక ముత్యాల నాయక్ తర్వాత సూరప్ప నాయకుడు క్రీ.శ.1550-70ల మధ్య జింజి రాజ్యాన్ని పాలించి ఉండవచ్చును. అతనికి ముత్యాల నాయక్‌కు ఉన్న సంబంధం తెలియదు. బహుశా సూరప్పనాయకుడు తళ్లికోట యుద్ధంలో కూడా పాల్గొని ఉండవచ్చును. రత్నాకర శ్రీనివాస దీక్షితుడు అనే పండితుడు భావనప్పురుషోత్తమ అనే గ్రంథాన్ని రాసి సూరప్పనాయక్‌కు అంకితం చేశాడు. తర్వాత వెంకటప్పనాయకుడు క్రీ.శ.1570 నుండి క్రీ.శ.1585 వరకు పాలించినట్లుగా కనిపిస్తోంది.

రెండవ కృష్ణప్పనాయక్ క్రీ.శ.1600-1614: వెంకటప్పనాయక్ కాలంలోనే రెండవ కృష్ణప్పనాయక్ కూడా పాలించినట్లు జేసూట్ల రచనలు తెలుపుతున్నాయి. బహుశా అతడు తండ్రితో కొంతకాలం సహపాలకుడిగా పాలించి ఉంటాడు. ఇతడు రెండవ వెంకటపతిరాయల సమకాలికుడు. ఇతడు వెంకటపతిరాయలను ధిక్కరించి తిరుగుబాటు చేశాడు. అందువలన రాయలు అతనిని ఓడించి చెరసాలలో ఉంచాడు. అప్పుడు తంజావూరు రఘునాథ యువరాజు వెంకటపతిరాయలను ఒప్పించి కృష్ణానాయక్‌ను విడిపించాడు. అందుకు కృతజ్ఞతగా అతడు తన కుమార్తెను రఘునాథనాయకునికిచ్చి వివాహం జరిపించి తంజావూరు వంశానికి బంధువయ్యాడు. ఈ వృత్తాంతం రామభద్రాంబ రచించిన రఘునాథాభ్యుదయంలోను, యజ్ఞనారాయణ దీక్షిత్ రాసిన సాహిత్య రత్నాకరంలో వర్ణించబడింది.

కృష్ణనాయక్ తిరుగుబాటును అణచడానికి వెంకట అనే సేనానిని పంపాడు. కృష్ణనాయక్ చెరసాలలో ఉన్నప్పుడు ఈ వెంకట్ జింజిని పాలించాడు. జింజిని పాలించినది వెంకటప్పనాయక్ అని చరిత్రకారుల

అభిప్రాయం. అతడు ఎంతకాలం పాలించినదీ స్పష్టంగా తెలియదు. వెంకటప్పనాయక్ ఆరవీటి చరిత్రలో ప్రముఖపాత్ర నిర్వహించాడు. రెండవ వెంకటపతిరాయలు మరణించిన తర్వాత వచ్చిన అంతర్యుద్ధంలో వెంకటప్పనాయక్ ప్రముఖ పాత్ర నిర్వహించాడు. కృష్ణప్పనాయక్ విడుదలైన తర్వాత జింజిని పాలించాడు. అతని పాలనలో జింజి మహోజ్వలంగా వెలిగిందని పోర్చుగీసు ఫాదర్ పిమెంటా రాశాడు. పోర్చుగీసు వారు డచ్చి వారిని విజయనగరంలో అడుగుపెట్టనీయలేదు. అప్పుడు డచ్చివారు జింజి కృష్ణప్ప నాయకుని ఆశ్రయించారు. అతడు వారికి దేవకీపట్టణంలో ఫ్యాక్టరీని నిర్మించుకోడానికి, తిరుప్పల పులియూర్ పట్టణంలో వ్యాపారం చేసుకోవడానికి అనుమతి ఇచ్చాడు. కాని వెంకటపతిరాయలు మూడు పర్యాయాలు కృష్ణప్పనాయక్‌కు ఉత్తరాలు రాసి డచ్చి వారిని దేవకీపట్టణం నుండి వెళ్ల గొట్టించాడు. కృష్ణప్పనాయక్ తాతాచార్యుల వారి శిష్యుడు. అందువల్ల అతడు విష్ణుభక్తుడయ్యాడు. చిదంబరంలోని వైష్ణవ ఆలయాన్ని పునర్నిర్మాణం చేయించాడు. వెంకటపతిరాయల మరణానంతరం జగ్గారాయుని వైపు చేరి తోపూరు యుద్ధంలో ఓడిపోయాడు. తర్వాత రామదేవరాయలకు విధేయుడయ్యాడు.

- **వరదప్పనాయక్ క్రీ.శ.1620:** రెండవ కృష్ణప్పనాయక్ తర్వాత వరదప్పనాయక్ క్రీ.శ.1620లో రాజ్యానికి వచ్చాడు. అతడు ఎంత కాలం పాలించిందీ స్పష్టంగా తెలియదు. క్రీ.శ.1650 వరకు పాలించి ఉండవచ్చును

అప్పానాయక్ క్రీ.శ.1650-1670: వరదప్పనాయక్ తర్వాత అప్పానాయక్ పాలించాడు. అతడు చివరి జింజి పాలకుడు. ఇతని కాలంలో జింజిపై ముస్లిం దండయాత్రలు ఆరంభమయ్యాయి. బీజాపూరు సేనాధిపతి రుస్తుంఖాన్ జింజిని క్రీ.శ.1670లో జయించాడు. అప్పానాయక్ ముస్లిం సైన్యాలతో వీరోచితంగా పోరాడాడని మెకంజీ చెంచిరాజక్కర్ కైఫీయత్తులో వర్ణించాడు. తర్వాత అది షాజీ వశం అయింది. తర్వాత అతని కుమారుడు ఏకోజి జింజికి అధిపతి అయ్యాడు. అప్పానాయక్‌తో జింజి వంశం అంతరించింది. మహారాష్ట్రులు పాలకులయ్యారు. శివాజీ కుమారుడు రాజారామ్‌కు జింజి 7 సంవత్సరాలు రాజధానిగా ఉంది. జింజినాయకులు రెండు శతాబ్దాలు పాలించారు. వారు విజయనగర ప్రభువులయందు విశ్వాస ఘాతకులుగా వ్యవహరించారు రాజ్యంలో ఉదార పరిపాలన చేశారు. హిందూ సంస్కృతిని సంరక్షించారు. జింజి పాలకులు తుబకి కృష్ణమ్మ జింజి సమీపంలోని వరాహానదికి ఆనకట్టను నిర్మించి వ్యవసాయాభివృద్ధి చేశాడు. వెంకటప్పనాయక్ భార్య మంగమ్మాళ్ జింజి సమీపంలోని త్రిద్దాచలం వద్ద పెద్ద చెరువును నిర్మించింది. దీనిని అమ్మకులమ్ అని పిలుస్తారు జింజిపాలకులు పోర్చుగీసు, డచ్చివారికి తమ రాజ్యంలో వ్యాపార సదుపాయాలను ఏర్పాటు చేశారు క్రీ.శ.1597లో ఫాదర్ పిమెంటా అనే పోర్చుగీసు మతాధికారి జింజిని దర్శించి జింజి నాయకుల పరిపాలనను మెచ్చుకున్నాడు. లిస్బన్‌ను మినహాయించి పోర్చుగల్ కంటే జింజి నగరం పెద్దదని పిమెంటా రాశాడు. జింజి పాలకులు పరమత సహనం గలవారు.

రెండవ కృష్ణప్పనాయక్ పోర్టోనోవా దగ్గర ఉన్న కృష్ణపట్టణంలో జేసూట్లకు చర్చిని నిర్మించుకోడానికి అనుమతి ఇచ్చాడు. అలాగే వెంకటప్పనాయక్ సిట్టమూర్‌లో జైనులకు జైనదేవాలయాన్ని నిర్మించుకోడానికి అనుమతించాడు. జింజి రాజులు తమ రాజ్యంలో అనేక శైవవైష్ణవ ఆలయాలు నిర్మించారు. వైయప్పనాయక్ తుభకి కృష్ణప్పనాయక్‌లు దక్షిణ ఆర్కాటు జిల్లాలోని శ్రీముష్ణం, తిరుక్కోయిలూరు వద్ద దేవాలయాలు నిర్మించారు ముత్యాల నాయక్ రాజగిరి పర్వత పాదం వద్ద వెంకటరమణస్వామి దేవాలయాన్ని నిర్మించాడు. అతడే వరాహానది ఒడ్డున చక్రపెరుమాళ్ అనే మరొక దేవాలయాన్ని కూడా నిర్మించాడు. అచ్యుతరామచంద్రనాయక్ జింజివనంలో ఒక వైష్ణవాలయాన్ని నిర్మించాడు. వెంకటప్పనాయక్ టిండివనంలో ఒక శివాలయాన్ని నిర్మించాడు. ఇంకా వారు దేవాలయాలలో అనేక కళ్యాణ మండపాలు, గోపురాలు నిర్మించారు. ఆర్కాటు జిల్లాలో అనేక దేవాలయాలు వీరి కాలంలో నిర్మించినవే. ఇంకా అనేక దుర్గాలు రాజభవనాలను కూడా నిర్మించారు. కవి, పండితులను పోషించారు హిందూ సంస్కృతిని కాపాడారు.

మైసూరు నాయకరాజ్యం క్రీ.శ.1524-1761-చామరాజు క్రీ.శ.1524: మైసూరు నాయక రాజ్యాన్ని పాలించే ఒడయారు వంశానికి మూలపురుషుడు చామరాజు. అతడు శ్రీకృష్ణదేవరాయల కాలంలో మైసూరు పరిసర ప్రాంతాలలో పాలెగాడుగా నియమింపబడ్డాడు. అతడు మహేశ్ అసుర్ అనే కోటను కట్టుకొని (అదే నేటి మైసూరు) శ్రీరంగపట్టణంలో ఉండే విజయనగర ప్రతినిధికి లోబడి ఉండేవాడు.

వడయారు క్రీ.శ.1578-1617: తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర సామ్రాజ్యం బలహీనపడగా

1578లో రాజ్యానికి వచ్చిన చామరాజు వంశస్థుడు వడయూరు స్వతంత్రవైఖరిని అవలంబించాడు. కాని రెండవ వెంకటపతిరాయలు అతనిని ఓడించాడు. కాని అతని బలిమిని గుర్తించి వడయూరును రాజు అని గుర్తించాడు. ఆ తర్వాత వడయూరు వెంకటపతిరాయలకు విధేయుడై సామ్రాజ్య ఐక్యతకు పాటుబడ్డాడు. మరొక కర్ణాటకంలో తన పరిసర ప్రాంతాలు జయించి తన రాజ్యాన్ని విస్తరించుకున్నాడు. బీజాపూరు దాడులను వీరోచితంగా ఎదుర్కొన్నాడు. క్రీ.శ.1610లో శ్రీరంగపట్టణాన్ని ఆక్రమించి దానిని తన రాజధానిగా చేసుకున్నాడు.

చామరాజు క్రీ.శ.1617-1637: ఒడయూరు తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ చామరాజు బెంగుళూరు పరిసర ప్రాంతాలను జయించి రాజ్యాన్ని విస్తరించాడు.

కంఠీరవ నరసనాయకుడు క్రీ.శ.1637-1659: చామరాజు తర్వాత రాజ్యానికి వచ్చిన కంఠీరవ నరస నాయకుడు మూడవ శ్రీరంగరాయలకు సాయం చేసి ముస్లింలను పారదోలి వెల్లూరిని జయించి ఇచ్చాడు. మధుర తిరుమల రాయలు తన సహాయం పొంది మోసగించినందుకు కోపించి మధురపై దండెత్తి సత్యమంగళం వద్ద మధుర సైనికుల ముక్కులు కోయించాడు. ఆ ప్రాంతాన్ని ఆక్రమించాడు. ఇతని కాలంలో ఒడయూరు రాజ్యం బలపడింది.

దొడ్డదేవుడు క్రీ.శ. 1659-1672: కంఠీరవ నరస కుమారుడు దొడ్డదేవుడు మధుర రాజ్యంపై దండెత్తి చిత్తూరు, కోయంబత్తూరులను ఆక్రమించాడు.

చిక్కదేవరాయలు క్రీ.శ.1672: దొడ్డదేవుని తర్వాత రాజ్యానికి వచ్చిన చిక్కదేవరాయలు వడయూరు వంశస్థులలో అగ్రగణ్యుడు. ఇతని కాలంలో మైసూరు రాజ్యం అన్ని దిక్కులకు విస్తరించింది. ఇతని విజయాల వల్ల రాజ్యం తూర్పున సేలం నుండి పశ్చిమాన కూర్గు, బేలూరుల వరకు, ఉత్తరాన తూముకూరు నుండి దక్షిణాన అన్నామలై కొండ వరకు విస్తరించి ఆధునిక మైసూరు రాజ్యంగా మారింది. కనుక ఇతనికి ఆధునిక మైసూరు రాజ్య నిర్మాత అనే పేరు వచ్చింది. ఇతడు కూడా ఔరంగజేబుకు తల వంచి కప్పం చెల్లించాడు. ప్రజాహిత తత్పరుడు. కావేరీ నదికి ఆనకట్టలు కట్టించాడు. సాహిత్య ప్రియుడై కన్నడ, తెలుగు కవులను పోషించాడు. ఆయన మంత్రి తిరుమలరాయలు చిక్క దేవరాజ వంశావళిని రచించాడు. తిరుమలరాయల సోదరుడు సింగమరాయలు శ్రీహర్షుని రత్నావళిని కన్నడంలోకి తర్జుమా చేశాడు. చికుపాధ్యాయుడు అనే మరొక మంత్రి వైష్ణవ గ్రంధాలను రాశాడు. కుళెవీరరాజు అనే కవి తెలుగు వచన భారతాన్ని రాశాడు. ఈ విధంగా చిక్కదేవరాయల కాలంలో మైసూరు రాజ్యం సర్వవిధాల అభివృద్ధి చెందింది.

హైదరాలి క్రీ.శ.1761: చిక్కదేవరాయల వారసులు అసమర్థులై రాచకార్యాలను మంత్రులకు వదిలి వేశారు. నంజరాజు అనే మంత్రి సర్వాధికారిగా మెలిగేవాడు. ఇదే సందర్భంలో మహారాష్ట్రులు మైసూరు రాజ్యంపై దాడులు ప్రారంభించారు. ఆ సమయంలో హైదరాలి అనే సేనాని నంజరాజు, వడయూరు రాజును తొలగించి అధికారం హస్తగతం చేసుకున్నాడు. 1799లో నాల్గవ మైసూరు యుద్ధంలో హైదరాలీ కుమారుడు టిప్పుసుల్తాన్ మరణించగా ఇంగ్లిషు వారు మైసూరు రాజ్యాన్ని తిరిగి వడయూరు వంశస్థులకు ఇచ్చారు. ఈ వంశం నేటికీ ఉంది. ఈ వంశానికి చెందిన జయచామరాజు వడయూరు ఇటీవలే మరణించాడు. వడయూరు వంశస్థులు కన్నడ భాషకు, సంస్కృతికి గొప్ప సేవ చేశారు.

విజయనగర రాజ్యావశేషంగా చరిత్రలో మైసూరు రాజ్యం చివరి వరకు నిలిచింది. దేశ స్వాతంత్ర్యానంతరం మైసూరు రాజ్యం దేశంలో విలీనం చెందినప్పటికీ వడయూర్ వంశం నేటికీ వర్థిల్లుతోంది. విజయనగర రాజ్యంలో ప్రతి సంవత్సరం అద్భుతంగా జరిపే దసరా ఉత్సవాలను విజయనగర రాజుల వారసత్వంగా మైసూరులో ఒడయూరు ప్రభువులు జరిపే వారు. ఇంగ్లిషు వారి కాలంలో కూడా మైసూరు ఒడయూరు ప్రభువులు దసరా ఉత్సవాలు వైభవంగా జరిపేవారు. స్వాతంత్ర్యానంతరం వారి రాజ్యం పోయినా నేటికీ వడయూరు వంశస్థులు దసరా ఉత్సవాలను అదే విధంగా 9 రోజులు వైభవంగా జరుపుతున్నారు. అంటే విజయనగర వారసత్వాన్ని వారు నేటికీ కొనసాగిస్తున్నారు. మైసూరు ఒడయూరులు ఆంధ్రులు కాకపోయినా తెలుగుభాషను పోషించారు.

వీరి కాలంలో పాలవేకరి కదిరీపతి తెలుగులో సుఖసప్తపతి అనే కావ్యాన్ని రాశాడు. కళెవ వీరరాజు తెలుగు వచన భారతాన్ని రచించాడు. వీరరాజు కుమారుడు సంబరాజు తెలుగులో హాలిస్యమహత్యమ్, కన్నడంలో వచన భారతాన్ని రాశాడు.

గోల్కొండ నవాబుల కాలం నాటి సామంతరాజ్యాలు

గోల్కొండ నవాబులు కాలంలో కమ్మసామంతులు: విజయనగర రాజ్యపతనం తర్వాత ఆంధ్రదేశం గోల్కొండ నవాబుల వశమైంది. అంతవరకు గజపతులు, విజయనగర రాజులు దగ్గర పని చేసిన అనేక మంది కమ్మనాయకులు గోల్కొండ నవాబుల సామంతులుగా కొనసాగారు. కొన్ని నూతన కమ్మ కుటుంబాలు గోల్కొండ సుల్తాన్‌ల దగ్గర నూతన జమీలను సంపాదించారు. బ్రిటిష్‌యుగంలో జమీందారులుగా మారిన అనేక రాచకుటుంబాలు గోల్కొండ యుగంలో జమీలు సంపాదించిన వారే. వారిలో వాసిరెడ్డి వారు, వెలుగోటి వంశాల వారు చాలా ముఖ్యులు.

ధూపాటిసీమ-సాయపనేని వారు - వెంకటాద్రి: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో సాయపనేని గంగపనాయుడు అనే అతడు ఆత్మకూరు, సిద్ధాపురం, ధూపాటిసీమ, కంభం తాలూకాలపై మన్నెకావలి రుసుము హక్కును సంపాదించాడు. అందువల్ల సాయపనేని వారి వంశం మరొకసారి ప్రఖ్యాతిలోకి వచ్చింది. వెంకటాద్రి క్రీ.శ.1629 నుండి 1630 వరకు ఆ ప్రాంతాలను పాలించాడు. అతని తర్వాత దేవాలయాలు నిర్మించాడు, చెరువులను తవ్వించాడు. అతడు దద్దణాలపట్టణం అనే గ్రామాన్ని కూడా నిర్మించాడు. అందులో 500 కోమట్లు, 500 మార్వాడీ ఇళ్లు, 60 అందలాలెక్కే ప్రభువుల ఇళ్లు ఉండేవట. 11 ఘటాల ఏనుగుశాలలను కూడా వెంకటాద్రి నిర్మించాడట. అతని సోదరి అక్కమ్మ ఒక దేవాలయాన్ని నిర్మించింది. వెంకటాద్రి తర్వాత అతని కుమారులు వెంకటపతి, సిద్ధన్నలు క్రీ.శ.1643 వరకు పాలించారు. వీరు శ్రీశైలంలోని లోహ విక్రయదార్లపైన విధించిన పన్నును రద్దుచేశారు. వారి తర్వాత సాయపనేని రంగప్ప, తిమ్మానాయుడులు పాలించారు. వీరి కాలంలో వీరి కుటుంబానికి గోల్కొండ నవాబు అబ్దుల్లా కుతుబ్‌షా దర్శి, పెళ్లూరి, పాడిసీమలు కూడా ఇచ్చాడు. వీరు క్రీ.శ.1677 వరకు పాలించారు. వారు బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చారు. వీరి తర్వాత వీరి కుమారులు పెద వెంకటాద్రి, చిన వెంకటాద్రిలు తానీషా సమకాలికులు. తానీషా వారికి 15 పరగణాలపై మన్నెకావలి రుసుములు నూటికి 3 తీసుకునే హక్కు ఇచ్చాడు. వీరి వద్ద 5 వేల అశ్వాలు, 12 వేల కాల్బల ఫౌజు ఉండేది. వారు జాగీరుదారుల నుండి రుసుములు వసూలు చేసి తానీషాకు పంపేవారు. చిన వెంకటాద్రి ఎర్రగొండపాలెంలో ఒక భవనాన్ని నిర్మించాడు. ఒక పర్యాయం చిన వెంకటాద్రి తన సైన్యంలో రుసుములు వసూలు చేయదానికి వెళ్లగా గోల్కొండ తానీషాపై తిరుగుబాటు చేసిన ఫ్రక్రుల్లా అనే అమీరు దద్దణాలపల్లెపై దండెత్తి పెద వెంకటాద్రిని సంహరించి పట్టణాన్ని దోచుకొని 96 లక్షల రూపాయల ఖజానాను దోచుకొని వెళ్లిపోయాడట. ఆ పరాభవాన్ని చూసి భరించలేక వారి స్త్రీలు అందరూ అగ్నిప్రవేశం చేశారట. చిన వెంకటాద్రి వచ్చి చూసి విరక్తి కలిగి ఆత్మహత్య చేసుకున్నాడట. అతని కుమారుడు పసివాడైనందున సాయపనేని మల్లికార్జునుని బంధువులు కొండవీటిసీమకు తీసుకొని వెళ్లిపోయి పెద్ద చేశారట.

సాయపనేని మల్లికార్జునుడు క్రీ.శ.1724: ఇదే సందర్భంలో గోల్కొండ రాజ్యం మొగల్ చక్రవర్తి ఔరంగజేబు క్రీ.శ.1687లో ఆక్రమించాడు. కమ్రుద్దీన్ అసఫ్‌జా హైదరాబాద్ సుబేదార్ అయ్యాడు. అప్పటికి పెరిగి పెద్దవాడైన సాయపనేని మల్లికార్జునుడు కమ్రుద్దీన్‌ను దర్శించి వినుకొండ పరగణాను సంపాదించాడు. ఆ సీమలో 225 గ్రామాలు ఉండేవి. వినుకొండ రాజ్యాన్ని అతడు పాలిస్తుండగా క్రీ.శ.1723లో విభురాం అనే మరొక దోపిడీ దారుడు వినుకొండపై దండెత్తి మల్లికార్జునుని సంహరించి అంతఃపుర స్త్రీలను చెరపట్టాడు. కోటను దోచుకొని వెళ్లిపోయాడు. దాంతో మల్లికార్జునుడు సంపాదించిన వినుకొండ రాజ్యం పోయింది.

సాయపనేని చెన్నప్ప-పురుషోత్తమనాయకుడు: తర్వాత క్రీ.శ.1725లో ఇతని వంశానికి చెందిన చెన్నప్ప పురుషోత్తమనాయుడు అనే వారు హైదరాబాద్ చేరి అసఫ్‌జాకు తమ దుస్థితిని తెలిపి ధూపాటిసీమలో 58 గ్రామాలు, కొచ్చెర్లకోటలో 20 గ్రామాలు సంపాదించి ఫర్మానా పొందారు. చెన్నప్ప మార్చంపల్లిలో నూతన గృహాన్ని నిర్మించుకున్నాడు. క్రీ.శ.1731 వరకు వీరిద్దరూ పాలించారు. తర్వాత పురుషోత్తముని కుమారుడు అంబానాయుడు ధూపాటిసీమను పాలించాడు. అంబానాయుడు తన పెద తండ్రి చెన్నప్ప కుమారులైన సుబ్బానాయుడు నారాయణప్పలకు రాజ్యంలో భాగం ఇవ్వలేదు. వారిని చెరసాలలో బంధించాడు. వారు బాజీరావు పీష్వా సహాయం అర్థించారు. కాని పీష్వా రాకముందే వారు చెరసాలలో మరణించారు. అంబానాయుడు క్రీ.శ.1751 వరకు పాలించి మరణించాడు. అతని తర్వాత శేషాచలం నాయుడు, మల్లికార్జునరాయుడు పాలించారు. వారి కాలంలో 632 వరహాలు పేష్కస్‌గా నిజాం రాజ్యానికి చెల్లించేవారు. వారిలో

మల్లికార్జునరాయుడు క్రీ.శ.1795లో, శేషాచలంనాయుడు క్రీ.శ.801లో మరణించారు. వారిద్దరూ నిజామాలీ, టిప్పుసుల్తాన్‌ల సమకాలికులు. వీరి మరణానంతరం నిజాం అలీ వీరి రాజ్య ప్రాంతాన్ని ఈస్టిండియా కంపెనీ వారికి దత్తం చేశాడు. అంతటితో సాయపనేని వారి రాజ్యం నశించింది.

కొండవీటి చౌదరీల పాలన: క్రీ.శ.1579లో ఇబ్రహీం కుతుబ్‌షా కొండవీటి సీమను ఆక్రమించాడు. అక్కడ రాయరావు అనే మరాఠా సేనాధిపతిని నియమించాడు. అప్పుడు కొండవీడు సీమలో 497 గ్రామాలు ఉండేవి. రాయరావు ఆ గ్రామాలన్నింటినీ 14 సముతులుగా విభజించి వాటిపై చౌదర్లను నియమించాడు. ఈ 14 సముతుల చౌదరీలుగా అందరినీ కమ్మ వారిని నియమించాడు. నాదెండ్ల సముతుకు నల్లబోతు వారిని, పొన్నూరు సముతుకు అలపర్తివారిని, చేబ్రోలు సముతుకు దేవభక్తుని వారిని, రావిపూడి సముతుకు వడ్లమూడి వారిని, మేదూరి సీమకు మేలిమి చౌదరిని కొన్ని ప్రాంతాలకు వాసిరెడ్డి వారిని చౌదర్లుగా నియమించాడు. ఇంకా కొండవీటిసీమలో దేశపాండ్యులు, దేశ్‌ముఖ్‌లు మన్నెవారు, బారాము సర్దీల్ అనే 12 రకాల ఉద్యోగులను నియమించాడు ఈ పద్ధతి తర్వాత కూడా కొనసాగింది. పన్నులు వసూలు చేసే చౌదరీ పదవులలో కూడా కమ్మ వారినే నియమించారు. గ్రామాధికారులను కూడా కమ్మ వారినే నియమించారు. అందువల్ల అప్పటి నుంచి కమ్మ వారికి చౌదరి అనే బిరుదు వచ్చింది. క్రీ.శ.1581-1598 సంవత్సరాల మధ్య కొండవీడు సర్కారుపై అమీన్ ముల్క్ అనే సరదారుడు అధిపతిగా ఉండేవాడు. అతడు దేవాలయాలను పడగొట్టి అనేక రకాల పన్నులు విధించి ప్రజలను బాధించాడు. అప్పుడు నల్లబోతు తిమ్మానాయుడు అతనిని ఎదిరించి గోల్కొండ చేరి సుల్తాన్‌కు నివేదించాడు. సుల్తాన్ అమీన్ ఉల్ ముల్క్‌ను తొలగించి అతని స్థానంలో శిఖవసునుడనే సరదారును కొండవీటి అమలుదారుడుగా నియమించాడు. అందువల్ల నల్లబోతు వారికి కొండవీటి సీమలో గొప్ప గౌరవప్రతిష్ఠలు పెరిగాయి. వారికి ప్రజలు ప్రథమ తాంబూలం ఇచ్చి గౌరవించారట. నిన్నమొన్నటి దాకా కొండవీటిసీమలో ఎవరి ఇళ్లలో పెళ్లి జరిగినా నల్లబోతు వారికి ప్రథమ తాంబూలం ఇచ్చే ఆచారం కొనసాగింది. క్రీ.శ.1697లో నల్లబోతు రమణప్ప నాదెండ్ల సముతుకు చౌదరీగా పని చేశాడు. తర్వాత నల్లబోతు ఎల్లమనీడు చౌదరీగా పని చేశాడు. అదే సమయంలో మేదూరి సీమకు మేలిమి చౌదరి, అతని తర్వాత యలమంచిలి రామినీడు చౌదరీగా పని చేశాడు.

రొంపిచెర్ల దుర్గం: క్రీ.శ.1629లో అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో రొంపిచెర్ల దుర్గాన్ని మేదరమెట్ల నరసింహనాయుడు అనే కమ్మసేనాని పాలించాడు. అతని సామంతుడు గుండ్లపల్లి గ్రామంలో వీరభద్ర, ఆంజనేయస్వామి దేవాలయాలు నిర్మించి తోటను వేయించి అక్కడ శాసనం వేయించాడు. అందువల్ల ఇతని చరిత్ర తెలుస్తోంది. ఈ వంశంలోని నరహరినాయుడు క్రీ.శ.1766లో చింతపల్లి జమీందారైన వాసిరెడ్డి రామన్న దగ్గర 50 మంది సైనికులకు సరదారుగా పని చేశాడు. నరహరి పూర్వీకులు అద్దంకి పేరులోని మందపాటి వారి దగ్గర సరదారులుగా పని చేశారు.

నందిగామ పరగణా-వాసిరెడ్డివారు: కమ్మవారిలో ప్రసిద్ధి చెందిన వంశం వాసిరెడ్డి వారిది. వారు కూడా గోల్కొండ సుల్తాన్‌ల కాలంలోనే తమ సంస్థానాన్ని సంపాదించారు. ఈ వంశానికి చెందిన సదాశివ నాయుడు క్రీ.శ.1550-1581 మధ్యకాలంలో ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో కొండవీటి సర్కారులో కొంత భాగంపై చౌదరీ తనాన్ని సంపాదించాడు. సదాశివనాయుని మనుమలలో గంగినీడు మోపులూరు, మాదినీడు తాడిగిరి, వెంకటాద్రి పల్లగిరి, గుర్వినీడు పొపూరు, చినవెంకటాద్రి నందిగామ చౌదరీ పదవులను సంపాదించారు. మరొక మనుమడు మాదినీడు తర్వాత కాలంలో నిడుమర్రు ఆత్మకూరుల చౌదరీ తనాన్ని సంపాదించాడు. అలాగే వీరపనీడు కుమారుడు లింగనీడు తాడికొండవంటు చౌదరి అయ్యాడు. వీరంతా క్రీ.శ.1600-1670 మధ్య కాలానికి చెందినవారు. క్రీ.శ.1660లో వాసిరెడ్డి వీరప్ప నాయకుడు గోల్కొండ సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షాను దర్శించి నందిగామ పరగణాకు దేశ్‌ముఖ్ సనద్‌ను సంపాదించాడు. అప్పటి నుంచి నందిగామ పరగణా క్రీ.శ.1948 వరకు వాసిరెడ్డి వారి ఆధీనంలోనే ఉండిపోయింది. క్రీ.శ.1689లో వీరప్పకుమారులు తమ జమీని పంచుకొన్నారు. క్రీ.శ.1687లో గోల్కొండ రాజ్యం మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. అందువల్ల వారు ఔరంగజేబును దర్శించి తమ జమీలను ఖాయం చేయించుకున్నారు. వీరిలో రామయ్య నాయుడు క్రీ.శ.1687లో నందిగామలోని శివాలయానికి మంటపాన్ని నిర్మించాడు.

చింతపల్లివంటు జమీ-వాసిరెడ్డి చిన పద్మనాభనాయకుడు: వాసిరెడ్డి వంశానికి చెందిన చినపద్మనాభ నాయకుడు క్రీ.శ.1685లో గోల్కొండ తానీషాను దర్శించి గుంటూరు, కృష్ణా జిల్లాలలోని 500 గ్రామాలపై జమీని

సంపాదించాడు. నందిగామ ఖమ్మంమెట్టు, వినుకొండ, కొండవీడు, సంతరావూరు, కూచిపూడి, రాయపూడి, పెనుగంచిప్రోలు, బేతవోలు పరగణాలని 500 గ్రామాలపై అతని అధికారం ఏర్పడింది. ఇతడు గుంటూరు జిల్లాలోని చింతపల్లిలో కోటను నిర్మించుకొని దానిని తన రాజధానిని చేసుకున్నాడు. కనుక ఈ జమీందారీకి చింతపల్లి జమీ అని పేరు వచ్చింది. ఇతడు మానూరి వెంకన్న జమీలోని 9 గ్రామాలను కూడా ఖరీదు చేశాడు ఇతడు దేవ బ్రాహ్మణులకు దానాలు చేశాడు. క్రీ.శ.1710లో మరణించాడు. అతని తర్వాత అతని సోదరుడు రామలింగన్న గుంటూరులో అగ్రహారాన్ని నిర్మించి 30 కుచ్చెళ్ల భూమిని బ్రాహ్మణులకు దానం చేశాడు. అతని తర్వాత బుచ్చి రాఘవనాయుడు, పెదనరసన్న, చిననరసన్న, చినరామలింగన్న నాయుడులు పాలించారు. వీరి కాలంలో మాంచాల గ్రామాన్ని అగ్రహారంగా చేశారు. నరసన్న చినరామలింగ నాయుడుల కాలంలో క్రీ.శ.1748లో పాటూరు పట్టణాధిపతి అయిన మలరాజు సూరభూపాలునితో సరిహద్దు గ్రామాల వద్ద తగాదా వచ్చి యుద్ధం జరిగింది. అందులో మలరాజు వారు ఓడిపోయారు. నరసన్న బేతవోలు గ్రామంలోను, రామలింగన్న పులిచింతల గ్రామంలోని భూములను బ్రాహ్మణ అగ్రహారాలుగా భూములను ఇచ్చారు. చినరామలింగని మంత్రి పాకాలపాడులోని దేవాలయాన్ని బాగుచేయించాడు. రామలింగన్ననాయుడు దివి రమణ అనే కవిని పోషించి శృంగారధామం అనే కావ్యాన్ని రాయించాడు. లింగన్న 12 సంవత్సరాలు పాలించాడు క్రీ.శ.1761లో వాసిరెడ్డి నాగన్ననాయుడు సంస్థానాధిపతి అయ్యాడు. అతడు షా ఆలం చక్రవర్తిని దర్శించి తన పరగణాలన్నింటిపై పాలనాధికారాన్ని పొంది సనద్‌ను సంపాదించాడు.

ముక్త్యాల జమీ: వీరి జమీలోని చింతలపాటినంటి జమీ క్రీ.శ.1686లో వాసిరెడ్డి చంద్రమౌళికి ఇవ్వబడింది. తర్వాత అతని కుమారుడు రాఘవనాయుడు, తర్వాత రాజమౌళిలు క్రీ.శ.1714 వరకు పాలించారు వారిలో రాజమౌళి మునియేరు కాల్వను తవ్వించాడు. తర్వాత చంద్రమౌళి, లక్ష్మీపతులు పాలించారు. తర్వాత క్రీ.శ.1745లో రామలింగనాయుడు అధిపతి అయ్యాడు. వీరు పాలించిన ఈ జమీ ముక్త్యాల జమీగా రూపొందింది.

దోమకొండ సంస్థానం లేక బిక్కనవోలు సంస్థానం: కుతుబ్‌షాల కాలంలో వారి సామంతులు కూడా తెలుగు భాషను, తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. అంకితాలు పుచ్చుకున్నారు. ఈ సామంతరాజులలో కొందరు స్వయంగా కవులు. వారు కూడా కావ్యాలు రాశారు. అలాంటి సంస్థానాలలో బిక్కనవోలు సంస్థానం అతి ముఖ్యమైనది. బిక్కనవోలు సంస్థానానికి మూలపురుషుడు కామినేని కాచారెడ్డి. అతడు మొదట విజయనగర రాజ్యంలో ఉద్యోగం చేసేవాడు. అతడు గోల్కొండ రాజ్యస్థాపకుడైన కులీకుతుబ్ ఉల్‌ముల్క్‌కు సమకాలికుడు. అతడు కాచారెడ్డి కాలంలో అతనిని ఆశ్రయించి మెదక్ దుర్గాధిపతి అయ్యాడు. అతని సంతతివారు బిక్కనవోలు కోటను నిర్మించి దానిని తమ రాజధానిగా చేసుకొని పాలించారు. తర్వాత వారు బిక్నూరు, దోమకొండలను కూడా రాజధానులుగా చేసుకొని పాలించినందువల్ల వారికి దోమకొండ సంస్థానాధీశులు అనే పేరు వచ్చింది. గోల్కొండ నవాబులు తర్వాత కూడా వారు మొగలులు, తర్వాత అసఫ్‌జాహీల సామంతులుగా పాలించారు. వీరు పాకనాటి రెడ్లు. కాచారెడ్డి మునిమనుమడు ఎల్లారెడ్డి. అతడు కిరాతార్జునీయం, బాలభాగవతం అనే కావ్యాలను అంకితం పుచ్చుకున్నట్లు నూతన సంహిత అనే గ్రంథం వల్ల తెలుస్తోంది. కాని అవి లభ్యం కాలేదు. ఆనాడు ఆరామ తటాకాన్ని అనేక దేవాలయాలను నిర్మించాడు. ఎల్లారెడ్డి మనుమడు కామిరెడ్డి. ఇతడు మహమ్మద్ కులీ సమకాలికుడు. ఇతడు ఈ వంశంలో ప్రఖ్యాతి చెందిన వాడు. ఇతనికి కామినేని, కామినేడు అని కూడా పేర్లు ఉన్నాయి. అతని పేరుతోనే ఈ వంశస్తులు తర్వాత కామినేని వంశస్తులని ప్రఖ్యాతి వహించారు కామిరెడ్డి క్రీ.శ.1580-1600 సంవత్సరాల మధ్య పాలించి ఉంటాడు. ఇతడు మహమ్మద్ కులీ సమకాలికుడు. ఇతడు, ఇతని వంశస్తులు మల్లికార్జున పండితుల వంశస్తులకు శిష్యులు.

ఆ వంశానికి చెందిన లింగనాథుడు ఇతని గురువు. ఇతని ఆస్థానంలో పట్టమట్ట సోమనాథ సోమయాజి అనే కవి ఉండేవాడు. అతడు స్కంధపురాణంలోని నూతన సంహితను ఆంధ్రీకరించి ఇతనికి అంకితం చేశాడు కామిరెడ్డి తర్వాత అతని తమ్ముడు ఎల్లారెడ్డి రాజ్యం చేశాడు. పట్టమట్ట సోమయాజి ఇతని ఆస్థానంలో కూడా కొనసాగి బ్రహ్మోత్తరఖండం అనే కావ్యాన్ని ఆంధ్రీకరించి ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. అంటే పట్టమట్ట సోమయాజి రెండు కావ్యాలు రాసి సోదరులిద్దరికీ చెరి ఒక కావ్యాన్ని అంకితం చేశాడు. ఎల్లారెడ్డి స్వయంగా కవి. అతడు వాసిష్టం, లింగపురాణాలు అనే రెండు కావ్యాలు రచించాడు. ఎల్లారెడ్డి సోదరుడు మల్లారెడ్డి బహు గ్రంథకర్త అతడు షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే మూడు కావ్యాలు రాసి తమ ఇష్టదైవమైన

సిద్ధిరామేశ్వరస్వామికి అంకితం చేశాడు. ఎల్లారెడ్డి తర్వాత అతని కుమారుడు కామిరెడ్డి రాజ్యానికి వచ్చాడు. అతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలికుడు. అతనికి అబ్దుల్లా కుతుబ్‌షా సనద్‌ని ఇచ్చినట్లు ఉమాపత్యాభ్యుదయ కావ్యం వల్ల తెలుస్తోంది. ఇతడు క్రీ.శ.1660-75 ప్రాంతంలో పాలించి ఉండవచ్చును. ఇతని వారసులు గోల్కొండ నవాబుల తర్వాత కూడా దోమకొండను పాలించారు.

వంశవృక్షం

కాచిరెడ్డి క్రీ.శ.1518-1540

భోగిరెడ్డి-భార్య దేచాంబ (ఆమె ఒక తటాకాన్ని నిర్మించినది)

కాచిరెడ్డి | మల్లారెడ్డి | బొమ్మారెడ్డి

ఎల్లారెడ్డి - భార్య మల్లమ్మ

కన్నారెడ్డి | కాచిరెడ్డి | పర్వతరెడ్డి

జంగమరెడ్డి | కామిరెడ్డి | ఎల్లారెడ్డి | మల్లారెడ్డి

మహమ్మద్‌కులీ సమకాలికుడు క్రీ.శ. 1580-1600

కామిరెడ్డి అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలికుడు క్రీ.శ. 1660-1678

దోమకొండ సంస్థానంలో చరికొండ ధర్మన్న, హరిభట్టు, పిడవర్తి బసవన్న, ఎలకూచి బాల సరస్వతి కాంద్రవేటు రామానుజాచార్యులు, మల్లారెడ్డి దేశాయి అనే కవులు ఉండేవారు. వారందరూ ప్రసిద్ధి పొందిన తెలుగు కవులు. కుతుబ్‌షా యుగంలో దోమకొండ సంస్థానంతోపాటు గద్వాల్, వనపర్తి లేక జటప్రోలు సంస్థానాధీశులు కూడా తెలుగుకవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. వనపర్తి రాజా బహరి గోపాలరావు స్వయంగా కవి. వారి ఆస్థానంలో కొలచెలమ నారాయణ పండితుడు, ఎలకూచి విన్నయ ప్రభాకరుడు ఉండేవారు. గద్వాల సంస్థానంలో లక్ష్మీనరసింగరుయ్య, ఆది కవులు ఉండేవారు. వీరందరూ తెలుగు కావ్యాలు రాసి తెలంగాణలో తెలుగుభాష పూర్తిగా నశించిపోకుండా నిలబెట్టారు.

మొగల్ యుగంలోని సామంత రాజ్యాలు

కొచ్చర్లకోట-సర్వేపల్లి సీమలు: క్రీ.శ.1687 నుండి 1724 వరకు 37 సంవత్సరాలు మొగలులు ఆంధ్ర దేశాన్ని పాలించారు. ఈ కాలంలో క్రీ.శ.1710లో కొచ్చర్లకోట సీమను రావెళ్ల వెంకటాద్రి పాలించాడు. అతడు కొచ్చర్లకోటను తన బంధువులైన ఆరుగురికి జాగీరుగా ఇచ్చాడు. అతని తర్వాత అతని కుమారుడు మల్లానాయడు పాలించాడు. అతడు సౌగంధిక పుష్పాపహరణం అనే కావ్యాన్ని రాయించాడు. క్రీ.శ.1751లో కొచ్చెర్లకోట సీమను తిరువెంగళప్ప పాలించాడు. అతని తర్వాత క్రీ.శ.1764లో మల్లానాయని కుమారుడు ఉద్దండ మల్లానాయడు పాలించాడు. ఈస్టిండియా పాలనలో వారు కొచ్చర్ల కోటను తీసుకొని అందులోని అరికట్లను మాత్రమే ఈ వంశస్తులకు మిగిల్చారు. సర్వేపల్లి సీమను రావెళ్ల ముద్దుకృష్ణప్ప నాయనింగారు క్రీ.శ.1711-12 ప్రాంతంలో పాలించారు. ఇతని కాలంలో అతని సామంతులు నారికేళపల్లి, మడమనూరు గ్రామాలలో చెరువులు తవ్వించి శాసనాలు వేయించారు. రావెళ్ల వంశస్తులను గురించి అనేక చాటువులు ఉన్నాయి.

కర్నూలు నవాబి: ఔరంగజేబు క్రీ.శ.1687లో గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించిన తర్వాత ఆంధ్రదేశంలో మొగలుల అధికారం ఏర్పడింది. ఆ సందర్భంలో గోల్కొండ నాటి స్థానిక వంశాలను తొలగించి వివిధ ప్రాంతాలలో వివిధ నూతన వంశాలు స్థానిక పాలెగాండ్రుగా నియమింపబడ్డాయి. ఆ విధంగా నియమింపబడిన వంశాలలో కర్నూలు నవాబుల వంశం కూడా ఒకటి. కర్నూలు నవాబుగా నియమింపబడిన మొట్టమొదటి వ్యక్తి

పఠాన్ వీరుడైన దౌడ్‌ఖాన్. అతనిని ఔరంగజేబు సేనాధిపతి అయిన గాజీవుద్దీన్ కర్నూలు జాగీరుదారునిగా నియమించాడు. కొన్నాళ్లు తర్వాత అతనిని గుజరాత్‌కు బదిలీ చేసి అతని స్థానంలో ఇబ్రహీంఖాన్ అనే అతన్ని నియమించారు. అతని తర్వాత అలుఫ్‌ఖాన్, అతని తర్వాత హిమ్మత్ బహదూర్‌ఖాన్‌లు వరుసగా కర్నూలు జాగీరుదారులయ్యారు. హిమ్మత్ బహదూర్ కర్నూలు పాలెగాడుగా ఉన్న సమయంలో బీజాపూరుకు హిమ్మత్ యార్‌ఖాన్ అనే అతడు సుబేదార్‌గా ఉండేవాడు. కర్నూలు హిమ్మత్‌ఖాన్‌కు బీజాపూరు హిమ్మత్ యార్‌ఖాన్‌తో పేష్కష్ విషయంలో వివాదం వచ్చి వారి మధ్య చిన్న యుద్ధం జరిగింది. అందు కర్నూలు హిమ్మత్ బహదూర్‌ఖాన్ ఓడిపోయి మొత్తం పేష్కస్ చెల్లించాడు. తర్వాత ఇతని రాజ్యంపై మహారాష్ట్రులు దండెత్తారు. రఘోజీ భోన్స్లే సేనాధిపతి అయిన ఫతేసింగ్ ఇతని రాజ్యంపై బడి చాగలమర్రు, సిరువెల్, నంద్యాలను దోచుకొని కర్నూలును ఆక్రమించాడు. హిమ్మత్ బహదూర్‌ఖాన్ నిజాం ఉల్ముల్క్ సమకాలికుడు. నిజాం ఉల్ముల్క్ మరణం తర్వాత 1748లో అతని కుమారులు నజీర్‌జంగ్ మనుమడు ముజఫర్‌జంగ్‌లకు వారసత్వ యుద్ధం వచ్చింది. అందులో ఇతడు ముజఫర్‌జంగ్‌తో పోరాడి మరణించాడు. అతని మరణం తర్వాత సలాబత్‌జంగ్ కర్నూలు జాగీరుదారును స్వాధీనం చేసుకొని మునవర్‌ఖాన్ అనే అతనిని జాగీరుదారుగా నియమించాడు. మునవర్‌ఖాన్ తన చివరి కాలంలో తన మూడవ కుమారుడైన అలుఫ్‌ఖాన్‌ను తన వారసునిగా నియమించాడు. కాని అతని సోదరులు అతని వారసత్వాన్ని అంగీకరించలేదు. కాని ఏమీ చేయలేకపోయారు. అతడు కర్నూలు నవాబుగా కొనసాగాడు. అతడు క్రీ.శ.1800 సంవత్సరాలలో ఇంగ్లిషు వారి సామంతుడయ్యాడు. ఇంగ్లిషు వారు నిర్ణయించిన పేష్కస్‌ను చెల్లించి వారి ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. కాని తన రాజ్యంలో నిరంకుశంగా వ్యవహరించి ప్రజలను బాధించాడు. ఇంగ్లిషు వారికి చెల్లించవలసిన పేష్కస్‌ను చెల్లించడానికి సరిపడా ఆదాయం వచ్చేది కాదు. అందువల్ల అతడు తన రాజ్యాన్ని చిన్నచిన్న జాగీరులుగా విభజించి తనకు అప్పు పెట్టిన ఫైనాన్షియర్స్‌ని జాగీరుదారులుగా నియమించాడు. అలుఫ్‌ఖాన్ మరణించిన తర్వాత అతని కుమారుడు ముజఫర్‌ఖాన్ అధికారాన్ని హస్తగతం చేసుకున్నాడు. కాని అతని అధికారాన్ని తొలగించి అలుఫ్‌ఖాన్ మరొక కుమారుడు మునవర్‌ఖాన్ నవాబై 8 సంవత్సరాలు పాలించాడు. అతడు మంచి పరిపాలనాదక్షుడు. ఈనాందారులపై తన తండ్రి అన్యాయంగా విధించిన పన్నులను రద్దు చేశాడు. అంతేగాక తన తండ్రి ఆక్రమంగా వసూలు చేసిన మొత్తాన్ని కూడా తిరిగి వారికి చెల్లించి ప్రజల ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. మునావర్‌ఖాన్ తర్వాత అతని సోదరుడు రసూల్‌ఖాన్ కర్నూలు నవాబు అయ్యాడు. కాని అతడు దురాశాపరుడు. అతడు తన సోదరుడు తీసి వేసిన పన్నులను తిరిగి విధించాడు. రైతుల దగ్గర నుండి చౌకగా ధాన్యాన్ని కొని నిలువ చేశాడు. సైన్యాన్ని అభివృద్ధి చేసి నూతన ఆయుధాలను కొన్నాడు. ఫిరంగులను అభివృద్ధి చేశాడు. ఈ చర్యలన్నీ బ్రిటిష్ వారికి అతనిపై అనుమానాన్ని కలిగించాయి. అతని చర్యలపై రిపోర్టు ఇవ్వడానికి ఐ.సి.యస్. ఆఫీసర్ బ్లేన్, గవర్నమెంటు మిలిటరీ సెక్రటరీ కల్నల్ స్టీల్‌లను నియమించింది. వారికి సహాయంగా బళ్లారి నుండి Col Dyce అనే అతని నాయకత్వాన చిన్న సైన్యం కూడా బయలుదేరింది. ఈ సైన్యం నవాబును బంధించి తిరుచునాపల్లికి బందీగా పంపింది. కాని నవాబు బ్రిటిష్ వారికి ద్రోహం తలపెట్టాడని రుజువు కాలేదు. అయినప్పటికీ క్రీ.శ.1839లో కర్నూలు రాజ్యాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని నవాబుకు, అతని కుటుంబానికి పెన్షన్ ఇచ్చింది. దాని పాలనకోసం ఒక కమిషనర్‌ని, అతనికి సహాయంగా ఒక మిలిటరీ అసిస్టెంటును నియమించారు. 1858లో కర్నూలుపై కలక్టర్‌ను నియమించాడు. దాంతో కర్నూలు నవాబి పూర్తిగా బ్రిటిష్ రాజ్యంలో కలసిపోయింది.

బనగానపల్లె నవాబీ: 17వ శతాబ్దం చివరిలో కర్నూలు జిల్లాలోని బనగానపల్లెలో ఒక నవాబీ ఏర్పడింది. దానికి బనగానపల్లె నవాబీ అని పేరు. ఈ నవాబీకి మహమ్మద్ బేగ్‌ఖాన్ అనే అతడు మూల పురుషుడు. క్రీ.శ.1665లో అతడు అబ్దుల్లా కుతుబ్‌షా చేత బనగానపల్లె ఖిలేదార్‌గా నియమింపబడ్డాడు. అతడు క్రీ.శ.1676 వరకు పాలించాడు. అతని తర్వాత అతని కుమారుడు ముహమ్మద్ బేగ్‌ఖాన్-ఇ-బంగ్ రాజ్యానికి వచ్చి 1725 వరకు పాలించాడు. ఇతడు తానీషా, ఔరంగజేబు, నిజాం ఉల్‌ముల్క్‌ల సమకాలికుడు. దక్షిణదేశంలో వచ్చిన రాజకీయ మార్పులన్నీ ఇతని కాలంలోనే జరిగాయి. గోల్కొండ రాజ్య పతనం, ఆంధ్రదేశంలో మొగలుల పరిపాలన, ఔరంగజేబు మరణం, నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జాహీ రాజ్యాన్ని స్థాపించడం అన్నీ ఇతని కళ్లముందే జరిగాయి. అతని తర్వాత 1769 వరకు అట్టాఖాన్, మొదటి ఫజల్ ఆలీఖాన్, రెండవ ఫజల్ ఆలీఖాన్‌లు పాలించారు. వారి తర్వాత 1769లో హుసేన్ ఆలీఖాన్ రాజ్యానికి వచ్చాడు. అతని కాలంలో మైసూర్ సుల్తాన్

హైదరాలి బనగానపల్లిపై దండెత్తాడు. హుసేన్ ఆలీఖాన్ గొప్ప వీరుడు. అతడు తన రాజ్యాన్ని రక్షించుకున్నాడు. అతడు అనేక యుద్ధాలు చేశాడు. అతడు క్రీ.శ.1783 వరకు పాలించి మరణించాడు. అతని మరణ కాలం నాటికి అతనికి నలుగురు మైనర్ కుమారులు ఉన్నారు. అదే సమయంలో మైసూరు రాజ్యంలో హైదరాలీ మరణించి టిప్పుసుల్తాన్ రాజ్యానికి వచ్చాడు. టిప్పు వారిని మైసూరు రావలసిందిగా ఆజ్ఞాపించాడు. అందుకు భయపడి వారు నలుగురు హైదరాబాద్ పారిపోయారు. వారు పారిపోగానే టిప్పు బనగానపల్లిని తన ఆధీనంలోకి తెచ్చుకొని మహమ్మద్ యూసఫ్ అనే సరదారుని బనగానపల్లి ఖిలేదారునిగా నియమించాడు. మూడవ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ ఓడిపోయినందువల్ల బనగానపల్లి రాజ్యం తిరిగి హుసేన్ ఆలీఖాన్ కుమారులకు దక్కింది. అతని నలుగురు కుమారులలో ఒకరైన సయ్యద్ గులాం అలీఖాన్ 1793లో బనగానపల్లె గద్దెనెక్కాడు. అతని తర్వాత రెండవ హుసేన్ ఆలీఖాన్, రెండవ గులాం అలీఖాన్, ఫతే అలీఖాన్ అనేవారు వరుసగా రాజ్యానికి వచ్చారు. వారి తర్వాత మూడవ మీర్ గులాం ఆలీకాన్ బహుదూర్ నవాబయ్యాడు. అతడు చిన్నవాడు. కనుక మద్రాసు గవర్నమెంటు Molony I.C.S.ను బనగానపల్లెకు రాజకీయ ఏజెంటుగా నియమించింది. మోలోనీ బనగానపల్లె రాజ్యంలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. న్యాయ విధానంలో మార్పులు తెచ్చాడు. ఇరిగేషన్ పనులు చేపట్టాడు. పరిపాలనా విధానంలో కూడా మార్పులు తెచ్చాడు. 1908లో మూడవ మీర్ గులాం ఆలీ మేజరయ్యాడు. అందువల్ల అతనికి పూర్తిగా అధికారం అప్పగింపబడింది. మోలోనీ శిక్షణలో పెరిగినందువల్ల నవాబు కూడా అభ్యుదయ పాలకునిగా ఎదిగాడు. అతడు బాలికలకు, బాలురకు వేర్వేరు స్కూళ్లను స్థాపించాడు. ప్రజా సంక్షేమ పథకాలు చేపట్టాడు. అతని తర్వాత మూడవ మీర్‌ఫాజుల్ ఆలీఖాన్ బహుదూర్ రాజ్యానికి వచ్చాడు. కాని అతనికి బ్రిటిష్ వారితో వివాదం వచ్చింది. అందువల్ల వారు 1939 నుండి 1947 వరకు బనగానపల్లె రాజ్యపరిపాలనను తమ చేతుల్లోకి తీసుకున్నారు. మైసూరు రెసిడెన్సీ పరిపాలన కింద ఉంచారు. క్రీ.శ.1947లో బ్రిటిష్ వారు ఇండియాకు స్వాతంత్ర్యం ఇచ్చారు. ఆ సందర్భంలో బనగానపల్లె రాజ్యాన్ని మీర్ ఫజుల్ ఆలీఖాన్‌కు అప్పగించారు. వెంటనే అతడు బనగానపల్లె రాజ్యానికి నూతన రాజ్యాంగాన్ని ప్రకటించి ప్రజలకు అనేక హక్కులను ఇస్తూ పరిపాలనలో భాగాన్ని ఇచ్చాడు. కాని సంస్థానాల విలీనీకరణ కోసం సర్దార్ వల్లభాయి పటేల్ చేసే ప్రయత్నాలకు సహకరించాడు. దక్షిణ భారతదేశంలో విలీనీకరణను రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ అగ్రిమెంటుపై సంతకం చేశాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు అతడు మరణించాడు. అతని తర్వాత అతని ఏకైక కుమారుడు మీర్ గులాం ఆలీఖాన్ బహుదూర్ వారసుడయ్యాడు. భారత ప్రభుత్వం అతనికి ప్రీవీపర్సును ఇచ్చింది. క్రీ.శ.1971లో అందరి ప్రీవీపర్సులు రద్దు అయ్యాయి.

కడప నవాబీ-మయన వంశం (Mayana Dynasty):

వంశవృక్షం

అబ్దుల్ నబిఖాన్ 1710-1736

- అబ్దుల్ ముహమ్మద్‌ఖాన్ లేక గుడ్డి నవాబు 1736-1747
- అబ్దుల్ ఖాదిర్‌ఖాన్
  - ఘనిమియా
  - గఫర్‌మియా
  - చిన్ననవాబ్
- అబ్దుల్ ఫత్తాఖాన్
- మోషుమ్‌ఖాన్ (ముహ్‌సిన్‌ఖాన్, మోచామియా) 1748-1752
- అబ్దుల్ హమీద్‌ఖాన్ 1753-1757
- అబ్దుల్ మజీద్‌ఖాన్ 1758-1760
  - హలిమ్‌ఖాన్ 1761-1779
  - సయ్యద్ మియా

ఔరంగజేబు మరణానంతరం కడపలో ఒక నవాబీ ఏర్పడింది. ఈ నవాబీకి మూలపురుషుడు పటాన్ వీరుడైన అబ్దుల్ నబీఖాన్. సిద్ధవటం స్థలమహాత్మ్యం శక 1632 అంటే క్రీ.శ. 1710లో దౌడ్‌ఖాన్ లేక దావూద్ ఖాన్ అనే మొగల్ అధికారి అబ్దుల్ నబీని కడప సుభాకు అధిపతిగా నియమించాడని తెలుపుతోంది. కడపలోని ఒక మసీదులో హిజ్రా 1130 అంటే క్రీ.శ.1717-18 సంవత్సరంలో వేయించిన శాసనం కూడా ఫరుక్‌షైర్ కాలంలో కూడా అబ్దుల్ నబీ కడప సుబేదారుడే ఉన్నట్లు తెలుపుతోంది. అతడు నిజాం ఉల్ ముల్క్‌కు

సమకాలికుడు. అతడు షకర్ కేర వద్ద నిజాం ఉల్ ముల్క్‌కు, ముబారిజ్ ఖాన్‌కు క్రీ.శ.1724లో జరిగిన యుద్ధంలో నిజాం ఉల్ ముల్క్‌కు వ్యతిరేకంగా ముబారిజ్ ఖాన్ తరపున పోరాడటానికి తన కుమారుడు అబ్దుల్ ఫత్తాఖాన్‌ను పంపాడు.

నబీఖాన్ కడప సుబేదార్ అయినప్పటి నుండి అన్ని దిక్కులకు తన రాజ్యాన్ని విస్తరింపజేయాలని చాలా ప్రయత్నాలు చేశాడు. కాని అతని ప్రయత్నాలను పాలెగాండ్రు, మొగల్ అధికారులు వ్యతిరేకించారు అయినప్పటికీ కొన్ని విజయాలు సాధించి కడప రాజ్యాన్ని విస్తరించాడు. అతడు మొదట సాధించిన దుర్గం సిద్దౌట్ ఉదయగిరి సుభాలో భాగంగా ఉండేది. ఉదయగిరి ఆర్కాట్ రాజ్యంలో ఒక సుభాగా ఉండేది. ఆనాటి ఆర్కాట్ నవాబ్ సదాతుల్లాఖాన్ ఉదయగిరి సుభాకు కేసరిసింగ్ కుమారుడైన ఫతేసింగ్ అనే అతడ్ని సుబేదార్‌గా నియమించాడు. అబ్దుల్ నబి తన రాజ్యంపై మరాఠీలు దండెత్తుతున్నారని, తన జనానాకు రక్షణ లేదని సిద్దౌట్ దుర్గంలో తన జనాభాకు రక్షణ ఇవ్వాలని ఫతేసింగ్‌ను బంధించి ఖైదు చేసి కోటను ఆక్రమించాడు. ఈ విధంగా మోసంతో సిద్దౌట్‌ను ఆధీనం చేసుకున్నాడట. తర్వాత అతడు గండికోటపై దండెత్తి అక్కడ ఖిలేదారుగా ఉన్న మహమ్మద్ నబీఖాన్‌ను ఓడించి కోటను ఆక్రమించాడు. తర్వాత కంభం, గుర్రంకొండ, పుంగనూరు పాలెగాండ్రను కూడా జయించి వారి వద్ద నుండి పేష్కస్ వసూలు చేశాడు. ఇంకా మరికొంతమంది పాలెగాళ్లను కూడా జయించి కప్పాలు వసూలు చేశాడు. అతడు అనేక మసీదులను నిర్మించి వాటి పోషణకు ఈనాములను ఇచ్చాడు చిన్నపసుపుల అంటే నేటి జమ్మలమడుగులోను, సిద్దౌట్‌లోను అతడు మసీదులు నిర్మించి శాసనాలు వేయించాడు అవి నేటికీ ఉన్నాయి. ఇతడు 25 సంవత్సరాలు అంటే క్రీ.శ.1735 వరకు పాలించాడు. అతని కాలంలోనే కడప రాజ్యం బాగా అభివృద్ధి చెందింది. ఇతని వంశాన్ని మయన వంశం అని పిలిచారు.

నబీఖాన్ తర్వాత ఎవరు కడప గద్దెనెక్కినదీ స్పష్టంగా తెలియడం లేదు. మజాద్‌ఖాన్ సింహాసనం అధిష్టించాడా లేక అబ్దుల్ ముహమ్మద్ ఖాన్ రాజ్యానికి వచ్చాడో స్పష్టంగా తెలియడం లేదు. అబ్దుల్ ముహమ్మద్ ఖాన్‌కు గుడ్డి నవాబు అని కూడా పేరుంది. కడప చరిత్రను తెలిపే పూర్వపు గజటీరు గండికొండ కైఫీయత్తు వేరు వేరు కథనాలను తెలుపుతున్నాయి. గండికోట కైఫీయత్తు అబ్దుల్ ముహమ్మద్ లేక గుడ్డి నవాబు పాలించాడని, అతని తర్వాత మోఘమ్‌ఖాన్ లేక ముహిసిన్ ఖాన్ రాజ్యానికి వచ్చాడని అతనికి మోచామియా అని కూడా పేరుందని తెలుపుతోంది. మోచామియా అబ్దుల్ నబి యొక్క మరొక కుమారుడు. గుడ్డి నవాబు కాలంలో గండికోటను నిజాం ఉల్‌ముల్క్ ఆక్రమించాడు. కవి దుల్లాఖాన్ అనే అతనిని తన ప్రతినిధిగా నియమించాడు నిజాం ఉల్‌ముల్క్ మరణం తర్వాత నిజాం రాజ్యంలో ఏర్పడిన కల్లోలాన్ని ఆసరాగా తీసుకొని మోచామియా గండికోటను తిరగి ఆక్రమించడానికి తన సోదరుడైన అబ్దుల్ ఖాదిర్‌ఖాన్ కుమారుడైన ఘనీమియాను పంపాడు అతడు గండికోటను చేరి దిగువ పట్టణం వద్ద విడిది చేశాడు. కవిదుల్లాఖాన్ కొన్ని రోజులు అతనితో పోరాడి తన సైనిక ఖర్చులు ఇచ్చి వేస్తే తాను కోటను స్వాధీనం చేసి వెళ్లిపోతానని కబురు పంపాడు. దానికి అంగీకరించి అతనికి ఖర్చులు చెల్లించి మోచామియా గండికోటను స్వాధీనం చేసుకొని గండికోట జాగీరును తన భార్య మదీనా బీబీకి ఇచ్చాడు. కాని గండికోటపై మోచామియా పాలన ఎక్కువ రోజులు కొనసాగలేదు. పన్నిసలీమ్‌ఖాన్, బక్రాసాహెబ్ అనే ఇద్దరు కడపకు చెందిన భాగ్య వంతులైన షావుకార్లు మోచమియాను ఖైదుచేసి అబ్దుల్ నబీఖాన్ మనుమడు, అబ్దుల్ హమీద్‌ఖాన్ కుమారుడు, సిద్దౌట్ జాగీరుదారుడు అయిన అబ్దుల్ మజీద్‌ఖాన్‌ను గండికోట జాగీరుదారునిగా ప్రకటించారు అని గండికోట కైఫీయత్తు తెలుపుతోంది. అతనికి వారు ధనసహాయం కూడా చేశారు. అతడు వారి సహాయంతో సైన్యాలను సమకూర్చుకొని వేముల పాలెగాడైన కుమార నాయుడిని ఓడించి సిద్దౌట్‌లో ఖైదు చేశాడు. తర్వాత గండికోటపై దండెత్తాడు. కాని మదీనా బీబి అతనిని ఎదిరించింది. ఆమెను ఓడించి ఖైదు చేసి గండికోటను ఆక్రమించాడు. తర్వాత అతడు జమ్మలమడుగు, గండికోటలను ఏకం చేసి ఒకే పరిపాలనా విభాగం చేసి బాల వెంకటరెడ్డి అనే తన అనుయాయుని అక్కడ అమీల్ దారుగా నియమించాడు.

మజీద్‌ఖాన్ గొప్పవీరుడు. తర్వాత అతడు తన రాజ్యాన్ని ఇంకా విస్తరించాలని విజయయాత్ర చేశాడు. అతడు గండికోటకు నాలుగు ఆమడల దూరంలో ఉన్న ఔక్ రాజ్యంపై దండెత్తి ఆ రాజ్యంలోని ముఖ్యకోట అయిన ఉప్పలపాడును ఆక్రమించాడు. తర్వాత గుత్తి, బళ్లారి, మడకసిర, శ్రీరంగపట్టణం, కోలారు, బారామహల్‌పై దండయాత్ర చేసి నాలుగు సంవత్సరాలకు ఇల్లు చేరాడు. అతడు ఇల్లు చేరిన తర్వాత కష్టాలు ప్రారంభమయ్యాయి. అతనికి పెట్టుబడి పెట్టిన వర్తకులు తమ డబ్బును చెల్లించమని కోరారు. కాని అతడు చెల్లించలేకపోయాడు

అందువలన వారు సిద్ధౌట్ చేరి అతనిపై తిరుగుబాటు చేశారు. అతడు తనకు సహాయం చేయవలసిందిగా మహారాష్ట్రులను కోరాడు. మహారాష్ట్రులు ఆ సమయంలో కృష్ణానది ఒడ్డున విడిది చేసి ఉన్నారు. వారు తనను కాపాడితే కోటి రూపాయలు పరిహారంగా ఇస్తానని వాగ్దానం చేశాడు. వారు అతనికి సహాయంగా వచ్చి కడప బుగ్గ అనే ప్రదేశంలో విడిసి మజీద్‌ఖాన్‌ను కొంత పైకం చెల్లించమన్నారు. కాని అతడు ఏమీ చెల్లించలేక పోయాడు. అందుల్ల కడపలో తిరుగుబాటు చేసిన వారిని దండించకుండా మరాఠా సైన్యం సిద్ధౌట్‌కు బయలుదేరింది. సిద్ధౌట్‌ను దోచుకుంటారేమోనని మజీద్‌ఖాన్ అనుమానించి కడపకు రెండు పరుగుల దూరంలో అంటే రెండు మైళ్లదూరంలో అతడు క్రీ.శ.1757లో మరాఠీ దండుతో యుద్ధంచేసి మరణించాడు. అతని మరణం తర్వాత మరాఠీలు కడప రాజ్యాన్ని దోపిడీ చేశారు. తరువాత వారు ఖైదులో ఉన్న మోచామియాను విడుదల చేసి కడప సింహాసనం ఎక్కించారు. అతడు అందుకు ప్రతిఫలంగా మహారాష్ట్రులకు గుర్రంకొండ రాయచోటి, పులివెందల, పద్నపల్లె, జమ్మల మడుగులను ఇచ్చాడు. వారు సంతోషించి వెళ్లిపోయారు.

అబ్దుల్ మజీద్‌ఖాన్ మరణించిన తర్వాత అతడు గండికోటలో బంధించిన మోచామియా భార్య మదీనా బీబీ కూడా విడుదలైంది. ఆమె కడప రాజ్యంలోకి వచ్చిన మహారాష్ట్రులను పారదోలి వేయడానికి గొప్ప ప్రయత్నం చేసింది. కర్నూలు నుండి ఘనిమియాను ఆహ్వానించింది. అతన్ని అతని బాకీదారులు బంధించాడు. వారి నుండి విడుదల పొంది అతడు మదీనాబీబీకి సహాయంగా వచ్చాడు. అతనిని గండికోటకు పంపింది. అక్కడ గండికోట ఖిలేదారు అయిన అబ్దుల్ అజీజ్‌ఖాన్‌ను ఘనీఖాన్‌తో సహకరించమని కోరింది. జమ్మలమడుగుకు ముస్లింలు ఖాదరాబాద్ అని పేరు పెట్టారు. ఖాదరాబాద్‌కు పశ్చిమంగా ఉన్న పనకాలనపల్లె అనే గ్రామం దగ్గర ఉన్న చెరువు వద్ద మహారాష్ట్రులతో వారు పోరాడారు. ఆ యుద్ధంలో మహారాష్ట్రులు ఓడిపోయారు. అజీజ్‌ఖాన్, ఘనిజ్‌ఖాన్‌లు మహారాష్ట్రులు పనకానపల్లె వద్ద తమకు జరిగిన ఓటమికి ప్రతీకారంగా మళ్లీ పెద్ద సైన్యంతో వెళ్లి ఖాదరాబాద్ వద్ద ఘనీమియా అతని తమ్ముడు చిన్న నవాబును ఓడించి తరిమారు. వారు పారిపోతుండగా అక్కడి కోటలో ఉన్న మదీనా బీబీ వారికి కోటలోకి రానిచ్చి కాపాడింది.

సిద్ధౌట్ కైఫీయత్తు అబ్దుల్ మజీద్‌ఖాన్ ఏ పరిస్థితులలో కడప సుబేదార్ అయిందీ, అతని తర్వాత చరిత్ర మరొక విధంగా చెబుతోంది. మోచామియా జింజి దగ్గర నజీర్‌జంగ్‌ను చంపినందుకు అతనిని శిక్షించడానికి నిజాం ఆలీ కడప వచ్చాడు. ఆ సమయంలో అబ్దుల్ మజీద్‌ఖాన్ నిజాం ఆలీని కలసి 2 లక్షల రూపాయలు చెల్లించి మోచామియా స్థానంలో కడప సుబేదార్‌గా నియమింపబడ్డాడు. తర్వాత అతడు పశ్చిమాన హోస్‌కోట, కోలారుల వరకు, తూర్పున కంభం దగ్గర ఉన్న కనకగిరి వరకు జయించి రాజ్యాన్ని విస్తరించాడు. క్రీ.శ.1757లో మరాఠా సేనాధిపతి బల్వంతరావు వచ్చి బండికనుమ వద్ద విడిశాడు. అది కడపకు రెండు పరుగుల దూరంలో ఉంది. మజీద్‌ఖాన్ బల్వంతరావుపై దండెత్తి అక్కడ జరిగిన యుద్ధంలో మరణించాడు. అని సిద్ధౌట్ కైఫీయత్తు తెలుపుతోంది. ఇదే వాస్తవంగా కనిపిస్తోంది.

అదే కైఫీయత్తు మోచామియా పరిపాలనను గురించి కూడా మరొక విధంగా చెబుతోంది. మజీద్‌ఖాన్ మరణం తర్వాత మోచామియా మహారాష్ట్రులతో సంధి చేసుకొని గుత్తి, గుర్రంకొండ మొదలైన అనేక కోటలు ఇచ్చాడు. మహారాష్ట్రులు గుత్తిలో మురారిరావు గోర్పాడే అనే మరాఠా సేనానిని నియమించి వెళ్లిపోయారు. దాంతో ఆ ప్రాంతాలు మహారాష్ట్రుల ఆధిపత్యంలోకి వెళ్లిపోయాయి. మోచామియా కడప, సిద్ధౌట్, మిగిలిన కడప రాజ్య భాగాలను పాలించాడు. మోచామియా మజీద్‌ఖాన్ కుమారులైన హలిమ్ ఖాన్ అనే అతన్ని పెంచుకొని అతనిని తన వారసునిగా ప్రకటించాడు. కాని అతనికి పిల్లలు లేరు. సర్వర్ ఖాన్, సయ్యద్ మియాఖాన్, హమ్మమియా ఖాన్‌లను ఖైదు చేశాడు. కాని 3 సంవత్సరాల తరువాత అతనికి ప్రవర్తనపై అనుమానం వచ్చి క్రీ.శ.1760లో సర్వర్‌ఖాన్‌ను బంధించాలని చూశాడు. కాని సర్వర్‌ఖాన్ తప్పించుకొని కంభం పారిపోయాడు. ఆ సందర్భంలో సిద్ధౌట్‌లోని సైనిక నాయకులు ఖైదులోని హలీమ్ ఖాన్‌ను విడిపించి సింహాసనం ఎక్కించారు. దాంతో మోచామియా కూడా తన రక్షణ కోసం కందనవోలు పారిపోయి అక్కడే మరణించాడు.

మయన వంశంలో హలిమ్‌ఖాన్ చివరివాడు. ఇతని కాలంలో క్రీ.శ.1760లో హైదరాలీ కడప రాజ్యంపై దండెత్తి కడప రాజ్యానికి చెందిన కృష్ణగిరి, బారామహల్‌లను జయించాడు. అక్కడ కడప ఫౌజ్‌దార్‌గా ఉన్న అజీజ్‌ఖాన్‌ను ఓడించి బారామహల్‌ను మైసూరు రాజ్యంలో కలిపివేశాడు. తర్వాత హైదరాలీ తన బావమరిది అయిన మీర్ ఆలీరజా అనే అతనిని పంపి కడప రాజ్యానికి చెందిన గుర్రం కొండను కూడా ఆక్రమించాడు.

హైదరాలీ మళ్లీ క్రీ.శ.1769లో కడప రాజ్యంపై దండెత్తాడు. హలీమ్‌ఖాన్ హైదరాలీతో సంధి చేసుకొన్నాడు. కాని పదే పదే తన రాజ్యంపై దండెత్తే హైదరాలీ నుండి తన రాజ్యాన్ని రక్షించుకోడానికి హైదరాబాద్ వెళ్లి నిజాం అలీ సహాయం అర్థించాడు. కాని నిజాం అలీ అతనికి ఎలాంటి సహాయం చేస్తానని వాగ్దానం చేయలేదు. నిరాశతో హలీమ్ తన రాజ్యానికి తిరిగి వచ్చాడు. నిజాం సహాయానికి వెళ్లినందుకు కోపగించి హైదరాలీ క్రీ.శ.1779లో కడప రాజ్యంపై దండెత్తి దువ్వూరు దగ్గర హలీమ్‌ఖాన్‌ను ఓడించి కుటుంబంతోసహా బంధించి శ్రీరంగపట్టణం తీసుకెళ్లి అక్కడ ఖైదు చేశాడు. హలీం ఖైదులోనే మరణించాడు. దాంతో కడపను ఏలిన మయనం వంశం అంతమైంది.

మూడవ మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ ఓడిపోయి సగం రాజ్యాన్ని కారన్‌వాలీస్‌కు ఇచ్చాడు. ఇంగ్లీష్ వారు, నిజాం ఆ రాజ్యభాగాలను పంచుకున్నారు. అందులో కడప, సిద్ధోట్‌లతోసహా 61 తాలూకాలు నిజాం నవాబుకు వచ్చాయి. అందువల్ల కడప రాజ్యం క్రీ.శ.1800 వరకు నిజాం ఆధిపత్యంలో ఉంది. కడప రాజ్యానికి నిజాం అలీ మహమ్మద్ అమీర్‌ఖాన్ అరబ్ అనే అతన్ని అధిపతిగా నియమించాడు. అతనిపై అజమాయిషీ చేయడానికి తన కుమారుడు సికిందర్‌జాకు అధికారం ఇచ్చాడు. కడప రాజ్యాన్ని కాపాడటానికి రైమండ్ అనే ఫ్రెంచి సేనాధిపతిని కూడా నియమించాడు. క్రీ.శ.1799లో నాల్గవ మైసూరు యుద్ధం జరిగింది. అందులో టిప్పుసుల్తాన్ మరణించాడు. లార్డ్ వెల్లస్లీ మైసూరు రాజ్యంలోని అనేక ప్రాంతాలు తీసుకొని అందులో గుర్రంకొండ, అనంతపురం జిల్లాలోని అనేక ప్రాంతాలను నిజాం నవాబుకు ఇచ్చాడు. కాని క్రీ.శ.1801లో నిజాం ఇంగ్లిషు వారితో చేసుకున్న సైన్య సహకార పద్ధతి కింద మూడు, నాలుగు మైసూరు యుద్ధాలలో తన వాటకు వచ్చిన అన్ని ప్రాంతాలను ఇంగ్లిషు వారికి దత్తం చేశాడు. దాంతో కడప రాజ్యం బ్రిటిష్ వారి సామ్రాజ్యంలో భాగమైపోయింది. అది మద్రాసు ప్రెసిడెన్సీలో కలపబడింది.

ఆర్కాట్ రాజ్యం లేక ఆర్కాట్ నవాబీ: మొగల్ యుగంలో జన్మించిన మరొక సామంతరాజ్యం ఆర్కాట్ రాజ్యం. చివరి విజయనగర సార్వభౌముడైన మూడవ శ్రీరంగరాయలచే పాలింపబడిన విజయనగర సామ్రాజ్య అవశేషాలైన చంద్రగిరి, రాయవెల్లూరు రాజ్యమే ఆర్కాటు రాజ్యంగా మారింది. ఈ రాజ్యాన్ని ఏర్పాటు చేసిన వాడు ఔరంగజేబు. శ్రీరంగరాయలు చివరిదశలో చాలా దయనీయమైన జీవితం గడిపాడు. తన సామంతులైన తంజావూరు, మధుర, జింజి, శ్రీరంగ పట్టణ పాలెగాండ్రు స్వతంత్రం ప్రకటించగా తనకు చంద్రగిరి పరిసర ప్రాంతాలు మాత్రమే మిగిలాయి. గోల్కొండ, బీజాపూరు సుల్తాన్‌ల దాడుల వల్ల చంద్రగిరికి భద్రత లేకుండాపోయింది. కనుక అతడు తన రాజధానిని వెల్లూరుకు మార్చాడు. కనుకనే దానికి రాయవెల్లూరు అని పేరు వచ్చింది. కాని శ్రీరంగరాయలను తరిమి ఆ ప్రాంతం కూడా గోల్కొండ సేనాని మీర్జుమ్లా ఆక్రమించాడు కాని తన ప్రభువు గోల్కొండ నవాబును ధిక్కరించి స్వతంత్రం ప్రకటించాడు. అందుకు కోపగించి గోల్కొండలోని అతని కుటుంబాన్ని బంధించగా తన కుటుంబాన్ని రక్షించుకోడానికి ఔరంగజేబు సహాయమర్థించి మొగల్ సైన్యాధిపతిగా చేరిపోయాడు. తర్వాత బహుమనులతో ఔరంగజేబుకు వచ్చిన యుద్ధాలలో పాల్గొని మరణించాడు మీర్జుమ్లా వెళ్లిన తర్వాత శ్రీరంగరాయలు తన సామంతుడైన ఒడయారు రాజు కంఠీరవనరస సహాయంతో మళ్లీ వెల్లూరుని జయించాడు, కాని దక్కించుకోలేకపోయాడు. బీజాపూరు సేనానులు దాడులు చేశారు. షాజీ తంజావూరు, జింజి, వెల్లూరులను జయించగా, గోల్కొండ సేనానులు చంద్రగిరి ప్రాంతాన్ని వశపరచుకున్నారు ఈ విధంగా 1565 తళ్లికోట యుద్ధం తర్వాత బీజాపూరు ఆక్రమించిన ప్రాంతాలను బీజాపూరు కర్ణాటకం అని గోల్కొండ ఆక్రమించిన ప్రాంతాలను గోల్కొండ కర్ణాటకం అని పిలిచారు. కర్ణాటకమని పేరు వచ్చింది. ఔరంగజేబు బీజాపూరు, గోల్కొండలను క్రీ.శ.1986-87లో జయించిన తర్వాత ఈ రెండు కర్ణాటక ప్రాంతాలను జుల్ఫిర్‌ఖాన్ అనే తన సేనానిని పాలకునిగా నియమించాడు. కాని తూర్పున కోరమండల్ తీరంలో వెల్లూరుకు దక్షిణంగా పూర్వపు విజయనగర సామంతులైన తంజావూరు, జింజి, మధుర మైసూరు నాయక రాజ్యాలున్నాయి. అవి తిరిగి హిందూ అధికారాన్ని ఉత్తరంగా విస్తరించకుండా నిరోధించడానికి హైదరాబాదు కర్ణాటకంలోని గుంటూరు నుండి కొలెరూన్ ప్రాంతం వరకు (పూర్వ చంద్రగిరి రాజ్యం) ఒక భాగంగా చేసి ఔరంగజేబు ఒక ప్రతినిధిని నిలిపాడు. అతడు ఆర్కాటును తన రాజధానిగా చేసుకొన్నాడు. అతడు హైదరాబాదులో ఉండే మొగల్ సుబేదార్‌కు లోబడి ఉంటాడు. ఆర్కాటులోని మొగల్ ప్రతినిధికే ఆర్కాటు నవాబు లేక కర్ణాటక నవాబు అని పేరు వచ్చింది. అతని ఆధీనంలోని రాజ్యానికే ఆర్కాటు లేక కర్ణాటక రాజ్యం అని పేరు. ఈ రాజ్యం ఉత్తరాన

కృష్ణాతీరంలో ఉన్న పలనాటి వరకు విస్తరించి ఉండేది. ఆనాడు పలనాటిని కూడా ఆర్కాటు రాజ్యంలో భాగంగా చేశారు. అనాది నుండి పలనాటిని సర్కారు ప్రాంతంలో భాగంగా భావించేవారు కాదు. ఆ ప్రాంతం కర్నూలు జిల్లాను ఆనుకొని ఉండేది. అక్కడ సంస్కృతి, తెలుగుభాష రాయలసీమ సంస్కృతికి, భాషా ఉచ్ఛారణకి అతి దగ్గరగా ఉండేది. కనుకనే ఆ ప్రాంతం మొదటి నుండి కూడా కోస్తా కంటే తెలంగాణను పాలించిన రాజవంశాలకే అతి సన్నిహితంగా ఉండేది. పలనాటి వీరులైన బ్రహ్మనాయుడు తన రాజ్యానికి కళ్యాణీ చాళుక్య రాజ్యంతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఆనాటి నుండి పలనాడు పశ్చిమాంధ్ర ప్రాంతాలకే అతి సమీపంగా ఉండేది. కనుక ఆర్కాటు రాజ్యం ఏర్పాటు చేసినప్పుడు పలనాటిని మొగలులు ఆర్కాటు రాజ్యంలో కలిపారు.

ఔరంగజేబు మరణానంతరం అతని కుమారుడు బహదూర్‌షా 1708లో మొగల్ చక్రవర్తి అయ్యాడు. అతడు తన ప్రధాని జుల్ఫిర్‌ఖాన్‌ను దక్కను వైస్రాయిగా నియమించాడు. జుల్ఫిర్‌ఖాన్ దక్కనులో ఉండటానికి ఇష్టం లేక తాను ఢిల్లీలో ఉంటూ దావూద్‌ఖాన్ పన్ని లేక దౌడ్‌ఖాన్ పన్ని అనే తన 1709-10 సంవత్సరాలలో సదాదత్‌ఖాన్ అనే సరదారుని ఆర్కాటు నవాబుగా నియమించాడు. సదాదత్‌ఖాన్‌తో ఆర్కాటు నవాబీ ప్రారంభమైంది. సదాదత్‌ఖాన్ క్రీ.శ.1732 వరకు ఆర్కాటు నవాబుగా కొనసాగాడు. సదాదత్ కాలంలోనే క్రీ.శ.1724లో నిజాం స్వతంత్రం ప్రకటించాడు. అందుల్ల ఆర్కాటు రాజ్యం నిజాం ఉల్‌ముల్క్ సామంత రాజ్యమైంది. సదాదత్‌ఖాన్ తర్వాత క్రీ.శ.1732లో అతని సోదరుని కుమారుడు దోస్తు అలీ ఆర్కాటు నవాబయ్యాడు. అతని కాలంలో అతని అల్లుడు చందాసాహెబు మధుర రాణియగు మీనాక్షిని మోసగించి తిరుచునాపల్లి, మధురలను ఆక్రమించాడు. దాంతో కర్నాటక రాజ్యం కన్యాకుమారి అగ్రం వరకు విస్తరించింది. తర్వాత చందాసాహెబు తంజావూరును ముట్టడించగా తంజావూరు పాలకుడు ఏకోజీ వంశస్థుడు ప్రతాపసింగు తన బంధువైన షాహు సహాయం కోరగా అతడు రఘూజీ భోన్స్లేను పెద్ద సేనతో పంపాడు. క్రీ.శ.1738లో రఘూజీభోన్స్లే మరారా సేనతో ఆర్కాటు రాజ్యంపై దండెత్తాడు. దోస్తు అలీ మహారాష్ట్రులను ఎదుర్కోడానికి సన్నాహాలు చేశాడు. తన సైన్యంతో చంద్రగిరి తాలూకాలోని దామెల్ చెరువు వరకు ముందుకు వచ్చాడు. అక్కడ అతడు మరారా సైన్యంతో యుద్ధానికి దిగాడు. కాని ఆ యుద్ధంలో అతడు అతని కుమారుడు హుస్సేన్ అలీ మరణించారు. అతని మేనల్లుడైన చందాసాహెబు మరాఠీలుకు బందీగా చిక్కాడు. దోస్తు అలీ మరణించిన తర్వాత మైనరులైన అతని కుమారులు సప్దర్ అలీ, మోర్టిజ్ అలీ, ముహమ్మద్ అలీలు దిక్కులేని వారయ్యారు. అలాంటి అల్లకల్లోల పరిస్థితులలో మహారాష్ట్రులు వెనుదిరగగానే నిజాం ఉల్ ముల్క్ కర్నాటకం వచ్చి శాంతిభద్రతలు పునరుద్ధరించి దోస్తు అలీ కుమారులను ఆర్కాటు రాజ్యానికి వారసులుగా అంగీకరించి వారికి సంరక్షకునిగా అన్వరుద్దీన్ అనే సరదారుని నియమించాడు. ఈ స్థావరం రాజమహేంద్రవరం. ఇతని కాలంలోనే పెద్దాపురం రాణి రాఘవమ్మతో క్రీ.శ.1734లో యుద్ధం జరిగింది. నిజాం ఉల్ ముల్క్ అన్వరుద్దీన్‌ను ఉత్తర సర్కారుల నుండి బదిలీ చేసి ఆర్కాటులో దోస్తు అలీ కుమారులకు సంరక్షకునిగా నియమించాడు. కాని అన్వరుద్దీన్ బాల నవాబులను చంపించాడు. అందుకు నిజాం ఉల్‌ముల్క్ కోపగించినప్పటికీ తప్పనిసరి పరిస్థితులలో అన్వరుద్దీన్‌ను ఆర్కాటు నవాబుగా గుర్తించాడు. ఇతని కాలంలోనే ఫ్రెంచి వారితో మొదటి కర్నాటక యుద్ధం జరిగింది. క్రీ.శ.1739లో శాంతోమ్ వద్ద డూప్లే అన్వరుద్దీన్ సైన్యాలను ఓడించాడు. ఈ సందర్భంలో మహారాష్ట్రులు చందాసాహెబ్‌ను వదిలివేశారు. అతడు కర్నాటకం చేరి సింహాసనం కోసం అన్వరుద్దీన్‌తో వివాదానికి దిగాడు. అంతేగాక అతడు నాటి ఫ్రెంచి గవర్నర్ డూప్లే సహాయం సంపాదించి అన్వరుద్దీనును అంబూరు యుద్ధంలో వధించి కర్నాటక నవాబయ్యాడు. కాని అన్వరుద్దీన్ కుమారుడు మహమ్మదాలీ తిరుచునాపల్లి పారిపోయాడు. అతనిని మద్రాసులోని ఇంగ్లిషు వారు సమర్ధింపగా ఆంగ్లేయులకు, ఫ్రెంచి సామర్థ్యాల వల్ల ఆంగ్లేయులు జయించి, కర్నాటకంలో తమ అధికారాన్ని స్థాపించారు. దాంతో భారతదేశంలో ఇంగ్లిష్ వారి అధికారానికి కర్నాటక రాజ్యం తొలి స్థావరమైంది. ఇదే సందర్భంలో హైదరాబాద్‌లో నిజాం ఉల్ ముల్క్ మరణానంతరం జరిగిన అంతర్యుద్ధం ముగిసి చివరకు సలాబత్‌జంగ్ నిజాం అయ్యాడు. అతడు మహమ్మద్ అలీని ఆర్కాటు నవాబుగా గుర్తించాడు.

మహమ్మద్ అలీ - అప్పుల నవాబు: మహమ్మద్ అలీని ఇంగ్లిషు వారు నవాబును చేసినందువల్ల వారంటే అతనికి తగని అభిమానం ఏర్పడింది. ఇంగ్లిష్ వారు ఎవరైనా తన రాజ్యానికి వస్తే వారికి అనేక నజరానాలు ఇచ్చేవాడు. అంతేగాక మద్రాసు ప్రెసిడెన్సీల బదిలీలు జరిగినప్పుడల్లా కొత్తగా వచ్చిన ఉద్యోగులు ఎవరైనా సరే ఆర్కాటు వచ్చి నవాబును దర్శించే సాంప్రదాయం ఏర్పడిందట. గవర్నర్ దగ్గర నుండి చిన్న బంట్రోతు వరకు వచ్చి

నవాబును దర్శించేవారు. మహమ్మదాలీ వారి వారి హోదాలను బట్టి బహుమానాలిచ్చేవాడట. గవర్నర్‌కు 30 వేలు, సేనాధిపతులకు 10 వేలు, ఇక మిగిలిన వారి హోదా ప్రకారం బహుమతి మొత్తం నిర్ణయమైంది. అందువల్ల ప్రతి సంవత్సరం తప్పనిసరిగా వారు వచ్చి తమ హోదాలను బట్టి బహుమానాలు అందుకొని పోయేవారు. తత్ఫలితంగా నవాబు అప్పుల పాలయ్యాడు. ఇంగ్లిష్ వారు కూడా అప్పులు పెట్టారట. అందువల్ల మహమ్మదాలీకి అప్పుల నవాబు అని పేరు వచ్చింది. ఆర్కాటు రాజ్యం అప్పులలో కూరుకుపోయి రాజ్యపాలన అస్తవ్యస్తమైంది. కనుక బ్రిటిష్ పార్లమెంటులో అప్పుడప్పుడు నవాబు అప్పులు ప్రస్తావనకు వచ్చేవట. ఆర్కాటు రాజ్యాన్ని సామ్రాజ్యంలో కలిపి నవాబుకు పెన్షన్ ఇవ్వండని ఒక ప్రతిపాదన కూడా చేయబడిందట. కాని నవాబుకు అప్పులు పెట్టిన ఇంగ్లిష్ వారు ఆ ప్రతిపాదనను సాగనివ్వకుండా చేసి అతని రాజ్యం పోకుండా చేశారట. అందువల్ల మహమ్మదాలీ జీవించినంత వరకు ఆర్కాటు రాజ్యాన్ని ఇంగ్లిష్ వారు కలుపుకోలేకపోయారు.

తిరుపతి ఉదంతం: మహమ్మదాలీ కాలంలో జరిగిన మరొక సంఘటన తిరుపతి ఆదాయం కోసం సంఘర్షణలు. తిరుపతి దేవస్థానం వల్ల మహమ్మదాలీకి సాలుకు రెండు లక్షల రూపాయలు ఆదాయం వచ్చేదట. దానిని కూడా అతడు ఇంగ్లిష్ వారికి ఇచ్చాడు. ఇంగ్లిష్ వారు తిరుపతిపై వచ్చే ఆదాయాన్ని ప్రతి సంవత్సరం అనుభవిస్తూ ఉన్నారు. క్రీ.శ.1753లో మహమ్మదాలీ అధికారి మహమ్మద్ కమూల్ అనే అతడు తిరుపతిపై దండెత్తాడు. అతనిని ఎదుర్కోవడానికి మద్రాసులోని కంపెనీ గవర్నమెంటు ఒక చిన్న సైన్యాన్ని పంపింది. కాని ఆ చిన్న సైన్యాన్ని కమూల్ ఓడించాడు. మళ్లీ కొత్త సైన్యంతో వచ్చి ఇంగ్లిష్ వారు చివరకు కమూల్‌ని ఓడించి యుద్ధంలో సంహరించి తిరుపతిని దక్కించుకున్నారు.

1754లో కర్ణాటక రాజ్యంలోని పాలెగాళ్లు మహమ్మదాలీకి ఎదురుతిరిగి కప్పాలు చెల్లించలేదు. వాటిలో కాళహస్తి, కార్వేటినగర పాలెగాళ్లు అతిముఖ్యులు. వారందరినీ అణచి కప్పాలు వసూలు చేయడానికి మహమ్మదాలీ ఇంగ్లిష్ వారి సహాయం అర్థించాడు. అది తెలిసి పాలెగాళ్లు భయపడి లొంగిపోయి కప్పాలు చెల్లించారు. 1756లో మహమ్మదాలీ సోదరుడు నజీబుల్లా అన్నపై తిరుగుబాటు చేసి కాళహస్తి, కార్వేటి నగరాలను దోపిడీ చేశాడు. క్రీ.శ. 1757 ఆగష్టు మాసంలో నజీబుల్లా నారాయణవనం దగ్గర ఉన్న సాళవ అనే దుర్గాన్ని పట్టుకున్నాడు. ఈ దుర్గానికి మర్కరాజుదుర్గం, ఆకాశదుర్గం అని కూడా పేర్లు ఉన్నాయి. తిరుపతి వేంకటేశ్వరస్వామి మామ ఆకాశరాజు దుర్గం ఇదేనని ప్రతీతి. నజీబుల్లా తిరుపతిలో జరుగుబోయే బ్రహ్మోత్సవాల సందర్భంలో దోచుకోవాలనే ప్రయత్నంలో ఉన్నాడు. అదీ గ్రహించి ఇంగ్లిష్ వారు కొంత సైన్యాన్ని తెచ్చి తిరుమలకొండ పాదాల వద్ద కాపలా ఉంచారు. దాంతో నజీబుల్లా ఇంగ్లిష్ వారిని ఏమీ చేయలేక భక్తులు తిరుపతి వచ్చే మార్గాలలో మాటు వేసి భక్తులను భయపెట్టి ఆ సంవత్సరం ఎక్కువ మందిని రాకుండా చేశాడు. దాంతో ఇంగ్లిష్ వారికి వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఇవన్నీ తన రాజ్యంలో జరుగుతున్నా మహమ్మదాలీ ప్రేక్షకుడిలా చూశాడు తప్ప ఏమీ చేయలేకపోయాడు.

మరాఠా సేనాని బల్వంతరావు దండయాత్ర: ఇదే సంవత్సరంలో 1757లో మరాఠా సేనాని బల్వంతరావు కడప రాజ్యంపై దండెత్తి కడప నవాబు మజీద్‌ఖాన్‌ను చంపి గుర్రంకొండ, పుంగనూరులను ఆక్రమించాడు. తర్వాత పలమనేరు తాలూకాలోని తాళ్లపుల్లగాట్ వద్ద ఉన్న కడపనట్టమ్ కూడా పట్టుకున్నాడు. బల్వంతరావు దండయాత్ర ఆర్కాటు రాజ్యానికి కూడా నష్టాన్ని తెచ్చి పెట్టింది. 1758లో మహమ్మదాలీ మరొక సోదరుడు అబ్దుల్‌వహాబ్ సోదరునితో పోట్లాడి తన తల్లి, కుమారునితో చిత్తూరుకు పారిపోయాడు. అక్కడ కొంత సైన్యాన్ని పోగు చేసి చిత్తూరు జిల్లాలోని పాలెగాళ్ల నుండి పేష్కష్ వసూలు చేసి తాను ఖర్చు పెట్టుకున్నాడు. తర్వాత తిరుపతి దేవాలయాన్ని దోచుకుందామని తలంచాడు. కాని ఇంగ్లిష్ వారి సైన్యం వస్తోందని వదంతులు బయలుదేరాయి కనుక భయపడి తిరుపతి నుండి పోయి చంద్రగిరి దుర్గాన్ని స్వాధీనం చేసుకొని అక్కడ మకాం పెట్టాడు. అదే సమయంలో ఫ్రెంచి సేనాని బుస్సీ హైదరాబాద్ నుండి పాండిచ్చేరి వెళ్తూ తిరుపతిలో మజిలీ చేశాడు. అతను తిరుపతిని కౌలుకు పాడిన వాడిని పట్టుకొని తిరుపతి ఆదాయాన్ని తనకు చెల్లించమని బుస్సీని నిర్బంధించాడు. అది తెలిసి చంద్రగిరిలోని వహబ్‌ఖాన్ బుస్సీతో చేరిపోయాడు. తిరుపతిని తనకు ఇప్పిస్తాడని ఆశించాడు. కాని బుస్సీ ఆ పని చేయలేదు. కనుక అతడు నిరాశతో చంద్రగిరి చేరాడు. 1758 డిసెంబర్‌లో పెద్ద సైన్యంతో మరాఠా వారు తిరుపతి వచ్చారు. ఆ సైన్యం గోపాలరావు అనే సేనాని నాయకత్వంలో 1759 మార్చిలో తిరుపతి చేరింది. ఏప్రిల్‌లో జరిగే ఉత్సవాలలో వచ్చే ఆదాయాన్ని తీసుకోవడానికి వచ్చారు. కాని ఏ కారణం వల్లనో ఆ సైన్యంలో

పెద్ద భాగం వెళ్లిపోయింది. ఒక చిన్న మరాఠా సైన్యాన్ని పారదోలి తాను తిరుపతిని కాపాడానని తనకు తిరుపతిపై అధికారం ఇవ్వాలని మద్రాసుకు కబురు పంపాడు. కాని ఇంగ్లిష్ వారు అతని కోర్కెను తిరస్కరించారు. అంతకు పూర్వం తిరుపతిని కౌలుకు పాడిన వ్యక్తికే ఖాయం చేశారు. 1759 జూలైలో మరాఠా సేనాని నారాయణశాస్త్రి కర్కంబాడి పాలెగాని సహాయంతో తిరుపతిని ఆక్రమించాలని ప్రయత్నించాడు. కాని ఇంగ్లిష్ వారు కర్కంబాడి రాజ్యం పైబడి దాని పాలెగాన్నిని యుద్ధంలో చంపారు. దాంతో నారాయణశాస్త్రి తిరుపతి ఆక్రమణ ఉద్దేశ్యాన్ని వదులుకొని వెళ్లిపోయాడు. 1763లో నిజాం హైదరాబాద్ నిజాం అలీ కూడా తిరుపతిని తన అధీనంలోకి తెచ్చుకోవాలని మద్రాసు గవర్నమెంట్ వారితో యుద్ధానికి దిగాడు. కాని ఇంగ్లిష్ వారిని జయించలేక వెనుదిరిగి కాళహస్తి, నెల్లూరుల గుండా హైదరాబాద్ చేరాడు. తిరుపతిపై ఇంగ్లిష్ వారి అధికారం స్థిరపడింది. మహమ్మదాలీ బలహీనతను చూసి కర్ణాటక రాజ్యంలో ఏ పాలెగాడూ నవాబుకు పేష్కష్ చెల్లించలేదు. ఒక మధుర ప్రాంతంలోనే 69 పాలెగాండ్రు ఉండేవారు. వారు ఒక్కొక్కరి వద్ద 10 వేల సైన్యం ఉండేది. వారిదే 7 లక్షల సైన్యం. మిగిలిన ప్రాంతాలలో కలుపుకుంటే ఆర్కాటు నవాబు 10 లక్షల సైన్యాన్ని పోగుచేయగలిగిన శక్తి ఉంది. కాని అతడు ఇంగ్లిష్ వారికి లోబడి తన స్థానాన్ని చాలా హీనస్థితికి తెచ్చుకున్నాడు. కనుక పాళగాళ్లు కప్పాలు కట్టడం మానివేశారు. వారి వద్ద నుండి పేష్కస్ వసూలు చేయడం మహమ్మదాలీ వల్ల కాలేదు. కనుక అతడు 1792 జూలై 12వ తేదీన తన రాజ్యాన్ని 5 సంవత్సరాల పాటు ఇంగ్లిషు వారికి కౌలుకు ఇచ్చాడు. ఈ ఐదు సంవత్సరాలలో ఇంగ్లిష్ వారు పాలెగాళ్లందరి నుండి పేష్కస్ వసూలు చేసి వారి ఖర్చులు తీసుకొని మిగిలిన మొత్తాన్ని నవాబుకు ఇచ్చేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం ఆర్కాటు రాజ్యం 5 సంవత్సరాలు అంటే 1797 వరకు ఇంగ్లిష్ వారి ప్రత్యక్ష పాలనలోకి వచ్చింది. ఈ కాలంలో వారు పాలెగాళ్లను క్రూరంగా అణచి పేష్కస్ వసూలు చేశారు. ఈ సందర్భంలోనే పాంజాలకుజం పాలెగాడైన వీరపాండ్య కట్టబొమ్మన్ ఇంగ్లిష్ వారికి ఎదురుతిరిగి చివరకు పట్టుబడి 1797లో ఉరి తీయబడ్డాడు. ఈ సమయంలో కాళహస్తి, కార్వేటి నగర సంస్థానాలు బ్రిటిష్ వారి కిందికి వచ్చాయి. 1797లో ఇంగ్లిష్ వారు ఆర్కాటు రాజ్యాన్ని నవాబుకు తిరిగి ఇచ్చివేశారు. అయినప్పటికీ నవాబు అప్పులు తీరలేదు. ఆ అప్పులతో మహమ్మదాలీ మరణించాడు. నాల్గవ మైసూరు యుద్ధం తర్వాత పుంగనూరు, వెంకటగిరి సంస్థానాలు కూడా ఇంగ్లిష్ వారి పరమయ్యాయి. మహమ్మదాలీ మరణానంతరం అతని కుమారుడు ఉమ్దత్ ఉల్ ఉమ్రా ఆర్కాటు నవాబు అయ్యాడు. అతని తర్వాత అతని తమ్ముడు అజమ్ ఉల్ ఉమ్రా రాజ్యానికి వచ్చాడు. అతన్ని తొలగించి క్రీ.శ.1801లో వెల్లస్లీ ఆర్కాటు రాజ్యాన్ని బ్రిటిష్ సామ్రాజ్యంలో కలిపి నవాబుకు పెన్షన్ ఇచ్చాడు. దాంతో ఆర్కాటు రాజ్యం అంతమైపోయింది.

మరికొన్ని సామంత రాజవంశాలు

నలవంశం: బళ్లారి, కర్నూలు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలను క్రీ.శ.7, 8 శతాబ్దాలలో ఒక నల వంశం పాలించింది. వారు పాలించిన ప్రాంతానికి నలవాడి అని పేరు వచ్చింది. వారిని గురించి ఎక్కువ విషయాలు తెలియటం లేదు. వీరు బాదామి చాళుక్యుల సామంతులు కావచ్చును.

బిదినేనిపల్లె తెలుగు చోళవంశం: ప్రకాశం జిల్లాలోని గిద్దలూరు ప్రాంతంలోని బిదినేనిపల్లె అనే గ్రామాన్ని రాజధానిగా చేసుకొని ఆ పరిసర ప్రాంతాలను ఒక తెలుగు చోళ వంశం పాలించింది. ఈ వంశస్థులకు చెందిన 3 శాసనాలు లభించాయి. ఈ శాసనాల ద్వారా బిక్రమహాదిత్య రాజ లేక విక్రమాదిత్య, బికిరాజా, కొకిరాజ అనే 3 తరాల రాజుల పేర్లు తెలుస్తున్నాయి. ఆ శాసనాలలో మరే వివరాలు లేవు. ఈ శాసనాల ప్రకారం వారు క్రీ.శ.7, 8 శతాబ్దాలకు చెందినవారు. వారు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఆ ప్రాంతాలను పాలించి ఉండవచ్చును.

నిడుగల్ చోళులు: 11వ శతాబ్దంలో కరికాళచోళుని వంశస్థులమని చెప్పుకొన్న ఒక తెలుగు చోళ శాఖ నిడుగల్‌లో చిన్న రాజ్యాన్ని స్థాపించారు. వారు తాము కరికాళచోళుని సంతతివారమని, ఉరయూరు పురాధీశ్వరులమని చెప్పుకున్నారు. వారు నిడుగల్, హేమవతి పరిసర ప్రాంతాలపై తమ అధికారాన్ని చెలాయించారు. వారి శాసనాలు అనంతపూర్ జిల్లాలోనే గాక, కర్ణాటక రాష్ట్రంలోని తుంకూరు జిల్లాలో కూడా లభించాయి. ఈ శాసనాలలో 11 తరాలకు చెందిన ఈ వంశస్థుల పేర్లు ఇవ్వబడ్డాయి. ఈ శాసనాలలో నిడుగల్, హేమవతి, గోవిందవాడి అనే ప్రదేశాల పేర్లు ప్రస్తావింపబడ్డాయి. ఈ వంశస్థులలో మంగరస, మొదటి ఇరుంగోల

మల్లదేవ, రెండవ ఇరంగోల ప్రముఖులు. హవలిగి, ఉండబండ శాసనాలు మంగరసను గురించి తెలుపుతున్నాయి. ఈ రెండు శాసనాలు గుత్తి తాలూకాలో లభించాయి. ఇవి చాళుక్య శకం 4వ సంవత్సరం, 7 సంవత్సరాల నాటికి చెందినవి. క్రీ.శ.1131 నాటి హవలిగి, 1138 నాటి ఎరదుకెర, 1140 నాటి గుత్తి తాలూకాలోని కళ్యాణీదుర్గం, కొనకొండ్లలో లభించిన శాసనాలు మొదటి ఇరుంగోలను గురించి తెలుపుతున్నాయి. అలాగే మల్లిదేవుని ప్రస్తావన శక 1084 సరియగు క్రీ.శ.1162 ఎరదుకేర, హేమవతి శాసనాలలో ఉంది. ఇంకా 1169 నాటి మధుధి, 1170 నాటి మలయనూరు శాసనాలలో కూడా ఇతని పేరు ఉంది. శక 1148 అంటే క్రీ.శ.1226 నాటి మడకసిర తాలూకాలోని అమరవరం, శక 1171 అంటే క్రీ.శ.1249 నాటి కళ్యాణీదుర్గం తాలూకాలోని కలబదూరు శాసనాలు రెండవ ఇరుంగోలను ప్రస్తావిస్తున్నాయి. ఇంతకు మించి ఈ వంశస్థుల గురించి మనకు వివరాలు తెలియవు. వారు కళ్యాణీ చాళుక్యులకు సామంతులుగా పాలించి ఉండవచ్చును.

వైదుంబ వంశ వృక్షం

అత్తిరాజు

ఆవహమల్ల

గంగ

సోమిదేవ

ఉదయాదిత్య

నెల్లూరు తెలుగు చోళవంశాలు-తొండియరాజు: 10వ శతాబ్దం నుండి అనేక తెలుగు చోళవంశాలు నెల్లూరు జిల్లాలోని అనేక ప్రాంతాలను పరిపాలించాయి. వారిలో కలుజువ్వలపాడును పాలించిన తొండియరాజు గుండికీర్తి తెలుగు వంశాలు ముఖ్యమైనవి. తొండియరాజు కరికాళచోళుని వంశస్థుడు. సూర్యవంశ క్షత్రియుడు కాశ్యపగోత్రీకుడు. నెల్లూరు జిల్లాలోని కొంత ప్రాంతాన్ని పాలించిన ఇతడు తెలుగు చోళులలో మొట్టమొదటి వాడుగా కనిపిస్తున్నాడు. ఇతనికి ముందు తెలుగుచోళ సామంత వంశాల ప్రసక్తి మనకు లభించడం లేదు. ఇతడు ఏరువచోళ శాఖకు చెందిన వాడని, 10వ శతాబ్దానికి చెందిన వాడని భావింపబడింది.

గుండికర్రు లేక గుండికీర్తి తెలుగుచోళ వంశం: నెల్లూరు జిల్లాలో కొద్ది భాగాన్ని పాలించిన మరొక స్థానిక తెలుగుచోళ వంశం గుండికీర్తి చోళ వంశం. ఈ వంశానికి చెందిన మూడు శాసనాలు దర్శి తాలూకాలో లభించాయి. ఆ శాసనాలు ఈ వంశానికి చెందిన నాలుగు తరాల రాజుల పేర్లను ఇస్తున్నాయి. పొత్తపి నన్నెచోడ, వెంక, కామ, బల్లిచోడ లేక చోడబల్లి అనే నలుగురు పేర్లు తెలుస్తున్నాయి. ఈ శాసనాలు క్రీ.శ.1145-1166 సంవత్సరాల మధ్య కాలానికి చెందినవి. ఈ శాసనాలు మన్నెపల్లి అనే గ్రామంలో లభిస్తున్నాయి. ఈ శాసనాలలో ఒకదానిలో మన్నెపల్లి గ్రామంతోసహా గుండికర్రు తాలూకా గ్రామాలను బల్లిదేవచోడునికి జీవనభృతిగా ఇవ్వబడ్డాయని తెలుపుతోంది. దీనిని బట్టి బల్లిదేవచోడుడు ఎవరికో సామంతునిగా ఈ గ్రామాన్ని పాలించాడని తెలుస్తోంది. ఆ కాలంలో కొండిదెస లేక కొండిదెన రాజ్యాన్ని త్రిభువన మల్లదేవ చోడ మహారాజు పాలిస్తున్నాడు. ఈ మల్లిదేవుడు అతనికి సామంతుడు కావచ్చును. ఇతని తర్వాత ఈ వంశస్థుల చరిత్ర తెలియదు.

మరికొన్ని సామంత రాజ్యాలు

పాలవంచ సంస్థానం: ఖమ్మం జిల్లాలో అతిముఖ్యమైన సంస్థానం పాలవంచ. దానికి హసవాబాద్ శంకరగిరి జమీందారీ అని పేరు. పూర్వం భద్రాచలం కూడా ఈ జమీందారీలోనే ఉండేది. ముసునూరి ప్రోలయ నాయకుని రాజధాని రేకపల్లి, భద్రాచలం కలసి భద్రాచలం సంస్థానంగా ఉండేది. భద్రాచలం జమీందార్ పాలవంచ జమీందారుగా ఉండేవాడు. మొదట ఈ జమీందారీలకు పాలవంచ రాజధానిగా ఉండేది. కాని తర్వాత భద్రాచలానికి రాజధాని మార్చారు. భద్రాచలాన్ని ఇంగ్లిష్ వారు స్వాధీనం చేసుకున్నందువల్ల 1860లో రాజధాని అశ్వారావుపేటకు మార్చబడింది. ఈ సంస్థానాధీశులు కాకతీయుల కాలం నాటి వారు. వారి వంశకర్త కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రదేవునికి సమకాలికుడు. అతడు గొప్ప అశ్వికుడు. కనుక ప్రతాపరుద్రుడు అతనికి అశ్వారావు అనే బిరుదునిచ్చి పాలవంచ నాయంకరానికి అమర నాయకునిగా నియమించాడు. కాకతీయ సామ్రాజ్య

పతనానంతరం ఢిల్లీ సుల్తాన్ అనప్పు అశ్వారావును పాలవంచ పాలకునిగా స్థిరపరచాడు. అతని వంశస్థులు క్రీ.శ.1769 వరకు పాలించారు. 1769లో నిజాం సేనాధిపతి జఫర్ ఉద్దౌలా పాలవంచ పాలకుని వధించి పాలవంచ రాజ్యాన్ని తన ఆధీనంలో ఉంచుకున్నాడు. 1798లో జఫర్ ఉద్దౌలా మరణించాడు. తర్వాత నిజాం ఆలీ 1798లో పాలవంచ పరగణాను అశ్వారావు కుటుంబానికి చెందిన వెంకట్రామ్ అశ్వారావుకు తిరిగి ఇచ్చాడు.

ఈ కాలానికి భద్రాచలం ప్రాంతం తిరుగుబాటుదారులకు కేంద్రంగా మారింది. పశ్చిమగోదావరి జిల్లాలోని ఉండి తణుకు, నర్సాపూరు ప్రాంతాల జమీందారైన భూపయ్య మొగలితుర్రు జమీందారైన వెంకట్రామరాజులు బ్రిటిష్ వారికి చెల్లించవలసి పేష్కస్ బకాయిపడ్డారు. అందువల్ల బ్రిటీష్ ప్రభుత్వం వారిని అరెస్టు చేసి కంచికి పంపారు. కాని మార్గమధ్యలో మద్రాసులో వారు తప్పించుకొని భద్రాచలం పారిపోయారు. ఇదే సమయంలో మొగలితుర్రులోని వారి కుటుంబాలు కూడా భద్రాచలం చేరాయి. భద్రాచలం బ్రిటిష్ వారి రాజ్యంలో లేదు. నిజాం రాజ్యంలో ఉండేది. భద్రాచలం చేరిన తర్వాత భూపయ్య కొంత సైన్యాన్ని పోగుచేసి మొగలితుర్రుపై దాడి చేశాడు. తర్వాత జిల్లా కలెక్టర్ గాంబియార్ ఇంటిపై కూడా మెరుపుదాడి చేశాడు. తగినంత సైన్యం లేకపోవడంతో కలెక్టర్ ఏమీ చేయలేకపోయాడు. పైగా తమ విషయం మద్రాసు ప్రభుత్వానికి నివేదించమని భూపయ్య కలెక్టర్‌ను కోరగా అందుకు కలెక్టర్ అంగీకరించాడు. తర్వాత భూపయ్య తన సైనికులతో భద్రాచలం తిరిగి వెళ్ళిపోయాడు. హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్, ఇంగ్లిష్ వారిపై తిరుగుబాటు చేసిన వారికి నిజాం తన రాజ్యంలో స్థావరం ఇచ్చినందుకు, భద్రాచలం జమీందారు, ఖమ్మంలోని నిజాం అమీల్‌దార్లు వారికి సహాయం చేస్తున్నందుకు నిజాంకు తన నిరసనను తెలియజేశాడు. కాని నిజాం ఆలీ అతని నిరసనను పట్టించుకోలేదు. భూపయ్య, వెంకట్రామరాజులు 1897లో మరణించారు.

కాళింది చిన్నతిమ్మరాజు అనే అతడు కూడా పేష్కస్ చెల్లించలేక భూపయ్యతో చేరిపోయాడు. అతడు 1798లో గోదావరి జిల్లాలోని ఉండి మీద దండెత్తి ఉండి రానేదార్‌ను చంపి నిజాం రాజ్యంలోకి పారిపోయాడు. భద్రాచలం జమీందారు ధమర శాయన్న తిమ్మరాజు సుబ్బయ్యను, మరో ముగ్గురు ఇతర తిరుగుబాటుదారులను పట్టుకొని మచిలీపట్టణం పంపాడు. దాంతో భద్రాచలానికి బ్రిటిష్ వారికి మధ్య స్నేహం కుదిరింది. కాని భద్రాచలం జమీందారుకు సంతానం లేకపోయింది. కనుక 1809లో మొదటిసారిగా ఈ వంశస్థులు దత్తత తీసుకున్నారు. దాంతో ఈ వంశంలోని మూడు కుటుంబాలలో విభేదాలు వచ్చాయి. ఈ వంశంలో అప్పటికి దామెర్ల అశ్వారావు కుటుంబం, కుందెముల్ల లేక కందిమళ్ల, శెట్టి పెళ్లి అనే మూడు కుటుంబాలుండేవి. వీరి మధ్య వచ్చిన వివాదం 40 సంవత్సరాలు సాగింది. చివరకు 1852లో సంస్థానం మొత్తం దామెర్ల కుటుంబానికి చెందుతుందని జమీందార్ల పంచాయితీ నిర్ణయించింది. 1860లో భద్రాచలం, దాని పరిసర ప్రాంతాలు బ్రిటిషు వారు తీసుకున్నారు. మిగిలిన పాలవంచ సంస్థానాన్ని 1948 వరకు దామెర్ల వంశస్తులు పాలించారు.

నెల్లూరు జిల్లా పాలెగాండ్రు - వెంకటగిరి: వెంకటగిరి సంస్థానాధీశులు తమ వంశానికి మూలపురుషుడు క్రీ.శ.1350 నాటి చెవిరెడ్డి అని చెప్పుకుంటారు. ఈ జమీందారీ చరిత్రను బట్టి క్రీ.శ.1599వ సంవత్సరాలలో విజయనగర చక్రవర్తి రెండవ వెంకటపతిరాయలు ఈ వంశానికి చెందిన వ్యక్తిని యచస్విందిన్ అనే బిరుదుతో వెంకటగిరి పాలకునిగా నియమించాడు. తోపూరు యుద్ధంలో జగ్గరాజును ఓడించినందువల్ల యాచమనాయకునికి ఈ యచస్విందిన్ అనే బిరుదు వచ్చింది. అదే ఈ వంశస్థులకు వంశప్రశస్తిగా మారింది. యచస్విందిన్ వంశస్థులు క్రీ.శ.1696 వరకు ఆ రాజ్యాన్ని అవిచ్ఛిన్నంగా పాలించారు. 1696లో బంగారు యాచమనాయుడు చనిపోగా అతని ముగ్గురు కుమారులు రాజ్యాన్ని సమానంగా పంచుకున్నారు. దాని ప్రకారం పెద్ద కుమారునికి వెంకటగిరి. రెండవ వానికి సగుతరు లేక సగుతూరు, మూడవ వానికి పోలూరు వచ్చాయి. ఈ ఏర్పాటు కొద్దికాలమే జరిగింది. రెండవ వాడైన కొమరనాయునికి వచ్చిన సగుతూరును మళ్లీ పెద్ద అతను తీసుకొని పొదిలి, దర్శి ప్రాంతాలను ఇచ్చాడు. అతడు సంతానం లేకుండా మరణించినందువల్ల ఆ ప్రాంతాలు కూడా తిరిగి వెంకటగిరిలో చేరి పోయాయి. అలాగే పోలూరు వారసుడైన రామారావుకు, కూడా సంతానం లేకుండా మరణించగా అది కూడా మళ్లీ వెంకటగిరిలో కలిసిపోయింది. 1751లో మరొకసారి విభాగం అయింది. కాని పంచహజార్ మన్సబ్‌దారీ అనే బిరుదు కలిగిన బంగారు యాచమనాయుడు తిరిగి ఏకం చేశాడు. ఈ వంశంలోని 25వ తరం పాలెగాడు అయిన కొమర యాచమనాయుడు బ్రిటిష్ వారికి మిత్రుడు. అతడు ఇంగ్లిష్ వారికి హైదరాలీకి జరిగిన యుద్ధాలలో బ్రిటిష్ వారికి కిందకు వచ్చిన తర్వాత వెంటకగిరి పునర్నిర్మాణం చేయబడింది. వెంకటగిరి,

సైదాపురం, శ్రీకాళహస్తి, బొమ్మరాజ్ పాలెములను కలిపి ఒక జిల్లాగా ఏర్పాటు చేసి బ్రిటిష్ వారు స్ట్రాటన్ అనే జిల్లా కలెక్టర్‌ను నియమించారు. క్రీ.శ.1808లో వెంకటగిరి సంస్థానం నెల్లూరు జిల్లాలో చేర్చబడింది. అప్పటి నుండి వారికి ఇంగ్లిష్ వారితో మంచి స్నేహ సంబంధాలు ఏర్పడి చివరి వరకు కొనసాగాయి.

చుండీ జాగీరు: చుండీ జమీందారులకు కామినేని రామానాయుడు మూలపురుషుడు. అతడు ఉదయగిరిని పాలించడానికి కృష్ణదేవరాయలు నియమించాడు. గోల్కొండ సుబేదార్ ఈ వంశానికి చెందిన అయ్యప్ప నాయకుని చుండీ జమీందారు చేసిన తిరుగుబాటును అణచడానికి పంపాడు. అయ్యప్ప చుండీ జమీందారును ఓడించి చంపాడు. చనిపోయిన జమీందారుకు వారసులు లేనందువల్ల సుబేదార్ అయ్యప్పను చుండీకి అమీల్‌దార్‌గా నియమించాడు. తర్వాత అయ్యప్ప కుమారుడు తాతానాయుడు చుండీ జాగీరుదారుగా నియమింపబడ్డాడు. అతని వారసులైన శేఖర్ నాయుడు, పోలినాయుడు పామూరు తాలూకాలని అనేక గ్రామాలను తమ జాగీరుకు కలుపుకొన్నారు. ఈ వంశంలోని నాల్గవతరం వాడైన ముతరాజు జమీందారు స్థాయికి ఎదిగాడు. అతని తర్వాత అతని నలుగురు కుమారులు వరుసగా పాలించారు. వారి తర్వాత అంకప్ప నాయుడు, ముతరాజు కొమర ముతరాజు వరుసగా పాలించారు. వారిలో చివరివాడైన కొమర ముతరాజు మైనర్ అయినందువల్ల అతని పినతండ్రి నారదనాయుడు సంస్థానాన్ని హస్తగతం చేసుకున్నాడు. కాని చివరలో సంస్థానం కొమర ముతరాజుకు ఇవ్వబడింది. అతని కుమారుడు వీరవెంకటప్పనాయుడు పాలించాడు. అతని కుమారుడు పేష్కస్ సరిగా చెల్లించలేకపోయాడు. ఈ వంశంలో తర్వాత వారిలో ముఖ్యమైనవారు రాజా కామినేని బంగారు ముతరాజు, రాజా కామినేని అంకప్పనాయుడు గార్లు.

ముత్యాలపాడు జాగీరు: ఈ వంశానికి మూలపురుషుడు చిట్టనేని నరసరావు. అతడు అనలూరు, గూడూరు ప్రాంతాలను సంపాదించాడు. అతని కుమారుడు లక్ష్మీకాంతరాయన హైదరాబాద్ సుబేదార్‌ను సేవించి జాగీరును సంపాదించి లక్ష్మీచండియ భూపాలభలరావు అనే బిరుదును పొందాడు. అతని కుమారుడు నరసింగ భలరావు ఇతని కాలంలో అతని కుమారడు ధర్మభూపాలభలరావు తండ్రితో తగవులాడి మొగల్ సైన్యంలో చేరాడు. మొగల్ సుబేదార్ జుల్ఫిర్‌ఖాన్ అతనికి రావూరు జాగీరు ఇచ్చాడు. కాని తర్వాత దానిని తీసుకొని కల్లూరు, కనకగిరి జాగీరును ఇచ్చి, ఉదయగిరి రాజ్యంలో ప్రబలిన అరాచకత్వాన్ని అణచవలసిందిగా ఆదేశించాడు. ధర్మభూపాల భలరావు ఆ ఫని చేశాడు. అందుకు ప్రతిఫలంగా అతని కుమారుడు వెంకటకృష్ణభూపాలబాల, జూపల్లి అప్పారావు అనే మరొక వీరుడు, ఇద్దరూ ఉదయగిరి, కంభం ప్రాంతాలకు దేశ్‌ముఖ్‌లుగా నియమింపబడ్డారు. వెంకటభూపాలుని తర్వాత రామచంద్ర భూపాల, వెంకటరమణ భూపాల, నరసింగభూపాల అనే వారు దేశ్‌ముఖ్‌లుగా కొనసాగారు. వారి కాలంలో ముత్యాలపాడు జమీ కొంత ప్రాంతాన్ని పోగొట్టుకుంది. కాని వారు ముత్యాలపాడు రాజుగా గుర్తించబడ్డారు.

జూపల్లి జాగీరు: ఈ వంశానికి మూలపురుషుడు జూపల్లి వెంకటరాయనింగారు. క్రీ.శ.1544లో రామరాయల కాలంలో అతడు ఉదయగిరి ఖిలేదార్‌గా నియమింపబడ్డాడు. అతని తర్వాత జూపల్లి అప్పారాయనిం గారు, వెంకటరాయనింగారలు 50 సంవత్సరాలు పాలించారు. తర్వాత నాల్గవతరం వాడైన నరసరాయనింగారు 500 సైన్యానికి సుబేదార్ అయ్యారు. అతడు 26 సంవత్సరాలు పాలించాడు. అతని తర్వాత అతని కుమారుడు పెదలక్ష్మరాయనింగారు రాజ్యానికి వచ్చి రాజ్యాన్ని పెంచాడు. కాని అతనిని నెల్లూరు ఫౌజ్‌దారు చంపాడు. అతని తర్వాత అప్పారావు, లక్ష్మణరావు, అప్పారావులు వరుసగా పాలించారు. వీరిలో చివరి వాడైన అప్పారావు కాలంలో సయ్యద్ బహిరుద్దీన్ ఆలీఖాన్ అనే ముస్లిం సరదారుడు ఉదయగిరిని ఆక్రమించాడు. అందువల్ల జాగీరు పోయింది. కనుక అతడు మద్రాసు రాష్ట్రం చేరి ఆర్కాటు నవాబును దర్శించాడు. ఆర్కాటు నవాబు అతనికి రాజ్యం ఇవ్వలేదు గాని, నెలకు 100 పగోడాలు భృతిగా ఇవ్వమని ఆదేశించాడు. 1801లో కర్ణాటక రాజ్యాన్ని ఇంగ్లిష్ వారు తీసుకున్న తర్వాత కూడా అప్పారావు మరణించే వరకు నెలకు 100 పగోడాలు చెల్లించారు. అతడు మరణించిన తర్వాత ఇంగ్లిష్ వారు అతని దత్తుకుమారుడు లక్ష్మ్మణరావు, అతని భార్య వెంకమ్మకు సగం భృతి చెల్లించారు. కాని తర్వాత 100 పగోడాలకు పెంచి ఆ వంశస్తులకు చాలా కాలం కొనసాగించారు. ఇక ఉదయగిరి నవాబులు కర్ణాటక రాజ్యాన్ని ఇంగ్లిష్ వారు తీసుకున్నంత వరకు అంటే క్రీ.శ.1801 వరకు అప్పారావుకు నెలకు 1000 పగోడాలు చెల్లించారు. ఆ తర్వాత వారు చెల్లించలేదు.

సైదాపురం జాగీరు: సైదాపురం జమీందారీకి కూడా జూపల్లివారే అధిపతులు. ఈ జమీందారీలో 115

గ్రామాలుండేవి. జూపల్లివారు అనేక తరాలు ఈ జమీందారీని ఏలారు. క్రీ.శ.1764లో వీరు పేష్కస్‌ను చెల్లించలేకపోయినందువల్ల బ్రిటిష్ వారు ఈ సంస్థానాన్ని వేలం వేశారు. నర్సారావుపేట జమీందారైన మలరాజు గుందారావు దాన్ని కొన్ని 6 సంవత్సరాలు పాలించాడు. అతని మరణం తర్వాత అతని అల్లుడు జూపల్లి మల్ల నాయుడు 3 సంవత్సరాలు ఈ జమీని పాలించాడు. తర్వాత బ్రిటిష్ వారు తీసుకున్నారు. కాని కొంత కాలం తర్వాత గుందారావు భార్యకు ఆ జమీ స్వాధీనం చేయబడింది. తిరిగి క్రీ.శ.1841లో రెవెన్యూ బకాయి కింద బ్రిటిష్ వారు జమీని వశపరచుకున్నారు.

ఉదయగిరి నవాబీ: క్రీ.శ.1544 నుండి ఉదయగిరిని జూపల్లి వంశస్తులు పాలించేవారు. సయ్యద్ బహదారుద్దీన్ ఆలీఖాన్ అనే సరదారుడు దక్కను సుబేదార్ నుండి ఉదయగిరి జాగీరుపై అధికారాన్ని సంపాదించాడు. అతడు జూపల్లి కుటుంబంలోని చివరివాడైన అప్పారావును తొలగించి ఉదయగిరి జాగీరును స్వాధీనం చేసుకున్నాడు జూపల్లి వంశానికి చెందిన లక్ష్మీనారాయణ, సయ్యద్ బహదారుద్దీన్‌ను తొలగించాలని ప్రయత్నించాడు. కాని సాధ్యం కాలేదు. అందవల్ల ఉదయగిరి నవాబులు మూడు తరాలు అవిచ్ఛిన్నంగా క్రీ.శ.1840 వరకు పాలించారు. 1840లో జాగీరుదారుడు బ్రిటిష్ వారిపై కుట్ర చేశాడనే నెపంతో వారి వంశాన్ని తొలగించి బ్రిటిష్ వారు కలుపుకొన్నారు. జాగీరుదారుని ఖైదు చేసి అతని కుటుంబ సభ్యులకు పెన్షన్ ఇచ్చారు.

గుడ్లూరు జాగీరు: ఈ జాగీరుదారులు కూడా చాలా పూర్వకాలం నుండే పాలించేవారు. వారిలో చివరివాడైన చిన్న నారాయణరాజుకు సంతానం లేదు. అందువల్ల వెంకటకృష్ణంరాజు అనే అతనిని దత్తు తీసుకున్నాడు. అతని మరణం తర్వాత ఆర్కాట్ నవాబు ఈ జమీని కలుపుకున్నాడు. ఈ వంశస్థులకు భృతిని ఏర్పాటు చేశాడు. ప్రధాన వారసుని కుటుంబానికి నెలకు 100 పగోడాల భృతిని ఇచ్చాడు. బ్రిటిష్ వారు ఆర్కాటు రాజ్యాన్ని తీసుకున్న తర్వాత ఈ వంశస్తులకు భృతిని ఇవ్వలేదు. తర్వాత ఈ వంశస్థుల జాడ తెలియదు.

ఒంగోలు జాగీరు: ఈ వంశానికి మూలపురుషుడు అయ్యపరాజు. అతని తర్వాత మూర్తిరాజు, లింగరాజు అనే వారలు పాలనకు వచ్చి జాగీరు పెంచారు. వారి తర్వాత రామభద్రరాజు, రఘుపతిరాజులు వరుసగా పాలించారు. క్రీ.శ.1750లో ఆ వంశస్తులు అంత వరకు ఒంగోలు, గుంటూరు జిల్లాలలో సంపాదించిన అన్ని ప్రాంతాలపై వారి అధికారాన్ని నిజాం నవాబు గుర్తించాడు. తర్వాత ఆర్కాట్ కందుకూరు తాలూకాలోని కొన్ని గ్రామాలను వీరి జాగీరుకు కలిపాడు. ఈ జాగీరు తర్వాత రెండుగా విభాగింపబడింది. కొంత వెంకటగిరి వారికి, మరికొంత మందపాటి వారికి ఇవ్వబడింది. వెంకటగిరి, మందపాటివారి మధ్య ఉన్న విరోధం వల్ల రామచంద్రరాజు తన పదవిని కోల్పోయాడు. అతని మరణానంతరం అతని దత్తు కుమారుడు వెంకటరామరాజుకు జాగీరు ఇవ్వబడింది. కాని అతని మరణానంతరం జాగీరు స్వాధీనం చేసుకొని అతని వారసులకు భృతి ఏర్పాటు చేయబడింది. తర్వాత అది కూడా ఇవ్వలేదు.

తురవారు జాగీరు: ఈ వంశంలో మొదటివాడు చినగంగమనాయుడు. ఇతనిని గోల్కొండ నవాబులు రాపూరు పాలెగాడుగా నియమించి ఆ పరిసర ప్రాంతాలలో అల్లర్లు చేసే చెంచు వారిని అణచమని ఆదేశించారు. అతడు చెంచువాళ్లను అణచి శాంతిభద్రలను నెలకొల్పినందువల్ల రాపూరు జాగీరు అతనికి వారసత్వంగా ధృవీకరింపబడింది. 14 తరాల అతని వారసులు రాపూరు జాగీరును పాలించారు. క్రీ.శ.1866లో ఈ జాగీరు వారికి కావలి తాలూకాలో ఇవ్వబడిన కొన్ని ఇనాములు మొత్తం బ్రిటిష్ ప్రభుత్వం తీసుకొంది.

తాడిబోయిన జాగీరు: ఈ వంశంలో మొదటివాడు రామానాయుడు. అతడు రాపూరు ఖజానాను కాపాడటానికి రక్షకుడుగా నియమింపబడ్డాడు. అతని కుటుంబ నిర్వహణకు రాపూరు తాలూకాలోని పుల్లికోలపాడు అనే గ్రామం ఇవ్వబడింది. తర్వాత రాయనిపల్లె, బొజ్జనపల్లె అనే గ్రామాలను గోల్కొండ నవాబు ఇచ్చాడు. మహారాష్ట్రులు ఇతని పాలెం మీద దండెత్తారు. అప్పుడు పాలెగాడు వెలకొండలకు పారిపోయాడు. కాని మార్గమధ్యలో మరాఠా సైన్యం ఇతనిని ఓడించి అతనిని దోచుకోవడమేగాక, అతనికి గోల్కొండ నవాబు, అంతకు ముందు రాజులు, వారి వారసులకు హక్కుతో ఇచ్చిన పత్రాలను కూడా లాక్కొని తీసుకువెళ్లిపోయారు. అయినప్పటికీ ఈ పాలెం అతని వంశస్తులకు ఖాయం చేయబడింది. బ్రిటిష్ వారి కాలంలో కూడా కొనసాగింపబడింది.

చిట్టేడు జాగీరు: ముమ్మూర్తినాయుడు అనే వీరుడు గోల్కొండ నవాబు నుండి చిట్టేడు, మదాళి, కేశవరం జాగీరును పొందాడు. ఆ ప్రాంతాలలో ప్రయాణం చేసే బాటసారులకు రక్షణ ఇవ్వడానికి నియమింపబడ్డాడు.

నాయుడు, పాపన్న, కృష్ణప్ప, రాఘవప్ప, కృష్ణప్ప, లక్ష్మీరాఘవప్ప నాయుడు వారసు పాలెగాళ్లుగా కొనసాగారు వారి కింద మొత్తం 72 గ్రామాలుండేవి. ఆ గ్రామాల రక్షణ భారం అంతా వారిదే. అదేగాక సైదాపురం జాగీరులోని కొన్ని గ్రామాల రక్షణ కూడా వీరికి ఇవ్వబడింది.

ఉదాత్తర్ జాగీరు: సింగమనాయుడు అనే అతడు ఈ జాగీరును సంపాదించాడు. ఈ వంశానికి చెందిన లింగమ నాయుడు గొప్ప విలుకాడు. అతడు తన ప్రభువైన గోల్కొండ నవాబు నెత్తి మీద ఒక ఉడుత పండును పడవేయబోతుండగా చూసి వెంటనే తన బాణం సంధించి దానిని చంపి ఆ కాయను సుల్తాన్ నెత్తి మీద పడకుండా చేశాడు. అది చూసిన సుల్తాన్ అతని విలు విద్యకు ఆశ్చర్యచకితుడై ఉదాత్తవారు అనే బిరుదు ఇచ్చి పొలిగారుగా పదోన్నతిని ఇచ్చాడు. అతని వంశస్తులు ఆ బిరుదును కొనసాగించారు. బ్రిటిష్ వారు పోలీసు విధానాన్ని కొనసాగించే వరకు వారి పొలిగార్ ఉద్యోగం హోదా కొనసాగింది. వారి పరిధిలో నెల్లూరు, గూడూరు, ఆత్మకూరు, రాపూరు తాలూకాలలోని 147 గ్రామాలు ఉండేవి.

గంగులవారి చెరువపల్లి జాగీరు: గంగుల గురవయ్య ఈ వంశానికి మూలపురుషుడు. అతనిని నెల్లూరు జిల్లాలోని కొన్ని గ్రామాలకు గోల్కొండ నవాబు అమరనాయకునిగా నియమించాడు. అతని కుమారుడు హనుమంతయ్య అనేక యుద్ధాలలో పాల్గొని అబుల్ హసన్ తానీషా మెప్పు పొందాడు. అతని కుమారుడు వెంకటపతినాయుడు యుద్ధంలో మరణించాడు. అతని కుమారుడు కూడా మరొక యుద్ధంలో మరణించాడు. తర్వాత అతని వారసులు కొనసాగారు. వారు సాలుకు 662 నక్షత్ర పగోడాలు పేష్కస్‌గా చెల్లించేవారు.

బుచ్చిరెడ్డిపాలెం జాగీరు: ఈ వంశానికి మూలపురుషుడు దొడ్ల అన్నారెడ్డి. ఇతడు మొదట చాలా బీదవాడు బుచ్చిరెడ్డిపాలెం వాసి కాదు. అక్కడికి వలస వచ్చి ఈ జాగీరును సంపాదించాడు. అతని కుమారుడు రాఘవరెడ్డి, అతని తర్వాత జాగీరును పాలించాడు. అతని వారసులలో రామారెడ్డి పరిపాలనా దక్షుడు. అతడు పెన్నారు నుండి కాలువ దక్షిణ ప్రాంతాలకు కాలువను తవ్వించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశాడు. బుచ్చిరెడ్డిపాలెంలో ఒక దేవాలయాన్ని నిర్మించాడు. అతని సామర్థ్యానికి మెచ్చి పెన్నా డెల్టాకు అతను రెవెన్యూ ఉద్యోగిగా నియమింపబడ్డాడు. అతని తర్వాత అతని తమ్ముడు నరసింహులురెడ్డి, మేనల్లుడు వెంకటరామారెడ్డి జాగీరు అధిపతులయ్యారు. ఈ వంశం ఇంగ్లిష్ వారితో మంచి సంబంధాలు కొనసాగించింది. అందువల్ల వారు నెల్లూరు జిల్లాను సర్వే చేసినప్పుడు ఈ కుటుంబీకులను ఉద్యోగులుగా తీసుకున్నారు. తర్వాత చెప్పుకోదగినవాడు పట్టాభిరామిరెడ్డి. అతని తర్వాత ఈ జాగీరు రెండు శాఖలుగా చీలిపోయింది.

మూడవ భాగం
పరిపాలనా వ్యవస్థలు

పరిపాలనా వ్యవస్థలు

ముసునూరి కమ్మనాయక రాజ్య పరిపాలనా వ్యవస్థ

క్రీ.శ.1323వ సంవత్సరంలో కాకతీయ సామ్రాజ్య పతనానంతరం తాత్కాలికంగా ఆంధ్రదేశం ముస్లింల వశమైనా, కమ్మసేనానులైన ముసునూరి ప్రోలయనాయకుడు, కాపయనాయకుల వీరోచిత ప్రతిఘటన వల్ల ఆంధ్రదేశం తుగ్లక్ పరిపాలన నుండి విముక్తి చెందింది. ముసునూరి నాయకులు ఓరుగల్లును రాజధానిగా చేసుకొని యావదాంధ్రదేశాన్ని క్రీ.శ.1325 నుండి 1368 వరకు సుమారు అర్ధశతాబ్దం ఏలారు. అదే కాలంలో అద్దంకి, కొండవీడులను రాజధానులుగా చేసుకొని ఏర్పడిన రెడ్డి రాజ్యం క్రీ.శ.1325 నుండి 1424 వరకు సుమారు ఒక శతాబ్దం పాటు కోస్తా ఆంధ్రదేశాన్ని పాలించింది. అదే కాలంలో రాచకొండ, దేవరకొండలను రాజధానులుగా చేసుకొని ఏర్పడిన పద్మనాయక వెలమ రాజ్యం క్రీ.శ.1325 నుండి 1458 వరకు సుమారు శతాబ్దంపైగా పాలించింది. ఈ మూడు రాజ్యాల వంశస్థులు కాకతీయుల సేనాధిపతులు. కనుక వీరు కాకతీయుల అడుగుజాడలలోనే తమ పరిపాలనా వ్యవస్థలను కొనసాగించి ఉండవచ్చని భావింపబడింది.

ముసునూరి వంశస్తులు సుమారు 50 సంవత్సరాలు పాలించారు. కాని వారి పరిపాలనా విశేషాలు తెలుసుకోడానికి మనకు తగిన ఆధారాలు లేవు. వారి కాలమంతా నిరంతర యుద్ధాలతో గడిచిపోయింది. అందువల్ల వారు తమ శక్తినంతా దేశరక్షణకే ఉపయోగాపెట్టారు. ప్రజాపరిపాలనపై ఎక్కువగా శ్రద్ధ తీసుకోవడానికి వారికి వీలుకలగలేదు. కనుక అంతకుముందు అమలులో ఉన్న కాకతీయుల పరిపాలనావ్యవస్థనే వారు కొనసాగించి ఉండవచ్చును. ముసునూరి వంశస్థుల పరిపాలన సైనిక స్వభావం కలిగిన పరిపాలనావ్యవస్థ. వీరు రాజ్యానికి వచ్చేముందు ముస్లింలు ఆంధ్రదేశపు పరిపాలనావ్యవస్థను చిన్నాభిన్నం చేశారు. తుగ్లక్ పరిపాలనా విధానాలను ప్రవేశపెట్టారు. కనుక ముస్లింలను పారదోలిన తర్వాత ముసునూరి నాయకులు తిరిగి కాకతీయుల కాలం నాటి పరిపాలనా పద్ధతులనే పునరుద్ధరించారు. కాని ప్రజావరిపాలనపై తగిన శ్రద్ధ తీసుకోవడానికి వీలు లేకపోయింది. కనుక అధికారాలన్నీ సైన్యాధిపతులకు ఇచ్చారు. దుర్గరక్షణతోపాటు ప్రజాపరిపాలనను కూడా వారే చేశారు. సర్వాధికారాలు వారే చెలాయించారు. న్యాయనిర్ణయం వారే చేశారు. అన్నీ సైనికాధిపతుల దయాదాక్షిణ్యాల మీదనే జరిగిపోయాయి. కనుక వీరి కాలాన్ని సైనిక పరిపాలనాయుగమని చెప్పవచ్చును.

మంత్రిమండలి: ముసునూరి రాజులకు మంత్రిమండలి ఉందో లేదో తెలియదు. ప్రోలయనాయకుని విలస శాసనం బ్రాహ్మణులను కీర్తిస్తోంది. కనుక అతడు బ్రాహ్మణులను మంత్రులుగా, సలహాదారులుగా నియమించుకొని ఉండవచ్చును.

గెరిల్లా యుద్ధం: అయితే రాజ్య రక్షణకు వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. దుర్గాలను శత్రుదుర్భేద్యంగా నిర్మించారు. అందుకు కారణం ముస్లిం దండయాత్రల భయం ఉండేది. ముస్లింల నుంచి రాజ్యాన్ని రక్షించడానికి యుద్ధవ్యూహంలో గెరిల్లా పద్ధతి అనే ఒక అద్భుత నూతన విధానాన్ని ప్రవేశపెట్టారు. ఈ విధానాన్ని ప్రవేశ పెట్టిన వాడు ప్రోలయనాయకుడు. కాకతీయ రాజ్యం ముస్లింలు ఆక్రమించగానే ప్రతాపరుద్రుని తమ్ముడు కుటుంబంతో సహా బస్తరు అడవులలోకి వెళ్లిపోయాడు. ప్రజలు దిక్కులేనివారయ్యారు. ఆ స్థితిలో ప్రోలయనాయకుడు ఆంధ్ర ప్రజలను రక్షించాలని నిర్ణయించుకొని శత్రువులపై రహస్యదాడులకు వ్యూహం పన్నాడు. చెల్లాచెదురైన కాకతీయ సైన్యాన్ని పోగు చేసి గోదావరీతీరంలోని రేకపల్లి వద్ద సమావేశం చేసి దేశవిముక్తికి గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుద్ధం పద్ధతి ప్రకారం శత్రు సైన్యాల గమనాలను ముందుగా తెలుసుకొని వారు వెళ్లే మార్గంలో మాటు వేసి హఠాత్తుగా వారిపైబడి-వధించడం. అంటే ఇది ప్రత్యక్షయుద్ధం కాదు. రహస్య యుద్ధం. యుద్ధాలలో ఈ పద్ధతిని ప్రవేశపెట్టిన మొట్టమొదటి వ్యక్తి ప్రోలయనాయకుడు. ఆంధ్రదేశంలోనే కాదు, భారతదేశంలోనే కాదు, ప్రపంచంలోనే గెరిల్లా యుద్ధాన్ని ప్రవేశపెట్టిన మొట్టమొదట వ్యక్తి ప్రోలయనాయకుడని చరిత్రకారులు అంటున్నారు. ఈ పద్ధతే తర్వాత విజయనగర రాజులకు, ఆ తర్వాత శివాజీకి కూడా మార్గదర్శకమైందని కూడా అంటారు. ఈ పద్ధతి ద్వారా ప్రోలయ నాయకుడు ముస్లిం సేనలను తరిమికొట్టి వేంగి, రాజమహేంద్రవరం, ఖమ్మం జిల్లా ప్రాంతాలను ఆధిపత్యం కిందకు తెచ్చుకున్నాడు. రేకపల్లిని రాజధానిగా చేసుకున్నాడు. తన సైన్యాన్ని పటిష్టంగా రూపొందించాడు. కాకతీయుల కాలం నాటి ఆయుధాలే ముసునూరి

వారు కూడా వాడారు వీరి సైన్యంలో పదాతిదళం ముఖ్యమైంది కాపయనాయకుని కాలంలో గుర్రపుదళాన్ని కూడా సేకరించారు

దుర్గపాలన ముసునూరి వంశస్తులు దుర్గరక్షణకు అమిత ప్రాధాన్యతనిచ్చారు రేకపల్లి దుర్గాన్ని బలిష్టంగా రూపొందించారు ఓరుగల్లును ఆక్రమించిన తర్వాత కాపయనాయకుడు దుర్గాన్ని పునర్నిర్మాణం చేసి మంచి సైన్యాన్ని రక్షణగా ఏర్పాటు చేసుకున్నాడు రాజమహేంద్ర దుర్గాన్ని బలపరచాడు ఇతని కాలంలోనే కోరుకొండ దుర్గం నిర్మింపబడింది రాజ్యంలోని అన్ని దుర్గాలను బలపరచి వాటిలో తగిన సైన్యాన్ని ఆహార పదార్థాలను ఏర్పాటు చేశాడు చివరలో ఇతనికి చెందిన కేలాస్ దుర్గాన్ని బహమనీరాజులకు ఇవ్వవలసివచ్చింది ఇతని కాలంలో గోల్కొండ దుర్గాన్ని గొల్లంకొండ అనే వారు దానిని కూడా బహమనీ సుల్తానులకు ఇచ్చాడు ఇంకా భువనగిరి జల్లిపల్లి వెలమ కొట్టం మొదలైన దుర్గాలు కూడా ఇతని రాజ్యంలో ఉండేవి

పరిపాలనా విభాగాలు ముసునూరి వంశస్తులు తమ సామ్రాజ్యాన్ని సీమలుగా మండలాలుగా విభజించారు వారి కాలం నాటి అనేక సీమల పేర్లు మండలాల పేర్లు శాసనాల ద్వారా తెలుస్తున్నాయి కోనసీమ లేక కోన మండలం సబ్బి మండలం మొదలైన రాజకీయ విభాగాలు శాసనాలలో పేర్కొనబడ్డాయి సీమ మండలం పర్యాయ పదాలుగా కనిపిస్తున్నాయి ప్రతి సీమకు లేక మండలానికి రక్షణకుగాను దుర్గం ఉండేది ఆ దుర్గానికి సేనానాయకులనే అధిపతులుగా నియమించేవారు ముసునూరి వంశస్తుల వారి సమీప బంధువులనే దుర్గాధిపతులుగా మండలాధిపతులుగా నియమించారు కాపయనాయకుడు తీరాంధ్రదేశానికి అధిపతిగా పోతనాయకుని నియమించాడు అతడు కాపయనాయకుని పినతండ్రి కుమారుడు కోనసీమ రాజమహేంద్రవరం పరిసరాలు ఇతని ఆధీనంలో ఉండేవి ఇది పూర్వపు వేంగి రాజ్యం పోతనాయకుడు రాజమహేంద్రవరాన్ని తన రాజధానిగా చేసుకున్నాడు ఇతనికి తొయ్యేరు కూడా రెండవ రాజధానిగా ఉండేది కోరుకొండకు కూనపనాయకుని అధిపతిగా నియమించాడు ఇతని కుమారుడు ముప్పిడి నాయకునికి కాపయనాయకుడు తన మేనకోడలినిచ్చి వివాహం చేశాడు సబ్బి మండలానికి గురజాల తెలుంగరాయని కుమారుడు అయిన ముప్ప భూపాలుని మండలాధీశునిగా నియమించాడు ఇతని రాజధాని రామగిరి ఇది నేటి మంథెన తాలూకాలో ఉంది కాపయనాయకుడు పిల్లలమర్రి అనుమగల్లు ప్రాంతాలను 1346లో జయించి తన ప్రత్యక్షపాలన కిందికి తెచ్చాడు ఆ ప్రాంతానికి అధిపతిగా తనకు ప్రియభృత్యుడైన ఎరపోతులెంక అనే సేనాపతిని నియమించాడు ఎరపోతులెంక క్రీ శ 1357వ సంవత్సరంలో పిల్లలమర్రి గ్రామంలో వేయించిన శాసనంలో అతడు కాపయనాయకు అనుమగంటి పురవరాధీశ్వరుడని చోడరాయ స్థాపనాచార్యుడని కీర్తించాడు ఈ శాసనం వల్ల కాపయ అనుమగల్లు పిల్లలమర్రి ఓడపల్లి ప్రాంతాలను క్రీ శ 1346వ సంవత్సరం నాటికే జయించాడని నిర్ణయించారు దీనిని బట్టి తెలంగాణలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతం కోస్తాలో కృష్ణకు దక్షిణ భాగం తప్ప మిగిలిన ఆంధ్రదేశమంతా కాపయనాయకుని ప్రత్యక్షపాలనలో ఉందని స్పష్టపడుతోంది మిగిలిన ప్రాంతాలను అంటే మహబూబ్‌నగర్ జిల్లా ప్రాంతాన్ని పద్మనాయక వెలమలు కృష్ణకు దక్షిణ భాగమైన గుంటూరు నెల్లూరు కర్నూలు ప్రాంతాలను రెడ్డిరాజులు పాలించేవారు వారు కూడా కాపయనాయకుని సార్వభౌమాధికారాన్ని అంగీకరించారు కాకతీయుల కాలం నాటి 75 మంది నాయకులు కాపయనాయకుని ఆధిపత్యాన్ని అంగీకరించారని రాజమహేంద్రవరపు రెడ్డి రాణి అని తల్లి కలువ చేరు శాసనం తెలుపుతోంది కనుక కొండవీటి రెడ్డి రాజులు రాచకొండ పద్మనాయక రాజ్యాలు జల్లిపల్లి సోమవంశ చాళుక్య రాజ్యం అతని సామంత రాజ్యాలుగా కొనసాగుతున్నాయని స్పష్టంగా చెప్పవచ్చును

సేనాధిపతులకు బహుమానాలు ముస్లింలను ఎదుర్కొని ఆంధ్రదేశానికి విముక్తి సాధించడంలో శ్రేష్ఠ సాహసాలు చూపిన వీరులకు నాయంకరాలు ఇచ్చారు కొంతమందిని దుర్గాధిపతులుగా మండలేశ్వరులుగా నియమించారు మరి కొందరు ఇతర బహుమతులు ఇచ్చి సత్కరించారు అందువల్ల ముసునూరి వంశస్థుల సేనాధిపతులు యుద్ధంలో అసమాన శౌర్యప్రతాపాలు ప్రదర్శించారు

బిరుదులు కనుకనే కాపయనాయకుడు ఆంధ్రసురత్రాణ ఆంధ్రాధీశ్వర చోదరాజ్య స్థాపనాచార్య శౌర్య నారాయణ అనే బిరుదులు వహించి యావదాంధ్రదేశానికి సార్వభౌముడయ్యాడు కనుక ముసునూరి కమ్మ రాజ్యం కాకతీయుల తరువాతి ఆంధ్ర సామ్రాజ్యం అని చెప్పవచ్చును

ఆదాయాలు ముసునూరి సామ్రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమి శిస్తు పంటలో $^1/_6$వ వంతు వసూలు

చేసినట్లు ప్రోలయనాయకుని విలస శాసనం తెలుపుతోంది పూర్వం కాకతీయ రాజ్యంలో వసూలు చేయబడిన ఇతర రకాల పన్నులు సుంకాలు కూడా వసూలు చేసి ఉండవచ్చును వ్యాపార సుంకాలు రేవు సుంకాలు సంత సుంకాలు వృత్తి పన్నులు వారి ఇతర ఆదాయాలు ముసునూరి వంశస్థులు పాలించిన 50 సంవత్సరాలు యుద్ధాలు చేస్తూనే ఉన్నారు కనుక వారి ఆదాయం అంతా యుద్ధాలకు సైనికుల జీతాలకే ఖర్చు అయ్యేది

సైనికపాలన ముసునూరి పరిపాలన సైనిక స్వభావం కలిగింది ప్రోలయనాయకుడు కాపయనాయకులు ఇద్దరూ సేనాపతులే కనుక వారు రాజ్యం అంతటిలో దుర్గాధిపతులనే పరిపాలకులుగా నియమించారు పౌర లేక సివిల్ పాలనకు ప్రత్యేక అధికారులంటూ ఉండేవారు కాదు వారే నేర నిర్ణయం చేసి శిక్షలు కూడా చెప్పేవారు

ఉద్యోగులు సామ్రాజ్యంలో ప్రధాన అధిపతులు దుర్గాధిపతులైనా సేనాధిపతులే అయినా పరిపాలనా నిర్వహణకు అనేక రకాల ఉద్యోగులుండేవారు ఆస్థానాలలో దుర్గాలలో లెక్కలు రాయడానికి రాతకాండ్రు ఉండేవారు సాధారణంగా ఈ ఉద్యోగాలలో బ్రాహ్మణులను నియమించేవారు పన్నులు వసూలు చేయడానికి మరి కొందరు ఉద్యోగులు ఉండేవారు వ్యాపార సుంకాలు వసూలు చేయడానికి సుంకరులు ఉండేవారు వీరుగాక పన్ను గుత్తకాండ్రు ఉండేవారు వారు గ్రామాలను గుత్తకు తీసుకొని గుత్త సొమ్మును ప్రభుత్వానికి చెల్లించేవారు

గ్రామపరిపాలన కాకతీయుల నాటి గ్రామ పరిపాలనే కొనసాగింది గ్రామంలో ద్వాదశ వృత్తుల వారు ఉండేవారు వారిలో కరణం పురోహితుడు తలారి ముఖ్య గ్రామోద్యోగులు గ్రామంలోని తగవులు గ్రామంలోనే తీర్చబడేవి కరణం గ్రామ లెక్కలు రాసేవాడు తలారి గ్రామానికి కాపలా కాసేవాడు అతనికి సహాయంగా కొందరు కాపలాదారులు కూడా ఉండేవారు వారు రాత్రుళ్ల దివిటీలు పట్టుకొని గ్రామాన్ని కాపలా కాసేవారు

న్యాయ పరిపాలన కాకతీయులకాలం నాటి ధర్మాసనాలు ఉన్నట్లు దాఖలాలు లేవు ముస్లింల దండయాత్ర కాలంలో కాకతీయుల పరిపాలనా పద్ధతులు చెల్లాచెదురయ్యాయి ముసునూరి ప్రభువుల తొలి రోజులలో సేనాధిపతులు న్యాయ నిర్ణయాలు చేసి తీర్పులు చేసినట్లు కనపడుతోంది గ్రామాలలో గ్రామ పెద్దలు తీర్పులు చెప్పేవారు శిక్షలు కఠినంగా ఉండేవి కొరత వేయడం అంగవిచ్ఛేదం తలను గానుగలలో ఆడించడం మొదలైన క్రూర శిక్షలు ఉండేవి బ్రాహ్మణులకు మాత్రం ప్రత్యేక శిక్షలు వేసేవారు మొత్తం మీద కొద్ది మార్పులతో ముసునూరి వంశరాజులు కాకతీయుల కాలం నాటి పరిపాలనా పద్ధతులనే కొనసాగించారని చెప్పవచ్చును

ప్రజలకు రక్షణ ముసునూరి వంశస్తులు ముస్లింల నుండి ఆంధ్రప్రజలను రక్షించడమే తమ లక్ష్యంగా భావించారు ప్రోలయనాయకుడు ముస్లింలను పారద్రోలి బ్రాహ్మణులను దేవాలయాలను కాపాడాడు దేవాలయ భూములను దేవాలయాలకు బ్రాహ్మణ అగ్రహారాలను బ్రాహ్మణులకు పునరుద్ధరించాడు వైదిక ధర్మాన్ని ఆంధ్ర ప్రజలను కాపాడాడు అందువల్ల ఆనాడు తాపసులు తమ తపస్సులో 6వ వంతు ప్రోలయనాయకునికీ ధారపోశారని నాటి శాసనాలు చెబుతున్నాయి అంటే నాటి ప్రజలు ప్రోలయనాయకుని తమపాలిట దైవంగా ఆపద్బాంధవునిగా భావించారని స్పష్టపడుతోంది అలాగే కాపయనాయకుడు జీవితమంతా ముస్లింలను ఆంధ్రదేశంలో ప్రవేశించకుండా చేయడానికి తన శాయశక్తులా పోరాడాడు అతని కుమారుడు వినాయకదేవుడు బహమనీలతో పోరాడుతూ మరణించాడు కనుక ఈ వంశస్తులు ప్రజా రక్షణకు తమ జీవితాలు ధారపోశారని నిస్సందేహంగా చెప్పవచ్చును

రెడ్డిరాజుల పరిపాలనా వ్యవస్థ

ఆధారాలు అనవేమారెడ్డి వానపల్లి తామ్రశాసనం అతని దిన చర్యను తెలుపుతోంది కాని పరిపాలనా వివరాలను ఇవ్వలేదు సకల నీతిసారం ఆనాటి రాచరిక స్వభావాన్ని తెలుపుతోంది రాజు విధులు మంత్రులు ఉన్నతోద్యోగుల నియామకం వారి విధులు పన్నుల వసూలు ఆదాయాన్ని ఖర్చు చేసే విధానం కోటలు వాటి నిర్మాణం రక్షణ యుద్ధ తంత్రం సప్తాంగాలనీ వాటి పరిపాలనా విజయాలన్నింటినీ తెలుపుతోంది బహుశా రెడ్డి యుగంలో సకలనీతి సారాన్నే అనుసరించి ఉంటాడు

కొండవీటి రెడ్ల పరిపాలనా విధానాన్ని గూర్చి కూడా తెలుసుకోవడానికి మనకు తగిన ఆధారాలు లేవు ఆ కాలం నాటి శాసనాలలో పరిపాలనను గురించిన వివరాలు చాలా తక్కువ ఆనాటి సాహిత్యాధారాల నుంచే కొంత వరకు వారి పరిపాలనా విశేషాలు తెలుస్తున్నాయి అంతకు పూర్వం ఉన్న రాజనీతిశాస్త్రాలలో ఉన్న విషయాలనే ఈ కాలం నాటి సాహిత్యం కూడా పేర్కొంటోంది కనుక సాంప్రదాయబద్ధంగా వచ్చే విధానాలనే రెడ్డిరాజులు కూడా అనుసరించారని చెప్పవచ్చును ప్రోలయనాయకుని విలస శాసనం కుమరగిరిరెడ్డి తంగెడశాసనం

మడికిసింగన సకలనీతి సమ్మతం ప్రౌఢకవి మల్లనకవి రుక్మాంగదచరిత్ర బద్దెన నీతిసారం శ్రీనాధుని రచనలు వెలుగోటి వారి వంశావళి ఆనాటి పరిపాలనా విధానాలను గురించి కొంత సమాచారాన్ని ఇస్తున్నాయి

రుక్మాంగదచరిత్రలో రాజ్యాంగాలు రాజు మంత్రి సైన్యం కోట మిత్రుడు భూమి పన్నుల అనే అంగాలు ఉండేవని చెబుతోంది ఈ గ్రంథంలో ఒక రాజు వేటకు వెళుతూ తన కుమారునికి రాజ్యాన్ని అప్పగించి జాగ్రత్తలు చెబుతాడు రాజులు ఇతరులు ఆరగించిన పదార్థాలు తినరాదని వేటకు వెళ్లేటప్పుడు యుద్ధరంగంలో ఉన్నప్పుడు సైన్యాలను పర్యవేక్షణ చేయడానికి వెళ్లేటప్పుడు అంత పురంలో శయనాగారంలో ఉన్నప్పుడు స్నానం చేసేటప్పుడు తగిన రక్షణతో ఉండాలి శత్రు రాజుల బలాబలాలను బట్టి సామ దాన భేద దండోపాయాలను ప్రయోగించాలి మంత్రులపైనా సామంతులపైనా పూర్తిగా ఆధారపడరాదు స్వశక్తి మీదనే ఆధారపడాలి ప్రజలపై అధిక పన్నులు వేసి పీడించరాదు పువ్వులో తేనెను తేనెటీగ గ్రహించినట్లు రాజు ప్రజల వద్ద నుండి పన్నులు వసూలు చేసుకోవాలి అని రాజధర్మాన్ని రాజనీతి తన కుమారునికి ఉపదేశిస్తాడు దీన్ని బట్టి ఆనాటి రాజులు తమ రాజ్యాలను కాపాడుకోడానికి ఎన్ని విధాల జాగ్రత్తలు తీసుకునేవారో అర్థమవుతోంది ఇంకా చారుచర్య పద్మ పురాణం ధృతరాష్ట్ర నీతి మహా భారతం రాజనీతిని పరిపాలనా విధానాలను తెలుపుతున్నాయి

రాజాధికారాలు రాజులు సర్వాధికారులు అన్ని విషయాలలో నిర్ణయాధికారం రాజులదే సాధారణంగా రాజులు విద్యావంతులు అయి ఉంటారు చిన్నతనం నుంచే వారికి తల్లిదండ్రులు విద్యాబుద్ధులు చెప్పించి రాజనీతిని బోధించడమేగాక కత్తి గుర్రపుస్వారీలలో కూడా శిక్షణ ఇచ్చేవారు రాజ్యాన్ని రక్షించుకోడానికి పాలించడానికి కావలసిన దక్షత శక్తిసామర్థ్యాలు వారికి కలిగించేవారు రాజులు సర్వాధికారులు అయినా వారు ధర్మశాస్త్రాలను అనుసరించి పాలించేవారు పెదకోమటి వేమారెడ్డిని శ్రీనాధుడు ఆంధ్రక్షమామండలి అని సంబోధించాడు అలాంటి బిరుదులు రెడ్డి రాజులు ధరించి పాలించారు

మంత్రి మండలి రెడ్డిరాజులకు పరిపాలనలో సహాయపడటానికి మంత్రిమండలి ఉండేది సాధారణంగా 10-20 మధ్య మంత్రులు ఉండేవారు ఒక్క కుమరిగిరిరెడ్డి తప్ప మిగిలిన రెడ్డి రాజులందరూ బ్రాహ్మణులనే మంత్రులుగా నియమించుకున్నారు కుమరగిరిరెడ్డి తన బావమరిది కాటయవేమారెడ్డిని తన మంత్రిగా నియమించుకున్నాడు వానపల్లి శాసనంలో దానం తీసుకున్న వ్యక్తి ఇమ్మడి మంత్రి అనవేమారెడ్డిని మంత్రులకు రాజు అని వర్ణించాడు కనుక రెడ్డిరాజులు మంత్రుల సలహాలను తీసుకొనేవారని భావించాలి రామప్రెగ్గడ మల్లినాధుడు ప్రోలయ వేమారెడ్డి మంత్రులు మల్లినాధుడు సోమయ అనపోతారెడ్డి మంత్రులు అప్పడు కుమారుడు జటనం పెద్ది కాటయవేముని పురోహితుడు మామిడి సింగయ పెదకోమటి వేముని మంత్రి

యువరాజు పరిపాలనలో రాజు ప్రధాన మంత్రి తర్వాత యువరాజు స్థానం ఉండేది ప్రోలయవేమారెడ్డి తన కుమారుడు అనపోతారెడ్డిని తన జీవిత కాలంలోనే యువరాజుగా చేసి త్రిపురాంతక ప్రాంతానికి రాజ ప్రతినిధిగా నియమించాడు కుమారగిరిరెడ్డి తన కుమారుడు రెండవ అనపోతారెడ్డిని యువరాజుగా ప్రకటించి రాజమహేంద్రవర రాజ్యానికి ప్రతినిధిగా నియమించాడు రెడ్డిరాజులు భావిరాజును ముందే నిర్ణయించి శిక్షణ ఇచ్చేవారు యువరాజు రాజు రాజధానిలో లేనప్పుడు రాజు బాధ్యతలను నిర్వహించేవాడు యుద్ధాలకు పోయి పోరాటాలు జరిపి యుద్ధతంత్రాన్ని తెలుసుకొనేవారు పరిపాలనలో భాగం పంచుకొనేవారు

పరిపాలనా విభాగాలు రాజ్యపు పరిపాలనా సౌకర్యం కోసం పరిపాలనా శాఖలుగా విభజించేవారు రెవెన్యూ సైనిక ప్రజాసంక్షేమ అనే శాఖలుగా పరిపాలన విభజించేవారు ప్రతి శాఖకు ఒక అధిపతి ఉండేవాడు వారికి సహాయంగా ప్రతి డిపార్టుమెంటులో వివిధ స్థాయిలు గల ఉద్యోగులుండేవారు వారికి సర్వమాన్యాలు అనే భూములను జీతాలకు బదులుగా ఇచ్చేవారు

ఆదాయాలు వ్యవసాయం పరిశ్రమలు గనులు వజ్రగనులు వ్యాపారం తోటలు అడవులు వాణిజ్య సుంకాల ద్వారా రాజ్యానికి ఆదాయం వచ్చేది బద్దెన మల్లన అరి సుంకం గోకులం వనిక్రియ నందనవనం కప్పం అప్పనం వారి కరము దుర్గ రక్షణం మొదలైన పన్నులు పేర్లు ఇచ్చారు ప్రోలయవేముని చీమకుర్తి శాసనం తోటల మీద వచ్చే పన్నులను పేర్కొంది

రాజోద్యోగులు - పరిపాలనా శాఖలు రాచకొలువులో అనేక తరగతుల రాజోద్యోగులు వివిధ విధులను నిర్వహిస్తున్నట్లు నాటి శాసనాలు సాహిత్యం తెలుపుతున్నాయి కవిలెసంప్రతులు అనే గణకులన్నట్లు మడికిసింగన సకలనీతి సమ్మతం తెలుపుతోంది రాష్ట్రాలు దుర్గాల నుండి వచ్చే ఆదాయ వ్యయాలను ఎప్పటికప్పుడు లెక్కలు

రాయడం వారి విధులని వారు రాజభవనానికి రత్నదీపాలని కూడా ఆ గ్రంథం పేర్కొంది తర్వాత చెప్పుకోదగిన ఉద్యోగులు రాయసకాండ్రు వీరు రాజులు మంత్రుల వెంట ఉంటూ వారు ఇచ్చే ఆజ్ఞలను ప్రకటనలను ఆదేశాలను ఎప్పటికప్పుడే రాసి జారీ చేయడం వారి బాధ్యత వీరు అనేక భాషలు తెలిసిన వారు కావడమేగాక చక్కని దస్తూరి కలవారు అయి ఉంటారని సకలనీతి సమ్మతం వివరిస్తోంది యుద్ధనిర్వహణ సంధి సంప్రదింపులు జరిపేశాఖ ఆదాయవ్యయాలు చూసే శాఖ ప్రజావసరాలు తీర్చేశాఖ పన్నులు వసూలు చేసే శాఖలు ఆనాటి ముఖ్య పరిపాలనాశాఖలు ప్రజావసరాలు తీర్చే శాఖ ముఖ్యంగా తటాక నిర్మాణాల పనిని చేపడుతుంది తటాక నిర్మాణానికి కాలువల తవ్వకానికి అయ్యే ఖర్చులు తర్వాత ఆ తటాకాల వల్ల వచ్చే పన్నులు ఆదాయాల లెక్కలు రాసి భద్రపరిచేవారు భూములను కొలవడం భూముల సారాన్ని బట్టి తరగతులుగా వర్గీకరించడం పన్నులు నిర్ణయించడానికి ప్రత్యేక శాఖలు ఉండేవి

పన్నులు - సుంకాలు - సుంకరులు ప్రభుత్వానికి అనేక రకాల పన్నులు సుంకాల ద్వారా ఆదాయం వస్తూ ఉండేది ఇవేగాక నజరానాలు పశుసంపద మీద వాణిజ్యం వినోదాల మీద గనుల నుండి పచ్చికబయళ్ల నుండి పుల్లరి మొదలైన ఆదాయాలు కూడా వచ్చేవని రుక్మాంగదచరిత్ర తెలుపుతోంది మెట్ట తరి తోటభూముల మీద వేరు వేరు పన్నులుండేవి మెట్ట తరి భూముల మీద పంట రూపంలో తోటభూముల మీద ధన రూపంలో పన్నుల వసూలు చేసేవారు ప్రోలయవేమారెడ్డి చీమకుర్తి శాసనం సువర్ణాదాయం అనే ఆదాయాన్ని తెలుపుతోంది శ్రీనాధుడు దండాదాయాన్ని ప్రస్తావించాడు ఇది జరిమానాల ద్వారా వచ్చే ఆదాయం భూమి మీద ఎంత పన్ను వసూలు చేసిందీ విలస శాసనం వల్ల తెలుస్తోంది పంటలో $^1/_6$వ వంతును ప్రోలయనాయకుడు వసూలు చేశాడని విలస శాసనం తెలుపుతోంది రెడ్డిరాజులు కూడా అంతే వసూలు చేసి ఉండవచ్చును గనుల మీద ప్రత్యేక పన్నులు వసూలు చేసేవారు వృత్తి కట్నాల పేరుతో మగ్గాల మీద నూనెగానుగల మీద కూడా పన్నులు ఉండేవి పట్టణాలలో గ్రామాలలో జరిగే సంతల వద్ద రేవు పట్టణాలలో సుంకాలు వసూలు చేసేవారు రేవుల వద్ద ఎగుమతి దిగుమతి సుంకాలు వసూలు చేసుకొనేవారు అలాంటి వారిని సుంక గుత్తగాండ్రు అని పిలిచే వారు ఆ సుంక గుత్తగాండ్రను కుమరిగిరిరెడ్డి కాలం నాటి తంగెడ శాసనం పేర్కొంటోంది ఎవరు ఎక్కువ పాటపాడితే వారికి సుంకగుత్తను ఇచ్చేవారు గుత్త లేని చోట పన్నులు వసూలు చేసే రాజోద్యోగులే వసూలు చేసేవారు వారిని సుంకర్లు సుంకాధికారులు అని అనే వారు రాచవూళ్లు అని ఉండేవి వాటిని కూడా గుత్తకు ఇచ్చేవారు గుత్తపాడిన వారు ఆ గ్రామంలోని పన్నులను తానే వసూలు చేసుకోనేవాడు తానే పాడినంత సొమ్ము రాజుకు చెల్లించేవాడు దేవబ్రాహ్మణ భూములపై పన్ను మినహాయింపు ఉండేది శాసనాలలో దశబంధమాన్యం అనే పదం కనిపిస్తోంది ఈ మాన్యాలను అనుభవించేవారు ఆ భూములను పెట్టుకొని నీటివనరులను మరమ్మత్తు చేయడానికి ఆ నీరు వాడుకొనే భూముల పంటలో $/_{0}$వ వంతు చెల్లించాలి మొత్తం మీద పన్నుల భారం అధికం

పన్నులు చెల్లించకపోతే శిక్షలు పన్నులు చెల్లించకపోతే క్రూరమైన శిక్షలు విధించేవారు శ్రీనాధుడు తన పలనాటిచరిత్రలో పన్ను చెల్లించలేని రైతులకు ఎలాంటి శిక్షలు వేసేవారో వర్ణించాడు నలగామరాజు కాలంలో పన్ను చెల్లించని రైతులకు సంకెళ్లు వేసేవారు గోతుల్లో పడవేసి రోకళ్లతో కుమ్మేవారు కొందరిని కొట్టేవారు కొందరికి జరిమానాలు విధించేవారని రాశాడు చివరి దశలో శ్రీనాధుడు కూడా పన్నులు కట్టలేక శిక్షకు గురయ్యాడు రెడ్డి రాజ్యం పతనం తర్వాత శ్రీనాధుడు తన కవిత్వాన్ని పోషించేవారు లేక భుక్తిగడవక పొలం సాగు చేశాడు కాని పంటపోయి పన్ను కట్టలేకపోయాడు అందుకుగాను అతని మెడకు ఇనపగుండ్లు కట్టారు భుజాల మీద పెద్ద బండను పెట్టారు బొండం వేశారు ఎర్రని ఎండలో నిలబెట్టారు కృష్ణవేణి కొనిపోయె కొంత పలం బలబలాక్షులు తినిపోయె తిలలు పెసలు ఎట్లు చెల్లింతు టంకంబులేడునూరు అని వాపోయాడు శిక్షను అనుభవించాడు అంతులేని పన్నులు విధించి క్రూరంగా విధించేవారు రాచవేమారెడ్డి కాలంలో పొయ్యి పన్ను పురిటి పన్ను కూడా విధించాడట సవరం ఎల్లయ్య అనే అతని భార్య ప్రసవించగానే రాజోద్యోగులు వచ్చి పురిటి పన్ను కట్టమని బాధించారట ఆ బాధకు తట్టుకోలేక అతడు రాచనగరులో ప్రవేశించి ముత్యాలమ్మ గుడి వద్ద ఉన్న రాచవేముని కత్తితో పొడిచి చంపాడు రాచవేముడు ఆ విధంగా మరణించాడని మెకంజీ కైఫీయత్తు తెలుపుతోంది మొత్తం మీద ప్రజలపై భరించలేని పన్నుల భారం ఉండేది

కప్పం సామంతరాజులు చెల్లించే కప్పం కూడా మరొక ఆదాయం సామంతులు తన ప్రాంతాలపై

వసూలు చేసిన పన్నులు తమ సైనిక పరిపాలనా ఖర్చులు పోను మిగిలిన ధనాన్ని కప్పం పేరుతో రాజుకు చెల్లిస్తారు ప్రతి ప్రాంతానికి కప్పం ఇంత అని ముందే నిర్ణయింపబడుతుంది ఆ నిర్ణీత మొత్తాన్ని సామంతరాజులు ప్రతి సంవత్సరం చెల్లిస్తారు రాజుకు పెద్ద మొత్తంలో కప్పం వస్తూ ఉండేది కప్పం చెల్లించకపోతే సామంతులను తొలగించేవారు ఈ కాలంలో రాజులకు వచ్చే ఆదాయంలో ఎక్కువ భాగం యుద్ధాలకు ఖర్చు అవుతుండేది

ఖర్చు వారికి వచ్చే ఆదాయంలోని ఎక్కువ భాగం సైన్యాలకు మిగిలింది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వ నిర్వహణకు ఖర్చు పెట్టేవారు

న్యాయపాలన-శిక్షలు రాజు ఉన్నత న్యాయాధీశుడు ఆరెకులు అనే వారు రహస్యాలు తెలుసుకొని నేర నిర్ధారణ చేసేవారు ధర్మశాస్త్రాలలో చెప్పిన ప్రకారం శిక్షలు వేసేవారు

ఆనాటి సాహిత్యం వల్ల నాటి న్యాయ విధానం కొంత తెలుస్తోంది న్యాయస్థానాలను ధర్మాసనాలు అని పిలిచేవారు ప్రత్యేకనేరాలు విచారించడానికి తాత్కాలిక ధర్మాసనాలను కూడా ఏర్పాటుచేసేవారు దోసిట్లో నిప్పులు పోసి నిర్దోషిత్వాన్ని నిరూపించుకొనే విధానం అమలులో ఉన్నట్లు సింహాసన ద్వాత్రింశిక తెలుపుతోంది మద్దుపట్టడం మొదలైన విధానాలు అవలంబించేవారు వాటిని దివ్య పరీక్షలు అని అనేవారు దొంగ సాక్ష్యాల కూట సాక్ష్యాలు కూడా అక్కడ కూడ ఉన్నట్లు రుక్మాంగద చరిత్ర పేర్కొంటోంది ఒకవేశ్యకు అతని విటునకు వచ్చిన వివాదం ధర్మాసనం ముందుకువచ్చినట్లు క్రీడాభిరామం తెలుపుతోంది ఆ నాడు నేరాలకు కఠిన శిక్షలు విధించేవారు రాజద్రోహానికి మరణదండన వేసి వధ్యశిల మీద చంపేవారు ఇంకా చర్మం ఒలిచి వేయడం కాళ్లు చేతులు నరకడం అంటే అంగవిచ్ఛేదం నూనెగానుగులలో ఆడించడం ఒంటికి గడ్డి చుట్టి నిప్పు అంటించడం వంటి శిక్షలు వేసేవారని సింహాసనద్వాత్రింశిక తెలుపుతోంది అప్పులు తీర్చకపోయినా పన్నులు చెల్లించపోయినా కూడా క్రూర శిక్షలు విధించేవారని రుక్మాంగద చరిత్ర వల్ల తెలుస్తోంది మనిషిని కట్టివేసి కొట్టడం బజారులో ఈడ్చడం ఎండలో నిలబెట్టడం గుండెలపై బండరాళ్లను పెట్టడం పట్టకారులతో తొడపాశం పెట్టడం మొదలైన శిక్షలు వేసేవారు బ్రాహ్మణులకు ప్రత్యేక శిక్షలుండేవి మరణదండన విధించదగిన తప్పు బ్రాహ్మణుడు చేస్తే ముఖంపై శునక చిహ్నాన్ని ముద్రించి గాడిద మీద ఊరేగించేవారు

పరిపాలనా విభాగాలు రెడ్డి రాజులు తమ రాజ్యాన్ని భూములుగాను భూములు సీమలుగాను సీమలను నాయంకరాలుగాను విభాగాలు చేశారు రెడ్డి శాసనాలలో గురజాల తంగెడ నాగార్జునకొండ బెల్లంకొండ సీమల పేర్లు కనిపిస్తున్నాయి తర్వాత నాడు స్థలం గ్రామం అనే విభాగాలు చేశారు ప్రతిభూమికి ఒకదుర్గం ఉంటుంది ఒక్కొక్కప్పుడు రెండు భూములను కలిపి ఒక దుర్గం కింద ఉంచేవారు దుర్గం తన కింద ఉంచిన భూమిని దుర్గం రక్షిస్తూ ఉండేది ఆ ప్రాంతాన్ని రక్షించడానికి తగినంత సైన్యం ఆ దుర్గంలో ఉంచేవారు ప్రతి దుర్గానికి దుర్గాధిపతి ఉండేవాడు సాధారణంగా దుర్గాలు పట్టణాలుగా పెద్ద జనాభాతో అభివృద్ధి చెందుతూ ఉండేవి

గ్రామ పాలన ఆనాడు గ్రామాలు నాలుగు రకాలుగా ఉండేవి

1 రాచ గ్రామాలు

2 **నాయంకర గ్రామాలు** సైనిక సేవ కింద సేనాధిపతులకు ఇచ్చిన గ్రామాలు

3 **అగ్రహారాలు** బ్రాహ్మణులకు ఇచ్చిన గ్రామాలు

4 **దేవదానాలు** దేవాలయాలకు ఇచ్చిన గ్రామాలు

గ్రామ పరిపాలనకు గ్రామసమితి ఉండేది గ్రామ పెద్దలు ఇందులో సభ్యులుగా ఉంటారు గ్రామ ప్రజల పనులు చేయడానికి వృత్తి పనివారు ఉండేవారు వారి ఉద్యోగం వారసత్వం వారికి వృత్తిమాన్యాలు ఇచ్చేవారు ప్రభుత్వం తరపున రెడ్డి కరణం అనే ఉద్యోగులు కూడా ఉండేవారు వీరిద్దరూ రాజాజ్ఞల ప్రకారం తమ విధులు నిర్వహిస్తారు రెడ్డి న్యాయమూర్తిగా కూడా వ్యవహరిస్తాడు అతడు గ్రామంలోని చిన్నచిన్న తగవులను విచారించి తీర్పులు చెబుతాడు కరణం భూముల కొలత విస్తీర్ణం నిర్ణయించడం పంటలను నమోదు చేయడం శిస్తులను నిర్ణయించడం విధులు వీరిద్దరూ కలసి సమన్వయంతో తమ విధులను నిర్వహిస్తారు వాటిని చటవృత్తి మాన్యాలు అని అంటారు అవేగాక మామూళ్లు కట్నాలు కానుకల పేరుతో కొంత ధానాన్ని వసూలు చేసుకుంటూ ఉంటారు గ్రామ రక్షణకు గ్రామం చుట్టూ ఊరు చుట్టూ కోట వంటి గోడను నిర్మించేవారు గ్రామం చుట్టూ కాపుదల కాయడానికి ప్రహరీ కాపు లేక బారి కాపు అనే కాపలాదారుని కూడా నియమించేవారు అలాగే గ్రామరక్షకుడు కూడా ఉండేవాడు అతనికి ఆరెకుడు అని కూడా పేరుండేది రాత్రుళ్లు దివిటీలు పట్టుకొని గ్రామాలను కాపు కాసే

వారు ఇంకా గ్రామంలో ద్వాదశ వృత్తుల వారు ఉండేవారు కాకతీయుల కాలం నాటి వృత్తులే కొనసాగాయి మొత్తం మీద గ్రామాలు స్వయం సంపూర్ణంగా స్వయంపాలనతో పటిష్టంగా ఉండేవి అందువల్ల పైన ఎన్ని రాజ వంశాలు వచ్చిపోయినా గ్రామస్థుల జీవితాలలో మార్పులు ఉండేవి కావు దేశం రాజకీయ కల్లోలంగా ఉన్నా ఎంత మంది రాజులు మారినా వారి నిత్య జీవితాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా వారి గ్రామ స్వయంపాలన వారిని కాపాడుతూ ఉండేది ఎన్ని వంశాలు మారినా గ్రామవ్యవస్థ చెక్కుచెదరకుండా నిలిచి ఉంది గ్రామ జీవితంలో పురోహితుడు కూడా ప్రధాన పాత్రనే నిర్వహిస్తాడు

అక్కు కావలి-వెలి కావలి అక్కు కావలి వెలి కావలి అనే ఇద్దరు ఉద్యోగులు ఉండేవారు త్రిపురాంతక ప్రాంతంలో ఏరువనాడు నుండి రెడ్డి రాజ్యంపై బడి రైతుల పంటను దొంగిలించుకొని పోయేవారట రైతులు అనవేమారెడ్డికి నివేదించగా అతడు ముత్రక కులానికి చెందిన బోడి లింగమనాయకుని రైతుల పంటలను కాపాడటానికి అక్కుకావలిగా నియమించాడట ముత్రక కులం నేటి ముతరాసు కులం అయి ఉండవచ్చును అక్కు కావలిగార్ పంటను దొంగల నుండి కాపాడలేకపోతే దొంగిలింపబడిన పంట నష్టాన్ని రైతుకు అతనే చెల్లించాలి అలాగే బయట కావలి కాయడానికి వెలికావలిని కూడా నియమించాడట అలా నియమింపబడిన వాడు అడపా సింగమనాయకుడు అక్కుకావలి వెలికావలి గాండ్రను కొండవీటి కైఫీయత్తు తెలుపుతోంది కాని వారి జీతభత్యాలు ఎలా చెల్లించిందీ తెలియటం లేదు కనుక వారికి మేర ఇవ్వబడేదని భావించబడింది వీరు పోలీసు డిపార్టుమెంటు వంటివారు

సైన్యం-యుద్ధతంత్రం-ఆయుధాలు రెడ్డి రాజుల కాలంలో సైన్యం మూడు అంగాలుగా ఉండేది గజ తురగ పదాతి దళాలు ఉండేవి ఏనుగులను సింహళం నుండి తెచ్చుకొనేవారట వాటికి శిక్షణ ఇవ్వడం అలంకరించడం మొదలైన విషయాలు శ్రీనాధుడు పలనాటి వీరచరిత్రలో వర్ణించాడు గుర్రాలపై ఉండి పోరాడే వారిని శాతులు లేక రాహుతులని పిలచేవారు పదాతిదళం నాలుగు రకాలుగా ఉండేది

1 సెలగొలుబలం వీరు ఈటెలతో పోరాడుతారు
2 విలుకాండ్రు వీరు విల్లంబులతో పోరాడుతారు
3 కైదీతగాండ్రు వీరు దినభత్యంతో అప్పుడప్పుడు యుద్ధరంగంలోకి తెచ్చే సైనికులు
4 ఎక్కట్లు యుద్ధంలో తమ సైన్యం చాలకపోతే కిరాయికి తెచ్చుకొనే ప్రత్యేక సైన్యం

ఈ ఎక్కట్లే తర్వాత వంటర్లు అనే కులంగా మారింది కొంతమంది రాజులు వీరికి భూములు ఇనాములు ఇచ్చి పోషించారు వారిని ఆ కాలంలో ప్రతి పట్టణంలో గ్రామాలలో కూడా ఉంచేవారు క్రీ శ 1418వ సంవత్సరం నాటి గుంటూరు జిల్లా వెల్లటూరి శాసనం వద్ద ఎక్కట్లే అక్కడి దేవాలయానికి భూములను దానం చేసినట్లు తెలుపుతోంది సైనికులలో కూడా రెండు తరగతుల వారు ఉన్నారు భూములను ఇచ్చి పోషించే సైన్యం భూములు లేకుండా కేవలం జీతాలు ఇచ్చి ఉంచుకున్న సైన్యం అని రెండు రకాలుగా సైన్యం ఉండేదని పలనాటి చరిత్ర తెలుపుతోంది సైన్యాలను సైనికులను సమకూర్చడానికి కాలరులు అనే ప్రత్యేక ఉద్యోగులు ఉండేవారు శత్రు సైన్యాల కదలికలు బలదర్పాలను గూర్చి తెలుసుకొని చెప్పడానికి వేగరులు అనే గూఢచారులు కూడా ఉండేవారు సైన్యం బయలుదేరే ముందు బాటలు బాగుచేయడానికి మార్గమధ్యంలో సైనికులకు కావలసిన ఏర్పాట్లు చేయడానికి ముందు కొందరు భటులను పంపేవారు

ఆయుధాలు ఆ కాలంలో 18 రకాల ఆయుధాలుండేవని శ్రీనాధుడు పలనాటి వీరచరిత్రలో పేర్కొన్నాడు శ్రీనాధుడు రెడ్డియుగంలోనే పలనాటి చరిత్రను రాశాడు గనుక అతడు సమకాలీన ఆయుధాలనే తన కావ్యంలో వర్ణించి ఉంటాడు అవి -

1 పరిఘము అంటే గధ
2 చురకత్తి
3 శూలం
4 పాసం అంటే విసిరే ఈటె
5 కుంతం అంటే రౌతులు ఉపయోగించే ఈటె
6 ముసలం అంటే గుద్దు కర్ర
7 బిండివాలం అంటే విసిరివేసే ఆయుధం

8 ముద్గరం అంటే సుత్తివంటి ఆకారంలో ఉండే ఆయుధం
9 పరశువు అంటే గండ్రగొడ్డలి
10 బల్లెం
11 బాకు
12 కటారి
13 సాంగం అంటే పొడుగాటి విల్లు
14 గద
15 చక్రం
16 ధనువు
17 శరధి
18 ఖడ్గం

ఇవిగాక పాషాణ యంత్రాలు కూడా ఉండేవి ఇవి రాళ్లను విసిరే యంత్రాలు ఫిరంగులు తుపాకులు కూడా ఉన్నట్లు వర్ణించబడింది నడిమివ్రేలు దూరునంత కన్నం కలిగి గిట్టంతో కర్రమదమతో ఉండే ఆయుధమని అందులో మందురాళ్లు కూర్చి కాలుస్తారని శుక్రనీతి వర్ణించింది 500 ఫిరంగులు 10000 తుపాకులు నలగామ రాజు వద్ద ఉన్నాయని పలనాటి చరిత్రలో శ్రీనాధుడు వర్ణించాడు వీటిని ముస్లింలు ప్రవేశపెట్టి ఉండవచ్చు

దుర్గాలు ఈ యుగంలో యుద్ధ వ్యూహాలలో దుర్గాలు అత్యంత కీలకపాత్ర వహించాయి ముఖ్యంగా గిరి దుర్గాలు అమిత ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి అనేక దుర్గాలు కొండలపైనే నిర్మింపబడ్డాయి శత్రువుల దాడికి వచ్చినప్పుడు వారికి దుర్గాలే రక్షణ ఇచ్చేవి అందువల్ల నాటి రాజులు దుర్గరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవారు దుర్గాలను శత్రుదుర్భేధ్యంగా నిర్మించేవారు ఈ కాలంలో అనేక దుర్గాలు నిర్మింపబడ్డాయి కోస్తా ఆంధ్రదేశంలో రెడ్డి రాజ్యంలో ఉదయగిరి కందుకూరు నాగార్జునకొండ కొండవీడు కొండపల్లి తంగెడ బెల్లంకొండ వినుకొండ రాజమహేంద్రవరం పిఠాపురం రాయలసీమ లోగుత్తి గండికోట మొదలగు దుర్గాలు ప్రసిద్ధి చెందాయి రాయలసీమ కోటలు విజయనగర రాజుల కింద ఉండేవి ఈ కోటలు కొన్ని నేటికీ నిలిచి ఉన్నాయి యుద్ధాలకు వెళ్లేటప్పుడు తమ దుర్గాలకు తగిన కాపు ఉంచి వెళ్లేవారు యుద్ధాలకు వెళ్లేప్పుడు జ్యోతిష్కులను విచారించి ముహూర్తాలు పెట్టించుకొనేవారు శకునాలు చూసేవారు యుద్ధభేరీలు మోగించుకుంటూ యుద్ధ భూములకు వెళ్లేవారు

దండు కదలికలు పరాయి రాజ్యంపై దండు వెళ్లేటప్పుడు పెద్ద సేనలతో వెళ్లేవారు ఆ దండు కదలికలు రాచనగరు కదలివస్తున్నట్లు ఉండేది గుడారాలు సామానులు పెట్టెలు మంచాలు ధాన్యాలు వంట సామానులు తినుబండారాలు రకరకాల ఆయుధాలు బండ్లపై వేసుకొని బయలుదేరేవారు సేవకులు భృత్యులు సైనికులు స్త్రీలు వేశ్యలు చిలుకులు వందిమాగధులు హాస్యగాళ్లు సామంతులు మొత్తం రాచపరివారమంతా బయలుదేరేవారు

అమానుష హత్యాకాండ సైన్యం శత్రురాజ్యంలో ప్రవేశించగానే వారి క్రూరత్వానికి హద్దులు ఉండేవిగాదు గ్రామాలను తగలబెట్టేవారు గ్రామపు బావులు చెరువులలో విషం కలిపేవారు శత్రువులు వచ్చేమార్గంలో నీటి వనరులలో విషం కలపాలని మడికి సింగన సకలనీతి సమ్మతంలో సూచన ఉంది గ్రామాలను తగులబెట్టేవారు ప్రజలను చంపేవారు అమానుష హత్యాకాండ జరిపేవారు ఆస్థిపాస్తులు దోచుకొనేవారు విజయనగర బహమనీ రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలలో వెలమ రెడ్డి రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలలో లక్షలాది ప్రజలు దారుణ వధకు గురయ్యారు అనేక మంది స్త్రీలు పడ్డ దురవస్థలు వర్ణించరానివి వెలమ రెడ్డి రాజ్యాలకు మధ్య విపరీతమైన పగ ఉండేది తమ పగ సాధింపులకై ఒకరి రాజ్యంపై మరొకరు దండయాత్రలు చేసి నాటి తెలుగు ప్రజలకు నరకం చూపించారు కనుక ఆ నాటి ప్రజల జీవితాలు దినదినగండంగా ఉండేవి

సేనాధిపతులకు బహుమతులు-దుర్గాధిపతులుగా నియామకాలు సేనాధిపతులను దండనాయక దళవాయి పదాలు పదవాలు అని పిలిచేవారు వెలుగోటి వారి వంశావళి నాయకులు అని బిరుదు రాహుత్తరులు అని సేనా నాయకులను పేర్కొంటోంది బహుశా పద్మ నాయకుల సేనాధిపతులను పడినాయకులని బిరుదు రాహుత్తరులను హోదాతో పిలిచి ఉండవచ్చును

యుద్ధాలలో విజయం సాధించడానికి దుర్గాలు ఆక్రమించడానికి అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన సేనాధిపతులను వారు జయించిన దుర్గాలకు అధిపతులుగా నియమించేవారు కొందరికి బహుమానాలు ఇచ్చేవారు కనుక సైన్యాధిపతులు ఎవరికివారే తమ సేన్యాలను నడిపి ఎవరికి వారే తమ సామర్థ్యాలను ప్రదర్శించి తమ రాజుల మెప్పు పొందడానికి దుర్గాల అధిపతులుగా నియమింపబడటానికి తీవ్ర ప్రయత్నం చేసేవారు అందువల్ల ప్రతి సేనాధిపతి ఇష్టారాజ్యంగా శత్రురాజ్యంలో అమానుషకాండ జరిపేవాడు అలాగే ఒక్కొక్కప్పుడు కొందరు సేనానాయకులు ద్రోహం చేయడం కూడా జరిగేది ప్రతాపరుద్రుని చివరి యుద్ధంలో రెడ్డి సైన్యం యుద్ధరంగాన్ని విడిచి దూరంగా వెళ్ళిపోయిందని అందువల్లనే ప్రతాపరుద్రుడు ఓడి బందీగా చిక్కాడని ప్రతీతి

బొమ్మ పెట్టు ఈ కాలంలో యుద్ధంలో చిక్కిన శత్రువు తల నరికి తమ్మపడిగలో పెట్టి అవమానించే వారట ఈ పద్ధతిని బొమ్మ పెట్టు అని పిలిచేవారు ముఖ్యంగా రాచకొండ పద్మనాయకులు ఈ పద్ధతిని ప్రారంభించారు పెదవేదగిరి మాచారెడ్డిని వధించి బొమ్మ పెట్టాడు అందుకు ప్రతీకారంగా పెదకోమటి వేమారెడ్డి పెదవేదగిరిని చంపి తమ్మపడిగలో పెట్టాడు అందుకు ప్రతీకారంగా లింగమనేడు పెదకోమటి వేమారెడ్డిని చంపి తమ్మపడిగలో పెట్టాడు

ప్రజలు శత్రు సైన్యాల వల్ల అనేక బాధలు పడుతున్నా కూడా యుద్ధాలలో ప్రజలు కూడా శత్రు సైన్యాల ఉనికి కదలికలను తమ ప్రభువులకు తెలియజేస్తూ రాజభక్తిని చూపేవారు అవసర సమయాల్లో ప్రజలు కూడా యుద్ధాలలో పాల్గొని తమ రాజులకు సహాయం చేస్తూ ఉండేవారు విజయాలు చేకూర్చేవారు ఆ రోజులలో దేశానికి ముస్లింల దండయాత్ర భయం ఉండేది అందువల్ల తమ రాజు తమను పీడిస్తూ ఉన్నప్పటికీ యుద్ధసమయాలలో తమ రాజులకు తాము చేయగలిగిన సహాయం చేస్తూ ఉండేవారు రెడ్డి వెలమ రాజులు వైదిక ధర్మరక్షణ వేమాద్రి రచించిన ధర్మాలను పాటించడం తమ ధ్యేయమని చెప్పుకున్నప్పటికీ ఆచరణలో దానిని విస్మరించి అంతః కలహాలలో దిగి క్రమేపీ బహమనీ రాజ్య విస్తరణకు దోహదం చేశారు

పద్మనాయకుల పరిపాలనా వ్యవస్థ

పద్మనాయకుల పరిపాలనా విధానం కాకతీయుల పరిపాలనా విధానాన్ని పోలి ఉండేది వారు వైదిక ధర్మరక్షణకు ప్రజాశ్రేయస్సే తమ లక్ష్యాలుగా పాలించారు హేమాద్రి తన రచనలలో వివరించిన పద్ధతుల ప్రకారం నడిచారు పరిపాలనా వ్యవహారాలలో వారికి ప్రధాన మంత్రులు పురోహితులు సేనాధిపతులు సలహాలు ఇచ్చేవారు వారు వారి మంత్రులుగా బ్రాహ్మణులను నియమించుకున్నారు పెద్దన పోతరాజు బాచన సింగన అయ్యలార్యుడు మొదలైన మంత్రుల పేర్లు నాటి శాసనాలు సాహిత్యం ద్వారా తెలుస్తున్నాయి మంత్రులు పురోహితులు దేవారికులు కూడా తమ ప్రభువులతో పాటు యుద్ధాలకు వెళ్లే వారు పరిపాలనలో యువరాజులకు ప్రత్యేక స్థానం ఉండేది రాజుకు సంతానం లేకపోయినా అతని కుమారులు చిన్నవారైనా సోదరులు సమీప బంధువులు రాజ్య భారం వహించేవారు

రాజ్యాన్ని సీమలుగా విభజించేవారు ప్రతి సీమకు ఒక దుర్గం సాధారణంగా ఒక పట్టణంగా కూడా ఉండేది ప్రతి సీమలో నాయంకరాలుండేవి సీమలు మండలాలుగా కూడా విభజించే వారు సీమలకు అధిపతులుగా రాజవంశస్థులను నియమించేవారు రాజబంధువులను మంత్రులు దండనాథులుగా కూడా నియమించేవారు రాజ్యంలో ముఖ్యపదవులన్నీ పద్మనాయకుల బంధువులే నిర్వహించేవారు యువరాజులను కూడా దుర్గాధిపతులుగా నియమించేవారు దుర్గాధిపతులు సామంతులు మండలాధీశులు తమ ప్రాంతాలలో పన్నులు వసూలు చేయడం సైనిక రక్షణ ఏర్పాటు చేయడం ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం వారి విధులు పన్నులు వసూలు చేసి వారి కింది పని చేసే ఉద్యోగులకు కూడా వారే జీతభత్యాలు ఇచ్చేవారు

పద్మనాయకుల కాలంలో నిరంతర యుద్ధాలు సాగేవి అందువల్ల వారు తమ రాజ్యంలో అనేక శత్రుదుర్భేద్య దుర్గాలు నిర్మించారు దుర్గాల రక్షణకు అమిత ప్రాధాన్యతనిచ్చారు వీరి రాజ్యంలో రాచకొండ దేవరకొండ పాడిచేడు అనంతగిరి అనుమల అమనగల్లు స్తంభగిరి ఉర్లుగొండ భువనగిరి ఉండ్రు గొండ జల్లపల్లి ఓరుగుల్లు మొదలైన అనేక పేరు మోసిన దుర్గాలుండేవి యుద్ధసమయాలలో దుర్గాలలో

ఆహార ధాన్యాలను నిలువ ఉంచేవారు అందుకు ప్రత్యేకంగా పాతరలు నిర్మించేవారు అలాగే ఆయుధ గారాలను కూడా నిర్మించుకొనేవారు ప్రతి నాయంకరంలో కొన్ని గ్రామాలు ఉండేవి గ్రామ పరిపాలన కాకతీయుల కాలంలో లాగా ఉండేది గ్రామాలలో ద్వాదశ వృత్తుల వారుండేవారు గ్రామ కరణం తలారి ముఖ్య గ్రామ ఉద్యోగులు పూజారి ముఖ్య గ్రామోద్యోగిగా కొనసాగాడు

న్యాయపాలన తీర్పులు చెప్పడానికి ధర్మాసనాలుండేవి శిక్షలు కఠినంగా ఉండేవి దివ్య పరీక్షల ద్వారా నేర నిరూపణ చేసేవారు అంగవిచ్ఛేదం గానుగలో తల ఆడించడం గుండెలపై పెద్దబండలను ఎత్తడం గడ్డిని శరీరానికి చుట్టి నిప్పు అంటించడం ఎండలో నిలబెట్టి పొగదండలు వేయడం కొరత వేయడం శిక్షలుగా ఉండేవి బ్రాహ్మణులు మరణదండన విధించదగిన తప్పు చేస్తే వారిని చంపకుండా వారి ముఖాలపై కుక్కపాదాన్ని గుర్తుగా ముద్రించి గాడిదలపై ఊరేగించేవారట

ఆదాయాలు భూమి శిస్తు ప్రధాన ఆదాయం పంటలో $^1/_6$వ వంతు వసూలు చేసేవారు బ్రాహ్మణ అగ్రహారాలకు దేవమాన్యాలకు పన్ను మినహాయింపు ఉండేది వ్యాపార సుంకాలు వృత్తి పన్నులు ఇతర ఆదాయాలుగా వచ్చేవి మొత్తం మీద పన్నుల భారం ఎక్కువ దండయాత్రలు చేసి శత్రు రాజ్యాలను దోచుకొనేవారు అది కూడా ఆదాయంగా ఉండేది

రణము కూడు పద్మనాయకుల కాలంలో రణం కూడు అనే అమానుష కాండాన్ని అమలు జరిపారు అది అత్యంత క్రూరంగా ఉండేది ఈ క్రూర ఆచారాన్ని పద్మనాయకులు పాటించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది యుద్ధంలో చిక్కిన శత్రువులను చంపి వారి రక్తాన్ని పట్టి భూతప్రేత పిశాచాలకు వెదజల్లేవారట కొన్నిసార్లు శత్రువులను పట్టుకొని వారి తలలు నరికి వారి పుర్రెలలోనే వారి రక్తం పట్టి అందులో బియ్యం పోసి వండేవారట దానినే రణం కూడు అని పిలిచేవారు అర్ధరాత్రి వేళ దిగంబరులై వళ్లంతా విభూది పూసుకొని జుట్టు విరబోసుకొని రణం కూడు పాత్రను నెత్తిన పెట్టుకొని బలి భూత ప్రేత మంత్రాలు చదువుతూ ఊరి పొలిమేర చుట్టూ తిరుగుతూ భూత ప్రేత పిశాచ శాకినీ ఢాకినీలకు ఆ రణం కూడును నైవేద్యంగా వెదజల్లేవారు ఇది ఆగమహితమైన కర్మకాండ అని శత్రువులపై విజయం సాధించడానికి రేచర్ల వంశంలోని ప్రతి ఒక్కరూ ఈ కర్మకాండను జరిపారని వెలుగోటి వారి వంశచరిత్ర తెలుపుతోందని మల్లంపల్లి సోమశేఖరశర్మ వ్యాఖ్యానించారు దీనిని బట్టి చూస్తే పద్మనాయకులు తమ శత్రువుల పట్ల అమితక్రూరంగా పరమ కిరాతకంగా వ్యవహరించారని చెప్పవచ్చును

వీరి కాలంలో విజయనగర రెడ్డి రాజులతో విరోధించి నిత్యం యుద్ధాలు జరుగుతున్నందువల్ల మాండలీకులు దుర్గాధ్యక్షులు అవసర యుద్ధాలలో నిమగ్నులై ప్రజాజీవితాలలో శాంతి లేకుండా చేశారు ఈ యుగంలో ప్రజలకు శాంతిభద్రతలు కరువయ్యాయి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని దినదిన గండంగా జీవించారు ఏ నిముషంలో పర రాజులు దండెత్తి తమ మాన ప్రాణాలు ఆస్తిపాస్తులు హరించి వేస్తారోనని హడలిపోతూ ఉండేవారు

ప్రజారక్షణ వైదిక ధర్మరక్షణ అని ప్రకటించుకున్న పద్మనాయకులు రెడ్డి రాజులు వారి ఆదర్శాన్ని ఆచరణలో పెట్టలేదు తమ యుద్ధాలకు ప్రజాశ్రేయస్సును ఫణంగా పెట్టారు పక్కన బహమనీ రాజ్యం ఉంది అది ఆంధ్రదేశానికి ప్రమాద హేతువు అని కూడా వారికి తోచలేదు పరస్పర యుద్ధాలతో ఉభయులు ఒకరినొకరు నాశనం చేసుకొని బహమనీ రాజ్యవిస్తరణకు అవకాశం ఇచ్చారు వారు కలసికట్టుగా వ్యవహరించి ఉన్నట్లయితే ఆంధ్రదేశం సురక్షితంగా ఉండి ఉండేది

గజపతుల పరిపాలనా వ్యవస్థ

గజపతుల పరిపాలనా వ్యవస్థ గురించి తెలుసుకోడానికి మనకు తగినన్ని ఆధారాలు లేవు ఐదారు తామ్ర శాసనాలలో వారి పరిపాలనా వ్యవస్థను గురించిన ప్రస్తావనలు ఉన్నాయి గాని అవి కూడా పూర్తి సమాచారాన్ని ఇవ్వడం లేదు స్థానిక కైఫీయత్తులలో కూడా కొన్ని ప్రస్తావనలు ఉన్నాయి వాటిని పరిశీలిస్తే గజపతులు తమ పరిపాలనకు పూర్వం పాలించిన తూర్పుగాంగులు రెడ్డిరాజులు అనుసరించిన పరిపాలనా పద్ధతులలో మార్పులేదు సాధారణంగా హిందూ రాజవంశాలు ఎన్ని వచ్చినా వారందరూ సాంప్రదాయకంగా వచ్చే పరిపాలనా పద్ధతులనే అనుసరించారు గజపతులు కూడా అలాగే సాంప్రదాయక హిందూ పరిపాలనా పద్ధతినే అనుసరించారు కాకపోతే వారు ఆంధ్రదేశంలో కొన్ని ఆంధ్రదేశంలో కొన్ని

ఒరియా పద్ధతులు ఒరియా పేర్లు ప్రవేశపెట్టారు

గజపతుల సామ్రాజ్యం చాలా విశాలమైనది వారి రాజ్యం ఉత్తరాన గంగానది నుండి దక్షిణాన కావేరీ నది వరకు దాదాపు తూర్పు కోస్తా మొత్తం రాయలసీమలో కర్నూలు కడప జిల్లాలు తెలంగాణ మొత్తం బీదరు వరకు విస్తరించి ఉండేది ఈ సామ్రాజ్యంలో ఓఢ్ర తెలుగు తమిళ ప్రాంతాలు కలిసి ఉండేవి అందువల్ల వారు ఆయా ప్రాంతాలలో అక్కడి సాంప్రదాయక పరిపాలనా వ్యవస్థలనే కొద్ది మార్పులతో కొనసాగించారు ఒరిస్సాకు పశ్చిమాన ఉండే అరణ్య ప్రాంతం కూడా వారి ఆధిపత్యంలో ఉండేది కాని ఆ ప్రాంతంలో అనేక మంది సామంతులు రాజ్యం చేస్తూ ఉండేవారు వారు ఆ ప్రాంతానికి అనుగుణంగా పరిపాలనా పద్ధతులను అవలంబించారు వారి పరిపాలనా పద్ధతులలో గజపతులు జోక్యం చేసుకొనేవారు కాదు గజపతులకు అవసర సమయాలలో ఆ సామంతులు తమ సైన్యాలతో వచ్చి యుద్ధాలు చేసేవారు

ఆంధ్రదేశంలో గజపతులు ప్రవేశ పెట్టిన మార్పులు ఆంధ్రదేశంలో లభించే గజపతుల కాలం నాటి రికార్డులను పరిశీలించినట్లయితే అంతకు పూర్వం పాలించిన రెడ్డి గంగరాజుల కాలం నాటి పరిపాలనా విభాగాల పేర్లు చాలా చోట్ల యథాతథంగా కొనసాగింపబడ్డాయని స్పష్టపడుతోంది అయినప్పటికీ వారు కొన్ని నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు ఒరిస్సాలో గంగరాజుల కాలంలో దండపథం అనే పరిపాలనా విభాగం ఉండేది దానిని ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టారు ఇది ఆంధ్రదేశానికి కొత్త గజపతులు ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టిన నూతన పరిపాలనా విభాగంగా పేర్కొనవచ్చును దండపథం అనేది విజయనగర పరిపాలనా విధానంలోని రాజ్యం అనే విభాగానికి సమానమైనదని పండితులు భావించారు దక్షిణాంధ్రదేశంలో విజయనగర రాజులు ఉదయగిరి చంద్రగిరి మొదలైన విభాగాలను రాజ్యాలు అని పిలిచేవారు ఆ రాజ్యాలపై దండనాయకులను అధిపతులుగా నియమించేవారు గజపతుల దండపథం విజయనగర రాజుల రాజ్యానికి సమానం వారి దండపథాలపై కూడా దండ నాయకులనే అధిపతులుగా నియమించేవారు వారిని పరీక్ష అని పిలిచేవారు - అంటే పరీక్ష అనే ఉద్యోగి పరీక్ష అంటే పరీక్షించడం కాని గజపతులు రాష్ట్ర గవర్నర్లను పరీక్షకులు అని పిలిచారు

హిందూ రాజనీతి ప్రాచీన భారతీయ రాజనీతి తత్వవేత్తలు రాజ్యం సప్తాంగ సమన్వితం అని ప్రవచించారు

1 స్వామి లేక రాజు
2 అమాత్య
3 జనపదం
4 దుర్గం
5 కోశం
6 దండ
7 మిత్ర

అనేవి సప్తాంగాలు వాటిలో రాజు చాలా ముఖ్యుడు శ్రీకృష్ణదేవరాయలు కూడా సప్తాంగాలను వివరిస్తూ వారిలో రాజు యొక్క ప్రాముఖ్యాన్ని తెలిపాడు రాజు సర్వాధికారి రాజ్యానికి చెందిన అన్ని అధికారాలు అతడే నిర్వహిస్తాడు అతడే సైన్యాధిపతి అతడే అత్యున్నత న్యాయాధ్యక్షుడు అతని అధికారాలను ఎవరికైనా బదిలీ చేయవచ్చును సైన్యాధిపతులను కవులను గాయకులను సన్మానిస్తాడు బహుమతులు బిరుదులు ఇస్తాడు రాష్ట్ర గవర్నర్లను నియమిస్తాడు ఆజ్ఞలు జారీ చేస్తాడు

ధర్మశాస్త్రాల మార్గదర్శకత్వం భారతీయ రాజులకు ఎన్ని అధికారాలున్నా అతడు స్వేచ్ఛా జీవి కాదు అతడు రాజ్యానికి ప్రతినిధి మాత్రమే రాజ్యపాలన ధర్మశాస్త్రాల ప్రకారమే జరగాలి అతడు ధర్మశాస్త్రాల నియమాలను అతిక్రమించరాదు ధర్మశాస్త్రాలను పాటించకపోతే ప్రజాభిమానాన్ని కోల్పోతాడు కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో రాజు తన సొంత నిర్ణయాలను మార్చరాదని స్పష్టంగా చెప్పాడు కొన్ని ప్రత్యేక సందర్భాలలో మాత్రమే తీసుకోవాలి తప్ప తన స్వీయ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదు భారతీయ రాజులకు సొంతంగా చట్టాలు చేసే అధికారం లేదు కాని విజయనగర రాజులు తమ ప్రధాన ధ్యేయం సనాతన సాంప్రదాయాలను రక్షించడమేనని ప్రకటించుకున్నారు అలాగే ప్రతాపరుద్ర గజపతి తన సరస్వతీ

విలాసంలో 8వ శతాబ్దానికి చెందిన అసహాయ మేధాతిథి 9వ శతాబ్దానికి చెందిన బారుచి 11వ శతాబ్దానికి చెందిన విజ్ఞానేశ్వర 12వ శతాబ్దానికి చెందిన అపరార్కక అనే ధర్మశాస్త్రకారులను ప్రస్తావించి వారు రచించిన ధర్మశాస్త్రాల సారాంశాన్ని తాను తన సరస్వతీ విలాసంగా రాశానని చెప్పుకున్నాడు పై ధర్మశాస్త్రకారులు గౌతమ మను నారద విష్ణుక ధర్మ యాజ్ఞవల్క్య స్మృతులకు వ్యాఖ్యానాలు రాశారు కనుక భారతీయ ప్రాచీన ధర్మశాస్త్రాలను స్మృతుల సారాంశమే సరస్వతీ విలాసం అని చెప్పవచ్చును సరస్వతీ విలాసాన్ని రచించిన ప్రతాపరుద్ర గజపతి తన రాజ్యాన్ని ఆ పద్ధతుల ప్రకారం పాలించి ఉంటాడు

రాజు సర్వాధికారి అతడే సైన్యాధిపతి న్యాయాధిపతి అయినప్పటికీ నీతిశాస్త్ర గ్రంధాలలో చెప్పిన రాజనీతి ధర్మాలను అనుసరించారు ఆ నాటి నీతిశాస్త్రాలు ఆదర్శవంతమైన రాజుకు ఉండవలసిన ధర్మాలను పేర్కొన్నాయి వారు న్యాయబద్ధంగా వ్యవహరించాలనీ నైతిక విలువలు పాటించాలని ప్రజలను ప్రేమతో ఆదరించాలనీ తెలిపాయి ఈ కాలానికి చెందిన దూబగుంట నారాయణకవి ఉదయగిరి పాలకుడైన బసవ భూపాలుని ఆస్థానకవి అతడు తెలుగులో పంచతంత్రం రాశాడు అతడు రాజులకు ఉండవలసిన ఉన్నత గుణాలను ఉండరాని దుర్గుణాలను వివరంగా రాశాడు అన్నదమ్ములుగాని ఆత్మబంధువుగాని మంత్రిగా ఉంటే వారిని చాలా జాగ్రత్తగా కనిపెట్టి ఉండాలని హెచ్చరించాడు అలాగే హితుడైనా అసమర్ధుడైతే లాభం లేదనీ సమర్ధుడై ఉండి హితుడు కాకపోయినా లాభం లేదని పైగా వారి వల్ల కష్టనష్టాలు తప్పవనీ అంటాడు శత్రు శేషం ఉండరాదని నీచులను అల్పులను అందలం ఎక్కించరాదని హితవు చెప్పాడు గజపతులు ఈ నీతి సారాన్ని అనుసరించి ఉండవచ్చును

రాజధర్మాలలో ప్రజారక్షణ రాజ్యరక్షణ అతి ముఖ్యమైనవిగా పేర్కొనబడింది రాజ్యాన్ని ప్రజలను విదేశీ దాడుల నుండి రక్షించాలి అంతేగాక కరువులు కాటకాలు కీటకాలు వరదల నుండి ప్రజలను పశువులను కూడా కాపాడాలి రాజ్యం ఆర్థిక సంక్షోభంలో పడకుండా చూడాలి తీర్పులు ఇవ్వాలి రాజు తన విధులను నిర్వహించడానికి తన తరపున తగిన ఉద్యోగులు న్యాయాధిపతులను నియమించాలి ప్రాణులను రక్షించడం రాజు ధర్మం తప్పు చేసిన వారిని శిక్షించడం ప్రజల హక్కులను సాంప్రదాయాలను గౌరవించడం ప్రజాక్షేమం కోసం యజ్ఞాలు ఇతర మత కర్మలను చేయడం రాజ్యం కోసం పోరాడి ప్రాణాల అర్పించిన వారి వారసులకు తగిన పరిహారాలు ఇవ్వడం రాచ ధర్మం అని ధర్మశాస్త్రాలు తెలుపుతున్నాయి గజపతులు తమ రాజ్యాన్ని హిందూ సాంప్రదాయకంగా వచ్చే ధర్మశాస్త్రాల ప్రకారం పాలించారని స్పష్టంగా చెప్పవచ్చును

గజపతుల దిన చర్యం-రాయవాచకం గజపతులు రాచకార్యాలను స్వయంగా చూసుకొంటారు తమ రాజ్యంలో ఏమి జరిగేది సైనికుల ప్రవర్తన ఎలా ఉందీ వారి శిక్షణ ఎలా సాగుతుందీ సరిహద్దులలోని శత్రు రాజ్యాల పన్నాగాలు ఏమిటి? మొదలైన విషయాలను సేకరించడానికి గూఢాచారులను పంపేవారు వారు తెచ్చే వారు సమాచారాన్ని జాగ్రత్తగా విని తమ వ్యూహాలను రూపొందించుకొనేవారు అలాగే విజయనగర గూఢచారులు గజపతుల చర్యలను కనిపెడుతూ ఉండేవారు వారు గజపతుల దినచర్యను తమ కృష్ణదేవరాయలకు నివేదించే వివరాలు రాయవాచకంలో ప్రస్తావించబడింది దాని ప్రకారం గజపతి సూర్యోదయానికి రెండు గంటల ముందే మేల్కొంటాడు వెంటనే ఇద్దరు బ్రాహ్మణులకు నమస్కరిస్తాడు తర్వాత 16 మంది పాత్రులను వెంటబెట్టుకొని రెండు మూడు ఆమడల దూరం స్వారీ చేసి వస్తాడు తర్వాత స్నానం చేసి పూరీ జగన్నాధునికి సహస్రనామార్చన చేస్తాడు షోడశోపచారాలు ఆచరిస్తాడు తర్వాత పురాణ శ్రవణం చేసి బ్రాహ్మణులకు పాదపూజ చేసి వారి పాద ధూళి నెత్తిన చల్లుకొని వారి పాదూదకం సేవించిన వారికి దక్షిణాలతో తాంబూలం ఇస్తాడు తర్వాత భోజనం చేస్తాడు ఆ తర్వాత కొంచెం సేపు రామాయణ శ్లోకాలు పరిస్తూ పచారు చేస్తాడు తర్వాత రాజ దుస్తులు ఆభరణాలు ధరించి దర్బారుకు వస్తాడు అక్కడ పాత్రులు మంత్రులు రాజోద్యోగులతో మంత్రాంగం చేస్తాడు మంత్రులు పురోహితులు రాజగురువు రాజ కుమారులు యువరాజు సేనాధిపతులు కవులు పండితులు జ్యోతిష్కులు ఇతర రాజోద్యోగుల సమావేశమవుతారు రాణి రాజుతోపాటు దర్బారులో ఆశీనురాలవుతుంది అక్కడ గజపతి నిజాంషాహీలు కుతుబ్ షాహీలు ఆదిల్‌షాహీలు విజయనగర రాజ్యాల నుండి వచ్చిన విదేశీ రాయబారుల లేఖలను చదివించుకుంటాడు వానికి ప్రత్యుత్తరాలు రాయిస్తాడు తరువాత తన సొంత రాజ్య వ్యవహారాల

పరిశీలించి పరిశీలించి దర్బారు చాలించి అంత పురానికి వెళ్లిపోతాడని విజయనగర చారులు నివేదించినట్లు రాయవాచకంలో ఉంది

రాచరికం వారసత్వం రాజు తన చివరి కాలంలో వారసుడిని నిర్ణయిస్తాడు గజపతులు పెద్ద కుమారుని వారసునిగా నియమించే ఆచారాన్ని పాటించినట్లు కనిపించదు కపిలేశ్వర గజపతి తన పెద్ద కుమారుడు హంవీరుని గాక చిన్న కుమారుడైన పురుషోత్తమ గజపతిని తన వారసునిగా నియమించాడు మాదలపంజి కపిలేశ్వర గజపతి పురుషోత్తముని తన వారసునిగా నియమించినట్లు తెలుపుతోంది

మంత్రులు గజపతుల పరిపాలనలో సహాయంగా ఉండటానికి మంత్రులను నియమించారు కాని గజపతుల మంత్రులు అంత విశ్వాసపాత్రులుగా కనిపించరు కపిలేశ్వర గజపతి కూడా మొదట గంగ వంశస్థులకు మంత్రి అతడు తన ప్రభువులకు ద్రోహం చేశాడు అతని కుమారులు హంవీరుడు పురుషోత్తముడు వివాదపడినప్పుడు హంవీరుడు ఆగర్భ శత్రువులైన బహమనీలతో కుమ్మక్కయి ఇద్దరూ నష్టపడ్డారు ప్రతాపరుద్ర గజపతి మంత్రి విద్యాధరుడు ద్రోహం చేసి బెంగాలు నవాబుతో చేరిపోయాడు తర్వాత ప్రతాపరుద్రుని కుమారులను చంపి రాజ్యాన్ని అపహరించాడు కనుక గజపతులు మంత్రులను నియమించినా వారి మీద ఆధారపడలేదు వారి సలహాలను పాటించలేదు

పాత్రులు మహాపాత్రులు గజపతుల దానశాసనాలు అనేకం పాత్ర మహాపాత్ర బేహర మహాపాత్ర సామంత అనే అధికారుల పేర్లను తెలుపుతున్నాయి రాయవాచకం కూడా ప్రతాపరుద్ర గజపతికి 16 మంది పాత్రులు ఉన్నట్లు తెలుపుతోంది పాత్రుడు అనే పదానికి పలువురు పలు రకాల అర్థాలు చెప్పారు మంత్రులు సేనాధిపతులు రాష్ట్రాధిపతులు అనే రకరకాల అర్థాలు ఇవ్వబడ్డాయి ప్రతాపరుద్రుని వెలిచెర్ల శాసనం 1936 ఆగస్టు భారతిలో ప్రచురించబడింది అందులో పాత్రుడు అనే పదానికి పూర్ణచంద్ర ఒరియా భాషా కోశం ఐదవ వాల్యూంలో మంత్రి అనే అర్థం ఇవ్వబడింది పాత్ర అంటే మంచి మనిషి అని కూడా అర్థం ఉంది అలాగే మహాపాత్ర అంటే ప్రధాన మంత్రి అని వివరింపబడింది కాని గజపతులు తమ దగ్గర పని చేసిన సేనాధిపతులను లేఖకులను పురోహితులను తోటమాలులను కూడా పాత్రులు మహాపాత్రులు అని వ్యవహరించినట్లు కనిపిస్తోంది పాత్రులు అనే అధికారులు కేంద్రప్రభుత్వంలోనే కాక రాష్ట్ర ప్రభుత్వాలలోనూ పని చేసినట్లు రికార్డులు తెలుపుతున్నాయి బేహర అంటే పల్లకీ మోసేవారని భావించారు ఒరిస్సాలోని కొందరు శూద్రులు కూడా ధరించారు కనుక పాత్ర అనేది గజపతుల కాలం నాటి బిరుదు అని చెప్పవచ్చును పాత్ర మహాపాత్ర సేనాపతి మహాసేనాపతి అనేవి హోదాలు గంగ వంశస్థుల కాలం నుండే ఉన్నాయి వాటిని గజపతులు యధాతథంగా కొనసాగించారు క్రీ శ 1396 నాటి నాల్గవ నరసింహుని శాసనం కపిలేశ్వర గజపతి జగన్నాథం శాసనం రెండింటిలో ఈ హోదాలు ఒకే రకంగా పేర్కొనబడ్డాయి

కనుక పాత్రులు అని పేర్కొనబడిన వారందరూ మంత్రులని చెప్పడానికి వీలులేదు కొంత మంది సాధారణ ఉద్యోగులు కూడా పాత్ర మహాపాత్ర అనే బిరుదులు ధరించారు ఉదాహరణగా కపిలేశ్వరుని జగన్నాథం శాసనంలో రాజముద్ర వేసే ఉద్యోగి సామానులు భద్రపరిచే స్టోర్ కీపర్ కూడా పాత్రులు అని పేర్కొనబడ్డారు

కనుక పాత్రులు అని పేర్కొనబడిన వారందరూ మంత్రులని చెప్పడానికి వీలులేదు కొంత మంది సాధారణ ఉద్యోగులు కూడా పాత్ర మహాపాత్ర అనే బిరుదులు ధరించారు ఉదాహరణంగా కపిలేశ్వరుని జగన్నాథం శాసనంలో రాజముద్ర వేసే ఉద్యోగి సామాన్లు భద్రపరిచే స్టోర్ కీపర్ కూడా పాత్రులు అని పేర్కొనబడ్డారు

మంత్రి పదవులు అలంకరించిన మహాపాత్రులకు యుద్ధానుభవం కూడా ఉండాలి వారు యుద్ధ సమయాల్లో సేనాధిపతుల లాగే సైన్యాలను నడిపిస్తారు పోరాడుతారు కనుక మంత్రులు సేనాధిపతులు విధులను ఒకే వ్యక్తి నిర్వహించేవాడని చెప్పాలి ఈ పద్ధతినే విజయనగర రాజులు కూడా అనుసరించారు ఆ తర్వాత శివాజీ కూడా తన అష్ట ప్రధాన విధానంలో ఇదే పద్ధతిని అవలంభించాయి శివాజీ అష్ట ప్రధానులలో న్యాయాధ్యక్షుడు పండిట్‌రావు తప్ప మిగిలిన మంత్రులు సైన్యాధిపతులుగా కూడా వ్యవహరించారు కనుక ఈ యుగంలో సైనిక నిర్వహణ సామర్థ్యం కలిగిన వారే మంత్రాంగ సభ్యులుగా నియమింపబడ్డారని తెలుస్తోంది

పురోహితుడు గజపతుల కాలంలో రాజ దర్బారులో పురోహితుడు కూడా ప్రముఖ పాత్ర నిర్వహించాడు ఇతనికి రాజగురువు అని కూడా పేరు ఉంది గజపతులేగాక విజయనగర చక్రవర్తులు కూడా తమ రాజగురువులకు గొప్ప గౌరవమర్యాదలు ఇచ్చారు విద్యారణ్యుడు తాతాచార్యులు విజయనగర చక్రవర్తుల వద్ద గొప్ప గౌరవ ప్రతిష్ఠలను అనుభవించారు అలాగే గజపతుల రాజగురువులు కూడా గొప్ప ప్రాముఖ్యతను పొందారు ప్రతాపరుద్ర గజపతి చేత ఆదరింపబడిన జీవదేవ అనే సంస్కృతి కవి రచించిన భక్తివైభవ నాటకం అనే గ్రంథంలో గజపతులచే ఆదరింపబడిన రాజగురువులైన తన పూర్వీకులను గురించి వివరించాడు అతని రచన ప్రకారం తన పూర్వీకుడైన గోపాలదేవుడు చివరి గంగరాజైన నిశ్శంక భానుదేవునికి రాజగురువుగా కొనసాగాడు అతని కుమారుడు త్రిలోచన కవిరాజు పురుషోత్తమ గజపతికి రాజగురువు అయ్యాడు జీవదేవుడు ప్రతాపరుద్ర గజపతి ఆస్థాన పురోహితుడు ఒకే వంశం గంగరాజుల కాలం నుండి ఒరిస్సా రాజ్య ఆస్థానంలో పురోహితులుగా కొనసాగారు ఈ వంశం వారేగాక మరికొందరు కూడా గజపతుల ఆస్థానంలో పురోహితులుగా ఉన్నట్లు కపిలేశ్వరగజపతి శాసనాలు తెలుపుతున్నాయి క్రీ శ 1437వ సంవత్సరం నాటి అతని భువనేశ్వర శాసనంలో వాసుమహాపాత్ర భువనేశ్వరమహాపాత్ర అనేవారు అతనిదే క్రీ శ1465వ సంవత్సరం నాటి గోపీనాథూర్ శాసనంలో వాసుమహాపాత్ర మహాపాత్ర లక్షణ పురోహిత అనే అతని పేర్లు తెలుపుతున్నాయి వీరు గజపతుల రాజగురువులు మరొక విశేషం ఏమిటంటే రాజపురోహితులు రాజగురువులు కూడా యుద్ధ విద్యలో ఆరితేరిన వారుగా కనిపిస్తున్నారు ప్రతాపరుద్ర గజపతి పురోహితుడైన జీవదేవునికి వాహినీపతి అనే బిరుదు ఉంది అంటే సేనాధిపతి అని అర్థం కనుక రాజగురువులు కూడా యుద్ధ సమయాలలో యుద్ధం చేసే వారని భావించవలసి వస్తోంది

రాష్ట్ర పాలన-దండపథాలు గజపతులు విశాలమైన సామ్రాజ్యాన్ని పాలించారు వారి సామ్రాజ్యంలో యావదాంధ్రదేశం తమిళదేశంలో కొంత భాగం కొంత భాగం బెంగాలు కొన్ని భాగాలు కలసి ఉండేవి ఈ విశాల సామ్రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం అనేక రాష్ట్రాలుగా విభజించారు రాష్ట్రాలను దండపథ అని అనే వారు దండపథాల అధిపతులను పరీక్ష అని అనే వారు శాసనాలలో అనేక దండపథాలు పేర్కొనబడ్డాయి కళింగ దండపథ రాజమహేంద్రవర కొండపల్లి కొండవీడు అద్దంకి వినుకొండ ఉదయగిరి అమ్మనబ్రోలు మొదలైన దండపథాలు పేర్కొనబడ్డాయి కొండవీడు అద్దంకి వినుకొండ దండపథాలకు క్రీ శ 1454-55వ సంవత్సరంలో గణపతి అనే అతడు పరీక్షగా ఉండేవాడు క్రీ శ 1460వ సంవత్సరంలో గణపతిని కళింగ దండపథానికి మార్చి అతని స్థానంలో యువరాజు హంవీరుని కుమారుడు దక్షిణ కపిలేశ్వరుని నియమించారు దండ పథాలను సీమలుగా విభజించారు దండపథ అంటే పరీక్ష అనే పదవి దుర్గ రక్షణకు ఏర్పాటు చేసినట్లుగా ఉంది వినుకొండసీమ అద్దంకిసీమ గురిందల అమ్మనబ్రోలు కొండవీడు పాకాటిసీమ కందుకూరు సీమ అనే పేర్లు కూడా శాసనాలలో పేర్కొనబడ్డాయి అవి ఉదయగిరి రాజ్యంలో ఉండేవి ఒక్కొక్క సీమకు రక్షణగా ఒక్కొక్క దుర్గం ఉన్నట్లుగా ఉంది దుర్గాల పేర్లతోనే దండపథం సీమ అని వ్యవహరించారు ఉదాహరణగా వినకొండ సీమగాను దండపథంగాను కూడా పేర్కొనబడింది సీమలను తిరిగి స్థలాలుగా విభజించారు రాజమండ్రి ప్రాంతంలో 21 స్థలాలు ఉండేవి

రాజమండ్రి రాజ్యంలో ఉభయగోదావరి జిల్లాలుండేవి దానికి రాజమండ్రి దుర్గం కేంద్రంగా ఉండేది రాజమహేంద్రవర రాజ్యం లేక దండపథం చాలా పెద్దది అది 21 స్థలాలుగా విభజింపబడి ఉండేదని స్థానిక రికార్డులు తెలుపుతున్నాయి అవి -

1	పల్నాటిస్థలం	2	గోడసకుర్రు	3	పొన్నాడు
4	నందిపూడి కొట్టం	5	కిమ్మూరు	6	బిక్కవోలు
7	ఈతకోత	8	కోరుకొండ	9	ఆరట్లకోట
10	చోడవరం	11	వింజవరం	12	మురముళ్ళ
13	చాగలనాడు	14	మొల్లేరు	15	రాజుపూడు
16	సర్వసిద్ధి	17	రాయవరం	18	కాకినాడ
19	సలిపాక	20	తాళ్లపాక	21	కోట

ఈ విభాగాలన్నీ రెడ్డిరాజుల కాలంనాడు ఉన్నవే కాకపోతే దుర్గాలకు దండపథమని వ్యవహరించారు

ఇది ఒరిస్సాలో ఉపయోగించే పదం దానిని ఆంధ్రదేశంలో కూడా ఉపయోగించారు కనుక దండపథం అనేది సీమ అనే రాజకీయ విభాగానికి ఒరిస్సా భాషలోని పర్యాయ పదం అని భావించవచ్చును రాజమహేంద్రవర దండపథానికి కపిలేశ్వర గజపతి కాలంలో ప్రభుదేవ నరేంద్రుడు పరీక్షకునిగా ఉండేవాడు ప్రతాపరుద్రుని కాలంలో రామానంద అనే అతడు పరీక్షకునిగా నియమింపబడ్డాడు

బదిలీలు దండపథ పాలకులైన పరీక్షకులకు బదిలీలు కూడా ఉండేవి కళింగ దండపథ పరీక్షకులను తరచు బదిలీ చేస్తూ ఉండేవారు 1451వ సంవత్సరంలో కుండలేశ్వర మహాపాత్రుని కుమారుడైన లక్షణ దాస మహాపాత్రుడు కళింగ పరీక్షకునిగా పాలించాడు క్రీ శ 1455వ సంవత్సరంలో అతని తండ్రి కుండలేశ్వర మహాపాత్రుడు పరీక్షకుడుగా నియమింపబడ్డాడు గణదేవుడు అంతకుముందు కొండవీడు పరీక్షకుడుగా ఉండేవాడు శక సంవత్సరం 1376 అంటే క్రీ శ 1454వ సంవత్సరం నాటి చింతపల్లిపాడు శాసనం గణదేవుడు కొండవీడు వినుకొండ ప్రాంతాలకు పరీక్షకుడుగా రాజ్యం చేసినట్లు తెలుపుతోంది అతనిని 1455లో కళింగ పరీక్షకునిగా నియమింపబడ్డాడు మళ్లీ 1465వ సంవత్సరంలో కొండవీడు అద్దంకి వినుకొండ స్థలాలకు గణదేవుని పరీక్షకునిగా బదిలీ చేశారు 1454 తర్వాత కపిలేశ్వర గజపతి కావేరీ నది వరకు విజయనగర రాజ్యాన్ని జయించి గణదేవుని మళ్లీ కొండవీటికి బదిలీ చేసి నూతనంగా జయించిన ప్రాంతాలను కూడా కొంత కాలం అతని కింద ఉంచారు తర్వాత నూతన ప్రాంతాలను ఉదయగిరి రాజ్యంగా రూపొందించారు ఉదయగిరి సీమను క్షత్రియ కులానికి చెందిన పూసపాటి బసవ భూపాలుడు పరీక్షకునిగా పాలించాడు ప్రతాపరుద్ర గజపతి కాలంలో తిరుమల రౌతురాయ అనే అతడు పరీక్షకునిగా పాలించినట్లు శాసనం ఉంది అలాగే కొంత కాలం ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్ర గజపతి కూడా ఉదయగిరి సీమను పాలించినట్లు తెలుస్తోంది

దండపథాల సరిహద్దులు గజపతి సామ్రాజ్యంలోని దండపథాల సరిహద్దులను ఖచ్చితంగా గుర్తించటానికి మనకు తగిన ఆధారాలు లేవు కళింగ దండపథంలో విశాఖ శ్రీకాకుళం ఒరిస్సాలోని కొన్ని ప్రాంతాలు చేరి ఉండవచ్చును రాజమహేంద్రవరం దండపథంలో ఉభయగోదావరి జిల్లాలు కృష్ణా జిల్లాలోని కొంత ప్రాంతం చేరి ఉండేది కొండవీటి దండపథం కృష్ణానది నుండి గుండ్లకమ్మ వరకు వ్యాపించి ఉండేది ఇందు కొండవీడు అద్దంకి వినుకొండ గురించి లేక గరజాల అమ్మనబ్రోలు అనే ఐదు స్థలాలు ఉండేవి అవి దుర్గాలు కూడా ఉదయగిరి దండపథంలో నెల్లూరు జిల్లా ప్రాంతమంతా చేరి ఉండేది గజపతి సామ్రాజ్యంలోని దక్షిణ ప్రాంతంలో ఇది అత్యంత ప్రాముఖ్యం వహించిన దుర్గం దండపథాల పరిపాలన కూడా కేంద్ర ప్రభుత్వానికి నకలుగా ఉండేవి పరీక్షకులు కూడా తమ రాజధానులలో వైభవంగా జీవించేవారు అక్కడ గుర్రాలు ఏనుగులు బేరి వాయిద్యాలతో ఎప్పుడూ సందడిగా ఉండేది

రాజబంధువులను రాష్ట్రాధిపతులుగా అంటే పరీక్షకులుగా నియమించడం గజపతి రాజ కుమారులను రాజ బంధువులను రాష్ట్ర పాలకులుగా నియమించాలి రాజమహేంద్ర దండపథానికి కపిలేశ్వర గజపతి తమ్ముని కుమారుడైన రఘుదేవ మహాపాత్రుని నియమించాడు కపిలేశ్వరుని పెద్ద కుమారుడైన హంవీరుని కొండవీటి పాలకునిగా నియమించాడు అతని కుమారుడు దక్షిణ కపిలేశ్వరుడు ఉదయగిరి పాలకుడుగా నియమింపబడ్డాడు కొన్ని దుర్గాలకు నమ్మకస్తులైన బంధువులను కూడా అధిపతులుగా నియమించారు కపిలేశ్వర గజపతి కొండవీడును జయించి క్రీ శ 1454లో అతని బంధువైన గుహిదేవుని కుమారుడైన గణదేవుడని కొండవీటి పాలకునిగా నియమించాడు అతని తర్వాత హంవీరుని కొన్ని దుర్గాలకు నమ్మకస్తులైన సేనాధిపతులను కూడా అధిపతులుగా నియమించారు వారిలో సీతాబ్ఖాన్ ముఖ్యుడు ఇతడు ప్రతాపరుద్ర గజపతి కాలంలో ఖమ్మం దుర్గాధిపతిగా ఉండేవాడు కొన్నాళ్లు రాజమహేంద్ర దుర్గాధిపతిగా కూడా పని చేశాడు

సీమ రెడ్డి రాజుల కాలం నాడు సీమ అని పిలిచిన విభాగాన్నే దండపథం అని పిలిచారు సీమకు కేంద్రం కోట ఆ కోట పరిసర గ్రామాలను దానికి అనుబంధం చేసి ఆ గ్రామాల రక్షణ బాధ్యతను అప్పగించేవారు

స్థలం దండపథం అంటే సీమ కొన్ని స్థలాలుగా విభజింపబడింది స్థలాలు పన్ను వసూలు కేంద్రాలుగా భావింపబడ్డాయి ప్రతి స్థలానికి స్థలకరణం అనే అధికారి ఉండేవాడు అతనికి పాత్రుడు అనే

బిరుదు కూడా ఉంది సీమ స్థలం అనేవి భాగాలు రెడ్డిరాజుల కాలం నాడు ఉన్నవే అంటే గజపతులు ఆ విభాగాలను యధాతథంగా కొనసాగించారని చెప్పవచ్చును కాకపోతే సీమకు దండపథం అనే పేరు మార్చారు అది ఒరియా భాష పదం కావచ్చును

గజపతులు గొప్ప సైన్యాన్ని పోషించారు వారికి గజ సైన్యం ఎక్కువ ఉండేది కనుక వారికి గజపతులు అని పేరు వచ్చింది అశ్వదళం పదాతి దళాలు కూడా ఎక్కువగానే ఉండేవి గజపతులు తమ సైనికులకు గట్టి శిక్షణ ఇచ్చేవారు సైనికులు రోజూ వ్యాయామం చేసేవారు పెద్ద పెద్దబండలు బరువులు మోసేవారు పెద్ద ఇత్తడి తాళం సిబ్బెలను ఒకేసారి పగులగొట్టగలిగేవారట కత్తితో ఒక దెబ్బతో చింతమానులను తెగవేసే వారట వంచేవారట ఇతర దేశాలకు చెందిన పెద్ద పెద్ద వస్తాదులతో కుస్తీలు చేసేవారు కనుకనే గజపతులు యుద్ధాలలో అద్భుత విజయాలు సాధించారు నూరు సంవత్సరాలు దక్షిణ భారతదేశంలో గజపతులు ప్రముఖ పాత్ర నిర్వహించారు బహమనీ సుల్తాన్‌లను అనేక పర్యాయాలు ఓడించి బీదరు వరకు వారి ప్రాంతాలను ఆక్రమించగలిగారు ఈ ఘనత అంతా వారి సైన్యానిదే

సైనిక శాఖ సైనిక నిర్వహణకు ప్రత్యేకంగా మిలిటరీ డిపార్టుమెంటు ఉండేది దానికి అధిపతి రాజు ఈ శాఖకు అనుబంధంగా సంధి విక్రగహ అనే మంత్రి ఉండేవాడు ఇతనిని విదేశాంగ మంత్రి అని చెప్పవచ్చును అతడు విదేశ రాయబారులతో సంప్రదింపులు జరిపేవాడు విదేశాలకు దూతలను పంపుతాడు సరిహద్దు రాజ్యాల రహస్యాలను సేకరించేవాడు ఇతని శాఖలో అనేక మంది ఉద్యోగులు ఉండేవారు వారు అతనికి విధులు నిర్వహించడంలో సహాయపడేవారు కపిలేశ్వర గజపతి కాలంలో ఈ పదవిని మహాపాత్ర మధుకేశ్వరుడు నిర్వహించాడు

యుద్ధ బీభత్సాలు గజపతులు యుద్ధ సమయాల్లో అనేక బీభత్సాలు సాగించేవారని అప్పటి సాహిత్యం వల్ల తెలుస్తోంది యుద్ధ సమయాల్లో గ్రామాలను దోచుకొని ధ్వంసం చేసి దహనం చేసినట్లుగా కనిపిస్తోంది కపిలేశ్వరుని మరణానంతరం అతని ఇద్దరి కుమారులు హంవీరుడు పురుషోత్తముడు యుద్ధాలకు దిగారు పురుషోత్తముడు అన్న హంవీరుని పైకి యుద్ధానికి వచ్చి తిరిగిపోతూ హంవీరుని అధికారంలో ఉన్న ప్రాంతంలో అనేక గ్రామాలను దోచుకొని ప్రజలను చంపించాడు హంవీరుని కుమారుడు దక్షిణ కపిలేశ్వరుని కాలంలో తమిళదేశంపై దండెత్తి అక్కడ గ్రామాలను నాశనం చేసి దేవాలయాలను కూడా దోచుకున్నట్లు క్రీ శ 1472వ సంవత్సరం నాటి దక్షిణక ఆర్కాటు జిల్లా శాసనాలు తెలుపుతున్నాయి ఆ శాసనాలు ఒడియనగలబై అని పేర్కొన్నాయి అంటే ఒరియా వారి అల్లర్లు అని అర్థం ఈ దాడులలో ఒక దేవాలయం ప్రకారం కూలిపోయిందట అనేక దేవాలయాల మండపాలు గోపురాలు కూలిపోయాయట వాటన్నింటిని పునరుద్ధరించడానికి సాళువ నరసింహరాయుని ఉద్యోగి అన్నమరసర్ అనే అతడు శాసనం ప్రజల వద్ద నుండి ప్రత్యేక పన్నులు వసూలు చేశాడని మండపాలు గోపురాలు పునర్నిర్మించాడని మరొక శాసనం చెబుతోంది ఈ శాసనాలను శాసనాలను బట్టి దక్షిణ కపిలేశ్వరుడు తమిళదేశంలో అనేక గ్రామాలు దేవాలయాలను దోచుకున్నాడని భావించబడింది అలాగే తర్వాత పురుషోత్తముడు కంచి మీద దాడి చేసి అలాగే స్థానిక రాజును ఓడించి అతని కుమార్తె పద్మినిని తెచ్చుకొని వివాహమాడాడు ఆమెకు కలిగిన కుమారుడే ప్రతాపరుద్రగజపతి అదే సందర్భంలో కంచి దేవాలయంలోని శక్తిగోపాలుని విగ్రహాన్ని తీసుకువెళ్లి పూరీ జగన్నాథుని దేవాలయంలో ఉంచారట కాని పూరీ జగన్నాథుడు అందుకు అభ్యంతరం చెప్పాడట కనుక ఆ విగ్రహాన్ని అక్కడి నుండి తరలించి మహానది ఒడ్డున మరొక దేవాలయం నిర్మించి అందులో ఆ విగ్రహాన్ని ప్రతిష్టించాడట ఈ విషయాలన్నింటి ద్వారా అంతకు పూర్వపు చోళ చాళుక్య కాకతీయ యుగాలలో జరిగినట్లే యుద్ధ సమయాలలో అమానుష దహనకాండ దోపిడీలు కొనసాగాయని చెప్పవచ్చును

విజయనగర సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థ

విజయనగర సామ్రాజ్య పరిపాలనా వ్యవస్థను తెలుసుకోడానికి విజయనగర శాసనాలు ఆముక్త మాల్యద రాయవాచకాలు పరాశర మాధవీయం సకలనీతి సమ్మతం పెరిష్టా న్యూనిజ్ నికోల్‌కొంటి అబ్దుల్ రజాక్ పేస్ ఇబన్‌బటూటా బార్బొస్ మొదలైన విదేశీ రచనలు ఉపయోగపడుతున్నాయి ఆ నాటి రాజనీతి గ్రంథాలు ఆముక్తమాల్యద శుక్రనీతి పరాశరమాధవీయం సకలనీతి సమ్మతం ఉత్తమరాజుకు

ఉండ వలసిన మంచి లక్షణాలను వివరిస్తున్నాయి రాజులు ఆ రాజనీతి గ్రంధాలలో చెప్పిన ధర్మసూత్రాల ప్రకారం పాలించాలని ప్రజలు భావించేవారు సాధారణంగా నాటి రాజులు కొన్ని అత్యవసర సందర్భాలలో తప్ప సాధారణంగా ధర్మసూత్రాల ప్రకారమే పాలన జరిపేవారు కొన్ని రాజకీయ అవసరాల దృష్ట్యా కొన్ని సందర్భాలలో రాజులు ధర్మశాస్త్రాలను ఉల్లంఘించడం కూడా జరిగేది ఆదర్శం కన్నా అవసరం గొప్పది కనుక అలాంటి సందర్భాలలో అవసరమే ప్రాముఖ్యతను సంతరించుకొనేది మిగతా సమయాలలో సాధారణంగా రాజులు ప్రజలకు అపకారం తలపెట్టేవారు రాచరికం దైవదత్తం క్షత్రియుల గుత్తాధికారం అనే నమ్మకం ఈ కాలం నాటికి సడలిపోయింది అంతేకాదు పుట్టుకతో ఎవరూ పరిపాలకుడైనా అతనిలో విష్ణు అంశ ఉంటుందనే భావం ప్రాచుర్యం పొందింది అందువల్ల ఈ కాలంలో శూద్రులే రాజ్యాధికారాన్ని చెలాయించారు అన్ని రాజనీతి గ్రంధాలు అదే భావాన్ని వెలువరించాయి

ఆముక్తమాల్యదలో రాయలు చెప్పిన రాజనీతి కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో వానప్రస్థాశ్రమానికి పోతున్న యువరాజు తన కుమారునికి రాజనీతి బోధిస్తున్నట్లుగా పాత్రలను సృష్టించి రాజనీతిని అద్భుతంగా చెప్పాడు అందులో రాజనీతి అంతా కృష్ణదేవరాయల అనుభవజ్ఞానం అని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు ఈ రూపంలో రాయలు ఆనాటి రాజరికపు స్వభావాన్ని వర్ణించాడు రాయలు తన గ్రంథంలో రాజు అతని దిన చర్య మంత్రులు ఉద్యోగులు భటుడు రాష్ట్రాలు దుర్గాలు ఆటవికులు శత్రువులు ఆదాయవ్యయాలు వ్యాపారం వాణిజ్యాలు మొదలైన 69 పరిపాలనాంశాలను సమగ్రంగా చర్చించాడు

రాజు ప్రజలయందు దయగలిగి ఉండాలి వారి యోగక్షేమాలు చూడాలి ప్రజలను బాధించకూడదు అతిగా దండించకూడదు ఉద్యోగులలో అవినీతిపరులను ప్రజలను బాధించే వారిని క్షమించకూడదు శత్రువులను జాగ్రత్తగా కనిపెట్టాలి రాచ వ్యవహారాలలో ఎల్లప్పుడూ అమితజాగరూకుడై ఉండాలి వ్యక్తిగతంగా కామానికి దాసుడు కారాదు భోగాలు అనుభవించటంలో కూడా ధర్మాన్ని అతిక్రమించకూడదు అని రాజుకు హితోపదేశం చెయ్యడమేగాక రాజు దినచర్యను కూడా వివరించాడు కౌటిల్యుడు అర్థశాస్త్రంలో కూడా రాజు దినచర్యను నిర్దేశించాడు అలాగే రాత్రులు కూడా రాజు దినచర్యను పేర్కొన్నాడు రాజు ప్రతిరోజు మంత్రులు జ్యోతిష్కులు ఇష్టులతో గోష్ఠి జరపాలి తర్వాత సభ చేయాలి మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకోవాలి సాయంత్రం పండిత సభలు జరపాలి ఆ తర్వాత వార్తాహరులకు దర్శనమిచ్చి వారు తెచ్చే వార్తలను వినాలని వివరించాడు

తర్వాత అమాత్యులకు ఉండవలసి లక్షణాలను చెప్పాడు మంత్రులు 50 సంవత్సరాలు పైబడినవారు మంచి విజ్ఞానులు మంచి అనుభవం కలిగినవారు అయి ఉండాలి రాజుల మేలుకోరువారై ఉండాలి అలాంటి వారు లభించకపోతే రాజులే స్వయంగా అన్ని పాలనా వ్యవహారాలు చూసుకోవాలి రాజు పట్ల వినయం నటిస్తూ శత్రు రాజులను ప్రోత్సహించేవారు అపకారం తలపెట్టేవారు కూడా ఉంటారు అలాంటి మంత్రులను తక్షణం తొలగించాలి మంత్రుల సంఖ్య కూడా పరిమితంగానే ఉండాలి అలాంటి ఉత్తమ గుణాలు గల వారిని ఉద్యోగులుగా నియమించుకోవాలి లంచగొండులు లోభివారు ప్రజలను పీడించే వారిని ఉద్యోగులుగా నియమించరాదు ప్రజలను ఆపదలో ఆదుకొనే ఉద్యోగులే నిజమైన రాజోద్యోగులు విశ్వాసపాత్రులై రాజ్యపు రహస్యాలు దాచే ఉత్తమ ఉద్యోగులను నియమించుకోవాలి రాజు కోసం ప్రాణాలు అర్పించే అత్యంత విశ్వాసపాత్రులనే సైన్యాధిపతులుగా దుర్గాధిపతులుగా నియమించాలి దుర్గాలలో మంచి ఆయుధాలు ఆహార పదార్థాలు నిండుగా ఉండాలి శత్రుదుర్భేధ్యంగా దుర్గాలను రూపొందించుకోవాలి రాష్ట్రాల అభ్యుదయానికి రాష్ట్రపాలకులు పనిచేయాలి ఆటవికులను సైనికులుగా వినియోగించుకోవాలి అలాగే ఆటవికుల నుండి ప్రజలను కాపాడాలి ఆటవికులను ప్రమాదం ఉన్నచోట శూద్రులైన పాలకులను నియమించాలి దొంగలను నిర్మూలించాలి దొంగలు తప్పించుకొనిపోవడానికి కారకులైన రక్షకభటులను కఠినంగా శిక్షించాలి రాయలు శత్రువులను గూర్చి దీర్ఘంగా చర్చించాడు శత్రువులు అంత. శత్రువులు బహిః శత్రువులు అని రెండు రకాలని అరిషడ్వర్గాలు అంత శత్రువులని వాటిని జయించాలని అంటాడు బహిః శత్రువులు తిరిగి రెండు రకాలు తన రాజ్యంలోనే ఉంటూ అపకారం తలపెట్టేవారు ఒక రకం పరాయి రాజులు రెండవ రకం శత్రువులు అని వర్గీకరించాడు

రాయలు శత్రువులను ఓడించు వారి సంపదలు వశం చేసుకో కాని వారిని చంపవద్దు అని అంటాడు అలాగే రాజ్యక్షేమం కోసం చారులను నియమించి వారి ద్వారా శత్రువులతోపాటు తన మంత్రులు సామంతులు ఉద్యోగుల చర్యలను కూడా తెలుసుకోవాలి సామంతులతో స్పర్ధలు కలిగినప్పుడు వారు ప్రత్యర్థి గుట్టులు రాజుకు చెప్పి తాము రాజు ఆదరాభిమానాలను పొందాలని ప్రయత్నిస్తారు ద్రోహ బుద్ధి మానుకొని భక్తిగా కొలుస్తారని యమునరాజైన తన కుమారునికి బోధిస్తాడు అంటే సామంతుల సైన్యాధిపతులుగా బ్రాహ్మణులను నియమించుకోమని కూడా ఉద్బోధ చేశాడు విదేశ వర్తకులకు బహుమానాలు గ్రామాలతో కూడిన జాగీరులు ఇచ్చి వారు తెచ్చే గుర్రాలు ఏనుగులు తనకు అమ్మేటట్లు చేసుకో అనీ శత్రువుల రాజ్యాన్ని అవసరమైతే దగ్ధం చేసి అయినా ఓడించి కోటలను స్వాధీనం చేసుకోమని కూడా భోదించాడు కృష్ణదేవరాయలు రాజుతో సంబంధం గల వారిని ఒకటి పండితులు కవులు వైద్యులు జ్యోతిష్కులు విజ్ఞానులు రెండు పన్నులు వసూలు చేసే ఉద్యోగులు ఇతర రాజోద్యోగులు మూడు రాజు చేత శిక్షింపబడినవారు అనే మూడు తరగతులుగా విభజించాడు వీరిలో మిత్రులు శత్రువులు కూడా ఉండవచ్చును రాజు చేత శిక్షింపబడి ఆస్తులు పోగొట్టుకున్నవారు శాశ్వత శత్రువులు అని వారు తాము కోల్పోయిన ఆస్తులను తిరిగి పొందడానికి సర్వప్రయత్నాలు చేస్తుంటారు కనుక వారిని ఎప్పుడూ నమ్మరాదని వివరించాడు ఇక ప్రజలను గురించి చెబుతూ తప్పు చేస్తే చాలా భయంకర శిక్షలు పడతాయనే భయాన్ని కలిగించి ప్రజలను అదుపులో పెట్టుకోవాలని చెప్పాడు కాని వారిని మరీ బెదిరించి అధిక పన్నులు విధించి ప్రజలు తమ ఆస్తులు అమ్ముకొని రాజ్యం విడిచి వెళ్లేలా చేయగూడదని హెచ్చరిస్తాడు ప్రజలు అలా వెళ్లిపోయేలాగా చేస్తే ప్రపంచం మొత్తాన్ని జయించినా రాజ్యంలో సంపద ఉండదు రైతులు ఉండి పంటలు పండించాలి వృత్తి పనివారు ఉండి ఉత్పత్తి చేయాలి కనుక ప్రజల సంక్షేమం కూడా ముఖ్యమే కనుక వారిని అదుపులో ఉంచడానికి మాత్రమే బెదిరించాలి గాని వారిని నాశనం చేయడానికి కాదని స్పష్టపరిచాడు

ఆదాయాలు - ఖర్చు రాయలు రాజ్యపు ఆదాయాన్ని నాలుగు భాగాలుగా ఖర్చుచేయాలని అంటాడు. ఒక భాగం రాజ కుటుంబం ఖర్చు ఒక భాగం సైనిక నిర్వహణకు మూడవ భాగం ప్రజాసంక్షేమం దేవ బ్రాహ్మణ పండిత పోషణకు నాల్గవ భాగం కోశాగారంలో నిల్వ ఉండాలి అని అంటాడు పండితులకు దేవాలయాలకు ఖర్చు పెట్టేది నిష్ప్రయోజనం కాదు అది కూడా మంచి ఖర్చే అని కూడా అంటాడు ఈ విధంగా శ్రీకృష్ణదేవరాయలు రాజనీతిని బోధించాడు ఇదంతా అతని కాలం నాటి పరిపాలనా స్వభావమని చెప్పవచ్చును

రాజు హిందూ ధర్మశాస్త్రాలు రాజ్యం సప్తాంగ సమన్వితమని వివరిస్తున్నాయి రాజు అమాత్య జనపద దుర్గ కోశం దండ మిత్రసప్తాంగాలు కనుక విజయనగర రాజులు కూడా సప్తాంగ సమన్వితమైన పరిపాలనను రూపొందించారు

పట్టాభిషేకం రాజ్యానికి రాజు అయ్యే వ్యక్తి పట్టాభిషేకం జరుపుకుంటాడు అతనికి రాజ్యాన్ని పాలించే అధికారం ఇవ్వబడిందని దాని అర్థం విజయనగరాన్ని దర్శించిన విదేశీయాత్రీకులు విజయనగర రాజుల పట్టాభిషేకాన్ని ప్రస్తావించారు పట్టాభిషేకంలో బ్రాహ్మణులు వేదమంత్రాలను పఠిస్తూ శిరస్సుపై మంత్రజలాన్ని చల్లి తర్వాత కిరీటాన్ని నెత్తిన పెడతారు దాంతో అతనికి రాజ్యంపైన సర్వాధికారాలు వస్తాయి పట్టాభిషేక మహోత్సవానికి రాజ్యంలోని సామంతులు ఉన్నతోద్యోగులు ప్రజాప్రముఖులు కూడా హాజరవుతారు వారి సమక్షంలో పట్టాభిషేకం జరగాలి అందువల్ల వారందరూ అతనిని రాజుగా అంగీకరించినట్లు

వారసుని నియామకం రాజు తన చివరి కాలంలో తన వారసుని ప్రకటిస్తాడు తన కుమారులలో ఒకరిని తనకు వారసునిగా ప్రకటించి యువరాజు పట్టాభిషేకం జరుపుతాడు తనకు కుమారులు లేనప్పుడు రాజకుటుంబంలో ఎవరు వారసత్వానికి అర్హులో వారిని వారసునిగా నియమిస్తాడు యువరాజులకు అన్ని విద్యలలో ఆరితేరిన వారి చేత శిక్షణ ఇప్పిస్తారు అన్ని రకాల యుద్ధ విద్యలు నేర్పుతారు పండితులు మంత్రులు విద్యాశాస్త్ర విషయాలు మంత్రాంగంలోని మర్మాలన్నీ బోధిస్తారు కళలలో ప్రవేశం కల్పిస్తారు కొన్ని సందర్భాలలో యువరాజులను రాష్ట్రపాలకులుగా నియమిస్తారు రాజ్యానికి వారసుడు

బాలుడయినట్లయితే అతనికి సంరక్షకుని నియమించేవారు

ధర్మశాస్త్ర పాలన భారతదేశ పరిపాలనా వ్యవస్థలో అతిముఖ్య విషయం రాజులకు స్వయం నిర్ణయాధికారం లేదు రాజ్య పాలనా విధానాలు ధర్మశాస్త్రాలలో నిర్దేశించారు ఇది వేదకాలం నుండి వచ్చే ఆచారం ఏ రాజు అయినా ధర్మశాస్త్రాల ప్రకారం పాలించవలసిందే దాంతోపాటు దేశ ఆచారాలను కూడా గౌరవించాలి ధర్మశాస్త్రాలను అతిక్రమించడానికి వీలులేదు ఇతర దేశాలకు భారతదేశానికి ఉన్న అతిముఖ్య తేడా ఇదే విదేశీ రాజులకు ఇలాంటి నియంత్రణ లేదు కనుక వారు నిరంకుశ రాచరికాన్ని అమలు పరచగలిగారు కాని భారతదేశపు రాజులకు ఆ స్వేచ్ఛ లేదు వారు ధర్మానికి ప్రతినిధులు మాత్రమే

రాజు విధులు రాజులకు అనేక విధులున్నాయి ప్రజలను శత్రుదాడుల నుండి కాపాడాలి ప్రజల బాధలను తెలుసుకొని పరిష్కరించాలి ధర్మశాస్త్ర నియమాలను అమలుజరపాలి ప్రజాభిప్రాయాన్ని మన్నించాలి ప్రజాభీష్టాన్ని తిరస్కరించడానికి వీలులేదు కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ప్రజల కష్టాలను తెలుసుకొని తొలగించాలి ప్రజల హృదయాలలో ఉండే ఆర్తనాదాలను దేవుడు తెలుసుకొని వారి బాధలను తీర్చని రాజును ఎలా నాశనం చేయాలో దేవునికి తెలుసునని బోధించాడు రాజు దైవాంశ సంభూతుడని ధర్మశాస్త్రాలు తెలుపుతున్నాయి కనుక దేవుడు జీవులను కాపాడినట్లు రాజు ప్రజలను కాపాడాలని ధర్మశాస్త్రాలు ఘోషిస్తున్నాయి ఈ ధర్మాలన్నింటినీ విజయనగర రాజులు పాటించారు వారి పరిపాలనను గమనిస్తే వారు ధర్మశాస్త్రాల ప్రకారం నడుచుకున్నారని అర్థమవుతోంది కాని డా విన్సెంట్ స్మిత్ విజయనగర రాజులు అంతులేని నిరంకుశత్వాన్ని నెరపారని వ్యాఖ్యానించాడు కాని వాస్తవం కాదు వారు ఎప్పుడైనా నిరంకుశత్వాన్ని పాటిస్తే అందుకు కారణం ఉందని ఈశ్వరప్రసాద్ వివరించాడు విజయనగర చక్రవర్తులు ప్రజాభీష్టాన్ని ఎన్నడూ తృణీకరించలేదు ప్రజాసంక్షేమం కోసం పాటుపడ్డారు ప్రజాక్షేమం కోసం పాటుపడే రాజులను ప్రజలు కాపాడుకుంటారని కనుక ప్రజలను కాపాడటానికి రాజులు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలని కృష్ణదేవరాయలు రాజులకు హితబోధ చేశాడు

పరిపాలనా స్వభావం విజయనగర పరిపాలనా స్వభావాన్ని గురించి చరిత్రకారులు భిన్నాభిప్రాయాలు వెలువరించారు దక్షిణ భారతదేశాన్ని పాలించిన పూర్వపు రాజవంశాలతో పోలిస్తే విజయనగర రాజ్యం భిన్నంగా కనిపిస్తుందని వ్యాఖ్యానించారు కాకతీయ సామ్రాజ్య విచ్ఛిన్నం తర్వాత దక్షిణ భారతదేశాన్ని కబళించడానికి ఇస్లాం మతవ్యాప్తికి నడుం కట్టిన బహమనీ రాజ్య వ్యాప్తిని అరికట్టి హైందవ ధర్మాన్ని భారతదేశపు ప్రాచీన సంస్కృతిని భారతీయ వ్యవస్థలను కళలను కాపాడటమే తమ లక్ష్యంగా పెట్టుకొని దక్షిణ భారతదేశచరిత్రలో 3 శతాబ్దాల పాటు చారిత్రకమైన పాత్రను నిర్వహించింది విజయనగర సామ్రాజ్యం కనుక మధ్యయుగంలో దక్షిణ భారతదేశపు హిందూ రాజ్యాలలో ఏ రాజ్యం కూడా విజయనగర రాజ్యం లాగా యుద్ధానికి సిద్ధంగా లేదు సర్వవేళలా యుద్ధానికి సిద్ధంగా రూపొందించబడింది కనుక విజయనగర రాజ్యం సైనిక రాజ్యవ్యవస్థ అని నీలకంఠశాస్త్రి వ్యాఖ్యానించారు ఇంకా టి వి మహాలింగం ఆచార్య అప్పాదొరై డా నేలటూరి వెంకటరమణయ్యలు కూడా ఇంచుమించు అదే అభిప్రాయం వెల్లడించారు అయితే వారు అది సైనిక రాజ్యవ్యవస్థ అని చెబుతూనే అది నిరంకుశ రాచరికం కాదని అన్నారు నేలటూరి వెంకటరమణయ్య రాజ్యంలో విజయనగర చక్రవర్తి ఉన్నత అధికారి అతని అధికారాన్ని పరిమితం చేయడానికి ప్రభుమండలిగాని ప్రజాసభలుగాని లేవు అయినా విజయనగర రాజులు నిరంకుశులు కారని అన్నారు డా బి యస్ యల్ హనుమంతరావు ఆ నాటి పరిస్థితుల వల్ల రాజ్యపు సైనిక అవసరాల దృష్ట్యా అలాంటి పరిపాలనావ్యవస్థ ఏర్పడింది కాని విజయనగర రాజ్య పరిపాలన కేంద్రీకృత నిరంకుశ రాచరికం కాదని అన్నారు రాచరికం వారసత్వమైనది అయినప్పటికీ రాజులు బలహీనులైనా వ్యసనపరులైనా లేక రాజ్యభద్రతకు ప్రజాసంక్షేమానికి వ్యతిరేకంగా ప్రవర్తించినా వారిని తొలగించి బలవంతులు సింహాసనమెక్కి రాజ్యాన్ని రక్షించారు కనుకనే సాళువ తుళువ ఆక్రమణలు జరిగాయని కూడా డా బి యస్ యల్ హనుమంతరావు వ్యాఖ్యానించారు కంభంపాటి సత్యనారాయణ విజయనగర రాజ్యం మధ్యయుగపు ఫ్యూడల్ వ్యవస్థకు చెందిందని అన్నారు అంతేగాక ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు బోధించిన రాజనీతి కూడా అచ్చు ఫ్యూడల్ వ్యవస్థ లక్షణాలతో కూడిందేననే అభిప్రాయం వెలువరించారు బి యస్ యల్ హనుమంతరావు కూడా విజయనగర రాజ్యం భూస్వామ్య పద్ధతుల మీదనే

రూపొందించబడిందని అభిప్రాయపడ్డారు కె వి సుబ్రమణ్య అయ్యర్ టి వి మహాలింగం ఎ కృష్ణస్వామి నీలకంఠశాస్త్రి మొదలైన వారు విజయనగర కాలంలో తమిళదేశంలో స్థానికసంస్థలు తమ పూర్వపు ప్రాబల్యాన్ని పోగొట్టుకున్నాయని వివరించారు కర్ణాటకంలో మాత్రం పూర్వపు పద్ధతే కొనసాగిందని కనుక అది ఫ్యూడలిజం లక్షణమేనని అన్నారు కాని ఇష్ట పూర్తిగా ఏనాడూ సామంతులుగా ఉండటాన్ని ఇష్టపడలేదు కనుక దానిని ఫ్యూడలిజం అని అనడానికి వీలులేదని అన్నారు న్యూనిజ్ పేస్ వర్ణనలు ఫ్యూడలిజానికి సరిపోతున్నాయని మరికొందరు అన్నారు న్యూనిజ్ రచనల ప్రకారం భూమి మొత్తం రాజుకు చెందుతుంది దానిని అతడు భాగాలు చేసి దళాధిపతులకు ఇస్తాడు దళాధిపతులు భూమిని సాగు చేయడానికి రైతులకు కౌలుకు ఇస్తారు వారు $^{9}/_{10}$వ వంతు పంటను ప్రభువుకు చెల్లిస్తారు వారికి సొంత భూమి అంటూ లేదని రాశాడు కాని ఇది వాస్తవం కాదు ఈ పద్ధతి ఐరోపాలో ఉంది కాని ఇక్కడ రైతులకు తమ భూములపై పూర్తి హక్కులున్నాయి వారు ఇక్కడి పరిస్థితిని ఐరోపా దాని లాగా ఉందని అనుకొన్నారు కనుక వెంకటరమణయ్య నాయంకర విధానానికి ఫ్యూడలిజానికి కొన్ని పోలికలు ఉన్నా కొన్ని భేదాలు కూడా ఉన్నాయని ఈ పద్ధతి కేంద్ర ప్రభుత్వానికి లోబడి సైనిక సేవ చేయడానికి ఇవ్వబడిన ఆస్తిహక్కు మాత్రమే అని అన్నారు బర్టన్ స్టెయిన్ అనే పండితుడు కూడా ఇదే అభిప్రాయాన్ని వెల్లడించారు అంతేగాక ఈ అమరనాయక విధానాన్ని ఐరోపా ఫూడలిజంతో పోల్చి అధ్యయనం చేయవలసిన అవసరంలేదని కూడా అన్నారు విజయనగర ప్రభువులు రాజ్యరక్షణకు ఈ అమరనాయకులపైన ఆధారపడ్డారు కనుక విజయనగర రాజ్యం అనేకమంది సైనికనాయకులతో కూడిన సైనిక సమ్మేళన రాజ్యం అని నీలకంఠశాస్త్రి వ్యాఖ్యానించారు దీని ప్రకారం అమరనాయకులు కేంద్ర ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సంధానకర్తలుగా వ్యవహరించారు కనుక విజయనగర రాజ్య పరిపాలన కేంద్రీకృత నిరంకుశ రాచరికం కాదు

నాయకులు విజయనగర రాజ్యంలో సైనిక నాయకులు మొదటి నుంచీ ప్రముఖ పాత్ర నిర్వహించారు కర్ణాటక శాసనాలలో నాయక పదవి విజయనగర యుగానికంటే 300 సంవత్సరాల ముందునుండే కనిపిస్తుంది ఆంధ్రదేశ శాసనాలలో మాత్రం 200 సంత్సరాల ముందు నుండి కనిపిస్తుంది 11వ శతాబ్దం శాసనంలో నాయకపదం లిఖించబడింది దానిని ఆధారంగా తీసుకొని డెరైట్ అనే పండితుడు నాయక అంటే ఒక సైనికోద్యోగి అని చెప్పి ఆ పదవిని ఇంగ్లండ్‌లోని కెప్టెన్ పదవితో పోల్చాడు కాని 12వ శతాబ్దపు శాసనంలో హాలక్కరే నాయకుడు తన సార్వభౌమాధికారిని ధిక్కరించి తన అధికారాన్ని ప్రకటించుకున్నాడు ఈ శాసన విషయాన్ని పరిశీలించిన డెరైట్ నాయకుడు ఒక ప్రాంతానికి అధికారాన్ని అయి ఉంటాడని భావించాడు 13వ శతాబ్దానికి చెందిన కాకతీయ శాసనాలు కొమరవిల్లి మాల్యాల విరియాల నాయకులను పేర్కొంటున్నాయి ప్రతాపరుద్రుని కాలంలో 75 మంది నాయకులు ఉన్నట్లు శాసనాలు నాటి సాహిత్యాలు తెలుపుతున్నాయి బర్భన్ స్టెయిన్ అనే పండితుడు నాయకుడు అనే అతడు ఒక ప్రదేశానికి అధిపతిగా ఉంటూ యుద్ధాలలో పాల్గొనే వీరుడు అయి ఉంటాడని అన్నాడు విజయనగర రాజ్యంలో నాయకులు గొప్ప పాత్ర నిర్వహించారని వారి శాసనాల ద్వారా తెలుస్తోంది తమిళదేశంలో క్రీ శ 1371 నుండి క్రీ శ 1422 వరకు ఆరుగురు నాయకులు ఉండేవారు క్రీ శ 1440 నుండి 1459 మధ్య కాలంలో 6 నుండి 12 మంది నాయకుల వరకు పెరిగారు క్రీ శ 1465-1491 మధ్యకాలంలో 9 మంది నాయకులు ఉన్నట్లు నాటి శాసనాలు తెలుపుతున్నాయి ఈ నాయకులందరూ దేవాలయాలకు దానాలు చేశారు చెరువులు బాగుచేయించారు నూతన తటాకాలను నిర్మించారు భూములను సాగులోకి తెచ్చారు వ్యాపార సుంకాలు వసూలు చేసేవారు కాని ఈ నాయకులు విజయనగర చక్రవర్తులకు కప్పం చెల్లించినట్లు ఏ శాసనాలు చెప్పలేదు ఐరోపాలో ఫ్యూడల్ లార్డ్ బాధ్యతలు నెరవేరుస్తున్నట్లు కూడా లేదు న్యూనిజ్ మాత్రం నాయకులు కప్పం చెల్లిస్తున్నారని రాశాడు అతడు విజయనగర సామ్రాజ్యంలో 200 మంది నాయకులున్నారని కూడా రాశాడు సామ్రాజ్యపు తొలికాలంలో అతి తక్కువగా ఉన్న నాయకుల సంఖ్య కృష్ణదేవరాయల కాలం నాటికి 200 మందికి చేరింది అంటే రాజ్యపు సైనిక అవసరాలు పెరిగేకొద్దీ నాయకుల సంఖ్య కూడా పెరిగిందని భావించవచ్చును తళ్లికోట యుద్ధం వరకు విశ్వాసపాత్రులుగా ఉండి సామ్రాజ్యానికి మూలస్తంభాలుగా ఉన్న నాయకులు క్రీ శ 1565 తర్వాత స్వార్థబుద్ధికిలోనై సామ్రాజ్య పతనానికి కారకులయ్యారు ఏమైనప్పటికీ విజయనగర పరిపాలనావ్యవస్థ నాయకులతో కూడి ఉంది కనుక

అది సెగ్మెంటు రాజ్యం అని బర్టన్ స్టెయిన్ అన్నాడు కాని డి యస్ నారాయణ చంపకలక్ష్మి మొదలైన వారు బర్టన్ స్టెయిన్ అభిప్రాయం సరికాదని అన్నారు ఈ విధంగా విజయనగర పరిపాలనా స్వభావం ఎలాంటిదైనా వారి ధ్యేయం హిందూ ధర్మరక్షణ అనేది నిర్వివాదాంశం వారు స్వయంగా తమ లక్ష్యాన్ని రాజప్రతినిధులం మాత్రమేనని కూడా చెప్పుకున్నారు హిందూ ధర్మలక్ష్యసాధన కోసం విజయనగర సామ్రాజ్యం 3 శతాబ్దాలు పోరాడింది

రాజు-యువరాజు విజయనగర రాజ్యంలో సాంప్రదాయకమైన రాజరికం అమలులో ఉంది రాజు దైవాంశ సంభూతుడని నమ్మకం ఉంది రాజులు రాజాధిరాజు రాజుపరమేశ్వర అనే బిరుదులు ధరించారు నూతన రాజు వచ్చినప్పుడు పట్టాభిషేకం వైభవంగా జరిగేది కృష్ణదేవరాయల పట్టాభిషేకం వైభవంగా జరిగిందని ఆ పట్టాభిషేకానికి అనేక మంది సామంతులు హాజరయ్యారని కుమార ధూర్జటి కృష్ణరాయ విజయం తెలుపుతోంది రెండవ వెంకటపతి రాయల పట్టాభిషేకానికి అనేకమంది సామంతులు రాజ్యంలోని ప్రముఖులందరూ హాజరయ్యారని జేసూట్లు రాశారు రాజులు తరచు కొలువు కూటాలు జరిపేవారు రాయల స్వభావాన్ని ముత్యాలశాల అని శ్రీనాధుడు వర్ణించాడు కృష్ణదేవరాయల సభకు భువనవిజయం అనీ అచ్యుతదేవరాయల సభకు వెంకవిలాస మండపమనీ పేర్లుండేవి ఈ భవనాలలో పండిత గోష్టులు కూడా జరిగేవి రాజు సర్వసమర్థులేగాక గొప్ప రాజనీతి దురంధరులుగా ఉండేవారు కృష్ణదేవరాయలు రాజధర్మాన్ని తన ఆముక్తమాల్యదలో అద్భుతంగా వివరించాడు

రాజు తర్వాత స్థానం యువరాజుది అతడు పరిపాలనలో రాజుకు సహాయపడేవాడు మొదటి హరిహరరాయలు తన తమ్ముడు బుక్కరాయలను యువరాజుగా నియమించాడు ఈ విషయం రెండవ హరిహరరాయల శాసనం తెలుపుతోంది యువరాజులు రాజసోదరులను రాష్ట్రపాలకులుగా కూడా నియమించే ఆచారం ఉంది బుక్కరాయలు తన కుమారులను రాష్ట్రపాలకులుగా నియమించాడు అచ్యుత రాయలు తన కుమారుడు వెంకటపతిరాయలను యువరాజుగా చేశాడని అచ్యుతరామాభ్యుదయం తెలుపుతోంది ఈ ఏర్పాటు వల్ల రాజు తర్వాత వారసుడు నిర్ణయం చేయబడతాయి కాబోయే రాజు యువరాజుగా పరిపాలనలో అనుభవాన్ని గడిస్తాడు

విజయనగర చక్రవర్తులు సర్వాధికారులు కాని నిరంకుశులు కాదు రాచకార్యాలు వారే స్వయంగా చూసుకొనేవారు ప్రజాసంక్షేమం కోసం నిరంతరం శ్రమించేవారు రాజ్యరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టేవారు సామంతుల తిరుగుబాట్లను నిర్దయగా అణచివేసేవారు పన్నులు సుంకాలు కప్పాల ద్వారా రాజ్యపు ఆదాయాన్ని పెంచుకొనేవారు అందుకు వ్యవసాయం వర్తకం పరిశ్రమలను ప్రోత్సహించేవారు రాజ్యంలో ఎక్కడ ఏమి జరుగుతోందో తెలుసుకొనేవారు నిరంతరం అతిజాగ్రత్తగా వ్యవహరించేవారు దానధర్మాలు చేసేవారు విజయనగర రాజుల దిన చర్యలు కూడా మనకు ఆ నాటి రచనల వలన తెలుస్తున్నాయి వీరనరసింహరాయలు తెల్లవారు ఝామునలేచి భక్తిగీతాలు వినేవాడు తర్వాత బ్రాహ్మణులను పూజించి స్నానం చేసి దేవతార్చన చేసుకొని తర్వాత రాష్ట్రపాలకులు మంత్రులకు దర్శనం ఇచ్చేవాడు కృష్ణదేవరాయలు తెల్లవారు ఝామున లేవగానే వ్యాయామం కుస్తీలు గుర్రపుస్వారీ కత్తిసాము చేసి స్నానం చేసి తర్వాత రాచకార్యాలు చూసుకొనేవాడని రాయవాచకం న్యూనిజ్ రచనలు తెలుపుతున్నాయి విజయనగర రాజులు విదేశీ రాయబారులను విదేశ వర్తకులను బాగా గౌరవించి ఆదరించేవారని అబ్దుల్ రజాక్ పేస్‌లు వర్ణించారు ఆత్మరక్షణ కోసం ఆహార పదార్థాలు నీళ్లలో విష ప్రయోగం జరగకుండా అనేక కట్టుదిట్టాలు చేసేవారు రాజుకు వంట చేయటానికి నమ్మకస్తులైన ప్రత్యేక వంట వారుండేవారు స్వీయ రక్షణ కోసం విజయనగర చక్రవర్తులు అనేక మంది గూఢచారులను నియమించుకొని అంతర బహిశ్శత్రువుల కార్యకలాపాలు సేకరించేవారు మారువేషాలలో సంచరించి చారులు తెచ్చిన వార్తల నిజానిజాలు స్వయంగా తెలుసుకొనేవాడు చారులు తెచ్చిన సమాచారంలో నిజం లేకపోతే సామంతులముందే వారిని మందలించేవాడని అది విన్న సామంతులు రాత్రులందు ఒకరినొకరు కలుసుకోవడానికిగాని మాట్లాడుకోడానికిగాని జంకేవారని రాయవాచకం తెలుపుతోంది

రాజుల జననాలు-విలాస జీవితం విజయనగర రాజులు అనేక మంది భార్యలను ఉంపుడుగత్తెలను పోషించారు రెండవ దేవరాయలకు 700 మంది భార్యలని 12 వేల మంది ఉంపుడుగత్తెలని అబ్దుల్ రజాక్

రాశాడు కృష్ణదేవరాయలకు 12 మంది భార్యలు అనేక మంది ఉంపుడుగత్తెలని వారిలో చాలా మంది వయసులో ఉన్న పరపురుషుని మొఖం కూడా చూసి ఎరుగరని పేస్ వర్ణించాడు అచ్యుతదేవరాయలకు 500 మంది భార్యలు వందలాది ఉంపుడుగత్తెలు ఉన్నారని న్యూనిజ్ రాశాడు వీరి భార్యలు ఎక్కువ మంది వారి సామంతుల అమరనాయకుల కూతుళ్లేనని న్యూనిజ్ వివరించాడు వారికి ఒక్కొక్కరికి ఒక్కొక్క గది ఉంటుందని రాజు గారు ఆ గదుల ముందు నుంచి వెళుతూండగా వారు తమ ముంగిట్లో ఉండి ఆయనను ఆహ్వానిస్తూ ఉంటారని రాజుకు ఇష్టమైన రాణిగదిలోకి వెళతాడని కూడా న్యూనిజ్ రాశాడు రాజుల ఉంపుడుగత్తెలేగాక అందమైన యవ్వనవతులైన పరిచారకులు 4 వేల మంది అంతః పురంలో ఉండేవారని వర్ణించారు వీరిని కూడా రాజులు అనుభవిస్తూ ఉంటారని కూడా విదేశస్తులు వర్ణించారు ఆ రోజుల్లో ఎంత మంది భార్యలు ఉంపుడుగత్తెలు ఉంటే అంత భోగం గొప్ప తక్కువ భార్యలు ఉంటే తక్కువగా చూసేవారు స్త్రీ సుఖాన్ని అష్టభోగాలలో ఒకటిగా నాటి సాహిత్యం వర్ణిస్తోంది మంచి భవనం ఖరీదైన దుస్తుల ఆభరణాలు అత్తరు పువ్వులు తాంబూలం వక్కలు స్త్రీలు అష్టభోగాలుగా పరిగణించేవారు స్త్రీని భోగ వస్తువుగా పురుషుని ఆస్తిగా భావించడం మధ్యయుగ లక్షణం కనుక నాటిరాజులు తాము భరించగలిగినంత మంది స్త్రీలను భార్యలుగా ఉంపుడు గత్తెలుగా చేసుకున్నారని నేలటూరి వెంకటరమణయ్య మొదలైన చరిత్రకారులు వ్యాఖ్యానించారు ఆ నాటి అంత పుర స్త్రీలలో కత్తిసాము చేసేవారు కుస్తీలు నేర్చినవారు ఉండేవారట ఇంకా వారిలో నాట్యకత్తెలు గాయికలు జంత్రవాయిద్యాలు వాయించేవారు ఇంకా అనేక కళలలో ప్రవేశం కలిగిన స్త్రీలు ఉండేవారు వారంతా రాజులకు వినోదాలు కలిగించేవారు అంత పురాన్ని కాపలా కాసేవారు అంత పుర స్త్రీలు పరపురుషుని కంట పడకుండా చేసేవారు యువకులెవరూ అంత పురంలోకి ప్రవేశించరాదు ప్రవేశిస్తే కఠిన దండన ఉండేది ఆ నాటి రాజులకు వాసుపాలక లేక మహత్తరిక అనే ఆంతరంగిక స్త్రీలను వశవర్తులను చేయడం వారి ఉద్యోగం మధ్యయుగంలో అన్ని వంశాల రాజులు విదేశాలలో కూడా ఇలాంటి పరిస్థితులే ఆచరణలో ఉన్నాయి అదే పద్ధతిని విజయనగర చక్రవర్తులు కూడా అనుసరించి విలాస జీవితాలను గడిపారు రాజులను చూసి వారి సామంతులు ఇతర రాజోద్యోగులు భాగ్యవంతులు అదే విధంగా స్త్రీని విలాస వస్తువుగా చేరదీసి విలాస జీవితాలను గడిపారు

మంత్రి మండలి విజయనగర చక్రవర్తులు పరిపాలనలో తమకు సహాయపడటానికి మంత్రులను నియమించుకున్నారు మంత్రులుగా ఎలాంటి వారిని నియమించాలో ఆముక్తమాల్యద చెబుతోంది నీచ కుటుంబంలో పుట్టిన వారు చదువు సంధ్యలు లేనివారు అనాగరికులైన పల్లెటూరి వారిని అబద్ధాల కోరులను పిరికివారిని కుట్రదారులను గౌరవప్రతిష్టలు లేని వారిని ప్రతిష్టపోయినా సిగ్గు లేని వారిని అధర్మపరుడుని విదేశస్తుడిని మంత్రులుగా నియమించరాదని ఆముక్తమాల్యద కృష్ణదేవరాయల వివరించాడు బ్రాహ్మణుడైనా పై నీచగుణాలు ఉంటే మంత్రిగా తీసుకోరాదని స్పష్టంగా వివరించాడు మంత్రులు ధర్మపరులై ఉండాలి రాజనీతిలో ప్రజ్ఞావంతులై ఉండాలి 50-70 సంవత్సరాల మధ్య వయస్కుడై ఉండాలి రాచకుటుంబానికి బాగా పరిచయస్తుడై ఉండాలి మంచి ఆరోగ్యవంతుడై ఉండాలి మంచి నడవడిక కలిగి ఉండాలి రాచ కుటుంబం యందు భక్తివిశ్వాసాలు గలవాడై ఉండాలి గర్వం లేనివాడై ఉండాలని వివరింపబడింది నవరత్నాలు రచయిత కూడా మంత్రులు గొప్ప ప్రజ్ఞా పాండిత్యాల గలవారై ఉండాలని రాశాడు అయినప్పటికీ మంత్రులను ఒక కంట కనిపెట్టి ఉండాలని రాజుకు వారి చర్యలు కని పెట్టే వేగులు ఉండాలని కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో వివరించాడు నా- మంత్రులుగా బ్రాహ్మణులేగాక క్షత్రియ వైశ్య శూద్రులను కూడా మంత్రులుగా నియమించుకున్నారు విజయనగర రాజులు సాధారణంగా యుద్ధం శాంతి ఇతర రాచకార్యాలను తమ మంత్రులతో చర్చించి నిర్ణయం తీసుకుంటారు మంత్రి మండలి సలహాలను తోసివేయరాదని కృష్ణదేవరాయలు ఒకచోట రాశాడు అందు మమ్మలను సింహాసనంపై కూర్చుండపెట్టారు నిర్ణయాలు వారే తీసుకొంటున్నారు మమ్మలను పట్టించుకునే వారు లేరని రాసుకున్నాడు కాని కొన్ని సందర్భాలలో వారి సలహాలను తోసివేసిన సంఘటనలు కూడా ఉన్నాయని న్యూనిజ్ రాశాడు చక్రవర్తి తన ఇష్టులతోనే సంప్రదింపులు జరిపేవాడని పేస్ రాష్ట్ర పాలకులు ముఖ్య రాజోద్యోగులతో సంప్రదించేవాడని బార్బోసా రాశారు వీరి రాతలను బట్టి మంత్రులకు మంత్రి మండలికి ప్రత్యేక గుర్తింపు అధికారం ఉన్నట్లు కనిపించదు వారి ఇష్ట ప్రకారం

వ్యవహరించారని చెప్పవచ్చును అదే మౌర్యులు చోళుల పాలనలో రాజులు మంత్రుల సలహాలను తప్పకుండా పాటించాలి కనుక విజయనగర యుగంలో ఈ నియమం లేదని స్పష్టంగా చెప్పవచ్చును అయినప్పటికీ వారు మంత్రులను నియమించుకున్నారు ప్రధాన మంత్రికి సర్వశి॰ సభానాయక తంత్ర నాయక కార్యకర్త అని కూడా పేర్లున్నాయి రాజు తర్వాత సర్వాధికారి ప్రధాన మంత్రి మిగిలిన ఉద్యోగులు ప్రజలు అతనిని రాజు తర్వాత రాజు అంతటివాడిగా చూసేవారు రాజు లేని సమయాలలో ప్రధానమంత్రి మంత్రి మండలి సభలకు అధ్యక్షత కూడా వహించేవాడు అందువల్ల అతనికి సభానాయక అని కూడా పేరు ఉంది తర్వాత ప్రముఖ పాత్ర నిర్వహించేవాడు మంత్రి పదవులు రాజు ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉండేవి తిమ్మరుసు అంతటివాడిని కృష్ణదేవరాయలు తొలగించాడు రాయభాండారా లేక కోశాధికారి దళాధికారి లేక దన్నాయక మహాసామంతాధిపతి కూడా మంత్రివర్గంలో సభ్యులు ధర్మశాసనాధికారి అనే మరొక మంత్రి ఉన్నట్లు రాయవాచకం తెలుపుతోంది ఇంకా అనేక మంది మంత్రులు ఉండవచ్చును తరచూ మంత్రివర్గ సమాలోచనలు జరుగుతుండేవి ఈ సమావేశాలు జరగటానికి విశాల భవనం ఉండేదని అది రాజభవనానికి కుడివైపున ఉండేదని అబ్దుల్ రజాక్ రాశాడు అతడు మంత్రుల కార్యాలయాన్ని వర్ణించాడు అది చాలా పెద్దదని 40 స్తంభాలతో ఉందని దాని ముందు 30 గజాల పొడవునా మనిషి ఎత్తులో 6 గజాల వెడల్పులో ఒక వేదిక ఉందని దాని మీద దస్తరాలు పెట్టుకొని రాయకాంధ్రు రాసుకొంటున్నారని రాశాడు పేస్ మంత్రి మండలి సమావేశాలు జరిగే భవనాన్ని వర్ణించాడు ఆ మండపంలో స్తంభాల వరండాకు వస్త్రాలతో తెరలుదించాడు ఆ భవనంలో ముందు రాజు మంత్రులతో సమాలోచనలు చేస్తాడు వారిలో తిమ్మరుసు ముసలి పెద్ద తర్వాత బయట వేచి ఉన్న దళాధిపతులను నగర పెద్దలను లోపలకు అనుమతిస్తారు అప్పుడు రాయలు వారితో అన్ని విషయాలు వివరిస్తాడని వర్ణించాడు అచ్యుత రామాభ్యుదయం ఆ సమావేశాలను వర్ణించింది బార్బోసా కూడా అచ్యుతరాయల సభకు గురించి రాశాడు నిర్ణీత దినాలలో రాయలు ఆ భవనంలోకి వచ్చి తన దర్శనం కోసం ఉండే వారికి దర్శనమిచ్చి అక్కడ ముఖ్యులతో సమావేశాలు రహస్యంగా జరిగేవి కృష్ణదేవరాయలు రాయూరుపై దండెత్తే ముందు రెండు పర్యాయాలు మంత్రి మండలి సమావేశాలు జరిగినట్లు న్యూనిజ్ రాశాడు ఈ సమావేశాలలో రాజుతోపాటు ప్రధానమంత్రి ప్రముఖపాత్ర నిర్వహించేవారు రెండవ దేవరాయలి తమ్ముని కుమారుడు మంత్రిమండలిలో 20వ మంత్రి అని న్యూనిజ్ రాశాడు అతని రాతలను బట్టి రెండవ దేవరాయల కాలంలో మంత్రిమండలిలో 20 మంది సభ్యులున్నారని భావించవచ్చును వీరనరసింహరాయలు శ్రీకృష్ణదేవరాయల కాలంలో మహా మంత్రి తిమ్మరుసు ప్రధానమంత్రి సోమరసు ఉపప్రధాని అని శాసనం తెలుపుతోంది అచ్యుతరాయల కాలంలో సకలం తిమ్మయ సాళువనాయక పెద తిరుమల అనే వారు ప్రధాన మంత్రులుగా పని చేశారు అంతకు పూర్వం సాళువ నరసింహరాయలకు తుళువ నరసనాయకుడు ప్రధాన మంత్రిగా చేశాడు

రాజ గురువులు విజయనగర రాజులు గురుదీక్ష తీసుకున్నట్లు కనిపిస్తోంది రెండవ హరిహర రాయల గురువు క్రియాశక్తి ఆచార్యుడు రెండవ సంగముని గురువు శ్రీకాంతుడు నరసింహాచార్యుడు రెండవ దేవరాయలకు రంగనాథ దీక్షితులు శ్రీకృష్ణదేవరాయలకు తాతాచార్యులు రామరాయలకు తర్వాత వారికి అప్పయ్య దీక్షితులు గోవింద దీక్షితులు గురువులని వీరందరూ వారి గురువులను ప్రత్యేకంగా గౌరవించేవారని నాటి సాహిత్యం తెలుపుతోంది

పరిపాలనా శాఖలు విజయనగర ప్రభువులు పరిపాలనా సౌలభ్యం కోసం అనేక శాఖలను ఏర్పాటు చేశారు కేంద్ర ప్రభుత్వపు పరిపాలనాంశాలు వివిధ శాఖలుగా విభజింపబడ్డాయని శాసనాలు తెలుపుతున్నాయి కాని ఆ శాఖల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలు సమన్వయం ఎలా ఉండేదో తెలియడం లేదని వెంకటరమణయ్య పేర్కొన్నారు శాసనాల ద్వారా నాటి సాహిత్యం వల్ల మనకు ఆనాడు అట్టవన కందాచార భాండార ధర్మాసన సుంక వ్యవహార అనే శాఖలు ఉన్నట్లు తెలుస్తోంది వీనిలో ప్రతి శాఖను సంప్రతులు కరణాలు అనే ఉద్యోగులు నిర్వహిస్తున్నట్లు కూడా తెలియజేస్తున్నాయి రాయవాచకంలో రెండు చోట్ల 9 మంది సంప్రతులు అనే ఉద్యోగులు ఉన్నట్లు ప్రస్తావింపబడింది సంప్రతి అనే అతడు శాఖ యొక్క ప్రధాన కార్యదర్శులుగా భావించవచ్చునని కనుక 9 మంది సంప్రతులు 9 శాఖలకు ప్రధాన కార్యదర్శిగా భావించవచ్చునని వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు మల్లంపల్లి సోమశేఖరశర్మ సంప్రతి

అనే ఉద్యోగి దుర్గం యొక్క గణకుడు అయి ఉండవచ్చునన్నారు. కాని వెంకటరమణయ్య ఆ వాదనను అంగీకరించలేదు. సామ్రాజ్యంలో రాష్ట్రాలు 9 కన్నా ఎక్కువ ఉన్నాయి. కాబట్టి సంప్రతులు దుర్గాధ్యక్షులు అయి ఉండరు అన్నారు. రాయవాచకం 9 మంది సంప్రతులు, 19 రేవు పట్టణాల లెక్కలను వీరనరసింహ రాయలకు సమర్పించారని తెలుపుతోంది. అదే రాయవాచకం కృష్ణదేవరాయలు 9 మంది సంప్రతులను పిలిపించి రాజ్యానికి సంబంధించిన విషయాలు తెలుపమని అడిగినట్లు చెబుతోంది. సంప్రతులు రాజ్యపు ఆదాయ వ్యయాలు, రైతుల శిస్తులు, సీమలు స్థలాల పొలిమేరలకు సంబంధించిన లెక్కలు రాసేవారని కొందరు అన్నారు. విజయనగర రాజ్యంలో అట్టవన కందాచార, భాండార, ధర్మాసన, సుంక వ్యవహార మొదలైన శాఖలుండేవి. ఈశాఖలను ప్రధాని, ధన్నాయక, ధర్మశాసనాధికారి, భాండాగారిక మొదలైన మంత్రులు నిర్వహించేవారని తెలుస్తోంది.

కోశాగారం: రాయవాచకం విజయనగర సామ్రాజ్యంలో రాయభాండారం, చిన్నభాండారం అనే రెండు కోశాలుండేవని తెలుపుతోంది. విజయనగర సామ్రాజ్యంలో పాలకుడు మరణించగానే అతని కోశాగారానికి సీలు వేసి తాళం వేసేవారని పేస్ రాశాడు. చిన్నభాండాగారం సామంతులు, అమరనాయకుల కోశాగారాలు ఒక మంత్రి ఆధీనంలో ఉండి ఉండవచ్చునని భావింపబడింది. అచ్యుతదేవరాయ కాలంలో తిమ్మప్ప అనే అతడు భాండాగారికగా ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. భాండాగారానికి అనుబంధంగా టంకశాల కూడా ఉండేది.

రాయవాచకం ధర్మయ్య అనే అతడు ధర్మాసనుడు అని తెలుపుతోంది. ఇతడు వీరనరసింహరాయల ఉద్యోగులలో ఒకడు. అతడు బ్రహ్మదేయ గ్రామాలను పర్యవేక్షించే అధికారి అని కూడా రాయవాచకం తెలుపుతోంది. కాని అళియరామ రాయల కాలం నాటి ఒక శాసనం ధర్మపారుపత్య అనే అధికారి చెబుతోంది. ఇతడు దేవాదాయ బ్రహ్మదేయ మఠాల వ్యవహారం చూసే మంత్రి అయి ఉండవచ్చని అభిప్రాయ పడ్డారు. బళ్లారిలోని ఒక శాసనం ప్రభుత్వ ధానశాసనాలను భద్రపరిచే కార్యాలయాన్ని తెలుపుతోంది ఆముక్తమాల్యద కూడా దేవాలయాలు, సత్రాల ఆస్తులను భద్రపరిచే అధికారిని ప్రస్తావించింది. కనుక దేవాలయాలు, సత్రాల ఆస్తులపై ప్రభుత్వ నిర్వహణ ఉన్నట్లు భావించవచ్చును. ఈ శాఖ కూడా ఒక మంత్రి పర్యవేక్షణలో పని చేసి ఉండవచ్చును.

అరవణశాఖ: విజయనగర పరిపాలనాశాఖలో అతిముఖ్యమైనది అరవణ శాఖ. కృష్ణదేవరాయల కాలం నాటి క్రీ.శ.1551 సంవత్సరానికి చెందిన ఒక శాసనంలో అరవణ అనే పదం పేర్కొనబడింది అరవణ శాఖ నేటి రెవెన్యూ శాఖ వంటిదని భావించారు. ఈ శాఖ ప్రధాన మంత్రి పర్యవేక్షణలో ఉంటుంది రాజ్యానికి సంబంధించిన రెవెన్యూ విషయాలన్నీ ఈ శాఖ నమోదు చేస్తుంది. గ్రామాల సరిహద్దులు, సీమ నాడు రాజ్యాల సరిహద్దు వివరాలు ఆయా ప్రాంతాల ఆదాయాలు, గ్రామాలలోని రైతుల పేర్లు, వ్యవసాయ భూమి విస్తీర్ణం పండించే పంటలు అన్ని వివరాలు నమోదు చేయబడతాయి. ఇంకా ప్రతి గ్రామం నుండి ఎంత పన్ను వసూలు కావాలి, ఏ రైతు ఎంత బాకీ ఉన్నాడు. అన్ని వివరాలు ఇందులో రాయబడతాయి అరవణ శాఖలో మరొక విభాగం దేవాదాయ బ్రహ్మదేయ మఠభూములకు సంబంధించిన ఆదాయాన్ని నమోదు చేస్తుంది. వారికి ఇవ్వబడిన అమరాలు, చెల్లించవలసిన కప్పం, అప్పుడు చేయవలసిన సేవ అన్నీ వివరంగా రాయబడేవి. మరొక శాఖ సైనిక బలగాల నిర్వహణను పర్యవేక్షించేది. క్రీ.శ.1902 నాటి శాసనంలో రాయస్వామి అనే వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు. కొన్ని శాసనాలలో సుంకం వారు సుంకడ వారు అనే పదాలు పేర్కొనబడ్డాయి. వారు సుంకాల శాఖకు సంబంధించిన వారు అయి ఉండవచ్చునని కొందరు, కాదని కొందరు అన్నారు. అందుకు కారణం ఈ కాలంలో పన్నులు వేలం వేసేవారు. కనుక ప్రభుత్వానికి సుంకం వసూలు చేసే అధికారులు అవసరం ఉండవచ్చునని, కనుక వారు వేలం పాట పాడిన వాని తరపున సుంకం వసూలు చేసేవారు అయి ఉండవచ్చునని వెంకటరమణయ్య భావించారు. విజయనగర సార్వభౌములకు లిఖిత ఆదేశాలిచ్చే ఆచారం లేదు. వారు ఎవరికైనా ఏమైనా ఇస్తే లేదా ఆజ్ఞలు జారీ చేస్తే వాటిని అరవణశాఖలోని ఒక విభాగం వారి చిట్టాలలో నమోదు చేసుకొనేవారని న్యూనిజ్ రాశాడు. రాజు ఎవరికైనా దానం చేస్తే అతనికి తన అంగుళీయక ముద్రను ఇచ్చేవాడట. అతడు ఆ ముద్రను తీసుకువెళ్లి అరవణశాఖలోని విభాగంలో చూపితే అతనికి రాయలు ఇవ్వమని చెప్పిన దానిని

ఇచ్చి వారి చిట్టాలో రాసుకొనేవారని న్యూనిజ్ వర్ణించాడు.

రేవు పట్టణాల పర్యవేక్షణశాఖ: విజయనగర రాజ్యంలో రెండవ దేవరాయల కాలంలో 300 రేవు పట్టణాలు ఉండేవని అబ్దుల్ రజాక్ రాశాడు. రాయవాచకం వీరనరసింహుని కాలంలో 18 రేవు పట్టణాలు ఉండేవని తెలుపుతోంది. రెండవ దేవరాయల కాలం నాటి 300 రేవు పట్టణాలు వీరనరసింహారాయల కాలం నాటికి 18కి తగ్గిపోవడం చాలా ఆశ్చర్యం కలిగిస్తోంది. బహుశా ఈ 18 రేవు పట్టణాలు ప్రధాన రేవులయి ఉండవచ్చును. వాటిపై కేంద్ర ప్రభుత్వపు ప్రత్యక్ష అజమాయిషీ ఉండి ఉండవచ్చును. ఈ రేవు పట్టణాల పర్యవేక్షణ రక్షణ, అక్కడికి వచ్చే విదేశస్థుల మంచి చెడ్డలు చూడటం మొదలైన విషయాలను ఆముక్తమాల్యద ప్రస్తావించింది.

గూఢచారి శాఖ: విజయనగర రాజ్యంలో గూఢచారి శాఖ ఉండేదని ఆముక్తమాల్యద తెలుపుతోంది. రాజు నిత్యం గూఢచారులను కలుసుకొని రాజ్యంలో జరిగే విషయాలను తప్పనిసరిగా తెలుసుకోవాలని కూడా తెలుపుతుంది. గూఢచారులకు ఉండవలసిన లక్షణాలను కూడా ఆముక్తమాల్యద వివరిస్తోంది. రాయవాచకం రెండు తరగతుల గూఢచారులను పేర్కొంది. ఒక తరగతి గూఢచారులు విజయనగర రాజ్యంలో జరిగే విషయాలను తెలుసుకొనేవారు. రెండవ వర్గం శత్రురాజ్యాలలోని విషయాలు తెలుసుకొని రాయలకు నివేదించేవారు. విజయనగర పొరుగు రాజ్యాలన్నీ అంటే బహమనీలు, బీజాపూరు, గోల్గొండ, అహమ్మద్‌నగర్, బీదర్ మొదలైన ముస్లిం రాజ్యాలు, హిందూ రాజ్యమైన గజపతులు కూడా విజయనగర రాజ్యానికి శత్రువులు. వారి చర్యలను ఎప్పటికప్పుడు కనిపెట్టడానికి రెండవ వర్గ గూఢచారులు పాటుపడేవారు. వారు వారి కర్తవ్య నిర్వహణలో ప్రాణాలను కూడా లెక్కచేసేవారు కాదు. అయితే విదేశాల నుండి వచ్చే వారిపై నిఘా ఉన్నా వారికి బహుమతులు కూడా రాయలు ఇచ్చేవాడు. శ్రీకృష్ణదేవరాయలు రాత్రి సమయాల్లో నగరంలో మారువేషంలో స్వయంగా సంచరించి గూఢచారులు తెచ్చిన వార్తలలో నిజం లేకపోతే సామంతులముందే వారిని మందలించే వారని, అందువల్ల సామంతులు ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి జంకేవారని రాయవాచకం తెలుపుతోంది. ఆముక్తమాల్యద, రాయవాచకం, మనుచరిత్ర రాజ్యాల మధ్య దౌత్యసంబంధాలు నెలకొల్పుకొనే ఆచారం ఉందని, అందుకు రాయబారులను పంపేవారని తెలియజేస్తున్నాయి. రాయబారులు సమావేశాలు జరిపేవారని రాయవాచకం తెలుపుతోంది. ఆ నాడు రాయబారులకు స్థానాపతులు అని పేరుండేది. గూఢచారులు, విదేశీ రాయబారులను పర్యవేక్షించే మంత్రిత్వశాఖ లేకపోవచ్చునని, వారు సార్వభౌముని ప్రత్యక్ష అధికారం కింద పని చేసి ఉండవచ్చునని వెంకట్రామయ్య భావించారు. కాని ఆ నాటి పోర్చుగీసు రచనలో విజయనగర గూఢచారి శాఖను గురించి ఎలాంటి వివరాలు తెలపలేదు.

ఇతర ఉద్యోగాలు: కర్ణకమ్ అనే ఉద్యోగి పేరు ఉంది. అతడు రాష్ట్ర ప్రభుత్వాల విషయాలు చూసే అధికారి అని భావించారు. సర్వనాయక అనే మరొక అధికారి పేరు తెలుస్తోంది. అతడు రాజకచేరీపై అధికారి అని భావించారు. అతని కింద తాంబూలం మోసే అడప్పమ్ అనే ఉద్యోగి, వందిమాగధి అయిన భట్టు అనే ఉద్యోగి, పంచాంగం చెప్పే ఉద్యోగి, శాసనాలు రాసే ఉద్యోగులు ఉండేవారు, వీరేగాక రాజముద్ర వేసే అధికారి కూడా ఉండేవాడు. అతనికి సహాయంగా ఆజ్ఞాధారక, ఆజ్ఞాపరిపాలక అనే సహాయక ఉద్యోగుల ఉండేవారు.

రాజ్య విభాగాలు-రాష్ట్ర ప్రభుత్వం: విజయనగర సామ్రాజ్యం ఉచ్ఛదశలో ఉన్నప్పుడు దక్షిణాన కన్యాకుమారి అగ్రం నుండి ఉత్తరాన కృష్ణానది వరకు వ్యాపించి ఉండేది. ఈ విశాల భూభాగంలో నేటి కేరళ, తమిళ, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలు ఉండేవి. ఈ నాలుగు ప్రాంతాలలో నాలుగు రకాలు విభజనలు ఉండేవి. కేరళ ప్రాంతాలలో చేర వంశం మొదలైన పూర్వపు రాజవంశాలు రాజ్యం చేస్తుండేవి. ఆ వంశాలు విజయనగర చక్రవర్తులకు లొంగిపోయి కప్పాలు కట్టారు. అందువల్ల అవి సామంత రాజ్యాలుగా మారాయి. విజయనగర ప్రభువులు ఆ వంశాలను తొలగించలేదు. వారి వద్ద కప్పం వసూలు చేసి వారి ఆంతరంగిక పరిపాలన వారికే వదలివేశారు. కనుక అవి కప్పం చెల్లిస్తూ విజయనగర సార్వభౌమాధికారాన్ని అంగీకరించి పూర్తి స్థాయి సామంత రాజ్యాలుగా ఉండిపోయాయి. కరక్కోర్ రాజైన వదయార్, గెరిపొప్పు, టెంకాశి, క్విలన్ రాజు అలాంటి సామంత రాజ్యాల కోవలోకి వస్తారు. మిగిలిన ప్రాంతమంతా విజయనగర రాజుల ప్రత్యక్ష

ఏలుబడిలోకి వచ్చింది. ఈ ప్రాంతంలోని కర్ణాటకంలో పూర్వం హొయసాల రాజ్యాన్ని మధుర సుల్తాన్ రాజ్యాన్ని జయించారు. అనెగొంది రాజ్యాన్ని తొండైమండలాన్ని జయించడం ద్వారా కొన్ని ఆంధ్ర ప్రాంతాలు కూడా వారి కిందికి వచ్చాయి. ఈ ప్రాంతాలలో, తమిళనాడు ప్రాంతంలో వారు ఎలాంటి మార్పులు చేయలేదు. అక్కడ చోళుల కాలం నుండి అమలులో ఉన్న నాడు కొట్టం, మండలం చోళమండలం బనవాసి మండలం మొదలైన పేర్లు పేర్కొనబడ్డాయి. కాని డా। ఎ.వి.వెంకటరత్నం మహాలింగం వాటిని రాజకీయ విభాగాలుగా చీల్చారు. చంగల్పట్టు జిల్లాని చంద్రగిరి రాజ్యంలో కలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో పరిపాలనా విభాగాలను భావించనవసరం లేదని అభిప్రాయపడ్డారు. తొండైమండలాన్ని పడైవీడు, తిరువడి అనే రాజ్యాలుగా చీల్చారు. చంగల్పట్టు జిల్లాని చంద్రగిరి రాజ్యంలో కలిపారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో పరిపాలనా విభాగాలను పూర్తిగా పునర్వ్యవస్థీకరించారు. అందుకు కారణం కృష్ణానదికి ఉత్తరంగా బహమనీ రాజ్యం ఉండేది. అది విజయనగరంపై నిరంతరం దాడులు సాగించేది. వారిని ఎదుర్కోవడానికి అనువుగా దుర్గాలను ప్రధాన కేంద్రంగా తీసుకొని అక్కడ పరిపాలనా విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ విభాగాలను వాస్తవానికి రాష్ట్రాలుగా పిలవాలి. కాని వారు వాటిని కూడా రాజ్యాలు అని పిలిచారు. అరవణ భాషలో రాజ్యం అంటే రాష్ట్రం అని అర్థమని కొందరన్నారు. ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంలోని రాష్ట్రాలను రాజ్యాలని పిలిచేవారు. ఆంధ్ర ప్రాంతంలో గుత్తి, పెనుగొండ, చంద్రగిరి, ఉదయగిరి, కొండవీడు, పడైవీడు కర్ణాటకంలో రాయదుర్గం, నిడ్గూరు, రాయచూరు అలాంటివి, వీటిని రాజ్యాలుగా వ్యవహరించారు. ఈ రాజ్యాల పేర్లు శాసనాలలో పేర్కొనబడ్డాయి. ఆంధ్రదేశంలో ఉదయగిరి, గుత్తి రాజ్యాలు సరిహద్దులలో ఉండేవి. అందువల్ల వాటిని అతి పటిష్టంగా రూపొందించారు. సామ్రాజ్యానికి ఉత్తరంగా ఉండే ఈ రాష్ట్రాలలో రక్షణ దృష్ట్యా మొదటి హరాహరరాయలు ఈ విభాగాలు చేశాడు. అదే పద్ధతిని బుక్కరాయలు ఇంకా పటిష్టం చేశాడు. అదే పద్ధతి సామ్రాజ్యం అంతమయ్యే దాకా కొనసాగింది.

ఈ రాష్ట్రాలు లేక రాజ్యాలలో ప్రతి రాష్ట్రానికి గవర్నర్‌ను నియమించారు. అతనిని రాజప్రతినిధి అనేవారు. సంగమ వంశస్తులు రాజకుమారులు బడేయ లేక వడయార్ అనే బిరుదులు ధరించారు. మొదటి హరిహరరాయల కాలంలో గుత్తి రాజధానిగా అరగ రాజ్యాన్ని మారన రాజ ప్రతినిధిగా పాలించాడు. మొదటి కంపన ఉదయగిరి రాజ్యపాలకుడుగా నియమింపబడ్డాడు. రెండవ హరిహరరాయల కుమారుడు విరూపాక్షుడు తుండీర, చోళ, పాండ్య రాజ్యాలకు పాలకుడుగా నియమించాడు. రెండవ దేవరాయల కాలం నుండి రాజకుమారులే గాక ఇతరులను కూడా రాజ ప్రతినిధులుగా నియమించే ఆచారం ప్రారంభమైంది ఈ విధంగా నియమింపబడిన రాజ ప్రతినిధులు సైన్యాధిపతి మంత్రుల అధికారాలు కూడా చెలాయించారు అంతేగాకుండా కొందరు ఒక రాష్ట్రానికేగాక రెండు మూడు రాష్ట్రాలకు కూడా పాలకులుగా వ్యవహరించారు 1475 సంవత్సరానికి చెందిన ఒక శాసనం విరరస అనే బదయ, బారకూరు, మంగుళూరు రాజ్యాలను పాలించినట్లు తెలుపుతోంది. రాష్ట్ర పాలకులుగా, దుర్గాధిపతులుగా సైన్యాధికారులను నియమించారు. వీరిని వెంకటరమణయ్య దుర్గాదన్నాయకులని అన్నారు. వారు తమ రాజ్యంలో కేంద్రప్రభుత్వం జోక్యం లేకుండా స్వతంత్రులుగా పాలించారని మహాలింగం భావించాడు. మాధవ మంత్రి, లక్కన్న, తిమ్మరుసు మొదలైన దన్నాయకులుగా పాలించారు. పర్వత నాయకుడు గండికోటను రాజధానిగా చేసుకొని సిరివళ్ళ, సిద్ధవటి సకిలి, పొత్తపినాడు రాజ్యాలను చాలా కాలం పాలించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

సీమలు: సామ్రాజ్యంలో రాజ్యాల సంఖ్య నిర్ణీతం కాదు. అవి మారుతూ ఉండేవి. కృష్ణదేవరాయల వివాహ శాసనంలో పెనుగొండ లేక గుత్తి, కందనవోలు, చంద్రగిరి, రాయదుర్గ, ముర్వేగళ్ రాజ్యాలు వాటితోపాటు నాగమండళ, పొత్తపి, సిద్ధవర, సీమలు గండికోట స్థలం పేర్కొనబడ్డాయి. ఈ ప్రాంతాలన్నీ కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్షపాలనలో ఉండవచ్చునని వెంకటరమణయ్య అభిప్రాయపడ్డారు. అచ్యుతరాయల కాలంలో -

1. హంపి లేక హస్తినావతి	2. పెనుగొండ	3. గుత్తి
4. చందగిరి	5. ఉదయగిరి	6. కొండవీడు
7. ముల్బగళ్	8. పడైవీడు	9. తిరువడి
10. శ్రీరంగపట్టణం	11. రాయచూర్	12. నిడుగళ్

13. కందనవోలు   14. శ్రీశైలం   15. రాయదుర్గం
16. ఆరగ   17. బారకూరు

అనే 17 రాజ్యాలు శాసనాలలో పేర్కొనబడింది. పరిపాలనావసరాల కోసం అనేక రాజ్యాలు ఏర్పాటు చేసి ఉండవచ్చునని పండితులు అభిప్రాయపడ్డారు. అలాగే కొన్ని రాజ్యాలను కలిపివేసేవారు. క్రీ.శ.1512వ సంవత్సరంలో గుత్తి ప్రత్యేక రాజ్యంగా ఉండేది. కాని 1529 సంవత్సరం నాటికి గుత్తి పెనుగొండ రాజ్యంలో కలుపబడింది. తిరిగి అచ్యుతదేవరాయలు సదాశివరాయల శాసనాలలో గుత్తి ప్రత్యేక రాజ్యంగా కలుపబడింది. దీనిని బట్టి రాజ్యాలు కలపడం, కొత్త రాజ్యాలు ఏర్పాటు చేయటం జరుగుతుండేదని బోధపడుతుంది. రాయచూరు రాజ్యాన్ని అనేకమార్లు గెలుచుకున్నారు. అనేక పర్యాయాలు పోగొట్టుకున్నారు. ఈ ప్రాంతం బహమనీలు, విజయనగర రాజుల మధ్య మారుతూ ఉండేది.

రాష్ట్రాధిపతులు: రాష్ట్రం లేక రాజ్యానికి అధిపతి దుర్గాదన్నాయక్, సాధారణంగా రాజకుటుంబానికి విశ్వాస పాత్రులైన వారిని రాష్ట్రాధిపతులుగా నియమించేవారు. విజయనగర యుగంలో బ్రాహ్మణులను కూడా దుర్గ దన్నాయకులుగా నియమించారు. ఆముక్తమాల్యద దుర్గాధిపతులుగా బ్రాహ్మణులను నియమించాలని తెలుపుతోంది. సరిహద్దు రాజ్యాలలోని ధన్నాయకులు తప్ప మిగిలిన రాష్ట్రపాలకులు రాజధానిలో నివసించేవారు. తమ రాష్ట్రపరిపాలనను తమ కార్యకర్తల ద్వారా నిర్వహించేవారు. వారి ద్వారా పౌరపరిపాలన నిర్వహించేవారని వెంకటరమణయ్య అన్నారు. క్రీ.శ.1415 సంవత్సరంలో కృష్ణదేవరాయలు సాళువ తిమ్మరుసును కొండవీటి గవర్నరుగా నియమించాడు. శాసనాలలో ఇటువంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. దన్నానాయకులకు పన్నులు విధించడం, రద్దు చేయడం, నాణేలు ముద్రించడం మొదలైన అధికారాలు ఉండేవి. వారు దుర్గధన్నాయక్ నివర్తన అనే పన్ను వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఈ పన్ను ప్రజలదని వెంకటరమణయ్య వ్యాఖ్యానించాడు. ఈ పన్ను దేశమంతటా ఒకే విధంగా ఉండేదో లేదో తెలియదు. దన్నాయకుడు రాష్ట్రంలో అన్ని అధికారాలు చెలాయించేవాడు. అతడు ఉన్నత రెవెన్యూ అధికారి, న్యాయపాలకుడు రాజ్యరక్షణాధికారిగా వ్యవహరించాడు. దన్నాయకుడు తన ఆదాయంలో కొంత చక్రవర్తికి చెల్లిస్తే తనకు నిర్దేశించిన సైన్యాన్ని పోషిస్తూ ఉండేవాడు. ఉదయగిరి దన్నాయకునికి 8 లక్షల ఆదాయం వచ్చేదని, అందు 3 లక్షలు రాయలకు చెల్లించేవాడని, అతడు తన వాటా కింద 25 వేల కాల్బలాన్ని, 15 వేల గుర్రపుదళాన్ని, 40 ఏనుగులను పోషించేవాడని న్యూనిజ్ రాశాడు. దన్నాయకులను ఒక దుర్గం నుండి మరొక దుర్గానికి మారుస్తూ ఉండేవారు. ప్రతి దన్నాయకునికి కార్యస్థానం ఉండేది. దాన్ని శాసనాలలో చావిడి అని పేర్కొన్నారు. కరణాలు రికార్డులు దాచి పెట్టే స్థలమని అర్థం. కరణాలు చావిడిలో కూర్చొని రికార్డులు రాసేవారని భావించవచ్చును.

ఇతర విభాగాలు-సీమ-స్థలం: రాజ్యం అనేక సీమలుగా విభజింపబడింది. సీమకు అధిపతి పారుపత్యగార్ అని కర్నూలు జిల్లా శాసనాలు తెలుపుతున్నాయి. ఇతనిని దుర్గా నాయకుడు నియమించే వాడు. సీమలు స్థలాలుగా విభజింపబడ్డాయి. స్థలకరణాలు స్థలాల పరిపాలన చూసేవారు. వారు గ్రామ రెవెన్యూల లెక్కలు తయారు చేస్తారు. అక్రమ సాగులు నిరోధిస్తాడు. సాగు అయిన భూములన్నింటికీ పన్నులు నిర్ణయించి వసూలు చేస్తాడు. స్థానిక తగవులు వివాదాలను విచారించి తీర్పులు కూడా చెబుతాడు. మొదటి హరిహరరాయలు నాలుగైదు పల్లెలను కలిపి ఒక గ్రామం గాను, ఇరవై ముప్పై గ్రామాలను కలిపి ఒక స్థలంగాను ఏర్పాటు చేసినట్లు గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ప్రతి గ్రామానికి ఒక కరణాన్ని, ప్రతి స్థలానికి ఒక స్థలకరణాన్ని నియమించాడని ఆ రికార్డులు తెలుపుతున్నాయి.

సీమ పరిపాలన: రాజ్యాలను సీమలుగా విభజించారు. వెంకటరమణయ్య సీమను రెండు అర్థాలలో ఉపయోగించారని అన్నాడు. కన్నడ దేశంలో సీమ, తెలుగుదేశంలో నాడు అయిందని చెప్పాడు. కనుక నాడు, సీమ పర్యాయ పదాలు అని భావించబడింది. రాజ్యానికి సీమకు మధ్యలో వనిత లేక వలిత అనే పరిపాలనా విభాగం ఉంది. ఉదయగిరి, పెనుగొండ, హంపి రాష్ట్రాలు వలితలుగా విభజింపబడ్డాయి. కన్నడ శాసనాలలో వెందేయ లేక వెంతి అనే విభాగం పేర్కొనబడింది. ఇది రాజ్యం తర్వాత భాగమని వెంకటరమణయ్య భావించారు. వెందేయ తర్వాత విభాగం స్థలం అన్నారు. కూటమిని కన్నడ దేశంలో సీమ అని కూడా పేర్కొనబడింది. కొన్ని గ్రామాలను కలిపి స్థలం అన్నారు. గ్రామం చిట్టచివరిది. సీమ, నాడు,

స్థలాల పరిపాలనకు వేరువేరు అధికారులు ఉన్నారని శాసనాలు తెలుపుతున్నాయి. కందనవోలు లేక కర్నూలు జిల్లాలో దొరికిన కొన్ని శాసనాలు సీమకు చెందిన ఉద్యోగుల పట్టికను ఇస్తున్నాయి. సదాశివ రాయల కాలంలో కందనవోలు గవర్నర్‌గా పని చేసిన వెంకటాద్రి దొరలకు, పారుపత్యగాళ్లకు, రాయసం వారికి, అవసరం వారికి, రాచకరణాలకు రద్దు చేసిన పన్నులు వసూలు చేయరాదని ఆజ్ఞాపించాడు ఈ శాసనంలో చెప్పబడిన ఉద్యోగులందరూ సీమకు సంబంధించిన ఉద్యోగులని స్పష్టంగా తెలుస్తోంది వీరిలో దొరలు అమర నాయకులని పారుపత్యసీమ యొక్క ముఖ్య అధికారి అని వెంకటరమణయ్య అన్నారు పారుపత్యను మణియ అని కూడా పిలిచేవాడు. ఇతనిని రాష్ట్రగవర్నరు గాని లేక అతని ప్రతినిధిగాని నియమించేవాడు. క్రీ.శ.1525లో రాయస తిమ్మ రెవెన్యూ అధికారి అయి ఉండవచ్చును. అతడు పన్నుల నిర్ణయించి వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించేవాడు. అంతేగాక ఆదాయం పెరిగే చర్యలు తీసుకోవడం సంతలు ఏర్పాటు చేయడం, రైతులకు పట్టాలు ఇవ్వడం కూడా అతని విధులే. ఇతనికి కూడా చావడి ఉండేది. అతనికి సహాయంగా పనిచేయడానికి కరణాలు కూడా ఉండేవారు.

రాయసంవారు, అవసరంవారు, రాచకరణాలు అనే ఉద్యోగుల విధులు స్పష్టంగా తెలియదు రాయసంవారు గుమస్తాలని, అవసరీకులు రాజభవనం అంతఃపురాలలో పని చేసేవారని భావించారు రాయసంవారు, అవసరంవారు యుద్ధ కాలాలలో కూడా చక్రవర్తితోపాటు వెళ్లేవారని రాయవాచకం తెలుపుతోంది. కనుక వారు సీమకు సంబంధించిన ఉద్యోగులు కారని కొందరు భావించారు. రాచకరణాలు రాచకుటుంబానికి సేవ చేసే ఉద్యోగులు అయి ఉండవచ్చు.

అవసరం వారు: అవసరం వారు అనే మరొక ఉద్యోగిదళం ఉండేది. ఇందులో స్త్రీ పురుషుల ఉభయులూ ఉండేవారు. రాజు అంతఃపురంలో ఉన్నప్పుడు అత్యవసరం వస్తే రాజుకు నివేదించడానికి స్త్రీలు రాజమొగసాలలో ప్రజలు రాజు దర్శనం కోసం వచ్చి వేచి ఉంటే రాజుకి తెలియజేయడానికి పురుష ఉద్యోగులు కూడా ఉండేవారు. దేవాలయపు ఆస్తులు ప్రభుత్వపు ఆధీనంలో ఉన్నాయని ఒక కన్నడ శాసనం తెలుపుతోంది. బ్రహ్మాదేయాల మీద పర్యవేక్షకులున్నారని రాయవాచకం పేర్కొన్నాయని రెవెన్యూ శాఖను ఆరవణ అని అనేవారు. ప్రధాన మంత్రి ఆ శాఖను నిర్వహించేవాడు.

నాడు: నాడు అనే పరిపాలనా విభాగానికి సంబంధించిన విశేషాలు లభించలేదు. క్రీ.శ.1530సం ఒక శాసనం నాడు తలవర అనే ఉద్యోగిని పేర్కొంది. ఇంతకు మినహా నాడు ఉద్యోగుల పేర్లు తెలియదు నాడుకు సీమ అనే పేరు కూడా ఉంది.

స్థలం: కొన్ని గ్రామాల కూటమిని స్థల అని అన్నారు. ఆరవీటి శాసనాలలో స్థలానికి బదులుగా సమ్మత, సముతి అని పేర్కొనబడింది. కర్ణాటక దేశంలో కొన్ని స్థలాల కూటమిని సీమ అని అన్నారు. దీనిని బట్టి సీమను స్థలాలుగా విభజించేవారని తెలుస్తోంది. స్థల విభాగానికి కూడా చావడి ఉండేది. చావడిని కచ్చేరి అని కూడా పిలిచేవారు. స్థలకరణాలు స్థలం యొక్క లెక్కల పట్టీలను తయారుచేసేవారు. క్రీ.శ.1849 సంవత్సరానికి చెందిన హోంగనూర్ శాసనం గ్రామ, గౌండ, సేనబోయతోపాటుగా చావడికరణీకను పేర్కొంది. అతడు స్థల కరణం అయి ఉండవచ్చును. ఆ కాలం నాటి శాసనాలలో స్థలకరణం అనే మాట ఎక్కువగా పేర్కొనబడింది. క్రీ.శ.1568వ సంవత్సరం శాసనంలో దువ్వూరి స్థలానికి చెందిన రెడ్డి, కరణం శెట్టి అనే ఉద్యోగుల పేర్లు పేర్కొనబడింది. స్థల ఉద్యోగులకు గ్రామపరిపాలనతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. స్థలంలోని రైతుల భూపట్టణ జాబితాను చావడి కరణం పర్యవేక్షించేవాడు. బుక్కాకపల్లె కైఫీయత్తు రెండు మూడు గ్రామాలకు సంబంధించిన నేరాలకు స్థలకరణాలు ధర్మాసనమేర్పడి విచారించేవారని తెలుపుతోంది. కనుక వారికి అదనపు బాధ్యతలు ఉండేవని వెంకటరమణయ్య అన్నారు.

గ్రామ పరిపాలన: విజయనగర పరిపాలనా వ్యవస్థలో చివరి విభాగం గ్రామం. విజయనగర యుగంలో గ్రామ పరిపాలనలో ప్రజాసభలు తమ ప్రాబల్యాన్ని కోల్పోయాయని కె.వి.సుబ్రహ్మణ్యం అయ్యర్ కె.ఎ.నీలకంఠశాస్త్రిలు వాదించారు. కాని వారి వాదనను మైసూర్ విశ్వవిద్యాలయానికి చెందిన డా॥ ఎ.వి వెంకటరత్నం తన సిద్ధాంత గ్రంథమైన (1992) లోకల్ గవర్నమెంట్ ఇన్ ది విజయనగర యంపైర్‌లో ఖండించారు. ఆ నాడు గ్రామసభలున్నాయని వాటిని బక్కలు, హలరు, ప్రజె, హెడినెంటు, జాతి లేక సమయక, జనని జగత్తు అని పిలిచేవారని వెంకటరత్నం తెలిపారు. గ్రామసభలు పన్నులు వసూలు చేసి

ప్రభుత్వానికి చెల్లించేవి. ప్రభుత్వం పన్నులు రద్దుచేసినా, నూతన పన్నులను విధించినా పన్నులు దేవాలయపు ఖర్చులకు బదలాయించినా ప్రభుత్వం ఆ విషయాలను గ్రామసభలకు తెలిపేది. కేంద్ర ప్రభుత్వానికి లేదా రాష్ట్ర ప్రభుత్వానికి, గ్రామ సభలకు మధ్య ఒప్పందం ఉందని వెంకటరత్నం, మహాలింగం అభిప్రాయపడ్డారు. అంతేగాక గ్రామసభలు ధర్మకర్తలుగా, న్యాయాధికారులుగా వ్యవహరించారని వారు భావించారు.

గ్రామ రకాలు: విజయనగర సామ్రాజ్యంలో మూడు రకాల గ్రామాలు ఉండేవి.

1. అమర గ్రామాలు లేక దళవాయి
2. మాన్య గ్రామాలు లేక వరగ్రామాలు
3. భాండారవాడ గ్రామాలు లేక కరగ్రామాలు

అమర గ్రామాలు: ఇవి సైనిక నిర్వహణ కోసం అమరనాయకులకు ఇవ్వబడిన గ్రామాలు. అమరనాయకునకు కొంత నిర్ణీత సైన్యాన్ని నిర్వహించే నిబంధనపై ప్రభువులు తన సేనాధిపతులకు ఇచ్చిన భూములను అమరము అని పిలిచేవారు. అమరాన్ని పొందిన నాయకులను అమరనాయకులు అనేవారు. అమరనాయకులు అమర గ్రామాలలో సైన్య నిర్వహణానికి దుర్గదన్నాయం అనే పేరు గల పన్నును వసూలు చేసేవారు. ఈ పన్నును వసూలు చేయటానికి విజయనగర రాజులు అమరనాయకులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అందువల్ల వారు అమర గ్రామ ప్రజలపై ఇష్టం వచ్చినట్లు పన్నులు వసూలు చేసి ప్రజలను పీడించేవారు. ఆ పన్నులు భరించలేక రైతులు గ్రామాలను వదలిపెట్టి వెళ్లిపోయినట్లు ఆనాటి అనేక శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1533వ సంవత్సరపు శాసనం కౌటాలసీమ శాసనం పన్నులు చెల్లించలేక భూములు వదలి వేసి వెళ్లిపోయినట్లు తెలుపుతోంది. ఇలాంటి సందర్భాలలో విజయనగర రాజులు గాని, రాష్ట్రపాలకులుగాని జోక్యం చేసుకొని పన్నులు తగ్గించి ఆ ప్రజలను వెనుకకు పిలిపించి భూములు అప్పగించే వారని కూడా శాసనాల వల్ల తెలుస్తోంది. కృష్ణదేవరాయలు కూడా తన ఆముక్తమాల్యదలో అధిక పన్నులు వేసి ప్రజలను పీడించరాదని హెచ్చరించాడు. అలా పీడిస్తే భూములు పండించే వారుండరని భూములు పండించేవారు లేకపోతే భూగోళాన్నంతా జయించినా ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం రాదని వివరించాడు.

మాన్య గ్రామాలు: రెండవ రకం గ్రామాలను మాన్య గ్రామాలు అని అనేవారు. విజయనగర ప్రభువులు తమ మంత్రులకు ఇతర రాజోద్యోగులకు వారి సేవలకు మెచ్చి గ్రామాలను దానాలు చేసేవారు. సేవకులకు ఇచ్చిన అలాంటి గ్రామాలను భటవృత్తి గ్రామాలని కూడా అనేవారు. అదే ధనరూపంలో కాకుండా ధాన్య రూపంలో ఆదాయాన్ని దానిని హోర గ్రామం అని అనేవారు. అలాగే కవులు, పండితులు, శాస్త్రవేత్తలు, మఠాధి పతులు, విద్యాబోధన చేసే బ్రాహ్మణులకు కూడా అగ్రహారాలిచ్చేవారు. అలాగే దేవాలయాలకు మఠాలకు కూడా దానాలు చేసేవారు. ఇలాంటి భూములను, గ్రామాలను మాన్యగ్రామాలు అని పిలిచే వారు. మాన్యగ్రామాలను తిరిగి దేవ, బ్రాహ్మణ, ఉచ్చిరి లేక ఉంబళి గ్రామాలని 3 రకాలుగా ఉండేవి. వీటికి వర గ్రామాలని మరొక పేరు కూడా ఉంది. ఈ గ్రామాల జోడి పన్నును చెల్లించేవి.

దేవ గ్రామాలు-మఠ గ్రామాలు: విజయనగర రాజులు అనేక దేవాలయాలకు, మఠాలకు, సత్రాలకు భూములు గ్రామాలు దానాలు చేశారు. అలాంటి గ్రామాలను దేవగ్రామాలు అని అనేవారు. ఈ గ్రామాలపై వచ్చే ఆదాయం అవి దానం చేయబడిన దేవాలయాలకు, మఠాలకు, సత్రాలకు వెళ్లేది. దేవాలయాలలో నిత్యపూజా పురస్కారాలకు దేవుని అంగరంగ భోగాలకు ఉత్సవాల నిర్వహణకు ఖర్చుపెట్టేవారు. అలాగే శైవ, వైష్ణవ మఠాలకు ఆ మఠాధిపతుల జీవనోపాధికి వారి మతధర్మాలను ప్రచారం చేసుకోడానికి వాటికి అనుబంధంగా ఉండే పాఠశాలలు, వైద్యశాలలను నిర్వహించటానికి ఈ ఆదాయాన్ని నిర్వహించారు. ఒక్కొక్కప్పుడు ఈ గ్రామాలపై ప్రభుత్వం పూర్తి హక్కులిచ్చేది కాదు. అలాంటి సందర్భాలలో ఈ గ్రామాల నుండి కొద్ది పన్నును వసూలు చేసేవారు. ఆ శిస్తును జోడి లేక శ్రోత్రీయం అని పిలిచేవారు.

బ్రాహ్మణ గ్రామాలు లేక బ్రహ్మదేయాలు: వేదపండితులు ఘటికలను స్థాపించి విద్యాదానం చేయు బ్రాహ్మణులకు విజయనగర చక్రవర్తులు గ్రామాలను దానం చేసేవారు. అలాంటి గ్రామాలను బ్రహ్మదేయాలని, అగ్రహారాలని, శ్రోత్రీయాలని పిలిచేవారు. వారు ఈ గ్రామాలపై వచ్చే ఆదాయాలను అనుభవిస్తూ వేదాధ్యయనం చేస్తూ విద్యార్థులకు శాస్త్రాలను బోధించేవారు. బ్రహ్మదేయాలు రెండు రకాలుగా ఉండేవి.

ఏకభోగ అగ్రహారం: కొన్ని సందర్భాలలో ఒకే గ్రామాన్ని అనేక మంది బ్రాహ్మణులకు వాటాలుగా ఇచ్చేవారు. అలాంటి గ్రామాన్ని గణభోగ అగ్రహారం అని పిలిచేవారు. ఆ గ్రామపు ఆదాయం ఆ బ్రాహ్మణుల వాటాల నిష్పత్తి ప్రకారం పంచుకుంటారు. గణభోగ గ్రామాలలోని బ్రాహ్మణులను మహాజనులు అని పిలిచేవారు. తమ గ్రామ పరిపాలనకు వాటాదారులందరూ సభగా ఏర్పడేవారు. ఈ సభను మహాసభ అని లేక విద్వన్ మహాసభ అని పిలిచేవారు. ఈ మహాజనసభకు ఆ గ్రామానికి సంబంధించిన అన్ని అధికారాలు ఉండేవి. వారికి న్యాయ విచారణ చేసి తీర్పు చెప్పే అధికారం కూడా ఉండేదని వెంకటరత్నం అన్నారు మత విషయాలు, భవన నిర్మాణాలు, ఆర్థిక, న్యాయ, సాంఘికపరమైన అన్ని విధులు నిర్వహించేవారు మహాజనులకు విద్వన్ మహాజనులు అని కూడా పేరుండేది. వారు ప్రభుత్వానికి, గ్రామానికి మధ్య సంధాన కర్తలుగా వ్యవహరించేవారు. గ్రామాలలో మహాజనుల సంఖ్య మారుతూ ఉండేది.

ప్రభుత్వ అధికారులు: అగ్రహారాలపై సర్వాధికారాలు ఉన్నప్పటికీ తరపున కూడా కొందరు అధికారులు కూడా నియమింపబడే వారని నాటి శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1375, 1517, 1532, 1577 నాటి శాసనాలు కేంద్ర ప్రభుత్వం అగ్రహార గ్రామాలపై అధికారులను నియమించినట్లు తెలుపుతున్నాయి. అగ్రహార గ్రామాలలో మాసవగ్గడె అనే అధికారులు ఉన్నట్లు వెంకటరత్నం అనే పండితుడు అన్నాడు. కొన్ని శాసనాలు బుద్ధివంతరులు అనే అధికారులు ఉన్నట్లు వెంకటరత్నం అనే పండితుడు అన్నాడు. కొన్ని శాసనాలు బుద్ధివంతరులు అనే అధికారులను పేర్కొంటున్నాయి. సాల్‌టోర్ అనే పండితుడు ఉపేంద్రపుర అనే అగ్రహారంలో నెలకొక అధికారిని నియమించుకొన్నారని రాశాడు.

ఉచ్చరి లేక ఉంబళి గ్రామాలు: విజయనగర ప్రభువులు తమ ఆస్థానంలోని మంత్రులు. రాజోద్యోగుల సేవలకు మెచ్చిగాని లేక తమ ఆస్థానంలోని కవి పండితుల కవిత్వానికి మెచ్చి భూములను గాని, గ్రామాలను గాని దానాలు చేసేవారు. ఆ గ్రామాలను ఉచ్చరి లేక ఉంబళి గ్రామాలని పిలిచేవారు. బ్రాహ్మణులకు ఇచ్చిన ఉంబళి గ్రామాలను అగ్రహారాలు అని కూడా అనేవారు. కృష్ణదేవరాయలు అల్లసాని పెద్దనకు కొకటి అనే గ్రామాన్ని ఉంబళి అగ్రహారంగా ఇచ్చినట్లు శాసనం ఉంది. అల్లసాని పెద్దన కూడా తనకు రాయలు కొకట గ్రామాగ్రహారాన్ని ఇచ్చాడని చెప్పుకున్నాడు. ఉంబళి గ్రామాల ఆదాయం ఆ దాన పరిగ్రహీతలకు వెళుతుంది. అలాగే దేవాలయాలు, చెరువులు నిర్మించిన వారికి కూడా గ్రామాలను ఇచ్చేవారు ఆ గ్రామాలను కొడిగె గ్రామాలని పిలిచేవారు.

భాండారవాడ గ్రామాలు: సామ్రాజ్యంలో మిగిలిన గ్రామాలన్నీ అంటే పైన చెప్పిన గ్రామాలన్నీ పోను మిగిలిన గ్రామాలను భాండారవాడ గ్రామాలని అనే వారు. ఇవి రాజ గ్రామాలు అని చెప్పవచ్చును ఈ గ్రామాల నుంచి వచ్చే ఆదాయం సరాసరి రాజ భాండాగారానికి వెళుతుంది. ఈ గ్రామాల పరిపాలన రాజోద్యోగులు నిర్వహించే వారు. వారే రైతుల నుండి పన్నులు వసూలు చేసేవారు. భాండారవాడ గ్రామాలు ఏ దుర్గపరిధిలో ఉన్నా ఆదాయం సరాసరి రాయభాండాగారానికి వెళ్లేది. కొన్ని సందర్భాలలో భాండారవాడ గ్రామాలను గుత్తకు ఇచ్చేవారు. వారి నుండి వసూలు అయ్యే గుత్త ప్రభుత్వ భాండాగారానికి వెళుతుంది

పన్నిద్దరు ఆయగాండ్రు: ప్రభుత్వానికి సంబంధించిన గ్రామాలలో అంటే భాండారవాడ గ్రామాలలో 12 మంది గ్రామోద్యోగులు ఉండేవారు. వీరిని ఆయగాండ్రు అని పిలిచేవారు. ఈ విధానం కాకతీయ సామ్రాజ్యంలో కూడా అమలులో ఉండేది. అదే పద్ధతి విజయనగర రాజులు కూడా కొనసాగించినట్లు కనిపిస్తోంది. వారు కరణం లేదా సేనగోవా, గౌడ లేక రెడ్డి, తలారి, చాకలి, మంగలి, కుమ్మరి, కమ్మరి వడ్రంగి, కంసాలి, నీరుకావలి, చర్మకారుడు, పురోహితుడు, వీరందరూ ప్రభుత్వ ఉద్యోగులు కారు, గ్రామ సేవకులు. వీరిలో కరణం గ్రామానికి సంబంధించిన లెక్కలు రాసేవారు. వీటిని గుడికట్టు లెక్కలు, ఆయకట్టు లెక్కలు అనేవారు. కరణం తర్వాత చెప్పుకోదగిన గ్రామాధికారి రెడ్డి. అరవణతంత్రం కాలక్రమేణ గ్రామాలలో రెడ్డి కరణాలు గొప్ప అధికారం సంపాదించారని తెలుస్తోంది. వీరి తర్వాత స్థానం తలారిది. మిగతా వారు వృత్తి పనివారని చెప్పవచ్చును. ఆయగార్లకు జీతాలు ఇచ్చేవారు కాదు. గ్రామంలోని భూములను వారికి సాగు చేసుకోడానికి ఇచ్చేవారు. ఆ భూములను మిరాశి భూములు అని అనేవారు. మిరాశి భూములపై కొద్దిగా పన్ను కట్టేవారు. ఆ పన్నును జోడి అని అనేవారు. ఈ గ్రామ సేవకులు తమకు సేవలు చేసినందుకు రైతులు ఇతర గ్రామ ప్రజలు ధాన్య రూపంలో మామూళ్లు ఇచ్చేవారు. దానిని మేర అని పిలిచేవారు

వీరందరూ గ్రామ ఉద్యోగులుగా గ్రామ సేవకులుగా గ్రామ పరిపాలనను నిర్వహిస్తూ గ్రామాలకు సేవలు చేస్తూ ఉండేవారు. సైనిక అవసరాల దృష్ట్యా రాజ్యం బలపడేకొద్దీ గ్రామాల స్వేచ్ఛ, అధికారం తగ్గిపోయాయి. అంతకు పూర్వం శాసనాలలో కనిపించిన మహాజనులు, కాపులు అష్టాదశ ప్రజ అనే ప్రస్తావనలు విజయనగర శాసనాలలో కనిపించవు.

గ్రామ యాజమాన్యం- పన్నులు వసూలు విధానం

విజయనగర కాలంలో గ్రామాలు మూడు రకాలుగా ఉండేవి.

1. **చక్రవర్తి గ్రామాలు:** వీటిని భాండారవాడ గ్రామాలు అని అంటారు.
2. **అమరగ్రామాలు:** ఇవి అమరగ్రామాలకు చెందినవి.
3. మాన్యాలు దేవాలయాలు, మరాలు బ్రాహ్మణులకు ఇచ్చిన ఇనాములు.

చక్రవర్తి తన గ్రామాలను పన్ను గుత్తదారులకు ఇస్తారు. వారు నిర్దిష్ట మొత్తాన్ని ప్రభుత్వానికి ముందే చెల్లిస్తారు. తర్వాత ప్రజల వద్ద నుండి పన్నులు వసూలు చేసుకుంటారు. కొందరు అమరనాయకులు కూడా తాము తమ నాయంకరాలను పన్ను గుత్తకు ఇచ్చేవారు. ఈ మూడు కాక నాల్గవ తరగతి గ్రామాలు ఏర్పాటు చేసుకుంటే వాటిపై మొదటి మూడు సంవత్సరాలు పన్నులు ఉండవు. తర్వాత కొద్ది కొద్దిగా పన్నులు వేసి 7 సంవత్సరాలకు ఇతర గ్రామాల స్థాయికి తెస్తారు. అడవులు కొట్టుకొని గ్రామాలు నిర్మించుకున్న వారికి మొదటి హరిహరరాయలు అనేక సౌకర్యాలు కలిగించినట్లు గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. సాళువ నరసింహుని కాలంలో తిమ్మారెడ్డి అనే అతడు యావదుర్గం, ద్రోణాచలం వద్ద నిర్జన ప్రదేశంలో రెండు ఊళ్ళు కట్టించి అందులో నివసించడానికి కొన్ని కుటుంబాలను తెచ్చాడు. అందుకుగాను అతనికి ఆ రెండు గ్రామాలపై రెడ్డిరికం ఇచ్చాడు. మొదటి తిరుమలరాయల కాలంలో ఇద్దరు రెడ్లు కోస్తా ప్రాంతం నుండి రావులకొల్లు వద్ద నూతన గ్రామం నిర్మించుకోడానికి అనుమతి సంపాదించారు. ఈ కాలం నాటికి పూర్వం నుండి వచ్చే గ్రామ సభలు లేనట్లుగా కనిపిస్తోందని నేలటూరి వెంకటరమణయ్య వ్యాఖ్యానించారు. ముస్లిం పరిపాలనా ఫలితంగా గ్రామసభలు అంతరించాయని ఆయన భావించారు. గ్రామపరిపాలనను ఆయగార్లు నిర్వహించేవారు. వారిలో కరణం, గౌడ, తలారిలు ముఖ్యులు. ఇంకా చాకలి, మంగలి, వడ్రంగి, కుమ్మరి. కమ్మరి, ఆగసాలి, నడది, చర్మకారుడు పురోహితుడు కూడా ఆయగార్లు కాక షరాబు, చాకిరి, షికారి అనే మరో ముగ్గురు గ్రామ సేవకులు కూడా పేర్కొన్నబడ్డారు. అరవణ తంత్రం కూడా షరాబును పేర్కొంటోంది. వీరిలో చాకిరి పొలాలను కాపలా కాసేవాడు. షికారి వేటగాడు షరాబు అంటే నాణేల లెక్కలు చూసేవాడు. గ్రామంలో షరాబు నియామకాన్ని బట్టి గ్రామాలలో వ్యాపారం నాణేల మారకం వ్యాప్తి చెంది ఉంటుందని భావించారు. విజయనగర కాలం చివరలో ఆయగార్ల విధులు, వారికి ఇచ్చే ప్రతిఫలాన్ని నిర్దేశిస్తూ ఒక రిజిష్టరు తయారు చేస్తారు. దానికి అరవణ వ్యవహారతంత్రం అని పేరు. ఆయగార్లకు రెండు రకాలుగా ఆదాయం వచ్చేది. భూయం లేక భూఆదాయం అర్ధాయం అంటే ధనరూపంలో వచ్చేది. అరవణ తంత్రం ఆయగార్లకు రెండు ముంతలు భూయంగాను, రెండు ముంతలు ఆదాయంగా కొలవాలి అని, ప్రతి కపిల, ఖండగ (అంటే పొలాల విభాగాల పేర్లు) నుండి వచ్చే ఆదాయంలో కొంత శాతాన్ని ఇవ్వాలని తెలుపుతోంది. ఇవిగాక ఆయగార్లకు మాన్యాలు కూడా ఉంటాయి. వీటిని ఈనాములు, భటవృత్తిమాన్యాలు, మిరాశీలు అని పిలుస్తారు. ఒక పురోహితుడు తప్ప మిగిలిన వారు మాన్యాలకు జోడీ చెల్లించాలి. జోడీ అంటే నామమాత్రపు పన్ను. ఆయగార్లలో రెడ్డి, కరణం, తలారీలు గ్రామసభ సభ్యులు కారు. వారు గ్రామాధికారులు. వారు తమకు గల అధికారంతో రైతుల నుండి రకరకాల మామూళ్లు కూడా వసూలు చేసుకొనేవారు. మామూళ్లు ఇవ్వకపోతే కరణం దొంగలెక్కలు రాసేవాడు. తలారి దొంగనేరాలు మోపుతాడు. మూటలు మోయించేవారు. అందుకు భయపడి ప్రజలు మామూళ్లు ఇస్తారని, తలారీకి ప్రజలు ఇంకా చిక్కని రాగిగంజకూరలు, చేలలో పండే పంటలలో ఏది కావాలన్నా పంపుతారని, కురావలు, కంబళ్లు కూడా ఇస్తారని విదేశస్తులు రాశారు. ఇవిగాక రకరకాల పన్నులు కూడా వసూలు చేసుకొనేవారు. రెడ్డి, కరణాలు పన్నులు చెల్లించకుండా సాగులేని బంజరు భూములను కూడా సాగుచేసుకొనేవారని తెలుస్తోంది. గ్రామసేవకులకు ప్రజలు హోరహల్లు మోరబత్తాలు ఇస్తారు. దీనిని బట్టి గ్రామ ఉద్యోగాలు మంచి లాభసాటిగాను, ప్రజలకు పీడలాగా తయారయ్యాయని తెలుస్తోంది. అందువల్ల గ్రామ ఉద్యోగాలు కోసం పోటీలు పడినట్లు కూడా నాటి

శాసనాలు, కైఫీయత్తులు తెలుపుతున్నాయి. నరసనాయకుని కాలంలో పేరూరుపై దాడి జరిగింది. అప్పుడు అక్కడి కరణం ఊరు వదలి పారిపోయాడు. అందువల్ల అతని కరణీకాన్ని పక్క గ్రామం అయిన ద్వారకచెర్ల కరణానికి అప్పజెప్పారు. తర్వాత పారిపోయిన కరణం వచ్చి తన కరణీకం తిరిగి ఇవ్వాలని వివాదానికి దిగాడు. సిరువెళ్ల స్థలం అధికారి ఈ వివాదాన్ని పరిష్కరించే బాధ్యతను సిరివెళ్ల గ్రామసభకు, అక్కడి పెక్కంగ్రు వర్తక సంఘానికి అప్పజెప్పాడు. వారు విచారణ సంఘంగా ఏర్పడి అతని కరణీకం అతనికి ఇవ్వాలని తీర్పు చెప్పారు. అలాగే నవనందుల నిట్టూరు గ్రామ రెడ్డిరికం కోసం ఉండవోలు బోడిరెడ్డి సాములదేవు రెడ్డికి వివాదం రాగా దడిపత్రి వర్తకశ్రేణి విచారించి బోడిరెడ్డికి రెడ్డిరికాన్ని ఇప్పించింది. కృష్ణదేవరాయలు కాలంలో 50 వరహాలు ఇచ్చి కొందరు మదనపల్లి తాలూకాలోని మాద గ్రామంలోని ఉద్యోగాలను, ఇనాములను పొందారని ఒక తామ్ర శాసనం తెలుపుతోంది.

నాడు-మహానాడు: విజయనగర సామ్రాజ్యకాలంలో నాడు, మహానాడులు అనే విభాగాలు కూడా ఉన్నాయి. నాడును ఈనాటి మండలంతోను, మహానాడును నేటి జిల్లాతోను పోల్చారు. నాడు అధిపతిని నాడగౌండు అని, మహానాడు అధిపతిని మహానాడ గౌండు అని పిలిచేవారు. నాడు మహానాడులలో వ్యాపారశ్రేణుల అధికారం చెలాయించినట్లు కృష్ణపట్టణం శాసనాలు తెలుపున్నాయి.

నగరం - పట్టణాల పరిపాలన: విజయనగర సామ్రాజ్యంలో అనేక నగరాలు, పట్టణాలు ఉండేవి. రాజధాని విజయనగర సామ్రాజ్యంలోనేగాక ప్రపంచంలో ఒక సుందరపట్టణంగా పేరు మోసింది. తర్వాత బొమ్మనహళ్లి, శ్రీగిరి సముద్రం, తిరుమలపురి, ద్వారసముద్రం, శ్రీరంగపట్టణం, కృష్ణాపురం, ఇక్కేరి, బంకాపురం, రాయచూరు, ఆదవాని, పెనుగొండ, తిరుపతి, కాళహస్తి, చంద్రగిరి, పులికాట్, మైలాపూర్, కుంభకోణం, నాగపట్టణం, తంజావూరు శ్రీరంగం, మధురై, శ్రీవిల్లికుత్తూర్, అనంతశయనం, హంకోలా, మేర్జన్, హనోర్, భటికం, మాజిందూర్, గరాకచ్, మంగుళూర్, రామేశ్వరం, ఉదయగిరి, శ్రీశైలం, కొండవీడు మొదలైన నగరాలు, పట్టణాలు ఉన్నాయి. ప్రతి నగరంలో వ్యాపారశ్రేణులు ఉండేవి. ప్రతి శ్రేణికి నాయకుడు ఉండేవాడు. వ్యాపారశ్రేణి నాయకులను శెట్టి, స్వామి ఉభయ నానాదేశి పట్టణ మహాపట్టె వ్యవహారి, శెట్టి పట్టణస్వామి, పృథ్వీశెట్టి పురపతి, నగరేశ్వరం, పట్టణాధీశ్వర, మహాప్రభు అని శాసనాలు తెలుపుతున్నాయి. వీరు నగరాలకు, పట్టణాలకు అధ్యక్షులుగా ఉండి ప్రభుత్వానికి మధ్యన సంధానకర్తలుగా వ్యవహరించేవారు. నగరాలు పట్టణాలు పేటలుగా విభజించేవారు. పేటలకు కోరాలు అని కూడా పేరుంది. పెద్ద నగరాలు 10 పేటలుగా విభజించినట్లు తెలుస్తోంది. విజయనగర కాలంలో వ్యాపారశ్రేణులు, వృత్తి సంఘాలు సామ్రాజ్యపు రాజకీయ ఆర్థిక కార్యక్రమాలపై తమ ప్రభావాన్ని చూపాయని మహాలింగం అనే పండితుడు అన్నాడు.

గ్రామాల ఆదాయాలు: విజయనగర కాలంలో గ్రామాలు, స్థలాల ఆదాయాలు ఎలా ఉండేవో తెలుసుకోడానికి ఆధారం లభించింది. రాయలసీమలోని అలంగొండు స్థల ఆదాయాన్ని తెలిపే స్థానిక రికార్డు లభించింది. ఈ రికార్డు ఆ స్థల అధికారి అయిన గౌరప్పనాయుడు రాయించాడు. ఇది వీరనరసింహరాయల కాలానికి చెందింది. ఈ రికార్డులో ఆ స్థలం ఆదాయం, ఐదు పద్దుల కింద గద్యాణాలలో చూపబడింది. భూమి పన్ను 456 $^1/_2$ గద్యాణాలు, సిద్ధాయం 1067 గద్యాణాలు, పరిశ్రమలు - వర్తకం 2170 గద్యాణాలు. ఇంటిపన్ను 30 గద్యాణాలు. 12 గ్రామాల రాయరేఖలు 4460 గద్యాణాలు అని రాసి ఉంది. దీని ప్రకారం భూమి ఆదాయం కన్నా పరిశ్రమలు, వర్తకంపై ఆదాయమే ఎక్కువ. సిద్ధాయం ఎక్కువగా వృత్తి పనుల వల్ల వచ్చేది. సిద్ధాయం కూడా భూమి పన్ను కంటే ఎక్కువగా వచ్చింది. కనుక ఆనాడు వ్యాపారం, పరిశ్రమలు మంచి ఉచ్ఛదశలో ఉన్నాయని చెప్పవచ్చును.

అగ్రహారాల పరిపాలన: అగ్రహారాలలో మాత్రం పూర్వం లాగానే మహాజనసభలు పని చేసేవి. అగ్రహారాలపై వారసత్వపు హక్కులు ఉన్నందువల్ల మహాజనసభ అధికారాలు తీసిపారవేయలేదు. అగ్రహారపు భూములు సాగు చేసే రైతుల నుండి వసూలు చేసి ఖజానాకు చెల్లించేవారు.

రక్షకదళం - పోలీసు - కావల్‌గార్లు: రాజ్యంలో శాంతిభద్రతలను నెలకొల్పడానికి, నేరాలు నిరోధించడానికి తగిన శ్రద్ధ తీసుకున్నారు. ప్రజల ధనమానప్రాణాలను రక్షించే బాధ్యత రాష్ట్రాధిపతులకు అప్పగింపబడింది. వారు తమ ప్రాంతంలో దొంగతనం జరిగితే దొంగలను పట్టి సొమ్మును స్వాధీనం

చేసుకొని యాజమానులకు ఇవ్వాలి. లేని పక్షంలో వారే ఆ నష్టాన్ని యాజమానులకు చెల్లించాలి. కనుక వారు తమ రక్షణ విధులు నిర్వహించడానికి కావల్‌గార్లను నియమించేవారు. ప్రతి సీమకు, స్థలానికి కావల్‌గార్ ఉంటాడు. నాడు కావల్‌గార్ అనే పదం శాసనాలలో కూడా ఉంది. ప్రతి గ్రామంలో తలారులు ఉంటారు. గ్రామాలలో తలారులు కావల్‌గార్ల అధికారంలో ఉంటాడు. కావల్‌గార్‌కి జీతానికి బదులు కొన్ని గ్రామాలు ఇస్తారు. అతని ఆధిపత్యంలో ఉండే గ్రామాలలో ఇనాములు కూడా ఇవ్వబడతాయి. పొలంలో వేసిన విత్తనాన్ని బట్టిగాని, నాగలిని బట్టిగాని పంటలో కొంత ఆదాయం ఇస్తారు. సంతలలో నుండి కొంత పన్ను వస్తుంది. తన ఆధీనంలోని ప్రాంతం కూడా వెళ్లే సరుకుల మీద కొంత సుంకం కూడా ఆదాయంగా వస్తుంది. విజయనగరరాజులు చివరి దశలో నియమించిన పాలెంగాడ్రు కూడా కావల్‌గార్ల విధులు నిర్వహించారు. అందువల్ల వారు కూడా తమ ప్రాంతాల రక్షణకు కావల్‌గార్లను నియమించుకున్నారు. మొత్తం మీద ఈ కాలంలో కావల్‌గార్ల ప్రాముఖ్యత బాగా పెరిగినట్లు కనిపిస్తోంది. చెంచు, బోయ, కోయ మొదలైన వారిని కూడా కావల్‌గార్లగా నియమించే వారు. వారు దొంగతనాలు చేయడంలో ప్రసిద్ధులు. కనుక దొంగల జాడలు బాగా తెలిసేవి.

తలార్లు: ప్రతి గ్రామంలో తలార్లు ఉండేవారు. వారు కావల్‌గార్ల ఆధిపత్యంలో ఉండేవారు. అయినప్పటికీ అతడు గ్రామ ఆయగార్లలో ఒకడుగా పరిగణింపబడేవాడు. గ్రామ ప్రజల ఆస్తులు ప్రాణాలు అతడు కాపాడాలి. దొంగలను పట్టుకోలేకపోతే ఆ నష్టాన్ని అతడు చెల్లించాలి. గ్రామాలలో వచ్చే అధికార్ల సామాను మోయడానికి మనుషులను ఏర్పాటు చేయాలి. గ్రామంలోని చెరువులు, కాలువలకు మరమ్మత్తులు చేయవలసివచ్చినా అతడే మనుషులను సరఫరా చేయాలి. దేవాలయాల ఆస్తులకు భూములకు కూడా అతడే కాపలా కాయాలి అతనికి మాన్యాలు ఇచ్చేవారు. ప్రజలు మామూళ్లు ఇచ్చేవారు. బందిపోట్లను, దొంగలను అణచివేయడానికి కావల్‌గార్లకు పూర్తి స్వేచ్ఛ ఉండేది. వారు ఏ చర్య చేపట్టినా ప్రభుత్వం వారికి పూర్తి సహకారం అందిస్తుంది. కావల్‌గార్లు తమ విధులు సరిగా నిర్వహించకపోయినట్లయితే శిక్షింపబడేవారు. చిత్తూరు జిల్లాలోని పెరువార్ నాయకుని కింద పని చేసిన కావల్‌గార్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఒక శాసనం వలన తెలుస్తోంది. ఆ కాలంలో రక్షణ బాధ్యతలను అప్పగిస్తూ కావల్‌గార్లను నియమించినట్లు అనేక శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1516లో శ్రీకృష్ణదేవరాయల కాలంలో మల్లెలసీమలో పెద్దినాయుడు అనే అతడు కావల్‌గార్‌గా నియమింపబడ్డాడు. అళియ రామరాయలు సిద్ధవటం సీమలో 84 గ్రామాలకు విప్పపెంటసీమలో 14 గ్రామాలకు పెదబుచ్చినాయుడు అనే వ్యక్తిని కావల్‌గారుగా నియమించాడు.

తలవరులు - పట్టణాల రక్షణ: పట్టణాలలో శాంతిభద్రతలు కాపాడటానికి దొంగలను పట్టుకోడానికి తలవరులు అనే ఉద్యోగులు ఉండేవారు. వారు రాత్రుళ్లు పట్టణం చుట్టూ గస్తీ తిరుగుతూ ఉంటారు. దొంగలను పట్టి న్యాయాధీశుని ముందు నిలబెట్టి శిక్షలు వేయించేవారు. విజయనగరంలో 12 వేల మంది తలవరులు ఉండేవారని వారికి నెలకు 30 ఫణాలు జీతంగా ఇచ్చేవారని అబ్దుల్ రజాక్ రాశాడు. వీరందరిపై ఒక అధిపతి ఉంటాడు. కృష్ణదేవరాయల కాలంలో జంగమయ్య అనే అతడు తలవరుల అధిపతిగా ఉండేవాడు. కృష్ణదేవరాయలు మారువేషంతో రాత్రుళ్లు తలవరులు విధులు సక్రమంగా నిర్వహిస్తుందీ, లేనిదీ తెలుసుకొనేవాడట. ఒకనాడు రాత్రి ఒక ఇంట్లో జరిగిన ఘోరాన్ని కృష్ణదేవరాయలు స్వయంగా చూశాడు. మరునాడు దాని విషయం జంగమయ్యను ప్రశ్నించాడు. కాని జంగమయ్యకు ఆ సంఘటన తెలియదు. సమాధానం చెప్పలేకపోయాడని, అందువల్ల రాయలు అతనిని మందలించాడనీ, అప్పటి నుండి జంగమయ్య గస్తీ చర్యలు బహు జాగ్రత్తగా నిర్వహించాడని రాయవాచకం తెలుపుతోంది.

విజయనగర రక్షణ: రాజధాని విజయనగర రక్షణకు 12,000 మంది రక్షణ భటులుండేవారని వారికి ఒక్కొక్కరికి 30 ఫణాలు జీతం అని అబ్దుల్ రజాక్ రాశాడు. ఇన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నా రాజ్యంలో దొంగల బాధ ఎక్కువగా ఉందని నాటి కైఫీయత్తుల వల్ల తెలుస్తోంది. దొంగలలో బోయలు ఎక్కువ ఉండేవారట. అందువల్ల వర్తకులు, గుంపులు గుంపులుగా ప్రయాణం చేసేవారట. ఆముక్తమాల్యదలో కూడా దొంగల క్రూరకృత్యాలు వర్ణించబడ్డాయి.

న్యాయపాలన: సామ్రాజ్యంలో చక్రవర్తి ఉన్నత న్యాయాధీశుడు. కాని నేర విచారణకు అనేక న్యాయ స్థానాలుండేవి. సామ్రాజ్యంలో నాలుగు రకాలైన న్యాయస్థానాలు ఉండేవని పరాశర మాధవీయం

తెలుపుతోంది. అందులో న్యాయాధీశులను చక్రవర్తిగాని, ఆయనచే అధికారం ఇవ్వబడిన అధికారులుగాని నియమించేవారు. కావల్‌గార్లుగాని, వారిపై అధికారిగాని దొంగలను న్యాయస్థానాల ముందు హాజరు పరుస్తారు. ఒక్కొక్కప్పుడు రాయలకు బదులు ప్రధానమంత్రి నేరాలు విచారించి తీర్పులు ఇచ్చేవాడు తిమ్మరుసుకు ధర్మపత్రిపాలక అనే బిరుదు ఉంది. ప్రతి రాష్ట్రంలో స్థావర న్యాయస్థానాలు ఉండేవి రాష్ట్రాలలో రాష్ట్రాధిపతులు న్యాయాధీశులుగా వ్యవహరిస్తారు. సీమలలోక, స్థలాలలో అమరనాయకులుగాని, పాలెగాండ్రుగాని న్యాయాధీశులుగా వ్యవహరించే వారు. అప్పుడప్పుడు చక్రవర్తి రాష్ట్రాలను దర్శించినప్పుడు తానే స్వయంగా నేరవిచారణ జరుపుతాడు. అలా జరిపినట్లయితే దానిని జంగమ న్యాయస్థానాలు అని పిలిచేవారు. ప్రజలు తమకు జరిగిన అన్యాయాన్ని చక్రవర్తికి తెలియజేయదానికి న్యాయస్థానం ముందు బోర్లాగా పడుకొని తన విషయం తెలుసుకొనే వరకూ లేచేవారు కాదని న్యూనిజ్ రాశాడు. సాక్ష్యాలు రెండు రకాలుగా ఉండేవి. నేరాన్ని చూసిన వారు చెప్పే సాక్ష్యాలు. మామూలు సాక్ష్యాలు. నేరం చేసినప్పుడు ఎవరూ చూసి ఉండకపోతే లేక ఏ రకమైన సాక్ష్యం లేనప్పుడు దివ్య పరీక్ష ద్వారా నేర నిర్ణయం చేసేవారు. మరుగుతున్న నూనెలో చేయి పెట్టడం, నిప్పులపైన నడవటం, నిప్పులు చేతిలో పోసుకోవడం మొదలైన దివ్య పరీక్షలు చేరేవారని నికోలో డి కోంటి రాశాడు. ఇలాంటి రెండవ రకం సాక్ష్యాలు. తీర్పు ఇచ్చిన తర్వాత పత్రం రాసి ఇచ్చేవారు. దానిని జయపత్రం అని అనేవారు.

శిక్షలు: శిక్షలు క్రూరంగా ఉండేవి. శిక్షల భయంతో అందరూ అణగిమణిగి ఉండేవారని ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు వివరించాడు. చిన్న దొంగతనానికి కాలు గాని, చెయ్యి గాని తీసివేసే వారు. పెద్ద దొంగతనానికి గడ్డం కింద గాలంగుచ్చి వేలాడదీస్తారని న్యూనిజ్ రాశాడు. స్త్రీలను చెరిస్తే పెద్దశిక్ష, తక్కువ కులాల వారు నేరం చేస్తే బజారులో తల నరికేవారట. హత్యకు తల తీయడం శిక్ష అని న్యూనిజ్ రాశాడు. సామంతులు ద్రోహం చేస్తే పొట్టలోకి సన్నగా చెక్కిన కర్రను గుచ్చి చంపేవారట అబద్ధాలు, తప్పుడు ఫిర్యాదులకు కూడా కఠిన శిక్షలుండేవి. శాన్‌థోమ్‌లోని పోర్చుగీసు వారి దగ్గర అనంతంగా సంపద ఉందని తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఫిడెల్లో అనే పోర్చుగీసు సైనికుడిని ఏనుగు కాళ్ల కింద తొక్కించి చంపించాడు. రామరాయలు, రెండవదేవరాయల కాలంలో కూడా ఏనుగులచే తొక్కించి చంపే ఆచారం ఉందని అబ్దుల్ రజాక్ రాశాడు. కొన్ని శిల్పాలలో ఏనుగులు మనుష్యులను తొక్కుతున్నట్లు చిత్రించబడింది. కృష్ణదేవరాయల కాలంలో మరణశిక్ష విధింపబడిన ఖైదీలను నాగలాపురం చెరువు నిర్మించేటప్పుడు నరబలి ఇవ్వవలసి, వారిని బలి ఇచ్చాడని న్యూనిజ్ రాశారు. కనుక ఖైదీలకు ఈ విధంగా శిక్షలు వేసే వారని కూడా భావించవచ్చును.

గ్రామాలలో న్యాయ విధానం: గ్రామాలలో సివిల్ వివాదాలన్నింటినీ గ్రామసభలు పరిష్కరించేవి. రెడ్డి, కరణం వైశ్యులు గ్రామసభ అందరూ కలసి నేర విచారణ చేస్తారు. దానిని ధర్మాసనం అని అనేవారు. నిజం తెలుసుకోవడానికి గట్టి ప్రయత్నం చేసేవారు. క్రిమినల్ కేసులను రెడ్డి అమరనాయకునికి ఫిర్యాదు చేస్తాడు అమరనాయకులు విచారించి శిక్షలు వేస్తారు. సివిల్ నేరాలను ధనోద్భవ, క్రిమినల్ నేరాలను హింసోద్భవ అని కొందరు వర్ణించారు. న్యాయస్థానాల చట్టాలు బ్రాహ్మణులు తయారు చేసే వారని న్యూనిజ్ రాశాడు.

ఆనాటి కొన్ని తీర్పులు: ఆ కాలం నాటి కొన్ని తీర్పులు విదేశస్తుల రాతల వలన, శాసనాల వలన తెలుస్తున్నాయి. క్రీ.శ.1580వ సంవత్సరంలో హరదనహళ్లి గ్రామంలో వివాహకాలంలో వరుని కాలివేళ్ల ఎవరు తియ్యాలి, తలపాగ ఎవరు చుట్టాలని చాకలి, మంగళ్లు, కుమ్మర్లకు వివాదం వచ్చింది. కుమ్మర్ల నాయకుడు మరుగుతున్న నేతిలో చేతిని ముంచి దివ్య పరీక్షలో విజయం సాధించాడు. కనుక రామరాజ నాయకుడు వారికే ఆ హక్కు ఇచ్చాడు. కరివెన అగ్రహారంలో పెద్దిబొట్లు అనే అతడికి నాల్గవ వంతు వాటా ఉంది. గ్రామ సమితి గ్రామ ఖర్చులకు అతనిపై వాటా ఖర్చును విధించింది. కాని అతడు తాను దరిద్రుడనని తాను ఆ ధనం చెల్లించలేనని మొరపెట్టుకున్నాడు. నంద్యాల ధర్మాసనం దానిని విచారించి అది నిజమని గ్రహించి అతనికి ఉన్న వృత్తి, భూమి 15 $^{1}/_{4}$ వంతు, 3 $^{1}/_{2}$ వంతు భూమిని గ్రామసమితి తీసుకొని అతని వాటా ధనాన్ని గ్రామ సమితి చెల్లించాలని తీర్పు ఇచ్చిందని మెకంజి కైఫీయత్తులు తెలుపుతున్నాయి. న్యాయాధీశులు కొందరు లంచం తీసుకొనేవారని బార్బోసా రాశాడు. ముగ్గురు అన్నదమ్ముల మధ్య వారికి రెండు గ్రామాలలో గల కరణీకం, మిరాశీని గురించి తగవు వచ్చింది. వారిలో పెద్దవాడు తమ వివాదాన్ని

ధర్మాసనం ముందు పెట్టాడు. ధర్మాసనం వివాదాన్ని చర్చిస్తూ ఉండగా అతడు ధర్మాసనంలోని సభ్యులకు 70 వరహాలు ఇచ్చాడని, అందువల్ల అతనికి అనుకూలంగా తీర్పు ఇచ్చారని బర్బోసా రాశాడు. కాని ఇది ఎంత వరకు నిజమో తెలియదు. సాధారణంగా ధర్మాసనంలో చాలా మంది సభ్యులు ఉంటారు. అందరూ అధర్మానికి ఒడిగట్టరు.

న్యాయ విధానం: భారతదేశంలో వేదకాలం నుండి ధర్మశాస్త్రాల ప్రకారం పాలించడం రాజు విధి. కాలానుగుణంగా అవసరమైన నియామకాలను రాజు చేయవచ్చును. మనిషిని నీతిమార్గాన నడిపించటమే ధర్మశాస్త్రాల ప్రధాన లక్ష్యం. కనుక ధర్మశాస్త్రాలను అతిక్రమించిన వారిని సాటి ప్రజలకు అపకారం చేసిన వారిని శిక్షించడం రాజు ధర్మంగా నిర్ణయించబడింది. దానికనుగుణంగా విజయనగర చక్రవర్తులు తమ రాజ్యంలో న్యాయపాలన చేశారు. రాజుకు ఉన్న శిక్షాధికారమే సంఘాన్ని నీతివంతంగా ఉంచుతుందని, శిక్షలకు భయపడి ప్రజలు సన్మార్గాన నడుస్తారని కృష్ణదేవరాయలు న్యాయాధికారానికి వివరణ ఇచ్చాడు. విజయనగర సామ్రాజ్య న్యాయవ్యవస్థను గురించి తెలుసుకోవడానికి పరాశర మాధవీయం ఉపయోగపడుతోంది. మాధవాచార్యుడు పరాశరస్మృతికి భాష్యం రాశాడు. మాధవాచార్యుడు తన భాష్యంలో పరాశరుని భాష్యంతోపాటు ఆనాటి ప్రామాణిక స్మృతుల సారాన్ని కూడా చేర్చి దానినొక గొప్ప న్యాయశాస్త్ర సంగ్రహంగా రూపొందించాడని జె.రామయ్యపంతులు అన్నారు. మాధవాచార్యుడు బుక్కరాయల వద్ద మంత్రిగా పనిచేశాడు. విజయనగర సామ్రాజ్య స్థాపనలో భాగం పంచుకున్నారు. దాంతోపాటు వారు యాజ్ఞవల్క్య స్మృతిని కూడా ప్రామాణికంగా తీసుకున్నారు. ఈ రెండు గ్రంథాల ఆధారంతో తమ న్యాయ పాలన కొనసాగించారు.

విజయనగర న్యాయవ్యవస్థ గురించి నేరస్తులకు విధించిన శిక్షలను గురించి విదేశీ యాత్రికుల రచనలు కొంత సమాచారాన్ని ఇస్తున్నాయి. నాటి కొన్ని శాసనాలు కూడా న్యాయ పరిపాలనా విధానాన్ని, ఆ నాటి ప్రజలు చేసిన నేరాలను, శిక్షలను తెలుపుతున్నాయి.

విజయనగర సామ్రాజ్యంలో చక్రవర్తి అత్యున్నత న్యాయాధీశుడు. అతనికి న్యాయ నిర్వహణలో ప్రాడ్వివాకుడు అనే మరొక న్యాయాధికారి మరో ఇద్దరు సభ్యులు సహాయపడేవారు. అతని ఈ న్యాయ స్థానాన్ని ధర్మాసనం అని అనేవారు. ధర్మాసన సభ్యుల సహకారంతో రాజు నేర విచారణ చేసి తీర్పును ప్రకటించేవాడు. రాజు స్వయంగా విచారించి తీర్పు చెపితే ఆ ధర్మాసనాన్ని ప్రతిష్టమని పిలిచేవారు. కొన్ని సందర్భాలలో రాజు విచారించడానికి తీరిక లేకపోయినట్లయితే అతడు తన ప్రతినిధిని నియమించేవాడు. సాధారణంగా ప్రాగ్వివాకుడే రాజు స్థానంలో నియమింపబడేవాడు. అతడు ధర్మాసనానికి అధ్యక్షత వహించేవాడు. చక్రవర్తికి ఉన్న అధికారాలన్నీ అతనికి ఉండేవి. అతని తీర్పు చక్రవర్తి తీర్పుతో సమానం. అతడు తీర్పు చెప్పిన న్యాయస్థానాన్ని ముద్రిత ధర్మాసనం అని అనే వారు. సాధారణంగా ధర్మాసనంలో ప్రాగ్వివాకుడు సాక్ష్యులను విచారించి నిజానిజాలు గ్రహించేవాడు. అతడు మిగిలిన ఇద్దరు సభ్యులు అన్నీ పరిశీలించి రాజుకు తమ అభిప్రాయాలు తెలుపుతారు. చివరగా రాజు తీర్పును ప్రకటిస్తాడు. ధర్మాసన నిర్వహణకు ఉద్యోగులుండేవారు. ధర్మాసనపు విచారణాంశాలను లిఖించడానికి లేఖకుడుండేవాడు. అతడు ధర్మాసనానికి చెందిన అన్ని పత్రాలు జాగ్రత్త చేస్తాడు. వివాదానికి చెందిన ఆస్తులు లెక్కలు కట్టడానికి ధర్మాసన ఆర్థిక కార్యకలాపాలను నిర్వహించడానికి ఒక గణకుడు కూడా ఉండేవాడు. సాక్షులను ప్రవేశ పెట్టడం, వారి వద్ద ఉన్న పత్రాలను తీసుకొని ధర్మాసనానికి సమర్పించడం, తదితర ధర్మాసనానికి చెందిన కార్యాలు నిర్వహించడానికి సద్యాపాలకుడు అనే మరొక ఉద్యోగి ఉండేవాడు. అతడే తీర్పులను కూడా అమలు జరుపుతాడు. రాజధర్మాసనానికి వచ్చిన వివాదాలు తక్షణమే పరిష్కరింపబడేవని న్యూనిజ్ పేర్కొన్నాడు. తాను విజయనగరంలో ఉండగా వచ్చిన ఒక వివాదాన్ని రాయలు అప్పటికప్పుడే పరిష్కరించి దానిని ఎలా అమలు జరపాలో ధర్మాసన సభ్యులకు సూచనలను ఇచ్చాడని న్యూనిజ్ వివరించాడు.

రాష్ట్రాలలో రాష్ట్ర పాలకులు న్యాయాధీశులుగా వ్యవహరిస్తారు. వారి రాష్ట్రాలలో రాజుకున్న న్యాయాధికారాలు వారికీ ఉండేవి. రాష్ట్ర న్యాయస్థానాలలో ముఖ్య, అముఖ్య అనే రెండురకాల న్యాయస్థానాలు ఉండేవి. రాష్ట్రగవర్నర్ నిర్వహించిన ధర్మాసనాన్ని కూడా కేంద్రంలో లాగా ప్రతిష్ఠితమనేవారు. రాష్ట్ర పాలకుడు తాను విచారించకుండా తన ప్రతినిధిని నియమిస్తే దానిని కూడా ముద్రిత ధర్మాసనం అనేవారు.

గ్రామాలలో స్థానిక మహాజనులు న్యాయ నిర్ణయం చేసేవారు. దేవాలయ ధర్మకర్తలు కూడా న్యాయాధీశులుగా వ్యవహరించేవారు. వర్తకశ్రేణులకు శ్రేణి పెద్దలు తీర్పు చెప్పేవారు. ఇవేగాక కుల న్యాయ స్థానాలు కూడా ఉన్నాయి. కింద న్యాయస్థానాలలో తమకు న్యాయం జరగపోతే రాష్ట్ర గవర్నర్ న్యాయ స్థానానికి నివేదించుకోవచ్చును. అక్కడ కూడా ధర్మ సందేహం వల్ల తీర్పులు చేయలేకపోతే ధర్మశాస్త్రాలలో నిష్ణాతులైన మహాజనులు అంటే బ్రాహ్మణ పండితులకు నివేదించేవారు. బుక్కరాయల కాలంలో వైశ్యులకు కోమట్లకు విభేదం వచ్చింది. వైశ్యులు తాము అధికులమని, కోమట్లు వైశ్యులుకారని, వారు తమకన్నా తక్కువ వారని ఆక్షేపించారు. కోమట్లు వారి వివాదాన్ని చక్రవర్తికి నివేదించారు. కాని చక్రవర్తికి దానినెలా పరిష్కరించాలో తెలియలేదు. అందువల్ల అతడు కంచికి చెందిన ధర్మశాస్త్ర నిపుణుని న్యాయాధీశునిగా నియమించాడు. ఆ పండితుడు కంచిలోని ఒక శాసనం ఆధారంగా ఉభయులూ సమానులేనని ప్రకటించాడు.

విచారణా పద్ధతి: వివాదపడినవారు తమకు ఏమైనా పత్రాలు ఉంటే సమర్పించాలి. పత్రాల ఆధారంగా తీర్పులు చెప్పేవారు, లేదా ఆ విషయం బాగా తెలిసిన వారు సాక్ష్యాలు చెప్పాలి. ఏ ఆధారాలు సాక్ష్యులు లేని పక్షంలో దివ్యలు, ప్రమాణాల ద్వారా నేర నిరూపణ చేసేవారు. నికోలో డి కోంటి అలాంటి మూడు దివ్య పరీక్షలను పేర్కొన్నాడు. దేవునిపై ప్రమాణం చేసి తాను అమాయకుడనని చెప్పి ఎర్రగా ఇనప ఊచను నాలికతో తాకాలి. నాలిక కాలకపోతే అతడు నేరం చేయలేదని ప్రకటించేవారు. నాలిక కాలితే నేరస్తుడని తీర్మానించేవారు. రెండవ పద్ధతిలో నిందితుడు ఎర్రగా కాలిన ఇనపముక్కలను చేతిలో పట్టుకొని దేవుని విగ్రహం వైపు కొన్ని అడుగులు వేయాలి. చేయి కాలితే నేరస్తుడు, కాలకపోతే అమాయకుడు మూడవ పద్ధతిలో మరుగుతున్న వెన్నెలో రెండువేళ్లు ముంచి బయటకు తీయాలి. తీయగానే వేళ్లకు గుడ్డ చుడతారు. రెండు రోజుల తర్వాత గుడ్డను తీస్తారు. వేళ్లు బొబ్బలెక్కి ఉంటే నేరస్తుడు, లేకపోతే సజ్జనుడు

శిక్షలు: నేర నిరూపణ అయితే శిక్షలు కఠినంగా ఉండేవి. అంగ విచ్ఛేదన, చర్మం ఒలవడం ఏనుగులతో తొక్కించడం శిక్షలుగా ఉండేవి. రాజ్యంలో న్యాయ నిర్వహణ సమర్థవంతంగా ఉండని, రాజ్యంలో నేరాలు తక్కువని, దొంగల బాధలేదని న్యూనిజ్ రాశాడు. న్యాయవ్యవస్థ పటిష్టంగా ఉండని బార్బోసా రాశాడు. ఆస్తి, వారసత్వం మొదలైన సివిల్ వివాదాలను ప్రజా న్యాయస్థానాల ద్వారా మధ్యవర్తుల ద్వారా పరిష్కరించుకొనేవారు. రాజు దాకా వచ్చేవి కావు. భారతదేశంలో ప్రజలు తమ వివాదాలకు న్యాయ వ్యవస్థనాలకు వెళ్లేవారు కాదు. మధ్యవర్తుల ద్వారా పరిష్కారం చేసుకొనే ఆచారం అనాది నుండి ఉంది

రక్షక దళం: విజయనగర సామ్రాజ్యంలో ప్రజారక్షణకు తగిన చర్యలు తీసుకున్నారు. ఆ కాలంలో దొంగతనాలు ఎక్కువగా ఉండేవి. కనుక దొంగతనాలు జరుగకుండా రక్షక దళాలను ఏర్పాటు చేశారు. రక్షక దళం కేంద్రప్రభుత్వ దళం, స్థానిక దళం అని రెండు రకాలుగా ఉండేది. కేంద్రప్రభుత్వ దళాన్ని రాజు నియమించేవాడు. ఆ దళం రాజధాని విజయనగర రక్షణ చూసుకొనేది. ఆ దళం చర్యలను న్యూనిజ్ వర్ణించాడు. విజయనగరపు ఏడు ప్రాకారాలలో జరిగే సంఘటనలపై నిఘా వేసేవారు. దొంగతనాలు జరిగితే దొంగలను పట్టుకొని దొంగసొత్తును స్వాధీనం చేసుకొని వాటి యజమానులకు అప్పగించేవారు దొంగిలించిన సొత్తును రక్షకదళం పట్టుకోలేకపోతే వారికి జరిమానాలు విధింపబడేవి. సొమ్ము పోగొట్టుకున్న వ్యక్తులు రాజుకు ఫిర్యాదు చేస్తే ఏ ప్రాంతంలో ఆ సొమ్ము పోయిందో ఆ ప్రాంతపు రక్షణదళాధిపతిని రాజు పిలిపించి సంజాయిషీ అడిగేవాడు. పోయిన సొత్తును అతడు తిరిగి రాబట్టలేకపోతే ఆ దళాధిపతి చేత దాని విలువను పోగొట్టుకున్న వారికి ఇప్పించేవాడు. నగరంలో జరిగే దొంగతనాల వివరాలు రాజుకు నివేదించాలి. కనుక రక్షకభటులు చాలా జాగ్రత్తగా కాపలా కాసి దొంగతనాలు జరుగకుండా నిరోధించే వారు. శ్రీకృష్ణదేవరాయలు రాజధాని విజయనగరాన్ని రక్షణ కోసం 77 పేటలుగా విభజించాడు ప్రతి పేటకు ఒక రక్షణ దళాన్ని ఏర్పాటు చేశాడు. దానితో తృప్తి చెందక రాయలు స్వయంగా మారువేషంలో రాత్రులు నగరాన్ని పర్యటించి వారి విధులను స్వయంగా తెలుసుకొనేవాడు. విధి నిర్వహణలో లోపం ఉంటే కఠినంగా శిక్షించేవాడు. కనుక విజయనగరంలో రక్షకభటులు కడు జాగ్రత్తగా నగరాన్ని కాపలా కాసేవారు ఆ తర్వాత వెంకటపతిరాయలు ఇదే పద్ధతిని చంద్రగిరిలో అమలు జరిపాడు. నగరంలో దొంగతనాలు జరిగేవి కావు. ఒకవేళ జరిగి పోయిన సొమ్మును రాబట్టకపోతే రక్షణ దళాధిపతి నష్టపరిహారం చెల్లించేవాడు

విజయనగర రక్షణదళంలో 12 వేల మంది ఉండేవారని, వారిలో ఒక్కొక్క భటునికి నెలకు 30 ఫణాలు ఇచ్చేవారని, సాలుకు 12 వేల మందికి ఇచ్చే జీతాల ఖర్చు విజయనగరంలోని వైశ్యులపై విధింపబడిన పన్ను ద్వారా వచ్చే ఆదాయం సరిపోయేదని అబ్దుల్ రజాక్ రాశాడు.

స్థానిక దళం: రాష్ట్రాలలో ఆయా రాష్ట్రాధిపతులు రక్షక దళాలను నియమించేవారు. ఆ రక్షక దళం ఆ రాష్ట్ర నాయకుల ఆధిపత్యంలో ఉండి రాష్ట్రంలో దొంగతనాలను అరికట్టేవారు. సీమలలో కావలిగార్లు నియమింపబడేవారు. వారాసీమలో ఎక్కడ సొత్తుపోయినా దానిని పట్టుకోలేకపోతే కావలిగార్లు చెల్లించేవారు.

తలారి: గ్రామానికి కాపలా కాసి, గ్రామాలలో దొంగతనాలు జరుగకుండా కాపాడటానికి ప్రతి గ్రామంలో తలార్లు నియమించబడేవారు. వారు కావలిగార్ల ఆధిపత్యంలో ఉండేవారు. కొందరు తలారిని గ్రామ కొత్వాలుగా వర్ణించారు. గ్రామంలో దొంగతనం జరిగి, పోయిన సొత్తును పట్టుకోలేకపోతే తలారి దాని ఖరీదు పోగొట్టుకున్న వారికి చెల్లించాలి. అందువల్ల తలారి జాగ్రత్తగా గ్రామాన్ని కాపలా కాసేవాడు. అతడు తమకు సహాయంగా మరికొంత మందిని తన కింద నియమించుకొనేవాడు. అతడు తన దళంతో రాత్రులు కాగడాలతో ఊరంతా తిరుగుతూ కాపలా కాసేవాడు. అందువల్ల దేశంలో దొంగతనాలు జరుగకుండా ఉండేవి.

తలారికి గ్రామ రక్షణ బాధ్యతేగాక అదనపు బాధ్యతలు కూడా ఉండేవి. గ్రామంలో జరిగే ప్రభుత్వ పనులను కూడా అతడే నిర్వహించాలి. అందుకుగాను అతడు గ్రామంలోని యువకులను, పనిలేక ఊరికే తిరిగే వారిని తనతో తీసుకెళ్లి ప్రభుత్వపు పనులు చేయించేవాడు. ప్రభుత్వ అధికారులు గ్రామంలోకి వస్తే వారికి కావలసిన వసతులు, ఇతర ఏర్పాట్లు తలారి చేయాలి. వారి సామానులు, మూటలు మోయాలి. గ్రామంలోని యువకుల చేత ఆ పనులు చేయిస్తాడు. అందువల్ల తలారిని చూస్తే ఏ పనికిలాక్కుపోతాడోనని ప్రజలు భయపడేవారట. తలారికి అతని సేవకు ప్రభుత్వం మాన్యాలు ఇచ్చేది. తలారికి గ్రామస్తులు అన్ని వస్తువులు ఇచ్చేవారు. రైతులు ధాన్యం, కూరగాయలు, పండ్లు, పాలు ఇచ్చేవారు. కురుమకులం వారు, సాలీలు బట్టలు, దుప్పట్లు ఇచ్చేవారని, వర్తకులు సరుకులు ఇచ్చేవారని అరవడ తంత్రం తెలుపుతోంది. అగ్రహారాలు, దేవాలయ భూముల నుండి కూడా అతనికి ధాన్యం వచ్చేది. కనుక తలారి జీవితానికి ఏ లోటు ఉండేది కాదు. అతడు కూడా గ్రామరక్షణను సమర్థవంతంగా నిర్వహించేవాడు.

పట్టణాలు: విజయనగరంలో అనేక పట్టణాలు ఉండేవి. ప్రతి పట్టణంలో రక్షణకు తలారులు ఉండేవారు. ఈ తలారులపై అధిపతులుండేవారు. వారిని పట్టణ తలారి అని అనే వారు. వారి ఆధిపత్యంలో తలారులు రాత్రి సమయాల్లో కాగడాలు పట్టుకొని తిరుగుతూ కాపలా కాసేవారు. పట్టణాలలో జరిగే దొంగతనాల సొత్తును పట్టుకోలేకపోతే పట్టణ తలారి నష్టపరిహారం చెల్లిస్తాడు.

సరిహద్దు ప్రాంతాలు గ్రామాల రక్షణ-పాలెగాండ్రు: సామ్రాజ్యంలోని సరిహద్దు ప్రాంతాల రక్షణకు పాలెగాండ్రను, చిన్న సేనానాయకులను నియమించేవారు. శత్రు దాడుల నుండి సరిహద్దు ప్రాంతాలను రక్షించడం వారి విధి. దాంతోపాటే సరిహద్దు గ్రామాల రక్షణ భద్రత కూడా వారికే అప్పగించబడేది. ఆ పాలెగాండ్రు ఆ గ్రామంలో దొంగతనాలు జరుగకుండా కాపాడేవారు.

మార్గాల రక్షణ: సామ్రాజ్యంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లే వర్తకులు, యాత్రికులపై బడి బందిపోటు దొంగలు దోచుకొనేవారు. అలాంటి దొంగల నుండి ప్రయాణీకులను కాపాడటానికి మార్గ కావలిగార్లను నియమించేవారు. వారు మార్గాల వెంట వెళ్లే వారి ధనాన్ని, ప్రాణాలను కాపాడేవారు. ప్రయాణీకులను కాపాడలేకపోతే వారు రాజుకు ఫిర్యాదు చేయవచ్చును. రాజు ఏ మార్గంలో దొంగతనం జరిగిందో ఆ మార్గ కావలిగారును సొమ్ము పోగొట్టుకున్న వారికి దాని ఖరీదు చెల్లించమని రాజు ఆదేశించేవాడు. కనుక విజయనగర సామ్రాజ్యంలో రక్షణ సమర్థవంతంగా ఉండని, దొంగతనాలు తక్కువని, యాత్రికులు ప్రయాణించే మార్గాలతో సహా దేశంలోని అన్ని ప్రాంతాలలో రక్షణ ఏర్పాట్లు బాగున్నాయని ఎక్కడికి వెళ్లినా భయం లేదని న్యూనిజ్ రాశాడు.

సైనిక నిర్వహణ: విజయనగర రాజ్యం స్థాపించిన నాటినుండి చివరి వరకు దక్కనులో స్థాపింపబడిన బహమనీ రాజ్యాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. బహమనీ సుల్తానులు తమ రాజ్యాన్ని దక్షిణానికి విస్తరించాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తూ ఉండేవారు. వారి దండయాత్రలను అరికట్టడమే విజయనగర రాజ్యానికి ఏకైక

లక్ష్యమైంది. అందువల్ల విజయనగర ప్రభువులు బహమనీ సుల్తాన్‌లతో నిరంతరం పోరాడవలసి వచ్చింది కొందరు, దక్షిణదేశంలో హిందూ ధర్మాన్ని రక్షించడం కోసం బహమనీలతో పోరాడి చేసిన పోరాటాలే విజయనగర చరిత్ర అని కూడా వ్యాఖ్యానించారు. కనుక విజయనగర ప్రభువులు తమ సైన్యాన్ని సర్వవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండే విధంగా రూపొందించుకున్నారు. అందుకు వారు తమ ఆదాయంలో ఎక్కువ భాగం ఖర్చు పెట్టారు. కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో రాజ్యపు ఆదాయంలో సగ భాగం సైన్యానికి ఖర్చు పెట్టాలని సూచించాడు. విజయనగర రాజ్య స్థాపకులైన హరిహర బుక్కరాయలు తమ సమకాలీన శత్రు రాజుల యుద్ధ పద్ధతులను అవగాహన చేసుకొని వారిని ఎదుర్కొనే విధంగా తమ సైన్యానికి శిక్షణ ఇచ్చారు. రెండవ దేవరాయలు, వీరనరసింహరాయలు, కృష్ణదేవరాయలు తమ లక్ష్యానికి అనుగుణంగా సైన్యాన్ని సంస్కరించి క్రమశిక్షణలో ఉంచి యుద్ధ వ్యూహాలలో గొప్ప ప్రావీణ్యాన్ని పెంచి శత్రువులపై అద్భుత బలిష్టమైన సైన్యంగా తీర్చిదిద్దారు. వారి కృషి వల్ల విజయనగర సైన్యం బహమనీ సుల్తాన్‌లతో పోరాడి 3 శతాబ్దాల పాటు అద్భుత విజయాలను సాధించింది.

విజయనగర సైన్యం సంఖ్య గురించి నాటి విదేశీయాత్రికులు రకరకాల లెక్కలు ఇచ్చారు. అందువల్ల వారి సైనిక సంఖ్య స్పష్టంగా తెలియదు. రెండవ దేవరాయలకు ముందు 50 వేల సైన్యం ఉండేదని, అందులో 6 వేలు గుర్రపు దళం అని న్యూనిజ్ రాశాడు. రెండవ దేవరాయల సైన్యంలో 90 వేల మంది సైనికులు ఉన్నారని నికొలాకాంటి రాశాడు. అబ్దుల్ రజాక్ లక్షల మంది సైనికులు ఉన్నారని రాశాడు కృష్ణదేవరాయలు 70 వేల కాల్బలంతో, 32 వేల గుర్రపు దళంతో, 551 ఏనుగులతో రాయచూరుపై దండెత్తాడని న్యూనిజ్ రాశాడు. రాయవాచకం కృష్ణదేవరాయలకు 5 లక్షల పదాతిదళం, 60 వేల అశ్వదళం 12 వందల గజబలం ఉండేదని తెలుపుతోంది. సంగమ వంశస్తుల చివరి రోజులలో గజపతులు విజయనగరంపై దండెత్తారు. మరొక సామంతుల తిరుగుబాట్లు ఎక్కువయ్యాయి. కనుక కృష్ణదేవరాయలు పటిష్టమైన కేంద్ర సైన్యాన్ని రూపొందించుకున్నాడు. అతనికి 10 లక్షల సైన్యం ఉందని, అవసరమైతే 20 లక్షల సైన్యాన్ని సమీకరించగల శక్తి ఉందని విదేశస్తులు రాశారు.

కందాచార శాఖ: విజయనగర సైన్యం రెండు భాగాలుగా ఉండేది. అందులో మొదటి సిద్ధ సైన్యం రెండవది అమరనాయక సైన్యం. సామంతులు పోషించే సైన్యాన్ని అమరనాయక సైన్యం అనేవారు. సైన్యం రెండు రకాలుగా ఉన్నా అది కొంత వరకు కేంద్రీకృత రూపంలో ఉండేది. చక్రవర్తి పోషించే సైన్యానికి తాను జీతాలు ఇచ్చేవాడు. అమరనాయకులు పోషించే సైనిక ఖర్చులకు వారికి జాగీరులు ఇచ్చేవారు. రాయల సొంత సైన్యాన్ని సిద్ధ సైన్యం అని అనేవారు. ఆ సైన్యాన్ని రాయలు స్వయంగా జీతాలిచ్చి పోషించేవాడు ఆ సైన్యానికి కైజీత సైన్యం అని పేరు కూడా ఉంది. ఈ సైన్యంపై అజమాయిషీ చేయటానికి కందాచారశాఖ ఉండేది. కందాచారశాఖ అంటే సైనిక నిర్వహణశాఖ అని అర్థం. ఈరుదము, స్కంద ఆచారం అనే రెండు పదాలు ఉండేవి. స్కంధుడు యుద్ధ దేవుడు. కనుక అతని పేరుతో ఈ శాఖను ఏర్పాటు చేశారని కొందరు అంటారు. అందుకే సైనిక మజిలీని స్కంధావారం అని అంటారు. దాని అధిపతిని దళవాయి అని సేనాపతి అని అనేవారు. కందాచారశాఖలో సైనికుల అవసరాలు తీర్చటానికి అనేక మంది ఉద్యోగులుండేవారు 4 గురు పారుపత్యగారులు, 6 గురు కరణాలు, 6 గురు మదుపుగొల్లలు ఉండేవారు. వీరేగాక 3 వేల మంది వృత్తి పనివారు కూడా ఉండేవారు. వారిలో మాలిష్ చేసేవారు, కమ్మరి, కాశె, వడ్రంగి, చాకలి, మంగలి వారు ఉండేవారు. సైనిక అవసరాలు తీర్చేవారికి మాన్యాలు ఇచ్చేవారు. విజయనగర ప్రభువుల సిద్ధ సైన్యం ఎంత ఉండేదో తెలియదు. న్యూనిజ్ కృష్ణదేవరాయ సిద్ధ సైన్యం 50 వేలు ఉండేదని రాశాడు. సిద్ధ సైన్యంలో అమిత ధైర్యసాహసాలు గల వారిని చేర్చుకొనేవారు. కృష్ణదేవరాయలు స్వయంగా సైనికులను పరిశీలించి ఎన్నిక చేసుకునేవాడట. ఆ కాలంలో గొప్ప పరాక్రమవంతుడుగా పేరు మోసిన తుళు, కళ్ళరి, మొరస జాతులకు చెందిన వారిని చేర్చుకొనేవారు. వారేగాక అడవులలో నిర్భయంగా చరించగల చెంచు కోయ, బోయ వారిని కూడా సైన్యంలో చేర్చుకొనేవారు. సామాన్య ప్రజలలో కూడా దేహదారుఢ్యం, యుద్ధోత్సాహం, ధైర్యస్థయిర్యాలు ఉన్న వారిని కూడా సైన్యంలో చేర్చుకొనేవారు. అనేక భాషా ప్రాంతాలున్న సామ్రాజ్యం కనుక విజయనగర సైన్యంలో భిన్న భాషా సైనికులుండేవారు. విజయనగర సైన్యంలో మొదటి నుండి ముస్లింలను కూడా చేర్చుకున్నారు. రెండవ దేవరాయల కాలం నుంచి వారి సంఖ్య పెరిగింది. ముస్లిం

సైనికులకు దేవరాయలు ఈనాములిచ్చారని ఫెరిష్తా రాయగా జాగీరులు కాక నాలుగు నెలలకొకసారి వారికి జీతాలిచ్చారని అబ్దుల్ రజాక్ రాశాడు. కృష్ణదేవరాయల కాలంలో కూడా ముస్లింలను సైన్యంలో చేర్చుకున్నాడు. కృష్ణదేవరాయల కాలంలోనే 50 వేల మంది సిద్ధ సైన్యంలో, 2 వేల మంది అశ్వికులు అంతఃపుర రక్షణకు నియమించేవారని, 200 మంది అశ్వికులు రాజుకు అంగరక్షకులుగా ఉండేవారని న్యూనిజ్ రాశాడు. కృష్ణదేవరాయలు ప్రతి మహానవమినాడు కైజీత సైనికులను స్వయంగా పరీక్షించేవాడని విదేశీ యాత్రికులు రాశాడు. అంతఃపుర రక్షణదళం మీద గజదళం మీద ప్రత్యేక సేనాధిపతులు ఉండేవారు. తర్వాత కందాచారశాఖ అధిపతి అయిన దళవాయి మంత్రిమండలిలో సభ్యుడుగా ఉండేవాడని కొందరు భావించారు. కొందరు అతనిని సైనిక అవసరాలు తీర్చే శాఖ అధిపతి మాత్రమేనని భావించారు. సిద్ధ సైన్యంలో పదాతి, అశ్వ, గజదళ విభాగాలు కూడా ఉండేవి. రామరాయల కాలంలో ముస్లింలను ఇంకా ఎక్కువగా చేర్చుకున్నాడు. కాని వారు తళ్లికోట యుద్ధంలో ద్రోహం చేశాడు.

అశ్వదళ-గజదళం: విజయనగర చక్రవర్తులకు నరపతులని పేరు ఉన్నప్పటికీ వారు గుర్రపుదళాన్ని, గజదళాన్ని అశ్రద్ధ చేయలేదు. ఆ దళాలను కూడా పోషించారు. అందువల్ల వారి సైన్యంలో పదాతి, అశ్వ గజ అనే మూడు దళాలు ఉండేవి. అయితే సంఖ్యా బలంలో పదాతిదళం అగ్రస్థానంలో ఉండేది. బహమనీ, గజపతుల కన్నా విజయనగర సామ్రాజ్యానికి పదాతి దళం ఎక్కువ ఉండేది. కనుక వారు నరపతులని కీర్తి పొందారు. అశ్వదళం అధికంగా గల బహమనీలతో పోరాడటానికి, వారికి దీటైన అశ్వదళాన్ని పోషించడానికి విజయనగర రాజులు శతవిధాల ప్రయత్నించారు.

కాల్బలం: దక్షిణ భారతదేశ రాజులందరిలోకి విజయనగర రాజులకు కాల్బలం ఎక్కువ. అందువల్ల వారిని నరపతులు అని పిలిచేవారు. కాల్బలంలోని వారంతా గొప్ప యుద్ధవీరులు. మంచి కండబలం, ధైర్యసాహసాలు ఉన్న వారిని సైన్యంలో చేర్చుకొని వారికి మంచి శిక్షణ ఇచ్చేవారు. అనేక రకాల ఆయుధాలు ప్రయోగించడంలో వారికి పూర్తి తర్ఫీదు ఇచ్చేవారు. వారు యుద్ధరంగాలలో అమిత శౌర్యప్రతాపాలు చూపేవారు.

గరిడీలు: వీరందరికీ సైనిక శిక్షణ ఇవ్వడానికి గరిడీలు ఉండేవి. విజయనగరంలోనేగాక అన్ని రాష్ట్ర రాజధానులలో గరిడీలుండేవి. ఈ గవరిడీలలో వారికి కత్తిసాము, మల్లయుద్ధం, అనేక తరహా ఆయుధాలు ప్రయోగించడంలో శిక్షణ ఇచ్చేవారు. వసుచరిత్ర నగరాలలోని గరిడీలను పేర్కొంది. మనుచరిత్ర గరడీలలో ఖడ్గ నైపుణ్యం వ్యాయామ విధానాలను నేర్పేవారని తెలుపుతోంది. పదాతిదళం శూలదారులు, విలుకాండ్రు, తుపాకుల దళం, ముస్లిం దళం అనే నాలుగు విభాగాలుగా ఉండేది.

సైనికులను చేర్చుకొనే విధానం: సైనికులుగా తీసుకొనేటప్పుడు విజయనగర చక్రవర్తులు మంచి జాగ్రత్తలు తీసుకొనేవారు. సైన్యంలో చేరడానికి వచ్చిన యువకుని పూర్తి నగ్నంగా చేసి నఖశిఖపర్యంతం పరీక్షించి శారీరక దృఢత్వం, ధైర్యసాహసాలను పరిశీలించి చేర్చుకొనేవారు. వారికి గరిడీలలో మల్ల యోధులు, ఖడ్గ సిద్ధహస్తుల చేత శిక్షణ ఇప్పించే వారు. క్రమశిక్షణ నేర్పేవారు. సొంత ఊళ్లకు వెళ్లినా ముందు అనుమతితోనే వెళ్లాలి. అనుమతి లేకుండా వెళ్లిన వారిని తిరిగి రప్పించి కఠినంగా శిక్షించేవారు. కృష్ణదేవరాయల కాలంలో సైన్యంలో తుళ, మొరస, కబ్బలి జాతి వారిని ఎక్కువగా చేర్చుకున్నారు. ఆ కాలంలో గొప్ప సాహసవంతులుగా పేరు పొందారు.

ఆయుధాలు: కత్తి, ఈటె, విల్లంబులు విజయనగర సైన్యానికి ప్రధాన ఆయుధాలు. ఒక దళం కత్తి, డాలులను ధరించేది. విలుకాండ్రు ధనుస్సు, బాణాలు, అంబుల పొదులను ధరిస్తారు. తుపాకుల దళం వద్ద గుండ్లు ఉపయోగించే మస్కట్లు, బ్లండర్లు, తుపాకులు, శతఘ్నులు ఉండేవి. ఇంకా గండ్రగొడ్డళ్లు, పిడిబాకులు, శూలాలు, మొరస, మొదలైన ఆయుధాలను కూడా ఉపయోగించేవారు.

శతఘ్ని దళం: విజయనగర సైన్యంలో శతఘ్నిదళం ఉండేది. కాని దానిని వారు సమర్థవంతంగా నిర్వహించలేదు.

సైనిక దుస్తులు - కవచాలు: సైనికులందరికి ఒకే రకమైన దుస్తు లేదు. సాధారణ సైనికులు ఏ బట్టపడితే అవి ధరించేవారట. కొద్దిపాటి పంచెను ధరించి మిగిలిన శరీరమంతా నూనె రాసుకొని యుద్ధాలకు వెళ్లేవారట. వారికి కవచ, శిరస్త్రాణాలు లేవని ఫెరిష్తా రాశాడు. అమరనాయకులు ఖరీదైన దుస్తులు ధరించేవారని,

చక్రవర్తి సైనిక కవాతును చూడటానికి వచ్చినప్పుడు ఖరీదైన దుస్తులలో ఉన్న అమరనాయకులను చూశానని పేస్ వర్ణించాడు. యుద్ధ సమయాలలో మొఖం, పాదాలు తప్ప మిగిలిన దేహ భాగాలకు చర్మంతో చేసిన కవచాలు, శిరస్త్రాణాలు ధరించేవారని అచ్యుతరామాభ్యుదయం తెలుపుతోంది. బార్బోసా, పేస్ మొదలైన పోర్చుగీసు వారు కూడా కవచాలు, శిరస్త్రాణాలు, డాలులను ధరించే వారని రాశారు. తలలకు, చేతులకు బేడీలు ధరించేవారని యుద్ధంలో శత్రువుల శూలాలు, కత్తిపోట్ల నుండి బేడీలు వారిని కాపాడతాయని వారు రాశారు. బేడీలను పేస్ కూడా వర్ణించాడు. డాలు ధరించేవారు మాత్రం కవచాలు ధరించేవారు కాదు. వారికి డాలే రక్షణగా ఉండేది పదాతి దళంలో తుపాకీ దళం కూడా ఉండేది. తుపాకీ గుండ్లను కుమార ధూర్జటి తన కావ్యంలో వర్ణించాడు

గుర్రపు దళం: సైన్యంలో తర్వాత స్థానం గుర్రపు దళానిది. గుర్రపుదళంలో బహమనీలది ప్రథమస్థానం కనుక వారిని అశ్వపతులు అని పిలిచేవారు. వారు అరబ్బు దేశాల నుండి ఉత్తమ అశ్వాలు తెప్పించుకొని మంచి అశ్వదళాన్ని పోషించడానికి తగినంత శ్రద్ధ తీసుకున్నారు. వారు కూడా విదేశ వర్తకులను ఆహ్వానించి గౌరవించి బహుమతులిచ్చి మంచి గుర్రాలను ఖరీదు చేయడానికి విశ్వప్రయత్నం చేశారు. కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో విదేశీ వ్యాపారులను గౌరవించి వారి దగ్గర నుండి మంచి గుర్రాలను కొనాలని చెప్పాడు గుర్రాలకు మంచి శిక్షణ ఇచ్చేవారు. కాని ఎంత శిక్షణ ఇచ్చినా బహమనీ సుల్తాన్‌ల అశ్వదళంతో సరిసమానం కాదు. నిర్వహణ పద్ధతులు వారికి తెలిసినంతగా వీరికి తెలియదు. గుర్రాలను కొనేవారు గాని గుర్రాల సంతతిని పెంచడానికి వారు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. గుర్రాలను 300 నుండి 800 పర్దావ్‌లను పెట్టి కొనేవారు మగ గుర్రాలే గాని ఆడ గుర్రాలు లేవు. అందువల్ల ఇక్కడ గుర్రాలు ఉత్పతి కావు అని క్రీ.శ.1502-1508 సంవత్సరాల మధ్యలో దక్షిణ భారతదేశాన్ని పర్యటించిన వార్తెమా అనే విదేశీ యాత్రికుడు రాశాడు. అశ్వకులకు గుర్రాల మేతకు, పోషణకు అయ్యే ఖర్చులను నెలనెలా ప్రభుత్వం ఇస్తుంది. గుర్రాలకు గడ్డి, దాణాలు సరఫరా చేసే వారికి భూములను కూడా ఇచ్చేవారు. గుర్రాలను చూసే రౌతులు తమ అశ్వాలను బాగా చూసుకుంటూ ఉంటే వారికి ఇంకా మంచి గుర్రాలను ఇచ్చేవారు. కృష్ణదేవరాయల వద్ద మూడువందల సాహిణీలు, 1600 మంది మాలీసువారు ఉండేవారు. అశ్వాలకు రాజముద్రికలు కూడా వేసేవారు. గుర్రం చనిపోతే ముద్ర ఉన్న చర్మ భాగాన్ని కోసి తీసుకువెళ్లి అశ్వశాలాధిపతికి ఇవ్వాలి. అదిచూసి అతను కొత్త అశ్వాన్ని ఇస్తాడు. అశ్వకులకు సాలుసరి నూరు నుండి వేయి పర్దావ్‌ల జీతం ఇచ్చేవారని తెలుస్తోంది. అచ్యుతదేవరాయలు తాను మంచి గుర్రాలను తీసుకొని దేశవాళి గుర్రాలను సామంతులకు ఇచ్చేవాడని, విదేశస్తుల నుండి గుర్రాలు కొన్నప్పుడు 10 గుర్రాలకు అయ్యే ఖర్చును 5 గుర్రాలకే సామంతుల నుండి వసూలు చేసి తన ఖజానా నుంచి ఏమీ ఖర్చు చేయకుండా అశ్వాలను సంపాదించేవాడని న్యూనిజ్ రాశాడు. పోర్చుగీసు వారి నుండి విజయనగర చక్రవర్తులు బహమనీలతో పోటీపడ్డారు. ప్రతి సంవత్సరం మహానవమి ఉత్సవాల చివరి రోజులు విజయనగర ప్రభువుల తమ సైన్యాలను పర్యవేక్షణ చేసే వారిని పేస్ తెలిపాడు. యుద్ధ సమయాలలో గుర్రాలకు కూడా కవచాలు తొడిగేవారు. రౌతులు కూడా కవచాలు ధరించేవారు. వారు శిరస్సులపై బలమైన శిరస్త్రాణాలు ధరించేవారు. అవి తలనే గాక, ముఖం, మెడను కూడా కప్పి ఉంచేవి. రౌతులు శూలాలు, కత్తులు, గండ్రగొడ్డళ్లు, నడుములో చిన్న పిడిబాకులు ధరించేవారు.

గజదళం: విజయనగర చక్రవర్తులు గజదళాన్ని కూడా పోషించేవారు. కాని చాలా తక్కువ. ఒరిస్సాఏలిన గజపతులకు అందరికంటే గజాలు ఎక్కువ ఉండేవి. అందువల్ల వారికి గజపతులు అని పేరు వచ్చింది. ఏనుగులకు ఒళ్లంతా కప్పే కవచం వేసేవారు. ముఖానికి ఇనపరేకును రక్షణగా తగిలించేవారు. కోట ద్వారాలను పగులగొట్టడానికి, శత్రుదళాలపై పడి వారిని చిందరవందర చేయడానికి ఏనుగులకు శిక్షణ ఇచ్చేవారు. యుద్ధ సమయాలలో వాటికి సారాయి తాగించేవారు. యుద్ధభూమిలో ఏనుగులకు నాలుగు వైపుల నలుగురు సాయుధ భటులు రక్షణగా కూడా ఉండేవారు. ఒక్కొక్కవైపు నలుగురు చొప్పున మొత్తం 16 మంది ఉంటారు. ఏనుగు మీద ఎటు నుండి దాడి జరగకుండా వారు కాపాడేవారు. యుద్ధంలో శత్రు సేనల మీద లంఘించి వారిని భయభ్రాంతులు చేసి చికాకుపరచి వారిని చెల్లాచెదురు చేయడంలో ఏనుగులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు ఉత్సవాలలోనే గాక యుద్ధ సమయాలలో కూడా గుర్రాలను, ఏనుగులను అలంకరించేవారు.

సామంతుల సైన్యం: సామ్రాజ్యంలో దాదాపు 200 మంది సామంతులు వందలాది పాలెగాండ్రు ఉండేవారు. వారందరూ సైన్యాలను పోషించేవారు. వారందరికీ సైనిక ఖర్చుల కింద జాగీరులు ఇచ్చేవారు. వారు

ఎంత సైన్యాన్ని పోషించిందీ సరైన లెక్కలు లేవు. కాని మొత్తం కలిపి కొన్ని లక్షల సైన్యం ఉండవచ్చును. మధుర నాయంకరంలోనే 7 లక్షల సైన్యం ఉండేదని విదేశస్తుల రాతలు తెలుపుతున్నాయి. కనుక మొత్తం నాయంకరాలలో కొన్ని లక్షల సైన్యం ఉండేదని చెప్పవచ్చును. కాల్బలంతోపాటు వారు గుర్రపుదళాన్ని కూడా పోషించారు.

సామంతులు రాజధానిలో ఉండేవారు. అప్పుడప్పుడు తమ జాగీరులకు వెళ్లి వస్తూ ఉండేవారు. చక్రవర్తి కోరినప్పుడు వారు హాజరు కావాలి. కనుక వారు ఎల్లప్పుడూ రాజధాని విజయనగరంలోనే కాపురం ఉండేవారు అని న్యూనిజ్ రాశాడు. సకాలంలో కప్పం చెల్లించాలి. నిర్దిష్ట సంఖ్య సైన్యాన్ని పోషించాలి. తన సైన్యంతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి. తన సైనిక ఖర్చులకు జాగీరులు ఇచ్చేవారు. రాజును విశ్వాసంతో కొలవాలి. అలా కాకపోయినా, నిర్దిష్ట సైన్యాన్ని పోషించకపోయినా కఠినంగా శిక్షింపబడేవారు. వారి జాగీరులను లాక్కొనేవారు. జాగీరుదారుతనం వారసత్వం కాదు. సామంతులు ఎల్లప్పుడూ రాజధానిలోనే ఉన్నందు వల్ల వారి జాగీరుల పాలన చూడటానికి పరిపాలనా దక్షత కలిగిన వ్యక్తులను నియమించుకొనేవారు. వారిని కార్యకర్త అని పిలిచేవారు. సామంతులకు సైనిక సేవేగాక తన జాగీరులో శాంతిభద్రతలను నెలకొల్పడం, ఆస్తిపాస్తులను రక్షించడం కూడా విధులే. దొంగతనం జరిగితే దొంగలను పట్టుకొని శిక్షించాలి. దొంగ సొత్తును స్వాధీనం చేసుకొని యజమానులకు ఇవ్వాలి. దొంగను పట్టుకోలేకపోతే పోయిన సొత్తు విలువ అతడే యజమానులకు చెల్లించాలి. అందువల్ల దొంగను వెదికిపట్టుకొని కఠినంగా శిక్షించేవారు. కనుక దొంగతనాలు పెద్దగా జరిగేవి కావని న్యూనిజ్ పేర్కొన్నాడు. సామంతులకు తమ జాగీరులలో నేర విచారణ చేసి శిక్షించే అధికారం కూడా ఉండేది. సామంతులు వీలయినప్పుడల్లా తిరుగుబాట్లు చేసి స్వతంత్రులవడానికి ప్రయత్నించేవారు. కనుక చక్రవర్తులు వారిని అదుపులో ఉంచుకోవడానికి అనేక చర్యలు తీసుకొనేవారు. సామంతులు నిర్దిష్ట సంఖ్య సైన్యాన్ని పోషించేది, లేనిది, కుట్రలు కుతంత్రాలు చేస్తున్నారా అని ఎప్పటికప్పుడు గూఢచారుల ద్వారా కృష్ణదేవరాయలు తెలుసుకొనేవాడని రాయవాచకం తెలుపుతోంది.

పాలెగాండ్రు: సామంతులుగాక పాలెగాండ్రు అనే చిన్న సైనిక నాయకులు కూడా నియమింపబడ్డారు. వారిని చక్రవర్తులు నియమిస్తారు. సేనానివేశం అని అర్థం వచ్చే తమిళ పదం అయిన పాలెయం, పాలెం అనే పదం నుండి పాలెగార్ అనే పదం పుట్టింది. ఊరి చివర పాలెం అని ఉంటే అది ఒకప్పుడు సైనిక స్కంధావారం. అక్కడ సైన్యాలు ఉండేవి. సైన్యాలపై అధిపతులుగా పాలెగాండ్రు అక్కడ ఉండేవారు. సైనిక సేవ చేసే షరతుపైన కొంత ప్రాంతంపై వచ్చే ఆదాయాన్ని వారికి దఖలు పరచేవారు. ఆ ప్రాంతంపై వచ్చే పన్నులను వారే వసూలు చేసుకొనేవారు. కాని నిర్దిష్టమైన మొత్తాన్ని ప్రభువుకు చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని వారు సైనిక ఖర్చు కింద ఉంచుకోవచ్చు. అంటే వారికి రెండు విధులు ఉన్నాయి. పన్నులు వసూలు చేసే బాధ్యత, నిర్దిష్ట సైన్యాన్ని పోషించే బాధ్యత రెండూ ఉన్నాయి. అంటే అమరనాయకుల లాగా సైనిక సేవచేయాలి. పన్ను గుత్తదారుల లాగా రాజుకు పన్నును చెల్లించాలి. అమరనాయక బాధ్యతలు పన్ను గుత్తదారుని బాధ్యతలు రెండూ అతడే నిర్వహిస్తాడు. ఒక రకంగా అతడు చిన్నరాజు. దక్షిణదేశ పాలెగాండ్రను గురించి రాసిన కె.రాజయ్యన్ అనే పండితుడు పాలెగాండ్ర వ్యవస్థ ఏర్పడటానికి కారణాలు వివరిస్తూ వారికి రాజు వంటి హోదా ఉండటం, రాజ సేవకు గుర్తింపు పొందడం, ప్రభుత్వ ప్రయోజనాలు రక్షించేవారు కావడం, వారి చేతిలో సాయుధ బలగాలు ఉండటం అనే నాలుగు కారణాలు దోహదం చేశాయని వివరించారు. తిరుగుబాట్లను అణచడానికి, బందిపోట్లను నాశనం చేయడానికి వారికి శాంతి భద్రతలు నెలకొల్పే అధికారాలు ఇవ్వబడ్డాయి. అందుకుగాను వారు శిస్తు హక్కుదారులుగా గుర్తింపబడ్డారు. కాని వారికి భూమిపై హక్కులేదు. కాని రాజు బలహీనుడైనప్పుడు వారు కూడా తిరుగుబాట్లు చేశారు. ప్రజలపై విపరీతంగా పన్నులు వేసి దోచుకొనేవారు.

ఆనాడు విజయనగర ప్రభువులు అనేక ప్రాంతాలలో పాలెగాండ్రను నియమించినట్లు శాసనాలు, నాటి సాహిత్యం తెలుపుతోంది. కృష్ణదేవరాయలు యాకర్ల ఎర్రమనాయుడు అనే అతన్ని రాయలసీమలోని రోళ్లమడుగుకు పాలెగాడుగా నియమించి ఆ ప్రాంతాన్ని అతనికి జాగీరుగా ఇచ్చాడు. అతడు చెయ్యేరు ఒడ్డున ఒక కోటను నిర్మించాడు. ఎర్రమనాయుడు బందరు నుండి అక్కడికి వలస వచ్చాడు. అచ్యుతదేవ రాయలు విర్నియాని సిద్ధప్ప అనే వ్యక్తిని నల్లమలకొండలలోని జ్యోతికనుమ దగ్గర దురంతాలు చేసే బందిపోట్లను అణచడానికి ఆ ప్రాంతానికి పాలెగాడుగా నియమించాడు. అతనికి దాసరిపల్లి గ్రామాన్ని జాగీరుగా ఇచ్చాడు. అచ్యుతరాయలు చేబ్రోలు తిమ్మరాజు అనే అతనిని పుట్టకోట పాలెగాడుగా నియమించాడు. సదాశివరాయల కాలంలో పెరుగు

బసివినాయుడు అనే అతనిని నెట్టూరు ప్రాంతానికి పాలెగానిగా అక్కడి బ్రాహ్మణులు నియమించుకున్నారు అతడు అక్కడి బందిపోట్లను అణచడానికి వారితో పోరాడాడు, కాని ఆ పోరాటంలో మరణించాడు.

పాలెగాళ్ల దురంతాలు: ఆయా ప్రాంతాలలో దోపిడీ దొంగలను అణచి ప్రజలను కాపాడటానికి, శాంతి భద్రతలను నెలకొల్పడానికి పాలెగాళ్లను నియమించారు. కాని వారే ప్రజలను దోచుకొని బందిపోటు దొంగలుగా వ్యవహరించి ప్రజాకంటకులుగా తయారైనట్లు కూడా అనేక సంఘటనలు సాహిత్యంలో పేర్కొనబడ్డాయి. రోళ్లమడుగులో యాకర్ల ఎర్రమనాయుడు చేసిన దురంతాలు భరించలేక అక్కడి అగ్రహారీకులు ఊరు వదలి వెళ్లిపోయారు. అచ్యుతరాయల కాలంలో పాలెగాళ్లు విపరీతమైన దురంతాలు సాగించారు. పుట్టకోట పాలెగాడు తిమ్మరాజు స్వయంగా ఊళ్లు దోచుకున్నాడని మెకంజీ కైఫీయత్తు వివరించింది. తిమ్మరాజు తంగెడ, పలనాడు వినుకొండ, పొదిలి, అమ్మనబ్రోలు, ఏరువనాడు, ఉదయగిరి, నందెళ్ల, సిరివెల్ల ప్రాంతాలలో దోపిడీలు చేసి ప్రజలను నిద్రపోనివ్వలేదని ఆ కైఫీయత్తు తెలుపుతోంది. పాలెగాళ్ల దురంతాలు తామ్ర శాసనం తెలుపుతోంది. రోళ్లమడుగు కనుమలో తమకు రక్షణ ఇచ్చినందుకు కొన్ని వస్తువుల మీద ఆ పాలెగానికి సుంకాలు చెల్లించడానికి చప్పన్న దేశాల వర్తకులు అంగీకరించారు. అందువల్ల అతడు దొంగలను పట్టుకొని వారు దొంగిలించిన వస్తువులను వర్తకులు ఇప్పించాడు. అంతేగాదు తన మండలంలో జరిగిన దోపిడీలో నష్టపోతే తాను ఆ వస్తువులు దొంగల నుండి స్వాధీనం చేసుకోలేకపోతే ఆ సొత్తులో సగం తాను భరించి దాని విలువ వర్తకులకు చెల్లిస్తానని కూడా మాట ఇచ్చాడని ఆ శాసనం తెలుపుతోంది.

అచ్యుతదేవరాయలు కాలం నాటి కొండవీడు కథ: అచ్యుతదేవరాయల కాలంలో కొండవీటిసీమలో 72 మంది పాలెగాండ్రు అనేక దురంతాలకు పాల్పడ్డారు. అక్కడ అమర నాయకునిగా నియమింపబడిన రామయ భాస్కరుడు యుక్తితో వారినందరినీ చంపించి శాంతిభద్రతలను నెలకొల్పాడని కొండవీటి కైఫీయత్తు తెలుపుతోంది. కొండవీటిలో ఉన్న గోపీనాథ దేవాలయంలో ఒక లోతైన బావిని తవ్వించి 72 మంది పాలెగాళ్లను దేవాలయంలోకి ఆహ్వానించి ఆ బావిలో పడేటట్లు చేసి చంపాడని కైఫీయత్తు వర్ణించింది. ఈ కథే కొండవీటి రెడ్లను చంపారని ఆంధ్రదేశంలో ప్రచారంలో ఉంది. వాస్తవానికి ఈ సంఘటన అచ్యుతదేవరాయల కాలంలో జరిగింది.

తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర రాజ్యం బలహీనపడింది. అందువల్ల పాలెగాండ్రు విచ్చలవిడిగా సంచరించారు. ప్రజలను దోచుకున్నారు. మరొకవైపు బందిపోట్లు విజృంభించారు. కొన్ని సందర్భాలలో బందిపోట్లతో పాలెగాండ్రు కూడా లాలూచీపడ్డారు. రెండవ వెంకటపతిరాయల కాలంలో బందిపోట్లు, పాలెగాండ్రు ఉదయగిరి, సిద్ధవటం, పోరుమామిళ్ల, బద్వేల్ ప్రాంతాలలో కల్లోలాలు సృష్టించారు. వారిని అణచడానికి వెంకటపతి రాయలు పులుగునాడుకు అమరనాయకుడైన మట్ల ఎల్లమరాజును పంపాడు. అతడు పాలెగాండ్రు బందిపోట్లతో పోరాటాలు జరిపి వారిని అణచివేశాడు. దేశరక్షణకు ఏర్పరచిన పాలెగాళ్లు ప్రజాకంటకులయ్యారని ఈ సంఘటనలు తెలుపుతున్నాయి. మధురనాయకులు అనేకసార్లు తిరుగుబాట్లు చేశారు. తళ్లికోట యుద్ధం తర్వాత సామంతులు తమలో తాము కయ్యాలకు దిగడం సర్వసాధారణం అయిపోయింది. మధుర, మైసూరు వడయారులు, మధుర, తంజావూరు నాయకులు తమలో తాము అనేక యుద్ధాలు చేశారు. వారిని దండించే శక్తి చివరి రాజైన మూడవ శ్రీరంగరాయలకు లేకపోయింది. పైగా బీజాపూరు, గోల్కొండ దాడులను ఎదుర్కోడానికి అతడే వారిపై ఆధారపడ్డాడు.

ఆదాయం: సామంతరాజుల ఆధీనంలో ఉండే భూముల నుండి సాలుకు 1 కోటి 20 లక్షల ఆదాయం వస్తుందని, దానిలో సగం చక్రవర్తికి కప్పంగా చెల్లించి మిగిలిన ధనాన్ని సైనిక ఖర్చుకు ఉంచుకొనేవాడని, చక్రవర్తికి వచ్చే 60 లక్షలు సైన్యానికి ఖర్చుపెట్టి మిగిలిన 20 లక్షలు సొంత ఖర్చులకు వాడుకొనే వాడని న్యూనిజ్ వివరించాడు. సామంతులు ప్రతి సంవత్సరం మహానవమినాడు కప్పాలను చెల్లిస్తారని పేస్ రాశాడు. సాధారణంగా అమరనాయకులే సామంతులుగా నియమింపబడేవారు. వారు తయారు చేసిన సైన్యానికి వారే నాయకులుగా ఉంటారు. ప్రతి సామంతుడూ, అమరనాయకుడూ చక్రవర్తుల ప్రత్యక్ష ఆధిపత్యంలో ఉంటాడు

అమరనాయక సైన్యం: విజయనగర రాజులు పోషించిన రెండవ రకపు సైన్యాన్ని అమరనాయక సైన్యం అని పిలిచేవారు. ఈ యుగంలో అమరనాయక సైన్యం అమిత ప్రాధాన్యతను సంతరించుకుంది. విజయనగర ప్రభువులు తమ సైనిక అవసరాల దృష్ట్యా రూపొందించుకున్న ప్రత్యేక సైన్యం అమరనాయక సైన్యం అని చెప్పవచ్చును. ఈ సైన్య విధానం విజయనగర ప్రభువులు సృష్టించింది కాదు. కాకతీయుల కాలంలోనే ఈ పద్ధతి

ఉంది. వారి కాలం నాటి నాయంకర విధానం, వీరి అమరనాయక విధానాన్ని, విజయనగర చక్రవర్తులు నిర్దిష్ట రూపం ఇచ్చారు. సైనిక సహాయానికి చక్రవర్తి కేటాయించే భూమిని లేక దానిపై వచ్చే ఆదాయాన్ని అమరమని నాయక అంటే సేనాధిపతి అని, కర అంటే పదవి అని అర్థం ఉందని, కనుక అమరనాయంకరం అని పేరు వచ్చిందని కొందరు అంటారు. మరికొందరు ఇది పారశీక పదం అని, ఆజ్ఞ అని అర్థం ఉందని భావిస్తారు. చక్రవర్తి రాజ్యాన్ని అమరాలుగా విభజించి నిర్దిష్ట సైన్యాన్ని పోషించడానికి వీరులకు ఇస్తాడు. అమరాలు పొందిన వీరులు చక్రవర్తి కోరినప్పుడు తన వంతు సైన్యంతో వచ్చి యుద్ధంలో పాల్గొనాలి. ఇది ఒక రకంగా భూస్వామ్య అంటే ఫ్యూడల్ వ్యవస్థ అని చెప్పవచ్చును. ఈ విధానం ప్రకారం రాజ్యంలోని భూమి అంతటికీ రాయలు యజమాని. ఆ భూమిని అమరాలుగా విభజించి సైన్యాన్ని సరఫరా చేసే షరతుపై నాయకులకు ఇస్తాడు. అవి పొందిన వారిని అమర నాయకులు అనేవారు. అమరనాయకులు తమ భూమిని అదే షరతులపై అంటే, సైనిక సహాయం చేసే షరతుపై తమ కింది నాయకులకు పంచేవారు. వారు ఆ భూములను సాగుచేయడానికి రైతులకిచ్చి వారి దగ్గర నుండి ఆదాయం పొందేవారు. ఆ ఆదాయంతో సైన్యాలను పోషించేవారు. ఈ వ్యవస్థకు, ఐరోపాలోని ఫ్యూడలిజానికి కొన్ని పోలికలున్నాయి. భూమిపై హక్కు సైనిక సేవ అనే రెండు సమాన లక్షణాలు ఈ రెండు వ్యవస్థలలో ఉన్నాయి. అమరం యొక్క పరిమాణాన్ని బట్టి అమరనాయకుని హోదా, అతడు పోషించవలసిన సైన్యం పరిమాణం ఉంటుంది.

అమరనాయంకర స్వభావం: అమరనాయక స్వభావాన్ని గురించి కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. ఇది ఐరోపాలోని ఫ్యూడల్ వ్యవస్థ వంటిదని కొందరు అంటే మరికొందరు అలాంటిది కాదని అన్నారు. భూమిపై హక్కు సైనిక సేవ అనే రెండు విషయాలు. ఈ రెండు వ్యవస్థలలో సమానంగా ఉన్నాయి. కనుక ఇది ఐరోపాలోని ఫ్యూడలిజం వంటిదేనని కొందరు అన్నారు. కాని ఐరోపాలో రాజులకు ఫ్యూడల్ లార్డులకు మధ్య రాత పూర్వకంగా ఉన్న హక్కులు, నిబంధనలు నాయంకరులకు లేవు. అలాగే ఐరోపా ఫ్యూడలిజం వారసత్వ హక్కు కలిగింది. కాని విజయనగర అమరనాయంకరానికి వారసత్వపు హక్కులు లేవు. రాయలు ఎప్పుడు తలచుకుంటే అప్పుడు అతనిని తొలగించవచ్చును. ఐరోపా ఫ్యూడల్ లార్డులను మరొక ఎస్టేట్‌కు బదిలీ చేయడానికి వీలులేదు. కాని అమర నాయకుని ఏ అమరానికైనా బదిలీ చేయవచ్చును. కనుక అమరనాయంకరం ఐరోపాలోని ఫ్యూడలిజం వంటిది కాదు. కొన్ని పోలికలు మాత్రమే ఉన్నాయని, కనుక దానిని ఫ్యూడలిజంతో పోల్చరాదని అన్నారు డి.సి.సర్కారు. మధ్యయుగపు భారతీయ రాజ్యాలకు ఫ్యూడలిజం వర్తింపజేయటానికి వీలులేదని చెప్పి డి.సి సర్కారు విజయనగర నాయంకర విధానం ఐరోపాలోని ఫ్యూడలిజం వంటిదేనని అభిప్రాయపడ్డారు. అందుకు కారణం అమరం అనే సైనిక స్థిరాస్తిని అనుభవించే హక్కు అమరనాయకునికి ఉంది. కనుక అది ఐరోపా ఫ్యూడలిజం లక్షణమేనని అన్నారు. కాని నేలటూరి వెంకటరమణయ్య వారి అభిప్రాయాన్ని అంగీకరించలేదు. అమరంపై హక్కు కేవలం కేంద్రప్రభుత్వ అధికారానికి లోబడి సైనిక సేవ చేసే తాత్కాలిక ఆస్తి హక్కు మాత్రమేగాని స్థిరాస్తి హక్కు కాదని, కనుక దానిని ఫ్యూడలిజం అనటానికి వీలులేదని వెంకటరమణయ్య భావించారు. అంతేగాక అమరనాయకులు చక్రవర్తికి సామంతులుగా ఉండటానికి మనస్ఫూర్తిగా ఇష్టపడలేదు. వీలయినప్పుడల్లా వారు తిరుగబాట్లు చేసి స్వతంత్రం పొందడానికి ప్రయత్నించారు. తళ్లికోట యుద్ధం తర్వాత ఎక్కువ మంది అమరనాయకులు స్వతంత్ర వైఖరిని అవలంబించి విజయనగర ప్రభువులను లెక్క చేయలేదని వివరించారు. ఐరోపా ఫ్యూడల్స్‌కు ఆ తిరుగుబాటు ధోరణి లేదు. ఐరోపాలో చక్రవర్తికి, ఫ్యూడల్ లార్డ్సుకు మధ్య రాజకీయ షరతులతో ఒప్పంద పత్రం లిఖిత పూర్వకంగా ఉంటుంది. అంటే వారి మధ్య ఉండేది రాజకీయ సంబంధం. ఆ ఒప్పందపత్రం ఫ్యూడల్స్‌కు వారసత్వ హక్కును కలిగించింది. కాని విజయనగర చక్రవర్తులకు, వారి అమరనాయకులకు అలాంటి ఒప్పందాలు లేవు. వారి మధ్య ఉంది రాజకీయ ఒప్పందం కాదు. కేవలం సైనిక ఆర్థిక సంబంధాలు మాత్రమే. ఐరోపా ప్రభువులు అధికారం వంశపారంపర్యమైంది. కాని నాయంకరుల అధికారం విజయనగర చక్రవర్తులు దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంది. వీరి మధ్య ఎలాంటి నిర్దిష్ట నిబంధనలు లేవు. ఫ్యూడల్ ప్రభువులు చాలా శక్తిమంతులు. వారి ఉనికిపైన వారి రాజుల భవిష్యత్తు ఆధారపడి ఉంది. కాని అమరనాయకుల ఉనికిపై విజయనగర చక్రవర్తి ఆధారపడిలేదు. ఫ్యూడల్ లార్డు రాజధానిలో నివసించాలనే నిబంధన లేదు. కాని అమరనాయకులు తప్పనిసరిగా రాజధానిలో నివసించాలి. బర్టన్‌స్టెయిన్ అనే పండితుడు విజయనగర అమర నాయంకరం కొన్ని విషయాలలో ఐరోపా ఫ్యూడలిజానికి సన్నిహితంగా ఉన్నా, ఐరోపా జపాన్ ఫ్యూడలిజాలతో

పోలిస్తే కొన్ని మౌలికమైన బేధాలున్నాయి. కనుక వీరు ఫ్యూడల్స్ అనడానికి వీలులేదు. విజయనగర రాజులకు వారి అమరనాయకులకు మధ్య ఉన్న సంబంధం నైతికమైనది అని వ్యాఖ్యానించాడు. అమర నాయకులను మహామండలేశ్వరులు అని పిలిచేవారు. మహామండలేశ్వరులు అంటే ఒక రకంగా వారు ఉద్యోగస్తులే కనుక వారు ఫ్యూడల్సు కాదని బర్టన్‌స్టెయిన్ వివరించారు. మొత్తం మీద అమరనాయకులు ఐరోపా ఫ్యూడల్స్ వంటివారు కాదని పలువురు అంగీకరించారు.

అమరనాయంకర పద్ధతి అభివృద్ధి కావడానికి కారణాలు: అమరనాయంకరం అభివృద్ధి కావడానికి కొన్ని కారణాలు దోహదం చేశాయి. అల్లా ఉద్దీన్ ఖిల్జీ కాలం నుండి దక్షిణదేశంపై ముస్లిం దాడులు ప్రారంభం అయ్యాయి. తుగ్లక్ దండయాత్రలకు కాకతీయ సామ్రాజ్యం, పాండ్య రాజ్యం ఆహుతి అయ్యాయి. దక్షిణదేశంలో హిందూ సంస్కృతి సామాజిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అయ్యాయి. కొద్ది కాలం కాకతీయ, పాండ్య రాజ్యాలలో కొద్ది కాలం సాగినా ముస్లిం పరిపాలనలో హిందువులు అష్టకష్టాలుపడ్డారు. ముస్లిం పాలనను అంతం చేసి ఆంధ్ర దేశంలో ముసునూరి కమ్మసేనానులు దక్షిణదేశంలో హరిహర బుక్కరాయలు హిందూ రాజ్యాలు స్థాపించినా వాటికి భద్రత లేదు. ఇదే కాలంలో గుల్బర్గులు, బహమనీ రాజ్యాలు ఏర్పడ్డాయి. బహమనీ రాజ్యం ఏ నిముషంలో విజయనగర రాజ్యంపై దండెత్తుతుందో చెప్పలేని విషయంగా ఉండేది. కనుక విజయనగర రాజ్యానికి తమ రాజ్యాన్ని, హిందూ సంస్కృతిని రక్షించడానికి సర్వవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండవలసి వచ్చింది కనుక అందుకు తగిన విధంగా సైన్యాన్ని తయారు చేసుకోవలసివచ్చింది. కనుక విజయనగర చక్రవర్తులు అంతకు ముందు ఏ దక్షిణదేశ రాజవంశం అనుసరించని నూతన సైనిక విధానాన్ని రూపొందించుకుంది. ఆ విధానమే అమర నాయంకర విధానం. అమర నాయకులకు సైనిక పోషణకు రాజులు భూమిని ఇచ్చేవారు. ఆ భూమిని అమరం అని అనేవారు. కాని అది వారి సొంతానికి కాదు. ఆ భూమి మీద వారికి ఎలాంటి హక్కు లేదు అది మరంలోని దేవబ్రాహ్మణ భూములు పోను మిగిలిన గ్రామాలలో పన్ను వసూలు చేసుకోనే హక్కును మాత్రమే ఇచ్చినట్లు. ఆ ఆదాయంతో సైన్యాలను పోషించాలి.

అమరనాయకుల విధులు: ఈ విధంగా ఏర్పడ్డ అమరనాయకులకు విజయనగర చక్రవర్తులు గురుతరమైన బాధ్యతను అప్పగించారు. ప్రతి అమరనాయకుడు నిర్దిష్ట సైన్యాన్ని పోషించాలి. తనకు కేటాయించిన అమర నాయంకరానికి నిర్దేశించిన కప్పం చెల్లించాలి. అది తన ఆదాయంలో సగభాగమని న్యూనిజ్ రాశాడు తన సైన్యాన్ని సుశిక్షతంగా ఉంచుకొని సర్వవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. చక్రవర్తి ఎక్కడికి వెళ్లమంటే అక్కడికి వెళ్లి శత్రువులతో పోరాడాలి. తనకు అప్పగించిన నాయంకర రాజ్యాన్ని కూడా కాపాడాలి. తమ నాయంకరం పరిపాలన విషయాలలో స్వయం నిర్ణయాధికారానికి గాను హక్కులు ఇవ్వబడ్డాయి. కానుకలలో మణులు, రత్నాలు బంగారమేగాక ఆహార పదార్థాలు కూడా ఉండేవి. తమ నాయంకరాలలో నేరస్థులను శిక్షించే అధికారం వారికే ఉంది. దొంగలను బంధించి ప్రజల ఆస్తులు, సొమ్మును కాపాడాలి. అమరంలో శాంతిభద్రతలను నెలకొల్పాలి అక్కడ అడవులను నరికించి వ్యవసాయాభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచాలి. అమరనాయకులు రాజధానిలో నివసించాలి. అమరనాయక వ్యవస్థ స్థానిక పరిపాలనలో అంతర్భాగంగా ఉండేది. రాష్ట్రాల అధిపతి అయిన దన్నాయకునికి కూడా అమర గ్రామాల మీద అధికారం లేదు. అమరాల మీద అమరనాయకులకు పూర్తి అధికారాలు ఇవ్వబడ్డాయి. దన్నాయకుడు రాష్ట్రంలో పరిపాలనకు రాయల ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. అమర నాయకుడు రాయల సైనిక సామంతుడు. దన్నాయకుని కంటే అమరనాయకులకు ఎక్కువ స్వాతంత్ర్యం ఉండేది. అమరనాయకులు తమ విధులను సక్రమంగా నెరవేర్చలేకపోయినా, చక్రవర్తి పట్ల భక్తివిశ్వాసాలు లేకపోయినా ద్రోహానికి తలపడినా అతనిని కఠినంగా శిక్షించడమేగాక నాయంకరం నుండి తొలగించేవారు అని న్యూనిజ్ రాశాడు.

అమరనాయక ప్రయోజనాలు: అమరనాయంకరం వల్ల విజయనగర రాజ్యానికి అనేక ప్రయోజనాలు చేకూరాయి. నాయంకరులు వారికి అప్పగించిన ప్రాంతాలను శత్రుదాడుల నుండి రక్షించారు. గ్రామాలు పట్టణాలను నెలకొల్పి అరణ్యాలను నిర్జన ప్రాంతాలను జనావాసాలుగా మార్చారు. బంజరు భూములను సాగులోకి తెచ్చి రాజ్యపు ఆదాయాన్ని పెంచారు. నీటిపారుదల సౌకర్యాలు పెంచి వ్యవసాయాభివృద్ధి చేశారు. తమ నాయంకరాలలో శాంతి భద్రతలను నెలకొల్పారు. తీర్పులు చెప్పారు. విజయనగర చక్రవర్తులకు పరిపాలనా బాధ్యతలు తగ్గించి ఆ బాధ్యతలను తాము నెత్తిన వేసుకున్నారు. తమ ప్రాంతంలో సాహిత్య సారస్వతకళలను

కాదు. అప్పటికి కృష్ణరాయల భార్యలు చిన్నాదేవి, తిరుమలదేవిలు జీవించి ఉన్నారు. కనుక రామరాయలపై యుద్ధానికి దిగితే రాజకుటుంబంలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని అతడు ఓర్పు చూపి ఉండవచ్చును. కాని అతడు పిరికివాడు కాదు. చివరలో మాత్రం అతడు రాజ్యపాలనను అశ్రద్ధ చేసిన మాట వాస్తవం. తన బావమరిదికి అధికారం అప్పజెప్పి అంతఃపురంలో కాలక్షేపం చేసినందువల్ల న్యూనిజ్ అలా రాసి ఉండవచ్చును. అందువల్ల రాజ్యానికి కొంత నష్టం జరిగింది. చివరలో అచ్యుతరాయల ఉదాసీనత వల్ల అమర నాయకులు, రాజోద్యోగులు తమ ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించారు. దొంగల ముఠాలు స్వైరవిహారం చేశాయి. రాచమార్గంలోనే బందిపోటు దొంగలు, వర్తకులను, యాత్రికులను దోచుకున్నారు. కొందరు సామంతులు కూడా దొంగలలో చేరిపోయి వర్తకులను దోచుకున్నారు. అలాంటి వారిలో చేబ్రోలు తిమ్మానాయకుడు ఒకడు. అందువల్ల వ్యాపారులు, యాత్రికులను రక్షణ కరువై బాధలుపడ్డారు. దొంగలను, సామంతులను అణచడానికి అచ్యుతరాయలు తగిన శ్రద్ధ తీసుకోలేదు. అందువల్ల పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. రాజ్య అవసరాల దృష్ట్యా అధిక పన్నులు విధింపబడ్డాయి. కనుక ప్రజలకు రాజుపై భయభక్తులు పోయి అసంతృప్తి ఏర్పడింది. ఇదే సమయంలో పశ్చిమకోస్తాలో పోర్చుగీసు వారి ఆగడాలు మితిమీరిపోయాయి. వారు విజయనగరంతో స్నేహ సంబంధాలు పాటిస్తూనే వారి సామంతులతో యుద్ధాలకు దిగేవారు. వారు అనేక కోటలు, గిడ్డంగులు నిర్మించారు. క్రీ.శ.1540లో వారు బీజాపూరు, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లతో సంధులు చేసుకున్నారు. విజయనగర అధిపతులు గాని, వారి సామంతులు గాని పోర్చుగీసు వారికి ఇచ్చిన మాటను ఎప్పుడూ తప్పలేదు. కాని వారు మాత్రం సంధులను ఉల్లంఘించి విజయనగర రాజ్యానికి ఇబ్బందులు కలిగించారు. అనేక మంది హిందువులను క్రైస్తవులుగా మార్చి వారు పోర్చుగీసు రాజుకు విధేయులుగా ఉండాలి గాని విజయనగర రాజులకు విధేయులుగా ఉండనవసరం లేదని బోధించసాగారు. మొత్తం మీద అచ్యుతదేవరాయల కాలంలో వారి ఆగడాలు హెచ్చాయి. సంధి కుదిరిన తర్వాత రామరాయలు విజయనగరాన్ని వదిలిపెట్టి గుత్తి, పెనుగొండ తూర్పు ప్రాంతాలను పాలించడానికి వెళ్లాడు. అతడు ప్రళయకావేరి లేక పులికాట్‌ను కొంతకాలం రాజధానిగా చేసుకొని పాలించాడు. అచ్యుతరాయలు మిగిలిన సామ్రాజ్యాన్నంతటిని క్రీ.శ.1542 వరకు 12 సంవత్సరాలు పాలించి మరణించాడు.

మధుర, తంజావూరు రాజ్యాల పుట్టుక: తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర అనే గ్రంథంలో తంజావూరు రాజ్య పుట్టుకను గురించిన కథ ఉంది. పాండ్యరాజ్యాన్ని చంద్రశేఖర పాండ్యుడనే రాజు శ్రీకృష్ణదేవరాయల సామంతుడుగా పాలించేవాడు. అతని రాజ్యంపై వీరశేఖర చోళుడు దండెత్తి చంద్రశేఖర పాండ్యుని ఓడించి తరిమివేశాడు. చంద్రశేఖర పాండ్యుడు విజయనగరం వచ్చి రాయలకు మొర పెట్టుకున్నాడు. రాయలు తన సేనాధిపతి అయిన కొటకం నాగమనాయకుని వీరశేఖర చోళుని దండించడానికి పంపాడు. నాగమనాయకుడు వీరశేఖరుని ఓడించి చోళ పాండ్య రాజ్యాలను ఆక్రమించాడు. తర్వాత ఆ ప్రాంతానికి తననే రాజుగా ప్రకటించుకున్నాడు. తన ఆజ్ఞను ధిక్కరించిన నాగమనాయకుని శిక్షించడానికి కృష్ణరాయలు తన సేనాధిపతులలో ఎవరు వెళతారని దర్బారులో ప్రశ్నించాడు. అందుకు నాగమనాయకుని కుమారుడు విశ్వనాధనాయకుడు ముందుకు వచ్చాడు. రాయలు తనలో ఊగిసలాడాడు. అనుమానాలను పక్కనబెట్టి అతనినే పంపాడు. విశ్వనాధ నాయకుడు తండ్రి అని కూడా చూడకుండా నాగమనాయకుని ఓడించి కట్టి తెచ్చి రాయలకు అప్పగించాడు. విశ్వనాధ నాయకుని రాజభక్తికి మెచ్చి రాయలు నాగమనాయకుని క్షమించి చోళ, పాండ్య దేశాలకు విశ్వనాధుని రాజుగా నియమించాడని, అతని సంతతి వారే మధుర నాయక రాజులని తంజావూరు ఆంధ్రరాజుల చరిత్ర చెబుతోంది. కృష్ణరాయల తర్వాత అచ్యుతరాయలు రాజు అయ్యాడు. అతని భార్య వరదాంబిక. ఆమెకు మూర్తయమ్మ అనే చెల్లెలు ఉండేది. ఆమె చెవ్వప్పనాయకుని వివాహం చేసుకుంది. అచ్యుతరాయలు తన తోడల్లునికి విశ్వనాధనాయకుని రాజ్యంలోని చోళమండలాన్ని విడగొట్టి చెవ్వప్పకు ఇచ్చాడు. అతని సంతతి వారే తంజావూరి నాయకవంశం అని తంజావూరి ఆంధ్రరాజుల చరిత్ర చెబుతోంది. కాని ఈ కథలను ధృవపరిచే సాక్ష్యం లభించలేదు. మధుర రాజ్యాధిపతిగా విశ్వనాధుని నియమించింది శ్రీకృష్ణదేవరాయలు కాదు, అచ్యుతదేవరాయలని కొందరు పండితులు అన్నారు. మధురై త్తలవరలారులో లభించిన సమాచారం ప్రకారం శక 1481 రౌద్రి నామ సంవత్సరంలో అంటే క్రీ.శ.1559-60లో కొటియమ్ నాయక్కర్ రాయల ఆజ్ఞనే రౌద్రి మార్గశిర నుండి అంగీరస వైశాఖి వరకు అంటే (1559-1592) పాలించి మరణించాడని తెలుస్తోంది. ఆ ప్రాంతంలోని శాసనాలను పరిశీలిస్తే తిరునల్వేలి జిల్లాలోని అంబా సముద్రం ప్రాంతాన్ని విశ్వనాధ నాయకుడు క్రీ.శ.1557 వరకు సాధారణ

అమర నాయకునిగా పాలించినట్లు తెలుస్తుంది. క్రీ.శ.1564 వరకు అతడు గాని, అతని కుమారుడు కృష్ణప్ప గాని అమర నాయకుని హోదాకు మించి ఉన్నట్లు సాక్ష్యం లేదు. విశ్వనాథ నాయకుని కృష్ణరాయలు గాని, అచ్యుతదేవరాయలు గాని మధుర రాజుగా నియమించినట్లు ఒక్క ఆధారం కూడా లభించలేదు. కనుక క్రీ.శ.1565 తళ్లికోట యుద్ధం తర్వాత అంబా సముద్రంలో అమర నాయకుడుగా ఉన్న విశ్వనాథ నాయకుని కుమారుడు కృష్ణప్ప మధుర రాజ్యాన్ని ఆక్రమించి స్వంత రాజ్యంగా ఏర్పరచుకొని సామంతుని హోదా పొంది ఉండవచ్చును. ఏమైనా మధుర, తంజావూరు రాజ్యాలు తళ్లికోట యుద్ధం తర్వాత పుట్టాయని భావించడానికే ఎక్కువ అవకాశం ఉంది.

అచ్యుతరాయల సైన్యం-సామంతులు-ఇతర విశేషాలు: అచ్యుతరాయలకు 50 వేల సిద్ధ సైన్యం ఉండేది వారిలో 6 వేల అశ్వదళం రాజభవనానికి కాపలాగా ఉండేది. వారిలో రెండు వందల మంది రాజుకు రక్షణగా ఉండేవారు. 20 వేల మంది బల్లాలు డాలులతో ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేవారు. మూడు వందల మంది ఏనుగులకు రక్షణగా ఉండేవారు. సైన్యానికి పని చేయడానికి 2 వేల మంది రకరకాల పనివారుండేవారు. చాకలి, మంగలి, వడ్రంగి మొదలైన పని వారు సైనికులకు సేవలు చేస్తుండేవారు. వారికి ఏ రోజుకారోజు రాజభవనం వద్ద వేతనాలే చెల్లించేవారు. అచ్యుతదేవరాయల కాలంలో గుర్రపుదళానికి మదన నాయక్ అనే అతడు అధిపతిగా ఉండేవాడు. అచ్యుతరాయలు ప్రతి సంవత్సరం 13 వేల మేలుజాతి అశ్వాలను కొనేవాడట. వాటిలో మంచివి తాను ఉంచుకొని మిగిలిన వాటిని సామంతులకు ఇచ్చేవాడట. అశ్వాల ఖరీదు అంతా సామంతుల నుండి వసూలు చేసేవాడట. అందువల్ల రాజఖజానా నుండి తాను తీసుకున్న గుర్రాలకు ఏమీ ఖర్చు అయ్యేది కాదట అచ్యుతరాయల కాలంలో కూడా 200 మంది అమరనాయకులు ఉండేవారు. వారు వివిధ ప్రాంతాలకు అధిపతులుగా ఉండి రాజుకు సైనిక సేవ చేసేవారు. వారిలో కొందరు రాజధానిలో మంత్రులుగా, ఉన్నత ఉద్యోగులుగా ఉండేవారు. అలాంటి వారిలో ప్రథముడు ప్రధాన మంత్రి, తర్వాత హోదా ఖజానాదారునిది. తర్వాత హోదా రాజభవన కాపలాదారునిది. రాయల ఆస్థానంలో ప్రత్యేకంగా రెవెన్యూ అధికారులుండేవారు కాదట మంత్రులే రెవెన్యూ వసూళ్లు చూసేవారట. అచ్యుతరాయల కాలంలో సాళువ నాయక్ మంత్రిగా రెవెన్యూ వసూళ్లు చూసేవాడట. అతడు చోళమండలం, నాగపట్టణం, తంగోరు, Bomgarın, apatao, Truguel, Caullım మొదలైన పట్టణాలకు అమరనాయకుడు. అతని నాయంకరం సింహాళం వరకు విస్తరించి ఉండేది. అతడు రాజధానిలో నివసిస్తూ ఉండేవాడు. అతనికి ఒక మిలియన్ ఒక వేయి బంగారు పరదావోల ఆదాయం వచ్చేది. అందులో $^1/_3$వ వంతు రాయలకు చెల్లించి మిగిలిన $^1/_3$వ వంతు తన ఖర్చులకు ఉంచుకొనేవాడు. అతడు రాజధానిలో నివసిస్తూ సామ్రాజ్యపు రెవెన్యూ వసూళ్లు చూసేవాడు. అతనికి మంత్రి హోదా కూడా ఉండేది. తర్వాత చెప్పుకోవలసిన అమరనాయకుడు అజపర్క తిమ్మప్ప. అతడు హుడోగరి, కండోవిమ్‌ల అధిపతి. తర్వాత మధుర నాయకుడైన విశ్వనాథ నాయకుడు. తర్వాత రోసిల్, తిపర్, తికాలో, బిగోలో ప్రాంతాల అమర నాయకుడు గణపనాయక్. తర్వాత వంగాపూర్ అధిపతి Lepapayque. ఇంకా Ondegema అధిపతి నరవర, Calay అధిపతి చిన్నప్పనాయక్, ఓసోల్ అధిపతి కృష్ణప్పనాయక్, బోడియల్ బాజపనాయక్, అవలీ అధిపతి మల్లప్పనాయక్, గేట్ అధిపతి అదెపనాయక్, మందగుల్ అధిపతి బాజపనాయక్‌ల పేర్లు న్యూనిజ్ తన క్రానికల్‌లో పేర్కొన్నాడు. రాజ్యం మొత్తం 200 మంది అమరనాయకుల కింద ఉండేది. వారందరూ దసరా ఉత్సవాలప్పుడు విజయనగరం చేరి రాయలకు తాము చెల్లించవలసిన కప్పం చెల్లించేవారు. రాయలు వారికి రసీదులు ఇచ్చేవాడు కాదని రాశాడు ఉత్సవాలలో పాల్గొని తర్వాత తమ ప్రాంతాలకు వెళ్లేవారు. రాజధానిలో ఎల్లప్పుడూ 20 వేల పల్లకీలు ఉండేవని, వాటిని మనుషులు మోసేవారని, ఉన్నతోద్యోగులు వాటిపై ఎక్కే వారని కూడా న్యూనిజ్ రాశాడు.

ఒకటవ వెంకటపతి రాయలు క్రీ.శ.1542: అచ్యుతదేవరాయల మరణానంతరం అతని కుమారుడు వెంకటపతిరాయలు సింహాసనమధిష్టించాడు. అచ్యుతరాయలు తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తుడు. అందువలన తన కుమారునికి వెంకటపతి అని పేరు పెట్టుకున్నాడు. అతడు క్రీ.శ.1452లో మొదటి వెంకటపతి రాయలుగా విజయనగర సింహాసనానికి వచ్చాడు. అప్పుడతని వయసు 16 సంవత్సరాలు. అచ్యుతరాయల అంత్యక్రియలకు రాజధానికి వచ్చిన అమర నాయకులు అతని వయసు చూసి నిరుత్సాహపడి పరిపాలనలో అతని పెద్దవారెవరైనా తోడు ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అందువల్ల అచ్యుతరాయల చిన్న బావమరిది సలకం చిన తిరుమలయ్య సంరక్షకత్వాన్ని వహించాడు. అప్పటికే అచ్యుతరాయలు పెద్ద బావమరిది సలకం పెద తిరుమలయ్య

మరణించాడు. కనుక అతని తమ్ముడు చిన తిరుమలుడు విజయనగర పరిపాలనను తన చేతిలోకి తీసుకున్నాడు. కాని అతడు దుష్టస్వభావుడని తెలిసిన అచ్యుతరాయల భార్య, వెంకటపతి తల్లి అయిన వరదాంబిక అతని రక్షకత్వాన్ని ఆమోదించలేదు. కాని అతడు కొందరు అమరనాయకుల మద్దతు సంపాదించి తన స్థానాన్ని పదిల పరుచుకున్నాడు. కాని వరదాంబిక తన కుమారుని భద్రత కోసం ఆరాటపడి బీజాపూరు సుల్తాన్ దర్బారుకు తన మనుషులను పంపి తన కుమారునికి అండగా నిలువమని కోరింది. ఇబ్రహీం ఆదిల్‌షా మళ్లీ విజయనగర రాజకీయాలలో జోక్యం చేసుకోటానికి మంచి అవకాశం వచ్చిందని తన సేనతో విజయనగరం బయలుదేరాడు. అది తెలుసుకున్న సలకం తిరుమలుడు మార్గమధ్యంలో సుల్తాన్‌ను కలుసుకొని కళ్లు చెదిరిపోయే ధనరాసులను సమర్పించాడు. అవి తీసుకొని సుల్తాన్ తిరుమలునే సమర్థించి వెనుదిరిగి వెళ్లిపోయాడు. వరదాంబిక నిరాశ చెందింది. తిరుమలుడు అధికారాన్నంతటినీ తన చేతులలోకి తీసుకున్నాడు. వరదాంబిక నిస్సహాయంగా మిగిలిపోయింది.

రామరాయల జోక్యం: అచ్యుతదేవరాయల కాలంలో రాజధానిని విడిచి వెళ్లిన ఆరవీటి రామరాజుకు విజయనగర అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి మంచి అవకాశం వచ్చిందని భావించి గుత్తి కోటలో బందీగా ఉన్న సదాశివరాయలను విడిపించి విజయనగర సామ్రాజ్యానికి వారసునిగా ప్రకటించాడు. రాజ్యానికి నిజమైన వారసత్వ హక్కు సదాశివరాయలదేనని స్పష్టం చేశాడు. దాంతో విజయనగర రాజ్యంలో వారసత్వ యుద్ధం వచ్చింది. దానివల్ల తిరుమలరాయలు, రామరాయల మధ్య ఒక సంవత్సరం అంతర్యుద్ధం జరిగింది. సదాశివరాయలకు సహాయం చేయమని రామరాయలు బీజాపూర్ ఆదిల్‌షా వద్దకు రాయబారం పంపాడు. సుల్తాన్ రామరాయలకు సహాయం చేయడానికి తిరస్కరించాడు. వ్యక్తిగత స్వార్థం మనిషిని ఎంత అజ్ఞానిగా మారుస్తుందో ఈ సంఘటన తార్కాణం. విజయనగర సామ్రాజ్యానికి ఆగర్భశత్రువైన బీజాపూరు సుల్తాన్‌ను వరదాంబిక, రామరాయలు, చిన తిరుమలయ్య ముగ్గురూ సహాయం కోరారు. వారి స్వార్థాన్ని బీజాపూరు సుల్తాన్ తనకు అనుకూలంగా మలచుకొని యుద్ధం లేకుండా విలువైన కానుకలు పొంది బలపడ్డాడు. రామరాయల ఆహ్వానాన్ని తిరస్కరించినా విజయనగరంపై దండెత్తి మళ్లీ దోచుకోవచ్చుని ఆశించి తన సేనతో బయలుదేరాడు. అది తెలిసిన ప్రజలు, అమరనాయకులు వెంకటపతిరాయలు రాజ్యాన్ని రక్షించలేడని భావించి చినతిరుమలయ్యను సింహాసన మధిష్టించాలని కోరారు. ప్రజల కోరికకు ఆనందపడి తిరుమలుడు వెంటనే క్రీ.శ.1543 జనవరి నెలలో తిరుమలదేవ మహారాయలను పేరుతో పట్టాభిషేకం జరుపుకున్నాడు. తర్వాత విజయనగర సేనతో వెళ్లి ఇబ్రహీం ఆదిల్‌షాను ఎదుర్కొని ఓడించి తరిమివేశాడు. పరాజయం పొందిన సుల్తాన్ బీజాపూరుకు పారిపోయాడు. విజయంతో తిరిగి వచ్చిన తిరుమలరాయలకు రాజధానిలో ఎదురు లేకుండాపోయింది. తన సింహాసనాన్ని శాశ్వతంగా దక్కించుకోవాలనే దుష్టతలంపుతో మేనల్లుడని కూడా చూడకుండా వెంకటపతి రాయలను గొంతుపిసికి చంపివేశాడు. వెంకటపతిరాయల మరణంతో తిరుమలుడు విజయనగర సామ్రాజ్యానికి నిజమైన చక్రవర్తి అయ్యాడు. కాని ప్రజలు, అమరనాయకులు అతని చర్యలను సమర్థించలేదు. వారు రామరాయలకు మద్దతు ఇచ్చి విజయనగరం రమ్మని ఆహ్వానించారు.

పెనుగొండ ఆక్రమణ-సమావేశం: ప్రజలు, అమరనాయకుల ఆహ్వానం రామరాయలకు నూతన ఉత్సాహాన్ని కలిగించింది. అతడు గుత్తి నుండి బయలుదేరి పెనుగొండపై దండెత్తి జయించాడు. అక్కడ సామంతరాజులను ఆహ్వానిస్తూ ఒక సమావేశం జరిపాడు. రామరాయలను సమర్థించే అమర నాయకులు ఆ సమావేశానికి హాజరై సలకం తిరుమలరాయలతో పోరాడి ఓడించి తరిమి సదాశివరాయలను రాజుగా చేయాలని తీర్మానించారు.

కొమలి యుద్ధం: పెనుగొండ సమావేశం తీర్మానం ప్రకారం రామరాయలు తిరుమలయ్యపై యుద్ధానికి ప్రయత్నాలు ప్రారంభించాడు. ఆనాడు గండికోటను కమ్మసేనాధిపతులైన పెమ్మసాని చినతిమ్మానాయకుడు పాలిస్తున్నాడు. రామరాయలు గండికోట చేరి తిమ్మానాయకుని సహాయం అర్థించాడు. తిమ్మానాయకుడు రామరాయల వైపు చేరిపోయాడు. అది తెలిసిన తిరుమలరాయలు తనకు ప్రమాదం ముంచుకొని వస్తోందని గ్రహించి రామరాయల ఆట కట్టించాలని రామరాయలపై యుద్ధానికి తయారై తన సేనతో గండికోటను చేరి రామరాయలను తనకు అప్పగించమని తిమ్మానాయకునికి కబురు పంపాడు. కాని పెమ్మసాని తిమ్మానాయకుడు తిరుమల రాయల కోర్కెను తిరస్కరించాడు. అంతేగాక తన సేనతో కోట బయటకు వచ్చి కొమలి అనే ప్రదేశం

చేరాడు. అక్కడ తిరుమలరాయల సైన్యానికి, పెమ్మసాని వారి సైన్యానికి యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో తిరుమల రాయలు ఓడిపోయి వెనుకకు తిరిగాడు. వెనుకకు తిరిగిన ఆ సేనను తరుముతూ రామరాయలు పెమ్మసాని తిమ్మానాయకుడు తమ సైన్యాలతో కందనవోలు రాజ్యంలో ప్రవేశించారు. అక్కడ వారి సేన రాయల సేనను మళ్లీ బేతంచర్ల, జూటూరుల వద్ద ఓడించారు. కందనవోలు కోట రామరాయల వశమైంది. కందనవోలు ఆరవీటి వంశస్తుల పూర్వపు స్థావరం. తన పూర్వీకుల కోట రామరాయలకు లభించింది.

బెడగల్ల యుద్ధం: ఓడిపోయిన విజయనగర సైన్యం ఆదవాని రాజ్యంలోని బెడగల్ల వైపుకు వెళ్లింది. రామరాయలు, పెమ్మసాని తిమ్మానాయకుని సైన్యం బెడగల్ల వద్దకు చేరి మళ్లీ తిరుమల రాయలతో తలపడ్డాయి. రాయల సైన్యం మళ్లీ ఓడి పారిపోసాగింది. వారిని తరుముతూ పెమ్మసాని వారి సైన్యం ముందుకు దూసుకుపోతూ ఉండగా ఆదవాని కోట అధిపతి సంజర్‌ఖాన్ తన సేనతో రాయలకు సహాయంగా వచ్చి రామరాజు పెమ్మసాని వారి సైన్యాన్ని అడ్డగించాడు. పెమ్మసాని తిమ్మానాయకుడు శౌర్యప్రతాపాలతో పోరాడి సంజర్‌ఖాన్‌ను ఓడించి ఆదవాని కోటను ఆక్రమించాడు. రామరాయలు ఆదవానికోటలో నాలుగు మాసాలుండి కర్నూలు, గద్వాల ప్రాంతాలను కూడా తన స్వాధీనం చేసుకొని నూతన సైన్యాలను పోగుచేసి క్రీ.శ.1543 జూన్ నెలలో విజయనగరంపై దాడికి బయలుదేరాడు.

బీజాపూరు సుల్తాన్ రాక: రామరాయలు సైన్యాలతో విజయనగరం వస్తున్నాడని తెలిసి సలకం తిరుమల దేవ మహారాజు హడలిపోయాడు. తనకు సింహాసనం దక్కదని గ్రహించి దానినెలాగైనా నిలుపుకోవాలని బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా సహాయం అర్థించాడు. సుల్తాన్ సైనిక ఖర్చు కింద రోజుకు మూడు లక్షల హొన్నులు చెల్లిస్తానని వాగ్దానం చేశాడు. డబ్బు ఆశతో ఇబ్రహీం వెంటనే వచ్చి విజయనగరం చేరాడు తిరుమలరాయలు అతనిని ఆహ్వానించి విజయనగరంలోకి తీసుకువెళ్లి విజయనగర సింహాసనంపై కూర్చోబెట్టాడు అప్పటివరకు బహమనీ సుల్తాన్‌లు ఎన్ని యుద్ధాలు చేసినా నగరంలోకి ప్రవేశించలేదు. సింహాసనాన్ని కళ్లతో కూడా చూడలేదు. తిరుమల రాయలు చేసిన హీనాతిహీనమైన చర్యకు సామంతులు, అమరనాయకులు, ప్రజలు భగ్గున మండిపోయారు. తిరుమల రాయలు రాజుగా పనికిరాడని నిర్ణయించుకున్నారు. అమరనాయకులు ముందు ఆదిల్‌ఖాన్‌ను బయటకు పంపాలని, అవసరమైతే రాజ్యం కోసం తమ ప్రాణాలు ఇస్తామని సుల్తాన్ సహాయం అక్కరలేదని తిరుమల రాయలకు నచ్చజెప్పారు. అదే సమయంలో రామరాయలు ఇబ్రహీం ఆదిల్‌ఖాన్‌ను బయటకు పంపాలని, తాను కూడా రాయలకు విధేయుడనని అతని అధికారాన్ని అంగీకరిస్తానని ముందు సుల్తాన్‌ను వెంటనే పంపించి వేయవలసిందని కబురు పంపాడు. అందరి మాటలు నమ్మి తిరుమలరాయలు ఇబ్రహీంకు 50 లక్షల హొన్నులు ధనాన్ని, ఇతర బహుమతులు బహూకరించి వెళ్లిపొమ్మని కోరాడు. ఇబ్రహీం విజయనగరం వదలి వెళ్లాడు. సుల్తాన్ కృష్ణానదిని దాటాడో లేదో వెంటనే రామరాయల సేన తిరుమల రాయల సైన్యంపై విరుచుకుబడింది. సుల్తాన్‌ను సాగనంపటానికి బయటికి వచ్చిన రాయలు తన సేనపై రామరాయల సైన్యంపై పడటాన్ని చూసి, నగరంలోని తిరుమలరాయలకు అది తెలిసి తాను మోసపోయానని గ్రహించి రాజభవనంలో తలుపులు మూసుకొని రాజధాని వైపు పరిగెత్తి కోటలో ప్రవేశించి రాజభవనం చేరి తలుపులు మూసుకొని ఏమి చేయాలో తెలియక పిచ్చిపట్టిన వాడి లాగా ప్రవర్తించాడు. తాను ఓడిపోతే విజయనగరం రామరాయల వశం అవుతుందని భావించి విజయనగరంలో ఉన్న ఏనుగుల సంపద, సైన్యం రామరాయల వశం కాగూడదని భావించి రాజధానిలో ఉన్న ఏనుగుల, గుర్రాల కండ్లు పొడిపించి అవి పనికి రాకుండా చేశాడట ధనాగారంలో ఉన్న తరతరాలుగా సంపాదించిన రత్నాలు, మణులను, వజ్రాలు, పచ్చలను పగులగొట్టి పిండి చేశాడట. తర్వాత ఒక స్థంభానికి కత్తిని బిగించి, తాను దానికి బలంగా తగిలి తన పొట్టలో నుండి వెన్నులోకి దిగిపోయేటట్లు పొడుచుకొని ఆత్మహత్య చేసుకొని మరణించాడని పెరిష్టా రాశాడు. న్యూనిజ్ కూడా అతని మరణాన్ని గురించి రాశాడు. కాని అతనిని రామరాయల సైన్యాలు యుద్ధంలో వధించి అతని తలను బల్లానికి గుచ్చి అందరికీ చూపారని కొందరు పండితులు భావించారు. ఈ లోపల రామరాయల సైన్యం తిరుమల రాయల సైన్యాన్ని చీల్చి చెండాడింది. అమరనాయకులు కొందరు యుద్ధం చేయకుండానే వెళ్లిపోయారు. రామరాజుకు విజయం లభించింది. సదాశివరాయలను ముందు పెట్టుకొని రామరాయలు సైన్యంతో విజయనగరం కోట ముఖద్వారం చేరాడు. అది తెలిసి శ్రీకృష్ణదేవరాయల భార్యలు తిరుమలదేవి, చిన్నాదేవిలు కోట తలుపులు తీయించమని కాపలాదారులను ఆదేశించారు. ఊరేగింపుగా రామరాయలు తన సేనతో సదాశివరాయలతో

క్రీ.శ.1543లో శోభాకృతు కార్తీక శుద్ధ ఏకాదశి నాడు రాజధానిలో ప్రవేశించాడు. కొన్నాళ్ల తర్వాత సదాశివరాయలకు పట్టాభిషేకం జరిగింది. సదాశివరాయలు సింహాసనాన్ని అధిష్ఠించిన తర్వాత చిన్న రాయలు సింహాసనం ఎక్కడం, తొలగించడం జరుగలేదు. అలాంటి సంఘటనలు వినలేదు అని ఫెరిష్టా రాశాడు. రామరాయలు సర్వాధికారి అయ్యాడు అని కూడా రాశాడు.

సదాశివరాయలు: సదాశివరాయలు సింహాసనం అధిష్టించడంతో 30 సంవత్సరాలు విజయనగర చరిత్రలో వారసత్వ యుద్ధాలు లేకుండా పోయాయి. అధికారం ఉన్నా లేకపోయినా సదాశివరాయలు విజయనగర చక్రవర్తిగా సుమారు 30 సంవత్సరాలు కొనసాగాడు. అచ్యుతదేవరాయల చివరి శాసనం క్రీ.శ.1541 జనవరి 25వ తేదీ నాటిది లభించింది. సదాశివరాయల మొదటి శాసనం క్రీ.శ.1542 జూలై 27వ తేదీది లభించింది. కనుక ఈ రెండు తేదీల మధ్య అచ్యుతరాయలు మరణించి ఉంటాడు. రామరాయలు సదాశివరాయలను రాజుగా ప్రకటించినా అతడు క్రీ.శ.1543లోనే రాజధానిలోనికి అడుగు పెట్టగలిగాడు. కాని క్రీ.శ.1542 జూలై 27 నుంచే అతడు శాసనాలను విడుదల చేయసాగాడు. కనుక అతని శాసనాలు క్రీ.శ.1542 నుండి 1576 వరకు లభిస్తున్నాయి. సదాశివరాయలు అసమర్థుడు, వ్యక్తిత్వం లేనివాడు. అతడు పేరుకు మాత్రమే రాజు. సర్వాధికారాలు రామరాయలు, అతని తమ్ములు తిరుమలరాయలు, వెంకటాద్రిలు చెలాయించేవారు. సోదరులు సంవత్సరానికొకసారి అంతఃరాజభవనంలో నివసించే సదాశివరాయలను దర్శించి సాష్టాంగ ప్రమాణాలు మాత్రం ఆదరించేవారు. తర్వాత వారి ఇష్టం ప్రకారం పరిపాలన సాగించారు. అయినప్పటికీ సామ్రాజ్యం అంతా సదాశివరాయలను చక్రవర్తిగా అందరూ గుర్తించారు. రామరాయలు సర్వాధికారాలు చెలాయించినా రాజాజ్ఞలు, శాసనాలు అన్నీ సదాశివరాయల పేరుతోనే విడుదల అయ్యాయి. సదాశివరాయల శాసనాలు క్రీ.శ.1542 నుండి 1570 వరకు నిరాటంకంగా వేయబడ్డాయి. తర్వాత 1576 వరకు కూడా అతడు విజయనగరంలో జీవించినట్లు శాసనాలు లభ్యమయ్యాయి. శాసనాలు సదాశివరాయల పేరుతోనే వేయించినప్పటికీ ప్రజలు సదాశివరాయలను మరచిపోయారు. రామరాయలే రాజుగా భావించేవారు. విదేశస్తులు కూడా రామరాయలే రాజు అన్నట్లుగా రాశారు. ఈ విధంగా రామరాయలు సదాశివరాయలను మరపింపజేసి విజయనగర రాజ్యాన్ని క్రీ.శ.1543 నుండి 1565 వరకు అంటే 22 సంవత్సరాలు పాలించాడు. కనుక ఈ కాలాన్ని విజయనగర చరిత్రలో రామరాయల యుగం అని పిలిచారు. సాళువయుగంలో నరసనాయకుడు ఏ పాత్రను పోషించాడో, తుళువయుగంలో రామరాయలు అదే పాత్రను పోషించాడు. సాళువ రెండవ నరసింహరాయలకు అధికారాలు ఇవ్వకుండా పాలించినందుకు నరసనాయకుని దురాక్రమణదారుడన్నారు. అలాగే సదాశివరాయలకు అధికారాన్ని ఇవ్వకుండా రాజ్యం చేసిన రామరాయలు కూడా దురాక్రమణదారుడు గానే భావింపవచ్చును. విజయనగర అధికారం మూడవసారి అపహరణకు గురైందని కూడా చెప్పవచ్చును. తళ్లికోట యుద్ధం తర్వాత సదాశివరాయలు హత్యకు గురి అయ్యాడు. సదాశివరాయలను తిరుమలరాయల చిన్న కుమారుడు రెండవ వెంకటపతిరాయలు హత్య చేశాడని వాదుకలో ఉంది. సదాశివరాయల హత్య తర్వాత రామరాయల తమ్ముడు పెనుగొండలో క్రీ.శ.1570లో పట్టాభిషేకం చేసుకొని ఆరవీటి వంశాన్ని స్థాపించాడు. అంటే వీరనరసింహరాయల పాత్రను తిరుమల రాయలు పోషించాడు. కనుక విజయనగరం సింహాసనం మూడవసారి దురాక్రమణకు గురైందని చెప్పవచ్చును.

రామరాయల పాలన క్రీ.శ.1543-65: రామరాయలు ఆరవీటి వంశానికి చెందినవాడు. అతని తండ్రి రంగరాజు, తల్లి తిమ్మాంబ. అతడు క్రీ.శ.1485లో జన్మించాడు. అతని బాల్యాన్ని గురించి మనకు ఏమీ స్పష్టంగా తెలియదు. అతడు చంద్రవంశ క్షత్రియుడు. రామరాజుకు ఎరతిరుమల లేక తిరుమల రాయలు, వెంకటాద్రి అనే ఇద్దరు తమ్ములున్నారు. వారు అతనికి రాచకార్యాలలో కుడి ఎడమ భుజాలుగా నిలిచారు. అతడు మొదట గోల్కొండ సుల్తాన్ కులీకుతుబ్‌షా వద్ద ఉద్యోగంలో చేరి రాయలసీమలోని కందనవోలు మొదలైన కొన్ని ప్రాంతాలకు పాలెగాడుగా నియమింపబడ్డాడు. ఆ ప్రాంతాలపై బీజాపూరు సుల్తాన్ దండెత్తి రామరాయలను ఓడించాడు. ఓడిన తర్వాత రామరాయలు గోల్కొండ చేరగా సుల్తాన్ అతనిని అవమానించాడు. అప్పుడు రామరాయలు విజయనగరం చేరి శ్రీకృష్ణదేవరాయలను ఆశ్రయించాడు. రాయలు అతనిలోని ప్రతిభను గుర్తించి తన కుమార్తె తిరుమలదేవినిచ్చి (ఈమెకు మోహనాంగి అని కూడా పేరుంది) వివాహం చేసి తన సేవలో నియోగించాడు. రామరాయలు గోల్కొండ రాజ్యంలో సేవ చేశాడని చెప్పడానికి ఆధారాలు లేవు. కన్నడంలో అల్లుడు అంటే అళియ కనుక అప్పటి నుండి అతడు అళియ రామరాయలుగా ప్రసిద్ధి చెందాడు. రామరాయలు

శ్రీకృష్ణదేవరాయల కూతురుని కాదు అతని సోదరుడు రంగరాయల కూతురుని అంటే సదాశివరాయల సోదరిని వివాహమాడాడని కొందరు అంటారు. రామరాయలకు ఇంకా భార్యలున్నారు. అతని రెండవభార్య అప్పలాంబ ఆమె జక్లెళ్ల పెదనందిరాజు కుమార్తె. మూడవ భార్య కొండమాంబ, నాల్గవ భార్య లక్ష్మాంబ. వీరిద్దరూ పోచిరాజు తిమ్మరాజు కుమార్తెలు. రామరాయలకు తిరుమలాంబ వల్ల కృష్ణరాజు, పెదతిమ్మరాజు అనే కుమారులు, కొండమాంబిక వలన కొండరాజు, చిన చిమ్మరాజు అనే కుమారులు, లక్ష్మాంబకు శ్రీరంగరాజు అనే కుమారుల కలిగారు. అప్పలాంబకు కుమారులు లేరు. కుమారులేగాక అతనికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. వారిలో ఒక కుమార్తె జ్యోతమరాజును, మరొక కుమార్తె జస్వంత రాజును వివాహమాడారు. కొండరాజును అనెగొందికి చిన్న తిమ్మరాజును రాయచూరుకు పాలకులుగా నియమించాడు. మిగిలిన వారు సేనాధిపతులుగా ఉండేవారు వారిలో పెదతిమ్మరాజు గొప్పవీరుడు. అతడు అహమ్మద్‌నగర్ హుస్సేన్‌షాను ఓడించాడు. కృష్ణరాయల మరణించిన తర్వాత అంతఃపుర స్త్రీల సహకారంతో కృష్ణరాయల 18 మాసాల కుమారుని రాజుగా ప్రకటించి అధికారం నెరపాలని ప్రయత్నించాడు. కాని అది విఫలమైంది. తర్వాత అచ్యుత దేవరాయలు గుత్తిదుర్గం తిరుగుబాటును అణచడానికి వెళ్లినప్పుడు సదాశివరాయలను రాజుగా ప్రకటించి అధికారాన్ని స్వాధీనం చేసుకున్నాడు. అది కూడా విఫలమైంది. చివరకు చినతిరుమలయ్యపై దండయాత్ర చేసి విజయనగరాన్ని ఆక్రమించి సదాశివరాయలను క్రీ.శ.1543లో పట్టాభిషిక్తుని చేసి అధికారాన్ని సొంతం చేసుకున్నాడు. దాంతో విజయనగర చరిత్రలో రామరాజు యుగం ప్రారంభమైంది. అతడు 22 సంవత్సరాలు దేదీప్యమానంగా వెలిగాడు విజయనగర చరిత్రలోనేగాక దక్షిణ భారతదేశ చరిత్రలోనే అతి బలవంతుడుగా, ప్రఖ్యాత రాజుగా గొప్ప పాత్రను పోషించాడు.

రామరాయలు కృష్ణదేవరాయల ఆస్థానంలో ప్రవేశించకముందు అతడు గోల్కొండ నవాబు వద్ద కొలువు చేసే వాడని తారిఖ్ మహమ్మద్ కులీకుతుబ్‌షా అనే గ్రంథం తెలుపుతోంది. కులీకుతుబ్‌షా రామరాజును విజయనగర రాజ్య సరిహద్దులోని ఒక దుర్గానికి అధిపతిగా నియమించాడు. శ్రీకృష్ణదేవరాయలు ఆ దుర్గంపై దాడి చేశాడు. రామరాయలు కృష్ణరాయలతో అద్భుతంగా పోరాడాడు. అతని పోరాటపటిమకు కృష్ణరాయలు ఆశ్చర్యం చెందాడు. రామరాయలు ఎంత శౌర్యంగా పోరాడినా ఓడిపోయి దుర్గాన్ని కృష్ణరాయలకు ఆధీనం చేసి గోల్కొండ వెళ్లి జరిగిన విషయం సుల్తాన్‌కు తెలిపాడు. ఓటమికి సుల్తాన్ రామరాయలను నిందించి తన కొలువు నుండి వెళ్లగొట్టాడు. దాంతో రామరాయలు విజయనగరం చేరి కృష్ణరాయలను ఆశ్రయించాడు. రాయలు అంతకుముందే రామరాజు శక్తి సామర్థ్యాలను తెలుసుకొని ఉన్నవాడైనందున అతనిని ఆదరించి, తన కుమార్తెనిచ్చి వివాహం చేసి తన కొలువులో ఉద్యోగం ఇచ్చాడు. పోర్చుగీసు రచయిత ఫాదర్ ఖైరాస్ రాసిన సింహళ ద్వీప చరిత్రలో రామరాజు శ్రీకృష్ణదేవరాయల మంత్రి అని రాశాడు. అంతేగాక అర్వాచీన తెలుగు సాహిత్యం వలన, పోర్చుగీసు, ముస్లిం చరిత్రకారుల రచనల ద్వారా రామరాజు కృష్ణదేవరాయల కాలంలో విజయనగర దర్బారులో రాజసేవలో ఉన్నట్లు తెలుస్తోంది. కాని అతని పేరు ఏ శాసనంలో ప్రస్తావించబడలేదు. రామరాజు గోల్కొండ సుల్తాన్ కొలువులో దుర్గాధిపతిగా ఉన్నప్పుడు ఆ దుర్గంపై దండెత్తింది కృష్ణరాయలు కాదని, బీజాపూర్ సుల్తాన్ అని, అతని చేతిలో ఓడి దుర్గాన్ని బీజాపూరు సుల్తాన్ వశం చేసి గోల్కొండ వెళ్లి, గోల్కొండ సుల్తాన్ వెడలగొట్టిన తర్వాత విజయనగరం చేరి శ్రీకృష్ణదేవరాయలను ఆశ్రయించాడని కొందరు భావించారు. కాని రామరాజు వంశస్తులు మొదటి నుండి విజయనగర రాజ్యంలో సామంతులుగా, సేనాధిపతులుగా పని చేశారు. అలాంటి వంశానికి చెందిన రామరాజు తన తొలి జీవితంలో గోల్కొండ సుల్తాన్ వద్ద కొలువులో చేరాడా అనేది పెద్ద సందేహం.

రామరాయలకు బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా, తర్వాత అతని కుమారుడు ఆలీ ఆదిల్‌షా అహమ్మద్‌నగర్ బురహన్‌షా, తర్వాత అతని కుమారుడు హుస్సేన్ నిజాంషా, గోల్కొండ జంషీద్ కుతుబ్‌షా తర్వాత అతని సోదరుడు ఇబ్రహీం కుతుబ్‌షాలు, బీదర్‌లో ఆలీబరీద్‌లు సమకాలికులు.

రామరాయలు క్రీ.శ.1543లో అధికారం చేపట్టే నాటికి వయోవృద్ధుడు. కాని శరీర పటిమ తగ్గలేదు. అతనికి 70 సంవత్సరాల వయస్సు ఉందని ఒకరు, 60 సంవత్సరాలని ఒకరు రాశారు. అప్పటికే రాజకీయాలలో ఆరితేరిన మేధావి, యుద్ధ నైపుణ్యాన్ని సంపాదించిన యోధాగ్రేసరుడు, పరిపాలనాదక్షుడు, రాజనీతి పారంగతుడు. శ్రీకృష్ణదేవరాయల నాటి సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించమే అతని ఏకైక లక్ష్యం. రామరాయల పరిపాలనా కాలాన్ని రెండు దశలుగా విభజించవచ్చు. క్రీ.శ.1543 నుండి 1552 వరకు ప్రథమ దశలో అతడు తాను

సదాశివరాయల సైన్యాధ్యక్షునిగా, రాయలకు పరిపాలనలో తోడ్పతున్నట్లు చెప్పుకున్నాడు. తర్వాత క్రీ.శ.1552 నుండి 1565 వరకు 12 సంవత్సరాలు అతడు రాయలు అనే బిరుదు వహించి తానే సర్వాధికారిగా పాలించాడు. అతడు కిరీటం పెట్టుకొనలేదు, సింహాసనం అధిష్టించలేదు కాని నిజమైన రాజ్యాధిపతిగానే ప్రవర్తించాడు.

బీజాపూరు సుల్తాన్ ఆదోని దండయాత్ర: అచ్యుతదేవరాయల కాలంలో విజయనగరాన్ని దర్శించిన న్యూనిజ్ క్రీ.శ.1535లో వెళ్లిపోయాడు. దాంతో న్యూనిజ్ క్రానికల్ అచ్యుతదేవరాయల చరిత్రతో ఆగిపోయింది. తర్వాత విశేషాలు పెరిష్టా రచనల నుండి గ్రహించబడ్డాయి. రామరాయలు సదాశివరాయలను రాజుగా చేసి అధికారాన్ని చేపట్టగానే బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా విజయనగర రాజ్యంలోని ఆదోని దుర్గాన్ని జయించమని తన సామంతుడైన బెల్గాం పాలకుడు అసద్‌ఖాన్‌ను పంపాడని పెరిష్టా ఆ యుద్ధాన్ని వర్ణించాడు. అసద్‌ఖాన్ క్రీ.శ.1543లో ఆదోని దుర్గాన్ని ముట్టడించాడు. రామరాయలు అసద్‌ఖాన్‌ను ఎదిరించడానికి తన తమ్ముడు వెంకటాద్రిని పెద్ద సేనతో పంపాడు. వెంకటాద్రి అసద్‌ఖాన్‌ను ఓడించి తరిమాడు. అసద్‌ఖాన్ 14 మైళ్లు వెనక్కి వెళ్లిపోయాడు. వెంకటాద్రి ఖాన్ సైన్యాన్ని తరుముతూ వెళ్లి అతనికి రెండు మైళ్ల దూరంలో విడిశాడు. ఆ రాత్రి విజయనగర సైనికులు తమ గుడారాలలో నిద్రించే సమయంలో అసద్‌ఖాన్ హఠాత్తుగా దాడి చేశాడు. ఆ చికాకులో విజయనగర సైనికులు పారిపోయారు. వెంకటాద్రి కూడా తన గుడారంలోని సంపదను, ఏనుగులు, గుర్రాలు తన కుటుంబ సభ్యులను వదలి పారిపోయాడని, అతడు రామరాజుకు కబురు పెట్టి మరికొంత సైన్యాన్ని పంపమన్నాడని, బందీలుగా చిక్కిన తన కుటుంబ సభ్యులను విడిపించుకోడానికి వెంకటాద్రి యుద్ధం చేయకుండా సంధి చేసుకున్నాడని పెరిష్టా రాశాడు. ఉభయులకు సంతృప్తినిచ్చే విధంగా సంధి జరిగిందని, తర్వాత అసద్‌ఖాన్ ఇబ్రహీం ఆదిల్‌షాలు తమ రాజ్యానికి వెళ్లిపోయారని వెంకటాద్రి విజయనగరం చేరాడని కూడా రాశాడు. కాని ఆదోని విజయనగర ఆధీనంలోనే ఉంది. కనుక విజయనగర రాజ్యానికి ఈ యుద్ధం వల్ల ఎలాంటి నష్టం జరుగలేదు.

అధికారాన్ని స్థిరపరచుకోవడం: ఆదోని యుద్ధం తర్వాత రామరాయలు తన స్థానాన్ని సుస్థిరపరచుకోవడానికి కొన్ని చర్యలను చేపట్టాడు. సామ్రాజ్యంలో అంతకు పూర్వం నుండి ఆస్థానంలో ప్రముఖ పాత్రను నిర్వహించిన సాళువ వంశస్తులను తొలగించాడు. వారే కాక మరికొందరు సామంతులను, అమర నాయకులుగా ఉన్న కొంతమందిని కీలక స్థానాల నుండి తొలగించాడు. ముఖ్యంగా కృష్ణరాయల కాలం నుండి దుర్గాధిపతులుగా ఉన్న బ్రాహ్మణులను తొలగించాడు. తనకు విశ్వాసపాత్రులైన వెలుగోటి, పెమ్మసాని, రావెల, కటకం మొదలైన కుటుంబాల వారిని కీలక పదవులలో నియమించాడు. వీరిలో వెలుగోటి వారు వెలమవారు, మిగిలిన కుటుంబాల వారు కమ్మకులస్తులు. దాంతో విజయనగర సైన్యంలో బ్రాహ్మణుల పాత్ర తగ్గిపోయి కమ్మ వెలమ నాయకుల పాత్ర పెరగసాగింది. తమ కుటుంబీకులైన ఆరవీటి వారికి ఉన్నత ఉద్యోగాలు ఇచ్చాడు. అలాగే కొందరు తెలుగుచోళ కుటుంబాల వారిని కూడా ఉన్నత ఉద్యోగాలలో నియమించాడు. అతని చర్యలను వ్యతిరేకించిన అందరినీ తొలగించాడు. బ్రాహ్మణులలో కొందరు అతనిని సమర్థించి తమ పదవుల్ని నిలుపుకున్నారు. అలాంటి వారిలో రామయామాత్యుడు రామభట్లయ్య, పులిగడ్డ పాపనరసయ్యలు ముఖ్యులు. వారిలో మొదటి ఇద్దరూ క్రీ.శ.1550 వరకు పదవులలో కొనసాగారు. చివరి పులిగడ్డ పాపనరసయ్య రామరాయలు మరణించే వరకు పదవిలో కొనసాగాడు.

ముస్లింలను అధికంగా సైన్యంలో చేర్చుకొనడం: తర్వాత ముస్లింలను అధిక సంఖ్యలో సైన్యంలో చేర్చుకున్నాడు. ముస్లింలను సైన్యంలో చేర్చుకొనే ఆచారం మొదటి దేవరాయల కాలంలోనే ప్రారంభమైంది. కాని వారి సంఖ్య తక్కువ. పైగా వారిని సైనికులుగా మాత్రమే చేర్చుకున్నారు గాని మిగిలిన కీలక పదవులలో నియమించలేదు. కాని రామరాయలు హద్దు దాటి వారిని ఉన్నత పదవులలో కూడా నియమించాడు. క్రీ.శ.1535లో బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా తన సైన్యం నుండి మూడు వేల మంది షియా సైనికులను తొలగించాడు. వారు రామరాయలను ఆశ్రయించగా వారిని తన సైన్యంలో చేర్చుకొని ఆరు భాగాలు చేసి వారిలోని ఆరుగురిని సేనాధిపతులుగా నియమించాడు. క్రీ.శ.1543లో అధికారం చేపట్టిన తర్వాత ఇంకా ముస్లిం సైనికులను పెంచాడు. తళ్లికోట యుద్ధం జరిగే నాటికి అతని సైన్యంలో 80 వేల మంది ముస్లిం సైనికులు ఉన్నారని సీవెల్ రాశాడు. డా॥ వై. శ్రీరామమూర్తి 150000 ముస్లిం సైనికులు ఉన్నారని రాశారు. వారికి విజయనగరంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశాడు. వారి కోసం ప్రత్యేకంగా తురకవాద ఉండేది. అక్కడ

రామరాయలు వారికి ఒక మసీదును కూడా నిర్మించాడు. అక్కడ వారు గోవధ చేయడానికి కూడా అనుమతించాడు. దర్బారులో ఒక వేదికపై ఖురాన్ ఉపయోగపడుతుందని ఖురాన్‌ను దర్బారులో ఉంచాడు ముస్లింలు సేనాధిపతులుగా, విజయనగర రాజ్య అధికారులుగా స్వేచ్ఛగా సంచరించి రాజ్యపు రహస్యాలన్నీ తెలుసుకున్నారు. చివరకు తళ్లికోట యుద్ధంలో ఈ 80 వేల మంది ముస్లిం సేన బహమనీ సుల్తాన్‌లతో చేరిపోయి రామరాయలకు తీరని ద్రోహం చేశారు. వీరిలో ఒక సైనికుడే వెనుక నుండి రామరాయలను పొడిచి చంపాడని ప్రతీతి. రామరాయలు తురక సైన్యంతో అత్యంత విధ్వంసక శక్తిగా తన సైన్యాన్ని తయారు చేయవచ్చని ఆశించాడు. కాని వారి విశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వారి వల్ల రాజ్యానికి ప్రమాదం వస్తుందేమో దూరదృష్టితో ఆలోచించకుండా పెద్ద తప్పు చేశాడు.

దక్షిణదేశ దిగ్విజయ యాత్ర: రామరాయలు అధికారం స్వీకరించిన సమయంలో దక్షిణదేశంలో చాలా మంది సామంతులు తిరుగుబాటు ధోరణిలో ఉన్నారు. అదే సమయంలో పోర్చుగీసు వారు దురంతాలకు పాల్పడ్డారు. వారందరినీ అదుపులోకి తీసుకురావడానికి రామరాయలు తన పినతండ్రి కుమారుడు అవుకు చిన తిమ్మానాయకుడు విరల రాజుల నాయకత్వంలో పెద్ద సేనను పంపాడు. దక్షిణ దండయాత్రకు నాలుగు కారణాలు ఉన్నాయి. చంద్రగిరికి దక్షిణంగా ఉన్న తమిళ ప్రాంతాలలో అల్లర్లు లేచాయి. వాటిని అణచడం మొదటి లక్ష్యం తర్వాత ట్రావెన్‌కూర్ పాలకుడైన నింక్విలిబిరామ్ లేక తిరువడి, కాయత్తార్‌ను పాలించిన పాండ్యరాజును తరిమి కాయత్తార్‌ను ఆక్రమించాడు. అతనిని దండించడం రెండవ లక్ష్యం. పోర్చుగీసు వారి ఆగడాలను కట్టించడం మూడవ లక్ష్యం. పోర్చుగీసు వారి చర్యల వల్ల బాధలకు లోనైన ప్రజలను కాపాడటం నాల్గవ లక్ష్యం విజయనగర సేన మొదట చంద్రగిరిపై దండెత్తి అక్కడ తిరుగుబాటు ధోరణిలో ఉన్న వారిని ఓడించి వారిని తొలగించి కోటను స్వాధీనం చేసుకున్నారు. తర్వాత చోళమండలంలో ప్రవేశించి భువనగిరి కోటను ముట్టడించి ఆక్రమించాడు. తర్వాత కావేరీ నది దాటి తంజావూరు పుదుక్కోటై నాయకులను లొంగదీసి కప్పం వసూలు చేశాడు. తర్వాత సముద్రం తీరం వెంట నడచి కాయత్తార్, ట్యూటికోరన్‌లను ఆక్రమించిన బెట్టు పెరుమాళ్లను ఓడించి పాండ్యరాజుకు అతని రాజ్యాన్ని అప్పగించాడు. తర్వాత ట్రావెన్‌కోర్ లేక తిరువనంతపురం రాజ్యంపై దండెత్తారు. మార్గమధ్యంలో తోవల్ కనుమ వద్ద పంచతిరువాడి సేనలు ఎదుర్కొన్నాయి. ఆ సైన్యాలను ఓడించి ట్రావెంకూర్ చేరి ఇంకిత్విబిరియన్‌ను లేక తిరువడిని ఓడించారు. అతడు శరణుజొచ్చి కప్పం చెల్లించి తన రాజ్యంలో పునఃప్రతిష్ఠుడయ్యాడు. ఈ విజయం తర్వాత చిన తిమ్మానాయకుడు తిరువనంతపురంలోని అనంతపద్మనాభస్వామి దేవాలయాన్ని దర్శించి పూజలు చేసి దానం చేశాడు. తర్వాత కన్యాకుమారి వద్ద విజయ స్తంభం నాటి రాజధానికి తిరిగి వచ్చాడు. ఈ దండయాత్రతో దక్షిణదేశమంతా అదుపులోకి వచ్చింది ఈ విజయాలు సాధించినందుకు విరలరాజును ద్రావిడ, కేరళ దేశాలకు పాలకునిగా నియమించాడు. అతడు క్రీ.శ.1558 వరకు ఆ పదవిలో కొనసాగాడు.

పోర్చుగీసు వారితో యుద్ధం: విజయనగర రాజులు పోర్చుగీసు వారిని ఎంతగా ఆదరించినా వారు విశ్వాసం లేని వారై విజయనగర రాజ్యంలో దురంతాలకు దిగారు. గోవాలోని పోర్చుగీసు గవర్నర్ మార్టిన్ అండదండలతో ఫ్రాన్సిస్ జేవియర్ అనే కాథలిక్ మత ప్రచారకుడు మధుర రాజ్యంలో మన్నారుఖాతంలోని ముత్యాలవేట తీరంలో నివసించే పరవలు అని పిలువబడే బెస్తవారిని క్రైస్తవులుగా మార్చాడు. దాదాపు మూడు వేల మంది బెస్తవారు పోర్చుగీసు వారి మాయమాటలు నమ్మి క్రైస్తవ మతాన్ని స్వీకరించారు. క్రైస్తవులుగా మారిన బెస్తవారు విజయనగర రాజును తమ ప్రభువుగా భావించనవసరం లేదని, వారికి పోర్చుగల్ రాజే ప్రభువని వారిని విజయనగర రాజ్యానికి అవిధేయులుగా చేయాలని బోధించసాగారు. పశ్చిమతీరంలో కూడా అనేక మంది హిందువులను క్రైస్తవమతంలోకి మారమని, అలా మారితే హిందూ రాజులకు పన్ను చెల్లించనవసరం లేదని ముస్లిం వర్తకుల దోపిడీ వ్యాపారం నుండి బయటపడవచ్చని, వారందరినీ తమ రాజు రక్షిస్తాడని ప్రచారం చేయసాగారు. తూర్పు తీరంలో అనేక దేవాలయాలు పడగొట్టి చర్చిలు నిర్మింపసాగారు. ఫ్రాన్సిస్ జేవియర్ ఇంకా అనేక మంది జేసూటుల తమ మత ప్రచారాన్ని ముమ్మరం చేశారు. శ్రీరంగం దేవాలయాన్ని పోర్చుగీసు వారు అపవిత్రం చేశారు. కంచి దేవాలయాన్ని దోచుకోవాలని ప్రయత్నించారు. పశ్చిమకోస్తాలో అనేక దేవాలయాలను దోచుకొని నాశనం చేశారు. అలాంటి స్థితిలో క్రీ.శ.1545లో తిరుపతి తిరుమల దేవాలయ సంపదను విని దానిని దోచుకోవాలని గోవా గవర్నర్ మార్టిన్ అఫాన్ డిసౌజా స్వయంగా 3000 సైన్యాన్ని తయారు చేసి సముద్రంపై

ప్రయాణించి మద్రాసు దగ్గర ఉన్న శాంతోమ్ చేరాడు. కాని ఆ సమయంలో పెద్ద తుఫాను వీచి అతని ప్రయత్నం విఫలమైంది. తర్వాత అతడు వెనుకకు తిరిగి వెళ్లి పశ్చిమకోస్తాలో అనేక దేవాలయాలను దోచుకొని భాగ్యవంతుడయ్యాడు. ఆ స్థితిలో ప్రజలు రామరాయలకు పోర్చుగీసు వారి ఆగడాలను తెలిపారు. అందువలన రాయలు దక్షిణదేశ దిగ్విజయ యాత్రకు బయలుదేరిన తిమ్మ, విరల రాజులకు పోర్చుగీసు వారిని దండించే కార్యక్రమాన్ని కూడా అప్పగించాడు. వారు ఆ సమయంలో నాగూరులో ఉన్న రోమన్ కాథలిక్‌ల స్థావరంపై దండెత్తి వారిని ఓడించి బుద్ధి చెప్పారు. అక్కడ ఉన్న రంగనాథ దేవాలయాన్ని వారు పాడు పెట్టారు. కనుక విరలరాజు వారు పాడు పెట్టిన దేవాలయాన్ని తిరిగి తెరిపించి పూజా పునస్కారాలు ఏర్పాటు చేశాడు. ఇలాంటి స్థితిలో పోర్చుగీసు గవర్నర్ మార్టిన్ అఫాన్ డిసౌజా పదవీ కాలం అయిపోయింది. అతని స్థానంలో జాన్‌డకాస్ట్రో అనే అతడు గవర్నర్‌గా నియమింపబడ్డాడు.

పోర్చుగీసు వారితో రామరాయల వర్తక సంధి క్రీ.శ.1547: నూతనంగా వచ్చిన గవర్నర్ జాన్‌డకాస్ట్రో విజయనగర సామ్రాజ్యంతో విరోధం మంచిది కాదని గ్రహించాడు. అందువల్ల అతడు 1547 సెప్టెంబర్ 19వ తేదీన విజయనగర రాజు సదాశివరాయలతో సంధి చేసుకున్నాడు. ఆ సంధి ప్రకారం పోర్చుగీసు వారు గోవాలో దిగుమతి అయిన గుర్రాలన్నింటిని విజయనగర రాజ్యానికే అమ్ముతామని మరెవరికీ అమ్మమని షరతును అంగీకరించారు. అలాగే విజయనగర వర్తకులు తమ వర్తక సరుకులను పోర్చుగీసు వారి ఫ్యాక్టరీలు ఉన్న రేవులకే పంపుతారు, బీజాపూర్ రేవులకు పంపరు. విజయనగర వర్తకులు ఇనుము, సూరేకారం, బీజాపూర్ రేవుల నుండి దిగుమతి చేసుకోరు. పోర్చుగీసు వారి రేవుల నుండి ఖరీదు చేస్తారు. అరబ్బుల వ్యాపార నౌకలు గాని, నౌకాదళాన్ని గాని విజయనగర రేవులలోకి ప్రవేశం ఇవ్వరు అనే షరతులతో వర్తక సంధి జరిగింది. ఈ వర్తక సంధి వల్ల పోర్చుగీసు వారికే అధిక ప్రయోజనాలు కలిగాయి. ఈ సంధి క్రీ.శ.1547 నుండి 1558 వరకు ఎలాంటి విఘాతాలు లేకుండా కొనసాగింది 1558లో మళ్లీ పోర్చుగీసు వారితో యుద్ధం వచ్చింది.

గోవా-శాంథోమ్‌లపై దాడి: విజయనగర సామ్రాజ్యం వల్ల అన్ని ప్రయోజనాలు పొంది లాభాలు గడిస్తూ ఉన్నప్పటికీ వారికి విశ్వాసం లేకపోయింది. పోర్చుగీసు మత ప్రచారకులు వారి దుండగాలను ఆపలేదు. హిందువులను క్రైస్తవులుగా మార్చడం, దేవాలయాలను దోచుకోవడం కొనసాగించారు. ఆ స్థితిలో ప్రజలు వారిపై చర్య తీసుకోమని రామరాయలను కోరారు. రామరాయలు వారి దుశ్చర్యలను అరికట్టడానికి క్రీ.శ.1558వ సంవత్సరంలో మద్రాసు వద్ద ఉన్న శాంథోమ్, మైలాపూర్‌లలో స్థావరం ఏర్పాటు చేసుకొని దుండగాలు చేసే పోర్చుగీసు వారిపై దండెత్తాడని ఆజ్ఞాపించాడు. శాంథోమ్‌పై దండెత్తిన రామరాయలు పోర్చుగీసు వారిని ఓడించాడు. మైలాపూరు, శాంథోమ్ పట్టణాలను ఆక్రమించాడు. ఓడిపోయిన పోర్చుగీసు వర్తకులు రామరాయలను శరణు వేడారు. అందుకు లక్ష పగోడాలు కప్పంగా చెల్లించమన్నాడు. అందుకు పోర్చుగీసు వారు అంగీకరించి తక్షణమే 50 వేల పగోడాలు చెల్లించారు. మిగిలిన 50 వేల పగోడాలు చెల్లించటానికి ఒక సంవత్సరం గడువు కోరారు. ఆ మొత్తం చెల్లించే వరకు 5గురు పోర్చుగీసు వారు తమ వద్ద హామీగా ఉండాలని చెప్పి, 5గురు వర్తక ప్రముఖులను బందీలుగా తీసుకెళ్లారు. గోవాపై దండెత్తిన విరల్‌రాయలు గోవాను జయించలేదు కాని గోవా నుండి, శాంథోమ్ నుండి పోర్చుగీసు వారికి ఎలాంటి సహాయం అందకుండా చేయగలిగాడు. తాత్కాలికంగా పోర్చుగీసు వారు తమ దుండగాలను ఆపు చేశారు. ఆ తర్వాత కొద్ది కాలానికి మళ్లీ ఎప్పటిలాగానే వారి దుశ్చర్యలు కొనసాగించారు.

బహమనీ రాజ్యాలతో రామరాయల సంబంధాలు: రామరాయలు విజయనగర అధికారం చేపట్టిన తర్వాత సామ్రాజ్యపు విదేశీ విధానంలోను, బహమనీ రాజ్యాల సంబంధాలలో చాలా మార్పు వచ్చింది. అంతకుముందు బహమనీ సుల్తాన్‌లు విజయనగరం రాజ్యంపై దండెత్తడం, విజయనగర రాజులు ఎదుర్కోవడం తప్ప బహమనీ రాజులతో ఎప్పుడూ స్నేహ సంబంధాలను పాటించలేదు. బహమనీ రాజ్యం విచ్ఛిన్నమై క్షీణించి బీదరు, బీరార్, అహమ్మద్‌నగర్, బీజాపూరు, గోల్కొండ రాజ్యాలుగా చీలిపోయిన తర్వాత వారిలో వారికి ఈర్ష్యాద్వేషాలు కలిగి విజయనగర రాజ్య సహాయం పొంది మిగిలిన రాజ్యాలను నాశనం చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నాయి. మొదటిసారిగా కృష్ణరాయలు వారి అంతఃకలహాలలో జోక్యం చేసుకున్నాడు. కాని చాలా పరిమితంగా జోక్యం చేసుకున్నాడు. కాని రామరాయలు ఆ రాజ్యపు ఆంతరంగిక వ్యవహారాలలో కూడా జోక్యం చేసుకున్నాడు. అంతకు పూర్వం రామరాయలు గోల్కొండ నవాబుల కొలువులో ఉండి సుల్తాన్‌ల మనస్తత్వం బాగా అవగాహన చేసుకొని

ఉన్నాడు. కనుక వారి వివాదాలలో జోక్యం చేసుకొని విస్తరించి విజయనగర రాజ్య వైభవాన్ని ఇనుమడింపజేయవచ్చని ఆశించాడు. అందువల్ల రామరాయలు బహమనీ రాజకీయాలలో లోతుగా పాల్గొన్నాడు క్రీ.శ.1543-1564 సంవత్సరాలు మధ్య జరిగిన బహమనీ రాజ్యాల అంతఃకలహాలలో విజయనగర రాజ్యం, బీజాపూరు ఆదిల్‌షా రాజ్యం, అహమ్మద్‌నగర్, నిజాంషామీ రాజ్యం ప్రముఖ పాత్ర నిర్వహించాయి. కుతుబ్‌షాహీ రాజ్యమైన గోల్కొండ, బరీద్‌షాహి రాజ్యమైన బీదరు ఉపపాత్రలు పోషించాయి. వారు ఒకరి ప్రాంతాలను ఒకరు ఆక్రమించి తమ రాజ్యాలను విస్తరించుకోవాలని ఈర్ష్యాద్వేషాలతో పోరాటాలు జరిపారు. ఈ పోరాటాలలో కళ్యాణీ, షోలాపూర్, రాయచూరు, అంతర్వేది, కోవెలకొండ, పానుగల్లు, గణాపూర్, ఇటిగర్, బగ్రాకోట లేక భగల్ ప్రాంతాలు వశం చేసుకోవాలని ఆరాటపడ్డారు. ఈ ప్రాంతాల ఆక్రమణలకే ఆ యుద్ధాలు జరిగాయని చెప్పవచ్చు. ఈ యుద్ధాలను రెండు దశలుగా విభజింపవచ్చును. క్రీ.శ.1543 నుండి 1557 వరకు మొదటి దశ. ఈ దశలో రామరాయలు అహమ్మద్‌నగర్ నిజాంషాహీతో స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకొని బీజాపూరు రాజ్యంపై దాడులు చేశాడు. ఈ దశలో రాయచూరు, అంతర్వేదిలను ఆక్రమించి విజయనగరానికి లాభం చేకూర్చాడు క్రీ.శ.1557 నుండి 1564 వరకు రెండవదశ. ఈ దశలో రామరాయలు అహమ్మద్‌నగర్‌తో స్నేహ సంబంధాలను వదలుకొని బీజాపూర్ ఆల్‌షాహితో చేరిపోయి అహమ్మద్‌నగర్ రాజ్యంపై దాడి చేశాడు. ఇది నిష్ప్రయోజనమైన యుద్ధం. ఈ యుద్ధమే సుల్తాన్‌లు ఏకం కావడానికి దోహదం చేసి తళ్లికోట యుద్ధానికి కారణమైంది రామరాయల, బహమనీ సుల్తాన్‌ల సంబంధాలు ముస్లిం చరిత్రకారుల రచనల ద్వారానే గాక శివతత్వ రత్నాకరం, వెలుగోటి వారి వంశావళి, కేళడిన్నప విజయం కావ్యాలు కూడా తెలుపుతున్నాయి.

అహమ్మద్‌నగర్ బీజాపూరు రాజ్యాల ఒడంబడిక క్రీ.శ.1542: సలకం చిన తిరుమలుడు మరణించిన తర్వాత బీజాపూరు అహమ్మద్‌నగర్ రాజ్యాలు ఒక ఒడంబడికను చేసుకున్నాయని గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు తెలిపాడు. ఆ ఒడంబడిక ప్రకారం అహమ్మద్‌నగర్ రాజ్యం బీదరును కలుపుకొనేటట్లు, బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యాన్ని జయించి తనలో కలుపుకొనేటట్లు ఒప్పందం చేసుకొన్నారు. అందుకు ఒకరినొకరు సహాయం చేసుకోవాలని కూడా తీర్మానించారు. ఆ ఒడంబడిక తర్వాత బీజాపూర్ సుల్తాన్ విజయనగరంపై దండెత్తి చాలా ప్రాంతాలు ఆక్రమించాడని అజ్ఞాత చరిత్రకారుడు రాశాడు. ఈ దండయాత్రను గురించి కేళడిన్నప విజయం కూడా పేర్కొంది. సుల్తాన్ సైన్యాలను విజయనగర సేనానాయకుడైన సదాశివనాయకుడు ఎదుర్కొని ఓడించి తరిమివేశాడని కేళడిన్నప విజయం తెలుపుతోంది. ఈ రెండు వృత్తాంతాలను బట్టి బీజాపూరు సైన్యాలు విజయనగరంపై దండెత్తాయని ఫాదర్ హీరాస్ భావించాడు. కాని అజ్ఞాత చరిత్రకారుడు పేర్కొన్నట్లు విజయనగరం తన ప్రాంతాలను కోలుపోలేదని ఈ దండయాత్ర విఫలమైందని వివరించాడు. ఈ దండయాత్ర తర్వాత రామరాయలు బహమనీ రాజ్యాలతో తాను అనుసరించవలసిన విధానాలు రూపొందించుకున్నాడు బహమనీ సుల్తాన్ రాజకీయాలలో జోక్యం చేసుకొని బీజాపూరు, అహమ్మద్‌నగర్‌లను వేరు చేయాలని తలచాడు ఈ ధ్యేయంతో రామరాయలు అహమ్మద్‌నగర్ రాజ్యంతో స్నేహ సంబంధాలను ఏర్పరచుకోవాలని తలచాడు అహమ్మద్‌నగర్ నిజాంషా కూడా బీజాపూరు, బీదర్‌లతో ఉన్న విరోధం వల్ల విజయనగరంతో స్నేహాన్ని వాంఛించాడు. కనుక బురహాన్ నిజాంషా విలువైన కానుకలతో తన రాయబారులను విజయనగరం పంపాడు రామరాయలు ఆ కానుకలను స్వీకరించాడు. అది తెలిసి బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా రామరాయలపై మండిపడి తన రాజ్యంలో ఉన్న విజయనగర రాయబారులను వెళ్లగొట్టాడు. అందువల్ల రామరాయలకు బీజాపూరుపై ఆగ్రహం కలిగింది.

మొదటి దశ క్రీ.శ.1543-57: అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్‌షా ఇదే తగిన సమయమని బీదరు మీద దండెత్తి కళ్యాణీదుర్గాన్ని ముట్టడించాడు. మొదటి నుండి కళ్యాణీదుర్గం బీదరు రాజ్యంలో ఉంది. దానిని ఆక్రమించాలని అహమ్మద్‌నగర్ కోరిక. ఈ దండయాత్రతో మొదటిదశ ప్రారంభమైంది. ఈ యుద్ధంలో రామరాయలు అహమ్మద్‌నగరానికి సహాయం చేశాడు. బీదర్ సుల్తాన్ ఆలీబరీద్ బీజాపూరు సహాయం అర్థించాడు బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం ఆదిల్‌షా బీదర్‌కు సహాయంగా వెళ్లాడు.

రామరాయలు రాయచూరు, అంతర్వేదిని ఆక్రమించటం: ఇదే తగిన సమయం అని రామరాయలు తన తమ్ముడు వెంకటాద్రిని సైన్యంతో పంపాడు. వెంకటాద్రి రాయచూరు, ముద్గల్, అంతర్వేదిని ఆక్రమించాడు. ఈ లోపల అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్ నిజాంషా కళ్యాణీ దుర్గాన్ని జయించాడు. ఈ మొదటి యుద్ధంలో

అహమ్మద్‌నగర్ విజయనగరం ఒక వైపు, బీదర్ బీజాపూరు మరొక వైపున పోరాడాయి. ఈ యుద్ధంలో అహమ్మద్‌నగర్, విజయనగర కూటమి విజయం సాధించింది. కళ్యాణీ, అహమ్మద్‌నగర్ వశం కాగా రాయచూరు, అంతర్వేది విజయనగరం వశమయ్యాయి. బీదరు, బీజాపూరులు నష్టపోయాయి. క్రీ.శ.1553 బురహాన్ నిజాంషా మరణించేవరకు కళ్యాణీకోట అహమ్మద్‌నగర్ ఆధీనంలోనే ఉంది.

రెండవ యుద్ధం క్రీ.శ.1551-52: బీజాపూరు, బీదర్‌లు నష్టపోవడంతో తిరిగి అహమ్మద్‌నగరంతో యుద్ధం చేయాలని సంకల్పించాయి. బీజాపూరు సుల్తాన్ తన నష్టానికి అహమ్మద్‌నగరం కారణమని భావించాడు. కోల్పోయిన కళ్యాణీ నగరాన్ని బీజాపూరు జయించుకోవచ్చుని కూడా బీదరు రాజ్యం పేర్కొంది. కనుక బీజాపూరు సుల్తాన్ ఇబ్రహీం అహమ్మద్‌నగరంపై దండెత్తాడు. కొన్ని దుర్గాలను జయించాడు. దాంతో అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్‌షా రామరాయల సహాయం అర్థించడానికి విజయనగర రాజ్యానికి వచ్చాడు. రామరాయలు బురహాన్‌షాలు క్రీ.శ.1551లో రాయచూరు వద్ద కలుసుకొన్నారు. ఉభయులూ రక్షణ సంధి చేసుకున్నారు. తర్వాత ఇద్దరూ బీజాపూరుపై దండెత్తి ఓడించారు. ఓడిపోయిన బీజాపూరు సుల్తాన్ తన రాజ్యంలోని షోలాపూర్‌ను అహమ్మద్‌నగరానికి ఇచ్చేసి సంధి చేసుకున్నాడు. అంతర్వేది రాయచూరులను రామరాయలకు వదలుకున్నాడు. ఈ విధంగా రెండవ యుద్ధంలో కూడా అహమ్మద్‌నగర్ విజయనగర కూటమి జయించింది. క్రీ.శ.1553లో అహమ్మద్‌నగర్ సుల్తాన్ బురహాన్ నిజాంషా మరణించాడు. అతని కుమారుడు హుసేన్ నిజాంషా గద్దెనెక్కాడు. ఆ సమయంలో తాను కోల్పోయిన షోలాపూర్‌ను జయించాలని బీజాపూరు ఇబ్రహీం ఆదిల్‌షా అహమ్మద్‌నగర్ రాజ్యంపై దండెత్తాడు. కాని షోలాపూర్ వద్ద ఓడిపోయాడు.

ఐనుల్‌ముల్క్ సైఫాఖాన్ క్రీ.శ.1555-56: బీజాపూర్ ఇబ్రహీం ఆదిల్‌షా షోలాపూర్ వద్ద యుద్ధం చేసినప్పుడు బీజాపూర్ రాజ్యంలో ఐనుల్‌ముల్క్ అనే సర్దార్ తిరుగుబాటు చేశాడు. షోలాపూర్ వద్ద ఓడిపోయి తిరిగి తన రాజ్యం చేరిన ఇబ్రహీం ఆదిల్‌షా అతనితో పోరాటానికి దిగాడు. కాని ఐనుల్‌ముల్క్ అతనిని ఓడించి బీజాపూరు రాజ్యాన్ని ఆక్రమించాడు. రాజ్యం పోగొట్టుకున్న బీజాపూరు సుల్తాన్ ఏమిచేయాలో తోచక రామరాయలను శరణువేడాడు. 7 లక్షల పగోడాలు ధనం ఇచ్చి తన రాజ్యాన్ని కాపాడమన్నాడు. రామరాయలు దయతలచి తన తమ్ముడు వెంకటాద్రిని పంపాడు. వెంకటాద్రి బీజాపూరుపై దండెత్తి ఐనుల్‌ముల్క్‌ను ఓడించి తరిమేసి రాజ్యాన్ని ఇబ్రహీం ఆదిల్‌షాకు అప్పగించాడు. ఐనుల్‌ముల్క్ అహమ్మద్‌నగరం పారిపోయాడు. కాని అక్కడ అతడు దారుణహత్యకు గురయ్యాడు. ఈ విధంగా ఇబ్రహీం ఆదిల్‌షా రామరాయల సహాయంతో తన రాజ్యాన్ని దక్కించుకున్నాడు. దాంతో బీజాపూరు రాజ్యం విజయనగరానికి చేరువ అయింది.

అబ్దుల్లా తిరుగుబాటు క్రీ.శ.1555-56: ఐనుల్‌ముల్క్ తిరుగుబాటు అంతమైన తర్వాత ఇబ్రహీం మరొక కష్టాన్ని ఎదుర్కోవలసివచ్చింది. అతని సోదరుడు అబ్దుల్లా తిరుగుబాటు చేసి పశ్చిమకోస్తాలోని పొండాలో స్వతంత్ర రాజ్యం స్థాపించాడు. ఇబ్రహీం ఆదిల్‌షా మళ్లీ రామరాయల సహాయంతో సోదరుని ఓడించి రాజ్యాన్ని కాపాడుకున్నాడు. దాంతో బీజాపూరు రాజ్యం రామరాయలకు మరీ దగ్గరైంది. తర్వాత క్రీ.శ.1557 లో ఇబ్రహీం కుతుబ్‌షా మరణించాడు. అతని కుమారుడు ఆలీ ఆదిల్‌షా బీజాపూరు గద్దెనెక్కాడు. అదే సమయంలో విజయనగరంలో రామరాయల కుమారుడు ఒకడు మరణించాడు. ఆలీ ఆదిల్‌షా విజయనగరం దర్శించి రామరాయలకు తన సంతాపం తెలిపాడు. అందుకు రామరాయలు సంతసించాడు. అది అదనుగా తీసుకొని ఆదిల్‌షా తనను కుమారునిగా చూసుకొమ్మనీ, తన రాజ్యం నుండి అహమ్మద్ నగరం జయించిన కళ్యాణీ, షోలాపూరులను ఇప్పించమని కోరాడు. రామరాయలు పొంగిపోయి ఆలీ ఆదిల్‌షాను తన కుమారునిగా చూసుకుంటానని వాగ్దానం చేశాడు. రామరాయల భార్య కూడా ఆలీ మన కుమారుడే అన్నదట. దాంతో మూడు రోజులు విజయనగరంలో గడిపి ఆలీ ఆదిల్‌షా సంతోషంగా తన రాజ్యానికి వెళ్లిపోయాడు. రామరాయల అండ తనకు ఉందని భావించి కళ్యాణీ, షోలాపూర్‌లను తనకు అప్పగించమని అహమ్మద్ నగరానికి కబురు పంపాడు.

రెండవ దశ క్రీ.శ.1557-1564: బీజాపూరు రాజ్యం రామరాయలకు దగ్గర కావడం, ఆలీ ఆదిల్‌షా కళ్యాణీ, షోలాపూర్‌లను అప్పగించమని కోరడంతో అహమ్మద్‌నగర్ రాజ్యం రామరాయలకు దూరమైపోయింది. బీజాపూరు రాజ్యం ఎప్పుడైనా తనపై దండెత్తవచ్చుని హుసేన్ నిజాంషా గోల్కొండ ఇబ్రహీం కుతుబ్‌షాతో స్నేహ సంబంధాలు ఏర్పరచుకొన్నాడు. వారు ఉభయులు కలసి బీజాపూరు రాజ్యంలో ఉన్న గుల్బర్గాను ముట్టడించారు. బీజాపూరు ఆలీ ఆదిల్‌షా రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు తన సైన్యంతో స్వయంగా

బీజాపూరు రాజ్యంలోకి వచ్చాడు. రామరాయలు తన సైన్యాలతో బీజాపూరు రాజ్యానికి సహాయంగా వచ్చాడని తెలిసి భయపడి అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లు ముట్టడిని విరమించి వెనక్కు వెళ్లిపోవాలని నిర్ణయించారు. అదే సమయంలో వారికి రామరాయల వద్ద నుండి సంధికి రావలసిందని కబురు వచ్చింది.

నాలుగు రాజ్యాల సంధి క్రీ.శ.1557-58: రామరాయల ఆహ్వానాన్ని అందుకొని బీజాపూరు, గోల్కొండ, అహమ్మద్‌నగర్ సుల్తాన్‌లు రామరాయల వద్దకు వచ్చారు. అప్పుడు రామరాయలు కృష్ణాభీమా నదులు కలిసేచోట విడిసి ఉన్నాడు. అనవసర రక్తపాతం మంచిది కాదని, యుద్ధాలు మాని సఖ్యతగా ఉండమని సుల్తాన్‌లకు హితవు చెప్పాడు. తర్వాత అక్కడ వారందరూ కలసి అన్ని విషయాలు మాట్లాడి ఒక సంధి చేసుకున్నారు. దీనినే **నాలుగు రాజ్యాల సంధి అని అంటారు.** ఆ సంధి ప్రకారం - ఇక ముందు ఎవరూ ఇతరుల రాజ్యాలపై దురాక్రమణ చేయరాదు. ఎవరైనా దురాక్రమణ చేస్తే మిగిలిన మూడు రాజ్యాలు కలసి దురాక్రమణ చేసిన రాజ్యంపై దండెత్తి గుణపాఠం చెప్పాలని తీర్మానించి నలుగురూ ఒప్పందంపై సంతకం చేశారు.

రామరాయల ఘనత: ఈ సంధి చేయించిన కాలానికి రామరాయల అధికారం తారాస్థాయికి చేరిందని చెప్పవచ్చు. రామరాయల స్థానాన్ని ఏ విజయనగర చక్రవర్తి సాధించలేదు. సుల్తాన్‌లందరిని తన ముందుకు పిలిపించుకొని శాసించింది విజయనగర రామరాయలు తప్ప మరెవరూ లేరు. కృష్ణదేవరాయలు కూడా అలాంటి ఘనతను సాధించలేదు. ఆ సంధి తర్వాత రామరాయలకు తనకు ఎదురులేదని గర్వం కలిగి ఉంటుంది. అందువల్ల ఆ తర్వాత బహమనీ సుల్తాన్‌లకు జరిగిన యుద్ధాల్లో తనకు అవసరం లేకపోయినా పాల్గొన్నాడు. వాస్తవానికి తనకు ఎటువంటి సమస్యలు లేవు. రాయచూరు, అతర్వేదిపై బీజాపూరు సుల్తాన్ హక్కులను వదులుకున్నాడు. గత రెండు సంవత్సరాలుగా విజయనగర చక్రవర్తులు సాధించలేని సరిహద్దుల స్థిరత్వాన్ని సాధించాడు. సరిహద్దులు స్థిరపడ్డాయి. తనకు ఇక బహమనీ సుల్తాన్‌లతో యుద్ధాలు చేయవలసిన అవసరం లేదు. కాని నాలుగు రాజ్యాల సంధి కుదిరిన తర్వాత సంధిని ధిక్కరించిన అహమ్మద్ నగరంపై అనవసరంగా దండయాత్ర చేశాడు. అంటే విజయనగర రాజ్య అవసరాలకు గాక తన వ్యక్తిగత అహంతో తన మాటే సాగాలనే పట్టుదలతో వారి యుద్ధాలలో పాల్గొన్నాడు. బీజాపూరు సుల్తాన్ పిలిచినంత మాత్రాన వెళ్లనవసరం లేదు. కాని తనకు తాను ఒక పెద్దగా ఊహించుకొని సంధి షరతులను అమలు జరపవలసిన బాధ్యత తనపై ఉందని భావించుకొని అహమ్మద్‌నగరంపై దండయాత్ర చేశాడు. ఈ విధంగా అతడు ఇచ్ఛికంగానో, పరిస్థితుల ప్రభావం వల్లనో, అనాలోచితంగా వారి యుద్ధాలలో తల దూర్చి విజయనగర రాజ్యానికి చేటు తెచ్చాడు. తను సాధించిన ఘనతను కొద్ది కాలంలోనే పోగొట్టుకోవడమే గాక తన ప్రాణాలకు ముప్పు తెచ్చుకున్నాడు. విజయనగర విధ్వంసానికి కారకుడయ్యాడు.

మొదటి అహమ్మద్‌నగర్ యుద్ధం క్రీ.శ.1560: క్రీ.శ.1560లో అహమ్మద్‌నగర్ సుల్తాన్ హుసేన్‌షా నాలుగు రాజ్యాల సంధిని ఉల్లంఘించి బీజాపూరు రాజ్యంపై దాడి చేశాడు. ఆల్ ఆదిల్‌షా విజయనగరం చేరి రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌షాకు ఉత్తరం రాసి అహమ్మద్‌నగర్‌ను దండించాలనీ, సైన్యాలతో బయలుదేరమనీ ఆదేశించాడు. ఇబ్రహీం కుతుబ్‌షాకు అహమ్మద్‌నగర హుసేన్‌షాకు రహస్య మైత్రి ఉన్నందువల్ల అహమ్మద్‌నగరంపై దండెత్తడం ఇష్టం లేదు. కాని రామరాయలకు ఎదురు చెప్పలేక అయిష్టంగా తన సేనలతో బయలుదేరాడు. దాంతో విజయనగర సేన, గోల్కొండ సేన బీజాపూరు చేరి మూడు సైన్యాలు కలిసి అహమ్మద్‌నగరంపై దండెత్తారు. విజయనగర సైన్యానికి వెంకటాద్రి, సదాశివ నాయకుడు నాయకత్వం వహించారు. మిత్రపక్షం సైన్యం వస్తోందని తెలిసి హుసేన్‌షా కళ్యాణీదుర్గ రక్షణ భారాన్ని తన సేనాధిపతి అయిన భోపాలరాయునికి అప్పగించి హడావిడిగా తాను తన రాజధాని అహమ్మద్‌నగరానికి వెళ్లిపోయాడు. మిత్రపక్షాలు తమ సైన్యంలో ఒక భాగాన్ని కళ్యాణీదుర్గాన్ని జయించడానికి పంపి, మిగిలిన సేన హుసేన్‌షాను తరుముతూ అహమ్మద్‌నగరంపై దండెత్తాయి. ఆ సమయంలో తాను అహమ్మద్‌నగరంలో కూడా ఉండటం క్షేమం కాదని హుసేన్‌షా కోట రక్షణను తన సేనాధిపతులకు వదిలేసి గోదావరి నదిని దాటి పైఠాన్‌కు వెళ్లిపోయాడు. విజయనగర సేనలను నడిపిన సదాశివనాయకుడు జంఖండి లేక జంబుఖండి వద్ద (ఈ ప్రదేశం అహమ్మద్‌నగర్ జిల్లాలో ఉంది) నిజాంషా సేనల్ని చిత్తుగా ఓడించాడు. తర్వాత మిత్రపక్షాల సేనలు ముందుకుసాగి అహమ్మద్‌నగర్ కోటను ముట్టడించాయి. ఈ విధంగా విజయనగర సేనల విజయపరంపరలతో ముందుకు సాగడం గోల్కొండ నవాబు ఇబ్రహీం కుతుబ్‌షాకు విపరీతమైన అసూయ

కలిగించి ద్రోహానికి తలపడ్డాడు. అహమ్మద్‌నగర్ కోటను రక్షించడానికి పోరాడే హుసేన్‌షా సేనలకు రహస్యంగా సహాయం చేశాడు. అయినప్పటికీ విజయనగర సేనలు అహమ్మద్‌నగర్ సేనలను ఓడించి కోటలో ప్రవేశించాయి. ఈలోపల విజయనగర సైన్యాలలో ఒక భాగం గోదావరి నదిని దాటి దౌలతాబాద్ కోటను కూడా జయించాయి. హుసేన్‌షా సైన్యం మరికొన్ని చోట్ల కూడా పోరాడి ఓడిపోయింది. కళ్యాణీ, అహమ్మద్‌నగర్, దౌలతాబాద్ కోటలు మిత్రపక్షాల వశమయ్యాయి. ఇక తాను గెలవడం అసాధ్యమని తలచి హుసేన్‌షా సంధి రాయబారం పంపాడు. నిజాంషా స్వయంగా రామరాయలను దర్శించి కళ్యాణీ కోట తాళాలు అప్పగించి, బీజాపూరుకు ఆ కోటను వదులుకున్నానని చెప్పాడు. యుద్ధ సమయంలో హుసేన్‌షా తరపున పోరాడి మిత్రపక్షాల సేనకు నష్టం కలిగించిన ఇమాద్‌షా సేనాధిపతి అయిన జహంగీర్‌ను వధించడానికి హుసేన్‌షా అంగీకరించాడు. రామరాయల చేతితో ఇచ్చిన తాంబూలాన్ని స్వీకరించడానికి కూడా హుసేన్‌షా అంగీకరించాడు. కాని ఆ సమయంలో రామరాయలు హుసేన్‌షా చేతిని ముద్దు పెట్టుకున్నాడట. వెంటనే హుసేన్‌షా నీళ్లు తెప్పించి రామరాయలు ముద్దుపెట్టుకున్న చేతిని కడుగుకున్నాడట. అందుకు రామరాయలకు కోపం వచ్చి తాను కూడా నీళ్లు తెప్పించి తన చేతులు కడుగుకొని నీవు చేసిన అవమానానికి అతిధి గనుక బతికిపోయావు, ఫో అని అన్నాడట. ఈ సందర్భంలోనే హుసేన్‌షాకు రామరాయలపై విపరీతమైన ద్వేషం కలిగిందట. రామరాయలకు అహమ్మద్‌తో సుదీర్ఘ సంఘర్షణ జరిగినట్లు కేళదినృప విజయం, బాలభాగవతాలు కూడా తెలుపుతున్నాయి. కనుక రాయల అహమ్మద్‌నగర్ దండయాత్ర విజయం వాస్తవమేనని స్పష్టమవుతోంది.

బీదరు దండయాత్ర: అహమ్మద్‌నగర్ దండయాత్ర తర్వాత విజయనగర సేనలు బీదర్‌పై దండెత్తి బీదర్ సుల్తాన్‌ను ఓడించి బందీ చేశాయని శివతత్వ రత్నాకరం, కేళదినృప విజయాలు పేర్కొన్నాయి. బీదరు సుల్తాన్ సేనలు అహమ్మద్‌నగర్ సుల్తాన్‌కు సహాయం చేశాయి. అందుకుగాను శిక్షించడానికి దండయాత్ర జరిగింది. ఓడిపోయిన బీదరు సుల్తాన్ మిత్రపక్షాలవైపు చేరతానని, అహమ్మద్‌నగర్ సైన్యంతో పోరాడతానని చెప్పి స్వేచ్ఛను పొందాడని శివతత్వ రత్నాకరం, కేళదినృప విజయం తెలుపుతున్నాయి.

యుద్ధానంతరం రామరాయలు గోల్కొండ కుతుబ్‌షాను అహమ్మద్‌నగర్ కోట వద్ద హుసేన్‌షా సైనికులకు సహాయం ఎందుకు చేశావని ప్రశ్నించాడు. అందుకు ఇబ్రహీం కుతుబ్‌షా ఏ సమాధానం చెప్పకుండా తన సేనలతో గోల్కొండ వెళ్లిపోయాడని ఫెరిష్టా రాశాడు. కాని గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు రామరాయలు అహమ్మద్‌నగర్ కోట ముట్టడిని విరమిస్తే తాను కొండపల్లి కోటను ఇస్తానని కుతుబ్‌షా వాగ్దానం చేశాడని, అందువల్ల రామరాయలే కోట ముట్టడి ఆపు చేశాడని రాశాడు. కాని అది వాస్తవం కాదు. అదే నిజమైతే కుతుబ్‌షా కొండపల్లిని రామరాయలకు ఇవ్వాలి. అతడు ఇవ్వలేదు. రామరాయలు అడుగనూలేదు. మొత్తం మీద మొదటి అహమ్మద్‌నగర్ దండయాత్ర విజయవంతమైంది.

జగదేకరావుకు ఆశ్రయం ఇవ్వడం-గోల్కొండతో సంబంధాలు: గోల్కొండ రాజ్య స్థాపకుడైన కులీకుతుబ్‌షా మరణానంతరం అతని కుమారుడు జంషీద్‌షా సింహాసనం అధిష్టించి అతని తమ్ముడైన ఇబ్రహీంను చంపించడానికి ప్రయత్నించాడు. ప్రాణభయంతో ఇబ్రహీం విజయనగరం చేరి రామరాయలను ఆశ్రయించాడు. రామరాయలు అతనిని 7 సంవత్సరాలు విజయనగరంలో ఉంచుకొని కన్నబిడ్డ లాగా చూసుకొని పోషించి కాపాడాడు. అంతేగాక గోల్కొండ సింహాసనం అధిష్టించడానికి సహాయం కూడా చేస్తానన్నాడు. తర్వాత ఇబ్రహీం గోల్కొండ సింహాసనం అధిష్టించాడు. అందువల్ల అతనికి రామరాయల మీద గౌరవ భావం ఉంది. ఒక పర్యాయం రామరాయలపై అతని సోదరులు తిరుగుబాటు చేయగా రామరాయలు వారిని అదుపులోకి తేవడానికి ఇబ్రహీం కుతుబ్‌షా సహాయం అర్థించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా అందుకు సాయపడగా, రామరాయల సోదరులు లొంగిపోయి అన్నను శరణువేడారు. రామరాయలు వారిని క్షమించాడు. ఈ విధంగా రామరాయలకు, ఇబ్రహీం కుతుబ్‌షాకు మంచి సంబంధాలు కొనసాగాయి. అప్పటివరకు ఎంతో సయోధ్యగా ఉన్న వారికి అహమ్మద్‌నగర్ కోట ముట్టడి సందర్భంలో అభిప్రాయభేదాలు వచ్చాయి. అంతేగాక అక్కడ రామరాయలకు లభించిన విజయానికి కుతుబ్‌షాకు ఈర్ష్య కలిగింది. ఇది జరిగిన కొద్ది కాలానికే గోల్కొండలో ఇబ్రహీం దగ్గర సేనాధిపతిగా పని చేసిన ఇమ్మడి జగదేకరావు తిరుగుబాటు చేశాడు. అతనిని కుతుబ్‌షా వెళ్లగొట్టాడు. జగదేకరావు అహమ్మద్‌నగర్ చేరి సుల్తాన్‌ను ఆశ్రయించాడు. కాని అక్కడ ఇమడలేక అతడు విజయనగరం చేరి రామరాయల ఆశ్రయం పొందాడు. తన శత్రువైన జగదేకరావుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఇబ్రహీంషాకు రామరాయలపై ఆగ్రహం కలిగింది. అప్పటి

నుండి ఇబ్రహీం కుతుబ్‌షా బహిరంగంగానే రామరాయలపై శతృత్వం వహించాడు. ఈ విధంగా గోల్కొండ విజయనగర సంబంధాలు చెడిపోయాయి.

రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం క్రీ.శ.1563-64: రామరాయల ఎడ శతృత్వం వహించిన గోల్కొండ ఇబ్రహీంషా అహమ్మద్‌నగర్ హుసేన్ నిజాంషాతో చేతులు కలిపాడు. వారి స్నేహబంధాన్ని దృఢపరచుకోడానికి హుసేన్‌షా తన కుమార్తె బీబీజమాన్‌ను ఇబ్రహీం కుతుబ్‌షాకు ఇచ్చి వివాహం చేసి కళ్యాణీదుర్గాన్ని అరణంగా ఇవ్వాలని సంకల్పించాడు. వివాహం కూడా కళ్యాణీదుర్గంలోనే జరగాలని నిర్ణయించారు. కళ్యాణీదుర్గం ఆ సమయంలో బీజాపూరు సుల్తాన్ ఆధీనంలో ఉంది. కనుక ఆ కోటను జయించడానికి హుసేన్‌షా ఇబ్రహీంషాలు కళ్యాణీకోటపై దండెత్తారు. దాంతో రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం వచ్చింది. అహమ్మద్‌నగర్, గోల్కొండ సైన్యాలు కళ్యాణీదుర్గాన్ని ముట్టడించడంతో బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రామరాయల సహాయం అర్థించాడు. రామరాయలు యుద్ధంలోకి దిగాడు. వారితో బీదరు సుల్తాన్ ఆలీబరీద్ కూడా చేరాడు. దాంతో ఈ రెండవ యుద్ధంలో విజయనగరం, బీజాపూరు, బీదరు ఒక వైపు, అహమ్మద్ నగరం, గోల్కొండ మరొక వైపు చేరి పోరాడాయి. రామరాయలు తన తమ్ముడు వెంకటాద్రి, జగదేకరావు నాయకత్వంలో ఒక సేనను గోల్కొండ రాజ్యంపైకి పంపాడు. తాను, ఆలీ బరీద్, ఆలీ ఆదిల్‌షాలు కలసి అహమ్మద్‌నగరంపై దండెత్తారు. వారు వచ్చే సంగతి తెలిసి హుసేన్‌షా, ఇబ్రహీంషాలు కళ్యాణీదుర్గ ముట్టడిని వదలేసి ఎవరి రాజ్యాల వైపు వారు వెళ్లిపోసాగారు. మిత్రపక్షాలు అహమ్మద్‌నగరం వైపు సాగిపోయారు. ఆ సమయంలో సేనానది వరదలు ఉధృతంగా ఉన్నందువలన ముట్టడిని విరమించవలసి వచ్చిందని పెరిష్టా రాశాడు. అందువల్ల బీజాపూరు సేన గోల్కొండ వైపుకు నడిచి ఇబ్రహీంను వెంటాడింది. వరదలు తగ్గగానే విజయనగర సేన నదిని దాటి అహమ్మద్‌నగరాన్ని ముట్టడించింది. అహమ్మద్‌నగర సేనను ఓడించి కోటలో ప్రవేశించి నగరంలో బీభత్సాన్ని సృష్టించాయి అహమ్మద్‌నగర్ సేనలు పూర్తిగా ఓడిపోయాయి.

గోల్కొండతో యుద్ధం: అహమ్మద్‌నగరం నుండి ఒక 30 వేల సైన్యం గోల్కొండ చేరింది. ఆ సేన బీజాపూరు సేన, అంతకు ముందే వెంకటాద్రి, జగదేకరావుల నాయకత్వంలో వెళ్లిన సేన గోల్కొండ రాజ్యంలో అనేక చోట్ల ఇబ్రహీంషాను ఓడించినా అతడు అతికష్టంపై తన రాజధాని గోల్కొండకి చేరుకోగలిగాడు. ఇదే సమయంలో కొండవీడు లోని విజయనగర ప్రతినిధి స్థిరాజు తిమ్మరాజును 50 వేల సైన్యంతో కొండపల్లి మచిలీపట్టణాలపై దాడి చేయమని రామరాయలు ఆజ్ఞాపించాడు. అదే సమయంలో పూర్వపు గజపతి సేనానులైన చితాబ్‌ఖాన్, విద్యాధరులు కూడా గోల్కొండపై యుద్ధం ప్రకటించారు. వారికి రామరాయలు మద్దతునిచ్చాడు చితాబ్‌ఖాన్ ఏలూరు మీద, విద్యాధరుడు రాజమహేంద్రవరం మీద దండెత్తారు. వారిని గోల్కొండ సైన్యాలు చారపల్లి వద్ద ఓడించినప్పటికీ ఇబ్రహీం కుతుబ్‌షా రాజ్యం అన్ని వైపుల నుండి ముట్టడించింది. తాను రామరాయలతో పోరాడటం అసాధ్యమని గ్రహించి రాయలతో సంధి చేసుకొని కోవెలకొండ, ఘనాపూర్ లేక గణపురం, పానుగల్లు కోటలను రామరాయలకు ఇచ్చాడు. దాంతో గోల్కొండతో యుద్ధం ముగిసింది. అహమ్మద్ నగరంపై అంతకు ముందే ఘనవిజయం సాధించాడు. ఈ రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధం రామరాయలను దక్షిణదేశంలో తిరుగులేని మహారాజును చేసింది. అతని కీర్తి దేశమంతటా పాకింది. సుల్తాన్‌లకు ఎక్కడ లేని భయాన్ని కలుగజేసింది. యుద్ధంలో ఓడిపోయిన అహమ్మద్‌నగర్, గోల్కొండ సుల్తాన్‌లు తమకు కలిగిన పరాభవాన్ని ఎంతో అవమానంగా భావించారు.

రామరాయలకు వ్యతిరేకంగా సుల్తాన్‌ల కూటమి ఏర్పడటం క్రీ.శ.1564: రెండవ అహమ్మద్‌నగర్ యుద్ధంలో తమ రాజ్యాలకు జరిగిన నష్టం, తమకు కలిగిన పరాభవాలు హుసేన్‌షాను, ఇబ్రహీంషాను దహించి వేశాయి. రామరాయలు అందనంత ఎత్తుకు ఎదిగిపోయాడని, విజయనగర రాజ్యం అతి బలిష్టంగా రూపొందిందని, ఇక తమ రాజ్యాలకు భద్రత లేదని తమ రాజ్యాలను ఎప్పుడైనా ఆక్రమించవచ్చని వారు భావించారు. కనుక రామరాయలపై పగ సాధించాలని పట్టుదల కలిగింది. కాని తాము బలహీనులు. ఏ ఒక్కరూ రామరాయలను జయించలేరు. కనుక సుల్తాన్‌లందరినీ ఏకం చేయాలనే భావన కలిగింది. అహమ్మద్‌నగర్ సుల్తాన్ తన దూతను గోల్కొండకు పంపి సుల్తాన్‌ల ఐక్యతకు కృషి చేయమని కోరాడు. ఆ వార్త ఇబ్రహీంషాకు అమిత సంతోషం కలిగింది. వెంటనే అహమ్మద్‌నగర్, బీజాపూరు సుల్తాన్‌ల మధ్య ఉన్న విరోధం పోతే తప్ప సుల్తాన్‌ల ఐక్యత సాధ్యం కాదని గుర్తించిన ఇబ్రహీం తన సేనాధిపతి అయిన ముస్తఫాఖాన్‌ను అందుకు

నియోగించాడు. అతడు అహమ్మద్‌నగర్, బీజాపూరు సుల్తాన్‌ల దర్బారులను దర్శించి వారి మధ్య రాయబారం చేసి వారు కలసిపోయే విధంగా చేశాడు. బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా రామరాయలతో కలసి ఉన్నా మనసులో రాయలు పెరిగిపోయాదని ఈర్ష్య ఉంది. రాయలంటే భయం కూడా ఉంది. కనుక అతడు అహమ్మద్‌నగర్‌తో స్నేహం చెయ్యడానికి అంగీకరించాడు. వారి స్నేహం వివాహ బంధంగా ఉంటే శాశ్వతంగా ఉంటుందని ముస్తఫాఖాన్ సలహా ఇచ్చాడు. అందువల్ల బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన చెల్లెలు ఫాలాబీబీని హుసేన్‌షా పెద్ద కుమారుడు మూర్తజాకు ఇచ్చి వివాహం చెయ్యడానికి, అలాగే హుస్సేన్‌షా తన కుమార్తె చాంద్‌బీబీని ఆలీ ఆదిల్‌షాకిచ్చి వివాహం చేయడానికి ఇద్దరు సుల్తాన్‌లను ముస్తాఫాఖాన్ ఒప్పించాడు. తర్వాత వారు ఈ రెండు వివాహాలను అత్యంత వైభవంగా జరిపారు. హుసేన్‌షా అల్లుడు ఆదిల్‌షాకు షోలాపూర్‌ను అరణంగా ఇచ్చాడు. అంతకు ముందే ఇబ్రహీం కుతుబ్‌షా హుసేన్‌షా అల్లుడై ఉన్నాడు. కనుక ఈ వివాహ బంధాలతో మూడు వంశాలకు విడదీయరాని బంధుత్వం ఏర్పడింది. వివాహాల అనంతరం వారు ఒక కూటమిగా ఏర్పడ్డారు. వారితో బీదర్ సుల్తాన్ ఆలీ బరీద్ చేరాడు. ఏ కారణం వల్లనో బీరారు సుల్తాన్ వారితో చేరలేదు. కనుక నలుగురు సుల్తాన్‌లు మాత్రమే కూటమిగా చేరారు. కాని కొన్ని స్థానిక రచనలు బీరారు సుల్తాన్ బుర్హాన్ ఇమాద్‌షా ఉల్‌ముల్క్ కూడా చేరాడని, అందువల్ల వారిని పంచపాదుషాలు అని వ్యవహరించారని తెలిపాయి. గుత్తి కైఫీయత్తు దక్కన్ సుల్తాన్‌లతో ఢిల్లీ పాదుషా అక్బర్ కూడా చేరాడని తెలుపుతోంది. కాని అక్బర్ బీరార్ సుల్తాన్‌లతో చేరలేదు. నలుగురు సుల్తాన్‌లు మాత్రమే రామరాయలకు వ్యతిరేకంగా కూటమిగా ఏర్పడ్డారు. స్థానిక రచనలు బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షాను బెదిరించి తమ కూటమిలో చేర్చుకున్నారని రాశాయి. అహమ్మద్‌నగర్ యుద్ధాల వల్ల లబ్ధి పొందిన వాడు బీజాపూరు సుల్తాన్. రామరాయల వల్ల అతనికి ఎలాంటి నష్టాలు కలుగలేదు. పైగా లాభం పొందాడు. అతడు కూడా రామరాయలకు వ్యతిరేకంగా చేరాడు. అందుకు పెరిష్టా ఒక కారణం చూపాడు. అతని రాజ్యంలోని యాద్గిరి, భాగల్ కోటలను రామరాయలు బలవంతంగా లాక్కున్నాడని, వాటిని తిరిగి సంపాదించడానికి కూటమిలో చేరాడని రాశాడు. కాని రామరాయలు ఆ కోటలను బలవంతంగా లాక్కున్నాడని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. అహమ్మద్‌నగర యుద్ధం తర్వాత బహుమానంగా సుల్తానే ఆ రెండు ప్రాంతాలను రామరాయలకు ఇచ్చి ఉండవచ్చును. రామరాయల వల్ల అతడు పొందిన లాభంతో పోలిస్తే అవి చాలా చిరు కానుకలు. ఆలీని బెదిరించి తమ కూటమిలో చేర్చుకున్నారని స్థానిక చరిత్రలు చెబుతున్నాయి. కాని అది కూడా వాస్తవం కాదు. రామరాయల వల్ల ఎంత ప్రయోజనం పొందినా అతనికి లోపల రామరాయలపై ద్వేషం, భయం రెండూ ఉన్నాయి. ఎంత స్నేహితంగా ఉన్నా అతడు హిందువు అనే భావం ఉంది. కనుకనే ముస్తాఫాఖాన్ మాటలకు అతి సునాయాసంగా తలొగ్గి అహమ్మద్‌నగర్‌తో వియ్యం పొందాడు. కనుక అతడు తన బద్ధ శత్రువులతో అతి సునాయసంగా కలిసిపోగలిగాడు. కూటమిలో అతడు ఇష్టపూర్వకంగానే చేరాడు. అందువల్లనే కూటమి ఏర్పడటానికి తమ సుల్తానే కారణం అంటే, తమ సుల్తానే కారణమని మూడు దర్బారులకు చెందిన ముగ్గురు ముస్లిం చరిత్రకారులు రాశారు. పెరిష్టా అహమ్మద్‌నగర్ అభిమాని. గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు గోల్కొండ అభిమాని. సయ్యద్ తబతబ బీజాపూరు అభిమాని. ఈ నాలుగు రాజ్యాలు తమ సైన్యాన్ని సమీకరించి రామరాయలపై యుద్ధానికి దిగారు.

తళ్లికోట యుద్ధానికి కారణాలు: తళ్లికోట యుద్ధానికి ముస్లిం చరిత్రకారులు పలు కారణాలు చెప్పారు. రామరాయలు ఇస్లాం మతాన్ని అగౌరవపరిచి మహమ్మదీయుల మనసుల్ని గాయపరచాడని వారు పేర్కొన్న మొదటి కారణం. విజయనగర సైన్యాలు అహమ్మద్‌నగరంపై దండెత్తినప్పుడు వారు చేయని ఘోరం లేదని రాశారు. మసీదులను నాశనం చేశారని, ముస్లిం స్త్రీలను చెరపట్టారని, ఖురాన్‌ను అగౌరవపరచారని, మసీదులలో తమ గుర్రాలను కట్టి వేశారని, అక్కడ పనికిమాలిన పూజలు చేశారని, తమ మూఢాచారాలను పాటించి పాటలు పాడుతూ నాట్యాలు చేశారని పెరిష్టా రాశాడు. కాని పెరిష్టా రచనలను మిగిలిన చరిత్రకారులు అంగీకరించలేదు. గోల్కొండ అజ్ఞాత చరిత్రకారుడు రామరాయల సైన్యాలు తాత్కాలికంగా మసీదు ఆక్రమించటం వల్ల అవి మైలపడ్డాయని మాత్రమే రాశాడు గాని, వారు కిరాతక చర్యలు జరిపారని రాయలేదు. హిందువుల దాడుల వల్ల అహమ్మద్‌నగర్ రాజ్యం పాడుపడిపోయిందని, చాలా మంది మహమ్మదీయులను హిందువులు చంపారని సయ్యద్ తబతబ రాశాడు. కాని ఖురాన్‌ను అవమానించినట్లుగాని, ముస్లిం స్త్రీలను చెరపట్టారని గాని రాయలేదు. కనుక పెరిష్టా రాతలు ఊహకు అందేవి కావని, అతడు ప్రతి సందర్భంలో పక్షపాతంగానే రాశాడని పండితులు

అభిప్రాయపడ్డారు. రామరాయలు తన సైన్యంలో ముస్లింలను చేర్చుకున్నాడు. వారికి తురకవాడను ఏర్పరచి అన్ని సౌకర్యాలు అమర్చాడు. గోవధను కూడా అనుమతించాడు. తన దర్బారులో ఖురాన్ ప్రతిని వేదికపై ఉంచాడు అలాంటి వాడు మసీదులను పడగొట్టి ఖురాన్‌ను అవమానించాడంటే అర్థం లేని మాట. ఒక వేళ అతడు అలా చేసి ఉంటే అహమ్మద్‌నగర్ యుద్ధం తర్వాత అతని ముస్లిం సైనిక విభాగం తల్లికోట యుద్ధానికి ముందే అతనిని వదలిపెట్టి వెళ్లిపోయేది. కాని ఆ ముస్లిం సైన్యం తల్లికోట యుద్ధంలో కూడా రామరాయల తోనే ఉంది. చివరలోనే వారు మోసగించారు. అలాగే బీజాపూరు ఆలీ ఆదిల్‌షా కూడా మొదట అహమ్మద్‌నగర్ యుద్ధంతో తానే రామరాయల స్నేహం మానుకొని ఉండేవాడు. ముస్లిం సైనికులను వధించారు, ఆస్తులను దోచుకున్నారనే ఆరోపణలు నిలవవు. కారణమేమిటంటే మధ్యయుగంలో ఏ ప్రాంతంలోనైనా ఓడిపోయిన శత్రు రాజ్యాన్ని ధ్వంసం చేసేవారు. అగ్నికి ఆహుతి చేసేవారు. కొల్లగొట్టేవారు. స్త్రీలపై అత్యాచారాలు జరిగేవి. అలాంటి యుద్ధ విధ్వంసకాండకు మత భేదాలు లేవు. ఒక హిందూ రాజు మరొక హిందూ రాజ్యంపై దండెత్తినా అలాంటి దమనకాండ జరిగేది. కృష్ణరాయలు కటకంపై దండెత్తినప్పుడు కటకాన్ని దహనం చేశాడు. ముస్లింలు హిందూ రాజ్యాలపై దాడులు చేసినప్పుడు వారు జరిపే దమనకాండకు హద్దులు ఉండేవి కావు. దేవాలయాలు నేలమట్టం అయ్యేవి. స్త్రీలపై అత్యాచారాలు జరిగేవి. హిందూ గ్రంథాలు భస్మీపటలం అయ్యేవి. ఫెరిష్టాకు ఆ దమనకాండ గుర్తుకు రాలేదు. కాని విజయనగర సైనికులు దుర్మార్గాలు చేశారని రాశాడు. అతని రాతలు వాస్తవాలు కాదు పక్షపాతంలో రాసినవని పండితుల అభిప్రాయం.

ఇక వారు చూపిన రెండవ కారణం రామరాయలు అతిగర్విష్టి అని, రాయబారులను అవమానించాడు అని రాశారు. అనేక విజయాలు సాధించిన ఏ వ్యక్తికైనా కొంత గర్వం ఉంటుంది. అతడు గర్వంతో సుల్తాన్‌లకు అపకారం ఏమీ చేయలేదు. రాయబారులను ఎవరినీ చంపలేదు. ఎలాంటి అపకారం తలపెట్టలేదు. రాయలు పరుషంగా మాట్లాడినంత మాత్రాన అది రాయబారులను అవమానించినట్లు కాదు. అది శత్రువుకు ఇచ్చిన సమాధానం. రామరాయలు తన మిత్రుడైన బీజాపూరు సుల్తాన్‌ల భూములను లాక్కున్నాడు అని రాశారు బీజాపూరు నుండి ఇట్గీర్, తనకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా ఇచ్చాడు. ఆనాడు రాయల సహాయమే లేకపోతే బీజాపూరు సుల్తాన్ తన రాజ్యాన్ని ఎప్పుడో పోగొట్టుకొని ఉండేవాడు. అంతటి సహాయానికి ఆ రెండు కోటలు అతి చిన్న కానుక.

గోల్కొండ నవాబు దగ్గర నుండి కోవెలకొండ, ఘనాపూర్, పానుగల్లు కోటలను ఆక్రమించాడు అనేది మరొక ఆరోపణ. ఇబ్రహీం కుతుబ్‌షా యుద్ధంలో ఓడిపోయి నష్టపరిహారం కింద వాటిని సమర్పించుకున్నాడు రాయలు తలచుకొంటే గోల్కొండ రాజ్యం మొత్తాన్ని కూడా కలుపుకోగలిగేవాడు. కాని రామరాయలు ఆ పని చేయలేదు. ఏ విధంగా చూసినా రామరాయలు సుల్తాన్‌ల పట్ల అన్యాయంగా ప్రవర్తించిన ఉదాహరణలు లేవు. సుల్తాన్‌లు కలహించుకొనవద్దని వారి హితువు కోరాడు. దక్కనులో యుద్ధాలు లేకుండా చేయాలని నాలుగు రాజ్యాల కూటమిని ఏర్పాటు చేశాడు. కాని సుల్తాన్‌లు వారి స్వార్థబుద్ధితో కలహాలు, ఒకరి మీద మరొకరు దాడులు చేసుకోవడం మానలేదు. సుల్తాన్‌లు సహజంగానే కలహప్రియులు. ఈర్ష్యాసూయలతో ఒకరి రాజ్య భాగాలను మరొకరు ఆక్రమించాలని నిరంతరం పోరాడుతుండేవారు. వారు తమస్వార్థం కోసం కుక్కలవలె పోరాడుతూ ఉండేవారని పోర్చుగీసు యాత్రికుడు న్యూనిజ్ రాశాడు. వారి పోరాటాలలో తనను సహాయం కోరిన వారికి సహాయం చేశాడే తప్ప వారిలో కలహాలు సృష్టించి ఎలాంటి లాభం పొందలేదు. రామరాయల వల్లనే సుల్తాన్‌లు లాభం పొందారు. సుల్తాన్‌లలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో రామరాయల వలన లబ్ధి పొందినవారే. మొదట అహమ్మద్‌నగర్ సుల్తాన్ లాభం పొంది కళ్యాణి దుర్గాన్ని పొందాడు. తర్వాత ఇబ్రహీం ఆదిల్‌షా తన అన్న చంపబోతే విజయనగరం చేరి ప్రాణాలు దక్కించుకున్నాడు. బీజాపూరు సుల్తాన్ రామరాయల వల్లనే కళ్యాణీ షోలాపూరులను పొందాడు. అందరూ రామరాయల వల్లనే లబ్ధి పొందారు. కాని వారి వల్ల రామరాయలు ఎలాంటి లాభం పొందలేదు. అన్ని లాభాలు పొంది చివరకు సుల్తాన్‌లే విశ్వాసహీనులై రామరాయలకు ద్రోహం చేశారు.

కనుక ముస్లిం చరిత్రకారులు ఆరోపించిన ఆరోపణలు అన్నీ అసత్యాలు. రామరాయలు అతి బలవంతుడైనాడు, విజయనగరం రాజ్యం అతిబలిష్టమైనది. కనుక దానిని నాశనం చేయాలనే ఏకైక సంకల్పంతో సుల్తాన్‌లు అందరూ ఏకమై కూటమిగా ఏర్పడి తల్లికోట యుద్ధం చేశారు తప్ప మరే ఇతర కారణం లేదు

విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేయడమే వారి ఏకైక లక్ష్యం.

తక్షణ కారణం: యుద్ధానికి ఏదో ఒక కారణం ఉండాలి కనుక బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన ప్రాంతాలను ఇవ్వమని కోరమని సలహా ఇచ్చారు. అతడు రాయచూరు, ముద్గల్, అంతర్వేది, ఇటీవల తాను ఇచ్చిన ఎట్గీర్, భాగల్ కోటలను తనకు స్వాధీనం చేయమని కోరుతూ రాయబారిని పంపాడు. రాయబారిని పరుషంగా మాట్లాడాడని, సుల్తాన్‌లు శత్రువులైనందున తనకేమీ నష్టం లేదని అన్నాడని పెరిష్టా రాశాడు. రాయబారి ఆలీ కోరికను చెప్పగా రామరాయలు బిగ్గరగా నవ్వి అతను వెళ్లవచ్చని ఆదేశించాడని, రాయబారి వెళ్లగానే దర్బారులో ఉన్న అమర నాయకులకేసి చూసి యుద్ధానికి సిద్ధం కండని ఆదేశించాడని కూడా రాశాడు. క్రీ.శ.1564 సెప్టెంబర్ 15వ తేదీన ఈ సంఘటన జరిగిందని నిర్ణయింపబడింది. బీజాపూర్ రాయబారి వెళ్లి సుల్తాన్‌లకు రాయల సమాధానం చెప్పగానే నలుగురు సుల్తాన్‌లు తమ సైన్యాలను సమాయత్తపరచి తళ్లికోటకు చేరారు. సుల్తాన్‌ల సైన్యం తళ్లికోట చేరిందని తెలియగానే రామరాయలు ఎలాంటి జంకూ లేకుండా తన సేనలను సమాయత్తం చేసుకొని యుద్ధానికి బయలుదేరాడు. దాంతో క్రీ.శ.1565 జనవరి నెలలో తళ్లికోట యుద్ధం జరిగింది.

సుల్తాన్‌ల సైన్యం-విడిది: నలుగురు సుల్తాన్‌ల సైన్యం ఎంత ఉందో ఎవరూ స్పష్టంగా రాయలేదు. 10 వేల అశ్వదళం, లక్షల సంఖ్యలో కాల్బలం, కొన్ని వేల మంది ధనుష్కులు, ఫిరంగిదళం, గజదళం ఉందని భావించారు. సుల్తాన్‌ల అందరి సైన్యం కలసి మూడు లక్షలు ఉంటుందని పెరిష్టా రాశాడు. గోల్కొండ సైన్యాలను ముస్తాఫాఖాన్, అహమ్మద్‌నగర్ సేనను ఇనయతుల్లా, బీజాపూరు సేనను ఖిజీర్‌ఖాన్, సేనానులు నడిపారు. వీరేగాక బీజాపూరు సేనలో యశ్వంతరావు, దేవనాయక్, భోజమల్లునాయక్, విశ్వాసరావు, కొళ్గేరావు మొదలైన మహారాష్ట్ర వీరులు కూడా ఉన్నారు. ఈ సైన్యం క్రీ.శ.1564 డిసెంబర్ 25వ తేదీన కృష్ణానది ఒడ్డున ఉన్న తళ్లికోటకు చేరి విడిశాయి. ఆ ప్రాంతం బీజాపూరు సుల్తాన్ రాజ్యంలో ఉంది కనుక అతడు మిత్రుల సైన్యాలకు భోజనాది అన్ని వసతులు ఏర్పాటు చేశాడు. అక్కడ ఆ సైన్యాలు చాలా రోజులు విడిది చేసి ఉన్నాయి. వారి విడిది కృష్ణానదికి ఉత్తరంగా కృష్ణానది, ద్రోణానదుల సంగమ ప్రాంతానికి 25 మైళ్ల దూరంలో ఉంది.

రామరాయల సైన్యం విడిది: సుల్తాన్‌ల సైన్యం తళ్లికోట వద్ద విడిది చేసిందని తెలిసిన రామరాయలు తన తమ్ముడు తిరుమల రాయలను, మరొక సేనాని ఎత్‌టుమ్ రాజును 20 వేల గుర్రపు దళాన్ని, లక్ష కాల్బలాన్ని 500 ఏనుగులను పంపి శత్రు సైన్యం కృష్ణానదిని దాటకుండా చేయమని ఆదేశించాడు. తర్వాత తన ఇంకొక తమ్ముడు వెంకటాద్రిని మరొక పెద్ద సైన్యంతో పంపాడు. తర్వాత తాను పెద్ద సైన్యాన్ని సమకూర్చాడు. సామ్రాజ్యంలోని అన్ని భాగాలకు అమరనాయకులు తమ సైన్యాలతో రావాలని ఆదేశించాడు. తూర్పున మధుర, తంజావూరు అంటే పాండ్య, చోళ మండలాల నుండి, పశ్చిమ దిశ నుండి మైసూరు, మలబారుల నుండి, సరిహద్దులలో తెలుగు, కన్నడ ప్రాంతాల నుండి అనేక మంది సామంతులు తమ సేనలతో విజయనగరం చేరారు. ఆ సైన్యం అంతా 6 లక్షల పదాతిదళం, లక్ష అశ్వదళం ఉండవచ్చని కౌటో రాశాడు. క్రీ.శ.1554 నుండి కౌటో అనే పోర్చుగీసు రచయిత ఇండియాలో ఉండి దక్కను చరిత్ర రాశాడు. తారిఖ్-ఇ-గోల్కొండ గ్రంధాన్ని రాసిన అజ్ఞాత చరిత్రకారుడు 3 లక్షల కాల్బలం, లక్ష అశ్వదళం ఉందని రాశాడు. పెరిష్టా 9 లక్షల కాల్బలం, 70 వేల గుర్రపుదళం, 2000 ఏనుగులు, 15000 ఫిరంగిదళంతో విజయనగర రాయలు వచ్చాడని రాశాడు. రామరాయలు తాను సమకూర్చుకున్న ఈ ప్రచండసేనతో కృష్ణాతీరంలోకి వచ్చిచేరాడు. తాను అక్కడికి వచ్చే లోపల తమ్ములు ఇద్దరూ శత్రువులను కృష్ణానది దాటకుండా నిరోధించారు. సుల్తాన్ సైన్యాలు కృష్ణానదికి ఉత్తరంగాను, రాయలసైన్యాలు కృష్ణానదికి దక్షిణంగా విడిశాయి. ముద్గల్ కోట నుండి ఇంగలగిరికి వెళ్లే మార్గంలో ఉన్న బోయపూరు లేక భోగాపురం అనే గ్రామం దగ్గర రాయల సైన్యం విడిది చేసిందని సీవెల్ రాశాడు. అక్కడే యుద్ధం జరిగిందని రాశాడు.

యుద్ధం ఎక్కడ జరిగింది?: ఉభయ సైన్యాలకు యుద్ధం ఎక్కడ జరిగింది అనే విషయంలో పండితుల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. సీవెల్ కృష్ణానదికి దక్షిణంగా జరిగింది అని రాశాడు. సుల్తాన్ సేనలు కృష్ణానదిని దాటి 12 మైళ్ల దూరంలో ఉన్న హుకరనది వద్దకు వచ్చాయని, అక్కడే రాయలు తన సైన్యంతో ఎదుర్కొన్నాడని అక్కడే యుద్ధం జరిగిందని పెరిష్టా రాశాడు. సయ్యద్ ఆలీ తబతబ ఇబ్రహీం జుచేరీలు కూడా సుల్తాన్ సైన్యాలు కృష్ణానదిని దాటి వచ్చాయి. కృష్ణానదికి దక్షిణంగానే యుద్ధం జరిగిందని రాశారు. ముస్లిం రచనలపై ఆధారపడి

సుల్తాన్ సేనలకు, రాయల సేనలకు కృష్ణానదికి 12 మైళ్లు దక్షిణంగా ఉన్న బన్నిహట్టి అనే గ్రామం వద్ద యుద్ధం జరిగిందని, ఆ యుద్ధం నాలుగు గంటలలోనే ముగిసిందని ఆచార్య షేర్వాణి నిర్ణయించారు. కనుక ఈ యుద్ధాన్ని తళ్లికోట యుద్ధం అనడానికి వీలులేదు. దానిని బన్నిహట్టి యుద్ధం అని పిలవాలని కూడా షేర్వాణి వ్యాఖ్యానించారు. కాని ముస్లిం చరిత్రకారుల అభిప్రాయాన్ని ఎక్కువ మంది చరిత్రకారులు అంగీకరించలేదు కారణమేమిటంటే ఈ యుద్ధం రాక్షసతంగడి అనే ప్రదేశంలో జరిగిందని హిందూ గ్రంథాలు, స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. రామరాజనబఖాయిర్ రామరాయలసేన రాక్షసి తంగడి గ్రామాల మధ్య విడిసిందని అక్కడే యుద్ధం జరిగిందని తెలుపుతోంది. నంద్యాల కైఫీయత్తు ముస్లిం సైన్యం రామరాయల సైన్యాన్ని కృష్ణానది మల్హారి లేక మలప్రభనది సంగమస్థానంలో వధించిందని, అక్కడే రామరాయలను కూడా చంపారని కూడా స్పష్టంగా పేర్కొంది. రాక్షస తంగెడ గ్రామాలు కృష్ణానదికి ఉత్తరంగా ఉన్నాయి. రెండు ఊళ్లు కృష్ణానది ఉత్తరపు ఒడ్డున హునుగొండ పరగణాలలో ఉన్నాయి. రెండు ఊళ్లకు మధ్యన 10 మైళ్ల దూరం ఉంది. తంగెడ గ్రామం కృష్ణానది, మలప్రభానదులు కలిసేచోట మలప్రభానదికి ఎదుర ఒడ్డున ఉంది. రామరాయలు ఇక్కడ కృష్ణను దాటి అవతల ఒడ్డుకు చేరాడు. యుద్ధ వ్యూహం రీత్యా ఈ ప్రదేశం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించి రామరాయలు అక్కడికి తన సైన్యాలను తరలించాడు. ఆ స్థానానికి 20 మైళ్ల దూరంలో తళ్లికోట ఉంది. అక్కడ సుల్తాన్‌ల సైన్యాలు విడిసి ఉన్నాయి. సుల్తాన్‌ల సైన్యాలు రామరాయల సైన్యాల వద్దకు వచ్చాయి. అక్కడ వారికి యుద్ధం జరిగింది. కనుకనే ఈ యుద్ధం రాక్షసి, తంగడి గ్రామాల వద్ద జరిగిందని అనేక గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. సుల్తాన్ సైన్యాలు రామరాయల రాజ్యంలోకి చొచ్చుకొనిపోయి అతనితో యుద్ధం చేశాయని గొప్పలు చెప్పడానికి ముస్లిం రచయితలు సుల్తాన్‌ల సేనలు కృష్ణనుదాటాయని, కృష్ణకు దక్షిణంగా యుద్ధం జరిగిందని రాశారు. కనుక వారి రచనలను నమ్మవలసిన పనిలేదు. తళ్లికోట వద్ద ముస్లిం సైన్యం, రాక్షసి తంగడి గ్రామాల మధ్య రాయల సైన్యం విడిశాయి. ఉభయ సైన్యాలకు యుద్ధం తళ్లికోట రాక్షసి తంగడి గ్రామాల మధ్య జరిగే ఉంటుంది. కనుక ఈ యుద్ధాన్ని రాక్షస తంగడి యుద్ధం అని గాని, తళ్లికోట యుద్ధమని గాని పిలువవచ్చును. షేర్వాణి రాసినట్టుగా ఈ యుద్ధానికి బన్నిహట్టి యుద్ధం అని పిలిచినా ఈ యుద్ధానికి మూడు పేర్లు అవుతున్నాయి. కనుక ఈ యుద్ధాన్ని తళ్లికోట యుద్ధం, రాక్షసితంగడి యుద్ధం, బన్నిహట్టి యుద్ధం అని మూడు పేర్లతో పిలువవలసి ఉంటుంది. పిసుపాటి శ్రీరామశర్మ మరొక విధంగా చెప్పారు. యుద్ధం కృష్ణానదికి ఉత్తరాన, దక్షిణాన కూడా 1565 జనవరి 24 వరకు నెల రోజులు జరిగిందని, యుద్ధం ఒకే రకంగా కాక పలు రంగాలలో జరిగిందని రాశారు. రాయల సైన్యం ఒకేచోట లేదు. కొంత సైన్యం కృష్ణానదికి దక్షిణంగా ఉండి సుల్తాన్ సైన్యాలను నదిని దాటనీయకుండా బలీయంగా కాపలా కాసింది. తన రాజ్యంలో యుద్ధం జరగకుండా ఉండటానికి ప్రధాన దళాన్ని తీసుకొని రామరాయలు కృష్ణనుదాటి రాక్షసితంగడికి చేరాడు. మొదట అక్కడ యుద్ధం జరిగింది. మొదటి యుద్ధంలో బీజాపూరు సేన పాల్గొన లేదు. గోల్కొండ అహ్మద్‌నగర్ సైన్యాలు మాత్రమే పాల్గొని ఓడిపోయాయి. తర్వాత రామరాయలతో సంధి చేసుకుంటామని రాయబారులను నమ్మించారు. రాయలు యుద్ధ విరమణ చేశాడు. అప్పుడు కృష్ణకు దక్షిణంగా కాపలా కాసే సైన్యం కూడా కాపలా వదలివేసి విశ్రమించింది. ఆ సమయంలో, సుల్తాన్‌ల సైన్యాలు కృష్ణానదిని దాటి రాయల భూభాగంలోకి వచ్చాయి ఆ విషయం రామరాయలకు తెలియదు. అతడు విందు ఆరగించేటప్పుడు చారులు వచ్చి చెప్పారని కౌటో రాశాడు. కనుక కృష్ణను దాటిన సుల్తాన్ సేనతో రామరాయల సైన్యం పోరాడింది. కనుకనే కృష్ణకు దక్షిణంగా జరిగిందని ముస్లిం చరిత్రకారులు రాసి ఉంటారు. అదే సమయంలో కృష్ణకు ఉత్తరంగా రామరాయలు రాక్షసతంగడి యుద్ధంలో పోరాటం జరిపి ఉంటాడు. బీజాపూరు సేన, సంధి చేసుకుంటామని చెప్పిన గోల్కొండ, అహ్మద్‌నగర్ సుల్తాన్‌లు తాము జయించిన భూభాగాలు తిరిగి ఇస్తామని చెప్పారని, కాని రామరాయలు తిరస్కరించారని ఫెరిష్టా రాశాడు. అంటే మోసంతో సుల్తాన్ సైన్యాలు కృష్ణను దాటాయి కనుక అక్కడ కొన్ని భూములు వారి స్వాధీనమై ఉండవచ్చును. వాటిని తిరిగి ఇస్తామని చెప్పి ఉండవచ్చును. ఈ లోపల బీజాపూరు సుల్తాన్‌ను బుజ్జగించి తిరిగి రామరాయలపై యుద్ధానికి దిగారు. ఆ యుద్ధంలోనే రామరాయలు వారికి చిక్కి వధించబడ్డాడు. కనుక కౌటో చెప్పింది చివరి యుద్ధం. అతడు చెప్పిన దానికి కేళడినృప విజయం వర్ణించిన దానికి సరిపోతుంది. ఫెరిష్టా రాసిన దానిపై ఆధారపడి షేర్వాణి యుద్ధం కృష్ణకు దక్షిణంగా బన్నిహట్టి వద్ద షేర్వాణి చెప్పిన యుద్ధం కూడా చివరి యుద్ధం అయి ఉండవచ్చును. చివరి రోజు నాలుగు గంటలు యుద్ధం జరిగిన తర్వాత రామరాయలు బందీగా

చిక్కి ఉంటాడు. కనుక ఆచార్య పీసుపాటి శ్రీరామశర్మ రాసిన ప్రకారం యుద్ధం కృష్ణకు దక్షిణంగా, ఉత్తరంగా రెండు రంగాలలో జరిగింది. ఆయన ఊహ ఎంత వరకు వాస్తవమో తెలియదు.

ఇంకా పలువురు పండితులు సుల్తాన్‌లకు, రామరాయలకు మధ్య ఎప్పుడు, ఎక్కడ, ఎంతకాలం యుద్ధం జరిగింది అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ప్రకటించారు. గ్రామ కైఫీయత్తులు రామరాజు భకైర్‌లు చెప్పే సమాచారం మీద ఆధారపడి నీలకంఠశాస్త్రి, డా నేలటూరి వెంకటరమణయ్య ఈ యుద్ధం రాక్షస, తంగెడ గ్రామాల మధ్య జరిగిందని అన్నారు. స్థానిక చరిత్రలు ఈ యుద్ధం ఆరు మాసాలు జరిగిందని చెబుతున్నాయి. ఈ యుద్ధంలో మొదట ముస్లిం సైన్యాలు ఓడి 20 మైళ్లు వెనుకకు వెళ్లాయని, అందువల్ల సుల్తాన్‌లు మోసంతో శాంతి సంప్రదింపులు జరిపి, విజయనగర సైన్యాలు అజాగ్రత్తగా ఉన్నప్పుడు ముస్లిం సైన్యాలు విజయనగర సైన్యాలను చుట్టుముట్టాయని కెళది నృపవిజయం తెలుపుతోంది. రామారాయల సైన్యంలోని ముస్లిం సైనికదళాలు యుద్ధం మధ్యలో తప్పుకొని శత్రువుల వైపు చేరిపోయారు. ఇద్దరు ముస్లిం సేనాధిపతుల నాయకత్వంలో చేరి ఒక 80 వేల సైన్యం ఉందని అంచనా. వారి సైన్యం హఠాత్తుగా రాయల సైన్యానికి ఎదురు నిలిచి చికాకుపరిచింది. విజయనగర సైన్యాలు కాల్బలం, గజదళంపై ఆధారపడగా, ముస్లిం సైన్యం అశ్వదళం, ఫిరంగి దళాల మీద ఆధారపడింది. సుల్తాన్‌ల సైన్యాలు కృష్ణను దాటి వచ్చి రాయల సైన్యాలను ఎదుర్కోవాలని భావించారు. కాని రామరాయలు వారికి ఆ అవకాశం ఇవ్వకుండా తన సైన్యాలతో కృష్ణను దాటి రాక్షస తంగడి వద్ద విడిది చేశారు. కనుక అక్కడే యుద్ధం జరిగిన స్థలాన్ని గురించి అభిప్రాయభేదాలు ఉన్నాయి.

యుద్ధ గమనం: రాబర్ట్ సీవెల్ కూడా యుద్ధం కృష్ణకు దక్షిణంగా భోగాపూర్ దగ్గర జరిగిందని భావించి యుద్ధ గమనాన్ని తన A Forgotten Empire లో వర్ణించారు. రాబర్ట్ సీవెల్ వర్ణనకు సీజర్ ఫ్రెడరిక్, కౌటోల రచనలు ఆధారాలు. క్రీ.శ.1565 జనవరి 23వ తేదీన ఉదయాన ఉభయసైన్యాలు తలబడ్డాయి. విజయనగర సైన్యం ఎడమవైపున అంటే పడమటి వైపున తిరుమల రాయలు, అతని కుమారుడు రఘునాధుడు నాయకత్వం వహించారు. వారికి ఎదురుగా బీజాపూరు సైన్యాలు నిలబడ్డాయి. కుడివైపున అంటే తూర్పువైపున వెంకటాద్రి నాయకత్వం వహించాడు. అతకి ఎదురుగా గోల్కొండ సైన్యం, ఆలీబరీద్ అహమ్మద్‌బాద్ నగరం సైన్యం నిలబడింది. తిరుమలరాయలు రఘునాధుడు బీజాపూర్ ఆలీ ఆదిల్‌షాతోను, రామరాయలు అహ్మద్‌నగర్ సుల్తాన్ హుస్సేన్ నిజాంషాతోను, వెంకటాద్రి గోల్కొండ ఇబ్రహీం కుతబ్‌షా, బీదర్ సుల్తాన్ ఆలీబరీద్‌తో తలపడ్డారు. సుల్తాన్‌ల సైన్యాలు వరుసగా ఒకే లైనులో నిలబడి మధ్యలో శతఘ్నిదళాన్ని పెట్టుకున్నారు. నిజాంషా దళానికి ముందు 6 వందల ఫిరంగులు మూడు వరుసలుగా ఒక్కొక్క వరుసకు రెండు వందలు చొప్పున నిలబెట్టారు. మొదటి వరుసలో పెద్ద ఫిరంగులు ఉన్నాయి. అవి కనిపించకుండా ఫిరంగుల ముందు రెండువేల మంది విదేశీ విలుకాండ్రను నిలబెట్టారు. రామరాయల సైన్యం ముందుకు నడిచింది. వారు దగ్గరకు రాగానే ఫిరంగుల ముందు ఉన్న విలుకాండ్రు తప్పుకున్నారు. ఫిరంగులు పేల్చబడ్డాయి. హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి విజయనగర సేనల్లో వేలాది మంది మరణించి సైన్యాలలో కలవరం ఏర్పడింది. అలాంటి స్థితిలో రామరాయలు ఏ మాత్రం జంకకుండా వారి మధ్యకు వెళ్లి చెల్లాచెదురైన సైన్యాన్ని తిరిగి సమీకరించాడని చెబుతూ కౌటో రామరాయలకు అప్పుడు 96 సంవత్సరాల వయస్సు ఉందని, కాని 30 సంవత్సరాల యువకుని లాగా అతిబలంగా ధృడ శరీరంతో ఉన్నాడని వర్ణించాడు. అప్పుడు అతడు ఒక పల్లకి ఎక్కి కూర్చొని తన సైనికులందరనీ తిరిగి సుల్తాన్‌ల సైన్యాన్ని ఢీకొనేటట్లు చేశాడని కౌటో వర్ణించాడు. అప్పుడు విజయనగర సైన్యాలకు, ముస్లిం సైన్యాలకు ముఖాముఖి యుద్ధం జరిగింది. అందులో వెంకటాద్రి గోల్కొండ సైన్యాన్ని చీల్చిచెండాడగా, తిరుమలరాయలు, అతని కుమారుడు రఘునాధుడు బీజాపూర్ సైన్యాలను చెండాడారు. కాని ఆ యుద్ధంలో రఘునాధుడు మరణించాడు. వెంకటాద్రికి కంటికి దెబ్బతగిలింది. ఆ స్థితిలో రామరాయలు తన గుడారం నుండి బంగారు నాణేలు తెప్పించి రాసులుగా పోయించి తన సైనికులకు చూపి ధైర్యసాహసాలతో పోరాడిన వారికి ఈ ధనాన్ని బహుమానంగా ఇస్తానని ప్రకటించాడు. యుద్ధరంగం మధ్యలోనే సింహాసనం వేయించుకొని కూర్చున్నాడట. అంతేగాక యుద్ధంలో నిజాంషా తలను కొట్టి తెమ్మన్నాడు. ఇబ్రహీం కుతుబ్‌షాను, అలీ ఆదిల్‌షాలను చంపకుండా బందీలుగా తీసుకురమ్మని ఆదేశించాడు. ఆ మాటలు విన్న విజయనగర సైన్యం అమిత ఉత్సాహంతో అహమ్మద్‌నగర్ సైన్యంపై దూకారు. ఆ సమయంలో మళ్లీ పల్లకీ ఎక్కి వారిని ఉత్సాహపరచాడట. అప్పుడు అహ్మద్‌నగర్ సేనానులు అక్లాస్‌ఖాన్, జల్బబిరూమీఖాన్ అనే సేనానులు ఫిరంగీలలో రాగినాణేలు, లోహపు

ముక్కలను కూర్చి విజయనగర సేనలపై పేల్చారు. ఆ పేలుళ్లకు వేలాది విజయనగర సైనికులు మరణించారు ఆ చికాకులో ఖిజీర్‌ఖాన్ అనే బీజాపూరు సేనాని 5 వేల అశ్వదళంతో విజయనగర సేనపై పడి వేల మందిని హతమార్చాడు. ఇలాంటి క్లిష్టదశలో రామరాయల సైన్యంలోని ముస్లిం సేనాధిపతులు హఠాత్తుగా సుల్తాన్ సైన్యంలో చేరిపోయారు. దాంతో విజయనగర సైన్యం యుద్ధరంగంలో తన క్రమపద్ధతిని కోల్పోయింది. ఆ స్థితిలో ఫిరంగి పేలుళ్లకు బెదిరిన నిజాంషా ఏనుగు ఒకటి రామరాయలు ఉన్న పల్లకీవైపుకు వచ్చి పల్లకీ మోసే బోయీలను తనతొండంతో కొట్టింది. వారు పల్లకీని వదలి పారిపోయారు. ఆ స్థితిలో రామరాయలు పల్లకీ దిగి దగ్గరలో ఉన్న గుర్రాన్ని ఎక్కబోతుండగా శత్రుసైనికులు వచ్చి రామరాయలను బంధించారు.

రామరాయల మరణం: రామరాయల మరణాన్ని గురించి రకరకాల అభిప్రాయాలున్నాయి. యుద్ధం మధ్యలో రామరాయల కొలువులో ఉన్న ముస్లిం సర్దార్ ఒకడు వెనుకనించి బల్లెంతో పొడిచి చంపాడని ఒక అభిప్రాయం ఉంది. రామరాయల తల నరికి బల్లానికి గుచ్చి తలను పైకెత్తి చూపగా విజయనగర సైనికులు అది చూచి పారిపోయారని వర్ణింపబడింది. నిజాముద్దీన్ అహమ్మద్ అనే సమకాలీన అనే ముస్లిం చరిత్రకారుడు యుద్ధంలో విజయం రామరాయల వైపు మొగ్గుతుండగా హుస్సేన్ నిజాంషా సైనికులు కాల్చిన ఫిరంగి గుండు రామరాయల తలకు తగిలి తల ముక్కలైందని, దాంతో విజయనగర సైనికులు భమపడి చెల్లాచెదురై పారిపోవడం మొదలుపెట్టారని, కాని వారిని పారిపోకుండా సుల్తాన్‌ల సైన్యం చుట్టుముట్టి అందరినీ సంహరించిందని రాశాడు పల్లకీ దిగి గుర్రాన్నెక్కే సమయంలో అతడు నిజాంషా సైన్యానికి చిక్కాడని, వారు అతనిని నిజాంషా ఫిరంగీదళ నాయకుని వద్దకు తీసుకెళ్లారని అతడు వెంటనే రామరాయలను నిజాంషా ముందు పడవేశాడని సయ్యద్ ఆలీ జబీరెలు రాశారు. ఆ సమయంలో హుస్సేన్ నిజాంషాకు స్నేహితుడు బేగ్ అనే వాడు రామరాయలను వెంటనే చంపు లేకపోతే అతని కుమారుడిని పిలిపించుకునే ఆలీ ఆదిల్షా వచ్చి అల్లరి చేసి రామరాయలను విడిపించుకొని వెళ్లిపోతాడని సలహా ఇచ్చాడు. దీనిని బట్టి ఆలీ ఆదిల్‌షాను మిగిలిన సుల్తాన్‌లు నమ్మలేదని తెలుస్తోంది బేగ్ సలహా విని వెంటనే హుస్సేన్ నిజాంషా స్వయంగా తన కత్తితో రామరాయల తల నరికి అల్లా నన్నేమి చేసినా ఫరవాలేదు, నా పగ తీర్చుకున్నాను అని ప్రకటించాడని సయ్యద్ ఆలీ తబతబ, జబీరేలు రాశారు. అంతేగాక రామరాయల మెడలో ఉన్న విలువైన రత్నాల హారాన్ని కూడా హుస్సేన్‌షా సంగ్రహించాడట. అదే విషయాన్ని రామరాయనభకాయిర్ కేళదినృప విజయాలు కూడా తెలుపుతున్నాయి. తల నరికిన తర్వాత దానిని బల్లానికి గుచ్చి ఎత్తి చూపారని దాంతో రామరాయలు మరణించాడని విజయనగర సైనికులు తెలుసుకొని యుద్ధ రంగం నుండి పారిపోసాగారు. కాని సుల్తాన్ సైన్యం వారి వెంటబడి ఎవరినీ వదిలిపెట్టకుండా దారుణంగా వధించిందని వారి రక్తంతో అక్కడ నది నీళ్లు ఎర్రగా మారాయని కూడా రాశాడు. సుల్తాన్ సైనికులు చుట్టుముట్టిన తర్వాత కూడా విజయనగర సైనికులు ఒకటిగా నిలిచి పోరాడటానికి ప్రయత్నించలేదు. అందరూ వారి చేతులలో దారుణంగా మరణించారు. ఈ విధంగా రామరాయల మరణంతో క్రీ.శ.1565 జనవరి 23వ తేదీన విజయనగర సైన్యాలు ఘోర పరాజయాన్ని పొందాయి. అంతటితో తళ్లికోట యుద్ధం ముగిసింది. యుద్ధంలో వెంకటాద్రి కూడా మరణించాడు. తిరుమల రాయలు తప్పించుకొని పరుగు పరుగున విజయనగరం పారిపోయాడు. యుద్ధానంతరం విజయనగర శిబిరాన్ని సుల్తాన్‌లు దోచుకున్నారు. అక్కడ 1,23,57,411 ఫణముల విలువ కలిగిన బంగారు వస్త్ర సంపద సుల్తాన్‌లకు చిక్కింది. మరణించిన సైనికుల వద్ద, ఇతర సేనా నాయకుల గుడారాలలో సుల్తాన్ సైనికులకు అపార ధనం లభించింది. ఆ దోపిడీలో సుల్తాన్ సైన్యంలోని ప్రతి ఒక్కడూ భాగ్యవంతుడయ్యాడని ఎవరు దోచుకుంది వారికే ఉండనిచ్చి ఏనుగులను మాత్రం సుల్తాన్ తీసుకున్నాడని ముస్లింలు రాశారు. ఇంకా ఆయుధాలు, వస్తు వాహనాలు, అశ్వాలు కూడా వారికి లభించాయి. ఈ విధంగా ఈ యుద్ధంలో విజయనగర సామ్రాజ్యం తన సైనికశక్తి సర్వస్వాన్ని కోల్పోయింది. ఈ యుద్ధానంతరం విజయనగరాన్ని రక్షించటానికి సైనికులే లేకుండాపోయారు. అందువల్ల తిరుమల రాయలు విజయనగరాన్ని రక్షించటం అసాధ్యమని నగరాన్ని వదిలిపెట్టి వెళ్లిపోవలసి వచ్చింది.

తళ్లికోట యుద్ధం దుర్వార్త విజయనగరం చేరింది. విజయనగర వాసులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. సుల్తాన్ సైన్యాలు నగరంలో ప్రవేశించనున్నాయని కూడా తెలిసింది. దాంతో వారు భయభ్రాంతులయ్యారు. అంతకు పూర్వం గత 200 సంవత్సరాల నుండి ఎన్నో యుద్ధాలు జరిగాయి. ఒకప్పుడు విజయనగర సేనలు గెలిచాయి. మరొకప్పుడు సుల్తాన్ సేనలు విజయాలు సాధించాయి. కాని వారెప్పుడూ విజయనగరంలోకి కాలు

పెట్టలేకపోయారు. ఈ యుద్ధానికి రామరాయలు బయలుదేరే ముందు విజయనగర సేనలు విజయంతో వస్తాయని భావించారు. కాని అంత ఘోరంగా ఓడిపోయి విజయనగరానికి ముప్పు వస్తుందని వారు కలలో కూడా ఊహించలేదు. ఇప్పుడు ఏమిచేయాలో తోచక ప్రజలు కూడా నగరం వదిలిపెట్టి పారిపోవలసిన పరిస్థితి వచ్చింది.

యుద్ధ రంగం నుండి తప్పించుకొని విజయనగరం చేరిన తిరుమలరాయలు నగరాన్ని రక్షించటం అసాధ్యమని గ్రహించాడు. కనుక అతడు విజయనగర ఖజానాలోని ధనరాసులను 1550 ఏనుగులపై ఎక్కించి అంతఃపుర జనంతోను, రాజు సదాశివ రాయలతోను పెనుగొండ కోటకు తరలి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో రాజ ఖజానా నుండి 100 మిలియన్ల స్టెర్లింగుల బంగారం, రత్నాలు, వజ్రాలు, వైఢూర్యాలు మరియు విజయనగర వజ్ర సింహాసనాన్ని పెనుగొండకు తరలించాడట. తిరుమలరాయలు విజయనగరం వదలివెళ్ళటంతో రాజధానిని రక్షించే నాధుడే లేకుండాపోయాడు. దాంతో ప్రజలు భయభ్రాంతులై తమ ధన, మాన, ప్రాణాలకు రక్షణలేక చాలా మంది ప్రజలు కూడా తమ సొత్తును తీసుకొని నగరం వదలి పారిపోయారు. పారిపోలేని వారు తమ సొత్తును భూమిలో పాతి పెట్టి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉన్నారు. మరుసటిరోజు రక్షణలేని విజయనగరంపై దొంగల ముఠాలు దాడి చేశాయి. పరిసర అడవులలో నివసించే లంబాడీలు, కురుబతెగవారు, బ్రింజారీలు మొదలైన దొంగల గుంపులు నగరంపై బడి దోపిడీ చేశాయి. షాపులు, వర్తకుల ఇళ్ళు దోచుకున్నారు. విజయనగర వీధులలో రత్నాలు రాసులుగా పోసి అమ్మే వారని కథలు ఉన్నాయి. అలాంటి అంగళ్ళు, వర్తకులు నిలువు దోపిడీకి గురయ్యారు. ఒకే రోజు నగరం ఆరుసార్లు దోపిడీకి గురైందని కౌటో రాశాడు. మూడవ రోజు సుల్తాన్ సైన్యాలు నగరం మీదకు వచ్చిపడ్డాయి. వారు 5 నెలలు తిష్టవేసి నగరాన్ని నిలువు దోపిడి చేసి నిర్దాక్షిణ్యంగా ప్రజలను వధించారు. రాజభవనాలు, దేవాలయాలను పడగొట్టారు. దేవతా విగ్రహాలను విరగ్గొట్టారు. అతి పెద్ద ఏకశిలా విగ్రహమైన ఉగ్రనరసింహుని పెదాలను విరగ్గొట్టారు. ఎంతో వైభవంగా విజయనగర రాజులు ఆసీనులై దసరా ఉత్సవాలను నిర్వహించే వేదికను పగులగొట్టారు. అనేక శిల్పాలను నాశనం చేశారు. ఏదీ వారి చేతి నుండి తప్పించుకోలేకపోయింది. రాజ ప్రాసాదాలను, దేవాలయాలను పెద్దపెద్ద గునపాలతో కూలగొట్టారు. కొన్ని శిల్పాలను విరగ్గొట్టారు. ప్రజలను, రాజ ప్రాసాదాలను దోచుకున్నారు. అడ్డం వచ్చిన వారిని కిరాతంగా వధించారు. మాటలకు వర్ణనలకు అందని విధంగా విజయనగరాన్ని నాశనం చేశారు. విజయనగర చరిత్రను రాసిన రాబర్ట్ సీవెల్ ప్రపంచ చరిత్రలో ఏ నగరం ఇంత ఆకస్మాత్తుగా ఇటువంటి ఘోర విధ్వంసానికి గురి కాలేదని తన గ్రంథంలో వర్ణించాడు. అంతులేని సిరిసంపదలతో, గొప్ప జనాభాతో అత్యంత వైభవంగా వెలిగిన విజయనగర పట్టణం ఒక్క రోజులో సర్వనాశనమైందని వర్ణించాడు. Never perhaps in the History of the world has such have been wrought and wrought so suddenly on so splendida city in the full plenitude of prosperity in one day అని రాశాడు. ఈ విధ్వంసం తర్వాత రెండు సంవత్సరాలకు సీజర్ ఫ్రెడరిక్ క్రీ.శ.1567లో విజయనగరాన్ని దర్శించి ఆ విధ్వంసాన్ని స్థానిక కైఫీయత్తులు పేర్కొన్నాయి. నిరంకుశోపాఖ్యాన గ్రంధకర్త రుద్రకవి విజయనగరం అనుభవించిన దుస్థితిని వర్ణించాడు. సుల్తాన్‌ల 6 నెలలుగా దోచుకొని బోలెడంత సంపదను పోగు చేసుకున్నారు. ఈ దోపిడీలో రాజ ఖజానాలో బీజాపూరు సుల్తాన్ ఆదిల్‌షాకు కోడిగుడ్డంత పరిమాణం కలిగిన వజ్రం దొరికిందని దానిని అతడు తన పట్టపు గుర్రం తల తురాయి దిమ్మెగా అలంకరించాడని కౌటో రాశాడు. ఈ యుద్ధం వలన సుల్తాన్‌లు అనేక విధాలుగా లాభం పొందారు. బీజాపూర్ సుల్తాన్‌కు రాయచూర్, ముద్గల్, అంతర్వేది ప్రాంతాలు వశమయ్యారు. గోల్కొండ సుల్తాన్‌కు పానుగల్లు, కోవెలకొండ, ఘనాపూర్‌లు వశమయ్యాయి. అహమ్మద్‌నగర్ నిజాంషాకు, బీదర్ బరీద్‌షాకు రాజ్యలాభం కలుగలేదు గాని దోపిడీలో కొంత ధనం లభ్యమైంది. 6 నెలల దోపిడీ తర్వాత వారిలో వారికి విభేదాలు కలిగి విజయనగరం వదిలి వారి రాజధానికి వెళ్ళిపోయారు. తళ్ళికోట యుద్ధ విజయం, రామరాయల వధను అతి ఘనకార్యంగా భావించారు. రామరాయల తలను అహ్మద్‌నగర్ సుల్తాన్ తన రాజధానికి తీసుకువెళ్ళి దానిని చెడిపోకుండా పసరు నూనెలో ఉంచి ప్రతి సంవత్సరం తళ్ళికోట విజయ ఉత్సవాలు జరిపి ఆ సందర్భంలో రామరాయల తలను ప్రదర్శించేవాడట. అతని తర్వాత అతని వారసులు 250 సంవత్సరాలు అంటే క్రీ.శ.1829 వరకు అలాగే ప్రదర్శించారని రాబర్ట్ సీవెల్ రాశాడు. బీజాపూర్ కోట దగ్గర రామరాయల రాతి తలను చెక్కించారట. దానిని బట్టి రామరాయలను జయించటం సుల్తాన్‌లు ఎంత గొప్పగా భావించారో బోధపడుతుంది.

సుల్తాన్‌లు 6 నెలలు విజయనగరాన్ని ధ్వంసం చేసినప్పటికీ అది పూర్తిగా ధ్వంసం కాలేదు చాలా దేవాలయాలు, చాలా ఇళ్లు నిలబడి ఉన్నాయి. తర్వాత పారిపోయిన ప్రజలు తిరిగి వచ్చి అక్కడ నివసించారు సుల్తాన్‌లు వెళ్లిపోయిన తర్వాత అరవీటి తిరుమలరాయలు విజయనగరానికి తిరిగి వచ్చి పట్టణాన్ని బాగుచేయించి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నించాడు. విగ్రహ ప్రతిష్ట చేసి పూజాదికాలు జరిగేటట్లు చేశాడు పోర్చుగీసు వర్తకులు విజయనగరంలో తిరుమలరాయలను దర్శించి వాణిజ్యం యథావిధిగా సాగించేటట్లు ఒప్పందం చేసుకున్నారు. కాని కుటుంబ కలహాల వల్ల తిరుమలరాయల ప్రయత్నాలు సఫలం కాలేదు. సదాశివ రాయలు తిరుమలరాయల అధికారాన్ని తిరస్కరించి అతనిని తొలగించటానికి సుల్తాన్‌ల సహాయాన్ని కోరటానికి కూడా సంశయించలేదు. ఈ కుటుంబ కలహాల ఫలితంగా రాజ్యంలోని సామంతులు స్వతంత్రాలు ప్రకటించారు ఆదోని, బంకాపురం, మధుర రాజ్యాల సామంతులు స్వతంత్రులయ్యారు. ఆ స్థితిలో విజయనగరంలో నివసించటం తనకు క్షేమం కాదని, విజయనగర వైభవాన్ని పునరుద్ధరించటం సాధ్యం కాదని నిరాశపడి మిగిలిన ప్రాంతాలకు సదాశివరాయలు రాజుగా కొనసాగాడు. అతడు 1576 వరకు జీర్ణ విజయనగరంలోనే నివసించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. వెల్లూరులో క్రీ.శ.1567 ఫిబ్రవరి 5వ తేదీ నాటి సదాశివరాయల శాసనం ఉంది పెనుగొండలో తిరుమలరాయలు స్వతంత్ర రాజ్యం ఏర్పాటు చేసినా అతడు సదాశివరాయలను తన సార్వభౌముడుగానే తన శాసనాలలో రాయించాడు. 1570 వరకు తిరుమలరాయలు సదాశివరాయలు సార్వభౌముడుగా అంగీకరించాడు. కాని 1570లో సదాశివరాయలు హత్యకు గురయ్యాడని ప్రతీతి. అందువల్ల తిరుమలరాయలు పెనుగొండలో పట్టాభిషేకం చేసుకున్నాడు. దాంతో తుళువ వంశపు అధికారం అంతమై ఆరవీటి వంశపాలన ప్రారంభమైంది. కాని సదాశివరాయలు క్రీ.శ.1576 వరకు విజయనగరంలో జీవించి ఉన్నట్లు శాసనాధారాలు ఉన్నాయి. 1576లో సదాశివరాయలు మరణించాడు. అంతటితో తుళువవంశం అంతరించింది. సదాశివరాయల మరణానంతరం విజయనగరం కూడా పాడుబడిపోయింది. ప్రజలందరూ వెళ్లిపోయారు. శిథిలమైన ఇళ్లలో పులులు, ఇతర అడవి జంతువుల నివసించాయని విదేశస్తులు రాశారు

విజయనగర సైన్యాలు - ఓటమికి కారణాలు: విజయనగర సైన్యాలకు ముస్లింలకు ఉన్నంత మత దీక్ష పట్టుదల లేవు. ముస్లిం సేనలు కక్షతో పోరాడాయి. ముస్లిం సేనలలో ఐకమత్యం హిందువులలో లేదు విజయనగర సేనలలోని ముస్లిం సైనికులు విశ్వాసంతో పోరాడలేదు. రామరాయలు యుద్ధ రంగం మధ్యలో శత్రువులకు అందుబాటులో ఉండి చాలా తప్పు చేశాడు. అతని హఠాన్మరణం అతని సైనికులకు భీతిని కలిగించి పారిపోయేలా చేసింది. ముస్లింల గుర్రపుదళం అద్భుత రణకౌశల్యం చూపింది. ముస్లింలు ఆ యుద్ధంలో కూడా మిన్నగా ఉన్నారు. ముస్లిం సేనానులు తమ సైన్యాలను సమర్థవంతంగా నడిపారు. దానికి తగిన వ్యూహాన్ని రామరాయలు పన్నలేకపోయాడు. తన రాజ్యంలో ఉన్న పోర్చుగీసు వారి సహాయాన్ని రామరాయలు సద్వినియోగం చేసుకోలేదు. ఈ కారణాల వల్ల విజయనగర సైన్యాలు ఓటమి పాలయ్యాయి.

రాక్షసతంగడి యుద్ధ ఫలితాలు: తళ్లికోట యుద్ధం విజయనగర సామ్రాజ్యానికి వజ్రఘాతం వంటిది ఈ యుద్ధం విజయనగర సామ్రాజ్యాన్ని చావు దెబ్బ తీసింది. దాంతో దక్షిణదేశంలో హిందూ అధికారం ఈ యుద్ధంతోనే అంతరించింది. కొందరు చరిత్రకారులు ఈ యుద్ధాన్ని వాటర్లూ యుద్ధంతో పోల్చారు. కాని దీనిని చాలా మంది అంగీకరించరు. కారణమేమిటంటే వాటర్లూ యుద్ధంతో నెపోలియన్ సామ్రాజ్యం అస్తమించింది. కాని ఈ యుద్ధం తర్వాత కూడా విజయనగర సామ్రాజ్యం కొనసాగింది. కనుక సధియనాథ అయ్యర్ తళ్లికోట యుద్ధం విజయనగర చరిత్రలో క్లిష్టమైన ఘట్టంగాని అత్యంత ప్రమాదకరమైంది కాదని అన్నాడు. చిలుకూరి శేషగిరిరావు తళ్లికోట యుద్ధం దక్షిణభారతదేశ చరిత్రలోనే గాక యావద్భారతదేశ చరిత్రలోనే ఒక మలుపుకు దారి తీసిన సంఘటన, ఈ యుద్ధం భారతీయ రాజకీయ వ్యవస్థలో ఒక శూన్యతను ఏర్పరచిందని వ్యాఖ్యానించాడు ఈ యుద్ధం దక్షిణ హిందూదేశపు సింహద్వారాలను బద్దలుకొట్టింది. గోల్కొండ, బీజాపూరు రాజ్యాలు దక్షిణంగా విస్తరించడానికి చక్కని అవకాశం కలిగింది. ఈ యుద్ధంతో పోర్చుగీసు వారి ప్రాబల్యం కూడా అంతరించింది. పోర్చుగీసు వారు విజయనగర చక్రవర్తుల సహాయంతో దక్షిణదేశంలో గొప్ప వ్యాపారం చేసుకొనేవారు. దీంతో వారి వ్యాపారం దెబ్బతిని బలహీనులయ్యారు. దక్షిణదేశంలో ముస్లిం మతాన్ని వ్యాప్తి చేయడానికి సుల్తాన్‌లకు మంచి అవకాశం లభించింది. కాని దాన్ని వారు వినియోగించుకోలేదు. విజయనగర సామ్రాజ్య పతనం తర్వాత సుల్తాన్‌ల ఐక్యత నశించింది. ఈ యుద్ధం తర్వాత వారికి హిందువుల భయం పోయింది. కనుక వారు తమ

బేధాలను బయటపెట్టుకొని తమలో తాము కీచులాడుకోసాగారు. అందువల్ల వారి రాజ్యాలపై దాడి చేసి ఆక్రమించగలిగారు. తళ్లికోట యుద్ధం జరగకుండా ఉంటే విజయనగర రాజ్యం అతిబలిష్టంగా ఉండేది. అందువల్ల మొగలులు దక్షిణ భారతదేశాన్ని ఆక్రమించడం అంత తేలికగా జరిగేది కాదు. విజయనగర రాజ్యం మొగల్ చక్రవర్తులను ఎదిరించి పోరాడి ఉండేది. ఈ యుద్ధం తుళువ వంశాన్ని అంతం చేసి విజయనగర సామ్రాజ్య అధికారాన్ని ఆరవీటి వంశస్తులపరం చేసింది. దాంతో తళ్లికోట యుద్ధం తర్వాత నాల్గవ వంశం అయిన అరవీటి వంశం పరిపాలన ప్రారంభమైంది.

రామరాయల స్థానం: విజయనగర సామ్రాజ్యంలో రామరాయల స్థానాన్ని, అతడు నిర్వహించిన పాత్ర, విజయనగర పతనానికి అతని బాధ్యతను గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. అతడు సామ్రాజ్యాన్ని అక్రమంగా చేజిక్కించుకున్న స్వార్థపరుడని, కుతంత్రాలలో ఆరితేరిన వాడని, దక్కను సుల్తాన్‌లలో ఒకరితో ఒకరికి తగవులు పెట్టి వారితో పక్షాలు మార్చి యుద్ధాలు చేసి వారి రాజ్య భాగాలను ఆక్రమించాడని, ముస్లింల పట్ల మతద్వేషం కనబరచి, వారి మసీదులను పాడు చేసి ఖురాన్‌ను అగౌరవపరచి ముస్లిం స్త్రీలను చెరపట్టి సుల్తాన్‌లకు ఆగ్రహం కలిగించాడని, అందువల్ల రామరాయల దుండగాలను సహించలేక వారు తమ వైరాన్ని విస్మరించి ఒకటై రాక్షసతంగడి యుద్ధంలో అతనిని వధించి ప్రతీకారంగా విజయనగరాన్ని నేలమట్టం చేశారని, అతని కుతంత్రాలే విజయనగర సామ్రాజ్య వినాశనానికి ప్రధాన కారణమని, రామరాయల ప్రవర్తనను కొందరు చరిత్రకారులు తీవ్రంగా విమర్శించారు. కాని ఈ ఆరోపణాలు వాస్తవాలుగా కనిపించవు. కారణమేమిటంటే రామరాయలకు బహమనీ సుల్తాన్‌లతో గల సంబంధాలన్నీ ముస్లిం చరిత్రకారులు రాసిన గ్రంథాల నుంచే తెలుస్తున్నాయి. ఈ ముస్లిం చరిత్రకారులు సుల్తాన్‌ల ఆశ్రితులు. వారు నిజాలు రాస్తే వారి సుల్తాన్‌లు వారి రచనలను ఆదరించకపోగా వారి కోపానికి గురికావలసి రావచ్చు. పైగా వారు కూడా ముస్లిం మత పక్షపాతులు. అందువల్ల రామరాయలు కుతంత్రికుడనే అర్థాలు వచ్చే విధంగా రాశారు. అందరికన్నా పెరిష్టా చాలా పక్షపాతంగా రాశాడు. శ్రీకృష్ణదేవరాయల తర్వాత సామ్రాజ్యంలో అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి అలాంటి స్థితిలో అతడు సాళువ నరసింహరాయల లాగా, తుళువ నరసనాయకుని లాగ వ్యవహరించి సామ్రాజ్యాన్ని కాపాడాడు. కాని అతడు సదాశివరాయలను హత్య చేయలేదు. కిరీటం ధరించలేదు. సింహాసనం అధిష్టించలేదు. తన ప్రభువును ముందు ఉంచుకొని అతని పేరుతోనే అన్నీ చేశాడు. సామంతుల తిరుగుబాట్లతో, బహమనీ సుల్తాన్ దురాక్రమణలతో కూలిపోయే సామ్రాజ్యాన్ని నిలబెట్టాడు. ఆ దృష్టితో చూసినట్లయితే అతడు అధికారాన్ని చెలాయించడం తప్పని అనిపించదు. అలాగే దక్కను సుల్తాన్‌ల మధ్య కలతలు సృష్టించి వారు యుద్ధాలకు దిగేలా చేసి వారి రాజ్యాలు ఆక్రమించాడనే వాదన కూడా వాస్తవం కాదు. వారే తమలో తాము కలహించుకొని రామరాయల సహాయం అర్థించారు. అయినా వారి మధ్య తగవులను మాన్పించి దక్కనులో శాంతిని స్థాపించడానికి తన వంతు కృషి చేశాడు. కాని అహ్మద్‌నగర్ బీజాపూరు సుల్తాన్‌లు దానిని సాగనీయలేదు. అలాగే ముస్లిం స్త్రీలను చెరబట్టాడని, ఖురాన్‌ను అవమానపరచాడని మసీదులను పాడు చేశాడని పెరిష్టా రాసిన రాతలు కూడా వాస్తవం కాదు. తన సైన్యంలో ముస్లింలు ఉన్నారు, వారికి మసీదులు కట్టించి తన దర్బారులో ఖురాన్‌ను వేదికపై ఉంచాడు. కనుక నేలటూరి వెంకటరమణయ్య దక్షిణ భారతావని నుంచి ఆసేతు నర్మదా నది వరకు భూమండలాన్ని శాసించి దక్కనులోని పంచపాదుషాలను తన ఆజ్ఞలకు బద్ధులయ్యేలా చేసి విజయనగర సామ్రాజ్యాన్ని 22 సంవత్సరాలు మహా వైభోగంతో పాలించిన విజయనగర సామ్రాజ్య చక్రవర్తి మరొకరు లేరు, అతడు వారిలో అగ్రగణ్యుడని చెప్పాలని రామరాయలను శ్లాఘించారు. అలాగే మరికొందరు కూడా ఆనాడు భారత ఖండాన్ని పాలించిన హిందూ రాజులలోకెల్లా అతిదొడ్డవాడని అన్నారు. సమకాలీన ఆంధ్రదేశం అతనిని రామరాజని, బదేరామప్పయ్య అని ఘనంగా చూసుకున్నారు. రంగప్పరాజు అనే అతడు రామరాయలు అతి ధైర్యశాలి, మహ్మదీయ విస్తరణ తరంగాలకు అడ్డుకట్టలు వేశాడు. రాజనీతి బాగా తెలిసినవాడు అని తెలిపాడు. అతడు జయాపజయాలకు బెదరనివాడు, ఎత్తులు వేయడంలో ఆరితేరిన వాడు, శత్రుభయంకరుడు, ఆశ్రితులకు కల్పవృక్షం, బంధుప్రియుడు, విద్యావంతుడు, విచక్షణా జ్ఞానసంపన్నుడు, కనుకనే ప్రజలు, అమరనాయకులు అతనిపై ప్రేమతో తమ జీవితాలు త్యాగాలు చేయదానికి ముందుకు వచ్చారు. అలాంటి రాజస గుణాలు కలిగిన వాడు కనుకనే శ్రీకృష్ణదేవరాయలు తన కుమార్తెనిచ్చి వివాహం చేసి తన అల్లునిగా చేసుకున్నాడు. రామరాయలు గొప్ప భాషాభిమాని. సర్వమత కళానిధి రాసిన రామయామాత్యుడు, వసుచరిత్ర

రాసిన భట్టుమూర్తి అతని ఆస్థాన కవులు. భట్టుమూర్తికి రామరాజ భూషణుదని పేరు. ఆ పేరును బట్టి అతదు రామరాయలకు ఎంత ప్రీతిపాత్రుడో తెలుస్తుంది. రామయామాత్యుడు రామరాయల మంత్రిగా కూడా పని చేశాడు. అతడు తాను సంస్కృతంలో రాసిన సర్వమేళ కళానిధిని రామరాయలకు అంకితం చేశాడు

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం రామరాయల తప్పిదమా?: ఎంతమాత్రం కాదు. బహమనీ రాజ్యం విజయనగరానికి జన్మవిరోధి. మొదటి నుండి విజయనగర రాజ్యాన్ని ధ్వంసం చేయడానికే తనశక్తినంతా వినియోగిస్తూ వచ్చింది. అవకాశం లభించినప్పుడు ఆ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం తప్పుకాదు కనుకనే మొట్టమొదటిసారిగా శ్రీ కృష్ణదేవరాయలు జోక్యం చేసుకున్నాడు.

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోవడం రామరాయలతోనే ప్రారంభం కాలేదు. అంతకు ముందు శ్రీకృష్ణదేవరాయలే ప్రారంభించాడు. విజయనగర చరిత్రలో మొట్టమొదటిసారిగా కృష్ణరాయలు జోక్యం చేసుకొని బీదరులో బందిఖానాలో ఉన్న బాలసుల్తాన్‌లను విడిపించి సింహాసనం ఎక్కించాడు. ఆ చర్య రాయలు విజయనగర రాజ్య రక్షణ కోసం తీసుకున్నాడు. బీదరులో కేంద్ర ప్రభుత్వం అనేది ఒకటి ఉంటే స్వతంత్రవైఖరిని అవలంబించిన బీజాపూరు, గోల్కొండ, అహ్మద్‌నగర్ సర్దారులు తమ స్వతంత్రాలు సాధించడానికి బీదరు రాజకీయలతోనే తల మునకలైపోతారు. అందువల్ల వారు విజయనగరంపై దండయాత్రలు సాగించలేరు. కనుక విజయనగర రాజ్యం శాంతంగా ఉండగలుగుతుందని కృష్ణరాయలు ఆశించాడు. బహమనీ సుల్తాన్‌ల దృష్టిని విజయనగరంపై లేకుండా చేయడమే రాయల ఏకైక లక్ష్యం. కనుక అతడు రూపొందించుకున్న విధానం కేవలం విజయనగర రాజ్యక్షేమం కోసం ఉద్దేశించినది. కాని రామరాయలు అలా చేయలేదు. అతనిలో వ్యక్తిత్వ లోపాలు ఉన్నాయి. పొగడ్తలకు పొంగిపోయి లొంగిపోయే గుణం ఉంది. అతడు తన రాజ్య క్షేమానికి కాక తన Vims and Fancies కే అధిక ప్రాధాన్యతనిచ్చాడు. ఎవరు వచ్చి తనను ఆశ్రయిస్తే వారినే సమర్థించేవాడు. అది రాజ్యానికి మంచిది కాదని ఆలోచించలేదు. ఇబ్రహీం కుతుబ్‌షా వచ్చి ఆశ్రయించగానే అతనిని ఆదరించాడు. బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తన కుమారుడు మరణించినప్పుడు పలకరించడానికి విజయనగరం వస్తే పొంగిపోయి అహ్మద్‌నగరంతో సంబంధాలు వదలుకొని బీజాపూరు వైపు చేరిపోయాడు. వీరిద్దరే చివరకు అతని పతనానికి కారకులయ్యారు బహమనీ సుల్తాన్‌లను ఏకం చేసిన వాడు ఇబ్రహీం కుతుబ్‌షా. రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఇవ్వాలని లేదంటే యుద్ధానికి సిద్ధమని కబురు పంపి యుద్ధానికి తక్షణ కారణమైనవాడు ఆలీ ఆదిల్‌షా. మొదట అతడు యుద్ధంలో చేరటానికి ఇష్టపడలేదని, మిగిలిన వారు బెదిరించి అతనిని కలుపుకున్నారని ముస్లిం చరిత్రకారులు రాశారు. కాని అది వాస్తవం కాదు. అతడే యుద్ధాన్ని ప్రారంభించాడు. ఎవరిని ఆదరించినా వారికి విజయనగరంపై ఎప్పుడూ జాలిలేదు. తమ స్వార్థాల కోసం తమ అవసరాలు తీర్చుకోవడం కోసం రామరాయలను ఆశ్రయించారే తప్ప విజయనగర రాజ్యం మీద ఎవరికీ అభిమానం లేదు. అది రామరాయలు గ్రహించలేక పోయాడు. ఎవరు ఆశ్రయించినా తన కుమారుని లాగా చూసుకుంటానని మాట ఇచ్చి వారి కోసం పోరాడేవాడు జగదేకరావుకు ఆశ్రయం ఇచ్చి గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం కుతుబ్‌సాను విరోధిని చేసుకున్నాడు. రాజకీయాలలో ఒకప్పుడు తనవాడైనా ఆశ్రయం ఇవ్వరాదు. ఏ శత్రువుకు, ఏ వ్యక్తికి ఆశ్రయం ఇస్తే వచ్చే ముప్పులు, కష్టనష్టాలు ఏమిటని రామరాయలు ఎప్పుడూ ఆలోచించలేదు.

బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోకముందు అహమ్మద్‌నగర్, బీజాపూరు రాజ్యాలు ఒక ఒప్పందం చేసుకొన్నాయి. అహ్మద్‌నగర్ రాజ్యం బీదరును ఆక్రమించేటట్లు, బీజాపూరు రాజ్యం విజయనగర రాజ్యాన్ని ఆక్రమించేటట్లు, అందుకు ఒకరికొకరు సహకారం చేసుకొనేటట్లు అంగీకరించారు. అంటే రామరాయలు బహమనీ రాజ్యాలలో జోక్యం చేసుకోకపోయినా వారి వల్ల విజయనగర రాజ్యానికి ప్రమాదం ఉందనే మాట వాస్తవం. ఆ తర్వాత వారి స్వార్థాల వల్ల విడిపోయి ఉభయులు వేరు వేరు కాలాలలో రామరాయలను ఆశ్రయించారు. కనుక అలాంటి ఆగర్భ శత్రురాజ్యాలలో జోక్యం చేసుకొని వాటిని నాశనం చేయడం తప్పుకాదు కాకపోతే రాయరాయలు ఆ రాజ్యాల విషయంలో అనుసరించవలసిన విధానాన్ని రూపొందించుకోవడంలో మాత్రమే తప్పు చేశాడు. అతడు మొదటిదశలో సరైన పద్ధతినే అనుసరించాడు. మొదటిదశలో అంటే క్రీ శ 1543 నుండి 1557 వరకు అతడు అహ్మద్‌నగరంతో స్నేహ సంభదాలు పాటించాడు. అది చాలా మంచి విధానం మన శత్రువు యొక్క శత్రువు మనకు మిత్రుడు అని చెప్పే కౌటిల్యుని నీతిని అనుసరించాడు. అందువల్ల బీజాపూరు రాజ్యం మధనపడి విజయనగరంపై దాడి చేయలేకపోయింది. అహ్మద్‌నగరం విజయనగరానికి సరిహద్దు రాజ్యం

కాదు. కనుక ఏనాడూ విజయనగర, అహ్మద్‌నగర రాజ్యాలకు యుద్ధం వచ్చే అవకాశమే లేదు. బీజాపూరు రాజ్యం సరిహద్దు రాజ్యం. రాయచూరు, అంతర్వేది కోసం ఉభయ రాజ్యాలకు వివాదం ఉంది. ఎప్పుడైనా వారి మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉంది. అలాగే అహ్మద్ నగరానికి, బీజాపూరుకు సరిహద్దు వివాదాలున్నాయి. వారిద్దరూ కలిసిపోయే ప్రశ్నేలేదు. రామరాయలు అహ్మద్‌నగర్‌తో స్నేహ సంబంధాలు ఏర్పరచుకోవడం వల్ల బీజాపూరు రాజ్యాన్ని తన రాజ్యంపై దండెత్తడానికి వీలులేకుండా చేయవచ్చు. ఆ విధానంలో ఎంతో రాజనీతి ఉంది. అహ్మద్ నగరంతో రక్షణ సంధి ఉన్నంత వరకు విజయనగర రాజ్యం సురక్షితంగా ఉంది. రాయచూరు, అంతర్వేది ప్రాంతం విజయనగర రాజ్యంలో భాగమైపోయింది. అలాంటి స్థితిలో రామరాయలు తన విధానాన్ని మార్చుకొని అహ్మద్‌నగర్‌తో తన సంబంధాలను తెంచుకొని బీజాపూరు వైపు చేరిపోవడం ఘోరమైన రాజకీయ తప్పిదం. ఆ తప్పిదమే విజయనగర రాజ్య వినాశనానికి కారణమైంది. బహమనీ రాజ్యాలు వారికి ఎన్నిభేదాలు, ఈర్ష్యాద్వేషాలు ఉన్నా అవసరమైతే ఏకం కాగలరు, విజయనగర రాజ్యాన్ని దెబ్బ తీయగలరని శ్రీకృష్ణదేవరాయల కాలం నాడే రుజువైంది. కృష్ణరాయలు బీజాపూరు సుల్తాన్‌ను రాయచూరు యుద్ధంలో ఓడించి రాయచూరు, అంతర్వేది ప్రాంతాలను ఆక్రమించిన తర్వాత సుల్తాన్‌లందరూ బీజాపూరు ప్రాంతాలను తిరిగి ఇచ్చివేయాలని, లేకపోతే తామంతా ఏకమై దండెత్తుతామని బెదిరిస్తూ రాయబారిని పంపారు. అప్పుడు వారిలో సయోధ్య లేదు. ఒకరిపై ఒకరు కత్తులు దూసుకుంటూనే ఉన్నారు. అయినా కృష్ణరాయలను బెదిరించారు. కృష్ణరాయల చేతిలో ఓటమి పొందవలసివస్తుందని మిన్నకున్నారే తప్ప ఏ మాత్రం తమకు శక్తి ఉన్నా ఆనాడే అందరూ కలసి రాయచూరుపై దండెత్తేవారు. కనుక వారి వల్ల విజయనగర రాజ్యానికి ఎప్పుడైనా ప్రమాదం ఉంది. అది గ్రహించక రామరాయలు అటు ఇటు పక్షాలు మార్చి అందరినీ విరోధులను చేసుకొని విజయనగర రాజ్యానికి అపకారం చేశాడు. అలా పక్షాలు మార్చకుండా ఉంటే వారి అంతఃకలహాలతో వారే నాశనమయ్యేవారు. కనుక రాక్షసతంగడి యుద్ధానికి రామరాయల స్వయంకృతాపరాధమే ప్రధాన కారణమని చెప్పడానికి ఎలాంటి సందేహం లేదు. తద్వారా విజయనగర వినాశనానికి కారకుడయ్యాడని చెప్పవచ్చు.

ఆరవీటి వంశం క్రీ.శ.1570-1680: రాక్షసతంగడి యుద్ధం తర్వాత విజయనగర పట్టణం ధ్వంసం అయింది. కాని విజయనగర రాజ్యం అంతరించలేదు. పూర్వవైభవం రాకపోయినప్పటికీ ఆరిపోయే దీపం మరొక 110 సంవత్సరాలు కొనసాగింది. కాని అధికారం తుళువ వంశం నుండి ఆరవీటి వంశం కైవసం చేసుకుంది. విజయనగర చరిత్రలో మూడవసారి అధికార అపహరణ జరిగింది. అయినప్పటికీ ఆరవీటివంశం మరొక శతాబ్దం పాటు విజయనగర సామ్రాజ్యాన్ని నిలబెట్టడానికి తన శాయశక్తులా పోరాడింది.

ఆరవీటి వంశస్థులు తాము చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలంలోని చిత్రావతీ నదీతీరంలో ఆరవీడనే గ్రామం ఉంది. కనుక వారు అనంతపూర్ జిల్లాకు చెందిన వారని కొందరు భావించారు. మరికొందరు ఆరవీడు కర్నూలు జిల్లాలో ఉందని భావించారు. కర్నూలు జిల్లా వారని చెప్పారు. కడపజిల్లాలోని రాయచోటి తాలూకాలో ఆరవీటిపురం ఉందని, అక్కడ కొన్ని కోట శిథిలాలు కూడా ఉన్నాయని దివాన్ బహుదూర్ టి.భుజంగరావు అన్నారు. అంతేగాక రాయలసీమ అనే పేరు ఆ ప్రాంతాలకు 16వ శతాబ్దం నుండే ఉందని కూడా అన్నారు. 16వ శతాబ్దం నాటి అనేక సామంతుల శాసనాలు ఆ ప్రాంతాన్ని రాయలసీమ అని వ్యవహరించాయని దివాన్ బహద్దూర్ తెలిపారు. ఆరవీడు ఉదయగిరి రాజ్యంలో ఉండేది. ఉదయగిరి రాజ్యాన్ని గజపతులు జయించినందువల్ల ఆరవీటి వారు తమ ప్రాముఖ్యాన్ని పోగొట్టుకున్నారు. ఉదయగిరిని శ్రీకృష్ణదేవరాయలు తిరిగి జయించడంతో ఆరవీటి వారు తిరిగి విజయనగర సామ్రాజ్యంలో ప్రాముఖ్యంలోకి వచ్చారు. కర్నూలు, కడప జిల్లాలో నేడు కూడా అనేక ఆరవీటి కుటుంబాల వారున్నారు. కనుక కడప జిల్లా వారి స్వస్థానం అని దివాన్ బహద్దూర్ నిర్ణయించారు. రాష్ట్రం నుంచి కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం వచ్చారని బి.యస్.యల్. హనుమంతరావు అన్నారు. కాని అందుకు ఆధారాలు లేవు. ఆరవీటి వారు స్వచ్ఛమైన తెలుగువారు. కాకతీయుల కాలం నుంచి వారు మాండలిక వంశంగా ఆరవీటిని పాలించినట్లు కనిపిస్తోంది. వీరిలో ఒక శాఖ నంద్యాల, కర్నూలు ప్రాంతాలను కూడా పాలించింది. ఆరవీటి వంశానికి మూల పురుషుడు తాత పిన్నమరాజు. అతడు రెండవ ప్రతాపరుద్రుని సామంతుడు. అతడు కాయస్థ అంబదేవుని సామంతుడైన చెరకురాజు రుద్రుని ఓడించాడు. అతని సోదరుడు కోగంటి రాఘవుడు ప్రతాపరుద్రుని ఆదేశం ప్రకారం కంపిలి రాజ్యంపై దండెత్తాడు. పిన్నమరాజు కుమారుడు ఆరవీటి సోమరాజు. ప్రతాపరుద్రుని

మరణానంతరం సోమరాజు కంపిలి రాజ్యంపై దండెత్తి ఏకంగా ఏడు దుర్గాలను జయించి తుగ్లక్ ప్రతినిధి అయిన మాలిక్ నెబిని ఓడించి తరిమి, అనెగొందిని ఆక్రమించాడు. అప్పటినుండి ఆరవీటి వంశానికి అనెగొంది కేంద్రం అయింది. కాని సోమరాజు తర్వాత వారు హరిహరబుక్కరాయల చేతిలో ఓడిపోయి విజయనగర సామ్రాజ్యానికి సేవలు చేశారు. ఆరవీటి సోమరాజు కుమారుడు రాఘవేంద్రుడు, అతని కుమారుడు పిన్నశౌరి, అతని కుమారుడు బుక్కరాజు. ఈ వంశంలో బుక్కరాజు గొప్పవీరుడుగా ప్రసిద్ధి చెందాడు. అతడు సాళువ నరసింహరాయల సేనాధిపతి. అతడు అనేక యుద్ధాలలో సాళువ నరసింహునికి సహాయం చేసి సాళువరాజ్య ప్రతిష్ఠాపనాచార్య అనే బిరుదు పొందాడని రామరాజ విజయం తెలుపుతోంది. అతడు ఆరవీటిలో చిన్నపాలెగాడు అయి ఉంటాడు సాళువ నరసింహుని కొలువులో చేరిన తర్వాత అతడు చంద్రగిరిలో నివసించి ఉంటాడు. అతని సేవలకు మెచ్చి అతనికి కర్నూలు జిల్లాలో జాగీరును ఇచ్చాడు. అందువల్ల బుక్క కుమారుడు రామరాజు తన మకాంను కర్నూలు జిల్లాకు మార్చాడు. అప్పటి నుండి వారి వంశస్తులు కర్నూలు ప్రాంతంలో సామంతరాజులుగా అమర నాయకులుగా కొనసాగారు. వీరనరసింహ రాయల కాలంలో ఈ వంశస్తులు కందనవోలు అమర నాయకులుగా ఉండేవారు. సుల్తాన్ ఆదవాని కోటపై దండెత్తినప్పుడు వారు కోటను కాపాడి వీరనరసింహ రాయలకు అప్పగించారు. బుక్కరాజు కుమారుడు రామరాజు. అతనికి తిమ్మరాజు, కొండరాజు, శ్రీరంగరాజు అనే ముగ్గురు కుమారులు కలిగారు. వారిలో శ్రీరంగరాజుకు ఐదుగురు కుమారులు కొనరాజు, తమ్మరాజు, రామరాజు తిరుమల దేవరాజు, వెంకటాద్రి. వీరిలో మూడవ కుమారుడైన రామరాజు శ్రీకృష్ణదేవరాయల కుమార్తెను వివాహామాడినందువల్ల అతనికి అళియ రామరాజ అనే పేరు వచ్చింది. అళియ అంటే కన్నడభాషలో అల్లుడు అని అర్థం. ఆరవీటి వంశస్థుడైనందున ఆరవీటి రామరాజు అని కూడా పిలిచేవారు. ఇతడు కృష్ణరాయల కుమార్తెను వివాహమాడినందువల్ల ఈ పునాది వేసినవాడు రామరాయలే. అతడు సదాశివరాయలను రాజును చేసి సర్వాధికారియై 22 సంవత్సరాలు విజయనగర రాజ్య చక్రాన్ని తిప్పాడు. అప్పటి నుండే విజయనగర అధికారం ఆరవీటి వంశస్తుల చేతిలోకి వచ్చింది. కాని అతడు సింహాసనం అధిష్టంచలేదు. తళ్లికోట యుద్ధంలో అతడు మరణించాడు. కనుక అతని తమ్ముడు తిరుమలరాయలు విజయనగర సామ్రాట్టు సదాశివరాయల రక్షణను చేపట్టి రాజ్యాధికారాన్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆరవీటి వంశానికి తుళువ వంశంతో వివాహబంధం ఉన్నందువల్ల వారి వారసత్వాన్ని ఎవరూ వ్యతిరేకించలేకపోయారు. తర్వాత తానే క్రీ.శ.1570లో పెనుగొండలో పట్టాభిషేకం చేసుకున్నాడు. దాంతో విజయనగర సామ్రాజ్యాధికారం తుళువ వంశం నుండి ఆరవీటి వంశానికి బదిలీ అయింది. విజయనగరాన్ని పాలించిన నాల్గవ వంశంగా రంగంలోకి వచ్చింది.

సదాశివరాయల చివరిదశ క్రీ.శ.1565-76: తండ్రి శ్రీరంగరాయల కాలంలో తిరుమలరాయలు పెనుగొండ రాజ్యాన్ని రాజప్రతినిధిగా పాలించేవాడట. తండ్రి ఆదేశానుసారం అతడు తన సైన్యాలతో తళ్లికోట యుద్ధంలో పాల్గొన్నాడు. తళ్లికోట యుద్ధంలో తన అన్న రామరాయలు మరణించగానే తిరుమలరాయలు పరుగు పరుగున విజయనగరం చేరి రాజధానిని రక్షించడం అసాధ్యమని గ్రహించి రాజ ఖజానాను రాజ కుటుంబాన్ని రాణివాసాన్ని, రాజు సదాశివరాయలను తీసుకొని పెనుగొండ పారిపోయాడు. అందువల్ల రాజకుటుంబం రాజసంపద కాపాడబడింది. అతడు విజయనగరాన్ని రక్షించలేకపోయినా రాజ కుటుంబాన్ని, రాజ భాండాగారాన్ని శత్రువుల పాలపడకుండా కాపాడగలిగాడు. అందువల్ల రాజ్యాన్ని నిలబెట్టడానికి కొంతవరకు వీలైంది.

సుల్తాన్‌ల అరాచకాలు: తిరుమలరాయలు నిష్క్రమించిన తర్వాత సుల్తాన్‌ల సేనలు విజయనగరంలో ప్రవేశించి 5 మాసాలు తిష్టవేసి నగరాన్ని ధ్వంసం చేసి ప్రజలను వధించారు. నగరమే గాక పరిసర గ్రామాలు కూడా వారి దమనకాండకు గురయ్యాయి. రాయలసీమలోని అనేక గ్రామాలు కూడా వారి రాక్షస కృత్యాలకు బలయ్యాయి. సాధారణ ప్రజలకు సుల్తాన్‌ల సైన్యాన్ని ఎదిరించగల శక్తి లేదు. కనుక వారు తమ గ్రామాలు వదిలి అరణ్యాలలో తలదాచుకొని ముస్లిం సైన్యాలు వెళ్లిపోయిన తర్వాత తిరిగి వచ్చారు. కాని రామరాయల కాలంలో తన బంధువులకు అనేక ఉన్నతోద్యోగాలు ఇచ్చాడు. ఇప్పుడు వారందరూ తమ ఇష్టారాజ్యంగా నడువసాగారు సైన్యంలోని రామరాయల బంధువులు ఎవరినీ లెక్క చేయకుండా అవిధేయులయ్యారు. ఆ పరిస్థితులలో రాజ్యంలో అరాచకత్వం ప్రబలి ప్రజలకు శాంతి భద్రతలు లేకుండా పోయాయి. ఆ విధంగా విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1565 నుండి 1570 వరకు ఐదారు సంవత్సరాలు సంక్షోభానికి గురైంది. పరిస్థితులన్నీ అస్తవ్యస్తంగా మారాయి.

పెదతిరుమలయ్య కుట్ర: అలాంటి పరిస్థితులలో రాజ్యాన్ని అదుపులోకి తీసుకురావాలని తిరుమలరాయలు చక్రవర్తి అయిన సదాశివరాయలను తీసుకొని క్రీ.శ.1568వ సంవత్సరంలో విజయనగరం వచ్చాడు. అతడు రాగానే తళ్లికోట యుద్ధం తర్వాత తమ వ్యాపారాన్ని పోగొట్టుకున్న పోర్చుగీసు వారు విజయనగరం వచ్చి తిరుమలరాయలను కలసి పూర్వం లాగా వ్యాపారసంధి చేసుకొని ఉభయులు ఒకరినొకరు రక్షించుకుందామని కోరారు. తిరుమల రాయలు అందుకు అంగీకరించాడు. అప్పటికే పారిపోయిన ప్రజలు చాలా వరకు విజయనగరం చేరుకున్నారు. రామరాయల కుమారులు విజయనగరంలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. తిరుమల రాయలు విజయనగరం రాగానే ఆరవీటి కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. రామరాయలు పెద్ద కుమారుడు కృష్ణప్ప తళ్లికోట యుద్ధంలో మరణించాడు. రెండవ కుమారుడు పెదతిమ్మ లేక పెదతిరుమలుడు తన తండ్రి తర్వాత అధికారం తనకు రావాలన్నాడు. సదాశివరాయల సంరక్షకత్వాన్ని తాను నిర్వహించాలని భావించాడు. దాంతో సేనాధిపతులలో చీలిక వచ్చింది. ఎక్కువ మంది పెదతిరుమలను సమర్థించారు. కొంత మంది తిరుమలరాయలను సమర్థించారు. వారిలో ఇమ్మడి జగదేకరావు ముఖ్యుడు. తర్వాత తిరుమల రాయలు సింహాసనం అధిష్టించడానికి తాను సహాయపడ్డానని చెప్పుకున్నాడు. కనుక తిరుమలరాయలను సమర్థించిన వారిలో అతిముఖ్యుడు జగదేకరావు. అయినప్పటికీ విజయనగరంలో పెదతిమ్మకే అధికమద్దతు లభించింది. కనుక పెదతిమ్మ తన పినతండ్రిని అధికారం నుండి తొలగించటానికి కుట్రలు ఆరంభించాడు. దాంతో తిరుమలరాయలు తాను విజయనగరంలో ఉండటం అంత శ్రేయస్కరం కాదని, తనకు ప్రమాదం జరిగే అవకాశముందని గ్రహించాడు. అంతేగాక విజయనగరం శత్రువులకు అతి సమీపంగా ఉంది. ఎప్పుడైనా సుల్తాన్‌లు దండెత్తవచ్చునని, శిథిలమైన ఆ నగరాన్ని పునరుద్ధరించి పూర్వవైభవానికి తీసుకురావడం కూడా తనకు సాధ్యం కాదని భావించాడు. కనుక తిరిగి పెనుగొండ వెళ్లిపోదామని సదాశివరాయలను తనతో రమ్మన్నాడు. కాని సదాశివరాయలు పెనుగొండ రావడానికి తిరస్కరించాడు. దాంతో తిరుమలరాయలు క్రీ.శ.1568లోనే పెనుగొండకు తిరిగి వెళ్లిపోయాడు. విజయనగరంలో సదాశివరాయల పేరుతో పరిపాలన కొనసాగింది. బహుశా పెద తిరుమలయ్య అధికారం నెరపి ఉండవచ్చును. పెనుగొండలో తిరుమల రాయలు పరిపాలన చేశాడు. కాని క్రీ.శ 1570 వరకు సదాశివరాయల పేరుతోనే రాజ్యపాలన చేశాడు. పెనుగొండలో పరిపాలన చేసిన పినతండ్రి తిరుమల రాయల అధికారాన్ని అంతం చేయాలని పెద తిరుమలయ్య బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా సహాయం కోరాడు.

సామంతుల తిరుగుబాటు క్రీ.శ.1568-70: ఈ స్థితిలో రాజకుటుంబంలోని అనైక్యతను గ్రహించిన సామంతులు స్వతంత్ర వైఖరిని అవలంబించారు. ఎవరికి వారు స్వంత రాజ్యాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రయత్నాలు ఆరంభించారు. అలాంటి వారిలో ఆదవాని కోట అధిపతి కోనేటి కొండరాజు మొదటివాడు. అతడు క్రీ.శ.1568లో స్వతంత్రం ప్రకటించాడు. తర్వాత బంకాపూర్ పాలకుడు వెలపరే కూడా స్వతంత్రం ప్రకటించాడు. ఇదే సమయంలో దక్షిణదేశంలో అంటే ద్రావిడ దేశంలో కూడా స్వతంత్ర ఉద్యమాలు ప్రారంభం అయ్యాయి. తిరువడి దేశానికి అధిపతిగా ఉన్న విశ్వనాధనాయకుని కుమారుడు కృష్ణప్ప పొరుగు ప్రాంతాలను ఆక్రమించి మధురను స్వాధీనం చేసుకొని కావేరీనదికి దక్షిణంగా ఉన్న పూర్వపు పాండ్య రాజ్యం అంతా నాదేనన్నాడు. జింజినాయకుడు కృష్ణప్ప కూడా వారిబాటలోనే నడచి తొండైమండలాన్ని ఆక్రమించాడు. ఆ స్థితిలో వారిని అణచి అదుపులోకి తీసుకువచ్చే శక్తి తిరుమలరాయలకు లేదు. దాంతో రాజ్యంలో పాలెగాళ్లు విచ్చలవిడిగా ప్రజల నుండి పన్నులు వసూలు చేయసాగారు. బందిపోటు దొంగలు విజృంభించారు. దేశంలో నేరాలు పెరిగాయి. దోపిడీ గాండ్రు, పాలెగాండ్ర దౌర్జన్యాలు, దుర్మార్గాలు ప్రబలిపోయాయి. వారిని ఎవరినీ తిరుమల రాయలు అణచలేకపోయాడు. వారి దౌర్జన్యాలకు తట్టుకోలేని ప్రజలు గ్రామాలు వదలి వెళ్లిపోసాగారు. ఈ విధంగా ఆరు సంవత్సరాలు విజయనగర రాజ్యంలో పాలకుడనేవాడు. లేకుండా పోయాడని, రాజ్యం అంతటా అరాచకత్వం తాండవించిందని ఒక కైఫీయత్తు తెలిపింది. మరొక కైఫీయత్తు దొంగలు పెట్టే బాధలకు ప్రజలు గగ్గోలు పెట్టారని పేర్కొంది. ఆ స్థితిలో తిరుగుబాటు చేసిన సామంతులు పెదతిరుమలయ్యను సమర్థించే ప్రమాదం ఉందని గ్రహించి, తిరుమలరాయలు తన స్థానాన్ని సుస్థిరం చేసుకోడానికి ద్రావిడదేశంలో సామంతులు ఆక్రమించిన భూములన్నీ వారికే చెందేటట్లు ఆమోదించాడు. దాంతో మధుర, తంజావూరు, జింజి పాలకులు సంతోషించి తిరుమల రాయలను సమర్థించి తిరుమలరాయలే విజయనగర ప్రభువుగా గుర్తించారు. దాంతో పెద

తిరుమలుడు నిస్సహాయుడయ్యాడు. తిరుమలరాయలు పరిస్థితి మెరుగుపడింది. కాని పెద తిరుమలుడు తన ప్రయత్నాన్ని విరమించకుండా బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా తనకు సహాయం చేయాలని కోరాడు.

పోర్చుగీసు వారి నుండి అశ్వాలను సంపాదించడం: బీజాపూరు సుల్తాన్ పెదతిరుమలునికి సహాయంగా వస్తాడని తిరుమలరాయలు తన సైనికశక్తిని పెంచుకోడానికి ప్రయత్నాలు చేశాడు. అంతేగాక జీర్ణించిపోతున్న సామ్రాజ్యాన్ని నిలబెట్టాలని తీర్మానించుకున్నాడు. గోవాకు కబురు చేసి మంచి గుర్రాలను తెమ్మన్నాడు అలాగే ఇతర రేవు పట్నాలకు కూడా కబురుపెట్టి వర్తకులను ఆహ్వానించాడు. వారు సరఫరా చేసే గుర్రాలకు మంచి ధర ఇస్తానని కూడా ప్రకటించాడు. పెద్ద ధరలకు ఆశపడి అనేక మంది వ్యాపారులు మంచి గుర్రాలను పెనుగొండకు తెచ్చారు. వాటిని పరీక్షించే నెపంతో రాచదొడ్డలోకి తోలారు. డబ్బు అడగ్గా తిరుమలరాయలు తర్వాత ఇస్తానన్నాడు. వాస్తవానికి అతని దగ్గర ధనం లేదు. సైన్యం అవసరం, అందునా అశ్వదళం అత్యవసరం కనుక వర్తకులకు ధనం చెల్లించకుండా ఆ గుర్రాలను తన సొంతం చేసుకున్నాడు. తర్వాత కాల్బలాన్ని కూడా తయారు చేసుకున్నాడు. ఈ విధంగా సైన్యాన్ని సమీకరించుకొంటుండగానే పెదతిరుమలుని ఆహ్వానాన్ని అందుకున్న బీజాపూరు సుల్తాన్ ఆలీ ఆదిల్‌షా పెనుగొండపై దండెత్తాడు.

బీజాపూరు దండయాత్ర: పెనుగొండ సింహాసనం నుండి తిరుమలరాయలను తొలగించి పెదతిరుమలయ్యను సింహాసనాధిష్టుని చేయడానికి ఆలీ ఆదిల్‌షా పెనుగొండపై దండెత్తాడని ఫెరిష్టా రాశాడు ఖిజీర్‌ఖాన్ అనే తన సేనాధిపతికి పెద్ద సైన్యం ఇచ్చి పెనుగొండ మీదకు పంపాడు. ఖిజీర్‌ఖాన్ వచ్చి పెనుగొండను ముట్టడించాడు. ఆలీ ఆదిల్‌ఖాన్ మరొక సైన్యంతో అనెగొందిపై దాడి చేశాడు. తిరుమలరాయలు తన సైన్యానికి సవరం చెన్నప్పను నాయకునిగా నియమించాడు. అతడు ఖిజీర్‌ఖాన్‌ను ఓడించి పెనుగొండ కోటను కాపాడాడు ఈ పోరాట సమయంలో తిరుమలరాయలు బీజాపూర్ సుల్తాన్‌కు వ్యతిరేకంగా అహమ్మద్‌నగర్ సుల్తాన్ సహాయం అర్థించాడు. తళ్లికోట యుద్ధానంతరం హుసేన్ నిజాంషా మరణించాడు. అతని కుమారుడు ముర్తజా సింహాసనానికి వచ్చాడు. కాని అతడు చిన్నవాడు. కనుక అతని తల్లి ఖున్‌జాసుల్తానా రాజ్యపాలన చేపట్టింది. తిరుమల రాయల దూతవచ్చి సహాయం అర్థించగా ఆమె అహమ్మద్‌నగర్ సేనలతో బీజాపూరు రాజ్యంపై దండెత్తింది. దాంతో తన రాజ్యాన్ని రక్షించుకోడానికి బీజాపూరు సుల్తాన్ పెనుగొండ, ఆనెగొంది ముట్టడిని విరమించి తిరిగి వెళ్లిపోయాడు. ఆదిల్‌షా తిరిగి వెళ్లిపోవడంతో పెదతిరుమలయ్య అధికారంపై తన ఆశ వదలుకొని ఉండవచ్చును. తర్వాత అతని ప్రస్తావన లేదు. తిరుమలరాయల అధికారం స్థిరపడింది.

బీజాపూరు రాజ్యంపై నిజాంషా కుతుబ్‌షాల దాడి: అహమ్మద్‌నగర్ రాణి ఖున్‌జా సుల్తాన్ తన సేనాధిపతి ముల్లా ఇనయతుల్లాను తమ సైన్యాధిపతిగా నియమించింది. అతడు గోల్కొండ, పెనుగొండ రాజ్యాల సహాయం తీసుకొని బీజాపూర్‌పై దండెత్తడం మంచిదని సలహా ఇచ్చాడు. అందువల్ల రాణి గోల్కొండ, పెనుగొండలను తనకు సహాయంగా రావాలని కోరింది. గోల్కొండ సుల్తాన్ ఇబ్రహీం తన సైన్యంతో వచ్చాడు. తిరుమలరాయలు తన కుమారునికి 10 వేల సైన్యాన్ని ఇచ్చి పంపాడు. దండయాత్ర చేసినందువల్ల తిరుమలరాయలకు లాభం కనుక అతడు రెండు లక్షల హొన్నులు యుద్ధ ఖర్చుకుగాను ఇవ్వాలని కోరింది. ఆ విషయం తెలిసిన తిరుమలరాయలు అంగీకరించలేదు. ఈ లోపల ఆలీఆదిల్‌షా వారితో సంప్రదింపులు జరిపి యుద్ధం లేకుండా పరిష్కరించుకున్నాడు తర్వాత తిరుమలరాయల కుమారుడు తన సైన్యంతో పెనుగొండ తిరిగి వచ్చాడు. తనపై యుద్ధానికి గోల్కొండ అహమ్మద్‌నగర్‌లతో కలిసినందుకు ఆలీఆదిల్‌షాకు తిరుమలరాయలపై ఆగ్రహం కలిగింది.

ఆదవానిపై దండయాత్ర: తన ఆగ్రహాన్ని చూపడానికి ఆలీ ఆదిల్‌షా క్రీ.శ.1568లో విజయనగర రాజ్యానికి చెందిన ఆదవాని కోటపై దండెత్తాడు. మరొక సేనను అతని సేనాని మలీఖాన్ నాయకత్వంలో పెనుగొండకు పంపాడు. పెనుగొండకోట వద్ద విజయనగర సేనాని సవరం చెన్నప్ప మలీఖాన్‌ను ఓడించి తరిమాడు. కాని తిరుమలరాయలు ఆదవాని కోటకు ఎలాంటి సహాయం పంపలేకపోయాడు. అందువల్ల ఆదవాని కోటలో దండనాయకుడు కోనేటి కొండమరాజు ఓడిపోయి కోటను బీజాపూర్ సుల్తాన్‌కు స్వాధీనం చేశాడు ఆ కోటను తిరిగి విజయనగర రాజులు జయించలేకపోయారు. ఆదవాని శాశ్వతంగా పోయింది. ఆదవాని కోటపై ఆలీ ఆదిల్‌షా క్రీ.శ.1568లో మాలిక్ రహిమాన్ ఖాన్ అనే వ్యక్తిని అధిపతిగా నియమించాడు. అతడు అక్కడ 39 సంవత్సరాలు పాలించాడు. అతడు మరణించిన తర్వాత అతని సమాధి నిర్మించారు. అది నేటికీ ఉంది. తర్వాత నవాబ్ సిద్ధిమసూబ్ అనే వ్యక్తి క్రీ.శ.1662లో అక్కడ జమ్మామసీదు నిర్మించాడు. దానికి చివరి బీజాపూర్ సుల్తాన్

సికిందర్ ఒక పాలరాతి ఫలకాన్ని పంపాడు. అది ఆ మసీదుపై ఇప్పుడు కూడా ఉంది. తర్వాత క్రీ.శ.1686లో ఔరంగజేబు బీజాపూరును జయించడంతో ఆదవాని మొగల్ సామ్రాజ్యంలో భాగమైంది. అతడు నవాబ్ గాజీ ఉద్దీన్‌ఖాన్ అనే అతన్ని ఆదోని గవర్నర్‌గా నియమించాడు. అప్పటి వరకు ఆదవాని బీజాపూర్ రాజ్యంలో ఉంది. నవాబ్ గాజీ ఉద్దీన్‌ఖాన్ వంశం క్రీ.శ.1752 వరకు ఆదవానిని పాలించింది. తర్వాత నిజాం ఆదవానిని బసాలత్‌జంగ్‌కు ఇచ్చాడు. అతడు 1777లో మరణించగా నిజాం ఆలీ ఆదవానిని ఇంగ్లిషు వారికి దత్తమండలాలతో పాటు ఇచ్చివేశాడు.

సదాశివరాయల దండయాత్ర క్రీ.శ.1568-75: తిరుమలరాయలు బీజాపూర్ సుల్తాన్‌తో పోరాటం సాగించినప్పుడు సదాశివరాయలు విజయనగరం నుండి సేనతో బయలుదేరి ద్రావిడ దేశంపై దండెత్తి తిరుగుబాటు చేసిన సామంతులను ఓడించి కప్పాలు వసూలు చేశాడు. తర్వాత దేవాలయాలకు దానాలు చేశాడు. కావేరీ తీరంలోని కృష్ణాపుర గ్రామాన్ని తిరుపతిదేవునికి దానం చేసి శాసనం వేయించాడు. పెనుగొండను తిరుమల రాయలు పాలిస్తున్నా 1570 వరకు సదాశివరాయల పేరుతోనే శాసనాలు వేయించాడు. కనుక అప్పటివరకు విజయనగర రాజ్యానికి ప్రభువు సదాశివరాయలేనని స్పష్టంగా తెలుస్తోంది.

పరిపాలనా విభాగాలు: తిరుమలరాయలు ఆదవానికోటను పోగొట్టుకున్నా మిగిలిన సామ్రాజ్యాన్ని నిలబెట్టాడు. పరిపాలనా సౌలభ్యం కోసం అతడు తన రాజ్యాన్ని మూడు పెద్ద రాష్ట్రాలుగా చేశాడు. తిరుమల రాయలకు నలుగురు కుమారులు. పెద్దకుమారుడు రంగనాథ్ అంతకు ముందే మరణించాడు. మిగిలిన ముగ్గురులోని పెద్ద కుమారుడు శ్రీరంగరాయలు పెనుగొండ రాజధానిగా తెలుగు ప్రాంతానికి రాజప్రతినిధి అయ్యాడు. తర్వాత తన రాజధానిని ఉదయగిరికి మార్చాడు. శ్రీరంగపట్టణం రాజధానిగా రెండవ కుమారుడు రామరాజును కన్నడ ప్రాంతానికి రాజప్రతినిధిగా నియమించాడు. మూడవ కుమారుడు వెంకటపతిని చంద్రగిరి రాజధానిగా తమిళ దేశానికి రాజప్రతినిధిగా నియమించాడు. భాష ప్రాతిపదిక మీద ఈ విభాగాలు చేసినట్లు కనిపిస్తోంది. ఈ విభజన సామ్రాజ్యాన్ని బలహీనపరిచిందని కొందరి అభిప్రాయం. కాని అది వాస్తవం కాదు. అవి రాష్ట్రాలే గాని వేరు వేరు రాజ్యాలు కాదు. ఇవేగాక జింజి, తంజావూరు, మధుర నాయక రాజ్యాలు కూడా పరిపాలనా విభాగాలే. వారు కప్పాలు చెల్లిస్తూ సామంతులుగా పాలించారు. తిరుమల తన శక్తియుక్తులన్నింటినీ వినియోగించినట్లు కనిపిస్తోంది. తిరుమలరాయలకు వెంగళాంబ, చెన్నమదేవి అనే ఇద్దరు భార్యలు. వారిలో వెంగళాంబకు రఘునాథరాజు, శ్రీరంగరాయలు, రామరాజు, వెంకటపతి అనే కుమారులు. వారిలో పెద్దవాడు, రఘునాధుడు తళ్లికోట యుద్ధంలో మరణించాడు. మిగిలిన ముగ్గురినీ పరిపాలనలో భాగం చేసి మూడు రాష్ట్రాలకు రాజ ప్రతినిధులుగా చేశాడు.

ఆరవీటి వంశం క్రీ.శ. 1570-1680

ఆరవీటి వంశం

చంద్రుడు

తాత పిన్నమ రాజు

సోమదేవుడు

రాఘవ దేవరాజు

పిన్నశౌరి

బుక్కరాజు

రామరాజు

శ్రీరంగరాజు

కొనరాజు, తిమ్మరాజు, అళియరామరాజు, తిరుమలరాయలు, వేంకటాద్రి

రంగ (భార్య బంగారమ్మ) 1570-72 రామరాజు శ్రీరంగరాజు

పెదవేంకట (1634-42) చినవేంకట (పినవేంకట) వేంకటరాజు గోపాలరాజు

వీరవెంకట, తిరుమల, మూడవ శ్రీరంగరాయలు (క్రీ.శ. 1642-1678) (దత్తు కొడుకు)

మూడవ శ్రీరంగరాయలు క్రీ.శ. 1642-1678

రంగనాథ్ (రఘునాథ్) (తండ్రికంటే ముందే గతించాడు)

మొదటి శ్రీరంగరాయలు 1572-1586

రామరాజు 1586

రెండవ వెంకటపతియలు 1586-1614

తిరుమలరాజు, రెండవ శ్రీరంగరాయలు (రెండవ వెంకటపతి దత్తుకుమారుడు) 1614

చిక్కరాయలు (1614-1616) (జగ్గారాయుని మేనల్లుడు)

రామదేవరాయలు (1616-1630) (రెండవ శ్రీరంగరాయల కుమారుడు)

రామ

రంగ

రామ, తిరుమల

రామ, గోపాల

వీరవెంకట

వెంగన్న చిన్నరాజా రామ

పెద్దదాసా చిన్నదాసా

రామ వీరవెంకట

తిరుమల చెల్లమ్మ

నరసింహ వీరవెంకట పెద్దపంపాపతి చిన్నపంపాపతి

కేశవమ్మ రంగ తిరుమల కుమార రాఘవ

చిన్న తిరుమల లక్ష్మీదేవి

నరసింహ

వెంకట (కూతురు) కృష్ణ

సదాశివ కోదండరామ కుప్పమ్మ నరస సంపాపతిరాయ

కుమార రాఘవ

(మూడవ వెంకటపతిరాయలు (1630-1642)
అళియరామరాయల వంశస్థుడు

మూడవ శ్రీరంగరాయలు (1642-1678)

వెంకట (1678-1680)
(ఇతనితో నేటి అనెగొంది వంశం ప్రారంభమైంది)

రంగ (1680-1692)

వెంకట (1706-1716)

(రంగ (1706-1716)

మహాదేవ (1716-1724)

రంగ (1724-1729)

వెంకట (1729-1732)

రామ (1732-1739)

వెంకట (18-739-1744)

....

....

వెంకట (1791-1793)

(ఇతని కాలంలో టిప్పుసుల్తాన్ అనెగొంది రాజ్యాన్ని ఆక్రమించాడు. టిప్పు సుల్తాన్ మరణానంతరం ఈ రాజ్యం ఇంగ్లిషు వారికి వచ్చింది. వారు ఆ ప్రాంతాన్ని సైన్య సహకార పద్ధతి ప్రకారం నిజాంకు అప్పగించి అనెగొంది వంశానికి పెన్షను ఏర్పాటు చేశారు. వారి రాజ్యం పోయినప్పటికీ వారి సంతతి వారు నేడు కూడా అనెగొందిలో జీవించి ఉన్నారు.)

తిరుమల రాయలు క్రీ.శ.1570-1572

పట్టాభిషేకం క్రీ.శ.1570: తళ్లికోట యుద్ధం తర్వాత అల్లకల్లోలానికి గురైన విజయనగర సామ్రాజ్యం క్రీ.శ.1570 నాటికి స్థిమితపడింది. కనుక తిరుమలరాయలు క్రీ.శ.1570లో తన 90వ ఏట పెనుగొండలో పట్టాభిషేకం జరుపుకున్నాడు. దాంతో విజయనగర సామ్రాజ్యానికి ఆరవీటివంశం రాజవంశమైంది. అప్పటికే 90 సంవత్సరాల వృద్ధుడు కనుక పరిపాలన కుమారులకు అప్పగించాడు. అప్పటికి రాజ్యం మొత్తంలో అతని అధికారం స్థిరపడింది. సామంతులందరూ అతనిని విజయనగర ప్రభువుగా అంగీకరించి విధేయులయ్యారు.

సదాశివరాయల మరణం క్రీ.శ.1576: క్రీ.శ.1570లో తిరుమలరాయలు పట్టాభిషేకం జరుపుకొనేటప్పుడు సదాశివరాయల పరిస్థితి ఏమిటి? అతనిని క్రీ.శ.1568లో తిరుమలరాయలు చంపించి రాజ్యాన్ని వశం చేసుకున్నాడని రాబర్ట్ సీవెల్ రాశాడు. కాని తర్వాత తన అభిప్రాయం మార్చుకొని సదాశివరాయలు ఎప్పుడు మరణించిందీ తెలియదని రాశాడు. కాని 1570లో అతడు మరణించి ఉండవచ్చు లేదా అధికారాన్ని త్యజించి పరిపాలన నుండి తప్పుకొని ఉండవచ్చు అని అన్నాడు. అందువల్లనే తిరుమలరాయలు పట్టాభిషేకం చేసుకొని ఉండవచ్చు. సీజర్ ఫ్రెడరిక్, తిరుమలరాయల కుమారులలో ఒకడు క్రీ.శ.1567లో

చెరసాలలో ఉన్న సదాశివరాయలను సంహరించాడని రాశాడు. ఆ కుమారులలో చిన్నవాడైన రెండవ వెంకటపతి సదాశివరాయలను హత్య చేశాడని పుకారు ఉంది. కనుక తిరుమలరాయలను హత్య చేయలేదని, ఒకవేళ హత్యను ప్రోత్సహించాడేమో అని ఫాదర్ హీరాస్ వ్యాఖ్యానించాడు. కాని ఇవేవీ వాస్తవాలు కాదు. సదాశివరాయలు క్రీ.శ.1576 వరకు జీవించి ఉన్నట్లు శాసనాలు లభించాయి. దక్షిన ఆర్కాట్ జిల్లాలోని సెంబేడులో క్రీ.శ 1575 మే 9వ తేదీన వేయించిన ఒక శాసనం సదాశివరాయలని ప్రభువుగా పేర్కొంటోంది. కనుక అతడు అప్పటివరకు జీవించి ఉన్నాడని స్పష్టంగా భావించవచ్చును. కనుక అతడు హత్య చేయబడలేదనే తెలుస్తోంది. పైగా అతనిని హత్య చేయవలసిన అవసరంలేదు. మొదటి నుండి అంటే క్రీ.శ.1543 నుండి అతడు ఎలాంటి అధికారాన్ని చెలాయించలేదు. సర్వాధికారాలు రామరాయలకే అప్పగించాడు. చివరిదశలో ముసలితనంలో అతడు అధికారం కోసం తిరుమలునికి అడ్డు తగిలాడని భావించవలసిన పనిలేదు. కనుక హత్య చేయవలసిన ఆగత్యం లేదు కనుక ఆరవీటి వంశాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కల్పించి ఉండవచ్చును. అయితే తిరుమలరాయలు క్రీ.శ.1570లో పట్టాభిషేకం చేసుకున్నాడంటే సదాశివరాయలు జీవించి ఉండగానే అతని అధికారాన్ని తోసిరాజని పట్టాభిషేకం చేసుకొని ఉంటాడు. ఆ తర్వాత కూడా సదాశివరాయలు క్రీ.శ.1576 వరకు విజయ నగరంలోనే జీవించి 1576లో మరణించి ఉండవచ్చు. ఒకవేళ అతడు హత్యకు గురైనా 1575 మే నెల తర్వాతనే అయి ఉండాలి ఏమైనా అతడి జీవితకాలంలోనే సామ్రాజ్యాధికారం ఆరవీటి వంశస్థుల పరమైంది. అతని మరణంతో క్రీ.శ.1576లో తుళువ వంశం అంతరించింది. తిరుమలరాయలు దైవభక్తి పరుడు. అనేక దేవాలయాలకు దానాలు ఇచ్చాడు. క్రీ.శ.1569లో ఉదయగిరిలోని ఆంజనేయస్వామి దేవాలయానికి దానాలు చేశాడు. కంచి శ్రీరంగం, శేషాచల దేవాలయాలకు దానాలు చేశాడు. పెనగలూరు విప్రులకు అగ్రహారాలు ఇచ్చాడు. తిరుమల రాయలు కవిపండిత పోషకుడు. రామరాజభూషణుడనే పేరు గల భట్టుమూర్తి అతని ఆస్థాన కవి. అతడు వసుచరిత్ర అనే ప్రబంధాన్ని రాసి తిరుమలరాయలకు అంకితం ఇచ్చాడు. తిరుమలరాయలు స్వయంగా కవి. పండితుడు. జయదేవుని గీతగోవిందానికి శృతిరంజని అనే మరొక వ్యాఖ్యానాన్ని రచించాడు. అతనికి ఆంధ్రభోజ అనే బిరుదు కూడా ఉంది.

తిరుమలరాయలు కొద్దికాలంలోనే అల్లకల్లోలానికి గురైన సామ్రాజ్య పరిస్థితులను చక్కదిద్ది జీర్ణ కర్ణాటక సామ్రాజ్యానికి ఒక రూపం ఇచ్చాడు. జీర్ణ కర్ణాటక సామ్రాజ్యోద్ధారక అనే బిరుదు పొందాడు. కాని అది కృష్ణరాయల కాలం నాటి కర్ణాటక సామ్రాజ్యాం కాదు. కృష్ణరాయలు ఏకఛత్రాధిపతి. కాని తిరుమల రాయల కాలంలో అది అర్ధ సామ్రాజ్యం మాత్రమే. సామంతులు అర్ధస్వతంత్రులు. వారికి అతని పట్ల పూర్తి విధేయతగాని ప్రభు భక్తిగాని లేవు. అయినప్పటికీ విజయనగర సామ్రాజ్యం పూర్తిగా కూలిపోకుండా నిలబెట్టి మరొక శతాబ్దం పాటు హిందూధర్మం నిలబడేటట్లు చేశాడు. పట్టాభిషేక కాలానికే తిరుమల రాయలు 90 ఏళ్ల వృద్ధుడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక్క సంవత్సరం పాలించి క్రీ.శ.1571లో పరిపాలన కుమారులకు అప్పగించి విశ్రాంతి పొందాడు. తర్వాత క్రీ.శ.1572లో తన 92వ ఏట మరణించాడు.

మొదటి శ్రీరంగరాయలు క్రీ.శ.1572-1585: తిరుమలరాయల తర్వాత అతని పెద్దకుమారుడు శ్రీ రంగారాయలు రాజ్యభారం చేపట్టాడు. గంగాధర రామేశ్వరుని దేవాలయ స్థంభాలపైన చెక్కిన శాసనంలో శక 1494 అంగీరస నామ సంవత్సరం వైశాఖ మాస శుద్ధ ద్వాదశి అంటే 1572 ఏప్రిల్ 24వ తేదీన తిరుమల రాయలు పృధ్వీపాలన చేస్తున్నట్లు, అదే సంవత్సరంలో అతని పాలన ముగిసినట్లు ఉంది. కొండవీడు కైఫీయత్తు కూడా ఆ విషయాన్ని ధృవపరుస్తోంది. కనుక తిరుమలరాయలు క్రీ.శ.1572లో పరిపాలన నుండి తప్పుకొని తన పెద్ద కుమారుడు శ్రీ రంగరాయలకు పట్టాభిషేకం చేసినట్లుగా కనిపిస్తుంది. అయినప్పటికీ తిరుమలరాయలు క్రీ.శ.1578 వరకు జీవించి ఉన్నాడు. వీరప్పయ్య కాలజ్ఞానం ఆంగీరస నామ సంవత్సరం వైశాఖ శుద్ధ ద్వాదశి అంటే క్రీ.శ.1572 మే నెల 11వ తేదీన పట్టాభిషేకం జరిగినట్లు తెలుపుతోంది. చంద్రగిరి నేలిన వెంకటపతి తన అన్న శ్రీరంగరాయల సార్వభౌమాధికారాన్ని గుర్తించినట్లు క్రీ.శ.1572 జులై 9వ తేదీ శాసనం తెలుపుతోంది. పై సమాచారాన్ని బట్టి వీరప్పయ్య కాలజ్ఞానం సరైన తేదీని ఇచ్చిందని స్పష్టపడుతుంది. శ్రీరంగరాయలను శాసనాలు రాజపరమేశ్వర శ్రీ వీరప్రతాప శ్రీరంగరాయ దేవమహారాజులని పేర్కొన్నాయి. అతనికి తిరుమలదేవి, కృష్ణాంబ అనే ఇద్దరు భార్యలు ఉండేవారు. పెమ్మసాని పెదతిమ్మరాజు, తిమ్మయ, వెలుగోటి తిమ్మానాయుడు అతని మంత్రులు. మంత్రి తిమ్మయకు రాయలు గజతురగ పల్లకీలనిచ్చి గౌరవించాడు. వెంకటప్పనాయకుడు

పోషించి హిందూ సంస్కృతిని అభివృద్ధిపరచారు. ముస్లిం దండయాత్రల నుండి హిందూ సంస్కృతిని కాపాడారు. సైన్యాలను పోషించి చక్రవర్తికి సహాయంగా యుద్ధాలు చేశారు. దేశాన్ని రక్షించారు. ముఖ్యంగా విజయనగర చక్రవర్తుల కోసం ప్రాణాలకు తెగించి యుద్ధభూములలో పోరాడారు. రాజ్య రక్షణకు మూలస్తంభాలుగా నిలిచారు. ఈ విధంగా నాయంకర విధానం విజయనగర రాజ్యానికి అనేక ప్రయోజనాలను కలిగించింది.

అమరనాయక సైన్య సంఖ్య: అచ్యుతరాయల కాలంలో 6 లక్షల అమరనాయక సైన్యం ఉండేదని న్యూనిజ్ రాశాడు. రాయవాచకం 2 లక్షల కాల్బలం, 24 వేల అశ్వాలు, 120 ఏనుగులను అమరనాయకులు పోషించే వారని తెలుపుతోంది.

న్యూనిజ్ అచ్యుతదేవరాయల కాలంలో పదాతి దళాలకు అమరనాయకులే జీతాలు ఇచ్చేవారు. వారు 6 లక్షల సైన్యాన్ని పోషించేవారు. కొందరు 24 వేల గుర్రపుదళాన్ని పోషించారని వర్ణించాడు. పేస్ కూడా అమరనాయక దళాన్ని గురించి రాశాడు. వారు 10 లక్షల సైన్యాన్ని పోషించేవారని, వారు కవచదారులైన అశ్వకులు అని, అంతేగాకుండా అమరనాయకులు ఏనుగులను కూడా పోషించేవారని వివరించాడు. అమర నాయక సైన్యం విషయంలో రాయలకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. వారే పోషించి యుద్ధ సమయాలలో వచ్చి శత్రువులతో పోరాడేవారు. పేస్ కైజీతగాండ్రను గురించి కూడా రాశాడు. ఇది రాయల సొంత సైన్యం. ఈ సైన్యానికి రాయలు జీతాలు ఇచ్చేవాడు

వారసత్వ హక్కు: మొదటిలో అమరనాయకులకు వారసత్వ హక్కులు లేవు. కాని కాలక్రమేణా వారి కుమారులు సంతతి వారినే అమరనాయకులుగా నియమించినందువల్ల క్రమేపీ వారికి వారసత్వ హక్కులు ఏర్పడ్డాయి. తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర రాజ్యానికి రక్షణ లేకుండాపోయింది కనుక ఆరవీటి రాజులు ఎక్కువగా అమరనాయకులపై, సామంతరాజులపై ఆధారపడ్డారు. అందువల్ల అమరనాయకులను సరిగ్గా అదుపులో ఉంచలేకపోయారు. కనుక వారి వారసత్వ హక్కు ఇంకా బలపడిపోయింది. ఆరవీటి రాజుల బలహీనతను ఆధారంగా చేసుకొని కొందరు అమరనాయకులు స్వతంత్రాలు కూడా ప్రకటించుకున్నారు.

సామంత-మండలేశ్వర సైన్యం: సిద్ధ సైన్యం అమరనాయక సైన్యాలే గాక విజయనగర రాజులకు సామంతులు, మండలేశ్వరులు కూడా సైన్యాలను పంపేవారు. మొత్తం మీద విజయనగర చక్రవర్తులు గొప్ప సైన్యాన్ని పోషించి 3 శతబ్దాలు బహమనీ సామ్రాజ్యంతో పోరాడి దక్షిణ దేశంలోకి ముస్లిం అధికారం విస్తరించకుండా కాపాడి హైందవ ధర్మాన్ని రక్షించారు.

రాష్ట్రపాలన - దుర్గనాయకులు: పరిపాలనా సౌలభ్యం కోసం సామ్రాజ్యాన్ని రాష్ట్రాలుగా విభజించారు. రాష్ట్రాలను కూడా రాజ్యాలని పిలిచేవారు. ఉదయగిరి రాజ్యం, పెనుగొండ రాజ్యం, కొండవీటి రాజ్యం అని కూడా అనేవారు. ప్రతి రాజ్యానికి రక్షణకు ఒక బలమైన దుర్గం ఉండేది. ఆ దుర్గానికి అధిపతిని దుర్గాధ్యక్షుడు లేక దుర్గ నాయకుడు అనేవారు. అమరనాయకులను దుర్గాధిపతులుగా నియమించేవారు. పరిసర ప్రాంతాన్ని ఆ దుర్గానికి అనుసంధించేవారు. అనుసంధింపబడి ప్రాంతానికి సరిపోయే సైన్యం ఆ కోటలో అతని అధిపత్యం కింద ఉండేది. దుర్గాధిపతికి జీతం లేదు. జాగీరు ఇవ్వబడుతుంది. జాగీరును నాయకరం అని పిలిచేవారు. నాయకరం పాలెగాళ్లకు ఇచ్చిన గ్రామాలు చక్రవర్తి ఆధీనంలో ఉంటాయి. మిగిలిన గ్రామాలపై అమరనాయకులకి అధికారం ఉంటుంది. అతడు తనకు ఇచ్చిన నిర్దిష్ట సంఖ్య సైన్యాన్ని పోషించకపోతే జాగీరును రద్దు చేస్తాడు. దుర్గాధిపతి రాజధానిలో ఉండాలి. కనుక తన రాజ్యంలో పరిపాలన నిర్వహించడానికి కార్యకర్తలను ఉద్యోగులను నియమించుకుంటాడు. వారు రెవెన్యూ అధికారులుగానూ, న్యాయాధీశులుగాను వ్యవహరిస్తూ కావలిగార్లను పర్యవేక్షణ చేస్తారు.

దుర్గాలు: విజయనగర సామ్రాజ్యంలో సైన్యంతోపాటు దుర్గాలు కూడా గొప్ప పాత్రను నిర్వహించాయి. దేశ రక్షణకు దుర్గాలు అతి ప్రధానమైనవి. కనుక దుర్గ నిర్మాణంలోను, రక్షణ ఏర్పాట్లలోను అమితశ్రద్ధ తీసుకున్నారు. దుర్గనాయకులుగా అత్యంత సమర్థులను, విశ్వాసపాత్రులను నియమించారు. రాయవాచకం గిరి, స్థల, జల, వన దుర్గాలను పేర్కొంది. చుట్టూ నీరు ఉన్నా, నదుల పక్కన నిర్మించినా దానిని జలదుర్గం అని అనేవారు. పర్వతాలపై నిర్మించిన దుర్గాలను గౌరిదుర్గం అని, అరణ్యాలలో నిర్మించిన దుర్గాలను అరణ్యదుర్గం అని, మామూలు నగరాలు, పట్టణాలలో భూమిపై నిర్మించిన దుర్గాలను స్థలదుర్గాలని అనేవారు. సమకాలీన సాహిత్యం 8 రకాల దుర్గాలను వర్ణించింది. గిరి, వన, జల, కర్దమ, గంహర్య, మిశ్రక, గ్రామ, కోస్టు దుర్గాలను తెలుపుతుంది. సరిహద్దులలో

గడిదేశంలో దుర్గాలను ఎక్కువగా నిర్మించాలని శ్రీకృష్ణదేవరాయలు సూచించాడు. విజయనగర సరిహద్దుల్లో అనేక దుర్గాలున్నాయని పేస్ రాశాడు. దుర్గాల చుట్టూ దట్టమైన అడవులు పెంచేవారు. దుర్గరక్షణకు పాషాణ యంత్రాలు, దంభోళి యంత్రాలు ఉండేవని పేస్ వర్ణించాడు. శత్రువులపై రాళ్లు రువ్వే యంత్రాలను దంభోళులని అనేవారు. దుర్గాలను ఆక్రమించడానికి లగ్గలు వేసేవారట. శ్రీకృష్ణదేవరాయలు కొండవీటిని ముట్టడించినప్పుడు లగ్గలాలు వేసి కోటను పట్టుకున్నాడు. కృష్ణదేవరాయలు రాయచూరుపై దండెత్తి కోటను పట్టుకున్న విధానాన్ని న్యూనిజ్ వివరంగా రాశాడు. కాయిటూర్ దుర్గాన్ని పట్టుకోడానికి దాని చుట్టూ ఉన్న నీటిని గండ్లు పెట్టి నీరు మొత్తం పోయిన తర్వాత పట్టుకోగలిగారట. అలాగే కోటను పట్టి వ్యూహం పన్ని కోటలను ఆక్రమించాడు. సరిహద్దులలోని దుర్గాల చుట్టూ దుర్గమాటులు ఉన్నాయని కూడా పేస్ రాశాడు. దుర్గాధిపతులుగా బ్రాహ్మణులను నియమించేవారని బర్టన్ స్టెయిన్ రాశాడు. మహారాష్ట్రానికి చెందిన బ్రాహ్మణులు అనేక మంది విజయనగర రాజ్యంలో సైనికులుగా, ఉద్యోగులుగా చేరారని కూడా అతడు రాశాడు. దుర్గాధిపతులుగా బ్రాహ్మణులను నియమించాలని శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో పేర్కొన్నాడు. విజయనగర రాజులు దేవాలయాల చుట్టూ కోటల లాగా ఎత్తయిన గోడల నిర్మాణం అవసరమైతే రక్షణకు యుద్ధాలకు ఉపయోగించేవారని బర్టన్ స్టెయిన్ అభిప్రాయం వెల్లడించాడు.

బ్రాహ్మణ సేనాధిపతులు: విజయనగర కాలంలో ప్రతీ బ్రాహ్మణ స్త్రీ తన కుమారుడు దుర్గాధిపతి కావాలని కోరుకునేదని నేలటూరి వెంకటరమణయ్య రాశాడు. అచ్యుతరాయల కాలం వరకు విజయనగర రాజ్యంలో అనేక మంది బ్రాహ్మణ సేనాధిపతులు ప్రముఖ పాత్ర నిర్వహించారు. సంగమవంశ కాలంలో గోపనారయ, సోమనంద నాథుడు అనే బ్రాహ్మణ సేనానులు తమిళ దేశాన్ని జయించారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో సాళువ తిమ్మరసు సాళువ గోవిందరాజు, రాయసం కొండమరసు, రాంభట్లయ్య, సెల్లప్ప, సళువలుర నరసింహ, కుడిక మగరసయ్య, బాచరసయ్య మొదలైన బ్రాహ్మణ సేనాధిపతులు ప్రముఖపాత్ర నిర్వహించారు విజయనగర చక్రవర్తులు ఇతర పాలక కులాల ప్రాబల్యాన్ని నిరోధించడానికి బ్రాహ్మణులను అచ్యుతదేవరాయల కాలం వరకు అనేక మంది బ్రాహ్మణ సేనానులు విజయనగర రాజ్యంలో ప్రముఖపాత్ర నిర్వహించారు. కాని తళ్లికోట యుద్ధం తర్వాత ఈ పద్ధతి పోయింది. బ్రాహ్మణులను సేనాధిపతులుగా ఆరవీటి వంశస్తులు నియమించలేదు ఒక శతాబ్దం తమిళ దేశంలో బ్రాహ్మణ సేనానుల నాయకత్వం నడిచిందని బర్టన్ స్టెయిన్ అన్నాడు.

తెలుగు సేనా నాయకులు: విజయనగర సామ్రాజ్యంలో ప్రముఖపాత్ర నిర్వహించిన సేనా నాయకులలో తెలుగువారు ప్రధానమైన వారు. చోళుల కాలంలో తమిళులు ఆంధ్రదేశంలోకి వలసవచ్చారు. విజయనగర యుగంలో తెలుగువారు తమిళదేశంలో ప్రవేశించి విజయనగర రాజ్యపు అధికారాన్ని స్థిరపరచారు తెలుగు సేనాధిపతులు తమిళదేశంపై దండెత్తి సునాయాసంగా తమిళ ప్రాంతాలు గెలిచారు. విజయనగర ప్రతినిధులుగా తంజావూరు, మధుర నాయక రాజ్యాలను పాలించారు. కమ్మసేనానులైన నాగమనాయకుడు, విశ్వనాధనాయకుడు చెవ్వప్ప తమిళదేశంలోని తిరుగుబాట్లను అణచి విజయనగర అధికారాన్ని సుస్థిరంగా ప్రతిష్ఠించి విజయనగర సామ్రాజ్యానికి సుస్థిరాన్ని కలుగజేశారు.

ఫిరంగి దళం: విజయనగర విజయాలకు ఫిరంగిదళం కూడా ఒక కారణం అని బర్టన్ స్టెయిన్ అన్నాడు. బహమనీ సుల్తాన్‌లపై బుక్కరాయలు ఫిరంగిలను ఉపయోగించాడని బర్టన్ స్టెయిన్ అంటే, రామచంద్రదీక్షిత్ పోర్చుగీసు వారి సహాయంతో ఫిరంగిదళ ప్రయోగంలో నేర్పు సంపాదించి ఉంటారని వ్యాఖ్యానించాడు కాని ఈ వ్యాఖ్యాలు సరైనవని చెప్పడానికి వీలులేదు. కారణమేమిటంటే మొదటి బుక్కరాయల కాలం నాటికి మన దేశానికి పోర్చుగీసు వారు రాలేదు. అంతేగాక ఏ యుద్ధంలో కూడా విజయనగర చక్రవర్తులుగాని, బహమనీలుగాని ఫిరంగులు ఉపయోగించలేదు. అప్పటికి ఫిరంగులు భారతదేశంలోకి రాలేదు. ఏమైనా విజయనగర ప్రభువులు రాజ్య రక్షణలో గొప్ప ప్రతిభను ప్రదర్శించారని చెప్పవచ్చు.

సైన్యాల స్థితి: విజయనగర రాజులు ఎల్లప్పుడూ తమ సైన్యాలను మంచిస్థితిలో ఉండేటట్లు చూసుకొనే వారు. గుర్రాలకు, ఏనుగులకు మంచి మేత, తిండి పెట్టి అవి బలంగా ఉండేటట్లు చూసేవారు. అశ్వికులు మావటీలు, తమ గుర్రాలను, ఏనుగులను ఎంత మంచిస్థితిలో ఉంచితే అంత సమర్థుడైన వారుగా గుర్తింపబడే వారు. వారు ఎలాంటి గుర్రాలను, ఏనుగులను కోరినా కొని ఇచ్చేవారు. అందువల్ల ఏనుగులు, గుర్రాలు మంచిస్థితిలో ఉండేవి.

ఆయుధాలు - ముస్లిం సైనికులు: విజయనగర రాజులు అనేక రకాల కత్తులు, డాలులు వాడటమేగాక వారి వద్ద అనేక రకాల తుపాకులు ఉండేవి. ఫిరంగులు కూడా ఉండేవి, కాని తక్కువ. బహమనీ రాజుల వద్ద మంచి ఫిరంగిదళం ఉండేది. ఐరోపా యుద్ధాలలో అనుభవం ఉన్న ముస్లిం సరదారులను వారు టర్కీ మొదలైన దేశాల నుండి రప్పించి తమ సైన్యానికి శిక్షణ ఇప్పిస్తూ ఉండేవారు. వారిని సేనాధిపతులుగా చేర్చుకొనేవారు. వారి పర్యవేక్షణలో విజయనగర రాజ్యంపై దండయాత్రలు చేసేవారు. కనుక విదేశీ యుద్ధ పద్ధతులలో శిక్షణ పొందడానికి విజయనగర చక్రవర్తులు కూడా ముస్లింలను తమ సైన్యంలో చేర్చుకున్నారు. రెండవ దేవరాయల కాలం నుండి విజయనగర సైన్యంలో ముస్లింలను చేర్చుకోవడం ప్రారంభమైంది. అతని వద్ద 2 వేల మంది గల ముస్లిం దళం ఉండేదట. తర్వాత ముస్లింలను అధికంగా చేర్చుకున్నవాడు రామరాయలు. అతని కాలంలో విజయనగరంలో తురకవాడ అనే ప్రత్యేక పేట ఉండేదట. అక్కడ గోవధను కూడా అనుమతించాడట. అయినప్పటికీ ముస్లిం సైనికులు అంత విశ్వాసంగా వారిని కొలచినట్లు కనిపించదు. సైన్యాలను మంచిస్థితిలో ఉంచడానికి, యుద్ధంలో శౌర్యప్రతాపాలు చూపడానికి బహమనీలు విజయనగర చక్రవర్తులు వేరు వేరు పద్ధతులు అవలంబించారు. సేనాధిపతులు సామంతులు నిర్దిష్ట సైన్యాన్ని పోషించకపోతే వారికి ఇచ్చే ధనాన్ని తగ్గించేవారు బహమనీలు. విజయనగర చక్రవర్తులు అమరకాన్ని తీసుకొని మరొకరికి ఇచ్చేవారు. యుద్ధంలో దోపిడీ చేసిన సొత్తును సైనికులకు వదలివేసేవారు బహమనీలు. అందువల్ల ఆశతో వారి సైనికులు అద్భుతంగా పోరాడేవారు. విజయనగర చక్రవర్తులు అలా దోపిడీ సొత్తును సైనికులకు వదలివేయలేదు. పరాక్రమాలను చూపిన వారికి, విజయాలు సాధించిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించేవారు. ఇక సైన్య నిర్వహణలోను కోటలో రక్షణ విషయంలో ఉభయులూ ఒకే పద్ధతిని అవలంబించారు. కోటలో నిర్వహణకు సేనాధిపతులను నియమించారు. వారికి విజయనగర రాజులు అమరకాలు ఇస్తే, బహమనీలు జాగీరులు ఇచ్చారు. రెండూ ఒకటే. సొంత సైన్యాలకు ఉభయులూ ఖజానా నుండి జీతాలు చెల్లించారు. యుద్ధ స్కంధావారాలు, వ్యూహాలు ఒకే విధంగా ఉండేవి. యుద్ధంలో ఉభయులు శత్రు గ్రామాలను తగులబెట్టి ప్రజలను దోచుకొనేవారు. అద్దగించిన ప్రజలను చంపేవారు. విధ్వంసకాండలో ఇద్దరూ సమానులే. కాని యుద్ధ వ్యూహంలో సుల్తాన్‌లే మిగులుగా ఉండేవారు. రాయచూరు యుద్ధంలో కృష్ణదేవరాయల విజయానికి పోర్చుగీసు వారి 200 మంది సైనికులు, వారి ఫిరంగులే కారణం అని కొందరు అంటారు. లక్షల సైన్యం కలిగిన రామరాయలను రాక్షసతంగడి యుద్ధంలో తక్కువ సైన్యంతో బహమనీ సుల్తాన్‌లు సులభంగా ఓడించగలిగారు.

నౌకాదళం: విజయనగర రాజులు నౌకాదళాన్ని పోషించలేదు. రెండవ హరిహరరాయల కాలంలో పశ్చిమకోస్తాలోని గోవాచౌల్, దౌబల్ రేవులను జయించినట్లు న్యూనిజ్ రాశాడు. కాని వారిని జయించడానికి నౌకదళం అక్కరలేదు. సింహళాన్ని జయించడానికి కూడా అతడు రాశాడు. అందుకు నౌకదళం అవసరం కనుక మొదట వారు కొంత నౌకాదళాన్ని పోషించి ఉండవచ్చును. పశ్చిమతీరంలో విజయనగర నౌకదళాధిపతి తిమోజు అని పోర్చుగీసు వారి రాతలు తెలుపుతున్నాయి. అతడు హనోవర్ రాష్ట్రపాలకుడు క్రీ.శ.1510లో ఆల్బుకర్క్, బీజాపూరు సుల్తాన్ నుండి గోవారేవును జయించినప్పుడు తిమోజు వారికి సహాయపడి ఉండవచ్చును. యుద్ధానికి ముందు పోర్చుగీసు వారు కృష్ణదేవరాయల సహాయం అర్థించారు. కాని తర్వాత పశ్చిమతీరంలో పోర్చుగీసు వారు పెద్ద నౌకా శక్తిగా రూపొందారు. విజయనగర రాజులు ఎవరితోను నౌకాదళంతో పోరాడినట్లు దాఖలాలు లేవు.

ప్రధాన సైన్యాధ్యక్షులు: విజయనగర ప్రధాన సైన్యాధ్యక్షుల పేర్లు మనకు అంతగా తెలియదు. క్రీ.శ.1545వ సంవత్సరం నాటి కన్నడ శాసనం తిమ్మప్పయ్య నాయకుని పేర్కొంటోంది. అతనిని ఖండచర నాయక అని తెలిపింది. ఖండచర అంటే సైనికశాఖ. అతడు ఒక శాఖకు నాయకుడు కావచ్చును. సేనాధిపతులను కూడా నాయకులు అని పిలిచేవారు. సర్వసేనాధిపతికి దండనాయకుడు కావచ్చును. సేనాధిపతులను కూడా నాయకులు అని పిలిచేవారు. సర్వసేనాధిపతికి దండనాయకుడు, దన్నాయకుడు అని కూడా పేర్లున్నాయి. అతడు కొన్ని సందర్భాలలో సైనిక పౌరవ్యవహారాలు రెండూ నిర్వహించేవాడు. సామంతులపై అధిపత్యం కూడా వహించేవాడు. సామంత రాజ్యాలను, సామంతుల సేవలను పర్యవేక్షించేవాడు. అతడు న్యాయాధీశుడుగా కూడా వ్యవహరించేవాడని అబ్దుల్ రజాక్ రాతల వల్ల తెలుస్తోంది. అతడు రాజధానిలో నివసించేవాడు. అతని భవనం రాజభవనం వెనుక ఉండేదట. ఒక సేనాధిపతి కింద పని చేసే రౌతులు, పదాతి సైనికులు సంఖ్యను అతని హోదా నిర్ణయించేవారు. 1447 నాటి శాసనంలో 1000 రౌతులు, లక్ష కాల్బలానికి అధిపతిగా ఉన్న నాయకుడు

పేర్కొనబడ్డాడు. దండు నడిచే మార్గాలను దండమార్గం దండుత్రోవ, దండుదారి అని సదాశివరాయల కాలం నాటి రెండు శాసనాలలో రాయబడి ఉంది.

అంతఃపురాలతో యుద్ధానికి వెళ్లడం: ఆ కాలంలో యుద్ధానికి వెళ్లినా కూడా రాజులు తమ రాణులను, ఉంపుడు కత్తెలను యుద్ధ భూములకు తీసుకువెళ్లే వారు. యుద్ధాలకు కుటుంబాలతోసహా వెళ్లే ఆచారం ప్రాచీనమైనదే. చాళుక్యులు, రాష్ట్రకూటుల కాలం నుండి ఈ ఆచారం ఉంది. రాజులే కాదు, సామాన్య సైనికులు, సేనాధిపతులు కూడా తమ భార్యాబిడ్డలతో బండ్లు కట్టుకొని యుద్ధయాత్రలు చేసేవారట. అదే ఆచారం ఈ నాటికి కూడా కొనసాగిందని చెప్పవచ్చును. కృష్ణదేవరాయలు రాయచూరు యుద్ధానికి వెళ్లినప్పుడు తన జనానాతో వెళ్లాడని అతని స్కంధావారం యుద్ధభూమిగా తోచదని, ఒక పట్టణం వెలసినట్లు ఉందని సీవెల్ వర్ణించాడు. బహమనీ సుల్తాన్‌లు కూడా అలాగే తమ జనానాలతో యుద్ధ భూములకు వెళ్లేవారు. కాని స్త్రీలతో యుద్ధానికి వెళ్లడం కాలక్రమేపీ సైన్యంలో క్రమశిక్షణను పోగొట్టింది. వేశ్యలను సైన్యం వెంట తీసుకురావడమే ఈ దిగజారుడు తనానికి కారణం. భార్యాబిడ్డలతో యుద్ధాలకు రావదానికి సైనికులకు అనుమతి ఉండేది. స్త్రీలతో యుద్ధాలకు వెళ్లినందున స్త్రీలను రక్షించడం కూడా సైనికులకు అదనపు బాధ్యతగా ఉండేది.

పన్నులు - రాజ్య ఆదాయ వ్యయాలు: విజయనగర సామ్రాజ్యపు ఆదాయాన్ని తెలుసుకోడానికి కొన్ని శాసనాలు, విదేశీ యాత్రికుల రచనలు ఉపయోగపడుతున్నాయి. ఆదాయ శాఖను అఠవణ తంత్రం అని పిలిచేవారు. విజయనగర రాజ్యానికి అనేక విధాలుగా ఆదాయం వస్తూ ఉండేది. ఈ ఆదాయం ధాన్యాదాయ, సువర్ణాదాయ అనే రెండు విధాలుగా ఉండేది. సువర్ణ రూపంలో వచ్చే ఆదాయాన్ని సిద్ధాయం అనేవారు. పరాశర మాధవీయం హరిహరరాయలు పన్నులు ధనరూపంలో చెల్లించాలని ఆదేశించాడని తెలుపుతోంది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాలలో పన్నులు, సామంతుల నుంచి వచ్చే కప్పాలు, భాండారవాడ గ్రామాల నుండి వచ్చే ఆదాయం. అమరనాయకులు చెల్లించే కప్పాలు, అమరనాయకులకు వచ్చే మామూళ్లు, దర్శన కానుకలు, అధికారవర్తన, వివాహాది శుభకార్యాల సమయాలలో సామంతులు వర్తకులు రాయలకు ఆభరణాలు ధన రూపంలో చెల్లించే కానుకలు ముఖ్య ఆదాయాలని చెప్పవచ్చును. కానుకల రూపంలో రాయలకు చాలా ఆదాయం వస్తుందని పేస్ రాశాడు. మొత్తం ఆదాయాన్ని 9 రకాలుగా విభజించవచ్చు.

1. భూమిశిస్తు పన్నులు
2. ఆస్థి పన్నులు
3. వృత్తి పన్నులు
4. పరిశ్రమల పన్నులు
5. వ్యాపార వాణిజ్య సుంకాల పన్నులు
6. సామాజిక పన్నులు
7. సైనిక అవసరాల పన్నులు
8. జరిమానాల పన్నులు
9. ఇతర రకాల పన్నులు

భూమిశిస్తు: విజయనగర రాజులు వసూలు చేసిన పన్నులలో భూమిశిస్తు ప్రధానమైనది. అయితే భూమి శిస్తు అన్ని భూములకు ఒకే విధంగా లేదు. భూమిశిస్తు నిర్ణయించే ముందు ఆ భూమి ఏ తరగతికి చెందిందో తెలుసుకొని నిర్ణయించేవారు. భూములలో భాండారవాడ భూములు, అమరభూములు, దేవాలయాల భూములు, బ్రహ్మదేయాలు అనే తరగతులుండేవి. ఈ భూములన్నింటికీ ఒకే రకమైన శిస్తు ఉండేది కాదు. రకరకాలుగా శిస్తు నిర్ధారించేవారు. భాండారవాడ భూములకు ఒక రేటు, దేవబ్రాహ్మణ భూములకు మరొక రేటు ఉండేది. తిరిగి భూమి తరిసాగా, అంటే మాగాణా లేక మెట్టా అని కూడా చూసేవారు. తరి భూమికి ఒక రేటు, మెట్టభూమికి మరొక రేటు నిర్ణయించేవారు. తరి భూమికి ఉన్న నీటిసాగు వసతులను బట్టి భూమిసారాన్ని బట్టి పంట దిగుబడిని బట్టి పన్ను నిర్ణయిస్తారు. అలాగే మెట్టభూమికి కూడా వేసిన పంట, దాని దిగుబడిని బట్టి నిర్ణయించేవారు. భూమి విస్తీర్ణాన్ని కూడా నిర్ణయించే మొత్తం చెల్లించవలసిన పన్నును నిర్ణయిస్తారు. అందుకోసం ప్రతి సంవత్సరం రైతుల నుండి పన్నులు వసూలు చేయడానికి వీలుగా భూమిని కొలిపించి సర్వే చేయించారు. వేరు వేరు ప్రాంతాలలో వేరు వేరు కొలతలను ఉపయోగించారు. తెలుగు ప్రాంతాలలో మహామంత్రి తిమ్మరసు

సర్వే నిర్వహించాడని తెలుస్తోంది. తీరాంధ్రదేశంలో కేసరి పాటిగడ్డ 42'6" రేనాడులో ఒక గడ, పాకనాడులో రెండు గడలు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. మెట్ట, మాగాణి భూములేగాక తోటభూములుండేవి. అరటి, నారింజ, మామిడి మొదలైన భూములపై శిస్తు రేటు మరొక విధంగా ఉండేది. అలాగే అడవులు, కొండలు, పచ్చిక బీళ్లు ఉండేవి. అడవులలో కట్టెలు కొట్టుకున్నందుకు, ఎండుగడ్డి తెచ్చుకున్నందుకు పన్ను ఉండేది. దానిని కొండగుత్త అని అనేవారు. పచ్చికబీళ్లలో కొండలు, గుట్టలపై పశువులు మేపుకున్నందుకు పుల్లరి అనే పన్ను ఉండేది. ఈ విధంగా భూమి నాలుగు రకాలుగా ఉండేది.

1. తరి
2. మెట్ట
3. తోటభూములు
4. అడవులు, పచ్చిక బీళ్లు

ఈ నాలుగు రకాల భూములపై నాలుగు రకాలుగా ఆదాయం వచ్చేది. శాస్త్రరీత్యా పంటలో 6వ వంతు వసూలు చేయాలి. కాని రైతుల నుండి సంగోరు అంటే సగ భాగం వసూలు చేసినట్లు కనపడుతోంది. బ్రాహ్మణుల భూముల నుండి ముంగోరు అంటే 3వ వంతు వసూలు చేశారు. దేవాలయ భూములు నుండి 30వ వంతు వసూలు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా నిర్మించిన వ్యవసాయ గ్రామాలలో శిస్తు మినహాయింపు ఇచ్చేవారు. మాగాణి భూములను నీలాంబర అని, మెట్ట భూములను కాదాంబర అని అనేవారు. నీలాంబర, కాదాంబర భూములకు శిస్తులలో తేడా ఉండేది. శిస్తును ధనరూపంలో చెల్లించాలని హరిహరరాయలు ఆదేశించాడని పరాశరమాధవీయం తెలుపుతోంది అయిన్నప్పటికీ పంట భూముల మీద ధాన్యరూపంలో చెల్లించేవారు. కాని అరటి, కూరగాయలు, ఆకు తోటలపై ధనరూపంలో చెల్లించేవారు. సువర్ణాదాయాన్ని సిద్ధాయం అని కూడా అనే వారు. గ్రామంలోని పంటపొలాల వివరాలు చెల్లించవలసిన శిస్తులు గ్రామకరణాలు నమోదు చేసేవారు. ఆ దస్తరాలను కవిలెలు అని అనేవారు. ఇంకా పచ్చికబీళ్లు, కొండలు, గుట్టలపై పశువులు మేపుకున్నందుకు పుల్లరి కూడా వసూలు చేసేవారు.

ఆస్తి పన్ను లేక సంపద పన్ను: చర స్థిరాస్తులపై కూడా పన్ను వసూలు చేశారు. ఇళ్లపై ఇల్లరి అనే పన్ను విధించిబడింది. ఇళ్ల రకాలను బట్టి పన్ను ఉండేది. మేడలు, మిద్దెలు, పూరిపాకలు, వాటి స్థితిని బట్టి ఇల్లరి నిర్ణయింపబడేది. పశువులు కూడా ఆస్తిగా పరిగణింపబడేవి. కొన్ని శాసనాలలో మేకలు, ఎద్దులు, గేదెలు, గుర్రాలు, ఒంటెలపై కూడా పన్నులు వసూల చేసినట్లు తెలుపుతున్నాయి. నీటిబుగ్గలపై కూడా సంపదన్ను వసూలు చేశారు. నిధినిక్షేపాలపై కూడా సంపద పన్ను విధించేవారు.

వృత్తి పన్నులు: ఒక వృత్తిని అవలంబించినందుకు పన్ను చెల్లించాలి. దానిని వృత్తి పన్ను అనేవారు. గ్రామోద్యోగులు, పురోహితులు, కుమ్మరి, కమ్మరి, కంసాలి, వడ్రంగి, చాకలి, మంగలి, మేళగాళ్లు, పశువుల కాపరులు, చర్మకార, జంగమ మొదలైన వృత్తి పనివారి మీద పన్నులు విధించేవారు. బిచ్చగాళ్లపై కూడా గణాచారి పన్ను వసూలు చేసేవారు. కొండోజ్ అనే మంగలి కోరికపై అళియరామరాయలు మంగలి పన్ను తీసివేసాడు. వేశ్యావృత్తి అమలులో ఉండేది. వేశ్యలు కూడా వృత్తి పన్నులు చెల్లించేవారు. విజయనగరంలో వేశ్యలు చెల్లించే పన్ను విజయనగరంలో ఉండే 12 వేల మంది రక్షకభటుల జీతాలకు సరిపోయేదని పేస్ రాశాడు.

పరిశ్రమలపై పన్ను: వ్యక్తుల మీదనే గాక వారు ఉపయోగించే వస్తువుల మీద కూడా పన్ను ఉండేది. అంటే వస్తు ఉత్పత్తి పరికరాలు పరిశ్రమగా భావించారు. సాలె మగ్గాన్ని ఉపయోగిస్తాడు. మగ్గం పరిశ్రమ కింద వస్తుంది. దానిని ఉపయోగించినందుకు పన్ను. దాని మీద వచ్చే ఆదాయం వృత్తి పన్ను. అంటే పరికరాలు ఉపయోగించి వృత్తి చేసుకొనేవారు రెండు రకాల పన్నులు చెల్లించాలి. సాలెవారి మగ్గరి, పింజ సిద్ధాయం అనే పన్నులు, కంసాలి, తెలికె, కుమ్మరి వారు ఉపయోగించే గానుగ చక్రాలపై కూడా గానుగరి, చక్రకానికనే పన్నులుగా, మల్లా వారిపై ఈడుగ సుంకం విధించేవారు. బెల్లం తయారు చేసే పరిశ్రమ, కొలిమి, పత్తిగింజలు తీసే గిరిక మీద, ఈడిగ మీద, వజ్ర పరిశ్రమల మీదా, అన్నింటి మీదా పన్నులు విధించారు. వాటి యజమానులు వచ్చే ఆదాయం మీద కూడా పన్ను ఉండేది. ఇవి పరిశ్రమలపై విధించిన సుంకాలని చెప్పవచ్చును. ఉప్పు కొఠారులపై ఉప్పరి అనే సిద్ధాయం వసూలు చేసేవారు.

వ్యాపార వాణిజ్య సుంకాలు: వ్యాపార వాణిజ్యాలపై అనేక రకాల సుంకాలు విధించబడేవి. చలివేంద్రాలు,

సంతలు, వసంత గరువులలో కూడా వాణిజ్య సుంకాలు వసూలు చేసేవారు. స్థలాదాయాలు, దుర్గాదాయాలు, మామూలు ఆదాయాలు అనే పేరుతో వాణిజ్య సుంకాలు వసూలు చేసేవారు. ఒక స్థలంలోకి దిగుమతి చేసుకొనే సరుకులపై విధించే సుంకాన్ని స్థలాదాయం అనేవారు. సరుకులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి తీసుకువెళ్తుంటే మార్గంలో వసూలు చేసే సుంకాన్ని మార్గాదాయం అని అనేవారు. సరుకులను ఎగుమతి చేస్తే మామూలాదాయం అనే పేరుతో సుంకం వసూలు చేసేవారు. బజారులలో అంగళ్లలో విక్రయించే సరుకులపై మాళిగ సుంకం అనే పేరుతో పన్ను వసూలు చేసేవారు. కొండవీడు, హంపి మొదలైన పట్టణాలలో వాణిజ్య కేంద్రాలలో విక్రయించే వస్తువులపై విధించే సుంకాల రేట్లను వివరించే శాసనాలు లభించాయి. సంతలో సుంకం వసూలు చేసుకొనే హక్కును వేలంపాటలో సుంకదారులు కొనేవారు. నాగలాపురం సంతకు వచ్చే వస్తువులపై 42 వేల పగోడాల ఆదాయం వచ్చేదని న్యూనిజ్ రాశాడు. సభలు సమావేశాలు జరుపుకున్నందుకు కూడా పన్నులు విధించేవారు. దేవాలయ పోషణ, దేవాలయ ఉత్సవాలు నిర్వహించటానికి కాసువీసాలు, మహరాజ ప్రయోజనాల పేరుతో పన్నులు విధించేవారు. దన్నాయకస్వామ్యం, దుర్గస్వామ్యం, కావలికానిక అనే పన్నులు కూడా వసూలు చేశారు. ఇవి సైనిక రక్షణ ఏర్పాటు చేసినందుకు వసూలు చేసిన పన్నులు.

సామాజిక పన్నులు - కళ్యాణ సుంకం: విజయనగర యుగంలో వివాహాల మీద సుంకం విధించేవారు. దానిని కళ్యాణ సుంకం అని పిలిచేవారు. పెళ్లిళ్లలో ఇరుపక్షాల వారి మీద గుడి కళ్యాణం, కళ్యాణకానికె అనే సుంకాలు వసూలు చేసేవారు. గుడి కళ్యాణం అంటే ఊరేగింపు పన్ను అని భావించారు. వివాహపన్నులను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక శాసనంలో కళ్యాణ కానుక వసూలు చేసేవాడు తల్లికి మొగుడు అని రాసి ఉంది. దానిని బట్టి ప్రజలు కళ్యాణ సుంకాన్ని గర్హించారని తెలుస్తోంది. అందువల్ల కృష్ణదేవరాయలు కందనవోలు చంద్రగిరి ప్రాంతాలలో కళ్యాణ సుంకం రద్దు చేసినట్లుగా తెలుస్తోంది. కాని ఆయన తర్వాత తిరిగి మామూలుగా వసూలు చేశారు.

సమయ సుంకం: కుల పెద్దలు తీర్పులు చెప్పినందుకు తీర్పు పొందిన వారు కొంత ధనాన్ని పెద్దలకు ముట్టజెప్పే ఆచారం ఉండేది. ఆ ఆదాయంలో కొంత ప్రభుత్వానికి చెల్లించాలి. దానిని సమయ సుంకమని అనేవారు.

సైనికావసరాల పన్ను: కోటల నిర్వహణకు, అందలి సేనల నిర్వహణకు కొన్ని పన్నులు వసూలు చేసేవారు. కోటల మరమ్మతులకు కూడా పన్ను విధించేవారు. అలాంటి పన్నులను దన్నాయక దుర్గసామ్యం, దుర్గ నిర్వహణకు విధించే పన్నును దుర్గస్వామ్యం లేక దుర్గ నివర్తన అని పిలిచేవారు. దుర్గానికి మరమ్మత్తుకు విధించే పన్నును వడైకానిక్కెలు అని అనేవారు. దళాధిపతి పోషణకు వసూలు చేసే పన్నును దన్నాయకస్వామ్యం లేక దన్నాయక నివర్తన లేక దళవిత్తి అని పిలిచేవారు. కావలికాసే వాని భత్యం కోసం వసూలు చేసే పన్నును కావలికానుక అని పిలిచేవారు. ఇవన్నీ ప్రజలను రక్షించడానికి సైనిక రక్షణ ఏర్పాటు చేసినందుకు వసూలు చేసే పన్నులు.

జరిమానాలు: న్యాయస్థానాలు దోషులు, నేరస్తులకు విధించే జరిమానాలు కూడా రాజ్యానికి ఆదాయాలుగానే వచ్చేవి.

ఇతర ఆదాయాలు: ఇంకా అనేక ఇతర మార్గాల ద్వారా కూడా రాజ్యానికి ఆదాయం వచ్చేది. సంచార అధికారుల గ్రాసానికి అయ్యే ఖర్చులు, సత్రాల నిర్వహణకు అయ్యే ఖర్చులు కూడా పన్నులుగా వసూలు చేసేవారు. వారసులు లేకుండా మరణించిన వారి ఆస్తులు రాజుకు వచ్చేవి. సభలు, సమావేశాలు నిర్వహించినా పన్ను విధించేవారు. దేవాలయ పోషణ, దేవాలయాల ఉత్సవాలు నిర్వహించడానికి కాసు, వీసాలు అనే పేరుతో మహారాజ ప్రయోజనాలనే పేరుతో మరికొన్ని పన్నులు వసూలు చేసేవారు. ఇంకా రాజును దర్శించడానికి వచ్చినప్పుడు ఇచ్చే కానుకలు, సామంతులు, అమరనాయకులు, చక్రవర్తికి సమర్పించే బహుమానాలు, కానుకలు కూడా రాజ్యానికి ఆదాయంగా వచ్చేవి. ఈ రకంగా అనేక పన్నుల ద్వారా రాజ్యానికి పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చేది.

పన్ను వసూలు విధానాలు - ప్రజల బాధలు: పన్నులు అనేక విధాలుగా వసూలు చేసేవారు. కొన్ని సందర్భాలలో పన్నులు వసూలు చేయడానికి ప్రభుత్వం సుంకాధికారులను నియమించేది. కొన్నిచోట్ల సుంక వసూలు అధికారాన్ని మధ్యవర్తులు కొనేవారు. మరికొన్నిచోట్ల స్థానిక సంస్థలు అమరనాయకులు వసూలు చేసేవారు. మొత్తం మీద పన్నులు నాలుగు రకాలుగా వసూలు చేసేవారు.

1. ప్రభుత్వ సుంక అధికారులు.
2. వేలంపాట పాడినవారు.
3. అమరనాయకులు.
4. గ్రామాలలో కరణాలు, గ్రామపెద్దలు.

పన్నుల భారంతోను, సుంకాధికారుల దౌర్జన్యంతోను ప్రజలు అనేక బాధలు పడుతున్నారని న్యూనిజ్, పేస్‌లు రాశారు. పన్నులు చెల్లించలేక అప్పుల పాలై భూములు అమ్ముకొనేవారని, మరికొందరు భూములు వదిలేసి వెళ్ళిపోయే వారని ఆ నాటి కైఫీయత్తులలో నమోదైంది. ఈ విషయాన్ని శాసనాలు కూడా బలపరుస్తున్నాయి. పన్నులు చెల్లించని రైతుల భార్యల స్థనాలకు సంబెట గురవరాజు అనే పాలెగాడు చిదతలను పట్టించి అవమానించినట్లు మాచుపల్లి కైఫీయత్తు తెలుపుతోంది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో కొండవీటిలో బాచమరచు అనే అధికారి పన్నులు వసూలు చేయడంలో చాలా దౌష్ట్యంగా వ్యవహరించేవాడట. సుంకాధికారులు పన్నులు వసూలు చేసే సమయంలో తమ సొంతానికి కూడా మామూళ్ళు, కట్నాలు వసూలు చేసేవారు. పన్నులు భరించలేక తంజావూరులోని పాంచాణం వారు ఊరు వదిలిపెట్టి వెళ్లడానికి నిశ్చయించుకున్నారట. అది తెలిసి పాలెగాడు అయిన చిన్నప్పనాయకుడు వారిపై విధించిన కానిక, తలారి కానిక అనే పన్నులను రద్దు చేశాడట. తమిళదేశంలో అధిక పన్నులకు వ్యతిరేకంగా వలంగై, ఇడంగై తెగలు ప్రభుత్వానికి ఎదురుతిరిగి తాము ఎంత చెల్లించేది తామే నిర్ణయించుకున్నట్లు శాసనం లభించింది. పన్నులు క్రూరంగా వసూలు చేయడం మంచిది కాదని కృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో ఒక సూచన కూడా చేశాడు. ఏమైనప్పటికీ విజయనగరయుగంలో పన్నుల భారం అధికం. అధిక పన్నులను ప్రజలు గర్హించినప్పటికీ వారు పన్నులు చెల్లించారు. ఆ కాలంలో ముస్లింల భయం ఉన్నందువల్ల విజయనగర ప్రభువులు తమను రక్షిస్తారనే నమ్మకంతో వారు పన్నులు చెల్లించారు. రాజులు కూడా ఆనాటి తప్పనిసరి పరిస్థితిలో సైనిక ఖర్చు కోసం అధిక పన్నులు వసూలు చేసేవారు.

విజయనగర సామ్రాజ్య ఆదాయం: విజయనగర రాజ్యం మొత్తం మీద ఎంత ఆదాయం వచ్చేది స్పష్టంగా తెలియదు. లూయీ రైస్ అనే పండితుడు స్థానిక చరిత్రలు ఇచ్చే సమాచారం మీద ఆధారపడి 81 కోట్ల రూపాయలు అని అంచనా కట్టాడు. కాని అది వాస్తవంగా కనిపించదు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో తూర్పు కన్నడ ప్రాంతాల నుండి మూడు కోట్ల రూపాయల ఆదాయం వచ్చేదని కర్ణాటక రాజకాల సవిస్తర చరిత్ర అనే ప్రాచీన గ్రంథం వల్ల తెలుస్తోంది. కృష్ణదేవరాయలు భారతదేశపు రాజులందరిలోను ఐశ్వర్యవంతుడని, రోజుకు అతని ఆదాయం 12 వేలు అని వార్తమ అనే అతడు రాశాడు. హిమాసిర్ అనే వ్యక్తి సదాశివరాయల ఆదాయం సాలుకు 12 కోట్ల హొన్నులు అని రాశాడు. కనుక ఈ పరస్పర రాతల వల్ల విజయనగర రాజుల ఖచ్చితమైన ఆదాయం తెలియకపోయినా పెద్ద మొత్తంలో ఆదాయం వచ్చేదని తెలుస్తోంది.

ఆదాయ వ్యయం: విజయనగర రాజులు తమ ఆదాయంలో ఎక్కువభాగాన్ని సైన్యానికి ఖర్చు చేశారు. సైనికుల జీతాలకు పోర్చుగీసు వారి వద్ద నుండి కొన్న గుర్రాలకూ, తమ ఆయుధాలకు ఖర్చు పెట్టేవారు. కృష్ణదేవరాయలు తన ఆదాయంలో సగం కంటే ఎక్కువ ఖర్చు పెట్టి గుర్రాలు, ఏనుగులు కొనేవాడని న్యూనిజ్ రాశాడు. కొంత ఆదాయాన్ని అంతఃపుర ఖర్చులకు వినియోగించేవారు. రాయల అంతఃపురం వైభవంగా ఉండేదని నాటి విదేశీ యాత్రికులు రాశారు. కొంత ఆదాయాన్ని తటాకాది నీటిపారుదల శాఖ సౌకర్యాలకు కళాసాహిత్య పోషణకు, దానధర్మాలకు వినియోగించేవాడు. ఆదాయంలో 5వ వంతు దేవాలయ నిర్మాణాలకు, వాటి నిర్వహణలకు ఖర్చు పెట్టేవారు. ఈ ఖర్చులన్నీ పోను కృష్ణదేవరాయలు ప్రతి సంవత్సరం కోటి పణాలు భాండాగారంలో నిల్వ చేసే వారని పేస్ రాతల వల్ల తెలుస్తోంది.

ప్రజాహిత కార్యక్రమాలకు పరోక్షంగా ఖర్చు పెట్టడం: ఎంత ఆదాయం వచ్చినా విజయనగర ప్రభువులు తమ ఆదాయాన్ని ప్రజాహిత కార్యాలకు ఎక్కువగా ఖర్చు పెట్టినట్లు కనిపించదు. ఆ నాడు పరపాలనా స్వభావం, ప్రజా రక్షణ ఒకటే గనుక వారు ఖర్చు పెట్టలేకపోయి ఉండవచ్చును. కాని వారు కవులకు, మఠాలకు అగ్రహారాలు ఇచ్చారు. మఠాధిపతులు విద్యాలయాలు, వైద్యశాలలు నిర్వహించారు. పరోక్షంగా విజయనగర ప్రభువులు విద్యా, వైద్య సౌకర్యాలకు ఖర్చు చేసారని చెప్పవచ్చును. అలాగే కొందరికి దానాలు ఇచ్చేవారు. ఆ విధంగా కొందరు ప్రయోజనాలు పొందుతుండేవారు. వ్యవసాయాభివృద్ధికి చెరువులు, కాలువలు తవ్వించారు. వ్యవసాయంపై మంచి శ్రద్ధ తీసుకున్నారు.

వ్యయం: రాజ్యానికి వచ్చే ఆదాయాన్ని అనేక విధాలుగా ఖర్చు పెట్టారు. కొంత ఆదాయాన్ని రాజ కుటుంబపు ఖర్చులకు వినియోగించేవారు. విజయనగర రాజుల అంతఃపుర ఖర్చులు ఎక్కువగానే ఉండేవి. రాయల అంతఃపురం వైభవంగా ఉండేదని విదేశస్తులు రాశారు.

ప్రభుత్వ సిబ్బందికి కొంత ఖర్చు పెట్టేవారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలుగాక పన్ను చెల్లించనవసరం లేని భూములు ఇచ్చేవారు. అందువల్ల సిబ్బంది ఖర్చు పరిమితంగానే ఉండేది. కాని వారి ఆదాయంలో సైన్యానికి ఎక్కువగా ఖర్చు అయ్యేది. గుర్రాలు, ఏనుగులను కొనడానికి, వాటి మేత, దాణాలు, వాటి నిర్వహణకు అమితంగా ఖర్చు చేసేవారు. కొంత ఆయుధాలకు ఖర్చు అయ్యేది. కృష్ణదేవరాయలు తన ఆదాయంలో సగానికి పైగా ఖర్చు పెట్టి ఏనుగులు, గుర్రాలను కొనేవాడని న్యూనిజ్ రాశాడు. మరికొంత సిద్ధ సైన్యం జీతాలకు ఖర్చు అయ్యేది. యుద్ధాల సమయాలలో ఇంకా ఎక్కువ ఖర్చు రాశాడు. సాలుకు వచ్చే 60 లక్షలలో రాజు తన సొంతానికి 25 లక్షలకు మించి ఖర్చు పెట్టేవాడు కాదని, మిగిలినదంతా గుర్రాలు, ఏనుగులు కొనడానికి, పదాతి దళాన్ని పోషించడానికి ఖర్చు చేసే వాడని న్యూనిజ్ రాశాడు. తర్వాత పెద్ద మొత్తం దేవాలయాలు నిర్మించడానికి, సత్రాలు, మఠాల పోషణకు ఖర్చు చేశారు. శిథిలమైన అనేక దేవాలయాలు పునర్నిర్మించారు. నూతనంగా కట్టించారు. ఆ దేవాలయాలలో పూజలు, ఉత్సవాలు జరగటానికి ఖర్చు చేసేవారు. రాయలు తన ఆదాయంలో 5వ వంతు దేవాలయాలకు ఖర్చు చేసేవాడని న్యూనిజ్ రాశాడు. తర్వాత కవిపండితుల పోషణకు ఖర్చు చేసేవారు. విజయనగర రాజులు అనేక కవులను పోషించేవారు. కృష్ణదేవరాయలు కవులకు ఎక్కువగా ఖర్చు పెట్టేవాడు. అంతేగాక కవిపండితులకు చేసే ఖర్చును, ఖర్చు అని భావించరాదని కూడా వివరించాడు. నీటిపారుదల సౌకర్యాలకు మరికొంత ఖర్చు పెట్టేవారు.

సంవత్సర ఆదాయంలో కొంత భాగం ఖజానాలో నిల్వచేసేవారు. కృష్ణదేవరాయలు ప్రతి సంవత్సరం ఖజానాలో ఒక కోటి సువర్ణాలు నిల్వ చేసేవాడని పేస్ వర్ణించాడు. ప్రభుత్వ ఆదాయాన్ని నాలుగు విధాలుగా ఖర్చు చేయాలని, అందు ఒక భాగం రాజకుటుంబానికి మరొక భాగం సైన్యానికి, మరొక భాగం కళాపోషకు, ఒక భాగం ఖజానాలో నిల్వచేయాలని చెప్పిన విషయాన్ని విజయనగర చక్రవర్తులు అక్షరాలా పాటించారు.

ద్రవ్య చెలామణి-నాణేలు: పంటలు బాగా పండినందువల్ల, వర్తక వాణిజ్యాలు విస్తరించినందువల్ల ద్రవ్య చెలామణి బాగా పెరిగింది. విజయనగర రాజులకు ముందు దేశంలో వరాహ, ఫణం, ద్రమ్మ అనే బంగారు నాణేలు చెలామణిలో ఉండేవి. వీటిలో వరాహకు గద్యాణం అని కూడా పేరు ఉండేది. వరాహ చాళుక్యుల కాలం నుండి వాడుకలో ఉన్న నాణెం. చాళుక్యుల చిహ్నం వరాహం. ఆ పదం నుండే వరాహ పుట్టి ఉండవచ్చును. విజయనగర రాజులు టంకశాలను నెలకొల్పి, ఒకే ప్రమాణంలో నాణేలను ముద్రించారు.

బంగారు నాణేలు: విజయనగర చక్రవర్తుల కాలంలో మూడు బంగారు నాణేలు ఉన్నట్లు అబ్దుల్ రజాక్ రాశాడు. కాని శాసనాలు గద్యాణం, మాడ, ఫణం, హగ అనే నాలుగు బంగారు నాణేలు ఉన్నట్లు తెలుపుతోంది. దీనిలో ఫణం పెద్ద నాణేం కాదు. ఇది అర్థనాణేం. గద్యాణానికి వరాహ, పాన్ అని కూడా పేర్లు ఉన్నాయి. కృష్ణరాయల కాలంలో గద్యాణం 119.7 గురిగింజల బరువు ఉండేదట. వరహా మళ్లీ శుద్ధవరహాలు, గట్టి వరహాలు, దొడ్డవరహాలు అని మూడు ప్రత్యేక వరహాలు ఉన్నాయి. ఈ బంగారు నాణేలకు అర్థ, పావు, పరక విలువలలో కూడా బంగారు నాణేలు ముద్రించారు. వీటిలో అర్థనాణేన్ని ఫణం అని అనేవారు. అంటే ఈ నాణేం వరాహ, లేక గద్యాణం లేక మాడలో సగం విలువ కలిగించింది. దానికి ఫణి అని కూడా పేరుంది. ఫణంలో సగం నాణేన్ని అంటే వరహాలో పావు నాణేన్ని ప్రతాప అని అనేవారు. దీనికి పర్దాన్, పొన్ను అని కూడా పేర్లు ఉన్నాయి. తర్వాత బంగారు నాణేం చిన్న, దానికి వీస అని కూడా పేరుంది. ఇది ప్రతాపలో $1/_{10}$వ వంతు. ఫణం, చిన్న అనేవి చిన్నవిలువ గలిగిన నాణేలు. ఇవి బాగా వాడుకలో ఉన్నాయి. సాధారణ ప్రజలు కూడా వీటిని బాగా ఉపయోగించేవారు.

వెండి నాణేలు: ఒకే ఒక్క వెండి నాణెం చలామణిలో ఉండేది. దాని పేరు తార్. అది ఫణంలో $1/_6$వ వంతు విలువ కలిగి ఉండేది.

రాగి నాణేలు: జితలు లేక జట్టలు లేక జిట్టలు, ఎన, కాసు అనే మూడు రాగి నాణేలు ఉండేవి. వాటి విలువ ఖచ్చితంగా తెలియదు. రాగి నాణేలలో కాసులు ఎక్కువగా చెలామణిలో ఉండేవి. అలాగే శత్రురాజ్యమైన బహమనీ సుల్తాన్‌లు టంకం అనే బంగారు నాణేం, బిశ్వ అని చిన్న విలువ కలిగిన నాణేలు ముద్రించారు. అవి

కూడా విజయనగర రాజ్యంలో చెలామణిలో ఉండేవి.

విదేశీ నాణేలు: పశ్చిమతీరంలో విదేశీ వ్యాపారం జోరుగా సాగుతుండేది. అందువల్ల అక్కడ అనేక విదేశీ నాణేలు చలామణిలోకి వచ్చాయి. ముస్లిం దేశాలైన ఈజిప్టు, పర్షియాలలో దీనారం అనే నాణెం ఉండేది. పశ్చిమ తీరంలో వ్యాపారం చేసే అరబ్బులు, పర్షియన్లు, ఈజిప్టు వ్యాపారులు దీనారులను వాడేవారు. ఐరోపా వారు వారి నాణేలను వాడేవారు. అరబ్బుల తర్వాత ఇండియాకు వచ్చిన వారు పోర్చుగీసు వారు కన్యోడా అనే నాణేన్ని ప్రవేశపెట్టారు. ఇటలీ దేశస్థుల నాణేలు అయిన డ్యూకాట్, సెక్విన్‌లు కూడా దేశంలో ప్రవేశించాయి. సెక్విన్ బరువు 52-40 గ్రెయిన్‌లు. డ్యూకాట్ బరువు 53.50 గ్రెయిన్‌లు. పగోడా అని మరొక నాణెం ఉండేది. దాని బరువు 52.40 గ్రెయిన్‌లు. విజయనగర రాజులు కూడా పగోడాలను ముద్రించారు. దాని బరువు 52.65 గ్రెయిన్‌లు సదాశివరాయలు పగోగాను 52.912 గ్రెయిన్లతో ఎక్కువ బరువుతో ముద్రించాడు. ఆ నాటి దేశ విదేశీ నాణేలు దాదాపు సమాన బరువుతో ఉన్నాయి. కనుక వ్యాపారంలో ఇబ్బందులు లేకుండా సాగి ఉంటుంది. దువారే బార్బోసా విజయనగర నాణేలలో కల్తీ లేదని వివరించాడు. విజయనగర రాజ్యంలో నాణేల ముద్రణ ప్రభుత్వం నియంత్రించలేదు. వర్తక శ్రేణులకు కూడా నాణేలు ముద్రించే అధికారం ఇచ్చారు. తారె, ఫణం, జట్టల్ అనే చిన్న నాణేలు ఎక్కువగా చెలామణిలో ఉండేవి. అందువల్ల సామాన్య ప్రజలు కూడా నాణేలు వాడేవారని భావించవచ్చును. నాణేలు బాగా చెలామణిలో ఉన్నట్లు తిరుపతి శాసనాలు కూడా తెలుపుతున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు తిరుపతి వేంకటేశ్వరస్వామికి 30 వేల వరహాలతో కనకాభిషేకం చేయించాడు. నవరత్న ఖచిత కిరీటాన్ని బహూకరించాడు. ప్రౌఢదేవరాయలు శ్రీనాథుని దీనార టంకాలతో కనాభిషేకం చేశాడు.

నాణేలు ముద్రించే అధికారం విజయనగర రాజులు గుత్తగా చెలాయించలేదు. వారి సామంతులు, అమరనాయకులు, వర్తకశ్రేణులు కూడా ముద్రించుకోడానికి అనుమతి ఇచ్చారు. ప్రతీ సామంతరాజ్యంలోనూ, రాష్ట్రాలలోను టంకశాలలు ఉండేవి. అక్కడి పాలకులు తమ పేర్లతో ప్రత్యేక ముద్రలు గల నాణేలు ముద్రించే వారని అరవణ తంత్రం తెలుపుతోంది. కంసాలులు నాణేల నాణ్యతను ఒరిపిడి పెట్టి నిర్ణయించే వారట. ఇవన్నీ విజయనగర యుగంలో ద్రవ్య చెలామణి బాగా అమలులో ఉన్నట్లు తెలుపుతున్నాయి.

ఖజానాలు - టంకసాల: విజయనగర రాజులు రెండు ఖజానాలను ఏర్పాటు చేశారు. ఒకదానిలో ధనం నిల్వ ఉంచే వారు. అది ఎప్పుడూ మూసి ఉంటుంది. రెండవది తెరిచి ఉంటుంది. ధనానికి సంబంధించిన నిత్య వ్యవహారాలన్నీ ఇక్కడే జరుగుతూ ఉంటాయి. రాజోద్యోగులకు రాచకార్యాలకు కావలసిన ధనం, అంటే నిత్య వాడుకకు అవసరమయ్యే ధనం ఇక్కడ ఉంటుంది. ఎవరికైనా ఇవ్వాలన్నా ఎవరైనా ధనాన్ని తెచ్చి జమకట్టినా ఇక్కడే చెల్లించాలి. సామంతులు కూడా తమ కప్పాలు ఇక్కడే చెల్లించాలి. వారికి రావలసిన ధనం ఏదైనా ఉంటే ఇక్కడి నుండే తీసుకోవాలి. సైనికోద్యోగులకు కూడా ఇక్కడి నుండే చెల్లింపులు చేస్తారు.

విజయనగర రాజులు మరణించగానే వారి ఖజానాకు సీలు వేస్తారట. ఇక అది తెరవరని, నూతనంగా వచ్చిన రాజు తన పట్టాభిషేక కాలం నుండి నూతన ఖజానాకు ఏర్పాటు చేసుకుంటాడని పేస్ రాశాడు.

ఖజానా వద్ద టంకసాల ఉండేది. అక్కడ నాణేలు ముద్రిస్తారు. కేంద్రప్రభుత్వానికే గాక సామంతులు, అమర నాయకులకు కూడా నాణేలు ముద్రించే అధికారం ఉన్నదని విదేశీయాత్రికులు రాశారు. అందువల్ల విజయనగర సామ్రాజ్యంలో అనేక నాణేలు చెలామణిలో ఉన్నాయని, తాము సామ్రాజ్యంలో పర్యటించినప్పుడు ఒక సామంత రాజ్యం దాటి మరొక సామంత రాజ్యంలో అడుగు పెట్టగానే మరొక రకం నాణేలు తీసుకోవలసి వచ్చేదని కూడా రాశారు.

లోపాలు: విజయనగర చక్రవర్తులు పటిష్టమైన పరిపాలనా పద్ధతిని ఏర్పాటు చేసినా కొందరు అందులో కొన్ని లోపాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా వారు ప్రజలపై పన్నుల భారం అధికంగా వేశారని, ప్రజలకు సరైన రక్షణ కల్పించలేక పోయారని, పటిష్టమైన న్యాయ విధానాన్ని అమలు జరపలేక పోయారని, ఇవి వారి పరిపాలనా లోపాలని అంటారు. కాని ముస్లిం రాజ్యవిస్తరణ ప్రమాదం ఉన్న ఆ రోజులలో రాజ్య రక్షణయే ప్రధానంగా భావించి వారు సైనిక రాజ్యంగా రూపొందించకతప్పలేదు. కనుక ఇవి లోపాలుగా భావించనక్కరలేదు.

పరమత సహనం: విజయనగర ప్రభువులు హైందవ ధర్మరక్షణే వారి ధ్యేయంగా ప్రకటించుకున్నా వారు ముస్లింలను, క్రైస్తవులను కూడా ఆదరించారు. ముస్లింలను తమ సైన్యంలో చేర్చుకున్నారు, పోర్చుగీసు వారిని ఆదరించారు. క్రైస్తవమత ప్రచారం చేసుకోడానికి అనుమతించారు. ఇది వారి పరిపాలనలోని మరొక లక్షణం అని

చెప్పవచ్చును. కాని బహమనీ రాజ్యంతో ఉన్న విరోధం వల్ల వారు పోర్చుగీసు వారితో స్నేహం చేశారు. మత కార్యకలాపాలను అదుపు చేయలేదని, అందువల్ల గోవాలోని కొందరు హిందువులు బాధలు పడ్డారని, విజయనగర రాజుల మెతక వైఖరి వల్ల అలాంటి పరిస్థితి ఏర్పడిందని కొందరు అంటారు.

బహమనీ సుల్తాన్‌ల పరిపాలనా వ్యవస్థ

భారతదేశాన్ని ముస్లింలు జయించడంతో భారతదేశ పరిపాలనా వ్యవస్థలలో టర్కీ, అరేబియా, పర్షియా పరిపాలనా పద్ధతులు ప్రవేశించాయి. తుగ్లక్ కాలంలో వారి పరిపాలనా వ్యవస్థ ఆంధ్రదేశంలోకి ప్రవేశించింది. తుగ్లక్‌ల వారసులైన బహమనీ సుల్తాన్‌లు వారి పరిపాలనా పద్ధతులనే అనుసరించారు. ముస్లిం పరిపాలనావ్యవస్థ షరియత్-ముస్లిం న్యాయశాస్త్ర ఆధారంతో రూపొందింది.

సిద్ధాంతం ప్రకారం బహమనీ సుల్తాన్‌లు కూడా భారతీయ రాజుల లాగా భూమికంతటికీ అధిపతి. అతడే సర్వాధికారి. సర్వసేనాధిపతి, ఉన్నత న్యాయాధీశుడు. ప్రధాన మత బోధకుడు, మతారాధ ఆరంభకుడు, భూమి మీద ఉన్న దేవుని ఛాయారూపం. అతనికి పరిపాలనలో అనేక తరహాల ఉద్యోగదళం సహాయపడేది. ఉలేమాలు, ఉమ్మావులు సలహాలు ఇస్తూ ఉండేవారు. అతనికి మంత్రి మండలి కూడా ఉండేది. ప్రధాన మంత్రి, కాజీ లేక న్యాయ మంత్రి ఉండేవారు. పీష్వా అనే పర్యవేక్షణ మంత్రి కూడా ఉండేవాడు. క్రీ.శ.1358-77 సంవత్సరాల మధ్య పాలించిన మహమ్మద్‌షా కాలంలో ఎనిమిది మంది మంత్రుల ఉండే సభ ఏర్పాటు చేయబడింది. వారిలో ప్రధాన మంత్రిని వకీల్ ఉష్ సల్తనత్ అనేవారు. ఇతనిని రాజప్రతినిధి అని కూడా భావించేవారు. ఆర్థిక మంత్రిని అమీర్-ఇ-జుమా అని, విదేశాంగ మంత్రిని వజీర్-ఇ-ఉష్‌రఫ్ అని, ప్రధాన న్యాయమూర్తిని సాదర్-ఇ-జహార్ అని, రక్షక భటాధికారిని కొత్వాల్ అని పిలిచేవారు. పేష్వా అనే మరొక మంత్రి కూడా ఉండేవాడు.

పరిపాలనా సౌలభ్యం కోసం బహమనీ రాజ్యం నాలుగు రాష్ట్రాలుగా విభజించబడింది. రాష్ట్రాలను తరఫ్‌లని పిలిచేవారు.

1. గుల్బర్గా
2. దౌలతాబాద్
3. బారార్
4. కౌలాస్. దీనికే ఇందూరు అని కూడా పేరుంది.

ఆంధ్రదేశానికి సంబంధించిన తరఫ్‌లో అనేక కోటలు ఉండేవి. ప్రతి కోటకు ఒక రక్షకుడు ఉండేవాడు. అతనిని ఠాణేదార్ అని పిలిచేవారు. తరఫ్‌లు సర్కారులుగాను, సర్కారులు పరగణాలుగాను విభజింపబడింది. పరగణాలను తహశీల్‌లని కూడా వ్యవహరించేవారు. కొన్ని గ్రామాలను కలిపి తహశీల్ అని అనే వారు. పరిపాలనలో గ్రామం చిట్ట చివరిది.

గవాన్ చేసిన మార్పులు: మహమ్మద్ గవాన్ కాలం రాజ్య విభాగాలలో కొన్ని మార్పులు చేశాడు. తరఫ్‌లు విశాలంగా ఉండేవి. తరఫ్‌దార్లు అమితమైన అధికారాలు అనుభవిస్తూ ఉండేవారు. వారి అధికారాలను పరిమితం చేయడానికి అతడు రాజ్యం మొత్తాన్ని 8 సర్ లష్కర్లుగా విభజించాడు. అందువల్ల తరఫ్‌ల వైశాల్యం తగ్గిపోయింది. ఆ కాలంలో తరఫ్‌దార్లు మంత్రులుగా కూడా నియమించబడేవారు. మహమ్మద్ గవాన్ ఖవేజహాన్‌లు ఇద్దరూ తరఫ్‌దార్లు. కాని వారు మంత్రులుగా కూడా ఏక కాలంలో పని చేశారు.

ఇక్తాలు: దక్షిణ దేశంలో సైనిక సేవ కింద జాగీరులిచ్చే సాంప్రదాయాన్ని బహమనీలు తొలగించలేదు. వారు కూడా అదే పద్ధతిని కొనసాగించారు. సుల్తాన్‌లకు సైన్యాలను సమకూర్చడానికి కొన్ని గ్రామాలను ఇచ్చే వారు. ఆ భాగాలను ఇక్తాలు అని అనే వారు. ఇక్తా అధిపతిని ఇక్తేదారు అని పిలిచేవారు. అతడు తన ఇక్తాలో పన్నులు వసూలు చేసి సైనిక నిర్వహణకు ఖర్చు పెట్టేవాడు. అంతకు పూర్వం జాగీరుదార్లకు వంశపారంపర్య హక్కు ఉండేది. కాని బహమనీలు ఇక్తేదారుల హక్కులను వంశపారంపర్యంగా గుర్తించలేదు. వారిని ఎప్పుడైనా తొలగించవచ్చును. ఇక్తేదారులు తమ ఇక్తాలో శాంతిభద్రతలను నెలకొల్పడం, న్యాయనిర్ణయం చేయడం అతని విధులు. తన ఇక్తాలో పరిపాలనాపరంగా అతనికి పరిపాలనా స్వేచ్ఛ ఇవ్వబడింది. అందువల్ల కొందరు ఇక్తాదారులు తమ ఇక్తాలను కౌలుకు కూడా ఇస్తూ ఉండేవారు. కేంద్రప్రభుత్వం బలహీన పడినప్పుడు ఇక్తాలు సొంత ఆస్తులుగా చెల్లుబడి అయ్యేవి. ఇక్తేదార్లపై తరఫ్‌దార్లు అజమాయిషీ చేసేవారు. వారికి లోబడి ఇక్తేదార్లు

తమ ఇక్తాలను నిర్వహించాల్సి వచ్చేది.

సైన్యం: బహమనీ రాజ్యం ప్రధానంగా సైనిక రాజ్యం. దాని మనుగడ బలదర్పాలు అన్నీ సైనిక బలం మీదనే ఆధారపడి ఉండేది. కనుక బహమనీ సుల్తాన్‌లు తమ సైన్యాన్ని పోషించడంలో ప్రత్యేక శ్రద్ధలు తీసుకున్నారు. ప్రతి తరఫ్‌దారుడు ఎంత సైన్యాన్ని సమకూర్చవలసిందీ ఖచ్చితమైన లెక్కలు ఉన్నాయి. ప్రతి తరఫ్‌దారుడు 2 వేల సైన్యాన్ని సమకూర్చాలి. వారి కింది వారు వరుసగా 1000, 500, 300, 200 సైనికులను సమకూర్చాలి. 200 నుండి 2000 వరకు వివిధ గ్రేడుల సేనాధిపతులు ఉంటారని అర్థం. వారి సైనిక నిర్వహణకిచ్చే జాగీరులకు డబ్బుతో విలువ కడతారు. అంటే 500ల మంది సైనికులను పోషించే సేనాధిపతికి ఇచ్చే జాగీరు విలువ ఒక లక్ష హొన్నులు. 1,000కి రెండు లక్షలు, 2,000 జాగీరు విలువ 4 లక్షలు. దానిని బట్టి రాజ్యంలో మొత్తం జాగీరుల విలువ తెలుసుకోవచ్చును. బహమనీలు కేంద్రప్రభుత్వం ఆధీనంలో 50 వేల అశ్వదళం, 25 వేల కాల్బలం ఉండేది. మిగిలిన సైన్యం తరఫ్‌దారులు, ఇక్తాదారుల ఆధీనంలో ఉండేది. మొత్తం సైన్యం లక్షల మీద ఉండేది.

గవాన్ సంస్కరణలు: గవాన్ ప్రధాన మంత్రిగా వచ్చేనాటికి తరఫ్‌దారులు, ఇక్తేదారులు బలపడి ఉన్నారు. వారి అధికారాలు తగ్గించడానికి అతడు కొన్ని సంస్కరణలు ప్రవేశపెట్టాడు. తరఫ్‌లు, ఇక్తాల విలువను పెంచాడు. అంటే అంతకు ముందు లక్ష హొన్నుల విలువ గల ఇక్తాను లక్షాపాతిక వేలకు, రెండు లక్షల దానిని రెండున్నర లక్షల హొన్నులకు పెంచాడు. వారు పోషించవలసిన సైన్యం తగ్గితే ఇక్తాలోని గ్రామాలను తగ్గించవచ్చును. అంతేగాక తరఫ్‌ల సంఖ్యను రెట్టింపు చేశాడు. అంతకు పూర్వం నాలుగు తరఫ్‌లు ఉండేవి. అవి చాలా పెద్దవిగా ఉండి పర్యవేక్షణ కష్టంగా ఉండేది. కనుక నాలుగింటిని 8 తరఫ్‌లుగా విభజించాడు. ఇందువల్ల బహమనీల కింద ఉన్న ఆంధ్రదేశం, తెలంగాణ, వరంగల్లు, రాజమండ్రి అనే మూడు తరఫ్‌లుగా విభజించబడింది. ప్రతి తరఫ్‌లోని కొన్ని పరగణాలను సుల్తాన్ ప్రత్యక్షపాలనలోకి తెచ్చాడు. తరఫ్‌లోని ఒక్క కోట మాత్రమే తరఫ్‌దారు ఆధిపత్యం కింద ఉంటుంది. మిగిలిన కోటల అజమాయిషీ కేంద్ర ప్రభుత్వపు ఆధీనంలోకి తెచ్చి ఖిలేదారులను నియమించాడు. వారు సుల్తాన్ ప్రత్యక్ష అధికారంలో ఉంటారు. అంతకుముందు తరఫ్‌లోని సైనిక వ్యవహారాలన్నీ తరఫ్‌దారుల చేతుల్లో ఉండేవి. తరఫ్‌లలోని అన్ని కోటలపై అతడే ఖిలేదార్లను నియమించేవాడు. వారందరూ అతని ఆజ్ఞలకు లోబడి ఉండేవారు. సుల్తాన్‌కు వారికి ఎలాంటి సంబంధాలు ఉండేవి కావు. వారిని తొలగించే అధికారం కూడా అతనిదే. తరఫ్‌లో ఎంత మంది సైనికులు కావాలన్నా అతడే నియమించాడు. అతనికి తరఫ్‌పై సర్వాధికారాలు ఉండేవి. ఒక్కొక్కప్పుడు అంటే అవసరం లేనప్పుడు సైనికుల సంఖ్యను తగ్గించి వారికి ఇచ్చే జీతభత్యాలను కూడా తానే మిగుల్చుకొనేవాడు. గవాన్ సంస్కరణల వలన తరఫ్‌దారులు తమ అధికారాలన్నీ పోగొట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వానికి తరఫ్‌దారులను, ఇక్తేదార్లను అదుపుచేయడానికి మంచి అవకాశం లభించింది.

గ్రామ పరిపాలన: గ్రామాలలో పూర్వపు పంచాయితీలు కొనసాగాయి. గ్రామపు భూములు గ్రామస్థులకు చెందేవి. సుల్తాన్ ఉద్యోగులలో భేదం రానంత వరకు వారి స్వయం పాలనాధికారాలకు భంగం వాటిల్లలేదు. కాని ఇక్తేదారులకు వంశపారంపర్య హక్కులు లేనందువల్ల ఎవరికి వారు ఎక్కువ దోచుకుందామనే తాపత్రయంలో రైతులపై అధిక పన్నులు విధించి వసూలు చేశారని అందువల్ల గ్రామ ప్రజలు దయనీయస్థితిలో ఉన్నారని అతనాసియస్ నికిటిన్ అనే రష్యా వ్యాపారి రాశాడు.

యుద్ధ నిర్వహణ - ఆధునిక పద్ధతులు - యుద్ధతంత్రంలో వచ్చిన మార్పు: ఐరోపాలో తుపాకి మందు కనిపెట్టడంతో ప్రపంచ వ్యాప్తంగా యుద్ధతంత్రంలో గొప్ప మార్పు వచ్చింది. తుపాకి మందు మొట్టమొదటి స్పెయిన్‌లోని బాజా యుద్ధంలో ఉపయోగించారు. బాజా అనే కోటను గ్రానడా రాజు క్రీ.శ.1325లో ముట్టడించి తుపాకీ మందును ఉపయోగించి జయించాడు. ఈ తుపాకీ మందు 40 సంవత్సరాలలో ఇండియాలో ప్రవేశించింది. అనే టర్కు బహమనీ సైన్యంలో చేరాడు. అతడు మొట్టమొదటిసారిగా తుపాకి మందును గురించి బహమనీ సుల్తాన్‌లకు తెలియజెప్పి దానిని టర్కీ నుండి తెప్పించారు. మొదటి మహమ్మద్‌షా క్రీ.శ.1365 హిజారా 767లో ఆదోని కోటపై దాడి చేసినప్పుడు మొదటిసారిగా తుపాకీ మందును ఉపయోగించారు. తుపాకీ మందు ప్రవేశం యుద్ధ తంత్రాన్నీ, కోటల నిర్మాణాన్ని పూర్తిగా మార్చివేసింది. కోటలు బలమైన రాళ్లతో, వెడల్పు గోడలతో నిర్మించవలసి వచ్చింది. ఆ గోడలపైన తుపాకులు అమర్చటానికి కావలసిన గూళ్లతో ముందు ఒక వరుస, వెనుక

రక్షణ కోసం మరొక వరుస రెండు గోడలను నిర్మింపవలసి వచ్చింది. కోట ద్వారాల ముందు రక్షణకు మరికొన్ని బలమైన గోడలు నిర్మించాల్సివచ్చింది. తుపాకులు ఉపయోగించడానికి. సైనికులకు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వవలసి వచ్చింది. ప్రత్యేకంగా తుపాకీ దళం ఏర్పడింది. ఈ విధంగా యుద్ధ వ్యూహం మారిపోయింది.

బహమనీ సుల్తాన్‌లు యుద్ధంలో నూతన పద్ధతులను ప్రవేశపెట్టారు. ముఖ్యంగా వారు ఫిరంగులు, తుపాకీ మందును ప్రవేశపెట్టారు. మొట్టమొదటిసారిగా వారు క్రీ.శ.1366వ సంవత్సరం ఆదోనిని ముట్టడించినప్పుడు తుపాకీ మందును వాడారు. 5 లక్షల పదాతిదళం, 40 వేల అశ్వపుదళం ఉన్న విజయనగర ప్రభువును ఫిరోజ్‌షా 10 వేల అశ్వదళం, 30 వేల పదాతిదళం సునాయసంగా ఓడించి ఆదోనిని పట్టుకున్నాడట. అలాగే బంకాపూర్ యుద్ధంలో ఫిరోజ్‌షా తన సైన్యం చుట్టూ ఫిరంగీ దళాన్ని ఉంచటంతో దేవరాయలు ఎంత పౌరుషంగా పోరాడినా ముస్లిం సైన్యాల ముందు నిలబలేకపోయాడని ఫెరిష్టా రాశాడు. బెల్గాం కోట గోడలను కూల్చడానికి నల్లమందు పాతర్లు పెట్టారని మొదటి మహ్మద్‌షా స్వయంగా సేనలను నడిపి కోటను పట్టుకున్నాడని షరూన్‌ఖాన్ అనే అతడు రాశాడు. ఇంకా బహమనీ సుల్తాన్‌లు అరబ్బు దేశాలలో వచ్చే నూతన యుద్ధ పద్ధతులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తమ సైన్యాలను అధునాతనంగా తీర్చిదిద్దుకోనేవారు. అందువల్ల వారి సైన్యాల ముందు విజయనగర సైన్యాలు నిలబడగలిగేవారు. మొదటి మహ్మద్‌షా ఇరాక్, ఖొరసన్ నుండి 3 వేల మంది విలుకాండ్రను రప్పించాడట. వారిలో హసన్ అర్రీస్తానీ అనే గొప్ప విలుకాడు బహమనీ సైన్యాలకు విలు విద్య నేర్పాడట. ఇవన్నీ చూసి విజయనగర ప్రభువులు తమ సైన్యాన్ని యుద్ధ పద్ధతులను సంస్కరించుకున్నారు. వారు కూడా తుపాకి మందు ఫిరంగీలు కొన్నారు. అశ్వదళాన్ని పెంచుకున్నారు. ముస్లిం విలుకాండ్రను ఆహ్వానించి తమ కొలువులో చేర్చుకున్నారు.

గెరిల్లా పద్ధతి: బహమనీలు ప్రత్యక్షయుద్ధాన్ని కోరేవారు. కాని విజయనగర సైన్యాలు మొదటి నుండి గెరిల్లా పద్ధతిలో యుద్ధాన్ని నిర్వహించేవారు. తుపాకులు, విలుకాండ్రు వచ్చినా వారు ఆ పద్ధతిని వదలలేదు. ప్రోలయ నాయకుడు గెరిల్లా పద్ధతిలో ముస్లింలను పారదోలిన విధానాన్నే వారు మొదటి బుక్కరాయల కాలం నుండి అనుసరిస్తున్నారు. మొదటి మహమ్మద్‌షా విజయనగరం నుండి తిరిగి పోయేటప్పుడు, విజయనగర సైనికులు చెట్ల మీద, ఇళ్ల కప్పుల మీద ఉండి గెరిల్లా యుద్ధం సాగించి అమిత నష్టాన్ని కలిగించారని ఫెరిష్టా రాశాడు. ఆ సమయంలో అతని వెంట ఉన్న 4 వేల అశ్వికదళంలో 1500 మాత్రమే మిగిలారని కూడా రాశాడు. తుపాకి గుండు తగిలి సుల్తాన్ కూడా గాయపడ్డాడట. విజయనగర ప్రభువులు తమ ప్రజలకు కూడా గెరిల్లా యుద్ధ పద్ధతిని నేర్పారు.

శత్రు రాజ్యాలను దోచుకోవడం - సైనికులకు భాగం ఇవ్వడం: బహమనీ సుల్తాన్‌లు శత్రు రాజ్యాలను దోచుకున్నప్పుడు దోపిడీ సొత్తులో ఐదింట నాలుగు వంతులు సైన్యాధిపతులకు, సైనికులకు వదలివేసేవారట. ధనాశతో సైనికులు సాహసంతో పోరాడి విజయాలు సాధించేవారట. బహమనీ సుల్తాన్‌లు ఈ పద్ధతిని సాంప్రదాయకంగా అనుకరించారు. ఈ పద్ధతిని మొదట టర్కీ వారు ఉత్తర భారతదేశంలో ప్రవేశపెట్టారు. అదే పద్ధతిని బహమనీ సుల్తాన్‌లు దక్షిణదేశంలో అనుసరించారు. ముద్గల్ కోటను పట్టుకున్నప్పుడు మొదటి మహమ్మద్‌షా ఏనుగులు, గుర్రాలు, ఫిరంగులు తప్ప మిగిలిన సొత్తు అంతా తన సైనికులకు వదలివేశాడట అలాగే పాలం కోటలో దోచుకున్న సొత్తు కూడా వారికే ఇచ్చివేశాడట.

న్యాయపాలన: రాజ్యంలో ముస్లిం న్యాయ విధానాన్ని అనుసరించారు. న్యాయ విచారణకు వేరువేరు న్యాయ స్థానాలను ఏర్పాటు చేశారని నికిటిన్ రాశాడు. సుల్తాన్ అత్యుత్తమ న్యాయాధికారి. అతని తర్వాత సదర్ అదాలత్ అనే న్యాయస్థానం ఏర్పరచబడింది. దానికి అధిపతి భోజయుల్ ఖుజ్జత్ అని అనేవారు. అతని తర్వాత ఖాజీ, ముఫ్తిము హెతసాబ్, ఫౌజ్‌దార్ దరోగా అనే వారు ఉంటారు. వారంతా సదర్ అదాలత్ సిబ్బంది. ముస్లిం మత వివాదాలను పరిష్కరించే న్యాయాధికారిని సదర్‌జహ అని అంటారు. తరఫ్‌లలో రెండు రకాల న్యాయ స్థానాలను స్థాపించారు. ఒకటి ముస్లింల కోసం, రెండవది హిందువులు, తదితరుల కోసం. ముస్లింల కోర్టులో న్యాయాధికారి కాజి. హిందువుల కోర్టుల కాజీ హిందూ పండితుల సహకారంతో తీర్పులు చెబుతాడు. తరఫ్‌దారు తరఫ్‌లలో ఉన్నత న్యాయాధికారి, రాణాలలో రాణేదారులు విచారిస్తారు. గ్రామాలలో గ్రామపంచాయితీల న్యాయాధికారాలు కొనసాగాయి. కాని అప్పుడప్పుడు భూమి తగాదాలను రాణేదార్లు, తరఫ్‌దార్లు విచారించేవారు. అవసరమైతేనే వారు జోక్యం చేసుకొనేవారు.

శిక్షలు: బహమనీ సుల్తాన్‌లు షరియత్ న్యాయవిధానాన్ని అమలుపరిచారు. హిందువుల విషయంలో హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం శిక్షలు చెప్పారు. హత్యలకు మరణదండన, తిరుగుబాటుకు అతిక్రూర శిక్షలు విధించేవారు. బందిపోటు దొంగలను తల నరికి కోటగుమ్మానికి వేలాడదీసేవారు. ఒక అమీరు ఒక ముస్లిం యాత్రికుని అవమానం చేసినందుకు అమీరు తల తీయించాడు సుల్తాన్. ఖజానాలో బంగారు నాణేలు కాజేసినందుకు యువరాజు ముజాహిద్‌ను కొరడాలతో కొట్టించాడు. హజ్రత్ నవాబందా నవాబ్ తాగి వ్యభిచారం చేసినందుకు కొరడా దెబ్బల శిక్ష వేయబడింది. ఇవన్నీ తరఫ్‌లలోను, రాజధానులలోను వేసిన శిక్షలు. గ్రామాలలో మార్పులు లేవు. పూర్వపు పంచాయితీలే పాత సంప్రదాయాలలో తీర్పు చెప్పేవి. హిందువుల విషయంలో వారు తమ పరిషత్‌ను అమలు జరుపలేదు. అది ముస్లింల వరకే పరిమితం చేశారు. గ్రామాలలో తలారులు మామూలుగానే గస్తీ విధులు నిర్వహించారు.

పోలీసుశాఖ - కొత్వాలు: కాని పట్టణాలలో సుల్తాన్‌లు రక్షణ కొత్వాల్‌ను నియమించారు. అతడు నేటి పోలీసు సూపరింటెండెంట్ వంటివాడు. అతనికి పెద్ద సిబ్బంది ఉండేది. వారి సహాయంతో అతడు పట్టణాల రక్షణను చేపట్టి శాంతిభద్రతలు కాపాడేవాడు. జైళ్లు అతని ఆధిపత్యంలో ఉండేవి. బీదర్ నగరాన్ని సాయుధులైన 1000 మంది అశ్వికులు రాత్రుళ్లు గస్తీ తిరుగుతూ కాపాడేవారని నికిటిన్ రాశాడు.

గోల్కొండ కుతుబ్‌షాహీల పరిపాలనా వ్యవస్థ

గోల్కొండ రాజ్యాన్ని పాలించిన కుతుబ్‌షాహీలు భారతదేశాన్ని ఏలిన ఇతర ముస్లిం చక్రవర్తుల మాదిరిగా గాక ఉదారత కలిగిన పాలకులు. వారు విదేశస్తులైనప్పటికీ తమ పాలితులకంటే భిన్న ఆచార వ్యవహారాలు గలవారైనప్పటికీ విశాల హృదయంతో, ఉదార స్వభావంతో ప్రజాభిప్రాయాన్ని మన్నించి స్థానిక తెలుగు ప్రజల సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలను గౌరవించి తమ ప్రజలయందు ఆత్మీయతను చూపి దూరదృష్టిని ప్రదర్శించారు. పరమత సహనాన్ని ప్రదర్శించి హిందువులను ఉన్నత పదవులలో నియమించారు. స్థానిక వేష భాషలను అనుసరించారు. తెలుగు భాషను స్వయంగా అభ్యసించారు. తెలుగులో ఫర్మానాలు జారీ చేశారు. ఫర్మానాలు నాగరిలిపిలో రాయించారు. హిందువులకు పూర్తిగా మత స్వాతంత్ర్యాన్ని ఇచ్చారు. ఉద్యోగ నియామకాలలో విచక్షణ పాటించలేదు. వారు ఆంధ్రదేశాన్ని జయించిన విజేతలమనిగాని, తాము ప్రజల కంటే ఉన్నతమైన వారమనిగాని భావించలేదు. అందువల్ల కుతుబ్‌షాహీలు ముసల్మానులైన వారి ప్రజల లాగే వారు కూడా తెలుగువారే అని డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య శ్లాఘించారు. వారి హయాంలో ఆంధ్రదేశం సమైక్యం చెంది ఆంధ్రజాతి ఏకమైంది. ప్రజానురంజకమైన పరిపాలనను ఏర్పాటు చేసి ప్రాజ్ఞ ప్రభువులుగా కీర్తి పొందారు. వారు తెలుగు కవులను, తెలుగుభాషా సాహిత్యాలను ఉదారంగా పోషించారు. వారు గొప్ప కట్టడ నిర్మాతలు. గోల్కొండ, హైదరాబాద్ నగరాలను నిర్మించారు.

బహమనీ పరిపాలనా విధానాన్ని అనుసరించడం: కుతుబ్‌షాహీలు సుమారు 170 సంవత్సరాలు ఆంధ్రదేశాన్ని పాలించినప్పటికీ వారు నూతన పరిపాలనా విధానాన్ని రూపొందించలేదు. బహమనీ రాజ్య శిథిలాల నుండి వెలసిన రాజ్యం కనుక వారు బహమనీ రాజ్యపరిపాలన విధానాన్నే కొద్ది మార్పులతో కొనసాగించారు. తమ రాజ్యంలోని పరిస్థితులకు అనుగుణంగా పరిపాలనను చక్కగా రూపొందించి ప్రజాక్షేమమే లక్ష్యంగా పాలించారు. వీరికాలంలో ఆంధ్రదేశంలో అంతటా ముస్లిం పరిపాలనా వ్యవస్థ వ్యాపించింది. అంతకుముందు దాదాపు 4 వేల హిందూ జాగీరుదారులు కూడా తమ దర్బారులను సుల్తాన్ దర్బారులకు నమూనాలుగా నడిపారు. ముస్లిం లాగా దిరుసులు ధరించారు. పారశీక, అరబ్బీ పదాలను తమ పరిపాలనలో వాడారు. సుల్తాన్‌ల ఉద్యోగాల పేర్లు తమ ఉద్యోగులకు కూడా వాడారు.

సుల్తాన్: మధ్యయుగంలోని అన్ని రాచరికాల లాగే గోల్కొండ సుల్తాన్‌లు కూడా సర్వాధికారులే. కుతుబ్ షాహి రాజ్యంలో సుల్తాన్ సర్వాధికారి. వాస్తవానికి అతడు నిరంకుశుడు. సుల్తాన్‌లు తాము దైవాంశ సంభూతులమని, అల్లా ప్రతినిధులమని విశ్వసించారు. వారు జుల్ అల్లా అనే బిరుదు ధరించారు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా సుల్తాన్ మహ్మద్ కులీ కుతుబ్‌షాలు ఈ బిరుదు ధరించేవారు. హైదరాబాద్‌కు ప్రాగ్భాగంలో జుల్లె అల్లాగూడ అనే గ్రామం కూడా ఉంది. దానిని ఇప్పుడు జిల్లెల్లగూడ అని పిలుస్తున్నారు. జుల్ అల్లా అంటే అల్లాకు ప్రతిరూపం అని అర్థం. ప్రభుత్వ విధానాలను వారే రూపొందించేవారు. ఫర్మానాలు, సుల్తాన్ పేరుతోనే జారీ

అయ్యేవి. సేనాధిపతులను, ఉన్నతోద్యోగులను, రాయచూరులను అతనే నియమించేవాడు. అతడే సర్వాధికారి. సర్వసైన్యాధ్యక్షుడు. అతని మాటకు తిరుగులేదు. అయినప్పటికీ వారు మంత్రులు, పండితులు, ప్రజల అభిప్రాయాలను, సలహాలను పాటించి ప్రజానురంజకంగా పాలించారు. గోల్కొండ సుల్తాన్‌లు గొప్ప విద్యావంతులు, సంస్కార సంపన్నులు. మత భేదం పాటించకుండా ముస్లింలతోపాటు హిందువులకు కూడా సమాన అవకాశాలు కల్పించారు. వారు తరచూ రాజ్యంలో పర్యటించి ప్రజల కష్టసుఖాలు తెలుసుకొని అప్పటికప్పుడే, అక్కడికక్కడే న్యాయం చేసేవారు. కనుక కులీకుతుబ్‌షాను బడేమాలిక్ అని ఇబ్రహీం కుతుబ్‌షాను మల్కభిరామ్ అని, అబుల్ హసన్‌షాను తానీషా అని ప్రజలు అభిమానంతో పిలిచారు.

వారసత్వ సాంప్రదాయాలు-పట్టాభిషేకం: సుల్తాన్ మరణించగానే వారసుని ప్రకటించేవారు. సుల్తాన్ మరణించిన రెండు మూడు రోజులకు అతని శవఖననం చేసి తర్వాత రాజుగా ప్రకటింపబడిన వారసుడే గద్దెనెక్కేవాడు. ఆ సమయంలో పట్టాభిషేకోత్సవం జరిగేది. పట్టాభిషేక మహోత్సవాన్ని ఒంటెల మీద, ఏనుగుల మీద నగరమంతా తిరిగి చాటింపు చేసేవారు. రాజ ఫర్మానా చదవబడేది. ముఖ్యులైన వారు పట్టాభిషేక మహోత్సవానికి హాజరై అభినందనలు, ఆశీర్వచనాలు, కవితా పఠనాలు చేసేవారు. నగారాలు, లాషాలు, ధగాములు, నౌబతుల మోగించేవారు. ఆ శుభ సందర్భంలో జందార్ ఖానా నుండి ఖిల్లతులు పంచబడేవి. ఆ సమయంలో సుల్తాన్‌లు తమకు ఇష్టమైన వారికి, తమను సమర్థించిన వారికి నూతన పదవులు కట్టబెట్టేవారు. ఖిలేదారులకు, సేనాధిపతులకు ఇంకా రాజ సేవ చేసిన వారికి ఈనాములు వారికి తగిన పదవులు ఇచ్చేవారు. ప్రజలకు ఆ సమయంలో మిఠాయిలు పంచి పెట్టేవారు. మిఠాయిలు పంచిపెట్టడం ముస్లింల సంప్రదాయం, అబ్దుల్లా కుతుబ్‌షా మహమ్మది మహల్ అనుభవనంలో పట్టాభిషేకం జరుపుకున్నాడు. పట్టాభిషేక మహోత్సవం పూర్తి అయిన తర్వాత నూతన సుల్తాన్ దర్బారే అమ్ అనే భవనంలో ప్రజలకు దర్శనమిచ్చేవారు.

రాయబారులు అరుదెంచటం: సుల్తాన్‌లు మరణించినప్పుడు నూతన సుల్తాన్ సింహాసనం అధిష్టించే సమయంలో మరణించిన సుల్తాన్‌కు శ్రద్ధాంజలి ఘటించడానికి, నూతన సుల్తాన్‌కు శుభాకాంక్షలు తెలపడానికి సరిహద్దు రాజులు రాయబారులను పంపేవారు. అహమ్మద్‌నగర్, బీజాపూర్, బీదర్, మొగల్, ఇరాన్ సుల్తాన్‌లు తమ రాయబారులను పంపేవారు. వారు పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొనేవారు.

దర్బారు వైభవం: గోల్కొండ సుల్తాన్‌ల అతివైభవంగా దర్బారును నిర్వహించేవారు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నుండి దర్బారు వైభవం బాగా పెరిగింది. ఇబ్రహీం కాలంలో రాజ సౌధానికి తూర్పుగా విశాలమైన దర్బారు హాలు నిర్మించాడు. దాని ద్వారా హిందూ వాస్తుశిల్ప రీతిలో నిర్మింపబడ్డాయి. ముఖద్వారానికి అద్దాలు తాపడం చేయబడ్డాయి. ఆ ద్వారం ముందు నగారాలు ఉండేవి. దర్బారు ప్రారంభించే ముందు రాజ లాంఛనాన్ని సూచిస్తూ నౌబతులు మోగించేవారు. ప్రతిరోజూ ఉదయం దర్బారు జరిగేది. సామంతులు, సేనాధిపతులు, ముఖ్య అధికారులు దర్బారుకు హాజరవుతారు. సుల్తాన్ దర్బారులో ప్రవేశించగానే అందరూ తప్పకుండా లేచి అభివాదం చేయాలి. ప్రతి వ్యక్తి వంగి సలాం చేయాలి. దర్బారులో రాజ్యానికి సంబంధించిన అన్ని విషయాలు చర్చిస్తారు. న్యాయనిర్ణయాలు చేస్తారు. ముఖ్య విషయాలు, రహస్య విషయాలు రాజకీయ మంత్రాంగం చేయవలసి వస్తే దర్బారు హాలుకు దక్షిణంగా ఉన్న షాహికసర్ లేక దాద్‌మహల్ అనే భవనంలోగాని మహమ్మదీ మహల్ అనే భవనంలో గాని ప్రత్యేక సమావేశం చేసి నిర్ణయం తీసుకొనేవారట. సమస్య అతి రహస్యం అయితే ఆ భవనంలో అతి ముఖ్యులతోనే సంప్రదిస్తారు. ఆ భవనంలోకి అమీరులు, రాజోద్యోగులు ప్రవేశించినప్పటికీ వారు కూర్చోటానికి వీలులేదు. వారి వారి హోదాలను బట్టి వారికి కేటాయించిన ప్రదేశాలలో నిలబడి ఉండాలి. అత్యంత ప్రముఖులకు మాత్రమే అక్కడ కూర్చోవడానికి అధికారం ఉండేది.

దర్బారులకు రక్షణ: దర్బారు జరిగే సమయాలలో దర్బారు హాలుకు దాద్‌మహల్ మహమ్మదీ మహల్‌ల చుట్టూ గట్టి రక్షణ ఏర్పాటు చేయబడేది. హబ్షిలు సోమ్లు సిపాయిలు చుట్టూ పహరా కాస్తూ ఉండేవారు. వెయ్యి మంది కాల్బలం, కొన్ని ఏనుగులు, కొంత అశ్వికదళం, దర్బారు భవనాల చుట్టూ తిరుగుతూ పహరా కాచేవట. దర్బారు హాలులోకి ఆయుధాలే గాక పాదరక్షలు కూడా అనుమతించేవారు. రాజ దర్బారుకు పశ్చిమంగా జామ్‌దార్‌ఖాన్ ఆయుధాగారం ఉండేదట. రాజ ప్రసాదానికి, జనానాకు, టంకశాలకు చుట్టూ కూడా గట్టి కాపలా ఉండేదట. ఈ విధంగా గోల్కొండ సుల్తాన్‌లు ఠీవిగా దర్బారు నిర్వహించి దర్జాగా జీవించారు.

దేశ పర్యటన: సుల్తాన్‌లు రాజ్యాన్ని పర్యటించేటప్పుడు రాజధానిని వదలి బయటికి వస్తే మంత్రుల

రాజోద్యోగులు, సేనాధిపతులు సైన్యం వెంటవస్తుంది. అది ఒక జనప్రవాహం లాగా వెళ్లిపోతూ ఉండేది. ఏనుగులు పల్లకీలు, గుర్రాలపై వెళుతూ పెద్ద సందడిగా ఉంటుందని స్కూరర్ అనే డచ్చి ఈస్టిండియా కంపెనీ ఉద్యోగి రాశాడు. సుల్తాన్ విడిది చేసి శిబిరం ఏర్పాటు చేసిన చోటు రాజ నగరమా అని అనిపించేటంత ఆడంబరంగా ఉంటుందని కూడా అతను రాశాడు.

మజ్లిస్-ఐ-కింగోష్ లేక మంత్రి మండలి: పరిపాలనలో సుల్తాన్‌కు సహాయపడటానికి ఒక సలహా సంఘం ఉండేది. దానిని మజ్లిస్-ఐ-కింగాష్ అని అనేవారు. అందులో సభ్యులను అమీరులు అని అనేవారు. వారినే మంత్రులు అని కూడా అనే వారు. దానిని నేటి మంత్రి మండలి అని చెప్పవచ్చు. అబుల్‌హసన్ కాలంలో ఈ మంత్రి మండలే మజ్లిస్-ఇ-దివాన్‌గా పనిచేసింది. అందువల్ల దానికి మజ్లిస్-దివాన్ దరి అని కూడా పేరు వచ్చింది. అందులో 20 మంది సభ్యులుండేవారు. వారి పేర్లు కూడా ఆనాటి రికార్డుల వల్ల తెలుస్తున్నాయి. వారిలో సయ్యద్ ముసాఫిర్ అతిముఖ్యుడు. అతడు అబుల్ హసన్‌ను తన గుప్పిట్లో పెట్టుకొని అధికారం అంతా చెలాయిస్తున్నాడని అపార సంపదను పోగు చేశాడని జాన్‌ఫ్రైయర్ అనే విదేశస్తుడు రాశాడు. ఇంకా ఈ మంత్రి మండలిలో మతాచార్యులు, విద్వాంసులు, రాజనీతి దురంధరులు, ఉన్నతోద్యోగులు కూడా సభ్యులుగా ఉండేవారు. వారందరినీ సుల్తాన్ నియమించేవారు. వీరందరూ రాజధానిలో ఉంటూ సమావేశాలకు హాజరయ్యేవారు. మజ్లిస్-ఇ-దివాన్ రాజకీయ సమస్యలను చర్చించి నిర్ణయాలు తీసుకోడానికి ప్రత్యేకంగా సమావేశం అయ్యేది. సుల్తాన్‌లు అన్ని విషయాలు వారితో చర్చించేవారు. క్రీ.శ.1636లో అబ్దుల్లా కుతుబ్‌షా మజ్లిస్-ఐ-కింగాష్‌ను సమావేశపరచి మొగల్ చక్రవర్తి షాజహాన్ కోరిన ప్రార్ధన నిబంధనాన్ని వారితో చర్చించి వారి సలహా ప్రకారం అంగీకరించాడట. ఈ సలహా సంఘంలో సుల్తాన్ రాజ్య సమస్యలు, విదేశీ విధానం, అంతర్జాతీయ ఒప్పందాలు, యుద్ధాలు, సంధి తీర్మానాలు మొదలైన వాటి గురించి చర్చించేవారు. మొగలులతో జరిగిన యుద్ధాల తర్వాత క్రీ.శ.1656 తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షాకు రాజ్య పరిపాలన మీద దృష్టి సన్నగిల్లింది. అతడు తన మీర్జులం ఖాటూన్ అనే సర్దారునకు అన్నీ అప్పగించి గోల్కొండ కోటలో వినోదాలతో, నాట్యసంగీతాలతో పొద్దు పుచ్చాడట. ఆ కాలంలో ఖాటూన్ మజ్లిస్-ఐ-కింగాష్ సమావేశాలు కూడా అతడే నిర్వహించి కొన్నాళ్లు సర్వాధికారాలు చలాయించాడని విదేశీ యాత్రికులు రాశారు.

విదేశీ రాయబారులు - విదేశీ విధానం - అంతర్జాతీయ దౌత్యనీతి: కుతుబ్‌షాహీలు ఇరాన్‌షాతో స్నేహ సంబంధాలు ఏర్పరచుకొని ఒకరి దేశాలకు ఒకరు రాయబారులను పంపుకున్నారు. గోల్కొండ సుల్తాన్‌లు, ఇరాన్ సుల్తాన్‌లు షియా మతానికి చెందిన వారు. అందువల్ల వారు ఒకరికొకరు సహాయం చేసుకొంటూ మొగలుల దండయాత్రల నుండి తమ రాజ్యాలను కాపాడుకోవాలని ఆకాంక్షించారు. అందువల్ల రాయబారులను నియమించుకున్నారు. ఇరాన్ రాయబారులను హాజబ్-ఐ-అజీమ్‌షా షాన్ అని అనేవారట. క్రీ.శ.1603వ సంవత్సరంలో కంబర్ ఆలీ, నిహిదికులీ అనే ఇరాన్ రాయబారులను ఇరాన్‌షా ఉస్మానితుర్కు గోల్కొండ దర్బారుకు పంపాడు. క్రీ.శ.1614వ సంవత్సరంలో హుస్సేన్‌బేగ్ కబాజి అనే ఇరాన్ రాయబారి సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా పట్టాభిషేకోత్సవానికి అభినందనలను తెలపటానికి వచ్చాడు. క్రీ.శ.1016లో 'షేక్ మహమ్మద్ బీన్ ఖాతుం గోల్కొండ రాయబారిగా ఇరాన్ వెళ్లాడు. అతడు క్రీ.శ.1626లో తిరిగి గోల్కొండ వచ్చేనాటికి సుల్తాన్ మమమ్మద్ మరణించాడు. అతడు వచ్చే నాటికి అబ్దుల్లా కుతుబ్‌షా పట్టాభిషేకం జరుగుతోంది. అతడు అబ్దుల్లాను ఆశీర్వదించాడు. ఖాతూన్ కుమారుడు కులీబేగ్ రెండు సంవత్సరాలు హైదరాబాద్‌లో ఉండి ఇరాన్ వెళ్లిపోయాడు. అతని వెంట ఖైరత్‌ఖాన్ అనే గోల్కొండ సరదారులు కానుకలు తీసుకొని వెళ్లి ఇరాన్‌షాకు కుతుబ్‌షా తరపున సమర్పించాడు. క్రీ.శ.1630 నుండి గోల్కొండ రాజ్యం మొగలులకు సామంత రాజ్యమైంది. కనుక ఇరాన్, గోల్కొండల మధ్య రాయబారాలు అంతమయ్యాయి. అంతవరకు గోల్కొండ సుల్తాన్‌లు తమ అంతర్జాతీయ విదేశీ విధానాన్ని జాగ్రత్తగా నిర్వహించారు. ఆ తర్వాత వారు విదేశాలతో దౌత్యనీతిని పాటించలేకపోయారు. తర్వాత దేశీయ రాజ్యాలతో రాయబారాలను నిర్వహించారు. రాయబారులలో హాజబ్ ఐముఖి అంటే శాశ్వత రాయబారులు, హాజబ్ హైమస్లిహతి అంటే తాత్కాలిక రాయబారులు అనే రెండు తరగతుల వారు ఉండేవారు. ఈ రెండవ తరగతి రాయబారులు ఒక ప్రత్యేక పని మీద వచ్చి వెళ్లేవారు. వారందరూ హైదరాబాద్‌లో నివసిస్తూ ఉండేవారు. వారందరికీ వసతులు ఏర్పాటు చేయబడేవి. గోల్కొండ సుల్తాన్‌లు మొగలులకు లొంగిపోయిన దగ్గర నుండి మొగల్ రాయబారులు గోల్కొండలో ఉండేవారు. ఔరంగజేబు కుమారుడు ఆజం కొన్నాళ్లు గోల్కొండలో

ఉన్నాడు. అప్పుడు అతడు హైదరాబాద్ అధికారులకు ఆజ్ఞలు జారీ చేసేవాడని క్రీ.శ.1667లో హైదరాబాద్‌ను దర్శించిన బెర్నియర్ రాశాడు.

ఉద్యోగదళం: పరిపాలనలో సుల్తాన్‌కు సహాయపడటానికి మంత్రి మండలేగాక ఇంకా అనేక హోదాలు కలిగిన ఉన్నతోద్యోగ దళం కూడా ఉండేది. వారిలో పీష్వా, మీర్జుమ్లా, ఐనుల్ ముల్క్ మొదలైన వారు ముఖ్యులు. కోశాధికారిని ఖజాన్‌దార్ అని పిలిచేవారు. అతడు కూడా ముఖ్య అధికారే.

పీష్వా-ప్రధాన మంత్రి లేక వకాలె ముతల్లిక్: కుతుబ్‌షాహి పరిపాలనలో ప్రధాన మంత్రిని పీష్వా అని పిలిచే వారు. అతను సుల్తాన్‌కు ప్రధాన సలహాదారుడు. అనేక విధులను నిర్వహించేవాడు. సాధారణ పరిపాలన వ్యవహారాలతోపాటు దేశ, విదేశ విధానాలు నిర్వహించేవాడు. అంతేగాక రాజ్యంలోని పరిపాలనా శాఖలన్నింటినీ పర్యవేక్షించేవాడు. పీష్వాకు తెలియకుండా ఏ పరిపాలనా విధానం పని చేసేది కాదు. సుల్తాన్ పీష్వాతో దివాన్ అని వ్యవహరించారు. పీష్వాకు సహాయంగా 12 మంది మంత్రులుండేవారు. వారిని దిషాకత్ అని అనే వారు. రోజువారీ పరిపాలనలో పీష్వా వారి సేవలు ఉపయోగించుకొనేవాడు. కాని వారు ఏ శాఖలను నిర్వహించేవారో తెలియదు. వారిలో సీనియర్ మంత్రిని ఉల్ ముల్క్ అని అనేవారు. వారిలో ఒకరు సైన్యాలను పర్యవేక్షించేవారు. ఈ 12 మంది మంత్రులకు జాగీరులుండేవి. ఈ జాగీరులు రాజధానికి దూరంగా ఇచ్చేవారు. వారు మాత్రం రాజధానిలో నివసించేవారు. వారు బలవంతులై సుల్తాన్ అధికారాన్ని ధిక్కరించకుండా వారికి దూరంగా జాగీరులివ్వబడ్డాయి. అయినప్పటికీ వారి చర్యలను ఎప్పటికప్పుడు సుల్తాన్ గూఢచారుల ద్వారా తెలుసుకుంటూ ఉండేవాడు. మీర్జుమ్లా పదవిని నిర్వహించిన వారిని పీష్వాలే నియమించేవారు. ముస్తాఫాఖాన్, మహమ్మద్, ఇష్రీ ఖాటూన్, మాదన్నలు పేరు మోసిన గోల్కొండ రాజ్యం పీష్వాకు ఖిల్లత్ పీష్వాయి వకాలేనూతల్లక్ అని కూడా బిరుదులున్నాయి. పీష్వాలు పల్లకీలో రాజదర్బారుకు వచ్చేవారు. ఇంకా పీష్వా కింద ఇద్దరు దబీరులు, ఇద్దరు కార్యదర్శులు ఉండేవారు.

మీర్జుమ్లా - ఆర్థిక మంత్రి: రాజ్యంలో పీష్వా తర్వాత స్థానం మీర్జుమ్లాది. ఇతడు ఆర్థికమంత్రి. రాజ్యపు ఆదాయ వ్యయాలు మొదలైన ఆర్థిక వ్యవహారాలను నిర్వహించేవాడు. అంతేగాక సైనిక వ్యవహారాలు తనిఖీ చేసేవాడు. పౌరపాలనను కూడా పర్యవేక్షించి ప్రజల మంచి చెడ్డలు చూసేవాడు. సైనిక విషయాలలో పీష్వాకన్నా మీర్జుమ్లా ప్రధాన పాత్ర నిర్వహించేవాడు. మీర్జుమ్లాకు అమీర్జుమ్లా, అని, జుంలాతుల్ ముల్క్, జిరాత్‌జుమ్ లతుల్ ముల్క్ అని కూడా బిరుదులున్నాయి. మన్‌సూర్‌ఖాన్, మహ్మద్ అమన్, మహ్మద్ సయ్యద్ ప్రసిద్ధి చెందిన మీర్జుమ్లాలు. మీర్జుమహ్మద్ అమీన్ మహ్మద్ కులీకుతబ్‌షా కాలంలో మీర్జుమ్లాగా పని చేశాడు. ముల్లాతకీ మహమ్మద్ సయ్యద్ అర్ద్‌సతానీలు అబుద్దల్లాకు తుబ్‌షాకు మీర్జుమ్లాగా పని చేశారు. వీరిలో మహ్మద్ అమీర్ కుముల్లాతఖీకు ఖలందానెమర్హి ఇవ్వబడింది. వారికాలంలో పీష్వాకన్నా మీర్జుమ్లాయే ఎక్కువ అధికారులు చెలాయించాడు.

ఐనుల్‌ముల్క్ - సర్వసైన్యాధ్యక్షుడు: ఇతనికి వజారే ఐనుల్ ముల్క్ అని కూడా పేరుంది. ఇతని ఉద్యోగం అన్ని ఉద్యోగాలకంటే శక్తివంతమైనది.

ఐనుల్‌ముల్క్: మంత్రులలో తర్వాత వాడు ఐనుల్ ముల్కు. ఇతడు యుద్ధ మంత్రి. సైనిక వ్యవహారాలన్నీ చూసేవాడు. సైనికులను చేర్చుకోవడం, వారికి శిక్షణ ఇప్పించడం మొదలైన విధులను నిర్వహించేవాడు. ఇతడిని ఒక విధంగా సర్వసైన్యాధిపతితో పోల్చవచ్చు. ఇతనిపై మీర్జుమ్లా అజమాయిషీ చేసేవాడు. సయిఫ్ ఖాన్, మన్సూర్ ఖాన్, హబ్షి అనే వారు ఈ పదవిని నిర్వహించారు.

మజుందార్: ఇతడు మంత్రి హోదా గలవాడే గాని పెద్ద హోదాకాదు. ఇతనిని నేటి ఉప మంత్రితో పోల్చవచ్చు. ఇతడు రాజ్యపు ఆదాయ వ్యయ పట్టికలు తయారు చేసేవాడు. ప్రభుత్వ శాఖల లెక్కలను తనిఖీ చేసే వాడు. ఇతనిని ప్రస్తుతం ఆడిటర్ జనరల్ లేక గణాంకాధికారితో పోల్చవచ్చును. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నారాయణరావు అనే హిందువు ఈ ఉద్యోగాన్ని నిర్వహించాడు. అతని కాలంలో ఈ శాఖలో అనేక మంది హిందువులు పని చేశారు.

నాజిర్ లేక నాజర్ లేక నాజరుల్ముల్క్: ఇతడు రాజ్యపు ఆదాయ వ్యయాలను పరిశీలిస్తాడు. ఇతర పరిపాలనా శాఖలను తనఖీ చేస్తాడు. రాజ్యంలోని పరిపాలన వ్యవహారాలు, శాంతిభద్రతలపై కేంద్రప్రభుత్వానికి నివేదికలు పంపుతాడు. ఇతడు మీర్జుమ్లా అధికారం కింద ఉంటాడు. మహ్మద్ కుతుబ్‌షా కాలంలో మీర్‌ఖాసింబ

ఈ పదవిని నిర్వహించారు.

దబీర్ లేక దబీరుల్ముల్క్ లేక మున్షీ: ఇతనికి మున్షీ అల్ ముమాలిక్ షమానతిస్ అని కూడ పేర్లున్నాయి. ఇతడు సుల్తాన్‌కు ప్రత్యేక కార్యదర్శిగా వ్యవహరిస్తాడు. రాజ ఫర్మానాలు రాయడం, వాటిని ఎవరికి పంపాలో వారికి పంపడం, రాజ శాసనాలు ప్రకటించి ప్రజలకు తెలియచేయడం, రాజశాసనాలు అమలుపరచటం అతని విధులు. ప్రభుత్వ పత్రాలను జాగ్రత్త చేసి కాపాడేవాడు. అంటే రికార్డు కీపర్ అని చెప్పవచ్చును. దబీరులలో దబీరు ఐముమాలిక్, దబీరు ఐఫర్మానీ ఇందవాల్ రాజ ఫర్మానాలను స్థానిక ప్రజల కోసం తెలుగు, కన్నడ భాషలలో రాసేవారు. గోల్కొండ రాజ్యం తెలుగు రాజ్యం. కనుక సుల్తాన్‌లు తెలుగులో ఫర్మానాలు జారీ చేసేవారు. అలాగే కొన్ని కన్నడ ప్రాంతాలు, తమిళ ప్రాంతాలు కూడా వీరి కింద ఉండేవి. వారికి ఆయా స్థానిక భాషలలో ఫర్మానాలు రాయబడ్డాయి. నాగరి లిపిలో ఫర్మానాలు రాయించేవారు. సుల్తాన్‌లు తెలుగుభాషను నేర్చుకొనేవారు. తెలుగుభాషలో మాట్లాడేవారు. ఈ తెలుగు, కన్నడ మొదలైన భాషలలో ఫర్మానాలు రాయటానికి దబీరు-ఐ-ఫర్మాని ఇందవాల్ అనే ప్రత్యేక దబీర్ శాఖ ఏర్పాటు చేయబడింది. ఈ శాఖలో ఆయా భాషలకు సంబంధించిన హిందువులు రాతకాండ్రుగా ఉండేవారు. వారు హిందువులైనప్పటికీ పర్షియా భాషలో మంచి ప్రవేశం ఉండేది. సుల్తాన్ మహ్మద్ కాలంలో ఖాజా ముజఫరిలీ అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మౌలనా అదీస్‌లు దబీరులుగా వ్యవహరించారు. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ఫర్మానీ ఇందవాల్ శాఖకు ఏత్‌మాద్‌రా అనే అతడు అధికారిగా నియమింపబడ్డాడు. దబీరు ఆఫీసును దివానీ ఐ ఇన్‌షా అని కూడా పిలిచేవారు. దబీరులకు న్యాయాధికారాలు కూడా ఉండేవి. ఇంగ్లిష్ వారు దబీరులను న్యాయాధీశులు అని కూడా రాశారు. వారు ఒక్కొక్కప్పుడు మజుందార్ విధులను కూడా నిర్వహించేవారు.

హవల్‌దార్: ఇతడు అశ్వశాలలను నిర్వహించేవారు. ప్రభుత్వ గిడ్డంగులను రక్షించేవాడు. రేవు పట్టణాలను అజమాయిషీ చేసేవాడు. హవల్‌దారులు రాజభాండాగార, గజశాలల రక్షణ బాధ్యతను కూడా నిర్వర్తించేవారు.

సర్‌ఖేల్: రాజధానిలో సర్‌ఖేల్ అనే మరొక పెద్ద అధికారి ఉండేవాడు. ఇతడు రెవెన్యూ అధికారి. సర్కారుల, రెవెన్యూ అధికారుల మీద కూడా అతనికి అజమాయిషీ చేసే అధికారం ఉంది. అంటే రాష్ట్రాలన్నింటి మీద ఇతనికి అధికారం ఉంది. ముఖ్యంగా తూర్పు కోస్తాలోని ఐరోపా కంపెనీల లావాదేవీలను ఇతడు చూసేవాడు. రేవు పట్టణాల అధికారులైన హవల్‌దారులను కూడా పర్యవేక్షించే అధికారం వారికి ఉండేది. సర్‌ఖేల్ ఉద్యోగులలో చిన్నతరహా ఉద్యోగులు కూడా ఉన్నారు. చిన్నతరహా సర్‌ఖేలులు ఐనుల్‌ముల్క్ అధికారం కింద సైనిక విభాగంలో పనిచేసే వారు. అలాగే సర్‌ఖేల్ షాహి అనే ఉద్యోగి సుల్తాన్ రక్షణ బాధ్యత వహించేవాడు.

కొత్వాల్: ఇతడు పోలీసు అధికారి. నగరాలు, పట్టణాలలో శాంతిభద్రతలను కాపాడటం అతని ప్రధాన విధి. ఇతనిని నేటి పోలీసు కమిషనర్‌తో పోల్చవచ్చును. నగరాలలో అల్లర్లు, దోపిడీలు జరుగకుండా చూసేవాడు. అతని అధికార పరిధిలో సర్కల్ అనే మరొక చిన్న ఉద్యోగి ఉండేవాడు. కొత్వాల్ అనుమతి లేనిదే ఏ కొత్త వ్యక్తి నగరంలో ప్రవేశించటానికి వీలులేదు. నగరంలో ప్రవేశించే కొత్త వారిని నగర ద్వారం వద్దనే తనిఖీ చేసి లోపలకు ప్రవేశించటానికి అనుమతినిస్తాడు. తర్వాత కూడా కొత్త వారు నగరంలో ఉన్నంతవరకు వారి మీద నిఘా ఉంచి పరిశీలిస్తాడు. వారు ఎలాంటి గూఢచారి చర్యలు చేయకుండా రాజ్యానికి చెడు తలపెట్టకుండా చూస్తూ ఉంటాడు. కొత్వాలు నగర వివాదాలలో ఒక్కొక్కప్పుడు అక్కడే విచారించి ముద్రణాలయ రక్షణకు కూడా బాధ్యత వహిస్తాడు. గోల్కొండ రాజ్యంలో మంచి పోలీస్ వ్యవస్థ ఉందని, కొత్వాలు తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్నాడని, అందువల్ల పోలీసు వ్యవస్థ చక్కగా పని చేసేదని టావర్నియర్ మొదలైన విదేశీ యాత్రికులు వర్ణించారు.

తరఫ్ ప్రభుత్వం: పరిపాలనా సౌలభ్యం కోసం గోల్కొండ రాజ్యాన్ని తరఫ్‌లుగా విభజించారు. తరఫ్‌లను రాష్ట్రాలనవచ్చును. తరఫ్‌లను సర్కారులుగా విభజించారు. సర్కారులను జిల్లాలనవచ్చును. సర్కార్లను పరగణాలుగా విభజించారు. పరగణాలు తాలూకాలనవచ్చును. బహమనీ రాజ్యంలో కూడా రాష్ట్రాన్ని తరఫ్‌లనే పిలిచేవారు. గోల్కొండ రాజ్యం 6 తరఫ్‌లుగా విభజింపబడింది. అందులో కర్ణాటక తరఫ్ విశాలమైంది. ఇందులో అనేక రేవు పట్టణాలు ఉండేవి. కనుక ఐరోపా వాసులు అనేక వ్యాపార స్థావరలు ఏర్పరచుకున్నారు. రేవు సుంకాలతో సంపన్నంగా ఉండేది. ఆ తరఫ్‌లో మద్రాసు, పులికాట్ వంటి రేవులు ఉండేవి. డచ్చి, ఇంగ్లిష్, ఫ్రెంచి మొదలైన విదేశీ కంపెనీలు ఉండేవి. ఆదాయం ఎక్కువగా వస్తూ ఉండేది. అందువల్ల ఆ రాష్ట్ర పాలనలో సుల్తాన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొనేవాడు. ఆ రాష్ట్రానికి నెక్నంఖాన్, అంగన్న, అక్కన్న వంటి సమర్థులను పాలకులుగా

నియమించేవాడు. తానీషా కాలంలో గోల్కొండ రాజ్యం 6 తరఫ్‌లుగా, 37 సర్కారులుగా 517 పరగణాలు లేక సమత్తులుగా విభజింపబడింది.

మొదటి తరఫ్ : 1. సర్కార్ మహ్మదు నగరు, 2. మెదకు, 3. కౌలాస్, 4. ముల్కనూరు

రెండవ తరఫ్ : 1. ఎల్లందల, 2. వరంగల్, 3. ఖమ్మమెట్టు, 4. దేవరకొండ

మూడవ తరఫ్ : 1. పానగల్, 2. ముస్తాఫానగర్ (కొండపల్లి), 4. భువనగిరి, 4. అకర్‌కర

నాల్గవ తరఫ్ : 1. కొయిల్‌కొండ, 2. ఘన్‌పూర్, 3. ముర్తజానగర్ (గుంటూర్), 4. నిజాంపట్టణం, 5. కడప, కర్నూలు ప్రాంతాలు

ఐదోవ తరఫ్ : 1. మచిలీపట్నం, 2. ఏలూరు, 3. రాజమండ్రి, 4. సికాకోల్.

ఆరవ తరఫ్ : కర్ణాటక ప్రాంతం. ఇందులో 16 సర్కారులు ఉండేవి. కుతుబ్‌షాహి రాజ్యంలోని నాలుగు తరఫ్‌ల వైశాల్యం గల పెద్ద తరఫ్ ఇది. పలనాటి నుండి తూర్పుకోస్తా మొత్తం తిరుచునాపల్లి వరకు విస్తరించి ఉండేది. ఈ తరఫ్‌లలో దుర్గాలను ఖిలేదారులు నిర్వహించేవారు. దుర్గ రక్షణమునకు సైన్యముండేది. సర్‌ఖేల్ సర్ లష్కర్‌లు ఈ దుర్గాలపై అజమాయిషీ జరుపుతుండేవారు. సామ్రాజ్యాన్ని సర్కారులుగా, పరగణాలుగా విభజించే పద్ధతిని మొదట షేర్షా ప్రవేశపెట్టాడు. తర్వాత మొగలుల అనుసరించాడు. అదే పద్ధతిని గోల్కొండ రాజ్యం కూడా అనుసరించినట్లు కనిపిస్తుంది.

తరఫ్‌దార్: తరఫ్‌పై అధికారిని తరఫ్‌దార్ అని అంటారు. ఇతనికి సర్‌లష్కర్, సర్ లషం అని కూడా పేర్లున్నాయి. ఇతడు రాష్ట్రపు అంటే తరఫ్‌కు సైనికాధికారి. అతడు శాంతిభద్రతలను కాపాడి పౌర పరిపాలనను నిర్వహించేవాడు. పరిపాలనలో అతనికి దివాన్ ఖాజి, పండిట్లు సహాయపడేవారు.

దివాన్: ఇతడు రాష్ట్రపు రెవెన్యూ వ్యవహారాలను చూసేవాడు. తరఫ్‌లలో భూమి శిస్తు వేలం పద్ధతిలో వసూలు చేయబడేది. వేలంపాడిన కాంట్రాక్టుదారుల నుండి దివాన్ శిస్తు వసూలు చేసి కేంద్ర కోశాగారానికి పంపేవాడు. కాంట్రాక్టుదారులు శిస్తును సంవత్సరంలో రెండు మూడు వాయిదాలుగా చెల్లించేవారు.

ఖాజీ పండిట్లు: వీరు రాష్ట్రంలో న్యాయాధికారులు, ముస్లింలకు ఖాజీ, హిందువులకు పండిట్లు న్యాయ విచారణ చేసేవారు. వారికి దివాన్ న్యాయ నిర్వహణలో సహాయపడేవాడు. ముస్లింల వివాహాలు, విడాకులు, ఆస్తి పంపకాలు, ఆస్థి తగాదాలు ఖాజీలు విచారించేవారు. హిందూ వివాదాలను హిందూ పండితులు తీర్పులు చెప్పేవారు.

సర్కార్లు: తరఫ్‌లు సర్కారులుగా విభజింపబడ్డాయి. తానీషా కాలంలో గోల్కొండ రాజ్యంలో 37 సర్కారులు ఉండేవి. సర్కారుకు అధిపతి ఫౌజ్‌దార్. అతను సైనికాధికారి. శాంతిభద్రలను కాపాడుట, పౌరపాలన నిర్వహించుట అతని విధి. అతనికి సైనిక వ్యవహారాలోను, శాంతిభద్రతల నిర్వహణలోనూ హవల్‌దార్ అనే ఉద్యోగి సహాయపడేవాడు. ఖాజీ పండిట్లు న్యాయ నిర్వహణలో సహాయపడేవారు. వీరేగాక ఖతిబ్ అనే మరొక ఉద్యోగి ప్రభుత్వ శాసనాలు రాసి జారీ చేసేవాడు.

తాలూకా లేక పరగణా లేక సమత్‌లు: సర్కారులు పరగణాలుగా విభజించబడ్డాయి. పరగణాలకు సమత్‌లని, తాలూకాలని కూడా పేర్లు ఉండేవి. తానీషా కాలంలో గోల్కొండ రాజ్యంలో 517 పరగణాలు లేక తాలూకాలు ఉండేవి. పరగణా లేక తాలూకాల ఉప ఫౌజుదార్ అధిపతి. అతనికి హవల్‌దార్, ఖాజీ, పండిట్లు పరగణా పరిపాలనలో సహాయపడేవారు. సమత్ లేక పరగణాధికారిని సర్ సమత్ అని కూడా పిలిచేవారు. వీరే కాక ఖలీల్ అనే స్థానిక ఉద్యోగులు ఉండేవారు. వారు రాజ ఫర్మానాలను ప్రజలకు వివరించి వాటిని అమలు జరిపేవారు.

రేవు పట్టణాల పరిపాలన: గోల్కొండ రాజ్యంలో మద్రాసు, మచిలీపట్టణం, పాండిచ్చేరి, పులికాట్ మొదలైన అనేక పట్టణాలు ఉండేవి. ఈ రేవుల వద్ద ఐరోపా వారు స్థావరాలు నిర్మించుకొని ఉండేవారు. విదేశీ వ్యాపారం ముమ్మరంగా జరుగుతుండేది. సుంకాల రూపంలో రాజ్యానికి గొప్ప ఆదాయం వచ్చేది. కనుక రేవు పట్టణాలను ప్రత్యేక పాలనా విభాగాలు చేసి సమర్థులు నమ్మకస్తులైన హవల్దారులను రేవులకు అధిపతులుగా నియమించారు. హవల్దారులు శాంతి భద్రతలను కాపాడుతూ కాంట్రాక్టర్లు సుంకాలు వసూలు చేసుకోడానికి సహాయపడుతుండే వారు. ముఖ్యంగా హవల్దారు అక్కడ రక్షణాధికారి. వ్యాపారులకు సరుకులకు, ఓడలకు రక్షణ ఇస్తారు.

షాబందర్ లేక షాహబందర్: మొత్తం రేవు వ్యవహారాలు చూడటానికి, సుంకాల వసూలు మొదలైన

పనులు చేయడానికి ప్రతి రేవుకు మరొక ప్రధానాధికారి కూడా ఉంటాడు. అతనిని షాబందర్ అని పిలిచేవారు. రేవులు ప్రతి సంవత్సరం వేలంపాట పెట్టి ఎక్కువపాడిన వారికి గుత్తకు ఇచ్చేవారు. మోర్ లేండ అనే అతడు షాబందరులుగా బ్రాహ్మణులనుగాని, బనియాలనుగాని నియమించేవారని రాశారు. ఐరోపా కంపెనీల వారు షాబందర్ పెద్ద అధికారి అయినప్పటికీ వారు అతనికంటే హావల్‌దారునే ఎక్కువగా గౌరవించేవారు. కారణం అతడు వారికి ప్రత్యక్ష అధికారి. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో మచిలీపట్నంలో డచ్చివారు ఇంగ్లిష్ వారిపైన దాడి చేశారు. అందువల్ల డచ్చివారిపై అక్కడ షహబందర్, హావల్‌దారు ఇద్దరూ కలసి చర్య తీసుకున్నారు.

వేతనాలు: గోల్కొండ రాజ్యంలో జాగీరు విధానం లేదు. కేంద్ర రాష్ట్ర ఉద్యోగులందరికీ కేంద్రప్రభుత్వం జీతాలు చెల్లించేది. అందువల్ల రాష్ట్ర స్థానికాధికార్లు, కేంద్ర ప్రభుత్వానికి విధేయులుగా ఉండేవారు. అంతేగాక సుల్తాన్, పీష్వా మొదలైన ఇతర మంత్రులు తరచూ రాష్ట్రాలను, సర్కారులను పర్యటించి పరిపాలనను పర్యవేక్షించేవారు. తానీషా, అతని పీష్వా మాదన్న నాలుగుసార్లు కర్ణాటక తరఫ్ సందర్శించి అన్ని విషయాలు స్వయంగా పర్యవేక్షించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి. రాష్ట్ర పాలకులు తిరుగుబాటులకు పాల్పడేవారు కాదు.

ఇతర చిన్న ఉద్యోగులు: రాజ్యంలో ఇంకా అనేక తరహాల చిన్న చిన్న ఉద్యోగులు ఉండేవారు. దేశ్‌పాండే, దేశ్‌ముఖ్, మజుందార్, రాజేదార్, తల్ కర్ణి లేక స్థల కరణం, కులకర్ణి ముఖద్దమ్ మొదలైన చిన్న చిన్న ఉద్యోగుల పేర్లు వారి సనద్‌లలో, ఫర్మానాలలో పేర్కొనబడ్డాయి. పరగణా రెవెన్యూ అధికారిని దేశ్‌ముఖ్ అని అంటారు. ముఖద్దమ్ గ్రామాధికారి, కుల్‌కర్ణి గ్రామ కరణం. ప్రభుత్వ ఉద్యోగులందరూ వజీరుల దగ్గర నుండి కుల్‌కర్ణి వరకు అంతా లంచగొండులు, ప్రజలను పీడించేవారు, విపరీతంగా సంపాదించేవారు అని విదేశస్తులు రాశారు. మచిలీ పట్టణం సుబేదార్‌ను గురించి బౌరీ అనే విదేశస్తుడు వివరించాడు. సుబేదార్ హోదా చాల గొప్పది. అతడు ఎక్కడికి బయలుదేరినా ఏనుగు మీదగాని, పల్లకీ మీదగాని వెళ్లేవాడు. ఆయన వెనుక రెండు మూడు వందల మంది పాదచారులుగా నడిచివెళుతూ ఉండేవారు. ఇక సంపదకు కొదవలేదని వర్ణించాడు. ఈ విధంగా ప్రతి రాజోద్యోగి తన హోదాకు తగినట్లు విలాసంగా జీవించేవారు. బీదలను పీడించి సంపాదించిన సంపదలతో నవాబులు, సామంతులు, వారి ఉద్యోగుల భవనాలు మెరిసిపోతూ ఉండేవి. వారి సేవకులు కూడా ఆశపోతులే. వీలు కలిగితే ఎక్కడైనా ప్రజలను దోచుకుంటారు అని క్రీ.శ.1620 సంవత్సరంలో తూర్పు కోస్తా నుండి సూరత్ వరకు స్థల మార్గాన ప్రయాణం చేసి నాటి పరిస్థితులను వివరించాడు పెల్సార్ట్ అనే విదేశస్తుడు.

గ్రామ పరిపాలన: గ్రామాలలో పూర్వపు పంచాయితీలు కొనసాగాయి. కాని పంచాయితీ సభ్యులు ఎన్నికైనట్లు లేదని షేర్వాణి రాశారు. అక్కడక్కడ పంచాయితీలు కొంత మందికి భూములు ఇచ్చినట్లు రికార్డులు ఉన్నాయి. కనుక పంచాయితీలకు హిందూయుగంలో ఉన్నట్లు అధికారాలు ఉన్నాయని భావించాలి. క్రీ.శ.1684వ సంవత్సరంలో కందుకూరులో ఒక దొమ్మరివాడు ప్రదర్శనలిస్తూ తాడు మీద నుండి కిందపడి చనిపోయాడు. అతని పిల్లలకు ఈనాము ఇవ్వాలని ఆ గ్రామపంచాయితీ సుల్తాన్‌కు నివేదించబడింది. అందువల్ల కస్బా గ్రామంలో తూర్పు పొలాలలో ఒక గొర్రు మెట్టభూమి, నల్లగట్టు చెరువు కింద నాలుగు తూముల తరి భూమి ఇవ్వబడింది. కస్బా గ్రామ కాపులు కరణాల అంగీకారంతో ఈ భూమి ఇవ్వబడింది. కస్బా గ్రామ కాపులు, కరణాల అంగీకారంతో ఈ భూమి ఇవ్వబడిందని ఆ దాన శాసనం తెలుపుతోంది. కుతుబ్‌షాహీల ఫర్మానాలు మిరాశీ హక్కులు గల 12 మంది ఆయాగార్లను పేర్కొంటోంది. 1. పటేల్, 2. కులకర్ణి, 3. చౌదరి, 4. ఫోతేదార్, 5. దేశ్‌పాండ్య, 6. సహని, 7. పారిక్, 8. సుతార్, 9. కుంభార్, 10. వేశహార్, 11. జోషి, 12. పురోహితులు లేక గురువు అనే పన్నెండు పేర్లు కనిపిస్తున్నాయి. ఇది అంతకు పూర్వం కాకతీయుల కాలంలో గ్రామాలలో ఏర్పడిన వ్యవస్థనే ఈ పేర్లతో కొనసాగించారని చెప్పవచ్చును. వీరు, ప్రభుత్వ అధికారులందరూ కలసి గోత్రభాగా ఏర్పడేవారు. దీనినే గోత్రకూటమి అని కూడా అనేవారు. ఇందులో ప్రభుత్వ అధికారులైన వతన్‌దారులు, గ్రామ ఉద్యోగులైన మిరాశీదారులు, గ్రామ కౌలుదారులు అంటే రైతులు సభ్యులు. అంటే ఇది పూర్వపు గ్రామసభకు నమూనా అని చెప్పవచ్చును. మిరాశీదారు అంటే వారసత్వపు హక్కు అని అర్థం. మిరాస్ అనే పదం నుంచి ఇది వచ్చింది. మిరాస్ అంటే వంశపారంపర్యపు హక్కు గ్రామాలలో హిందువులకు తగవులు వస్తే సుల్తాన్‌లు ముస్లిం అధికారులు కలుగజేసుకొనేవారు కాదు. ఆ వివాదాన్ని బ్రాహ్మణ సభకు అప్పజెప్పేవారు.

కావలిగార్: గ్రామాలలో రక్షణకు తలారులు ఉండేవారు. వారుగాక సర్కారులకు పరగణాలకు ప్రత్యేక

కావలిగార్లను నియమించారు. వారు తమ ఆధీన ప్రాంతంలో దొంగలను పట్టుకోవాలి. దొంగసొత్తును స్వాధీనం చేసుకోవాలి. కొన్నిచోట్ల కావలిగార్ల బాధ్యతలను పాలెగాండ్రకు అప్పజెప్పేవారు. అందుకుగాను వారికి పన్ను చెల్లించనక్కరలేని గ్రామాలు ఇస్తారు. అలాంటి గ్రామాలను మొఖాసా గ్రామాలు అనేవారు. ఆ గ్రామాలలో వారు పంట మీద మేర వసూలు చేసుకొంటారు. ఈ మేరలు అన్ని గ్రామాలలో ఒకే విధంగా ఉండవు.

రెవెన్యూ విధానం - ఆదాయ వ్యయాలు: రాజ్యంలో పరిపాలనా నిర్వహణకు, సైన్యాన్ని పోషించటానికి ఎంతో ఆదాయం కావలసి ఉండేది. కుతుబ్‌షాహీలు తమ ఆదాయాన్ని పరిపాలన నిర్వహణకేగాక ప్రజాహిత కార్యాలకు కూడా ఖర్చు పెట్టారు. వ్యవసాయాభివృద్ధికి అనేక చెరువులు తవ్వించారు. నగర నిర్మాణాలకు, చార్మినార్ వంటి కట్టడాలకు, సాహిత్య పోషణకు కూడా ఖర్చు పెట్టారు. కనుక గోల్కొండ నవాబులు అనేక మార్గాల ద్వారా తమ ఆదాయాన్ని రాబట్టుకున్నారు. భూమిశిస్తు, రేవు సుంకాలు, ఆదాయాలలో అతి ముఖ్యమైనవి. గోల్కొండ సుల్తాన్‌లు వేలం పద్ధతి ద్వారా శిస్తు వసూలు చేసేవారు.

వేలం పాట - శిస్తు వసూలు - రేవుసుంకాలు - ముస్తజీరులు: వేలంపాటలో ఎవరు అధిక మొత్తం చెల్లిస్తే వారికి శిస్తు వసూలు అధికారం దఖలుపడేది. రాజ్యంలో శిస్తు వసూలుకు సహితం సర్కారును ప్రమాణంగా తీసుకున్నారు. అన్ని సర్కారులలో వేలంపాటల ద్వారా శిస్తు వసూలు అధికారాన్ని అమ్మేవారు. ఆ అధికారం కొన్న వారిని ముస్తజీర్లు అని పిలిచేవారు. వీరిని వేలం లేక శిస్తు కాంట్రాక్టర్లు అని అనేవారు. వారికి సర్కారుపై ఒక సంవత్సరం శిస్తు వసూలు చేసుకొనే అధికారం ఉంటుంది. భూమి శిస్తు వసూలు చేయడంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోటానికి అతనికి సివిల్, క్రిమినల్ అధికారాలు కూడా ఇవ్వబడ్డాయి. ముస్తజీర్లలో ఎక్కువ మంది హిందువులు ఉండేవారు. ముఖ్యంగా బ్రాహ్మణులు, వైశ్యులు తమకు ఇష్టమైన వారికి శిస్తు వసూలు చేసి ఇచ్చేవారు. ఈ విధానం వల్ల ప్రభుత్వానికి, రైతుకు మధ్య ఇద్దరు ముగ్గురు మధ్యవర్తులేర్పడి రైతుపై శిస్తు భారం పెరిగింది. రేవుపట్టణాలలో కూడా సుంకాలు వసూలు చేసే అధికారం ముస్తజీర్లకు అమ్మేవారు. వారు శిస్తు వసూలు చేసుకోవడానికి అక్కడి హవల్దారులు సహాయపడేవారు.

పన్నుగుత్త - వేలంపాటలు - జమీందారీ విధానం - ముస్తజీర్ల విధానం: కుతుబ్‌షాహీల యుగంలో ప్రాముఖ్యత చెందిన విధానం పన్ను గుత్త పద్ధతి. గోల్కొండ నవాబుల ఆంధ్రదేశాన్నంతటినీ జయించారు. నూతనంగా తమ కిందకు వచ్చిన ప్రాంతాలలో కిందిస్థాయి వరకు ఉద్యోగ దళాన్ని ఏర్పాటు చేసి పన్నులు వసూలు చేసుకోనే విధానాన్ని వారు రూపొందించలేదు. అందుకు భిన్నంగా వారు ఎక్కడికక్కడే పన్ను వసూలు చేసే బాధ తప్పిపోయింది. పైగా జనాభాలో అధిక సంఖ్యాకులు హిందువులు. వారి నుండి ప్రత్యక్షంగా పన్నులు వసూలు చేస్తే రాజవంశంపై ద్వేషం కలిగే అవకాశం ఉంది. అదే పన్నును గుత్తకు ఇచ్చివేస్తే ఆ బాధలన్నీ గుత్తదారుడు భరిస్తాడు. తమకు ఒకే మొత్తంగా గుత్తదారు నుండి ఆదాయం వస్తుంది. కనుక వారు పన్నుగుత్త విధానాన్ని అవలంబించారు.

వేలం పద్ధతి: పన్నును గుత్తకు ఇవ్వడానికి వారు వేలంపాట పద్ధతిని ప్రవేశపెట్టారు. ఎవరు ఎక్కువ పాటపాడితే వారికి ఆ ప్రాంతంపై పన్ను గుత్త అధికారాన్ని ఇచ్చేవారు. వారు సర్కారులు, పరగణాలు, గ్రామాలను ఎక్కడికక్కడే అన్నింటిని గుత్తకు ఇచ్చివేశారు. ఎవరి శక్తి కొలది వారు పాటలు పాడుకొనేవారు. ప్రతి సంవత్సరం వేలంపాటలు జరిగేవని మూర్‌లాండ్ రాశాడు. కొండవీడు, బెల్లంకొండ, వినుకొండ, మచిలీపట్నం అన్నీ వేలం వేసేవారు. కొండవీడు 40 వేలు, మచిలీపట్టణం 180 వేలు, నిజాంపట్నం 55 వేల పగోడాలకు వేలం వేసేవారని అతడు రాశాడు. ఈ ప్రాంతాలు గుత్తకు ఇచ్చినందువల్ల అక్కడ పని చేసే సుబేదారులకు సుల్తాన్ నిజాంపట్టణం సుబేదారుకు 5 వేల పగోడాలు గుత్తలో నుంచి వదలివేసి మిగిలింది సుల్తాన్ ఖజానాకు చేరేది. గుత్తల ద్వారా వచ్చే ఆదాయమేగాక ఇతర రూపాలలో ఈ ప్రాంతాల నుండి ఆదాయం వస్తూనే ఉంటుందని అది 20 లక్షల పగోడాల దాకా ఉంటుందని, అది నజరానాల ద్వారా ముట్టుతుందని విదేశస్తులు రాశారు. పన్ను గుత్తదారులకు న్యాయాధికారాలు కూడా ఇవ్వబడేవి. సుబేదారులు కూడా తమ భూభాగాలు చీల్చి పన్నుగుత్తకు ఇచ్చేవారని నెల్లూరు జిల్లా గజటీర్ తెలుపుతోంది. భూమి మీదనేగాక వృత్తి పన్నులు, రేవు సుంకాలను, వ్యాపారులపై వేసే పన్నులను కూడా గుత్తకు ఇచ్చేవారు. ఈ పద్ధతి వల్ల సుల్తాన్‌లు ఇబ్బందులు లేకుండా ఆదాయం పొందేవారు.

జమీందారీ విధానం: గోల్కొండ నవాబుల ఆంధ్రదేశాన్నంతటినీ జయించారు. అందువల్ల అంతకుపూర్వం ఆంధ్రదేశాన్ని పాలించే అనేక రాజవంశాలు తమ రాజ్యాలను పోగొట్టుకున్నారు. సైనిక వృత్తిని చేపట్టిన అనేక కమ్మ, రెడ్డి, వెలమ కుటుంబాలకు తమ ఉద్యోగాలు, హోదాలు పోయాయి. వారి స్థానాలలో అన్ని ప్రదేశాలలో

ముస్లిం సరదారులు వచ్చారు. ఈ పరిస్థితులలో గోల్కొండ సుల్తాన్‌లు అనుసరించిన పన్ను గుత్త విధానం వారికి రాజకీయ పునరావాసాన్ని కలిగించింది. పూర్వపు రాజకుటుంబాల వారు సేనాధిపతుల కుటుంబాల వారు అమరనాయక, పాలెగాండ్ర కుటుంబాల వరకు అనేకులు తమ శక్తికొలది పన్ను గుత్తలు పాడి కుతుబ్ షాహీల పరిపాలనా వ్యవస్థలో స్థానాన్ని సంపాదించుకున్నారు. ఆ వీలును ఈ పన్ను గుత్త విధానం వారికి కలిగించింది. ఈ విధంగా పన్ను గుత్తలు సంపాదించిన కుటుంబాలు చివరకు జమీందారులుగా రూపొందారు. ఒక విధంగా ఆంధ్రదేశంలోని జమీందారీ విధానానికి మూలం కుతుబ్‌షాహీలు ప్రారంభించిన పన్నుగుత్త విధానం అని చెప్పవచ్చును. వీరు క్రమేపీ బలపడి సాయుధ బలగాలను కూర్చుకొని గోల్కొండ నవాబుల చివర కాలం నాటికి స్థానిక రాజులుగా తయారయ్యారు. గోల్కొండ రాజ్యంపై మొగలులు దండయాత్రలు ప్రారంభమైన తర్వాత వారిని గోల్కొండ నవాబులు అదుపు చేయడానికి వీలుకలగలేదు. ఆ సమయంలో వారు బాగా బలపడ్డారు. తర్వాత వచ్చిన మొగలులు వారిని తోసివేయలేకపోయారు. తర్వాత వచ్చిన నిజాం నవాబులు కూడా వారి హక్కులను గుర్తించారు. ఆ తర్వాత వచ్చిన ఇంగ్లిష్ వారు శాశ్వతశిస్తు నిర్ణయపద్ధతి కింద ఈ కుటుంబాలను జమీందారులుగా గుర్తించారు. ఆ విధంగా వచ్చిన వారే విజయనగర పూసపాటి వంశం, బొబ్బిలి చల్లపల్లి, వెంకటగిరి మొదలైన జమీందారీ కుటుంబాలు. వీరి మూలపురుషులందరూ కుతుబ్‌షాహీల నుంచి పన్ను గుత్తాధికారాన్ని సంపాదించినవారే. కృష్ణాజిల్లా కొండపల్లి సమీపంలో పూసపాడు అనే గ్రామం ఉంది. ఆ గ్రామానికి చెందిన పూసపాటి మాధవవర్మ విశాఖపట్టణం చేరి అప్పుడు శ్రీకాకుళంలో ఉన్న కుతుబ్‌షాహీల ఫౌజ్‌దార్‌గా ఉన్న షేర్‌మహ్మద్ ఖాన్ నుండి కమిలి, భోగాపురం ప్రాంతాలను గుత్తకు తీసుకున్నాడు. అలాగే క్రీ.శ.1652లో వెంకటగిరి నుండి వచ్చిన పెద్దరాయుడు షేర్ మహ్మద్ నుంచి బొబ్బిలిని గుత్తకు తీసుకున్నాడు. అదే విధంగా కాకర్లపూడి అప్పలరాజు తుని వద్ద గల పాయకరావుపేటను గుత్తకు తీసుకున్నాడు. పాయకరావు అంటే యుద్ధంలో ముందు ఉండే గొప్పవీరుడు అని అర్థం. అతడు గోల్కొండలో సుల్తాన్‌కు యుద్ధాలలో సహాయం చేసినందుకు ఈ ప్రాంతాన్ని అతనికి గుత్తకు ఇచ్చారట. అలాగే చల్లపల్లిని యార్లగడ్డ తిరుమలనాయుడికి నూజివీడును, విజయ అప్పారావు బహద్దూరుకు చింతపల్లి అమరావతిలను వాసిరెడ్డి వారికి ఇంకా వెల్లం, రేపల్లె, మైలవరం కుటుంబాలకు పన్ను గుత్త అధికారం ఇస్తూ గోల్కొండ నవాబులు సన్నదులు ఇచ్చారు. ఈ కుటుంబాలన్నీ ఇంగ్లిష్ వారి కాలంలో జమీందారులుగా గుర్తింపబడ్డారు. ఈ విధంగా ఆంధ్రదేశ జమీందారీ వ్యవస్థ కుతుబ్‌షాహీల కాలంలో మొలకెత్తింది.

పన్ను వసూలు - ప్రజల అగచాట్లు: కుతుబ్‌షాహీల కాలంలో పన్ను గుత్తదార్లు అతి కఠినంగా పన్నులు వసూలు చేసేవారు. పన్నులు చెల్లించకపోతే వారి భార్యాబిడ్డలను అవమానించేవారు. భర్తలు పారిపోతే వారి వద్ద నుండి వసూలు చేసేవారు. రైతులలో పన్ను చెల్లించని వారి భార్యలను, పశువులను తీసుకొని వెళ్ళిపోయేవారు. అంతేగాక వృత్తి పని వారిని కూడా పీడించి వసూలు చేసేవారు. పన్ను గుత్తదార్లు సుల్తాన్‌కు చెల్లించవలసింది చెల్లిస్తే వారు ప్రజలను ఏమి చేసినా పట్టించుకొనేవారు కాదు. పైగా పన్ను గుత్తదారులకు న్యాయాధికారాలు కూడా ఇచ్చాడు. కనుక వారు పన్నులు చెల్లించకపోతే శిక్షలు, జరిమానాలు కూడా వేసేవారు. ప్రజలు ఎక్కడికైనా పారిపోదామంటే పోయినచోట కూడా ఇవే బాధలుండేవి. కనుక వారు ఆ బాధలన్నీ భరించారు. అయితే ప్రజలే కాదు, సుల్తాన్‌కు, అతని ఫౌజ్‌దార్లకు పన్ను గుత్త తీసుకున్నవారు చెల్లించలేకపోతే పన్ను గుత్తదార్లు కూడా ఇదే విధమైన బాధలను అనుభవించారు. మచిలీపట్టణం సుబేదార్ బసబలరావు పన్నుగుత్తను చెల్లించలేకపోయాడు. అతనిని నడి బజారులో పొట్ట మీద తన్నగా చనిపోయాడు. పన్నుగుత్తదార్ల పరిస్థితే అలా ఉంటే ఇక ప్రజల పరిస్థితి ఎలా ఉండేదో చెప్పనక్కరలేదు. అతిదారుణంగా పన్నులు వసూలు చేసేవారని స్పష్టంగా తెలుస్తోంది.

ముస్తజీర్లు లేక కాంట్రాక్టు విధానంలోని లోపాలు: ఈ కాంట్రాక్టు విధానంలో అనేక లోపాలు ఉండేవి. కాంట్రాక్టర్లకు సివిల్, క్రిమినల్ అధికారాలున్నందువల్ల అతడు తన ప్రాంతంలో ఒక ప్రభువులాగే ప్రవర్తించేవాడు. ప్రజలపై శిస్తును తన ఇష్టం వచ్చినంత వసూలు చేసేవాడు. ఖజానాకు తాను చెల్లించవలసింది చెల్లించి మిగిలింది తాను అనుభవించేవాడు. ఈ పద్ధతి వల్ల రైతులు కాంట్రాక్టర్ల దోపిడీకి గురై అనేక బాధలు పడేవారు. బకాయిపడ్డ రైతులను కఠినంగా శిక్షించేవారు. ఆ బాధలను తట్టుకోలేక వారు పొలాలు, గ్రామాలు వదలిపోయేవారు.

కాంట్రాక్టర్ల బాధలు: రైతులే కాక కాంట్రాక్టర్లు కూడా బాధలు పడేవారు. కరువు కాటకాలలో శిస్తు వసూలు అయ్యేదికాదు. ప్రభుత్వానికి చెల్లించవలసిన మొత్తాన్ని చెల్లించని కాంట్రాక్టర్లను సుల్తాన్‌లు శిక్షించేవారు.

వాసవ్‌లిరావు అనే మచిలీపట్టణం ఇజారాదార్ బకాయి పడినప్పుడు స్పృహతప్పి పడిపోయే వరకు కొరడా దెబ్బలు తిన్నాడు. శిస్తు వసూలు చేసి చెల్లించకుండా మోసం చేసిన వారిని ఏనుగుల చేత తొక్కించిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాంట్రాక్టు పద్ధతికి ఇజారా పద్ధతి అని కూడ పేరు. ప్రభుత్వం ఇజారాదార్ల నుండి సంవత్సరానికి రెండు పర్యాయాలు శిస్తు వసూలు చేసేవారు.

ఇజారా కాంట్రాక్టు విధానం రద్దు: తానీషా కాలంలో మాదన్న గోల్కొండకు పీష్వా అంటే ప్రధాన మంత్రి అయ్యాడు. అతడు కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న లోపాలను గ్రహించి వారసత్వం కలిగిన జమీందార్లను తప్ప మిగిలిన కాంట్రాక్టు పద్ధతిని తొలగించాడు. శిస్తును సరాసరి రైతుల నుండి వసూలు చేశాడు. అందుకు ప్రభుత్వ ఉద్యోగులను నియమించాడు. ఈ పద్ధతివల్ల రైతుల బాధలు తొలగిపోవటమే కాక ప్రభుత్వపు ఆదాయం పెరిగింది. ఇజారీదార్లు, ముస్తజీర్లు మధ్యదళారుల పద్ధతి తొలగించబడింది.

గోల్కొండ రాజ్యపు ఆదాయం: ఆనాటి రాతలవల్ల గోల్కొండ రాజ్యపు ఆదాయం తెలుస్తోంది. విదేశస్తులు కూడా రాశారు. మూర్తజానగర్ నుండి 11,67,709, ముస్తఫానగర్ నుండి 7,78,491, ఓరుగల్లు సర్కారు నుండి 7,78,491, గోల్కొండ నుండి 15,57,573 హొన్నులు వచ్చేదని లెక్కలు తెలిశాయి. గిరిధర్‌లాల్ ఆఖర్ లెక్క ప్రకారం 1685-86 సంవత్సరంలో ఆంధ్రదేశంలోని 22 సర్కారుల నుండి 82,95,196 హొన్నులు, కర్ణాటకంలోని 16 సర్కాల నుండి 2675,498 హొన్నులు మొత్తం కలిపి 1,09,36,964 హొన్నులు వచ్చిందని రాశాడు. హొన్ను అంటే మూడు రూపాయలని లెక్క కట్టారు. ఈ ఆదాయమే గాక నజరానాలు, జరిమానాలు, ఇంకా ఇతర విధాల ద్వారా కూడా ఆదాయం వస్తూ ఉండేది. ఒక్కొక్కప్పుడు పన్నుల గుత్తలు ఎక్కువగా పాడేవారు. అప్పుడు ఆదాయం పెరుగుతూ ఉండేది.

న్యాయ పరిపాలన: గోల్కొండ సుల్తాన్‌లు తమ ప్రజలకు చక్కని న్యాయాన్ని కలుగజేశారు. సుల్తాన్ అత్యున్నత న్యాయాధికారి. తర్వాత ఖాజీ న్యాయాధీశుడుగా వ్యవహరించేవాడు. ప్రాచీన సంప్రదాయాల ప్రకారం న్యాయ నిర్ణయం చేసేవారు. హిందువులకు హిందూ ధర్మశాస్త్రం ప్రకారం, ముస్లింలకు ఖురాన్ ధర్మం ప్రకారం విచారణ జరిగేది. న్యాయపాలనలో ముస్లింలకు కాజుల సలహా ప్రకారం, హిందువులను పండితుల సలహా ప్రకారం శిక్షలు విధించేవారు. నిష్పక్షపాతంగా న్యాయనిర్ణయం జరిగేది. మహమ్మద్ కులీ గొప్ప న్యాయప్రదాతగా ప్రసిద్ధి చెందాడు. అతడు దాద్‌మహల్ అనే ప్రత్యేక న్యాయమందిరాన్ని కట్టించాడు. ఆ భవనం పిడుగుపడి కూలిపోయిందట. మళ్లీ సుల్తాన్ మహమ్మద్ పునర్నిర్మాణం చేశాడట. సుల్తాన్ మహమ్మద్ కూడా న్యాయపాలనలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అమన్‌మహల్ అనే మరొక న్యాయస్థానాన్ని నిర్మించాడు. వారానికొక పర్యాయం వారు ఆ భవనాలలో ఆశీనులై అపీలుకు వచ్చిన వివాదాలను విచారించి తీర్పు చెప్పేవారట. న్యాయం చెప్పడానికే గాక ఆ భవనంలో సమావేశమైనప్పుడు ప్రజలు కష్టాలు కూడా చెప్పుకోవచ్చు. వారి కష్టాలు విని వెంటనే న్యాయం చేసేవారు.

న్యాయ పాలన: కుతుబ్‌షాహీలు బహమనీ రాజుల కాలం నాటి న్యాయవ్యవస్థ కొనసాగించారు. వారు మూడు తరహాల న్యాయ చట్టాలను అమలుపరచారు. రాజఫర్మానాలు స్థానిక ఆచారాలు, ఖురాను నిబంధనలు న్యాయ సూత్రాలుగా రూపొందించారు. నవాబు అత్యంత న్యాయాధీశుడు. అతనిది తుది తీర్పు. దానికి తిరుగు లేదు. ఆయన తర్వాత న్యాయాధికారి షరియత్‌పంచ్. ఇతడు మజ్లిస్-ఇ-దివాన్‌లో సభ్యుడు. ఆయన తర్వాత కాజీ ముస్లిం ప్రజలలో నైతిక ధర్మాలు కాపాడటానికి ముహ్‌తసిబ్ అనే న్యాయాధికారి కూడా ఉంటాడు. ప్రతి సర్కారులోను, పరగణాలో కూడా కాజీ ఉంటారు. ఇంకా మజ్లిస్ అనే మరొక న్యాయాధికారి కూడా ఉంటాడు. అతడు సివిల్ వివాదాలు విచారిస్తాడు. ఠాణేదార్ అందరికన్నా తక్కువ స్థాయి న్యాయాధికారి. వీరంతా ఫరిదుశ్ పర్యవేక్షణలో ఉంటారు.

రాష్ట్రాలు, సర్కారులలో న్యాయం: తరఫ్‌లు లేక రాష్ట్రాలు, సర్కారులు, పరగణాలలో కూడా న్యాయ స్థానాలు ఉండేవి. ఆ న్యాయస్థానాలలో ఖాజీలను, న్యాయాధికారులను సుల్తాన్ నియమించేవాడు. శ్రీకాకుళం అదాలత్‌కు అమల్‌దారుని నియమించాడు. కాని అతడు తన అధికారాన్ని ఇంకొకరికి అమ్మివేశాడు. కొన్నవాడు తన ఆస్తిలో నాల్గవ భాగం ఇచ్చాడని గంజాం జిల్లా మాన్యూల్‌లో నమోదైంది. నెల్లూరులో నవాబు క్రిమినల్ కేసులు విచారించడానికి ఫౌజ్‌దార్‌ను నియమించాడని ఎ.సి.బాస్వెల్ రాశాడు.

హిందువులకు హిందూ ధర్మశాస్త్రాల ప్రకారం తీర్పులు చెప్పేవారు. అందుకు కాజీలు, ఫౌజ్‌దార్లు, ఆఖరికి

సుల్తాన్ కూడా హిందూ పండితుల సహకారం తీసుకొనేవారు. హిందూ పండితుల సలహా లేకుండా తీర్పు చెప్పేవారు కాదు. శిక్షలు కఠినంగా ఉండేవి. దొంగతనానికి చేతులు నరకడం శిక్ష. ద్రోహానికి గాడిదపై ఊరేగించి శిరచ్ఛేదన చేసేవారు. హత్యలకు మరణదండన విధించేవారు. ఉన్నతోద్యోగులు తప్పులు చేస్తే వారి హోదాలు తగ్గించి తక్కువ పదవిలో నియమించేవారు. ఇబ్రహీం కుతుబ్‌షా ముస్తాఫాఖాన్‌ను అబ్దుల్లా కుతుబ్‌షా మహమ్మద్ మీర్జుమ్లాను పదవుల నుండి తొలగించారు.

గ్రామాలలో న్యాయం: గ్రామాలలో ప్రాచీన కాలం నుంచీ అమలులో ఉన్న గ్రామ పంచాయితీలు నేరాలు విచారించి తీర్పులు చెప్పేవి. గ్రామం నుండి రాజధాని వరకు న్యాయవ్యవస్థ అంచెలుగా ఉండేది.

అప్పీలు - సుల్తాన్ తీర్పులు: కింద న్యాయస్థానాలలో తమకు అన్యాయం జరిగిందని భావించినట్లయితే ప్రజలు నేరుగా సుల్తాన్‌ను దర్శించి ఫిర్యాదు చేయవచ్చు. సుల్తాన్ తనకు వచ్చిన ఫిర్యాదులను దాద్‌మహల్, అమన్ మహల్‌లో గాని, సమావేశమై స్వయంగా తుది తీర్పు చెబుతాడు. ఈ భవనంలోకి ఎవరైనా రావచ్చు. దర్వానులు ఎవరినీ అడ్డగించరాదు. సుల్తాన్ న్యాయవిచారణ చేయడం విదేశీయాత్రికుడైన టావెర్నియర్ స్వయంగా చూశాడట. సుల్తాన్ భవనంలో ప్రవేశించి తన స్థానంలో కూర్చొనేవాడు. మిగిలిన న్యాయాధీశులు ఖాజీలు వారి వారి స్థానాల్లో కూర్చునేవారు. సుల్తాన్ కూర్చున్న ఆసనానికి, ప్రజలు కూర్చునే స్థలానికి మధ్యన కర్రలు పాతి మూడు వరుసలుగా తాళ్లను కట్టేవారు. ఫిర్యాదీదారుని పేరు పిలువగానే అతడు తాళ్లను దాటి న్యాయాధికారుల సన్నిధికి వచ్చేవాడు. సుల్తాన్ ముందుకు మరీ చొచ్చుకొని రాకుండా అక్కడ కూడా మరొక తాడు కట్టి ఉంచేవాడు. కావాలి అంటే ఆ తాడును వంచి సుల్తాన్ వద్దకు చేరవచ్చును. ఫిర్యాదీదారుల మొదట భవనంలో ప్రవేశించేటప్పుడు వారి అర్జీలను ఖాజా తీసి సుల్తాన్ ముందు ఉంచేవాడు. అర్జీదారుని పేరు పిలువగానే అతడు సుల్తాన్ ముందుకు వెళ్లాలి. సుల్తాన్‌లు ఎంతటి వారు తప్పు చేసినా శిక్ష వేసేవారు. ఒక అమీరు ఒక షరీఫును మోసగించి 5 వేలు కాజేయగా సుల్తాన్ అబ్దుల్లా అమీరును బంధించి 5 వేలు వసూలు చేసి షరీఫుకు ఇప్పించాడట. ఎల్చిన్‌బేగ్ అనే అమీరుడు ఒక వ్యాపారి వద్ద అప్పు చేసి ఎగనామం పెట్టాడట. వ్యాపారి సుల్తాన్‌కు ఫిర్యాదు చేయగా ఎల్చిన్‌బేగ్ జీతం నుండి 40 వేల హొన్నులు వసూలు చేశాడట. అది చాలక పోయేటప్పటికి ఖజానా నుండి మిగిలిన సొమ్ము తెప్పించి వ్యాపారికి ఇప్పించాడట. ఖజానా నుండి చెల్లించిన ధనాన్ని తర్వాత ఎల్చిన్‌బేగ్ నుండి వసూలు చేశారట. ఈ విధంగా సుల్తాన్ న్యాయ భవనంలో తీర్పులు జరిగేవని, ప్రజలకు చక్కని న్యాయం జరిగేదని టావెర్నియర్ రాశాడు. బీజాపూరు నివాసి అయిన మీర్జా ఇబ్రహీం జుబేరి అనే అతడు బసాటిన్ సలాటిన్ లేక దస్తూర్ ఉల్ అమర్ అనే రాజనీతి గ్రంథాన్ని రాశాడు. అందులో అతడు న్యాయనిర్వహణ ఆదర్శప్రాయంగా ఉండాలని రాశాడు. ఈ కాలంలో దక్కన్ సుల్తాన్‌లు ఆ గ్రంథాన్ని అనుసరించి న్యాయ విధానాన్ని రూపొందించుకున్నారు. అలాగే గోల్కొండ నవాబుల కూడా ఈ గ్రంథంలోని న్యాయవిధానాలను పాటించే ఆదర్శ న్యాయప్రదాతలుగా ప్రసిద్ధి చెందారు.

సైనిక నిర్వహణ: మధ్యయుగంలో రాజ్య రక్షణ అతి ముఖ్యమైన కార్యం. కనుక కుతుబ్‌షాహీలు బలమైన సైన్యాన్ని పోషించారు. బహమనీల కాలంలో వారి సైనిక వ్యవస్థలో కొన్ని లోపాలు ఉండేవి. కులీకుతుబ్‌షా ఆ లోపాలను సరిదిద్ది పటిష్టమైన సైనిక దళాన్ని రూపొందించుకున్నాడు. అదే పద్ధతిని అతని వారసులు అనుసరించారు. వారి సైన్యంలో ప్రధానంగా మూడు అంగాలుండేవి. పదాతి దళం, అశ్వదళం, ఫిరంగిదళం. సుల్తాన్‌లు స్వయంగా కొంత సైన్యాన్ని పోషించేవారు. మరికొంత సైన్యాన్ని సామంతులు, పాలెగాండ్రు, జాగీరుదారులు సమకూర్చేవారు. సుల్తాన్ సైన్యంలో 40 వేల మంది అశ్వికులున్నారని, వారిలో ప్రష్యా వారు తార్తారులు, ఇతర ముస్లిం దేశాల వారు ఎక్కువని తెవెన అనే అతడు రాశాడు. పట్టా, కత్తి, మస్కెట్ అనే ఆయుధాలను పదాతిదళం వాడేది. అశ్వికులు విల్లంబులు, డాలు, గండ్రగొడ్డలి ఉపయోగించేవారు. వారికి కవచం, శిరస్త్రాణాలు తప్పనిసరిగా ఉంటాయి. ప్రతి కోటలో బురుజులు, వాటిపైన ఫిరంగులు అమర్చేవారు. ఫిరంగి దళాన్ని నడపటానికి టర్కులను సేనాధిపతులుగా చేర్చుకునేవారు. కొంత మంది ఐరోపా వారిని బట్టి వారు తమ ఉద్యోగాలు వదులుకొని గోల్కొండ నవాబులు, వారి సామంతులు, ఫౌజ్‌దార్ల వద్ద ఆయుధాలు తయారు చేయుదానికి కుదిరి బాగా డబ్బు సంపాదించారని, మరికొందరు వారి వద్ద సైనిక సలహాదారులుగా చేరారని బౌరే అనే అతడు రాశాడు. అలాగే మిగిలిన యూరోపియన్లు కూడా ఎక్కడ లాభసాటిగా ఉంటే అక్కడ చేరిపోయారట. ఇలాంటి పటిష్టమైన సైన్యం ఉండబట్టే గోల్కొండ సైన్యాలు 8 నెలలు మొగల్ సైన్యాలను ఎదిరించి

నిలబడగలిగాయి.

సైన్యాధిపతులు: సైన్యానికి ప్రధాన అధికారి ఐనుల్‌ముల్క్ తర్వాత అధికారి బక్షిల్ముల్క్ తర్వాత వరుసగా సర్ఖేలు, ఖిలేదార్, హవల్దారులు అధికారులు, బక్షిల్ముల్కు సైన్యానికి జీతాల బట్వాడా చేసేవాడు కుతుబ్‌షాలు వారంలో రెండు రోజులు సైనిక విన్యాసాలు తిలకించి సైనిక వందనాన్ని స్వీకరించేవారు. జంషీద్ ఇబ్రహీం మహ్మద్ కుతుబ్‌షాలు స్వయంగా సైన్యాన్ని యుద్ధాలకు తయారు చేసేవారు. రాజ్యంలోని మొత్తం సైన్యాన్ని మీర్జుమ్లా పర్యవేక్షించేవాడు. అవసరమైతే కుతుబ్‌షాలే స్వయంగా సైనిక విషయాలు చూసుకొనేవారు తరఫ్‌దార్లు తరఫ్‌లలో సైన్యాలను నడిపేవారు. సైన్యాలను నడిపినందువల్ల తరఫ్‌దారులను కూడా సర్ లష్కర్లని పిలిచేవారు.

ఐనల్‌ముల్క్: సైనికులను చేర్చుకోవడం, వారికి శిక్షణ ఇవ్వడం కోసం ఐనుల్‌ముల్క్ అనే ప్రత్యేక ఉద్యోగి నియమింపబడ్డాడు. అతడు మంచి ఆరోగ్యం, శక్తి సామర్థ్యాలున్న యువకులను సైనికులుగా చేర్చుకునేవాడు వారికి నిత్యం కవాతు నేర్పించేవాడు. సైన్యానికి మంచి ఆయుధాలు సమకూర్చడం. సైన్యాలను యుద్ధాలకు సన్నద్ధులను చేయడం కూడా ఐనుల్‌ముల్క్ విధులలో భాగమే.

జాతి విభేదం లేని సైనికదళం: సైన్యంలో చేర్చుకోవడానికి గోల్కొండ సుల్తాన్‌లు జాతి భేదం పాటించేవారు కాదు హిందూ, ముస్లింలనే భేదం లేకుండా శక్తిసామర్థ్యాల ప్రాతిపదికగా చేర్చుకునేవారు. వీరేకాక టర్కీ జాతి వారు పర్షియా వారిని కూడా సైనికులుగా చేర్చుకునేవారు. కాని ముస్లింలలో ఎక్కువ మంది దక్కన్ ముస్లింలుండేవారు మొత్తం మీద సైన్యంలో ఎక్కువ భాగం తెలంగాణ వారే. కోస్తాలో ఎక్కువ ప్రజలు సైన్యంలో చేరలేదు

సైనిక విభాగాలు: గోల్కొండ సైన్యం కేంద్ర, రాష్ట్ర సైన్యమని రెండు భాగాలుగా ఉండేది కాని రెండు రకాల దళాల వారు ఒకే రకమైన దుస్తులు ధరించేవారు. కొంత సైన్యం తరఫ్‌లలోను, కొంత సర్కారులలో ఉండేది అవసరమైతే మొత్తం సైన్యం రాజధానికి కదలివచ్చేది. కేంద్ర సైన్యాన్ని సిద్ధ సైన్యమని, సర్కారులో, పరగణాలలోని సైన్యాన్ని జాగీర్‌దారి సైన్యం అని అనేవారు.

నాయక్‌లు: గోల్కొండ సైన్యాన్ని చిన్న దళాలుగా విభజించారు. ఆ దళాలను నాయక్ వారీలు అని పిలిచే వారు. నాయక్ వారీలకు నాయర్ అనే సేనాధిపతి ఆధిపత్యం వహించేవాడు.

5 లక్షల సైన్యం: గోల్కొండ సుల్తాన్‌లకు కేంద్ర, రాష్ట్ర సైన్యం మొత్తం కలిపి 5 లక్షల సైన్యం ఉండేదని 1650-1668 సంవత్సరాల మధ్య గోల్కొండ రాజ్యాన్ని దర్శించిన దేవ్‌నోట్ అనే ఫ్రెంచి యాత్రికుడు రాశాడు అబుల్ హసన్ కాలంలో రాజధానిలో 55 వేల అశ్వదళం, 96 వేల పదాతిదళం ఉందని గిరిధరలాల్ రాసిన తారీఖజఫ్రా అనే గ్రంథం తెలుపుతోంది. తరఫ్‌లలో ఎక్కువగా సైన్యం ఉండేది. అన్నిటికంటే కర్ణాటక తరఫ్ పెద్దది. కర్ణాటక తరఫ్‌లో 40 వేల పదాతి దళం ఉండేది. అదిగాక మహమ్మద్‌సేర్ లేక సయూద్ వద్ద 5 వేల స్వంత సైన్యం కూడా ఉండేది. సరిహద్దులలో ఎక్కువగా సైన్యాన్ని ఉంచేవారు. ఇంకా జమీందార్లు, జాగీరుదార్లు కూడా సైన్యాన్ని పోషించే రాజసుల్తాన్ సేవకు వచ్చేవారు. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో శాశ్వత సైనిక విభాగాలు ఏర్పడ్డాయి.

అంగరక్షక దళం: సిద్ధ సైన్యం కాక కుతుబ్‌షాహి సుల్తాన్‌లకు ప్రత్యేక అంగరక్షక దళం ఉండేది ఆ దళానికి ఖాసాఖైల్ అని పేరు. అంగరక్షక దళం సుల్తాన్‌లను కంటికి రెప్పలాగా కాపాడేది. అబుల్ హసన్ కాలంలో అంగరక్షక దళంలో 6 వేల అశ్వకదళం ఉండేది. ఆ దళానికి అధిపతి సర్‌ఖైల్. అంగరక్షక దళంలో పదాతిదళం ఉండేదికాదు.

గూఢచారి దళం: రాజ్యంలో వార్తలు, రహస్యాలు, విదేశస్థుల గమనాన్ని తెలుసుకోడానికి సమర్ధవంతమైన గూఢచారి దళం ఉండేది.

సైనిక కవాతు - శిక్షణ - ఫిరంగిదళం - దిరుసులు: సైన్యానికి నిత్యం శిక్షణ ఇచ్చేవారు. కవాతు చేయించే వారు నాసురుల్ ముల్క్ సర్ ఖలీల్, షాహిలష్కరి అనేవారు సైనికులకు కవాతు నిర్వహిస్తారు. సైనికులలో తెలుగు వారు ఎక్కువ. కాని సేనాధిపతులుగా ముస్లిం సరదారులుండేవారు. టర్కీ ఇరాన్, ఇరాక్, అరబ్బీ ప్రాంతాల నుండి వచ్చిన అనుభవం కలిగిన వీరులను సేనాధిపతులుగా నియమించేవారు. సుల్తాన్ మహ్మద్ కాలంలో విదేశీ సైనికులు తక్కువ. కాని అబ్దుల్లా కుతుబ్‌షా కాలం నాటికి ఇరాన్, టర్కీ సైనికులు, సేనాధిపతుల సంఖ్య పెరిగింది అబుల్ హసన్ కాలంలో ఫిరంగిదళాన్ని ఏర్పాటు చేశారు. ఐరోపా వారిని రికాబఫిరంగ్ అని అనేవారట ఈ దళానికి సంవత్సరానికి 9 లక్షల హొన్నులు ఖర్చు అయ్యేదట.

దుస్తులు: పదాతిదళంలోని సైనికులు అందరూ ఒకేరకమైన దుస్తులు ధరించేవారట. అశ్వదళం సైనికులు ఎర్ర పంట్లాములు, నల్లని టోపీలు ధరించేవారట. కర్ణాటక సైనికులు నీలిరంగు పంట్లాములు, తొడల వరకు నల్లరంగు కచ్చా, తలపై ఎర్రని పగిడ ధరించేవారు. నడుముకు వేలాడే కత్తిని ధరిస్తారు. తెలుగు సైనికులు ధోవతి కచ్చా, పగిడి ధరించేవారు. నాయక్‌వారులు, ఖిలేదార్లు విలువైన దుస్తులు ధరించేవారు. ముస్లిం సైనికులు ఎరుపురంగు దుస్తులు, నడుముకు పట్టీ ధరించేవారు. నెత్తిన తప్పకుండా టోపీ ఉండేది. పఠాన్ ఎర్రని రంగుగల తొడుగు, నల్లని రంగు టోపీ, చంక నుండి వేలాడే తల్వార్, చేతిలో మరొక కత్తి ధరించి గొప్ప వీరులుగా యుద్ధ యోధులుగా చూడటానికే భయం గొలిపే రీతిలో ఉండేవారట.

సైనిక జీతాలు: సిద్ధ సైన్యానికి, అంగరక్షక దళానికి సుల్తాన్ జీతాలిచ్చి పోషించేవాడు. జాగీరుల సైన్యాలకు జాగీరుదారులు, తరఫ్‌దారులు జీతాలు ఇచ్చుకునేవారు. తరఫ్‌దార్లందరూ సైన్యాన్ని పోషించాలి. కనుక వారిని సర్ లష్కర్‌లని కూడా పిలిచేవారు. అందరికంటే కర్ణాటక లష్కర్ చాలా పెద్ద వాడు. అతడు 40 వేల పదాతిదళాన్ని, 5 వేల అశ్వదళాన్ని పోషించేవాడు. ఇరానీ, తుర్కి సైనికులకు నెలకు 10 హొన్నులు జీతం ఇచ్చేవారు. దాంతోపాటు 2 గుర్రాలు, 5గురు పని వారిని కూడా ఇచ్చేవారు. తెలుగు సిపాయిలకు 2 హొన్నుల జీతం మాత్రమే ఇచ్చేవారు. పరిచారకుల్నిగాని, గుర్రాలనుగాని ఇచ్చేవారు కాదు. సుల్తాన్ మహ్మద్ కాలంలో తెలుగు సైనికులకు జీతాలు పెంచారు. కుతుబ్‌షాహీలు తమ సైన్య జీతభత్యాలకు సాలుకు 1 కోటి 40 లక్షల 50 వేల హొన్నులు ఖర్చు చేసేవారట. అశ్వదళానికి 120,00,000 హొన్నులు, పదాతిదళానికి 20,40,000 హొన్నులు, ఫిరంగి దళానికి 11,00,000 హొన్నులు ఖర్చు పెట్టేవారట. ఇవిగాక ఆయుధాలకు, సైనికులకు ఇతర వస్త్ర వాహనాల కోసం ఇంకా ఖర్చు పెట్టేవారు.

కోటలు: గోల్కొండ రాజ్యం కొండలు, గుట్టలతో నిండి ఉండేది. అందువల్ల రాజ్యరక్షణకు అనేక కొండలపై దుర్గాలు నిర్మించారు. నాడు రాజ్యంలో మొత్తం 66 దుర్గాలుండేవి. వాటిలో గోల్కొండ, ఓరుగల్లు, కొండపల్లి, కొండవీడు, మెదక్, కోయిలకొండ, ఘనాపూర్, పానుగల్లు, రాచకొండ, దేవరకొండ, ఖమ్మం, భువనగిరి, వేల్పుకొండ లేక జాఫర్‌ఘడ్, రామగిరి, ఎల్లందల, ఉర్లుకొండ, ఉంద్రుకొండ, ఆమనపల్లి, పాడిదేము, ఇంద్రపురి, బెల్లంకొండ మొదలైనవి ప్రసిద్ధి చెందిన కోటలు. కోటను బట్టి సైన్యాన్ని ఉంచేవారు. పెద్ద కోటలలో 10 లేక 12 వేల సైన్యం, చిన్న కోటలలో వెయ్యి మంది నుండి 4 వేల వరకు సైన్యాలుండేవారు. గోల్కొండ, ఓరుగల్లు కోటలు తెలంగాణలోను, తీరాంధ్రదేశంలో కొండపల్లి, కొండవీడు దుర్గాలు అతిముఖ్యమైనవి. ఈ దుర్గాల రక్షణకు 12 వేల సాయుధ సైన్యం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేది. ఎవరూ అనుమతి లేకుండా బయటకుగాని, లోపలకుగాని రావడానికి వీలులేదు. సైనికులు, సేనానాయకులు రాత్రులు తమ పై అధికారి అనుమతి లేనిదే తమ స్థానాల నుండి కదలకూడదు. ఎలాంటి పరిస్థితులలోను కోట విడిచి వెళ్లకూడదు. రాత్రులు దివిటీలు పట్టుకొని తిరుగుతూ కాపలా కాసేవారు.

సర్కారులలో కోటలు: పూర్వం హిందూ రాజులు సీమలుగా వర్గీకరించిన రాజకీయ విభాగాలనే గోల్కొండ నవాబులు సర్కారులు అని పేరు పెట్టారు. ఆంధ్రదేశంలో 22 సర్కారులు, కర్ణాటకంలో 16 సర్కారులు, మొత్తం రాజ్యంలో 38 సర్కారులుండేవి. ప్రతి సర్కారుకు ఒక కేంద్రం ఉండేది. అక్కడ బలమైన కోట ఉండేది. ప్రధాన కోటగాక సర్కారులలో ఇంకా చిన్నచిన్న కోటలు కూడా ఉండేవి. రాజ్యం మొత్తంలో 66 కోటలుండేవని నాటి లెక్కలు చెబుతున్నాయి. కోటలు ప్రధానంగా సైనికస్థావరాలు. ఒక్కొక్క కోట రక్షణలో ఉండే ప్రాంతపు వైశాల్యాన్ని బట్టి అక్కడి సైనికుల సంఖ్య పెరుగుతూ ఉంటుంది. కొండపల్లి, కొండవీడు, వినుకొండ, బెల్లకొండ ఆనాడు శత్రుదుర్భేద్యాలుగా ప్రసిద్ధి చెందాయి. మచిలీపట్టణం, ఏలూరు, రాజమండ్రి, కోయిల్‌కుంట్ల, ఘనాపూర్, పానుగల్లు, ఖమ్మం, వరంగల్లులలో కూడా కోటలుండేవి. కాని అవి చిన్నకోటలు. రాజమండ్రి, చికాకోల్, ఏలూరు సర్కారు కేంద్రాలుగా కూడా ఉండేవి. సరిహద్దులో ఉండే కోట చాలా బలంగా నిర్మించేవారు. ఎల్లప్పుడూ సైన్యం సర్వసన్నద్ధంగా ఉండేది. సైన్యానికి లోటు లేకుండా ఆయుధాలు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచేవారు.

జాగీర్లు - జాగీరు సైన్యం: కుతుబ్‌షాహీ రాజ్యంలో సర్కారులు పరగణాలేగాక అనేక అంతరువులు గల జాగీర్లు కూడా ఉండేవి. వారు నవాబులకు సైన్యాన్ని సమకూర్చాలి. వారు సమకూర్చవలసిన సైనికుల సంఖ్యను బట్టి వారి హోదాలుండేవి. 10 మంది, 100 మంది, వేయి మంది, 2 వేల మంది గుర్రాలను సమకూర్చవలసిన హోదా కలిగిన వారు ఉంటారు. వారికి ధనరూపంలోగాని, జాగీరు రూపంలోగాని ఇస్తారు. వారు

సమకూర్చవలసిన అశ్వాల సంఖ్య ముందే నిర్ణయించబడేది. అదీ నవాబే నిర్ణయిస్తాడు. జాగీరుదార్లు దొంగలెక్కలు చూపి ధనం కాజేస్తారని తమ కింది వారికి ఇవ్వవలసిన ధనాన్ని పూర్తిగా ఇవ్వరని, అందులో మిగుల్చుకుంటారని బెర్నియర్ రాశాడు. చాలా మంది జాగీర్దార్లు ఉమ్రావ్‌లు, పారశీకులు అని, వారు చాలా ధనవంతులని కూడా రాశాడు. సంవత్సరానికొకక పర్యాయం జాగీర్దార్లందరూ నవాబుకు వినతులు సమర్పించుకొనేవారు. ఆ సమయంలో వారు తమ బలగాలతో వచ్చి నగరం వెలుపల గుడారాలు వేసుకొని మకాం పెట్టేవారు. ఒక్కొక్క జాగీరుదారుడు ఒక్కొక్క రోజు పహారాకాస్తారని టావెర్నియర్ రాశాడు. జాగీరుదార్ల హక్కులు వారసత్వం కాదు. భూమిపై హక్కులు రైతులదే. వారిపైన, వృత్తి పని వారిపైన పన్నులు వసూలు చేసుకొనే అధికారం మాత్రమే జాగీరుదార్లకు ఉంటుంది. జాగీరు ఇచ్చేటప్పుడు ఒక నిర్దిష్ట ప్రదేశంలో తనకు వచ్చే పన్నును వసూలు చేసుకొనే అధికారాన్ని నవాబు వారికి ఇచ్చేవాడు. అది వారి జీతం, వారు సమకూర్చవలసిన తమకు ఇచ్చిన గ్రామాల రక్షణకు కూడా ఏర్పాటు చేయాలి. దోపిడీ దొంగలను అణచివేయాలి. ప్రజల ఆస్తులను కాపాడాలి. ఈ విధానాన్ని పరిశీలించిన ఎ.సి.బాస్వెల్ అనే విదేశస్తుడు వారు పన్ను హక్కుదారులే గాని భూమికి యజమానులు కారని వ్యాఖ్యానించాడు.

హిందువులకు పదవులు: కుతుబ్‌షాహీలు ఉన్నత పదవులు ఇవ్వడంలో హిందువులకు కూడా అవకాశం ఇచ్చారు. దేశం హిందూదేశం కావడం అంతేగాకుండా వారికి కావలసిన అన్నితరగతుల మనుషులు విదేశాల నుండి తెప్పించడం వీలుగాక హిందువులను కూడా ఉద్యోగులుగా తీసుకున్నారు. చిన్నచిన్న ఉద్యోగాలేగాక పెద్ద పెద్ద సైన్యాధిపతి ఉద్యోగాలు కూడా ఇచ్చారు. బ్రాహ్మణులు రెవెన్యూ శాఖలో ఉద్యోగాలు సంపాదించారు. సైనికసేవ చేయగల వీరులు సేనాధిపతులుగా చేరారు. కులీకుతుబ్‌షా రామరాజు అనే హిందువుకు ఉన్నత ఉద్యోగం ఇచ్చాడు. జంషిద్ కాలంలో జగదేల్‌రావు చాలా పెద్ద పదవిని నిర్వహించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో మురహరిరావు గొప్పసేనాధిపతిగా ప్రఖ్యాతి వహించాడు. అబ్దుల్లా అనేక మంది బ్రాహ్మణులకు ఉద్యోగాలు ఇచ్చాడు. అతడు ఒకసారి వర్షాలు పడకపోతే మూసీనదికి పూజలు చేస్తే వర్షాలు పడతాయని బ్రాహ్మణులు సలహా ఇవ్వగా వెంటనే వారి సలహా ప్రకారం మూసీనదికి పూజలు చేశాడట. అతడు అన్ని విషయాలలో బ్రాహ్మణుల సలహా తీసుకొనేవాడని షేర్వాణి రాశాడు. అబుల్‌హసన్ అక్కన్న, మాదన్నలను మంత్రి, సేనాధిపతులను చేసుకొన్నాడు. వారి మేనల్లుడు లింగన్నను పూనమల్లి తరఫ్‌దారుగాను, మరొక మేనల్లుడు గోపన్న భద్రాచలం తహశీల్‌దారుగాను నియమింపబడ్డారు.

ఈ విధంగా హిందువులకు ఉన్నత పదవులిచ్చినందువల్ల హిందువులు గోల్కొండ రాజ్యాన్ని ముస్లిం రాజ్యంగా భావించలేదు. హిందూ రాజ్యంగానే భావించి సుల్తాన్‌లను సేవించారు.

గోండుల పరిపాలనా వ్యవస్థ

గోండు రాజులు సర్వాధికారులు. వారు రాజ్యాన్ని రక్షణకు చిన్నచిన్న విభాగాలుగా విభజించి ఆ విభాగంలో ఒక కోటను నిర్మించి దాని రక్షణకు దుర్గాధిపతులను నియమించారు. గోండు రాజ్యాలలో 22 దుర్గాలుండేవి. దుర్గాధిపతులు తమ ఆధిపత్యంలోని ప్రాంతాన్ని రక్షించడం, శాంతి భద్రతలను నెలకొల్పటం వారి ప్రధాన విధులు. అవేగాక వారికి ప్రత్యేక విధులు కేటాయించబడ్డాయి. వారు తమ ప్రాంతంలోని అడవులను నరికించి వ్యవసాయ క్షేత్రాలను విస్తరించడం కూడా వారి విధులే. వారు నూతన గ్రామాలు నిర్మించాలి. నూతనంగా విస్తరించిన వ్యవసాయ క్షేత్రాలకు నీరు అందించడానికి చెరువులు, గుంటలు తవ్వించాలి. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలి. వ్యవసాయాభివృద్ధి చెయ్యని దుర్గపాలకులను తొలగించేవారు. హీర్షా ఈ పద్ధతిని ప్రవేశపెట్టాడు. సామంతులను తార్వేలులు అని పిలిచేవారు. తార్వేలుల హక్కులను హీర్షా సన్నద్దుల ద్వారా స్థిరపరచాడు. అలాగే రైతుల భూములపై హక్కులను గుర్తిస్తూ పట్టాలు జారీ చేశారు.

గ్రామ పరిపాలన: గ్రామాలు నిర్మించినప్పుడే ఆ గ్రామానికి ఒక గ్రామాధికారిని, ఒక గ్రామ పూజారిని నియమిస్తారు. గ్రామాధికారిని పాట్లా అని, గ్రామ పూజారిని దేవరి అని అంటారు. సాధారణంగా గ్రామ ప్రతిష్ఠాపకుడు పాట్లా హోదాలో ఉండి గ్రామాధికారిగా చెలామణి అయ్యేవాడు. పాట్లా అనే పదం నుండి పటేల్ అనే పదం పుట్టింది.

పాట్లా విధులు: పాట్లా గ్రామ ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. గ్రామ జీవితంలో కీలకపాత్ర వహిస్తాడు.

మతపరమైన ఉత్సవాలలో గ్రామాధికారి హోదాలో పాల్గొంటాడు ఉత్సవాలు పండుగల నిర్వహణకు కావలసిన ఏర్పాట్లు చేస్తాడు పండుగలప్పుడు జాతర నిర్వహించే సమయంలో అల్లర్లు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఎర్పాట్లు చేస్తాడు ఉత్సవాలు జాతర్ల సమయాలలో సందర్శకులకు ఎలాంటి లోపాలు జరగకుండా చూస్తాడు అన్ని గ్రామల నుండి వచ్చే అతిధులకు ప్రభుత్వపరంగా దర్శించే అధికారులకు తన స్వగృహంలో అతిధి సత్కారాలను చేస్తాడు గ్రామ పంచాయతీకి బాధ్యత వహించి తీర్పులు ఇస్తాడు పాట్లా పదవి వారసత్వం

పాటిల్ పాట్లా గ్రామంలో ప్రముఖుడు అలాగే పాట్లా భార్యను పాటిల్ అని అనేవారు ఆమె గ్రామ స్త్రీలలో ప్రముఖురాలు గ్రామస్త్రీలలో ఆమె మొదటి స్త్రీగా గుర్తింపబడుతుంది పొలా వంటి పండుగలలో ఆమె ప్రముఖపాత్ర నిర్వహిస్తుంది ఆమె హోదా భర్త మరణించి కుమారుడు పాట్లా అయినా కూడా జీవించి ఉన్నంత కాలం ఆమెయే పాటిల్‌గా కొనసాగుతుంది ఆమె మరణం తర్వాతనే ఆమె కోడలు పాటిల్ అవుతుంది

దేవరి విధుల ప్రతి గ్రామంలో దేవరి ఉంటాడు ఇతడు మతకర్మలు నిర్వహిస్తాడు ఒక విధంగా ఇతడు గ్రామ పూజారి పండుగలలో చేయవలసిన పూజా కార్యక్రమాలన్నీ ఇతడు నిర్వహిస్తాడు గ్రామాధికారి సహకారంతో ధార్మిక విధులను నిర్వహిస్తాడు

గ్రామసభ ప్రతి గ్రామంలో గ్రామ సభ ఉంటుంది అందులో గ్రామ సభ్యులందరూ సభ్యులు గ్రామానికి సంబంధించిన అన్ని విషయాలు ఆ సభలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు గ్రామసభకు పాట్లా అధ్యక్షత వహిస్తాడు గ్రామసభలో తీసుకున్న నిర్ణయాల అతడు అమలు జరుపుతాడు గ్రామసభ ఎప్పుడు అవసరమైతే అప్పుడు సమావేశం అవుతుంది గోండు ప్రజల మంచిచెడులను చూస్తుంది వారి రక్షణ బాధ్యత చేపడుతుంది గోండు ప్రజలలో ఏ వ్యక్తికి కష్టం వచ్చినా గ్రామసభ అతని రక్షణ భారాన్ని చేపడుతుంది అలాగే గోండు ప్రజలు గోండు ఆచార వ్యవహారాలు సాంఘిక కట్టుబాట్లు అతిక్రమించకుండా ఆచరించేటట్లు కూడా చేస్తుంది అతిక్రమిస్తే గ్రామసభ శిక్షిస్తుంది

న్యాయవ్యవస్థ గోండు ప్రజలకు న్యాయం చెప్పడానికి తప్పు చేసిన వారిని శిక్షించడానికి గ్రామ పంచి అనే వ్యవస్థ ఉంది గ్రామసభ సభ్యులలో కొంత మందితో ఒక సంఘం ఎర్పడుతుంది దానిని గ్రామపంచి అని అంటారు దానికి గ్రామ పెద్ద అంటే పాట్లా అధ్యక్షత వహిస్తాడు శాంతిభద్రతలను పాడు చేసే వారిని శిక్షిస్తుంది వ్యక్తుల మధ్య వచ్చిన వివాదాలను పరిష్కరించి తీర్పు లిస్తుంది సాక్షులను విచారించి సాంప్రదాయ పద్ధతిలో తీర్పు చెప్పబడుతుంది పంచి జరిమానాలు విధించినప్పుడు అతడే చెల్లించనక్కరలేదు అతని తరపున మరెవరైనా చెల్లించవచ్చు తర్వాత అతని వద్ద వసూలు చేసుకోవచ్చు ఆ పద్ధతి వలన సాంఘిక సామరస్యం అభివృద్ధి చెందుతుంది తీర్పు ఇచ్చిన తర్వాత వాది ప్రతివాదులతో సహా గ్రామపంచి సభ్యులు గ్రామ పెద్దలు కలసి భోజనం చేసేవారు ఈ పద్ధతి వల్ల కక్షలు కార్పణ్యాలు లేకుండా సాంఘిక సామరస్యం అభివృద్ధి చెందుతుంది అది వారి దూరాలోచనకు విశాల హృదయానికి లోతైన మానవ మనస్తత్వానికి అద్దం పడుతుంది ఈ రోజున ఇద్దరు వ్యక్తులకు వివాదం వస్తే వారిని కలిపే వ్యవస్థే లేదు అలాగే ఒకసారి న్యాయ నిర్ణయం చేసిన తర్వాత దానిని తగ్గించడం రద్దుచేయడం జరగదు శిక్షలను తప్పనిసరిగా అమలు జరుపుతారు గోండు వివాహాలు అస్థిరమైనవి సాధారణంగా వివాహసంబంధమైన వివాదాలే ఎక్కువగా పంచి ముందుకు వచ్చేవి వివాహాన్ని పంచి రద్దుచేస్తే కన్యాశుల్కాలు పెండ్లి ఖర్చులు తిరిగి ఇప్పించేవారు స్త్రీలను చెరపట్టినా చెరిచిన స్త్రీల వాఙ్మూలానికే అధిక ప్రాధాన్యతనిచ్చి స్త్రీకి న్యాయం జరిగేటట్లు ఊరంతా తిప్పుతారు దాంతో అతడు గ్రామంలో తలెత్తుకోలేడు గ్రామ ప్రజలు హీనంగా చూస్తారు దాంతో మళ్లీ జీవితంలో అలాంటి పని అతడు చేయడు అతని స్థితి చూసిన ఇతరులు కూడా అలాంటి పని తలపెట్టరు గోండు సమాజపు విలువలను కాపాడటానికి సాంఘిక ద్రోహం తలపెట్టిన వారికి బహిష్కారశిక్షను వేసేవారు కుల బహిష్కరణ గ్రామ బహిష్కరణ వెలివేయడం వంటి శిక్షలను గ్రామ పంచి విధించి తప్పనిసరిగా అమలు జరిపేది మంత్రగాళ్లు గ్రామాన్ని పాడు చేస్తారని అనుమానం ఉన్నవాళ్లకు బహిష్కరణ శిక్షణ విధింపబడేది

బహిష్కారశిక్ష బహిష్కారశిక్ష విధించినప్పుడు అంటే సంఘ బహిష్కరణ గ్రామ బహిష్కరణ రెండుశిక్షలను గ్రామ పంచి అమలు జరుపుతుంది కాని వెలివేసినప్పుడు దానిని ఆ వ్యక్తి కుల పెద్ద అమలు జరుపుతాడు బహిష్కారశిక్షలో రెండు రకాలుండేవి మొదటి దానిని తాపు లేక వితార్ అని అంటారు సాధారణంగా

గోండేతరులతో భుజించినా సాంగత్యం చేసినా సంఘ బహిష్కరణగాని గ్రామ బహిష్కరణగాని పంచి విధిస్తుంది అలాంటి శిక్షను తాపు లేక వితార్ అని అంటారు తాపు శిక్షపడిన వ్యక్తి తిరిగి గోండు సమాజంలో చేరాలంటే గోండు రాజు అనుమతించాలి కారణం ఈ శిక్ష ఒక ఊరికో ఒక కులానికో చెందింది కాదు మొత్తం గోండు జాతి పవిత్రతకు చెందిన శిక్ష గోండు జాతి పవిత్రతను కాపాడుకోడానికి ఉద్దేశించిన శిక్ష కనుక గోండురాజు ఆ శిక్షను రద్దు చేయాలి అంతేగాక అతడు తిరిగి పవిత్రుడు కావాలి దానికి సంబంధించిన మత ధార్మిక శుద్ధి జరిపించుకోవాలి అప్పుడే తాపు శిక్ష నుండి ఆ వ్యక్తి బయటపడతాడు లేకపోతే గోండు సమాజాన్ని అతడు వదులుకొని వెళ్లిపోవలసిందే రెండవ రకం శిక్షను జాలుల్‌హ భ్రమండానా అని అనేవారు ఈ తరహా శిక్ష పొందిన వారు పంచి విధించిన జరిమానా చెల్లించితే చాలు గ్రామపంచి తిరిగి అతడు సంఘంలో చేరడానికి అనుమతినిస్తుంది రాజు దాకా వెళ్లనవసరం లేదు జరిమానా చెల్లించిన తర్వాతనే గోండు ప్రజలు శిక్షపడిన వానిని తిరిగి చేర్చుకుంటారు ఈ విధంగా గోండులు న్యాయ విధానాన్ని రూపొంచుకొని తమ జాతి ప్రజలలో తప్పులు జరగకుండా గోండు జాతి అస్థిత్వాన్ని కాపాడుకున్నారు

దేవరి విధులు ప్రతి గ్రామంలో గ్రామాన్ని నిర్మించినప్పుడే గ్రామాధికారితోపాటు గ్రామ పూజారిని కూడా నియమిస్తారు గ్రామ పూజారిని దేవరి అని అంటారు అతని సంతతివారే దేవర్లుగా కొనసాగుతారు ఒక్కొక్కప్పుడు గోండు కుటుంబాల నుండే గాక కోలామీ జాతి వారి నుండి కూడా దేవరులుగా నియమించిన సందర్భాలు ఉన్నాయి ఒకొక్క సందర్భంలో ఒకటి రెండు గ్రామాలకు కలిపి ఒకే దేవరి ఉన్న సందర్భాలు కూడా ఉన్నాయి దేవరి సత్ప్రవర్తన కలిగి ఉండాలి లేని ఎడల అతనిని గ్రామాధికారి అంటే పాట్లా తొలగించవచ్చును ఒకవేళ అతనిని తొలగించినా తిరిగి నియమించేటప్పుడు అతని వారసులనే నియమిస్తారు వారసులు లేకపోయినట్లయితే కొత్త వారిని నియమిస్తారు దేవేరులు దైవశక్తి సంపన్నులని గోండుల నమ్మకం భక్తులకు దేవతలకు దేవరి అనుసంధాన కర్త చెంచి భీమన మార్నింగ్ విడ్రి ఆకరి నోవన్ వంటి వ్యవసాయపు పండుగలలో దేవరులు దేవతలకు జంతు బలులిచ్చేవారు గోండు జాతి శ్రేయస్సుకు పూజాధికాలు నిర్వహించేవారు మిగిలిన పండుగలన్నీ వారే జరుపుతారు పండుగలన్నీ పాట్లా సహకారంతో జరుపుతారు బాలకుడైనా దేవరిగా ఉండవచ్చును యుక్త వయస్కుడు కాగానే వివాహం చేసుకోవాలి అవివాహితుడు దేవరిగా ఉండరాదు కాని ధార్మిక కార్యాలు నిర్వహించేటప్పుడు అతడు భార్యకు దూరంగా ఉండి నిష్టతో ఉండాలి ఉపవాసదీక్ష పాటించాలి

ఓటార్ స్థానం దేవరి భార్యను ఓటార్ అని అంటారు ఆమె పవిత్రురాలు గ్రామ ప్రజలు ఆమె నుండి శుభాశీస్సులు పొందుతారు ముఖ్యంగా పాంచ్వి అంటే బిడ్డ పుట్టినప్పుడు ఆమె సమక్షంలో గ్రామ స్త్రీలు బాలెంతరాలికి నమస్కరించి పాంచ్విని ఆశీర్వదించి వెళ్లేవారు గ్రామ స్త్రీ లోకంలో ఓటార్ పవిత్ర స్థానాన్ని కలిగి ఉంది దేవరి ఓటార్ వ్యవస్థను వారు ఆ నాడు మత విధానంగా భావించలేదు దానిని కూడా గ్రామ పరిపాలనలో భాగంగానే భావించారు

ఈ విధంగా గోండు రాజులు తమ పరిపాలనను నిర్వహించి తమ జాతిని జాగ్రత్తగా కాపాడుకున్నారు ఈ ఆధునిక కాలంలో గోండు ప్రజల పూర్వపు కట్టుబాట్లు అన్నీ సడలిపోతున్నాయి

రాజవంశాల పట్టికలు

ప్రాచీన కాలం నుండి కాకతీయుల వరకు రాజవంశాల పట్టికలు మొదటి రెండు భాగాలలో యివ్వబడ్డాయి ఈ భాగంలో ముసునూరి వంశంనుండి మొగల్ సుబేదారుల వరకు ఇవ్వబడ్డాయి

ముసునూరి కమ్మనాయక వంశం

ముసునూరి ప్రోలయనాయకుడు	క్రీ శ	1325-1335
కాపయనాయకుడు	క్రీ శ	1325-1368

కొండవీటి రెడ్డి వంశం

ప్రోలయ వేమారెడ్డి	క్రీ శ	1325-1353
అనపోతారెడ్డి	క్రీ శ	1354-1364
అనవేమారెడ్డి	క్రీ శ	1364-1386
కుమారగిరి రెడ్డి	క్రీ శ	1386-1402
పెదకోమటి వేమారెడ్డి	క్రీ శ	1402-1420
రాచవేమారెడ్డి	క్రీ శ	1420-1424

రాజమహేంద్రవర రాజ్య వంశం

కాటయ వేమారెడ్డి	క్రీ శ	1402-1414
రెండవ కుమారగిరిరెడ్డి	క్రీ శ	1414-1417
లనితల్లి అల్లాడరెడ్డి సంరక్షకత్వం)	క్రీ శ	1417-1422
మూడవ కుమారగిరిరెడ్డి	క్రీ శ	1422-1423
మూడవ అనపోతారెడ్డి	క్రీ శ	1423-1423

వీరిద్దరూ అల్లాడరెడ్డి సోదరుడైన ప్రోలారెడ్డి కుమారులు)
కొమ్ముచిక్కాల శాసనం ఆధారం

అనితల్లి - వీరభద్రారెడ్డి	క్రీ శ	1423-1448

గజపతి వంశం

కపిలేశ్వర గజపతి	క్రీ శ	1434-1468
పురుషోత్తమ గజపతి	క్రీ శ	1468-1496
ప్రతాపరుద్ర గజపతి	క్రీ శ	1496-1538

విజయనగర సామ్రాజ్య సంగమవంశం

మొదటి హరిహరరాయలు	క్రీ శ	1336-1355
మొదటి బుక్కరాయలు	క్రీ శ	1355-1377
రెండవ హరిహరరాయలు	క్రీ శ	1377-1404
మొదటి విరూపాక్షరాయలు	క్రీ శ	1404-1405
రెండవ బుక్కరాయలు	క్రీ శ	1405-1406
మొదటి దేవరాయలు	క్రీ శ	1406-1422
రామచంద్రరాయలు	క్రీ శ	1422-1422
మొదటి విజయరాయలు	క్రీ శ	1422-1426
రెండవ దేవరాయలు	క్రీ శ	1426-1446
రెండవ విజయరాయలు	క్రీ శ	1446-1447
మల్లికార్జున రాయలు	క్రీ శ	1447-1467
రెండవ రామచంద్రరాయలు	క్రీ శ	1467-1467
రెండవ విరూపాక్షరయలు	క్రీ శ	1467-1485
ప్రౌఢదేవరాయలు లేక వడియరావు	క్రీ శ	1485-1486

సాళువ వంశం

సాళువ నరసింహరాయలు	క్రీ శ	1486-1491
చిన్న రాకుమారులు	క్రీ శ	1491-1493
ఇమ్మడి నరసింహరాయలు	క్రీ శ	1493-1505

తుళువ వంశం

వీరనరసింహరాయలు	క్రీ శ	1505-1509
శ్రీకృష్ణదేవరాయలు	క్రీ శ	1509-1529
అచ్యుతదేవరాయలు	క్రీ శ	1530-1542
మొదటి వెంకటపతిరాయలు	క్రీ శ	1542-1543
సదాశివరాయలు	క్రీ శ	1543-1570

ఆరవీడు వంశం

మొదటి తిరుమలరాయలు	క్రీ శ	1570-1572
మొదటి శ్రీరంగరాయలు	క్రీ శ	1572-1586
రెండవ వెంకటపతిరాయలు	క్రీ శ	1586-1614
చిక్క రాయలు	క్రీ శ	1614-1615
రామదేవరాయలు	క్రీ శ	1615-1630
మూడవ వెంకటపతిరాయలు	క్రీ శ	1630-1642
మూడవ శ్రీరంగరాయలు	క్రీ శ	1642-1680

రాచకొండ పద్మనాయక వంశం

మొదటి సింగమనాయకుడు	క్రీ శ	1326-1361
మొదటి అనపోతానాయకుడు	క్రీ శ	1361-1384
రెండవ సింగమనాయకుడు	క్రీ శ	1384-1399
రెండవ అనపోతానాయకుడు	క్రీ శ	1399-1421
రావు మాదానాయకుడు	క్రీ శ	1421-1430
మూడవ సింగభూపాలుడు	క్రీ శ	1430-1475

దేవరకొండ వంశం

మాదానాయుడు	క్రీ శ	1361-1384
పెదవేదగిరినాయుడు	క్రీ శ	1384-1410
రెండవ మాదానాయుడు	క్రీ శ	1410-1425
లింగమనేడు	క్రీ శ	1425-1475

బహమనీ వంశం

అల్లావుద్దీన్ హసన్ బహమన్‌షా	క్రీ శ	1347-1358
మొదటి మహమ్మద్ షా	క్రీ శ	1358-1375
ముజాహిద్	క్రీ శ	1375-1378
మొదటి దావూద్	క్రీ శ	1378-1378
రెండవ మహమ్మద్	క్రీ శ	1378-1397

తహంతన్	క్రీ శ 1397-1397
రెండవ దావూద్	క్రీ శ. 1397-1397
ఫిరోజ్‌షా	క్రీ శ 1397-1422
మొదటి అహమ్మద్‌షా	క్రీ శ 1422-1436
రెండవ అల్లావుద్దీన్ అహమ్మద్‌షా	క్రీ శ 1436-1458
హుమాయూన్	క్రీ శ 1458-1461
మూడవ అహమ్మద్‌షా	క్రీ శ 1461-1463
మూడవ మహమ్మద్	క్రీ శ 1463-1482
మహమూద్	క్రీ శ 1482-1518
నాల్గవ అహమ్మద్	క్రీ శ 1518-1520
మూడవ అల్లావుద్దీన్	క్రీ శ 1520-1523
వలీముల్లా	క్రీ శ 1523-1526
కలీముల్లా	క్రీ శ 1526-1528
	1538

గోల్కొండ కుతుబ్‌షాహి వంశం

కులీ కుతుబ్‌షా	క్రీ శ 1518-1543
జంషీద్ కుతుబ్‌షా	క్రీ శ 1543-1550
సుభాన్ కులీ	క్రీ శ 1550-1550
ఇబ్రహీం కుతుబ్‌షా	క్రీ శ 1550-1580
సుల్తాన్ మహమ్మద్ కులీకుతుబ్షా	క్రీ శ 1580-1612
మహమ్మద్ కుతుబ్‌షా	క్రీ శ 1612-1626
అబ్దుల్లా కుతుబ్‌షా	క్రీ శ 1626-1672
అబుల్‌హసన్ తానీషా	క్రీ శ 1672-1687

దక్కను మొగల్ సుబేదారులు

ఖాన్-ఐ-జహాన్ జఫర్‌జంగ్	
కోకలిటాష్	క్రీ శ 1687-1707
గాజి ఉద్దీన్ ఖాన్ ఫిరోజ్‌జంగ్	క్రీ శ 1707-1708
ముజ్జమ్	క్రీ శ 1708-1709
దుల్‌ఫిర్‌ఖాన్	క్రీ శ 1709-1713
నిజాం ఉల్ ముల్కు	క్రీ శ 1713-1714
హుసేన్ ఆలీఖాన్	క్రీ శ 1714-1720
నిజాం ఉల్‌ముల్క్	క్రీ శ 1720-1722
ముబారిజ్‌ఖాన్	క్రీ శ 1722-1724
నిజాం ఉల్‌ముల్క్	క్రీ శ 1724

(స్వతంత్రం ప్రకటించాడు)

గోందురాజులు

కోల్‌భిల్	క్రీ శ 1220-1240
భీంభల్లాల్‌సింగ్	
హీరాసింగ్	
ఆంద్య భల్లాల్‌సింగ్	
తల్వార్‌సింగ్	
కేసర్‌సింగ్	
దినకర్‌సింగ్	
రాంసింగ్	
షేర్‌సింగ్ (సూర్జాభల్లాల్‌సింగ్)	
ఖండ్కియా భల్లాల్‌షా	క్రీ శ 1437-1462
హీర్‌షా	
భూమా	
లోక్బ	
కర్ణషా	
బాబాజీ భల్లాల్‌షా	క్రీ శ 1572-1592
కృష్ణషా	
బీర్‌షా	
రాంషా	క్రీ శ 1672-173০
నీల్‌కంఠ్‌షా	క్రీ శ 1735-175

మరాఠాసేనాని రఘూజిభోంస్లే గోందురాజులలో చివరివాడైన నీల్‌కంఠ్‌షాను బంధించి గోందు రాజ్యాన్ని మరాఠా రాజ్యంలో కలిపాడు దాంతో ఆదిలాబాద్‌జిల్లాలోని గోండు రాజ్యం అంతరించిపోయింది తర్వాత ఇంగ్లీషువారు ఈ ప్రాంతాన్ని నిజాం రాజ్యంలో కలిపారు

కాకతీయ గణపతిదేవుని వంశవృక్షం

గణపతిదేవుడు

- గణపాంబ-భర్తకోట బేతరాజు
- రుద్రమదేవి (1268-1296) భర్త చాళుక్య వీరభద్రుడు
  - రుయ్యమ్మ భర్త ఇందలూరి అన్నయ
  - రుద్రమ్మ భర్త యల్లాణదేవుడు
  - ముమ్మిడమ్మ భర్త మహాదేవరాజు
    - ప్రతాపరుద్రుడు-2 (1296-1323)
    - అన్నయదేవుడు (బస్తరుకు వెళ్ళిపోయాడు

నాల్గవ భాగం
సంస్కృతి-విభాగం

ఈ యుగంలో ఆంధ్ర సాంఘిక వ్యవస్థలో వచ్చిన పరిణామం

ఈ యుగంలో ఆంధ్ర సాంఘిక వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయి కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఆంధ్రదేశంలోని పాలకవర్గాలు పాలకవంశాలు అన్నీ కమ్మ వెలమ రెడ్డి కులాలుగా రూపొందటం ఈ యుగం నాటి ప్రత్యేక సాంఘిక పరిణామం అందువల్ల ఆంధ్ర సమాజంలో అంతకు పూర్వం పాలించిన చాళుక్య చోళ మొదలైన వంశాల పేర్లన్నీ మరుగున పడిపోయి కమ్మ వెలమ రెడ్డి అనే ప్రత్యేక కులాలు పాలక వంశాలుగా రూపొంది ఒక నూతన సాంఘిక వ్యవస్థ ప్రారంభమైంది. ఈ కులాల పరిణామం ఇక్కడ వివరిద్దాం

కమ్మ కులం పుట్టుక - పరిణామం

కమ్మ అనే శబ్దం చాలా ప్రాచీనమైనది. అది ప్రాకృత పదం ఈ శబ్దం శాసనాలలో మూడు విధాలుగా ప్రయోగించబడింది మొదట వ్యక్తులకు తరువాత ప్రదేశానికి తరువాత కుల సంకేతంగా ప్రయోగించబడింది. క్రీ పూ 4వ శతాబ్దానికి చెందిన అమరావతిలోని బౌద్ధ శాసనంలో మొట్టమొదటిసారిగా కమ్మ శబ్దం కనిపిస్తోంది ఆ శాసనంలో నవ కమ్మలు మహాన కమ్మలు అనే శబ్దాలున్నాయి దానిని బట్టి కమ్మ అనేవారు ఒక ప్రజా సమూహమని చెప్పవచ్చును వారు బౌద్ధమతాన్ని పుచ్చుకున్నారని కూడా చెప్పవచ్చును కనుక కమ్మ అనేది ఒక జాతి లేక తెగ అయి ఉండవచ్చు. క్రీస్తు పూర్వ కాలంలో ముఖ్యంగా మౌర్యయుగానికి ముందు ఆంధ్రదేశంలో అనేక తెగలున్నట్లు గ్రీకు రచనల ద్వారా తెలుస్తోంది. ఆంధ్రదేశంలో 118 తెగలున్నట్లు పరియన్ రాశాడు కనుక 118 తెగలలో కమ్మ తెగ కూడా ఒక తెగ అయి ఉండవచ్చును దౌర్భాస దేవీ పురాణకథలో కమ్మ మహారాజు సంతతి వారు కమ్మ వారని తెలుపుతోంది అతడు చంద్రవంశస్థుడని కూడా తెలుపుతోంది. కనుక కమ్మవారు ఒక జాతి వారనే అభిప్రాయాన్ని ఈ పురాణం బలపరుస్తోంది అలాగే గుంటూరు జిల్లా ప్రకాశం జిల్లా ప్రాంతాలు కమ్మ రాష్ట్రంగా శాసనాలు తెలుపుతున్నాయి కమ్మరాష్ట్ర ప్రస్తావన మొట్టమొదటిసారిగా మనకు క్రీ శ 3వ శతాబ్దానికి చెందిన ఇక్ష్వాకు వీరపురుషదత్తుని జగ్గయ్యపేట లేక బేతవోలు శాసనంలో కనిపిస్తోంది ఆ శాసనం ప్రాకృత భాషలో ఉంది అందులో కమ్మ కరట అనే పదం ఉపయోగించబడింది. సంస్కృతంలో కమ్మ కరటాన్ని కర్మ రాష్ట్రం అని పేర్కొన్నారు పల్లవరాజులలో కుమారవిష్ణువు చందలూరు తామ్రశాసనంలోను విష్ణుగోపుని చూర శాసనంలోను కర్మ రాష్ట్ర ప్రస్తావన ఉంది కర్మ రాష్ట్రం అని పేర్కొన్న మొదటి శాసనాలు పల్లవుల శాసనాలే అయ్యుండాలి మూడవ మాధవవర్మ పొలమూరు శాసనంలో కమ్మ రాష్ట్రం పేరుంది అలాగే 7వ శతాబ్దానికి చెందిన రెండవ పులకేశి కొప్పరం శాసనం 8వ శతాబ్దంలోని రెండవ జయసింహుని పెదకళ్లు శాసనాలలో కర్మ రాష్ట్రం లేక కమ్మనాడు అని పిలువబడిన ప్రాంతం కృష్ణానదికి దక్షిణ భాగం కొద్దిగా ఉత్తరంగా కూడా ఉంది. ఖమ్మం జిల్లా నందిగామ తాలూకాలు కూడా కమ్మ రాష్ట్రంలోనివే 15వ శతాబ్దం వరకు కమ్మనాడు వాడుకలో ఉంది.

ఒక జాతి నివసించిన ప్రాంతానికి ఆ జాతి పేరు రావడం పరిపాటి శాతవాహనులు వచ్చిన తర్వాత ధాన్యకటక ప్రాంతానికి ఆంధ్ర రట్టం అని పేరు వచ్చింది అంతకు పూర్వం బౌద్ధయుగంలో దక్షిణదేశంలో నాగజాతి వారు నివసించినందువల్ల గంగాతీరం నుండి దక్షిణాది వరకు భూభాగాన్ని బౌద్ధసాహిత్యం నాగభూమి అని పేర్కొంది కనుక వీరపురుషదత్తుని శాసనంలో పేర్కొనబడిన కమ్మకరటదు ప్రాంతంలో కమ్మజాతి వారు నివసించి ఉండాలి వారు నివసించినందువల్లనే ఆ ప్రాంతానికి కమ్మకరట అని పేరు వచ్చి ఉంటుంది కనుక ఆంధ్రదేశంలో ప్రాచీన కాలంలో కమ్మజాతి ఒకటి ఉందని స్పష్టంగా చెప్పవచ్చును కమ్మ అనేది జాతి సంకేతమా ప్రాంత సంకేతమా దేశ సంకేతమా స్పష్టంగా తెలియదని కొందరు కమ్మ రాష్ట్రంలో నివసించిన వారు కమ్మవారయ్యారని అంటారు అంటే ప్రాంతం పేరు వల్ల జాతికి పేరు వచ్చిందని అర్థం కాని ఒక నిర్జన ప్రదేశానికి మొదట పేరు ఎలా వస్తుంది జాతి వల్లనే ఏ ప్రాంతానికైనా పేరు వస్తుంది శాసనాధారం కూడా కమ్మ శబ్దం కమ్మ రాష్ట్రానికంటే ప్రాచీనమైందని తెలుపుతోంది కమ్మరాష్ట్రం క్రీ పూ 4వ శతాబ్దానిదనీ కమ్మకరటమ

క్రీ శ 3వ శతాబ్దానిదనీ శాసనాలు తెలుపుతున్నాయి కనుక కమ్మజాతి నివసించినందువల్లనే ఆ ప్రాంతానికి కమ్మ రాష్ట్రం అని పేరు వచ్చిందని ఖచ్చితంగా చెప్పవచ్చును 10వ శతాబ్దం తర్వాత శాసనాలు కూడా ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి క్రీ శ 10వ శతాబ్దం నాటి రెండవ అమ్మరాజమహేంద్రుని కురవాడ శాసనం క్రీ శ 1011 నాటి పశ్చిమచాళుక్య ఐదవ విక్రమాదిత్యుని అలూరి శాసనం కమ్మ కులజులైన విప్రులను పేర్కొంటుంది అమరావతి శాసనంలో కమ్మకులోద్భవులైన భూసురులను గురించి చెప్పబడింది ఆంధ్రదేశంలోనే కాక కన్నడ దేశంలోని ధార్వార్ హసన్ చిత్రదుర్గ చిక్కమగులూర్ మైసూర్ ప్రాంతాలలోని అనేక శాసనాలు కమ్మ బ్రాహ్మణులు పేర్కొంటున్నాయి కళ్యాణి చాళుక్యుల కాలంలో అనేక మంది కమ్మనాటి బ్రాహ్మణులు కన్నదేశానికి వలస పోయి కళ్యాణి చాళుక్యులను ఆశ్రయించి ఉద్యోగాలు సంపాదించినట్లుగా కనిపిస్తోంది 5వ విక్రమాదిత్యుని సేనాధిపతి వినయభట్టు కమ్మ కులస్థుడని ఉంది ఆరవ విక్రమాదిత్యుని సేనానులైన చాముండరాయ సర్వదేవ అనే వారు కమ్మ కులస్తులు కన్నడ పంచతంత్ర రచయిత అయిన దుర్గసింహుడు క్రీ శ 1525నాటికి చెందిన వాడు అతడు కమ్మ కులానికి చెందిన వాడు 1209 సంవత్సరానికి చెందిన జెన్న అనే ప్రముఖ కన్నడ కవి కమ్మ వంశస్తుడని ఉంది అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం వీరశైవ మతస్థాపకుడైన బసవేశ్వరుని తండ్రి శూద్రరాజు అతడు భాగ్వాజపురాధీశ్వరుడు బసవరాజ దేవర్గాజ వలె అనే పద్యంలో శూద్రరాజు కమ్మకులస్థుడని ఉంది ఈ విషయాన్ని గురించి వివరిస్తూ బి దేశాయ్ అనే చరిత్రకారుడు ఆంధ్రదేశంలోని కమ్మనాటి నుంచి వలస వెళ్లిన వారంతా కమ్మ కులస్థులుగా చెలామణి అయ్యారని రాశాడు వీరంతా కన్నడ దేశం వెళ్లి కన్నడ భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేశారు వీరి పేర్లలో ఉన్న కులం అనే పదం జాతి సంకేతమేగాని ప్రాంత సంకేతం కాదు ప్రాంతం వల్ల వారికి ఆ పేరు వచ్చి ఉంటే వారిని కమ్మనాటి విప్రులని కమ్మరాష్ట్ర భూసురులని పేర్కొని ఉండేవారు కనుక ఈ రెండు శాసనాలలో చెప్పిన కులం అనే పదం ఖచ్చితంగా జాతి సంకేతమే కనుక వారు కమ్మ జాతికి చెందిన బ్రాహ్మణులని చెప్పాలి అందుకు ఉదాహరణంగా క్రీ శ 673 నాటి సర్వలోకాశ్రయ విష్ణువర్ధన మహారాజు చందలూరు శాసనాన్ని చెప్పవచ్చును ఆ శాసనంలో బోయ బ్రాహ్మణుల ప్రస్తావన ఉంది ఈ పదంలోని బోయశబ్దం జాతిచిహ్నం బ్రాహ్మణపదం కుల చిహ్నం తూర్పుచాళుక్యుల కాలంలో నెల్లూరు జిల్లాలోని బోయశబ్దం జాతిచిహ్నం బ్రాహ్మణపదం కుల చిహ్నం తూర్పుచాళుక్యుల కాలంలో నెల్లూరు జిల్లాలోని బోయ జాతి వారిని ఆర్యమతంలోకి మార్చారు అప్పుడు ఆ జాతిలోని ప్రజలు చేసే వృత్తిని బట్టి దేవాలయ పూజారులను బ్రాహ్మణులుగాను బోయ రాజులను క్షత్రియులుగాను బోయ వ్యాపారులను వైశ్యులుగాను మిగిలిన బ్రాహ్మణులను పేర్కొంటున్నాయి ఈ శబ్దంలోని పల్లవ అనే పదం జాతి సంకేతం అందులోని బ్రాహ్మణపదం కుల సంకేతం అంటే పల్లవ జాతి వారిలో కూడా కొందరు బ్రాహ్మణులుగా మారారని ఈ శాసనం తెలుపుతోంది క్షత్రియ వైశ్యులు క్రమంగా బ్రాహ్మణులు కావచ్చని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి కనుక బోయ పల్లవ జాతులకు చెందిన వారు కొందరు బ్రాహ్మణులుగా మారిపోయారని స్పష్టమవుతోంది అలాగే అప్పటి దాకా జైన బౌద్ధ మతాలలో ఉన్న కమ్మ జాతి వారు వైదికమతంలోకి మారగానే వారి వారి వృత్తులను బట్టి కమ్మజాతి వారు కూడా కమ్మ బ్రాహ్మణులుగాను కమ్మకోమట్లుగాను కమ్మ కాపులుగాను కమ్మసాలీలు ఇతర వృత్తుల వారుగానూ మారిపోయారు కమ్మకులజులైన విప్రుల ప్రస్తావనలాగే కమ్మకోమట్ల ప్రస్తావన కమ్మసాలీల ప్రస్తావన శాసనాలలో ఉంది క్రీ శ 1068 నాటి ద్రాక్షరామ శాసనంలో కమ్మకోమటి పాపయ్య పేరు ఉంది క్రీ శ 1150 నాటి మరొక ద్రాక్షరామ శాసనంలో కమ్మకోటి కొమ్మిశెట్టి ప్రస్థావన ఉంది క్రీ శ 1201 నాటి సరసీపుర అంటే ఏలూరు శాసనం కమ్మకోమటి అయితమశెట్టిని పేర్కొంది కమ్మసాలీలున్నారని బౌద్ధసాహిత్యం తెలుపుతోంది శ్రీలంకనేలిన విజయుడు అనే రాజు ఆంధ్రదేశంలోని కమ్మ రాష్ట్రంలోని కమ్మసాలీలను తన దేశానికి పిలిపించుకున్నాడని సింహళ బౌద్ధ గ్రంధాలు తెలుపుతున్నాయి బ్రాహ్మణులలో బొజ్జారి కమ్మలు 6 వేల ధర్మనందున విలాసం అనే గ్రంథంలో కమ్మ వారు చాతుర్వర్ణాలలో ఉన్నారని తెలుపుతోంది కనుక కమ్మజాతి వైదికమతంలోకి ప్రవేశించిన తర్వాత వారి వారి వృత్తిని బట్టి నాలుగు కులాలలో సభ్యులయ్యారని చెప్పవచ్చును కమ్మకాపులు చాళుక్య కాకతీయయుగంలో రాజసేవలో చేరి కమ్మనాయకులుగాను కమ్మదొరలుగాను మారి నేటి కమ్మవారయ్యారు పద్మనాయక చరిత్ర కాపులెల్ల కమ్మవెలమలయ్యారని తెలుపుతోంది కనుక కమ్మరాష్ట్రంలోని పాలకవర్గం కాపుల నేటి కమ్మ వారుగా మారారు కమ్మవారు చాళుక్యులకు తోడ్పడుతూ ఉన్నారని వారిని ఓడించి కమ్మదొరలను మోదిన కాలదండ అని వెలమనాయకులు బిరుదులను ధరించారని వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది నేటి

కమ్మవారి పూర్వీకులకు ఈ కమ్మ శబ్దం క్రీ శ 12-14 శతాబ్దాల మధ్య స్థిరపడిందని శాసనాలు నాటి గ్రంధాలు ధృవపరుస్తున్నాయి హిందూ సంస్కృతి విస్తరణలో వైదిక మతస్తులు ఒక ప్రత్యేక వ్యూహాన్ని అనుసరించారు వారు తమ మతంలో ఒక వ్యక్తిని గాక జాతి మొత్తాన్ని చేర్చుకునేవారు చేర్చుకొనేముందు ఆ తెగలోని వ్యక్తుల ఏ హోదాలో ఉంటే తమ వర్ణవ్యవస్థలో అదే క్రమంలో చేర్చుకొనేవారు ఆ తెగకి రాజుగా ఉంటే అతని కుటుంబాన్ని క్షత్రియులుగా చేసుకొనేవారు ఈ పద్ధతి వల్ల వ్యక్తుల మధ్య పేచీలు రావడానికి అవకాశం లేదు ఒక్క దెబ్బతో ఆ తెగ అంతా ఒకేసారి వైదికమతంలో చేరిపోయి వారి రాజ్యం అంతా హిందూ ప్రాంతంగా మారిపోయేది ఇది అమోఘమైన పద్ధతి ఈ పద్ధతిలో వారు సులభంగా భారతదేశాన్నంతటినీ వైదిక వర్ణచట్రంలోకి తీసుకురాగలిగారు అదే విధానాన్ని అనుసరించి కమ్మరాష్ట్రంలోని కమ్మజాతిని వైదికమతంలోకి చేర్చుకున్నారు ఆ రోజులలో అనార్యులకు గుడులుండేవి అందులో కొందరు పూజారులుగా ఉండేవారు వారిని తమ వర్ణవ్యవస్థ చట్రంలో బ్రాహ్మణులుగా తీసుకోవలసి వచ్చింది తీసుకొని వారిని కమ్మబ్రాహ్మణులు అన్నారు కనుక కమ్మరాష్ట్రం కాలక్రమేణా కమ్మనాడుగా పిలువబడింది కనుక బ్రాహ్మణునిగా తీసుకున్న పూజారిని కమ్మబ్రాహ్మణుడు అని అన్నారు అలాగే అక్కడి వ్యాపారిని కమ్మ కోమటి అని అన్నారు అదే విధంగా ఇతర వృత్తుల వారిని కమ్మసాలీలు ఆంధ్రశాసనాలలో పేర్కొనబడ్డారు అన్ని వృత్తుల వాళ్లు అలా పిలువబడగా వ్యవసాయదారులుగా మిగిలి పోయిన కమ్మజాతి వారిని కమ్మవారు అని అన్నారు కమ్మనాటి రైతులను కమ్మకాపులని కూడా పిలిచేవారు కాలక్రమేణా కమ్మబ్రాహ్మణులకు కమ్మకోమట్లకు కమ్మసాలీలకు పక్కన ఉన్న కమ్మ శబ్దం పోయి కమ్మ బ్రాహ్మణుడు వట్టి బ్రాహ్మణుడుగాను కమ్మకోమటి వట్టి కోమటిగాను కమ్మసాలీలు వట్టి సాలీలుగాను మిగిలారు మిగిలిన కమ్మకాపులు కమ్మవారుగా మిగిలారు వారే ఈ నాటి ఆంధ్రదేశంలోని కమ్మకులస్తుల పూర్వీకులు ఈ కమ్మ వారు తర్వాత కాలాలలో కమ్మ రాష్ట్రం నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు ముఖ్యంగా ఖమ్మంజిల్లాకు తరలి వెళ్లారు వారి వల్లనే ఆ ప్రాంతానికి ఖమ్మం అని పేరు వచ్చింది ఆదిలో కమ్మరాష్ట్రం అంత వరకు ఉండేది కనుక దానికి ఖమ్మం మెట్టు అని పేరు వచ్చింది గుండ్లకమ్మనది కూడా కమ్మ శబ్దం నుండి వచ్చిందే నాగులేరు శబరి నదుల లాగా గుండ్లకమ్మ కమ్మనది కమ్మజాతి వారు ఆ నదికి ఇరువైపులా నివసించారు అందువల్ల దానికి కమ్మ నది అని పేరు వచ్చి ఉంటుంది ఆ నదిలో గుండ్లు ఎక్కువగా ఉన్నందును దానికి గుండ్లకమ్మ అని పేరు వచ్చింది ఈ నదికి ఎప్పుడు గుండ్లకమ్మ అని పేరు వచ్చిందో తెలియదు ఆ నదికి ఆ పేరు వచ్చినంత ప్రాచీన కమ్మజాతి ఉందని చెప్పవచ్చును కమ్మజాతితోపాటు కమ్మ రాష్ట్రంలో నివసించిన మిగిలిన నాగ యక్ష బోయ మొదలైన జాతుల వారు కూడా అదే విధంగా వైదికమతంలో వారి వారి వృత్తులను బట్టి నాలుగు కులాలుగా చేరిపోయారు కనుకనే వారు బోయ బ్రాహ్మణులని పల్లవ బ్రాహ్మణులని పిలువబడ్డారు కాని వారు కమ్మవారికి భిన్నమైనవారు

12వ శతాబ్ది స్థితి - కమ్మ వెలమ రెడ్డి కులాలు ప్రత్యేకంగా రూపొందడం

12వ శతాబ్దంలో కమ్మ రాష్ట్రంలో సూర్య వంశీయులైన తెలుగు చోళరాజులు ధనంజయ గోత్రీకులగు కోట వంశం వారు దుర్జయాన్వయులైన వెలనాటిచోదులు చంద్రవంశ చాళుక్యులు హైహయులు నాగరాజులు యాదవ రాజులు తెలుగు పల్లవరాజులు రెడ్లు నివసించారు తెలుగుచోళులు హైహయ చాళుక్యరాజులతో వియ్యాలు పొందుతుండగా దుర్జయాన్వయులు వెలనాటిచోదులు కొండపడమటి వంశస్తులు వియ్యాలందారు కాకతీయులు దుర్జయులైన నతవాడి కోట వంశస్తులతో వియ్యం పొందారు పల్లవులు తెలుగుచోళులతో వియ్యం పొందారు వీరందరూ తాము పాలకవర్గం అయిన క్షత్రియులుగా భావించుకున్నారు ఈ స్థితిలో పలనాటి యుద్ధం జరిగింది అందులో క్షత్రియ కులం తన ప్రాముఖ్యతను పోగొట్టుకుంది తర్వాత కాకతీయ రాజ్యం పతనమైంది కాకతీయ రాజ్యపతనం పాలకవర్గాలలో పెను మార్పును తీసుకువచ్చింది ముస్లింలను పారదోలి ముసునూరు ప్రోలయ నాయకుడు కాపయ నాయకులు ఓరుగల్లు సామ్రాజ్యాన్ని పునరుద్ధరించారు కాపయనాయకుడు ఆంధ్రసురత్రాణ ఆంధ్రాధీశ్వర అనే బిరుదులు ధరించాడు అదే సమయంలో అద్దంకిలో ప్రోలయ వేమారెడ్డి రెడ్డి రాజ్యాన్ని స్థాపించాడు అంతవరకు ఈ మూడు వర్గాల కాకతీయ సైన్యాధిపతులుగా ఉండేవారు ఈ రాజ్యాల స్థాపనతో అంతవరకు సేనాధిపతులుగా ఉన్న ముసునూరు రేచర్ల దేసటి వంశాలు రాజ వంశాలుగా మారాయి ఈ మూడు రాజ వంశాల వారే ఈ మూడు కమ్మ వెలమ రెడ్డి కులాలకు మూల పురుషులయ్యారు అంతవరకు ఆంధ్రదేశంలో రెడ్డిరికం చేసిన కుటుంబాలన్నీ రెడ్డి కులస్తులుగాను కమ్మనాటి నాయకులంతా కమ్మ వెలమలు

గాను మూడు వర్గాలుగా చీలిపోయారు వాస్తవానికి ఈ మూడువర్గాలకు మూలస్థానం కమ్మనాడే రెడ్డి రాజ్యానికి ప్రథమస్థానం అయిన అద్దంకి ఒంగేరు మార్గాలు కమ్మనాటిలోనివే అలాగే పద్మనాయక వెలమల స్థానం అయిన వెలనాడు కమ్మనాటిలోనిదే ఇక కమ్మవారి స్వస్థానం కమ్మనాడే కాని ఈ మూడు రాజ్యాలు ఏర్పడిన తర్వాత కమ్మనాటి పాలకవర్గాలు మూడు వర్గాలుగా చీలిపోయాయి ఈ పరిణామం తర్వాత అంతకుముందు పాలించిన చాళుక్య కాకతీయ తెలుగుచోళ మొదలైన వంశాలు కూడా తమ ఉనికిని కోల్పోయి ఈ మూడు కులాలలో దేనిలోనో ఒక దానిలో చేరిపోయారు ముసునూరి రేచర్ల కుటుంబాల మధ్య జరిగిన యుద్ధాల వల్ల ఈ పరిణామం జరిగింది వాస్తవానికి ముసునూరు రేచర్ల రెండు కుటుంబాలు కమ్మవారే

ఇక్ష్వాకుల కాలంలో గుంటూరు ప్రకాశం జిల్లా ప్రాంతాలన్ని కర్మ రాష్ట్రంగానే ఉండేవి ఇక్ష్వాకుల తర్వాత వచ్చిన పల్లవులు నాగార్జునకొండ ధరణికోటను పాలించారు కనుక వారి తర్వాత ఆ ప్రాంతానికి పలనాడు అనే పేరు వచ్చింది మిగిలిన ప్రాంతానికి కమ్మనాడు అనే పేరు కొనసాగింది 11-12 శతాబ్దాలలో వెలనాటిచోడులు ఆంధ్రదేశానికి అధిపతులయ్యారు అంతవరకు కమ్మనాడు ఆరువేలనాడుగా ఉండేది శాసనాలలో ఆరువేల కమ్మనాడు అని పేర్కొనబడింది వెలనాటి చోడుల కాలంలో వారి రాజ్యం ఉత్తరాన మహేంద్రగిరి వరకు దక్షిణాన కాళహస్తి వరకు విస్తరించి 1600 నాడు అయింది అందువల్ల వారు తమిళనాడులోని 16 వేల సంఖ్యను వాడకుండా వేలనాడు అని పిలువసాగారు అదే కాలక్రమంలో వెలనాడు అని మారింది తర్వాత వారి రాజధాని అయిన చందోలు పరిసర ప్రాంతాలకు అంటే బాపట్ల రేపల్లె వెలనాటిచోడుల తర్వాత ఇక్ష్వాకుల నాటి కమ్మరాష్ట్రం మూడు భాగాలైంది కొంత ప్రాంతాన్ని అంటే మిగిలిన ప్రాంతం అంటే నర్సరావుపేట అద్దంకి ఒంగోలు ప్రాంతాలు కమ్మనాడుగా వ్యవహరించబడ్డాయి వాస్తవానికి ఈ మూడు పేర్లతో పిలువబడే ప్రాంతం అంతా కమ్మనాడే పేర్లు మారిపోయినా అందరినీ కమ్మనాటి నాయకులనే పిలిచేవారు కాకతీయ రుద్రమదేవుని కాలంలో మొట్టమొదటిసారిగా కమ్మరాష్ట్ర నాయకులు కమ్మనాయకులుగా పిలువబడ్డారు కమ్మనాయక శబ్దం కాకతీయ యుగంలోనే ప్రారంభమైంది వారు వెలనాటి నుండి వచ్చినా పలనాటి నుండి వచ్చినా వారంతా కమ్మ నాయకులుగానే చెలామణి అయ్యేవారు వెలనాటి నుండి వచ్చిన వారిని వెలనాటి కమ్మలు అనేవారు నేడు కూడా వెలనాడని పిలువబడిన రేపల్లే బాపట్ల తాలూకాలలో కమ్మవారి జనాభాయే అధికం వెలమలు దాదాపు లేరనే చెప్పవచ్చును పలనాటిలో కూడా కమ్మవారే ఉన్నారు వెలమలు అసలు లేరు అద్దంకిలో ప్రోలయవేమారెడ్డి రెడ్డి రాజ్యం స్థాపించిన తర్వాత కమ్మనాడు అనే పేరు మరుగున పడిపోయింది అద్దంకి గుండ్లకమ్మ నది ఒడ్డున ఉంది అంతకుముందు కమ్మనాడు అని పిలువబడిన ఆ ప్రాంతానికి అద్దంకి రాజ్యం అనే పేరు వాడుకలోకి వచ్చింది తర్వాత అనపోతారెడ్డి తన రాజధానిని కొండవీటికి మార్చాడు అంతవరకు వెలనాడు అని పిలువబడే ఆ ప్రాంతానికి కొండవీటి రాజ్యం అనే పేరు చలామణిలోకి వచ్చింది ఒక్క పలనాడు ప్రాంతం మాత్రమే తన పేరును నేటి వరకు నిలుపుకొంది రెడ్డి రాజ్యస్థాపన ఫలితంగా కమ్మనాడు వెలనాడు అనే పేర్లు పూర్తిగా అంతరించి పోయాయి

కమ్మలు - వెలమలు, కమ్మలుగా చీలిపోవడం

ముసునూరు కాపయనాయకుని కాలంలో రేచర్ల సింగమనాయకుడు సొంత రాజ్యం ఏర్పరచుకొని కాపయ నాయకుని అధికారాన్ని ధిక్కరించాడు దాంతో కాపయ నాయకుడు సింగమనాయకునిపై దండెత్తి అతని రాజ్యాన్ని ఆక్రమించి క్రీ శ 1357లో తన సేనాధిపతి అయిన ఎరపోతులెంకను అనుమగల్లులో తన ప్రతినిధిగా నియమించాడు అతడు క్రీ శ 1357లో పిల్లలమఱ్ఱిలో శాసనం వేయించాడు దాంతో ఈ రాజ్యాల మధ్య పోరాటం ప్రారంభమైంది కాపయనాయకుడు బహమనీ సుల్తాన్ చేతిలో ఓడిపోయిన తర్వాత సింగమనాయకుడు తిరిగి తన రాజ్యాన్ని కైవసం చేసుకొన్నాడు కాపయనాయకుడు అతనిని అదుపు చేయలేకపోయాడు కనుక కాపయ నాయకుని చివరి కాలంలో స్వతంత్ర పద్మనాయక రాజ్యం వెలసింది

వెలమ కుల ప్రారంభం

రేచర్ల ప్రసాదిత్యుని సంతతి వారిని వెలుగోటి వారి వంశావళి పద్మనాయకులని సంబోధిస్తోంది వారే వెలమ కులస్తులు రేచర్లవారి చరిత్రను సింగమ నాయకుని తాత రేచర్ల ప్రసాదిత్యుని కాలం నుంచి బ్రిటిష్ యుగం దాకా వివరిస్తోంది సింగమనాయకుని తర్వాత వారు రాజకీయ వృత్తిని వదలుకోలేదు వారి వంశస్తుల

విజయనగర సామ్రాజ్యంలో సేనాధిపతులుగా చేరి నాయంకరాలు సంపాదించారు వారిలో నెల్లూరు జిల్లాలో వెంకటగిరి నాయంకరం ఒకటి ఆ తర్వాత కూడా వారి వంశం అనేక శాఖలుగా వృద్ధి చెంది బ్రిటిష్‌యుగంలో జమీందారీలు సంపాదించారు వీరి చరిత్ర అంతా రేచర్ల సింగమనాయకుని సంతతివారి చరిత్రలే ఆ వంశంలో పుట్టిన వీరులు సేనాధిపతులు సామంతులు జమీందారుల చరిత్రలతో వెలుగోటివారి వంశావళి నిండి ఉంది దానిని బట్టి పద్మనాయకులు లేక వెలమకులానికి మూలపురుషుడు రేచర్ల ప్రసాదిత్యుడు ఇతడు రుద్రమదేవి వద్ద సేనాధిపతి అంతకుముందు ఆంధ్రదేశంలో వెలమ కులం లేదు మరి అంతకుముందు వీరు ఎవరు? వెలమలు కమ్మలు వెలనాడు ప్రాంతీయులై ఉంటారు వెలనాటి చోడరాజ్యాన్ని గణపతిదేవుడు జయించిన తర్వాత వెలనాటి రాజ్యపు సేనాధిపతులు చాలా మంది కాకతీయుల కొలువులో సేనాధిపతులుగా చేరిపోయారు ఆ సమయంలో ప్రసాదిత్యుని పూర్వీకులు కూడా కాకతీయుల వద్ద సేనాధిపతులుగా చేరి తెలంగాణ వెళ్లిపోయి ఉంటారు వారు వెలనాటి నుండి వచ్చారు గనుక వెలనాటి వారుగా భావించుకొని ఉండవచ్చును బ్రహ్మనాయుని వీరవైష్ణవమతాన్ని ప్రచారం చేసుకున్నారు బ్రహ్మనాయుడు కూడా వెలనాటి వారుగా భావించుకొని ఉండవచ్చును పలనాటి యుద్ధం తర్వాత బ్రహ్మనాయుని అనుయాయులు కూడా ఓరుగల్లు చేరి కాకతీయ రాజ్యంలో బ్రహ్మనాయుని వీరవైష్ణవ మతాన్ని ప్రచారం చేసుకున్నారు బ్రహ్మనాయుడు కూడా వెలనాటివాడే గనుక తమ ప్రాంతం వాడైన బ్రహ్మనాయుని వీరవైష్ణవమతాన్ని ప్రసాదిత్యుడుగాని అతని తర్వాత వారు గాని స్వీకరించి ఉండవచ్చును కనుక వారు తమను పద్మనాయకులు అంటే విష్ణువు బొడ్డు నుండి పుట్టిన వారని కీర్తించుకొని ఉండవచ్చును వెలనాటి వారైనందువల్ల వెలమలని వీరవైష్ణవులైనందువల్ల పద్మనాయకులని వారు ముందు అతని పూర్వీకులు కూడా కమ్మనాటి నాయకులనే చెప్పవచ్చును కనుకనే కమ్మలు వెలమలు మొదట ఒకరే అనే స్మృతి ఆంధ్రదేశంలో కొనసాగి ఉంటుంది కనుక వెలుగోటి వంశావళిలో పేర్కొనబడిన వారు తప్ప నాయక బిరుదు కొనసాగించారు తమ పేర్ల చివరలో నాయుడు అని తగిలించుకొన్నారు వెలమలు తమను కమ్మవారికంటే భిన్నంగా భావించుకున్నారు గనుక తర్వాత కాలాలలో వారు తమ పేర్లలో నాయకుడు నాయుడు అనే పదాలు తొలగించుకొని రాయడు రావు రాయరావు అనే బిరుదులు ధరించి తమ ప్రత్యేకతను చాటుకున్నారు అందువల్ల నాయడు నాయుడు అనే పదం కమ్మవారి కుల సంకేతం అయింది

కాపయ నాయకుడు ముసునూరి వంశస్తుడు ముసునూరి వారు కమ్మవారు ఇనుగుర్తి మగత జీలుగుపల్లి యుద్ధాలలో చాళుక్య సైన్యంతోపాటు కాపయ నాయకుని సైన్యాన్ని సింగమనాయకుడు ఓడించినందువల్ల మచ్చ నాయకుల తలగొండుగండ కమ్మదొరలను మోదిన కాలదండం అనే బిరుదులు వహించాడు ఈ యుద్ధంలో పోరాడిన మచ్చనాయకులు చాళుక్యవంశస్తులు మిగిలినవారు కమ్మనాయకులు కనుక సింగమనాయకుడు ఆ రెండు బిరుదులు ధరించాడు తర్వాత అతని కుమారులు అనపోతా నాయకుడు మాదానాయకుడు భీమవరం యుద్ధంలో కాపయనాయకుని సంహరించారు అది వారికి గొప్ప విజయం కనుక కమ్మనాయకుని వధించిన ఘనతను వారు చాలా కాలం చెప్పుకున్నారు వెలుగోటి వారి వంశావళి కూడా ఆ సంఘటనను ఘనంగా వర్ణిస్తోంది ముసునూరు రేచర్ల కుటుంబాల మధ్య జరిగిన యుద్ధాలే కమ్మనాటి నాయకులనే వెలమ కమ్మ అనే రెండు వేర్వేరు కులాలుగా రూపొందుటకు కారణమయ్యాయి కనుక నాటి నుండే ఈ రెండు కులాలు ప్రత్యేకంగా రూపొందటం ప్రారంభమైంది చివరకు ముసునూరి వారి అనుయాయులు కమ్మ కులంగా మారారు వారికి పూర్వీకులు అయిన వారు కమ్మ రాష్ట్రంలోని కొండపడమటి కోట వెలనాటి చోడ వంశస్తులు జాయపనాయకుని అయ్యపవంశస్తుల మూలపురుషులు రేచర్ల సింగమనాయకుని సంతతి వారు వెలమకులంగాను రూపొందారు అంతవరకు వారు నాయకులు అని పిలువబడ్డారు అంటే సేనాధిపతులు తర్వాత వారిలో కమ్మనాయకులు వెలమ నాయకులు అని వర్గీకరణ వచ్చింది ముఖ్యంగా ముసునూరి వారితో సింగమనాయకుని కుటుంబీకులు చేసిన యుద్ధాల వల్లనే తమను ప్రత్యేక వర్గంగా రూపొందించుకున్నారు వారే చివరకు వెలమ కులంగా మారారు

రెడ్డి కులం రూపొందడం

కమ్మనాటి నాయకులు కమ్మ వెలమ కులాలుగా పరిణామం చెందిన సందర్భంలో కమ్మనాటిలోని రెడ్డిరికం చేసిన కుటుంబాలన్నీ రెడ్డి వర్గంగా రూపొందడం ఆ వర్గమే చివరకు రెడ్డి కులంగా మారింది దాంతో కమ్మనాటి నాయకులు కమ్మ వెలమ రెడ్డి అనే మూడు కులాలుగా చీలిపోయారు

చాళుక్య, చోళ, కాకతీయ, తెలుగుచోడ వంశాలు కమ్మ, రెడ్డి కులాలలో చేరిపోవడం

కమ్మనాటి నాయకులు మూడు వర్గాలుగా చీలిన తర్వాత ఆంధ్రదేశపు సాంఘికవ్యవస్థలో మరొక పరిణామం జరిగింది. అంతవరకు ఆంధ్రదేశంలో క్షత్రియులుగా పాలించిన చాళుక్య, చోళ, తెలుగు చోడవంశాలు, కాకతీయులు కూడా తమ ఉనికిని నిలబెట్టుకోలేకపోయి కమ్మ, రెడ్డి కులాలలో చేరిపోయాయి. ఈ పరిణామం కూడా ముసునూరు, రేచర్ల కుటుంబాల మధ్య జరిగిన యుద్ధాల వలననే జరిగింది. రేచర్ల సింగమనాయకుడు కాపయ నాయకుని నుండి క్రీ.శ.1557 తర్వాత అనుమగల్లు, పిల్లలమర్రి ప్రాంతాన్ని పునరాక్రమించాడు. తర్వాత తన రాజ్యాన్ని విస్తరించసాగాడు. ఆ కాలంలో నల్లగొండ జిల్లాలోని జల్లిపల్లి, జీలుగుపల్లి, మగతల, ఇనుగుర్తి మొదలైన ప్రాంతాలలో చంద్ర వంశానికి చెందిన చాళుక్యులు పరిపాలిస్తున్నారు. సింగమనాయకుడు వారి రాజ్యాలను జయించి తన రాజ్యంలో కలుపుకోవాలని వారి ప్రాంతాలపై దండయాత్రలు జరిపాడు. సింగమ నాయకుని ఎదుర్కోడానికి చాళుక్యులు భీకర పోరాటాలు జరిపారు. ఆనాటి చాళుక్యులలో మచ్చ వంశస్తులు, కొండవారు, చోడివారు, సమ్మెటవారు ఉండేవారు. సమ్మెట వంశస్తులను సంపెటవారని, సంబెటవారని కూడా పిలిచేవారు. ఈ నాలుగు వంశాలు చాళుక్య వంశాలని వెలగోటివారి వంశావళి తెలుపుతోంది. ఈ చాళుక్య వంశస్తులు రేచర్ల సింగమనాయకునితో పోరాడారు. మొదట సింగమనాయకుడు జీలుగుపల్లిపై దండెత్తాడు. జీలుగుపల్లిని క్రీ.శ.1321 నుండి మచ్చగన్న విభుడనే చాళుక్యరాజు పాలించాడు. అతడు రేచర్ల వారిని ఎదిరించాడు. కాని రేచర్ల సింగమ నాయకుడు అతని తండ్రి యెఱ్ఱదాచానాయకుడు మచ్చగన్నవిభుని సంహరించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది. తర్వాత రేచర్లవారు మగతలపై దండెత్తారు. వీరిని మచ్చకొమ్మవిభుడు, అతని పుత్రుడు బాచడు, మచ్చరుద్రుడు అనే చాళుక్యవంశస్తులు ఎదిరించారు. ఆయుద్ధంలో మచ్చ కొమ్మవిభుడు, మచ్చ రుద్రుడు మరణించారు. సింగముడు మళ్ళీ జీలుగుపల్లిపై దండెత్తాడు. జీలుగుపల్లి చాళుక్యులు కాపయనాయకుని సహాయం కోరారు. కాపయనాయకుడు కొంత సైన్యాన్ని చాళుక్యులకు సహాయంగా పంపాడు. అలాగే మగతలపల్లి చాళుక్య బాచడు కూడా జీలుగుపల్లి వారికి సహాయంగా వచ్చాడు. అక్కడ రేచర్ల వారికి, చాళుక్య కమ్మ సంయుక్త సైన్యానికి భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో కూడా సింగమ నాయకుడు విజయం సాధించాడు. ఈ యుద్ధంలో అనేక మంది కమ్మవీరులు మరణించారు. అలాగే మగత తలబాచనితో సహా అనేక మంది చాళుక్యులు కూడా మరణించారు. ఆ విజయం తర్వాత రేచర్ల సింగమనాయకుడు మచ్చనాయకులు తలగొండు గండ, కమ్మదొరలమోదిన కాలదండ అనే బిరుదులు ధరించాడు. తర్వాత అతడు జల్లిపల్లిపై దండెత్తాడు. అక్కడి చాళుక్యులు అతనితో పోరాడలేమని తలచి అతనిని కోటలోకి ఆహ్వానించి మోసంతో చంపాలని పథకం పన్నారు. వారిని నమ్మి సింగమనాయకుడు కోటలోకి వచ్చాడు. వచ్చిన సింగమనాయకుని తమ్మలజియ్య అనే అతడు చంపాడు. ఇతనికే తమ్మ బొమ్మయ్య అని కూడా పేరుంది. ఆ విషయం తెలిసిన సింగమనాయకుని కుమారులైన రేచర్ల అనపోతా నాయకుడు, మాదానాయకుడు జల్లిపల్లిపై దండెత్తారు. జల్లిపల్లి వద్ద క్రీ.శ.1361 శార్వరి సంవత్సరంలో రేచర్ల వారికి చాళుక్యులకు చివరి పోరాటం జరిగింది. ఈ యుద్ధంలో జల్లిపల్లి పాలకుడైన మచ్చ ఓబలరాజు ఐదులక్షల అరవైవేల సైన్యంతో రేచర్ల సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. అతనితోపాటు కొండవారు. చోడెవారను చాళుక్యలు కూడా పాల్గొన్నారు. చోడె పర్వతరాజు కొండమర్రానే వారు ఓబల రాజుతో చేరారు. అక్కడ వారికి ఘోరయుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో అనపోతానాయకుడు ఓబలరాజును, చోడ పర్వతరాజు కొండమర్రాజును సంహరించారు. దాంతో మచ్చవంశానికి చెందిన చాళుక్యులు తమ రాజ్యాన్ని పోగొట్టుకున్నారు. తర్వాత మచ్చవారికి చోడెవారికి కొందారికి నిలువనీడలేకుండా పోయింది. వారికి రక్షణ కూడా లేకుండాపోయింది. కనుక వారు రక్షణ కోసం కమ్మవారిలో కలసిపోయి కమ్మవారిగా మారిపోయారు. 15వ శతాబ్దంలో మచ్చకొండ నృపాలుడు తన కుమార్తె తిరుమలయ్యను కమ్మకులానికి చెందిన అడపా వంశానికి చెందిన నృసింహన్నపాలుడు అనే వ్యక్తికిచ్చి వివాహం చేసినట్లు జానకీ రాఘవం అనే గ్రంథం తెలుపుతోంది. చోడెవారు, కొండవారు, మచ్చవారు అనే ఇంటి పేరు గల వారు నేటికీ కమ్మవారిలో ఉన్నారు. ఆ విధంగా చాళుక్యవంశానికి చెందిన మచ్చవారు, చోడెవారు, కొండవారు కమ్మవారిలో విలీనమయ్యారు.

జల్లిపల్లి విజయం తర్వాత అనపోతానాయకుడు ఇనుగుర్తి మీదకు దండెత్తాడు. అక్కడ సమ్మెట కొండ్రాజను చాళుక్యుడు పాలిస్తున్నాడు. అతడు క్రీ.శ.1361లో తనకోటవద్ద రేచర్లవారిని ఎదిరించి వీరస్వర్గం అలంకరించాడు. దాంతో సమ్మెట వారు తమ రాజ్యాన్ని కోల్పోయి కమ్మ వారిలో కలిసిపోయారు. సమ్మెట వారనే

ఇంటి పేరు గల వారు కమ్మ వారిలో ఉన్నారు ముసునూరి రాజ్యం పతనమైన తర్వాత సమ్మెటవారు విజయనగర రాజ్యంలో సేనాధిపతులుగా చేరారు కాని సమ్మెట వారికి వెలుగోటి వారికి విరోధం పోలేదు క్రీ శ 1417లో సమ్మెట వంశానికి చెందిన సోమనాయకుని కడప జిల్లాలోని పేర్నెపాడు పాలకునిగా దేవరాయలు నియమించాడు కొండవీటి వద్ద జరిగిన ఒక యుద్ధంలో ఈ సోమనాయకుని వెలగోటి అనపోతు ఓడించినట్లు వెలగోటి వారి వంశావళి తెలుపుతోంది సోమనాయకునికి సమ్మెట పిన్నమనేని అనే కుమారుడు ఉండేవాడు మాదానాయకుని కుమారుడు లింగమనాయకుడు పిన్నమనేనిని ఓడించినట్లు వెలుగోటి వారి వంశావళి తెలుపుతోంది సమ్మెట వంశస్తులు రాయలసీమలో విజయనగర పాలెగాళ్లుగా కొనసాగారు వీరనరసింహరాయల కాలంలో పన్నులు చెల్లించలేదని స్త్రీల స్థనాలకు చిడతలు తగిలించి వీరనరసింహరాయల ఆగ్రహానికి గురైన సమ్మెట గురవరాజు వీరి వంశస్తుడే శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఒక సమ్మెట వీరుడు సింహాద్రి జయస్తంభాన్ని నాటించాడని చాటువులు తెలుపుతున్నాయి తర్వాత ఎలమంచిలి నిడదవోలు పిఠాపురం చాళుక్యులు కూడా కమ్మవారిలో కలిసిపోయారు ఎలమంచిలి ఇంటి పేరు గల కమ్మవారు ఉన్నారు

ఈ విధంగా చాళుక్యవంశస్తులు పూర్తిగా కమ్మవారిలో కలిసిపోయారు చాళుక్య అనే శబ్దం ఆంధ్రదేశంలో అదృశ్యం అయిపోయింది ఈ చాళుక్యులలో చోడ అనే వారు తెలుగు చోడులు వారు చాళుక్యుల బంధువులైనందువల్ల జీలుగుపల్లి జల్లిపల్లి యుద్ధంలో చాళుక్యులతో కలసి పోరాడారు వారు కమ్మవారిలో కలిసిపోయేటప్పటికీ మిగిలిన తెలుగు చోడవంశాలు కూడా కమ్మవారిలో విలీనం చెందాయి తెలుగుచోళ తెలుగుచోడ అనే పదాలు కూడా అదృశ్యం అయ్యాయి తెలంగాణలోని కాకతీయవంశాలు కూడా కమ్మవారిలో విలీనం చెందాయి తెలంగాణలో ఇలా జరుగుతూ ఉండగా వేంగి దేశంలో మరొక పరిణామం జరిగింది ఏరువ తెలుగోచోళ వంశం కమ్మ రెడ్డి ఉభయకులాలలో చేరిపోయింది ఏరువ చోళులు ప్రకాశం జిల్లాలోని ఏరువ ప్రాంతానికి చెందిన వారు ఆ వంశానికి చెందిన భక్తీశ్వరచోడుడు వేంగిదేశం చేరి స్వతంత్ర రాజ్యాన్ని సంపాదించాడు అతనికి అనదేవుడు భీమరాజు అనే ఇద్దరు కుమారులు వారిలో చిన్నవాడైన భీమరాజుకు కొండవీటి అనవేమారెడ్డి తన కుమార్తెను ఇచ్చి వివాహం చేశాడు తర్వాత అనదేవుని సంతతివారు కమ్మవారిలో కలిసిపోగా భీమరాజు సంతతివారు రెడ్డి కులంలో కలసిపోయారు అందువల్ల ఏరువ ఇంటి పేరు గలవారు కమ్మవారిలోను రెడ్లలోనూ ఉన్నారు ఎరువ సింగరాజు లక్ష్మీదేవిల పుత్రుడు ఎరువ కేశవరాజు అనే అతడు అమరావతిలో దానం చేసి ఒక శాసనం వేయించాడు ఇతడు కమ్మకులస్తుడు విప్పర్ల గోత్రీకులైన యేర్మ పేరారెడ్డి జంగంరెడ్డి పెదవెంగన తిమ్మారెడ్డి చినవెంగన అనే వారు కనిగిరి తాలూకాలో కూడగుంట్ల గ్రామంలో గోపాలస్వామి దేవాలయానికి దానాలు చేసి శాసనం వేయించారు వారి తండ్రి లచ్చిరెడ్డి అని తాత కొండారెడ్డి అని చెప్పబడింది వీరు రెడ్లుగా మారిన ఏరువ చోళ వంశాకులని భావించవచ్చును ఈ విధంగా అంతకుముందు రాజ వంశాలన్నీ రెడ్లలోగాని కమ్మవారిలోగాని చేరిపోయినట్లు తెలుస్తోంది వెలమలలో ఎవరూ చేరినట్లు లేదు ఎక్కువ రాజవంశాల వారు కమ్మవారిలో చేరిపోయినట్లు తెలుస్తోంది

ఈ విధంగా 14వ శతాబ్దం చివరకు కమ్మ వెలమ రెడ్డి వంశాలు తమ రూపాన్ని సంతరించుకొని ఆంధ్రదేశపు పాలక వర్గాలుగా రూపొందాయి అయినప్పటికీ కమ్మ రాజకుమార్తె అయిన ధరణికోట కోట వంశస్తుల వారి అమ్మాయి సూరాంబికను పెదకోమటి వేమారెడ్డి వివాహమాడాడు కోట వంశస్తులు కమ్మవారు కాని విజయనగర యుగంలో అంతర్వివాహాలు లేవు విజయనగర యుగం నుంచి ఈ మూడు కులాలు పూర్తిగా ప్రత్యేక కులాలుగా స్థిరరూపం ధరించాయి అప్పటి నుంచి శాసనాలు సాహిత్యం కమ్మవిభుడు అని వెలమ వీరుడు అని రెడ్డి ప్రభువులు అని కులాల పేరుతోనే వర్ణనలు చేశాయి ఈ విధంగా ఆంధ్రదేశం కమ్మ వెలమ రెడ్డికులాలు యుద్ధవీరులుగా కొనసాగినప్పటికీ వారిలో కొందరు వ్యవసాయాన్ని వృత్తిగా కొనసాగించారు వ్యవసాయం కొనసాగించిన కమ్మ రెడ్డి వెలమలను సామూహికంగా కాపులు అని కూడా పిలిచేవారు ఒక బానల భట్టు అనే అతడు వెలమ వారితోపాటు కమ్మవారి గోత్రాల పట్టీని తయారు చేశాడని పద్మనాయక చరిత్రలో ఉంది వారి పూర్వీకులు ఏ గ్రామంలో నివసిస్తే ఆ గ్రామ నామమే గోత్రంగా ఇవ్వబడిందట నేడు కమ్మవారిలో 1 200ల గోత్రాలు ఉన్నాయి

బలిజలు

క్రీ శ 13వ శతాబ్దం నుండి కమ్మనాటిలో బలిజలు అని చెప్పుకొన్న వారి శాసనాలు లభిస్తున్నాయి వీరు

తెలుగు వారు కాదు వారు అయ్యవోలు స్వాములమని తమ శాసనాలలో చెప్పుకున్నారు వారు కన్నడదేశం నుండి వ్యాపారులుగా వచ్చి ఆంధ్రదేశంలో స్థిరపడ్డారు ఇదే కాలంలో అంటే 14-16 శతాబ్దాలలో వారు కూడా మరొక ప్రత్యేక కులంగా రూపొందారు ఆ తర్వాత వారిలో కొందరు వ్యాపారాన్ని విడిచి పెట్టి మిగిలిన వృత్తులను స్వీకరించారు మరికొందరు వ్యాపారాన్ని కొనసాగించారు వ్యాపారం లేని వారు బలిజలని వ్యాపారాన్ని కొనసాగించిన వారు శెట్టిబలిజలని వారు రెండు తెగలుగా చీలిపోయారు

యాదవులు - గొల్లలు

మధ్యయుగంలో యాదవులు మహారాష్ట్రం నుండి ఆంధ్రదేశంలోకి వచ్చి చిన్న చిన్న రాజ్యాలు స్థాపించారు వీరి వృత్తి పశుపోషణ వారి రాజ్యాలు పోయిన తర్వాత వీరు కూడా గొల్లలు అనే పేరుతో మరొక కులంగా రూపొందారు

క్షత్రియులు లేక రాజులు

కాకతీయుల తర్వాత ఈ విధంగా సాంఘిక పరిణామం జరిగినా కొన్ని కుటుంబాలు తమను క్షత్రియులుగా పరిగణించుకొని కమ్మ రెడ్డి వెలమ కులాలలో కలవకుండా తమ ప్రత్యేకతను కొనసాగించాయి వారిలో కోనసీమనేలిన హైహయులు గుడిమెట్టను పాలించిన సాగివంశస్తులు ప్రముఖమైనవారు సాగివారిలో కొందరు కమ్మవారిలో కలసి పోగా, కొన్ని కుటుంబాలు తూర్పుగోదావరి జిల్లా చేరి క్షత్రియులుగా కొనసాగారు ఆ విధంగా కొనసాగిన కుటుంబాలలో పెద్దాపుర సంస్థానాన్ని తుని సంస్థానాన్ని ఏలిన వత్సవాయి కుటుంబం ప్రముఖమైంది అలాగే విజయనగర సంస్థానాన్ని ఏలిన పూసపాటి వారి కుటుంబం మరొకటి అలాగే పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం పాలకొల్లు తాలూకాలలోను తూర్పుగోదావరి జిల్లాలోని కోనసీమలో నివసించే రాజులు క్షత్రియ కులంగా చెప్పుకుంటారు

వారు కోనసీమను ఏలిన హైహయ వంశస్తులు కావచ్చును వారు తమ రాజ్యాన్ని పోగొట్టుకున్న తర్వాత వ్యవసాయ వృత్తిని చేపట్టి రాజులు అనే కులంగా కొనసాగి ఉంటారు కాని పలనాటిని ఏలిన హైహయ వంశస్తులు కమ్మవారిలో కలిసిపోయారు అలాగే తెలుగుచోడ వంశస్తులలో ఒక శాఖ కోణిదెనను రాజధానిగా చేసుకొని కమ్మనాటిని పాలించింది

క్రీ శ 1115లో పాలించిన కన్నరదేవుడు బాపట్లలోని స్వామి మధుకంబల్లి గ్రామాన్ని దానం చేశాడు వీరి వంశస్తులు కొణిదెనలో బల్లేశ్వర కామేశ్వర త్రిభువనమల్లేశ్వర దేవాలయాలను నిర్మించారు వీరి వంశస్తులు వెలనాటిచోడులకు సామంతులుగా పాలించారు చివరకు ఈ కుల పరిణామాలలో వీరి వంశస్తులు కూడా కమ్మవారిలో కలిసిపోయారు

తెలుగుచోడులు నివసించిన ఊరి పేర్లే వారి ఇంటి పేర్లుగా అయ్యాయి క్రీ శ 1428లో కనపర్తి బుక్కరాయల సామంతునిగా పాలించిన ఆలమందల గంగయ దేవచోడరాజులు తెలుగుచోడవంశానికి చెందినవారై ఉండవచ్చును ఆలమందల వారు నాగులపాటి వారు కమ్మ వారిలో ఉన్నారు తెలుగుచోడులు పాలించిన కోడూరు నెల్లూరు మోపూరు వల్లూరు కొణెదెన మాలెపాటి కంచర్ల పొందూరు నెక్కంటి కట్టా గొల్లపూడి కందార అనే ఇంటి పేర్లు కమ్మవారిలో ఉన్నాయి ఈ శాఖలు కమ్మవారిలో కలసిపోయినందువల్ల ఆ ఇంటి పేర్లు వచ్చి ఉండాలి ఇక దుర్జయులు అని చెప్పుకున్న వంశాలన్నీ కమ్మవారే

కమ్మనాటికి వెలుపల ఉన్న కొందరు చోడవంశస్తులు కమ్మవారిలో చేరలేదు వారిలో పొత్తూరు కొందూరి రచిరాజు మంచిరాజు కొట్టికంటి వంగలి మాద్రాజు కాలువబొడి రెట్టమతశాస్త్రంలో చెప్పబడిన కొంద్రాజు మట్లవారు ముఖ్యులు వీరంతా క్షత్రియులుగానే కొనసాగారు ఈ ఇంటి పేర్లు గల రాజులలో కొందరు రాయలసీమలోను గోదావరి జిల్లాలోను ఉన్నారు కనుక కమ్మనాటిలో తెలుగు చోడవంశాలు కమ్మవారిలో కలిసిపోగా కమ్మనాటి వెలుపల నివసించిన చోడవంశాలు క్షత్రియులుగానే కొనసాగారు దుర్జయ చోడ చాళుక్య పదాలు వాడుకలో ఉన్న కాలంలో ఈ వంశస్తులు ఆ పేర్లతోనే చెలామణి అయ్యారు ఆ కాలంలో కమ్మవారు శాసనాలలో తమను కమ్మవారని గాక చతుర్థ కులస్తులుగా చెప్పుకున్నారు చోడ చాళుక్య దుర్జయపదాలు అదృశ్యం అయిన తర్వాత వీరందరూ కమ్మ శబ్దాన్ని వాడి కమ్మవారమని చెప్పుకున్నారు ఈ విధంగా నేటి రాజులని చెప్పుకొనే వారి కులం కమ్మవారిలో కలసిపోగా మిగిలిన చోడ హైహయ సాగి లేక చాగి వంశాల

నుండి జన్మించిందని చెప్పవచ్చును

రెడ్డి - నాయుడు - రాయుడు - చౌదరి పదాల ఉత్పత్తి

రట్ట రడ్డి రెడ్డి అయినట్లే నాయకుడు అనే పదం నుండి నాయడు నాయుడు అనే పదాలు పుట్టాయి రెడ్డి అనే గ్రామాధికారి హోదా నాయక అనే సైన్యాధిపతి హోదా రెడ్డి పదవి కంటే నాయక పదవి పెద్దది కాకతీయుల కాలంలో సేనాధిపతులను నాయకులనేవారు నాయక అనే హోదాలు మొట్టమొదటి సారిగా రేనాటి చోళుల కాలంలో ప్రారంభమైనట్లు కనిపిస్తోంది చాళుక్యచోళ యుగంలో నాయుడు అనే పదం స్పష్ట రూపం తీసుకుంది బ్రహ్మనాయుడు దొడ్డనాయుడు ఉదాహరణలు తర్వాత కాకతీయుల కాలంలో సైన్యాధిపతులనందరినీ నాయకులని పిలిచారు అదే విధానం విజయనగర యుగంలో కొనసాగింది ఇంకా బలపడింది నాగమ నాయకుడు విశ్వనాథ నాయకుడు యాచమ నాయకుడు తిమ్మానాయకుడు ఉదాహరణలు తర్వాత నాయకుడు అనే పదం నుండి నాయడు అనే పదం ఉచ్చారణలో నాయుడు అనే పదం వచ్చింది నాయుడు అనే పదంలో యు పోయి నాడు అని తర్వాత అదే నీడుగా మారింది నీడు అనే పదాన్ని ఉపయోగించి కొందరు గంగినీడు గన్నమనీడు అని కూడా పేర్లు పెట్టుకున్నారు అలాగే నీడు నేనిగా కూడా మారి కొందరికి గంగినేని గన్నమనేని అనే పేర్లు వచ్చాయి విజయనగర ఆస్థానంలో కమ్మ వెలమ సేనానులు ప్రముఖ పాత్ర నిర్వహించారు పెమ్మసాని రావెల కటికం వారు కమ్మ కులస్తులు వెలుగోటివారు వెలమ కులస్తులు ఉభయులు నాయకుడు అనే బిరుదులు ధరించారు కాని తర్వాత విజయనగర యుగంలో నాయుడు పదానికి ప్రత్యామ్నాయంగా రాయుడు అనే మరియొక పదం ఉత్పత్తి అయింది ఈ పదం రాయలు అనే పదం నుండి వచ్చింది రాజు అనే సంస్కృత పదానికి సమానమైన అర్థంలో కన్నడ భాషలో రాయలు అనే పదాన్ని ఉపయోగించారు రాయలు అనేది విజయనగర చక్రవర్తుల బిరుదు రాయలు బహువచనం గౌరవప్రదంగా వాడేవారు దానికి ఏకవచనం రాయదు అదే పదం ఉచ్చారణలో రాయుడు అయింది ఈ పదం విజయనగర యుగంలో చాలా గొప్ప ఘనత వహించిన బిరుదు ఈ పదం వాడుకలోకి వచ్చిన తర్వాత వెలమ సేనానులు నాయుడు అనే పదాన్ని వదిలివేసి రాయుడు అనే పదాన్ని వాడసాగారు అందువల్ల నాయుడు అనే పదం కేవలం కమ్మ నాయకుల సంకేతంగా మిగిలిపోయింది కనుక కమ్మ సేనాధిపతులు నాయుడు అని కొనసాగించగా వెలమ సేనాధిపతులు రాయుడు అని బిరుదులు ధరించారు రడ్డిరికం చేసిన వారందరూ రెడ్డి పదాన్ని తమ కుల సంకేతంగా వాడారు దాంతో రెడ్డి కులస్తులు తమ పేర్లలో రెడ్డి అనే పదాన్ని కమ్మవారు నాయుడు చౌదరి అనే పదాలను వెలమలు రాయుడు అనే పదాన్ని తమ కుల సంకేతాలుగా వాడారు విజయనగర యుగంలో విజయనగర చక్రవర్తులు కమ్మ సేనానులను తమిళ దేశంలోని మధుర తంజావూరు రాష్ట్రాధిపతులుగాను వెలమ సేనాధిపతులను ఆంధ్రదేశంలోని వెంకటగిరి వెలమ వంశస్థులు కోస్తా ఆంధ్రా అంతా ప్రాకి అనేక ప్రాంతాలలో జమీలు సంపాదించారు నూజివీడు నర్సరావుపేట పిఠాపురం బొబ్బిలి ఇవన్నీ వెలమ సంస్థానాలు ఆ సంస్థానాధిపతులు 1948 దాకా జమీందారులుగా కొనసాగారు వారు రాయదు అనే పదాన్ని ఉపయోగించారు ఉదాహరణగా బొబ్బిలి వెంగళరాయుడు రంగారాయుడు గుండారాయుడు అనే పేర్లు వెలమలు రాయుడు అని కొనసాగించగా కమ్మవారు నాయుడు అనే పదాన్ని కొనసాగించారు వెలమ కులస్తుడైన నర్సరావుపేట జమీందారు పేరు గుండారాయుడు అతనికి సమకాలీనమైన అమరావతి కమ్మ జమీందారు పేరు వెంకటాద్రినాయుడు కనుక బ్రిటీషు యుగం దాకా రాయుడు వెలమ చిహ్నంగాను నాయుడు కమ్మ చిహ్నంగాను కొనసాగింది తర్వాత రాయుడు అనే పదం నుండి రావు అనే బిరుదు వచ్చింది కనుక కొందరు వెలమ జమీందారులు రావు అనే బిరుదు ధరించారు నూజివీడు జమీందారు మేక అప్పారావు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేసిన వెంగళరావు ఇందుకు ఉదాహరణలు రావు అనేది గొప్ప గౌరవ సూచకంగా మారింది కనుక కొందరు రావు బహద్దర్ అనే బిరుదు పెట్టుకున్నారు బ్రిటిషుయుగంలో ఆంధ్ర కోస్తాలో వెలమ జమీందార్లు ఎక్కువగా ఉన్నందున వారు ధరించే రావు బిరుదు గొప్ప గౌరవ సూచకంగా మారడంతో తర్వాత సామాన్య ప్రజలు కూడా రావు అని పెట్టుకోసాగారు ఈనాడు అన్ని కులాల వారు తమపేర్ల చివర రావు అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు ఈ విధంగా విజయనగర చక్రవర్తుల బిరుదు అయిన రాయలు రాయదు రాయుడుగా మారి చివరకు రావు అనే పదంగా స్థిరపడి ఆంధ్రదేశంలో నేటికీ కొనసాగుతోంది ఇక నాయుడు అనే పదం ఆనాటి నుండి నేటివరకు కమ్మవారి

సంకేతంగానే కొనసాగుతోంది నేటికీ నెల్లూరు రాయలసీమలలో కమ్మవారు తమ పేర్లలో నాయుడు అనే పెట్టుకుంటారు కొంతమంది జమీందారులు నాయుడు అనే పదాన్ని ఇంకా గౌరవ సూచకంగా నాయనింగారు అని పెట్టుకొని పిలిపించుకున్నారు గోల్కొండ నవాబులు కొండవీటి రాజ్యాన్ని జయించిన తర్వాత దానిని 14 సముతులుగా విభజించి అన్ని సమితులకు కమ్మవారిని చౌదరీలుగా నియమించారు అందువల్ల కమ్మవారికి చౌదరి అనే మరొక బిరుదు వచ్చింది అప్పటి నుండి గుంటూరు కృష్ణా జిల్లాలలోని కమ్మవారు నాయుడు అనే పదాన్ని వదిలివేసి చౌదరి అని పెట్టుకోసాగారు వారు చౌదరి అని పెట్టుకున్నందున వారి పూర్వపు బిరుదు అయిన నాయుడు అనే పదాన్ని గుంటూరు కృష్ణా జిల్లాలలోని తెలగాలు తమ పేర్లకు తగిలించుకున్నారు వారిని చూసి గోదావరీ జిల్లాలలోని కాపులు తాము తెలగాలు ఒకటేనని చెప్పుకుంటూ తాము కూడా నాయుడు అని పిలిపించుకున్నారు కాని అది వారి బిరుదు కాదు అది తరతరాలుగా కమ్మవారు ధరించిన బిరుదు కమ్మవారి నాయుడు పదాన్ని తెలగాలు కాపులు ఉపయోగించుకున్నా చౌదరి అనే పదం మాత్రం కేవలం కమ్మవారి సంకేతంగా నిలిచి ఉంది రెడ్డి అనే పదం కేవలం రెడ్డి కులస్తుల సంకేతంగా కొనసాగుతోంది కాని వెలమ బిరుదు అయిన రాయుడు రావుగా మారి అన్ని కులాల వారు ధరిస్తున్నారు చివరకు రెడ్డి చౌదరి పదాలు మాత్రమే రెడ్డి కమ్మ కులస్తుల ప్రత్యేక సంకేతాలుగా మిగిలి ఉన్నాయి

ముసునూరి కమ్మనాయక కాలం నాటి సంస్కృతి

ముసునూరి కమ్మనాయకులు పరిపాలించిన 45 సంవత్సరాల కాలంలో వారు నిరంతర యుద్ధాలలో మునిగి తేలారు ప్రోలయ నాయకుడు ముస్లింలతో పోరాడి ఆంధ్రదేశాన్ని విముక్తి చేయడమే సరిపోయింది చివరి దశలో కళింగ గాంగులతో పోరాడుతూ మరణించాడు అలాగే కాపయ నాయకుడు కూడా జీవితంలో విశ్రాంతి అనేది లేకుండా యుద్ధాలు చేసి చివరకు యుద్ధంలోనే మరణించాడు అందువల్ల వారు సంస్కృతికి ఎక్కువ సేవ చేయలేకపోయారు అయినప్పటికీ వారు తమ శక్తి కొలది బ్రాహ్మణులకు దానం చేశారు అగ్రహారాలను పునరుద్ధరించారు ముస్లింలు దండయాత్రల వల్ల పాడుబడిన దేవాలయాలను పునరుద్ధరించి దీపధూప నైవేద్యాలను ఏర్పాటు చేశారు ప్రోలయనాయకుని విలాస శాసనం కాపయ నాయకుని గురజ శాసనాల వలన వారు చేసిన దానాలు తెలుస్తున్నాయి ఆ కాలంలో గొప్ప జ్యోతిష్య పండితులు ఉండేవారని వేదాంత శాస్త్రజ్ఞులు ఉండేవారని వారి శాసనాల వల్ల తెలుస్తోంది ప్రోలయ నాయకుడు అన్ని శాస్త్రాలలో నిష్ణాతులయిన 78 మంది వివిధ శాస్త్రాలలో పండితులైన వారికి విలస గ్రామాన్ని వృత్తులుగా విభజించి దానం చేశాడు వారిలో గణితశాస్త్ర మీమాంస వ్యాకరణ వేదాంత ఆగమ పండితులు యజ్ఞయాగాదులు నిర్వహించగల శక్తిమంతులు అనేక రకాలైన విజ్ఞాన శాస్త్రవేత్తలు జ్యోతిష్ శాస్త్రవేత్తలు ఉన్నారని విలస శాసనం పేర్కొనబడింది ఈ శాసనంలో 78 పండితుల పేర్లు వారి గోత్రాలు వారు ఏఏ శాస్త్రాలలో పండితులో అన్నీ వివరంగా రాయబడ్డాయి ఆ కాలంలో భారద్వాజ గోత్రానికి చెందిన గణపతి అనే పండితుడు ప్రశ్నాస్తకం చెప్పడంలో గొప్ప నేర్పరి అతని జ్యోతిష్ పాండిత్యానికి మెచ్చి పిఠాపురాన్ని పాలించిన కొప్పుల వెలమ సామంతరాజు అయిన నామయ నాయకుడు ప్రోలవరాన్ని అగ్రహారంగా ఇచ్చాడట ముసునూరి ప్రోలయనాయకుడు విలస అగ్రహారంలో నృసింహభట్టు వైకుంఠభట్టు అనే వారికి భాగాలు ఇచ్చాడు వీరి పేర్లు తీరాంధ్రదేశంలో లభించిన మరొక శాసనం ద్వారా కూడా తెలుస్తున్నాయి వీరిలో నృసింహభట్టు పెదకోమటి వేమారెడ్డి ప్రస్తావించిన ఆగంబరి నాటక రచయిత కావచ్చని పండితుల అభిప్రాయం అతడు సౌగంధికాపహరణం రాసిన విశ్వనాథకవికి దగ్గరివాడు కావచ్చును తీరాంధ్ర దేశంలో లభించిన శాసనంలో పేర్కొనబడిన సాంఖ్య గోత్రానికి చెందిన కందియ పెద్దిభట్టుకు కాపయ నాయకుడు పూలవరం గ్రామాన్ని దానం చేశాడు అతడు గొప్ప పండితుడు శ్రీశైలంలో సత్రయాగాన్ని చేశాడట అతడు గిరీసహస్ర లేక శివసహస్రనామ అనే గ్రంథానికి వ్యాఖ్యానం కూడా రాశాడు ఇవన్నీ పరిశీలించినట్లయితే ముసునూరి నాయకులు తాము పాలించిన స్వల్పకాలంలో ఆంధ్ర సంస్కృతికి భాషా సాహిత్యాలకు దేవాలయాల పునరుద్ధరణకు గొప్ప సేవ చేశారని తెలుస్తోంది ఓరుగల్లు కోట లోపల అనేక దేవాలయాల శిథిలాలు ఉన్నాయి కాకతీయుల కాలంలో ఏకవీర మండాలమ్మ నీలశంభువు వెంకటేశ్వర రామాలయాలున్నాయి వీటన్నిటి కంటే అతి ముఖ్యమైనవి కోట మధ్యలో ఉన్న కీర్తి స్తంభాలు వాటిని చూడగానే సాంచీ తోరణాలు గుర్తుకు వస్తాయి దబోయి తోరణాలు కూడా అలాగే ఉంటాయి ఈ తోరణాల మధ్య ఆనాడు ప్రసిద్ధి చెందిన స్వయంభూ దేవాలయం ఉండేది అక్కడే ప్రతాపరుద్రుని ఖండిత శిరస్సు ఈ నాడు ఉంది ఆ శిరస్సు ప్రతాపరుద్రుని ఆకారం తెలియజేస్తోంది ముస్లింల దాడుల వల్ల ఈ దేవాలయాలన్నీ దెబ్బ తిన్నాయి కాపయ నాయకుడు ఓరుగల్లును పునరాక్రమించిన తర్వాత ఈ దేవాలయాలన్నింటినీ పునర్నిర్మాణం చేశాడు కాని ఆ తర్వాత ఓరుగల్లు బహమనీల స్వాధీనం అయిన తర్వాత మళ్లీ అది నేల మట్టం చేయబడింది ఈ విధంగా ముసునూరి నాయకులు వారి శక్తి కొలదీ ఆంధ్ర సంస్కృతికి సేవ చేశారు

రెడ్డి యుగంలో ఆంధ్రదేశ సంస్కృతి

కమ్మ రెడ్డి వెలమ యుగంలో కులవ్యవస్థ స్పష్టరూపం తీసుకుంది కాకతీయుల కాలంలో రాచరికం సైనిక వృత్తిని చేపట్టిన కులాలలో పట్టింపు అంతగా కనిపించదు రుద్రమదేవి అన్ని కులాల వారితో వియ్యం పొందింది బ్రాహ్మణులకు కూడా తన కుమార్తెను ఇచ్చి వివాహం జరిపింది కాని ఈ యుగంలో రాజ్యాధికారం చేపట్టిన వారిలో కులాలు స్పష్టరూపం ధరించి కమ్మ రెడ్డి వెలమ కులాలుగా చీలిపోయారు అంతవరకు రాజ్యాలు వంశాల పేర్లతో పిలువబడుతుండేవి చాళుక్య కాకతీయ చోళ గంగ కాలచూరి బాణ మొదలైనవి వంశాల పేర్లు కాని ఈ యుగం నుండి రాజ్యాలు కులాల పేర్లతో పిలిచే ఆచారం కూడా వచ్చింది రెడ్డి రాజ్యం వెలమ రాజ్యం అని వెలమ సేనాధిపతులు కమ్మ సేనాధిపతులు అనే పేర్లు ప్రాచుర్యంలోకి వచ్చాయి ఇది సామాజిక వ్యవస్థలో వచ్చిన ప్రధానమైన మార్పు

కమ్మ రెడ్డి వెలమ కులాలు తాము చతుర్థ కులస్తులమని బాహాటంగా చాటుకుంటూనే రాచరికం చేశారు ఈ కులాలకు చెందిన అనేక మంది సేనాధిపతులుగా రాజోద్యోగులుగా ప్రసిద్ధి చెందారు రాజ లాంఛనాల బిరుదులు పొందారు సంస్కృతం చదువుకున్నారు కావ్యాలు నాటకాలు సంగీత శాస్త్రాలు రచించి గొప్ప కవులుగా కూడా ప్రసిద్ధి చెందారు అంతకు పూర్వం చతుర్థ కులానికి విద్యాభ్యాసం వేదాలు వల్లించడం నిషిద్ధం వీరే దేవాలయాలకు బ్రాహ్మణులకు దానాలు చేశారు మొత్తం మీద వైదిక వర్ణ వ్యవస్థలో చతుర్థ కులస్థుల క్షత్రియుల స్థానమైన రెండవ స్థానాన్ని పొందారు

బ్రాహ్మణులు సంఘంలో అగ్రస్థానం ఎప్పటిలాగే బ్రాహ్మణులు అనుభవిస్తున్నారు వారు రెండు తరగతులుగా ఉన్నారు కొందరు సాంప్రదాయక మతాచారాలను అంటిపెట్టుకొని విద్యాబోధన చేస్తూ వేదాధ్యయనం చేసేవారు- వారు వేదాలు వ్యాకరణం జ్యోతిష్యం షడ్దర్శనాలు తర్కం గణితశాస్త్రాలను అధ్యయనం చేస్తూ విద్యా బోధనాలు చేస్తూ ఉన్నారు పండితులుగా ప్రసిద్ధి చెంది అగ్రహారాలు పొందారు కావ్యాలు రాస్తూ ఉన్నారు మరికొందరు పరిపాలనలో ఉద్యోగులుగా చేరారు ఈ కాలంలో వారు సచివ అమాత్య మంత్రి మొదలైన బిరుదులతో పిలువబడ్డారు మరికొందరు బ్రాహ్మణులు కరణాలుగా ఉద్యోగాలు చేస్తున్నారు మరికొందరు దుర్గాధిపతులుగా సేనాధిపతులుగా దండనాయకులుగా కూడా చేరారు మరికొందరు రాయసకాండ్రుగా దాయసములుగా సీమలలో గ్రామాలలో గణకులుగా కూడా చిన్న చిన్న ఉద్యోగాలు చేపట్టారు బ్రాహ్మణ వృత్తిని అంటి పెట్టుకున్న వారిని వైదికులుగాను రాజోద్యోగులుగా ఉన్న వారిని నియోగులుగాను పిలిచేవారు రాజ్యోద్యోగులుగా ఉన్నా సమాజంలో వారు బ్రాహ్మణులుగానే పరిగణింపబడ్డారు కులవ్యవస్థలో వారికున్న అగ్రస్థానంలో మార్పులేదు రెడ్డియుగంలో 30 గోత్రాల బ్రాహ్మణులు శాసనాలలో పేర్కొనబడ్డారు అలాగే 110 ఇంటి పేర్లు దాన శాసనాల ద్వారా తెలుస్తున్నాయి

వైశ్యులు - ఇతర కులాలు వైశ్యులు ఎప్పటిలాగే వ్యాపారమే వృత్తిగా కొనసాగారు వీరు వ్యాపారంలో అధిక లాభాలు ఆర్జించే వారని వడ్డీ వ్యాపారం కూడా చేసేవారని అందువల్ల వారికి సమాజంలో మంచి గౌరవ మర్యాదలు లేవని నాటి సాహిత్యం ద్వారా తెలుస్తోంది రెడ్డి యుగపు శాసనాలలో 13 గోత్రాలు కలిగిన వైశ్యుల ఉన్నారు అవచి తిప్పయశెట్టి కౌండిన్య గోత్రానికి చెందిన వైశ్యుడు బ్రాహ్మణులు ఇతర కులాల వారు కూడా వడ్డీ వ్యాపారం చేసేవారు వడ్డీ వ్యాపారులు చేసే మోసాలు అక్కడక్కడ ప్రస్తావించబడ్డాయి డబ్బు తీసుకున్నవారు పత్రాలు రాసి ఇచ్చేవారు మాస వడ్డీలు సంవత్సర వడ్డీ చక్ర వడ్డీలు వసూలు చేసినట్లు వర్ణనలు ఉన్నాయి జనాభాలో అధికులు శూద్రులు వీరిలో ఎక్కువ మందికి వ్యవసాయం ప్రధాన వృత్తి మిగిలిన ఉపకులాలు వృత్తి పని చేసుకొనేవారు ఒక్కొక్క కులానికి ఒక్కొక్క వృత్తి ఉంది అట్టడుగున అస్పృశ్యుల కులం ఉండేది

కులవ్యవస్థ బలపడటం కులవ్యవస్థ బలపడింది అన్ని కులాలు సొంత నియమ నిబంధనలతో మరింత దృఢపడ్డాయి ముస్లింల దండయాత్రల వల్ల ప్రజలకు రక్షణ కరువైంది కాకతీయ రాజ్యం పతనం అయిన తర్వాత రక్షణ లేక ముస్లింల దాడులకు అన్ని కులాలు కుల విచక్షణ లేకుండా మత శాఖాభేదాలతో నిమిత్తం లేకుండా హిందువులందరూ బలి పశువులయ్యారు వారికి రక్షణ కరువైంది కనుక ఏ కులానికాకులం ఐక్యతగా ఉండాలి తమను తాము రక్షించుకోవాలి అనే లక్ష్యంతో కుల కట్టుబాట్లను కఠినం చేశారు అందువల్ల కుల వ్యవస్థ

సరిహద్దులు గీసుకొని మరింత కఠినతరం అయింది ఇతర కులాలతో వివాహాలు నిషేధించుకున్నాయి ఏ కులానికి ఆ కులం ఒక శాఖగా రూపొందింది

వేషధారణ నూలు సిల్కు బట్టలు వాడేవారు పురుషులు ధోవతి ఉత్తరీయాన్ని తలపాగాను ధరించేవారు భాగ్యవంతులు సిల్కు జరీ ధోవతులు సిల్కు జరీ ఉత్తరీయాలు సిల్కు జరీ తలపాగాలు ధరించేవారు స్త్రీలు చీరెలు ధరించి రవికెలు ధరించేవారు భాగ్యవంత స్త్రీలు సిల్కు చీరెలు పేదవారు మామూలు చీరెలు ధరించేవారు రవికెలలో బంగారు పూవుల రవికె యమునా రవికె అనే రెండు రకాలుండేవి అనేక రంగులు అద్దకాలు వాడేవారు చెంగావి నీలం ఎరుపు పచ్చరంగుల చీరెలు నేసేవారు కవులు పండితులు కోక కట్టి కుళ్లాయి నెత్తికి చుట్టుకునేవారని శ్రీనాధుని రచనల వల్ల తెలుస్తోంది మహాకుర్పాసనం ధరించానని శ్రీనాధుడు తనను తాను వర్ణించుకున్నాడు మహాకుర్పాసన అంటే చొక్కా అని భావించారు రాజులు ఉన్నత రాజోద్యోగులు సన్నని నాజూకైన వస్త్రాలు ధరించేవారు రాణులు పట్టుచీరెలు ధరించేవారు కట్టు వేషధారణ కులానికొక విధంగా ఉండేది చిన్న కుల స్త్రీలు ఎడమ పైట వేసుకొనేవారు కులీన స్త్రీలు కుడి పైట వేసుకొనేవారు గొల్లవారు పిలిపాగలు అనే తలపాగా పెట్టుకొనేవారు భుజాన ఎప్పుడూ గొంగడి ఉండేది రైతులకు తలగుడ్డ తప్పనిసరిగా ఉండేది దాంతోపాటు పైపంచె లేక కండువా ఉండేది చొక్కాలు ఉండేవి కావు రాజులు రాణులు ఖరీదైన పాదరక్షలు వాడేవారు

ఆభరణాలు రెడ్డి యుగంలో అనేక రకాల ఆభరణాలు వాడేవారని నాటి సాహిత్య వర్ణనల వల్ల తెలుస్తోంది భూలోకమల్ల సోమేశ్వరుడు 12వ శతాబ్దంలో రాసిన అభిలాషితార్థ చింతామణిలో మూడవ భాగం అయిన ఉపభోగవింశతిలో పలు రకాల ఆభరణాలను వర్ణించాడు ఆ రకాల్ని రెడ్డియుగంలో వాడినట్లు సాహిత్యంలో స్త్రీల వర్ణనలను బట్టి తెలుస్తోంది చెవి పోగులు ముక్కు బేసరీలు గాజులు ఉంగరాలు వడ్డాణాలు కడియాలు కంకణాలు నెక్లెసులు మొదలైన అన్నిరకాల ఆభరణాలు స్త్రీలు ధరించారు పురుషులు కూడా చెవిపోగులు ముక్కులకు చిన్న రింగులు ముత్యాల హారాలు ధరించేవారు రాజులు అతి విలువైన వజ్రాల కిరీటాలు ఉంగరాలు ధరించేవారు అలాగే రాణులు రాజకుమార్తెలు వజ్ర రత్న ఖచితమైన సొమ్ములు ధరించేవారు సుగంధ లేపనాలు పరిమళ ద్రవ్యాలు ఉన్నత కుటుంబాల వారందరూ ఉపయోగించేవారు వసంతోత్సవాలలో సామాన్య ప్రజలు కూడా సుగంధ లేపనాలు పరిమళ ద్రవ్యాలు ఒకరిపై ఒకరు చల్లుకొనేవారు

స్త్రీ స్థానం ఈ యుగంలో స్త్రీ స్థానం దిగజారింది ముస్లింల భయం వల్ల స్త్రీలను ఇల్లు వదిలి బయటకు రానివ్వకుండా చేశారు ధర్మశాస్త్రాలలో చెప్పిన సూత్రాలు తు చ తప్పకుండా పాటించారు పాతివ్రత్యం ధర్మంగా భావింపబడింది అందువల్ల ఆమె భర్తకు దాసిగా దిగజారింది సతీసహగమనం అమలులోకి వచ్చింది వితంతు సహగమనం చేయకపోతే చిన్నచూపు చూడబడేది సహగమనం చేయని స్త్రీ వితంతువుగా అతిహీనస్థితిలో దీనాతిదీనంగా జీవింపవలసి వచ్చింది హిందూ సమాజంలో దురాచారాలన్నీ ఈ యుగంలోనే ప్రవేశించాయి బాల్య వివాహాలు ప్రారంభమయ్యాయి ఇవన్నీ ముస్లిం దండయాత్రల వల్ల వచ్చాయి స్త్రీలను రక్షించుకోవడానికి వారి గౌరవాన్ని కాపాడడానికి వారి శక్తికి మించిన పని అయింది కనుక ఈ దురాచారాలు స్త్రీలపై రుద్దబడ్డాయి తత్ఫలితంగా స్త్రీ పరిస్థితి దయనీయంగా మారింది ముస్లింలు దాడులు చేశారూ అంటే మొట్టమొదట బలైపోయేది స్త్రీలు కనుక వారు వంట ఇంటికి పరిమితమై బందీలాగే జీవితం వెళ్లబుచ్చవలసి వచ్చింది రాజులు వివాహాలు ఆడంబరంగా జరిపేవారు కట్నకానుకలు ఇచ్చేవారు చందోలును ఏలిన వెలనాటి చోడులు పలనాటి సీమను అనుగు రాజుకు అరణంగా ఇచ్చారు కట్నానికి మారు పేరు అరణం కులీన స్త్రీల విషయం ఇలా ఉంటే సమాజంలో సాని వృత్తి అభివృద్ధి చెందింది

సాని వృత్తి అంతకు పూర్వం ఉన్న దేవదాసీ వృత్తి ఈ కాలం నుంచి సాని వృత్తిగా దిగజారిపోయింది దేవదాసీ వృత్తి దాని పవిత్రతను పోట్టుకుంది దేవదాసీలు రాజుల ఉంపుడు గత్తెలుగా మారిపోయారు దాంతో సంఘంలో వేశ్యావృత్తి ప్రారంభమైంది వేశ్యలు సంగీత నాట్య కళలలో ప్రావీణ్యం సంపాదించి ధనికులను ఆకర్షించి సంపదలను గడిస్తున్నారని నాటి సాహిత్యం ద్వారా తెలుస్తోంది వారి మాయలతో ధనాన్ని పోగొట్టుకున్న వారి కథలను సాహిత్యం వర్ణించింది పండుగలకు దేవాలయాల ఉత్సవాల సందర్భాలలో వేశ్యలు నాట్యాలు చేసి బహుమానాలు పొందుతుండేవారు రాజులు భోగం వారిని చేరదీసే వారు బ్రాహ్మణులలో కూడా వేశ్యాలంపటత్వం ఉంది శ్రీనాధుడు గొప్ప శృంగార పురుషుడుగా పేరు పొందాడు

వినోదాలు: ఈ యుగంలో ప్రజలకు ప్రధాన వినోదాలు పండుగలలో జరిగే ఉత్సవాలు. రెడ్డి రాజుల కాలంలో వసంతోత్సవాలు జరిపారు. ఆ ఉత్సవాలలో రాజులు, వేశ్యలు, సామంతులు, సామాన్య ప్రజలు అందరూ ఉత్సాహంగా పాల్గొనేవారు. ఆ ఉత్సవాలు తొమ్మిది రోజులు జరిగేవి. నదుపూరు శాసనం అనవేమారెడ్డిని వసంతరాయనిగా కీర్తిస్తోంది. అతనికే కర్పూర వసంతరాయలు అని కూడా మరొక పేరు ఉంది. అతని కుమారుడు కుమారగిరిరెడ్డికి కూడా కర్పూర వసంతరాయలు అని కూడా మరొక పేర ఉంది. ఆ కాలం నాటి గ్రంధాలైన సింహాసన ద్వాత్రింశిక, శ్రీనాధుని కాశీఖండం, భీమేశ్వర పురాణం వసంతోత్సవాలను వర్ణిస్తున్నాయి. వసంతోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు రాజుల నుండి సామాన్యుల వరకు తమ స్థాయిలను మరచిపోయి స్త్రీ పురుష భేదం లేకుండా ఉత్సవాలలో పాల్గొని ఆటలు పాటలు నృత్యాలతో యధేచ్ఛగా అనుభవిస్తారు. కాముని ఉత్సవం ఆది దేవునికి ప్రీతిపాత్రమైనది అనే భావనతో వారి స్వేచ్ఛా విహారం పవిత్రమైనదిగా భావిస్తారు. సంవత్సరంలో పడ్డ బాధలన్నీ మరచి ఆ తొమ్మిది రోజులు మనస్పూర్తిగా సుఖసంతోషాలను అనుభవిస్తారని నాటి గ్రంధాలు తెలుపుతున్నాయి. నైతికాచారాలు దిగజారాయి. బ్రాహ్మణులు కూడా నైతికంగా దిగజారినట్లు కనిపిస్తోంది. వసంతోత్సవ కాలంలో ఇతర ఆటపాటలు, కుస్తీలు, ద్వంద్వ యుద్ధాలు కూడా జరిగేవి. సింహాసన ద్వాత్రింశిక ఇద్దరు సామంతుల భృత్యులు వసంతోత్సవాలలో ద్వంద్వ యుద్ధం చేయటాన్ని వర్ణించింది. ఇంకా కోడి పందేలు, ఎద్దుల పందేలు, పొట్టేళ్ల పందేలు కూడా జరిగేవని క్రీడాభిరామం వర్ణించింది. రాజులకు వేట ఆనాటి గొప్ప వినోదం. సాహిత్యంలో వేటలను గూర్చి అనేక వర్ణనలు ఉన్నాయి. జూదం కూడా ఒక వినోదంగా కొనసాగింది.

వివాహ వేడుకలు ఐదు రోజులు జరుపుకొనేవారు. రాచకుటుంబాల వివాహ వేడుకలు రాజ్యం అంతటా జరుపుకొనేవారు. యుద్ధాలలో విజయం లభించిన రాజులు వేడుకలు జరిపేవారు. దేవాలయాలు, పవిత్ర క్షేత్రాలు దర్శించి దానాలు చేసేవారట. ముహూర్తాలు నిర్ణయించుకొని రాజులు యుద్ధాలు చేసేవారు. సామాన్య ప్రజలు కూడా ముహూర్తాలు పెట్టించుకొని తమ పనులు చేసుకునేవారు.

గ్రామాలలో భజనలు, కోలాటాలు, ఇతర వినోదాలు ఉండేవి. శకునాల పట్ల ప్రజలకు గొప్ప నమ్మకం ఉండేదట. వీధి నాటకాలు, పురాణ శ్రవణాలు కూడా ఆనాటి వినోదాలే. తెలంగాణ ప్రాంతంలో నాగపూజ ఉండేదట. గ్రామాలలో విద్యా వికాసం లేదు. చిన్న కులాలకు విద్య లేదు. విద్యాగంధం పెద్ద కులాలకు మాత్రమే పరిమితం. కాని వైష్ణవమత ప్రచారం వల్ల కింది వర్ణాలలో కూడా విద్యపై ఆస్తి కలిగింది.

పురుషులు పంచె, తలపాగ, ఉత్తరీయం ధరించేవారు. స్త్రీలు చీరెలు, కాశెకట్టు, రవికెలు ధరించేవారు ఆనాడు రంగురంగుల వస్త్రాలు నేసేవారు. పండుగలప్పుడు నూతన వస్త్రాలు ధరించేవారు. ప్రజల దైనందిన జీవితాలలో పెద్ద మార్పులేదు. ఆ కాలంలో స్పర్శవేది అనే యోగం ఉండేదట. స్పర్శవేదితో బంగారం తయారు చేయవచ్చుని నమ్మకం. స్పర్శవేదిని సాధించడానికి ఈ కాలంలో ప్రయత్నం చేసేవారట. ఈ కాలం నాటి సాహిత్యంలో స్పర్శవేది ప్రస్తావనలు ఉన్నాయి.

ముస్లింల ప్రవేశం: ముస్లిం దండయాత్రల వల్ల ఆంధ్రదేశంలో ముస్లింలు స్థిరపడ్డారు. కొందరు గ్రామాలలోకి వచ్చి కూడా స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వారి రాక వల్ల హిందూ సమాజంలో కొన్ని ఆచారాలు, సాంప్రదాయాలు, విశ్వాసాలు మార్పులు వచ్చాయి. ఒకరి అలవాట్లు మరొకరికి సంక్రమించసాగాయి ముస్లిం లాగా హిందువులు వేషధారణ చేసుకోసాగారు. అలాగే హిందువుల ఆచారాలైన శకునాలు, ముహూర్తాలు ముస్లింలు అవలంబించసాగారు. ముస్లింలు కొందరు హిందూ రాజుల కొలువులలో చేరారు. హిందువులు ముస్లింల కొలువులలో చేరారు. పరస్పరం ప్రభావితులై మిశ్రమ సాంఘిక వ్యవస్థ ప్రారంభమైంది.

ఆర్థిక పరిస్థితులు-వ్యవసాయం: ఈ యుగంలో కూడా ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమే. వ్యవసాయాభివృద్ధికి, నీటిపారుదల సౌకర్యాల కోసం రెడ్డిరాజులు అనేక చర్యలు చేపట్టారు. చెరువులు, బావులు, కాలువలు తవ్వించారు. ఏరులు ఉన్నచోట కాలువలు తవ్వి నీరు పంట భూములలోకి మళ్లించారు. ఏలేరు నదిని ఆనాడు ఏలానది అని పిలిచేవారు. ఆ ప్రాంతాన్ని నాయమ నాయకుడు అనే అతడు పాలించాడని శాసనాలు తెలుపుతున్నాయి. అతడు అక్కడ కాలువలు తవ్వించాడు. అందువల్ల ఆ ప్రాంతంలో రెండు మూడు పంటలు పండేవని ఆ శాసనం తెలుపుతోంది. ఏటి కాలువల కింద అనేక అగ్రహారాల భూములు సాగవుతున్నాయని శ్రీనాధుడు భీమేశ్వర పురాణంలో వర్ణించాడు. గోపరాజు ద్వాత్రింశికలో కాలువలు పాయలు, బావులు మొదలైన

నీటి వనరుల నుండి నీరు తోడి నల్ల నేలలను సాగు చేస్తున్నారని పేర్కొనబడింది భూమిని కేసరి పాటిగడ అనే కఱ్ఱతో కొలిచి పన్ను నిర్ణయించేవారట హద్దులు కూడా ఈ కఱ్ఱతోనే కొలిచి నిర్ణయించేవారు భూమిని మాగాణి వెలిపొలం తోట భూములని వర్గీకరించేవారు అనంతామాత్యుడు రచించిన భోజరాజీయంలో పోడు వ్యవసాయాన్ని పేర్కొన్నాడు

నూతులు రెడ్డి రాజుల కాలంలో నూతులు ఎక్కువగా తవ్వించారు తూర్పు గోదావరి జిల్లాలో వారు అనేక నూతులను తవ్వించారని వాటిని రెడ్డినూతులని పిలిచేవారని గోదావరి జిల్లా గజిటీర్ వివరిస్తోంది ముఖ్యంగా అమలాపురం తాలూకాలో నేటికీ వారు తవ్వించిన నూతులు ఉన్నాయి అవి 18-24 అడుగుల లోతు ఉన్నాయి నీటి లోపల 6-12 అడుగుల లోతు వరకు ఇటుక కట్టుబడి కట్టి ఉన్నాయని ఆ బావులలో నీరు ఎప్పుడూ తగ్గదని గజిటీర్‌లో వివరింపబడింది

వ్యవసాయం జనాభా తక్కువ గనుక వ్యవసాయం మీద పెద్ద వత్తిడి లేదు చేసుకొనే వారికి కావలసినంత భూమి లభ్యమయ్యేది పన్నులు విధానానికి అనుగుణంగా భూమిని మాగాణి లేక తరి మెట్ట లేక వెలిపొలం పండ్లతోటలు అనే మూడు వర్గాలుగా విభజించారు సంవత్సరానికి రెండు పంటలు పండేవి వైశాఖ మాసంలో ఒక పంట కార్తీక మాసంలో రెండవ పంట వచ్చేది కాని కార్తీక మాసాన్ని ముందు ప్రస్తావించారు ప్రతి గ్రామంలో శిస్తుగా వసూలు చేసిన ధాన్యాన్ని నిలువ చేయడానికి రాచగాదెలు ఉండేవి వ్యవసాయ పనిముట్లు కంసాలులు తయారు చేసేవారు నదుల ఒడ్డున చెరువుల పక్కన బావులు తవ్వేవారు ఆ బావులలో నీరు సమృద్ధిగా ఉండేది మరికొన్ని సందర్భాలలో నదులు చెరువుల నుండి కాలువలు పాయలు పాయలుగా తీసి పొలాలలోకి తీసుకొని వెళ్లేవారు కొళ్లు అనే కాలువలో నీళ్లు తోడటానికి రత్నములు అనే సాధనాలను ఉపయోగించినట్లు సింహాసన ద్వాత్రింశికలో ప్రస్తావన ఉంది నల్లభూములలో పంటలు బాగా పండుతున్నాయని కూడా పేర్కొంది ఎత్తు భూములకు ఏతం ద్వారా మోట ద్వారా నీళ్లను చేరవేసేవారు ఏతాన్ని పికోట మోటను కపిలి అని పేర్కొనబడ్డాయి అనేక అగ్రహారాలలో క్రొప్పంగలియలు అనే పేరు గల కాలువల ద్వారా నీరు వచ్చేటట్లు చేసి వ్యవసాయాన్ని చేశారు ఎత్తు పొలాలకు తోట భూములకు క్రమమైన పద్ధతి ప్రకారం నీళ్లు నిరంతరం వచ్చేటట్లు చేసి వ్యవసాయాన్ని చేశారు ఎత్తు పొలాలకు తోట భూములకు క్రమమైన పద్ధతి ప్రకారం నీళ్లు నిరంతరం వచ్చేటట్లు చేసేవారు కొత్తగా చెరువును నిర్మించడానికి 12 అంగాలు నిర్మించాలని శక 1291 అంటే క్రీ శ 1391 నాటి పోరుమామిళ్ల శాసనం తెలుపుతోంది చెరువును నిర్మించడంలో ఎదురయ్యే దోషాలను కూడా తెలిపింది కొండల మధ్య ఎలా నిర్మించాలి మెత్తని భూములలో ఎలా నిర్మించాలి నిర్మాణానికి తగిన మనుషులుగా ఎవరిని ఎంపిక చేయాలి అనే విషయాలను పూర్తిగా ఈ శాసనం వివరించింది

రెడ్డిరాజుల కాలంలో అనేక రకాల వరి పండినట్లు శ్రీనాథుని రచనల వల్ల తెలుస్తోంది అంతకుముందు కాంద్రప వ్రిహి అనే రెండు రకాల వడ్లు పండేవి కాని రెడ్డి యుగంలో కలమసాలి శిరాముఖ హయన పతంగ సస్తిక అనే రకాలేగాక కర్పూరభోగం అనే మరొక ప్రత్యేక రకం కూడా పండేదట వీటిలో సస్తిక రెండు నెలల పంట ప్రసాంగి లేక రాసంగి రాజనం అనేవి సాధారణ పంటలు

మెట్ట పంటలుగా మిరప ప్రత్తి నల్ల భూములలో పండేవి ఇంకా చెరకు తమలపాకులు మామిడి జామ అరటి పండ్ల తోటలు వక్క చెట్లు కొబ్బరి చెట్లు కూడా వేసేవారట

చెరువులు నూతులేగాక అనేకచోట్ల చెరువులు కూడా తవ్వించారు గుంటూరు కర్నూలు జిల్లాలలో అనేక చెరువులు తవ్వించారు పెదకోమటి వేమారెడ్డి భార్య సూరాంబిక సంతానపయోనిధి అనే చెరువును తవ్వించింది ఆ చెరువుకు నీరు తేవడానికి జగనొబ్బగండ అనే పేరుతో కాలువను ఆమె కుమారుడు రాచవేమారెడ్డి తవ్వించాడు రాచవేమారెడ్డి మరొక పెద్ద చెరువు నిర్మించి బద్దిపూండి జనార్దనునికి దానం చేశారు సముద్రం కన్నా గొప్ప చెరువని శ్రీనాథుడు వర్ణించిన ఒక శాసనం ఫిరంగిపురంలో లభించింది శ్రీగిరిరెడ్డి సముద్రాలంతటి చెరువులను నిర్మించాడు నర్సరావుపేట దగ్గర అప్పాపురంలో కావూరి వల్లభశెట్టి అనే అతడు గోవర్ధన సముద్రం అనే చెరువును నిర్మించి స్థానిక దేవునికి దానం చేశాడు నెల్లూరు జిల్లా వేమరులో కొందరు గ్రామస్థులు అక్కడ ఉన్న ఒక చెరువుకు దేవాలయానికి కలిపి దశబంధ మాన్యం దానం చేసినట్లు శాసనం ఉంది కాటయ వేమారెడ్డి గౌరవార్థం ఉప్పల హనుమయ్య చెరువు తవ్వించాడని తూర్పు గోదావరి జిల్లాలోని మొల్లేరు శాసనం తెలుపుతోంది హిందూరాజులు వ్యవసాయానికి నీటిపారుదల సౌకర్యాలకు ఎంత ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరని గ్రిబెల్ అనే

పండితుడు రాశాడు. నదులకు ఆనకట్టలు కట్టి మైళ్లకొలది కాలువలు తవ్వి మాగాణి భూములకు అందిస్తారని కూడా వివరించాడు.

పంటలు: వారు ఏర్పాటు చేసిన నీటిపారుదల సౌకర్యాల వల్ల వ్యవసాయం విస్తరించింది. రెడ్డిరాజుల శాసనాలు రెండు పంటలను తెలుపుతున్నాయి. ఒక పంట కార్తీక మాసంలో అంటే నవంబర్‌లో, రెండవ పంట వైశాఖ మాసంలో అంటే మే నెలలో చేతికి వచ్చేదని వారి శాసనాలు తెలుపుతున్నాయి. పంటలో రాజు భాగాన్ని కోరు లేక కోరుపాలు అని, రైతు భాగాన్ని మేడిపాలం అనేవారు. ప్రతి గ్రామంలో రాచగాదెలు ఉండేవి రైతులు పన్నులుగా ఇచ్చిన ధాన్యాన్ని ఆ గాదెలలో నిల్వ చేసేవారు. ఒక్క మిరపతప్ప ఈనాటి పంటలన్నీ ఆనాడు పండేవి వరి, చెరకు, మామిడి, కొబ్బరి, పనస, తమలపాకు, పోక వంటివి పండేవి. కోనసీమ చాలా సారవంతమైనదని అక్కడ తోటలు ఎక్కువని సాహిత్యం వర్ణిస్తోంది. వరిలో కలమ, శాలి, శిరాముఖి, పతంగహోయ్య మొదలైన రకాల వారి పేర్లు గ్రంథాలలో ప్రస్తావించబడ్డాయి. వరి ధనికుల ఆహారంగా ప్రఖ్యాతి వహించింది.

పలనాటి పరిస్థితి: అయితే నీటి పారుదల లేని పలనాడు మొదలైన మెట్ట ప్రాంతాలు కరవు కాటకాలతో ఉండేవి. శ్రీనాథుడు పలనాటిలో జొన్నలు దప్ప సన్నన్నము సున్న అని వర్ణించాడు. దోసెడు కొంప అని గ్రామ పురోహితుని ఇంటిని వర్ణించాడు. చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు నాగులేటి నీళ్లు నాపరాళ్లు, రంభ అయినా వడకును ఏకులు వడకవలసినదే, అని ఆనాటి పలనాటి పరిస్థితిని కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. సజ్జ, జొన్నకూళ్లు సర్పంబులుండేళ్లు పల్లెనాటి సీమ పలనాడు అని కూడా వర్ణించాడు. శ్రీనాథుడు తాను స్వయంగా పలనాటిని దర్శించి నాటి పరిస్థితులను వర్ణించాడు. పలనాడు రేనాటిలో జొన్నన్నమే ప్రధానాహారం. జొన్న తర్వాత చెప్పుకోదగింది సజ్జ.

పశుపోషణ: వ్యవసాయం తర్వాత ముఖ్యమైన వృత్తి పశుపోషణ, రైతులేగాక రాజులు, సామంతులు కూడా పశువులను పోషించారు. దేవాలయాలు కూడా పశువులను పోషించాయి. ప్రతి దేవాలయానికి కిలారులు అనే పేరుతో పశుశాలలు ఉండేవి. బ్రాహ్మణులు కూడా పశువులను పెంచారు. ముఖ్యంగా గోవులను వారు పోషించేవారు. గోవుపాలు ఏకాగ్రతనిచ్చి తపస్సు చేసే శక్తిని పెంచుతాయని వేద కాలం నుండి నమ్మకం ఉంది. కనుక బ్రాహ్మణులు గోదానం పట్టేవారు. అందువల్లనే గోవులను పవిత్రంగా పూజించేవారు.

భూదానాలు - ఇతర దానాలు: బ్రాహ్మణులకు దేవాలయాలకు దానాలు చేసే ఆచారం రెడ్డి యుగంలో కూడా కొనసాగింది. అనవేమారెడ్డి అమ్మనబ్రోలు సీమలో అంటే శ్రీశైలం ప్రాంతంలో రామతీర్థం అనే గ్రామాన్ని తిమ్మనభట్టు అనే పండితునకు దానం చేసి చీమకుర్తిలో శాసనం వేయించాడు. ఆ శాసనంలో ఇంకా అనేక గ్రామాల నుండి వచ్చే ఆదాయాన్ని కూడా ఆయనకే ఇవ్వాలని నిర్దేశించారు. చీమకుర్తి, పులికొండ, భీమవరం, మైలవరం, కుమారపురి గ్రామాలలోని సువర్ణాదాయాలలో ఐదవ వంతు, అక్కడ తరిభూములలో పండే పంటలలోను, చెరకు, తమలపాకు తోటల పంటలో నాలుగో వంతు ఆయనకు ఇవ్వాలి. అక్కడ పెద్ద చెరువు నుండి ఆయనకు నీరు ఇవ్వాలి. అంతేగాక అమ్మనబ్రోలు సీమలోని పెద్ద గ్రామాలలో 200 కుంటలు, చిన్న గ్రామాలలో 100 కుంటలు కొలిచి ఆ భూములలో పండే పంటను కూడా ఆయనకు ఇవ్వాలి అని ఆ శాసనంలో రాయించాడు. కుంట అంటే 16 బారలు. తిమ్మనభట్టుపై అనవేమారెడ్డికి అంతటి అనుగ్రహం ఎందుకు కలిగిందో స్పష్టంగా తెలియదు. అంతేగాక అనవేమారెడ్డి గుండ్లకమ్మ, కృష్ణానది, గోదావరి మహానదుల తీరప్రాంతాలలో అనేక అగ్రహారాలు ఇచ్చాడని అనేక పట్టణాల చుట్టూ పోకతోటలు నాటించాడని అదే శాసనం తెలుపుతోంది. అన్ని హక్కులతోపాటు రైతులను కూడా స్వాధీనపరుస్తున్నట్లు అల్లయరెడ్డి కందుకూరు శాసనం కూడా తెలుపుతోంది రైతులను స్వాధీనం చేయడం అంటే రాజు గ్రామాలలో ఉండే రైతులను అగ్రహార రైతులుగా మార్చడం అయి ఉండవచ్చును. అష్టాధికారాలు అంటే గ్రామ సభలకు ఉండే అన్ని అధికారాలు అయి ఉండవచ్చును. కొమరిగిరి మండలంలోని కొన్ని గ్రామాలను బ్రాహ్మణులకు దేవాలయాలకు దానం చేస్తూ తన రాజుకు రాణులకు శుభాలు చేకూరాలని ఆశిస్తూ కాటయ వేమారెడ్డి కలువ చేరులో శాసనం వేయించాడు. రాజులు, సామంతులు విపరీతంగా దానాలు చేశారు. హిందూ రాజులను చూసి ముస్లిం రాజులు కూడా దానాలు చేయసాగారు. క్రీ.శ.1417 సంవత్సరం నాటి రెండు వేదాద్రి శాసనాలు ముస్లింలు చేసిన దానాలను పేర్కొంటున్నాయి. ధర్మకార్యాలకు భూములు అమ్మడం, కొనడం ఈ కాలంలో కూడా కొనసాగింది. మెట్ట భూమి పుట్టి లేక ఖండిక ఖరీదు 20 టంకాలని సర్పవరం గ్రామక వెలలు తెలుపుతున్నాయి.

బ్రాహ్మణుల ఐశ్వర్యం: అగ్రహారాలు, ధనధాన్యాలు, దానాలు పొంది బ్రాహ్మణులు అష్ట ఐశ్వర్యాలను అనుభవిస్తున్నట్లు శ్రీనాథుడు భీమేశ్వర పురాణంలో వర్ణించాడు. గోదావరి తీర అగ్రహారాలలో బ్రాహ్మణులు రత్నపు ఉంగరాలు ధరించారని, జంధ్యంతోపాటు మెడలో ముత్యాలహారాలు ధరిస్తారని సిగలో పద్మాలు పెట్టుకొని పునుగు జవ్వాదులు పూసుకుని సుఖసంతోషాలు అనుభవించారని పేర్కొన్నాడు. అంతేగాక వారి ఇళ్లలో బంగారు, వెండి ఆభరణాలు, పాత్రలు అనేకం ఉన్నాయని కూడా వర్ణించాడు.

రైతుల స్థితిగతులు: ఈ యుగంలో రైతుల స్థితిగతులు అంత బాగా ఉన్నట్లు లేదు. సింహాసన ద్వాత్రింశిక, హరివంశం భోజరాజీయం మొదలైన కావ్యాలు జట్టీ పద్ధతిని పేర్కొన్నాయి. జట్టీ పద్ధతి అంటే పంట మీద అప్పు తీసుకోవడం, పంట రాగానే ఆ పంటను అతనికే అమ్మాలి. అంటే సాధారణంగా మార్కెట్ రేటు కంటే తక్కువకే అమ్మవలసి ఉంటుంది. దానివల్ల రైతు నష్టపోతాడు. కనుక పంటలు పండించడానికి రైతులకు అప్పులిచ్చి పంట రాగానే తాము పంటను తీసుకుని తమ బాకీ కింద చెల్లు వేసుకొనే పద్ధతి అమలులో ఉందని భావించవచ్చును. అగ్రహారీకులు, దేవాలయాలు కూడా ఈ పద్ధతిని అనుసరిస్తూ ఉండవచ్చని మల్లంపల్లి సోమశేఖరశర్మ తన రెడ్డి కింగ్‌డమ్స్‌లో వ్యాఖ్యానించారు. ఇక వ్యవసాయ కూలీల పరిస్థితి ఇంకా హీనంగా ఉండేది. పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణంలో మూడు రకాల వెట్టిచాకిరీని ఉదహరించాడు. అందులో రాచవెట్టి ఒకటి. మిగిలినవి గ్రామవెట్టి, భూకామందు వద్ద వెట్టి అయి ఉండవచ్చును. వెట్టి పన్ను కూడా వసూలు చేసినట్లు కనిపిస్తోంది.

వృత్తులు: అంతకు పూర్వం లాగా కంసాలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగులు, పాంచాణం వారు తమ వృత్తులు సాగిస్తూ ప్రజలకు కావలసిన వస్తువులను ఉత్పత్తి చేసేవారు. కాని పూర్వం శాసనాలలో కనిపించే వృత్తి సంఘాల ప్రస్తావన చాలా తక్కువ. కంసాలులు తయారు చేసే రత్నాలు పొదిగిన నగలను చూసి విదేశస్తులు ప్రశంసించినట్లు సాహిత్యంలో ఉదాహరణలున్నాయి. వడ్రంగం పని కూడా మంచి అభివృద్ధి సాధించింది. వేశ్యల ఇళ్లలో ఉండే రకరకాల మంచాలు, నిలువుటెత్తు అద్దాల కిటికీలు, వాటిపై కళాత్మకంగా చెక్కిన చెక్కడాలను మల్లన వర్ణించాడు. భారతదేశంలో అద్దాలు, గాజు అనాది నుండి వస్తున్నాయి.

పరిశ్రమలు: బంగారు ఆభరణాల పరిశ్రమ చాలా ప్రాచుర్యంలో ఉండేది. రకరకాల బంగారు ఆభరణాలు అందంగా తయారు చేసేవారు. అనేక లోహ పరిశ్రమలు కూడా ఉచ్ఛదశలో ఉండేవి. ఇనప పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఇనుముతో వ్యవసాయ పనిముట్లేగాక ఆయుధాలు కూడా తయారు చేసేవారు. పాంచాణం వారు పంచలోహాలతో గజఘంటలు, చెంబులు కొలువు చలికెలు, దీపస్తంభాలు, జయస్తంభాలు తయారు చేసే వారు. బంగారు నగలు అద్భుతంగా తయారు చేసేవారు. దంత పరిశ్రమ కూడా ఉండేది. కాగితాన్ని శ్రీనాథుడు పేర్కొన్నాడు. నిర్‌లో కత్తులు తయారయ్యేవి. కాగితం తయారు చేసేవారో లేక దిగుమతి చేసుకునేవారో తెలియదు. బహుశా ముస్లింలు ప్రవేశపెట్టి ఉంటారు. వజ్ర పరిశ్రమ ఉండేది. మాచర్లలోని ఒక శాసనం విశ్వకర్మలు శివలింగాలు చెక్కడంలో గొప్ప నేర్పరులని తెలుపుతోంది. శివలింగాల తయారీ కూడా ఒక పరిశ్రమ. ప్రాసాదాలు, భవనాలు నిర్మించడం కూడా ఒక గొప్ప పరిశ్రమ.

వస్త్ర పరిశ్రమ - కలంకారీ అద్దకం: కోస్తా ప్రాంతం వస్త్ర పరిశ్రమకు పెట్టింది పేరు. సన్నని సెల్లాలు తయారయ్యేవని, వస్త్రాలు వెన్నెలవంటి పాము కుబుసం అంతటి పల్చగా ఉండేవని శ్రీనాథుడు, జక్కన వర్ణించారు. ఈ కాలంలో వస్త్రాల తయారీలో వచ్చిన మరొక మార్పు కలంకారీ అద్దకాలు. చీరెల అంచులపైన రాజహంసలు, చిలకల వరుసలు, లేళ్లు, గుర్రాలు, ఏనుగులు, నెమలి పింఛాలు చిత్రించేవారు. చందనకవలు, పట్టెడకవలు, కదంబకవలు, చెంగల్వలు, ఎరుపురంగు ఛాయలను నాటి సాహిత్యం పేర్కొంటోంది. మచిలీపట్టణం కలంకారీ పరిశ్రమకు పేరు. కామవరం, సూరవరం, బట్టల నేతకు ప్రసిద్ధి చెందాయి. ఆ ఊళ్ల పేర్లతోనే కామవరం వస్త్రాలు, సూరవరం వస్త్రాలు అని పిలిచేవారు. కొన్ని చీరెలను ద్రౌపదీ స్వయంవరం, లక్ష్మీవిలాసం, వసంతవిలాసం, శ్రీకృష్ణవిలాసం, రాయసింగారం అనే పేర్లతో పిలిచేవారు. అనేక రకాల పట్టు చీరెలు కూడా ఉండేవని సింహాసన ద్వాత్రింశిక పేర్కొంటోంది. హేమపట్టు, పులిగోరుపట్టు, వజ్రపట్టు, ఉదయపట్టు, వెలపట్టు అనేక రకాల రంగు రంగుల పట్టువస్త్రాలు నేసేవారు. వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా రంగుల పరిశ్రమ ఉండేది. ముఖ్యంగా నీలి రంగు తయారీ ప్రతి ఇంట్లో ఉండేదట. వినుకొండ, పలనాడులలో ముతక వస్త్రాలు నేసేవారు.

ఉప్పు పరిశ్రమ: కోస్తా తీరంలో ఉప్పు తయారీ మరొక పెద్ద పరిశ్రమ. చౌడును కూడా తీసి అమ్మేవారు.

ఆ రోజులలో ఇంటి కప్పులపై నాపబండలు పరచి వానిపై చౌడు పోసేవారు. అదే ఇంటికప్పుగా తయారు అయ్యేది.

వర్తకం - వాణిజ్యం: రెడ్డిరాజుల కాలంలో యుద్ధాలు, దండయాత్రలు సాగుతున్నప్పటికీ వర్తక వాణిజ్యాలు కూడా అభివృద్ధి చెందాయి. ఈ కాలంలో కూడా నానాదేశి పెక్కండ్రు, వీరబలంజా చెలుములు సంస్థ మొదలైన వర్తక శ్రేణుల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి. వీరు పూర్వంలాగే అనేక దానాలు చేసి శాసనాలు వేయించారు వీరు సుంకగుత్తంకాండ్రుగా కూడా వ్యవహరించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. బహుశా రాజులకు ముందే పెట్టుబడి పెట్టి దానిని వసూలు చేసుకోవడానికి సుంకగుత్తత తీసుకున్నట్లు తెలుస్తోంది. దేవతా ఉత్సవాలు వ్యాపారాన్ని వృద్ధి చేశాయి. దేవాలయాలకు కావలసిన వస్తువులు, రాజులకు, రాణులకు కావలసిన మణి మాణిక్యాలు, వ్యాపారాన్ని లాభసాటిగా మార్చాయి. వ్యాపార శ్రేణులకు రాజాదరణ ఉన్నందున వర్తకులు ధనవంతులు కావడమేగాక రాజదర్బారులలో వారి పలుకుబడి హెచ్చింది. రాచకార్యాలు కూడా నిర్వహించారు క్రీ.శ.1393లో కోరుకొండరాజు ముమ్మడినాయకుడు చనిపోయాడు. అప్పుడు అతని కుమారుడు బాలుడు కనుక ఆ యువరాజు తరపున సింహాద్రిశెట్టి, ఓబులశెట్టి అనే ఇద్దరు వర్తకులు పరిపాలనా భారాన్ని చేపట్టారు. రాజులకు అవసర సమయాలలో ధనసహాయం చేసేవారు. వారి బిడారు సైన్యాన్ని కూడా రాజుకు అండగా పంపేవారు విదేశాల నుండి మంచి గుర్రాలను తెచ్చి రాజుకు అమ్ముతుండేవారు. దాని వల్ల రాజుల సైనిక పాటవం పెరిగేది

అవచి కుటుంబం: రెడ్డి రాజులకు అవచి కుటుంబం వారు అండగా ఉండేవారు. అవచి దేవయశెట్టి సరఫరా చేసిన యుద్ధ సామాగ్రితోనే ప్రోలయ వేమారెడ్డి రాజ్యస్థాపన చేయగలిగాడని కొందరు అంటారు దేవయశెట్టికి ముగ్గురు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు తిప్పయశెట్టి. అతడు అనవేమారెడ్డికి కుమారగిరి రెడ్డికి అవసర సమయాలలో ధనసహాయం చేసేవాడని శ్రీనాధుడు వర్ణించాడు. ఈ తిప్పయశెట్టికే శ్రీనాధుడు తన హరవిలాసాన్ని అంకితం చేశాడు. కుమారగిరి నిర్వహించే వసంతోత్సవాలకు కావలసిన చందనం, అగరు, మంచి గంధం, కస్తూరి, పన్నీరు, కర్పూరం మొదలైన సుగంధ ద్రవ్యాలు, ఇతర వస్తువులు, ఏనుగులను తిప్పయశెట్టి విదేశాల నుండి తెచ్చి ఇచ్చేవాడు. అతనికి కుమారగిరి రాజలాంఛనాలను ఇచ్చి గౌరవించాడని కూడా శ్రీనాథుడు పేర్కొన్నాడు. అవచి కుటుంబీకులు మలయా, పన్సోర్, జిలోతింగ్, దమన్న, పరిష్యా, సింహళం, హెర్ముజ్ జాష్ణా లేక మాంప, భూటాన్, చీనా దేశాలతో వ్యాపారం చేసేవారని శ్రీనాధుడు రాశాడు. రెడ్డి యుగంలో అవచి కుటుంబం గొప్ప శ్రీమంతులు.

ఇతర శ్రేణులు: అవచి కుటుంబమేగాక అనేక ఇతర వర్తక కుటుంబాలు కూడా విదేశీ వాణిజ్యం చేస్తూ లాభాలు గడించి దానాలు చేశారు. బందారుశెట్టి అనే వర్తకుడు రాజమహేంద్రవరంలోని గోపీనాధ దేవాలయానికి ఘటికా యంత్రాన్ని దానం చేశాడు. ఆ దేవాలయంలో పని చేసే నలుగురు బ్రాహ్మణులకు 8 పుట్ల భూమిని కూడా దానం చేశాడు. ఆ రోజులలో పెద్ద పాత్రలలో సన్నని రంధ్రం ఉన్న చిన్న పాత్రను తేలేటట్లు వేసేవారట రంధ్రం గుండా క్రమంగా నీరు లోపలికి ఎక్కి చిన్న పాత్ర మునిగిపోయేది. పాత్రను ఉంచిన కాలం నుంచీ మునిగిపోయే వరకు ఒక ఘటిక అని లెక్కించేవారు. ఘటిక అంటే నేటి 24 నిముషాలకు సమానమని అంచనా కట్టారు దీనిని జలఘటికా యంత్రం అని పిలిచేవారు. ఈనాటి వర్తకులు, వారి శ్రేణులు చెరువులు తవ్వించే వారు దేవాలయాలకు దానాలు చేసేవారు.

బాటలు: కేతన తన కావ్యంలో నాటి మార్గాలను పేర్కొన్నాడు. అయోధ్య నుండి కంచి వరకు ఒక మార్గం ఉండేది. అది ఓరుగల్లు, నెల్లూరుల గుండా వెళ్లేది. పుణ్యక్షేత్రాలన్నింటికీ మార్గాలున్నాయి. శ్రీశైలం, త్రిపురాంతకం అహోబిళాలకు యాత్రామార్గాలు ఉండేవి. నాడు మార్గాలలో రక్షణ లేనందువల్ల వ్యాపార సంఘాలు గుంపులుగా ప్రయాణం చేసేవారు. తెలికలు, వీరబలంజాలు ఆనాడు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి సరుకులను చేరవేస్తూ వ్యాపారం చేసేవారు. వారికి సొంత రక్షక దళాలు ఉండేవి.

అంతకు పూర్వం దేశాన్ని కలుపుతూ ఉన్న మార్గాలే కొనసాగాయి. యాత్రాస్థలాలు, వ్యాపార మార్గాలు ఒకటిగానే ఉండేవి. దేవాలయాల వద్ద ఎక్కువ వ్యాపారం సాగేది. మిగిలిన రోజులలో పెద్ద పెద్ద రాచనగరాలలో సంతలు జరిగేవి. కొండవీడు, కొండపల్లి, బెల్లంకొండ రాజమహేంద్రవరం మొదలైన రాచ నగరాలు పెద్ద వ్యాపార కేంద్రాలు. నదులు దాటడానికి పుట్టిలు ఉపయోగించేవారు.

మోటుపల్లిరేవు-అభయ శాసనం: ఈ కాలంలో మోటుపల్లి గొప్ప రేవు పట్టణం. దాని కోసం రెడ్డి

రాజులకు, విజయనగర రాజులకు తరచూ యుద్ధాలు జరిగేవి. మోటుపల్లి రేవు నుండి రెడ్డి యుగంలో సముద్ర వ్యాపారం కూడా బాగానే సాగింది. కాకతీయుల పతనం తర్వాత మోటుపల్లి రేవు మళ్లీ దోపిడీలకు గురైంది. కనుక అనపోతారెడ్డి, అనవేమారెడ్డిలు మోటుపల్లి రేవును పునరుద్ధరించి అభయ శాసనం వేయించారు. ఈ శాసనం మోటుపల్లి వీరభద్రస్వామి దేవాలయంలోని స్తంభం మీద చెక్కబడి ఉంది. ఇది క్రీ.శ.1358వ సంవత్సరం నాటిది. ఈ శాసనం రాసింది సోమయామాత్యుడు. అతడు ఆ శాసనంలో మోటుపల్లిని ములుకుల పట్టణం అని పేర్కొన్నాడు. ఈ శాసనం తెలుగు, తమిళ రెండు భాషలలో చెక్కబడి ఉంది. ఈ రేవులో తమిళ వర్తకులు కూడా వ్యాపారం చేసినట్లుగా ఉంది. కనుక తమిళంలో కూడా శాసనం రాయించబడింది. ఈ శాసనం విదేశీ వర్తకుల నుండి వసూలు చేసే అపుర్తిక దండం అనే సుంకాన్ని రద్దు చేసింది. వెండి, బంగారం మీద సుంకాన్ని కూడా రద్దు చేసింది. ఎగుమతి అయ్యే చందనం మీద మూడో వంతు సుంకాన్ని రద్దు పరచింది. ఇతర వస్తువులపై అంతకు పూర్వం కన్నా ఎక్కువ సుంకాలు వసూలు చేయకూడదని అక్కడి అధికారులను ఆదేశించింది. వస్త్రాలను గోదాములలో తొక్కి పట్టరాదని శాసించింది. మోటుపల్లి రేవును వదలిపోయిన వారు తిరిగి వస్తే వారి వారి తోటలు భూములు ఆస్తులు తిరిగి ఇవ్వబడతాయని ప్రకటించింది. విధించిన సుంకాలు కూడా నమోదు చేయబడ్డాయి. దక్షిణ దేశం నుండి వచ్చే నూరు కట్టల వస్తువులకు 3 కట్టలు, నూరు వస్త్రాలకు 2 నాణేలు, ఉత్తర దిక్కు నుండి దిగుమతి అయ్యే నూరు కట్టలకు 5 కట్టలు, నూరు వస్త్రాలకు 3 నాణేలు, విదేశాలకు ఎగుమతి అయ్యే నూరు వస్త్రాలకు 3 నాణేలు, నూరు ముత్యాలకు ఏడున్నర నాణేలు సుంకాలుగా నిర్ణయించబడింది. ఈ నాణేలు ఏమిటో తెలియదు.

సముద్ర వ్యాపారం - తూర్పు తీర వ్యాపారం: ఈ అభయ శాసనం వల్ల మోటుపల్లి రేవు నుండి సముద్ర వ్యాపారం తిరిగి ప్రారంభమైంది. చీనా, జావా, మలయా దేశాలతో వ్యాపారం సాగింది. తూర్పు సముద్రం మే, ఆగస్టు నెలల మధ్య అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్ల సంవత్సరంలో 8 నెలలు మాత్రమే సముద్ర వ్యాపారం సాగేదట. మనదేశపు ఎగుమతులను గూర్చి వివరాలు నాటి సాహిత్యంలో పేర్కొనలేదు. కాని పైచెప్పిన సుంకాలను బట్టి ముత్యాలు, నూలు వస్త్రాలు, రత్నాలు, వజ్రాలు, మణులు, అత్తరులు, పట్టు ఎగుమతి అయ్యేవని తెలుస్తోంది. చీనా, సిల్కు, పింగాణి, కస్తూరి, కర్పూరం, సుగంధ ద్రవ్యాలు దిగుమతి అవుతూ ఉండవచ్చును. శ్రీనాధుని హరవిలాసాన్ని బట్టి మలయా, జాఫ్నా, సింహళం సుమిత్రా మొదలైన దేశాలతో వ్యాపారం సాగినట్లు తెలుస్తోంది.

పశ్చిమ తీర వ్యాపారం: పశ్చిమతీరంలో అనాది నుండి ఈజిప్టు, రోమ్, పర్షియా, అరేబియా దేశాలతో వ్యాపారం సాగుతుండేది. ఈ కాలంలో ప్రధాన దిగుమతి గుర్రాలు. ముస్లింలు భారతదేశాన్ని జయించిన నాటి నుంచీ యుద్ధ రంగంలో గుర్రాల ప్రాధాన్యత పెరిగింది. మధ్యాసియా అశ్వదళానికి పుట్టినిల్లు. అశ్వదళాన్ని పోషించి మధ్యయుగంలో వారు ప్రపంచవ్యాప్తంగా అద్భుత విజయాలు సాధించి ముస్లిం సామ్రాజ్యాన్ని నలు దిక్కులకు విస్తరించగలిగారు. అశ్వదళంతోనే వారు భారతదేశాన్ని సునాయాసంగా గెలవగలిగారు. 11వ శతాబ్దం తొలి సంవత్సరాలలో గజనీ మహమ్మద్ అశ్వికదళ యుద్ధం అద్భుతంగా ఉండేదట. ప్రపంచ వేగంతో దూసుకువచ్చే అతని అశ్విక దళాన్ని చూస్తే శత్రువులకు ధడట. ఇక భారతీయ సైన్యాల పని చెప్పనక్కర్లేదు. గజనీ సైన్యాలు వస్తున్నాయని వింటే చాలు చావు బతుకులు ఎరుగకుండా పారిపోయేవట. కనుకనే అతడు 17 సార్లు భారతదేశంపై దండెత్తగలిగాడు. కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత ముస్లింల అశ్వికబలం విలువ దక్షిణాది రాజులకు తెలియవచ్చింది. కనుక వారు కూడా మధ్యాసియా నుండి గుర్రాలను దిగుమతి చేసుకుని తమ సైన్యాన్ని అధునాతనంగా తీర్చిదిద్దుకోసాగారు. అందువల్ల రెడ్డి యుగం నుండి గుర్రాల దిగుమతి ప్రధాన వ్యాపారం అయింది. సాలుకు 10 వేల గుర్రాలు దక్షిణ భారతదేశంలో దిగుమతి అయ్యేవి. ఒక్కొక్క గుర్రం ఖరీదు 15 వేల బంగారు నాణేలు. పెద్ద పెద్ద ఓడల మీద ఈ గుర్రాలు దిగుమతి అయ్యేవట. ఆర్ముజ్, ఖోటాన్‌ల గుండా కూడా వ్యాపారం జరిగేది.

ఓడల రకాలు - కప్పల్ - జోంగు: ఆ రోజులలో రెండు రకాల ఓడలు ఉండేవని నాటి సాహిత్యం వర్ణిస్తోంది. శ్రీనాధుడు కప్పలి, జోంగు అనే రెండు రకాలను పేర్కొన్నాడు. తమిళంలో కప్పల్ అనే పదం ఉంది అంటే ఓడ అని అర్థం. కప్పల్ తమ ఓడల కంటే చాలా పెద్దదని, దాని అడుగు భాగం మూడు పలకలుగా బిగించి కట్టి ఉంటుందని, కనుక అది తుపాను బీభత్సానికి తట్టుకుని ఉంటుందని, వాటిలో కొన్ని విడి భాగాలుగా నిర్మించి

ఉంటుందని, వాటిలో ఒకటి పోయినా మిగిలిన భాగాల సహాయంతో ఓడ ప్రయాణం చేస్తుందని కోల్‌కొంటి రాశాడు. ఇక జోంగ్ అనేది చైనా వారి ఓడ. దానికి మూడు నుండి 12 వరకు తెరచాపలుంటాయి. ప్రతి ఓడ మీద 600 మంది నావికులు, 400 మంది విలుకాండ్రు ఉంటారు. ఈ ఓడల వెంట ఒకదాని కన్నా మరొకటి చిన్నవిగా ఉంటాయి. మరి మూడు ఓడలు వెంబడిస్తూ పోతూ ఉంటాయని ఇబన్‌బటూటా రాశాడు. ఈ ఓడలకు తెరచాపలు జమ్ముతో అల్లుతారని వాటిని గాలికి ఎదురు తిప్పుతారని, రేవులో ఉంటే గాలికి వదిలివేస్తారు, కాని వాటిని ముడవటం అనేది ఉండదని కూడా రాశాడు. ప్రతి పెద్ద ఓడలో నాలుగు కప్పులు ఉంటాయని, అవి అంతస్థులుగా ఉండి అనేక గదులుగా విభజింపబడతాయని కూడా రాశాడు. ఆ గదులలో వర్తకులు తమ భార్యలతోను, ఉంపుడు కత్తెలతోను కాపురాలు చేస్తూ ప్రయాణం చేస్తారని రాశాడు. ఆ గదులలో అన్ని సౌకర్యాలు ఉంటాయని, నీటి తొట్లు కూడా ఉంటాయని, ఎన్ని రోజులైనా ఇబ్బంది లేకుండా సుఖంగా ప్రయాణం చేయవచ్చని కూడా రాశాడు. దీనిని బట్టి చైనా, అరబ్బు మొదలైన విదేశస్తులు తరచూ ఆంధ్రదేశానికి వ్యాపారం నిమిత్తం వచ్చిపోయే వారని భావించవచ్చు.

కరవు, కాటకాలు: రెడ్డి యుగంలో క్రీ.శ.1344 ప్రోలయ వేమారెడ్డి కాలంలో ఒక కరవు, క్రీ.శ.1377లో అనవేమారెడ్డి కాలంలో ఒక కరవు, కుమారగిరి కాలంలో క్రీ.శ.1393, 1396 సంవత్సరాలలో రెండు భయంకర కరవులు వచ్చాయి. చివరి కరవు 12 సంవత్సరాలు సాగింది. ఆకలికి తట్టుకోలేక తమ పిల్లలను తామే తిన్నారట ఆ కరవుకు దుర్గాలేవి కరవు అని పేరు వచ్చిందట.

రెడ్డి రాజుల గురువులు: రెడ్డి రాజులకు మొదటి నుండి ఘోడెరాయ కుటుంబానికి చెందిన ఆచార్యులు గురువులుగా వ్యవహరించారు. ఘోడెరాయ గంగయదేవుడు ప్రోలయ వేమారెడ్డి గురువు. తూర్పు గోదావరి జిల్లాలోని శక 1345 నాటి పలివెల శాసనంలో వీరభద్రారెడ్డి అని తల్లి తమ గురువులైన త్రిపురారిదేవుని, అతని కుమారుడైన భీమయదేవుని పేర్కొన్నారు. అలాగే కందుకూ శివలింగారెడ్డి తాను రాసిన గిరీశశృతి సూక్తిమాల తన గురువుల వంశ వృక్షాన్ని ఇచ్చాడు. గంగాధర లేక గంగయదేవుడు, అతని కుమారుడు త్రిపురాంతక, అతని కుమారుడు శ్రీగిరి, అతని కుమారుడు త్రిపురారి, అతని కుమారులు భీమేశ్వర, శ్రీగిరిలను పేర్కొన్నాడు. వీరంతా శైవదీక్ష ఇచ్చిన గురువులు కావచ్చును. ఈ గురువులపై రెడ్డి రాజులకు అపారమైన భక్తి విశ్వాసాలున్నాయి ఘోడెరాయ గంగయదేవుని దయ వలన తాను రాజ్యం స్థాపించానని ప్రోలయవేమారెడ్డి చెప్పుకున్నాడు. దానిని బట్టి ప్రోలయ వేమునికి తన గురువుపై ఎంతటి భక్తి ఉందో తెలుస్తోంది. అలాగే పరాశరభట్టు, కందర అయ్యం గారు అనే మరికొన్ని కుటుంబాలు కూడా ఈ యుగంలో గురువులుగా దీక్ష ఇచ్చారు. కోరుకొండ ముమ్మడి నాయకుని గురువు కందడ అయ్యంగారు వేదాచార్య, అతని కుమారుడు శ్రీరంగనాథభట్టు, అతని కుమారుడు పరాశరభట్టు లేక భట్టుపరాశర మొదలైన పేర్లు కూడా నాటి శాసనాల ద్వారా తెలుస్తున్నాయి.

వైష్ణవశాఖకు చెందిన తిరుమల నల్లాంది చక్రవర్తి లేక నల్లమ చక్రవర్తి ఆంధ్రదేశం వచ్చి స్థిరపడ్డాడు అతనికి ఐదుగురు కుమారులు. తిరువెంగళ చక్రవర్తి, అలగారి చక్రవర్తి, అహోబిల చక్రవర్తి, శ్రీదేవ చక్రవర్తి, గోవింద చక్రవర్తి, వీరంతా గుంటూరు జిల్లాలో నివసించినట్లు రొంపిచర్ల శక 1318 సంవత్సరం నాటి కారంపూడి శాసనాలు తెలుపుతున్నాయి. రొంపిచర్ల శాసనంలో రామదాసు అనే అతడు నల్లాండి చక్రవర్తి శిష్యుడని చెప్పబడింది. వేదాంత దేశికుని కుమారుడు వరదాచార్యుడు లేక నైనాచార్యుడు కూడా చెప్పుకోదగినవాడే. ఇతని తండ్రి వేదాంత దేశికుడు శుభాషితనివి, తత్వసందేశ, రహస్య సందేశ అనే మూడు గ్రంథాలు రాశాడు.

కమ్మ, రెడ్డి, వెలమ యుగంలో మత పరిస్థితులు

ఆంధ్రదేశంలో ముస్లిం అధికారం విస్తరించే కాలంలో వారి అధికారం, దౌర్జన్యాలపై తిరుగుబాటుగా జన్మించిన కమ్మ, రెడ్డి, వెలమ రాజ్యాధిపతులు సహజంగానే వైదిక ధర్మరక్షణకు పూనుకున్నారు.

ఆంధ్రదేశం ముస్లిం వశమై వారి అధికారం దౌర్జన్యాలకు గురైన ఆంధ్ర ప్రజలను వైదిక ధర్మాన్ని రక్షించడానికి ముస్లింలపై తిరుగుబాటుగా కమ్మ, రెడ్డి, వెలమ రాజ్యాలు అవతరించాయి. కనుక వారు వైదిక మతాన్ని సనాతన ధర్మాన్ని రక్షించడమే వారి ధ్యేయంగా పెట్టుకున్నారు. కనుక ముస్లింల దండయాత్రల వల్ల నష్టపోయిన అగ్రహారీకులకు వారి అగ్రహారాలను పునరుద్ధరించారు. ప్రోలయ నాయకుడు వైదిక ధర్మాన్ని రక్షించి ధర్మాన్ని నిలబెట్టినందుకు తాపసులు తమ తపోశక్తిలో $^1/_6$వ వంతు ధారపోశారని నాటి సాహిత్యం వర్ణిస్తోంది. ప్రోలయ వేమారెడ్డి అగ్రహారాలను విప్రులకు ఇచ్చి యజ్ఞకర్తలుగా నిలిపాడని ఎఱ్ఱాప్రగడ వర్ణించాడు. ఈ కాలంలో, హిందూ మతంలోని శాఖాభేదాలతో నిమిత్తం లేకుండా కమ్మ, రెడ్డి, వెలమ ప్రభువులు అందరినీ ఆదరిస్తూ వైదిక ధర్మ రక్షణకు పూనుకున్నారు.

వాస్తవానికి ఈ యుగంలో యావద్భారతదేశంలో ముస్లిం మత ప్రభావం వల్ల భక్తి ఉద్యమాలు ప్రబలాయి. ఈ కాలంలో అనేక మంది భక్తి ఉద్యమకారులు జన్మించారు. వారు అంతకు పూర్వం అమలులో ఉన్న అంధ విశ్వాసాలు, మూఢ నమ్మకాలను ప్రక్షాళన చేసి నూతన పంథాలను ప్రచారం చేశారు. నిర్మల హృదయంతో, ఏకాగ్రచిత్తంతో భగవంతుని ధ్యానం చేయడం ద్వారా అతని సాన్నిధ్యాన్ని పొందవచ్చు అనే సిద్ధాంతాన్ని ప్రవచించారు. ఈ సిద్ధాంతమే భక్తి ఉద్యమంగా రూపొందింది. భక్తి ఉద్యమం కుల వ్యవస్థను బహు దేవతారాధనను, విగ్రహారాధనను ఖండించింది. ఇలాంటి నూతన హిందూమత పంథా ఉత్తరదేశంలో వ్యాప్తిలో ఉంది. కాని ఆంధ్రదేశంలో అలాంటి భక్తి ఉద్యమం రాలేదు. భక్తి ప్రధానమైన శైవ శాక్తేయ వైష్ణవ మతాలు ప్రాచుర్యం పొందాయి. రామానుజాచార్యులు కూడా భక్తి ఉద్యమకారునిగానే భావిస్తారు. కారణం అతడు కూడా విష్ణుభక్తిని బోధించాడు. అంతేగాక కులాలను ఖండించి సర్వమానవ సమానత్వాన్ని చాటాడు. ఆంధ్రదేశంలో మొదట శైవమతం, తర్వాత వైష్ణవ మతం ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి. కనుక కమ్మ, రెడ్డి, వెలమ ప్రభువులలో మొదటివారు శైవమతాన్ని ఆదరించారు. తర్వాత వారు వైష్ణవ మతం వైపు ఆకర్షించబడ్డారు. కాని వారి వ్యక్తిగత మతం ఏదైనా అన్ని శాఖలను ఆదరించి సాంప్రదాయబద్ధమైన పరమత సహనాన్ని పాటించారు.

ఈ యుగంలో మత పరిస్థితులలో పెద్ద మార్పులు ఏమీలేవు. కాకతీయుల కాలం నాటి మత పరిస్థితులు కొనసాగాయి. అంతేగాక హిందూమత శాఖలలో సంఘర్షణ అంతమైంది. వైష్ణవ శైవ శాఖాభేదాలు సమసి పోయాయి. మహమ్మదీయుల దండయాత్రల వల్ల హిందూ మతానికి ప్రమాదం ఏర్పడింది. అందువల్ల హిందువులలో శాఖాబేధాలు అంతరించి వారి మధ్య ఐక్యత వచ్చింది. తమలో తాము సిద్ధాంత భేధాలతో సంఘర్షణలకు స్వస్తి చెప్పారు. అయినప్పటికీ అవి శాఖలుగానే కొనసాగాయి. అప్పుడప్పుడు శాఖాధిపతుల మధ్య వాదోపవాదాలు మాత్రం జరిగేవి. శైవమతం, వైష్ణవమతం మరొకవైపు హరిహర మతావలంబులు ఆంధ్ర సమాజంలో పక్కపక్కనే ఉన్నారు. శివునిపై అభిమానం గల కవులు శివునిపై కావ్యాలు రాయగా, విష్ణుభక్తులు విష్ణువుపై కావ్యాలు రాశారు.

శైవమతం: శ్రీనాధుడు గొప్ప శివభక్తుడు. అతడు శివుని మహిమను గురించి హరవిలాసం మొదలైన కావ్యాలు రాశాడు. శివరాత్రి మహిమను వర్ణిస్తూ శివరాత్రి మహాత్మ్యం రాశాడు. ఈ కావ్యాన్ని భిక్షావృత్తి మఠాధిపతి అయిన ముక్తిశాంత భిక్షావృత్తిత్రయుని ప్రోత్సాహంతో రాశాడని అంటారు. హరవిలాసంలో చిరుతొండ నంబి తిరువెంగమాంబలు తమ కుమారుని కోసి మాంసం వండి భైరవయోగికి పెట్టారని, అందువల్ల వారు శివ సాయుజ్యం పొందారని శ్రీనాధుడు వర్ణించాడు. పాల్కురికి సోమనాధుని పంథాలో శ్రీనాధుడు కూడా శివభక్తిని గూర్చి రాశాడని చెప్పవచ్చును. పరమ పాపాత్ముడైన ఒక బ్రాహ్మణుడు శివరాత్రి ఉపవాసం చేసినందున మరుజన్మలో కుబేరుడై జన్మించాడని శివరాత్రి మహిమలో వర్ణించాడు. శివభక్తి భయంకరమైన హింసను కూడా ఆమోదయోగ్యమైనదిగా అంగీకరించినట్లు తెలుపుతోంది. శివలింగ స్థాపన సర్వపాపహరమని సమకాలీన శైవసాహిత్యం వర్ణిస్తోంది. మొత్తం మీద శైవమతం మంచి ప్రాచుర్యంలో ఉందని ఈ నిదర్శనాలు తెలుపుతున్నాయి.

కొలువులు - గ్రామ దేవతలు: ఈ కాలంలో సాంప్రదాయకంగా వచ్చే గ్రామ దేవతల పూజలు కొనసాగాయి. గ్రామ దేవతల ప్రీత్యర్థం కొలువులు కొలిచే ఆచారం అమలులో ఉంది. ప్రతి గ్రామానికి ఒక గ్రామ దేవత ఉంటుంది. ఆమెకు చిన్న దేవాలయం ఉంటుంది. ఆమెకు కొలువులు కొలిచి బలులిచ్చేవారు. దుర్గ, కాళి చండి, భద్రకాళి అనే పేర్లతో శక్తిని ఆరాధించేవారు. ఈ దేవతలకు బలులు ఇచ్చేవారు. ఈ యుగంలో బలులు చాలా క్రూరంగా ఉండేవి. రెడ్డిరాజుల కులదేవత పేరు మూలగూరమ్మ. వారు ఆమెను పూజించి బలులిచ్చేవారు కొండవీడు వద్ద మూలగూరమ్మ దేవాలయం ఉంది. రాజమండ్రిలో కూడా కాటయవేమారెడ్డి మూలగూరమ్మ గుడిని నిర్మించి దానం చేసి దాన శాసనం వేయించాడు. ఆ గుడి ఇప్పుడు కూడా ఉంది. ఆ దేవతను ఇప్పుడు కొర్లమ్మ అనే పేరుతో గ్రామ దేవతగా కొలుస్తున్నారు. ఇది అక్కడి దేవీచౌక్‌కు కొద్ది దూరంలో ఉంది. వేమభూపాల చరిత్రలో వామనభట్టు వింధ్యవాసిని పూజను గొప్పగా వివరించారు.

ఈ యుగపు మొదటి భాగంలో ఆంధ్రదేశంలో తీవ్రవాద శైవమతం అభివృద్ధి చెందింది. శివుని ఉగ్రరూపాలైన భైరవ, మైలారు దేవుళ్లను అర్చించారు. భైరవ విగ్రహాలు ఎక్కువగా ప్రతిష్టించబడ్డాయి వామనాచార సంబంధమైన తాంత్రిక పూజా విధానం అమలులోకి వచ్చింది.

ఈ కాలంలో శైవ మతాన్ని ప్రచారం చేసిన గురువులలో ఘోడెరాయవంశం ముఖ్యమైనది. కొండవీడు కందుకూరు, రాజమహేంద్రవరం రెడ్డిరాజులకు వీరు గురువులు. శ్రీనాధుడు కూడా ఘోడెరాయ గురువులను ప్రశంసించాడు. అతడు 'వారిని వీరమాహేశ్వరులని పేర్కొన్నాడు. ఘోడెరాయ 'గురువులకు త్రిపురాంతకం కేంద్రంగా ఉండేది.

ఈ కాలంలో శ్రీశైలం, త్రిపురాంతకం, అమరావతి, భీమవరం, గునుపూడి, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామం గొప్ప శైవక్షేత్రాలు. దేవాలయాలకు అనుబంధంగా మఠాలు ఉండేవి. అవి విద్యా కేంద్రాలుగా విలసిల్లాయి. శ్రీశైలంలో గంటామఠం, కలుమఠం, విభూదిమఠం, భిక్షావృత్తిమఠాలు ఉన్నట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ మఠాలను శైవ గురువులు నడిపేవారు. వారి పేర్లు శక్తి, రాశి, పండిత, రాశిపండిత అనే పదాలతో అంతం అవుతున్నాయి.

వైష్ణవ మతం: శైవ మతం మంచి ప్రాచుర్యంలో ఉన్నా వైష్ణవ మతం వ్యాప్తి చెందింది. వైష్ణవ మతం వడగలై, తెంగలై అనే రెండు శాఖలుగా చీలింది. వడగలై ఉత్తరదేశపు శాఖ. అది బ్రాహ్మణ ఆధిక్యతను అంగీకరిస్తుంది. కనుక ఆ శాఖ అగ్రవర్ణాలకు మాత్రమే పరిమితమై ఉంది. తెంగలై దక్షిణాదిశాఖ. వారు రామానుజుని సర్వసమానత్వం సిద్ధాంతాన్ని అంగీకరిస్తారు. ప్రాచీన ఆళ్వారుల బోధనలు తమిళభాషలో ఉన్నాయి వారి బోధనలు, సంకలనం చేయబడ్డాయి. ఆ సంకలనానికి నల్లాయిడ ప్రబంధం అని పేరు. నాదముని, యమునాచార్యులు తమిళ వైష్ణవాన్ని సంస్కృతీకరించే ప్రయత్నం చేశారు. రామానుజాచార్యులు ప్రస్థానత్రయానికి సంస్కృతంలో భాష్యం రాసి ప్రబంధ వైష్ణవానికి వైదిక విధానానికి సమన్వయం సాధించి శ్రీవైష్ణవాన్ని రూపొందించాడు. శ్రీవైష్ణవం వైదిక విధానాన్ని అంగీకరిస్తూ కుల వ్యవస్థను ఖండించి సర్వమానవ సమానత్వాన్ని బోధిస్తుంది. రామానుజుడు చిన్న కులాలలో చైతన్యాన్ని తీసుకురావడానికి ప్రయత్నించాడు. పంచములకు దేవాలయ ప్రవేశం కల్పించాడు. కంచి గోపురం ఎక్కి తారక మంత్రాన్ని ప్రజలందరికీ బోధించి మంత్ర రహస్యాన్ని బట్టబయలు చేశాడు. కాని అతని సిద్ధాంతాలు వేలాది సంవత్సరాలుగా వచ్చే సాంప్రదాయక సాంఘిక వ్యవస్థలో తీవ్ర వైరుధ్యం ఏర్పడింది. కనుక నాటి చోళచాళుక్య చక్రవర్తి రామానుజుని తమిళదేశం నుండి వెళ్లగొట్టాడు రామానుజుడు కర్ణాటక దేశం చేరి హోయసాల బిట్టిగ విష్ణువర్ధనునిచే ఆదరించబడ్డాడు. రామానుజుని తర్వాత శ్రీవైష్ణవం వడగలై, తెంగలై అనే రెండు శాఖలుగా చీలిపోయింది. ఆళ్వారుల వైష్ణవ కృతులను పాశురాలు అని వ్యవహరించేవారు.

వడగలైశాఖ: వడగలైశాఖ వారు రామానుజుని సర్వమానవ సమానత్వాన్ని అంగీకరించరు. వారు రామానుజుని గౌరవించరు. వారిది సంస్కృత సాంప్రదాయం అంటే ఉత్తరదేశపు సాంప్రదాయాన్ని పాటిస్తారు వర్ణవ్యవస్థను అంగీకరిస్తారు. వైష్ణవంలో కేవలం వైదికాచారం మాత్రమే ఉండాలి అనే సిద్ధాంతం కలిగినవారు వారి నాయకుడు వేదాంత దేశికుడు. వైష్ణవ మతాన్ని సంస్కృతీకరించడానికి వడగలైశాఖ పరాకాష్ట అని చెప్పవచ్చును

తెంగలైశాఖ: తెంగలైశాఖ వారు తమిళ ప్రబంధ సాంప్రదాయాన్ని పాటించేవారు. రామానుజుని సర్వమానవ సమానత్వాన్ని అంగీకరిస్తారు. వీరు ఉదారవాదులు. కాని ఆంధ్రదేశంలో ఈ ఉదారశాఖ వ్యాప్తి

చెందలేదు. వడగలైశాఖ వ్యాప్తి చెందింది. ఇదే కాలంలో విజయనగరంలో మాధవ విద్యారణ్యుల నాయకత్వంలో వైదిక సాంప్రదాయం పునరుద్ధరించబడింది. హరిహర బుక్కరాయలు విద్యారణ్యుల వారి శిష్యులు. విజయనగర సామ్రాజ్యం హిందూ ధర్మరక్షణకు పూనుకుంది. ఆ రాజ్యపు సదాశయం విజయనగర సామ్రాజ్యానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలను తెచ్చింది. కనుక విజయనగర సామ్రాజ్య అభివృద్ధితోపాటు వారు అభిమానించిన వారి గురువులైన విద్యారణ్యుల వారి వైదిక సంప్రదాయం కూడా నలు దిక్కులకు విస్తరించింది. కనుక వైష్ణవ మతం కూడా వైదిక సాంప్రదాయాలు కలిగిన వడగలైశాఖ మంచి ప్రాచుర్యం పొందింది. సంగమ వంశీయులకు సమకాలికులైన రెడ్డి రాజ్యంలో కూడా వడగలై వైష్ణవశాఖ ప్రాచుర్యంలోకి వచ్చింది. వడగలైశాఖ వారు అహోబిళాన్ని తమ కేంద్రంగా చేసుకుని తమ మత ప్రచారం చేశారు. తర్వాత అద్దంకి వారికి ప్రధాన కేంద్రమైంది. రెడ్డిరాజులలో కుమారగిరి రెడ్డి కాటయవేమారెడ్డి వైష్ణవులు.

వైష్ణవ గురువులు: ఈ కాలంలో దక్షిణదేశం నుండి నల్లాన్ చక్రవర్తుల, నంబి, తిరుమల, కందాడ, భట్టార వైష్ణవ కుటుంబాలు ఆంధ్రదేశం వచ్చి వైష్ణవ మతాన్ని ప్రచారం చేశాయి. వీరిలో భట్టారు కుటుంబీకులు శ్రీరంగం నివాసులు. రామానుజాచార్యుల తర్వాత ఈ వంశానికి చెందిన పరాశరభట్టు శ్రీరంగంలోని వైష్ణవ గురుపీఠాన్ని అధిష్టించాడు. ఆయన వంశానికి చెందిన శ్రీరంగవర్ధనుడు (ఈయనకే ఏడవ పరాశరభట్టు అనే పేరు కూడా ఉంది.) కోరుకొండను ఏలిన ముమ్మడి నాయకుని గురువు. ఈ గురువు ఆదేశం ప్రకారం ముమ్మడి నాయకుడు కోరుకొండపై నరసింహ దేవాలయం నిర్మించాడు. శ్రీరంగవర్ధనుడు కోరుకొండలోనే మరణించాడు.

వైష్ణవ క్షేత్రాలు: ఈ కాలంలో తిరుపతి, అహోబిలం, నెల్లూరు, మాచర్ల, మార్కాపురం, బాపట్ల, శ్రీకాకుళం, సర్పవరం, సింహాచలం, శ్రీకూర్మం మొదలైనవి ప్రసిద్ధి చెందిన వైష్ణవక్షేత్రాలు. ఇవేగాక రెడ్డిరాజులు వారి సామంతులు ఇంకా అనేక దేవాలయాలు నిర్మించారు.

శైవ వైష్ణవాచార్యుల వాగ్వివాదాలు: ఈ కాలంలో శైవవైష్ణవాచార్యుల మధ్య, ఒకే మతంలోని వివిధ శాఖల మధ్య వాదోపవాదాలు జరుగుతుండేవి. వెలమ ఆస్థానంలోని శాకల్య మల్లుభట్టుకు పరాశరభట్టుకు వాదన జరిగింది. అలాగే విద్యారణ్యుల వారికి, ద్వైతపీఠాధిపతి అయిన అక్షోభ్యతీర్థుల వారికి వాదోపవాదాలు జరిగాయని వైష్ణవ గ్రంథాలు తెలుపుతున్నాయి. నాచన సోముడు కూడా తన కావ్యంలో హరిమేలని కొందరు, హరుడు మేలని మరికొందరు హాస్యాస్పద వాదనలు చేస్తారని రాశాడు. కనుక ఆ కాలంలో మతవాదనలు జరుగుతుండేవని స్పష్టమవుతోంది.

హరిహరనాథ మతం: ఈ రెండు శాఖలేగాక తిక్కన ప్రారంభించిన హరిహరనాథ మతస్థులు కూడా ఉన్నారు. వారు శివకేశవులకు భేదం చూపకుండా వారిద్దరూ కలసిన రూపంగా హరిహరనాథుని పూజిస్తూ రెండు మతాల ఐక్యతకు కృషి చేశారు. శివభక్తుడైన శ్రీనాథుడు కూడా హరిహరోపాసనలోని ఔచిత్యాన్ని ప్రశంసించాడు. అంతేగాక విష్ణుభక్తుల ప్రీత్యర్థం అష్టోత్తర శతకం, విష్ణునామాలు జపించాలని శ్రీనాథుడు అన్నాడు. మల్లనకవి శివ విష్ణువులను ఎవరు దూషించినా నరకానికి పోతారని వ్యాఖ్యానించాడు. కనుక హరిహరనాథతత్వం రెడ్డిరాజుల కాలంలో ప్రజలను, కవులను ఆకర్షించిందని చెప్పవచ్చును.

ప్రాణాయామం - అష్టసిద్ధులు: ఈ కాలంలో ప్రాణాయామం చేయడం ద్వారా అష్టసిద్ధులు పొందవచ్చునని నమ్మకం ఉంది. ఇది నాధులపంథా, మత్స్యేంద్ర మొదలైన నవనాథుల చరిత్రలను పురాణాలుగా చెప్పుకొనేవారు. శ్రీనాథుడు కూడా సిద్ధయోగాన్ని తన కాశీఖండంలో వర్ణించాడు. దానిని అతడు హఠయోగం అని పేర్కొన్నాడు.

భైరవతంత్రం: ఈ కాలంలో కూడా భైరవతంత్రం ప్రాచుర్యంలో ఉంది. దానికే చక్రపూజ అని పేరు. పంచమకారాలు ఇందులో ఉన్నాయి. మద్యం, మాంసం, మత్స్యం, ముద్ర, మైథునం అనే ఐదింటిని పంచమకారాలు అని అంటారు. ఈ ఐదింటిని ఉపాసించడం ద్వారా ముక్తి పొందవచ్చును అనేది వారి సిద్ధాంతం. చక్రపూజలో స్త్రీ పురుషులు యథేచ్ఛగా సమష్టి భోజనం సమష్టి మైథునం చేసి తాము తరించామని భావిస్తారు. దానిని తాంత్రికకర్మ అని పిలిచారు. ద్వాత్రింశికలో కొరవి గోపరాజు యోగినీ చక్రాన్ని పేర్కొనగా, శ్రీనాథుడు జక్కనలు తమ రచనలలో భైరవీయోగుల్ని ప్రస్తావించారు.

ఆత్మహింస - తాంత్రికపూజ: తాంత్రిక పూజా విధానంలో ఆత్మహింస కూడా ఒకటి. దేవుని ప్రీతి కోసం ఆత్మహత్యలు చేసుకొంటే శివసాయుజ్యం లభిస్తుందని నమ్మకం నాటి ప్రజలకు ఉంది. అష్టదిక్కులలో ఉండే 8 మంది భైరవులకు తన ఎనిమిది శరీర అంగాలను కోసి రక్త తర్పణం చేసి చివరకు తన తలను నరుక్కొన్న

భక్తులను కొరవి గోపరాజు తన సింహాసన ద్వాత్రింశికలో వర్ణించాడు. అంతేకాదు, భక్తులు నాల్కలు కోసుకోవడం నరసాలు గుచ్చి దీపాలు వెలిగించడం మొదలైన క్రూరకృత్యాలు చేపట్టారు. ఇంకా ఆత్మహత్యలు చేసుకోవడానికి చంపుడు గుడి ఉందని కూడా వివరించాడు. ఆత్మార్పణ చేసుకున్న వారి గౌరవార్థం ప్రతిమలు నిలిపేవారు. వాటిని వీరకల్లులు అని పిలిచేవారు. శ్రీశైలంలో అనవేమారెడ్డి వీరశిరోమండపాన్ని నిర్మించాడు. అందులో అనేక మంది శివభక్తులు తమ నాలుకలు కోసుకుని, తలలు నరుక్కుని శివసాయుజ్యం చెందారని అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. భృగుపాతం అనే మరొక ఆచారం కూడా ఉండేది. కొండపై నుండి దూకి మరణించినా స్వర్గం వస్తుందని నమ్మకమే భృగుపాతం అని అంటారు. దీనికి కర్మహరి, కనుమారి అని కూడా పేర్లున్నాయి. శ్రీశైలంలో భృగుపాతం జరిపే వారని పండితారాధ్య చరిత్ర తెలుపుతోంది.

ఈ కాలపు రాజులు శివకేశవుల భేదాలు పాటించకుండా ఈ క్షేత్రాలన్నీ దర్శించారు. దానాలు చేశారు అనవేమారెడ్డి శ్రీశైల దేవాలయానికి పాతాళగంగకు మెట్లు కట్టించాడు. అహోబిళానికి కూడా మెట్లు నిర్మించాడు ఇందులో ఒకటి శైవక్షేత్రం, మరొకటి వైష్ణవ క్షేత్రం. అలాగే రెడ్డి రాజులు అన్ని దేవాలయాలకు దానాలు చేశారు ఈ కాలంలో దేవాలయాలకు అనుబంధంగా మఠాలు ఉండేవి. అవి విద్యా కేంద్రాలుగా విలసిల్లేవి. గంటామఠం కలుమఠం, భిక్షావృత్తి మఠాల పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి. ఈ కాలంలో అన్ని దేవాలయాలలో ఉత్సవాలు జరిగేవి. కొలుపులు, జాతరలు నిర్వహించేవారు. అందులో సమాజంలోని అన్ని వర్గాల వారు పాల్గొనేవారు.

వ్రతాలు - దానాలు: దేవతలను పూజించడమేగాక క్షేత్రాలు దర్శించడమేగాక, వ్రతాలు చేయడం దానాలు ఇవ్వడం పుణ్యప్రదంగా భావించబడింది. కులభేదాలు లేకుండా ప్రజలు అన్నిరకాల వ్రతాలు చేసేవారు. ఏకాదశ వ్రతం చేస్తే స్వర్గప్రాప్తి లభిస్తుందని నమ్మేవారు. లక్ష్మీనారాయణ వ్రతం చేస్తే సమస్త కోరికలు తీరుతాయని భావించేవారు. అలా అనేక వ్రతాలు ఆచరించారు. హేమాద్రి తన దానకాండలో పదహారు దానాలను వర్ణించాడు షోడశ దానాలు అనేవి అంతకు ముందు నుండే ప్రాచుర్యంలో ఉన్నాయి. అనవేమారెడ్డి బ్రహ్మాండ దానం, గోసహస్ర దానం, కనకధారా దానం, కల్పతరు దానం అనే నాలుగు దానాలు చేశాడు. కుమారగిరిరెడ్డి తులాపురుష దానం చేశాడు. అల్లాడరెడ్డి ద్రాక్షారామంలో గోసహస్ర దానం చేశాడని శాసనాలు తెలుపుతున్నాయి అన్ని దానాలలోకి అన్న దానం గొప్పదని భావించి అనేక అన్న సత్రాలు నిర్మించారు. ధనవంతులు, రాజులు కీర్తి కోసం అనేక దానాలు చేస్తూ ఉండేవారు. పుణ్య ఫలానికన్నా వారు కీర్తి కోసమే ఎక్కువ దానాలు చేసినట్లుగా కనిపిస్తోంది. షోడశ సంస్కారాలు కూడా పాటించారు. జాతకం, ఉపనయనం, అన్నప్రాసన, నామకరణ మొదలైన సంస్కారాలను పాటించారు. ఏకాదశి, ద్వాదశి, శివరాత్రి వ్రతాలు జరిపారు. ధవన పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, లక్ష్మీ గౌతమీ ఉత్సవాలు, కృష్ణా పుష్కరాలు జరిపేవారు. పలివెల శాసనం అయోధ్య పుణ్యకాలం, మహోదయ పుణ్య కాలం అనే మరో రెండు పండుగలను పేర్కొంటోంది. మొత్తం మీద రెడ్డిరాజులు సనాతన ధర్మాన్ని ఆదరించారు

ఇతర దేవతలు: ఈ కాలంలో శైవ వైష్ణవ దేవతలేగాక, వైశ్యులు కన్యకాపరమేశ్వరి దేవతను తమ కుల దేవతగా పూజించేవారు. వారు ఆమెకు అనేక ప్రదేశాలలో దేవాలయాలు నిర్మించారు. ఆమె పార్వతి రూపంగా కొలువబడింది. అలాగే శైవ వైష్ణవ దేవాలయాలలో పరివార దేవతలను ప్రతిష్ఠించి పూజించే ఆచారం కూడా వచ్చింది. వైష్ణవ దేవాలయాలలో ఆళ్వారులు, హనుమంతుడు, గరుడ విగ్రహాలు ప్రతిష్ఠించేవారు. చనిపోయిన వారి పేర్లతో శివలింగాలు ప్రతిష్ఠించే ఆచారం కూడా వచ్చింది. మంచి రాజు అనే బ్రాహ్మణుడు శ్రీపర్వతం నుండి శివలింగాలు తెచ్చి మణికేశ్వర గ్రామంలోని మాండూక శంభు దేవాలయంలో ఒక లింగాన్ని శక 1275లో ప్రతిష్ఠించి మరణించిన తన సోదరుని పేరుతో రావినూతన పర్వత మల్లినాథ లింగం అని పేరు పెట్టాడు. ఈ మల్లినాథుని అనపోతారెడ్డి గౌరవించేవాడు. పిన్న భూపాలుని సేవకుడు నరభూపాలుడు ఒక శివలింగాన్ని ప్రతిష్ఠించి అల్లాడేశ్వర లింగం అని పేరు పెట్టాడు. ఇతడు అల్లాడరెడ్డి సేనాధిపతి. అల్లాడరెడ్డి మరణించిన తర్వాత అతనిపై భక్తితో ఈ లింగాన్ని అతని పేరుతో ప్రతిష్ఠించాడు. ఆ రోజులలో ప్రతి కులానికి కులదేవత ఉండేది. వ్యాపారులు గౌరేశ్వర, గౌడేశ్వర అనే దేవుళ్లను ప్రతిష్ఠించి పూజించారు. గుర్రాల వ్యాపారులు గుర్రాల పరమేశ్వరి అనే దేవతను ప్రతిష్ఠించి పూజించేవారట. విశ్వకర్మ కులానికి చెందిన భవనాల లింగన అనే అతడు శక 1327లో చెన్న మల్లికార్జున దేవాలయాన్ని నిర్మించాడు.

ముస్లిం మతం: ఈ యుగంలో ఆంధ్రదేశ మతపరిస్థితులలో వచ్చిన మరొక మార్పు ముస్లిం మతం. ఆంధ్రదేశంలోకి ముస్లిం మతం అడుగు పెట్టింది. ఓరుగల్లు మొదలైన తెలంగాణ ప్రాంతాలలో ముస్లింలు నివాసం

ఏర్పాటు చేసుకున్నారు. మసీదులు నిర్మించారు. అనేక దేవాలయాలు కూల్చబడ్డాయి. కొన్ని దేవాలయాలు మసీదులుగా మార్చబడ్డాయి. రాజమహేంద్రవరంలోని పెద్ద మసీదు అక్కడి విష్ణు దేవాలయాన్ని కూల్చి నిర్మింపబడింది. ఆంధ్రదేశంలోని అతిప్రాచీన మసీదులలో ఇది ప్రప్రథమమైనది. హిందూమతం పక్కనే ఇస్లాం మతం వెలగసాగింది. హిందువులు పూజలు చేస్తుండగా పక్కపక్కనే ముస్లింలు నమాజులు చేస్తూ ఉండేవారు. ఉభయుల సంపర్కం వలన సూఫీతత్వం వ్యాప్తి చెందింది.

పరమత సహనం: ముస్లింలు హిందూ దేవాలయాలను ధ్వంసం చేసి మసీదులు నిర్మించినా హిందూ రాజులు ముస్లిం మతాన్ని ద్వేషించలేదు. భారతదేశపు సాంప్రదాయకపద్ధతి అయినా పరమత సహనాన్ని పాటించారు. ముసునూరి కాపయనాయకుడు బహమనీ సుల్తాన్‌లకు తన సహాయ సహకారాలను అందించాడు. రెడ్డి రాజులు కూడా తమ రాజ్యంలో ప్రవేశించిన ముస్లింలను ఆదరించారు.

రెడ్డి రాజుల కాలం నాటి భాషా సాహిత్యాలు

రెడ్డి రాజుల కాలంలో భాషా సాహిత్యాలు బాగా అభివృద్ధి చెందాయి. వారు కాకతీయుల కాలం నాటి భాషా సాహిత్యాల వికాసాన్ని కొనసాగించారు. అనేక మంది కవులు అనేక కావ్యాలు రచించారు. ప్రప్రథమంగా తెలుగు భాషకు రాజభాష స్థాయి లభించింది. పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథుని ఆస్థాన విద్యాధికారిగా నియమించడంలో విద్యకు రెడ్డి రాజులు ఎంతో ప్రాముఖ్యతను ఇచ్చారని స్పష్టంగా తేటతెల్లమవుతోంది.

రెడ్డి రాజుల రచనలు: రెడ్డి రాజులు విద్యావంతులు. స్వయంగా కవులు, పండితులు. వారు వేదాలు వేదాంగాలు, పురాణాలు, ఇతిహాసాలు, ఖగోళం, గణితం, వైద్యశాస్త్రం, కావ్య నాటకాలంకార శాస్త్రాలు, అస్త్రశస్త్ర అశ్వశాస్త్రాలు, సామజశిక్ష, భరతనాట్య శాస్త్రాలను అధ్యయనం చేశారు. సంగీత, నాట్య, నృత్య మొదలైన లలితకళను అభ్యసించారు. అనేక రాజనీతి గ్రంథాలను చదివి జీర్ణించుకున్నారు. మహావిజ్ఞానులుగా, పండితులుగా కవులుగా కీర్తి పొందారు. అనవేమారెడ్డి అమరు శతకానికి వ్యాఖ్య రాశాడు. కుమారగిరిరెడ్డి గొప్ప కవి. అతడు వసంతరాజీయం అనే నాట్యగ్రంథాన్ని రచించాడు. కుమారగిరిరెడ్డి గొప్ప భరతనాట్య ప్రవీణుడని ప్రతీతి. అతని బావమరిది కాటయవేమారెడ్డి గొప్పపండితుడు, కవి అని అతని శక 1326 నాటి కురుటాల శాసనం తెలుపుతోంది. అతని ఆస్థానం సాహిత్యగోష్ఠులకు నిలయమై సరస్వతీనిలయం అనే పేరు పొందింది అతడు సాహిత్య చింతామణి అనే అలంకార గ్రంథాన్ని, సంగీత చింతామణి అనే సంగీత శాస్త్రాన్ని, సప్తసతిసారటీక అనే అమరుక కావ్యానికి శృంగార దీపిక అనే వ్యాఖ్యానాన్ని రచించాడు. స్కందపురం లేక కందుకూరు రెడ్డి రాజు శివలింగారెడ్డి హరదత్తున్ని గిరిశశృతి సూక్తిమాల అనే కావ్యానికి తత్త్వప్రకాశిక అనే పేరుతో వ్యాఖ్య రాశాడు ఇతడు నాట్యశాస్త్ర పారంగతుడు కూడా. శ్రీగిరిరెడ్డి కళా విమర్శకుడు. సంగీత సాహిత్య ప్రవీణుడు. మమ్మటుని కావ్య ప్రకాశికను అనుకరిస్తూ పెదకోమటి తన సాహిత్య చింతామణిని రాశాడట. రాజమహేంద్రవర రెడ్డిరాజు వీరభద్రారెడ్డి గొప్ప సంగీత సాహితీవేత్తగా ప్రఖ్యాతి వహించాడు. అతనికి సాహిత్య సంగీత లక్ష్యలక్షణ భంగ సర్వజ్ఞుడు అనే బిరుదు ఉంది.

రెడ్డి రాజులు మొదటి నుండి చివరి వరకు అనేక కవులను పోషించారు. సకలశాస్త్ర పారంగతులు, వేదవేదాంగ విదులైన బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలు దానం చేసి వేదవిద్య అయిన వైదిక సంస్కృతిని పోషించారు. గోసహస్రకల్పతరు బ్రహ్మాండ తులాపురుష దానాలు చేశారు. విలసశాసనం ప్రకారం నాటి పండితులు షడ్దర్శనాలు, జ్యోతిష్యం, శబ్ద మీమాంసశాస్త్రాలు, ధర్మశాస్త్రాలు, సంగీత సాహిత్యాలు, ఆయుర్వేదం మొదలైన విద్యలు నేర్చుకున్నట్లు తెలుస్తోంది. వారు సంస్కృతం, ఆంధ్రభాషలేగాక అనేక ఇతర భాషలలో కూడా పాండిత్యం సంపాదించడానికి ప్రయత్నాలు చేసేవారు. నాటి కవులు అష్టభాషలలో కవిత్వం చెప్పడం ఘనంగా భావించేవారు. అనేక లిపులు నేర్చేవారు. రాజోద్యోగులు అరబ్బు, పారశీక భాషలను కూడా నేర్చుకొనేవారట. శ్రీనాథుడు అనేక దేశాల వారితో వారి భాషలోనే మాట్లాడేవాడట. రాజాస్థానంలో లేఖకులు అందంగా అక్షరాలు రాసేవారట. విద్యా కేంద్రాలైన అగ్రహారాలకు, మఠాలకు దానాలు ఇచ్చి పోషించేవారు.

పంచాంగం-గడియారం: ఈ కాలంలో పంచాంగ శ్రవణం అభివృద్ధి చెందింది. ముఖ్యంగా ఉగాది పండుగ రోజున ప్రతి గ్రామంలో అందరూ దేవాలయంలో చేరి గ్రామ బ్రాహ్మణునితో పంచాంగం చదివించుకునే వారట. ఈ కాలంలో శకునం మీద నమ్మకం, ప్రతి పనికి పురోహితుని చేత ముహూర్తం పెట్టించుకొని పని చేసే వారు. ఇల్లు కట్టాలన్నా, పెండ్లి చేయాలన్నా, ఇంట్లో ఏ నూతన పని ప్రారంభించాలన్నా సంవత్సరం మొదట్లో వ్యవసాయం ప్రారంభించాలన్నా, విద్యాభ్యాసం ప్రారంభించాలన్నా ముహుర్తాలు తప్పనిసరిగా పెట్టించేవారు అలాగే ముహూర్త నిర్ణయానికి, పని ప్రారంభానికి కాలమానాన్ని పాటించేవారు. ఈ కాలంలో గడియారాలుండేవి గడియారం అనే పదం పాకృతపదం. ఘటికాగార అనే పదం నుండి పుట్టిందట. బౌద్ధ గ్రంథం దివ్యావధాన, కౌటిల్యుని అర్థశాస్త్రం, వాయి విష్ణు బ్రహ్మాండ, భగవత, బ్రహ్మపురాణాలలో కూడా గడియార ప్రసక్తి ఉంది. అంటే భారతదేశంలో పురాణ కాలం నుండే గడియారాల వాడకం ఉందన్నమాట. నీటికుండలో 7వ శతాబ్దానికి చెందిన లల్ల అనే పండితుడు ఈ ఘటికను గురించి వర్ణించాడు.

రెడ్డియుగంలో తెలుగుసాహిత్యం: తెలుగుభాషా చరిత్రలో రెడ్డి యుగం ఒక ముఖ్యఘట్టం. కాకతీయుల

కాలంలో ఆస్థాన భాష సంస్కృతం, తెలుగుది ద్వితీయస్థానమే. రెడ్డి యుగంలో తెలుగుభాష రాజాస్థాన భాషగా సంస్కృతంతో పోటీ పడింది. కాకతీయుల కాలం నుండి జాతీయాభిమానం, స్వభాషాభిమానంతోనే వినుకొండ వల్లభరాయుడు దేశభాషలందు తెలుగులెస్స అని పలికాడు. పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథుని ఆస్థాన విద్యాధికారిగా నియమించాడు. ఇది తెలుగు సాహిత్య చరిత్రలో ఒక మలుపు. తెలుగుభాషా విద్యాధికారికి బహుదేశ భాషాపండితులను, కవులను పరీక్షించే గౌరవం లభించింది. ఆ గౌరవం తెలుగుభాషకు దక్కినట్లే దాంతో తెలుగుభాషకు మొట్టమొదటిసారిగా రాజభాషా స్థాయి లభించిందని అంటారు.

ఆంధ్రభాషా చరిత్రలో రెడ్డి యుగాన్ని సంధియుగమని అంటారు. శ్రీనాథుడు విజయనగర ఆస్థానకవి అయిన గౌడ డిండిమభట్టును ఓడించడంతో సంస్కృత భాషా స్థానం చెదిరిపోయి దేశభాషల ప్రాభవం ప్రారంభం అయిందని, ఆ తర్వాత క్రమేపీ సంస్కృతం తన స్థానాన్ని కోల్పోయిందని పండితులు భావిస్తారు. శాతవాహనుల కాలంలో గుణాఢ్యునిపై శర్వవర్మ సాధించిన విజయం ప్రాకృతభాషా స్థానాన్ని పోగొట్టి సంస్కృత భాషాధిక్యతను సాధించినట్లే ఈయుగంలో డింఢిమభట్టుపై శ్రీనాథుడు విజయం సంస్కృతభాష స్థానాన్ని పోగొట్టి తెలుగుభాష దేశభాషలకు ప్రాచుర్యం తెచ్చిందని పోలిక చెప్పారు.

ఈ యుగంలో తెలుగుభాషా రచనాశైలిలో చాలా మార్పులు వచ్చాయి. నన్నయభట్టు సంస్కృత శైలికి, తిక్కన దేశిశైలికి కూడలిగాను మరొక వైపు అఖ్యా పద్ధతికి చెందిన పురాణాలకు వర్ణనాత్మకమైన ప్రబంధాలకు వారధిగాను రూపొందింది. ఈ రచనా విధానాల కలయికల వల్ల అలంకారిక శైలి ప్రారంభమైంది. ఈ శైలి ఎర్రాప్రెగడతో ప్రారంభమైందని పండితులు అంటారు. ఈశైలిలో తెలుగు సంస్కృత పదాల మిశ్రమంతో అలంకారయుక్తంగా కవిత్వం చెప్పడం, కనుక తెలుగుభాషలో అలంకార సాహిత్యం ప్రారంభమైంది. ఈ శైలిని మహావృక్షంగా రూపొందించినవాడు శ్రీనాథుడు. శ్రీనాథుడు సంస్కృత భాషలోని ప్రౌఢి, తెలుగుభాషలోని నుడికారం గొప్పగా ఉంటాయని అన్నాడు. అలాగే ఈ కాలపు భక్తి కవి అయిన పోతన కూడా సంస్కృత ఆంధ్రభాషల సమన్వయానికి కృషి చేశాడు. నిశ్శంకన కొమ్మను అనే మరొక కవి కూడా తనది సంస్కృత తెలుగు భాషల మిశ్రమశైలి అని చెప్పుకున్నాడు.

నాటి తెలుగుభాషా రచనలో వచ్చిన మరొక మార్పు చిత్ర కవిత్వం. రాజాస్థానాలలో వినోదాన్ని కలిగించడానికి ఈ చిత్ర కవిత్వం రూపొందింది. రెడ్డియుగపు సారస్వతంలో చిత్రకవిత్వం ఒక ప్రత్యేక విశేషం అని చెప్పవచ్చు. అష్టభాషలలో చిత్రకవిత్వం చెప్పేవారు ఘటికలలో శతగ్రంథాలు రాసేవారు అనేక మంది ఉండేవారు. అవధానాలు, సమస్యాపురాణాలు, గొప్పకవిత్వ, గర్భకవిత్వం, అక్షరాచ్యుతకం, మాత్రాచ్యుతనం, ఏకసంధా, ద్విసంధ ధారణలు మొదలైన అనేక గారడీలు సాహిత్యంలో వచ్చాయి. శాకల్యమల్లు భట్టు రచించిన నిరోష్ఠ్య రామాయణం కూడా ఈ పంథాలో నడిచిందే.

ఈ కాలంలో స్త్రీ సహగమనం కొద్దిగా అమలు జరిగింది. వీరగల్లులను పూజించే ఆచారం ఉండేది. పలనాటిలో జీవరక్ష తిమ్మన అనే అతడు కారంపూడిలో నాయుడు మంటపాన్ని నిర్మించాడు. అదే నేటి కారంపూడిలో ఉన్న పల్నాటి వీరులగుడి. ఇప్పుడు కూడా ప్రతి సంవత్సరం తొమ్మిది రోజులు వైభవంగా జరిగేవి. మదనుని పూజించే విధానం కూడా హేమాద్రి వర్ణించాడు. మదనుని పూజలు జరిపి తర్వాత ఉత్సవాలు జరుపుకొనేవారు. కార్తీక పౌర్ణిమ, దీపావళి, సంక్రాంతి, శివరాత్రి మొదలైన పండుగలను కూడా ఉత్సాహంగా జరుపుకొనే వారట. రెడ్డియుగంలో శ్రావణ నవరాత్రులు అనే పేరుతో శ్రీజయంతి అనే పండుగ జరుపుకొనేవారట. ఈ పండుగకు లక్ష్మీ ఉత్సవాలు, మహాలక్ష్మీ పండుగలని పేరుంది. ఈ పండుగ గుంటూరు జిల్లా సత్తెనపల్లి వద్ద ఉన్న మాదలలోని ఒక శాసనంలో పేర్కొనబడింది.

వినోదాలు: రెడ్డి యుగం నాడు అనేక వినోదాలుండేవి. సంగీతం, నాట్యం, నాటకాలు, పేరణి నృత్యం, గొండ్లి (యువతీ యువకులు చేతులు పట్టుకొని గుండ్రంగా తిరుగుతూ పాడే పాటలను గొండ్లి అని అంటారు), కోలాటం, జక్కిడి, చిందు, వేట, ద్వంద్వ యుద్ధాలు, పులిజూదం ఆ నాటి వారి ముఖ్య వినోదాలు. పండుగలలోను వసంతోత్సవాలలో ఈ వినోదాలన్నీ జరుగుతుండేవి. ఇవేగాక ఆ కాలంలో విప్రవినోదులు, వీరముష్టివారు అని ఉండేవారు. వారు కూడా ఆశుకవిత్వాలు చెప్పి ప్రజలను నవ్వించేవారు. భట్రాజులు రాజులను, భాగ్యవంతులను పొగిడి డబ్బు సంపాదించుకొనేవారు.

సంస్కృత భాష: రెడ్డి యుగంలో తెలుగుభాష మంచి ప్రాచుర్యం పొందినా సంస్కృతభాష తన స్థానాన్ని

కోల్పోలేదు. సంస్కృతం కూడా ఎప్పటిలాగే తన స్థానాన్ని కొనసాగించింది. సంస్కృతంలో అనేక గ్రంథాలు రాయబడ్డాయి. పండితులు సంస్కృతాన్ని అభిమానిస్తూనే ఉన్నారు. నాటి కవులందరికీ సంస్కృతంలో ప్రవేశం ఉంది. కొందరు ఉభయ భాషాకవులని కూడా ప్రసిద్ధి చెందారు. రెడ్డి రాజులు రాసిన కావ్యాలు కూడా సంస్కృత భాషలోనే రాయబడ్డాయి. సంస్కృత పండితులనే రెడ్డిరాజులు తమ ఆస్థానంలో విద్యాధికారులుగా నియమించారు

ప్రోలయవేమారెడ్డి ఆ స్థానంలో మహాదేవుడు అనే గొప్ప సంస్కృత పండితుడు ఉండేవాడు. అనపోతారెడ్డి అనవేమారెడ్డి ఆస్థానాలలో బాల సరస్వతి, త్రిలోచనాచార్యుడు అనే కవులు ఉండేవారు. వారు ఈ రాజుల దాన శాసనాలు రాశారు. ఈ యుగంలో నృశింహాభట్టు, వైకుంఠభట్టు, పెద్దిభట్టు, విశ్వేశ్వరభట్టు అనే ప్రసిద్ధ కవులు రెడ్డి రాజులచే పోషించబడ్డారు. వారిలో పెద్దిభట్టు సూర్యసిద్ధాంత పండితుడు. ఇతనికి అనవేమారెడ్డి గుంటూరు జిల్లాలోని పచ్చల తాడిపర్రు గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ఆ రోజుల్లో జ్యోతిష్యశాస్త్రంలో భాగంగా ఖగోళశాస్త్రం అభివృద్ధి చెందింది. ఇంకా అనేక సంస్కృత కావ్యాలు వెలువడ్డాయి.

కవిత్వ ప్రయోజనం: రెడ్డి యుగంలో కూడా కవులు తమ కవితాశక్తిని తాము నమ్మిన మత ధర్మాలను ప్రజలకు బోధించడానికే ఉపయోగించారు. శైవకవులు శివుని గొప్పదనాన్ని వైష్ణకవులు విష్ణుదేవుని గొప్పదనాన్ని చాటడానికి ప్రయత్నించారు. అలాగే పాపపుణ్యాలను స్వర్గనరకాలను తమ కావ్యాల ద్వారా ప్రచారం చేశారు దైవప్రీతి కోసం తలలు నరుక్కుంటే కూడా మోక్షం వస్తుందని ప్రజలను నమ్మించారు. నీతి నిజాయితీలతో జీవిస్తే స్వర్గం, మోక్షం లభిస్తాయని బోధించారు. వ్రతాలు ఆచరించడం, దేవుని పూజించడం, మంత్రాలు ఉచ్చరించడం ద్వారా పుణ్యాలు, శక్తులు సంపాదించవచ్చనే భావన హరవిలాసం, రుక్మాంగద చరిత్ర కల్గించాయి. ఆత్మార్పణ ద్వారా ముక్తి పొందవచ్చని విక్రమార్క చరిత్ర బోధించింది. నాటి సమాజ కట్టుబాట్లు పాటించకపోయినా, రుణం చెల్లించకపోయినా సతీసహగమనం చేయకపోయినా, బ్రాహ్మణ నింద చేసినా, గోహత్యలు చేసినా, పితృదేవతలను ఆరాధించకపోయినా ఘోర నరకాలను అనుభవించాలని నాటి సాహిత్యం ఘోషించింది. సహగమనం చేసిన స్త్రీలను సతిగా పూజించాలని కూడా ప్రచారం జరిగింది. ఈ విధంగా నాటి సాహిత్యం మూఢనమ్మకాలను విపరీతమైన దైవభక్తిని, మత కర్మకాండలను ప్రజలకు బోధించడానికి ఉపయోగింపబడింది. కవిసార్వభౌముడు శ్రీనాధుడు కూడా మూఢభక్తిని తన కావ్యాలలో సమర్ధించాడు.

రెడ్డి యుగంలో రాత సాధనాలు - పార్యాంశాలు: రెడ్డి యుగంలో రాత సాధనాలలో మార్పు వచ్చింది అంతవరకు భారతీయులు తాళపత్రాల మీద రాసేవారు. ఈ యుగంలో రాత సాధనం కాగితం ప్రవేశించింది మొదట కాగితం కాంబేలో ప్రవేశించినట్లు కనిపిస్తోంది. అక్కడ ముస్లింలు ప్రవేశపెట్టి ఉండవచ్చును. నికోల్‌కొంటి ఒక్క కాంబేలో తప్ప మిగిలిన అన్ని ప్రాంతాలలో తాళప్రతాలపై రాస్తున్నారని తన రచనలలో పేర్కొన్నాడు శ్రీనాధుడు చాటువులలో వ్యాపారస్తుని వద్ద పని చేసే బ్రాహ్మణులు కాగితాల మీద కలం సిరాతో రాసేవారని పేర్కొనబడింది. భీమేశ్వర పురాణంలో అల్లయ వేమారెడ్డి మంత్రి ఆరియేటి అన్న మంత్రి బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షాకు రాసిన ఉత్తరాలు, పర్షియా భాషలో కాగితం మీద రాశాడు అని పేర్కొంది. కనుక రెడ్డియుగం చివరలో ఆంధ్రదేశంలో కాగితం ప్రవేశించిందని చెప్పవచ్చును.

విద్యారంగంలో తేడాలున్నాయి. బ్రాహ్మణులు వేదవేదాంగాలు అధ్యయనం చేసేవారు. రాజులు రాజనీతి విద్యలు అధ్యయనం చేసేవారు. కౌటిల్యున్ని అర్ధశాస్త్రం కామందకుని నీతిసారం, రుక్మాంగద చరిత్ర, సకలనీతి సమ్మతం మొదలైన గ్రంధాలు చదివేవారు. వారితోపాటు ధనుర్విద్య, ధనుర్వేదం, ఆయుర్వేదం, భరతుని నాట్యశాస్త్రం, వాత్స్యాయనుని కామసూత్రాలు, ధర్మశాస్త్రాలు, ఇతిహాసాలు, పురాణాలు, వేదవేదాంగాలు కూడా అధ్యయనం చేసేవారు.

రెడ్డియుగంలో సాహిత్యం, సంస్కృతం రెండూ పోషించబడ్డాయి. సంస్కృతమే రాజభాష కావచ్చును ప్రోలయవేమారెడ్డి, అనపోతారెడ్డి కవిపండితులను పోషించారే కాని వారు స్వయంగా కవులు కాదు. అనవేమారెడ్డి నుండి అందరూ కవులు. అనవేమారెడ్డి అమరు శతకానికి వ్యాఖ్యానం రాశాడట. తర్వాత వచ్చిన కుమారగిరి గొప్పకవి. అతనికి వసంతరాజని పేరుంది. అతడు గొప్ప సంస్కృతకవి. సంగీత, నాట్యశాస్త్రాలలో ప్రవేశం ఉంది వసంతరాజీయం అనే పేరుతో గొప్ప నాట్యశాస్త్రాన్ని రచించాడు. ఈ గ్రంధం లభించలేదు. దాని ప్రస్తావన అతని బావ కాటయ వేమారెడ్డి రాసిన వసంతరాజీయంలో పేర్కొనబడింది. భరతుడు, భోజుల నాట్యశాస్త్రాలను కూడా అధ్యయనం చేసి నూతన రీతులతో కుమారగిరి తన వసంత రాజీయ గ్రంధాన్ని రాశాడట. లకుమాదేవి మొదలైన

నాట్యకత్తెలు కుమారగిరి ఆస్థానంలో అద్భుత నృత్య వసంతోత్సవాలు, మదనోత్సవాలను జరిపి కర్పూర వసంత రాయలనే బిరుదును పొందాడు. కుమారగిరి బావ కాటయవేమారెడ్డి గొప్ప పండితుడు. అతడు కుమారగిరి రాజీయం అనే పేరుతో కాళిదాసు నాటకాలకు వ్యాఖ్యానాలు రాశాడు.

పెదకోమటి వేమారెడ్డి రచనలు: కుమారగిరి తర్వాత సింహాసనానికి వచ్చిన పెదకోమటి వేమారెడ్డి రెడ్డి రాజులందరికన్నా గొప్ప కవి, పండితుడు, విద్వాంసుడు. శ్రీనాథుడు ఇతని ఆస్థాన విద్యాధికారి. అతడు పెదకోమటిని సర్వజ్ఞ చక్రవర్తి అని కీర్తించాడు. ఈ బిరుదు మొదటిసారిగా అతని శక 1326 సంవత్సరం నాటి కురునుటాల శాసనంలో పేర్కొనబడింది. కుమారగిరి నాట్యశాస్త్రంలో ప్రవీణుడైతే, పెదకోమటి వేమారెడ్డి సంగీత, సాహిత్యాలలో గొప్ప పండితుడు. అతడు సంస్కృతంలో సాహిత్య చింతామణి అనే కావ్యాన్ని రాశాడు. ఇది మమ్మటుడు రాసిన కావ్య ప్రకాశికకు నమూనా అని అంటారు. ఈ గ్రంథంలో మహిమభట్టు అనుమానాన్ని ఖండిస్తాడు. ఈ గ్రంథంలో ఒక కుసుమాయుధిని పేర్కొన్నాడు. అతడు కూడా సాహిత్య ప్రక్రియలో అభిరుచి ఉన్న వాడిలా కనిపిస్తాడు. కాని ఈ కుసుమాయుధుడు ఎవరో స్పష్టంగా తెలియదు. ముదిగొండ చాళుక్యులలో కుసుమాయుధ అనే పేరు గల రాజులు ఉన్నారు. మొగలిచెరువు శాసనంలో నాల్గవ కుసుమాయుధుని పేరుంది. కోమటి లేదు. వీరనారాయణ చరితం అనే మరొక గ్రంథాన్ని రాసినట్లు సాహిత్య చింతామణిలో తెలిపాడు. పెదకోమటి రాసిన మరొక గ్రంథం సంగీత చింతామణి. ఇందులో అతడు స్వరాలు మారినప్పుడు రాగాలు మారే విధానాన్ని వివరించాడు. నృత్యం చేసేటప్పుడు రసరాగాలకు సమన్వయ పద్ధతిని కూడా రాశాడు. తర్వాత అతడు అమరక శతకం మీద శృంగారదీపిక అనే వ్యాఖ్యానాన్ని రాశాడు. ఇది శృంగార కావ్యం. అమర శతకం మీద రాసిన వ్యాఖ్యానాలలో పెదకోమటి రాసిన వ్యాఖ్యానం చాలా ప్రామాణికమైనదట. భోజుని వారసుడైన అర్జునదేవుడు రాసిన రసిక సంజీవిని అనే వ్యాఖ్యానం తప్ప పెదకోమటి రాసిన వ్యాఖ్యకు మరేదీ సాటిలేదట. ఈ గ్రంథంలోనే పెదకోమటి ప్రోలయవేమారెడ్డి పాతాళగంగకు సోపానాలు కట్టించాడని రాశాడు. ఇంకా సప్తసతిసారటికా అనే మరొక గ్రంథాన్ని కూడా రాశాడు. ఇది హాలుని సప్తశతికి వ్యాఖ్యానం. ఈ గ్రంథానికి భావదీపిక అని కూడా పేరుంది. హాలుని గాథాసప్తశతిలో 700 గాథలున్నాయి. వాటిలో పెదకోమటి అతి ముఖ్యమైన 100 గాథలను తీసుకొని ఈ వ్యాఖ్యానం రాశాడు.

కందుకూరు శాఖకు చెందిన శివలింగారెడ్డి కూడా గొప్ప సంస్కృత కవి. అతడు హరదత్తుని గిరీశశృతి సూక్తిమాలకు తత్వప్రకాశిక అనే వ్యాఖ్యానం రాశాడు. గిరీశశృతి సూక్తిమాలకు చాతుర్వేద తాత్పర్య సంగ్రహ అని కూడా పేరుంది. ఇందులో శివుడు గొప్పదేవుడని వర్ణింపబడ్డాడు. ఈ గ్రంథంలో శివలింగారెడ్డి తన వంశవృక్షాన్ని ఇచ్చాడు. అందువల్ల కందుకూరు శాఖ చరిత్ర తెలుసుకోడానికి బాగా ఉపయోగపడింది. శక 1326 నాటి శాసనంలో శివలింగారెడ్డి భారతమాత పతంగా అంటే కుమారుడని వర్ణింపబడ్డాడు. శివలింగారెడ్డికి ఈ రచనలో ఈశ్వరభట్టు అనే వ్యక్తి సహాయం ఉందని పండితులు అంటారు.

రాజమహేంద్రవరాన్ని పాలించిన వీరభద్రారెడ్డి కూడా పండితుడే. అతనిని శ్రీనాథుడు సాహిత్య సంగీత కళా లక్ష్యలక్షణ, భంగిసర్వజ్ఞ అని వర్ణించాడు. అతడు సంగీత సాహిత్యాలలో గొప్పకవి అని శ్రీనాథుడి వర్ణన. కాని వీరభద్రారెడ్డి గ్రంథాలేవీ లభించలేదు. ప్రోలయ వేమారెడ్డి కవికాదు కాని కవి పండితులను ఆదరించాడు. అతని ఆస్థానంలో సేశం వంశానికి చెందిన మహాదేవుడునే కవి ఉండేవాడు. అతడు లొల్ల లక్ష్మీధరునికి పూర్వీకుడట. మహాదేవుడు మొదట విజయనగర ఆస్థానంలో ఉండి తర్వాత అద్దంకి చేరి ప్రోలయ వేమారెడ్డి ఆస్థానంలో విద్యాధికారిగా చేరాడట. అనపోత, అనవేమారెడ్డి ఆస్థానంలో కవులు ఉన్నట్లు కనిపించదు. కాని కోలాచల మల్లినాథుని సోదరుడైన కోలాచల పెద్దిభట్టును అనపోత గౌరవించాడట. కాని అతడు అనపోత ఆస్థాన పండితుడుగా కనిపించదు. కాని కొల్లూరులో కొంత వృత్తిని పొందాడు. వారి ఆస్థానంలో బాలసరస్వతి, త్రిలోచనాచార్య అనే ఇద్దరు శాసన లేఖకులు ఉన్నారు. బాలసరస్వతి కవితా ధోరణిలో శాసనాలు రాశాడు. అనవేమారెడ్డి ఇప్పగుళ్లు, ధృజ్జవరం, పచ్చలతాడిపర్రు శాసనాలను అతడు రచించాడు. అలాగే శ్రీశైలంలోని శిలా శాసనం కూడా అతడే లిఖించాడు. ఇతడు అనపోతారెడ్డి కాలం నుండి క్రీ.శ.1378 వరకు జీవించాడు. బాలసరస్వతి తర్వాత త్రిలోచనాచార్యులు శాసన లేఖకునిగా పనిచేశాడు. అనవేమారెడ్డిని వానపల్లి శాసనం బహుసహస్ర సువర్ణరాక సంతోషిత, మహాకవీశ్వర అనే బిరుదుతో వర్ణించింది. అలాగే తెలుగుకవి వెన్నెలకంటి సూరన్న తన విష్ణుపురాణంలో అనవేమారెడ్డి అల్లవేమ అనేక కావ్యాలు అంకితం పొందారని రాశాడు. కాని ఒక్క

నిదర్శనం కూడా లభించలేదు. కుమారగిరి గొప్ప పండితుడే గాని అతడు కూడా ఎక్కువ మంది కవులను పోషించలేదు. మనమ దుర్గసురి మనుమడు పిన్నయ కుమారుడు అన్నయ అనే అతడు అతని ఆస్థాన శాసన లేఖకుడు. అతడు శక 1312 నాటి అనపర్తి శాసనాన్ని రాశాడు. ఇతడు గాని ఇతని తండ్రితాతలు ఏ కావ్యాలూ రాయలేదు. పెదకోమటి రెడ్డి ఆస్థానంలో ఎక్కువ మంది కవులు ఉండేవారు. శ్రీనాధుడు ఆస్థాన విద్యాధికారి ఆస్థానానికి వచ్చే కవులను పరీక్షించడం అతని విధి. కనుక పెదకోమటి వేముని ఆస్థానానికి అనేక మంది కవులు వచ్చే వారని భావించవచ్చును. పెదకోమటి ఆస్థాన కవులలో శ్రీనాధుడు, వామనభట్టు రత్నాల వంటి కవులు శ్రీనాధుడు గొప్ప తెలుగుకవి. వామనభట్టు గొప్ప సంస్కృత కవి.

వామనభట్టు లేక బాణభట్టు: వామనభట్టు తండ్రి పేరు కోమటి యజ్వ, తాత వరదాగ్నిచిట్, ఇతనికి బాణభట్టు అని కూడా పేరుంది. ఇతడు కాలయవేమారెడ్డి సహాధ్యాయి అని ప్రతీతి. అతనికి సాహిత్య చూడామణి సాహిత్య సామ్రాజ్య దురంధర, కవిసార్వభౌమ అనే బిరుదులున్నాయి. అతడు గద్య, పద్య నాటక కావ్యాలు రాయడంలో ప్రసిద్ధుడు. విజయనగరంలో ఉండి విద్యాభ్యాసం చేశాడు. విద్యారణ్యుల వారు ఇతని గురువు అతడు రచించిన శృంగారభూషణ బాణ అనే నాటకంలో తనకు విజయనగరంతో గల సంబంధాన్ని చెప్పుకున్నాడు ఈ నాటకాన్ని విజయనగరం విరూపాక్షదేవుని ఉత్సవాలప్పుడు ప్రదర్శించేవారట. ఈ కావ్యంలో వామనభట్టు తాను కాళిదాసు, బాణుల కంటే గొప్పవాడినని తాను పద్యం గద్యం రెండింటిలో ప్రజ్ఞ గల వాడినని, వారు ఒక్కదానిలోనే ప్రజ్ఞావంతులని చెప్పుకున్నాడు. అంతేగాక వామనభట్టుకు సాహిత్య చూడామణి అనే బిరుదు ఉన్నట్లు కూడా ఈ నాటకం తెలుపుతోంది. ఇతడు మరి మూడు నాటకాలు రాశాడు. కనకలేఖా కళ్యాణం, ఉషా పరిణయం, పార్వతీపరిణయం. విష్ణువర్ధన వంశానికి చెందిన లక్ష్మీస దండాధిపుని కోరికతో ఈ నాటకాలు రాశాడట. ఈ దండాధిపుడు మొదటి దేవరాయల సేనాధిపతి. వీటిలోని పార్వతీపరిణయం ఇతనికి కవిసార్వభౌమ, గద్య కవిసార్వభౌమ, సాహిత్య సామ్రాజ్య దురంధర అనే బిరుదులు ఉన్నట్లు తెలుపుతోంది. అంతకుముందే అతనికి సాహిత్య చూడామణి అనే బిరుదుంది. ఇవేగాక నలాభ్యుదయం, రఘునాధాభ్యుదయం అనే రెండు పద్య కావ్యాలు రాశాడు. ఇవేగాక వేమభూపాల చరిత్ర అనే గద్య కావ్యం కూడా రాశాడు. ఈ కావ్యానికి వీరనారాయణ చరితం అని కూడా పేరుంది. హంస సందేశం అనే మరొక చిన్న కావ్యం కూడా రాశాడు. ఇవేగాక శబ్దరత్నాకరం, శబ్ద చంద్రిక అనే రెండు నిఘంటువులను రాశాడు. వామనభట్టు తన వేమభూపాలీయంలో వేమభూపాలుడు అన్ని దిక్కులను జయించాడని వర్ణనలతో రాశాడు. కాని అవి చారిత్రక సత్యాలు కావు. నలాభ్యుదయంలో నలచరిత్ర రామాభ్యుదయంలో శ్రీరాముని చరిత్రలు రాశాడు. ఇతడు అనవేమారెడ్డి కాలం నుండి రెడ్డి ఆస్థానంలోనే గాక విజయనగర ఆస్థానంలో కూడా ఉండి గౌరవ మర్యాదలు పొందాడు. గంగాధరుని కుమారుడు విశ్వనాధకవి సోదరుడు అయిన నరసింహకవి కాదంబరి అనే కావ్యాన్ని రాశాడు. ఈ కావ్యాన్ని పెదకోమటి వేమారెడ్డి తన సాహిత్య చింతామణిలో ప్రస్తావించాడు. కనుక ఇతడు రెడ్డి యుగంలో ప్రోలయ వేమారెడ్డి సమకాలికుడని భావించారు. ఇతని సోదరుడు విశ్వనాధ కవి సౌగంధికాపహరణ అనే సంస్కృత కావ్యాన్ని రాశాడు రాజమహేంద్రవరరెడ్డి రాజులు కూడా కవులను పోషించేవారు. వీరి కాలం నాటి ఇద్దరు కవుల పేర్లు తెలుస్తున్నాయి. కానవ్య గోత్రానికి చెందిన శ్రీవల్లభ లక్ష్మీల పుత్రుడైన శ్రీవల్లభుడు మొదటివాడు. అతడు కాటయవేముని, అతని మేనల్లుడైన రెండవ అనపోతుని శాసనాలు లిఖించాడు. రెండవ కవి శ్రీవత్స గోత్రానికి చెందిన సరస్వతీ భట్టు, అతనికి వేదాంత పరాగహ అనే బిరుదుంది, ఆత్రేయ గోత్రానికి చెందిన వైకుంఠ భట్టకవి సాంఖ్య గోత్రీకుడైన కందయ పెద్ది భట్ట, భారద్వాజ గోత్రానికి చెందిన విశ్వేశ్వర భట్టు అనే కవుల పేర్లు తెలుస్తున్నాయి. వీరిలో నృశింహభట్టు, వైకుంఠభట్టులు విలసలోని అగ్రహారంలో భాగస్తులు. ముసునూరి ప్రోలయ నాయకుడు వారికి వృత్తాన్నిచ్చాడు. నృశింహభట్టు పెదకోమటి ప్రస్తావించిన కాదంబరి నాటక రచయిత కావచ్చును. ఇతడు సౌగంధికాపహరణ రాసిన విశ్వనాధకవి దగ్గర వాడు కావచ్చును. కందయ పెద్దిభట్టు కాపయ నాయకునిచే ప్రోలవరం దానం చేయబడిన కవి పండితుడు. అతడు శ్రీశైలంలో సత్రయాగం చేశాడట. అతడు గిరీశ సహస్ర లేక శివ సహస్రనామ అనే గ్రంధానికి వ్యాఖ్యానం రాశాడు. వీరిలో చివరివాడైన విశ్వేశ్వరభట్టు శక 1334లో పెదకోమటి వేమునిచే ఆలపాడు గ్రామాన్ని అగ్రహారంగా పొందాడు. అతని తండ్రి మాధవర్య గొప్ప కవి. అతనికి సకల కవి సార్వభౌమ అనే బిరుదు ఉంది.

హరితస గోత్రానికి చెందిన జ్యోతిష్య పండితుల కుటుంబాన్ని కొండవీటి రెడ్డిరాజులు పోషించారు. వారి

వంశవృక్షం కొన్ని శాసనాలలో ఇవ్వబడింది. నరసింహం, భీమేశ్వర యజ్వ, పోతిభట్ట గుండయార్య, పెద్దియజ్వ, రామచంద్ర, గంగాధర అనే వారి పేర్లు ఆ శాసనంలో ఇవ్వబడ్డాయి. వీరిలో పెద్దియజ్వ అనవేమారెడ్డి సమకాలికుడు. అతనికి పచ్చలతాడిపర్రుని దానం చేశాడు. వీరేగాక కాశ్యప గోత్రికులైన కాచిభట్టనారాయణ మొదలైన వారి పేర్లు కూడా తెలుస్తున్నాయి. ఆత్రేయ గోత్రానికి చెందిన పరహిత కుటుంబానికి చెందిన ఆయుర్వేద వైద్యుల వంశవృక్షం కూడా వీరి శాసనాలలో ఇవ్వబడింది. పరహిత మల్లినాథ, రెండవ పరహిత రామనాథ, మూడవ, నాల్గవ పరహిత అనే పేర్లు ఇవ్వబడ్డాయి. ఇంకా పరహిత కుమారుడు భాస్కరాచార్య యజుర్వేదిన్‌కి, పెదకోమటి శక 1326లో పొన్నపల్లి శాసనం వారికి ఇచ్చిన దానాలను తెలుపుతోంది. పరహిత కుటుంబీకులను ఆనాడు భూలోక ధన్వంతరులని పిలిచేవారు. శక 1330లో మరొక పొన్నపల్లి శాసనంలో శింగరయ్య అనే మరొక ఆయుర్వేద వైద్యుడు, అతని తండ్రి విల్లయార్య, తాత భాస్కరాచార్యులు పేర్కొనబడ్డారు. పరహిత, సంహిత అనే గ్రంథం, పరహిత విష్ణు సిద్ధాంతం కూడా ఈ వంశస్తులు రాశారట. ఈ గ్రంథంలో ఆయుర్వేదంతోపాటు వాజీకరణం, భూత విద్య, రసాయనశాస్త్రాలు కూడా రాయబడ్డాయి. రాజదర్బారులో ప్రాణాచార్యులు అనే పేరుతో వైద్యులు నియమింపబడ్డారని, ఆ పదవిని పరహిత కుటుంబం నిర్వహించారని కూడా శాసనాలు తెలుపుతున్నాయి. మూడవ పరహితుడు కోరుకొండ సింగమనాయకుని ఆస్థానంలో రాజ వైద్యుడట. అలాగే లక్ష్మణాచారి రెండవ బుక్క హరిహరరాయల రాజ వైద్యుడు లేక ప్రాణాచార్యుడు.

చదలవాడ ఎర్రాప్రెగ్గడ: రెడ్డి ఆస్థానంలోని మొదటి తెలుగుకవి చదలవాడ ఎర్రాప్రెగ్గడ. అతనికి శంభుదాసు అని కూడా పేరుంది. ఇతడు శ్రీవత్స గోత్రీకుడు. తండ్రి సూరనార్యుడు. వీరు వేంగినాటి వారు. ఇతని పూర్వీకుడు భీమ మంత్రి. అతడు వెలనాటి రెండవ చోడుని మంత్రి. అతని వంశంలో ఐదవ తరం వాడు ఎర్రాప్రెగ్గడ. ప్రెగ్గడ తాత కరవర్తి అగ్రహారంలో వృత్తి భాగస్తుడు. తర్వాత ఈ వంశస్తులు పాకనాటిలోని గుడ్లూరుకు తరలివెళ్లారు. ప్రెగ్గడ గొప్ప శివభక్తుడు. ఇతని గురువు శంకరస్వామి గొప్ప శైవ గురువు. అతడు అన్నీ శైవగ్రంథాలే రాశాడు. వైష్ణవ చిహ్నంగా శంభుదాసుడని కూడా బిరుదు వహించాడు. వైష్ణవ భక్తులను దాసుడని అంటారు. ఈ బిరుదు కూడా వైష్ణవమత చిహ్నంగానే భావించవచ్చును. శంభుదాసుడు గుడ్లూరులో నివసించే కాలంలో ప్రోలయవేమారెడ్డి సోదరుడు మాచారెడ్డితో పరిచయం ఏర్పడిందట. అతడే ఎర్రా ప్రెగ్గడను ప్రోలయ వేమారెడ్డికి పరిచయం చేశాడు. అప్పటి నుండి ఎర్రాప్రెగ్గడ అద్దంకి ఆస్థానకవి అయ్యాడు. ఎర్రాప్రెగ్గడ నాలుగు గ్రంథాలు రాశాడు. మొదట అతడు రామాయణం రాశాడు. కాని అది లభించలేదు. తర్వాత అతడు నన్నయ తిక్కనలను అనుసరిస్తూ వారు అసంపూర్ణంగా వదలిన ఆంధ్రమహాభారతంలోని అరణ్య పర్వాన్ని తెనిగించి ఆంధ్ర మహాభారతాన్ని పూర్తి చేశాడు. అరణ్య పర్వాన్ని పూర్తి చేసినందువల్ల అతనికి కవితా లోకంలో గొప్ప కీర్తిప్రతిష్టలు వచ్చాయి. అరణ్య పర్వానికి తన పేరు పెట్టుకోకుండా నన్నయ్య పేరుతోనే పూర్తి చేశాడు. అరణ్య పర్వం పూర్తి కాగానే దాని రచయితలు ముగ్గురికీ కవిత్రయం అని పేరు వచ్చింది. తర్వాత అతడు ఉత్తర హరివంశ కావ్యాన్ని రాసి ప్రోలయ వేమారెడ్డికి అంకితం చేశాడు. ఈ కావ్యం ఎర్రన పరిపూర్ణ కవితాశక్తికి గొప్ప నిదర్శమని అంటారు. తర్వాత అతడు నృసింహ పురాణం అనే మరొక కావ్యం రాశాడు. దానికి నృసింహ అవతారం అని కూడా పేరుంది. ఈ కావ్యంలో సంస్కృతం దేశీపదాలను సమన్వయం చేశాడు. ఇది ప్రబంధశైలికి మార్గం తీసిందని అంటారు. ఈ కావ్యం రాసినందుకు అతనికి ప్రబంధ పరమేశ్వరుడని పేరు వచ్చింది. ఇందులోని ఇతివృత్తానికి బ్రహ్మాండ పురాణంలోని చిన్న కథను ఆధారంగా తీసుకొని పెద్ద ప్రబంధంగా రాశాడు. దానిని అహోబిలం నరసింహస్వామికి అంకితం చేశాడు. తర్వాత అతడు రామాయణం రాశాడు. కాని అది లభించలేదు. కాని అందలి శ్లోకాలను కొన్నింటిని 18వ శతాబ్దానికి చెందిన కూచిమంచి తిమ్మకవి తన సర్వలక్షణసార సంగ్రహం అనే లక్షణ గ్రంథంలో ఉదాహరించాడు. కందుకూరి రాచవేమారెడ్డి శక 1320లో వేయించిన శిలాశాసనం కూడా ఈ రామాయణాన్ని ప్రస్తావించింది. చివరలో అతడు రాసిన హరివంశంలో కూడా తాను రామాయణం రాసినట్లు చెప్పుకున్నాడు. చివరగా ఎర్రాప్రెగ్గడ హరివంశాన్ని రాసి ప్రోలయ వేమారెడ్డికి అంకితం చేశాడు. ఇందులో ప్రోలయ వేమారెడ్డికి సంబంధించిన చారిత్రకాంశాలు రాయబడ్డాయి. ఇతని పేరులోని ప్రెగ్గడ అనే పదం కర్ణాటక సాంప్రదాయం. ఆ పదాలు ఎందుకు ధరించాడో తెలియదు.

ప్రమథ కవి శ్రీగిరి: ప్రోలయ వేమారెడ్డి చేత ఆదరింపబడిన మరొక కవి శ్రీగిరి కవి. ఇతనిని శ్రీగిరి అయ్యంగార్ అని పిలిచేవారు. ఇతడు ప్రతాపరుద్రుని కాలం నుండి ప్రోలయ వేమారెడ్డి కాలం వరకు జీవించు

ఉన్నట్లు శక 1237 నాటి పశ్చిమ గోదావరి జిల్లాలోనే మోగల్లు శాసనం, అక్కడే ఉన్న ప్రోలయ వేమారెడ్డి కాలం నాటి మరొక శాసనం వల్ల తెలుస్తోంది. ఇతడు నవనాథ చరిత్రను పద్యకావ్యంగా రాశాడు. గౌరన ఈ నవనాథ చరిత్రను తన కావ్యంలో ప్రస్తావించాడు.

జక్కన: విక్రమార్క చరిత్ర రాసిన జక్కన కూడా రెడ్డియుగానికి చెందినవాడే. ఇతడు విక్రమార్కుని సాహస కార్యాలను చక్కని కథలుగా రాశాడు. ఈ కావ్యాన్ని వెన్నెకంటి కుటుంబానికి చెందిన సిద్ధయ అనే అతడికి అంకితం చేశాడు. అతని తండ్రి జన్నయ, తాత సిద్ధన. మొదటి దేవరాయల వద్ద మంత్రిగా పని చేసిన చ్ఛామనామాత్యుని వద్ద సిద్ధయ గణాంకునిగా పని చేశాడని మల్లంపల్లి సోమశేఖరశర్మ భావించారు. కాని సిద్ధడు బెల్లంకొండ నివాసి. బెల్లంకొండ భైరవుని దయ వల్ల సిద్ధయ సుఖంగా జీవిస్తున్నాడని జక్కన తన కావ్యంలో సిద్ధయను గురించి చెప్పాడు. బెల్లంకొండ రెండవ దేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో భాగం అయింది. కనుక సిద్ధయ రెండవ దేవరాయల కాలం నాటి వాడుగా కనిపిస్తున్నాడు. జక్కన తాత పెద్దయామాత్యుడు. అతడు నెల్లూరు తెలుగుచోదరాజు తిరుకలదేవునికి సమకాలికుడు. తిరుకలదేవ అనే బిరుదులు నెల్లూరు తెలుగు చోళరాజులైన మొదటి తిక్క, రెండవ తిక్కలు ఇద్దరూ ధరించారు. జక్కనను ఆదరించిన సిద్ధన పినతండ్రి వెన్నెలకంటి భాస్కర లేక సూర్య అనే పండితునికి వేమారెడ్డి ఒక అగ్రహారాన్ని దానం చేశాడు. రెడ్డి యుగంలో వెన్నెలకంటి వారి కుటుంబం గొప్ప పండిత కుటుంబంగా ప్రసిద్ధి చెందింది. కనుక జక్కన కూడా రెడ్డి యుగానికి చెందినవాడని భావింపబడింది. జక్కనను ఆదరించిన సిద్ధయ కూడా పండితుడే. అతని తండ్రి జన్నడు దేవకీనందన శతకం రాశాడట. విష్ణు పురాణం రాసిన సూరన కూడా వెన్నెలకంటి వంశానికి చెందినవాడే.

అన్నయ: వెన్నెలకంటి వంశానికి చెందిన మరొక కవి అన్నయ. షోడశ కుమారచరిత్ర అనే కావ్యాన్ని రాసి తన తండ్రి వెన్నెలకంటి సూర్యకు అంకితం చేశాడు. ఈ సూర్య జక్కన తన విక్రమార్క చరిత్రలో ప్రస్తావించిన వెన్నెలకంటి సూర్య లేక భాస్కర అంటే జక్కన పినతండ్రి అని భావించారు. కాని కొందరు ఈ పోలికను అంగీకరించలేదు. అన్నయ తన కావ్యంలో 16 మంది యువకుల సాహసకృత్యాలను రాశాడు. రచనలో ఇతడు కేతన దశకుమార చరిత్ర, మంచన కేయూరబాహు చరిత్రను అనుకరించాడు. ఇందులో మహత్తులు, సిద్ధులను జోడించాడు. ఆ కాలంలో సిద్ధుల పూజ, యోగుల మహత్తులను నమ్మేకాలం గనుక ఆ భావాలు ఈ కావ్యంలో చోటుచేసుకున్నాయి.

అనంతకవి లేక అనంతామాత్యుడు: అనంతకు అనంతామాత్య అని కూడా పేరు. ఇతడు కౌండిన్య గోత్రీకుడు. ఇతని తండ్రి తిక్కన. ఇతడు విజయవాడ దగ్గర ఉన్న శ్రీకాకుళం ఆంధ్రమహావిష్ణువు భక్తుడు ఇతని స్వగ్రామం పెరుమగూరు. దీనిని విజయవాడ దగ్గరున్న పెనమకూరు లేక పెనమలూరుగా గుర్తించారు కనుక ఇతడు కృష్ణా జిల్లా వాసి. ఇతని ముత్తాత బయ్యన కూడా గొప్ప కవి. అతడు తిక్కన సోమయాజి సమకాలికుడు తిక్కన సోమయాజి బయ్యనకు భావ్యభారతి అనే బిరుదు ఇచ్చాడు. అనంత సోదరుడు చిట్టన కూడా పండితుడే. వీరంతా వైష్ణవులు. వీరి గురువులు నల్లంద చక్రవర్తి వంశస్తులు. ఈ వైష్ణవ గురువులు కారంపూడి స్థావరంగా వైష్ణవ మతాన్ని ప్రచారం చేసేవారు. అనంతామాత్యుడు భోజరాజీయం, చందోదర్పణం, రసాభరణం అనే మూడు కావ్యాలు రాశాడు. భోజరాజీయంలో భోజరాజు కథలు రాశాడు. ఈ గ్రంథాన్ని అహోబిల నరసింహస్వామికి అంకితం చేశాడు. చందోదర్పణం అలంకార గ్రంథం. రసాభరణం శృంగారాది రసాలతో రాయబడింది ఈ గ్రంథం శక 1356 అంటే క్రీ.శ.1434లో రాయబడింది. ఇతడు శ్రీనాధునికి సమకాలికుడు.

విన్నకోట పెద్దన: పెద్దన కౌశిక గోత్రీకుడు. విన్నకోట వంశస్తుడు. ఇతడు ఎలమంచిలి చాళుక్య రాజైన విశ్వేశ్వరుని ఆస్థానకవి. విశ్వేశ్వరుడు పెదకోమటి వేమారెడ్డి సమకాలికుడు. అతడు ఎలమంచిలి పాంచదార్లను పాలించాడు. పెద్దన కావ్యాలంకార చూడామణి అనే అలంకార గ్రంథాన్ని రాసి తన ప్రభువైన విశ్వేశ్వరునికి అంకితం చేశాడు. ఇది తెలుగులో మొదటి అలంకార కావ్యంగా ప్రసిద్ధి చెందింది. పాంచదార్లలోని ధర్మలింగేశ్వర స్వామి ఆలయంలోని ఒక స్తంభం మీద చాళుక్య విశ్వేశ్వరుడు సంస్కృతంలో ఒక శాసనాన్ని శక 1329 అంటే క్రీ.శ.1407లో రాయించాడు. ఆ శాసనంలో అతడు పద్మనాయకులను ఓడించినట్లు ఉంది. ఈ శాసనంలో విన్నకోట పెద్దన రాసిన కావ్యాలంకార చూడామణి కావ్యంలోని శ్లోకం ఉంది. ఈ శాసనం కూడా పెద్దన రాసి ఉంటాడు. మొత్తం మీద క్రీ.శ.1407 కంటే ముందే ఈ అలంకార గ్రంథం రాయబడిందని స్పష్టం అవుతోంది.

శివలీలా విలాసం: విన్నకోట పెద్దన తర్వాత రాజమహేంద్రవరపు రెడ్డి ఆస్థానంలో చేరినట్లు కనిపిస్తోంది

అతడు శివలీలా విలాసం అనే మరొక కావ్యాన్ని రాసి అల్లాడరెడ్డి కుమారుడైన దొడ్డారెడ్డికి అంకితం చేశాడు. ఈ కావ్యాన్ని ప్రబంధ పద్ధతిలో రాశాడు. ఈ కావ్యం అల్లాడరెడ్డి విజయాలు రాజమహేంద్రవర రెడ్డి రాజ్య పరిస్థితులు తెలుసుకోడానికి మంచి ఆధారంగా ఉపయోగపడుతోంది.

శివలెంక కొమ్మన: రెడ్డి యుగంలో ప్రసిద్ధి చెందిన మరొక కవి శివలెంక కొమ్మన. ఇతనిని అల్లాడరెడ్డి కుమారుడు దొడ్డారెడ్డి ఆదరించాడు. అతనికి శక 1352లో కొంకుదూరు గ్రామాన్ని దానం చేశాడు. కొమ్మన వీరమహేశ్వరం, శివలీలా విలాసం అనే రెండు తెలుగు కావ్యాలు రాశాడు. వీనిలో మొదటిది లభించలేదు. కాని అది కొన్ని లక్ష్మణ గ్రంధాలలో ఉదహరించబడింది. శివలీలా విలాసాన్ని అల్లాడరెడ్డి కుమారుడు దొడ్డారెడ్డికి అంకితం ఇచ్చాడు. ఈ కావ్యం ప్రబంధ విధానంలో రాయబడింది. ఇందులో అల్లా రెడ్డి విజయాలు రాజమహేంద్రవరపు రాజ్య పరిస్థితులు వర్ణింపబడ్డాయి. కనుక నాటి రాజమహేంద్రవర రాజ్యపు పరిస్థితులు తెలుసుకోవడానికి మంచి ఆధారంగా ఉపయోగపడుతోంది. అంతేగాక ఈ కావ్యం గ్రంధకర్త యొక్క వంశవృక్షాన్ని కూడా ఇచ్చింది. ఐదు తరాల వారి పేర్లు ఇవ్వబడ్డాయి: గంగయ, అతని కుమారుడు సింగయ, అతని కుమారుడు నిశ్శంకయ, అతని కుమారుడు అబ్బయ - భార్య అంబమాంబ, వారి కుమారుడు కొమ్మయ. ఈ చివరివాడే శివలీలా విలాస గ్రంధకర్త. వీరు శ్రీవత్స గోత్రీకులు. వీరిలో సింగయకు ఊరయ అనే కవి తుర్కయ్య అనే వ్యక్తి సమక్షంలో సుభద్రా కళ్యాణం అనే కావ్యాన్ని అంకితం చేశాడట. పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం వద్ద ఉన్న మహానందీశ్వర ఆలయంలోని శక 1330 నాటి శాసనంలో శివలెంక నిశ్శంకనాధయ్య ఆ దేవుని కోసం కొప్పాక బ్రాహ్మణుని వద్ద కొంత భూమిని కొన్నట్లు ఉంది. అదే ప్రదేశంలోని మరొక శాసనంలో నిశ్శంకనాధయ్య మనుమడు నిశ్శంకకొమ్మయ వద్ద నుండి మహానందీశ్వర లింగయకు చోడభక్తిరాజు కుమారుడు అన్నెదేవచోడుడు భూమిని కొన్నట్లు ఉంది. ఈ శాసనాల వల్ల శివలెంక కొమ్మన అన్నెదేవచోడుడు, కుమార గిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి సమకాలికుడని తెలిసింది. ఆ రోజులలో వారు తెలుగు కావ్యాలు రాసినా అవి అన్నీ సంస్కృతంలో ఉన్నవే అని సంస్కృత పండితులు ఆక్షేపించేవారట. అందువల్ల తెలుగు కావ్యాలు రాసేవారు చిన్నబుచ్చుకొనే వారట ఆ విధంగా ఆక్షేపించబడిన తెలుగు కవుల మనస్థితిని కొమ్మన తన గ్రంధంలో పేర్కొన్నాడు.

త్రిపురాంతక కవి: త్రిపురాంతక కవిని తిప్పన అని కూడా అనేవారు. అతని ఇంటి పేరు రావిపాటి వారు. అతడు నాలుగు కావ్యాలు రాశాడు. త్రిపురాంత కొదాహరణం, మదన విజయం, చంద్రతీరావళి, అంబికాశతకం అతని కావ్యాలు. అతడు ప్రేమాభిరామం అనే మరొక గ్రంధాన్ని కూడా రాశాడట. ఈ కావ్యాలు ఏవీ లభించలేదు. కాని వీటి గురించి పెదపాటి జగన్నాధ కవి రచనలలోను, ప్రయోగరత్నాకరం అనే మరొక తెలుగు కావ్యంలోను ప్రస్తావించబడింది. త్రిపురాంతక కవి రాయన మంత్రి కుమారుడైన రాయన భాస్కరుని తాను రచించిన ఒక చాటు పద్యంలో ప్రశంసించాడు. రాయనభాస్కరుడు అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డిల సమకాలికుడు. అతడు వినుకొండ, కొండపల్లి కోటలు అధిపతిగా పని చేశాడు. కనుక త్రిపురాంతక కవి అనవేమారెడ్డి కుమారగిరి కాటయ వేమారెడ్డిల సమకాలికుడని చెప్పవచ్చును.

వినుకొండ వల్లభరాయ: ఈ కాలం నాటి గొప్పకవులలో వినుకొండ వల్లభరాయుడు ముఖ్యుడు. అతడు గొప్ప నాటకకర్త అతడు క్రీడాభిరామం అనే గ్రంధాన్ని రాశాడు. దానిని తెలుగులో మొట్టమొదటి నాటక రచనగా అంగీకరిస్తారు. ఇది వీధి నాటకం అని చెప్పవచ్చును. దశరూపకాలలో వీధి ఒకటి. ఇది సంస్కృతంలో రావిపాటి తిప్పన రాసిన ప్రేమాభిరామానికి నమూనా అని అంటారు ఈ గ్రంధం ఇద్దరు మిత్రుల మధ్య సంభాషణ రూపంలో సాగుతుంది. గోవింద మంచనశర్మ అనే ఒక బ్రాహ్మణుడు టిట్టిభశెట్టి అనే ఒక వైశ్యుడు మిత్రులు. వారు ఓరుగల్లు పట్టణాన్ని చూడటానికి వెళ్లారు. ఉదయం నగరంలో అడుగుపెట్టిన దగ్గర నుంచీ రాత్రి వారు పూటకూళ్ల పెద్దమ్మ ఇంటికి చేరే వరకు, ఓరుగల్లులో వారు చూసిన వింతలను, ఆ నగర వైభవాన్ని వర్ణించే నాటక రూపమే ఈ క్రీడాభిరామం. ఆ కాలం నాటి సాంఘిక పరిస్థితులు, నాటి ప్రజల వినోదాలు, వారి అభిరుచులు, వారి జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్లు వర్ణించిన గ్రంధం ఇది. ఈ గ్రంధం చివరలో ద్వారసముద్రపు నాటక దళం ఈ నాటకాన్ని కడప జిల్లా మోపూరులోని భైరవదేవుని ఉత్సవాలలో ప్రదర్శించారని చెప్పబడింది. కనుక వల్లభరాయుడు మోపూరు స్థానిక పాలకుడు కావచ్చును. ఈ గ్రంధం పీఠికలో వల్లభరాయుని వంశాన్ని గురించి వివరంగా రాయబడింది. వీరి కుటుంబం వారసత్వంగా విజయనగర రాజులను కొలిచింది. వీరి వంశంలో మొదటి వ్యక్తి చంద్రామాత్యుడు. అతడు మొదటి బుక్కరాయలను కొలిచాడు. వల్లభరాయుని చిన తాత లింగన

మంత్రి రెండవ హరిహరరాయల వద్ద రత్నాభాండాగారకునిగా పనిచేశాడు. తర్వాత వినుకొండ దుర్గాధిపతిగా నియమించబడ్డాడు. తర్వాత వినుకొండను అనవేమారెడ్డి జయించి కొండపల్లిలో ఉద్యోగిగా ఉన్న రాయన భాస్కర మంత్రిని వినుకొండ దుర్గాధిపతిగా నియమించాడు. కనుక త్రిపురాంతకుని కుమారుడు క్రీడాభిరామ గ్రంథకర్త అయిన వల్లభరాయుని మోపూరులో స్థానిక పాలకునిగా నియమించి ఉంటారు. ఈ వంశస్తులు విజయనగర ఆస్థానం వారైనా రెడ్డి యుగానికి చెందినవారు. క్రీడాభిరామాన్ని శ్రీనాథుడు రచించాడని ఒక వాదన ఉంది

మడికి సింగన: మడికి సింగన కూడా రాజమహేంద్రవరం ప్రాంతానికి చెందినవాడే. రామచంద్రపురం దగ్గరున్న మడికి ఇతని స్వస్థానం. ఇతడు తిక్కన సోమయాజి ముని మనుమడు. తిక్కన సోమయాజి కుమారుడు కొమ్మన. అతని కుమారుడు అయ్యలామాత్యుడు. అతని కుమారుడు మడికి సింగన. సింగన తండ్రి అయ్యలామాత్యుడు రాజమహేంద్రవరాన్ని పాలించిన తొయ్యేటి అనపోతానాయకునికి మంత్రి. క్రీ.శ.1353లో అతని మరణానంతరం వీరి కుటుంబం రామగిరికి వలస పోయింది. రామగిరి సబ్బినాటికి రాజధాని. కరీంనగర్ జిల్లా ప్రాంతాన్ని సబ్బినాడు అని అంటారు. ఆనాడు సబ్బినాటిని ముప్పిడినాయకుడు పాలిస్తున్నాడు. అతని మంత్రి కందయామాత్యుడు. మడికి సింగన అతనిని ఆశ్రయించాడు. అతడు పద్మపురాణం, భాగవతంలోని దశమస్కంధం అనే రెండు గ్రంథాలు రాసి కందయామాత్యునికి అంకితం చేశాడు. కందయామాత్యుని తండ్రి అభయామాత్యుడు అక్కడ కాకతీయ ప్రతాపరుద్రుని సేనాధిపతి గన్నయామాత్యుని వంశస్తుడు. కందయామాత్యుడు గురిజాల కుటుంబానికి చెందిన తెలుంగురాయుని కుమారులైన ముప్పిడి లేక ముప్పనాయకుని వద్ద మంత్రిగా పని చేశాడు తర్వాత వశిష్ట రామాయణాన్ని రాసి అహోబిల నరసింహస్వామికి అంకితం చేశాడు. దీనిని సంస్కృతంలోని యోగావాసిష్టారి మూలం అయినా సింగన స్వతంత్ర కావ్యంగా మలిచాడు. ఇతని గ్రంథాలలో ప్రసిద్ధి చెందింది సకల నీతిసమ్మతం అనే రాజనీతి గ్రంథం. దానిని కూడా కందయామాత్యునికి అంకితం చేశాడు.

శ్రీనాథుడు: ఈ యుగ కవులలో కవిసార్వభౌముడని ప్రసిద్ధికెక్కిన శ్రీనాథుడు అగ్రగణ్యుడు. శ్రీనాథుడు గొప్ప వేదశాస్త్ర పారంగతుడు. కృష్ణ యజుర్వేదం, న్యాయ వైశేషిక దర్శనాలు సాంఖ్యసిద్ధాంత యోగం, శైవ ఆగమాలు, స్మృతులు, పురాణాలు, సంస్కృతం, ప్రాకృతం, సూరసేని భాషలు, నాట్యసంగీతాలు మొదలైన సమస్త శాస్త్రాలలో నిష్ణాతుడు. అతడు పెదకోమటి వేమారెడ్డికి ఆస్థానాధికారి. పెదకోమటి వేమారెడ్డి వేయించిన అన్ని శాసనాలు లిఖించినవాడు అతడు. సంస్కృతంలో అతడు గోదావరీ ఖండం అనే కావ్యాన్ని రాశాడని ప్రతీతి ఆదిపురాణం మహాస్కంధంలోని 50 ఖండాలలో అది ఒకటని అంటారు. ప్రాకృత భాషలోని హాలుని గాథాసప్తశతిని తెలుగులోకి తర్జుమా చేశాడని అంటారు. తెలుగులో అతడు కవిసార్వభౌముడు. తెలుగు భాషలో అంత అందంగా, మధురంగా, సంగీతసుధగా పదప్రయోగం చేసినవారు లేరు అంటే ఆశ్చర్యం లేదు. అమోఘమైన ఊహాశక్తి, కాల్పనిక శక్తి కలిగిన మహాకవి. ఆనాటి కవులను పురాణాల నుండి మళ్లించాడు శ్రీనాథుడు మారయ భీమాంబల కుమారుడు. భారద్వాజ గోత్రం, ఆపస్తంభ సూత్రం యజుర్వేద శాఖకు చెందినవాడు. అతని కావ్యాలలో ఎక్కడా అతడు తన ఇంటి పేరును చెప్పుకోలేదు. అతని తాత కమలనాభుడు. అతడు కాల్పట్టణవాసి. అతనికి కవితా విద్యాధర, సర్వసాహిత్య చక్రవర్తి, పద్మపురాణ సంగ్రహ, కోలాకావ్య ప్రబంధాధిప అంటే ఆ కావ్యాన్ని అంకితం పొందినవాడని అర్థం అనే బిరుదులున్నాయి. కాని అది లభ్యం కాలేదు అతని భీమేశ్వర పురాణంలో పాకనాటి పొదవు అనే పదం ఉంది. కనుక కొందరు అతనిని పాకనాటి వాడని భావించారు. కాకతీయుల కాలంలో సముద్రతీర ప్రాంతాలను కరణ పట్టణాలనేవారు. కాకతీయుల కాలంలో శ్రీనాథుని తాత కరణ పట్టణంలో అధికారిగా ఉండి ఉండవచ్చని కొందరు ఊహించారు. కనుక వారు పాకనాటి వారని పేరు వచ్చి ఉండవచ్చును. కాని అతని రచనలలో నా కవిత్వంబు నిజంబు కర్ణాటక భాష అని, కర్ణాటక దేశ కటక పద్మవనహేలి అని స్వయంగా చెప్పుకున్నాడు. దేవరాయలను కర్ణాటక దేశస్తుడని కొందరు భావించారు పాల్కురికి సోమనాథుడు కర్నూలు జిల్లాని గొబ్బూరుని కూడా కర్ణాటకం అని రాశాడు. కనుక కర్ణాటక అని అంటే ఇప్పటి సరిహద్దులు కావు. అతడు మహారాష్ట్ర దేశస్తుడని మరొక వాదన ఉంది. అయినప్పటికీ తెలుగు భాషా సాహిత్యంలో శ్రీనాథునిది అగ్రస్థానం. తెలుగు సాహితీపీఠంలో అగ్రస్థానాన్ని అధిరోహించడమేగాక ఆనాటి రాజకీయ పరిణామాలలో కూడా తగినంత పాత్రను నిర్వహించాడు. తెలుగు భాషకు నూతన వ్యక్తిత్వాన్ని తెచ్చాడు. నూతన సాంప్రదాయాలను నెలకొల్పి ఆనాటి కవులను పురాణాల నుండి కావ్యాలవైపు మళ్లించాడు. కవిత్రయం మార్గానికి భిన్నమైన అక్షర రమ్యత అర్థ గౌరవాలను సమన్వయం చేసి నూతన ఒరవడిని సృష్టించాడు

ముఖ్యంగా తెలుగు, సంస్కృత పదాల మిశ్రమంతో అలంకారయుక్తంగా నూతన సాహిత్యాన్ని, నూతన ఒరవడిని సృష్టించిన మహాకవి శ్రీనాథుడు. శ్రీనాథుడు తన రచనలలో తనను పెదకోమటి వేమారెడ్డి, వీరారెడ్డి, వీరభద్రారెడ్డి, పంట మైలారురెడ్డి, తెలుంగరాయుడు, విస్సన్న మంత్రి, భాస్కర మంత్రి ఆదరించారని చెప్పుకున్నాడు. వీరి కాలాలను బట్టి అతడు క్రీ.శ.1404 తర్వాత పెదకోమటి వేమారెడ్డి కాలంలో కవిగా తన జీవితాన్ని ప్రారంభించి కపిలేశ్వర గజపతి కాలం వరకు అంటే క్రీ.శ.1454 వరకు జీవించాడని భావించారు. అతడు క్రీ.శ.1378లో జన్మించి ఉండవచ్చని మల్లంపల్లి సోమశేఖరశర్మ భావించారు. క్రీ.శ.1378-1454 మధ్య జీవించాడు. అతడు మొదట వరుసగా మరుత్తరాట్ చరిత్ర, శాలివాహన సప్తశతి, శృంగారనైషధం, భీమేశ్వరపురాణం, కాశీఖండాలు రచించినట్లుగా తెలుస్తోంది. నూనూగు మీసాలనాడు మరుత్తరాట్ చరిత్ర, యవ్వనదశలో అడుగుపెట్టే సమయంలో శాలివాహన సప్తశతి, నిండు యవ్వనంలో శృంగారనైషధం రాశాడు. భీమేశ్వరపురాణం శక 1350 తర్వాత రాశాడు. అందులో బెండపూడి అన్నయ మంత్రి ద్రాక్షారామంలో నిర్మించిన తూర్పుగోపుర ప్రస్తావన ఉంది. ఆ గోపురాన్ని శక 1350లో క్రీ.శ.1428లో నిర్మించినట్లు అక్కడ శాసనం ఉంది. కనుక 1428 తర్వాత భీమేశ్వర పురాణాన్ని రచించి ఉంటాడు. ఆ తర్వాత కాశీఖండం రాశాడు. ఇవేగాక అతడు హరవిలాసం, పండితారాధ్య చరిత్ర, ధనుంజయ విజయం, శివరాత్రి మహాత్యం, పలనాటి వీరచరిత్ర రాశాడు. శివరాత్రి మహిమ అతని చివరి రచన. ఇంకా అనేక కావ్యాలు రాసి ఉండవచ్చును. కాని లభించలేదు. వానిలో పండితారాధ్య చరిత్రను ముమ్మిడి సింగన మంత్రి ప్రెగ్గడయ్యకు, శృంగార నైషధాన్ని పెదకోమటిరెడ్డి మంత్రి అయిన ముమ్మిడి సింగన మంత్రికి, హరవిలాసాన్ని అవచి తిప్పయ శెట్టికి, భీమేశ్వర పురాణాన్ని అల్లయ వేమారెడ్డి మంత్రి బెంజపూడి అన్న మంత్రికి, కాశీఖండాన్ని రాజమహేంద్రవర వీరభద్రారెడ్డికి, ధనుంజయ విజయం ధాన్యవాటిని ఏలిన హరికృష్ణ వంశానికి చెందిన దంతులూరి గన్నభూపాలునికి, శివరాత్రి మహాత్యం శ్రీశైల శాంత భిక్షు వృత్తి యతీశ్వరుని శిష్యుడైన ముమ్మడ శాంతయ్యకు అంకితం చేశాడు. దీనిని బట్టి కొండవీడు రాజ్యపతనం తర్వాత భీమేశ్వర పురాణం రాశాడు. శివరాత్రి మహిమ శక 1371 ప్రాంతంలో రాసి ఉండవచ్చును. శక 1371 నాటి శ్రీశైల శాసనంలో శాంత భిక్షు వృత్తి యతీశ్వరుని ప్రస్తావన ఉంది.

విజయనగర దర్శనం-డిండిమభట్టును ఓడించడం: శ్రీనాథుని జీవితంలోని అతి గొప్ప విజయం ఆస్థాన కవి డిండిమభట్టును ఓడించడం. ఈ సంఘటన శక 1350-1360 మధ్యకాలంలో జరిగి ఉండాలి. కారణం ఏమిటంటే అతడు రచించిన కాశీఖండం, శివరాత్రి మహిమలో మాత్రమే తన కవిసార్వభౌమ అనే బిరుదును రాసుకొన్నాడు. అంటే గౌడ డిండిమభట్టును ఓడించిన తర్వాత ఈ రెండు గ్రంథాలు రాసి ఉంటాడు. కొండవీటి రాజ్యం పడిపోగానే అతడు ఆశ్రయం కోల్పోయి దేశ సంచారం చేశాడని ఆ సందర్భంలో పలనాటిని దర్శించి పలనాటి చరిత్రను రాశాడని అంటారు. పలనాటిలో అతడు అనేక గ్రామాలు దర్శించినట్లు అనేక చాటు పద్యాలు ప్రచారంలో ఉన్నాయి. తర్వాత రేనాడును దర్శించాడు. అక్కడి నుండి విజయనగరం వెళ్లిపోయి ఉండవచ్చును. రాజాశ్రయం కోసం అతడు విజయనగరం వైపు వెళ్లి ఉంటాడు. అక్క చంద్రభూష క్రియాశక్తి మధ్యవర్తిత్వంలో డిండిమభట్టును ఓడించి విజయనగర ముత్యాలశాలలో కనకాభిషేకం జరిపించుకొని కవిసార్వభౌమ బిరుదును పొందాడు. తర్వాత అతనికి రాజమహేంద్రవరం ఆస్థానంలో ఆదరణ లభించి ఉంటుంది. రాజమహేంద్రవర రాజ్యం కొండవీటి రాజ్యానికి బద్ధ శత్రువు. గనుక మొదట అతనికి ఆశ్రయం లభించి ఉండదు. అందువల్ల అతడు మొదట వారి మంత్రి బెండపూడి అన్నయమంత్రికి భీమేశ్వర పురాణం రాసి అంకితం చేసి అతని సిఫారసుతో శ్రీనాథుడు వీరభద్రారెడ్డి దయకు పాత్రుడై ఉంటాడు. వీరభద్రరెడ్డికి కాశీఖండాన్ని అంకితం ఇచ్చాడు. రాజమహేంద్రవర రాజ్యం కూలిపోయిన తర్వాత అతడు శ్రీశైలం చేరి తన చివరి గ్రంథం అయిన శివరాత్రి మహాత్యాన్ని శక 1370-71 ప్రాంతంలో రాసి ఉంటాడు. అదే అతని చివరి రచన. తర్వాత అతడు తనను ఆదరించేవారు లేక కపిలేశ్వర గజపతి కాలంలో కృష్ణానది ఒడ్డున బొడ్డేపల్లిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. పంట నష్టపోయి పన్ను కట్టలేక శిక్షకు గురయ్యాడు. తర్వాత అతడు ఎంత కాలమో జీవించలేదు. బహుశ, శక 1371-76 మధ్యకాలంలో అంటే క్రీ.శ.1454 ప్రాంతంలో మరణించి ఉండవచ్చును. శ్రీనాథుని జీవితం అతి విచిత్రమైంది. అతని జీవితం చీకటి వెలుగుల మయం. ఒకవైపు అతడు అంతు లేని ఐశ్వర్యాన్ని, భోగాన్ని అనుభవించాడు. మరొకవైపు భరించలేని కష్టాలు అనుభవించాడు.

రాచకొండను దర్శించడం: శ్రీనాథుడు రాచకొండను కూడా దర్శించాడు. దేవరకొండ లింగమనేడు,

పెదకోమటి వేమారెడ్డిని సంహరించి గృహరాజు మేడాలోని ఎనబోతు కటారిని తీసుకొని వెళ్లాడు. ఆ కటారి రాచకొండ, దేవరకొండ పద్మనాయకుల వద్ద ఉండటం రాజమహేంద్రవరం రెడ్లకు తలవంపులుగా ఉండేదట. అది తెలుసుకున్న శ్రీనాధుడు, రాచకొండ వెళ్లడానికి సిద్ధపడ్డాడు. కాని ఆ కాలంలో రాచకొండ రాజు సింగభూపాలుడు గొప్ప పండితుడట. అతనికి సర్వజ్ఞ అనే బిరుదుంది. అతనిని మెప్పించడం ఎవరికీ సాధ్యం కాదట. కనుక శ్రీనాధుడు సరస్వతిని ప్రార్థించాడట. మహా విజ్ఞాని అయినా రాజు సింగమహీపాలుని కొలువులో ఉన్న నాకు ఏ విధంగా విజయాన్ని కలిగిస్తావో నీవే దిక్కు అని ప్రార్థించాడట. ఈ ప్రార్థనలో సరస్వతి తనను విజయనగరంలో డిండిమభట్టును ఓడించడానికి సహాయం చేశావు, ఇప్పుడు ఎలా సహాయపడతావో అని సంబోధించాడని చాటువులు తెలుపుతున్నాయి. కనుక విజయనగర ఆస్థానాన్ని దర్శించిన తర్వాతనే శ్రీనాధుడు రాచకొండ, సింగభూపాలుని ఆస్థానాన్ని దర్శించాడని స్పష్టంగా చెప్పవచ్చును. సింగభూపాలుడు బహమనీ సుల్తాన్‌ల చేతిలో ఓడిపోయి క్రీ.శ.1435కు ముందే దర్శించి ఉంటాడు. అంటే ఈ సంవత్సరానికి ముందు అతడు విజయనగరం దర్శించడం, తర్వాత రాజమహేంద్రవరం వెళ్లి వీరభద్రారెడ్డి కొలువులో చేరి ఉండాలి. అంటే రాచవేమారెడ్డి మరణానంతరం అతడు నాలుగు, ఐదు సంవత్సరాలు దేశ సంచారం చేసి క్రీ.శ.1430 ప్రాంతంలో విజయనగరం దర్శించి ఉండాలి. తర్వాత 1430-35 సంవత్సరాల మధ్య రాచకొండ దర్శించి ఉంటాడు. రాచకొండలో శ్రీనాధుడు రావు సింగమనేనిని మెప్పించి ఎనబోతు కరారిని తెచ్చి వీరభద్రారెడ్డికి అప్పగించాడని గాధలు ప్రచారంలో ఉన్నాయి. తర్వాత క్రీ.శ.1448లో రాజమహేంద్రవర రాజ్యం కూడా కూలిపోయింది. తర్వాత ఇతనిని కొన్నాళ్లు మైలారు పంట మైలారురెడ్డి పోషించినట్లుంది. తిరిగి అతనికి రాజాశ్రయం కరువైంది. తర్వాత అతడు శ్రీశైలం చేరి తన చివరి రచన అయిన శివరాత్రి మహాత్మ్యాన్ని శక 1371లో రాసి ఉంటాడు. అదే అతని చివరి రచన. ఈ తర్వాత ఆ మాత్రం కూడా ఆదరించేవారు లేక కపిలేశ్వర గజపతి కాలంలో. కృష్ణానది ఒడ్డున భూమిని సాగుచేశాడు. పంట వరదకు కొట్టుకొనిపోయింది. కొంత బలభిక్షుడు తినిపోయె నెట్లు చెల్లించు నేడు నూరు టంకాలు అని దీనంగా పద్యం చెప్పుకున్నారు. పన్ను చెల్లించలేక పోయాడు. శిక్షకు గురయ్యాడు. అతని మెడపై గుదిబండను ఎత్తి శిక్షించారు. ఆ తర్వాత అతడు ఎంతో కాలం జీవించలేదు. శక 1371-76ల మధ్య క్రీ.శ.1454 ఆ ప్రాంతంలో మరణించి ఉంటాడు. శ్రీనాధుని జీవితం అతి విచిత్రమైంది. చీకటి వెలుగుల మయం. కొన్నాళ్లు అంతులేని భోగవైభోగాలు అనుభవించాడు. చివరిదశలో భరించలేని అవమానాలు, కష్టాలు పడ్డాడు. నూనూగు మీసాల వయసులో కావ్యరచన ప్రారంభించాడు. తర్వాత కొండవీడు చేరి మామిడి ప్రెగ్గడయ్యకు అతని సోదరుడు మామిడి సింగమకు అవచి తిప్పయశెట్టికి కృతులు ఇచ్చి వారి ఆదరాభిమానాలతో పెదకోమటి రెడ్డి ఆస్థానంలో విద్యాధికారి అయ్యాడు. శ్రీనాధుని కవిత్వం విద్వత్తు కొండవీటి రాజ్యానికే పరిమితం కాలేదు. విజయనగరం డిండిమభట్టును ఓడించడం అతని జీవితంలో మహత్తర ఘట్టం. దాంతో కనకాభిషేకం చేయించుకున్నాడు. ఇంతలో కొండవీటి రాజ్యం కూలిపోయింది. అందుకు ఖిన్నుడై దేశసంచారం చేశాడు. తిరిగి రాజమహేంద్రవరం రాజ్యంలో ఆశ్రయం సంపాదించాడు. రెడ్డి, వెలమ రాజ్యాల మధ్య దౌత్యం నెరపడానికి రాచకొండ వెళ్లి రావు సింగముని మెప్పు పొందాడు. కాని విచిత్రం రాచకొండ, రాజమహేంద్రవరం రెండు రాజ్యాలు కూడా తన కన్నుల ముందే కూలిపోయాయి. ఆంధ్రదేశం కపిలేశ్వర గజపతి వశం అయింది. అతనిని ఆదరించే వారు లేక దురవస్థలను అనుభవిస్తూ దీనాతిదీనంగా మరణించాడు. అతను చివరలో ఎన్ని కష్టాలు పడ్డా అతని రచనలు అతని చిరఃయశస్సును కలిగించాయి. అతని రచనలు ఆంధ్రసాహిత్యానికే మకుటాలు. పామరులకు సహితం సులభగ్రాహ్యం అయ్యే రీతిలో పలనాటి వీరచరిత్ర వీధినాటకాన్ని రాశాడు. ఏమైనా అతడు తన రచనల ద్వారా అజరామరమైన కీర్తిని పొందాడు.

ఈ యుగంలో ఇంకా అనేక మంది కవులు జీవించారు. రుక్మాంగదచరిత్ర రాసిన మల్లన, నీతిసారం రాసిన బద్దెన, నీతిశాస్త్రం రాసిన కామందుడు ఈ కాలం వారు. ఇంకా చారుచర్య నీతి తారావళి, నీతి భూషణం, ముద్రామత్యం, పంచతంత్రం మొదలైన కావ్యాలు ఈ కాలం నాటివి.

పరహిత కుటుంబం: రెడ్డి రాజుల కాలంలో పరహిత కుటుంబం అనే పేరు కలిగిన ఒక ఆయుర్వేద పండితుల కుటుంబాన్ని రెడ్డి శాసనాలు ప్రస్తావిస్తున్నాయి. వారికి పెదకోమటి వేమారెడ్డి అని తల్లి, కోరుకొండను ఏలిన శింగమ నాయకుడు అగ్రహారాలిచ్చారు. రాజమహేంద్రవరాన్ని ఏలిన ముసునూరి అనపోతానాయకుని ఆస్థానంలో పిన్నయ అనే జ్యోతిష్యశాస్త్రవేత్త ఉండేవాడు. అతనికి జ్యోతిష్మార్గ నిదర్గళ అనే బిరుదు ఉండేది. వీరి

వల్ల రెడ్డి యుగంలో ఆయుర్వేదం, జ్యోతిష్యశాస్త్రం అభివృద్ధి చెందాయి.

మామిడి శింగనామాత్యుడు: పెదకోమటి వేమారెడ్డి మంత్రి మామిడి శింగనామాత్యుడు కూడా గొప్ప పండితుడు. అతడు సోమ సిద్ధాంతానికి గూడార్థ దీపిక అనే వ్యాఖ్య రాశాడు. వీటన్నింటిని బట్టి రెడ్డి యుగంలో విజ్ఞానశాస్త్రాలు బాగా ప్రాచుర్యం పొందాయని బోధపడుతోంది.

ఇతర కళలు-సంగీతం-సంగీత వాయిద్యాలు: భాషా సాహిత్యాలేగాక రెడ్డి యుగంలో లలితకళలు కూడా అభివృద్ధి చెందాయి. పెదకోమటి వేమారెడ్డి, కాటయ వేమారెడ్డి, వీరభద్రారెడ్డిలు సంగీత నాట్యశాస్త్రాలలో ప్రావీణ్యులుగా ప్రసిద్ధి చెందారు. పెదకోమటి వేమారెడ్డి తన సంగీత చింతామణిలో వీణను వృత్త విభాగంలో దేశివృత్తాలను గూర్చి వర్ణించాడు. కోరుకొండ ముమ్మడినాయకుని సోదరుడు సింగమనాయకుడు కూడా సంగీత శాస్త్రాన్ని రాశాడు. రుక్మాంగద చరిత్ర, సింహాసన ద్వాత్రింశికలలోని గీతాలు సుధాది గీతాలు, జతి గీతాలు మంచి ప్రాచుర్యంలో ఉన్నట్లు తెలుపుతున్నాయి. ఇంకా తుమ్మెద పదాలు, గొబ్బి పదాలు, ప్రభాత పదాలను కూడా నాటి ప్రజలు పాడుకొనేవారు. శుభకార్యాలలో స్త్రీలు మంగళ గీతాలు, కళ్యాణ గీతాలు పాడేవారు. వసంతోత్సవాలలో హిందోళరాగంలో జాతర గీతాలు పాడేవారని శ్రీనాథుడు వర్ణించాడు. దేవాలయాలలో రాజమందిరాలలో వాద్యసంగీతం పాడేవారు. మురజ, అపజ కాహళ, భేర, జయగుంట, చక్కి, ఢక్క, హుడక్కి, ఝల్లరి, ఝర్ఝరి, వల్లకి మొదలైన వాయిద్యాలు ఉండేవి. వాయిద్యగాండ్రకు కూడా మాన్యాలు బహుమానాలు ఇచ్చినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

నాట్యం, నృత్యం-నాటకాలు: సంగీతం, నాట్యం జంటకళలు. నాడు సంగీతంతోపాటు నాట్యం, నృత్య కళలు కూడా పోషింపబడ్డాయి. నాట్యగత్తెలను రాజులు స్వయంగా పోషించారు. పండుగలప్పుడు, వివాహ సమయాలలో దేవాలయ ఉత్సవాలలో నాట్యం తప్పకుండా ఉండేది. ద్రాక్షారామ భీమేశ్వరుని ఆలయంలో శనివారం జరిగే ఉత్సవాలలో అప్సరసలు, గంధర్వులు దేశినృత్యం చేస్తారని శ్రీనాథుడు వర్ణించాడు. కుమారగిరి రెడ్డి ఉంపుడుగత్తె లకుమాదేవి భగవద్గీత భావాన్ని సహస్రమార్గాలను వ్యక్తం చేయగల నేర్పు కలిగి ఉండేది. వామనభట్టు పెదకోమటి వేమారెడ్డి సంస్కృతంలో రాసిన నాటకాలను కొండవీటిలో వసంతోత్సవ రోజులలో ఆడేవారట. అతడు జక్కిణి, గొండ్లి, బిందు మొదలైన దేశినాటకాలను ప్రస్తావించాడు. నాటి సాహిత్యంలో పేర్కొన బడ్డాయి. ఓరుగల్లులో ఒక నాట్యకత్తె నాట్యం చేస్తూ నీటి తొట్టిలో పడవేసిన ముక్కెరను తీసి ముక్కుకు పెట్టుకొనేదని, గాజుపూసలను వేగంగా గుచ్చి మాలగా చేసిందని వల్లభామాత్యుడు క్రీడాభిరామంలో వర్ణించాడు. విజయనగర కాలం నాడు మంచి ప్రాచుర్యం పొందిన యక్షగానాలు కూడా ఈ యుగంలోనే ప్రారంభం అయ్యాయి. వాటిలో దేశినృత్యాలు చేర్చారు. పురాణ కథలను యక్షగానాలకు ఇతివృత్తాలుగా తీసుకున్నారు. ఆనాడు నాటక కళ బాగా అభివృద్ధి చెందింది. నాటకాలాడటానికి ప్రత్యేక నాటకశాలలుండేవి. నటులు దేశ సంచారం చేస్తూ నాటకాలు ఆడేవారట. కుమారగిరిరెడ్డి, పెదకోమటి వేమారెడ్డి వసంతోత్సవాలను జరిపి అందులో పాల్గొన్న కళాకారులకు బహుమానాలు ఇచ్చేవారట.

పారశీక నర్తనం: ఈ కాలంలో ఆంధ్రదేశంలో పారశీక నర్తనం అని ఒక విదేశీ నృత్యం ప్రాచుర్యంలో ఉన్నట్లు కోమటి వేమారెడ్డి తన సంగీత చింతామణిలో ప్రస్తావించాడు. అతడు దానిని పారశీమత్తల్లి నర్తన అని పేర్కొన్నాడు. శ్రీనాథుడు కూడా ఈ నృత్యాన్ని వివరించాడు. మస్లింల ప్రభావం వల్ల వారి నృత్యం ఆంధ్రదేశంలో ప్రవేశించి ఉంటుంది.

తోలుబొమ్మలాట - టక్కుటమారి విద్యలు - ఇంద్రజాలం: ఈ కాలంలో మరొక వినోద సాధనం తోలు బొమ్మలాట. రామాయణ, భారత కథలను తోలుబొమ్మలాట ద్వారా ప్రదర్శించేవారు. ఇంకా ఈ కాలంలో ఇంద్రజాలం, మహేంద్రజాలం, అదృశ్యకరణి, జలస్తంభన, అగ్నిస్తంభన, శిలాస్తంభన, నష్టవస్తు సముద్ధరణ, టక్కుటమార మొదలైన గారడీ విద్యలు కూడా ప్రాచుర్యంలో ఉండేవని నాటి సాహిత్యం ద్వారా తెలుస్తోంది.

చిత్రలేఖనం: ఈ కాలంలో చిత్రలేఖనం కూడా అభివృద్ధి చెందింది. ఇళ్ల గోడల మీద కృష్ణలీలల చిత్రాలున్నట్లు రుక్మాంగద చరిత్రలో పేర్కొన్నాడు. అన్నయ తన షోడశ కుమారచరితలో వేశ్యల పడకగదుల గోడల మీద రతిబంధన చిత్రాలు ఉన్నట్లు వర్ణించాడు. పోతన కూడా తన భాగవతంలో చిత్రలేఖనాన్ని ప్రస్తావించాడు. అందులో చిత్రలేఖ అనే అప్సరస తన చెలికత్తె ఉషకు అందమైన యువకుల చిత్రాలు గీసి చూపిస్తుంది. ఆమె వజ్రలేపనం అనే పదార్థంతో ఒక ఫలకాన్ని నున్నగా తెల్లగా మెరిసేటట్లు చేసి దాని మీద తూలికతో రేఖలను

గీచింది. చిత్రలేఖనానికి తూలిక, వర్తిక, లఖిమి అనే మూడు రకాల కుంచెలను వాడేవారు. తూలిక రేఖలు గీయడానికి, వర్తిక దాని మీద రంగులు అద్దడానికి, లఖిమి రంగులు సరిచేయడానికి తగిన విధంగా రంగును దిద్దడానికి ఉపయోగిస్తారు. లఖిమి మెత్తని వెంట్రుకలతో తయారు చేస్తారు. వజ్రలేపనాన్ని జంతుచర్మంతో తయారు చేస్తారు. రంగులు దిద్దడానికి బంగారం, వెండి సబ్బిలలో ఐదు మౌలిక రంగులను సిద్ధం చేసి చిత్రలేఖ యువకుల చిత్రాలను గీసిందని పోతన వర్ణించాడు. పాశ్చాత్యులు చిత్రలేఖనానికి మూడు మౌలికరంగులనే తీసుకుంటారని, భారతీయులు తెలుపును కూడా మౌలికరంగుగానే తీసుకుంటారని, కాని పోతన వర్ణించిన ఐదవ మౌలికరంగు నీలిరంగు అయి ఉండవచ్చని శివరామమూర్తి అనే పండితుడు తన పెయింటింగ్ ఇన్ పోతన అనే గ్రంధంలో రాశాడు. అంతకు పూర్వం నన్నెచోడుడు తన కుమారసంభవంలో కూడా చిత్రలేఖనాన్ని వర్ణించాడు పార్వతి శివుని రూపాన్ని చిత్రంగా గీస్తుంది. ఆమె దారంతో గీతలు గీచి పత్రక బిందుక రీతులలో శరీర అంగాలు గీసి రంగులతో దిద్ది చివరకు కళ్లను దిద్దింది. ఈ వర్ణనల వల్ల నన్నెచోడుని నాటికే ఆంధ్రదేశంలో చిత్రలేఖనం ఉన్నట్లు స్పష్టమవుతోంది. శ్రీశైల దేవాలయ ప్రాకారాలపైన శివభక్తుల జీవిత చిత్రాలు చిత్రించబడి ఉన్నాయి. ఇవి రెడ్డి యుగం నాటివి. ఇంకా ఈ కాలపు అనేక దేవాలయాలలో చిత్రలేఖనాలు చిత్రించబడ్డాయి. 14వ శతాబ్దం నుండి ఆంధ్రదేశంలో చిత్రలేఖనం బాగా అభివృద్ధి చెందింది.

రెడ్డి రాజుల నాటి శిల్పకళ - ఇతర కళలు

రెడ్డి రాజుల కాలం నాటి శిల్పకళను తెలుసుకోదానికి తగిన ఆధారాలు లేవు. వారు నిర్మించిన ఒక్క దేవాలయం కూడా నేడు నిలిచి లేదు. వారి రాజధానులైన అద్దంకి, కొండవీడుల్లో వారు అనేక దేవాలయాలు నిర్మించి ఉండవచ్చును. కాని వాటి జాడలేదు. కొండవీటి దుర్గంలో అనేక శిధిల దేవాలయాలున్నాయి. వాటిలో కొన్ని వీరు నిర్మించి ఉండవచ్చును. ప్రస్తుతం కొండవీటిలో నిలిచి ఉన్న శిధిల కోట కపిలేశ్వర గజపతి కుమారుడు హంవీరుడు నిర్మించాడని అంటారు. అంతకు పూర్వం రెడ్డి రాజులు నిర్మించిన కోట చాలా చిన్నదని దానిని పుట్ట కోట అని అనే వారని, అది ఇప్పటి కోట ప్రాంతం గాక దానికి మరి కొద్ది దూరంలో ఉందని చెబుతారు. కనుక కొండవీడు కోటలో నేడు కనిపించే శిధిల దేవాలయాలు కూడా వారు నిర్మించారని చెప్పదానికి వీలు లేదు. కాని వారు అక్కడ కొన్ని దేవాలయాలు నిర్మించే ఉంటారు ముఖ్యంగా రెడ్డి రాజులలో మొదటితరం వారు శైవ మతస్థులు. వారు తమ కోటలో శైవాలయాలు నిర్మించి ఉండవచ్చును. దేవాలయం ముందు నిర్మించి తర్వాతనే ఊరు కట్టే ఆచారం ఆనాడు ఉండేది. కనుక తప్పకుండా వారు దేవాలయాలు నిర్మించి ఉంటారు. కుమారగిరిరెడ్డి, కాటయవేమారెడ్డిలు వైష్ణవమతాన్ని అభిమానించారు. వారు వైష్ణవ ఆలయాలు నిర్మించి ఉండవచ్చును. కొండవీటి దుర్గంలో అనేక శైవ, విష్ణుదేవాలయాల శిధిలాలు ఉన్నాయి. రెడ్డి రాజుల కుల దేవత మూలగూరమ్మ. ఆమె దేవాలయం కూడా ఉండవచ్చును. రాచవేమారెడ్డి కాలంలో కొండవీటిలో ముత్యాలమ్మ గుడి ఉన్నట్లు తెలుస్తోంది. ఏమైనా వారి దేవాలయాల శిల్ప కళా లక్షణాలు తెలుసుకోదానికి మనకు వీలు కావడం లేదు.

కత్తుల బావి: నేడు కొండవీడు గ్రామంలో ఒక పెద్ద గుడి ఉంది. ఇది చాలా పొడవైన గుడి. వెడల్పు తక్కువ. దీని ముందు భాగం కొంత మసీదుగా మార్చారు. వెనుక భాగం దేవాలయంగానే ఉంది. గర్భగృహంలో దేవ విగ్రహం లేదు. దాని గోడలపై ఎలాంటి శిలాలంకరణలు లేవు. చాలా సాదాగా ఉంది. ఈ దేవాలయంలో గర్భగుడికి, ముఖమండపానికి మధ్యలో కత్తుల బావి ఉందని, ఈ బావిలో పడేటట్లుగా చేసి 80 మంది రెడ్డి రాజులను ఒక బ్రాహ్మణుడు పథకం ప్రకారం చంపాడనే కథ ప్రచారంలో ఉంది. పూర్వం ఆ బ్రాహ్మణుని మోసం చేసి పరుసవేదిని కాజేసి రెడ్డి రాజ్యం స్థాపించబడిందని, అతడు పగ తీర్చుకోవడానికి ఈ వ్యూహం పన్నాడనే కథ ఆంధ్రదేశంలో ఇప్పుడు కూడా చెప్పుకుంటారు. కాని అది నమ్మదగిన కథ కాదు. కాని ఈ దేవాలయం రెడ్డి రాజుల కాలం నాడు నిర్మించి ఉండవచ్చును.

ఇతర నిర్మాణాలు: రెడ్డి రాజులు ఇతర ప్రాంతాల్లో కొన్ని కట్టడాలు నిర్మించారు. ప్రోలయ వేమారెడ్డి శ్రీశైలంలో పాతాళగంగకు మెట్లు కట్టించాడు. అహోబిలంలో ఆలయానికి సోపానాలు నిర్మించాడు. అనవేమారెడ్డి శ్రీశైలంలో వీరశిరోమండపాన్ని నిర్మించాడు. త్రిపురాంతకం మొదలైన అనేక దేవాలయాలకు దానాలు చేశాడు. రెడ్డి రాజుల దేవాలయాలు లేకపోయినప్పటికీ వారు అనేక మండపాలు నిర్మించినట్లు వారి శాసనాల వల్ల తెలుస్తోంది. అనవేమారెడ్డి ద్రాక్షారామంలో భీమనాధ నగరాన్ని నిర్మించి అక్కడ నాట్య కళ్యాణ, యజ్ఞ, శనివార మంటపాలు నిర్మించినట్లు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. పెదకోమటి వేమారెడ్డి కొండవీటిలో గృహ రాజు మేడ అనే భవనాన్ని నిర్మించి అందులో ఎనపోతు కటారిని ఉంచాడట. ఇది కూడా ఒక దేవాలయమే. కాని దాని జాడ నేడు కనిపించదు. కాని దీనిని కుమారగిరి నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

గృహరాజు మేడ గాథ: గృహరాజు సౌధం లేక గృహరాజు మేడను గురించి ఒక కథ ప్రచారంలో ఉంది. శ్రీనాధుడు విజయనగరం చేరి ప్రౌఢదేవరాయలను దర్శించినప్పుడు రాయలు, ఎవరూ నిర్మించలేని ఒంటి స్తంభంతో ఒక గొప్ప సౌధాన్ని నిర్మించాలని అనుకుంటున్నానని చెప్పాడట. అది విని ఆశ్చర్యపడి రాయలు వేగులను కొండవీడుకు పంపాడట. శ్రీనాధుడు తాను అబద్ధం ఆడానని నిజం తెలిస్తే రాయలు శిక్షిస్తాడని తన ఇష్టదేవతను ప్రార్ధించాడట. నవులూరులో పోతురాజు దేవాలయం దగ్గరున్న ఏడు తాటి చెట్ల ఎత్తు ఏడు మోకులు చుట్టుకొలత కలిగిన నల్ల తుమ్మచెట్టును తెచ్చి దానిని ఒంటి స్తంభంగా చెక్కించి నిలబెట్టి గృహరాజు మేడను కట్టించి అందులో ఆదిలక్ష్మి కామేశ్వరీ దేవతను ప్రతిష్ఠించారని కొండవీటి దండకవిలె, స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ఈ కథలో వాస్తవం ఎంతోగాని కొండవీటిలో గృహరాజు మేడ నిర్మింపబడటం మాత్రం నిజం. కాని ఈ భవనాన్ని పెదకోమటి వేమారెడ్డి నిర్మించలేదు. దాని నిర్మాత కుమారగిరి రెడ్డి. కాటయవేమారెడ్డి శక-

1317 సంవత్సరం గోపవరం శాసనం క్రీ.శ.1330 నాటి కొమరగిరివరం శాసనాలు కుమారగిరి గృహరాజ ప్రాసాదాన్ని నిర్మించాడని తెలుపుతున్నాయి. చాటువులు కూడా గృహరాజు మేడను గూర్చి వర్ణిస్తున్నాయి పెదకోమటి వేముని ఫిరంగిపురం శాసనంలో గృహరాజు మేడలో ఆదిలక్ష్మిని ప్రతిష్ఠించినట్లు తెలుపుతోంది. ఈ మేడకు ఆనుకొని జడ్డిగాల బావి అనే కోనేరు ఉంది. కాటయ వేమారెడ్డి సేనాధిపతి కడియం మాచినేడు ద్రాక్షారామంలో ఆస్థాన మండపాన్ని నిర్మించగా అతని భార్య పోతసాని ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి తిరుచుట్టాలిక అనే రాతి ప్రాకారాన్ని నిర్మించింది. అల్లాడరెడ్డి వద్ద పని చేసిన నాయనపెద్ది పలివెలలోని కొప్పేశ్వర స్వామి దేవాలయంలో శిలామండపం, కళ్యాణవేదికలను నిర్మించాడు. అల్లాడరెడ్డి మరొక ఉద్యోగి మాంచాళ్ల నరహరినేడు రాజమహేంద్రవరంలో 20 స్తంభాల మండపాన్ని నిర్మించాడు. అతడే పాలకొల్లులోని క్షీరారామేశ్వరునికి 16 హస్తాల పొడవు, 8 హస్తాల వెడల్పు గల కళ్యాణమండపాన్ని కూడా నిర్మించాడు. అల్లయ వేముని మంత్రి బెండపూడి అన్న మంత్రి ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి దేవాలయం ముందు ఉన్న సప్తగోదావరి తటాకం ఒడ్డున 12 స్తంభాల మండపం, దాని మీద గోపురాన్ని నిర్మించాడు. అల్లయవేముని మంత్రి బెండపూడి అన్న మంత్రి ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి దేవాలయం ముందు ఉన్న సప్తగోదావరి తటాకం ఒడ్డున 12 స్తంభాల మండపం, దాని మీద గోపురాన్ని నిర్మించాడు. ఇవన్నీ రెడ్డి యుగానికి చెందినవి.

రెడ్డి కాలం నాటి సాహిత్యంలోని ఇతర విశేషాలు: ఎఱ్ఱనను మొదట పోషించినవాడు మల్లారెడ్డి. తర్వాత ఎఱ్ఱన ప్రోలయ ఆస్థాన కవి అయ్యాడు. మహాభారతంలోని అరణ్యపర్వాన్ని తెనిగించి మహాభారతాన్ని పూర్తి చేశాడు. అతడు రాసిన హరివంశం విషయంలోను, ప్రమాణంలోను మహాభారతం తర్వాత స్థానాన్ని ఆక్రమిస్తుంది. ఈ కావ్యాన్ని ప్రోలయ వేమారెడ్డికి అంకితం ఇచ్చాడు. అతడు నరసింహపురాణం, రామాయణం కూడా రచించాడు. కాని రామాయణం లభించలేదు. ఎఱ్ఱయ తెలుగు కవులలోని గొప్పవారిలో ఒకడు తర్వాత ఈ యుగంలో ప్రసిద్ధి చెందినవాడు శ్రీనాథుడు, చక్కని గాంభీర్యమైన శైలి, ఖచ్చితమైన భావసంపదకు శ్రీనాథుడు పెట్టింది పేరు (Elegant style and clear thought). ఈ యుగంలో అనేక మంది కవులు ఉన్నా వీరిద్దరూ ఈ యుగానికి ప్రతినిధులు. వారి కావ్యాలలోని పీఠికలలో వారిని పోషించిన రాజుల వంశవృక్షాలు, ఆనాటి రాజకీయ, సైనిక సాహిత్య కార్యకలాపాలను వర్ణించారు. ఎఱ్ఱన తన వంశవృక్షాలు, ఆనాటి రాజకీయ, సైనిక సాహిత్య కార్యకలాపాలను వర్ణించారు. ఎఱ్ఱన తన నరసింహ పురాణంలో వెలనాటిచోడులను గురించి రాశాడు. హరి వంశంలో ప్రోలయ వేమారెడ్డిని గురించిన వివరాలు ఇచ్చాడు. శ్రీనాథుని కావ్యాలలో నాటి సాంఘిక పరిస్థితులు కండ్లకు కట్టినట్లు వర్ణించాడు. క్రీడాభిరామంలో ఆనాటి పండుగలు, తిరునాళ్లను గురించి ప్రతాపరుద్రుని కాలం నాటి ఓరుగల్లు విశేషాలు వర్ణించబడ్డాయి. శృంగార నైషధంలో ఆనాటి విద్యా విషయాలను గురించి తెలిపాడు హరవిలాసంలో కుమారగిరి రెడ్డి జరిపే వసంతోత్సవాలను వర్ణించాడు. ఆ ఉత్సవాల కాలంలో అవచి తిప్పయ్యశెట్టి ఎన్ని రకాల సుగంధ పరిమళ ద్రవ్యాలు కుమారగిరికి అందించేవాడో తెలిపాడు. పలనాటి చరిత్ర ఆనాడు పలనాటి ప్రజల ప్రశాంత జీవన విధానాన్ని తెలుపుతోంది. భీమఖండం, కాశీఖండాలను బెండపూడి అన్నయ, వీరభద్రారెడ్డిలకు అంకితం ఇచ్చాడు. ఆ కావ్యాల పీఠికలలో అన్నయ, వీరభద్రారెడ్లను గురించిన విషయాలే గాక వారి పూర్వీకులను గురించి, వారు సాధించిన ఘన కార్యాలను కూడా వివరించాడు. ఇవన్నీ చరిత్రకారులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. శ్రీనాథుని కవితాశక్తి అర్ధ శతాబ్దం పాటు తెలుగుభాషను శాసించింది. అతనిని పోషించిన వారందరూ గతించిన తర్వాత కూడా జీవించాడు. అందరి కాలాల నాటి విశేషాలు రాశాడు. ఆనాడు రాజులు కవులనేగాక ఇతర కళాకారులను కూడా పోషించేవారు. ముఖ్యంగా నాట్యకత్తెలను ఆదరించేవారు. లకుమాదేవి కుమారగిరి చేత ఆదరింపబడిన గొప్ప నాట్యకత్తె. కుమారగిరి, పెదకోమటి వేమారెడ్డిలు స్వయంగా కావ్యాలు రాసి సంస్కృతాన్ని సుసంపన్నం చేశారు. వసంతరాజీయం, శృంగారదీపిక నాటి సంస్కృత కావ్యాలలో మకుటాలు. కళలు, సాహిత్యం, సంగీతం, తెలుగు సంస్కృతిని పోషించి ఆంధ్రదేశానికి సేవ చేశారు. అద్దంకి, కొండవీడు, రాజమహేంద్రవర విద్యలకు నిలయాలయ్యాయి. కాటయ, కుమారగిరి, పెదకోమటి వేమారెడ్డి, కాటయవేమారెడ్డి, వీరభద్రారెడ్డి పేర్లు శాశ్వతమైనవి.

ఈ కాలంలో తెలుగు భాషలో పురాణాలు, ప్రబంధాలు అనే రెండు రకాల కావ్యాలు రాయబడ్డాయి పురాణాలు ఎక్కువగా వచనంలో రాయబడ్డాయి. ప్రబంధాలు పద్యం తర్వాత వచనంగా రాయబడ్డాయి. కాని వాటి ఇతివృత్తాలు పురాణాల నుండే తీసుకున్నారు. పురాణాలు రాయడంలో కవి ఊహాశక్తి, వర్ణనాశక్తిలో తన సత్తా

చూపవలసి ఉంటుంది. ఈ యుగంలో పురాణ రచనలు చేసిన ఎర్రన ప్రబంధాల రచనకు కూడా పునాదిని వేశాడు. అందువల్ల అతనికి శంభుదాసు, ప్రబంధ పరమేశ్వరుడు అని కూడా బిరుదులు వచ్చాయి. శ్రీనాథుడు పురాణాలకు ప్రబంధాలకు మధ్యేమార్గంగా రచించి రెండు విధానాలను సుసంపన్నం చేశాడు. అతని మధురమైన వర్ణనా రీతిని మిగిలిన ప్రబంధ కవులు అనుసరించారు. శ్రీనాథుని వచనం కూడా పద్యం లాగా లాలిత్యంగా నడుస్తుంది. ఈ విధానంలో అతడు నన్నయను అనుసరించాడు. నన్నయ తన మహాభారతంలో వచనం, పద్యం రెండూ ఉపయోగించాడు. అలాంటి కావ్యాలను చంపూ కావ్యాలని అంటారు. కావ్య రచనలో నన్నయ పద్యవచన రచనా విధానాన్ని పరిపుష్టం చేశాడు.

శాసనాలలో తెలుగు వచనం: అనేక తెలుగు శాసనాలు వచనంలో రాయబడ్డాయి. నన్నయ తన మహాభారతంలో వాడిన వచనా విధానం తెలుగు శాసనాల రచనా విధానాన్ని ప్రభావితం చేసిందని అంటారు. అతని పద్యరచన సున్నితంగా ప్రవాహం లాగా ఉంటుంది. అతని వచనం శ్లోకం లాగా ఉంటుంది. కనుక దానిని పద్యాత్మక గద్యం అని కొందరు వ్యాఖ్యానించారు. వచన పద్యం లాగా ప్రవాహంగా నడుస్తుంది. కాని ఛందస్సు ఉండదు. కనుక తూర్పు చాళుక్యులు తమ శాసనాలలో నన్నయ రచనా విధానాన్ని అనుసరించారు. అలాగే శ్రీనాథుని రచనా విధానం రెడ్డి రాజులు తమ శాసనాలలో నన్నయ రచనా విధానాన్ని అనుసరించాడు. రెడ్డి రాజులు శాసనాలలో పద్యాత్మక గద్యాలు లేవు. అయితే రెడ్డి రాజులకు పూర్వమే గద్యాత్మక తెలుగు శాసనాలు ఉన్నాయి. తొలి గద్యాత్మక శాసనాలు తెలుగు చోడ యుగంలోనే ప్రారంభమయ్యాయి. కాని అందులో పదాలు నేడు మనం వాడే పదాలకు చాలా తేడా కనిపిస్తుంది. కొన్ని పదాలు మనకు అర్థం కావు. ఉదాహరణగా కొన్ని పదాలు చూడండి. పొట్లదుర్తి, మాలెపాడు శాసనాలు రేవణకలు, పుద్దంకలు అనే దాతలను పేర్కొన్నాయి. అలాగే సత్యాధిత్యచోళుని శాసనంలో కొద్కుల్ అనే పదం భోజ అనే పదం నుండి వచ్చిందని అంటారు. వెలనాటి పృధ్వీశ్వరుని పిఠాపురం శాసనంలో హవిర్‌బల్ అర్చన అనే పదం ఉంది. అనపోతారెడ్డి కొమ్ముచిక్కాల శాసనం సగం తెలుగు, సగం సంస్కృతంలో రాయబడింది. ఇందులో తెలుగు నేటి తెలుగు లిపికి కొద్దిగా దగ్గరగా ఉంది. రెడ్డి శాసనాలన్నీ ఆనాడు వారు మాట్లాడే తెలుగు పదాలతోనే రాసినట్లుగా కనిపిస్తోంది. వీరి శాసనాలలో రాణులకు సాని అనే పదం ప్రయోగించారు. ఈ రోజున ఈ పదం అర్థం మారిపోయింది. కాని ఆనాడు ఈ పదం చాలా గౌరవప్రదమైంది. అలాగే గౌరవవాచకంగా గారు అనే పదం వాడారు. ఇది తమిళంలోని గల్ పదం వంటిది. గారు నేడు కూడా గౌరవప్రదంగా వాడుతున్నాం. అగు, అవ అనే పదాలు వాడారు. నన్నయ భారతంలో అగు, బసవ పురాణంలో అవ అని వాడబడ్డాయి. ఎక్కువ శాసనాలలో తెలుగు వచనం, తెలుగు పద్యాలతో పాటు సంస్కృత శ్లోకాలు, సంస్కృత వచనం కూడా కలిపి లిఖించారు.

పద్మనాయకుల నాటి సంస్కృతి

పద్మనాయకుల కాలంలో సాంఘిక పరిస్థితులలో కొంత మార్పు వచ్చింది. ముస్లింల దండయాత్రల వల్ల బ్రాహ్మణులు కుల వృత్తికి దూరమయ్యారు. రాజాస్థానాలలో ఉద్యోగాల కోసం ప్రయత్నించారు. ఉద్యోగాలు లభించిన వారు వ్యవసాయాన్ని కూడా చేపట్టారు. బ్రాహ్మణులలో వైదిక, నియోగిక అనే శాఖలు ఏర్పడ్డాయి కొందరు వేదాధ్యయనాన్ని వదలలేదు. వారు తర్క, వ్యాకరణ, జ్యోతిష్య, గణిత, వైద్య శాస్త్రాలలో పాండిత్యం సంపాదించి రాజాస్థానాలలో కవులుగా చేరి కావ్యాలు రాశారు.

ఈ కాలంలో క్షత్రియ కులం ఉన్నట్లు లేదు. ఆధారాలు లేవు. చాళుక్య వంశాలు అక్కడక్కడ ఉన్నాయి గాని వారు తమ కుల స్వచ్ఛతను కాపాడుకొని ఉన్నట్లు లేదు. శూద్రకులాలైన కమ్మ, రెడ్డి, వెలమ కులాల ప్రాభవం పెరిగింది. వీరు రాజ్యస్థాపకులై పాలక కుటుంబాలుగా మారారు. అందువల్ల ఈ కులాలు ఒకరిపై ఒకరు ఈర్ష్యాద్వేషాలు పెంచుకున్నారు. మిగిలిన శూద్రకులాలు ఎవరి వృత్తిని వారు కొనసాగించారు. వైశ్యులు, బలిజలు సాంప్రదాయకమైన వ్యాపారాన్ని కొనసాగించారు.

వైష్ణవమత ప్రచారం వల్ల అన్ని కులాలలో విద్యాభ్యాసం చేయాలనే కోరిక కలిగింది. ప్రజలలో మూఢ నమ్మకాలు ఉండేవి. శకునాలయందు అమిత నమ్మకం ఉంది. పంచాంగం వాడుకలో ఉండేది. పంచాంగం చూసి ముహుర్తాలు పెట్టించుకొని ప్రతీ పనీ చేసేవారు. రాజులు కూడా ముహూర్తాలు నిర్ణయించుకొని యుద్ధాలు ప్రకటించేవారు. గ్రామాలలో కోలాటాలు. భజనలు, దేవాలయాలలో జరిగే ఉత్సవాలు, వినోదాలు, కోళ్ల పందేలు, మేకలు, పొట్టేళ్ల పందాలు, వీధినాటకాలు, పురాణ శ్రవణం, గచ్చకాయ లాటలు, పులి జూదాలు నాటి ప్రజలకు వినోదాలు. వివాహాలు ఐదు రోజులు వైభవంగా జరిగేవి. రాచ కుటుంబపు వివాహాలు రాజ్యమంతటా వేడుకగా జరుపుకొనేవారు. ప్రజల నిత్యజీవితంలో మార్పులు లేవు. వ్యవసాయం కూలి పని చేసుకునేవారు. ప్రజలు ఆర్థికంగా బీద స్థితిలో ఉన్నారు. పైగా వారిపై పన్నులు కూడా ఎక్కువ. అందువల్ల ప్రజలు అప్పులు చేసేవారు డబ్బు ఇచ్చినవారు పత్రాలు రాయించుకొని మసవడ్డీ, చక్రవడ్డీలు వసూలు చేసేవారు. ఈ కాలంలో వడ్డీ వ్యాపారులు చాలా అన్యాయాలు చేసేవారని సాహిత్యంలో ప్రస్తావనలు ఉన్నాయి.

విలాస జీవితం: ఈ కాలంలో ప్రజలు భోగలాలసులయ్యారు. వేశ్యావృత్తి బాగా పెరిగింది. రాజులు, సామంతులు సామాన్య ప్రజలు చివరకు బ్రాహ్మణులు కూడా వేశ్యాలంపటుత్వానికి అర్రులు చాచారు సింగభూపాలుడు పోతన చేత భోగిని దండకం రాయించాడట. అతనికి సర్వజ్ఞ అనే బిరుదు ఉంది. తప్పొప్పులు తెలిసిన విజ్ఞాని, అతడే భోగాలకు దాసుడైతే ఇక సాధారణ ప్రజల మాట చెప్పనక్కరలేదు. ప్రతాపరుద్రుడు మాచలదేవుని ఆదరించినట్లు సర్వజ్ఞ సింగన కూడా వేశ్యలను పోషించాడు. తిరునాళ్లలో జాతరలు, ఉత్సవాలలో స్త్రీ, పురుషులు విచ్చలవిడిగా విహరించేవారట. మొత్తం మీద ప్రజలు, రాజు నీతినియమాలను పాటించలేదు. కాని వైదిక ధర్మాన్ని రక్షించారు. హేమాద్రి తన వ్రతఖండ కల్పతరువులో సూచించిన దానాలు చేశారు. వర్ణాశ్రమ ధర్మాలను కాపాడారు.

దుస్తులు: ఈ కాలం పురుషులు పంచె, అంగీలు ధరించి తలపాగాలు పెట్టుకొనేవారు. స్త్రీలు రంగు రంగుల చీరెలు ధరించేవారు. కాశీకట్టు కట్టుకొనేవారు. రంగుల అద్దకాలు ఉండేవి.

ఆర్థిక పరిస్థితులు: పద్మనాయకుల కాలంలో కాకతీయుల కాలం నాటి ఆర్థిక పరిస్థితులే కొనసాగాయి వ్యవసాయం ప్రధాన వృత్తి. వ్యవసాయాభివృద్ధికి వెలమ రాజులు అనేక చెరువులు తవ్వించారు. అనపోతు సముద్రం, నాగసముద్రం, రాయసముద్రం మొదలైన తటాకాలు వీరి కాలంలో నిర్మింపబడ్డాయి. పాత చెరువులను, కాలువలను బాగు చేయించారు. ఇంకా బావులు, కుంటలు, నదులు కూడా నీటివనరులుగా ఉండేవి. ఏతాముల ద్వారా రాట్నాల ద్వారా నీళ్లు తోడేవారు. కాకతీయుల కాలం నాటి తటాకాలు వీరు తవ్వించిన చెరువుల వల్ల తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధి చెందింది. వరి పంట పుష్కలంగా పండేది. ఈ కాలంలో రకరకాల వరి పంటలు పండేవి. కలమ, శాలి, శిరాముఖి, పతంగ హొయన అనే వరి రకాలు ఉండేవి. నీటి వనరులు లేని చోట వర్షాధారంగా మెట్ట పంటలు పండించేవారు. జొన్న, సజ్జ ముఖ్యమైన మెట్ట పంటలు. ఇంకా నువ్వులు, ప్రత్తి, మిరప మొదలైన వ్యాపార పంటలు పండించేవారు. ఇంకా చెరకు, అరటి, కొబ్బరి, కూరగాయలు, ఆకుతోటలు

కూడా పండేవి. ఈ కాలంలో అనేక మంది వ్యవసాయ వృత్తిని చేపట్టారు. ఉద్యోగాలు దొరకని బ్రాహ్మణులు కూడా వ్యవసాయాన్ని చేపట్టారు. బమ్మెర పోతన అలాంటి వారిలో ఒకడు.

పరిశ్రమలు: తెలంగాణలో అనేక పరిశ్రమలు వృద్ధిలో ఉండేవి. ప్రధాన పరిశ్రమ వస్త్ర పరిశ్రమ. ఓరుగల్లు, దేవరకొండ వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందాయి. దాంతోపాటే కలంకారీ అద్దకపు పరిశ్రమ పెరిగింది. అలాగే రత్నకంబళ్లు, తివాచీల నేత కూడా పెరిగింది. గ్రామాలలో స్త్రీలు రాట్నాల మీద నూలు వడికే వారు. సుగంధ ద్రవ్యాలు, పట్టుబట్టలు దిగుమతి చేసుకునేవారు. పాంచాణం వారు గంటలు, స్తంభాలు, చలికెలు తయారు చేసేవారు. వంట పాత్రలు, పంచలోహాలతో కొలువు చెవికలు, గజగంటలు, స్తంభాలు, చలికెలు తయారు చేసేవారు. వంట పాత్రలు, పంచలోహాలతో కొలువు చెవికలు, గజగంటలు, జయస్తంభాలు, దీపస్తంభాలు, దేవతావిగ్రహాలు, వ్యవసాయ పరికరాలు, స్త్రీలకు బంగారు, వెండి ఆభరణాలు కూడా పాంచాణం వారు తయారు చేసారు. పాంచాణం వారు గాక గ్రామాలలో ద్వాదశ వృత్తులవారుండేవారు. ఇంకా ఆనాడు గాజు, అద్దాల పరిశ్రమలుండేవి. గాజురెక్కల ప్రస్తావన సాహిత్యంలో ఉంది. కాగితం వాడుకలోకి వచ్చింది. కాగితాన్ని ముస్లింలు ప్రవేశపెట్టి ఉండవచ్చును. ఆయుధాల పరిశ్రమలు కూడా ఉండేవి. ఉక్కు పరిశ్రమ ఉండేది. నిర్మల్ ఉక్కు కత్తులు పేరెన్నిక గన్నవి.

వీరి కాలంలో బలిజలు, వైశ్యులు విదేశీ వ్యాపారం చేసేవారు. కృష్ణాతీరంలోని వాడపల్లి వీరి నౌకా కేంద్రం. వాడపల్లిపై ఆధిపత్యం కోసం రెడ్డి రాజులకు పద్మనాయకులకు తరచూ ఘర్షణలు జరుగుతుండేవి. కాకతీయుల కాలంలో ఉన్న నాణేలు, తూకాలు, కొలతలు అమలులో ఉన్నాయి. పుణ్యక్షేత్రాలలో పండుగలకు జాతరలకు సంతలు జరిగేవి. వారపు సంతలు కూడా ఉండేవి. వ్యాపారులు అనేక ప్రాంతాల నుండి తెచ్చే సరుకులను ఆ సంతలలో విక్రయించేవారు. పద్మనాయకులకు వ్యాపార సంతల వల్ల కూడా సుంకాల రూపంలో ఆదాయం వచ్చేది. కాని వీరి ఆదాయంలో ఎక్కువ భాగం యుద్ధాలకు ఖర్చు అయ్యేది.

పద్మనాయకుల కాలంలో మత పరిస్థితులు: పద్మనాయకుల కాలంలో తెలంగాణలో శైవవైష్ణవమతాలు రెండూ వర్ధిల్లాయి. పద్మనాయకులలో మొదటి వారు శైవులు. చివరి రాజులు వైష్ణవమతం పుచ్చుకున్నారు. శైవమతంలో తీవ్రవాదం ప్రవేశించింది. పద్మనాయకుల కాలంలో భైరవాలయాలు మైలారుదేవుని గుడులు వెలిశాయి. భైరవపూజ ప్రాచుర్యం పొందింది. పద్మనాయకులు అనేక భైరవ విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. భైరవారాధన ఫలితంగా ఈ కాలంలో రణం కూడా అనే ఆచారం వచ్చినట్లుగా కనిపిస్తోంది. ఇంకా ఈ కాలంలో కాళికాదేవి, దుర్గాదేవి, చండి, భద్రకాళిని, మహిషాసురమర్ధనిలను పూజించే ఆచారం కూడా ప్రబలింది. అలాగే గ్రామ దేవతలైన కట్టమైసమ్మ, రేణుక, ముత్యాలమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతల పూజలు కూడా ఉన్నాయి. ఆ గ్రామ దేవతలకు బలులిచ్చేవారు. ఆ కాలంలో నాగపూజ కూడా తెలంగాణలో ప్రాచుర్యంలో ఉంది. నాగపంచమినాడు, నాగులచవితినాడు పాములకు పుట్టలలో పాలు పోసి పూజ చేసేవారు. తమ రాజధాని రాచకొండలో భైరవ ఆలయం నిర్మించారు. దుర్గాదేవి ఆలయం కూడా నిర్మించారు. ఇవన్నీ తీవ్రవాద శైవమతానికి నిదర్శనాలు. ఇంకా శాక్తేయ మతారాధన కూడా ఉంది.

పద్మనాయకుల చివరి కాలంలో వైష్ణవమతాన్ని స్వీకరించారు. సర్వజ్ఞ సింగన కోరికపై వేదాంత దేశికుడు సుభాషితనీతి, తత్వ సందేశం, రహస్య సందేశం అనే గ్రంథాలు రాసి రాచకొండ' పంపాడట. కుమారుడు వరదాచార్యుడు వైష్ణవమత ప్రచారం చేయడానికి రాచకొండ వచ్చాడు. అతను సర్వజ్ఞ సింగన మనసును గెలుచుకున్నాడు. అందువల్ల సింగన నైనాచార్యుల వద్ద వైష్ణవ దీక్ష పుచ్చుకున్నాడు. పరాశరభట్టు కూడా శాకల్య మల్లుభట్టును ఓడించాడట. అందువల్ల వెలమ రాజ్యంలో వైష్ణవమతం త్వరితగతిన అభివృద్ధి చెంది అనేక విష్ణాలయాలు నిర్మింపబడ్డాయి. రాచకొండలో రామాలయం కూడా నిర్మింపబడింది. 'వెలమ రాజ్యంలో నైనాచార్యుడు వైష్ణవమత ప్రచారం చేశాడని గురుపరంపరాప్రభావ అనే గ్రంథం తెలుపుతోంది. పద్మనాయకులు బ్రాహ్మణులకు దానాలు చేశారు. అగ్రహారాలు ఇచ్చారు. వైదికమతాన్ని కాపాడారు. ముస్లిం దండయాత్రల వల్ల నాశనమైన హిందూ దేవాలయాలను పునరుద్ధరించారు. యుద్ధాలలో విజయం లభించినప్పుడు ప్రసిద్ధక్షేత్రాలు దర్శించి దేవాలయాలకు దానాలు చేసేవారు. ఎన్ని చేసినా వారు రెడ్డి రాజులతో వైరం పూని వారితో అనవసర యుద్ధాలు చేసి ప్రజల బాధలకు కారకులయ్యారు. చివరకు బహమనీ రాజ్యం విస్తరించడానికి దోహదం చేశారు. వెలమ రెడ్డి రాజ్యాలు కలసికట్టుగా ఉంటే ఆంధ్రదేశం ముస్లింల పాల పడకుండా ఉండేది.

పద్మనాయకుల భాషా సారస్వత పోషణ: పద్మనాయకులు భాషా సారస్వతాలను బాగా పోషించారు సారస్వత పోషణలో వారు రెడ్డి రాజులతో పోటీపడ్డారు. వీరు కూడా సంస్కృత ఆంధ్ర రెండు భాషలను పోషించారు. వీరి కాలంలో పండితులు జ్యోతిష్యం, షడ్దర్శనాలు, మీమాంస, శబ్దశాస్త్రాలు, సాహిత్య సంగీత శాస్త్రాలు అధ్యయనం చేశారు. సంస్కృత ఆంధ్ర భాషలలోనేగాక పారశీక, అరబ్ భాషలను కూడా నేర్చుకున్నారు అందుకు కారణం వారి రాజ్యం పక్కనే బహమనీ రాజ్యం ఉంది.

సంస్కృతం: పద్మనాయకులలో సర్వజ్ఞ సింగన చాలా గొప్పవాడు. ఇతడు స్వయంగా కవి. అతడు సాహిత్య సృష్టిలో రెడ్డిరాజైన పెదకోమటి వేమారెడ్డికి దీటైనవాడు. అతడు రసార్ణవ సుధాకరం అనే లక్షణ గ్రంధాన్ని లేక అలంకార శాస్త్రాన్ని, రత్నపాంచాలిక అనే నాటకాన్ని రచించాడు. దీనికే కువలయావళి అని కూడా పేరుందట ఈ నాటకం నాలుగు అంకాలు గలది. ఇందులోని ఇతివృత్తం శ్రీకృష్ణునితో కువలయావళికి వివాహం జరగడం ఈ నాటకంలో కవిత నమతాను లలిత కవితా విలాస చతురానామా అని వర్ణించుకున్నాడు. ఇంకా అతనికి ప్రతిగండభైరవ, ఖడ్గనారాయణ అనే బిరుదులున్నట్లు కూడా ఈ నాటకం తెలుపుతుంది. ఈ రత్నపాంచాలిక నాటకాన్ని రాచకొండలోని ప్రసన్నగోపాలదేవుని ఆలయం వద్ద జరిపే వసంతోత్సవాల సమయంలో ప్రదర్శించే వారట. ఇదేకాక అతడు రసార్ణవ సుధాకరం, రత్నపాంచాలిక అనే మరో రెండు కావ్యాలు కూడా రచించాడు సింగభూపాలునికి లక్ష్యలక్షణవేది, సర్వజ్ఞ చూడమణి అనే బిరుదులున్నాయి. సింగన గొప్ప కవియే గాక అనేక మంది కవులను, పండితులను పోషించాడు. ఇతని ఆస్థానంలో బొమ్మకంటి అప్పయాచార్యుడు, విశ్వేశ్వరుడు అనే ఇద్దరు కవులు ఉన్నారు. వారిలో అప్పయాచార్యుడు అమరకోశానికి వ్యాఖ్యానం రచించాడు. విశ్వేశ్వరుడు చమత్కారచంద్రిక అనే అలంకార శాస్త్రాన్ని రచించాడు. అతడు తన గ్రంథంలో సింగభూపాలుని సాహిత్యశిల్పావధి అని కీర్తించాడు. ఇంకా అతడు తన ప్రభువు ప్రజ్ఞను వర్ణిస్తూ లక్ష్యలక్షణవేది అయిన కుమారసింగన ఏ కావ్యాన్ని అయినా చెప్పాడంటే ఎవరు దానిని బాగుంది అని అన్నా లాభం లేదు అని కీర్తించాడు. అంటే రెండవ సింగన తిరుగులేని పాండిత్యం కలవాడని అర్థం. అందువల్ల బొమ్మకంటి అప్ప ఆర్య అతనిని సర్వజ్ఞసింగభూపాల అని వర్ణించాడు. ఇలాంటి బిరుదు పెదకోమటి వేమారెడ్డికి కూడా ఉంది.

రెండవ సింగన ఆస్థానకవి విశ్వేశ్వరుడు రాసిన చమత్కార చంద్రికలో సింగన రాసిన రసార్ణవ సుధాకరాన్ని ప్రస్తావించాడు. కనుక చమత్కారచంద్రిక కంటే రసార్ణవ సుధాకరం ముందు రాయబడిందని తెలుస్తోంది విజయనగర యువరాజు రెండవ సంగముని బిట్రగుంట శాసనం రచించిన భోగనాధుడు తన అలంకార సుధానిధిని క్రీ.శ.1356-58 మధ్య రాశాడు. అందులో విశ్వేశ్వరుని చమత్కార చంద్రికలోని చక్రబంధాలను తన గ్రంథంలో పేర్కొన్నాడు. కనుక క్రీ.శ.1356 కంటే ముందే తన గ్రంధాన్ని రాసి ఉండాలి. క్రీ.శ.1356 కంటే ముందే రెండవ సింగన రసార్ణవ సుధాకరాన్ని రాసి ఉంటాడు. మిగిలిన అతని కావ్యాలు ఎప్పుడు రాసిందీ చెప్పలేము. విశ్వేశ్వరకవి రసమీమాంస రాసిన కాశీశ్వరమిశ్రా శిష్యుడు. ఇతడు రాసిన చమత్కారచంద్రిక ఎనిమిది విలాసాలు కలిగిన లక్షణశాస్త్రం. ఇందులో శబ్దాలంకారాలు, ధ్వనులు వివరించబడ్డాయి.

సింగభూపాలుని కుమారుడైన రావుమాదానేడు కూడా గొప్ప పండితుడే. అతడు శ్రీమద్రామాయణం మీద రాఘవీయ అనే వ్యాఖ్యానం రాశాడు. మాదానేడు భార్య వేయించిన నాగారం శాసనంలో ఈ విషయం రాయబడి ఉంది. రేచర్ల రెండవ సింగని ఆస్థానంలో శాకల్యమల్లుభట్టు అనే పండితుడు ఉండేవాడు. అతడు మహాకవి అతడు నిరోష్ట్యరామాయణం, ఉదారరాఘవం అనే కావ్యాలు, అన్వయ సంగ్రహ అనే నిఘంటువును రచించాడు ఈ నిఘంటువులో తాను చతుర్భాషా కవితాపితామహుండనని చెప్పుకున్నాడు. శాకల్యభట్టును వైష్ణవ ఆచార్యుడైన నైనాచార్యుడు ఓడించినట్లు వైష్ణవ సాంప్రదాయం తెలుపుతుంది. వీరికాలంలో కవిత్వంలో అనేక ప్రయోగాలు అభివృద్ధి చెందాయి. అవధాన విద్య సమస్యాపూరణం, గర్భగోప్యబంధ, అక్షరచ్యుతి, మాత్రాచ్యుతి, ఏక ద్విసంధాగ్ర మొదలైన ప్రక్రియలు వచ్చాయి. నాట్యశాస్త్రాలు కూడా రాయబడ్డాయి. రకరకాల నాట్యాలు వాడుకలోకి వచ్చాయి భరతనాట్యం, జక్కిణి, గొండ్లి, పేరిణి, బిందు, పారశీకమత్తల్లి మొదలైన నాట్యాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఢక్క ఝర్ఝరి, ఝల్లరి, భేరి, కాహళ, హుడక్క మొదలైన వాయిద్యాలు ఉన్నాయి.

నాగనాథ: మొదటి అనపోత ఆస్థానంలో నాగనాధుడు అనే సంస్కృత కవి ఉండేవాడు. అతడు పశుపతి పండితుని కుమారుడు. విశ్వేశ్వరుని శిష్యుడు. ఇతడు సంస్కృత భాషలో మదన విలాసబాణం అనే నాటకాన్ని రచించాడు. మొదటి అనపోత వేయించిన ఐనవోలు శాసనాన్ని ఇతడే రచించాడు. ఇది శిలాశాసనం. శక 1291

క్రీ.శ.1369లో వేయించబడింది. ఇతడు అనపోత నాయకీయం అనే మరొక నాటకం కూడా రాశాడు. అది లభ్యం కాలేదు. కాని దానిని కుమారసింగన తన రసార్ణవసుధాకరంలో ప్రస్తావించాడు. పెద్దన పోతరాజు అనే మరొక పండితుడు మొదటి మాదానాయకుడు వేయించి ఉమామహేశ్వర రాతి శాసనాన్ని లిఖించాడు. ప్రతి వాక్యం గొప్ప కవిత్వంతో ఉంది. ఈ శాసనం శక 1298 సంవత్సరానిది. రెండవ సింగన ఆస్థానకవి బొమ్మకంటి అప్పయార్య అమరసింహుని అమరకోశానికి అమరకోశ వ్యాఖ్యానం రాశాడు. ఈ గ్రంథం వల్ల అప్పయార్యకు మాదపోత అనే మరొక పేరున్నట్లు తెలుస్తోంది. కనుక అతని పూర్తి పేరు పోత అప్పయ్య అయి ఉంటుందని భావించారు.

శాకల్య మల్లుభట్టు: రేచర్ల వారి ఆస్థానంలో ప్రసిద్ధి పొందిన మరొక కవి శాకల్య మల్లుభట్టు. అతడు ప్రతాపచరిత్ర రాశాడు. ఇతడు కాకతీయ ప్రతాపరుద్రుని కాలం వాడు కావచ్చును. తర్వాత మొదటి సింగన సమకాలికుడై ఉంటాడు. అతడు రాసిన ప్రసంగ రత్నావళిలో మొదటి హరిహరరాయలను ఒక శ్లోకం కీర్తించింది. కనుక ఇతడు మొదట విజయనగర ఆస్థానంలో నివసించి ఉండవచ్చును. గురు పరంపర ప్రబంధం అనే గ్రంథం వల్ల అతడు రేచర్ల ఆస్థాన కవి అని తెలుస్తోంది. కాని ఎవరి ఆస్థానంలో ఉందీ స్పష్టంగా తెలియడం లేదు. ఇతడు శాకల్యమాధవసుధ కుమారుడట. ఇతడు నిరోష్ఠ్య రామాయణం, ఉత్తరరాఘవం అనే రెండు కావ్యాలు రాశాడు. అతడు అవ్యయ సంగ్రహ నిఘంటువును కూడా రాశాడు. ఉత్తర రామాయణం 9 సర్గలతో శూర్పణక శిఖాచ్ఛేదనంతో ఆగిపోయింది. ఈ గ్రంథంలోనే అతను మాధవభట్టు కుమారుడని తెలిసింది. అవ్యయ నిఘంటువు శాకల్య మల్లుభట్టుకు చతుర్భాషా కవిత పితామహంక అనే బిరుదు ఉన్నట్లు తెలుపుతోంది. అంటే నాలుగు భాషలలో పండితుడని అర్థం.

మత గ్రంథాలలో స్తోత్రాలు, అష్టకాలు, గద్యాలు రాయబడ్డాయి. తెలుగు సాహిత్యం కూడా వీటిని ప్రస్తావిస్తుంది. నీలకంఠస్తవ, మహిమస్తోవ, మహిమస్తోత్ర, హాలాయుధస్తోత్ర, సంసార మాయోత్సవ, మల్వావాస్తవ, బాణగద్య, ఆనామయస్త్వమలయరజ స్తోత్ర కాళిదాస గద్య మొదలైనవి రాయబడ్డాయి. పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రలో ఈ స్తోత్రాలను పేర్కొన్నాడు. వీటిలో నీలకంఠ స్తోత్రం చాలా ప్రచారంలో ఉంది. శ్రీనాథుడు, పోతరాజు కూడా ఈ స్తోత్రాలను తమ గ్రంథాలలో ప్రస్తావించారు.

తెలుగు కావ్యాలు: సంస్కృతంతోపాటు పద్మనాయకులు తెలుగు భాషను పోషించారు. వారి ఆస్థానంలో కూడా అనేక తెలుగు కావ్యాలు రచించబడ్డాయి. రెడ్డి ఆస్థానకవి ఎర్రాప్రెగడ అరణ్యపర్వాన్ని తెనిగించి భారత ఆంధ్రీకరణ పూర్తి చేశాడు. రెడ్డి ఆస్థానంలో భారత ఆంధ్రీకరణ పూర్తి కాగా పద్మనాయకుల ఆస్థానంలో రామాయణం ఆంధ్రీకరించబడింది. ఆ కాలంలోని ద్విపద కావ్యాలలో రంగనాథ రామాయణం కూడా ఒకటి. ఈ కావ్యాన్ని గోనబుద్ధ రాజు తన తండ్రి విఠల్ ధరణీశుని పేరన రాశాడు. అతడు గోన గన్నయ సామంతుడుగా రాయచూరును పాలించాడని కొందరన్నారు. కాని ఈ కావ్యం కాకతీయుల కాలం నాటిదని ప్రతీతి. ఈ కావ్యానికి రంగనాథ రామాయణం అని పేరు రావడానికి కారణం రంగనాథుడనే ప్రసిద్ధ కవి సహాయంతో రాసినందున ఆ పేరు వచ్చిందని అంటారు. కాని విఠలుడికి పాండురంగ విఠల అని పేరుంది కనుక అతని కావ్యానికి రంగనాథ రామాయణం అనే పేరు వచ్చిందని మరొక వాదన. రంగనాథ రామాయణం క్రీ.శ.1340వ సంవత్సరంలో రాయచూరులో రచించబడింది అని ఆరుద్ర తీర్మానించారు. కాని ఆ కాలం నాటికి రాయచూరు విజయనగర రాజ్య భాగంగా ఉంది. గోన గన్నయ అనే అతడు అక్కడ పాలకుడుగా లేడు. కనుక ఈ రామాయణం కాకతీయుల కాలం నాటిదని చెప్పవచ్చును.

రేచర్ల పద్మనాయక ఆస్థాన కవులు: రేచర్ల పద్మనాయక ఆస్థానంలో కూడా అనేక కవులుండేవారు. వారిలో పూసపాటి నాగనాథుడు, అయ్యలార్య, గారన, కొరవి గోపరాజు, బమ్మెర పోతన ప్రముఖులు.

పూసపాటి నాగనాథుడు తెలుగులో విష్ణు పురాణాన్ని రాశాడు. మొదటి అనపోతానాయకుని ఐనవోలు శాసనాన్ని రాసిన కౌశిక గోత్రీకుడైన పూసపాటి పండితుని కుమారుడైన నాగనాథ కవి ఇతడు ఒకరేనని చరిత్రకారుల అభిప్రాయం. ఈ గ్రంథంలో పద్మనాయకుల విజయాలు కూడా వర్ణింపబడ్డాయి. భైరవ కవి అనే మరొక కవి కూడా ఈ కాలం వాడే. అతడు ముమ్మడి సర్వజ్ఞ సింగనకు సమకాలికుడు.

శాకల్య అయ్యలార్య: దేవరకొండ రేచర్ల వంశస్థులచే ఆదరింపబడిన కవి అయ్యలార్యుడు. ఇతడు భాస్కర రామాయణంలోని యుద్ధకాండాన్ని పూర్తి చేశాడు. భాస్కర రామాయణాన్ని పరిశీలించినట్లయితే ఒక్కరు రచించినట్లుగా కనిపించదు. మల్లికార్జునభట్టు, కుమార రుద్రదేవ, అయ్యలార్యుడు తలా కొంత రాసినట్లు

కనిపిస్తోంది. యుద్ధకాండను ఇద్దరు రాశారు. అందులో ఒకరు అయ్యలార్యుడు. హుళక్కి భాస్కరుడు కొంత రాసి వదిలి వేసిన యుద్ధకాండను ఇతడు పూర్తి చేశాడు. ఇతు దేవరకొండను పాలించిన పెదవేదగిరి కోరిక వల్ల యుద్ధకాండను పూర్తి చేశాడు. కనుక ఇతడు పెదవేదగిరికి సమకాలికుడు. ఇతని గ్రంథంలో అతడు అప్పలార్య కుమారుడననీ, శాకల్యమల్లు రామనరసింహుని తమ్ముడనీ చెప్పుకున్నాడు. ఇతడు నిరోష్ఠ్య రామాయణాన్ని రాసిన శాకల్యభట్టు మనుమడు.

గారన: పద్మనాయకుల ఆస్థానంలో ప్రసిద్ధి పొందిన మరొక కవి గారన. ఇతడు తెలంగాణ వాసి. గౌతమి గోత్రానికి చెందినవాడు. ఇతని తండ్రి అయ్యలార్య, తల్లి పోచమాంబ. ఇతడు తెలుగులో హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్ర అనే రెండు ద్విపద కావ్యాలు రాశాడు. సంస్కృతంలో లక్షణ దీపిక అనే మరొక అలంకార గ్రంధాన్ని రాశాడు. ఇతడు తన కావ్యాలలో తన పెద తండ్రి పెద్దన పోతరాజు అని చెప్పుకొన్నాడు. అతడు దేవరకొండను పాలించిన రెండవ మాదానాయకుని మంత్రి. కనుక గారన 15వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు శైవమతస్తుడు. శైవకవులు దేశిపదాలను ఉపయోగించి ద్విపదకావ్యాలను రాశారు. గారన తన నవనాథ చరిత్రను శ్రీశైలంలోని భిక్షు వృత్తి మఠాధిపతి ముక్తి శాంతారాయనికి అంకితం చేశాడు. ఇతని ముమ్మడి శాంతయ్యకే శ్రీనాధుడు కూడా తన శివరాత్రి మహత్మ్యాన్ని కూడా అంకితం చేశాడు. కనుక గారన, శ్రీనాధుడు సమకాలికులు, తెలుగులో శ్రీగిరికవి కూడా గారన కంటే ముందే నవనాథ చరిత్రను రాశాడు. కాని అది పద్య కావ్యం. గారన రాసింది ద్విపద కావ్యం. గారన నవగ్రహస్తోత్రం అని మరొక పద్య కావ్యం కూడా రాశాడట. ఇది నవగ్రహాలను స్తోత్రం చేసే పద్యాలు. ఇవి లభించలేదు. కాని ఇందులోని పద్యాలను తర్వాత కాలానికి చెందిన పెదపాటి జగన్నాధ కవి తన గ్రంథంలో ఉదహరించాడు. హరిశ్చంద్రోపాఖ్యానం కూడా ద్విపదగానే రాయబడింది.

కొరవి గోపరాజు: ఈ కాలంలో ప్రసిద్ధి చెందిన మరొక కవి కొరవి గోపరాజు. అతడు కేశవరాజు, కామాంబికల పుత్రుడు. హరితస గోత్రీకుడు. తెలంగాణ నివాసి. ఇతని వంశంలో ఇతనికి ముందు 7వ తరం వాడైన వెన్నయమంత్రి వెలనాటి పృధ్వీశ్వరుని వద్ద మంత్రిగా చేశాడు. గోపరాజు తండ్రి రణమల్ల అనే అతడి వద్ద మంత్రిగా పని చేశాడట. కాని అతడెవరో తెలియలేదు. గోపరాజు పద్మ వెలమరాజైన కుమార అన్నపోతు దేవరకొండను పాలించిన రెండవ మాదానాయకునికి సమకాలికుడు. గోపరాజు తెలుగులో సింహాసన ద్వాత్రింశిక అనే కావ్యాన్ని రాశాడు. ఇందులో ఉజ్జయినిని ఏలిన విక్రమార్కునికి సంబంధించిన 32 కథలు రాయబడ్డాయి. విక్రమార్కునికి సింహాసనం లభించిన తర్వాత భోజరాజు ఆ సింహాసనాన్ని అధిష్టించటానికి రాగా ఆ సింహాసనానికి ఇరువైపులా ఉన్న సాలభంజికలు ఒక్కొక్క రోజు ఒక్కొక్క విక్రమార్కుని సాహసకార్యాలు తెలపడం ఇందలి ఇతివృత్తం. సంస్కృతంలో త్రిషష్టిసాలాకాపురు సచ్చరిత్ర అనే జైన కావ్యం స్వతంత్ర కావ్యం కాదని చెప్పుకున్నాడు. కాని ఈ కావ్యంలో అతడు అద్భుతమైన తెలుగు భాషను ఉపయోగించాడు.

బమ్మెర పోతన: పద్మనాయకుల రాజ్యంలో ప్రసిద్ధి పొందిన కవులలో అగ్రగణ్యుడు బమ్మెర పోతన. ఇతనికి పోతరాజు, పోతనామాత్య అని కూడా పేర్లున్నాయి. నల్లగొండ జిల్లాలోని బమ్మెర ఇతని స్వగ్రామం. ఇప్పుడది ఓరుగల్లు జిల్లాలోకి వచ్చింది. కాని ఇతని కుటుంబం ఓరుగల్లు వలస పోయి అక్కడ స్థిరపడింది. పోతన తల్లి లక్కమ్మ, తండ్రి కేశన్న. వారు కౌండిన్య గోత్రీకులు, ఆపస్తంభ సూత్రీకులు. పోతన భోగినీ దండకం, ఆంధ్రమహాభారతం, వీరభద్ర విజయం అనే మూడు గ్రంధాలు రాశాడు. వీటిలో మొదటిదైన భోగినీ దండకాన్ని సర్వజ్ఞ సింగభూపాలుని ప్రియురాలిపై రాశాడట. ఇది శృంగారపరమైన గ్రంథం. అందువల్ల కొందరు భోగినీ దండకాన్ని రాసిన పోతన ఇతడు కాదని, ఇతడు మహాభక్తుడని భావించారు. కాని దానిని ఇతడే రాశాడని, ఆ కాలంలో అతడు సర్వజ్ఞసింగన ఆస్థాన కవిగా ఉన్నాడని ఎక్కువ మంది భావిస్తారు. కాలక్రమేణా రాజాస్థానంలోని పనులను చూసి అతనికి రాజాస్థానంపై విరక్తి కలిగి రాజసేవను వదులుకొని తన స్వగ్రామం చేరి వ్యవసాయదారుడుగా జీవించాడని కథ ప్రచారంలో ఉంది. ఇతనికి సహజకవి అని పేరుంది.

ఆంధ్ర మహాభాగవతం: అతనికి వైరాగ్యం కలిగిన తర్వాత అతడు తన ఇంటి వద్ద కూర్చొని నిష్ఠగా భక్తిపారవశ్యంతో సంస్కృత భాగవతాన్ని తెనిగించాడు. కాని స్వచ్ఛమైన తెలుగు పదాలతో స్వతంత్ర కావ్యంగా దానిని మలిచాడు. భగవంతుడే తన చేత భాగవత పలుకులను పలికించాడని స్వయంగా తన భాగవతంలో చెప్పుకున్నాడు. అతని తల్లిదండ్రులు శైవులు. అతడు శైవునిగా ఉన్నప్పుడు వీరభద్ర విజయం రాశాడని, తర్వాత వైష్ణవ మతాభిమానిగా మారి విష్ణుభక్తితత్వాన్ని బాగా వంట పట్టించుకొని భక్తిపారవశ్యంతో భాగవతాన్ని రాశాడని

అంటారు. ఏమైనా ఈ కావ్యం తెలుగు భాషకు మకుటం వంటిది. ఈ కావ్యంలోని ప్రతి అక్షరం పోతన వ్యక్తిత్వాన్ని, వైరాగ్యాన్ని తెలియజేస్తుంది. ఇది భక్తిప్రధాన కావ్యం. అప్పటికి చైతన్యుని కృష్ణభక్తితత్వం రాలేదు. చైతన్యునికంటే ముందుగానే అద్భుత భక్తితత్వాన్ని తన భాగవతంలో బోధించాడు. నన్నయ, తిక్కనలు భాగవతాన్ని ముట్టక తనకు వదలివేయడం తన పూర్వజన్మ సుకృతం అని చెప్పుకున్నాడు. ఈ కావ్యం భక్తిరస కావ్యంగా పోతనకు ఆంధ్రదేశంలో చిరఃయశస్సును కలిగించింది. ఈ కావ్యాన్ని పోతన రచించాడని రాచకొండరాజు మూడవ శింగమనాయకుడు ఆ కావ్యాన్ని తనకు అంకితమివ్వమని కోరాడట. కాని అందుకు పోతన తిరస్కరించి భూమిలో పాతాడట. అందువల్ల అందులోని కొంత భాగం శిధిలం కాగా తర్వాత అతని శిష్యులైన యరకూరి శింగన, గంగన, వెలిగండ్ల నారయలు శిధిలమైన పద్యాలను పూర్తి చేశారని ఆంధ్రదేశంలో శృతి ఉంది. కాని చరిత్రకారులు ఈ వాదనను అంగీకరించలేదు. క్రీ.శ.1435 తర్వాత రాచకొండ రాజ్యం బహమనీ సుల్తాన్ మొదటి అహమ్మద్‌షా వశమైంది. ఆ అరాచక పరిస్థితులలో ఈ గ్రంథం దాచబడి కొంత శిధిలం అయి ఉండవచ్చును. పోతన తన భాగవతాన్ని శ్రీరామునికి అంకితం చేశాడు. అందులోని ఒక పద్యాన్ని అలవైకుంఠపురిలో, నగరిలో, ఆమూల సౌధాగ్రంబు అనే పద్యం రాస్తుండగా అక్కడ పదాలు తట్టక ఘంటం ఆగిపోయిందట. ఆలోచనతో ఆయన బయటికి వెళ్లగా శ్రీరాముడు స్వయంగా పోతన రూపంలో వచ్చి ఆ పద్యంలోని చివరి వాక్యాన్ని పూర్తి చేశాడని పోతన చెప్పుకున్నాడు. భక్తి కావ్యంగా పోతన మహాభాగవతం ఆంధ్ర సాహిత్యంలో గొప్ప స్థానాన్ని ఆక్రమించింది.

పోతన చివరిగా వీరభద్ర విజయం అనే కావ్యాన్ని రాశాడు. ఇది మహాభాగవతమంత గొప్ప కావ్యం కాదు గాని ఇది కూడా మంచి తెలుగు కావ్యంగానే గుర్తింపబడింది. పోతన శైవమతస్తుడని ప్రతీతి. భాగవతం వైష్ణవ గ్రంథం. వీరభద్ర విజయం శైవ గ్రంథం. దీనిని బట్టి అతడు శైవ, వైష్ణవ శాఖాభేదాలకు అతీతుడని తెలుస్తోంది.

రెడ్డి రాజుల ఆస్థాన కవి శ్రీనాథుడు, బమ్మెర పోతన బావ, బావమరదులని ప్రతీతి. ఈ ఇద్దరు కవులు ఆ కాలంలో తెలుగుదేశాన్ని తమ కవిత్వాలతో ఉర్రూతలూగించారు. తెలుగుభాషా చరిత్రలో అజరామరమైన కీర్తిని, స్థానాన్ని సంపాదించుకున్నారు. కాని వారిద్దరూ, విరుద్ధ స్వభావాలు కలిగిన వారు కావడం విశేషం. శ్రీనాథుడు విలాస పురుషుడు. తన కావ్యాలను అంకితాలు ఇచ్చి రాజసభలు దర్శించి, ధనాన్ని సంపాదించి దివ్యమైన సుఖాలు అనుభవించాడు. అందుకు విరుద్ధంగా బమ్మెర పోతన మహాభక్తుడు, విరాగి, ఇహలోక సుఖాలపై ఎలాంటి వ్యామోహం లేని వాడు. రాచకొండ ప్రభువు సర్వజ్ఞ సింగన భాగవతాన్ని తనకు అంకితం ఇవ్వమని ప్రాధేయపడినా, బెదిరించినా రాజాధములకు కావ్యకన్నియను ఇవ్వమని నిర్భయంగా ప్రకటించి శ్రీరాముడికి అంకితం చేశాడు. మహాభక్తుడుగా ప్రసిద్ధి చెంది జన్మను చరితార్థం చేసుకున్నవాడుగా ఆంధ్ర సాహిత్య జగత్తులో నిలిచాడు. భోగి అయినప్పటికీ శ్రీనాథుడు కూడా తన కవితాశక్తితో కవిసార్వభౌముడుగా అలాంటి స్థానాన్నే సంపాదించుకున్నాడు. రెడ్డి పద్మనాయక యుగంలో ఆంధ్రులకు ప్రీతిపాత్రాలైన రామాయణం, మహాభారతం, భాగవతం మూడు తెలుగులోకి వచ్చాయి.

పద్మనాయకుల దేవాలయాలు – కోటలు: పద్మనాయకుల రాజ్యస్థాపనకు ముందు ముస్లింలు తెలంగాణలో అనేక దేవాలయాలను ధ్వంసం చేశారు. పద్మనాయక రాజ్యం స్థిరపడిన తర్వాత ఆ దేవాలయాలలో కొన్నింటిని బాగు చేయించారు. వారు కూడా కొన్ని నూతన దేవాలయాలు నిర్మించారు. వారి రాజధాని రాచకొండలో భైరవాలయం, రామాలయాన్ని నిర్మించారు. వీనిలో రామాలయం నేటికి నిలిచి ఉంది. అక్కడ దుర్గాదేవి ఆలయం కూడా నిర్మించారు. దేవరకొండలో శివాలయాలు, రామాలయాలు నిర్మించారు. దేవరకొండ కోటలో వారు నిర్మించిన దేవాలయాన్నీ నేడు శిధిలాలుగా మిగిలి ఉన్నాయి. భువనగిరిలో సోమేశ్వరాలయాన్ని నిర్మించారు. ఓరుగల్లులోని దేవాలయాలను పునర్నిర్మాణం చేశారు. వేయిస్తంభాల గుడిని కాపాడారు. సర్వజ్ఞ సింగన కాలంలో కొన్ని వైష్ణవ ఆలయాలు నిర్మింపబడ్డాయి. ఆ కాలంలో పంచరంగులలో చిత్రాలు చిత్రించే వారని పోతన భాగవతంలో వర్ణలేపనాన్ని గురించి వర్ణించాడు. అభిలాషికార్థ చింతామణి నాలుగు రంగులను మాత్రమే పేర్కొంటోంది. స్విత అంటే తెలుపు, సోన అంటే ఎరుపు, పిత అంటే పసుపుపచ్చ, కృష్ణ అంటే నలుపు అనే నాలుగు రంగులను పేర్కొంది. శ్రీనాథుడు కూడా నాలుగు రంగులనే పేర్కొన్నాడు.

పాలంపేటలోని రామప్ప దేవాలయం కాకతీయుల యుగంలోకెల్లా తలమానికమైంది. చతురస్రాకారమైన అధిష్ఠానంపై నిర్మింపబడింది. పైకప్పు రామాయణ భారత కథలతో చెక్కారు. ఆలయంలోని స్తంభాలు మెరుగు

పెట్టినట్లు తళతళ మెరుస్తాయి. ఈ ఆలయంలో ఎటుచూసిన నాట్యకత్తెల విగ్రహాలున్నాయి. ఇవి మనిషి ఎత్తు కలిగి సున్నితమైన అంగసౌష్టవంతో అతిసుందరంగా కనిపిస్తాయి. కొందరవి మదనిక బొమ్మలని, మరికొందరు నాగిని బొమ్మలని భావిస్తున్నారు. ఈ దిగంబర స్త్రీమూర్తులు చూపరుల మనసులకు మత్తెక్కిస్తాయి. ఈ ఆలయంలోని నంది చిన్నదైనా అద్భుతంగా చిత్రించబడింది. ప్రేక్షకులు ఈ నందిని ఎటువైపు నుండి చూసిన అది తమ వైపు చూస్తున్నట్లు ఉంటుంది. ఇది అతి విచిత్రమైన విషయం. రామప్ప దేవాలయానికి వాడిన ఇటుకలను నీటిలో వేస్తే అవి తేలియాడుతాయి. ఇది మరొక విచిత్రం. ఇలాంటి దేవాలయాలను రేచర్ల పద్మనాయకులు ముస్లిం బారిన పడకుండా కాపాడారు. వారి కాలంలో కోటలు శత్రుదుర్భేధ్యంగా నిర్మించారు. దేవరకొండ కోట నిర్మాణంలో అడుగడుగునా వారి రక్షణ వ్యూహం కనిపిస్తుంది. అది ఆనాటి వాస్తుకు తార్కాణంగా చెప్పవచ్చును. వీరి కాలం అంతా యుద్ధాలతో గడిచిపోయింది. కనుక శిల్పకళకు పెద్ద ప్రాముఖ్యత ఇవ్వలేకపోయారు.

గోండుల సంస్కృతి

గోండు పురుషులు విశాలమైన నుదురు, ఎత్తయిన దౌడలు, చట్టిముక్కులు కలిగి సాధారణమైన ఎత్తు ఉంటారు. గోండు స్త్రీలు సన్నని చేతులు, సన్నని కాళ్లు కలిగి అందంగా ఉంటారు. పురుషులు నేత ధోవతులు మోకాలి వరకు మడచికట్టి తెల్లని రుమాలు తలకు చుట్టుకొని ఉండేవారు. ప్రస్తుతం ఆధునికుల లాగే ధోవతులు, చొక్కాలు ధరిస్తున్నారు. రజాయిలు, దుప్పట్లు వాడుతున్నారు. గొడుగులు ఉపయోగిస్తారు. గొడుగు కొనలేనివారు టేకు ఆకులతో గొడుగులు తయారు చేసుకొంటారు. గోండు స్త్రీలు చీరలు ధరిస్తారు. కాని గోచీ పెట్టుకుంటారు. వారు కుడివైపు పైటలు వేసుకుంటారు. చేతులకు దండకడియాలు, చెవులకు వెండి లోలకులు, మెడలో తాళిబొట్టు, నల్లపూసలు, చేతులకు రంగురంగు గాజులు ధరిస్తారు గోండు జాతి వారు నాలుగు వర్గాలుగా ఉన్నారు వారి వర్గాలను సాగాలు అని అంటారు. ప్రతి సాగాలో కొన్ని కుటుంబాలు ఉంటాయి. కుటుంబాన్ని పారిలు అని అంటారు. వారి పేర్లకు ముందు వంశనామాలు చేర్చుకుంటారు. గోండు స్త్రీలకు తెలుగు భాష అంతగా రాదు

ఇతర జాతులు: గోండు ప్రాంతాలలో గోండు లేక ఇతర జాతులకు చెందిన తెగలు కూడ జీవిస్తున్నాయి. అలాంటి వారిలో కోలమ్ తెగ ఒకటి. వారు కొలామీ భాష మాట్లాడుతారు వారు తెలుగు భాష మాట్లాడుతారు. వీరు గోండుల పక్కన జీవించినందుకు గోండు భాష బాగానే మాట్లాడతారు. నాయక్ పోడులని మరొక తెగ కూడా అక్కడ ఉంది. వీరికి ప్రత్యేక భాష ఉంది. వారి భాషను నాయకుడి గొండి అని పిలుస్తారు వారు తెలుగు కూడా మాట్లాడతారు. వీరికి కొలామీలకన్నా భిన్నమైన ఆచారాలు ఉన్నాయి అనాది గోండులని మరొక తెగ కూడా ఉంది జంజారని మరొక తెగ ఉంది. వారు నాందేడ్ పర్భిణి జిల్లాల నుండి వచ్చి ఆదిలాబాద్ జిల్లాలో గోండు గ్రామంలో స్థిరపడ్డారు. వీరిని బంజారీలు అని కూడా అంటారు. బంజారీలు ప్రత్యేక సంస్కృతి కలిగి ఉన్నారు. వారు రాజస్థాన్ ప్రాంతవాసులు. రాజస్థాన్ ఆచార వ్యవహారాలు పాటిస్తారు. వారి భాష బంజారు భాష. వీరు తెల్లని శరీరంతో తీక్షణమైన చూపులు కలిగి ఉంటారు. మధురాలు అనే మరొక జాతి వారున్నారు వారు కూడా బంజారాల లాగా తెల్లగా ఉంటారు. ఆజానుబాహులు. బంజారాలు, మధురాల సంస్కృతి, గోండు సంస్కృతికి భిన్నంగా ఉంటుంది.

సామాజిక వ్యవస్థ: గోండు సమాజంలో. అనేక వృత్తులవారు ఉన్నారు. పటారీలు లేక పర్దానులు అనే ఒక వృత్తి పని వారు ఉన్నారు. వారు కవులు. కాని భట్రాజుల వలె రాజగోండు వీరుల కథలను, గాథలను ఆశుకవిత్వ ధోరణిలో గానం చేస్తారు. వీరిలో తోడీలు అనే మరొక ఉపశాఖ ఉంది. వారు కూడా భట్రాజులు లాగా పాటలు పాడతారు. వారు ముఖ్యంగా భీమదేవుని గురించి పాటలు పాడుతారు. వారు కర్రతో చేసిన ఫిడేల్ వాయిద్యాన్ని వాయించుకుంటూ పాటలు పాడుతారు. దానిని కింగ్రి అని అంటారు. తోడి స్త్రీలు గోండు స్త్రీలకు పచ్చబొట్లు పొడుస్తారు. పచ్చబొట్లు పొడవటం తోడి స్త్రీల వృత్తి తోడీలు పర్దానులకన్నా తక్కువ వారిగా చూస్తారు. కాని వారు పర్దానులకన్నా తామే గోండు జాతి వారికి సన్నిహితులమని చెప్పుకుంటారు. వారు గోండీ భాష మాట్లాడుతారు. భాట్‌లనే మరొక వృత్తివారు ఉన్నారు. వారు గోండులకు, కొలామీలకు వ్యవసాయ పరికరాలను తయారు చేసి ఇస్తారు. వీరు కూడా గోండీ భాషను తమ మాతృభాషగా పరిగణిస్తారు. భాట్‌లు కమ్మరులవంటివారు. తమ ఇళ్లలోనే కొలిమిలను ఏర్పాటు చేసి వ్యవసాయ పరికరాలను తయారు చేస్తారు. వీరు కంసాలుల వంటివారు. వారు మట్టి మూసలలో లోహాలు కరిగిస్తారు. ఓజారీలు రాజగోండుల వద్ద శాశ్వత ఉద్యోగాలు నిర్వహించి రాజగోండుల వంశనామాలతో పిలువబడుతున్నారు. ఇన్‌కారులనే మరొక వృత్తి వారు నూలు బట్టలు నేసి గోండు ప్రజలకు అమ్ముతారు. వీరు సాలె వారి వంటివారు. గోండు రాజ్యపతనం తర్వాత వారినాశ్రయించిన వృత్తుల వారు చెల్లాచెదురైపోయారు. గోండులు కూడా తమ ఆర్థిక స్థితిని కోల్పోయారు నేడు వెలమలు, కాపులు మొదలైన కులాల వారు పూర్వపు గోండ్యను రాజ్యభాగమైన ఆదిలాబాద్ జిల్లాలో భూములు కొని భూస్వాములయ్యారు. గోండులు వారి వద్ద పొలాలు కౌలుకు తీసుకొని సాగు చేసుకొని జీవిస్తున్నారు. గోండు ప్రాంతాలలో కోమట్లు వ్యాపారాన్ని ప్రారంభించారు. గోండ్ల వ్యవసాయోత్పత్తులు చౌకగా కొంటారు. వ్యవసాయ కాలంలో వారికి పెట్టుబడులు పెట్టి వడ్డీ వసూలు చేస్తారు. ధాన్యరూపంగా చెల్లిస్తే అధికంగా ధనం వసూలు చేస్తారు. ఇవ్వవలసిన దానికన్నా ఎక్కువ వసూలు చేసిన ధాన్యాన్ని నాగు అని అంటారు.

ఆచారాలు: గోండులు అడవులను నరికి పంటలను వేస్తారు. దానిని పోడు వ్యవసాయం అని అంటారు ప్రస్తుతం గ్రామాలు నిర్మించుకొని స్థిరనివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. నూతన గ్రామాలు నిర్మించుకుంటే వారు దురారి పూర్ణిమకు ముందు గ్రామంలో గృహప్రవేశం చేస్తారు. దానిని హోలీ పున్నమి అని అంటారు ఆ రోజున పండుగ జరుపుకుంటారు. ఆ పూర్ణిమనాడే భూయజమానులు కూలీలు ఒప్పందం చేసుకొని పంట వచ్చే వరకూ ఎవరూ గ్రామం విడిచి వెళ్లరాదని మాటపుచ్చుకుంటారు. ఈ పండుగను ఆంధ్రదేశంలోని రైతులు కూడా ఏరువాక పున్నమి అనే పండుగ చేసుకుంటారు. ఆ రోజున నూతన సంవత్సరానికి జీతగాళ్లను కుదుర్చుకుంటారు ఎద్దులను అలంకరించి రంగులు కొట్టి అరకకు కట్టి రైతులందరూ తమ అరకలను ఊరిలో ప్రదర్శిస్తారు. గోండుల హోలీ పున్నమి పండుగ కూడా అలాంటిదే. గ్రామాన్ని నిర్మించిన వ్యక్తిగాని, అతని వారసులుగాని హోలీపున్నమి పండుగను నిర్వహిస్తారు. గ్రామంలో వ్యవసాయం ప్రారంభం చేయడానికి ముందు పాట్లా అనే పూజారిని నియమిస్తారు. ఈ పండుగలో మాత్రాల్, మాత్రి అనే గోండు పురాణ దంపతులను పూజిస్తారు. గ్రామ పొలిమేర దేవతలైన దువారి, అవల్‌లను నైవేద్యం స్వీకరించడానికి రమ్మని ఆహ్వానిస్తారు. గోధుమరొట్టెలు, ఉల్లిగడ్డలతో చేసిన పదార్థాలు దేవతలకు సమర్పిస్తారు. ఈ కార్యక్రమం అంతా పాట్లా అనే పూజారి నిర్వహిస్తాడు. నూతన గ్రామాలు నిర్మించినప్పుడు, నిర్మాణం పూర్తికాగానే వారు వారి దేవత ప్రీత్యర్థం మేకలను, గొర్రెలను బలి ఇస్తారు గ్రామానికి నాలుగు దిక్కులా నాలుగు రాతిస్తంభాన్ని పాతి వాటికి కోళ్లకు బలి ఇస్తారు. అకిముందా అనే మరొకచోట మరొక రాతిస్తంభాన్ని నిలబెడతారు. దానిని గాబుర్ అకి అని అంటారు. ఈ ఐదు రాతి స్తంభాలు గ్రామాన్ని రక్షిస్తాయని వారి నమ్మకం. పొలానెలలో అమావాస్యనాడు గోండులు నంది, హనుమాన్, మహదేవుడు అంటే శివుని పూజిస్తారు. వారికి మహదేవుడు, అపికెన్ అనే గోండదేవుడు, గ్రామదేవత ముఖ్యమైన దేవతలు గోండులలో బహుభార్యాత్వం ఉంది. అయినప్పటికీ భార్యలందరూ ఒకే కుటుంబంగా ఒకే ఇంట్లో ఉంటారు సోదరి కుమార్తెను వివాహం ఆడటం నిషిద్ధం. కుటుంబంలోని పెద్ద కుమారుడు ప్రజ్ఞావంతుడైతే తల్లిదండ్రులను విడిచి పెట్టి మరొక గ్రామం చేరి హోదా గల జీవితాన్ని గడుపుతాడు. అడవులలో నిర్మింపబడిన గోండు గ్రామాలకు గ్రామ పెద్ద ఉంటాడు. అతని పర్యవేక్షణలో ఆ గ్రామంలోని ప్రజలు జీవిస్తారు.

మతాచారాలు: గోండులకు మూఢనమ్మకాలు ఉన్నాయి. వ్యక్తి అదృష్ట దురదృష్టాలు దైవనిర్ణయం అని భావిస్తారు. పర్సాపెన్ వారి ముఖ్య దేవత. దేవరి, కటార, భక్తాల్ అనే దేవతలను పూజిస్తారు. వాటిని దేవరి, కటార గ్రామ దేవతలుగా భావిస్తారు. పర్సాన్ ఆయురారోగ్యాలను, సిరిసంపదలను ఇస్తుందని నమ్ముతారు. పర్సాన్ భయంకరంగా ఉంటుంది. స్త్రీలు దూరంగా ఉండి చూస్తారు. గోండులు తమ దేవతలకు బలులిచ్చి కల్లు, సారాను దేవతలకు అర్పిస్తారు. ఇంకా అక్పెన్, నార్, అవ్వల్ అనే దేవతలను పూజిస్తారు. బొద్రాయి, గుబుల్ అకి, కొస్ అకి అనే శిలాస్తంభాలను శివమార్పె అనే పొలిమేర దేవతను కూడా పూజిస్తారు. గ్రామ పొలిమేర దేవత భూతప్రేత పిశాచాలను గ్రామంలోకి రాకుండా కాపాడుతుందని నమ్ముతారు. గర్భిణీ స్త్రీ మరణిస్తే దెయ్యం అయి బాధిస్తుందని నమ్మకం. కనుక గర్భిణీ స్త్రీ మరణిస్తే ఆ శవాన్ని ఒక చెట్టు కింద పూడ్చి ఆమె కురులను ఆ చెట్టు వేళ్లకు కట్టి పూడ్చివేస్తారు. అప్పుడు ఆమె దెయ్యం అయినా కదలలేదని వారు భావిస్తారు. శివరాత్రి రోజున శివుని ఆరాధిస్తారు. శివుని చెంత నందీశ్వరుని నిలుపుతారు. గోండ్లు గొప్పగా జరుపుకొనే పండుగ దురారి. ఇది హోలీపండుగ. ప్రతి సంవత్సరం గ్రామాధికారి ఆధిపత్యంలో జరుపుకుంటారు. చెంచి భీముని వివాహం జరిగిన పండుగగా జరుపుకుంటారు. అలాగే దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలను కూడా జరుపుకుంటారు. దీపావళి రోజున వారు లక్ష్మిని పూజించి కోళ్లను బలి ఇస్తారు. ఆ కోడి రక్తాన్ని వ్యవసాయ పరికరాలపై చల్లుకుంటారు పండారి మార్మింగ్ అకారి, పొలా గోండు పండుగలను జరుపుకుంటారు.

గజపతుల కాలం నాటి ఆంధ్ర సంస్కృతి

గజపతుల కాలంలో సాంఘిక పరిస్థితులు: గజపతుల కాలంలో సాంఘిక పరిస్థితుల్లో మార్పులు లేవు. కాకతీయుల కాలంలో రూపొందిన కుల వ్యవస్థ కొనసాగింది. బ్రాహ్మణులు ఉన్నత గౌరవ మర్యాదలు పొందుతూ ఉన్నారు. గజపతులు బ్రాహ్మణ భక్తిని ప్రదర్శించారు. రాయవాచకం ప్రతిరోజు నిద్రలేవగానే గజపతులు ఇద్దరు బ్రాహ్మణులకు నమస్కారం చేస్తారని తెలుపుతోంది. తర్వాత పూజలు జరిపేటప్పుడు బ్రాహ్మణుల పాదాలు కడిగి ఆ నీటిని తలపై చల్లుకుంటారని కూడా తెలుపుతోంది. బ్రాహ్మణులకు అనేక అగ్రహారాలు కూడా ఇచ్చారు.

క్షత్రియ కులం: కాకతీయుల కాలంలో క్షత్రియుల ప్రస్తావన లేదు. కాని గజపతులు తాము సూర్యవంశ క్షత్రియులమని చెప్పుకున్నారు. వీరి లాగే విజయనగరాన్ని ఏలిన మొదటి వంశస్తులైన సంగమ వంశస్తులు తాము చంద్ర వంశస్తులమని చెప్పుకున్నారు. వారు గొప్ప కోసం చెప్పుకొని ఉండవచ్చు. కాని వారు క్షత్రియులని చెప్పటానికి ఎలాంటి ఆధారం లేదు. కపిలేశ్వర గజపతి పుట్టుపూర్వోత్తరాలే స్పష్టంగా తెలియదు. అలాగే విజయనగర సంగమ వంశస్తులు కూడా సాధారణ కుటుంబీకులే గాని అంతకు పూర్వం వారి వంశస్థులు ఎవరూ రాచరికాలు చేసినట్లు తెలియదు.

మిగిలిన కులాలు: హిందూ సమాజంలో మిగిలిన కులాలు ఎవరి వృత్తి వారు చేసుకుంటూ ఉన్నారు. కోమట్లు ఎప్పటిలాగే వ్యాపారం చేసుకున్నారు. ఉండవల్లి శాసనం పెనుగొండ స్వాములమని కుబేర వంశస్తులమని చెప్పుకుంటూ నలుగురు వర్తకులు శాసనం వేయించారు. పాంచాణం వారు అనేక శాసనాలలో ప్రస్తావించబడ్డారు. వారు తమ తమ వృత్తులు చేసుకొనేవారు. మిగిలిన కుమ్మరి, కమ్మరి, మేదరి వారు తమ తమ వృత్తులను కొనసాగించారు. హిందూ సమాజంలో కుల వ్యవస్థ ఎప్పటి లాగానే కొనసాగుతుండేది.

వడ్డెర కులం: గజపతుల యుగంలో ఆంధ్ర సామాజిక వ్యవస్థలో వచ్చిన ఒకే ఒక మార్పు వడ్డెర కులం ఏర్పడటం. గజపతులు ఒరియా దేశస్థులు. వారు ఆంధ్రదేశాన్ని పాలించే కాలంలో అనేక మంది ఒరియా వారు ఆంధ్రదేశం వచ్చారు. గజపతుల పాలన అంతమైన తరువాత చాలా మంది ఒరియా వారు వారి స్వస్థానానికి వెళ్లకుండా ఇక్కడే స్థిరపడ్డారు. వారు ఆంధ్ర సామాజిక వ్యవస్థలో వడ్డెర కులం అనే పేరుతో నూతన కులంగా రూపొందారు. అందువల్లనే వారు ఈనాడు కూడా తాము వడియ రాజులమని చెప్పుకుంటారు.

గౌడ కులం: కళింగ గజపతులు తెలంగాణను కూడా జయించి పాలించారు. ఆ కాలంలో కొంత మంది ఒరిస్సా వారు తెలంగాణ ప్రాంతానికి వెళ్లి స్థిరపడ్డారు. గజపతుల పాలన అంతమైన తరువాత వారు కూడా తమ స్వదేశానికి వెళ్లకుండా అక్కడే స్థిరపడి గౌడ కులంగా రూపొందారు. కళింగకు ఓఢ్ర దేశమని, గౌడ దేశమని కూడా పేర్లు ఉన్నాయి. కోస్తా ప్రాంతంలో స్థిరపడ్డవారు ఓఢ్ర అనే పేరుతో వడ్డెర కులంగా రూపొందగా తెలంగాణలో స్థిరపడ్డవారు గౌడ పేరుతో గౌడ కులంగా రూపొందారు.

వినోదాలు: దేవాలయాల ఉత్సవాలు ఎప్పటిలాగే కొనసాగాయి. ఈ కాలంలో జగన్నాథ రథచక్రాల కింద పడి మరణించే ఆచారం వచ్చినట్లుగా కనిపిస్తోంది. అది మోక్షప్రదమని వారు తలచి ఉంటారు. శైవులు శ్రీశైలంలో తలలు నరుక్కొనే ఆచారానికి ఇది ప్రతిరూపం కావచ్చును. దేవాలయాలలో నాట్యాలు, సంగీతాలు, సాధారణ వినోదాలు. ఆనాడు నాటకాలు కూడా ఆడినట్లు సాహిత్యంలో ప్రస్తావనలున్నాయి. యాత్రలు చేయడం కూడా ఆ నాటి ఆచారం. పండుగల రోజులలో ప్రజలు నూతన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా ఉండేవారు.

ఆర్థిక పరిస్థితులు: గజపతుల కాలంలో ఆర్థిక పరిస్థితుల్లో పెద్ద మార్పులు ఏమీ లేవు. కాకతీయులు రెడ్డి రాజుల కాలం నాడు ఎలాంటి పరిస్థితులున్నాయో అవే పరిస్థితులు కొనసాగాయి. కపిలేంద్ర గజపతి వెలిగలం గ్రామాన్ని 120 మంది బ్రాహ్మణులకు దానం చేశాడు. 36 రకాల పన్నులను రద్దు చేశాడు. అతని అన్న కుమారుడు రాఘవేంద్ర పాత్రుడు రాజమండ్రి వద్ద గోదావరి తీరంలో క్రిద్దేని ఖండాన్ని 42 మంది బ్రాహ్మణులకు అష్టభోగాలతో అష్టభూతులతో దానం చేశాడు. 1. నిధి, 2. నిక్షేప, 3. పాషాణ, 4. సిద్ధ, 5. సాధ్యం, 6. జల, 7. భోగ, 8. అభోగ అనేవి అష్టభూతాలు. కొండవీటి పాలకుడుగా ఉన్న హంవీరుడు కృష్ణా తీరంలోని చిరువోలు గ్రామాన్ని అనేక మంది బ్రాహ్మణులకు ఇచ్చాడు. అతడే బెజవాడ వద్ద ఉన్న ఎనికెపాడు గ్రామాన్ని అష్టభోగాలతో అక్కడి రాజ నారాయణదేవుని ఆలయానికి దానం చేశాడు. పురుషోత్తముడు ఒంగోలు జిల్లాలోని పోతవరం

గ్రామాన్ని చదలవాడలోని మహాదేవుని ఆలయానికి అష్టభోగ తేజసామ్యంగా దానం చేశాడు. అతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి పాకనాటిలోని వెలిచర్ల గ్రామాన్ని 36 పన్నులు తీసి వేసి ఒక బ్రాహ్మణునికి దానం చేశాడు ఆ శాసనంలో షట్‌త్రింశధా వేదనక రహితం, నిరుపాధికమ్ అని పేర్కొన్నాడు. ఇందు షట్‌త్రింశ అంటే ఏమిటో తెలియదు. ద్రాక్షరామ శాసనంలో పెళ్లి పన్ను, సింహాచల శాసనం సముద్రదేవులలో వసూలయ్యే సుంకాలు పూరీలో కపిలేంద్రుని శాసనం ఉప్పు పన్ను, గవ్వల పన్నులను పేర్కొంటున్నాయి. అక్కడే ఉన్న పురుషోత్తమని శాసనం చౌకీదారు పన్నును పేర్కొంటోంది. ఇవి షట్‌త్రింశధా పన్నులు కావచ్చును. అంతేకాదు అతడు ఆ గ్రామాన్ని క్రయవిక్రయ హక్కులతో ఇచ్చాడు. అతడే తెనాలి తాలూకాలోని అనంతవరాన్ని 128 మంది బ్రాహ్మణులకు దానం చేశాడు. అతడే నెల్లూరు జిల్లాలోని రాజమాంచాపురాన్ని ఇద్దరు బ్రాహ్మణులకు, గోదావరి జిల్లాలోని నందంపూడి గ్రామాన్ని పౌండరీక యజ్ఞం చేసిన ఒక బ్రాహ్మణునికి దానం చేశాడు. పూర్వం ఇదే గ్రామాన్ని రాజరాజనరేంద్రుడు నన్నయభట్టుకు ఇచ్చాడు. ఈ కాలం నాటికి వారి వంశం వారు దానిని పోగొట్టుకున్నారని భావించాలి. అతడే అద్దంకి సీమలోని వంకాయలపాడు, గుండిమళ్ల గ్రామాలను తిమ్మా పండితునికి దానం చేశాడు. ప్రతాపరుద్రుని సామంతుడు బాహుబలేంద్రుడు కొండవీడుసీమలోని కొమ్మూరు ఓరుగంటి, రావిపాడు, గోగులుమూడి గ్రామాలను శ్రీపర్వత మల్లికార్జునస్వామికి దానం చేశాడు. పెద్దాపురం తాలూకాలోని తిరుపతి గ్రామంలో అగ్రహారదారులు తమ సొంత భూములు మూడింటిని శృంగారరాయుడు అనే వ్యక్తికి దానం చేశారు. దీనిని బట్టి అగ్రహారీకులు తమ అగ్రహారీ భూములను దానం చేయడానికి, అమ్ముకోడానికి హక్కులు కలిగి ఉన్నట్లు చెప్పవచ్చును. అంటే వ్యక్తి యాజమాన్య హక్కును ప్రభుత్వం గుర్తించినట్లుగా భావించవచ్చును.

దేవాలయ దానాలు: బ్రాహ్మణులకు అగ్రహారాలు, భూములు దానాలు చేసినట్లే దేవాలయాలకు, అందులో పని చేసే వారికి దానాలు చేశారు. సత్తెనపల్లి తాలూకా వేల్పూరు గ్రామంలోని రామేశ్వర దేవాలయం నిర్మించినందుకు కాసా లింగాబత్తుడికి భూమిని దానం చేసినట్లు అక్కడి శాసనం తెలుపుతోంది. మాచర్ల చెన్నకేశవ స్వామి ఆలయంలో నాగార్జునకొండకు చెందిన రామోజు అనే అతడు మరమ్మతులు చేయించాడు. కుమార హంవీరుడు ఎనికెపాడు దేవాలయంలో పని చేసే వారికి వేరు వేరుగా దానాలు చేశాడు. వైదికుని పోషణకు నాలుగు పుట్ల భూమిని దానం చేసినట్లు, సింహాచల శాసనం దేవదాసీలకు దానం ఇచ్చినట్లు, పెద్దాపురం వద్ద ఉన్న తిరుపతి గ్రామ శాసనం తెలుపుతోంది. కపిలేశ్వర గజపతి పూరీ జగన్నాథునికి అనేక ఆభరణాలు చేయించాడు. వానిలో కర్ణాభరణాలు, కంఠహారాలు, బాజుబంధులు, కంకణాలు, వడ్డాణాలు, కిరీటాలు, ఉంగరాలు మొదలైన అనేక రకాల ఆభరణాలు ఉన్నాయి.

వ్యాపారం: గజపతుల కాలంలో దేశీ, విదేశీ వ్యాపారం అంతకుముందు లాగా కొనసాగింది. కాని నాటి వ్యాపార విశేషాలు పెద్దగా శాసనాలలో కనిపించడం లేదు. ఉండవల్లిలో క్రీ.శ.1527వ సంవత్సరం నాటి శాసనం పెనుగొండ ప్రభువులమని చెప్పుకొన్న వారి శాసనం లభించింది. ఆ శాసనంలో పాపిశెట్టి, తిప్పిశెట్టి, మల్లిశెట్టి కృష్ణమశెట్టి అనే నలుగురు వర్తకులు అక్కడ భాస్కర దేవాలయాన్ని నిర్మించినట్లు ఉంది. అందులో వారు తాము పెనుగొండ ప్రభువులు కుబేర కుటుంబీకులమని చెప్పుకున్నారు. అంటే గజపతుల కాలం కూడా చాళుక్య యుగం నాటి పెనుగొండ కోమట్లు యథాతథంగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని చెప్పవచ్చును. అలాగే శ్రీకూర్మంలో మరి కొందరు వర్తకులు కూర్మనాథస్వామికి కొంత భూమిని కొని దానం చేసినట్లు శాసనం ఉంది. వారు భూమితోపాటు 5 తులాల బంగారం కూడా దానం చేశారు. కనుక పూర్వం లాగానే వర్తకులు దేవాలయాలకు దానాలు చేశారు

కరువులు: గజపతుల కాలంలో ఆంధ్రదేశంలో కొన్ని కరువులు వచ్చాయి. కపిలేంద్రుని 11వ రాజ్య కాలంలో పెద్ద కరువు వచ్చింది. అనేక మంది ప్రజలు మరణించారు. భరణం ధాన్యం 105 కవల గవ్వలు ఖరీదు అమ్మిందట. మరొకసారి వచ్చిన కరువులో 100 గవ్వలు అమ్మిందట. ఆయన కాలంలోనే 23వ సంవత్సరం కాలంలో ఒక పెద్ద ఉప్పెన వచ్చి అనేక మంది మరణించారట. ప్రతాపరుద్ర గజపతి 13వ రాజ్యకాలంలో మళ్లీ ఒక పెద్ద కరువు వచ్చి భరణం ధాన్యం 120 గవ్వలు అమ్మిందట. రాజభవనంలో దొంగలు పడి ధనాన్ని దోచుకు పోయారట. అలాగే కరువు కాటకాలలో గజపతులు పన్నులు రద్దు చేసి రైతులను ఆదుకోడానికి ప్రయత్నించారు

మత పరిస్థితులు: గజపతుల కాలంలో ఉత్తర దేశంలో భక్తి ఉద్యమం సాగుతోంది. కబీరు, చైతన్యుడు, వల్లభాచార్యులు వారి సిద్ధాంతాలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. వాటి ప్రభావం గజపతుల రాజ్యంపై పడింది.

కబీరు రామానందుని శిష్యుడు అని అంటారు. కబీరు వర్గ సమానత్వాన్ని బోధించాడు. భక్తుడు, భగవంతుని రూపం. కనుక ఎవరినైనా కులం తక్కువ వాడు అని అంటే అది దేవునికి అపచారం చేయడమే, కనుక వర్ణ వ్యవస్థ లేదు, అందరూ సమానులే అని బోధించాడు. తర్వాత చైతన్యుడు గజపతి రాజ్యానికి వచ్చాడు. అతడు కొన్నాళ్లు ఊరిలో ఉండి భక్తిని ప్రబోధించాడు. అతడు ముక్తికి మతమూ, కులమూ అడ్డు కావని ప్రచారం చేశాడు. అతని బోధనలు హిందూ, ముస్లింలను కూడా ఆకర్షించాయి. భక్తే మనిషికి ముక్తి సాధనం అని చెప్పి మానవుడు ఐదు అంతరువుల ద్వారా పరమాత్మలో ఐక్యమవుతాడని చెప్పాడు. శాంతి, దాస్య, సఖ్య, వాత్సల్య, మాధుర్య అనే ఐదు భావాల ద్వారా పరమాత్మ కృపకు పాత్రుడై ఆయనలో ఐక్యమవుతాడని చైతన్యుడు వివరించాడు. సూఫీ సిద్ధాంతానికి, చైతన్యుని సిద్ధాంతాలకు కొన్ని పోలికలు ఉన్నాయి. అందువల్ల ముస్లింలు కూడా ఆయనకు శిష్యులయ్యారు. బెంగాలు నవాబు నజరత్‌షా చైతన్యుని ఎంతగానో ఆదరించాడు. తర్వాత వల్లభాచార్యుడు మరొక సిద్ధాంతం చెప్పాడు. ఆత్మ ఐహిక భోగాలన్నీ అనుభవించిన తర్వాతనే విముక్తి పొందుతుంది. వల్లభాచార్యుని సిద్ధాంతం భోగాలను ప్రోత్సహిస్తుంది. చందనాలు, అత్తరులు, పన్నీరు పూసుకొని పట్టువస్త్రాలు ధరించి భోగాలు అనుభవించండి అని చెబుతుంది. వీరు ముగ్గురూ గజపతుల రాజ్యంలో తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకున్నారు. గజపతులు వారిలో చైతన్యుని మతాన్ని అనుసరించారు. చైతన్యుడు సామాన్య ప్రజల మతాచార్యుడుగా ప్రసిద్ధి చెందాడు. వల్లభాచార్యుడు ధనవంతుని విలాస పురుషుల మతాచార్యుడుగా కీర్తి వహించాడు. గజపతులు మాత్రం జగన్నాథ ఆలయంలో ఊడ్చే సేవకా వృత్తిని కూడా చేపట్టారు. కనుక వారు ప్రజల మతాన్ని అనుసరించేవారుగా కీర్తి వచ్చింది. వైష్ణవమత ప్రచారం వల్ల వైష్ణవ భక్తితత్వ ప్రచారం వల్ల పూరీ జగన్నాథ ఆలయం బాగా అభివృద్ధి చెందింది. గజపతులకు కులదైవం జగన్నాథుడు. ఏ కష్టం వచ్చినా పూరీ జగన్నాథునికి చెప్పుకున్నారు. అతడు తమకు కలలో కనిపించే ఆజ్ఞలు జారీ చేసేవాడని గజపతులు చెప్పుకున్నారు. పూరీ జగన్నాథ ఆలయంలో ఇతర దేశ రాజులు పూజలు నిర్వహించాలంటే 9 లక్షల సిక్కరు రూపాయలు చెల్లించాలట.

కపిలేశ్వరుడు తాను జగన్నాథుని దయ వల్లే రాజ్యాధిపతినయ్యానని చెప్పుకున్నాడు. పురుషోత్తముడు తన తండ్రి తనను తన వారసునిగా ఎన్నుకోవడం జగన్నాథుని ఆజ్ఞ అని చెప్పుకున్నాడు. ప్రతాపరుద్ర గజపతి గొప్ప జగన్నాథ భక్తుడు. అతడు అక్కడ ఒక శిలా శాసనం వేయించి జగన్నాథుని సన్నిధానంలో రాత్రులు గీత గోవిందం మాత్రమే పాడాలి అని శాసించాడు. మరేపాట పాడకూడదు. ఎవరైనా అలా పాడితే దేవునిపై తిరుగుబాటు చేసినట్లే అని కూడా రాయించాడు. చైతన్యుడంటే ప్రతాపరుద్రునికి అమిత అభిమానమట. అతని వెంట శిష్యుని లాగా నడిచివెళ్లేవాడట.

పరమత సహనం: గజపతులు పూరీ జగన్నాథుని భక్తులై వైష్ణవమతాన్ని అనుసరించనంత మాత్రాన వారు పరమతద్వేషులు కారు. సాంప్రదాయకంగా వచ్చే పరమత సహనాన్ని పాటించి ఇతర హిందూమత శాఖలకు కూడా దానాలు చేశారు. కపిలేశ్వరుడు తాను పురాణ వైష్ణవుడినని చెప్పుకుంటూనే తాను పురాణ మావేశ్వరుణ్ణి, దుర్గపుత్రుణ్ణి అని చెప్పుకున్నాడు. అతని సేనాని రఘుదేవుడు శ్రీశైలానికి దానం చేసి శాసనం వేయించాడు. హంవీరుడు శ్రీశైలంలోని ఒక జంగం మఠానికి బ్రాహ్మణ మఠానికి జక్కిరెడ్డిపల్లి గ్రామాన్ని దానం చేసి శాసనం వేయించాడు. ధనవంతులు వేదాంతం మీద ఆసక్తి చూపారు. సామాన్య ప్రజలు భక్తిభావానికి ప్రాధాన్యతను ఇచ్చారు. దీంతోపాటు వ్రతాలు ఆచరణలో ఉన్నాయి. వ్రతాలు, దానాలు చేస్తే స్వర్గం లభిస్తుంది అనే భావం పూర్తిగా ఉంది. ఇది కూడా అంతకుముందు ఉన్న సాంప్రదాయమే. గజపతులు అన్ని రకాల దేవాలయాలకు దానాలు చేసి ఆదరించారు. కనుక మత విషయాలలో ఎలాంటి ఒడిదుడుకులు వీరి కాలంలో లేవు.

చైతన్య ప్రభువు: గజపతి యుగంలో స్మరించదగిన మహా వ్యక్తి చైతన్య ప్రభువు. అతడు ఆ కాలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన భక్తి ఉద్యమకారుడు. భక్తి ఉద్యమం వైదికమతంలోని కర్మకాండకు వ్యతిరేకంగా ఒక సంస్కరణ ఉద్యమంగా ప్రారంభమైంది. డాక్టర్ భండార్కర్ ఈ ఉద్యమాన్ని ఏకాంతిక ధర్మం అని, అది భగవద్గీత మీద ఆధారపడిందని చెప్పాడు. మహాభారతంలోని శాంతిపర్వంలోని నారాయణీయాన్ని పరిశీలించినట్లయితే అప్పటికే ఈ ఉద్యమం ఒక నిర్దిష్టరూపాన్ని తీసుకుందని, దానికి పాంచారాత్ర సత్వత మతం అనే పేరు వచ్చిందని పండితులు అంటారు. ఈ పంచారాత్ర సత్వతమతం నారాయణ, విష్ణుశాఖలతో కలిసిపోయి వైష్ణవమతంగా రూపొందింది. దానికి భాగవతమతం అని కూడా మరొక పేరుంది. జంతుబలిని వదిలివేసి హరిని భక్తితో ఆరాధిస్తే

ముక్తి వస్తుంది అని ఈ మత సారాంశం. ఈ ఏకాంతిక ధర్మాన్ని శ్రీకృష్ణుడు మొదట అర్జునునికి బోధించాడు. కర్మ చేయడం జీవుని ధర్మం, ఫలం భగవంతునికి వదిలివేయాలని శ్రీకృష్ణుడు అర్జునునికి బోధించాడు. దాని వల్ల జీవుని ఆత్మ వికారాలు నశించి భగవత్‌ను పొందుతాడు. పరమత భాగవతులమని చెప్పుకొన్న గుప్తుల ఉత్తరదేశంలో వైష్ణవమతానికి సేవ చేశారు. దక్షిణ దేశంలో కూడా వైష్ణవమతం వ్యాప్తి చెందింది. దక్షిణదేశంలో ఆళ్వారులు, ఆచార్యులు అనే రెండు తరగతులు వైష్ణవ మతాచార్యులు ఉన్నారు. ఆళ్వారులు విష్ణునారాయణ భక్తులు. వారికి కులభేదం లేదు. అన్నికులాల వారు ముఖ్యంగా శూద్రులు ఆళ్వారుశాఖలో ఉన్నారు. వారు పంచరాత్ర సత్తత సాంప్రదాయానికి చెందిన వారు. ఆచార్యుల బ్రాహ్మణ కులానికి చెందిన వారు. వారు కుల భేదాలు పాటిస్తారు. 11వ శతాబ్దపు రామానుజాచార్యులు ఆళ్వారు శాఖయందు నమ్మకం కలిగినవాడు. అతడు శంకరాచార్యుని మాయావాదాన్ని ఖండించి విశిష్టాద్వైతం అనే మతాన్ని స్థాపించాడు. భక్తి ప్రధానం అని అన్నాడు. భక్తి కూడా ఒక రకమైన జ్ఞానమే అని నిర్వచించాడు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతల నుండి తన విశిష్టాద్వైతతత్వాన్ని రూపొందించాడు. అది పూర్వకాలపు నారాయణ విష్ణు పంచారాత్రాలతో కలిసిన వాసుదేవమత సాంప్రదాయానికి చెందిందని చెప్పవచ్చును. ఇందులో శ్రీకృష్ణునికి ప్రాధాన్యత లేదు. పరమాత్మ భక్తిని నిలిపి ధ్యానం చేయడం ద్వారా పరమాత్మ ఐక్యత లభిస్తుందని రామానుజుడు నమ్మాడు.

నింబార్క: రామానుజునకు సమకాలికుడైన నింబార్కుడు ఒక తెలుగు బ్రాహ్మణుడు. ఇతడు కూడా శంకరుని మాయావాదాన్ని ఖండించాడు. కాని రామానుజునితో కూడా కొద్దిగా విభేదించాడు. ఈ లోకంలో ఆత్మ, పరమాత్మ వేరు వేరు, కనుక భక్తుడు ప్రపత్తి ద్వారా భగవంతుని చేరుకుంటాడు. కనుక భక్తితోపాటు ప్రపత్తి ఉండాలని దశ శ్లోకాలలో తన తత్వాన్ని వివరించాడు. ప్రపత్తికి ప్రాధాన్యత ఇచ్చినందువల్ల అతని తత్వంలో కృష్ణునికి ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చాడు. కృష్ణతత్వాన్ని వల్లభాచార్యుడు కూడా ప్రచారం చేశాడు. కనుక రాధాకృష్ణుల తత్వం బాగా ప్రాచుర్యం పొందింది. వాస్తవానికి రాధాకృష్ణుల తత్వం తొలి వైష్ణవ గ్రంథాలలో లేదు తర్వాత గ్రంథాలలో చోటు చేసుకుంది.

వల్లభాచార్యునికి సమకాలికుడైన చైతన్యుడు కూడా రాధాకృష్ణుల తత్వానికి చెందినవాడే. కాని ఒక చిన్న భేదం ఉంది. వల్లభాచార్యుడు Ceremonial form ని develop చేస్తే భావావేశానికి Cultivational or emotionals కు ప్రాధాన్యత ఇచ్చాడు. కృష్ణదాస కవిరాజు రాసిన చైతన్య చరితామృతం, జయనందుడు రాసిన చైతన్య మంగళ ఇంకా అనేక బెంగాలీ రచనలు శ్రీచైతన్యుని గురించి అనేక వివరాలు ఇస్తున్నాయి.

చైతన్యుని అసలు పేరు విశ్వంభర. అతడు నవద్వీపంలోని మినాపూర్‌లో క్రీ.శ.1486లో జన్మించాడు అతని తండ్రి జగన్నాథ మిశ్రా, తల్లి సచీదేవి. వారు ఒరిస్సాలోని జయపుర వాస్తవ్యులు. జీవనోపాధికి బెంగాలు లోని నాడియాకు వెళ్లారు. చైతన్యుడు అజానుబాహుడు, అందగాడు, చామన ఛాయవాడు. అతనికి గౌరంగా, గౌరచంద్రా అని కూడా పేర్లు ఉన్నాయని. అతడు చిన్నతనంలో స్త్రీలతో ఆటలాడేవాడని చైతన్య చరితామృతం తెలుపుతోంది. అతని 18వ సంవత్సరం తండ్రి మరణించాడు. తర్వాత బలభద్రాచార్యుని కుమార్తె లక్ష్మీదేవిని వివాహమాడి గృహస్థాశ్రమం స్వీకరించాడు. విద్యాలయం ప్రారంభించి లౌకిక విద్యలు బోధించాడు. కొంత కాలానికి పాముకాటుకు గురై భార్య మరణించింది. రెండు నెలలు తర్వాత సనాతన అనే వ్యక్తి కుమార్తె విష్ణు ప్రియను వివాహమాడాడు. తర్వాత కొన్నాళ్లకు తన పూర్వీకులకు పిండం పెట్టడానికి గయకు వెళ్లాడు. అక్కడ ఈశ్వరపురి అనే వైష్ణవ గురువును కలుసుకొన్నాడు. అతడు భక్తితత్వాన్ని బోధించాడు. దాంతో చైతన్యునిలో గొప్ప మార్పు వచ్చింది. తిరిగి తన ఇంటికి వచ్చి గురువు చెప్పిన ప్రకారం ధ్యానించి ఆత్మసాక్షాత్కారం పొందాడు. అప్పటి నుంచి అతడు బ్రాహ్మణ కర్మకాండకు స్వస్తి చెప్పి హరినామస్మరణ చేస్తూ సంకీర్తనలు పాడసాగాడు. ఆ గానమాధుర్యానికి ప్రజలు పరవశులై అతనితో చేరిపోసాగారు. అతడు హిందూ మతాచారాలను, కుల వ్యవస్థను ఖండించాడు. ఆనాడు నవద్వీప ఆచార్యుడు సాంప్రదాయవాది అయిన భట్టాచార్య చైతన్యుని వ్యతిరేకించాడు. అక్కడి ఖాజీకి ఫిర్యాదు చేసి చైతన్యుని చర్యలను ఆపమని కోరాడు. కాని ప్రయోజనం లేకపోయింది. క్రీ.శ.1509వ సంవత్సరంలో 24వ సంవత్సరంలో చైతన్యుడు కేశవభారతి ద్వారా సన్యాసాశ్రమం స్వీకరించాడు పూరీ జగన్నాథుని దర్శించాడు. తర్వాత దేశమంతా పర్యటించి తిరిగి పూరీ వచ్చి అక్కడ 18 సంవత్సరాలు గడిపాడు. చైతన్యుడు రాధాకృష్ణుల భక్తితత్వాన్ని ప్రచారం చేశాడు. భక్తితత్వాలలో భక్తుడు 5 దశలను దాటాలని చెప్పాడు.

1. **శాంత:** ఈ దశలో తన ఆలోచనలన్నీ వదిలివేయాలి.
2. **దాస్య:** ఈ దశలో తాను భగవంతుని దాసుడనని భావించాలి.
3. **సఖ్య:** ఈ దశలో తాను భగవంతుని మిత్రుడుగా సాన్నిహిత్యం పొందాలి.
4. **వాత్సల్య:** ఈ దశలో తాను భగవంతునిపై అనంతమైన ప్రేమను పెంచుకోవాలి.
5. **మాధుర్య:** ఈ దశలో భక్తుడు తనను తాను మరిచిపోయి మాధుర్యాన్ని అనుభవిస్తాడని వివరించాడు.

కృష్ణుడు సర్వాంతర్యామి, ప్రపంచమంతా అతని అవతారమే. అతడు సత్‌చిత్, ఆనంద స్వరూపుడు. కనుక అతని శక్తి సత్ అంటే సంధిని, చిత్ అంటే సంభిత, ఆనంద అంటే హ్లాదిని అని మూడు రూపాలుగా ఉంటుందని వర్ణించి, తన తత్వానికి పూర్తి రూపురేఖలు దిద్దాడు. దీనికే చైతన్య మార్గం అని పేరు వచ్చింది. అతడు తన తత్వాన్ని బెంగాలు, ఒరిస్సాలలో ప్రచారం చేశాడు. ఈ ప్రచారంలో అతనికి అతని శిష్యులు నిత్యానంద, అద్వైతానందలు పూర్తిగా పాలుపంచుకున్నారు. కనుక వారు ముగ్గురినీ ప్రభుత్రయం అని పిలిచారు. వీరిద్దరూ చైతన్యునితో పాటు చైతన్యతత్వ సిద్ధాంతకర్తలు అని కీర్తి పొందారు.

చైతన్యుడు క్రీ.శ.1509 మార్చిలో పూరీ వచ్చాడు. కేశవమిశ్రా అతనికి ఆతిథ్యం ఇచ్చాడు. చైతన్యుడు తన సంకీర్తనల ద్వారా త్వరలోనే ఒరిస్సా ప్రజలను ఆకర్షించాడు. ఆ సందర్భంలో ప్రతాపరుద్ర గజపతి ఆస్థానకవి వాసుదేవ సార్వభౌముడు చైతన్యుని సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. అతడు అద్వైతతత్వవేత్త వారిద్దరికి వారం రోజులు సంవాదం జరిగింది. చివరకు చైతన్యుడు వాసుదేవుని ఓడించాడు. దాంతో 80 సంవత్సరాల వయస్సు కలిగిన వాసుదేవ సార్వభౌముడు చిన్నవాడైన చైతన్యుని కాళ్లపై బడి అతని శిష్యుడయ్యాడు. ఆ తర్వాత అనేకులు చైతన్యునికి శిష్యులయ్యారు. తర్వాత చైతన్యుడు ఆంధ్రదేశంలో పర్యటించాడు. రాజమహేంద్రవరం వద్ద అక్కడ పరీక్షకుడైన రామానందరాయను కలుసుకొన్నాడు. వారిద్దరికీ వాదోపవాదాలు జరిగి చివరకు రామానంద చైతన్యుని శిష్యుడయ్యాడు. తన పదవికి రాజీనామా చేశాడు. చైతన్యునితో పూరీ వెళ్లి అతనితోనే నివసించాడు. రామానందుడు రాగానుగ అనే ప్రత్యేకతత్వాన్ని రూపొందించాడు. అందులో రాధకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ఆమె గొప్ప సౌందర్యరాశియే గాక, ఆధ్యాత్మిక ప్రేమతత్వానికి మారురూపం అని సిద్ధాంతీకరించాడు.

ప్రతాపరుద్రుడు చైతన్యుని గొప్పదనం విని వాసుదేవ సార్వభౌముని తనకు చైతన్యునితో సమావేశం ఏర్పాటు చేయమని కోరాడు. కాని చైతన్యుడు అతని దర్శనం ఇవ్వడానికి నిరాకరించాడు. అందుకు విచారించి చైతన్య ప్రభు తనకు దర్శనం ఇవ్వకపోతే తాను సింహాసనాన్ని త్యజించి సన్యాసినవుతానని కూడా ప్రకటించాడు. సార్వభౌమ తన శక్తి వంచన లేకుండా ప్రయత్నించి విఫలుడై కనీసం ప్రతాపరుద్రుని కుమారునికైనా దర్శించే అవకాశం ఇవ్వాలని కోరాడు. అందుకు చైతన్యుడు అంగీకరించగా రాజకుమారుడు వచ్చాడు. రాజకుమారుని చైతన్యుడు దగ్గరకు తీసుకొని కౌగలించుకున్నాడు. దాంతో రాజకుమారుడు కూడా చైతన్య భక్తుడయ్యాడు. తర్వాత ప్రతాపరుద్రునికి కూడా అవకాశం వచ్చింది. ఒక రోజున చైతన్యుడు కాశీమిశ్రుని ఇంటిలో గానం చేస్తూ స్పృహ తప్పి పడిపోయాడు. ఆ సమయంలో సార్వభౌమ కవి గజపతికి కబురుపెట్టాడు. వెంటనే ప్రతాపరుద్రుడు వచ్చి చైతన్యుని కాళ్లపై పడ్డాడు. చైతన్యుడు మేల్కొని అతని భక్తి నిజమైనదని గ్రహించి కౌగిలించుకొని ఆదరించాడు. దాంతో గజపతి అతని శిష్యుడయ్యాడు. ఈ విషయాన్ని రామానందరాయ తన జగన్నాథ వల్లభ నాటకంలో పేర్కొన్నాడు. తర్వాత చైతన్యుడు ఎప్పుడూ కీర్తనలు పాడుకుంటూ బజారులలో తిరిగినా ప్రతాపరుద్ర గజపతి పాదరక్షలు లేకుండా గురుదేవుల వెంట బజారులో నడిచేవాడని చైతన్య చరితామృతం తెలుపుతోంది. చైతన్యుని ప్రచారంతో కులభేదాలు తగ్గాయి. కింది కులాల వారు చైతన్య మతంలో చేరారు. అతడు, అతని శిష్యులు స్థానిక భాషలలో ప్రచారం చేసినందువల్ల ఒరియా, బెంగాలీ భాషలు అభివృద్ధి చెందాయి.

గజపతి రాజ్యంపై చైతన్యుని ప్రభావం: కాని డాక్టర్ ఆర్.డి.బెనర్జీ గజపతి రాజ్యంపై చైతన్యుని ప్రభావం చెడు ఫలితాలను చూపిందని వ్యాఖ్యానించాడు. చైతన్యుడు రానంత వరకు ప్రతాపరుద్ర గజపతి పేరు చెబితే పరానులకు హడలు పుట్టేది. గజపతి చాలా పరాక్రమవంతుడు. శారీరకంగా అతి బలిష్ఠుడు. కాని చైతన్యుని స్పర్శ తగలగానే అతడు అతిమెత్తని వాడయ్యాడు. ఆ స్థితి గజపతి రాజ్యాన్ని బలహీనపరచిందని, గొప్పసేనాని అయిన రామానందరాయ కూడా భక్తుడైపోయాడని, గోపీనాథ బరజెన కూడా అతని భక్తుడై రాజ్యాన్ని బలహీనపరచారని, దాంతో గజపతి సైన్యం కూడా తన శక్తిని కోల్పోయిందని, ప్రజలు కూడా ఈ నయా వైష్ణవమత ప్రభావంతో శాంతికాముకత్వాన్ని సంతరించుకున్నారని, దాంతో రాజ్యమే తన శక్తిని కోల్పోయిందని బెనర్జీ భావించాడు.

జయానందుని చైతన్యమంగళంలో ఒక విషయం వివరింపబడింది. ప్రతాపరుద్ర గజపతి బెంగాలుపై దండెత్తాలని సంకల్పించి చైతన్యుని సంప్రదించాడట. కాని చైతన్యుడు యుద్ధం మంచిది కాదని సలహా ఇచ్చాడట. దాంతో అతడు యుద్ధం విరమించుకున్నాడని చైతన్యమంగళం తెలుపుతుంది. కనుక చైతన్యుని ఆగమనం గజపతి రాజ్యాన్ని బలహీనపరచి చివరకు రాజ్యపతనానికి కారణమైందని వ్యాఖ్యానింపబడింది. కాని అది వాస్తవంగా కనిపించదు. చైతన్యునికి గజపతిపై గొప్ప ప్రభావం ఉంది, కాని దానిని చైతన్యుడు దుర్వినియోగం చేయలేదు గోపీనాథరాయ అనే అతడు ఒక నేరం చేశాడు. రాజు అతనిని దండించాలని భావించాడు. దాంతో గోపీనాథరాయ చైతన్యుని దర్శించి తనను విడిపించమని రాజుకు చెప్పమని కోరాడు. కాని చైతన్యుడు తిరస్కరించాడు. నేరస్తుని తరపున మాట్లాడనని, నీవు నా భక్తుడివై అలా కోరినందువల్ల నేను పూరీలో ఉండమని చెప్పి అక్కడి నుండి అల్లాలనాథ అనే ప్రదేశానికి వెళ్లిపోవడానికి నిశ్చయించుకున్నాడట. కాశమిశ్రా ద్వారా ఆ విషయం తెలిసి గజపతి అతనిని ఆపడానికి గోపీనాథరాయుని శిక్షించకుండా వదలివేశాడట. కాని అందుకు చైతన్యుడు బాధ్యుడు కాదు పైగా చైతన్యుని సలహాపై ప్రతాపరుద్ర గజపతి యుద్ధాలు వదిలివేయ లేదు. 1516 నుండి 1533 వరకు చైతన్యుడు పూరీలో ఉన్నాడు. 1516 నాటికే ప్రతాపరుద్రుడు శ్రీకృష్ణదేవరాయలతో పోరాటాలు జరుపుతున్నాడు కృష్ణదేవరాయలతో సంధి చేసుకున్న తర్వాత కూడా గజపతి తన యుద్ధ చర్యలను మానలేదు. కృష్ణదేవరాయల మరణం తర్వాత తన రాజ్య భాగాలను తిరిగి వశం చేసుకోదానికి యుద్ధప్రయత్నాలు చేశాడు. బెంగాలు మొదలైన యుద్ధాలలో గజపతి ఓడిపోయాడంటే అతనికి గోవింద, విద్యాధర వంటి సేనాధిపతులు స్వార్థం కుతంత్రాల వల్ల సైనిక బలహీనతలే కారణమని చెప్పాలి గాని, చైతన్యుడని భావించడానికి వీలు లేదు. గోవింద విద్యాధరుడి స్వామి ద్రోహం వల్ల గజపతి రాజ్యం అస్తమించింది. కనుక చైతన్యుని బాధ్యుడుగా చేయడం సమంజసం కాదు. పైగా ఆనాటి భక్తి ఉద్యమకారుల ఉద్యమాల వల్ల ఉత్తర హిందూస్థానంలోని ముస్లిం రాజుల కాఠిన్యం తగ్గి హిందువులపై అకృత్యాలు తగ్గాయి. ముస్లిం మతవ్యాప్తి అరికట్టబడింది. చైతన్యుని ప్రభావం వల్ల బెంగాలు నవాబులు హిందూ ప్రజలను బాధించడం మానుకున్నారు. ఒరిస్సాలో కూడా అంతకుముందే వైష్ణవ మతం మంచి ప్రాచుర్యంలో ఉంది. గజపతి పూరీ జగన్నాథుని దేవాలయంలో గీతగోవిందంలోని గీతాలు తప్ప మరే గీతాలు ఆలాపించరాదని శాసనం వేయించాడు. చైతన్యుడు వచ్చిన తర్వాత పరమత సహనం హెచ్చి అన్ని హిందూమత శాఖల ప్రజల మధ్య ఐక్యత పెరిగింది. కనుక చైతన్యుడు గజపతి రాజ్యపతనానికి కారకుడని చెప్పడానికి వీలు లేదు

గజపతుల కాలంలో భాషా సాహిత్యాలు

భారతదేశంలో అనాది నుండి విద్యను ప్రభుత్వం నిర్వహించలేదు. వ్యక్తుల నిర్వహణలో ఉండేది. మొదటిసారిగా బౌద్ధులు తమ మతవ్యాప్తి కోసం విద్యాబోధనను తమ సంఘారామాలలో విస్తృత ప్రాతిపదికన ప్రారంభించారు. అందువల్ల బౌద్ధ విహారాలు విద్యాకేంద్రాలుగా వెలిగాయి. వారిని చూసి హిందువులు కూడా విద్యా ఘటికలను స్థాపించారు. మధ్యయుగంలో దేవాలయాలు, అగ్రహారాలు విద్యా నిలయాలుగా మారాయి. రాజులు విద్యావ్యాప్తికి పాటుపడ్డారు. కాకతీయ రుద్రమదేవి మల్కాపురం శాసనం విశ్వేశ్వర శంభుకు మందడ గ్రామాన్ని దానం చేసి అక్కడ వేద విద్యలు అభివృద్ధి చెందడానికి దోహదం చేసిందని తెలుపుతోంది. క్రీ.శ.1291వ సంవత్సరం నాటి సింహాచల శాసనం విద్యానిలయాన్ని గురించి తెలుపుతోంది ఈ శాసనం తూర్పుగాంగ వంశస్థుడైన ప్రతాపవీర నరసింహదేవునిచే కళింగదేశ పరీక్షకునిగా నియమింపబడిన గోపాల మహాసేనాపతి కుమారుడైన నారాయణ సేనాపతి అక్కడి విద్యాఘటికకు దానాలు చేసినట్లు తెలుపుతోంది. కనుక కళింగ దేశంలో కూడా విద్య బ్రాహ్మణులచే నిర్వహింపబడుతోందని స్పష్టమవుతోంది.

విద్యాశాస్త్రాలు - పార్యాంశాలు: గజపతులు అగ్రహారీకులకు ఇచ్చిన దాన శాసనాలలో లిఖించబడిన విషయాలను బట్టి ఆనాడు అధ్యయనం చేయబడిన శాస్త్రాలు, పార్యాంశాలు తెలుసుకోడానికి వీలవుతోంది హంవీరుని చిరుప్రోలు దానశాసనంలో అతడు దానం చేసిన బ్రాహ్మణుల పేర్లు, వారు పాండిత్యం సంపాదించిన విద్యలు పేర్కొన బడ్డాయి. వారిలో నైషధం వంశానికి చెందిన అహులభట్టు వేదాలు, భాష్యాలలో గొప్ప పండితుడని తెలుపుతోంది. కపిలేంద్రుని గోపీనాధపూర్ శాసనం జాగలి అనే పండితుడు మీమాంస వేదాంతాలతో పండితుడని వివరిస్తోంది. అలాగే ప్రతాపరుద్రుడు గజపతి అనంతవరం దాన శాసనంలో 128 మంది బ్రాహ్మణులకు దానం ఇచ్చినట్లు ఉంది. వారందరూ పురాణాలు, స్మృతులు, మీమాంస, పారభౌతిక మొదలైన శాస్త్రాలలో నిష్ణాతులైన పండితులని తెలిపింది. ఈ శాసనాలను బట్టి ఆనాడు వేదాలు, భాష్యాలు, పురాణాలు, స్మృతులు, మీమాంస శాస్త్రాలలో అధ్యయనం జరుగుతోందని చెప్పవచ్చును.

భాషలు: గజపతుల సామ్రాజ్యం చాలా విశాలమైనది. వారి సామ్రాజ్యంలో అనేక భాషల ప్రజలు నివసిస్తుండేవారు. తెలుగు, ఒరియా, బెంగాలీ, తమిళ ప్రజలు ఉండేవారు. చైతన్యుడు గజపతుల కాలం నాటి గొప్ప భక్తి ఉద్యమకారుడు. అతడు తన భక్తిగేయాలను స్థానిక భాషలలోనే గానం చేశాడు. అందువల్ల బెంగాలీ, ఒరియా భాషలకు కొంత ప్రాచుర్యం వచ్చింది. అయినప్పటికీ గజపతులు సంస్కృత భాషకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

సంస్కృత భాష - సంస్కృత కవులు - కావ్యాలు: గజపతుల ఆస్థాన సంస్కృతం. స్థానిక భాషలకు ప్రాచుర్యం వచ్చినా గజపతులు సంస్కృతాన్నే ఎక్కువగా ఆదరించారు. పండితులు సంస్కృతాన్నే అభిమానించారు. బ్రాహ్మణులు, క్షత్రియులు స్థానిక భాషలను తక్కువగా చూశారు. ఏ భాష అయినా వీరి కాలం నాటి వాఙ్మయం భక్తిభావపూరితమైంది.

సంస్కృత శాసనాలు: పురోషోత్తమ గజపతి కాలం నాటి ఒక్క శాసనం తప్ప గజపతుల మిగిలిన శాసనాలన్నీ సంస్కృతంలో రాయించబడ్డాయి. కపిలేంద్రుని గోపినాధపూర్ శాసనం ఒరియా లక్షణాలలో ఉన్నా అది కూడా సంస్కృతంలోనే రాయించబడింది. ప్రతాపరుద్ర గజపతి దాన శాసనాలన్నీ సంస్కృత భాష నాగరి లిపిలో ఉన్నాయి. గజపతుల ప్రశస్తులన్నీ గొప్ప సంస్కృత కావ్యాల లాగా నడిచాయి. ఈ శాసనాలు అనుష్టుబ్, ఇంద్రవ్రజ, ఉపేంద్రవ్రజ, ద్రుతిలంబిత, శార్దూల, ఇంద్రవంశ, పంకాకమర శ్లోకాలలో రచించబడ్డాయి. కాని ఈ శాసన లేఖకుల పేర్లు తెలియదు.

గజపతులు స్వయంగా కవులు: గజపతులు కవి పండిత పోషకులేగాక స్వయంగా కవులు. వారు అనేక కావ్యాలు, గ్రంధాలు రాశారు. కపిలేశ్వర గజపతి రచనలు లభించలేదు. అతని జీవితమంతా యుద్ధాలలోనే గడిచిపోయింది. కనుక అతడు రచనలు చేసి ఉండకపోవచ్చును. కాని అతని కుమారుడు పురుషోత్తమ గజపతి గొప్ప రచయిత. అతడు సంస్కృతంలోని అన్ని రకాల కావ్యాలను అధ్యయనం చేసిన గొప్ప పండితుడు.

పురుషోత్తమ గజపతి రచనలు: అతడు దండక అనే గ్రంధాన్ని రచించాడు. దానికి స్తోత్రం అని కూడా

పేరుంది. అతని తర్వాత రచన అభినవ గీతగోవింద. దానిని అతడు 800 శ్లోకాలలో రచించాడు. అతడు విష్ణు బ్రహ్మ, పద్మ, శైవ, భాగవత, నారదీయ, మార్కండేయ, అగ్ని, భవిష్యత్, బ్రహ్మకైవర్త, లింగ వరాహ, స్కంధ, కూర్మ మత్స్య, గరుడ, బ్రహ్మాండ పురాణాలు లోతుగా అధ్యయనం చేసి వాటి సారాంశంతో హరిని కీర్తిస్తూ నామమాలిక గోపాలుని అర్చించే విధానాన్ని, గోపాలార్చన విధి అనే మరొక గ్రంథం రాశాడు. తర్వాత ఆగమ కల్పతరు అనే మరొక గొప్ప కావ్యం కూడా రాశాడు. హరావళి త్రికాండశేషం అనే రెండు సంస్కృత నిఘంటువులు కూడా రాశాడు. వీనిలో త్రికాండశేషంలో అమరసింహుడు రచించిన నామలింగాను శాసనం అనే నిఘంటువులో లేని అనేక పదాలను చేర్చాడు. అందువల్ల అది అమరసింహుని నామలింగాను శాసనానికి అనుబంధ నిఘంటువుగా ప్రసిద్ధి చెందింది. రూపగోస్వామిన్ రచించిన పద్యావళిలోని ఒక శ్లోకం పురుషోత్తమ దేవుడు రచించాడని ప్రతీతి ఈ విధంగా పురుషోత్తమ గజపతి అనేక కావ్యాలు రచించి గొప్ప కవిగా ప్రఖ్యాతి వహించాడు.

ప్రతాపరుద్ర గజపతి రచనలు: పురుషోత్తమ దేవుని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి కూడా గొప్ప కవి అనేక కావ్యాలు రచించాడు. అతని కాలం నాటి శాసనాలు కూడా అతనిని గొప్ప రచయితగా కీర్తిస్తున్నాయి అనంతవరం శాసనం అతనిని కల్పక్షోనిరుహ దానసాంధ అని కీర్తిస్తోంది. సర్వసతీ విలాసం అతడు అనేక విద్యలలో ఆరితేరినవాడని తెలుపుతుంది. అతడు కాటుకచింతామడి, నిర్ణయసంగ్రహ, ప్రౌఢ ప్రతాపమార్తాండ, సరస్వతీ విలాసం అనే నాలుగు కావ్యాలు రాశాడు. వీనిలో సరస్వతీ విలాసం అతిముఖ్యమైనది. అది 5 ప్రకరణాలుగా విభజింపబడింది. పదార్థ నిర్ణయ, వత్సరాధి నిరూపణ, తిధి నిరూపణ, వ్రతనిర్ణయ, విష్ణుభక్తి అంతేగాక తన గ్రంధానికి హేమాద్రి, కల్పతరు, రత్నాకర, నితాక్షర, మాతవీయ, అనంతభట్ట, స్మృతికంద్రిక, అపరార్క, పారిజాత, కళాదర్శ మొదలైన గ్రంధాలు ఆధారాలు అని చెప్పుకున్నాడు.

కవిపండిత పోషణ: ప్రతాపరుద్ర గజపతి గొప్ప కవే కాకుండా అనేక కవి పండితులను పోషించాడు అనేక ప్రాంతాల నుండి కవి పండితులు అతని ఆస్థానాన్ని దర్శించేవారు. వచ్చిన ప్రతి పండితుడికీ ఆదరణ లభించేది అనేక శాస్త్రాలు విద్యలలో నిష్ణాతులైన పండితులతో అతని సభ అలరారుతుండేది. ఆ పండిత సభకు విద్వత్ సభ అని పేరు వచ్చింది.

వాసుదేవ సార్వభౌమ: ప్రతాపరుద్ర గజపతి ఆస్థానాన్ని అలంకరించిన కవులలో ప్రసిద్ధి చెందినవాడు వాసుదేవ సార్వభౌమ. అతడు గొప్ప నవ్య న్యాయ పండితుడు. అతని తండ్రి విశారద. అతడు బెంగాల్‌లోని నవద్వీప నివాసి. అతని తండ్రి వద్ద స్మృతులను చదువుకొని న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేయటానికి మిథిలా నగరం వెళ్లాడు. అక్కడ పక్షధార మిశ్రా అనే పండితుని వద్ద న్యాయశాస్త్రం అభ్యసించాడు. ఆ సందర్భంలో తత్వ చింతామణిని కంఠస్తం చేశాడు. తర్వాత తన గురువు పెట్టిన సలాక పరీక్షలో ఉత్తీర్ణుడై సార్వభౌమ అనే బిరుదును పొందాడు. తర్వాత అతడు బెనారస్ చేరి వేదాంతాన్ని క్షుణ్ణంగా చదువుకొని నవద్వీపం తిరిగి వచ్చి అక్కడ న్యాయ అధ్యయన పీఠాన్ని స్థాపించాడు. అతను స్థాపించిన పీఠం, తర్వాత అతని శిష్యుడు రఘునాథుని సారథ్యంలో నవద్వీప విశ్వవిద్యాలయంగా రూపొందింది.

ఈ విశ్వవిద్యాలయం నవ్య, న్యాయ విద్యను అభివృద్ధి చేసింది. న్యాయ అంటే లాజిక్, భారతీయ తాత్విక చింతనలను షడ్దర్శనాలని అంటారు. అందులో న్యాయశాస్త్రం కూడా ఒక దర్శనం. న్యాయదర్శన కర్త గౌతముడు. అతనికి అక్షపాదుడు అని కూడా పేరుంది. అతని రచనకు గౌతమ సూత్రాలు అని పేరు క్రీ.పూ.150 సంవత్సరంలో రచింపబడిందని భావిస్తారు. ఆత్మ భవబంధాల నుండి విముక్తి చెందే సూత్రాలను ఇందులో పొందుపరచాడు. ఇతని తాత్విక చింతన దేశంలో చాలా ప్రాచుర్యం పొందింది. ఈ తాత్విక చింతన రెండు దశలుగా అభివృద్ధి చెందింది. మొదటిదశను ప్రాచీనమని, రెండవ దశను నవ్యదశమని అంటారు. గౌతమ సూత్రాలకు క్రీ.శ.4వ శతాబ్దంలో వాత్స్యాయనుడు వ్యాఖ్యానం రాశాడు. తర్వాత గౌతమ సూత్రాలను బౌద్ధ పండితుడైన ధిగ్నాగ లేక దిన్నాగ విమర్శించాడు. అతని తర్వాత ఉద్యోతకర అనే పండితుడు తన వార్త అనే గ్రంథంలో గౌతమ సూత్రాలను సమర్థించాడు. జయంతభట్ట తర్వాత ఆ తాత్విక చింతన మరుగున పడిపోయింది దాంతో దాని ప్రాచీన దశ ముగిసింది. అప్పటి నుండి నవ్యన్యాయతత్వమని పేరొచ్చింది. ఈ రెండింటి ప్రధాన భేదం ఏమిటంటే ప్రాచ్యన్యాయం అంటే ప్రాచీన న్యాయచింతన పూర్తిగా స్వతంత్ర వ్యక్తిత్వం కలిగింది నవ్యన్యాయతత్వానికి ప్రత్యేక తాత్విక ధోరణి లేదు కాని క్లుప్తమైన ఆలోచనా విధానం ఉంది. ఈ నవ్యన్యాయతత్వాన్ని వాసుదేవ సార్వభౌముడు, అతని తర్వాత అతని శిష్యుడు రఘునాథుడు బాగా అభివృద్ధి

చేసారు. వారి నవ్యన్యాయతత్వాన్ని వారు స్థాపించిన నవద్వీప విశ్వవిద్యాలయం బహుళ వ్యాప్తిలోకి తెచ్చింది.

13, 14, 15 శతాబ్దాలలో మిథిలా నగరం న్యాయచింతనా ధోరణి అధ్యయనానికి నిలయంగా ఉండేది. అక్కడ న్యాయశాస్త్రం అధ్యయనం చేసిన వారికి చివరలో సలాక పరీక్ష అనే పరీక్ష జరిపేవారు. అందులో ఉత్తీర్ణులైన వారే న్యాయ లేక తర్కశాస్త్ర పండితులుగా గుర్తింపబడేవారు. వాసుదేవ సార్వభౌముడు ఆ పరీక్షలో విజయం సాధించి న్యాయ లేక తర్కశాస్త్ర పండితుడుగా గుర్తింపు పొందడమే గాక నవద్వీపంలో తర్క విద్యాపీఠాన్ని ప్రారంభించి తర్కశాస్త్రానికి నవరూపం ఇచ్చిన నవ్యన్యాయ శాస్త్రమని గొప్ప కీర్తి వచ్చేలా చేశాడు.

వాసుదేవ సార్వభౌముడికి అదృష్టవశాత్తు గొప్ప శిష్యులు లభించారు.

1. **చైతన్యుడు:** ఇతనికి విశ్వంభర అనే పేరుండేది. అతడు గొప్ప భక్తి ఉద్యమకారుడై కీర్తి పొందాడు.
2. **రఘునాథ:** ఇతని దిధితి తర్కశాస్త్రానికే గొప్ప కీర్తి తెచ్చింది.
3. **రఘునానందన:** ఇతడు తాంత్రిక విద్యను అభివృద్ధి చేశాడు.

వీరందరి వల్ల వాసుదేవ సార్వభౌముని యశస్సు అజరామరమైనది. వాసుదేవ సార్వభౌముడు అనేక కావ్యాలు రచించాడు. కాని అవి మనకు లభ్యం కావడం లేదు. తత్వ చింతామణి మీద వ్యాఖ్యానం రచించిన శారావళి అని ఒకే గ్రంథం లభ్యమైంది.

ఇతని కాలంలో బెంగాల్‌ను సుల్తాన్ హుస్సేన్‌షా పరిపాలించేవాడు. అతడు బ్రాహ్మణులను అణచే విధానాన్ని ప్రారంభించాడు. ముఖ్యంగా నవద్వీప పండితులను అణచివేశాడు. అతని నిరంకుశత్వాన్ని తట్టుకోలేక వాసుదేవ సార్వభౌముడు నవద్వీపాన్ని వదిలి పూరీ చేరి ప్రతాపరుద్ర గజపతిని ఆశ్రయించాడు. గజపతి అతనిని గౌరవించి బంగారు సింహాసనాన్ని అర్పించాడు. వాసుదేవ సార్వభౌముడు పూరీలో నివసిస్తూ న్యాయవైశేషిక శాస్త్రాల నుండి మనసును మళ్లించి వేదాంత అధ్యయనంపై దృష్టిని నిలిపాడు. లక్ష్మీధరుని అద్వైత మకరందానికి వ్యాఖ్యానం రచించాడు. క్రీ.శ.1629లో కాపీ చేయబడిన దాని ప్రతి పూరీ శంకరమఠంలో ఉంది. తర్వాత అతడు 1510వ సంవత్సరానికి తన శిష్యుడైన చైతన్యుని ప్రభావంతో వైష్ణవుడుగా మారాడు. వైష్ణవునిగా మారిన తర్వాత అతడు సోదర బెంగాల్ భక్తి ఉద్యమకారులైన చైతన్య, నిత్యానంద, అద్వైతాలపై అనేక స్తోత్రాలు రచించాడు. ప్రతాపరుద్రుడు అతనిని తన ఆస్థాన ప్రధాన పండితునిగా నియమించాడు. నాటి ప్రజలు అతనిని గొప్ప న్యాయ శాస్త్రవేత్తగా, కర్మకాండ పండితునిగా, గొప్ప వేదాంతిగా భావించేవారు.

వాహినీపతి: వాసుదేవ సార్వభౌముని కుమారుడు వాహినీపతి. ఇతని పూర్తి పేరు జ్ఞానేశ్వర వాహినీపతి మహాపాత్ర. ఇతడు కూడా ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలో నివసించాడు. గజపతి ఇతనికి మహాపాత్ర అనే బిరుదు కూడా ఇచ్చాడు. ఇతడు కూడా తండ్రి లాగే న్యాయవైశేషిక శాస్త్రాలలో పండితుడు. ఆలోక అనే శబ్దకాండ మీద ఉద్యోత అనే పేరుతో వ్యాఖ్యానం రాశాడు. దీని ప్రతి నేటికీ బెనారస్ సంస్కృత కళాశాలలో ఉంది.

లొల్ల లక్ష్మీధర పండితుడు: ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలోని మరొక ప్రసిద్ధ కవి లొల్ల లక్ష్మీధరుడు. అతని తండ్రి విశ్వనాథ భట్టారక. హరీతి గోత్రానికి చెందినవాడు. అతడు సౌందర్యలహరికి రాసిన వ్యాఖ్యానంలోని పీఠికలో తన వంశవృక్షాన్ని ఇచ్చాడు. దాని ప్రకారం -

మహామహోపాధ్యాయ మహాదేవాచార్య

↓

లక్ష్మీధరరాయ

↓

రచనలు-సాహిత్య పారిజాత-స్మృతికల్పతరు

↓

విరూచి

↓

రచనలు-భారతార్ణవ-సాహిత్య మీమాంస

↓

పురుషోత్తమ మహోపాధ్యాయ

↓

మహామహోపాధ్యాయ లక్ష్మనార్య

↓

రచనలు-ప్రభాకర భూతవాహిని-ప్రభావ-ఖండనఖాండ

↓

మహామహోపాధ్యాయ విద్వత్ సార్వభౌమ విశ్వనాథ భట్టారక

↓

రచనలు-నయ వివేకదీపిక

లక్ష్మీధరుడు: లక్ష్మీధరుడు గొప్ప కవి. అనేక కావ్యాలు రాశాడు. ఇతడు లొల్ల లక్ష్మీధరుడని ప్రసిద్ధి చెందాడు.

1. వాసప్తివిలాస
2. యోగదీపిక
3. మానవధర్మశాస్త్ర దీపిక
4. కర్నావతంస
5. సౌందర్యలహరి వ్యాఖ్య

మొదలైనవి లొల్ల రచనలు. కాని ఈ గ్రంథాలన్నీ లభించలేదు. అతని సౌందర్యలహరి వ్యాఖ్య మాత్రం అనేక భాషలలోకి తర్జుమా చేయబడింది. అది తెలుగులోకి కూడా అనువదింపబడింది. లొల్లకు అనేక మంది శిష్యులు ఉన్నారు. వారిలో దాసయామాత్యుడు ముఖ్యుడు. అతడు నాదెండ్ల గోప ప్రభువుకు సహాయకుడుగా ఉండేవాడు. నాదెండ్ల గోప మంత్రి కృష్ణదేవరాయలచే కొండవీటి పాలకుడుగా నియమింపబడ్డాడు. ప్రతాపరుద్ర గజపతి క్రీ.శ.1500 సంవత్సరంలో లొల్లకు అనంతవర గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ప్రతాపరుద్ర గజపతిచే రచించబడిందని చెప్పబడిన సరస్వతీ విలాసాన్ని లొల్ల రచించాడని ప్రతీతి. ఈ గ్రంథాన్ని తన తొలి రోజులలో రాసి ప్రతాపరుద్ర గజపతి పేరు పెట్టి అతని అభిమానాన్ని సంపాదించాడని భావింపబడింది. అందువల్లనే గజపతి అతనికి అనంతవర అగ్రహారం ఇచ్చాడని కొందరు అంటారు. లొల్ల అద్వైత మకరందం అనే మరొక వేదాంత గ్రంథాన్ని రాశాడు. దానికి ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలోని ప్రఖ్యాత తర్కశాస్త్రవేత్త అయిన వాసుదేవ సార్వభౌముడు వ్యాఖ్యానం రాశాడు.

శ్రీకృష్ణదేవరాయలు ప్రతాపరుద్ర గజపతిని ఓడించిన తర్వాత లొల్ల విజయనగరం ఆస్థానానికి వెళ్ళిపోయాడు. కృష్ణదేవరాయలు కాజ, మంగళగిరిలలో వేయించిన శాసనాలను లొల్ల లిఖించాడు. ఈ శాసనాలు క్రీ.శ.1520వ సంవత్సరం నాటికి చెందినవని భావించారు. కనుక లొల్ల క్రీ.శ.1520 సంవత్సరానికి ముందు విజయనగర ఆస్థానంలో చేరి ఉండవచ్చును. రాయలు ప్రతాపరుద్ర గజపతిని క్రీ.శ.1518లో పూర్తిగా ఓడించాడు. కనుక క్రీ.శ.1518-1520 మధ్యకాలంలో అతడు గజపతుల ఆస్థానాన్ని వదిలి వెళ్లి ఉంటాడు. అతని శిష్యుడు దాచయామాత్యుడు మహింనస్తవ అనే కావ్యానికి వ్యాఖ్య రాశాడు. అందులో లొల్ల జ్యోతిష్, ఖగోళ శాస్త్రాలలో గొప్ప పండితుడని వర్ణించాడు. లొల్ల జ్యోతిష్ దర్పణ అనే గ్రంథం రాశాడు. కనుక అతడు గొప్ప జ్యోతిష్ శాస్త్రవేత్తగా దాచయామాత్యుడు వర్ణించాడు.

దివాకర కవి: ప్రతాపరుద్రుని ఆస్థానంలోని మరొక కవి దివాకరుడు. అతని తండ్రి వైద్యేశ్వరుడు వాజసనేయ శాఖకు చెందిన భారద్వాజ గోత్రీకుడు. నారాయణ కవిరత్నకు మేనల్లుడు. గోవింద మధుసూదనులకు సోదరుడు. పురుషోత్తమ గజపతి రచించిన అభినవ గీతగోవిందను ఇతడు రాశాడని కొందరంటారు. ధూరచరిత్ర అనే మరొక గ్రంథం రాశాడు. ఇది అతని సోదరుడైన మధుసూదనుడు రాశాడని మరికొందరంటారు. ఈ గ్రంథంలో దుర్గాదేవిని 100 శ్లోకాలలో కీర్తించాడు. అతడు రచించిన ప్రముఖ గ్రంథం లక్షణదర్శ. ఇది 14 అధ్యాయాలుగా రచించాడు. ప్రతి అధ్యాయంలో పాండవుల కథను చెబుతూ వ్యాకరణాంశాలను వివరించాడు. కాని ఈ గ్రంథం అసంపూర్ణంగా వదలివేయబడింది. ఇతడు రచించిన మరొక ప్రముఖ కావ్యం భారతామృతం దీని ప్రతులు మద్రాసు ఓరియంటల్ మాన్యుస్క్రిప్టు లైబ్రరీలో ఉన్నాయి. ఇందులో రచయిత పేరు లేదు. కాని అతడు ముక్తాంబ వైద్యేశ్వరుల కుమారుడని ఉంది. అంతేగాక ఈ కావ్య రచనలో అతని పినతండ్రి గోవింద అనే అతడు సహాయం చేశాడని కూడా చెప్పబడింది. ఈ గ్రంథంలోని పీఠికలో ఈ కవి పారిజాతాపహరణ నాటకం,

రసమంజరి అనే కావ్యాలు రాశానని చెప్పుకున్నాడు. భారతామృతంలో మహాభారత కథను పద్యకావ్యంగా రచించాడు. అందులో ప్రతి అధ్యాయం చివరలో తన వంశాన్ని గురించి వివరించాడు. ప్రతాపరుద్ర గజపతి దివాకర కవిని గొప్పగా గౌరవించి కవిచంద్రరాయ అనే బిరుదునిచ్చాడు. ప్రతాపరుద్ర గజపతి కృష్ణదేవరాయల చేతిలో ఓడిపోయిన తర్వాత, ఇతడు కూడా లొల్ల లాగే గజపతుల ఆస్థానం వదిలి కృష్ణదేవరాయలను ఆశ్రయించి విజయనగరం చేరాడు.

జీవదేవ కవి: ప్రతాపరుద్ర గజపతి ఆదరించిన మరొక సంస్కృత కవి జీవదేవ కవి. అతడు భక్తి వైభవ నాటకం అనే గ్రంథాన్ని రాశాడు. అందులో అతడు శ్రీమత్ కవిరాజ రాజగురు త్రిలోచనాచార్యుని కుమారుడని రాసుకున్నాడు. జీవదేవుని పూర్తి పేరు శ్రీమాన్ మహామహోపాధ్యాయ కవి డింఢిమ వాహినీపతి రాజగురు శ్రీజీవదేవాచార్య అని చెప్పుకున్నాడు. అతడు రచించిన భక్తివైభవ నాటకం 2800 శ్లోకాలతో రచింపబడింది. అందులో పీఠికలో అతడు తన వంశాన్ని గురించి వివరించి తనను ప్రతాపరుద్ర గజపతి ఆదరించాడని చెప్పుకున్నాడు. జీవదేవ కవికి మూలపురుషుడు గోపాలదేవుడు. అతడు చివరి తూర్పుగాంగరాజైన నిశ్శంక భానదేవుని రాజగురువు. తర్వాత కపిలేంద్రకు కూడా గురువుగా వ్యవహరించాడు. అతని కుమారుడు త్రిలోచన కవిరాజు పురోషోత్తమ గజపతికి రాజగురువు. అతని కుమారుడైన జీవదేవ కవి ప్రతాపరుద్ర గజపతికి రాజగురువు. ఇతడు గొప్ప దైవభక్తుడు. వేదాంతం షడ్దర్శనాలలో గొప్ప పండితుడు. ఇతడు చివరలో చైతన్యుని ప్రభావానికి లోనయ్యాడు. జీవదేవ కవి భక్తి భాగవత మహాకావ్యం అనే మరొక కావ్యాన్ని కూడా రాసి, ప్రతాపరుద్ర గజపతికి అంకితం ఇచ్చాడు. ఈ గ్రంథంలోని పీఠికలో గజపతుల పరిపాలన, విజయాలు, వారు చేసిన దాన ధర్మాలను గురించి వివరించాడు.

రామానందరాయ: ఇతడు ఒరిస్సాలో ప్రసిద్ధి చెందిన కరణ వంశానికి చెందినవాడు. ఇతని తండ్రి పేరు భవానంద పట్నాయక్. భవానందకు ఐదుగురు కుమారులు. వారిలో రామానందరాయ పెద్దవాడు. ఇతడు గొప్ప మేధావిగా ప్రసిద్ధి చెందాడు. అందువల్ల ప్రతాపరుద్ర గజపతి అతనిని రాజమండ్రి దండపథానికి పరీక్షకునిగా నియమించాడు. ఇతడు ఒక సందర్భంలో చైతన్యుని కలుసుకున్నాడు. అప్పుడు వారిద్దరి మధ్య వేదాంత చర్చ జరిగింది. చివరకు చైతన్యుడు భక్తిమార్గం గొప్పదని నిరూపించాడు. దాంతో రామానందరాయ వైష్ణవుడుగా మారిపోయి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. చైతన్యునితో ఉండిపోయాడు. అతడు భక్తితత్వానికి ఒక నూతనతత్వాన్ని కలిగించాడు.

అతడు పూర్వపు భజన పద్ధతిని తిరస్కరించాడు. భజన చేసే సమయంలో ఒక నూతన పద్ధతిలో నాట్యం చేసేవాడు. తన భక్తి విధానంలో రాధాకృష్ణుల ప్రేమకు అమిత ప్రాధాన్యతనిచ్చాడు. తన తత్వానికి రాగానుగ అని పేరు పెట్టాడు. రామానందరాయ గొప్ప కవి. అతడు జగన్నాథ వల్లభ నాటకం అనే గ్రంథాన్ని రచించాడు. అది 5 అంకాల నాటకం. రాధాకృష్ణుల ప్రేమకలాపం. ఈ నాటకం ప్రతాపరుద్ర గజపతి సమక్షంలో ప్రదర్శింపబడింది. ఈ నాటక పీఠికలో రామానందరాయ తన తండ్రి భవానందను, తన ప్రభువు ప్రతాపరుద్ర గజపతిని పేర్కొన్నాడు. ప్రతాపరుద్ర గజపతిని చైతన్య మతంలోకి మార్చడంలో రామానందరాయ ప్రముఖ పాత్ర నిర్వహించాడని చైతన్య చరిత్రామృతం అనే గ్రంథం తెలుపుతోంది.

ఒరియా సాహిత్యం: గజపతులకు ముందు ఒరిస్సాను పాలించిన తూర్పు గాంగులు ఒరియా భాషను ఆదరించలేదు. వారు సంస్కృతాన్నే పోషించారు. వారి కాలం నాటికి చెందిన ఒరియా రచన ఒక్కటి కూడా మనకు లభ్యం కాలేదు. సూర్యవంశ గజపతులు ఓఢ్ర రాజవంశమని చెప్పుకున్నా వారు కూడా ఒరియా భాషను పెద్దగా ఆదరించలేదు. ఒరియా కవులు కూడా గజపతి వంశాన్ని గురించి తమ కావ్యాలలో గొప్పగా పేర్కొనలేదు.

గాంగ వంశం గజపతి వంశం ఒరియా భాషా సాహిత్యాన్ని పోషించకపోయినా ఒరియా భాషా సాహిత్యం కొద్ది కొద్దిగా అభివృద్ధి చెందింది. కేసవకోయిల్ అనే ఒరియా పద్య కావ్యం లభించింది. అది క్రీ.శ.1450 సంవత్సరానికి ముందు రచించబడి ఉండవచ్చని ముజుందార్ అనే పండితుడు భావించాడు. కనుక అది చివరి గాంగ వంశరాజుల కాలంలోగాని కపిలేశ్వర గజపతి కాలానికి చెంది ఉండవచ్చని కొందరు ఊహించారు. అనే పండితుడు అది 500 సంవత్సరాల క్రితానిదని అన్నాడు. మన్మోహన చక్రవర్తి అనే పండితుడు అది 300 సంవత్సరాల నాటిదని అన్నాడు. జగన్నాథ దాస్ ఈకోయిల్‌ను తన కావ్యం అయిన అర్థకొయిలిలో పేర్కొన్నాడు. అతడు ప్రతాపరుద్ర గజపతి సమకాలికుడు. కనుక ఇది జగన్నాథ దాస్ కంటే ముందు రాయబడింది. దానిని

మార్కండేయదాస్ రాశాడు. దానికి యశోద కోయిల్ అని కూడ పేరుంది. మార్కండేయదాస్, కపిలేశ్వర లేక పురుషోత్తమ గజపతి కాలానికి చెందింది. దాని కాలం స్పష్టంగా తెలియకపోయినా ఈకోయిల్ ఒరియా భాషలో తొలి రచన అని భావించారు.

ఇది సంభాషణా రూపంలో రచించబడింది. కవి తన భావాలను ఒక మనిషి ద్వారా ఒక కోయిలకు తెలుపుతున్నట్లు రాయబడింది. తొలి ఒరియా సాహిత్య గ్రంథాలన్నీ అనువాదాలే. మహాభారత, భాగవత, రామాయణం రాసిన సరళదాసు, బలరామదాసు జగన్నాథదాసులు మొదట ఒరియా కవులు. అయితే వారు ఉంది ఉన్నట్లు కాక కొంత స్వతంత్ర వైఖరిని అవలంబించారు. శ్లోకాలు రాయడంలో వారు సొంత చరణాలు రాశారు. చౌతిస పద్యాలు ఎక్కువగా రాశారు. ఈ విధంగా రాయడం ఒరియా సాహిత్యంలోని ప్రత్యేకత. ఒక చౌతిసాలో 34 వాక్యాలుంటాయి. ప్రతి వాక్యంలో మొదటి అక్షరాలు 'క' గాని 'క్ష'తో గాని ప్రారంభం అవుతాయి. ఈ విధంగా రాయడం తాంత్రిక మంత్ర లక్షణం.

ఒరిస్సాలో తాంత్రిక మత ప్రభావం ఉండేది. దాని ప్రభావం భాషా రచనలో కూడా ప్రవేశించింది. దీనాకృష్ణదాసు తన రాసకల్లోలం అనే రచనను ఈ పంథాలో రచించాడు. చైతన్యుని ప్రభావం వల్ల కృష్ణదాసు తన రాసకల్లోలం ఈకృష్ణభక్తి ప్రభావం వల్ల రచించబడింది. ఈ గ్రంథకర్త దీనాకృష్ణదాసు వైష్ణవుడు. పూరీలో జగన్నాథ ఆలయంలో నివసించేవాడు. అతని కావ్యంలో పురుషోత్తమ గజపతిని స్తుతించాడు. కనుక ఇతడు అతని కాలానికి చెందినవాడని భావించారు. ఈ కావ్యంలో 32 గద్యాలున్నాయి. అవి ఒక్కొక్కటి 100-150 పంక్తులతో ఉన్నాయి. స్థానిక ఒరియా భాషలో రాయబడింది. ఈ కావ్యం ఒరిస్సాలో చాలా ప్రాచుర్యం పొందింది. ఒరిస్సా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలు ఇందులో పాటలు పాడుకుంటారు. అంతేగాక అందులోని అనేక కావ్యాలు సామెతలుగా రూపొందాయి. సంస్కృతంలోని దీర్ఘసమాసాలు లేకుండా రాసినందువల్ల పామరులు సులభంగా పాడుకోటానికి వీలు కలిగి ఈ కావ్యం బాగా ప్రజాభిమానం పొందిందని అంటారు.

తొలి ఒరియా కవులు - సరళదాసు: ఒరియా భాషలోని తొలి కవులలో మొదట చెప్పుకోదగినవాడు సరళదాసు. ఇతడు ఒరియా మహాభారతాన్ని రాశాడు. దాంతో ఒరియా భాషలో మతసంబంధమైన ఇతిహాసాల రచన ప్రారంభమైంది. మిగిలిన వారు అతనిని అనుసరించారు. అతడు శూద్రుడు. జంకూర్‌పూర్ నివాసి. ఈ గ్రంథంలో కవి పురుషోత్తమ గజపతి కాలం వాడని నిర్ణయించారు. ఇతడు రచించిన మహాభారతం బెంగాలీ భాషలోకి అనువదించబడింది. డాక్టర్ దినేష్ చంద్రసేన్ అనే పండితుడు పేర్కొన్నాడు. బెంగాల్‌లో ఆ గ్రంథం గొప్ప ప్రాచుర్యం పొందింది.

బలరామ దాస్: తర్వాత చెప్పుకోదగిన కవి బలరామ దాస్. ఇతడు సరళదాసును అనుసరిస్తూ ఒరియా రామాయణాన్ని రాశాడు. ఇతని తండ్రి సోమనాథ మహాపాత్రుడు. అతడు ఒక మంత్రి. ముజుందార్ అనే పండితుడు, సోమనాథుడు కపిలేశ్వరుని మంత్రి అయిన గోపీనాథుని వారసుడు కావచ్చును, కనుక అతడు పురుషోత్తమ గజపతికి మంత్రిగా చేసి ఉంటాడని భావించారు. సరళదాసు ఒక చోట తన కావ్యం పూర్తి పేరు జగన్మోహన రామాయణ అని పేర్కొన్నాడు. ఇతని రామాయణం గొప్ప ప్రజాభిమానం పొందింది. కాని బ్రాహ్మణులు ఇతని రామాయణాన్ని తక్కువ భావనతో చూశారు. తన గ్రంథంలో ఒకచోట బ్రాహ్మణులు తన రామాయణాన్ని పఠించాలని అర్థించాడు.

ఇతడు తన 32వ ఏట ఈ రామాయణాన్ని పూర్తి చేశానని చెప్పుకున్నాడు. కనుక అతడు పురుషోత్తమ గజపతి కాలంలో రామాయణం రాశాడని తీర్మానించారు. గజపతి కాలంలో కూడ రచనలు చేశాడు. అర్జునగీత, గజనిష్తరణ గీత, భేద పరికర్మ, రాశాడని తెలుపుతున్నాయి. కాని దానిని అతడు పూర్తిగా రాయలేదని అతని మరణం తర్వాత ముకుందదేవుడు అనే కవి దానిని 35 అధ్యాయాలుగా పూర్తి చేశాడని అతడు బలరామదాసు అవతారమేనని భావించారని ఆ గుప్తగీత తెలుపుతుంది. మరొక గుప్తగీత బలరామదాసుకు కొందరు సనాతన బ్రాహ్మణులకు వాగ్వివాదం జరిగిందని తెలుపుతుంది. వారి వాదనలు ప్రతాపరుద్ర గజపతికి నివేదింపబడ్డాయని కూడా తెలిపింది. బలరామదాసు తన చివరి దశలో చైతన్యుని ప్రభావానికి లోనై చైతన్యభక్తుడిగా మారిపోయాడు.

జగన్నాథ దాస్: తర్వాత చెప్పుకోదగిన కవి జగన్నాథ దాస్. ఇతడు ప్రతాపరుద్రుని ఆస్థాన కవి. ఇతని తండ్రి భగవాన్ దాస్, తల్లి పద్మ. ఇతడు బ్రాహ్మణుడు. కాని అతడు బలరామదాసు శిష్యుడని జగన్నాథ చరిత్రామృతం తెలుపుతోంది. అతని తండ్రి భగవాన్ దాస్ పూరీ జగన్నాథుని ఆలయంలో పురాణ శ్రవణం

చేసేవాడు. తన కుమారునికి సంస్కృతంలో మంచి శిక్షణ ఇచ్చాడు. దివాకర కవి ఇతని కథ రాస్తూ అతడు పూరీలో భగవద్గీత పారాయణం జరుగుతుండగా విని ప్రేరణ పొంది ఒరియాలో భగవద్గీతను రాశాడని పేర్కొన్నాడు. ఈ భగవద్గీత ఒరిస్సా అంతటా గొప్ప ప్రాచుర్యం పొందింది. చైతన్యుని ప్రభావం వల్ల ఇతడు కూడా వైష్ణవుడయ్యాడు. అప్పటి నుండి జగన్నాథ దాసు తన భగవద్గీతను అందరూ వినేటట్లు చేయాలని భావించాడు. అందుకు ప్రతి గ్రామంలో ఒక వ్యక్తి ప్రతిరోజూ తన భగవద్గీతను చదివే ఏర్పాటు చేశాడు. అది చదివిన వ్యక్తికి ఆ గ్రామ ప్రజలు సంభావన ఇచ్చే ఏర్పాట్లు కూడా చేశాడు. దాంతో ఒరిస్సా అంతటా ఇతని భగవద్గీత గొప్ప పారాయణ గ్రంథంగా మారింది. దాని వల్ల వైష్ణవ మతం కూడా బాగా వ్యాప్తి చెందింది. కుల భేదాలు కొంత వరకు తగ్గాయి. జగన్నాథ దాసు ఇంకా అనేక గ్రంథాలు రాశాడు. 1. గుప్తభాగవత, 2. దారుబ్రహ్మగీత, 3. గజస్తుతి, 4. అర్థకొయిలి, 5. ముర్గునిస్తులు, 6. ధృవస్తుతి, 7. తులాభిన, 8. ఇతిహాసపురాణం, 9. పాసందదళన, 10. మానసికోశం, 11. రాసక్రీడ మొదలైన గ్రంథాలు రాశాడు.

అచ్యుతానంద దాస్: ఈ కాలం నాటి మరొక ఒరియా కవి అచ్యుతానంద్ దాస్. ఇతడు గరుడ గీత, శూన్యసంహిత అనే రెండు కావ్యాలు రాశాడు. ఇతడు ప్రతాపరుద్ర గజపతిచే ఆదరింపబడ్డాడు. తర్వాత ముకుంద దేవుని కాలం వరకు జీవించాడు. రణపూర్ పాలకుడు పద్మనాభ నరేంద్రుని వద్ద కొన్నాళ్లు రాజసేవ చేశాడు. ఆ తర్వాత ఇతనిని గురించి ఏమీ తెలియదు.

గజపతుల కాలం నాటి తెలుగు కవులు-కవులు: ఆంధ్రదేశం యావత్తూ గజపతి సామ్రాజ్యంలో చేరి ఉన్నా వారు తెలుగు భాషా సాహిత్యాలను పోషించలేదు. కర్ణాటక సామ్రాట్ అయిన శ్రీకృష్ణదేవరాయలు తెలుగు భాషను అద్భుతంగా పోషించాడు. కాని యావదాంధ్ర పాలకులై ఉండి కూడా గజపతులు తెలుగు భాషను ఆదరించలేదు. వారు తెలుగునే కాదు ఒరియా భాషను కూడా ఆదరించలేదు. వారు సంస్కృతానికే పెద్దపీట వేశారు.

శ్రీనాథుడు: గజపతుల తొలి కాలంలో ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన కవి శ్రీనాథుడు. కొండవీటి రాజ్యం పతనం అయిన తర్వాత అతడు రాజమహేంద్రవరం చేరి వీరభద్రారెడ్డి ఆదరాభిమానాలకు పాత్రుడయ్యాడు. కాని క్రీ.శ.1448వ సంవత్సరంలో కపిలేశ్వర గజపతి రాజమహేంద్రవర రాజ్యాన్ని జయించాడు. వేమారెడ్డి వీరభద్రారెడ్డిలు యుద్ధంలో మరణించారు. వారి మరణంతో శ్రీనాథునికి రాజాశ్రయం పోయింది. గజపతులు తెలుగు భాషను ఆదరించలేదు.

కనుక శ్రీనాథునికి భుక్తికి తన కవిత్వం పనికి రాలేదు కనుక అతడు కుటుంబ పోషణానికి వేరు మార్గం లేక కొండవీడు ప్రాంతానికి వెళ్లి కృష్ణానది ఒడ్డున ఉన్న బొడ్డుపల్లి అనే గ్రామంలో కొంత భూమిని కౌలుకు తీసుకున్నాడు. కాని పంట సరిగా పండలేదు. కొంత పక్షులు తినిపోయాయి. ఈ లోపల కృష్ణానది పొంగి మిగిలిన పంటను కొట్టుకుపోయింది. రాజుకు పన్ను కట్టలేకపోయాడు. దాంతో గజపతి ప్రతినిధులు పన్ను చెల్లించనందుకు కఠినంగా దండించారు. అతడు కవి సార్వభౌముడు. రెండవ దేవరాయలంతటి వాడిచే కనకాభిషేకం చేయించుకున్నవాడని కూడా తలచకుండా శ్రీనాథుడిని లాక్కొని వచ్చి నడి బజారులో ఎర్రని ఎండలో నిలబెట్టి కంఠానికి గండకొయ్యను తగిలించారు. భుజాలపై పెద్దబండను ఎత్తారు. రెండు కాళ్లను గొలుసులతో బంధించారు. రెండు దండ చేతులను వెనకకు విరచి కట్టి వీపు దండచేతుల మధ్య ఎదురు బొంగును దూర్చారు. శ్రీనాథుడు వంటి తెలుగు మహాకవి గజపతుల హయాంలో అలాంటి శిక్షకు గురి కావడం చాలా కాలమహిమ అని చెప్పాలి.

చివరి దశలో శ్రీనాథుడు దుర్భర దారిద్ర్యాన్ని, భరించరాని అవమానాలను, దుర్భర వేదనను అనుభవించి తన దుస్థితికి తనను పోషించిన వీరభద్రారెడ్డిని తలచుకొంటూ, వీరభద్రారెడ్డి పంటమైలారా తెలుంగరాయా హాట్టా, విస్సన్న మంత్రి, భాస్కరా మంత్రి మీరు వెళ్లిపోయారా అని విచారిస్తూ తన మరణశయ్యపైన చివరి శ్లోకం చెప్పి మరణించాడని కందుకూరు వీరేశలింగం తన కవుల చరిత్రలో వివరించారు.

He mentions with regret his desarted patron Veerabhadra Reddy and announces his resolve to go to heaven so as to cause fear in the minds of the poets of that world as the life on earth in the Kaliyuga has become extremely hard.

శ్రీనాథుడు ఎలాంటి దుర్భర పరిస్థితులలో మరణించినా ఈ పద్యం వల్ల అతడు ఆంధ్రదేశంలో ప్రారంభం అయిన గజపతుల పాలనను చూశాడు. తనను పోషించిన రెడ్డి రాజ్యం తన కళ్ల ముందే కూలిపోవటాన్ని

చూశాడు. కొండవీటిలోని గజపతుల ఉద్యోగులు శ్రీనాథుని పూర్వ చరిత్రను, వైభవాన్ని కూడా చూడకుండా కఠినంగా ప్రవర్తించడం ఆశ్చర్యకరం కాదు. కారణం గజపతులకు తాము జయించిన ప్రాంతాలను గట్టిగా అదుపులో ఉంచుకోవాలన్నా, అక్కడ స్థిరమైన పరిపాలనను ఏర్పాటు చేయాలన్నా ధనం కావాలి. ఆ ధనాన్ని అక్కడనే వసూలు చేయాలి. కనుక వారు క్రూరంగా ప్రవర్తించి ఉంటారు. నిర్దాక్షిణ్యంగా ప్రజల వద్ద పన్నులు వసూలు చేసి ఉంటారు.

గజపతి సామంతులు తెలుగు భాషను పోషించడం: గజపతులు స్వయంగా తెలుగు భాషను పోషించక పోయినా వారి సామంతులు తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. అలాంటి వారిలో గజపతుల సామంతుడుగా, ఉదయగిరి రాజ్యాన్ని పాలించిన పూసపాటి బసవ భూపాలుడు అతిముఖ్యుడు. అతడు దూబగుంట నారాయణకవి, దగ్గుపల్లి దుగ్గన్న, జంటకవులైన నంది మల్లయ, ఘంట సింగయ అనే నలుగురు కవులను ఆదరించాడు.

దూబగుంట నారాయణ కవి: ఇతడు నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి రాజ్యంలోని దూబగుంట గ్రామ వాస్తవ్యుడు. అతని తండ్రి బ్రహ్మయ మంత్రి, తల్లి నాగమ్మ. అతని గురువు కొండయ మంత్రి కుమారుడైన నాగనార్యుడు. నారాయణ కవి ఉదయగిరి పాలకుడైన బసవభూపాలుని ఆస్థానంలో ఉద్యోగిగా పని చేశాడు. అతడు వేదాంతం మత గ్రంథాల జోలికి పోకుండా లౌకిక జీవితానికి సామాన్య ప్రజలకు ఉపయోగపడే పంచతంత్రం అనే గ్రంథాన్ని రాశాడు. అందులో ఇహలోక బాధలను దారిద్ర్యాలను గురించి వివరించాడు. అతడు దారిద్ర్యాన్ని మించిన నరకం లేదంటాడు. దరిద్రాన్ని భరించే బదులు నిప్పులో దూకి చావడం మేలని వక్కాణించాడు. అన్ని బాధలకు దరిద్రమే మూలం అంటూ పంచతంత్రంలో దారిద్ర్యాన్ని, దరిద్ర బాధలను కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఇది సంస్కృతంలోకి పంచతంత్రానికి తెలుగు అనువాదం. దాన్ని తన ప్రభువైన బసవ భూపాలునికి అంకితం చేశాడు.

దగ్గుపల్లి దుగ్గన్న: ఇతడు తిప్పన, ఎర్రమ అనే దంపతుల కుమారుడు. శైవ మతస్థుడు. శాండిల్య గోత్రీకుడు. ఇతడు కవిసార్వభౌముడైన శ్రీనాథునికి బావమరిది అట. అతడు నాచికేతోపాఖ్యానంలో వైదిక కర్మకు, భక్తి భావానికి మధ్యన ఉన్న సంఘర్షణను ఇతివృత్తంగా తీసుకొని ఈ కావ్యాన్ని మలచాడు. ఉద్దాలకుడంటే సోమయాజి, వైదిక నిరతుడు. అతడు అగ్నిష్టోమం మొదలైన క్రతువులు చేస్తాడు. అతని కుమారుడు నాచికేతుడు. అతనికి వైదిక కర్మయందు నమ్మకం. వేదం, భక్తిజ్ఞానం, ఆత్మవిద్యలయందు నమ్మకం. వారిద్దరి మధ్య జరిగిన సంవాదం ఇందులోని కథ.

నంది మల్లయ - ఘంట సింగయ: ఈ కాలంలో వీరు జంటకవులుగా ప్రసిద్ధి పొందారు. వీరిని మొదట బసవభూపాలుడు ఆదరించారు. వీరు 12వ శతాబ్దానికి చెందిన ప్రబోధ చంద్రోదయం అనే సంస్కృత నాటకాన్ని తెలుగులోకి అనువదించారు. వీరు అన్ని మతాలను ఖండించి వేదాంతాన్ని సమర్థిస్తూ ఈ నాటకాన్ని రచించారు. ఒక జైనుడు, ఒక బౌద్ధుడు, ఒక సిద్ధుడు మద్యమాంసాల కోసం, స్త్రీల పొందు కోసం ఒక కాపాలికుడికి శిష్యులైనట్లు వర్ణించి, ఆ మతాలు దిగజారిపోయాయనే భావనను కలిగించి వేదాంతం గొప్పదనాన్ని చెప్పుకున్నారు కాని దానిని అతని మంత్రి చందలూరి గంగయామాత్యునికి అంకితం ఇచ్చారు. ఈ నాటకంలోని మరొక విశేషం ఏమిటంటే, గజపతి, నరపతుల మధ్య ఉన్న సంబంధాలను కూడా వివరించింది.

క్రీ.శ.1457వ సంవత్సరంలో ఉదయగిరి రాజ్యాన్ని సాళువ నరసింహరాయలు జయించాడు. దాంతో ఈ జంట కవులు అతని ఆస్థానానికి వెళ్లిపోయారు. అక్కడ వారు ప్రబంధ పద్ధతిలో వరాహ పురాణం అనే కావ్యాన్ని రాశారు. దానిని సాళువ నరసింహరాయల సేనాధిపతి అయిన నరసనాయకునికి అంకితం చేశారు. ఈ కావ్యంలో వ్రతాలు చేసినందువలన అనంత పుణ్యాలు వస్తాయని బోధించారు. ఏకాదశ వ్రతాన్ని చేసిన ఒక రాజు బ్రహ్మ హత్య పాతకాన్ని పోగొట్టుకుంటాడని ఒక కథను చెప్పారు. ఇది వ్రతాల మహాత్మ్యాన్ని వివరించే కావ్యం అని చెప్పవచ్చును.

మల్లేశ్వర కవి: సాళువ నరసింహరాయల ఆస్థానంలో పిల్లలమర్రి పినవీరభద్ర కవి ఉండేవాడు. అతడు జైమినీ భారతం రాసి, దానిని సాళువ నరసింహునకు అంకితం ఇచ్చాడు. పిల్లలమర్రి పినవీరభద్రునికి వీరన్న, మల్లేశ్వర అనే ఇద్దరు కుమారులు. వారిలో మల్లేశ్వర కవి గజపతుల అభిమానాన్ని సంపాదించి గజపతి రాజ్యంలోకి వెళ్లిపోయాడు. గజపతులు అతనికి ఉద్యోగం ఇచ్చారు. అతడు చేసిన సేవకు మెచ్చి పెనుమల్ల అనే

గ్రామాన్ని కూడా మల్లేశ్వరునికి ఇచ్చాడు. ఆ గ్రామం వచ్చిన నాటి నుండి అతని ఇంటి పేరు కూడా మారిపోయింది. పిల్లలమర్రి అనే ఇంటి పేరు మారిపోయి పెనుమల్ల మల్లేశ్వర అని ప్రసిద్ధి చెందాడు. ఈ విధంగా కవులు ఒక రాజ్యం నుండి మరొక రాజ్యానికి మారడం ఆ రోజుల్లో జరుగుతుండేది. రాజులు అతడు శత్రు రాజ్యం నుండి వచ్చాడేమోనని అనుమానించేవారు కాదు. ఎక్కడి నుండి వచ్చినా ఆదరించే వారు. కవులు కూడా అలాగే రాజకీయాలను పట్టించుకొనేవారు కాదు.

ధర్మశాస్త్రాలు - సరస్వతీ విలాసం - రచయిత చర్చ: గజపతుల యుగంలో ధర్మశాస్త్రాలు కూడా రచించబడ్డాయి. అస్తి వారసత్వం సాంఘిక నియమాల విషయంలో యాజ్ఞవల్క్యుడు, విజ్ఞానేశ్వరుడు చెప్పిన ధర్మసూత్రాలే అప్పటి వరకు అమలులో ఉన్నాయి. అవేగాక విజ్ఞానయోగి, భారుచి, మేధతిథి, అపరార్క చంద్రిక, అసహాయ మొదలైన వారి న్యాయశాస్త్ర గ్రంథాలు కూడా ఉండేవి. కొన్ని విషయాలలో అవి పరస్పర విరుద్ధ అభిప్రాయాలు వెల్లడించాయి. కనుక ఆ భేదాలను పరిష్కరిస్తూ గజపతుల కాలంలో సరస్వతీ విలాసం అనే ధర్మశాస్త్రం రచింపబడింది. ఈ గ్రంథాన్ని ప్రతాపరుద్ర గజపతి రాశాడని ఒక కథ ప్రచారంలో ఉంది. కాని దానిని లొల్ల లక్ష్మీధరుడు రాసి ప్రతాపరుద్రుని పేరు పెట్టాడని మరొక కథ కూడా ఉంది. ఏమైనా ఈ గ్రంథకర్త అయిన లొల్ల లక్ష్మీధరునికి తెనాలి తాలూకాలోని అనంతవరం గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడని శాసనం లభించింది. రెవరెండ్ థామస్ ఫాక్స్ దీనిని ఇంగ్లిషులోకి అనువదించాడు.

క్రీ.శ.1881 తర్వాత మైసూరుకు చెందిన డాక్టర్ ఆర్.శ్యామశాస్త్రికి లభించిన మరొక కాపీ సహాయంతో ఈ గ్రంథాన్ని పూర్తిగా ముద్రించాడు. ఈ గ్రంథం హిందూ సమాజానికి చెందిన మత, నీతి, సాంఘిక ధర్మాలన్నింటినీ కూలంకషంగా వివరిస్తోంది. అంతకు పూర్వం ఉన్న ధర్మశాస్త్రంలో కొన్ని విషయాలు పరస్పర విరుద్ధంగా ఉన్నందున వాటన్నింటికీ స్పష్టమైన రూపం ఇవ్వడానికి సాంఘిక ధర్మాలు పండితులందరికీ సత్వరం అందుబాటులో ఉండటానికి తాను ఈ గ్రంథాన్ని రాశానని రచయిత స్వయంగా చెప్పుకున్నాడు. ఇందులో తాను నూతనంగా చెప్పింది కూడా ఏమీ లేదని, అంతకు పూర్వం ధర్మశాస్త్రకారులు చెప్పిన విషయాలను తాను క్రోడీకరించానని కూడా రచయిత చెప్పుకున్నాడు. కౌటిల్యుడు, విజ్ఞానేశ్వరుని లాగే ఈ రచయిత సొంత ధర్మసూత్రాలు చెప్పలేదు గాని, ఆస్తి స్వరూపం, స్త్రీ ఆస్తిహక్కులను గురించి నూతన వ్యాఖ్యానాలను చేశాడు.

ఆస్తి హక్కు భౌతికమైనది, దైవికమైనది అని మితాక్షరం చెబుతోంది. కాని అది పూర్తిగా భౌతికమయినది అని సరస్వతీ విలాసం నొక్కిచెబుతోంది. బ్రాహ్మణుడు స్వీకరించి, క్షత్రియుడు జయించి, వైశ్యుడు లాభం సంపాదించి శూద్రుడు సేవక వృత్తి వల్ల ఆస్తులు సంపాదిస్తారు. లేదా వారసత్వం పంచుకోవడం, దొరకడం, తీసుకోవడం ద్వారా మాత్రమే వస్తుంది. కాని దైవికం కాదని వివరణ ఇచ్చింది. కనుక ఈ గ్రంథం వల్ల ఆస్తి వ్యక్తి గత హక్కు అని అర్థం అవుతోంది.

స్త్రీ ఆస్తి: స్త్రీ ఆస్తిని గురించి కూడా సరస్వతీ విలాసం పూర్తి వివరణ ఇచ్చింది. చంద్రిక, అపరార్కం విజ్ఞానేశ్వరాలు తండ్రి ఆస్తిలో స్త్రీకి భాగం పంచుకొనే హక్కు లేదు గాని అందులో ఆమెకు భాగం ఉంటుంది అని చెబుతున్నాయి. అంటే ఆమెకు ఆస్తిని పంచనవసరం లేదు గాని ఆమె అవసరాలు తీర్చాలి, ఆమె జీవితాన్ని పోషించాలి అని అంటున్నాయి. భర్త ఆస్తి విషయంలో ఆమె భాగాన్ని నిర్ణయించే అధికారం ఆమె భర్తది అని విజ్ఞానేశ్వరం చెబుతోంది. ఈ విషయంలో సరస్వతీ విలాసం భార్య అర్ధ శరీరం అని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. అంటే మంచి చెడ్డలన్నింటిలోను ఆమెది సగం వాటా. అటువంటప్పుడు ఆస్తిలో కూడా ఆమెకు సగం వాటా ఎందుకు రాదు, వచ్చి తీరాలి. ఆమెకు కాకుండా భర్త ఆస్తి మరొకరికి ఎలా వెళుతుంది. ఆమె భర్తకు తండ్రి తల్లి, అన్నదమ్ములు ఉండవచ్చు. అతడు మరణిస్తే వారు తన్నుకొని పోతారు. కనుక అలా జరగరాదు. ఎంత మంది వారసులున్నా అతని అతని భార్యే వారసురాలు. భర్త వాటా భార్యకే రావాలి అని సరస్వతీ విలాసం ఖండితంగా తేల్చి చెప్పింది. ఇంకా ఆమెకు తల్లి నుండి గాని, తండ్రి, సోదరులు ప్రేమతో బహుమానంగా ఇవ్వడం వల్ల గాని, వారసత్వం వల్ల గాని ఆమెకు ఆస్తి రావచ్చు. అదంతా స్త్రీ ధనం. స్త్రీ ధనాన్ని ముట్టుకోవడానికి ఎవరికీ అధికారం లేదు. భర్తకు కూడా అధికారం లేదు. భర్త గాని, తల్లిదండ్రులు, సోదరులు గాని తీసుకొంటే వడ్డీతో సహా తీర్చాలి. అది అప్పుగా భావించాలి. ఆమె ఇష్టపూర్వకంగా ఇచ్చినా సరే మళ్లీ తీర్చాలి. కాని వడ్డీతో సహా తీర్చాలి. కాని వడ్డీ ఇవ్వనక్కరలేదు. అలాగే స్త్రీకి తండ్రి ఆస్తిలో కూడా భాగం ఉందని చెబుతోంది. తండ్రి ఆస్తి తనకు వచ్చినప్పుడు ఆ ఆస్తి తన సంతానం పంపిణీ చేసుకొనేటప్పుడు కూతుళ్లతో సహా కుమారులకు కూడా పంచుకొనే హక్కు ఉందని

అంటాడు. కూతుళ్లకు తండ్రి ఆస్తిలో భాగం ఉన్నప్పుడు, కొడుకులకు కూడా తల్లి ఆస్తిలో హక్కు ఉంటుందని సరస్వతీ విలాసం నిర్ణయించింది. ఈ విధంగా అప్పటికి 8 శతాబ్దాలుగా అమలులో ఉన్న మితాక్షరికి భిన్నంగా సరస్వతీ విలాసం ధర్మసూత్రాలను నిర్దేశించింది.

గజపతులు సరస్వతీ విలాసాన్ని అనుసరించారు. ఈ గ్రంథంలో రచయిత చట్టానికి, ధర్మానికి, హక్కులకు సంబంధించిన అన్ని అంశాలు కూలంకషంగా చర్చించాడు. ముఖ్యంగా న్యాయాన్ని గురించి వివాదాల పరిష్కార విధానాన్ని గురించి చర్చించాడు. వాది ప్రతివాది వారి వాదనలు, ఆస్తి హక్కు పత్రాలు, ఆస్తి స్వాధీనం, అనుభవం మొదలైన అంశాలన్నీ వివరించాడు. ప్రముఖ ధర్మశాస్త్రాలు, స్మృతుల పేర్లే గాక ఆ నాటికి ప్రచారంలో ఉన్న ఇతర ధర్మశాస్త్రకారుల పేర్లు, వారి గ్రంథాలను కూడా పేర్కొన్నాడు. అపరార్క, అసహాయ, కర్కిభాష్య, కటార్క గురుప్రభాకర, స్మృతి చంద్రిక, దేవరథ, దేవస్వామి, దారేశ్వర, నిబంధనకార, ప్రదీప, ప్రదీపకకార, భావదేవ, భవనాథ, బారుచి, మితాక్షర, యాజ్ఞపతి, మేధాతిది, రాజలస్క, లక్ష్మీధర, వరదరాజ, విజ్ఞానేశ్వర, వృత్తికార, ఆపస్తంబ శ్రౌతవైఖానస సంహిత, సాలికానాథ, శ్రీకర సంగ్రహకార, సోమేశ్వర మొదలైన ధర్మశాస్త్రకారులను పేర్కొన్నాడు. సర్ థామస్ స్ట్రేంజ్ ఈ ధర్మశాస్త్రంలోని నిబంధనలు పెన్నానదికి ఉత్తర ప్రాంతంలో నేటికి అమలులో ఉన్నాయని అన్నాడు. ముఖ్యంగా భూమి సంబంధాలకు చెందిన అంశాలు విజ్ఞానేశ్వరానికి అనుబంధంగా ఉన్నాయని వివరించాడు.

గ్రంథ కర్తృత్వం: సరస్వతీ విలాసాన్ని రచించింది ఎవరు అనే విషయం వివాదాస్పదంగానే ఉంది. గ్రంథ పరిచయంలో ప్రతాపరుద్ర గజపతి వంశానుక్రమణిక ఇవ్వబడింది. సూర్యవంశంలో రాముడు, అతని కుమారుడు కుశుడు, అతని వంశంలో కపిలేంద్రుడు, అతని కుమారుడు పురుషోత్తముడు, అతని దేవేరి రూపాంబిక వారి కుమారుడు ప్రతాపరుద్రుడు లేక వీరరుద్రదేవుడు అని వంశవృక్షం ఇవ్వబడింది. అంతేగాక ప్రతాపరుద్రునికి అనేక బిరుదులున్నట్లు కూడా ఈ గ్రంథం తెలుపుతోంది. గజపతి, గౌడేశ్వర, నవకోటి కర్ణాటకల వర్గేశ్వర, యమునా పురాధీశ్వర హుసేన్‌షాహి సురత్రాణ, శరణరక్షక అనే బిరుదులను పేర్కొంటుంది. ఇతడు బెంగాల్‌ను ఏలే సుల్తాన్ హుసేన్‌షాను దయతలచి రక్షించాడట.

అందువల్ల ఈ చివరి బిరుదు వచ్చిందట. కాని ఈ గ్రంథాన్ని లోతుగా పరిశీలించిన పండితులు ప్రతాపరుద్ర గజపతి గ్రంథకర్త కాదనే అభిప్రాయాన్ని వెలువరించారు. గ్రంథంలోని దైవస్తుతిలో విఘ్నేశ్వర సరస్వతి, ఆంజనేయ, జగన్నాథ, విష్ణువు, ఈశ్వరుడు, దుర్గలను రచయిత ప్రార్థించాడు. ఈ ప్రార్థనను బట్టి రచయిత ఒక మత శాఖకు చెందిన వాడు కాదని స్పష్టమవుతోంది. ప్రతాపరుద్ర గజపతి వైష్ణవుడు. వైష్ణవ మతం విష్ణువును తప్ప మరే దేవుని ప్రార్థనను అంగీకరించదు. తర్వాత రచయిత తనను గురించి వివరించాడు. అక్కడ గ్రంథకర్త తనను గురించి తన గ్రంథాన్ని గురించి వివరించడం సాంప్రదాయమే కాని గ్రంథకర్త తనను గురించి అతిగా రాసుకున్నాడు. ముఖ్యంగా కాంతానామ్, కామదేవహ కులగిరిర్ ఆవనేహ కామధేను కవినామ్ అనే వాక్యం రచయితను అతిగా కీర్తిస్తోందని, కనుక కవి ఎవరూ తనను తాను అంతగా కీర్తించుకోరని, అలాగే రెండవ అధ్యాయంలో ముందు వ్యవహారకాండను రచించాడు. కాని సాధారణంగా మొదట ఆచారకాండను చెప్పి తర్వాత వ్యవహారకాండను వివరిస్తారు. కనుక ఈ రచన గజపతి కాదని, దానిని మరొక వ్యక్తి రాసి ఉండవచ్చని భావించారు.

చివరకు ప్రతాపరుద్ర గజపతి ఆస్థానంలోని లొల్ల లక్ష్మీధరుడు ఈ గ్రంథాన్ని రాసి ఉంటాడని ఊహించారు. అందుకు కారణమేమిటంటే అతడు రచించిన సౌందర్యలహరిలోని పరిచయ శ్లోకాలలో ఒక శ్లోకం సరస్వతీ విలాసం శ్లోకం ఉంది. ఆ కావ్యంలోని ముగింపులో తాను సరస్వతీ విలాసం రాసానని చెప్పుకున్నాడు. కృష్ణదేవరాయలచే కొండవీటి పాలకుడుగా నియమింపబడిన నాదెండ్ల గోపమంత్రి వద్ద పని చేసిన దాచయామాత్యుడు రచించిన మహింనస్తత్వ పంచికలో లక్ష్మీధరుడు సరస్వతీ విలాసాన్ని రాశాడని తెలిపాడు. కనుక లొల్ల లక్ష్మీధరుడు ఈ కావ్యాన్ని రాసి తన ప్రభువు పేరు పెట్టి అతని అభిమానాన్ని సంపాదించుకున్నాడని భావించారు. ఈ గ్రంథాన్ని అచ్చు వేయించిన డాక్టర్ ఆర్. శ్యామ్‌శాస్త్రి కూడా ఈ గ్రంథకర్తృత్వాన్ని సందేహించాడు.

కాని వీరి వాదనలు నిజం అని నమ్మడానికి వీలులేదు. ఆముక్తమాల్యద విషయంలో కూడా పండితులు ఇలాగే భావించి అల్లసాని పెద్దన రాశాడని సిద్ధాంతాన్ని చేశారు. కాని ఆముక్తమాల్యదలో చెప్పబడిన రాజనీతిని

చూస్తే అది తప్పకుండా కృష్ణదేవరాయ స్వానుభవం అని తెలుస్తుంది. ఒక సామాన్య కవి అయిన పెద్దనకు అలాంటి రాజనీతి స్వానుభవం ఎక్కడి నుండి వస్తుంది. అలాగే సరస్వతీ విలాసంలోని పరిపాలన అంశాలు, న్యాయపాలన సారాంశాన్ని చూస్తే అది తప్పకుండా గజపతి రచనే అయి ఉంటుంది. గజపతి స్వయంగా కవి. స్వయంగా కావ్యం రాసే శక్తి అతనికి ఉంది. ఇక అనేక దేవతలను ప్రార్థన చేశాడు. గజపతి వైష్ణవుడు, కనుక అతని రచన కాదన్న వారి వాదన నిలువదు. అతడు రాజు అన్న విషయం మరువకూడదు. భారతదేశపు రాజులు అన్ని మతాలను, అందరి దేవుళ్లను సమానంగా చూశారు. తన కావ్యం దేశంలోని అందరి ప్రజల కోసం కనుక అందరు దేవతలను స్తుతించాడు. ఇక అతిగా తనను గురించి పొగడ్తలు చేశాడని అన్నారు. రాజులకు పొగడ్తలంటే మహా ఇష్టం. కనుక అలా చేసి ఉండవచ్చును. తర్వాత అతడు ముందు వ్యవహార కాండ రాశాడు అని అన్నారు. అతడు రాజు గనుక వ్యవహారకాండకే మొదటి ప్రాముఖ్యత ఇచ్చి ఉంటాడు. ఇక లొల్ల తన కావ్యంలో తాను రచించానని చెప్పుకున్నాడని అన్నారు. బహుశా అతడు రచనా కాలంలో రాజుకు సహాయం చేసి ఉండవచ్చును. కనుక దాచయామాత్యుడు కూడా అట్లా చెప్పి ఉండవచ్చును. లేక లొల్ల కూడా ధర్మం శాస్త్రం రచించి ఉండవచ్చును. కారణమేమిటంటే సరస్వతీ విలాసంలో చెప్పబడిన ధర్మశాస్త్రకారులలో లక్ష్మీధర అనే పేరు ఉంది. బహుశా అతడు లొల్ల అయి ఉండవచ్చును. కనుక ఈ సరస్వతీ విలాసం గజపతి కృతి అని చెప్పడమే సమంజసంగా ఉంటుంది.

విజయనగర సంస్కృతి

విజయనగర పట్టణ వైభవం: విజయనగర పట్టణం ఆనాడు సుందరభవనాలతో, ఉద్యానవనాలతో, గొప్ప సిరిసంపదలతో అత్యంత వైభవంగా వెలిగిందని, అలాంటి సుందరనగరం ప్రపంచంలో మరెక్కడా లేదని ఆనాడు ఆ పట్టణాన్ని దర్శించి కన్నులారా చూసిన నికోల్‌కాంటి, అబ్దుల్ రజాక్, డామింగో గోపేస్, టామీ పైరస్, సీజర్ ఫ్రెడరిక్, న్యూనిజ్ మెదలైన విదేశీ యాత్రికులు ఘనంగా వర్ణించారు. 3 శతాబ్దాలపాటు దక్షిణ భారతదేశంలో సుందరంగా వెలిగిన ఆ పట్టణాన్ని వారు తమ రచనలలో కళ్లకు కట్టినట్లుగా వర్ణించారు. వారి రచనల ద్వారా నాటి విజయనగర పట్టణ స్థితిని మనం కొంత ఊహించడానికి వీలు కలుగుతోంది. విదేశీ యాత్రికులే కాదు, విజయనగర రాజ్యానికి బద్ధ శత్రువులైన బహమనీ సుల్తాన్‌లు కూడా ఆ పట్టణ సౌందర్యాన్ని విని దానిని చూడాలని తలంచుచుండెడి వారట. 1357లో సుల్తాన్ ముజాహిద్ ఆ పట్టణాన్ని చూడాలని తహతహ లాడి వచ్చి చూసి ఆ నగర నిర్మాణానికి అమిత ఆశ్చర్యం చెందాడట.

నికోల్‌కాంటి వర్ణనలు క్రీ.శ.1420: విజయనగరాన్ని దర్శించిన మొట్టమొదటి విదేశీ యాత్రికుడు దేశంలోని వెనిస్ వాస్తవ్యుడైన నికోల్‌కాంటి. అతడు క్రీ.శ.1420లో విజయనగరాన్ని దర్శించాడు. అతడు ఆ పట్టణాన్ని వైభవాన్ని తన రచనలలో ఘనంగా వర్ణించాడు. అతని వర్ణనల వల్ల 15వ శతాబ్దంలో విజయనగర స్థితిగతులు మనకు తెలియవచ్చాయి. అతడు తన రచనను లాటిన్ భాషలో రాశాడు. తర్వాత ఇటాలియన్, పోర్చుగీసు భాషలలోకి అనువదింపబడింది. అతని వర్ణనలు నేటికీ నిలిచి ఉండి 15వ శతాబ్దంలో విజయనగర స్థితిని తెలుసుకోడానికి మనకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. నికోల్‌కాంటి మొదట గుజరాత్‌లోని కాంబే పట్టణానికి వచ్చి అక్కడి నుండి పశ్చిమ కోస్తా వెంట దిగువకు ప్రయాణం చేసి వచమూరియా అనే పట్టణం చేరాడు. ఇది బారాకూరు అని నిర్ణయించారు. అక్కడి నుండి విజయనగరానికి చేరాడు.

నగర నిర్మాణం, ఉనికి, వర్ణన: విజయనగరాన్ని అతడు బిజెంగాలియా అని పేర్కొన్నాడు. నగరాన్ని ఎత్తయిన కొండల వద్ద నిర్మించారు. నగరం చుట్టుకొలత 60 మైళ్లు ఉంటుంది. నగర గోడలు కొండల వరకు చేరాయి. కొండల కింద ఉన్న లోయలన్నీ కోటగోడల నడుమనే ఉన్నందున నగరం విస్తీర్ణం పెరిగింది. నగరానికి రక్షణగా ఎల్లప్పుడూ 90 వేల మంది ఆయుధపాణులు కాపలా కాస్తూ ఉంటారు. రక్షణ గోడల నిడివి చాలా పెద్దది. ఎత్తయిన రాతిగోడలు లోయలగుండా కొండచరియలను చేరేటట్లు నిర్మించారు.. నగరం వెలుపలి గోడలు మైళ్ల కొద్దీ ఉన్నాయి. పెద్ద పెద్ద శిలల మధ్య ఉన్న లోయలలో ఇళ్లు ఉన్నాయి. అందులో కొన్ని గొప్ప మేడలు, కొన్ని చిన్న గృహాలున్నాయి. లోయ భూముల్లో వ్యవసాయం చేస్తారు. అందులో వరి, చెరకు, పండ్లతోటలున్నాయి. పండ్ల తోటలలో నారింజ, నిమ్మ, దానిమ్మ, పనస, మామిడి, తెల్లద్రాక్ష మొదలైన ఉద్యానవనాలు ఉన్నాయి. కొండలపై నుండి వచ్చే నీరు ఆ లోయలలో సరోవరాలుగా ఏర్పడ్డాయి. ఆ సరోవరాల నుండి నీటిని తోటలలోకి కాలువల ద్వారా మళ్లిస్తారు. నగరంలో అనేక సుందరమైన దేవాలయాలున్నాయి. కొన్ని దేవాలయాలలో వేద పాఠశాలలు కూడా ఉన్నాయి. దేవతా విగ్రహాన్ని సంవత్సరానికోసారి నగరం చుట్టూ తిప్పుతారు. ఆ విగ్రహానికి ఇరువైపులా రథాలుంటాయి. ఆ రథాలలో అందమైన స్త్రీలు ముస్తాబై పాటలు పాడుతుంటారు. భక్తి ఆవేశంలో కొందరు ఆ రథచక్రాల కింద పడి మరణిస్తుంటారు. అలా మరణిస్తే ముక్తి వస్తుందని నమ్ముతారు. కొందరు తమ పక్కలకు రంధ్రాలు పొడుచుకొని ఒక తాడును ఆ రంధ్రాల గుండా దేహంలోకి పోనిచ్చి రథాలకు వేలాడ వేయించుకొని ఊగుతూ సగం చచ్చి ఆ దైవ విగ్రహం వెంట వెళతారు. ఇది కూడా పుణ్యఫలమని నమ్ముతారు. సంవత్సరంలో మూడు పర్యాయాలు పండుగలు జరుపుకుంటారు. పండుగలలో నూతన వస్త్రాలు ధరించి విందులు, వినోదాలతో గడుపుతారు. మూడవ పండుగ (దసరా) 9 రోజులు జరుపుతారు. వసంతోత్సవ పండుగలో వసంతం చల్లుకుంటారు. ఆ రోజు రాజు రాణిలపై కూడా వసంతం చల్లుతారు. ఆల్బెనిస్ అనే పర్వతం మీద వజ్రాలు దొరుకుతాయి. ఈ రాజ్యపు రాజు చాలా బలవంతుడు. అతనికి 12 వేల మంది భార్యలున్నారు. వారిలో నాలుగు వేల మంది పల్లకీలలో, నాలుగు వేల మంది గుర్రాలపైన, మరో నాలుగు వేల మంది కాలి నడకన, రాజు ఎక్కడికి వెళ్లితే అక్కడికి వెళతారు. రాజు మరణిస్తే భార్యలు సహగమనం చేయడానికి సిద్ధంగా ఉంటారని రాశాడు. ఇంకా నగరం గొప్ప మేడలతో, ఉద్యానవనాలతో, సరస్సులతో కన్నుల పండుగ చేస్తూ ఉంటుంది. ఉన్నతోద్యోగులు,

ప్రజలు గొప్ప విలాసవంతులు. సుఖజీవనం చేస్తున్నారు. దీపావళి, దసరా రథోత్సవాలు, వసంతోత్సవాలు వేడుకగా జరుపుకుంటారని, ఆ సమయాలలో నగరం గొప్ప అలంకరణలతో బహుసుందరంగా వెలిగిపోయేదనీ ఆ ఉత్సవాలలో ప్రజలు అమిత ఉత్సాహంగా పాల్గొనేవారని నికొల్‌కాంటి ఆనాటి విజయనగర పట్టణాన్ని వర్ణించాడు.

అబ్దుల్ రజాక్ క్రీ.శ.1443: పర్షియా రాజు ఖఖన్‌షారుక్ అబ్దుల్ రజాక్ అనే రాయబారిని కళ్లికోటను పాలించి జామొరిన్ ఆస్థానానికి పంపాడు. రజాక్ 1442 జనవరి 13వ తేదీన బయలుదేరి నవంబర్‌లో కాలికట్ చేరాడు. అతడు 1443 ఏప్రిల్ వరకు ఉన్నాడు. రెండవ దేవరాయలు రజాక్‌ను విజయనగరం పంపమని లేఖ పంపాడు. అందువల్ల జామొరిన్ రజాక్‌ను విజయనగరం పంపాడు. రజాక్ 1443 ఏప్రిల్‌లో వచ్చి 1443 డిశంబర్ 5వ తేదీ వరకు విజయనగరంలో ఉండి నగరాన్ని వర్ణించాడు. విజయనగర రాయలన్నా జామొరిన్‌కు భయం అని రజాక్ రాశాడు. విజయనగరాన్ని చూసిన రజాక్ ఆ నగర వైభవానికి అబ్బురపడ్డాడు. అటువంటి పట్టణాన్ని తాను జీవితంలో ఎప్పుడూ చూడలేదని, అలాంటిది ఉందని వినను కూడా వినలేదని, నగరం 7 ప్రాకారాలచే చుట్టబడిందని, నగర వీధులలో మొదటి కోట ముందు నిలువెత్తు బండలను నిట్టనిలువు అడ్డంగా పాతారని, గుర్రాలుగాని, సైనికులుగాని వాటిని దాటి కోట ద్వారం వద్దకు వెళ్లలేరని, కోట రక్షణ విధానాన్ని వర్ణించాడు. వజ్రవైఢూర్యాలు రాసులుగా పోసి అమ్ముతున్నారని, ఉద్యానవనాలతో అసంఖ్యాకమైన జనసంఘాలతో ఉండేదని, నగరంలో అనేక ఏనుగులున్నాయని అవి కొండల లాగా, దెయ్యాల లాగా కనిపిస్తున్నాయని, విజయనగర రాజ్యం సెరెన్దీబ్ నుండి కలెబరగా వరకు విస్తరించి ఉందని రాశాడు. రాజాంతఃపురం పాలరాతి గచ్చుతో చేయబడిందని, రాయల సభా భవనం విలువ గల అలంకరణలతో అత్యంత సుందరంగా ఉందని, అంతఃపురంలో భోజనశాల, పాకశాల, చంద్రపాల, నాట్యశాల అనే విభాగాలు ఉండేవని, అందులో ఒక గది పూర్తిగా దంతంతో చేయబడి చాలా అద్భుతంగా ఉందని రాశాడు. విజయనగర సామ్రాజ్యంలో రాజమహల్ వద్ద నాలుగు విశాలమైన బజారులున్నాయని అక్కడ రత్నాలు, వజ్రాలు అమ్మే అంగళ్లు, మంత్రులు, సేనాధిపతుల ఇళ్లు ఉన్నాయని రాశాడు. అక్కడకి దగ్గరలో టంకశాల ఉందని రాశాడు. ఇంకా దప్తర్‌ఖానా, తీర్పులు చెప్పే హాలు, దన్నాయకుని, ఉన్నత ఉద్యోగుల ఇళ్లను గురించి కూడా రాశాడు. సామ్రాజ్యంలో 300 రేవులున్నాయని, ప్రపంచంలోని అన్ని దేశాలతో వ్యాపారం జరుగుతుందని, విజయనగరంలో లభించని వస్తువు లేదని రాశాడు. కొన్ని రోజుల తర్వాత రజాక్‌ను రాజ దర్శనానికి అనుమతించారు. రాయలు ఆకుపచ్చని శాటిన్ దుస్తులు ధరించాడని, అతని మెడలో చక్కని ముత్యాల హారం ఉందని, బుగ్గలపై నొక్కులున్నాయని, అతడు వారి సుల్తాన్ లాగా గడ్డం పెంచలేదని రెండవ దేవరాయలను వర్ణించాడు. రాయలు కూర్చొనే సింహాసనం అసాధారణంగా ఉందని, అది పూర్తిగా బంగారంతో చేయబడి వజ్రాలు పొదగబడి ఉందని వర్ణించాడు. నగరంలో మహానవమి ఉత్సవాలు అద్భుతంగా జరుగుతాయని, ఆ సమయంలో నాట్యకత్తెలు అద్భుత నాట్యాలు చేసి చూపరులకు మైమరపు కలిగిస్తారని రాశాడు. ఆ నాట్యగత్తెలంతా భోగంసానులని, వారు అద్భుత సౌందర్యరాశులని వర్ణించాడు. అంతేగాక వారి అలంకరణ, వస్త్రధారణ, నాట్యకౌశల్యాల, అందచందాలకు తాను ముగ్ధుడనయ్యానని కూడా రాశాడు. ఆనాడు ఉన్నతోద్యోగులు, రాజులు బాహాటంగా ఉంపుడుగత్తెలను ఉంచుకొనేవారని, అది వారు తప్పుగా భావించేవారు కాదని, పైగా ఎంత మందిని ఉంచుకుంటే అంత గొప్పగా భావించేవారని ఆనాటి ప్రజల రసిక జీవితాన్ని కూడా తన రచనలో వర్ణించాడు. రజాక్ తన రచనలో రెండవ దేవరాయలపై హత్యా ప్రయత్నం జరిగిందని, దాని వివరాలు కూడా రాశాడు. ఈ అంశం మనకు రజాక్ రచనల వల్లనే తెలుస్తుంది.

శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలంలో విజయనగరం: కృష్ణదేవరాయలు, అచ్యుత దేవరాయల కాలంలో వార్తెమా, బార్బోసా, పేస్, న్యూనిజ్‌లు విజయనగరాన్ని దర్శించి ఆనాటి నగర వైభవాన్ని వర్ణించారు. వారి వర్ణనల వల్ల రెండవ దేవరాయల కాలం నాటి కంటే శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగరం ఇంకా గొప్ప వైభవోపేతంగా వెలిగిందని స్పష్టపడుతోంది.

వార్తెమా వర్ణన: ఇతడు వీరనరసింహరాయల కాలంలో వచ్చాడు. వీరు విజయనగర రాజ్యాన్ని నరసింగ రాజ్యం అని వర్ణించారు. అంతకుముందు నరసనాయకుడు సాళువ నరసింహరాయలు, అతని కుమారుడు రెండవ నరసింహరాయలు, తుళువ వీరనరసింహరాయలు వరుసగా పాలించినందువల్ల నరసింగ రాజ్యంగా పేరు పొందింది. కనుక ఈ యాత్రికులు నరసింగ రాజ్యం అని వర్ణించారు. బీస్‌నగర పట్టణం నరసింగ రాజుది, చాలా

పెద్దది, నగరం రెండవ స్వర్గం లాగా ఉంది. ఈ రాజు అందరి కంటె ధనవంతుడు, రోజుకు 12 వేల పర్దావోలు ఆదాయం ఉంటుందని, రాజు ఎల్లప్పుడూ యుద్ధాలలో మునిగి ఉంటాడు. రాజు బంగారు తీగెలున్న టోపీ ధరిస్తాడు, బంగారు పూలతో వేలాడు ధగధగలాడే కోటును ధరిస్తాడు. ఆయన గుర్రానికి అలంకరించే ఆభరణాలు ఒక ఇటలీ పట్టణపు విలువ కంటే ఎక్కువ అని వార్తెమా వర్ణించాడు.

బార్బోసా వర్ణన: బార్బోసా మెజిలాన్ పిన తండ్రి కుమారుడు. పశ్చిమతీరం దాటి 45 లీగుల దూరం నడిస్తే బీజ్‌నగరం వస్తుంది. నగరానికి ఒకవైపు నది, ఒకవైపు బలమైన గోడ, ఒకవైపు కొండలున్నాయి. అయినప్పటికీ నగరం సమతలంలోనే ఉంది. రాజు ఎప్పుడోగాని బయటకు వెళ్లడు. ఎల్లప్పుడూ నగరంలోనే నివసిస్తాడు. రాజు పనులన్నీ పనికత్తెలే చేస్తారు. మంత్రులు, ఉన్నతోద్యోగులు పల్లకీలతో వస్తారు. వారందరూ రాజుతో సమాలోచనలు చేస్తారు. రాజభవన ప్రాంగణంలో ఎప్పుడూ పల్లకీలు, గుర్రాలు ఉంటాయి. నరసింగరాజు ఎప్పుడూ దక్కను ఒతరా అంటే ఓఢ్ర రాజుతో యుద్ధాలు చేస్తాడు. రాజు మరణిస్తే నాలుగు వందల మంది స్త్రీలు అతనితో నిప్పులలో కాలిపోతారు అని బార్బోసా వర్ణించాడు.

డామింగో పేస్: డామింగో పేస్ పోర్చుగీసు వర్తకుడు. పోర్చుగీసు వారి వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి భారతదేశం వచ్చి శ్రీకృష్ణదేవరాయల కాలంలో విజయనగరాన్ని దర్శించాడు. ఇతడు శ్రీకృష్ణదేవరాయల మూర్తిని, విజయనగర వైభవాన్ని నాటి అనేక విశేషాలను రాశాడు. నగరం 72 మైళ్ల వైశాల్యంతో ఉందని రాశాడు. అది రెండవ దేవరాయల కాలం నాటి కంటే నగరం పెరిగి ఉండవచ్చును. రాయలు విజయనగరం ముందు ఒక నూతన పట్టణాన్ని నిర్మించాడు. గోవా నుండి వచ్చేవారు ఈ పట్టణం నుండే విజయనగరంలోకి రావాలి. ఈ నూతన పట్టణం వద్ద రాయలు ఒక పెద్ద చెరువును తవ్వించాడు. దానిని తవ్వడానికి రోజూ 20 వేల మంది కూలీలు పని చేస్తున్నారని రాశాడు. ఈ నూతన పట్టణం శ్రీకృష్ణరాయలు తన తల్లి పేర నిర్మించిన నాగలాపురం. రాజుకు కృష్ణారావు, ముకరాజో, రాజాధిరాజ, రాజపరమేశ్వర, త్రిసముద్రాధీశ్వర అనే బిరుదులున్నాయి. ఈ రాజుకు 12 మంది భార్యలు ఉన్నారు. వారిలో ముగ్గురు ముఖ్యులు. ముగ్గురిలో ఓఢ్రరాజు పుత్రిక ఒకరు. మరొక ఆమె శ్రీరంగపట్టణ రాజకుమార్తె. మూడవ రాణి రాజు చిన్న వయసులో ఉంచుకున్న ఉంపుడుగత్తె. ఆమెను కూడా రాజు వివాహమాడి రాణిని చేశాడు. రాణులు ఎక్కడికి వెళ్లినా పల్లకిలో వెళ్తారు. వారికి 60 మంది ఇష్టసఖులున్నారు. ఆ చెలికత్తెలు కూడా ధగధగ మెరిసే ఆభరణాలు ధరిస్తారు. రాజభవనంలో 12 వేల మంది స్త్రీలున్నారని అంటారు. వారిలో కుస్తీపట్టే వారు కూడా ఉన్నారు. రాయలు ప్రతిరోజు తెల్లవారు జామున పావుశేరు నూనె వంటికి పట్టించి, అది ఆవిరి అయ్యే వరకు వ్యాయామం చేస్తాడు, తర్వాత స్నానం చేసి భగవత్ ప్రార్థన చేసి తర్వాత దర్బారు చేస్తాడు. రాజభవనం చుట్టూ ఉన్న గోడ చాలా బలమైనది. లోపల ఆవరణ లిస్బన్ కోట కంటే పెద్దది. నగరం చాలా పెద్దది. నేను ఒక కొండ ఎక్కి చూశాను. కాని పట్టణం అంతా కనబడలేదు. కనబడిన వరకే రోమ్ నగరం కంటే పెద్దదిగా కనిపించింది. నగర ప్రాకారానికి ఉత్తరదిశలో మూడు అందమైన దేవాలయాలు ఉన్నాయి. భవన విజయం అనే భవనంలో రాయలు సభలు చేస్తాడు. విజయదశమి వేడుకలు 9 రోజులు వైభవంగా జరుగుతాయి. ఆ ఉత్సవాలకు సామంతులంతా హాజరై రాజుకు కప్పాలు చెల్లిస్తారు. ఈ రాజుకు 10 లక్షల సైన్యం ఉంది. అదీకాక ఇంకా సామంతుల సైన్యం కూడా ఉంది. క్రిస్టావావో నిరేజ్ నాతోపాటు ఉన్నాడు. అతడు రాజభవనాలను చూడాలని కోరాడు. అతని కోరిక మీద దండ నాయకుడు గుండరాజు మాకు రాజాంతఃపురంలోని కొన్ని భవనాలు చూపించాడు. మమ్మల్ని లెక్క పెట్టి లోనికి తీసుకువెళ్లారు. లోపల ఆవరణ చుట్టూ తెల్లని గోడలున్నాయి. రాజభవనం వద్ద రెండు చిత్రాలున్నాయి. వాటిలో కుడివైపు చిత్రం రాజు తండ్రిది. రాజు తండ్రి నల్లగా ఉన్నాడు. కాని దృఢకాయుడు. రెండవ చిత్రం రాజుదే. తర్వాత లోపలకు వెళ్లాం. లోపల ఎడమవైపు ఒక గదిపైన మరొక గది, రెండు గదులు ఉన్నాయి. కింది గది భూమిలో ఉంది. మెట్లు దిగి కిందికి వెళ్లాం. మెట్లు రాతితో చేసి ఉన్నాయి. లోపల గోడలు బంగారంతో పూతా చేసి ఉన్నాయి. ఆ గది పైభాగం వజ్రాలతో తాపడం చేసి ఉంది. వజ్రానికి మధ్య చెలి పెట్టిన ముత్యాల వరుసలు ఉన్నాయి. ద్వారానికి బంగారు తోరణాలున్నాయి. గది లోపల పడక మంచం ఉంది. దాని కాళ్లు బంగారంతో పోతపోసినవి. దాని మీద పరుపు నల్లని శాటిన్ గుడ్డతో కుట్టబడి ఉంది. పరుపు అంచుల చుట్టూ ముత్యాల వరుసల పట్టీలు ఉన్నాయి. ఇది రాయల పడక గది. ఈ భవనంలోనే ఒక దంతపు గది ఉంది. ఆ గది గోడలు స్తంభాలు. స్తంభాలపైన చెక్కిన గులాబీ పూలు. కప్పు అంతా దంతంతో చేసి ఉంది. ఆ దంతపు నిర్మాణం అతిక

శోభాయమానంగా ఉంది. ఇలాంటి గది ప్రపంచంలో ఎక్కడా ఉండదు. ఆ గది బయటకు పోకుండా ప్రపంచ పోకడలను రాజులు గ్రహించడానికి గాను ఆ చిత్రాలు చిత్రించి ఉంటారు. ఆ భవనంలోనే మరొక గదిలో రెండు బంగారు సింహాసనాలు, ఒక వెండి మంచం ఉంది. అక్కడే ఒక చిన్న ఆసనం బల్ల ఉంది. అది చాలా అద్భుతమైన వస్తువని చెప్పారు. దానికి ఆనుకొని రాళ్లతో చేయించిన ఒక గది ఉంది. ఆ గదిలో అంతకు ముందు పాలించిన రాజు ఖజానా ఉందని చెప్పారు. దాని తెరవరు. ఆ గదిపైన చిన్న గదిని మాకు చూపలేదు. అక్కడి నుండి ఒక ద్వారం గుండా ఒక పెద్ద ఆవరణలోకి వచ్చాం. అక్కడ కుడివైపున నాలుగు అందమైన ఇళ్లు చూశాం. అవి రాణుల ఇళ్లు అయి ఉండవచ్చును. తర్వాత ఎడమవైపుకు తిరిగి మరొక ఆవరణలోకి వెళ్లాం. ఆ ఆవరణలో గోడలతో కూడుకున్న కూటములు ఉన్నాయి. అవి చాలా అందంగా ఉన్నాయి. అవి దాటి మరొక హాలులోకి వచ్చాం. అది పొడుగు ఎక్కువ, వెడల్పు తక్కువ. అది రాణుల నాట్యం నేర్చుకొనే నాట్యశాల. రాణులు, రాజాంతఃపుర స్త్రీలు అక్కడకు వచ్చి నాట్యం నేర్చుకొంటారు. హాలులో నాలుగు వైపుల రాతి స్తంభాలు ఉన్నాయి. ఆ స్తంభాలపై నాట్యభంగిమలలో అందమైన స్త్రీల శిల్పాలు చెక్కి ఉన్నాయి. మొదటి స్తంభం నుండి చివరి స్తంభం వరకు ఆ స్త్రీ శిల్పాలు ఒక్కొక్కరు ఒక్కొక్క భంగిమలో ఉన్నారు. ఆ శిల్పాలు చూస్తే నాట్య భంగిమలను తెలుసుకోవచ్చును. నాట్యం మధ్యలో భంగిమ మరచిపోతే ఆ స్తంభంపై ఉన్న భంగిమను చూసి తెలుసుకోవచ్చును. ఆ స్తంభాల కింద జంతువుల శిల్పాలను ఆధారంగా చేశారు. స్తంభానికి స్తంభానికి మధ్య వంపులు అమర్చారు. స్తంభాలపైన చిన్న నాట్య శిల్పాల వరుసలు మొదటి దాని నుండి తర్వాత దానిలో తగ్గుతూ చివరి స్తంభానికి చేరుకునేటప్పటికి దాని పైన గోపురం మాత్రమే ఉంది. ఆ గోపురం చాలా అందంగా ఉంది. స్తంభాల మధ్య లతలు చిత్రించారు. స్తంభాలపైన ఏనుగు శిల్పాలు ఉన్నాయి. పైకప్పు శిల్పాలు కూడా ఉన్నాయి. ఆ పైకప్పుపై కూర్చున్న శిల్పాలు స్తంభ వంపులపై కూర్చున్న శిల్పాలు అన్నీ నాట్యభంగిమ లోనివే. కొన్ని నాట్యశిల్పాల శిల్పాలు మద్దెల వాయిస్తున్నట్టు కూడా ఉన్నాయి. జంతువుల బొమ్మలకు ముఖాలపై లేక ఎడమవైపుల నీ ఉంది. వంపులలోని బొమ్మలు నాట్యం చేసి చూపించిన భంగిమలను చూపుతున్నాయి. నాట్యశాల నాట్యం చేసేటప్పుడు పొరపాటున చేసి చూపించిన భంగిమ మరచిపోతే ఆ వంపుపై బొమ్మను చూసి ఆ భంగిమను గుర్తు తెచ్చుకోవచ్చును. ఆ నాట్యమండపం చివర ఒక రాతి గది ఉంది. అక్కడ గోడలు కోసి ఉన్నాయి. నాట్యం నేర్చుకొనే వారు ఆ గోడలు పట్టుకొని తమ శరీరాన్ని అన్ని వైపులకు సాగదీయగా తిప్పుతూ శరీరాన్ని నాట్యానికి అనువుగా సాధన చేయవచ్చును. అక్కడ జరిగే నాట్యాలు తిలకించడానికి రాజు కూర్చోవడానికి నాట్య మండపంలో ఒక పీఠం ఉంది. దాని గోడలన్నీ బంగారు పూత పూసి ఉన్నాయి. గోడ మధ్యన స్త్రీ మూర్తి ఉంది. అది కూడా బంగారు పూత పూసిన విగ్రహమే. ఆ విగ్రహం 12 సంవత్సరాల బాలిక విగ్రహం. ఆ బాలిక పాదాలు చిన్న చేసి నాట్యభంగిమలో ఉన్నాయి. ఆ నాట్యమండపంలో ఒక పక్కగా చివరగా విశ్రాంతిమందిరానికి దారి ఉంది. రాజాంతఃపురవాసులు ఎవరికీ కనిపించరు. కనుక ఏ నాట్యాచార్యుని సహాయం లేకుండా కేవలం ఆ శిల్పాల భంగిమలను చూస్తూ స్వయంగా రాణులు, రాజ కుమార్తెలు నాట్యం నేర్చుకోవడానికి ఆ నాట్యమండపాన్ని నిర్మించి ఉండవచ్చును. నాట్యమండపం చూసిన తర్వాత మేము చూడకుండా మహానవమిదిబ్బను చెక్కిపెట్టారని ఎదుటకు తీసుకువెళ్ళి చూపించారు అని వ్రాశాడు.

హంపీకి పతనం: హంపీ అద్భుత దేవాలయ నగరంలో విజయనగరాన్ని వర్ణించి తన గ్రంథంలో రాశాడు. అద్భుత దేవాలయ నగరంలో నాటకరంగంలో నాటి ప్రతి పాత్ర బంగారువన్నే. వెండి పళ్లాలు, గిన్నెలు ఉండేవి. రాజు మంచాన్ని బంగారు కోళ్లు, వెండి రేకులతో అలంకరించారు. పట్టు పరుపులు, ముత్యాల అంచుతో ఉండేవి. అద్భుతాలకు 500 మంది భార్యలు. వారు పదుల మంది దాసీలతో ఒక అంతఃపురంలో ఉండేవారు. మహానవమినాడు 1000 మంది నాట్యకత్తెలు నాట్యం చేసేవారు. 100 మంది ఆడ కుస్తీవాళ్ళు ఉండేవారు. వారు ఆ రాణుల కొలువులో కుస్తీ పోటీలు చేసేవారు. రాజమహలు చుట్టూరా 4 వేల మంది స్త్రీలు ఉండేవారు. వారిలో కొందరు లెక్కలు వ్రాసే గుమాస్తాలుగా కూడా పని చేసేవారు. కొందరు రాజుకు భోజనం వడ్డించడానికి వెళ్లేవారు. ఆ విధంగా రాజాంతఃపురంలో స్త్రీలు పలురకాల పనులు చేసేవారని హంపీకి వచ్చినవారు. ఆ విదేశీయుల రచనలు బట్టి చూస్తే విజయనగరం అద్భుత నగరమైన నగరమని, ఎంతో వైభవంగా వెలిగిందని, ఆ పట్టణమే ఒక శిల్పకళా ఖజానా కలిగినదని. కాని అలాంటి నగరం 1565 తళ్లికోట యుద్ధం తర్వాత పతనమయ్యింది.

విజయనగర కాలం నాటి సాంఘిక పరిస్థితులు

విజయనగర యుగంలో ఆంధ్రదేశపు సామాజిక పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. కాకతీయ సామ్రాజ్యం పతనానంతరం ముస్లింలు ఆంధ్రదేశంలో దేవాలయాలను ధ్వంసం చేసి బ్రాహ్మణులను సంహరించి, గోవులను వధించి దేశ ప్రజలను భయభ్రాంతులను చేశారు. కనుక విజయనగర రాజ్యం హిందువులను రక్షించే బాధ్యతను చేపట్టింది. సర్వవేళలా యుద్ధానికి సిద్ధంగా ఉండే రాజ్యంగా రూపొందింది. కనుక విజయనగర రాజ్యంపై సైనిక రాజ్య లక్షణాలను సంతరించుకుంది. అందువల్ల ప్రజలపై విపరీతమైన పన్నులు విధించి ప్రజలను కొంత వరకు ఇబ్బందుల పాలు చేసింది. అయినప్పటికీ ప్రజలు తమను ముస్లింల నుండి రక్షిస్తుందని పన్నులను భరించారు. అధిక పన్నులతో సైన్యాలను సమకూర్చుకోవడం వల్ల అధికంగా ధనం మిగల లేదు. ధనంతో రాజులు, సామంతులు భోగలాలసులయ్యారు. సాధారణ ప్రజలు బాధలు పడ్డారు. ఈ కాలం నాటి పరిస్థితులు తెలుసుకోడానికి మనకు బార్బొసా, న్యూనిజ్, పేస్, అతనాసియస్, నికిటిన్ మొదలైన వారి రచనలు ఉపయోగపడుతున్నాయి. కాని వారి రచనలు కూడా ఈ కాలం నాటి ప్రజల కష్ట నిష్ఠూరాలను తెలపడం లేదు. విజయనగర వైభవాన్ని మాత్రమే ఎక్కువగా వర్ణిస్తున్నాయి. నాటి సాహిత్యం కూడా సామాన్య ప్రజల జీవన విధానాలను తెలపడం లేదు. శాసనాలలో నాటి మత సాంఘిక పరిపాలనా విశేషాలను తెలుపుతున్నాయి. కాని ప్రజల జీవనస్థితులను వివరించడం లేదు. కాని నాటి పన్నుల విధానం, బహమనీ విజయనగర రాజులు చేసిన యుద్ధాలను పరిశీలించినట్లయితే నాటి ప్రజలు రక్షణ లేక అలమటించారని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు నోచుకోలేదని విశదమవుతుంది.

విజయనగర చక్రవర్తులు తమ శాసనాలలో తాము హైందవ ధర్మరక్షకులమని, వర్ణాశ్రమ ధర్మాలను పోషించేవారమని చెప్పుకున్నారు. కాని వర్ణాశ్రమధర్మాలను వారు గట్టిగా అమలు జరిపినట్లు కనిపించదు. సాంఘిక వ్యవస్థ సామ్రాజ్యంలోని ఒక్కొక్క భాగంలో ఒక్కొక్క విధంగా రూపొందినట్లు కనిపిస్తోంది. తమిళ, కర్ణాటక, ఆంధ్రదేశాలలో వృత్తుల ప్రాతిపదికగా సమాజం అనేక ఉపకులాలుగా చీలిపోయింది. అంతేగాక విజయనగర సామ్రాజ్యంలో హిందువులు అధిక సంఖ్యాకులైనప్పటికీ వారి పరమత సహనం వల్ల ముస్లింలు, క్రైస్తవులు కూడా సామ్రాజ్య భాగాలలో ప్రవేశించి నివసించసాగారు. ముఖ్యంగా వ్యాపార వాణిజ్య కేంద్రాలు, రేవు పట్టణాలలో విదేశస్థులు ఎక్కువగా నివసించారు.

హిందూ సమాజం: ఈ కాలంలో హిందూ సమాజం సాంప్రదాయబద్ధమైన నాలుగు కులాలు పేరుకు మాత్రమే ఉన్నాయి. ఆ కులాలు కూడా ధర్మశాస్త్రాలు చెప్పే వృత్తిని, సాంప్రదాయ విధులను ఏ కులం కూడా అవలంబించలేదు. ఎవరి ఇష్టం వచ్చిన వృత్తిని వారు అవలంబించారు. పేరుకు మాత్రమే వర్ణాశ్రమ వ్యవస్థగాని, దాని లక్షణాలు లేవు. పైగా కులవ్యవస్థ బలంగా ఉన్నట్లు కూడా కనపడదు. ఆనాటి ప్రజలు నాలుగు తరాలుగా ఉన్నట్లు పేస్ రాశాడు. ఉద్యోగులు, వర్తకులు, భూస్వాములు, పురోహితులు అని అన్నాడు. న్యూనిజ్ కూడా నాలుగు తరగతులు అని అన్నాడు గాని పేర్లు మార్చి రాశాడు. అతడు పురోహితులు, వర్తకులు, కన్నడిగులు, భూస్వాములు అని రాశాడు. వారికి భాషా సాంప్రదాయాలు తెలియక అలా రాసి ఉండవచ్చును.

బ్రాహ్మణులు: సాంప్రదాయబద్ధంగా హిందూసమాజంలో బ్రాహ్మణులది అగ్రస్థానం. అలాగే విజయనగరం యుగంలో కూడా బ్రాహ్మణులు అగ్రస్థానాన్ని అనుభవించారు. విజయనగర రాజులు, సామంతులు వారి పట్ల భక్తిగౌరవాలను ప్రదర్శించారు. రెండవ దేవరాయల బ్రాహ్మణభక్తిని అబ్దుల్ రజాక్, కృష్ణదేవరాయల బ్రాహ్మణభక్తిని పేస్‌లు వర్ణించారు. దానం ద్విజరక్షణ అని ఆముక్తమాల్యదలో చెప్పాడు. కాని బ్రాహ్మణులు వారి కుల వృత్తిని తూ.చ. తప్పకుండా పాటించలేదు. భుక్తి కోసం వారు అనేక రకాల వృత్తులను చేపట్టారు. బార్బొసా, న్యూనిజ్, పేస్ మొదలగు విదేశీ యాత్రికులు బ్రాహ్మణులు 6 వర్గాలుగా ఉన్నట్లు రాశారు.

1. పురోహితులు
2. అగ్రహారీకులు
3. మఠాధిపతులు
4. ప్రభుత్వ ఉద్యోగులు

5. వర్తకులు
6. భోక్తలు

బ్రాహ్మణులలో అధికులు వైదిక వృత్తిని చేపట్టారు. వారిని వైదికులని పిలిచేవారు. వారు వైదిక విద్యాబోధన చేస్తూ వైదిక ధర్మాన్ని అచరిస్తూ జీవించేవారు. కొందరు బ్రాహ్మణులు రాచకొలువులో చేరారు. వారిని నియోగులని పిలిచేవారు. వారు విజయనగర సార్వభౌముల వద్ద, వారి సామంతులు, అమరనాయకుల వద్ద కొలువు చేశారు. కొందరు మహామంత్రులుగా, మంత్రులుగా, సేనాధిపతులుగా, దుర్గాధ్యక్షులుగా, ఆస్థానాలలో రాతకాండ్రుగా, గ్రామాలలో కరణాలుగా ఉద్యోగాలు చేశారు. శ్రీకృష్ణదేవరాయల తన ఆముక్తమాల్యదలో బ్రాహ్మణులను దుర్గ రక్షకులుగా, ఆస్థానాలలో అధికారులుగా నియమించడం చాలా ఉత్తమమని సూచించాడు. ఈ యుగం నుండి బ్రాహ్మణులలో వైదికులు, నియోగులు అనే భేదం ఏర్పడింది. కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలం వరకు వారు ఆస్థానంలో ప్రధాన మంత్రి పదవి నుండి కరణం వరకు ఉద్యోగాలు చేశారు. సాళువ తిమ్మరుసు, అయ్యపరుసు, చంద్రగిరి సోమరస, కొండమరుసు, సాలువ నరసింహనాయక మొదలైన వారు నియోగి బ్రాహ్మణులు. వారు రాజోద్యోగాలే గాక కవిత్వంలో కూడా ప్రావీణ్యం సంపాదించారు. కావ్యాలు రాసి రాజులకు మండలాధీశులకు అంకితం చేసేవారు. ధర్మశాస్త్రాలలో ప్రవీణులైన కొందరు బ్రాహ్మణులు అగ్రహారాలు పొందారు. కొందరు బ్రాహ్మణులు మహాజనుల హోదాలో ప్రాడ్వివాకులుగా నియమింపబడి నేరాలు విచారించి తీర్పులు చెప్పారు. లిన్‌షొటిన్ అనే పండితుడు రాజాస్థానాలలో అనేక మంది బ్రాహ్మణులు ఉద్యోగులుగా నియమింపబడ్డారని రాశాడు. వారు గొప్ప సమర్థులు, నిజాయితీపరులని కూడా రాశాడు. కాని రామరాయల కాలం నుంచీ రాజోద్యోగాలలో రాజదర్బారులో బ్రాహ్మణులు తమ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రామరాయలు బ్రాహ్మణులను ఆదరించలేదని, మహిసూరనరపతి విజయం అనే గ్రంథం పేర్కొంది. కాని అసలు విషయం ఏమిటంటే తళ్లికోట యుద్ధం తర్వాత ఆరవీటి రాజులు బ్రాహ్మణులను ఉన్నత ఉద్యోగాలలో నియమించలేదు. బహుశా నిత్యం రాజ్యానికి యుద్ధ భయం ఉన్నందువల్ల బ్రాహ్మణులను రాచకొలువులోకి తీసుకొని ఉండక పోవచ్చును. దేవాలయాలలో పూజారులుగా, గొప్ప పండితులుగా, జ్యోతిష్య శాస్త్రవేత్తలు, సాహిత్యవేత్తలు, ధర్మశాస్త్రవేత్తలు, వైద్యులు, రాజగురువులుగా బ్రాహ్మణులు ఉండేవారని పేస్ రాశాడు. వారేగాక వినోదవిప్రులు అనే మరొక వర్గం కూడా ఉండేది. వీరు ఆంధ్రదేశంలోనే గాక బెదదకోట, కర్ణాటక ద్రావిడ దేశాలలో కూడా ఉండేవారట. కొందరు బ్రాహ్మణులు వర్తకం కూడా చేపట్టారు. అయినప్పటికీ బ్రాహ్మణులు గొప్ప గౌరవ మర్యాదలను పొందుతున్నారని వ్యాస్‌లిన్ షొటెన్ రాయగా న్యూనిజ్ మొదలైన వారు పురోహితులను, పూజారులను, రాజగురువులను గర్హించారు. వారు దురాశాపరులని, సంభావనలకు ఎగబడతారని సేన్, న్యూనిజ్ ఇద్దరూ రాశారు. అలాగే రెండవ వెంకటపతిరాయల ఆస్థానాన్ని దర్శించిన జెసూట్ ఫాదరి ఒకొటిన్హో రాజ గురువైన తాతా చారిని గురించి హీనంగా రాశాడు. అతనికి అనేక మంది భార్యలు ఉన్నారని, అతనికి లేని వ్యసనం లేదని, అతడు రాజ గురువుగా పనికిరాడని వివరించాడు. కొందరు పూజారులు దేవుడు కోరాడని చెప్పి స్త్రీలను గర్భగుడిలోనే చెరుస్తున్నారని రాశాడు. డబ్బు సంపాదించడానికి బ్రాహ్మణులు ఏ వృత్తికైనా సిద్ధపడతారని, అందుకు ఎలాంటి అడ్డంకులు లేవని కూడా రాశారు. కొందరు బ్రాహ్మణులు భోజనం చేయడం తప్ప ఏ పనీ చేసేవారు కారని బార్బొసా రాశాడు. కాని వారిని హిందువులు చాలా గౌరవిస్తారని, వారికి భోజనం పెట్టడం, సంభావనలు ఇవ్వడం పుణ్యంగా భావిస్తారని కూడా వారు రాశారు. కొందరు విద్యావంతులు బ్రాహ్మణులను ధిక్కరించేవారట. మొత్తం మీద బ్రాహ్మణులు సమాజంలో అగ్రస్థానంలో ఉన్నారని భావించవచ్చును. బ్రాహ్మణులను గురించి క్రీ.శ.1584వ సంవత్సరపు వెల్లాల శాసనంలో పేర్కొనబడిందని వెంకటరమణయ్య రాశారు.

వైశ్యులు: వైశ్యులను ఆంధ్రదేశంలో కోమట్లు, కర్ణాటకంలో శెట్లు అని అనేవారు. తమిళదేశంలో వారిని చేరులని పిలిచేవారు. వీరిని వైశ్యులని అంగీకరించేవారు కాదు. కనుక వారిలో ఒక వివాదం వచ్చింది. అది తీర్చడానికి మొదటి దేవరాయలు న్యాయాధికారిని నియమించగా అందరూ ఒకటేనని తీర్పు చెప్పాడు. అప్పటి నుండి వారిలో శాఖాబేధాలు పోయాయి. వైశ్యులు సాంప్రదాయకంగా వారు నిర్వహించే వ్యాపారమే వారి వృత్తి. వారు బలమైన శ్రేణులుగా ఏర్పడి వ్యాపారాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. అయ్యవోలు స్వాములు, పెనుగొండ స్వాముల ప్రస్తావనలు శాసనాలలో ఉన్నాయి. వారు పన్ను గుత్తదారులుగా కూడా ఉన్నట్లు శాసనాలు ఉన్నాయి. వారికి

పన్నులు వసూలు చేసే హక్కు ఉంది. న్యాయ విచారణాధికారాలు ఉన్నాయి. వారి వివాదాలు వారే పరిష్కరించుకుంటారు. రాజుల వద్దకు రావు. వారు చాలా ధనికులని రత్నాలు, ముత్యాలు, పగడాలు, వెండి, బంగారు వస్తువులతో వ్యాపారం చేస్తారని బార్బోసా రాశాడు. దేవాలయాలకు, ధర్మసంస్థలకు దానాలు చేయదలస్తే రాజులైనా, సామంతులైనా వారి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. వారు వడ్డీ వ్యాపారం కూడా చేస్తారని, తమ్ముని కైనా వడ్డీ లేకుండా ఒక సెరబెల్ కూడా అప్పు ఇవ్వరని, లాభం లేనిదే వారు ఏ పనీ చెయ్యరని బార్బోసా రాశాడు. రాజాదరణ ఉన్నా వారు తమ వ్యాపారాభివృద్ధికి రాజులకు, సామంతులకు రాజోద్యోగులకు కానుకలు, బహుమతులు ఇస్తూ ఉంటారని కూడా రాశాడు. కోమట్ల భాష యాసగా ఉండేదని సురవరం ప్రతాపరెడ్డి రాశారు. వారు బిడారులుగా తగిన రక్షణలతో మార్గాలలో ప్రయాణం చేస్తారు. ఈ కాలంలో వారికి పోటీ వచ్చింది. అరబ్బు వర్తకులు, పోర్చుగీసు వర్తకులు పోటీగా ఏర్పడ్డారు. కొందరు లింగాయతులు, బ్రాహ్మణులు కూడా వ్యాపారంలో ప్రవేశించారని తెలుస్తోంది. కాని వారి పోటీ చాలా తక్కువ. ముస్లింలు మాత్రం వారికి గట్టి పోటీ ఇచ్చారు. అయినప్పటికీ వారు విశేష లాభాలు గడించారు. దేవాలయాలకు దానాలు చేశారు. ప్రధానంగా వ్యాపారం చేసే బలిజలు కొందరు ఈ కాలంలో రాజసేవలో చేరినట్లు శాసనాలు తెలుపుతున్నాయి.

క్షత్రియులు - కమ్మ, రెడ్డి, వెలమ కులాలు: దక్షిణ భారతదేశంలో క్షత్రియ కులం లేదని అంటారు. అందుకు కారణం ఉంది. క్షత్రియులమని శాసనాలలో చెప్పుకున్న వంశాల వారు తమ పూర్వీకుల కాలం నుండి క్షత్రియ కులానికి చెందిన వారు కారు. మధ్యలో తాము క్షత్రియులమని చెప్పుకున్నారు. విజయనగర శాసనాలు, సాహిత్యం సూర్యవంశ, చంద్రవంశ క్షత్రియులను పేర్కొంటున్నాయి. చోళులు, గజపతులు సూర్యవంశ క్షత్రియులని, పాండ్య వంశస్తులు, విజయనగర ప్రభువులు చంద్రవంశ క్షత్రియులమని తమ శాసనాలలో చెప్పుకున్నారు. అలాగే వారి సామంతులలో కూడా కొందరు తాము సూర్య వంశస్తులమని, మరికొందరు చంద్ర వంశస్తులమని చెప్పుకున్నారు. కాని సంగమ వంశస్తులు కురుబలు అంటే గొల్లవారని భావించారు. గొల్లవారు తాము యాదవులమని చెప్పుకుంటారు. అంటే యదు వంశస్తులు. యదుపు చంద్రవంశ క్షత్రియుడు కనుక తాము కూడా చంద్రవంశ క్షత్రియులమని చెప్పుకొని ఉండవచ్చును. చంద్రవంశ క్షత్రియుడనని చెప్పుకున్న రెండవ హరిహరరాయలు తన కుమార్తెను చతుర్ధ కులస్తుడైన కాటయవేమారెడ్డికిచ్చి వివాహం చేశాడు. తుళువ కాలం నాటి కవులు తుళు వంశస్తులు చంద్రవంశ క్షత్రియులని వర్ణించారు. కాని గజపతులు కృష్ణదేవరాయలను శూద్రుడని ఆక్షేపించారు. శూద్రకులస్తుడైన అనవేమారెడ్డికి తన కుమార్తెను సూర్యవంశ క్షత్రియుడనని చెప్పుకున్న ఏరువ పాలకుడైన చోడ భక్తిరాజుకిచ్చి వివాహం చేశాడు. దీనిని బట్టి రాజ్యం ఎవరు చేసినా వారిని క్షత్రియులుగా భావించుకున్నారని చెప్పవచ్చును. ఈ కాలంలో ముఖ్యంగా చతుర్ధ కులస్థులైన కమ్మ, రెడ్డి, వెలమ కులస్థులు రాజ్యాధికారం పొంది క్షత్రియ కులపు స్థానాన్ని, హోదాను అనుభవించారు. వారు సేనాధిపతులుగా, దండ నాయకులుగా, సామంతులుగా రాజుల హోదాను, రాజభోగాలను అనుభవించారు. వారికి వ్యవసాయం కూడా వృత్తిగా ఉండేది. కాని యుద్ధ జీవితమే వీరికి ఈ కాలంలో ప్రధాన వృత్తి అయింది. ఏదో ఒక రాజ్యంలో వారు సైనిక వృత్తిని చేపట్టారు.

శూద్రులు: హిందూ సమాజంలో నాల్గవ కులం శూద్ర కులం. కాని వృత్తి ప్రాతిపదికగా ఈ కులం అనేక ఉపకులాలుగా చీలిపోయి ఉంది. శూద్రులలో ప్రఖ్యాతి వహించిన ఉపకులాలు కమ్మ, రెడ్డి, వెలమ వారు. వారు శూద్ర కులంలో ప్రధాన శాఖలని చెప్పవచ్చును. కాకతీయుల కాలంలో ఉన్న 75 మంది నాయకులలో ఈ మూడు కులాల వారు ఉన్నారు. కాని ఆ కాలంలో వారి మధ్య బేధాలు అంతగా కానరావు. కాని విజయనగర కాలం నాటికి ఈ కులాలు ప్రత్యేక కులాలుగా రూపొందాయి. ఈ కులాల పుట్టుపూర్వోత్తరాలను శ్రీనాధుడు తన భీమేశ్వర పురాణంలో వివరించాడు. చతుర్ధ కులానికి చెందిన రెడ్లు క్షత్రియులని చెప్పాలనే ఉద్దేశంతో పద్మనాయకులని, వెలమలని, కమ్మలని, సరిసర్ధన, పంటర్ధన బహుప్రకారం శాఖలుగా వెలిశారని, వారిలో పంటదేసటి రెడ్డి కూడా ఒకరని వర్ణించాడు. శూద్రులైన రెడ్లను క్షత్రియులుగా చేద్దామనే తాపత్రయంలో శ్రీనాధుడు అలా వర్ణించాడేగాని రెడ్లు తాము చతుర్ధ కులస్థులమని తమ శాసనాలలో స్పష్టంగా చెప్పుకున్నారు. అలాగే కమ్మసేనాని అయిన ముసునూరి ప్రోలయనాయకుని చతుర్ధ కులస్తుడని విలస తామ్ర శాసనం స్పష్టంగా చెబుతోంది. కనుక వీరందరూ చతుర్ధ కులస్తులనేది నిర్వివాదాంశం. రట్టోడి, రెడ్డిరికం చేసిన కుటుంబాల వారు రెడ్డి కులస్తులుగా రూపొందారు. అలాగే వెలనాటి వారు వెలమ వారుగా, కమ్మనాటి వారు కమ్మ కులస్తులుగా రూపొందారు. తెలంగాణ వారు

తెలగాలని పిలువబడ్డారు. వీరందరి వృత్తి వ్యవసాయమే. అలాగే పాకనాటి కాపులు పాకనాటివారని, పెన్నానదికి దక్షిణంగా ఉన్న వారు పంటకాపులని, మోటాటివారిని మోటాటికాపులని అంటారు. వీరంతా కాపులే. వారు 14 శాఖలుగా ఏర్పడ్డారని లెక్కించారు. ప్రాంత భేదాన్ని బట్టి బ్రాహ్మణులలో కూడా శాఖలు ఏర్పడ్డాయి. వెలనాటి బ్రాహ్మణులు, కమ్మనాటి బ్రాహ్మణులు, ఆరు వేల నియోగులు, తెలంగాణ బ్రాహ్మణులు అని శాఖాభేదాలు వచ్చాయి. అలాగే వ్యాపార వృత్తిని చేపట్టిన బలిజలు, పెరికెలు కూడా ప్రత్యేక కులాలుగా రూపొందారు. కోమట్ల సంఘాన్ని నకరం అని అనేవారు. ఇంకా గవరలు, దండులు, ముమ్మరులు కూడా నాడు వ్యాపార సంఘాలుగా ఉండేవారు. అలాగే వృత్తి పనివారైన వడ్రంగి, కమ్మరి, సాలె, ఆగసాలె, మంగలి, కుమ్మరి, చాకలి వారు కూడా కులాలుగా మారారు. ఈ కాలంలో సాంఘిక ఆర్థిక వ్యవస్థలో శూద్రులు ప్రముఖ పాత్రను నిర్వహించారు. వ్యవసాయం, పరిశ్రమలు, వృత్తి పనులలో వీరు కృషి చేసి దేశసంపద ఉత్పత్తిదారులుగా వ్యవహరించారు. అలాగే యుద్ధరంగాల్లో కమ్మ, రెడ్డి, వెలమలు పాల్గొని దేశాన్ని రక్షించారు. వీరు తమ పరాక్రమం చేత మాండలీకులుగా, సేనాధిపతులుగా, అమరనాయకులుగా వ్యవహరించారు. విజయనగర యుగంలో రాయలసీమ ప్రాంతంలో బలిజ వారు, తెలంగాణ ప్రాంతంలో వెలమలు, ఒంటరులు, కోస్తాలో కమ్మ, రెడ్డి కులస్థులు ఎక్కువగా ఉండేవారు. విజయనగర ఆస్థానంలో రెడ్లు లేరు. కొండవీటి రెడ్డి రాజ్య అస్తమయంతో వారు రాజకీయంగా తమ ప్రాభవాన్ని పోగొట్టుకున్నారు. విజయనగర ఆస్థానంలో కమ్మ సేనాధిపతులు ప్రముఖ పాత్రను నిర్వహించారు. నాగమ నాయకుడు, విశ్వనాధ నాయకుడు, రఘునాధ నాయకుడు పేరు మోసిన కమ్మ సేనానులు. బ్రాహ్మణులు కూడా విజయనగర ఆస్థానంలో మంత్రులుగా దుర్గాధిపతులుగా కరణాలుగా రాజోద్యోగులుగా ప్రముఖ పాత్రను నిర్వహించారు. విజయనగర ప్రభువులు కమ్మ సేనానులను తమిళదేశంలో దుర్గాధిపతులుగా, సేనాధిపతులుగా పాలెగాండ్రుగా నియమించారు. కృష్ణదేవరాయల తర్వాత కమ్మవారైన రావెళ్ల పెమ్మసాని వారు సామంతులుగా, సేనానులుగా ప్రఖ్యాతి వహించారు. వారితో పాటు అనేక మంది వృత్తి కులాల వారు కూడా అంటే సాలీలు, ఉప్పరవాండ్లు, చాకలివారు, చర్మకారులు, గొల్లవారిని తొట్టియన్ లేక కంలబళత్తార్ అని అనేవారు. తెలుగువారితో పాటు కన్నడిగులు కూడా తమిళదేశం వెళ్లి స్థిరపడ్డారు. శూద్రులలో ప్రతికులానికి ఒక వృత్తి ఉంటుంది. కురుబలు గొర్రెల కాపరులు, కమ్మరులు ఇనుప పనిముట్లు చేస్తారు. సాలీలు నేత నేస్తారు. ప్రతి కులానికి స్వంత నిబంధనలు ఉన్నాయి. కుల పెద్దలు కూడా ఉన్నారు. వారిలో వివాదాలు వచ్చినట్లయితే కుల పెద్దలు తీర్పులు చెపుతారు. విజయనగర యుగంలో పాలకవర్గం వ్యాపారవర్గం ఒకరికొకరు సహాయం చేసుకొని సంపదలను పోగుచేసుకొని ప్రాబల్యం సంపాదించుకొని విలాస జీవితాన్ని గడపగా శూద్రులు ఉత్పత్తిని పెంపొందించారని కంభంపాటి సత్యనారాయణ వ్యాఖ్యానించారు.

పాంచాణం వారు: కాకతీయుల కాలంలో ఏర్పడ్డ పాంచాణం వారు విజయనగర యుగంలో ప్రఖ్యాతిలోకి వచ్చారు. వీరి ప్రస్తావనలు విజయనగర కాలం నాటి అనేక శాసనాలలో కనిపిస్తున్నాయి. వీరిలో ఐదు కులాల వారు ఉన్నారు. కమ్మరులు, కంసాలులు (అగసాలెలు), వడ్రంగులు, కంచరులు, కాసెవారు అని ఐదు శాఖలు ఉన్నాయి. వీరిలో ఒక్కొక్కరు ఒక్కొక్క పని చేస్తారు. వీరు ఐదుగురిని పాంచాణం వారు అని శాసనాలు పేర్కొంటున్నాయి. వీరిలో 74 శాఖలున్నట్లు మొదటి దేవరాయల శాసనం తెలుపుతోంది. వీరు కొని సాంఘిక మర్యాదలను, హోదాలను, హక్కులను విజయనగర రాజుల నుండి పొందారు. దేవాలయ ఉత్సవాలలో పాల్గొనే హక్కును సంపాదించారు. వివిధ కులాల వారు సమాజంలో గౌరవ మర్యాదలు హోదాలు పొందాలని ప్రయత్నాలు చేశారు. అలాంటి వారిలో పాంచాణం వారు ప్రథములు. తర్వాత మంగలులు పొందారు.

మంగలి: విజయనగర యుగంలో మంగలి కులాన్ని శాసనాలు ప్రస్తావించాయి. సదాశివరాయల కాలంలో అళియ రామరాయలను మెప్పించి కొండరాజు అనే మంగలి వారికి పన్ను మినహాయింపును పొందాడని తెలుస్తోంది.

పంచములు: హిందూ సమాజంలో పంచములనే ఐదవ కులం ఉంది. వారిలో మాలా, మాదిగ అనే రెండు శాఖలున్నాయి. మాల వారు నేత పని, వ్యవసాయ కూలీ పని చేసేవారు. మాదిగలు చర్మకార వృత్తిని చేసేవారు. మాలలను వోళెయ లేక వరయ అని, మాదిగలను చెక్కిటి అని కూడా పిలిచేవారు. విజయనగర శాసనాలు ఈ కులాలన్నింటినీ ప్రస్తావించాయి.

వేమన - కులమత ఖండన: ఈ యుగంలో యోగి వేమన కులాలను నిరసిస్తూ పద్యాలు రాశాడు. ఇతని

కాలాన్ని గూర్చి వివాదాలు ఉన్నాయి. ఇతడు 14వ శతాబ్దం వాడని రెడ్డిరాజుల కాలం నాటి వాడని, కొండవీటి నివాసి అని ఒక కథ ఉంది. కాదు, ఇతడు 17వ శతాబ్దం వాడని కడప జిల్లాలోని గండిపేట వాస్తవ్యుడని బ్రౌన్ అభిప్రాయపడ్డాడు. ఏమైనా విజయనగర యుగం నాటి వాడని చెప్పవచ్చును. ఇతడు సూక్తుల రూపంలో ఆనాటి సాంఘిక దురాచారాలను కుల వ్యవస్థను ఖండించాడు. పంచములతో సహా అన్ని కులాల వారు ఒక్కటే, అందరి శరీరాలలో ఒకే రకమైన రక్తం ఉందని చాటాడు. తాను శైవమతాభిమాని అయినా మత ద్వేషాన్ని నిరసించి, ఏ మతస్థుడైనా చచ్చి బూడిద అవుతాడు. వాదాలు ఎందుకు అని అన్నాడు. అలాగే ఆర్థిక అసమానతలను కూడా ఎత్తి చూపాడు. కులమత ప్రభావం అధికంగా కలిగి ఉన్న నాటి సామాజిక పరిస్థితులలో కులాలను, మతాలను ఖండించి సర్వమానవ సమానత్వాన్ని చాటి, సామాజిక స్పృహను కలిగించిన ఆంధ్రదేశ కవులలో మొట్టమొదటి వాడు వేమని అని ప్రశంసించారు. బ్రౌన్ మొదలైన విదేశీయులు వేమనను గ్రీకు తత్వవేత్త ప్లేటో, డెమాక్రటీస్‌లతో పోల్చారు. కొందరు అతనిని కబీర్‌తోను, కన్నడ సర్వజ్ఞానితోను పోల్చారు.

కైక్కోలులు: విజయనగర యుగంలో తమిళ దేశంలో కైక్కోలులు అనే కులం ఉన్నట్లు తెలుపుతున్నాయి వారు నేత పనివారు. వారు దేవాలయ పరిసరాలలో నివాసం ఏర్పాటు చేసుకొనేవారు. వారు దేవాలయ ఉత్సవాలలో పల్లకి మోయడం, శంఖాన్ని ఊదడం మొదలైన హక్కులను పొందారు. ఆంధ్రదేశంలో పాంచాణం వారి లాగా తమిళ దేశంలో వీరు దేవాలయాల ఉత్సవాలలో పాల్గొనే గౌరవ హోదాలను పొందారు.

వెల్లాలులు-వక్కలిగర్లు: తమిళ దేశంలో వెల్లాలులు, కన్నడ దేశంలో వక్కలిగర్లు అనే కులస్తులు వ్యవసాయదారులు, వీరి వృత్తి వ్యవసాయం. తమిళ దేశంలో ఇడైయన్లు, కన్నడ దేశంలో కురుబలుల, ఆంధ్ర దేశంలోని గొల్లవారి లాగా పశువుల కాపర్లు.

వలంగై - ఇడంగై: తమిళ, కన్నడ దేశాలలో శూద్రులలో కొన్ని కులాలలో వలంగై, ఇడంగై అనే శాఖలు ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. వలంగై అంటే కుడిచేయి వారు. ఇడంగై అంటే ఎడమ చేయివారు అని అర్థం. ఈ రెండు వర్గాల మధ్య సాంఘిక మర్యాదల కోసం తరుచు సంఘర్షణలు జరుగుతుండేవట. పాంచాలులు, భేరిశెట్లు, దేవాంగులు, గానుగ వారు ఎడమచేతి వారట. మిగిలిన శూద్రులు కుడిచేతి వారట. ఎడమచేతి వారు తమకు కూడా సమాన స్థాయి ఉండాలని పోరాడేవారట. అలాగే ఆ రాష్ట్రాలలో 18 జాతులు ఉండేవని, ఒక్కొక జాతిలో 98 ఉప కులాలు ఉన్నట్లు కూడా శాసనాలు తెలుపుతున్నాయి. కాని ఆ ఉపకులాల పేర్లు తెలపలేదు. మొత్తం మీద కైక్కోలులు, వెల్లాలులు, వక్కలిగర్లు, వలంగై, ఇడంగై కులాలన్నీ శూద్రకులానికి చెందినవే. ఈ కులాలన్నీ విజయనగర శాసనాలలో పేర్కొనబడ్డాయి. దీనిని బట్టి విజయనగర కాలం నాటికి నేడు దక్షిణ దేశంలో ఉన్న కులాలన్నీ పూర్తిగా తమ రూపురేఖలు దిద్దుకున్నాయని చెప్పవచ్చును. అంటే హిందూ సమాజం నేటి రూపాన్ని సంతరించుకుంది.

శూద్ర పురోహితులు: ఈ కాలంలో శూద్రులు అన్ని రంగాలలో ప్రముఖ పాత్రను నిర్వహించారు. అంతేగాక శూద్రులు పురోహితులుగా కూడా వ్యవహరించినట్లు శాసనాధారం లభించింది. రెండవ వెంకటపతి రాయల కాలంలో ముద్దుకృష్ణప్ప నాయకుని సమక్షంలో వృద్ధాచలంలో కండెమదేవరకు ఒక శూద్ర పురోహితుడు అభిషేకం చేసినట్లు తెలుస్తోంది. కనుక బ్రాహ్మణులు ఇతర వృత్తులను అవలంబించినట్లే శూద్రులు కూడా బ్రాహ్మణ వృత్తిని చేయడానికి ఎలాంటి అభ్యంతరం లేదని ఈ విషయం వల్ల స్పష్టమవుతోంది.

బానిసలు: అబ్దుల్ రజాక్, బార్బోసా, నికోల్‌కొంటి మొదలైన వారు విజయనగర యుగంలో బానిసలు ఉన్నట్లు రాశారు. శాసనాలు కూడా బానిస వ్యాపారాన్ని గురించి తెలుపుతున్నాయి. క్రీ.శ.1470 నాటి ఒక శాసనం ఒక బానిసను పేర్కొంది. మరొక శాసనం ఆడ బానిసను ప్రస్తావించింది. అప్పు తీర్చలేని వాడు బానిస అయ్యే వాడని కొందరు భావించారు. ఎంత మంది బానిసలుండేవారో తెలియదు. బానిస వ్యాపారం, వృత్తి ముస్లింల వల్ల ఆంధ్రదేశంలో ప్రవేశించి ఉండవచ్చును. ఆనాడు ఢిల్లీ దర్బారులో, బహమనీ దర్బారులలో బానిసలుండేవారు. మధ్యాసియాలో బానిస వృత్తి సర్వసాధారణం. కనుక ముస్లింల వల్లనే విజయనగర సామ్రాజ్యంలో కూడా బానిస వృత్తి ప్రవేశించి ఉండవచ్చును.

ముస్లింలు: ఈ కాలంలో దక్షిణ దేశంలోకి ముస్లింలు ప్రవేశించారు. విజయనగర రాజ్యంలో కూడా ప్రవేశించి హిందువుల పక్కన నివసించారు.

ప్రజాజీవనం - భవనాలు - వేషభాషలు: సమాజంలో రాజులు, రాజోద్యోగులు, వ్యాపారులు, ధనవంతులు

విలాస జీవితం, రసిక జీవితం గడిపేవారు. వారు రెండతస్తుల, మూడంతస్తుల భవనాలు నిర్మించుకొనేవారు. దర్బారుకు వెళ్లే వేశ్యలు కూడా గొప్ప ఇళ్లు నిర్మించుకొనేవారు. ఈ భవనాలకు కప్పుపైన గోపురాలు కూడా ఉండేవి. బయట స్తంభాలు వరండాలతో ఉండేవి. దొడ్లలో పూలతోటలు కూడా ఉండేవని విదేశస్తులు వర్ణించారు. భవనాలకు అలంకరణలుగా నెమళ్ళు, పావురాలు చెక్కేవారు. సామాన్యులు మట్టి మిద్దెలు, పెంకుటిళ్లలో జీవించేవారు. మరీ బీదవారు గుడిసెలలో నివసించేవారు. ఆ కాలం నాటి సాహిత్యం, నాటి భవనాలను కూడా వర్ణించింది. విజయనగరంలోని రాచభవనాలను విదేశీయాత్రికులు వర్ణించారు. రెడ్డి రాజులు తమ రాజధాని కొండవీటిలో అనేక సుందర భవనాలు నిర్మించారు. కుమారగిరి రెడ్డి కనకరత్న ఖచితమైన లీలా గృహాలు, మహాప్రాసాదం కేళీరథాలు, క్రీడా సరస్సులు నిర్మించాడని సాహిత్యం తెలుపుతోంది. కోమటి వేమారెడ్డి కొండవీటిలో గృహరాజు మేడ అనే ఒంటిస్తంభ సౌధాన్ని నిర్మించాడు. రాజమహేంద్రవరంలోని వీరభద్రారెడ్డి రాజ సౌధాన్ని త్రైలోక్య విజయమని శ్రీనాధుడు వర్ణించాడు. విజయనగరంలో ప్రౌఢదేవరాయల సభను ముత్యాలశాల అని, కృష్ణదేవరాయల సభా భవనాన్ని భువన విజయమని పిలిచేవారు. కృష్ణదేవరాయల నివాస భవనం, రాణుల అంతఃపురం అద్భుతంగా ఉండేవని నాటి విదేశీ యాత్రికుల వర్ణనలు తెలుపుతున్నాయి. ఇవన్నీ నాటి ప్రభువుల వైభవ జీవితానికి మచ్చుతునకలు. నాటి ప్రజల వేషభాషలను గురించిన వర్ణనలు కూడా సాహిత్యంలో ఉన్నాయి. లేపాక్షి వర్ణచిత్రాలలో చిత్రించిన దుస్తులు ఆనాటి ప్రజలు ధరించిన దుస్తులేనని చెప్పవచ్చును. సామాన్యులు ధోవతి, ఉత్తరీయాన్ని ధరించేవారు. శ్రీమంతులు జరీ వస్త్రాలు ధరించేవారు. రకరకాల తలపాగలు ధరించడం నాటి ముఖ్య ఆచారాలలో ఒకటి. నాటి శిరోవేష్టాన్ని కొల్లాయి అనేవారు. అది పొడుగుగా ఉండే టోపి. శ్రీనాధుడు విజయనగర దర్బారును దర్శించేటప్పుడు కుళ్లాయి నుంచి తికొకకట్టితిన్ కూర్పాసమున్ తొడిగితి అని వర్ణించుకున్నాడు. అవి ఆనాటి వేషధారణ అని చెప్పవచ్చును. లేపాక్షి చిత్రాలలో కూడా కుళ్లాయి చిత్రించారు. రైతులు, ధోవతిని నడుముకు చుట్టి మోకాళ్లపైన బిగ గట్టేవారు. సామాన్య స్త్రీలు నేత చీరెలు ధరించేవారు. రవికె ఉండేది కాదు. పైటను కప్పుకునేవారు. ధనిక స్త్రీలు పట్టు వస్త్రాలు, రవికెలు ధరించేవారు. నాడు వస్త్రాలు కరక్కాయ, మంజిష్టి, ఇంటలీకం, నీలిరంగు అద్దకం వేసేవారు. రాయలు ధరించే వస్త్రాలను న్యూనిజ్ వర్ణించాడు. మృదువుగా ఉండే సిల్కు దుస్తులు ధరించేవాడని, అవి బంగారు జరీతో నేయబడి ఉండేవని వర్ణించాడు. అంత నాణ్యం కాకపోయినా అలాంటివే మిగతా సామంతులు, మంత్రులు కూడా ధరించేవారని కూడా రాశాడు. నడుముకు గట్టిగా గుడ్డలు చుట్టుకునేవారు. పంచెను కుచ్చిళ్లుగా ముందుకు విడిచేవారు. ఆనాటి వర్ణనల ప్రకారం ధోవతి, నడుముకట్టు, తలపాగా గాని టోపి గాని కండువాలు ధరించేవారు. పాదరక్షలు ధరించేవారు. రైతులు కట్టుపంచె, తలగుడ్డ చుట్టుకొనేవారు. మాలలు నీలిరంగు కాసెను ధరించేవారు. విదేశీ యాత్రికులు స్త్రీల దుస్తులను కూడా వర్ణించారు. ధనవంతుల స్త్రీలు, రాచస్త్రీలు సిల్క్ జరీ చీరెలు ధరించేవారు. చిన్నపిల్లలు పావడాలు ధరించేవారు. కులీన స్త్రీలు రవికెలు ధరించేవారు. కొన్ని కులాలు స్త్రీలు రవికెలు ధరించేవారు కాదు. రంగు రంగుల చీరెలు నేసేవారు. సామాన్య స్త్రీలు నూలు వస్త్రాలు ధరించేవారు.

ఆభరణాలు: కమ్మలు, మెడలో కంటె, కాసుల పేరు, ముక్కెర, నడుముకు వడ్డాణం, పట్టెడ, కాళ్లకు దండ కడియాలు, పట్టాలు, అందమైన ఆనాటి ఆభరణాలు. ఒక్కొక్క కులం వారు ఒక్కొక్క రకంగా ఆభరణాలు ధరించే వారు. సామాన్యుల ఆభరణాలు వెండితోను, శ్రీమంతుల ఆభరణాలు బంగారం, రత్నాలతో తయారు చేయించే వారు. పురుషులు కూడా చెవి పోగులు మొదలైన కొన్ని ఆభరణాలు ధరించేవారు. పండితులు గండపెండేరాలు ధరించేవారు. బీద స్త్రీలు పూసలు, మట్టి గాజులు ధరించేవారు.

పరిమళ ద్రవ్యాలు: నాటి స్త్రీ పురుషులందరూ పరిమళ ద్రవ్యాలు వాడేవారు. కస్తూరి, పునుగు, జవ్వాజి, కర్పూరం, పన్నీరు వాడేవారు. స్త్రీలు వక్షస్థలంపై కస్తూరి, కుంకుమపువ్వు పూసుకొనేవారట. పన్నీటి స్నానం చేసే వారు. సెంట్లు, అత్తరులు ఒళ్లంతా పూసుకొనేవారు. పురుషులు కూడా పన్నీటి స్నానం చేసి సెంట్లు రాసుకొనే వారు. కులీన స్త్రీ, పురుషులు దేహాలు సువాసనలు వెదజల్లుతుండేవని బార్బోసా రాశాడు. తెలుగుదేశంలో అత్తర్లు విరివిగా తయారయ్యేవని కృష్ణదేవరాయలు కూడా పేర్కొన్నాడు. స్త్రీలు రకరకాల పూలు పెట్టుకొనేవారు. స్త్రీ పురుషులు పూల దండలు వేసుకొనేవారు. గొప్ప ఇళ్లలో పూల తోటలు ఉండేవి.

స్నానం: విజయనగర యుగంలో స్నానం, శుచి, శుభ్రతలకు మారు పేరుగా ఆచరించబడింది. దక్షిణ దేశంలో ఇప్పుడు స్నానం ఆచరించనిదే భుజించరు. శుచి, శుభ్రత పరంగానే గాక మతపరంగా కూడా స్నానానికే

గొప్ప ప్రాముఖ్యత ఉంది. బ్రాహ్మణులకు మత నియమాలున్నాయి. అందువల్ల వారు చన్నీటి స్నానం చేసేవారు. మిగిలిన వారు వేడి నీటితో స్నానం చేసేవారు. కులీన స్త్రీ పురుషులు పన్నీటి స్నానం చేసేవారు. సాధారణంగా వారానికొకసారి అభ్యంగన స్నానంలో తలకు, ఒంటికి నూనెలు మర్దించుకొని స్నానం చేస్తారు. స్త్రీలు నలుగు పిండితో ఒళ్లంతా రుద్దుకొని స్నానం చేసేవారు.

జలక్రీడలు: రాజాంతఃపురాలలో రాజులు రాణులు జలక్రీడలు ఆడేవారు. వారి జలక్రీడలకు ప్రత్యేకమైన ఈత కొలనులను కూడ ఏర్పాటు చేసుకొనేవారు. రాజాంతఃపురాలలో రాజులు తప్పకుండా జలక్రీడలకు కొలనులను ఏర్పాటు చేసేవారు. రాయలు జనానాలోని స్త్రీల జలక్రీడలను బార్బొసా కూడా ప్రస్తావించాడు. నాటి సాహిత్యంలో కూడా జలక్రీడలను వర్ణించారు.

ఆహార పానీయాలు: ఆనాడు శ్రీమంతులు వరి అన్నం తినేవారు. సామాన్య ప్రజలు సజ్జ, జొన్నకూళ్లు, సన్నన్నం సున్నసుమీ అని శ్రీనాథుడు వర్ణించాడు. అన్ని రకాల మాంసాలు తినేవారని అబ్దుల్ రజాక్, పేస్, న్యూనిజ్, బార్బొసాలు రాశారు. బ్రాహ్మణులు, లింగాయతులు శాకాహారం తీసుకొనేవారు. బ్రాహ్మణుల ఇళ్లలోని ఆహార పదార్థాలను ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు వర్ణించాడు. వరి అన్నం, చాయపప్పు, తాళింపు కూరలు, చారు, నెయ్యి, వడిపిండెలు, అప్పడాలు, చెరుకురసాలు, కొబ్బరినీళ్లు, ఆవపచ్చళ్లు, పాయసం, ఊరగాయలు మొదలైన ఆహార పదార్థాలను వర్ణించాడు. అవి ఆనాటి నాగరిక భోజన పదార్థాలు. ఆ రోజులలో పూటకూళ్లు ఉండేవి. అక్కడ కూడా వరి అన్నం, పెసరపప్పు, అప్పడాలు, గోధుమ పిండివంటలు, నాలుగైదు కూరలు, ఆవు నెయ్యి, అరటిపండ్లతో కూడిన భోజనం ఒక రూకకే పెట్టేవారని క్రీడాభిరామం తెలుపుతుంది. ఆనాడు ప్రజలు మత్తుపానీయాలు తీసుకొనేవారు. మాధవం, ఇప్పసారాయి, ఐక్షవం, చెరకు, బెల్లపు సారాయి, ఈతకల్లు మొదలైన మత్తుపానీయాలను నాటి సాహిత్యం పేర్కొంటోంది.

భోగ జీవితం: విజయనగరంలో శ్రీమంతులు అత్యంత భోగప్రదమైన జీవితాన్ని గడిపారని ఖండవల్లి లక్ష్మీ రంజనం, నేలటూరి వెంకటరమణయ్య వర్ణించారు. ఆనాటి రాజులు, వ్యాపారులు ఇతర శ్రీమంతులు ప్రాచీన సాహిత్యంలో పేర్కొన్న అష్టభోగాలను అనుభవిస్తూ సుఖజీవనం సాగించారు. ఉదయం లేవగానే పువ్వులు, సుగంధ ద్రవ్యాలతో చేయబడిన మైలపిండితో నలుగు పెట్టుకొని స్నానం చేసేవారు. కొందరు నిత్యం అభ్యంగన స్నానం చేసేవారు. స్నానం చేసే నీటిలో పన్నీరు కలుపుకొనేవారు. స్నానానంతరం పట్టువస్త్రాలు, శిల్కు వస్త్రాలు ధరించేవారు. పూలదండలు వేసుకొనేవారు. స్త్రీలు తలనిండా పూలు పెట్టుకునేవారు. వారు సన్నని వరి అన్నంతో భోజనం చేసేవారు. వేడివేడి సన్నని వరి అన్నంలో అప్పుడే కాచి ఘుమఘుమలాడే నెయ్యిని వేసుకొనేవారు. కొందరు అన్నంపై వెన్నను వేసుకొనేవారు. అది కరిగి అన్నంలో కలిసిపోయేది. ఆ నేతి అన్నంలో రకరకాల పక్షుల, జంతువుల మాంసాన్ని కలుపుకొని భోజనం చేసేవారు.

తాంబూలం: భోజనానంతరం తాంబూలం వేసుకొనేవారు. ఆనాడు తాంబూలం వేసుకోవడం ప్రత్యేకమైన ఆచారంగా ఉండేది. అది దర్జాకు, హోదాకు ప్రతిబింబంగా ఉండేది. ఎవరైనా అతిథులు వస్తే వారికి తాంబూలం ఇచ్చేవారు. రాజుల నుండి తాంబూలం పొందితే గొప్పగా భావించేవారు. ఎక్కడికి వెళ్లినా వెంట తాంబూలాలను తీసుకువెళ్లేవారు. తాంబూలం తీసుకువెళ్లడానికి పాన్‌దాన్ అనే ప్రత్యేకమైన వెండి పెట్టె ఉండేది. కొందరు ఇత్తడి, రాగి పెట్టెలను వాడేవారు. ఇది చేతితో తీసుకువెళ్లే పరిమాణంలో ఉండేది. ఆనాడు ధనికులైనా, సామాన్యులైనా తాంబూలం వాడేవారు. తాంబూలాన్ని గురించి ఆనాటి విదేశీ యాత్రికులు తమ రచనలలో ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఆనాటి సంఘ జీవితంలో తాంబూలానికి ఒక ప్రత్యేకత ఉండేది. ఇది కేవలం వ్యక్తులు సేవించడానికి కాక ఇతర కార్యక్రమాలకు కూడా వాడేవారు. వ్యక్తులు ఒడంబడికలు, కట్టుబాట్లు చేసుకోడానికి తాంబూలం పుచ్చుకొనేవారు. తాంబూలం పుచ్చుకుంటే వారు ఇక ఆ ఒప్పందానికి కట్టుబడ్డట్లే లెక్క. ఇక మాట తిరగటానికి వీలులేదు. అలాగే సైన్యాధిపతులను యుద్ధ భూములకు పంపేటప్పుడు రాజులు వీరులకు తాంబూలం ఇస్తారు. తాంబూలం పుచ్చుకోవడం ద్వారా ఖాయం చేసుకొనేవారు. వివాహాలు, తాంబూలం ఇచ్చి కుదుర్చుకొనే వారు. ఈ ఆచారం నేడు కూడా ఇప్పుడు కొనసాగుతోంది.

రసిక జీవితం: ఈ యుగంలో రాజులు, చక్రవర్తులు, ఉన్నత వర్గాల వారు విలాసమైన భోగ జీవితాన్ని, రసిక జీవితాన్ని అనుభవించారు. రసిక భోగానికి స్త్రీ మొట్టమొదటి వస్తువు. భోగ స్త్రీలు, సుగంధద్రవ్యాలు, పట్టు వస్త్రాలు, జరీదుస్తులు, పొడవైన అంగీలు, నాట్య కర్పూర వడియాలు, మధురాసన సేవనాలు, నాట్యకేళీ

వినోదాలు, నారికేళ మద్యం, పుష్పాసవం, ఇక్ష్వాసదం, ద్రాక్షాసవం మొదలైన మధువులను సేవించారు. బంధు మిత్రులతో పానీయాలు సేవించడానికి భవనాల ఉపరితలాలలో ప్రత్యేక శాఖలు ఉండేవి. వాటిని చంద్రసాలలు అనేవారు. సుగంధ ధూప పరీకృత మేడలలో, సుందరీమణుల సాంగత్యంలో, నృత్య సంగీత చదరంగపు ఆటలతో కేళీ విలాసంగా జీవితాన్ని గడిపారు. వారి స్త్రీలు బిగుతైన కంచనాలు, పావడాలు, రత్నాల పైటలు, కాళ్లకు మెత్తని పాదరక్షలు ధరించేవారు. వెండి, బంగారు, రత్నాలు, వజ్ర వైఢూర్యాల నగలు, రవ్వల ఉంగరాలు ధరించి మిరుమిట్లు గొలిపేవారు. పురుషులు పొడవైన అంగీలు, ఎత్తయిన టోపీలు, పట్టు జరీ వస్త్రాలు, వజ్రపుటుంగరాలు ధరించి దర్జా వెలగబోసేవారు. ఇలాంటి శ్రీమంతులు చక్రవర్తి, సామంతులు, మండలాధీశ్వరుల ఇళ్ల పక్కనే తామూ ఇళ్లను నిర్మించుకునేవారు. వారి ఇళ్లు విశాలంగా సుందరంగా ఉండేవి. ఇళ్లలోని గోడలపై పౌరాణిక చిత్రాలు, శృంగార చిత్రాలు చిత్రించుకునేవారు. రాజుల ఇళ్లలో అనేక కక్ష్యాంతాలుండేవి. హాలులో బంగారు తూగుటుయ్యాలలుండేవి. స్త్రీ పురుషులు ఇరువురు ఉయ్యాల మంచాల మీద పవళించేవారు. రాజ భవనాలు, శ్రీమంతుల మేడలలో విలాస ప్రియులైన స్త్రీ పురుషులు సమావేశమై పుష్పాసవం, తాళమధువు, మధిరారసం, ద్రాక్షసవం మొదలైన మద్యాలు సేవిస్తూ సంభోగాలు, రసిక జీవితాన్ని సాగించేవారు. కొందరు జూదాలు ఆడేవారు. కొందరు వేటకు వెళ్లేవారు. ఇవన్నీ వారి వినోదాలు.

వేశ్యలను పోషించడం: నాటి రాజులు, శ్రీమంతులు, ఉన్నతోద్యోగులు తమ భవనాలలో భోగ జీవితం సాగించడమే గాక వేశ్యలను, ఉంపుడుగత్తెలను ఉంచుకొనేవారు. ఈ కాలంలో సానివృత్తి బాగా వృద్ధి చెందింది. విజయనగర యుగానికి ముందే దక్షిణ దేశంలో వేశ్యావృత్తి ఒక జీవన మార్గంగా ఉండేది. కనుక ఈ కాలంలో వేశ్యావాటికలు ప్రతిచోటా ఉండేవి. ఆనాడు సంఘంలో ఉన్నత వర్గాలలో బహుభార్యాత్వం, వేశ్యాలంపటుత్వం బాహాటంగా సాగింది. ఎంత మంది వేశ్యలను, ఉంపుడుగత్తెలను ఉంచుకుంటే అంత గొప్పగా భావింపబడింది. వ్యభిచారం చేయడం తప్పని గాని, అగౌరవప్రదమని గాని ఎవరూ భావించలేదు. పైగా అలాంటి వారి గౌరవం పెరిగిందని, వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీలకు కూడా అంతులేని గౌరవ మర్యాదలు పెరిగాయని ఆశ్చర్యపోయి విదేశీ యాత్రికులు రాశారు. అందువల్ల శిష్టాచార, సంపన్నులైన బ్రాహ్మణులు కూడా వేశ్యాలంపటుత్వం, జూదం హద్దులు లేకుండా పోయినట్లు శ్రీనాథుని శివరాత్రి మహత్త్వం, తెనాలి రామలింగని పాండురంగ మహాత్మ్యం తెలుపుతున్నాయి. జాతరలలో, తిరునాళ్లలో యువతీ యువకులు విశృంఖలంగా విహరించేవారని వారు వర్ణించారు. శ్రీకాకుళం తిరునాళ్లలో యువతీ యువకులు ఎలా విచ్చలవిడిగా శృంగార కార్యాలు జరిపేవారో కూడా ఎలాంటి జంకూ లేకుండా శ్రీనాథుడు వర్ణించాడు. ప్రభువుల జీవితాలను సామంతులు అనుసరించారు. వారిని చూసి శ్రీమంతులు, వారి జీవితాలను సామాన్యులు అనుసరించారు. ఒకరిని చూసి ఒకరు అందరూ భోగ జీవితాలు గడపాలని తాపత్రయపడ్డారు.

వేశ్యావృత్తి: ఈ యుగంలో వేశ్యావృత్తి ప్రబలంగా ఉంది. వేశ్యలు స్వతంత్రులు. సామాజికంగా కూడా వారికి గౌరవ మర్యాదలున్నాయి. రాజుల ఆదరణ, రక్షణ ఉండేది. వారు వేశ్యావృత్తిని సాగించడం తప్పు కాదు. వారికి అన్ని సౌకర్యాలు కలిగించబడ్డాయి. తమ వృత్తిని నిరాటంకంగా సాగించి ధనాన్ని సంపాదిస్తారు. నాడు వేశ్యలలో రెండు తరగతుల వారు ఉన్నారు. దేవదాసీలు, సాధారణ వేశ్యలు. దేవదాసీలు దేవాలయాలకు అంకితం అయి ఉండేవారు. సాధారణ వేశ్యలు ప్రజలకు సుఖాలు ఇస్తూ ఉంటారు. ఈ కాలంలో ప్రతి కులంలో వేశ్యలుండేవారు. ఏ కులానికి ఆ కులమే వేశ్యా వృత్తిని పోషించేది. ఇది ఈ కాలపు ప్రత్యేకత. కొందరు పెద్ద కులాల ఆడపిల్లలు సంసారాలు చెడి వారి దగ్గరికి చేరేవారు. చిన్న కులాల వారు తమ పిల్లలను పెంచలేక పెళ్లిళ్లు చేయలేక వారికి అప్పజెప్పేవారు. వారి దగ్గరికి వచ్చిన పడుచులకు సంగీత నాట్యకళలు నేర్పి తమ వృత్తిలో తర్ఫీదు ఇచ్చేవారు. రాజులు, సామంతులు వారి వద్దకు వచ్చిపోతుంటారు. లేదా వారి ఇళ్లకు పిలిపించుకుంటారు. ఎంత మంది వచ్చినా వారు మాత్రం ఎవరినీ ప్రేమించేవారు కాదు; ధన సంపాదన చేసుకొనేవారు.

ప్రజలలో ఉన్న వేశ్యాలోలత వలన దేశమంతటా వేశ్యావృత్తి పెద్దపెట్టున అభివృద్ధి చెందింది. ప్రతి నగరంలో వేశ్యలుండేవారు. నెల్లూరి నెరజాణలను గురించి శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించాడు. రాజధాని విజయనగరంలో భోగంసానులు అపారంగా ఉండేవారు. భోగం వృత్తిని ప్రభుత్వం గుర్తించింది. వారిపై వృత్తి పన్ను విధించింది. ఆ పన్ను వసూలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక అధికారులను కూడా నియమించింది. భోగం వారి నుండి వసూలయ్యే పన్ను నగరంలో కాపలా కాసే 12 వేల మంది రక్షకభటుల జీతాలకు సరిపోయేదని

అబ్దుల్ రజాక్ రాశాదు. వారు గొప్ప సౌందర్యవంతులని, వారి అందచందాలకు తాను ముగ్ధుడనై పోయానని కూడా రజాక్ వర్ణించాడు. సాని వృత్తి చేసినందుకు వారి గౌరవ మర్యాదలు తగ్గిపోవడానికి బదులు వారికి సమాజంలో గౌరవం పెరిగిందని బార్బొసా రాశాడు. నాటి ఉన్నతోద్యోగులు బాహాటంగా ఉంపుడు గత్తెలను ఉంచుకొనేవారని పేస్ ఆశ్చర్యంతో రాశాడు. దేవీ నవరాత్రి ఉత్సవాలలో, రథోత్సవాలలో దేవాలయాలలోని శనివార ఉత్సవాలలో భువన విజయంలో ప్రతిరోజూ వారు నృత్యం చేసే వారట. సంగీత నాట్యాలలో వారు గొప్ప ప్రజ్ఞాశాలులుగా ఉండేవారు. సమాజంలో వేశ్యలు గొప్ప ఆకర్షణీయులుగా ప్రముఖ పాత్ర నిర్వహించారు. వారి కోసం ప్రజలు వెంపర్లాడి పోయేవారు. వారి పొందుకోసం ప్రజలు పడే ఆరాటం హద్దులు మీరిన ఈ కాలం ప్రజల రశిక జీవితాలు వారిలో నీతినియమాలు లేకుండా చేశాయి. కనుక ధనం కోసం నీచపు పనులు కూడా చేశారు. శివాలయాలలోని అర్చకులైన తంబళ్లవారు, విష్ణాలయ పూజారులైన నంబివారు దేవాలయాల ద్రవ్యాన్ని కాజేసే వారట. వ్యాపార వర్గాలు ధనార్జనకు మోసాలు చేసేవారు. పాంచాణం వారు దొంగ సొత్తు కొనేవారని, వారిపై రక్షక భటులు ఒక కన్ను వేసి ఉంచేవారని వైజయంతీ విలాసం పేర్కొంది. ఈ ధన సంపాదనంతా నాటి భోగలాలసత్వం కోసమే అయి ఉంటుంది. వేశ్యలను ఉంచుకోవడం మగతనానికి గీటురాయి అని, వ్యక్తి హోదా, గొప్పదనం, అతని శృంగార జీవితంపై ఆధారపడి ఉందని ఆనాటి విదేశీ యాత్రికులు వర్ణించారు. వారు రాజవేశ్యలకున్న గౌరవ మర్యాదలు, ప్రత్యేక స్థానాన్ని కూడా రాశారు. ఆనాటి సారస్వతంలో వేశ్యలపై వ్యామోహాలు, ధనార్జన కోసం వారు చేసే మోసాలు వివరిస్తుంది. సమాజంలో మద్యపానం, ధూమపానం, జూదం మొదలైన జాడ్యాలు పెరిగాయి. వ్యసనాల కోసం వస్తువులు కుదువబెట్టి వడ్డీకి డబ్బు తీసుకొనేవారు. వడ్డీ వ్యాపారులు అధిక వడ్డీలు వసూలు చేసే వారని కూడా నాటి సాహిత్యం తెలుపుతోంది. రాజులు, సామంతులు తమ విలాసాలకు అధిక పన్నులు వసూలు చేసే వారు. ప్రజలు వారి విలాసాలకు అయ్యే ఖర్చులు పన్నుల రూపంలో భరించి దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు.

రాజుల వైభోగం - వేడుకలు: ఈ కాలంలో రాజులు అనేక వేడుకలు చేసి ఆనందించేవారు. రెడ్డి రాజులైన అనవేమారెడ్డి, కుమారగిరిరెడ్డి కొండవీటిలో వసంతోత్సవాలు జరిపి వసంతరాయ అనే బిరుదులు ధరించారు. ఈ వసంతోత్సవాలలో ప్రజలందరూ పాల్గొని ఆ వేడుకలలో పాలుపంచుకొనేవారు. ఈ వేడుకలలో కర్పూరం, కస్తూరి, చందనం, కుంకుమపువ్వు, జాజికాయ, జాపత్రి, పన్నీరు, ఆగరుధూపాలు మొదలైన సుగంధద్రవ్యాలు ఉపయోగించేవారు. ఆ సుగంధద్రవ్యాలు ఏ దేశం నుండి వ్యాపారులు తెచ్చి రాజులకు ఇచ్చేవారో శ్రీనాధుడు హరవిలాసంలో వివరించాడు. విజయనగర రాజు దసరా ఉత్సవాలు, దీపావళి పండుగలు మహా వైభవంగా జరిపేవారు. దసరా పండుగ తొమ్మిది రోజులు జరిపేవారు. ఆ ఉత్సవాలలో నాట్యాలు, సంగీతాలు ఉండేవి. ప్రజలు వాటిని తిలకించి ఆనందించేవారు. దసరా ఉత్సవాలను గూర్చి పేస్, నికొల్‌కాంటీలు విపులంగా రాశారు. విజయనగర రాజులు కూడా వసంతోత్సవాలు జరిపేవారు. ఆ రోజుల్లో అందరూ ఒకరిపై ఒకరు రంగునీళ్లు చల్లుకుంటూ ఎంతో ఉత్సాహంగా సంతోషంగా ఉండేవారు. ఆ రోజున రాజు, రాణీ కనిపించిన వారిపై కూడా రంగులు చల్లి వినోదించేవారట. విజయనగరంలో హోలీ పండుగను వసంతోత్సవంగా జరుపుకున్నారు. ప్రౌఢ దేవరాయలు పండిత సభలు జరిపేవాడు. ఆ సభలకు పండితులే గాక పామరులు సైతం హాజరయ్యేవారు. రాయలు ముత్యాలశాలలో శ్రీనాధుని బంగారు దీనాటంకాలతో అభిషేకించాడు. కృష్ణదేవరాయలు తిరుపతి వెంకటేశ్వరునికి 30 వేల వరహాలతో అభిషేకం చేయించాడు. ఆ ఉత్సవాలను కూడా ప్రజలు తిలకించేవారు. ఇవన్నీ ఆనాడు విజయనగర ప్రభువులు, సమకాలీన రాజులు వేడుకలు జరుపుకుంటూ వైభవ జీవితాలను గడిపారని తెలియజేస్తున్నాయి.

వినోదాలు: ఆనాడు అనేక వినోదాలు ఉండేవి. పురుషులకు కుస్తీలు పట్టడం ఆనాటి వినోదంలో అతి ముఖ్యమైంది. కుస్తీ వస్తాదులకు నాయకులు కూడా ఉండేవారు. వారు కుస్తీలు నేర్పుతూ ఏ పనీ చేసేవారు కాదని పేస్ రాశాడు. ముఖ్యంగా రాజులు, సామంతులు, సేనా నాయకులు, సైనికులు కుస్తీలు నేర్చుకునేవారు. వారు ఇంకా సాముగరిడీలు కూడా చేసేవారు. కుస్తీలో దెబ్బలు తగిలిన వారికి రాజు బహుమతులు, పట్టు వస్త్రాలు బహూకరించేవాడట. గెలిచిన వారికి ఇంకా విలువైన కానుకలు ఇచ్చేవారు. ఆ రోజుల్లో కుస్తీలు నిర్వహించడానికి ప్రత్యేక గరిడీలు ఉండేవి. రఘునాధాభ్యుదయంలో తంజావూరు గరిడీని గూర్చిన ప్రస్తావన ఉంది. చంద్రగిరి గరిడీని దుజారిక్ అనే అతడు వర్ణించాడు. గరిడీశాల మధ్యభాగంలో చదరంగా విశాలమైన ప్రదేశం ఉందని, దాని

మధ్య భాగంలో అతిమెత్తగా ఉండేటట్లు ఏర్పాటు చేశారని దాని చుట్టూ నడవడానికి ఇసుక పోశారని వర్ణించాడు.

మరొక వినోదం వేట. అడవులకు వెళ్లి రకరకాల జంతువులను వేటాడేవారు. నాటి సాహిత్యంలో ఏనుగులు, ఎద్దులు, వరాహాలు, లేళ్ల వేటలను గురించిన వర్ణనలు ఉన్నాయి. పులులను, ఎలుగుబంట్లను, తోడేళ్లను చంపేవారు. ఏనుగులను తీసుకొని వచ్చి సైన్యంలో చేర్చేవారు. వేటలో ఛంపిన దుప్పి, లేళ్లను వండుకొని తినేవారు.

తర్వాత వినోదం చదరంగం. కృష్ణదేవరాయల కాలంలో బొద్దు తిమ్మన్న గొప్ప చదరంగపు ఆటగాడట. అతని ఆటకు మెచ్చుకొని రాయలు కొప్పోలు అగ్రహారాన్ని ఇచ్చాడు. పాచికలు ఆడటం మరొక వినోదం. స్త్రీలు కూడా పాచికలు ఆడేవారట. గుర్రపు స్వారీ మరొక వినోదం. దేవాలయాల మీద స్తంభాల మీద యుద్ధవీరులు అశ్వాలను పరిగెత్తించే దృశ్యాలు అనేకం ఉన్నాయి. నాటకాలు ఆనాటి గొప్ప వినోద సాధనాలు. కృష్ణదేవరాయలు రచించిన జాంబవతీ కల్యాణం ఉత్సవాలలో ప్రదర్శించేవారు. పండితులు దానిని ఆసక్తిగా చూచేవారట. పామరులకు యక్షగానాలు మంచి వినోదాలు. గంగావతరణం మొదలైన యక్షగానాలు ప్రదర్శించేవారు. ఆనాడు నట్టున నాగయ్య, పెండెలనాగి బుచ్చిగాడు పేరు గాంచిన నటులట. తోలుబొమ్మలాట కూడా ఆనాడు ప్రాచుర్యంలో ఉండేది. దొమ్మరివారి గారడీ విద్యలు, విప్ర వినోదుల భాగవత ప్రదర్శనలు కూడా నాటి గొప్ప వినోదాలు. విజయనగర యుగంలో ప్రసిద్ధి చెందిన మరొక వినోదం కూచిపూడి భాగవతుల నాటకాలు. ఇవి పండిత పామరులను రంజింపచేసేవి.

నాటి ప్రజలు పండుగలు ప్రతి సంవత్సరం జరుపుకునేవారు. పండుగ రోజుల్లో అనేక వినోద ప్రదర్శనలు జరిగేవి. కోలాటం, భజనలు, నాటకాలు, నృత్యాలు ఆడేవారు. స్త్రీలు పాచికలాట ఆడేవారు. పురుషులు, ఇంకా కోడిపందాలు, పొట్టేళ్ల పందాలు, దున్నపోతుల యుద్ధాలు జరిపేవారు. దేగ వేటలు ఆడేవారట. పండుగలలో దేవాలయాలలో ఉత్సవాలు జరిగేవి. ఆ ఉత్సవాలలో ప్రదర్శించే ప్రదర్శనలన్నీ నాటి ప్రజలకు వినోదాలుగానే ఉండేవి.

జనసాంద్రత: విజయనగర సామ్రాజ్య జనాభాను తెలుసుకోవడానికి మనకు తగిన ఆధారాలు లేవు. కాని బార్బొసా, న్యూనిజ్, పేస్ రచనల వల్ల విజయనగర సామ్రాజ్యంలో జనసాంద్రత ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. విజయనగర రాజ్యభాగాలు నీటిసదుపాయాలు కలిగినవి. కనుక పంటలు బాగా పండేవి. సిరి సంపదలు అభివృద్ధి చెందాయి. కనుక జనాభా కూడా ఎక్కువగానే వృద్ధి చెందింది. విజయనగర సామ్రాజ్యంలోని ప్రతి గ్రామం జనాభాతో నిండి ఉందని అబ్దుల్ రజాక్ రాశాడు. అతనాసియస్ నికటిన్ కూడా తాను ప్రయాణం చేసిన మార్గంలో అనేక పట్టణాలు, గ్రామాలు జనాభాతో నిండుగా ఉన్నాయని రాశాడు. పేస్ కూడా జనసాంద్రత ఎక్కువని వర్ణించాడు. గ్రామాల సంఖ్య కూడా ఎక్కువగానే ఉండేదని భావించారు. గ్రామ గ్రామానికి సరిహద్దులుగా తెలుపు రాళ్లు పాతేవారు. ఆ రాళ్లపై దేవతా చిత్రాలుండేవి. ఆ దేవతలను గ్రామస్తులు పూజిస్తూ ఉండేవారు. దేవతల బొమ్మలు ఉన్నందువల్ల ఆ రాళ్లను తీసిపారేసేవారు కాదు. అందువల్ల గ్రామాల సరిహద్దులు ఖచ్చితంగా అమలులో ఉండేవి. రాజధాని విజయనగర జనాభా 5 లక్షలు ఉండవచ్చని రాశారు. సామ్రాజ్యంలో 500 పెద్ద పట్టణాలు, వేలాది గ్రామాలున్నాయని వారు రాశారు. 18వ శతాబ్దానికి చెందిన హంస వింశతి అనే గ్రంథం ఆనాటి అనేక పట్టణాల పేర్లను ఇచ్చింది. అందులో చెప్పబడిన 175 పట్టణాలను వెంకటరమణయ్య తన గ్రంథంలో పేర్కొన్నారు. విజయనగర కాలంలో వర్ధిల్లిన విదేశీ వాణిజ్యం వల్ల వ్యాపారం, వాణిజ్యం అభివృద్ధి చెంది పట్టణాలు పెరిగాయి. పశ్చిమ సముద్ర తీరంలో అంకోలా, హోనవార్, భట్కల్, మిర్జన్ బైందూర్ బర్సూరి, కుంబ్ల, మంగుళూర్, బిదనూర్, ఉధరే, సంగీతపుత్ర, గెరెసొప్పె భారంగి మొదలైన పట్టణాలు ప్రసిద్ధి చెందాయి. సామ్రాజ్యపు మధ్యభాగంలో రాజధాని విజయనగరం, ద్వారసముద్రం, బంకాపురం, ఇక్కేరి, రాయచూర్, ముద్గల్, శ్రీరంగపట్టణం, ఆదవాని, పెనుగొండ మొదలైన పట్టణాలు సామ్రాజ్యపు తూర్పుతీరంలో కొండవీడు, శ్రీశైలం, ఉదయగిరి, కాళహస్తి, తిరుపతి, చంద్రగిరి, పులికాట్, మైలాపూర్, కంచి, తిరువణ్ణామలై, చిదంబరం, కుంభకోణం, నాగపట్నం, శ్రీరంగం, తంజావూరు, శ్రీవిల్లిపుత్తూరు, తిరునల్వేలి, రామేశ్వరం, మధురై అనంత శయనం ముఖ్య పట్టణాలు. వీటిలో ఎక్కువ పట్టణాలు పుణ్యక్షేత్రాలు. అలాగే దుర్గాలుగా ప్రసిద్ధి చెందిన మరికొన్ని పట్టణాలు కూడా ఉండేవి. మధుర, తంజావూరు, టెంకాశి, తిరునల్వేలి, జింజి, చంద్రగుత్తి, చేలూరు, చిక్‌బల్లాపూర్, ముల్బగల్, చంద్రగిరి, పెనుగొండ, ఉదయగిరి, వినుకొండ, కొండవీడు ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన

దుర్గాలు. ఈ పట్టణాలలో జనాభా అధికంగా నివసించారు. మొత్తం విజయనగర సామ్రాజ్య జనాభా ఒకటిన్నర కోట్లు ఉండవచ్చని ఊహించారు.

ఆనాడు విజయనగర సామ్రాజ్యంలో 200లకు పైగా పట్టణాలుండేవి. అందులో కొన్ని ముఖ్యమైనవి.

రాయదుర్గం, గుత్తి, రాయవెల్లూరు, అనెగొంది, శ్రీరంగపట్టణం, కంచి, గదగ్, బంకాపురం, మధుర, ఆదవాని, వినుకొండ, కొండవీడు, కొండపల్లి, పొదలి, తంజావూరు, ఉదయగిరి, మైసూరు, పెనుగొండ, మంగళగిరి, బెల్లంకొండ, దేవరకొండ, రాచెర్ల, మునిమడుగు, దూపాడు, బనగానపల్లి, పోరుమామిళ్ల, తాడిపత్రి, నంద్యాల, నందవరం, కందుకూరు, హంపి, విరూపాక్షం, కంపిలి, కడప, సిద్ధవటం, గండికోట, పుత్తూరు, నెల్లూరు, వల్లూరు, రాయచూర్, రాచకొండ, కదిరి, రామళ్లకోట, వజ్రగిరి, బాగూరు, బళ్లారి, కొత్తకోట, గొబ్బూరు, బళ్లాపురం, పుంగనూరు, ఔకు, కౌతళమ్, కుంభకోణం, బెంగళూరు, చిత్తూరు, రాజోలు, గద్వాల్, తురుత్తడి, కాళహస్తి, మధ్యార్జునమ్, మైలాపూర్, రామాపురం, వెల్లా, తంగెడ, భువనగిరి, వెలిగొండ, దర్శి, చిదంబరం, ఉడిపి, రామనాధపురం, బెదండ, ధర్మవరం, మార్కాపురం, బెజవాడ, కొండూరు, కందనవోలు.

ఆర్థికంగా నాటి ప్రజలను కొందరు వినియోగదారులు, ఉత్పత్తిదారులు అని వర్గీకరించారు. ప్రభువులు, మండలేశ్వర్లు, రాజోద్యోగులు, కవులు, పండితులు, దేవాలయాలు, మఠాధిపతులు వినియోగదార్లు అని, సామాన్య ప్రజలు, వృత్తిపని వారు, రైతులు ఉత్పత్తిదారులని అన్నారు. సామాన్య ప్రజలు చాలా మంది పై వినియోగదార్ల వద్ద సేవకులుగా ఉండేవారని వారు వ్యాఖ్యానించారు. ఉన్నత వర్గాల వారికి సేవ చేస్తూ వారిని సంతోషపెట్టడం ఉత్పత్తిదారుల విధి అని వారు వ్యాఖ్యానించారు. ఉత్పత్తి పెంచే వారిలో వ్యవసాయదారులు, పారిశ్రామికులు, వృత్తి పనివారు ముఖ్యులు. కొందరు పశువుల కాపరులుగా ఉంటూ పాలు, పెరుగు, నెయ్యిలను తీసి ఉన్నత వర్గాల వారికి అమ్ముకొనేవారు. పాంచాణం వారు, చాకళ్లు, మంగళ్లు సమాజానికి ఉపయోగపడేవారు. నాటకులు, దొమ్మరి వారు, తోలు బొమ్మలాడే వారు ప్రజలకు వినోదం అందించేవారు. ఈ కాలంలో కూచిపూడి నాటక కళాకారులు ప్రజలకు గొప్ప వినోదం కల్పించేవారు. చాలా మంది ప్రజలు కూలీ నాలీ చేసుకుంటూ జీవించేవారు. ఈ విధంగా సమాజంలో ప్రజలు అనేక తరగతులుగా జీవిస్తూ ఉండేవారు.

విజయనగర యుగంలో స్త్రీల స్థితిగతులు

విజయనగర యుగంలో స్త్రీ విలాస వస్తువుగా మారింది. రాజులు, సామంతులు వందల, వేల స్త్రీలను వివాహం చేసుకొని వారిని అంతఃపురాలలో బందీలు చేశారు. రెండవ దేవరాయలకు 12 వేల మంది భార్యలు ఉండేవారట. కృష్ణదేవరాయలు కూడా ఎక్కువ మంది భార్యలను పోషించాడు. అచ్యుతదేవరాయలు అంతఃపురంలో నాలుగు వేల మంది ఉండేవారు. ఈనాటి రాజస్త్రీలలో సాముగరిడీలు, కుస్తీలు పట్టే స్త్రీలు కూడా ఉండేవారట. వారిలో విద్యావంతులు, నాట్యకత్తెలు, సంగీత విద్వాంసులూ ఉండేవారు. రాజులకు జమాఖర్చులు రాసిపెట్టే స్త్రీ కార్యకర్తలు కూడా ఉండేవారు. రాణులు కూడా విద్యావంతులు, కళలలో ఆరితేరి ఉండేవారని న్యూనిజ్ రాశాడు. అచ్యుత దేవరాయలకు పది మంది వంట స్త్రీలు ఉండేవారట. రాజమందిరాన్ని స్త్రీలు కాపలా కాసేవారట. మహానవమి ఉత్సవాలప్పుడు అచ్యుత దేవరాయల భార్యలు 36 మంది పట్టువస్త్రాలు బంగారు ఆభరణాలు ధరించి బంగారు దీపపుబుడ్లు చేత పట్టుకొని సింహాసనం ముందు నుండి నడిచి వెళ్తూ ఉంటే వారి సౌందర్యానికి అబ్బురపడిపోయానని స్వయంగా వారిని చూసిన న్యూనిజ్ రాశాడు. రాణీవాసాన్ని కాపలా కాయడానికి వేయి మంది స్త్రీ వస్తాదులు ఉన్నారని కూడా న్యూనిజ్ రాశాడు. కాపలా కాసే స్త్రీలు ధనుర్విద్య, కత్తిసాము, మల్లయుద్ధం, గుర్రపుస్వారీలో సిద్ధహస్తులై ఉండేవారట. విజయనగరంలో అలాంటి వారు 12 వేల మంది ఉండేవారని నాటి రచనలు తెలుపుతున్నాయి.

ఉన్నత స్త్రీలు: ఉన్నత కులాల్లోని స్త్రీలకు స్వాతంత్ర్యం లేదు. భర్తలను ఆనందపరచడమే వారి విధి. మగ వారిని సుఖపెట్టడానికి స్త్రీలు జన్మించారని భావన కలుగజేశారు. పాతివ్రత్యాన్ని బోధించేవారు. భర్తే దైవం. భర్తే రక్షకుడు, అతని సంతోషమే తన సంతోషమని నూరిపోశారు. రాణులైతే, అంతఃపురాలలోను, సరదారుల భార్యలైతే ఇళ్లలోను, పరదాల వెనుక జీవించాలి. కనుక వారి కాలక్షేపానికి సంగీతం, నాట్యం నేర్చుకొనేవారు. కృష్ణదేవరాయలు, అచ్యుత దేవరాయలు, రామరాయలు తమ భార్యలు, ఉంపుడుగత్తెలకు సంగీత నాట్యాలు నేర్పడానికి సంగీత, నాట్య విద్వాంసులను నియమించారు. అచ్యుతదేవరాయలు అంతఃపురంలో నాట్యశాలను నిర్మించాడు. భర్తలు మరణిస్తే వారి భార్యలు సహగమనం చేయాలి. అలా చేస్తే పుణ్యం అని, గొప్ప అనే భావాన్ని పెంచారు. మొత్తం మీద ఉన్నత స్త్రీల పరిస్థితి దుర్భరమనే చెప్పవచ్చు.

చిన్న కులాల స్త్రీలు: పెద్ద కులాల స్త్రీలతో పోలిస్తే చిన్న కులాల స్త్రీల పరిస్థితి చాలా మెరుగ్గా ఉండేది. పెళ్లి విషయంలో వారికి స్వేచ్ఛ ఉండేది. తమకు ఇష్టం లేకపోతే భర్తను వదిలేసి మరొక వివాహం చేసుకోవచ్చు. సహగమనం చేయనవసరం లేదు. కాని పెద్ద కులాల వాళ్లను చూసి చిన్న కులాల్లోని కొందరు స్త్రీలు సహగమనం చేశారని పీట్రొడెల్లావాల్ రచనల వల్ల తెలుస్తోంది. కాని అది నిర్బంధం కాదు. వారి ఇష్టం. కాని పెద్ద కుల స్త్రీల విషయంలో అలా కాదు. వారికది తప్పనిసరి. లేకపోతే అగౌరవం. అలాగే వివాహ విషయంలో స్వేచ్ఛ లేదు. పెద్దలు చెప్పిన వారినే చేసుకోవాలి. బయటకు రావడానికి వీలు లేదు. ముఖ్యంగా సామంతులు, సరదారులు వారి కూతుళ్లను తమ మహారాజులకిచ్చి వివాహం చేసేవారు. అందువల్ల నాటి రాజులకు వేలాది మంది భార్యలు అయ్యేవారు. వారంతా అంతఃపురంలో బందీల లాగా జీవించేవారు. కాని కింది కులాల స్త్రీలు ఇళ్లలో బందీలుగా ఉండే పని లేదు. వారు బయట సంచరిస్తూ ఏదో ఒక పని చేసుకొని జీవించేవారు. అయినప్పటికీ ఆడపిల్లలకు అంతగా గౌరవం లేదు. తల్లిదండ్రులు తమ కుమార్తెలకు త్వరగా వివాహాలు చేసి పంపుదామనే ఆలోచిస్తూ ఉండేవారు. పురుషులలో బహుభార్యాత్వం ఉండేది. ఒక్కొక్కప్పుడు స్త్రీకి స్త్రీయే శత్రువుగా తయారయ్యేది.

విజయనగర దర్బారులో మల్లయుద్ధంలో సిద్ధహస్తులైన అనేక మంది స్త్రీలు ఉన్నారని ప్రొ॥ ముజుందార్ రాశాడు. ఇంకా జ్యోతిష్యం, భవిష్యత్ వాణిని చెప్పగల స్త్రీలు అక్కడ ఉండేవారట. ఇంకా కోటలో లెక్కలు రాసే స్త్రీలు ఆదాయ, వ్యయాలను గుణించే స్త్రీలు విజయనగర రాజుల వద్ద ఉండేవారని, ఇంకా న్యాయాధికారులుగా, దండనాధికారులుగా, రాజప్రతినిధులుగా, కోటకు కాపలా కాసేవారుగా కూడా స్త్రీలు ఉండేవారని రాశాడు. విజయనగర రాణులు సంగీతంలో గొప్ప విద్వాంసులని కూడా రాశాడు. మయూరసూరి, ఈశ్వరసూరి ఆ బ్రాహ్మణ కవులు.

అల్లసాని పెద్దన ప్రేమ నిర్వచనం: బహుభార్యత్వం, విచ్చలవిడి విలాస జీవితం ఉన్న సమాజంలో స్త్రీ

పురుషుల మధ్య ప్రేమలు ఉండవు అని అల్లసాని పెద్దన అంటాడు. తన భర్త మరొక స్త్రీతో ఉండగా చూసిన ఏ స్త్రీకైనా అతనిపై ప్రేమ ఉండదు, తప్పక ద్వేషం కలుగుతుంది. కాని వివాహ బంధాన్ని పోగొట్టుకోదు. సాంఘిక మర్యాద కోసం సంసార జీవితాన్ని సాగిస్తూ ఉంటుంది. అలాగే పురుషుడు కూడా అనేక మందితో సంబంధం పెట్టుకున్నా అతనికి అందరిపై ప్రేమ ఉండదు. కనుక ప్రేమ వేరు, కామవాంఛ వేరు అని అంటాడు. స్త్రీ పురుషులు అనేక మంది ప్రేమ కన్నా వాంఛతోనే సంబంధాలు పెట్టుకుంటారని పెద్దన వివరించాడు. ఈ సందర్భంలో వెంకటప్ప నాయకుని భార్యను ఉదాహరణగా చెప్పవచ్చు. వెంకటప్ప నాయకుడు ఒకరోజు ఒక ముస్లిం యువతితో ఉండగా అతని పట్టమహిషి చూసింది. ఆమెను వదిలి వేయమని అర్థించింది. కాని అతడు వినలేదు. దాంతో ఆమెకు అతనిపై విరక్తి కలిగి ఇప్పటి నుండి తాను అతనికి భార్యగా కాక కూతురి లాగా జీవిస్తానని ప్రమాణం చేసిందట. దాంతో హడలిపోయిన వెంకటప్ప నాయకుడు ఆ ఒట్టును తీసివేసుకోమని ఎంత బతిమిలాడినా ఆమె అంగీకరించలేదట. ఆమె జీవితాంతం అలాగే గడిపిందట. కనుక పరస్త్రీ వ్యామోహంలో ఉన్న భర్తలపై భార్యలకు ప్రేమ, గౌరవాభిమానాలు ఉండవని చెప్పడానికి ఈ వృత్తాంతం నిదర్శనమని చెప్పవచ్చు.

స్త్రీ విద్య - కవయిత్రులు: ఈ కాలంలో కులీన స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకపోయినా విద్యనభ్యసింప చేసేవారు. విద్యతో పాటు సంగీతం, నాట్యాలను కూడా నేర్చుకొనేవారు. కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు, రామరాయలు అంతఃపుర కాంతలకు సంగీత శిక్షణ ఇప్పించారు. విదేశీ యాత్రికులు కూడా రాచ స్త్రీలు సంగీత నాట్యాలలో ప్రసిద్ధి చెందారని రాశారు. రాచస్త్రీలు సంగీత నాట్యాలు నేర్చుకోడానికి కృష్ణరాయలు ప్రత్యేక నాట్యశాలను నిర్మించాడు. బ్రాహ్మణ స్త్రీలు కూడా గొప్ప విద్యావంతులు. శూద్ర స్త్రీలకు కూడా విద్యపై నిషేధం లేదు. ఎవరైనా ఏ విద్యనైనా నేర్చుకోవచ్చు. చిన్నతనం నుండే పాటలు పాడటం, నాట్యం చేయడం నేర్చుతారని బార్బొసా రాశాడు. నగరంలో బహిరంగ నాట్య శిక్షణా కేంద్రాలు ఉండేవి. అందులో రాచస్త్రీలు కానివారు నాట్య సంగీతాలను నేర్చుకొనేవారు. సామంత రాజ్యాలలో కూడా నాట్య సంగీతశాలలు ఉండేవి. కొందరు స్త్రీలు సాహిత్యంలో గొప్ప కృషిచేసి కవయిత్రులుగా కూడా ప్రఖ్యాతి గాంచారు. అదృష్టం గల స్త్రీలు రాణులు అయ్యేవారు. ఈ కాలంలో స్త్రీలలో అనేక మంది కవయిత్రులు, విద్వాంసులు ఉండేవారు. చిత్రకవిత్వం, గర్భకవిత్వం, బంధకవిత్వం రాయగలిగినవారు, ఘడియకు వంద పద్యాలు చెప్పగలిగినవారు, అష్టభాషా కవితా విశారదులైన స్త్రీలు ఉన్నారని సాహిత్యం చెబుతోంది. అలాగే వారిని రాజులు ఆదరించే వారు. రాణులు కూడా ఈ కాలంలో చాలా కావ్యాలు రాశారు. గంగాదేవి మధురా విజయం, రామరాయల భార్య తిరుమలాంబ మరీచి పరిణయం, రామభద్రాంబ రఘునాథాభ్యుదయం రాశారు.

దేవదాసీల విద్య: నాడు దేవదాసీ పద్ధతి అమలులో ఉండేది. అనేక మంది స్త్రీలు దేవాలయాలకు అర్పింపబడేవారు. వారు విధిగా చదువుకొనేవారు. ముఖ్యంగా సంగీత నాట్యాలలో గొప్ప నేర్పు సంపాదించేవారు. దేవాలయ ఉత్సవాలలో వారు ఆడాలి, పాడాలి. కనుక వారికి విద్య తప్పనిసరి. వారు గాత్రశుద్ధి కలిగిన వారుగా కూడా ఉండాలి. దేవాలయాలలో వారు దేవుని ముందు నాట్యం ఆడి సంగీతాన్ని ఆలపించాలి. ఉత్సవాల సందర్భంలో వారు ఊరేగింపులో దేవుని ముందు నాట్యం ఆడుతూ వెళ్లాలి.

వేశ్యల విద్య: విజయనగర యుగంలో వేశ్యా వృత్తి గుర్తింపబడింది. వారి వారి వృత్తి ధర్మాన్ని ఆచరించడానికి తగిన విద్యలను నేర్చుకొనేవారు. ముఖ్యంగా శృంగార కావ్యాలు, శృంగార గ్రంథాలు అధ్యయనం చేసేవారు. విటులను ఆకర్షించడానికి మైమరిపింపు కలిగించడానికి సంగీతాలు, నాట్యాలు అభ్యసించేవారు. తమ వద్దకు వచ్చిన వారితో చతుర సంభాషణలు చేసి సాహిత్య చర్చలు జరిపి వారిని ఆకట్టుకొని వారి వద్ద నుండి ధన ధాన్యాదులను సంపాదించేవారు. అనేక మంది వేశ్యలు తమ చాతుర్యంతో రాజులను వశపరచుకొని రాచ దర్బారులో ప్రవేశం సంపాదించేవారు. వారి వద్ద నుంచి మణిమాణిక్యాదులు పొందేవారు. అలాంటి వారంతా గొప్ప విద్యావంతులు, ప్రతిభ, తెలివితేటలు గలవారు. ఉత్సవాల సందర్భాలలో వేశ్యలు రాజదర్బారులోను, రాజ భవనాలలో తప్పకుండా నాట్య ప్రదర్శనలు ఇవ్వాలి. వారి అందచందాలకు వాక్చాతుర్యానికి పరవశులై ఎందరో రాజులు, సామంతులు, మంత్రులు, దండనాధులు వారి గృహాలు దర్శించేవారు. మొత్తం మీద విజయనగర యుగంలో కులీన స్త్రీలు, దేవదాసీలు, వేశ్యలు గొప్ప విద్యావంతులని చెప్పవచ్చు.

విజయనగర యుగంలో సతీసహగమనం: భారతదేశంలో సతీసహగమనం అతి ప్రాచీన కాలం నుంచే ఉంది. సతీసహగమనం మొట్టమొదటి ప్రస్తావన క్రీ.పూ.4వ శతాబ్దం నాటిది లభించింది. గ్రీకు వీరుడు

యాంటిగ్లోనస్‌తో పోరాడుతూ హిందూ సేనాధిపతి కేటియస్ మరణించినప్పుడు అతని భార్యలిద్దరూ సహగమనం చేయటానికి సిద్ధపడ్డారు. కాని చిన్న భార్యకు మాత్రమే సహగమనం చేయడానికి అనుమతి లభించింది. చిన్న పిల్లలు ఉన్న తల్లులను సతి చేయనిచ్చేవారు కాదు. విష్ణుధర్మ సూత్రంలో సతి నియమాలు వర్ణించబడ్డాయి. పురాణాలు కూడా సతిని గురించి తెలుపుతున్నాయి. పద్మపురాణం బ్రాహ్మణ స్త్రీలు సహగమనం చేయరాదని తెలుపుతోంది. క్రీ.శ.510వ సంవత్సరంలో గుప్త సేనాధిపతి గోపరాజు చనిపోగా అతని భార్య సహగమనం చేసింది. బాణుని హర్ష చరిత్ర, కాదంబరి కూడా సతిని ప్రస్తావించాయి. ఇబన్ బటూటా తన రెహ్లాలో సతిని గురించి రాశాడు. కాని విజయనగర యుగంలో జరిగినన్ని సహగమనాలు మరే యుగంలో జరగలేదని తెలుస్తోంది. బ్రాహ్మణ స్త్రీలు సహగమనం చేయనక్కర లేదని శాస్త్రాలు చెబుతున్నా బ్రాహ్మణ స్త్రీలు కూడా సహగమనం చేశారు. పరాశర మాధవీయం బ్రాహ్మణ స్త్రీలు కూడా సహమరణం పొందాలని చెబుతోంది. అంటే ఈ కాలం నాటికి ధర్మశాస్త్రాలు బ్రాహ్మణ స్త్రీలకు కూడా సతిని వర్తింపచేశాయి. క్రీ.శ.1583వ సంవత్సరం నాటి వ్యాస విజయం అనే గ్రంథంలో ఒక కథ చెప్పబడింది. ఒక బ్రాహ్మణుడు చనిపోయాడు. అతని భార్య సహగమనం చేయడానికి సిద్ధపడగా ఆమె స్నేహితులు చేయవద్దని బలవంతం చేశారు. ఆమె ఆ కాలంలో ప్రసిద్ధి పొందిన పండితుడైన బ్రాహ్మణ్య తీర్థుని సలహా అడిగింది. అతడు ఆమె భర్తను బతికించాడు. తర్వాత ఆమెకు ఇద్దరు కుమారులు కలిగారు. వారిలో పెద్దవాడు ప్రసిద్ధి పొందిన వ్యాసతీర్థుల వారు. ఆయన వ్యాసరాయ మఠాన్ని స్థాపించాడు.

విజయనగర యుగంలో సహగమనం చేసిన స్త్రీలు ఎక్కువ మంది విజయనగర సేనాధిపతుల భార్యలు. నాయకులు, గౌడల భార్యలు సహగమనం చేసినట్లు అనేక శాసనాలు తెలుపుతున్నాయి. ఇబన్ బటూటా సతి స్వచ్ఛందమైనదే కాని, సహగమనం చేయకపోతే చాలా అగౌరవం. అందరూ హీనంగా చూస్తారు. గుండు చేయిస్తారు. అవమానాలు చేస్తారు. సతి చేయని వారి కుటుంబాలకు సమాజంలో గౌరవం లేదు. అవమానాలు పడలేక స్త్రీలు సహగమనం చేస్తారని రాశాడు. మనకు లభించిన వాటిలో విజయనగరంలో జరిగిన మొదటి సతి హరియప్ప ఒడయర్ కాలం నాటికి చెందింది. క్రీ.శ.1354వ సంవత్సరంలో చెన్నక్క అనే స్త్రీ తన భర్త మాలగౌడ చనిపోగా సహగమనం చేసి స్వర్గానికి వెళ్లిందని శాసనం లభించింది. క్రీ.శ.1376వ సంవత్సరంలో బుక్కరాయల కాలంలో బేచిగౌడ చిన్న భార్య మద్దిగౌండి సహగమనం చేసింది. ముక్తి పొందింది. అనేక గౌడ, నాయకుల భార్యలు సహగమనాలు చేసినట్లు శాసనాలు లభించాయి. గౌడలు ఆ కాలంలో సేనాధిపతులు. క్రీ.శ.1583వ సంవత్సరంలో నుంకగౌడ మరణించగా అతని భార్య దేమయి సహగమనం చేసింది. క్రీ.శ.1386వ సంవత్సరం రెండవ హరిహరరాయల కాలంలో బొమ్మక్క అనే ఆమె సహగమనం చేయగా మహాసతికల్లు ప్రతిష్టించారు. దేవయ నాయకుడు పాము కాటుకు గురై మరణించగా అతని భార్య ముద్దనకేతి సహగమనం చేసి వైకుంఠం చేరింది. హరియగౌడ మరణించగా అతని రాణి లక్ష్మాయి కేశవుని సన్నిధిలో సహగమనం చేసి దైవ లోకానికి వెళ్లింది. క్రీ.శ.1391వ సంవత్సరంలో చొక్కగౌడ భార్య అతనితో పాటే స్వర్గానికి వెళ్లింది. బైచినాయకుని కుమారుడు వీరహరిహరుని భార్య సహగమనం చేసింది. నెల్లైలిగనాడు పాలకుడైన బొలగండ కుమారుడు భుజగౌడ భార్య త్యాయ, క్రీ.శ.1401లో బొమ్మన్న భార్య నాగయి, క్రీ.శ.1402లో వీరనరసనాయకుని భార్య కళాదేవి సహగమనం చేశారు. ఇంకా సహగమనం చేసినట్లు అనేక శాసనాలు లభించాయి. బొమ్మెన నాయకుని కుమారుడు నరప్పనాయకుడు సరిహద్దు యుద్ధంలో మరణించగా అతని భార్య బొమ్మక్క, రామగౌడ భార్య చియగౌడి, మాధప్ప భార్య మసనక్క క్రీ.శ.1454లో సహగమనం చేశారు. ఇంకా శెట్టిగౌడ, రామగౌడ భార్యలు సహగమనం చేసి స్వర్గానికి వెళ్లారు. ఇంకా రామక్క కందవ్వ అనే వారు తమ భర్తలు చనిపోగా సతి చేసి స్వర్గం చేరారు. ఇవన్నీ శాసనాలలో లిఖించబడ్డాయి.

ఆనాడు సహగమనం జరిగిన విధానాలను, నాడు దర్శించిన విదేశీ యాత్రికులు తమ రచనలలో వివరంగా రాశారు. అంతేగాక ఆనాడు భారతదేశాన్ని దర్శించిన విదేశీ యాత్రికులందరూ అంటే బార్బోసా 1514, న్యూనిజ్ 1535, సీజర్ ఫ్రెడరిక్ 1567, లన్‌షొటెన్ 1583, బర్‌దాస్ 1614, ప్రిటొడెల్లావాల్ 1623 సతీసహగమనాన్ని తమ రచనలలో పేర్కొన్నారు. బార్బోసా విజయనగరంలో జరిగిన సహగమనాలను గూర్చి చాలా వివరంగా రాశాడు. చనిపోతే వారి భార్యలు భర్త చితిపైన మరణిస్తారు. అదే భాగ్యవంతుల భార్యలు అయితే తర్వాత మరణిస్తారు. భర్తను ముందు దహించివేస్తారు. తర్వాత భార్య మంచి బొట్టు, నగలు పెట్టుకొని గుర్రంపై

ఊరేగి భర్తను దహనం చేసిన చోటుకు వస్తుంది. ఆమె వెంట బంధువులు, స్నేహితులు వస్తారు. తన ఆభరణాలు బంధువులకు ఇచ్చి, నూనెను మంటపై చల్లుతుంది. మంట పెద్దదవుతుంది. వెంటనే ఆమె మంటలలోకి దూకుతుంది. న్యూనిజ్ ఆమె చితి దగ్గరకు ఊరేగింపుగా వచ్చేటప్పుడు ఒక చేతిలో అద్దం, మరొక చేతిలో పూల గుత్తి తీసుకొని వెళుతుందని రాశాడు. సీజర్ ఫ్రెడరిక్ ఆమె కుడి చేతిలో బాణం, ఎడమ చేతిలో అద్దం ఉంటుందని రాశాడు. బాణం తన భర్త యుద్ధ వీరుడని తెలపడానికి చిహ్నంగా ధరించి ఉండవచ్చు. సతి చేయడానికి స్త్రీలు ఏ మాత్రం భయపడరని, సంతోషంగా దూకుతారని రాశారు. కానీ వీరందరూ సహగమనం తప్పనిసరి అని కూడా రాశారు. ఒక రాజు మరణించగా అతని ఐదు వందల మంది భార్యలు సహగమనం చేశారని రాశారు. బార్బోసా అనుమరణం, సహమరణం వేరువేరని రాశాడు. బీదవాళ్లు చేసేది సహమరణమని, భాగ్యవంతులైన స్త్రీలు చేసేది అనుమరణమని వివరించాడు. నికొల్‌కాంటీ రాజులను గూర్చి రాస్తూ వారు వందలాది భార్యలను చేసుకుంటారని, వివాహం చేసుకునేముందు తన మరణం తర్వాత సహగమనం చేయాలని ఒప్పించుకొని వివాహం చేసుకుంటారని రాశాడు. విజయనగర చక్రవర్తులకు 12 వేల మంది భార్యలుండేవారని, వారంతా సహగమనం చేసేవారని రాశారు. మొదటి వెంకటపతిరాయలు మరణించినప్పుడు బర్రడాస్ అనే విదేశస్తుడు అక్కడే ఉన్నాడు. రాజు శరీరానికి సెంట్లు రాసి గంధం చెక్కలు వేసి దహనం చేశారని, అతని ముగ్గురు భార్యలు వెంటనే చితిలోకి దూకారని, తాను ప్రత్యక్షంగా చూశానని రాశాడు. ఫ్లోరిస్ అనే మరొక యాత్రికుడు అది నిజమేనని ధ్రువపరచాడు. సీజర్ ఫ్రెడరిక్ ఇంకా వివరాలు రాస్తూ స్త్రీ నూనె కుండను మంటలలో వేసి దూకగానే బంధువులు తలా ఒక కట్టెను మంటలలోకి విసురుతారని, నూనెలు పోస్తారని, దాంతో మంటలు పెద్దవై ఆ స్త్రీ తొందరగా చనిపోతుందని, ఆమె చనిపోయిన తర్వాత బంధువులందరూ పెద్దగా ఏడుస్తారని రాశాడు.

క్రీ.శ.1624వ సంవత్సరంలో పెట్రొడెల్లావాల్ అనే ఇటలీ యాత్రికుడు దక్షిణ దేశం వచ్చాడు. అదే సమయంలో ఒక స్త్రీ సహగమనం చేయడానికి సిద్ధపడింది. అతడు ఆమెను కలిసి దుబాషీ సహాయంతో ఆమెతో సంభాషించాడు. ఆమె పేరు గౌరమ్మ. ఆమె ఒక భజంత్రీ వాని మూడవ భార్య. ఆమెకు ఆరు సంవత్సరాల కొడుకు, ఒక కూతురు ఉన్నారు. అప్పటికి భర్త చనిపోయి 19 రోజులైంది. ఆమె చిన్న కులస్తురాలే అయినా సహగమనం చేయడానికి సిద్ధపడింది. అందుకు అతనికి ఆశ్చర్యం కలిగి అడిగాడట. తనను ఎవరూ సహగమనం చేయమని నిర్బంధించలేదని, తానే నిర్ణయించుకున్నానని, తనకు చావంటే భయం లేదని, తన పిల్లల్ని తన మేనమామ పెంచుతాడని చెప్పింది. ఈ సమయంలో అతడు రావడం తన అదృష్టమని, తన కీర్తి విదేశాలకు కూడా అతని ద్వారా వెళుతుందని సంతోషపడిందని రాశాడు. చితిపై వేసే కట్టెలు కొనడానికి అడిగే విరాళానికి తన ఇంటికి కూడా వస్తానని అన్నదట. ఆమె మేనమామ ఆ అమ్మాయి తన కుటుంబంలో పుట్టడం తమకు చాలా గౌరవం, గర్వకారణమని, సంతోషం కలుగుతోందని చెప్పాడు. ఆమె తెల్లని చీర కట్టుకొని నగలు, పువ్వులు పెట్టుకొని పెళ్లి కూతురులాగే ఉందని, అలాంటి స్త్రీ మంటలకు ఆహుతి కాబోతున్నందుకు ఆమెకు ఏ దిగులూ లేదని, కాని తనకు అమిత దుఃఖం కలిగిందని డెల్లావల్ తన రచనలో విషాదంగా రాసుకున్నాడు. స్త్రీల పట్ల ఇంతటి నిర్దయగా ఉన్న ఈ దురాచారాన్ని తిట్టుకున్నానని కూడా రాసుకున్నాడు. సహగమనం భయంకరమైనదే అయినా వితంతువులుగా జీవించలేక, సహగమనం చేస్తే గౌరవ ప్రతిష్టలు కలుగుతాయని, తన మరణం తర్వాత తనను స్త్రీలు పేరంటాలుగా కొలుస్తారనే ఆలోచన వారికి సహగమనం చేసే ధైర్యాన్ని ఇచ్చేది. సహగమనం చేసిన స్త్రీలను పేరంటాళ్లుగా కొలిచే ఆచారం కూడా ఉండేది. నేటికీ నెల్లూరు జిల్లాలో వెంగమాంబ అనే పేరంటాలకి ఏటా ఉత్సవాలు జరుపుతారు. ఆమె సహగమనం చేసిందట. డెల్లావిల్లా రాసిన రాతను బట్టి మరొక విశేషం తెలుస్తోంది. భర్త మరణించగానే చితిపైన కూర్చొని దహించబడటమే గాక, తర్వాత కొన్ని రోజులకు ఒంటరిగా చితి పేర్చుకొని సహగమనం చేసేవారని కూడా తెలుస్తోంది.

బొందలో కూర్చోబెట్టి కప్పివేయటం: క్రీ.శ.1509వ సంవత్సరం నాటి ఒక శాసనం శవంతోపాటు అతని భార్యను బొందలో పూడ్చిపెట్టినట్లు తెలుపుతోంది. అరూరచాండగౌడ కుమారుడు బొమ్మగౌడ మరణించగా అతని భార్య అతని సమాధిలో కూర్చొని స్వర్గానికి వెళ్లిందని ఆ శాసనం వివరిస్తోంది. లింగాయతులు శవాన్ని దహనం చేయరు. బొందపెడతారు. బొందగుంటలో మరణించిన వ్యక్తి భార్యను కూర్చోబెట్టి మట్టితో పూడ్చివేస్తారు. లోపల ఊపిరాడక స్త్రీ కూడా మరణిస్తుంది. ఇది మరీ ఘోరమైన విధానం. లింగాయతులు సహగమనం చేయనక్కరలేదు, కాని అప్పుడు ప్రబలంగా ఉన్న ఆచార ప్రభావం లింగాయతులపై కూడా ప్రసరించి ఉండవచ్చు.

ఇలాంటి భయంకర సహగమనం చేయడానికి ఆ కాలం నాటి పరిస్థితులు కారణం కావచ్చు. ముస్లింల చేతిలో పడకుండా ఉండటానికి రాజపుత్రులు ఉత్తర దేశంలో సహగమనాన్ని అమలుపరిచారు. విజయనగర కాలంలో ముస్లింలు దక్షిణ దేశంలోకి చొచ్చుకొని వచ్చారు. కనుక రాజపుత్రుల ఆచారాన్ని దక్షిణదేశ హిందువులు కూడా స్వీకరించి ఉండవచ్చు. ఆనాటి ధర్మశాస్త్రాలు కూడా సహగమనానికి అనుకూలంగా రాశారు. సహగమనం చేస్తే స్వర్గం వస్తుందని శంఖ అంగీరసులు రాశారు. మూడున్నర కోట్ల సంవత్సరాలు భర్తతో స్వర్గంలో ఉంటారని నాడు రాశారు. శాసనాలు కూడా మోక్షం, స్వర్గం వస్తుందని పేర్కొంటున్నాయి. కనుక ఈ ప్రచారాలు స్త్రీలకు సహగమనం చేయడానికి ధైర్యాన్ని ఇచ్చి ఉంటాయి. కాని ఈ ఆచారం ప్రతి సంవత్సరం వేలాది స్త్రీలను బలి తీసుకుంది.

వివాహాలలో కట్నకానుకలు నిషేధం: ఆ కాలంలో వివాహాలు ఆడంబరంగా జరిగేవి. రాజులు, సామంతులు, ఉన్నతోద్యోగులు తమ కుమార్తెలకు ఆభరణాలు, భూములు అరణంగా ఇచ్చేవారు. అల్లుళ్లకు గుర్రాలు, ఏనుగులు, జాగీరులను బహూకరించేవారు. బీదబిక్కీ కూడా తమ శక్తికొలది వివాహానికి ఖర్చు పెట్టేవారు. కొందరు కట్నకానుకలు ఇవ్వలేక పిల్లల వివాహం చేయలేకపోయేవారు. చివరకు కట్నం కన్యాశుల్కాలు తల్లిదండ్రులకు బాధలను తెచ్చిపెట్టాయి.

నాటి సమాజంలోని మరొక దురాచారం కట్నకానుకలు ఇవ్వడం. చాలా మంది తల్లిదండ్రులు కట్నకానుకలు ఇవ్వలేకపోయేవారు. కొందరు భూస్వాములు తమ కుమార్తెలకు తమ భూములను అరణంగా ఇచ్చేవారు. చివరకు కట్నాల బెడద ఎక్కువైపోయి స్త్రీ ధనంగా గ్రామ భూములను, ఇతర గ్రామాలకు ఇవ్వరాదని కొన్ని గ్రామాలు నిషేధాన్ని ప్రవేశపెట్టాయి. దాంతో ఆస్తి ఉన్నవారు కూడా తమ కుమార్తెలకు వివాహాలు చేయలేక పోయారు. దాంతో వడైవీడు గ్రామ బ్రాహ్మణులు సమావేశమై కట్నాలు ఇవ్వరాదని తీర్మానించారు. ఎవరైనా ఇచ్చినా, కట్నం తీసుకున్నా రాజు శిక్షించాలని తీర్మానించారు. అలాగే కర్నూలు జిల్లా నందవరంలో క్రీ.శ. 1570వ సంవత్సరంలో మహాజనులు కన్యాశుల్కాన్ని నిషేధించారు. ఆ కాలంలో బ్రాహ్మణులలో బాల్య వివాహాలు ఎక్కువగా ఉండేవని లిన్‌షోటన్ అనే అతడు రాశాడు. రాచ స్త్రీలు పనులు చేయరు. వారికి పరిచారక గణం ఉండేది. బ్రాహ్మణ స్త్రీలు తమ ఇంటి పని తామే చేసుకునే వారు. మిగిలిన కుల స్త్రీలు తమ ఇళ్లలోనే గాక ఇతర ఇళ్లలో కూడా పని చేసేవారు. ఏ స్త్రీ అయినా భర్త అదుపాజ్ఞల్లో ఉండవలసిందే. భర్తకు సేవ చేసుకుంటూ సతి అని పిలిపించుకోవలసిందే. స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవు.

విజయనగర యుగంలో ఆర్థిక పరిస్థితులు

నీటిపారుదల, వ్యవసాయ, భూ సంబంధాలు: ప్రజలకు వ్యవసాయం ప్రధాన జీవనాధారం కనుక విజయనగర చక్రవర్తులు వ్యవసాయాభివృద్ధికి, నీటిపారుదల సౌకర్యాలకు తగిన శ్రద్ధ తీసుకున్నారు. ఐరోపాలో మాదిరిగా హిమతలాలు లేవు, నదులు ఎక్కువగా లేవు, కనుక వర్షాల వల్ల పడే నీటిని చెరువుల్లో భద్రపరచి వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి విజయనగర రాజులు చెరువులు, కాలువలు తవ్వించారని పోర్చుగీసు యాత్రీకుడైన పేస్ వర్ణించాడు. బుక్కరాయల కాలం నుండి నీటిపారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయడం ప్రారంభమైంది.

బుక్కరాయల మంత్రి చిక్కప్ప వడయార్. అతడు నంద్యాల రాష్ట్రంలోని దేవరకొండకు దగ్గరలో ఉన్న పాండు వాగుకు క్రీ.శ.1365వ సంవత్సరంలో ఆనకట్ట కట్టించాడు. దానికి తూర్పుగట్టున బుక్కసముద్రమని, పడమటి గట్టున అనంతసాగరం అనే రెండు గ్రామాలను కూడా నిర్మించాడు. పెనుగొండ దగ్గర శిరులేరు అనే చెరువు నిర్మింపబడింది. విజయనగర తలారిగా ఉన్న పెనుగొండ వీరన్న మోదయ గ్రామం వద్ద ఒక చెరువును తవ్వించి, దానికి ఒక కాలువను తవ్వించి దానికి నూతన తుంగభద్ర అని పేరు పెట్టారు. ఉదయగిరిలో బుక్కరాయల రాజప్రతినిధిగా ఉన్న భాస్కరుడు బద్వేలు తాలూకాలోని పోరుమామిళ్ల అనే పేరుతో పెద్ద చెరువును తవ్వించాడు. అంతేగాక ఆ చెరువుకట్టపై రెండు పెద్ద బండలను పాతించి వానిపై తటాక నిర్మాణాలు ఎలా ఉండాలి అనే నిర్మాణపరమైన 12 సాంకేతిక అంశాలు రాయించాడు. చెరువులకు ఇరువైపులా పర్వతాలు ఎంత దూరంలో ఉండాలి, చెరువు గర్భం ఎలా ఉండాలి, అడ్డకట్ట ఎలా నిర్మించాలి, చెరువు కింద ఆయకట్టు భూములు ఎలా ఉండాలి, నీరు ఏ విధంగా వదలాలి, చెరువులను ఎలా కాపాడుకోవాలో మొదలైన జాగ్రత్తలు కూడా రాయించాడు. తర్వాత తరాల వారికి చెరువులు నిర్మించడానికి ఇవి మార్గదర్శక సూత్రాలుగా ఉపయోగపడే విధంగా ఉన్నాయి. ఈ చెరువు నిర్మాణం రెండు సంవత్సరాలు పట్టింది. వేయి మంది మనుషులు, 100 బండ్లు నిరంతరం పని చేశారని, ధనం చాలా ఖర్చయిందని రాయించబడింది. ఈ తటాకానికి రెండు వైపులా రెండు పర్వతాలు ఉన్నాయి. వాటి మధ్య దూరం 5 వేల రేఖాదండాలు. దానిని కలుపుతూ కట్ట పోశారు. వెడల్పు ఎనిమిది రేఖాదండాలు, ఎత్తు 7 రేఖాదండాలు. మొరవను రాతితో నిర్మించారు. నాలుగు తూములు ఏర్పాటు చేశారు. ఇది గొప్ప నిర్మాణం. రెండవ బుక్కరాయలు పెద్ద మొత్తం ధనాన్ని ఖర్చు పెట్టి తుంగభద్రా నదిపై ఆనకట్ట నిర్మించాడు. దాని వల్ల విజయనగర పట్టణం సస్యశ్యామలం అయింది. పట్టణం చుట్టూ అరటి, నారింజ, నిమ్మ, పోక, తమలపాకులు, చెరకు, కొబ్బరి, పళ్లు, గులాబీ తోటలు విస్తారంగా అభివృద్ధి చెందాయనీ, అందువల్ల సాలుకు మూడున్నర లక్షల పగోడాల ఆదాయం పెరిగిందని న్యూనిజ్ వర్ణించాడు. రెండవ హరిహరరాయల గురువైన క్రియాశక్తి ఒడయారు ధర్మవరం పట్టణాన్ని నిర్మించి అనేక చెరువులు, బావులు తవ్వించాడు. అతడు గొట్టూరు, ధర్మవరంలలో బావులు, చెరువులను తవ్వించాడు. అతని తల్లి మేడాంబ స్వయంగా ఈ నిర్మాణాలను పర్యవేక్షించేదట. ఆమె మరణించిన తర్వాత ఊరి పేరు మేడాపురంగా మార్చారట. సాళువ నరసింహరాయల కాలంలో అనంతపురం దగ్గర నరసాంబుధి అనే తటాకం నిర్మించబడింది. కృష్ణదేవరాయల కాలంలో అనేక చెరువులు నిర్మింపబడ్డాయి. యుద్ధ అనే అతని దండనాయకుడు 10 ఆనకట్టలు కట్టించాడు. వాని వల్ల హోస్‌పేట తాలూకాలో 13,200 ఎకరాలు, బళ్లారిలో 2,300 ఎకరాలు, ఆదోని తాలూకాలో 900 ఎకరాలు సాగులోకి వచ్చాయి. ఈ కాలువలలో కురుదుగడ్డ ఆనకట్ట నుండి కమలాపురం తాలూకాలోకి తవ్విన కాలువ నిర్మాణంలో గొప్ప సాంకేతిక పరిజ్ఞానాన్ని కనబరచారని మేజర్ హెండర్సన్ అనే అతడు రాశాడు. ఆ కాలువ చెరువు గర్భం కన్నా దాని కింద సాగయ్యే భూములు ఎత్తులో ఉండేటట్లు నిర్మించారు. అందువల్ల చిన్న చిన్న గుట్టల మీదుగా నిర్మించారు. పోర్చుగీసు ఇంజనీర్ల సహాయంతో కృష్ణదేవరాయలు తోరగల్లు వద్ద తుంగభద్రానదికి ఆనకట్ట కట్టించాడు. కృష్ణదేవరాయలు ప్రారంభించిన ఒక కాలువను రామరాయలు పూర్తి చేశాడని బీజాపూర్ చరిత్రకారుడైన రఫీ ఉద్దీన్ షిరాజి రాశాడు. సొండూరు లోయలో సమాంతరంగా ఉన్న రెండు కొండలను కలుపుతూ మరొక దండనాయకుడు ఆనకట్ట నిర్మించినట్లు పేస్ వివరించాడు. ఈ చెరువు గర్భంలో ఉన్న ఒక గుట్టను పూర్తిగా తొలగించారు. ఈ చెరువుకు మూడు లీగుల దూరంలో ఉన్న మరొక చెరువు నుండి గొట్టాల

ద్వారా నీరు వచ్చేటట్లు నిర్మాణం చేశారు. ఈ చెరువు నిర్మించడానికి 20 వేల మంది పని చేశారని పేస్ వివరించాడు. ఆత్మకూరు తాలూకాలో రెండు గుట్టలను కలిపి కృష్ణదేవరాయలచే నియమింపబడిన అధికారి ఒకరు అనంతసాగరం అనే పేరుతో తటాకాన్ని నిర్మించాడు. ఆ చెరువులో 40 అడుగుల లోతు నీరు నిల్వ ఉంటుంది. అచ్యుతరాయల కాలంలో జామోదెల్లాఫోటే అనే పోర్చుగీసు ఇంజనీర్ సహాయంతో దండనాయకుని చెరువుకు మరమ్మతులు చేశారు. ఆ చెరువు నీరుతో అనేక నూతన భూములు సాగులోకి వచ్చాయని, ఆ భూములకు 9 సంవత్సరాలు పన్నులు లేకుండా నీరు అందించారని న్యూనిజ్ రాశాడు. 20 వేల పర్దాన్‌లు ఆదాయం పెరిగిందని కూడా రాశాడు. ఇదే కాలంలో ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో తిమ్మనాయనిపేట చెరువు, జాకు చెరువు, కంభం చెరువులు నిర్మింపబడ్డాయి. ఇంకా అనేక మంది సామంతరాజులు అనేక తటాకాలు నిర్మించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడ్డారు. కొండవీటి రాజ్యంలో కృష్ణరాయలచే పాలెగాడుగా నియమింపబడ్డ కొండమరసు అనే అతడు తిమ్మ సముద్రం, కొండా సముద్రం అనే తటాకాలను నిర్మించాడు. ఉదయగిరి రాజ్యంలో అనంతసాగరం, కందనవోలులో సిద్ధవట తటాకాలు కూడా నిర్మింపబడ్డాయి.

ఉద్యోగులు - ప్రజలు చెరువులు నిర్మించడం: రాజులు సామంతులేగాక అనేక మంది ఉద్యోగులు సాధారణ ప్రజలు కూడా అనేక తటాకాలు నిర్మించారు. రెండవ దేవరాయల వద్ద ఉద్యోగులుగా పని చేసిన అహమ్మద్‌ఖాన్ అనే వ్యక్తి హోస్‌పేట తాలూకా కమలాపురంలో ఒక బావిని తవ్వించాడు. మహమ్మద్ మియా అనే మరొక ఉద్యోగి తన యజమాని అయిన కోనేటి రంగారావు పుణ్యప్రదానికి కోవూరు తాలూకాలోని ఒక గ్రామంలో రంగబుగ్గ అనే చెరువును తవ్వించాడు. కొందరు పౌరులు బళ్లారి జిల్లాలో ఒక దేవదాన గ్రామంలో ధర్మబుగ్గ నుండి నీరు తోడటానికి కలపను ఉచితంగా దానం చేశారు. ఆ బుగ్గ నుండి నీరు తోడేవాడికి ఉప్పు తయారు చేసే రైతులు ఒక్కొక్క ఉప్పు మడి నుండి రెండు బస్తాలు ఉప్పు ఇవ్వడానికి అంగీకరించారు. నీరు తోడే ఇనుప గూను పాడైపోగా కమ్మర్లు కొత్త గూను చేసి ఇచ్చారు. నీరు తోడే వాడికి గ్రామ రెడ్డి కొంత భూమిని ఇచ్చాడని అక్కడి శాసనం తెలుపుతోంది. చెరువులు, బావులు తవ్వించినందువల్ల పుణ్యం, స్వర్గం లభిస్తాయని నాటి ప్రజలు నమ్మారు. అందువల్ల అందరూ ఆ పనికి పూనుకున్నారు.

చెరువులను సరైన స్థితిలో ఉంచడం - దశబంధ పద్ధతి: చెరువులు, బావులు తవ్వించడమే కాదు, వాటిని ఎల్లప్పుడూ సరైన స్థితిలో ఉంచవలసిన అవసరం కూడా ఉంది. కనుక అందుకు కూడా తగిన ఏర్పాట్లు చేశారు. కాలువలు, గట్లు తెగిపోవచ్చు. మేటలు వేయవచ్చు. కనుక ఆ పనులు చేయడానికి రైతుల నుండి ధాన్యం వసూలు చేసే వారు. పంటలో పదో వంతు ఫలసాయాన్ని వసూలు చేసే వారు. దేవదాన బ్రహ్మదేయాలలో చెరువులు మరమ్మతు చేసే బాధ్యత ఆ గ్రామాల యాజమాన్యానిదే. చెరువులను మరమ్మతులు చేసే పనిని గుత్తకు ఇచ్చే ఆచారం కూడా ఉండేది. వారు తమ సొంత ఖర్చుతో చేయవచ్చు. తర్వాత వసూలు చేసుకోవచ్చు. లేదా కొంత భూమిని పొందవచ్చు. భూములు, గ్రామాలు ఇచ్చి మరమ్మతులు చేసే పద్ధతిని దశబంధ ఈనాము అని అంటారు. కట్టుంగొడుగు అని మరొక పేరు కూడా ఉంది. రాయలసీమలో ఈ పద్ధతి అమలులో ఉండేది. నెల్లూరు, కృష్ణా జిల్లాల్లో కొన్నిచోట్ల ఈ పద్ధతి ఉన్నట్లు కొన్ని శాసనాలున్నాయి. రైతులు కూడా దశబంధ పద్ధతిలో భూములు ఇచ్చేవారు. కడప జిల్లా పులివెందుల తాలూకాలో 14వ శతాబ్దానికి చెందిన ఒక శాసనం లభించింది. అందులో దశబంధ పద్ధతి పేర్కొనబడింది. రాయలసీమలో బావులపై వ్యవసాయం చేయడం ఎక్కువ. ఒక్క రాయచోటి తాలూకాలోనే 5,700 బావులున్నాయని, అందులో చాలా భాగం దశబంధ నూతులని 1875వ సంవత్సరం కడప మాన్యూల్ వివరిస్తోంది. రాయలసీమ విజయనగర రాజుల కింద ఉన్నందువల్ల అక్కడ ఆ పద్ధతి అమలులోకి వచ్చింది. అదే పద్ధతి అక్కడ ఇటీవల దాకా కొనసాగింది.

బళ్లారి జిల్లాలో ఒక అగ్రహారపు మహాజనులు ఒక చెరువును తవ్వించారు. అందుకు ప్రతిఫలంగా ఆ చెరువు కింద కొంత భూమిని పన్నులు లేకుండా ఇచ్చారు. ముగ్గురు బ్రాహ్మణులు నరసింగయుడు అనే పాలకుని పేరుతో నరసాంబుధి అనే చెరువును తవ్వించినందుకు రాయపరాజు అనే అతని ఉద్యోగి వారికి కొంత భూమిని దానం చేసి ఆ భూములకు నీరు పారే కాల్వపై అధికారాన్ని కలిగించాడు. అనంతపురం జిల్లాలో ఒక చెరువు కట్ట మూడు చోట్ల తెగిపోయింది. దానిని తమ ఖర్చుతో మరమ్మతు చేసిన ఇద్దరు వ్యక్తులకు వెంకటాద్రినాయకుని ప్రతినిధి కట్టుంగొడుగుగా కొంత భూమిని దానం చేశాడు. అహోబిలంలోని ఒక శాసనం కొన సముద్రాన్ని నిర్మించిన ఒక మహామండలేశ్వరునికి దేవాలయ ధర్మకర్త ఒక గ్రామాన్ని ఇచ్చినట్లు తెలుపుతోంది. మడకశిరలో

లభించిన మూడు శాసనాలు అక్కడి తటాకాలను తమ ఖర్చులతో బాగుచేసిన కొందరు గౌదలకు స్థానిక అధికారులు కట్టుంగొడుగు భూములు ఇచ్చినట్లు తెలుపుతున్నాయి. కొందరు ఆయగార్ల అనుమతితో చెరువు తవ్వించడానికి కొంత భూమిని ఇచ్చారని మరొక శాసనం వివరిస్తోంది. చెరువులు తవ్వించడానికి మరమ్మతులు చేయించడానికి స్థానిక ఉద్యోగులకు అమరాలు ఇచ్చే ఆచారం నెల్లూరు జిల్లాలో ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. వెంకటపతిరాయల కాలంలో వెలుగోటి వంశానికి చెందిన నాయకుడు మరొకనికి ఆత్మకూరు తాలూకాలో ఒక గ్రామాన్ని అమరంగా ఇచ్చాడు. అమర గ్రామాలలోని రైతులు చెరువుల నుండి కాలువల ద్వారా నీటిని తమ పొలాలలోకి పారిస్తే మెట్ట పంటలో నాల్గో వంతు, తరి పొలాల పంటలో మూడో వంతు ఇచ్చే పద్ధతి ఉంది. అలాగే ఇతర గ్రామాల్లో చెరువులను మంచి స్థితిలో ఉంచినందుకు రైతులు పుట్టికి కుంచం ధాన్యం ఇచ్చినట్లు అనేక శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1538 సంవత్సరం అచ్యుతదేవరాయల కాలం నాటి ఒక శాసనం అధికారులు వసూలు చేసిన మేరలు తటాకాల మరమ్మతులకే ఖర్చుపెట్టాలి. అలా చేయకపోయినా ఎవరైనా చేసే వారిని ఆటంకపరిచినా వారిని గ్రామ వెట్టివాడికి అప్పజెప్పినట్లు అని కట్టడి చేసినట్లు తెలుపుతోంది. మనుషులను నిర్దేశించడానికి అలాంటి పదజాలం ఆనాడు వాడేవారని ఈ శాసనం తెలుపుతోంది.

దేవస్థానాలకు నీటి సౌకర్యాలు కలిగించడం అంటే అది మహా పుణ్యప్రదంగా, సప్తసంతానాలలో ఒకటిగా భావింపబడేది. దేవాలయ భూములకు నీటిపారుదల సౌకర్యాలు కలిగిస్తే వారి పేరుతో దేవాలయంలో పూజలు జరిపే వారని కొన్ని శాసనాల ద్వారా తెలుస్తోంది. చంద్రగిరి వాస్తవ్యుడు తిరుపతి దేవాలయానికి చెందిన ఒక కాలువను బాగు చేయించాడు. ఐదు వేల మంది కూలీలను పెట్టి దేవాలయ భూమిని చదును చేయించాడు. అందుకుగాను దేవునికి ఆయన పేరుతో ప్రతిరోజూ ఒక తిరుప్పొనం నైవేద్యంగా పెడతామని ధర్మకర్తలు అంగీకరించారు.

ఒక్కొక్కప్పుడు కాలువలు తవ్వేటప్పుడు మరొకరి భూముల గుండా తవ్వవలసివస్తుంది. మరీ పెద్ద కాలువలు అయితే మరొక ఊరి పొలాల్లో గుండా తవ్వవలసి వస్తుంది. భూమిని నష్టపోయే రైతులు అభ్యంతరాలు చెప్పేవారు. అటువంటప్పుడు రాజులు, వారి ప్రతినిధులు అందరికీ ఆమోదయోగ్యం అయ్యే ఒప్పందాలు చేసుకుంటారు. అవిలై గ్రామంలోని ఒక చెరువుకు రెండు ఊళ్లు అవతల ఉన్న పైడిపల్లి గ్రామం దగ్గర ఉన్న ఒక బుగ్గ నుండి నీరు తెప్పించవలసి వచ్చింది. అందుకు తాను కాలువ తవ్విస్తానని చెన్నకేశవదాసు అనే వ్యక్తి ముందుకు వచ్చాడు. కాని మధ్యలోని గ్రామ రైతులు తమ భూములలో కాల్వ తవ్వడానికి వీలులేదని పేచీ పెట్టారు. అంతట రాజు జోక్యం చేసుకొని ఆ రైతులకు వేరే భూములు ఏర్పాటు చేసి కాలువ తవ్వించడానికి వీలు కల్పించాడు. ఈ విధంగా ఆ కాలంలో నీటిపారుదల సౌకర్యాలు కలిగించడానికి కృషి జరిగింది. నీటి సౌకర్యాల వల్ల వరి, చెరకు, పత్తి, కాయధాన్యాలు, పప్పుధాన్యాలు, పండ్ల తోటలు అన్ని రకాల పంటలు పండేవి. వరి ధాన్యంలో తీగమల్లెలు, మొలకొలుకులు, ఖర్జూరాలు, సంపెంగలు, రాజనాలు, కుసుమలు మొదలైన రకాలు పండేవట. విజయనగర రాజుల కాలంలో పోర్చుగీసు వారు మిరప, పొగాకు, బత్తాయి, నల్లమందు, ఫిరంగి, కురసానివాము అనే పంటలు భారతదేశంలో ప్రవేశపెట్టారు. వాటిలో మిరప, పొగాకులు గొప్ప వ్యాపార పంటలుగా మారాయి. వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ విధానాలలో మార్పులు లేవు.

బంజరు భూముల సాగు: బంజరు భూములు సాగు చేసి పంటలు పండించడానికి అడవులను కొట్టించి వ్యవసాయ క్షేత్రాలు విస్తరించడానికి కూడా విజయనగర రాజులు శ్రద్ధ తీసుకున్నారు. పంటలు ఎంత ఎక్కువగా పండితే రాజ్యానికి అంత ఎక్కువగా పన్నుల రూపంలో ఆదాయం వస్తుంది. కనుక వారు వ్యవసాయాన్ని ప్రోత్సహించేవారు. హరిహరరాయలు అడవులు కొట్టుకొని వ్యవసాయ క్షేత్రాలుగా మార్చడానికి అనేక అడవి భూములను రైతులకు కౌలుకు ఇచ్చినట్లు గ్రామ కైఫీయత్తులు తెలుపుతున్నాయి. నరసింహ అనే అతడు ప్రజలను ప్రోత్సహించి అడవులను కొట్టించి కర్నూలు జిల్లాలో పాలకుర్తి, సూరబోయినపాడు అనే గ్రామాలు నిర్మింప జేశాడు. అందుకుగాను ఆ రెండు గ్రామాల రెడ్డిరికాన్ని అతనికి ఇచ్చారు. అనంతపురంలోని బంజరు భూములను ఆ గ్రామంలోని సమస్త ప్రజలకు కౌళ్లకు ఇచ్చినట్లు అక్కడి పాలకుడు వేయించిన మూడు శాసనాలు తెలుపుతున్నాయి. అందువల్ల వ్యవసాయ భూముల విస్తీర్ణం పెరిగింది. కొత్త గ్రామాలు ఏర్పడ్డాయి. పాడుబడ్డ గ్రామాలను బాగు చేయించారు. గ్రామాలను పునరుద్ధరించి నూతన వ్యవసాయ క్షేత్రాలు పెంచే ప్రజలకు కూడా ప్రోత్సాహం ఇచ్చారు. ఆ ప్రజలకు మిరాశి భూములు కూడా ఇచ్చారు. వారికి 3 సంవత్సరాలు పన్నులు లేకుండా

చేశారు. బ్రాహ్మణులు కూడా వ్యవసాయాన్ని పెంచడానికి పూనుకున్నారు. బళ్లారి జిల్లాలో కొందరు మహాజనులు అడవులు కొట్టించి వ్యవసాయ భూములుగా మార్చి చెరువులు తవ్వించారు. అందుకు వారికి వారి భూములపై అన్ని రకాల పన్నులు రద్దు చేశారు. పశువులపై పుల్లరి కూడా రద్దు చేశారు. అనంతపురంలో ఒక మహా మండలేశ్వరుడు హంపిలో మరొక నాయకుడు అక్కడ వ్యవసాయ క్షేత్రాలు పెంచిన వారికి ఇలాంటి సౌకర్యాలే ఇచ్చారని అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. అందువల్ల వారి కాలంలో అనేక నూతన గ్రామాలు ఏర్పడ్డాయి. వ్యవసాయ క్షేత్రాలు విస్తరించాయి. ప్రభువుల ఆదాయం పెరిగింది. వస్తు ఉత్పత్తి కూడా పెరిగింది.

పంటలు, తోటలు: విజయనగర సామ్రాజ్యంలో వరి విస్తారంగా పండేది. వరి పంటను అభివృద్ధి చేయడానికి మంచి జాగ్రత్తలు తీసుకున్నారు. విజయనగరంలోని ధనవంతులు సన్నని, తెల్లని వరి అన్నం తినే వారని విదేశస్తులు రాశారు. ఎర్ర వడ్లు కూడా పండేవట. బీదలు ఎర్ర వరి అన్నం తినేవారు. వరి ధాన్యం దేశ ప్రజలకు సరిపోగా ఇంకా మిగిలేవట. కనుక అధిక దిగుబడి వరి ధాన్యాన్ని విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఇంకా జొన్నలు, సజ్జలు, రాగులు, వరిగెలు, కందులు, పెసలు, మినుములు మెట్టపొలాల్లో పండించేవారు. తర్వాత చెప్పుకోదగినది చెరకు పంట. ఇది కూడా విస్తారంగా పండేది.

తర్వాత చెప్పుకోదగ్గవి పండ్ల తోటలు. మామిడి, నిమ్మ, నారింజ, అరటి, జామ, దానిమ్మ, ద్రాక్ష ఫలాలు విస్తారంగా పండించేవారు. విజయనగరం రెండు మూడు కోటల మధ్య అనేక రకాల ఫలవృక్షాలను, పండ్ల తోటలను చూశామని విదేశీ యాత్రికులు వర్ణించారు. అక్కడే చెరకు తోటలుండేవని, ఆ తోటలకు నీరు విస్తారంగా లభించేదని కూడా రాశారు. తోటలు గుబురుగా పెరిగి చిట్టడవుల లాగా ఉండేవని కూడా రాశారు. అన్నిరకాల కూరగాయలు పండించేవారు. ఇళ్లల్లో కూడా ఫలవృక్షాలు, కూరగాయల చెట్లు నాటేవారు. తోటలలో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి తమలపాకు తోటలు. విజయనగర యుద్ధంలో తాంబూలం వేసుకోవడం నాగరికతకు, ఘనతకు, హోదాకు చిహ్నం అయింది. కనుక ప్రతివారూ తాంబూలం వాడేవారు. అందువల్ల తమలపాకులకు విపరీతమైన గిరాకీ ఉండేది. కనుక తమలపాకుల తోటలు విస్తారంగా వేసి పెంచారు. పూలతోటలు కూడా ఎక్కువగా ఉండేవి. విజయనగర ప్రజలు విలాస పురుషులు కనుక పూలు ఎక్కువగా వాడేవారు. స్త్రీ పురుషులిద్దరూ పూలదండలు వేసుకొనేవారు. కనుక పూలకు కూడా ఎక్కువ గిరాకీ ఉండేది. కనుక పూలతోటలు కూడా విపరీతంగా పెంచారు. ధనికుల ఇళ్లలో తప్పకుండా పూలతోటలు ఉండేవి.

పన్నుల బాధ - రైతుల అగచాట్లు: విజయనగర కాలంలో రైతులు, వ్యాపారులు, వృత్తి పనివారు అనేక రకాల పన్నులు చెల్లించేవారు. వ్యవసాయ భూములను నీరారంబం, కదారంబం అని రెండు రకాలుగా విభజించి పన్నులు వేసేవారు. తరి భూములు అంటే వరి, పళ్ల తోటలను నీరారంబం అని అంటారు. మెట్ట భూములను కదారంబాలు అని అంటారు. ఈ భూములను కూడా మూడు తరగతులుగా విభజించి పన్ను నిర్ణయిస్తారు. మేలురకం, మధ్యరకం, నాసిరకం భూమి అని మూడు విధాలుగా వర్గీకరిస్తారు. ఈ వర్గీకరణ నీరారంబాలకు, కదారంబాలకు అంటే తరి, మెట్ట భూములకు విడివిడిగా వర్తిస్తుంది. నిల్వ ఉందని పంటల మీద వస్తురూపంలో పన్నులు నిర్ణయిస్తారు. ధనాదాయాన్ని సిద్ధాయం లేక సువర్ణాయం అని అనే వారు. ఆనాడు ధనాన్ని హొన్నులనేవారు. ఒక హొన్ను అర వరహాతో సమానం. సంస్కృతంలో సువర్ణం అనే పదమే స్థానిక భాషలో హొన్ను అనే పదంగా మారిందని అంటారు. గడ్డి, బీళ్ల మీద పన్ను వసూలు చేస్తారు. అడవులలో పశువులను మేపుకున్నందుకు పుల్లరి వసూలు చేస్తారు. అడవులలో కలప, కలప కొట్టుకొనేందుకు పాటలు పాడుతారు. ఆ కట్టెలు కొట్టేవారు చెల్లించే పన్నును కొండగుత్త అని అంటారు. ఆ పాటల మొత్తం కూడా ప్రభుత్వానికి ఆదాయంగా ఉంటుంది. ప్రజలను రక్షించేందుకు దండనాయకునికి దన్నాయం అనే పన్ను చెల్లించాలి. కావలి కాసినందుకు తలారికి కావలి కట్నం ఇవ్వాలి. దానికి తలవారిక అని కూడా పేరుంది. ఇవిగాక కరణీకవర్తనె, రాయసవర్తనె అనే మరి రెండు పన్నులు ఉండేవి. ఇవి కరణానికి, రాయసం అనే ఉద్యోగికి వెళ్లి ఉండవచ్చు. వృత్తి మాన్యాల మీద కూడా కొన్నిరకాల పన్నులు వసూలు చేసేవారు. జోడి, కట్నం, కాడి, కప్పం మొదలైన పేర్లతో వారి వద్ద నుండి వసూలు చేశారు. కట్నం కొడిక అనేవి రాజులకు, రాజోద్యోగులకు ఇచ్చే బహుమతులు. మంగళ్లు, చాకళ్ల వద్ద నుండి వసూలు చేసేది కప్పం. రెడ్డి, కరణం మొదలైన పెద్ద ఉద్యోగుల నుండి వసూలు చేసేది జోడి. బుక్కరాయల కాలం నుండి దేవాదాయ బ్రహ్మదేయాలకు పన్నుల రాయితీలు తగ్గించారు. అందువల్ల అగ్రహారాల నుండి కూడా కొంత ఆదాయం వస్తుండేది. పంటలో ఆరో వంతు మాత్రమే పన్నుగా వసూలు చేయాలని ధర్మశాస్త్రాలు

చెబుతున్నా పంటలో అర్ధభాగం వసూలు చేసినట్లు కనిపిస్తోంది. న్యూనిజ్ పంటలో తొమ్మిది వంతులు రాజు గాని, అమర నాయకులు గాని వసూలు చేస్తారని రాశాడు. పైగా ధనరూపంలో వసూలు చేసినప్పుడు రైతు ఇంకా నష్టపోయేవాడు.

సమ్మెట గురవరాజు పన్ను వసూలు: రాయలసీమలో సమ్మెట గురవరాజనే స్థానిక పాలకుడు ప్రజలపై, రైతులపై అనేక పన్నులు విధించి అతిక్రూరంగా వసూలు చేసేవాడు. పన్నులు కట్టని రైతుల భార్యలను లాక్కొని వచ్చి స్తనాలు కొలిపించే వాడట. స్తనాలకు పట్టకారులు పట్టి హింసించేవాడట. ఇది చూసిన కూచిపూడి భాగవతులు విజయనగరం రాజు ముందు తమ ప్రదర్శన ఇస్తూ మధ్యలో గురవరాజు దురంతాలను ప్రదర్శించారు. దాని గురించి రాజు తెలుసుకొని గురవరాజును శిక్షించడానికి ఇస్మాయిల్‌ఖాన్ అనే సేనాధిపతిని పంపి గురవరాజు తల కొట్టించాడు. ఈ సంఘటన సాళువ నరసింహరాయల కాలంలో గాని, వీరనరసింహ రాయల కాలంలో గాని జరిగి ఉండవచ్చని భావింపబడింది.

రైతుల వలస: ఈ విధంగా విధించే పన్నులు, అధికారుల దురంతాలు భరించలేక రైతులు తమ గ్రామాలు వదిలేసి వేరే ప్రాంతాలకు వలస పోయేవారు. సదాశివరాయల కాలంలో అనంతపురం జిల్లాలోని చాబల గ్రామంలోని రైతులు పన్నులు చెల్లించలేక గ్రామం వదలి వెళ్లిపోయారు. ఆ గ్రామాన్ని అమరంగా పొందిన కొండయ దేవమహదాసు ఆదాయం మొత్తం పోయి అమితంగా నష్టపడ్డాడు. అతడు వారిని వెనక్కి పిలిపించి అనేక పన్నులు రద్దుచేశాడు. వెట్టి చేయనక్కరలేదని వాగ్దానం చేశాడు. ఆదోని తాలూకాలోని కవుతాళ సీమలోని ప్రజలందరూ పక్కన ఉన్న బీజాపూరు రాజ్యంలోకి వలసపోయారు. అక్కడి మహామండలేశ్వరుడైన సకల దేవుడు పన్నులన్నీ తగ్గించి వారు తిరిగి వచ్చేటట్లు చేశాడని ఒక శాసనం తెలుపుతోంది. గొల్లలు పెరుగు, మజ్జిగ ఇవ్వనక్కరలేదు, పశువులు మేపుకోవడానికి పుల్లరి చెల్లించనక్కరలేదని కూడా ప్రకటించాడు. దాంతో ప్రజలు తిరిగి వచ్చారు. రైతులు ఊళ్లను వదలిపోయి రాజులను కిందికి దిగివచ్చేటట్లు కూడా చేయగలిగారు. ఆనాడు దేశంలో జనాభా తక్కువ, భూములు ఎక్కువ చేసుకునే వారికి ఎక్కడైనా భూమి దొరికేది. అందువల్ల వారు ఎక్కడికైనా వెళ్లిపోయేవారు. పరిసర రాజులు కూడా వారిని ఆహ్వానించేవారు. అందుకు కారణం తమ రాజ్యంలో సాగుకాని భూములు సాగులోకి వస్తాయి. పన్నుల ద్వారా ఆదాయం పెరుగుతుంది. కనుక రైతులను ఆహ్వానించి సౌకర్యాలు కలిగించేవారు. కాని ఐరోపాలోని రైతులకు ఇలాంటి స్వేచ్ఛ లేదు. వారు ఎలాంటి పరిస్థితులలో కూడా ఊళ్ల వదిలిపోవడానికి వీలులేదు. ఒకవేళ వెళ్లినా అవతల రాజులు వారిని రానివ్వరు. వారిది బానిస బతుకు. కాని భారతదేశంలో అనాది నుండి రైతులకు భూమిపై హక్కు ఉంది. ఎక్కడికైనా వెళ్లడానికి స్వేచ్ఛ ఉంది. ఇది భారత దేశ ప్రత్యేకత. కనుకనే భారతదేశంలో ఐరోపాలో మాదిరి భూస్వామ్య వ్యవస్థ లేదని పండితులు తీర్మానించారు. అంతేకాదు భారతీయ రాజులు ప్రజలు కష్టాలలో ఉన్నప్పుడు పన్నులు తీసేసేవారు. యుద్ధాలు జరిగినప్పుడు పంట పొలాలు నష్టపోయేవి. ఆ నష్టాలన్నీ రాజులు భర్తీ చేసే వారు. ఆ ప్రదేశాలను, పొలాలను బాగు చేయించేవారు. ముస్లిం దండయాత్రల వల్ల రెండవ వెంకటపతిరాయల కాలంలో నష్టపడిన రైతులకు నూతన భూములను తక్కువ కౌళ్లకు ఇచ్చినట్లు క్రీ.శ.1601వ సంవత్సరం నాటి శాసనం తెలుపుతోంది. ఎనిమిది సంవత్సరాల వరకు పన్నులు లేవని ప్రకటించారు. కరువులు వచ్చినప్పుడు కూడా ప్రజలు వలస పోయేవారు. క్రీ.శ.1540వ సంవత్సరంలో భయంకరమైన కరువు వచ్చింది. ఆ కరువులో మూడు వంతుల ప్రజలు మరణించారని, మరణించిన వారి మాంసం తిన్నారని జొనొడేకాస్ట్రో అనే పోర్చుగీసు యాత్రికుడు వర్ణించాడు. అనేక గ్రామాలు అగ్రహారాలు ఖాళీ చేసి ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు.

భూమి హక్కు: విజయనగర యుగంలో భూమిపై ప్రజలకు హక్కు లేదు. భూమిని దున్నుకునే హక్కేగాని, యాజమాన్య హక్కు లేదని కొందరు అన్నారు. న్యూనిజ్ కూడా భూమి హక్కు రాజుదేగాని ప్రజలది కాదని, ఆయన ద్వారా సామంతులకు వచ్చింది గాని ప్రజలకు భూమిపై ఎలాంటి హక్కు లేదని రాశాడు. సామంతులు రాజు తమకు ఇచ్చిన భూమిలో పదింట తొమ్మిది వంతుల భూమి రైతులకు కౌలుకు ఇచ్చారు. కనుక ప్రజలకు, రైతులకు భూమి మీద హక్కు లేదని విదేశీ యాత్రికులు రాశారు. కాని అది వాస్తవం కాదు. భూమిపై ప్రజలకు వ్యక్తిగత హక్కు ఉంది. వారు అష్టభోగాలతో అమ్ముకోడానికి, దానం చేసుకోవడానికి, దఖలు చేయడానికి ప్రజలకు సర్వ హక్కులు ఉన్నాయని అనేక శాసనాలు తెలుపుతున్నాయి. అతి ప్రాచీన కాలం నుండే భారతదేశంలో ప్రజలకు భూమిపై హక్కు ఉంది. భూములపై ప్రజలకు, రైతులకు ఉన్న హక్కులను కాపాడే బాధ్యత కూడా రాజుదేనని

ధర్మశాస్త్రాలు వక్కాణిస్తున్నాయి. అదే పద్ధతి విజయనగర యుగంలో కూడా కొనసాగింది. అచ్యుతదేవరాయలు, రామచంద్రదీక్షితులు అనే పండితునికి ఒక గ్రామాన్ని సర్వ హక్కులతో దానం చేశాడు. అతడు దానిని 110 భాగాలు చేసి 46 మంది బ్రాహ్మణులకు ఇచ్చాడు. కాని వారికి సర్వహక్కులతో ఇవ్వలేదు. అతనికి అచ్యుత దేవరాయలు ఇచ్చిన విధంగా ఇచ్చినట్లు అతడు బ్రాహ్మణులకు రాయించి ఇచ్చిన శాసనంలో లేదు, తేడా ఉంది. కనుక అతడు వారికి సాగు చేసుకునే హక్కును మాత్రమే ఇచ్చాడు గాని సర్వహక్కులతో ఇవ్వలేదు. అచ్యుత దేవరాయల కాలంలో దేవుని కొలువులు కొలిచినప్పుడు అయిన అప్పులు తీర్చడానికి రుద్రశివాచార్యుడు ఒక గ్రామాన్ని దేవాలయానికి అమ్మినట్లు కాళహస్తి శాసనం తెలుపుతోంది. శ్రీరంగరాయల కాలంలో కురిచేమనిపల్లె, చెప్పరపల్లె, చేమలకుంట, చెరుకూరు, రఘునాధపురం మొదలైన గ్రామాలను కొని దేవాలయానికి ఇచ్చినట్లు పెనుగొండ శాసనం తెలుపుతోంది. కడప జిల్లా చిలమకూరు దేవాలయ స్థానాపతి తన వాటా భూమిని అమ్మినట్లు క్రీ.శ.1382 నాటి శాసనం తెలిపింది. క్రీ.శ.1531 సంవత్సరం నాటి లేపాక్షి శాసనం చెలువిండ్ల, గణపతిహళ్లె గ్రామాల మీద యాజమాన్య హక్కును విరూపన్నకు ఇచ్చినట్లు తెలుపుతోంది. ధర్మకార్యాలకు, దైవ కార్యాలకు భూములు కొనడం, అమ్మడం జరిగినట్లు అనేక మంది అగ్రహారీకులు, దేవాలయ ధర్మకర్తలు భూమిని అమ్మినట్లు అనేక శాసనాలు ఉన్నాయి. బయచేన బోయడు అనే వ్యక్తి బోయవీడు కుడిచెలపాడుల వద్ద నిర్మించిన దశబంధ తటాకాన్ని అమ్మినట్లు శాసనం లభించింది. ఇలాంటివే మరి రెండు తామ్ర శాసనాలు నెల్లూరు జిల్లాలో లభించాయి. చిత్తూరు జిల్లాలో కొందరు కొన్ని ఇళ్ల స్థలాలను దేవాలయపు ఖజానాకు అమ్మినట్లు శాసనం లభ్యమైంది. తిరుపతిలో కొందరు పల్లీయుల నుండి ఒక భక్తుడు భూమి కొన్నాడు. ఇంతవరకు ధర్మకార్యాలకు మాత్రమే భూమిని అమ్మేవారని, కాని ఈ కాలంలో ప్రజలు కూడా తమ భూములను ఇష్టారీతిలో అమ్మివేశారని మెకంజీ సేకరించిన కవెలలు తెలుపుతున్నాయి. 15వ శతాబ్దంలో రాసిన స్థల పురాణాలు కూడా కరువు కాటకాలప్పుడు భూమిని అమ్మివేశారని తెలుపుతున్నాయి. క్రీ.శ.1402లో ఒక పర్యాయం కరువు వచ్చింది. తర్వాత క్రీ.శ.1442-1452 సంవత్సరాల మధ్య 12 సంవత్సరాల కరువు వచ్చింది. ఆ కాలంలో మిరాశీదారులు వృత్తి మాన్యాలు అమ్ముకొని వెళ్లిపోయారట. బెల్లంకొండ సీమలో మంత్రయ్య అనే పన్నుగుత్తదారుడు ఊళ్లకు ఊళ్లే కొనేశాడని శాసనాలు తెలుపుతున్నాయి. గురుజేపల్లి, కొండకాపూరులను ఒక్కొక్కదాన్ని 80 వరహాలకు కొన్నాడు. నందిభీమవరం, విప్పర్ల, వెలుకూరు మూడు గ్రామాలను 140 వరహాలకు కొనేశాడు. గాదెలపర్రు కరణం తన మిరాశీలో సగం భాగాన్ని మరొక కరణానికి అమ్ముకున్నాడు. కొసరాజు అనే నియోగి బ్రాహ్మణులు, చెరుకూరు బ్రాహ్మణులు భూములు అమ్ముకొన్నారు. చాత్రగడ్డ, కామరాజుగడ్డ, రుద్రవరం గ్రామాల్లోని లింగాయతులు తమ భూములను శిష్యులకు అప్పగించి వెళ్లిపోయారు. గుడిపూరిలో రంగపతి అనే స్థానిక ప్రభువు దేవాలయంలో నిత్యసేవ చేయడానికి 30 తూముల భూముని పద్మసాని అనే దేవదాసికి దానం చేశాడు. కాని ఆ భూమిని అంతకు ముందు మిరాశీలు తనకు అమ్మారని అక్కడి కరణం వివాదాన్ని లేవదీశాడు. కనుక పూర్వం లాగే అమ్మకాలు, కొనుగోళ్లు, దానాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పవచ్చు.

వీసబడి పద్ధతి: ఇదే కాలంలో నెల్లూరు, కడప జిల్లా ప్రాంతంలో వీసబడి పద్ధతి అమలులో ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. దీని ప్రకారం గ్రామంలోని భూమంతా గ్రామ ప్రజలందరికీ చెందుతుంది. భూమి సారాన్ని బట్టి గ్రామ భూమినంతా 16 భాగాలుగా విభజిస్తారు. గ్రామ ప్రజలు ఆ భూమిని వాటాలుగా తీసుకొని సాగు చేస్తారు. దాని ప్రకారమే వారు గ్రామానికి పన్నులు చెల్లిస్తారు. ఐదారు సంవత్సరాలకొకసారి భూమిని కలిపి మళ్లీ వాటాలు వేసుకుంటారు. ఈసారి అంతకుముందు చేసిన భూమి కాక మరొక భూమిని తీసుకుంటారు. అలా భూమిని మార్చుకుంటూ సాగుచేసుకుంటారు. ఇది ఉమ్మడి సాగు అని చెప్పవచ్చు. దీనిని వీసబడి పద్ధతి అని అంటారు. ఈ పద్ధతి విజయనగర యుగం నుండి అక్కడ అమలులో ఉందని క్రీ.శ.1801వ సంవత్సరంలో అక్కడ కలెక్టర్‌గా చేసిన సర్ థామస్ మన్రో మద్రాసు రెవెన్యూ బోర్డు వారికి తెలియపరుస్తూ జాబు రాశాడు. ఈ పద్ధతిలో భూమి ఎవరిది అనే ప్రశ్నే లేదు. పంటలో సగ భాగం రాజుకు గాని, అమర నాయకునికి గాని పోతుంది. మిగిలింది తాము సాగు ఖర్చులు పోగా రైతులకు అతి కొద్దిగా మిగిలేది. అందువల్ల ఆ ప్రాంతంలో వ్యవసాయం బాగా అభివృద్ధి చెందలేదని థామస్ మన్రో మద్రాసు ప్రభుత్వానికి తెలియజేశాడు.

కవిలె: ఆ కాలంలో ప్రతి గ్రామంలో కవెలె అనే గ్రామ రికార్డులుండేవి. అందులో ఎవరి కింద ఎంత భూమి ఉండేది, ఏ పంటలు వేసేవారు, దానిపై పన్ను ఎంత వచ్చేది వివరాలను కరణాలు రాసేవారు. ఈ

రికార్డులు ప్రతులు రాష్ట్రాలు, సీమలు, స్థలాలుగా కూడా ఉండేవి. గ్రామాలలో కరణాలు తమ కార్యక్రమాలు నిర్వహించడానికి ఆఫీసులు ఉండేవి. వాటిని చావడులు అని అనేవారు. రాష్ట్రాలలోను సీమలలోను స్థలాలలో కూడా ఇలాంటి చావడులుండేవి.

పరిశ్రమలు: ఆర్థిక రంగంలో వ్యవసాయం తర్వాత చెప్పుకోదగినవి పరిశ్రమలు. విజయనగర సామ్రాజ్యంలో పట్టణాలలోనేగాక గ్రామాలలో కూడా పరిశ్రమలు అభివృద్ధి చెందినట్లు ఆధారాలున్నాయి. ఈ యుగంలో దక్షిణ భారతదేశంలో పారిశ్రామికస్థితి, వస్తు ఉత్పత్తి ఆనాటి ఐరోపా కంటే ఎన్నో రెట్లు ముందుందని మోర్లెండ్ అనే పండితుడు వ్యాఖ్యానించాడు. దేశ ప్రజలకు కావలసిన వస్తువులన్నీ అక్కడ ఉత్పత్తి అవుతున్నాయనీ, కొన్ని వస్తువులను మాత్రమే దిగుమతి చేసుకొంటున్నారనీ, దిగుమతుల కంటే అనేక రెట్లు దేశీయ వస్తువులు సరుకులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయనీ కూడా రాశారు. ఆనాటి పరిశ్రమలు-

1. వ్యవసాయ ఉత్పత్తుల మీద ఆధారపడి పరిశ్రమలు
2. గనుల పరిశ్రమ
3. లోహాలపై ఆధారపడిన పరిశ్రమలు
4. చేతి పరిశ్రమలు
5. చేపల పరిశ్రమలు

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు: వ్యవసాయ ఆధారిత పరిశ్రమలలో చక్కెర, బెల్లం, నూనె, నేత పరిశ్రమలు ముఖ్యమైనవి.

చక్కెర పరిశ్రమ: సామ్రాజ్యంలో చాలా చోట్ల చక్కెర తయారయ్యేది. ఇది రెండు రకాలు. చూర్ణ చక్కెర, గుండు చక్కెర అని రెండు రకాలుగా ఉండేదట. భట్కల్‌లో చక్కెర ఎక్కువగా దొరుకుతుందని వార్తెమా రాశాడు. చూర్ణ చక్కెరను చిన్న చిన్న పొట్లాలలో కూడా అమ్మేవారని బార్బోసా రాశాడు. చక్కెర దేశీయుల వినియోగానికి పోను ఇంకా ఎక్కువగా ఉండేదని, విదేశాలకు ఎగుమతి అయ్యేదని కూడా వారు రాశారు.

బెల్లం పరిశ్రమ: చక్కెర తర్వాత బెల్లం కూడా తయారయ్యేది. పేదలు బెల్లాన్ని ఎక్కువగా వాడేవారు. బెల్లం చెరకు కొట్టగానే పొలాలలోనే పెద్ద ఇనుప బొచ్చలలోకి చెరకు రసం తీసి ఉడికించి తీసేవారు. ఇంకా తాటిబెల్లం, తాటి కలకండ కూడా తయారు చేసేవారు. తాటికల్లు నుండి తాటిబెల్లం, తాటి కలకండ ఆయుర్వేద మందులలో వాడేవారు.

నూనె పరిశ్రమ: తర్వాత చెప్పుకోదగినది నూనెల తయారీ. నువ్వుల నూనె, వేరుశనగ నూనె, ఆవనూనె, కొబ్బరి నూనె, ఆముదం మొదలైన నూనెలను గానుగలలో ఆడించి తీసేవారు. ఈ నూనెలు వంటలలోకి నిత్యం అవసరం.

తాటి, కొబ్బరి ఆకుల పరిశ్రమ: తాటినార, కొబ్బరినారతో తాళ్లు పేనేవారు. తాటి ఆకులు రాత కావ్యాలు రాయడానికి కూడా వాడేవారు. తాటి ఆకులు, కొబ్బరి మట్టలతో పేదలు తమ ఇళ్లకు కప్పులు వేసుకొనేవారు. తాటి పట్టెలను వాసాలుగా, తాటి మొదళ్లను దూలాలుగా వాడేవారు.

చేనేత పరిశ్రమ: పరిశ్రమలన్నింటిలో చేనేత పరిశ్రమ చాలా పెద్దది. దేశంలో అన్ని గ్రామాల్లో వస్త్రాలు నేసేవారు. మగ్గాలపై రకరకాల వస్త్రాలు తయారయ్యేవి. తొగటవారు, పద్మసాలీలు, మాలవారు, జాండ్రవారు నేత పనులు చేసేవారు. కురుబలులు అంటే గొల్లవారు కూడా కంబళ్లు నేసేవారట. ఈ మూడు కులాల వృత్తి నేత పని. వీరే గాక కురుబలులు అనే గొల్ల కులం వారు కూడా వస్త్రాలు నేసేవారు. వారి అసలు వృత్తి గొర్రెల కాపరులు. వారు కంబళ్లను నేస్తారు. మాలలు కూడా వస్త్రాలు నేసేవారు. రాచనగరులలో అత్యంత నిపుణులైన నేత పని వారుండేవారు. వారు రాజులకు, రాణులకు సన్నని వస్త్రాలు నేసేవారు. ఉలవకొండ స్థలంలోని 12 గ్రామాలలో 453 మగ్గాలు ఉండేవి. వానిలో 411 రంగు బట్టలు నేసేవని రాయరేఖ తెలుపుతోంది. అక్కడ 43 చిల్లర దుకాణాలున్నాయని; ఆ స్థలానికి వచ్చే ఆదాయంలో సగం ఈ మగ్గాల మీద, దుకాణాల మీద వేసే పన్నుల వలనే వచ్చేదని తెలుస్తోంది. ఆంధ్రదేశంలో సాలీలు, నేత పనులు చేయగా తమిళ దేశంలో కైక్కోలులు నేత పనిచేసేవారు. నీలి, ఎరుపు, తెలుపురంగు వస్త్రాలు ఎక్కువ. మిగిలిన పచ్చ, ఇతర రంగుల వస్త్రాలు కూడా నేసేవారు. తాడిపత్రి, ఆదవాని, గుత్తి, బళ్లారి నూలుబట్టలకు ప్రసిద్ధి చెందాయి. చిత్రదుర్గ, జరిమెల కంబళ్లకు ప్రసిద్ధి. ధర్మవరం, గుత్తి, బళ్లారి, రాయదుర్గం, మెలతాయి తూరులు పట్టువస్త్రాలకు ప్రసిద్ధి. పల్లెల్లో రాట్నాల మీద నూలు వడికేవారు.

దాంతో సాలీలు ముతకబట్టలు నేసేవారు. చేనేత మగ్గాలను కోడూరు, అలవకొండ శాసనాలు పేర్కొన్నాయి.

చేనేత పరిశ్రమకు అనుబంధంగా పత్తి నుండి గింజలు వేరు చేసే గిరకలు ఉండేవి. పింజని, తర్వాత పత్తిని ఏకులుగా అంటే పింజలుగా చేసి నూలు వడికేవారు. పింజనిగురు, పింజసిద్ధాయం అనే పన్నులు వసూలు చేసినట్లు శాసనాలు కూడా తెలుపుతున్నాయి. నూలు ఎక్కువగా గుంటూరు మండలంలో ప్రత్యేకంగా పలనాటిలో ఎక్కువ తయారయ్యేది. తూర్పు తీరంలో పులికాట్ వద్ద జౌళి వస్త్రాలు తయారయ్యేవి. అవి అక్కడి నుండి పెగు, మలక్కా సుమిత్రా, మలబారు, గుజరాత్‌లకు కూడా ఎగుమతి అయ్యేవని బార్బోసా రాశాడు.

అద్దకపు పరిశ్రమ: వస్త్ర పరిశ్రమకు అనుబంధంగా అభివృద్ధి చెందిన మరొక పరిశ్రమ అద్దకం. అద్దకం ద్వారా వస్త్రాలకు రంగులు వేసేవారు. రంగులలో నీలి రంగు ప్రధానమైంది. నీలి ఆకుల ద్వారా నీలిరంగు తయారు చేస్తారు. అందువలన నాటి రైతులు నీలి ఆకును పండించేవారు. నీలి రంగు తయారీ కూడా వ్యవసాయ ఆధార పరిశ్రమే. ఇంకా అనేక రంగులు తయారు చేసే పరిశ్రమలు ఉండేవి.

గనులు - లోహాల శుద్ధి: విజయనగర యుగంలో గనుల తవ్వకం చురుకుగా సాగింది. సామ్రాజ్యంలోని వివిధ భాగాలలో వివిధ లోహాలు లభించేవి. మైసూరు పరిసర ప్రాంతాలలో ఇనుము, బంగారం, వజ్రకరూర్ ప్రాంతంలో వజ్రాలు లభిస్తుండేవి. కొన్నిచోట్ల రాగి, వెండి, గంధకం లభించేది. ఈ లోహాలను బయటకు తీసి శుద్ధి చేసేవారు. ఈ లోహాల వల్ల అనేక లోహాల పరిశ్రమలు అభివృద్ధి చెందాయి.

ఇనప పరిశ్రమ - ఆయుధాల పరిశ్రమ: ఇనుము ఎక్కువ మైసూరు ప్రాంతంలో లభ్యం అయ్యేది. ఇనుముతో ఆయుధాలు తయారు చేసేవారు. కత్తి, డాలు, బల్లేలు మొదలైన అన్ని ఆయుధాలు ఇనుము వల్లనే తయారయ్యేవి. తర్వాత ఇనుముతో వ్యవసాయ పనిముట్లు అంటే నాగలి, గొర్రు మొదలైన పనిముట్లు తయారు చేసేవారు. బట్టీల ద్వారా ఇనుమును కరిగించేవారు. కాకిరాయి నుండి కూడా ఇనుమును తీసేవారట.

గృహ సామగ్రి - రాగి పరిశ్రమ - దేవతా విగ్రహాలు: రాగితో గృహోపకరణాలు తయారయ్యేవి. బిందెలు, చెంబులు, గ్లాసులు మొదలైన ఇంటిలో వాడే వస్తువులు తయారు చేసేవారు. ఇంకా పూజాపాత్రలు, దేవతా విగ్రహాలు కూడా రాగితో తయారయ్యేవి. ఆభరణాల పరిశ్రమలో కూడా రాగి వాడేవారు.

ఆభరణాల పరిశ్రమ: బంగారం, వెండిలతో రకరకాల ఆభరణాలు తయారయ్యేవి. రాణులు, శ్రీమంతులు నెక్లెస్‌లు, చంద్రహారాలు, గాజులు, చెవి కమ్మలు మొదలైన ఆభరణాలు ధరించేవారు. పండితులకు బంగారు గండపెండేరాలు చేయించి బహూకరించేవారు. వీటన్నింటిని నిపుణులైన కంసాలులు తయారు చేసేవారు. బీదలు వెండి ఆభరణాలు ధరించేవారు. కాళ్ల కడియాలు, పట్టీలు, మెట్టెలు, పూజాపాత్రలు, గ్లాసులు, పళ్లేలు, వెండితో తయారయ్యేవి. భారతదేశంలో రాచ స్త్రీలు ధరించే బంగారు ఆభరణాలు, దేవతా విగ్రహాలకు అలంకరించే బంగారు నగలు, రాజాంతఃపురంలో, దేవాలయాలలో వాడే వెండి పాత్రలను చూసి విదేశీ యాత్రికులు అమిత ఆశ్చర్యాలకు గురయ్యేవారు. ఇంకా గుర్రాలకు, ఏనుగులకు కూడా బంగారు, వెండి రేకులతో అలంకరించేవారు. ఆభరణాల వినియోగం ఎక్కువగా ఉన్నందు వల్ల ఆభరణాల పరిశ్రమ విజయనగర యుగంలో బాగా అభివృద్ధి చెందింది.

వజ్రాల పరిశ్రమ: విజయనగర యుగంలో వజ్రాల పరిశ్రమ కూడా బాగా అభివృద్ధి చెందింది. అనేక చోట్ల వజ్రాల గనులుండేవి. నల్లమల పర్వత పాదాల వద్ద రత్నాలు లభించేవట. అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్ ఆనాడు ప్రసిద్ధి చెందిన వజ్రాల గని. కృష్ణానదీ తీరాలలో ఎక్కువగా వజ్రాలు దొరికేవి. గార్షియా దా ఓర్టా అనే విదేశస్తుడు విజయనగర రాజుల వద్ద కోడిగుడ్డు పరిమాణంలో ఒకటి, కొంచెం తక్కువ పరిమాణంలో ఇంకొక మూడు వజ్రాలు ఉన్నాయని రాశాడు. 1565 సంవత్సరంలో తళ్లికోట యుద్ధం తర్వాత పెనుగొండకు ఖజానా తరలించినప్పుడు మూడు పెట్టెల నిండా వజ్రాలు తీసుకొని వెళ్లారని కొందరు రాశారు. రాజులు, రాణులు ఆ కాలంలో వజ్రాల హారాలు ధరించేవారు. బంగారు గనులు కూడా ఉండేవి. గనులు తవ్వి బంగారం తీసేవారు. గుత్తి ప్రాంతం నుండి వజ్రాలు ఎక్కువగా వచ్చేవని న్యూనిజ్ రాశాడు. రెండవ దేవరాయల కాలంలో గుత్తి ప్రాంతానికి అడపానాయకుడు అధిపతిగా ఉండేవాడు. అతని రాజ్యంలో లభించే వజ్రాలలో 20 మాంగినుల బరువును మించిన వజ్రాలన్నింటినీ చక్రవర్తికి పంపేవాడని న్యూనిజ్ రాశాడు. అతడు సంవత్సరానికి 40 వేల పర్దాలు చక్రవర్తికి చెల్లించేవాడట. అతనాసియస్ నికిటిన్ కూడా వజ్రాలను తన రచనలలో పేర్కొన్నాడు. వజ్రాలను సింహాసనాలు, కిరీటాలలో, హారాలలో పొదిగేవారు. వజ్రాల సింహాసనం, వజ్రాల కిరీటం, వజ్రాల హారం, వజ్రాల

ఉంగరాలను ధరించడం నాటి రాజుల, రాణుల ఘనతకు తార్కాణం. శ్రీమంతులు, వారి స్త్రీలు కూడా వజ్రాల ఆభరణాలు ధరించేవారు. కనుకు ఉన్నత వర్గాలలో వజ్రాల వాడుక బాగా ఉండేది. రాయలు అనేక విలువైన వజ్రాలు సేకరించేవారు. కృష్ణదేవరాయల కాలంలో వజ్రసింహాసనాన్ని, వజ్రకిరీటాన్ని చూశానని పేస్ వర్ణించాడు.

వజ్ర, బంగారు ఖజానాలు: విజయనగర రాజుల వద్ద అంతు లేని వజ్రాలు, మణులు, రత్నాలు, వైఢూర్యాలు, ఇతర నవరత్నాలుండేవట. వాటిని భద్రపరచడానికి ప్రత్యేక వజ్రాల ఖజానా ఉండేదట. అలాగే విజయనగర రాజులు బంగారాన్ని కరిగించి ముద్దలుగా చేసి ప్రత్యేక ఖజానాలో భద్రపరచేవారట. అందుకుగాను ప్రత్యేక బంగారపు ఖజానాను ఏర్పాటు చేసుకున్నారట. కృష్ణదేవరాయలు శయనించే గదికి పూర్తిగా బంగారం తాపడం చేయించి ఉన్నదట. రాయలు శయనించే హంస తూలికా తల్పం పూర్తిగా బంగారంతో చేసింది. పట్టెలు, కాళ్లు పచ్చగా మెరిసిపోతున్నాయని పేస్ స్వయంగా చూసి వర్ణించాడు.

దంతపు పరిశ్రమ: ఆనాడు దంతాలతో రకరకాల వస్తువులు తయారు చేసేవారు. దంతపు ఏనుగులు, గుర్రాలు, దువ్వెనలు మొదలైన ఇతర వస్తువులు తయారయ్యేవి. శ్రీమంతులు, రాజులు దంతపు సామాగ్రిని ఉపయోగించేవారు. రాణుల మందిరంలో ఒక గది మొత్తం దంతంతో తయారు చేశారని, అందులోని అలంకరణ చిత్రాలైన పుష్పాలు, లతలు కూడా దంతంతో చెక్కి అమర్చారని, అవి అత్యంత అద్భుతంగా ఉన్నాయని, అలాంటి గది ప్రపంచంలో ఎక్కడా ఉండదని, ఆ గదిని తనకు చూపారని పేస్ వర్ణించాడు.

గంధకం - ఉప్పు పరిశ్రమలు: ఆనాడు గంధక పరిశ్రమ కూడా ఉండేది. గంధకంతో ఆయుధాలు, దీపావళి పేలుడు సామగ్రి తయారయ్యేది. ఉప్పు మరొక పరిశ్రమ. సముద్రపు ఒడ్డునే గాక చవుడు భూములలో కూడా నీటిని ఎండగట్టి ఉప్పు తయారు చేసేవారు. ఉప్పు ప్రతి గ్రామానికి సరఫరా అయ్యేది. ఉప్పు వ్యాపారం ప్రత్యేకం. గాడిదతలపై ప్రతి గ్రామానికి ఉప్పు బయటి నుండే వచ్చేది. ఉప్పు నిత్యావసర వస్తువు. సముద్ర తీరాలలోనేగాక లోపలి భూభాగాల్లో కూడా ఉప్పును తయారుచేసేవారు. చౌటపర్రలలో ఉప్పు నీటిని నిలువ ఉంచి ఉప్పు తయారు చేసేవారు. ఉప్పు తయారీ ప్రభుత్వ గుత్తగా ఉండేది.

చేపల పరిశ్రమ: విజయనగర సామ్రాజ్యానికి మూడు వైపులా సముద్రం ఉండేది. సముద్ర తీరరేఖలలో 300 రేవు పట్టణాలుండేవి. అన్ని రేవులలో చేపలు పట్టేవారు. సామ్రాజ్యపు మొత్తం తీరంలో బెస్తవారు నివసిస్తూ చేపల వేటతో జీవించేవారు.

చేతి పరిశ్రమలు-కుటీర పరిశ్రమలు: విజయనగర యుగంలో ఉచ్ఛదశలో ఉన్న పైపరిశ్రమలన్నీ చేతి పరిశ్రమలే. ఈ వస్తువులు ఉత్పత్తి చేయడానికి పెద్ద పెద్ద కర్మాగారాలు లేవు. వృత్తి పనివారు తమ హస్త నైపుణ్యంతో పైనవివరించిన వస్తువులను తయారు చేసేవారు. అందువల్ల చేతివృత్తులు, హస్తకళలు బాగా అభివృద్ధి చెంది అవే వారి జీవనోపాధులయ్యాయి. ఒకరిద్దరు కుటుంబ సభ్యులు ఎవరికి వారే స్వతంత్రంగా తమ వృత్తి విద్యా నైపుణ్యంతో వస్తువులు తయారు చేసి వాటిపై వచ్చే ఆదాయంతో జీవించేవారు. అందువల్ల ఈ పరిశ్రమలను కుటీర పరిశ్రమలు అని చెప్పవచ్చు.

భవన నిర్మాణం - దేవాలయ నిర్మాణ వృత్తులు: విజయనగర పట్టణం తదితర పట్టణాలలో రాజులు, సామంతులు, శ్రీమంతులు అనేక భవనాలు నిర్మించారు. ఆ భవనాల నిర్మాణం వల్ల అనేక మందికి జీవనభృతి లభించేది. భవనాలు నిర్మించడానికి ప్రత్యేకంగా ఒక కులం ఉండేది. అది వారి కులవృత్తి. భవన నిర్మాణ కాలంలో ఇతర కులాల వ్యక్తులకు కూడా కూలి పనులు లభించేవి.

అలాగే దేవాలయాల నిర్మాణం, జీర్ణ దేవాలయాల పునరుద్ధరణ వల్ల వేలాది మంది శిల్పులకు శిల్ప కళావృత్తి ఏర్పడింది. వారితో పాటు అనేక రకాల పని వారికి పనులు దొరికేవి. భవన నిర్మాణానికి అనుబంధంగా ఇటుకల పరిశ్రమ, రాళ్లను పగులగొట్టే వృత్తి, తలుపులు, కిటికీలు మొదలైన వస్తువుల తయారు, కలప కోత వృత్తి మొదలైన వృత్తులు అభివృద్ధి చెందాయి. దేవాలయాల మీద శాసనాలు, రాగి శాసనాలు చెక్కే వారిది మరొక వృత్తి. ఈ విధంగా విజయనగర రాజ్యంలో అనేక వృత్తి లేక చేతి లేక కుటీర పరిశ్రమలుండేవి.

వర్తకం-వాణిజ్యం-శ్రేణులు-విదేశీ వ్యాపారం: విజయనగర యుగంలో ఐరోపాలో వచ్చిన రాజకీయ మార్పుల, సంఘటనల వల్ల విదేశీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. క్రీ.శ.1453వ సంవత్సరంలో కానిస్టాంట్ నోపుల్ పతనమైంది. ఆ సంఘటన తర్వాత ఐరోపా వారు ఇండియాకు సముద్ర మార్గం కనిపెట్టాలని ప్రయత్నించారు. అందులో పోర్చుగీసు నావికుడు వాస్కోడిగామా ఆఫ్రికాను చుట్టి ఇండియా చేరాడు. దాంతో

పోర్చుగీసు వారు ఇండియాతో వ్యాపారం ప్రారంభించారు. వారి రాకతో ఇండియాకు ఐరోపాతో వ్యాపార సంబంధాలు ఏర్పడి విదేశీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. ఆనాడు అనేక విదేశస్తులు దక్షిణదేశాన్ని దర్శించారు. వారందరూ విజయనగర సామ్రాజ్యం అత్యంత సంపన్నమైందని ముక్తకంఠంతో ఘోషించారు. అనేక పరిశ్రమలు ఉన్నాయని, దేశీయ, విదేశీ వ్యాపారంతో మంచి ఉచ్ఛదశలో ఉందని వారందరూ తమ రచనలలో పేర్కొన్నారు. వెనీస్ యాత్రికుడు సీజర్ ఫ్రెడరిక్, 1563-1581, పాస్పెట్టి 1578-88, బార్బోసాలు విజయనగర సామ్రాజ్యంలోని ఓడరేవులు, విదేశీ వ్యాపారాన్ని గూర్చి వివరంగా రాశారు. సామ్రాజ్యంలో 300 రేవు పట్టణాలు ఉండేవని అబ్దుల్ రజాక్ రాశాడు. ఆముక్తమాల్యదలో కూడా విదేశీ వ్యాపారాన్ని గురించి ప్రస్తావనలు ఉన్నాయి. రాజధాని విజయనగరంలో అపారంగా వాణిజ్యం జరిగేది. ప్రపంచంలోని అతి ఖరీదైన అన్ని వస్తువులు విజయ నగరానికి వచ్చేవట. విదేశీ వ్యాపారులు అనంతమైన లాభాలు గడించేవారని బార్బోసా రాశాడు. రాజధాని ప్రధాన ద్వారం గుండా ప్రతిరోజూ రెండు వేల ఎద్ద బండ్ల మీద సరుకులు విజయనగరంలోకి వచ్చేవట. ఆ సరుకులపై సుంకాలు వసూలు చేయడానికి గుత్తకు ఇచ్చేవారట. 12,000 పద్దాన్‌లు గుత్తగా వచ్చేదని న్యూనిజ్ రాశాడు.

ఏనుగులు-గుర్రాల వ్యాపారం: విజయనగర యుగంలో విదేశీ వ్యాపారంలో ప్రధాన పాత్ర వహించినవి ఏనుగులు, గుర్రాలు. యుద్ధంలో ఏనుగులు, గుర్రాలు ప్రత్యేక దళంగా ఉండి యుద్ధాలలో ప్రముఖ పాత్రను నిర్వహిస్తుండేవి. అంతేగాక ఇవి నాటి రాజుల దర్జాకు, హోదాకు కూడా చిహ్నాలుగా పరిగణింపబడేవి. ఇవి రెండూ విదేశాల నుండే వచ్చేవి.

ఏనుగులు: విజయనగర రాజులు ఏనుగులనూ పెగూ, సింహళాల నుండి దిగుమతి చేసుకొనేవారు. ముఖ్యంగా సింహళరాజు ఏనుగుల వ్యాపారంలో గుత్తాధిపత్యం చెలాయించాడు. సింహళంలో మేలు రకపు ఏనుగులు జన్మించేవట. మంచి ఏనుగు ఖరీదు వెయ్యి క్రూజోడులుగా ఉండేది. ఒక మాదిరి ఏనుగుల ఖరీదు ఐదారు వందల క్రూజోడులుండేదట. రెండవ దేవరాయల వద్ద వెయ్యికి పైగా ఏనుగులుండేవని, అవి పర్వతాకారంలో దెయ్యాలవలే భయంకరంగా ఉండేవని అబ్దుల్ రజాక్ వర్ణించాడు. సామంతుల వద్ద కూడా అనేక ఏనుగులు ఉండేవి. విజయనగర సార్వభౌములు ఏనుగు దళాన్ని పోషించినా అది పెద్ద దళం కాదు. వీరి కాలంలో కళింగ గజపతులు పెద్ద గజదళాన్ని పోషించి గజపతులని ప్రసిద్ధి చెందారు.

గుర్రాలు: యుద్ధాలలో ఏనుగులకన్నా గుర్రపుదళం అత్యంత ప్రాముఖ్యం సంతరించుకుంది. బహమనీ సుల్తాన్‌లు అరబ్బు దేశాల నుండి మేలు జాతి పంచకళ్యాణులను సంపాదించి పెద్ద అశ్వదళాన్ని పోషించి అశ్వపతులు అని కీర్తిగాంచారు. విజయనగర అశ్వాలు బలహీనంగా, సన్నగా ఉండి యుద్ధాలలో త్వరగా అలసిపోతుండేవట. కనుక బహమనీలను ఎదుర్కోవటానికి విజయనగర ప్రభువులకు కూడా దృఢమైన మేలు జాతి గుర్రాలు కావలసివచ్చాయి. ఒకవైపు బహమనీలు, మరొకవైపు విజయనగర చక్రవర్తులు గుర్రాలను కొనడంతో గుర్రాల వ్యాపారం ఉధృతంగా సాగింది. అందువల్ల అరబ్బులు దక్షిణ భారతదేశంతో గుర్రాల వ్యాపారం ప్రారంభించి గొప్ప లాభాలు పొందారు.

విదేశీ వాణిజ్యం - పోర్చుగీసు వారి వ్యాపారం: పోర్చుగీసు వారు విదేశాల నుండి అరబ్ గుర్రాలు, మక్మా వెల్వెట్లు, శాటిన్ మొదలైన బరువు బట్టలు, పోర్చుగీసు, ఆర్మెనెస్, శీధని, కుంకుమపువ్వు, పింగాణీ సామానులు, పచ్చకర్పూరం, పారశీక యువతులను, ఓర్ముజ్ నుండి రత్నాలు, ముత్యాలు గోవా రేవుకు తెచ్చేవారు. అక్కడి నుండి అవి విజయనగర సామ్రాజ్యంలోకి, ఇతర దక్షిణ దేశ రాజ్యాలకు సరఫరా అయ్యేవి. విజయనగరం నుండి నూలు వస్త్రాలు, రత్నకంబళ్ళు, దంతపు సామానులు, కొన్నిరకాల సుగంధ ద్రవ్యాలు, బంగారపు ఆభరణాలు, పాదరసం, ఇనుము, రాగి, తగరం, సీసం కొని విదేశాలకు తీసుకువెళ్ళేవారు. పోర్చుగీసు వారు విజయనగర సామ్రాజ్యంలో మంగుళూరు, బార్కులూరు, తూర్పుతీరంలో నాగపట్నం, సెంట్‌థోమ్‌లో కూడా వ్యాపార స్థావరాలు ఏర్పాటు చేసుకున్నారు. దాంతో విజయనగరపు విదేశీ వ్యాపారం అంతా పోర్చుగీసు వారి చేతుల్లోకి వెళ్ళిపోయింది.

ఇంత భారీగా విదేశీ వాణిజ్యం జరుగుతున్నా విజయనగర చక్రవర్తులు విదేశీ వాణిజ్యాన్ని కట్టుదిట్టం చేయలేకపోయారు. విదేశీ వ్యాపారం అంతా పోర్చుగీసులకు వదిలివేశారు. వీరి రాకతో అరబ్బుల వ్యాపారం క్షీణించింది. పోర్చుగీసు వారు అరేబియా సముద్రం మీదనే గాక హిందూ మహాసముద్రంపై కూడా ఆధిపత్యం సంపాదించారు. విజయనగర రాజులకు గుర్రాలు, ఫిరంగులు సరఫరా చేస్తూ వారు తమపై ఆధారపడేటట్లు చేయలిగారు. బహమనీలతో ఉన్న విరోధం వల్ల పోర్చుగీసు వారు ఇచ్చే గుర్రాలు, ఫిరంగులకు ఆశపడి పోర్చుగీసు

వారికి తమ సామ్రాజ్యం అంతటా అనేక సౌకర్యాలు కలిగించారు. అది పోర్చుగీసు వారికి ఎంతో లాభదాయకంగా మారింది. పోర్చుగీసు రాజులు విజయనగర రాజులకు రాయబారాలు పంపుతూ మైత్రిని నటించారు. దానికి పొంగిపోయి తమ సామ్రాజ్యంలోని మొత్తం ఎగుమతి దిగుమతి వ్యాపారాన్ని వారి పరం చేశారు. పోర్చుగీసు వారు ఒకవైపు వ్యాపారం సాగిస్తూ మరొకవైపు సముద్రాలపై దోపిడీలు చేసేవారు. అరబ్బు నావలను దోచుకొనేవారు. కొన్నింటిని ముంచేవారు. పోటీ వర్తకులను చంపేవారు. దేశంలో ఆడపిల్లలను బందీలుగా తీసుకువెళ్లి విదేశాలలో అమ్మేవారు. బలవంతంగా క్రైస్తవులుగా మార్చేవారు. వారు ఏం చేసినా విజయనగర రాజులు వారిని దండించలేదు. విజయనగర సామ్రాజ్యం ఉచ్ఛదశలో ఉన్నంత వరకు వారి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్థిల్లింది.

శ్రీకృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ఒక పద్యంలో రాజు తన రాజ్యంలోకి విదేశాల నుండి గుర్రాలు, ఏనుగులు రత్నచందన మొదలైన వస్తువులు వచ్చేటట్లు చేయాలని, తన రాజ్యంలోని రేవు పట్టణాలను అభివృద్ధి చేసి ఎగుమతి దిగుమతులను అభివృద్ధి చేసుకోవాలని వివరించాడు. బంగారు గనులు, వజ్రాలు, రత్నాలు లభించే ప్రాంతాలను తనకు విశ్వాసపాత్రులైన వారి అజమాయిషీలో ఉంచాలని కూడా రాశాడు. అదే విధంగా రాజ్యపు సైనికశక్తికి మూలకారణాలైన మంచి అశ్వాలను, ఏనుగులను శత్రు రాజులకు దక్కకుండా చూడాలని మరొక పద్యంలో వివరించాడు. విజయనగర రాజ్యంలో ఆముక్తమాల్యదలో చెప్పిన పద్ధతులను తూ.చ. తప్పకుండా అనుసరించినట్లు ఆ కాలం నాటి విదేశీ యాత్రికులైన సీజర్, ఫ్రెడరిక్, వార్తెమ, బార్బోసా, పేస్, టామ్‌పైరస్ మొదలైన వారి రచనలు బలపరుస్తున్నాయి. విజయనగరంలో జరిగే వ్యాపారంలో గుర్రాలు, ఏనుగులు, రత్నాలు, ముత్యాలు, వెండి, బంగారు ఆభరణాలు, సుగంధ ద్రవ్యాలు, పట్టుబట్టలు, నూలు వస్త్రాలు, ఔషధాలు, ఇనప ఆయుధాలు ఎగుమతి దిగుమతులుగా ఉండేవని బార్బోసా రాశాడు. వ్యాపారంలో ఎవరికీ అన్యాయాలు జరగకుండా విజయనగర రాజులు చూసేవారు. అందువల్ల అరబ్బులు పోర్చుగీసు వారు విజయనగర రాజ్యంలో తిరిగి తమ వ్యాపారాలు చేసుకొనే వారు. విజయనగర సామ్రాజ్యం నుండి బియ్యం, వస్త్రాలు, సుగంధద్రవ్యాలు, పంచదార, ఇనుమును విదేశస్తులు కొని తీసుకువెళ్తుండేవారు. పులికాట్ రేవు నుండి మలయా, పెగు, సుమత్రా దీవులకు వస్త్రాలు ఎగుమతి అవుతుండేవి. మంగుళూరు, బారకూరు రేవుల నుండి బియ్యం, మలబారు, మాల్దీవుల నుండి ఆర్మజ్, ఎడెన్‌లకు ఎగుమతి అయ్యేవి. భట్కల్ నుండి పంచదార, ఇనుము ఎగుమతి అయ్యేవి. మొదట అరబ్బులు విజయనగరంలో వ్యాపారం చేసేవారు. వారు విజయనగరం నుండి సుగంధ ద్రవ్యాలు, ఏలకులు, మిరియాలు, శొంఠి, అల్లం మొదలైన వాటిని కొని తీసుకువెళ్లి పశ్చిమదేశాలలో అమ్ముకొనేవారు.

తూర్పు దీవుల నుండి దిగుమతులు: పశ్చిమ రేవుల నుండేగాక దక్షిణ భారతదేశపు తూర్పు తీరరేవుల నుండి కూడా తూర్పు దేశాలతో విదేశీ వాణిజ్యం జరుగుతుండేది. సుమత్రా, జావా, మలక్కా నుండి లవంగాలు, ఏలకులు, దాల్చినచెక్క మొదలైన మేలురకపు సుగంధ ద్రవ్యాలు, సింహళం నుండి ఏనుగులు, బోర్నియో, సుమత్రాల నుండి కర్పూరం దిగుమతి అయ్యేవి. ఈ కర్పూరం అతి శ్రేష్టమైనదట. దానికి తులానికి తులం వెండి ఇచ్చినా నష్టం లేదనుకొనేవారట. జావా నుండి లక్క, పుచ్చకాయలు, గంధపు చెక్క వచ్చేది. జెద్దా నుండి కుంకుమపువ్వు, పన్నీరు, ఆవ దీవుల నుండి కస్తూరి, చైనా నుండి నల్లమందు, సిల్కు, పింగాణీ విజయనగర సామ్రాజ్యంలోకి దిగుమతి అయ్యేది. టినెసిరిమ్ నుండి తగరం వచ్చేది. ఇవేగాక నాటి రాజుల కోసం ప్రసిద్ధి చెందిన రత్నాలు, వజ్రాలు, ముత్యాలు కూడా వస్తుండేవి. పెగూ, సింహళం నుండి విలువైన వజ్రాలు, రత్నాలు, ముత్యాలు దిగుమతి అయ్యేవట. దేశంలో ముత్యాలు ఉన్నా, విదేశాల నుండి వచ్చే ముత్యాలు శ్రేష్టమైనవట. వాటిని రాజులు, శ్రీమంతులు కొన్ని ముత్యాల హారాలు తయారు చేయించుకొని ధరించే వారట.

ఎగుమతులు: విజయనగర సామ్రాజ్యం నుండి విదేశాలకు అనేక వస్తువులు ఎగుమతి అయ్యేవి. ఆహార ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, ఔషధాలు, లోహాలు, వస్త్రాలు దేశం నుండి ఎగుమతి అయ్యేవి. ఆహార ధాన్యాలలో బియ్యం, చక్కెర, రాగులు ముఖ్యమైనవి. యేడిన్, ఓర్ముజ్‌లకు కొబ్బరి ఎగుమతి అయ్యేది. భట్కల్, మలబారు రేవుల నుండి నీలిరంగు, ఇతర అద్దకపు రంగులు, ఉసిరికాయలు, గోరింటాకు, గంధపుచెక్క సింధూరం, ఇనుము, రాగి, పాదరసం, కలప, ఓషధులు ఎగుమతి అయ్యేవి. కాలికట్ రేవుగుండా మిరియాలు, ఇతర సుగంధ ద్రవ్యాలు ఎగుమతి అయ్యేవి. విదేశాలకు ఎగుమతయ్యే సరుకులలో వస్త్రాలది పెద్ద స్థానం. అంకొలా, హెనోవర్

రేవులలో పోర్చుగీసు వారు వస్త్రాలు కొనేవారు. పులికాట్ రేవు నుండి మలక్కా, సుమత్రా, పెగూ దేశాలకు అద్దకపు వస్త్రాలు ఎగుమతయ్యేవి. జావాకు ఎరుపు, నీలి, తెలుపు రంగుల వస్త్రాలు ఎగుమతయ్యేవి. ఈ ఎగుమతి దిగుమతుల వ్యాపారం వల్ల విజయనగర సామ్రాజ్యానికి సుంకాల రూపంలో కోట్లాది హొన్నుల ఆదాయం వచ్చేది.

రేవులు: విజయనగర యుగంలో విదేశీ వ్యాపారం బాగా ఉచ్ఛ దశలో ఉన్నందువల్ల సామ్రాజ్యంలో అనేక రేవులు అభివృద్ధి చెందాయి. రెండవ దేవరాయల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో 300 రేవులున్నాయని అబ్దుల్ రజాక్ రాశాడు. బుర్హాన్ అతీర్ అనే గ్రంథం 60 రేవులున్నాయని తెలుపుతోంది. ఈ గ్రంథం ముఖ్య రేవులను మాత్రమే పేర్కొందని భావించారు. విరూపాక్షరాయల కాలంలో గోవా, చౌల్, దబోల్ లేక దేబాల్ మొదలైన రేవులు బహమనీ సుల్తాన్‌లు ఆక్రమించారు. తిరిగి శ్రీకృష్ణదేవరాయల విజయం వల్ల కొత్త రేవులు సామ్రాజ్యంలో కలిశాయి. సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు రేవుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రేవులలో సౌకర్యాలు పెంచి విదేశీ వర్తకులకు రక్షణ కల్పించి విదేశీ వ్యాపారం పెరగడానికి కృషి చేశారు. విజయనగర రాజ్యంలోని రేవులన్నింటిలో గోవా ప్రసిద్ధి చెందింది.

గోవా: సామ్రాజ్యపు పశ్చిమ తీరాన ఉన్న రేవులన్నింటిలో ఇది పెద్దది. ఓర్ముజ్ నుండి వచ్చే సరుకులు గుర్రాలు ఈ రేవులో దిగేవి. గుర్రాలు అక్కడికి చేరుతున్నందువల్ల ఆ రేవుకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. గుర్రాలను కొనడానికి దక్షిణ దేశంలోని రాజులందరూ ముఖ్యంగా బహమనీలు, విజయనగర రాజులు, ఇతర చిన్న రాజులు గోవాతో సంబంధాలు పెట్టుకున్నారు. గుర్రాలు, రత్నాలు, వజ్రాలు, ముత్యాలు, అరబ్ యువతులు ఈ రేవుకు దిగుమతయ్యేవి. ఈ రేవు నుండి విజయనగర సామ్రాజ్యం నుండి బియ్యం, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, మిరియాలు, పిప్పళ్లు, సొంఠి, అల్లం, ఔషధాలు, ఇనుము, వస్త్రాలు విదేశాలకు ఎగుమతయ్యేవి. అరబ్బు వర్తకులు గుర్రాలను తనకు అమ్మడం లేదని విరూపాక్షరాయలు అక్కడ నివసించే అరబ్బు వర్తకులను హెనోవర్ పాలెగాడి చేత సంహరించినందున బహమనీ రాజ్య ప్రధానమంత్రి మహమ్మద్ గవాన్ సైన్యంతో వచ్చి దానిని ఆక్రమించి. బహమనీ రాజ్యంలో కలిపాడు. దాంతో గోవా విజయనగర సామ్రాజ్యం నుండి తొలగిపోయింది. తర్వాత క్రీ.శ.1510లో పోర్చుగీసు గవర్నర్ ఆల్బ్‌కర్క్ గోవాను జయించి పోర్చుగీసు వారి రాజధానిగా చేశాడు. ఆనాటి నుండి గోవా క్రీ.శ.1962 వరకు పోర్చుగీసు వారి అధికారం కింద ఉండిపోయింది.

పశ్చిమ తీరాన ఇతర రేవులు: గోవా తర్వాత హెనోవర్, మంగుళూరు, భట్కల్, బాకనూరు, మానేశ్వర్, నీలేశ్వర్, కంబోలా రేవులు పెద్దవి. ఇంకా చౌల్, పాల్‌శెట్టిలు కూడా రేవులుగా ఉండేవి. హెనోవర్ పాలకుడైన తిమోజు విజయనగర సామంతుడు. అతడు విజయనగర నౌకాదళాధిపతిగా కూడా నియమింపబడ్డాడు. అతని తమ్ముడు రావూజీ కూడా నౌకా సేనాధిపతిగా పని చేసేవాడు. ఈ రేవుల గుండా పర్షియా, ఏడెన్, జెడ్డాలతో వ్యాపారం జరిగేది. ఇంకా బరనూరు, బ్రక్కర్ , మంగుళూరు, కుంబ్లీ, భరంగి, అంకోలా, మిర్జన్, బైందూరు, జాదరకూరు, గెరిస్సొప్పతి, క్విలన్ ప్రముఖ రేవులని మహాలింగం రాశాడు.

మలబారు తీర రేవులు: మలబారు తీరంలో పెద్ద రేవు కాలికట్. దానినే కళ్లికోట అని కూడా అంటారు. వాస్కోడిగామా మొట్టమొదటిసారి ఇక్కడే దిగాడు. ఇక్కడి నుండి సుగంధ ద్రవ్యాలు, మిరియాలు, పిప్పళ్లు ఎక్కువగా ఎగుమతి అయ్యేవి. ఐరోపా దేశాలకే గాక ఈ రేవు నుండి తూర్పు దేశాలకు కూడా సరుకులు ఎగుమతయ్యేవి. కాలికట్‌లో ఓడల నిర్మాణం జరిగేది. అక్కడ 400 తెడ్లు వేసే అంత భారీ ఓడలను నిర్మించేవారని వార్తెమా రాశాడు. భారతీయ ఓడలు ఇటలీ ఓడలకన్నా పెద్దవని, కనీసం 2,000 తెడ్లు వేసే ఓడలను నిర్మిస్తారని రాశాడు. ముస్లింలు పెద్ద ఓడలు నిర్మించే వారని బార్బొసా రాశాడు. పైగా భారతీయ ఓడలకు చీలలు వాడారని కూడా రాశాడు. కొచ్చిన్, క్విలన్, కాయల్ రేవులు చెప్పుకోదగిన రేవులు. క్విలన్‌లో ముస్లిం, హిందూ, క్రైస్తవ వ్యాపారులుండేవారు. ఇక్కడ భారీగా విదేశీ ఎగుమతులు జరిగేవి. కాయల్ రేవుకు తూర్పు దీవుల నుండి సరుకులు వస్తుండేవి, వెళ్తుండేవి. కాయల్ రేవులో గొప్ప వర్తకులుండే వారు. వారు వజ్రాలు, ముత్యాల వ్యాపారం చేసేవారు.

తూర్పు తీర రేవులు: తూర్పు తీరంలో నాగపట్టణం, కాయల్, తిరుమలై, రాజపట్నం, దేవనాపట్నం, పోర్టొనోవా, చతుంగపట్టణం, మైలపూర్, పులికాట్, కృష్ణపట్టణం, మోటుపల్లి, మచిలీపట్నం ముఖ్యమైన రేవులు. పులికాట్ నుండి మలయా, సుమత్రా, పెగు, మలక్కాలతో వ్యాపారం జరిగేది. క్రీ.శ.1443 నాటి శాసనంలో ఓడ కేటిన్, ధ్వజం అనే పదాలు ఉన్నాయి. విదేశీ వ్యాపారంలో పశ్చిమ తీరంలో పోర్చుగీసు వారు, అరబ్బులు వ్యాపారం చేసేవారు. తూర్పు తీరంలో భారతీయులు వ్యాపారం చేసేవారు. మలబారు తీరంలో క్రిస్టియన్లు,

యూదు వ్యాపారస్తులు వ్యాపారం చేసేవారు. తూర్పు తీరంలోని భారతీయులు చైనా, మలయా, అర్చిపెలాగో, టినెసిరిమ్, పెగూలతో వ్యాపారం చేసేవారు. భారతీయ వ్యాపారులలో లబ్బీ ముస్లింలు, శెట్లు ఎక్కువగా ఉండేవారు. పశ్చిమ తీరంలో అరబ్బులు పర్షియా, అరేబియా, టర్కీ ఈజిప్టులతో వ్యాపారం చేసేవారు. పోర్చుగీసు వారు ఐరోపాతో వ్యాపారం చేసేవారు. మొత్తం మీద తూర్పు పశ్చిమ తీరాలు రెండింటి విదేశీ వ్యాపారం ఉచ్ఛదశలో ఉంది. పశ్చిమ దేశాలకు అరేబియా సముద్రం నుండి ఎర్రసముద్రం, పర్షియా గల్ఫ్ నుండి వెళ్లేవారు. తూర్పు దేశాలకు బంగాళాఖాతం మీదుగా వెళ్లేవారు. బెంగాలుకు భూమార్గం గుండా సముద్ర మార్గం గుండా రెండు విధాలుగా వెళ్లేవారు.

గుర్రాల వ్యాపారం: ఆనాటి పశ్చిమ తీర వ్యాపారంలో ప్రధాన పాత్ర వహించింది గుర్రాల వ్యాపారం. అరబ్బులు అరేబియా, పర్షియాల నుండి మేలురకం గుర్రాలను తెచ్చి దక్షిణ దేశపు రాజులకు అమ్మేవారు. బహమనీ సుల్తాన్‌లు మేలురకపు గుర్రపు దళాన్ని పోషించి, అశ్వపతులని కీర్తి వహించారు. వారు తమ అశ్వదళంతో విజయనగర రాజులపై అద్భుత విజయాలు సాధించేవారు. వారి అశ్వదళాన్ని ఎదుర్కోటానికి తమకు కూడా దీటైన గుర్రపు దళాలు ఉండాలని విజయనగర రాజులు కూడా అరబ్బుల నుండి మంచి గుర్రాలు కొనేవారు. కాని అరబ్బు వర్తకులు, బహమనీ సుల్తాన్‌లకు మేలుజాతి గుర్రాలను అమ్మి, విజయనగర చక్రవర్తులకు నాసిరకం గుర్రాలను అమ్మేవారు. అవి బహమనీల అశ్వదళంతో సాటి అయ్యేవి కావు. వారు ముస్లింలు అయినందువల్ల బహమనీ రాజ్యంపై అభిమానం చూపేవారు. విజయనగర రాజుల విషయంలో పక్షపాతం చూపేవారు. అది గ్రహించిన విరూపాక్ష రాయలు తన రాజ్యంలో ఉన్న గోవా రేవులో నివసించే అరబ్బు వర్తకులను సంహరించమని ఆజ్ఞలు జారీ చేశాడు. అతని ఆజ్ఞ ప్రకారం హెనోవర్ పాలకుడు గోవాలోను, హెనోవర్‌లోను పరిసర పశ్చిమతీరంలో నివసించే అరబ్బు గుర్రాల వ్యాపారుల మీద దాడి చేసి అనేక మందిని సంహరించాడు. కొందరు ప్రాణాలతో తప్పించుకొని బహమనీ రాజ్యం చేరి సుల్తాన్‌కు మొర పెట్టుకున్నారు. సుల్తాన్ వారి రక్షణ కోసం గోవాపై దండెత్తి ఆ రేవుపట్టణాన్ని ఆక్రమించాడు. ఆ విధంగా విరూపాక్ష రాయలు గోవా రేవును పోగొట్టుకున్నాడు. విరూపాక్ష రాయల చర్యలకు భయపడి అరబ్బులు విజయనగరంతో వ్యాపారాన్ని మానుకున్నారు. సాళువ నరసింహ రాయలు గుర్రాల అవసరాన్ని గుర్తించి అరబ్బులను బుజ్జగించి వారు అడిగిన ధర ఇచ్చి కొన్నాడు కాని, ఎందుకూ పనికిరాని గుర్రాలను విజయనగర రాజ్యానికి అమ్మేవారని న్యూనిజ్ రాశాడు. 16వ శతాబ్దం తొలి సంవత్సరాలలో అరేబియా నుండి రెండు వేల గుర్రాలను కొన్నారని బార్బోసా రాశాడు. ఈ గుర్రాలన్నీ ఓర్ముజ్ రేవు నుండి దిగుమతయ్యాయి. ఈ స్థితిలో పోర్చుగీసు వారు ఇండియా వచ్చారు. వారు విజయనగరంతో వ్యాపారం మొదలు పెట్టారు. వారు విజయనగరానికి మంచి గుర్రాలను సరఫరా చేస్తామని వాగ్దానాలు చేశారు. పోర్చుగీసు వారు వచ్చిన తర్వాత అరబ్బులకు పోర్చుగీసు వారికి పశ్చిమ తీరంలో వ్యాపార స్పర్థ వచ్చింది. పోర్చుగీసు వారు విజయనగరంతోను, అరబ్బులు బహమనీ సుల్తాన్‌లతోను వ్యాపార సంబంధాలు కొనసాగించారు. చివరకు పోర్చుగీసు వారు అరబ్బులను తరిమి గోవాను ఆక్రమించారు. విజయనగర ప్రభువులు తమకు అండగా ఉంటే వారికే మంచి గుర్రాలను తెచ్చి ఇస్తామని కూడా వాగ్దానం చేశారు. అందువల్ల కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయలు, రామరాయలు, సదాశివరాయలు వారిని గొప్పగా ఆదరించారు. కృష్ణదేవరాయలు ఏనుగులు, గుర్రాల వ్యాపారం చేసే వారిని బాగా ఆదరించి అవి బహమనీలకు అందకుండా చేశాడు. ముఖ్యంగా పోర్చుగీసు వారు తెచ్చిన ప్రతి గుర్రాన్ని తాను కొనేవాడు. అచ్యుతదేవరాయలు కూడా అదే విధంగా కొన్నాడు. అతడు ప్రతి సంవత్సరం 13 వేల గుర్రాలను కొనేవాడట. సదాశివరాయలు గోవాలో దిగే అన్ని గుర్రాలను తనకే అమ్మాలని, బహమనీలకు అసలు అమ్మరాదని ఒప్పందం చేసుకున్నాడట. దాంతో పోర్చుగీసు వారు మంచి గుర్రాలు తెచ్చి విజయనగర రాజులకు హెచ్చు ధరతో అమ్మి మంచి లాభాలు గడించేవారని, ఆ డబ్బుతో వారు దక్షిణ దేశం నుండి సున్నితమైన వస్త్రాలు, రత్నాలు, వజ్రాలు, సుగంధ ద్రవ్యాలు కొని ఐరోపా తీసుకువెళ్లేవారని సీజర్, ఫ్రెడరిక్ రాశారు. క్రమేపీ గుర్రాల వ్యాపారంతోపాటు మిగతా వ్యాపారాన్ని కూడా వారు సొంతం చేసుకున్నారు. విజయనగర సామ్రాజ్యంలో వారిది గుత్త వ్యాపారమైపోయింది. అరబ్బుల వ్యాపారం పూర్తిగా విజయనగరం నుండి తొలగిపోయింది. విజయనగర ప్రభువులు తమ సామ్రాజ్యంలోని వ్యాపారాన్నంతటినీ పోర్చుగీసు వారి వశం చేశారు.

సముద్ర దొంగలు: విదేశీ వ్యాపారులకు సముద్రాలపై ప్రయాణం చేసేటప్పుడు ఓడ దొంగల బెడద

ఎక్కువగా ఉండేది. సముద్ర దొంగలలో ముస్లింలు, భారతీయులే గాక పోర్చుగీసు వారు కూడా ఉండేవారు. పోర్చుగీసు వారు సముద్రాలలో ఒంటరిగా చిక్కిన అరబ్ ఓడలను దోచుకొనేవారు. భారతీయ సముద్ర దొంగలు అన్ని పడవలు దోచుకొనేవారు. అరేబియా సముద్రంలో జంజీర దీవులలో సిద్దీలను ముస్లిం ఓడ దొంగలుండే వారు. వారి అన్ని ఓడలను దోచేవారు. సిద్దీలు అతి సాహసమైన సముద్ర దొంగలు. కొందరు ఓడ దొంగలు స్థానిక రాజులకు దోచిన సొత్తులో భాగం ఇచ్చి వారి సహకారాన్ని పొందుతుండేవారు. ఓడ దొంగల భయం వల్ల వ్యాపార నౌకలకు ఎంతో ఖర్చుపెట్టి రక్షక దళాన్ని ఏర్పాటు చేసుకొని ప్రయాణాలు చేసేవారు. అయినా ఓడలు కొల్లగొట్టబడుతుండేవి. విజయనగర యుగంలో పోర్చుగీసు వారికి, అరబ్బులకు సముద్ర వ్యాపారంలో పోటీ తీవ్రంగా ఉండేది. పోర్చుగీసు వారు అరబ్బులకు చెందిన అనేక ఓడలను సముద్రంలో ముంచి ఎంతో నష్టపరుస్తుండేవారు. చివరకు అరబ్బులు పోర్చుగీసు వారి నౌకా బలం ముందు నిలబడలేక పశ్చిమ తీరంలోని వ్యాపారాన్ని పోగొట్టుకున్నారు.

దేశీయ వ్యాపారం - వృత్తి శ్రేణులు: విదేశీ వ్యాపారం పోర్చుగీసు వారి పరం అయినా దేశీయ వ్యాపారం స్థానిక వ్యాపారుల చేతిలోనే ఉంది. పూర్వపు పెనుగొండ, అయ్యవోలు స్వాములు, శ్రేణులు దేశీయ వ్యాపారాన్ని నడిపారు. ప్రతి వర్తక శ్రేణికి ఒక అధ్యక్షుడు ఉండేవాడు. శ్రేణి సభ్యులు దేవాలయాలలో సమావేశం అయ్యేవారు. వర్తకులు పోటీలు పడకుండా కొన్ని క్రమశిక్షణ నిబంధనలను రూపొందించుకునే వారు. శ్రేణి సభ్యులు చెల్లించవలసిన పన్నులు అధ్యక్షుడు వసూలుచేసి ఖజానాలో చెల్లిస్తాడు. రాజుగాని, అమరనాయకులు గాని ఆ పన్నులు దేవాలయానికి దానం చేయాలని భావించినట్లయితే వారు శ్రేణి అధ్యక్షుని అనుమతి తీసుకోవాలి. అచ్చిరాజు తిమ్మరాజు అనే అతడు పెద్ద పట్టణ స్వాముల అనుమతితో మూలవీసాన్ని దేవాలయానికి దానం చేశాడు. అయ్యవాళి సమస్త పెక్కంద్రు వారి అనుమతితో 24 కులాల వారు ఇవ్వవలసిన పన్నులను లింగయ్య అనే వ్యక్తికి దానం చేసినట్లు సిద్ధవటంలోని ఒక శాసనం తెలుపుతోంది. అలాగే కురుగోడు శాసనం పట్టణ స్వాములు, గౌడ, సేనబోవవారి అనుమతితో దానం చేసినట్లు తెలుపుతోంది. శ్రేణికి ఇంకా అనేక అధికారాలున్నాయి. శ్రేణి సభ్యులు అమ్మే సరుకులపై పన్నులు విధించే అధికారం ఉంది. గుత్తి వద్ద వేల్పులమడుగు శాసనం కొత్త బజారు వీధిలో పన్నురేటును నిర్ణయిస్తూ సేన బోవలకు స్థానిక విదేశీ వర్తకులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుపుతోంది. వర్తక శ్రేణులకు విచారణాధికారం కూడా ఉంది. తీర్పులు చెప్పి శిక్షలు కూడా వేసేవారు. కదరి శాసనం ఒక గ్రామంలో మాలమాదిగలకు రైతులకు వచ్చిన తగవును పరిష్కరించి తీర్పు చెప్పినట్లు తెలుపుతోంది. ఏమైనా తీర్పులు చెప్పవలసి వచ్చినప్పుడు స్థానిక యువకుడు ధర్మాసనాన్ని ఏర్పాటు చేశాడు. అందులో శ్రేణి సభ్యులు తప్పకుండా ఉంటారు. వృత్తి శ్రేణులపై కూడా వారికి అధికారాలున్నాయి. వారు తయారు చేసే వస్తువుల విలువను కూడా వర్తక శ్రేణులు నిర్ణయించేవి. విజయనగర యుగంలో అనేక వృత్తి శ్రేణులున్నట్లు ఆముక్తమాల్యద తెలుపుతోంది. పాంచాణం వారు అనే పేరుతో ఐదు వృత్తుల వారు ఉన్నట్లు శాసనాలు చెబుతున్నాయి. క్రీ.శ.1418వ సంవత్సరంలో రాజుగారి సింహాసనాన్ని తయారు చేసినందుకు వారి శ్రేణి నుండి పన్నులు తీసుకోరాదని అనంతపురం జిల్లాలోని గౌనివారిపల్లెలో లభించిన శాసనంలో ఉంది. అదే జిల్లా బనగానిపల్లెలో లభించిన మరొక శాసనం ఊళ్లు వదలి వెళ్లిన 32 శ్రేణుల వారికి వారి స్వంత గ్రామాలలో పునరావాసం కల్పించి అన్ని పన్నులు మినహాయించినట్లు తెలుపుతోంది. వర్తక శ్రేణులు అనేక దేవాలయాలకు దానాలు చేసినట్లు కూడా శాసనాలు లభించాయి. పాలకులకు వర్తక శ్రేణులకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉండేవి. విజయనగర సామ్రాజ్యంలో వర్తకులు, చేతి పనులు చేసే వృత్తి పనివారు శ్రేణులుగా ఏర్పడి పక్కపక్కనే తమ వృత్తులను కొనసాగిస్తున్నారని అబ్దుల్ రజాక్ రాశాడు. వస్తు విక్రయశాలలు, చేతిపనుల శ్రేణుల వారి అంగళ్లు పక్కపక్కనే ఉండేవని కూడా రజాక్ వివరించాడు. వర్తకశ్రేణి అధిపతిని శెట్టి అని పిలిచేవారు. అతనికి పట్టణ స్వామి అని కూడా పేరుంది. వర్తక సంఘాలు తమలో తాము పోటీలు పడకుండా వ్యాపారాన్ని నిర్వహించే వారు. పరిపాలకుల నుండి అనుమతి పొంది టోకు ధరలు చిల్లర ధరలు నిర్ణయించి తమలో తమకు స్పర్ధలు లేకుండా చూసుకునేవారు. వర్తక శ్రేణులు వివిధ ప్రాంతాల్లో చెలామణి అయ్యే నాణేల విలువలను కూడా నిర్ణయించేవారు. వారి నిర్ణయమే తుది నిర్ణయం. వర్తక శ్రేణులకు న్యాయ విచారణ జరిపే అధికారం కూడా ఉందని కదిరి శాసనం తెలుపుతోంది. ప్రజల వద్ద నుండి పన్నులు వసూలు చేసే పనిలో కూడా వర్తక శ్రేణుల వారు ప్రభుత్వానికి సహాయపడేవారు. ఆనాటి వర్తకులు కేవలం తమ లాభమే ప్రధానం అని చూడలేదు. వారు

అనేక ధార్మిక కార్యక్రమాలు చేపట్టినట్లు నాటి శాసనాలు తెలుపుతున్నాయి. వారు దేవాలయాలకు దానాలు చేసేవారు. చెరువులు తవ్వించారు. దానధర్మాలు చేసి, ప్రజలను ఆదుకొనేవారు. వర్తక శ్రేణులు దేవాలయానికి దానాలు చేసినా లేక ఎవరితోనైనా ఒప్పందాలు చేసుకున్నా దానిని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చేవారు. ఆ పత్రాన్ని మాధవసాధక పట్టా అని అనేవారు. దేవాలయానికి దానాలు చేయవలసి వస్తే శ్రేణి సభ్యులు మాధవసాధక పట్టా రాసి ఇచ్చేవారు. తమ శ్రేణి రక్షణార్థం కావలి గార్లతో ఒప్పందాలు చేసుకుంటే మాధవసాధక పట్టా రాయించి తాము చెల్లించవలసిన ధనాన్ని అందులో పేర్కొంటారు. అందువల్ల ఆ తర్వాత పేచీలు రావడానికి వీలు లేకుండా ఉంటుంది. శ్రేణి సభ్యుల సమస్యలను వారే పరిష్కరించుకునే న్యాయ హక్కులు కూడా వారికుండేవి.

రాజాదరణ: వ్యాపారం వల్ల అధిక ఆదాయం వస్తున్నందువల్ల రాజులు, సామంతులు వర్తకులను తమ నగరాలలో నివసించమని ఆహ్వానించేవారు. వర్తకులు వారి ఆహ్వానాలను మన్నించి రాచనగరులలోను, వాటి సమీపంలోను నివసించే వారు. కృష్ణదేవరాయల కాలంలో అనేక మంది వర్తకులు నాగలాపురంలో భవనాలు నిర్మించుకొని స్థిరపడ్డారని పేస్ రాశాడు. అలా నివసించిన వారు కొన్నాళ్లు పన్నులు చెల్లించనక్కరలేదు. గుంటూరు జిల్లా క్రోసూరులో లభించిన క్రీ.శ.1575 నాటి ఒక శాసనం పరుచూరి కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి అక్కడ ఒక పేటను నిర్మించినట్లు తెలుపుతోంది. అలాగే వెంపటిగె గ్రామంలో ఒక పేటను నిర్మించినట్లు క్రీ.శ.1524 నాటి మరొక శాసనం తెలుపుతోంది. రాచనగరులో స్థిరపడిన వర్తకులు రాజులకు కావలసిన అన్ని వస్తువులు తెచ్చి ఇచ్చేవారు. అక్కడ సరుకులను ఎగుమతి చేసేవారు. కావలసిన వస్తువులను దిగుమతి చేసేవారు.

సంతలు- సరుకుల రవాణా: విజయనగర సామ్రాజ్యంలో అంతర్గతంగా జరిగే వ్యాపారాన్ని గురించి అనేక శాసనాలు తెలుపుతున్నాయి. క్రీ.శ.1521 నాటి రోళ్లమడుగు శాసనం, 1530 నాటి బుక్కపట్టణ శాసనం, 1531 నాటి ఎనిమిలినాడు శాసనం, 1546 నాటి ఉదయగిరి శాసనాలు ఆనాడు సరుకులు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి రవాణా అయ్యేవని తెలుపుతున్నాయి. ఆ శాసనాలు నాడు ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి రవాణా అయ్యే సరుకుల పేర్లను కూడా తెలుపుతున్నాయి. ఆనాడు వర్తక కేంద్రాలుగా ఉన్న స్థలాలు పట్టణాలను గురించి హంస విశంతి తెలుపుతోంది. శ్రీశైలం, త్రిపురాంతకం, అనిమెల, కొచ్చెర్లకోట, యాడికి, పోరుమామిళ్ల, నెల్లూరు, ఉదయగిరి, పొదిలి, కంభం, మార్కాపురం, తంగెడ, చిలకలూరిపేట, కొండవీడు, వినుకొండ, మాచర్ల, మంగళగిరి, కొండపల్లి, మట్టివాడ, జడ్చెర్ల, పానుగల్లు, దేవరకొండ, పేరూరు, అలంపూరు, పెనుగొండ, ఆదోని మొదలైన పట్టణాలు గొప్ప వర్తక స్థావరాలు అని అనేక శాసనాలు, సాహిత్యాలు కూడా తెలుపుతున్నాయి. ఈ ప్రదేశాలలో అంకాపేటలు అని పిలువబడే సంతలు నిర్వహించేవారు. రాజు, సామంతులు తమ రాజధానులలో వర్తకుల సరుకులు నిల్వ చేసుకోవడానికి చావళ్లు నిర్మించేవారు. అందులో నిల్వ చేసిన వస్తువులపై చావడి సుంకం వసూలు చేసేవారు. అలాగే అమ్మకాల మీద అమ్మబడి సుంకం, కొనుగోళ్ల మీద కొనుబడి సుంకం వసూలు చేసేవారు. ఈ సుంకాలను ప్రభుత్వ ఉద్యోగులు వసూలు చేసేవారు. ఒకవేళ ఆ ప్రదేశం గుత్తకు ఇచ్చినట్లయితే పన్ను గుత్తకాండ్రు వసూలు చేసేవారు. టోకు వ్యాపారం చేసేవారు. హెర్జుంకం అనే పన్ను చెల్లించేవారు. వారి వద్ద నుండి ప్రభుత్వ ఉద్యోగులే హెర్జుంకాన్ని వసూలు చేసేవారు.

రహదారులు: దేశమంతటా వ్యాపారం సాగుతున్నందువల్ల విజయనగర రాజులు రవాణా సౌకర్యాలను అభివృద్ధి చేశారు. సామ్రాజ్యంలోని అన్ని భాగాలను ముఖ్యంగా పట్టణాలు, రేవులు, పుణ్యక్షేత్రాలను కలుపుతూ బాటలు ఉండేవి. రాజధాని విజయనగరం నుండి చంద్రగిరి మీదుగా పులికాట్‌కు ఒక మార్గం ఉండేది. అలాగే మచిలీపట్టణం నుండి ఐనవోలు కోవెలకొండ మీదుగా కంపిలి, విజయనగరానికి మరొక మార్గం ఉండేది. విజయనగరం నుండి ఉదయగిరి, కొండవీడు, కొండపల్లి మీదుగా రాజమహేంద్రవరం, సింహాచలం, శ్రీకూర్మం మీదుగా కటకం పోవడానికి మరొక మార్గం ఉండేది. వేంగి నుండి కళింగకు పూర్వం నుండి బాట ఉండేది. ఇవి ప్రధాన మార్గాలు. ఇవికాక అహోబిలం, పోరుమామిళ్లను, బద్వేలు, కంభంలను కలిపే మరొక బాట ఉండేది. ఇంకా కాశీ, రామేశ్వరం వెళ్లే మరొక బాట ఉండేది. తిరుపతి వెళ్లడానికి, శ్రీశైలం వెళ్లడానికి కూడా బాటలు ఉండేవి. విజయనగరం నుండి శివసముద్రం, అక్కడి నుండి శ్రీరంగపట్టణం వెళ్లే మార్గం, విజయనగరం నుండి ఆదవానికి, అక్కడి నుండి రాయచూరు వెళ్లే మార్గం, విజయనగరం నుండి కాళహస్తి, తిరుపతి, కంచి, తిరువణ్ణామలై, చిదంబరం, మధుర, రామేశ్వరం, ధనుష్కోటికి వెళ్లే మార్గం ఉండేవి. వీటిని తీర్థయాత్రా బాటలు అని పిలిచేవారు. ఇవన్నీ దండు బాటలుగా కూడా ఉపయోగపడేవి. యుద్ధాలకు పోయే సైన్యాలు కూడా ఈ బాటల

నుండే ప్రయాణం చేసేవి. అందువల్ల వాటిని దండుబాటలు అని కూడా అనేవారు. సరుకులు ఒకచోటు నుండి మరొక చోటుకు చేర్చడానికి గుర్రాలు, గాడిదలు, ఎడ్లబండ్లు సాధనాలుగా ఉండేవి. సరుకులను పెరికె వాళ్లు చేరవేస్తుండేవారు. మార్గాలలో దొంగల భయం ఉండేది. ఆముక్తమాల్యదలో కృష్ణదేవరాయలు కూడా దొంగల క్రూరకృత్యాలను వర్ణించాడు. కనుక వర్తకులు గుంపులు గుంపులుగా ప్రయాణం చేసేవారు. వర్తకులు వారి రక్షణ ఏర్పాట్లు వారే చేసుకునేవారు. వర్తక శ్రేణులు మార్గాలలోని కావలిగార్లతో రక్షణ ఒప్పందాలు చేసుకునేవారు. అందుకు వారికి కొంత ధనం సమర్పించేవారు.

భట్కల్ నుండి విజయనగరానికి వెళ్లే మార్గాన్ని పేస్ వర్ణించాడు. అది జంబుజా నుండి రెక్లమ్ ద్వారా విజయనగరం చేరేది. శాసనాలు ఈ మార్గాన్ని ప్రాచీన రహదారిగా పేర్కొంటున్నాయి. గుత్తి నుండి మునిమడుగు పోయే మార్గముందని రాచర్ల కైఫీయత్తు తెలుపుతోంది. పోరుమామిళ్ల, బద్దెనవోలు, కంభం, అహోబిలం వెళ్లే మార్గాన్ని దాసరిపల్లి కైఫీయత్తు తెలుపుతోంది. బార్బోసా పులికాట్ నుండి విజయనగరానికి వెళ్లే మార్గాన్ని పేర్కొన్నాడు. మచిలీపట్టణం నుండి కోవెలకొండ, అక్కడి నుండి విజయనగరం వెళ్లే మార్గాన్ని తెలిపాడు. తిన్నెవేలీ నుండి కాయయళానికి మరొక త్రోవ ఉండేది. కాని ఈ మార్గాల దూరం, వాటి వెడల్పు, విశాలత్వాలను గూర్చి ఘనకు ఎలాంటి వివరాలు తెలియలేదు.

నాడు సరుకుల రవాణాను గురించి కొన్ని వివరాలు తెలిశాయి. కృష్ణదేవరాయల కాలం నాటి శాసనం ఆనాటి రవాణా సాధనాలను పేర్కొంది. ఆనాడు సరుకులను కావళ్ల ద్వారా మనుషుల నెత్తిమీద పెట్టుకొని వెళ్లేవారని, ఎద్దులు, గుర్రాలు, గాడిదలపై మూటలు తీసుకెళ్లేవారని ఆ శాసనంలో లిఖించబడి ఉంది. మలబారు ప్రాంతం నుండి మిరియాల మూటలు, గాడిదలు, ఎద్దులు, గుర్రాలపై తెచ్చే వారని బార్బోసా రాశాడు. రోళ్లమడుగు శాసనం ఎద్దులపై సరుకులు వెళ్లేవని తెలుపుతోంది. సరుకులు తీసుకువెళ్లడానికి గుర్రాలను అద్దెకు ఇచ్చేవారని విదేశీ యాత్రికులు రాశారు.

వర్తకులు పల్లకీలలో ప్రయాణం చేసేవారు. బోయలు పల్లకీలను మోసేవారు. మార్గమధ్యంలో చలివేంద్రాలు, పూటకూళ్లు ఉండేవి. ఆముక్తమాల్యద కూడా ప్రతి నగరంలోనూ, గ్రామాలలోనూ సంతలు జరుగుతాయని తెలుపుతోంది. సంతలలో ప్రజలు తమ సరుకులను అమ్ముకుంటారు. తమకు కావలసిన వస్తువులు కొనుక్కుంటారు. క్రీ.శ.1564వ సంవత్సరం నాటి శాసనం నెల్లూరులో ప్రతి శుక్రవారం జరిగే సంతకు సంబంధించి వర్తకులతో ఒక సామంతుడు ఒప్పందం చేసుకున్నట్లు తెలుపుతోంది. ఈ సంతల వల్ల వస్తు ఉత్పత్తి అధికమైనట్లు, వ్యాపారం పెరిగినట్లు తెలుస్తోంది. 16వ శతాబ్ది ప్రథమ భాగంలో నూలు, పత్తి బేళ్లు, సిల్కు, బియ్యం, రాగులు, చోళ్లు, బెల్లం, పంచదార, నూనెలు, నెయ్యి, చందనం, కస్తూరి, హారతి కర్పూరం, పప్పు ధాన్యాలు, పళ్లు, కాయలు, గింజలు ఉదయగిరి, రాళ్లమడుగు, బుక్కపట్టణం, అనిమెల మొదలైన ప్రదేశాలకు వస్తున్నట్లు అక్కడి శాసనాలు తెలుపుతున్నాయి. నూలు, సిల్కు వస్త్రాలు, ధర్మవరం, ఆదోని, తాడిపత్రి, గుత్తి, బళ్లారిల నుండి శ్రీరంగపట్టణానికి వెళుతున్నాయని అరవణతంత్రం తెలియజేస్తోంది. చిత్రదుర్గం నుండి గింజలు, ఉన్ని కంబళ్లు, ఇనుము, చందనం, పోకలు, గంధం చెక్క, కొబ్బరి, ఆహారధాన్యాలు అన్ని ప్రదేశాలకు వెళుతున్నట్లు ఆదోని నుండి కోలారుకు, సిద్ధగట్టుకు పత్తి రవాణా అవుతున్నాయి. మిరియాలు, యాలకులు, పోకలు, నల్లమందు, కస్తూరి, ఇంగువ, ముత్యాలు, శాలువలు, పత్తి ఉత్తర ప్రాంతాల నుండి బాల్గాట్‌కు వచ్చేవి. పోర్చుగీసు వారు పొగాకు, మిర్చిలను భారతదేశంలో ప్రవేశపెట్టారు. రేచర్ల, చిరుమని, ధర్మవరాలలో పండించేవారు. ఇవి అక్కడి నుండి ఇతర ప్రదేశాలకు వెళ్లేవి. నాదెండ్ల గోపుని కొండవీటి శాసనం దేశీయ సరుకుల జాబితాను ఇచ్చింది. గోధుమలు, అపరాలు, రాగులు, చోళ్లు, కూరగాయలు, చింతపండు, ఉప్పు, లవంగాలు, మిరియాలు, పిప్పళ్లు, శొంఠి, జాజికాయ, దాల్చిన చెక్క, జాపత్రి, కొబ్బరి, నెయ్యి, నూనె, బెల్లం, పంచదార, వక్కలు, తమలపాకులు, పండ్లు, పత్తి, అద్దకపు రంగులు, నూలు, లోహాలు, ఉక్కు సామానులు, గుర్రాలు, గాడిదలు, ఎద్దులు అమ్మకానికి వచ్చేవని ఆ శాసనం తెలిపింది.

పడవలు, పుట్టీలు: నదులు, కాలువలు దాటడానికి తొట్టి పడవలు వాడేవారని పేస్ వర్ణించాడు. అవి గుండ్రంగా ఉండేవని లోపలి పక్కల చర్మంతో కప్పి కుట్టేవారని అతడు వివరించాడు. న్యూనిజ్ కూడా అలాంటి పడవలను పేర్కొన్నాడు. వీటికి పుట్టీలని పేరు. సరుకులను కూడా ఈ పుట్టీల ద్వారా కాలువలు, నదులు దాటించేవారు. తూర్పు తీరంలో మసల పడవలని ఉండేవి. వీనిని కాలబందులు, కలప చెక్కతో తయారు చేసేవారు. ఆ

కలప బందులు, పలకలను జనపనార తాళ్లతో గట్టిగా బిగించేవారని, నదులు దాటడానికి మంచి సౌకర్యంగా ఉండేవని బార్బొసా రాశాడు. చేపలు పట్టడానికి బెస్తవారు కూడా చిన్న చిన్న పడవలు ఉపయోగించేవారు.

వ్యాపార సుంకాలు, వృత్తి పన్నులు: విజయనగర చక్రవర్తులు వ్యాపారం మీద, వృత్తుల మీద అనేక రకాల పన్నులు విధించి వసూలు చేశారు. వస్త్ర పరిశ్రమలో మగ్గాలపై మగ్గరి అనే పన్ను వసూలు చేసేవారు. వర్తక శ్రేణులకు వృత్తి శ్రేణుల మీద అధికారం ఉన్నట్లు శాసనాలు తెలుపుతున్నాయి. కడప జిల్లాలోని వామనూరులో లభించిన శాసనంలో చప్పన్న దేశాల వర్తకులు ములికినాడు, రేనాడు, పెన్నబాడి, సకిలిసీమ, జౌకు, కోయిలకుంట్ల, పులివెందుల, పెదనంద్యాలలోని మగ్గాల నుండి రావలసిన బాకీలను శ్రీశైల మఠాధికారికి ఇచ్చినట్లు తెలుపుతోంది. దీనిని బట్టి ఈ వర్తకశ్రేణి పైనచెప్పిన తొమ్మిది సీమలలో వ్యాపారం చేస్తున్నట్లు, సాలీలకు పెట్టుబడులు పెట్టినట్టు తెలుస్తోంది. వారు పెట్టిన ఈ పెట్టుబడిలో 16వ వంతు పన్ను చెల్లిస్తారు. దానిని మూలవీసం అని అంటారు. గానుగలపై వసూలు చేసే పన్నును గానుగరి అనేవారు. ఇంకా స్వర్ణకారులు, కమ్మరులు, కుమ్మర్లు, కల్లుగీత వారిపై కూడా వృత్తి పన్నులుండేవి. దిగుమతి వస్తువులపై స్థల సుంకం, సుంకస్థావరం లేక మాళికమండె సుంకం అనే పేర్లతో పన్ను విధించేవారు. సరుకులు ఒకచోటి నుండి మరొక చోటికి రవాణా అయ్యేటప్పుడు మార్గాదాయం లేక చౌక సుంకం అని వసూలు చేసేవారు. అయితే ఈ సుంకం అన్ని ప్రాంతాల్లో ఒకే రేటు ఉండదు. స్థానిక పాలకుల ఇష్టాయిష్టాల మీద ఉంటుందని అరవణతంత్రం ద్వారా తెలుస్తోంది. బుక్కపట్టణంలో బెల్లం, మిరియాలు, పోకలు మొదలైన సరుకులపై పెరికకు రెండు రూకలు ఉండగా కొండవీటిలో మిరియాల మీద బస్తాకు ఆరు దమ్మాలు, బెల్లం బస్తా మీద రెండు దమ్మాలు, పోకల మీద నాలుగు దమ్మాలు పన్నుగా ఉండేది. ధాన్యం మీద ఒక పెరిక, పత్తి నూలు మీద ఒక పెరిక, సీసం, తుత్తునాగం మీద వేసే సుంకంలో మూడవ వంతు ఇనుముపై విధించేవారు. ఇంకా మాగళి సుంకం, అడ్డ సుంకం, మార్గాదాయం, విరాళం అనే పేర్లు గల పన్నులు శాసనాలలో పేర్కొనబడ్డాయి. గ్రామవెట్టి పోషణకు వెట్టివేముల అనే పన్ను కద్దాయం అనే మరొక పన్ను, చాకలి పన్ను, ఈడిగ గుత్త అనే కల్లుగీత వారిపై పన్ను, బోయ సుంకం, ఇళ్లపై ఇల్లరి అనే పన్ను, గ్రామ కట్నం అనే పన్ను వసూలు చేశారు. ఇంకా నగరి, బరడ, త్యాగం, తిరుకట్నాలు, బదెకె, లురాడి, తెరెగె, అశెవెచ్చాలు, కపురాపు పన్ను అనే పన్నులు ఉన్నాయి. కాని వాటిని గూర్చి వివరాలు తెలియలేదు

పెళ్లి పన్ను: ఇంకా పెళ్లి పన్ను వసూలు చేసేవారు. వధువు ఒక రూక, వరుడు రెండు రూకలు చెల్లించాలి పెళ్లి పన్నును దానం చేసినట్లు అచ్యుతదేవరాయల కాలం నాటి ఒక శాసనం తెలుపుతోంది. కడప జిల్లాలోని ముత్తుకూరు శాసనం కూడా పెళ్లి పన్నును ప్రస్తావించింది. పెళ్లి ఊరేగింపుకు కూడా పన్ను ఉండేదట. పెళ్లి పన్ను కట్టలేక చాలా మందికి పెళ్లి కాలేదట. అందువల్ల హరిహరరాయలు నాలుగు నాడులలో పెళ్లి పన్నును తొలగించాడు. వీరనరసింహరాయలు గుత్తిసీమలో రద్దు చేశాడు. శ్రీకృష్ణదేవరాయలు రాజ్యం అంతటా రద్దు చేశాడు. కాని రామరాయల కాలంలో పెళ్లి పన్ను 101 మాడల నుండి 16 మాడలకు తగ్గించినట్లు శాసనం ఉంది అంటే కృష్ణదేవరాయల తర్వాత మళ్లీ పెళ్లి పన్ను విధించినట్లుగా భావించవచ్చును. క్రీ.శ.1554 సంవత్సరంలో ఒక వర్తకశ్రేణి బెజవాడ మల్లేశ్వరస్వామి దేవాలయంలో ఒక శాసనం వేయించింది. అందులో ప్రథమ వివాహానికి ఓలి 21 చిన్నాల బంగారం ఇవ్వాలి. దానిలో వరుడు 12.5 చిన్నాల వెండి, వధువు 20.5 చిన్నాల బంగారం ఇవ్వాలని రాసి ఉంది.

ఆదాయాలు: విజయనగర సామ్రాజ్యం ఆదాయాలను ప్రధానంగా రెండు రకాలుగా విభజించారు. భూమ్యాదాయం శుల్కాదాయం. భూమ్యాదాయాన్ని తిరిగి ధాన్యాదాయమని, సువర్ణాదాయమని రెండు రకాలుగా చెప్పవచ్చును. సామ్రాజ్యంలోని భూమి రెండు రకాలుగా ఉండేది. వ్యవసాయయోగ్యమైన భూమి, వ్యవసాయ యోగ్యం కాని భూమి అని రెండు రకాలుగా ఉంది. వ్యవసాయ భూములు రైతులు, అగ్రహారీకులు, దేవాలయాల యాజమాన్యంలో ఉండేది. వ్యవసాయయోగ్యం కాని భూములు అరణ్యాలు, కొండలు, గుట్టలు, బీడులుగా ఉండేది ఈ భూమి అంతా రాజు అధీనంలో ఉండేది. ఈ భూముల్లో పశువులున్న వారు పశువులను మేపుకొనే వారు కొండగుత్త అనే పన్ను చెల్లించేవారు.

భూమ్యాదాయాన్ని తమిళ శాసనాలు ఏల్‌ముదల్ అని సువర్ణాదాయాన్ని పొణిముదల్ అని పేర్కొన్నారు మాగాణి భూముల వ్యవసాయాన్ని నీరారంబమని మెట్ట భూముల వ్యవసాయాన్ని కాడారంబమని అనేవారు. పన్నులను ముంగోరు, పంగోరు అని తెలుపుతున్నాయి. దీనిని బట్టి పన్ను ఆదాయంలో సగభాగం, మూడవ

భాగంగా వసూలు చేసినట్లు అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణుల అగ్రహారాలపై 1/6వ వంతు పన్ను వసూలు చేసేవారు. న్యూనిజ్ మాత్రం పంటలో తొమ్మిదవ వంతుగా పన్ను వసూలు చేసేవారని రాశాడు. కాని దానిని ఎవరూ అంగీకరించలేదు. పన్నులు ధన రూపం, ధాన్య రూపం రెండు విధాలుగా వసూలు చేశారు. పరాశర మాధవీయం పన్నులు, ధన రూపంలో చెల్లించాలని హరిహరరాయలు ఆదేశించినట్లు చెబుతుంది. సువర్ణ రూపంలో వసూలు చేసి ఆదాయాన్ని సిద్ధాయం అని పిలిచేవారు. పంటలో రాజుకు చెల్లించవలసిన భాగాన్ని గూర్చి ఖచ్చితమైన నిర్ణయం లేనందున అమర నాయకులు, దండ నాయకులు, సామంతులు, గుత్తదార్లు రైతులపై ఇష్టారాజ్యంగా పన్నులు విధించి పండించేవారు. ఒక్కొక్కప్పుడు ఇట్టి దురంతాలు రాజులకు తెలిసి పరిస్థితిని చక్కదిద్దేవారు. రాజుకు భాండావార గ్రామాల నుండి సరాసరి ఆదాయం వచ్చేది. ఇదికాక మహార్నవమినాడు సామంతులు, దండనాయకులు కూడా చక్రవర్తికి కప్పాలు కట్టేవారు. రాజుకు ఇంకా కట్నాలు కానుకలు కూడా వచ్చేవి.

రెండవ రకం ఆదాయం శుల్కాదాయం. వర్తక సుంకాలు, కొన్ని ఇతర పన్నులను అనగా ధన రూపంలో వచ్చే ఆదాయాన్ని శుల్కాదాయం అని పిలిచేవారు. కానుక దీనిని సువర్ణాదాయం అని పిలిచేవారు. శాసనాలలో కానిక్, కట్నం, గ్రామ కట్నం, వెట్టివేమి, ఇల్లరి, పుల్లరి, చెరువు మేర, బెడిద, దుర్గా నివర్తనం, దణ్డాయం, సిద్ధాయం, అడుగుకొలు సురవంక మొదలగు పన్నులు ఈ కోవలోకి వస్తాయి. మగ్గస్థాపర, ఈడి పద్దాయ, పిందాణి సిద్ధాయ మొదలగు వృత్తి పన్నులు కూడా శుల్కాదాయంలో భాగంగానే ఉండేవి. లూయీ రైస్, శుల్కాదాయాన్ని మూడు తరగతులుగా విభజించారు. అవి స్థలాదాయం, మార్గాదాయం, మామూలాదాయం. ఒకే స్థలంలో అమ్మకం జరిపే సరుకులపై విధించే పన్ను స్థలాదాయం. ఒక స్థలం నుండి మరొక స్థలానికి తీసుకెళ్లే సరుకులపై విధించే పన్ను మామూలాదాయం అని లూయీ రైస్ వర్గీకరించాడు.

పరిశ్రమలపై కూడా పన్నులు విధించేవారు. ఆనాటి పరిశ్రమలన్నీ కుటీర పరిశ్రమలు, చేతి పరిశ్రమలే. నేత మగ్గాలపైన సాలుకు అర్ధవరాహ లేదా మూడు ఫణాల సుంకం విధించేవారు. సాలె వారు తాము నేసి అమ్ముకున్న వస్త్రాలపై కూడా అమ్మకపు సుంకం ఉండేది. సంతలో అమ్మితే సంత సుంకం కూడా చెల్లించాలి. దూదిని ఏకి దారం తీసిన వారి వద్ద సింజుణి సిద్ధాయం అనే పేరుతో పన్ను వసూలు చేసేవారు. కంసాలులు లేక అగసాలెలు, మంగలి, కుమ్మరి, చాకలి వారు, చర్మకారులు కూడా వృత్తి పన్నులు చెల్లించాలి. నూనె గానుగుల వారు గానుగ పన్ను చెల్లించేవారు. కుమ్మరులు, బెల్లం తయారు చేసేవారు, ఉప్పు చేసేవారు, పెద్ద కొలిమి వారు, ప్రత్తి నుండి గింజలు తీసేవారు, ఎడ్ల పరిశ్రమ వారు, ఇంకా దొమ్మరి వారు, విప్రవినోదులు వారి వారి వృత్తులను బట్టి జాతి సిద్ధాయం అనే వృత్తి పన్ను చెల్లించేవారు. దుర్గాధిపతుల రక్షణలో ఉండే గ్రామాలు ఆయా దుర్గాధిపతులకు భరణం కింద పన్ను చెల్లించాలి. దానిని దుర్గదన్నాయం లేక దుర్గ నివర్తనం అని పిలిచేవారు. ఈ పన్ను గ్రామానికి 10 వరహాలుండేది. మహారాజ ప్రయోజనాలు అని మరొక పన్ను ఉండేది. దీని స్వభావం పూర్తిగా తెలియదు. ఇది మహారాజు క్షేమం కోసం దేవాలయాలలో పూజలు జరపడానికి విధించే పన్ను అని కొందరు, కొన్ని శాసనాలు తెలుపుతున్నాయి. కాని వెంకటరమణయ్య గ్రామదేవత పూజా ఉత్సవాలు జరపడానికి వసూలు చేసే పన్ను అని కొన్ని శాసనాలు తెలుపుతున్నాయని అన్నారు. అన్ని రకాల స్థిర చరాస్తులపై ఆస్తి పన్నులుండేవి.

ఇళ్ల మీద ఇల్లరి, అంగళ్ల మీద మడిగె అనే పన్ను ఉండేది. మడిగెను అరకాసు అని కూడా అనేవారు. మగ్గాలు, గానుగలపై ఉత్పత్తికే కాక ఆ సాధనాలకు కూడా పన్ను విధించేవారు. మగ్గానికి మగ్గ స్థావరం, గానుగకు గానుక స్థావరం అనే పన్ను వసూలు చేసేవారు. అడవులలో పశువులు మేపుకున్నందుకు వసూలు చేసే పుల్లరిగాక పశులపై కూడా అంటే ఆవులు, గొర్రెలు, మేకలు మొదలైన పశువుల మీద కూడా ఆస్తి పన్ను విధించేవారు. గొర్రెలను అమ్మితే వారి వద్ద అడ్డగోడ అనే సుంకం వసూలు చేసేవారు. శ్రీకృష్ణదేవరాయల కొండవీటి శాసనం అమ్మకానికి వచ్చే 59 రకాల సరుకులు, వస్తువులు, దినుసులపై విధించే పన్నుల జాబితాను ఇచ్చింది. ఇటువంటి రకరకాల పన్నులున్నందువల్ల అమర నాయకులు, పారుపత్యగార్లు, ఆయగార్లు ప్రజలను పీడించడానికి, తాము సిరిసంపదలు పొంది వైభవ జీవితం అనుభవించడానికి బాగా వీలు చిక్కింది. ఈ పన్నులే కాక సమయ సుంకం మరొక పన్ను ఉండేది.

సమయ సుంకం లేక కుల సిద్ధాయం: దిగువ కులాలలో కుల పెద్దలు ఉండేవారు. వారు తీర్పులు

చెపుతారు. తీర్పులు చెప్పినందుకు వారికి ఆ కులం వారు కొంత ధనాన్ని ముట్టచెప్పేవారు. అది వారి ఆదాయంగా ప్రభుత్వం పరిగణించేది. ఆదాయంపై కొంత పన్ను చెల్లించాలి. దానిని సమయ సుంకం లేక సిద్దాయం అని అంటారు. గ్రామ దేవతలకు నైవేద్యాలు పెట్టడానికి కూడా పన్నులు వసూలు చేసేవారు. దానిని మహారాజతేవలు లేక మహరజగుత్తలు అని అంటారు. వీరముష్టి పన్ను అని వసూలు చేసి వీరశైవ మఠానికి ఇచ్చేవారట. దొమ్మర్లపై దొమ్మరి పన్ను అని వసూలు చేసేవారు. దొమ్మరి పన్ను స్థానిక దేవాలయానికి దానం చేసినట్లు శాసనాలు ఉన్నాయి. మంగళ్లపై కూడా పన్ను ఉండేది. కొండోజు అనే మంగలి రామరాయలను మెప్పించి మంగలి పన్ను రద్దు చేయించుకున్నాడని కథ ప్రచారంలో ఉంది. దేవదాసీల పోషణకు లంజ కట్నం అని వసూలు చేసేవారని మార్కాపురంలో శాసనం లభించింది. ఇంకా కానిక్, వెట్టిమేమి, బెడిద, అలుగుకోలు, సురవంక, దణ్డాయం అడుగుకోలు, మహారాజ ప్రయోజనాలు పేర్లు శాసనాలలో కనిపిస్తున్నాయి. ఈ పన్నులను చూస్తే ఆనాటి ప్రజలు ఎట్లా జీవించారో అర్థం కాదు. కదిలితే పన్ను అన్నట్లుగా ఉండేది. ఈ పన్నులు భరించలేక ప్రజలు ఒక్కొక్కప్పుడు గ్రామాలు వదలి వెళ్లిపోయేవారు. అప్పుడు రాజులు పన్నులు తీసి వేసి వారిని తిరిగి గ్రామాలకు రప్పించేవారు

ద్రవ్య చెలామణి-నాణేలు: విజయనగర రాజుల కాలంలో అనేక రకాల నాణేలు చెలామణిలో ఉండేవి విజయనగర రాజులు గద్యాణం లేక వరహా, మాడ, ఫణం, హగ అనే నాలుగు బంగారు నాణేలు, తారె అనే వెండి నాణెం, జీతలు, ఏన, కాసు అనే మూడు రాగి నాణేలు ముద్రించారు. వీటితో పాటు పోర్చు గీసువారి కస్పోడ అనే నాణెం, పర్షియా, ఈజిప్టు వారి దీనారం, ఇటలీ దేశస్థుల ద్యూకాట్, సెక్విన్‌లు, బహమనీ సుల్తాన్‌ల టంకం, ఓస్వ అనే నాణేలు కూడా విజయనగర రాజ్యంలో చెలామణిలో ఉండేవి.

సామాన్య ప్రజల ఆర్థిక జీవనం: విజయనగర సామ్రాజ్యం సిరిసంపదలతో తులతూగినా సామాన్య ప్రజలు సుఖంగా జీవించిన దాఖలాలు లేవు. ప్రజలపై విపరీతమైన పన్నుల భారం విధింపబడింది. రాజులు, సామంతులు, అమర నాయకులు తమ ఇష్టారాజ్యంగా పన్నులు వసూలు చేసుకొని తాము విలాసవంతమైన జీవితాన్ని గడిపారు. వారి భోగ జీవితం విదేశీ యాత్రికులకు మిరిమిట్లు గొలిపింది. వారి విలాసాలన్నీ ప్రజలు భరించారు. అందువల్ల ఆర్థికంగా చాలా హీనస్థితిలో ఉన్నారని చెప్పవచ్చును. కానీ విదేశీ యాత్రికులు ప్రభువు ఆడంబరాలను వైభోగ జీవితాన్ని వర్ణించారు గాని ప్రజల దుర్భర జీవితాన్ని అంతగా వర్ణించలేదు. రైతులు పన్నులు చెల్లించలేక గ్రామాలు వదలిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అవన్నీ వారి దుర్భర దారిద్ర్యాన్ని తెలియ జేస్తున్నాయి. రాజులు, సామంతులతోపాటు వ్యాపార శ్రేణులు అధిక లాభాలు గడించి సిరిసంపదలను అనుభవించారు. అగ్రహారీకులు కూడా సుఖజీవనం చేశారు. రాజులు వైభవాన్ని చూసిన విదేశీ యాత్రికులు విజయనగరం సిరిసంపదలకు నిలయం అని రాశారు గాని వారు సామాన్య ప్రజల దుస్థితిని గమనించినట్లు కనిపించదు.

విజయనగర యుగంలో మత పరిస్థితులు

తుగ్లక్ వంశ దాడుల వల్ల దక్షిణదేశ ప్రజలకు పట్టిన దుర్గతి నుండి కాపాడి హిందూ సంస్కృతిని వైదిక ధర్మాన్ని రక్షించడానికి స్థాపింపబడిన విజయనగర ప్రభువులు సహజంగా హిందూమతాన్ని ఆదరించారు. ముస్లిం దండయాత్రల కాలంలో వైదిక విజ్ఞానం నశించే ప్రమాదం ఉన్నందు వల్ల బుక్కరాయలు హిందూ వేదాంత పండితులను ఆదరించి వేదాలకు భాష్యాలు రాయించారు. వైదిక, ధర్మ గ్రంథాలు రాసేవారని ప్రోత్సహించారు. ముఖ్యంగా శాయణ మధన విద్యారణ్యుల ఆధ్వర్యంలో గ్రంథాలు రాయించి వాటిని కాపాడి, హిందూ విజ్ఞానం నశించకుండా కాపాడారు. అందువల్ల వారికి వైదికమార్గ ప్రతిస్థాపనాచార్య, వేదమార్గ ప్రతిస్థాపనాచార్య అనే బిరుదులు వచ్చాయి. అయినప్పటికీ వారు పరమతాలను ద్వేషించలేదు. ముస్లిం, క్రైస్తవ మతాలను కూడా ఆదరించారు. అందువల్ల విజయనగర సామ్రాజ్యంలో ఉన్న మతాలు సహజీవనం చేశాయి. కనుక విజయనగర సామ్రాజ్యం మత రాజ్యం కాదని పండితులు అభిప్రాయపడ్డారు.

హిందూ మతం: విజయనగర సామ్రాజ్యంలో హిందూ మతం ప్రధాన మతం. అయితే ఇందులో అనేక శాఖలున్నాయి. శైవ, వైష్ణవ, స్మార్త, అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత మత శాఖలున్నాయి. అవేగాక ఈ మతాలలో ఉప శాఖలు కూడా అనేకం ఉన్నాయి. శైవమతంలో పాశుపతం, కాలాముఖ, కాపాలిక, వీరశైవ, స్మార్త అనే శాఖలుండగా, విశాష్టాద్వైత వైష్ణవ మతంలో తెంగలై, వడగలై అనే శాఖలున్నాయి. ఈ శాఖాధిపతులందరూ విజయనగర రాజులను, వారి సామంతులను ప్రజలను తమవైపు తిప్పుకోవడానికి వారి వారి విధానాలతో ప్రచారం చేసుకున్నారు.

విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన మొదటి దశలో శైవమతం ప్రాచుర్యంలో ఉండేది. తర్వాత స్మార్తమతం కొద్దిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. తర్వాత వీరశైవమతం అభివృద్ధి చెందింది. తర్వాత వైష్ణవ మతం మంచి ప్రాచుర్యం పొంది చివరి వరకు కొనసాగింది. ఈ మతశాఖల అధిపతులు గొప్ప పండితులు. వారు తమ పాండిత్య వాదనా పటిమలతో ఇతర శాఖాచార్యులతో వాదించి తమ మత ఆధిక్యతను చాటాలని ప్రయత్నాలు చేసేవారు. అందువల్ల విజయనగర కాలంలో శాఖాధిపతుల మధ్య అనేక వాగ్వివాదాలు జరిగాయి.

శాఖాధిపతులు: విజయనగర యుగంలో శైవ, వైష్ణవ మతాలు అనేక శాఖలుగా చీలి ఉండేవి. ఇవేకాక అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మత శాఖలు ప్రత్యేకంగా ఉండేవి. అద్వైత మతానికి విద్యారణ్యస్వామి, అప్పయదీక్షితులు, విశిష్టాద్వైతానికి వేదాంత దేశికులు, ద్వైతానికి అక్షోభ్యముని, వ్యాసరాయలు అధిపతులు. వీరందరూ మహా పండితులు, కవులు. వారు వారి శిష్యులు తమ సిద్ధాంత వ్యాఖ్యాన రచనల వల్ల వ్యక్తిత్వ బలం వల్ల, వారి విస్తృత ప్రచారం వల్ల వైదిక హిందూ మతానికి విశేషమైన ప్రాచుర్యాన్ని కలిగించారు.

శైవమతం: ఈ కాలంలో శైవమతం అనేక శాఖలుగా చీలి ఉండేది. పాశుపతం, కాలాముఖ, కాపాలిక, వీరశైవ లేక లింగాయతశాఖ, స్మార్తశైవం అనే శాఖలుగా ఉండేది. శైవ మతంలోని వీర శైవ శాఖ కర్ణాటకంలోని వీరబసవుని మత శాఖగా చెప్పవచ్చును.

పాశుపతానికి, కాలాముఖ శాఖకు పెద్దగా తేడా లేదు. పాశుపత మతానికి కాశీవిలాస క్రియాశక్తి అధిపతిగా ఉండేవారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, త్రిపురాంతకాలలో పాశుపత మత కేంద్రాలున్నాయి. శ్రీశైలంలోని భిక్షువృత్తిమఠం పాశుపత మతానికి చెందింది. కొందరు పాశుపత మతస్థులు శైవాగమాలను పాటిస్తూనే వేదాల ప్రామాణికాన్ని అంగీకరించారు. కాని కొందరు వేదాలను అంగీకరించలేదు. అందువల్ల వేదాలను అంగీకరించిన పాశుపతులను వైదిక పాశుపతులని, అంగీకరించని వారిని అవైదిక పాశుపతులు అని పిలిచారు. పాశుపతులు పతిపసు లాసాలను నమ్ముతూ వర్ణాశ్రమ ధర్మాలను పాటించారు. వైదిక ధర్మాలను ఆచరించారు. విజయనగర సామ్రాజ్యపు తొలి దశలో ప్రజలలో ఎక్కువ మంది పాశుపత శైవులు, తొలి సంగమ రాజులు కూడా పాశుపత మతాన్నే అనుసరించారు. తర్వాత ఈ శాఖ తన ప్రాభవాన్ని పోగొట్టుకుంది.

వీరశైవమతం లేక లింగాయత శైవం: సామ్రాజ్యంలోని కన్నడ ప్రాంతాలలో లింగాయత శైవమతం ఎక్కువగా ఉండేది. ఇది వీరబసవడు స్థాపించిన వీరశైవమతం. వీరశైవులు వేద ప్రామాణ్యాలను గుర్తించరు. వైదికాచారాలను అంగీకరించరు. పునర్జన్మ సిద్ధాంతాన్ని కూడా వారు నమ్మరు. వారు బాల్య వివాహాలను

నిరసించారు. విధవా వివాహాలను సమర్థించారు. రెండవ దేవరాయల కాలం నుండి వీరశైవ మతం కొంత ప్రాచుర్యాన్ని పొందింది. శ్రీశైలంలో పాశుపత మఠంగా ఉన్న భిక్షువృత్తి మఠం విజయనగర యుగంలో వీరశైవ లింగాయత మతానికి సంక్రమించింది. వ్యాపారస్తులలో ఎక్కువ మంది వీరశైవ మతాన్ని అనుసరించారు. కానీ ఆంధ్రదేశంలో శ్రీశైలం, త్రిపురాంతకంలోని ఒకటి రెండు మఠాలకు మాత్రమే పరిమితమైంది. ఇంకా నాటి సాహిత్యంలో సిద్ధ కాపాలిక శాఖల ప్రస్తావన ఉంది. కాని వాటి ప్రభావం చాలా తక్కువ.

స్మార్త శైవమతం లేక అద్వైత మతం: కాలాముఖశాఖ క్షీణించిన తర్వాత స్మార్తమతం అభివృద్ధి చెందింది స్మార్తులు ఐదుగురు దేవుళ్లను సమానంగా పూజిస్తారు. గణపతి, శివుడు, విష్ణువు, సూర్యుడు, దేవిలను ఏక శక్తి రూపులుగా భావించి పూజిస్తారు. ఈ విధానాన్ని కుమరిలభట్టు శంకరాచార్యుడు రూపొందించారు. విజయనగర కాలం నాటికి స్మార్తులు సుబ్రహ్మణ్యస్వామిని కూడా చేర్చి ఆరుగురు దేవతలుగా మార్చారు. ఈ విధానాన్ని శంకరాచార్యుడే ఏర్పాటు చేశారని కూడా ప్రచారం చేశారు. శంకరాచార్యుని అనుయాయులను స్మార్తులు అని అంటారు. వీరికి శంకరాచార్యుని అద్వైత తత్వం మూల సిద్ధాంతంగా ఉంటుంది. వీరు వైదికాచారాలను వర్ణాశ్రమ ధర్మాలను పాటిస్తారు. శృంగేరి, కంచి, పుష్పగిరి, విరూపాక్షం, ద్రాక్షారామం, అమరావతి మొదలైన శైవ ఆరామాలలో స్మార్త సాంప్రదాయం పాటించబడింది. విద్యారణ్యులు, మధ్వాచార్యులు, శాక్త్మీణాచార్యులు ప్రసిద్ధి చెందిన స్మార్త ఆచార్యులు. స్మార్త ఆచార్యులను, స్మార్త మఠాలను విజయనగర ప్రభువులు పోషించారు.

శైవ ఆగమవాదులు - భక్తియుత శైవమతం: శైవమతంలో ఆగమ సిద్ధాంతవాదులనే మరొక శాఖ ఉంది ఈ శాఖవారు శైవ సిద్ధాంతం 28 ఆగమాల మీద ఆధారపడి ఉందని నమ్ముతారు. మేయకందదేవ అనే శైవుడు రచించిన శివజ్ఞాన బోధమ్ ఈ శైవ సిద్ధాంతాలను వివరిస్తోంది. ఆత్మ, పరమాత్మ, ప్రకృతి మధ్యన ఉండే సంబంధాన్ని చక్కగా వీరితత్వంలో విశదపరచబడింది. వీరు కర్మకాండను వ్యతిరేకిస్తారు. ఇతర శైవ శాఖలు పాటించే ఆచారాన్ని కూడా అంగీకరించరు. వీరు భక్తికి అధిక ప్రాధాన్యతను ఇస్తారు. శివునిపై భక్తి ఉంటే చాలు అంటారు. ఈ శాఖ దక్షిణాదిలో బాగా విస్తరించింది.

వైష్ణ వమతం: విజయనగర యుగంలో వైష్ణవ మతంలో రెండు ప్రధాన శాఖలున్నాయి. ద్వైత, విశిష్టాద్వైత మతాలు. విశిష్టాద్వైత మతాన్ని రామానుజాచార్యులు, ద్వైతమతాన్ని మధ్వాచార్యులు స్థాపించారు. రామానుజ మతానికి శ్రీవైష్ణవం అని, మధ్వాచార్యుని మతానికి మాధ్వమతం అని పేరు.

ద్వైత మతం:-మధ్వాచార్యుడు ఆంధ్రదేశాన్ని పర్యటించి గోదావరి తీరంలోని శ్యామశాస్త్రి, శోభన భట్టులను తన శిష్యులుగా చేసుకున్నాడు. వారే నరహరితీర్థులు. పద్మనాభతీర్థులు అని ప్రసిద్ధి వహించారని ఒక గాథ ప్రచారంలో ఉంది. మధ్వాచార్యుల తరువాత ద్వైతపీఠానికి పద్మనాభ తీర్థులు అధిపతి అయ్యాడు. నరహరితీర్థులు శ్రీకూర్మాన్ని తన కేంద్రంగా చేసుకొని ఆంధ్ర కళింగ దేశాలలో మాధ్వమతాన్ని ప్రచారం చేశాడు. శ్రీపాదరాయతీర్థ, మాధవతీర్థ అనే వారు కూడా అద్వైత మతప్రచారం చేశారు. బుక్కరాయల కాలంలో అద్వైత మతాచార్యులు అక్షోభ్యతీర్థులు. అతడు విద్యారణ్యునితో వాదించాడని తెలుస్తోంది. విజయనగర యుగంలో ప్రసిద్ధి చెందిన ద్వైతాచార్యుడు వ్యాసతీర్థులు. అతడు సాళువ నరసింహరాయల గురువయ్యాడు. నరసింహరాయలతో పాటే విజయనగరం చేరి చాలా కాలం జీవించాడు. అతడు గొప్ప పండితుడు. అతడు ద్వైత, అద్వైతతత్వాలను తర్కిస్తూ వాదనలు చేసేవాడట. అనేక మందిని వాదనలలో ఓడించి మాధ్వమతాన్ని వ్యాప్తి చేశాడు. అందువలన అతనికి వైష్ణవ సిద్ధాంత ప్రతిష్ఠాపనాచార్యుడని బిరుదు ఉంది. కాని ఇతనిని వల్లభాచార్యుడు ఓడించాడని ప్రతీతి. ఏమైనా వ్యాసతీర్థుల కాలంలో విజయనగర సామ్రాజ్యంలో ద్వైతమతం మంచి ప్రాచుర్యం పొందింది. ద్వైతమతంలో ఎంత గొప్ప ఆచార్యులున్నా ఈ మతం ప్రజల్లోకి చొచ్చుకుపోయింది. కొందరు పండితులు రాజకుటుంబీకులకు మాత్రమే పరిమితమయ్యారు. అయినప్పటికీ ద్వైతమతానికి ఒక ప్రత్యేకత ఉంది. హిందూ దేవతలలో హనుమంతుని పూజను ప్రోత్సహించిన వారు ద్వైతులు. మధ్వాచార్యుడు హనుమంతుని అవతారం అని వారి విశ్వాసం.

విశిష్టాద్వైత మతం: రామానుజాచార్యుడు విశిష్టాద్వైత మతాన్ని స్థాపించాడు. అతడు కుల వ్యవస్థను ఖండించి సమస్త ప్రజలకు తారక మంత్రాన్ని ఉపదేశించి సర్వమానవ సమానత్వాన్ని చాటాడు. పంచములకు కూడా దీక్ష ఇచ్చి వారిని ఉద్ధరించడానికి ప్రయత్నించాడు. అందువల్ల రామానుజ మతం త్వరితగతిన వ్యాప్తి చెందింది. రామానుజుని తర్వాత అతని మతం తెంగలై, వడగలై అనే రెండు శాఖలుగా చీలిపోయింది. తెంగలై

శాఖ వారు ఉదారవాదులు. వారు ప్రాచీన వైష్ణవ ఆళ్వారుల బోధనలను అనుసరిస్తారు. వారి బోధనలకు వైదిక విధానాలను సమన్వయం చేసి తమ విధానాన్ని రూపొందించుకున్నారు. వీరు కుల భేదాలు పాటించరు. పంచములకు దేవాలయ ప్రవేశం కలిగించారు. కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో మాలదాసరి కథను రాశాడు. వైష్ణవ మతం పంచములలోకి చొచ్చుకుపోయిన దానికి ఈ కథ నిదర్శనంగా చెప్పవచ్చును. వీరి ఉదార వైఖరి కొందరికి నచ్చలేదు. వారు చీలిపోయి వేరుపడ్డారు. వారి ఆచార్యుడు వేదాంత దేశికుడు. అతడు వేదాలకు మాత్రమే ప్రాధాన్యతనిచ్చి ఆళ్వారుల ప్రబంధాలను అనుసరించనక్కరలేదని అన్నాడు. అందువల్ల వారు వేరే శాఖగా రూపొందారు. వారి శాఖకు వడగలై శాఖ అని పేరు వచ్చింది. ఈ రెండు శాఖలకు అనేక భేదాలున్నాయి.

తెంగలై శాఖీయులు తమిళ ప్రబంధ సాంప్రదాయాన్ని పన్నిద్దరాళ్వారుల 12 మంది బోధనలను అనుసరిస్తారు. అన్ని కులాలను సమభావంతో చూస్తారు. వడగలై శాఖీయులది సంస్కృత సాంప్రదాయం. వారు కేవలం వైదిక పద్ధతిని మాత్రమే ఆచరిస్తారు. వీరి శాఖ బ్రాహ్మణులకు మాత్రమే పరిమితం. అగ్రవర్ణాల వారికి మాత్రమే దీక్ష ఇస్తారు. సిద్ధాంతపరంగానే కాకుండా ఆచారపరంగా కూడా వారి మధ్య భేదాలున్నాయి. మతాన్ని ఏ భాషలో ప్రచారం చేయాలి, తమిళంలోనా లేక సంస్కృతంలోనా అనే విషయంలో ఏకాభిప్రాయం లేదు. వడగలై శాఖ సంస్కృతాన్ని, తెంగలై శాఖ తమిళాన్ని ప్రచార భాషగా ఎన్నుకున్నారు. రామానుజుడు తన కాలంలో రెండు భాషలను ఉపయోగించాడు. మోక్షసాధనకు భక్తిప్రపత్తి, శరణాగతి మాత్రమే చాలని ఆళ్వారులు చెప్పారు. ఆ పద్ధతిని తెంగలై శాఖ అనుసరించింది. కాని వడగలై శాఖ వారు శరణాగతికి ముందు స్వప్రయత్నంతో మోక్షసాధనకు పాటుపడాలని సిద్ధాంతం చేశారు. తన ప్రయత్నం వల్ల మోక్షం పొందలేనప్పుడు మాత్రమే భగవంతుని శరణు వేడాలని చెప్పారు. మోక్ష సాధనానికి తమ ప్రయత్నం అక్కరలేదని, శరణాగతుడి మోక్షం దానంతట అదే వస్తుందని, స్వర్గం లభిస్తుందని తెంగలై శాఖ వారు నమ్ముతారు. దైవకృపతో పాపాత్ముడు కూడా జగజ్జనని సహాయం పొందవచ్చుని తెంగలై శాఖ వారు అన్నారు. కాని వడగలై శాఖవారు దానిని ఆమోదించలేదు. దేవుడు పాపకర్మలను అంగీకరించడని, పాపాత్ములను విస్మరిస్తాడని వడగలై శాఖ వారు చెప్పారు. స్థానాన్ని గురించి కూడా వారిలో అభిప్రాయభేదాలు వడగలై శాఖవారు కులభేదాలను పాటిస్తారు. వారు వర్ణాశ్రమ ధర్మాలను పాటించాలని అన్నారు. తెంగలై శాఖ వారు ప్రసన్నుడు కులమత సిద్ధాంత భేదాలకు అతీతుడని కులం తక్కువ వాడైనా నిజమైన భక్తుడు. అయితే అతడు బ్రాహ్మణునితో సమానమని భావించారు. బొట్టు పెట్టుకునే విషయంలోను, మొదట ఎవరికి నమస్కరించాలి అనే విషయాలలో కూడా వారికి భేదాలున్నాయి. తెంగలై శాఖకు రామానుజుడు ఆద్యుడని, వడగలై శాఖకు వేదాంత దేశికుడు ఆద్యుడని భావిస్తారు. వేదాంతదేశికుని తర్వాత అతని కుమారుడు వరదాచారి వడగలై శాఖకు అధిపతి అయ్యాడు. తెంగలై శాఖకు పిళ్లైలోకాచార్య మణవాళముని అధిపతులయ్యారు. తమిళ దేశంలో తెంగలై శాఖ బాగా వ్యాప్తి చెందింది. కాని ఆంధ్రదేశంలో వడగలై శాఖ ప్రాచుర్యం పొందింది. వరదాచారి ఆంధ్రదేశం దర్శించి, వెలమ ప్రభువు అయిన సర్వజ్ఞ సింగనకు వైష్ణవదీక్ష ఇచ్చాడు. వేదాంత దేశికుని శిష్య పరంపరలోని భట్టరువారు, కంధాళంవారు, తిరుమలవారు, నల్లాన్ చక్రవర్తుల వారు ఆంధ్రదేశంలో అనేక ప్రదేశాలు దర్శించి వైష్ణవ మతాన్ని ప్రచారం చేశారు. వైష్ణవ గురువులు దేశ సంచారం చేస్తూ తమ మతాన్ని ప్రచారం చేసుకొనే పద్ధతిని అవలంబించారు. తాళ్లపాక, తాతాచార్య కుటుంబాల వారు కూడా వైష్ణవ మత ప్రచారం చేశారు. తాళ్లపాక వారు తిరుపతిలో ఉండేవారు. వారు వాగ్గేయకారులు. తాళ్లపాక అన్నమాచార్యుడు ఈ వంశానికి చెందినవాడు. తాతాచార్యుల కుటుంబీకులు తుళువ, ఆరవీటి వంశస్థులకు రాజ గురువులయ్యారు.

వాగ్వివాదాలు: అనేక శాఖలుగా ఉన్న మతాధిపతులు తమ మతం గొప్పదనాన్ని ప్రదర్శించడానికి వాగ్వివాదాలకు దిగేవారు. నాచనసోముడు శైవవైష్ణవులు పరిహాసాస్పద వాదనలు చేసుకుంటారని ఆక్షేపించాడు. కృష్ణదేవరాయలు తన ఆముక్తమాల్యదలో ఆరాధ్య దేవుళ్లను పతితులని శ్రీరంగనాథునిచే అనిపిస్తాడు. అలాగే విష్ణుమూర్తి పాండ్యరాజు చర్యలను గురించి లక్ష్మీదేవికి ఫిర్యాదు చేసినట్లు సన్నివేశాన్ని సృష్టించాడు. విప్ర నారాయణ చరిత్రలో మతాచార్యులు గోరంత భేదాలను కొండంతగా చేసి మాయావాదాలు ఆడుతారని అధిక్షేపించబడింది. ఈ మత చర్చలలో ఒకరినొకరు దూషించుకొనేవారట. వారి దూషణలో ఒకరినొకరు చండాలురని, పాపులని, పాషండులని తిట్టుకొనేవారట. ఇతర మత దేవుళ్లను కూడా దూషించేవారట. పరమయోగి విలాసంలో తాళ్లపాక తిరువెంగళనాథుడు కొన్నిచోట్ల శివుని దూషించాడు. కాళహస్తీశ్వర శతకంలో

విష్ణుదూషణ ఉంది. శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో శైవరాజులు ఇతర మతాల వారి దేవాలయాలను ధ్వంసం చేసి శైవమఠాలు నిర్మించినట్లు వర్ణించాడు. వైష్ణవులు జైనుల దేవాలయాలను ధ్వంసం చేశారు. కాని వారి దూషణ భూషణలలో విజయనగర రాజులు జోక్యం చేసుకోలేదు. ఎవరి పట్లా పక్షపాతం చూపలేదు. అందరినీ సమానంగానే ఆదరించారు. వారి వాదనలు తమ ముందు జరిగితే నిష్పక్షపాతంగా న్యాయ నిర్ణయం చేశారు.

స్మార్త అద్వైతాచార్యులైన మాధవ విద్యారణ్యులు, ద్వైతాచార్యులైన అక్షోభ్యముని, విశిష్టాద్వైతాచార్యులైన వేదాంత దేశికులు ముగ్గురూ సమకాలికులు. వారు ముగ్గురినీ వారు సమానంగా ఆదరించారు. బుక్కరాయల కాలంలో విద్యారణ్యులకు, అక్షోభ్యతీర్థులకు వాగ్వివాదం జరిగింది. వారు జరిపే వేదాంతచర్చలో న్యాయనిర్ణయం చేయడానికి వేదాంత దేశికులను విజయనగర ప్రభువు నియమించాడని గురుపరంపర అనే వైష్ణవ గ్రంథం తెలుపుతోంది. న్యాయ నిర్ణయం ఖచ్చితంగా జరగాలని విజయనగర రాజు ఆశించాడు. అలాగే కృష్ణదేవరాయల కాలంలో తన గురువైన వ్యాసతీర్థులకు వల్లభాచార్యునికి వాదన జరిగింది. అందులో తన గురువు వ్యాసతీర్థులు ఓడిపోయాడు. అందుకు కృష్ణదేవరాయలు బాధపడలేదు. తన గురువు వైపు పక్షపాతం చూపించలేదు. విజయం సాధించిన వల్లభాచార్యుని కనకాభిషేకంతో సత్కరించాడు. అలాగే వెంకటపతిరాయల కాలంలో వైష్ణవాచార్యుడైన దొడ్డయాచార్యునికి, స్మార్త ఆచార్యుడైన అప్పయదీక్షితులకు వాదన జరిగి అందులో అప్పయ్య దీక్షితులు ఓడిపోయాడు. అన్ని వాగ్వివాదాలలో విజయనగర చక్రవర్తులు న్యాయ నిర్ణయం ఖచ్చితంగా జరగాలని ఆశించారే తప్ప వారు ఎవరి పట్లా పక్షపాతం వహించలేదు. అది వారి విజ్ఞతకు గీటురాయి.

మఠాలు: ఈ కాలంలో మత నిర్వహణకు, మత ప్రచారాలకు మఠాలు ప్రముఖ పాత్ర నిర్వహించాయి. మత శాఖకు తనదంటూ ఒక మఠం ఉండేది. ఆ మఠాల పోషణకు రాజులు దానాలు చేసేవారు. రాజపోషణలో మఠాలు నడుపుతూ మఠాధిపతులు తమ మత వ్యాప్తికి పాటుపడుతూ ఉండేవారు. ఇతర మఠాధిపతులతో పోటీ పడుతుండేవారు. అంతేగాక ఈ మఠాలలో తమ తాత్విక విద్యలను తమ శిష్యులకు నేర్పుతుండేవారు. దాంతో పాటు వేదవిద్యలు, వ్యాకరణ, జ్యోతిష్య మొదలైన ఇతర శాస్త్ర విద్యలు కూడా నేర్పేవారు. అందువల్ల మఠాలు విద్యా కేంద్రాలుగా కూడా నాటి సమాజంలో ప్రముఖ పాత్రను నిర్వహించాయి. ఇవి మతతత్వాలు ప్రచారం చేస్తూ ప్రజల మానసికాభివృద్ధికి కూడా ఉపయోగపడ్డాయి.

శైవమఠాలు: శైవమఠాలలో బ్రాహ్మణ, బ్రాహ్మణేతర మఠాలుండేవి. శంకరాచార్యులు, వారి శిష్యుల చేత నడుపబడే మఠాలు బ్రాహ్మణ మఠాలు. శృంగేరి, పుష్పగిరి, విరూపాక్షం, కుంభకోణం మఠాలు వీరికి చెందినవి. ఈ మఠాలలో యతువేదాలు వాటికి సంబంధించిన ఇతర గ్రంథాలు పఠించేవారు. శృతులు, స్మృతులను ఆమోదిస్తారు. అద్వైతతత్వాన్ని బోధిస్తారు. కాని తమిళనాడు శైవబ్రాహ్మణ మఠాలలో అద్వైతతత్వం బోధించలేదు. వారు పాశుపత మత విధానాలను అనుసరించారు. దేవికాపురంలోని భిక్షువృత్తి మఠం మల్లికార్జునయ్యర్ మఠం, గోళకమఠాలు వీరికి చెందినవి. బ్రాహ్మణేతర శైవమఠాలలో మరలా రెండు రకాలున్నాయి. లింగాయతులు, లింగాయతులు కానివారు. లింగాయతులు వీరబసవని తత్వాన్ని బోధిస్తారు. లింగాలు ధరిస్తారు. ఆగమాలు వాటికి సంబంధించిన గ్రంథాలను పఠిస్తారు. కన్నడ, తెలుగు భాషలలో ఉపయోగిస్తారు. ఇవి వీరశైవ మఠాలని చెప్పవచ్చును. శ్రీశైలం, ఉమ్మత్తూరు, సంగమేశ్వరాలలో వీరి మఠాలున్నాయి. తమిళ దేశంలో కూడా బ్రాహ్మణేతర మఠాలు ఉన్నాయి. వారు శైవ సిద్ధాంతాన్ని అనుసరిస్తారు. కాని లింగాయతులు ధరించరు. వారి మఠాలు ఎక్కువగా తమిళ దేశంలో ఉన్నాయి.

వైష్ణవ మఠాలు: వైష్ణవ మఠాలలో శ్రీవైష్ణవులని మధ్వమఠాలని రెండు రకాలు. శ్రీవైష్ణవుల మఠాలలో మళ్లీ వడగలై, తెంగలై అని రెండు రకాల మఠాలున్నాయి. వడగలై వారి మఠాలు అహోబిలం, తిరుపతి, శ్రీరంగంలలో ఉన్నాయి. వీరి మఠాలలో వేదాలు పారాయణం చేస్తారు. తెంగలైవారి మఠాలు వానమామలై, మేల్కొటే అనే ప్రదేశాలలో ఉన్నాయి. వీరు ప్రాచీన తమిళ ఆళ్వారుల ప్రబంధాలను పఠిస్తారు. వారి మార్గాన్ని అనుసరిస్తారు. మధ్వమఠాలు ఉడిపి, ముల్బాగల్, విజయనగరాలలో ఉండేవి. మధ్వులు వైదికాచారాలను పాటిస్తారు. వారు వేదాలు ఉపనిషత్తులు, ధర్మశాస్త్రాలు, పురాణాలు అధ్యయనం చేస్తారు.

మఠ నిర్వహణ: మఠాల నిర్వహణకు కూడా ఒక క్రమమైన పద్ధతులు రూపొందించబడ్డాయి. ఏ శాఖకు చెందిన మఠం అయినా దానికి ఒక మఠాధిపతి ఉంటాడు. అతనికి మఠానికి సంబంధించిన అన్ని అధికారాలు ఉంటాయి. మఠంలో ఉండే ఇతర సన్యాసులకు ఎలాంటి అధికారాలుండవు. మఠాధిపతి జీవితకాలం దానికి

అధిపతిగా ఉంటాడు. అతని చివరి కాలంలో మఠ నిర్వహణకు తగిన జ్ఞానం, అర్హత శక్తిసామర్థ్యాలున్న వ్యక్తిని తన శిష్యుల నుండి ఎంపిక చేసుకొని నియమిస్తాడు. అతని తర్వాత అతడు మఠాధిపతి అవుతాడు. మఠానికి వారసుని నిర్ణయించే విషయంలో కూడా మఠంలో ఉండే ఇతర సన్యాసులకు ఏ హక్కులూ లేవు. మఠాధిపతిదే నిర్ణయాధికారం. అతని నిర్ణయానికి తిరుగులేదు. మఠాలలో తమ శాఖకు చెందిన శాస్త్రాలు, మత గ్రంథాలు బోధిస్తారు. వానితోపాటే లౌకిక విద్యను కూడా నేర్పుతారు. సాహిత్యం, కళలు, వైద్యశాస్త్రాలు నేర్పేవారు. మఠాలు ప్రజలకు కూడా విద్యను బోధించేవి. అందువల్ల ప్రజలు కూడా మఠాల యందు గౌరవాభిమానాలు ప్రదర్శించే వారు. విద్యావంతులు ఏ కులం వారైనా సమాజంలో గౌరవ మర్యాదలుండేవి. ఏ శాఖకు చెందిన మఠం అయినా భేదాలు చూపకుండా విజయనగర రాజులు మఠాలకు దానాలు చేశారు.

దేవాలయాలు: ఈ కాలంలో ప్రజా జీవితంలో దేవాలయాలు కూడా ప్రముఖ పాత్రను నిర్వహించాయి. పండితుల జీవితాలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తే సామాన్య ప్రజల జీవితాలలో దేవాలయాలు ఆ పాత్రను నిర్వహించాయి. కనుక ఈ కాలంలో రాజులు, సామంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ధనవంతులు, వర్తకులు, వృత్తి పని వారు, ఆఖరికి సామాన్య మానవులైన ప్రజలు కూడా పోటీలు పడి దేవాలయాలకు దానాలు చేశారు. దేవాలయాలు నిర్మించారు. వేశ్యలు కూడా దేవాలయాలకు దానాలు చేసి శాసనాలు వేయించుకున్నారు. దానాల ద్వారా వచ్చిన ధనాన్ని దేవాలయ నిర్వహణకు, దేవుని ఉత్సవాలు, కళ్యాణాలు జరపడానికి ఖర్చు చేసేవారు. పాత దేవాలయాలను మరమ్మతులు చేసేవారు. నూతన దేవాలయాలు నిర్మించేవారు. తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి, అహోబిలం, శ్రీరంగం, కంచి మొదలైన ప్రదేశాలలో విజయనగర ప్రభువులు అనేక మంటపాలు, గోపురాలు నిర్మించారు. ఈ కాలంలో తిరుపతి దేవాలయానికి అమిత ప్రాచుర్యం వచ్చింది. దేవాలయాలలో ఉత్సవాలు, దేవునికి కళ్యాణం చేసే ఆచారం బాగా ఎక్కువైంది. అర్చకులు దేవుని విగ్రహానికి స్నానం చేయించి పట్టువస్త్రాలు కట్టబెట్టి, ఆభరణాలతో అలంకరించేవారు. నాట్యకత్తెలు నాట్యం చేసేవారు. నిత్యం నైవేద్యం పెట్టేవారు. ధూప దీపాలు పెట్టేవారు. దేవునికి రంగరంగ వైభోగాలన్నీ జరిపేవారు సుగంధలేపనాలు రాసేవారు. బ్రహ్మోత్సవాలు జరిపేవారు. దేవాలయానికి రకరకాల సిబ్బంది ఉండేది. ఇవన్నీ జరపడానికి దేవాలయానికి రాజులు భూదానాలు చేసేవారు. భక్తుల కానుకలు వచ్చేవి. అందువల్ల క్రమేపి దేవాలయపు ఆస్తులు పెరిగాయి.

దేవాలయ నిర్వహణ: దేవాలయపు ఆస్తులు కాపాడటానికి, దేవాలయాలను సక్రమంగా నడపడానికి దేవాలయ నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కమిటీ సభ్యులను ధర్మకర్తలు అని పిలిచేవారు. దేవాలయ నిర్మాతలే కమిటీలను నియమించేవారు. సాధారణంగా స్థానికులనే ధర్మకర్తలుగా నియమించేవారు. శ్రీవిల్లిపుత్తూరు దేవాలయానికి స్థానికులు ధర్మకర్తలుగా ఉన్నారని ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నాడు. అలాగే క్రీ.శ.1542వ సంవత్సరం నాటి కర్నూలు జిల్లాలోని కడిగెరేల శాసనం స్థానికులను పేర్కొంది. ధర్మకర్తను స్థానాపతి, స్థానాచార్య అని పిలిచేవారు. అహోబిలం, మార్కాపురం శాసనాలలో స్థానాపతులు పేర్కొనబడ్డారు. ప్రతి దేవాలయానికి ఒక చావిడి ఉండేది. దేవాలయపు లెక్కలను రాయడానికి కరణాల వంటి లెక్కగాండ్రు ఉండేవారు. ప్రతి దేవాలయానికి కోశాధికారి ఉండేవారు. అతనిని శ్రీభాండార అని అనేవారు. వీరందరినీ ప్రభుత్వం నియమించేది. వీరందర్నీ పర్యవేక్షించే అధికారం సీమ పారుతయ్యకి ఇవ్వబడింది. పారుతయ్యను మణియగార్ అని పిలిచేవారు. దేవాలయపు సొమ్మును దొంగిలించిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించేవారు. దొంగలను శిక్షించడానికి స్థానికులతో న్యాయ కమిటీ ఉండేది, అది కూడా మణియగార్ పర్యవేక్షణలో ఉండేది. దేవాలయ స్థానాపతికి అన్ని అధికారాలుండేవి. దేవాలయపు ఆస్తులు, అమ్మడానికి, కొనడానికి, ఉత్సవాలప్పుడు డబ్బు ఖర్చు పెట్టడానికి దేవాలయపు పొలాలను రైతులకు కౌళ్లకు ఇవ్వడానికి సర్వహక్కులుండేవి. అలాగే దేవాలయం మంచి స్థితిలో ఉంచడం, మరమ్మతులు చేయించడం, దేవాలయాన్ని, దేవాలయపు ఆస్తులను కాపాడటం మొదలైన బాధ్యతలు కూడా ఉండేవి. ఆ కాలంలో దేవాలయాలు భక్తికి కేంద్రాలేగాక అనేక మందికి వృత్తులను, పనులను కల్పించి భుక్తిని కూడా కలిగిస్తుండేవి. కళాకారులకు జీవనోపాధిని కలిగించేవి. బీదలకు అన్నదానాలు చేసేవి. ప్రజలకు ఉత్సవాల ద్వారా ఆనందాన్ని, ఉత్సాహాన్ని, సంతోషాన్ని, వినోదాన్ని కూడా కలిగించేవి.

తీర్థయాత్రలు: ఈ కాలంలో ప్రజలు పుణ్యం కోసం తీర్థయాత్రలు చేసేవారు. విజయనగర సామ్రాజ్యంలో అనేక పుణ్యక్షేత్రాలుండేవి. ప్రజలు శైవ వైష్ణవ మత భేదాలతో నిమిత్తం లేకుండా అన్ని క్షేత్రాలు దర్శించేవారు.

విరూపాక్షం, తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి, అహోబిలం, సంగమేశ్వరం, కంచి, శ్రీరంగం, చిదంబరం, తిరువణ్ణామలై, రామేశ్వరం, కుంభకోణం, హరిహర్, మహానంది, గోకర్ణం మొదలైనవి పుణ్యక్షేత్రాలు సాధారణంగా ప్రజలు వేసవి కాలంలో తీర్థయాత్రలు చేసేవారు. ఆ కాలంలో మార్గమధ్యంలో దొంగల బాధ ఉండేది. అయినా ప్రజలు తీర్థయాత్రలు చేసేవారు. ధనవంతులు పల్లకి, గుర్రాలు, బండ్లపైన యాత్రలు చేసేవారు. బీద ప్రజలు కాలినడకన వెళ్లేవారు. తీర్థయాత్రలకు గుంపులు గుంపులుగా వెళ్లేవారు. ఆనాడు తీర్థయాత్రలకు వెళ్లే వారికి గుర్రాలు అద్దెకు ఇచ్చేవారట. ఆముక్తమాల్యద రామరాజ కొటలు అద్దె గుర్రాలను ప్రస్తావించింది.

జైన, బౌద్ధమతాలు: విజయనగర యుగంలో జైనమతం సామ్రాజ్యపు ఉత్తర పశ్చిమ భాగాలలో ఎక్కువగా ఉండేది. ఆంధ్రదేశంలో పెనుగొండ దాని పరిసర ప్రాంతాలలో ఉండేది. తమిళదేశంలో కంచి, చిదంబరాలలో ఉండేది. కంచిలో ఒక భాగాన్ని జినకంచి అని పిలిచేవారు. హంపిలో జైన దేవాలయాలుండేవి. రెండవ దేవరాయలు హంపిలో జైన దేవాలయాలను నిర్మించాడు. అతని దండనాయకుడు ఇరుగప్ప అతని కుమారులు కూడా జైన దేవాలయాలు నిర్మించారు. బుక్కరాయలు జైన దేవాలయాలకు రక్షణ కల్పించాడు. శ్రావణ బెళగొళ జైనులకు గొప్ప పుణ్యక్షేత్రం. జైన మతవ్యాప్తికి జైనులు మఠాలను కూడా నిర్మించుకున్నారు. జైన మఠాలకు కూడా విజయనగర రాజులు దానాలు చేశారు.

బౌద్ధ మతం: విజయనగర యుగం నాటికి బౌద్ధమతం దాదాపుగా అంతరించింది. కాని కొద్దిగా అక్కడక్కడ నిలిచి ఉంది. కంచి, నాగపట్టణం, కళావతు అనే ప్రదేశాలలో బౌద్ధ మతం ఉంది అని టి.వి.మహాలింగం అనే పండితుడు రాశాడు. కంచిలోని ఏకామ్రేశ్వర దేవాలయంలో కొన్ని బౌద్ధ శిల్పాలున్నాయి. అవి విజయనగర కాలం నాటివని మహాలింగం అభిప్రాయం. క్రీ.శ.1365లో ప్రపంచ రచించిన నాగకృతాగమ అనే గ్రంథంలో కంచి బౌద్ధ కేంద్రమని పేర్కొనబడింది. నాగపట్టణం కూడా 15వ శతాబ్దంలో బౌద్ధమత కేంద్రంగా ఉన్నట్లు ఆధారాలున్నాయి

విజయనగర రాజుల వ్యక్తిగత మతం: విజయనగర చక్రవర్తుల వ్యక్తిగత మతాన్ని గూర్చి రకరకాల అభిప్రాయాలున్నాయి. సంగమ వంశస్థులలోని మొదటి ప్రభువులలో మొదటి దేవరాయల వరకు శైవ మతస్థులు శైవ మతంలోని పాశుపత శాఖకు చెందినవారు. కాకతీయుల కాలంలో పాశుపత శైవ మతం ప్రాచుర్యాన్ని పొందింది. హరిహర బుక్కరాయలు ప్రతాపరుద్రునికి సమకాలికులు. గనుక వారు పాశుపత మతస్థులై ఉండవచ్చని పండితులు భావిస్తారు. కన్నడ శాసనాలు, సంగమ వంశస్థులు కురుబ కులానికి చెందిన వారని శైవ మతస్థులని తెలుపుతోంది. కురుబ కులం అంటే గొల్లలు. పశువులను, గొర్రెలను, మేకలను కాయడం వారి వృత్తిగా ఉండేది.

సంగమ వంశస్థులు కాలాముఖ శైవులు. వారి కులదైవం విరూపాక్షుడు. వారి శాసనాలు విరూపాక్ష పదంతో సమాప్తమయ్యేవి. వారి కులగురువు కాశీ విలాస క్రియాశక్తి ఆచార్యుడు. అతడు అసాధారణ శక్తి గలవాడని, గంగాదేవి తన మధుర విజయంలో కీర్తించింది. సంగమ రాజులకు రెండవ దేవరాయల వరకు క్రియాశక్తి గురువుగా ఉన్నాడు. హరిహరుని సోదరుడు బనవాసిని పాలించిన మారప్పకు అతని మంత్రి మాధవ మంత్రికి కూడా క్రియాశక్తే గురువు. సంగమ వంశస్థులలో రెండవ దేవరాయల వరకు క్రియాశక్తే గురువుగా కొనసాగాడు. అయితే మొదటి హరిహరుని కాలం నాటి క్రియాశక్తి కాకపోవచ్చును. అతని వారసులు అదే పేరుతో సంగమ వంశస్థులకు గురువులుగా కొనసాగి ఉండవచ్చును.

స్మార్త మతం: సంగమ వంశస్థులు పాశుపత లేక కాలాముఖ శైవులుగా కొనసాగినప్పటికీ వారు స్మార్త మతాచార్యులైన విద్యారణ్య, మధ్వాచార్య, శాయణాచార్యులను కూడా ఆదరించి తమ గురువులుగా గౌరవించారు వారు శృంగేరీ పీఠాధిపతులు. ఈ కాలం నాటికి కర్ణాటక దేశంలో వీరబసవుడు స్థాపించిన వీరశైవ మతం తగ్గిపోయి స్మార్త మతం ప్రాచుర్యంలోకి వచ్చింది. వారి ప్రాతినిధ్యం వహించిన శృంగేరీపీఠం ప్రాబల్యం వహించసాగింది. హరిహర బుక్కరాయలు శృంగేరిని దర్శించి అక్కడి మఠాధిపతి అయిన విద్యాతీర్థులకు దాన ధర్మాలు చేసి ఆయన ఆశీస్సులను పొందారు. విజయనగరంలో విరూపాక్ష దేవాలయం కేంద్రంగా స్మార్త మఠం ఏర్పడింది. మాధవాచార్యులు గొప్ప పండితుడు. అతడు బుక్కరాయలుకు మంత్రి అయ్యాడు. అతని తమ్ముడు శాయణాచార్యులు వేదాలకు, స్మృతులకు భాష్యాలు రాశాడు. బుక్కరాయల చివరి కాలంలో విద్యాతీర్థుల స్థానంలో విద్యారణ్యుడు శృంగేరి పీఠాధిపతి అయ్యాడు. మాధవాచార్యుడు, విద్యారణ్యుడు ఒకరేనని ఒక వాదన ఉంది. కాని వారు వేరువేరు వ్యక్తులని పలువురు భావిస్తారు. ఈ సోదరులు ముగ్గురు శంకరుని అద్వైత మతాన్ని

అనుసరించారు. వారు కేవలం శంకరుని అద్వైత సిద్ధాంతాన్నే కాకుండా కర్మ, మీమాంస పద్ధతిని కూడా జోడించి ప్రచారం చేశారు. వీరు ప్రచారం చేసిన మతానికి స్మార్త మతం అని పేరు. మాధవాచార్యుడు తన సిద్ధాంతాలను వివరిస్తూ జైమినీయ మాలావిస్తరం, యజ్ఞతంత్ర సుధానిధి అనే గ్రంధాలు రచించాడు. వీరి కాలంలో ఉత్తర దేశంలో ఇస్లాం మతం ప్రమాదం నుంచి హిందూ మతాన్ని రక్షించడానికి భక్తి ఉద్యమం సాగుతోంది. కాని దాని ప్రభావం వీరిపైన లేదు. వీరు స్వతంత్ర ఆలోచనలతో తమ స్మార్త విధానాన్ని రూపొందించుకున్నారు. ఈ మతానికి చివరి ప్రతినిధి అప్పయ్య దీక్షితులు. ఇతడు క్రీ.శ.1520-93 మధ్య కాలానికి చెందినవాడు. అతడు అచ్యుత దేవరాయలకు, రెండవ వెంకటపతిరాయలకు సమకాలికుడు. అతడు గొప్ప పండితుడు. అనేక గ్రంధాలు రాశాడు. కాని ఇతనిని దొడ్డయాచార్య అనే వైష్ణవ గురువు ఓడించాడు. దాంతో స్మార్త శైవమతం తనస్థానాన్ని పోగొట్టుకుంది.

మాధవ విద్యారణ్యుల తర్వాత స్మార్తమతం కొద్ది మంది పండితులకే పరిమితం. హరిహర బుక్కరాయలు కూడా వారిని గౌరవించారు కాని స్మార్త విధానాన్ని పాటించినట్లు లేదు. వారు క్రియాశక్తి గురువుల వద్దనే దీక్ష పుచ్చుకున్నారు. వారి వారసులు కూడా క్రియాశక్తి వంశస్తులనే గురువులుగా చేసుకొని శైవమతాన్ని అనుసరించారు. రెండవ దేవరాయలు శ్రీశైలంలోని ముఖ మండపాన్ని నిర్మించాడు. అలాగే సామాన్య ప్రజలు కూడా సాధారణ భక్తిపరమైన శైవ వైష్ణవాలనే అనుసరించారు.

వీరశైవ మతం: రెండవ దేవరాయల కాలం వరకు విజయనగర ప్రభువులు పాశుపత శైవమతాన్ని అవలంబించారు. కాని రెండవ దేవరాయలు వీరశైవ మతాన్ని అనుసరించినట్లు ఆధారాలున్నాయి. కన్నడ ఆర్కలాజికల్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ డా॥ శ్యామశాస్త్రి 1923లో ఆర్కలాజికల్ రిపోర్టులో ప్రకటించిన 92వ నెంబరు గల కన్నడ శాసనం రెండవ దేవరాయలు వీరశైవ మతస్తుడని తెలుపుతోంది. ఈ శాసనం షిమోగా జిల్లాలోని కెంగిపురంలోని వీరభద్ర ఆలయపు ప్రాకారంలోని ఒక రాతిపై చెక్కి ఉంది. ఇది శక సంవత్సరం 1340 పుష్యమాసం 15 చంద్రపక్షం 15వ రోజున అంటే 1419వ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన వేయబడింది. డా శ్రీకాంతశాస్త్రి కూడా పరిశీలించి రెండవ దేవరాయలు వీరశైవ మతస్థుడని నిర్ధయించారు. ఈ శాసనంలో రెండవ దేవరాయలుకు వీరశైవాగమ సారసంపన్న అనే బిరుదు ఉన్నట్లు రాసి ఉంది. ఇంకా మరికొన్ని శాసనాలు కూడా అతడు వీరశైవ మతాన్ని అనుసరిస్తున్నట్లు తెలుపుతున్నాయి. ఎపిగ్రఫీ అండ్ కర్ణాటికాలోని 238, 239 నెంబర్లు కలిగిన శాసనాలు నంజప్పన మారురాయ, బసవశంకర శెట్టినాయక అనే వారు రెండవ దేవరాయల కుమారులని తెలుపుతున్నాయి. ఈ రెండు పేర్లు వీరశైవుల పేర్లు. విరూపాక్ష పండితుడు రాసిన చెన్నబసవపురాణం రెండవ దేవరాయలు తన కుమార్తెను వీరశైవుల జంగమ స్థలానికి చెందిన వీరన్న ఒడయార్‌కిచ్చి వివాహం చేశాడని తెలుపుతోంది. క్రీ.శ.1650 సంవత్సరానికి చెందిన గురురాజ చరిత్ర క్రీ.శ.1672వ సంవత్సరానికి చెందిన భైరవేశ్వర కావ్య కధాసూత్ర రత్నాకరం 1763వ సంవత్సరానికి చెందిన చోర బసవరాజ చరిత్ర అనే గ్రంధాలు రెండవ దేవరాయలకు ప్రభులింగలీలపై ఉన్న గాఢాభిమానం వల్ల వీరశైవ మతాన్ని స్వీకరించాడని తెలుపుతున్నాయి. రెండవ దేవరాయలు తన నాణేలపై నీలకంఠుడు నంది చిత్రాలను ముద్రించాడు. ఇవి రెండూ వీరశైవ చిహ్నాలే. ఈ ఆధారాలన్నీ రెండవ దేవరాయలు వీరశైవ మతాన్ని స్వీకరించాడని చాటుతున్నాయి. అతని తర్వాత రాజ్యానికి వచ్చిన అతని వారసులైన మల్లికార్జునరాయలు, విరూపాక్షరాయలు కూడా వీరశైవ మతాన్ని అనుసరించారు.

మల్లిఖార్జునరాయలు: మల్లిఖార్జునరాయలు ఏ మతాన్ని అనుసరించాడో స్పష్టంగా తెలియదు. అతని తండ్రి రెండవ దేవరాయలు వీరశైవ మతస్థుడు కనుక మల్లిఖార్జునరాయలు కూడా సహజంగానే తండ్రి మతాన్ని కొనసాగించి. ఉంటాడని గుల్బర్గాలోని సరనబసవేశ్వర కాలేజీలో చరిత్ర అధ్యాపకులైన బి.వి.శ్రీనివాసరావు అభిప్రాయం వెలువరించారు. మల్లిఖార్జునరాయల కుమారులు నంజరాజ ఒడయార్, దీపన్న ఒడయార్లు కూడా వీరశైవులే. ఒడయార్ అనే పేరు కర్ణాటకంలో వీరశైవులు ధరించారు. కనుక మల్లికార్జునరాయలు కూడా వీరశైవుడనే అభిప్రాయానికి వచ్చారు.

రెండవ విరూపాక్షరాయలు: మల్లిఖార్జునరాయల తర్వాత సింహాసనానికి వచ్చిన రెండవ విరూపాక్షరాయలు కూడా వీరశైవ మతానికి చెందినవాడని కొన్ని ఆధారాలు లభించాయి. అనంతాచారి రచించిన ప్రసన్నామృతం అనే వీరశైవ గ్రంధం విరూపాక్షరాయలుకు విరూపన్న అనే బిరుదు ఉందని, అతడు వీరశైవుడని తెలుపుతోంది. తుంకూరు తాలూకాలోని యెడియూర్‌లో విరూపాక్షరాయలు సిద్ధలింగేశ్వర ఆలయాన్ని నిర్మించాడు. అది వీరశైవ

దేవాలయం. విరూపాక్షరాయల కాలంలో తొంటదసిద్ధేశ్వర, గుమ్మలపురద సిద్ధలింగేశ్వర, కల్లరస మల్లిఖార్జున, సనదశివయోగి, లింగకవి, నీలకంఠాచార్య, విరక్త తొందరాయ, దొడ్డలింగేశ్వర అనే వీరశైవ కవులు విరూపాక్ష రాయల కాలానికి చెందినవారు. వారు వీరశైవ కావ్యాలు రచించారు. సమకాలికుడైన విరూపాక్షరాయల ఆదరాభిమానాలు వారికి ఉన్నాయి. కనుక విరూపాక్షరాయలు వీరశైవమతాన్ని అనుసరించాడని కర్ణాటక పండితులు భావించారు. మొత్తం మీద రెండవ దేవరాయలు, మల్లిఖార్జునరాయలు, విరూపాక్షరాయలు వీరశైవ మతాన్ని అనుసరించినందువల్ల విజయనగర రాజ్యంలో 68 సంవత్సరాలు వీరశైవమతం రాజ మతంగా కొనసాగిందని ఆ పండితులు అభిప్రాయపడ్డారు.

విరూపాక్షరాయలు వైష్ణవ మతానికి మారడం: విరూపాక్షరాయలు మొదట వీరశైవమతాన్ని అనుసరించినా, అతని చివరి కాలంలో వైష్ణవ మతస్తుడుగా మారాడు. విజయనగర చక్రవర్తులలో వైష్ణవమతానికి మారిన మొట్టమొదటి వాడు విరూపాక్షరాయలు. అతడు వైష్ణవ మతానికి మారిన కారణాలను రామానుజ శాఖకు చెందిన వైష్ణవ గ్రంథమైన అనంతాచార్యుని ప్రసన్నామృతం వివరించింది. విరూపాక్షరాయల కాలంలో రామానుజ శాఖకు చెందిన రామానుజాచార్య మతస్థులు అనేకమంది శూద్రులను రామానుజ మతంలోకి మార్చారు. వారిలో కొందరు శూద్రులు రామానుజ మతపు బ్రాహ్మణులుగా కూడా వ్యవహరించారు. ఈ కాలంలో రామానుజ మత ప్రచారం చేసిన వారిలో ఎట్టూరు సింగరాచార్యుడు ఒకరు. అతనికి నరసింహాచార్యులు అని కూడా పేరుండేది. అతడు చాలా బీదవాడు. కనుక ధనాన్ని సంపాదించే ఉద్దేశంతో అతడు తన తమ్ముడైన శ్రీరంగాచారిని తోడు తీసుకొని విజయనగరం చేరాడు. ఆ కాలంలో విజయనగర రాజ్యాన్ని విరూపాక్ష రాయలు పాలించేవాడు. విరూపాక్ష రాయలు రాజ్యానికి వచ్చిన తొలి రోజుల్లో అతని దాయాదులు అతనిపై కుట్రలు చేసి పారదోలారు. విరూపాక్ష రాయలు విజయనగరం వదలివెళ్లి సైన్యాలను సమకూర్చుకొని ఒక రాత్రి నగరంపై దండెత్తి రాజభవనంలో ప్రవేశించి తనను సింహాసన భ్రష్టుణ్ణి చేసిన దాయాదులనందరినీ సంహరించాడు. తిరిగి సింహాసనాన్ని అధిష్టించి పాలించడం మొదలు పెట్టాడు. కాని అతడు చంపిన దాయాదులందరూ పిశాచాలు, భూతాలై రాజభవనంలో ప్రవేశించి విరూపాక్ష రాయలును బాధించసాగారు. పిశాచాల బాధ తట్టుకోలేక విరూపాక్షరాయలు తన రాజభవనాన్ని వదలివేసి నూతన భవనాన్ని నిర్మించుకొని అక్కడ నివసించసాగాడు. అయినప్పటికీ భూతాలు పాత రాజభవనాన్ని వదలలేదు. అవి ఆ భవనంలో కాపురం పెట్టాయి. విరూపాక్ష రాయలు వాటిని వదలించడానికి అనేక భూత శాంతులు చేశాడు. కాని అవి వెళ్లిపోలేదు. అవి నిత్యం కోలాహలం చేస్తూ చుట్టూ ఉండే ప్రజలకు శాంతిని లేకుండా చేస్తూ ఉండేవి.

ఆ పరిస్థితుల్లో నరసింహాచార్యులు, అతని తమ్ముడు శ్రీరంగాచార్యులు విజయనగరం చేరి అదే రాజభవనం అనుకొని పిశాచాలున్న భవనంలోకి ప్రవేశించారు. అప్పుడు వారి చేతిలో రామాయణ గ్రంథం ఉంది. ఆ సమయంలో భూతాలు ఆ భవనంలో సభ తీరి ఉన్నాయి. ఆచార్యులను చూడగానే భూతాల మంత్రి వారి వద్దకు వచ్చి వారిని గురించిన వివరాలు అడిగాడు. వారి విషయం విని ప్రతిరోజు రాత్రి రహస్యంగా వచ్చి రామాయణాన్ని చదివి తమకు వినిపించమని, అందుకు రోజుకు ఒక బంగారునిక్ష ఇస్తామని చెప్పాడు. దాంతో నరసింహాచార్యులు, అతని తమ్ముడు ప్రతిరోజు రాత్రి వచ్చి రామాయణ పారాయణం చేసి వారికి వినిపించారు. చివరి రోజున శ్రీరామపట్టాభిషేకం చదువుతామని ఆ రోజున వేడుక జరపాలని, అందుకు ఏర్పాట్లు చేయమని వారు భూతాలకు చెప్పారు. రామపట్టాభిషేకం చదవడం పూర్తికాగానే భూతాలు అన్నదమ్ములకు అనేక కానుకలు ఇచ్చి వారి కథను చెప్పారు. తామంతా విరూపాక్షరాయల దాయాదులమని, తమను అతడు సంహరించాడని, అందువల్ల తాము భూతాలయ్యామని, వారు చదివిన రామాయణం విన్నందున తమ పాపాలు పటాపంచలయ్యాయని, తాము స్వర్గానికి వెళ్తున్నామని చెప్పి భూతాలు మాయమయ్యాయి. రాజభవనం ప్రశాంతంగా మారిపోయింది. దాని చుట్టూ నివసించే ప్రజలు అందుకు ఆశ్చర్యచకితులై విషయం తెలుసుకొని విరూపాక్ష రాయలుకు తెలిపారు రాయలు అన్నదమ్ములను రాజాస్థానానికి పిలిపించి వారిని వివరాలు అడిగాడు. వారు తాము ఎట్టూరు గ్రామ వాసులమని, శ్రీశైల పురాణం వంశస్తులమని, శ్రీశైల పురాణాన్ని తిరుపతి శ్రీవేంకటేశ్వరుడు తన తాత అని అంటాడని, అతడే రామానుజునికి 24 విధాలుగా రామాయణాన్ని చెప్పాడని, తాము రాజాదరణ పొందాలని అదే రాజభవనం అనుకొని అక్కడికి వెళ్లామని, తాము పారాయణ చేసిన రామాయణం విని భూతాలు వెళ్లిపోయాయని వివరించారు. అదంతా వినేటప్పటికి విరూపాక్షరాయలుకు రామాయణం మీద, శ్రీరాముని మీద,

నరసింహాచార్యుల మీద ఎక్కడలేని గౌరవ ప్రపత్తులు కలిగాయి. వెంటనే అతడు తన వీరశైవ మతాన్ని వదలివేసి వైష్ణవ మతాన్ని స్వీకరించాడు. అంతేగాక తనకు కూడా రామాయణాన్ని చదివి వినిపించమని కోరాడట. నరసింహాచార్యులు రామాయణ పారాయణ చేశాడు. పట్టాభిషేక సర్గ అయిపోగానే విరూపాక్షరాయలు నరసింహాచార్యులుకు బంగారంతో అభిషేకం చేశాడట. దాంతో నరసింహాచార్యులు విజయనగరంలో నివసించి అనేక మందిని వైష్ణవులుగా మార్చాడని, రాజు వైష్ణవ మతంలోకి మారగానే అనేక మంది ఉన్నతోద్యోగులు, ప్రజలు వైష్ణవులుగా మారారని ప్రసన్నామృత గ్రంథం తెలుపుతోంది. అంతేగాక విరూపాక్షరాయలు నాణేలపై ముద్రించే విరూపాక్ష అనే ఆఖ్యను తొలగించి శ్రీరామ అనే ఆఖ్యను కూడా రాయించాడట. ఈ విధంగా విరూపాక్షరాయలు వైష్ణవ మతంలోనికి మారగానే విజయనగర ఆస్థానం వైష్ణవ మతానికి నిలయం అయింది. సంగమ వంశం తర్వాత వచ్చిన సాళువ, తుళువ, అరవీటి వంశాలు కూడా వైష్ణవ మతాన్ని రాజమతంగా కొనసాగించారు.

సాళువ నరసింహరాయలు: సాళువ నరసింహరాయలు తిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుడు. తిరుపతి స్వామిపై అమితభక్తి విశ్వాసాలు కలవాడు. ఇతని కాలంలోనే తిరుపతి దేవాలయం సర్వముఖాభివృద్ధి ప్రారంభం అయింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆలయం మొదట శైవ దేవాలయం అని, అందులో ఉన్న విగ్రహం వీరభద్రునిదని, ఆ దేవుని వీరేశ్వర అని పిలిచేవారని, రామానుజాచార్యులు వీరేశ్వరుని వేంకటేశ్వరునిగా మార్చి శైవ ఆలయాన్ని విష్ణు ఆలయంగా చేశాడని బి.వి.శ్రీనివాసరావు అనే పండితుడు వివరించాడు. 11వ శతాబ్దంలో శ్రీశైలంలోని సూర్యసింహాసన పండితారాధ్య పీఠాధిపతి వీరశైవ మత రూపకర్తలలో ఒకడుగా భావింపబడే శ్రీపతి పండితుడు రాసిన శ్రీకరభాష్యంలో వీరేశ్వరుని వెంకటేశ్వరునిగా రామానుజాచార్యులు మార్చాడని అర్థం వచ్చే శ్లోకం ఉన్నదని మైసూరు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డా టి.జి.సిద్ధప్పరాధ్య అనే పండితుడు అన్నాడు.

తిరుపతి వేంకటేశ్వరుని విగ్రహంలో శివ మతానికి చెందిన చిహ్నాలు అయిన శివధర్మ, నాగాభరణాలు, నెత్తిపైన శివజరాజూటం, వేంకటేశ్వరుని చేతిలో శివలింగం ఉన్నాయని, వేంకటేశ్వరుని కళ్ళు తిర్ధిని ముద్రలో ఉన్నాయని, ఈ రోజున వేంకటేశ్వరుని చేతిలో ఉన్న శంఖుచక్రాలు మొదట లేవని తర్వాత అవి పెట్టబడ్డాయని శ్రీనివాసరావు వివరించారు.

రెండవ దేవరాయల కాలంలో విజయభూపతి కుమారుడైన శ్రీగిరిభూపాలుడు చంద్రగిరి పాలెగాడుగా ఉండేవాడు. అతని కాలంలో తిరుపతిలో శైవులకు వైష్ణవులకు దేవాలయాన్ని గురించి వివాదం రాగా తిప్పనాగమ నాయక్ అనే అతన్ని వివాదాన్ని తీర్చడానికి రెండవ దేవరాయలు పంపాడని క్రీ.శ.1442వ సంవత్సరం నాటి చంద్రగిరి శాసనాలు తెలుపుతున్నాయి. ఆ వివాదంలో తిరుపతి దేవాలయం, వైష్ణవ దేవాలయం అని నిర్ణయింపబడింది. కనుక వీరభద్రుని విగ్రహం వేంకటేశ్వరుని విగ్రహంగా పూర్తిగా మారిపోయి అది వైష్ణవ దేవాలయంగా స్థిరపడిందని శ్రీనివాసరావు అభిప్రాయం. తమిళ కవి అయిన అరుణగిరినాధుడు తిరుపతి వేంకటేశ్వరుని సుబ్రహ్మణ్యస్వామి అని కీర్తించాడు. అలాగే 16వ శతాబ్దానికి చెందిన తాళ్లపాక అన్నమాచార్యునికి సమకాలికుడు చిలకలవాడి వీరశైవానికి చెందిన వీరశైవయోగి అయిన శ్రీనిజగుణ శివయోగి కూడా తిరుపతి వేంకటేశ్వరుడు వీరభద్రుడని కీర్తించాడని కూడా శ్రీనివాసరావు తెలిపారు. రామానుజ మతస్థుడైన సాళువ తిప్పదేవునికి రెండవ దేవరాయలు తన కుమార్తె హరిమను ఇచ్చి వివాహం చేశాడు. అందువల్ల శివాలయాన్ని వైష్ణవ ఆలయంగా మార్చినా కూడా రెండవ దేవరాయలు వ్యతిరేకించలేదని కూడా వ్యాఖ్యానించాడు. కనుక నేటి తిరుపతి వేంకటేశ్వరుని విగ్రహం, మొదట వీరభద్రుని విగ్రహం అని సిద్ధాంతీకరించారు.

సాళువ వంశస్థులు మొదటి నుండి వైష్ణవులు. కనుక సాళువ నరసింహరాయలు తిరుపతి దేవుని భక్తుడై తిరుపతి దేవాలయ అభివృద్ధికి కృషి చేశాడు. క్రీ.శ.1470వ సంవత్సరపు తిరుపతి శాసనం తిరుమలలో సాళువ నరసింహరాయలు, అతని భార్య, ఇద్దరు కుమారులు 4 స్తంభాల మంటపాన్ని నిర్మించినట్లు తెలుపుతోంది. క్రీ.శ.1471 సంవత్సరపు శాసనం సాళువ నరసింహుని సేనాధిపతి ఈశ్వరనాయకుడు తిరుమలలో నిర్మాణం జరిపినట్లు తెలుపుతోంది. క్రీ.శ.1472వ సంవత్సరపు శాసనం సాళువ నరసింహరాయలు తిరుమల ఆలయానికి గోపురాన్ని నిర్మించినట్లు తెలుపుతోంది. మంధినమరం రామానుజకూటాన్ని సాళువ నరసింహరాయలు నిర్మించాడని మరియొక శాసనం తెలుపుతోంది. అదే శాసనం చంద్రగిరి కోటను కూడా సాళువ నరసింహరాయలే నిర్మించాడు. ఈ కాలంలో తిరుపతిలో వేంకటేశ్వరస్వామిని అభిషేకించే ఆచారం కూడా ప్రారంభం అయింది. ఈ అభిషేకాన్ని తిరుమంజనం అని పునుగుకాప్పు అని పులుగుకాప్పు అని పిలిచేవారు. అభిషేకంలో చందనం,

రోజ్‌వాటర్, నూనెలు వాడేవారని తిరుపతిలోని అనేక శాసనాలు తెలుపుతున్నాయి. అభిషేకంలో ప్రతిరోజు అభిషేకం చేయడానికి కావలసిన ఏర్పాట్లు చేసినట్లు ఆ శాసనాలు తెలుపుతున్నాయి. ఆగమ శాస్త్రాల ప్రకారం ప్రతి దేవాలయంలో అభిషేకం జరుగుతుంది. అదేవిధంగా తిరుమల దేవాలయంలో కూడా నిత్య అభిషేకం జరుపుతున్నట్లు సూర్యకుమారి అనే పండితురాలు తెలిపారు. మొత్తం మీద సాళువ వంశస్థులందరూ వైష్ణవులని స్పష్టమవుతోంది. వారి కాలంలోనే తిరుపతి దేవాలయం మంచి ప్రాచుర్యంలోకి వచ్చిందని చెప్పవచ్చును. తిరుపతి శ్రీవైష్ణవులకు ప్రధాన కేంద్రమైంది. తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి జరిగే కొన్ని ఉత్సవాలు, ఉభయులు సాళువ వంశస్థుల కాలంలో ఏర్పాటు చేయబడ్డాయి. ఈ సాంప్రదాయాలన్నీ వైష్ణవాచార్యులు చెప్పే వైఖానస సాంప్రదాయాలకు అనుగుణంగా ఏర్పాటయ్యాయి. సాళువ నరసింహరాయల గురువు వ్యాసతీర్థులు. ఇతడు ద్వైతాచార్యులు. సాళువ నరసింహరాయల కోరికపై అతడు కొన్నాళ్లు తిరుపతి దేవాలయంలో అర్చకత్వం చేశాడు. సాళువ నరసింహరాయలు విజయనగర సింహాసనం అధిష్టించిన తర్వాత వ్యాసతీర్థులు కూడా చంద్రగిరి నుండి విజయనగరం చేరాడు. నరసింహరాయల మరణం తర్వాత అతడు తుళువ వంశానికి గురువయ్యాడు. శ్రీకృష్ణదేవరాయలు గోవిందదేశికుని తొలగించి వ్యాసతీర్థులను రాజగురువు పీఠంలో నిలిపాడు. వ్యాసతీర్థులకు తాతాచార్యులని కూడా పేరుంది.

తుళువ వంశం: తుళువ వంశం వారందరూ వైష్ణవ మతాన్ని అనుసరించారు. వీరనరసింహరాయలు కృష్ణదేవరాయలు ఈ పేర్లు కూడా వైష్ణవ నామాలే. కృష్ణదేవరాయలు అతని తమ్ముడు అచ్యుత దేవరాయలు గొప్ప వైష్ణవ భక్తులు. వారు తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తులు. కృష్ణదేవరాయలు తన ఇద్దరు దేవేరులతో తిరుపతిలో కంచు విగ్రహాలు వేయించుకున్నాడు. అంజలి ముద్రలతో అచ్యుత దేవరాయలు, అతని దేవి విగ్రహాలు కూడా తిరుమల ఆలయంలో ప్రతిష్టించబడ్డాయి. హంపిలో వారు విఠల్‌స్వామి, కృష్ణస్వామి కోదండ చక్రతీర్థ రామాలయాలను నిర్మించారు. హంపిలో పెద్ద నరసింహ విగ్రహం, హనుమంతుని విగ్రహాలు ప్రతిష్టింపబడ్డాయి ఇవన్నీ విజయనగర రాజ్యంలో వైష్ణవ మతం మంచి ఉచ్ఛదశను అందుకుందని చాటుతున్నాయి. వారి సామంత ప్రభువులు కూడా వైష్ణవ మతాన్ని అవలంబించారు. నాటి కవులు కూడా వైష్ణవ మతం వైపు మొగ్గారు. తెనాలి రామలింగడు మొదట శైవుడని, తర్వాత వైష్ణవుడై తెనాలి రామకృష్ణుడు అని పేరు మార్చుకున్నాడని అంటారు

కృష్ణదేవరాయలు తిరుపతి వేంకటేశ్వరుని భక్తుడైనప్పటికీ మధ్వమతాచార్యుడైన తాతాచార్యుల వారి వద్ద దీక్ష పుచ్చుకొని అతని శిష్యుడయ్యాడు. తాతాచార్యుల వారు తుళువ వంశానికి రాజగురువయ్యాడు. కృష్ణదేవరాయలు అల్లుడు అళియరామరాయలుకు కూడా తాతాచార్యులే గురువు. కృష్ణదేవరాయల ఆస్థానకవి అల్లసాని పెద్దన గురువు శఠగోపయతులు కూడా వైష్ణవుడే. తాతాచార్యులు శఠగోపయతుల సహాయంతో దొడ్డయాచార్యుడు అనే వైష్ణవ మతస్థుడు స్మార్త మతస్థుడైన అప్పయ దీక్షితులను ఓడించి శైవక్షేత్రం అయిన చిదంబరంలో గోవిందస్వామి పూజా ఉత్సవాలను ప్రవేశపెట్టాడట. వైష్ణవ మతంలో పుష్టి పద్ధతిని ప్రచారం చేసే వల్లభాచార్యుడు కృష్ణదేవరాయల ఆస్థానాన్ని దర్శించి వ్యాసరాయలును ఓడించి వైష్ణవులకు ముఖ్య ఆచార్యునిగా ఎన్నికైనట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. వల్లభాచార్యుని ప్రతిభకు మెచ్చి కృష్ణదేవరాయలు అతనికి కనకాభిషేకం చేయించాడు. కృష్ణదేవరాయల ఆస్థానాన్ని దర్శించి వ్యాసరాయలును ఓడించి వైష్ణవులకు ముఖ్య ఆచార్యునిగా ఎన్నికైనట్లు ఒక కథ ప్రచారంలో ఉంది. వల్లభాచార్యుని ప్రతిభకు మెచ్చి కృష్ణదేవరాయలు అతనికి కనకాభిషేకం చేయించాడు. కృష్ణదేవరాయల ఆస్థానాన్ని చైతన్య ప్రభువు కూడా దర్శించాడని ఒక గాథ ఉంది. కృష్ణదేవరాయల కాలంలో పండరీపురంలోని విఠల్‌స్వామి దేశమంతటా ప్రాచుర్యం పొందాడు. విజయనగరంలో కూడా విఠల్‌స్వామి పూజ ప్రారంభమైంది. కనుక కృష్ణదేవరాయలు విఠల్‌స్వామి ఆలయాన్ని నిర్మించాడు. మొత్తం మీద కృష్ణదేవరాయల కాలంలో విజయనగరంలో వైష్ణవ మతం తారాస్థాయిని అందుకుంది. అతని తర్వాత అచ్యుత రాయలు, తర్వాత సదాశివరాయలు కూడా వైష్ణవ మతాన్ని కొనసాగించారు.

ఆరవీటి వంశం: ఆరవీటి వంశస్థులు రామానుజ మతాన్ని అనుసరించారు. తిరుమలరాయలు, అతని దేవేరి శిలా ప్రతిమలు తిరుమల ఆలయంలో ఉన్నాయి. అతడు మండపం నిర్మించాడు. దానికి తిరుమలరాయ మండపం అని పేరు. శ్రీరంగరాయల గురువు తిరుమల తాతాచార్యులు. రెండవ వెంకటపతిరాయలు అంజలి ముద్రలో తన కాంస్య ప్రతిమను తిరుమల దేవాలయంలో ప్రతిష్టించుకున్నాడు. రెండవ వెంకటపతిరాయలు సాంప్రదాయంగా వచ్చే విరూపాక్షుని పేరు తొలగించి శాసనాలలో తిరుపతి వెంకటేశ్వరుని పేరును రాయించాడు

నాణేలపై కూడా వెంకటేశ్వరాయ నమః అని రాయించాడు. ఇతని ఆస్థానంలో అతని గురువైన తాతాచార్యులు కాక తిరుమల శ్రీనివాసాచార్యులు, కందాళ అప్పలాచార్య, తాళ్లపాక తిరుమలాచార్యుడు ఉండేవారు. వారంతా వైష్ణవ విద్యాంసులు. ఇతనికి సమకాలికుడైన అప్పయదీక్షితుడు దొడ్డయాచార్యుని చేతిలో ఓడిపోవడంతో శైవమతం పూర్తిగా మరుగున పడిపోయి వైష్ణవ మతం గొప్ప వైభవాన్ని అనుభవించింది. అరవీటి వంశస్థుల సామంతుడు మట్ల అనంతరాజు తిరుమలకు మెట్లు కట్టించాడు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయానికి గోపురం నిర్మించాడు. వారి ఇతర సామంతులు కూడా వైష్ణవాన్ని ఆదరించారు. ఈ విధంగా విరూపాక్షరాయల కాలంలో రాజకుటుంబంలో ప్రవేశించిన వైష్ణవ మతం చివరి వరకు కొనసాగింది. శివాలయాలలో తంబిళ్ల వారు వైష్ణ దేవాలయాలలో నంబివారు పూజారులుగా ఉండేవారు.

విజయనగర రాజ్య మత విధానం-పరమత సహనం: విజయనగర రాజుల తొలి గురువైన విద్యారణ్యుల వారు అద్వైత సిద్ధాంతవేత్త. పరమత సహని. అతడు అన్ని మతాలను ఆదరించాలని చాటాడు. ఆయన విధానాన్ని హరిహర బుక్కరాయలు అనుసరించారు. అందువల్ల విజయనగర రాజులు పరమత సహనం ప్రదర్శించడమే గాక పరమత రక్షణకు కూడా నడుం కట్టారు. ఈ మత విధానాన్ని మొదటి బుక్కరాయలు రూపొందించాడు. అదే విధానాన్ని చివరి వరకు విజయనగర సార్వభౌములు కొనసాగించారు.

మొదటి బుక్కరాయల కాలంలో వైష్ణవులకు, జైనులకు వివాదాలు వచ్చాయి. వైష్ణవులు పెనుగొండలోని ఒక జైన దేవాలయాన్ని ధ్వంసం చేశారు. చిదంబరంలోని జైనులను అక్కడి వైష్ణవులు బాధించసాగారు. ఈ రెండు దుశ్చర్యలు బుక్కరాయలుకు నివేదింపబడ్డాయి. అతడు వైష్ణవులను మందలించి పెనుగొండలో ధ్వంసం చేయబడిన జైన దేవాలయాన్ని వైష్ణవులు పునర్నిర్మాణం చేయాలని తీర్పు ఇచ్చాడు..అంతేగాక ఉభయ మతాల వారినీ చేతులు కలిపి సహజీవనం చేయమని చెప్పాడు. రెండు మతాలకు భేదం లేదని, ఒకటేనని హితబోధ చేసి జైనుల చేతులను తీసుకొని వైష్ణవుల చేతులలో పెట్టి ఉభయులు కలిసి జీవించమని కోరాడు. అంతేగాక తాను చేసిన తీర్పును శాసనం రాయించి రాజ్యంలోని ముఖ్య ప్రదేశాలలో ప్రతిష్ఠించి ప్రజలందరికీ తెలియజెప్పి అందరూ పరమత సహనం పాటించాలని శాసించాడు. బుక్కరాయల శాసనాన్ని తర్వాత విజయనగర ప్రభువులు శిరసావహించి పరమత సహనాన్ని చూపారు. కేవలం హిందూ మతశాఖల మీదే కాక అన్ని మతాల పట్లా సమభావాన్ని ప్రదర్శించారు. మహమ్మదీయ, క్రైస్తవ మతాల యందు కూడా వారు ఇదే భావాన్ని ప్రకటించారు. అందువల్ల విజయనగర సామ్రాజ్యంలో మహమ్మదీయ, క్రైస్తవ మతస్థులు కూడా నిర్భయంగా జీవించారు. విజయనగరంలో ఎవరైనా ఏ మతస్థుడైనా, క్రైస్తవుడైనా, యూదుడైనా, ముస్లిం అయినా రావచ్చు, పోవచ్చు, నిరభ్యంతరంగా జీవించవచ్చు. అసలు విజయనగరంలో ఎవరూ నీ మతమేమిటి అని అడగరని బార్బోసా రాశాడు. పక్కన బహమనీ రాజులు మతతత్వ రాజ్యంతో రాజ్యం చేస్తుండగా విజయనగర ప్రభువులు అలా సర్వమతాలను సమదృష్టితో ఆదరించడం విదేశస్తులను సంభ్రమాశ్చర్యాలతో ముంచెత్తింది. దీనిని బట్టి విజయనగర ప్రభువులకు మతమౌఢ్యం లేదని ఆ ఛాయలు ఎక్కడా కనిపించవని రోమిల్లా థాపర్ వ్యాఖ్యానించారు.

చిన్నపాటి సంఘర్షణలు: అయితే అప్పుడప్పుడు మతమౌఢ్యుల వలన చిన్న చిన్న మత ఘర్షణలు జరుగుతుండేవి. వెంటనే విజయనగర రాజులు వారిపై చర్యలు తీసుకొని అన్ని మతాల వారిని రక్షించేవారు. అలాంటి సంఘటనలు కూడా మనకు శాసనాల వల్ల తెలుస్తున్నాయి. వైష్ణవ మతంలో శాఖాభేదాలు ఉండేవి. అలాగే శైవులలో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులు అని రెండు శాఖల వారున్నారు. బ్రాహ్మణేతరులలో లింగాయతులు, లింగధారులు కానివారు అని మళ్లీ రెండు శాఖలున్నాయి. శైవ, వైష్ణవ మతాల మధ్య ఇంకా చిన్నపాటి ఘర్షణలు జరుగుతూనే ఉన్నవి. ఈ కాలంలో అప్పయ్య దీక్షితులు గొప్ప శైవ మతాచార్యుడు. తాతాచార్యుల వారు గొప్ప వైష్ణవ మతాచార్యుడు. వీరిద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. అందులో తాతాచార్యుల వారు ఓడిపోయారు. ఓటమి సహించలేక అప్పయ్య దీక్షితులను చంపించడానికి ప్రయత్నించాడని అంటారు. ఒకటవ రంగరాయల కాలంలో అనంతపురం జిల్లాకు చెందిన శైవులైన హండెనాయకులు గోల్కొండ నవాబు సహాయంతో అహోబిలంలో నరసింహ ఆలయాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించారు. శ్రీశైలంలో వీరశైవ మతాభిమాని శాంతలింగయ్య శివలోకం ప్రాప్తిస్తుందని జైనులను హింసించసాగాడు. అది తెలిసి కృష్ణదేవరాయలు వెలుగోటి తిమ్మనాయకుని పంపి అతనిని దండించి జైనులను కాపాడాడు.

బుక్కరాయలు అన్ని మతాలు ఒకటే, ఎవరూ ఇతర మతాలను నాశనం చేయరాదని రాజాజ్ఞ జారీ చేశాడు.

జైన మతానికి రక్షణ ఇస్తానని వాగ్దానం చేశాడు. శిధిల జైన ఆలయాలకు దానాలుచేసి మరమ్మతులు చేయించాడు. శ్రావణ బెళగొళలోని జైన ఆలయాలకు రక్షణ కల్పించాడు. జైనులు సామ్రాజ్యపు ఉత్తర పశ్చిమ ప్రాంతాలలో ఎక్కువగా ఉండేవారు. బుక్కరాయల మంత్రి అయిన బెచప్ప, అతని కుమారుడు ఇరుగప్ప జైనులు. వీరు రెండవ హరిహరరాయల వద్ద కూడా మంత్రులుగా పనిచేశారు. రెండవ హరిహరరాయలు కందెనవోలులో చైత్యాలయం నిర్మించాడు. విజయనగరం పాన్‌సుపారి బజారులో పార్శ్వనాధుడికి మరొక ఆలయం నిర్మించాడు. మత ఛాందసులను ఖండించాడు. ఈ మొదటి విజయనగర రాజులందరూ శైవులు, విరూపాక్షుని భక్తులు. రెండవ దేవరాయలు హిందూమత శాఖలయందేగాక ముస్లిం మతాన్ని కూడా ఆదరించాడు. ముస్లింలను తన సైన్యంలోకి తీసుకున్నాడు. వారికి మసీదులు నిర్మించుకోడానికి అనుమతి ఇచ్చాడు. తన దర్బారులో ఒక వేదికపై ఖురాను ప్రతిని ఉంచేవాడు. మహమ్మదీయులకు జాగీరులు ఇచ్చాడు. సాదత్ ముల్క్ అనే ముస్లిం సరదారునికి పొణ్యం జాగీరును ఇచ్చాడు. దానిని అతని వంశస్తులు వంద సంవత్సరాలు క్రీ.శ.1393 నుండి 1497 వరకు అనుభవించారు. సాళువ నరసింహరాయలు ఏణప్పాడి, పొణుపరప్పు అనే పేరు గల జైన దేవాలయాలను బాగు చేయించి చంద్రగిరి రాజ్యంలో పన్నుల భారం వల్ల పాడుబడిన జైన, బౌద్ధ దేవాలయాల భూములకు భూమిశిస్తు ముదరా ఇచ్చాడు.

వైష్ణవులు: శ్రీకృష్ణదేవరాయలు వైష్ణవుడు అయినప్పటికీ అతడు శైవ, వైష్ణవ భేదం లేకుండా అన్ని దేవాలయాలను దర్శించి దానాలు చేశాడు. సింహాచలం, అహోబిలం, కాళహస్తి, శ్రీశైలం, అమరావతి దేవాలయాలకు అనేక దానాలు చేసి మంటపాలు, గోపురాలు నిర్మించాడు. అతని రాజ్యంలో నీది ఏ మతం అని ఎవరూ అడగరని, అందరూ తమ మత ధర్మాలను అనుసరిస్తూ స్వేచ్ఛగా జీవించవచ్చని బార్బొసా రాశాడు. కృష్ణదేవరాయలు జినకంచిలోని త్రైలోకనాథ జైన దేవాలయానికి భూమిని దానంగా ఇచ్చాడు. నఱచై, కరందైరి, నాగరకోయిల్ జైన దేవాలయాలకు కూడా దానాలు ఇచ్చాడు. కృష్ణరాయల కాలంలో శ్రీశైలంలో శాంతిలింగయ్య అనే శైవమతస్థుడు అక్కడి జైనుని హింసించాడు. అది తెలిసిన రాయలు వెలుగోటి తిమ్మానాయకుని పంపి అతనిని దండించి జైనులకు రక్షణ కల్పించాడు. కృష్ణదేవరాయలు ముస్లింలను కూడా తన సేనలోకి తీసుకున్నాడు. వారికి ప్రత్యేకంగా ఒక పేట ఉండేదట. పేస్ మూరిష్ పేటను వర్ణించాడు. కృష్ణదేవరాయలు గుల్బర్గా బాలసుల్తాన్‌ను సింహాసనమెక్కించి యువన రాజ్యస్థాపనాచార్య అనే బిరుదు పొందాడు.

అచ్యుతదేవరాయలు వైష్ణవుడు. విరలేశ్వరుని సన్నిధానంలో వైష్ణవ బ్రాహ్మణులకు దానాలు చేశాడు. సదాశివరాయలు విష్ణువు, గణేశుడు, శివుని ప్రార్థించేవాడు. రామరాయలు వైష్ణవుడు, కాని అన్ని దేవాలయాలను ఆదరించాడు. అతడు ముస్లింలకు విజయనగరంలో ఒక వాడను నిర్మించాడు. అక్కడ మసీదులు నిర్మింపజేశాడు. వారిని తన సైన్యంలో చేర్చుకున్నాడు. అతని సేనాధిపతులలో నలుగురు ముస్లింలు. వారిలో ఐన్ ఉల్ ముల్క్ అనే సేనాధిపతి బీజాపూర్ నవాబు కొలువు నుండి వచ్చాడు. వారందరికీ రామరాయలు జాగీరులు ఇచ్చాడు. దిలావర్ ఖాన్ అనే సరదారుడు రామరాయలుకు ప్రధాన కార్యకర్త. దిలావర్ ఖాన్ వద్ద సీతప్ప అనే ఒక హిందువు పని చేసేవాడు. ఖాన్ ఒక బ్రాహ్మణునికి దానం చేసి దానిని ముస్లిం భంగ పరిస్తే పంది మాంసం తిన్నట్లు, హిందువులు భంగ పరిస్తే తల్లిని, తండ్రిని కాశీలో చంపినట్లు అని కట్టడి చేశాడు. రామరాయల కాలంలో తురకవాడలో గోవులను చంపేవారు. రామరాయల తమ్ముడు తిరుమలరాయలు మొదలైన వారు ఆందోళన చేయగా వారిని రామరాయలు శాంతపరచి, ఎవరి మతాచారం వారిది, రాజులైన వారు అన్ని మతాచారాలను గౌరవించాలి అని హితవు పలికాడట. రాజు శరీరాలకు మాత్రమే రక్షకుడు కాని, వారి ఆత్మలకు కాదు అని వివరించాడు. విజయనగరంలో నివసించిన ముస్లిం సేనానులు బ్రాహ్మణులకు దానాలు ఇచ్చారు. దర్గా దగ్గర ఉండే ముస్లింలు జ్యోతిష్యం నేర్చుకొనేవారట. విజయనగర సామంతులు కూడా వారి ప్రభువులను అనుసరించి పరమత సహనం ప్రదర్శించారు. విరూరి, వేదాద్రి వైష్ణవ మతస్థుడు. వినుకొండ వల్లభరాయుడు స్మార్త మతస్థుడు. కాని వారు కూడా తమ ప్రాంతాలలో అన్ని మతాలకు స్వేచ్ఛనిచ్చారు.

క్రైస్తవ మతం: దక్షిణ భారతదేశానికి మొదటి శతాబ్దంలో క్రీస్తు శిష్యుడు సెయింట్ థామస్ వచ్చాడని, అతడు కేరళలో చనిపోయాడని అంటారు. కాని పోర్చుగీసు వారి రాకతోనే భారతదేశంలో క్రైస్తవ మతవ్యాప్తి ప్రారంభమైంది. పోర్చుగీసు వారి సంపర్కంతో విజయనగర చక్రవర్తులకు క్రైస్తవ మతంతో పరిచయం ఏర్పడింది. అందువల్ల వారు క్రైస్తవ మతాన్ని కూడా ఆదరించి తమ మత ప్రచారం చేసుకోవడానికి అనుమతి ఇచ్చారు.

క్రీ.శ.1445 నాటి ఒక శాసనం రెండవ దేవరాయల మంత్రి ఒకరు క్రైస్తవ మతస్థుడని తెలుపుతోంది. విజయనగర రాజుల మతసహనం చూసి పోర్చుగీసు వారు క్రీ.శ.1545వ సంవత్సరంలో తిరుపతి దేవాలయాన్ని దోచుకోవాలని 3 వేల సైన్యాన్ని శాంథోమ్‌కు తీసుకువచ్చారట. కాని పెద్ద తుఫాను వచ్చి వారి ప్రయత్నం విఫలం అయిందట. శాంథోమ్‌లో చర్చిలు కట్టుకోడానికి రెండవ వెంకటపతిరాయలు అనుమతి ఇచ్చాడు. చంద్రగిరి, నెల్లూరు, శాంథోమ్‌లలో మూడు చర్చిలు, శాంథోమ్‌లో ఒక మిషనరీ కాలేజీని స్థాపించారు. ఆ చర్చిలకు సాలుకు వెయ్యి వరహాలు ఆదాయం వచ్చే ఈనాములను ఇచ్చాడు. ఆ ఆదాయంతోనే వారు ఆ చర్చిలు, మిషనరీ కళాశాలను నడిపారు. క్రీ.శ.1605లో రాబర్ట్-డి-నోబిల్ అనే ఒక క్రైస్తవ మతాచారి ఎంత ప్రయత్నించినా హిందువులు క్రైస్తవులుగా మారడం లేదని మధురలో సంస్కృతం, తమిళం, తెలుగు భాషలు నేర్చుకొని హిందూ వేదాంతి లాగా దేశం తిరిగి క్రైస్తవ మతాన్ని వ్యాప్తి చేయాలని నిర్ణయించుకున్నాడు. అతడు కాషాయ దుస్తులు ధరించి తత్వబోధస్వామి అనే పేరుతో హిందూమతాన్ని విమర్శిస్తూ దేశమంతా తిరిగి క్రైస్తవ మతాన్ని ప్రచారం చేసుకుంటున్నా రెండవ వెంకటపతిరాయలు ఎలాంటి చర్యా తీసుకోలేదు. ప్రచారానికి అతనికి సంపూర్ణ స్వేచ్ఛ ఇచ్చాడు. పైగా తమ మతంలో చాలా తప్పులున్నాయని కూడా హిందువులు అంగీకరించారట. కాని తమ మతం మార్చుకోలేదు. పశ్చిమ కోస్తాలో ముస్లింల ఆధిపత్యం ఉండేది. వారి బాధపడలేక క్రీ.శ.1533వ సంవత్సరంలో 20 వేల మంది మాత్రం క్రైస్తవ మతంలోకి మారారని ఫాదర్ వీరాస్ రాశాడు. పోర్చుగీసు రాజు మూడవ ఫిలిప్పి క్రీ.శ.1607వ సంవత్సరంలో తమ దేశస్థులను, తమ మతాన్ని ఆదరించినందుకు అభినందిస్తూ రెండవ వెంకటపతి రాయలుకు జాబు రాశాడు. అందుకు సంతోషించి తాను పోర్చుగీసు వారికి ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉన్నానని ప్రత్యుత్తరం పంపాడు. ఈ విధంగా విజయనగర ప్రభువులు సర్వమతాల వారితో సమభావం ప్రదర్శించారు.

పోర్చుగీసు వారు ఇండియాలో అడుగుపెట్టిన తర్వాత వారి వ్యాపారంతోపాటు తమ క్రైస్తవ మతాన్ని కూడా వ్యాప్తి చేయటానికి ప్రయత్నించారు. అనేకమంది క్రైస్తవ మిషనరీలు లిస్బన్ నగరం నుండి గోవా వచ్చి గోవాను కేంద్రంగా చేసుకొని దక్షిణ దేశంలో క్రైస్తవ మత ప్రచారం చేశారు. ఫాదర్ ఫెర్నాండెజ్ మధురా ప్రాంతం చేరి వీరప్పనాయకుని కాలంలో 14 సంవత్సరాలు క్రైస్తవమత ప్రచారం చేశాడు. హిందువులెవరూ క్రైస్తవ మతంలో చేరలేదు. అతి కష్టం మీద పరవరులు అనే బెస్తవారిని మాత్రం 3 వేల మందిని క్రైస్తవ మతంలోకి మార్చగలిగారు. ఎంత ప్రయత్నించినా అగ్రకులాల హిందువులు ఎవరూ క్రైస్తవ మతాన్ని స్వీకరించలేదు. క్రైస్తవ మతాధికారులు అందుకు కారణాలను దీర్ఘంగా చర్చించారు. క్రైస్తవ ప్రచారకులు నీతినియమాలు లేని తాగుబోతులని, మాంస భక్షకులని హిందువులు భావిస్తున్నారని వారు తెలుసుకున్నారట. అంతేగాక పరవరులు హిందూ సమాజంలో అంటరాని కులానికి చెందినవారు. వారు స్వీకరించిన మతాన్ని అగ్రకులాల హిందువులు హీనంగా చూసేవారట. ఈ కారణాలు తెలుసుకున్న క్రైస్తవ మతప్రచారకులు తమ మత ప్రచార విధానాన్ని మార్చుకున్నారు.

రాబర్ట్ డినోబిలి హిందూ సన్యాసిలాగ క్రైస్తవ మతాన్ని ప్రచారం చేయడం: క్రీ.శ.1616వ సంవత్సరంలో రాబర్ట్ డినోబిలి అనే అతడు జెసూట్ ఫాదర్ సంఘ ప్రతినిధిగా దక్షిణదేశంలోని మధురకు వచ్చాడు. అతడు హిందూ సన్యాసిగా తన ఆకారాన్ని మార్చుకున్నాడు. ముఖానికి విభూతిరేఖలు దిద్ది, జంధ్యం వేసుకొని, కాషాయ వస్త్రాలు ధరించి చేతిలో కమండలాన్ని, రుద్రాక్షలను ధరించి అచ్చం హిందూ సన్యాసిగా మారి ఒక చిన్న గుడిసెలో కాపురం పెట్టాడు. బ్రాహ్మణులతో కలిసి తిరగడం, హిందూ తత్వబోధకులు ఏ విధంగా తత్వప్రచారం చేస్తారో అదే విధంగా క్రైస్తవ మతాన్ని ప్రచారం చేశాడు. క్రీస్తు మీద తత్వాలు రాయించి అవి పాడుకుంటూ దేశం తిరుగుతూ క్రైస్తవ మత ప్రచారం చేశాడు. హిందువులు హరికథ, బుర్రకథ, భజనలు, కోలాటాలతో ఎలా తమ దేవతా కథలు గానం చేస్తారో అదే విధంగా హిందూ జానపద కళారూపాలలో క్రైస్తవ మతాన్ని ప్రచారం చేశాడు. అయినప్పటికీ హిందువులెవరూ క్రైస్తవ మతాన్ని స్వీకరించలేదు. అతడు హిందూ వేషంలో క్రైస్తవ మతాన్ని ప్రచారం చేస్తూ హిందూ ప్రజలను మభ్యపెట్టాలని చూశాడు. అయినప్పటికీ మధుర నాయకరాజులు గాని, విజయనగర చక్రవర్తులు గాని అతనిపై ఎలాంటి చర్య తీసుకోలేదు. వారు పరమత సహనాన్ని పాటించే రాజులైనందువల్ల డినోబిలి తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించగలిగాడు.

పెనుగొండ బాబా: విజయనగర యుగంలో పెనుగొండ బాబానాథ్ అనే ముస్లిం ఫకీరు చాలా ప్రసిద్ధి చెందాడు. బాబా నాథుడు ఒక హిందువు. అతడు ముస్లిం మతం స్వీకరించి మక్కా దర్శించి నాథజౌలియాకు

శిష్యుడయ్యాడు. తిరిగి వచ్చి పెనుగొండలో ఒక హిందూ దేవాలయంలో బస చేశాడు. కాని అది సహించని కొందరు అతనిని గోనెసంచిలో కుట్టి చెరువులో పడవేశారట. కాని అతడు జీవించి తిరిగి వచ్చాడు. అతనిని పడవేసిన చెరువును నేటికి బాబయ్య చెరువు అని పిలుస్తారు. అతడు నివసించిన దేవాలయం మసీదుగా మారింది. అతడు మరణించిన తర్వాత అక్కడ దర్గా నిర్మించారు. ఆ దర్గాకు వీరనరసింహరాయలు కొన్ని గ్రామాలు దానం చేశాడు. ఇమ్మడి నాయకులు పెనుగొండను ఆక్రమించినప్పుడు ఆ పత్రాలు పోగా చినవెంకటపతి రాయలు దర్గాకు ఇచ్చిన దానాలను పునరుద్ధరించాడు. మధురవాణి మంగమ్మాళ్ కూడా ఈ దర్గాకు బహుమతులను ఇచ్చింది. ప్రతి సంవత్సరం ఆ దర్గాలో ఉరుసు జరుగుతుంది. హిందూ ముస్లింలు ఉభయులూ అందులో పాల్గొంటారు. అలాగే సిద్ధవటంలో పీర్‌జాదాసాహెబ్ అనే ముస్లిం ఫకీరు ఉండేవాడు. అతని దర్గాకు సిద్ధవటం సీమ ప్రజలు వంద భీఘాల భూమిని దానం చేశారు.

దేవాలయాలు - ఉత్సవాలు - తిరుపతి: విజయనగర యుగంలో అనేక దేవాలయాలు నిర్మింపబడ్డాయి సంవత్సరం పొడుగునా దేవాలయాలలో ఏదో ఒక ఉత్సవం జరుగుతూనే ఉండేది. దేవునికి అనేక సేవలు జరిగేవి దేవుని ప్రతిరోజు ప్రాతఃకాలంలో మంగళవాయిద్యాలతో నిద్ర మేల్కొలిపేవారు, స్నానం చేయించేవారు పట్టువస్త్రాలు కట్టేవారు. నైవేద్యం పెట్టేవారు. నృత్యాలు, సంగీతంతో వినోదాలు కలిగించేవారు. సెంట్లు, గంధం, అత్తరు పూసేవారు. బంగారు ఆభరణాలతో అలంకరించేవారు. ఉత్సవాలలో రథాలపైన పల్లకీలలో ఊరేగించే వారు. జోల పాటలతో నిద్రపుచ్చేవారు. సంవత్సరానికి ఒకసారైనా కళ్యాణం చేసేవారు. ఈ విధంగా హిందూ దేవాలయాలలో, ముఖ్యంగా వైష్ణవ దేవాలయంలో అదీ ముఖ్యంగా తిరుపతి వేంకటేశ్వరుని ఆలయంలో ఈ సాంప్రదాయాలు పాటించే ఆచారాలు బాగా అభివృద్ధి చెందాయి. దేవునికి అలా సేవలు చేయడం గొప్ప పుణ్య ప్రదంగా భావించారు ఆనాటి ప్రజలు. కనుక దేవుని ఉత్సవాలకు అనేక మంది సంతోషంగా దానాలు చేసేవారు దేవుళ్లకు పెట్టే నైవేద్యాలు, ఉత్సవాలకు ఎంతో ఖర్చు అవుతుండేది. తిరుపతిలో సంవత్సరానికి ఒక పర్యాయం 10 రోజులు బ్రహ్మోత్సవాలు జరిగేవి. ఆ పదిరోజులు జరిగే అనేక రకాల ఉత్సవాలు ఎంతో ఆర్భాటంగా జరిగేవి ఈ ఉత్సవాలను కళ్లారా చూసిన ఒక జేసూట్ ఫాదర్ తమ దేశస్థులకు క్రీ.శ.1602వ సంవత్సరంలో ఒక జాబు రాస్తూ మనకు రోమ్ నగరం ఎటువంటి పవిత్రమైనదో హిందువులకు ఈ తిరుపతి పెరుమాళ్ అటువంటివాడు. ప్రజలు గుంపులుగా వచ్చి దేవుని దర్శించి కానుకలు ఇస్తారు. అవి 20 లక్షల డ్యూకాట్లు ఉంటాయి అని రాశాడు అలాగే దేవుని రథంపై కూర్చోబెట్టి 10 వేల మంది ప్రజలు రథాన్ని లాగుతారు, అంతకంటే ముందు రాజు ఉంటాడు, అతడు కూడా రథం లాగుతాడు, అని అమిత ఆశ్చర్యంగా రాశాడు. ఈ విధంగా ఆనాడు తిరుపతి వైభోగంగా వెలుగుతుండేది. రథోత్సవాలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకొనే వారని కదరీపతి అనే కవి కూడా వర్ణించాడు.

అన్నమాచార్యుని కీర్తనలు: విజయనగర యుగంలో తాళ్లపాక అన్నమాచార్యులు అనే వాగ్గేయకారుడు తిరుపతిలో నివసించి వెంకటేశ్వరుని మీద సంస్కృతాంధ్ర భాషలలో వేలాది కీర్తనలు రాశాడు. వాటిని రాగి రేకులపై రాయించి తిరుపతి దేవాలయంలో భద్రపరచారు. అతని మనుమడు చినతిరుమలయ్య అన్నమాచార్యుని కీర్తనలను తెలుగులో ద్విపదలుగా రాశాడు. అన్నమాచార్యుని కీర్తనలు ఆధ్యాత్మికంగానే కాక శృంగారభరితంగా ఉంటాయి. వెంకటేశ్వరుడు పురుషుడుగా, నాయకుడుగాను, తాను నాయకిగా ఊహించుకొని కీర్తనలు పాడుతూ తనను దరి చేర్చుకోమని వేడుకుంటాడు. బ్రహ్మ కడిగిన పాదం అనే పాట, అదిగో అల్లదిగో శ్రీహరి వాసము అనే పాటలు బహుళ ప్రచారం పొందాయి. ఇతని కీర్తనలు గొప్ప భక్తి గీతాలుగా ప్రసిద్ధి చెంది నేటికీ తిరుపతిలో గానం చేయబడుతున్నాయి. అవి ప్రస్తుతం రాష్ట్ర, దేశ, ప్రపంచవ్యాప్తంగా ఇతని కీర్తనలను అతని మనుమడు చినతిరుమలయ్య ద్విపదలుగా తెలుగులో రచించి, అతడు కవిశిరహః కంపయోగ్యప్రతి ద్విపద నవబిరుదాయద అని స్వయంగా చెప్పుకున్నాడు. అన్నమాచార్యుడు సంస్కృతంలో సంకీర్తనల లక్ష్యం అనే గ్రంధం రాశాడట. అది అలభ్యం. దానికి వారి కుమారుడు పెద తిరుమలాచార్యుడు వ్యాఖ్య రాశాడట. అది కూడా అలభ్యం. దానికి పెద తిరుమలాచార్యుని పెద్ద కుమారుడు చిన్న తిరుమలాచార్యుడు సంకీర్తనల లక్షణం అనే పేరుతో తెనిగించాడట. ఈ గ్రంధాన్ని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ స్టడీస్ వారు 1990లో దానిని ప్రచురించారు.

అన్నమాచార్యులు చరిత్ర: అన్నమాచార్యుడు కడప జిల్లాలోని రాజంపేటకు సమీపంలో ఉన్న తాళ్లపాక గ్రామంలో జన్మించాడు. అక్కడ సిద్దేశ్వరాలయం, చెన్నకేశవస్వామి దేవాలయం అనే రెండు ఆలయాలు ఉన్నాయి.

వాటిలో చెన్నకేశవ దేవాలయ పూజారి కుమారుడు అన్నమయ్య. అన్నమయ్య తాత నారాయణయ్య. అతనికి చిన్న తనంలో చదువు అబ్బలేదు. అందరూ చదువురాని మొద్దబ్బాయిగా అవమానించేవారు. ఆ అవమానాలు భరించలేక ఊరి చివర ఉన్న చింతలమ్మ గుడిలో ఒక పుట్ట ఉండేది. ఆ పుట్టలో ఉన్న పాముతో కాటు వేయించుకుని చనిపోవాలని వెళ్ళి ఆ పుట్టలో చేయి పెట్టాడు. కాని ఆశ్చర్యంగా కాటు వేయలేదు. చింతలమ్మ ప్రత్యక్షమై అతనిని ఓదార్చి మీ వంశంలో రాబోయే తరాలలో గొప్ప హరి భక్తుడు జన్మిస్తాడు. అతని వల్ల మీ వంశం తరిస్తుంది కనుక నీవు ఇంటికి వెళ్ళి మీ కుల దైవమైన చెన్నకేశవుని ప్రార్థించు, అన్ని విద్యలు అనుగ్రహిస్తాడని చెప్పి అదృశ్యమైంది. చింతలమ్మ చెప్పినట్లుగా గొప్ప పండితుడయ్యాడు. అతనికి నారాయణ సూరి అనే కుమారుడు కలిగాడు. అతనికి లక్కమాంబ అనే ఆమెతో వివాహం జరిపించాడు. ఈ పుణ్య దంపతులకు జన్మించిన వాడే అన్నమయ్య.

అన్నమయ్య 90 సంవత్సరాలు జీవించాడు. అనేక క్షేత్రాలు దర్శించి అక్కడి దైవాలపైన అనేక కీర్తనలు రచించాడు. అన్నమయ్య 12 ఏళ్ల పాటు అహోబిలంలో ఉండి అక్కడ ఉన్న చరగోప యతీంద్రునికి శుశ్రూషలు చేసి వైష్ణవ ఆగమాలు నేర్చుకున్నాడు. అన్నమయ్య వెంకటేశ్వరుని తరువాత ఎక్కువ కీర్తనలు రచించింది నారసింహునిపైననే. హరిభక్తిని ప్రచారం చేస్తూ అన్నమయ్య కడపలోని ప్రసన్న వెంకటేశ్వరునిపైన, ఒంటిమిట్టలోని కోదండరామునిపైన, నందలూరులోని సౌమ్యనాథుడు అని పిలువబడే చొక్కనాథునిపైన, కడప జిల్లాలోని గండికోట, మాదుగూరు, అమలాపురం, నంబటూరు, కనకగిరి, మండెం, నల్లబల్లి, చప్పల్లి, మాచనవోలు, పెద్దముడియం, పోట్లదుర్తి, తుమ్మలూరు, కోన, చింతకుంట, సిద్ధవటం, వేయినూతల మొదలైన గ్రామాలలోని క్షేత్రపాలకులపైన, కర్నూలు జిల్లాలోని కోవెలకుంట్ల పాండురంగనిపైన, బండి ఆత్మకూరులోని జనార్ధనస్వామిపైన, అనంతపురం జిల్లాలోని కదరి నృసింహునిపైన, గుత్తి రఘునాధునిపైన అనేక కీర్తనలు రాశాడు. అన్నమాచార్యునికి సాళువ నరసింహరాయల సమకాలికుడు. ఆయనకు సాళువ నరసింహరాయలు కొంత భూమిని బ్రహ్మదేయంగా ఇచ్చారు. అది ఇప్పటికీ అన్నమాచార్యులు కుటుంబీకుల అధీనంలో ఉంది.

అంతేగాక ఆనాటి రాజధాని అయిన హంపిలోని తిరువెంగళనాథాలయం దానికి అచ్యుత రామాలయం అని పేరు. మాల్యమత రఘునాధ హజారా రామాలయం, కలిశాపురం హనుమంతుని దర్శించి వారిపైన కూడా కీర్తనలు రచించాడు. చాలా మందికి అన్నమయ్య ఇన్ని క్షేత్రాలు దర్శించాడని తెలియదు. ఆయన గౌరవార్థం కడప నుండి తిరుపతి వెళ్లే మార్గంలో రాజంపేటకు సమీపంలోని రహదారిపైన 108 అడుగుల ఎత్తయిన అన్నమయ్య విగ్రహాన్ని ఆయన 600 జయంతి సందర్భంగా 2008లో ప్రతిష్టించారు. ఈ విగ్రహం ఆయన జన్మస్థలం అయిన తాళ్లపాకకు 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. తాళ్లపాకలోని చెన్నకేశవాలయం పక్కగా ఒక చిన్న మంటపంలో కూడా అన్నమయ్య విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ మధ్య తిరుపతి దేవస్థానం వారు అన్నమయ్య కీర్తనలకు విశేష ప్రాచుర్యం కల్పించారు.

ఇతర పండుగలు: హోలీ పండుగను వసంతోత్సవాలు అనే పేరుతో జరుపుకొనేవారు. నికోల్‌కొంటి రాయల ఆస్థానంలో జరిగిన వసంతోత్సవాలను వర్ణించాడు. వీధులలో ఎరుపురంగు నీరు ఉంచేవారట. ఆ దారిని ఎవరు వచ్చినా పైన చల్లేవారట. ఆఖరికి రాజు, రాణి వచ్చినా రంగు నీళ్లు చల్లేవారట. ముక్కు తిమ్మన కృష్ణదేవరాయల కాలం నాటి వసంతోత్సవాలను వర్ణించాడు. ఆకాశ భైరకల్పం అనే గ్రంథంలో దీపావళిని గురించి వర్ణించారని పి.కె.గొడే అనే పండితుడు రాశాడు. ఆనాటి ప్రజలు ఏరువాక పున్నమి పండుగ జరుపుకొనేవారని సురవరం ప్రతాపరెడ్డి రాశాడు. శుకసప్తసతి సంక్రాంతిని పొంగలి పండుగ అని వర్ణించింది. అలాగే వింతటి పండుగ అనే మరొక పండుగ జరుపుకొనేవారట. ఇది జొన్నలు విత్తనం వేసే పండుగట.

విజయదశమి ఉత్సవాలు: ఈ యుగంలో జరిగిన మరొక ప్రముఖ ఉత్సవాలు మహానవమి ఉత్సవాలు. రాజధాని విజయనగరంలో ఈ ఉత్సవాలు 9 రోజులు జరిగేవి. విదేశస్తులు ఈ ఉత్సవాలను ఆసక్తితో తిలకించి తమ రచనలలో వాటిని వర్ణించారు. ఈ తొమ్మిది రోజులు చక్రవర్తి ఉదయం, విజయ మంటపానికి వస్తాడు. దుర్గపూజ చేస్తాడు. పూజ తర్వాత పూజా పుష్పాలను తన ఏనుగులపైన, గుర్రాలపైన చల్లుతాడు. తర్వాత దుర్గాదేవికి జంతుబలులు ఇస్తారు. దున్నలు, మేకలు, గొర్రెలను బలి ఇస్తారు. ప్రతిరోజూ మొత్తం 13797 జంతువులు బలి అయ్యాయని న్యూనిజ్ రాయగా 6379 అని పేస్ లెక్క కట్టాడు. బలి అనంతరం రాజు సాగిలపడి దేవికి మొక్కుతాడు. తర్వాత దేవత ముందు దేవదాసీల నృత్యగానం సాగుతుంది. మధ్యాహ్నం కుస్తీలు, ఏనుగుల

విన్యాసాలు జరిగేవి. ఇవన్నీ అయిపోయిన తర్వాత రాజు దర్బారు చేస్తాడు. సామంతులు వచ్చి కప్పాలు చెల్లిస్తారు ఎవరికైనా బహుమతులు ఇవ్వాలనుకుంటే రాజు అక్కడే వారికి బహుమతులు ప్రకటించి ఇస్తాడు. తర్వాత చివరలో బాణా సంచా కాల్చి, ఇతర వేడుకలు జరుపుతారు. ఈ తొమ్మిది రోజులు రాజు పగలు ఉపవాసం చేస్తాడని విదేశస్తులు వర్ణించారు. ఈ దసరా ఉత్సవాలను విజయనగర సామంతులైన మైసూరు వడయార్ వంశస్తులు తర్వాత కూడా కొనసాగించారు. నేటికీ వారు అదే పద్ధతిలో ప్రతి సంవత్సరం జరుపుతున్నారు.

ఇతర మతాచారాలు: గ్రామ దేవతలకు కొలువులు కొలిచే ఆచారం ఉండేది. ఆ రోజులలో నయన పోలయ్య, గ్రామగంగ, పుట్టలమ్మ, ఎల్లమ్మ, నందివీరులు, పోతురాజు, ధర్మరాజు, కంబమయ్య దేవాదుల కాటిరేడు అనే గ్రామ దేవతలను పూజించేవారు. అందుకు మహారాజ గుత్త అనే పన్ను వసూలు చేసేవారు. గ్రామ దేవతలకు కొలువు కొలిస్తే అంటురోగాలు, చీడలు, పీడలు అంటవని నమ్మకం ఉండేది. కదరీపతి అనే కవి జాతర్లను గురించి వర్ణించాడు. దుర్గాదేవి అనుగ్రహం సంపాదిస్తే అద్భుత శక్తులు వస్తాయని నమ్మకం ఉండేది. అందుకు ఆత్మహింస చేసుకొనేవారు. కళ్లు పొడుచుకుంటే దూరదర్శన శక్తి వస్తుందని చెవులలో ఊచపెట్టి పొడుచుకుంటే దూరశ్రవణ శక్తి వస్తుందని, నాలుక కోసుకుంటే విద్య అబ్బుతుందని తల నరుక్కుంటే శత్రువధ జరుగుతుందని నమ్మేవారు దుర్గదయ సంపాదించడం కోసం సిరిమానుకు వేలాడదీసే ఆచారం విజయనగర కాలంలో ఉండేదని విదేశస్తులు రాశారు. సిరిమాను గురించి తెనాలి రామలింగడు తన పాండురంగ మహత్యంలో వర్ణించాడు. అలాగే కోరిక నెరవేరితే రక్త తర్పణం చేస్తామని మొక్కుకుంటారు. మొక్కు తీర్చే రోజున బాజాభజంత్రీలతో ఊరేగింపుగా బయలుదేరి దేవాలయానికి వస్తారు. అక్కడ ఒక కొయ్య పాతి ఉంటుంది. దానిని సిరిమాను అని అంటారు. ఆ కొయ్యపైన ఏతం కర్రవలె ఒక కమ్మీని అడ్డంగా అమర్చుతారు. ఆ కర్రకు ఒకవైపున గాలం ఉంటుంది. రెండో వైపు తాడు కట్టి గాలాన్ని పైకి ఎత్తడానికి వీలుగా చేస్తారు. ఆ గాలాన్ని మొక్కుకున్న మనిషి ముక్కుకి గుచ్చుతారు తర్వాత గాలాన్ని పైకి లాగుతారు. మనిషి దాంతో పైకిలేచి గిరగిరా తిరుగుతూ ఉంటాడు. ముక్కుల నుండి రక్తం కారుతూ ఉంటుంది. కొన్ని సందర్భాలలో చనిపోతాడు. ఇలాంటి మూఢాచారాలు ఆనాడు ప్రజలందరూ ఆచరించే వారని విదేశీ యాత్రికులు అందరూ రాశారు. ఆ కాలంలో పెద్దకులాల వారు మత చర్చలలో ఆసక్తి ప్రదర్శించగా, చిన్న కులాల వారు భజనలు, కొలువు ఉత్సవాల మీద ఆసక్తి ప్రదర్శించేవారు.

నరబలి: ఇవేగాక ఆనాడు నరబలి కూడా ఒక ఆచారంగా ఉండేది. దేవతలను తృప్తిపరచడానికే గాక కొన్ని పనులు సక్రమంగా జరగడానికి కూడా నరబలి ఇచ్చేవారు. దుర్గాలు నిర్మించేటప్పుడు పునాదులలో నర బలి ఇచ్చేవారు. అచ్యుతరాయల కాలంలో దన్నాయక చెరువు నిర్మించేటప్పుడు ఎంత రాయి వేసినా పునాది పూడలేదట. బ్రాహ్మణులు నరబలి ఇవ్వాలని సలహా ఇచ్చారట. అప్పుడు రాయలు మరణదండన విధించిన ఖైదీలను రప్పించి బలి ఇచ్చాడట. అప్పుడు ఆ తటాకం గట్టు సరిగా నిలిచిందని న్యూనిజ్ రాశాడు.

సతీ సహగమనం: ఆ కాలంలో ఆచరణలో ఉన్న మరొక దురాచారం సతీసహగమనం. ఈ ఆచారం పెద్ద కులాలలో ఎక్కువగా ఉన్నదని విదేశీ రచనలు తెలుపుతున్నాయి. సహగమనం చేసిన స్త్రీ మరణానంతరం భర్తను కలుస్తుందని, ఇద్దరూ కలిసి స్వర్గం చేరి స్వర్గ సుఖాలు అనుభవిస్తారని నమ్మేవారు. సహగమనం చేసేముందు స్త్రీ బంధువులందరి వద్ద సెలవు తీసుకొంటుంది. నెత్తిన నూనె కుండ పెట్టుకొని ధైర్యంగా మంటలలోకి ఉరుకుతుంది ఆమె మంటలలో ప్రవేశించగానే కట్టెలతో సిద్ధంగా ఉన్న ఆమె బంధువులు తమ చేతులలోని కట్టెలతో ఆమెను కప్పివేస్తారు. ఆ కట్టెలతో ఆమె కాలి బూడిద అవుతుంది. అంతా అయిపోయిన తర్వాత బంధువులందరూ పెద్దపెట్టున ఏడుస్తారు అని న్యూనిజ్ సహగమన ఘట్టాన్ని వర్ణించాడు. వితంతువులకు గౌరవ మర్యాదలు ఉండేవి కావని, వారి జీవితం నరకమని, దానిని భరించలేకనే చాలా మంది సహగమనం చేస్తారని కూడా వివరించాడు.

ముస్లింల పట్ల విజయనగర చక్రవర్తుల వైఖరి

విజయనగరంపై ఇస్లాం మత ప్రభావం: విజయనగర సామ్రాజ్యం మూడున్నర శతాబ్దాలపాటు ముస్లిం దండయాత్రల నుండి దక్షిణ హిందూదేశాన్ని కాపాడింది. నిరంతరం బహమనీ రాజ్యంతో పోరాటాలు జరిపింది. అయినప్పటికీ విజయనగర చక్రవర్తులు ముస్లింల ఎడ మతద్వేషాన్ని ప్రదర్శించలేదు. సమదృష్టితో ఆదరించారు. అందువల్ల ముస్లింలు విజయనగరం ప్రవేశించి అక్కడ నివసించారు. వారికి విజయనగర చక్రవర్తులు రక్షణ ఇచ్చారు. హిందువుల మధ్య ముస్లింలు స్వేచ్ఛగా విహరించారు. ముస్లిం సంపర్కం వల్ల విజయనగర రాజ్యంలో కూడా హిందూ సంస్కృతి ముస్లిం ప్రభావానికి గురైంది.

పోర్చుగీసు యాత్రికుడు డొమింగో పేస్ విజయనగరంలోని ముస్లింల ఉనికిని, ముస్లిం సంస్కృతి ప్రభావాన్ని హిందువుల మతసహనాన్ని వివరంగా రాశాడు. విజయనగర పట్టణంలో ముస్లింలకు ప్రత్యేకమైన పేట ఉండేదని, వారు స్వేచ్ఛగా నిర్భయంగా జీవించారని వివరించాడు. అనెగొంది, విజయనగర ప్రాంతంలో అనేక ముస్లిం సమాధులు చూశానని, తన రాక కంటే ముందే అనేక సంవత్సరాల ముందు నుంచే ముస్లింలు విజయనగరంలో నివసిస్తున్నారనీ, అందుకు కారణం సంగమ వంశస్థుల ఉదార వైఖరి అని రాశాడు. విఠలస్వామి ఆలయ అధిష్ఠానం మీద, హజారా రామచంద్ర దేవాలయాల ప్రాకారం మీద, దసరా దిబ్బ కట్టడం మీద ముస్లింలకు చెందిన చిత్రాలు ఉన్నాయని కూడా రాశాడు. దసరా పండుగకు దసరా దిబ్బ వద్ద 9 రోజులు ఉత్సవాలు జరుగుతాయని, అందులో ముస్లింలు కూడా పాల్గొంటారని, వారు అక్కడ జరిగే కత్తి యుద్ధాలు, మల్లయుద్ధాలలో పాల్గొంటారని వివరిస్తూ వారు టర్కీ ఆయుధాలు, జావలిన్‌లను, మందుగుండు ఆయుధాలు ఉపయోగించడంలో గొప్ప నేర్పు కలిగినవారని రాశాడు. విజయనగర చక్రవర్తులు ముస్లింలను తమ సైన్యంలో చేర్చుకున్నారని, వారి పట్ల గొప్ప నమ్మకాన్ని ప్రదర్శించారని పెర్నోస్, న్యూనిజ్ రాశారు. మెర్‌కర్ అనే ముస్లిం సరదారునికి రాయలు 40 వేల పర్దాల ధనాన్ని ఇచ్చి మంచి యుద్ధ అశ్వాలను కొనమని గోవా పంపాడని న్యూనిజ్ తన రచనలో పేర్కొన్నాడు. బార్బోసా విజయనగరంలో ఎవరైనా స్వేచ్ఛగా సంచరించవచ్చని, నీది ఏ మతమని ఎవరూ అడగరని, క్రైస్తవుడని గాని, ముస్లిం అని గానీ, హీబ్రూ అని గానీ భేదం చూపరని, అది తనకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోందనీ రాశాడు.

యుద్ధరంగంలో ముస్లిం సైనికులకు చాలా ప్రాముఖ్యత ఉందని, వారు అగ్ని ఆయుధాలు ప్రయోగించడంలో బహు నేర్పరులనీ, అందువల్ల వారిని విజయనగర చక్రవర్తులు తమ సైన్యంలోకి తీసుకున్నారని, వారు విజయనగర చక్రవర్తుల తరపున పోరాడారని విజయం సాధించడానికి ముస్లిం సైనికులు కూడా కారణమని వివరించాడు. రాయచూరు యుద్ధానికి వెళ్లిన ఒక సైనిక విభాగానికి ఒక ముస్లిం సరదారు నాయకుడు. అతని ఆజ్ఞల ప్రకారం హిందూ సైనికులు నడిచారు అని కూడా రాశాడు. సంగమ వంశంలో సుప్రసిద్ధుడైన ప్రౌఢదేవరాయల కొలువులో అనేక మంది ముస్లిం సైనికులుండేవారు. అతడు ఒక ముస్లిం దళాన్ని ప్రత్యేకంగా పోషించాడు. అతడు తన దర్బారులో ఒక వేదికపై ఖురాన్ ప్రతిని ఉంచి గౌరవించాడని విదేశస్తులు రాశారు. ప్రౌఢదేవరాయల కాలంలో పొకమ్ అన్నారి అనే సరదారుడు పాణెం అనేచోట ఒక దుర్గాన్ని నిర్మించాడు. ఆ దుర్గాన్ని రాయలు సబత్‌ములక్ అనే ముస్లిం వీరునికి ఇచ్చాడు. అతడు 20 సంవత్సరాలు పాణెం దుర్గ పాలకుడుగా పాలించాడు. ప్రౌఢదేవరాయల కాలంలో ఇంకా అనేక మంది ముస్లిం సరదారులకు భూములు జాగీరులు ఇవ్వబడ్డాయి. వీరప్రతాపరాయ కాలంలో తిరుగుబాటు చేసిన ఒక హిందూ పాలెగాణ్ణి అణచడానికి ఒక ముస్లిం సరదారుని పంపారు. రెండవ దేవరాయలు గురయవరాయ అనే సామంతుడు తిరుగుబాటు చేయగా ఇస్మాయిల్‌ఖాన్ అనే ముస్లిం సేనాధిపతిని పంపి గురయవరాయుని లొంగదీశాడు.

రాజకీయ సైనిక రంగంలోనే గాక ముస్లింలు వ్యాపార రంగంలో కూడా విజయనగర రాజ్యంలో ప్రముఖ పాత్రను నిర్వహించారు. అనేక మంది ముస్లిం, అరబ్బు వ్యాపారులు, మేలుజాతి అశ్వాలను తెచ్చి విజయనగర రాజులకు అమ్మారు. గుర్రాల వ్యాపారం అరబ్బుల చేతిలో ఉండేది. పోర్చుగీసు వారు వచ్చే వరకు విజయనగర రాజులు అరబ్బుల వద్దనే అశ్వాలను కొన్నారు. విఠల్‌స్వామి దేవాలయ ఉపపీఠమైన అరబ్బు వర్తకులు గుర్రాలను తెచ్చి విజయనగర రాజులకు అమ్ముతున్నట్లు శిల్పాలు చెక్కారు. గుర్రాలేగాక ఇతర సరుకులను కూడా ముస్లిం

వ్యాపారులు విజయనగరంలో అమ్ముకున్నారు. వారికి కావలసిన సరుకులను కొన్నారు. విజయనగరంలో నివసించే ముస్లింలు ఖరీదైన చైనా వారి పింగాణీ, సిల్కు వస్తువులను కొనేవారు. అంటే విజయనగర ముస్లింలు ఆర్థికంగా బాగా ఉన్నారని, సిరిసంపదలను అనుభవించారనీ స్పష్టపడుతోంది. తుళువ యుగం వరకు అనేక మంది ముస్లింలు విజయనగరంలో హిందువులతో సమానంగా అన్ని హక్కులతో జీవించారని స్పష్టంగా తెలుస్తోంది. విజయనగరంలో అనేక మసీదులు నిర్మింపబడినట్లు దాఖలులు కనిపించాయి. ఏనుగుల శాలకు దగ్గరలో ఒక మసీదు ఉండేది. అక్కడికి దగ్గరలో ఉన్న ఒక చిన్న కొండగుట్ట మీద మరొక మసీదు ఉంది. విఠల్‌స్వామి దేవాలయం వద్ద మరొక మసీదు నిర్మింపబడింది. అనేక దేవాలయాలకు దగ్గరలో ముస్లిం సమాధులు నిర్మించినట్లు శిథిలాలు కనిపిస్తున్నాయి. పక్కన ఉన్న ముస్లిం రాజ్యం అయిన బహమనీ రాజ్యంలో హిందువులకు ఎలాంటి హక్కులు లేని కాలంలో ముస్లింలు విజయనగరంలో సర్వస్వేచ్ఛలు అనుభవించి మసీదులు, సమాధులు నిర్మించుకుంటూ జీవించారంటే అది విజయనగర చక్రవర్తుల పరమతసహనానికి, ఔదార్యానికి నిదర్శనమని విదేశీ యాత్రికులు శ్లాఘించారు. రామరాయల కాలంలో తురకవాడలో గోవధ కూడా జరిగేదట. రామరాయల సోదరుడు తిరుమలరాయలు ముస్లింల గోవధను భరించలేక రామరాయలుకు ఫిర్యాదు చేశాడట. దానికి రామ రాయలు ఎవరి నమ్మకాలు వారివి, రాజులుగా వారికి రక్షణ ఇవ్వడమే మన కర్తవ్యం అని సమాధానపరచాడట. రాజకీయ, మత రంగాలలోనేగాక శిల్పకళ, రాజభవనాలు, ఇతర కట్టడాలలో కూడా ముస్లిం సాంప్రదాయాలను విజయనగర రాజులు ప్రవేశపెట్టారు. అంతఃపుర భవనాలు, రాజదర్బారు, గజసాల, పద్మమహల్‌లు ముస్లిం సాంప్రదాయాలలో నిర్మించారు. ఇంకా పెనుగొండ, చంద్రగిరి, రాయ వెల్లూరులలోని రాజభవనాలలో కూడా ముస్లిం సాంప్రదాయాలు ప్రవేశించాయి. ఆర్చీలు, గుమ్మటాలలో అనేక ఇతర కట్టడాలు కూడా నిర్మించారు ముస్లింల వేషభాషలు కూడా విజయనగరంలో ప్రవేశించాయి. ఈ విధంగా విజయనగర సామ్రాజ్యం ముస్లిం ప్రభావానికి గురైంది. విజయనగర పాలకుల మతసామరస్య ఫలితంగా హిందూ మహమ్మదీయ మతాలపై కూడా తన ప్రభావం చూపింది. హిందువుల భక్తి ఉద్యమం, ముస్లింల సూఫీ మత ఉద్యమాలపై రెండు మతాల ప్రభావం ఉండేది.

విజయనగర యుగంలోని మతాచార్యులు-మాధవ విద్యారణ్యస్వామి: విజయనగర సామ్రాజ్య స్థాపకునిగా కీర్తి వహించిన మాధవ విద్యారణ్యుల వారు ఈ కాలం నాటి గొప్ప మతాచారి. ఇతడు స్మార్త మతాన్ని అవలంబించాడు. అతడు గొప్ప సంస్కృత పండితుడు. అతడు సంగీతసారం అనే కావ్యాన్ని రాశాడు. అందులో 50 మేళాలు, 50 రాగాలను వివరించాడు. దీంతో మేళాలలోని రాగాలను వర్గీకరణ చేయడం రామయామాత్యుని కంటే ప్రాచీనమని అర్థమవుతోంది. గోవింద దీక్షితుని సంగీతసుధ అనే గ్రంథంలో విద్యారణ్య శ్రీచరణుని సంగీతసారం పేర్కొనబడింది. రకరకాల సంగీత విద్వాంసుల గురించి కూడా వివరింపబడింది.

విద్యారణ్యుడు సంగీత శాస్త్రకారుడే గాక గొప్ప మహిమ కలవాడు. త్యాగరాజు, తాన్‌సేన్‌లు జ్యోతి స్వరూపిణి, దీపక్ అనే రాగాలను ఆలపించి దీపాలను ప్రజ్వలింప చేసేవారు. వారి సంగీత మాధుర్యం వల్ల దీపాలు వాటంతట అవే వెలిగేవట. అలాంటి సంగీతఝరిని జ్యోతిస్వరూపిణి అని, దీపక్ అని అనేవారు. ఈ మహత్తులను మాధవాచారి వారి కంటే ఎన్నో సంవత్సరాల ముందే ప్రదర్శించాడు. చెట్లు వికసించడానికి, సంగీతానికి అనుబంధం ఉందని ఇటీవల అన్నామలై యూనివర్సిటీకి చెందిన స్టెల్లా పొన్నయ్య అనే పండితుడు కనుక్కొన్నాడు. మాధవాచారి తన అమృతగానంతో చెట్లకు పుష్పాలను, ఫలాలను కాయించేవాడట. ఈ విద్యను పుష్పవర్షిణి, ఫలవర్షిణి అని అనేవారు. సంగీతం వినడం ద్వారా చెట్లు పూలు పూస్తాయని పండ్లు కాస్తాయని పొన్నయ్య నిరూపించారు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఒకసారి మాధవాచారి వేదాలను ఖండించిన తన ప్రత్యర్థిని నోరు మూయించడానికి అధర్వణ వేదంలోని ఒక అధ్యాయాన్ని ఉచ్చరించగా అక్కడ సమావేశమైన అందరి కళ్లముందు చెట్టుకు ఆకులు, పుష్పాలు, కాయలు కాశాయట. అతనికి కనకవర్షం కురిపించగల శక్తి ఉండేదట. ఇటువంటి అద్భుతాలను అతని ప్రత్యర్థి అయిన త్రివిక్రముని కుమారుడైన నారాయణ పండితుడు తన మాధవ విజయం అనే కావ్యంలో రాశాడు. త్రివిక్రముడు మాధవ విద్యారణ్యుని వేదాంతచర్యకు రమ్మనమని సవాల్ చేశాడు. ఆ వాదనలలో త్రివిక్రముడు విద్యారణ్యుని శిష్యుడయ్యాడు. విద్యారణ్యుడు అద్భుత యోగ పద్ధతులను ప్రదర్శించేవాడట. అన్ని శక్తులు ఉన్నా విద్యారణ్యులు తనతత్వమే గొప్పది అని చెప్పే వ్యక్తి కాదు. అన్ని ఆలోచనా ధోరణులను సమన్వయం చేయగలిగిన విశాల దృక్పథం కలవాడు. అతడు శంకర, వల్లభ, మధ్వాచార్యులకు ఏ

మాత్రం తీసిపోని వాడు. భగవత్పాద ఆదిశంకరుడు స్థాపించిన శృంగేరి మఠానికి అతడు 21వ అధిపతి. అతడు హంపిలో త్రిపురసుందరి ఆలయాన్ని నిర్మించాడు. దానిని ముస్లింలు ధ్వంసం చేశారు. కనుక అతడు హరిహర బుక్కరాయలును ప్రోత్సహించి విజయనగర రాజ్యాన్ని స్థాపించాడు. కర్ణాటక రాజ్యస్థాపనాచార్య అని కీర్తి పొందాడు. విజయనగర రాజ్యం వేద విద్యలకు నిలయమైంది.

విద్యారణ్యుడు బళ్లారి జిల్లాలోని కుందిరాం అనే గ్రామంలో సుమతి, నారాయణ దంపతులకు జన్మించాడు. అతడు నాలుగు వేదాలను సంపూర్ణంగా అధ్యయనం చేశాడు. అతడు అనేక శాస్త్రాలలో నిష్ణాతుడు. అతడు భౌదాయన సూత్రాలకు, శంక సూత్రాలకు, వేదాలకు వ్యాఖ్యానాలు రాశాడు. వ్యాకరణం, శిల్ప, మంత్ర శాస్త్రాలలో కూడా అతడు ప్రసిద్ధుడు. అతడు సంస్కృత, కర్ణాటక, తెలుగు భాషలలో అఖండ పండితుడు. అతడు అనేక గ్రంధాలను రాసి, మరికొన్ని గ్రంధాలను సేకరించి గొప్ప గ్రంధాలయాన్ని తయారు చేశాడు. కాని కంపిలి రాజ్యాన్ని ఆక్రమించిన ముస్లింలు అతని గ్రంధాలయాన్ని దగ్ధం చేశారు. అందువల్ల అనేక అమూల్య గ్రంధాలు మనకు లభ్యం కాకుండా పోయాయి. అతడు క్రీ.శ.1380వ సంవత్సరంలో పరమపదించాడు.

విజయనగర యుగంలోని వైష్ణవ మతాచార్యులు - వ్యాసతీర్థులు: విజయనగర యుగంలో అనేక మంది ప్రసిద్ధి చెందిన వైష్ణవ ఆచార్యులు నివసించి వైష్ణవ మతాన్ని ప్రచారం చేశారు. వారిలో ప్రముఖుడు వ్యాసతీర్థుల వారు. అతనికి శ్రీవ్యాసరాయరు అని కూడా పేరుండేది. అతని మొదటి పేరు ఎతిరాజు. అతని విద్యాగురువు శ్రీపాదరాజు. ఎతిరాజుకు బ్రహమన్య తీర్థులవారు వైష్ణవదీక్ష ఇచ్చారు. దీక్ష పుచ్చుకొన్న తర్వాత వ్యాసతీర్థులు అని పేరు మార్చుకున్నాడు. ఇతడు 22-4-1447వ తేదీన జన్మించాడని యస్.కె.రామచంద్రరావు అనే పండితుడు 13-5-1962వ తేదీన ప్రజావాణి అనే దినపత్రికలో పురంధరదాసు అనే వ్యాసం రాసి అందులో వ్యాసతీర్థుల తేదీ కూడా ఇచ్చారు.

వ్యాసరాయరు గొప్ప పండితుడు. అతడు అనేక గ్రంధాలు రాశాడు. చంద్రిక, న్యాయామృత, తర్కతంధాన అనే కావ్యాలు, కన్నడ భాషలో అనేక కీర్తనలు Saladis, Ugabhogas రాశాడు. ఇతనికి అనేక మంది శిష్యులు ఉన్నారు. ఇతని కీర్తనలను శ్రీకృష్ణునికి అంకితం చేశాడు. సొడెమఠానికి చెందిన శ్రీవదిరాజ నారాయణయతి, పురందరదాసు, కనకదాసులు ఇతని శిష్యులు. వ్యాసతీర్థులు అనెగొందిలో వ్యాసకూటాన్ని స్థాపించారు. మఠాలలో అతడు కన్నడ సాహిత్యాన్ని అభివృద్ధి చేసే ప్రయత్నం చేశాడు.

ఉత్తరాది మఠ సాంప్రదాయానికి చెందిన రాజేంద్ర అనే అతడు పొసలలో ఒక మఠాన్ని నెలకొల్పాడు. ఆ మఠంలో వ్యాసతీర్థులు మహిమలను ప్రదర్శించాడట. కనుక ఆ మఠానికి వ్యాసరాయ మఠం అని పేరు వచ్చింది. క్రీ.శ.1521వ సంవత్సరంలో కుషయోగి కాలంలో వ్యాసతీర్థులు విజయనగర సింహాసనం అధిష్టించి రాజ్యాన్ని పాలించాడని ఒక కథ ప్రచారం ఉంది. ఈ కాలంలో విజయనగర సింహాసనంపై శ్రీకృష్ణదేవరాయలు పాలించాడు. కనుక ఇది అద్భుత కల్పనగా కనిపిస్తోంది. కుషయోగి మఠాధిపతిగా పదవిని నిర్వహించి ఉండవచ్చును. దానిని విజయనగర సింహాసనంగా వర్ణించి ఉండవచ్చును.

నరసింహాచార్యుడు రాసిన కర్ణాటక కవిచరిత్ర వ్యాసతీర్థులు మాధ్వమతశాఖకు చెందిన ఆచార్యుడు, గొప్ప కవి అని, అతడు 12 సంవత్సరాలు తిరుపతి దేవాలయంలో పూజారిగా పనిచేశాడని తెలుపుతోంది. ఇతడు మల్లికార్జున రాయల కాలంలో జన్మించి అచ్యుతరాయల కాలం వరకు క్రీ.శ.1539వ సంవత్సరం వరకు 92 సంవత్సరాలు జీవించాడు. మల్లిఖార్జున విరూపాక్ష, సాళువ నరసింహ, తుళువ వీరనరసింహ, కృష్ణదేవరాయ, అచ్యుత దేవరాయలకు ఇతడు సమకాలికుడు. తుళువ వంశస్తుల గురువుగా వారికి దీక్ష ఇచ్చాడు. ఇతనికి తాతాచార్యులని కూడా పేరు ఉంది. రాజదీక్ష గురువుగా తుళువ యుగంలో గొప్ప గౌరవ మర్యాదలు పొందాడు.

శ్రీపాదరాజరు: శ్రీపాదరాజు క్రీ.శ.1471వ సంవత్సరంలో రెండవ విరూపాక్షరాయల కాలంలో అబ్బూరులో జన్మించాడు. ఇతని మొదటి పేరు లక్ష్మీనారాయణ. ఇతడు చిన్న వయసులో సన్యసించాడు. తర్వాత ఇతడు శ్రీపాదరాజరు అనే పేరుతో ప్రఖ్యాతి చెందిన వైష్ణవ ఆచార్యునిగా ప్రసిద్ధి చెందాడు. సాళువ నరసింహరాయలుకు ఇతడు గురువు. శ్రీవ్యాసరాయరకు కూడా అతడు గురువు. ఇతడు భ్రమరగీత, వేణుగీత, గోపిగీత అనే గీతాలు రాశాడు. ఇతడు తన గీతాలను రంగ విఠలస్వామికి అంకితం చేశాడు. అంటే ఆ దేవునిపై ఈ గీతాలు పాడాడు. ఉత్తరాది మఠానికి చెందిన రఘునాథ తీర్థులు, ఉడిపిలోని పజావార మఠానికి చెందిన విజయ ధ్వజతీర్థులు శ్రీపాదతీర్థులను గొప్పగా గౌరవించేవారు. ఇతడు తన కీర్తనలల్లో వృత్తాలను రాశాడు. ఇది

కన్నడ భాషలో నూతన ప్రక్రియ. ఈ విధానంలో మొదట పల్లవి, తర్వాత వృత్తం, తర్వాత చరణం, తర్వాత మళ్లీ వృత్తం ఉంటుంది. ఇది హరిదాసులు విష్ణునామ సంకీర్తన చేసే విధానం అని చెప్పవచ్చును. ఇతని కీర్తనలే హరిదాసులు పాడే కీర్తనలకు మూలాలు అయ్యాయి. కనుక ఇతనిని హరిదాసు సాహిత్యానికి మూల పురుషుడయ్యాడని అన్నారు. అతని కీర్తనలలో శ్రీవాయు హనుమాన్, భీమ, మధ్వాచార్యుడు, కృష్ణుని బాల్యం, మహిమలను గురించి కీర్తనలు పాడాడు. ఇతడు ముల్‌భగల్‌లోని పద్మనాభ తీర్థమఠానికి చెందిన ఆచార్యుడని కర్ణాటక కవి చరిత్ర తెలుపుతోంది. అతడు ముల్‌భగల్‌లోనే మరణించాడు.

శ్రీవడిరాజరు: శ్రీవడిరాజు క్రీ.శ.1480వ సంవత్సరంలో జన్మించాడు. ఇతడు కూడా విజయనగర యుగం నాటి మరొక గొప్ప వాగ్గేయకారుడు. ఇతని మొదటి పేరు వరహాచార్యుడు. ఇతడు కూడా హరిదాసు సాహిత్యాన్ని రాశాడు. ఇతడు వైకుంఠ వర్ణన అనే సంగీత గ్రంథాన్ని రాశాడు. ఈ గ్రంథంలో సంగీతం నాలుగు సంధులుగా రాయబడింది. ఈ గ్రంథానికి తత్వసారద సొతిగినసొనె అని కూడా పేరుంది. ఈ గ్రంథంలో ఆనందతీర్థ సరస్వతి, విష్ణు, వేద వ్యాసులను స్తుతించాడు. తర్వాత ఇతడు స్వప్నగద్య అనే సంగీత గ్రంథాన్ని రాశాడు. అందులో అతడు 45 భామినీసత్పదులు రాశాడు. అవి 9 కీర్తనలుగా విభజింపబడి ఉన్నాయి. తర్వాత లక్ష్మియసోబనె అనే మరొక గ్రంథాన్ని 112 పద్యాలతో రాశాడు. మధ్వాగురువు రాసిన భరతతాత్పర్య అనే సంస్కృత గ్రంథానికి కన్నడ అనువాదం రాసి, దానికి భరతతాత్పర్య నిర్ణయ టీకా అని పేరు పెట్టాడు. తర్వాత విష్ణువును స్తుతిస్తూ కొన్ని కీర్తనలు రాశాడు. ఇంకా అతడు కీచకవ, కేశవనామ గుండక్రియె అనే గ్రంథాలు పద్యాలలో రాశాడు. అతని కీర్తనలలో హయవందన అని ఉంటుంది. అది అతని అంకితం. 10 సంవత్సరాలు అతడు హరిదాస సాహిత్యాన్ని రాసి దానికి మంచి ప్రాచుర్యాన్ని సాధించాడు. అతని సాహిత్యానికి ప్రవాస సాహిత్యం అని తీర్థ ప్రబంధం అని కూడా పేరుంది. అందుకు కారణం అతడు పవిత్ర క్షేత్రాలను దర్శించి తరించాడని బోధించాడు. అతడు అనేక క్షేత్రాలలోని దేవుళ్లను కీర్తిస్తూ రాశాడు. కనుక అతని సాహిత్యానికి తీర్థయాత్రల సాహిత్యం అని పేరు వచ్చింది ఇలాంటి సాహిత్యం కన్నడ భాషలో అపురూపమైన సాహిత్యంగా పేరు తెచ్చుకుంది. అతడు తుళు భాషలో దశావతార అనే గ్రంథం కూడా రాశాడు. ఇతని గురువు శ్రీవ్యాసతీర్థులు. గురువు ఆదేశం ప్రకారం దశకూటాన్ని స్థాపించాడు. వడిరాజు గొప్ప పండితుడుగా ప్రసిద్ధి చెంది అనేక మంది పండితులను ఓడించాడు. అందువల్ల అతనికి వడిరాజు అని పేరు వచ్చిందట. వడిరాజు క్రీ.శ.1600 సంవత్సరంలో మరణించాడని ప్రతీతి.

శ్రీపురంధరదాసు: ఈ కాలం నాటి మరొక వాగ్గేయకారుడు పురంధరదాసు. అతడు విరూపాక్షరాయల కాలంలో పురంధరఘడ్‌లో జన్మించాడు. మొదట ఇతడు స్మార్త మతస్థుడు. తర్వాత మాధ్వ వైష్ణవశాఖకు మారాడు ఇతడు పురంధర విఠలుని భక్తుడని, తన కీర్తనలను విఠలునికి అంకితం చేశాడని ఆర్. నరసింహాచార్యులు రచించిన కర్ణాటక కవుల చరిత్ర తెలుపుతోంది. ఇతని అసలు పేరు శ్రీనివాసు లేక సీకప్ప. అతని భార్య కూడా గొప్ప భక్తురాలు. ఆమె చాలా విశాల భావాలు గల స్త్రీ. ఆమె సలహా మీద అతడు తన ఆస్తిపాస్తులను దానం చేసి హరిదాసుడుగా మారాడు. వ్యాసతీర్థుల వద్ద మంత్రోపదేశం పొంది భాగవతుడు అయ్యాడు. దీక్ష పుచ్చుకున్న తర్వాత వ్యాసతీర్థులు అతనికి పురంధర విఠల అని పేరు మార్చాడు. అదే పురంధరదాసుగా మారింది. అతడు హరికీర్తనలు పాడుకొంటూ క్రీ.శ.1564వ సంవత్సరంలో మరణించాడు.

విజయనగర యుగంలో వైష్ణవాచార్యులు వ్యాసతీర్థులు, శ్రీపాదరాజరు, శ్రీవడిరాజరు, శ్రీపురంధరదాసు, కనకదాసులు జన్మించారు. వ్యాసతీర్థులు వ్యాసకూటాన్ని స్థాపించగా అతని శిష్యులు శ్రీవడిరాజు, పురంధరదాసు, కనకదాసు దశకటాన్ని స్థాపించారు. వీరందరూ విజయనగర యుగంలో దక్షిణదేశంలో వైష్ణవ మతాన్ని ప్రచారం చేశారు. వారి ప్రచారం వల్ల శైవ మతం కొంత వరకు వెనుకంజ వేసింది. ప్రజలు కూడా వైష్ణవ మతం వైపు ఆకర్షింపబడ్డారు. విరూపాక్షరాయల తర్వాత సాళువ, తుళువ, ఆరవీటి వంశాలు వైష్ణవ మతాన్ని స్వీకరించారు అందువల్ల ఈ కాలంలో వైష్ణవ మతం ప్రధాన మతంగా కొనసాగింది.

వాగ్గేయకారుడు - అహోబిల పండితుడు: ఈ యుగంలో ప్రసిద్ధి చెందిన మరొక తెలుగు వాగ్గేయకారుడు అహోబిల పండితుడు. అతడు గొప్ప సంగీత విద్వాంసుడు. గొప్ప రచయిత. సంస్కృతంలో సంగీత పారిజాతం అనే గ్రంథాన్ని రాశాడు. అది సంస్కృతంలో గొప్ప ప్రమాణాలు కలిగిన సంగీత గ్రంథంగా ప్రసిద్ధి చెందింది. ఇంకా అతడు వ్యాకరణం, వేదాంతం, తత్వశాస్త్రం, జ్యోతిష్యం, న్యాయశాస్త్రం, సంగీతశాస్త్రాలలో గొప్ప పండితునిగా ప్రసిద్ధి చెందాడు. కాని ఇతని కాలాన్ని గురించి భిన్నాభిప్రాయాలున్నాయి. ఇతడు 14వ శతాబ్దం

వాడని కొందరు, 15వ శతాబ్దం వాడని కొందరు, 17వ శతాబ్దం వాడని మరికొందరు భావించారు. 14వ శతాబ్దంలో రామ్‌నగర్ రాజు నిర్వహించిన సోమయజ్ఞ కాలంలో అందరు పండితులను ఓడించాడని కలిందిజ అనే పండితుడు చెప్పాడు. అతడు ఖిల్జీ యుగానికి చెందినవాడని, అతని పారిజాత సంగీత గ్రంథంలోని శ్లోకాలను బట్టి కొందరు నిర్ణయించారు.

అతడు కర్నూలు జిల్లాలోని అహోబిలంలో జన్మించాడు. అతని తండ్రి కృష్ణ పండితుడు. అతడు వేదాలు అభ్యసించడానికి కాశి వెళ్లాడు. అక్కడ అతడు గొప్ప పండితునిగా, వాగ్గేయకారునిగా ప్రసిద్ధి చెందాడు. కాశిలో అతని పేరుతో గంగానది ఒడ్డున అహోబిలఘాట్ అనే ఒక ఘాట్, అహోబిల మందిర్ అనే ఒక ఆలయం ఉన్నాయి. కాశీలోనే అతడు తన సంగీత పారిజాతాన్ని రాశాడు. అది అద్భుతమైన సంగీత కావ్యమై అతనికి గొప్ప కీర్తి తెచ్చింది. ఈ కావ్యం అతనిని సంగీత శాస్త్రంలో ప్రసిద్ధులైన భరతుడు, సారంగదేవుడు, దామోదర మిశ్రా, సోమనాథులతో సమానమైన స్థాయిని తెచ్చింది. అతని కీర్తిని విని బెనారస్ వద్ద ఉన్న హటువా రాజు తన ఆస్థానాన్ని దర్శించమని అహోబిల పండితునికి కబురు పెట్టాడు. కాని అతడు రాజు ఆహ్వానాన్ని తిరస్కరించాడు. ధర్మశాస్త్ర పండితులు అతనిని గొప్పగా గౌరవిస్తారు. అతడు గొప్ప పండితునిగా గుర్తింపు పొందినప్పటికీ జీవితంలో అప్పుల పాలై దారిద్ర్యాన్ని అనుభవించాడు. ఒకసారి అతడు 75 రూపాయలు అప్పు చేశాడు. ఆ సమయంలో హటువా రాజు పండితులను సత్కరిస్తానని ప్రకటించాడు. పాండిత్యంలో పోటీలు జరుగుతాయనీ, అందులో విజయం సాధించిన వారికి బహుమానాలు ఇస్తానని కూడా ప్రకటించాడు. అప్పులలో ఉన్న అహోబిల పండితుడు ఆ పరీక్షకు వెళ్లాడు. తన వంతు వచ్చినప్పుడు తనను 75 ప్రశ్నలు అడగాలని నియమం పెట్టారు. అది విని రాజు ఆశ్చర్యచకితుడై 75 ప్రశ్నలను తయారు చేసి ప్రశ్నించమని పరీక్షించే పండితులను ఆదేశించాడు. వారు అడిగిన అన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పాడు. అందుకు ఆశ్చర్యపడి రాజు అతనిని రెండు మూడు రోజులు తన రాజధానిలో ఉండమని కోరాడు. కాని అహోబిలుడు రాజ్యం మొత్తం ఇచ్చినా తాను అక్కడ ఒక్క క్షణం కూడా ఉండనని వెళ్లిపోయాడు. తిరిగి నాలుగు రోజుల తర్వాత వచ్చి పండితులతో వాదిస్తానని అన్నాడు. వ్యాకరణం, తర్క, మీమాంసలలో చర్చ జరిగింది. అందులో కూడా అతడు విజయం సాధించాడు.

అతని విజయాలను గురించి మరొక కథ ఉంది. బెనారసరాజు యజ్ఞం చేస్తుండగా అహోబిలుడు వెళ్లి ఋత్విక్కులను తప్పుపట్టాడు. అందుకు ఋత్విక్కులు కోపగించగా అహోబిలుడు మణికర్ణికా ఘట్టానికి వెళ్లి వీణ వాయించగా సరస్వతి ప్రత్యక్షమై అతని గానానికి అనుగుణంగా నాట్యం చేసిందట. రాజుకు సంభ్రమాశ్చర్యం కలిగి యజ్ఞ దోషాన్ని నివారించే ఉపాయం చెప్పమని వేడుకున్నాడట. పాణిని శిక్షలోని ఒక శ్లోకం చదివి ఆ విధంగా శాంతి చేయమని రాజుకు సలహా ఇచ్చాడట. రాజు ఆ విధంగా చేసి ముక్తి పొందాడని ఒక కథ ఉంది.

అహోబిలునకు పాండిత్యమే గాక శిల్పశాస్త్రం కూడా తెలుసు. అతడు తన స్వహస్తాలతో అహోబిల మందిరాన్ని నిర్మించి అందులో శివలింగాన్ని ప్రతిష్ఠించాడు. నేటికీ ఆ దేవాలయం ఉంది. ఒక రోజు ఆ మందిరంలో కూర్చొని గౌరీ రాగాన్ని గానం చేస్తుండగా దక్షిణాది సంగీత విద్వాంసులు వచ్చి సంగీత రత్నాకరంలోని ఒక శ్లోకాన్ని చెప్పి దానిని పాడమన్నారట. వెంటనే దానికి అనుగుణంగా రాగాలాపన చేసి వారిని మెప్పించాడట. అతడు జంజమా, ధౌద, ఝూల అనే రాగాలను వీణ మీద పాడుతూ ఉండగా ఒక త్రాచు పాము, నెమలి వచ్చాయట. పాట అవగానే అవి మాయమయ్యాయట. అతడు రచించిన సంగీత పారిజాతం హనుమన్మటం మీద ఆధారపడి ఉందట. ఈ గ్రంథం కాండాలుగా విభజింపబడింది. కొందరు అతడు ధర్మార్ రాజు ఆస్థాన పండితుడని, 17వ శతాబ్దం వాడని అంటారు. వీణలో స్వరాలను పలికించిన మొట్టమొదటి సంగీత విద్వాంసుడు అతడు. అతను 29 శృతులను, 122 రాగాలను రూపొందించాడు. అతడు మేళా అంటే రాగం అని అన్నాడు. అతడు 11340 మేళాలను ఉపయోగించాడు. అతడు ప్రతి రాగానికి ఉగ్రహ, స్థాయి, సంచారి, ముక్తయి అనే నాలుగు భాగాలు ఉంటాయని వివరించాడు. ఈ సంగీతశాస్త్ర లక్షణాలన్నీ సంగీత పారిజాతంలో వివరించాడు. ఈ గ్రంథం హిందుస్థానీ సంగీతం అభివృద్ధి చెందడానికి బాగా ఉపయోగపడింది. కనుక అతడు భారతీయ సంగీతశాస్త్ర రచయితలలో గొప్ప స్థానం పొందాడు.

జగన్నాథ కవి క్రీ.శ.1620-1665: విజయనగర ఆస్థానానికి చెందకపోయినా ఆ కాలం నాటి ఆంధ్ర జాతికి చెందిన మహోన్నత పండితుడు, సంగీత విద్వాంసుడు జగన్నాథ కవి. ఇతనికి కవిరాయ అనే బిరుదు కూడా ఉంది. ఇతడు షాజహాన్ ఆస్థానంలో చేరి ప్రఖ్యాతి చెందిన సంస్కృత పండితుడు. ఇతడు ఆంధ్రుడు.

గోదావరి జిల్లాలోని ముంగండ గ్రామంలో జన్మించాడు. ఇతని తల్లి లక్ష్మి, తండ్రి పెరుభట్టు. ఇతడు ఆంధ్ర దేశానికి చెందిన చిట్టచివరి great luminary-poet rhetorician 17వ శతాబ్దపు అద్భుతపు కవులలో ఇతడు ఒకడు. అతని తండ్రి మహా పండితుడు. కుమారుని అన్ని శాస్త్రాలలో నిష్ణాతుడిని చేశాడు. అతని కవిత్వం, పాండిత్యం అతని Magnumous, Rasagandhara లతో స్పష్టంగా కనిపిస్తుంది. రెండవ వెంకటపతిరాయల మరణానంతరం క్రీ.శ.1614వ సంవత్సరం తర్వాత విజయనగర రాజ్యంలో వారసత్వ యుద్ధం వచ్చి తోపోరు యుద్ధం జరిగింది. విజయనగర రాజ్యం అలజడుల పాలైంది. అందువల్ల హిందూ పండితులను ఆదరించేవారు లేకపోయారు. అందువల్ల జగన్నాథకవి ఉత్తరదేశం వెళ్లి జయపూరు చేరాడు. అక్కడ ఒక విద్యా సంస్థను నెలకొల్పాడు. జయపూర్‌లో పర్షియా భాష, ఇస్లాం మత వేదాంతంలో నిష్ణాతులైన ఒక ఖాజీ ఉండేవాడు జగన్నాథుడు పర్షియన్ భాషను నేర్చుకొని ఆ ఖాజీని వాదనలతో ఓడించాడు. అతని ఏకసంధాగ్రాహిత్వానికి, పాండిత్యానికి అబ్బురపడి ఆ ఖాజీ జగన్నాథ పండితుని ఎదురులేని పాండిత్యాన్ని గురించి ఢిల్లీ చక్రవర్తి అయిన జహంగీర్‌కు తెలిపాడు. జహంగీర్ జగన్నాథ పండితుని మొగల్ ఆస్థానానికి ఆహ్వానించాడు. మొగలుల ఆస్థానంలో క్రీ.శ.1620 నుండి 1650 వరకు ఉన్నాడు. అతడు జహంగీరు తర్వాత షాజహాన్, దారాషుకోవ్‌ల అభిమానాన్ని పొందాడు. అతడు గొప్ప పండితుడే గాక గొప్ప సంగీత విద్వాంసుడు. అతనికి పండితరాయ, కలవంత్ పదవాక్య ప్రమణ, పదవరీణ అనే బిరుదులను ఇచ్చారు. అతడు వ్యాకరణం, న్యాయ, మీమాంస, చతుస్ శాస్త్రాలలో పండితుడు. అతడు క్రీ.శ.1641వ సంవత్సరంలో అసఫ్ విలాసం అనే కావ్యాన్ని రాసి నూర్జహాన్ సోదరుడైన అసఫ్‌ఖాన్‌కు అంకితం ఇచ్చాడు. 12 సంగీత శ్లోకాలు రాసి షాజహాన్‌కు అంకితం చేశాడు. అందుకు షాజహాన్ జగన్నాథుని వెండి, బంగారు నాణేలతో తులాభారం జరిపాడు. అతడు 4,500 నాణేల బరువు తూగాడట. ఆ సమయంలోనే అతనికి కవిరాయ అనే బిరుదు ప్రదానం చేయబడింది. పాదుషానామా అనే గ్రంథంలో జగన్నాథుని ప్రస్తావన ఉంది. సంగీతం, ఛందస్సు, ప్రబంధ రచనలలో తిరుగులేని వాడని ప్రతీతి అతడు రసగంగాధర, అసఫ్ లహరి అనే కావ్యాలు రాశాడని కునంగో అనే పండితుడు కూడా పేర్కొన్నాడు సిద్ధాంతసార కౌస్తుభం అనే పేరుతో అరబిక్ Alamgist ను సంస్కృతంలోకి అనువదించాడు. సామ్రాట్ సిద్ధాంతం అనే పేరుతో ఖగోళశాస్త్రాన్ని కూడా రాశాడు. మొగల్ ఆస్థానంలో అతడు కవులకు నాయకత్వం వహించాడు అతని కీర్తి విని కూచ్‌బీహార్ రాజ్యపాలకుడైన రాజా ప్రేమ్ నారాయణ జగన్నాథుని తన ఆస్థానానికి ఆహ్వానించాడు. అతని ఆస్థానంలో జగన్నాథకవి క్రీ.శ.1650-65 సంవత్సరాల మధ్య నివసించాడు. ప్రేమ్ నారాయణ గొప్ప కవి, వాగ్గేయకారుడు, సంగీత విద్వాంసుడు, నాట్యశాస్త్రంలో నిష్ణాతుడు, గొప్ప వేదాంతి, కవి, పండిత పోషకుడు, అతని కాలాన్ని కూచ్ బీహారు రాజ్యంలో స్వర్ణయుగం అని అంటారు. అలాంటి ప్రేమ్ నారాయణ జగన్నాథుని తన ఆస్థానానికి ఆహ్వానించి గౌరవించాడు. జగన్నాథుడు జగదాభరణ, ప్రణభరణ, అసఫ్ విలాసం, భామినీవిలాసం, మనోరమ కుచమర్దన, రసగంగాధర అనే ఐదు లహరీలను రచించాడు.

జగన్నాథ కవి రాయుడు గొప్ప కవి పండితుడేగాక గొప్ప రసికుడని కూడా అంటారు. అతడు ఢిల్లీ దర్బారులో ఉన్నప్పుడు కురంగి అనే ఒక ముస్లిం సౌందర్యరాశిని ప్రేమించి వివాహం చేసుకొని ఆమెతో ఆనందమయ జీవితాన్ని గడిపాడట. ఆమె పట్ల అతనికి అనంతమైన వ్యామోహం ఉండేదట. ఆమెపై అతనికి పిచ్చి ప్రేమ కలిగిందట. అందువల్ల ఆమెను యవనోనవనీత, కామలాంగి అని రాసుకున్నాడు. జీవితంపై విరక్తి కలిగి కాశ్మీరు వెళ్లాడట. అక్కడ అప్పయ్యదీక్షిత్ పండితుడు అతని ప్రేమ వ్యవహారాన్ని ఖండించి కులం నుండి వెలి వేశాడట. అతడు తాను పాపం చేశానని తలచి తన పాపప్రక్షాళన కోసం గంగానది వద్దకు వెళ్లి గంగా లహరి అనే సంస్కృత శ్లోకాలను గానం చేశాడట. అతని గానం తారాస్థాయిని చేరగానే గంగానది పొంగి వచ్చి అతనిని లాక్కొని వెళ్లిపోయి తనలో కలుపుకుందట. నేటికీ కాశీలో గంగానదికి జగన్నాథఘాట్ అనే స్నానఘాట్ ఉంది. జగన్నాథ కవి రాయుడు క్రీ.శ.1665లో మరణించాడు.

విజయనగర యుగంలో సంస్కృత భాషా సాహిత్యాలు

విజయనగర కాలంలో కూడా సంస్కృతం దేశ భాషగా కొనసాగింది. భారతదేశం అంతటా ఇది పండిత భాషగా కొనసాగింది. ఏ ప్రాంతంలోనైనా స్థానిక భాషతోపాటు సంస్కృతంలో కవులు, పండితులై ఉండేవారు. వారిని ఉభయ భాషా పండితులు అనేవారు. తెలుగు కవులు తెలుగు భాషతోపాటు సంస్కృత భాషలో నిష్ణాతులై ఉండేవారు. అలాగే తమిళదేశంలో తమిళంతోపాటు సంస్కృత భాషా పాండిత్యం ఉండేది. అంటే అన్ని ప్రాంతాలలో సంస్కృతం తప్పనిసరి దేశ భాష. దాంతోపాటు ఎవరి ప్రాంతంలో వారి స్థానిక భాషలో కవుపై ఉండేవారు. కనుక విజయనగర యుగంలో సామ్రాజ్యం అంతటా సంస్కృత భాషలో అసంఖ్యాక కావ్యాలు వెలువడ్డాయి. అన్ని రంగాలకు చెందిన కావ్యాలు రాయబడ్డాయి. వేదాంత గ్రంథాలు, పురాణాలు, వైద్య గ్రంథాలు, లౌకిక గ్రంథాలు అది ఇది అనేది కాకుండా ఎన్ని రంగాలలో విజ్ఞానం ఉండేదో అన్ని రకాల సంస్కృత గ్రంథాలు రాయబడ్డాయి.

విజయనగర చక్రవర్తులలో కవిగానీ, రాజుగానీ కవి పండితులను పోషించని రాజుగానీ లేడంటే అతిశయోక్తి కాదు. వారు కవి, పండితులను పోషించడమేగాక తాము స్వయంగా కవులై కావ్యాలు రాశారు. వారే గాక వారి సామంతులు, మంత్రులు, ఉన్నతోద్యోగులు అనేక మంది కవులు, పండితులు. వారు స్వయంగా అనేక కావ్యాలను రాశారు. ఉత్తమ గ్రంథాలు, శాస్త్రాలు రాయటానికి ప్రోత్సహించారు.

స్వయంగా కవులు: విజయనగర ప్రభువులలో చాలా మంది స్వయంగా సంస్కృత పండితులు. వారు అనేక సంస్కృత కావ్యాలు రచించారు. విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహరబుక్కరాయలు తమ జీవితమంతా సామ్రాజ్య నిర్మాణం కోసం నిరంతరం పోరాటాలు జరిపారు. అందువల్ల వారు కావ్యాలు రచించలేక పోయారు. కాని రెండవ హరిహరరాయల నుండి దాదాపు విజయనగర సార్వభౌములందరూ కావ్యాలే రచించారు.

రెండవ హరిహరరాయలు: ఇతడు గొప్ప పండితుడు. ఇతనికి రాజవాల్మీకి, రాజవ్యాస, కర్ణాటక విద్యావిలాస అనే బిరుదులున్నాయి. కాని అతని గ్రంథాలు లభించలేదు. కవి అయి రచనలు సాగించి ఉండకపోతే అలాంటి బిరుదులు ఉండవు.

విరూపాక్ష రాయలు: ఇతడు ఉన్మత్తరాఘవం, నారాయణీయం అనే రెండు సంస్కృత నాటకాలు రచించాడు.

ప్రౌఢదేవరాయలు: ఇతడు ప్రసిద్ధి గాంచిన రెండవ దేవరాయలు. ఇతడు బ్రహ్మసూత్రాలకు భాష్యం, రత్నదీపిక అనే శాస్త్ర గ్రంథం, మహానాటక సుధానిధి గ్రంథం రామాయణ కావ్యం అనే నాటకాన్ని, మొత్తం మూడు గ్రంథాలు రాశాడు.

సాళువ నరసింహరాయలు: ఇతడు గొప్ప కవి. రామాభ్యుదయం అనే కావ్యాన్ని రాశాడు. కాని అందరూ ఈ కావ్యాన్ని ఇతని ఆస్థానకవి రామనాథ డిండిముని కుమారుడు డిండిమ సార్వభౌముడు రాశాడని అంటారు.

శ్రీకృష్ణదేవరాయలు: సాహితీ సమరాంగ సార్వభౌమ అనే బిరుదు పొందిన శ్రీకృష్ణదేవరాయలు విజయనగర చక్రవర్తులందరిలోనూ మహోన్నతుడు. ఇతడు మహాపండితుడు, గొప్ప సంస్కృత కవి. ఇతడు జాంబవతీ పరిణయం అనే నాటకాన్ని, ఉషాపరిణయం, మదాలస పరిణయం సత్యవధూప్రీణనం, జ్ఞాన చింతామణి, రసమంజరి, సకల కథా సారసంగ్రహం అనే 7 సంస్కృత గ్రంథాలను రచించానని తన తెలుగు కావ్యమైన ఆముక్తమాల్యదలో రాసుకున్నాడు. కనుకనే నంది తిమ్మన అతనిని కవిత, ప్రావీణ్య, ఫణీశుడు అని వర్ణించాడు.

తిరుమల రాయలు: అరవీటి వంశంలోని తిరుమలరాయలు గీత గోవిందానికి శ్రుతిరంజని అనే పేరుతో వ్యాఖ్యానం రాశాడు.

రాజాంతఃపుర కాంతల కావ్యాలు: విజయనగర సార్వభౌములేగాక వారి అంతఃపుర స్త్రీలు కూడా అనేక సంస్కృత కావ్యాలు రచించారు. వాటిలో పెక్కు చారిత్రక కావ్యాలు ఉన్నాయి.

గంగాదేవి: రాజాంతఃపుర కాంతలలో ప్రప్రథమమైన కవయిత్రి గంగాదేవి. ఈమె మొదటి బుక్కరాయల కోడలు. గొప్ప సంస్కృత పండితురాలు. ఆమె తన భర్త కంపరాయుని మధుర దండయాత్రను మధురా విజయం

అనే పేరుతో మనోహరమైన సంస్కృత కావ్యం రాసింది. ఇందులో ఋతువుల వర్ణనలు అద్భుతంగా వర్ణించబడ్డాయి.

తుక్కాంబ: ఈమె కృష్ణదేవరాయల భార్య అయిన అన్నపూర్ణ. ఈమెకు తుక్కాంబ అనే పేరు కూడా ఉంది. తుక్కపంచతి అనే కావ్యం రాసింది.

తిరుమలాంబ: ఈమె కృష్ణదేవరాయల కుమార్తె, అచ్యుతదేవరాయల ఆస్థాన కవయిత్రి. ఆమె వరదాంబికా పరిణయం అనే కావ్యాన్ని రచించింది. అచ్యుత దేవరాయలు, ఆయన భార్య వరదాంబికల వివాహాన్ని ఇతివృత్తంగా తీసుకొని ఈ కావ్యాన్ని రచించింది.

విజయనగర ప్రభువుల ఉన్నతోద్యోగుల రచనలు: వీరి వద్ద పని చేసిన అనేక మంది ఉన్నతోద్యోగులు కూడా సంస్కృత కావ్యాలు రచించారు. వారిలో ఇరుగప్ప దండనాథుడు, మహామంత్రి తిమ్మరుసు అతిముఖ్యులు.

ఇరుగప్ప దండనాథుడు: ఇతడు రెండవ దేవరాయల మంత్రి. ఇతడు నానార్థ రత్నమాల అనే నిఘంటువుని రాశాడు.

సాళువ తిమ్మరుసు: మొదట సాళువ వంశస్తులకు, తర్వాత శ్రీకృష్ణదేవరాయలకు ప్రధానమంత్రిగా పని చేసిన తిమ్మరుసు కూడా గొప్ప సంస్కృత కవి. ఇతడు అగస్త్యుడు రాసిన బాల భారతానికి మనోహర అనే పేరుతో వ్యాఖ్యానం రచించాడు.

గోపన మంత్రి - అప్పరస మంత్రి: వీరిద్దరూ మహామంత్రి తిమ్మరుసు మేనల్లుళ్లు. వారు కృష్ణమిశ్రుని ప్రబోధ చంద్రోదయ నాటకానికి చంద్రిక అనే పేరుతో వ్యాఖ్యానం రాశారు. గోపన మంత్రి కవియేగాక కవి పండిత పోషకుడు. అతడు మల్లన, రామకృష్ణ అనే కవులను ఆదరించాడు.

గోప తిప్పయ్య: రెండవ దేవరాయల మేనల్లుడైన గోపతిప్పయ తాళదీపిక, కావ్యాలంకార కామధేను అనే రెండు కావ్యాలు రాశాడు.

ఆస్థాన కవులు - డిండిమకవి కుటుంబం: విజయనగర యుగంలో ప్రసిద్ధి చెందిన కవి కుటుంబం డిండిమకవి కుటుంబం. ఈ కుటుంబం మూడు నాలుగు తరాలు విజయనగర ఆస్థాన కవులుగా కొనసాగారు. వీరు గొప్ప సంస్కృత పండితులు. వారు సంస్కృతం, తెలుగు రెండు భాషలలో కావ్యాలు రాశారు. ఈ కుటుంబం ప్రౌఢదేవరాయల కాలంలో విజయనగర ఆస్థానంలో ప్రవేశించింది. వారిలో మొదటివాడు అరుణగిరినాథ డిండిముడు. అతడు సోమవల్లి యోగానంద ప్రహసనం, సౌందర్యలహరి అనే రెండు కావ్యాలను రచించాడు ఇతనికి కవి సార్వభౌమ అనే బిరుదును ఇచ్చారు. ఇతని సంతతి వారిలో రెండవవాడు రాజనాథ డిండిముడు అతడు సాళువాభ్యుదయం అనే పేరుతో సాళువవంశ చరిత్రను రచించాడు. వీరివంశంలో మూడవ రాజనాథ డిండిముడు అచ్యుతరాయాభ్యుదయం అనే పేరుతో అచ్యుతరాయల చరిత్రను కావ్యంగా కూడా రాశాడు. అష్టదిగ్గజాల రాక వరకు డిండిమ కవి కుటుంబీకులే విజయనగర ఆస్థానంలో ప్రముఖ కవి పండితులు.

విజయనగర సామంతరాజుల ఆస్థాన కవులు: విజయనగర ప్రభువుల సామంతులు, వారి ఆస్థాన కవులు కూడా ఈ యుగంలో అనేక సంస్కృత కావ్యాలు రాశారు.

రత్నఖేట శ్రీనివాస దీక్షితుడు: అచ్యుత దేవరాయల సామంతుడు, జింజిపాలకుడు అయిన సూరప్పనాయకుని ఆస్థానకవి శ్రీనివాసదీక్షితులు, భావనా పురుషోత్తమ అనే నాటకం రాసి సూరప్పనాయనికి అంకితమిచ్చాడు.

అప్పయదీక్షితులు: రాయవేలూరులో సామంతరాజుగా పాలించిన బొమ్మనాయకుని ఆస్థానకవి. ఈ కాలంలో గొప్ప ప్రసిద్ధి చెందిన వేదాంతి. ఇతడు కువలయానంద అనే అలంకార శాస్త్రం, పరిమళ అనే అద్వైత సిద్ధాంత గ్రంథం రాశాడు. ఇతడు ఆ కాలంలో గొప్ప ప్రజ్ఞాశాలియని, 104 గ్రంథాలు రాశాడని పేరుంది. బొమ్మా నాయకుడు ఇతనికి కనకాభిషేకం చేశాడు.

శ్రీనాథుడు - కవిసార్వభౌముడు: శ్రీనాథుడు విజయనగర ఆస్థాన కవి కాకపోయినా అతని కావ్యాలన్నీ ఈ యుగానికి చెందినవే. కవి సార్వభౌమునిగా వెలిగాడు. ఇతడు ఉభయ భాషా కవి.

వేదాంత గ్రంథాలు - తత్వశాస్త్రాలు - మతగ్రంథాలు: విజయనగర యుగంలో అన్ని మతాలలో శాఖాభేదాలుండేవి. ప్రతి శాఖ మతాచార్యులు తమ తత్వాలను వివరించడానికి గ్రంథాలు రాశారు. ఈ కాలంలో అద్వైత, ద్వైత, విశిష్టాద్వైత శాఖలుండేవి. వారు విజయనగర రాజులను ఆకర్షించడానికి తమ తత్వశాస్త్రాలను

అభివృద్ధి చేశారు.

అద్వైత గ్రంథాలు: ఈ కాలంలో అద్వైతులు శంకరాచార్య సిద్ధాంతాలు ప్రచారం చేశారు. వారు అందుకు అనుగుణంగా తమ గ్రంథాలు రాశారు. విద్యారణ్య మాధవాచార్యుడు, అతని సోదరుడు శాయణాచార్యులు శంకరతత్వాన్ని విశదపరుస్తూ గ్రంథాలు రాశారు. వారు శంకరాచార్య, హస్తమలకాచార్య, గోమటిభట్టు భాస్కరుని తత్వాలను అనుసరించారు.

విద్యారణ్యుని రచనలు: విద్యారణ్యుల వారు విద్యారణ్య వివేకచూడామణి, ఐతరేయ దీపిక, తైత్తరీయ దీపిక, వివర్ణ ప్రమేయ సంగ్రహం, పంచదశి - గురువుల పాదపద్మాలను పూజించి, హృదయాలను క్షాళన చేసుకొని జగత్ సత్యాలను తెలుసుకొనే విధానాలను తెలిపే గ్రంథం, జీవముక్తి వివేక, వ్యవహార మాధవీయం, మనుస్మృతి వ్యాఖ్య, పరాశరమాధవీయం, కాలజ్ఞానం, శంకర విజయం, రాజనీతి గ్రంథం, అనుభూతి ప్రకాశిక - ఉపనిషత్తులపై వ్యాఖ్యానం, అవరోక్షామభూతి దీపిక - శంకరాచార్యుల వారి అవరోక్షామభూతి దీపికకు వ్యాఖ్యానం మొదలైన గ్రంథాలు రాశారు.

మాధవాచార్యుడు: ఇతని తండ్రి యామణ. భారద్వాజస గోత్రీకుడు. బృహదాయన సూతం యజుశ్శాఖకు చెందినవాడు. అనేక గ్రంథాలు రచించాడు. ఇతడే విద్యారణ్యుడని, శృంగేరి పీఠాధిపతి అని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. కాని వీరిద్దరూ వేరు వేరు వ్యక్తులని ఎక్కువ మంది భావిస్తారు. మాధవాచార్యుడు పరాశర స్మృతి వ్యాఖ్య, కాలమాధవీయం, జైమినీయం న్యాయమాలవిస్తర, జీవముక్తి వివేకం, సర్వదర్శన సంగ్రహం అనే గ్రంథాలు రాశాడు. వీటిలో పరాశరస్మృతి వ్యాఖ్య చాలా ముఖ్యమైనది. ఇందులో హిందువులు నిత్యం ఆచరించదగిన నియమాలు రాయబడ్డాయి. కాల మాధవీయానికి కాలనిర్ణయం అనే మరొక పేరు కూడా ఉంది. జైమినీయ మాలావిస్తర బుక్కరాయలచే కొనియాడబడింది. జీవన్ముక్తి వివేకం అనే గ్రంథంలో అద్వైత వేదాంతం వివరించబడింది. సర్వదర్శన సంగ్రహంలో ఆరు ఆస్తిక దర్శనాల సారాంశం వివరింపబడింది. ఈ గ్రంథం ఇతని రచన కాదని, శాయణాచార్యుల వారి కుమారుడు మాధవుడు రచించాడని కొందరు భావిస్తారు. మాధవాచారికి బుక్కరాయల మంత్రి కుల గురువు అని పరాశర మాధవీయం తెలుపుతోంది. ఇతడు గృహస్తుడు, సోమయాజి, విద్యాతీర్థ, భారతీతీర్థ శ్రీకంఠుడు ఇతని గురువులు. ఇతడు చివరి కాలంలో సన్యసించాడని అతడే విద్యారణ్యుడని, శృంగేరి మఠాధిపతి అయ్యాడని కొందరు భావిస్తారు. అందువల్లనే మాధవ విద్యారణ్యుడనే పేరు వచ్చిందని అంటారు.

శాయణాచార్యుడు: మాధవాచార్యుని సోదరుడైన శాయనాచార్యుడు కూడా గొప్ప పండితుడు. రాజనీతిజ్ఞుడు. ఇతడు మొదటి కంపన, అతని కుమారుడు సంగమునికి మంత్రిగా చేసి తర్వాత బుక్కరాయల ఆస్థానంలో చేరాడు. బుక్కరాయలు మాధవాచార్యుల వారిని వేదాలకు భాష్యాలు రాయవలసిందిగా కోరాడట. అతడు తన తమ్ముడు శాయణుడు గొప్ప విజ్ఞాని అని, అతని చేత రాయించమని చెప్పాడట. బుక్కరాయల కోరికపై శాయణాచార్యులు వేదాలకు భాష్యాలు రాశాడు. అతడు ఋగ్వేద సంహిత, తైత్తరీయ సంహిత, కాణ్వసంహిత - దీనికే శుక్లయజుర్వేదం అని కూడా పేరుంది. సామవేద సంహిత, అధర్వణ వేద సంహిత, ఐతరేయ బ్రాహ్మణం, తైత్తరీయ బ్రాహ్మణం - దీనికే కృష్ణ యజుర్వేదం అని కూడా పేరుంది. శతపత బ్రాహ్మణం - దీనికి శుక్లయజుర్వేదం అని కూడా పేరు. సద్వింస బ్రాహ్మణం - సామవేదానికి సంబంధించినది, ఐతరేయ ఆరణ్యక అనే గ్రంథాలు రాశాడు. ప్రతి వేదం సంహిత, బ్రాహ్మణం, అరణ్యకం, ఉపనిషత్తు అనే నాలుగు భాగాలుగా ఉంటుంది. ప్రతి వేదంలోని నాలుగు భాగాలు విడివిడిగా వివరించి రాశాడు. ఈ రచనలో అతడు మరికొందరు పండితుల సహాయం కూడా తీసుకున్నాడని అంటారు. ఇంకా అతడు వేదాంత ప్రకాశిక అనే పేరుతో నాలుగు వేదాలకు కూలంకషమైన భాష్యం రచించాడు. దానికి శాయనభాష్యం అని పేరుంది. ఇవేగాక సుభాషిత శుభానిధి, రాయచిత్త సుధానిధి - దీనికే కర్మ విభాగం అని పేరు కూడా రాశాడు. ఇవన్నీ వేదాంత గ్రంథాలు. ఈ గ్రంథాలు కర్మయోగాన్ని మిళితం చేసిన పద్ధతికి ధాతువృత్తి, అలంకార సుధానిధి, పురుషార్థ సుధానిధి అనే గ్రంథాలు కూడా రాశాడు. ఇవన్నీ వేదాంత గ్రంథాలు. ఈ గ్రంథాలు కర్మయోగాన్ని, భక్తియోగాన్ని మిళితం చేసిన పద్ధతికి ప్రాధాన్యతనిచ్చాయి. విద్యారణ్య మాధవాచార్య శాక్మీణాచార్యులు, శృంగేరి పీఠానికి ప్రతినిధులు. వారు శృంగేరి పీఠం ద్వారా తమ అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేశారు. శృంగేరి పీఠాధిపతులకు క్రియాశక్తులు అని కూడా పేరుంది. శాయణాచార్యులు బుక్కరాయల కుమారుడు రెండవ దేవరాయల కాలంలో కూడా జీవించాడు.

భోగనాథుడు: ఇతడు మాధవ, శాయణుల సోదరుడు. ఇతడు కూడా గొప్ప కవి. అతని రచనల గొప్పదనాన్ని శాయణుడు కొనియాడాడు. బహుశా అతడు శాయణుడు రచించిన వేద భాష్యాలలో సహాయపడి ఉంటాడు.

ఇతర అద్వైత సిద్ధాంతులు: వీరేగాక మరికొందరు కూడా అద్వైత సిద్ధాంతాన్ని ప్రచారం చేసి గ్రంథాలు రాశారు. అవి అనన్యానుభవ, కైవల్యానంద, కృష్ణానంద, విశ్వేశ్వర సరస్వతి, అహోబల పండిత, గోవింద దీక్షిత భూమివల్లభావజీ, మహాదేవ ద్వారిన్, ఆనంద సరస్వతి. కాని వీరందరూ ఒకే విధమైన భావాలు కలిగిన వారు కాదు. ఎవరికి వారుగా అద్వైతతత్వాన్ని ఎవరి కోణంలో వారు వ్యాఖ్యానించి ప్రచారం చేశారు. అందువల్ల అద్వైత తత్వంతో అనేక సాంప్రదాయక వాదాలు ఏర్పడ్డాయి.

ద్వైత సిద్ధాంతాచార్యులు: ద్వైత సిద్ధాంతాన్ని వైష్ణవ ద్వైతతత్వమని కూడా పిలుస్తారు. దానికి మాధ్వతత్వం, మాధ్వమతం అని కూడా పేరుంది. ఈ మతాన్ని మధ్వాచార్యుడు స్థాపించాడు. ఈ మతం విష్ణుభక్తిని, కృష్ణతత్వాన్ని ప్రభోదిస్తుంది. 13వ శతాబ్దంలో ఈ మతాన్ని నారాయణ పండితుడు, నరహరితీర్థ పద్మనాభతీర్థ, మాధవతీర్థ అనే వారు ప్రచారం చేశారు. వీరిలో నారాయణ పండితుడు సముద్ర విజయం, హనుమద్భవ విజయమణి మంజరి, ద్వైతకలనాలు అనే గ్రంథాలు రాశాడు. నరహరితీర్థుల వారు యమక భారత ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రాశారు. అలాగే ఆనందతీర్థుని సూత్రాలకు కూడా భాష్యం రాశాడు. పద్మనాభతీర్థుడు ఆనందమాల అనే గ్రంథం రాశాడు. మాధవతీర్థుడు ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలకు భాష్యాలు రాశాడు.

విజయనగర యుగంలో ద్వైత సిద్ధాంతాన్ని అక్షోభ్యతీర్థులు, జయతీర్థులు, వ్యాసతీర్థులు, రఘోత్తమ, శ్రీపాదచార్య, వడిరాజ, విజయేంద్ర, విద్యాతీర్థ, రాఘవేంద్ర అనే వారు ప్రచారం చేశారు. వీరిలో అక్షోభ్యతీర్థులు మాధవతత్వ సంగ్రహాన్ని రాశాడు. జయతీర్థులు 23 గ్రంథాలు రాశాడు. అందులో తత్వప్రకాశిక, సుధ, న్యాయవివరణ, అధ్యామృత తరంగిణి ముఖ్యమైనవి. వ్యాసతీర్థులు ఉపనిషత్తులకు వ్యాఖ్యానాలు రాశాడు. ఇంకా మాయావాదఖండన, సుధ, మధ్వ, మందార మంజరి, తత్వోద్యోత, తాత్పర్యచంద్రిక, తర్కతాండవ, న్యాయామృతం అనే 13 గ్రంథాలు కూడా రాశాడు. ఇతడు తుళువ వంశానికి రాజగురువు. రఘోత్తముడు భవబోధ అనే గ్రంథం రాశాడు. శ్రీపాదాచార్యుడు వగ్వజ్ర అనే గ్రంథం రాశాడు. వడిరాజ గురువర, దీపిక, ఈశభాష్యతిక, గీతవ్యాఖ్యాన వివరణ మధ్వతంత్ర భూషణం, యుక్తిమల్లిక, వివర్ణత పాషాండ ఖండనం అనే గ్రంథాలు రాశాడు. విజయేంద్రుడు 104 గ్రంథాలు రాశాడు. అందులో రాగప్రస్తార బోధ విద్యావిలాసం ముఖ్యమైనవి. ఇతడు ఆ కాలంలో ప్రసిద్ధి చెందిన అప్పయ దీక్షితునికి ప్రత్యర్థి. విద్యాతీర్థుడు వాక్యార్థ చంద్రిక అనే గ్రంథం రాశాడు. రాఘవేంద్రుడు నాలుగు వేదాలకు వ్యాఖ్యలు రాశాడు. ఇంకా 12 గ్రంథాలు రాశాడు. వాటిలో పరిమళ, ఈసవశ్యవృత్తి ముఖ్యమైనవి. ఇతడు యజ్ఞనారాయణ పండితుడు లేక యజ్ఞనారాయణ దీక్షితుడికి సమకాలికుడు.

విశిష్టాద్వైత తత్వశాస్త్రాలు: విశిష్టాద్వైతతత్వాన్ని రామానుజాచార్యులు ఐదు పరంపరలుగా అందించాడు వేదాంతదేశిక, (క్రీ.శ.1269–1371) శ్రీ పిళ్లై లోకాచార్య వాటిలో రెండు పరంపరలకు వారసులై రెండు ఉపశాఖలకు వారసులయ్యారు. వేదాంత దేశికుని శాఖకు వడగలై అని, శ్రీపిళ్లై లోకాచార్య శాఖకు తెంగళై అనే పేర్లు వచ్చాయి. వేదాంత దేశికుడు విద్యారణ్యుని సమకాలికుడు. అతడు కూడా కాకతీయ సామ్రాజ్య పతనం తర్వాత హిందూ రాజులను కూడగట్టడంలోను, విజయనగర సామ్రాజ్య స్థాపనలోను తనవంతు కృషి చేశాడు మాలికాపూర్ మధురా పట్టణాన్ని ఆక్రమించినప్పుడు అక్కడి మధుర మీనాక్షి విగ్రహాన్ని భద్రత కోసం మలబారుకు తీసుకువెళ్లి రక్షించాడని కథ ఉంది. ఈ కాలం నాటి ఇతర శ్రీవైష్ణవ ఆచార్యులు తాతాచార్య – ఇతడు తత్వటీక, తాత్పర్యచంద్రిక, న్యాయ సిద్ధాంతజము అనే గ్రంథాలు రాసి విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని బలపరచాడు. ఇంకా అతడు యాదవాభ్యుదయం, రామాభ్యుదయం అనే కావ్యాలు కూడా రాశాడు. అతనికి కవితార్కిక సింహ అనే బిరుదు ఉంది. మహాచార్య, ముండపెద్ది, అప్పలాచార్య – ఇతడు వీరశైవ మతాచార్యులైన జక్కన, చామరసలను ఓడించాడు. ఎర్రప్రెగడ చెప్పుకోదగిన వారు. వీరిలో ఎర్రాప్రెగడ కొండవీటి పాలకుడు ప్రోలయవేమారెడ్డి ఆస్థాన కవి. అతడు హరివంశం, నరసింహపురాణం, అరణ్యపర్వాలను రాశాడు. జైతీర్థ తిక్కాచార్యులు, చెంచుభట్టు రెండవ దేవరాయల కాలం నాటి వైష్ణవ పండితులు. ఈ పండితులందరూ తమ సిద్ధాంతాల గొప్పను చాటుకోవడానికి, ఇతర సిద్ధాంతాలను ఖండించడానికి తమ తమ తత్వగ్రంథాలను రాశారు.

జైనుల సంస్కృత గ్రంథాలు: పైమూడు హిందూ శాఖలేగాక జైనమతం కూడా విజయనగర యుగంలో

కొంత ప్రాచుర్యంలో ఉండేది. జైనకవులు కూడా సంస్కృతంలో కొన్ని కావ్యాలు రాశారు. నేమిచంద్ర, అభయచంద్ర, శృతముని సింహనంది, ప్రభేందు, శృతకీర్తి, రామచంద్రమాలాధారి, శ్రేయంసభటట్టనాధ, సుభాచంద్ర, బాహుబలి మాలాధారి, పద్మనంది, పద్మసేనమునిభద్ర, దండరధ. వీరు ప్రసిద్ధి చెందిన ఆనాటి జైనకవులు. వీరిలో రామచంద్ర మాలాధారి గురుచంద్ర పంచస్కృతిని రాశాడు. దండరధనానార్ధ రత్నమాల అనే గ్రంధాన్ని రాశాడు.

వీరశైవ కవులు: విజయనగర యుగంలో వీరశైవం కూడా ఉండేది. వీరశైవకవులు కూడా తమ గ్రంధాలు రాశారు. మాయాదేవ విభు అనే కవి అనుభవసూత్ర అనే గ్రంధం రాశాడు. ఇతనికి మగ్గేయ యామదేవ అని కూడా పేరుంది. దేవన్నభట్ట అనే మరొక కవిస్మృతి చంద్రిక అనే కావ్యాన్ని రచించాడు. సంగీతముక్తావళి అనే మరొక సంగీత గ్రంధాన్ని కూడా రాశాడు.

చౌండమాధవుడు: ఇతడు కాలాముఖ శాఖకు చెందిన శైవుడు. ఇతడు మొదటి బుక్కరాయల కాలం నాటి వాడు. అతని తమ్ముడు మారప్పకు మంత్రిగా పని చేశాడు. అందువల్ల ఇతనికి మాధవమంత్రి అనే పేరు కూడా ఉంది. అతడు ఉపనిషత్తులను సులభంగా పఠించే విధానాన్ని వివరించాడు. అతడు సూతసంహితకు తాత్పర్యదీపిక అనే వ్యాఖ్యను రాశాడు. ఇంకా శైవామ్నాయసారం అనే మరొక కావ్యాన్ని రచించాడు.

శ్రీకంఠ పండితుడు - అప్పయ దీక్షితులు: వీరిద్దరూ ఈ యుగంలోని గొప్ప శైవకవులు. వారిలో శ్రీకంఠ పండితులు వీరశైవపరంగా బ్రహ్మసూత్రభాష్యం రాశాడు. దానిపైన అప్పయదీక్షితులు శైవార్కమణి దీపిక అనే పేరుతో వ్యాఖ్యానం రచించాడు. అప్పయదీక్షితులు, తాతాచార్యులు సమకాలికులు. వారిద్దరూ కృష్ణదేవరాయల కాలంలో గొప్ప పండితులుగా ప్రసిద్ధి చెందారు.

వీరశైవకవులు సంస్కృత భాషకన్నా కన్నడ భాషకే అధిక ప్రాముఖ్యతను ఇచ్చారు. అందువల్ల వారు ఎక్కువ సంస్కృత గ్రంధాలు రాయలేదు.

మతేతర కావ్యాలు - చారిత్రక గ్రంధాలు: సంస్కృతంలో అనేక మతేతర గ్రంధాలు కూడా వెలువడ్డాయి. కధలు, చరిత్రలు ఇతర ఇతివృత్తాలతో కావ్యాలు రాయబడ్డాయి. ఇట్టి గ్రంధాలలో గంగాదేవి కంపరాజ విజయం మొట్టమొదటిది. ఈమె బుక్కరాయల కోడలు. బాణభట్టు అనే కవి ఇటు విజయనగరంలోను, రెడ్డి రాజ్యంలోను ఉండేవాడు. అతడు వసంతరాజీయం అనే కావ్యం రాశాడు. ఈ కావ్యానికి కుమారగిరి విజయం అని కూడా పేరుంది. రాజనాధుడు సాళువాభ్యుదయం రాశాడు. సోమనాద్రి రామాభ్యుదయం అనే కావ్యం రాశాడు. దీనికి వీరభద్ర విజయం అని మరొక పేరు కూడా ఉంది. వీరప్పయ కాలజ్ఞానం అనే గ్రంధం కూడా ఈ యుగానికి చెందినదే. తత్వటీక, న్యాయసిద్ధాంతజాలు, తాత్పర్య చంద్రిక అనే గ్రంధాలు కూడా ఈ కాలం నాటివే.

నీలకంఠశాస్త్రి: ఇతడు తిరుమలరాయల ఆస్థానకవి. ఇతడు శివలీలార్ణవము, నీలకంఠ విజయము అనే రెండు గ్రంధాలు రాశాడు.

కామేశ్వరకవి: ఇతడు సత్యాస్వాంతనం అనే కావ్యం రాశాడు.

రాజనాధ ఢిండిముని అచ్యుతాభ్యుదయం, కొల్లరన్ మల్లిఖార్జున విజయం - ఈ గ్రంధానికి మదన తిలక అని కూడా పేరుంది. తిరుమలాంబ, వరదాంబ, వరదాంబిక పరిణయం మొదలైనవి ప్రసిద్ధి చెందిన చరిత్ర గ్రంధాలు. అలాగే పురాణాలలోని ఇతివృత్తాలను తీసుకొని మరికొందరు కవులు పద్యకావ్యాలు రాశారు. అలాంటివి విద్యామాధవుడు రాసిన పార్వతీ రుక్మిణీయం, రాజనాధ ఢిండిముని భాగవతచంపు, నల్లదీక్షితుని గంగావతరణ కావ్యం, మహాదేవ కవి సుసందేశ, వెంకటకృష్ణుని నటేశ విజయం (దీనికే ఉత్తర చెంపు అని కూడా పేరుంది) అనే గ్రంధాలు రాశారు. వీటిలో గంగాదేవి కావ్యం ఒక్కటే సంగమ యుగానికి చెందింది. మిగిలినవన్నీ సాళువ యుగం తర్వాత రాయబడ్డాయి.

ఇతర కావ్యాలు: ఇవేగాక ఈ యుగంలో ఇంకా మరికొన్ని రకాల సంస్కృత గ్రంధాలు రాశారు. ఇవి కాళిదాసు, భానుడు, భవభూతి మొదలైన ప్రాచీన సంస్కృత కవులు రాసిన బాణీలో రాశారు. అలాంటివి వామన, భట్టభాణుని రాసిన భవశృంగార భూషణ, సర్వజ్ఞ సింగన నాటక పరిభాష, రసార్ణవసుధాకర, విద్యానాధుని ఏకామ్రనాధుని ప్రతాపరుద్ర యశోభూషణం, కోలాచలమల్లినాధకవి రాసిన కాళిదాస విరచిత శకుంతలం, కుమార సంభవం, మేఘసందేశాలకు వ్యాఖ్యానాలు, విద్యారణ్యుని శిష్యుడైన నరహరి రాసిన నైషిధ దీపిక కావ్య ప్రకాశికకు వ్యాఖ్యానం, విద్యామాధవుని కాళిదాస విరచిత కుమార సంభవ వ్యాఖ్యానం, అభినవ భట్టభాణుని

శృంగార దీపిక, అమరుక మీద వ్యాఖ్యానం, కాటయవేముని కాళిదాస విరచిత శాకుంతల మొదలైన వాటిపై వ్యాఖ్యానాలు, చాముండపాచార్యుని ప్రయోగరత్నమాల, సాళువ గొనతిప్ప వాయనుని కావ్యాలంకారానికి రాసిన వ్యాఖ్య, అరుణగిరి, లక్ష్మీధర, అనే కవులు శంకరుని సౌందర్యలహరిపై రాసిన వ్యాఖ్యానాలు (లక్ష్మీధరకు లొల్ల అని పేరుంది), మల్లికార్జున ఇమ్మడి దేవరాయలు రాసిన మహానాటక సుధానిధి, రతిరత్నప్రదీపిక, శ్రీకృష్ణదేవరాయలు రాసిన రసమంజరి, సత్యవధూప్రీతనం, సకల కథాసార సంగ్రహం, జగన్నాథ పండితుడు రాసిన రసగంగాధర, గంగాలెహరి, గోవింద దీక్షితుడు రాసిన సాహిత్య సుధ, యజ్ఞ నారాయణ దీక్షితుడు రాసిన సాహిత్య రత్నాకరం, భోగనాథుడు రాసిన త్రిపుర విజయం, రామోల్లాస మొదలైన గ్రంథాలు ఈ కోవలోకి వస్తాయి. శ్రీకృష్ణదేవరాయలు భార్య అన్నపూర్ణ తుక్కపంచతి అనే కావ్యం రాసింది. ఆమెకు తుక్కాంబ అని కూడా పేరుంది.

నాటకాలు: ఈ యుగంలో సంస్కృత నాటకాలు కూడా రాయబడ్డాయి. కాని అవి కాళిదాసు, భాసుడు, భవభూతి, హర్షుని నాటకాలంత గొప్పవి కాకపోయినా నాటకాలు రాయబడ్డాయి. అవి రెండవ దేవరాయలు రచించిన మహానాటక సుధానిధి, అతని కాలం వాడైన ఉద్దండకవి రాసిన మల్లికామారుతం, విరూపాక్ష కవి నారాయణి విజయం, అరుణగిరి కవి రాసిన యోగానంద ప్రహసన, శ్రీకృష్ణదేవరాయలు రాసిన జాంబవతీ పరిణయం - ఈ నాటకాన్ని విరూపాక్ష స్వామి చైత్రోత్సవ సందర్భంలో ప్రదర్శించేవారట. నల్లదీక్షితుని సుభద్రా పరిణయం, శృంగార సర్వస్వాభరణ, నీలకంఠ దీక్షితుని నలచరిత్ర నాటిక, రామభద్ర దీక్షితుని జానకీ పరిణయం, శృంగార తిలక, పతంజలి చరిత్ర, వెంకట కృష్ణుని కుశలవ విజయం, మహదేవకవి అద్భుతదర్పణ నాటిక అప్పద్వారిని మదన భూషణ బాణ, రఘునాథ రాయల పారిజాత హరణం, గజేంద్ర మోక్షం, నలచరిక్షత, దుక్కిడి కృష్ణ వివాహం మొదలైనవి నాడు రాయబడిన ప్రసిద్ధ నాటకాలు.

న్యాయశాస్త్ర గ్రంథాలు లేక తర్క గ్రంథాలు: న్యాయ గ్రంథాలు కూడా రాయబడ్డాయి. మాధవభట్టు రాసిన తర్కభాష్య వివరణ, బలభద్రుడు అనే కవి రాసిన తర్కభాషటిక, నారాయణభట్టు తర్కభాషప్రకాశ, మురారిభట్టు రాసిన తర్కప్రకాశ మొదలైనవి రాయబడ్డాయి. న్యాయశాస్త్రాన్ని ఆనాడు తర్కశాస్త్రం అని పిలిచేవారు.

ఖగోళశాస్త్రాలు - వైద్య గ్రంథాలు: విజయనగర యుగంలో సంస్కృతంలో ఖగోళ శాస్త్రాలు కూడా రచించబడ్డాయి. విద్యామాధవ సూరి ముహుర, దర్పన అనే పేరుతో రాసిన గ్రంథం గొప్ప ఖగోళశాస్త్రం. దీనికే విద్యామాధవీయ అని కూడా పేరుంది. లక్ష్మణ పండితుడు అనే అతడు వైద్య రాజవల్లభ అనే వైద్య గ్రంథాన్ని రాశాడు.

అలంకారశాస్త్ర గ్రంథాలు: సాయణుని ధాతవృత్తి, భోగనాథుని ఉదహరణమాల, గోపతిప్ప కవి రాసిన కావ్యాలంకార సూత్రాలపై వ్యాఖ్య ఈ కాలం నాటి ముఖ్యమైన అలంకార శాస్త్ర గ్రంథాలు.

సంగీత గ్రంథాలు: విద్యారణ్యుని సంగీత సారం, దేవరభట్టు సంగీతముక్తావళి, గోపతిప్పుని తాళదీపిక, కల్లినాథుని కళానిధి, బండారు లక్ష్మీనారాయణ సంగీత సూర్యోదయం, రామయామాత్యుని సర్వమేళ కళానిధి పేర్కొనబడ్డాయి. వీరిలో బండారు లక్ష్మీనారాయణ శ్రీకృష్ణదేవరాయల ఆస్థానకవి, రామయామాత్యుడు అళియ రామరాయల ఆస్థానకవి.

ఈ విధంగా విజయనగర కాలంలో వేలాది సంస్కృత గ్రంథాలు రాయబడ్డాయి. ప్రాచీన కాలంలో గుప్తులు సంస్కృత భాషకు ప్రాభవం కలిగించినట్లు, మధ్యయుగంలో విజయనగర సార్వభౌములు దక్షిణదేశంలో సంస్కృత భాషకు మహోన్నత దశను కలిగించారు.

విజయనగర యుగంలో తెలుగు భాషా సాహిత్యాలు

విజయనగర యుగం ఆంధ్ర సాహిత్యానికి స్వర్ణయుగమని కవులు, పండితులు, చరిత్రకారులు ముక్త కంఠంతో ఘోషించారు. ఈ యుగం ఆంధ్రసాహిత్య చరిత్రలో ప్రబంధ యుగమని ప్రసిద్ధి చెందింది. ఈ యుగంలో అనేక మంది అనన్య ప్రతిభావంతులు జన్మించి ఆంధ్ర సాహిత్యంలో అద్భుత కావ్యాలు రచించి తెలుగు భాషను సుసంపన్నం చేసి దేశ భాషలందు తెలుగులెస్స అనే కీర్తిని పొందునట్లు చేశారు. విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, ఆరవీడు వంశాలు పరిపాలించాయి. ఈ నాలుగు వంశాలు తెలుగు వంశాలేనని కొందరంటారు. కొందరు సంగమ, తుళువ వంశాలు కన్నడ వంశాలని, సాళువ, ఆరవీడు వంశాలు మాత్రమే తెలుగు వంశాలని భావిస్తారు. ఏమైనప్పటికీ ఈ నాలుగు వంశాలు తెలుగు కవులను పోషించాయి. నాలుగు వంశాల కాలంలో తెలుగు కావ్యాలు వెలువడ్డాయి.

సంగమ వంశ కాలం - నాచన సోమనాథుడు: సంగమ వంశ కాలంలో ప్రసిద్ధి చెందిన తెలుగు కవి నాచన సోముడు. ఇతడు తిక్కనకు ఏ మాత్రం తగ్గని కవి అని అంటారు. ఇతడు ఉత్తర హరివంశం అనే తెలుగు కావ్యాన్ని రచించాడు. ఈ కావ్యంలోని అవతారికలో ఇతనిని గురించి ఎలాంటి వివరాలూ పేర్కొనలేదు. ఇతని సమకాలికపు ఒక శాసనంలో ఇతనికి నెల్లూరు జిల్లాలో పినాకిని నది ఒడ్డున ఉన్న పంచకల దిన్నె అనే గ్రామాన్ని క్రీ.శ.1344లో బుక్కరాయలు అగ్రహారంగా ఇచ్చాడని పేర్కొనబడింది. ఆ శాసనంలో ఇతనిని గురించిన వివరాలు కూడా లిఖింపబడ్డాయి. ఈ శాసనం ప్రకారం నాచన సోమనాథుడు భారద్వాజ గోత్రానికి చెందినవాడు. ఆపస్తంభ సూత్రీకుడు, యజుర్వేది, అతడు నాలుగు వేదాలు, 18 పురాణాలను అధ్యయనం చేశాడు. అతడు 18 భాషలలో కవి అంటే అష్టాదశ భాషాకవి అని ఆ శాసనం తెలుపుతోంది. నాచన అనేది అతని ఇంటి పేరైనదీ, తండ్రి పేరైనదీ వివరంగా తెలియదు. నాచన అనేది అతని ఇంటి పేరు అయినట్లయితే అది ఒక గ్రామం పేరు అయి ఉండాలి. ఆంధ్రదేశంలో తమ స్వగ్రామం పేరును ఇంటి పేరుగా స్వీకరించే ఆచారం ఉంది. నాచన అనే పేరు కలిగిన గ్రామం ఒకటి రాజస్థానంలోను, మరొకటి బుందేలుఖండ్‌లోను ఉన్నాయి. కాని అవి చాలా దూరంలో ఉన్నందు వల్ల ఆ ప్రాంతాల భాషలు తెలుగు కానందువల్ల అవి ఇతని స్వస్థానం కాదని, ఆంధ్రదేశంలోనే నాచన అనే పేరు కలిగిన గ్రామం ఉండవచ్చునని కొందరు భావించారు. మరికొందరు నాచన అనేది అతని తండ్రి పేరు అని భావించారు. ఇతడు నెల్లూరు ప్రాంతపు వాడని భావించడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. అతడు తన ఉత్తర హరివంశ కావ్యాన్ని హరిహరనాథునకు అంకితమిచ్చాడు. శైవ వైష్ణవ భేదాలను నిరసించాడు. తన కావ్యంలో తిక్కన సోమయాజిని పేర్కొన్నాడు. తిక్కన కూడా తన మహాభారతాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చాడు. కనుక ఇతడు నెల్లూరు నివాసి అయి ఉండవచ్చునని భావించబడింది. అతడు నెల్లూరు నుండి విజయనగరం చేరి బుక్కరాయల అనుగ్రహం సంపాదించి విజయనగర ఆస్థానంలో కవిగా చేరి ఉండవచ్చును. అందువల్ల బుక్కరాయలు ఇతనికి నెల్లూరు జిల్లాలో పెన్నానది ఒడ్డున గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు.

నాచన సోముడు రచించిన హరివంశపు సాహిత్యపు విలువను గురించి రెండు అభిప్రాయాలున్నాయి. కొందరు ఎర్రాప్రెగడ రచించిన హరివంశానికంటే తక్కువ స్థాయి కలిగిందని భావించారు. కాని మరికొందరు అది ఎర్రాప్రెగడ కావ్యం కంటే చాలా ఉన్నతమైందని భావించారు. ముఖ్యంగా కందుకూరు వీరేశలింగం పంతులు తన ఆంధ్ర కవుల చరిత్రలో నాచన సోముడు రచించిన హరివంశాన్ని ఘనంగా కీర్తించాడు. హరిద్వారం వద్ద గంగానది దూకుతూ ఉంటే ఎంత అందంగా కనిపిస్తుందో నాచన సోముని రచనాశైలి అంత అందంగా, మధురంగా ఉంటుందని వర్ణించాడు. ఈ కావ్యంలో అంత్యనియమం చాలా మధురంగా ఉంటుంది. ఇది సంస్కృత కావ్యం. ఇది సంస్కృత కావ్యానికి అనువాదమే అయినప్పటికీ పూర్తిగా స్వతంత్ర కావ్యంగా మలచబడింది, అని కీర్తింపబడింది. ఇటీవల లభించిన ఒక శాసనంలో ఇతడు ప్రౌఢదేవరాయల కాలంలో కూడా జీవించి తురిమెళ్లదిన్నె అనే మరొక అగ్రహారాన్ని కూడా పొందినట్లు తెలుస్తోంది. ఇతనికి సర్వజ్ఞ సాహిత్య రసపోషణ చక్రవర్తి అనే బిరుదు ఉంది. నవీజి గుణసనాథ, సవిధాన చక్రవర్తి, సకల భాషా భూషణ అనే బిరుదులు కూడా ఉన్నాయి.

జక్కన: సంగమ యుగపు కవులలో చెప్పుకోదగిన మరొక కవి జక్కన. అతడు విక్రమార్క చరిత్రాన్ని రచించి

వెన్నెలకంటి జన్నాయి సిద్ధన మంత్రికి అంకితమిచ్చాడు. సిద్ధన మంత్రి మొదటి దేవరాయల వద్ద కోశాధికారిగా పని చేశాడు. జక్కన నెల్లూరు జిల్లాకు చెందినవాడు. అతని తాతతండ్రులు గొప్ప కవులు. ఇతని కావ్యంలోని విక్రమార్కుని సాహస కార్యాలు అద్భుతంగా వర్ణింపబడ్డాయి.

వినుకొండ వల్లభాచార్యుడు: ఈ కాలానికి చెందిన మరొక గొప్పకవి వినుకొండ వల్లభాచార్యుడు అతడు శ్రీనాధుడికి మిత్రుడని అంటారు. అతడు ములికినాడు అంటే నేటి కర్నూలు జిల్లాలోని మోపూరు గ్రామానికి చెందినవాడు. అతడు క్రీడాభిరామం అనే కావ్యాన్ని రచించాడు. ఇందులో ఇతిహాసం, నాటక రచనా లక్షణాలు మేళవింపబడ్డాయి. ఈ కావ్యంలోని ఇతివృత్తం ఒక్క రోజుకు సంబంధించింది. మంచనశర్మ, టిట్టిభశెట్టి అనే ఇద్దరు మిత్రులు ఒక్క రోజులో ఉదయం నుండి సాయంత్రం వరకు ఓరుగల్లు పట్టణంలో తిరిగి వారు దర్శించిన ప్రదేశాలు, అందరి విశేషాలు వర్ణింపబడ్డాయి. ప్రతాపరుద్రుని ఉంపుడుగత్తె మాచలదేవి అందాన్ని, పలనాటి వీరులను ఆరాధించే విధానాన్ని అద్భుతంగా వర్ణించాడు. మంచనశర్మ ఒక అందమైన వేశ్యతో ఆనందించడాన్ని శృంగార భరితంగా వివరించాడు. ఈ కావ్యం ప్రతాపరుద్రుని కావ్యం నాటి ఓరుగల్లు పట్టణం యొక్క వైభవాన్ని కాకతీయ యుగం నాటి సాంఘిక పరిస్థితులను తెలుసుకోవడానికి బాగా ఉపయోగపడుతోంది. ఈ కావ్యాన్ని శ్రీనాధుడే రచించాడని మరొక వాదన కూడా ఉంది.

దగ్గుబల్లి దుగ్గన్న: ఈ కాలం నాటి మరొక ప్రసిద్ధ కవి దగ్గుబల్లి దుగ్గన్న. ఇతడు శ్రీనాధుని బావమరిది అని ప్రతీతి. దుగ్గన్న చాలా కావ్యాలు రచించాడు. కాని అవేవీ లభించలేదు. అందులో నాచికేతోపాఖ్యానం అనే ఒక కావ్యం లభించింది. దీనిని ఇంగ్లిష్ సాహిత్యంలో మిల్టన్ రచించిన పారడైజ్‌లాస్ట్‌తో పోల్చారు. ఇందులో కవిత్వం కథనశైలి చాలా గొప్పగా ఉందని కీర్తింపబడింది. దుగ్గన్న ఈ కావ్యాన్ని చందలూరి గంగన్నమంత్రి అనే అతనికి అంకితం చేశాడు. గంగన్న మంత్రి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరిని పాలించిన బసవరాజుకు మంత్రి బసవరాజు గజపతుల సామంతుడుగా ఉదయగిరిని పాలించాడు.

దూబగుంట నారాయణ కవి: ఈ బసవరాజుకే దూబగుంట నారాయణ అనే అతడు పంచతంత్రం అనే గ్రంధాన్ని రాసి అంకితమిచ్చాడు. కనుక నారాయణ కవి, ఉదయగిరి ఆస్థానకవి దుగ్గన్న ఉభయులూ ఉదయగిరిలో బసవరాజు ఆస్థాన కవులని భావింపబడింది. బసవరాజు 50 సంవత్సరాలు ఉదయగిరిని పాలించాడని భావింపబడింది.

అరుణనాధ డింధిమ కవి: ఇతడు రెండవ దేవరాయల ఆస్థానకవి. ఇతనికి కవిసార్వభౌముడనే బిరుదు ఉంది. కవిత్వంలో తనకు సాటిలేదని కంచుఢక్కను తన ఇంటిలో పెట్టించాడు.

శ్రీనాధుడు: సంగమ వంశకాలంలో ఆంధ్రదేశంలో అత్యంత ప్రసిద్ధి చెందిన కవి శ్రీనాధుడు. ఇతడు విజయనగర ఆస్థానకవి కాకపోయినప్పటికీ రెండవ దేవరాయల ఆస్థానాన్ని దర్శించి ప్రసిద్ధి చెందిన సంస్కృత కవి, కవిసార్వభౌమ అనే బిరుదు కలిగిన డింధిమభట్టును ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించి రెండవ దేవరాయల చేత కనకాభిషేకాన్ని పొందాడు. రెండవ దేవరాయలు విజయనగర దర్బారులోని ముత్యాలశాలలో స్వయంగా సువర్ణస్నానం, దానరటంకాల తీర్ధం ఆడించి అంటే కనకాభిషేకం చేసి తన ఆస్థానకవి అయిన డింధిమభట్టు బిరుదు అయిన కవిసార్వభౌమ అనే బిరుదును శ్రీనాధునకు ప్రధానం చేశాడు. హరివిలాసం మరుత్‌రాట్ చరిత్ర, వాహన సప్తశతి, భీమఖండం, కాశీఖండం, పలనాటి వీరచరిత్ర, శృంగార నైషధం ఇతని కావ్యాలు.

సాళువ యుగం: సంగమ వంశాన్ని అంతం చేసి సాళువ నరసింహరాయలు విజయనగరాన్ని ఆక్రమించాడు. అంతటితో విజయనగర చరిత్రలో సాళువ యుగం ప్రారంభమైంది. సాళువ నరసింహరాయలు స్వయంగా కవి. సంస్కృతంలో రామాభ్యుదయం అనే కావ్యాన్ని రచించాడని అంటారు.

రాజనాధ డింధిమకవి: సాళువ నరసింహరాయల ఆస్థానకవి రాజనాధ డింధిముడు. అతడు సాళువాభ్యుదయం అనే సంస్కృత కావ్యాన్ని రచించాడు. ఈ కావ్యం వల్ల సాళువ నరసింహరాయల ఘనకార్యాలు తెలుస్తున్నాయి.

పిల్లలమర్రి పినవీరభద్రుడు: సాళువ ఆస్థానకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఇతడు సాళువయుగంలో గొప్ప కవి. వాణి నా రాణి అని చెప్పుకొన్న కవి. అనేక కావ్యాలు రచించాడు. అందులో రెండు మాత్రమే లభించాయి. వాటిలో జైమినీ భారతాన్ని సాళువ నరసింహరాయలుకు అంకితం ఇచ్చాడు. ఇందులో పాండవులు

అశ్వమేధ యాగాన్ని చేయడం ఇతివృత్తంగా తీసుకున్నాడు. రెండవ కావ్యం శృంగార శాకుంతలం. దానిని నెల్లూరు జిల్లాలోని ఒక స్థానిక అధిపతి అయిన వెన్నయామాత్యునికి అంకితమిచ్చాడు. ఇతడు కమ్మనాటి ప్రాంతానికి చెందినవాడు. ఇతని సోదరుడు నరసింహ రాయలవద్ద సైనికుడుగా చేరాడు. సోదరుని ప్రాపకం వల్ల ఇతడు కూడా విజయనగరం చేరి నరసింహరాయల ఆస్థానకవిగా స్థిరపడ్డాడు. ఇతని తొలి కావ్యమైన శృంగార శాకుంతలం కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలానికి నమూనా. దానినతడు తెలుగులో ప్రబంధంగా రచించాడు. దీనిని తన సొంత ఊరిలో ఉన్నప్పుడు రచించి అక్కడి స్థానికుడు చిల్లర వెన్నయామాత్యునికి అంకితమిచ్చాడు. వెన్నయామాత్యుడు నెల్లూరు జిల్లా బిట్రగుంట వద్ద ఉన్న సోమరాజుపల్లె అనే గ్రామానికి చెందినవాడు. విజయనగరం చేరిన తర్వాత జైమినీ భారతాన్ని రచించి, సాళువ నరసింహరాయలుకు అంకితమిచ్చాడు. ఇది సంస్కృతంలోని జైమినీ భారతానికి అనువాదం. అది కూడా పూర్తిగా రచించలేదు. అందులోని అశ్వమేధ పర్వాన్ని మాత్రమే తెనిగించాడు. జైమినీ భారతానికి, వ్యాసుని భారతానికి తేడా ఉంది. జైమినీ భారతం ధర్మరాజు అశ్వమేధ యాగం చేసినప్పుడు అర్జునుడు, అతని సోదరులు సాధించిన విజయాలను వర్ణిస్తుంది. సాళువ నరసింహరాయలు అర్జునుని అవతారమన్నట్లుగా పినవీరభద్రుడు తన జైమినీ భారతాన్ని వర్ణించాడు. పిన వీరభద్రుడు శ్రీనాథుని చివరి కాలానికి చెందినవాడని భావిస్తారు.

ప్రోలుగంటి చిన్న మంత్రి: సాళువ యుగానికి చెందిన మరొక కవి ప్రోలుగంటి చెన్న మంత్రి. ఇతనికి చెన్నశౌరి అని కూడా పేరుంది. ఇతడు సాళువ నరసింహరాయల సమకాలికుడు. ఇతడు నరసింహ పురాణాన్ని ద్విపద కావ్యంగాను, బాల భారతాన్ని వచన కావ్యంగా రచించాడు. సాళువ చరిత్ర అనే మరొక యక్షగానాన్ని కూడా రాశాడు. ఇది విష్ణుపురాణంలోని సౌభరి చరిత్ర అనే దానిని ఆధారంగా తీసుకొని ఈ యక్షగానాన్ని రాశాడు. ఇప్పటివరకు లభించిన యక్షగానాలలో ఇది మొట్టమొదటిది. కనుక ప్రప్రథమ యక్షగాన రచయితగా ఇతడు తెలుగు సాహిత్య చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించాడని ఆరుద్ర వ్యాఖ్యానించాడు.

తుళువ యుగం: సాళువ నరసింహరాయల వద్ద సేనాధిపతిగా చేసిన తుళువ నరసనాయకుడు సాళువ నరసింహుని మరణానంతరం అతని కుమారుడు ఇమ్మడి నరసింహరాయనికి సంరక్షకునిగా పాలించాడు. నరసనాయకుని రాకతో తుళువ వంశం ప్రారంభమైంది. నరసనాయకుని కాలంలో ఇద్దరు తెలుగు కవులు విజయనగర ఆస్థానంలో ఉండి తెలుగు కావ్యాలను రచించారు. వారు నంది మల్లన్న, గంట సింగన్న వీరు మొదట ఉదయగిరిలో గజపతుల సామంతుడైన పూసపాటి బసవరాజు ఆస్థాన కవులుగా ఉండేవారు. సాళువ నరసింహరాయలు గజపతులనోడించి ఉదయగిరి దుర్గాన్ని జయించిన తర్వాత వారు విజయనగర ఆస్థానం చేరారు. తర్వాత సాళువ నరసింహరాయలు కొద్దికాలమే జీవించాడు. అందువల్ల వీరు అతని సేనాధిపతి తుళువ నరసనాయకుని ఆశ్రయించారు.

నందిమల్లన్న - ఘంటసింగన్న: వీరికి జంట కవులని పేరు. వీరు గుంటూరు ప్రాంతపు వారు. ఆరువేల బ్రాహ్మణులు. వీరిద్దరు దగ్గరి బంధువులు. గంట సింగన్న, నంది మల్లన్నకు మేనల్లుడు. అంటే సోదరి కుమారుడు. వీరు కృష్ణమిశ్రుడు సంస్కృతంలో రచించిన ప్రబోధ చంద్రోదయాన్ని తెలుగులోనికి అనువదించారు. ప్రబోధ చంద్రోదయం సంస్కృత నాటకం, కాని దానిని వీరు తెలుగులో ప్రబంధ కావ్యంగా రచించారు. దానిని వారు ఉదయగిరి పాలకుడైన పూసపాటి బసవరాజు వద్ద మంత్రిగా పనిచేసిన చందలూరి గంగయ మంత్రికి అంకితమిచ్చారు. ఈ కావ్యం తెలుగు భాషలోనే ఒక గొప్ప కావ్యంగా గుర్తింపు పొందింది. సంస్కృత నాటకాన్ని తెలుగులో కావ్యంగా రాసిన మొదటి కవులు వీరే. వీరు వరాహ పురాణం అనే మరొక కావ్యాన్ని కూడా రచించారు. అది సంస్కృతంలోని వరాహ పురాణానికి అనువాదం. విష్ణువు వరాహ అవతారాన్ని గురించిన కథ ఇందులోని ఇతివృత్తం. ఈ కావ్యాన్ని వారు తుళువ నరసనాయనికి అంకితమిచ్చారు. ఈ కావ్యంలో చిన్న చిన్న కథలు అద్భుతంగా వర్ణింపబడ్డాయి. వానిలో దుర్జయుడు, ధర్మవ్యాధ రుషికథలు చాలా వివరంగా రాయబడ్డాయి. ఈ జంట కవులు చిత్రబంధగర్భ కవితలు రాయడంలో ప్రసిద్ధులుగా పేరు పొందారు. వారు రాసిన ఒక కంద పద్యంలో అక్షరాలు మొదటి నుండి చదివినా చివరి నుండి చదివినా ఒకే క్రమంలో నడుస్తాయి. ఇది ఒక అద్భుత ప్రయోగం. అలాగే గుణింత భేదాలతో రెండు అక్షరాలను మాత్రమే ఉపయోగించి మరొక కంద పద్యం రాశారు. వీరు నరసింహ పురాణం, వరలక్ష్మి పురాణం అనే మరో రెండు గ్రంధాలు కూడా రాశారని అంటారు. అలాగే వారు దుర్జయోపాఖ్యానం అనే ప్రబంధాన్ని కూడా రాశారని అంటారు.

మారన: నరసనాయకుడు క్రీ.శ.1505వ సంవత్సరంలో మరణించాడు. అతని తర్వాత అతని పెద్ద కుమారుడు వీరనరసింహుడు సింహాసనమధిష్టించాడు. ఇతని కాలంలో మారన అనే కవి మైరావణ చరిత్రను రచించాడు. వీరనరసింహుడు మారన కవిని సత్కరించాడు.

శ్రీకృష్ణదేవరాయల యుగం - ఆంధ్రభాషా సాహిత్యాలు: కృష్ణదేవరాయల రాకతో తెలుగు భాషకు స్వర్ణయుగం పట్టింది. క్రీ.శ.1509లో వీరనరసింహరాయలు మరణించగా అతని తమ్ముడు శ్రీకృష్ణదేవరాయలు సింహాసనానికి వచ్చాడు. కృష్ణదేవరాయలు దక్షిణ భారతదేశ చరిత్ర మొత్తంలో అత్యంత సుప్రసిద్ధుడు. ఇతడు సమరంలోనేగాక సాహిత్య చరిత్రలో కూడా అత్యున్నత స్థానాన్ని పొందినవాడు. ఇతని కాలం తెలుగు భాషకు స్వర్ణయుగం. సాహితీ సమరాంగణ, ఆంధ్రభోజ, కవితా ప్రావీణ్య ప్రణేశ అనే బిరుదులు వహించి తెలుగు భాషకు దేశభాషలందు తెలుగు లెస్స అనే కీర్తిని తెచ్చినవాడు. ఇతని యుగాన్ని తెలుగు సాహిత్యంలో ఇంగ్లండులోని ఎలిజబెత్ యుగంగా పోల్చారు. ఎలిజబెత్ రాణి కవి కాదు. కావ్యాలు రచించలేదు. కాని కృష్ణదేవరాయలు స్వయంగా కవి, కనుక రాయయుగం అంతకంటే గొప్పదని కొందరు కీర్తించారు. కవులకు అగ్రహారాలు, కానుకలిచ్చి అనేక మంది కవులను పోషించాడు. కవితా గోష్ఠులు జరిపాడు. తాను రాజధానిలో ఉన్నంత కాలం నిత్యం కవితా గోష్ఠులతో కాలం గడిపేవాడు. ఒక్కొక్కప్పుడు యుద్ధ భూములకు కూడా కవులను వెంట తీసుకొని వెళ్లేవాడు.

ప్రబంధ యుగం: తెలుగు సాహిత్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల యుగం ప్రబంధ యుగమని ప్రసిద్ధి చెందింది. ఇతని కాలంలో అనేక ప్రబంధాలు రాయబడ్డాయి. ప్రబంధాలు, స్వతంత్ర రచనలు ఇంతవరకు తెలుగు సాహిత్యంలో అనువాదాలే ఎక్కువ. పురాణాలు, ఇతిహాసాలు, మహాకావ్యాలను సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించేవారు. కాని ఈ యుగంలో ఒక చిన్న ఇతి వృత్తాన్ని తీసుకొని అనేక ఊహలతో మహాకావ్యంగా మలచారు. కనుక దీనిని కాల్పనిక సాహిత్యం అని, కాల్పనికయుగం అని కూడా పిలిచారు. అంతకుముందు రచించిన మహా కావ్యాలు కథాత్మకాలు. కాని ఇవి వర్ణనాత్మకాలు. అందువల్ల వీటికి ప్రబంధాలు అని పేరు వచ్చింది. ఈ కాలంలో అనేక ప్రబంధాలు వెలువడి దీనికి ప్రబంధ యుగమని పేరు వచ్చింది. చిన్న కథనో లేక ఒక చిన్న సన్నివేశాన్నో తీసుకొని దాని చుట్టూ అనేక సన్నివేశాలను సృష్టించి దానికనుగుణంగా అనేక పాత్రులు, మానసికోద్వేగాలు చేర్చుతూ కథను మలుస్తారు. అందువల్ల అది ఒక పెద్ద కావ్యంగా మారుతుంది. ప్రబంధం సాధారణంగా శృంగార రసాత్మకం. యువతీయువకులను ప్రధాన పాత్రలుగా పెట్టి అష్టాదశ వర్ణనలతో సుఖాంతంగా మలచే శృంగార కావ్యాన్ని ప్రబంధమని అంటారు. చదువరులకు మానసికానందం కలిగించటం ప్రబంధం యొక్క ప్రధాన లక్ష్యం. 1. రాజు, 2. రాజధాని, 3. పర్వతం, 4. నది, 5. సూర్యోదయం-సూర్యాస్తమయం 6. చంద్రోదయం, 7. ఋతువులు, 8. సరోవరం, 9. ఉద్యానవనం, 10. అతిలోక సుందరి, 11. విరహం, 12. రాయబారం, 13. వివాహం, 14. మధుపానం, 15. సంభోగం, 16. సంతానం, 17.యుద్ధం, 18. తీర్థయాత్రలు అనే అంశాలను అష్టాదశ వర్ణనలు అని అంటారు. వీటికితోడు అలంకారాలు, ఉపమానాలు, అతిశయోక్తులు, శ్లేషలు, రూపకాలు కూడా ఉంటాయి. వీటన్నిటిని మేళవించి ఒక చిన్నకథను మహాకావ్యంగా రచించే పద్ధతిని ప్రబంధ సాహిత్యం అని అంటారు. ఈ కాలంలో రచించిన కావ్యాలలో ఎక్కువ భాగం ప్రబంధాలే. అల్లసాని పెద్దన చేతిలో ప్రబంధ ప్రక్రియ సర్వాంగ సుందరంగా రూపొందింది. అందువల్ల అతడు రచించిన మనుచరిత్ర తెలుగులో ప్రథమ ప్రబంధంగా ప్రసిద్ధి చెందింది. ఈ కాలంలో రచింపబడిన జైమినీ భారతం, పాండురంగ మహత్మ్యం, కాళహస్తి మహత్మ్యం మొదలైన పురాణాలు కూడా ప్రబంధ శైలిలోనే నడిచాయి కాని ఈ కాలపు కవిత్వంలోని ప్రబంధాల్లో వర్ణనాశక్తికి, ఊహాశక్తికి మంచి ప్రాచుర్యం కల్పించింది. కావ్యరచనల్లో వాస్తవికత లోపించింది. నన్నయభట్టులోని ఆధ్యాత్మికతత్వంగానీ, శివకవులలోని సాంఘిక స్పృహగానీ, తిక్కనలోని జాతీయ దృష్టిగానీ లేవని, కవుల ఉదరపోషణకు, రాజుల సంతోషానికి మాత్రమే కవిత్వం రాయబడిందని, అది కూడా పచ్చి శృంగారాన్ని వలకబోసిందని డా బి.యస్. యల్. హనుమంతరావు వర్ణించారు. అల్లసాని పెద్దన రమణీ ప్రియదూతిక తెచ్చి ఇచ్చు కప్పుర విడెము ఆత్మకింపైన భోజనంతోనే కవిత్వం వస్తుందని స్వయంగా తన కావ్యాలలో చెప్పుకున్నాడు. నాటి కవిత్వపు ప్రభావం ఆనాటి సామాజిక జీవనంలో ప్రతిబింబించింది. రాజులు, వారి సామంతులు విపరీతమైన భోగలాలసులయ్యారు.

ద్వ్యర్థి కావ్యాలు - త్ర్యర్థి కావ్యాలు: ఈ కాలంలో ప్రబంధాలేగాక ద్వ్యర్థి, త్ర్యర్థి కావ్యాలు కూడా

రచింపబడ్డాయి. ఆశు కవిత్వం కూడా వచ్చింది. క్షణాలలో వందలాది పద్యాలు చెప్పడం ఆశు కవిత్వంలోని విశేషం. ఒక గంటలో రెండు మూడు వందల పద్యాలు చెప్పగలిగే వారట. అలాగే అష్టావధానాలు, శతావధానాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ యుగంలో కవిత్వంలో అనేక నూతన ప్రక్రియలు వచ్చాయి. శైవ, వైష్ణవ కవులు తమ మత సిద్ధాంతాలను ద్విపదలలో రచించారు.

స్వయంగా కవి - ఆముక్తమాల్యద: కృష్ణదేవరాయలు స్వయంగా కవి. అతడు శ్రీరంగనాధుడు, గోదాదేవిల వివాహాన్ని ఇతివృత్తంగా తీసుకొని 870 పద్యాలతో ఆరు సర్గలతో విష్ణు చిత్తీయం అనే ప్రబంధాన్ని రచించాడు. దానికే ఆముక్తమాల్యద అనే పేరుంది. అతడు వైష్ణవుడు. విష్ణుదేవుని గొప్పతనాన్ని చాటడానికి ఈ కావ్యాలు రచించాడని అంటారు. కాని అతడు మతభేదం లేకుండా అన్ని శాఖల కవులను పోషించాడు. రాయలు తన ఆముక్తమాల్యదను తన ఇష్టదేవుడైన తిరుపతి వెంకటేశ్వరునకు అంకితం చేశాడు. ఈ కావ్యం తెలుగు భాషలోని పంచ కావ్యాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ద్రావిడ భాషలోని పెరియాళ్వార్ చరిత్ర ఈ కావ్యానికి మూలం. దీనిని క్రీ.శ.1519లో రాశాడని భావింపబడింది.

భువన విజయం: రాయలు స్వయంగా కవి కనుక కవిత్వం మాధుర్యం తెలుసును. అందువల్ల ఎల్లప్పుడు కవి, పండిత గోష్ఠులు జరిపేవాడు. అందుకతడు ఒక ప్రత్యేక మందిరాన్ని నిర్మించాడు. దానికే భువన విజయం అనిపేరు. అతడు భువన విజయంలో ప్రతిరోజూ కొద్దికాలమైనా కవుల మధ్య గడిపేవాడట. అతని ఆస్థానంలో తెలుగు కవులనేగాక కన్నడ, తమిళ, సంస్కృత కవులను కూడా పోషించాడు. అతడు సంస్కృతంలో కూడా గొప్ప పండితుడు. జాంబవతీ కళ్యాణం, మదాలస చరిత్ర మొదలైన అనేక సంస్కృత గ్రంథాలు రచించాడు. అనేక మంది కవులు కృష్ణదేవరాయలుకు తమ కావ్యాలను అంకితమిచ్చారు. ఈ కవులందరితో భువన విజయంలో నిత్యం సాహిత్యగోష్టి జరిపేవాడు.

అష్టదిగ్గజాలు: శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని తెలుగు కవులకు అష్టదిగ్గజాలని పేరు ఉండేది. ఈ పేరు ఒక్క తెలుగు కవులకు మాత్రమే ఉండేది.

1. అల్లసాని పెద్దన
2. నంది తిమ్మన
3. ధూర్జటి
4. మాదయగారి మల్లన
5. అయ్యలరాజు రామభద్రుడు
6. రామరాజభూషణుడు లేక భట్టుమూర్తి
7. పింగళి సూరన్న
8. తెనాలి రామకృష్ణుడు.

ఈ 8 మంది కవులు అష్టదిగ్గజాలని అనే శృతి ఉంది. కాని వారిలో అల్లసాని పెద్దన, నంది తిమ్మనలు మాత్రమే తమ కావ్యాలను కృష్ణదేవరాయలుకు అంకితం చేశారు. మిగిలిన కవులు రాయలను తమ కావ్యాలలో స్మరించలేదు. మాదయగారి మల్లయ రాయలుకు సమకాలికుడేనని రాయవాచకం తెలుపుతోంది. కాని అతడు తన కావ్యాన్ని కొండవీటిసీమను పాలించిన నాదెండ్ల అప్పయామాత్యునకు అంకితం చేశాడు. ధూర్జటి రాయల ఆస్థాన కవి అని కొన్ని చాటువులు తెలుపుతున్నాయి. కుమార ధూర్జటిని కృష్ణరాయలు ఆదరించినట్లు తెలిపాడు. కాని అతడు తన కావ్యాలను తన ఇష్టదైవం అయిన కాళహస్తీశ్వరునికి అంకితం చేశాడు. అంతేగాక రాజులు మత్తులు, వారి సేవ నరకప్రాయం అని రాజులను ఈసడించుకున్నాడు. అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయాన్ని అళియరామరాయల మేనల్లుడైన గొబ్బూరి నరసరాజుకు అంకితం ఇచ్చాడు. కనుక ఇతడు తర్వాతవాడై ఉంటాడు. కృష్ణదేవరాయలు సంస్కృతంలో రాసిన సకల కథాసారాన్ని పుత్తేటి రామభద్రుడు అనే కవి తెనిగించాడు. బహుశ అతనే అష్టదిగ్గజాలలోని రామభద్రుడు అయి ఉంటాడని కొందరు భావించారు. కనుక ఈ నలుగురు మాత్రమే కృష్ణదేవరాయల ఆస్థానకవులని, మిగిలిన నలుగురూ ఆరవీటి యుగంలోని వారని చరిత్రకారులు అంటారు.

అల్లసాని పెద్దన: అష్టదిగ్గజాలలో అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు. అతడు నందవారిక శాఖకు చెందిన బ్రాహ్మణుడు. పెద్దన అంటే రాయలకెంతో అభిమానం. రాయలు అతనిని తన సాహిత్య గురువుగా భావించేవాడు. పెద్దన ఆశు కవిత్వంలో దిట్ట. ఒక పర్యాయం కవిత్వ ప్రయోజనాన్ని గురించి చెప్పమన్నప్పుడు ఆశువుగా 48

చరణాలు గల ఉత్పలమాలను చెప్పాడట. రాయలు బయటకు వెళ్లినప్పుడు పెద్దన కనిపిస్తే తన ఏనుగును ఆపి పెద్దనను ఏనుగుపై తన పక్కనే కూర్చోబెట్టుకొని వెళ్లేవాడట. పెద్దన మనుచరిత్ర అనే అద్భుత కావ్యాన్ని రచించి శ్రీకృష్ణదేవరాయలకు అంకితం ఇచ్చాడు. ఈ కావ్యపు ఇతివృత్తాన్ని కృష్ణదేవరాయలే సూచించి రచించమని కోరాడట. రాయల కోరికపై పెద్దన వరూధిని అనే దేవకన్య (Divine Nymph), ప్రవరాఖ్యుడు అనే నియమ నిష్ఠాగరిష్ఠుని ప్రేమలో పడిన కథను స్వారోచిష మనుకావ్యంగా రాశాడు. స్వారోచిష రాజు తన ముగ్గురు భార్యలతో ఉండగా చూసిన ఒక చక్రవాకం హంసతో కామాన్ని గురించి తెలియజేయగా దానికి సిగ్గుపడి స్వారోచిషుడు రాజ్యాన్ని కుమారునకు అప్పజెప్పి తపస్సు చేసుకోవడానికి వెళ్లిపోతాడు. ఈ కథను పెద్దన అతి సుందరంగా మలచాడు. సమాజంలో నీతిని, విలువలను వృద్ధి చేసే లక్ష్యం ఇందులో కనిపిస్తుంది. పెద్దన తన మనుచరిత్ర ద్వారా తెలుగు సాహిత్యాన్ని నూతన మార్గంవైపు తిప్పాడు. కృష్ణదేవరాయలు ఆ కావ్యంలోని మధుర కవిత్వానికి ముగ్ధుడై ఆంధ్ర కవితాపితామహ అని అల్లసాని పెద్దనకు బిరుదునిచ్చాడు. కావ్యాన్ని అంకితం తీసుకునే సమయంలో రాయలు స్వయంగా పెద్దన కూర్చున్న పల్లకీని మోసి విజయనగరంలో ఊరేగించాడు. తాను స్వయంగా బంగారు గండపెండేరాన్ని పెద్దన ఎడమకాలికి తొడిగి ఆయన మీద తనకు గల గౌరవ భావాన్ని ప్రదర్శించాడు. అంతేగాక పెద్దనకు కొకట గ్రామాన్ని ఇంకా అనేక అగ్రహారాలను, ధనాన్ని బహూకరించి సత్కరించాడు. కృష్ణదేవరాయలు పెద్దనకు ఇచ్చిన గౌరవం తెలుగు భాషకు ఇచ్చిన గౌరవంగా భావింపబడింది. అంతేగాక తెలుగుభాష అతి మధురమైనదని దేశభాషలందు తెలుగు లెస్స అని రాయలు కీర్తించాడు. రాయలచేత అంతటి ఘన సన్మానాన్ని పొంది చరితార్థుడైన మహాకవి అల్లసాని పెద్దన. ఇతనికి ప్రబంధ పరమేష్ఠి అని కూడా బిరుదు ఉంది. అతని గురువు శరగోపయతి.

నంది తిమ్మన: తర్వాత పేర్కొనదగిన వారు నంది తిమ్మన. ఇతడు కూడా ఆశు కవిత్వంలో దిట్ట. ఇతడు ముక్కు మీద ఆశువుగా నూరు పద్యాలు చెప్పాడట. అందువల్ల ఇతనికి ముక్కు తిమ్మన అని పేరు కూడా ఉంది ఇతడు ఆరు వేల శాఖకు చెందిన బ్రాహ్మణుడు. ఇతనిని కూడా కృష్ణదేవరాయలు గొప్పగా గౌరవించేవాడు. ఇతనికి రాయలు కొన్ని గ్రామాలను దానం చేశారు. తిమ్మన పారిజాతాపహరణం అనే కావ్యాన్ని రచించి కృష్ణదేవరాయలకు అంకితమిచ్చాడు. కృష్ణుడు, సత్యభామలను కథానాయకులుగా తీసుకొని రాశాడు. ఇది కృష్ణదేవరాయలకు చిన్న భార్యపై కలిగిన అలుకను తీర్చటానికి రాశాడని ప్రతీతి. ఇతడు గజపతుల ఆస్థానకవి అని, కృష్ణదేవరాయలు గజపతి రాజకుమార్తెను వివాహమాడిన తర్వాత ఆమె వెంట విజయనగరం వచ్చాడని ఒక కథ ప్రచారం ఉంది. కాని అది వాస్తవంగా కనిపించదు. ఈ కావ్యం కూడా తెలుగు భాషలోని ఒక గొప్ప కావ్యంగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని కవిత్వం మధురంగా ఉంటుందని అంటారు. ముఖ్యంగా పారిజాత పుష్పాన్ని తనకు ఇవ్వకుండా రుక్మిణికి ఇచ్చినందుకు సత్యభామ అలుక వహించడం, శ్రీకృష్ణుడు ఆమెను బ్రతిమలాడుకొనే సన్నివేశాన్ని అత్యంత ప్రేమభరితంగా వర్ణించాడు. అది సాటిలేని వర్ణన అంటారు. పెద్దన మనుచరిత్ర, తిమ్మన పారిజాతాపహరణాలను పోల్చినట్లయితే దేని ప్రత్యేకత దానికే ఉంది. మహాపండితుడు, మహాకవి అయిన కృష్ణదేవరాయలే వాటిలోని గొప్పదనాన్ని గుర్తించగలిగిన శక్తిగలవాడని కొందరన్నారు.

మాదయగారి మల్లన: కృష్ణదేవరాయల ఆస్థానంలో మరొక కవి ధూర్జటి. అతడు శైవ బ్రాహ్మణుడు. అతడు కాళహస్తీశ్వర మహాత్మ్యం అనే కావ్యాన్ని రచించాడు. కాని అతడు దానిని కృష్ణదేవరాయలకు అంకితం ఇవ్వలేదు కాళహస్తినాథునికి అంకితం ఇచ్చాడు. అతడు ఆ కావ్యంలో ధన సంపాదన ఒక్కటే జీవిత లక్ష్యం కాదని, అదే ఏకైక లక్ష్యంగా పెట్టుకున్నవాడు అధముడని ఉద్బోధించాడు. ఈ మాటలను అతడు వేశ్యమాత సన్నివేశంలో అనిపిస్తాడు. ధనాన్ని సంపాదించటమే కాక మానవుడు అంతకు మించిన ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించాడు ఇతని చివరి కాలంలో రాజాదరణ కోల్పోయినట్లుగా కనిపిస్తోంది. రాజులను దూషించాడు.

సుంకుసాల నృసింహ కవి: ఈ కాలానికి చెందిన మరొక కవి సుంకుసాల నరసింహ కవి. ఇతడు కవి కర్ణరసాయనం అనే కావ్యాన్ని రచించి శ్రీరంగనాథునకు అంకితం ఇచ్చాడు. ఈ కావ్యంలో మాంధాత విమలాంగి అనే రాజకుమార్తెను వివాహమాడటం ఇతివృత్తం. ఇది ఆరు సర్గలుగా రచించాడు. ఇందులో శృంగారాన్ని విచ్చలవిడిగా వర్ణించాడు. ఇతడు గొప్ప కవియే గాని అతిగర్విష్ఠియట. అందువల్ల ఇతడు కృష్ణదేవరాయల ఆదరాభిమానాలకు నోచుకోలేదు. ఎంతో మంది కవులను ఆదరించిన రాయల ఆదరణకు ఇతడు పాత్రుడు కాకపోవటానికి అతని స్వభావమే కారణమని భావింపబడింది.

అయ్యలరాజు రామభద్రుడు: కృష్ణదేవరాయల కాలం నాటి మరొక కవి అయ్యలరాజు రామభద్రుడు. రాయలు ఇతనిని సకల కథసార సంగ్రహం అనే కావ్యాన్ని రచించమని కోరాడు. దానిని కృష్ణదేవరాయలు తన చిన్నతనంలో రచించాడట. సంస్కృతంలో ఉన్న ఈ కావ్యాన్ని తెలుగులోకి అనువాదం చేయమని రామభద్రుని కోరాడు. కాని అది పూర్తికాక మునుపే రాయలు మరణించాడు. రామభద్రకవి రామాభ్యుదయం అనే మరొక కావ్యాన్ని రచించి కడప జిల్లాలోని ఒంటిమిట్టలోని శ్రీరామచంద్రునికి అంకితం చేశాడు. ఈ కావ్యం సాళువ నరసింహరాయలు సంస్కృతంలో రచించిన రామాభ్యుదయానికి అనువాదం. ఈ కావ్యంలో అయ్యలరాజు శ్లేషలను (verbal jingles) ఎక్కువగా ప్రయోగించాడు.

చింతలపూడి ఎల్లనార్యుడు: కృష్ణదేవరాయల కాలంనాటి మరొక కవి ఎల్లనార్యుడు. ఇతడు గొప్ప కవి. అనేక కావ్యాలను రచించాడు. కాని అందులో మూడు మాత్రమే లభిస్తున్నాయి. వానిలో మొదటి రాధామాధవం. అందులో రాధామాధవుల ప్రణయాన్ని కావ్యంగా రాశాడు. రాధ ప్రేమను భక్తికి మారు రూపంగా చిత్రించాడు. కృష్ణదేవరాయలకు శ్రీకృష్ణుడంటే అమితమైన ప్రేమట. అందువల్ల అతడు ఈ కావ్యాన్ని అమితంగా మెచ్చుకొని ఎల్లనార్యునకు రాధామాధవ కవి అనే బిరుదు నిచ్చాడు. ఈ కావ్యంలో ఎల్లనార్యుడు జావళీలను ఎక్కువగా ఉపయోగించాడు. రెండవ కావ్యం తారక బ్రహ్మరాజీయం. ఇది ఒక శృంగార కావ్యం. అందులో ఒక బోయ పడుచుతో ప్రేమలో పడిన ఒక బ్రాహ్మణుని కథ రాశాడు. మూడవ కావ్యం విష్ణుమాయా నాటకమని మరొక కావ్యం కూడా రాశాడు. ఇందులో నారదుడు ఒక యువతిగా మారి ఒక రాజును వివాహమాడి సంసారం చేసి చివరకు మాయను తెలుసుకోవడం ఇతివృత్తం. వీటిలో చివరి రెండు కావ్యాలు రాసే నాటికి కృష్ణదేవరాయలు మరణించాడు. అతని తమ్ముడు అచ్యుత దేవరాయలు రాజ్యానికి వచ్చాడు. అచ్యుత దేవరాయ మంత్రి అయిన నంద తిమ్మయ కోరగా తారకబ్రహ్మ రాజీయాన్ని రచించాడట.

కృష్ణదేవరాయల నాటి ఇతర కవులు: అష్టదిగ్గజాలలో లేని మరికొందరు కవులు కృష్ణదేవరాయలుకు సమకాలికంగా కావ్యాలను రాశారు. వారిలో 1. కందుకూరి రుద్రకవి. ఇతడు నిరంకుశోపాఖ్యానం అనే కావ్యాన్ని, సుగ్రీవ విజయం అనే యక్షగానాన్ని రాశాడు. 2. కొండవీటి రాజ్యంలో ఉన్నతోద్యోగిగా పని చేసిన నాదెండ్ల గోపరను స్వయంగా కవి. అతడు కృష్ణార్జున సంవాదం అనే పేరుతో గయోపాఖ్యానాన్ని ద్విపద కావ్యంగా రాశాడు. 3. ఉదయగిరి పాలకుడైన కంపరాయల ఆస్థానంలో మనుమంచిభట్టు అనే కవి ఉండేవాడట. అతడు అశ్వలక్షణసారం అనే గ్రంథం రాసి కంపరాయలుకు అంకితమిచ్చాడట. 4. అన్నమాచార్యుని కుమారుడు పెదతిరుమలయ్య రాయలకు సమకాలికుడు. 5. లొల్ల కూడా కృష్ణదేవరాయల సమకాలికుడు. అతడు దైవజ్ఞ విలాసం అనే గ్రంధాన్ని రచించాడు. 6. సూరన్న (పింగళి సూరన కాదు). 7. హరిభట్టు అనే మరో ఇద్దరు కవులు కూడా కృష్ణరాయల సమకాలికులని ప్రతీతి. వారిలో సూరన్న ఉదయనోదయ, వనమాలీ విలాసం అనే గ్రంధాలను రచించాడు. హరిభట్టు రతి రహస్యం, తెలుగులో ఉత్తర నరసింహ పురాణం, వరాహ పురాణం, మత్స్య పురాణం అనే గ్రంధాలను రచించాడు. ఈ విధంగా కృష్ణదేవరాయల కాలంలో అపారమైన తెలుగు సాహిత్య సృష్టి జరిగినందువల్ల తెలుగు భాషా చరిత్రలో స్వర్ణయుగంగా ప్రసిద్ధి చెందింది.

భువనవిజయం-సార్థక నామధేయం: ఇలాంటి మహాకవుల చేత పరివేష్టితమైన రాయల ఆస్థానానికి భువన విజయమని పేరు రావడం ఆశ్చర్యం కాదు. అనేక కవులు దేశదేశాల నుండి భువన విజయానికి వచ్చి సాహిత్య చర్చలలో పాల్గొని రాయల చేత విశేష బహుమానాలు అందుకుని వెళ్లేవారట. ఈ విధంగా రాయలు దిగ్గజాల వంటి కవి పండితులను పోషించి భాషా సాహిత్యాలకు అద్వితీయ సేవ చేసి సాహితీ సమరాంగణ సార్వభౌమ అని సగర్వంగా కీర్తి వహించాడు. సంస్కృతానికి భోజుడు సేవ చేసినట్లు రాయలు తెలుగు భాషకు సేవ చేసి ఆంధ్రభోజుడని ప్రసిద్ధి చెందాడు. అల్లసాని పెద్దన రాయలను రాజాధిరాజు, రాజపరమేశ, వీరప్రదాప, మూరురాయరగండ అని మనుచరిత్ర పీఠికలో వర్ణించాడు.

అచ్యుత దేవరాయల కాలం - సదాశివరాయల కాలం: అచ్యుతదేవరాయల ఆస్థానంలో ఎల్లనార్యుడు అనే కవి ఉండేవారు. అతనికి రాధామాధవుడు అని కూడా పేరుంది. అతడు తారకబ్రహ్మ రాజీయం అనే గ్రంధం రాశాడు. అందులో అతడు రామావతారపు గొప్పదనాన్ని చాటాడు. కాని ఈ కావ్యం పూర్తిగా లభించలేదు. ఇతడే విష్ణుమాయా విలాసం అనే కావ్యం రాశాడు. అందు విష్ణు మాయలను వర్ణించాడు. అచ్యుత దేవరాయల కాలంలో తాళ్లపాక చినతిరువెంగళనాథ అనే కవి జీవించాడు. ఇతడు కవిత్వం, సంగీతం అనే రెండు కళలలోనూ ప్రసిద్ధి

చెందిన కుటుంబానికి చెందినవాడు. ఇతడు రెండు ద్విపద కావ్యాలు (couplet metre) రచించాడు. అందులో మొదటిది అష్టమహిషి కళ్యాణం. ఇందులో శ్రీకృష్ణుడు 8 మంది భార్యలను వివాహమాడటం ఇతివృత్తం. ఇందులో జావళీలను ఎక్కువగా ప్రయోగించాడు. రెండవ కావ్యం పరమయోగి విలాసం. ఇందులో వైష్ణవ భక్తుల కథలు ఇతివృత్తం. ఈ కవికి తాళ్లపాక చిన్నన్న అనే పేరు కూడా ఉంది. ఇతడు ఈ రెండు కావ్యాలను తిరుపతి వేంకటేశ్వరస్వామికి, ఆయన దేవేరి అలివేలుమంగకు అంకితమిచ్చాడు. అతని తాతతండ్రుల కాలం నుండి వారు తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తులు. ఇతనిని సదాశివరాయలు ఆదరించి బహుమానాలు ఇచ్చాడు సదాశివరాయల ఆస్థానంలో దొడ్డయాచార్యుడు, తాతాచార్యులు గొప్ప పండితులు. మధ్వగురువైన విజయేంద్ర తీర్థుల వారు చాలా మధ్వమత గ్రంథాలు రాశారు. అచ్యుతదేవరాయల మరణానంతరం విజయనగర సామ్రాజ్యంలో ఏర్పడిన అరాచక పరిస్థితులు వారసత్వ యుద్ధాల వల్ల కవిపండిత పోషణ క్షీణించింది. కనుక పింగళి సూరన, తెనాలి రామకృష్ణుల వంటి మహాకవులు చిన్న చిన్న ప్రభువులను ఆశ్రయించవలసి వచ్చింది.

ఆరవీటియుగం - భట్టుమూర్తి: అళియరామరాయల రాకతో ఆరవీటి వంశం అధికారం చేపట్టింది రామరాయల ఆస్థానంలో భట్టుమూర్తి అనే కవి నివసించాడు. ఇతడు క్షత్రియుడు. అతనికి భట్‌రాజు అని కూడా పేరుంది. ఇతడు అల్లసాని పెద్దన శిష్యుడు. ఇతనిని రామరాజు చక్కగా ఆదరించాడు. రామరాజు ఆస్థానంలోని గొప్ప కవి. కనుక ఇతనికి రామరాజు భూషణుడు అనే పేరు వచ్చింది. ఇతడు మూడు కావ్యాలు రచించాడు. కాని వాటిలో దేనినీ కూడా రామరాజుకు అంకితం ఇవ్వలేదు. అందులో మొదటిది నరసభూపాలీయం. అది ఒక చందోగ్రంథం (poetics) కాకతీయుల కాలం నాటి విద్యానాధుని ప్రతాపరుద్రీయ యశోభూషణాన్ని ఆధారంగా తీసుకొని ఈ కావ్యాన్ని రాశాడు. ఈ గ్రంధాన్ని అళియరామరాయల సోదరి కుమారుడైన అంటే మేనల్లుడు బొబ్బూరి నరసనాయనికి అంకితమిచ్చాడు. ఇతడు తొలగల్లుని పాలించేవాడు. ఇతనికి పోచిరాజు, నరసరాజు అని కూడా పేర్లున్నాయి. రెండవది హరిశ్చంద్ర నలోపాఖ్యానం. ఇది ద్వర్థికావ్యం. ఇందులో ప్రతి వాక్యం రెండు అర్థాలనిస్తుంది. ఒకటి హరిశ్చంద్రుని చరిత్ర, రెండవది నలచరిత్ర. ప్రతిశ్లోకం ఈ ఇద్దరి రాజుల చరిత్రను తెలుపుతూ నడుస్తుంది. ఈ కావ్యాన్ని శ్రీరామునకు అంకితం ఇచ్చాడు. ఇతని మూడవ కావ్యం వసుచరిత్ర. ఇది అతని మూడు కావ్యాలలో ఉత్తమోత్తమమైనది. ఈ కావ్యాన్ని రామరాయల తమ్ముడైన తిరుమలరాయులకు అంకితం ఇచ్చాడు. దీనిని బట్టి ఈ కావ్యం తళ్లికోట యుద్ధానంతరం రచించి ఉంటాడు. ఈ కావ్యంలో వసురాజు గిరికాదేవిని వివాహ మాడటం ఇతివృత్తం. గిరిక కోలాహల పర్వతానికి శుక్తిమతినదికి జన్మించిన కూతురు అని వర్ణింపబడింది. ఈ కావ్యంలో అలంకారాలు, శ్లేషలు ఉపయోగింపబడ్డాయి. ఈ కావ్యం మొదటి నుండి చివరి వరకు ధ్వని ప్రధానంగా నడిచింది. గొప్ప వర్ణనాత్మక కావ్యంగా ప్రసిద్ధి చెందింది. అందులో పద్యాలు, భావాలు సంగీత స్వభావం అతని రచనాశక్తిని నిరూపిస్తాయి. ఈకావ్యం ఆనాటి సాహిత్య రంగాన్ని బాగా ఆకర్షించింది. రామరాయల కాలంలో రామయామాత్యుడు అనే కవి సర్వమేళ కళానిధి అనే గ్రంధాన్ని రాశాడు.

పింగళి సూరన: రామరాజ భూషణునకు సమకాలికుడైన మరొక గొప్ప కవి పింగళి సూరన. అతడు ఆరువేల బ్రాహ్మణ శాఖకు చెందినవాడు. గుంటూరు ప్రాంతానికి చెందినవాడు. ఇతని కాలం నాటికే విజయనగర సామ్రాజ్యం క్షీణదశలో ఉంది. కనుక ఇతడు నంద్యాలను పాలించిన సామంతరాజులను ఆశ్రయించాడు. అతడు రాఘవ పాండవీయం అనే ద్వర్థి కావ్యాన్ని మొదట రచించాడు. ఇందులో ప్రతిశ్లోకంలో రామాయణం, మహాభారతం అనే రెండు గాథలు నడుస్తాయి. దీనిని అనుకరిస్తూనే రామరాజభూషణుడు తన హరిశ్చంద్ర నలోపాఖ్యాన్ని రచించాడని అంటారు. పింగళిసూరన రాఘవపాండవీయాన్ని కర్నూలు జిల్లాను పాలించిన ఆకువీడు పెదవెంకటాద్రికి అంకితం ఇచ్చాడు. ఇతని రెండవ కావ్యం కళాపూర్ణోదయం. ఇది పూర్తిగా కల్పితం నాటకీయంగా అద్భుతంగా రచించాడు. ఇది పద్యాత్మిక నవల అంటే, ఇది కొంత నవలలాగ, కొంత నాటకంలాగా, కొంత దృశ్యకావ్యంలాగా నడిచిందని ఆరుద్ర వ్యాఖ్యానించాడు. ఇందులో మధ్యలో ప్రవేశింపబడిన సుధాత్రిసవీయుల కథ భోగలాలసత్వానికి, శారీరక శ్రమవలన వచ్చే సంతృప్తికి ఉన్న తేడాలను చక్కగా చిత్రించాడు. ఆనాటి కావ్యాలలో దీనితో సాటి వచ్చే కావ్యంలేదని కీర్తి పొందింది. ఈ కావ్యాన్ని విజయనగర రాజ్య సామంతుడైన నంద్యాల కృష్ణమరాజుకు అంకితమిచ్చాడు. అతని మూడవ కావ్యం ప్రభావతీ ప్రద్యుమ్నం. ఇది కూడా గొప్ప కావ్యమే. ఇందులో ప్రధాన రంగంలో అనేక ఉపరంగాలను కల్పించి రచించాడు. ఈ కావ్యంలోని తెలుగు అతిమధురంగా ఉంటుందని పండితులు అంటారు. ఈ కావ్యాన్ని అతడు తన తండ్రికి అంకితం ఇచ్చాడు.

ఇతనికి సమకాలికంగా రెండవ వెంకటపతిరాయలు చంద్రగిరి రాజ్యం పరిపాలిస్తూ ఉండవచ్చును.

తెనాలి రామలింగడు: ఈ యుగంలో ప్రసిద్ధి చెందిన చివరి కవి తెనాలి రామలింగడు. ఇతడు కృష్ణదేవరాయల సమకాలికుడని, అతని ఆస్థానకవి అని, వీరిద్దరూ కలిసి ఉండేవారని అనుశ్రుతి ఉంది. కాని అది వాస్తవంగా కనిపించడం లేదు. ఇతని ఇంటి పేరు గార్లపాటి. తెనాలి వాస్తవ్యుడు కనుక తెనాలి రామలింగడుగా ప్రసిద్ధి చెందాడు. ఇతడు మొదట శైవమతస్థుడు. ఉద్భటారాధ్యచరిత్రను రాశాడు. ఇది ఉద్భటారాధ్య అనే శైవభక్తుని కథ. ఇది మంచి కవితాశక్తి కలిగిన కావ్యం. ఈ కావ్యాన్ని నాదెండ్ల గోపరసు మంత్రి అయిన ఉరదేభయ్యకు అంకితం చేశాడు. తర్వాత అతడు వైష్ణవ మతాభిమానిగా మారిపోయి తన పేరును రామకృష్ణునిగా మార్చుకున్నాడు. తర్వాత పాండురంగ మహాత్మ్యం అనే కావ్యాన్ని రాశాడు. పండరీపురంలోని పాండురంగని మహాత్మ్యాన్ని చాటుతూ ఈ కావ్యాన్ని రాశాడు. ఈ కావ్యం చాలా కఠినంగా ఉంటుంది. అర్థం కాని అనేక పదాలను ప్రయోగించాడు. నిగమశర్మ అక్క కథ అద్భుతంగా చిత్రించాడు. ఈ కథ చాలా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇది ఐదు అశ్వాసాల ప్రౌఢ ప్రబంధం. దీనిని విరూరివేనాద్రి మంత్రికి అంకితం చేశాడు. మూడవ కావ్యం ఘటికాచల మహాత్మ్యం. ఘటికాచలం తమిళనాడులోని ఉత్తర ఆర్కాట్ జిల్లాలోని షోలింగనూరులో ఉంది. అందులో నరసింహస్వామి ఆలయం ఉంది. ఈ కావ్యాన్ని రామకృష్ణుడు ఖాండోజీరావు అనే మరాఠా బ్రాహ్మణునికి అంకితం చేశాడు. ఈ ఖాండోజీరావు ఎవరో గుర్తింపబడలేదు. ఇతడు పండరిలోని పాండురంగని భక్తుడు అయిన తర్వాత పండరిని దర్శించి ఉండవచ్చును. అక్కడ ఈ ఖాండోజీరావు పరిచయమై ఉండొచ్చు. రామకృష్ణుని చివరి దశలో అతని కవిత్వంలో మార్పు వచ్చింది. కవితాశక్తి తగ్గిపోయింది. శ్లేషలు ఎక్కువగా వాడాడు. ఇతని సమకాలికుడైన పింగళిసూరన మొదటికంటే చివరి కాలంలో అద్భుత కవిత్వం రాయగా ఇతడు మొదట అద్భుత కవిత్వం రాసి చివరి దశలో దిగజారిపోయిన కవిత్వం రాశాడని పండితులు అంటారు. ఇతడు రెండవ వెంకటపతి రాయల కాలం నాటి వాడు అయి ఉండవచ్చు.

ఈ యుగంలోని ఇతర కవులు: ఈ యుగంలో ఇంకా అనేక మంది కవులు ఉన్నారు. విజయనగర సామ్రాజ్యం క్షీణించిపోయినా వారి కాలం నాటి ఒరవడితో ప్రబంధాలు రాసిన కవులు అనేక మంది ఉన్నారు.

సూరన: వారిలో సూరన ఒకడు. అతడు ధనాభిరామం అనే గ్రంథాన్ని రాశాడు. ఆ గ్రంథం ప్రపంచంలో ధనానికి ఉన్న శక్తిని తెలిపింది. మన్మథుడు, కుబేరుడు సౌందర్యం గొప్పదా, ధనం గొప్పదా అని పందెం వేసుకుంటారు. చివరకు కుబేరుడు గెలిచి ధనం గొప్పదని నిరూపిస్తాడు.

నారాయణకవి పంచతంత్రం: నారాయణకవి పంచతంత్రం రాశాడు. అందులో అతడు దరిద్రాన్ని మించిన నరకం లేదని అంటాడు. ధనవంతుడు ఎక్కడికి వెళ్లినా అంతా బంధువులవుతారు. ప్రపంచమంతా అతనిదే అని వివరిస్తాడు. డబ్బు లేని వాడిని సొంత భార్య కూడా చులకన చేస్తుందని అంటాడు. ఇంకా వదిలి వేసినా ఆశ్చర్యపడనక్కరలేదని కూడా అంటాడు. పంచతంత్రంలో చిన్న చిన్న కథలుగా రాజకుమారులకు రాజనీతిని నేర్పుతాడు. ఈ కథలలో ఒక గొర్రెలు కాసే సుందరి, ఒక దండనాధుని, అతని కుమారుని, తన సొంత భర్తను ఒకరికి తెలియకుండా ఒకరిని సంతోషపెడుతుంది. ఈ కథ ద్వారా స్త్రీల జాణతనాన్ని చిత్రించాడు.

కూచిరాజు ఎర్రన - కొక్కోకం: కూచిరాజు ఎర్రన అనే మరొక కవి కొక్కోకం అనే రతి శాస్త్రాన్ని రచించాడు. ఇది తెలుగులో గొప్ప శృంగార శాస్త్రంగా ప్రసిద్ధి చెందింది.

నూతన ప్రక్రియలు - వెలగండ్ల నారాయణ: ఇంకా అనేక మంది కవులు అనేక నూతన ప్రక్రియలతో కావ్యాలు రాశారు. వెలిగండ్ల నారాయణ అనే కవి భాగవతంలో పదకొండవ స్కంధాన్ని తెనిగించాడు. అతడు కేవలం లఘువులను మాత్రమే ఉపయోగించి ఒక సీసపద్యాన్ని రాశాడు.

బంధకవిత్వం - భైరవ కవి: ఈ కాలంలో బంధకవిత్వం అనే మరొక ప్రయోగం అభివృద్ధి చెందింది. భైరవ కవి అనే అతడు ఈ బంధ కవిత్వానికి ఆద్యుడు. అతడు చక్రబంధం, నాగబంధం, మూత్రికాబంధాలలో పద్యాలు రాశాడు. ఇంకా చిత్రబంధ గర్భకవితలు కూడా ఉండేవి. అంటే పద్యాన్ని ముందు నుండి చదివినా వెనుకనుండి చదివినా అక్షరాలు ఒకే విధంగా ఉంటాయి.

తిమ్మకవి - రంగపరాజు - కోనేరినాధుడు - వెంకయ్య: వీరు కూడా ఈ యుగంలో చెప్పుకోదగిన కవులే. వీరిలో తిమ్మకవి పరమయోగి విలాసం, రంగపరాజు శంభోపాఖ్యానం అనే కావ్యాలు రాశారు. కోనేరినాధుడు బాల భాగవతం రాసి విరలరాయుని తమ్ముడు చినతిమ్మరాజుకు అంకితం ఇచ్చాడు. వెంకయ్య రామరాజీయం రాశాడు.

అందులో నరపతుల విజయాలను వర్ణించాడు. ఇది ఆరవీటి రాజు చరిత్ర.

జావళీలు - శతకాలు: ఈ కాలంలో జావళీలు అనే పేరుతో అనేక మంది కవులు ప్రేమగీతాలు, శృంగార గీతాలు రాశారు. అందులో నిరీక్షణను మధురంగా చిత్రించారు.

యోగివేమన: యోగివేమన ఈ కాలం వాడని ప్రతీతి. అతడు వేమన శతకం రాశాడు. అతడు విరాగి, గొప్ప తత్వవేత్త అయినా నిర్భయంగా సామాజిక దోషాలను విమర్శించాడు. ఐహిక దృష్టితో నీతిబోధ చేసి అతడు గొప్ప మానవతావాదిగా ప్రసిద్ధి చెందాడు. వేమనను కబీరుతోను, కన్నడ సర్వజ్ఞునితోను పోల్చారు.

తెలుగు కవయిత్రులు-మొల్ల: విజయనగర యుగంలో స్త్రీలు కూడా తెలుగులో కావ్యాలు రాశారు. వారిలో మొల్ల ప్రసిద్ధురాలు. ఆమె రామాయణాన్ని 571 పద్యగద్యాలతో ఆరు ఖండాలుగా రాసింది. దానికి మొల్ల రామాయణం అని పేరు. మృదుమధురమైన తేటతెనుగులో చక్కటి శృతితో ఎవరికీ తీసిపోని విధంగా రచించింది మొల్ల అంటే మల్లెలాంటి పువ్వు అని అర్థం. ఆమె తండ్రి కేశవ వృత్తిరీత్యా కుమ్మరి, కనుక ఆమెకు కుమ్మరి మొల్ల అని పేరు వచ్చిందట. ఈమె కాలం స్పష్టంగా తెలియదు. తెనాలి రామలింగనికి సమకాలికురాలని గాథలు ప్రచారంలో ఉన్నాయి. ఈమె ఏ రాజునూ ఆశ్రయించలేదు.

తాళ్లపాక తిమ్మక్క: ఈమె తాళ్లపాక అన్నమాచార్యుని భార్య. ఆమె సుభద్రా కళ్యాణం అనే ద్విపద కావ్యాన్ని రచించింది. సుభద్రను అత్తవారింటికి పంపుతూ రుక్మిణి ద్వారా ఆమెకు మగవారిని నమ్మకు, ద్రౌపదితో సఖ్యంగా ఉండు అని హితోపదేశం చేయించింది. అలాగే ద్రౌపది సుభద్రను అర్జునుని గదిలోకి పంపుతూ ఏదైనా ఇవ్వవచ్చు కాని భర్తను ఎవరికీ ఇవ్వలేమని అంటుంది. బహుభార్యత్వంలో స్త్రీలు ఎలాంటి మానసిక క్షోభను అనుభవిస్తారో తిమ్మక్క ఈ పాత్రల ద్వారా చెప్పించింది.

తుక్కాంబ - తిరుమలాంబ: శ్రీకృష్ణదేవరాయల భార్య అన్నపూర్ణాదేవికి తుక్కాంబ అని పేరుంది. ఆమె కూడా ఈ కాలం నాటి ప్రసిద్ధి చెందిన కవయిత్రి. ఆమె తుక్కపంచతి అనే కావ్యం రచించింది. తిరుమలాంబ కృష్ణదేవరాయల కుమార్తె. ఆమెకు మోహనాంగి అనే ముద్దు పేరుంది. ఆమె మారీచి పరిణయం అనే కావ్యాన్ని రచించింది. ఈమె వరదాంబికా పరిణయం అనే మరొక కావ్యాన్ని రచించింది. ఇందులో అచ్యుతదేవరాయలు ఆయన భార్య వరదాంబికల వివాహం ఇతివృత్తంగా తీసుకుని రాసింది.

వాగ్గేయకారులు - తాళ్లపాక అన్నమాచార్యుల కుటుంబం: విజయనగర యుగంలో ప్రసిద్ధి చెందిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుడు. ఇతని స్వస్థలం తాళ్లపాక. ఇతడు సాళువ నరసింహరాయల సమకాలికుడు. ఇతడు తిరుపతి వేంకటేశ్వరుని భక్తుడు. ఇతడు సాళువ నరసింహరాయల ఆగ్రహానికి గురై చెరసాలను అనుభవించాడని ప్రతీతి. తర్వాత నరసింహరాయలు తన తప్పును తెలుసుకొని చెరసాల నుండి విడిపించగా అతడు తిరుపతి చేరి అక్కడ స్థిరపడి తిరుపతి వెంకటేశ్వరునిపై 3 వేల పదాలు రచించాడు. అవి శృంగారాత్మకంగా, భక్తి ప్రధానంగా ఉన్నాయి. వాటిని తామ్రరేకులపై లిఖించి అక్కడి సరస్వతీ భాండారంలో భద్రం చేశాడు. శ్రీవేంకటేశ్వరస్వామిని కీర్తించే ఈ పదాలు ఆంధ్రదేశంలో బహుళ ప్రచారం పొందాయి. అతడు రాసిన పదాలలో అదుగో... అల్లదుగో శ్రీహరివాసము అనే పదం నేటికీ ఆంధ్ర ప్రజల నోటిలో తాండవమాడుతోంది. ఇతని భార్య తిమ్మక్క కూడా గొప్ప కవయిత్రి. ఇతని కుమారుడు పెదతిరుమలాచార్యుడు కృష్ణదేవరాయల సమకాలికుడు. చినతిరుమలాచార్యుడు, చిన్నన్నలు అచ్యుతదేవరాయలు, సదాశివరాయల సమకాలికులు. వారు కూడా గొప్ప వాగ్గేయకారులు. పెదతిరుమలాచార్యుని కుమారుడు తిరువెంగళనాథునికే చిన్నన్న అని పేరు. అతడు కూడా గొప్ప కవి. అతడు పరమయోగీ విలాసం అనే కావ్యం రాశాడు. అందులో ఆళ్వారుల కథలు ఉన్నాయి. మొత్తం మీద వీరి కుటుంబం సాళువ, తుళువ యుగాలలో పరంపరగా పదకవితలు చెప్పారు.

క్షేత్రయ్య: క్షేత్రయ్య ఆరవీటి యుగానికి చెందినవాడు. ఇతడు కృష్ణాజిల్లాలోని మొవ్వ గ్రామ వాస్తవ్యుడు అతడు అనేక శృంగార పదాలు రాశాడు. ఇతడు రాసిన పదాలను కూచిపూడి నాట్యకారులు తమ నాట్య కళకు జోడించి అద్భుత ప్రదర్శనలిచ్చి ఆనాడు ఆంధ్రదేశాన్ని ఉర్రూతలూగించారు.

కూచిపూడి నాట్యం: మాచుపల్లి కైఫీయత్తు వల్ల వీరనరసింహరాయల కాలం నాటికే కూచిపూడి భాగవతులు దేశసంచారం చేసి నాటకాలాడినట్లు తెలుస్తోంది. కృష్ణా జిల్లాలోని కూచిపూడిలో ఒక ప్రత్యేకమైన నాట్యకళ అభివృద్ధి చెందింది. వీరిని కూచిపూడి భాగవతులు అనేవారు. వారు విజయనగర ఆస్థానాన్ని దర్శించి

తుళువ వీరనరసింహరాయల సమక్షంలో సంగీత నాటకాన్ని ప్రదర్శించి అతని అభిమానానికి పాత్రులయ్యారు. అంతేగాక ఆకాలంలో రాయలసీమలో గురవరాజు అనే స్థానిక పాలెగాడు చేసిన దురంతాలను తమ నాటక కళతో వీరనరసింహరాయల దృష్టికితెచ్చి అతనిని శిక్షింపజేశారు. కూచిపూడి పూర్వనామం కుచేలపురమని అంటారు.

సంగీత, నాట్య, నాటక కళలు: ఈ యుగంలో సంగీత నాట్య నాటక కళలు బాగా అభివృద్ధి చెందాయి. విద్యారణ్య మహర్షి తన సంగీతసారంలో 1267 రాగాలను వర్ణించాడు. ప్రౌఢదేవరాయలు నాటక సుధానిధి అనే సంగీత శాస్త్రాన్ని రచించాడు. కృష్ణదేవరాయలు కృష్ణ అనే విద్వాంసుని వద్ద వీణను నేర్చుకున్నాడని తెలుస్తోంది. రామరాయలు తన కుమార్తెలకు రామయ మంత్రి చేత సంగీతం నేర్పించాడు. రామయ మంత్రి సర్వమేళ కళానిధి అనే సంగీత గ్రంథం రాశాడు. ఇది కర్ణాటక సంగీతానికి వేదం వంటిది.

నాట్యకళ: ఆ కాలంలో వేశ్యలు నాట్యకళలు అభ్యసించి దేవతా ఉత్సవాలలో ప్రదర్శించేవారు. విజయనగర కాలం నాటి దేవాలయాలలో ప్రత్యేకంగా నాట్యమండపాలు నిర్మించేవారు. నాట్యాలలో అనేక రకాలు ఉండేవి. సుద్ధ పద్ధతి, చిత్ర పద్ధతి, ఘనదేశి పద్ధతి అనే నృత్య పద్ధతులు ఉండేవని మల్లణ చరిత్ర ద్వారా తెలుస్తోంది. కృష్ణదేవరాయలు తన కావ్యాలలో సప్త, అవంజం, దండెతాళం, కిన్నెర, మౌరి, గౌరు, గుమ్మెట, చయ్యంకి, ఢక్కి ఢక్కి వీణ, ముఖవీణ అనే వాయిద్యాలను పేర్కొన్నాడు. వీటన్నింటిలో వీణ ప్రసిద్ధి చెందిన వాయిద్యం.

ఇతర రచనలు: ఈ కాలంలో యక్షగానాలు అనే పాటలు కూడా ప్రాచుర్యంలోకి వచ్చాయి. తందానతానా అంటూ పాటలతో కథలు చెప్పేవారు. ఇవి నాట్య సంగీతాలతో మేళవింపబడిన రూపకాలు. చెన్నశౌరి అనే అతడు యక్షగానాలు రాశాడు. తర్వాత చెప్పుకోదగినవి వీధినాటకాలు (country plays). రామాయణ, భారత, భాగవత కథలను వీధినాటకాలుగా వేసేవారు. శ్రీకృష్ణదేవరాయలు రచించిన జాంబవతీ కళ్యాణం నాటకాన్ని వసంతోత్సవ సమయంలో ప్రదర్శించే వారట. అలాగే తోలుబొమ్మలాటలు, హరికథలు అనే సంగీత గానాలు కూడా ఉండేవి. జానపద నృత్యాలుండేవి. మలబారుతీరంలో కథక్, మోహిని, అత్తమ, కథాకళి అనే నాటక ప్రక్రియలు కూడా విజయనగర యుగంలో ప్రాచుర్యం పొందాయి. వీటన్నింటికీ కావలసిన పాటలను ఎవరు రచించారో తెలియదు. కాని అవి మౌఖికంగా తరతరాలుగా వస్తున్నాయి. ఈ విధంగా అన్ని రకాల సాహిత్యం విజయనగర యుగంలో అభివృద్ధి చెందింది.

గజపతుల తెలుగు భాషాపోషణ: 15వ శతాబ్దంలో విజయనగరంలో కంటే ఉదయగిరిలోని గజపతుల అధికారులు పాలెగాండ్రు తెలుగు భాషను ఎక్కువగా ఆదరించారు. క్రీ.శ.1470వ సంవత్సరంలో ఉదయగిరిని గజపతులు సామంతులుగా పాలించిన పూసపాటి బసవరాజుకు దూబగుంట నారాయణ కవి పంచతంత్రాన్ని అంకితం చేశాడు. నారాయణ కవి తాను హరిహరదేవుని భక్తుడనని చెప్పుకున్నాడు. బసవరాజు మంత్రి పెనరువాయి గంగన్నకు దగ్గుపల్లి దుగ్గన నాచికేతోపాఖ్యాన్ని అంకితం చేశాడు. అతనికే నందిమల్లయ్య, గంట సింగయలు ప్రబోధ చంద్రోదయాన్ని అంకితమిచ్చారు. ఉదయగిరిని సాళువ నరసింహరాయలు ఆక్రమించిన తర్వాత జంటకవులైన మల్లయసింగయలు విజయనగరం చేరి తుళువ నరసనాయకుని ఆశ్రయించి అతనికి వరాహపురాణం అంకితమిచ్చారు.

తెలంగాణ కవులు - చెరిగొండ ధర్మన్న: ఓరుగల్లును గజపతుల సేనాధిపతి అయిన చితాబ్‌ఖాన్ పాలించే రోజులలో అతని మంత్రి అయిన ఎల్ల పెద్దనను ఆశ్రయించి చెరిగొండ ధర్మన్న చిత్రభారతం రచించాడు. ఇతనికి శతలేఖిని సురత్రాణ అనే బిరుదు ఉంది.

కొరవి గోపరాజు: ఇతడు సింహాసన ద్వాత్రింశ సాలభంజికను రచించి హరిహరనాథునకు అంకితం చేశాడు. ఇతడు తన కావ్యంలో వేకొకలబోనియట్టి శిరిపుట్టిన ఇంటికి ఓరుగంటికిన్ అని వర్ణించాడు. ఈ వర్ణనలను బట్టి ఓరుగల్లు మంచి స్థితిలోనే ఉందని తెలుస్తోంది. ఇతడు 16వ శతాబ్దంలో తొలి పాదానికి చెందిన వాడు.

దక్షిణాత్యంలో తెలుగు భాషా సాహిత్యాలు
నాయక రాజుల కాలం

ఆంధ్ర కవులు అనేక భాషా కవుల మధ్య సంచరించినందు వల్ల ఈ కాలపు తెలుగు సాహిత్యంలో తమిళ, కన్నడ, మహారాష్ట్ర భాషా పదాలు ప్రవేశించాయి. శివకవుల యుగంలో లాగానే ప్రజల భాషలో జాతీయ పలుకుబడితో చమత్కారాలతో కావ్యాలు రచించబడ్డాయి. ప్రబంధాల రచన కొనసాగింది. సంగీత సాహిత్యాలు మేళవించి గేయాలు, దృశ్యకావ్యాలు, యక్షగానాలు అసంఖ్యాకంగా రాశారు. వచన వాఙ్మయం ఈ కాలంలో క్రమ పరిణామం పొందింది. తంజావూరు యక్షగానానికి, మధుర వచనగానానికి ప్రసిద్ధి చెందింది. శాస్త్ర గ్రంథాలు కూడా రాయబడ్డాయి. వననప్ప అనే కవి ఖడ్గ లక్షణం అనే పేరుతో 132 ఆయుధాలను వర్ణిస్తూ పద్యకావ్యం రచించాడు. ఆ కాలపు సాహిత్యం నిండా చారిత్రక సంఘటనలు, ఆర్థిక, సాంఘిక పరిస్థితులు వర్ణింపబడ్డాయి దాంతోపాటే శృంగార, హాస్య రచన ప్రధానంగా ఎక్కువ కావ్యాలు రచింపబడ్డాయి. ఆనాటి ప్రభువుల విలాసవంతమైన అభిరుచిని బట్టి శృంగారాన్ని నాటి కవులు తమ కావ్యాలలో సృష్టించారు. అందువల్ల ఆనాటి కావ్యాలలో ఉత్తమ కళాఖండాలు అనదగిన కావ్యాలు చాలా తక్కువగా ఉన్నాయి. అందువల్ల పింగళి లక్ష్మీకాంతంగారు ఆనాటి కావ్యాలలో ధర్మ సౌందర్యం లోపించింది. కథలో బిగువు లేక సొంపు చెడిపోయి కేవలం శబ్ద వైచిత్రితో కూడిన గారడీ కవిత్వం తయారైందని వర్ణించారు. ఇలాంటి శబ్ద వైచిత్రితో కూడిన కవిత్వం రచించిన వారిలో రేవూరు కాళహస్తిదేవుడు అనే కవి ప్రసిద్ధుడు. అతడు ప్రయోగించిన పదాలు అద్భుత శబ్దాలను సృష్టించాయి.

నాయక రాజ్యాలకు ముందు ద్రవిడ దేశంలో తెలుగు భాష: నాయక రాజ్యాలు ఏర్పడక ముందు ద్రావిడ దేశంలో ఆంధ్ర భాష ప్రవేశించింది. జింజిపాలెగాడు అయిన గోపన మంత్రి సింధూమతి విలాసం అనే తెలుగు కావ్యం రచించాడు. గోపన మంత్రి వీరకంపరాయల సేనాధిపతులలో ఒకడు. అతడు వీరకంపరాయల మధుర దండయాత్రలో పాల్గొన్నాడు. శ్రీరంగంలో దేవుని ప్రతిష్ఠించి దేశికాచార్యునిచే అభినందనలు అందుకున్నాడు అతని సేవలకు మెచ్చిన బుక్కరాయలు అతనిని జింజిపాలెగాడుగా నియమించాడు. ఇతడు తెలుగువాడై ఉండవచ్చును. అచ్యుతదేవరాయల కాలంలో తిరువత్తూర్ పాలెగాడు అయిన గోల్ల చినరామప్ప తన ఆస్థానకవి పచ్చకప్పూరపు తిరువెంగళనాథునిచే చొక్కనాథ చరిత్ర రాయించాడు. ఇదే కాలంలో భద్రకవి లింగయ అనే అతడు సానంద చరిత్రను ద్విపద కావ్యంగా రచించి అరుణాద్రి మంగళం నివాసి అయిన జంగమదేవరకు అంకితం చేశాడు. తర్వాత అరవీటి యుగంలో మధుర తంజావూరు నాయక రాజ్యాలు ప్రబలమయ్యాయి. వారు తెలుగు భాషను బాగా పోషించారు.

తంజావూరు నాయక రాజుల ఆంధ్రసారస్వత పోషణ: తంజావూరు నాయక రాజులలో రఘునాథ నాయకుడు అగ్రగణ్యుడు. అతడు గొప్పవీరుడే గాక స్వయంగా కవి. కవి పండిత పోషకుడు. తంజావూరుకు అతడు శ్రీకృష్ణదేవరాయలనే కీర్తిపొందాడు. అతడు ఆశువుగా పారిజాతాపహరణం చెప్పి తండ్రి చేత కనకాభిషేకం చేయించుకున్నాడనే శృతి ఉంది. అతడు పారిజాతాపహరణం, వాల్మీకి చరిత్ర, అచ్యుత రామాభ్యుదయం అనే మూడు కావ్యాలు రచించాడు. అంతేగాక రఘునాధరాయలు సంస్కృతంలో సంగీతసుమ, రామాయణం కథాసారం భారత కథా సంగ్రహం అనే నాలుగు కావ్యాలు రాశాడు. అచ్యుతాభ్యుదయం, గజేంద్రమోక్షం, నల చరిత్ర అనే ద్విపద కావ్యాలు తెలుగులో రాశాడు. జానకీ పరిణయం, రుక్మిణీ పరిణయం, శృంగార సావిత్రి అనే యక్షగానాలు రాశాడు. ఇతని రచనలలో గజేంద్రమోక్షం, జానకీ పరిణయం, రుక్మిణీ పరిణయం లభ్యం కాలేదు ఆరుద్ర రఘునాధ రాయలను అరుదుగా కన్పించే కవులలో ఇతడు ఒకడని వ్యాఖ్యానించారు. ఇతడు సంగీతసుధ అనే సంగీత శాస్త్రంలో జయంతసేన, రామానందం అనే నూతన రాగాలను సృష్టించాడు. రఘునాధ విలాసం అనే మరొక నాట్యశాస్త్రం కూడా రచించాడు. ఇంకా అతడు నూరు గ్రంథాలు రాశాడని ప్రతీతి ఉంది. అందులో అనేక ద్విపదలు, యక్షగానాలు ఉన్నాయి.

గోవింద దీక్షితులు: రఘునాధరాయల మంత్రి గోవింద దీక్షితులు సాహిత్యసుధ అనే గ్రంథం రాశాడు

ఇంకా అతడు వేదాంత గ్రంధాలు రాశాడు. ఇతనికి అద్వైత విద్యావిశారద అనే బిరుదు ఉంది.

యజ్ఞనారాయణ: ఇతడు గోవింద దీక్షితుని కుమారుడు. అతడు సాహిత్య రత్నాకరం అలంకార శాస్త్రాన్ని, రత్నాకరం అనే శాస్త్రాలను రఘునాధాభ్యుదయం అనే కావ్యాన్ని, శుల్బసూత్రాలు అనే గణిత గ్రంధాన్ని రాశాడు.

చేమకూర వెంకటకవి: రఘునాధరాయల ఆస్థానంలోని తెలుగు కవులలో అగ్రగణ్యుడు చేమకూర వెంకటకవి. ఇతడు సారంగధర చరిత్ర, విజయ విలాసం అనే రెండు కావ్యాలు రాసి రఘునాధ నాయకునకు అంకితమిచ్చాడు. విజయ విలాసంలో వెంకటకవి తెలుగుభాషలోని మార్దవాన్ని, లాలిత్యాన్ని అద్భుతంగా చిత్రించాడు.

కృష్ణాధ్వరి: ఇతని ఆస్థానంలో కృష్ణాధ్వరి అనే మరొక కవి ఉండేవారు. రఘునాధ భూపాలీయం, నైషధ పారిజాతం అనే శ్లేష కావ్యాన్ని రచించి రఘునాధ నాయకునకు అంకితం చేశాడు.

వెంకటమఖి లింగాధ్వరి: వెంకటమఖి బౌధాయనస్రౌధ సూత్రాలకు భాష్యం, శుల్బమీమాంస అనే రెండు గ్రంధాలు రచించాడు. అతని తమ్ముడు లింగాధ్వరి వేదార్థతత్వ నిర్ణయం అనే గ్రంధం రచించాడు. వీరిద్దరూ గోవింద దీక్షితుల కుమారులు.

కవయిత్రులు - రామభద్రాంబ, మధురవాణి: ఇతని ఆస్థానంలో ప్రసిద్ధి చెందిన కవయిత్రులు కూడా ఉండేవారు. వారిలో చిత్ర, బంధ, గర్భ, ఆశు కవిత్వాలు చెప్పగలిగిన అనేక మంది ప్రజ్ఞాధురీమణులు ఉండేవారు. వారిలో రామభద్రాంబ మధురవాణి అనే కవయిత్రులు ముఖ్యులు. రామభద్రాంబ రఘునాధాభ్యుదయం అనే పేరుతో రఘునాధరాయల విజయాలను సంస్కృత కావ్యంగా రచించింది. మధురవాణి రామాయణసారం అనే కావ్యాన్ని రచించింది. ఆమెకు రఘునాధ నాయకుడు కనకాభిషేకం చేశాడు. అతని ఆస్థానంలో ఇంకా అనేక మంది కవయిత్రులున్నారని మధురవాణి రాసింది.

విజయరాఘవ నాయకుడు: రఘునాధనాయకుని కుమారుడు విజయరాఘవ నాయకుడు కూడా గొప్పకవి. అష్టభాషాధురీణుడు, సాహితీస్రష్ట, సాహిత్యరాయ పెండేరాన్ని ధరించాడు. 20 వరకు యక్షగానాలు, అనేక పదాలు, కీర్తనలు రచించాడు. అంతేగాక రఘునాధాభ్యుదయం అనే పద్య, గద్యాత్మక తెలుగు నాటకాన్ని రచించాడు. ఇది తెలుగు నాటకాలలో మొట్టమొదటిదిగా ప్రసిద్ధి చెందింది. ఇంకా విప్రనారాయణ చరిత్ర, పాదక సహాస్రం అనే మరి రెండు ద్విపద కావ్యాలు రాశాడు. ఇంకా రగడలు, సాంగత్యాలు, దండకాలు కూడా రచించాడు. ఇతడు యక్షగానాలలో నూతన ప్రక్రియలు ప్రవేశపెట్టాడు.

పసుపులేటి రంగాజమ్మ: విజయరాఘవుని ఆస్థాన కవయిత్రి రంగాజమ్మ. ఈమె విజయరాఘవుని ప్రియురాలు అని అంటారు. ఆమె మన్నారుదాస విలాసం, ఉషాపరిణయం అనే రెండు కావ్యాలు రాసింది. అందులో ఆమె శృంగార రసాన్ని గుప్పించి వేసింది. ఆమె కొన్ని యక్షగానాలు కూడా రచించింది. ఆమె ఇంకా సంగ్రహ భారతం, భాగవతం, రామాయణాలను కూడా యక్షగానాలుగా రచించింది.

కృష్ణాజీ-చంద్రలేఖ: ఇతని ఆస్థానంలో కృష్ణాజీ, చంద్రలేఖ అనే మరో ఇద్దరు కవయిత్రులు కూడా ఉండేవారు. వారి సమస్యాపూరణాలు చేయడంలో దిట్టలని పేరు పొందారు.

సౌందాని అల్లాడ విజయసింహ భూపతి: ఇతడు సింహవిలాసం అనే కావ్యాన్ని రాశాడు.

మొవ్వ క్షేత్రయ్య: కృష్ణాజిల్లాలోని మొవ్వకు చెందిన క్షేత్రయ్య విజయ రాఘవుని ఆస్థానాన్ని దర్శించి విజయ రాఘవునిపై వేయి పదాలను చెప్పాడు. అందుకు విజయరాఘవుడు సంతోషించి అతనికి బహుమతులనిచ్చి సత్కరించాడు. అతడు 4000 పదాలు రాశాడు. కాని అందులో 380 మాత్రమే మిగిలాయి.

మన్నారు దాసు: విజయ రాఘవుని కుమారుడు మన్నారుదాసు కవి, పండితుడు. అతడు కొన్ని యక్షగానాలు రచించాడు.

చిన నారాయణరాజు: విజయరాఘవుని సమకాలీకుడైన చిన నారాయణరాజు మార్కండేయ పురాణంలోని కథను ఆధారంగా తీసుకొని కువలయాశ్వ చరిత్ర అనే కావ్యం రాశాడు.

కోనేటి దీక్షితుడు - వెంకటపతి సోమయాజీ: వీరరాఘవుని కాలంలో ఇంకా కోనేటి దీక్షితుడు, వెంకటపతి సోమయాజి అనే మరి ఇద్దరు యక్షగాన రచయితలు కూడా ఉన్నారు.

మధుర నాయక రాజుల తెలుగుభాషా సాహిత్యాల పోషణ: విజయనగర సామంతులుగా పాలించిన మధుర నాయకులు తెలుగువారు. వారు తమిళదేశంలో పాలన చేసినప్పటికీ వారు తమ మాతృభాషను వదలి

పెట్టలేదు. ఈ వంశానికి మూల పురుషుడైన విశ్వనాథ నాయకుని నుండి చివరివారైన విజయరంగ చొక్కనాథుడు అతని భార్య మీనాక్షి వరకు వారు తెలుగు భాషలో శాసనాలు వేయించారు. శాసనాల మీద తెలుగులో సంతకాలు చేశారు. విశ్వనాథ నాయకుడు తాను రాయించిన శాసనాలపై మహారాజమాన్యరాజ విశ్వనాథనాయకుని అయ్యలుగారు అని సంతకం చేసేవాడు. చివరివాడైన విజయరంగ చొక్కనాథుడు తన శాసనాలపై విజయరంగ చొక్కనాథ నాయనయ్య రాలు అని సంతకం చేసేవాడు. మొదటివాడైన విశ్వనాథ నాయకునికి, చివరివాడైన విజయరంగ చొక్కనాథ నాయకునికి మధ్యకాలం 200 సంవత్సరాలు జరిగింది. ఈ 2 వందల సంవత్సరాలు పాలించిన అందరూ తెలుగులో శాసనాలు రాయించారు. మొదటివాడైన విశ్వనాథనాయకుడు తెలుగుదేశం నుండి వెళ్లినవాడు కనుక అతడు తెలుగులో శాసనాలు రాయించాడు అంటే అది సహజం. కాని చివరి వారి వరకు రాయించారంటే వారు తమ మాతృ భాషను వదలుకోలేదన్నమాట. వలస పోయిన రెండోతరంలోనే తమ మాతృభాషను పోగొట్టుకొని అక్కడి భాష మాట్లాడేవారుగా మారిపోతారు. అలాగే విశ్వనాథ నాయకుని తర్వాత వారు తమ మాతృభాషకు దూరం అయిపోయి తమిళ భాష వారిగా మారిపోయి ఉండవలసింది. కాని అలా జరగలేదు. చివరి వరకు వారి రాజ్యం పోయే వరకు వారు తమ మాతృభాషను నిలుపుకున్నారు. అది మధుర నాయక రాజ్యవంశపు ప్రత్యేకత. వారు తెలుగు భాషలో శాసనాలు రాయించినా, సంతకాలు పెట్టినా అది తమిళ ప్రజలకు అయిష్టం కాలేదు. ఆనాడు తమ రాజు ఏ భాషవాడు, ఏ ప్రాంతం వాడు అనే భేదాన్ని భారతీయులు పాటించలేదు. ఎవరు రాజైతే వారినే కొలిచారు. అందువల్ల వారు అనేకమంది తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. ఆంధ్రదేశం నుండి కవులు దక్షిణాగ్రం అయిన మధురకు వెళ్లి ఆ రాజుల ఆదరాభిమానాలు పొంది కావ్యాలు రాశారు. గుంటూరు జిల్లాలోని గణపవరం నుండి వెంకటకవి, కుందుర్తి నుండి వెంకటాచలకవి అనే వారు మధుర వెళ్లి ముద్దలగిరి ఆదరాభిమానాలు పొందారు. వీరి వంశం విశ్వనాథ నాయకునితో ప్రారంభమైనప్పటికీ అతని కాలంలో తెలుగు కవులు పోషించబడిందీ లేనిదీ తెలియదు. తిరుమల రాయల కాలం నుండి తెలుగు కవుల ప్రస్తావనలు కనిపిస్తున్నాయి. ఇతని ఆస్థానంలో నీలకంఠ దీక్షితుడు అనే కవి ఉండేవారు. అతడు శివలీలార్ణవం, నీలకంఠ విజయం అనే కావ్యాలు రాశాడు.

లింగనమఖి కామేశ్వర కవి: తిరుమలరాయ కాలంలో ప్రసిద్ధి చెందిన తెలుగు కవి కామేశ్వర కవి. అతడు రచించిన సత్యభామా స్వాంతనం అనే గ్రంధంలో తనను తిరుమల రాయలు ఆదరించాడని చెప్పుకున్నాడు. ముక్త చత్ర, చామర, కలాచిక, కనక, అంధొలి (pearls, umbrella, chownifans, gold spitoons, gold palanquin)లు ఇచ్చి సత్కరించాడని కూడా రాసుకున్నాడు. ఈ విధంగా చెప్పుకున్నప్పటికీ కామేశ్వరకవి తిరుమల రాయల కాలంలో కావ్యం రచించినట్లుగానీ, అతనికి అంకితం ఇచ్చినట్లుగానీ ఏమీ బయల్పడలేదు. తిరుమల నాయకుని తర్వాత అతని కుమారుడు రెండవ ముత్తు వీరప్ప నాయకుడు కొన్ని మాసాలు రాజ్యం చేశాడు. అతనికి ఇద్దరు కుమారులు, చొక్కనాధుడు, ముద్దలగిరిలు.

తుపాకుల అనంతభూపాలుడు: ఇతడు ఈ కాలం నాటి మరొక కవి. ఇతడు విష్ణు పురాణం, భగవద్గీత, సుందరకాండలను రాశాడు.

ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్ర: ఇదే కాలంలో ఏకామ్రనాథుడను కవి కాసె సర్వప్ప సిద్ధేశ్వర చరిత్రను ఆధారంగా తీసుకొని ప్రతాపరుద్ర చరిత్ర అనే ద్విపద కావ్యాన్ని రచించాడు.

చొక్కనాధుని కాలం 1659-1898: చొక్కనాధుని కాలంలో కామేశ్వరకవి ధేనుమహాత్మ్యం అనే కావ్యం రాశాడు. ఈ కావ్యం గోమహాత్యాన్ని గురించి రాయబడింది. ఇది వచన కావ్యం. ఈ కావ్యంలో తెలుగులో వచన కావ్య రచన ప్రారంభమైంది. ఈ కావ్యం అచ్చుకాలేదు. దీని ప్రతి తంజావూరు గ్రంధాలయంలో ఉంది.

ముద్దలగిరి కాలం 1672-1678: చొక్కనాధుని సోదరుడు అయిన ముద్దలగిరికి కామేశ్వర కవి సత్యభామా స్వాంతనం అనే గ్రంధాన్ని క్రీ.శ.1674లో అంకితం చేశాడు. ఈ గ్రంధం సాహిత్యపరంగానే కాకుండా చారిత్రక దృష్ట్యా కూడా చాలా ప్రాముఖ్యమైనది. ఇందులో మధుర నాయకరాజుల వంశావళి ఇవ్వబడింది. ఈ వంశానికి మూలపురుషుడైన నాగమనాయకుని నుండి ముద్దలగిరికి ముద్దుఅలగాద్రి, ముద్దుఅలగిరి నాయుడు, ముత్తులింగనాయక అనే పేర్లు ఉన్నాయి. సత్యభామా స్వాంతనంలో కామేశ్వరకవి తనను తిరుమల నాయకుడు గౌరవించాడని చెప్పుకున్నాడు. ఈ గ్రంధాన్ని ముద్దలగిరికి అంకితం ఇచ్చి కామేశ్వర కవి ముద్దలగిరి పేరును శాశ్వతం చేశాడు. ఈ కావ్యం నాలుగు ఖండాలుగా రాశాడు. ఇది శృంగార ప్రధాన కావ్యం. శ్రీకృష్ణునిపై

సత్యభామ అలుక ఇందులోని ఇతివృత్తం.

కామేశ్వర కవి చరిత్ర: కామేశ్వర కవి గ్రంథాల నుంచి అతని చరిత్ర కొంత తెలుస్తోంది. అతని తండ్రి నాగన, తల్లి కామాక్షి. అతడు కాళహస్తీశ్వర జ్ఞాన ప్రసూనాంబల భక్తుడు. అతనికి తిరుకమ కవి అని కూడా పేరుంది. అతని గ్రంథంలో తన పేరు తిరుకమస్వామి అని చెప్పుకున్నాడు. అతని ఇంటిపేరు లింగనమఖి. ఇతడు గొప్ప కవియేగాక, గొప్ప సంగీత విద్వాంసుడు. వీణను చక్కగా వాయించేవాడు. వాదలు, వర్ణాలు, గీతాలు, స్వరాల మీద కూడా గ్రంథాలు రాశాడు. కాని అవి లభ్యం కాలేదు. ముద్దళగిరి కూడా సంగీత విద్వాంసుడట. కనుక వారిద్దరికీ మంచి బాంధవ్యం ఏర్పడింది. కందుకూరి వీరేశలింగం పంతులుగారు తన కవుల చరిత్రలో కామేశ్వర కవిని పేర్కొన్నారు (మూడవ భాగం పేజీ 13). కామేశ్వరకవి తిరుమలరాయలు, అతని కుమారుడు రెండవ ముత్తువీరప్ప నాయకుడు, అతని కుమారులు చొక్కనాథుడు, ముద్దళగిరిలకు సమకాలికుడు. సుమారు 25 సంవత్సరాలు వారి ఆస్థానంలో కవిగా ఉన్నాడు.

గణపవరపు వెంకటకవి: ముద్దళగిరి ఆదరించిన మరొక కవి గణపవరపు వెంకటకవి. ఇతడు గుంటూరు జిల్లాలోని గణపవరపు నివాసి. ఇతడు సుదూరంలో ఉన్న మధుర వెళ్లి ముద్దళగిరి చేత ఆదరింపబడ్డాడు. ఇతడు గొప్ప కవి. అనేక రకాల కావ్యాలు రాశాడు. వ్యాకరణ, ఛందస్సు గ్రంథాలు పద్యకావ్యాలు రాశాడు. అతడు ఆశువు, మధుర, చిత్ర, విస్తార అనే నాలుగు కవితలు చెప్పడంలో సిద్ధహస్తుడని పేరు ఉన్నది. ఈ నాలుగు రకాల కవిత్వాలను చతుర్విధ కవిత అని పిలిచేవారు. అతడు విద్యావతి దండకం అనే గొప్ప గ్రంథాన్ని రాశాడు. ముద్దళగిరి కోరికపై ఈ గ్రంథాన్ని రాశానని చెప్పుకున్నాడు. ఈ గ్రంథం అచ్చుకాలేదు. మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలో ఉంది. అతడు ప్రబంధరాజు వెంకటేశ్వర విజయ విలాసము, సర్వలక్షణ శిరోమణి అనే మరి రెండు గ్రంథాలు కూడా రాశాడు. ఇందులో మొదటిది ఛందోగ్రంథం. రెండవది పద్యకావ్యం. కందుకూరి వీరేశలింగం ఈ కవిని తన కవుల చరితలో కూచిమంచి తిమ్మకవి తర్వాత వాడని రాశారు. కాని అతని విద్యావతి దండకం వల్ల అతడు కూచిమంచి కవి కన్నా ముందువాడని తెలుస్తోంది.

పెద్దలగిరి విజయం: మద్రాసు గవర్నమెంటు ఓరియంటల్ లైబ్రరీలో కవి పేరులేని గ్రంథం ఉంది. దానిపేరు పెద్దలగిరి విజయం. అందు పెద్దలగిరి తంజావూరు కోటలోని నాలుగు ద్వారాలను జయించాడని రాసి ఉంది. ఇందులో చెప్పబడిన పెద్దలగిరి ముద్దళగిరియని, అతడు తంజావూరుపై దాడి చేసి విజయం సాధించాడని దానినే ఈ కావ్యంగా రాశారని భావించారు. ముద్దళగిరి కాలంలో తంజావూరును షాజీ కుమారుడు, శివాజీ సోదరుడు అయిన ఏకోజీ పాలిస్తున్నాడు. బహుశా ముద్దళగిరి తంజావూరిని ఏకోజీ నుంచి జయించడానికి ప్రయత్నించి ఉండవచ్చును.

విజయరంగ చొక్కనాథుని కాలం 1706-1732: మధుర నాయక రాజులందరిలో చివరి వాడైన విజయరంగ చొక్కనాథుడు. అనేక మంది తెలుగు కవులను పోషించాడు. అతని కాలంలో అనేక తెలుగు కావ్యాలు వెలువడ్డాయి. ఇతని కాలంలో అనేక శాసనాలు తెలుగులో రాయబడ్డాయి.

తెలుగు శాసనాలు-మంగమ్మాళ్ కాలం: విజయరంగ చొక్కనాథుడు చిన్నవాడైనందు వల్ల అతని నాయనమ్మ మంగమ్మ లేక మంగమ్మాళ్ క్రీ.శ.1689-1706 సంవత్సరాల మధ్య 16 సంవత్సరాలు పాలించింది. ఆమె 10 తెలుగు శాసనాలు రాయించింది. విజయరంగ చొక్కనాథుని కాలంలో వేయించిన తెలుగు శాసనాలలో ఒకటి దాన శాసనం. అందులో శ్రీధర వెంకటశాస్త్రి అనే అతనికి దిండిగల్లు వద్ద ఉన్న పరక్కాడి గ్రామంలో భూమిని దానం చేశాడు. దానం ఇచ్చింది తమిళదేశంలో అయినప్పటికీ శాసనం తెలుగులో రాయించి దాని మీద విజయరంగ చొక్కనాథ నాయునయ్యు రాలు అని సంతకం చేశాడు. బహుశ శ్రీధర వెంకటశాస్త్రి తెలుగువాడు అయి ఉండవచ్చును.

స్వయంగా కవి: విజయరంగ చొక్కనాథుడు స్వయంగా కవి. అతడు శ్రీరంగ మహాత్మ్యం, మాఘమహాత్మ్యం అనే రెండు గ్రంథాలు రాశాడు. శ్రీరంగమహాత్మ్యం వచన కావ్యం. ఇందు 10 అధ్యాయాలున్నాయి. శ్రీరంగనాథుని మహాత్మ్యం వర్ణింపబడింది. మాఘమహాత్మ్యం 15 అధ్యాయాలు గలది; ఇందులో మాఘమాసం మహాత్మ్యం వర్ణింపబడింది. ఇవి ప్రచురణకు నోచుకోలేదు.

ఇతని కాలం నాటి కవులు - సముఖము వెంకటకృష్ణప్పనాయుడు: సముఖము వెంకటకృష్ణప్పనాయుడు చొక్కనాథుని సామంతుడు. ఇతని తండ్రి మీనాక్షినాయుడు. వెంకటకృష్ణప్ప గొప్పకవి. ఇతడు నాలుగు కావ్యాలు

రాశాడు. జైమినీ భారతం - ఇది ఐదు అధ్యాయాలు కలిగిన పద్యకావ్యం. అహల్య సంక్రందనం. ఇది మూడు అధ్యాయాలు గల శృంగార ప్రబంధకావ్యం. అహల్య ఇంద్రుల కథ ఇందులో ఇతివృత్తం. రాధికాస్వాంతనం. ఇది ఒకే అధ్యాయం గల పద్యకావ్యం. రాధాకృష్ణుల ప్రణయం ఇందలి ఇతివృత్తం. తంజావూరు ప్రతాపసింహ మహారాజు ఆస్థానకవి ముద్దుపళని రాసిన రాధిక స్వాంతనానికి ఈ గ్రంథం ఆధారం. సారంగధర చరిత్ర. మూడు అధ్యాయాలు గల గద్యకావ్యం. సారంగధరుని చరిత్రను రాశాడు.

కుందుర్తి వెంకటాచల కవి: ఈ కవి మిత్రవింద పరిణయం, కార్తీక మహాత్మ్యం అనే రెండు ప్రబంధాలు రాశాడు. ఇందులో మొదటిది ఆరు ఆధ్యాయాలు కలిగిన కావ్యం. అందులో మిత్రవింద శ్రీకృష్ణుల వివాహం ఇతి వృత్తం. రెండవది మూడు అధ్యాయాలు గల కావ్యం. అందులో కార్తీక మహాత్మ్యం వర్ణింపబడింది. అతడు రామాయణ, భారత, భాగవతాలను కూడా వచన కావ్యాలుగా రాశాడట. కాని అవి లభ్యం కాలేదు. అలాగే కొన్ని నాటకాలు, మరికొన్ని కావ్యాలు కూడా రాశాడట, కాని అవి కూడా లభ్యం కాలేదు. ఇతని తాత గోవిందామాత్యుడు. అతడు వీరవెంకటపతి రాయలకు భారతి పరిణయం అనే గ్రంథాన్ని అంకితం చేసి సత్కారాలు పొందాడు. విజయరంగ చొక్కనాథుడు కూడా గౌరవించి బంగారు పల్లకీలను బహూకరించాడు. విజయరంగని కవికల్పక, కావ్యరసంగ అని ఈ కవులు కొనియాడారు.

వెలిదండ్ల అలఘూరి - వెలిదండ్ల వెంకటపతి: అలఘూరి చొక్కనాథుని కోరికపై సుధాంత పరిణయం అనే కావ్యం రాశాడు. సుధాంత శ్రీకృష్ణుల వివాహం ఇతివృత్తం. ఇందులో నాలుగు అధ్యాయాలున్నాయి. కాని ఇది ప్రచురించబడలేదు. ఈ కావ్యంలోని అవతారికలో వెలిదండ్ల వంశస్తులను గురించి వివరాలు ఇవ్వబడ్డాయి ఈ వంశానికి చెందిన వెలిదండ్ల వెంకటపతి రాధామాధవ సంవాదం అనే గ్రంథాన్ని రాశాడని పేర్కొనబడింది అలఘూరి తండ్రి వెలిదండ్ల పెదరాఘవ పాండ్యదేశాధిపతి అయిన విజయరంగ చొక్కనాథుని మంత్రి అని, అతనికి వెంకటరాఘవాచార్య అని పేరుందని వివరించాడు.

గద్దెపూడి ఎఱ్ఱరాజు: ఎఱ్ఱరాజు విజయరంగ చొక్కనాథుని సామంతుడు. అతడు పంట వంశానికి చెందిన కలువ కొలను గోత్రీకుడు. అతని తండ్రి కృష్ణభూపతి, తల్లి మీమాంబ. ఇతని గురువు రేపూరి అనంతుడు అనంతుడు గొప్ప తెలుగు కవి. అతడు గాధేయోపాఖ్యానం, శ్రీకృష్ణ మహాత్మ్యం అనే రెండు గ్రంథాలు రాశాడు ఎఱ్ఱరాజు యువజన హృద్య నిరంజనం అనే గ్రంథాన్ని రచించాడు. ఇందులో తార, చంద్రుల కథ ఇతి వృత్తం దీనిలో రెండు అధ్యాయాలు మాత్రమే లభించాయి. ఈ కవి తనకు విజయరంగ చొక్కనాథుడు రాజలాంఛనాలిచ్చి గౌరవించాడని చెప్పుకున్నాడు.

శేషం వెంకటపతి: ఈ కవి తారాశశాంక విజయమనే ప్రబంధాన్ని రాసి విజయరంగ చొక్కనాథుని మంత్రి అయిన వంగళ శీనయ్యకు అంకితమిచ్చాడు. ఇందులో 3 అధ్యాయాలున్నాయి. ఇది గొప్ప శృంగార కావ్యం.

వంగల శీనయ: ఇతడు కూడా కవి. సంగీత సాహిత్యాలలో నిష్ణాతుడు. ఇతడు రామానుజాచార్యుని జీవిత చరిత్రను ప్రబంధంగా రాశాడు. ఆ గ్రంథం పేరు రామానుజ చరిత్రమని వెంకటపతి కవి తన తారాశశాంక విజయంలో వర్ణించాడు. ఈ రెండు గ్రంథాలు ప్రచురించబడలేదు. యస్.వి.ఆర్.ఇన్‌స్టిట్యూట్, తిరుపతిలో ఉన్నాయి.

తిరుమల కవి: ఇతడు చిత్రకూట మహాత్మ్యం అనే యక్షగానాన్ని రాశాడు. ఇతడు తాను మధురలో నివసిస్తున్నానని తనను విజయరంగ చొక్కనాథుడు గౌరవించాడని తన గ్రంథంలో చెప్పుకున్నాడు. ఈ గ్రంథం ప్రచురించబడలేదు. ఇది తంజావూర్ లైబ్రరీలో ఉంది.

శ్యామరాయ కవి: ఇతడు అశ్వాలయన సూత్రీకుడు. వాశిష్ట గోత్రీకుడు. ఇతని తండ్రి కృష్ణయామాత్యుడు ఇతని సోదరుడు లక్ష్మీపతి. ఈ కవి, దర్శనాలలో గొప్ప విజ్ఞానినని, సంస్కృతం, తెలుగు భాషలలో గొప్ప కవినని, తాను అసహాయ కవినని, చతుశ్శాస్త్రాలలో పండితుడనని ఘనంగా వర్ణించుకున్నాడు. ఇతడు రామాయణాన్ని వచన కావ్యంగా రచించి తుమ్మలపాటి వంశస్థుడైన సుబ్బరాయశెట్టి అనే వైశ్యునికి అంకితం ఇచ్చాడు. ఈ వైశ్యుడు పరిశెట్ల గోత్రీకుడు. అతని తాత మన్నారుశెట్టి, తండ్రి వెంకట కామిశెట్టి, తల్లి కృష్ణమాంబ. ఇతడు విజయరంగ చొక్కనాథుని అభిమాని. ఈ రామాయణం పూర్తిగా లభించలేదు. అరణ్యకాండ మాత్రం లభించింది

శ్రీపతి రామభద్రకవి: ఇతడు హలాశ్యమహాత్మ్యం అనే వచన కావ్యాన్ని 5 ఆశ్వాసాలలో రాశాడు. దీనికి అదే పేరు గల సంస్కృత కావ్యం మూలాధారం. ఇతడు కాశ్యపగోత్రీకుడు, అశ్వాలయన సూత్రీకుడు. ఇతని తండ్రి

సూరయ్య, తల్లి గిరియమాంబ. ఇతడు విజయరంగ చొక్కనాధుని సమకాలికుడని సేతురామయ్య అనే పుదుక్కోట ఆస్థాన కవి రచనల వల్ల తెలుస్తోంది.

వెలగపూడి కృష్ణయామాత్యుడు: ఈ కవి కూడా విజయరంగ చొక్కనాధుని కాలానికి చెందినవాడు. ఇతడు భానుమద్విజయం అనే కావ్యం రాశాడు. అందులో ఇతని వంశాన్ని గురించి వివరాలున్నాయి. ఇతని తల్లి తిరుపతమ్మ, తండ్రి నరహరి. అతడు విజయరంగ చొక్కనాధుని వద్ద మంత్రిగా పని చేశాడు. విజయరంగ చొక్కనాధుని సేనాధిపతి బొప్పూడి సాంబయ్య ఈ కవికి మేనమామ. అంటే ఇతని తల్లి తిరుపతమ్మకు సోదరుడు. ఇతడు తన గ్రంథంలో తన మేనమామను గూర్చి ఘనంగా రాశాడు. సాంబయ్య 44 లక్షల మధుర సైన్యానికి అధిపతి అని, అతడు ఆర్కాటు నవాబు అయిన సాదుల్లాఖాన్‌కు, మైసూరు రాజ్యం మంత్రి అయిన నంద్యరాజుకు, తర్వాత ఆనందరావు పీష్వా అనే అతడికీ సమకాలికుడనీ, అతని వద్ద ఎల్లప్పుడు 60 వేల పదాతిదళం, 6 వేల గుఱ్ఱాలు సిద్ధంగా ఉండేవని, అతను తంజావూరు, జింజి, ఆర్కాటు, శ్రీరంగపట్నం తిరువాన్‌కూరు పాలకులను భయభ్రాంతులను చేశాడని, ఇతడంటే చొక్కనాధునకు అమిత గౌరవం అని వర్ణించాడు. అంతేగాక సాంబయ్య గొప్ప దానశీలి. అతడు వేద పండితులకు అనేక అగ్రహారాలిచ్చాడు. అనేక దేవాలయాలకు గోపురాలు, ప్రాకారాలు నిర్మించాడని, అనేక విద్యాసంస్థలు, సత్రాలు నిర్మించి అనేక చెరువులు తవ్వించి అనేక తోటలను నాటించాడని కూడా వివరించాడు. సాంబయ్య కుమారుడు గోవిందరాయ అని, అతని పేరు కూడా పేర్కొన్నాడు.

భానుమద్విజయం 5 అధ్యాయాలు కలిగిన ప్రబంధం. ఇందులో భానుమంత అనే ఒక బ్రాహ్మణ యువకుడు ఉజ్జయినీ రాజకుమార్తె పద్మావతి అనే కన్యను వివాహమాడే కథను ఇతివృత్తంగా తీసుకున్నాడు. ఇది ఒక సాహస గాథ. ఈ గ్రంథం అచ్చుకాలేదు. ఈ కవి ఇంకా మాలినీమాధవీయం, గౌలికశాస్త్ర, వేదాంతసార సంగ్రహం, యోగశాస్త్రం అనే మరో నాలుగు కావ్యాలు కూడా రాశాడు. వీటిలో యోగశాస్త్రంలో హఠరాజ, అమనస్క, తారక, యోగాలను వివరించాడు. ఇది చాతుర్విధ, కాండ, పద్య శతకం.

ఈ విధంగా విజయరంగ చొక్కనాధుని కాలంలో అనేక మంది తెలుగు కవులు తెలుగు కావ్యాలు రచించి తమిళ దేశంలో తెలుగు భాషకు మంచి ప్రాచుర్యం తెచ్చారు. ఈ కవులందరినీ పోషించి, తంజావూరునేలిన రఘునాథ రాయలు విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలకు ఏ మాత్రం తీసిపోదని కీర్తి పొందాడు. ఇతని కీర్తి అనేక చాటు పద్యాలుగా రాయబడింది.

కవుల పేర్లు తెలియని కావ్యాలు: మధుర నాయకుల కాలం నాటి మరికొన్ని కావ్యాలు కూడా లభించాయి. కాని వాటిని రచించిన కవుల పేర్లు తెలియలేదు. అలాంటివి -

1. **రాయవాచకం:** ఈ కావ్యం శ్రీకృష్ణదేవరాయల విజయాలను గురించి వర్ణిస్తోంది. ఈ కావ్యాన్ని స్థానాపతి విశ్వనాధనాయక అనే అతడు రచించాడు. ఇతడు మధురనాయక రాజ్యానికి మూల పురుషుడైన విశ్వనాథ నాయకుడని భావింపబడింది. కొందరు ఆ పేరు కలిగిన మరొక వ్యక్తి రచించాడని కూడా భావిస్తారు. కొందరు ఇతడు రెండవ కృష్ణప్పనాయకుని తమ్ముడు విశ్వనాథ స్థానాపతి అని కూడా అంటారు. ఈ గ్రంథం క్రీ.శ.1564వ సంవత్సరానికి ముందు రచించబడిందని నిర్ణయించారు. కృష్ణదేవరాయల విజయాలను ఎంతో చక్కగా వర్ణింపబడ్డాయి. ఇతడు విశ్వనాథ నాయకుడని కృష్ణదేవరాయల సేనాధిపతిగా పని చేసిన వాడు కనుక రాయల విజయాలను కళ్లారా చూసినవాడు కనుక, అతడు ఈ గ్రంథకర్త అని ఎక్కువ మంది భావిస్తారు. ప్రజలకు తేటపడగా శృజయుంచితి కృష్ణరాయశేఖర చరిత అని చెప్పుకొన్నాడు.
2. **మధుర మంగపుంస్క లీలావిలాసం:** ఇది ఒక వచన కావ్యం. ఈ కావ్యాన్ని రచించిన కవి పేరు తెలియదు. ఈ కావ్యంలో మధురమంగ, అనెగొంది చినవెంగమరాయలు, తంజావూరు విజయ రాఘవరాయలు, వెంకోజీ రాజ్యారామ్, చొక్కనాథ నాయుడు మొదలైన పాత్రలున్నాయి. కాని ఇందులో కొంత అశ్లీలత ఉంది. ఈ గ్రంథంలో చెప్పబడిన మధురమంగ చొక్కనాధుని నాయనమ్మ మంగమ్మాళ్‌గా భావించారు. ఆమె గొప్ప నాట్యకత్తె, సంగీత విద్వాంసురాలని, తంజావూరు నేలిన ఏ కోజీ గొప్పగా గౌరవించేవాడని తెలుస్తోంది.
3. **నరసభోజనులి:** ఈ కావ్యం రచించిన కవి పేరు కూడా తెలియదు. ఈ కావ్యంలో దళవాయి నరసప్ప అనే అతని గుణగణాలు, విజయాలు, పరాక్రమం వర్ణింపబడింది. నరసప్ప మంగమ్మ వద్ద సేనాధిపతిగా, మంత్రిగా పని చేశాడు. అతడు క్రీ.శ.1702వ సంవత్సరంలో మార్వయుద్ధంలో మరణించాడు. ఇది కూడా

అచ్చు కాలేదు. దీని ప్రతి తంజావూరు లైబ్రరీలో ఉంది.

4. **బంగారు తిమ్మరాజు కథ:** ఈ కావ్యపు రచయిత పేరు కూడా తియదు. ఇందులో బంగారు తిమ్మరాజు అనే వ్యక్తి కథ రాయబడింది. ఇది మధురను ఏలిన విజయరంగ చొక్కనాధుని భార్య మీనాక్షి రాణి కాలంలో అంటే క్రీ.శ.1532-1736 సంవత్సరాల మధ్య రాయబడిందని భావించారు.
5. **పాండ్యరాజ్య చరిత్ర:** ఇది ఒక పద్య కావ్యం. ఇందులో మధుర నాయక రాజుల చరిత్ర రాయబడింది. ఇది కూడా అచ్చు కాలేదు. ఇది మద్రాసు అదయారు లైబ్రరీలో ఉంది. ఈ 5 గ్రంథాలు విజయరంగ చొక్కనాధుని కాలంలోనే రచించబడినట్లు భావించవచ్చును.
6. **తంజావూరాంధ్ర చరిత్ర:** ఇందులో నాగమనాయకుడు శ్రీకృష్ణ దేవరాయలపై తిరుగుబాటు చేయడం, రాయలు విశ్వనాధ నాయకుని అతనిపైకి పంపడం, విశ్వనాధ నాయకుడు తండ్రిని ఓడించి బందీగా తేవడం ఇతివృత్తం.

తెలుగు శాసనాలు: మంగమ్మ రాణి క్రీ.శ.1707వ సంవత్సరంలో సీతారామశాస్త్రి అనే అతనికి దిండికంటి సీమలో కొంత భూమిని దానం చేసి తెలుగులో శాసనం రాయించి ఇచ్చింది. విజయరంగ చొక్కనాధుడు క్రీ.శ.1710వ సంవత్సరంలో జంబుకేశ్వరంలోని గజార్ణయక్షేత్రంలో ఉన్న శంకరాచార్య మఠానికి భూమిని దానం చేసి తెలుగులో శాసనం రాయించాడు. శౌంరి గున్నయ్య అనే మరొక తెలుగు బ్రాహ్మణునికి ఒక గ్రామాన్ని దానం చేసి తెలుగులో శాసనం రాయించాడు. శ్రీరంగం దేవాలయపు మూడవ ప్రాకారపు మండపం దూలం మీద అక్కడ విజయరంగ చొక్కానాధుని భక్తుడు. ఆ దేవాలయపు రెండవ ప్రాకారంలో తన విగ్రహాన్ని తన భార్య విగ్రహాన్ని దంతంతో చేయించి ప్రతిష్ఠించాడు. ముద్దమ్మగారు రామానుజ కూటానికి రెండు గ్రామాలు దానం చేసి అక్కడ రాతిపై తెలుగు శాసనం చెక్కించి ప్రతిష్ఠించింది. ఈమె విజయరంగ చొక్కానాధుని తల్లి. ఇంకా వారి సేనాధిపతులు, మంత్రులు కూడా అనేక తెలుగు శాసనాలు రాయించారు. ఈ విధంగా మధుర నాయకులు వారి కాలంలో తమిళదేశంలో తెలుగు శాసనాలు వేయించి తెలుగు భాషకు గొప్ప స్థానాన్ని కలిగించారు.

పుదుక్కోట పాలెగాండ్ర తెలుగు భాషా సేవ: పుదుక్కోట నేలిన రఘునాధ తొండమాన్ పార్వతీ పరిణయం అనే తెలుగు ప్రబంధాన్ని రచించాడు. ఇతని ఆస్థానంలో నుదురుపాటి కవి వంశస్థులు ఉండేవారు. వారిలో నుదురుపాటి వెంకన్న ఆంధ్ర భాషార్ణవం అనే పేరుతో తెలుగు పదకోశాన్ని తయారు చేశాడు. ఇది తెలుగు భాషలో ప్రప్రధమ పదకోశం. ఇంకా ఇతడు మల్లు పురాణం, రాజవంశ ప్రశస్తి, రఘునాధీయం అనే కావ్యాలు కూడా రాశాడు. రాయరఘునాధ నాయకుడు అనే కవి పార్వతీ పరిణయాన్ని రాశాడు. ఇంకా చిదంబర కవి, గొన సూర్యనారాయణ అనే కవులు కూడా ఉండేవారు.

మైసూరు వడయార్ల తెలుగు భాషా సేవ: మైసూరు ప్రభువైన చిక్కదేవరాయల వద్ద దళవాయిగా పని చేసిన కళువై వీరరాజు (క్రీ.శ.1730) మహాభారతాన్ని తెలుగు వచనంలో రచించాడు. ఈ కాలంలో తెలుగువారు ఎవరి ఆస్థానంలో ఉన్నా తెలుగు కావ్యాలు రచించి తెలుగు భాషాసాహిత్యాలకు సేవ చేశారని భావింపవచ్చును. వీరరాజు కుమారుడు నంజరాజు కూడా కవి. అతడు హాలస్య మహాత్మ్యం అనే తెలుగు కావ్యాన్ని రాశాడు. అతడు కన్నడంలో కూడా కవి. కన్నడంలో వచన భారతాన్ని రాశాడు. ఇంకా కాశీమహిమార్థ దర్పణం అనే గద్యకావ్యం కూడా రాశాడు.

తంజావూరు నేలిన మహారాష్ట్రుల తెలుగు భాషాపోషణ: తంజావూరు తెలుగు నాయకుల అనంతరం బీజపూర్ తరపున వారి మరాఠా సేనాధిపతి శివాజీ తండ్రి అయిన షాజీ తంజావూర్‌ను జయించాడు. అతని తర్వాత అతని కుమారుడు శివాజీకి సవతి సోదరుడైన ఏకోజీ తంజావూరును పాలించాడు. అతని తర్వాత సెహజీ (క్రీ.శ.1684-1712) పాలించాడు. సెహజీ తెలుగుభాషాభిమాని అయ్యాడు. అతడు తెలుగులో 20 యక్షగానాలు రచించాడు. వానిలో శివ, విష్ణు, పల్లకీ సేవ వంటివి నాలుగు, పార్వతీ కళ్యాణం వంటివి ఆరు, విలాస నాటకాలు 4, ఇతర రకాలు 6 ఉన్నాయి. ఈ యక్షగానాలలో దరువులు, చూర్ణికాలు, పద్యాలు, సంభాషణలు, వచనం సూత్రధారి ప్రస్తావనలు, కైవారులు, తోడియ మంగళం వంటివి ఉన్నాయి. ఇందులో తోడియ మంగళం అన్నమాచార్యుని కీర్తనలను పోలి ఉంది. అతడి ఆస్థానంలో ముద్దుపళని అనే కవయిత్రి ఉండేది. ఆమె అతని ప్రియురాలు కూడా. ఆమె రాధికాస్వాంతనం అనే కావ్యాన్ని రచించింది. ఈ కావ్యంలో ఆమె పచ్చి శృంగారాన్ని వర్ణించింది. ఈ గ్రంథంలో వెంకటకృష్ణప్ప నాయకుని రాధికాస్వాంతనంలోని కొన్ని పద్యాలు ఉన్నాయని అంటారు

త్యాగరాజు క్రీ.శ.1764-1846: తంజావూరును రెండవ శరభోజ (క్రీ.శ.1798-1833) పరిపాలించే కాలంలో త్యాగరాజు ఉండేవాడు. ఇతడు కాకర్ల వంశానికి చెందినవాడు. ఇతని గురువు శొంరి వెంకటరమణయ్య, ఇతడు గొప్ప రామభక్తుడు. భక్తిపారవశ్యంలో శ్రీరామునిపై వేయి కృతులకు పైగా చెప్పాడు. త్యాగరాజకృతులు కర్ణాటక సంగీతానికి మూలాధారాలై నేటికీ కొనసాగుతున్నాయి. ఇతడు భక్తివిజయం, నౌకా విజయం అనే రెండు యక్షగానాలు రాశాడు. అతడు ప్రహ్లాద విజయాన్ని 5 అంకాల యక్షగానంగా రాశాడు. శరభోజి తర్వాత రాజ్యం చేసిన రెండవ శివాజీ (క్రీ.శ.1883-1855) కూడా కవి. అతడు అన్నపూర్ణ పరిణయం అనే తెలుగు యక్షగానం రచించాడు. మరాఠీ రాజులు హిందీ, మరాఠీ భాషలలో కూడా యక్షగానాలు రాశారు. అంతేగాక పంచభాషా విలాస నాటకం అనే యక్షగానం సంస్కృతం, తమిళం, తెలుగు, హిందీ, మరాఠీ 5 భాషలలో రాయబడింది. ఆనాడు భాషాభేదాలు ఉండేవి కావు. శివాజీ గురువైన సమర్థ రామదాసు రాసిన తాండవనృత్య కచేరీ అనే మరాఠీ కృతిని, షెహజీ రాసిన విష్ణు పల్లకీ సేవలోని గణేశస్తుతిలను తెలుగువారైన కూచిపూడి భాగవతులు ప్రదర్శన చేసేవారు. నేటికీ అది కూచిపూడి నాట్యంలో కొనసాగుతుంది.

ఇతర కావ్యాలు: జింజి దుర్గాధిపతి తుపాకుల అనంతభూపాలుడు (1730) విష్ణుపురాణం, భగవద్గీతలకు దృశ్య కావ్యాలుగా రాశాడు. శివసముద్రం రాజు బెంగుళూరు నిర్మాత అయిన పెదకెంపరాయుడు (క్రీ శ.1513-1569) గంగా గౌరీ విలాసం అనే యక్షగానాన్ని రాశాడు. కోలారు మండల పాలవేకరి కదరీపతి రాజు శుకసప్తతి అనే కావ్యం రాశాడు. ఇది తెలుగు కావ్యాలలో అత్యుత్తమ కావ్యంగా ప్రసిద్ధి చెందింది. అయ్యలరాజు నారాయణామాత్యుడు హంసవింశతి అనే విజ్ఞాన సర్వస్వం, అనే కథా కావ్యాన్ని రాశాడు. అన్నమాచార్యుని తర్వాత చెప్పుకోదగిన వాగ్గేయకారుడు శివనారాయణతీర్థులు (క్రీ.శ.1580-1680). అతడు సంగీతశాస్త్రంలోనే గాక గొప్ప యోగశాస్త్ర పండితుడు. అతడు సంస్కృతంలో కృష్ణలీలా తరంగిణి అనే 12 అంకాల సంగీత రూపకాన్ని రాశాడు. తెలుగుభాషలో పారిజాతాపహరణం అనే యక్షగానాన్ని రాశాడు. ఇవన్నీ విజయనగర యుగానికి చెందినవి.

విజయనగర యుగంలో కన్నడ సాహిత్యం

విజయనగర సామ్రాజ్యం పూర్తిగా కన్నడ సామ్రాజ్యం. కదంబులు, హొయసాలులు పాలించిన ప్రాంతమే విజయనగర సామ్రాజ్యానికి కూడా మూలస్థానం, జైనులు, లింగాయతులు, శ్రీవైష్ణవులకు ఈ ప్రాంతమే నిలయం. ఈ మతాచార్యులు అనేక రూపాలలో, అనేక విధాలుగా కన్నడ సాహిత్యాన్ని అభివృద్ధి చేశారు. బసవేశ్వరుని, అల్లంప్రభు అక్కమహాదేవి, దేవర దిసిమయ్య అభిగార చౌడయ్యల వచనాలు కర్ణాటక సామాన్య ప్రజలను ఉత్తేజితులను చేశాయి. కర్ణాటక సాహిత్యం అభివృద్ధి కావడానికి అక్కడ వచ్చిన మతోద్యమాలు కారణం అని చెప్పవచ్చును. జైనులు, వీరశైవులు తమ మతాలను ప్రచారం చేసుకోడానికి అసంఖ్యాక గ్రంథాలు కన్నడ సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. మధ్వాచార్యుడు, రామానుజాచార్యుడు, వీరశైవులు భక్తితత్వంతో అనేక గ్రంథాలు రాశారు. వీరశైవులు 63 మంది తమిళ నాయనారులపై గ్రంథాలు రాయగా, మాధ్వులు, శ్రీవైష్ణవులు విష్ణువు, శ్రీకృష్ణుని మీద గ్రంథాలు రాశారు. వీరందరికంటే ముందు జైనులు తమ తీర్థంకరులపై అనేక గ్రంథాలు కన్నడంలో రాశారు. ముఖ్యంగా జైనులు మాధ్వవైష్ణవులు, లింగాయతులు సంస్కృతం కన్నడం భాషలలో రాయగా, అద్వైతులు సంస్కృతం, తెలుగులో రాశారు. విశిష్టాద్వైతులు తమిళం, సంస్కృతాలలో రాశారు. అందువల్ల విజయనగర కాలంలో తెలుగు, కన్నడ, తమిళ సంస్కృత భాషలలో అసంఖ్యాక గ్రంథాలు వెలువడ్డాయి. ఈ భాషా సాహిత్యాల అభివృద్ధి అంతా ఈ మతాచార్యుల కృషి ఫలితమేనని చెప్పవచ్చును.

కన్నడ సాహిత్యం విజయనగరయుగంలో అభివృద్ధి చెందినంతగా మరేయుగంలో అభివృద్ధి చెందలేదు కారణమేమిటంటే విజయనగర సామ్రాజ్యం కర్ణాటక సామ్రాజ్యం, కర్ణాటక ప్రాంతమే విజయనగర సామ్రాజ్యానికి స్థావరం. కనుక అక్కడ వేదాంతం, సాహిత్యం, పద్యసాహిత్యం, సాహిత్య విమర్శలు, విజ్ఞాన శాస్త్రాలు, గణితం, వైద్యశాస్త్రాలు అన్ని రకాల గ్రంథాలు రాయబడ్డాయి. కన్నడ భాషలో దేశీసాహిత్యాన్ని ప్రారంభించినవారు జైనులు తొమ్మిదవ శతాబ్దంలో నృపతుంగుని కాలంలో జైనులు కన్నడదేశీ సాహిత్యం ప్రారంభించారు. 12వ శతాబ్దం వరకు వారి సాహిత్యం ధారావాహికంగా వెలువడింది. బసవేశ్వరుని రాకతో వీరశైవ సాహిత్యం వచ్చింది వీరశైవులు వచనాలు ప్రారంభించారు. త్రిపది సంగత్య, రగళ అనే సాహిత్య ప్రక్రియలు ప్రారంభించి సాధారణ ప్రజలను ఆకర్షించారు. దాంతో వీరశైవ సాహిత్యం రాకతో జైన సాహిత్యం తగ్గుముఖం పట్టింది. జైనుల వైరాగ్యతత్వాన్ని వీరశైవుల భక్తితత్వం తోసి వేసింది.

తత్వశాస్త్రాలు లేక వేదాంత గ్రంథాలు: విజయనగర యుగంలో వైదికమతస్థులు వేదాంత గ్రంథాలు అంతగా రాయలేదు. జైనులు, లింగాయతులు వారి వారి తత్వాలను గురించి అనేక తత్వశాస్త్రాలు రాశారు.

జైన గ్రంథాలు: విజయనగర యుగంలో బాహుబలి క్రీ.శ.1252, పద్మనాభ క్రీ.శ.1385, మధుర మాధవుడు, భాస్కరుడు, సాళ్వుడు, దొడ్డయ, ఐతవర్మ క్రీ.శ.1400, చంద్రకీర్తి క్రీ.శ.1400, కళ్యాణకీర్తి క్రీ.శ.1448, విజయన్న క్రీ.శ.1448, మంగరస క్రీ.శ.1508, రత్నాకరవర్ణి క్రీ.శ.1557, నెమ్మన క్రీ.శ.1559, బొమ్మనరుసుడు, భాస్కరుడు, కోటేశ్వరుడు ప్రసిద్ధి చెందిన జైన కవులు.

బాహుబలి: ఇతడు ధర్మనాథపురాణం అనే గ్రంథం రాశాడు. ధర్మనాధుడు 15వ తీర్థంకరుడు. ఇంకా ఇతడు వృత్తి విలాసం, ధర్మపరీక్ష, శాస్త్రసారం అనే గ్రంథాలు కూడా రాశాడు.

పద్మనాభ: ఇతడు పద్మనాభ పురాణం రాశాడు.

ఐతవర్మ: ఇతడు రత్నకరందర అనే గ్రంథాన్ని రాశాడు. ఇది సంస్కృతంలో సామంతభద్రుడు రాసిన రత్నకరందకు అనువాదం. ఇందులో జైన త్రిరత్నాలు వివరింపబడ్డాయి.

చంద్రకీర్తి: ఇతడు పరమసాగర అనే గ్రంథాన్ని రాశాడు.

కళ్యాణకీర్తి: ఇతడు జ్ఞానచంద్రాభ్యుదయం అనే గ్రంథాన్ని రాశాడు.

విజయన్న: ఇతడు ద్వాదశనుపేక్ష అనే గ్రంథాన్ని రాశాడు.

మంగరస: ఇతడు నేమనాథ పురాణం రాశాడు.

రత్నాకరవర్ణి: ఇతడు మొదటి తీర్థంకరుడైన ఆది నాథ లేక వృషభనాథ తీర్థంకరుని కుమారుడైన భరతుని కథను 10వేల పద్యాలతో భరతేశ వైభవం అనే పేరుతో ఉత్తమ కన్నడ కావ్యంగా రాశాడు.

నెమ్మన లేక నేమన్న: ఇతడు జ్ఞానభాస్కర చరిత్ర అనే గ్రంథం రాశాడు. మరొక ప్రకృతి శాస్త్ర గ్రంథం కూడా రచించాడు.

బొమ్మరసు: ఇతడు సౌందర్య పురాణం అనే గ్రంథాన్ని రాశాడు.

కోటేశ్వరుడు: ఇతడు కూడా కొన్ని జైన గ్రంథాలు రాశాడు.

మధురమాధవుడు: ఇతడు రెండవ హరిహరరాయల సమకాలికుడు. ఇతడు 15వ తీర్థంకరుడైన ధర్మనాథుని జీవితాన్ని ధర్మనాథ పురాణం అనే కావ్యంగా రాశాడు. ఇతడు గోమఠ స్తుతికర్త అంటే శ్రావణ బెళగొళలోని గోమఠేశ్వరుని కీర్తించే గ్రంథం.

భాస్కరుడు: ఇతడు మొదటి దేవరాయల కాలం నాటి వాడు. జీవంధరరాజు కావ్యం అనే గ్రంథం రాశాడు.

పొన్నుడు: ఇతడు జైన భారతాన్ని రాశాడు. ఇతడు సాళువ మల్లుని ఆస్థాన కవి.

అన్నమయ్య: తెలుగులో సంకీర్తనయుగం 12వ శతాబ్దంలో కృష్ణమాచార్యుని సింహగిరి వచనాలతో ప్రారంభమైందని అంటారు. ఆ తర్వాత 15వ శతాబ్దంలో అన్నమాచార్యుడు దానిని అద్భుత ప్రక్రియగా మార్చాడు. అతడు రాసిన 32000 పదాలలో "జో అచ్యుతానంద జోజో ముకుందా, లాలి పరమానంద రామగోవిందా" అనే కీర్తన తెలుగు తల్లుల నోళ్లలో శతాబ్దాల తరబడి నాట్యం చేసింది.

శాంతికీర్తి: ఇతడు శాంత్యనాథ చరిత్రను రాశాడు.

దొడ్డయ: ఇతడు చంద్రప్రభాజిన అనే గ్రంథం రాశాడు.

మూడవ మంగరసుడు: ఇతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు. జయనృప అనే కావ్యాన్ని రాశాడు.

సంజుండ కవి: ఇతడు కుమార రాముని చరిత్ర రాశాడు.

సకల రాజు: ఇతడు చినతిరుమలునికి కాలజ్ఞానం రాశాడు.

లింగనమంత్రి కబ్బిగర: ఇతడు కైపిడి అనే నిఘంటువును తయారు చేశాడు.

వీరశైవ గ్రంథాలు: జైన కవుల లాగే ఆనాటి శైవకవులు కూడా అనేక కన్నడ కావ్యాలు రాశారు. కర్ణాటకదేశంలో వీరబసవుడు సాగించిన వీరశైవ ఉద్యమం వల్ల వీరశైవ మతానికి కర్ణాటకదేశం ఆయువుపట్టు అయింది. కనుక వీరశైవమతస్థులు కన్నడభాషలో తమ మతసిద్ధాంతాలను బలపరుస్తూ అనేక గ్రంథాలు రాశారు. వీరశైవ కవులు 66 మంది నాయనార్ల మీద పురాణాలు రాశారు. మరికొందరు వీరశైవ తత్వాలను, వచనాలను కూడా రాశారు. కన్నడభాషలో వీరశైవకవులు రచించిన గ్రంథాలు నాలుగు వర్గాలుగా విభజించారు. అవి పురాతన, మధ్య, నవీన, నాల్గవ తరగతి గ్రంథాలు వర్గీకరించారు. ఈ వర్గీకరణ వారు రాసిన నాయనార్ల జీవిత చరిత్రల మీద ఆధారపడి వర్గీకరించారు. పురాతన నాయనార్ల చరిత్రను పురాతన పురాణాలని, తర్వాత నాయనార్ల చరిత్రలను మధ్య, నవీనపురాణాలని వివరించారు. మిగిలిన గ్రంథాలు 4వ తరగతికి చెందుతాయి.

పురాతన పురాణాలు-రాఘవంక క్రీ.శ.1165: ఇతడు హరిశ్చంద్రకావ్యం, సోమనాథ చరిత్ర, సిద్ధరామ పురాణం అనే గ్రంథాలు రాశాడు.

బొమ్మరస క్రీ.శ.1430: ఇతడు సౌందర్య పురాణం అనే గ్రంథం రాశాడు. ఈ ఇద్దరు కవులు రాసిన గ్రంథాలను పురాతన పురాణాలని వర్గీకరించారు. కారణమేమిటంటే వారు తమ కావ్యాలలో తీసుకున్న ఇతివృత్తాలు, ప్రాచీన నాయనార్ల చరిత్రకు చెందని గాథలు.

మధ్యకాలపు పురాణాలు: భీమకవి క్రీ.శ.1369, పద్మంక కవి క్రీ.శ.1385, లక్కన్నదండేశ క్రీ.శ.1428, చామరసకవి క్రీ.శ.1430, జక్కనాచార్యుడు, గురుబసవడు, విరూపాక్షుడు, విరక్త తొంటదయ్య క్రీ.శ.1560, గుబ్బి మల్లనాచార్యుడు మొదలైన కవులు రాసిన గ్రంథాలను మధ్యకాలపు పురాణాలు అని వర్గీకరించారు.

1. **భీమకవి:** ఇతడు హరిహరబుక్కరాయల కాలానికి చెందినవాడు. తెలుగు, కన్నడ భాషలలో అసమాన ప్రతిభను చాటాడు. ఇతడు బసవపురాణం అనే కావ్యం రాశాడు. ఇది తెలుగులో పాల్కురికి సోమనాథుడు రాసిన బసవపురాణానికి కన్నడ అనువాదం.
2. **పద్మంక కవి:** ఇతడు పద్మనాభ పురాణం రాశాడు.
3. **లక్కన్నదండేశ :** ఈ కవి శివతత్వ చింతామణి అనే గ్రంథం రాశాడు.
4. **చామరసుడు:** ఇతడు వీరశైవుడైన అల్లమప్రభు అనే అతని జీవితాన్ని ప్రభులింగలీల అనే ఉత్తమకావ్యంగా రాశాడు. ఇది తెలుగుభాషలోకి అనువాదం చేయబడింది. ఈ కవి రెండవ దేవరాయల సమకాలికుడు.

రెండవ దేవరాయలు చామరసుని ఘనంగా సత్కరించాడు. అందువల్ల కొందరు రెండవ దేవరాయలు కూడా జైనమతాన్ని పాటించాడని భావించారు. ఇతని రచన వీరశైవమతానికి బలాన్ని చేకూర్చింది. ఈ గ్రంథం తమిళభాషలోకి కూడా అనువదింపబడింది.

5. **గురు బసవడు:** ఇతడు ఆనాటి గొప్ప కవి. 7 కావ్యాలు రాశాడు.
6. **గుబ్బి మల్లనాచార్యుడు:** ఇతడు వీరశైవామృతం, శివభక్త పురాణం, బసవచింతారత్నం అనే గ్రంథాలు రాశాడు. ఇందులో బసవ చింతారత్నపిళ్ళై నాయనారు రాసిన జ్ఞానసంబంధి కావ్యానికి అనువాదం. ఇతడు పంచాక్షరీ మంత్ర మహిమను తన బసవచింతారత్నం అనే కావ్యంలో వర్ణించాడు. ఇతడు వీరశైవామృతం 7 వేల పద్యాలతో రాయబడింది.
7. **విరక్త తొంటరయ్య:** ఇతడు సిద్దేశ్వర పురాణాన్ని రాశాడు. ఇతడు మూడవ విరూపాక్షరాయల సమకాలికుడు.
8. **విరూపాక్ష పండితుడు:** ఇతడు క్రీ.శ.1584వ సంవత్సరంలో చెన్నబసవ పురాణాన్ని కావ్యంగా రాశాడు ఈ కవులందరూ రాసిన గ్రంథాలను మధ్యకాలపు శైవపురాణాలని వర్గీకరించారు.

నవీన పురాణాలు - నీలకంఠ శివాచార్య క్రీ.శ.1485: ఇతడు ఆరాధ్య చరిత్ర అనే గ్రంథం రాశాడు ఇందు మల్లికార్జున పండితారాధ్యుని చరిత్ర ఉంది.

చెన్నబసవంక క్రీ.శ.1550: ఇతడు మాధవీ అక్కపురాణం అనే కావ్యం రాశాడు. ఈ ఇద్దరు కవులు రాసిన కావ్యాలను నవీనప్పురాణాలని వర్గీకరించారు.

4వ తరగతి కావ్యాలు - కుమార చెన్నబసవ క్రీ.శ.1550: ఇతడు బసవ పురాణ కథలు రాశాడు

ఆధార్యసంజుండ క్రీ.శ.1550: ఇతడు కూడా బసవ పురాణ కథలు రాశాడు.

అభినవాది విద్యానంద క్రీ.శ.1553: ఇతడు కావ్యసారం అనే గ్రంథాన్ని రాశాడు. కృష్ణదేవరాయలు ఇతనికి రత్నాభిషేకం చేశాడు. ఈ కవులు రాసిన గ్రంథాలను 4 వర్గ కావ్యాలుగా వర్గీకరించారు.

వచనాలు: ఈ యుగంలో కొందరు వచనాలు కూడా రాశారు. వీరశైవకవి అయిన టెంటడ సిద్ధలింగ (క్రీ.శ.1480), గుమ్మలూరి సిద్ధలింగ (క్రీ.శ.1480) వచనాలు రాశారు. కాని వీరి వచనాలు అంతకు ముందు వారైన బసవేశ్వరుడు, చెన్న బసవేశ్వరుడు, అల్లంప్రభు, అక్కమహాదేవి, దేవర దశిమయ్యలు రాసిన గ్రంథాలకు సాటిరావు. తంతాడ సిద్ధేశ్వరుడు షట్స్థల జ్ఞానసారామృతం అనే కావ్యాన్ని రచించాడు. అందులో 700 వచనాలున్నాయి. ఆనాడు ఇతడు గొప్ప ప్రజాదరణ పొందిన కవి.

మరికొందరు కవులు - మహాలింగదేవుడు: ఇతడు ఏకోత్తరసాస్థల, ప్రభుదేవస్థల, జ్ఞాన చరిత్రవచన దలికె అనే గ్రంథాలు రాశాడు.

లక్షణ దండనాథుడు: ఇతడు శివతత్వ చింతామణి అనే తత్వశాస్త్ర గ్రంథాన్ని రాశాడు.

జక్కనాచార్యుడు: ఇతడు నూరుండస్థల అనే గ్రంథాన్ని రాశాడు. ఇది 101 విషయాలపై రచన. ఇతడు అనేక మంది కవులను కూడా పోషించాడు. వారిలో కుమార బంకనాథుడు, మహా లింగదేవుడు ముఖ్యులు.

అమృతవర్మ: ఇతడు రత్నాకర దండకం అనే గ్రంథాన్ని రాశాడు.

వీరభద్రరాజు: ఇతడు వీరభద్ర విజయం అనే కావ్యం రాశాడు.

గురులింగవిభుడు: ఇతడు భిక్షాటన చరిత్ర రాశాడు.

మల్లనాచార్యుడు: ఇతడు భావచింతారత్న, సత్యేంద్రచోళ కథ అనే రెండు గ్రంథాలు రాశాడు.

సదాశివయోగి: ఇతడు రాజేంద్ర విజయం అనే కావ్యం రాశాడు.

ఈ గ్రంథాలన్నీ శైవ, జైన కవులు తమ తమ తత్వసాంప్రదాయాలను తెలిపే వాఙ్మయ పద్ధతులతో రచించారు.

కల్లరస: ఇతడు మల్లికార్జున విజయం అనే గ్రంథం రాశాడు. ఇది వాత్స్యాయనుని కామసూత్రాలను అనుసరించి రాయబడిన గ్రంథం. ఇది కన్నడ దేశంలో చాలా ప్రసిద్ధి చెందిన శృంగార గ్రంథం.

రెండవ హరిహరరాయలు: రెండవ హరిహరరాయలు కూడా కవి. అతనికి కర్ణాటక వ్యాజ్య విలాస అనే బిరుదు ఉందని తెలుస్తోంది. కాని అతని కావ్యాలు లభించలేదు.

వైష్ణవ కవులు: విజయనగర యుగంలో అనేక మంది వైష్ణవ కవులు కన్నడభాషలో కావ్యాలు రచించారు.

వారిలో కుమారవ్యాసుడు, తిమ్మకవి, విరల్‌నాథకవి, నారాయణకవి, సుకుమార భారతి, భరతకుమార వాల్మీకి సదానందయోగి అనే వారు ముఖ్యులు.

కుమారవ్యాసుడు: ఇతడు రెండవ దేవరాయలకు సమకాలికుడు. ఇతడు మహాభారతంలోని పది పర్వాలను గదుగివ భారతం అనే పేరుతో కన్నడంలోకి అనువదించాడు. ఇతనికి గడిగిన నరనప్ప లేక నారణప్ప అని కూడా పేరుంది. కన్నడ భాషలో పంప కవి తర్వాత గొప్ప కవిగా ప్రసిద్ధి చెందాడు.

తిమ్మకవి: ఇతడు శ్రీకృష్ణదేవరాయల సమకాలికుడు. క్రీ.శ 941వ సంవత్సరంలో పంప కవి కన్నడంలో భారతాన్ని రచించాడు. అది అసంపూర్ణంగా ఉందట. దానిని పూర్తి చేయమని శ్రీకృష్ణదేవరాయలు ఆదేశించగా తిమ్మ కవి దానిని పూర్తి చేసి కృష్ణరాయ భారతం అనే పేరు పెట్టి రాయలకు అంకితమిచ్చాడు. కృష్ణరాయల కీర్తిని శాశ్వతపరచటానికే తాను ఈ కావ్యాన్ని రచించానని చెప్పుకున్నాడు.

సదానందయోగి **క్రీ.శ.1530-నారాయణకవి:** ఇతడు కూడా శ్రీకృష్ణదేవరాయలకు సమకాలికుడు. ఇతడు భాగవతాన్ని కన్నడంలో రాశాడు. నారాయణ కవి అనే మరొక కవి కూడా భాగవతాన్ని రాశాడు. ఇతడు క్రీ.శ.1450వ సంవత్సరం నాటి వాడని ప్రతీతి.

విరల్ నాథకవి: ఇతడు అచ్యుతదేవరాయల ఆస్థాన కవి. ఇతడు భాగవత పురాణాన్ని కన్నడంలో రాశాడు.

సుమారభారతి క్రీ.శ.1550: ఇతడు త్వరవ రామాయణాన్ని రాశాడు.

భరతకుమార వాల్మీకి క్రీ.శ.1590: ఇతడు రామాయణాన్ని కన్నడ భాషలోకి అనువదించాడు. శింగరాజ పురాణం అనే మరొక గ్రంధాన్ని కూడా రాశాడు.

కీర్తన వాఙ్మయం లేక గేయకవులు లేక దాససాహిత్యం - సంగీత శాస్త్రాలు: జైనులు, వీరశైవులు, సంగత్య, రాగల అనే సంగీత గ్రంధాలు రాశారు. కాని అవి వైష్ణవదాసుల సంగీతశాస్త్రాలకు సాటిరావు. వైష్ణవభక్తులైన శ్రీపదాచార్యుడు, వ్యాసరాయ పురంధరదాసు, వదిరాజు, కనకదాసులు అద్భుత సంగీత గానపదాలను రాశారు. వీరు రాసిన కీర్తన సాహిత్యానికి దాససాహిత్యం లేక హరిదాసు సాహిత్యం అని కూడా పేరుంది. వీరి కీర్తనలు కన్నడ సాహిత్యంలో బహుళ ప్రచారం పొందాయి. వీరు భక్తిగేయాలు రాసి కన్నడ భాషలో గేయసాహిత్యం రచనకు నాంది ప్రస్తావన చేశారు.

శ్రీపాదరాజు లేక శ్రీపదాచార్యుడు: ఇతడు భ్రమరగీతాలు, గోపీగీతాలు, వేణుగీతాలు అనే మూడు రకాల గీతాలను రచించాడు. ఇతడు సాళువ నరసింహరాయల సమకాలికుడు. ఇతని రచనా ప్రభావం తర్వాత భక్తి కవులైన నాదిరాజు, పురంధరదాసు, కనకదాసులపై ప్రసరించింది.

పురందరదాసు: ఇతడు కన్నడంలో అనేక భక్తి కీర్తనలు రచించాడు తెలుగులో అన్నమాచార్యుని పద సాహిత్యం లాగే ఇతని కీర్తనలు కన్నడ సాహిత్యంలో మంచి ప్రాచుర్యం పొందాయి.

కనకదాసు: ఇతడు భక్తిగీతాలు రాయడమేగాక మోహనతరంగణ, నలచరిత్ర, హరిభక్తసారం, రామధ్యాన చరిత అనే గ్రంధాలు రాశాడు. ఇవి కన్నడ సాహిత్యానికి మకుటాలుగా ప్రసిద్ధి చెందాయి.

నాదిరాజు: ఇతడు గూడ అనేక భక్తిగీతాలు రచించి భక్త కవిగా ప్రసిద్ధి చెందాడు.

శతకాలు: ఈ కాలంలో కన్నడంలో అనేక శతకాలు కూడా రాయబడ్డాయి. హరిహరేశ్వరుడు పంపావతి శతకాన్ని గుమ్మటార్యుడు (క్రీ.శ.1550) అర్ధేందుమౌళి శతకాన్ని, చంద్రకవి (క్రీ.శ.1430) చూడామణి శతకాన్ని, చెన్నమల్లికార్జునుడు (క్రీ.శ.1560) ఒక శతకాన్ని, వీరభద్రరాజు (క్రీ.శ.1538) ఐదు శతకాలను, రత్నాకరకవి (క్రీ.శ.1557) త్రిలోక శతకాన్ని, అపరాజిత శతకం అనే రెండు గ్రంధాలను, శృంగారకవి (క్రీ.శ.1660) రత్నాకరదేశ్వర శతకాన్ని రాశారు. మగ్గియ అనే కవి రాసిన శతకాలకు మగ్గియదేవుని శతకాలని పేరు. ఆంధ్రదేశంలో వేమనలాగే దురాచారాలను ఖండిస్తూ సర్వజ్ఞమూర్తి, సర్వజ్ఞపదగళు అనే పేరుతో 1000 పద్యాలను రాశాడు. చంద్ర అనే కవి చూడామణి అనే శతకాన్ని రచించాడు. ఇది గొప్ప శతకంగా ప్రసిద్ధి చెందింది.

కధలు-గాధలు: కధ-గాధల గ్రంధాలు కూడా రాయబడ్డాయి. నాగరాజు (క్రీ.శ.1331) కవిపుణ్యాస్రవ అనే కావ్యాన్ని రాశాడు. అందులో 52 కధలు ఉన్నాయి. ప్రభుగ క్రీ.శ.1500 అనే మరొక కవి చూడనస్థాన, వైభోగరాజస్థాన అనే రెండు గ్రంధాలు రాశాడు. సదానందయోగి (క్రీ.శ.1354) రామనాధ విలాసం అనే కావ్యాన్ని రాశాడు. ఇందులో కైలాసంలోని శివుని కీర్తించాడు. దేవరాయ (క్రీ.శ.1410) అనే కవి సొభాగినసొజె అనే శృంగార కావ్యాన్ని రాశాడు. అమరుక, మురుగదేశి కేంద్ర అనే కవులు కూడా ఈ కాలం వారే. మరుగెదేశి

రాజేంద్ర విజయం అనే కావ్యాన్ని రాశాడు.

విజ్ఞానశాస్త్రాలు: విజ్ఞానరంగంలో వైద్యగ్రంథాలు, గణితం, వ్యాకరణం, ప్రకృతి శాస్త్రాలు రచించబడ్డాయి

వైద్య గ్రంథాలు: మంగరస (క్రీ.శ.1360) ఖగేంద్రమణిదర్పణ అనే గ్రంథం రాశాడు. ఇందులో విషాలను గురించి వివరించబడింది. అభినవచంద్రుడు (క్రీ.శ.1400) అశ్వవైద్యం అనే గ్రంథాన్ని రాశాడు. బచరస (క్రీ.శ.1500) మరొక అశ్వవైద్య గ్రంథం రాశాడు. శ్రీధరదేవుడు (క్రీ.శ.1500) వైద్యామృతం అనే గ్రంథాన్ని రాశాడు. సాళువకవి (క్రీ.శ.1550) వైద్య సాంగత్య అనే గ్రంథాన్ని రాశాడు.

గణిత గ్రంథాలు: రాజాదిత్యుడు అనే కవి అర్థమాటిక్ (బీజగణితం), ఆల్‌జీబ్రాల (క్షేత్రగణితం)పై గ్రంథం రాశాడు. ఈ గ్రంథాలకు మూలం అంతకు పూర్వం బల్లాలుని ఆస్థానకవి అయిన భాస్కరుడు రాసిన గణితశాస్త్రం

అలంకార గ్రంథాలు: ఈ కాలంలో సంస్కృతంలో అలంకార గ్రంథాలు ఎక్కువగా రాయబడ్డాయి. వాటిని అనుకరిస్తూ కన్నడంలో కూడా రాయబడ్డాయి. మాధవకవి (క్రీ.శ.1500) మాధవాలంకార అనే శాస్త్రాన్ని రచించాడు. ఇది సంస్కృతంలో దండి రాసిన కావ్యదర్శనానికి కన్నడ అనువాదం. ఈశ్వర కవి (క్రీ.శ.1510) కవి జిహ్వాబంధన అనే అలంకార గ్రంథాన్ని రాశాడు. సాళ్వకవి (క్రీ.శ.1550) రసరత్నాకర, శారదవిలాస అనే గ్రంథాలు రాశాడు. వీనిలో నవరసాలను గూర్చి, ధ్వనిని గూర్చి రాశాడు. అంటే శబ్దాలంకార శాస్త్రం. తిప్పరస (క్రీ.శ.1610) కవినవరసాలంకార గ్రంథం, కవికాంతర -అనే మరొక అలంకార శాస్త్రాన్ని రాశాడు. రట్టకవి (క్రీ.శ.1330) రట్ట సూత్రాలు అనే గ్రంథాన్ని రాశాడు.

శబ్ద పదకోశాలు-వ్యాకరణ గ్రంథాలు: ఈ కాలంలో శబ్దవ్యాకరణ శాస్త్రాలు కూడా రచించబడ్డాయి కర్ణాటక శబ్దసార (క్రీ.శ.1350) అనే గ్రంథంలో 1416 శబ్దాలు వర్ణించబడ్డాయి. అభినవ మంగరస అనే కవి (క్రీ.శ.1398) అభినవ నిఘంటువు అనే గ్రంథాన్ని రాశాడు. ఇది కేశిరాజ అనే అతడు రాసిన గ్రంథానికి అనుకరణ. ఈ గ్రంథానికి వాస్తుకోశం, భాండార, శబ్దమణి, దర్పణ అనే పేర్లున్నాయి. బొమ్మరసు (క్రీ.శ.1450) చతురాస్య నిఘంటువు రాశాడు. శైవలింగ (క్రీ.శ.1460) అనే కవి కబ్బిగకైపిడి అనే నిఘంటువును రాశాడు. తోటదార్య (క్రీ.శ.1480) అనే కవి కర్ణాటక శబ్దమంజరి, కర్ణాకట సంజీవిని అనే రెండు నిఘంటువులను రాశాడు ఈ నిఘంటువులన్నింటిలో తోటదార్యుని కర్ణాటక శబ్దమంజరి కర్ణాటక భాషకు గొప్ప నిఘంటువుగా ప్రసిద్ధి చెందింది. భట్టాలంకదేవుడు కర్ణాటక శాబ్దాను శాసనం అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. ఇతడు మొదటి శ్రీరంగరాయలు, రెండవ వెంకటపతి ఆస్థాన కవి. ఈ విధంగా అనేక కన్నడ కవులు కన్నడభాషలో అసంఖ్యాక గ్రంథాలు రాసి కన్నడభాషను సుసంపన్నం చేశారు. విజయనగర చక్రవర్తులేగాక వారి సామంతులైన గెర్సిప్ప హైవె - కొంకణ, మగ్గి, హళ్లి సామంతరాజులు కూడా కన్నడ భాషను పోషించారు.

విజయనగర యుగంలో తమిళ సాహిత్యం

20 సంవత్సరాల పోరాటానంతరం కుమార కంపరాయలు 1371లో మధురలోని సుల్తాన్ రాజ్యాన్ని అంతం చేశాడు. దాంతో తమిళ దేశం విజయనగర రాజ్యంలో భాగమైంది. విజయనగర రాజులు తెలుగు, కన్నడ భాషలను ఆదరించినట్లుగా తమిళభాషను ఆదరించలేదు. అయినప్పటికీ నాడు తమిళ వేదాంతులు అనేక తమిళ గ్రంథాలు రాశారు. కొందరు తమిళకవులు విజయనగర ప్రభువుల మన్ననలను పొందారు. రెండవ దేవరాయల కాలం నుండి తమిళ కవులు విజయనగర ఆస్థానాన్ని దర్శించసాగారు. అతని ఆస్థానంలో అరుణ గిరినాథుడు అనే తమిళ కవి ఉండేవాడు. దేవరాయల తరఫున తమిళ దేశాన్ని పాలించిన సామంతులు, ఉన్నతోద్యోగులు తమిళ కవులను ఆదరించి, వారి మన్ననలకు పాత్రులయ్యారు. అలాంటి వారిలో సాళువ గోపతిప్ప అనే సామంతుడు ప్రముఖుడు. అతడు కాలమేఘ అనే తమిళ కవిని పోషించాడు. ఇంకా కొంత మందిని కూడా ఆదరించాడు. అందువల్ల తమిళ కవులు అతనిని తమ కావ్యాలలో ప్రశంసించారు. 16వ శతాబ్దం నుండి కృష్ణరాయల కీర్తినలు దిక్కులకూ వ్యాపించింది. అనేక మంది తమిళ కవులు విజయనగర ఆస్థానాన్ని దర్శించి రాయల అభిమానాన్ని సంపాదించడానికి ప్రయత్నించారు. కృష్ణరాయలు ప్రత్యక్షంగా ఆదరించిన కవులలో కవి హరిదాసు ముఖ్యుడు. వదగలై, అణ్ణాగళయ్యన్ అనే మరొక కవి కూడా రాయల అభిమానాన్ని పొందాడు. ఇతడు తమిళదేశంలో విజయనగర అధికారిగా కూడా పని చేశాడు. అతడు గొప్ప కవేగాక గొప్ప విష్ణుభక్తుడు. అందువల్ల అతనిని హరిదాసన్ అని కూడా పిలిచేవారు. అతడు ఇరుశమయ విళక్కం అనే కావ్యాన్ని రాసి అందులో శైవ, వైష్ణవమతాలను పోల్చి వైష్ణవమతం గొప్పదని నిరూపించాడు. అతని వైష్ణవమత భక్తికి, పాండిత్యానికి మెచ్చి కృష్ణరాయలు అతనికి పన్నులు లేకుండా ఒక గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. కృష్ణదేవరాయలు ఆదరించిన కవి తిరుమలై నాథుడు. అతడు చిదంబర పురాణాన్ని మధుర చొక్కనాథరుళ అనే గ్రంథాన్ని రాశాడు. కృష్ణరాయల చేత గొప్పగా ఆదరింపబడిన కవులలో కుమారసరస్వతి ఒకడు. అతడు బహుభాషా పండితుడు. అతడు తెలుగు, కన్నడ, తమిళ, సంస్కృత భాషా పండితుడు. నావలార్రై చరిత్ర అనే గ్రంథం రాశాడు. అందులో కృష్ణరాయల కళింగ జైత్రయాత్ర, గజపతి కుమార్తెతో వివాహం మొదలైన అంశాలను వర్ణించాడు అతడు తన కవిత్వంలో తెలుగు, కన్నడ పదాలను ధారాళంగా వాడాడు. రాయలు ఆదరించిన మరొక కవి జ్ఞానప్రకాశ దేశికర్. రాయల సమకాలీకులలో మరొక ప్రసిద్ధ కవి పుదుదర్ జ్ఞానప్రకాశర్. అతడు తరునిరన్ కొండై అనే జైనమఠానికి అధిపతి అయిన గణభద్రుని శిష్యుడు. అతడు నికండు చూడామణి అనే నిఘంటువును తయారు చేశాడు. తిరువారూర్ తత్త్వప్రకాశర్ అనే మరొక తమిళ కవి కూడా కృష్ణరాయలచే ఆదరింపబడ్డాడు. అనేక మంది తమిళ కవులు కృష్ణరాయలను తమ కావ్యాలలో ప్రస్తావించి కీర్తించారు. సదాశివరాయల కాలంలో తమిళ దేశాన్ని పాలించిన రామరాడు విఠలుడు అనేక మంది తమిళ కవులను ఆదరించి వారి మన్ననలను పొందాడు. ఆ కాలంలో తమిళ కవులను మఠాలు కూడా ఆదరించేవి. కనుక ఎక్కువ మంది తమిళ కవులు రాయల ఆశ్రయం కోసం ప్రయత్నించలేదు. అందువల్ల తెలుగు, కన్నడ కవులంతమంది తమిళ కవులు విజయనగర ఆస్థానంలో చేరలేదు.

జైనకవులు-వామనాచార్యుడు: వామనాచార్యుడనే జైన కవి 14వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు మేరువమందర పురాణం అనే గ్రంథం రాశాడు.

మండల పురంధర్: ఇతడు ఈ కాలం నాటి మరొక జైన కవి. నికణ్డు చూడామణి అనే తమిళ నిఘంటువును తయారు చేశాడు. ఇంకా తిరుప్పాకళ్ అనే పేరుతో జైనతీర్థంకరుల జీవితాలపై పురాణం రాశాడు.

శైవకవులు: ఈ యుగంలో అనేక మంది శైవకవులు శైవతత్త్వాన్ని విశదీకరిస్తూ అనేక శైవమత గ్రంథాలు రాశారు.

జంట కవులు: కాలమేఘపలవర్, ఇళంరార్యర్ అనే కవులు జంట కవులుగా ప్రసిద్ధి చెందారు. వీరిని తిరుమల దేవరాజు అనే సాళువ సేనాని ఆదరించాడు. అతనిని వీరు తమ గ్రంథాలలో శ్లాఘించారు. వీరిద్దరూ 15వ శతాబ్దానికి చెందిన తమిళ కవులు.

కాలమేఘ పలవర్: ఇతనికి మధుసూర్యాళ్ అనే మరొక పేరుంది. ఇతడు ఒంగోకోయిల్ పురాణం అనే గ్రంథాన్ని రాశాడు.

తత్వప్రకాశస్వామిగళ్‌సి: ఇతడు తిరువారర్ నివాసి. ఇతడు తత్వప్రకాశమనే శైవవేదాంతాన్ని రాశాడు శైవతత్వాన్ని సమర్థిస్తూ రాసిన గ్రంథం ఇది.

స్వరూపానందదేశికర్: ఇతడు శివప్రకాశ పెరుందిరట్టు అనే గ్రంథం రాశాడు.

తత్తువరాయర్: ఇతడు పురిందిరట్టు, పాడుతురై, నానావినోద కళంబంకం, మోహవద్దైపురాణి, అన్యాన హదిప్పరం అనే గ్రంథాలను రాశాడు.

తిరుమలైనాథుడు: కృష్ణదేవరాయలు తమిళ కవులను ఆదరించాడు. కొందరి కావ్యాలలో రాయల ప్రస్తావన ఉంది. తిరుమలైనాథుడు అనేక కవి చిదంబర పురాణాన్ని వధురచొక్కనాథరుళ అనే గ్రంథాలను రాశాడు.

పరంజ్యోతియార్: అతని కుమారుడు పరంజ్యోతియార్ చిదంబర్ పొట్టియల్ అనే అలంకారశాస్త్రాన్ని, తిరువిళై యాదర్ అనే పురాణాన్ని రాశాడు.

జ్ఞానప్రకాశ్ దేశికర్: ఇతడు కంచి వాస్తవ్యుడు. కృష్ణదేవరాయల సమకాలికుడు. అతనికి మాంటరియప్ప అని కూడా పేరుంది. అతడు మంజరి అనే కావ్యాన్ని కృష్ణదేవరాలను కీర్తిస్తూ రాశాడు. అతడే కంచిమహత్మ్యాన్ని తెలిపే కచ్చికలంబకం అనే మరొక కావ్యాన్ని కూడా రాశాడు.

కవిరసపండితర్: ఇతడు కవి. శంకరాచార్యుల వారి సౌందర్య లహరిని తమిళంలోకి అనువదించాడు

మరైజ్ఞానసంబంధార్: ఇతడు అచ్యుతరాయలు, సదాశివరాయల కాలంలో ప్రసిద్ధి చెందిన తత్తవేత్త, కవి ఇతడు కమలాలయ పురాణం, శివధర్మోత్తరం, శైవసమయనౌరి, సతిపశుప్పొరువళ్, శంకరఫణిరాగరణం అనే గ్రంథాలు రాశాడు.

శివాగ్రయేగిగళ్లి: ఇతడు సూర్యనార్ కోయిల్ నివాసి. వీరశైవ గ్రంథాలు రాశాడు.

కమైజ్ఞానప్రకాశ్ పండితర్: ఇతనిని క్రీ.శ.1561లో అళియ రామరాజు ఒక దేవాలయాధికారిగా నియమించాడు. ఇతడు కూడా నాడు చెప్పుకోదగిన కవి, శివభక్తుడు. ఇతడు పూమాలై, శివానందబోధం అనే శైవ గ్రంథాలు రాశాడు.

గురుజ్ఞాన సంబంధార్-ఇతర కవులు: గురుజ్ఞాన సంబంధార్ గొప్ప శివభక్తుడు. శైవగ్రంథాలు రాశాడు అతడే గాక తిరువయ్యార్, జ్ఞానప్రకాశికర్, నిరంబవీకగియ దేశికర్, అనధారి అనే ముగ్గురు కవులు కూడా శైవ గ్రంథాలు రాశారు. వారిలో అనధారిని మధుర వీరప్పనాయకరాజు వద్ద మంత్రి అయిన తిరువిరుందాస్ అనే అతడు ఆదరించాడు. ఈ నలుగురు కవులు ఆనాడు గొప్ప శైవకవులుగా పేరు పొందారు.

అరివీర రామపాంద్యుడు: ఇతడు తెన్‌కాశీని పాలించిన పాండ్యవంశస్థుడు. విజయనగర సామంతరాజు ఇతడు శ్రీనాథుని నైషధం, కాశీఖండం, కూర్మపురాణాలను తమిళంలోకి తర్జుమా చేశాడు. పరంజ్యోతియార్, యల్లప్పనాయర్ అనే పండితుడు ఇతనికి సమకాలికులు.

ఎల్లప్పనాయర్: ఇతడు ప్రసిద్ధ కవి, సౌందర్య లహరి, అరుణాచల పురాణం, తిరైవారూర్‌కోవై మొదలైన అనేక తమిళ కావ్యాలు రాశాడు.

రేవణసిద్ధర్: ఇతడు ఆరవీటి యుగానికి అంటే 7వ శతాబ్దానికి చెందినవాడు. ఇతడు అకరాతిక్రం అనే నిఘంటువును, మరికొన్ని శైవస్థల పురాణాలను రాశాడు.

ఆనందనమశ్శివాయ పండారు: ఇతడు కవి. రెండవ వెంకటపతి రాయలకు సమకాలికుడు. ఇతడు గొప్ప విద్వాంసుడు.

వైష్ణవ గ్రంథాలు: ఈ యుగంలో అనేక మంది వైష్ణవకవులు కూడా తమిళ భాషలో గ్రంథాలు రాశారు.

వేదాంత దేశికుడు: ఇతడు ముమ్మణ్ణిక్కొవై, నవరత్నమవై, అర్థపంచకం, అద్దైకలైప్పొట్టు అనే గ్రంథాలు రాశాడు.

విల్లికుత్తూర్: ఇతడు తమిళ భాషలో భారతాన్ని రచించాడు.

నయనార్: ఇతడు పిళ్ళైయాన్దాది అనే గ్రంథం రాశాడు.

మానరాల మహామణి: ఇతడు రామనుజనూర్యన్దాది అనే గ్రంథం రాశాడు.

శైవ్యచూడువర్: ఇతడు భాగవత పురాణాన్ని తమిళంలోకి అనువాదం చేశాడు.

వాడమలై అన్నగయ్యన్: ఇతనికి హరిదాసర్ అని కూడా పేరు ఉంది. ఇతడు తమిళ ప్రాంతంలో విజయనగర సామంతుడుగా రాజ్యం చేశాడు. ఇతడు గొప్పకవి. వైష్ణవభక్తుడు. ఇరుసమయ విళక్కం అనే వైష్ణవ

సిద్ధాంత గ్రంథాన్ని రాశాడు. వైష్ణవతత్త్వాన్ని ప్రచారం చేశాడు. కనుక ఇతనికి హరిదాసన్ అనే పేరు వచ్చింది.

వీరకవిరసర్: ఈ కవి హరిశ్చంద్ర పురాణం, వరదన్ పురాణ భాగవతం అనే రెండు గ్రంథాలు రాశాడు.

ఇతర రచనలు - కుమార సరస్వతి: ఇతడు ఆ కాలం నాటి గొప్ప తమిళకవి. కృష్ణదేవరాయలపై ఒక గ్రంథం రాశాడు. అందులో తెలుగు, కన్నడ పదాలు కూడా వాడాడు. ఇతనిని కృష్ణదేవరాయలు తన ఆస్థానంలో సత్కరించి గౌరవించాడు.

తాయుమానవర్: ఇతడు మధుర నాయకుని సమకాలికుడు ఇతడు కూడా గొప్ప కవి, వేదాంతి.

అపత్తరసర్: ఇతడు విజ్ఞానకవి, భూగోళశాస్త్రాన్ని రచించాడు. ఈ గ్రంథాలన్నీ విజయనగరయుగం నాటి తమిళ సాహిత్య వికాసాన్ని తెలుపుతున్నాయి. విజయనగర యుగంలో ప్రాంతీయ భాషలలోని సాహిత్యాన్ని రెండు విధాలుగా విభజింపవచ్చును. ప్రాథమికమైనది, అనుషంగికమైనది. శైవ, వైష్ణవ తత్వశాస్త్రాలకు సంబంధించిన సాహిత్యాన్ని ప్రాథమికమైన సాహిత్యంగా వర్గీకరించారు. సృజనాత్మకమైన సాహిత్యాన్ని అనుషంగిక సాహిత్యం అని వర్గీకరించారు. తెలుగు, కన్నడ, తమిళ భాషలలో తత్వశాస్త్రాలతోపాటు సృజనాత్మక సాహిత్యం కూడా ఎక్కువగానే రచించబడింది. 11-13 శతాబ్దాల మధ్యకాలంలో వీరశైవ, వీరవైష్ణవ ఉద్యమాల వల్ల సృజనాత్మక సాహిత్యం అభివృద్ధి చెందింది.

విద్య, విద్యాసంస్థలు: విజయనగర ప్రభువులు ప్రత్యక్షంగా విద్యాసంస్థలను స్థాపించి విద్యాభివృద్ధి చేయలేదు. ప్రాచీన యుగంలో పల్లవులు, చోళులు, చాళుక్యులు కళాశాలలు, పాఠశాలలు స్థాపించి విద్యాభివృద్ధికి దోహదం చేశారని, ఆ విధంగా విజయనగర ప్రభువులు చేయలేదని నేలటూరి వెంకట్రామయ్య అభిప్రాయపడ్డారు. అనాది నుండి భారతదేశంలో విద్యాసంస్థలను బ్రాహ్మణులే నడిపేవారు. ఆ సంస్థలకు రాజులు దానాలు, అగ్రహారాలు ఇచ్చేవారు. అలాగే ఈ యుగంలో కూడా విజయనగర ప్రభువులు అనేక విద్యాసంస్థలకు దానాలు చేశారు. వారి ఆదరణతో విద్యాసంస్థలు చక్కగా జరిగి విద్యావ్యాప్తి జరిగింది. ఆనాటి విద్యా సంస్థలను ఘటికలు అని పిలిచేవారు. ఈ ఘటికలకు భోజనం పెట్టి, విద్య నేర్పేవారు. కొందరు బ్రాహ్మణులకు అగ్రహారాలిచ్చేవారు. అగ్రహారాలలో కూడా పండితులు విద్యార్థులకు తామే భోజనంపెట్టి విద్యను నేర్పేవారు. ఆనాటి పండితులు చతుష్షష్టి కళలలో ఆరితేరినవారు. వేదాలు, వేదాంగాలు, షట్‌శాస్త్రాలు, ధర్మశాస్త్రాలతో పాటు గణితం, తర్కం, మీమాంస, వ్యాకరణం, అలంకార శాస్త్రాలు, రాజనీతిని కూడా నేర్పేవారట. బ్రాహ్మణ అగ్రహారాలే గాక శృంగేరీ, కంచి మొదలైన మఠపీఠాలు కూడా విద్యాకేంద్రాలుగా పనిచేసి విద్యనభివృద్ధి చేశాయి. ఇన్ని ఉన్నప్పటికీ ఆనాడు విద్య అందరికీ అందుబాటులో లేదు. పైగా ఈ విద్యాకేంద్రాలలో బ్రాహ్మణులకు మాత్రమే విద్యను బోధించేవారు. మిగిలిన వారిని ఈ విద్యాసంస్థలలో చేర్చుకునేవారు కాదు. అందువల్ల అధిక సంఖ్యాకులు నిరక్షరాస్యులుగా ఉండేవారు.

బ్రాహ్మణులు కాని వారిని ఈ విద్యాసంస్థలు చేర్చుకోకపోయినప్పటికీ వారికి విద్యను తిరస్కరించలేదు. రామరాజభూషణుడు మహాకవి. అతడు బ్రాహ్మణుడు కాదు. గొప్ప పండితుడు. ఏ అగ్రహార పండితుల దగ్గరో సంస్కృత భాషను నేర్చుకొని ఉంటాడు. బ్రాహ్మణేతరులకు వైష్ణవమతం దీక్ష ఇచ్చింది. వారు బ్రాహ్మణేతరులకు విద్యను కూడా నేర్పారు. అందువల్ల మిగిలిన కులాల వారు కూడా విద్యావంతులయ్యారు. 16వ శతాబ్దంలో అనేక బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కవులు తాము పరవస్తు, కందాడై కుటుంబాలకు చెందిన వైష్ణవాచార్యులకు శిష్యులమని చెప్పుకున్నారు. కనుక వైష్ణవుల వల్ల బ్రాహ్మణేతరులలో విద్య అభివృద్ధి చెందిందని భావింపవచ్చును. ఒక్క వేదాధ్యయనం తప్ప మిగిలిన అన్ని శాస్త్రగ్రంథాలు బ్రాహ్మణేతరులు నేర్చుకొన్నారు. బ్రాహ్మణులు ఈ గ్రంథాలే కాక ఆధ్యాత్మికపరమైన జ్ఞానమార్గాన్ని కూడా సాధన చేస్తుండేవారు. ఏమైనా విద్యావంతులు కొద్ది మందే ఉండేవారు. గ్రంథాలు కూడా అతి తక్కువగానే ఉండేవి. ఈ కాలంలో సింహాచలం, ద్రాక్షారామం, కంచి, మధుర పట్టణాలు గొప్ప విద్యాకేంద్రాలుగా ప్రసిద్ధి చెందాయి.

రాజోద్యోగం చేయాలంటే మరొక రకం విద్య నేర్చుకోవలసి ఉండేది. గణితం, రాజనీతి గ్రంథాలు, నీతిసారాలు, ఇతర లౌకిక పరిపాలనా సంబంధమైన విజ్ఞానశాస్త్రాలు చదివేవారు. సకలనీతిసారం కరణాలకు సంబంధించిన విద్యను ప్రస్తావించింది. ఉద్యోగులకు గణితం తప్పనిసరిగా తెలిసి ఉండాలి. తిథి వార నక్షత్రాలు తెలిసి ఉండాలి. ఇవికాక వృత్తివిద్యలుండేవి. ఈ విద్యలు ఎక్కువగా తల్లిదండ్రులు, వారి కులపెద్దల వద్ద వారి వృత్తిలో నిష్ణాతులైనవారి వద్ద నేర్చుకొనేవారు. ఇవన్నీ సాంప్రదాయక కుల విద్యలు, కళలు అని అనేవారు. ఈ

విద్యలు నేర్చుకొనే వారికి అక్షరజ్ఞానం అక్కరలేదు. అక్షరజ్ఞానం లేకపోయినా వృత్తివిద్యలో నిష్ణాతులయ్యేవారు. మొత్తం మీద విద్యలు మూడు రకాలుగా ఉండేవి. మధ్య సభలలో వాగ్వివాదాలు జరిగేవి. రాజులు గెలిచిన వారికి యోగ్యతాపత్రాలు ఇచ్చేవారు. డింఢిమ భట్టును ఓడించినందుకు శ్రీనాధునకు ప్రోల రెండవ దేవరాయలు కనకాభిషేకం చేశాడు. ఈ కాలంలో కావ్యాలన్నీ తాళపత్ర గ్రంధాలపై రాశారు. కొన్ని రాగిరేకులపై లిఖించారు. ముఖ్యంగా దానశాసనాలు రాగిరేకులపై రాయించేవారు. తాళ్లపాక అన్నమాచార్యుని భక్తిగీతాలు రాగిరేకులపై లిఖించి సరస్వత నిరంకుశోపాఖ్యానం, అల్లసాని పెద్దన కావ్యాల నుండి ఆనాడు వారు చదివిన విద్యలు తెలుస్తున్నాయి. పెద్దన ఆయుర్వేద విద్యను కూడా నేర్చుకొనేవారని రాశాడు. బ్రాహ్మణులు నడిపే విద్యాసంస్థలకు విజయనగర రాజులు వారి సామంతులు అనేక దానాలు చేశారు. రాబర్ట్ డినోబిలి అనే క్రైస్తవమత ప్రచారకుడు మధుర నాయకరాజు ముద్దువీరప్ప మధురలోని విద్యాఘటికకు ఎంతో ధనసహాయం చేశాడని, అందులో కొన్ని వేల మంది విద్యార్థులు చదువుకొనేవారని రాశాడు. ఆ ఘటికలో వేదాలు, ధర్మశాస్త్రాలతో పాటు గణితం, తర్కం, మీమాంస, వ్యాకరణం, అలంకార గ్రంధాలు, జ్యోతిష్యం, రాజనీతి అన్నీ నేర్పేవారట. ఆ కాలంలో గ్రామాలలో గ్రామ బడులుండేవట. అక్కడ కూడా వేదాంతశాస్త్రాలతో బాటు, రామయణ, భారత, భాగవత గ్రంధాలు, శతకాలు, రాజుల చరిత్రలు చదివించేవారు. మడికి సింగన రాసిన సకలనీతి సమ్మతి ప్రతివారు చదివేవారట

వెంకటరమణయ్య విజయనగర ప్రభువులు విద్యాసంస్థలను స్థాపించలేదని అన్నారు. కాని రెడ్డి రాజుల ఆస్థానంలో శ్రీనాధుని విద్యాధికారిగా నియమించారు. ప్రభుత్వానికి విద్యాసంస్థలతో సంబంధం లేకపోతే విద్యాధికారి పదవిని రెడ్డి రాజులు ఎందుకు ఏర్పరచినట్లు? కనుక రాజులు విద్యాసంస్థలకు పర్యవేక్షించేవారేమో. అదే నిజమైతే ప్రభుత్వానికి విద్య మీద అదుపు ఉన్నట్లేనని భావించవలసి ఉంటుంది.

విజయనగర యుగంలో శిల్ప కళ

భారతీయ ప్రాచీన శిల్పశాస్త్రాలైన మానసార ఆగమం, కాశ్యపీయ, భరతనాట్యశాస్త్రం, ఇతర మానవ ధర్మశాస్త్రాలు, పురాణాలు, మానవుడి ఇతర కార్యాలలాగే కళలు కూడా చతుర్విధ పురుషార్థాల సాధనకు మార్గాలని తెలుపుతున్నాయి. భగవద్గీత యోగః కర్మసుకౌశలమ్ Yogah Karmasu Kausalam అని తెలుపుతున్నాయి. కనుక కళలు ప్రాపంచిక సుఖాలు ఇవ్వడంతో పాటు ఆధ్యాత్మిక ప్రగతిని కూడా కలిగించాలి అనే భావన ఉంది. కళలు సౌందర్యోపాసన సాధనాలు. కనుకనే జాన్ కీట్స్ A thing of beauty is a joy for ever అని వ్యాఖ్యానించాడు. శిల్పి ప్రాణం లేని మట్టికి, రాతికి ప్రాణం పోసి దివ్యత్వాన్ని, సౌందర్యాన్ని, కలగజేసి చూపరులకు ఆనందాన్ని కలిగిస్తాడు. కనుకనే శిల్పిని విశ్వకర్మ అని అన్నారు. కాబట్టి మనకు హృదయానందం కలిగించడమే కళకు ప్రధాన లక్ష్యం. దాంతోపాటే ఆధ్యాత్మిక భావం కూడా కలుగజేయాలని భారతీయులు ఆకాంక్షించారు.

విజయనగర సామ్రాజ్యం దక్షిణ భారతీయుల అదృష్ట ఫలం. హిందూ జీవన విధానంలోని అన్ని రంగాలను కాపాడటానికి స్థాపించబడింది. భారతదేశంలో సనాతన ధర్మాన్ని కాపాడటమే తమ లక్ష్యమని విజయనగర చక్రవర్తులు ప్రకటించారు. హిందూమతంలోని అన్ని శాఖలను రక్షించే లక్ష్యాన్ని చేపట్టింది. హిందువులు, జంగాలు, లింగాయతులు, జైనులు, బౌద్ధులు అన్ని శాఖల రక్షకత్వాన్ని చేపట్టింది. వైష్ణవ, జైనశాఖల మధ్య వచ్చిన వివాదాన్ని గురించి విచారించి బుక్కరాయలు రెండు శాఖలకు భేదం లేదు, ఒకరినొకరు నాశనం చేసుకోరాదని శాసించాడు. అంతేగాదు, సూర్యచంద్రాదులున్నంతవరకు ఒకరినొకరు రక్షించుకోవాలని హితోపదేశం చేశాడు. అంతేకాదు, వారు అన్ని శాఖల దేవాలయాలను కాపాడారు. నేటికి హంపీ పరిసర ప్రాంతాలలో హిందూ దేవాలయాలతోపాటు అనేక బౌద్ధ, జైన ఆలయాలు, తీర్థంకరుల విగ్రహాల శిథిలాలు కనిపిస్తున్నాయి.

ఆంధ్రదేశంలోనేగాక దక్షిణభారతదేశంలోనేగాక, యావద్భారతదేశం లోనే శిల్పకళా చరిత్రలో విజయనగర యుగం చివరి ఘట్టమని చెప్పవచ్చును. ఉత్తరదేశంలో గుప్తులతోను, దక్షిణదేశంలో ఇక్ష్వాకులతోను ప్రారంభం అయిన దేవాలయ నిర్మాణం అంచెలంచెలుగా ఎదిగి పల్లవ చోళ, చాళుక్య యుగాలలో వివిధ శైలులుగా విస్తరించి కాకతీయుల కాలం నాటికి పరాకాష్ఠ చెంది చివరకు విజయనగర యుగంతో శిల్పకళా ప్రగతి ఆగిపోయింది. బానిస వంశం రాకతో ఉత్తరదేశంలో హిందూ శిల్పకళా విస్తరణ ఆగిపోయింది.

విజయనగర రాజ్యపతనం తర్వాత దక్షిణదేశం మొత్తం ముస్లిం వశమైంది. దాంతో దక్షిణదేశంలో కూడా హిందూ శిల్పకళా ప్రగతి ఆగిపోయింది. హిందూ రాజులు పోయారు. హిందూ శిల్పకళకు ఆదరణ లేకుండా పోయింది. యావద్భారతదేశంలో హిందూ శిల్పులకు దాతలు కరువయ్యారు. దాంతో శిల్పకళ పూర్తిగా తిరోగమించింది. ఆ తర్వాత ఎవరైనా ఎక్కడైనా దేవాలయాలు నిర్మించినా నూతనశైలి అంటూ ఏదీ అభివృద్ధి చెందలేదు. అప్పటి వరకు అభివృద్ధి చెంది ఉన్న ఏదో ఒక శైలిలోనే లేక మిశ్రమశైలుల్లోనే దేవాలయాలు నిర్మించారు గాని నూతనశైలి అంటూ ఏమీలేదు. కనుక భారతదేశ శిల్పకళకు విజయనగర యుగం చివరిదశ అని శిల్పశాస్త్ర పండితులు వ్యాఖ్యానించారు. ఆ తర్వాత శిల్పకళ ఎలాంటి వికాసానికి నోచుకోలేదు. నేటికీ అదే పరిస్థితి.

విజయనగర సామ్రాజ్యపు తొలికాలంలో విజయనగర చక్రవర్తులు తమశైలితో దేవాలయాలు నిర్మించలేదు. 12-13వ శతాబ్దాల నాటి శైలులతో నిర్మాణాలు చేశారు. కాదంబ, చాళుక్య, హొయసాల పద్ధతులలో వారు తమ దేవాలయాలు నిర్మించారు. హేమకూట పర్వతంపై ఉన్న జైనబస్తీలు హంపీలో రెండవ హరిహరరాయల సేనాధిపతి అయిన ఇరుగప్ప క్రీ.శ.1385 సంవత్సరంలో హంపిలో రాణుల స్నానవాటికకు తూర్పుగా నిర్మించిన గన్నడిట్టి జైనదేవాలయం నిర్మింపబడిన కల్లేకలు గణపతి దేవాలయం, అందులో చిత్రించబడిన హిందూ దేవతాగణం కూడా 12-13 వ శతాబ్దాల శిల్పకళకు ప్రతిబింబాలు. ఈ ఆలయంలో గణపతి విగ్రహం కూడా చాలా పెద్దది. అది ఏకశిలా నిర్మాణం. అలాగే శశిరేఖలు, గణపతి దేవాలయం, కృష్ణదేవరాయల కాలంలో రూపొందించబడిన అతి పెద్దదైన ఏకశిలా యోగనరసింహ విగ్రహం కూడా అతి సాధారణ శిల్పకళ లక్షణాలకు చెందినవి. ఇవి బేలూరు, హలేబీడు, సోమనాధపూర్‌లలో ఉన్న హొయసాల శిల్పుల కంటే కూడా భిన్నంగా ఉన్నాయి. 8వ శతాబ్దపు ఎలిఫెంటా గుహలలోని శిల్పకళా లక్షణాలు వీనిలో కనిపిస్తాయి. కృష్ణదేవరాయల కాలం

నాటికి సామ్రాజ్యం మహోన్నతదశకు చేరుకుంది. అప్పటికి విజయనగర సామ్రాజ్యానికి తనదంటూ ఒక శైలి ఏర్పడింది. కనుక అప్పటి నుండి విజయనగర శిల్పకళలో ప్రత్యేక లక్షణాలు కనిపించాయి. ముఖ్యంగా శ్రీకృష్ణదేవరాయలు ప్రత్యేకశైలిలో దేవాలయాలు నిర్మించాడు. అతని కాలం నాటి దేవాలయాలే నేటికీ నిలిచి ఉన్నాయి. ఈ దేవాలయాలలో హంపి పరిసరాలలో లభించే ఆకుపచ్చని గ్రానైటురాయి soap stone లతో ఈ కాలపు దేవాలయాలు నిర్మింపబడ్డాయి. ఈ ఆలయాలలో ద్రావిడ, ఆర్యావర్త, చాళుక్య హొయసాల శైలులు మిశ్రం చేయబడ్డాయి. ముఖ్యంగా ఈనాటికీని నిలిచి ఉన్న విఠల్‌స్వామి, కృష్ణస్వామి, అచ్యుతరాయ ఆలయాలలో ఆ మిశ్రమశైలులు చూడవచ్చును.

విజయనగర వాస్తువును మూడు రకాలుగా విభజించారు. అవి దుర్గాలు, భవనాలు, దేవాలయాలు.

దుర్గాలు: విజయనగర కాలంలో హంపి, పెనుగొండ, చంద్రగిరి, గుత్తి, ఉదయగిరి, కొండవీడు దుర్గాలు ప్రసిద్ధి చెందినవి. సాధారణంగా కొండలపై నిర్మించేవారు. దుర్గాలకు చుట్టూ నాలుగు వైపులా బలిష్టమైన రాతి గోడను నిర్మించేవారు. దుర్గాల నిర్మాణానికి రాళ్ళు, ఇటుకలు, సున్నం ఉపయోగించేవారు. దుర్గం చుట్టూ పెద్ద అగడ్త ఉండేది. హంపి మొదలైన కొన్ని దుర్గాల చుట్టూ ప్రహరీ గోడలతో రెండు కక్ష్యలు ఏర్పాటు చేశారు. రెండు కక్ష్యల మధ్య అగడ్తను తవ్వారు. దుర్గాలు, రక్షణ దుర్గాలపై ఎటువంటి అలంకారిక వైభవం ఉండేది కాదు. అవి రక్షణ కోసం గనుక బలంగా పెద్దపెద్ద బండలతో నిర్మించేవారు. విజయనగర దుర్గం బలిష్టమైనదని అబ్దుల్ రజాక్, డొమేంగో పేస్, సీజర్, ఫ్రెడరిక్ మొదలైన విదేశీ యాత్రికులు ఆనాటి విజయ నగర కోటను వర్ణించారు. వారు విజయనగరం చుట్టుకొలత 24 మైళ్లని అన్నారు. అంటే కోటగోడలు కూడా అంతవైశాల్యం కలిగి ఉండాలి.

రాజధాని విజయనగర నిర్మాణం: విజయనగర సామ్రాజ్య రాజధాని విజయనగరం బలిష్టంగా, అత్యంత జాగరూకతతో నిర్మించబడింది. శుక్రనీతిసారంలో రాజధానులు, కోటలు ఎలా నిర్మించాలో వివరింపబడింది. అందులో చెప్పబడిన విధంగా విజయనగరం నిర్మింపబడింది.

రకరకాల చెట్లు, పశుసంపద, జంతువులు, పక్షులు, మంచిగడ్డి, పంటలు, జలసంపద సమృద్ధిగా ఉన్నచోట, దుర్భేధ్యాలైన పర్వతాలు, సముద్రానికి మార్గాలు ఉన్నచోట రాజధానులు నిర్మించాలని శుక్రనీతిసారం తెలుపుతోంది. ఒక సముద్రమార్గం తప్ప, అందులో వర్ణింపబడిన మిగిలిన అన్ని లక్షణాలు విజయనగరం నిర్మింపబడిన ప్రదేశానికి ఉన్నాయి. హంపి వద్ద 7 పర్వతాలున్నావి. హేమకూటం, ఋష్యశృంగం, మాతంగ, అంజనీపర్వతం, మాల్యవంతం, సుగ్రీవఖిల్లా, జాంబవంతపర్వతం అనే ఈ 7 పర్వతాలచే రాజధాని విజయనగరం పరివేష్టింపబడి ఉంది. పేస్ తన రచనలో ఈ పర్వతాలు నగరం చుట్టూ 24 లీగులు వైశాల్యంతో విస్తరించి ఉన్నాయనీ, ఈ పర్వతాల మధ్య ఉన్న ఖాళీలను బలిష్టమైన కోట గోడల చేత పూరించారనీ వర్ణించాడు. వార్తెమా పేస్ రాతలను సమర్థిస్తూ రాశాడు. అతడు నగరం చుట్టుకొలత 7 మైళ్లని రాశాడు. నగరం మంచి అందమైన ప్రదేశంలో ఉందని అలాంటి ప్రదేశాన్ని తాను ఎన్నడూ చూడలేదని కూడా వివరించాడు. అతనాసియస్ నికిటిన్, అది పెద్ద నగరం అని, దానికి చుట్టూ మూడు కోటలు నిర్మింపబడి ఉన్నాయనీ కోటకు ఒకవైపు నది, మరొక వైపున భయంకరమైన అడవి ఉన్నాయని వర్ణించాడు.

విద్యారణ్యుని సలహాపై మొదటి హరిహరరాయలు విజయనగరాన్ని క్రీ.శ.1336లో నిర్మించాడని జనశృతి ఉంది. కాని పండితులు దానిని బుక్కరాయలు క్రీ.శ.1368వ సంవత్సరంలో ప్రారంభించి 1378వ సంవత్సరంలో పూర్తి చేసి విద్యానగరం అని నామకరణం చేశాడని భావిస్తున్నారు.

తుంగభద్రానదికి పంపానది అని పేరు ఉంది. ఈ పేరు పశ్చిమచాళుక్య చక్రవర్తి అయిన వినయాదిత్య సత్యాశ్రయుని క్రీ.శ.698-90 శాసనంలో ప్రస్తావించబడింది. ఆ పంపాయే నేడు హంపీగా పిలువబడుతోంది పంపానది ఒడ్డున ఒక కొండపై విరూపాక్షస్వామి ఆలయం ఉంది. ప్రఖ్యాతి వహించిన ఒక పట్టణం ఉండేదని క్రీ.శ.1018-19 సంవత్సరం నాటి ఒక శాసం తెలుపుతోంది. ఆ సంవత్సరంలో కళ్యాణీ చాళుక్య చక్రవర్తి జయసింహుడు పంపా నగరాన్ని దర్శించినట్లు ఆ శాసనం తెలుపుతోంది. చోళ చక్రవర్తి మొదటి రాజరాజు కూడా దర్శించాడు. పశ్చిమచాళుక్య సేనాధిపతి మహాదేవుడు క్రీ.శ.1112వ సంవత్సరంలో అక్కడ ఒక శాసనం వేయించి ఆ ప్రదేశాన్ని పంపాస్వామి స్థలం అని వివరించి అక్కడ ఉన్న విరూపాక్ష దేవునికి దానం చేశాడు. హొయసాల సోమేశ్వరుడు, అతని మనుమడు మూడవ భల్లాలుడు చాళుక్య చోళ చక్రవర్తి మూడవ రాజ రాజు కూడా ఆ ప్రదేశాన్ని దర్శించి శాసనాలు వేయించారు.

దీనిని బట్టి చూడగా పంపాక్షేత్రం అతి ప్రాచీన కాలం నుండి పవిత్రక్షేత్రంగా విరాజిల్లుతోందని, భావింపవచ్చును. రామాయణ కాలంలో అది సుగ్రీవుని స్థావరం. అక్కడే వాలిసుగ్రీవులు పాలించారు. అదే రామాయణ కాలం నాటి వానర రాజ్యం. అక్కడ పశ్చిమ చాళుక్యులు వారికిష్టదైవమైన విరూపాక్షుని దేవాలయం నిర్మించారని భావించవచ్చును. ఈ ప్రదేశం పశ్చిమచాళుక్యులకు విడిదిగా ఉండేదట. చోళచాళుక్య సంఘర్షణలో రాజప్రాసాదాన్ని చోళులు ధ్వంసం చేసారని చోళశాసనాలు తెలుపుతున్నాయి. తర్వాత అది కంపిలి రాజ్యంగా మారింది. ఈ రాజ్యపు భాగమే చివరకు విజయనగర రాజ్యానికి కేంద్రమైంది. అక్కడే పంపాక్షేత్రంలో విజయనగర పట్టణం నిర్మింపబడింది.

శుక్రనీతిసారం రాజధాని అర్ధచంద్రాకారంలోగాని, గుండ్రంగాగాని, నలుచదరంగాగాని అందంగా ఉండాలి అని చెబుతోంది. విజయనగరం ఎలా ఉండేదో తెలియదు. కాని పేస్, అబ్దుల్ రజాక్ మొదలైన వారి వర్ణనల వల్ల అది వలయంగా గాని, అర్ధచంద్రాకారంలో గాని ఉండేదని తెలుస్తోంది. నలుచదరంగాను, దీర్ఘచతురస్రంగాను నిర్మించడానికి అక్కడి పర్వతాలు అనువుగా లేవు. కోట నలుమూలలలో దేవతలను ప్రతిష్ఠించే ఆచారం హిందువులు పాటిస్తారు. కృష్ణదేవరాయలు ఒకవైపు కోట గోడ వద్ద రణమంజల భైరవుని ఆలయం నిర్మించాడని ప్రతీతి.

ఆ కాలంలో విజయనగరాన్ని దర్శించిన అనేక మంది విదేశీ యాత్రికులు, ముస్లిం చరిత్రకారులు విజయనగర కోటను గురించి చాలా వివరంగా రాశారు. వారిలో ఫెరిష్తా విజయనగర రక్షణ వ్యూహాన్ని గూర్చి చాలా వివరాలు ఇచ్చాడు. కోటకు ప్రథమశ్రేణి రక్షణగా దూరటానికి వీలులేని దట్టమైన అడవి ఉండేదట. ఆ అడవిలో గుండా సైన్యం ప్రయాణించడం దుర్లభం. అడవి దాటిన తర్వాత రెండవ రక్షణశ్రేణిగా బలిష్టమైన రాతి నిర్మాణం ఉండేదట. కోట బయటి గోడ చుట్టూ 50 గజాల వెడల్పులో పెద్ద పెద్ద బండరాళ్ళు చిక్కగా నిలువుగా పాత బడ్డాయి. అవి సగభాగం భూమిలో పాతబడ్డాయి. మనిషి ఎత్తున భూమిపై కనిపిస్తూ ఉంటాయి. అవి వరుసలుగా నాటబడ్డాయి. మొదటి వరుసలో ఉండే సందులకు ఎదురుగా రెండవ వరుసరాళ్ళు నాటబడ్డాయి. ఆ వరుస సందులకు ఎదురుగా మూడవ వరుస, అలాగే సరాసరి వెళ్ళడానికి వీలులేకుండా వరుసలలో బండలు పాతబడ్డాయి. ఈ 50 గజాల మేరలో ఉన్న బండలు గుర్రపుదళాన్ని ముందుకు సాగకుండా అడ్డుకునేవి. గుర్రపుదళాలేకాక పదాతిదళం కూడా ముందుకురావడానికి వీలులేదు. ఇది గొప్ప వ్యూహాత్మక రక్షణశ్రేణిగా వర్ణింపబడింది. ఈ రక్షణశ్రేణి దాటిన తర్వాత పెద్దరాతి కోట గోడ ఉంది. బలిష్టమైన అనేక బురుజులున్నాయి. ఆ గోడ లోపల అలాంటివే మరో 6 కోటలు ఉన్నాయి. మొత్తం ఒకదాని చుట్టూ మరొకటిగా నగరం చుట్టూ 7 కోటలు ఉండేవని అబ్దుల్ రజాక్ వర్ణించాడు.

అబ్దుల్ రజాక్ బయట కోట ఉత్తరపు ద్వారం నుండి దక్షిణపు ద్వారం వరకు 7 మైళ్ల దూరం ఉందని, అదే విధంగా తూర్పు, పడమరల ద్వారాల మధ్య కూడా అంతే అంటే 7 మైళ్ల దూరం ఉన్నదని వర్ణించాడు. నగరం మధ్యలో రాజభవనం ఉందని, దాని చుట్టూ ఒకదానిలో ఒకటి మూడు కోటలు నిర్మింపబడి ఉన్నాయని కూడా రాశాడు. వార్తెమా, పేస్‌లు కూడా అబ్దుల్ రజాక్ రాతలను బలపరుస్తూ రాజభవనం చుట్టూ 3 ప్రాకారాలున్నాయని తమ రచనలలో పేర్కొన్నారు. 15వ శతాబ్దంలో విజయనగరం దర్శించిన నికోలో డి కోంటి నగరం చుట్టుకొలత 60 మైళ్లు ఉంటుందని రాశాడు. సీగల్ పట్టణం 12 మైళ్ల పొడవు, 10 మైళ్ల వెడల్పు ఉండవచ్చునని భావించాడు. ఇతని రాతలు నికోలో డి కోంటి రాతలను బలపరుస్తున్నాయి. పేస్ కోట ద్వారాల నుండి నగరం రెండు లీగులు దూరం ఉంటుందని నగరం చుట్టూ ఉన్న కొండలో ఉన్న ఖాళీలలో బలిష్టమైన రాతి గోడలను నిర్మించి ఆ గోడ మధ్యలో పెద్ద ద్వారాన్ని ఏర్పాటు చేశారని తెలిపాడు. నగరం చుట్టూ ఉన్న పర్వతశ్రేణులు 24 లీగుల చుట్టుకొలత ఉన్నాయి. కొండల వరుస లోపల అలాంటివే మరికొన్ని వరుసలున్నాయి. వాటి ఖాళీలయందు కూడా గోడలు నిర్మింపబడి ఉన్నాయి. బయట నుండి మొదటి కోటలో పంట పొలాలు, రెండవ కోటలో పూలతోటలు, మూడవ కోటలో ప్రజల గృహాలున్నాయి. నాల్గవ కోట నుండి 7వ కోట వరకు అంటే రాజప్రాసాదం ఉన్న కోట వరకు విశాలమైన బజారులు, బజారుల కిరువైపుల అంగళ్లు నిర్మింపబడి ఉన్నాయి. రాజభవనానికి నాలుగు దిక్కులలో నాలుగు బజార్లు ఉన్నాయి. ఆ బజారులలో మంత్రులు ఇతర ఉన్నతాధికారుల గృహాలున్నాయి.

మరొక చరిత్రకారుడు విజయనగరం చుట్టూ ఉన్న 7 కోటలను వర్ణించాడు. మొదటి కోట అంటే రెండు

పర్వతాలు కలిసే చోట నిర్మింపబడిన ద్వారం మొదటిది. అది హోస్‌పేటకు నైరుతిమూలన ఉంది. దానికి లోపల ఉన్న కోటగోడ నేటి హోస్‌పేట పట్టణం అయి ఉండవచ్చును. మూడవ గోడ హోస్‌పేటకు ఉత్తరంగా ఉండేది. 4వ కోట మల్పనగుడి గ్రామానికి దక్షిణంగా ఉండేది. దానికి ఉత్తరంగా 5వ కోట గోడ కూడా ఉండేది. అక్కడ నేటికీ ఒక పెద్ద ద్వారం నిలిచి ఉంది. 6వ కోట కూడా కమలాపురం చెరువు వద్ద ఉంది. 7వ కోట కూడా రాజప్రాసాదం ఉన్నతోద్యోగుల ఇళ్ల 'చుట్టూ నిర్మింపబడి ఉంది. అది తూర్పు పడమరలుగా 2 1/4 మైళ్లు ఉత్తరదక్షిణంగా 1 మైలు విశాలంతో ఉండేది. సీవెల్ ఈ కోట గురుతులను అతికష్టంపై గుర్తించాడు. ఈ విధంగా విజయనగరం 7 కోటలతో పటిష్టంగా నిర్మింపబడిందని వీరి రచనల ద్వారా మనకు తెలుస్తోంది. వీరి రచనల వల్లనే కాక మొదటి బుక్కరాయల కోడలు కుమార కంపన భార్య అయిన గంగాదేవి రచించిన మధురా విజయం కావ్యం వలన విజయనగరానికి చెందిన మరికొన్ని విషయాలు తెలుస్తున్నాయి. ఆమె రాజధాని అంద చందాలను, అక్కడ ఉన్న విశేషాలను తన కావ్యంలో వర్ణించింది. ఆమె విజయనగరాన్ని ఇంద్రుని పట్టణమైన అమరావతివలె ఎంతో సుందరంగా ఉండేదని వర్ణించింది. ఆమె చక్రశాల ప్రాకారేణ పరిశ్రుత అని వర్ణించింది. ఈ పదాలను బట్టి నగరం వలయాకారంలో ఉండేదని భావించారు. విదేశీయుల రచనలు కూడా నగరం వలయాకారంలోనే ఉందని తెలియజేస్తున్నాయి. సుమేరు శృంగసంకసై గోపురః ఉపశోభిత అని కూడా ఆమె వర్ణించింది. ఈ వర్ణనను బట్టి నగరం చుట్టూ గుండ్రని బురుజులున్నాయని భావించారు. అవి బంగారు వన్నెతో మేరు పర్వతం మెరిసినట్టు మెరుస్తున్నాయని ఆమె వర్ణించింది. ఉత్పుల్ల చంపకాశోకనాగకేసర కేసరాః వసంతవాస భువనైక ఆరామహా అభితోవృత అని వర్ణింపబడిన దానిని బట్టి నగరంలోని భవనాలు నాగకేశర శైలిలో నిర్మింపబడ్డాయని, అనేక కొలనులు ఉండేవని, వానిలో తామర పుష్పాలు ఉండేవని, ఇంకా నగరంలో చంపక, అశోక వృక్షాలు ఉండేవని వీటన్నింటితో నగరం అతి సుందరంగా ఉందని, గంగాదేవి వర్ణనలు వాస్తవమేనని Duarte Barbosa రచనలు బలపరుస్తున్నాయి. అతడు విజయనగరంలో అనేకమైన సుందర ప్రదేశాలున్నాయని అనేక గుట్టలు, ఆ గుట్టల మధ్య కొలనులు, ఆ కొలనులలో రకరకాలైన చేపలు, సుందరమైన తోటలు, పూలు, సువాసనలు వెదజల్లే తీగలు ఉన్నాయని తన రచనలలో వర్ణించాడు. ఈ వర్ణనలో గంగాదేవి తన మధురాకావ్యంలో వర్ణించిన వర్ణనలతో సరిపోతున్నాయి. మొత్తం మీద విజయనగరం అతి సుందరమైన పట్టణమని మాతంగ, ఋష్యశృంగ, సుగ్రీవఖిల్లా, అంజనీ పర్వతం మొదలైన 7 పర్వతాల మధ్య పటిష్టమైన రక్షణ కలిగిన రాజధానిగా నిర్మింపబడిందని పై వారి రచనల వలన స్పష్టమవుతోంది.

భవనాలు - ముస్లిం వాస్తు శిల్పకళా ప్రభావం: విజయనగర కాలంలో హంపీలో అనేక సుందర రాజ భవనాలు నిర్మింపబడ్డాయి. ఈ భవన నిర్మాణాలలో కొన్నింటిలో ముస్లిం నిర్మాణ సాంప్రదాయాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా ఆర్చిలు ప్రవేశించాయి. ఆర్చిలతో నిర్మించిన భవనాలలో అతి ముఖ్యమైనవి పద్మమహల్, Lotus mahal. తర్వాతది గజశాల. చంద్రగిరి, పెనుగొండ, మధురలలోని రాజభవనాలు కూడా ముస్లిం వాస్తు ప్రభావానికి లోనయ్యాయి. ఆనాడు హిందూ రాజులు కూడా తమ భవనాలను ముస్లిం కట్టడాల వలె నిర్మించారు. ఈ పద్ధతి రాజాస్థానాంలో రాజపుత్రులు కూడా అవలంబించారు. అలాగే విజయనగర చక్రవర్తులు కూడా ముస్లింల పద్ధతులను జోడించి నిర్మించి ఉండవచ్చును. ఒకటవ దేవరాయలు తమ కుమార్తెను ఫిరోజ్‌షాకిచ్చి వివాహం చేశాడని ముస్లిం చరిత్రకారులు రాశారు. అలాగే రామరాయల వద్ద ముస్లిం బానిస స్త్రీలు ఉండేవారని కొన్ని రచనల వల్ల తెలుస్తోంది. బహమనీ, బీజాపూర్, గోల్కొండ రాజ్యాలలో విజయనగర రాజ్యానికి ఉన్న సాన్నిహిత్యం వల్ల కూడా ముస్లిం నిర్మాణ పద్ధతులు విజయనగర కట్టడాలలో ప్రవేశించి ఉండవచ్చును. చాలా భవనాలు శిథిలమైనందు వల్ల వాటి స్వరూపం స్పష్టంగా తెలియటం లేదు.

దేవాలయ శైలులు: కాకతీయ సామ్రాజ్య విచ్ఛిన్నం తర్వాత మహ్మదీయులు దక్షిణదేశంలోకి ప్రవేశించినందువల్ల అంతకు పూర్వం శతాబ్దాల తరబడి సాగుతూ వచ్చిన దేవాలయ నిర్మాణానికి అంతరాయం ఏర్పడింది. ఒక అర్ధ శతాబ్దం వరకు దేవాలయ నిర్మాణం సాగలేదు. ఈ లోపల మహోత్తుంగ తరంగంలాగ విజయనగర సామ్రాజ్యం పైకి లేచి దక్షిణదేశమంతా విస్తరించింది. ముస్లిం ప్రవాహాన్ని అడ్డుకుంది. తిరిగి దేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. విజయనగర చక్రవర్తులు తమ ఆలయ నిర్మాణంలో చాళుక్య, కాకతీయ, హొయసాల రీతులను, దక్షిణాది పల్లవ, చోళ, పాండ్య రీతులను అనుసరించారు. హంపీలోని శిథిల ఆలయాలలో ఈ 6 రకాల శైలుల ఆలయాలున్నాయి. ఆంధ్ర కర్ణాటకలలో అంతకుముందు వాడుతూ వచ్చిన ఇసుకరాతిని

తొలగించి కఠిన శిలలను ఉపయోగించారు. ఇది వీరి నిర్మాణాలలో అతి ముఖ్యమైన మార్పు. విజయనగర యుగంలో నిర్మింపబడినన్ని ఆలయాలు మరేయుగంలోనూ నిర్మింపబడలేదు. వారు అపూర్వమైన అనేక గోపురాలు, మండపాలు నిర్మించారు. ఆలయాలకేగాక తుంగభద్రానది ఒడ్డున ఉన్న పెద్దరాతి కొండ నడుమ ఉన్న విరూపాక్ష లేక పంపావతి ఆలయం చుట్టూ నిర్మించిన హంపీనగరపు కోటకు కూడా అక్కడ లభించే కఠిన శిలను ఉపయోగించి బ్రహ్మాండమైన గోడలు, ద్వారాలను నిర్మించారు.

విజయనగర శిల్పులు ఉత్తర దక్షిణ సంగమస్థానంగా ప్రసిద్ధి చెందిన తొలి చాళుక్య ప్రాంతంలోని ఆలయాల నుండి దక్షిణాదిలోని ఆలయ రూపాల నుండి అంశాలను ఎన్నుకున్నారు. మొదటి లక్షణం తొలి చాళుక్య రాష్ట్రకూట యుగం నుండి వస్తున్న శుకనాసికతో ఉండే దక్షిణాది విమానం, రెండవది కదంబ నగర విమానం. ఈ రెండు అంశాలను మిళితం చేసి వారు ఆలయాలు నిర్మించారు. ఈ రెండు అంశాలలో ఒకటి ప్రధానంగా ఉంటే రెండవది ఉపాంగంగా ఉంటుంది. కదంబనగర విమానం ఒకదానికన్నా ఒకటి తక్కువ పరిధి కలిగిన పళ్లలను ఒకదానిపై ఒకటి అమర్చినట్లుగా ఉంటాయి. ప్రతితలం చదునుగా ఉంటుంది. అన్నిటికన్నా అగ్రతలం చిన్నదిగా ఉంటుంది. దాని మీద గ్రీవశిఖర స్తూపిలుంటాయి. ఈ ఆఖరు రూపం ఒరిస్సాలో ఉండే ఫిదద్యూల్ లాగ, గుజరాత్, పశ్చిమ భారతదేశంలో ఉండే ఫకస, నకర శిఖరం ఉంటుంది. విజయనగరం, దాని పరిసర ప్రాంతాలలో నిర్మించిన ఆలయాలలో ఈ ద్విలక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. తర్వాత విజయనగర రాజులు ఈ రెండు శైలులూ జీర్ణించుకొని ప్రత్యేకంగా విజయనగర శైలిని రూపొందించుకొని బృహత్ పరిమాణంతో, గాంభీర్యంగా, నూతన లక్షణాలు తొణికిసలాడే విధంగా ఆలయాలు నిర్మించారు.

పెర్సిబ్రౌన్ విజయనగర వాస్తువు పరిపక్వత చెందిన ద్రావిడ సాంప్రదాయానికి చెందినదని వ్యాఖ్యానించాడు. కాని అతని వ్యాఖ్యానం సమంజసంగా కనపడదు. అందుకు కారణమేమిటంటే అంతకు పూర్వం పల్లవులు, చోళులు, చాళుక్యులు, హొయసాలులు, కాకతీయులు ఎవరి ప్రాంతంలో వారు వారి సొంత శైలులలో దేవాలయాలు నిర్మించారు. కాని విజయనగర చక్రవర్తులు ఏదో ఒక శైలినే అనుసరించకుండా అన్ని శైలులను అనుసరించారు. కారణం ఏమిటంటే సామ్రాజ్యం విశాలమైనది. అందులో ఆంధ్ర, కర్ణాటక, తమిళ, కేరళ రాష్ట్రాలు చేరి ఉండేవి. అంటే అంతకు పూర్వం దక్షిణదేశంలో ప్రసిద్ధి చెందిన పల్లవ, చోళ, కదంబ, చాళుక్య రాజ్యభాగాన్నీ వారి సామ్రాజ్యంలో చేరి ఉన్నాయి. కనుక ఏ ప్రాంతంలోని శిల్ప సాంప్రదాయాన్ని ఆ ప్రాంతంలో కొనసాగించారు. కనుక వారు వేరు వేరు ప్రాంతాలలో, వేరు వేరు శైలులతో ఆలయాలు నిర్మించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాలలో వారు చాళుక్య, హొయసాల, కాకతీయ శైలులను అనుసరించారు. తమ రాజధాని హంపి, దాని పరిసర ప్రాంతాలలో చాళుక్య, రాష్ట్రకూట, కదంబ శైలుల మిశ్రమ విధానాన్ని అనుసరించారు. వీరి కాలంలో అన్ని దేవాలయాలు వాస్తుశాస్త్ర సూత్రాల ప్రకారం నిర్మించారు. ఆంధ్రదేశ ప్రాంతాలలో 4 రకాల శైలులుండేవి.

1. అనంతపూరు, కడప, కర్నూలు జిల్లాల్లో కర్ణాటక శైలులు అంటే హొయసాల హంపిలోని ఆలయ లక్షణాలతో ఉన్నాయి.
2. చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో తమిళదేశపు చోళుల శైలిలో ఉన్నాయి.
3. తెలంగాణ ప్రాంతాలలో కాకతీయ శైలిలో ఉన్నాయి.
4. ఉత్తరకోస్తాలో వేంగి కళింగదేశ శైలుల మిశ్రమంలో ఉన్నాయి.
2. పూర్వపు శైలిననుసరిస్తూనే తమ వాస్తు సాంప్రదాయాలను రూపొందించుకున్నారు.
3. హొయసాలులు శిల్పకళకు అమిత ప్రాధాన్యతనిచ్చారు. అదే ప్రాంతంలో ఉన్న వీరి రాజధానిలో హొయసాలుల వలె గాక వాస్తువుకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. వీరి కాలంలో దేవాలయాలు కొన్ని దీర్ఘచతురస్రంగాను, మరికొన్ని సమచతురస్రంగాను నిర్మింపబడ్డాయి. దేవాలయం 5 కక్ష్యలుగా ఉండేది. ముఖద్వారం, రంగమంటపం, అర్ధమంటపం, అంతరాలం, గర్భగృహం అనే 5 ప్రధాన అంగాలు. గర్భగృహంపై విమానం, ప్రాకార ద్వారంపై గోపురం తప్పకుండా ఉంటాయి.
4. వీరి దేవాలయాల అధిష్టానాలు 6 అడుగుల నుండి 12 అడుగుల ఎత్తు వరకు ఉన్నాయి. వానిలో పట్ట, త్రిపట్టగళ అనే 6 భాగాలున్నాయి. అధిష్టానాలపై అర్ధశిల్పాలు చెక్కారు. ఇది హొయసాల సాంప్రదాయం. కాని వారి లాగ మితిమీరకుండా పరిమితంగా ఉన్నాయి. కొన్ని ఆలయాలపై శాలకోష్టాలున్నాయి. ఇవి అధిష్టానంలోని ఒక భాగాన్ని మరొక విభాగాన్ని కలుపుతున్నాయి. హంపిలోని సంగీత మండపం ఈ

రీతిలో ఉంది.

5. ఆలయాల కుడ్యాలు రెండు విధాలుగా నిర్మించారు. తొలి ఆలయాలలో గర్భగృహం అంతరాళాల కుడ్యం వెలుపలి ముఖ భాగం మీద దేవతాకోష్ఠాలు అందు దేవతా ప్రతిమలున్నాయి. పెనుగొండ దేవాలయాలు ఈ రీతిగా ఉన్నాయి. తర్వాత కాలపు దేవాలయాలలో దేవతాకోష్ఠాలు లేవు. దేవాలయ ప్రాంగణంలో పరివార దేవతలకు ప్రత్యేక దేవతా గృహాలు నిర్మించే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఈ దశలో కుడ్యభాగాలు కొంత ప్రాంతం లోతుగాను నిర్మించారు. ఉబ్బెత్తు భాగాలలో అంటే ప్రొజెక్షన్స్‌లో శాలకోష్ఠాలు కుడ్య స్తంభాలు ఉండగా లోతు భాగాలు అంటే రీసెస్‌లలో కుంభ పంజరాలు నిర్మించారు. కుడ్యభాగం సాదాగా శిల్పరహితంగా ఉంది. కాని ఈ తరహాకు చెందిన తాడిపత్రి ఆలయకుడ్యాలపై రామాయణ, మహాభారత కథల శిల్పాలు చెక్కారు. ఈ కాలంలో వారోత్సవాలు, మహోత్సవాలు, నిత్యపూజలు ప్రవేశపెట్టినందువల్ల ఆయా పూజలకు కావలసిన కట్టడాలు ప్రాంగణంలో నిర్మించారు.
6. కపోతాలు రెండు రకాలుగా ఉన్నాయి. గర్భగృహపు కపోతం, చోళుల శైలికపోతంగా ఉంది. దాని ముఖ భాగంపై సింహలలాటం కూడా వాళలు, గణాల వరుసలున్నాయి. ముఖమండపు కపోతం పద్మ ఆకారంలో ఉంది. కపోతంపైన ఉన్న కప్పు అంచు భాగాలలో మండపం చుట్టూ ఇటుకలతో చిన్నదేవతా గృహాల వంటి వరుసను నిర్మించారు. ఇలాంటిది హంపీలోని సంగీత మండపంపై ఉంది. మండపాలలో కప్పుల మీద మధ్యలో విశ్వపద్మం అని పేరు గల పద్మశిల్పాన్ని సుందరంగా చెక్కారు. చుట్టూ శిల్పాలలో వరుసలు, వర్ణచిత్రాల వరుసలు చిత్రించారు.
7. విమానాలలో ప్రతి తలంలో కూట, పంజర శాలహారాలున్నాయి. విమానంపై గ్రీవశిఖరపురి భాగాలు ద్రావిడశైలిలో ఉన్నాయి. గర్భగృహంపై ఉండే విమానం కన్నా ప్రాకార ప్రవేశ ద్వారాలపై ఉండే విజయనగర విమానం ముందు సుకనాసను నిర్మించారు. ఈ పద్ధతి హంపిలోని హజారా రామస్వామి ఆలయంలో ఉంది. విజయనగర కాలంలో గోపురాలు విమానాలకంటే ఎత్తుగా నిర్మించారు. అందువల్ల వాటికి రాయగోపురాలు అని పేరు వచ్చింది. ఈ గోపురాలపై తలాలను ఇటుకలతో నిర్మించడం విజయనగర కాలం నాటి మరొక విశేషం. ఈ సాంప్రదాయాన్ని విజయనగర చక్రవర్తులు ప్రవేశపెట్టారు అంతకు ముందు కింది నుండి పైదాకా రాతినే వాడేవారు. ద్వారాలకు రెండు పక్కల రేఖాచిత్రాలను పోలిన శిల్పాకృతులను కూడా పొందుపరచారు.
8. దేవాలయ ప్రాంగణంలో మొదట ధ్వజస్తంభం, దానిముందు పద్మపత్రాలంకరణలతో బలపీఠం ఉంటాయి. బలపీఠం అధిష్ఠానం ధ్వజస్తంభం అధిష్ఠానం ఒకే విధంగా ఉంటాయి. ధ్వజస్తంభం మాత్రం గుండ్రంగా గాని, అష్టభుజంగా గాని ఉంటుంది. ఇలాంటి అష్టభుజ ధ్వజస్తంభం లేపాక్షి, పెనుగొండ ఆలయాలలో ప్రతిష్ఠించారు. దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక దేవగృహాలు నిర్మించారు. ఇది చోళుల పద్ధతి వారు ప్రారంభించిన ఈ పద్ధతిని వీరు కూడా కొనసాగించారు.
9. చోళుల లాగే విజయనగర చక్రవర్తులు కూడా పెద్ద పెద్ద మండపాలు నిర్మించారు. శతస్తంభాలు, వేయి స్తంభాలతో అనేక మండపాలు నిర్మించబడ్డాయి. వాటిని మహామండపాలు అనేవారు. మహామండపం సమ చతురస్రంగా ఉంటుంది. దానిని రంగమండపం లేక ముఖమండపం అని కూడా పిలుస్తారు. ఈ మండపంలోని స్తంభాలు సింహం, గుర్రం మొదలైన జంతువుల శిల్పాలతో అలంకరణం చేస్తారు. లేపాక్షి కదరి ఆలయాలలో నర్తకీ నర్తక శిల్పాలతో అలంకరించారు. ఈ స్తంభాలు సమచతురస్రాకారపు అధిష్ఠాలు కలిగి దానిపై చతుర్భుజాకారపు పట్టికను, దానిపై మరొక చతుర్భుజాకారపు పట్టిక, దాని మీద ఊర్ధ్వ పద్మాలంకరణ, దానిపై స్తంభశీర్షాన్ని కలిగి ఉన్నాయి. మిగిలిన మండపాల స్తంభాలు కూడా ఇలాగే ఉన్నాయి. సాధారణంగా రంగమండపంలో కప్పు మీద చిత్రలేఖనాలుంటాయి. అర్ధమండపం అంతరాళాలలో పార్శ్వదేవతలు కుడ్యాలలో త్రిమూర్తుల శిల్పాలు ఉంచుతారు. ఈ ప్రదేశంలో దేవతా శిల్పాలేగాక మిగిలిన అలంకరణలు కూడా ఉండేవి. గర్భగృహం కుడ్యాలపై ఎలాంటి అలంకరణలు లేవు దేవకోష్ఠాలు కూడా లేవు. పైన విమానం, అధిష్ఠానం, పట్టిక, తలం, నశిల్పం తలం శిల్పం, పట్టిక అనే 6 భాగాలుగా విభజింపబడి ఉంటుంది.

ప్రాంగణంలో ఉపమండపాలు పరిమితంగాను, ఎక్కువగా కూడా ఉంటాయి. ఆగమశాస్త్రాలు

ఉపమండపాల నిర్మాణానికి ఎలాంటి నియమాలు చెప్పలేదు. ఈ ఉపమండపాలలో అష్టదిక్పాలురను, నవగ్రహాలను, ఇతర దైవాలను ప్రతిష్టించేవారు. ప్రాకారానికి నాలుగు మూలలలో కూడా మండపాలు నిర్మించేవారు. వీటిని మండపాలు అని అనేవారు. లేపాక్షి పాపనాశేశ్వర ఆలయంలో ఏడు వారాల పేరుతో విశాలమైన మండపాలున్నాయి.

10. ప్రాకారాలు రెండు రకాలుగా నిర్మించారు. కొన్ని ఆలయాలలో ఒకే ప్రాకారం, మరికొన్ని ఆలయాలలో ఒకే బహుప్రాకార నిర్మాణాలు చేశారు. శ్రీరంగంలో సప్తప్రాకారాల మధ్య పట్టణం ఉంది. లేపాక్షి స్తంభాలు 3 రకాలుగా ఉన్నాయి. మొదటి రకం స్తంభాల అందం లేక షాష్పముఖాలు గల విభాగం ఉంది. ఘనచతురస్రపు విభాగ ముఖంపై దేవతల అర్ధ శిల్పాలున్నాయి. ఇలాంటిది హజరారామ దేవాలయ ముఖ మండపంలో మధ్యన ఉంది. రెండవ రకం స్తంభాలలో కోపంతో దూకుతున్న సింహం శిల్పాలున్నాయి. వాటి వెనుక కాళ్లు ఏనుగులను అణచివేస్తున్నట్లు ఉంది. వాటిని వ్యాళ స్తంభాలు అని అంటారు. వ్యాళాల నోళ్లలో బయటికి తీయటానికి వీలు లేని బంతులను రూపొందించారు. ఇది ఈ కాలం నాటి అద్భుత శిల్పకళా లక్షణం అని చెప్పవచ్చును. ఆబంతులను లోపల గుండ్రంగా తిప్పవచ్చును, అటు ఇటు కదిలించవచ్చును. మూడవ రకం స్తంభాలు ఉప స్తంభాలున్నాయి. కొన్ని స్తంభాలపై కూటసాల పంజరాలు చెక్కి ఉన్నాయి. వాటిని చిత్రఖండ స్తంభాలు అని అంటారు. కొన్ని స్తంభాలకు బ్రాకెట్లు ఉన్నాయి. కొన్ని స్తంభాల శీర్షికలు, చోళ స్తంభాల శీర్షికల లాగా ఉన్నాయి. కొన్ని శీర్షికలు పద్మకాండం లాగా వంపు తిరిగి ఉన్నాయి. దాని అడుగున పుష్పపోలిక ఉంది.

11. విజయనగర కట్టడాలలో హిందూ, ముస్లిం వాస్తురీతుల సమ్మేళనం కూడా జరిగింది. ఈ పద్ధతి రాజభవనాల నిర్మాణంలో పాటించారు

అలంకరణలు: విజయనగర దేవాలయాలలో అలంకరణలు నాలుగు విధాలుగా ఉన్నాయి.

1. పుష్పలతాలంకరణలు, 2. జంతుచిత్రాల అలంకరణలు, 3. ఇతిహాస శిల్పాలు, 4. లౌకిక శిల్పాలు.

కళ్యాణమండపం: విజయనగర రాజుల కాలంలో ప్రసిద్ధి చెందిన ఉపమండపం కళ్యాణమండపం. దేవుని కళ్యాణం జరపడానికి ఈ మండపం నిర్మించారు. ఇది కూడా మహామండపాన్ని పోలి ఉంటుంది. లేపాక్షిలో కళ్యాణ మండపానికి లతాలంకరణలు చేశారు. అందువల్ల దానిని లతామండపం అని కూడా పిలుస్తారు. ప్రతి సంవత్సరం దేవునికి కళ్యాణం జరిపే ఆచారం వీరి కాలం నుండి ప్రారంభమైంది. అంతేగాక ఆలయ ప్రాంగణంలో యజ్ఞశాలలు సామగ్రి ఉంచే గదులను కూడా నిర్మించారు.

సాలెటూర్ వర్ణించిన విజయనగర స్తంభాలు: సాలెటూర్ అనే పండితుడు విజయనగర కట్టడాలలోని స్తంభాలను గురించి చాలా వివరంగా వర్ణించాడు. విజయనగర యుగంలో గుండ్రని స్తంభాలు ఉపయోగించే విధానం పోయి నలుచదరంగా ఉండే స్తంభాలు వాడారు. ప్రధాన స్తంభాలు నలుచదరంగా తయారు చేయగా గుండ్రని స్తంభాలు ఉపస్తంభాలుగా ఉపయోగించారు. అవి కూడా కుంభపంజరాలలో అలంకరణ స్తంభాలుగా వాడారు. ఇలాంటి అలంకరణ మనకు హజరా రామస్వామి ఆలయంలో కనిపిస్తుంది. నలుచదరపు స్తంభాలు జంటగా కూడా తయారు చేశారు. విఠల్‌స్వామి ఆలయంలోని కళ్యాణమండప స్తంభాలు జంట చతురపు స్తంభాలతో నిర్మించారు. అంతేకాదు ఇక్కడ జంట స్తంభాలను చేర్చి కొన్ని ఉపస్తంభాలు కూడా నిర్మించారు. ఈ ఏర్పాటు అలంకరణ అందం కోసం కాదు. గజముఖాలతో స్తంభాలు చెక్కాలనే ఇలా చేసినట్లు కనిపిస్తుంది. అంతకు పూర్వం గుర్రాలపై ఉన్న రౌతులు పై స్తంభాలు మోస్తున్నట్లు చెక్కేవారు. అది అవాస్తవంగా భావించి శిల్ప నూతన పద్ధతిని అవలంబించి గజముఖాలతో స్తంభాన్ని రూపొందించారు. ఇదే పద్ధతిలో వెల్లూరులోని వైకుంఠ పెరుమాళ్ల ఆలయంలో కూడా నిర్మించారు. విఠల్‌స్వామి ప్రధాన ఆలయంలో స్తంభాలను విభజించలేదు. కాని అక్కడి నడవలోను, కృష్ణస్వామి ఆలయంలో స్తంభాలను విభజించారు.

ద్విస్తంభ పద్ధతిలో మరికొన్ని లక్షణాలు కూడా చోటు చేసుకున్నాయి. విఠల్‌స్వామి ఆలయంలోకి ప్రవేశించే ముందు ఉన్న స్తంభాల వేదికలు సింహశిల్పాలతో తయారు చేయబడ్డాయి. వెల్లూరులోని వైకుంఠ పెరుమాళ్ ఆలయంలోని కళ్యాణమండపు స్తంభాలపై కృష్ణదేవరాయలు తన ముగ్గురు దేవేరుల శిల్పాలు చెక్కించాడు. నాలుగు పలకలు కలిగిన చతురస్రపు స్తంభాలు దీపమాలలుగా అంటే దీపపు స్తంభాలుగా కూడా ఉపయోగించాడు. భక్తల్‌లోని నారాయణ దేవాలయంలో అలాంటి ఏర్పాటు చేశారు. చతురస్రపు స్తంభాలను బాగా కింది నుండి పైకి

భాగాలుగా చేసి రకరకాల శిల్పాలు చెక్కారు. కింది భాగం మీద నాగబంధాలు చిత్రించారు. దానిపై కీర్తి ముఖాలు నిర్మించేవారు. దానిపై కప్పు వేసేవారు. అచ్యుతరాయల కాలం నాటికి ఈ పద్ధతి బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆలయపు కప్పుల మీద కుడ్యాలు నిర్మించి పరివారదేవతల శిల్పాలను ప్రతిష్ఠించేవారు. విరల్‌స్వామి ఆలయంలో ఈ పద్ధతి అనుసరించారు. హంపిలోని హజారా రామస్వామి ఆలయపు స్తంభంపై ఉన్న వేణుగోపాల శిల్పం ఉజ్జయిని వద్ద ఉన్న మలాల్‌కెరె ఆలయంలో ఉన్న వేణుగోపాల విగ్రహాన్ని పోలి ఉందని సాలెటూర్ వ్యాఖ్యానించాడు. విజయనగర చక్రవర్తులు పూర్వపు శిల్ప సంప్రదాయాలను అనుసరిస్తూనే తమదైన శైలిని రూపొందించుకున్నారని సాలెటూర్ వ్యాఖ్యానించాడు.

పెర్సీ బ్రౌన్ వర్ణన: సాలెటూర్ లాగే పెర్సీ బ్రౌన్ కూడా విజయనగర శిల్పాలను అద్భుతంగా వర్ణించాడు. స్తంభాలను అలంకరించడంలో విజయనగర చక్రవర్తులు తమ ప్రత్యేకతను చూపారని అన్నాడు. స్తంభం కనిపించనంతగా భారీ శిల్పం చెక్కారు. స్తంభం శిల్పంలో అడుగున పైకిలేచి గుర్రంగాని, ఎగురుతున్న నీటిగుర్రం గాని, లేదా పైకిలేచే మరొక జంతువునో శిల్పించారు. విజయనగర స్తంభాలలో కనిపించే మరొక నమూనా మధ్య కనపడే స్తంభాల చుట్టూ చిన్న స్తంభాలున్నాయి. వీటిని సంగీత స్తంభాలని అంటారు. ఒక రాతి ముక్కతో దానిని తాకితే స్వరధ్వని వినిపిస్తుంది. ఏడు చిన్న స్తంభాలు సప్తస్వరాలను వినిపిస్తాయి. ఇది చాలా అద్భుతం. మూడవ రకపు స్తంభాల ఉపరితలంపై చిన్న గుళ్ల సముదాయనం ఒకదాని మీద ఒకటి శిఖరం, గోపురాలను చెక్కినట్లుగా చెక్కారు. ఈ స్తంభాల పుష్పకపోతిక, స్తంభం నుండి విడివడి ఊగుతున్నట్లుగా కనిపిస్తుంది. ఇలాంటి అద్భుత స్తంభాలను పెర్సీ బ్రౌన్ చిత్ర ఖండపు స్తంభాలని కీర్తించాడు.

పుష్పాలంకారాలు: ఈరకం అలంకరణలలో పూవులు, లతలు చిత్రీకరిస్తారు. పద్మం షోడశ దళపద్మం చెక్కుతారు. అలాగే స్తంభాలపైన స్తంభ శీర్షాలపైన, కుడ్యాలపైన, అధిష్ఠానాలపైన పద్మపత్రాలు తప్పకుండా చెక్కుతారు. బలిపీఠం వద్ద స్తంభం శీర్షిక వద్ద ఊర్ధ్వపద్మాలు, అధిష్ఠానం వద్ద అధః పద్మాలంకరణ చిత్రిస్తారు. ఇవి ప్రధానంగా రేఖా చిత్రాలుగా కనిపిస్తాయి.

జంతు అలంకరణలు: ఈ రకం అలంకరణాలలో ఏనుగులు, గుర్రాలు, సింహాలు, కోతులు చిత్రించారు. స్తంభాల అధిష్ఠానాలు జంతువులతో తీర్చిదిద్దారు. అశ్వకులు, ముంగాళ్లపై నిలబడిన సింహాలు, మెట్ల వరుసల పక్కన ఏనుగుల శిల్పాలు చెక్కారు. ఇంకా చేప, తాబేలు, కోడి, నెమలి, రకరకాల పక్షులను కూడా చిత్రించారు. ఇవి కూడా రేఖాచిత్రాలుగా కనిపిస్తాయి.

ఇతిహాస శిల్పాలు: ఈ రకం శిల్పాలలో మానవాకృతులతోపాటు జంతు రూపాలు కూడా ఉన్నాయి. ఇతిహాసాలు, పురాణాలలో చెప్పిన కథలను ఇతివృత్తాలుగా తీసుకొని శిల్పంగా చెక్కారు. భక్త కన్నప్ప కథ, చిరుతొండ, నంబికథ, సీతాకళ్యాణం మొదలైన ఘట్టాలు చిత్రించారు. ప్రజలకు పురాణగాథలు తెలియజేయడం ఈ శిల్పాల ఉద్దేశం. ఇందులో చిత్రించబడిన వ్యక్తులు ఆజానుబాహులు. స్త్రీలు సర్వాభరణాలతో అలంకరించుకొని అందంగా కనిపిస్తారు. తాండవకృష్ణుని అనేక చిత్రాలలో చిత్రించారు.

లౌకిక చిత్రాలు: ఈ తరగతిలోకి నాట్యకత్తెలు, యుద్ధవీరులు, సాధారణ మనుషుల చిత్రాలు వస్తాయి. మార్గం గుకులు, వైణికులు, నాట్టువరాండ్రు, అశ్వికులు, యోర్షుల శిల్పాలు వస్తాయి. కావ్యాలలో వర్ణించబడిన వారిజాక్షులు, దంటోరు, ఆజానుబాహులైన స్త్రీ పురుషులు చిత్రాలు చిత్రించి చూపరులకు మానసిక ఆనందాన్ని కలిగించారు. ఇంకా కందుకక్రీడ, కోలాటం, చదరంగం, స్త్రీపురుషుల అలంకరణలు, ఆయుధాలు కూడా చిత్రించారు. రోలు, రోకలి మొదలైన నిత్యజీవితంలో వాడే వస్తువులను కూడా చిత్రించారు. విజయనగర దేవాలయాలు దక్షిణదేశంలోని అనేక ప్రదేశాలలో నేటికీ నిలిచి ఉన్నాయి. వాటిని రెండు రకాలుగా విభజించవచ్చును. ఆంధ్రప్రాంతంలోని దేవాలయాలు, ఆంధ్రేతర ప్రాంతంలోని దేవాలయాలు.

ఆంధ్రప్రాంతంలో అనంతపురం జిల్లాలో 1. లేపాక్షి, 2. తాడిపత్రి, 3. గోరంట్ల, 4. పెనుగొండ, 5. కదిరి-కడపజిల్లా, 6. కమలాపురం, 7. పుష్పగిరి చిత్తూరు జిల్లా, 8. చంద్రగిరి, 9. సోమపాలెం, 10. కాళహస్తి, 11. తిరుపతి, 12. నారాయణవరం, 13. నాగలాపురం నెల్లూరు జిల్లా, 14. ఉదయగిరి కర్నూలు జిల్లా, 15. శ్రీశైలం, 16. అహోబిలం, 17. మార్కాపురం, తెలంగాణలో 18. జటప్రోలు, 19. మాంచాలకట్ట మొదలైన ప్రదేశాలలో వారి దేవాలయాలున్నాయి.

లేపాక్షి - వీరభద్రస్వామి ఆలయ సముదాయం: విజయనగర కాలపు ఆలయాలలో అనంతపురంలోని

లేపాక్షిలోని వీరభద్రాలయం అగ్రగణ్యమైనది. దీనిని క్రీ.శ.1533 సంవత్సరంలో అచ్యుతరాయల కాలంలో పెనుగొండ కోశాధికారి అయిన విరూపణ్ణ నిర్మించాడు. కాని ఇటీవల ఆలయంలో లభించిన ఒక శాసనం క్రీ.శ.15వ శతాబ్దపు పశ్చిమార్ధంలో ఒక చిన్న దేవాలయం ఉండేదని తెలుపుతోంది. ఆ ఆలయాన్నే విరూపణ్ణ విస్తృత పరచి భారీ ఎత్తున నిర్మించి అద్భుత శిల్పాలు వర్ణచిత్రాలతో అలంకరించినట్లుగా కనిపిస్తోంది.

ఆలయ నిర్మాణ గాధ: విరూపణ్ణ అక్కడ వసూలు చేసిన పన్నులు కృష్ణదేవరాయలకు ఇవ్వకుండా ఈ దేవాలయాన్ని కట్టించాడని, అందువలన రాయలు అతని కళ్లు పీకించమన్నాడని, విరూపణ్ణ అది తెలిసి తానే తన కళ్లను పీకి దేవాలయపు గోడలకు కొట్టాడని కనుక దానికి లేపాక్షి ఆలయం అనే పేరు వచ్చిందని ఒక కధ ప్రచారంలో ఉంది. కాని ఈ ఆలయం అచ్యుతదేవరాయల కాలంలో నిర్మించబడిందని చరిత్రకారులు అంటున్నారు. అంతేగాక అచ్యుతదేవరాయలు తన ఎత్తు బంగారాన్ని లేపాక్షి దేవునికి కాంచీపురంలో దానం చేసినట్లు తుంగభద్రా నదీ తీరంలోని విరలరాయ సన్నిధిలో లేపాక్షి ఆలయానికి రెండు గ్రామాలు దానం చేసినట్లు శాసనాలున్నాయి. విరూపణ్ణ మరణానంతరం అచ్యుతరాయులు దేవాలయ నిర్వహణకు ఈ దానాలు చేసి ఉండవచ్చును. లేపాక్షి దేవాలయంలో కొన్ని నిర్మాణాలు అసంపూర్ణంగా నిలబడి ఉన్నాయి. అచ్యుత దేవరాయల తర్వాత సామ్రాజ్యంలో వచ్చిన కల్లోలాల వల్ల గాని, విరూపణ్ణ మరణం వల్ల గాని నిర్మాణం మధ్యలో ఆగిపోయి ఉండవచ్చును.

లేపాక్షి అనంతపురం జిల్లాలోని హిందూపురానికి తూర్పున 12 కిలో మీటర్ల దూరంలో ఉంది. ఊరికి దక్షిణంగా కూర్మశైలమనే పేరుతో చిన్న తెల్లశాసపురాలు కొండ ఉంది. ఆ కొండ మీద పాపనాశేశ్వర, రఘునాధేశ్వర, వీరభద్రేశ్వర అనే మూడు ఆలయాలు ఉన్నాయి. ఈ మూడు ఆలయాలకు ఒకే మండపం ఉంది. ఈ మూడు ఆలయాల సముదాయమే లేపాక్షి దేవాలయంగా జగత్ ప్రసిద్ది చెందింది. విజయనగర యుగంలో లేపాక్షి పెనుగొండ రాజ్యంలో భాగంగా ఉండేది. నేడు హిందూపురానికి వెళ్లే బాటకు ఎడమవైపున ఉన్న గ్రామం పాత లేపాక్షి అని అక్కడి ప్రజలు చెపుతారు. ఈ గ్రామం పక్కన చెరువు ఉంది. ఆ చెరువుకట్ట మీద దిగువన శివాలయాలు ఉన్నాయి. కనుక లేపాక్షి దేవాలయ సముదాయం నిర్మించకముందే అక్కడ గ్రామం ఉన్నట్లు రూఢి అవుతోంది. పాపనాశేశ్వరుని ఆలయపు తూర్పు గోడ మీద ఒక బండ మీద భిక్షాటన శివుని శిల్పం ఉంది. ఇది అర్ధశిల్పం. ఇలాంటి శిల్పాలు చెక్కే ఆచారం పల్లవుల కాలం నాటిది. చోళుల కాలం నాటి కాళహస్తి మణికంఠేశ్వర ఆలయంలో ఉన్నాయి. లేపాక్ష్యాం పాపనాశనః అని స్కంధ పురాణంలో ఉంది. కనుక అక్కడ పాపనాశేశ్వర దేవాలయం ఉందని సూచిస్తుంది. ఈనాటి ఆలయానికి ఆగ్నేయ మూలలోని పెద్ద పెద్ద బండలు, గుహల లాగ ఉన్న మూలలున్నాయి. వాటిని పరికిస్తే అది పూర్వం జైన స్థావరం అనే భావన కలుగుతుంది. మధ్యయుగంలో జైనదేవాలయాలను ధ్వంసం చేసి వీరభద్ర ఆలయాలు నిర్మించారు. ఈ ఆధారాలన్నీ లేపాక్షి ప్రాచీన క్షేత్రం అని చాటుతున్నాయి. కూర్మశైలానికి తూర్పున ఒక కిలో మీటరు దూరంలో కొన్ని పాదాల గుర్తులున్నాయి. అవి కూడా జైన మునుల గుర్తులు అని అంటారు. లేపాక్షి అనే పేరు ఎలా వచ్చిందో తెలియదు. కాని అక్కడి వారు జటాయువు ఈ కొండ వద్ద రావణునితో పోరి రెక్కలు తెగి పడిపోయాడని శ్రీరాముడు అతనిని లేపాక్షి అని అన్నాడని, కనుక లేపాక్షి అని పేరు వచ్చిందని చెపుతారు. కాని ఇది కట్టుకధ. ఆనాడు తెలుగుభాష ఉన్న దాఖలాలు లేవు. విరూపణ్ణ తన రెండు కళ్లను గోడకు కొట్టాడని, ఆ అక్షుల లేపనం వల్ల లేపాక్షి అని పేరు వచ్చిందని పలువురు భావిస్తారు. ఆలయపు గోడలపై ఉన్న రెండు రంధ్రాలు, ఆ రంధ్రాల నుండి కారిన రెండు చారలను విరూపణ్ణ అక్షుల గుర్తులని కూడా అక్కడి ప్రజలు చూపిస్తారు. కొందరు పద్మాక్షి, కామాక్షి, మీనాక్షి లాగా లేపాక్షి కూడా ఏదైనా స్త్రీదేవత పేరేమోనని ఊహించారు. ఏమైనా ఆ పేరు ఎలా వచ్చిందీ స్పష్టంగా తెలియదు.

ఈ ఆలయాన్ని నిర్మించినవాడు విరూపణ్ణ. ఇతడు విజయనగర సామ్రాజ్యంలో ఒక నాయంకరుడు. అచ్యుత దేవరాయల కాలంలో పెనుగొండ నాయంకరాన్ని పొంది అక్కడ స్థానిక పాలెగాడుగా ఉండేవాడు. కొందరు అతనిని శ్రీకృష్ణదేవరాయల కాలం వాడని అంటారు. ఇతని తండ్రి నంది లక్కిశెట్టి, తల్లి ముద్దమ్మ. ఆమెకు ముదమాంబిక అని కూడా పేరుంది. వారు లేపాక్షి గ్రామవాసులు. విరూపణ్ణ కూడా అక్కడే జన్మించి ఉండవచ్చును. ఇతనికి వీరణ్ణ అనే పేరు గల సోదరుడు కూడా ఉన్నాడని శాసనాలు తెలుపుతున్నాయి. శాసనాలలో విరూపణ్ణ నాయక, విరూపణ్ణ భూపతి పేర్కొనబడ్డాడు. సోదరులిద్దరూ నాయంకరులే. వీరణ్ణ గోదానహళ్లిలో లక్కమ్మ దేవాలయం నిర్మించాడు. అతడు అక్కడ స్థానిక పాలెగాడు కావచ్చును. విరూపణ్ణ లేపాక్షిలో

ఆలయాన్ని నిర్మించాడు. కాని లేపాక్షిలోని పాపనాశేశ్వర ఆలయం అంతకుపూర్వమే ఉన్నట్లు తెలుస్తోంది. కనుక విరూపణ్ణ దానికి గోపురం, మంటపం నిర్మించి ఉండవచ్చని, వీరభద్ర ఆలయం అతని నిర్మాణం అయి ఉండవచ్చని 3 గుడులకు ఒకే మండపం నిర్మించాడు గనుక అతడే 3 దేవాలయాలు నిర్మించాడని, కాలక్రమంలో అతనికి కీర్తి వచ్చి ఉండవచ్చని పండితులు భావించారు. కాని ఆ దేవాలయంలో క్రీ.శ.1538వ సంవత్సరానికి ముందు శాసనాలు లభించలేదు. మొత్తం మీద విరూపణ్ణ లేపాక్షి ఆలయ నిర్మాతగా ప్రసిద్ధి చెందాడు.

ఈ ఆలయ సముదాయం ఒకే మూసిన మండపంలో ఉన్నాయి. అందులో ప్రధానమైన మూడు ఆలయాలే గాక మరో మూడు చిన్న ఆలయాలు కూడా ఉన్నాయి. మొత్తం 6 ఆలయాలు అక్కడున్నాయి. అవి 1. పాపనాశేశ్వర ఆలయం, 2. పార్వతి ఆలయం, 3. రామలింగ ఆలయం, 4. హనుమలింగ ఆలయం, 5 రాఘునాథదేవర ఆలయం, 6. వీరభద్ర ఆలయం. వీనిలో పాపనాశేశ్వర ఆలయం అతి ప్రాచీనమైంది. ఈ దేవుడు, భద్రకాళి, నవగ్రహాలు కూడా ఉన్నాయి.

లేపాక్షి గుడిలో ఒక స్తంభం గుడి పైభాగం నుండి కిందికి వేలాడుతూ ఉంటుంది. నేలను తాకినట్లుగా ఉండేలా ఎలా వేలాడదీశారో ఎవరికీ అంతుబట్టలేదు. ఒక గుడ్డపొరను స్తంభం అడుగునుండి అటూ ఇటూ తీయవచ్చును. అంటే స్తంభం కింద ఆనలేదని, అది వేలాడుతూ ఉందని అర్థం అవుతోంది.

పాపనాశేశ్వర ఆలయం: ఈ ఆలయం పశ్చిమ ముఖంగా ఉంది. గర్భాలయం పెద్ద పెద్ద రాళ్లతో నిర్మింపబడి ఉంది. పశ్చిమ చాళుక్యుల కాలం నాటి గర్భాలయం లాగా చిన్నదిగా ఉంది. ఈ ఆలయంలో పానపట్టం గుండ్రంగా ఉంది. గర్భాలయంలో లింగం ఉంది. ఈ లింగమే పాపనాశేశ్వరుడు. ఈ లింగం బాణ రాజుల కాలంలో ఉండే విధంగా ఉంది. కనుక ఇందులోని లింగం బాణ లింగమని కొందరు భావించారు. ఈ దేవాలయం పశ్చిమ చాళుక్యుల కాలానికి చెందిందని కొందరి అభిప్రాయం. చాళుక్యుల కాలంలోనే మూసిన అర్ధమండపాలు నిర్మించేవారు. కనుక ఆ ప్రాంతాన్ని పాలించే వారి సామంతులైన బాణులు ఆ ఆలయాన్ని నిర్మించి ఉండవచ్చని కొందరు భావించారు. గర్భాలయంలో కప్పు కర్రవాసాలతో మూసి ఉంది. ఇది కూడా పశ్చిమ చాళుక్యుల సాంప్రదాయమే. అయితే 14వ శతాబ్దంలో బుక్కరాయ సముద్రంలోని శంకర దేవాలయంలో కూడా పానపట్టం గుండ్రంగా ఉంది. కనుక ఈ ఆలయం ఎప్పుడు నిర్మించిందీ స్పష్టంగా చెప్పడానికి వీలుపడటం లేదు మొత్తం మీద ఇది విరూపణ్ణకు ముందే గర్భాలయం, శుకనాసి ఉన్నవని, శుకనాసి ముందుగోడకు విరూపణ్ణ ద్వారం అమర్చి గోపురం నిర్మించాడని భావించారు. ఈ ఆలయపు ఈశాన్య మూలన ఉన్న స్తంభంపై పాంచాల పురుషుని శిల్పం చెక్కి ఉంది. ద్వార బంధాలకు ద్వారపాలురు ఉన్నారు. ద్వారా బంధం అడ్డు కమ్మీ మీద మధ్యన ఆరు చేతులున్న కిరీటధారి శిల్పం చెక్కి ఉంది. ఇతని ముక్కు ద్వారపాలుర ముక్కులు ఒకే రీతిలో ఉన్నాయి. ఇతని కింది రెండు చేతులు మధ్య రెండు చేతులలో కలశాలు ఉన్నాయి. పద్మాసనంలో కూర్చొని ఉన్నాడు. పై రెండు చేతులలో కూడా కలశాలు ఉన్నాయి. ఆ కలశాలలోని-నీటిని కిరీటంతో ఉన్న తల మీద పోస్తున్నాయి. ఈ కలశాలు అమృత కలశాలు కావు. ఔషధ కలశాలూ కావు. స్నాన కలశాల లాగా ఉన్నాయి. దక్షిణపు వరండాలోని కప్పు మీద కూడా ఈ దేవుడే రంగులతో చిత్రించబడి ఉన్నాడు. ఆ చిత్రంలో కూడా చేతులలో ఇలాగే కలశాలు ఉన్నాయి. ఆయన వ్యాఘ్రాజన వస్త్రాన్ని ధరించాడు. ఆయనకు అటు ఇటు భక్తులున్నారు. లేపాక్షిలో ఉన్న ఇతర వర్ణచిత్రాలలో కూడా శివునికి ఇటువంటి వస్త్రమే కట్టి ఉంది. కనుక ఈ శిల్పం ఈశ్వరునిదని భావింపబడింది. కొందరు ఆ శిల్పాన్ని మృత్యుంజయుడు అని అన్నారు. కాని ఏ శివాలయంలోనూ ద్వారబంధం మీద అలాంటి శిల్పం లేదు. ఈ శిల్పం ఈ ఆలయంలోని ప్రత్యేకత అని చెప్పవచ్చును. శిఖరం గుండ్రని పెద్ద అమలకములతో నిర్మింపబడింది. విజయనగర కాలంలో ఆలయానికే కాకుండా నాలుగు స్తంభాల మండపానికి ఈ ఆలయపు శిఖరం ఉంది. కనుక ఈ శిఖరం నిర్మించే సాంప్రదాయాన్ని పాటించారు. ఇదే పద్ధతిలో ఈ ఆలయపు శిఖరం ఉంది. కనుక ఈ శిఖరం విజయనగర కాలంలో విరూపణ్ణ నిర్మించాడని భావింపబడింది. ఇలాంటి శిఖరాలు పెనుగొండ, బుక్కసముద్ర ఆలయాలలో ఉన్నాయి. ఈ ఆలయ ముఖమండపానికి ముందు వరండా ఉంది. దాని ముందు నాట్యమండపం ఉంది. దానికి 70 స్తంభాలున్నాయి. ఆ స్తంభాలపై నందికేశ్వరుడు రంభ, తుంబురుడు, భిక్షాటనమూర్తి మొదలైన దేవతామూర్తుల శిల్పాలున్నాయి.

పాపనాశేశ్వరుని ఆలయానికి దక్షిణంగా పార్వతి ఆలయం ఉంది. ఈ పార్వతి విగ్రహం శిల్పశాస్త్రాలు వర్ణించే విధంగా లేదు. ఈ ఆలయానికి శిఖరం లేదు. ద్వారబంధాలు ఒకేసారి నిర్మించినట్లు లేవు. ఒకవైపున

ద్వారపాలుడు లేడు. ద్వార బంధం పైకమ్మీ మీద ఎలాంటి చిహ్నాలు లేవు.

పాపనాశేశ్వరుని ఆలయం ముందు ఒక నంది ఉంది. కాని ఊరి బయట ఉన్న బసవణ్ణ విగ్రహానికి ఉన్న అలంకరణకు, దీనికి చాలా తేడాలున్నాయి. అలాగే నందికి ఉన్న పానపట్టం తెలుగుచోళుల కాలం నాటి పానపట్టం లాగ ఉంది. నందులకు పానపట్టం నిర్మించే ఆచారం కాకతీయుల కాలంలో ప్రారంభమైంది.

రఘునాథ ఆలయం: పాపనాశేశ్వరుని ఆలయం ఎదురుగా ఉన్న ఆలయాన్ని రఘునాథ ఆలయం అని పిలుస్తున్నారు. ఈ ఆలయానికి కోదండరామస్వామి ఆలయం అని కూడా పేరుంది. కన్నడిగులు ఈ ఆలయాన్ని చెన్నకేశవ ఆలయం అని పిలుస్తున్నారు. 16వ శతాబ్దపు విజయనగర శాసనాలు ఈ దేవుని రఘునాథదేవరు అని సంబోధిస్తున్నాయి. రఘునాథదేవరునికి పానపట్టం ఉంది. విజయనగర యుగంలో శైవులు, జైనులు వైష్ణవులు అందరూ తమ దేవుళ్లను అభిషేకించేవారు. కనుక రఘునాథ దేవరకు పానపట్టం ఏర్పాటు చేసి ఉండవచ్చును. గర్భాలయపు ద్వారబంధంపై వైష్ణవచిహ్నం అయిన గరుత్మంతుడు లేడు. ఆ స్థానంలో గజలక్ష్మి శిల్పం ఉంది. ఈ ఆలయంపై ఉన్న శిఖరం ఆకర్షణీయంగా లేదు. మెట్లలాగ అర్ధగీతలతో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ ఆలయంలో దేవి విగ్రహం లేదు. విజయనగర యుగం చివరి వరకు దేవికి ప్రత్యేకంగా ఆలయం నిర్మించే ఆచారం రాలేదు. అంతవరకు దేవుళ్లను జంటగా ప్రతిష్ఠించేవారు. లక్ష్మీనరసింహస్వామి, ఉమామహేశ్వరులు జంటగా విగ్రహ ప్రతిష్ఠ చేసేవారు. కనుక ఇది విరూపణ్ణ కాలంలో నిర్మించినదేనని భావింపబడింది.

రామలింగ హనుమలింగ ఆలయాలు: అర్ధమండపంతో పాపనాశేశ్వర ఆలయంతోపాటు మరి రెండు లింగాలున్నాయి. ఈ లింగానికి ఇటుకలతో నిర్మించిన ఆలయం ఉంది. ఇది ఇటుకలతో నిర్మించి ఉన్నందు వల్ల స్థానికులు అది అతి ప్రాచీన దేవాలయమని చెపుతారు. కాని అది అలా కనిపించదు. వెలుపలి గోడలలో అర్ధ స్తంభాలు అలంకారాలుగా చేర్చారు. అలాగే దాని అమలకం పలకలుగా ఉంది. కనుక ఇది విజయనగర కాలానికి చెందినదేగాని అతిప్రాచీన ఆలయం అని చెప్పటానికి వీలులేదు. ఈ ఆలయం పక్కనే వీరభద్రాలయం ఉంది.

వీరభద్రాలయం: వీరభద్రాలయం ఉత్తరముఖంగా ఉంది. ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ప్రదక్షిణ పథం ఉన్నాయి. ఆలయపు ద్వారబంధాలకు ఇరుపక్కల ద్వారపాలురు ఉన్నారు. ద్వారబంధం పైకమ్మీ మీద లింగార్చన చేస్తున్న ఏనుగుల శిల్పాలు చెక్కారు. గజలింగానికి కింద ఉన్న శిల్పాలు విరిగిపోయి ఉన్నాయి. బహుశా అక్కడ సింహలలాటంగాని, గండభేరుండంగాని ఉండి ఉండవచ్చును. ఈ ఆలయానికి కూడా పాపనాశేశ్వర, రఘునాథేశ్వర ఆలయాలకు లాగే గర్భాలయం, శుకనాసిక ఉన్నాయి. గర్భాలయంలోని వీరభద్ర విగ్రహం 5 అడుగుల ఎత్తు ఉంది. ఈ ఆలయంపైన నిర్మించబడిన శిఖరం చాలా అందంగా ఉంది. శిఖరం మంచి కుదురుగా ఉంది. అంతస్థులు విడివిడిగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అమలకం చాలా అందంగా అమర్చారు. ఈ మూడు ఆలయ శిఖరాలలో ఇది ఉత్తమ శిఖరం. చాలా అందంగా రూపొందించబడింది.

విజయనగర ఆలయాలకు సాధారణంగా గర్భాలయం అంతే వెడల్పున్న శుకనాసిక అంటే ముందు గది ఉంటాయి. ఇవి రెండూ భూమట్టానికి 4 అడుగుల ఎత్తు ఉంటాయి. శుకనాసిక నుండి నాలుగైదు మెట్లు ఉంటాయి. ఆ మెట్లు దిగగానే అర్ధమండపం ఉంటుంది. దీని వెడల్పు గర్భాలయానికంటే ఎక్కువగా ఉంటుంది. దీనికి మూడు వైపులా గోడలు వాటి మధ్యన ద్వారాలు ఉంటాయి. దాని ప్రధాన ద్వారం దాటి బయటికి వస్తే అన్ని వైపులా తెరచి ఉండే స్తంభాల మండపం ఉంటుంది. దీనినే ముఖమండపం అని అంటారు.

కాని లేపాక్షి ఆలయం అలా లేదు. మూడు ఆలయాలకు కలిపి ఒకే మూసిన మండపం అంటే అర్ధ మండపం నిర్మించాడు. వాటికి వేర్వేరు అర్ధమంటపాలు లేవు. అయితే ఈ అర్ధమండపం వెలుపల కుడ్యాలపై శిల్పాలు చెక్కించాడు. ఈ విధానం శ్రీశైల ప్రాకార కుడ్యాలపై ఉంది. బహుశా విరూపణ్ణ శ్రీశైలం దర్శించి ఉంటాడు. అర్ధమంటపం నిర్మించడంతో దేవాలయ సముదాయానికి రూపం ఏర్పడింది. అర్ధమంటపం చుట్టూ అరుగుని నిర్మించాడు. ఇది హొయసాలుల శైలి. దానిపైన కప్పుకు కర్రపేర్పులాగా కనపడే గళ్లు చెక్కించాడు. ఇది కూడా హొయసాల లక్షణమే. అర్ధమండపానికి ముందు అన్ని వైపులా తెరచిన స్తంభాల మండపం కూడా నిర్మించాడు. ఈ ఏర్పాటుతో గర్భాలయం అర్ధమండపం నాట్యమండపాలు పూర్తి అయ్యాయి. అర్ధమండపం, ముఖమండపాల లోకప్పులపైన శయనాగారపు గోడల మీద వర్ణచిత్రాలు వేయించాడు.

శిఖరాలు: ఈ ఆలయాలలో వీరభద్రాలయంపై వృత్తశిఖరంతో ద్వితలవిమానం ఉంది. రఘునాథ ఆలయం పై చతురస్రపు శిఖరం గల ద్వితల విమానం ఉంది. ఈ రెండు ఆలయకుడ్యాలపై ఎలాంటి అలంకరణలు లేవు.

ప్రాకారాలు: ఆలయం చుట్టూ ప్రాకారాలు నిర్మించాడు. మొదటి ప్రాకారానికి మూడు ప్రవేశ ద్వారాలు ఉన్నాయి. ముఖ ద్వారంపైన గోపురం నిర్మించాడు. దక్షిణపు గోపురం నిర్మించలేదు. ఉత్తరపు గోడ మీద సైనిక మాటులను ఏర్పాటు చేశాడు. ఈ ప్రాకారం లోతట్టున స్తంభాల వసారా ఉంది. ఈ మొదటి ప్రాకారంలోనే కళ్యాణ మండపం, లతామండపాన్ని నిర్మించాడు. దక్షిణ ద్వారానికి పడమర బాగా ఈ రెండూ ఎత్తైన వేదికల మీద నిర్మించాడు. ఆలయానికి నైరుతి దిశన సైనికుల గస్తీకి బురుజు నిర్మించాడు. ఈ ప్రాకారం మీద విరూపణ్ణ అచ్యుతరాయల దాన శాసనాలు చెక్కి ఉన్నాయి.

తర్వాత ఈ ప్రాకారం చుట్టూ రెండవ ప్రాకారం నిర్మించాడు. తూర్పు, పడమర, ఉత్తర ద్వారాల మీద గోపురాలు నిర్మించాడు. దక్షిణ ద్వారంపై గోపురం లేదు. చుట్టూ తిరుమాలను కూడా నిర్మించాడు. రెండవ ప్రాకారం తూర్పువైపు ద్వారంగా వస్తే మొదటి ప్రాకారపు గోడ అడ్డు వస్తుంది. అంటే మొదటి ప్రాకారానికి తూర్పుదిశలో ద్వారం లేదు. కాని పశ్చిమ ద్వారానికి ఎదురుగా గోడ అడ్డులేదు. అంటే మొదటి ప్రాకారానికి కూడా దాని ఎదురుగా ద్వారం ఉంది. పాత లేపాక్షి నుండి వచ్చేవారు పశ్చిమద్వారం గుండా వచ్చేవారు. కొండ దిగువన మరొక ప్రాకారం నిర్మించాలని తలచినట్లుగా ఉంది. అక్కడి ప్రాకార మండపాలు, నాలుగు స్తంభాల మండపాలు నిర్మించి ఉన్నాయి. కాని ప్రాకారం లేదు. ఊరి బయట పెద్ద బసవణ్ణ విగ్రహం మలిపించాడు. కాని ఈ రెండూ అసంపూర్ణంగా ఉన్నాయి. బహుశా ఇవి మొదలు పెట్టిన కొద్ది కాలానికే విరూపణ్ణ శిక్షింపబడి ఉంటాడు. అందువల్ల కొండ దిగువ ప్రాకారం, బసవణ్ణ నిర్మాణం మధ్యలో ఆగిపోయి ఉంటాయి.

వాస్తు శిల్పం: విజయనగర యుగంలో అర్ధమండపం ప్రాముఖ్యత తగ్గి కళ్యాణ మండపాల ప్రాముఖ్యత పెరిగింది. మండపాల గోడలలో అర్ధ స్తంభాలు ప్రతిష్టించడం, అర్ధశిల్పాలతో అలంకరించడం పెరిగింది. గోరంట్ల మాధవస్వామి ఆలయం, తాడిపర్తి రామలింగేశ్వర ఆలయం, పెనుగొండ మీద నరసింహాలయం అర్ధశిల్పం చిత్రించే కాలానికి ముందువి. కాని పుష్పగిరి చెన్నకేశవాలయం, పెనుగొండ శ్రీరామాలయం, కాశీ విశ్వేశ్వరాలయం, తాడిపర్తి చింతల వెంకటేశ్వర ఆలయం, చుక్కలూరు చెన్నకేశవ ఆలయాలలో అర్ధశిల్పం ఎక్కువ శిల్పించబడింది. అర్ధమండ గోడలు, గర్భాలయ గోడల మీద కూడా అర్ధశిల్పం వ్యాపించింది. ఇదే పద్ధతి లేపాక్షిలో అనుసరించబడింది. లేపాక్షిలో తూర్పు, ఉత్తర, పశ్చిమ గోడలపై అర్ధశిల్పం విడిగా ఉంది. కాని ఎందువల్లనో దక్షిణపు గోడ మీద అర్ధ శిల్పం చెక్కలేదు.

ముఖమండపం: సోమపాలెం, కదిరి, పెన్నహోబలంలో చతురస్రపు ముఖమండపాలున్నాయి. కాని లేపాక్షిలో ముఖ మండపం, దీర్ఘచతురస్రపు ఆకారంలో ఉంది. కొండ మీద స్థలం ఇరుకుగా ఉన్నందువల్ల ఎటుపడితే అటు జరగటానికి వీలులేక దీర్ఘచతురస్రంగా నిర్మించారు. తూర్పుపడమరలలో పొడవు ఎక్కువ, ఉత్తర దక్షిణాలలో పొడవు తగ్గింది. తూర్పు, పడమరలలో 10 స్తంభాలు, ఉత్తర దక్షిణాలలో 7 స్తంభాల వరుసలు ఉన్నాయి. మండపానికి ఉత్తరపు అంచున జమిల స్తంభాలు ఉన్నాయి. అవి 12 అడుగుల ఎత్తు ఉన్నాయి. ఇవి శేనప్పురాతితో నిర్మించినవి. వీనిలో అభ్రకపు స్పటికాలుంటాయి. శేనప్పురాయి నల్లరాతివలె మెరుగుపెట్టడానికి వీలుకాదు. ఒక్క ఉలి దెబ్బ తగిలితే అందులోని అభ్రకపు స్పటికలు ఊడిపోతాయి. రాతి మీద గుంటలు పడతాయి. కనుక స్తంభాలు గుండ్రంగా కాక పలకల పలకలుగా తయారు చేశారు. శేనప్పురాతి ఫలకాలతో కప్పు వేశారు. ఆ ఫలకాలు నునుపుగా చేయడానికి వీలులేక సున్నపుగారతో అలికి దానిపై వర్ణచిత్రాలు చిత్రించారు. కాకతీయులు, హొయసాలులు కప్పులకు నునుపు చేయడానికి వీలయిన మెత్తని నల్లనిరాయిని వాడి దానిపై శిల్పాలు చెక్కారు. కాని లేపాక్షిలో శేనప్పురాతిని వాడినందువల్ల శిల్పాలు చెక్కలేకపోయారు. కాని లోకప్పుల మీద చాలా వర్ణచిత్రాలు చిత్రించగలిగారు.

వేలాడే స్తంభం: ఈ ముఖమండపంలో వేలాడే స్తంభం ఒకటి ఉండేదని అక్కడి వారు చెపుతారు. దానికింద నుంచి సన్నని వస్త్రాన్ని దిగగొట్టి ఈ స్తంభాన్ని వేలాడే విధంగా చేశారేమో కాని ఇప్పుడు వారు చూపే స్తంభం వేలాడి లేదు. మామూలుగానే ఉంది. ముఖమండపానికి ఉత్తరం వైపు అర్ధమండప ద్వారానికి ఎదురుగా కిందికి దిగడానికి 10 మెట్లు ఉన్నాయి. ఆ మెట్లు దిగితే రెండవ గోపురం వద్దకు వెళతాము. ఈ గోపుర ద్వారబంధాలకు ఇరువైపులా విజయనగర శిల్పాలు వృక్షాలు చిత్రించి ఉన్నాయి. ఇవి రెండువైపులా ఒకే ఎత్తు లేవు. ద్వారబంధపు స్తంభాల ఎత్తులో కూడా తేడా ఉంది. ద్వారపాలురు కూడా ఒకే ఎత్తులో లేరు. కుడివైపు ద్వారపాలుడి విగ్రహం పెద్దది, ఎడమ వైపుది చిన్నది. ఎడమవైపు ద్వారపాలుడు కుడివైపుకు చూడకుండా నృత్యం చేస్తున్నట్లు ఉంది.

చదునైన ప్రదేశంలోకాక కొండపై నిర్మించినందుకు ఈ అపసవ్యం ఏర్పడింది.

ద్వారాలకు ముందు కుడివైపున ప్రాకారం మీద లింగార్చన చేసే వ్యాఘ్రపాదుని అర్ధశిల్పంలో చెక్కారు. ఎడమవైపున ఒకే శరీరంతో మూడు తలలు గల ఆవు శిల్పం ఉంది. ఇది మూడు వైపుల నుండి ఎటుచూసిన ఆవు లాగా కనిపిస్తుంది. ఇక్కడ విజయనగర చిహ్నాలైన వరాహం, కత్తి, సూర్యచంద్రులు లేరు. ఇవి గోరంట్ల, తాడిపర్తి, పెనుగొండ ఆలయాలు గోపురాల మీద చిత్రించి ఉన్నాయి. రెండు ప్రాకారాల మధ్య ధ్వజస్తంభ పునాదులున్నాయి. వీటిని దాటి వస్తే ఉత్తరపు బయటిగోపురం ఉంది. కాని అది కూలిపోయింది. దీని ద్వారబంధాలపై అలంకరణలు లేవు. ఈ రెండవ ప్రాకారం నేటికీ ఆలయానికి చుట్టూ ఉంది. ఇది ఒక్కటే ఆలయానికి ఉన్న పూర్తి ప్రాకారం. గోపుర మండపం కూడా సాధారణ స్తంభాలతో నిర్మింపబడింది. ఈ ప్రాకారం రెండు వరుసలలో రాతి పేర్పులు చేసి మధ్యలో ఎర్రమట్టి కంకర కలిపి పోశారు. ఆలంపురంలో బాదామీ చాళుక్యులు గోడలు ఇట్లాగే నిర్మించారు. శ్రీశైల ప్రాకారం, విజయనగర కోట గోడలు కూడా ఇలాగే నిర్మించారు. గోడలు కింద వెడల్పు తగ్గి పైన బీళ్ల గోపురాలు నిర్మించారు. ఇలాంటివి లేపాక్షి, గొరవనహళ్లి లక్ష్మమ్మ గుడికి మాత్రమే ఉన్నాయి.

బురుజు: బయటి ప్రాకారానికి 15 గజాల దూరంలో నైరుతి మూలన ఒక బురుజు ఉంది. ఆ కాలాలలో ముస్లింలు దేవాలయాలను ధ్వంసం చేస్తూ ఉండేవారు. కనుక ఆలయ రక్షణకు ఈ బురుజు నిర్మించారు. కోట లోపల నీటి గుంట మొదటి ప్రాకారం మీద ఉన్న సైనిక మాటులు ఇవన్నీ రక్షణకు ఉద్దేశించినవే.

ప్రదక్షిణ పథం: బయట ప్రాకారం చుట్టూ ప్రదక్షిణ చేయవచ్చును. ఈ ప్రాకారం ఉత్తరపు ద్వారం గుండా లోపల ప్రవేశించవచ్చును. బయటి ప్రాకారపు లోతట్టున తిరుచుట్టుమాల మండపం ఉంది. దానికి దిగువన ప్రదక్షణ పథం ఉంది. అక్కడ కూడా ప్రదక్షిణం చేయవచ్చును. తిరుచుట్టుమాల అంచున జమిలి స్తంభాలున్నాయి. తూర్పు దిక్కున ప్రాకారానికి దగ్గరలో నేలపై శాసనం ఉంది. నేల మీద శాసనాలు రాయించే ఆచారం ఏ రాజవంశం పాటించలేదు. ఒక గుత్తిదుర్గంలో కొండమీద పశ్చిమ చాళుక్యుల కాలం నాటివి రెండు శాసనాలు మాత్రం నేలబండల మీద రాసి ఉన్నాయి. అవి తప్ప ఎక్కడా నేల శాసనాలు కనిపించవు. ప్రదక్షిణంలో దక్షిణం వైపు ప్రాకారం ఆగిపోయి కళ్యాణమండపం పీఠం ఎత్తుగా మొదలవుతుంది. కళ్యాణమండపానికి పశ్చిమంగా నాలుగు స్తంభాల మండపం ఉంది. సాధారణంగా ఇలాంటి మండపాలు దేవాలయ గోపురానికి ముందు ప్రాకారానికి బయట ఉంటాయి. తిరుపతి, కంచి, ఇతర దక్షిణాది ఆలయాలన్నింటిలో అలాగే ఉన్నాయి. కాని ఇక్కడ, విరుద్ధంగా ఉంది. అలా ఎందుకు నిర్మించారో తెలియదు. లతామండపం 6 అడుగుల ఎత్తు పీఠంపై ఉంది. కాని దానికి మెట్లు లేవు. ఈ మండపంలో హనుమంతుని అర్ధశిల్పం ఉంది. మండపానికి ఎదురుగా నేల మీద కంచాలు, గిన్నెలు తొలిచారు. అక్కడ ఆలయం నిర్మించిన కూలీలు భోజనం చేశారని చెప్తారు. దానికి పక్కనే రాతి కొలను ఉంది. ఇది స్తంభాల కోసం కొట్టిన గుంట. ఆలయంలోని అర్ధమండపం ఉత్తర ద్వారం నుండి మరొక ప్రదక్షణం చేయవచ్చును. ఈ అర్ధమండపానికి తూర్పున మెట్లు, నాగలింగం, గణేశుని విగ్రహాలున్నాయి.

పంచుటంచు: మండపాల కప్పుల మీద కురిసిన వర్షపునీరు జారిపోవడానికి స్తంభాలపై ఉండే అడ్డదూలంపైన ముందుకు వంగి ఉండే ఫలకాలు పేర్చారు. ఇది విజయనగర సాంప్రదాయం. బేలూరు, హళేబీడులలో అలాకాక కిటికీలకు నీడపలకల్లాగ, దొర టోపీల అంచుల లాగ బల్లపరుపుగా ముందుకు పొడుచుకువస్తాయి. కాని లేపాక్షి విజయనగరాలలో ముందుకు వంగి ఉంటాయి. ఆ పలకలు కదలకుండా పైన అంచులపై చిన్న పిట్టగోడ కూడా నిర్మించారు. అర్ధమండపం అంచున అడుగు వెడల్పున కప్పపేర్పు లాగా కనబడే గళ్లు చెక్కారు. మూసిన మండపం బయట ఎత్తయిన అరుగు నిర్మించారు. ఇది జైనుల సాంప్రదాయం. అలాగే ముఖమండపానికి ఉన్న స్తంభాలు కొన్ని జైన స్తంభాల శైలిలాగా ఉన్నాయి. కనుక స్థానికులు వీటిని జైనస్తంభాలు అని చెప్తారు. దేవాలయం ముందు స్తంభం ప్రతిష్ఠించడం జైన సాంప్రదాయం. ఆంధ్రదేశంలో తిరుచుట్టు మాలలు చోళులు ప్రారంభించారని అంటారు. పెద్ద ద్వారాలు, ఎత్తయిన మండపాలు, వంపు అంచులు, జమిలి స్తంభాలు, గోపురాలు, మండప శిఖరాలు, కొలను చేర్చి నిర్మించిన బృహత్తర ఆలయం లేపాక్షి ఆలయం.

గుర్రాలు - విమాన రూపం: లేపాక్షి ముఖమండపం చుట్టూ మండపాల్లో పోతగుర్రాలు, రాణిగుర్రాలు గుర్రాల శిల్పాలు చెక్కారు. ఇది లేపాక్షి దేవాలయం విమాన రూపంగా చెక్కారని భావన కలుగుతోంది. దేవాలయాన్ని విమాన రూపంలో నిర్మించిన వారు కదంబులు. వారి శైలి కనిపిస్తోంది.

లేపాక్షి శిల్పం: శిల్పకళా సంపదలో విజయనగర కాలపు దేవాలయాలన్నింటిలో లేపాక్షి దేవాలయం

అగ్రగణ్యమైనది. హంపిలో ఉన్న దేవాలయాలు విరలాలయంతో సహా ఏ దేవాలయంలో ఇన్ని శిల్పాలు లేవు విజయనగర కాలంలో పల్లవ, చోళ, చాళుక్య, కాకతీయ, హొయసాల రీతులలో దేవాలయాలు నిర్మించినందువల్ల ఈ అన్ని శైలుల మిశ్రమంతో శిల్పసంపద బహుముఖంగా అభివృద్ధి చెందింది. అలాంటి బహుముఖ శిల్పం మనకు లేపాక్షిలో కనిపిస్తుంది. అటువంటి శిల్పం మరెక్కడా లేదు.

అంతేగాక లేపాక్షిలో పెద్ద పరిమాణం గల శిల్పాలు శిల్పించబడ్డాయి. మొదటి నుండి ఆంధ్రులకు పెద్ద పరిమాణాలతో శిల్పాలు చెక్కే అలవాటు ఉంది. బౌద్ధయుగం నుండే ఈ ఆచారం ఆంధ్రదేశంలో అమలులో ఉంది. ఉత్తర భారతదేశంలో బౌద్ధులు చిన్న స్థూపాలు నిర్మిస్తూ ఉండగా అదేకాలంలో ఆంధ్రదేశంలో అతి ఎత్తయిన స్థూపాలు నిర్మించారు. అమరావతి స్థూపం ప్రపంచంలోనే అతి పెద్దది. హిందూ శిల్పకళ ప్రారంభమైన తర్వాత కూడా పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేయించారు. తూర్పు చాళుక్యుల కాలం నాటి విజయవాడ ద్వారపాలురు చామరధారిణి ఏనుగులు, విఘ్నేశ్వరుడు పెద్ద సైజు శిల్పాలు. ఇవి నేడు మద్రాసు మ్యూజియంలో ఉన్నాయి. బిక్కవోలు విఘ్నేశ్వరుడు, ఉండవల్లి అనంతపద్మనాభుడు, వేంగి నంది, చందవోలు వినాయకుడు కూడా గొప్ప విగ్రహాలే. అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట ఆరామాలలోని శివలింగాలు చాలా ఎత్తయినవి. కాకతీయులు, ఓరుగల్లు, కొల్లిపాక, ఐనవోలులలో పెద్ద ద్వార తోరణాలు నిలిపారు. అలాంటివి భారతదేశంలో మరెక్కడా లేవు సోముపాలెం, చిప్పగిరి దేవాలయాల ధ్వజస్తంభమంత పెద్దస్తంభాలు మరెక్కడా లేవు. బుక్కరాయల కాలం నాటి అనంతపురం గణుశుని విగ్రహం కూడా చాలా పెద్దది. పల్లవులు కూడా మహాబలిపురంలో ఏనుగు సింహాన్ని పెద్దగానే రూపొందించారు. తంజావూరు నంది కూడా పెద్దదే. శ్రావణబెళగొళలోని గోమరేశుని విగ్రహం ప్రపంచంలోనే అతి పెద్దది. ఇదే సాంప్రదాయాన్ని లేపాక్షి శిల్పులు అనుసరించి బృహత్ శిల్పాలను రూపొందించారు. అలాంటి వాటిలో ముఖ్యమైనవి నాగలింగం, నంది.

నాగలింగం: లేపాక్షిలో అతి పెద్దదైన నాగలింగం శిల్పించబడింది. ఇంత పెద్ద పరిమాణం గలిగిన లింగం మరెక్కడా లేదు. పల్లవులు, పశ్చిమ చాళుక్యులు కూడా అలాంటివి నిర్మించలేదు. లింగాల వెనుక పాముపడగలను తీర్చే ఆచారం ఇక్ష్వాకుల కాలంలోనే ఉంది. నాగలింగ శిల్పాలు శ్రీశైల కుడ్య శిల్పాలలో ఉన్నాయి. తిరిగి అలాంటి శిల్పం ఒక్క లేపాక్షిలోనే ఉంది. లేపాక్షి పాముచుట్టల పడగలు అతి సహజంగా ఉన్నాయి. ఈ నాగలింగం వీరభద్రాలయం చుట్టూ ఉన్న ప్రదక్షిణ మార్గంలో ఉంది. నాగు 7 తలలతో అతిమనోహరంగా ఉంది. ఈ సప్తఫణి నాగేంద్రుని శిల్పం చూపరులకు కన్నుల పండుగగా ఉంటుంది. ఇది అతి ఎత్తయిన శిల్పం. ఈ సప్తశిల నాగుపై దేవాలయం నిర్మించినట్లయితే అది వీరభద్రాలయానికంటే ఎత్తయినది అయి ఉండేది. నాగలింగం దగ్గర ఒక సాలీడు బొమ్మ, ఏనుగు బొమ్మ గీచి ఉన్నాయి. దానిని బట్టి కాళహస్తీశ్వరునిగా చేయటానికి ప్రయత్నించినట్లు ఉంది.

గణేశుడు: నాగలింగానికి దగ్గరలోనే పెద్ద గణేశుని విగ్రహం కూడా ఉంది. ఈ గణేశుడు నాలుగు భుజాలతో కుండ ఆకారపు బొజ్జతో రూపొందింపబడ్డాడు. పక్కనే మూషిక వాహనం కూడా ఉంది. వీరభద్రాలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ నాగలింగం, విఘ్నేశ్వర విగ్రహాలు రెండింటినీ చూడవచ్చును.

లేపాక్షి బసవన్న: లేపాక్షిలో ఉన్న శిల్పాలన్నింటిలో అతి పెద్దది ఈ బసవన్న శిల్పం. లేపాక్షిలోనేగాక ఈ నంది ప్రపంచంలోనే అత్యంత పెద్దది. ఇంత పెద్దనంది మరెక్కడాలేదు. ఇది 22 అడుగుల పొడవు, 15 అడుగుల ఎత్తుతో గాంభీర్యంగా ఉంటుంది. దాని మువ్వలు, గంటలు, తాళ్లు, గజ్జలతో లేత వయసులో ఉన్న దాని లాగా చెక్కారు. ఇది అత్యంత పెద్దదే కాక అత్యంత సుందరమైనది. మహానంది, తంజావూరు, హాలేబీడు, మైసూరు చాముండేశ్వరి నందులు కూడా లేపాక్షి నందికి సాటిరావు. వీటికంటే లేపాక్షినంది వయసులో చిన్నదిగా ఉంటుంది. జాతిలో కూడా వాటికంటే భిన్నంగా ఉంటుంది. పొట్టికొమ్ములు, బిగిసిన మూతి, సన్నని ముక్కుపుటాలు, పొట్టి తల, అమాయకపు చూపుతో మనోహరంగా ఉంటుంది. హాలేబీడు నందికి అలంకారాలు ఎక్కువ. మైసూరు నంది గొప్ప లోకానుభవం ఉన్నదాని లాగ కనిపిస్తుంది. బసవన్నకు ఉండవలసిన చైతన్యం అంతా శిల్పి నందిలో కూర్చాడు. నందికి వాడిన రాయి కూడా చెక్కుచెదరని శిల లభించింది. కాని దురదృష్టవశాత్తు ఈ నంది శిల్పం పూర్తి కాలేదు. అయినప్పటికీ ఈ నంది అత్యంత ప్రఖ్యాతి వహించింది. కవులు లేపాక్షి బసవయ్య లేచి రావయ్య అని పాటలు కూడా రాశారు. ఆంధ్రదేశానికి గొప్ప కీర్తి తెచ్చిన నంది లేపాక్షి బసవన్న.

స్తంభాలపై అలంకార శిల్పం: అలంకార శిల్పం ఎక్కువ భాగం స్తంభాల మీద శిల్పిస్తారు. స్తంభాల మీద అలంకార శిల్పాన్ని చెక్కే సాంప్రదాయం బౌద్ధయుగం నుండే ఉంది. అమరావతి, జగ్గయ్యపేట, స్థూపాల వేదికలపైన, పాలరాతి ఫలకాలను అతికించి వాటిపై చిత్రాలు చిత్రించారు. అలాగే స్థూపాల వద్ద ఉండే స్తంభాలపైన కూడా శిల్పాలు చెక్కారు. ఈ శిల్పాలన్నీ బుద్ధుని జీవిత ఘట్టాలకు చెందినవి. అమరావతి గుహాలయాలలో కూడా స్తంభాల అలంకార పద్ధతి ఉంది. బౌద్ధులు అలంకార శిల్పాలకు ప్రాధాన్యతనిచ్చారు. కాని, జైనులు అలంకార శిల్పాలను తిరస్కరించారు. జైనమత ప్రభావం వలన ఆంధ్రదేశంలో కూడా తూర్పు చాళుక్యుల తొలి కాలంలో పెద్దగా శిల్పాలు చెక్కలేదు. కాని పశ్చిమ చాళుక్యులు వేములవాడ, ఆలంపురం, పెదతుంబలం దేవాలయాలలో స్తంభాల మీద శిల్పాన్ని అలంకారంగా శిల్పించారు. వారు ఇసుకరాతి స్తంభాలను నాలుగు ఫలకాలుగా చెక్కి వాటిపై పురాణగాథలు శైవ చిత్రాలు, రామాయణ భారత చిత్రాలు చెక్కించారు. ఈ విధంగా స్తంభాలపై అలంకార శిల్పాన్ని శిల్పించే సాంప్రదాయం వారితోనే మొదలైందని చెప్పవచ్చును. తర్వాత బాదామీ చాళుక్యులను అనుసరిస్తూ తూర్పు చాళుక్యులు కూడా బిక్కవోలు, ఎలమంచిలి మొదలైన ప్రదేశాలలో స్తంభాలంకార పద్ధతిని ప్రవేశపెట్టారు. బాదామి చాళుక్యుల తర్వాత కాలంలో శిల్పంలో మార్పులు తెచ్చినవారు కాకతీయులు. వారు నల్లరాయి వాడారు. స్తంభంలో కొంతభాగం నలుపలకలగాను, కొంతభాగం స్థూపంలాగా, గుండ్రంగాను, మళ్లీ కొంతభాగం పలకగాను చెక్కించారు. నాలుగు ఫలకాలుగా ఉన్న భాగం మీద అర్ధశిల్పాలు చెక్కించారు. తర్వాత నాలుగు ఫలకాలు, 8 ఫలకాలుగా మార్చారు. ఫలకాలు బత్తులాలు మధ్యన జిలుగు ఒత్తులాల మీద నిలువు పట్టీలు మొదలైన అనేక మేళవింపులు, విచ్చ స్తంభాల అలంకరణ పద్ధతి ఒక ప్రత్యేక శాఖ అయింది. రెడ్డి రాజుల కాలం నాటికి స్తంభాల అలంకరణ ప్రత్యేక శిల్పకళగా అభివృద్ధి చెందింది. వారు బాదామి చాళుక్యులు అలంకారప్రాయంగా చేర్చిన విగ్రహాన్ని నిండు శిల్పాలుగా మార్చారు. ద్రాక్షారామం, సర్పవరం, కోరుకొండ, పెదకళేబళ్లి ఆలయాలలో విగ్రహాలు స్తంభాలకు అతికించి ఉన్నాయి. విజయనగర రాజులు మొదట నాలుగు ఫలకాల నల్లరాతి స్తంభాల మీద అర్ధశిల్పాన్ని చెక్కించారు. స్తంభాలపైన దూలాలకాధారంగా అడ్డ రాతి ముక్కల కొసలను తామర మొగ్గల ఆకారంలో రూపొందించారు. హంపి హజారా రామస్వామి ఆలయంలోను, గోరంట్ల మాధవస్వామి ఆలయంలోను ఈ రకపు స్తంభాలున్నాయి. తర్వాత ఎత్తు స్తంభాలతో మండపాలు వచ్చాయి. హంపిలోని గణపతి ఆలయపు మండపం ఎత్తుగా ఉంటుంది. లేపాక్షి ముఖమండపంలోని స్తంభాలు కూడా అంత ఎత్తు కలిగి ఉన్నాయి. అవి రెండు వరుసల 8 పలకల పట్టీలు ఉన్నందువల్ల మూడు భాగాలుగా కనిపిస్తూ ఒక నూతన వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఈ స్తంభాలపై శైవమతానికి సంబంధించినవి, సమకాలిక సంస్కృతికి సంబంధించినవి, జీవితానికి సంబంధించినవి, లౌకికపరమైనవి మొత్తం మూడు రకాల శిల్పాలు చెక్కబడ్డాయి. ఈ ఆలయంలోని స్తంభాలపై జడలు విరబోసుకొని శస్త్రాలు చేతపట్టి వీరావేశంతో విన్యాసాలు చేసే శివాచార్యుల చిత్రాలు చిత్రించారు. వారిలో శృంగనాదం మోగించేవారు, డప్పును వాయించేవారు, చేతితో విషసర్పాలను పట్టుకొని నృత్యం చేసేవారు. కత్తి, గధను ఝళిపించేవారు, శంఖాలతో ఊదేవారు, కాలితో తొక్కి వింటి బద్దను వంచేవారు మొదలైన శిల్పాలు చెక్కారు.

శైవ మత చిహ్నాలైన వృషభం, వ్యాఘ్రపాద మహర్షి, నాగలింగం, విఘ్నేశ్వరుడు, పానపట్ట లింగాలు, నాగబంధం శిల్లా కూడా ఉన్నాయి. అలాగే వైష్ణవ చిహ్నాలైన చక్రం, త్రిమూర్తులు, ఆంజనేయుడు, నరసింహ స్వామి, కాళీయమర్ధనుడు, కూర్మాలు, కోతులు కూడా స్తంభాల మీద ఉన్నాయి. బహుశా వైష్ణవ చిహ్నాలు రఘునాధేశ్వర ఆలయం ఉన్నందువల్ల చెక్కి ఉంటారు. ఇంకా హంస, సింహం, ఏనుగు, లేడి, కోతి, చిలుక, గుడ్లగూబ, సూర్యచంద్రులు శిల్పాలు కూడా ఉన్నాయి. అవేగాక మానవ జీవితానికి సంబంధించిన శిల్పాలు కూడా ఉన్నాయి. అద్దం చూసుకుంటూ బొట్టుపెట్టుకునే స్త్రీ, కొప్పు ముడుచుకుంటున్న మరొక స్త్రీ, గొడుగు కమండలం కలిగిన జడధారి, గోనెపట్ట కట్టుకొని వానలో చెట్టు కిందున్న గొర్రెల కాపరి, కమండలం కలిగిన ఒక బ్రహ్మచారి, డప్పు వాయించే మైలారుభటుడు, తంబుర మీటుతూ నృత్యం చేసే మరొక భక్తుడు, లింగాన్ని నాకుతూ పాలు ఇచ్చే గోవు, ఒకరినొకరు పట్టుకొని చక్రంగా ఏర్పడ్డ మల్లులు, నడుం బిగించి విల్లు వంచే ఒక స్త్రీ మేఖాలపై నుండి పూలు జల్లేవారు మొదలైన శిల్పాలు చెక్కి ఉన్నాయి. దేవాలయపు ప్రాకారం మీద వీరశైవ శిల్పాలు ముఖ్యంగా నటరాజ తాండవం చెక్కి ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే లేపాక్షి శిల్పి అందాన్ని రాతిలో బంధించాడు.

లేపాక్షి ఆలయంలో పాపనాశేశ్వర ఆలయం తప్ప మిగిలిన నిర్మాణాలన్నీ తెల్లశేనప్పు రాతితో నిర్మించారు.

తెల్లశేనప్పు రాతిస్తంభాల లావు ఎక్కువై శిల్పాలకు ఎక్కువ వైశాల్యం వచ్చింది. స్తంభపు ఫలకాల వెడల్పు ఎక్కువ అయినందువల్ల ఒకే ఫలకంలో మూలస్తంభం సైజులో ఒకటి దానికి పక్కనే చిన్న సైజులో అలంకారానికి మరొక స్తంభం చెక్కడానికి వీలైంది. లేపాక్షి ఆలయంలో తిరుచుట్టుమూల అంచులో ఇటువంటి స్తంభాల వరుస ఉంది. చిన్న స్తంభాన్ని పెద్ద స్తంభాన్ని కలుపుతూ సింహం ఉంది. పెద్ద స్తంభం మీద నృత్య భంగిమలలో శివభక్తులు చెక్కబడ్డారు. ఇలాంటి స్తంభాలను జెమిలి స్తంభాలు అని అంటారు. ఇవి మండపానికి అలంకారంగా నిర్మించినవి. ఇలాంటి జమిలి స్తంభాలు మొట్టమొదట విజయనగర కాలంలోనే ప్రారంభమయ్యాయి. స్తంభం మూలంలో స్త్రీ శిల్పం, ఆ శిల్పం పైన గుర్రాన్ని రెండు కాళ్ల మీద పైకి లేపించే అశ్వికుడు, గుర్రం పక్కన రక్షణ కోసం ఖడ్గంతో నడిచే పదాతి సైనికుడు, కలిసి ఉండే సంకీర్ణశిల్పం చెక్కేవారు. కాని లేపాక్షిలో ఇలాంటి గుర్రానికి బదులు సింహాన్ని మలచారు. కొన్ని స్తంభాలలో సింహానికి బదులు గజముఖ సింహాలు మలచి ఉన్నాయి. ఇలాంటి దానిని శరభమృగం అని అంటారు. నాట్య మండపంలోని స్తంభాలకు ఆనించి నాలుగడుగుల పెద్ద సైజులో నర్తకి, మార్దంగికుడు, గంగా, యమున ఋషి శిల్పాలను రూపొందించారు. కళ్యాణమండపంలో అష్టదిక్పాలుర శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ స్తంభాలు, శిల్పాలు, హంపిలో కూడా లేవు. హజారా రామస్వామి ఆలయం గోరంట్ల మాధవస్వామి ఆలయంలో జమిలి స్తంభాలు లేవు. ముఖమండపంలో నాలుగు, అర్ధమండపం నాలుగు, మొత్తం ఎనిమిది స్తంభాలపై అన్ని వైపులా శిల్పాలను చెక్కి శిల్ప పీఠాలుగా మార్చారు. స్తంభాలపై అర్ధ శిల్పాలను చెక్కే విధానం లేపాక్షిలో పరాకాష్టను అందుకుంది. అక్కడ చెక్కిన స్తంభాలున్నాయి అనే బదులు శిల్పాలే స్తంభాలుగా మారాయి అని చెప్పవచ్చునని శ్రీపాద గోపాలకృష్ణ వ్యాఖ్యానించారు.

నాట్యమండపం: లేపాక్షి నాట్యమండపంలో ఒక ప్రత్యేకత ఉంది. అక్కడ విడివిడిగా ఉన్న స్తంభాలకు నిలువెత్తు మనుష్యుల శిల్పాలను అమర్చి సభ తీరినట్లు రూపొందించబడింది. ఈ పద్ధతి లేపాక్షిలోనే మొదలైంది. వీరభద్రాలయపు ముఖమండపం మధ్యలో ఉన్న నాట్యమండపం ఈ విధంగా నిర్మించారు. అందులో మధ్యలో నర్తకి నిలిచి ఉండగా వాయిద్యాలు మోగించేవారు, నాట్యమాడేవారు అన్నివైపుల గుమిగూడి నిలబడి ఆమెకు ఉత్సాహం కలిగిస్తూ ఉన్నట్లు కనబడుతూ ఉన్నారు. అదే హొయసాలుల నిర్మాణంలో మండపానికి ఉన్న నాలుగు స్తంభాలు పూర్తిగా శిల్పాలంకరణలతో ఉంటాయి. నాలుగు స్తంభాల మధ్య వృత్తాకారపు వేదికను తీర్చిదిద్దారు. నర్తకిని దేవునికి ఎదురుగా నిలబడి ఉన్నట్లు చెక్కారు. లేపాక్షిలో అలా కాక నర్తకి నృత్యానికి కావలసిన హంగులన్నీ ఏర్పాటు చేశారు. పురాణాలలో దేవతాగణం నృత్యాలు చేస్తున్నటు వర్ణనలు ఉన్నాయి. ఆ వర్ణనలలో ఉన్న నృత్య భంగిమల ప్రకారం లతామండపం అద్భుతంగా నిర్మించబడింది.

లతామండపం: ఇది ప్రధాన ఆలయానికి నైరుతి దిక్కున ఉంది. ఈ మండపంలో 40 స్తంభాలున్నాయి. అందులో అన్ని స్తంభాలు నాలుగు పలకలుగా ఉన్నాయి. నాలుగు పలకాల మీద రకరకాల లతలు చెక్కారు. ఆ లతలకు పూలు, పండ్లకాయలు ఉన్నాయి. లతలపై రకరకాల పక్షులు వాలి ఉన్నాయి. కేవలం లతలు మాత్రమే పూర్తిగా చెక్కి ఉన్న ఇలాంటి మండపం మరెక్కడా లేదు.

కుడ్య శిల్పం: లేపాక్షి ఆలయంలో కుడ్య శిల్పాలు కూడా ఉన్నాయి. కృష్ణదేవరాయలు హంపీలోని హజారా రామస్వామి ఆలయం గోడల మీద రామాయణ గాథలను చెక్కించారు. దసరా దిబ్బవేదిక పక్కలను కూడా అనేక అర్ధ శిల్పాలను చెక్కించాడు. కాని అవి అన్నీ చిన్నవి. విరూపణ్ణ లేపాక్షిలో అంతకన్నా పెద్ద శిల్పాలు చెక్కించాడు. ఇవి శ్రీశైలం ఆలయపు కుడ్య శిల్పాల లాగా ఉన్నాయి. విరూపణ్ణ వీరశైవుడు. అర్ధమండపం వెలుపలి గోడల మీద అర్ధ శిల్పాలు వరుస చెక్కి ఉంది. ఆ వరుసలో తూర్పువైపున శిరియాళుని కథ, పడమట వైపున కిరాతార్జునీయ కథ శిల్పాలుగా చెక్కబడ్డాయి. శిరియాళునకు ఈశ్వరుడు వరమివ్వడం, శిరితొండడు జన్మించడం, ఋషులు రావడం, శిరితొండని తలను రోట్లో దంచడం భోజనశాల శిరితొండడు తిరిగి జీవించడం, నందివాహనారూఢులై పార్వతీ పరమేశ్వరులు శిరియాళుడికి ప్రత్యక్షమవడం అద్భుతంగా చిత్రించబడ్డాయి. కిరాతార్జునీయగాథ శిల్పంలో నారదుడు పాండవులతో దివ్యాస్త్రాలు సంపాదింపజేయడం, అర్జునుడు తపస్సుకు బయలుదేరడం, ఇంద్రుడు మారువేషంలో పరీక్షించడం, అర్జునుడు లింగార్చన చేయడం, అర్జునుడు తపస్సు చేయడం, వరాహం రావడం, కిరాతార్జునుల విల్లంబుల యుద్ధం, ముష్టి యుద్ధం, నందివాహనారూఢులై పార్వతీపరమేశ్వరులు ప్రత్యక్షమవడం అద్భుతంగా చిత్రించబడ్డాయి. ఈ శిల్పాలు అర్ధమండపు నైరుతి మూల నుండి ప్రారంభమై గుహద్వారం వరకు విస్తరించి ఉన్నాయి. ఈ చిత్రాలలో అర్జునుడి ఒంటి కాలి తపస్సు, కిరాతార్జునుల వింటి యుద్ధం అద్భుత

కళాఖండాలు. ఆలయపు ప్రాకారపు వెలిగోడలలో సింహలలాటం, శిల్పపుగూళ్లు ఉన్నాయి. కాని అందులో ఎలాంటి శిల్పాలు లేవు. బహుశా అవి శిల్పాలు ప్రతిష్ఠించడానికి నిర్మించి ఉండవచ్చును. ప్రాకారపు ఆగ్నేయ మూలలో రెండు చేపలు పడమటి ప్రాకారపు ఉత్తరపు వైపున సూర్యబింబం కొన్ని గుర్తులు ఉన్నాయి. అక్కడ ఉన్న అర్థశిల్పానికి క్రమంగా వైశాల్యం పెరిగింది. తాడిపర్తి, చుక్కలూరు, పెనుగొండలలోని దేవాలయాల మీద అర్థశిల్పం కథలు మాత్రమే తెలుపుతుండగా లేపాక్షిలోని ఈ అర్థశిల్పం కథనాన్ని తెలుపుతూ గొప్ప కళాత్మకంగా రూపొందింపబడింది.

విగ్రహ శిల్పం: లేపాక్షిలో దేవతా విగ్రహాలు ప్రత్యేకంగా శిల్పించారు. చాళుక్యులు విగ్రహాలకు వెనుక పలక ఉంటుంది. దానిని పరికరమని అంటారు. వారు దేవతా విగ్రహాలకు అర్థశిల్పాలుగా తీర్చి దేవాలయాల బయట గోడలపై నిలిపారు. ఇలాంటి విగ్రహాలు పట్టడికల్, వేంగి, బిక్కవోలు, ఎలమంచిలి దేవాలయాలలో ఉన్నాయి. హొయసాలులు నిండు విగ్రహాలుగానే మలచిన వాటిని దేవాలయపు గోడలలోనే బిగించారు. కాని వారు విగ్రహాల అలంకారానికి అమిత ప్రాధాన్యతను ఇచ్చారు. లేపాక్షి శిల్పులు దేవాలయ నిర్మాణానికి శేనప్పు రాయిని వాడినందువల్ల ఆలయపు గోడలలో గూళ్లు ఏర్పాటు చేసి పెద్ద శిల్పాలను ఏర్పాటు చేసి నిలపటానికి వీలుకాకపోయింది. అందువల్ల వారు విగ్రహ శిల్పాన్ని స్తంభాలకు అతికి ఉండేటట్లు చెక్కారు. కనుక స్తంభాన్ని వారు విగ్రహ శిల్పంగా మార్చారు. ఇది ఇక్కడ ఉన్న ఒక ప్రత్యేకత.

విగ్రహ శిల్పానికి ఒక రూపును తెచ్చిన వారు చాళుక్యులు. కాని వారి విగ్రహాలు నిటారుగా నిలబడి ఉన్నట్లు ఉంటాయి. పట్టడికల్, బిక్కవోలు, ఎలమంచిలి విగ్రహాలు నిటారుగా తీర్చారు. చాళుక్యులు పంచతంత్ర గాథలు, దశావతార మూర్తులు శిల్పించారు. మండపాలలో కప్పు మధ్యన తమ ఇష్టదేవతామూర్తిని ఎనిమిది మూలల్లో వాహనారూఢులై ఉన్న దిక్పాలురను చిత్రించారు. దిక్పాలుర వాహనాలు వారి కన్నా పెద్ద సైజులో ఉన్నాయి. గంజిగట్టిలో దిక్పాలకులు భార్యా సహితంగా వాహనాలను అధిష్టించి ఉన్నారు. వనవాసిలో దిక్పాలురు వారి వాహనాలు సమాన సైజులో ఉన్నాయి.

లేపాక్షిలో దిక్పాలకులు 4 1/2 అడుగుల ఎత్తులో ఉన్నారు. కాని వారు నిటారుగా నిలిచి ఉండకుండా ఎడమ కాలి మీద బరువు ఆనించి కుడి కాలిని ఒదులు చేశారు. వారి వాహనాలు వారి కంటే చిన్నవిగా చిహ్నాలు మాత్రంగా వారి పాదాలకు దిగువన ఉన్నాయి. వారి శిరస్సుపై కిరీట శృంగాలు ఉన్నాయి. కిరీటాలకు అటు ఇటు జడల వంటి అలంకారాలు ఉన్నాయి. కొన్ని విగ్రహాల చేతులు కటి మీద నిలిపి ఉన్నాయి. వారి వస్త్రాలు మడమ దాకా ఉన్నాయి. కాళ్లకు కడియం అందెలు ఉన్నాయి. ఆ శిల్పాలపై మకర తోరణం, వాటి మధ్య ఉన్న సింహలలాటం, కిరీట అలంకారాలు, కదంబ లక్షణాలలో ఉన్నాయి. కాని ఇవి కన్నడ హొయసాల శిల్ప వ్యక్తుల లాగా పొట్టివారు కాదు. గుండ్రని ముఖాలు కాదు. అతి అలంకార ఆభరణాలు లేవు. లేపాక్షి శిల్ప వ్యక్తులు ఆంధ్రుల లాగా పొడుగు వారు, కోలముఖాలతో పరిమితమైన అలంకారాలతో ఉన్నాయి.

ఈ శిల్పాలలో కొన్ని స్త్రీ విగ్రహాలు కుడిచేతిని పైకి మడిచి ముకుళములు ధరించి ఉన్నాయి. ఎడమ చేయి జానువు వైపు తిప్పి ఉన్నాయి. ఇవి చోళ విగ్రహాల లక్షణాలు. కాని ఆకారం చోళ స్త్రీలది కాదు. ఆంధ్ర స్త్రీల వస్త్రధారణ ఉంది. స్త్రీల వస్త్రాల ముడతలు ఎలా ఉంటాయో అలాగే ఉన్నాయి. తిరుమల దేవస్థానంలో ఉన్న కృష్ణదేవరాయల దేవేరులైన తిరుమలదేవి, చిన్నాదేవిల విగ్రహాలకు చీర కట్టిన పద్ధతే లేపాక్షి స్త్రీల విగ్రహాలకు కూడా అనుసరించారు. విజయనగర విగ్రహాలకు పొడుగు టోపీలు ఉన్నాయి. కాని లేపాక్షి విగ్రహాలకు సాంప్రదాయబద్ధమైన కిరీటాలున్నాయి.

విజయనగర సామ్రాజ్య శిల్పం: ఈ విగ్రహం లక్షణాలన్నీ పరిశీలించి చూడగా ఇవి ఏ ఒక్క ప్రాంతానికి చెందినవి కావు. విజయనగర సామ్రాజ్యంలో దక్షిణాది నాలుగు భాషా ప్రాంతాలు చేరి ఉన్నాయి. కనుక ఆ ప్రాంతాలలో ఉన్న అన్ని రకాల శిల్ప లక్షణాలను మేళవించి లేపాక్షి శిల్పులు సంకీర్ణ శిల్పాన్ని రూపొందించినట్లుగా చెప్పవచ్చును. ఈ శిల్పాలలో పశ్చిమ చాళుక్యుల మకరతోరణ, కిరీట అలంకరణ పద్ధతి, చోళుల శిల్పవిన్యాసం, హొయసాలుల ప్రతిబంధ ఆభరణ కౌశల్యం సమకాలిక వాస్తవికతలను మేళవింపబడ్డాయి. లేపాక్షి శిల్పి విగ్రహ నిర్మాణంలో పూర్తిగా ఆగమాలను అనుసరించినట్లుగా కనిపించడం లేదు. విఘ్నేశ్వరుడు వరద అభయహస్తాలలో చూపలేదు. ముకుళ కటిబంధహస్తుడుగా చూపబడ్డాడు. అలాగే విష్ణువుకు గరుడ వాహనం లేదు. కొన్ని అలాగే విగ్రహాలకు చిహ్నాలు లేవు. కనుక వాటిని గుర్తించటానికి వీలులేదు.

తిరు చుట్టు మండప స్తంభాలు, లతామండప స్తంభాలు, ముఖమండప స్తంభాలు, నాట్యమండప స్తంభాలు, కళ్యాణ మండప స్తంభాలు, అర్ధమండప స్తంభాలు ఒకే శిల్పి చెక్కలేదు. వేరు వేరు శిల్పులు చెక్కినట్లుగా కనిపిస్తున్నాయి. ఈ శిల్పాలన్నింటిలోకీ అర్ధమండపు స్తంభాలై ఉన్న శిల్పాలు అత్యద్భుతంగా ఉన్నాయి. అవి ఆంధ్ర శిల్పాలకు తలమానికాలని కొందరు ప్రస్తుతించారు.

అర్ధమండపంలో ఆగ్నేయమూలన ఒక స్తంభం మీద నటరాజు, వృషభ వాహనం ఉన్నాయి. నైరుతి మూల స్తంభం మీద త్రిపురాసుర సంహారిణి, నాట్య గణపతి ఉన్నారు. ఈశాన్యపు మూలస్తంభంపై రంభ, నలకూబరులు ఉన్నారు. ఈ మండపంలో కప్పు మీద మహిషాసురమర్దని రాక్షసుని పొడిచే శివుని చిత్రాలు ఉన్నాయి. నటరాజు విగ్రహం చోళ నటరాజు లాగా కాలు వంచి ఉన్నాడు. కాని చోళ విగ్రహాల ముక్కుల లాగా లంబంగా లేవు. ఈ విగ్రహాల ముక్కులు కోటేరు వేసినట్లు ముందుకు దూసుకువచ్చి ఉన్నాయి. నలకూబరునికి కోరలున్నాయి. కనుక ఆ విగ్రహం వాస్తు పురుష విగ్రహం అని, దేవాలయానికి ఈశాన్యాన వాస్తుపురుషుని చిత్రించే ఆచారం శిల్పుని శిల్పం చెక్కిన దాఖలాలు లేవు. రంభ హంపి, హంపి సింహాసనపు దిబ్బ అంటే దసరా దిబ్బపై చెక్కిన శిల్పాలలోని నాట్యకత్తెలు వస్త్రాలంకరణ చేసుకున్నట్లు ఉంది. కాలి మడమల వరకు షరాయి లాగా మడిచి కట్టిన చీర ఉంది లోపల మోకాళ్ల వరకు కుచ్చిళ్ల లంగా ఉంది. రంభకు చనుకట్టులేదు. కనుక ఈమె రంభ కాదని కొందరు భావించారు. అయినప్పటికీ ఈ నాట్యకత్తె గొప్ప సౌందర్యంతో వెలుగుతోంది. తాడిపర్తిలోని వృక్షకి శిల్పం, పాలంపేటలోని నర్తకి శిల్పం, గొప్ప సౌందర్యరాసులని చాలా మంది భావిస్తారు. కాని లేపాక్షి నాట్యకత్తెకు వారిద్దరూ సాటిరారని శ్రీపాద గోపాలకృష్ణమూర్తి వ్యాఖ్యానించారు.

లేపాక్షి శిల్పానికి ఈ మాతృక శ్రీశైల కాపాలిక మతం అని కొందరు భావిస్తారు. అందుకు కారణం లేపాక్షిలో పాశుపత మత చిహ్నాలు గాని, అమలక లింగాలు గాని, లకులీశుని విగ్రహం గాని లేవు. లేపాక్షిలోని కొన్ని శివుని విగ్రహాలు కపాల మూలలు కిరీట కపాలం ధరించి ఉన్నాయి. శిల్పాలలో చిత్రించబడిన శివభక్తుల విన్యాసాలు, నాగలింగాలు వ్యాఘ్రపాదుడు ఇవన్నీ వీరశైవమత లక్షణాలని అంటారు. ఏమైనప్పటికీ లేపాక్షి శిల్పంలో అద్భుతమైన చైతన్యం ఉంది. చోళ శిల్పానికి ఆత్మశక్తి, బాదామీ చాళుక్య శిల్పానికి ఆత్మీయత లక్షణాలు హొయసాల శిల్పానికి ఆత్మ అలంకరణ, విజయనగర శిల్పానికి మారు పేరైన లేపాక్షి శిల్పంలో చైతన్యం పూర్తిగా నిండి ఉంది.

విరూపణ్ణ విగ్రహం: ఈ దేవాలయంలో చేతులలో గడ్డం అనించి కూర్చున్న ఒక శిల్పం ఉంది. అది విరూపణ్ణదని కొందరు అంటారు. కాని అది ఒక కురబాని వ్యక్తి శిల్పం అని మరికొందరు అంటారు. దేవాలయం నిర్మించేటప్పుడు జీతాల విషయంలో వివాదం వచ్చిందని ఆ వివాదంలో ఈ కురబాని వ్యక్తి మధ్యవర్తిత్వం వహించి పరిష్కరించాడని అందువల్ల అతని శిల్పం అక్కడ చెక్కారని అంటారు. కురబాని గొల్ల వ్యక్తి పశువుల కాపరి అని కూడా అంటారు. ఈ కథ వల్ల ఆనాడు శిల్పులకు జీతాలు ఇచ్చి పెట్టుకొనేవారని తెలుస్తోంది.

లేపాక్షి - చిత్రకళ: విజయనగర యుగం నాటి చిత్రకళకు లేపాక్షి దేవాలయంలోని చిత్రాలు చక్కని ఉదాహరణలు. లేపాక్షిలోని వీరభద్ర ఆలయపు పైకప్పు మీద అద్భుతమైన చిత్రాలు చిత్రించబడ్డాయి. ఇవి అజంతా చిత్రకళ కంటే భిన్నమైనవి. అజంతా గుహలలోని చిత్రాలు బుద్ధుని జీవితగాధలు, జాతకకధలలోని ఇతివృత్తాలను చిత్రించగా, లేపాక్షి చిత్రకళలో ప్రధానంగా శివునికి చెందిన చిత్రాలు చిత్రించబడ్డాయి. ఈ ఆలయంలోని చిత్రకళ 16వ శతాబ్దానికి చెందిందని భావిస్తారు. కాని కలకత్తా యూనివర్సిటీ రూరల్ క్రాఫ్ట్ సర్వేయర్ శ్రీ సుదాన్‌శు కుమార్ రాయ్ వీటిని పరిశీలించి ఇవి క్రీ.శ.14-15 శతాబ్దాల నాటివని అభిప్రాయం వెలిబుచ్చారు. అంతేగాక ఈ చిత్రాల లక్షణాలను కూడా వివరించారు. ఈ చిత్రాల కళ్లు విశాలంగా ఉండటమే గాక కనుబొమ్మలు చెవుల వరకు విస్తరించి ఉన్నాయి. ఈ విధంగా గుజరాతీ తాళపత్ర గ్రంధాలలో జైన చిత్రాలు చిత్రించబడి ఉన్నాయి. మధ్య మధ్యలో నేపాల్‌లోని చిత్రాల లక్షణాలు పాళీ గ్రంధాలలో చిత్రించబడి తాంత్రిక బౌద్ధదేవతల చిత్రాల లాగా ఉన్నాయి. కొన్ని చిత్రాలు అజంతాలోని చిత్రాల లాగా ఉన్నాయి. మరికొన్ని చిత్రాలు దక్షిణాదిలో 10వ శతాబ్దానికి చెందిన కంచు విగ్రహాల తరహాగా ఉన్నాయి. ఈ లక్షణాలను బట్టి చూడగా లేపాక్షి చిత్రకారులు దక్షిణ భారతదేశపు సాంప్రదాయాన్ని గుజరాతీ జైన సాంప్రదాయాన్ని, ఉత్తరాది సాంప్రదాయాలను మిళితం చేసి చిత్రించినట్లు కనిపిస్తోంది. ఇటీవల ఈ దేవాలయంలో లభించిన తామ్ర ఫలకం మీద నాగరి లిపిలో స్థానిక భాష రాసి ఉంది. ఇది ఉత్తర, దక్షిణ ఉభయ సాంప్రదాయాల కలయిక అని స్పష్టమవుతోంది. మద్రాసు మ్యూజియంలో

మూడు తెలుగు జానపద చిత్రాలు ఉన్న ఫలకాలు ఉన్నాయి. అవి కడప జిల్లా నుండి సేకరింపబడి ఉన్నాయి. ఈ ఫలకాలలోని చిత్రకళకు లేపాక్షి చిత్రకళకు చాలా భేదముంది. కడప చిత్రకళలో జైనసాంప్రదాయం గాని తాంత్రిక చిత్రకళా సాంప్రదాయం గాని మచ్చుకైనా లేవు. లేపాక్షి చిత్రాలలో జైన మరియు తాంత్రిక లక్షణాలున్నాయి. ఈ లక్షణాలు కొన్ని సమస్యలను లేవనెత్తుతున్నాయి. ఈ చిత్రకళా లక్షణాలు వివిధ కాలాలకి చెందినవి. ఈ ఆలయానికి ముందు అక్కడ జైన బౌద్ధ స్థావరాలు ఉన్నట్లు భావించవలసి ఉంది. ఈ ఆలయంలోని స్తంభాలు ద్వారం వైపు ఉండే ఫలకాల మీద స్థూపాల లక్షణాలున్నాయి. కనుక అక్కడ అంతకు పూర్వం జైన ఆలయం గాని, బౌద్ధస్థూపం గాని ఉండి ఉండవచ్చుననే భావన కలుగుతోంది. తర్వాత జైన లేక బౌద్ధ ఆలయాన్ని శివాలయంగా మార్చి ఉండవచ్చును. ఆ శివాలయ నిర్మాణంలో అంతకు పూర్వం అక్కడ ఉన్న జైన బౌద్ధ శిల్పకళ ఆకృతులు ఈ నూతన నిర్మాణంలో చోటుచేసుకొని ఉండవచ్చును.. ఇవి విజయనగర శిల్పాలు అంత గొప్పవి కావు. కాని లేపాక్షిలోని చిత్రకళ దక్షిణ ఉత్తర దేశపు శిల్పకళల మిశ్రమం అని చెప్పవచ్చును.

ప్రాచీన కాలంలో అజంతా చిత్రకళ మంచి ప్రాచుర్యం పొందింది. కాని క్రీ.శ.6వ శతాబ్దం నాటికి అజంతా చిత్రకళ ఆగిపోయింది. అజంతా కొండలలో చతురస్రాకారపు గుహలను తొలచి లోకప్పుల పైన గోడలపైన పూతలు పెట్టి నునుపు చేసి వర్ణచిత్రాలు చిత్రించారు. అవి బౌద్ధగుహలు కనుక వారు బుద్ధుని జీవిత ఘటనలు, జాతక కథలను వర్ణచిత్రాలుగా చిత్రించారు. వాటితోపాటు రాజుల చిత్రాలు, వేట, సంగీత దృశ్యాలు కూడా చిత్రించారు. స్త్రీని చిత్రించడంలో శరీర ఆకర్షణ, స్త్రీ సౌందర్యానికి అంతగా ప్రాముఖ్యతనివ్వలేదు. అయినప్పటికీ అజంతా చిత్రకారులు తమ కుంచెలతో రేఖా నిర్మాణంలో క్షేత్రగణిత విజ్ఞానంలో అలంకారాలతో తమ ప్రజ్ఞాపాటవాలను చూపించారు. భాఘ్ బౌద్ధ విహారాలలో స్పష్టంగా కనపడే విధంగా నీడలను చిత్రించి అజంతా చిత్రకళను మరొక మెట్టు ఎక్కించారు. కాని వారు తమ చిత్రాలకు నలుపు ఎక్కువగా కలిపిన బూడిద రంగును వాడారు. అరచేతులకు కచికరంగును వాడారు. అందువల్ల చిత్రాలు అంత అందంగా కనిపించలేదు.

సింహళంలోని సింహగిరి చిత్రాలు కూడా అజంతా రీతులలోనే చిత్రించారు. అందులో ఎర్రరంగును వాడారు. కర్ణాభరణాలు, హస్తాంగుళీలు, చనుకట్లు అజంతా చిత్రాలను పోలి ఉన్నాయి.. అయినప్పటికీ ముఖాలలో భావాలు స్పష్టంగా ప్రదర్శించడం లేదు.

తమిళనాడులోని చిత్తన్నవాసల్‌లో కూడా వర్ణచిత్రాలు ఉన్నాయి. అవి జైనుల చిత్రాలు. జైనులు విరాగులు. అందువల్ల ఆ చిత్రాలలో అజంతా చిత్రాల లాలిత్యం కనపడదు. బాదామీ గుహ చిత్రాలు కూడా అజంతా చిత్రాలను పోలి ఉన్నాయి. ఎల్లోరా చిత్రాలలో కొన్ని అజంతా చిత్రాల లాగా ఉన్నాయి. మరికొన్ని కొత్త పద్ధతిలో చిత్రించబడ్డాయి. కొత్తవి యుద్ధ చిత్రాలు, సమకాలిక జీవనశైలిని ప్రతిబింబిస్తున్నాయి. తంజావూరు బృహదీశ్వర ఆలయ చిత్రాలు పుష్టి కలిగినవిగా కనిపిస్తాయి. అయినప్పటికీ అందులో కూడా అజంతా చిత్రాల శైలి ఉంది. కోణార్క, పల్లవ, చోళ శిల్పాలలో కూడా అజంతా శైలి గోచరిస్తుంది. 7వ శతాబ్దం నుండి రాజులు శిల్పానికి ఇచ్చినంత ప్రాముఖ్యత చిత్రకళకు ఇవ్వలేదు. పైగా వారు దేవాలయాలు రాళ్లతో నిర్మించారు. వర్ణచిత్రాలకు గుహలలో ఉండే విశాలత్వం కట్టుబడి చేసిన ఆలయాలలో ఉండేది కాదు. కనుక చిత్రకళా స్థానంలో శిల్పాలు వచ్చాయి. పైగా శిల్పాలు శాశ్వతాలు. చిత్రకళ కాలక్రమంలో మాసిపోతుంది. కనుక వారు చిత్రకళను అశ్రద్ధ చేశారు.

అభిలషితార్థ చింతామణి: నశించిపోయే చిత్రలేఖనాన్ని పదిలపరచడానికి అన్నట్లు మూడవ సోమదేవుడు తన అభిలషితార్థ చింతామణిలో చిత్రలేఖనాన్ని రచించే విధానాన్ని వర్ణించాడు. గోడకు పేడ, ఊక కలిపిన మట్టిని పూసి నునుపు చేయాలి. దానిపై సుద్దను అంటే గుల్లసున్నాన్ని పూయాలి. దానిపై లేపనం పూయాలి. లేపనాలు రకరకాలుగా తయారు చేసేవారు. వానిలో వజ్రలేపనం అనేది ఒకటి. గేదె చర్మాన్ని నీటిలో ఉడకబెట్టి ఆ నీటిలో పంచదార, శంఖచూర్ణాన్ని కలపాలి. అప్పుడు దానిని వజ్రలేపనం అని అంటారు. లేపనం పూసి నునుపు చేయాలి. దానిపై రేఖాచిత్రం గీయాలి. ఉడికించిన బియ్యాన్ని దీపపుమసిని కలిపి నూరాలి. ఈ ముద్దను వార్తికము లేక కడికె అని అంటారు. ఈ వార్తికముతో చిత్రం గీయాలి. దీనిని మాతృక చిత్రం అని అంటారు. దానిని గైరిక ద్రవంతో దిద్ది దాని ఆకారం వచ్చేట్లు చేయాలి. అప్పుడు దానిని రేఖాచిత్రం అని అంటారు. రేఖాచిత్రాలు చిత్రించిన తర్వాత చిత్రం రూపం స్పష్టంగా అందంగా కనిపించడానికి రంగులు పూయాలి. రంగులు పూయడానికి మూడు కుంచెలను వాడేవారు. మొత్తం రంగు పూయడానికి ఒక కుంచె, అంగాంగ సామరస్యాన్ని సాధించడానికి

అంతకంటే చిన్నకుంచె, ఇంకా సూక్ష్మ అంశాలు చిత్రించడానికి ఇంకా చిన్నకుంచె వాడాలి. ఆ కాలంలో తెలుపురంగుకు శంఖచూర్ణం, ఎరుపురంగుకు లాక్షరసం, గౌరికశిల నలుపురంగుకు మరొక చూర్ణం వాడేవారు ఇవన్నీ శిలాద్రవ్యాలు. అందువల్ల ఎన్ని శతాబ్దాలు గడిచినా ఆ రంగులు నేటికీ నిలిచి ఉన్నాయి. సోమదేవుని వల్ల ఆనాడు వర్ణచిత్రాలను చిత్రించే విధానం మనకు తెలియవచ్చింది.

జైనుల తాళపత్ర గ్రంథాలు: 11వ శతాబ్దం నుండి తాళపత్రాల గ్రంథాలపై చిత్రకళను చిత్రించే సాంప్రదాయం ప్రారంభమైంది. ఈ సాంప్రదాయం మొదట గుజరాత్‌లో జైనులు ప్రారంభించారు. నాటికే భారతదేశంపై ముస్లిం దండయాత్రలు ప్రారంభమయ్యాయి. గజనీ మహమ్మద్ 17 సార్లు దండెత్తి అనేక దేవాలయాలను కొల్లగొట్టాడు, కూలగొట్టాడు. అప్పటి నుంచీ జైనులు తమ సాంప్రదాయాలను చిత్రాల రూపంగా తాళపత్రాల మీద రచించి కాపాడుకున్నట్లుగా కనిపిస్తుంది. ఇలాంటి చిత్రాలు క్రీ.శ.1100 సంవత్సరంలో గుజరాత్‌ను పాలించిన జయసింహుని కాలం నుండి లభిస్తున్నాయి. క్రీ.శ.1120లో రచించిన షట్కాండాగమనం, 1127 నాటి జ్ఞాతసూత్రం, 1143 నాటి దశవైకాలిక లఘువృత్తి, 1161 నాటి ఓఘనిర్యుక్తి మొదలైన గ్రంథాలు చిత్రాలతో రచించబడ్డాయి. అంటే కథను చిత్రాల ద్వారా చెప్పడం. క్రీ.శ.1288 నాటి సుబాహుకథను పూర్తిగా చిత్రాలతోనే రచించారు. మొదటిదశలో తీర్థంకరుల చిత్రాలను మాత్రమే రచించారు. తర్వాత వారి జీవితగాథలను కూడా చిత్రాల రూపంలో రచించారు. 16వ శతాబ్దం వరకు తాళపత్రాలు, భూర్జర పత్రాల మీద రచించారు. తర్వాత వస్త్రాల మీద, కాగితాల మీద రచించబడి ఉత్తర భారతదేశంలో ఒక ప్రముఖమైన హస్తకళగా అభివృద్ధి చెందింది.

జేగురురంగు తయారు చేసి దాంతో చిత్రించేవారు. రేఖామాత్రంగా రెండు కొలతలతో సూది ముక్కులు, సదిగడ్డాలతో దీర్ఘమైన దౌడలతో పక్కకు తిరిగిన ముఖాలతో చిత్రించారు. వస్త్రాల అంచున అలంకారంగా గళ్లు లతలు చిత్రించారు. స్త్రీల కళ్లకాటుక కంటి చివర నుండి చెవి వైపు రేఖ లాగా పొడిగించి చిత్రించారు. కర్ణాభరణాలు చక్రాల లాగా ఉన్నాయి. ఇంకా చెట్లు, ఏనుగు మొదలైన కొన్ని జంతువుల బొమ్మలు కూడా గీసారు. ఎల్లోరాలోని కైలాసనాథ ఆలయంలోని గరుత్మంతుడు, లక్ష్మీదేవి చిత్రాల ఈ కోవకు చెందుతాయి. వారి ముక్కులు సన్నగా పొడవుగా ఉన్నాయి. ఈ చిత్రాలను బట్టి జైనులు తమ చిత్రాలు గీసారని, కనుక జైనులు ప్రత్యేకంగా ఈ చిత్రకళను అభివృద్ధి చేయలేదని కొందరు అభిప్రాయపడ్డారు. కాని జైనచిత్రాలు తాటి ఆకుల మీద చిత్రించారు హిందువులు వెదురుపుల్లకు రాగిముల్లు గుచ్చి దాంతో రేఖాచిత్రాలు గీచేవారట. దాంతో తాటాకు మీద గీయటానికి వీలులేదు. కనుక తాటాకుల మీద చిత్రాలు గీచే నూతన పద్ధతిని జైనులే మొదట ప్రారంభించారని మరికొందరు భావించారు. రేఖామాత్రంగా ఉన్న చిత్రింపబడే ఈ కళ తర్వాత కలంకారీ చిత్రకళకు మాతృకై ఉండవచ్చును.

విజయనగర కాలం నాటికి ఈ చిత్రకళ దక్షిణ దేశంలోకి కూడా విస్తరించింది. కనుక ఈ జైన సాంప్రదాయం విజయనగర చిత్రకళలో ప్రవేశించిందని భావింపవచ్చును. చిత్తన్నవాసల్, తంజావూరులలో ప్రాచీన కాలంలో ఉన్న చిత్రకళ మరుగునపడిపోయినందున లేపాక్షి చిత్రకారుడు నాటి జైన చిత్రకళను తన చిత్రాలలో ప్రవేశపెట్టి ఉండవచ్చును.

లేపాక్షి దేవాలయంలో శేనప్పురాయిని వాడారు. అది నల్లరాతి లాగా సులభంగా శిల్పాలు చెక్కడానికి వీలు లేదు. కనుక లేపాక్షి నిర్మాతలు చిత్రకళకు ప్రాధాన్యతనిచ్చారు. చిత్రకళ ద్వారా దేవాలయాన్ని సుందరంగా తీర్చిదిద్దవచ్చని భావించారు. కనుక మండపాల లోకప్పులను, కుడ్యాలను సున్నపుగారతో నునుపు చేసి వర్ణచిత్రాలు చిత్రించారు. అలాగే చిప్పగిరి చెన్నకేశవ ఆలయం, సోమపాలెం, కరుగూడు శివాలయాలలో కూడా ఇలాంటి చిత్రాలు చిత్రించబడ్డాయి. ఈ ఆలయాలలో పలుచని గారపూత పూసి నునుపు చేసి తడి ఆరకుండానే చిత్రరచన చేశారట. తడి ఆరిపోతే రంగు పట్టదట. చిత్రాలకు వేసే రంగును సున్నపుతేటతో కలిపారట. అందువల్ల ఆ ద్రవం బొగ్గుపులుసు వాయువును పీల్చి గట్టిపడుతుందట. అలాంటి రంగులు వెలిసిపోక శతాబ్దాల తరబడి నిలిచి ఉంటాయట. ఇలాంటి సైంటిఫిక్ విజ్ఞానం వారికి ఆనాడు ఎలా తెలిసిందో మనకు తెలియదు. అది స్వానుభవంతో సంపాదించిన విజ్ఞానం అని చెప్పవచ్చును.

లేపాక్షిలోని చిత్రకళను 3 భాగాలుగా విభజించారు.

1. **దేవతామూర్తులు:** లేపాక్షి పరమేశ్వరుని వివిధ రూపాలు చిత్రించారు. శివుడు, భిక్షాటనమూర్తి, భైరవుడు, నటరాజు, అంధకాసురుడు, అర్ధనారీశ్వర, గౌరీప్రసాదక, హరిహర, మత్స్యకూర్మ విష్ణు అవతారాలు,

వటపత్రశాయి, రంభ నాట్యం చేస్తున్నట్లు అద్భుతంగా చిత్రించారు. ఇంకా సరస్వతి, తుంబుర, నారద, విష్ణు, బ్రహ్మ, ఇంద్ర చిత్రాలు కూడా ఉన్నాయి. ఇవి మొదటి కోవలోకి వస్తాయి.

2. **భక్తులు:** రాజులు, రాణులు, రాజోద్యోగుల చిత్రాలు ఈ కోవలోకి వస్తాయి.
3. **పురాణగాథలు:** ద్రౌపదీ స్వయంవరం, మాధవవర్మగాథ, కిరాతార్జునీయం, మనుచోళుని కథ మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి.

దేవతామూర్తులు: లేపాక్షి చిత్రకారుడు దేవతామూర్తులను చిత్రించడంలో ఆగమాలను పాటించడమేగాక సౌందర్యంతో గొప్ప చైతన్యాన్ని సాధించాడు. జైన చిత్రాలలో సౌందర్యం ఉండదు. లేపాక్షిలో దేవతామూర్తులు అర్ధమండపం ఉత్తరపు వరండాలోను, రఘునాథ ఆలయపు ముఖమండపంలోను ఎక్కువగా ఉన్నాయి. రఘునాథ ఆలయంలో ఆగ్నేయమూలలో ఉన్న భైరవుడు, భైరవుని కన్నులలో చక్కని చైతన్యం గోచరిస్తుంది. ఈ ఆలయంలోనే చిత్రించిన మత్స్యకూర్మమూర్తులు అతి సుందరంగా ఉన్నాయి. అవి చూసే వారికి గొప్ప భక్తి భావాన్ని కలిగిస్తాయి. పశ్చిమ చాళుక్యుల దేవాలయ అధిష్ఠాన పీఠాల మీద కూడా మత్స్య, కూర్మ శిల్పాలున్నాయి. కాని లేపాక్షిలోని మత్స్య కూర్మమూర్తుల వంటి సుందరమైన చిత్రాలు మరెక్కడా లేవు. వాటి కాళ్లు ముద్దులొలికేటట్లు తీర్చిదిద్దబడ్డాయి.

వీరభద్రేశ్వర ఆలయపు ప్రదక్షిణాపథంలోను, సేనాగారపు లోకప్పు మీద చిత్రించిన శివుడు చూపరుల వైపు చూస్తూ ఉంటాడు. ఈ చిత్రంలో జైనుల చిత్రాలలోని మహావీరుని శైలి కనిపిస్తుంది.

దేవతామూర్తిని మధ్య చిత్రించి అటు ఇటు భక్తులను చిత్రించిన చిత్రాలు కూడా లేపాక్షిలో ఉన్నాయి. ఇక్కడ చిత్రించబడిన వ్యక్తులు ప్రక్కకు చూస్తూ ఉంటారు. ముక్కులు సూదిగా ఉంటాయి. చిరుగడ్డాలున్నాయి. భక్తులు బారులు తీరి నిలబడి ఉన్నారు. కూర్చున్న వరుసలో లేరు. ఒక్క భృంగి తప్ప నాట్యం చేసే చిత్రాలు లేవు. స్త్రీల పాపటి పొడుగున తీర్చిన ముత్యాల సరాలు వివరంగా చిత్రించాడు. కొన్ని చిత్రాలు మన వైపే చూస్తూ ఉంటాయి. ఈ భక్తుల విన్యాసాలు శాలివాహన సప్తశతిలో వర్ణించిన వర్ణచిత్రాల లాగ ఉన్నాయి. కిరాతార్జునీయ గాథలు కొండ మీద ఒకరు, చుట్టుపక్కల ఒకరు ఉన్నట్లు చిత్రించారు. స్త్రీల చీరెలలో గారలు, చారలు మాత్రమే ఉన్నాయి గాని శరీరపు ఒంపులను సూచించే ముడతలు లేవు. మాధవవర్మ గాథలో ప్రధానికవతల ఒక వ్యక్తి కనబడుతున్నట్లు అద్భుతంగా చిత్రించారు. శివపూజ చేయటానికి తుంబురుడు, వెనుక ఒక మూడు ముఖాలు కలిగిన వ్యక్తి నిలబడి ఉన్నట్లు చిత్రించారు. మైలారు వీరభటుడు వీరవైష్ణవ చిత్రాలు కూడా చిత్రించి ఉన్నాయి. లేపాక్షి స్త్రీలు ధరించిన చీరెలు అనేక రకాలవి చిత్రించబడ్డాయి. ఏ స్త్రీ కూడా ఇంకొక స్త్రీ కట్టిన చీర కట్టలేదు. బహుశా ఈ కారణం వల్లనే లేపాక్షి చిత్రకళ ఈనాటి వస్త్రాలపై చిత్రించడానికి కారణమై ఉంటుంది. ఆంధ్రదేశంలో లేపాక్షి ప్రింటుచీరెలే మంచి ప్రాచుర్యంలో ఉన్నాయి. లేపాక్షి చిత్రకళలో మరొక విశేషం ఉంది. వరాహాన్ని పెద్ద ఏనుగుసైజులోను, కుందేళ్లు, చిలకలను ఒకే సైజులో చిత్రించారు. ఇది వాస్తవికతకు వ్యతిరేకంగా ఉంది. మొత్తం మీద లేపాక్షి చిత్రాలన్నీ దారంలోని పూసల వలె ఒక వరుసక్రమంలో ఉన్నాయి. ఈ వర్ణచిత్రాలకు వివిధ రంగులు వాడారు. శివుని చిత్రాలకు తెలుపు, వటపత్రశాయి, మత్స్య, కూర్మ చిత్రాలకు నీలిరంగు, ఇంద్రుని వజ్రాలకు నల్లరంగు, వ్యాఘ్రాజినానికి అదే రంగు వాడారు.

లేపాక్షి చిత్రాలలో అర్ధమండపం ఉత్తర వరండాలో తూర్పు నుండి పడమటి అంచు వరకు శివమూర్తులు ఉన్నాయి. వానిని లింగోద్భవ, అంధకాసుర సంహార, దక్షిణామూర్తి, భిక్షాటనమూర్తి, చండికేశానుగ్రహమూర్తి, అర్ధనారీశ్వర, కళ్యాణసుందర, గౌరిప్రసాదిక, ఆనందతాండవ, త్రిపురభంజన, వృషభారూఢ మూర్తులుగా డా॥ పుట్టపర్తి శ్రీనివాసాచార్యుల వారు గుర్తించారు. ఇదే వరండాలో గంగాధరమూర్తి కూడా ఉన్నారు. ఆ గంగలో చేపలు కూడా ఉన్నాయి. పార్వతీపరమేశ్వరులు చదరంగమాడటం కూడా ఉంది. ఒకేచోట ఇన్ని చిత్రాలు ఉండటం ఒక్క మహాబలిపురంలో తప్ప మరెక్కడా కనిపించదు. ఇలాంటి అత్యంత ఆకర్షణీయ శివుని వివిధ రూపాలు మరెక్కడా లేవని లాంగ్హూరష్టు ప్రశంసించాడు.

రఘునాథ ఆలయపు ముఖమండపం లోకప్పు 9 పలకాలుగా ఉన్నాయి. వాటిపై మధ్యలో లక్ష్మీ నారాయణస్వామి, చుట్టూ మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామావతారాలు చిత్రించబడ్డాయి. అర్ధమండపం ఉత్తర ద్వారంపైన ఉమాసహితమూర్తి ఉన్నాడు. వారిపై ఖేచరులు పూలు చల్లుతూ ఉంటారు. ఈ చిత్రానికి దక్షిణాన పెద్ద వీరభద్రమూర్తి ఉన్నాడు. ఈయన మోకాలి దగ్గర విరూపణ్ణ, ఆయన భార్య చిత్రాలు

చిత్రించారు. వీరభద్రాలయపు ప్రదక్షిణపు లోకప్పు మీద తెల్లనిరంగుతో ఈశ్వరుడు లింగోద్భవమూర్తి వీరభద్రుడు, విష్ణుమూర్తి చిత్రాలు చిత్రించబడ్డాయి. పార్వతీదేవి ఆలయానికి ఉత్తరపు వైపు ఉన్న లోకప్పు మీద అర్ధనారీశ్వరుడు చిత్రముంది. శైనాగారంలో ఉన్న ఈశ్వరుని చిత్రానికి ఒక విచిత్రమైన మకర తోరణం చిత్రింపబడి ఉంది దుర్గాదేవి చిత్రానికి పైన ఒక పులివేట చిత్రించబడి ఉంది. వేటగాళ్లు తాళ్ల చెప్పులు ధరించి ఉన్నారు. వారు ఒక చిరుత పులిని వేటాడుతూ ముఖమండపంలో అనేక కథాచిత్రాలు చిత్రింపబడి ఉన్నాయి. ద్రౌపదీ కళ్యాణం, గౌరికళ్యాణం, భూకైలాస్, దక్షిణామూర్తి, ఆనందతాండవం, ఈశ్వరప్రత్యక్షం, వీరభద్రానుగ్రహం, శ్రీరామ పట్టాభిషేకం చిత్రాలున్నాయి. ఈ మండపంలోనే ఉత్తరం వైపు మాధవవర్మకథ, కిరాతార్జునీయం కథ ఇంద్రానుగ్రహం చిత్రాలు చిత్రింపబడ్డాయి. మాధవవర్మ చిత్రంలో రథం మీద పడి ఉన్న దూడను ఆవు నాకుతున్నట్లు చిత్రించారు. కిరాతార్జునీయం చిత్రంలో అరణ్య దృశ్యం అద్భుతంగా చిత్రించారు. లేళ్లు, కుందేళ్లు కుక్కలు, చిలుకలు పరుగెత్తిపోవడం, వరాహానికి దగ్గరలో ఉన్న దుప్పులు దాక్కోవటం, వరాహాన్ని చూసి మునులు భయభ్రాంతులు కావటం అద్భుతంగా ఉన్నాయి. మరొక చిత్రంలో ఈశ్వర దర్శనార్థం బాలబ్రహ్మచారి నారదుడు భృంగి నిలబడి ఉన్నారు. వారిలో భృంగికి మూడు కాళ్లు ఉన్నాయి. ఈ వర్ణ చిత్రాలలో కొన్ని పెద్దవి, కొన్ని చిన్నవి కిరాతార్జునీయం గాథలో 'వరాహం మనుషుల కంటే పెద్ద ఆకారంలో మహాభయంకరంగా ఉంది. మాధవవర్మ కథలోని ఆవు కూడా పెద్దదే. భైరవచిత్రం పక్కన కుక్క ఉంది. దాని మూతి మొసలి మూతి లాగా ఉంది కిరాతార్జునీయంలోని చిలుక, కుందేళ్లు, మాధవవర్మ కథలోని ఆవు దూడ రాణివాస చిత్రంలోని యువతులు చిన్న చిత్రాలుగా చిత్రించబడ్డాయి. లేపాక్షి చిత్రాలలో మబ్బులు కూడా చిత్రించబడి ఉన్నాయి. ఏ కోణంలో నుంచి చూసినా మనవైపు చూస్తున్నట్టు ఉన్న ఒక అసాధారణ చిత్రం అక్కడ ఉందని ఫ్రాన్సిస్ అనే విదేశస్తుడు రాశాడు

లేపాక్షి చిత్రాలలో సమకాలీన ఆచారాలు కూడా చిత్రించబడ్డాయి. నాటి స్త్రీలకు రవికలను ధరించే ఆచారం లేనట్లుగా కనిపిస్తోంది. స్త్రీ చిత్రాలకు రవికలు లేవు. అనేక రకాల చీరలు మాత్రం ధరించారు. పైటను శరీరం చుట్టూ రెండుసార్లు తిప్పుకున్నట్లు ఉన్నాయి. చాలా మంది స్త్రీలు కొప్పుముడి వేసుకున్నట్లు ఉన్నారు కొప్పులో దండలు లేవు, విడిపూలు పెట్టుకున్నారు. పురుషులు మోకాళ్ల బిగువు వరకు వ్రేలాడే అంగరఖాను ధరించారు. ఉత్తరీయాన్ని నడుంకు బిగించి కట్టుకున్నారు. తలపై పొడవు టోపీ ఉంది. కొందరు తలపాగాను ధరించారు. టోపీలపై అల్లిక, అలంకారాలు నిలువు పట్టీలు ఉన్నాయి. మెడలోను, మణికట్లకు తారహారాలు ధరించారు. పొడుగాటి టోపీలు ధరించిన శిల్పాలు చిప్పగిరి, తాడిపర్తి దేవాలయాలలో కూడా ఉన్నాయి తాడిపర్తి రామలింగేశ్వర ఆలయం గోపురం మీద పొడవాటి టోపీతో సాళువ తిమ్మరుసు శిల్పం ఉంది. విజయనగర కాలంలో పొడుగాటి టోపీలు ధరించే ఆచారం ఉందని స్పష్టంగా చెప్పవచ్చును.

కొన్ని చిత్రాలలో దేవళాలు, రథాలు, కోట గోడలు కూడా చిత్రించబడ్డాయి. కొన్ని రథాలు మూడు చక్రాలతో చూడముచ్చటగా ఉన్నాయి. లేపాక్షిలోని ఒక వర్ణచిత్రంలో ఈశ్వరుడు దేవాలయం లాగా ఉన్న ఒక మండపంలో ఉన్నాడు. ఆ మండపం వెనుక కోట గోడ ఉంది. ఆ కోటగోడపై సైనికులు యుద్ధపుమాటులు చిత్రించబడి ఉంది. ఈ రకం గోడ విజయనగరంలో ఎక్కడా కనిపించలేదు. ఈ గోడలాగే శ్రీశైల ప్రాకారపు గోడ ఉంది. లేపాక్షిలో కుడ్యచిత్రకళ ప్రాచుర్యంలో ఉన్నాయి. కనుక లేపాక్షి చిత్రకారులు జైనసాంప్రదాయాన్ని తీసుకొని అందులో సమకాలీన ప్రజాజీవిత శైలిని చొప్పించారు. కనుకనే లేపాక్షి చిత్రాలలో ముత్యాల సరాలు, కుచ్చెళ్ల చీరెలు, అంగరఖాలు, పంచలు, విజయనగరపు వస్త్రాలంకారం ప్రవేశించి చిత్రకళలో సమకాలీన వాస్తవికతను ప్రతిబింబించాయి.

లేపాక్షి సారస్వతం - యక్షగానాలు: లేపాక్షి శాసనాలన్నీ కన్నడంలో ఉన్నాయి. అచ్యుతదేవరాయల కాలం వరకు ఇది కన్నడ ప్రాంతంగానే కనిపిస్తోంది. కాబట్టి అనంతపురం జిల్లా మొదటి నుండి విజయనగర రాజ్యం కిందనే ఉంది. యావదాంధ్రదేశాన్ని జయించిన కపిలేశ్వర గజపతి కూడా అనంతపురం జిల్లాను జయించలేదు కాలక్రమేణా తెలుగు జనాభా పెరిగి తెలుగు ప్రాంతంగా మారింది. కనుక లేపాక్షి దేవునికి అంకితంగా 5 తెలుగు నాటకాలు రాయబడ్డాయి. జోడి వెంకట్రాయకవి అనే అతడు కృష్ణలీల, శివలీల, రామనాటకం అనే మూడు నాటకాలు రచించాడు. ఇతని బావమరిది లంకా గుండావధాని శిష్యుడు రామచంద్రకవి దమయంతీ పరిణయం అనే నాటకరూప యక్షగానాన్ని రచించాడు. లేపాక్షి వెంకటనారాయణ కవి ఇతని వంశం వాడట. మరొక కవి మహాభారతాన్ని ఆదిపర్వం నుండి ఉద్యోగపర్వం వరకు నాలుగు రాత్రులు కథగా రచించాడు.

మొదటి మూడు నాటకాలు రచించిన వెంకరాయ కవి నాట్యప్రదీపనము అనే భరత శాస్త్ర గ్రంథం, రుక్మిణీ పరిణయము అనే యక్షగానాన్ని కూడ రచించాడు.

లేపాక్షి వీరభద్రాలయ అర్ధమండపంలో వాయవ్య దిశలో ఉన్న స్తంభం మీద శిల్పంగా ఉన్న మహిషాసుర మర్ధని ప్రస్తుతం దుర్గమ్మగా పూజింపబడుతోంది. 19వ శతాబ్దం ప్రారంభంలో చండికేశ్వర భక్తుడు అయిన సన్యాసి ఈ స్తంభం మీద ఉన్న దుర్గకు, హోమం, పూజ చేసి ఉత్సవాన్ని జరిపాడట. నాటి నుంచి ఈ దుర్గాదేవికి నిత్యార్చన జరుగుతూ లేపాక్షి ఆలయానికి దుర్గమ్మగుడి అని పేరు వచ్చిందట. ఈమె స్తంభావిర్భవమన, భద్ర, ప్రమద, స్వర్గాపవర్గప్రద అనే ఒక మకుటంతో ఒక శతకం కూడా రాయబడింది.

లేపాక్షి హరికి అంకితం చేయబడ్డ మొదటి నాటకం కృష్ణలీల. ఇది ద్విపదలతో దృశ్య, శ్రవ్య, కావ్య మిశ్రమంగా సాగింది. ఇందు కొన్ని కందార్థాలున్నాయి. విజయనగర కాలం నాటి సుగ్రీవ విజయం తంజావూరు నాయకరాజ్య కాలం నాటి కాళీయమర్ధనం పూతనాహరణం వంటి యక్షగానాలలో కందార్థాలు లేవు. యక్షగానాలలో దరువులకు ప్రాధాన్యత ఎక్కువగా ఉంటుంది. దరువు తొలి భాగం పల్లవి చిన్నది. దానివెంట అనే పల్లవి లాగా అనుసరించిన దరువు భాగం దీర్ఘంగా ఉంటుంది. పాత్రలు ఈ దరువును వాడేటప్పుడు రెండవ భాగాన్ని తాళపు దెబ్బల శబ్దాలతో లయను మాత్రమే ప్రధానంగా సూచిస్తూ పాడుతారు. ఈ రకపు దరువుల కోలాహలం ఎక్కువై పద్యాలలో అంతరార్థంలో ఉన్న లయను ఉపయోగించుకొని పద్యాల చివరన చేరుస్తారు. గంద పద్యంలో చతురస్ర గతి అంతర్వృత్తిగా ఉంటుంది. కనుక నాల్గవపాదం యతివరపు పద్యంగా చతురస్రగతి వచ్చేటట్లు కిటతక, కిటతక, కిటతక అని పాడి తర్వాత తకిట, కిటతక అనే మిశ్రమగతిలో పాడతారు. ఈ పద్ధతిలో ఏకతాళం నుండి త్రిపుటకు మారుతుంది. అందువల్ల పాటకు మంచి మార్దవం వస్తుంది. ఈ కృష్ణనాటకంలో కందార్థాలేగాని ఇతర పద్యార్థాలు లేవు. సాధారణంగా యక్షగానాలలో చివర స్త్రీలపాటలు, ధవళాలు, వ్యాలలు, హెచ్చరికలు, సోభనాలు, హారతులు, మంగళాలు ఉంటాయి. కాని అవి ఈ నాటకంలో లేవు. కనుక ఇవి యక్షగానాలు ఎక్కువగా లేని కాలంలో రాసి ఉండవచ్చునని భావింపబడింది. కొందరివి క్రీ శ.1835వ సంవత్సరం నాటిదని అంటారు.

తర్వాత నాటకం శివలీల. ఇది క్రీ.శ.1839లో రాయబడినదని భావించారు. ఇందులో నాట్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. నాట్యానికి అనుకూలంగా దరువులతో శబ్దాలను ప్రవేశపెట్టి గీతార్థాలను ప్రవేశపెట్టి కథను పెంచాడు. ఇందులో దక్షుని కుమార్తె తపస్సుచేసి ఈశ్వరుని ప్రత్యక్షం చేసుకోవడం ఇతివృత్తం. ఈ నాటకం రచించిన వెంకటరాయకవి తాను శ్రీవిశ్వేశ్వర కరుణాకటాక్షలబ్ధాంధ్ర కవితాలంకృతుడనని చెప్పుకున్నాడు.

తర్వాత నాట్యం నాట్య ప్రదీపిక. ఇందులో నాట్యాభినయనములు అద్భుతంగా వివరింపబడ్డాయి. ఇలాంటి గ్రంథాలు చాలా అరుదు. నాట్యంలోని కరణాలను వివరించే పద్య గ్రంథం 32 కరణాలు వివరింపబడ్డాయి. ఇందులో అన్నీ కంద పద్యాలు తేటగీతాలు మాత్రమే ఉన్నాయి.

లేపాక్షి రామాయణం అనే పేరుతో .మూడు రాత్రుల యక్షగానాన్ని వెంకటరాయకవి క్రీ.శ.1543లో రచించాడు. లేపాక్షి మహాభారతం అనే పేరుతో మరొక నాలుగు రాత్రుల కథ కూడా రాయబడింది. ఈ గ్రంథాలన్నీ లేపాక్షి దేవునిపై భక్తితో రాయబడినందువల్ల లేపాక్షి దేవాలయం తెలుగు సారస్వతాన్ని కూడా సృష్టించగలిగింది. ఈ నాటకాలను లేపాక్షి సారస్వతం అని పిలుచుకున్నారు.

లేపాక్షి సంగీతకళ: లేపాక్షి దేవాలయం నిర్మించే కాలంనాటికి సంగీతకళ పెద్దగా అభివృద్ధి చెందినట్లు కనబడదు. తిరుపతి దేవస్థానం మ్యూజియంలో గీత ప్రబంధం అనే సంగీత గ్రంథం ఉంది. అందులో వరూధిని వీణను గురించిన వర్ణన ఉంది. ఆ వీణను మెట్లవీణ అని పిలుస్తున్నారు. నారదుని వీణ పేరు మేళ వీణ. వరూధిని మెట్లవీణ లేపాక్షిలో కనిపించలేదు గాని, నారదుని వీణ లేపాక్షి శిల్పాలలో ఉంది. ఇది నాట్యమండపంలో ఉంది. అలాగే వర్ణచిత్రాలలో తాళపత్ర గ్రంథాన్ని పరిస్తూ ఉన్న ఒక తరుణి వెనుక ఒక పరిచారిక ఉంది. ఆమె కూడా ఇలాంటి వీణనే వాయిస్తోంది. చిత్రాలలోని కిన్నెరులు దాసరుల చేతిలో కూడా ఇలాంటి వీణ ఉంది. ఇదేరకపు వీణ అజంతా గుహలలోని 17వ గుహలో చిత్రింపబడి ఉంది. కనుక లేపాక్షి వీణ దేశంలో అంతకు పూర్వం నుండి సాంప్రదాయబద్ధంగా వస్తోందని చెప్పవచ్చును.

వాయిద్యాలు: జాతకకల చిత్రాలు చూపే శంఖదమనం, భేరి వాయిద్యం లేపాక్షి శిల్పాలలో ఉన్నాయి. వాటిని మైలారు భటులు వాయిస్తున్నట్లు శిల్పాలు చెక్కారు. ఇంకా శృంగనాథం కూడా ఉంది. డోలు, మృదంగం

తప్పెట తాళాల చిత్రాలు కూడా ఉన్నాయి. లేపాక్షిలో కనిపించే ప్రత్యేక వాయిద్యం సన్నాయి. సాంచిలో బాకాలేగాని సన్నాయి లేదు. అజంతాలో కూడా సన్నాయి లేదు. బారాహుత్ శిల్పాలలో కొసన శంఖం గల ఒక వాయిద్యం ఉంది. ఇది సన్నాయి లాగా కనిపిస్తోంది, కాని స్పష్టంగా చెప్పలేము. చాళుక్యుల శిల్పాలలో కూడా ఎక్కడా సన్నాయి లేదు. విజయనగర నాట్యసభలో నాలుగు మూలల్లో నాలుగు విగ్రహాలున్నాయి. వారిలో ఒకరు సన్నాయి వాయిస్తున్నాడు. కనుక విజయనగర యుగంలోని సన్నాయి అనే వాయిద్యం వచ్చిందని చెప్పవచ్చును.

దరువులు: రాక్షస తంగడి యుద్ధం తర్వాత తంజావూరు, మధురనాయక రాజ్యాలు తెలుగు భాషను పోషించాయి. వారి కాలంలో యక్షగానాలకు మంచి ప్రాచుర్యం వచ్చింది. యక్షగానాలలో పదాలు పాడుతూ పదకేళిని అభినయిస్తారు. కాని లేపాక్షి యక్షగానాలలో దరువులే ఎక్కువ. సంగీతభావం కంటే దరువులలో తాళానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతోంది. పాట తాళపు దెబ్బలతో నడుస్తుంది. దీనిని బట్టి ఆ కాలం నాటికి అన్నమయ్య పదాలు ఎక్కువగా ప్రచారంలోకి రాలేదని తెలుస్తోంది. కనుకనే లేపాక్షి యక్షగానాలలో పదాలకు ప్రాముఖ్యత లేకుండా దరువులకే ప్రాముఖ్యత ఇవ్వబడింది. మొత్తం మీద సంగీతకళ కూడా లేపాక్షిలో ఉందని చెప్పవచ్చును.

గండికోట-తాడిపత్రి ఆలయాలు: లేపాక్షి ఆలయాలు తర్వాత చెప్పుకోదగినవి గండికోట ఆలయం, గండి కోట రాజ్యంలోని తాడిపత్రి ఆలయాలు. గండి కోట విజయనగర సామంత రాజ్యం. దానిని పెమ్మసాని కుటుంబానికి చెందిన కమ్మసేనాధిపతులు విజయనగర సామంతులుగా పాలించారు. వారి రాజధాని గండికోట అందులో పెమ్మసాని వారు రఘునాధ దేవాలయం నిర్మించారు. ఇంకా పెమ్మసాని వారు తమ రాజ్యంలోని తాడిపత్రిలో కూడా మరో రెండు దేవాలయాలు నిర్మించారు. లేపాక్షి ఆలయం తర్వాత ప్రసిద్ధి చెందింది తాడిపత్రి ఆలయం. రామలింగేశ్వరస్వామి ఆలయం, వెంకటరమణ ఆలయం అని రెండు దేవాలయాలున్నాయి. వాటిని బుగ్గరామలింగేశ్వర ఆలయం అని చింతల వెంకటరమణ ఆలయం అని కూడా పేర్లున్నాయి. ఇందులో బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని కాళహస్తి దేవాలయం లాగా ప్రముఖ దేవాలయంగా భావిస్తున్నారు. హంపి విజయనగర దేవాలయాలకన్నా విజయనగర శిల్పశైలి ఈ రెండు దేవాలయాలలో పరిణతి చెందిందని పెర్గుసన్ అన్నాడు. ఇవి క్రీ.శ.1450-1551 సంవత్సరాల మధ్య నిర్మింపబడ్డాయని భావింపబడింది. ఇవి రెండూ ఖచ్చితమైన ఆగమశాస్త్ర నియమాల ప్రకారం నిర్మించారు.

చింతల వెంకటరమణ ఆలయం: ఈ ఆలయం రామలింగేశ్వర ఆలయానికి ఈశాన్యంగా అర కిలోమీటరు దూరంలో ఉంది. స్థానికంగా ప్రచారంలో ఉన్న కథ ప్రకారం ఈ దేవాలయంలోని విష్ణు విగ్రహం ఒక చింతచెట్టు మొదలులో లభించింది. ఆ విగ్రహాన్ని బయటికి తీసి స్థానికంగా పాలించిన పెమ్మసాని వంశస్తులు ఈ దేవాలయాన్ని నిర్మించారు. దేవునికి చింతల తిరువెంగళనాథ అని పేరు పెట్టారు. ఆ ఆలయాన్నే నేడు చింతల వెంకటరమణ దేవాలయంగా పిలుస్తున్నారు. ఈ ఆలయానికి చుట్టూ పెద్ద ప్రాకారం ఉంది. ఉత్తరం, దక్షిణం, తూర్పు వైపులలో ద్వారాలున్నాయి. తూర్పు ద్వారంపై ఎత్తయిన గోపురం నిర్మింపబడింది. దానిపై భాగం కొంత శిధిలమైంది. గర్భాలయం చతురస్రంగా ఉంది. దానిపై ద్వితలవిమానం నిర్మించారు. గర్భాలయంముందు అంతరాళం, దానికిముందు ముఖమండపం, దానికిముందు అర్ధమండపం నిర్మింపబడ్డాయి. ప్రాంగణంలో గరుడ విగ్రహంతో ఉన్న ఏకశిలరాతి రథం, ధ్వజస్తంభం బలిపీఠం మూలలో దేవి ఆలయం, కళ్యాణ మండపం, రామానుజుల సన్నిధి, లక్ష్మీనారాయణ సన్నిధి, ఇంకొన్ని వర్తులాకారపు చిన్న ఆలయాలు ఉన్నాయి. దేవాలయపు అగ్రమండపం పొడవైనది. దానికప్పు లోపలిభాగం మీద నాట్యం చేసే సుందరాంగుల శిల్పాలతో అలంకరించారు గర్భాలయ కుడ్యాలపై రామాయణ, మహాభారత శిల్పాలు చిత్రించారు. ఇక్కడ హంపిలోని విఠలాలయంలో ఉన్నట్లే ఏకశిలా రథం కూడా ఉంది.'

శిల్పం: ఆలయంలో అనేక రకాల శిల్పాలు చెక్కబడ్డాయి. దశరథుడు సంతానం కోసం యజ్ఞం చేయడం రాముడు సీతను దగ్గరకు తీసుకోవడం, నరసింహస్వామి హిరణ్యకశిపుని పొట్టను చీల్చడం మొదలైన చిత్రాలు అద్భుతంగా చెక్కారు. ముఖమండపంలో కప్పు మీద వర్ణచిత్రాలు చిత్రించారు. స్తంభాలపై నిలువెత్తు విగ్రహాలు చెక్కారు. కప్పును వాలుగా నిర్మించి దానిపై కోతులు, వాటి పిల్లలు, బల్లులను అందంగా చిత్రించారు.

పెనుగొండ: విజయనగర రాజులకు పెనుగొండ వేసవి విడిది. తళ్లికోట యుద్ధం తర్వాత పెనుగొండ రాజధాని అయింది. ఆరవీటి తిరుమలరాయలు ఇక్కడే పట్టాభిషేకం చేసుకొన్నాడు. పెనుగొండలో ఒక

శివాలయం, ఒక రామాలయం, ఒక కృష్ణాలయం ఉన్నాయి. ఇవి 14వ శతాబ్దం రెండవ అర్ధభాగంలో నిర్మింపబడ్డాయని అక్కడ శాసనాల ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయాలకు గర్భగృహం, అంతరాళం, ముఖ మండపాలున్నాయి. శివాలయ కుడ్యాలపై దేవకోష్ఠాలు, మకర తోరణాలు ఉన్నాయి. పెనుగొండ కృష్ణాలయపు కుడ్యాలపై రామాయణ భాగవత పురాణంలోని ఘట్టాలు చిత్రించారు. ఇంకా అనేక శిథిల ఆలయాలున్నాయి. కొన్ని ఆలయాలు మసీదులుగా మార్చబడ్డాయి. కొండపై కోట ఇప్పటికీ పటిష్టంగానే ఉంది. కొండపై ఉన్న కోటలో అనేక శిథిల దేవాలయాలు నేటికీ కనిపిస్తున్నాయి.

మసీదు: పెనుగొండలో ఒక దేవాలయాన్ని కూల్చి అవే రాళ్లతో మసీదును నిర్మించారు. ఆ మసీదులో క్రీ.శ.1564వ సంవత్సరం నాటి సదాశివరాయల శాసనం ఉంది. అంతకు పూర్వం అది హిందూ దేవాలయం అని ఈ శాసనం స్పష్టం చేస్తోంది. ఈ మసీదు పేరు షేర్‌ఖాన్ మసీదు. ఇది స్వచ్ఛమైన ముస్లిం వాస్తు ప్రకారం నిర్మించబడింది. పెనుగొండలోని గగన్‌మహల్ కూడా ముస్లిం వాస్తు ప్రకారం నిర్మించేవారు.

గోరంట్ల: అనంతపురం జిల్లాలోని గోరంట్ల గ్రామంలోని ఆలయం క్రీ.శ.1354వ సంవత్సరంలో సాళువ వంశానికి చెందిన నరసింహుడు అనే వ్యక్తి నిర్మించినట్లు అక్కడ శాసనం ఉంది. ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. మహామండపంలో గజక్రాంత స్తంభాలున్నాయి. ఇది ఈ ఆలయంలోని ప్రత్యేకత.

కదిరి: అనంతపురం జిల్లాలోని కదిరిలో క్రీ.శ.1352వ సంవత్సరంలో నరసింహ ఆలయం నిర్మించినట్లు అక్కడి శాసనం తెలుపుతోంది. ప్రాంగణంలో అనేక ఇతర ఆలయాలు కూడా నిర్మింపబడి ఉన్నాయి. ఇక్కడ ఉన్న స్వయం ప్రధానాలయం అయిన నరసింహ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహామండపం ఉన్నాయి. గర్భగృహం, అంతరాళం సుందరశైలిలో నిర్మించారు. ఆలయ ప్రాంగణంలో అనేక ఇతర ఆలయాలు కూడా ఉన్నాయి. అందులో దేవీ ఆలయం ఆంజనేయ ఆలయం ముఖ్యమైనవి. ఇంకా గరుడుడికి అంగాలయం, కళ్యాణ మండపం ఇతర మండపాలు కూడా నిర్మించారు.

పుష్పగిరి ఆలయాలు-చెన్నకేశవ ఆలయం: విజయనగర యుగంలో క్రీ.శ.1436వ సంవత్సరంలో పుష్పగిరిలో ఒక చెన్నకేశవ ఆలయం నిర్మింపబడింది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. అధిష్ఠానంలోనే కుంభపాజరం ప్రారంభమై కుడ్యాల దాకా విస్తరించింది. అధిష్ఠానంలో సింహముఖ ప్రణాళం ఉంది. కుడ్యాలపై కృష్ణుడు అర్జునునికి గీతోపదేశం చేసే శిల్పం చెక్కబడింది. ఇక్కడి శిల్పాలలో ఇది మేటి. ఇలాంటి శిల్పం ఆంధ్రదేశంలో మరెక్కడా కానరాదు. భారతదేశంలోనే ఎక్కడా ఇలాంటి శిల్పం లేదని కూడా అంటారు. ఇంకా వేణుగోపాల, రతీమన్మథులు, మహిషాసురమర్ధని, వరాహనరసింహ శిల్పాలు అందంగా చెక్కారు. ఒక శిల్పంలో శివుడు నాట్యం చేయడానికి దుస్తులు ధరిస్తున్నట్లు చెక్కబడింది. కుండలాలు, ఆభరణాలు ధరిస్తున్నట్లు చూపబడింది. ఇది అపూర్వ శిల్పం.

సంతాన మల్లేశ్వర - ఉమామహేశ్వర ఆలయాలు: చెన్నకేశవ ఆలయానికి ఉత్తరంగా సంతాన మల్లేశ్వర, ఉమామహేశ్వర అనే మరి రెండు ఆలయాలున్నాయి. ఈ రెండు ఆలయాలను కలుపుతూ ఒకే మండపం నిర్మించారు. ఇవి కూడా 15వ శతాబ్దంలో నిర్మించబడి ఉండవచ్చని వాటి నిర్మాణ శైలిని బట్టి నిర్ణయించారు. సంతాన మల్లేశ్వర ఆలయానికి వృత్తశిఖరం కలిగిన ద్వితల విమానం ఉండగా ఉమామహేశ్వర ఆలయానికి చతురస్రాకార శిఖరంతో ఉన్న ద్వితల విమానం నిర్మించారు. సంతానమల్లేశ్వర ఆలయ కుడ్యాలపై సీతారామ లక్ష్మణులు, విష్ణుమూర్తిని చిత్రించారు. ఊర్ధ్వ జాను భంగిమలో శివతాండవం చక్కగా చిత్రించారు. ఇంకా కిరాతార్జునగాథ, కంకాళమూర్తుల శిల్పాలు కూడా చెక్కారు. ఉమామహేశ్వర ఆలయ కుడ్యాలపై శిల్పాలు లేవు. చెన్నకేశవ, సంతానమల్లేశ్వర, ఉమామహేశ్వర మూడు ఆలయాలకు కలిపి ఒకే ప్రాకారం ఉంది. తూర్పు వైపు ద్వారం ఉంది. దానిపై గోపురం నిర్మించారు.

కమలాపురం: కమలాపురంలో అచ్యుత దేవరాయలు నిర్మించిన ఆలయం నేటికీ నిలిచి ఉంది.

శ్రీశైలం: శ్రీశైల మల్లికార్జున దేవాలయానికి క్రీ.శ.1405లో రెండవ హరిహరరాయలు ముఖమండపాన్ని నిర్మించాడు. అక్కడ ఒక శిరోమండపాన్ని రెడ్డి రాజులు, మరొక దానిని హరిహరరాయల రాణి కట్టించినట్లు శాసనాలున్నాయి. శ్రీశైల మల్లికార్జున ఆలయానికి క్రీ.శ.1456వ సంవత్సరం ప్రాకారం నిర్మింపబడింది. దానిపై విజయనగర కాలం నాటి శిల్పాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఈ ప్రాకారంపై శివపురాణంలోని శివుని

రూపాలు చిత్రించారు. ఏనుగులు, గుర్రాలు, మకర తోరణాలు, హంసల వరుసలు కూడా చిత్రించబడ్డాయి వనంలో శివుడు సంధ్యాతాండవం చేస్తున్నట్లు ఉన్న శిల్పం అద్భుతంగా మలిచారు. ఇందులో శివుడు అపస్మారునిపై నాట్యం చేస్తుండగా బ్రహ్మవిష్ణువులు వాయిద్యాలు వాయిస్తూ శివునికి రెండు వైపులా నిలబడి ఉన్నారు. నాలుగు చేతుల దేవి, నందికేశ్వరుడు ఘోటను పట్టుకొని ఉన్నాడు. మరొక చిత్రంలో శివుడు ఆనందతాండవం చేస్తున్నాడు. షణ్ముఖుడు, సరస్వతి పక్కనే ఉన్నారు. మరొక చిత్రంలో భృంగి మూడు కాళ్లతో నిలబడి ఉన్నాడు. హనుమంతుడు, గణేశుడు మరొక చిత్రంలో ఉన్నారు. పాతాళగంగ వద్ద ఒక ఉమామాహేశ్వర ఆలయం ఉంది. అది విజయనగర శైలిలో ఉంది. ఈ ఆలయం కూడా వీరి కాలంలోనే నిర్మింపబడి ఉండవచ్చును. ఈ ఆలయానికి గర్భగృహం ముఖమంటపం మాత్రమే ఉన్నాయి. పైన విమానం లేదు.

మార్కాపురం - చెన్నకేశవ ఆలయం: విజయనగర యుగంలో 16వ శతాబ్దంలో మార్కాపురంలో ప్రసిద్ధి చెందిన చెన్నకేశవ ఆలయం నిర్మింపబడింది. ఇక్కడి మండపస్తంభాలు గజ, సింహ, అశ్వ, వ్యాళాలతో రూపొందించబడి చాలా అందంగా కనిపిస్తాయి. బలిపీఠంపై మణిబంధం, సింహం, భారపుత్రులు, లోకపాలురు కూర్చొని ఉన్న భక్తులు శిల్పాలు చెక్కి ఉన్నాయి.

అహోబిలం-నరసింహ ఆలయం: అహోబిలంలోని నరసింహ ఆలయంలోని కళ్యాణమండపం విజయనగర యుగంలో నిర్మించారు. అందులో స్తంభాలపై ఉన్న అలంకరణ తాడిపత్రి ఆలయాల స్తంభాలను పోలి ఉన్నాయి.

ఉదయగిరి: విజయనగర సామ్రాజ్యంలో ఉదయగిరి ఒక ఉపరాజ్యంగా ఉండేది. అక్కడ విజయనగర రాజుల కాలంలో వందలాది దేవాలయాలు నిర్మింపబడ్డాయి. ముస్లింలు ఆక్రమించిన తర్వాత అవన్నీ శిథిలమై పోయాయి. నేటికీ ఊరి చుట్టూ కొన్ని మైళ్ల వైశాల్యంలో వందలాది దేవాలయ శిథిలాలు కనిపిస్తాయి. ప్రాకారం గర్భగుడి గోడలు, కొన్ని మండపాలు నిలచి ఉన్న రంగనాయకుల దేవాలయం ఆనాటి వైభవానికి చిహ్నంగా మిగిలింది. ముస్లింల కాలంలో ఇందులోని రంగనాయక విగ్రహాన్ని నెల్లూరు తరలించి నేటి నెల్లూరులోని రంగనాయక దేవాలయంలో ప్రతిష్ఠించారని అక్కడి ప్రజలు నేటికీ చెప్పుకుంటూ ఉంటారు. ఉదయగిరిలోని శిథిల రంగనాయక దేవాలయ ప్రాంగణంలో అనేక శిల్పాలు ఉన్నాయి. ముఖద్వారపు బంధాలపై ఉన్న సాలభంజికలు బహుసుందరరంగా మలచబడ్డాయి. అవి నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. ఈ సాలభంజికలు అతి నాజూకుగా త్రిభంగ స్థితిలో నిలబడి ఉన్నాయి. కుడిచేతిలో వీణ ఉంది. ఎడమ చేయి తొడపైన పెట్టుకొని ఉన్నారు. ఒంటిపై మంచి ఆభరణాలు ఉన్నాయి. నెత్తిన శిరోవేష్టాలు ఉన్నాయి. శరీరం బలిష్టంగా మంచి కండపుష్టి కలిగిన తొడలతో రమణీయంగా చెక్కారు. ప్రాంగణంలో అనేక విరిగిపోయిన విగ్రహాలున్నాయి. విజయనగర కాలంలో స్థానిక పాలెగాడు రాయించిన శాసనం కూడా ఒక రాతిపై చెక్కి ఉంది. పక్కన ఉన్న కొండపై శిథిలమైన కోట ఉంది. రంగనాయకుల ఆలయానికి కోట ఉన్న కొండకు మధ్యన సుమారు నాలుగు మైళ్ల దూరం ఉంటుంది. ఆ ప్రదేశమంతా శిథిలమైన కట్టడాలు వేలాదిగా ఉన్నాయి. ఒకప్పుడు అది గొప్పగా వెలిగిన పట్టణం అని, ఆ శిథిలాలు స్పష్టపరుస్తున్నాయి.

చంద్రగిరి: చిత్తూరు జిల్లాలోనే ఉన్న సోమపాలెంలో విజయనగర రాజుల కాలం నాటి ఒక చెన్నకేశవ ఆలయం ఉంది. ఇది క్రీ.శ.16వ శతాబ్దంలో నిర్మించిన ఆలయం. ఈ ఆలయంలో కప్పు మీద నుంచి వర్ణచిత్రాలు చిత్రించారు. కాని నేడు అవి రంగులు వెలిసిపోయి కళావిహీనంగా కన్పిస్తున్నాయి.

తిరుపతి: విజయనగర రాజులు తిరుపతి తిరుమలలో అనేక నిర్మాణాలు చేశారు. సాళువ నరసింహ రాయలు తిరుపతి ఆలయాలను అభివృద్ధి చేశాడని అంటారు. కృష్ణదేవరాయలు ప్రాకారాన్ని కళ్యాణ మండపాన్ని నిర్మించాడు. విజయనగర రాజులు ప్రతి తరంలో తిరుపతిలో ఏదో ఒక నిర్మాణం చేశారు. తిరుపతి చక్రతీర్థంలో రంగనాథ శిల్పం వీరి కాలం నాటి గొప్ప శిల్పం.

నారాయణాపురం నాగలాపురం ఆలయాలు - కాళహస్తి: చిత్తూరు జిల్లాలోని నారాయణాపురం, నాగలాపురాలలో కూడా విజయనగర కాలం నాటి అనేక ఆలయాలున్నాయి. ప్రసిద్ధి చెందిన కాళహస్తిలో గోపురాన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించాడు. ఇది చాలా పెద్ద గోపురం. దానికి రాయగోపురం అని పేరు.

తెలంగాణలో విజయనగర ఆలయాలు: తెలంగాణలో కూడా అనేక ప్రదేశాలలో విజయనగర రాజులు దేవాలయాలు నిర్మించారు. వాటిలో జటప్రోలు, మాంచాలకట్టలలో రెండు ఆలయాలు మంచి స్థితిలో ఉన్నాయి

జటప్రోలు ఆలయం: ఇక్కడ మదనగోపాలస్వామి ఆలయం క్రీ.శ.15వ శతాబ్దంలో నిర్మింపబడింది. ఇందులో గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. ఆలయంపై చతురస్ర శిఖరం గల ఏక తల విమానం నిర్మింపబడింది. కుడ్యాలలోని దేవకోష్ఠాలలో అనే స్తంభాలు నిలిపారు. గర్భగృహంలో రుక్మిణి, సత్యభామా సహిత మదన గోపాల విగ్రహం ఉంది. మళ్లీ ప్రాంగణంలో ప్రత్యేకంగా దేవి ఆలయం కూడా ఉంది. యాగశాల రంగమండపం కూడా నిర్మింపబడ్డాయి. రంగమండపానికి 88 స్తంభాలు ఉన్నాయి.

మాంచాలకట్ట ఆలయం: ఇక్కడ క్రీ.శ.15వ శతాబ్దంలో మాధవస్వామి ఆలయం నిర్మింపబడింది. ఆలయంపై చతురస్ర శిఖరం గల ఏక తల విమానం ఉంది. గర్భాలయ కుడ్యాలపై కుంభపంజరాలు చిత్రించారు. రంగ మండపంలో 44 స్తంభాలున్నాయి. ఆచ్ఛాదనంలో దశావతారాలు చెక్కారు.

గోపురాలు: అరుణాచలం, కాళహస్తి ఆలయాలలో కృష్ణదేవరాయలు పెద్ద గోపురాలు నిర్మించాడు. వాటిని రాయగోపురాలని అంటారు.

శిల్పాలు: విజయనగర కాలం నాటి దేవాలయాలలో రాయలసీమలోని దేవాలయ ద్వారబంధాల మీద ఆచ్ఛాదనల మీద పదే పదే దశావతార శిల్పాలు కనిపిస్తాయి. మాంచాలకట్టలో కూడా దశావతారాలు చిత్రించారు. ఇది రాయలసీమ ప్రభావం. పుష్పగిరి, లేపాక్షి, శ్రీశైలంలో కిరాతార్జునీయ చిత్రానికి ప్రాముఖ్యత ఇచ్చారు. వీరి కాలం నాటి మరొక విశేషం కుడ్యాలపై దేవకోష్ఠాలు అదృశ్యమయ్యాయి.

దేవాలయాలకు దానాలు: విజయనగర చక్రవర్తులు ఆంధ్రదేశంలోని అనేక దేవాలయాలకు విరివిరిగా దానం చేశారు. శ్రీకృష్ణ దేవరాయలు తన తూర్పు దిగ్విజయ యాత్రలో అతడు దర్శించిన ప్రతీ దేవాలయానికి భూరివిరాళాలు ఇచ్చాడు. శ్రీకాళహస్తి, శ్రీశైలం, అహోబిలం, మహానంది, అమరావతి, మంగళగిరి, కొండవీడు, కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళ ఆంధ్రవిష్ణువు, బెజవాడ కనకదుర్గ, సింహాచల దేవాలయాలను దర్శించి కానుకలు ఇచ్చి శాసనాలు రాయించాడు. ఆయన దర్శించని దేవాలయంగాని, దానం ఇవ్వని దేవాలయంగాని లేవు. కృష్ణదేవరాయలు సింహాచలనాథునికి సమర్పించిన పచ్చల పతకం, విజయనగర చక్రవర్తులు ముద్రించిన బంగారు వెండి, రాగినాణేలు, వాటిపై వారు రాయించిన అఖ్యలు, చిహ్నాలు వారి కాలం నాటి కళకు మచ్చుతునకలు.

చిత్రకళ: శిల్పకళతో పాటు చిత్రకళ కూడా బాగానే అభివృద్ధి చెందింది. దేవాలయాలు గోడలపైన కప్పులలో భాగంగా రామాయణ, మహాభారతాలలోని చిత్రాలు చిత్రించేవారు. కావ్యాలలో కూడా దేవాలయాలు గోడలపై చిత్రాలు చిత్రించారని వర్ణనలు చేశారు. వేశ్యల పడకటిళ్లలో రతిబంధన చిత్రాలు చిత్రించుకొనేవారని ఎల్లనార్యుడు తన రాధామాధవ కావ్యంలో వర్ణించాడు. అలాంటి చిత్రాలు దేవాలయాలపై కూడా చిత్రించేవారు. అవి ఆనాడు తప్పుగా భావించలేదు. ధూర్జటి కూడా రతిబంధనాలు చిత్రాలను గూర్చి తన కావ్యంలో ప్రస్తావించాడు. రాజభవనాలలో కూడా చిత్రశాలలుండేవి.

పోర్చుగీసు చిత్రకళ: విజయనగర రాజుల చివరి కాలంలో పోర్చుగీసు వారి చిత్రకళ ప్రభావం పడినట్లు తెలుస్తోంది. పోర్చుగీసు వారు వారి చిత్రాలను ఇండియాలో ప్రవేశపెట్టారు. వారి మతాన్ని ప్రచారం చేసుకోడానికి మేరీ, క్రీస్తు చిత్రాలు చిత్రించి ప్రజలకు చూపేవారు. క్రైస్తవులుగా మారిన వారి ఇళ్లలో చిత్రాలు పెట్టుకొనే వారు. ఒక పర్యాయం అలెగ్జాండర్ ఫ్రే అనే పోర్చుగీసు చిత్రకారుడు శిశువుగా ఉన్న క్రీస్తును చేతులలో ఎత్తుకొని ఉన్న మేరీ చిత్రాన్ని తెచ్చి రెండవ వెంకటపతిరాయలకు చూపాడట. ఆ చిత్రాన్ని చూసి ముచ్చట పడి తీసుకొని తన సింహాసనం ఉన్న గదిగోడకు అమర్చమని ఆజ్ఞాపించాడు. కాని బ్రాహ్మణులు అందుకు అభ్యంతరం చెప్పారట. అపుడు రాయలు మీరు నెత్తిన పెట్టుకున్న వెల్వెట్ టోపీ, మనం కూర్చున్న తివాచీలు వారి దేశం నుండి వచ్చినవే. అవి ఉపయోగించడానికి అభ్యంతరం లేనప్పుడు ఈ చిత్రాన్ని ఇక్కడ ఉంచడానికి ఎందుకు అభ్యంతరం అని వారికి నచ్చజెప్పాడని జేసూట్ ఫాదర్ తన దేశానికి జాబు రాశాడు. అంతేగాక ఫాదర్ ఇగ్నేషియస్, ఫ్రాన్సిస్ జెనీర్ అనే చిత్రకారులు తన ముందు కూర్చొని ఒక ఘడియలో అనేక చిత్రాలు గీయడం చూసి రాయలు అబ్బురపడ్డాడట. వెంటనే మనదేశాచారం ప్రకారం వారికి జరీవస్త్రాన్ని బహుకరించాడని ఫాదర్ కొటిన్హో అనే అతడు తన దేశానికి రాసిన జాబులో పేర్కొన్నాడు. మొత్తంమీద ఐరోపా చిత్రకళ ఆంధ్రదేశంలో ప్రవేశించినందని చెప్పవచ్చును.

ఇతర కళలు - సంగీతం, నాట్యం, యక్షగానాలు: విజయనగర కాలంలో ఇంకా సంగీతం, నాట్యం, యక్షగానాలు కూడా బాగా ఆదరించబడ్డాయి. ఆనాటి శాసనాలలో అనేక సంగీతవాయిద్యాల ప్రసక్తి ఉంది. వీణ,

భేరి, మృదంగం, దుందుభి మొదలైన వాయిద్యాలను ఒక వ్యక్తి కృష్ణదేవరాయలకు బహూకరించాడని పేస్ వర్ణించాడు. కృష్ణదేవరాయల ఆస్థానంలో కృష్ణుడు అనే గొప్ప గాయకుడుండేవాడని తెలుస్తోంది. లక్ష్మీనారాయణ అనే కవి సంగీత చింతామణి అనే గ్రంధాన్ని రాశాడు. తాళ్లపాక అన్నమాచార్యుడు ఈ కాలం వాడు. అతడు తెలుగులో పల్లవి, అనుపల్లవి అనుచరణాలతో మూడు వేల కీర్తనలు రాశాడు. ఇవి కర్ణాటక సంగీతానికి జీవం పోశాయి. రామరాయల ఆస్థానకవి అయిన రామరాయామాత్యుడు సర్వమేళ కళానిధి అనే సంగీతశాస్త్రాన్ని రచించాడు. సంగీతంతో పాటు నాట్యకళ కూడా అభివృద్ధి చెందింది. రాజాంతపురంలో నాట్యశాల ఉండేది.

నాటకాలు: ఈ కాలంలో నాటకాలు కూడా ఆడేవారు. అది రాజులకు గొప్ప వినోదం. రాజభవనాలలో నాటక శాలలు కూడా ఉండేవి. తెర వెనుక నుండి రంగం మీదికి వస్తున్న నటి లాగా ద్వారక ఉందని పింగళి సూరన తన ప్రభావతీ ప్రద్యుమ్నంలో వర్ణించాడు. నటీనటులు ధరించే ఆభరణాలు, వారు అందుకొనే బహుమతులను నాటకశాలల ప్రస్తావనలు ఉన్నాయి. విజయనగరంలో జరిగే వసంతోత్సవాలలో కృష్ణదేవరాయలు రాసిన సంస్కృత నాటకం జాంబవతీ పరిణయాన్ని ప్రదర్శించేవారట. ఈ కాలపు నటుల పేర్లు కూడా కొన్ని శాసనాలలో ఎక్కాయి. నాగయ్య అనే నటుడు తాయికొండ అనే నాటకాన్ని ప్రదర్శించడంలో గొప్ప నేర్పరి అని క్రీ.శ.1514వ సంవత్సరం నాటి ఒక శాసనం తెలుపుతోంది. అదే శాసనంలో తిమ్మయ్య అనే మరొక నటుని కుమార్తె పేరు కూడా ఉంది. వీరు కృష్ణదేవరాయల సమకాలికులు.

యక్షగానాలు - కూచిపూడి నాట్యం - తోలుబొమ్మలాట: పండితులు సంస్కృత నాటకాలతో సంతోషం పొందుతూ ఉంటే పామరులను యక్షగానాలు ఆకర్షించేవి. ఇది ఒక సంగీత నాటకం, వీణ, వేణువు, మృదంగం తాళాలతో నటిస్తారు. సాధారణంగా వేశ్యలు ఈ నాటకాలో నటించేవారు. వేశ్యలు ఆ కాలంలో సర్వకళలయందు ఆరితేరి ఉంటారు. సంగీతం, నాట్యం, అభినయం వారికి వెన్నతో పెట్టిన విద్య. తెర మీద జంతువులు, పక్షులు, ఇతర చిత్రాలు చిత్రిస్తారు. సూత్రధారుడు నాటక కధను గీత రూపంలో ఆలపిస్తూ ఉంటాడు. నటీనటులు వస్తూ పోతూ ఉంటారు. తర్వాత జక్కులవాండ్రు యక్షగానాలు ఆడేవారు. 15వ శతాబ్దంలో ప్రోలుగంటి చిన్నయ అనే కవి సౌభరీ పరిణయం అనే పేరుతో యక్షగానం రాశాడు. ఒక రుషి యువకుని రూపంలో 50 మంది రాజ కుమార్తెలను వివాహం ఆడి ఒకరికి తెలియకుండా మరొకరితో సంసారం చేసే కథ ఇది. రుద్రకవి సుగ్రీవ విజయం అనే యక్షగానం రాశాడు. అందులో దండకారణ్యంలో రాముని జీవితం సుగ్రీవుడు వాలిపై విజయం సాధించడం ఇతివృత్తం. ఇందులో త్రిపుటతాళంలో గీతాలు రాశాడు. ఇవే లక్షణాలు గురజాడ అప్పారావు రాసిన ముత్యాల సరాలలో కనిపిస్తున్నాయని ఆరుద్ర వ్యాఖ్యానించారు. ఈ కాలంలో పేర్కొనదగిన మరొక నాటక కళ కూచిపూడి భాగవతుల నాట్యం, నాటకాలు, కూచిపూడి వారి నాట్యకళ భరతనాట్యంతో దీటుగా అభివృద్ధి చెందాయి. జక్కులు ఆదే యక్షగానాలను కూడా వారు స్వీకరించి వాటికి పూర్తి వికాసం కలిగించారు. నాటి ప్రజలను ఆకట్టుకొన్న మరొక కళ తోలుబొమ్మలాట. రామాయణ భారతాలలోని పాత్రలను తోలు బొమ్మలుగా తయారు చేసి తెరవెనుక దీపాలు పెట్టి తెరపై చూపుతూ పాటలు పాడి, కధలను గానం చేస్తూ ఆడుతారు. ఈ కళ తర్వాత ఆంధ్రదేశంలో గొప్ప ప్రాచుర్యాన్ని పొందింది.

విజయనగర యుగంలో ఆంధ్రదేశంలో జైనశిల్ప కళ: విజయనగర యుగంలో కూడా ఆంధ్రదేశంలో జైనమతం కొద్దిగా ప్రాచర్యంలో ఉంది. అక్కడక్కడ జైనదేవాలయాలున్నాయి. వాటికి విజయనగర రాజులు, మరొక అధికారులు, ప్రజలు దానాలిచ్చినట్లు శాసనాలు లభించాయి.

జైనులలో సర్వసంగ పరిత్యాగం చేసి సన్యాసాన్ని పుచ్చుకొన్న వారిని యతులు అని అంటారు. సర్వసంగ పరిత్యాగం చేయకుండా సంసార జీవితం సాగిస్తూ జైనధర్మాన్ని అనుసరించే వారిని శ్రావకులు అని అంటారు. జైనులు నీతినియమాలకు క్రమశిక్షణకు కఠోర నియమాలకు అమిత ప్రాధాన్యతనిస్తారు. వారి నీతినియమావళిని లేక క్రమశిక్షణ నియమావళిని మహావ్రతలు అనగా Great duties అని అంటారు. వారు సత్యసంధతకు, నిజాయితీకి, పవిత్రతకు (Truth Honesty Chastity) మొదలైన విలువలను విధిగా పాటిస్తారు. ప్రాపంచిక కోరికలను విసర్జిస్తారు. ధర్మాన్ని పాటిస్తారు. ధ్యానం చేస్తారు. అందువల్ల వారు Liberty, Gentleness లను పొందుతారు. మనసును, వాక్కును అదుపులో ఉంచుకుంటారు. సర్వసుఖాలను వదలుకుంటారు. దేవుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడని విశ్వసించరు. వారు తమ తీర్థంకరులను పూజిస్తారు. ఆత్మ కైవల్యం పొందడానికి తీర్థంకరులు సహాయపడతారని, ఆత్మకు విశ్వానికి వారు వారధులుగా ఉంటారని జైనులు భావిస్తారు. అందువల్ల

వారు హిందువులు తమ దేవుళ్లకు దేవాలయాలు నిర్మించినట్లు తమ తీర్థంకరులకు దేవాలయాలు నిర్మించుకున్నారు. దేశంలో అనేక ప్రాంతాలలో వారి దేవాలయాలున్నాయి. ఆ ప్రదేశాలను వారు పరమ పవిత్రంగా భావిస్తారు.

జైన క్షేత్రాలలో అతి పవిత్రమైనవి. కథియవాడలోని పలిటానాలోని శత్రుంజయపర్వతంపై ఉన్న ఆలయం, మౌంటు అబూపై ఉన్న దిల్వారా ఆలయం, బెంగాలులోని పార్శ్వనాథ పర్వతంపై ఉన్న ఆలయం అతి ముఖ్యమైనవి. ఇటీవల సారనాథ్‌లో ఒక votice జైన ఆలయం బయల్పడింది. కర్ణాటకంలో అతి ప్రాచీన కాలం నుండి జైనమతం పాదుకొంది. శ్రావణబెళగొళలో 60 అడుగుల బాహుబలి విగ్రహం ప్రపంచంలోనే అతి పెద్ద జైన విగ్రహం. దక్షిణ కెనరాలోని వెన్నూరులో 35 అడుగులు ఎత్తుగల మరొక బాహుబలి విగ్రహం ఉంది. కళ్యాణీ చాళుక్యుల కాలంలో చోళరాజరాజు ఆ ప్రాంతంపై దండెత్తి పలిగ్ర లక్షణేసరి అనే ప్రదేశంలోని జైన ఆలయాలను ధ్వంసం చేశాడు. తర్వాత కూడా కర్ణాటకంలో జైన ఆలయాలు నిర్మించాడు. బేలూరులో హొయసాల విష్ణువర్ధనుడు క్రీ.శ.1117 వ సంవత్సరంలో ఒక జైన ఆలయాన్ని నిర్మించాడు. మంగుళూరు దగ్గర ఉన్న కర్కలలో 41 1/2 అడుగుల ఎత్తు ఉన్న బాహుబలి విగ్రహం క్రీ.శ.1432వ సంవత్సరంలో ప్రతిష్ఠించబడిందని అక్కడి శాసనం తెలుపుతోంది. అంటే ఇది విజయనగర యుగంలో ప్రతిష్ఠించబడింది. స్వస్తిక్ చిహ్నం కూడా ఉంది. రెండవ హరిహరరాయలు కొన్ని జైనదేవాలయాలకు దానాలిచ్చినట్లు విజయనగరంలోని ఒక ధ్వజస్తంభం మీద శాసనం ఉంది. ఇంకా హంపిలో నాగాణాగిత్తి దేవాలయం, తిరుప్పతికుండ్రంలోని వర్ధమాన దేవాలయం ఆనాటి జైన దేవాలయాలు. ఇవి హిందూ దేవాలయాల లాగా అలంకృతాలు.

ఆంధ్రదేశంలో జైన దేవాలయాలు: ఈ యుగంలో ఆంధ్రదేశంలో కూడా అనేక ప్రాంతాలలో జైనమతం ప్రాచుర్యంలో ఉన్నట్లు అనేక ప్రాంతాలలో లభించిన జైన శిథిలాల వల్ల తెలుస్తోంది. ముఖ్యంగా అనంతపూర్ జిల్లాలో దాదాపు 300 జైనస్థావరాలున్నట్లు, వాటిలో 200 స్థావరాలు ఒక్క మడకసిరి తాలూకాలో ఉన్నట్లు పరిశోధనల వల్ల తెలుస్తోంది. అనంతపూర్ జిల్లాలోని అమరపురం, గుత్తి, కంబదరు, కొకకొండ్ల, అగలి, పెనుకొండ, రత్నగిరిలలో అనేక జైనశిథిలాలు బయల్పడ్డాయి. వీటిలో విజయనగర కాలంలో అగలి, రత్నగిరి, పెనుగొండలలో జైన ఆలయాలు మంచి స్థితిలో ఉన్నాయి.

అమరపురం: మడకసిరి తాలుకాలోని అమరపురిలో ఒక నూతనంగా నిర్మించిన జైన ఆలయం ఉంది. ఈ ఆలయంలో పూర్వ కాలానికి చెందిన ఒక శిల పాతి ఉంది. దాని మీద నిలబడి ఉన్న ఒక దిగంబర విగ్రహం చెక్కి ఉంది. విగ్రహం పక్కనే ప్రాచీన కన్నడ భాషలో ఒక శాసనం ఉంది. ఈ శిల అక్కడ దేవాలయం నిర్మింపకముందే ఉంది. ఆ విగ్రహాన్ని పూర్వకాలంలో అక్కడ నివసించే జైనులు పూజించేవారని ప్రతీతి.

తమ్మడేహళ్లి: అమరపురానికి ఒక మైలు దూరంలో ఉన్న తమ్మడేహళ్లి అనే ప్రదేశంలోని ఆంజనేయ దేవాలయంలో కూడా ఇటువంటిదే ఒక శిల, దాని మీద రెండు దిగంబర శిల్పాలు, ఒక శాసనం ఉన్నాయి. ఇవి కూడా జైన శిల్పాలని భావించారు.

గుత్తి: గుత్తి కోట ముఖద్వార పాదం వద్ద ఒక చిన్న దేవాలయం ఉంది. ఆ ఆలయంలో జైన శిల్పాలు చెక్కి ఉన్న ఫలకాలున్నాయి. జైన శిల్పాలు ఉన్న కొన్ని బండలు గుత్తికొండపై ఉన్న కోటకు మెట్లుగా ఉన్నాయి.

కంబదూర్: కళ్యాణదుర్గం తాలూకాలోని కంబదూరులోని మూడు దేవాలయాలలో జైన చిహ్నాలు కలిగిన శిల్పాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ఉన్న మరొక దేవాలయం చోళులచే నిర్మింపబడింది. ఈ ఆలయంలో ఎక్కువ జైన శిల్ప కళారీతులున్నాయి. ఈ ఆలయం ముందు ఉన్న మంటపం పిట్టగోడపైన ఉన్న ఫలకాల మీద చాలా జైన శిల్పాల లక్షణాలు కనిపిస్తున్నాయి. కాని అవి నేడు శివుని ప్రతిమల లాగా మార్చబడ్డాయి. ప్రస్తుతం ఇది శైవ ఆలయం.

కొనకండ్ల: గుత్తి తాలూకాలోని కొనకొండ్లలో చాలా జైన శిథిలాలు లభ్యమయ్యాయి. అతి ప్రాచీన కాలంలో ఇది కొండకుండనాచార్యుని స్థావరం. ఆదిచెన్నకేశవుని దేవాలయం వద్ద ఒక శిలా ఫలకం భూమిలో పాతి ఉంది. దాని మీద ఒక శాసనం ఉన్న గుర్తులున్నాయి. ఆ శాసనం పైభాగం మీద ఒక తీర్థంకరుడు పద్మాసనంలో కూర్చున్న భంగిమలో ఉన్నాడు. ఈ శిల వెనుక భాగాన తర్వాత కాలానికి చెందిన తెలుగు శాసనం ఉంది. ఈ గ్రామానికి దక్షిణంగా ఉన్న ఒక బండ మీద 3 1/2 అడుగుల ఎత్తుగల నిలబడి ఉన్న విగ్రహం ఉంది. ఇది దిగంబర విగ్రహం. చేతులు వేలాడుతూ ఉన్నాయి, చెవులకు కుండలాలున్నాయి. రెండువైపులా వింజామరలు వీచే

శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ బండకు పరిసరాలలో అనేక శిథిల శిథిలాలున్నాయి. అక్కడ ఉన్న ఒక ఆకుపచ్చని రాతి ఫలకం మీద ఒక శాసనం కూడా ఉంది. ఈ రాతిపై భాగాన ఒక జైనశిల్పం పద్మాసనంలో కూర్చొని ఉన్నట్లు ఉంది, కాని నడుము దగ్గర పైభాగం విరిగిపోయింది. ఈ శిథిలాలన్నింటినీ పరిశీలించి పండితులు అక్కడ పూర్వం ఒక జైన దేవాలయం ఉండేదని నిర్ధారణ చేశారు. గ్రామానికి ఉత్తరంగా కూడా 3 1/2 అడుగుల ఎత్తు గల మరో రెండు దిగంబర విగ్రహాలున్న ఫలకాలున్నాయి. ఈ విగ్రహాలకి నెత్తి మీద కిరీటాలున్నాయి. రెండు పక్కల చామరాలు పట్టుకొని నిలబడి ఉన్న శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ విగ్రహాల చుట్టూ గ్రామస్తులు మట్టిగోడలను నిర్మించారు. విగ్రహాలకు నల్లని పెయింటువేసి శైవగుర్తులు దిద్దించారు. దీనికి పశ్చిమంగా మరొక రాతి మీద జైన శిల్పం ఉంది. ఇది 8 అడుగుల ఎత్తు ఉన్న దిగంబర విగ్రహం. దానికి దగ్గరలో ఉన్న మరొక రాతి మీద గుండ్రంగా ఆభరణాల శిల్పం చెక్కి ఉన్న ఆ రాతికి దిగువన చిన్న చెరువు ఉంది. ఆ చెరువులో 10 అడుగుల ఎత్తు కలిగిన శిల పాతి ఉంది. దాని మీద కూడా జైనశిల్ప లక్షణాలు కలిగిన చిత్రాలు ఉన్నాయి.

అగలి - రత్నగిరి: మడకసిరి ప్రాంతంలోని అగలిలో ఒక పురాతన జైన దేవాలయం ఉంది. అక్కడ ఒక దిగంబర జైనతీర్థంకరుని విగ్రహం ఉంది. అదే తాలూకాలోని రత్నగిరిలో కూడా మరొక పురాతన జైన దేవాలయం ఉంది.

పెనుగొండ జైన దేవాలయాలు: పెనుగొండలో రెండు జైన దేవాలయాలు నేటికీ నిలిచి ఉన్నాయి మొదటిది పోస్టాఫీసు దగ్గర ఉంది. దానిని మట్టడబస్తి అని పిలుస్తున్నారు. ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉంది రెండవది పట్టణానికి తూర్పు దిక్కున ఉంది. దానిని అష్టనాడ బస్తి అని పిలుస్తున్నారు. దాని ప్రధాన ద్వారం ఉత్తరం వైపున ఉంది.

పెనుగొండ మట్టడబస్తి - మొదటి జైన ఆలయం: ఈ ఆలయ పశ్చిమ ద్వారం నుండి లోపలికి వెళ్లాలి లోపలకు వెళ్లగానే ఎడమవైపు Pial dressed in stone, కుడివైపున heaps of stone and brick mortar కాంపౌండులో పశ్చిమాన పూజారి ఇల్లు ఉంటుంది. అక్కడే దేవాలయాన్ని ఆనుకొని store room కూడా ఉంది దీని గోడకు ఉపయోగించిన రాళ్లు 3×1 $^1/_2$ అడుగుల కొలతలో ఉన్నాయి. స్టోర్ రూం ముందు ఒక రాతి రోకలి ఉంది. 2 అడుగుల చతురస్రాకారపు రోలు ఉంది. ఇది మూలికలు దంచడానికి ఉపయోగించేవారు. దాని పక్కన ఒక బావి ఉంది. అది 1 $^1/_2$ అడుగుల వైశాల్యంతో గుండ్రంగా ఉంది. ఈ బావికి దక్షిణంగా 2 అడుగుల ఎత్తు, 1 అడుగు వెడల్పు కలిగిన ఒక ద్వారం ఉంది. ఈ ద్వారం గుండా లోపలికి వెళితే లోపల 10×13 అడుగుల కొలతలు కలిగిన నేలమాళిగ ఉంది. అది చీకటిగా ఉంటుంది. ప్రమాద సమయాలలో విగ్రహాలు, అభరణాలు దేవాలయపు ధనాన్ని అక్కడ దాచేవారట.

ఈ ఆలయం దక్షిణ ముఖంగా ఉంది. అక్కడ ఉన్న ప్రతి రాతిపై జైన శిల్పకళా చిహ్నాలున్నాయి. ఆలయం బయట ఎలాంటి అలంకారాలు లేవు. సాదాగా ఉంది. దక్షిణ ప్రవేశ ద్వారం దగ్గర గుడి ఎదురుగా మానస్తంభ ఉంది. అది శిల్పాలంకృతం. దాని ఎదురుగా ఉన్న శిలపై ఒక తీర్థంకరుని నిలబడి ఉన్న భంగిమలో చెక్కారు. చెవులకు లోబ్స్ ఉన్నాయి. ఆయన చుట్టూ భక్తులున్నారు. అక్కడే మరొక శిల్పం ఉంది. అందులో ఒక గురువు, ఒక శిష్యుడు ఉన్నారు. వారి మధ్యన ఒక పుస్తకం ఉంది. అక్కడ ఉన్న రాతిపై పార్శ్వనాథ తీర్థంకరుని శిల్పం ఉంది. తలపై పాము పడగపట్టి ఉంది. రెండు మూలలలో చంద్రుని చిత్రాలు చిత్రించి ఉన్నాయి. ఈ శిల్పం ఎదురుగా ఉన్న మరొక రాతిపై స్వస్తిక్ చిహ్నం ఉంది. అక్కడ పశ్చిమ దిక్కులో ఉన్న స్తంభాలలో ఒకటి Symmetrical గా లేదు ఇది ఇటీవల నిర్మించిన దానిలాగ ఉంది. నేలమాళిగకు దక్షిణంగా ఉన్న మూడు స్తంభాలపై కిరీటాలు పెద్దవి ఉన్నాయి. స్తంభాల మీద లతలు, ఇతర బొమ్మల వరుసలు చెక్కి ఉన్నాయి. వాటిలో ఒక చిత్రంలో ఒక స్త్రీ చేపపై కూర్చొని ఉంది. మరొక స్త్రీ నాలుగు చేతులు కలిగి ఉంది. ఆమె మహంకాళి కావచ్చుని భావింపబడింది. అక్కడ ఉన్న మరొక రాతిపై ఒక గురువు, శిష్యుడు ఉన్నారు. ఆ చిత్రంపైన దేవుడిని ఒక స్త్రీ, ఒక పురుషుడు పూజిస్తున్నట్లు మరొక చిత్రం చిత్రించి ఉంది. బావి వద్ద పాతి ఉన్న రాతిపై రెండు కన్నడ భాషా శాసనాలు ఉన్నాయి. ఆ శాసనాలలో మహాసకల విద్యజ్ఞ చక్రవర్తి గళు బిరుదావళి విజయమాన్యశ్రియ ఢిల్లీ, కొల్హాపూర, జనకంచి, పెనుగొండె చతుసిద్ధ సింహాసన రాధాలక్ష్మీసేన భట్టారక పట్టాచారి, స్వామియవరిగె అని ఉంది. ఈ శాసనం వల్ల ఢిల్లీ, కొల్హాపూరు, కంచి, పెనుగొండలు జైనులకు నాలుగు ప్రసిద్ధ క్షేత్రాలని, అందులో పెనుగొండ లక్ష్మీసేనభట్టారక పట్టాచారిస్వామికి ఇవ్వబడిందని తెలుస్తోంది. జీవేంద్ర చరిత్ర అనే గ్రంథం

పెనుగొండలో 7 జైనాలయాలు ఉన్నాయని, అందులో శాంతినాథుని ఆలయం ఒకటని, అందులో ఈ జినేంద్ర గ్రంథం రాయబడిందని తెలుపుతోంది. ఈ శాంతనాథ ఆలయం నేడు కనిపించదు. జినేంద్రనాథ చరిత్ర వల్ల ఆంధ్రదేశంలో పెనుగొండ జైనులకు గొప్ప పవిత్ర క్షేత్రమని స్పష్టంగా తెలుస్తోంది.

మట్టదబస్తి ఆలయానికి మొదట తూర్పు ద్వారం ప్రధాన ద్వారమై ఉంటుంది. కానీ ఇప్పుడు అది పూర్తిగా మూసివేయబడింది. ఆలయపు ద్వారపాలకులు ఎదురు రొమ్ముల వరకు పూడుకొని పోయి ఉన్నారు. అందుకు కారణం ఆలయం ఎదుట ఉన్న రోడ్డు 4 అడుగుల ఎత్తు పోసి ఉంది. ఆలయానికి నాలుగు వైపులా గోపురాలుండేవి. నాలుగు గోపురాల మీద పార్శ్వనాథుని శిల్పాలుండేవి. కాని ఇప్పుడు ఒక్క పశ్చిమ గోడ వద్ద మాత్రమే 5 అడుగుల ఎత్తు నల్లరాతి పార్శ్వనాథుని విగ్రహం నిలబడి ఉన్న భంగిమలో ఉంది. ఆలయంలోని కళ్యాణ మండపం మధ్యలో రెండు అడుగుల ఎత్తు గల 5 తీర్థంకరుల పాలరాతి విగ్రహాలు కూర్చొని ఉన్న భంగిమలో ఉన్నాయి. వాటిలో ఒక నేమినాథుని విగ్రహం, రెండవది పార్శ్వనాథుడు, మూడవది చంద్రనాథస్వామి విగ్రహం. మిగిలిన రెండూ గుర్తించలేకపోయారు. అందుకు కారణం ఆ విగ్రహాల చిహ్నాలు పోయాయి. వాటి చిహ్నాలతోనే తీర్థంకరులను గుర్తించగలం. Pigeon holes కు రెండూ పక్కలా అలాంటివే మరో 8 విగ్రహాలు ఉన్నాయి. వాటి పక్కన మరో 12 తీర్థంకరుల బొమ్మలున్నాయి. ఇవి మొత్తం 24 తీర్థంకరుల చిత్రాలు. ఈ 24 విగ్రహాలు పాలరాతితో చిన్నవిగా రూపొందించబడ్డాయి. అక్కడే తీర్థంకరులను పూజించే పూజాద్రవ్యాలైన అష్టమంగళ ద్రవ్యాలను ఒక వరుసలో చిత్రించారు. వాటి మధ్య $1\frac{1}{2}$ అడుగుల ఎత్తుగా మహావీరుని విగ్రహం కూడా మలచారు. వీటి తూర్పుగా మరొక తీర్థంకరుని విగ్రహం పచ్చరాతిలో చెక్కి ఉంది. ప్రాంగణం మధ్యలోని గర్భాలయంలో నిల్చొని ఉన్న పార్శ్వనాథుని విగ్రహం పచ్చరాతితో చేయబడి ఉంది. ఈ విగ్రహాన్ని హంపి నుండి తెచ్చి ప్రతిష్ఠించారని శృతి ఉంది. ఇవేగాక ఈ ఆలయంలో కాగితంపై చిత్రించిన మరో రెండు చిత్రాలు ఉన్నాయి. అందులో మొదటిది పవపురిజి చిత్రం. ఇది మహావీరునికి కైవల్యాన్ని ఇచ్చిన భూమి చిత్రం. రెండవది చంద్రమేఘునోరిన్ హిమహమున్ అనే ఒక జైనదుతిచిత్రం. ఈ విగ్రహాలు తూర్పున పద్మావతి శిల్పం, మూడు అడుగుల ఎత్తులో కూర్చొని ఉంది. పశ్చిమ దిక్కున కూడా పద్మావతి శిల్పం ఉంది. మండపం గోడల మీద పరివార దేవతలను చెక్కారు. తూర్పు గోడకు బయట బ్రహ్మ యక్షదేవుడు గుర్రంపై కూర్చొని ఉన్నాడు. అతని పక్కన 5 అడుగుల ఎత్తు గల పార్శ్వనాథస్వామి విగ్రహం చెక్కబడింది. తూర్పు ఉన్న గోడపై నలుగురు దిగంబర తీర్థంకరుల 4 అడుగుల శిల్పాలు చెక్కారు. పశ్చిమ గోడ మీద పార్శ్వనాథుని యక్షుడైన ధారణేంద్రుని చెక్కారు. దక్షిణపు గోడపై కూడా అలాంటి గుర్తులు ఉన్నాయి. కాని విగ్రహాలు లేవు. ఈ ఆలయ పూజారులు తమిళ బ్రాహ్మణులు. వారు వెల్లూరు నుండి వచ్చి పూజారులుగా చేరారట.

రెండవ దేవాలయం అప్తనాదబస్తి: ఈ జైన ఆలయం పెనుగొండ పట్టణానికి తూర్పు దిక్కున ఉన్న దానిమ్మ తోటలో ఉంది. ఈ ఆలయ ప్రవేశ ద్వారం ఉత్తరపు ముఖంగా ఉంది. దానికి రెండువైపుల అంటే తూర్పు పడమరలలో రెండు గదులున్నాయి. ప్రవేశ ద్వారం లోపల రెండు వైపులా ద్వారపాలకులు ఉన్నారు. ప్రాంగణంలో ఆలయానికి ముందు ఒకదాని తర్వాత ఒకటి అమర్చిన బండలున్నాయి. ఒకదాని మీద బ్రహ్మ కూర్చొని ఉన్నాడు. Earlobes వేలాడుతూ ఉన్నాయి. ఒకదాని మీద కిన్నెరుడు కిరీటం పెట్టుకొని వీణ వాయిస్తూ స్వర్గం వైపు చూస్తున్నాడు. అతని శరీరంలో కింది భాగం తోక ఉన్న సింహం లాగా ఉంది. మరొక దాని మీద నెమలి వాహనంపై సుబ్రహ్మణ్యస్వామి ఉన్నాడు. మరొక దాని మీద చక్రం, మరొక దాని మీద హనుమంతుని చిత్రాలు చెక్కబడ్డాయి. అక్కడ ఉన్న ఒక స్తంభం చివర పడగవిప్పిన పాము చిత్రం కూడా ఉంది. పూర్వం ఇది హిందూ దేవాలయమై ఉన్నట్లు, తర్వాత ఇది జైన ఆలయంగా మార్చబడినట్లు కనబడుతోంది. నైరుతి మూలన దక్షిణ ముఖంగా క్షేత్రపాలకుడు బ్రహ్మదేవుడు కిరీటంతో నాలుగు చేతులతో గుర్రాన్ని స్వారీ చేస్తున్నట్లు శిల్పం చెక్కబడింది. దానికి పడమరగా తీర్థంకరుని విగ్రహం ఉంది. అక్కడే మరొక రాతిపై ఇద్దరు భక్తులు కూడా చిత్రించబడ్డారు. ప్రాంగణంలో బావి ఉంది. బావి వద్ద రెండు వంటగదులున్నాయి. గర్భాలయం ప్రవేశ ద్వారానికి రెండు వైపులా 4 అడుగుల ఎత్తు ఉన్న ఏనుగులున్నాయి. దేవాలయ అధిష్ఠానం మీద నాలుగు స్తంభాలు మాత్రమే ఉన్నాయి. ఆ స్తంభాల మీద అన్ని వైపులా శిల్పాలు చెక్కబడ్డాయి. మధ్య రెండు స్తంభాల మీద యాళి శిల్పాలు చెక్కబడ్డాయి. అవి ఉత్తరపు ముఖాలుగా ఉన్నాయి. వాటిపై తీర్థంకరులు కొన్నింటిపై కూర్చొని, మరికొన్నింటిపై నిలబడి ఉన్నారు. వారిలో మధ్యన దిగంబరంగా అజితనాథుడు అతనికి తూర్పు పద్మావతి, పడమట సరస్వతి

శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ దేవాలయానికి అనుబంధంగా ఉన్న దానిమ్మ తోటకు నీరు తోడటానికి ఒక బావి కూడా ఉంది. ఈ ఆలయానికి తూర్పు వైపున ప్రధాన ప్రవేశ ద్వారముంది. కాని ఇది నేడు మూసి ఉంది. ఈ ద్వారం ముందు ఒక పెద్ద మండపం ఉంది. ఈ మండపం స్తంభాల మీద నాలుగు వైపుల యాళి శిల్పాలు వాటిపై తీర్థంకరులు కూర్చొని ఉన్నట్లు, కొన్నింటిపై నిలబడి ఉన్నట్లు చెక్కి ఉన్నాయి. ఈ మండపం మీదకు ఎక్కడానికి మెట్లకు రెండు వైపులా నిర్మించిన ప్రహరీ గోడ వెలుపల వైపు సింహాల బొమ్మలు అతిసుందరంగా చెక్కబడ్డాయి. దేవాలయం యొక్క బయట గోడ బలమైన రాళ్లతో నిర్మింపబడింది. దానిమ్మ తోట చుట్టూ ప్రహరీగోడ నిర్మింపబడి ఉంది. ఈ ప్రహరీగోడ రాళ్లు పక్కనే పాడుబడి ఉన్న ఈశ్వర దేవాలయం నుండి తెచ్చినట్లుగా కనబడుతోంది. ఈ ఆలయానికి నైరుతి దిక్కున దేవకాంచన పూదోట ఉంది. అందులో అనేక నాగశిల్పాలు ఉన్నాయి. అక్కడ ఉన్న ఒక రాతిపై ఇంద్రుడు ఏనుగుపై కూర్చొని ఉన్నాడు. అతనికి ముందు వెనుక ఇద్దరు సేవకులు ఉండి చామరాలు వీస్తున్నారు. మరొక రాతిపై బ్రహ్మయక్షుడు గుర్రంపై కూర్చొని ఉండగా అతని పక్కన ఇద్దరు కిన్నెరులు వీణ వాయిస్తూ ఉన్నారు. ఆలయపు మండపానికి నాలుగు స్తంభాలున్నాయి. ఆ స్తంభాలకు అన్నివైపులా పాలరాతి తీర్థంకరుల విగ్రహాలు నిలబెట్టి ఉన్నాయి. ఒక తీర్థంకరుని విగ్రహం నల్లరాతితో చేయబడింది. అతను కూర్చొని ఉన్నాడు. జ్వాలామాలిని పద్మావతి కంచు విగ్రహాలు కూడా ఉన్నాయి. అష్టమంగళ ద్రవ్యాలు పూజాపాత్రలు ఒక అడుగు ఎత్తు ఉండే ఇత్తడితో చేయబడ్డాయి. అవి బలింగార, తాళ, కలశ, ధ్వజ, సంప్రదిష్ట, స్వేతాద, ఛత్ర, వరతర్పణ చామరాశి వీటికి పశ్చిమంగా నల్లరాతి పార్శ్వ తీర్థంకరుడు, అతనికి కుడి పక్కన సరస్వతీదేవి విగ్రహాలు ఉన్నాయి. ఈమెకు రత్నగిరి సరస్వతి అని పేరు. ఈ విగ్రహాన్ని రత్నగిరి నుండి తెచ్చినందువల్ల ఆ పేరు వచ్చింది ఈ దేవాలయంలోని గర్భాలయంలో ఉన్న ప్రధాన దేవుడు అజితనాధ తీర్థంకరుడు. ఈ విగ్రహం 5 అడుగుల ఎత్తు ఉండి నిలబడి ఉన్న భంగిమలో ఉంది. ఈ ఆలయంలోకి స్నానం చేయకుండా ఎవరినీ వెళ్లనీయరు. ఈ ఆలయానికి కూడా పూజారి మట్టడబస్తి ఆలయపు తమిళ పూజారి. అంతకు పూర్వం ఈ రెండు జైన ఆలయాలకు గౌరిబద్‌నూర్‌కు చెందినవారు పూజారులుగా ఉండేవారట. ఈ రెండు జైన దేవాలయాలు విజయనగర యుగానికి చెందినవి.

ఇంకా హేమకూట పర్వతం మీద జైన బస్తీలు ఉండేవి. కర్కల్‌లో జైన విగ్రహాలు, శ్రావణ బెలగొళలోని అతి పెద్ద గోమఠేశ్వరుని విగ్రహం ఆ కాలంలో గొప్ప ఆకర్షణీయంగా ఉండేవి. కన్నడ, సంస్కృత భాషలో అనేక జైన గ్రంథాలు రాయబడ్డాయి.

బౌద్ధ శిల్పాలు: విజయనగర యుగంలో ఎక్కడా బౌద్ధ దేవాలయాలు ఉన్నట్లు మనకు ఆధారాలు లభించలేదు. కాని హేమకూట పర్వతంపై కొన్ని బౌద్ధ శిధిలాలు కనుగొనబడ్డాయి. అంటే అప్పటికీ ఆంధ్రదేశంలో బౌద్ధ మతం పూర్తిగా అంతరించిందని భావించవచ్చు.

విజయనగర రాజుల కర్ణాటక దేశ ఆలయాలు: విజయనగర సామ్రాజ్యం ఆంధ్ర సామ్రాజ్యం అనడం కన్నా కర్ణాటక సామ్రాజ్యం అనడమే సమంజసంగా ఉంటుంది. వారు తమ రాజధాని హంపిలో అనేక దేవాలయాలు నిర్మించారు. ఇతర కర్ణాటక ప్రాంతంలో కూడా అనేక దేవాలయాలు నిర్మించారు. వాటిలో వారి వాస్తుశిల్పకళను తెలుసుకోడానికి ఉపయోగపడే ఆలయాలు నేటికీ చాలా ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి.

1. హజారాస్వామి దేవాలయం
2. విఠల్‌స్వామి దేవాలయం
3. అనంతశయన ఆలయం
4. అచ్యుతరాయ దేవాలయం
5. విరూపాక్ష ఆలయం లేక పంపాపతి ఆలయం
6. విద్యాశంకర ఆలయం ముఖ్యమైనవి
7. కృష్ణాలయం కృష్ణదేవ రాయలకు ఉదయగిరిలో అందమైన కృష్ణుని విగ్రహం లభించగా దానిని తెచ్చి విజయనగరంలో దేవాలయం నిర్మించి అందులో ప్రతిష్ఠించాడు. కృష్ణదేవరాయలకు శ్రీకృష్ణుడు అంటే అమిత ఇష్టం. బహుశా తన పేరు అదే కనుక అలాంటి ఇష్టం ఏర్పడి ఉంటుంది. ఇంకా చిత్‌దుర్గ, నామాపురం మొదలైన పరిసర ప్రాంతాలలో అనేక దేవాలయాలు నిర్మించారు. వాటిలో కొన్ని నేటికి నిలిచి ఉన్నాయి. కొన్ని శిధిలమయ్యాయి.

నేడు హంపీలో నిలిచి ఉన్న దేవాలయాలన్నీ తుళువ యుగం నాటివని పండితులు నిర్ణయించారు. కృష్ణదేవరాయలు, అచ్యుతదేవరాయల కాలం నాడు నిర్మింపబడిన దేవాలయాలే నిలిచి ఉన్నాయని భావించారు. అంటే అంతకు పూర్వం దేవాలయాలు నిర్మింపబడలేదని అర్థం కాదు. సంగమ వంశీయులు దేవాలయాలు నిర్మించినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. కాని అవి శిథిలమైపోయాయి. రెండవ హరిహరరాయలు, రెండవ దేవరాయలు దేవాలయాలు గోపురాలు నిర్మించినట్లు శాసనాలు, సాహిత్యం తెలుపుతున్నాయి. రెండవ హరిహరరాయల సేనాధిపతి ఇరుగప్ప దండనాథుడు క్రీ.శ.1385లో రాజధాని విజయనగరంలో ఒక జైన దేవాలయాన్ని నిర్మించాడు. రెండవ దేవరాయల ఆస్థానంలోని ఉన్నత ఉద్యోగి అయిన ప్రోలుగంటి తిప్ప హంపిలోని విరూపాక్ష దేవాలయంలో ఒక గోపురాన్ని విరలాలయంలో భోగమంటపాన్ని నిర్మించినట్లు ఆధారం ఉంది. హజారామస్వామి ఆలయం కూడా కృష్ణదేవరాయల కంటే ముందే ఉన్నట్లు దాఖలాలు ఉన్నాయి. కనుక తుళువ యుగానికి ముందే దేవాలయ నిర్మాణం జరిగింది. కాని అవి శిథిలమై పోగా కృష్ణదేవరాయలు వాటిలో కొన్నింటిని పునరుద్ధరించాడు. కొన్ని నూతన ఆలయాలను నిర్మించాడు. తర్వాత అతని తమ్ముడు అచ్యుత దేవరాయలు కొన్ని దేవాలయాలు నిర్మించాడు. వారు నిర్మించినవి నేటికీ నిలిచి ఉన్నాయి.

శ్రీవిరూపాక్ష దేవాలయం: హంపిలోని దేవాలయాలన్నింటిలో అతిప్రాచీనమైనది శ్రీవిరూపాక్ష దేవాలయం. నాగుల దేవుడు విరూపాక్షుడని ప్రతీతి. విరూపాక్ష పూజ మొదట నాగార్జునకొండలో ప్రారంభమైంది. ఇక్ష్వాకు రాజ్యస్థాపకుడైన శాంతిమూలుడు తాను విరూపాక్షుని భక్తుడనని చెప్పుకొని విజయపురిలో అంటే నాగార్జునకొండలో విరూపాక్ష దేవాలయం నిర్మించాడు. అంతకుముందే నాగార్జునకొండ నుండి అమరావతి వరకు కృష్ణాతీరంలో నాగులు నివసించేవారు. అంటే పలనాటిలో నాగులు నివసించేవారు. నాగుల పేరుతోనే దాచేపల్లి వద్ద నాగుల ఏరు అనేది ఇప్పుడు కూడా ఉంది. ఆ నదికి నాగుల నివాసం వల్లనే ఆ పేరు వచ్చి ఉంటుంది. అమరావతిలో ధర్మాశోకుడు అనే నాగరాజు బౌద్ధ స్థూపాన్ని నిర్మించాడు. నాగార్జునుడు కూడా నాగ జాతికి చెందినవాడే. కనక పలనాటిలో ప్రాచుర్యంలో ఉన్న నాగుల దేవుడైన విరూపాక్షునికి శాంతిమూలుడు తన రాజ్యంలో దేవాలయం నిర్మించి ఉంటాడు. ఇక్ష్వాకుల సామంతుడైన చెలికి రెమ్మన సంతతివారే చాళుక్యులు. చాళుక్యులు కదంబుల సామంతులుగా కన్నడ దేశం చేరారు. వారి ద్వారా నాగార్జునకొండలోని విరూపాక్ష పూజ కన్నడ దేశం చేరి ఉంటుంది. వారే పట్టదకల్, హంపీలలో విరూపాక్ష ఆలయాలు నిర్మించారు. హంపిలో నిర్మించిన ఆ దేవాలయానికి పంపాపతి దేవాలయమని, స్వామి పంపాస్థల అని కూడా పేరుంది. ఈ పేరు తుంగభద్రానది వల్ల వచ్చింది. ఈ ఆలయం తుంగభద్రానది ఒడ్డున ఉంది. తుంగభద్రానదికి పంపానది అనే పేరు ఉన్నందువల్ల ఈ దేవుడు పంపాపతి అని ప్రఖ్యాతి వహించాడు. ఈ ఆలయం చాలా పెద్దది. ఈ దేవాలయపు పుట్టు పూర్వోత్తరాలు స్పష్టంగా తెలియదు. కాని క్రీ.శ.7వ శతాబ్దం నాటికే ఈ దేవాలయం ఉందని, దాని చుట్టూ అక్కడ ఒక గ్రామం కూడా ఉండేదని శాసనాల వల్ల తెలుస్తోంది. హిందువులు ఎక్కడ గ్రామాలు నిర్మించినా ముందు దేవాలయాన్ని ప్రతిష్ఠించి దాని చుట్టూ ఇళ్లు నిర్మించుకొంటారు. సాధారణంగా ఆ స్థలం పేరుతోనే దేవుని కూడా పిలుస్తారు. అందువల్ల దేవునికి పంపాపతి అని పేరు వచ్చి ఉంటుంది. పురాణాలలో హంపిని దక్షిణ కాశీగా వర్ణించారు. వ్యాసముని స్కంధపురాణంలో, కాశీఖండంలో కాశీవిశ్వేశ్వరుని ప్రశంసించి హేమకూట ఖండంలో పంపాస్థలంలోని శ్రీ విరూపాక్షుని మహత్మ్యాన్ని వర్ణించాడు. వశిష్ఠుడు, కాశ్యపుడు, భరద్వాజుడు మొదలైన సప్తరుషులు హిమాలయ పర్వతాల నుండి వచ్చి ఈ దేవుని దర్శించారని ఆ పురాణంలో వర్ణింపబడింది. అంతేగాక ఈ క్షేత్రానికి 8 దిక్కులలో 8 ద్వారాలున్నాయని అక్కడ విరూపాక్షుడు పంపాంబలు స్థిరపడి ఉన్నారని కూడా ఆ పురాణం తెలుపుతుంది. అంతేగాక అక్కడ 25 తీర్థాలున్నాయని, వాటికి అగస్త్య, సోమ, నలిమతి, రస్య, ముక్తి, మలప్రహరి, కోటిలింగ, చక్రగౌరి ముఖ, బ్రహ్మకుండ అని పేర్లున్నాయని ఈ క్షేత్రం చుట్టూ ఋష్యశృంగ, మాతంగ, మాండవ్య మాల్యవంక, జాంబవంత మొదలైన పవిత్ర పర్వతాలున్నాయని 8 దిక్కులలో 8 మంది క్షేత్ర పాలకులున్నారని కూడా తెలుపుతోంది. తూర్పున బ్రహ్మకుండ వద్ద కిన్నెరేశ్వరుడు, పడమర సోమతీర్థం వద్ద సోమనాథుడు లేక సోమగిరి, ఉత్తరాన సోమతీర్థం వద్ద మణిభద్రేశ్వర యక్షుడు, దక్షిణాన బ్రహ్మకుండ వద్ద చండభైరవుడు. ఆగ్నేయ దిక్కున ద్రౌపది, మణికుండల తీర్థం వద్ద భైరవుడు, నైరుతి దిక్కున కాళి షణ్ముఖ, శంకరేశ్వరులు, వాయువ్య దిక్కున కాపాలిభైరవ మహాకాళి, ఈశాన్య దిక్కున సంహారభైరవ, మహాభైరవులు క్షేత్ర పాలకులుగా ఉన్నారు. తూర్పు దిక్కున ఉన్న క్షేత్రపాలకుడైన కిన్నెరేశ్వరులు రాత్రింబగళ్లు వీణ, వేణువులతో

పాటలు పాడుతూ పంపాపతిని సేవిస్తున్నారు. దేవుని కీర్తించే పాటలలో ఆరోహణ, అవరోహణ, గ్రామ, న్యాస మూర్ఛంద మొదలైన సంగీత పదజాలం ఉపయోగింపబడింది. దేవుడిని సంగీతంలో కీర్తించడం కూడా ముక్తిదాయకమని హిందువుల నమ్మకం. ఈ క్షేత్రపాలకుడు ఇప్పుడు వారి వారి ప్రదేశాలలో లేరు. ఈ దేవాలయపు ప్రాంగణంలోని గోడకు ఆనించి నిలబెట్టి ఉన్నాయి. వానిలో చండభైరవ, కాపాలిభైరవ, సంహార భైరవ, మణిభద్రేశ్వర యక్షవిగ్రహాలను కొందరు పండితులు గుర్తించారు. ఈ ఆలయానికి 5 ఫర్లాంగుల దూరంలో ఉద్దాన వీరభద్రేశ్వర ఆలయం ఉంది. అందులో మూలవిరాట్టు కూడా ప్రస్తుతం విరూపాక్ష ఆలయ ప్రాంగణంలోనే ఉంది. విజయనగర రాజుల దైవం విరూపాక్షుడు. విజయనగర రాజ్యం విరూపాక్షునిది అని, తాము ఆ రాజ్యానికి ప్రతినిధులం మాత్రమేనని విజయనగర చక్రవర్తులు చెప్పుకున్నారు. విరూపాక్షుని పేరుతోనే రాజ్యాన్ని నడిపారు కనుక విరూపాక్షుడు వారి ఆరాధ్య దైవం, రాజ్యపు యజమాని, తొలి చాళుక్య కాలం నాడే పట్టడకల్‌లో విరూపాక్ష ఆలయం నిర్మింపబడింది. తొలి చాళుక్యుల కాలం నుండే విరూపాక్షదేవుని పూజ ప్రాచుర్యంలో ఉంది. చాళుక్యులు నిర్మించిన ఆలయాన్ని తొలి విజయనగర చక్రవర్తులు విస్తృతపరచి తమ రాజ్యానికి రక్షకుడని, యజమాని అని భావించి ఉండవచ్చును. నేటికీ ఈ ఆలయం మంచి స్థితిలో ఉండి పూజలు అందుకొంటోంది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం, మహామండపం ఉంది. కప్పుపై అనేక చిత్రలేఖలు ఉన్నాయి. వాటిలో జీవితపు దృశ్యాలు వర్ణచిత్రాలుగా చిత్రించారు. వర్ణచిత్రాలలో అగ్రగణ్యమైనది విద్యారణ్యుల వారిది. ఆయన శృంగేరి పీఠాపతి అయిన తర్వాత సకల రాచమర్యాదలతో విరూపాక్ష ఆలయానికి తీసుకువెళ్ళే దృశ్యాన్ని గొప్పగా చిత్రించారు. ఇది విజయనగర రాజులకు విద్యారణ్యుల వారిపై ఉన్న భక్తి భావానికి ప్రతీక. ప్రాంగణంలో దేవ గృహం కూడా నిర్మింపబడి ఉంది. చుట్టూ ప్రాకారం ఉంది. తూర్పు వైపు ద్వారంపై ఉన్న గోపురం ఇటుకలతో నిర్మించారు. ఈ గోపురానికి పోలికలున్నాయి. ఇది విజయనగర పెద్దగోపురాలలో ఒకటి. ఈ ఆలయానికి రెండవ దేవరాయల సేనాధిపతి ప్రోలుగంటి తిప్ప ఒక గోపురాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అతడే విరలాలయానికి కూడా భోగమండపం నిర్మించాడు. మైలవంత రఘునాధునికి వజ్ర కిరీటం, మాతంగ వీరభద్రస్వామికి ముత్యాలదండ సమర్పించాడని కూడా తెలుస్తోంది. కృష్ణరాయలు తన పట్టాభిషేక కాలంలో విరూపాక్షుని ఆలయానికి ముందు ఒక రంగమండపాన్ని నిర్మించి విరూపాక్ష దేవాలయంలో ఒక గోపురం శిధిలం కాగా దానిని బాగు చేయించాడు. అంతేగాక ఆలయపు తూర్పు ద్వారంపైన మరొక నూతన గోపురాన్ని కూడా నిర్మించాడు.

భువనేశ్వరి ఆలయం: విరూపాక్ష ఆలయానికి ఎడమ పక్కన భువనేశ్వరిదేవి ఆలయం ఉంది. ఇది కూడా ప్రాచీనమైనదే. ఇందులోని దేవీ విగ్రహం శిల్పశాస్త్ర సూత్రాల ప్రకారం తయారు చేయడమేగాక విగ్రహం చాలా అందమైన ఆకారంలో రూపొందించారు. రాతి నిర్మాణాలలో యోగాసనాలున్నాయి. ఇవి హలేబీడులోని హొయసాలేశ్వర ఆలయంలో ఉన్న వాటిలాగ రూపొందాయి. కనుక ఇవి తర్వాత కాలానికి చెందినవిగా భావించారు. హొయసాల వంశానికి చెందిన రాజులు ఈ క్షేత్రాన్ని దర్శించి యోగాసనాలు కలిగిన రాతి నిర్మాణాలు చేయించి ఉండవచ్చును. పంపావతి ఆలయంలో ఉన్న స్తంభాల కంటే ఇక్కడి స్తంభాలపై అందమైన శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. కాని ఈ ఆలయపు భూప్రణాళిక ద్రావిడ శైలికి చెంది నిరాడంబరంగా ఉంది. దీనిని బట్టి ఈ ఆలయం హొయసాలుల కంటే ముందే ఉందని తర్వాత దానికి హొయసాలులు, విజయనగర చక్రవర్తులు కొన్ని నూతన నిర్మాణాలు చేసి ఉండవచ్చునని భావింపబడింది. తిరుమలరాయలు తూర్పు గోపురాన్ని, కృష్ణదేవరాయలు పశ్చిమ గోపురాన్ని నిర్మించినట్లు భావించారు. అక్కడ ఉన్న మలయవంత పర్వతం మీద తిరుమలరాయలు శ్రీ రంగనాథ ఆలయం కూడా నిర్మించాడు.

విద్యాశంకర ఆలయం: విజయనగర తొలి రాజులు నిర్మించిన ఆలయాలలో విద్యాశంకర ఆలయం అతి ప్రధానమైంది. ఈ ఆలయాన్ని హరిహర బుక్కరాయల గురువైన విద్యారణ్యుల వారి సలహాపై విద్యారణ్యుల వారి గురువైన విద్యాతీర్థ సంస్మరణార్థం హరిహరబుక్కరాయలు నిర్మించారు. విద్యాతీర్థుల వారికి విద్యాశంకర అని కూడా పేరుంది. కనుక ఈ ఆలయానికి విద్యాశంకర ఆలయం అని పేరు వచ్చింది. ఈ ఆలయం చిక్క మంగుళూరు దగ్గరున్న శృంగేరికి దగ్గరలో ఉంది. విద్యాశంకరుల వారు దేహవిముక్తి చెందిన చోట ఈ ఆలయాన్ని నిర్మించారు. విద్యాశంకరుల వారు ఒక భూగర్భ సమాధిలోకి వెళ్లి 12 సంవత్సరాల వరకు తెరవ వద్దని తన శిష్యులను ఆదేశించారట. కాని శిష్యులు ఉండబట్టలేక 3వ సంవత్సరంలో సమాధిని తెరచి చూశారట, సమాధి ఖాళీగా ఉందట. ఆ సమాధిలో క్రీ.శ.1333 సంవత్సరంలో శివలింగాన్ని ప్రతిష్టించి తర్వాత ఆలయం

నిర్మించారట. ఆయన ఆధ్యాత్మికశక్తి ఇప్పటికీ ఆ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుందని అక్కడి ప్రజలు నమ్ముతారట. శృంగేరీ పీఠాధిపతులు విజయనగర చక్రవర్తులు ఈ సమాధిపై నిర్మించిన దేవాలయాన్ని పరమ పవిత్రంగా భావించారు. ఇప్పటికీ శృంగేరీ పీఠాధిపతులను శ్రీ విద్యాశంకరనామంతో పిలుస్తారు. క్రీ.శ.1338లో ఈ ఆలయాన్ని నిర్మించారని అక్కడి స్థానిక రాతలు తెలుపుతున్నాయి. కాని శృంగేరీ శాసనం క్రీ.శ.1256వ సంవత్సరంలో నిర్మించినట్లు తెలుపుతోంది. శిష్యులు క్రీ.శ.1338లో లింగ ప్రతిష్ఠ చేసి ఉంటారు. తర్వాత విద్యారణ్యుని సలహాపై బుక్కరాయలు ఈ దేవాలయాన్ని క్రీ.శ.1356లో నిర్మించి ఉండవచ్చును. అప్పటికీ విజయనగర రాజ్యం బలపడింది.

ఈ ఆలయాన్ని స్థానికంగా లభించే ఎర్రని గట్టి రాతితో నిర్మించారు. ఇది విజయనగర రాజుల తొలి ఆలయాలలో పెద్దది. ఈ ఆలయంలో మండపం, ఆలయం రెండూ కలిసి ఉంటాయి. ఈ ఆలయ ప్రణాళిక ఒక ప్రత్యేక తరహాలో ఉంది. పునాది నుండి ఆది తలం, మండప ప్రస్తారం రెండూ రెండు ధనస్సుల ఆకారంలో నిర్మించారు. ఈ ధనస్సులో రెండూ కలిసి ఉన్నట్లు కనిపిస్తాయి. వాటి చివరలు తూర్పు పడమరలుగా ఉన్నాయి. పడమటి భాగంలో గర్భగుడి విమానం, తూర్పు అర్ధ భాగంలో పెద్ద స్తంభాలున్న మండపం ఉన్నాయి. రెండింటికీ మధ్యన ఉత్తర దక్షిణంగా ఒక భాగం ఉంది. ఆలయం కింద చాపాకారపు ఉపపీఠం, దాని మీద అదే ఆకారంలో అధిష్ఠానం ఉంది. అధిష్ఠానానికంటే ఉపపీఠం వెడల్పుగా ఉంది. అందువల్ల ప్రదక్షిణ మార్గం కూడా ఏర్పడింది. ఉపపీఠం దక్షిణాది శైలిలో నిర్మింపబడింది. అధిష్ఠానం ఆరు తలాలుగా మెట్టపల్లాలుగా ఉంది. మధ్యలో శిల్పాలు చెక్కారు. ఇది మలి చాళుక్య హొయసాల శైలి. ఇందులో గజాలు, అశ్వాలు, పద్మాలు పౌరాణిక గాథలు, స్థానిక వీరగాథలు శిల్పాలుగా చెక్కారు.

గర్భగృహం చుట్టూ లోపల ప్రదక్షిణ పథం ఉంది. కనుక ఇది సాంధరశైలి ఆలయం. తూర్పు వైపు బాహ్యభిత్తి, ఆవరణంలో 12 స్తంభాల రంగమండపం ఉంది. దానికి ఆరు ద్వారాలు ఉన్నాయి. ఇది పశ్చిమ చాళుక్యుల శైలి. ద్వారబంధం చుట్టూ శాఖలున్నాయి. ఇది చాళుక్య లక్షణం. గొడుగు బల్ల మీద రాతిఫలకంపై గజలక్ష్మి చెక్కి ఉంది. ఇది కాకతీయశైలి. ద్వారాల మీద ముందుకు పొడుచుకొని వచ్చిన వెడల్పాటి కపోతం ఉంది. ఇది కాకతీయ శైలి. పక్కనే నదీ దేవతలను అంటే గంగా, యమునా తోరణాలను చెక్కారు. ఉపపీఠం ఎత్తుకు ఆరు, అధిష్ఠానం ఎత్తుకు ఆరు, మొత్తం పన్నెండు మెట్లు ఉన్నాయి. మెట్లకు రెండువైపులా ఏనుగుల శిల్పాలున్నాయి. బయట గోడలలో కుడ్యస్తంభాలున్నాయి. స్తంభాల మధ్య దేవకోష్ఠాలు ఉన్నాయి. వాటిలో రకరకాల విగ్రహాలున్నాయి. ఇన్ని శిల్పాలు ఒకే చోట ఉండటం అరుదైన విషయం. ఈ శిల్పాలలో శైవ, వైష్ణవ, శాక్తేయ మతాలవేగాక జైన బౌద్ధ విగ్రహాలు కూడా ఉన్నాయి. అది వారి పరమత సహనానికి నిదర్శనాలు. ఆరు ద్వారాలకు 12 మంది ద్వారపాలురు ఉన్నారు. వారిలో నలుగురు శైవులు, నలుగురు వైష్ణవులు, నలుగురు శాక్తేయులు. ఆలయం తూర్పు మూలలోని కపోతం నుండి కిందికి వేలాడే రాతి గొలుసు చెక్కి ఉంది. ఇలాంటిది కంచి వరదరాజస్వామి ఆలయంలో ఉంది. గర్భాలయంలో విద్యాశంకర లింగం ఉంది. దానికి ముందు ఇరుకైన అంతరాళం ఉంది. దానికి దక్షిణంగా గణపతి ఆలయం, ఉత్తరంగా దుర్గ ఆలయం నిర్మింపబడ్డాయి. వెనుక ఉన్న చాపంలోని మూడు ద్వారాలకు ఎదురుగా బ్రహ్మ, విష్ణు, శివాలయాలు ఉన్నాయి. వీటితో కలిపి ఇది పంచాయతన ఆలయం అయింది. చాళుక్య ఆలయాలలో అంతరాళానికి కొద్ది దూరంలో మహామండపంలో ఎదురెదురుగా దుర్గ, గణేష ఆలయాలు నిర్మించేవారు. పల్లవ పాండ్య ఆలయాలలో అర్ధమండపు వెలుపలి గోడలలో ఉత్తర దక్షిణ దేవకోష్ఠాలలో ఉంచేవారు. కొన్ని పశ్చిమచాళుక్య ఆలయాలలో గర్భగృహానికి పశ్చిమ దక్షిణ ఉత్తర దిశలలో వరుసగా సరస్వతి బ్రహ్మలు, లక్ష్మీనారాయణులు, ఉమామహేశ్వరులకు పరివార ఆలయాలు నిర్మించారు. ఈ చాళుక్య పద్ధతిని విజయనగర రాజులు దేవాలయంలో ప్రవేశపెట్టారు.

తూర్పుచాపం లోపల 12 పెద్ద శిలా స్తంభాలున్న మండపం ఉంది. మండపాలను విజయనగర రాజులు తప్పనిసరిగా నిర్మించారు. స్తంభాల మధ్యభాగంలో లోపలి వైపుకు వంగి కూర్చున్న ఏనుగు నెత్తి మీద వ్యాళం చెక్కారు. వ్యాళం పైన పాండ్యశైలిలో పుష్పపాలుకలు చెక్కారు. స్తంభానికి వెలుపల వైపు ఉపస్తంభాన్ని చెక్కారు. వ్యాళాల నోటిలో రాతిని కదిలే బంతి లాగా చెక్కారు. దానిని నోటి లోపల కదిలించవచ్చును గాని, బయటకు తీయడానికి వీలులేదు. ఇది ఆ ఆలయంలోని ప్రత్యేక లక్షణం అని చెప్పవచ్చును. విజయనగర శిల్పుల అనన్య సామాన్య లక్షణంగా పండితులు వర్ణించారు. 12 స్తంభాల మీద 12 రాశులు చెక్కారు. కనుక వాటిని రాశి

స్తంభాలు అని అంటారు. ఒక్కొక్క నెలలో ఒక్కొక్క స్తంభంపై సూర్య కిరణాలు పడేటట్లు అమర్చారు. సంవత్సరం తిరిగితే గాని 12 స్తంభాల మీద కిరణాలు పడటం పూర్తికాదు. మండపం నేల మీద ఒక వృత్తం దాని మీద ఉత్తర దక్షిణ తూర్పు ద్వారాలగుండా సూర్యకిరణాలు స్తంభాల మీద ప్రసరించేటట్లు ఏర్పాటు చేశారు. సూర్యకిరణాలు పడేటప్పుడు పడే నీడలను సూచించే గీతలను కూడా చెక్కారు. ఇది ఒక అద్భుతమైన ఖగోళశాస్త్ర వాస్తుశిల్పి సమ్మేళనం. రంగమంటపం కప్పు బాగా లోతుగా ఉంటుంది. దానిని నాభిచ్ఛందవితానం అని అంటారు. ఇది రెండు ఎత్తులలో ఉండి పైనపడే వర్షం నీరు కిందికి వెళ్లేటట్లు నిర్మించారు. వర్షం ఎక్కువ పడే పశ్చిమకోస్తాలోని ఆలయాలన్నీ ఇలాగే ఉంటాయి. అంతరభితి, విమానంగా పైకి నిర్మించారు. విమానం మీద మూడు తలాలున్నాయి. అది పైకిపోయే కొద్దీ వర్తులం తగ్గుతూ ఉంటుంది. చివరగ్రవం, దాని మీద శిఖరం, దానిపైన స్థూపి ఉన్నాయి. విమానం ముందు శుకనాసిక ఉన్నది. అది అంతరాళం మీదకు వంగి ఉంది. దక్షిణాది ఆలయాలలో ఉండే హర అలంకరణ లేదు. విమాన ఆకారం స్థానిక హొయసాల శైలికి భిన్నంగా ఉంది. భద్రాలలో దేవకోష్టాలు ఉన్నాయి. ఇది ప్రాచీన బౌద్ధ గ్రంథాలలో వర్ణించినట్లు దివ్యవినావపు పంచకలశాలుగా నిర్మింపబడింది. ఈ విమానాన్ని నిలబెట్టడానికి లోతట్టున రాళ్లను వాసాలుగా పేర్చారు. ఇలాంటి ఏర్పాటు మరెక్కడా లేదు. ఈ విధంగా ఈ ఆలయం దక్షిణదేశంలోని ప్రముఖ రాజవంశాల శైలులన్నీ మిళితం చేసి విశిష్ట దేవాలయం. విద్యాశంకరస్వామి మీద విజయనగర చక్రవర్తులకు ఉన్న గౌరవానికి ఇది ప్రతీక.

విఠల్‌స్వామి ఆలయం: హంపిలోని దేవాలయాలన్నింటిలోకి విఠల్‌స్వామి ఆలయం మేటి తలమానికమైంది. ఈ ఆలయ నిర్మాణం గురించి చరిత్రకారులలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ ఆలయం కృష్ణదేవరాయల కన్నా ముందే ఉందని, దానికి కొన్ని చేర్పులు మాత్రమే కృష్ణదేవరాయలు చేశాడని కొందరు భావించగా, మరికొందరు దానిని కృష్ణదేవరాయలే స్వయంగా నిర్మించి పండరీపురం నుండి విఠల్ విగ్రహాన్ని తెచ్చి ప్రతిష్ఠించాడని భావించారు. ఆర్కలాజికల్ డిపార్టుమెంట్ వారు పరిశీలించి ఒక నివేదికను తయారు చేశారు. అందులో ఈ ఆలయాన్ని కృష్ణదేవరాయలు ప్రారంభించగా అతని తర్వాత అతని రాణులు, అతని సోదరులు అచ్యుత దేవరాయలు, తర్వాత రామరాయలు, సదాశివరాయలు కొనసాగించారని వివరింపబడింది. ఏమైనప్పటికీ ఈ ఆలయ నిర్మాణం పూర్తి కాలేదు. 1565వ సంవత్సరంలో జరిగిన తళ్లికోట యుద్ధం వల్ల విజయనగర పట్టణం ధ్వంసమైంది. కనుక ఈ ఆలయ నిర్మాణం పూర్తికాకుండా ఆగిపోయి ఉండవచ్చును. 1922-23 సంవత్సరం నివేదికలో ఒక కథ వివరింపబడింది. దాని ప్రకారం పండరీపురంలోని విఠల్‌స్వామి హంపిలో తన కోసం నిర్మించిన విఠలాలయానికి రావడానికి ఇష్టపడలేదనీ, తన స్వస్థానమైన పండరీపురాన్ని వదిలిపెట్టాలని తెలిపినందువల్ల హంపిలోని విఠలాలయ నిర్మాణం పూర్తికాకుండా ఆగిపోయిందని, పండరి విఠలునికి బదులు మరొక విఠల విగ్రహాన్ని తయారు చేయించి అందులో ప్రతిష్టించారని ఆ నివేదికలో పేర్కొనబడింది. కృష్ణదేవరాయలకు సమకాలికుడైన వడి రాజతీర్థులు ఇందుకు భిన్నంగా వివరించాడు. ఇతని రచన శక సంవత్సరం 1493 అంటే క్రీ.శ.1571-72 సంవత్సరాలకు చెందిందని భావిస్తారు. మైసూర్‌లో జరిగిన 8వ ఆలిండియా ఓరియంటల్ కాన్ఫరెన్స్‌లో డా॥ సి.నారాయణరావు ఆ దేవాలయంలో ప్రతిష్ఠింపబడిన విఠల్‌స్వామి విగ్రహాన్ని తాను కనుగొన్నానని ప్రకటించాడు. దానిని బట్టి ప్రధాన విఠలాలయం కృష్ణదేవరాయలకు ముందు ఉందని, దాని రెండవ దేవరాయలు నిర్మించాడని, దానికి కృష్ణదేవరాయలు చేర్పులు చేర్చాడని భావింపబడింది. ఏమైనప్పటికీ ఈ ఆలయ నిర్మాణం పూర్తి కాలేదు. లాంగూరస్ట్ అనే పండితుడు విఠల్‌స్వామి ఆలయపు కప్పు పూర్తికాక పోయినప్పటికీ ఈ ఆలయంలోని స్తంభాలు అద్భుతంగా రూపొందించబడ్డాయని వ్యాఖ్యానించాడు. అలాగే ఫెర్గుసన్ ఇది విజయననగర శిల్పకళ మంచి ఉచ్ఛదశనందుకుందని వ్యాఖ్యానించాడు. ఇది విజయనగర శిల్పకళకు ఒక గొప్ప మచ్చుతునక అని నిర్భయంగా చెప్పవచ్చని పండితులు అంటారు.

ఈ ఆలయ ప్రాంగణంలో మూడు కట్టడాలున్నాయి. వాటిలో మొట్టమొదటిది విఠలాలయం, రెండవది కళ్యాణమండపం, మూడవది రాతిరథం. ఈ రాతిరథం ఒరిస్సాలోని కోణార్క రాతి రథాన్ని పోలి ఉంది. కృష్ణదేవరాయలు గజపతి రాజ్యంపై దండయాత్ర చేసినప్పుడు అక్కడి రాతి రథాలను చూసి విఠలాలయంలో ఈ రథాన్ని చెక్కించి ఉండవచ్చును. హంపి ఆలయాలలో విఠలాలయం అతి పెద్ద ఆలయం. విమానం, మండపాలు, గరుడ కళ్యాణ మండపాలు, ప్రాకరం, గోపురాలు అన్నీ కలిసి ఒక బ్రహ్మాండమైన ఆలయాన్ని నిర్మించ తలపెట్టినట్లు ఆలయ ప్రణాళిక తెలుపుతోంది. ఈ ఆలయం 500 అడుగుల పొడవు, 310 అడుగుల వెడల్పుతో

విశాల ప్రాంగణంతో నిర్మించబడి ఉంది. దీనికి గర్భాలయం అంతరాళం మూత వేసి ఉన్న దక్షిణ పథం, ముఖ మండపం, సంగీత మండపం అనే విభాగాలతో ఉంది. సాంధర దేవాలయంలో మరో మూడు బహుస్తంభ మండపాలు కూడా ఉన్నాయి.

సంగీత మండపం: విఠలాలయంలో ప్రఖ్యాతి గాంచింది సంగీత మంటపం. ఇది మంచి బలమైన అధిష్ఠానంపై నిర్మింపబడింది. ఇది గ్రాడ్యుయేటెడ్ ప్రొజక్షన్‌లో నిర్మించారు. ఈ అధిష్ఠానంలో శాలకోష్ఠాలు, విడి అంగాల నుండి చొచ్చుకొని పోతున్నాయి. మండపంలో ఇప్పుడు 56 స్తంభాలున్నాయి. అందులో ప్రతి స్తంభానికి ఉపస్తంభాలున్నాయి. వాటిని అనుస్తంభాలని కూడా పిలుస్తారు. ఒక్కొక్క స్తంభం ఎత్తు 12 అడుగులు. మండపం మధ్యలో కొంత ఖాళీని వదలి దాని చుట్టూ 36 స్తంభాలు అమర్చారు. మిగిలిన 40 స్తంభాలు ఈ 16 స్తంభాల చుట్టూ అమర్చబడి ఉన్నాయి. ఈ స్తంభాలను మీటినట్లయితే సప్తస్వరాలు వినిపిస్తాయి. అందుకే దానికి సంగీత మండపం అని పేరు వచ్చింది. మండపు ఆచ్ఛాదనం చాలా భాగం శిథిలమైపోయింది. మండపానికి అమర్చిన కపోతం ఉబ్బెత్తుగా వంపు తిరిగి లోతుకు పోయిన వంపు భాగంతో ఉంది.

మహా మండపం: ఆలయానికి ముందు ఉన్న మహామండపానికి ఉత్తర దక్షిణ వైపులలో మెట్ల వరుసలున్నాయి. ఈ మెట్లకు రెండు వైపులా పెద్ద ఏనుగుల శిల్పాలున్నాయి. మండపం లోపలి భాగం 55 అడుగులు చతురస్రం ఉంది. దానిలో కూడా 16 స్తంభాలున్నాయి. దీని అచ్ఛాదనం కూడా శిథిలమై ఉంది. ఈ మండపానికి రెండు వైపులా వరండాలున్నాయి.

ప్రదక్షిణాపథం - విమానం: గర్భగృహం అంతరాళాలను చుట్టి ఉన్న ప్రదక్షిణ పథం బాగా లోతుగా ఉంది. దేవాలయం నిర్మించినప్పుడు గాక తర్వాత నిర్మించినట్లుగా కనిపిస్తోంది. గర్భగృహం అంతరాళాల కుడ్యాలపై శాలకోష్ఠాలు, కుంభపంజరాలు, కుడ్యస్తంభాలు ఉన్నాయి. గర్భగృహంపై ఉన్న విమానాన్ని ఇటుకలతో నిర్మించారు. అది కూడా శిథిలమైపోయింది. విమానాల పైభాగాన్ని ఇటుకలతో నిర్మించే ఆచారం విజయనగర ప్రభువులు ప్రవేశపెట్టారు. అంతకు ముందు అంతా రాతి నిర్మాణమే.

రాతి రథం: అగ్రమండపానికి ముందు గరుడ వాహనం ఉంది. ఇది రథం లాగా చెక్కిన చిన్న విమానం. ఏకశిలలతో నిర్మించారు. ఇది రథం ఆకారంలో నిర్మింపబడింది. కనుక దానిని రాతి రథం అని పిలుస్తున్నారు. ఇది కూడా దేవాలయం మాదిరిగానే గర్భగృహం అంతరాళం, ముఖమండపం అనే విభాగాలతో రూపొందిచబడింది. దాని శిఖరం మాత్రం ఇటుకలతో నిర్మించారు. అది నేడు శిథిలమైపోయింది. ఇది గరుడ వాహనం అని భావిస్తున్నారు.

ఇతర మండపాలు: ఆలయంలో మరో ఐదారు మండపాలు కూడా ఉన్నాయి. వాటిలో మూడు మండపాలు బహుస్తంభ మండపాలు.

ప్రాకారం-గోపురాలు: ఈ ఆలయం చుట్టూ దీర్ఘచతురస్రాకారపు ఆకారం నిర్మింపబడింది. ప్రాకారకుడ్యం లోపల ముఖ భాగాన్ని ఒక స్తంభాల వరండా నిర్మింపబడి ఉంది. ప్రాకారానికి మూడు వైపులా ద్వారాలు వాటిపైన గోపురాలు ఉన్నాయి. వానిలో తూర్పు దక్షిణ ద్వారాలు ప్రముఖమైనవి. తూర్పు గోపుర ద్వారం ఆలయానికి ప్రవేశ ద్వారం. ఆ ద్వారానికి ఎదురుగా ఒక పెద్ద బజారు ఉంది. దానికి రెండువైపులా ఇళ్ల వరుసలు ఉన్నట్లు పునాదులున్నాయి. కాని ఈ ఆలయం పూర్తి కాలేదు. కృష్ణదేవరాయల తర్వాత దానిని ఎవరూ కొనసాగించలేదు. క్రీ.శ.1565 తళ్లికోట యుద్ధం తర్వాత విజయనగర పట్టణం ధ్వంసమైంది.

హజారా రామస్వామి దేవాలయం: హంపిలోని హజారా రామస్వామి దేవాలయం కేవలం రాజ కుటుంబీకుల కోసం నిర్మింపబడిందని పండితులు చెబుతున్నారు. ఈ ఆలయం 200 అడుగుల పొడవు, 110 అడుగుల వెడల్పుతో విశాలంగా ఉంది. ఆలయం అంతకు పూర్వమే ఉంది. దానిని కృష్ణదేవరాయలు పునర్నిర్మాణం చేసినట్లుగా కనిపిస్తోంది. ఈ ఆలయానికి గర్భగృహం, అంతరాళం, మూడు ద్వారాలున్న ముఖ మండపం ఉన్నాయి. ముఖ మండపం కట్టడాలు, బూడిదరంగు గ్రానైట్ రాతితో ఉండగా మధ్యలో ఉన్న నాలుగు నల్లరాతి స్తంభాలు ప్రత్యేకంగా పేర్కొనాలి. ఇవి అత్యంత సుందరమైన స్తంభాలని పండితులు వర్ణించారు. ఈ స్తంభాలపై మకరాలతో పాటు లోపల లక్ష్మీనారాయణ, ధన్వంతరి, కృష్ణుడు, కాళీయమర్దన, బ్రహ్మ, విష్ణు, వరాహమూర్తి, వినాయక శిల్పాలు చెక్కారు. ఇంకా వేణుగోపాల, శ్రీరామ, హనుమంత, జాంబవంత శిల్పాలు అద్భుతంగా చెక్కారు. ఈ నాలుగు స్తంభాలను వారి పేరుతోనే వేణుగోపాల, శ్రీరామ, హనుమంత, జాంబవంత

స్తంభాలని పిలుచుకున్నారు. ఈ నాలుగు స్తంభాలపైన ఆచ్ఛాదనంలో పద్మ శిల ఉంది. పైకప్పు మధ్య భాగంలో రెండు కోతి తలలు చిత్రించబడ్డాయి. ఆ తలలకు నాలుగు వైపుల నాలుగు కోతి శరీరాలు తొలిచారు. ఎటునుండి చూసినా కోతి బొమ్మ కనిపిస్తుంది. అంటే రెండు తలలతో నాలుగు కోతి బొమ్మలు కనిపిస్తున్నాయి. ఈ శిల్పం ఈ ఆలయంలోనే ఒక ప్రత్యేకత. ఇవన్నీ వైష్ణవ శిల్పాలు. ఇవి కృష్ణరాయల వైష్ణవ మతానికి చిహ్నాలని పండితులు వ్యాఖ్యానించారు.

ముఖమండపం, అంతరాళం కొంచెం ఎత్తుగా ఉంది. గర్భగృహంపైన విమానం పిరమిడ్ ఆకారంలో త్రి తలాలుగా నిర్మింపబడింది. మొదటి తలం రాతితోను, పైరెండు తలాలు ఇటుకలతో నిర్మింపబడి ఉన్నాయి. విమానానికి ముందు శుకనాసిక ఉంది. మూడు తలాలలో కర్ణకూడులు, పంజరాలు, శాలలు ఉన్నాయి. శిఖరం చతురస్రంగా నాగరశైలిలో ఉన్నాయి. ఆలయ కుడ్యాలపై శలకోష్టాలు, కుంభపంజరాలు, కుడ్యస్తంభాలు ఉన్నాయి కుడ్యాలపై రామయణ మహాభారత శిల్పాలు చెక్కారు. అధిష్ఠానం పట్ట త్రిపట్ట విభాగాలతో నిర్మింపబడింది దేవి ఆలయం ప్రధాన ఆలయాన్ని పోలి ఉంది. దానికి గర్భగృహం, అంతరాళం, ముఖమండపం ఉన్నాయి. పైన ఏక తల ద్రావిడ విమానం ఆయతస్ర శిఖరంతో ఉంది. ఆలయ కుడ్యాలపై ఉత్తర రామకథను తెలిపే మూడు వరుసల అర్ధ శిల్పాలు చెక్కారు. ఒక మూల కళ్యాణమండపం నిర్మింపబడింది. ఆలయ సముదాయం చుట్టూ ఎత్తయిన ప్రాకారం నిర్మింపబడి ఉంది. ఈ ప్రాకారపు కుడ్యం వెలుపల వైపు హిందూ దేవతాగణాలు అంబారీలతో అలంకరించి ఏనుగులు, అశ్వాలు, వాటిని అమ్మటానికి తీసుకువచ్చిన వర్తకులు యుద్ధ భూములు, నర్తకీమణులు, దసరా వేడుకలలో స్త్రీలు ఒకరిపై మరొకరు జలకాలు విరజిమ్ముకోవడం మొదలైన దృశ్యాలు చిత్రించబడ్డాయి దేవాలయం కింది భాగాన చుట్టూ బారులు తీరి నడుస్తున్నట్లు ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, సైనికుల శిల్పాలు చెక్కారు. ఈ వరుసపైన అనేక భంగిమలలో నృత్యం చేస్తున్న స్త్రీమూర్తులను చిత్రించారు. వారి వంటిపై కనిపించనంతటి పలుచని బట్టలున్నాయని డబ్ల్యు ఫ్రాన్సిస్ అనే పండితుడు రాశాడు. ఇంకా ఈ దేవాలయపు గోడల మీద జైన తీర్థంకరుల విగ్రహాలు కూడా మలచారు.

కృష్ణాలయం: శ్రీ కృష్ణదేవరాయలు గజపతులపై విజయాన్ని సాధించిన తర్వాత ఉదయగిరిలో తెచ్చిన కృష్ణ విగ్రహానికి క్రీ.శ.1513లో మనోజ్ఞమైన ఆలయం నిర్మించాడు. ఇది ద్రావిడశైలిలో నిర్మింపబడింది. ఇది పంపానాథుని ఆలయానికి అర మైలు దూరంలో ఉంది. అందులో అనేక పరివార ఆలయాలు, మండపాలు నిర్మించాడు. సుందరమైన అలంకరణలతో స్తంభాలు చెక్కబడ్డాయి. పెద్ద గోపురం నిర్మింపబడింది. ఇందలి కళ్యాణ మండపం విఠలాలయంలో ఉంది. కృష్ణదేవరాయలకు కృష్ణుడంటే అమిత ఇష్టమట. బహుశా తన పేరు కూడా కృష్ణుడు కావడం కావచ్చును. ప్రస్తుతం ఈ విగ్రహం మద్రాసు మ్యూజియంలో ఉంది.

అచ్యుతదేవరాయల పట్టాభిరామ ఆలయం: విఠలాలయ సముదాయం లాగే పెద్ద పరిమాణంలో మాతంగ పర్వత సమీపంలో అచ్యుతదేవరాయలు క్రీ.శ.1539వ సంవత్సరంలో హంపిలో పట్టాభిరామ ఆలయాన్ని నిర్మించాడు. ఇది విఠలాలయాన్ని పోలి ఉంది. ఆలయానికి గర్భగృహం అంతరాళం, ముఖమండపం, మహా మండపాలు ఉన్నాయి. విఠలాలయంలో మహామండపాన్ని సంగీత మండపం అని అంటారు. కాని ఇక్కడ దానిని మహా మండపం అని పిలిస్తున్నారు. గర్భాలయం అంతరాళం చుట్టూ మూత వేసిన ప్రదక్షిణాపథం ఉంది. అంటే ఇది సాంధర ఆలయం ప్రాంగణంలో దేవీ ఆలయం కూడా ప్రత్యేకంగా గర్భగృహం, అంతరాళం, ముఖ మండపాలను కలిగి ఉండి ప్రత్యేక ఆలయంగా కనిపిస్తోంది. వాయవ్య మూలన కళ్యాణ మండపం ఉంది. కళ్యాణ మండప స్తంభాలు సుందర శిల్పాలతో అలంకరించబడి ఉన్నాయి. ప్రధాన ఆలయ విమానం కర్ణగూడులు, పంజర శాలలు కలిగి తలాలతో నిర్మింపబడింది. అమ్మవారి ఆలయంపై ఆయతాస్ర శిఖరం ఉంది. ఈ దేవాలయాల సముదాయం చుట్టూ రెండు ప్రాకారాలు ఒకదాని చుట్టూ ఒకటి నిర్మింపబడి ఉన్నాయి. రెండు ప్రాకారాలకు మూడువైపులా ద్వారాలు వాటిపై గోపురాలు నిర్మింపబడి ఉన్నాయి. లోపలి ప్రాకారపు లోపలి ముఖభాగాన్ని ఆనుకొని ఒక స్తంభ వరండా ఉంది. వెలుపలి ప్రాకారం లోపలి భాగంలో వాయువ్యమూలన ఒక పెద్ద స్తంభ మండపం ఉంది. ప్రధాన ఆలయం మీద విమాన శిఖరం పోయింది. రాక్షసతంగడి యుద్ధం తర్వాత శిఖరం పడగొట్టబడి ఉండవచ్చును.

నాట్యశాల: డామింగో పేస్ కృష్ణదేవరాయల కాలంలో విజయనగరాన్ని దర్శించాడు. ఆ కాలంలో రాజులు, రాజ కుమార్తెలు ఇతర అంతఃపుర కాంతలు నాట్యం నేర్చుకోవడానికి రాచనగరులో ప్రత్యేకమైన నాట్యశాల

ఉందని వివరిస్తూ దాని నిర్మాణ కౌశల్యాన్ని వర్ణించాడు. అది విరలాలయ సమీపంలో ఉంది.

ఈ శాలకు రాజు రాచస్త్రీలను నాట్యం నేర్చుకోడానికి పంపేవాడు. ఈ శాల చాలా పొడవుగా ఉంది. కాని వెడల్పు తక్కువ. అందులో స్తంభాలు ఆ శాల చుట్టూ నిర్మించిన గోడకు బారెడు లోపల హాలులో చుట్టూ ఉన్నాయి. ఈ స్తంభాలన్నింటిపై రాతి శిల్పాలున్నాయి. ఈ స్తంభాలు సగం మెరుస్తున్నట్లు ఉన్నాయి. మిగిలిన సగభాగం మీద శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ శిల్పాలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని ఫెర్గూసన్ రాశాడు.

ఈ వర్ణనలను బట్టి అక్కడి ఫలకాల మీద భరతుని నాట్యశాస్త్రంలోని భంగిమలను చిత్రించారని తెలుస్తోంది. నాట్యం చేసేవారు తాము ఏ భంగిమలో ఉండాలో ఆ శిల్పాలను చూసి తెలుసుకోవడానికి వీలుగా ఉన్నాయి అలాగే కృష్ణదేవరాయలకు నాట్యకళపై ఉన్న అభిరుచిని కూడా తెలియజేస్తోంది. కృష్ణదేవరాయల కాలంలో అన్ని కళలు పరిపూర్ణస్థాయికి చేరుకున్నాయని పండితులు భావిస్తారు. నాట్యకళ కూడా ఉన్నతస్థితికి చేరుకుందని, ఈ నాట్యశాల వర్ణనల వల్ల తెలుస్తుంది. కృష్ణరాయలు స్వయంగా కవిత్వం, సంగీత కళలలో అరితేరిన వాడు. రాఘవేంద్రతీర్థుని పూర్వీకుడైన కృష్ణ, సంగీత సూర్యోదయాన్ని రాసిన బండెం లక్ష్మీనారాయణ అనే వారి దగ్గర రాయలు సంగీతాన్ని నేర్చుకున్నాడని ప్రతీతి. వైష్ణవ భక్తులైన కనకదాసు, పురంధరదాసులను రాయలు ఆదరించాడు. వారి కీర్తనలు కూడా సంగీత కళాఖండాలే. ఈ కాలంలో భరతుని నాట్యశాస్త్రానికి కల్లినాథుడు క్రీ.శ.1420లో వ్యాఖ్యానం రాశాడు. క్రీ.శ.1220 నాటి సారంగదేవుని సంగీత రత్నాకరానికి కూడా వ్యాఖ్యానం రాయబడింది. ఇవేగాక రాయల సమ కాలానికి చెందిన అంటే క్రీ.శ.1510-1525 సంవత్సరాల మధ్య కాలానికి చెందిన సద్రగ చంద్రోదయ రాగమంజిర అనే సంగీత గ్రంధాలు కూడా వెలువడ్డాయి. వీటిని పుండరీక విఠల అనే అతడు రాశాడు. ఈ సంగీత గ్రంధాల వల్ల రాయల కాలం నాటికి సంగీతం ఉన్నత స్థాయినందుకుంది. నేడు హాలీవుడ్ సంగీతం ఏ స్థాయిలో ఉందో ఆ నాడు విజయనగరంలో సంగీతం ఆ స్థాయిలో ఉండేదని పేస్ రచనలు తెలుపుతున్నాయి. కాని అంతటి బ్రహ్మాండంగా, అద్భుతంగా ఉన్న నాట్యశాల శిధిలాలు కూడా నేడు లేవు. అది గొప్ప దురదృష్టం. కాని విఠల్‌స్వామి దేవాలయంలోని కళ్యాణ మండపానికి ఎదురుగా ఒకరాతి వేదిక ఉంది. ఆ వేదిక మీద చుట్టూ సంగీత విద్వాంసులు, వాయిద్యగాండ్రు శిల్పాలు చెక్కి ఉన్నాయి. దానిని పరిశీలించినట్లయితే పేస్ వర్ణించిన నాట్యశాల రూపురేఖలు కొంత అవగాహన చేసుకోవచ్చును. ఇది నాట్య వేదిక కావచ్చును. విఠల్‌స్వామి ఆలయంలో ఉత్సవాల సందర్భాలలో ఈ వేదికపై నాట్యాలు చేసి ఉండవచ్చును. కృష్ణదేవరాయల కాలంలో ఆ వేదిక బంగారు పుష్పాలు, రత్నాలు, మణులతో అలంకరింపబడేదని అనుశృతి ఉంది.

మహార్ణవమి దిబ్బ లేక సింహాసన వేదిక: ఒక చరిత్రకారుడు దేవాలయాల మీద, మహార్ణవమి దిబ్బ మీద చిత్రించిన లతలు, జంతువుల బొమ్మలకు ఒక ప్రయోజనముందని వ్యాఖ్యానించాడు. విజయనగరంలో మహార్ణవమి దిబ్బ లేక దసరా దిబ్బ అనే పేరుతో ఒక పెద్ద వేదిక ఉంది. దీనిని కొందరు సింహాసన వేదిక అని భావిస్తారు. ఈ వేదిక చుట్టూ ఉన్న గోడల మీద అనేక పక్షులు, జంతువులు, మనుషులు నాట్యకారులు, సంగీత విద్వాంసులు, వేట చిత్రాలు చిత్రించి ఉన్నాయి. ఇవి హాలేబీడు, బేలూరు, సోమనాధపూర్‌లలో ఉన్న చిత్రాలకన్న చాలా ఎక్కువగా చక్కగా చిత్రించబడ్డాయి. ఈ వేదిక దక్షిణపు గోడ మీద దాదాపు 9 వరుసలలో చిత్రాలు చిత్రించబడి ఉన్నాయి. మొదటి వరుసలో హంసలు, రెండవ వరుసలో ఏనుగులు, మూడవ వరుసలో వేట చిత్రాలు, నాల్గవ వరుసలో గుర్రాలు, ఒంటెలు, ఐదవ వరుసలో పక్షులు, చెట్లు, ధాన్యం దంచే స్త్రీలు ఆరవ వరుసలో సింహాలు ఏనుగులపై లంఘించటం, ఏడవ వరుసలో నాట్యచిత్రాలు, ఎనిమిదవ వరుసలో కుక్కలు, పదాతి సైనికులు, విదేశస్తుల చిత్రాలు తొమ్మిదవ వరుసలో ఎలుగుబంట్లు, జింకల శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. వేదికపైకెక్కే మెట్ల వరుసకు రెండు వైపుల కూడా 6 వరుసలుగా శిల్పాలు చెక్కి ఉన్నాయి. మొదటి వరుసలో ఏనుగులు, రెండవ వరుసలో కల్పలతలు, మూడవ వరుసలో భరత నాట్యభంగిమలు, నాల్గవ వరుసలో కోలాటం, ఐదవ వరుసలో సంగీత వాయిద్యగాండ్రు ఆరవ వరుసలో హంసలు చెక్కి ఉన్నాయి. దసరా లేక విజయదశమికి అక్కడ బ్రహ్మాండమైన ఉత్సవాలు జరిపేవారట. అలాగే ప్రతి శనివారం నాడు అక్కడ నాట్యం జరుగుతుండేదని పోర్చుగీసు వారు రాశారు.

ఇవన్నీ ఆకాలం నాటి సాంఘిక జీవనాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ చిత్రాలన్నీ చాళుక్యులు హొయసాల కాలం నాటి శిల్పాలకేమాత్రం తీసి పోదు. అర్సికేరా, సోమనాధపూర్, శృంగేరి శిల్పాలకంటే మిన్నగా ఉన్నాయి ఈ

కట్టడాన్ని పేస్ విజయ భవనం అని, దానిని కృష్ణదేవరాయలు తన కళింగ దిగ్విజయయాత్ర తర్వాత నిర్మించాడని పేర్కొన్నాడు. దానికి భువన విజయం అని పేరు పెట్టి అక్కడ ఆశీనుడై కృష్ణదేవరాయలు మహానవమి ఉత్సవాలను తిలకించేవాడని భావించారు. విదేశీయులు తమ రచనలలో వర్ణించిన మహానవమి ఉత్సవాల వర్ణనల దృశ్యాలు ఆ వేదిక చుట్టూ ఉన్న ఆ దృశ్యాలలో ఒక మనోహరమైన శిల్పం ఉంది. అందులో మంచి యవ్వనంలో ఉన్న యువకుడు వసంతజలాలు చిమ్మే గొట్టాలను పట్టుకొని నాట్యకత్తెల మధ్యన ఉన్నట్లు చిత్రించి ఉంది. వసంతోత్సవాల్లో పండుగనాడు రంగునీళ్ళు ఒకరిపై ఒకరు చిలకరించుకుంటూ ఆనందించే దృశ్యం అని చెప్పవచ్చును. నికోల్ డి కోంటి వర్ణించిన వసంతోత్సవ దృశ్యం ఇదే అయి ఉండవచ్చని లాంగ్‌హర్స్ట్ అభిప్రాయపడ్డాడు. తెలుగు సాహిత్యంలో కూడా వసంతోత్సవాల వర్ణన ఉంది.

ఈ కట్టడానికి దగ్గరలో మరొక శిథిల అరుగు ఉంది. అది 5 అడుగుల ఎత్తు ఉంది. దాని గోడలపై ఉన్న ఫలకాలపైన కూడా మహానవమి ఉత్సవ ఊరేగింపు దృశ్యాలున్నాయి.

ఆడియన్సు హాలు: విజయనగర శిథిలాలలో ఒక పెద్ద పునాది ఉంది. దానిని పరిశోధకులు విజయనగర రాజులు ప్రజలకు దర్శనమిచ్చే మందిరం అని భావించారు. ఆ పునాదిపైన పది వరుసల స్తంభాలు ఉన్న చిహ్నాలు కనిపిస్తున్నాయి. ఒక్కొక్క వరుసలో 10 స్తంభాలు ఉన్నట్లు మొత్తం నూరు స్తంభాల భవనం అయి ఉండాలని ఊహించారు. అది నాలుగు అంతస్థుల భవనం అయి ఉండవచ్చని కూడా తలంచారు. పునాది అరుగు నాలుగు పక్కలా సాధారణ శిల్పాలున్నాయి.

రాణీవాసం లేక జనానా: ఈ శిథిలాలకు ఉత్తరంగా ఒక ఫర్లాంగు దూరంలో ఒక ఎత్తయిన గోడ ఉంది. దాని లోపల ఆవరణ ఉంది. దానిని లాంగ్‌హర్స్టు జనానా అని భావించాడు. అంటే రాజాంతఃపురం అక్కడ రాణులు నివసించే వారు. అక్కడి భవనం లోపల ఇండో-ఇరానియన్ వాస్తుశైలిలో ఉంది. ఆ గోడ పైకిపోయేకొద్దీ మందం తగ్గిపోయింది. గోడ రాళ్లతో నిర్మించింది. కాని రాళ్లకు మధ్య మట్టి కలిపి పెట్టారు. గోడపైన ఇనుప ములుకు ఉండి ఉండాలి. అని లాంగ్‌హర్స్టు ఊహించాడు. ఈ గోడకు ఆగ్నేయంగా, ఈశాన్యంగా రెండు ఎత్తయిన గోపురాలు ఉన్నాయి. వాటిపైకి వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. అవి అంతఃపురానికి రక్షణగా నిర్మించిన బురుజులు అయి ఉండవచ్చును. గోపురంలో నుండి బయటకు చూడటానికి కిటికీలున్నాయి. ఈ కిటికీలకు సాధారణమైన ఆర్చీలున్నాయి. ఈ ప్రాంతంలో అనేక పునాదులున్నాయి. అవి రాజభవనాల పునాదులు అయి ఉండవచ్చునని భావింపబడింది.

హంపిలోని ఇతర శిథిలాలు: హంపిలో మరికొన్ని శిథిలాలు కూడా ఉన్నాయి. ఐదారు భవనాలు ఇరానీ సాంప్రదాయంలో నిర్మించారు. అందులో ముఖ్యమైనది పద్మ మహల్. దసరా దిబ్బ, నాట్యశాల, ఆడియన్స్ హాలు ఇవన్నీ విరలాలయ సమీపంలోనే ఉన్నాయి. వీటి నిర్మాణంలో ఎలిఫెంటా గుహలలోని శిల్పకళా లక్షణాలు అనుసరించబడ్డాయి.

హంపిలోని లౌకికవాస్తువు: విజయనగరానికి నీళ్లు తీసుకురావడానికి తుంగభద్రానది మీద నిర్మించిన తిరుత్తు కాలువ కఠిన శిలల మీదుగా నిర్మించారు. ఇది ఆ నాటి ఇంజనీరింగు ప్రతిభకు నిదర్శనం.

రాణి స్నాన మందిరం: రాజభవనాలలో రాణి స్నాన మందిరం అద్భుతంగా నిర్మించారు. అది 50 అడుగుల పొడవు, 6 అడుగుల లోతు ఉంది. ఈ భవనం ముస్లిం సాంప్రదాయ పద్ధతులతో కమానులతో నిర్మించారు. కాని దాని ద్వారం రెండు నిలువు కమ్ముల మీద అడ్డదూలంతో హిందూ సాంప్రదాయ పద్ధతిలో నిర్మింపబడింది. రాణి స్నానఘట్టం నుండి నీళ్లు బయటికి వెళ్లడానికి పొడుగాటి రాతిగొట్టాలను ఉపయోగించారు.

దివాన్ ఖానా: అలాగే దివాన్ ఖానా కూడా ముస్లిం వాస్తువు ప్రకారం నిర్మించారు. కాని దాని గోడల మీద హిందూ విగ్రహాలు చెక్కారు.

గజశాల: అంతఃపురానికి తూర్పుగా దీర్ఘచతురస్రాకారంలో ఒక కట్టడం ఉంది. అందులో 11 గదులు ఎత్తుగా అర్ధగోళాకారంలో నిర్మించారు. మధ్య గదిపై గోపురం నిర్మింపబడి ఉంది. గోపురానికి రెండువైపులా మెట్లు ఉన్నాయి. మిగిలినవి అర్ధగోళాలు. అవి ఒకే విధంగా లేవు. రకరకాలుగా ఉన్నాయి. వాటిలో ఆరు అర్ధగోళాలు అండాకారంలో ఉన్నాయి. వాటి అంచులు రేకులుగా తీర్చబడ్డాయి. ఈ కట్టడం కూడా ఇండో సెరసినిక్ వాస్తు మిళితంగా ఉంది. కాని అందంగా హుందాగా కనిపిస్తుంది. ఇది ఏనుగుల శాల అని భావించారు. కాని ఈనాడు ఏనుగులను బంధించడానికి ఉపయోగించే ఇనప రింగులు, కడ్డీలు లేవు. ఇది ముస్లిం సాంప్రదాయంలో

నిర్మించారు. దాని కమానులు ఆర్చీ ద్వారాలతో నిర్మించారు. దాని కప్పు గుమ్మటం అంటే డోమ్ ఆకారంలో నిర్మించారు. ఈ కట్టడానికి ఉపయోగించిన రాళ్లు చాలా పెద్దవి. అవి 4 1/2 ×3×2 1/2 అడుగుల పరిమాణంలో ఉన్నాయి.

విజయనగర నిర్మాణాలలో 14, 15 శతాబ్దాలలో ఇండో పర్షియన్ వాస్తు లక్షణాలు లేవు. తళ్లికోట యుద్ధం తర్వాతనే ఈ లక్షణాలు ప్రవేశించినట్లు కనిపిస్తుంది. బహుశా అప్పటికి ముస్లిం ప్రభావం పెరిగిపోయి ఉండవచ్చును. పెనుగొండ, చంద్రగిరి నిర్మాణాలలో ఈ రీతి ఎక్కువగా ఉంది. ఇలాంటి వాస్తువు గల ఒక భవనం కదిరామాపురంలో ఉంది. కాని అది ఇంగ్లిష్ వారి ఘోరీ.

పద్మ మహల్ (Lotus Mahal): ఇది నేటికీ నిలిచి ఉంది. ఇది ఇండో-సెరసినిక్ వాస్తుశిల్పానికి మచ్చుతునక అని లాంగ్ హర్స్టు అన్నాడు. ఇది రెండంతస్థుల భవనం. కాని పరిమాణంలో చిన్నది. అడుగున అందమైన రాతి పునాది ఉంది. ఈ పునాది బాగా ఎత్తుగా ఉంది. మండపం అన్ని వైపులా తెరిచి ఉంది. స్తంభాలపై ఆర్చీలతో నిర్మించారు. ఆర్చీలపైన రెండవ అంతస్థు నిర్మించబడి ఉంది. స్తంభాలు దళసరిగా ఉన్నాయి. వాటిపై గచ్చు చేశారు. స్తంభాల అడుగు భాగం చదరంగా ఉంది. పై అంతస్థు కింది అంతస్థుకు నమూనా. కాని అది అన్ని వైపులా మూసి ఉంది. కాని కిటికీలు ఉన్నాయి. పైకి వెళ్లడానికి ఈశాన్య దిక్కున మెట్లు ఉన్నాయి. ఈ కట్టడంలో హిందూ సెరసినిక్ వాస్తువు మిళితం చేయబడింది. స్తంభాలు ఆర్చీలు సెరసినిక్ వాస్తువు కాగా, పునాది కప్పు రాతి అలంకరణలు హిందూ సాంప్రదాయంలో ఉన్నాయి. అక్కడికి దగ్గరలో ఉన్న అంతఃపుర భవనాలన్నీ శిథిలమయ్యాయి. కనుక ఈ ఒక్క భవనం మిగిలి ఉందంటే అది తర్వాత నిర్మించిన కట్టడం కావచ్చును అని డా। సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ కట్టడానికి మూలన కాపలా గోపురాలున్నాయి. దానికి దగ్గరలోనే ఏనుగులుండే శాల ఉంది. కనుక ఇది రాజ స్త్రీలు ఉండే భవనంగా కనిపించడం లేదు. అది శత్రువుల రాకను గమనించడానికి నిర్మించి ఉండవచ్చునని సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు.

రాజ వీధి: విజయనగరంలో రాజ వీధి 800 గజాల పొడవు, 35 గజాల వెడల్పుతో ఉండేదని, దానికి రెండు వైపులా అతిసుందరమైన భవనాలు నిర్మించారని, అవి చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండేవని పేస్ వర్ణించాడు. అవి మార్కెట్ భవనాలని భావించారు. ఈ భవనాల శిథిలాలు ఆనాటి విజయనగర పట్టణ వైభవానికి తార్కాణంగా నిలుస్తున్నాయి.

విజయనగరంలోని ఇతర ఆలయాలు - కృష్ణపుర శివలింగం - దత్తాత్రేయ లింగం - హంపి: హంపి ఆర్కలాజికల్ మ్యూజియం క్యూరేటర్ టి.సి.ఎం.కోట్రయ్య హంపి పక్కన ఉన్న కృష్ణపురంలోని ఉద్దాన వీరభద్ర ఆలయంలోని మూలలో ఒక అసాధారణమైన శివలింగాన్ని కనుగొన్నాడు. అక్కడ పూజారి అది దత్తాత్రేయలింగం అని చెప్పాడు. ఇలాంటి లింగం మరెక్కడా లేదు. ఇది త్రిభుజాకారంలో ఉన్న శివలింగం. ఈ లింగానికి మూడు వైపులు మాత్రమే ఉన్నాయి. మూడు వైపుల ఒక్కొక్క వైపు మూడు లింగాల చొప్పున మూడు వైపుల మొత్తం 9 లింగాలు చెక్కి ఉన్నాయి. ప్రతి వైపు కింద జంట లింగాలు ఉన్నాయి. ఈ జంట లింగాల చుట్టూ పద్మం చెక్కి ఉంది. పద్మంలో కొన్ని లింగాలకు వృత్తం, మరికొన్ని లింగాలకు త్రిభుజం, మరికొన్ని లింగాలకు చతుర్భుజం రేఖ గీసి ఉన్నాయి. పైభాగాలలో ఒక్కొక్కవైపు ఒక్కొక్క లింగం మాత్రమే ఉంది. పైభాగంలో ఉన్నటువంటి ఒక్కొక్క లింగం, కింది భాగంలో ఉన్నటు వంటి జంట లింగాలకంటే పెద్దది. ఆ మూడు లింగాలుకూ చుట్టూ వృత్తాలున్నాయి. మధ్యలో ఒక దానికి చతుర్భుజం, ఒక దానికి త్రిభుజం మరొక దానికి రెండు త్రిభుజాలు ఒకటి పైకి, ఒకటి కిందికి ఉన్నాయి. ఈ లింగాకారం వీరశైవులు షట్థల సిద్ధాంతంలో చెప్పిన అభూత సిద్ధాంతానికి చెందిన లక్షణాలతో ఉంది. ఈ లింగాల చుట్టూ ఉన్న పద్మాలు యోగశాస్త్రంలో చెప్పే కుండలినీ యోగంలో అష్టచక్రాలు అని అంటారు. ఈ విధంగా ఉన్న లింగాలను ఇష్టలింగాలు అని అనేవారట. ఇది హంపి శిల్పకళలలో ఒక ప్రత్యేకమైనదిగా భావింపబడింది. ఆ దేవాలయంలో క్రీ.శ.1547వ సంవత్సరానికి చెందిన ఒక శాసనం ఉంది. ఆ శాసనం నందళవాయు జంగమయ్య వేయించాడు. ఈ లింగానికి, ఆ శాసనానికి సంబంధం లేదు. అయినప్పటికీ ఈ దత్తాత్రేయలింగం క్రీ.శ.16వ శతాబ్దానికి చెందినదిగా భావించారు.

కోదండరామస్వామి ఆలయం: ఈ దేవాలయం చక్రతీర్థం వద్ద ఉంది. ఇది ఎప్పుడు నిర్మించిందీ తెలియదు. ఈ ఆలయంలో కోదండరాముడు, లక్ష్మణుడు, సీత విగ్రహాలు వారి పాదాల వద్ద హనుమంతుడి విగ్రహం ప్రతిష్ఠించి ఉన్నాయి. ఈ విగ్రహాలు నల్లరాతితో చేయబడ్డాయి. అవి బాగా పాలిష్ చేయబడ్డాయి. ఆగమ

శాస్త్రానుసారంగా విగ్రహాలు మలచబడ్డాయి. కొందరు ఈ ఆలయం హొయసాలుల నిర్మాణమని భావించారు కాని పలువురు ఇది విజయనగర నిర్మాణమనే భావిస్తారు.

ప్రసన్న విరూపాక్ష ఆలయం: ఇటీవల తవ్వకాలలో ఈ ఆలయం బయల్పడింది. ఇది భూమి లోపల నిర్మింపబడిన ఆలయం. ఈ ఆలయం చుట్టూ కందకం కూడా ఉంది. ఈ ఆలయం నిర్మాణంలో కళారూపానికన్నా ఇంజనీరింగ్ ప్రతిభకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇక్కడ ద్వారపాలకులు, స్తంభాల మీద తామరపువ్వుల శిల్పాలు తప్ప మరి ఎలాంటి శిల్పాలు లేవు. ఈ ఆలయం ఎప్పుడు నిర్మించిందీ, ఎవరు నిర్మించిందీ తెలియదు.

రంగనాథ ఆలయం: ఈ ఆలయాన్ని తిరుమల రాయలు మలయవంత పర్వతంపై నిర్మించాడు. అది అతి చక్కని ప్రదేశం. చుట్టూ పచ్చని చెట్లతో నిండి ఉంటుంది. ఇక్కడి స్తంభాలపై యాళివరుసలు చెక్కబడ్డాయి. కళ్యాణ మండపు ఫలకాల మీద చేపలు సముద్ర జంతువులు, పక్షుల చిత్రాలు చిత్రించబడ్డాయి. రామాయణగాథ ప్రకారం శ్రీరాముడు ఈ పర్వతంపై కొన్నాళ్లు నివసించాడు. అతడు అక్కడ ఉండగానే హనుమంతుడు లంక నుండి వచ్చి సీత జాడను చెప్పాడని ప్రతీతి.

విజయనగర పట్టణ పరిసరాలలోని ఆలయాలు - కమలాపురంలోని పట్టాభిరామాలయం: ప్రస్తుతపు హంపి శిథిలాలు కమలాపురం నుండి ప్రారంభమవుతున్నాయి. కమలాపురం పంపాస్థలంలోని విరూపాక్ష ఆలయానికి 6 కిలోమీటర్ల దూరంలో ఉంది. కమలాపురం అచ్యుతదేవరాయలు పట్టాభిరామాలయాన్ని నిర్మించాడు. ఈ ఆలయంలో ఒక ప్రత్యేకత ఉంది. యాళిశిల్పాలు కింది నుండి పైకి చెక్కబడ్డాయి. ఈ ఆలయంలో సున్నితమైన శిల్పాలు లేవు.

నాగలాపురంలోని అనంతశయన ఆలయం: హొస్‌పేట దగ్గరున్న నాగలాపురాన్ని శ్రీకృష్ణదేవరాయులు తన తల్లి అయిన నాగలాంబిక పేరుతో నిర్మించాడు. కొందరు నాగలాంబికను కృష్ణదేవరాయల ప్రియురాలని భావిస్తారు. నాగలాపురం విజయనగరం పట్టణానికి ఒక సరిహద్దుగా ఉండేది. అక్కడ రాయలు అనంతశయన ఆలయాన్ని ఆర్యావర్తశైలిలో నిర్మించాడు. ఈ ఆలయంలో రతిశాస్త్రంలో వర్ణింపబడిన విధంగా అందమైన శిల్పాలు చెక్కబడ్డాయి. ఈ ఆలయంలో ప్రతిష్టించడానికి నల్లనిరాతితో అనంతశయన విగ్రహాన్ని తయారు చేయించారు దానిని తయారు చేసిన దగ్గర నుండి దేవాలయం వద్దకు పొడుగాటి బండిపై తీసుకొని వస్తూ హోలాలు అనే ప్రదేశంలో వదలివేశారట. ఈ విగ్రహం ఆదిశేషునిపై పడుకొని ఉన్నట్లు తయారు చేయబడింది. ఈ ఆలయాన్ని రామరాయలు నిర్మించాడని, విగ్రహాన్ని హోలాలు దగ్గరకు తెచ్చేటప్పటికీ తళ్లికోట యుద్ధం ప్రారంభమైందని అది అశుభంగా భావించి ఆ విగ్రహాన్ని అక్కడే వదిలివేశారని ఒక కథ ప్రచారంలో ఉంది. ఫేస్ రచనల మీద ఆధారపడిన సీవెల్ ఈ ఆలయాన్ని కృష్ణదేవరాయలే నిర్మించాడని స్పష్టంగా రాశాడు. కృష్ణవస్ డిఫిగ్యురెడో అనే పోర్చుగీసు ఇంజనీరు హోస్‌పేట వచ్చినప్పుడు కృష్ణదేవరాయలు అతనిని అక్కడ కలుసుకొని మాట్లాడి తిరిగి హంపికి వచ్చే సందర్భంలో ఈ ప్రదేశంలో దేవాలయం నిర్మించాలని చెప్పి సంకల్పం కలిగి అక్కడ ఈ అనంతశయన ఆలయాన్ని నిర్మించాడని సీవెల్ వివరించాడు. ఇది వాస్తవమైనట్లయితే అందులో దేవతా విగ్రహాన్ని తళ్లికోట యుద్ధం తర్వాత ముస్లింలు నాశనం చేసి ఉండవచ్చును. రామరాయలు ఈ ఆలయాన్ని నిర్మించాడని భావించేకన్నా కృష్ణదేవరాయలు నిర్మించాడని అనడమే సమంజసంగా ఉంటుంది. ఇప్పుడు ఆలయాలలో ఉన్న విగ్రహం అలాగే ఉండగా అనంతశయన విగ్రహం ఒక్కదాన్నే ఎందుకు నాశనం చేశారో తెలియదు. ఇది ఒక విలక్షణమైన ఆలయం. ఈ ఆలయపు విమానం చాలా పెద్దది. దీర్ఘచతురస్రంగా ఇటుకలతో నిర్మించబడి ఉంది. దీనిపై ఉన్న శలశిఖరం కూడా చాలా పెద్దది. విమానం ఎదురుగా పెద్ద స్తంభాల మండపం దానికి రెండువైపులా మరో రెండు చిన్నమండపాలు ఉన్నాయి. ప్రాంగణంలో దేవీ ఆలయం ఉంది. ప్రాంగణం చుట్టూ ప్రాకారం దానిపై పెద్ద గోపురం ఉంది. ఈ ఆలయం అనంతశయన విష్ణుమూర్తికి ఇవ్వబడింది. కాని ఇప్పుడు విగ్రహంలేదు. కాని ఇది చాలా పెద్ద విగ్రహం అని అక్కడి ఏర్పాటు తెలుపుతోంది. గర్భగుడిలో మూడు ద్వారాలున్నాయి. అంతరాళం నుండి మూడు ద్వారాల గుండా దేవుని శిరస్సు, దేహం, పాదాలు చూడవచ్చును. అంటే దేవుని విగ్రహం ఎంత పొడవు ఉండేదో ఊహించుకోవచ్చును. ఇది విజయనగర కాలం నాటి శాలశిఖరం ఉన్న దేవాలయాన్నింటిలోకి అతి పెద్ద ఆలయం. అనంతశయన శిల్పం ఉండవల్లి గుహలోను, కంచి తీర దేవాలయంలోను ఉన్నాయి. వాటిని అనుసరించి ఈ ఆలయం నిర్మించి ఉండవచ్చును.

తమిళనాడు, కేరళ ఆలయాలు - రాయవెల్లూరు జలకంఠేశ్వర ఆలయం: తమిళనాడు అనాది నుంచి

గొప్ప ఆలయాలకు ప్రసిద్ధి. వాటిలో కొన్నింటికి నూతన అంగాలు చేర్చారు. అంతేగాక తమిళనాడులో కూడా విజయనగర చక్రవర్తులు కొన్ని నూతన ఆలయాలను కూడా నిర్మించారు. చివరి దశలో వారికి ఆర్కాటు జిల్లాలోని రాయవెల్లూరు రాజధానిగా ఉంది. చివరి విజయనగర చక్రవర్తి మూడవ శ్రీరంగరాయలు ఇక్కడే నివసించాడు. వెల్లూరులో వారు అనేక దేవాలయాలు నిర్మించారు. వానలో జలకంఠేశ్వర ఆలయం చాలా ప్రముఖమైనది. ఇంకా అక్కడ చిన్న ఆలయాలు చాలా ఉన్నాయి. ఈ ఆలయాలలోని కళ్యాణ మండపం గొప్ప శిల్పకళా నిలయం. సింహాలు, గుర్రాలు గంతులు వేస్తున్నట్లు చిత్రించబడ్డాయి. స్తంభాల పైభాగాన పావురాళ్లు, మర్కటాలు చిత్రించారు. అక్కడ రాతి గొలుసును కూడా చెక్కారు. మార్గసహాయేశ్వర ఆలయంలో కూడా గొప్ప శిల్పసంపద ఉంది. కంచి కామేశ్వర ఆలయానికి వేయిస్తంభాల మండపం, ఒక గోపురం నిర్మించారు. వరదరాజు పెరుమాళ్ ఆలయంలో నూరు స్తంభాల మండపాలు నిర్మించారు. ఒక మండపం మూలన కిందికి వేలాడే రాతి గొలుసు ఉంది. అణ్ణామలై, చిదంబర, కుంభకోణం, శ్రీరంగాల దేవాలయాలకు పెద్ద పెద్ద గోపురాలు నిర్మించారు. వీటిని రాయగోపురాలు అని అంటారు. శ్రీ రంగంలో రంగనాథుని దేవాలయంలో శేషగిరి మండపం నిర్మించారు. అందులో అశ్వదర్బారు అనే పేరుతో అనేక అశ్వాలను మలిచారు. అవి ఉక్కుతో పోతపోసిన వాని లాగా ఉన్నాయి. అవి నాలుగు గజాల ఎత్తుకు ఎగిరి పోరాడుతున్నట్లు అద్భుతంగా రూపొందించారు. అలాంటి గుర్రాల చిత్రాలు భారతదేశంలో ఎక్కడా చెక్కలేదు. విజయనగర యుగంలో శిల్పాలలో గుర్రాలకు అలాంటి ప్రాధాన్యత ఇవ్వడానికి కారణం వారు బహమనీలతో చేసిన యుద్ధాలలో గుర్రపు దళానికి ఉన్న ప్రాముఖ్యతను వారు బాగా గుర్తించినట్లు కనిపిస్తుంది. స్తంభాల కింద గుర్రాలు పైకిలేచినట్లు అనేక దేవాలయాలలో చిత్రించారు. యుద్ధాల వల్ల ఆనాడు. కదనుతొక్కే ఆవేశాన్ని గుర్రాల శిల్పాల ద్వారా వారు ప్రకటించారు. కేరళ రాష్ట్రంలో కూడా వీరి కాలం నాటి అనేక దేవాలయాలు నిర్మింపబడ్డాయి. అక్కడ వారి సామంతులు నిర్మించారు. ఈ విధంగా విజయనగర చక్రవర్తులు దక్షిణ దేశమంతా దేవాలయాలు నిర్మించి భారతీయ శిల్పకళకు అమోఘమైన సేవ చేశారు.

విజయనగర శిల్పం: విజయనగర శిల్పకళలో వాస్తువుతోపాటు అద్భుత శిల్పాలను కూడా రూపొందించారు. విజయనగర శిల్పాలలో చెప్పుకోదగిన మొట్టమొదటి శిల్పం హంపిలోని ఉగ్రనారసింహ విగ్రహం. ఇది 22 అడుగుల ఎత్తయిన విగ్రహం. చూడటానికి చాలా భయంకరంగా ఉంటుంది. ఈ విగ్రహానికి దేవాలయం లేదు. బహిప్రదేశంలో ప్రతిష్టించబడి ఉంది. విగ్రహం నెత్తిపై 7 తలల పాము ఆకారం చెక్కి ఉంది. పాము తలకు ఆధారంగా కింది నుంచి స్తంభాల రెండు వైపులా రాతి చెక్కడం కూడా ఉంది. ఉగ్రనారసింహుని నోరు చాలా పెద్దది. చూపరులకు భీతి కలిగేటట్లు ఉంది. తర్వాత చెప్పుకోదగినది గణేషుని విగ్రహం. ఇది పెద్దదిగా ఉండటమేగాక సుందరంగా రూపొందించబడింది. విఠలాలయంలోని ఏకశిలా రథం కూడా గొప్పశిల్పం. ఇవి ఏకశిలా నిర్మాణాలు. వాక్‌స్టాఫ్ అనే పండితుడు విజయనగర శిల్పసంపదకు సాటిలేదని అన్నాడు.

స్తంభాలపై శిల్పాలు: విఠల్‌స్వామి ఆలయంలోని ప్రతి స్తంభం ఒక శిల్పకళాఖండం. స్తంభాల మధ్యలో ప్రతి స్తంభం మీద అద్భుతమైన శిల్పం చెక్కి ఉంది. అక్కడి సప్తస్వర స్తంభాలు కూడా గొప్ప కళాఖండాలు. అందులో సరిగమలు పలుకుతాయని అంటారు. అలాగే కృష్ణస్వామి ఆలయపు స్తంభాలు మూడు భాగాలుగా చేయబడ్డాయి. కింది భాగం చదరంగా నాలుగు ఫలకాలతో ఉంది. నాలుగు ఫలకాలపై శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ భాగంపైన స్తంభం గుండ్రంగా రూపొందించబడింది. ఈ నాలుగు ఫలకాలపైన కూడా శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. హజారా రామస్వామి ఆలయపు గోడల వెలుపలి భాగం మీద అర్ధశిల్పాలు చెక్కబడ్డాయి. అలాగే దసరా దిబ్బ వేదిక నాలుగు పక్కల కూడా అద్భుత శిల్పాలు చెక్కబడ్డాయి. ఇక్కడి నాట్యకత్తెలు వాయిద్యగాండ్ర శిల్పాలు ఉన్నాయి. హంపి రాణులు నాట్యం నేర్చుకొనే నాట్యశాలలో ప్రతి స్తంభం మీద నాట్యభంగిమల శిల్పాలున్నాయి. పైన కప్పు వద్ద స్తంభాల మధ్య ఫలకాలున్నాయి. ఆ ఫలకాలపై అనేక నాట్యభంగిమలలో నాట్యకత్తెల బొమ్మలు అద్భుతంగా చెక్కారు.

నాగాలాపురం దగ్గర ఉన్న అనంతశయన ఆలయంలోని అనంతశయన విగ్రహం గొప్ప శిల్పం. ఇటీవల కమలాపురంలో అనేక విజయనగర కాలం నాటి విగ్రహాలు బయల్పడ్డాయి. అందులో అనేక నాగిని విగ్రహాలు ఉన్నాయి. ఈ నాగిని విగ్రహాలు నడుం దగ్గర నుండి కింద సర్ప శరీరం, నడుం దగ్గర నుండి పైన స్త్రీ శరీరం, ఆ స్త్రీకి తలపైన 7 తలల సర్పం పడగ బట్టినట్లు చెక్కి ఉన్నాయి. కొన్ని నాగిని విగ్రహాలు తలపై పాము పడగలు కాకుండా మకర తోరణం ఉంది. నడుం నుండి కింద భాగం పాము రూపంతో ఉంది.

మకర తోరణం: కమలాపురంలో ఒక అద్భుతమైన మకర తోరణం లభించింది. ఈ తోరణం చాలా పొడవు ఉంది. తోరణం కింద వేదిక నుండి పైభాగం వరకు మొత్తం శిల్ప సమన్వితం, మధ్యలో నటరాజ నాట్యం చేస్తున్నాడు. ఆయనకు 8 చేతులున్నాయి. ఆయనకు రెండువైపులా రెండు స్తంభాలున్నాయి. స్తంభాలపైన గుండ్రని వేదిక ఉంది. ఆ వేదికలపై దేవాలయ మంటపాలున్నాయి. ఆ మంటపాలలో దేవతా విగ్రహాలున్నాయి. మంటపాల పైకప్పుల మీద శిఖరాలున్నాయి. విమానాలపైన తోరణాలున్నాయి. ద్వారపాలుర విగ్రహాల తర్వాత కూడా ఈ తోరణం ఇంకా పొడవుగా పెరిగి ఉంది. వానిపై కూడా అద్భుత శిల్పాలు చెక్కి ఉన్నాయి. ఈ తోరణం ఒకవైపు విరిగి ఉంది. అయినప్పటికీ చూపరులకు మనోహరంగా కనిపిస్తోంది.

రాజ విగ్రహాలు: భారతీయ శిల్పంలో రాజుల శిల్పాలు తక్కువ అని డాక్టర్ స్మిత్, జెపిహెచ్ వోగల్ వ్యాఖ్యానించారు. కాని విజయనగర యుగంలో రాజులు, ఇతర ఉన్నతోద్యోగులు విగ్రహాలు చెక్కించుకున్నారు. వీరి కాలం నాటి శిల్పాలలో మొదటిది ఇరుగప్ప విగ్రహం. అతడు బుక్కరాయల ఆస్థాన ఉద్యోగి జైనుడు. అతడు తిరువరుతికున్రమ్ ఆలయంలో తన విగ్రహాన్ని వేయించుకున్నాడు. అతడు దేవునికి నమస్కరిస్తున్నట్లు చెక్కి ఉంది. అతడు మానవసేవలో నిమగ్నమై కనిపిస్తాడు. అతనికి కింది వస్త్రం ఉంది గాని పైన లేదు. జుట్టు ముడి ఎడమవైపుకు వాలి ఉంది. హంపిలోని హనుమాన్ ఆలయంలో మల్లికార్జున రాయల విగ్రహం ఉంది. అక్కడి విగ్రహం కింద ఉన్న శాసనం అది మల్లికార్జున రాయల విగ్రహం అని తెలుపుతుంది. ఈ ఆలయాన్ని అతని ఉద్యోగి శ్రీరంగ నిర్మించాడు.

కృష్ణదేవరాయల విగ్రహాలు: నరసరాయల, శ్రీ కృష్ణదేవరాయల నిలువెత్తు విగ్రహాలు చూశానని పేస్ రాశాడు. నరసనాయకుని విగ్రహాలు కనిపించలేదు గాని కృష్ణదేవరాయలు ఆయన దేవేరుల విగ్రహాలు నాలుగు ప్రదేశాలలో ఉన్నాయి. హంపిలోని విఠల్‌స్వామి దేవాలయపు గోడ దగ్గర వారి రాతి శిల్పాలు ఉన్నాయి. మధ్యలో కృష్ణదేవరాయలు రెండువైపులా ఆయన దేవేరుల శిల్పాలున్నాయి. కాని ఈ శిల్పాలకు తలలులేవు. అవి నల్లని రాతితో రూపొందించబడ్డాయి. ఇవి ఇటీవల తవ్వకాలలో బయల్పడ్డాయి. ఇవి తులాభార ఎడమస్తంభం కింద ఉన్నాయి. రాయవెల్లూరులోని వైకుంఠపెరుమాళ్ ఆలయ ప్రాంగణంలోని కళ్యాణమండపంలోని ప్రధాన స్తంభం మీద కృష్ణదేవరాయలు, అతని ముగ్గురు రాణుల శిల్పాలు చెక్కబడ్డాయి. తిరుమల ఆలయంలో ముఖద్వారం దాటి లోపల అడుగు పెట్టగానే కుడిచేతివైపు గోడవద్ద కృష్ణదేవరాయలు, ఆయన ఇద్దరి భార్యల కంచు విగ్రహాలు ప్రతిష్టించబడి ఉన్నాయి. మధ్యలో కృష్ణదేవరాయలు చేరి ఒకవైపున ఆయన భార్యల విగ్రహాలున్నాయి. ఆ విగ్రహాలపై తిరుమల డివియర్ చిన్నా డివియర్ అని కన్నడ భాషలో వారి పేర్లు చెక్కబడ్డాయి. ఇక్కడి చిదంబరం ఉత్తర గోపురానికి పశ్చిమంగా ఉన్న గూడులో కృష్ణదేవరాయల విగ్రహం ఉంది. అమరావతిలో కృష్ణదేవరాయల శాసనం ఉన్న రాయి కూడా ఇటీవల కనుగొనబడింది. తిరుపతిలో వెంకటపతిరాయల విగ్రహం కూడా ఉంది. అతని విగ్రహం పక్కన అతని తండ్రి తిరుమలరాయలు, తల్లి వెంగమాంబ విగ్రహాలు కూడా ఉన్నాయి. ఇవన్నీ విజనయనగర కాలంనాటి శిల్పకళా ప్రాభవాన్ని తెలుపుతున్న శిల్పాలుగా నేటికీ నిలిచి ఉన్నాయి.

చిత్రకళ: విజయనగర యుగంలో పురాణాలలో వర్ణించిన దృశ్యాలను తమ గృహాల గోడల మీద, రాచభవనాల మీద, దేవాలయాల గోడల మీద చిత్రించడం ఆనవాయితీగా ఉండేది. హంపి విరూపాక్ష ఆలయపు మహారంగ మంటపంలో కప్పు మీద హిందూ పురాణ గాథలను 13 వరుసలలో త్రిమూర్తులు తమ దేవేరులతో సింహాసనాలపై కూర్చున్నట్లు చిత్రించారు. తర్వాత వరుసలో విరూపాక్షుడు పంపాదేవి వివాహ దృశ్యాలున్నాయి. తర్వాత మదన విజయం, త్రిపురసంహారం, విష్ణుమూర్తి దశావతారాలు, శ్రీ రాముడు శివధనస్సును విరిచి సీతను పరిగ్రహించడం ఉన్నాయి. తర్వాత అర్జునుడు మత్స్యయంత్రాన్ని ఛేదించి ద్రౌపదిని పొందటం ఉంది. చివరి వరుసలో రాచమార్యాదతో పల్లకీలో వెళ్లే కాషాయాంబరధారి ఉన్నాడు. ఈ చిత్రాన్నే విద్యారణ్యుల చిత్రంగా గుర్తించారు. విద్యారణ్యుని పల్లకి వెనుక గుర్రం అద్భుతంగా చిత్రించారు.

విజయనగర చిత్ర లేఖనం: ఈనాడు విజయనగర చిత్రకళను చాటే చిత్రాలు హంపిలోని ఏ దేవాలయంలోనూ లేవు. కాని అనెగొంది రాజ ప్రాసాదంలో కొన్ని చిత్రాలున్నాయి. కాని అవి చాలా మొరటుగా ఉన్నాయి. అవి బెంగాలులో ఉండే కుండలపై వేసే చిత్రకళ లాగా ఉన్నాయి. ఇంకా విజయనగర చిత్రకళను చాటే చిత్రాలు ఈనాడు లేపాక్షిలోని (క్రీ.శ.1535) పాపనాశేశ్వర ఆలయం, చిత్తూరు జిల్లా మదనపల్లి తాలూకాలోని సోమపల్లి (క్రీ.శ.1550)లోని చెన్నకేశవ ఆలయం, కంచిలోని వరదరాజస్వామి ఆలయం, హంపిలోని హజారా

రామస్వామి ఆలయాలలోని రామాయణ చిత్రాలు, తొండాద సిద్ధలింగేశ్వర ఆలయంలోని శైవపురాణ చిత్రాలు, తిరుప్పనకుండ్రంలోని వర్ధమాన జైన ఆలయంలోని జైన చిత్రాలు ఈ కాలం నాటివి. ఇవన్నీ అజంతా ప్రెస్కో విధానంలో చిత్రించారు. సహజ సిద్ధమైన రసాల జిగురులను సున్నపునీటిలో కలిపి రంగులు సృష్టించారు. ఈ కాలంలో ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ రంగులు ఎక్కువగా వాడారు. ఇవి చిత్తన్నవాసల్, మామ్మండూర్, ఎల్లోరా, తంజావూరు చిత్రకళకు భిన్నంగా ఉన్నాయి. ఇవి సగం కుంద చిత్రకళ, సగం జైన శిల్ప లక్షణాలతో ఉంది. అందువల్ల అవి విజయనగర కాలపునాటి స్వచ్ఛమైన చిత్రకళా రూపాలను తెలపడం లేదు. అయినప్పటికీ మొగల్ కాలం నాటి చిత్రకళ కంటే ఉన్నతంగా ఉన్నాయి. నటరాజ శివుడు, దక్షయజ్ఞం, పార్వతి ఖండరూపాలతో ఉన్న శివుడు, గౌరీ కళ్యాణం, వటపత్రశాయి, సీతారామ కళ్యాణం మొదలైన లేపాక్షి చిత్రాలు దక్షిణ భారతదేశపు కాంశ్య నటరాజులు, ఎలిఫెంటా శిల్పాలలో ఉన్న జీవకళ పరిపక్వత ఈ చిత్రాలలో లేవు. అవి కాశ్యపు శిల్పశాస్త్రం ప్రకారం రూపొందించాయి. జిన కంచిలోని వర్ధమానుని ఆలయంలోని జైన చిత్రాలు రెండవ దేవరాయల కాలం నాటివి. ఏమైనప్పటికీ విజయనగర చిత్రకళ కూడా కృష్ణదేవరాయల కాలం నాటికి తారాస్థాయికి చేరింది. తర్వాత క్రమేపి క్షీణించింది. ఆరవీటి యుగంలో విజయనగర ఆస్థానంలోకి పోర్చుగీసు చిత్రలేఖనం ప్రవేశించింది. క్రీ.శ.1584-1614 సంవత్సరాల మధ్య పాలించిన రెండవ వెంకటపతిరాయల కాలంలో అతని ఆస్థానంలోకి అనేక మంది పోర్చుగీసు చిత్రకారులు దిగుమతయ్యారని Frdu Jarnc అనే విదేశస్తుడు పేర్కొన్నాడు. తల్లికోట యుద్ధం తర్వాత విజయనగర ప్రభువులు చిత్రకళాకారులకు తగిన పోషణ ఇవ్వలేకపోయారు. అందువల్ల వారి కాలం నాటి చిత్రకళ అంతరించింది. దాని స్థానంలో విదేశీ చిత్రకళ ప్రవేశించింది. రెండవ వెంకటపతిరాయలు జేసూట్ చిత్రకారుడిని చంద్రగిరికి పంపారు. అతడు క్రీ.శ.1602 వరకు రాయల ఆస్థానంలో ఉన్నాడు. తర్వాత 1607లో లేబ్రదర్ బార్థలేమియా పోతేబోనా అనే మరొక చిత్రకారుడిని పంపారు. అతడు గొప్ప చిత్రకారుడు. అతని చేత వెంకటపతిరాయలు తన చిత్రాన్ని గీయించుకున్నాడు. అతడు 1611 వరకు రాయల ఆస్థానంలో ఉన్నాడు. ఒక పోర్చుగీసు చిత్రకారుడు గీసిన మేరీమాత చిత్రం వెంకటపతిరాయలను ఎంతగానో ఆకట్టుకుందట. అతడు దానిని తీసుకొని రాయవెల్లూరులో తన దర్బారు హాలులోని గోడకు అలంకరించాడట. కొందరు ఆస్థాన ఉద్యోగులు అభ్యంతరం చెప్పినా కూడా అతడు దానిని తొలగించలేదట.

పరమశివన్ అనే పండితుడు విజయనగర చిత్రకళను మూడు తరగతులుగా విభజించాడు. అవి -

1. పేస్ విజయనగరాన్ని దర్శించినప్పుడు ఉన్న చిత్రాలు అనెగొంది, హంపిలలో విరూపాక్ష దేవాలయాలలోని చిత్రాలు. ఇవి కృష్ణదేవరాయల కాలం నాటివి.
2. లేపాక్షి, సోంపల్లిలోని చిత్రకళ. ఇది కృష్ణదేవరాయల తర్వాత కాలానికి చెందినది. ఈ రెండు తరగతులకు పెద్ద భేదం ఉండకపోవచ్చునని డాక్టర్ నేలటూరి వెంకటరమణయ్య వ్యాఖ్యానించారు. వీటిలో మొదటి తరగతి చిత్రాలు కొన్ని ఆనెగొందిలో ఉన్నాయి, కాని విరూపాక్ష ఆలయంలో లేవు. బహుశా శతాబ్దాలుగా ఆ దేవాలయంలో నూతన చిత్రాలు వేస్తూ వస్తున్నందువల్ల మొదటి దశకు చెందిన చిత్రాలు అదృశ్యమై ఉండవచ్చును.
3. రెండవ వెంకటపతిరాయల కాలం నాటికి చెందినవి. వీటితోపాటు తంజావూరు మధుర నాయకరాజుల కాలం నాటి చిత్రాలు. ముఖ్యంగా క్రీ.శ.1646వ సంవత్సరానికి చెందిన విజయరాఘవ నాయకుని కాలానికి చెందిన తంజావూరు బృహదీశ్వరాలయంలోని చిత్రాలు, ఇంకా త్రిమూర్తుల అవతారాల చిత్రాలు. ఇవన్నీ మూడవ దశకు చెందినవి. నాయకరాజుల కాలం నాటికి చెందిన చిత్రాలు చోళుల కాలం నాటి చిత్రకళకు ధీటురావు. చోళ చిత్రకళ స్థాయి దిగజారింది.

సాధారణంగా చిత్రకళ అశాశ్వతమైంది. అది త్వరగా పోతుంది. భారతీయ శిల్పులు తమ శిల్పాలకు రాళ్లను వాడి అవి శాశ్వతంగా ఉండాలని ఆకాంక్షించారు. చిత్రకళలో అది సాధ్యం కాదు. కాని సాధ్యమైనంత వరకు సుదీర్ఘకాలం ఉండేటట్లు చిత్రకళలో వర్ణలేపనాలు వాడారు. ముఖ్యంగా అజంతా గుహలలోని వర్ణచిత్రాలు చాలా కాలం నిలిచి ఉన్నాయి. కాని విజయనగర చిత్రకారులు అలాంటి వర్ణలేపనాలను వాడలేదు. అందువల్ల అవి త్వరగా అంతరించిపోయాయి.

శృంగార జీవితం - చిత్రకళ: విజయనగర కాలంలో వాత్స్యాయనుడు తన కామసూత్రాలలో చెప్పిన శృంగార జీవితం అద్భుతంగా వెలిగింది. రాణివాసం, అక్కడి పూదోటలు, రాణులు అంతఃపురంలోని రాణుల

స్నానవాటికలు గమనిస్తే వారు విలాస సరస శృంగార జీవితాలు గడిపారని బోధపడుతుంది. అంతేగాక వారి గృహాల గోడలపై శృంగార చిత్రాలు చిత్రించుకొనేవారు. ముఖ్యంగా వేశ్యాగృహాలలో రతిబంధనాలు చిత్రించేవారట. ఇంకా రతీమన్మధులు, రంభ నలకూబరులు, ఊర్వశి పూరూరవులు, మేనక విశ్వామిత్రులు, గోపికలు, శ్రీకృష్ణుడు చిత్రాలు చిత్రించే వారిని నాటి సాహిత్యంలో వర్ణనలున్నాయి. ఈ వర్ణనలు వైష్ణవమత ప్రాబల్యాన్ని కూడ తెలుపుతున్నాయి.

సంగీతం: విష్ణు ధర్మోత్తర అనే గ్రంథంలో మూడవ భాగంలో మార్కండేయుడు ఇలా చెప్పారు కళలన్నింటికీ నాట్యం వేదిక కాని అది సంగీతంలో మిళితమై ఉంటుంది. సంగీతం లేనిదే నాట్యం లేదు ఈ రెండూ ఒకదాంతో ఒకటి మిళితమై విడదీయరాని బంధం కలిగి ఉన్నాయి. సంగీతం భావోద్రేకాలను వెలువరిస్తుంది. ఆ భావోద్రేకాలకు నాట్యం అంగిక భౌతిక రూపాన్ని ఇస్తుంది. అంతేగాక సంగీతం సవ్యంగా అర్థం కావాలంటే పాటపాడే నియమాలు కూడా స్పష్టంగా తెలిసి ఉండాలి. కారణమేమిటంటే సర్వకళల సారాంశం Rhythm యొక్క భావాన్ని అందాన్ని ప్రదర్శించటమే. ఇది నాట్యంలోకన్నా సంగీతంలోనే బాగా తెలియజేయబడుతుంది. ఇలాంటి సంగీతం విజయనగర కాలంలో బాగా అభివృద్ధి చెందింది.

క్రీ.పూ.100 నుండి క్రీ.శ.1450 వరకు అంటే సుమారు 15 శతాబ్దాలు భారతదేశంలో అన్ని ప్రాంతాలలో భరతనాట్యం మంచి ప్రాచుర్యంలో ఉంది. దాంతోపాటు నందికేశ్వరుడు దతిల (బృహద్‌దేశి) కోహల, ప్రాశ్వదేవ సంగీతకార (సంగీత సమయసార), జాయపసేనాని నృత్యరత్నావళి, నాట్యమంజరి, సర్గనదేవ (సంగీత రత్నాకర), విద్యారణ్య మాధవాచార్యుని సంగీతసార, సర్వజ్ఞ సింగణ సంగీత సుధాకర, పెదకోమటి సంగీత సుధామణి, వైశ్రాయ్ సాళువ గోపతిప్ప రాసిన తాళదీపిక, దేవన్నభట్టు రాసిన సంగీత ముక్తావళి మొదలైన నాట్యశాస్త్ర గ్రంథాలు ఉన్నప్పటికీ భరతుని నాట్యగ్రంథానికి సరైన వ్యాఖ్యానం ఎవరూ రాయలేదు. వీరిలో సర్గనదేవుని (క్రీ.శ.1220) సంగీత రత్నాకరం భరతుని నాట్యశాస్త్రానికి వివరణ అయి ఉండవచ్చును. కాని అది కూడా స్పష్టంగా లేదు. కాని అది కూడా స్పష్టంగా కావలసివచ్చింది. విజయనగర రాజైన ఇమ్మడి దేవరాయల చేత పోషింపబడిన చతుర కల్లినాథుడు సంపూర్ణమైన సంగీత రత్నాకరానికి క్రీ.శ.1490వ సంవత్సరంలో సంపూర్ణమైన వ్యాఖ్యను రాశాడు. కల్లినాథునకు కల్లమాత్య, కొల్లరస అని కూడా పేర్లున్నాయి. ఇతని వ్యాఖ్యానంలోనే మొట్ట మొదటిసారిగా మేళ పద్ధతిపై రాగాలు వర్గీకరింపబడ్డాయి. ఈ విభజన శాస్త్రీయంగా జరిగి మేళ పద్ధతులు ప్రత్యేకమైన రాగ గ్రూపులుగా అభివృద్ధి చెందాయి. అంతకు పూర్వం రాగ పద్ధతులు మాధ్యమ గ్రామ, షద్యమ గ్రామ అనే రెండు పద్ధతులుగా ఉండేవి. వీనికి గ్రామపద్ధతులుగా పేరుండేది. సంగీత విద్వాంసులు రాగాలను ఈ రెండుపద్ధతుల్లో మిళితంచేసి పాడుతూ ఉండేవారు. కల్లినాథుడు శాస్త్రీయ పద్ధతులపై రాగాలు విభజించినందువల్ల సంగీత శాస్త్రానికి నూతన రూపం రావడమే గాక గ్రామ పద్ధతుల కాలం నాటి రాగాలకు కూడా కొత్తపదజాలం ఏర్పడి నశించిపోకుండా నిలబడింది. కల్లినాథుడు తన విధానానికి మేళ పద్ధతి అని పేరు పెట్టాడు.

సాళువ తుళువ వంశాల కాలంలో అనేక సంగీత గ్రంథాలు రచించినట్లు కనిపిస్తోంది. కానీ అందులో రెండు మాత్రమే లభ్యమయ్యాయి. శ్రీకృష్ణదేవరాయల సంగీత గురువైన బంధ్యం లక్ష్మీనారాయణ రాసిన సంగీత సూర్యోదయం క్రీ.శ.1550వ సంవత్సరంలో రామామాత్య తోడరమల్ల అనే రాష్ట్రపాలకుడు రచించిన స్వరమేళా కళానిధి అనే రెండు గ్రంథాలు మాత్రం లభించాయి. రామామాత్యుడు పుండరీక విఠలుని సమకాలికుడు. అతదు 1510-1525 సంవత్సరాల మధ్య సద్రచంద్రోదయ, 1525-1540 సంవత్సరాల మధ్య రాగమంజరి, 1540-1555 సంవత్సరాల మధ్య రాగమాల, 1555-1564 సంవత్సరాల మధ్య నటన నిర్ణయ అనే సంగీత గ్రంథాలు రాశాడు. వీనిలో మొదటి రెండు గ్రంథాలు ముఖ్యమైనవి. అందులో మొదటి దానిలో మేళ ప్రస్తారాలను గురించి కల్లినాథుని సూత్రాలతో అన్వయం చేస్తూ రచించాడు. రెండవదైన రాగమంజరిలో మేళాలను గురించి నిర్వచనాలు చేశాడు. అతడు సుమారు 90 మేళాలను నిర్వచించి వాటికి రాగాలను నిర్ణయించాడు. అతని కాలం నాటికి ఆచరణలో ఉన్న పద్ధతులన్నింటికీ ఒక రూపం ఇచ్చాడు. ఇతడు కన్నడిగుడు అయినప్పటికీ కర్ణాటక చక్రవర్తి అయిన కృష్ణదేవరాయలు అతన్ని ఆదరించలేదు. అందువల్ల అతను ఢిల్లీ వెళ్లిపోయాడు. అతనిని మొగల్ చక్రవర్తులు ఆదరించారు. అతని వద్దనే మొగల్ ఆస్థాన విద్వాంసులైన గోపల్‌నాయక్ మరియు తాన్‌సేన్‌లు సంగీతం నేర్చుకున్నారు. కర్ణాటక సంగీతంలో పూర్వీకులైన భరతుడు, సర్గనదేవుడు, కల్లినాథుల గ్రంథాలలో లేవు.

వెంకటమచిన్ అనే అతడు తంజావూరు నాయకరాజుల ఆస్థానంలో ఉండి చతుర్దండి ప్రకాశిక అనే

సంగీత కావ్యాన్ని రాశాడు. ఇతడు సంగీతసుధను రాసిన గోవిందదీక్షితుని కుమారుడు. వెంకటమచిన్ సంగీత గ్రంధాన్ని చాలా మంది పండితులు అంగీకరించలేదు. కారణమేమిటంటే అందులో చాలా భావాలు ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయని భావిస్తారు. ఇతడు 72 మేళాలు ఉన్నాయని భావించారు. అందులో కూడా రామామాత్యుని శృతి భావాలను మాత్రమే అంగీకరించాడు. ఇతని భావాలు పుండరీక విఠలుని సూత్రాలకు కూడా విరుద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ దక్షిణ భారతదేశం సంగీత వెంకటమచిన్ సంగీత శాస్త్రాన్నే అనుసరిస్తోంది. విద్వాన్ కృష్ణాచార్య 162 మేళాలున్నాయని ప్రకటించాడు. కాని అవి పరిగణనలోకి తీసుకోలేని విధంగా ఉన్నాయి.

తుళువ యుగం నుండి దక్షిణ భారతదేశ సంగీతం తన రూపురేఖలను దిద్దుకున్నట్లు కొందరు పండితులు భావించారు. విజయనగర రాజుల ప్రోత్సాహంతోనే పైగ్రంధాలు వెలువడ్డాయని వారు భావించారు. అంతేగాక కృష్ణదేవరాయలు అచ్యుత దేవరాయలు స్వయంగా సంగీతం నేర్చుకోవడమే గాక అంతఃపుర కాంతలను కూడా సంగీతం నేర్చుకోడానికి అనుమతించారు. శ్రీకృష్ణదేవరాయలు మధ్వగురువైన రాఘవేంద్రుని పూర్వీకుడైన కృష్ణ వద్ద వీణావాయిద్యం నేర్చుకున్నాడు. అంతఃపుర స్త్రీలకు సంగీతాన్ని నేర్పడానికి లక్ష్మీనారాయణుని నియమించాడట. అతడే సంగీత సూర్యోదయాన్ని రాసిన వాడు. అచ్యుత దేవరాయలు రామామాత్యుని సంగీత ప్రజ్ఞకు మెచ్చి అతనిని కొండవీటి పాలకునిగా నియమించాడు. అతడు సర్వమేళ కళానిధిని రాశాడు. రామరాయల కాలంలో కూడా రామామాత్యుడు జీవించాడు. రామరాయలు అతని వద్ద తన కుమార్తెకు సంగీత శిక్షణ ఇప్పించాడు. రామామాత్యుని సర్వమేళ కళానిధి దక్షిణ భారత సంగీతంలో అనేక మార్పులు తెచ్చింది. ఆ రోజులలో సంగీత విద్వాంసుల మధ్య పోటీలు ఉండేవట. ఆ కాలంలో సంగీత వాయిద్యాలలో వీణకు ఎక్కువ ప్రాచుర్యం ఉండేది. రాణులు వీణ వాయించడంలో ప్రజ్ఞామణులు.

ముస్లిం సంస్కృతి-హిందూ ముస్లింల సంబంధాలు

అనాది నుండి భారతదేశంలోకి ఎన్నో జాతులు దండెత్తి వచ్చాయి. అలాగే మధ్యయుగంలో ముస్లింలు కూడా దండెత్తి వచ్చి ముస్లిం సామ్రాజ్యాన్ని స్థాపించారు. మొదట దండెత్తిన గ్రీకులు, శకులు, కుషానులు, హూణులు అన్ని జాతుల వారు హిందువులలో కలిసిపోయారు. కాని ముస్లింలు అలా కలవకుండా తమ అస్థిత్వాన్ని నిలబెట్టుకున్నారు. అందుకు కారణం ఈ రెండు మతాల మధ్య ఒకదానికొకటి పోలిక లేని అనేక వైరుధ్యాలుండటమే. రెండు మతాల వారు ఎవరికి వారే తమ మతమే గొప్పదని, తమ మతమే పరిపూర్ణమైనదని భావించడం మొదటి కారణం. సాంఘిక ఆచార వ్యవహారాలలో రెండు మతాలకు అభివృద్ధి చెందిన వ్యవస్థలు ఉండటం రెండవ కారణం. ముస్లింలు దారుల్ సలామ్, దారుల్ హనిర్బ వ్యవస్థ ముస్లిమేతర రాజ్యం అనే సిద్ధాంతాన్ని నమ్మేవారు కావడం మూడవ కారణం. మత విషయాల్లో ఎలాంటి పరిస్థితులలో రాజీపడేతత్వం ఇస్లాం మతానికి లేకపోవడం. అలాగే హిందువులకు కూడా కొన్ని అతిక్రమించరాని నియమాలుండటం, ఈ కారణాల వల్ల ఈ రెండు మతాలు ఒక దాంతో ఒకటి కలిసిపోకుండా నిలబెట్టాయి. ముస్లింలలో హిందువులకు నచ్చనివి, కష్టం కల్గించే కొన్ని పద్ధతులున్నాయి. అంతేకాదు కొన్ని విషయాలు ఒకరికొకరిని శత్రువులుగా మార్చే పద్ధతులు కూడా ఉన్నాయి.

అలాగే ముస్లింలకు నచ్చని కొన్ని పద్ధతులు హిందువులలోనూ ఉన్నాయి. గోవులను చంపి గోమాంసం భక్షణ చేయడం, దేవాలయాలను నాశనం చేయడం, నిర్బంధంగా ముస్లింలుగా మార్చడం, జిజియా పన్ను విధించడం హిందువులు భరించలేకపోయారు. ఈ పద్ధతులు రెండు మతాలను శత్రువులుగా మార్చి నిత్య సంఘర్షణకు తోవతీశాయి. ఉభయుల మధ్య సహజీవనం అసాధ్యమైంది. ముస్లింలు దారుల్ ఇస్లాంను ప్రకటించి హిందువులను రెండవ తరగతి ప్రజలుగా చూడటం హిందువులకు తమ మాతృభూమిలో హీనంగా జీవించడం కష్టసాధ్యమైంది. జిజియా పన్ను విధించడం మరొక అవమానంగా భావింపబడింది. ఇస్లాం మతం ప్రకారం ముస్లిమేతర ప్రాంతంలో ముస్లింలు నివసించకూడదు. కనుక తాము జయించిన రాజ్యాన్ని దారుల్ ఇస్లాంగా ప్రకటించాలి. ఇస్లాం భూమి అని అర్థం. యూదు ప్రాంతాలు ముస్లింల కిందికి వచ్చిన తర్వాత వారికి ఈ సమస్య వచ్చింది. యూదులు ముస్లింలకు దాయాదులు, ఒక తండ్రి రక్తం పంచుకొని పుట్టినవారు, తల్లులు మాత్రమే వేరు, కనుక యూదులను పూర్తిగా ముస్లింలుగా మార్చాలా లేక అంతం చేయాలా అని సందేహం వచ్చింది. అప్పుడు వారు దాయాదులు గనుక వారిని వధించకూడదు. వారు దారుల్ ఇస్లాంలో జీవించటానికి ప్రత్యేక పన్ను చెల్లించి జీవించవచ్చని పవిత్ర ప్రవక్త అంగీకరించారు. ఆ పన్ను పేరు జిజియా. ఆ విధంగా మొట్టమొదటి జిజియా విధింపబడిన వారు యూదులు. ఇండియాలో జిజియా పన్నును మొట్టమొదట విధించిన వ్యక్తి మహమ్మద్ ఖాసిం అతడు దహీరును ఓడించి సింధుని జయించాడు. ఆ సమయంలో ముస్లింలకు కొందరు హిందువులు, బౌద్ధులు సహాయం చేశారట. సహాయం చేసిన వారిని ముస్లింలుగా మార్చలేకపోయాడు. వారిని హింసించలేకపోయాడు కనుక ప్రవక్త యూదుల విషయంలో అనుసరించిన విధానాన్ని అతడు సింధూదేశంలో అనుసరించి వారిపై జిజియా పన్ను విధించాడు. ఈ విధంగా ఇండియా ముస్లిం పాలకులకు మహమ్మద్ ఖాసిం మార్గదర్శకుడయ్యాడు

హిందువులకు నచ్చనివి ముస్లింలలో ఉన్నట్లే, ముస్లింలకు కొన్ని హిందువుల పద్ధతులు నచ్చలేదు. హిందూ మతంలోని బహుదేవతారాధన, విగ్రహారాధన, కుల వ్యవస్థ వారికి చాలా తప్పుగా కనిపించాయి. ఇవన్నీ రెండు మతాలను ఒకరికొకరిని దూరంగా ఉంచాయి. ఈ కారణాలన్నీ శతాబ్దాల తరబడి రెండు మతాలు వేరువేరుగా కొనసాగడానికి దోహదం చేశాయి.

ఈ విధంగా అనేక వైరుధ్యాలున్నప్పటికీ వారిద్దరూ సహజీవనం చేయక తప్పలేదు. ఒకరి మీద ఒకరు ఆధారపడక తప్పలేదు. అందుకు కొన్ని కారణాలున్నాయి. ముస్లింలు పాలకులైనా వారి జన సంఖ్య తక్కువ. వారి మత సిద్ధాంతాలను గట్టిగా అమలుపరిస్తే హిందువులు పూర్తిగా తిరగబడి తమ తమ రాజ్యాలు పోతాయేమోనని లోపల భయపడ్డారు. పెద్ద జనాభా అయినందువల్ల హిందువులను పూర్తిగా తుడిచిపెట్టడం సాధ్యం కాదు కనుక వారిని ఆదరించక తప్పలేదు. అలాగే హిందువులు జనాభా అధికంగా ఉన్నా తాము పాలితులుగా మారారు. పాలకులకు విధేయులు కాక తప్పలేదు. అయిష్టంగానో విధి లేకనో ఈ పరిస్థితులు వారిని కలిసి జీవించేటట్లు

చేశాయి. అందువల్ల ముస్లిం పాలకులు హిందువులకు తమ ఆస్థానాలలో ఉద్యోగాలు ఇచ్చారు. హిందువులను సైన్యంలో చేర్చుకొని వారి మీద ఆధారపడ్డారు. పరిపాలనలో వారికి దేశభాషలు రావు. కనుక బ్రాహ్మణులను ఉద్యోగాలిచ్చి పరిపాలనలో వారి సహాయం తీసుకున్నారు. కొంత కాలం ఉభయులు కలిసి ఉన్న తర్వాత ఒకరి ఆచార వ్యవహారాలు, పద్ధతులు, సాంప్రదాయాలు, వేదాంతం, తాత్విక విధానాలు మరొకరికి తెలిసి వచ్చాయి. ఒకరి మత గ్రంధాలు మరొకరు చదివారు. దాంతో ఉభయ సంస్కృతులు ఒక దానిపై ఒకటి ప్రభావం చూపసాగాయి. హిందూ వేదాంతంలోని లోతులను కొందరు ముస్లింలు గ్రహించారు. దారాషుకోవ్ వంటి విజ్ఞానులు హిందూమత సారాంశాన్ని లోతుగా అవగాహన చేసుకొని హిందూ గ్రంధాలను పర్షియన్ భాషలోకి అనువాదం చేశారు. అలాగే మరికొందరు చేయగా హిందూ వేదాంతతత్వం ముస్లిం సమాజంలోకి చొచ్చుకొని పోయింది. భారతదేశంలోని ముస్లింలలోనే గాక పర్షియా, టర్కీ అరేబియా ముస్లింలలోకి కూడా విస్తరించింది. కొందరు సూఫీ మత గురువులు హిందువులను ఆదరించసాగారు. వారు హిందూ ప్రాంతాలలోకి వచ్చి ఆశ్రమాలు నిర్మించుకొని హిందువుల మధ్య జీవించసాగారు. హిందూ ముస్లింల మధ్య వేదాంత చర్చలు ప్రారంభమై ఒకరినొకరు అర్థం చేసుకొన్నారు. హిందువులు కూడా ముస్లింల ఎడ అసహనాన్ని వదలుకొన్నారు. విజయనగర రాజులు ముస్లింలను తమ సైన్యంలో చేర్చుకున్నారు. కొందరిని జాగీరుదార్లుగా నియమించారు. పాణ్యం జాగీరును ముస్లిం సరదారులకు ఇవ్వగా వారు నాలుగు తరాలు పాణ్యాన్ని పాలించారు. అదే విధంగా దక్కను సుల్తాన్‌లు తమ ఆస్థానాలలో హిందువులను నియమించారు. మహమ్మదీయ రాజుల కొలువులో హిందువులు, హిందువుల కొలువులో మహమ్మదీయులు చేరారు. అదే పంథాలో గోల్కొండ నవాబుల కొలువులో హిందువులు పదవులు పొందారు. ముస్లింల రాజ్యాలలో కొలువు చేయడానికి హిందువులు పర్షియన్, ఉర్దూ, అరబ్బీ, టర్కీ భాషలను నేర్చుకున్నారు. మాదన్న, అక్కన్నలు హిందీ, సంస్కృతం, తెలుగు, మరాఠీ, ముస్లింల భాషలైన పర్షియన్, టర్కీ అరబిక్, ఉర్దూ భాషలలో అనర్గళంగా మాట్లాడగలిగేవారు. ఆ భాషలలో చక్కగా రాయగలిగేవారు. చదవగలిగేవారు. అలాగే గోల్కొండ సుల్తాన్‌లు తెలుగు భాషను నేర్చుకున్నారు. తెలుగు భాషలో మాట్లాడేవారు ఉభయులు కలసిపోయినందువల్ల హిందూ ముస్లిం మిశ్రమ సంస్కృతి ఏర్పడింది. ముస్లింల పండుగలైన పీర్లపండుగలలో హిందువులు పాల్గొనేవారు. హిందూ పండుగలైన హోలీ, దీపావళిలో ముస్లింలు పాల్గొనేవారు. ముస్లిం ఫకీరులను హిందువులు కొలిచే వారు. వారి దర్గాలను దర్శించే వారు. వారి ఉరుసులలో పాల్గొనేవారు. పెనుగొండలో బాబయ్య ఉరుసులలో హిందువులే ఎక్కువ మంది పాల్గొనేవారు. ముస్లింల పేర్లు మస్తాన్, సైదులు మొదలైన పేర్లు హిందువులు పెట్టుకునేవారు.

ఈ విధంగా చివరకు హిందూ ముస్లింల ఐక్యత సాధించబడింది. వారి ఐక్యత ఫలితంగా ఉత్తర హిందూ స్థానంలో హిందూస్తాన్ సంస్కృతి ఫలితం వాస్తువు, శిల్పకళలు, నాట్య చిత్రకళలు, నాట్య సంగీతాలు, భాషా సాహిత్యాలు, వేషభాషలలో ప్రసరించింది. మహమ్మద్ కులీ తన కవితలలో హిందూ పండుగలను వర్ణించాడు. ముస్లిం కట్టడాలలో హిందూ చిత్రకళ ప్రవేశించింది. హిందూ భవనాలలో ఆర్చీలు ప్రవేశించాయి. కుతుబ్‌షాల కాలంలో అనేక సంస్కృత గ్రంధాలు పర్షియన్ భాషలోకి అనువదించబడ్డాయి. పంచతంత్రం, నలచరిత్ర మొదలైన సంస్కృత గ్రంధాలు పార్శీ భాషలోకి అనువదించబడ్డాయి. హైదరాబాద్ రెడ్డి హాస్టలులో పర్షియా భాషలోకి అనువదించబడిన మహాభారతం ఉంది. అందులో శ్రీకృష్ణుడు, భీముడు, ద్రోణుల వర్ణచిత్రాలు కూడా ఉన్నాయి. ఈ విధంగా హిందూ ముస్లింలు ఐక్యంగా జీవించి మిశ్రమ సంస్కృతి ఏర్పడటానికి దారితీసింది.

బహమనీ కాలం నాటి సంస్కృతి

బహమనీ కాలంలో సాంఘిక పరిస్థితులు: బహమనీ కాలంలో సమాజంలో చాలా మార్పులు వచ్చాయి ముస్లింల ఆధిక్యత పెరిగింది. హిందువులు రెండవ తరగతి ప్రజలయ్యారు. ముస్లింలలో కుల వ్యవస్థ లేదు. వారు చేసే ఉత్పత్తిని, ఉద్యోగాన్ని బట్టి సమాజంలో వారి అంతస్తు నిర్ణయించబడుతుంది. వారు హిందువులను కూడా వారు చేసే వృత్తిని బట్టి వారి అంతస్థులను చూసేవారు. హిందువులతో కలవక తప్పలేదు. దేశ పరిపాలనలో హిందూ రాజులతో సర్దుకోవలసి వచ్చింది. తమ మతం వారే అయినా ఢిల్లీ సుల్తాన్‌లతో పోరాడవలసి వచ్చింది. కనుక వారు హిందువులతో సఖ్యతకు పెంపొందించుకోవలసిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడ్డాయి. కనుక వారు హిందువులను తమ ఆస్థానాలలో ఉద్యోగులుగా నియమించారు. ముఖ్యంగా హిందూ సమాజాన్ని నడిపే బ్రాహ్మణులకు ఆస్థానాలలో గ్రామాలలో చిన్న చిన్న ఉద్యోగాలు ఇచ్చారు. హిందువులలో సైనిక వృత్తి చేసే కులాల వారిని తమ సైన్యంలో చేర్చుకున్నారు. కొందరికి ఇక్తాలు ఇచ్చారు. హిందువులు కూడా ఇక్తేదారులై ముస్లింలను కొలిచారు. హిందూ స్త్రీలను సుల్తాన్‌లు, ముస్లిం సరదారులు వివాహమాడారు. హిందువులలో చిన్న కులాల వారు కొందరు ముస్లిం మతంలో చేరారు. ఈ విధంగా సామాజికంగా అనేక మార్పులు సంభవించాయి. తత్ఫలితంగా సమాజంలో నూతన వర్గాలు అవతరించాయి. బహమనీ కాలంలో సమాజం స్థూలంగా 5 వర్గాలుగా ఉందని చెప్పవచ్చును. భూస్వాములు, వర్తకులు, వృత్తి నిపుణులు, రైతులు, బానిసలు.

భూస్వాములు: భూస్వాములలో అనేక అంతరాలు, హోదాలు కలిగిన ప్రభువులు ఉన్నారు. వారి ఇక్తాలను బట్టి వారి హోదా నిర్ణయించాలి. ఖాన్‌లు, మాలిక్‌లు, అమీర్‌లు, ఉలేమాలు, ఉమ్రావులు ఈ కోవలోకి వస్తారు వీరిలో 'చాలా మంది పర్షియా, టర్కీ, అరేబియా దేశాల ఉండి వచ్చిన వారు. వారు ప్రత్యేక హోదాను కనబరచేవారు. తామే అసలైన ముస్లింలమని భావించుకుంటుండేవారు. ముస్లిం మతం పుచ్చుకొన్న హిందువులు, చిన్న చిన్న పన్ను గుత్తదారులు రెండవ తరగతికి చెందిన భూస్వాములుగా పరిగణించబడతారు. ముస్లిం సమాజంలో ఉలేమాలది ప్రత్యేక స్థానం. వారు సాహిత్యవేత్తలు, విద్యావంతులై ఉంటారు. ఖురాన్ అధ్యయనంలో నిష్ణాతులై ఉంటారు. రాజ్యంలోని విద్యాసంస్థలు, మతసంస్థలపై వారికి అధికారం ఉంటుంది. వారికి కూడా ఈనాములు ఇస్తారు. కనుక వారు కూడా భూస్వాముల తరగతిలోకే వస్తారు.

వర్తకులు: తర్వాత వారు వర్తకులు. బహమనీల విదేశీ వాణిజ్యం కూడా అభివృద్ధి చెందింది. విదేశాల నుండి అనేక మంది వర్తకులు వచ్చి రాజాశ్రయం పొందారు. అరేబియా వర్తకులను బహమనీ సుల్తాన్‌లు బాగా ఆదరించారు. వారితోపాటు దేశీయ వర్తకులు కూడా శ్రేణులుగా ఏర్పడి వర్తకం సాగించారు. దేశీ, విదేశీ వర్తకులు ఉభయులు మత బేధంతో సంబంధం లేకుండా వ్యాపారం చేశారు. ఆ రోజుల్లో యుద్ధ సామాగ్రికి, రాజుల విలాస వస్తువులకు విపరీతమైన గిరాకీ ఉండేది. కనుక దేశీ, విదేశీ వర్తకులు రాజులకు కావలసిన వస్తువాహనాలు, ఆయుధాలు, గుర్రాలను సరఫరా చేస్తూ ధనవంతులై సమాజంలో ఉన్నత స్థితిని అనుభవిస్తూ ఉండేవారు.

వృత్తిపనివారు: రాజులకు కావలసిన వస్తువాహనాలను తయారు చేసే వృత్తి పని వారికి కూడా మంచి గిరాకీ ఉంది. వారు వృత్తిశ్రేణులుగా ఏర్పడి వస్తూత్పత్తి చేస్తూ ఉండేవారు. వీరు సమాజంలో కొంత దిగువ స్థాయిలో ఉండేవారు.

రైతులు: బహమనీల కాలంలో రైతు పరిస్థితి దుర్భరంగా ఉండేది. వ్యవసాయాభివృద్ధికి సుల్తాన్‌లు తగిన శ్రద్ధ తీసుకోలేదు. నీటిపారుదల సౌకర్యాలు ఏర్పాటు చేయలేదు. దానికి తోడు తరచూ క్షామాలు వస్తుండేవి. వీరి కాలంలో నాలుగైదు కరువులు వచ్చాయి. రెండవ మహమ్మద్‌షా కాలంలో వచ్చిన కరువులో అతడు ముస్లింలకు సహాయం చేశాడు గాని హిందువులను పట్టించుకోలేదు. ఒకటవ మహమ్మద్‌షా కాలంలో వర్షాలు పడలేదు. పెద్ద కరువు వచ్చింది. ఆ సమయంలో అహమ్మద్‌షా ప్రార్థనలతో వర్షం కురిపించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. అతనికి వలి అంటే రుషి అని కూడా పేరుందట. మూడవ మహమ్మద్‌షా కాలంలో 2 సంవత్సరాలు తీవ్ర అనావృష్టి ఏర్పడింది. ఈ కరువులో లక్షలాది మంది ప్రజలు మరణించారు. బతుకు తెరువు కోసం అనేక మంది మాళ్వ, గుజరాత్, ఒరిస్సాలకు వలసపోయారు. మూడవ సంవత్సరం వర్షాలు పడ్డాయి. కాని విత్తనం వేయడానికి మనుషులే లేరు. క్రీ.శ.1396 నుండి 12 సంవత్సరాలు పాటు మహాక్షామం వచ్చింది. దీనిని దుర్గాదేవి కరువు

అని పిలిచారని సీవెల్ అనే పండితుడు రాశాడు. ఈ కరువు కాటకాలతో రైతులు నిర్జీవులయ్యారు. అయినా వారిపై పన్నుల భారం తప్పలేదు. పన్నులు చెల్లించనందుకు అనేక శిక్షలకు గురయ్యేవారు. వారి పరిస్థితి అతి దయనీయమని నాడు బహమనీ రాజ్యాన్ని దర్శించిన విదేశీ యాత్రీకులు రాశారు.

బానిసలు: ముస్లింల రాకతో సామాజిక వ్యవస్థలో వచ్చిన మరొక మార్పు బానిస వ్యవస్థ. అంతకుపూర్వం బానిస వ్యవస్థ భారతీయ సమాజంలో లేదు. మధ్యాసియా, ఐరోపాలలో బానిస వ్యవస్థ మొదటి నుండి ఉండేది. ముస్లింలు ఆ వ్యవస్థను భారతదేశంలో ప్రవేశపెట్టారు. సుల్తాన్‌లు బానిసలను కొని తమ రాజ భవనాలలో వారిచేత సేవలు చేయించుకొనేవారు. ఆడ బానిసలు కూడా ఉండేవారు. సాధారణంగా ఇతర దేశాల నుండే బానిసలను తెచ్చి అమ్మేవారు. మధ్యాసియా దేశాలలో తల్లిదండ్రులే తమ పిల్లలను బానిసలుగా అమ్ముకొనేవారు. బానిసలు తమ యజమానులను మెప్పించి బానిసత్వం నుండి బయటపడటమేకాదు, సేనాధిపతులు, తరఫ్‌దారులు, రాష్ట్ర గవర్నర్లు, చివరకు సుల్తాన్‌లు అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. కుతుబుద్దీన్ ఐబక్, ఇల్ టిట్‌మష్‌లు అలాంటి బానిసలే. బహమనీ సుల్తాన్‌ల కాలంలో కూడా అలా ఎదిగిన బానిసలున్నారు. షముద్దీన్ తల్లి అలా విడుదలైన బానిస. ఆ రోజులలో బానిసలుగా జీవితం ప్రారంభించి సుల్తాన్‌లను మెప్పించి ఉన్నత స్థానాలకు ఎదిగిన బానిసలలో యూసఫ్ ఆదిత్, మసేన్, కాశిమ్ బరీద్ అనే వారు చాలా ముఖ్యులు. ఫిరోజ్‌షా హర్షియార్, బేదర్ అనే ఇద్దరు బానిసలకు తన రాజ్య పాలనాధికారాన్ని అప్పజెప్పాడు. కాని అందరు బానిసలకు ఆ దశ పట్టదు. తెలివి, సామర్థ్యం ఉన్న వారు అలాంటి స్థానాలకు ఎదగగలరు. మిగిలిన వారు బానిసలే. బానిసలకు ఏ హక్కులూ ఉండవు. వారు గొడ్డు చాకిరీ చేస్తుండాలి. ఏమైనా తప్పు చేస్తే యజమాని వేసే శిక్షలు భరించాలి. కొన్ని సందర్భాలలో బానిసలను చంపే అధికారం, హక్కులు కూడా యజమానులకు ఉంటాయి. ముస్లిం యుగంలో లక్షలాది మంది బానిసలుగా జీవించారు. వస్తువులతోపాటు నల్లవారిని బానిసలుగా సంతలలో, బజారులలో అమ్ముతారని అతనాసియన్ నికిటిన్ రాశాడు.

మతం మార్పిడులు: బహమనీల కాలంలో ఆంధ్రదేశంలో మత మార్పిడీలు విస్తృతంగా ప్రారంభం అయ్యాయి. అనేక మంది హిందువులు ముస్లింలుగా మారిపోయారు. ముస్లింలైన తర్వాత వారికి బహమనీ సుల్తాన్‌లు తమ ఆస్థానాలలో ఉద్యోగాలు ఇచ్చారు. కొందరు సేనాధిపతులయ్యారు. మరికొందరు ఇక్తాదారులయ్యారు. ఉభయ మతస్థులు కలిసి జీవించారు. అన్ని పండుగలు ఉత్సవాలలో కలిసి పాల్గొన్నారు. అందువల్ల ఒకరి మత విషయాలు మరొకరు తెలుసుకోడానికి అవకాశం కలిగింది. మత మార్పిడులు ఎక్కువగానే జరిగాయి. మత ఛాందసులు ఉలేమాలు మత విషయంలో కాఠిన్యాన్ని కూడా చూపారు.

అతనాసియన్ నికిటిన్: బహమనీ సుల్తాన్‌ల కాంలో అతనాసియన్ నికిటిన్ అనే రష్యా వ్యాపారి బీదరు వచ్చాడు. అతడు అక్కడ క్రీ.శ.1470 వరకు అంటే 4 సంవత్సరాలు నివసించాడు. అతడు బహమనీ రాజ్యం మొత్తం తిరిగి ఆనాటి అనేక విషయాలు గ్రంథస్తం చేశాడు. అతని రాతలు బహమనీ సుల్తాన్‌ల కాలం నాటి విశేషాలు తెలుసుకోడానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అతడు క్రైస్తవుడు. ముస్లింలు అతనిని కూడా బాధించారు. ఇక్కడికి రావాలి అంటే ముస్లింగానే రావాలి అని అతనికి స్పష్టపరిచారు. వారి బాధ తట్టుకోలేక అతడు ముస్లింగా మారానని చెప్పి పేరు కూడా మార్చుకున్నాడు. ఖ్వాజీయూసఫ్ ఖొరసాని అనే పేరుతో అతడు బహమనీ రాజ్యంలో ఉండి తర్వాత తన దేశం వెళ్లిపోయాడు. దేశంలో జనాభా విరివిగా ఉందని, అమీరులు భోగలాలసత్వంలో ఉండగా ప్రజలు దుర్భర పరిస్థితులలో ఉండే వారని ముఖ్యంగా హిందువులు అనేక హింసలకు గురయ్యేవారిని, ఉదారుడుగా కీర్తివహించిన మహమ్మద్ గవాన్ కూడా హిందువుల ఎడ జాలి చూపలేదని రాశాడు.

మత సహనం: అయితే బహమనీ సుల్తాన్‌లు అందరూ మత ద్వేషం చూపలేదు. వారిలో కొందరు పరమత సహనం చూపారు. రెండవ అల్లావుద్దీన్ బీదరులో ఒక వైద్యశాలను నిర్మించి హిందూ, ముస్లిం రెండు మతాలకు చెందిన వైద్యులను నియమించాడు. హిందూ, ముస్లింలకు వైద్య సౌకర్యాలు కల్పించాడు. విద్యాలయాలలో ముస్లిం మత విద్యతోపాటు లౌకిక విద్యలు కూడా బోధించే ఏర్పాటు చేశాడు. తమ ఆస్థానాలలో పనిచేసే హిందువులను మతం మార్చుకోమని బాధించలేదు. హిందువులను కూడా ఆదరంగానే చూశారు. కాని హుమయూన్ తనను ఎదిరించిన వారిని మాత్రం సోదరులను, అమీరులను, ఇతరులను, స్త్రీ పురుష బేధం లేకుండా వధించాడని జాలిమ్ అంటే నీరో చక్రవర్తి అనే బిరుదు వహించాడని పెరిష్టా రాశాడు. రెడ్డి, వెలమ విజయనగర రాజ్య ప్రజలపై సుల్తాన్‌లు అమానుష మారణకాండ జరిపారని కూడా రాశాడు. వారి రాజ్యంలోని హిందువులపై జిజియా పన్ను

వసూలు చేశారు.

హిందూ సమాజం: హిందూ సమాజంలో మాత్రం కుల వ్యవస్థ గట్టిపడిపోయింది. అంతర్వివాహాలు సహపంక్తి భోజనాలు లేకుండాపోయాయి. హిందువుల భోజనం వద్ద కూడా అంటు దోషం పాటించేవారని నికిటిన్ రాశాడు. హిందూ రాజులు పోయినందువల్ల బ్రాహ్మణులను పోషించేవారు లేకపోయారు. కనుక వారు కూడా ముస్లిం పాలకుల వద్ద ఉద్యోగులుగా చేరి వారి కింద పనిచేయసాగారు. మిగిలిన వారు కేవలం హిందువుల ఇళ్లలో జరిగే పెళ్లి, పండుగ ఉత్సవాలలో వచ్చే సంభావనలతో బతకవలసి వచ్చింది. కొందరు పూజారులుగా జీవించారు. మొత్తం మీద హిందువులు దేశంలో రెండవ తరగతి ప్రజలైపోయారు. అనేక బాధలకు గురయ్యారు

క్రిష్టియన్లు: బహమనీ సుల్తాన్‌ల కాలంలో పోర్చుగీసు వారు ఇండియాలో అడుగుపెట్టారు. వారు బహమనీ సుల్తాన్‌లకు చెందిన గోవా, దాని పరిసర ప్రాంతాలను ఆక్రమించారు. వారు క్రైస్తవ మతాన్ని కూడా ప్రోత్సహించారు. గోవా ప్రాంతంలో చాలా మందిని క్రైస్తవులుగా మార్చారు. హిందూ స్త్రీలను వివాహాలు చేసుకొన్నారు. వివాహాల ద్వారా, బంధుత్వం ద్వారా క్రైస్తవుల సంఖ్య పెంచాలని తీర్మానించారు. అందువల్ల నాటి సమాజంలో క్రైస్తవులు కూడా మరొక వర్గంగా అభివృద్ధి కాసాగారు.

వేషభాషలు - వినోదాలు: సమాజంలో వేషభాషలలో పెద్ద మార్పు వచ్చింది. హిందూ సామంతులు, ఇక్తాదార్లు ముస్లిం లాగ వేషాలు ధరించసాగారు. వారిలాగ టోపీలు, తలపాగాలు రూపొందించుకున్నారు. టర్కీ పర్షియా పదాలు తమ భాషతో కలిపి మాట్లాడసాగారు. దిగువస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్న హిందువులకు ముస్లిం పరిపాలనా పద్ధతులలో ప్రత్యేక శిక్షణనిచ్చారు. బీదరు తాలింఖానాలో అన్ని మతస్థులకు శిక్షణ ఇచ్చేవారట. పండుగలకు ఉత్సవాలలో ఉభయ మతస్తులు కలిసి పాల్గొనసాగారు. విద్యాలయాలలోను, వైద్యశాలలోను హిందూ ముస్లింలు కలిసి ఉండేవారు. ముస్లింలు కూడా హిందువుల లాగా వేషధారణ చేశారు. ఖాజీ సిరాజ్ అనే అతడు హిందూ వేషంలో విజయనగర ఆస్థానాన్ని దర్శించాడట. ఎవరూ అతనిని అనుమానించలేదట. రాజ కుటుంబాలే గాక వర్తకులు, ప్రజలు కూడా అందరి పండుగలు ఉత్సవాలలో పాల్గొని కలిసిపోయారు. అందువల్ల ఒకరి మత సంస్కృతులు మరొకరు అర్థం చేసుకోడానికి బాగా ఉపయోగపడ్డాయి. అందువల్ల మతఘర్షణలు జరగకుండా సమాజంలో ప్రశాంత పరిస్థితులు నెలకొనడానికి వీలు కలిగింది. ఇవన్నీ మిశ్రమ సంస్కృతికి దోహదం చేశాయి

దర్బారుల ముఠాలు: బహమనీ సుల్తాన్‌ల దర్బారులో రెండు వర్గాలుండేవి. అఫాకీలు, దక్కనీలు అని రెండు ముఠాలుండేవి. అరేబియా, టర్కీ, పర్షియా నుండి అనేక మంది ముస్లింలు బహమనీ రాజ్యంలోకి వచ్చారు కొందరు వర్తకులుగా, ఉద్యోగులుగా, కవులుగా, పండితులుగా, మరికొందరు సేనాధిపతులుగా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. కొత్తగా వచ్చిన వారందరినీ అఫాకీలు అని పిలిచేవారు. దక్షిణ భారతదేశ హిందువులు కొందరు ముస్లిం మతంలో చేరారు. వారిని దక్కనీలు అని పిలిచేవారు. అంటే పాత వారంతా దక్కనీ, కొత్త వారంతా అఫాకీలు. వీరు రెండు ముఠాలుగా చేరి బహమనీ సుల్తాన్‌లను తమ చెప్పు చేతలలో ఉంచుకోవాలని ప్రయత్నం చేశారు. అందుకు వారు కుట్రలు కుతంత్రాలు చేస్తూ ఉండేవారు. దర్బారు ఉద్యోగాలలో యుద్ధరంగాలలో, అఫాకీలు ప్రముఖ స్థానాలు సంపాదించారు. వారు తమ దేశాలలో ఎప్పటికప్పుడు వచ్చే అధునాతన యుద్ధ పద్ధతులలో నిష్ణాతులు కనుక సహజంగానే వారు యుద్ధరంగాలలో గొప్ప విజయాలు సాధించేవారు. కనుక వారికి ఉన్నత స్థానం లభించడం ఆశ్చర్యపరచే విషయమేమీ కాదు. దక్కనీలకు వారిలా నూతన పద్ధతులు తెలియవు గనుక వారు రెండవ స్థానంలో ఉండేవారు. అందువల్ల దక్కనీలకు అఫాకీలపై ఈర్ష్యాద్వేషాలు ఉండేవి. దానికి తోడు మతభేదం కూడా తోడైంది. అఫాకీలు షియాలు. దక్కనీలు సున్నీలు. ఒకటవ అహమ్మద్ కాలంలో ఈ వర్గాల మధ్య ఈర్ష్యా ద్వేషాలు తారాస్థాయికి వచ్చాయి. అతని కాలంలో అతని ప్రధానమంత్రి ఖలఫ్‌హసన్ బస్రీ అఫాకీ అతని నాయకత్వంలో బహమనీ సైన్యం గుజరాత్‌పై దండెత్తింది. కాని సైన్యంలోని దక్కనీలు అతనితో సహకరించలేదు. అందువల్ల బహమనీ సైన్యం ఓడిపోయింది. దక్కనీల ద్రోహం తెలుసుకొని అహమ్మద్‌షా దక్కనీలలో కొందరిని ఖైదు చేశాడు. తర్వాత రాజ్యానికి వచ్చిన రెండవ అహమ్మద్‌షా దక్కనీలను విడుదల చేశాడు. తర్వాత ఖలఫ్‌హసన్ అఫాకీ నాయకత్వంలో సైన్యాన్ని మళ్లీ గుజరాత్‌పైకి పంపాడు. పంపిన 10 వేల సైన్యంలో 7 వేలు దక్కనీ సైనికులు. గుజరాత్‌లో విజయం సాధించి తిరిగి వస్తూ ఉండగా మార్గమధ్యలో కొంకణ దేశ అడవుల్లో జబ్బుపడ్డాడు. అతడు విశ్రాంతి తీసుకుంటూ ఉండగా దక్కనీలు అతని గుడారానికి దూరంగా శిబిరాలు వేసుకున్నారు. ఒంటరిగా ఉన్నాడని తెలిసి 30 వేల గుజరాతీ సైన్యం హఠాత్తుగా హసన్‌పైబడి అతనిని, అతని

అనుచరులను చంపారు. మిగిలిన వారు పక్కనున్న చాకన్ దుర్గం చేరారు. దక్కనీలు చాకన్ దుర్గంపైబడి మిగిలిన అఫాకీలను కూడా భార్యాబిడ్డలతో సహా అందరినీ సంహరించారు. కొద్ది మంది అఫాకీలు బీదర్ చేరి దక్కనీలు చేసిన ద్రోహం సుల్తాన్‌కు విన్నవించారు. అతడు ఉగ్రుడై దక్కనీలను కొందరిని చంపి కొందరికి శిక్షలు వేశాడు. ఈ సంఘటన అఫాకీలు, దక్కనీల మధ్య అఘాతాన్ని పెంచింది.

మహమ్మద్ గవాన్: ఈ స్థితిలో మూడవ మహమ్మద్‌షా గద్దెనెక్కాడు. అతడు మహమ్మద్ గవాన్‌ని ప్రధాన మంత్రిగా చేశాడు. గవాన్ కూడా అఫాకీయే. కాని అతడు రెండు వర్గాలలోని వారిని సమానంగా ఉద్యోగాలలో నియమించాడు. అయినప్పటికీ దక్కనీలు సుల్తాన్‌కు చాడీలు చెప్పి అతనిని కొండపల్లి కోటలో ఉరి తీయించారు. తర్వాత నిజం తెలుసుకొని సుల్తాన్ దుఃఖించాడు. ఆ దుఃఖంతో రెండేళ్లు మాత్రమే జీవించాడు. అతని మరణం తర్వాత బహమనీ సామ్రాజ్యం 5 ముక్కలై పోయింది. దర్బారులోని మురా తగాదాలు కూడా నాటి సమాజంపై వాటి ప్రభావాన్ని చూపుతుండేవి.

ఆర్థిక పరిస్థితులు: బహమనీ రాజుల కాలంలో వ్యవసాయం అభివృద్ధి చెందలేదు. వారి కాలమంతా యుద్ధాలతో గడిచిపోయింది. కనుక వారు నూతన చెరువులను తవ్వించలేదు. కనీసం పాత వాటిని కూడా మరమ్మత్తులు చేయించలేదు. అందువల్ల రైతుల పరిస్థితి దిగజారింది. పైగా పన్నుల భారం ఎక్కువ. ఇక్తాదారులు ఎవరి ఇష్టం వచ్చినంత వారు వసూలు చేసుకొనేవారు. బహమనీ సుల్తాన్‌ల దర్బారులో ఎప్పుడూ కుట్రలూ, కుతంత్రాలూ జరుగుతుండేవి. ఆధిక్యత సంపాదించిన వారు కొత్త ఇక్తాలు సంపాదించి రైతులను పిండేవారు. సుల్తాన్‌లు విలాసాలకు విపరీతంగా ఖర్చులు చేసేవారు. బహమన్‌షా కుమారుని పెండ్లికి ఒక సంవత్సరం పాటు విందులు, వినోదాలు జరిగాయి. మృష్టాన్నాలు పెట్టి తాంబూలాలు ఇచ్చారు. ఒకటవ మహమ్మద్ తల్లి మక్కాయాత్ర వెళ్లడానికి వేయి మందిని వెంట తీసుకువెళ్లింది. ఆమె 4,000 పెళ్లిళ్లు చేయించింది. మూడవ మహమ్మద్‌షా తల్లిని భార్యలను వెంటబెట్టుకొని 10 వేల గుర్రాలు, రౌతులు, 50 వేల మంది పదాతి దళంతో వేటకు వెళ్లేవాడని నికిటిన్ రాశాడు. ఈద్ ప్రార్ధనలకు పెద్ద పరివారంతో వెళ్లేవాడట. దేవరాయల కూతురుని ఫిరోజ్‌షా వివాహమాడినప్పుడు అతని శిబిరం వద్ద ఒక రాత్రికి రాత్రే ఒక పెద్ద నగరం వెలిసిందని, బంగారు జలతారు వస్త్రాలు పరచారని వర్ణించారు. ఈ విలాసాల ఖర్చులన్నీ ప్రజలపై పడేవి. అందువల్ల బహమనీ సుల్తాన్‌ల కాలంలో ప్రజల పరిస్థితి అతిదయనీయంగా ఉండేదని, ప్రభువులు తరఫ్‌దారులు అపార సంపదలతో భోగవిలాసాలలో తేలియాడేవారని నికిటిన్ వర్ణించాడు. వారి కాలంలో పన్ను ఎంత వసూలు చేసిందీ ఎవరూ ఖచ్చితంగా రాయలేదు. కనుక $^1/_6$వ వంతు వసూలు చేసి ఉండవచ్చునని భావింపబడింది. భూములను కొలిచి పన్నును నిర్ధారణ చేసేవారు. వీరు జిజియా పన్ను వసూలు చేయలేదు.

పరిశ్రమలు: అంతకు పూర్వం నుండి ఉన్న పరిశ్రమలు కొనసాగాయి. ఓరుగల్లులో తివాచీల పరిశ్రమ, చర్మాలకు పదును పెట్టే పరిశ్రమలు ఉండేవి. భువనగిరి కిర్మలో కత్తులు తయారు చేసే పరిశ్రమ ఉండేది. అక్కడే ఇత్తడి, కంచు పరిశ్రమ కూడా ఉంది. కోస్తా ఆంధ్రదేశంలో నేత పరిశ్రమ ఉచ్ఛదశలో ఉంది. వెల్వెట్ వస్త్రాలు సన్నని వస్త్రాలు నేసేవారు. ఈ వస్త్రాలకు పోర్చుగీసు వారు కొని తీసుకువెళ్లేవారని బార్బొసా రాశాడు. పదును పెట్టిన తోళ్లు ధానా నుండి అరేబియా, గల్ఫ్ దేశాలకు ఎగుమతయ్యేవి. బీదర్‌లో పాత్రల పరిశ్రమ, బిద్రి నగిషీ వస్తువులు తయారయ్యేవి. బిద్రి నగిషీ పాత్రలు, తివాచీలు, రత్నాలు, సుగంధద్రవ్యాలు ఎగుమతి అవుతుండేవి. గుర్రాలు, సిల్క్, చీనా వస్తువులు, మందులు, అత్తర్లు దిగుమతయ్యేవి. విదేశాల నుండి అనేక వస్తువులు తెప్పించడానికి ఫిరోజ్‌షా గోవా చౌల్ రేవుల నుండి ఓడల్ని పంపేవాడని పెరిష్టా రాశాడు. తూర్పుకోస్తాలో పెద్ద పెద్ద ఓడలు నిర్మించేవారని నికోలో డి కోంటి రాశాడు. వీరి కాలంలో పశ్చిమ కోస్తాలో దేబల్, చౌల్, గోవాలు, తూర్పు కోస్తాలో మచిలీపట్టణం, మోటుపల్లి గొప్ప రేవుపట్టణాలు. బహమనీ రాజ్యంలోని ధాన్యం కాలకోలు, వలిపాలు, మస్లినులు చౌల్ రేవు ద్వారా ఎగుమతయ్యేవి. అరేబియా ఖొరాసన్ మొదలైన దేశాల నుండి వచ్చే గుర్రాలు ఇతర సరుకులు దేబాల్ రేవులో దిగుమతయ్యేవని బార్బొసా రాశాడు. బహమనీ సుల్తాన్‌లు విదేశీ వ్యాపారాన్ని బాగా ప్రోత్సహించారు. ఎగుమతి, దిగుమతులపై సుంకాలు లేవని నికిటిన్ రాశాడు. బీదర్, గుల్బర్గా, దేబాల్, చౌల్, గోవాలలో వర్తకశ్రేణులు ఉండేవని ఇబన్ బటూటా పేర్కొన్నాడు. పిల్సర్గాలోని షేక్ సిరాజుద్దీన్, అల్లావుద్దీన్ సమాధుల వద్ద ప్రతి సంవత్సరం 100 రోజులపాటు పెద్ద సంతలు జరిగేవట. 40 కిలోమీటర్లు ఉన్న బీదర్ నుండి 20 వేల గుర్రాలు ఆ సంతకు అమ్మకానికి వచ్చేవని, అది చాలా పెద్ద సంత అని నికిటిన్ రాశాడు.

వీరి కాలంలో దేశీయ వర్తకం, విదేశీ వాణిజ్యం మంచి ఉచ్ఛస్థాయిలో జరిగేవని చెప్పవచ్చును.

సుంకాలు: వస్తువుల మీద, పశువుల మీద నామమాత్రపు సుంకాలు వసూలు చేసేవారు. గుర్రానికి, ఏనుగుకు ఒక దీనారం, ఆవుకు, ఎద్దుకు ఒక ఫణం, గొర్రెకు 5 జట్టలు, ఒంటెకు అర జట్ట, వస్త్రాలు సిల్క్‌పాతల మీద ఒక దీనారం, బంగారం మీద రెండు దీనారాలు వసూలు చేసేవారట. బహమనీల కాలంలో టంకం అనే బంగారు నాణెం, బిస్వా అనే చిన్న నాణేలు కూడా చలామణిలో ఉండేవి.

వజ్ర పరిశ్రమ: బహమనీ కాలంలో వజ్ర పరిశ్రమ కొనసాగింది. గుంటూరు జిల్లాలో కొళ్లూరు కొల్లూరులలో వజ్రాలు దొరికేవట. బీదర్ దగ్గరలోని కొండ మీద కూడా వజ్రాలు దొరికేవట. గొండ్వానాలో కుల్లుమ్ వజ్రాల గనిని మొదటి అహమ్మద్‌షా తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

పట్టణ జీవితం: పట్టణ జీవితం అవినీతిమయంగా ఉందని నికిటిన్ రాశాడు. పురుషులు దుర్మార్గులని, స్త్రీలు వ్యభిచారులని, భర్తలను కూడా విషం పెట్టి చంపేవారని అన్నాడు. దేబాల్‌లో పూటకూళ్ల ఇళ్లలో అన్నమే గాక స్త్రీలు కూడా లభిస్తారని విమర్శించాడు.

ద్రవ్య చలామణి: వీరి కాలంలో నాణేల వాడకం బాగా పెరిగింది. మొదట వీరు తమ నాణేలను ఢిల్లీ సుల్తాన్‌ల నాణేల లాగా ముద్రించారు. తర్వాత కొన్ని మార్పులు చేశారు. ముజాహిద్‌షా ముద్రించిన వెండి నాణేలు కళాత్మకంగా ఉన్నాయి. రెండవ అహమ్మద్‌షా తర్వాత వేసిన నాణేలు చాలా లభించాయి. కాని అవి బాగా అరిగిపోయి ఉన్నాయి. వారి రాగి నాణేలు కూడా ఢిల్లీ నాణేల తరహాలోనే ముద్రించారు. గుల్బర్గాలో వారి టంకశాల ఉండేది. రెండవ మహమ్మద్‌షా కాలంలో బీదరులో రెండవ టంకశాలను నిర్మించారు. ఫతేబాద్‌లో మూడవ టంకశాలను కూడా నిర్మించారు. అప్పటి నుండి వారు రాగి నాణేలను ఎక్కువగా ముద్రించారు వీరి నాణేలన్నీ ఒకే ఆకారంలో ఒకే సైజులో ముద్రింపబడ్డాయి. దీనిని బట్టి నాణేల ముద్రణ ప్రభుత్వం గుత్తాధిపత్యంలో ఉందని స్పష్టమవుతోంది. మొదటి నుండి భిన్న విలువలు గల అనేక నాణేల ముద్రణను మొదటి మహమ్మద్‌షా నిషేధించాడు. ఒకే తరహా నాణేలు ముద్రించి ద్రవ్య చెలామణిని క్రమబద్ధం చేశాడు. అతడు బంగారు నాణేలను కూడా ముద్రించాడు. ఈ నాణేలను బుక్కరాయలు, కాపయనాయకుడు వ్యతిరేకించారు. వ్యాపారులు కూడా ఈ పద్ధతిని వ్యతిరేకించి వారి వద్దకు వచ్చిన బంగారు నాణేలను కరిగించి బంగారాన్ని విజయనగరం, ఓరుగల్లులకు పంపసాగారు. తమ నాణేలను కరిగించినందులకు కోపించి సుల్తాన్ వ్యాపారులను శిక్షించాడు. కొందరిని ఉరి తీయించాడు. ఉత్తరదేశానికి చెందిన ఖత్రీ అనే హిందూ వ్యాపారులకు వ్యాపార అనుమతినిచ్చాడు. తర్వాత ఫిరోజ్‌షా కాలంలో ఉరితీతకు గురైన వారి కుటుంబీకులు సుల్తాన్‌కు అపరాధం చెల్లించి తిరిగి వ్యాపారం చేసుకొనే అధికారాన్ని సంపాదించారట. తమ నాణేలను కరిగించడాన్ని ప్రోత్సహించినందులకే విజయనగర రాజులతోను, కాపయనాయకునితోను బహమనీ రాజులకు తీవ్ర విరోధం ఏర్పడిందని నాటి రచయితలు పేర్కొన్నారు ముఖ్యంగా ఈ కారణం వల్ల బహమనీ సుల్తాన్ కాపయనాయకుని రాజ్యంపై దండెత్తాడట. ఇదే కాలంలో ఉత్తరదేశంలో వస్తు మార్పిడి పద్ధతి అమలులో ఉంది. కాని దక్కనులో నాణేల చలామణి ఎక్కువ అయింది. అంటే ఆనాటి వ్యాపారం, వాణిజ్యాలు విస్తరించాయని తెలుస్తోంది.

మత పరిస్థితులు: బహమనీ యుగంలో ముస్లిం మతం ప్రధాన మతం అయింది. కాని ఇస్లాంలో సూఫీశాఖ బాగా అభివృద్ధి చెందింది. ఇస్లాం మతం జన్మించింది సామ్రాజ్యాలు స్థాపించడానికి కాదు. మానవునికి స్వేచ్ఛ, సమానత్వాన్ని ప్రసాదించి, ఆత్మజ్ఞానం పొందే అవకాశం మానవునికి కలిగించడానికి ఇస్లాం జన్మించిందని సూఫీ ప్రవక్తలు చాటారు. అంతేకాదు హిందువుల విగ్రహాలను నాశనం చేయడం, హేళన చేయడం కాదు మీరు చేయవలసింది, వారు విగ్రహరూపంలో దేవుని పూజించే విధానం, దేవునియందు వారు చూపే భక్తిని తెలుసుకో, వారి నుండి నేర్చుకో అని కూడా ఆనాటి సూఫీ ప్రవక్తలు ముస్లింలకు హితోపదేశం చేశారు. అందువల్ల ముస్లింలు హిందూతత్వాన్ని గూర్చి ఆలోచించసాగారు. హిందూమతంలో ఉన్న గొప్పదనాన్ని గ్రహించడానికి ప్రయత్నించారు దాంతో హిందూ ముస్లింల మధ్య సహజీవనం అభివృద్ధి చెందింది. సూఫీలు భోగాలను విసర్జించిన విరాగులు, గొప్ప పండితులు భక్తితత్వాన్ని ప్రచారం చేశారు. హిందువులు వారిని ఎంతగానో గౌరవించేవారు. వారు బోధించే త్యాగవైరాగ్య బోధనలు హిందూతత్వానికి చాలా దగ్గరగా ఉండేవి. కనుక వారు హిందూ, ముస్లింల ఇద్దరినీ ఆకర్షించగలిగారు. ఈ కాలంలో షేక్ జియా ఉద్దీన్ దావూద్ గొప్ప ప్రసిద్ధి చెందిన సూఫీ. అతడు మొదటి మహమ్మద్‌షా కాలం నాటి వాడు. ఆయన సుల్తాన్‌ని కూడా దర్శించేవాడు కాదు. కారణం అడిగితే సుల్తాన్

తాగుబోతు, దుర్వ్యసనపరుడని నిర్భయంగా ప్రకటించాడు. అది తెలిసి సుల్తాన్‌కు కోపం వచ్చినా తమాయించుకొని తాగుడు మానేశాడట. మరొక సూఫీ యోగి హజ్రత్ సయ్యద్ జెసూట్‌రాజ్. అతడు ఫిరోజ్‌షా సమకాలికుడు. అతనికి సుల్తాన్ కొన్ని గ్రామాలను ఈనాంగా ఇచ్చాడు. హిందూ, ముస్లింలు కూడా ఆయనకు శిష్యులయ్యారు. తర్వాత రాజ్యానికి వచ్చిన అహమ్మద్‌షాకు ఆయనకు గల ప్రజాభిమానాన్ని చూసి దడ పుట్టేదట. జెసూట్‌రాజ్ పక్కనే విశ్వేశ్వర శివాలయం ఉండేది. అందులో విశ్వేశ్వరుడనే లింగాయతుడు ఉండేవాడు. అతడు ఆ సూఫీయోగి సహచర్యంలో తాను కూడా సూఫీగా మారాడు. జెసూట్‌రాజ్ మరణించగానే ఆయనకు అహమ్మద్‌షా సుందరమైన సమాధిని నిర్మించాడు. అది ముస్లింలకు పవిత్రమైన దర్గా అయింది. అహమ్మద్‌షా కూడా హిందూ, ముస్లిం భేదం పాటించేవాడు కాదట. అందువల్ల అతన్ని వలీ అంటే యోగిగా పరిగణించేవారట. ముస్లింలు అహమ్మద్‌షా వలీ అని, హిందువులు అలమ్ ప్రభువని పిలిచేవారట. మొత్తం మీద సూఫీ ప్రవక్తల బోధనల వల్ల బహమనీ రాజ్యకాలంలో హిందువులు, ముస్లింలు సహజీవనం చేశారు. మతద్వేషాలు మత సంఘర్షణలు లేకుండా శాంతి నెలకొనగలిగింది.

భాషా సాహిత్యాలు: బహమనీ సుల్తాన్‌ల కాలంలో దక్షిణ భారతదేశంలో అరబిక్, టర్కీ, పర్షియన్ భాషలు ప్రవేశించాయి. సుల్తాన్‌లు అనేక మదర్సాలను నిర్మించి ఆ భాషలలో విద్యను చెప్పించారు. ఆ ముస్లిం విద్యాలయాలు ప్రభుత్వ ధనసహాయంతో నడిచేవి. విద్యార్థులకు కూడా ఉచిత భోజనం పెట్టేవారు. బీదర్, ఎలిచ్‌పూర్, గుల్బర్గాలో విద్యాసంస్థలు నెలకొల్పబడ్డాయి. వాటికి అనుబంధంగా గ్రంథాలయాలు కూడా ఏర్పరిచారు. విదేశాల నుండి అనేక ముస్లిం గ్రంథాలను సేకరించి ఆ గ్రంథాలయాలలో భద్రపరిచారు. ఆ విశ్వవిద్యాలయాలలో ముస్లిం మత విద్యేగాక లౌకిక విద్యలు కూడా నేర్పేవారు. ఖగోళం, గణితం కూడా నేర్పబడేది. ఒకటవ మహమ్మద్‌షా ముస్లిం దేశాల నుండి అనేక మంది విద్వాంసులను రప్పించాడు. హరూన్‌ఖాన్ షేర్వాని రాశాడు. అనేక చోట్ల నుండి మంచి గ్రంథాలు తెప్పించారని ఫెరిష్టా రాశాడు. బీదరు విదేశీ పండితులతో నిండి ఉండేదట. షేక్ ఇబ్రహీం అనే కవి మారిఫుల్ ఉలుమ్ అనే గ్రంథాన్ని రాసి రెండవ అహమ్మద్‌షాకు అంకితం ఇచ్చాడు. మహమ్మద్ గవాన్ విద్యాసంస్థలను, గ్రంథాలయాలను ఇంకా పెంచాడు. భారతదేశం ఈర్ష్య పడే విధంగా బీదరు గొప్ప విద్యాకేంద్రంగా ఉండేదట. మౌలానా నూరుద్దీన్, జలా ఉద్దీన్ దవాని, షేక్ నద్రుద్దీన్, అబ్దుల్ రహమాన్, రవాసి మొదలైన వారు నాటి గొప్ప విద్వాంసులు. కాని సుల్తాన్‌లు సంస్కృతాన్ని గాని, దేశిభాషలను గాని ఆదరించలేదు. కాని అనేక మంది వివిధ భాషలకు చెందిన వారిని వివాహం చేసుకున్నారు. ఫిరోజ్‌షా తన భార్యలతో వారి వారి భాషలలోనే మాట్లాడేవాడట. కనుక సుల్తాన్‌లు హిందువుల భాషలు కూడా నేర్చుకున్నారని భావించవచ్చును.

శిల్పకళ: బహమనీ సుల్తాన్ కాలంలో ముస్లిం శిల్పకళ అద్భుతంగా అభివృద్ధి చెందింది. వారు పర్షియా, టర్కీ అరేబియా శిల్పకళా లక్షణాలతో అనేక రాజభవనాలు, మసీదులు, సమాధులు నిర్మించారు. డోములు, గుంబజ్‌లు, ఆర్చీలు, పైకప్పు లేని చతురస్రాకారపు ఖాళీస్థలాలతో, మీనారులతో నిర్మాణాలు చేశారు. వాటిపై ఖురానులోని సూక్తులతోను, ఇతర అక్షరాలతో, లతలతోను అలంకరణలు చేసేవారు. ప్రపంచంలోనే ప్రసిద్ధి పొందిన హిందూ శిల్పులను కూడా వారు తమ కట్టడాలు నిర్మించడానికి నియోగించారు. వారు ముస్లిం కట్టడాలలో కొన్ని హిందూ రీతులు కూడా మేళవించారు. కనుక క్రమేపీ హిందూ ముస్లిం మిశ్రమ లక్షణాలతో ముస్లిం కట్టడాలు నిర్మింపబడ్డాయి. ఒకటవ మహమ్మద్ గుల్బర్గాలో జామీ మసీదును నిర్మించాడు. అందులో ప్రార్థన స్థలానికి పైన డోమ్ నిర్మించారు. దేశంలో మరే మసీదులో ఇలాంటిది లేదు. ఇది హిందూ శిల్పకళా సంప్రదాయం. అలాగే నాలుగు చిన్న స్తంభాలకు బదులు నాలుగు డోములు నిర్మించారు.. అక్కడే మరో రెండు సమాధులు నిర్మింపబడ్డాయి. అందులో ఒకటి తుగ్లక్ వాసుశైలిలోను, రెండవది హిందూ ముస్లిం మిశ్రమశైలిలోను నిర్మించబడ్డాయి. మొదటి మహమ్మద్‌షా, ఫిరోజ్‌షా మధ్య 20 సంవత్సరాల కాలంలో హిందూ ముస్లిం సంస్కృతుల మధ్య సమ్మేళనం ఒక స్థాయికి చేరింది. ఫిరోజ్‌షా సమాధి ఇరాని, ఢిల్లీ హిందూ రీతులను మేళవించి నిర్మించారు. ఇది చాలా పెద్ద భవనం. మహమ్మద్ సమాధికి ఫిరోజ్‌షా సమాధికి చాలా తేడా కనిపిస్తుంది. హజ్రతజెసూ, ఆయన కుమారుని సమాధులు, ఫిరోజ్‌షా సమాధి రీతిలోనే నిర్మించారు. బీదర్‌లోని దర్బారు మిశ్రమశైలిలో నిర్మింపబడింది. దాని ద్వారాలు, ఆర్చీలు హిందూ సంప్రదాయంలో నిర్మించారు. దానిని నిర్మించింది మొదటి అహమ్మద్‌షా. బీదర్‌లోని షాక్‌తాముల్లా సమాధికి పైకప్పు లేదు. మహమ్మద్ గవాన్ విద్యాలయాన్ని రంగు రంగుల రాళ్లతో నిర్మించాడు.

గోల్కొండ యుగంలో ఆంధ్ర సంస్కృతి

గోల్కొండ యుగంలో సాంఘిక పరిస్థితులు - ఆధారాలు: గోల్కొండ నవాబుల కాలం నాటి లేక 17వ శతాబ్దపు ఆంధ్రదేశపు పరిస్థితులను తెలుసుకోడానికి మనకు అనేక ఆధారాలు ఉన్నాయి. విదేశీ యాత్రికులైన ట్రావెర్నియర్, దేవ్‌నాట్ రచనలు, ఫెరిస్తా, ఖాఫీఖాన్ మొదలైన ముస్లిం చరిత్రకారుల రచనలు, సమకాలీన సాహిత్య ఆధారాలైన పొన్నెగంటి తెలగనార్యుడు రచించిన యయాతి చరిత్ర, అద్దంకి గంగాధరకవి రాసిన తపతి సంవరణోపాఖ్యానం, మట్ల అనంతభూపాలు కకుత్సక విజయం, మల్లారెడ్డి రచించిన పద్మపురాణం, షట్చక్రవర్తి చరిత్రం, భద్రాద్రి శతకం, సింహాద్రి శతకం, భక్త రామదాసు రచించిన దాశరథీ శతకం ముఖ్యమైనవి.

సాంఘిక పరిస్థితులు: గోల్కొండ నవాబుల కాలంలో అంటే 17వ శతాబ్దంలో ఆంధ్రదేశంలో హిందువులు, ముస్లింలు రెండు ప్రధాన వర్గాలుగా ఉన్నారు. ఉభయులు ప్రభుత్వ ఉద్యోగులుగా, వర్తకులుగా జీవితాన్ని గడిపారు. హిందువులు అదనంగా వ్యవసాయ వృత్తిని కూడా సాగించారు. ముస్లింలు వ్యవసాయంపై అంతగా ఆసక్తి చూపించలేదు. ముస్లింలు ఉన్నతోద్యోగాలు చేస్తూ సమాజంలో ఉన్నత స్థానంలో ఉంటూ శ్రీమంతులుగా విలాస జీవితాన్ని గడిపారు.

బ్రాహ్మణులు: సమాజంలో బ్రాహ్మణులకు గొప్ప పలుకుబడి ఉందని బౌర్ రాశాడు. వారు గొప్ప విజ్ఞానులు. వారికి ఖగోళశాస్త్ర పరిజ్ఞానం ఉంది. ఏఏ గ్రహాలు ఎప్పుడు ఎక్కడ ఉంటాయో ఖచ్చితంగా లెక్కలు కట్టగలిగే శక్తి వారికి ఉంది. గ్రహణాలను ఖచ్చితంగా చెప్పగలరు. గణితంలో గొప్పవారు. వారు విజ్ఞానాన్ని ఎవరికీ చెప్పరు. లోపలే దాచుకుంటారు. అందువల్లనే ముస్లిం యుగంలో హిందూ విజ్ఞానం, సంస్కృతి నశించకుండా నిలిచి ఉంది. ముస్లింలు హిందూ గ్రంధాలు తగులబెట్టినా వారి విజ్ఞానం బ్రాహ్మణుల బుర్రలలో భద్రంగా ఉందని మేత్ ఓల్డు రాశాడు. ముస్లిం పాలకులు వారిని తమ ఆస్థానాలలో గణకులుగా నియమించుకున్నారు. కొందరు బ్రాహ్మణులు ఉన్నత ఉద్యోగాలు, మిరాసీదార్లుగా పనిచేస్తూ ఉన్నారు. అందువల్ల బ్రాహ్మణుల పరిస్థితి మెరుగ్గా ఉంది. కొందరు పన్ను గుత్తలు కూడా తీసుకున్నారు. అబుల్‌హసన్ కాలంలో అతని మంత్రి సయ్యద్ ముసాఫిర్ సలహాతో ఒక బ్రాహ్మణ గుత్తదారు వద్ద అప్పు తీసుకున్నాడు. కొందరు వడ్డీ వ్యాపారం కూడా చేస్తున్నారని ఫ్రేయర్ రాశాడు. మరికొందరు వ్యవసాయం చేసేవారు. వారికి గాదెలనిండా ధాన్యం నిల్వ ఉండేది. పశువులు కూడా ఉన్నాయి. ఆవులు, ఎద్దులు, గేదెలు, గొర్రెలను పోషించారు. కొందరు భిక్షాటన చేసేవారు. గ్రహణాలప్పుడు దానాలు పుచ్చుకొనేవారు. కొందరు గ్రామ కరణాలుగా, ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేసేవారు. అలాంటి వారిని నియోగులనేవారు. కొందరు దేవాలయాలలో పూజారులుగా పనిచేసేవారు. విదేశస్తులు వారి చర్యలను గర్హిస్తూ రాశారు. పూజారులుగా ఉన్న బ్రాహ్మణులు అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. దేవుడు కోరుతున్నాడని మోసగించి చెరుస్తున్నారని మనుస్సీ రాశాడు. తిరుపతి దేవాలయంలోని అర్చకులు చేసే ఈ మోసాన్ని గ్రహించి ఒక యువతి తన అన్న సహాయంతో తప్పించుకొని పుదుచ్చేరి వెళ్లి క్రైస్తవ మతంలో చేరారని మనుస్సీ ఉదహరించాడు. అతడు నాసికాత్రయంబకంలో కూడా ఇలాంటి చర్యలే సాగుతున్నాయని రాశాడు. టావెర్నియర్ బెజవాడ కనకదుర్గ ఆలయంలో జరిగిన మరొక సంఘటనను వర్ణించాడు. ఒకామె భర్త మరణించాడు. పిల్లల్ని పెంచే మార్గం చెప్పాలని ఆమె ఉపవాసం చేస్తూ దేవుని గుడి ముందు కూర్చుందని, దేవుడు చెప్పే వరకు అలాగే ఉండమని అక్కడి పూజారి ఆమెకు చెప్పాడని, ఆమె చనిపోతుందని తాను తలచి నిజం తెలుసుకోవాలని అర్ధరాత్రి గర్భగుడిలోకి వెళ్లానని, గర్భగుడిలో గోడలో ఒక రంధ్రం ఉందని, ఆ రంధ్రం గుండా దేవుడు మాట్లాడినట్లు పూజారులే ఏదో చెప్పే వారని తాను గ్రహించానని, ఇంతలో పూజారి వచ్చి దేవాలయాన్ని అపవిత్రం చేశానని తన మీద కేకలు వేశాడనీ, తాను రెండు రూపాయలు చేతిలో పెట్టగా శాంతించాడని ట్రావెర్నియర్ అనే యాత్రికుడు వర్ణించాడు. అలాగే సతీసహగమనాన్ని కూడా బ్రాహ్మణులే ప్రోత్సహిస్తారని, సహగమనం చేసే స్త్రీలు బంగారు ఆభరణాలతో చితిలోకి దూకాలని నిబంధన పెట్టారని ఆమె కాలి బూడిదకాగానే చితిలోని బూడిదలో ఉండే బంగారాన్ని వారు తీసుకుంటారని, అందుకే వారు సహగమనాన్ని ప్రోత్సహిస్తారని టావెర్నియర్ రాశాడు. సతీసహగమనాన్ని జరగకుండా చూడాలని ముస్లిం పాలకులు ప్రయత్నించే వారని, తమ చావును కోరే బ్రాహ్మణుల నుండి తమ ప్రాణాలు కాపడటానికి ప్రయత్నించే

ముస్లింలు తమకు పాలకులైనందువల్ల భారత స్త్రీలు సంతోషిస్తున్నారని తెవెనా అనే అతడు రాశాడు. దేవుని రథచక్రాల కిందపడి ప్రాణాలు వదిలితే మోక్షం వస్తుందని చెప్పి అలా వారిని కూడా ప్రోత్సహించేది బ్రాహ్మణులేనని, జ్యోతిష్యాలు, శకునాలు చెప్పి ప్రజలలో మూఢనమ్మకాలు కలిగించేది కూడా వారేనని ఫ్రయర్ అనే అతడు రాశాడు. వీరి రాతలను బట్టి చూడగా విదేశీ యాత్రికులకు బ్రాహ్మణులపై చాలా హీనమైన భావన ఉన్నట్లు కనిపిస్తుంది.

వైశ్యులు: వైశ్యులు వారి సాంప్రదాయక వర్తకం చేసేవారు. వారు గొప్ప కార్యశూలులని, ఉపాయపరులని బాగా లెక్కలు కడతారని, అతికష్టమైన సమస్యలను కూడా చిటికెలో పరిష్కరిస్తారని, ప్రపంచంలోనే వారిని గొప్ప గణితవేత్తలని చెప్పవచ్చని బౌర్ రాశాడు. వారిని కోమట్లు అని అంటారని, వారు దేశమంతా తిరుగుతూ బట్టలు కొని తెచ్చి విదేశస్తులకు అమ్ముతారని మంచి లాభాలు తీస్తున్నారని మెత్ ఓల్డ్ రాశాడు. వారు కిరాణా సరుకులు కూడా అమ్ముతారని రాశాడు. ఏ బంగారం ముక్కను చూసినా క్షణంలో దాని నాణ్యతను తెలుసుకొని దాని విలువ కడతారని కూడా అతడు రాశాడు.

శూద్రులు: శూద్రులు, వ్యవసాయదారులు, ఇతర వృత్తులు చేసుకుంటారని, శూద్రులలో అధిక కులస్తులు రాజుల వద్ద సేనాధిపతులు, సైనికులుగా పనిచేస్తూ ఉంటారని మెత్ ఓల్డ్ రాశాడు. కమ్మ, వెలమ, రెడ్డి, బలిజ కులస్థులు సైనిక వృత్తిలో ఉండేవారు. మిగిలిన శూద్రకులాలైన కుమ్మరి, కమ్మరి, ప్రత్తి, చొల్ల, కాసె, కంచర, అగసాల, సాలె, వఢ్రంగి, తొగడజెట్టి, జాంఢ్రగాంఢ్ర, సాతాని, కటిక, బెస్త బోయ, మేదర మొదలైన కులాలు తమ కుల వృత్తులను చేసుకొనేవారు.

స్త్రీల పరిస్థితి: కుతుబ్‌షాహీల కాలంలో ఆంధ్రదేశంలో స్త్రీల పరిస్థితి దుర్భరంగా తయారైంది. బాల్య వివాహాలు, సతీసహగమనాలు ఎక్కువయ్యాయి. మగపిల్లవాడికి 5 సంవత్సరాలకు, ఆడపిల్లకు 3 సంవత్సరాలకే వివాహం చేసేవారట. పెద్ద కులాల స్త్రీలు ఇళ్లలోనే ఉండేవారు. కాని చిన్న కులాల స్త్రీలు సంఘంలో స్వేచ్ఛగా తిరిగే వారని ఫ్రయర్ రాశాడు. బహుభార్యాత్వం నిషేధం కాదు గాని హిందువులలో ఎక్కువ మంది బహు భార్యలను చేసుకోరు, ఒకే భార్యతో ఉంటారు. కొందరు బహుభార్యలను చేసుకున్నవారు కూడా ఉన్నారు, కాని తక్కువ. వ్యభిచారం ఉంది. సంసార స్త్రీ వ్యభిచారం చేస్తే ఆ స్త్రీకి శిక్ష వేసేవారు. వితంతువులది చాలా అధమ స్థితి అని విదేశస్తులు రాశాడు. వారు మంచి బట్టలు ధరించకూడదు. ఇంటి చాకిరీ అంతా వారే చేయాలి. పుట్టింట్లో కుటుంబ గౌరవం అంతా వారిపైనే ఉంది అంటూ మాటలతో చిత్రహింసలు పెడతారని ఆ మాటలు భరించలేక కొందరు ఇళ్ల నుండి పారిపోయి ఎవరికో ఉంపుడుగత్తెలుగా అవినీతిలోనే జీవిస్తూ ఉంటారని, మరికొందరు చిత్రహింసలు భరిస్తూనే జీవచ్ఛవంగా జీవిస్తూ ఉంటారని, పుట్టింటిలో చాకిరీ చేస్తూ అవమానాలు సహిస్తూ, లేకపోతే ఎవరికో ఉంపుడుగత్తెగానో జీవించడం కన్నా చావడం మేలని కొందరు భావించి సహగమనం చేస్తారని ఆనాటి విదేశస్తులు తమ రాతలలో రాశారు. కొందరు బంధువులకు దూరంగా ఉంటూ అవినీతితో కుటుంబాలకు అప్రతిష్ట తెస్తారని, కొందరు బంధువులు అది భరించలేక వారే విషం పెట్టి వితంతువులను చంపుతుంటారని మెత్ ఓల్డ్ రాశాడు.

వేశ్యలు: సమాజంలో వేశ్యావృత్తి ఉండేది. పాలకులు వేశ్యావృత్తిని అంగీకరించారు. గోల్కొండలో 20 వేల మంది వేశ్యలుండేవారని టావెర్నియర్ రాశాడు. వారిపై పన్ను లేదని, కాని వారు ప్రతి శుక్రవారం సుల్తాన్ దర్బారుకు వచ్చి నృత్యం చేయాలని రాశాడు. గోల్కొండ రాజ్యంలో వేశ్యలు కల్లు దుకాణాలను కూడా నడిపేవారని టావెర్నియర్ రాశాడు.

దేవదాసీలు: దేవదాసీ వృత్తి కూడా ఉండేది. ఇది పూర్వం నుండి ఉండేది. వేశ్యలాగే సమాజంలో గౌరవ ప్రతిష్టలుండేవి. గోల్కొండ యుగంలో కూడా వారికి గౌరవ ప్రతిష్టలు అంతకు పూర్వం లాగే కొనసాగాయని తెలుస్తోంది. వారు వివాహాలు చేసుకోడానికి నిరాకరించేవారని విదేశస్తులు రాశారు. వివాహమాడి భర్త చేతిలో హింసలు పడుతూ అతడు మరణిస్తే సహగమనం చేసేకన్నా, లేదా ఇంటి చాకిరీ చేస్తూ అవమానాలతో జీవించేకన్నా ఇదే బాగుందని చెప్పారని బౌర్ అనే అతడు రాశాడు. దేవదాసీలలో చాలా మంది ధనవంతులని, శరీరాన్ని పరిశుభ్రంగా ఉంచుకొని అనేక ఆభరణాలు ధరిస్తారని మేత్ ఓల్డ్ వర్ణించాడు.

సతీసహగమనం: గోల్కొండ యుగంలో ఆంధ్రదేశంలో ఉన్న భయంకర దురాచారం సతీసహగమనం. ఈ కాలంలో ఆంధ్రదేశాన్ని దర్శించిన విదేశీయాత్రికులు అనేకులు స్వయంగా సహగమనాన్ని చూసి తమ రచనలలో

విపులంగా పేర్కొన్నారు. బౌరీ, బెర్నియర్, టావెర్నియర్, మేత్ ఓల్డు, ఫ్రయర్, తెవెనా మొదలైన విదేశస్తులు తమ రచనలలో ఈ భయంకర ఆచారాన్ని ఖండిస్తూ రాశారు. బందరు, మద్రాసుల మధ్య కరేదు అనే చోట తాను సహగమనాన్ని చూశానని బౌరీ రాశాడు. అతడు ఆ స్త్రీతో మాట్లాడి, ఎందుకు ప్రాణాలు తీసుకుంటావు అని అడిగాడట, ఆమె నవ్వి సహగమనం చేయడానికి నాకు చాలా సంతోషంగా ఉంది అని చెప్పి తన తలలోని పువ్వులను తీసి అతనికి ఇచ్చి అందరికీ నమస్కరించి చితిలో దూకింది అని వర్ణించాడు. కొందరు స్త్రీలు సతికి అంగీకరించరనీ, అలాంటి సందర్భంలో బ్రాహ్మణుల ప్రోద్బలంతో వారిని మంటలలోకి తోసివేస్తారని బౌరీ రాశాడు. ఆ విధంగా చేయబోయిన ఒక 10 సంవత్సరాల బాలికను ఇంగ్లిష్ నావికులు కాపాడి తమ స్థావరానికి తీసుకువెళ్లారని, ఆమె తేరుకున్న తర్వాత తాను అక్కడికి ఎలా వచ్చానని అడిగిందని, వారు తాము కాపాడామని చెప్పి అలా ఎందుకు సతి చేయడానికి అంగీకరించావని అడుగగా బ్రాహ్మణులు, పెద్దలు చెప్పిన మాటల వల్ల అంగీకరించానని తెలిపిందని, తర్వాత ఆమె క్రైస్తవమతం పుచ్చుకొని మచిలీపట్టణం ఫ్యాక్టరీలో పనికి చేరి పోయిందని బౌర్ రాశాడు. బెర్నియర్ తాను ఆరు సహగమనాలను చూశానని రాశాడు. అతడు సహగమనానికి ఎందుకు ఈ స్త్రీలు అంగీకరిస్తున్నారనే కారణాలను అన్వేషించాడు. భర్తతో సహగమనం చేయడం పుణ్యమని, ఇహలోకంలో కీర్తి అని తల్లులే కూతుళ్లకు బోధిస్తున్నారని గ్రహించాడట. అంతేగాదు, సహగమనం చేయని స్త్రీకి సంఘంలో గొప్ప అగౌరవమని, దానిని భరించలేక సహగమనం చేస్తున్నారని గ్రహించాడట. గౌరవంగా జీవించాలని అనుకొనేవారు సంఘ కట్టుబాట్లను ధిక్కరించలేరు. ధిక్కరిస్తే ఆ గౌరవం, అందుకే ఈ అమాయక స్త్రీలు బలైపోతున్నారు అని తన గ్రంథంలో వివరంగా రాసుకున్నాడు. ఒక స్త్రీ సహగమనానికి సిద్ధపడగా తన పిల్లల భవిష్యత్తు చూసి అయినా చేయవద్దని హితవు చెప్పాడట. అలాగే మరొక స్త్రీని కూడా ఆపాడట. కాని సంఘంలో వారికి కలిగిన అగౌరవానికి వారు తల్లడిల్లిపోయారట. 12 సంవత్సరాల బాల వితంతువు సహగమనానికి అంగీకరించకుండా భయంతో ఏడుస్తూ ఉంటే బంధువులే ఆ పిల్లలను ఎత్తి విసిరి మంటలలో వేశారు. ఆ ఘోరాన్ని చూడలేకపోయానని అతను రాసుకున్నాడు. మరొకామె నిర్భయంగా మంటలోకి ఉరికిందని ఆమెతోపాటు ఆమె సేవకులు ఐదుగురు మంటలలో దూకారని రాశాడు. ఒక స్వర్ణకారుని భార్య సహగమనం చేయడానికి మచిలీపట్టణం కొత్వాలు అనుమతి ఇవ్వలేదట. అందుకు ఆమె ఉరిపోసుకొని చనిపోయిందని ఫ్రయర్ రాశాడు. ఒకామె సహగమనం చేయడానికి వెళ్తుందని తెలిసి ఒక బ్రిటిష్ సైనికుడు అక్కడికి వెళ్లి తుపాకితో చంపుతానని అందరినీ బెదిరించి చెదరగొట్టాడు. ఆ అమ్మాయిని సహగమనం చేయవద్దని హితవు చెప్పాడు. కాని ఆమె వినలేదు, మంటలలో దూకిందని ఫ్రయర్ మరొక సంఘటనను వర్ణించాడు. కొందరు పారిపోయి అవినీతిగా జీవిస్తూ ఉంటారని అతడే రాశాడు. సహగమనం చేయకపోతే వితంతువుగా తన పుట్టింట బండచాకిరీ చెయ్యాలి లేదా కూలీ నాలీ చేసుకొని బతకాలి, లేదా ఎవరికైనా ఉంపుడుకత్తెగా ఉండాలి. అలా ఉందామన్నా వదలరు నిర్బంధంగా మంటలలో పడవేస్తారు. పారిపోయి ఎలాగో బతుకుదామన్నా గౌరవ మర్యాదలు లేవు. హీనాతి హీనంగా చూస్తారు. ఎవరో ఒకరు దిగజారుస్తారు. ఈ నరకం భరించేకన్నా చావడం మేలని చాలా మంది సహగమనం చేస్తున్నారని తెవెనా అనే వైద్యుడు రాశాడు.

ముస్లిం పాలకుల విధానం: సహగమనం విషయంలో ముస్లిం పాలకులు కొంతవరకు ఉదారంగా ప్రవర్తించారని నాటి వారి రాతలు తెలుపుతున్నాయి. వారు సహగమనానికి వ్యతిరేకులు. అది అన్యాయమైన క్రూర ఆచారమని వారు భావించి, దానిని నిరోధించడానికి ప్రయత్నించారని సహగమనం చేయదలచుకున్న స్త్రీ స్థానిక సుబేదారు అనుమతి తీసుకోవాలని నియమం పెట్టారు. ఆ సమయంలో అతడు సహగమనం చేయవద్దని చెప్పి చూస్తాడు. తన జనానాలోకి పంపి తన బేగంల చేత చెప్పిస్తాడు. అప్పటికీ వినకపోతే అనుమతి ఇస్తాడని తెవెనా రాశాడు. ముస్లిం పాలకులు ఈ దురాచారాన్ని మాన్పడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారని బౌరీ రాశాడు. కాని హిందువులు వినడం లేదు, తమ మతాచారాలలో ముస్లింలు కల్పించుకోరాదని కోరుతున్నారు. తమ పాలనపై తిరుగుబాట్లు వస్తాయేమోనని వారు గట్టిగా ఏమీ చేయలేకపోతున్నారని కూడా రాశారు. కనుక కొందరు ముస్లిం సుబేదారులు తమకున్న అధికారాన్ని దుర్వినియోగం చేసి ధనాన్ని సంపాదిస్తున్నారని కూడా కొన్ని సంఘటనలను తెలిపాయి. టావెర్నియర్ ఒక సుబేదార్ వద్దకు వెళ్ళాడట. ఆ సమయంలో ఆ సుబేదార్ ఒక స్త్రీని సహగమనం చేయవద్దని హితోపదేశం చేస్తూ ఉన్నాడట. అంతలో అతని గుమస్తా వచ్చి సంజ్ఞ చేశాడట. వెంటనే సుబేదార్ ఆమెకు సహగమనం చేయడానికి అనుమతిని ఇచ్చాడట. ఇది చూసిన టావెర్నియర్ మహమ్మదీయుల

ఉద్యోగులకు హిందువులు లంచాలు ఇచ్చి కూడా సతీసహగమనాన్ని అమలు చేసుకుంటున్నారని రాశాడు. అంతేగాక స్త్రీలకు సహగమన సమయంలో ఉమ్మెత్తకాయ రసం, ఇతర మత్తుపదార్థాలు ఇచ్చి చితి దగ్గరకు తెస్తారని, ఆ మత్తులో ఆమె చితిలోకి దూకుతుందని కూడా రాశాడు.

ఈ వర్ణనలు, సంఘటనలను బట్టి చూస్తే కొందరు స్త్రీలు ఇష్టపూర్తిగాను, మరికొందరు బలవంతంగాను సహగమనం చేసే వారని తెలుస్తోంది. ఏమైనా ఈ సహగమనం వల్ల స్త్రీ దారుణమైన దురవస్థను ఎదుర్కొందని స్పష్టంగా చెప్పవచ్చును. ముస్లింలు తమ స్త్రీలను ఇళ్లలో నుండి బయటకు రానిచ్చేవారు కాదు. బయటకు వస్తే పరదాలు కప్పుకొని వచ్చేవారు.

ఇతర మూఢాచారాలు: జ్యోతిష్యం, జాతకాలు, శకునాల మీద నమ్మకాలు ఉన్నాయి. హిందువులకే గాక ముస్లింల సుల్తాన్‌లు కూడా ఈ మూఢాచారాలను బాగా వంట పట్టించుకున్నారు. వారు కూడా దుష్ట ఘడియలు, దుర్ముహూర్తాలు, రాహుకేతువులను నమ్మసాగారు. తిరువళ్లూరు దేవాలయంలో ఆత్మార్పణలు చూశానని, పూరీ జగన్నాథ ఆలయ రథచక్రాల కిందపడి మరణించే వారని, వీటన్నింటిని స్వయంగా చూశానని ఎవరూ అడ్డు చెప్పరని అది పుణ్యప్రదంగా భావిస్తారని బెర్నియర్ రాశాడు. ఇంకా సిరిమాను ఊగడం, దేవతలకు కొలుపులు కొలిచి బలులు ఇచ్చే ఆచారం ఉందని రాశారు. అలాగే గోవులను పూజిస్తారని, పండుగలప్పుడు గొప్ప ఉత్సవాలు జరుపుకొంటారని కూడా రాశారు. ఒంటి బ్రాహ్మణుడు, కంచి బ్రాహ్మణుడు, పిల్లి, పాము ఎదురైతే దుశ్శకునమని భావించేవారు. గద్ద మంచి శకునమని తలచేవారు. కీడు జరుగుతుందని తెలిస్తే శాంతి చేయించుకుంటే కీడు తొలగుతుందని నమ్మేవారు. ఎరుకసాని చేత సోది చెప్పించుకొనే ఆచారం కూడా ఉండేది.

ముస్లింలు: బహమనీ సుల్తాన్‌ల కాలంలో ముస్లిం జనాభా తెలంగాణకు మాత్రమే పరిమితమై ఉండేది. గోల్కొండ యుగంలో ముస్లిం పాలన ఆంధ్రదేశమంతటా విస్తరించింది. గ్రామాలలో కూడా విస్తరించి స్థిరపడ్డారు. కుతుబ్‌షాహీలు మతాంధ్రీకరణను ప్రోత్సహించలేదు. పరమత సహనం కూడా చూపించారు. కాని స్థానిక ముస్లిం అధికారులు కొందరు హిందువులను వేధించారు. హిందూ స్త్రీలను చెరపట్టారు. గోవులను చంపి గోమాంసం భుజించేవారు. బ్రాహ్మణుల వేదాధ్యయాలకు, పురాణ పఠనాలకు ఆటంకాలు కలిగించారు. హరి భజనలు సరిగా సాగనీయలేదు. మౌల్వీలు, సయ్యద్‌లు, ఫకీర్లు ముస్లిం మత ప్రచారం చేసేవారు. వారి ప్రభావం వలన పర్షియా, ఉర్దూ భాషలు కూడా తెలుగులో ప్రవేశించాయి. బ్రాహ్మణులు, హిందూ సన్యాసులు కొన్ని ఇబ్బందులు పడ్డారు. కొన్ని దేవాలయాలు ధ్వంసం చేయబడ్డాయి. వాటి స్థానాలలో మసీదులు నిర్మింపబడ్డాయి. కొండపల్లిలో ఒక దేవాలయాన్ని కూల్చి దాని మీద మసీదు నిర్మించారు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆంధ్రులు తమ దేశంలో రెండవ తరగతి ప్రజలుగా దిగజారిపోయారు. డా॥ నేలటూరి వెంకటరమణయ్య కుతుబ్‌షాలు ఆంధ్రులే అన్నారు గాని ఆయన భావించినంత సత్యం లేదు. కుతుబ్‌షాలు కూడా గోల్కొండ రాజ్యాన్ని దారుసల్తనత్‌గానే ప్రకటించుకున్నారు. గోల్కొండ పట్టణానికి కులీకుతుబ్‌షా మహమ్మద్‌నగర్ అని పేరు పెట్టుకున్నాడు. ఆంధ్రులు రెండవ తరగతి ప్రజలగానే చూడబడ్డారు. వారిపై జిజియా పన్ను కూడా విధించబడింది. హిందూ దేవాలయాలు కూడా ధ్వంసం చేయబడ్డాయి. కొండవీడులో ఒక పెద్ద దేవాలయం ముందు భాగం మసీదుగా మార్చబడింది. వెనుక భాగం నేటికీ అలాగే శిథిల దేవాలయంగా నిలిచి ఉంది. రుస్తుంరావ్ అక్కన్న, మాదన్నలు గోల్కొండ రాజ్యంలో ఉన్నతోద్యోగులుగా పదవులు నిర్వహించడం ఎంతో మంది ముస్లింలు సహించలేకపోయారు. వారిని వధించిన దాకా నిద్రపోలేదు. గిరిధారిలాల్ మాదన్న తెలుగు బ్రాహ్మణుడు, అతనికి సాటి ఎవరూ లేరని రాశాడు. అలాంటి ప్రధానమంత్రి గోల్కొండ నడి వీధిలో హత్యకు గురయ్యాడు. ఈ విషయాలను పరిశీలించినట్లయితే నేలటూరి వెంకటరమణయ్య అభిప్రాయంలో వాస్తవం లేదని భావన కలుగుతోంది.

ఆహార విహారాలు: గోల్కొండ యుగంలో ప్రజల ప్రధాన ఆహారం వరి, జొన్న, మొక్కజొన్న, గోధుమ, కూరలు, నెయ్యి, పచ్చళ్లు ఎక్కువగా వాడేవారు. బ్రాహ్మణులు పొంగలి, పులిహోర, దద్యోజనం, పప్పు, నెయ్యి, వడలు, దోసెలు, వడియాలు, అప్పడాలు, గారెలు, బూరెలు, చక్కిడాలు మొదలైన పిండివంటలు చేసుకొని భోంచేసేవారు. సామాన్య ప్రజలు సజ్జ, జొన్న, మొక్కజొన్న, రాగి, కొర్ర, వరి అన్నం తినేవారు. ఆనాటి వరి ధాన్యంలో అనేక రకాలుండేవి. జమీందారులు, బ్రాహ్మణులు, ఉన్నత వర్గాల వారు వరి అన్నం భుజించేవారు. మహ్మదీయులు మాంసాహారులు. వారు గోధుమ రొట్టెలు, పలావు, పలు రకాల మాంసాహారాలు భుజించేవారు. ఈ కాలంలో తాంబూలం వేసుకొనే ఆచారం ఉండేది. ధనిక, పేద తారతమ్యం లేకుండా అందరూ తాంబూలం వేసుకొనేవారు.

ముస్లింలు కూడా తాంబూలం వేసుకొనేవారు. శ్రీమంతులు కర్పూర తాంబూలం వేసుకోగా పేద వారు సున్నం, వక్కలతో సాదా తాంబూలం వేసుకొనేవారు.

దుస్తులు: సమాజంలో వివిధ తరగతుల వారు వివిధ రకాల దుస్తులు ధరించేవారు. కుతుబ్‌షాహీ సుల్తానులు మొదట టర్కీ శైలిలో దుస్తులు ధరించేవారు. కాలక్రమేణా స్థానిక పద్ధతులకు అలవాటుపడి స్థానిక దుస్తులు వాడేవారు. మహమ్మద్ కులీకుతుబ్‌షా టర్కీ టోపి ఉన్న కోటులకు బదులుగా ప్రాంతీయ దుస్తుల ధరించారు. ఏచ్‌దార్, పగిడిమల్లు, చొక్కా, వెనుక వైపు ముసుగు, తెల్లని పైజామా ధరించేవాడు. గడ్డం తీయించి వేశాడు. చేతులు మడిచి అచ్చం తెలంగాణ ప్రజలు ధరించే వేషాన్ని ధరించేవాడు. ముస్లింలు లుంగీ జుబ్బా లేక లాల్చీ లేక పేటాలు ధరించేవారు. కొందరు షేర్వాణి, క్రౌజరు, టర్కీ టోపి వాడేవారు. ముస్లిం స్త్రీలు మెడ నుండి మోకాళ్ల వరకు వేలాడే చౌలీలు ధరించేవారు. అవి చేతులు కూడా పూర్తిగా కప్పబడి ఉండేవి. తర్వాత చౌలీల స్థానంలో పద్ధను పొట్టి జాకెట్లు వాడుకలోకి వచ్చాయి. కాలక్రమేణా ముస్లిం స్త్రీలు కూడా స్థానిక ఆచారాలకు అలవాటుపడి హిందూ స్త్రీలు ధరించే చీరెలు, జాకెట్లు ధరించారు. ముసుగులకు బదులు జుమానీమాలు ధరించే వారు. చిన్నపిల్లలు పావడా ధరించి పైటలు వేసుకున్నారు. అమీరులు తలకు పగిడి, పాదరక్షలు, నడుముకు ఉత్తరీయం ధరించేవారు. దర్బారులకు వెళ్లేటప్పుడు దస్తార్ ధరించేవారు. హిందువులు కూడా అలాగే ధరించే వారు. సామాన్య ప్రజలు అంగరఖా బనియను వేసుకొనేవారు. కర్ణాటకులు జుట్టును పెంచి ముడి వేసుకొనేవారు

హిందువులలో శ్రీమంతులు రంగురంగుల పేటంచుల పట్టుపంచెలు ధరించేవారు. నెత్తిన తలపాగా ధరించేవారు. ముతకకట్టు పంచెలు ధరించేవారు. ధనవంతులైన స్త్రీలు పట్టుచీరెలు, సరగ రవికెలు ధరించేవారు మంచి మంచి అంచులతో అల్లిక గలిగిన రవికెలను సరిగ రవికెలు అనేవారు. పేద స్త్రీలు ముతక చీరెలు, సాదా రవికెలు ధరించేవారు. స్త్రీలందరూ ధనిక, పేద తారతమ్యం లేకుండా నుదుట బొట్టు పెట్టుకొని కొప్పులో పూలదండలు తురుముకొనేవారు.

ఆభరణాలు: స్త్రీలు అనేక రకాల ఆభరణాలు ధరించేవారు. నక్లెస్‌లు, చంద్రహారాలు ఇతర రకాలైన కంఠహారాలు, మణిహారాలు, పాపటబొట్లు, జడబిళ్లలు, ముత్యాలహారాలు, కాసుల పేర్లు, పగడాల పేర్లు, నెత్తి మీద సూర్యచంద్రవంకలు, గాజులు, కంకణాలు, ఉంగరాలు, చెవికమ్మలు, బుట్టలు, ముక్కుపుడకలు, చేతివంకెలు, వడ్డాణాలు, పవిట పిన్నులు, నాగరం, గీగరం, కాళ్లకు అందెలు, కడియాలు, పట్టాలు మొదలైన అనేక రకాల ఆభరణాలు ధరించేవారు. ప్రత్యేకంగా ముస్లిం స్త్రీలు చెవులకు చుట్టూ బంగారు కాడలు ధరించేవారు. మెడలో బంగారు కంటే, గొలుసులు, చెవులకు పోగులు, దండకడియాలు, గజ్జెల మొలతాడు కూడా ధరించేవారు మహమ్మద్ కులీకుతుబ్‌షా కూడా బంగారు దండ కడియాలు ధరించాడు. కవుల కాళ్లకు బంగారపు గండపెండేరం వేయించేవాడట.

గృహాలు - గృహోపకరణాలు: గోల్కొండ సుల్తాన్‌లు విశాల భవనాలను నిర్మించుకొని వైభవమైన జీవితాన్ని అనుభవించారు. రాజప్రాసాదాలు చాలా గాంభీర్యంగా కనిపించేవి. వారి భవనాలలో విశాలమైన హాలులు, పడక గదులు, విశ్రాంతి మందిరాలు ఉండేవి. ఆ భవనాల కప్పులకు గాజు గిన్నెల దీపాలు ఉండేవి. అవి మెరుస్తూ భవనంలో చక్కని కాంతిని ప్రసరింపజేసేవి. సుల్తాన్‌లు బంగారు, వెండి పాత్రలలో భుజించేవారు. వారి విశాల భవనాలలో రకరకాల బంగారు, వెండి పాత్రలు, గాజు, దంతపు సామాగ్రి ఉండేది. శయ్యామందిరాలలో బంగారపు పట్టెమంచాలు, పట్టుపరుపులు, ముత్యాలజాలీలు, తూగుటుయ్యాలలు, తాంబూలపు భరిణెలు, వట్టివేళ్ల విసనకర్రలు, దీపపుస్తంభాలు, దోమతెరలతో అలంకరింపబడి ఉండేవట. తాంబూలాలకు ప్రత్యేకంగా పాన్‌దాన్‌లు ఉండేవట. ఇంకా అక్కడ రుద్రవీణ, ఫిడేలు మొదలైన సంగీత వాయిద్యాలు కూడా ఉండేవట. రాచభవనం మొత్తం కూడా రంగురంగుల అందమైన తివాచీలు పరచబడి ఉండేది. పన్నీరు, గంధం మొదలైన సుగంధద్రవ్యాలు వాడేవారు. సుల్తాన్‌ల జీవితాన్ని అనుకరిస్తూ వారి వద్ద పనిచేసే ఉన్నత ఉద్యోగాలు అంటే పీష్వా, మీర్జుమ్లా తదితర సరదారులు కూడా అదే విధంగా భవనాలు నిర్మించుకొని విలాస జీవితం గడిపారు. మధ్యతరగతి వారు కూడా సుఖప్రదమైన జీవితాన్ని గడిపినట్లు తెలుస్తోంది. మధ్యతరగతి హిందూ ప్రజల ఇళ్లలో పడకగది, వంటగది, దేవతార్చన గది, అటకలు, విశాలమైన చావడి, బావి, పశువులదొడ్డి, గాదెలు ఉండేవి. గృహ నిర్మాణ విషయంలో మంచి శ్రద్ధ తీసుకొనేవారు. పేదలు పూరిగుడిసెలలో జీవించేవారు. రైతుల ఇళ్లు విశాలంగా పశువులు కూడా ఉండేటట్లు నిర్మించుకొనేవారట. హైదరాబాద్ నగర జనాభా 10 లక్షలు ఉండేదని విదేశస్తుల రాతల

తెలుపుతుండేవి. గోల్కొండ వశమైన తర్వాత రాజభవనంలో ఉన్న విశాలమైన చావడులు, తివాచీలు, బంగారు, వెండి ఆభరణాలు, గాజు సామానులను చూసి మొగలులు అమిత ఆశ్చర్యానికి గురయ్యారట.

వినోదాలు: హిందువులు పండుగలు, జాతరలు, రథోత్సవాలు జరుపుతుండేవారు. దొమ్మరి ఆటలు, తోలు బొమ్మలాటలు, విప్రవినోదాలు, వీధి నాటకాలు, కోడి పందాలు, పులి జూదం ఆనాటి ప్రజల ముఖ్య వినోదాలు. పిల్లలకు బొంగరాలాట, గుడిగుడిగుంచం, బిళ్లంగోడు మొదలైనవి ముఖ్యమైన ఆటలు. దీపావళి, సంక్రాంతి మొదలైన పండుగలను ఉత్సాహంగా జరుపుకొనేవారు. ముస్లింలు రంజాన్, నౌరోజు ఉత్సవాలను వైభవంగా జరుపుకొనేవారు. పీర్ల పండుగ కూడా జరుపుకొనేవారు. పీర్ల పండుగలోనే రోజూ ఉత్సవాలలో హిందువులు కూడా పాల్గొనేవారు.

చలివేంద్రాలు: ఉత్సవాలప్పుడు, పండుగలప్పుడు చలివేంద్రాలను ఏర్పాటు చేసి అందరికీ మంచినీళ్లు ఇచ్చేవారు. ఉత్సవాలను చూడటానికి వచ్చిన పరాయి గ్రామస్తులకు మంచినీళ్లతోపాటు మజ్జి, గంజి కూడా పోసేవారు. వేసవి కాలంలో చలివేంద్రాలు పెట్టి బాటసారులకు దాహం తీర్చేవారు.

రుణ పత్రాలు: అప్పు చేసినట్లయితే ఆ కాలంలో రుణపత్రాలు రాసే అలవాటుంది. మ్రానిపట్టల మీద కొన్ని పసరులతో రాసేవారట.

విద్యాభ్యాసం: ఆ కాలంలో రాజకుమారులు, కులీనులు విద్యను తప్పకుండా అభ్యసించేవారు. హిందువులకు దేవాలయాలు, మఠాలు, ముస్లింలకు మసీదులు, మదర్సాలు విద్యా కేంద్రాలుగా ఉండేవి. ముస్లింలు అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషలలో విద్యాభ్యాసం చేసేవారు. హిందువులకు ఓనమాలు దిద్దటంలో విద్యను ప్రారంభిస్తారు. గుణింతాలు, పద్యాలు నేర్పేవారు. విద్యార్థులు విద్యలో మందకొడిగా ఉంటే గురువులు తొడపాశం పెట్టేవారు. కోదండం వేయించేవారు.

పుణ్య కార్యాలు: నాడు ప్రయాణీకులకు పత్రాలు కట్టించడం బావులు తవ్వించడం, వేసవి కాలంలో చలి వేంద్రాలు పెట్టించి మంచి నీరు ఇవ్వడం పుణ్య కార్యాలుగా భావించేవారు. విజయనగర కాలంలో ఆంధ్ర ప్రజలు ఇంకా సాంఘిక దురాచారాలతో దిగజారిపోయారని, ఆ కాలం కంటే గోల్కొండ రాజ్య కాలం నాటి సాంఘిక పరిస్థితులు కొంత వరకు మెరుగని చరిత్రకారులు భావించారు.

దూదేకుల కులం రూపొందడం: ఈ కాలంలో ఆంధ్ర సామాజిక వ్యవస్థలో జరిగిన మరొక పరిణామం దూదేకుల కులం జన్మించడం. ముస్లిం మతాన్ని స్వీకరించిన హిందువులను టర్కీ ఇరానీ ముస్లింలు తమతో సమానంగా గుర్తించలేదు. వారందరూ వేరు వర్గంగానే చూడబడ్డారు. తత్ఫలితంగా ముస్లిం సమాజంలో మత ప్రాతిపదికన, సాంఘిక ప్రాతిపదికగా రెండు కులాలు ఏర్పడ్డాయి. హిందూ ముస్లింలకు సుల్తాన్ కొలువులో పెద్ద హోదా కలిగిన ఉద్యోగాలు కూడా లభించలేదు. కాలక్రమేపీ వారు దూది ఏకి పరుపులు కుట్టే వృత్తి చేపట్టారు. అందువల్ల వారికి దూదేకుల కులం అనే పేరు వచ్చింది. అంతకుముందు ముస్లింలలో సున్నీ, షియా, సయ్యద్ వహబి, సూఫీ అనే శాఖాభేదాలు మాత్రమే ఉండేవి. దూదేకుల కులం వచ్చిన తర్వాత ముస్లింలలో కూడా రెండు కులాలు ఏర్పడ్డాయి. హిందూ కుల వ్యవస్థ ప్రభావం ముస్లిం సమాజం మీద కూడా పడింది. ఆంధ్ర సమాజం దూదేకుల వారిని ఒక కులంగా చూసేవారు. చాలా గ్రామాలలో నేడు కూడా దూదేకులవారున్నారు.

గోల్కొండ నవాబులు టర్కీ, ఇరాన్ సంస్కృతులతో మూర్తీభవించినప్పటికీ వారు దక్కనులో రాజ్యం స్థాపించుకున్నందువల్ల క్రమేపీ దక్కనీ సంస్కృతిని జీర్ణించుకున్నారు. బహమనీ రాజుల కాలంలో హిందూ ముస్లింల సంపర్కం వల్ల దక్కనీ సంస్కృతి అభివృద్ధి చెందింది. ఇది హిందుస్థానపు సంస్కృతికి భిన్నంగా ఉండేది. బహమనీ రాజ్యం అవతరించిన తర్వాత దక్కను సంస్కృతి బీజాపూర్, బీదర్, గోల్కొండ రాజ్యాలలో కొనసాగింది. కొంత కాలానికి దక్కనీ సంస్కృతిలో స్థానిక లక్షణాలు ప్రవేశించాయి. బీజాపూర్ రాజ్యంలో ముస్లిం, కన్నడ సంస్కృతులు మిశ్రమం చెందగా గోల్కొండ రాజ్యంలో కుతుబ్‌షాహీల సంస్కృతికి తెలుగు సంస్కృతి కలిసిపోయి నూతన సంస్కృతి ఏర్పడింది. ఇదే గోల్కొండ సంస్కృతి లేక కుతుబ్‌షాహీల సంస్కృతి లేక తెలంగాణ సంస్కృతి అని కీర్తి వహించింది.

కుతుబ్‌షాహీలు ఎంతో వైభవంగా జీవించారు. వారు ఎక్కడికి వెళ్లినా ఏనుగులు, అశ్వాలు, పల్లకీల మీద వెళ్లేవారు. వారి వెంట సైనికులు, మంత్రులు, ఇతర పరివారం ఉండేది. వారి అమీరులు కూడా అదే విధంగా వైభవ జీవితం గడిపారు. కుతుబ్‌షాహీలు మరణించక ముందే తమ సమాధులు నిర్మించుకున్నారు. సమాధులపై

ఆకుపచ్చ కంబళ్లను ఆచ్ఛాదనగా వేసి వెండి, బంగారు చిమ్మెలను వెలిగించేవారు. వారు గృహాలలో చీని, పింగాణీ పాత్రలు, బంగారు, వెండి పాత్రలను ఉపయోగించి కళ్లు జిగేల్‌మనే జీవితాన్ని గడిపారు. హైదరాబాద్ నగరంలో విదేశీ వర్తకులు టర్కీ, ఇరాన్, అరేబియా దేశాల నుండి వచ్చే ముస్లిం సరదారులతో ఎంతో సందడిగా ఉండేది అందమైన గృహాలతో సుందరమైన ఉద్యానవనాలతో హైదరాబాద్ నగరం ఎంతో ఆకర్షణీయంగా ఉండేది హైదరాబద్ నగరంలో సాహిత్య సంగీత, నాట్యాలలో సరస సంభాషణలలో చతురులైన వేశ్యలుండేవారు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా కాలంలో వేశ్య వృత్తి అభివృద్ధి చెందింది. అతడు నాట్యకత్తెలను పోషించాడు. ప్రేమావతి తారామతి అనే వారు కుతుబ్‌షా ఉంపుడుకత్తెలు. ఆగ్రా, బురహంపూర్, అహమ్మదాబాద్, లాహోర్, కాబూల్ కర్ణాటక, తెలంగాణల నుండి అనేక మంది వేశ్యలు హైదరాబాద్ చేరి అక్కడ స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. వీరు దర్బారులో నాట్య ప్రదర్శనలు ఇచ్చేవారు. వివాహాలలో భోగం మేళంగా పాల్గొనేవారు. తానీషా కాలంలో ఈ వృత్తి కొనసాగింది. 20 వేల మంది వేశ్యలు ఉండేవారట. వారిని ప్రభుత్వమే పోషించిందట.' వారికి ప్రభుత్వ ఖజానా నుండి 3,24,000 రూపాయలు చెల్లించేవారట.

ట్రావెర్నియర్ గోల్కొండ రాజ్యంలో వైద్యులు లేరు, ప్రజలకు ఆస్పత్రులు లేవని రాశాడు. అది వాస్తవం కాదు. దారుషాషఫీ అనే ఆస్పత్రిని మహమ్మద్ కులీకుతుబ్‌షా క్రీ.శ.1590లోనే కట్టించాడు. అది నేటికీ పని చేస్తోంది. ట్రావెర్నియర్ నగరాలలో పనిచేసే వైద్యులు ఉచితంగా వైద్యం చేస్తారని రాశాడు. దానిని బట్టి ప్రభుత్వమే వైద్యులకు జీతాలిచ్చి పోషించేదని, కుతుబ్‌షాహీల కాలంలో ఆయుర్వేదం, యునాని వైద్య విధానాలేగాక అల్లోపతి వైద్యం కూడా ఉండేదని ట్రావెర్నియర్ రాతల వల్లనే తెలుస్తోంది. హైదరాబాద్‌లో Delaen అనే డాక్టర్ ఇంటిలో తాను కొన్నాళ్లు ఉన్నానని అతడు రాజభవనంలోని రాజకుటుంబానికి వైద్యం చేశాడని ట్రావెర్నియర్ రాశాడు కనుక అల్లోపతి వైద్యం కూడా గోల్కొండ రాజ్యంలో ప్రవేశించిందని చెప్పవచ్చును.

పండుగలు-ఉత్సవాలు: గోల్కొండ సుల్తాన్‌లు ఇస్లాం పండుగలను ఘనంగా జరిపేవారు. ప్రవక్త జన్మ దినాన్ని మొదటి రబీనాడు జరిపేవారు. మొహరం రోజున ఇమామ్ హుస్సేన్ త్యాగదినంగా జరిపేవారు. సుల్తాన్ జన్మదిన ఉత్సవాలు ఘనంగా జరిగేవి. మహమ్మదీయుల ప్రధాన పండుగలలో మొహరం అతి ముఖ్యమైనది. అలి ఫాతియా కుమారులైన హస్సన్, హుస్సేన్ వీరుల స్మారకార్థం శోకతప్త హృదయాలతో జరుపుకొనే పండుగను మొహరం అని అంటారు. మొహరం పండుగనే పీర్ల పండుగ అని కూడా అంటారు. పీర్ అంటే రుషి లేక మహాత్ముడు అని అర్థం. యూఫ్రెటిస్ నదీ తీరాన ఉన్న కర్బలా మైదానంలో హుస్సేన్ అతని అనుచరులు వధించబడ్డారు. ఆ సోదరుల మరణానికి చిహ్నంగా ముస్లింలు పీర్ల పండుగను జరుపుకుంటారు. కుతుబ్‌షాల కాలంలో ఈ పండుగను ఘనంగా జరిపేవారు. ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాలలో ముస్లింలు ఈ పండుగను జరుపుకొని మొహరం గీతాలను ఆలపిస్తారు. చాలా ప్రాంతాల్లో హిందువులు కూడా పీర్ల పండుగలో పాల్గొంటారు

ముస్లింలలోనే ఒక తెగ వారైన దూదేకులవారు ఆటలమ్మ, మారెమ్మ మొదలైన హిందూదేవతలను పూజిస్తారు. వారి పిల్లలకు ఎర్రప్పన, తిమ్మప్ప, ఎల్లమ్మ, బాలమ్మ, నరసింహులు అని పేర్లు పెట్టుకుంటారు. అలాగే హిందువులు కూడా దస్తగిరి, మస్తాన్‌రావు, కుల్లాయమ్మ, లాలమ్మ, ఫకీరప్ప, నబీగౌడు, సేకణ్ణ, సైదులు మొదలైన ముస్లిం పేర్లు పెట్టుకుంటారు. ఇవన్నీ హిందూ ముస్లిం ఐక్యతకు చిహ్నాలు. ముస్లింల కాలమానం రీత్యా సంవత్సరానికి మొదటి తారీఖు మొహరం. ఆ రోజు నుండి 9 రోజులు పీర్ల పండుగను పాటించి 10వ రోజు పీర్లను బావిలోగాని, నదులలోగాని శుభ్రపరచి ఒక పెట్టెలో దాచి పెడతారు.

గోల్కొండ యుగంలో మత పరిస్థితులు

కుతుబ్‌షాహీలు పర్షియా నుండి వచ్చిన షియా ముస్లింలు. వారు తమ రాజ్యం సుస్థిరంగా ఉండాలంటే హిందువుల పట్ల ద్వేషభావం పనికిరాదని గ్రహించారు. కనుక వారు పరమత సహనాన్ని ప్రదర్శించారు. హిందూ దేవాలయాలను కూల్చే పనిని వదిలివేశారు. పైగా దేవాలయాలకు, బ్రాహ్మణులకు దానాలు చేశారు. అగ్రహారాలు ఇచ్చారు. హిందువులను ముస్లింలుగా మార్చే ప్రక్రియను వదలివేశారు. నిర్బంధంగా ఎవరినీ తమ మతంలో చేర్చుకోలేదు. హిందువులకు తమ ఆస్థానంలో అనేక ఉన్నతోద్యోగాలు ఇచ్చారు. అక్కన్న, మాదన్న తానీషాకు మంత్రి, సేనాధిపతులు. అబుల్‌హసన్ కాలంలో భద్రాద్రిలో రామదాసు సుల్తాన్ ధనంతో రామాలయాన్ని నిర్మించాడు. రామదాసును శిక్షించినా ఆ దేవాలయానికి భద్రాచలం, శంకరగిరి, పాల్వంచ గ్రామాలను అగ్రహారాలుగా ఇచ్చాడు. అలాగే అతడే బెజవాడలోని మల్లేశ్వర ఆలయానికి భోగాపురం, చెరుకూరు, వీరన్న పట్టణాలను దానం చేశాడు. కనుక అతనిని తెలుగువారు రుషిగా భావించేవారు. మహమ్మద్ కులీ వద్ద ఉద్యోగిగా పని చేసిన లాల్‌ఖాన్ బ్రాహ్మణులకు ఉప్పునూతల గ్రామాన్ని దానం చేశాడు. అలాగే అబ్దుల్లా కాలంలో మీర్జుమ్లా మధురాపురం గ్రామాన్ని ఒక బ్రాహ్మణునికి అగ్రహారంగా ఇచ్చాడు. అందువల్ల నేలటూరి వెంకటరమణయ్య కుతుబ్‌షాహీలు తెలుగు నవాబులు అని వర్ణించారు. అనేక మంది హిందువులను ఉన్నతోద్యోగులుగా నియమించారు. మిరాశీదార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలుగా అనేక మంది కమ్మ, రెడ్డి, వెలమ, బ్రాహ్మణ కులస్తులను నియమించారు. వారి కాలంలో నియమింపబడిన అనేక మంది మిరాశీదార్లు వారి తర్వాత జమీందారులుగా రూపొందారు.

ఆనాడు ఆంధ్రదేశాన్ని దర్శించిన విదేశస్తులు కూడా సుల్తాన్‌ల పరమత సహనాన్ని రాశారు. ఇక్కడ మత స్వేచ్ఛ ఉంది. మతం పేరుతో ఎవరూ ఎవరినీ బాధించరని మేత్ ఓల్డ్ రాశాడు. కుతుబ్‌షాహీలు బ్రాహ్మణులను గొప్పగా గౌరవించారు. వారి ప్రాభవం బాగా పెరిగింది. హిందూ ముస్లింలు కలిసి ఒకచోట అన్యోన్యంగా పని చేశారు. సుల్తాన్‌లు, అతని ముస్లిం సరదారులు హిందూ దేవాలయాలకు, బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇస్తూ ఉంటే హిందువులు కూడా సుల్తాన్‌ల పుణ్యం కోసం సుల్తాన్ పేర దానాలు చేశారు. ఆదోని తాలూకా కవుతాళపురంలో రెండు సమాధులున్నాయి. అందులో ఒకటి రంగరామయ్య అనే హిందువుది, రెండవది కదిర్ లింగ అనే ఫకీరుది. ఒక సంవత్సరం తీవ్రమైన కరువు రాగా రంగరామయ్య వర్షం కురిపించాడట. కదిర్ లింగ ఒక దివాన్ కూతురుని ముద్దు పెట్టుకున్నాడట. అందుకు అతనికి మరణశిక్ష విధించగా తన మహత్తులతో తప్పించుకున్నాడట. ఫకీరు మహిమలకు భయపడి సుబేదారు ఇత్వల గ్రామాన్ని ఫకీరుకు జాగీరుగా ఇచ్చాడు. దానిని అతని వారసులు చాలాకాలం అనుభవించారు. ఫకీరు, రంగరామయ్యల సమాధులు ఒకేచోట నిర్మించారు. ఉభయ మతస్థులు రెండు సమాధులను పరమపవిత్రంగా పూజిస్తారు. వీరి కాలంలో సూఫీ మతం అభివృద్ధి చెందింది. సూఫీ మతం హిందూ ముస్లింల మధ్య మంచి సమన్వయాన్ని పెంపొందించింది. సూఫీ సిద్ధాంతాలు హిందూ మత సిద్ధాంతాలకు చాలా దగ్గరగా ఉండేవి. అబ్దుల్లా-అబుల్ హసన్ కాలంలో హిందూ ముస్లింలు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ముస్లింలు జరుపుకొనే షబీబారాత్ హిందువుల దీపావళికి పోలికలుండేవి. ఇవి రెండూ ఆర్యుల నుండి సంక్రమించాయని షేర్వాణి అనే పండితుడు రాశాడు. అలాగే హిందువుల వసంతోత్సవం, ముస్లింల నౌరోజ్ ఒకే విధంగా ఉంటాయి. హిందూ ముస్లిం వివాహ పద్ధతులలో వధూవరుల మధ్య తెర ఉంచటం, ప్రథమ దర్శనంగా వారు అద్దంలో చూసుకోవడం వంటి ఏక సాంప్రదాయాలు ఉన్నాయని పోలుస్తూ సుల్తాన్ కులీకుతుబ్‌షా కొన్ని పద్యాలు రాశాడు. మొహరం పండుగకు సంబంధించిన కొన్ని తెలుగు పాటలు హిందూ ముస్లింలు కలిసి పాడుకుంటారని షేర్వాణి రాశాడు. అలాగే ముస్లింలు నిర్మించిన మసీదులలో హిందూ శిల్పకళా లక్షణాలు ప్రవేశపెట్టారు. అబ్దుల్లా దర్బారులో ఉన్నతోద్యోగి అయిన మూసాఖాన్ టోలీ మసీదు నిర్మించాడు. ఇందులో హిందువుల పూర్ణకుంభాలు చిత్రించారు. ఏనుగు ముఖాలు, జాజుపీరంగా ఉపయోగించారు. హిందూ దేవాలయాలలో నిర్మించే దేవకోష్ఠాల వంటివి ఈ మసీదులో నిర్మించారు. పూనమల్లి మసీదులో హిందువులు శాసనాలలో శాపాలు రాయించినట్లు రాయించారు. ఈ మసీదును నాశనం చేస్తే గోవును చంపినట్లు అని శాసనం రాయించారు. దానిని కాపాడితే షోడశ దానాలు చేసినంత పుణ్యమని రాయించారు.

కుతుబ్‌షాహీలు షియా మతస్థులైనందు వల్ల వారు పర్షియాతో సంబంధాలు కొనసాగించారు. గోల్కొండ రాజ్యంలోని మసీదులలో జరిగే ప్రార్థనలలో పర్షియా చక్రవర్తి పేరును చదివేవారు. షియా సాంప్రదాయాలను పాటించేవారు. వారు తమ మత విధానాలను అనుసరిస్తూ అనేక మసీదులు నిర్మించారు. రాజ్యమంతటా వారు, వారి సామంతులు అనేక మసీదులు, భవనాలు నిర్మించారు. గోల్కొండ, హైదరాబాద్, ఖమ్మం, ఓరుగల్లు, కొండవీడు, కొండపల్లి, వినుకొండ మొదలైన అనేక చోట్ల మసీదులు నిర్మించారు. మార్కెట్లు, కొట్లు కట్టించి, మసీదుల నిర్వహణకు ఇచ్చారు. ఇంకా ఈనాములు కూడా ఇచ్చారు. నేక్ నామ్ ఖాన్ అనే అతడు మరణించగా అతని సమాధి వద్ద ఖురాన్ చదవడానికి, దీపాలు వెలిగించడానికి అబుల్‌హసన్ హసనాబాద్ గ్రామ షీలా అనే కర్ణాటక సేనాధిపతి సమాధి నిర్వహణకు భూమిని దానం చేశాడు. అనేక ముస్లింలకు ఇనాములు ఇచ్చారు. వారి మతాన్ని వారు పోషించుకుంటూ హిందువులకు మత స్వేచ్ఛ ఇచ్చారు. కనుక ఏ ముస్లిం వంశాల కాలంలోనూ లేని విధంగా గోల్కొండ నవాబులు పరమత సహనాన్ని పాటించి మత విధానంలో తాము ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు. కాని వారి మత సామరస్యం సున్నీమతస్థుడైన ఔరంగజేబుకు రుచించలేదు. హిందువులను ఆదరించినందుకు సున్నీమతస్థులపై కోపించి అతడు గోల్కొండపై దండెత్తి ఆ రాజ్యాన్ని తన సామ్రాజ్యంలో కలిపివేశాడు. గోల్కొండ నవాబుల ఔదార్యం వల్ల పర్షియా, మధ్యాసియాల నుండి కూడా అనేక మంది వచ్చి గోల్కొండలో నివసించారు. వారిలో కొందరు వ్యాపారం చేయడానికి వచ్చారు. కొందరు ఉద్యోగార్థం వచ్చారు అందువల్ల గోల్కొండ నవాబులు అనేక తెగల వారు ఉండేవారు. వారిలో షేకు, సైదు, పఠాను, మొగలు, తురక అనే తెగలు ఉన్నట్లు వేమన పద్యాలలో వర్ణించబడింది.

హిందువులలో అనేక శాఖలు ఉండేవి కాని వాటిలో స్మార్త, శైవ, వైష్ణవ శాఖలు ముఖ్యమైనవి. స్మార్త బ్రాహ్మణులు తరచూ యజ్ఞాలు చేస్తూ ఉండేవారు. బహు దేవతారాధన, విగ్రహారాధన, గ్రామ దేవతలకు కొలుపులు, బలులు కూడా పూర్వం లాగానే కొనసాగాయి. మతం పేరుతో కొందరు మోసాలు చేసే వారని వేమన పద్యాల ద్వారా తెలుస్తోంది. అతడు బతుకు తెరువు కోసం బడుగులందరు పెద్ద యోగివాదులమనుచు, లింగధారులందు దొంగలుగలరయా అని వర్ణించాడు.

శైవం: హిందూమతంలో శైవ, వైష్ణవ శాఖలు ఉన్నాయి. శైవ మతంలో మళ్లీ పాశుపతం, రసశైవ అనే ఉపశాఖలు ఉన్నాయి. రసశైవ వల్ల ఆయుర్వేద వైద్యం బాగా వ్యాప్తి చెందింది. శైవ సంప్రదాయం వల్ల అనేక పూజా విధానాలు వ్యాప్తి చెందాయి. సిద్ధులు, మహిమల్లో నమ్మకం పెరిగింది. శైవమఠాలు విద్యావ్యాప్తికి కృషి చేశాయి. ఆనాడు శైవయోగులకు సిద్ధులున్నాయనే నమ్మకం ప్రజలకుండేది. సిద్ధులకు, శైవయోగులకు సమాజంలో గొప్ప గౌరవ మర్యాదలుండేవి.

వైష్ణవ మతం: వైష్ణవ మతం కూడా బహుళ వ్యాప్తిలో ఉంది. రామాలయాలు ప్రతి గ్రామంలో నిర్మింపబడేవి. ప్రసిద్ధి చెందిన భద్రాద్రి రామాలయాన్ని భక్త రామదాసు తానీషా ధనంతో కట్టించాడు. అది ఆనాడు గొప్ప పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందింది. తిరుపతి, అహోబిలం, జామిలోని జనార్ధనాలయం, చోడవరంలోని కేశవాలయం, పోటూరిలోని కోదండ రామాలయం, భీమసింగ్‌లోని గోపాలస్వామి ఆలయం, మట్టపల్లి యాదగిరిలో నరసింహాలయాలు, తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వరాలయం నాటి ప్రసిద్ధి చెందిన విష్ణు దేవాలయాలు అన్ని వార్గల వారు వైష్ణవ మతంలో చేరారు.

హిందువులలో మత ద్వేషం: శైవ వైష్ణవులు ఒకరినొకరు ద్వేషించుకునేవారు. పైగా వారిలో దురాచారాలు కూడా ఉండేవి. శైవంలో బసివిరాండ్రు వ్యవస్థ, వైష్ణవుల దేవదాసీ వ్యవస్థ పవిత్రతను చెడగొట్టాయి. ఈ రెండు వ్యవస్థలూ నాడు బాగా అభివృద్ధి చెందాయి. తర్వాత అవే వ్యభిచారానికి మూలమయ్యాయి.

బౌద్ధ, జైన మతాలు: గోల్కొండ నవాబుల కాలంలో జైన, బౌద్ధమతాలు నామమాత్రంగా ఉండేవి నల్లగొండ జిల్లాలోని కొలనుపాక, అనంతపురం జిల్లాలోని పెనుగొండ ప్రాంతాలలో చిన్న జైనమఠాలు ఉండేవి బౌద్ధ మతానికి చెప్పుకోదగిన స్థావరాలు లేవు.

క్రైస్తవ మతం: గోల్కొండ సుల్తాన్‌ల కాలంలోనే ఆంధ్రదేశంలో క్రైస్తవ మతం ప్రారంభమైంది. మచిలీపట్టణంలోని పోర్చుగీసు వారు తమ స్థావరాలతోపాటు చర్చిలు కూడా నిర్మించారు. అందులో పోర్చుగీసు వారితోపాటు స్వదేశీయులు కూడా ప్రార్థనలు చేసే వారని విదేశీ యాత్రికులు రాశారు. గోవా నుండి పోర్చుగీసు వర్తకులు ఆంధ్రతీరం చేరి వ్యాపారం చేసేవారని విదేశీ యాత్రికులు రాశారు. వారితోపాటు క్రైస్తవ మతాచార్యులు

వచ్చి క్రైస్తవ మతాన్ని ప్రచారం చేశారు. వారు గోవాకు చెందిన స్థానికులు నల్లవారు అంటే భారతీయులే అని పలువురి అభిప్రాయం.

హిందూ ముస్లింల సామరస్యం: గోల్కొండ యుగంలోని ప్రత్యేక లక్షణం హిందూ ముస్లింల సామరస్యం. గోల్కొండ నవాబుల సహనగుణం వల్ల హిందూ ముస్లింల మధ్య సామరస్యం పరస్పర అవగాహన కలిగి సంస్కృతి సమ్మేళనానికి దారి తీసింది. సూఫీ మత గురువులు దక్షిణదేశంలో హిందూ ముస్లింల సామరస్యానికి పాటుపడ్డారు. అసలు అల్లావుద్దీన్ దక్షిణదేశ దండయాత్రలకు ముందే సూఫీ గురువులు దక్షిణదేశంలో ప్రవేశించారు. చిష్టీ శాఖకు చెందిన సూఫీ గురువులు దక్షిణదేశంలో కంఖాలు అంటే మఠాలు స్థాపించి, హిందూ ముస్లింల సామరస్య బోధనలను చేశారు. షేక్ ఫక్రుద్దీన్ అనే ఫకీరు క్రీ.శ.1294లో పెనుగొండలో ఒక కంఖాను స్థాపించాడు. షియా ఉద్దీన్, షేక్‌బాబాషర్ ఉద్దీన్ అనే సోదరులు గోల్కొండ సమీపంలో కంఖాను స్థాపించుకొని జీవించారు. బహమనీల కాలంలో బందెనవాబ్ గిసూద్‌రాజ్ అనే సూఫీ ఫకీరు గొప్ప పేరు ప్రతిష్టలు పొందారు. అతడు మానవులందరూ సోదరులని ప్రచారం చేశాడు. సూఫీ యోగులకు ముస్లింలు, హిందువు లాగ సాష్టాంగ నమస్కారం చేసే వారు. సూఫీ గురువుల కృషి హిందూ ముస్లిం సామరస్యానికి హిందూ ముస్లిం సాంప్రదాయాల సమ్మేళనానికి దారి తీసింది. రంజాన్‌కు ముందురోజు ముస్లింలు జరుపుకొనే షబీరాత్‌లో ముస్లింలు తమ ఇళ్లలో దీపాలను వెలిగిస్తారు. ఇది హిందువుల దీపావళికి అనుకరణ. మొహరం పండుగలలో హిందువులు పాల్గొంటారు. హిందువుల వసంతోత్సవం ముస్లింల నౌరోజ్ రెండూ ఒకే రకంగా ఉంటాయి. వివాహ సమయాలలో వధూవరుల మధ్య తెర పట్టే ఆచారం ఉభయ మతస్తులు పాటించేవారు. ముస్లింల నిర్మాణాలలో పూర్ణకుంభం, హంసలు, ఏనుగులు, లతలు, పద్మాలు మొదలైన హిందూశిల్ప సాంప్రదాయాలు ప్రవేశపెట్టబడ్డాయి. ముస్లింలు హిందూ దేవాలయాలను దర్శించారు. ముస్లింలు తిరుపతి ఆలయాన్ని దర్శించేవారని వేమన పద్యాలలో పేర్కొనబడింది. అలాగే హిందువులు ముస్లింల దర్గాలు, కంఖాలను దర్శించేవారు.

ముస్లింల వ్యాప్తి: గోల్కొండ నవాబులు మతాంత్రీకరణను ప్రోత్సహించలేదు. అయినప్పటికీ ఆంధ్రదేశంలో ముస్లిం జనాభా పెరిగింది. బహమనీల కాలంలో ముస్లిం జనాభా తెలంగాణలో మాత్రమే ఉండేది. కాని వీరి కాలంలో ముస్లింలు ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతలలో ప్రవేశించి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అందువల్ల గ్రామాలలో కూడా ముస్లింల జనాభా పెరిగింది. రాజాస్థానం లభించని ముస్లింలు తాము పాలకులమనే గర్వాన్ని వదలివేసి గ్రామాలలో చిన్నచిన్న వృత్తులను అవలంబించి జీవించారు. ఆంధ్రదేశంలో హిందువుల తర్వాత చెప్పుకోదగింది ఇస్లాం మతం. ఇది రాజమతం. అందువల్ల మంచి అభివృద్ధిలో ఉంది. ముస్లింలకు అధిక గౌరవ మర్యాదలున్నాయి. కుతుబ్‌షాహీలు షియా మతస్తులు. వారిలో ఒక్క మహమ్మద్ కులీకుతుబ్‌షా తప్ప మిగిలిన వారందరూ గొప్ప పరమత సహనం కలిగినవారు. అతడు మాత్రం సున్నీ మతస్థులను నిరసించి కొద్దిగా ఇబ్బందులు పెద్దాడు. ముస్లింలలో మూడు తరగతుల వారున్నారు. విదేశాలకు చెందిన తుర్కి, ఇరాన్ జాతి వారు మొదటి తరగతికి చెందిన స్వచ్ఛమైన ముస్లిం వర్గంగా గౌరవింపబడేవారు. విదేశీ ముస్లింలు స్థానిక స్త్రీలను వివాహమాడగా జన్మించిన వారు రెండవ తరగతి ముస్లింలు. ముస్లిం మతాన్ని స్వీకరించిన హిందువులు, స్వదేశస్తులు మూడవ తరగతి ముస్లింలు. వారే తర్వాత దూదేకుల వారిగా ప్రత్యేక వర్గంగా ఏర్పడ్డారు. షియాలే గాక సున్నీలు కూడా ఆంధ్రదేశంలో నివసించారు. వారేగాక సనాతన సాంప్రదాయవాదులైన వహబ్ అనే మరొక ముస్లిం వర్గం కూడా ఉండేది. వారు కూడా హైదరాబాద్‌లో కొందరు ఉండేవారు. వారు ఖురాన్‌లో అంగీకరించని కొన్ని ఆచారాలను పాటిస్తారు.

గోల్కొండ యుగంలో ఆర్థిక పరిస్థితులు

గోల్కొండ రాజ్యం కూడా విజయనగర సామ్రాజ్యం లాగే సిరిసంపదలతో తులతూగింది. గోల్కొండ రాజ్యం ప్రకృతిసిద్ధంగా మంచి ఆర్థిక వనరులు కలిగిన రాజ్యం. అందువల్ల రాజ్యంలో వ్యవసాయం, వర్తక వాణిజ్యాలు జోరుగా సాగి ఆర్థిక ప్రగతికి దోహదపడింది.

వ్యవసాయ పంటలు: గోల్కొండ రాజ్యం మంచి ప్రకృతి వనరులున్న రాజ్యం. అవి మంచి సారవంతమైన భూములు. సారవంతమైన కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలు. కర్ణాటక ప్రాంతం గోల్కొండ రాజ్యంలో భాగాలయ్యాయి. గోల్కొండ రాజ్యంలో సాగులో లేని భూమి లేదని ఔరంగజేబు వర్ణించాడు. తెలంగాణ పీఠభూమిలోని అరణ్య ప్రాంతాలు తప్ప మిగిలినవన్నీ మంచి సారవంతమైన భూములు. తెలంగాణ పీఠభూమి అరణ్య ప్రాంతాలు అయినప్పటికీ కూడా అందులోంచి అపార ఆటవిక సంపద లభించేది. ముఖ్యంగా కలప, కుంకుళ్ళు, జిగురుల ద్వారా ముఖ్యమైన ఆదాయం వస్తుండేది. ఇంకా పశుసంపద పెరగడానికి కూడా వీలు కలిగింది. వీలైన చోటల్లా చెరువులు, నదులకు ఆనకట్టలు నిర్మింపబడ్డాయి. అందువల్ల అనేక రకాలైన పంటలు పండించడానికి అవకాశం ఏర్పడింది. వరి, చెరకు, సజ్జ, జొన్న, పప్పు ధాన్యాలు విరివిగా పండేవి. వ్యాపార పంటలైన పత్తి, పొగాకు, వేరుశనగ, కంది, పెసర, ఆముదాలు ఉండేవి. ఇంకా మామిడి, నిమ్మ, నారింజ, దానిమ్మ, అరటి, అనాస, జామ, కమలా ఫలాలు, అంజూర పండ్ల తోటలు పెంచబడ్డాయి. ఏనుగులు, దుప్పిలు, జింకలు, ఎలుగుగొడ్డులు, పెద్దపులులు, కోతులు అరణ్యాలలో విహరించేవి. కానీ అడవి జంతువుల వల్ల కూడా రాజ్యానికి ఆదాయం వచ్చేది.

గోల్కొండ నవాబుల కాలంలో ఆంధ్రదేశాన్ని దర్శించిన విదేశీ యాత్రికులందరూ గోల్కొండ రాజ్యం సంపన్నమైందని వర్ణించారు. క్రీ.శ.1645లో టావెర్నియర్ అనే ఫ్రెంచి యాత్రికుడు గోల్కొండ రాజ్యాన్ని దర్శించి ధాన్యం, బియ్యం, పశువులు, కోళ్లు, గొర్రెలు, ఇతర నిత్యావసర వస్తువులు చాలా చౌకగా లభిస్తాయని, 8 కోళ్ల ఖరీదు 12 పెన్నీలు, గొర్రె ఖరీదు 10 పెన్నీలని తెలిపాడు. పల్లెటూళ్లలో ఇంకా చౌకగా దొరుకుతాయని రాశాడు దేశం నిండా చెరువులున్నాయి. కొండల మధ్య ఒక గట్టు పోస్తే నీరు నిలువ ఉంటుంది. సులభంగా చెరువులు నిర్మించి పొలాలు సాగు చేస్తున్నారు. రెండు, మూడు పంటలు కూడా పండిస్తున్నారని బ్రిటిష్ అధికారి మెత్ ఓల్డ్ వర్ణించాడు. 17వ శతాబ్దంలో వచ్చిన బౌరి అనే బ్రిటిష్ వ్యాపారి కోస్తా ప్రాంతం ప్రపంచంలోనే అతిసారవంతమైన భూమి అని, అందువల్ల పాడి పంటలకు కొదువ లేదని, ప్రతి సంవత్సరం 10 వేల గరిసెల ధాన్యం, వెన్న, ఏలకులు, మస్లిన్‌లు, లక్క మొదలైనవి ఎగుమతి అవుతున్నాయని రాశాడు.

కుతుబ్‌షాహీల కాలంలో భూసంబంధాలు: ముస్లింలు యుద్ధాలు చేయడం, ముస్లిమేతర ప్రాంతాలను జయించడం తమ కర్తవ్యం, జీవిత లక్ష్యమని భావించేవారు. రాజ్యంలోని భూమి అంతా తమకే చెందుతుందనే భావం ముస్లింలకు ఉందని 17వ శతాబ్దంలో భారతదేశాన్ని దర్శించిన ఐరోపా యాత్రికులు అభిప్రాయపడ్డారు సిద్ధాంతరీత్యా అలా ఉండి ఉండవచ్చునేమోగాని ఆచరణలో అది లేదు. ముస్లింలు జయించిన రాజ్య భాగాలను వారి సేనాధిపతులకు పంచిపెట్టారు.. తాము జయించిన కొన్ని ప్రాంతాలను హిందువులకు కూడా దఖలు పరచారు. జిజియా పన్ను, ఖరాజ్ పన్నులు చెల్లించే షరతుల మీద హిందువులు అధికారంలో కొనసాగనిచ్చారు జిజియా పన్ను అంటే జుట్టు పన్ను, ఖరాజ్ అంటే భూమి మీద విధించే పన్ను. ఖరాజ్ వసూలు కోసం వారు పన్ను గుత్త విధానాన్ని అనుసరించారు. దానివల్ల రాజుకు, ప్రజలకు మధ్య జమీందారులు, పాలెగాండ్రు, దేశ్‌ముఖ్ అనే పన్ను గుత్తదార్లు ఏర్పడ్డారు. వారు భూమి పన్ను చెల్లించని రైతుల నుండి భూమిని స్వాధీనం చేసుకుని మరొకరికి ఇచ్చే హక్కు కూడా పొందారు. కనుక భూములపై రైతులకు హక్కు లేదు. ప్రభుత్వానిదే హక్కు అని బ్రిటిష్ వారు గజటీర్లలో తమ భావాలను ప్రకటించారు. కనుక ఈ కాలంలో భూమిపై యాజమాన్య హక్కు ఎవరిది, పాలకులదా? రైతులదా? అనే సందేహం బ్రిటిష్ వారికి కలిగినట్లుగా ఉంది. వారి దేశంలో రైతులకు భూమిపై హక్కులు లేవు. హక్కులన్నీ ఫ్యూడల్ లార్డులవే. అలాగే భారతదేశంలో కూడా భూమిపై హక్కు ప్రభుత్వానిదే. ప్రజలకు లేదని వారికి భావం కలిగి ఉండవచ్చును. కాని కుతుబ్‌షాహీల కాలంలో కూడా భూమిపై హక్కు హిందూ రాజుల కాలంలో ఎలా కొనసాగిందో అలాగే కొనసాగిందని అనేక శాసనాలు, కుతుబ్‌షాహీల సన్నదులు

స్పష్టంగా తెలుపుతున్నాయి. సుల్తాన్‌లు స్వయంగా గ్రామాలను దేవాలయాలకు దానం చేశారు. బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చారు. భూముల అమ్మకం, కొనుగోళ్లు జరిగాయి. గ్రామ సభలు భూముల అమ్మకాలకు అనుమతి ఇచ్చినట్లు శాసనాలు లభించాయి. పరిపాలనా విషయాలలో తేడాలున్నా, భూమి హక్కు విషయంలో ముస్లిం రాజులు అంతకు ముందు హిందూ రాజుల పద్ధతినే అనుసరించారు. ఔరంగజేబు న్యాయ సూత్రాలను తయారు చేయించాడు. దానిని ఫతవా-ఇ-ఆలమ్‌గిరి అని అంటారు. అందులో బంజరు భూములను సుల్తాన్ ఎవరికైనా ఇవ్వవచ్చును. అలా ఇస్తే ఆ భూమిని మూడు సంవత్సరాలు వదిలివేయాలి. మూడు సంవత్సరాలలో ఆ భూమిని పొందినవాడు సాగు చేయకపోతే దానిని తిరిగి తీసుకుని మరొకరికి ఇవ్వవచ్చు. బంజరు భూమి ఎవరు సాగు చేస్తే వారిదేనని ఆ ఫతవా వివరిస్తోంది. దీనిని బట్టి బంజరు భూములను మాత్రమే సుల్తాన్ ఇంకొకరికి ఇవ్వగలడు. పట్టా భూమిని సుల్తాన్ కూడా ఇంకొకరికి ఇవ్వలేదు. అంటే భూమి హక్కు వ్యక్తులదేగాని ప్రభుత్వానిది కాదని తెలుస్తోంది. కాకపోతే గోల్కొండ నవాబుల కాలంలో అనుసరించిన గుత్త పన్ను విధానం భూమి సంబంధాలలో కొద్ది మార్పులు తీసుకువచ్చింది. జమీందారీ భూములు అనే నూతన భూ సంబంధాలను తెచ్చింది. ఇది తప్ప మరే మార్పులేదు. అంతకు పూర్వం కూడా సామంతుల భూములు, పాలెగాండ్ర భూములని ఉండేవి. అలాంటివే జమీందారీ భూములు. కనుక కుతుబ్‌షాహీల కాలంలో భూములు ఐదు రకాలుగా ఉన్నాయి.

1. హవేలీ భూములు
2. జమీందారీ భూములు
3. గ్రామ భూములు
4. రైతుల భూములు
5. దేవాలయ భూములు - మఠాల భూములు- అగ్రహారాలు.

హవేలీ భూములు: ఇవి ప్రభుత్వ భూములు. ఈ భూములన్నీ సుల్తాన్‌ల సొంత భూములు. ఇవి కోటలకు, రాజధానులకు సమీపంలో ఉంటాయి. ఇవి సైనికులకు, పౌర పరిపాలనా అవసరాలకు ఉపయోగిస్తారు. ఈ భూముల నుండి ప్రభుత్వ ఉద్యోగాల ద్వారా రైతుల నుండి సరాసరి పన్నులు వసూలు చేస్తారు. అందువల్ల ఈ భూములు సాగుచేసే రైతులకు కొంత సౌలభ్యం ఉండేది. కాని తర్వాత ఈ భూములు కూడా పన్ను గుత్తకు ఇవ్వబడ్డాయి. అందువల్ల అక్కడి రైతులు కూడా ఇబ్బందులపాలయ్యారు.

జమీందారీ భూములు: సుల్తాన్‌లు తమకు పన్ను గుత్తగా ఇచ్చిన ప్రాంతాలను పర్యవేక్షించడమూ ప్రజలను కాపాడటం, వ్యవసాయం చేయడానికి కావలసిన సదుపాయాలు ఏర్పాటు చేయడం, న్యాయ నిర్ణయాలు చేయడం, పన్నులు వసూలు చేయడం వారి విధులుగా, వారికి ఇచ్చిన సన్నదులు తెలుపుతున్నాయి. అందుకు ప్రతిఫలంగా వారికి పన్నులు లేకుండా కొన్ని భూములను ఇస్తారు. ఆ భూములు ఒకేచోట కాకుండా సర్కారులో ఎక్కడైనా ఇవ్వవచ్చును. అందువల్ల జమీందారులు ఒకే చోట స్థిరంగా నివసించకుండా అన్ని ప్రాంతాలు తిరుగుతూ ప్రజల బాగోగులు చూస్తారని సుల్తాన్‌లు ఆశించారు. ఆ విధంగా ఇచ్చిన భూములను సావరం భూములు అని అంటారు. వాటినే జమీందారీ భూములుగా పిలిచారు. వారు తమ విధులను నిర్వహించడానికి సాయుధ బలగాలను పోషించారు. కాని వారు స్వతంత్ర ప్రభువులు కారు. కనీసం సామంత ప్రభువులుగా కూడా గుర్తింపబడరు. వారికి భూమి మీద హక్కు లేదు. వారు కేవలం పన్ను గుత్తదారులు మాత్రమే అని ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనా కాలంలో సెలక్ట్ కమిటీ తమ ఐదవ రిపోర్టులో వారి హోదాను గూర్చి స్పష్టమైన అభిప్రాయాన్ని తెలియజేసింది. జమీందారులు స్థానిక ఆచారాల ప్రకారం పన్నును వసూలు చేస్తారు. కానీ జమీందారులు కూడా తమ ఆధీనంలోని ప్రాంతాలపై పన్ను గుత్తకు మరొకరికి ఇస్తూ ఉండేవారు. వారు ప్రజలను పీడించి, తాము మరికొంత లాక్కొంటూ ఉండేవారు.

గ్రామ భూములు: నెల్లూరు, కర్నూలు జిల్లాలలో భూములు గ్రామాల ఆధిపత్యం కింద ఉన్నట్లు అక్కడి కైఫీయత్తులు తెలుపుతున్నాయి. వారు గ్రామ భూమిని సమష్టిగా సాగు చేసుకుంటారు. గ్రామసభ లేదా గ్రామ పెద్ద గ్రామ భూములను వాటాలుగా చేసి రైతులకు ఇస్తాడు. ఐదారు సంవత్సరాల తర్వాత మళ్లీ భూములు అన్నీ కలిపి మళ్లీ వాటాలు చేసుకుంటారు. ఈ పద్ధతి వల్ల మంచి, చెడూ ఉంది. భూమి ఒకరికే ఉండకుండా మారుతూ ఉంటుంది. ఈ పద్ధతి వీసబడి పద్ధతి అని కూడా అనేవారు. ఇలా ఉన్న భూములను గ్రామ భూములు అనేవారు. ఆ భూములను రాజులు అమ్మాలన్నా కూడా గ్రామసభ అనుమతి తీసుకోవాలి.

రైతుల భూములు: రైతులకు సంపూర్ణ హక్కులు కలిగిన భూములు ఇవి. వారు ఆ భూములను అమ్ముకోవచ్చును, దఖలు పరచవచ్చును. గ్రామ కరణాల లెక్కలలో భూమి వారి పేరనే ఉంటుంది. ఆ భూమిని వారు వదిలివేసి వెళ్లిపోయినా అది వారి పేరనే కొనసాగుతుంది. వారి వారసులు వచ్చి ఎప్పుడైనా దానిని తమ స్వాధీనం చేసుకోవచ్చును. కాని బకాయి ఉన్న పన్నులన్నీ చెల్లించాలి. భూమి హక్కు వారికే చెందుతుంది.

రైతులలో కదెం రైతులు, పాయికారి రైతులని రెండు రకాలుండేవారు. కదెం రైతులంటే భూమిపై సర్వహక్కులు ఉండేవారు, పాయికారి రైతులంటే కౌలుదార్లు. వారికి భూమి మీద హక్కు ఉండదు. ఎవరిదో ఒకరి భూమిని కౌలుకు చేసుకుంటూ ఉంటారు. వీరు పాలు పద్ధతి మీద భూమిని సాగు చేస్తారు. ప్రభుత్వ భూములు కౌలుకు తీసుకుంటే ఖర్చులు ప్రభుత్వం భరిస్తే పంటలో రైతుకు పావు భాగం, రైతే ఖర్చులు భరిస్తే సగభాగం వస్తుందని మెకంజీ రాతలు తెలుపుతున్నాయి. కార్తీక, మార్గశిర మాసాలలో కౌళ్ల కరారు నామాలు జరుగుతాయి కౌళ్ల వసూలు నాలుగు వాయిదాలలో చెల్లించాలి. దానిని వసూలు చేసే బాధ్యత రెడ్డి, కరణాలది. వసూలు కాని మొత్తం ఉంటే గ్రామంలో పెద్ద రైతులు కట్టేసి, తర్వాత వారు కౌలుదారుల వద్ద వసూలు చేసుకుంటారు.

అగ్రహారాలు - దేవాలయపు మరుపు భూములు: అగ్రహారాలు బ్రాహ్మణ గ్రామాలు. ఆ గ్రామాలలోని భూములపై వారికి పూర్తి హక్కులున్నాయి. అమ్ముకునే హక్కు కూడా ఉంది. వారి హక్కులను కుతుబ్‌షాహీలు తీసివేయలేదు. అంతకు ముందు హిందూరాజులు ఇచ్చిన హక్కులన్నీ ఇచ్చారు. పైగా నవాబులు కూడా అనేకమంది బ్రాహ్మణులకు అగ్రహారాలు ఇచ్చారు. అలాగే దేవాలయ మరాల భూములకు కూడా పూర్తి హక్కులు కొనసాగాయి. నవాబులు కూడా అనేక దేవాలయాలకు, గ్రామాలకు భూములను దానాలు చేశారు. క్రీ.శ.1652వ సంవత్సరంలో భద్రాచలంలో రామదాసు కట్టించిన రామాలయానికి అబుల్‌హసన్ భద్రాచలం, శంకరగిరి, పాల్వంచ గ్రామాలను దానం చేశాడు. కృష్ణాతీరంలోని మల్లేశ్వరస్వామి దేవాలయానికి చెరుకూరు, భోగాపురం, వీరన్నపట్టణాలను దానం చేశారు. కందుకూరు సీమలో ఒక దేవాలయానికి మరమ్మతులు చేయడానికి ఒక వాల్మీకి కులం వాడికి అంటే బోయవాడికి చుండి గ్రామాన్ని అమరంగా ఇచ్చారు. అబ్దుల్లా కుతుబ్‌షా అనుమతితో అతని సేనాధిపతి అశ్వారావు శ్రీకూర్మం గ్రామాన్ని అక్కడి శ్రీకూర్మ దేవాలయానికి దానం చేశాడు. సుల్తాన్ కుమారుడు హసన్‌బేగ్ తూర్పు గోదావరి జిల్లాలోని పలివెల దేవాలయంలోని కోనేరుకు ఒక తూము పెట్టించి మెట్లు కట్టించాడు. ఒక తాటివనం కూడా నాటించాడు. సుల్తాన్‌లు బ్రాహ్మణులకు అగ్రహారాలు కూడా ఇచ్చారు మహమ్మద్ కులీకుతుబ్‌షా గౌరవార్థం అతని సేనాధిపతి లాల్‌ఖాన్ ఉప్పునూతల గ్రామాన్ని ముగ్గురు బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చాడు. అబ్దుల్లా కుతుబ్‌షా అప్పలకొండ అనే అతనికి హైదరాబాద్ సుభాలో కొంత భూమిని దానం చేశాడు. కృష్ణా జిల్లాలో ఒక మహాయజ్ఞం చేసిన ఒక బ్రాహ్మణునికి మీర్జుమ్లా మహమ్మద్ సయాద్ మధురాపురాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. మంగళగిరి పంతులు అనే అతని సలహా ప్రకారం మీర్జుమ్లా ఈ దానం చేశాడట. ఈ విధంగా నాటి భూ యాజమాన్యం ఐదు రకాలుగా కొనసాగింది.

భూమి తగాదాలు: కుతుబ్‌షాహీల కాలంలో కొన్ని భూమి తగాదాలు వచ్చినట్లు, అవి పరిష్కరించబడినట్లు శాసనాలు తెలుపుతున్నాయి. చిత్తూరు జిల్లా దేవుల చెరువు వద్ద భూముల విషయంలో తగాదాలు రాగా పరిష్కరింపబడ్డాయని దేవుల చెరువు శాసనం తెలుపుతోంది. తెనాలి తాలూకాలోని ఎడ్లపల్లి, పెనుగుదురుపాడు గ్రామాల సరిహద్దులను గురించి తగాదా రాగా రాజుగారి ఆజ్ఞపై మాణిక్యాలరావు అనే అతడు కొలిచి సరిహద్దులను నిర్ణయించాడని ఎడ్లపల్లి శాసనం తెలుపుతోంది. తాటికొండ, పరిమి రైతుల మధ్య వచ్చిన తగాదాలను పరిష్కరించినట్లు అక్కడి శాసనాల వల్ల తెలుస్తోంది. మల్కాపురం శాసనం రావిపాడు స్థలంలోని 19 గ్రామాల భూములను ఆ గ్రామ ప్రజలు ఇబ్రహీం కుతుబ్‌షా అనుమతితో 38 మూరల తాడుతో కొలిచి పన్ను నిర్ణయించారని తెలుపుతోంది. దీనిని బట్టి కుతుబ్‌షాలు భూమిపై వ్యక్తి హక్కులు గుర్తించారని స్పష్టపడుతోంది.

నీటిపారుదల సౌకర్యాలు: కుతుబ్‌షాహీలు వ్యవసాయాభివృద్ధికి చెరువులు, బావులు, కాలువలు తవ్వించి నీటిపారుదల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కాకతీయుల కాలం నాటి పానుగల్ చెరువు ఉదయ సముద్రం అనే చెరువులు కట్టలు తెగి పోతే సుల్తాన్‌లు బాగు చేయించారు. క్రీ.శ.1551వ సంవత్సరం ఇబ్రహీం కుతుబ్‌షా శాసనం ఆ చెరువు కింద సాగయ్యే భూముల నుంచి రైతులకు, టర్కీ సిపాయిలకు, బ్రాహ్మణులకు, సుల్తాన్‌కు రావలసిన వాటాలను తెలుపుతోంది. రహమ్‌తుల్లా అనే అతడు అక్కడ మరమ్మతులు చేసి ఆ శాసనం వేయించాడు. దశబంధ పన్ను ఆచంద్రార్కం అనుభవించాలని ఆ శాసనం తెలుపుతోంది. మహమ్మద్ కుతుబ్‌షా

తల్లి కానమ్ ఆగా హైదరాబాద్‌లోని మాసాబ్‌టాంక్ తవ్వించింది. కందుకూరు శాసనం అంతోజీ అని హిందూ హవల్దారు అక్కడి చెరువును బాగు చేయడానికి ఒకక్కొర్రు తరి భూమిని ఇచ్చాడు. దానిని అబ్దుల్ కుతుబ్‌షా మొఖసాగా ఇచ్చిన భూమి. చల్లా తిమ్మారెడ్డి కొందరు కందుకూరు ధర్మకర్తలతో కలిసి నాలుగు చెరువులు తవ్వించి తర్వాత వాటిని మంచి స్థితిలో ఉంచడానికి ఏర్పాటు చేశారు. ఆ చెరువు గట్లు బాగు చేసిన వడ్డెర్లకు ధాన్యం ఇచ్చే ఏర్పాటు చేశారు. ఇంకా వారికి మోపాదు, మాచవరం గ్రామాలలో 12 తూముల భూములను కూడా ఇచ్చారు. ఈ భూములు వారికి నవాబు మొఖాసాగా ఇచ్చాడు. ఇంకా వెట్టివారు, ముదములు గ్రామస్తులు, మాదిగలు ఆ చెరువును కాపాడాలని, ఇవన్నీ హజ్రత్ సుల్తాన్ అబ్దుల్లా పాదుషా ప్రీత్యర్థం చేస్తున్నామని కూడా శాసనం రాయించి ప్రతిష్ఠించారు. కందుకూరుకు చెందిన ముగ్గురు వ్యక్తులు చెరువు మరమ్మతులకు తమకు సుల్తాన్ అమరంగా ఇచ్చిన భూముల నుండి పంటను ఇస్తామని శాసనం వేయించారు. మహమ్మద్ కులీపాదుషా ప్రీత్యర్థం గుంటూరు జిల్లా సంతరావూరులోని చెరువుకు పొలాన్ని ఇచ్చినట్లు అక్కడి శాసనం తెలుపుతోంది. ఆ చెరువును ఓబులసాని తవ్వించిందని ఆ శాసనం తెలుపుతోంది. మదనపల్లి తాలూకాలోని ఒక గ్రామ శాసనం చెరువు కింద భూములను కాపులకు, బ్రాహ్మణులకు దశబంధ హక్కులతో ఇచ్చినట్లు తెలుపుతోంది. మరొక శాసనంలో స్థానిక హవల్దారు అక్కడి చెరువును బాగు చేయించి దాని పంటలో సగం రైతులకు, సగం సుల్తాన్‌కు చెందేటట్లు శాసనం వేయించాడు.

నూతన గ్రామాల అభివృద్ధి – నూతన నిర్మాణాలు: కుతుబ్‌షాహీలు నీటిపారుదల సౌకర్యాలు కలిగించడమే గాక నూతన గ్రామాలను కూడా నిర్మించారు. నర్సరావుపేట తాలూకాలో పల్లవరంలో నూతులు తవ్వించారు. తోటలను పెంచారు. మార్కెట్‌ను కట్టించి దానిని పట్టణంగా మార్చారు. అద్దంకి సుబేదార్ ఎక్లాస్ ఖాన్ అద్దంకి సీమలో ఎక్లాస్‌ఖాన్ పురాన్ని కట్టించాడు. అక్కడ ఒక శాసనం వేయించి గ్రామ భూముల వాటాలు ఎవరికెంత చెందాలో, రహదారి సుంకాలు ఎంత వసూలు చేయాలో రాయించాడు. అబుల్‌హసన్ కాలంలో ముర్తజానగర్ వద్ద హసనాబాద్ గ్రామం నిర్మింపబడింది. 5 సంవత్సరాల పాటు అక్కడ ఎలాంటి పన్నులు వసూలు చేయరాదని ఆజ్ఞ జారీ చేశాడు.

పన్నుల తగ్గింపు: కుతుబ్‌షాహీల కాలంలో కూడా రైతులు, వృత్తి పని వారు పన్నులు చెల్లించలేక ఊళ్లు వదిలిపోయారు. కొండపల్లి సీమలో విశ్వబత్తులు సుంకాలు కట్టలేక వెళ్లిపోయారు. ఆ విషయం స్థలకరణం సుల్తాన్‌కు తెలియజేయగానే అతడు పన్నులను తగ్గించాడని కొండపల్లి శాసనం తెలుపుతోంది. మంగళగిరి ప్రజలు పన్నులు కట్టలేక ఊరు విడిచి వెళ్లిపోయారు. వారిని వెనుకకు రప్పించడానికి సుల్తాన్ ఖోజారీ అనే ప్రతినిధిని మంగళగిరి పంపాడు. అతడు వచ్చి పన్నులు రద్దు చేసి శాసనం రాయించాడు. పులివెందులలో ఇతర వర్తకులు వచ్చి స్థిరపడేటట్లు చేయడానికి అనేక రాయితీలు కలిగించి అక్కడి స్థానిక అధికారి మహమ్మద్ జాఫర్ శాసనం వేయించాడు. ఈ విధంగా కుతుబ్‌షాహీలు భూమి సంబంధాల పన్నులు విధింపు తగ్గింపు విషయాలలో పూర్వపు హిందూ రాజుల పద్ధతులనే అనుసరించారు.

పరిశ్రమలు – వృత్తి పని వారు: గోల్కొండ రాజ్యం గొప్ప పరిశ్రమలకు పేరు మోసింది. వస్త్ర పరిశ్రమ, నౌకా నిర్మాణం, ఆయుధ కర్మాగారాలు, వజ్ర పరిశ్రమలున్నాయి. ఓరుగల్లులో సన్నని వస్త్రాలకు, మచిలీపట్టణం కలంకారీ అద్దకాలకు, నిర్మల్, ఇందల్వాయిల వద్ద బల్లెల పరిశ్రమలకు, కొండపల్లి బొమ్మలకు, నర్సాపురం దారు పరిశ్రమకు, మచిలీపట్నంలో తుపాకీ, తూటాల తయారీకి ప్రసిద్ధి చెందాయి. ఇంకా ఇనుము, ఉక్కు, బొగ్గు, సీసం, వజ్రాల, గనుల పరిశ్రమలు కూడా ఉండేవి. ఈ విధంగా గోల్కొండ రాజ్యంలో వివిధ ప్రాంతాలలో వివిధ రకాల పరిశ్రమలు అభివృద్ధి చెందాయి. పల్లెలలో రైతుల ఇళ్లలో చేతి పనుల ద్వారాను, పట్టణాలలో వృత్తి పని వారి వల్ల వ్యాపారానికి కావలసిన వస్తు ఉత్పత్తి జరుగుతూ ఉండేది. గోల్కొండ రాజ్యంలో వృత్తి నిపుణులు, యంత్ర శిల్పులు, రత్నాభరణాలు తయారు చేసేవారు ఉండేవారని మహమ్మద్ సాకె అనే మొగల్ చరిత్రకారుడు రాశాడు. రత్నాభరణాలు చేసే, మంచి సువర్ణాభరణాలు చేసే పని వారిని సుల్తాన్ సామంతరాజులు తమ ఆస్థానాలలో ఉంచి పోషించే వారని, వారి చేత మంచి రత్నాభరణాలు చేసే పని వారిని సుల్తాన్ సామంతరాజులు తమ ఆస్థానాలలో ఉంచి పోషించేవారని, వారిచేత మంచి రత్నాభరణాలు చేయించేవారని, ఆ పనితోనే వారికి సరిపోయేదని మరేపని చేయనక్కరలేదని తెవెనా అనే వైద్యుడు రాశాడు. గోల్కొండ నవాబుల కాలంలో పరిశ్రమలు, ఉత్పత్తి బాగా అభివృద్ధి చెందినా అవన్నీ చేతి పరిశ్రమలేగాని యంత్ర పరిశ్రమలు కావు. మొత్తం మీద గోల్కొండ రాజ్యంలోని

పరిశ్రమలను గురించి రాయాలంటే ఒక గ్రంథం అవుతుందని మొగల్ చరిత్రకారుడు సాకె రాశాడు.

వస్త్ర పరిశ్రమ: ఆంధ్రదేశంలోని పరిశ్రమలన్నింటిలో అతి పెద్దది వస్త్ర పరిశ్రమ. అనాది నుండి ఈ పరిశ్రమ వర్ధిల్లుతూ ఉండేది. గోల్కొండ నవాబుల కాలంలో ఉచ్ఛదశకు వచ్చింది. విదేశీ ఎగుమతులు ఎక్కువయ్యాయి. శాతవాహనుల కాలం తర్వాత ఆంధ్రదేశ వస్త్రాలు ఇంత ఎక్కువగా విదేశాలకు ఎగుమతి కావటం, మళ్లీ కుతుబ్‌షాహీల కాలంలోనే జరిగింది. ఐరోపా వాసులైన పోర్చుగీసు, డచ్చి, ఫ్రెంచి, ఇంగ్లీష్ వారు రావడమే అందుకు కారణం. మొదట ఐరోపా వారు ఇండియా వస్త్రాలను ఐరోపాకు ఎగుమతి చేయలేదు. మన వస్త్రాలను తూర్పు ఇండియా దీవులకు తీసుకువెళ్లి అక్కడ వాటిని అమ్మి అక్కడి నుండి సుగంధద్రవ్యాలు కొని ఐరోపాకు తీసుకువెళ్లేవారు. పోర్చుగీసు వారి ప్రతిభ తగ్గిన తర్వాత డచ్చి, ఇంగ్లీష్ వారి కంపెనీలు అభివృద్ధి చెందాయి. వారు ఇండియా వస్త్రాలు చాలా బాగా ఉన్నాయని గ్రహించి క్రీ.శ.1630 నుండి ఇండియా వస్త్రాలను ఐరోపా మార్కెట్లలో కూడా ప్రవేశపెట్టారు. 17వ శతాబ్దం వరకు ఇండియా వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా గిరాకీ హెచ్చింది. అందువల్ల గోల్కొండ నవాబుల కాలంలో వస్త్రపరిశ్రమ బాగా అభివృద్ధి చెంది రకరకాల వస్త్రాలు తయారు చేశారు.

మస్లిన్‌లు - కాలికోలు - చిన్‌జ్‌లు - పింటదోలు: ఆ రోజులలో మస్లిన్‌లు, కాలికోలు అనే రెండు రకాల వస్త్రాలను తయారు చేసేవారు. మస్లిన్‌ను దేశంలో వాడేవారు. కాలికోలు విదేశాలకు ఎగుమతి చేసేవారు. ఈ వస్త్రాలకు నీలి, ఎరుపు రంగులు వేసేవారు. చెక్రి వేరు నుండి ఎరుపురంగు, నీలిమొక్కల నుండి నీలిరంగు తయారు చేస్తారు. కొన్ని మొక్కల నుండి పసుపురంగు కూడా తీస్తారు. కర్ర అచ్చులను తయారు చేసి రంగులలో ముంచి వస్త్రాల మీద ముద్రిస్తారు. ఈ విధంగా చేసే పనిని అద్దకం అని అనేవారు. ఈ అద్దకాలను చిన్‌జ్ లేక చేనేత అని అనేవారు. ఇవికాక పింటదోలు అనే మరొక అద్దకాలు కూడా తయారు అయ్యేవి. బ్రష్షులతో రంగులు వేసి బొమ్మలు చిత్రించేవారు. అద్దకాలలో ఒకే నమూనా అచ్చును ముద్రిస్తూ పోతారు. దానికి పెద్ద నేర్పు అవసరం లేదు. కాని పింటదోలు వస్త్రాలకు మంచి నేర్పు కావాలి. బొమ్మలను చిత్రించడానికి కళాకారితనం కావాలి అనుభవం మీద నేర్పరితనం వచ్చేది అని జాన్ ఇర్విన్ అనే అతడు రాశాడు.

కలంకారీ వస్త్రాలు: ఇవిగాక ఆనాడు కలంకారీ వస్త్రాలని ఐదారు రంగులతో అనేక చిత్రాలతో వస్త్రాలను తయారు చేసేవారు. దీనికి శ్రమ, నేర్పు కావాలి. ఒకే బట్ట నేయడానికి ఐదారు మాసాలు కూడా పట్టేది. ఇలాంటి వస్త్రాలు రాజులు, రాణులు వాడేవారు. విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ఆ రోజులలో మచిలీపట్టణం కలంకారీ వస్త్రాలకు ప్రసిద్ధి చెందింది. అవి బట్ట చినిగిపోయినా రంగులు, కలంకారీ అద్దకాలు పోయేవి కావట. ఈ వస్త్రాలకు విదేశాలలో మంచి గిరాకీ ఉంది. ఇంకా పాలకొల్లు, నిజాం పట్టణాలలో కూడా కలంకారీ వస్త్రాలు తయారు చేసేవారు. ఇవిగాక సాదా అద్దకాల బట్టలు కూడా అనేక రకాలవి తయారయ్యేవి. వాటికి అనేక రకాల పేర్లుండేవి. కొరా, తాను, సలంపొరె, పలంపొరె అనే పేర్లుండేవి. వీటిలో పలంపొరె అనేది వర్ణచిత్రాలు ఉండే కాలికోబట్ట. దుప్పట్లు, తలపాగలు, సాదాచీరెలు, తెరలకు రకరకాల బట్టలు తయారయ్యేవి.

గోదావరి వద్ద నాగూరులో మంచి బట్టలు తయారు అయ్యేవి. శ్రీకాకుళంలో మస్లిన్‌లు, ఏలూరులో ఉన్ని తివాచీలు తయారయ్యేవి. నర్సాపురంలో మచిలీపట్టణంలో కన్నా చిక్కని బట్ట తయారయ్యేదట. పాలకొల్లులో కాలికోలు, లుంగీలు, రకరకాల రంగు బట్టలు తయారై మచిలీపట్టణానికి ఎగుమతికి వచ్చేవట. మచిలీపట్టణం ఆనాడు గొప్ప పారిశ్రామిక వాణిజ్య కేంద్రంగా వెలిగింది. మచిలీపట్టణం వద్ద ఉన్న పలంపోరులో కూడా మంచి వస్త్రాలు నేసేవారట. వాటికి పలంపోరు బట్టలు అని పేరుండేది. బట్టలకు వేసే నీలిరంగు నల్లగొండ జిల్లాలోను, ఖమ్మంమెట్టుకు 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న నాగులవంచలో ఎక్కువగా తయారయ్యేదట. అక్కడ తయారయ్యే నీలిమందు విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేదట.

ఎగుమతి వ్యాపారం: వస్త్రాలలో ఎక్కువ భాగం విదేశాలకు ఎగుమతి అయ్యేవి. 17వ శతాబ్దం నుండి ఐరోపాకు కలంకారీలు అద్దకాలు ఎక్కువగా ఎగుమతి అవసాగాయి. ఐరోపా వర్తకులు ఆంధ్రదేశం నుండి తమ దేశాలకు సాలుకు 30 లక్షల రూపాయల విలువైన వస్త్రాలు పంపేవారని గ్రాంట్ అనే పండితుడు రాశాడు. కోస్తా నుండి 10 లక్షల విలువగల ముతకబట్ట మద్రాసు చేరేది. వస్త్రాలేగాక 25 లక్షల రూపాయల ధాన్యం కూడా మద్రాసుకు వెళ్లేవి. లంబాడీల ద్వారా 10 లక్షల రూపాయల సరుకు వెళ్లేది. ఈ విధంగా ఆంధ్రదేశంలో ఎగుమతులు బాగా పెరిగాయి. కనుక ఇంగ్లీష్ వారు ఆంధ్రదేశంలో వ్యాపారం చేసుకోవడానికి గోల్కొండ

నవాబుకు సాలుకు 12 వేల పగోడాలు చెల్లించే షరతుపై బంగారు ఫర్మానాను సంపాదించారు. డచ్చి వారు, ఫ్రెంచి వారు కూడా ఆంధ్రదేశంలో, ముఖ్యంగా కోస్తాలో వ్యాపారం చేసుకోవడానికి పోటీలు పడ్డారు. అంటే ఆనాడు ఆంధ్రదేశపు వ్యాపారం ఎంత లాభసాటిగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. సాలుకు 75 లక్షల రూపాయల విలువ చేసే వ్యాపారం జరిగేదని జేమ్స్ గ్రాంట్ రాశాడు

సంవత్సరం పొడవునా అనేక ఓడలు మచిలీపట్టణం, కోరంగి, భీమునిపట్టణం, పండి, వాతర మొదలైన రేవులకు వస్తుంటాయని విదేశీ వర్తకులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని వర్తకం చేస్తున్నారని రాశాడు. 17వ శతాబ్దపు ఒక డచ్ వర్తకుడు కోస్తా నుండి సరుకులతో తొట్టి పడవలు దుగ్గరాజుపట్టణం, పులికాట్, ఆర్మగాం, మైలాపూర్, కోవలం, గునువోడె, తెనాంపట్టణం, అగ్రెజం, పోర్టొనోవోలకు వెళుతుంటాయని రాశాడు. క్రీ.శ.1667వ సంవత్సరంలో కుతుబ్‌షాహీ రాజ్యంలో పర్యటించిన తెవెనాట్ అనే ఫ్రెంచి వైద్యుడు మచిలీపట్టణం గొప్ప రేవు అని, అక్కడి నుండి అన్ని దేశాలకు సన్నని బట్ట ఎగుమతి అవుతూ ఉంటుందని రాశాడు. చైనా, సయాం, పెగూ దేశాల నుండి అక్కడికి అనేక వర్తకులు వచ్చేవారు. వారిని తాను చూశానని కూడా వివరించాడు. మెత్ ఓల్డ్ అనే అతడు కోస్తా కలంకారీ అద్దకాలకు గొప్ప ప్రసిద్ధి అని, బట్ట చినిగినా రంగుమాయదని వర్ణించాడు.

తివాచీల పరిశ్రమ: ఆంధ్రదేశంలో తివాచీల పరిశ్రమ గోల్కొండ నవాబుల కాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ఎక్కువగా ముస్లింలు తివాచీలను నేసేవారు. ఏలూరు తివాచీల నేతలకు ప్రసిద్ధి చెందింది. అక్కడ కూడా ముస్లింలే ఎక్కువ మంది పనివారు. వారు నేసే తివాచీలలో 12 వేల కుట్లకుపైన ఉండేవట. అవి కూడా చాలా సున్నితంగా ఉండేవట. కుట్లపొందిక, వాటికి వేసే రంగులు చాలా అద్భుతంగా ఉండేవని, అటువంటి తివాచీలు మరెక్కడా లభించవని జార్జి బర్డ్ ఉడ్ అనే పండితుడు రాశాడు.

సూరేకార పరిశ్రమ: వస్త్ర పరిశ్రమలే గాక ఆంధ్రదేశంలో ఇతర పరిశ్రమలు కూడా వృద్ధి చెందాయి. వాటిలో సూరేకారం పరిశ్రమ ముఖ్యమైనది. మచిలీపట్టణం, నర్సాపూరు, పులికాట్ మొదలైన రేవు పట్టణాల వద్ద సూరేకారం తయారయ్యేది. ఇది విదేశాలకు ఎగుమతి అయ్యేది. దీనితో తుపాకీ మందు తయారు చేసేవారు. ఈ కాలంలో ప్రతి దేశానికి తుపాకీ మందు అత్యవసరమైంది. కనుక సూరేకారం వ్యాపారం కూడా బాగానే అభివృద్ధి చెందింది. ఇది తయారు చేయడం చాలా సులభం. ఉప్పుమడుల వంటి ఒకదానికన్నా ఒకటి ఎత్తుగా రెండు మడులు ఏర్పాటు చేస్తారు. పైమడిలో ఉప్పు నీరుపోసి మట్టిలో కలసి బురద అయ్యేటట్లు మనుషుల చేత తొక్కిస్తారు. ఆ బురదను రెండు మూడు రోజులు నాననిచ్చి, అందులోని నీటిని కిందిమడిలోనికి వచ్చేటట్లు చేస్తారు. ఆ నీరును ఎండబెడతారు. నీరు ఇగిరి సూరేకారం మడిలో మిగులుతుంది. దానిని మళ్లీ నీటిలో కరిగించి మళ్లీ ఇగరబెడతారు. అలా తెల్లగా, స్వచ్ఛంగా అయ్యే వరకూ ఇగరబెడుతూనే ఉంటారు. అప్పుడు స్వచ్ఛమైన సూరేకారం తయారవుతుంది. మచిలీపట్టణంలోనే ఐరోపా కంపెనీ వారు తుపాకీ మందు, తూటాలు కూడా తయారు చేసుకునేవారట.

ఇనుము, ఉక్కు పరిశ్రమ: ఇంకా ఆంధ్రదేశంలో ఇనుము, ఉక్కు పరిశ్రమలు కూడా ఉండేవి. విరిగిపోయిన ఇనుమును కమ్మరి చక్కగా అతికిస్తాడని వేమన కూడా తన పద్యాలలో ప్రస్తావించాడు. నిర్మల్, ఇందూరులలో ఆయుధ పరిశ్రమలుండేవి. నిజామాబాద్ జిల్లాలోని ఇందల్‌వాయిలో తయారయ్యే కత్తులు, బల్లేలు, చురకత్తులు, జెంజాతి బాకులు దేశంలోని అన్ని ప్రదేశాలలో కొంటారని, వాటికి మంచి గిరాకీ ఉందని దేమాట్ రాశాడు. ఆంధ్రదేశం నుండి ఇనుము పంజాబ్, పర్షియా, అరబ్ దేశాలకు ఎగుమతి అయ్యేది. డమాస్కస్ కత్తులు ఆంధ్ర దేశపు అంటే గోల్కొండ రాజ్యపు ఉక్కు, ఇనుముతో తయారయ్యేవని విదేశస్తులు రాశారు. గోల్కొండ రాజ్యంలో 23 గనులుండేవి. అందులో ఇనుము, సీసం గనులు అతిముఖ్యమైనవి. ఇంకా సీసం పరిశ్రమ కూడా ఉండేది.

ఉప్పు-పంచదార-బెల్లం పరిశ్రమలు: ఉప్పు నీటిని మడుగులలో ఎండబెట్టి ఉప్పును తయారు చేస్తారు. పంచదార, బెల్లం చెరకు నుండి వండి తయారు చేస్తారు.

నౌకా పరిశ్రమ - నర్సాపురం - మాధవాయపాలెం: వస్త్ర పరిశ్రమ, సూరేకారం పరిశ్రమలు విదేశీ ఎగుమతులను పెంచినందువల్ల నౌకల అవసరం కూడా పెరిగింది. కనుక ఆంధ్రదేశంలో నౌకా పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. నర్సాపురం వద్ద ఉన్న మాధవాయపాలెంలో బలిష్టమైన నౌకలు నిర్మించేవారని విదేశీ రచనలు తెలుపుతున్నాయి. ఇక్కడ తయారయ్యే నౌకలు ఎర్రసముద్రంలో నిమోచాకు సుమిత్రాలోని అచనేకు, ఇంకా ఆరకాన్, పెగూ, టెన్సెరిమ్ సింహళాలకు వెళ్లేవని, చాలా దృఢంగా ఉండేవని మెత్ ఓల్డు రాశాడు. నర్సాపురం

చాలా పెద్ద రేవు అని అక్కడ ఇంగ్లిష్ వర్తకులుండేవారని, వారికోసమే అక్కడ నౌకలు నిర్మింపబడేవని, అక్కడ మంచి పనివారున్నారని, ఇనుము, దృఢమైన కర్ర దొరికేదని బౌరే రాశాడు. ఇంగ్లిష్ కంపెనీ వారు నర్సాపూర్‌లో ఓడలు తయారు చేసుకుంటున్నందువల్ల ఇంగ్లండ్‌లో ఓడలు నిర్మించే కంపెనీలకు పనిలేకుండా పోయిందని బ్రిటిష్ ప్రభుత్వం ఈస్టిండియా కంపెనీ భారత ఇండియాలో ఓడలు నిర్మింపరాదని ఆదేశించిందట. ఇంగ్లిషు కంపెనీ అధికారి ఫోర్ అనే అతడు మచిలీపట్నంలో కొన్ని వ్యాపార నౌకలు తయారు చేయించాడట. అందువల్ల ఇంగ్లండులోని నౌకా నిర్మాణ సంస్థలకు పని లేకుండా పోయిందట. అందువల్ల ఇండియాలో నౌకలు నిర్మించే పద్ధతిని నిషేధించారట. భీమునిపట్నం, మచిలీపట్టణం, పులికాట్‌లలో డచ్చివారు నౌకలు కట్టించేవారని కూడా వారు రాశారు. పోర్చుగీసు వారు కూడా అక్కడ ఓడలు నిర్మించుకున్నారట. నర్సాపురం దారు పరిశ్రమకు కూడా కేంద్రంగా ఉండేది. కొండపల్లి కూడా దారు పరిశ్రమకు ప్రసిద్ధి చెందింది. మచిలీపట్టణంలో నాణ్యమైన తెరచాపలు, దూలాలు దొరికేవట. ఆ కాలంలో ఇంగ్లిష్ వారి ఓడలు 200-400 టన్నుల బరువు ఉండేవట

కలప పరిశ్రమ: గోల్కొండ రాజ్యంలో విస్తారంగా అరణ్యాలు ఉన్నందువల్ల నౌకా పరిశ్రమతోపాటు కలప పరిశ్రమ కూడా అభివృద్ధి చెందింది. కుర్చీలు, మంచాలు, సోఫాలు, కొయ్య, తెరలు తయారయ్యేవి. కొండపల్లిలో కొయ్యబొమ్మలు తయారయ్యేవి. కొండపల్లి బొమ్మలు దేశమంతటా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాయి.

పట్టణాలు - వర్తకులు - వాణిజ్యాలు: విదేశీయుల రాకతో గోల్కొండ రాజ్యంలో దేశీయ, విదేశీ వాణిజ్యం అత్యున్నత దశనందుకొని అంతర్జాతీయ వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెంది రెండవ ఈజిప్టుగా కీర్తి పొందింది. ఇది జనసామర్థ్యం గల దేశమని, ఇక్కడ అన్నీ లభిస్తాయని బౌరె అనే ఇంగ్లిష్ వర్తకుడు రాశాడు. గోల్కొండ రాజ్యంలో భీమునిపట్టణం, విశాఖపట్టణం, మచిలీపట్టణం, పులికాట్ గొప్ప రేవు పట్టణాలు. వాటిలో మచిలీ పట్టణం నేటి బొంబాయిలాగా అంతర్జాతీయ ఖ్యాతి గల రేవు. అక్కడి నుండే ప్రపంచంలోని నలుమూలలకు సరుకులు ఎగుమతి, దిగుమతులు జరుగుతుండేవి. టర్కీ, అరేబియా, సింహళం, మలయా, అరకాన్, పెగు, డెన్సిరియ్, మాల్దీవులు, ఐరోపా దేశాలలో వాణిజ్యం జరిగేది. భూ, జలమార్గాలపై జరిగే వ్యాపారం వల్ల రాజ్యానికి మంచి ఆదాయమే వస్తుండేది.

విదేశీ వ్యాపారం ఉచ్ఛదశలో ఉన్నందువల్ల ఆంధ్రదేశంలో అనేక పట్టణాలు పెరిగాయి. అన్నింటిలో మచిలీపట్టణం చాలా పెద్దదని, చాలా భాగ్యవంతమైనదని విదేశస్తులు రాశారు. అక్కడ 2 లక్షల జనాభా ఉండేదని, ఐదారు అంతస్తుల భవనాలుండేవని బౌరే రాశాడు. జనాభాలో ముస్లింలు అధికులు. వారిలో కూడా పర్షియావారు ఎక్కువ ధనవంతులు. పర్షియా, బర్మా, మలేషియా, బెంగాల్, నరత్, ఆరకాన్, ఫ్రాన్స్, హాలెండ్, ఇంగ్లండ్, పోర్చుగల్ దేశాలకు చెందిన అనేక మంది వర్తకులు అక్కడ నివసిస్తున్నారని ఈ పట్టణం ఇండియాలో కెల్లా చాలా ఉచ్ఛదశలో ఉందని అలెగ్జాండర్ హేమిల్టన్ వర్ణించాడు. తర్వాత పెద్ద పట్టణం శ్రీకాకుళం, ఇది కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళం, ఇంకా నర్సపూరు, పులికాట్‌లు కూడా నాటి పెద్ద పట్టణాలు. విదేశీ వర్తకులు సరాసరి వస్తువులు కొనేవారు కాదట. వారు దేశీయ వర్తకులకు బయానాలిచ్చి వారికి కావలసిన డిజైన్లు చెప్పేవారు. దాని ప్రకారం దేశీయ వ్యాపారులు తయారు చేయించి వారికి అందించేవారట. అందుకు వారికి మంచి లాభం ఉండేదట. ఇక వస్తువులు గాని, వస్త్రాలు గానీ తయారు చేసే వృత్తి పనివారి పరిస్థితి హీనంగా ఉండేదట. వారికి స్వయంగా ఏ వస్త్రాన్నిగానీ, వస్తువుగానీ తయారుచేసే స్తోమత లేదు. వ్యాపారులు బయానా ఇచ్చి చేయమంటేనే చేయగలిగేవారు. మంచిపని వాడికి మూడు పెన్నీలు, కింది పనివారికి ఒక పెన్నీ కూలీ అని రాశారు. దేశీయ వ్యాపారులు కూలీ ఇచ్చి వస్త్రాలు నేయించి వాటిని మంచి లాభాలతో విదేశీ వర్తకులకు అమ్మేవారు. వృత్తి పనివారి పరిస్థితి బాగా లేకపోయినా దేశం సిరిసంపదలతో వర్ధిల్లింది. సుల్తాన్‌లు, వర్తకులు, శ్రీమంతులు విలాస జీవితాలను గడిపారు. గోల్కొండ పట్టణం కూడా గొప్ప వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. రత్నాలు, వజ్రాలు, సుగంధద్రవ్యాలు, కస్తూరి, పరిమళ ద్రవ్యాలకు గొప్ప వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందింది. టర్కీ ఇరాన్ దేశాల నుండి గోల్కొండ వచ్చిన ముస్లిం వ్యాపారులకు సుల్తాన్‌లు అన్ని వసతులు ఏర్పాటు చేసి పన్నులు కూడా తగ్గించేవారట.

ఎగుమతులు - దిగుమతులు: రత్నాలు, వజ్రాలు, తెల్లని వస్త్రాలు, ఇనుము, ఉక్కు రంగు బట్టలు, నూనె, పొగాకు జలమార్గాన తూర్పు-పశ్చిమ దేశాలకు అనేక ద్వీపాలకు ఎగుమతి అయ్యేవి. మణులు, లక్క, సిల్కు వస్త్రాలు, పంచదార, సువర్ణం, మిరియాలు, గాజు వస్తువులు, చీనాపట్టు దిగుమతి అయ్యేవి. చందనపు కర్ర,

సీసం, మెరుపు పాత్రలు, ముఖమల్ దిగుమతి అయ్యేవి. భాద్రపద మాసంలో తూర్పు దేశాలకు, పుష్యమాసాలలో పశ్చిమ దేశాలకు రాకపోకలు సాగించేవారు. దిగుమతులపై $3^1/_4$ శాతం సుంకాలు వసూలు చేసేవారు. ఇంకా ఐరోపా రాజ్యాల నుండి కొన్ని ప్రత్యేక వస్తువులు దిగుమతి అయ్యేవి.

Lead ఇంగ్లండు నుండి, ఫ్రాన్స్ నుండి, Broad Cloth ఉజ్బెకిస్తాన్, అరేబియా, పర్షియా, ఇథియోపియాల నుండి, Dried Fruits బుఖార్, పర్షియా నుండి, Chownes and Ambergris మాల్దీవుల నుండి, Porcelain చైనా నుండి, Pearls ట్యూటికొరన్, బహ్రెయిన్‌ల నుండి, Cloves and Cinnmor సిలోన్ నుండి దిగుమతి అయ్యేవి. Shipladem, Quick Silver, Vermilion, బంగారం, వెండి, ఇనుప ఫిరంగులు బహుమతి వస్తువులు పశ్చిమ దేశాల నుండి వచ్చేవి. Salt Petre దిగుమతులలో అతి ముఖ్యమైనవి. తుపాకీ మందు తయారు చేయడానికి అది చాలా ముఖ్యం. బెంగాల్ నుండి కొన్ని వస్తువులు వచ్చేవి. మొగలులకు, గోల్కొండ సుల్తాన్‌లకు యుద్ధాలు జరిగినప్పుడు బెంగాల్ నుండి సరుకులు రవాణా కాలేదు.

వడ్డీ వ్యాపారం: ఇరాన్, టర్కీ దేశస్తులు హైదరాబాద్‌లో స్థిరపడి వ్యాపారాలు చేసి ధనవంతులయ్యారు. కొందరు వడ్డీ వ్యాపారం చేసేవారు. 4 శాతం వడ్డీ వసూలు చేసేవారు. కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా చేరేవారు. గనులలో వ్యాపార ప్రాంతాలలో, రేవు పట్టణాలలో కూలీలు పని చేసేవారు. హిందువులు, కమ్మరులు, వడ్రంగులు, కంసాలులకు రోజుకు మూడు అణాల కూలీ ఇచ్చేవారట. పల్లకీలు మోసే బోయీలకు, నౌకరులకు రోజుకు ఒక అణా కూలీ ఇచ్చేవారు. వారి పరిస్థితి దీనంగా ఉండేది.

రహదారులు: గోల్కొండ రాజ్యంలో వర్తక వాణిజ్యాలు బాగా అభివృద్ధి చెందినందువల్ల రహదారులు కూడా బాగు చేయబడ్డాయి. రాజ్యంలో ముఖ్యమైన వాణిజ్య కేంద్రాలను, పట్టణాలను, రేవులను కలుపుతూ అనేక మార్గాలుండేవి. రాజధాని అయిన హైదరాబాద్ నుండి ఆంధ్రదేశంలోని అన్ని ప్రాంతాలను కలుపుతూ రోడ్లు వేయబడ్డాయి. హైదరాబాద్ నుండి మచిలీపట్టణానికి రెండు రాజమార్గాలుండేవి. ఒక మార్గం గోల్కొండ నుండి నల్లగొండ, కొండపల్లి, బెజవాడల మీదుగా మచిలీపట్టణం చేరేది. మరొక మార్గం గోల్కొండ నుండి తేనారా అనే పట్టణం నుండి పానుగల్లు, అక్కడి నుండి బందర్, బముబారక్ చేరేది. ఆ కాలంలో మచిలీపట్టణాన్ని బందర్ బముబారక్ అని వ్యవహరించేవారు. తేనారా అనే పట్టణాన్ని టేవర్నియర్, తేవనాట్ అనే విదేశీ యాత్రికులు ఇద్దరూ తమ గ్రంథాలలో పేర్కొన్నారు. కాని ఈ పట్టణం గుర్తింపబడలేదు. ఇది హైదరాబాద్‌కు 12 కిలోమీటర్లలో ఉన్న హయత్‌నగర్ అని కొందరు భావించారు. హైదరాబాద్ నుంచి మరొక బాట కొళ్లూరుకు ఉంది. కొళ్లూరు నుంచి కృష్ణానది ఉపనదిని దాటి ఒక బాట బెజవాడ చేరేది. హైదరాబాద్ నుండి కొళ్లూరుకు 14 క్రోసుల దూరం ఉండేది. బెజవాడ, మచిలీపట్టణాల మధ్య ఇంకా తక్కువ దూరం ఉండేది. మచిలీపట్టణం నుండి సముద్రతీరం వెంట పులికాట్ మీదుగా మద్రాస్‌కు ఒక బాట ఉండేది. మచిలీపట్టణం నుండి నర్సాపూర్ ఒక బాట ఉండేది. అలాగే మచిలీపట్టణం నుండి శ్రీకాకుళానికి ఒక బాట ఉండేది. బెజవాడ నుండి కొండవీడు, గండికోటల మీదుగా చెన్నపట్టణానికి ఒక రహదారి ఉండేది. గోల్కొండ నుండి తేనారా, అక్కడి నుండి దేవరకొండ చేరి అక్కడ కృష్ణానదిని దాటి కంభం గుండా గండికోట, అక్కడి నుండి మద్రాసు చేరడానికి రహదారి ఉంది. కర్నూలు నుండి రామల్లకోట మీదుగా గోల్కొండ చేరటానికి ఒక రహదారి ఉంది. మరొక మార్గం కర్నూలు నుండి ఆలంపూర్ మీదుగా బీజాపూర్ రాజ్యంలోకి వెళ్లటానికి మరొక బాట ఉండేది. గోల్కొండ నుండి నల్లగొండ, మిరియాలగూడెం, వాడపల్లి దగ్గర కృష్ణను దాటి దాచేపల్లి, పిడుగురాళ్ల, నెమలిపురి, నకెరకల్లు, ముప్పాళ్ల, అద్దంకి, ఒంగోలు అక్కడి నుండి మద్రాసు చేరే మరొక మార్గముంది. దానికి దండుబాట అని పేరు. ఈ విధంగా ఆంధ్రదేశం మొత్తాన్ని కలుపుతూ అన్ని ప్రాంతాలకు బాటలున్నాయి. ఇవేగాక హైదరాబాద్ నుండి సూరత్ వరకు ఒక మార్గముండేది. ఆ మార్గం ఇందూర్ లేక నిజామాబాద్ నుండి నాందేడ్, పర్భణి, ఔరంగాబాద్, దౌలతాబాద్‌ల గుండా సూరత్ చేరేది. గోల్కొండ రాజ్యంలో చివరి గ్రామమైన ఇందల్‌వాయి నుండి మేడ్చల్ గుండా మౌలాలి, హుస్సేన్‌సాగర్, పురానాపూల్ వరకు ఒక మార్గముండేది. కుతుబ్‌షాహి రాజ్యంలోని కోహిర్ నుండి బీదర్, షోలాపూర్ గుండా బీజాపూర్‌కు దక్షిణం నుండి గోవా చేరటానికి రహదారి ఉండేది. ఈ విధంగా గోల్కొండ నుండి, దక్షిణదేశం నుండి అన్ని ప్రాంతాలకు మార్గాలున్నాయి. నర్సాపూర్, మచిలీపట్టణం, నిజాం పట్టణం, పెద్దపల్లి, పులికాట్, చెన్నపట్టణం ఆనాడు గొప్ప రేవు పట్టణాలు. ఈ రేవుల నుండి తూర్పున అరకాన్, పెగు, మలయా దేశాలతోను, పశ్చిమాన పర్షియా, అరేబియా, టర్కీ, ఐరోపా రాజ్యాలతో వ్యాపారం జరిగేది.

వజ్ర వ్యాపారం - పరిశ్రమ: గోల్కొండ రాజ్యంలో ఉన్న మరొక గొప్ప పరిశ్రమ వజ్ర పరిశ్రమ. గోల్కొండ రాజ్యం వజ్రాలకు ప్రసిద్ధి. అనేకచోట్ల వజ్రాల గనులుండేవి. గోల్కొండ రాజ్యం వజ్రదేశమని ప్రసిద్ధి చెందింది. ఆనాడు వజ్రాల వ్యాపారం ప్రపంచ ప్రసిద్ధి చెంది, ప్రపంచ వ్యాప్తంగా వజ్రాలకు మంచి గిరాకీ ఉండేది. వజ్రపు గనుల నుండి సుల్తాన్‌కు ఎక్కువ ఆదాయం వచ్చేదని ఆనాడు ఆంధ్రదేశాన్ని దర్శించిన విదేశస్తులు రాశారు. ఒక కృష్ణా జిల్లా గనుల నుండి పని జరుగుతూ ఉంటే చాలు ఆదాయం వచ్చేదని, వజ్రాలు దొరకకపోయినా గంటకు ఒక పగోడా ఆదాయం వస్తుందని రాశారు. కృష్ణా జిల్లాలో పరిటాల, నూజివీడు తాలూకాలోని మాలపల్లె, గల్లపల్లె, రాయనపేటలలో ఉన్నాయి. ఈ గనులను వేలంపాట ద్వారా గుత్తకు ఇచ్చేవారు. సుల్తాన్‌కు వేలం పాటల ద్వారా ఏటా 60 వేల పగోడాలు ఆదాయం వచ్చేదట. ఆ గనులు క్రీ.శ.1679లో పని చేస్తూ ఉండటం తాను చూశానని స్ట్రెన్‌షామ్ మాస్టర్ రాశాడు. అక్కడ 30 వేల మంది కూలీలు పని చేసేవారని, వారిలో కొందరు తవ్వుతారు, కొందరు మట్టిని మోస్తారు, మరికొందరు నీరుపోస్తారు అని రాశాడు. కర్నూలు జిల్లాలోని బనగానపల్లె, మునిమడుగు, తిమ్మాపురం, రామల్లకోటలలో వజ్రాలు లభించేవి. ఒక గుజరాతీ వర్తకుడు మునిమడుగులో వజ్రాలు కొన్నాడు. దాంతో అక్కడ వజ్రపు గనులున్నాయని తెలిసింది. వెంటనే గండికోట సుబేదారు ఆ గనులను స్వాధీనం చేసుకున్నాడు. కడప జిల్లా పెన్నానది ఒడ్డున చెన్నూరులో వజ్రాలు దొరికేవి. వజ్రకరూర్ ప్రసిద్ధి చెందిన వజ్రపు గని. క్రీ.శ.1615లో బ్రిటీష్ ఉద్యోగి మేత్ ఓల్డ్ గోల్కొండ రాజ్యానికి వచ్చాడట. అతడు రాజ్యంలో పర్యటిస్తుండగా ఒక పశువుల కాపరి కనిపించాడట. అతనితో కలసి కొంత దూరం వెళ్లగానే పశువుల కాపరి కాలికి ఒకరాయి తగిలిందట. దానిని పైకి తీసి చూడగా అది వజ్రమట. దానిని పశువుల కాపరి తీసుకొని ఒక వ్యాపారికి చౌకగా అమ్మాడట. అది చాలా విలువైన వజ్రం అని అతడు రాశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో నూతన వజ్రపు గనులు బయల్పడ్డాయి. గనుల చుట్టూ కుతుబ్‌షా కాపలా పెట్టేవాడట. కర్ణాటక ప్రాంతంలో కొత్త గనులు బయల్పడ్డాయి. ఆ రోజులలో వజ్ర నిపుణులు భూమి స్వభావం, మట్టిపెళ్లల వాసనలను బట్టి వజ్రపు గనుల ఉనికిని కనిపెట్టేవారట. మహమ్మద్ సయీద్ లేక మీర్జుమ్లా కడప, సిద్దవటం, గండికోటలను జయించిన తర్వాత ఆ ప్రాంతంలో అతనికి అనేక వజ్రాలు లభించాయి. అతడు షాజహాన్ చక్రవర్తికి 40 లక్షలు విలువ చేసే వజ్రాలను బహూకరించాడట. అందులో 365 కేరట్ల బరువు ఉన్న పెద్ద వజ్రం ఉంది. కోహినూరు వజ్రాన్ని కూడా మీర్జుమ్లాయే షాజహాన్ చక్రవర్తికి బహూకరించాడట. అది ముడిగా 900 కేరట్ల బరువు ఉండట. అబ్దుల్లా కుతుబ్‌షా, తానీషాల కాలంలో గోల్కొండ ఖజానాలో 300 కేరట్ల వజ్రాలు అనేకం ఉండేవట. అబ్దుల్లా కిరీటంలో విలువైన వజ్రాలు పొదగబడి ఉండేవని దయోనా వర్ణించాడు. గోల్కొండ రాజ్యంలో 23 వజ్రపు గనులుండేవట. గండికోట, కోలారు గనులలో 10 వేల మంది కార్మికులు పనిచేసే వారట. మహమ్మద్ సయీద్ ఆ ప్రాంతానికి మీర్జుమ్లా అయిన తర్వాత 1200 మందిని ప్రత్యేకంగా పెట్టి వజ్రపు గనులు తవ్వించి వజ్రాలు సేకరించాడట. పది కేరట్లకు పైన బరువు ఉంది కుతుబ్‌షాకు పంపేవారు. గనులు కౌలుకు తీసుకుంటే గంటకు ఒక హొన్ను ప్రభుత్వానికి చెల్లించి తాము సేకరించిన వజ్రాలు అమ్ముకొనేవారు. పెద్ద పెద్ద గనులపై సంవత్సరానికి 3 లక్షల హొన్నులు కౌలు వచ్చేది. గనుల వద్ద కూలీలు, వ్యాపారులు నివసించినందువలన అక్కడ జనసాంద్రత పెరిగి నూతన గ్రామాలు, పట్టణాలుగా పెరిగేవట. వజ్రాలను సంచుల ద్వారా కూడా లెక్కించేవారట. కుతుబ్‌షాహీల కాలంలో వజ్రాల వ్యాపారం ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ప్రపంచంలో రాజులందరూ వజ్రాలను కొనేవారట. అందువల్ల ప్రపంచం మొత్తంలో వజ్రాలకు మంచి గిరాకీ ఉండేదట. గుంటూరు జిల్లాలోని కొల్లూరు, కృష్ణా జిల్లాలోని పరిటాల, అనంతపురం జిల్లాలోని వజ్రకరూర్‌లో వజ్రాలు బాగా దొరికేవి. ఇంకా కొండపల్లి, నర్సాపురం, కర్ణాటకంలోని కందికోట, కోలారులలో కూడా వజ్రాలు లభించేవి. కర్ణాటక వజ్రపు గనులలో 20 వేల మంది కూలీలు పని చేసేవారు.

కొల్లూరు - వజ్రపు గనులు: గోల్కొండ సుల్తాన్‌ల కాలంలో అత్యంత ప్రసిద్ధి చెందిన వజ్రాల గని కొల్లూరు గని. ఇది సత్తెనపల్లి తాలూకాలో కృష్ణానది ఒడ్డున ఉంది. అక్కడ 60 వేల మంది కూలీలు పని చేసేవారట. అక్కడ మగవాళ్లు తవ్వుతుంటే ఆడవారు ఆ మట్టిని తీసుకువెళ్లి నీటిలో కలిపి అదుసుగా చేసి రెండు మూడు రోజులు నాననిచ్చేవారు. తర్వాత దాని మీద నీరు పోస్తూ మట్టి అంతా పోయేటట్లు చేస్తారు. మట్టిపోగానే అడుగున ఇసుక వంటి రేణువులు మిగిలేవి. ఆ ఇసుకను తూర్పార పట్టేవారు. అప్పుడు నేల మీద గాంగ్ర ఇసుక మిగిలేది. దానిని దిమ్మిసతో నలగ గొట్టి మళ్లీ తూర్పార పోసి ఆ రాశిలో వజ్రాల కోసం వెతికేవారు. దొరికిన వజ్రాలను

సానపెట్టకుండా ముడిగానే అమ్ముతారట. వజ్రాలు, రత్నాలు కొనడానికి ఆరుసార్లు ఇండియా వచ్చిన టావెర్నియర్ కొళ్లూరు గనిని దర్శించి, అక్కడి విశేషాలు రాశాడు. ఆ గనిలోనే ప్రపంచ ప్రసిద్ధి పొందిన కోహినూర్ వజ్రం లభించింది. దానిని మీర్జుమ్లా షాజహానుకు ఇచ్చాడు. టావెర్నియర్ ఔరంగజేబును దర్శించినప్పుడు ఆ వజ్రం అతని వద్ద ఉందని పేర్కొన్నాడు. అది 900 కారెట్లు ఉందట. అదేగాక పిట్ వజ్రం అనే మరొక వజ్రం కూడా ఇక్కడ లభించింది. దానికి రీజెంట్ వజ్రం అని కూడా పేరు. ఇది పరిటాలలో దొరికిందని మరికొందరు అంటారు. కొళ్లూరు గనులలో దొరికిన వజ్రాలలో 10 కేరట్ల కంటే ఎక్కువ ఉన్న వాటిని గోల్కొండ నవాబులు ఉంచుకొని మిగిలినవి మాత్రమే గుత్తదారులను అమ్ముకోనిచ్చేవారని, గుత్తదారుల నుండి ప్రతి సంవత్సరం 3 లక్షల పగోడాలు ఆదాయం వచ్చేదని మెత్ ఓల్డు రాశాడు.

గోల్కొండ నవాబు కిరీటంలో ఒక అడుగు పొడవు కలిగిన అమూల్యమైన రత్నఖచిత ఆభరణం, ఇంకా 4 అంగుళాల వ్యాసం కలిగిన రత్నాలు కూడా కిరీటంపై ఉన్నాయని తెనెవా అనే అతడు రాశాడు. అతడు అనేక రత్నాభరణాలను ధరించాడని, అతని దగ్గర ఉన్న రత్నాలు చాలా విలువైనవని, వాటిని కొనగలిగినవారు లేరని కూడా అతడు వివరించాడు. ఈ విధంగా కుతుబ్‌షాహీ రాజ్యపు సంపదను విదేశీయులు వర్ణించారు. గోల్కొండ రాజ్యంలో వజ్రాలతో పాటు Garnet, Amethyst. Topaz, Agate కూడా లభించేవి. మంచి ముత్యాలు దిగుమతి అయ్యేవి. Kalaghat హిల్స్‌లో ఇనప గనులుండేవి.

ఐరోపా వ్యాపార కంపెనీలు: పర్షియన్ చరిత్రకారులు కుతుబ్‌షాహీల దర్బారులో జరిగిన విషయాలు, ముస్లిం సరదారుల కార్యాలు, కుతుబ్‌షాహీ సుల్తాన్‌ల చరిత్ర, వారి జీవన విధానాలను మాత్రమే రాశారు. మిగిలిన విషయాలు అంతగా రాయలేదు. డచ్చి, ఇంగ్లిష్, ఫ్రెంచి కంపెనీలు స్థాపించిన తర్వాత వారు దేశంలోని ప్రజల నిత్యజీవిత విషయాలు, వారి జీవన విధానం, ఆర్థిక పరిస్థితి, దేశంలోని వ్యాపారం వాణిజ్యాలను గురించి చాలా వివరంగా రాశారు. అందువల్ల గోల్కొండ కాలం నాటి ప్రజావసరాలను గురించి బాగా తెలుసుకోవడానికి వీలు కలిగింది. క్రీ.శ.1602లో డచ్చి ఈస్టిండియా కంపెనీ స్థాపించబడింది. తర్వాత నాలుగేళ్లకే వారు కుతుబ్‌షాహి సుల్తాన్‌ల ఉద్యోగులతో వ్యాపార సంధి చేసుకున్నారు. మచిలీపట్టణంలో, ఇబ్రహీం పట్టణాలలో తమ ఫ్యాక్టరీలను నెలకొల్పారు. తర్వాత 1610లో పులికాట్‌లో కూడా మరొక స్థావరాన్ని నెలకొలిపారు. ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీ 31-12-1600లో స్థాపించబడింది. వారు కూడా గోల్కొండ నవాబులతో ఒప్పందం చేసుకుని క్రీ.శ.1611లో మచిలీపట్టణం, నాగపట్టణాలలో తమ ఫ్యాక్టరీలను నిర్మించారు. అలాగే క్రీ.శ.1621లో పులికాట్‌లో కూడా నిర్మించారు. ఇంగ్లిష్ వారు మొదట చాలా ఇబ్బందులు పడ్డారు. డచ్చి వారికి తూర్పు ఇండియా దీవులలో అనేక స్థావరాలుండేవి. అందువల్ల వారు అన్ని ప్రదేశాలలో వ్యాపారాన్ని సమర్థవంతంగా చేయడమేగాక ప్రతిచోట ఇంగ్లిష్ వారికి ఆటంకాలు కల్పించారు. అంతేగాక డచ్చి వారు కుతుబ్‌షాహీలకు సాలుకు ఒకేసారి సుంకాన్ని చెల్లించేవారు. అందువల్ల సంవత్సరం వరకు గోల్కొండ ఉద్యోగులు వారి జోలికి వచ్చేవారు కాదు. కాని ఇంగ్లిష్ వారు కొని అమ్మే సరుకులకు అప్పటికప్పుడే సుంకాలు చెల్లించవలసి వచ్చేది. అందువల్ల సుంకాలు చెల్లింపుకు మూలధనం నుండి ఖర్చు చేయవలసి వచ్చేది. డచ్చి వారికి అలాకాక చివరలో తమ లాభాల నుండి సుంకాలు చెల్లించడానికి అవకాశం ఉండేది. అందువల్ల మూలధనం పూర్తిగా వారు వ్యాపారానికి ఖర్చు పెట్టుకోగలిగేవారు. ఈ విధంగా ఇంగ్లిష్ వారు మొదట అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ విదేశీ కంపెనీలు మొదట మంచి దూది, నీలి మందు, ముడిబట్టను కొనేవారు. తర్వాత సిల్క్ Porcelain, Lead, Quick Silver, Alum లాంగ్ క్లాత్, Broad cloth కూడా కొనేవారు. డచ్చివారు వజ్రపు గనులు కూడా కౌలుకు తీసుకున్నారు. అందువల్ల అది వారి గుత్త వ్యాపారమైంది. వజ్రపు గనుల మీద వచ్చే ఆదాయాన్ని చూసి మహమ్మద్ కుతుబ్‌షా గనులను అద్దెకివ్వరాదని నిర్ణయించుకున్నాడు. ప్రభుత్వ ఉద్యోగుల చేత గనుల తవ్వకాన్ని నిర్వహించాడు. మచిలీపట్టణంలోని డచ్చి, ఇంగ్లిష్ కంపెనీ వారి రికార్డుల ద్వారా ఆనాటి ఎగుమతి, దిగుమతులు, ఆ సరుకుల ఖరీదులు వాటిపై విధించిన సుంకాల రేట్లు వివరంగా తెలుస్తున్నాయి. ఐరోపాలోని ఏఏ ప్రదేశాలకు సరుకులు వెళుతున్నాయో అన్నీ నమోదు చేయబడ్డాయి. క్రీ.శ.1621 అక్టోబర్‌లో Lead రేటు 20 మణుగులు, 65 మొగల్ రూపాయలు 20 Mands or 13 seers, 20 (20 మణుగులు లేక 13 సీర్లు), లాంగ్ క్లాత్ 3000 ముక్కలు 50 రూపాయలు, Qyick Silver ఒక పౌను 4 1/2 షిల్లింగులు. మీర్జుమ్లా శాంథోమ్‌ను ఆక్రమించినప్పుడు రేట్లు విపరీతంగా పెరిగాయి. ప్రతి వస్తువు 300 శాతం పెరిగిందట. అయినా ఐరోపా కంటే చౌకేనని వారే రాశారు.

Quick Silverకి డిమాండు పడిపోయిందట. బంగారం 225 గ్రాములకు 265 $^3/_2$ గ్రాములు ఇచ్చినా కొనేవాడు లేరట. ఆనాటి ఐరోపా వారి రికార్డులు ఈ వివరాలను తెలిపాయి.

సుల్తాన్ మహమ్మద్ కాలంలో నిత్యం కోస్తా మొత్తం కుతుబ్‌షాహీల ఓడలు గస్తీ తిరుగుతుండేవి. అందులో గోల్కొండ ఉద్యోగులు సైనికులు ప్రతి రేవులో జరిగే వ్యాపారాన్ని పర్యవేక్షించేవారు. ప్రతి రేవు పట్టణం షా బందర్ అనే అధికారి నియంత్రణ కింద ఉండేది. షా బందర్‌కి అనేక అధికారాలుండేవి. డచ్చివారు అతనిని His Majesty అని సంబోధించేవారు. ఇతడు రేవు సుంకాలు వసూలు చేసే చాలా చిన్న అధికారి. కాని డచ్చివారు అతనిని గవర్నర్ అని అనుకొని His Majesty అని సంబోధించేవారు. షా బందర్లుగా బ్రాహ్మణులను, బనియాలను నియమించేవారు. గోల్కొండ ఆస్థానంలోని తమ పైఅధికారులకు వారు పెద్ద పెద్ద నజరానాలు లంచాలు ఇస్తూ ఉండేవారు. ప్రభుత్వానికి చెల్లించవలసిన గుత్త పన్నును సంవత్సరంలో మూడు వాయిదాలుగా చెల్లించాలి. చెల్లించకపోతే శిక్షలు చాలా కఠినంగా ఉండేవి. ఐరోపా వారికి హైదరాబాద్ నగరంలో ప్రవేశించడం చాలా కష్టంగా ఉండేది. ఒకసారి వారు ప్రవేశిస్తే పాస్ లేకుండా బయటకు వెళ్లడానికి వీలులేదు. పాసులు సంపాదించడం చాలా కష్టమయ్యేది. ఒక పట్టాన గోల్కొండ అధికారులు వారికి పాసులు ఇచ్చేవారు కాదు డచ్చివారు 4 $^1/_2$ సుంకం, 11 శాతం స్టాంపు డ్యూటీ చెల్లించేవారు. తర్వాత 3 వేల పగోడాలు సంవత్సరానికి చెల్లించేటట్లు క్రీ.శ.1613లో ఒప్పందం కుదిరింది. ఇంగ్లిష్ వారికి క్రీ.శ.1636లో అబ్దుల్లా కుతుబ్‌షా గోల్డెన్ ఫర్మానా ఇచ్చాడు. దాంతో వారు కూడా సంవత్సరానికి 800 పగోడాలు సుంకం చెల్లించేటట్లు ఒప్పందం కుదిరింది. 6 వేల పగోడాలు నజరానాలుగా బంగారు ఫర్మానాకు చెల్లించారు. ఆర్మగావ్‌లో ఇంగ్లిష్ వారు స్థావరం సంపాదించడానికి స్థానిక నాయకునికి బట్టలు, ఇత్తడి ఫిరంగులు, ఇతర బహుమతులు ఇచ్చారు. బహుమతులు కూడా ఒక రకంగా పేష్కస్ వంటివే. పొగాకు, ఉప్పు మీద Octroi విధించేవారట. తరి, తాటికల్లు, గీతపై అబారం పన్ను విధించేవారు. డచ్చి, ఇంగ్లిష్ వారు రేవు ప్రాంతాలను కౌలుకు తీసుకుని గిడ్డంగులు కట్టుకుని వాణిజ్యం చేస్తూ ఉండేవారు. ఐరోపా వారు రావడంతో విదేశీ వాణిజ్యం బాగా పెరిగింది. ఈ రేవుల నుండి ధాన్యం, వస్త్రాలు, వజ్రాలు, ఇనుము, ఉక్కు ఎగుమతి అయ్యేవి. చందనం, పట్టు, కస్తూరి, లక్క, గాజు దిగుమతి అయ్యేవి. ఆ వాణిజ్యం మీద వచ్చే సుంకాలు కూడా బాగా పెరిగాయి. ఎగుమతి దిగుమతుల మీద 3 $^1/_2$ శాతం సుంకం విధించారు. పులికాట్ రేవులో మాత్రం 2 శాతం సుంకం వసూలు చేశారు. రేవులలో లంగరు వేసిన నౌకలపైన కూడా లంగరు సుంకంగా 15 హొన్నులు విధించేవారు. నిజాంపట్టణం పరగణా నుండి సాలుకు 6 లక్షల హొన్నులు వ్యాపార సుంకాలుగా వసూలయ్యేది. కాని చివరకు ఐరోపా వారు విదేశీ వ్యాపారం అంతటినీ తమ ఆధీనంలోకి తెచ్చుకున్నారు.

కొలతలు - తూనికలు: గోల్కొండ రాజ్యంలో వజ్ర వ్యాపారం బాగా ఉండేది. వజ్రాల బరువును మెంగలిన్సు (Mengalıns), గుమ్చి (Gumchi)లలో తూకం తూచే వారట. ఒక గుమ్చి అంటే రావులకొండలో 7 గ్రెయినులు. ఇతర ప్రాంతాలలో 5 $^3/_5$ గ్రెయినులు. ఇతర లోహాలను రట్టీలలో తూచేవారు. 96 రట్టీలు ఒక తులం అవుతుంది. తూకాలు అన్ని ప్రాంతాలలో ఒకే రకంగా లేవు. మణుగుకు 24 $^1/_4$ Lbs పులికాట్‌లో 27 $^1/_2$ Lbs, నిజాంపట్టణంలో 26 Lbs, మచిలీపట్టణంలో 36 $^1/_2$ Lbs గా ఉండేది. బట్టలను గజాలలో, క్యూబిక్‌లలో కొలిచేవారు. ప్రాంతాల దూరాన్ని క్రోసులలో కొలిచేవారు. ఐదు క్రోసులు 8 మైళ్లట. మెత్ ఓల్డు 4 క్రోసులు 6 మైళ్లు అని లెక్కకట్టాడు.

నాణేలు: గోల్కొండ రాజ్యంలో ప్రధాన నాణెం హొన్ను. ఇది బంగారు నాణెం. విదేశీయులు ఈ నాణెంను పగోడా అని అనేవారు. హొన్ను తర్వాత నాణెం పేరు ఫణం. ఇది హొన్నులో పదహారవ వంతు. తర్వాత నాణెం తార్ అయ్యేది. మొగలుల అధికారం దక్కనులోకి విస్తరించడంతో వారి నాణేలైన రూపాయి, అణాలు గోల్కొండ రాజ్యంలోకి ప్రవేశించాయి. హొన్నులో నాల్గవ వంతు రూపాయి. అంటే నాలుగు రూపాయలు ఒక హొన్ను అయ్యేది. రూపాయి తులం బరువు ఉండేది. అది వెండి నాణెం. రూపాయిని మొట్టమొదటి షేర్షా ప్రవేశపెట్టాడు. మొగలులు దానిని కొనసాగించారు. ఇంగ్లిష్ వారి నాణేలలో రూపాయి ఒక షిల్లింగు ఆరు పెన్నీల విలువ ఉండేదని దేవ్‌నాట్ రాశాడు.

విలాస వస్తువులైన పట్టు, కస్తూరి ధరలు ఎక్కువగా ఉండేవి. కాని నిత్యావసర వస్తువులు చవకగా ఉండేవని విదేశస్తులు రాశారు. ఒక రూపాయికి 40 శేర్లు బియ్యం వచ్చేవట. రూపాయకు అర్ధ మణుగు నెయ్యి వచ్చేదట.

ఎద్దు ఖరీదు 5 రూపాయలు. మేక 12 అణాలు, కార్ఖానాలలో పని చేసే వ్యక్తికి కూలి 13 అణాలు ఇచ్చేవారు.

అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో విదేశీ నాణేలు: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో గోల్కొండ కోస్తాలో ఐరోపా కంపెనీల వారు వ్యాపార స్థావరాలు ఏర్పరచుకున్నందువల్ల వ్యాపారం బాగా అభివృద్ధి చెంది విస్తృతంగా రకరకాల నాణేలు చలామణిలోకి వచ్చాయి. ఆ కాలంలో తూర్పు కోస్తాను విదేశస్తులు, గోల్కొండ కోస్తా అని వ్యవహరించేవారు. పోర్చుగీసు, స్పెయిన్, డచ్చి, వెనీషియా, ఇంగ్లీష్, ఫ్రెంచి వారి నాణేలు గోల్కొండ రాజ్యంలో ప్రవేశించాయి. అబ్దుల్లా కాలంలోనే దక్కనులోకి మొగలు సామ్రాజ్యం వ్యాపించింది. అందువల్ల మొగలుల వెండి రూపాయి కూడా గోల్కొండ రాజ్యంలో ప్రవేశించింది. డచ్చివారి రూయి మీద పర్షియన్ అక్షరం ఉండేది. అది ఔరంగజేబు నాణేన్ని పోలి ఉండేది. కాని ఎడమ నుండి కుడికి రాయబడి ఉండేది. ఆ రాత అద్దంలో స్పష్టంగా చదవటానికి వీలయ్యేది. దాని అడుగు వైపున డచ్చి ఈస్టిండియా కంపెనీవారి చిహ్నం ముద్రించబడింది. పర్షియా గుజరాతీ వర్తకులు కూడా గోల్కొండ రాజ్యంలో వ్యాపారం చేశారు. వారి నాణేలు కూడా గోల్కొండ రాజ్యంలో చలామణిలో ఉన్నాయి. వీటితోపాటు విజయనగర రాజుల బంగారు హొన్నులు కూడా గోల్కొండ రాజ్యంలో ప్రవేశించాయి. సుల్తాన్ పేరుతో ఉన్న నాణేలు రాగి లోహంతో తయారయ్యేవి. ఇన్ని రకాల నాణేలతో విలువలు నిర్ణయించడంతో కొన్ని ఇబ్బందులు వస్తూ ఉండేవి. ఈ సందర్భంలో కుతుబ్‌షా డచ్చివారికి మిగిలిన ఐరోపా కంపెనీల వారికి వారి సొంత చిహ్నాలతో నాణేలు ముద్రించుకోడానికి అధికారాన్ని ఇచ్చాడు. దాంతో వేరు వేరు ప్రాంతాలలో ఆ నాణేలు విలువలు మారుతుండేవి. అబ్దుల్లా నాణేల మీద ఒకవైపు అతని పేరు, రెండవ వైపున దారుస్, సల్తనత్, మహమ్మద్‌నగర్ - హైదరాబాద్ అని ఉండేది. క్రీ.శ.1657 తర్వాత అంటే మీర్జుమ్లా మొగలుల వైపు చేరిన తర్వాత అబ్దుల్లా కుతుబ్‌షా పేరులోని బిరుదులు తొలగించి ఒట్టి పేరును మాత్రమే నాణేలపై ముద్రించారు. అంటే అతడు మొగలుల సామంతుడయ్యాడని అర్థం. అంతేకాదు రాజ్యం ఆపద నుండి తప్పించుకుంది అనే అర్థం వచ్చే పర్షియన్ పదాలను తన నాణేలపై ముద్రించాడు.

గోల్కొండ రాజ్యపు సిరి సంపదలు - ఆదాయాలు: మొత్తం మీద గోల్కొండ రాజ్యం గొప్ప సిరి సంపదలు అనుభవించింది. క్రీ.శ.1636 నుండి గోల్కొండ నవాబులు మొగలాయిలకు చెల్లించిన అపార ధనరాసులు సాలుసరి కప్పాలు, నజరానాలు, యుద్ధ నష్టపరిహారాలు పరిశీలించినట్లయితే వారి సిరిసంపదలు తెలుసుకోవచ్చు. 1687లో మొగల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండ ఖజానా నుండి 7 కోట్ల హొన్నులు స్వాధీనం చేసుకున్నాడు. ఇంకా విలువ కట్టలేని వజ్రాలు, రత్నాలు, వైఢూర్యాలు, బంగారు ఆభరణాలు, పాత్రలు వాళ్ల స్వాధీనమయ్యాయి. 1687లో మొగల్ రాజకుమారుడు గోల్కొండను దర్శించినప్పుడు దర్బారు వైభవానికి దిగ్భ్రాంతి చెందారని సమకాలికులు రాశారు. వ్యవసాయం, గనులు, వజ్రాలు, వస్త్ర పరిశ్రమలు, వ్యాపారం, వాణిజ్యాలు కుతుబ్‌షాహీలకు ప్రధాన ఆదాయ మార్గాలు. ఒక్క భూమిశిస్తు ద్వారానే 2 కోట్ల ఆదాయం వచ్చేదట. తానీషా కాలంలో 2,40,50,503 హొన్నులు ఆదాయం వచ్చింది. అందులో కొండపల్లి సర్కార్ నుండి 40 వేలు, మచిలీపట్టణం సర్కారు నుండి 18 వేలు, నిజాంపట్టణం సర్కారు నుండి 60,600 హొన్నులు వచ్చేది. మొత్తం 5 కోట్ల హొన్నుల ఆదాయం వచ్చేది. అందులో 4 కోట్లు ఖర్చు అయ్యేది. ఒక కోటి హొన్నులు ప్రతి సంవత్సరం నికరంగా ఖజానాలో నిల్వలో చేరేదని మెత్ ఓల్డ్ రాశాడు.

పేద ప్రజల పరిస్థితి: గోల్కొండ రాజ్యం సిరిసంపదలతో తులతూగినా అది శ్రీమంతులకు మాత్రమే పరిమితం. ప్రజలపై పన్నుల భారం ఎక్కువ. పన్ను చెల్లించకపోతే అమిత శిక్షలకు గురయ్యేవారు. మనూచీ అనే వెనిస్ యాత్రికుడు నాటి పన్నుల విధానం ప్రజల రక్తమాంసాలను పీల్చేదని రాశాడు. రైతుల పరిస్థితి దారుణంగా ఉండేది. సైనికులు ప్రభుత్వ అధికారులు వారిని హింసించేవారు. వారిని హింసించి సంపాదించిన ధనంతో ప్రభువుల భవనాలు మెరిసిపోతున్నాయని పెల్సార్ట్ అనే ఇంగ్లీష్ ఉద్యోగి రాశాడు.

కరవు - కాటకాలు: ఆంధ్రదేశం ఇంత సిరిసంపదలతో ఉన్నా ఒక సంవత్సరం వర్షం లేకపోతే కరవు వస్తుందని, లక్షలాది ప్రజలు చనిపోతారని మలబారు నుండి బియ్యం, వస్త్రాలు తెచ్చి వారు బండ్లతో ధనాన్ని తీసుకుపోతారని ఆనాటి విదేశస్తులు రాశారు. 17వ శతాబ్దం రెండవ దశకంలో ఒక కరవు వచ్చింది. అప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలను 5 ఫణాలకు అమ్ముకున్నారని మెత్ ఓల్డ్ రాశాడు. క్రీ.శ.1704లో మరొక కరవు వచ్చింది. ఆ కరవులో 20 లక్షల మంది చనిపోయారని, పిల్లల్ని అమ్మదామన్నా పావలాకు కూడా కొనేవాడు లేడని మనూచీ రాశాడు.

నిత్యావసర వస్తువులు: కాని ఆనాడు నిత్యావసర వస్తువులు చౌకగా లభించేవి. రూకకు బియ్యం 40 శేర్లు, గోధుమలు 20 శేర్లు, నెయ్యి అర్ధ మణుగు ఉండేవట. ఎద్దు 5 రూపాయలు, మేక 12 అణాలు, కోడిగుడ్లు ఫణానికి 80, కోళ్లు హొన్నుకు 80. కార్ఖానాలో పనిచేసే కూలీకి 3 అణాలు లభించేవట. అయినప్పటికీ సామాన్య ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించారు. విలాస పురుషుల వస్తువులైన చీనాపట్టు మణుగు 45 హొన్నులు, కస్తూరి మణుగు 12 హొన్నులు, చైనా ముఖమల్ గజం 1 హొన్ను, మిరియాలు పుట్టి 25 హొన్నులు, లవంగాలు మణుగు 33-60 హొన్నులు, చందనం కఱ్ఱ పుట్టి 100 హొన్నులు, సీసం పుట్టి 7-20 హొన్నులు, కర్పూరం శేరు 5-20 హొన్నులు, లక్కసామాను 1 హొన్ను, పాదరసం 5-20 హొన్నులు ఉండేది.

కుతుబ్‌షాహీల కాలంలో భాషా సాహిత్యాలు

కుతుబ్‌షాహి వంశస్తులు విద్యావంతులు. భాషా సాహిత్యాల మీద అభిమానం కలవారు. స్వయంగా కవులు. కవి పండితులను పోషించారు. రాజ్యంలో అనేకచోట్ల విద్యాసంస్థలు నెలకొల్పి విద్యావ్యాప్తికి పాటుపడ్డారు. అనేక గ్రంథాలయాలు స్థాపించారు. గోల్కొండలో రాజపుస్తక భాండాగారాన్ని నెలకొల్పి వేలాది గ్రంథాలను సమకూర్చారు. కుతుబ్‌షాహీల మాతృభాష పర్షియన్. దాంతోపాటు అరబ్బీ, టర్కీ భాషలను కూడా ఆదరించారు. ఇండియాలో జన్మించిన ఉర్దూ భాషను బాగా అభివృద్ధి చేశారు. ముఖ్యంగా వీరి కాలంలో పర్షియన్, ఉర్దూ భాషలలో అనేక గ్రంథాలు వెలువడ్డాయి. అలాగే వారు తమ భాషలతో పాటు తెలుగు సంస్కృత కవులను పోషించారు. అందువల్ల వీరి కాలంలో తెలుగు, సంస్కృత భాషలలో కూడా అనేక కావ్యాలు వెలువడ్డాయి. కవితా గోష్ఠులు కూడా నిర్వహించేవారు. అషీఖానా అనే భవనాన్ని నిర్మించి దానిని కవితా గోష్ఠులకు కేటాయించారు. ఈ కవితా గోష్ఠులలో సుల్తాన్‌లు కూడా పాల్గొనేవారు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా పర్షియాకు చెందినవాడు. అతని మాతృభాష పర్షియన్. కనుక సహజంగానే అతడు పర్షియా భాషను ఆదరించాడు. అతడు స్వయంగా కవి. పర్షియా భాషలో అనేక గ్రంథాలు కూడా రాశాడు. తెలంగ్ ముస్లిం రాజ్యం పర్షియన్ భాషను ఆదరిస్తోందని తెలియగానే అనేక మంది పర్షియా ముస్లిం కవులు గోల్కొండ చేరారు. వారిని కులీ ఆదరించాడు. అతని పీష్వా మీర్ మహమ్మద్ మొమిన్ గొప్ప పండితుడు. అతడు మానాలు, తూకాలు, వైద్యం, నీతిశాస్త్రాలను గురించి పర్షియన్‌లో చాలా గ్రంథాలు రాశాడు. గోల్కొండను నయా ఇస్ఫహన్ అని పిలిచేవాడు. అంటే నూతన పర్షియా అని అర్థం. గోల్కొండ రాజ్యంలో పర్షియా రాజభాషగా ఉపయోగింపబడింది.

ఉర్దూభాష: పర్షియా తర్వాత ఉర్దూ భాష ప్రసిద్ధి చెందింది. ఉర్దూ భాష ఇండియాలో పుట్టింది. పర్షియన్, అరబిక్, సంస్కృతం, ఉత్తర భారత దేశీయ భాషల కలగలుపుతో మిశ్రమ భాషగా అభివృద్ధి చెందింది. భారతదేశాన్ని ఏలిన ముస్లిం రాజులకు ఇదే ప్రధాన భాష అయింది. ముస్లిం రాజులందరూ ఉర్దూను ఆదరించారు. బహమనీల కాలంలోనే ఉర్దూ దక్షిణదేశంలో ప్రవేశించింది. దక్షిణ భాషల మిశ్రమంతో ఉత్తరాది ఉర్దూ కన్నా భిన్నంగా ఉండేది. కనుక దానికి దక్కన్ ఉర్దూ అని కూడా పేరు వచ్చింది. బహమనీ రాజ్యంలో శిథిలాల నుండి పుట్టిన గోల్కొండ రాజ్యం ఉర్దూను అభిమానించింది. క్రీ.శ.1572వ సంవత్సరంలో అక్బరు గుజరాత్‌ను జయించాడు. ఆ సమయంలో చాలా మంది ఉర్దూ కవులు గోల్కొండ రాజ్యానికి వలస వచ్చారు. మహమ్మద్ కులీ మాతృభాష పర్షియన్ అయినప్పటికీ అతనికి కూడా ఉర్దూలో మంచి ప్రవేశం ఉంది. అతనికి గజల్ అంటే అమిత ప్రీతి అని యూసఫ్‌కొకన్ అనే పండితుడు అన్నాడు. అతడు హిందూ, ముస్లిం వివాహ పద్ధతులలోని కొన్ని పోలికలను వర్ణిస్తూ పద్యాలు రాశాడు. అతని దర్బారులో వజహీ, అహమ్మద్ అనే ఇద్దరు ఉర్దూ కవులుండేవారు. వారిలో వజహీ ప్రసిద్ధి చెందిన లైలా మజ్ను కావ్యం రాశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ఉర్దూ సాహిత్యం ఉన్నత శిఖరాలను అందుకొంది. అతడు స్వయంగా కవి, ద్విపదలు కూడా రాశాడు. అవి నేటికీ లభిస్తున్నాయి. రాగవాసి అనే గొప్పకవి ఉండేవారు. అతడు పూర్వపు కావ్యాలకు స్వేచ్ఛానువాదాలు చేశాడు. అతడు అనువాదాలు చేసిన మొదటి కవి. అతడు సెపుల్ బదియుల్ జమాల్ అనే గ్రంథాన్ని క్రీ.శ.1625లో రాశాడు. అతడు గొప్ప గజల్ రచయిత కూడా. కులీకుతుబ్‌షా కంటే గొప్ప గజల్స్ రాశాడని షేర్వానీ అన్నాడు. తర్వాత చెప్పుకోదగిన కవి ఇబన్-ఎ-నిషాతి. అతడు ఫూల్‌బన్ అనే అద్భుత కావ్యం రాశాడు. ఆ ఒక్క కావ్యంతోనే అతని కీర్తి ఉన్నత శిఖరాలను అందుకొంది. అతని మరణం తర్వాత కూడా ఫూల్‌బన్ ప్రజలలో మంచి ప్రాచుర్యంలో ఉండేది. షేక్ బర్హనుద్దీన్ గరబ్, సయ్యద్ మహమ్మద్ గెసూదరాజ్, షాబహనుద్దీన్ బజన్, షమ్మల్ ఉష్షేబ్‌షా మిరాంజి, షబర్హమ్ సత్తారీలు నాటి కవులు. వారి మాటలలో హిందీ, దక్కన్ పదాలు, దుబ్రోలు కలిసి ఉండేవి. ఆ కాలంలో సూఫీ ఉద్యమం కూడా ఉర్దూ భాషాభివృద్ధికి దోహదం చేసింది. హిందూ ముస్లింలు కలసి సహజీవనం చేసినందువల్ల ఒకరి భాష మరొకరిపై ప్రసరించింది. తెలుగులో ఉర్దూ పదాలు ప్రవేశించాయి. ఉద్యోగాలు చేసే హిందువులు ఉర్దూ, పర్షియన్ భాషలను నేర్చుకున్నారు. అలాగే తెలుగు భాషా పదాలు ఉర్దూలో కలసిపోయాయి. 17వ శతాబ్దంలోని ఉర్దూలో అనేక తెలుగు పదాలు కలసి ఉన్నాయని రాజబహద్దూర్ గౌడ్ అనే పండితుడు రాశాడు. కులీకుతుబ్‌షా కవితలో కూడా తెలుగు పదాలున్నాయని కొన్ని పదాలను ఉదహరించాడు. అతడు రాసిన పదాలలో

బాట్, కాల్వే, కోప్, యకట్ అనేవి తెలుగు పదాలని, వాటికి బాట, కాల్వ, కోపం, ఒకటి అని అర్థాలని రాశాడు

పర్షియన్ - ఉర్దూ గ్రంథాలు: జంషీద్ ఆశు కవిత్వం చెప్పగలిగనవాడు - గజల్స్, గేయాలు రాశాడు బురహం నిజాంషా అతనికి షాహ్ అని బిరుదునిచ్చాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా కాలం: ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో గోల్కొండ దర్బారు కవి పండితులతో నిండిపోయి అనేక కావ్యాలు రచింపబడ్డాయి. ఆస్థాన కవులలో ఉమర్‌షా మహమ్మద్ అంజు, అమీర్ ఇమాదుద్దీన్ మహమూద్ షిరాజి, జావి, నవీసుల్ జమా కాశింబేగ్, షిరాజి, హుస్సేన్ కులి మీర్జా ముఖ్యులు. కాశిం తబ్బి అనే అతడు రాజపుస్తక భాండాగారిగా పని చేసేవాడు. అతడు ఇబ్రహీం కుతుబ్‌షా లేఖలు ముఖ్య పత్రాలు ప్రభుత్వ ఫర్మానాలు భద్రపరిచేవాడు. కుర్షబిన్ కబ్బాదుల్ హుస్సేన్ అనే పారశీక కవి ఇతని కాలంలో తారీఖ్ ఎల్చి నిజాంషాహి అనే గ్రంథం రాసి ఇతనికి అంకితం ఇచ్చాడు. ఇతని ఆస్థాన ఉర్దూ కవులలో ముల్లాఖియా, ఫిరోజ్ అనేవారు ముఖ్యులు. ఆంధ్రదేశపు ఉర్దూ కవులలో ఖియా ప్రముఖుడని షేర్వాణీ రాశాడు.

మహమ్మద్ కులీ కాలం: మహమ్మద్ కులీ కాలాన్ని ఉర్దూ పారశీక భాషలకు స్వర్ణయుగమని అంటారు ఇతని కాలంలో అనేక మంది కవులు గొల్కొండలో నివసించారు. అనేక ఉర్దూ, పారశీక గ్రంథాలు వెలువడ్డాయి పీష్వాగా పనిచేసిన మీర్ మహమ్మద్ మొమీన్ ప్రసిద్ధి చెందిన పారశీక కవి. ఇతనికి అలామమీర్ మొహిన్ అస్తరాబాది అని మరొక పేరు. మోర్తజాకు ముమాలిక్ ఇస్లాం అనే బిరుదు కూడా ఉంది. ఇతడు పారశీక కవితలను సంకలనం చేశాడు. అలిపుర్కి అనే కవి ఉర్దూలో నసబ్‌నామా కుతుబ్‌షాహి అనే గ్రంథాన్ని 20 వేల పద్యాలలో రాశాడు. మీర్జామహమ్మద్ అమీర్ అనే మరొక కవి లైలామజ్ను అనే కావ్యాన్ని రాశాడు. ఇది గొప్ప కీర్తిని సంపాదించింది. ఇంకా అతడు సిర్లిష్‌కుసలు, పల్కుబరోస్, మతమహికుల్‌ముజార్ అనే గ్రంథాలు కూడా రాశాడు. ఖాజిసంనాని, మిరక్, మోమిన్ సబ్జవారి అనే కవులు కూడా ఇతని కాలం నాటికి చెందినవారు. సుల్తాన్ స్వయంగా కవి. పార్శీ భాషలో మంచి కవితలు అల్లేవాడు. ఇతని కవిత్వాలకు కుతుబ్‌షా కవితలు అని పేరు.

సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలం: సుల్తాన్ కులి గొప్ప విద్యావేత్త, పండితుడు. ఇతడు అనేక చరిత్ర గ్రంథాలను, విజ్ఞాన గ్రంథాలను అధ్యయనం చేసి గొప్ప పాండిత్యాన్ని సంపాదించాడు. అతని పుస్తక భాండాగారంలో ఉన్న గ్రంథాలపై అతని హస్తాక్షరి ఉంది. అతడు పండితులలో పండితుడుగా, కవులలో కవిగా ప్రసిద్ధి చెందాడు. అతడు పారశీక భాషలో చెప్పిన కవితలకు జుల్ అల్లా అనే పేరు వచ్చింది. అతడు స్వయంగా కవి, అనేక గ్రంథాలు రాశాడు. అతడు రాసిన గ్రంథాలలో రుహుల్ ఖద్దర్స్, బఫరుల్లలూబ్, ఘదరత్, నిహయతుల్ కుకుం, ముష్బల్ రవాజ్, హిదాయతుల్, మలరా అనేవి ముఖ్య గ్రంథాలు. సాలార్‌జంగ్ గ్రంథాలయంలో ఉన్న అబ్దుల్, అవలాకుల్, సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా అనే రాతను బట్టి ఈ గ్రంథాలు ఇతడు రాశాడని భావింపబడింది. ఈ గ్రంథాలలో వేదాంత విషయాలు చర్చించబడ్డాయి. సుల్తాన్ అనే పేరుతో అతడు మరికొన్ని రచనలు చేశాడు. ఇంకా అతడు రుబాయి, మర్సియే, కసీద, గజల్ అనే మరికొన్ని కూడా రచించాడు. ఇతని రచనలలో భాషా, భావం చాలా స్పష్టంగా ఉంటాయి. అతని పద్యాలు వర్ణనాత్మకంగా ఉంటాయి. కొన్ని వందల పద్యాలు రాశాడు. అతని రచనలలో పారశీక, ఉర్దూ తెలుగు పదాలను ధారాళంగా ఉపయోగించాడు. అతని పద్యాలలో ఆనాటి హైదరాబాద్ సాంఘిక జీవనం, హిందూ ముస్లిం పండుగలను కళ్లకు కట్టినట్లు వర్ణించాడు. ఇంగ్లిష్ భాషకు చాసర్ ఎలాంటి వాడో ఉర్దూభాషకు సుల్తాన్ కులి అలాంటి వాడని షేర్వాణి పండితుడు శ్లాఘించాడు. ఇతని కాలంలో హిజారా 1020 అంటే క్రీ.శ.1617 వరకు కుతుబ్‌షాహీల చరిత్ర రాయబడింది. ఆ గ్రంథం పేరు తారీక్-ఇ-మహమ్మద్ కుతుబ్‌షాహి. కాని ఆ గ్రంథకర్త పేరు తెలియదు. క్రీ.శ. 1617 సంవత్సరం వరకు ఈ గ్రంథం కుతుబ్‌షాహీల చరిత్ర అధ్యయనానికి బాగా ఉపయోగపడుతోంది. ఇతని ఆస్థానంలో సయ్యద్ కమాలుద్దీన్ మాజ్ సదరాని సయ్యద్ మీర్ కుతుబుద్దీన్ నియామతుల్లా అనే కవులు ఉన్నారు. అతని ఆస్థానంలోని పీష్వా మహమ్మద్ మొమెన్ వైద్యం, తూకాలు, మానాల మీద పర్షియన్ భాషలో గ్రంథాలను రచించాడు. ఇంకా అతని ఆస్థానంలో వజిహి, అహ్మద్ అనే ఇద్దరు ప్రసిద్ధ ఉర్దూ కవులు ఉండేవారు. వారిలో వజిహి లైలా-మజ్నూ కావ్యాన్ని రచించాడు.

అబ్దుల్లా కుతుబ్‌షా కాలం: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో అనేక మంది కవులు పోషింపబడ్డారు. అందువల్ల ఇతని కాలంలో అనేక కావ్యాలు రచింపబడ్డాయి. ఇతని ఆస్థానంలో అలామి మీర్ మజిదుద్దీన్ ఖాజిహసన్, మీర్‌మీరాన్, మీర్‌ఫజలుల్లా, షిరాజి, మౌలానా, రూనఖి, ముల్లా, అరబ్, కుష్‌నవాన్, మీర్జా అంజా అస్తరాబాది, ముల్లా తప్తాయి షిరాజి, షేక్ హరుం అనే కవులు ముఖ్యులు. అబ్దుల్లా కుతుబ్‌షా వద్ద పీష్వాగా పని చేసిన మహమ్మద్

ఇబన్‌కాటూన్ ఖురాన్ మొదలైన అనేక గ్రంథాలకు పార్శీ భాషలో వ్యాఖ్యానాలు రాశాడు. అతడే ఘర్షన్ ఘాటూన్ అనే పేరుతో పారశీక నిఘంటువును తయారు చేశాడు. ఈ కాలంలో ప్రసిద్ధి చెందిన ఉర్దూ కవిగా అతడు సైపుల్‌ముల్క్ నాబదియుల్‌జమాల్ అనే కావ్యాన్ని రచించాడు. ఇంకా అనేక అనువాదాలు చేశాడు. అందులో తూత్‌నామా పేర్కొనబడింది. ఇది సంస్కృతంలోని శుకసప్తశతికి పారశీక అనువాదం. అలిచిన్ తైపూర్ అనే పారశీక కవి హదైకుల్ సలాటిన్ అనే గ్రంథం రాశాడు. ఇతనికే నిజాం ఉద్దీన్ అహమ్మద్ అని కూడా పేరుంది. ఆలామ ఉబిన్ ఖాతూన్‌కి కితాబుల్ హర్షాద్, ఖామే అబ్బాసిపై వ్యాఖ్యానం రాశాడు. అర్బియిన్ అనువాదం చేయబడింది. అలంబు జమాలుద్దీన్, అల్మస్సాముల్లా అలియబిన్ తైపూర్, ఐవాన్ అక్బర్ రజాలు పార్శీ అనువాదాలు చేశారు. మౌలానా అయిం అమ్లా నెహజుల్ బలాగకమా అబ్దుల్లా సమ్నానియమాం, యాఫలురోజుల్ రియాహింలు కూడా అనువాదం చేశారు. ఇబిన్ ఇమాద్‌రోజ్ బహోంకర్ కతుల్ ఉల్‌మా అనే పేరుతో ఒక పెద్ద కథను రాశాడు. తబ్సిర్, ఆడీస్, ముతఫరకా అలల్ ఆషియా - కాషస్ ఉల్‌సరాక్, నుజుము అబుల్ దకాయిక్, హిక్‌మత్ ఇవి కుతుబ్‌షాహి వంశస్తుల జ్ఞాపక చిహ్నాలు. మహమ్మద్ హుస్సేన్ బురహాన్‌ఖాతా అనే పారశీక పదకోశాన్ని రాశాడు బురహాన్ అనేది అతని రచనానామం. అబ్దుల్లా కుతుబ్‌షా ఆదరణతో ఈ గ్రంథం రాశానని చెప్పుకున్నాడు. ఇతని కాలం నాటి మరొక కవి మాలిక్ కుష్. అతడు దక్కని ఉర్దూలో గొప్ప కావ్యమైన 'సైప్పుల్ ముల్క్ వాబదియుల్ జమాల్'ను క్రీ.శ.1665లో రచించాడు. ఆ కాలంలో ఉర్దూ భాష వ్యాప్తికి సూఫీ మతం బాగా తోడ్పడింది. సూఫీలతో పాటు వర్తకులు కూడా ఉర్దూ భాషను బాగా ప్రచారంలోకి తెచ్చారు. ఉర్దూ, పర్షియన్ భాషలలోకి హిందువుల ఉపనిషత్తులు, రామాయణం అనువాదం చేయబడ్డాయి. విచిత్రమేమంటే ఉర్దూ, పర్షియన్ భాషలలో 24 రకాల రామాయణాలు రచించబడ్డాయి. సయ్యద్ అహమ్మద్ అబ్దుల్లా కుతుబ్‌షా యొక్క పెద్ద అల్లుడు. అతడు గొప్ప పండిత పోషకుడు. అతని సిఫార్సుతో అనేక మంది అరబ్బీ, పారశీక పండితులు గోల్కొండ ఆస్థానానికి వచ్చారు. వారిలో జమాలుద్దీన్, మహమ్మద్ హకేలి, జైనుద్దీన్ అమ్లా, షేక్ మహమ్మద్ హకి ఉల్‌ముల్క్, కబిక్‌బెన్ ఉల్‌మదీని, సయ్యద్ గబా అయిన్, సయ్యద్ మహమ్మద్, ఖతీబ్ అబ్దుల్లాలు ముఖ్యులు. సయ్యద్ అహమ్మద్ పెద్ద భార్య కుమారుడు సయ్యద్ అలి గొప్ప అరబ్బీ కవి. అతనికి అతని తాత సయ్యద్ అలిచిన్ మాసూం పేరు పెట్టారు. అతడు క్రీ.శ.1642లో మక్కాలో జన్మించాడు. తండ్రితోపాటు క్రీ.శ.1654లో గోల్కొండకు వచ్చాడు. అతడు అరబ్బీ భాషలో సలాఫ్త ఉల్‌హసర్, దుర్హాతుల్ రఫియా అనే గ్రంథాలు రచించారు. ఇతని రాకవల్ల గోల్కొండలో అరబ్బీ భాష అభివృద్ధి చెందినది. అబ్దుల్లా స్వయంగా కవి. ఉర్దూలో కొన్ని ద్విపదలు రాశాడు.

తానాషా కాలం: హబుల్ ఆస్థానంలో ఆలీచిన్ తైపూర్ అనే పారశీక కవి హదైఖర్ సలాటిన్ అనే గ్రంథాన్ని రాశాడు. అంటే రాజుల తోట అని అర్థం. ఉర్దూ కవులలో షాకులీన్, గులాం ఆలీలు ముఖ్యులు. జాయ్‌సె రచించిన పద్మావతి కావ్యాన్ని గులాం ఆలీ ఉర్దూలోకి అనువాదం చేశాడు. మహిజబుద్దీన్ అహమ్మద్ ఖురాన్‌కు తఫ్సరుల్ ఖురాన్ అనే వ్యాఖ్యను రాశాడు. ఆలీహుసేన్ అల్వాకొల్వా విహలాయతుల్‌ఖారి అనే గ్రంథాన్ని రాశాడు. ఇతనిని క్రీ.శ.1675లో ఇరాన్ షా ఆదరించాడు. షా అనుమతితో కొన్ని కథలను రాశాడు. తానాషా కాలంలో ఉర్దూ భాష అభివృద్ధి చెందింది.

ఉర్దూ కావ్యాలు: ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నుండి ఉర్దూ భాషలో కావ్యరచన ఎక్కువగా ప్రారంభమైంది. అతని కాలంలో ఫిరోజ్ మహమ్మద్, నలాఖైయాలి అనే వారు ప్రసిద్ధి చెందిన ఉర్దూకవులు. వారిలో ఫిరోజ్ కౌసిఫ్‌నామా అనే గ్రంథాన్ని రచించాడు. వర్జిగవాసి అనే కవులు ఇతని శిష్యులు. మహమ్మద్ కులీ కుతుబ్‌షా స్వయంగా ఉర్దూలో మాని అనే పేరుతో ఖనేద్‌కితా తత్‌మర్సియాలు గజళ్లను ఉర్దూలో రాశాడు. ఇతని ఆస్థానంలో వర్జి అహమ్మద్ అనే ఉర్దూ కవులుండేవారు. వారిలో వర్జి అనే అతడు కుతుబ్‌మిస్తరి అనే పద్య కవిత్వాన్ని సంబ్రస్ అనే వచన కవిత్వాన్ని ప్రాస్వరస ప్రధానమైన కథలను రాశాడు. అహమ్మద్ లైలామజ్ను ప్రేమ కావ్యాన్ని రాశాడు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా అనే పేరుతో ఉర్దూ కవితలను రాశాడు. అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ఉర్దూ భాషకు స్వర్ణయుగం. అబ్దుల్లా స్వయంగా కవి. అబ్దుల్లా అనే పేరుతో కవితలు అల్లేవాడు. ఇతని కాలంలో గవాసి ఇబిన్‌నషాతి తబ్బియా అనే వారు ప్రసిద్ధి చెందిన ఉర్దూ కవులు. గవాసి తోతినామా, సైఫిల్‌ములాక్ బదియుల్ జమాల్ అనే కథలను రాశాడు. ఇబిన్‌నిషాతి అనే పారశీక కథ ఉర్దూలో ఫూల్‌బిన్ అనే పేరుతో రాయబడింది. తబియా అనే కవి బహరాంగువల్ అనే కథను రాశాడు. తానాషా ఆస్థానంలో లతీఫ్ షాహినూరి మీర్జాగులాం అనే కవులు కవితలు రాశారు.

కుతుబ్‌షాహీల తెలుగు భాషా పోషణ

కులీకుతుబ్‌షా - జంషీద్‌ల కాలం: తెలుగు భాషాపోషణ కుతుబ్‌షాహీలు కేవలం వారి భాషలనే గాక తెలుగు భాషను కూడా ఆదరించారు. అనేక మంది తెలుగు కవులను పోషించారు. వారి పోషణలో తెలుగు కవులు అనేక తెలుగు కావ్యాలను రచించారు. కుతుబ్‌షాహి యుగంలో తెలుగు సాహిత్యంలో చాలా వరకు తంజావూరు సాహిత్యపు లక్షణాలు కనిపిస్తాయి. సుల్తాన్‌లే గాక వారి సామంతులు కూడా తెలుగు కవులను ఆదరించి తెలుగు గ్రంథాలను అంకితం పుచ్చుకున్నారు. గోల్కొండ రాజ్య స్థాపకుడైన కులీకుతుబ్ ఉల్ ముల్క్ కాలంలోనే తెలుగు కావ్యరచన ప్రారంభమైంది. కోర్కోలను జాగీరుదారులు ఈదూరు ఎల్లయ్యకు సత్తెనపల్లి హరిచంద్రోపాఖ్యానాన్ని రచించి అంకితం చేశాడు. గోల్కొండ యుగంలో ఇదే మొదటి తెలుగు కావ్యమని చెప్పవచ్చును. కులీ కాలంలో క్రీ.శ.1530లో కొండపల్లిలో తెలుగులో శాసనం వేయబడింది. జంషీద్ కూడా నాగులపాడులో తెలుగులో శాసనం వేయించాడు.

ఇబ్రహీం కుతుబ్‌షా కాలం: ఇతని కాలంలో తెలుగు కవులు బాగా ఆదరింపబడ్డారు. అతడు 7 సంవత్సరాలు విజయనగరంలో నివసించి తెలుగు సంస్కృతిని, ఆచార వ్యవహారాలను తెలుగు భాష మాధుర్యాన్ని ఆకళింపు చేసుకున్నాడు. అందువల్ల అతని కాలంలో తెలుగు కవులకు గోల్కొండ దర్బారు నిలయమైంది. అతడు అషిఖానా అనే భవనాన్ని నిర్మించి అందులో విద్యా గోష్ఠులను ఏర్పాటు చేసుకున్నాడు. ఇది శ్రీకృష్ణదేవరాయల భువన విజయం లాంటిది. ఈ సభలో అరబ్బీ, పారశీ, ఉర్దూ, సంస్కృతాంధ్ర భాషా కవులు పాల్గొని విద్యా వ్యాసంగాలు, సాహిత్య గోష్ఠులు నిర్వహించేవారు. అతనికి మల్కిభరాం అని కూడా పేరుండేది. అతని ఆస్థానంలో అద్దంకి గంగాధర కవి, కందుకూరి రుద్రకవి, పొన్నెకంటి తెలగనాచార్యుడు ఉండేవారు. కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానం రాశాడు. అందులో వేశ్యల మాయలను, వేశ్యమాతల ధనాశను వర్ణించాడు. వారు గొప్ప పండితురాళ్లు, గాయకురాళ్లు, తెలివైన జూదరులు అని వర్ణించాడు. ఇబ్రహీం కుతుబ్‌షా రుద్రకవికి రెంట చింతల అనే గ్రామాన్ని దానం చేశాడు. మల్కిభరాం కీర్తిని తూచడానికి బ్రహ్మ తక్కెడలో కైలాసాన్ని ఉంచాడు. అది చాలక శివుడు కూడా కూర్చోవలసి వచ్చింది అని రుద్రకవి ఇబ్రహీం కుతుబ్‌షాను కీర్తించాడు. మల్కభరాం కవులను ఆదరించిన తీరును గురించి ఒక తెలుగు పద్యం కూడా ఉంది. అతని సరదారులు కూడా తెలుగు కవులను ఆదరించారు. పటాన్ చెరువు స్థానిక పాలకుడైన అమీన్‌ఖాన్ అనేక మంది తెలుగు కవులను ఆదరించాడు. అతని తర్వాత పొన్నెగంటి తెలగనాచార్యుడు తెలుగులో యయాతి చరిత్రను రాశాడు. ఇది అచ్చ తెలుగు కావ్యం. కాని అది అందరికీ అర్థం కాదని పండితులు అంటారు. అతడు తద్భవ అన్న దేశ పదాలను కూడా తీసుకున్నాడట అచ్చ తెలుగు కావ్యాలు రాయదలచుకున్నవారికి తెలగనాచార్యుడు మార్గదర్శకుడయ్యాడు. ఇవి ద్వర్థి కావ్యాల లాగా ఉండేవట. తెలగనాచార్యుడు పొట్ల చెరువు వాస్తవ్యుడు. అతడు పటాన్ చెరువు స్థానిక పాలకుడైన అమీన్‌ఖాన్ ఆశ్రితుడు. యయాతి చరిత్రలో స్త్రీ స్థానం చాలా అధమంగా ఉందని, అందరికీ లొంగి ఉండవలసిందేనని వర్ణించాడు.

అద్దంకి గంగాధరుడు: అద్దంకి గంగాధరుడు తపతీ సంవరనోపాఖ్యానం రాశాడు. భారతంలోని ఒక చిన్న కథను ఇతి వృత్తంగా తీసుకొని కావ్యంగా రాశాడు. అందులో తనను ఆదరించిన ఇబ్రహీం కుతుబ్‌షాను రాముని అవతారంగా కీర్తించాడు. గంగాధర కవి ఇబ్రహీం కుతుబ్‌షా అన్న జంషీద్‌ను కూడా తన కావ్యంలో కీర్తించాడు. జంషీద్ తండ్రిని చంపి సింహాసనానికి వచ్చాడు. గంగాధర కవి ఇబ్రహీం కుతుబ్‌షా ఆస్థానంలో అనేక మంది పండితులు ఉన్నట్లు వర్ణించాడు. అంతేగాక ఇబ్రహీం భాగీరథి అనే హిందూ స్త్రీని వివాహమాడినట్లు, గోల్కొండ పట్టణానికి భాగీరథి పట్టణమని నామకరణం చేసినట్లు ఇతని రచనలలో సూచన ఉంది. గంగాధర కవి ఇబ్రహీం కుతుబ్‌షాను హిందూరాయ విభాళ సత్ కవిమణి అని వర్ణించాడు. అలాగే సకల వేద, పురాణశాస్త్ర పారంగతులైన కవీంద్రులు ఇబ్రహీం కుతుబ్‌షా దర్బారులో ఉన్నట్లు కూడా వర్ణించాడు. అతడు తన కావ్యాన్ని ఇబ్రహీం కుతుబ్‌షాకు అంకితమిచ్చాడు.

కందుకూరు రుద్రకవి: రుద్రకవి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ మండలంలోని కందుకూరు గ్రామ వాస్తవ్యుడు. ఇబ్రహీం కుతుబ్‌షా దేవరకొండ దుర్గంలో రాజప్రతినిధిగా ఉన్నప్పుడు కందుకూరి రుద్రకవితో

పరిచయమైంది. తర్వాత అతనిని ఆదరించి రెంటచింతల లేక చింతలపాలెం అనే గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. ఇతడు నిరంకుశోపాఖ్యానం, సుగ్రీవ విజయం అనే యక్షగానాన్ని రాశాడు. ఇది యక్షగానాలలో ప్రప్రథమ యక్షగానం. కాని ఇతడు ఈ రుద్రకవి కాదని ఈ వంశానికి చెందిన తర్వాత వాడని పండితులు భావిస్తున్నారు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలం నాటి మరొక కవి మట్ల అనంత భూపాలుడు. అతడు కాకుత్స విజయం అనే కావ్యాన్ని రాశాడు.

అసూరిమరిగంటి సింగనాచార్యుడు: ఇబ్రహీం ఆస్థానంలో నివసించిన మరొక కవి ఆసూరి మరిగంటి శింగనాచార్యులు. అతడు నల్లగొండ జిల్లాలోని కనగల్లు గ్రామ నివాసి. అతనిని కూడా ఆదరించి అగ్రహారాలు ఇచ్చాడు. ఇతడు వైష్ణవమత పండిత కుటుంబానికి చెందినవాడు. అతడు నిరోష్ఠ్య రామాయణం అనే పేరుతో దశరథ రాజనందన చరిత్రను రచించాడు. ఈ కుటుంబానికి చెందిన మరొక పండితుడు మరిగంటి అప్పన్న. అతడు అమీన్‌ఖాన్ ఆస్థాన పండితుడు. కృష్ణయామాత్యుడు అనే కవిరాజనీతి రత్నాకరం అనే వైష్ణవ ప్రబంధంగా పంచతంత్ర గ్రంథాన్ని రచించాడు.

అమీన్‌ఖాన్ పోషణ: ఇబ్రహీం కుతుబ్‌షా అతని సామంతులకు సరదారులకు కూడా ఆదర్శ పాత్రుడయ్యాడు. అందువల్ల అతని సామంతులు కూడా కవులను పోషించి తెలుగు కావ్యాలను అంకితం పొందారు. అతని తరఫ్‌దార్ అమీన్‌ఖాన్ పొట్లచెరువు ప్రాంతాన్ని పాలించాడు. అతడు కూడా కవి పండితులను పోషించాడు. నల్లగొండ జిల్లాలోని కనగల్లు గ్రామంలో మరిగంటి అప్పలాచార్యుడనే వేద పండితుడు ఉండేవారు. అతడు ఉభయభాషా కవి. అమీన్‌ఖాన్ అతనిని ఆహ్వానించి తన ఆస్థాన కవిగా నియిమించాడు. ఇతని ఆస్థానంలో ఉన్న మరొక తెలుగు కవి పొన్నెగంటి తెలగణాచార్యుడు. అతడు యయాతి చరిత్ర అనే కావ్యాన్ని రాసి అమీన్‌ఖాన్‌కు అంకితమిచ్చాడు. ఇది తెలుగులో మొట్టమొదటి అచ్చ తెలుగు కావ్యం అని ప్రసిద్ధి చెందింది. తెలుగు భాషలో అచ్చ తెలుగు కావ్యాన్ని మొట్టమొదట రచించిన ఘనత పొన్నెగంటి తెలగణాచార్యునిదే అని పండితులంటారు. అలాంటి ప్రథమ అచ్చ తెలుగు కావ్యాన్ని అంకితం పొందిన ఘనత అమీన్‌ఖాన్‌కు దక్కింది. ఈ కావ్య దీపికలో తెలగణాచార్యుడు అమీన్‌ఖాన్ యొక్క గుణగణాలు, శౌర్యప్రతాపాలు అతని వంశ చరిత్ర కవి పండితాభిమానం, తెలుగు భాషాభిమానం, అతని భార్యల గుణగణాలను వర్ణించాడు. ఈ కావ్యం తర్వాత తెలుగు కావ్యాలకు మార్గదర్శకమైంది. ఈ కాలంలో ఓష్ఠ్య, నిరోష్ఠ్య, ద్వర్థి, అచట, దిజిహ్వక, మొదలైన కావ్యాలు గారడీ కావ్యాలని అంటారు. అయినప్పటికీ అవి రసవంతంగా ఉండేవని కూడా అభిప్రాయపడ్డారు. అమీన్‌ఖాన్ కుటుంబీకులంతా బహుభాషావేత్తలు, పండిత పోషకులు. అతని సోదరుడు గతాతఖాన్ బీద బ్రాహ్మణులకు వివాహాలు చేశాడట. అతని భార్య బడేబీబీ కూడా గొప్ప దానశీలి అని పేరు పొందింది.

ఈ విధంగా ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో అనేక మంది తెలుగు కవులు పోషింపబడి తెలుగు కావ్యాలు రచింపబడ్డాయి. అందువల్ల అతడు తెలుగు కవులకు దైవ సమానుడయ్యాడు. ఇబ్రహీం కుతుబ్‌షా క్రీ.శ.1880లో మరణించాడు. అతని మరణానికి అమితదుఃఖం కలిగిన ఒక కవి నిస్సారపు లోభి రాజులను చంపక మల్కిభరామ భూవరున్ చంపితివా అని దేవుని దూషిస్తూ పద్యం చెప్పాడు. దానిని బట్టి ఇబ్రహీం కుతుబ్‌షా కవి పండితులకు ఎంతటి అభిమాన పాత్రుడయ్యాడో అర్థమవుతోంది. అందువల్ల అద్దంకి గంగాధర కవి తన కావ్యంలోని కొన్ని పద్యాలలో శ్రీరామునితో పోల్చి మల్కిభరాం అనే బిరుదు ఇచ్చాడు. అందువల్లనే ఇబ్రహీం కుతుబ్‌షా మల్కిభరాం అని తెలుగు సాహిత్య జగత్తులో ప్రసిద్ధి పొందాడు. ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో అనేక తెలుగు శాసనాలు కూడా వేయబడ్డాయి. వాటిలో క్రీ.శ.1550 నాటి కోయలకొండ, క్రీ.శ.1551 నాటి రాచకొండ, క్రీ.శ.1560 నాటి పానుగల్లు, క్రీ.శ.1565 నాటి కొలలంపూడి, క్రీ.శ.1574 నాటి ఈపూరు, క్రీ.శ.1577 నాటి మల్కాపురం శాసనాలు ముఖ్యమైనవి.

మహమ్మద్ కులీ కుతుబ్‌షా కాలం: మహమ్మద్ కులీ ఉర్దూ, పారశీ, అరబ్బీ భాషలలోనే గాక సంస్కృతాంధ్ర భాషలలో కూడా గొప్ప ప్రజ్ఞావంతుడు. ఇతని తల్లి భాగీరథి, భార్య భాగ్యమతి. ఇతడు హిందువుల వసంతోత్సవాలు హోలీ, బతకమ్మ పండుగలలో పాల్గొన్నట్లు కనిపిస్తోంది. అతని ఉర్దూ నజములలో తెలుగు ఆచార వ్యవహారాలు బంసతికి ఈద్, పూకడిపూ అనే బతకమ్మ ఆటలకు సంబంధించిన తెలుగువారి సంస్కృతి తెలుగు, ఉర్దూ, ఇరాని భాషల సమ్మేళనంగా వర్ణించాడు. ఇతని కాలంలో కూడా తెలుగు కవులు పోషింపబడ్డారు. అనేక తెలుగు కావ్యాలు వెలువడ్డాయి. అనేక తెలుగు శాసనాలు రచించబడ్డాయి. ఇతని కాలంలో శక 1522లో

ఒంగోలు తాలూకాలోని ధర్మవరంలో అతని సేనాని ఏక్లాస్‌ఖాన్ ఒక శాసనం వేయించాడు. అందులో ఒక మంచి తెలుగు సీసపద్యం ఉంది. అదేవిధంగా కొండవీటి దగ్గర ఉన్న అమీనాబాద్‌లో అమీను ఉల్‌ముల్క్ వేయించిన శాసనంలో మరొక తెలుగు పద్యం ఉంది. ఇతని కాలంలోనే క్రీ.శ.1619లో మాచర్లలోని చెన్నకేశవుని ఆలయంలో మరొక తెలుగు శాసనం వేయబడింది. అందులో మాచర్ల మహాదేవిచర్లగా పేర్కొనబడింది.

కులీకుతుబ్‌షా తెలుగు దక్కనీ ఉర్దూలో కవితలు రాసి అందులో అనేక తెలుగు పదాలను వాడాడని షేర్వానీ రాశాడు. ఇతడు హైదరాబాద్ నిర్మాత. అతని ఆస్థానంలో పట్టమెట్ట సోమయాజి, గణేశ్ పండితుడు, కామిరెడ్డి సారంగుతిమ్మయ్య అనే కవులు ఉండేవారు. వారిలో కామిరెడ్డికి అతడు రాజలాంఛనాలను ఇచ్చి గౌరవించాడు. కామిరెడ్డి తమ్ముడు మల్లారెడ్డి శివధర్మోత్తరం, పద్మపురాణం రాశాడు. సారంగు తిమ్మయ్య వైజయంతి విలాసం రాశాడు. ఇతడు గోల్కొండ కరణం కూడాను. సుల్తాన్ అభిమాని. ఇతడు తన కావ్యంలో విప్రనారాయణుడు, దేవదేవి అనే వేశ్యవలలో పడిపోతాడు. వేశ్యమాత ధనం తెమ్మంటుంది. అందుకు దొంగతనం చేసి అప్రదిష్టపాలయి, చివరకు విష్ణువు చేత ఉద్ధరింపబడతాడు; ఈ ఇతివృత్తంతో కామం ఎంతటి అనర్థాలను సృష్టిస్తుందో దైవభక్తులు కూడా ఎలా పతనమవుతారో తెలుపుతాడు. వైజయంతీ విలాసంలో గోల్కొండను భాగీరథీ పట్టణం అని వర్ణించాడట.

నౌబతి కృష్ణయామాత్యుడు అనే అతడు మహమ్మద్ కులీ కుతుబ్‌షా వద్ద మంత్రిగా పని చేశాడు. అతడు కూడా కవి. అతడు రత్నాకరం అనే గ్రంథాన్ని రాశాడు. ఇది వైష్ణవ సంబంధమైన ఆరు అశ్వాసాలు గల కావ్యం ఇతని తండ్రి కమల ప్రధాని అని పానుగంటిని పాలించాడని రాశాడు. మహమ్మద్ కులీ కాలంలో హరిభక్త సుభోదయ వ్యాఖ్యానం అనే మరొక వైష్ణవ కావ్యం కూడా రాయబడింది. సుల్తాన్ కాలంలో ఓక్కనపోట సంస్థానాధీశులు కూడా తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. ఈ సంస్థానాధీశులలో కొందరు స్వయంగా కవులు. కులీకుతుబ్‌షా రచించిన రచనలు దివాన్ అనే పేరుతో సంకలనంగా వెలువడ్డాయి అది 18 వందల పుటల గ్రంథం. అతడు కలం పేరుతో కూడా రచనలు రాసేవాడట. ఆ కలం పేర్లలో మాని అనేది ఒకటి.

అబ్దుల్లా కుతుబ్‌షా కాలం: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో 9 తెలుగు శాసనాలు వేయించబడ్డాయి. అబ్దుల్లా ఆస్థానంలో తులసీదాసనే కవి ఉండేవాడు. ఇతని కాలంలో క్షేత్రయ్య అబ్దుల్లా ఆస్థానాన్ని దర్శించి తులసీదాసును ఓడించి అబ్దుల్లా కుతుబ్‌షా మీద పదాలు చెప్పాడట. ఈ పదాలకు క్షేత్రయ్య పదాలు లేక మొవ్వగోపాల పదాలు అని పేరు. క్షేత్రయ్య పదాలను కొందరు అశ్లీల శృంగార పదాలు అని అంటారు. ఇవి కూచిపూడి భాగవతుల నృత్యగీతాలుగా ఉపయోగపడ్డాయి. అతడు 4500 వరకు పదాలు రాశాడు. అందులో 2 వేల పదాలు మధురను ఏలిన తిరుమలరాయల మీద, 1000 పదాలు తంజావూరును ఏలిన విజయ రాఘవనాయకుని మీద, 1500 పదాలు అబ్దుల్లా కుతుబ్‌షా మీద పాడి వారికి అంకితం ఇచ్చాడు.

అబుల్ హసన్ తానీషా కాలం: అబుల్ హసన్ కాలంలో అనేకులు ముస్లిం పండితులు తెలుగు సంస్కృత భాషలు నేర్చుకొని అనేక కావ్యాలు రాశారు. సుల్తాన్‌కు ముస్లిం మతగురువైన షారాజు కుమారుడు షా అక్బర్ గొప్ప తెలుగు సంస్కృత పండితుడు. అతడు శృంగార మంజరి అనే అలంకార శాస్త్రాన్ని సంస్కృతంలోకి తర్జుమా చేశాడు. ఈ కాలంలో 24 రకాల రామాయణాలు, ఉపనిషత్తులు పర్షియన్ ఉర్దూ భాషలలోకి తర్జుమా చేశారు.

భక్త రామదాసు: అబుల్ హసన్ కాలంలో ప్రసిద్ధి చెందిన వాగ్గేయకారుడు భక్త రామదాసు. అతని అసలు పేరు కంచర్ల గోపన్న. అతడు పాల్వంచ పరగణాలోని నేలకొండపల్లిలో జన్మించాడు. తండ్రి కంచెర్ల లింగనమంత్రి తల్లి కామమ్మ. అతడు అక్కన్న, మాదన్నలకు మేనల్లుడు. కొందరు అతడు వారికి మేనల్లుడు కాదని, దగ్గర బంధువని అంటారు. అలాగే అక్కన్న, మాదన్నలు కూడా సోదరులు కాదని మరొక వాదన ఉంది. ఒక రోజున అక్కన్న, మాదన్న ఇంటికి వచ్చాడని, మాదన్న ఎవరు నీవని అడగ్గా, నేను పెద్ద సోదరుడనని చెప్పాడని, దానికి అర్థం దరిద్రుడను అని, పెద్దమ్మ చిన్నమ్మల అర్థంలో ఆ పద ప్రయోగం చేశాడని అంటారు. అందుకు మాదన్న నవ్వి అతనికి ఆస్థానంలో ఉద్యోగం ఇప్పించాడని, నాటి నుంచీ వారిద్దరూ సొంత సోదరుల లాగా జీవించారని ఒక కథ ప్రచారంలో ఉంది. కాని వారిద్దరూ సోదరులని, కంచెర్ల గోపన్న వారి మేనల్లుడని, నాటి నుంచీ ఆంధ్రదేశంలో శృతి ఉంది. అతని మేనమామలు అక్కన్న, మాదన్నలు అతన్ని పాల్వంచ పరగణాకు తహశీల్దారుగా నియమించగా శిస్తు వసూలు చేసి భద్రాద్రిలో రామాలయం నిర్మించాడు. అందుకు కోపించి అతన్ని తానీషా

జైలులో పెట్టినప్పుడు తనను విడిపించమని శ్రీరాముని ప్రార్థిస్తూ భక్తిగీతాలు రచించి రామదాసుగా ప్రసిద్ధి పొందాడు. ఆ భక్తిగీతాలను దాశరథీ శతకం అని అంటారు. అతని భక్తిగీతాలు తెలుగు భాషలో అతి మధురమైనవని కీర్తి పొందాయి. నేటికీ తెలుగు ప్రజలు దాశరథ శతకంలోని భక్తిగీతాలను పాడుకొంటూ ఉంటారు. అతని కీర్తనలు లయ, తాళబద్ధంగా ఉండి భజన కీర్తనలుగా గొప్ప ఆదరణ పొందాయి. రామదాసుకు కబీరు గురువని, అతడు రామదాసుకు రామనామ మహాత్మ్యం బోధించాడని కథలు ప్రచారంలో ఉన్నాయి. కాని కబీరు అంతకు పూర్వం వాడు. రామదాసుపై జాలిపడి తానీషా కూతురు విడుదల చేసిందని కూడా ఒక కథ ప్రచారంలో ఉంది. అతడు జైలులోనే మరణించాడని ఆంగ్లేయులు రాశారు. కాని అబుల్ హసన్ అతనిని విడుదల చేసి భద్రాచలం ఆలయానికి ధర్మకర్తగా నియమించాడని, దేవాలయానికి దానాలు కూడా చేశాడని రాసి ఉన్న శాసనం ఒకటి ఇటీవల వంగూరి సుబ్బారావు అనే వ్యక్తికి దొరికిందని కంభంపాటి సత్యనారాయణ రాశారు. ఆ శాసనం ప్రకారం భద్రాచల రామాలయ నిర్వహణకు ధూపదీప నైవేద్యాలకు భద్రాచలం, పాల్వంచ, శంకరగిరి పట్టీలు, భోగవరం, చెరుకూరు, వరన్న పట్టణ గ్రామాలను దానం చేశాడని తెలుస్తోంది. అంతేగాక ఆనాటి నుండి అతడు భద్రాచల రామునికి శ్రీరామనవమినాడు జరిగే కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు పంపే ఆచారాన్ని కూడా ప్రారంభించాడు. ఆ సాంప్రదాయాన్ని నిజాం నవాబులు కొనసాగించారు. నేటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రతి శ్రీరామనవమి రోజున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తలంబ్రాలను తీసుకువెళ్ళి, భద్రాచలం శ్రీరామ కళ్యాణ ఉత్సవంలో పాల్గొంటున్నారు. దక్షిణవారు కూడా కంచెర్ల గోపన్న భద్రాచలం తహశిల్దారని రాశారు. అది వాస్తవం అయితే తానీషాయే స్వయంగా విడుదల చేశాడని భావించవచ్చును. కంచర్ల గోపన్న దాశరథి శతకంలోని ఒక పద్యంలో దుర్వ్యసనం చెంది కావ్యం దురాత్ములకిచ్చి మోసపోయానని వాపోయాడు. అతడు రాసిన కావ్యం ఏమిటో, దానిని ఎవరికి అంకితమిచ్చి మోసపోయాడో వివరాలు తెలియడు. .రామదాసు దాశరథీ శతకం కాక మరికొన్ని సాహిత్య గ్రంథాలు రాశాడు. రామదాసు చరిత్ర యక్షగానం గాను, హరికథగాను మలచబడి తెలుగునాట గానం చేయబడింది.

సింగనాచార్య: ఈ కాలంలో సింగనాచార్య అనే కవి పఫబభమ అనే అక్షరాలు లేకుండా ఒక నిరోష్ఠ్య కావ్యాన్ని రాశాడు. ఇది తెలుగు భాషలో నూతన ఒరవళ్ళు తొక్కినట్లు చెబుతారు. ప్రత్యేకతను పొందటానికి కవులు అప్పుడప్పుడు ఇలాంటి ప్రయోగాలు చేస్తారు. అదే ప్రయత్నంలో సింగనాచార్యుడు ఈ కావ్యం రాశాడు. తర్వాత వారు అతనిని అనుసరించి ఇలాంటివి తానీషా కాలంలో జటప్రోలు, గద్వాల సంస్థానాధీశులు కూడా తెలుగు భాషను పోషించారు.

సంస్కృత భాష: కుతుబ్‌షాల కాలంలో తెలుగుతోపాటు సంస్కృత భాష కూడా పోషించబడింది. శృంగార మంజరి అనే సంస్కృత కావ్యం ఈ కాలంలో రచింపబడింది. ఇంకా సంస్కృతంలో అనేక ద్విపదలు, గద్య పద్య కావ్యాలు రచింపబడ్డాయి. ముస్లిం యుగంలో సంస్కృత భాష నశించిపోకుండా కొనసాగింది.

చిత్రలేఖనం: కుతుబ్‌షాల కాలంలో కవిత్వంతోపాటు చిత్రలేఖనం నాట్య సంగీతాలు కూడా అభివృద్ధి చెందాయి. వీరి కాలపు చిత్రలేఖనంలో హిందూ పారశీక పద్ధతులు మిళితం చేయడమేగాక కొన్ని పాశ్చాత్య సాంప్రదాయాలు కూడా చేర్చబడ్డాయి. ఈ పద్ధతికి దక్కన్ చిత్రకళ అని పేరు వచ్చింది. ఈ చిత్రాలు మొగలుల చిత్రాల లాగే సూక్ష్మచిత్రాలు. ఈ సూక్ష్మచిత్రాలు గ్రంథాలలో చేర్చబడ్డాయి. ఈ విధానం ఆ కాలంలో అన్ని దక్కన్ రాజ్యాలలో ప్రచారంలో ఉంది. నిజాంషాహి కొలువులో తయారైన తారీఫ్ హుసేన్‌షా పాద్‌షాహి దక్కన్ అనే గ్రంథంలో మొదటిసారిగా సూక్ష్మచిత్రాలు చిత్రించబడ్డాయి. ఈ గ్రంథంలో 14 సూక్ష్మచిత్రాలు చిత్రించబడినవి. ఇది ఈ తరగతికి చెందిన మొదటి గ్రంథం. ఇందలి చిత్రాలు తళ్ళికోట యుద్ధానికి సంబంధించినవి. తర్వాత అనేకమంది కవులు ఈ పద్ధతిని అనుసరించారు. ఇదే పద్ధతి గోల్కొండ రాజ్యంలో కూడా ప్రవేశించింది. గోల్కొండ దర్బారులో మీర్‌హాషిం అనే చిత్రకారుడుండేవాడు. అతడు ఇట్టి చిత్రాలు చిత్రించడంలో ఆనాడు గొప్ప చిత్రకారుడుగా పేరు పొందాడు. దక్కని వర్ణచిత్ర శైలికి అతడే మూల పురుషుడట. అంతకుముందు దక్కన్‌లోకి మొగల్ చిత్రకళ ప్రవేశించలేదు. అతని ప్రావీణ్యాన్ని తెలుసుకొని మొగల్ చక్రవర్తులు అతనిని ఢిల్లీ దర్బారుకు పిలిపించుకున్నారట. బహుశా మొగలుల సూక్ష్మచిత్రాలకు కూడా అతడే ప్రారంభకుడు కావచ్చును. గోల్కొండ రాజ్యంలో అబ్దుల్లా కుతుబ్‌షా, తానీషా కాలంలో అనేక సూక్ష్మచిత్రాలు చిత్రించబడ్డాయి. తానీషా కాలం నాటి ఊరేగింపు చిత్రంలో మీర్జుంలా మాదన్న, అక్కన్నల ముఖాల చిత్రాలు స్పష్టంగా చిత్రించబడ్డాయి. అవి సహజ

సిద్ధంగా చిత్రించబడ్డాయి. అబ్దుల్లా కుతుబ్‌షా, తానీషాల చిత్రాలు కూడా అద్భుతంగా చిత్రించబడ్డాయి. ఆనాటి వీరిద్దరి చిత్రాలు ఇటీవల నిజాం నవాబుల భవనాలలో కనుగొనబడ్డాయి. ఈ చిత్రాలలో వారి ముఖాలు అర్ధముఖాకృతిలో చిత్రించబడ్డాయి. ఈ చిత్రాలలో అజంతా చిత్రాల ఛాయలున్నాయని చిత్రకారులు అంటారు.

నృత్య సంగీతాలు - కూచిపూడి భాగవతులు: కుతుబ్‌షాహీల కాలంలో నాట్య సంగీతాలు కూడా ఆదరింపబడ్డాయి. హైదరాబాద్ పట్టణంలో 2 వేల మంది వేశ్యలుండేవారని నాటి రాతల వల్ల తెలుస్తోంది. వారందరూ నాట్యసంగీతాలలో ప్రజ్ఞావంతులు. వారు సుల్తాన్ దర్బారులో వారి సామంతుల ఆస్థానాలలో వారు నాట్యాలు చేసి బహుమానాలు పొందేవారని పాశ్చాత్య బాటసారులు రాశారు. పండుగలు, ఉత్సవాలప్పుడు వారి నాట్యకచేరీలు తప్పకుండా ఉండేవట. ఆనాటి ప్రజలకు అవే పెద్ద వినోదాలు. ఈ కాలంలో ప్రసిద్ధి చెందిన మరొక కళాకారులు కూచిపూడి నాట్యకారులు. వారు నాట్య, సంగీత ప్రవీణులేగాక నాటకాలు, రూపకాలు ప్రదర్శించే వారు. వారు దేశమంతా పర్యటించి తమ నాటకాలను ప్రదర్శించేవారు. తానీషా కోస్తా ప్రాంతాన్ని పర్యటించినప్పుడు కూచిపూడిని దర్శించి వారి నాట్య సంగీతాలను తిలకించాడట. వారు అతని ముందు అద్భుత ప్రదర్శన ఇచ్చారట. అందుకు సంతోషించి వారికి కూచిపూడి గ్రామాన్ని అగ్రహారంగా ఇచ్చాడు.

కుతుబ్‌షాహీల సామంతుల తెలుగు భాషాపోషణ: కుతుబ్‌షాల కాలంలో వారి సామంతులు కూడా తెలుగు భాషను, తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. అంకితాలు పుచ్చుకున్నారు. ఈ సామంత రాజులలో కొందరు స్వయంగా కవులు. వారు కూడా కావ్యాలు రాశారు. అలాంటి సంస్థానాలలో బిక్కనవోలు సంస్థానం అతి ముఖ్యమైనది. ఈ సంస్థానానికి దోమకొండ సంస్థానం అని కూడా పేరుంది. ఈ వంశానికి చెందిన కామిరెడ్డి క్రీ.శ.1580-1600 సంవత్సరాల మధ్య పాలించి ఉంటాడు. ఇతడు మహమ్మద్ కులీ సమకాలికుడు. ఇతడు, ఇతని వంశస్తులు మల్లికార్జున పండితుల వంశస్తులకు శిష్యులు. ఆ వంశానికి చెందిన లింగనాథుడు ఇతని గురువు. ఇతని ఆస్థానంలో పట్టమట్ట సోమనాథ సోమయాజి అనే కవి ఉండేవారు. అతడు స్కాంధ పురాణంలోని నూతన సంహితను ఆంధ్రీకరించి ఇతనికి అంకితం చేశాడు. కామిరెడ్డి తర్వాత అతని తమ్ముడు ఎల్లారెడ్డి రాజ్యం చేశాడు. పట్టమట్ట సోమయాజి ఇతని ఆస్థానంలో కూడా కొనసాగి బ్రహ్మోత్తరఖండం అనే కావ్యాన్ని ఆంధ్రీకరించి ఎల్లారెడ్డికి అంకితమిచ్చాడు. అంటే పట్టమట్ట సోమయాజి రెండు కావ్యాలు రాసి సోదరులిద్దరికి చెరొక కావ్యాన్ని అంకితం చేశాడు. ఎల్లారెడ్డి స్వయంగా కవి. అతడు వాశిష్టం, లింగ పురాణాలను రెండు కావ్యాలు రచించాడు. ఎల్లారెడ్డి సోదరుడు మల్లారెడ్డి బహుగ్రంథకర్త. అతడు షట్చక్రవర్తి చరిత్ర, శివధర్మోత్తరం, పద్మపురాణం అనే కావ్యాలు రాసి తన ఇష్టదైవమైన సిద్ధిరామేశ్వరస్వామికి అంకితం చేశాడు.

దోమకొండ సంస్థానంలో చరికొండ ధర్మన్న, హరిభట్టు, పిడవర్తి బసవన్న, ఎలకూచి బాలసరస్వతి, కాంద్రవేటు రామానుజాచార్యులు, మల్లారెడ్డి, దేశాయి అను కవులుండేవారు. వారందరూ ప్రసిద్ధి పొందిన తెలుగు కవులు. కుతుబ్‌షా యుగంలో దోమకొండ సంస్థానంతోపాటు గద్వాల్, వనపర్తి లేక జటప్రోలు సంస్థానాధీశులు కూడా తెలుగు కవులను పోషించి తెలుగు కావ్యాలు రాయించారు. వనపర్తి రాజా బహరి గోపాలరావు స్వయంగా కవి. వారి ఆస్థానంలో కొలచెలమ నారాయణ పండితుడు, ఎలకూచి విన్నయ ప్రభాకరుడు ఉండేవారు. గద్వాల సంస్థానంలో లక్ష్మీనరసింగరుయ్య, ఆదికవులు ఉండేవారు. వీరందరూ తెలుగు కావ్యాలు రాసి తెలంగాణలో తెలుగు భాష పూర్తిగా నశించిపోకుండా నిలబెట్టారు.

జమీందారుల కాలం - కవులు - వారి రచనలు

1. నరసింహ కవి 1750 - భద్రాద్రి రామశతకం
2. కాసుల పురుషోత్తమరాజు 1798 - ఆంధ్ర నాయక శతకం
3. గోగులపాటి కూర్మనాథకవి 1725 - సింహాద్రి నారసింహ శతకం
4. అడిదం సూర కవి 1720-1785 - రామలింగేశ్వర శతకం.
   ఇది ఆనాటి రాజులను ఘాటుగా వర్ణించిన శతకం.

1. **కూచిమంచి తిమ్మకవి:** రుక్మిణీ కళ్యాణం, రాజశేఖర విలాసం, రసికజన మనోభిరామం, నీలాసుందరీ పరిణయం, శివలీలా విలాసం రాశాడు. ఇవి పండితుల చేత గొప్పగా భావింపబడిన రచనలు.
2. **అతని తమ్ముడు కూచిమంచి జగ్గకవి:** చంద్రరేఖా విలాసం రాశాడు. కాని ఇది బూతు కావ్యంగా ప్రసిద్ధి చెందింది.

3. **కంటిపాపరాజు:** ఉత్తర రామాయణం రాశాడు. ఇది ఒక మహాకావ్యంగా ప్రసిద్ధి చెందింది.
4. **పుష్పగిరి తిమ్మన:** సమరకుమార విజయం అనే కావ్యాన్ని రాశాడు. ఇది కూడా నాటి గొప్ప కావ్యాలలో ఒకటిగా కీర్తి పొందింది. వారి తర్వాత అంటే 19వ శతాబ్దం ప్రథమ భాగం నుండి తెలుగు సాహిత్యంపై ఆంగ్ల ప్రభావం పడింది. అప్పటి నుండి తెలుగు సాహిత్య చరిత్రలో ఆధునిక యుగం ప్రారంభమైంది.

కుతుబ్‌షాహీల వాస్తువు - శిల్పకళ

కుతుబ్‌షాహీల వాస్తు శిల్ప కళలకు వారు నిర్మించిన గోల్కొండ, హైదరాబాద్ కోటలు, అందరి భవనాలు తార్కాణాలు, వారు ఈ రెండు ప్రదేశాలలో అనేక మసీదులు, రాజప్రాసాదాలు, సమాధులు నిర్మించారు. ముస్లిం నిర్మాణాలకు, హిందువుల నిర్మాణాలకు చాలా భేదాలున్నాయి. హిందువుల భవన నిర్మాణాలలో గోడలను నిర్మించి వాటి మధ్య స్తంభాలను నిలిపి వాటిపై రాతి దూలాలను గాని, దారుదూలాలను గాని ఎత్తి వాటిపై కడ్డీలు పరచి వాటిపై రాతి ఫలకాలను పరచిగాని, ఇటుకలను సున్నపు అడుసుతో ఒకదానితో మరొక దానిని అతికించి పైకప్పును నిర్మిస్తారు. రాజప్రాసాదాలు ప్రజలు తమ నివాసాల కోసం నిర్మించుకొనే ఇళ్ల నిర్మాణంలో కర్ర సామాను వాడతారు. అంటే స్తంభాలు, దూలాలు, కడ్డీలకు కొయ్యను వాడతారు. గోడలు నిర్మించి మధ్యలో కొయ్య స్తంభాలు పాతి, వాటిపై కొయ్య దూలాలు, కొయ్య కడ్డీలు పరచి ఆ చట్రం మీద ఇటుకలను సున్నపు గచ్చుతో అతికించి కప్పును నిర్మిస్తారు. దేవాలయాల నిర్మాణంలో అలాగాక అన్నింటికీ రాతినే వాడతారు.

గర్భ గృహాలపైన కప్పును నిర్మించడానికి మరొక పద్ధతిని అవలంబిస్తారు. గర్భ గృహం గోడమీద మూలలను రాళ్లతో మూసుకొంటూ వస్తారు. బండలను సమతుల్యం చెడకుండా ఒకదానిపై ఒకదాన్ని పేర్చుకుంటూ వస్తారు. నాలుగు మూలలలో ఆ విధంగా పేర్చుకుంటూ రాగా క్రమేపీ గర్భగుడి కప్పు వెడల్పు తగ్గుతూ వస్తుంది. అంటే సంకుచితం చెందుతూ అంటే కొద్దికొద్దిగా తగ్గుతూ పైకి వెళుతుంది. చివరకు ఒక్క బండ వేస్తే కప్పు పూర్తిగా మూసుకుని పోతుంది. ఈ విధంగా గోపుర నిర్మాణం జరుగుతుంది. ఈ విధంగా నివాస భవనాలు ఒక విధంగా, దేవాలయాల నిర్మాణం మరొక విధంగా హిందూ వాస్తురీతి రెండు విధాలుగా సాగుతుంది.

ముస్లిం నిర్మాణాలు ఇందుకు భిన్నంగా నిర్మింపబడతాయి. ముస్లిం నిర్మాణాలలో మీనారులు, కమాన్‌లు, గుమ్మటాలు ప్రధాన పాత్ర వహిస్తాయి. మీనారులు అంటే స్తంభాలు, కమానులు అంటే ఆర్చీలు, గుమ్మటాలు అనగా కప్పు (డోమ్) అని భావించవచ్చును. ముందు బలమైన పెద్ద స్తంభాలు వరుసలుగా నిర్మించి ఆ స్తంభాలను ఆర్చీలలో కలుపుతారు. ఆ విధంగా కలుపబడిన చట్రంపై గుమ్మటాలు అంటే డోములను నిర్మిస్తారు. ఈ నిర్మాణాలలో దూలాలు, కడ్డీలు ఉండవు. గుమ్మటాల బరువంతా కమాన్ల మీద ఆధారపడి ఉంటుంది. అందువలన కమాన్లను చాలా బలంగా పటిష్టంగా నిర్మిస్తారు. రాళ్లనుగాని, ఇటుకలనుగాని, సున్నపు గచ్చుతో ఒకదాని మీద ఒకదానిని అతికిస్తూ పైకి పోయేటప్పటికి గుండ్రని ఆకారం వచ్చేటట్లు చేస్తారు. ఒకవేళ స్తంభాలు లేకుండా ఉంటే గోడలను నిర్మించి ద్వారాల వద్ద ఆర్చీలు అంటే కమానులు నిర్మిస్తారు. ఇలాగే గుమ్మటాలు కూడా ఆర్చి నిర్మాణంలో ఇటుకలు గాని, రాళ్లు గాని అతికించిన విధానాన్నే పాటిస్తూ కప్పు పూర్తి అయ్యేటప్పటికీ గుండ్రంగా తయారవుతుంది. చూడటానికి కుండను బోర్లించినట్లు కనిపిస్తుంది. ఈ విధంగా నిర్మించిన గుమ్మటమే భవనానికి కప్పు అవుతుంది. భవనానికి నాలుగు వైపులా నాలుగు మినరేట్లు అంటే స్తంభాలు చాలా ఎత్తు నిర్మిస్తారు. ఈ మినరేట్లు కప్పును అంటే గుమ్మటాలకంటే ఎత్తుగా నిర్మిస్తారు. రాజభవనాలు, మసీదులు చాలా ఎత్తు వేదికలపై నిర్మిస్తారు. అందువల్ల ఎత్తయిన వేదికల మీద పెద్ద పెద్ద ఆర్చీలు, గుమ్మటాలు, వాటిని మించిన మినరేట్లతో ఈ నిర్మాణాలు పెద్ద పరిమాణాలతో చాలా గాంభీర్యంగా కనిపిస్తుంటాయి. ముస్లిం నిర్మాణాలలో కప్పులకు దర్వాజాలకు దూలాలు, కడ్డీలు ఉండవు. కనుక బలమైన గచ్చును వాడతారు. భవనపు బలమంతా అందులోవాడే గచ్చు మీదనే ఆధారపడి ఉంటుంది. ఇది ముస్లిం వాస్తురీతి. గోల్కొండ నవాబులు షియా మతస్థులు. వారు తమ భవనాలు, మసీదులు పర్షియా వాస్తురీతిని అనుసరించారు. దానిని ఇరాని శైలి అని అంటారు. సాధారణంగా ముస్లిం కట్టడాలు అలంకార రహితంగా నిరాడంబరంగా ఉంటాయి. హిందూ నిర్మాణాలలో అలంకరణలు ఉంటాయి. దేవాలయం అయితే గోడలు, స్తంభాలు, గోపురాలు, శిల్పాలతో అలంకరిస్తారు. లోగోడలు, లోకప్పులపై రంగులతో దేవతా చిత్రాలను చిత్రిస్తారు. భారతదేశంలో ప్రవేశించిన ముస్లింలు హిందూ శిల్పకళా ప్రభావాన్ని తప్పించుకోలేకపోయారు. అందువల్ల కాలక్రమేపి వారి నిర్మాణాలలో హిందూ లక్షణాలు సమ్మిళితమయ్యాయి. హిందువులు చిత్రించుకొనే లతలు, పూవులను పక్షులు, ముస్లింలు తమ మసీదులపైనా, భవనాలపైనా చిత్రించారు. ఇంకా వారు క్షేత్రగణిత నమూనాలు, ఖురాన్ సూక్తులను కూడా తమ మసీదులపై రాయించారు. అలాగే వాస్తులో కూడా వారు కొన్ని నిర్మాణాలలో హిందూ పద్ధతులు ప్రవేశపెట్టారు. అక్కడ

ఫతేపూర్ సిక్రీలో నిర్మించిన పంచమహల్ బౌద్ధ చైత్యం లాగా ఉంటుంది. అలాగే కొన్ని సమాధులలో కూడా హిందూ వాస్తు ప్రవేశించింది. ఈ విధంగా ముస్లిం నిర్మాణాలు హిందూ ముస్లిం వాస్తుకళా సాంప్రదాయాల మిశ్రమంగా నిర్మింపబడ్డాయి. అలాగే ముస్లిం వాస్తు లక్షణాలు హిందూ కట్టడాలలో కూడా ప్రవేశించాయి విజయనగర చక్రవర్తులు తమ కట్టడాలలో కొన్ని ముస్లిం పద్ధతులను అనుసరించారు. హంపిలోని పద్మమహల్, గజశాల ఈ కోవలోకి వస్తాయి. అందులో ముస్లింల ఆర్చీ అంటే కమాన్‌శైలి ప్రవేశపెట్టబడింది. ఆంధ్రదేశంలోని జమీందారులు కుతుబ్‌షాహీల హిందూ సామంతులు తమ భవనాలలో ఆర్చి మొదలైన కొన్ని పద్ధతులను ప్రవేశపెట్టారు. ఈ విధంగా గోల్కొండ యుగంలో ఆంధ్రదేశంలో హిందూ, ముస్లిం వాస్తుశిల్ప, చిత్రకళలు ఒకదానికొకటి తమ ప్రభావాలకు గురయ్యాయి. అయితే హిందూ నిర్మాణాలలో ముస్లిం వాస్తువు రాజప్రాసాదాలకే పరిమితం. దేవాలయాల నిర్మాణంలో ప్రవేశించలేదు. కాని హిందూ దేవాలయాల మీద చెక్కే పక్షుల లతలు, పుష్పాలు ముస్లింల మసీదులలోకి ప్రవేశించాయి. బాలాసాహిర్ ద్వారం మీద హిందూ పురాణ చిత్రాలు, హిందూ చిత్ర సంకేతాలు చిత్రించారని ఆచార్య షేర్వానీ రాశారు. వాస్తువులో పర్షియా వాస్తును అనుసరించారు. కాని అలంకరణలో హిందూ శిల్పకళా లక్షణాలను మిళితం చేశారని పండితులు అంటారు. మొత్తం మీద ఉభయ రీతుల మిశ్రమంతో కట్టడాలు నిర్మింపబడ్డాయి. గోల్కొండ నవాబులు పఠాన్, పర్షియా, ఆంధ్ర శైలుల మిశ్రమంతో కట్టడాలు నిర్మించినందువల్ల హైదరాబాద్ శైలి అని అనవచ్చును. గోల్కొండ సుల్తాన్‌ల నిర్మాణ శైలికి గోల్కొండ కోట, అందరి భవనాలు, కుతుబ్‌షాహీల సమాధులు, హైదరాబాద్ పట్టణం, చార్మినార్, మక్కామసీదు, ఇతర భవనాలు నిదర్శనాలు. హైదరాబాద్, గోల్కొండ పరిసర ప్రదేశాలలో రెండవ మిలీనియం యుగం నుండే జనావాసాలు ఉన్నట్లు పరిశోధనల వల్ల రుజువైంది. నియోలిథిక్ పరికరాలు టోలుకట్ట వద్ద బయల్పడ్డాయి. నియోలిథిక్ యుగం తర్వాత కాలానికి చెందిన మొదటి మిలీనియం యుగానికి చెందిన మెగాలిథిక్‌లకు సంబంధించిన కైరన్లు బోయినపల్లి, ఫతేనగర్, గుర్రంగూడ, లింగంపల్లి, కుక్కుటపల్లి, హాషీంపేట, మౌలాలీలలో ఉన్నాయి. ఇటీవల క్రీ.శ.4వ శతాబ్దానికి చెందిన రెండు శాసనాలు మలక్‌పేట వద్ద ఉన్న చైతన్యపురి వద్ద లభించాయి. ఈ శాసనాలలో ఒకటి గోవింద రాజవిహారాన్ని పేర్కొంది. ఈ శాసనాలు మూసీనది ఒడ్డున ఉన్న ఒక పెద్ద గ్రానైట్ రాతి మీద ఉన్నాయి. ఈ శాసనాలు విష్ణుకుండిన గోవిందవర్మకు చెందినవిగా గుర్తించబడ్డాయి. హైదరాబాద్ పొలిమేరలలోని బోయినపల్లి వద్ద క్రీ.శ.11వ శతాబ్దానికి చెందిన జైన శాసనం లభించింది. ఈ ఆధారాలన్నీ హైదరాబాద్ ప్రాంతంలో అతి ప్రాచీన కాలం నుండే జనావాసాలు ఉన్నట్లు స్పష్టం చేస్తున్నాయి. కాకతీయుల కాలంలో గోల్కొండలో కోటను నిర్మించడంతో ఈ ప్రాంతానికి చారిత్రక ప్రాధాన్యత వచ్చింది.

గోల్కొండ కోట - హైదరాబాద్ నిర్మాణాలు: గోల్కొండ కోట నేటి హైదరాబాద్ పట్టణానికి పశ్చిమంగా 9 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఒక పెద్ద గుట్ట మీద నిర్మింపబడింది. ఆ కాలంలో ఇది వజ్రాల పట్టణంగా పేరు పొందింది. ఈ ప్రదేశాన్ని కళ్యాణీ చాళుక్యుల కాలంలో మాన్యపురం - మంగళవరం అని, కాకతీయుల కాలంలో దీనిని గొల్లకొండ అని పిలిచేవారు. తర్వాత మహమ్మదీయుల ఉచ్ఛారణలో గోల్కొండగా రూపాంతరం చెందింది. గొల్లలు అక్కడ నివసిస్తూ ఆ కొండవైపు పశువులను మేపుకొంటూ ఉండేవారట. అందువల్ల దానిని గొల్లకొండ అని పిలిచేవారట. నేడు కూడా ఆ పరిసర గ్రామాలలో గొల్లవారే ఎక్కువట. కాకతీయులు అక్కడ ఒక చిన్న కోటను నిర్మించారు. కాకతీయుల పతనానంతరం ఈ కోట కాపయనాయకుని అధికారం కిందికి వచ్చింది. అతడు బహమనీలతో జరిగిన యుద్ధంలో ఓడిపోయి క్రీ.శ.1364లో గొల్లకొండను మొదటి మహమ్మద్‌షాకు ఇచ్చివేశాడు. ఆనాటి నుండి క్రీ.శ.1512 వరకు అది బహమనీల వశంలోనే ఉంది. బహమనీల కాలంలో ఈ కోట స్థితిని గురించి తెలుసుకోవడానికి మనకు ఆధారాలు లేవు. బహమనీ సుల్తాన్ గోల్కొండ కోటను, దాని పరిసర ప్రాంతాలను కులీ కుతుబ్‌షాకు ఇచ్చి అతనిని తెలంగాణ తరఫ్‌దార్‌గా నియమించాడు. అతడు క్రీ.శ.1518లో గోల్కొండను రాజధానిగా చేసుకుని స్వతంత్ర కుతుబ్‌షాహీ రాజ్యాన్ని స్థాపించాడు. దాంతో గోల్కొండ దక్కను చరిత్రలో ప్రముఖ పాత్రను నిర్వహించింది. కులీకుతుబ్‌షా అక్కడి కోటను బలపరచి అందులో అనేక నూతన భవనాలను నిర్మించాడు. గోల్కొండ దుర్గానికి ఒకదాని చుట్టూ మరొకటి చొప్పున మొత్తం మూడు కోటలు నిర్మింపబడ్డాయి. మొదటి కోట కొండ శిఖరం చుట్టూ పెద్ద పెద్ద బండలను కలుపుతూ కోట నిర్మించబడింది. రెండవకోట రాచనగరు, దర్బారు, రాజోద్యోగుల ఇళ్ల చుట్టూ నిర్మింపబడింది. మూడవకోట గోల్కొండ పట్టణం చుట్టూ నిర్మింపబడింది. ఈ విధంగా మొత్తం ఒకదాని చుట్టూ మరొకటిగా మూడు కోటలున్నాయి.

ఇబ్రహీం కుతుబ్‌షా నిర్మించిన బయటి కోట క్రీ.శ.1560: పట్టణం చుట్టూ నిర్మింపబడిన మూడవ కోటను నాల్గవ సుల్తానైన ఇబ్రహీం కుతుబ్‌షా నిర్మించాడు. అతడు కోటను విశాలం చేస్తూ 7 వేల మీటర్ల పొడవున నూతనంగా కోటను నిర్మించాడు. ఈ కోట 5 కి.మీ. చుట్టు కొలత కలిగి, పట్టణం చుట్టూ వ్యాపించి ఉంది గోల్కొండ పట్టణంలోని ప్రజలకు రక్షణ కల్పించటానికి ఈ కోట నిర్మింపబడింది. ఈ కోట గోడలో 87 బురుజులు నిర్మింపబడ్డాయి. ఈ బురుజులలో కొన్ని Octagonal Shape లో ఉండి వాటి మీద పిట్టగోడలున్నాయి. ఈ బురుజులపై పెద్ద పెద్ద ఫిరంగులు అమర్చబడ్డాయి. ఈ కోట మొత్తానికి 8 దర్వాజాలున్నాయి. ప్రతి దర్వాజా ముందు రెండు వైపులా బురుజులున్నాయి. ఈ దర్వాజాలు 15 నుండి 18 మీటర్ల ఎత్తున్నాయి. ఈ దర్వాజాలకు పేర్లు పెట్టబడి ఉన్నాయి. పశ్చిమదిక్కులో ఉన్న దర్వాజాకు మక్కా దర్వాజా అని పేరు పెట్టారు. ఆ దర్వాజా మక్కావైపుకు తిరిగి ఉంటుంది. ఈ కోటకు ప్రధాన దర్వాజాకు ఫతేదర్వాజా అని పేరు పెట్టబడి ఉంది. మిగిలిన వాటికి మూసాదర్వాజా, బంజారా దర్వాజా, పెటల్ బురుజు దర్వాజా అని పేర్లు పెట్టబడి ఉన్నాయి. ప్రధాన దర్వాజా అయిన ఫతేదర్వాజాకు, మక్కా దర్వాజాకు అదనపు రక్షణగా ముందు వెనుకల బలమైన గోడలు నిర్మించి వాటికి కూడా దర్వాజాలు పెట్టారు. మక్కా దర్వాజాకు దానికి ముందు నిర్మించిన గోడకు మధ్యలో పెద్ద ఖాళీ వదలబడింది. దర్వాజాకు రక్షణ వ్యూహంగా ఖాళీ ప్రదేశం వదిలినట్లుగా కనిపిస్తోంది. బయట నిర్మించిన గోడకు కూడా గేటు ఉంది. ఆ గేటు Barican చేత రక్షింపబడేటట్లు ఏర్పాటు చేశారు. పక్కన చిన్నద్వారం ఏర్పాటు చేశారు. మక్కా గేటుకు వెనుకవైపు కూడా అంటే లోపలి పక్క కూడా అలాగే గోడ నిర్మించి ముందు ఏర్పాటు చేసినట్లే రక్షణ కల్పించారు. ద్వారాలన్నీ ఇనప ప్లేట్లతో బిగించి ఇనప spikes ను అమర్చారు. ఈ కోట చుట్టూ పెద్ద కందకం ఉంది. ఈ విధంగా ఇబ్రహీం కుతుబ్‌షా అతి పటిష్టంగా కోటను తీర్చిదిద్దాడు. ఈ కోట నిర్మాణం క్రీ.శ.1560 నాటికి పూర్తయింది. ఈ కోటలో సాధారణ ప్రజలు వ్యాపారులు, గోల్కొండలో నివసించే మిగిలిన అన్ని రకాల ప్రజలు ఈ కోటలో ఇళ్లు నిర్మించుకొని నివసించేవారు.

బాలాహిస్సార్ కోట - రెండవ కోట: ఈ కోట లోపల కొండపాదం చుట్టూ రెండవ కోట నిర్మింపబడింది. అసలు మొట్టమొదట నిర్మించిన కోట ఇదే. ఈ కోట కాకతీయుల కాలంలోనే నిర్మింపబడింది. కులీకుతుబ్‌షా గోల్కొండ అధిపతి అయిన తర్వాత ఈ కోటను పూర్తి పునర్నిర్మాణం చేశాడు. ఈ కోట లోపలే రాజప్రాసాదాలు, దఫ్తర్‌లు, రాజోద్యోగుల నివాసాలు ఉండేవి. అంటే ఇది రాచనగరు. ఆ రాచనగరు చుట్టూ నిర్మింపబడిన రెండవ కోట ఇది. ఈ కోట మొదటి కోట కంటే అంటే పట్టణానికంటే 300 మీటర్ల ఎత్తులో పర్వతపాదం మీద పర్వతం చుట్టూ నిర్మింపబడింది. రెండవ కోటలో ఉన్న భాగాన్ని బాలాహిస్సారి అని అంటారు. అందులో మధ్యలో విశాలమైన బజారు ఉంది. దానికి రెండువైపులా నివాసగృహాలు, అంగళ్లు ఉన్నాయి. ఈ బాలాహిస్సార్ చుట్టూ ఉన్న కోటకు ఒకే దర్వాజా ఉంది. దానిని బాలాహిస్సారి గేటు అని అంటారు. ఈ దర్వాజా అన్నింటికంటే చాలా పెద్దది. ఈ గేటు పక్కలనే ఉన్న రాళ్ల మీద సింహాలు, Griffins మొదలైన బొమ్మలు చెక్కి ఉన్నాయి. ఇవి హిందూ చిహ్నాలు. ఈ చిహ్నాలు అక్కడ అంతకుముందే కోట ఉందని రుజువు చేస్తున్నాయని పండితులు అంటున్నారు. బాలాహిస్సార్ గేటు మీద కూడా హిందూ చిహ్నాలున్నాయని ఆచార్య షేర్వాణీ కూడా అన్నారు. ఈ గేటుకు రక్షణగా ఒక బలమైన సెమిసర్క్యులర్ కోట నిర్మింపబడింది. అందులో బురుజుల ఎత్తు వరకు ఒక పెద్ద ఎత్తయిన వేదిక నిర్మింపబడింది. ఆ వేదిక మీద కూర్చొని గేటు రక్షక భటులు లోపల ప్రవేశించే వారిని గమనిస్తూ ఉంటారు. ఈ Citadel లోకి ప్రవేశించగానే ఎడమచేతి వైపున మూడు అంతస్థుల భవనం ఉంది. దాని పేరు శిలాఖానా. అది ఆయుధాగారం. అందులో ఆయుధాలు, కవచాలు, తుపాకులు, ఫిరంగులు ఉండేవి. నేడు కూడా అక్కడ Muskets with wooden handles, Cannons, cannon balls, ఆయుధాలను యుద్ధ భూములకు చేరవేసే Carriages, బోగీలు, వాటి తాలూకు చిహ్నాలు కనిపిస్తాయి.

ఈ గేటుకు కుడివైపున కొన్ని భవన శిథిలాలు కనిపిస్తున్నాయి. ఇవి గేటు దగ్గర నుండి కొండ దాకా నిర్మింపబడి ఉన్నాయి. బహుశ ఇవి కుతుబ్‌షాహీల కాలం నాటి ఆఫీసులు కావచ్చును. ఈ భవనాలు ఎత్తు తక్కువగా కనిపిస్తున్నాయి. ఈ భవనాలు, ఎడమవైపున ఉన్న ఆయుధాగారానికి మధ్యలో కొండవైపు బాట ఉంది.

జలయంత్రం: ఈ బాటలో కొంచెం ముందుకు వెళితే కొండమీదకు మెట్లు ఉంటాయి. ఆ మెట్లు ఎక్కి కొద్ది దూరం వెళ్లగానే కుడివైపున నీళ్లతోడే జలయంత్రం ఉంది. అక్కడ Conduit Pipes అమర్చబడి ఉన్నాయి. అక్కడ పర్షియన్ విధానంలో చుట్టూ తిరిగే చక్రం అంటే Rotating Persian Wheel ను ఉపయోగించి నీళ్లను

కొండపైన ఉన్న భవనాలలోకి పంపేవారు. కోటకు ఉత్తరంగా 3 కిలో మీటర్ల దూరంలో ఉన్న దుర్గం తటాకం గోల్కొండ కోటకు ప్రధాన జలాధారం. కోటలోని భవనాలకు నేడు కూడా Conduit పైపులు అమర్చి ఉండటం కనిపిస్తోంది. గోల్కొండ కోటలో నీటి Hydroological Engineering Skill ద్వారా ఈ నీటి సప్లయ్‌ని ఏర్పాటు చేశారని తెలుస్తోంది.

అంబరుఖానా: జలయంత్రం నుండి ఇంకొద్దిగా కొండ ఎక్కితే ఒక భవన శిధిలాలు కనిపిస్తాయి. దానిని అంబర్‌ఖానా అని పిలిచేవారు. అది సుల్తాన్ స్టోర్ హౌస్. దాని ముందు పర్షియాలో ఒక శాసనం ఉంది. అందులో సుల్తాన్ అబ్దుల్లా కాలంలో క్రీ.శ.1642 అక్టోబర్‌లో కోట అధికారి ఖైరత్‌ఖాన్ కృషి వల్ల అంబర్‌ఖానా పూర్తి అయిందని రాసి ఉంది.

రామదాసు బంధిఖానా: ఈ అంబర్‌ఖానాకు ఎడమవైపున కొద్దిగా కింద కొద్దిగా వెలుతురు గల ఒక Oblong Cell ఉంది. అందులో భక్త రామదాసును తానీషా బందీగా ఉంచాడట. దానిని తానీషా బందిఖానా అని పిలుస్తారు. బాలాహిస్సార్ సమీపంలోనే రెండు కమాన్ భవనాలు విశాలమైన ఆవరణలతో ఉండేవి. సుల్తాన్ అక్కడే సైనిక వందనాన్ని స్వీకరించేవాడట. దానిని జల్వేఖాన్ అని కూడా అనేవారట. అక్కడే మోతీమహల్ అనే పేరు గల 9 అంతస్థుల భవనం కూడా ఉండేదట. అంబర్‌ఖానాకు ఎడమవైపు ఒక చిన్న మసీదు ఉంది. దానిని ఇబ్రహీం కుతుబ్‌షా నిర్మించాడని అంటారు. దానికి కుడివైపున ఒక హిందూ దేవతా గుహాలయం ఉంది. ఆ గుహాలయంలో ఉన్న దేవతను దుర్గరక్షిణి అని చెబుతారు. ఈ గుహాలయాన్ని మాదన్న నిర్మించాడని కూడా చెబుతారు. ఈ గుహాలయం వద్ద ఒక దర్వాజా ఉంది. ఆ దర్వాజా దాటితే కొండ శిఖరం మీద ఉన్న కోట ప్రాంగణంలోకి అడుగు పెడతాము.

మూడవ కోట - కొండ శిఖరపు కోట - తానీషా గద్దె: మూడవ కోటను కొండ శిఖరం చుట్టూ ఉన్న పెద్ద పెద్ద బండలను కలుపుతూ బలమైన గోడ నిర్మించబడింది. ఈ కోటలో ఉన్న పై శిఖరం మీద విశాలమైన భవనం నిర్మించబడింది. ఆ భవనాన్ని దౌలత్‌ఖాన్ దర్బారు హాలు అని పిలుస్తారు. అందులో నగీనాలు అందంగా తీర్చిదిద్దబడ్డాయి. అది రెండతస్థుల భవనం. కింది అంతస్థును దివానా-ఐ-భాషా అని అంటారు. అది న్యాయ స్థానంగా ఉపయోగపడింది. ఈ హాలుకు రెండు వైపులా ఇరుకైన మెట్ల వరుసలున్నాయి. ఆ మెట్ల నుండి పైకి వెళ్లవచ్చు.

రాజదర్బారు భవనం: పైన పెద్ద విశాలమైన హాలు ఉంది. ఆ హాలులో ఒక రాతి సింహాసనముంది. దానిని తక్ లేక మసనాద్ అని అంటారు. దానిని తానీషా గద్దె అని చెబుతారు. అది చాలా ఎత్తుగా ఉంది. దానిని ఎక్కడానికి 10 మెట్లు ఉన్నాయి. బాలాహిస్సార్‌లోని 9 అంతస్థుల మోతీమహల్‌లో తానీషా నివసించేవాడు. ఆ భవనం నుండి ఈ కొండ శిఖరం మీద ఉన్న దర్బారు హాలుకు వచ్చి దర్బారు చేసేవాడట. కనుక ఈ భవనానికి దర్బారు హాలు అని కూడా పేరుంది.

టెలిఫోన్ సిస్టం: గోల్కొండ కోటలో అతి విచిత్రమైన ఒక ఏర్పాటు ఉంది. రాచనగరు చుట్టూ ఉన్న రెండవ కోట గేటు అయిన బాలాహిస్సార్ గేటు ముందు వలయాకారంగా రాతి నిర్మాణం ఉంది. ఆ వలయంలో నిలబడి మనిషి చప్పట్లు కొడితే కొండ శిఖరం మీద ఉన్న తానీషా గద్దె హాలులోకి శబ్దం వినబడుతుంది. శత్రువులు బాలాహిస్సార్ గేటును ఛేదించి లోపలకు అడుగుపెట్టినా, గుర్రాల మీద లోపలకు అడుగుపెట్టినా ద్వారం ముందు ఏర్పాటు చేసిన రాతివలయం మీద నుండి లోపలకు రావలసిందే. ఆ రాతి వలయం మీద అడుగు పెట్టగానే గుర్రాల డెక్కల చప్పుడు శత్రు సైనికుల పాదాల చప్పుళ్లు కొండపైన ఉన్న రాజభవనంలోకి వినబడేవి. వెంటనే రాజకుటుంబం తమను రక్షించుకొనే ప్రయత్నం చేసేదట. ఇది ఈనాటి వైర్లెస్ పద్ధతి అని చెప్పవచ్చును. ఈ పద్ధతి మొదట కాకతీయుల రాజధాని ఓరుగల్లు కోటలో ఉండేదట. ఆ సాంకేతిక నైపుణ్యాన్ని గోల్కొండ నవాబులు సంగ్రహించి తమ కోట ద్వారం దగ్గర ఏర్పాటు చేసుకున్నారు.

దర్బారు హాలు పైకప్పు ఎక్కిచూస్తే గోల్కొండ చుట్టూ నాలుగు వైపులా కొన్ని మైళ్ల దూరం కనిపిస్తుంది. అంతేగాక పైన చల్లనిగాలి వీస్తుంది. కుతుబ్‌షాహి సుల్తాన్‌లు, వారి రాణులు భవనంపై కూర్చొని చల్లని గాలులను అనుభవిస్తూ నగర పరిసరాలను వీక్షిస్తుండేవారు. చివరి కుతుబ్‌షా అయిన తానీషా ఈ భవనంపైనే కూర్చొని మొగలులతో జరిగిన చివరి యుద్ధాన్ని తిలకించాడట. ఈ విధంగా మూడు కోటలు ఒకదానిలో ఒకటి నిర్మింపబడ్డాయి.

రాజప్రాసాదాలు-దివాని-ఇ-ఆమ్-గోల్కొండ కోటలోని నాల్గవ భాగం: ఈ భవనం నుండి రెండవ వైపు కిందికి దిగితే రాజప్రాసాదాల శిథిలాలున్నాయి. అక్కడి రాజభవనాలు చాలా విశాలమైన ప్రాంగణాలతో (Court Yard) మందమైన గోడలతో అందమైన Lofty ఆర్చీలతో గంభీరంగా కనిపిస్తాయి. కొండపై నుండి రాజ భవనంలోకి మెట్లు ఉన్నాయి. ఆ భవనాన్ని కాపలా కాయదానికి, రక్షకభటులు ఉండటానికి చుట్టూ సైనిక నిర్మాణాలున్నాయి. రాణులు నివసించే భవన ప్రాంగణాలలో అందమైన నీటి కొలనులు Cisterns ఉన్నాయి. రాణుల భవనాన్ని జనానా అని పిలిచేవారు. వాటి కాపలాకు హబ్షీలనే ప్రత్యేక రక్షక భటులుండేవారు. రాజ భవనానికి కొద్ది దూరంలో దర్బారు హాలు ఉంది. దీనినే దివాని ఐ ఆమ్ అని పిలిచేవారు. ఈ భవనంలో అవసరాలను బట్టి వివిధ కాలాలలో వివిధ రకాల కట్టడాలు నిర్మింపబడ్డాయి. ఈ దివానీ ఐ ఆమ్‌కు ఒకవైపున ఒక పెద్ద ప్లాట్ ఫారం ఉంది. అక్కడ సుల్తాన్ ముఖ్యమైన సరదారులతో ముఖ్య విషయాలు చర్చించేవాడట. ఈ భవనానికి ఒక మూలలో ఒక గుండ్రని వాకిలి ఉంది. ఇది ఘోషామహల్‌కు వెళ్లేమార్గం అని అంటారు. ఘోషామహల్ అక్కడి నుండి 10 కిలో మీటర్ల దూరంలో ఉంది. కులీకుతుబ్‌షా కాలంలో ముష్కమహల్ అనే భవనాన్ని నిర్మించాడట. దాని పునాదులు వేసేటప్పుడు సుగంధ ద్రవ్యాలు వేయించి నిర్మించాడట.

ఈ విధంగా గోల్కొండ కోట అతి పటిష్ఠంగా నిర్మింపబడింది. కనుకనే ఆరితేరిన మొగల్ సైన్యం ముందు 8 నెలలపాటు నిలబడింది. వారు ఫిరంగులు, తుపాకీమందు పెట్టి పేల్చినా కోటగోడలు కదలలేదు. కనుక చివరకు మోసంతో గేటు కాపలాదారునికి లంచం ఇచ్చి తలుపులు తెరిపించి రాత్రికి రాత్రి లోపలికి చొరబడ్డారు.

ఇబ్రహీం కుతుబ్‌షాహీ కాలంలో గోల్కొండ పట్టణం 7 మైళ్ల వైశాల్యంతో 50 వేల ఇళ్లు, 2 లక్షల జనాభాతో ఉండేదట. ఈ పట్టణ నిర్మాణం అఫ్జల్‌ఖాన్ అనే అతని పర్యవేక్షణలో జరిగింది. నిర్మాణానికి 78 లక్షల హొన్నులు ఖర్చు అయిందని తెలుస్తోంది. గోల్కొండ మూడు విభాగాలుగా ఉండేది. మొదటి విభాగంలో సాధారణ ప్రజలు, వర్తకులు నివసించేవారు. రెండవ విభాగంలో రాచనగరు, మూడవ విభాగం కొండ శిఖరాన ఉన్న రాజమహల్ విభాగం. వీధులను మొహల్లాలు అనేవారు. రాచమొహల్లా, పంచమొహల్లా, మీర్జుమ్లా మొహల్లా, మాదన్న మొహల్లాలని అనేవారు. కొన్ని ప్రాంతాలను కమాన్‌లు అని పిలిచేవారు. హర్షీకమామ్, మచిలీకమాన్ అని పిలిచేవారు. కొన్ని ప్రాంతాలను కటోరాహౌజ్, గుల్జార్‌హౌజ్ అని పిలిచేవారు. గోల్కొండ కోటలో తూర్పు భాగాన సాధారణ ప్రజల గృహాలు, పశ్చిమ భాగాన రాజభవనాలు ఉండేవి.

గోల్కొండ పట్టణంలో అనేక మసీదులు, ధర్మశాలలు, భిక్షుగృహాలు, పాఠశాలలు, విశ్రాంతి భవనాలు, వైద్యశాలలు, యాత్రికులకు విడిది గృహాలు, గుంభజులుండేవి. ఈ గుంభజుల గోడలపై రంగురంగుల పక్షుల చిత్రాలు చిత్రింపబడ్డాయి. గోల్కొండ పట్టణానికి కొంతకాలం ఖాసింబేగ్ అనే అతడు కొత్వాలుగా పనిచేశాడు. గోల్కొండలో ఇరాన్, ఇరాక్, అరబ్బు, టర్కీ మొదలైన విదేశీ ముస్లింలు వచ్చి నివసించేవారు. నగరాలు ప్రాగించేవారు, చిత్రకారులు, వాస్తుశిల్పులు, గణితశాస్త్ర పారంగతులు, శిల్పులు, నాట్యకత్తెలు, జ్యోతిష పండితులు, కవులు అన్నివర్గాల ప్రజలు ఉండేవారు. గోల్కొండ కోట నేడు పురావస్తు శాఖవారి ఆధీనంలో ఉంది.

కుతుబ్‌షాహీల సమాధులు లేక టూంబులు: కుతుబ్‌షాహీ నిర్మాణంలో అద్భుతమైనవి వారి సమాధులు. శతాబ్దాలుగా ప్రకృతి విలయాలకు తట్టుకొని నేటికీ చెక్కుచెదరకుండా నిలిచి ఉన్న ఈ సమాధులు కుతుబ్‌షాహీల నిర్మాణ చాతుర్యానికి నిదర్శనాలు. ఈ సమాధులు గోల్కొండ కోటకు ఉత్తరాన ఒక కిలోమీటర్ దూరంలో ఉన్నాయి. కోటలోని బంజారా దర్వాజా ద్వారా ఈ సమాధుల వద్దకు వెళ్లవచ్చును. హైదరాబాద్ నుండి వెళ్లాలంటే సైఫాబాద్ లేక మల్లేపల్లి నుండి వెళ్లాలి. ఈ సమాధులు విశాలమైన ఎత్తయిన వేదికల మీద నిర్మింపబడ్డాయి. అవి ఎంతో ఎత్తుగా, ఎంతో గాంభీర్యంగా, హుందాగా కనిపిస్తూ చూపరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కుతుబ్‌షాహీల సమాధులు, ఇతర కట్టడాలు బీజాపూరు, బీదరు, గుల్బర్గా మొదలైన ప్రదేశాలలోని ఇతర దక్కన్ సుల్తానుల నిర్మాణాలకు భిన్నంగా కనిపిస్తాయి. వీటి నిర్మాణాలు పర్షియా, పఠాన్, హిందూ శైలుల మిశ్రమంగా రూపొందింపబడ్డాయి. షారూకొ అనే అతడు Homogeneous Development లేదని, proportionate గా లేవని, ఈ సమాధులు చాలా పెద్దవని తెలిపాడు. stylobates and minarates are stunted. కాని Plinth నుండి Top వరకు Perfect Harmony ఉంది. అతి విశాలమైన quadrangular terrace ఉంది. అన్నివైపులా మెట్లున్నాయి. Arcades అన్నివైపులా ఉన్నాయి. Pointed ఆర్చీలు కట్టడానికి మంచి అందాన్ని తీసుకువచ్చాయి. సమాధులలోని ప్రధాన కట్టడం కూడా Quadrangular గా ఉండి టెర్రాసుల మీద 9-15 మీటర్లు above the

terrace over the arcades and are surmounted by balustrades with beautiful minarates.

ఈ సమాధుల నిర్మాణం గ్రే గ్రానైట్‌తో నిర్మించారు. అవసరమైనచో stucco decoration చేశారు. ప్రతి సమాధికి adjunct గా ఒక మసీదు ఉన్నది which gives sanctity or sanctuary. ఈ కాంప్లెక్సులో మొత్తం 30 ఉన్నాయి. అందులో కొన్ని Open air Tombs అవి రాజవంశం వారివి కాదు, వారి సరదారుల సమాధులు. ఈ సమాధులు 7గురు కుతుబ్‌షా సుల్తాన్‌లవి. హయత్‌భక్షి భేగం సమాధి అతి ముఖ్యమైనది. ఈ టూంబ్‌లకు మినరేట్లు లేకపోవడం ఒక విశేషం. ఔరంగజేబు గోల్కొండ కోటను ఆక్రమించిన తర్వాత ఈ సమాధి భవనాలను మొగల్ సర్దారులు వారి విడుదులుగా ఉపయోగించారు.

కులీకుతుబ్‌షా సమాధి: గోల్కొండ సుల్తాన్‌లలో మొదటివాడైన కులీకుతుబ్‌షా సమాధి సాధారణంగా ఉంది. ఈ సమాధి కులీ జీవిత కాలంలోనే నిర్మింపబడింది. ఈ సమాధి మహమ్మద్ కులీ సమాధికి వాయువ్యంగా ఉంది. ఇది మిగిలిన కుతుబ్‌షా సమాధుల కంటే కొంచెం భిన్నంగా ఉంది. ఇందులో బీదర్‌లోని బహమనీ సుల్తాన్‌ల శైలికి దగ్గరగా ఉంది. ఇది symmetrical proportions తోను simplicity of designs లతో ఉంది. 30-5 చదరపు మీటర్ల వేదికపై 9.5 మీటర్ల నలు చదరపు ఆకారంలో నిర్మింపబడింది. లోపల Octogonal హాలుగా తీర్చిదిద్దబడింది. Outer elevation is quardangular in plan with walls raising to 6 meters high crowned by a doom which soares another 6 meters కప్పు యొక్క నాలుగు మూలలు Four bouquets తో అందంగా అలంకరింపబడ్డాయి. which is the reminiscent of the style of the బహమనీ ఆర్కిటెక్చర్ షా బీదర్ కులీ 2 సెప్టెంబర్, 1543లో మరణించాడు.

జంషీద్ కుతుబ్‌షా సమాధి: జంషీద్ తన తండ్రి సమాధికి నైరుతి దిక్కులో తన సమాధిని తానే నిర్మించుకున్నాడు. ఇది చాలా అందమైన కట్టడం though not massive as his successors but delectable proportions. ఈ Octogonal plan ఎత్తయిన ప్లాట్ ఫారం మీద నిర్మించబడింది. ఈ సమాధి రెండంతస్థుల కట్టడం లాగా కనిపిస్తుంది. కాని రెండు అంతస్థులు లేవు. అలా కనపడే విధంగా కట్టడానికి మధ్యలో బ్రాకెట్లు కూర్చి వాటిపై బయటకు ఒక బాల్కనీని నిర్మించారు. బాల్కనీ మొదటి అంతస్థు కప్పు లాగా కనిపించి సమాధి రెండు అంతస్థుల నిర్మాణమనే భావం కలిగిస్తుంది. పైన మరొక బాల్కనీ కూడా నిర్మించబడింది. అది రెండవ అంతస్థు కప్పు లాగా కనిపిస్తుంది. ఆ బాల్కనీ మీద అన్ని మూలల్లో మినరేట్లు నిర్మించబడ్డాయి. కాని ఆ మినరేట్లు డోమును దాటలేదు. చాలా చిన్నవి. ప్రతి వాకిలికి Pointed ఆర్చి ఉంది. ప్రతి ద్వారా rectangular ఆకారంలో ఉన్న ఫ్రేములో బిగించినట్లుంది. పై అంతస్తులోని వాకిళ్లకు ఉన్న ఆర్చీలు చిన్నవి. కప్పును Hemipherical dome ఆకారంలో పుష్పగుచ్ఛంలో అమర్చినట్లు నిర్మించారు. గుమ్మటంపైన 4.5 మీటర్ల ఎత్తున్న సన్నని కొసగలిగిన రాగి Finial అమర్చబడింది. జంషీద్ 22 జనవరి 1550లో మరణించాడు.

ఇబ్రహీం కులీ కుతుబ్‌షా సమాధి: నాల్గవ కుతుబ్‌షా అయిన ఇబ్రహీం కుతుబ్‌షా సమాధి Quadrangual గా నిర్మింపబడింది. నాలుగు వైపులా గోడలకు రెండు వరుసలు గల ఆర్చీలు నిర్మింపబడ్డాయి. ఒక్కొక్క వరసలో ఐదు ఆర్చీలున్నాయి. అంటే ఐదు ఆర్చీల వరుస మీద మరొక ఐదు ఆర్చీల వరుస నిర్మింపబడింది. రెండు వరుసలలో మొత్తం 10 ఆర్చీలుంటాయి. ఆ విధంగా నాలుగువైపులా 40 ఆర్చీలతో ఈ సమాధి నిర్మింపబడింది. ఇలా ఆర్చీలు నిర్మించినందువల్ల ఈ సమాధి కూడా రెండంతస్థుల కట్టడం లాగా కనిపిస్తుంది. Each face is topped by a balustrade interspersed with miniature arches at the four corners. This is one of the structures that show traces of enamel of various hues. లోపల Plan 9 5 meters చతురస్రాకారం అడుగు అంటే base 9.5 మీటర్ల చతురస్రాకారపు ఆకారంలో నిర్మింపబడింది. కాని నాలుగు మూలలలో నాలుగు ఆర్చీలు నిర్మించినందున అది Octagonal నిర్మాణంగా కనిపిస్తుంది. దానికి కొద్దిగా పైన అది it become 16 sided by the contrivance of overlaping arches. బయట రంగురంగుల enanamelled tiles తో తాపడం చేశారు. కాని అవి అన్నీ పోయాయి. కాని కొన్ని ఎనామిల్ tiles పై ఆర్చీలలో దక్షిణ ముఖంగా ఉన్న రెండు ఆర్చీల మీద ఉన్నాయి. అవి నేడు కూడా మంచి స్థితిలో ఉండి మెరుస్తున్నాయి. ఇబ్రహీం కులీ 5 జూన్ 1580లో మరణించాడు.

మహమ్మద్ కులీకుతుబ్‌షా: ఐదవ కుతుబ్‌షా అయిన మహమ్మద్ కులీకుతుబ్‌షా సమాధి మొదటిసారిగా Massive scale మీద నిర్మింపబడింది. ఇది ఈ సమాధులలో అన్నింటికంటే అతి పెద్దది. అతి సుందరమైంది.

ఇది 42.5 మీటర్ల ఎత్తు ఉంది. గుమ్మటం 18.2 మీటర్ల ఎత్తు ఉంది. ఇది అతి పెద్ద కట్టడం. కనుక దీని నిర్మించిన శిల్పి భూమి మీద నుండి 6 మీటర్ల ఎత్తున రెండు Terrace లను నిర్మించాడు. కింది Terrace 60 8 మీటర్ల నలుచదరపు కట్టడం. దానికి నాలుగు వైపులా 28 ఆర్చీలు సపోర్టుగా ఉన్నాయి. పై Terrace 38.3 మీటర్ల నలు చదరపు నిర్మాణం. ఇప్పటి వరకు నిర్మించిన సమాధులు నలుచదరంగా గాని లేక Octagonalగా గాని హాలును కట్టి దానిపై గుమ్మటం నిర్మించేవారు. కాని ఈ విధానం అతి పెద్ద నిర్మాణాలకు పనికిరాదు. Large domicile నిర్మాణాలకు పనికిరాదు. This tomb is designed as a picturersque gallery with false openings with two central pillars supporting horizontal lintels on the four exterior sides of the hall in order to make the base symmetrical to its otherwise leavey dome. పుష్పకిరీటాలు గల (lotus capitals) Octagonal స్తంభాల మీద కుప్ప వేయబడింది. In order to relieve monotony rich ornamental parapets with minarats at the corners are added.

In the crypt in the midst of the lower plinth at the level of the land surface లో శవం ఖననం చేయబడింది. Tumulus of black stone తో సమాధి cover చేయబడింది. While the shadow tomb is inside the pompous and majestic surroundings at the higher floor level. సుల్తాన్ మహమ్మద్ కులీ 1 జనవరి, 1612న మరణించాడు. ఇతడే హైదరాబాద్ నిర్మాత. ఈ సమాధిపై 'షా' అనే సార్వభౌమాధికారం గల బిరుదు రాయించాడు.

మహమ్మద్ కుతుబ్‌షా సమాధి: ఆరవ కుతుబ్‌షా, ఐదవ కుతుబ్‌షా అయిన సుల్తాన్ మహమ్మద్ కులీకి అల్లుడు. ఈ సమాధి లోపల అతని సమాధితో పాటు మరొక ఆరు సమాధులున్నాయి. వాటిలో మూడు పెద్దవి, మూడు చిన్నవి. అవి అతని కుమారులు, కుమార్తెలవి. అంతకు ముందు నిర్మించిన సమాధులకు, ఈ టూంబకు ప్లానులోను, ఆర్కిటెక్చర్ పరంగా కొద్ది తేడా ఉంది. ఈ కట్టడంలో స్తంభాలు లింటెల్ openings ని తొలగించి వాటి స్థానంలో ఆర్చీలను ప్రవేశపెట్టారు. అంతేగాక అందంగా కనబడటానికి ప్రధాన హాలు యొక్క కప్పుకన్నా ఆర్చీల గాలరీని కిందికి దించారు. ఈ టూంబ్ ముందు భాగానికి ఎనామిల్ టైల్స్ అమర్చారు. అవి నేటికీ కనిపిస్తున్నాయి. ఈ టూంబులోని ప్రధాన ఆకర్షణ lies in Tone and air in association in delicacy and ingenuity of detail. మహమ్మద్ కుతుబ్‌షా 31 జనవరి, 1626లో మరణించాడు.

హయత్ భక్షిబేగం టూంబ్: హయత్ భక్షిబేగం మాసోలియం కుతుబ్‌షాల సమాధుల కాంప్లెక్స్ ద్వారానికి కొన్ని మీటర్ల దూరంలో కుడివైపున ఉంది. ఈమె హైదరాబాద్ నిర్మాత అయిన ఐదవ కుతుబ్‌షా అయిన సుల్తాన్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా కుమార్తె. ఆరవ సుల్తాన్ అయిన మహమ్మద్ కుతుబ్‌షా భార్య. ఏడవ సుల్తాన్ అయిన అబ్దుల్లా కుతుబ్‌షా తల్లి. ఈమె దాదాపు 80 సంవత్సరాలు జీవించి 1664లో మరణించింది. ఈమె టూంబ్ చాలా అందంగా నిర్మింపబడింది. ఇది Rectangular stone cistern దీని ముందు ఒక ఫౌంటేన్ కూడా ఉంది. దీనికి ఎడమ పక్కన ఒక చిన్న మసీదు ఉంది. ఇది కూడా ఈ టూంబ్ నిర్మించినప్పుడే నిర్మించబడింది. ఔరంగజేబు గోల్కొండ కోటపై దాడి చేసినప్పుడు అతడు ఈ మసీదులోనే నమాజు చేశాడట. 1.8 మీటర్ల ఎత్తు కలిగిన విశాలమైన వేదిక మీద ఈ టూంబ్ నిర్మించబడింది. వేదిక మీదకు ఎక్కడానికి మెట్లు ఉన్నాయి. ఈ వేదిక మీద నాలుగు వైపులా ఏడు pointed ఆర్చీలు కలిగిన carridors ని నిర్మించారు. ఈ కారిడార్ నుండి ప్రధాన కట్టడం వద్దకు వెళ్లాలి. ప్రధాన కట్టడం quadrangular హాలు. దాని నాలుగు వైపుల ఐదు చొప్పున false ఆర్చీలను ఏర్పాటు చేశారు. దాని మీద ఒక చిన్న పారాపిట్ గోడ నిర్మింపబడింది. ఆ పారాపిట్‌లో ఒక్కోవైపు ఆరు చిన్న మినరేట్లు కూడా నిర్మింపబడ్డాయి. దాని మీద పుష్పగుచ్ఛంలో ఉన్నట్లు semi circular dome అందంగా కట్టబడింది. గుమ్మటం పైన సన్నని కొనగలిగిన రాగి finial ఆకాశం వైపు చూస్తున్నట్లు అమర్చబడింది. కారిడార్ 30 మీటర్ల స్క్వేర్‌లో ఉంది. కట్టడం 19 మీటర్ల చతురస్రాకారంలో ఉంది. డోమ్ కారిడార్‌లు బాగా మలిచిన పెద్ద గ్రానైట్ బండలతో కట్టబడ్డాయి. బండల మధ్య గచ్చు ప్లాస్టరు లాగా వాడబడ్డాయి. ద్వార బంధాలు కూడా పాలిష్ చేసిన నల్లని బసాలత్ రాళ్లతో నిర్మించబడింది. వాటి మీద surmounted architrves ఉన్నాయి. గుమ్మటం Arcade తో సహా 15 మీటర్ల ఎత్తు ఉంది. ఈ టూంబ్‌కు వాయువ్యంగా ఒక మసీదు ఉంది. ఈ మసీదు మీద గచ్చుతో అందమైన చిత్రాలను చిత్రించారు. with enturning creepers and rossettes. ఇందులో ఒక creeper మీద ఒక squirrel ను చిత్రించారు. ఇది చూడటానికి చాలా బాగుంటుంది. ఇస్లామిక్ వాస్తు లక్షణా

ప్రకారం జీవించిన ప్రాణుల చిత్రాలు చిత్రించరాదు ఈ టూంబులో చిత్రాలు చిత్రించడం ఒక ప్రత్యేకత. ఇది Reminiscent of Persian influence

బౌద్ధయుగం నుండి Stucco ను కట్టడాలలో వాడే సాంప్రదాయం ఉంది క్రీ.శ.3-4 శతాబ్దాల నుండి Stucco చిత్రాలు కనిపిస్తున్నాయి. దేవాలయాలు, రాజభవనాలు అందంగా కనిపించడానికి Stucco ను వాడేవారు. కాల్చిన లేక పచ్చి ఇటుకలతో కట్టిన గోడలు రఫ్‌గా ఉంటాయి అందంగా ఉండవు. కనుక దాని మీద Stucco తో డిజైన్లు చిత్రించేవారు. కుతుబ్‌షాహీలు కూడా ఈ పద్ధతి ప్రభావానికిలోనై తమ టూంబులపైన మిగతా కట్టడాలతో హిందూ శైలిని ప్రవేశపెట్టారు.

ముస్లిం సమాజంలో ఒక స్త్రీకి ఇంత పెద్ద టూంబ్‌ను నిర్మించడం చాలా అరుదు. దీనిని బట్టి హయత్ భక్షీబేగం గోల్కొండ రాజకీయాలలో గొప్ప పాత్రను నిర్వహించిందని చెప్పవచ్చును. ఆమె తన భర్త మహమ్మద్ కుతుబ్‌షా, కుమారుడు అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో రాజకీయాలలో పాల్గొంది. అనేక కీలక నిర్ణయాలు తీసుకుంది. కుమారుడు అబ్దుల్లాకు అనేకసార్లు మంచి సలహాలు ఇచ్చింది. ప్రజలను ఆదరించి వారి మంచి చెడ్డలు చూసేది. ఆమెను ఆ కాలంలో ప్రజలు మాసాహెబా అని పిలుచుకొనేవారట. అందువల్ల ఆమె గౌరవార్థం అంత పెద్ద టూంబ్ నిర్మించబడింది.

అబ్దుల్లా కుతుబ్‌షా టూంబ్: ఏడవ కుతుబ్‌షా అయిన అబ్దుల్లా కులీ కుతుబ్‌షా సమాధి కాంప్లెక్స్ బయట గోల్కొండ కోటవైపు ఉంది. ఈ సమాధి కూడా తన పూర్వీకుల సమాధులలాగే నిర్మింపబడింది. అయితే నిర్మాణంలో కొంత పరిణతి కనిపిస్తుంది. అతని తండ్రి, తల్లి సమాధులకన్నా పరిమాణంలో పెద్దది. నల్లని గ్రానైట్ రాతితో నిర్మింపబడింది. with five decreasing plinths all inscribed with ayats of the holy Quran. ఈ ఐదు ప్లింతులు ఐదుసార్లు నమాజు చేయాలి అని చెప్పే ఖురాన్ సూక్తికి నిదర్శనం. గుమ్మటం మీద అమర్చే ఫినియల్ చివరి నమాజుకు చిహ్నం అట. ఈ సమాధికి 82 మీటర్ల ప్లాట్‌ఫాం నిర్మించబడింది. దాని మీద నాలుగు వైపులా 7 పాయింటెడ్ ఆర్చీలు గల వరండా నిర్మింపబడింది పూర్వపు సమాధుల లాగే ప్రధాన కట్టడం quadrangular గా ఐదు false ఆర్చీలతో నిర్మింపబడింది. దాని మీద Balustrades interfected by finials దాని మీద పుష్పగుచ్ఛంలో ఉన్నట్లు గుమ్మటం నిర్మింపబడింది. డోము మీద ఆకాశంలోకి చొచ్చుకొని పోయినట్లు తామ్ర finial అమర్చబడింది. సన్నని మొనదేలిన finial ఈ దేవుని ఏకత్వానికి చిహ్నమట

అబుల్‌హసన్ తానీషా టూంబ్: కుతుబ్‌షాహీ వంశంలో చివరివాడైన తానీషా తన కోసం టూంబ్ నిర్మాణాన్ని ప్రారంభించాడు. కాని అది పూర్తి కాకుండానే అతడు క్రీ.శ.1687లో గోల్కొండ యుద్ధంలో ఓడిపోయాడు. ఔరంగజేబు అతనిని దౌలతాబాద్ కోటకు బందీగా పంపాడు. అతడు అక్కడ క్రీ.శ 1700 సంవత్సరంలో మరణించాడు. దౌలతాబాద్ నుండి ఔరంగాబాద్‌కు వచ్చే మార్గంలో రోజా అనే ప్రదేశంలో సమాధి చేయబడ్డాడు. అక్కడ అతనికి ఒక చిన్న సమాధి నిర్మింపబడింది. ఇక్కడ కుతుబ్‌షాహీల సమాధుల కాంప్లెక్స్ ప్రధాన గేటుకు ఎడమవైపు అసంపూర్ణంగా నిలిచి ఉన్న అతని సమాధి ఉంది. దానికి కింది వేదిక దాని మీద వరండా మధ్యలో ప్రధాన కట్టడం. దానికి నాలుగువైపులా మూడు చొప్పున false ఆర్చీలు, దానిపైన కప్పు మూయని గుమ్మటం నిర్మింపబడి ఉన్నాయి.

కుల్సూమ్ బేగం టూంబ్: కాంప్లెక్స్ లోపలనే మహమ్మద్ కులీ కుతుబ్‌షా సమాధికి పశ్చిమంగా మరొక టూంబ్ ఉంది. ఈ కట్టడం లోపల రెండు పెద్ద సమాధులు ఉన్నాయి. కాని వాటి పేర్లు లేవు. అందులో ఒక సమాధిని భాగమతి సమాధి అని భావిస్తారు. ఆమె మహమ్మద్ కులీ కుతుబ్‌షా ప్రియురాలు, భార్య. ఆమె పేరుతోనే అతడు హైదరాబాద్‌ను నిర్మించాడని కథ ప్రచారంలో ఉంది. రెండవ సమాధి ఎవరిదో తెలియదు. ఈ టూంబును కుల్సూం బేగం సమాధి అని పిలుస్తున్నారు.

ఇతర టూంబులు: ఇంకా కుతుబ్‌షాల సర్దారుల టూంబులు కూడా ఉన్నాయి. రాజ్యస్థాపకుడైన కులీ కుతుబ్‌షా సమాధి వద్ద రాజబంధువులు, ఇతర సరదారులకు చెందిన 21 సమాధులున్నాయి. ఇబ్రహీం కుతుబ్‌షా సమాధి వద్ద అలాంటివే 16 సమాధులున్నాయి. వాటిలో ప్రేమావతి, తారామతి అనేవారి సమాధులున్నాయని అంటారు. ఇబ్రహీం సమాధి వద్దనే నెక్నౌ అనే సరదారుని సమాధి ఉంది. అతడు 30-3-1673లో మరణించినట్లు ఆ సమాధిపై శాసనం ఉంది. ఖురాన్ చదవడానికి, దీపాలు వెలిగించడానికి మంగళారం అనే గ్రామం పైన వచ్చే ఆదాయాన్ని కేటాయించారట. ఈ సమాధులను దర్శించే వారికి భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేసేవారని

టావెర్నియర్ రాశాడు.

మార్చురి: ఈ సమాధుల వద్ద ఒక మార్చురి అనే ఒక కట్టడం ఉంది. అది ఒక గుండ్రని వేదిక. అది మరణించిన సుల్తాన్‌లు, పేరు మోసిన సరదారుల మృతకళేబరాలను అక్కడికి తీసుకువచ్చి అక్కడ చివరిసారిగా స్నానం చేయిస్తారు. తర్వాత ఆ శరీరాన్ని ఆ గుండ్రని ప్లాట్‌ఫారంపై ఉంచి ఖనన సంస్కారాలన్నీ పూర్తి చేస్తారు. అక్కడ పైపులైన్ల ద్వారా వేడి నీరు, చల్లని నీరు వచ్చే ఏర్పాట్లు షారొకో అనే అతడు అక్కడ చివరిసారిగా ప్రార్థనలు జరుగుతాయని రాశాడు. అన్నీ పూర్తి అయిన తర్వాత సుల్తాన్ మృతకళేబరాన్ని అతని కోసం నిర్మించిన టూంబ్‌లో ఖననం చేస్తారు. ఈ కట్టడం కూడా ఆర్చీలలోనే నిర్మించబడింది.

టోలీ మసీద్: కుతుబ్‌షాల కాలం నాటి కట్టడాలలో చెప్పుకోదగిన మరొకటి టోల్ మసీదు. ఈ మసీదు అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో క్రీ.శ.1671లో మూసాఖాన్ అనే వ్యక్తి చేత నిర్మింపబడింది. మసీదులోని ప్రార్థనా గూడు దగ్గర ఉన్న శాసనంలో మూసాఖాన్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో క్రీ.శ.1671లో ఈ మసీదును నిర్మించాడని రాసి ఉంది. ముసాఖాన్ అబ్దుల్లా కుతుబ్‌షా వద్ద మంత్రిగా పని చేశాడు. గోల్కొండ కోటలోని మూసా బురుజును కూడా ఇతడే నిర్మించాడట. గుల్జార్ ఇ అసాఫియా అనే గ్రంథంలో మూసాఖాన్ ఏ విధంగా టోల్ మసీదును నిర్మించిందీ వివరించబడింది. మూసాఖాన్ హైదరాబాద్‌లోని మక్కామసీదు నిర్మించినప్పుడు దాని పర్యవేక్షకునిగా నియమింపబడ్డాడు. అప్పుడు అక్కడ ఖర్చు పెట్టే డబ్బులో రూపాయికి దమ్రి, తెలుగులో దమ్మిడి కమీషన్‌గా తీసుకోవచ్చుని సుల్తాన్ అంగీకరించాడట. అలా మక్కామసీదు నిర్మాణ కాలంలో తాను సంపాదించిన ఆ డబ్బుతో అతడు ఈ టోల్ మసీదును నిర్మించాడట. అందువల్ల ఈ మసీదుకు దుమ్మిడీ మసీదు అని కూడా పేరుందని ఆ గ్రంథం తెలుపుతోంది. పర్షియన్ భాషలో దమ్మిడీని టోలీ అని అంటారు. అందువల్ల ఈ మసీదుకు టోల్ మసీదు అనే పేరు వచ్చింది. అబ్దుల్లా తర్వాత అబుల్ హసన్ సింహాసనం అధిష్టించడంలో కూడా మూసాఖాన్ తన వంతు సహాయం చేశాడు.

టోలీ మసీదు గోల్కొండ నుండి హైదరాబాద్ వచ్చే మార్గంలో కార్వాన్ ప్రాంతంలో ఉంది. గోల్కొండ కోటకు ఆగ్నేయంగా కార్వాన్ ఉంది. ఈ మార్గం గుండానే సుల్తాన్‌లు గోల్కొండ కోట నుండి హైదరాబాద్ వెళ్తుండేవారు. ఈ మార్గం పక్కనే మూసాఖాన్ టోలీ మసీదును నిర్మించాడు. ఈ మసీదు రెండు హాలులుగా విభజింపబడి ఉంది. ఈ హాలులను దలన్లు అని కూడా అంటారు. ముందు దలన్‌కు ఐదు ఆర్చీల openings ఉన్నాయి. లోపలి దలన్‌కు మూడు ఆర్చీలు మాత్రమే ఉన్నాయి. ముందు భాగంలో రెండు మూలలా రెండు మినరేట్లు నిర్మించబడ్డాయి. అవి 20 మీటర్ల ఎత్తున్నాయి. ఈ మినరేట్లు అడుగు భాగం కుండ ఆకారంలో తీర్చిదిద్దబడ్డాయి. ఆ కుండపై నుండి shafts octagonal ఆకారంలో ఉండి వానిపైన Lotus తలాటాలు అంటే capitals ఉన్నాయి. లోటస్‌ల పైభాగం నుండి ఈ మినరేట్లు Moulded shape లో diminutive balustrades ల నిర్మాణంతో ఉండి వాటిపైన గుమ్మటాలు ఉన్నాయి. గుమ్మటాలపైన ఫినియల్స్ అమర్చబడ్డాయి. ఈ స్తంభాలలోని అడుగున అనుసరించిన కుంభక లేక కుండ పద్ధతి హిందువుల నిర్మాణశైలి. బౌద్ధులు కూడా కుంభకాన్ని చిత్రిస్తారు. కనుక టోలీ మసీదులో హిందూ ముస్లిం శైలులు మిళితం చేయబడ్డాయి. మసీదు మీద పారాపిట్ గోడ ఆర్చీలలో నిర్మించబడింది. ఈ ఆర్చీలన్నీ రకరకాల డిజైన్లు గల స్క్రీన్లు రూపొందించబడ్డాయి. కుతుబ్‌షాహీల కాలం నాటి అందమైన మసీదులలో ఇది ఒకటి. హిందూ ముస్లిం సంస్కృతుల సమ్మేళనానికి ఇది చక్కటి నిదర్శనం.

కాసారం: ఈ మసీదు వద్ద మరొక ప్రత్యేకత ఉంది. ఈ మసీదు మొత్తం నీటిలో కనిపించే విధంగా మసీదు ముందు ఒక కాసారాన్ని నిర్మించారు. ఆ నీటిలో మసీదు మొత్తం కనిపిస్తుంది. ఆ దృశ్యం చూపరులకు అమిత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఆ రోజులలో ఇరాన్, టర్కీ దేశాల నుంచి బంగారం, వజ్రాల వ్యాపారం చేసేవారు. గోల్కొండ కోటకు వచ్చే మార్గంలో ఉన్న ఈ మసీదు నీడన సేద తీరే వారట. ఈ మసీదు లోపలా, బయటా వేసిన రంగులు నేటికీ చెక్కు చెదరలేదు. ఈ మసీదులో ఖురాన్ సూక్తులు పర్షియా భాషలో రాశారు. కొందరు ఇది చార్మినార్ అంతటి ప్రసిద్ధ కట్టడమని అంటారు.

హైదరాబాద్ నగర నిర్మాణం - వాస్తువు: క్రీ.శ.1591వ సంవత్సరంలో ఐదవ కుతుబ్‌షా మహమ్మద్ కులీ కుతుబ్‌షా హైదరాబాద్ పట్టణాన్ని నిర్మించి తన రాజధానిగా చేసుకొన్నాడు. కనుక క్రీ.శ.1591వ సంవత్సరం నుండి హైదరాబాద్ నగరాన్ని మహ్మద్ కులీకుతుబ్‌షా తన ముద్దుల భార్య భాగ్యమతి పేరుతో భాగ్యనగర్ అనే

పేరుతో నిర్మించాడని ఒక కథ ప్రచారంలో ఉంది. అతడు యవ్వనంలో ఉండగా భాగ్యమతి అనే ఒక హిందూ స్త్రీని ప్రేమించాడట. ఆమె మూసీనదికి తూర్పు వైపున నివసించేదట. ఆమెను కలుసుకోడానికి రోజూ వెళ్లేవాడట. ఒక రోజున అతడు మూసీనది వద్దకు రాగా కుండపోతగా వర్షం పడుతూ మూసీనది ఉధృతంగా ప్రవహిస్తోంది. అయినప్పటికీ లెక్క చేయకుండా తన గుర్రంతో నదిలో దిగాడట. కాని ప్రవాహంలో గుర్రం మీద నుంచి పడిపోయాడట. అయినా లేచి ఈదుకుంటూ అవతల ఒడ్డుకు చేరి తన ప్రియురాలిని కలుసుకున్నాడట. తర్వాత ఈ విషయం అతని తండ్రి ఇబ్రహీం కుతుబ్‌షాకు తెలిసి తన కుమారుని శ్రేయస్సు కోసం ఆ నదిపై వంతెనను నిర్మించాడట. అదే పురాన్‌పూల్ వంతెన అని చెబుతారు. ఈ కథలోని వాస్తవమేమోగాని క్రీ.శ.1578వ సంవత్సరంలో ఇబ్రహీం కుతుబ్‌షా మూసీనదిపై పురాన్‌పూల్ అని పిలువబడే బ్రిడ్జిని నిర్మించడం మాత్రం వాస్తవం. ఈ వారధి నిర్మాణానికి 250000 హొన్నులు ఖర్చు అయిందట. ఈ బ్రిడ్జి నిర్మాణంతోనే హైదరాబాద్ నగర నిర్మాణానికి పునాది వేయబడింది. గోల్కొండ పట్టణంలో రద్దీ పెరిగింది. విదేశాల నుండి వచ్చే ముస్లిం సరదారులు, ముస్లిం వ్యాపారులు, రాజ్యంలోని సామంతులు, జాగీరుదార్లు, రాజధానిలో నివసించడంతో గోల్కొండ జనాభా విపరీతంగా పెరగసాగింది. కాని గోల్కొండ గుట్టల ప్రాంతం, నీటి సదుపాయం లేదు. ఇబ్రహీం కుతుబ్‌షా గోల్కొండ పట్టణాన్ని పడమర వైపుకు విస్తరించాలని చూశాడు. కాని అక్కడ నీరు లేదు. కనుక నీరు లభించే మైదాన ప్రాంతంలో నూతన నగరాన్ని నిర్మించినట్లయితే బాగుంటుందని భావించాడు. అందుకు తగిన స్థలం మూసీనదికి తూర్పు ప్రాంతమని భావించాడు. అప్పటికే ఆ ప్రాంతంలో కొందరు గృహాలు నిర్మించుకొని నివశిస్తున్నారు. అక్కడ మొదట నివసించిన వారిలో హజరత్‌షా చిరాగ్, హజరత్ నూరుల్ హదీలు ముఖ్యులు. వారి సమాధులు మీర్ సమాధి వద్ద ఉన్నాయి. Daira Mis Momin అనే necropolis కు దగ్గరలో ఉన్నాయి. కనుక అక్కడ నూతన నగరాన్ని నిర్మించవచ్చని ఇబ్రహీం భావించాడు. కాని ఇబ్రహీం నగర నిర్మాణం చేయలేదు. అతడు క్రీ.శ.1580లో మరణించాడు. అతని తర్వాత అతని కుమారుడు మహమ్మద్ కులీకుతుబ్‌షా సింహాసనానికి వచ్చి క్రీ.శ.1591లో నగర నిర్మాణం చేపట్టాడు. కుతుబ్‌షాహీ చరిత్ర అనే గ్రంథంలో సుల్తాన్ ఒక రోజు హచలం లేక చంచలం అనే గ్రామానికి షికారుకు వెళ్లాడని, ఆ ప్రదేశం చాలా బాగా ఉందని గమనించి అక్కడ నూతన నగర నిర్మాణం చేయాలని నిర్ణయించాడని రాశాడు. దీనిని బట్టి హైదరాబాద్ నగరానికి ముందు చంచల అనే గ్రామం ఉందని అర్థమవుతోంది. అక్కడ నూతన నగర నిర్మాణం చేయాలని నిర్ణయించుకున్న తర్వాత మహమ్మద్ కులీ ప్రణాళిక సిద్ధం చేయమని Meer Momin అనే అతన్ని నియమించాడట. అతడు నగర నిర్మాణ పథకాన్ని రచించాడట. నేటి పరిభాష ప్రకారం Meer Momin హైదరాబాద్ నగర నిర్మాణ ఇంజనీర్ అని చెప్పవచ్చును. అతడు మూసీ నది ఒడ్డున రేఖాశాస్త్ర పద్ధతిపై ప్రణాళికను తయారు చేశాడట. భారతదేశంలో నగరాలు, పట్టణాలు ప్రణాళికా బద్ధంగా నిర్మాణమయ్యేవి కావని ఐరోపా చరిత్రకారులు రాశారు. హైదరాబాద్ నగరం కూడా ఎలాంటి ప్రణాళిక లేకుండా నిర్మింపబడిందని చాలా మంది భావిస్తారు. కాని ఇది వాస్తవం కాదు. నగర నిర్మాణానికి ముందు ఆ ప్రదేశం అంతా పరిశీలించి నిర్మాణానికి నడిబొడ్డు నిర్ణయించబడింది. ఆ నడిబొడ్డు నుండి నాలుగు దిక్కులకు నాలుగు బజార్లు రూపొందించి ఆ బజార్లకు ఇరువైపులా కట్టడాలుండాలని నిర్ణయించారు. నాలుగు బజార్లు కలిసే నడిబొడ్డు మీద మొట్టమొదటి కట్టడంగా చార్మినార్‌ను నిర్మించారు. చార్మినార్ నిర్మాణంతో హైదరాబాద్ నగర నిర్మాణం ప్రారంభమైంది. చార్మినార్ నుండి నాలుగు దిక్కులకు నాలుగు బాటలు వెళుతున్నాయి. చార్మినార్ నిర్మించకముందు నుండే ఒక బాట గోల్కొండ నుండి తూర్పుగా మచిలీపట్టణం వెళ్లేది. చార్మినార్ నిర్మించిన చోట ఆ బాటకు అడ్డంగా ఉత్తర దక్షిణ దిక్కులకు వెళ్లే విధంగా మరొక బాటను రూపొందించారు. ఈ రెండు బాటలు కలిసిన ప్రదేశాన్నే నడిబొడ్డుగా నిర్ణయించి అక్కడ చార్మినార్ నిర్మించారు. చార్మినార్ నుండి ఉత్తరంగా వెళ్లే బజారు మూసీ నది వరకు వెళ్తుంది. ఈ బజారునే ఆరవ నిజాం కాలంలో మూసీనదిపై బ్రిడ్జిని నిర్మించి అఫ్జల్‌గంజ్ వరకు పొడిగించారు. ఈ బ్రిడ్జిని అఫ్జల్ బ్రిడ్జి అని అంటారు. చార్మినార్ నుండి దక్షిణంగా వెళ్లే బజారు ఫలక్‌నుమా ప్యాలెస్ ఉన్న గుట్ట వైపు వెళుతుంది. ఫలక్‌నుమా ప్యాలెస్ ఉన్న గుట్టను పూర్వం కొహిటూర్ అని పిలిచేవారు.

చార్మినార్ నుండి తూర్పుగా వెళ్లే బజారు మచిలీపట్నం వెళ్తుంది. చార్మినార్ నుండి పడమర వైపు వెళ్లే బజారు గోల్కొండ కోటకు వెళ్తుంది. ఈ బజారు పూర్వం నుండి ఉన్నదే. ఈ విధంగా నాలుగు బజార్ల కూడలిని కేంద్రంగా చేసుకుని నగర నిర్మాణం ప్రారంభమైంది. అంటే ఈ నగరం క్రమబద్ధమైన పట్టణ నిర్మాణ ప్రణాళిక

ప్రకారం నిర్మించబడిందని స్పష్టంగా చెప్పవచ్చు. ఈ నగర నిర్మాణం అప్పుడు, తన నగరంలో కొన్ని కోట్ల మంది జనవృద్ధి కావాలని కులీకుతుబ్‌షా ప్రార్థించాడట. ప్రస్తుతం హైదరాబాద్ జనాభా లక్షల సంఖ్యలో ఉంది. ఈ జనాభా అతి కొద్ది రోజులలోనే కోటి దాటనుందని తెలుస్తుంది.

హైదరాబాద్ నగర నిర్మాణపు పనివారు: హైదరాబాద్ నగర నిర్మాణం ప్రారంభమయ్యే నాటికి గోల్కొండ రాజ్యంలో అనేక మంది ఇరానీ అఫాకీలు నివసిస్తున్నారు. వారు అనేక రంగాల్లో నిష్ణాతులు. వారిలో శిల్పులు, కట్టడాలను నిర్మించేవారు, ఖురాన్ సూక్తులు చక్కగా రాయగలిగిన వారు, చిత్రకారులు అనేక నైపుణ్యాలు గల కళాకారులు ఉన్నారు. సుల్తాన్ నగర నిర్మాణంలో వారి సేవలను తీసుకున్నాడు. నగర నిర్మాణ పథకాన్ని తయారు చేసిన మీర్ మొమిన్ కూడా ఇరానీయే. అతడు ఇరానీ ఆలిమ్. కనుక హైదరాబాద్ నగర నిర్మాణంలో ఇరానీ శైలి స్పష్టంగా కనిపిస్తుంది. ఇరాన్‌లో ఇష్పాన్‌నగర పోలికలు హైదరాబాద్‌లో ఉన్నాయని అంటారు. మీర్ మొమిన్ కూడా హైదరాబాద్‌ను ఇష్పాన్ అని అన్నాడు. ఇష్పాన్ నగరం షియా ఇమాంల గౌరవార్థం నిర్మించిన పట్టణం అని అంటారు.

చార్మినార్: ప్రాచీన కాలం నుంచీ ఒక నగరాన్ని నిర్మించే ముందు నగరం మధ్యలో ఒక కట్టడాన్ని నిర్మించే ఆచారం ఉందని (Central Plaza), ఆ ఆచారం ప్రకారమే చార్మినార్ నిర్మింపబడిందని బిల్‌గ్రామి అనే పండితుడు తాను రాసిన మజీర్-ఇ-దక్కన్ అనే గ్రంథంలో చార్మినార్ మసీదు, తుబుట్ అనే కట్టడాల లాగా ఉందని రాశాడు. కాని ఆ అభిప్రాయాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సాదిక్ నక్వీ తిరస్కరించి చార్మినార్ ఇరాన్‌లోని ఇస్‌ఫాహన్ పట్టణంలో నిర్మింపబడిన షియా ముస్లింల 8వ ఇమామ్ అయిన హజరత్ ఆలీరజా మౌసోలియాన్ని పోలి ఉందని అన్నాడు. ఆంధ్రదేశంలోనే గాక భారత దేశంలోనే ప్రఖ్యాతి వహించిన కట్టడం చార్మినార్ అని ఆచార్య షేర్వాణీ రాశారు. చార్మినార్ నిర్మాణాన్ని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి గోల్కొండ ప్లేగు వ్యాధి బారిన పడగా ఏదైనా కట్టడాన్ని నిర్మిస్తే ప్లేగు వ్యాధి పోతుందని పండితులు చెబితే మహమ్మద్ కులీకుతుబ్ షా దీనిని నిర్మించాడని ఒక అభిప్రాయం ఉంది. దేవ్‌నాట్ అనే విదేశీ యాత్రికుడు చార్మినార్‌కు దగ్గరలో ఉన్న రాజప్రాసాదాలకు నీళ్ల సరఫరా చేయడానికి ఈ కట్టడాన్ని నిర్మించాడని రాశాడు. చార్మినార్ పైఅంతస్తులోకి నీరు గొట్టాల ద్వారా జల్లవల్లి రిజర్వాయర్ నుండి ఎక్కించేవారట. తర్వాత గొట్టాల ద్వారా రాజప్రాసాదాలలోని పైఅంతస్తులకు కూడా నీరు ఎక్కించేవారట. రాజప్రాసాదాలకు ముందు ముఖ ద్వారంగా నిర్మించారని మరొక అభిప్రాయం ఉంది. నూతనంగా పట్టణాన్ని నిర్మించేటప్పుడు మొదట మధ్యలో ఒక కట్టడాన్ని నిర్మించే ఆచారం మధ్యయుగంలో ఉండేదని, ఆ ఆచార ఫలితంగా హైదరాబాద్ నగరాన్ని నిర్మించడానికి ప్లాను తయారు చేయించి దాని మధ్యలో మొదటి కట్టడంగా చార్మినార్‌ను మహమ్మద్ కుతుబ్ షా నిర్మించాడని, చార్మినార్ నిర్మాణంతో హైదరాబాద్ నగర నిర్మాణం ప్రారంభమైందని ప్రొఫెసర్ షేర్వాణీ రాశాడు. కొందరు అది సెక్యులర్ నిర్మాణం అని అంటారు. కాని అందులో పైన మసీదు ఉంది. అక్కడ ముస్లింలు నమాజులు చేసేవారు. మిగిలిన భాగాన్ని మదర్సాలాగా ఉపయోగించారు. అక్కడ ముస్లిం విద్యార్థులకు విద్యాబోధనలు చేసేవారు.

మినరేట్లు: చార్మినార్ 30×30 మీటర్ల వేదిక మీద నిర్మించబడింది. అది నాలుగు మినరేట్ల నిర్మాణమని, కుతుబ్‌షాహీల కాలం నాటి Chef-d-ocbre అనీ వర్ణింపబడింది. ఈ నాలుగు మినరేట్లు ఆగ్నేయ, నైరుతి, వాయవ్య, ఈశాన్య దిక్కులలో భారీ ప్రమాణాలతో 56 మీటర్లు అంటే 186 అడుగుల ఎత్తుతో నాలుగు అంతస్తులుగా నిర్మింపబడ్డాయి. ఆ మినరేట్లలోని పైఅంతస్తు నాల్గవ అంతస్తుకు ఎక్కడానికి 146 మెట్లు ఉన్నాయి. ఈ అంతస్తులు కప్పు కింద రెండు, కప్పుపైన రెండు మొత్తం నాలుగు అంతస్తులుగా ఉన్నాయి. నాలుగు అంతస్తులకు బాల్కనీలు నిర్మింపబడ్డాయి.

కమాన్లు: ఆ నాలుగు మినరేట్ల మధ్య తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిక్కులకు అభిముఖంగా నాలుగు గొప్ప ఆర్చీలను నిర్మించారు. ఒక్కొక్క ఆర్చీ 11 మీటర్లు అంటే 36 అడుగుల పొడవుతో నాలుగు దిక్కులలో నాలుగు ఆర్చీలు మినరేట్లకు సంధింపబడ్డాయి. ఆ విధంగా సంధింపబడినందువల్ల ఒక్కొక్క వైపు 20 మీటర్ల పొడవు, వెడల్పులతో నలుచదరపు కట్టడమైంది. ఆర్చీల ఎత్తు 30 మీటర్లు. ఆ ఆర్చీలపైన Magnificent rectangular edifice నిర్మింపబడింది. మినరేట్లు కప్పు మీద నుండి 20 మీటర్లు ఎత్తు ఉన్నాయి. ప్లింత్ లెవెల్ నుండి పైవరకు 25 మీటర్లు, మొత్తం కింది నుండి పైకి అంటే ప్లింత్ లెవెల్ నుండి పైదాకా 55 మీటర్లున్నాయి. మినరేట్లే గాక ఆర్చీల మీద కట్టడం కూడా నాలుగు అంతస్తులుగా ఉంది. మినరేట్లపైన గుమ్మటాలు నిర్మింపబడ్డాయి.

మినరేట్ల మీద తామరపూలు చిత్రించబడ్డాయి. నాల్గవ అంతస్తు పైకప్పు పైనుండి కిందికి చూస్తే కళ్లు తిరుగుతాయి. కంది పడిపోతామేమో అనే భయం కలుగుతుంది. పైకప్పు మీద నాలుగు వైపులా రెండు మినరేట్ల మధ్య దానిని నిర్మించిన Opening శిల్పి ఆర్చీలను నిర్మించి ఆర్చీలకు రెండు వరుసల Screen లను రూపొందించాడు. ఆ రెండు వరుసలు గల Screens వెనుక నుండి చూస్తే చూపులకు ఎత్తు తగ్గినట్టు కనబడి భయం తగ్గిపోతుంది. ఈ Screens ను అనేక రకాల designs తో రూపొందించాడు గానీ అవి చాలా delicate గా ఉన్నాయి. కింది అంతస్తులలో కూడా 9 అడుగుల ఎత్తుగల ఆర్చీలు నిర్మింపబడ్డాయి. వాటికి కూడా Screens ఉన్నాయి. ఇవన్నీ పైన తిరిగే వారికి రక్షణ సరిహద్దులుగా పనిచేస్తున్నాయి.

చార్మినార్ పైన మసీదు: పైకప్పు మీద పశ్చిమ వైపున ఒక మసీదు నిర్మింపబడింది. ఆ మసీదుకు 5 చొప్పున డబుల్ ఆర్చీలున్నాయి. ఇవి షియా మతస్తులు పవిత్రంగా భావించే ఐదుగురు గొప్ప షియా ప్రతినిధులకు చిహ్నాలుగా నిర్మింపబడ్డాయట. ఈ ఆర్చీలు ఒక ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. ఇవి Pointed అర్చీలు. They have been framed by a cusped arch. వీటి పనితనానికి ముగ్ధులై తర్వాత మొగలులు ఈ శైలిని తమ కట్టడాలలో ప్రవేశపెట్టారట. కుతుబ్‌షాహీ కాలం నాటి మసీదులన్నింటి కన్నా ఇది చాలా సుందరమైంది. ఈ మసీదు లోపల 45 మంది నమాజు చేయడానికి సరిపోయే స్థలం ఉంది. (within covered liwan). మసీదుకు ముందు విశాలంగా ఖాళీ స్థలం ఉంది. శుక్రవారాలలో ఇక్కడ కూడా నమాజులు చేసేవారట ఈ మసీదుకు తూర్పు వైపున ఒక అందమైన వరండా ఉంది. అది అన్నివైపులా సమతుల్యంగా నిర్మింపబడింది. ఆ వరండాకు మధ్యలో ఒక పెద్ద ఆర్చీ, దానికి రెండువైపులా చిన్న చిన్న ఆర్చీలు చాలా అందంగా రూపొందించారు. ఈ మధ్య ఆర్చీ సరిగ్గా దాని ఎదురుగా ఉన్న మసీదులోని మధ్య ఆర్చీకి ఎదురుగా ఉంది. ఈ ఆర్చీపైన Cupola నిర్మింపబడింది. దాని మీద నుండి బయటకు చూడవచ్చు. ప్రార్ధనకు ముందు ముస్లింలను పిలిచే అజాగా లేక పిలుపుకు కూడా ఉపయోగించవచ్చు. ఈ కట్టడ నిర్మాణానికి మొత్తం గట్టి రాయిని మంచి గచ్చును వాడారు. చార్మినార్ మీద సూక్ష్మంగా పుష్పాలంకరణలు, geometric designs రేఖాశాస్త్ర చిత్రీకరణను చిత్రించారు. ఇమామ్ హుస్సేన్ ఆలమ్ పోలికలు చార్మినార్‌లో ఉన్నాయని డా॥ సాధిక్ నక్వీ అన్నారు. చార్మినార్‌లోనే గాక కుతుబ్‌షాహీల నిర్మాణాలన్నింటిలో ఈ లక్షణాలున్నాయని కూడా అన్నారు. క్రీ.శ.1667లో హైదరాబాద్‌ను దర్శించిన ఫ్రెంచి యాత్రికుడు దేవ్‌నాట్ చార్మినార్‌ను గురించి చాలా వివరంగా రాశాడు. ఆ రోజుల్లో చార్మినార్‌ను ప్రతిరోజూ రోజా పూలతో అలంకరించేవారట. చార్మినార్ నిర్మాణానికి 3 లక్షల హొన్నులు ఖర్చు అయ్యాయి. చార్మినార్ నాలుగు దిక్కులకు చిహ్నంగా నిర్మించబడింది. చార్మినార్ నిర్మాణం రెండు సంవత్సరాలు పట్టింది. యాహాఫీజ్ అనే పదంతో పూర్తయింది. ఈ కట్టడ నిర్మాణంలో హచలం ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చార్ కమాన్-జలోఖానా: చార్‌మినార్ నిర్మాణం తర్వాత చార్మినార్‌కు 80 అడుగులు ఉత్తరంగా నాలుగు దిక్కులా నాలుగు పెద్ద ఆర్చీలు నిర్మించారు. ఈ ఆర్చీలు 65 అడుగుల ఎత్తుతో భారీగా ఉన్నాయి. ఇవి separated from the centre of the Piazza by about 110 yards. ఆర్చీల మధ్య నాలుగు దిక్కులలో సమాన దూరం ఉంది. కనుక ఇది నలుచతురస్రపు ప్రదేశంగా ఉంది. దాని మధ్యలో అందం కోసం ఫౌంటెన్ నిర్మించబడింది. ఈ నిర్మాణాన్ని ఆనాడు జలూఖానా అని పిలిచేవారు. నేడు దానిని చార్‌కమాన్ అని పిలుస్తున్నారు. అక్కడే దౌలత్ ఖానా-ఇ-అల్లా అనే మరొక కట్టడం కూడా నిర్మింపబడిందట. ఇది హిందూ ఆచారం ప్రకారం నిర్మింపబడిందట. హిందువులకు నాలుగు దిక్కులలో దర్వాజాలు నిర్మించే ఆచారముందని, ఆ ఆచారాన్ని పాటించి మహమ్మద్ కులీకుతుబ్‌షా గేట్లుగా అంటే దర్వాజాలుగా పెద్ద ఆర్చీలను నిర్మించాడని డా॥ సాధిక్ నక్వీ అన్నారు. ఈ స్క్వేర్ మధ్యలో ఉన్న ఫౌంటెన్‌ను చార్యుకావేశాజ్ లేక నాలుగు దిక్కుల cistern అని అనేవారట. తర్వాత సూకా హౌజ్ dry cistern అని అన్నారట. జిలోఖానాకు నిర్మించిన నాలుగు ఆర్చీలను ఒక యూనిట్‌గా తీసుకురాకుండా విడివిడిగా ఉంచబడ్డాయి. ఈ ఆర్చీల మధ్య 330 అడుగుల దూరం ఉంది. ఒక్కొక్క ఆర్చీ 60 అడుగుల ఎత్తు, 36 అడుగుల పొడుగు, 6 అడుగుల మందం కలిగి ఉన్నాయి. ఈ పెద్ద చతురస్రాకార రాజప్రాసాదానికి అనుబంధమట. ఈ స్క్వేర్‌కు పశ్చిమంగా రాచనగరు నిర్మింపబడింది. ఈ చతురస్రాకారంలోని పశ్చిమ ఆర్చీ రాజప్రాసాద ప్రాంగణం. లోపలికి వెళ్లడానికి దర్వాజా ఉపయోగపడేది. రాజప్రాసాదానికి కాపలా ఉండే సైనికుల కోసం ఈ చతురస్రాకారంలో నిర్మింపబడింది. మిగిలిన మూడు ఆర్చీలను త్రిపోలియా అని అనేవారు. తూర్పు ఆర్చీ సరిగా రాజప్రాసాదానికి ఎదురుగా ఉండేది. దాని మీద సంగీత వాయిద్యకారులు కూర్చొని సంగీత

వాయిద్యాలను వాయిస్తూ రాజప్రాసాదంలోని వారికి ఆనందం కలిగించేవారు. వారు రోజుకు ఐదుసార్లు తమ సంగీత వాయిద్యాలను వాయించేవారు. పశ్చిమ దర్వాజా పైన అందరి కళ్లూ ఉండేవి. ఆ దర్వాజాకు బంగారు అల్లికలతో చేసిన తెర వేలాడుతూ ఉండేదట. ఈ పశ్చిమ గేటు వద్ద పీష్వా మీర్ మునిమ్ ఒక స్తంభాన్ని ప్రతిష్ఠించి దానిపై ఖురాన్‌లోని కొన్ని సూక్తులను రాయించాడట. ఆ సూక్తులు మహిమగలవట. ఈ పశ్చిమ ఆర్చీని షేర్ ఇ ఆలీ అని మొదట పిలిచేవారు. తర్వాత కమాన్‌సిఫ్రి బాటిల్ అని పేరు మార్చారు. అంటే మహత్తుగల కమాన్ అని అర్థం. ఆ పదం కాలక్రమేణా మారిపోయి కమాన్‌షేర్ ఐ బాటిల్ అని పిలువసాగారు. కొందరు ఖట్టికాషేర్ అని కూడా అనేవారు. తూర్పు ఆర్చీని లేక కమాన్‌ను మచిలీకమాన్ అని ఉత్తర కమాన్‌ను సక్కర్ కమాన్ అని, దక్షిణ కమాన్‌ను చార్మినార్ కమాన్ అని పిలిచేవారు. జలూఖాన్ వద్దనే దౌలత్‌ఖానా, చార్‌కమాన్‌ల పక్కనే బార్‌సుకా అనే నాలుగు చెరువులను నాలుగు దిక్కులలో తవ్వించారు. చార్మినార్‌లోను, చార్‌కమాన్ చార్‌సుకాలతో షియా సంకేత స్తంభాలు లేవు. షియాలు తమ కట్టడాలలో ఐదుగురు షియాల సంకేతంగా 5 స్తంభాలు నిర్మిస్తారు. గోల్కొండ నవాబులు షియా మతస్థులైనప్పటికీ ఈ కట్టడాలలో షియా సంకేతాలు విస్మరించారు. ఈ నిర్మాణంలో ఉన్న నాలుగు స్తంభాలు నాలుగు దిక్కులకు సంకేతాలని షేర్వాణి అన్నారు.

రాజభవనాల సముదాయం: జలూఖానాకు పశ్చిమంగా మహమ్మద్ కులీకుతుబ్‌షా రాజభవనం నిర్మించాడు. ఆ ప్రదేశం చాలా విశాలంగా ఉండి అనేక భవనాలు, పార్కులు, ఫౌంటెన్‌లు, పూదోటలు, ఫలవృక్షాలతో కళకళలాడుతూ ఉండేది. అక్కడ మహమ్మద్ కుతుబ్‌షా చాలా భవనాలు నిర్మించాడు. అతను మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా రచించిన పద్యాలలో అక్కడ తాను నిర్మించిన భవనాలను పేర్కొన్నాడు. మాహెల్ ఇ ఖాస్ చాబర్‌సఫా, హష్టమహల్, గగన్‌మహల్, లాల్‌మహల్, సజన్ మహల్, సర్దార్ మహల్, చందన మహల్ అనే భవనాల పేర్లు అతని పద్యాలలో ప్రస్తావించబడ్డాయి. ఇంకా అక్కడ దాద్‌మహల్ అనే గొప్ప భవనాన్ని నిర్మించి దానిని న్యాయస్థానంగా చేశాడు. ఇది 9 అంతస్తుల భవనం. తన కుమార్తె హయత్ భక్షీ బేగం వివాహం మహమ్మద్ కుతుబ్‌షాతో అయిన తర్వాత క్రీ.శ.1610లో ఖుదాదాద్ మహల్ నిర్మించాడు. ఇది 7 అంతస్తులు గల విశాల భవనం. ఈ భవనంలోని ఒక్కొక్క అంతస్తుకు ఒక్కొక్క పేరు ఉంది. మూసవిమహల్, హాసేనిమహల్, హాసనిమహల్, ఇలాహీమహల్, మహమ్మద్ మహల్, జాఫరిమహల్, హైదర్‌మహల్ అనే పేర్లున్నాయి. నక్షీమహల్ అనే మరొక అద్దాల భవనాన్ని కూడా నిర్మించాడు. అద్దాల కిటికీలతో ఈ భవనం మిలమిల మెరుస్తూ ఉండేది. అతడు దారెగుల్షన్, ఇబ్రహీం బాగ్, లంగర్ ద్వావాయి, ఇమాం బారాదరి మొదలైన వాటిని కూడా నిర్మించాడు. ఈ రాజప్రాసాదాలున్న ఈ ప్రాంతం జలూఖానా నుండి మూసీ నది వరకు విస్తరించి ఉండేది. ఈ ప్రాంతం నేటి హైకోర్టు, సిటీ కాలేజి ఉన్న ప్రాంతం. ఆ కాలం నాటి ఒక్క భవన ఛాయ కూడా నేడు కానరావడం లేదు.

బాదుషాహీ అషూర్‌ఖానా క్రీ.శ.1594-95: చార్మినార్ నిర్మాణం పూర్తికాగానే మహమ్మద్ కులీ బాద్‌షాహీ అషూర్‌ఖానాను నిర్మించాడట. ఇది నయాపూల్ నుండి 100 మీటర్ల దూరంలో ఉంది. ఈ ప్రాంతాన్ని పత్తర్‌గట్ట్ అని అంటారు. అది నేడు షాపింగ్ సెంటర్. చార్మినార్‌కు దగ్గరలోనే ఉంది. ఈ కట్టడాన్ని కర్బాలాలో ప్రాణత్యాగం చేసిన అలమ్‌ల జ్ఞాపకార్థం ఈ బాద్‌షాహీ అషూర్‌ఖానాను నిర్మించాడు. ఈ కట్టడం నేడు కూడా మంచిస్థితిలో ఉంది. కుతుబ్‌షాహీ కాలంలో నిర్మించబడిన అద్భుత నిర్మాణాలలో ఇది ఒకటి అని పండితులు అంటారు. ఇది 40 గజాలు పొడవు, 30 గజాల వెడల్పు ఉంది. 12 గజాల ఎత్తు ఉంది. ప్రధాన భవనం ఎత్తయిన ప్లాట్‌ఫాం మీద నిర్మింపబడింది. దాని మధ్య హాలు 87 అడుగులు పొడవు, 17 అడుగుల వెడల్పు ఉంది. మధ్య హాలులో 5 గూళ్లున్నాయి. అందులో పశ్చిమగోడలోని ఉత్తర దక్షిణ గోడలలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 5 గూళ్లున్నాయి. ఈ కట్టడంలో మూడు ప్రత్యేకతలున్నాయి. మొదటి ప్రత్యేకత 12 గజాల ఎత్తున ఉన్న కప్పు నాలుగు రాళ్ల స్తంభాలపై నిర్మింపబడింది. రెండవ ప్రత్యేకత మధ్య హాలు మొత్తం అందమైన ఎనామిల్ టైల్స్ చేత తాపడం చేయడం. ఈ పని అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ఇరానియన్ పనివారి చేత చేయించబడింది. వాటి రంగు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. ఆ రోజులలో ఎనామిల్ టైల్స్ పర్షియా నుండి వచ్చేవట. మూడవ ప్రత్యేకత అందులోని 17 శాసనాలు. అవి మతపరమైనవే అయినప్పటికీ అవి ఆనాటి రచనా నైపుణ్యాన్ని చాటుతున్నాయి. ఇందులోని పశ్చిమ గోడ మీద భవనం మధ్యలోని గూడు వద్ద రెండు శాసనాలున్నాయి. ఆ రెండు శాసనాలలో మహమ్మద్ కులీకుతుబ్‌షా పేరుంది. ఈ గోడ వరకే అతను నిర్మించాడట. అతని అల్లుడు మహమ్మద్ కుతుబ్‌షా పేరు కూడా ఇందులో ఉంది. అతడు కూడా క్రీ.శ.1611లో కొన్ని ఎనామిల్ టైల్స్‌ని తాపడం చేయించాడట. అబ్దుల్లా

కుతుబ్‌షా ఎనామిల్ టైల్స్ చేయించి తాను కూడా శాసనం వేయించాడు. దాంతో పాటు 17 శాసనాలు రాయించింది కూడా అతడే. అవి అన్నీ fine ornamental tughra style లో రాయబడ్డాయి. అతడు ఈ భవనంలో ఎక్కువ భాగాన్ని నిర్మాణం చేశాడు. అప్పుడు Alams ప్రతిష్ఠించాడు. 3 శతాబ్దాలు గడిచినా నేటికీ అవి రంగులు వెలిసిపోకుండా నేడు కూడా మెరుస్తున్నాయి. ఆ టైల్స్‌ను అతికించిన విధానం కూడా చాలా అద్భుతంగా ఉంది. కుతుబ్‌షాల కాలంలో ఎనామిల్ తాపడపు పనులు చేయడం చాలా తక్కువ. బీదర్‌లోని బహమనీ సుల్తాన్‌లు మొజాయిక్ టైల్స్‌ను వాడి వారి భవనాలను అతి సుందరంగా నిర్మించుకునే వారు. కుతుబ్‌షాహీల నిర్మాణాలలో ఎనామిల్ వాడిన భవనాలు నాలుగంటే నాలుగు మాత్రమే. బీదర్‌కు దగ్గరలో ఉన్న షేక్‌పేటలోని మసీదు, ఇబ్రహీం కుతుబ్‌షా, మహమ్మద్ కుతుబ్‌షా సమాధులు. ఈ బాద్‌షాహి అషూర్‌ఖానాలు మాత్రమే. ఈ అషూర్‌ఖానా నిర్మాణానికి 66,000 హొన్నులు ఖర్చు అయింది. కాని ఈ కట్టడం మొగలుల దండయాత్రల కాలంలో దాడికి గురైంది. అందులోని బంగారు ఆలమ్‌లను మొగల్ సైనికులు దోచుకొని కట్టడపు ముందు భాగాన్ని నాశనం చేశారట. నిజాంల కాలంలో నిజాం అలీ మొగలులు పాడు చేసిన బయటి దల్లానును బాగు చేయించాడట. ఈ దల్లాను నిజాం అలీ ఒకే చెట్టు మొదలు నుండి కోయించిన నాలుగు కొయ్య స్తంభాలతో బయటి దల్లానును నిర్మించాడట. అప్పటి నుండి మళ్ళీ ప్రజలు ఈ అషూర్‌ఖానాను దర్శిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్కీవ్స్ అషూర్‌ఖానాను మాన్యుమెంటుగా ప్రకటించింది. ఈ ప్రాంగణంలో మసీదు నక్కర్‌ఖానా, ఇతర భవనాలు కూడా ఉన్నాయి.

దారుల్‌షిఫా క్రీ.శ.1595-96: మహమ్మద్ కులీ నిర్మించిన మూడవ భవనం దారుల్‌షిఫా. ఇది యునానీ దవాఖానా. కుతుబ్ షాహీల కాలంలో హకీంలందరూ ఇక్కడ ఉండేవారు. ఇక్కడ రోగులకు ఉచిత వైద్యం చేయడమేగాక, ఉచిత భోజన సదుపాయాలు కల్పించి, ఉచితంగా మందులు, బట్టలు ఇచ్చేవారు. ఈ భవనం 175 అడుగుల పొడవు, 75 అడుగుల వెడల్పు కలిగిన 25,000 చదరపు అడుగుల వైశాల్యం కలిగి ఉంది. దాని గేటు పెద్ద పరిణామంలో ఆర్చి లాగా నిర్మించబడింది. దానికి ఉత్తరం వైపు ప్లాట్‌ఫారం, హాలు, గదులున్నాయి. ఇవి రోగులను పరీక్షించడానికి, వారికి వైద్యం చేయడానికి ఉపయోగించేవారు. ఈ గదులు వైద్య విద్య నేర్చుకొనే విద్యార్థులకు చదువు చెప్పడానికి కూడా ఉపయోగించేవారు. మిగిలిన మూడు వైపులా రెండంతస్తుల బిల్డింగ్ ఉంది. ఆ భవనం ముందు మూడు వైపులా పెద్ద హాలుంది. అది స్తంభాల మీద నిర్మించబడింది. ఆ హాలు 15×15 స్క్వేర్ భాగాలుగా విభజించబడింది. ఆ స్క్వేర్‌ల ముందు 5 అడుగుల కారిడార్ ఉంది. ఒక్కొక్క అంతస్తులో 12 గదులున్నాయి. కాని ఉత్తరపు భాగంలో 8 గదులు మాత్రమే ఉన్నాయి. పశ్చిమ భాగం వెనుక నాలుగవ ఇమాం హజరత్ జైన్ ఉల్ ఎబిడీన్ అర్ర ఆలమ్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో ప్రతిష్ఠించబడింది. ఈ భవనం పైకి వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. పైకి వెళ్తే చల్లని గాలి వస్తుంది. రోగులు కూడా పైకి వెళ్లి మంచి గాలిని పీల్చుకొని త్వరగా కోలుకొనేటట్లు చేయడానికి ఉపయోగపడేదని ఫ్రాన్సిస్ రాశాడు. ఈ భవనం హాస్పిటలే కాదు, మెడికల్ కాలేజీ కూడా. అక్కడ వైద్య విద్యను నేర్పేవారు. అక్కడ వైద్యం నేర్చుకొనే వారికి కుతుబ్‌షాహీ ప్రభుత్వం ధన సహాయం కూడా చేసేది. తర్వాత వారికి అక్కడే ఉద్యోగాలు కూడా ఇచ్చేవారు. హాస్పిటల్ గేటు వద్ద ఒక మసీదు కూడా ఉండేది. అక్కడే ఒక పెద్ద కార్వాన్‌సెరాయ్ కూడా ఉన్నట్లు శిథిలాలున్నాయి. అసఫ్ జాహీల కాలంలో ఈ హాస్పిటల్ మూసివేయబడింది. కాని 7వ నిజాం కాలంలో ప్రత్యేక భవనాన్ని నిర్మించి ఆలమ్‌ను అక్కడ ఉంచాడు.

జామా మసీదు క్రీ.శ.1597: మహమ్మద్ కులీకుతుబ్‌షా నిర్మించిన నాలుగవ కట్టడం జామా మసీదు. ఇది చార్మినార్‌కు ఈశాన్య దిక్కులో ఉంది. ఈ మసీదుకు 7 ఓపెన్ ఆర్చీలు ఉన్నాయి. ఇందులో ప్రధాన ఆర్చి మిగిలిన 6 ఆర్చిల కన్నా పెద్దది. ప్రధాన ప్రార్థన హాలు రెండు Dallans గా ఉంది. అవి 72.6 అడుగుల వెడల్పు, 32.6 అడుగుల వెడల్పుతో ఉన్నాయి. దాని ముందు 74 అడుగుల పొడవు, 70 అడుగుల వెడల్పు గల ప్రాంగణం ఉంది. హాలుకు మధ్య రెండు పెద్ద ఆర్చీలు, వాటికి రెండు వైపులా మూడు చొప్పున చిన్న ఆర్చీలున్నాయి. ఈ ఆర్చిల మీద 3 అడుగుల ఎత్తులో మళ్ళీ false cusped ఆర్చీలు రూపొందించబడ్డాయి. In Charminar Mosque simple arch is framed by a cusped arch. But here in this Jama Masjid, architect has superimposed a false cusped arch over each of the real openings. మసీదుకు రెండు వైపులా రెండు పెద్ద మినారెట్లు ఉన్నాయి. వాటి తల మీద Lotus ఆకారాలు ఉన్నాయి. దాని మీద gallery with intersected arches is vested. ఆ గ్యాలరీ మీద cylindrical shaft of the minor with four columns at the corners. The

shaft supports a beautiful miniature building with three false arches on each side crowned by a dome (Truncated pillars). ఈ మసీదులో 800 మంది ప్రార్థనలు చేయడానికి సరిపోతుంది. అంతకుమించి వీలు లేదు. ఈ మసీదుకు అనుబంధంగా ఒక మదర్సా, స్నానశాల ఉండేవని, అక్కడ స్నానం చేయడానికి వచ్చే వారికి ఉచితంగా క్షురకర్మ చేసే వారని, స్నానం చేయడానికి బట్టలు కూడా ఇచ్చేవారని గిరిధర్‌లాల్ తారీఖ్-ఇ-జఫ్రా అనే గ్రంథంలో రాశారు. ఈ మసీదులో రెండు విశేషమైన శాసనాలున్నాయి. One on the Mirab in fine Thulth style and a beautiful chronogram executed in Mastaliq over what was once the main entrance of the mosque over in both Mastalique and Thulth styles. ఈ శాసనాలను చాలా మంది ప్రశంసించారు. షిరాజీ జలాలుద్దీన్ మహమ్మద్ బాబాఖాన్‌లు దస్తూరితో రాసిన ఈ శాసనాలు ఈ మసీదుకు గొప్ప ఆభరణాలు. అందువల్ల ఈ మసీదు కుతుబ్‌షాల కాలం నాటి గొప్ప నిర్మాణమని ఆచార్య షేర్వాణి ప్రశంసించారు. యాజ్దాని ఈ శాసనాలు దక్కనులోనే గొప్ప Nastalique Script అని అన్నారు. దీని నిర్మాణ వ్యయం రెండు లక్షల రూపాయలు.

నాభట్‌ఘాట్ - నౌబత్‌పహాడ్: హైదరాబాద్ నగరానికి ఉత్తరంగా హుసేన్‌సాగర్‌కు ఎదురుగా ఉన్న రెండు చిన్నకొండల మీద మహమ్మద్ కులీ ఒక భవనాన్ని నిర్మించి దాని చుట్టూ చాలా రకాల చెట్లను నాటించాడు. దానిని నాభట్‌ఘాట్ అని పిలిచేవారు. దానినే కొండపక్క ఉన్న తోటను Hill side Botanical Garden అనేవారట. ఈ భవనం హైదరాబాద్ నగరానికి ఉత్తరంగా ఉన్న ప్రాంతాల అజమాయిషీకి ఉపయోగపడేదట. ఈ కొండనే ప్రస్తుతం నౌబత్ పహాడ్ అని పిలుస్తున్నారు.

కొహిటూర్: హైదరాబాద్ నగరానికి దక్షిణ దిక్కులో రెండు మైళ్ల దూరంలో నేడు ఫలక్‌నుమా భవనం ఉన్న గుట్ట మీద కొహిటూర్ అనే పేరు గల భవనాన్ని నిర్మించాడు. ఈ భవనం నగర దక్షిణ ప్రాంతాల అజమాయిషీకి ఉపయోగించేవారు.

పూదోటలు: నౌబత్ పహాడ్ నుండి కోహిటూర్ గుట్టల వరకు మధ్య ఉన్న ప్రాంతాలన్నింటిలో పూల తోటలు, ఫల వృక్షాలు పెంచబడ్డాయి. తర్వాత ఈ తోటలు పటాన్ చెరువు నుండి ఇబ్రహీంపట్నం, భోన్‌గిరి, నల్గొండల మధ్య 750 కిలోమీటర్ల విస్తీర్ణంలోకి విస్తరించబడ్డాయి.

మీర్ మొమిన్ నిర్మాణాలు-సైదాబాద్, మీర్‌పేట మసీదులు: క్రీ.శ.1585 నాటికే మీర్ మొమిన్ మహమ్మద్ కులీకి పేష్వా అయ్యాడు. అతడే హైదరాబాద్ నగర ప్రణాళికా నిర్మాత. అతడు నగర పరిసరాలలో కూడా కొన్ని నిర్మాణాలు చేపట్టాడు. వాటిలో రెండు మసీదులు ముఖ్యమైనవి. ఒకటి సైదాబాద్ మసీదు, రెండవది మీర్‌పేట మసీదు. సైదాబాద్ మసీదు క్రీ.శ.1605లో పూర్తయింది. ఇది పెద్దది కాదు. 30 అడుగుల పొడవు, 21 అడుగుల వెడల్పు గల చిన్న మసీదు. దాని వద్ద 56 గదులు గల quadrangle building ఉంది. ఈ గదులు ప్రయాణికులకు carvan serai గానూ, చదువుకునే వారికి విద్యా సంస్థగానూ ఉపయోగపడి ఉండవచ్చు. మీర్‌పేట మసీదు కూడా ఇదేవిధంగా నిర్మింపబడింది. మసీదు లోపల మధ్య గోడ మీద గూటి వద్ద ఉన్న Chronogram అంటే శాసనంలో ఆ మసీదు క్రీ.శ.1610లో పూర్తి చేసినట్లు రాసి ఉంది. రెండు మసీదుల నిర్మాణానికి ఐదు సంవత్సరాల కాల వ్యవధి ఉంది. అందువల్ల మీర్‌పేట మసీదులో నిర్మాణ విధానం కొద్దిగా మారింది. సైదాబాద్ దానికంటే కొత్త దానిగా కనిపిస్తుంది. ముందు చిన్న ఆర్చీల సంఖ్య పెరిగింది. రెండు అందమైన Medalion executed by Hussain b Mahmud of Shiraz, గదులు quadrangle గా కాక చుట్టూ నిర్మింపబడి ఉన్నాయి. ఈ మసీదు గదుల చుట్టూ పెద్ద కాంపౌండ్ గోడ ఉంది. బహుశా లోపల తోట కూడా ఉండి ఉండవచ్చు.

ఇవన్నీ మహమ్మద్ కులీ నాటి భవనాలు. అతని కాలంలోనే నిర్మింపబడిన అతని సమాధి కూడా ఇతని కాలం నాటి మరొక గొప్ప కట్టడం. ఇది కుతుబ్‌షాహీ సమాధులన్నింటిలోకి పెద్దది. దాని మెయిన్ ప్లాట్‌ఫాం గ్రౌండ్ లెవెల్ నుండి 13.6' with double Terrace పైది 126-3" square. గుమ్మటం నేల స్థాయి నుండి 130 అడుగుల ఎత్తు ఉంది. 60 అడుగులు దాని own base నుండి colonnade in pillar and lintel syste running right round exterior of the mortuary chamber. పైన కప్పు చుట్టూ అలంకరింపబడిన పారాపిట్ గోడ ఉంది. relieved by Turrets at the four corners which make the whole composition symmetrical. మహమ్మద్ కులీకుతుబ్‌షా వద్ద నాజర్‌గా పని చేసిన మీర్ అబూ తాలబ్ హైదరాబాద్ నగరాన్ని

నిర్మించడానికి కులీ కుతుబ్‌షా 70 లక్షల హొన్నులు ఖర్చుపెట్టాడని తెలిపాడు. నజీముద్దీన్ అహమ్మద్ గిలానీ ఇబ్నుసారి షిరాజి అనే పండితుడు హదీకట్-ఉమ్-సలాటిన్ అనే గ్రంథం రాశాడు. ఇతడు అబ్దుల్లా కుతుబ్‌షా సమకాలికుడు. అతడు మహమ్మద్ కుతుబ్‌షా కాలం నాటి నుండి అబ్దుల్లా కాలం నాటి హైదరాబాద్ పట్టణాన్ని గురించి, ఆనాడు అక్కడ జరిగిన ఉత్సవాలు, పండుగలు, హైదరాబాద్‌లోని తోటలు, బజార్లు, కట్టడాలను గురించి రాశాడు. కులీ కుతుబ్‌షా తర్వాత అభివృద్ధి చెందిన హైదరాబాద్ నగరాన్ని గురించి తెలుసుకోవడానికి ఈ నజీముద్దీన్ రచన మనకు బాగా ఉపయోగపడుతోంది.

మహమ్మద్ కుతుబ్‌షా కాలం నాటి నిర్మాణాలు: మహమ్మద్ కులీ తర్వాత అతని అల్లుడు మహమ్మద్ కుతుబ్‌షా సింహాసనానికి వచ్చాడు. ఇతని కాలంలో ఇంకా అనేక నూతన భవనాలు నిర్మింపబడ్డాయి. ఇతని కాలంలో రాజభవనాలు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. యువరాజు ఇబ్రహీం జన్మించిన తర్వాత అగ్నిప్రమాదం జరిగింది. ఆ అగ్నిప్రమాదంలో రాజప్రాసాదాలన్నీ కాలిపోయాయి. అందువల్ల ఇతడు నూతన భవనాలను నిర్మించాడు. అలా నిర్మింపబడిన వానిలో దాద్‌మహల్ ముఖ్యమైంది. తర్వాత నాలుగు అంతస్తుల అమ్మాన్ మహల్‌ను నిర్మించాడు. ఇంకా హైదర్‌మహల్, మహమ్మద్ మహల్ అనే భవనాలను కూడా కట్టించాడు. ఈ నిర్మాణాలకు చాలా ధనం ఖర్చయిందని నజీముద్దీన్ రాశాడు. హైదరాబాద్‌కు ఉత్తరంగా ఒక అద్భుతమైన భవనం ఉంది. దాని చుట్టూ సుందరమైన తోటలున్నాయి. ఆ భవనం ఇరాకీ శైలిలో నిర్మించారని, లోపలి భాగాలలో కొన్నింటిని బంగారు, వెండితో తాపడాలు చేయించారని నిజాముద్దీన్ రాశాడు. అది నాలుగు అంతస్థుల భవనమట. కాని ఆ భవనం పేరు రాయలేదు. నజీరుద్దీన్ మహమ్మద్ కుతుబ్‌షా చార్‌బజారులో చాలా షాపులను నిర్మించాడని రాశాడు. మహమ్మద్ కుతుబ్‌షా హైదరాబాద్ నగరానికి తూర్పుగా సుల్తాన్‌పూర్ అనే నూతన నగరాన్ని నిర్మించాలని ప్రణాళిక సిద్ధం చేశాడట. కాని దానిని పూర్తి చేయలేకపోయాడు.

మక్కా మసీదు: మహమ్మద్ కుతుబ్‌షా నిర్మించిన కట్టడాలలో అత్యుత్తమమైంది మక్కా మసీదు. చార్మినార్‌కు నైరుతి దిక్కున 100 మీటర్ల దూరంలో మక్కా మసీదు ఉంది. హైదరాబాద్ మసీదులన్నింటిలో ఈ మసీదు చాలా పెద్దది. మక్కాలోని మసీదు నమూనాలో నిర్మింపబడినందువల్ల మక్కా మసీదు అని పేరు వచ్చింది. ఈ మసీదు నిర్మాత మహమ్మద్ కుతుబ్‌షా. అతడు మక్కా నుండి ఒక రాయిని తెప్పించి దానిని ఈ మసీదుకు మొదటి పునాది రాయిగా వేశాడట. అందువల్ల మక్కా మసీదు అనే పేరు వచ్చిందని మరొక అభిప్రాయం ఉంది. మక్కా నుండి కొంత మట్టిని తెప్పించి ఇటుకలు చేయించి మధ్య ఆర్చ్‌లో కూర్చాడని ఇంకొక అభిప్రాయం ఉంది. ఈ మసీదు హాలు 67 మీటర్ల పొడవు, 54 మీటర్ల వెడల్పు, 23 మీటర్ల ఎత్తు ఉంది. మూడువైపులా 5 చొప్పున ఆర్చీలు నిర్మించారు. మొత్తం 15 ఆర్చీలున్నాయి. పశ్చిమదిశన మాత్రం ఆర్చీలు లేకుండా పెద్ద గోడను నిర్మించారు. ఈ గోడ మీద Mehrab ను అమర్చారు. 15 ఆర్చీల మీద మసీదు కప్పు నిర్మింపబడింది. నాలుగు మూలలా నాలుగు పెద్ద మినరేట్లు ఉన్నాయి. ప్రతి మినరేట్ మీద గుమ్మటం ఉంది. ఈ మినరేట్‌లు ఒకే గ్రానైట్ రాతితో మలచబడింది. ఈ మసీదులో 10 వేల మంది ఒకేసారి నమాజు చేయవచ్చు. ఇండియాలోని పెద్ద మసీదులలో ఇది ఒకటి. షేర్వాణి దీనిని ఢిల్లీలోని జామా మసీదుతో పోల్చవచ్చని అన్నారు.

ఈ మసీదును మహమ్మద్ కుతుబ్‌షా హిజ్రా 1023 అంటే క్రీ.శ. 1614లో ప్రారంభించాడు. దాని నిర్మాణ పర్యవేక్షణకు దరోగా మీర్‌ఫైజుల్లా బేగ్, చౌదరి రంగయ్య అనే వారిని నియమించాడట. రంగయ్యకు హునార్‌మండ్ ఖాన్ అని కూడా పేరుందట. మసీదు పునాది రాయిని వేయబోయేముందు కుతుబ్‌షా పట్టణంలోని పవిత్ర పండితులను ఆహ్వానించి ఎవరైతే నియమం తప్పకుండా రోజూ ఐదుసార్లు నమాజ్ చేశారో వారు ముందుకువచ్చి మొదటి పునాది రాయిని వేయమని కోరాడట. కాని ఎవరూ ముందుకు రాలేదు. చివరకు తానే ముందుకువచ్చి తన 12వ ఏట నుండి ఒక్కసారి కూడా నమాజు మానలేదని, ప్రతిరోజూ ఐదు సార్లు నమాజు చేశానని ప్రకటించాడట. అప్పుడు అక్కడ సమావేశమైన ప్రతి ఒక్కరూ మొదటి పునాది రాయిని వేయడానికి సుల్తానే అర్హుడని ముక్తకంఠంతో పలికారట. దాంతో సుల్తాన్ తానే మొదటి పునాది రాయిని వేసి మసీదును ప్రారంభించాడట. కాని ఈ మసీదు అతని కాలంలో పూర్తికాలేదు. 77 సంవత్సరాలు పట్టింది. టావెర్నియర్ మసీదులోని ప్రార్థన చేసే Niche నిర్మాణానికి దగ్గరలోని క్వారీ నుండి కొన్ని రాళ్లను తొలారనీ, ఇందుకు కొన్ని వందల మంది కూలీలు 5 సంవత్సరాలు రాళ్లు తవ్వారనీ, ఆ రాళ్లను 700 ఎడ్లబండ్లలో 5 సంవత్సరాలు మసీదు వద్దకు తోలుకు వచ్చారనీ, ఈ మసీదులోని ఒక గదిలో ప్రవక్త వెంట్రుక, మరికొన్ని పవిత్ర అవశేషాలు ఉన్నాయనీ

రాశాడు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా ఈ మసీదుకు బెతుల్ అటిక్ అని పేరు పెట్టాడు. ఈ మాటలో మసీదు ప్రారంభించిన సంవత్సరం ఉంది. ఈ మసీదు హిజ్రా 1023లో ప్రారంభించబడింది. ఆ సంవత్సరం పేరు ఈ పదంలో ఉంది. కాని తరువాత మక్కా మసీదు అని పేరు వచ్చింది. మక్కాలోని కాబాలో ఎల్లవేళలా ప్రార్థనలు జరిగినట్లు ఈ మసీదులో కూడా ఎల్లవేళలా ప్రార్థనలు జరుపుతున్నందువల్ల మక్కా మసీదు అని పేరు వచ్చిందని కొందరు అంటారు. ఒక పండితుడు ఈ మసీదును గురించి ఒక కవిత రాసి సుల్తాన్‌కు సమర్పించాడట. ఆ కవితలో ఎవరైనా మక్కాలోని పవిత్ర కాబాను దర్శించలేకపోతే దక్కనులోని ఈ కాబాను దర్శించి ప్రార్థించండి అని అర్థం ఉందట. కానీ ఈ మసీదు మహమ్మద్ కుతుబ్‌షా కాలంలో పూర్తి కాలేదు. అతని తర్వాత అతని కుమారుడు అబ్దుల్లా కుతుబ్‌షా, అతని తర్వాత అతని వారసుడు తానీషాలు నిర్మాణాన్ని కొనసాగించారు. వారు 8 లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. అయినా అది పూర్తి కాలేదు. తానీషా గోల్కొండ యుద్ధంలో ఓడిపోయాడు. క్రీ.శ.1687లో గోల్కొండ రాజ్యం ఔరంగజేబు వశమైంది. అతడు మిగిలిన నిర్మాణాలను చివరగా క్రీ.శ.1694 నాటికి పూర్తి చేశాడు. అప్పటికి మక్కా మసీదుకు పునాది రాయి వేసి 77 సంవత్సరాలైంది. అంటే ఈ మసీదు నిర్మాణం 77 సంవత్సరాలు పట్టింది. మసీదు నిర్మాణం పూర్తయిన తర్వాత దానికి అలంకరణలు చేయమని కొందరు ఔరంగజేబును కోరారట. కానీ అతడు ఆ మసీదు మీద ఇక డబ్బు ఖర్చు పెట్టడానికి ఇష్టపడలేదట. అంతేగాక ప్రపంచంలో ఏ పనులూ ఎవరూ పూర్తిగా చేయలేరు. కనుక ఎంతవరకు ఉంటే అంత మంచిది అని సమాధానం చెప్పాడట. ఈ మసీదు నేటికీ వైభవంగా కొనసాగుతోంది.

అబ్దుల్లా కుతుబ్‌షా కాలం – తోటలు: నిజాముద్దీన్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలం నాటి విశేషాలను తన గ్రంథంలో వర్ణించాడు. అబ్దుల్లా పుట్టిన దగ్గర నుండి తాను అక్కడ నివసించిన వరకు అబ్దుల్లా చరిత్రను కూడా రాశాడు. నిజాముద్దీన్‌కు తోటలంటే చాలా ఇష్టమని తెలుస్తోంది. తన గ్రంథంలో తాను హైదరాబాద్‌లో చూసిన తోటలను వివరంగా వర్ణించాడు. అబ్దుల్లా కుతుబ్‌షా తన పట్టాభిషేకం అయిన 2వ సంవత్సరంలో విలాసయాత్ర చేశాడు. అతడు తన పరివారంతో మొదట లింగంపల్లికి వెళ్లాడు. అక్కడ మహమ్మద్ కులీ నిర్మించిన చిన్న కోట ఉంది. దాని చుట్టూ కూడా పెద్ద తోట ఉంది. అక్కడ కొన్ని రోజులుండి తన రెండవ పట్టాభిషేక ఉత్సవాలను జరుపుకున్నాడు. తర్వాత హుసేన్‌సాగర్ ఎదురుగా ఉన్న నాభట్‌ఘాట్ అంటే నౌబత్‌పహాడ్ కొండమీద మహమ్మద్ కులీ నిర్మించిన భవనానికి వచ్చాడు. ఆ భవనం చుట్టూ ఉన్న తోటలను గురించి నిజాముద్దీన్ చాలా వివరంగా రాశాడు. అక్కడ ఆ కొండ నుండి చుట్టూ ఆరు మైళ్ల వరకు పండ్ల తోటలు, పూదోటలు విస్తారంగా పెరిగి ఉన్నాయి. భవనం చుట్టూ ఉన్న తోటలో 3 రకాల ఫలవృక్షాలు, 3 రకాల పూదోటలు ఉన్నాయి. ఈ భవనం 3 అంతస్తుల గలిగింది. ఆ భవనంలో విలాసవంతమైన జీవితం గడపడానికి కావలసిన అన్ని వసతులు ఉన్నాయి. భవనం, దాని చుట్టూ ఉన్న తోటలు, చుట్టూ మూడు మైళ్ల పొడుగున 100 అడుగుల ఎత్తున మహమ్మద్ కులీ పెద్ద గోడను నిర్మించాడు. అటువంటి అందమైన తోటగాని, ఆ భవనం వంటి విలాసవంతమైన సుందర భవనాన్ని గానీ తానెప్పుడూ చూడలేదని, ప్రపంచంలో అలాంటిది ఉంటుందని తాను భావించడం లేదని రాశాడు. అబ్దుల్లా ఆ భవనంలో కొన్ని నెలలు హాయిగా గడిపాడు. ఈ భవనం హైదరాబాద్ నగరానికి ఉత్తర దిక్కు ఉంది. తర్వాత దక్షిణపు దిక్కున ఉన్న కొహిటూర్ భవనాన్ని, దాని చుట్టూ ఉన్న తోటలను కూడా వర్ణించాడు. అబ్దుల్లా తన 3వ సంవత్సరం పట్టాభిషేక ఉత్సవాలను కొహిటూర్ భవనంలో జరుపుకున్నాడు.

కొహిటూర్ భవనం – తోటలు: మహమ్మద్ కులీ కాలంలో ఈ నగరానికి దక్షిణంగా కొహిటూర్ భవనాన్ని నిర్మించాడు. అది మూడు అంతస్తుల భవనం. ఈ భవనానికి పెద్ద పెద్ద కారిడార్లు, వెంటిలేటర్లు, పెద్ద పెద్ద వేదికలు ఉన్నాయి. భవనం ఎదురుగా 50 అడుగుల పొడవు, 30 అడుగుల వెడల్పు కలిగిన కొలను తవ్వబడింది. భవనం లోపల కూడా చిన్న చిన్న కొలనులున్నాయి. ఈ కొలనులకు ఆ కొండ కింద ఉన్న చెరువు నుండి గొట్టాల ద్వారా పైకి ఎక్కించి ఈ భవనంలోని కొలనులను నింపేవారు. ఈ భవనం చుట్టూ మూడు మైళ్ల ఫలవృక్షాలు, పూదోటలు నాటబడ్డాయి. ఆ పండ్ల తోటల మధ్య గోల్కొండ రాజ్యపు ఉన్నతోద్యోగులు, ముస్లిం సరదారులు తమ నివాస గృహాలను నిర్మించుకొని విలాస జీవితాలు గడిపేవారు. అబ్దుల్లా తన 3వ పట్టాభిషేక ఉత్సవాలు కొహిటూర్ భవనంలో జరుపుకొని కొన్నాళ్లు అక్కడ విలాసమయ జీవితాన్ని గడిపాడని నిజాముద్దీన్ రాశాడు. అంతేగాకుండా అబ్దుల్లా హిజ్రా 1039లో అక్కడ మరొక అందమైన భవనాన్ని నిర్మించాడు. దాని చుట్టూ తోటలు వేయించాడు. ఆ భవనం చూపరులకు ఎంతో ఆశ్చర్యం కలిగించేదని కూడా రాశాడు.

ఉన్నతోద్యోగుల భవనాలు-బోల్సిబేగ్-మీర్జుంలాల భవనాలు: మధ్యయుగంలో చరిత్రకారులందరూ రాజులను గురించి, వారి భవనాలు, వైభవ జీవితాన్ని గురించి రాశారు కాని ఇతర సరదారులను గురించి, ప్రజల గురించి రాయలేదు. నిజాముద్దీన్ తన హదకత్ సలాటిన్‌లో అబ్దుల్లా కాలం నాటి కొందరు సరదారుల భవనాలను కూడా వర్ణించాడు. అలాంటి వారిలో బోల్సిబేగ్, మహమ్మద్ అమీన్ మీర్జుమ్లాలు ముఖ్యులు. బోల్సిబేగ్ ఇల్లు చాలా అందంగా ఉండేదట. అది ఎంతో ఖరీదైన వస్తువులతో అలంకరింపబడిందట. అబ్దుల్లా ఆ భవనాన్ని చూడటానికి వచ్చాడట. అందుకు బోల్సిబేగ్ చాలా ఆనందించాడట. మహమ్మద్ మీర్జుమ్లా నివాస భవనం హౌజ్-ఇ-కుల్జుం అనే పేరు గల ఒక చెరువు వద్ద ఉండేది. ఆ చెరువు 400 అడుగుల పొడవు, 1000 అడుగుల వెడల్పు ఉండేది. ఆ చెరువు నిండా ఎల్లప్పుడూ నీళ్ళ నిండుగా ఉండేవి. ఈ చెరువు వద్ద సుల్తాన్ అబ్దుల్లా దీపాల పండుగను జరిపాడట. వేలాది దీపాలు వెలిగించి మట్టి కుండలలో పెట్టి చెరువు ముందు మీర్జుమ్లా భవనం దగ్గర ఉంచారట. దాంతో ఆ ప్రదేశమంతా వెలిగిపోయిందట. మొగల్ రాయబారులు ఈ భవనంలో విడిది చేసేవారట. మీర్జుమ్లా మొగలుల వైపు చేరిపోయిన తర్వాత మొగల్ రాయబారులు హైదరాబాద్ వచ్చినప్పుడల్లా ఈ భవనంలోనే నివసించే వారట.

బజారులు - షాపులు: నిజాముద్దీన్ తోటలు, భవనాలను గురించి ఎక్కువగా రాశాడు గాని, బజార్లు, షాపుల గురించి ఎక్కువగా రాయలేదు. మొహరం, ఇద్ ఉల్ ఫితర్ మొదలైన పండుగలను వర్ణించేటప్పుడు కొన్ని బజార్ల పేర్లు రాశాడు. మీర్ ఆలమ్ అనే రచయిత బజారులను గురించి ఎక్కువ వివరాలను ఇచ్చాడు. అతడు హైదరాబాద్ మధ్య నాలుగు వైపులా నాలుగు బజారులున్నాయని, ఆ బజారులకు రెండు వైపులా 14,000 షాపులు ఉన్నాయని రాశాడు. ఇంకా మహలులు, హమ్మామేలు, కంఖాలు, మదర్సాలు, మసీదులు, లంగర్ల మొహం ఖానాలు ఉన్నాయని రాశాడు. ఖ్వాజా గులామ్ హుస్సేన్ తన గుల్జారి-ఇ-అసాఫియా, మహమ్మద్ ఖాసిం తన తారిఖ్-ఇ-పరిస్తాలో కూడా ఇవే విషయాలు రాశాడు. ఆనాడు 12 వేల అతిథి గృహాలుండేవి. నగరంలో నాలుగైదు కార్వాన్ సత్రాలు కూడా ఉండేవి. పురాన్‌పూల్ వద్ద నిర్మింపబడిన కార్వాన్ సత్రం చాలా పెద్దదట. మూసీనది ఒడ్డున మహమ్మద్ షాహిబాగ్ కూడా ఉంది. అక్కడే మీర్ ఆలంబాదాదరి కూడా నిర్మింపబడింది. క్రీ.శ.1676లో హైదరాబాద్‌ను దర్శించిన టావెర్నియర్ హైదరాబాద్ నగరం ఆర్లిన్స్ నగరానికంటే చిన్నదని రాశాడు. కనుక కొందరు హైదరాబాద్‌లో అన్ని షాపులు ఉండకపోవచ్చు అన్నారు. కాని ఆనాటికే హైదరాబాద్‌లో విదేశీ వ్యాపారులు కూడా నివసిస్తున్నారు. కనుక షాపులు ఎక్కువగానే ఉండవచ్చు. టావెర్నియర్ క్రీ.శ.1578లో మహమ్మద్ కులీ నిర్మించిన పురాన్‌పూల్ బ్రిడ్జిని చాలా ఘనంగా వర్ణించాడు. దానిని పారిస్‌లోని Pont Neub అనే నూతన బ్రిడ్జితో పోల్చాడు. ఈ బ్రిడ్జి ఇబ్రహీం కుతుబ్‌షా పురాన్‌పూల్ నిర్మాణాన్ని ముగించిన సంవత్సరం పారిస్ Pont Neub బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించాడట. ఇది ఒకరికొకరికి తెలియకుండా జరిగిన విషయం. కాని టావెర్నియర్ వాటి నిర్మాణ విధానంలో పోలికలున్నాయని రాశాడు. ఇబ్రహీం నిర్మించిన వంతెన చాలా బలంగా ఉందని, అంత నేర్పుగా ఎలా నిర్మించారో అని ఆశ్చర్యపోయాడు. క్రీ.శ.1656లో అబ్దుల్లా కుతుబ్‌షా మొగలుల చేతిలో ఓడిపోయి షాజహాన్‌తో సంధి చేసుకున్నాడు. దాంతో గోల్కొండ రాజ్యం తన స్వాతంత్ర్యం కోల్పోయింది. అప్పటి నుండి రాజాజ్ఞల మీద అధికార పత్రాల మీద ఒక ప్రత్యేకమైన వాక్యం Peaceful and blissful end అనే వాక్యంతో రాజముద్ర వేయబడింది. అప్పటి నుండి హైదరాబాద్ నగరంలో భవన నిర్మాణాల పని మందగించింది.

హయతాబాద్ నిర్మాణం క్రీ.శ.1626: అబ్దుల్లా కుతుబ్‌షా కాలంలో చెప్పుకోదగిన మరొక విశేషం హయత్‌నగర్‌ను నిర్మించటం. అబ్దుల్లా కుతుబ్‌షా తన తల్లి హయత్ భక్షిబేగం పేరుతో క్రీ.శ 1626లో హయతాబాద్ గ్రామాన్ని నిర్మించాడు. అక్కడ రాజభవనం, మసీదు, ఓదారు సత్రాలు నిర్మింపబడ్డాయి. ఈ గ్రామం హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వెళ్ళే మార్గంలో హైదరాబాద్‌కు 8 మైళ్ళ దూరంలో ఉంది. ఈ గ్రామం వర్తక వ్యాపారులు నివసించడానికి కూడా చాలా వసతిగా ఉండేది. అక్కడ ఇంకా ఖాస్‌బాగ్, అనేక దుకాణాలు, విద్యాసంస్థలు వెలిశాయి. ఇంకా హయత్‌భక్షి బేగం జ్ఞాపకార్థం 5వ మొహ్రం అన్నసత్రం, హౌసేస్ ఆలం, ఓటా చష్మా, ఓటా ఆలం కూడా నిర్మింపబడ్డాయి. ఆమెను హయత్‌మా అని ప్రజలు పిలిచేవారట. నిజాముద్దీన్ కూడా హయతాబాద్‌ను గురించి రాశాడు. ఇక్కడి రాజభవనంలోని అంతఃపురం ఫ్రెంచి రాజభవనం లాగా మనోహరంగా ఉంటుందని టావెర్నియర్ రాశాడు.

హైదరాబాద్ అతి సుందర నగరంగా అభివృద్ధి చెందింది. అందుకు ముఖ్యమైన కంభక్ష అక్కడ ఒక గృహాన్ని

నిర్మించుకున్నాడు. అందుకు ఔరంగజేబు కోపించాడు. హైదరాబాద్ వశమైన తర్వాత ఔరంగజేబు కూడా పట్టణ సౌందర్యాన్ని మెచ్చుకొని అక్కడ నాలుగు మాసాలు ఉన్నాడు. ఔరంగజేబు కాలం నాటి రచయిత కాఫీఖాన్ హైదరాబాద్‌ను మించిన సుందర పట్టణం మరేదీ లేదని మెచ్చుకున్నాడు. మొగల్ దర్బారుకు చెందిన షాజహానాబాద్ వాస్తవ్యుడు సాకీ అనే అతడు కూడా హైదరాబాద్ నవరత్నాల అంగళ్లు, రంగురంగుల పూల తోటలతో వైభవంగా వెలిగే పట్టణం అని వర్ణించాడు. ఆ విధంగా మొగలుల ప్రశంసలు పొందిన పట్టణం హైదరాబాద్. అలాగే బ్రిటిష్ వారు కూడా హైదరాబాద్‌ను ప్రశంసించారు. బ్రిటిష్ అధికారి మెతోల్డు కుతుబ్ షాహీల రాజప్రాసాదాలు, మొగలుల భవనాలకంటే పెద్దవి అని రాశాడు.

అబుల్ హసన్ తానీషా: కుతుబ్‌షాహీ వంశంలో అబుల్ హసన్ తానీషా చివరివాడు. అతని కాలం అంతా యుద్ధాలతో ఒడిదుడుకులుగా గడిచిపోయింది. అయినప్పటికీ అతని కాలంలో కూడా కొన్ని భవనాలు నిర్మించబడ్డాయి. చార్‌మహల్ అనే పేరుతో 4 భవనాలు నిర్మించాడు. ఈ భవనాలు ఒక కొలను చుట్టూ ఒకదానికొకటి ఎదురుగా నిర్మించాడు. ఈ భవనాలపై అలంకరణగా అందమైన చిత్రాలు నిర్మించారు. తానీషా కాలంలో హైదరాబాద్‌ను దర్శించిన థీవ్‌నోట్ అనే అతడు ఈ భవనాలను గురించి తాను రాసిన తారీఖ్-ఇ-ఓల్‌షష అనే గ్రంథంలో వర్ణించాడు.

ఘోషామహల్: ఈ నాలుగు భవనాలే గాక తానీషా ఘోషామహల్ అనే మరొక సుందరమైన భవనాలను కూడా నిర్మించాడు. ఈ ఘోషామహల్ నుండి గోల్కొండ కోటలోకి మార్గం ఉందని అంటారు. ఘోషామహల్ పక్కనే ఒక కొలను ఉండేది. ఆ కొలనుపై ఒక అందమైన కమాన్ నిర్మింపబడింది. అబ్దుల్లా తానీషా కాలంలో కాలాపహాడ్ వేసవి విడిదిగా, కొహిటూర్ వర్షాకాలపు విడిదిగా ఉండేవట.

తానీషాను ఓడించి ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని, హైదరాబాద్ నగరాన్ని ఆక్రమించాడు. మొగలుల కాలంలో హైదరాబాద్ నగర నిర్మాణం ఆగిపోయింది. ఆసఫ్‌జాహి వంశస్థాపన తర్వాత తిరిగి కట్టడాల నిర్మాణం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అయిన తర్వాత హైదరాబాద్ నగరం బహుముఖంగా విస్తరించింది. భారతదేశపు ప్రధాన నగరాలలో ఒకటిగా అభివృద్ధి చెందింది. నేడు ఇంకా అభివృద్ధి కొనసాగుతోంది. ఇకముందు కూడా కొనసాగుతుంది.

హైదరాబాద్ లాల్‌దర్వాజా, ఢిల్లీ దర్వాజా, గౌలిపురా దర్వాజా, ఫతే దర్వాజా అనే నాలుగు ప్రధాన దర్వాజాలుండేవి. వాటిలో ఫతేదర్వాజా పురావస్తు వారి అధీనంలో ఉంది. మిగిలిన మూడు దర్వాజాలు పడిపోయాయి. అబ్దుల్లా కాలం నుండి ఇరానీ వస్తు పద్ధతి, హిందూ అలంకారాలైన పూలు, లతలు కలిసిన హిందూ ముస్లిం శిల్పకళా సమ్మేళనంతో భవనాలు నిర్మించడం బాగా ఎక్కువైంది. అదే పద్ధతి అనుసరించి తానీషా కూడా కట్టడాలు నిర్మించాడు. అతని కాలంలో బీజాపూరు సేనాని సిద్ధి మసూద్‌ఖాన్ ఆదోనిలో 2 లక్షల ఖర్చుతో జామీ మసీదు నిర్మించాడు. అందులో హిందూ శిల్పకళా లక్షణాలున్నాయి.

తానీషా కాలంలో అక్కన్న, మాదన్నలు మంత్రి సేనాధిపతులుగా ఉన్నందువల్ల అనేక హిందూ దేవాలయాలు నిర్మింపబడ్డాయి. కొన్ని పునరుద్ధరింపబడ్డాయి. వారు మైసారంలో ఒక శివాలయాన్ని నిర్మించాడు. దానికి అనుబంధంగా ఒక చట్టాన్ని కూడా ఏర్పాటు చేశారు. గోల్కొండలోని బాలాహిస్సార్‌లో శిథిలస్థితిలో ఉన్న ఒక దేవాలయాన్ని పునరుద్ధరించారు. గోల్కొండ కోటలలో అంబర్‌ఖానాకు కుడివైపున ఒక గుహాలయాన్ని మాదన్న నిర్మించాడు. అనంతగిరిలో మరొక దేవాలయాన్ని నిర్మించాడు. విజయవాడలోని అక్కన్న మాదన్న గుహాలయాలను బాగు చేయించారు. అందువల్ల వాటికి అక్కన్న మాదన్న గుహలని పేరు వచ్చింది. కుతుబ్‌షాహీల సరదారులు వినుకొండ, కంభం, కొండపల్లి, కొండవీడులలో అనేక భవనాలు, మసీదులు నిర్మించారు. కొండవీటి దగ్గరున్న అమీనాబాద్ గ్రామంలోని ఒక చిన్న గుట్టపై కుతుబ్‌షాహీల కాలం నాటి ఒక చిన్న కట్టడం నేటికీ చెక్కు చెదరకుండా ఉంది.

కలంకారీ చిత్రాలు: ఈ కాలంలో కలంకారీ చిత్రకళ బాగా అభివృద్ధి చెందింది. మచిలీపట్టణం కలంకారీ చిత్రకళకు పెట్టింది పేరు. నవాబులు విదేశస్తుల అభిరుచులకు అనుగుణంగా కలంకారీ చిత్రాలు చిత్రించేవారు ఆ కలంకారీ అద్దకాలలో గోల్కొండ, బీజాపూరు చిత్రకళ ప్రభావం ఉందని జగదీష్ మిత్తల్ రాశారు.

వర్ణ చిత్రాలు: ఈ కాలంలో వర్ణ చిత్రాలు కూడా అభివృద్ధి చెందాయి. తారీఫ్ హుసేన్‌షా పాద్‌షాహి దక్కన్ అనే మత గ్రంథంలో 14 చిత్రాలున్నాయి. షేర్వాణి ఆ కాలం నాటి చిత్రాల్లో ఇవే మొదటివి అని వ్యాఖ్యానించాడు

అందులో రాక్షస తంగడి యుద్ధానికి చెందిన చిత్రాలు ఉన్నాయి. ఇంకా నాటి దర్బారులు, గ్రామ ప్రాంతాలు సుందరమైన స్త్రీల చిత్రాలు చిత్రించారు. క్రీ.శ.1570వ సంవత్సరంలో నాజ్మల్ ఉలుమ్ చిత్రాలు గీశారు. ఇవన్నీ మొగలాయి చిత్రాలు రాక ముందు గీసినవి. వీటిపై మొగలాయి చిత్రకళ ప్రభావం లేదు. ఇవి పూర్తిగా దక్కను శైలికి చెందినవి. వాటిపై కొంత గుజరాతీ చిత్రకళ ప్రభావం ఉంది. హైదరాబాద్ మ్యూజియంలో అబ్దుల్లా కుతుబ్‌షా, అబుల్‌హసన్‌ల పెద్ద చిత్రాలు ఉన్నాయి. వారి కాలంలో దర్బారులో హిందువుల ప్రభావం ఎక్కువగా ఉండేది. దాని ఛాయలు చిత్రకళలో కూడా కనిపిస్తున్నాయి. మొత్తం మీద కుతుబ్‌షాహీల కాలం ఆంధ్రదేశ సంస్కృతి, హిందూ ముస్లింల మిశ్రమ సంస్కృతి యుగమని చెప్పవచ్చు.

ప్రజాహిత కార్యాలు: కుతుబ్‌షాహీలు గొప్ప ప్రజాహిత తత్పరులు. వారు ప్రజోపయోగానికి అనేక పనులు చేశారు. వారి కాలంలో 12000లకు పైగా సత్రాలు నిర్మించారు. ఇంకా అనేక విశ్రాంతి గృహాలు, పాఠశాలలు, వైద్యశాలలు, భిక్షుగృహాలు, స్నానశాలలు, మసీదులు నిర్మించారు. రాజ్యమంతటా రహదారులు వేయించారు. రహదారుల పక్కన చెట్లు నాటించారు. లంగరు హౌసులు నిర్మించారు. వైద్యశాలలు నిర్మించారు. ఆ రోజుల్లో ప్రజలకు ఉచితంగా వైద్యం చేసి మందులు కూడా ఉచితంగా ఇచ్చేవారు. ఆ వైద్యశాలల్లో పని చేసే డాక్టర్లకు ప్రభుత్వమే జీతాలు ఇచ్చేది. గోల్కొండ రాజదర్బారులో ఒక దబ్బి వైద్య శాస్త్ర నిపుణుడు ఉండేవాడు. అతనికి సంవత్సరానికి 800 పగోడాలు కుతుబ్‌షాహీ జీతంగా ఇచ్చాడు.

తటాకాలు: వ్యవసాయాభివృద్ధికి, తాగునీటి వసతికి వారు అనేక తటాకాలు తవ్వించారు. హుస్సేన్‌సాగర్, ఇబ్రహీంసాగర్, బద్వాల్ చెరువు నిర్మించి వ్యవసాయానికి కృషి చేశారు. మూసీనదిపై ఆనకట్ట నిర్మించి నీటి కొరత తీర్చారు. మూసీపై బ్రిడ్జి నిర్మించి గోల్కొండ, హైదరాబాద్ మధ్య రాకపోకల సౌకర్యం పెంచారు. హుసేన్‌సాగర్ హజరత్ హుసేన్ షావలీ పర్యవేక్షణలో క్రీ.శ.1562లో తవ్వించబడిందట. దాని నిర్మాణానికి రెండు లక్షల హొన్నులు ఖర్చయిందట. ఈ చెరువు హైదరాబాద్ వాసులకు నీటి కొరత లేకుండా చేసింది.

హైదరాబాద్ మొదటి పేరు భాగ్యనగరమా?: మహమ్మద్ కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని తన ప్రియురాలు పేరుతో భాగ్యనగరం పేరిట నిర్మించాడని, తర్వాత తన కుమారుడు హైదర్ పేరుతో హైదరాబాద్‌గా మార్చాడని కథ ప్రచారం ఉంది. ఇది వాస్తవమా, కాదా అని తెలుసుకోవడానికి ఆనాటి ఆధారాలను లోతుగా పరిశీలించవలసి ఉంటుంది. ఆ కాలానికి చెందిన కొన్ని ఆధారాలలో భాగ్యమతి పేరు ఉంది. భాగ్యమతిని మొట్టమొదటిసారి ప్రస్తావించిన వ్యక్తి ఫైజి. ఇతడు అక్బరు రాయబారి. అతడు దక్కను విషయాలను గురించి తనకు ఎప్పటికప్పుడు తెలియజేయడానికి అక్బరు అతనిని బుహనస్‌పూర్, అహమ్మద్‌నగర్‌లలో నియమించాడు. ఫైజి క్రీ.శ.1594లో అక్బరుకు తన నివేదికను పంపుతూ కుతుబ్ ఐముల్క్ విషయులోలుడు, తన పూర్వపు ప్రియురాలు భాగ్యమతి పేరుతో భాగ్‌నగర్ అనే నగరాన్ని నిర్మించాడు అని రాశాడు. అదే కాలంలో నిజాముద్దీన్ తాను రాసిన తబకత్ ఐ అక్బర్‌షాహీలో మహమ్మద్ కులీ భాగమతి అనే స్త్రీని ప్రేమించాడని, ఆమె పేరుతో భాగ్‌నగర్‌ను నిర్మించాడని రాశాడు. అతడు తన గ్రంథంలో భాగమతి కాక భాగమని అని పేర్కొన్నాడు. ఫెరిష్టా కూడా హిజ్రా 1018 క్రీ.శ.1609-10 సంవత్సరంలో తాను రాసిన గ్రంథంలో భాగమతి ఎప్పుడు గోల్కొండ వచ్చినా ఆమెకు 1000 మంది అశ్వికుల రక్షణ ఉండేదనీ, సుల్తాన్ తన నూతన రాజధానికి మొదట ఆమె పేరు పెట్టి తర్వాత హైదరాబాద్ అని మార్చాడనీ రాశాడు. అబ్దుల్‌బాకి క్రీ.శ.1616లో రాసిన మాతిరి ఐ రహిమి లోనూ, కాఫిఖాన్ రాసిన మంతకాబు ఐ లుబాబ్‌లోనూ భాగమతి, భాగ్యనగర్‌ల ప్రస్తావన ఉంది.

ఆచార్య షేర్వాణి వీరు రాసిన విషయాలు వాస్తవాలు కాదు అని అంటారు. ఫైజి ఎప్పుడూ హైదరాబాద్‌లో అడుగుపెట్టలేదు. అతడు రాసినదంతా తాను విన్న కథలే అని పేర్కొన్నారు. తబకత్ నిజాముద్దీన్, ఫెరిష్టాలు ఆమె రక్షణకు 1000 మంది అశ్వికులు నియమింపబడ్డారని రాశాడు. కాని ఫెరిష్టా రాసిన గుల్షన్ ఐ ఇబ్రహిమిలో అనేక తప్పులున్నాయి. సోనేపట్ యుద్ధం తర్వాత సుల్తాన్ హైదరాబాద్ వెళ్లాడని, షా పర్షియా కుమారునికి హయత్‌భక్షిని వివాహానికి అడిగారని, ఈ విషయాలన్నీ సవ్యంగా రాయలేదు. కనుక వారి రాతలు నమ్మవలసిన పనిలేదు అని షేర్వాణి రాశారు. హైదరాబాద్‌లో క్రీ.శ.1616లో రాయబడిన తారీఖ్ మహమ్మద్ కుతుబ్‌షాహి గ్రంథంలో భాగమతి పేరు గాని, భాగ్యనగర్ పేరు గాని లేదు. క్రీ.శ.1644లో నిజాముద్దీన్ అహమ్మద్ సైయిది రాసిన హది కుతుస్‌సలాటీన్‌లో హైదరాబాద్‌ను గురించి రాశాడు. కాని అందులో భాగమతి పేరు గాని, భాగ్యనగర్ అనే పదం గాని లేదు. సుల్తాన్ రాసిన కుల్లియత్‌లో తన 17 మంది భార్యలలోని మొదటి ఐదుగురి

మీద వివరాలు ఉన్నాయి. కాని అందులో భాగమతి పేరు లేదు. భాగమతి అంత గొప్ప ప్రియురాలైతే ఆమె పేరు అందులో ఉండాలి గదా అని అంటారు షేర్వాణీ. భాగమతికి వివాహం అయిన తర్వాత ఆమె పేరు హైదర్ మహల్‌గా మార్చిందనీ, కనుక హైదరాబాద్ అని పేరు పెట్టారని కూడా ఒక వాదన ఉంది. దానికీ ఆధారాలు లేవని షేర్వాణీ అంటారు. సుల్తాన్ రాసిన కవితల్లో హైదరాబాద్ పేరు మాటిమాటికి వస్తుంది. అందులో భాగ్యనగర్ అని పేరే లేదు. సుల్తాన్ కలికే హైదర్ అనే రెండో పేరుంది. ఆ విషయాన్నే మీర్ మోమిన్ పద్యా నిర్మాణం చేశారు. అంతేగాక నాణేలు కూడా ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయని షేర్వాణీ అన్నారు. క్రీ.శ.1584లో ముద్రించిన నాణేల మీద గోల్కొండ ముద్రాలయం అని ఉంది. క్రీ.శ.1603-04 సంవత్సరంలో ముద్రించిన నాణేల మీద హైదరాబాద్ అని ఉంది. కాని భాగ్యనగర్ అనే పదం లేదు. అంతేగాక కుతుబ్‌షాహీల రాజ్యం పోయిన తర్వాత భాగ్యనగర్ అనే మాట మరుగునపడిపోయింది. అసఫ్ జాహీల కాలంలో ఈ కథ తిరిగి ప్రచారంలోకి వచ్చింది. క్రీ.శ.1816లో గులాం హుసేన్‌ఖాన్ రాసిన మాస్నవీలో ఈ కథ ప్రత్యక్షమైంది. పైగా వర్ణించిన చిన్న చక్కని పెద్ద కథ అలా కూర్చుంది. కనుక ఇది 18-19 శతాబ్దాల కథ మాత్రమే, వాస్తవం కాదు అని షేర్వాణీ అన్నారు.

ఆయనే హైదరాబాద్‌కు భాగ్యనగర్ అని పేరుండని అంగీకరించారు. ఐరోపా వారు భాగ్‌నగర్, హైదరాబాద్ అనే రెండు పేర్లతో వ్యవహరించారు. బెర్నియర్, థేవనాట్ క్రీ.శ.1666లో రాజధాని హైదరాబాద్, భాగనగర్ అనే రెండు పేర్లు తమ రాతలలో పేర్కొన్నారు. హైదరాబాద్ అధికారిక పేరు, భాగ్‌నగర్ అనే పేరు ప్రజలు పిలిచేవారు అని రాశారు. టావెర్నియర్ అబ్దుల్లా కాలంలో హైదరాబాద్‌ను దర్శించారు. అతడు నగర నిర్మాణాన్ని వివరిస్తూ ఈ నగరాన్ని ప్రస్తుత సుల్తాన్ తాత నిర్మించారు. ఈ నగరంలో చాలా తోటలున్నాయి. ఇది భాగ్‌నగర్ అని పిల్చేవారు. కనుక టావెర్నియర్ కంటే 60 సంవత్సరాల ముందు రల్ఫ్ ఫిచ్ కూడా ఇదే అతడు ఈ పట్టణం మొత్తం ఒక తోట అని అన్నాడు. కనుక పిచ్చిని పట్టిన మీద ఆధారపడి షేర్వాణీ హైదరాబాద్‌కు భాగమతి వల్ల గాక ఆ పేరు అక్కడ ఉన్న తోటల వల్ల ఆ పేరు వచ్చింది. కనుక భాగ్‌నగర్ అనే పేరు ప్రజల నోళ్లలో భాగ్‌నగర్ లేక భాగ్యనగర్ అని పేరు వచ్చింది అని షేర్వాణీ చెప్పారు. పైగా తెలుగు సాహిత్యంలో ఎక్కడా భాగ్యనగర్ అనే పేరే లేదు అని కూడా అన్నారు.

కాని షేర్వాణీ అభిప్రాయాన్ని అంగీకరించడానికి వీలులేదు. కారణమేమిటంటే ఆయన సమకాలీన రాతప్రతి ఫైజీ. ఫెరిష్తా. నిజాముద్దీన్ రచనలను అంగీకరించలేదు. పైగా అవి తప్పని అన్నారు. తర్వాత కాలానికి చెందిన అంటే అబ్దుల్లా కుతుబ్‌షా కాలానికి చెందిన వారి రచనలు వాస్తవాలంటున్నారు. తర్వాత వారు పిచ్చల ఏం రాశారు. తర్వాత కుతుబ్‌షాహీల తర్వాత మరుగున పడిపోయింది అని అన్నారు. అది వాస్తవం. కారణం ఏమిటంటే- మొదట పెట్టిన పేరును తొలగిస్తే రెండవసారి పెట్టిన హైదరాబాద్ అనే పేరు వాడా ప్రచారంలో ఉంది. కనుక భాగ్యనగర్ అనే పేరు మరుగునపడిపోయి ఉండవచ్చు. అందువల్లనే తర్వాత రచయిత భాగ్యనగర్ అనే మాట్ని వాడలేదు. ప్రజలలో భాగ్యనగరం అని వాడుకలో ఉంది అని విదేశీయులు రాశారు. అధికారికంగా మాత్రమే హైదరాబాద్ అని ఉంది. అంటే ప్రజలలో మొదటి పేరు ఇంకా ప్రచారంలో ఉన్నట్టు మాట. టావెర్నియర్ అది తోటల నగరం కనుక భాగ్‌నగర్ అని వాడాడని షేర్వాణీ అన్నారు. మరి ప్రజలలో ఎందుకు భాగ్‌నగర్ అని వాడుకలో ఉంది? అంటే టావెర్నియర్ తోటల అర్థంలో భాగ్‌నగర్ అనే పదం వాడాడు అనేది షేర్వాణీ ఊహ మాత్రమే. తెలుగు సాహిత్యంలో భాగ్‌నగర్ అనే పేరు లేదనడం కూడా వాస్తవం కాదు. అద్దంకి గంగాధర కవి తన తపతీ సంవరణంలో భాగ్యనగరం అని రాశాడు. కనుక మొదట భాగ్యనగరం అని పేరు పెట్టి తర్వాత హైదరాబాద్‌గా మార్చినందువల్లనే భాగ్యనగరం అనే పేరు మరుగున పడిపోయింది.

కొండపల్లి, కొండవీడు దుర్గాలు

కుతుబ్‌షాహీల కాలంలో కోస్తాలో కొండపల్లి, కొండవీడు దుర్గాలు ప్రసిద్ధి చెందాయి. తీరాంధ్ర దేశపు రక్షణ అంతా ఈ రెండు దుర్గాల మీద ఆధారపడి ఉండేది. అందువల్ల ఈ దుర్గాల రక్షణ కోసం వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. కొండపల్లి దుర్గం వారి స్వాధీనమైన తర్వాత అక్కడ కోటను పునర్నిర్మాణం చేసి అన్ని దిక్కులలో బలిష్టమైన బురుజులను నిర్మించారు. ఆ బురుజులు కొండల శిఖరాలపై నిర్మించినందువల్ల చాలా ఎత్తుగా కనిపిస్తాయి. అలాగే తూర్పు, పశ్చిమ దేశాలలో బలమైన ద్వారాలను నిర్మించారు. వాటి ముందు రక్షణకు ప్రత్యేక బురుజులను నిర్మించారు. తానీషా కాలంలో పశ్చిమ ద్వారాన్ని అతి బలిష్టంగా రూపొందించాడు. ఆ ద్వారం పక్కన ఉన్న బురుజుల మీద పెద్ద ఫిరంగులను పెట్టించాడు. నేటికీ అక్కడ ఆ బురుజులపై పెద్ద ఫిరంగి ఉంది. ఈ ద్వారాన్ని గోల్కొండ గేటు అని పిలిచేవారు. గోల్కొండ వెళ్లాలన్నా, గోల్కొండ నుండి వచ్చే సైన్యం ఈ కోటలో ప్రవేశించాలన్నా ఈ ద్వారం గుండానే రాకపోకలు జరిగేవి. కోట మధ్యలో పెద్ద చెరువు ఉంది. ఆ చెరువు వేసవి కాలంలో కూడా నిండుగా ఉంటుంది. కొండపల్లి కోట ఏనాడూ నీటి ఎద్దడికి గురికాలేదు. ఈ తటాకానికి తూర్పు వైపున రాచనగరు నిర్మింపబడింది. దర్బారు హాలు, రాజమహలు, జనానా, మార్కెట్లు ప్రదేశం అన్ని పెద్ద పెద్ద రాళ్లతో నిర్మింపబడ్డాయి. రాజులు నివసించిన జనానా భవనంలో గోడలకు గూళ్లున్నాయి. భవనం ముందు విశాలమైన ఆవరణ అందులో మధ్యలో ఫౌంటెన్ ఉంది. ఈ రాచనగరుకు ఉత్తరంగా ఒక గుట్ట మీద ఆయుధాగారం ఉంది. ఆయుధాగారానికి ముందు మరొక చిన్న చెరువు ఉంది. ఈ కోటకు నాలుగు వైపులా ఎత్తయిన శిఖరాలుండేవి. మధ్యలో విశాలమైన సమతలం ఏర్పడి ఉంది. అందువల్ల అక్కడ బలిష్టమైన దుర్గాన్ని నిర్మించటానికి వీలు కలిగింది. అంతకుముందు దీనిని రెడ్డి రాజులు, గజపతులు పాలించారు. కుతుబ్‌షాహీల అధీనమైన తర్వాత కొండపల్లి దుర్గపాలకునిగా ముస్తఫాఖాన్ అనే ఖిలేదారుని నియమించారు. అతడు హిందూ ద్వేషి. కోటలోని హిందూ దేవాలయాలను పడగొట్టి మసీదులు నిర్మించాడు. అందులో ఒక మసీదుకు అజరత్ గాలిబ్ షాహదర్గా అని పేరు పెట్టారు. ఆ దర్గా కోట మధ్యలో ఉన్న చెరువు ఒడ్డు మీద ఉంది. ఆనాడు నిర్మించిన మసీదులు నేటికీ నిలిచి ఉన్నాయి. కొండపల్లి గ్రామంలో అతడు ఒక ముసాఫిర్ ఖానాను కూడా నిర్మించాడు. అది ఫకీరులకు, బాటసారులకు, భిక్షువులకు నిలయంగా ఉంది. దానికి ఎత్తయిన ప్రాకారాలు కూడా ఉన్నాయి. ముస్తఫాఖాన్ కొండపల్లికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక గ్రామానికి ఇబ్రహీంపట్నం అని పేరు పెట్టి అక్కడ ఒక పట్టణాన్ని నిర్మించాడు. అది కృష్ణా నది ఒడ్డున ఉంది. ఈ విధంగా ముస్తఫాఖాన్ కొండపల్లి కోటను బలపరచి చివరకు దానికి తన పేరుతో ముస్తఫానగర్ అని పేరు మార్చాడు. కుతుబ్‌షాహీ కాలంలో కొండపల్లి కోటను ముస్తఫానగర్ అనే పేరుతోనే వ్యవహరించారు. ముస్తఫాఖాన్ తర్వాత క్రీ.శ.1590-1611 వరకు వరుసగా అమీనుల్ముల్క్, ఫరాన్‌ఖాన్, విలాస్‌ఖాన్‌లు వరుసగా పాలించారు. తర్వాత క్రీ.శ.1611లో గుంటుపల్లి ముత్తనామాత్యుడు అనే హిందువును దేశపాండ్యగా మహమ్మద్ కుతుబ్‌షా నియమించాడు.

గుంటుపల్లి ముత్తనామాత్యుడు క్రీ.శ.1611-1658: ముత్తనామాత్యుడు కొండపల్లి పక్కనే ఉన్న గుంటుపల్లి వాస్తవ్యుడు. అతడు ముస్తఫానగర్ దేశపాండ్యగా నియమింపబడిన తర్వాత అతడు అనేక ప్రజోపయోగ కార్యాలు నిర్వహించాడు. అతడు గొప్ప బలపరాక్రమవంతుడు. అతని కాలంలో కొండపల్లి సర్కారులో ప్రజలు సుఖంగా జీవించారు. ప్రజలు అతనిని రెండవ సుల్తాన్‌గా కీర్తించేవారు. అతని శక్తి సామర్థ్యాలను గ్రహించిన అబ్దుల్లా కుతుబ్‌షా కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ దుర్గాల పాలనను కూడా ముత్తనామాత్యునకు అప్పగించాడు. అతడు తనకు అప్పగించిన బాధ్యతను దక్షతతో నిర్వహించాడు. అతడు అనేక దానధర్మాలు చేసి శాసనాలు వేయించాడు. ఆ కాలంలో గొప్ప వీరుడుగా పేరు పొందాడు.

తానీషా కాలం: తానీషా కాలంలో అతని మంత్రి మాదన్నను వెంటబెట్టుకొని దేశ పర్యటన చేశాడు. క్రీ.శ.1674-1676-1678 సంవత్సరాలలో ఈ పర్యటనలు జరిగాయి. ఈ సందర్భంలో అతడు కొంత కాలం కొండపల్లి కోటలో నివసించాడు. ఆ సమయంలో అతడు దుర్గానికి పశ్చిమ దిక్కున గోల్కొండ దర్వాజాను కట్టించాడు. దుర్గంలో ఉత్తర దిక్కున ఉన్న బలీ మాన్యం అని పిలువబడే ప్రదేశంలో బాలాహిస్సార్ అనే గొప్ప భవనాన్ని నిర్మించాడు. దానిని బర్మా టేకుతో నిర్మించాడు. అది చిత్రవిచిత్ర శిల్పకళా సౌందర్యంతో దివ్యంగా

ఉండేదట. నేడు ఈ భవనాన్ని స్థానికులు భోగం మేడ అని పిలుస్తున్నారు. మాదన్న ఈ సందర్భంలోనే తానీషాకు కొండపల్లి రాజ్యానికి రెండవ రాజధానిగా చేయమని సలహా ఇచ్చాడు. మొగలుల దండయాత్రలు గోల్కొండపై సాగుతున్నందు వల్ల ప్రమాద సమయాలలో ఈ కోటకు చేరి తమను తాము రక్షించుకోవచ్చునని సలహా చెప్పాడు. ఆ సలహాను పాటించి తానీషా ఈ కోటకు పూర్తిగా మరమ్మతులు చేసి బలపరిచాడు. కుతుబ్‌షాల కాలంలో కొండవీటి కోట కంటే కొండపల్లి కోటకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. అందువల్ల ఆ కాలంలో కొండపల్లి బాగా వెలిగింది. కొండపల్లిలో క్రీ.శ.1530 నాటి కుతుబ్‌షాహి రాజ్యస్థాపకుడైన కులీకుతుబ్‌షాకి చెందిన రెండు శాసనాలు ఉన్నాయి. ఆ శాసనాలలో పాంచాణం వారు మొదలైన సీమ ప్రజల విన్నపం ప్రకారం పన్నులు తగ్గించబడ్డాయని ఉంది.

కొండవీడు దుర్గం: గోల్కొండ నవాబుల కాలంలో ప్రసిద్ధి చెందిన దుర్గాలలో కొండవీడు కూడా ఒకటి. దక్షిణ కోస్తా ప్రాంతానికి కొండవీడు ప్రధాన దుర్గం. ఈ దుర్గాన్ని రెడ్డిరాజులు నిర్మించారు. తర్వాత గజపతులు, తర్వాత విజయనగర చక్రవర్తులు ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నారు. తళ్లికోట యుద్ధం తర్వాత ఇబ్రహీం కుతుబ్‌షా కాలంలో కొండవీడు రాజ్యం కుతుబ్‌షాహీల వశమైంది. అప్పటి నుంచీ ఈ దుర్గం చివరి వరకు కుతుబ్‌షాహీల అధికారంలో కొనసాగింది. కొండవీడు దుర్గాన్ని గురించి తెలుసుకోవడానికి కొండవీటి కైఫీయత్తు, కొండవీటి దండకవిలె, కొండవీటి సామ్రాజ్యం అనే గ్రంథాలు చాలా ఉపయోగపడుతున్నాయి. ఆ రోజుల్లో దానిని కొండవీడు రాజ్యం అని కూడా పిలిచేవారు.

కొండవీటి దండకవిలె రచన క్రీ.శ.1810: సర్వేయర్ జనరల్‌గా నియమించబడిన శ్రీ మెకంజీ ప్రతి గ్రామంలోని శాసనాలు, ఆ గ్రామాధికారుల వాఙ్మూలాలను వారి కైఫీయత్తుల నుండి గ్రహించి, చర్చించి గ్రామ చరిత్రలు, దేశ చరిత్రలు రాయించారు. తర్వాత సి.పి.బ్రౌన్ తమ వ్యాఖ్యలతో శుద్ధప్రతులు రాయించి లోకల్ రికార్డ్స్ అనే పేరుతో మద్రాసు మ్యూజియంలో భద్రపరిచారు. పులిగడ్డ మల్లయ్య అనే అతడు ఆంధ్రదేశం వచ్చి కైఫీయత్తులను రాయించాడట. ఇతనిని మెకంజీ నియమించాడు. కానీ కొండవీటి కైఫీయత్తు, దండకవిలె ఎవరు రాసిందీ సంతకాలు లేవు. జయుని నాగభట్టు క్రీ.శ.1328లో రాశాడని శ్రుతి. తర్వాత సంపుటం కోనప్ప రాయించినట్లు మరొక కథ ఉంది. కొండవీటి కరణాల ఇంటి పేరు సంపుటం వారని, తర్వాత కొండవారుగా మారిందని, వారి వంశంలో వాడే ఈ సంపుటం కోనప్ప అని అభిప్రాయం ఉంది. ఇతడు 19వ శతాబ్దం తొలి సంవత్సరాల వాడని భావించారు.

కొండవీడు పర్వతం 30 మైళ్ల వైశాల్యం ఉంది. 50 జోరులు ఉన్నాయి. కొండవీటి కొండ ఎత్తు 1725 అడుగులు. కోటప్పకొండ 1615 అడుగుల ఎత్తు. బెల్లంకొండ 1569 అడుగులు. మంగళగిరి కొండ 875 అడుగుల ఎత్తు ఉన్నాయి అని గుంటూరు జిల్లా జాగ్రఫీలో పేర్కొనబడింది. కొండవీటి కొండలో బైరాగుల గుహ ఓళం నరసింహుని గుహ, మేకల గయి మొదలైన గుహలు కూడా ఉన్నాయి. పుట్టకోటకు ఉత్తర భాగంలో గృహ రాజు మేడ ఉంది. ప్రోలయవేముడు చదలవాడ రాఘవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. దీనిని బట్టి కొండవీటి రెడ్లకు చదలవాడతో సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది.

కొండవీటి దుర్గ నిర్మాణం: మధ్యయుగంలో ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన కోట కొండవీటి కోట. కొండవీటి పట్టణం కాకతి గణపతిదేవుని కాలం నాటికే ఉన్నట్టు గణపతి మోటుపల్లి శాసనం వల్ల తెలుస్తోంది. శక 1160 నాటి గణపతి దేవుని మోటుపల్లి శాసనంలో సాయంకొండ పట్టణం అని ఉంది. అలాగే కామరాజుగడ్డ గ్రామంలోని ముక్తేశ్వరస్వామి దేవాలయానికి గణపతి దేవుడు దానం చేసిన గ్రామాన్ని విశ్వాసుతుడు అనే ఉద్యోగి బ్రాహ్మణులకు అగ్రహారంగా ఇచ్చాడు. ఈ రెండు శాసనాలను బట్టి గణపతి దేవుని కాలంలోనే కొండవీడు పట్టణం ఉందని తెలుస్తోంది. కాని కొండవీడు రెడ్డిరాజుల రాజధాని అయినప్పటినుండే ప్రఖ్యాతిలోకి వచ్చింది.

కొండవీడు కొండ ఈశాన్య దిక్కు నుండి నైరుతి దిక్కు నుండి ఈశాన్య దిశగా 15 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. 4 మైళ్ల వెడల్పు, 6 కిలోమీటర్ల వెడల్పున నాలుగు వరసలుగా కొండలు ఉన్నాయి. ఆ కొండలపై ఎత్తుగా శిఖరాలున్నాయి. ఈ కొండల మొత్తం చుట్టుకొలత 30 మైళ్లతో 50 జోరులుగా ఉన్నాయి. ఈ పర్వత వరుసలలో దక్షిణ దిక్కున చివరగా ఉన్న శిఖరాన్ని నన్నకొండ అని అంటారు. పర్వతానికి పశ్చిమంగా కొండపాదంలో కొండవీడు పట్టణం ఉంది. అక్కడి నుండి కొండపై ఉన్న జోరులతో కోటగోడ సంధింపబడింది. ఈ కోట పెద్ద పెద్ద బండలతో చాలా బలంగా నిర్మింపబడింది. దక్షిణ దిక్కున అర మైలు పైన ఉన్న పెద్ద శిఖరం

వరకు కోట గోడ నిర్మింపబడి చాలా ఎత్తుగా కనిపిస్తుంది. అలాగే ఉత్తర దిక్కున కూడా బలమైన గోడ నిర్మింపబడింది. ఉత్తర దిక్కు నుండి తూర్పు దిక్కున ఉన్న పెద్ద శిఖరం వరకు కోట నిర్మింపబడింది. ప్రస్తుత గ్రామానికి తూర్పుగా రెడ్డి రాజుల కాలం నాటి పట్టణం ఉండేదని స్థానికులు చెబుతారు. వారు చూపిన ప్రదేశంలో అనేక శిథిలాలు ఉన్నాయి. కొండపైన కోటలో అనేక భవనాలు, శిథిల దేవాలయాలు నేటికీ కనిపిస్తున్నాయి. ఆ కోట మధ్య అంటే శిఖరాల మధ్యలో పెద్ద లోయ ఉంది. ఆ లోయ మధ్యలో పెద్ద చెరువు ఉంది ఆ చెరువునిండా ఈనాడు కూడా నీరు ఉంది. ఇంకా అక్కడ అనేక బావులు కూడా ఉన్నాయి. కింది కోట ద్వారం వద్ద ఒక మసీదు ఉంది. అక్కడ కొన్ని భవనాల శిథిలాలు కూడా ఉన్నాయి. దక్షిణ దిక్కున మూడు చెరువులు ఉన్నాయి. ఆ చెరువుల నిండా నీరు ఉంది. ఇది నేడు మనకు కనిపించే కొండవీటి దుర్గం స్థితి ఈ కోటను 800 సంవత్సరాల కింద విశ్వంభర దేవుడు నిర్మించాడని కొండవీటి దండకవిలె తెలుపుతోంది. ఈ విశ్వంభరదేవుడు కపిలేశ్వర గజపతి కుమారుడు హంవీరుడు కావచ్చు. లేదా ప్రతాపరుద్ర గజపతి కుమారుడు వీరభద్ర గజపతి కావచ్చు. అతనికి విద్యాధరుడని పేరుంది.

కొండవీటి కొండపై ఉత్తర దిశలో మొత్తం పుట్టకోట, అరకోట, పిల్లకోట, పెదమాలెముకోట, చినమాలెము కోట, తట్టకోట అనే 6 కోటలు నిర్మింపబడ్డాయి. వీటిలో కొండకు ఉత్తరాన కొండల మధ్యలో పుట్టకోట ఉంది. దానినే ప్రోలయ వేమారెడ్డి నిర్మించాడు. దానికే కుండినపురం అనే పేరు ఉండని దండకవిలె తెలుపుతోంది. మాంబాళ్ల శాసనం, గోపీనాథ అలయ శాసనం కూడా దానిని కుండినపురమనే పేర్కొంది. చింతలవారి పంచాంగ పీఠిక కూడా కొండవీటిని కుండినపురమనే తెలుపుతోంది. కొండ కింద పడమర దిక్కులో మరొక కోట ఉంది. దానిని రాయన భాస్కరుడు నిర్మించాడట. దానికి గోపీనాథపురమని పేరు. పెదమాలెంకోట, చినమాలెంకోటలను లాంగూల గజపతి క్రీ.శ.1520-31 సంవత్సరాల మధ్య నిర్మించాడని స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. లాంగూల గజపతి దేవరాయ కాలంలో రెండవ దేవరాయలు కొండవీటిని జయించాడు. అతడు ప్రతాపదేవరాయలు, హరిహరదేవరాయలు అనే వారిని తన ప్రతినిధులుగా నిలిపాడు. వారు క్రీ.శ.1431 నుండి 1454 వరకు కొండవీటిని పాలించారని స్థానిక కైఫీయత్తులు తెలుపుతున్నాయి. ప్రౌఢ దేవరాయలు అదే కాలంలో రాజమహేంద్రవరాన్ని కూడా జయించి దానికి అతని మంత్రి నాగభూపాలుని కుమారుడు మల్లయను తన ప్రతినిధిగా నియమించాడు. మల్లయ క్రీ.శ.1445 వరకు రాజమహేంద్రవరాన్ని పాలించాడు. 1454లో కపిలేశ్వర గజపతి కొండవీటిని జయించాడు. ఆనాటి నుండి శ్రీకృష్ణదేవరాయలు 1515లో కొండవీటిని జయించే వరకు అది గజపతుల చేతుల్లో ఉంది. గజపతుల చేతుల్లో ఉన్న ఆ కాలంలో విశ్వంభర దేవుడు బృహత్తర ప్రణాళికతో ప్రస్తుతపు కోటను నిర్మించి ఉంటాడు. ఈ కోట చాలా పెద్దది. రెడ్డి రాజుల నాటి కోటకంటే చాలా పెద్దది. ఈ కోటకు 23 బురుజులున్నాయి. పట్టణం 5-6 మైళ్ల వైశాల్యంతో విడు వాడలుగా ఉండేదట. ఇది నేటి లింగిసాని పేట నుండి ముల్లగూరమ్మ కొండ వరకు విస్తరించి ఉంది.

కొండవీటి రాజ్యానికి రెడ్డి రాజుల కాలంలో హద్దులు తూర్పున సముద్రం, దక్షిణాన కంచి, పడమర శ్రీశైలం, ఉత్తరాన రాజమహేంద్రవరం అని వాడపల్లి అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి దానం చేసి అక్కడ అనవేమారెడ్డి సేనాధిపతి కడియం పోతినాయకుడు వేయించిన శాసనం తెలుపుతోంది. కాని ఇది వాస్తవం కాదు. రెడ్డి రాజ్యం కంచి వరకు ఏ నాడూ విస్తరించలేదు. దండకవిలె రెడ్డి రాజ్యం కృష్ణా, గోదావరి, గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల వరకు వ్యాపించి ఉండని తెలుపుతోంది. అంతేగాక దండకవిలె రెడ్డి రాజ్యంలోని దుర్గాలు, సీమలు, గ్రామాలు, రాజ్యపు విస్తీర్ణాన్ని కూడా ఇచ్చింది. ఈ వివరాలను బట్టి చూస్తే రెడ్డి రాజ్యంపై 5 జిల్లాలకు మాత్రమే పరిమితమై ఉంది. కనుక దండకవిలె చెప్పే సరిహద్దులే వాస్తవమైనవని చెప్పవచ్చు. దండకవిలె నాలుగు గిరిదుర్గాలు, 14 సీమలు, 2048 గ్రామాలతో, 22500 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉండేదని తెలుపుతోంది. ఈ సీమ విభజన కుళోత్తుంగచోళుని కాలంలో ఏర్పడినట్లు ప్రతీతి. గిరిదుర్గాలు కొండవీడు, వినుకొండ, బెల్లంకొండ, నాగార్జునకొండ.

సీమలు:

సీమ	గ్రామాలు
కొండవీటి సీమ	580
వినుకొండ సీమ	225

బెల్లంకొండ	100
అద్దంకి సీమ	55
ఉదయగిరి	80
కోట సీమ	60
నెల్లూరు సీమ	150
మారెళ్ల సీమ	58
కందుకూరు సీమ	65
దర్శి లేక పొదిలి సీమ	66
అమ్మనబ్రోలు సీమ	55
చుండి సీమ	44
. ధూపాటి సీమ	360
నాగార్జునకొండ సీమ	150

సముతులు అయిదు. మాచెర్ల - 64 గ్రామాలు, గురజాల - 16 గ్రామాలు, కారెంపూడి- 14 గ్రామాలు, తంగెడ- 44 గ్రామాలు, తుమృకోడు 12 గ్రామాలతో సముతులుగా ఉండేవి. కొండవీటి రాజ్యం మొత్తంలో 84 దుర్గాలుండేవని దండకవిలె తెలుపుతోంది. మరొక గ్రంథంలో ఇవిగాక నందిగామ- 90 గ్రామాలు, కంభంసీమ- 200 గ్రామాలు, వినుకొండ సీమ-237 గ్రామాలు అని మొత్తం. 2219 గ్రామాలు కొండవీటి రాజ్యంలో ఉన్నాయని రాయబడింది.

విజయనగర సామ్రాజ్య కాలం: క్రీ.శ.1515లో కొండవీడు శ్రీకృష్ణదేవరాయల వశమైంది. కృష్ణానది వరకు రాయల రాజ్యంలో భాగమైపోయింది. రాయల కిందికి వచ్చిన తర్వాత కొండవీటి రాజ్యాన్ని బెల్లంకొండ సీమ, వినుకొండ సీమ అనే రెండు సీమలుగా విభజించి, కొండవీటి ప్రాముఖ్యాన్ని తగ్గించాడు. అంతేగాక అక్కడ కొన్ని మార్పులు కూడా చేశాడు. కైతేపల్లిని ఉదయగిరిసీమలోను, పరుచూరును అద్దంకి సీమలోను, కేసానుపల్లి ఎనుమలమంద, మాదల, తొండపి క్రోసూరు జువ్వలకల్లు గ్రామాలను బెల్లంకొండ సీమలో చేర్చారు. మూసి దగ్గరున్న బింగనపల్లి, తుమ్మలపెంట, కదేరులను కందుకూరు సీమలోను, ఈతముక్కల, మడునూరులను పెల్లూరి సీమలోను చేర్చారు. తర్వాత ఈ ప్రాంతం మొత్తం వినుకొండ, బెల్లంకొండ పరగణాలుగా విభజించారు. జంపని వారి కింద 9, విశాయి కింద 14 గ్రామాలు చేర్చబడ్డాయి. గోరంట్ల, గరికిపాడులు బెల్లంకొండ పరగణాలో కలపబడ్డాయి.

గోల్కొండ నవాబుల కాలంలో: మొదటి శ్రీరంగరాయల కాలంలో కొండవీటి రాజ్యం గోల్కొండ నవాబుల వశమైంది. వారి కిందికి వచ్చిన తర్వాత కొండవీటిని మూర్తజానగర్ అని, కొండపల్లిని ముస్తాఫానగర్ అని పేర్లు మార్చారు. కొండవీటి అయ్యవారప్పు చెరువు లోతట్టున ఉన్న శక.1519 అంటే క్రీ.శ. 1597వ సంవత్సరంలో వేయించిన శాసనం కొండవీటిని మూర్తజానగర్ అని పేర్కొంటోంది. వారు కొండవీటి పేరేగాక అందులోని వాడల పేర్లు కూడా మార్చారు. కుతుబ్‌షాహీపేట, నవాబ్‌పేట, శిఖివన్‌ఖాన్‌పేట, మహమ్మద్‌షాపురం, సర్‌సాల వర్ధంద్ పేట అని పేర్లు మార్చారు. వాడలు పేటలుగా పేర్కొనబడ్డాయి. తర్వాత కొండవీడు, కొండపల్లి రాజ్యాలలోని కొన్ని గ్రామాలను అటూ, ఇటూ మార్చారు. ముస్లింల పాలనలో ఈ కొండవీడు ముర్తజానగర్ లేక మూర్తుజానగర్, కొండపల్లి ముస్తాఫానగర్ అనే రెండు సర్కారులుగా చేయబడ్డాయి. రెండు సర్కారులు సమానంగా ఉండేటట్లు చేయడానికి కొండవీటి సీమలోని పాములపాడు, వెలగపూడి, మద్దూరు, ధరణికోట, బందంరావూరు, మందడం, ఉండవల్లి, పెనుమాక, తాడేపల్లి, పాతూరు, నరుకుళ్లపాడు, తూమునూరు, ఉప్పుమాగులూరు, రావిపూడి గ్రామాలను కొండపల్లి సర్కారులో కలిపారు. ఇవన్నీ కృష్ణకు దక్షిణంగా ఉన్న ఏటిపట్టె ఊళ్లు. ముస్లింల కాలంలో గోకర్ణేశ్వరం గ్రామ పొలంలో ఊరుకట్టి నిజాంపట్టణం అని పేరు పెట్టి అక్కడ ఉప్పుమహల్‌ను నిర్మించారు. దాని పరిసరాలలో ముంద్రేడు, ఆముదాలపల్లి, గోకర్ణేశ్వరం, అల్లూరు, కావూరు, బాపట్ల, పెరవలి, పేరాల, అడుసుమిల్లి, వెలగపాడు, దేవరపాడు, నగరం, చెరుకుపల్లి మొదలైన 36 గ్రామాలు ఉప్పుమహల్‌కు చేర్చబడ్డాయి.

కొండవీడు గురించి ఇతర విశేషాలు: రెడ్డి రాజుల కాలం నాటి దుర్గాధిపతుల పేర్లను కూడా దండకవిలె ఇస్తోంది. ఉదయరావు, సూరపనేడు, ముత్యాల నాయకుడు, లింగనాయకుడు మొదలైన 31 మంది పేర్లు

తెలుస్తున్నాయి. వారు ముస్లింలను కూడా దుర్గాధిపతులుగా నియమించారు. బందా, ఖాదాఖండే అనే ముస్లిం నాయకుల పేర్లు ఇవ్వబడ్డాయి. వారు 8 మంది. అబ్దుల్, దావల్‌జీ, కరీం, బాజత్, హుస్సన్, అల్లీ, బందా, ఖాదాఖండే. రెడ్డి రాజులు తమ బంధువులకు పాకాల, బింగనాపల్లి, తుమ్మలపెంట, కరేదు, మదునూరు, ఈతముక్కల గ్రామాలను మొకసాలగా ఇచ్చారు.

ముల్ల గూరమ్మ రెడ్డి రాజుల ఇష్టదేవత. ఈమెకు అనవేమారెడ్డి దేవాలయాన్ని నిర్మించాడు. అతడు ముల్ల గూరమ్మ అనే గ్రామాన్ని కూడా నిర్మించి ముల్లగూర, పడిదరం, పలకలూరులను రంగభోగంగా ఇచ్చాడు. ఇది నేటి అమీనాబాద్‌లోని గుట్టపై ఉంది. అక్కడ పెదకోమటి వేమారెడ్డి శాసనం ఉంది. ముల్ల గూరమ్మ దేవాలయానికి ప్రాకారం నిర్మించి శాసనం వేయించాడు. అనవేమారెడ్డి ఆస్థానంలో కంచి, పేరి, పొన్ని అనే వేశ్యలు ఉండేవారట. వారికి అతడు నందిగామ తాలూకాలో కంచికి కంచికచర్ల, పేరికి పెరికలపాడు, పొన్నికి పొన్నవరం కట్టించాడట. అనవేమారెడ్డి సూరనార్యుడనే వ్యక్తికి సిరిపురాన్ని అగ్రహారంగా ఇచ్చాడు. అలాగే వేంగినాటి వారికి మూడు గ్రామాలు, ద్రావిడ బ్రాహ్మణులకు 5, వెలనాటి వారికి 36 గ్రామాలు దానాలు చేశాడని దండకవిలె తెలుపుతోంది. అమీనాబాద్‌లోని ముల్లగూరమ్మను, పలకలూరులో బెల్లంకొండలో గౌతమీశ్వరుని ప్రతిష్టించాడు. కుమారగిరిరెడ్డి అహోబిలం వద్ద కుమారగిరి పురాన్ని నిర్మించాడు. అనవేమారెడ్డి తన కుమార్తె సంక్రాంతి పండుగ ఖర్చులకు సంక్రాంతిపాడును ఇచ్చాడట. అందువల్ల ఆ గ్రామానికి సంక్రాంతిపాడు అని పేరు వచ్చిందట.

పొన్నపల్లి, కసునూరులను పెదకోమటి వేమారెడ్డి ముల్లగూరమ్మ దేవాలయానికి దానం చేశాడు. అతని భార్య సంతాన సాగరమనే చెరువును ఫిరంగిపురం నుండి మేడికొండూరు వరకు ఆరు మైళ్ల పొడుగున నిర్మించింది. కుమారగిరి కొమరగిరి పట్టణాన్ని నిర్మించాడు.

వీరభద్ర గజపతికి విద్యాధరుడనే పేరుండేది. అతడు విద్యాధరపురాన్ని, తన భార్యల పేరిట ముత్యాలంపాడు, భవానిపురం కట్టించాడు. కపిలేశ్వరుడు కపిలేశ్వరపురాన్ని నిర్మించాడు. బెజవాడ వద్ద పాపవినాశనస్వామి, రుద్రపాశ స్థలానికి బెజవాడ తాలూకాలో జక్కిరెడ్డిపల్లెను దానం చేశాడు. అంబరదేవుని శాసనం ఒకటి జక్కంపూడిలో ఉంది. బందరు సముద్రతీరంలో పురుషోత్తమపురాన్ని నిర్మించాడు.

నేల కోట - రంపచోడవరం మండలం

మధ్యయుగంలో ప్రసిద్ధి చెందిన మరొక కోట నేల కోట. ఇది తూర్పుగోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన రంపచోడవరం మండలంలోని పురుషోత్తమ పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలో ఉంది. పురుషోత్తమ పట్టణం రాజమండ్రి నుండి 32 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం వద్ద ఒక మట్టికోట ఉంది. నేడు అది పూర్తిగా శిథిలస్థితిలో ఉంది. అక్కడ శిథిలాలలో 12×10×4 అంగుళాల సైజు కలిగిన ఇటుకలు బయల్పడ్డాయి. ఈ మట్టికోట ఒకదానిలో ఒకటి రెండు కోటలుగా నిర్మింపడింది. వాటిలో ఒక దానిని పెద్ద కోట అని, రెండవ దానిని చిన్నకోట అని అక్కడి ప్రజలు పిలుస్తున్నారు. ఇది కింద కొండ చుట్టూ ఉన్న కోట. ఈ కోట మధ్యలో ఉన్న పర్వత శిఖరంపైన ప్రధాన కోట నిర్మింపబడింది. ఆ పర్వతాన్ని దుర్గపర్వతం అని అంటారు. కొండమీద ఉన్న ప్రధాన కోటకు అదనపు రక్షణగా కొండ కింద పైన రెండు మట్టికోటలు నిర్మించి ఉంటారు. కొండపైకి ఎక్కడం పెద్ద కష్టం కాకపోయినా, కొండ ఏటవాలుగా ఉండి మంచి రక్షణ కలిగి ఉంది. కొండపై ఉన్న కోటను రామదుర్గం అని, రామగిరి అని అంటారు. కొండ మీద ఒక శిథిల రామాలయం ఉంది. శ్రీరామనవమికి అక్కడ నేడు కూడా ఉత్సవాలు జరుగుతాయి. వేలాది ప్రజలు ఆ ఉత్సవాలకు హాజరవుతారు. కొండపై ఉన్న రామదుర్గం పెద్ద పెద్ద బండలతో చాలా దృఢంగా నిర్మింపబడింది. ఆ కోట కూడా 9 అడుగుల మందంతో చాలా బలంగా ఉంది. కొన్నిచోట్ల పెద్ద సైజు ఇటుకలు ఉపయోగింపబడ్డాయి. కొండ శిఖరంపై ఉన్న కోట గోడలు 50 అడుగుల.ఎత్తు ఉన్నాయి. కాని ఆశ్చర్యకర విషయమేమిటంటే ఆ కొండ శిఖరాన ఉన్న కోటలో ఇప్పుడు నీటి వనరులు లేవు. నీటి వనరులు లేకుండా కోట నిర్మించారు. కాని ఆ కాలంలో ఉండేవేమో తెలియదు. కోట లోపల అక్కడక్కడ సొరంగాల వంటి గుహలు ఉన్నాయి. ఈ శిఖరపు గోడల మధ్య శిథిలావస్థలో ఉన్న దేవాలయం, దాని శిఖరం ఉంది. ఈ దేవాలయం గుండా కోట మొదట్లో ఉన్న రామాలయం ఉన్నట్లే ఉంది. అందులోని దేవతా విగ్రహాలు కూడా వైష్ణవదేవుళ్ల లాగా కనిపిస్తున్నాయి. ఈ ఆలయానికి బయట పీఠంపై ఉన్న ఒక శివలింగం ఉంది. అక్కడ ఒక కొలను కూడా ఉంది. కానీ అందులో నీరు లేదు. ఆ కోట మొత్తం 20 ఎకరాల వైశాల్యం ఉంటుంది. ఈ

కొండ చుట్టూ అనేక చిన్న చిన్న పర్వత శిఖరాలున్నాయి. అన్నిటికంటే ఈ శిఖరమే ఎత్తయినది. అందువల్ల అక్కడ ఈ కోట నిర్మించి ఉంటారు. అక్కడి కొండలలో ఒకదాని బాలింతరాల మెట్ట అని పేరుతో పిలుస్తున్నారు. ఆ కొండ మీద పసుపు పచ్చని రాళ్లున్నాయి. అందువల్ల బాలింతరాల మెట్ట అని పిలుస్తున్నట్టుగా కనిపిస్తోంది. కొండకింద ఉన్న నేల కోట వద్ద సీతారాములు కొన్నాళ్లు నివసించారని అక్కడి ప్రజలు చెబుతారు. అందుకు నిదర్శనంగా కొండ కింద రెండు పెద్ద బండలు పాతి ఉన్నాయి. అవి సీతారాముల వారివి అని వారు అంటారు. శిఖరంపైన ఉన్న కోటలోనే గాక కింద కోట చుట్టూ కూడా చాలా శిథిల దేవాలయాలు కనిపిస్తాయి. చాలా విగ్రహాలు తలలు విరగగొట్టబడి ఉన్నాయి. 16వ శతాబ్దంలో ముస్లింలు పోలవరం వద్ద గోదావరి నదిని దాటి వచ్చి ఈ కోటను ఆక్రమించి అక్కడి దేవాలయాలను నాశనం చేశారట.

ఈ కోట తూర్పు చాళుక్యుల కాలం నుండి ఉందని ప్రతీతి. రాజరాజనరేంద్రుడు అక్కడ దేవాలయాలు నిర్మించాడని కూడా స్థానికులు చెబుతారు. ముసునూరి కాపయ నాయకుని కాలంలో ఈ దుర్గాలు రెండూ అతని అధీనంలో ఉండేవి. రాజమండ్రి మ్యూజియం తామ్రశాసనం ప్రకారం ఆ ప్రాంతాన్ని ఏరువ చోళ వంశానికి చెందిన అన్నెదేవచోడుడు పాలించాడు. నేటి రంపచోడవరం ఈ చోడ వంశస్థుల పేరుతోనే నిర్మింపబడిందని కూడా అంటారు. రంపచోడవరం, ఎల్లవరం, పోలవరం ప్రాంతాలను క్రీ.శ.1367 నుండి 1387 వరకు 20 సంవత్సరాలు అన్నెదేవచోడుడు పాలించాడని శాసనాలు తెలుపుతున్నాయి. అన్నెదేవచోడుడు శివభక్తుడు. తన కుమారునికి వీరభద్ర అని పేరు పెట్టుకున్నాడు. గోదావరి నది మధ్యలో ఉన్న చిన్నగుట్ట మీద నిర్మింపబడిన పట్టిసం వీరభద్ర దేవాలయానికి అనేక దానాలు చేశాడు. అంతేగాక ఆ దేవాలయానికి బంగారు మలాములు కూడా చేయించి తన పేరుతో చోళ అన్నదేవవరం అనే గ్రామాన్ని నిర్మించి అనేక మంది బ్రాహ్మణ పండితులకు అగ్రహారంగా ఇచ్చాడు. ఆ గ్రామమే నేటి పోలవరం డివిజన్‌లోని అన్నెదేవరపేట. అన్నెదేవచోడుడు తన రాజధానిని కామవరం నుండి రామవరపు పేటకు మార్చాడని, ఆ రామవరపు కోటయే ఈ రామగిరి లేక రామదుర్గం అని అంటారు. అతడు ఈ కోటను బలంగా తీర్చిదిద్దాడు. అన్నెదేవచోడుని మరణానంతరం ఈ కోటను రెడ్డి రాజులు ఆక్రమించారు. రెడ్డి రాజుల పతనం తర్వాత ఈ దుర్గం గజపతుల వశమైంది. పురుషోత్తమ గజపతి ఈ దుర్గానికి సమీపంలో తన పేరుతో ఒక గ్రామాన్ని నిర్మించాడు. అదే నేటి పురుషోత్తమ పట్టణం గజపతుల తర్వాత నేల కోట, రామదుర్గం ముస్లింల వశమయ్యాయి. ఆ తర్వాత ఈ కోటలు తమ ప్రాముఖ్యాన్ని పోగొట్టుకున్నాయి. నేడు అక్కడ శిథిలాలు మాత్రమే ఉన్నాయి.

గుర్రం కొండ దుర్గం

గోల్కొండ అసఫ్‌జాహీల కాలంలో ప్రసిద్ధి చెందిన మరొక దుర్గం గుర్రం కొండ. మొదట విజయనగర చక్రవర్తులు ఈ దుర్గాన్ని నిర్మించారు. వారి కాలంలో ఈ దుర్గం అంత ప్రసిద్ధి చెందలేదు కానీ తర్వాత గోల్కొండ, నిజాం నవాబుల కాలంలో ఈ దుర్గం మంచి ప్రాముఖ్యతను సంపాదించుకుంది. క్రీ.శ.1646లో ఈ దుర్గం గోల్కొండ నవాబుల ఆధీనంలోకి వచ్చింది. వారి హయాంలో ఈ దుర్గాన్ని కడప నవాబు ఆధిపత్యంలో ఉంచారు. గోల్కొండ రాజ్యపతనం తర్వాత ఈ కోట ఆర్కాటు నవాబు కిందకు వచ్చింది. క్రీ.శ.1758లో ఆర్కాటు నవాబు తమ్ముడైన అబ్దుల్ వాహెల్‌ఖాన్ ఈ దుర్గాధిపతిగా నియమింపబడ్డాడు. తర్వాత మహారాష్ట్రులు ఈ కోటను ఆక్రమించారు. వారి వద్ద నుండి క్రీ.శ.1766లో హైదరాలీ ఈ కోటను జయించి మైసూరు రాజ్యంలో కలిపాడు. కానీ మహారాష్ట్రులు తిరిగి ఈ దుర్గాన్ని జయించారు. కాని నిలబెట్టుకోలేకపోయారు. క్రీ.శ.1774లో హైదరాలీ కుమారుడు టిప్పు సుల్తాన్ ఈ కోటను మళ్లీ తన ఆధీనంలోకి తెచ్చుకున్నాడు. క్రీ.శ.1792 వరకు గుర్రంకొండ అతని ఆధీనంలోనే ఉంది. మూడవ మైసూరు యుద్ధంలో ఓడిపోయి ఇంగ్లిష్ వారితో చేసుకున్న శ్రీరంగపట్టణ సంధి ప్రకారం గుర్రంకొండను కారన్‌వాలీస్‌కు ఇచ్చాడు. అతడు దానిని నిజాం నవాబు ఆలీకి ఇచ్చాడు. అందువల్ల గుర్రంకొండ హైదరాబాద్ రాజ్యంలో భాగమైంది. క్రీ.శ.1801వ సంవత్సరంలో నిజాం ఆలీ లార్డ్ వెల్లస్లీతో చేసుకున్న సైన్య సహకార పద్ధతి ప్రకారం కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి జిల్లాలను ఇంగ్లిష్ వారికి దత్తం చేశాడు. అందువల్ల ఆనాడు కడప జిల్లాలో ఉన్న గుర్రంకొండ దుర్గం ఇంగ్లిష్ వారికి వచ్చింది. ఆంగ్లేయుల వద్దకు వచ్చిన తర్వాత ఈ దుర్గం తన ప్రాముఖ్యాన్ని కోల్పోయింది.

నేటి స్థితి: గుర్రంకొండ కోటలోను, దాని పరిసరాలలోను నేడు అనేక శిథిలాలు కనిపిస్తాయి. మొదట ఒక

పెద్ద గోడ కనిపిస్తుంది. దాని తర్వాత ఒక పెద్ద కందకం ఉంది. దానికి తూర్పు దిక్కులో ఒక పెద్ద చెరువు ఉంది. దానిని హాతీతలాబ్ అని పిలుస్తారు. అంటే ఏనుగుల చెరువు అని అర్థం. ఆ చెరువు నుండి నీళ్లు ఈ కందకంలోకి వచ్చే విధంగా ఏర్పాటు చేశారు. కందకం దాటిన తర్వాత మరొక పెద్ద గోడ ఉంది. ఈ గోడ తర్వాత ఎత్తయిన కొండ ఉంది. ఆ కొండనే గుర్రంకొండ అని అంటారు. ఆ కొండ చుట్టూ బలమైన దుర్గం నిర్మింపబడి ఉంది. ఆ దుర్గానికే గుర్రంకొండ దుర్గం అని పేరు. ఆ కొండ మీదకు ఎక్కడానికి ఉత్తరం వైపు ఒకే ఒక మార్గం ఉంది. ఈ మార్గానికి రెండు వైపులా బలిష్టమైన కోట గోడను నిర్మించారు. మిగిలిన మూడు వైపులా కొండ ఏకశిలా రూపంలో నిట్టనిలువుగా ఉంది. అందువల్ల ఆ దుర్గం శత్రుదుర్భేద్యంగా తయారైంది. దుర్గం లోపల, బయట ఆనాటి సైనిక స్థావరాల శిధిలాలు అనేకం నేటికీ కనిపిస్తున్నాయి. అలాగే దుర్గం లోపల అనేక శిల్పాలు, భవన శిధిలాలు కనిపిస్తున్నాయి. కోట లోపల వినాయకుని ఆలయం, నరసింహస్వామి ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. వాటితో పాటు మూడు దర్గాలు కూడా ఉన్నాయి. కొండ దిగువన నవాబుల నివాస భవనం ఉంది. దానిని రంగినీమహల్ లేక రంగమహల్ అని అక్కడి వారు పిలుస్తారు. ఈ భవనం ముందు నుండి చూస్తే రెండు అంతస్థులుగాను, వెనుక నుండి చూస్తే మూడు అంతస్థుల భవనం లాగా కనిపిస్తూ చూపరులకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ భవనం నేటికీ మంచి స్థితిలోనే ఉంది. కోట లోపల ఒక రాతితో నిర్మించిన మసీదు ఉంది. దుర్గానికి పశ్చిమ దిక్కున ఒక రెండంతస్థుల సమాధి ఉంది. దానిని మగ్బీరా అరబిక్ శైలిలో నిర్మించారు. అది టిప్పు సుల్తాన్ మేనమామ అయిన మీర్ రజా ఆలీ సమాధి. టిప్పు తన మేనమామ రజా ఆలీని గుర్రంకొండ అధిపతిగా నియమించాడు. అతడు అక్కడే మరణించగా ఈ సమాధి నిర్మింపబడింది. ఈ సమాధికి ఒక కిలో మీటరు దూరంలో మరొక సమాధి ఉంది. అది టిప్పు సుల్తాన్ గురువైన హజరత్ షా సమాధి అని చెబుతారు. హజరత్ షా పారశీక, అరబ్బీ భాషలలో గొప్ప పండితుడట. టిప్పు అతని మాటను జవదాటేవాడు కాదట. ఆయనకు జమీ-ఎ-దక్కన్ అనే బిరుదును కూడా ఇచ్చి గౌరవించాడట.

కాపవరం-జల్లూరు: ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలోని కాపవరంలో అతి ప్రాచీన కాలం నాటి బౌద్ధ స్థూపాలు, బౌద్ధ ఆరామాల శిధిలాలు కనుగొనబడ్డాయి. దానిని బట్టి ఇది ప్రాచీన కాలంలో గొప్ప బౌద్ధ క్షేత్రమని రుజువైంది. కాపవరం కొండ మీద ఉన్న బౌద్ధ స్థూపాలకు, బౌద్ధ ఆరామాలకు నీరు అందించడానికి లోతైన కొలనులు తవ్వబడిన ఆనవాళ్లు కనిపించాయి. ముసునూరి కాపయనాయకుని కాలంలో ఈ గ్రామానికి కాపవరం అని పేరు పెట్టినట్టు కనిపిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలోనే ఉన్న జల్లూరులో కూడా అనేక బౌద్ధ శిధిలాలు లభించాయి.

ఈ యుగంలో పద కవిత్వం
వాగ్గేయకారులు - సంఘ సంస్కర్తలు

అన్నమయ్య: క్రీ.శ.15-16 శతాబ్దాలలో ఆంధ్రసాహిత్య రచనలో పదకవిత్వం అనే ఒక నూతన సాహిత్యం ప్రారంభమైంది. ఈ సాహిత్యానికి తాళ్లపాక అన్నమాచార్యుడు ఆద్యుడు. అతడు విజయనగర సామ్రాజ్యానికి చెందినవాడు. తాళ్లపాక గ్రామస్తుడు. క్రీ.శ.1424-1503 సంవత్సరాల మధ్య జీవించాడు. ఇతడు కొంతకాలం సంసార జీవితం సాగించి తర్వాత దైవభక్తి కలిగి తిరుపతి చేరి తిరుపతి వేంకటేశ్వరునిపై కీర్తనలు పాడుకుంటూ తిరుపతిలోనే జీవించాడు. ఇతడు పాడిన కీర్తనలకే పదాలు అని పేరు. ఈ పదాలు ప్రయత్న పూర్వకంగా కాక గళం విప్పగానే తనకు తెలియకుండానే అనర్గళంగా కీర్తన సాగి పద సాహిత్యంగా రూపొందేదట. ఈ కీర్తనలు పాడుకుంటూ తనను తాను తెలియని భక్తిపారవశ్యంలో మునిగిపోయేవాడట. అలా రాగ, తాళ, లయబద్ధంగా సాహిత్యం సృష్టించి పాడిన గీతాకారులని పిలిచేవారు. అతడు పాడిన పాటలు అతిరమ్యంగా ఉండి పామర జనాన్ని పులకింపచేసేవి. అతని పదాలు ఆంధ్రదేశమంతటా వ్యాప్తిచెంది పామరులు కూడా కీర్తనలుగా పాడుకునేవారు. ఇతని పదాలు జానపదాల లాగా ఉండి సాహిత్య విలువలను కలిగి ఉండేవి. కనుక జానపదాలకు సాహిత్య విలువలను తెచ్చిన ఘనత కూడా అన్నమాచార్యునిదే. ఇతనిని సాళువ నరసింహరాయలు ఆదరించాడు. అన్నమాచార్యుడు 32 వేల పదాలను పాడాడని ప్రతీతి. ఇతని పదాలలో నాట్యం, సంగీతం, అభినయాలకు అనుగుణమైన ధ్వనులుండే లాగే ఆ భక్తి, శృంగార, అభినయ భావసంపదతో నిండి ఉండేవి. ఆయన తర్వాత కాలంలో అతని పదాలలోని భావనాశక్తి మూడు ప్రత్యేక సాంప్రదాయక వాదాలుగా రూపొందాయి. అందులో మొదటిది అయిన భక్తి సాంప్రదాయాలలో భక్త రామదాసు, త్యాగరాజులలో ప్రతిఫలించిందని, శృంగార సాంప్రదాయకత క్షేత్రయ్యలో కనిపించిందని అభినయ సాంప్రదాయకత కూచిపూడి సంగీతంలో వికసించిందని సంగీత విద్వాంసులు అంటారు. ఆంధ్రదేశంలో భక్తి సాహిత్యానికి భక్త పోతన, అన్నమయ్య రెండు స్తంభాలని కూడా పండితులు భావిస్తారు. రుషితుల్యులైన ఈ ఇద్దరూ సంగీత పండితులు చైతన్యుడు, వల్లభాచార్యులకు మార్గదర్శకులయ్యారని కూడా పండితులంటారు. భాగవతంలోని పద్యాలు కూడా గొప్ప సంగీత నిధులు. ఆ పలుకులు పోతన నోటి నుండి సహజ సిద్ధంగా ప్రవాహం లాగా వచ్చాయి. అందుకే ఆయనకు సహజకవి అని బిరుదు వచ్చింది. అలాగే అన్నమాచార్యుని గళం నుండి కూడా సహజ సిద్ధంగా పదాల వెల్లువ వచ్చింది. ఆయన గళం నుండి వచ్చిన ఆ పదాలు శాశ్వతంగా నిలపాలని ఆయన కుమారుడు పెదతిరుమలయ్య ఆ పదాలన్నిటినీ సేకరించి రాగిరేకులపై చెక్కి భద్రపరచాడు. ఆ పని చేయటానికి అతడు తన 20 సంవత్సరాల జీవిత కాలాన్ని శక్తిని అంకితం చేశాడు. అన్నమాచార్యుని మనుమడు చినతిరుమలయ్య క్రీ.శ.1495-1553 సంవత్సరాల మధ్య తన తాత గళం నుండి వెలువడిన, తన తండ్రి చేత రాగి రేకులపై చెక్కింపబడిన పదాలను ఆంధ్రదేశం మొత్తం వ్యాప్తి చేశాడు. ఆ పదాల రాగాలను, అవి పాడే రీతులను గానం చేస్తూ దేశం మొత్తం ప్రచారం చేశాడు. అందువల్ల అవి బహుళ ప్రచారం చెందాయి. తిరుపతి దేవాలయంలో అన్నమాచార్యుని కీర్తనలు పరంపరగా పాడబడుతున్నాయి. అన్నమాచార్యుని కీర్తనల ఆధారంగానే ఆంధ్రదేశంలో భజనపాటలు, భజన సంఘాలు వెలిశాయి. త్యాగరాజు కృతులకు మూలాలయ్యాయి. ఆ విధంగా అన్నమాచార్యుడు చిరఃయశస్సును పొందాడు. తాళ్లపాక వారి కుటుంబం ఆంధ్రదేశానికి పద సాహిత్యాన్ని అందించటమే గాక మొత్తం తెలుగు కవయిత్రిని అందించిన ఘనత కూడా ఈ కుటుంబానిదే. అన్నమాచార్యుని పెద్ద భార్య తాళ్లపాక తిమ్మక్క గొప్ప కవయిత్రి. ఆమె సుభద్రా కళ్యాణాన్ని ద్విపదగా రాసింది.

క్షేత్రయ్య: తర్వాత చెప్పుకోదగిన పదకవి క్షేత్రయ్య. ఇతడు కృష్ణాజిల్లాలోని మొవ్వ గ్రామస్తుడు. అందువల్ల అతనిని మొవ్వ క్షేత్రయ్య అని కూడా అంటారు. అతని అసలు పేరు వరదయ్య. అతడు కంచి, తిరుపతి, శ్రీరంగం మొదలైన అనేక క్షేత్రాలను దర్శించినందువల్ల క్షేత్రయ్య అని పేరు వచ్చిందట. అతడు చిన్నతనంలో మోహనాంగి అనే నాట్యకత్తెను ప్రేమించాడు. కాని వారి ప్రేమను పెద్దలు అంగీకరించలేదు. కనుక అతడు వైరాగ్యంతో తన ఊరు విడచి దేశసంచారం చేసి వివిధ దైవ క్షేత్రాలను దర్శించి ఆయాదేవుళ్లపై అనేక పదాలు పాడాడు. కాని అతని

పదాలలో భక్తికన్నా శృంగారమే అధికం. దేవి, దేవులను ఏకాంతంగా ఊహించుకొని వారిలో శృంగార క్రీడను తిలకించినట్లు ఆ స్థితిలో ఎలా ఉన్నారో వర్ణిస్తూ పదాలు పాడాడు. కంచిలో వరదరాజస్వామి ఆలయాన్ని దర్శించినప్పుడు ఒక రాత్రి గర్భాలయంలోనే ఉండిపోయాడట. ఆ రాత్రి అతడు దేవి, దేవుల సమాగమనాన్ని గమనించి ఆ స్థితిలో ఉన్న దేవిని వర్ణిస్తూ పాడిన పదాలు ఉన్నాయి. అతనికి దైవంలో కూడా శృంగారమే కనిపించింది. అతని ప్రేమ వికటించినందువల్ల అతని మనసులో ఉన్న మధుర శృంగార భావనాశక్తి అతని చేత అలాంటి పదాలను పలికించి అద్భుతంగా ఉపయోగపడ్డాయి. ఆ నాటి కళావంతులు నాట్యసంగీత కళలకు అంకితమై తమ జీవితాలను దేవాలయాలకు అంకితం చేసుకొని పండుగలు, దేవాలయ ఉత్సవాలు జరిగే రోజులలో దేవాలయాల ప్రాంగణంలో అద్భుత సంగీత నాట్య కౌశల్యాలను ప్రదర్శిస్తూ ప్రజలను అమితంగా సంతోషపెట్టేవారు. ఆ విధంగా ప్రజలకు అదే గొప్ప వినోదం. అలాంటి నాట్య ప్రదర్శనలకు తమ హావభావాలతో, నాట్యభంగిమలతో క్షేత్రయ్య రచించిన పదాలను పాడుతూ ప్రజలను మధుర శృంగార భావాలతో ముంచెత్తి మైమరపించేవారు. ఆ విధంగా నాట్యకత్తెలు రాజాస్థానంలో క్షేత్రయ్య పదాలతో నాట్యగానాలు చేస్తూ సభికులను ఉర్రూతలూగించేవారు. ఆ విధంగా పండిత, పామర, కులీన వర్గం ప్రజాబాహుళ్యానికి అమర శృంగార వినోద భరిత సంగీత పదాలను ఆంధ్రదేశానికి అందించిన ఘనత క్షేత్రయ్యది. అతని పదాల మీదనే ఆధారపడి కూచిపూడి నాట్యకళ ఆంధ్రదేశంలో వైభవంగా వర్ధిల్లింది. అతడు 4,500 పదాలు రాశాడు. ప్రతిపదానికి చివరలో ఒక ముద్ర ఉంటుంది. క్షేత్రయ్య సాహిత్యంలో ముద్రాసాంప్రదాయం వచ్చింది. ప్రతి పదానికి చివరలో ఒక ముద్ర ఉంటుంది. క్షేత్రయ్య పదాలకు చివరలో మువ్వగోపాల అనే ముద్ర ఉంటుంది. ఈ పదం తన స్వగ్రామంలో వెలసి ఉన్న మువ్వ గోపాలస్వామి సంబోధన. క్షేత్రయ్య అనేక దైవక్షేత్రాలు దర్శించాడు. అనేక రాజాస్థానాలు దర్శించాడు. తంజావూరు, చెంజి ఆస్థానాలను క్రీ.శ.1615-1620 సంవత్సరాల మధ్య దర్శించి తుపాకుల కృష్ణప్పనాయకుని ఆదరణ పొందాడు. తర్వాత అతడు గోల్కొండ ఆస్థానానికి వెళ్లి అబ్దుల్లా కుతుబ్‌షాను పాడుకుంటూ అక్కడే మరణించాడు. మువ్వగోపాలుని మీద చెప్పిన పదాలు కనుక అతని పదాలు మువ్వగోపాల పదాలుగా ప్రసిద్ధి చెందాయి. అతడు నివసించిన ఇల్లు నేటికీ మొవ్వ గ్రామంలో ఉంది. ఆ ఇంటి ఖాళీ ప్రదేశంలో అతనిది చిన్న విగ్రహం కూడా ప్రతిష్ఠించబడి ఉంది. క్షేత్రయ్య పదాలలో పల్లవి, అనుపల్లవి అనే రెండు రీతులు మిళితమై ఉంటాయని, అది క్షేత్రయ్య ప్రత్యేకత అని సంగీత విద్వాంసులు అంటారు. ఇతడు క్రీ శ.1595-1660 మధ్య జీవించాడని చరిత్రకారులు భావించారు.

భక్త రామదాసు: ఇతడు నేల కొండపల్లిలో కంచెర్ల లింగన మంత్రి, కామమ్మలకు జన్మించాడు. ఇది ఖమ్మం జిల్లాలో ఉంది. ఇతని అసలు పేరు కంచెర్ల గోపన్న. శ్రీరామచంద్రుని భక్తుడై, అతని సేవలో తరించి, తన కీర్తనల ద్వారా భక్తి భావోద్దీపనా శిఖరాలను అందుకొని తెలుగువారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయినందువల్ల రామదాసు పేరు సార్థక నామమైంది. ఇతడే భద్రాచలంలో శ్రీరామచంద్రుని ఆలయం నిర్మించాడు. ఇతడు గోల్కొండ సుల్తాన్ అబుల్ హసన్ కుతుబ్‌షాహీ వద్ద పని చేసే అక్కన్న, మాదన్నలకు మేనల్లుడనీ, మేనమామల మూలంగానే ఇతనికి భద్రాచలం తహశీల్దారుగా ఉద్యోగం లభించిందని ప్రసిద్ధి. అయితే కొందరు చరిత్రకారులు ఇతడు అక్కన్న, మాదన్నలకు మేనల్లుడు కాదని, బంధుకోటిలోని వాడనీ నిర్ణయించారు. ఇతడు తాను జమ చేసిన పన్నుల పైకాన్ని ప్రభుత్వ ఖజానాకు పంపకుండా, భద్రాచలంలోని శ్రీరామాలయానికి, ఆలయ గోపురానికి, సీతారామలక్ష్మణుల ఆభరణాలకీ వినియోగించాడు. ఈ విషయం తానీషాకు తెలిసి గోపన్నను రప్పించి, సర్కారు సొమ్ము ఇచ్చేవరకు బంధిఖానాలో బంధించాడు. ఆ విధంగా గోపన్న చెరసాలలో పన్నెండేళ్ళ గడపవలసి వచ్చింది. ఈ కాలంలో అతడు శ్రీరాముని కీర్తనల్లో స్తుతించాడు, నిందించాడు. రామదాసులో, అతని భక్తిభావనలో నిర్మలత్వమూ, నిజాయితీ కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. త్యాగరాజు కీర్తనల లాగే రామదాసు కీర్తనలు కూడా విఖ్యాతాలై దక్షిణ దేశీయులందరినీ అలరిస్తున్నాయి. రామదాసు త్యాగరాజు, క్షేత్రయ్యలతో పాటు 'పేరు పడిన వాగ్గేయకారుడు.

భద్రాచలంలో జరిగే సీతారామ కళ్యాణానికి తానీషా కాలం నుండి ముత్యాల తలంబ్రాలు పంపబడటం సాంప్రదాయంగా నిలిచిపోయింది. ఈ సంప్రదాయానికి కారణభూతుడు భద్రాచల రామదాసు. మహాభక్తుడైన రామదాసు యక్షగానంగా, హరికథగా తెలుగునాట వినిపిస్తూనే ఉంటుంది.

యోగి వేమన: క్రీ.శ.16-17 శతాబ్దాలలో ఒక గొప్ప సంస్కర్త ఆంధ్రదేశంలో జన్మించాడు. అతడే యోగి

వేమన. విశ్వదాభిరామ వినురవేమ అనే ముద్రతో ఇతడు అనేక పద్యాలు రాశాడు. అతని పద్యాలలో సంఘంలోని దురాచారాలను ఎదుర్కొనే సమస్యలు, సామాన్య మానవులు పడే బాధలు, దురహంకారులు ప్రదర్శించే దర్పాలు, దాంబికులు ప్రదర్శించే కుయుక్తులు ఉన్నవి ఉన్నట్లుగా చిత్రించి మానవ జీవితాన్ని చక్కదిద్దటానికి ప్రయత్నించాడు సామాజిక రుగ్మతలను వదలండని ప్రజలకు హితవు పలికాడు. అతని పద్యాలలో ఆనాటి సాంఘిక జీవనం స్పష్టంగా కనిపిస్తుంది. మానవ మనస్తత్వాన్ని, సాటి మానవుని పట్ల అతను ప్రదర్శించే రీతిని కళ్లకు కట్టినట్లు పామరులకు సహితం సులభ గ్రాహ్యంగా అగునట్లు చక్కని సాధారణ తెలుగు పదాలతో చిత్రించాడు. అతని పద్యాల ద్వారా ఆంధ్ర సమాజంలోని మూఢనమ్మకాలు, దూరాచారాలను తొలగించటానికి ప్రయత్నించాడు. అతని పద్యాలు ఎక్కువ భాగం ఆటవెలదిలో రచించబడ్డాయి. ఆటవెలది అంటే నాట్యం చేసే స్త్రీ అని అర్థం. ఆ పేరుకు తగినట్లే అతని పద్యాలు ఆంధ్రుల నాలుకపై నేటికీనీ నాట్యమాడుతున్నాయి. అతను రాసిన కొన్ని పద్యాలలో యోగతత్వం మిళితమై ఉంది. వేమన పద్యాలను సి.పి.బ్రౌన్ సేకరించి ప్రచురించాడు. ఆంధ్రదేశంలో వేమన పద్యాలు ఇంతగా ప్రాచుర్యం పొందినా, అతని చరిత్ర స్పష్టంగా తెలియటం లేదు. అతడు కొండవీటి రెడ్డి వంశానికి చెందినవాడని చెప్పుకున్నాడు. కొందరు అతడు కడప వాస్తవ్యుడని అంటారు. అతని సమాధి కడప జిల్లాలో ఉంది. అతడు చిన్నతనంలో విచ్చలవిడిగా తిరిగి స్త్రీ భోగం అనుభవించాడని చివరకు అతనికి వైరాగ్యం కలిగి యోగాభ్యాసం చేసి ఆత్మశుద్ధి పొంది యోగిగా మారాడని ఒక గాథ ఉంది. వాస్తవం తెలియదు. కొండవీటి రెడ్డి కుటుంబానికి చెంది ఉంటే అంతటి గొప్ప కవిని కొండవీటి ఆస్థాన కవులు తమ రచనలలో ప్రస్తావించి ఉండేవారు. అతడు రెడ్డి యుగానికి చెందిన వాడుగా కనిపించదు. క్రీ.శ.1625 ప్రాంతం వాడని చరిత్రకారులు భావిస్తారు. అతడు చెప్పిన పద్యాలలోని పరిస్థితులు 17వ శతాబ్దపు మొదటి భాగానికి చెందినవి. కనుక అతడు క్రీ.శ.1625 ప్రాంతం వాడని భావింపబడింది. వేమన బోధించిన మతం వీరశైవమని, బౌద్ధం అని, శూన్యవాదం అని, సామ్యవాదం అని రకరకాల అభిప్రాయాలు వెల్లడయ్యాయి. మధ్యయుగం ప్రజలు అనుభవించిన ఆర్థిక దుస్థితి, వారి దైన్యస్థితి ఆనాడు మత, సాంఘిక రంగాలలో వచ్చిన మార్పులు దర్పణం పడుతుంది. కనుకనే ఆనాటి సమస్యలకు గూడా ఆనాటి సాహిత్యం ద్వారానే సమాధానం కూడా రూపొందుతుంది. ఆనాటి సారస్వతంలో ఒక్క వేమన పద్యాలలోనే ఇస్లాం ప్రభావం, కబీర్, నానక్‌ల బోధన ప్రభావం కనిపిస్తోంది. వేమన వేదాలను, సోమయాజులను, పురాణగాథలను, విగ్రహారాధన, తీర్థయాత్రలు, శ్రాద్ధకర్మలు, కులభేదాలను, అంటరాని తనాన్ని ఖండించాడు. నిరాడంబరత్వం, మానవతా దృష్టి ఉండాలని, నిరాడంబరమైన కృషి ద్వారా ఆత్మజ్ఞానం పొందాలని వేమన బోధించాడు. వేమన 4 వేల పద్యాలకు పైగా రచించాడని అంటారు. కొన్ని మాత్రమే లభించాయి. అందులో కూడా కొన్ని నూతన కూర్పులకు లోనయ్యాయని పండితులు అభిప్రాయపడ్డారు.

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారు-సంస్కర్త: 16-17 శతాబ్దాలలో ఆంధ్రదేశంలో మరొక తత్వవేత్త, సంఘ సంస్కర్త జన్మించాడు. ఆయనే శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాముల వారు. ఆయన పరిపూర్ణయాచార్యుడు, ప్రకృతాంబ దంపతులకు జన్మించాడు. అతడు జన్మించగానే తల్లిదండ్రులిద్దరూ మరణించారు. అతనిని నందికొండ పాపాఘ్ని మఠాధిపతి అయిన యనమదల వీరభోజయాచార్యులు, ఆయన ధర్మపత్ని వీరపాపమాంబలు పెంచి పెద్ద చేశారు. అతడు చిన్నతనం నుండే పద్మాసనంలో కూర్చొని యోగాభ్యాసం చేస్తూ ఉండేవాడట. కొన్నాళ్లకు పెంచిన తండ్రి కూడా మరణించాడు. ఆ తర్వాత అతడు ఇల్లు వదలి దేశాటనం చేసి చివరకు బనగానపల్లె చేరి గరిమిరెడ్డి అచ్చమ్మ గారి ఇంటిలో పశువుల కాపరిగా చేరాడు. ఆ కాలంలోనే ఆయనకు ఆత్మసాక్షాత్కారం కలిగి కాలజ్ఞానాన్ని రాశాడు. ఆయన యోగాభ్యాసం ద్వారా సమాధిస్థితికి చేరి దివ్యానుభూతి చెంది భూత, భవిష్యత్, వర్తమాన కాలాలను గ్రహించి తాను గ్రహించిన జ్ఞానాన్నే కాలజ్ఞానంగా రచించాడు. ఆ రచనలు బనగానపల్లెలోనే అచ్చమ్మగారి పశువుల కోష్టంలో పాతర తవ్వి పూడ్చిపెట్టాడట. ఆ పాతరపై చింతచెట్టు మొలిచింది. నేటికీనీ ఆ స్థలంలో పాతర, దానిపై చింత చెట్టు ఉంది. అతని మహిమను గ్రహించి గరిమిరెడ్డి అచ్చమ్మ ఆయనకు ఒక మఠం నిర్మించి ఇచ్చింది. ఆయన అక్కడ కొన్నాళ్లు ఉండి బనగానపల్లె వదలి వేసి తను సాధించిన ఆత్మజ్ఞానాన్ని ప్రచారం చేస్తూ ఆంధ్రదేశం అంతటా పర్యటించాడు. ఆ రోజుల్లో ఆంధ్రదేశాన్ని గోల్కొండ నవాబులు పరిపాలిస్తున్నారు. కడప, కర్నూలు, బనగానపల్లెను కూడా ముస్లిం నవాబులు పరిపాలిస్తున్నారు. ఆ రాజ్యాలలో పర్యటించి హిందూ ముస్లింల ఐక్యతను బోధించాడు. హిందూమతంలోని కులవ్యవస్థను ఖండించాడు. కులమతాలు అజ్ఞాన చిహ్నాలని, మానవులందరూ సమానులేనని సర్వమానవ సమానత్వాన్ని, సహజీవనాన్ని బోధించాడు. ఆయన బోధనలకు

ఆకర్షితులైన బనగానపల్లె కడప నవాబులు ఆయనను తమ దర్బారులకు ఆహ్వానించి గౌరవించారు. హిందూ, ముస్లిం అనే భేదం చూపక ఆత్మజ్ఞానం పొందాలని కోరిక కలవారందరికీ మంత్రోపదేశం చేశాడు. యోగవిద్యను నేర్పాడు. సిద్ధయ్య అనే ఒక దూదేకుల కులస్థుడు ఆయనకు ప్రియశిష్యుడై ఆయనతోపాటు దేశాటన చేశాడు. బ్రహ్మంగారి ఆంధ్రదేశ పర్యటన వల్ల ఆంధ్రదేశంలో హిందూ ముస్లింలలో గొప్ప ఐక్యత వచ్చింది. హిందూ మతంలోని మూఢాచారాలు, కులవ్యవస్థను ఖండించి భగవంతుని అనుగ్రహానికి అందరూ అర్హులే అని చాటాడు. సాధన చేస్తే అందరూ బ్రహ్మసిద్ధి పొందవచ్చునని ప్రచారం చేశాడు. నేను బ్రహ్మమురా అనే తత్వాన్ని పాడుతూ మానవులంతా బ్రహ్మలే. అంటే భగవంతునిలోని అంశాలే అనే సందేశాన్ని ఇచ్చాడు. తత్వవేత్తగా మధ్యయుగంలో ఈ విధంగా సంఘ సంస్కరణకు పూనుకున్న మహా వ్యక్తి బ్రహ్మంగారు. ఆయన చివరకు కడప జిల్లాలోని కందిమల్లయపల్లె చేరి అక్కడ సమాధి చెందాడు. ఆయన జీవించి ఉండగానే సమాధిలోకి వెళ్లిపోయి సిద్ధి పొందాడని ఆంధ్రదేశంలో అనుశృతి ఉంది. ఆంధ్రదేశంలో హిందూ, ముస్లింల ఐక్యతకు పాటుబడిన ఏకైక తత్వవేత్త శ్రీ బ్రహ్మంగారు. ఈ యుగంలో క్షేత్రయ్య శృంగారాన్ని, రామదాసు భక్తి పారవశ్యాన్ని, వేమన సంఘ సంస్కారాన్ని, బ్రహ్మంగారు తాత్త్విక బోధనను ప్రచారం చేశారు. వారి ప్రబోధాలకు సులభమైన అచ్చ తెలుగు భాష సాధనమైంది.

ఐరోపా వారి రాక-నూతన ఆర్థిక వ్యవస్థ

17వ శతాబ్దం చివరి నుండి ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థలో గణనీయమైన మార్పు ప్రారంభమైంది. అంత వరకు స్వయం సంపూర్ణ గ్రామ ఆర్థికవ్యవస్థ వర్ధిల్లుతూ ఉండేది. వ్యవసాయం, వృత్తి పరిశ్రమలు ఒకదానికొకటి అనుబంధంగా ఉండేవి. గ్రామాలలో అమ్మకం కోసం అంతగా తయారు అయ్యేవి కావు. గ్రామపు అవసరం వరకే తయారయ్యేవి. ప్రతి గ్రామం ఇతర ప్రదేశాల మీద ఆధారపడకుండా కావలసిన వస్తువులన్నీ ఆయా గ్రామాలలోనే తయారు చేయబడేవి. అందువల్ల ప్రతీ గ్రామం స్వయం సంపూర్ణమై ఉన్నందువల్ల బయట నుండి సరుకులు కొనవలసిన అవసరం ఉండేది కాదు. ఏ గ్రామమైనా ఎక్కువ ఉత్పత్తి చేస్తే కొనే వారూ ఉండేవారు కారు. కనుక గ్రామ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి ఉండేది. 17వ శతాబ్దం చివర నుండి ఈ వ్యవస్థలో మార్పులు వచ్చాయి. అందుకు కారణం విదేశీ వర్తకులు ఆంధ్రదేశంలో ప్రవేశించడం. ఐరోపా వర్తకులైన పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లిష్, ఫ్రెంచి కంపెనీలు ఆంధ్రదేశంలో ప్రవేశించి తమకు కావలసిన వస్తువులు ఖరీదు చేయసాగారు. ముఖ్యంగా వస్త్రాలు కొనసాగారు. దాంతో అంతవరకు స్వదేశీయుల అవసరాల కోసం మాత్రమే వస్త్రాలు తయారు చేసే వృత్తిపని వారు, అదనపు లాభాల కోసం వస్త్రాలు ఎక్కువగా నేయసాగారు. అలాగే మిగిలిన వృత్తుల వారు కూడా అమ్మకాల కోసం సరుకుల ఉత్పత్తి ప్రారంభించారు. ఈ పరిస్థితి వృత్తిపని వారిని, వ్యవసాయం సాయంతో అనుబంధంగా ఉండే వృత్తిపని వారిని వ్యవసాయం నుండి వేరు చేయసాగింది. ఈ పరిస్థితి క్రమేపీ అభివృద్ధి చెంది గ్రామ స్వయం పోషకత్వాన్ని నాశనం చేసింది. ఐరోపా వారి రాకతో ఆంధ్రదేశ గ్రామ స్వయంపోషకత్వం నాశనమైందని చెప్పవచ్చును. దాంతో ఆంధ్రదేశపు ఆర్థికవ్యవస్థ స్వరూపం పూర్తిగా మారిపోయి నూతన రూపం ధరించింది. వ్యవసాయంలోను, పరిశ్రమలోను ఉత్పత్తులు విస్తరించాయి. రైతులు అమ్మకాలకు వ్యాపార పంటలైన ప్రత్తి, మిరప, పొగాకు, చెరకు, నూనె గింజలు పండించేవారు. చెరకు నుండి బెల్లం, పంచదారను తయారు చేసేవారు. ఇంకా నీలిమందును, సూరేకారాన్ని కూడా తయారు చేసేవారు. వృత్తిపని వారు అమ్మకానికి సరుకులను ఉత్పత్తి చేయసాగారు. గ్రామీణ ప్రాంతాలలో డబ్బు తీసుకొని సరుకులు అమ్మే పద్ధతులు ప్రవేశించాయి. ఇవన్నీ గ్రామాలలోని చేతివృత్తుల సాంప్రదాయక పద్ధతులను మార్చివేశాయి. వ్యవసాయం నుండి చేతి పరిశ్రమలు విడిపడిపోసాగాయి.

17వ శతాబ్దం వరకు చేతి వృత్తుల ద్వారా జరిగే సరుకుల ఉత్పత్తి రెండు విధాలుగా జరిగేది. వ్యవసాయంతో పాటు రైతుల ఇళ్లలో చేతి పరిశ్రమల ద్వారా కొన్ని వస్తువుల ఉత్పత్తి జరిగేది. నూలు వాడకం అందులో ముఖ్యమైనది. పత్తిని ఏకులు చేసి రైతుల భార్యలు రాట్నాల మీద నూలు వడికేవారు. ఈ నూలు అమ్ముకొనే వారు. వృత్తిపని వారు పట్టణాలలోను, పల్లెలలోను అమ్మకం కోసం వస్తువులను ఉత్పత్తి చేసేవారు. వృత్తిపని వారు ఒక మారు డబ్బుకు వస్తువులను అమ్మి మార్కెట్టుతో సంబంధాలు ఏర్పాటు చేసుకొంటే ఇక అమ్మడానికే వస్తువులను ఉత్పత్తి చేస్తారు. ఆ విధంగా విదేశీ వ్యాపారం దేశంలో వ్యాపారాన్ని అభివృద్ధి చేసి వ్యవసాయాన్ని, చేతి వృత్తులను చీల దీసి ఆంధ్రదేశపు సాంప్రదాయక గ్రామ స్వయంపోషకత్వాన్ని నాశనం చేసింది. ఐరోపా వారు ఇండియాలో అడుగు పెట్టే నాటికి ఇండియా ఐరోపా కంటే అనేక రెట్లు మిన్నగా అభివృద్ధి స్థాయిలో ఉంది. పారిశ్రామికంగా మంచి పురోభివృద్ధిలో ఉంది. మేలు రకం నాజూకైన వస్త్రాలు, విలాస వస్తువులు తయారు అవుతున్నాయి. ఇండియా వస్త్రాల నాణ్యతను గ్రహించి ఐరోపా వారే వారి దేశాల మార్కెట్లకు భారతీయ వస్త్రాలను ఎగుమతి చేశారు. తూర్పు దీవులన్నింటిలో భారతీయ వస్త్రాలకు మంచి గిరాకీ ఉంది. డచ్చివారు సాలె వారికి బయానాలు ఇచ్చి వస్త్రాలు నేయించుకొని తూర్పు రేవులకు తీసుకువెళ్లి అమ్మి విశేష లాభాలు గడించేవారు. క్రీ.శ.1608-14 సంవత్సరాల మధ్య కోరమండల తీరాన్ని దర్శించిన ఆంథోని షురర్ అనే డచ్ వ్యాపారి నిజాం పట్టణాభివృద్ధి, అనేక రకాల వస్త్రాలు తయారవుతున్నాయని రాశాడు. కోస్తా అంతటా అతి నిపుణులైన నేతగాళ్లు అద్దకం పనివారున్నారని తెలిపాడు. ఒక్క మచిలీపట్టణంలోనే 7 వేల మంది నేతగాళ్లు ఉండేవారని కూడా రాశారు. మచిలీపట్టణంలో సూరేకారం, తుపాకీమందు కూడా తయారయ్యేవని జాన్ ఓలాఫ్సన్ అనే వ్యాపారి రాశాడు. ఇంకా కోస్తా అంతటా అనేక రకాల పరిశ్రమలుండేవి. కొబ్బరిపీచుతో తాళ్లు, పగ్గాలు తయారు చేసేవారు, ఓడలకి తెరచాపలు కట్టేవారని మెత్ ఓల్డ్ రాశాడు. మచిలీపట్టణంలో అన్ని చోట్లకంటే చౌకగా వస్త్రాలు లభిస్తాయని మెత్

ఓల్డ్ రాశాడు. కోస్తా అంతటా ఇలాగే అన్నిరకాల పరిశ్రమలున్నాయని వివరించాడు. నేత పరిశ్రమ ఒక స్వతంత్ర పరిశ్రమగా అవతరించింది. ఈ కాలంలో బట్టలను తెలుపు చేయడం, రంగులు వేయడం, చిత్రాలు చిత్రించడం మొదలైన పనులు పక్కపక్కనే స్వతంత్ర పరిశ్రమలుగా అభివృద్ధి చెందాయి. వస్త్రాల మీద చిత్రాలు గీయడం అనేది అనేక దశలుగా ఉండేది. చిత్రాలు చిత్రించే బట్టలను మామూలుగా కాకుండా ప్రత్యేకంగా నేసేవారు. మస్తరుగీసి దానిని వస్త్రం మీదకు ఎక్కిస్తారు. తర్వాత రంగులు వేస్తారు. ఈ పనులన్నీ ఒకే కుటుంబం చేయకుండా వేరువేరు కుటుంబాల వృత్తులుగా విడిపోయాయి. వాణిజ్యం పట్టణాలలో నేత అద్దకాలకు సంబంధించిన వివిధ రకాల పని వారితో ప్రత్యేక పేటలు వెలిశాయని బౌర రాశాడు. బట్టల వర్తకులు తమకు కాలసిన నమూనాలను ఇస్తారు. ఈ నమూనాలను మస్తర్లు అని అంటారు. ఆ మస్తర్ల ప్రకారం నేతగాళ్లు వస్త్రాలు తయారు చేసి ఇస్తారు. ఉత్తరదేశంలో మొగలాయి సామ్రాజ్యం నుండి ఇరాన్ మొదలైన మధ్యాసియా దేశాల నుండి తూర్పుదేశాల నుండి రకరకాల మస్తర్లు వస్తూ ఉండేవి. వాటి ప్రకారం ఆంధ్రదేశపు నేతపని వారు వస్త్రాలు తయారు చేసి అంతర్జాతీయ కీర్తి గడించి ఉన్నారు. మచిలీపట్టణం కలంకారీ వస్తువులకు అంతర్జాతీయ గిరాకీ ఉండేది. మంచి లాభాలు వస్తూ ఉండేవి. అందువల్ల కలంకారీ పనివారంతా నవాబు కోసం పని చేయాలని గోల్కొండ నవాబు క్రీ.శ.1630వ సంవత్సరంలో ఆజ్ఞ జారీ చేశాడు.

ఉక్కు పరిశ్రమ: బట్టలేగాక ఆంధ్రదేశంలో మేలు రకమైన ఇనుము, ఉక్కు లభించేది. చౌకగా దొరికేది. 2-3 షిల్లింగులకు కూడా దొరికేదట. రేవులకు వచ్చేటప్పటికి 5-6 షిల్లింగుల రేటుగా పెరిగేదని మేత్ ఓల్డ్ రాశాడు. ఈ ఇనుము విదేశాలకు ఎగుమతి అయ్యేది. ఈ ఇనుముతోనే దమాస్కస్ కత్తులు, దాళ్ళు, బాకులు తయారయ్యేవని విదేశస్తులు రాశారు. గోల్కొండ రాజ్యంలో కంచర్లు ఒక తిత్తి, సుత్తి, పటకారు, తాగలి భుజాన వేసుకొని ముందు నడిచేవారట. వారివెంట ఒక పిల్లవాడు బొగ్గుల సంచి భుజాన తగిలించుకొని వచ్చేవాడు. వీధుల వెంట తిరుగుతూ ఎక్కడ కావాలంటే అక్కడే కొలిమిపెట్టి ఎవరికి కావలసిన ఇనప వస్తువులు వారికి అక్కడికక్కడే ఇళ్లముందు తయారు చేసి ఇచ్చేవారని విదేశీ రచనల వల్ల తెలుస్తోంది. కొందరు కమ్మర్లు ఇనుమును తామే కొని వస్తువులు తయారు చేసి అమ్ముకొనేవారని కూడా రాశాడు.

నర్సాపురంలో నౌకా నిర్మాణం జరిగేది. దానికి కావలసిన మంచి కలప, ఇనుము అక్కడ లభించేది. అక్కడ నౌకా నిర్మాణంలో గొప్ప అనుభవం కలిగిన పనివారు ఉండేవారని బౌర రాశాడు. ఇంకా నూనెలు ఆడటం, బెల్లం వండటం, ఉప్పు తయారు చేయడం, పంచదార తయారు చేయడం వంటి అన్నిరకాల పరిశ్రమలు ఆంధ్రదేశంలో ఉండేవి. కోట్ల విలువ గలిగిన వజ్రాల గనులుండేవి. ఐరోపా వారు రాకముందు భారతదేశం ఈ విధంగా సిరిసంపదలతో ప్రఖ్యాతి గాంచిన పరిశ్రమలతో, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పని నిపుణులతో ఉండేది. ఐరోపాలో ఏ దేశం కూడా భారతదేశానికి సాటిగాదు. అలాంటి ఐరోపా వారు వ్యాపారానికి వచ్చి ఇక్కడి సరుకులు వారి దేశానికి తీసుకువెళ్లి విశేష లాభాలు ఆర్జించి ధనికులయ్యారు. తర్వాత ఈ దేశాన్ని జయించి ఒక్క శతాబ్దంలో భారతదేశపు ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి బడుగుదేశంగా మార్చారు.

గ్రామాలలో పూర్వ పరిస్థితి కొనసాగడం: విదేశీ వ్యాపారం వల్ల ఉత్పత్తి పెరిగి ఒకే పని వేరు వేరు వృత్తులుగా అభివృద్ధి చెంది అమ్మకానికి, డబ్బు కోసం ఉత్పత్తి జరిగినందువల్ల వ్యవసాయం, పరిశ్రమలు; పట్టణాలు, పల్లెలు వేరుపడ్డాయి. అయినప్పటికీ గ్రామాలలో వ్యవసాయం, చేతి వృత్తులు పూర్తిగా విడిపోలేదు. వ్యవసాయక పరికరాలు చేసే కంసాలులు, కమ్మరులు, కుమ్మరులు, చాకళ్లు వారి వారి వృత్తులను ఎప్పటిలాగే కొనసాగిస్తూ గ్రామ స్వయం పోషకత్వాన్ని కొంత వరకు నిలబెట్టారు. అందువల్ల ప్రాచీన గ్రామవ్యవస్థ ఆంధ్రదేశంలో 20వ శతాబ్దందాకా కొనసాగింది. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ప్రధాన ఆర్థికశక్తిగా కొనసాగింది.

విదేశీ వ్యాపారం: 16-17వ శతాబ్దాలలో భారతదేశంలో విదేశీ వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. విదేశీయుల రాతల వల్ల తెలుస్తోంది. మచిలీపట్నం పెద్ద వ్యాపార కేంద్రం. దానిచుట్టూ వందమైళ్ల దూరం వరకు ఇది పెద్ద మార్కెట్టు అని బౌర రాశాడు. నర్సాపురం దాని పరిసరాలలో పికాన్లను చిన్న నాణేలు చెలామణిలో ఉండేవి. అక్కడ వ్యాపారం కోసం ఇవి ప్రత్యేకంగా ముద్రింపబడిన నాణేలు. ఈ నాణేలు అక్కడ గొప్ప వ్యాపారం ఉండేదని తెలుపుతున్నాయి. పెద్ద రేవుపట్టణాలే గాక కొన్ని ఉప పట్టణాలు కూడా వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. పాలకొల్లు, వేటపాలెం వంటి గ్రామాలు వ్యాపార మార్కెట్లుగా అభివృద్ధి చెందాయి. ఈ చుట్టుపక్కల సరుకులు అక్కడికి చేరి అక్కడి నుండి ఎగుమతికి మచిలీపట్టణం వస్తుండేవని రాశారు. బెంగాలు ఒరిస్సాల నుండి

బియ్యం కోరమండల్ కోస్తాకు వచ్చేవి. ఆ బియ్యాన్ని మలబారు కోస్తా నుండి వచ్చిన ఓడలు తీసుకువెళ్లేవి. అలాగే ఇటునుండి రాగి, జింక్, తగరం, పొగాకు, సుగంధ ద్రవ్యాలు, మచిలీపట్టణపు చిన్జ్ వస్త్రాలు బెంగాలుకు వెళ్లేవి. అలాగే మలబారు, గుజరాత్‌ల నుండి రాగి, పాదరసం, మిరియాలు ఆంధ్రదేశానికి వచ్చేవి. గోల్కొండ, విజయనగర రాజ్యాలలోని సరుకులన్నీ మచిలీపట్టణం రేవు నుండి విదేశాలకు ఎగుమతయ్యేవి. మచిలీపట్టణం నుండి బెంగాల్, బర్మా, పెగూ, అరకన్, సయాం, చైన, మలక్కా, ఓర్ముజ్, మడగాస్కర్, సుమిత్రా, జావా, మామిళ్లె దీవులలోను, పర్షియా, అరేబియా, ఆఫ్రికాలలో వ్యాపారం జరుగుతుండేది.

పోర్చుగీసు వారు రాకముందు భారతదేశపు వస్త్రాలకు తూర్పుదీవులలో మంచి గిరాకీ ఉండేది. ముఖ్యంగా వస్త్రాలకు వారు భారతదేశం మీద ఆధారపడి ఉండేవారు. చాలా ప్రాచీన కాలం నుండి తూర్పు కోస్తా నుండి ఆగ్నేసియా దేశాలకు వస్త్రాలు ఎగుమతి అవుతుండేవని రాయచౌదరి అన్నారు. తూర్పుకోస్తా విదేశీ వ్యాపారం దేశీయుల చేతులలోను, పశ్చిమ కోస్తా వ్యాపారం అరబ్బుల చేతులలోను ఉండేది. మొదటి నుంచీ విదేశీయులు బంగారాన్ని చెల్లించి భారతీయ వస్తువులు కొనేవారు. తూర్పుదేశాలే గాక పశ్చిమ దేశాలు, ఐరోపా దేశాలు కూడా బంగారాన్ని చెల్లించి భారతీయ వస్తువులు కొనేవారు. మొగలు సామ్రాజ్య కాలం నుండి బంగారంతో కొనే ఆచారం ఉండేది. ఐరోపా వారు రాకముందు ఇండియాకు, ఐరోపాకు మోచారేవు నుండి 6 లక్షల పౌనులు, అలప్పీ కాన్‌స్టాంట్‌నోపిల్ ద్వారా 5 లక్షల పౌన్లు వ్యాపారం జరిగేది. పర్షియా, టర్కీ దేశాలు ఇండియాతో ఓర్ముజ్ రేవు గుండా వ్యాపారం జరిపేవి. సన్నని వలెపాలు, సిల్క్ బట్టలు, సుగంధ ద్రవ్యాలు, నీలిమందు, పంచదార, వజ్రాలు, ఆయుర్వేద మందులు, విలాస వస్తువులు, కళాఖండాలు భారతదేశం నుండి విదేశాలకు ఎగుమతి అయ్యేవి భారతదేశానికి, ముఖ్యంగా కోస్తా ఆంధ్రదేశానికి విశేష లాభాలు వచ్చేవి. ఎగుమతులు ఎప్పుడూ మిగులుగానే ఉండేవి. దిగుమతులు చాలా తక్కువ. భారతీయులకు కావలసిన వస్తువులన్నీ దేశంలో తయారయ్యేవి. విదేశాల నుండి తెప్పించుకోనవసరం లేదు. అందువల్ల ఎప్పుడు మిగులు లాభం ఉండేది. భారతదేశ వ్యాపారానికి ఐరోపాలో లాగా కార్పొరేషన్లు, కంపెనీలు ఉండేవి కాదు. వర్తక శ్రేణుల ద్వారా జరిగేది. ఎక్కువ భాగం వ్యక్తి ప్రాతిపదికన జరిగేవి.

ఆంధ్రదేశంలో ఐరోపా కంపెనీలు: వాస్కోడిగామా కేఫ్ ఆఫ్ గుడ్‌హోప్‌ను చుట్టి సముద్రమార్గం ద్వారా సరాసరి భారతదేశం రావడంతో భారతదేశ చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమైంది. ఐరోపాతో సరాసరి ఇండియాకు వ్యాపార సంబంధాలు హెచ్చాయి. వాణిజ్యం విస్తరించింది. పోర్చుగీసు చిన్న దేశం. పెద్ద పెట్టుబడి పెట్టి భారీ వ్యాపారం చేసే శక్తి లేదు. కనుక పోర్చుగీసు వారు తమకు పోటీలేకుండా చేసుకోవాలని భావించారు. తమ ఓడలలో దేశంలో ఒక రేవు నుండి మరొక రేవుకు సరుకులు తీసుకువెళ్లరాదని నిర్ణయించుకున్నారు. సముద్రాలపై తిరిగే ఇండియా అరబ్బు ఓడలను దోచుకోవడం, ముంచడం చేసి సముద్రాలపై ఆధిపత్యాన్ని సాధించారు. 20 వేల టన్నుల బరువు గల పోర్చుగీసు యుద్ధనౌకలు హిందూ మహాసముద్రంలో తిరుగుతుండేవని అంచనా. వారి ఓడలను ఎదుర్కొనేశక్తి ఇండియాలో ఏ రాజ్యానికీ లేదు. పోర్చుగీసు వారు ఇండియాలో దౌర్జన్యాలు చేశారు. ప్రజలను క్రైస్తవులుగా మార్చారు. ఇంక్విజిషన్‌ని ప్రవేశపెట్టారు. ఇన్ని చేసినా వారిని దండించిన వారు లేరు. విజయనగర సామ్రాట్‌లు కూడా వారి జోలికి పోలేదు. పోర్చుగీసు వారి వ్యాపార స్థావరాలు పశ్చిమ తీరంలోనే ఎక్కువ ఉండేవి. తూర్పు తీరంపై వారు పెద్దగా శ్రద్ధ చూపలేదు. శాంథోమ్‌లో ఒకటి, నాగపట్టణంలో ఒకటి మాత్రమే ఉండేది. ఆంధ్రకోస్తాలో వారికి ఎక్కడా స్థావరం గాని, ఫ్యాక్టరీ గాని లేదు. వారు సుగంధ ద్రవ్యాల వ్యాపారానికి అధిక ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ వ్యాపారం వల్ల వారికి 1000 రెట్లు లాభాలు వచ్చేవి.

డచ్చివారు పోర్చుగీసు వారితో సంఘర్షణ: పోర్చుగీసు వారి తర్వాత వచ్చిన వాడు డచ్చివారు. వారు పోర్చుగీసు వారికి మంచి పోటీ ఇచ్చారు. స్వదేశీయులు పోర్చుగీసు వారిని ఏమీ చేయలేకపోయారు. కాని వారి సాటివారైన డచ్చివారు, పోర్చుగీసు వారిని బాగా దెబ్బతీసారు. డచ్చివారు తూర్పుకోస్తా వస్త్రాలకు తూర్పుదీవులలో మంచి గిరాకీ ఉందని గ్రహించి వారు తూర్పు తీరాన తమ వ్యాపార కేంద్రాలు తెరచారు. ఇక్కడ వస్త్రాలు కొని తూర్పు దీవులకు తీసుకువెళ్లి వస్త్రాలు అమ్మి ఆ లాభాలతో అక్కడ సుగంధ ద్రవ్యాలు కొని యూరోప్‌కు తీసుకువెళ్లేవారు. దాంతో వారికి మంచి లాభాలు రాసాగాయి. ఐరోపాలో డచ్చివారి పలుకుబడి పెరగసాగింది. దాంతో పోర్చుగీసు వారు డచ్చి వారిని అంతం చేయాలని ప్రయత్నాలు ఆరంభించాయి. దాంతో పోర్చుగీసు వారికి, డచ్చి వారికి సంఘర్షణ ప్రారంభమైంది. క్రీ.శ.1606వ సంవత్సరంలో డచ్చివారు శాంథోమ్ వద్ద మూడు

పోర్చుగీసు వారి నౌకలు తగులబెట్టారు.

ఆంధ్రకోస్తాలో డచ్చివారు: కోరమండల తీరంలోని వ్యాపారం లాభసాటిగా ఉండటంతో, ఆంధ్రకోస్తాలో తమ వ్యాపారాన్ని నెలకొల్పాలని గోల్కొండ నవాబులను అనుమతి కోరారు. గోల్కొండ నవాబు అనుమతిని ఇచ్చాడు. దాంతో వారు క్రీ.శ.1608వ సంవత్సరంలో మచిలీపట్టణంలో తమ స్థావరాన్ని తెరిచారు. ఆంధ్రకోస్తాలో నెలకొల్పిన తొలి ఐరోపా స్థావరం డచ్చి వారిది. పోర్చుగీసు వారు అరబ్బు నౌకలను దోచుకోగా గోల్కొండ నవాబు మచిలీపట్టణంలో ఉన్న పోర్చుగీసు కెప్టెన్‌ను బంధించమని ఆజ్ఞలు జారీ చేశాడు. పోర్చుగీసు వారు గోల్కొండ నవాబుల ఆగ్రహానికి గురికావడం డచ్చివారికి బాగా కలిసివచ్చింది. పోర్చుగీసు వారిని ధ్వంసం చేయడానికి మంచి అవకాశం వచ్చింది. కనుక క్రీ.శ.1610లో డచ్చివారు మచిలీపట్టణం వద్ద రెండు, పులికాట్ వద్ద రెండు పోర్చుగీసు వారి ఓడలను ధ్వంసం చేశారు. ప్రతీకారంగా క్రీ.శ.1612లో పోర్చుగీసు వారు పులికాట్‌లో ఉన్న డచ్చి వారి ఫ్యాక్టరీని ధ్వంసం చేశారు. డచ్చివారు పులికాట్ వద్ద ఫ్యాక్టరీని నిర్మించుకోడానికి అనుమతి సంపాదించారు. బలమైన కేంద్రాన్ని నిర్మించారు. దానిని ధ్వంసం చేయాలని క్రీ.శ.1626 వరకు పోర్చుగీసు వారు ప్రయత్నించారు. కాని డచ్చివారు అనేక పర్యాయాలు పోర్చుగీసు వారిని ఓడించారు. అంతేగాక తూర్పు తీరానికి వచ్చే ఇతర దేశాల ఓడలకు కూడా పోర్చుగీసు వారి నుండి రక్షణ ఇచ్చారు. క్రీ.శ.1639వ సంవత్సరంలో పోర్చుగీసు వారు తూర్పుకోస్తా నుండి పూర్తిగా వైదొలిగారు. క్రీ.శ.1642లో డచ్చివారు నాగపట్టణాన్ని స్వాధీనం చేసుకున్నారు. క్రీ.శ.1661లో గోల్కొండ నవాబులు శాంథోమ్‌ని స్వాధీనం చేసుకొని డచ్చివారికి ఫ్యాక్టరీ కట్టుకోడానికి అనుమతి ఇచ్చారు. దాంతో పోర్చుగీసు వారికి తూర్పుతీరంలో స్థానం లేకుండాపోయింది. 17వ శతాబ్దంలో కోరమండల్ కోస్తాలో వర్తకం చేసుకొనే హక్కు డచ్ వారు పొందారు. వారు చెల్లించవలసిన సుంకాలు నిర్ణయమయ్యాయి. మచిలీపట్టణం, నిజాంపట్టణం, తేనాంలలో 4 శాతం, పులికాట్‌లో 2 శాతంగా నిర్ణయించారు. కాని సామంతులు, పన్నుగుత్తదార్లు వారిని బాధించసాగారు. అందువల్ల ఎగుమతి, దిగుమతి సుంకాల గుత్తలను రద్దు చేస్తూ ఫర్మానా విడుదల చేశారు.

దేశీయ వర్తకుల వాణిజ్యం: క్రీ.శ.1630లో దేశంలో పెద్ద కరువు వచ్చింది. నేతగాళ్లు బట్టలు చలువ చేసేవారు, అద్దకాల వారు చాలా మంది పారిపోయారు. ఆంధ్రదేశంలో పరిశ్రమలు, వాణిజ్యం దెబ్బతిన్నాయి. తూర్పుదీవులలో వస్త్రాలకు గిరాకీ మాత్రం ఇంకా ఎక్కువ అయింది. డచ్చివారి వద్ద ఎక్కువగా పెట్టుబడులు లేక డిమాండ్‌ను తట్టుకోలేకపోయారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దేశీయ వర్తకులు ఆయా దేశాలతో ప్రత్యక్ష వాణిజ్యాన్ని మొదలుపెట్టారు. అంతవరకు డచ్చి వారికి ప్రధాన సప్లయిదారులుగా ఉన్న చిన్నన్న అనే దేశీయ వ్యాపారి స్వయంగా ఆరకాన్, పెగు, సింహళాలతో వ్యాపారం ప్రారంభించాడు. మచిలీపట్నంలోని స్థానిక ముస్లిం వర్తకుడు కమాలుద్దీన్ పర్షియా, బెంగాలు మొదలైన ప్రాంతాలలో సొంత వర్తకం ప్రారంభించాడు. అతడు కూడా అంతకు ముందు డచ్చి వారికి వస్త్రాలు సప్లయి చేసేవాడు. మీర్జుమ్లాఖాన్-ఇ-ఖానన్, కృష్ణప్పలనే గోల్కొండ సామంత రాజులు కూడా సొంత వాణిజ్యాన్ని మొదలుపెట్టారు. దాంతో డచ్చివారి వ్యాపారం అడుగంటింది. వారికి సముద్రాలపై ఆధిపత్యం ఉంది. కనుక సముద్రాలపై ఇండియా ఓడలు ప్రయాణం చేయడానికి అనుమతి నిరాకరించారు. కాని వారిపై ఒత్తిడి వచ్చింది. నవాబుల ఒత్తిడి తట్టుకోలేక కొంత మంది ముఖ్యులైన అంటే మీర్జుమ్లా వంటి వారికి పరిమితంగా అనుమతినిచ్చారు. మిగిలిన వారికి అనుమతి ఇవ్వలేకపోయినా లెక్కచేయకుండా తమ ఓడలను నడిపారు. డచ్చివారు ఏమీ చేయలేకపోయారు.

డచ్చివారి పునర్నిర్మాణం: కనుక వారు తమ వ్యాపారాన్ని పటిష్టం చేయాలని తీవ్ర ప్రయత్నం చేశారు. అందుకు వారు గోల్కొండలో ఫ్యాక్టరీని పెట్టారు. పులికాట్ రేవు పూర్తిగా వారి ఆధిపత్యంలోకి వచ్చింది. భీముని పట్టణంలో మరొక ఫ్యాక్టరీని నిర్మించారు. గోల్కొండ సుల్తాన్‌లు విదేశీవాణిజ్యంపై పన్నులు తీసివేసారు. కనుక త్వరితగతిన వారి వ్యాపారం అభివృద్ధి చెందింది. కాని ఎక్కువ కాలం నిలువలేదు. గోల్కొండ నవాబులతో భేదాభిప్రాయాలు వచ్చాయి. అబ్దుల్లాహుసేన్‌షా కాలంలో నాణేలు ముద్రించుకోడానికి 120000 పగోడాల రాగిని డచ్చివారు గోల్కొండకు అమ్మారు. ఆ డబ్బు చెల్లించమని డచ్చి కంపెనీ అడిగినప్పుడు అక్కడున్న నేతగాళ్లు వస్త్రాలను డచ్చి వారికి అమ్మరాదని ఆదేశించాడు. ఇంతలో ఇంగ్లిష్ వారి పోటీ అధికమైంది. ఔరంగజేబు గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించాడు. మహారాష్ట్రుల దాడులు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితులలో వారు నిలదొక్కుకోలేక పోయారు. దాంతో వారి వ్యాపారం పూర్తిగా అంతమైంది. ఆంధ్రదేశంలో డచ్చివారి వ్యాపార

కార్యకలాపాల వల్ల ఆంధ్రదేశంలో పత్తి, నీలిపంటలు బాగా విస్తరించాయి. డచ్చివారు ఆంధ్రదేశంలో రోజువారీ కూలీని ప్రవేశపెట్టారు. సాయంత్రానికల్లా డబ్బు చేతిలో పడేది. ఇది దేశానికి కొత్త, వృత్తిపని వారు ముందు పనులు చేసేవారు, తర్వాత ఎప్పుడో వారికి డబ్బు ఇచ్చేశారు. రైతులైతే సంవత్సరానికొక పర్యాయం ధాన్యం కొలిచేవారు. వారు కార్ఖానాల పద్ధతి ప్రవేశపెట్టారు. వారి వ్యాపార స్థావరాలలో వస్త్రాలు తయారు చేయమని వృత్తి పని వారిని ఆహ్వానించారు. దాంతో వృత్తి పనివారు ఐరోపా వారి వర్తక స్థావరాల వద్ద నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసించే పద్ధతి వచ్చింది. డచ్చివారు తమకు అంతకుముందు డచ్చి కంపెనీ వారు వస్త్రాలు నేయించుకోవడానికి ముందు బయానా ఇచ్చేవారు. ఈ పద్ధతి వల్ల దేశీయ వ్యాపారులు తమ సొంతపెట్టుబడి పెట్టి నేయించి డచ్చి వారికి తగ్గిపోయింది. దీని వల్ల వ్యక్తిగత పోటీ తగ్గిపోయింది. మార్కెట్టు నియంత్రించగలిగారు. వస్త్రాలు నేసే వృత్తి పని వారిని కూడా కంపెనీ అదుపులో ఉంచగలిగింది.

ఫ్రెంచి వారి ఈస్ట్ ఇండియా కంపెనీ: క్రీ.శ.1664లో రిషెల్యూ ఫ్రెంచి ఈస్టిండియా కంపెనీని స్థాపించాడు. 70వ దశకంలో ఫ్రెంచి వారు కూడా ఇండియాలో అడుగుపెట్టారు. ఇండియాలో అడుగు పెట్టిన వారిలో వారు చివరి వారు. వారి రాకను డచ్చివారు, ఇంగ్లీష్ వారు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. కాని గోల్కొండ నవాబులు వ్యాపారం చేసుకోడానికి వారికి అనుమతి నిచ్చారు. మచిలీపట్టణంలో ఒక ఫ్యాక్టరీని నిర్మించారు. కోరమండల తీరంలో జింజి పాలకుని వద్ద పుదుచ్చేరిని కొన్నారు. ఫ్రెంచి వారు కూడా క్రమేపీ బలపడి ఆంధ్రదేశంలో వ్యాపారం సాగించారు.

డచ్చి - ఫ్రెంచి వారి సంఘర్షణ: డచ్చివారు 1672లో శాంథోమ్‌ను ఆక్రమించారు. ఆరు నెలలలో డచ్చివారు శాంథోమ్‌పై దండెత్తి ఫ్రెంచి వారిని పారదోలారు. క్రీ.శ.1693లో డచ్చివారు పుదుచ్చేరిని ఆక్రమించారు. కాని 1697లో రిస్విక్ ఒప్పందం వల్ల పుదుచ్చేరిని తిరిగి ఇచ్చారు. ఫ్రెంచివారు నర్సాపురంలో ప్రవేశించాలని చూశారు. డచ్చివారు, గోల్కొండ నవాబులు ఆటంకాలు కలిగించారు. మొదట ఫ్రెంచివారు ఇంగ్లీష్ వారితో స్నేహంగా ఉండేవారు. తర్వాత వారితో కూడా విరోధాన్ని పెంచుకున్నారు. ఈ విధంగా ఐరోపా వారి మధ్య సంఘర్షణలు సాగుతుండేవి.

ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ

క్రీ.శ.1600 సంవత్సరంలో ఇంగ్లాండ్‌లో ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వారు ఇండియాలో వ్యాపారం చేయాలని ఇండియా రాజుల వద్దకు రాయబారాలు పంపారు. ఆ కాలంలో ఉత్తరదేశంలో మొగలులు, దక్షిణదేశంలో బహమనీ సామ్రాజ్య శిథిలాల మీద వెలసిన దక్కన్ సుల్తాన్ రాజ్యాలు, ఆంధ్రదేశంలో గోల్కొండ నవాబులు, దక్షిణదేశంలో విజయనగర రాజ్యాన్ని ఆరవీటి వంశం పాలిస్తున్నారు. పశ్చిమకోస్తాలో పోర్చుగీసు వారు, తూర్పుకోస్తాలో డచ్చివారు స్థిరపడి ఉన్నారు. వారితో పోటీ పడవలసివచ్చింది. క్రీ.శ.1602వ సంవత్సరంలో విలువగలిగిన సరుకులతో ఉన్న 900 టన్నుల పోర్చుగీసు నౌకను ఇంగ్లీష్ వారు స్వాధీనం చేసుకున్నారు. మరొక బ్రిటిష్ ఓడ క్రీ.శ.1604వ సంవత్సరంలో భారతదేశ ఓడలను దోచుకుంది. మిడిల్టన్ అనే అతని నాయకత్వాన బయలుదేరిన నౌక గొప్ప లాభాలు సంపాదించి క్రీ.శ.1609లో ఇంగ్లాండ్ చేరింది. అతని నాయకత్వంలో మరొక ఓడ సూరత్ వద్దకు వచ్చింది. కాని అక్కడ పోర్చుగీసు వారు ఎదుర్కొని నష్టం కలిగించారు. మిడిల్టన్ అనేక భారతీయ నౌకలను అడ్డగించేవాడు, దోచుకొనేవాడు. కెప్టెన్ హిప్పన్ తూర్పుకోస్తా వెంట నౌకలో ప్రయాణించి అన్ని ప్రదేశాలను పరిశీలించాడు. ప్రతిచోట డచ్చివారు స్థిరపడి ఉన్నారని తెలుసుకున్నాడు. క్రీ.శ.1611వ సంవత్సరంలో గోల్కొండ నవాబు వద్ద అనుమతి సంపాదించి మచిలీపట్నంలో ఒక ఫ్యాక్టరీని నెలకొల్పాడు. తర్వాత నిజాం పట్టణంలో మరొక స్థావరాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. క్రీ.శ.1612వ సంవత్సరంలో సూరత్ వద్ద నాలుగు యుద్ధనౌకలతో తలపడి పోర్చుగీసు వారిని ఓడించాయి. మొగల్ చక్రవర్తి జహంగీర్ మొగల్ సామ్రాజ్యంలో వ్యాపారం చేసుకోడానికి అనుమతి ఇచ్చాడు. మొగల్ దర్బారులో బ్రిటిష్ వారు ఎగుమతి, దిగుమతులపై 3 1/2 శాతం సుంకం చెల్లించాలని అంగీకారం కుదిరింది. తర్వాత పశ్చిమకోస్తాలో తమ స్థావరం నెలకొల్పారు. తూర్పుకోస్తాలో పులికాట్ వద్ద స్థావరాన్ని నెలకొల్పాలని ప్రయత్నించారు. కాని డచ్చివారు సాగనీయలేదు. క్రీ.శ.1620లో కెప్టెన్ షిల్లంగ్ నాయకత్వాన వెళుతున్న ఇంగ్లిషు నౌకల మీద పోర్చుగీసువారు దాడిచేసి నష్టం కలిగించారు. అయినప్పటికీ అదే సంవత్సరంలో ఆగ్రా, పాట్నాలలో ఫ్యాక్టరీలు తెరిచారు. ఇలాంటి ఒడిదుడుకుల మధ్య వారు ఇంగ్లాండు నుండి 613681 పౌన్ల ఉన్ని వస్త్రాలు, జింకు, సీసం, ఇనుము మొదలైన సరుకులు తెచ్చి ఇండియా తూర్పుదేశాలలో అమ్ముకున్నారు. డచ్చి కంపెనీలలాగా గాక ఇంగ్లీష్ వారు ఇండియా అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బు పెట్టి సరుకులు కొన్నారు. ఇక్కడ నుండి వస్త్రాలు, నీలిమందు, సూరేకారాన్ని యూరోప్ దేశాలకు తీసుకువెళ్లి అమ్ముకున్నారు. క్రీ.శ.1621 నాటికి ఇంగ్లిషు కంపెనీలు ఇండియా, తదితర తూర్పుదేశాలతో వ్యాపారం వల్ల 2014600 పౌన్లు గడించారు. వారు పెట్టిన పెట్టుబడికన్నా ఐదురెట్లు లాభం పొందారు. డచ్చివారు, ఫ్రెంచివారు ఆసియాదేశ మార్కెట్లపై దృష్టి పెట్టగా ఇంగ్లిషు వారు ఐరోపా మార్కెట్లపై దృష్టి పెట్టి అమిత లాభాలు పొందారు. క్రీ.శ.1621 నాటికి ఇంగ్లిషు వారి వ్యాపారం ఇండియాతోనేగాక చైనా, ఇండోచైనా, ఆగ్నేయాసియా దీవులకు కూడా విస్తరించింది.

1621వ సంవత్సరంలో ఇంగ్లండు, హాలెండులు రక్షణ సంధిని చేసుకున్నాయి. ఆ సంధి ప్రకారం ఇండియాలో వ్యాపారంలో ఒకరికొకరు సహకరించుకోవాలని నిర్ణయించుకొన్నారు. అందువల్ల ఇంగ్లిషువారు, డచ్చి వారికి బలమైన స్థావరం అయిన పులికాట్‌లో ఫ్యాక్టరీ తెరిచారు. కాని డచ్‌వారు అందుకు అంగీకరించలేదు. క్రీ.శ.1622లో ఆంగ్లేయులు పర్షియన్లతో కలసి పోర్చుగీసు వారిని ఓడించి అర్ముజ్‌ను ఆక్రమించారు. ఇదే సమయంలో ఇంగ్లాండ్‌లో తూర్పు ఇండియా కంపెనీ పెద్ద పెట్టుబడిని సేకరించింది. 16 లక్షల పౌన్ల మూలధనం, 36 నౌకలతో పెద్ద జాయింట్ స్టాక్ కంపెనీగా రూపొందించారు. దాంతో కంపెనీ ఆర్థికంగా బలపడింది. కాని ఇంగ్లిష్ వారికి, డచ్చి వారికి మధ్య విరోధం తీవ్రస్థాయికి చేరింది. అంబోయి వద్ద డచ్చివారు ఇంగ్లిషు వారిపై దాడి చేసి 12 మందిని చంపారు. మలక్కా, సయాం మొదలైన దీవులలో ఇంగ్లిషు వారికి రక్షణ లేకుండా పోయింది. ఒక్క బంటమ్ నుండి తప్ప మిగిలిన తూర్పు దీవులన్నింటి నుండి ఇంగ్లిషు వారు వైదొలిగారు. దీనివల్ల కంపెనీకి 20 లక్షల పౌండ్లు నష్టం వచ్చింది. తమ దేశంలో 2 లక్షల పౌండ్లు బాకీ తేలారు. కంపెనీ షేరు విలువ 100 నుండి 80 పౌండ్లకు పడిపోయింది. ఈస్టిండియా కంపెనీ ఇండియా, తూర్పు దీవులతో వ్యాపారం వదలి వేయాలని, అసలు కంపెనీనే మూసివేయాలని తలచారు. కాని కొంత ఓర్పు చూపి వ్యాపారాన్ని కొనసాగించారు.

క్రీ.శ.1620వ సంవత్సరంలో ఆర్మగావ్ వద్ద ఒక ఫ్యాక్టరీని తెరిచారు. అది పులికాట్‌కు ఉత్తరంగా 60 కిలోమీటర్ల దూరంలో ఉండేది. కాని అది అంతగా ఉపయోగపడలేదు. మచిలీపట్టణం వద్దనే వ్యాపారాన్ని కేంద్రీకరిద్దామని అక్కడ ఫ్యాక్టరీ కట్టారు. అక్కడ నుండి తూర్పు ఇండియా దీవులతో వ్యాపారం సాగించారు. లాభాలు రాసాగాయి. కంపెనీ మూసివేయాలన్న ఆలోచనను విరమించారు. కోరమండల తీరంలో క్రమేపీ ఇంగ్లీష్ వారు గోల్కొండ నవాబుల అభిమానం సంపాదించి వీరవాసరం, మోటుపల్లిలో కూడా రెండు కొత్త ఫ్యాక్టరీలు తెరిచారు. నిజాం పట్టణం, ఆర్మగావ్‌లలో అంతకు ముందు నిర్మించిన ఫ్యాక్టరీని బాగు చేశారు. డచ్ వారు ఏమీ చేయలేకపోయారు

క్రీ.శ.1627లో కోరమండల్ తీరంలో కరవు వచ్చింది. అది 1630 నాటికి తీవ్రరూపం దాల్చింది. చిక్కిన మనుషులను కూడా చంపి తిన్నారట. ఒంటరిగా చిక్కితే చంపుతారని ప్రజలు ప్రయాణాలు కూడా మానుకున్నారని విలియం ఫాస్టర్ రాశాడు. క్రీ.శ.1633వ సంవత్సరంలో పులికాట్‌కు పోయే డచ్ వారి ఆహార ధాన్యాలను ఇంగ్లీష్ వారు ఆర్మగావ్‌కు మళ్లించారు. దాని వల్ల పులికాట్‌లో ఆహారధాన్యాల ధరలు ఆర్మగావ్‌లో వస్త్రాల ధరలు పెరిగాయి. డచ్చివారు తమ ఓడలను కాపాడుకోడానికి ఒక క్రూయిజర్‌ను పంపి కాపాడుకోసాగారు. ఇంగ్లీష్ వారు డచ్ వారి కంపెనీని దెబ్బ తీయడానికి తూర్పుతీరంలో తయారయ్యే అన్నిరకాల వస్త్రాలను ఎక్కువ ధరలకు కొని తూర్పు ఇండియా దీవులకు పంపసాగారు. కోరమండల తీర ప్రజలకు కావలసిన వస్తువులను తెచ్చి తక్కువ ధరకు అమ్మసాగారు. అయినప్పటికీ డచ్ వారు మలక్కా నుండి సుగంధ ద్రవ్యాలు, చైనా నుండి శిల్క్, జపాన్ నుండి వెండిని తెచ్చి వ్యాపారం చేసి నష్టాలు రాకుండా చూసుకున్నారు. ఇంగ్లీష్ వారు ఐరోపాకు ఇక్కడి వస్త్రాలు, సరుకులు ఎగుమతి చేస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొంటూ ఉన్నారు. కాని ఇదేకాలంలో స్థానిక పాలెగాండ్రు సొంత వ్యాపారాలు మొదలుపెట్టారు. మీర్జుమ్లా నీలిమందు వ్యాపారాన్ని తన గుత్తాధికారంలో ఉంచుకున్నాడు అతడు మంచర్బాస్ అనే వ్యక్తికి ఒక్కడికే నీలి మందును అమ్మే గుత్తాధికారాన్ని ఇచ్చాడు. ఈ పద్ధతి డచ్, ఇంగ్లీష్ వారికి చాలా నష్టాన్ని తెచ్చింది. తమ విరోధాన్ని మాని ఇద్దరూ కలసి దేశీయ వ్యాపారాన్ని నిర్ణయించిన ధరకు మించి దేశీయ సరుకులు, వస్త్రాలు కొనరాదని నిర్ణయించారు. ఇంతలో మీర్జుమ్లాకు గోల్కొండ నవాబుతో విరోధం వచ్చింది. అతని అధికారం సన్నగిల్లింది. దాంతో మళ్లీ ఇంగ్లీష్ వారి వ్యాపారం పుంజుకొంది.

గోల్కొండ రాజ్యంలో డచ్చి వారికి సుంకాలు లేవు. వారికున్న సౌకర్యాలు తాము సంపాదించాలని ఇంగ్లీష్ వారు తమ ఏజంటు తామస్‌జోయ్‌స్‌ని క్రీ.శ.1634వ సంవత్సరంలో గోల్కొండ పంపారు. ఎల్చిబేగ్ అనే పర్షియన్ సరదారుని సహాయంతో అతడు గోల్కొండ నవాబు వద్ద ఫర్మానా సంపాదించాడు. దీని ప్రకారం ఇంగ్లీష్ వారు సాలుకి 12 వేల పగోడాలు నవాబుకు చెల్లించాలి. గోల్కొండ రాజ్యంలో మరెక్కడా ఏ సుంకాలు చెల్లించనక్కరలేదు. ఈ షరతులను సుల్తాన్ బంగారు రేకుపై రాయించి ఇచ్చాడు. దానికే గోల్డెన్ ఫర్మానా అని పేరు వచ్చింది. ఈ ఫర్మానా వల్ల పన్నుగుత్తదార్లకు నష్టం వస్తుందని సుల్తాన్ మచిలీపట్టణంలోని పన్నుగుత్తదారుకు 800 పగోడాలు రాయితీ ఇచ్చాడు. బంగారు ఫర్మానా వల్ల మచిలీపట్టణంలో ఇంగ్లీష్ వారి వ్యాపారం వారు ఆశించిన దానికంటే అనేక రెట్లు ఎక్కువైంది. దాంతో వారు 1635లో పుదుచ్చేరి, పోర్టొనోవాలలో కూడా వ్యాపార కేంద్రాలు తెరిచారు.

కోర్టిన్ అసోసియేషన్: క్రీ.శ.1637వ సంవత్సరంలో బ్రిటన్‌లో ఈస్టిండియా కంపెనీకి ప్రతిస్పర్ధగా కోర్టిన్ అసోసియేషన్ అనే మరొక కంపెనీ వెలసింది. ఆ కంపెనీ ఏజెంట్లు ఇండియా వచ్చారు. గోల్కొండ నవాబును వ్యాపారానికి అనుమతిని అడిగారు. కాని నవాబు తిరస్కరించాడు. దాంతో వారు నగరంపై కాల్పులు జరిపారు వారి ఏజంటును నవాబు జైలులో పెట్టాడు. పోటీ కంపెనీ వల్ల ఈస్టిండియా కంపెనీ ఇబ్బందుల పాలైంది. నష్టాలు రాసాగాయి. ఇంతలో క్రీ.శ.1639వ సంవత్సరంలో నవాబు మచిలీపట్టణాన్ని దర్శించాడు. నవాబులు అధికార పర్యటనను దౌరా అని అంటారు. ఈ దౌరా సమయంలో ఇంగ్లీషు వారు మంచి బహుమతులు ఇవ్వలేకపోయారు. కాని డచ్చి వారు విలువైన బహుమతులు ఇచ్చి నవాబు అభిమానాన్ని సంపాదించారు. ఇంగ్లీష్ వారు అప్పటికే 20 వేల పగోడాలు బాకీ పడి ఉన్నారు.

మద్రాసు ఫ్యాక్టరీ: కనుక వారు కోరమండల్ తీరంలో వ్యాపారం పెంచుదామని ఫ్రాన్సిస్ అనే వ్యక్తిని పంపారు. అతడు అక్కడి స్థానిక పాలెగాడు అయిన దామెర్ల వెంకటాద్రినాయుడిని కలిసి ఒప్పందం చేసుకొని మద్రాసు సంపాదించాడు. అక్కడ సెంట్ జార్జి కోటను కట్టారు. క్రీ.శ.1641వ సంవత్సరంలో ఆ ప్రాంతంలో క్రీ.శ.1647వ సంవత్సరంలో పెద్ద కరవు వచ్చింది. నేతగాళ్ల వేల సంఖ్యలో చనిపోయారు. మద్రాసులో 3 వేలు, శాంథోమ్ పలకట్లలో 10 వేల మంది చనిపోయారని, వస్త్రాలు నేసే వారి కొరత ఏర్పడిందని, ధరలు 15 శాతం

పెరిగాయని, ఐరోపా సరుకులు కొనే వారు లేరని, ఐరోపా వారి ఉత్తరాల వల్ల తెలుస్తోంది. అందువల్ల వారి వ్యాపారం ఆటుపోట్లను అనుభవించింది. ఇంతలో క్రీ.శ.1654వ సంవత్సరంలో రాయవెల్లూరు రాజ్యాన్ని మీర్జుమ్లా జయించాడు. మద్రాసు ప్రాంతం అతని ఆధీనంలోకి వచ్చింది. అతడు ఇంగ్లిష్ వారిపై కొత్త పన్నులు విధించాడు. అది చెల్లించలేదని క్రీ.శ.1658వ సంవత్సరంలో అతడు మద్రాసుపై దాడి చేశాడు. ఇంగ్లిష్ వారు అతనికి లొంగిపోయి సాలుకు 380 పగోడాలు సుంకం చెల్లించడానికి అంగీకరించాడు. క్రీ.శ.1600 నుండి ఇంగ్లిష్ వారి వ్యాపారం పుంజుకుంది. కాని కంపెనీ ఉద్యోగులు అవినీతిపరులై సొంత వ్యాపారం చేస్తూ అక్రమ లాభాలు గడిస్తూ కంపెనీని నష్టపరచసాగారు. సర్‌గ్రీన్‌హిల్, జాన్‌ఫాక్స్‌క్రాఫ్ట్, శాంబ్రోక్, ఎడ్వర్డ్ వింటర్ అనే కంపెనీ ఉద్యోగులు బేరా తిమ్మన్న, వీరన్న అనే బ్రోకర్లతో చేతులు కలిపి కంపెనీని నష్టపరిచారని విలియం పాస్టర్ తన ఇంగ్లిష్ ఫ్యాక్టరీస్ ఇన్ ఇండియా అనే గ్రంథంలో రాశాడు. తమ సొంత కంపెనీ ఉద్యోగులను శిక్షించి మద్రాసును తమ ఆధీనంలోకి తెచ్చుకోడానికి ఇంగ్లాండ్ నుండి ఒక సైన్యాన్ని కూడా పంపవలసివచ్చింది. క్రీ.శ.1668లో విశాఖపట్టణంలో కొత్త ఫ్యాక్టరీని తెరిచారు. మీర్జుమ్లా తర్వాత గోల్కొండ నవాబులు సాలుకు 1200 పగోడాలు చెల్లించే పద్ధతిపై మద్రాసు ప్రాంతంలో సుంకం చెల్లించనక్కరలేకుండా ఫర్మానా ఇచ్చారు. కాని స్థానిక పాలకులు తమకు రావలసిన గుత్త పన్ను చెల్లించమని నిర్బంధించారు. మద్రాసు చుట్టూ తన సైనికులను కాపలాపెట్టి మద్రాసుకు ఎలాంటి సరుకులు అందకుండా చేశారని ఒక స్థానిక నాయక్ మద్రాస్‌ను ముట్టడించాడని బౌరే రాశాడు. గోల్కొండ నవాబుకు మొరపెట్టుకోగా స్థానిక నాయకులు వెళ్లిపోయారు అని కూడా రాశాడు. క్రీ.శ.1676లో ఇంగ్లిష్ వారు ఎలాంటి పన్నులు చెల్లించనక్కరలేదని కొత్త సనద్ కూడా లభించింది. దాంతో ఇంగ్లిష్ వారి వ్యాపారం మద్రాసులో బాగా పెరిగింది.

స్ట్రెయన్‌షామ్: మద్రాసుకు నూతన గవర్నర్‌గా స్రెయిన్‌షామ్ నియమింపబడ్డాడు. అతడు గొప్ప మేధావి, సమర్థుడు, కార్యదక్షుడు. అతడు కంపెనీకి చెందిన 16 మంది ప్రధాన ఉన్నతోద్యోగులను వెంటపెట్టుకొని మద్రాసు నుండి మచిలీపట్టణం వరకు పర్యటించి పరిస్థితులన్నీ స్వయంగా తెలుసుకున్నాడు. ఈ పర్యటనలో అతడు పులికాట్, ఆర్మగావ్, కృష్ణపట్టణం, గంగపట్టణం, గొతుకూరు, గోగులపల్లి, నెల్లూరు, గాజులదిన్నె, తుమ్మలపెంట, రామయపట్టణం, కరుడు వెలగపూడి, అల్లూరు, అమ్మనబ్రోలు, వేటపాలెం, బాపట్ల, నిజాంపట్టణం, పెదపలివార్రు, నడకుదురు, పెదకెల్లేపల్లి, దివిసీమ, వాడపాలె, మచిలీపట్టణాలను దర్శించాడట. ఇవన్నీ ఆనాటి వ్యాపార కేంద్రాలు. ప్రతిచోట నేతగాళ్లు, అద్దకం పని వారు అతనిని దర్శించి తాము తక్కువ ధరలకు వస్త్రాలు అందిస్తామని చెప్పారట. మద్రాసు తిరిగి వచ్చి స్థానిక బ్రోకర్లతో ఒప్పందాలు చేసుకున్నాడు. బ్రోకర్లు తమ సొంత పెట్టుబడులు పెట్టి పని వారికి బయానాలు ఇచ్చి వస్త్రాలు తయారు చేయించేటట్లు, వచ్చిన లాభాలు పంచుకొనేటట్లు ఒప్పించి, వారిని కంపెనీలుగా ఏర్పడేటట్లు చేశాడు. ఇది అంతకుముందు డచ్ వారు చేసిన పద్ధతి. మచిలీపట్టణంలో 84 మంది వర్తకులతో ఒక కంపెనీ ఏర్పడింది. వారిలో 11 మంది ఆ కంపెనీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఆ కంపెనీతో మచిలీపట్టణం ఇంగ్లిష్ కంపెనీ డైరెక్టర్లుగా వ్యవహరిస్తారు. ఆ కంపెనీతో మచిలీపట్టణం ఇంగ్లిష్ కంపెనీ ఏజెంటు క్రీ.శ.1679 మార్చి 31వ తేదీన కాంట్రాక్టు కుదుర్చుకున్నాడు. ఆ కాంట్రాక్టు ప్రకారం నిర్ణీత కాలంలో వస్త్రాలను అందజేయాలి. ఆలస్యం అయితే నిర్ణీతకాలంలో తాము ఇంగ్లాండ్‌లో అమ్ముకుంటే వచ్చే లాభం ఈ వర్తకులు తమ కంపెనీకి చెల్లించాలి, కంపెనీలో తాము పెట్టిన వాటా ధనం కోల్పోతారు. క్రీ.శ.1683వ సంవత్సరంలో రాజమండ్రిలో కొందరు వ్యాపారులు 8000 పగోడాల మూలధనంతో ఒక కంపెనీగా ఏర్పడ్డారు. వారు డచ్చి ఈస్టిండియా కంపెనీకి వస్త్రాలు సరఫరా చేస్తామన్నారు. పులికాట్‌లో 55 మంది 200 పగోడాల వాటా చొప్పున మరొక కంపెనీగా ఏర్పడ్డారు. ఇంగ్లాండ్ లాగే ఇండియాలో కంపెనీలు ఏర్పడే పద్ధతిని స్వదేశీయులకు నేర్పారు.

విశాఖపట్టణం: క్రీ.శ.1680లో విశాఖపట్టణంలోని కంపెనీ అధికారి శ్రీకాకుళం ఫౌజ్‌దార్‌కు ఒక వెండి భోషాణం, 15 మణుగుల చందనం, కర్పూరగులాము అత్తరు, తుపాకి మందు ఒక పెట్టె, ఐరోపా మద్యం సీసాలు, విదేశపు బట్టలు ఇచ్చి సంతోషపెట్టారు. అతడు వారికి విశాఖపట్టణాన్ని కౌలుకిచ్చాడు. అక్కడ వారు ఫ్యాక్టరీ కట్టుకోవచ్చును, సుంకాలు చెల్లించనక్కరలేదు.

ఇంగ్లిష్ వారి దురంతాలు: డచ్చి వారి ప్రాబల్యం తగ్గేకొలదీ ఇంగ్లిష్ వారి కంపెనీ అభివృద్ధి చెందింది. లాభాలు గడించసాగారు. దాంతో వారి స్థావరాల వద్ద దురంతాలు కూడా ప్రారంభించారు. స్థానిక ప్రజలపై

పన్నులు వేయసాగారు. క్రీ.శ.1680వ సంవత్సరంలో మద్రాసు కౌన్సిల్ పట్టణ ప్రజల మీద ఒక కొత్త పన్ను విధించారు. కంపెనీ కింద పని చేసే నేతపని వారు, అద్దకం పని వారు మద్రాసు వదలి శాంథోమ్‌కు వెళ్లిపోయారు. వారి భార్యాబిడ్డలను బంధించి వారిని తిరిగి మద్రాసు రప్పించారు. తర్వాత సెంట్‌జార్జి కోటకు మరమ్మత్తులు చేయాలని, మద్రాసులోని ప్రజల నుండి క్విట్‌రెంట్ అనే పేరుతో ఇంటి పన్నును విధించారు. ప్రజలు, దుకాణదారులు దానిని చెల్లించడానికి నిరాకరించారు. ఇంగ్లిష్ వారు కుల పెద్దలను బెదిరించి లొంగదీశారు. మచిలీపట్టణంలో ఒక ఆంగ్లేయుడు ఒక భారతీయ స్త్రీని చెరిచాడు. తర్వాత అతనిని పట్టుకొని ప్రజలు ముక్కలుగా నరికారు. అందుకు ప్రతిగా ఇంగ్లిష్ వారు పట్టణంపై ఫిరంగులను పేల్చి ప్రజలను భయకంపితులను చేశారు. క్రీ.శ.1679లో మచిలీపట్టణంలో పెద్ద ఉప్పెన వచ్చింది. ఇంగ్లిష్ వారు ప్రజలకు ఎలాంటి సహాయం చేయలేదు. కంపెనీ ఉద్యోగులు ఇంగ్లాండులోని ఈస్టిండియా కంపెనీ అధికారుల కంటే విలాస జీవితాన్ని అనుభవిస్తున్నారని 1670లో ఇండియాను దర్శించిన జాన్‌ఫ్రయర్ రాశాడు.

మొగల్ అధికారం: క్రీ.శ.1687వ సంవత్సరంలో గోల్కొండ రాజ్యాన్ని ఔరంగజేబు జయించాడు. ఇంగ్లిష్ వారి దురంతాలు విని ఔరంగజేబు వారిని తరిమివేయడానికి సైన్యాలను పంపాడు. మొగల్ సేనలు మచిలీ పట్టణంపై దండెత్తడానికి కొండపల్లి చేరాయి. అది విని డచ్, ఇంగ్లిష్, ఫ్రెంచి వారు పట్టణం వదలి పారిపోయారు. 1689వ సంవత్సరంలో మొగలులు మద్రాసులోని సెంట్ జార్జికోటను, అక్కడ ఉన్న 18 గొడౌన్లను స్వాధీనం చేసుకున్నారు. విశాఖపట్టణ స్థావరాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు.

పునరుద్ధరణ: మొగలాయిలకు, మహారాష్ట్రులకు యుద్ధాలు జరుగుతుండేవి. జింజి కోటను వశపరచుకోవడానికి మొగలులకు ఇంగ్లిష్ వారు సహాయం చేశారు. అందువల్ల మొగల్ సేనాని జుల్ఫికర్ అలీ వారి ఫ్యాక్టరీలను పునరుద్ధరించుకోడానికి అనుమతి ఇచ్చాడు. క్రీ.శ.1692వ సంవత్సరంలో మొగల్ సేనను మహారాష్ట్రులు ఓడించారు. ఓడిపోయిన మొగల్ సేనానులు పారిపోయి వచ్చి మద్రాసులో దాక్కొన్నారు. వారిని కాపాడినందుకు ఇంగ్లిష్ వారికి జుల్ఫికర్ అలీఖాన్ ఎగ్మూరు, పరుశవాకం, తుండూరులను ఇచ్చి కంపెనీవారు పన్నులు చెల్లించనక్కరలేదని ఫర్మానా రాసి ఇచ్చాడు. క్రీ.శ.1701వ సంవత్సరంలో జుల్ఫికర్ అలీఖాన్ స్థానంలో కర్ణాటక ప్రతినిధిగా వచ్చిన దావూద్‌ఖాన్ కంపెనీ వారిని బెదిరించి 10 వేల పగోడాలు వసూలు చేశాడు. కాని జుల్ఫికర్ అలీఖాన్ ఇచ్చిన ఫర్మానాను ఖరారు చేశాడు. ఏమైనా మొగలుల కాలంలో కంపెనీ తిరిగి స్థిరపడింది.

యునైటెడ్ ఈస్టిండియా కంపెనీ: క్రీ.శ.1695వ సంవత్సరంలో స్కాట్లండ్‌లో మరొక కంపెనీ ఏర్పడింది. ఈస్టిండియా కంపెనీ ఏర్పడిన నాటి నుండి అనేక మంది అందులో భాగస్తులు కావాలని వాంఛిస్తూ ఉండేవారు. కాని చాలా మందికి సభ్యత్వం లభించలేదు. అలాంటి వారు కొందరు స్వతంత్ర వర్తకులుగా తూర్పు ఇండియా దీవులతో వ్యాపారం చేస్తూ ఉండేవారు. వారు తాము స్వతంత్ర వర్తకులమని చెప్పుకునేవారు. కాని కంపెనీ వారిని దొంగ వర్తకులని అంటుండేది. వారి వల్ల కంపెనీకి నష్టం వచ్చేది. కనుక వారితో ఒప్పందానికి వచ్చి క్రీ.శ.1702లో యునైటెడ్ ఈస్టిండియా కంపెనీ అనే పేరుతో ఇంగ్లిష్ వారి కంపెనీ నూతన రూపం ధరించింది. క్రీ.శ.1695లో స్కాట్లండ్‌లో ఏర్పడిన కంపెనీ క్రీ.శ.1698లో ఇంగ్లాండ్‌లో ఏర్పడిన కంపెనీ తూర్పు కోస్తాలో చాలా చోట్ల స్థావరాలు నెలకొల్పగలిగింది. మద్రాసు ట్యూటికోరన్, పోర్టోనోవా, కడలూరు, జింజి, పులికాట్, ఆర్మగాం, వీరవాసరం, ఇంజరమ్, నిజాంపట్టణం, మచిలీపట్టణం, మాధవాయపాలెం, నర్సాపూరు, విశాఖ పట్టణం, బిలమపట్టణం, భీముని పట్టణం, గంజాం, కొమ్మెర, తేనాం, బాలాసోర్, పిప్లి మొదలైన ప్రదేశాలలో ఇంగ్లిష్ వారి స్థావరాలు ఉన్నాయి.

నాణేలు

రెడ్డి రాజుల కాలం నాటి నాణేలు: రెడ్డి రాజుల కాలంలో టంకాలు అనే నాణేలు చలామణిలో ఉండేవి. ఇవి బంగారంతో చేసినవా, వెండితో చేసినవా తెలియదు. కొన్ని శాసనాలలో వెండి టంకాలు, మాడల పేర్లు పేర్కొనబడ్డాయి. మాడకు గద్దె, గద్య, గద్యాణ అని కూడా పేర్లున్నాయి. గణిత గ్రంథాలు 10 చిన్నాలు ఒకమాడ అని తెలుపుతున్నాయి. ఇంకా రూకలు, వరహాలు అనే నాణేలు కూడా చెలామణిలో ఉన్నాయి. నాలుగు టంకాలు ఒక రూక, రెండు రూకలు, ఒక మాడ, రెండు మాడలు ఒక వరహా అని తెలుస్తోంది. వరహాలను వరాహం అని కూడా అంటారు. చాళుక్యుల రాజచిహ్నం వరాహం. దానినుండే వరాహ అనే నాణెం పేరు వచ్చింది. ఈ నాణెం చాళుక్యుల కాలం నుండి వాడుకలో ఉండేది. ఈ నాణెం రెడ్డిరాజుల కాలంలో కూడా కొనసాగినట్లు తెలుస్తోంది.

విజయనగర నాణేలు: దక్షిణ భారతదేశంలో విజయనగర సామ్రాజ్యం స్థాపించిన తర్వాత నాణేలలో స్థిరత్వం ఏర్పడింది. నాణేలే గాక వస్తుమార్పిడి పద్ధతి కూడా అమలులో ఉండేవట. విజయనగర రాజులు తమ నాణేలపై తమ ఇష్టదైవాల బొమ్మలను ముద్రించారు. మొదటి హరిహర బుక్కరాయలు తమ నాణేలపై హనుమంతుని లాంఛనాన్ని ముద్రించారు. రెండవ హరిహరరాయలు వృషభం, సరస్వతి, బ్రహ్మ, ఉమా మహేశ్వరుడు, లక్ష్మీనారాయణ చిత్రాలను ముద్రించారు. అతని తర్వాత వారు ఏనుగును, ఏనుగుతో పోరాడే రాజు బొమ్మలను ముద్రించారు. కృష్ణరాయలు, అచ్యుతదేవరాయలు వైష్ణవ చిహ్నాలైన వెంకటేశ్వర, బాలకృష్ణ, గండభేరుండ బొమ్మలను ముద్రించారు. సదాశివరాయలు నాణేలపై లక్ష్మీనారాయణ, గరుడ లాంఛనం ఉన్నాయి. ఆరవీటి తిరుమలరాయల నాణేలపై శ్రీరాముడు, సీతాలక్ష్మణమూర్తులు ముద్రింపబడ్డాయి. వరాహం కూడా ఉంది. రెండవవైపున తిరుమల రాయలు అనే ఆఖ్య ఉంది. ఆఖ్య అంటే అక్షరమాల.

సంగమ వంశస్తులలో చివరి వాడైన రెండవ దేవరాయ క్రీ.శ.1419-1446, మల్లికార్జున క్రీ.శ.1446-1466, విరూపాక్ష-క్రీ.శ.1466-1487, ముగ్గురూ అనేక నాణేలు విడుదల చేశారు. వీరి నాణేలను గురించి అబ్దుర్ రజాక్ రచనల ద్వారా తెలియుచున్నది. రజాక్ తైమూర్ కుమారుడు. సామర్ఖండ్ సుల్తాన్ అయిన షహరుక్ రాయబారి. అతడు 1443 డిసెంబర్ 5వ తేదీన విజయనగరం చేరి రెండు సంవత్సరాలు అక్కడ నివసించి విజయనగర విశేషాలు రాశాడు. అతడు రెండవ దేవరాయల కాలంలో మూడు రకాల బంగారు నాణేలు ఉన్నాయని రాశాడు. వరాహం, ప్రతబ్, ఫణం. వరాహం రెండు దీనారాలకు సమానం. వరాహంలో సగం ప్రతబ్. అందులో పదవ వంతు ఫణం. ఫణానికి హణం అని కూడా పేరుంది. అదే అణాగా మారినట్లుగా కనిపిస్తోంది. అది 5.2 గింజల బరువు ఉంటుంది.

రెండు రకాల వెండి నాణేలు ఉండేవి. ఫణం, తర్ అనే పేర్లతో ఉండేవి. ఒక ఫణానికి ఆరు అతర్‌లు, అట్లే తర్, జితల్ అనే పేరు గల రాగి నాణేలు ఉండేవి. మూడు జితల్‌లు ఒక తర్ అవుతుంది. దీనిని బట్టి బంగారు నాణేలలో చివరి దాని పేరు, వెండి నాణేలలో మొదటి దాని పేరు ఒకటే. కాని లోహం మారుతుంది. అలాగే వెండి నాణేలలో చివరి దాని పేరు, రాగి నాణేలలో మొదటి దాని పేరు ఒకటి. ఈ విధంగా మూడు లోహాలలో మొత్తం 7 రకాల నాణేలు చెలామణిలో ఉండేవని తెలుస్తోంది.

తర్వాత చలామణిలో ఉన్న నాణెం చిన్నం. ఇది పగోడాలో ఎనిమిదవ వంతు. దానికి కాకిని అని కూడా పేరుంది. వరాహకు హొన్ను, పొన్ను, గద్యాణం, పగోడా అని కూడా పేర్లున్నాయి. వరాహాలు గట్టి వరాహలు, గొడ్డ వరాహలు, శుద్ధ వరాహలు. శుద్ధ వరాహలో 52 గురి గింజల తూకం బరువు గల బంగారం ఉండేది. దానికి రెండు రెట్లు అంటే 104 గింజల బంగారం ఎత్తు దొడ్డవరాహ ఉండేది. శ్రీకృష్ణరాయల కాలంలో వరాహ 119.7 గురిగింజల తూకం ఉండేది.

విజయనగర రాజ్యంలో విదేశీ నాణేలు కూడా చలామణిలో ఉండేవి. ముఖ్యంగా పోర్చుగీసు వారి క్రూజడో అనే నాణెం అతిముఖ్యమైన విదేశీ నాణెం.

నాణేలపై చిహ్నాలు: బంగారు నాణేలలోని వరాహం పైభాగం మీద ఎడమవైపుకు తిరిగి ఉన్న ఏనుగు, దానిపైన సూర్యుడు, చంద్రుల బొమ్మలు చిత్రింపబడి ఉంది. అడుగువైపున శ్రీదేవరాయ అనే ఆఖ్య ఉంది. వెండి నాణెంపైన కూడా అవే చిహ్నాలు ఉన్నాయి. పైభాగం మీద ఏనుగు, సూర్యుడు, చంద్రుల బొమ్మలు, అడుగు భాగం

మీద శ్రీదేవరాయ అనే ఆఖ్య ఉంది. రాగి నాణేల మీద మార్పుగా ఉంది. తర్ అనే రాగి నాణెం మీద ఏనుగు కుడివైపుకు తిరిగి ఉంది. అడుగువైపున ప్రతాపదేవరాయ అనే ఆఖ్య కన్నడ భాషలో ఉంది. జతల్ అనే రాగినాణెం మీద పైవైపు కుడివైపుకు తిరిగి ఉన్న ఏనుగు, అడుగువైపున శ్రీదేవరాయ అనే ఆఖ్య ఉన్నాయి. కొన్ని నాణేల మీద అడుగువైపున రాయగజగండభేరుండ అనే బిరుదు ఉంది. ఈ ఏనుగు చిహ్నం అతని శక్తికి నిదర్శనం. ఏనుగుల వేటలో రెండవ దేవరాయలు ప్రసిద్ధుడట. అందుకు చిహ్నంగా ఏనుగును ముద్రించాడు. కన్నడ భాషలో ఆఖ్య ఉండటం అతనికి కన్నడ భాషపై ఉన్న మక్కువను చూపిస్తోందని పండితులు అన్నారు. విజయనగర సామ్రాజ్య రాజభాష, అధికార భాష కూడా కన్నడ భాషే. అంతేకాదు, విజయనగర చక్రవర్తులు తాము కర్ణాటక రాజ్య రమావల్లభులం అని స్వయంగా చెప్పుకున్నారు. అంతేకాదు, విజయనగర సామ్రాజ్యం ఆంధ్ర సామ్రాజ్యం అనడం కన్నా కర్ణాటక సామ్రాజ్యం అని భావించడమే సమంజసం.

మత చిహ్నాల నాణేలు: దేవరాయల కొన్ని నాణేలపై మత చిహ్నాలు కూడా ఉన్నాయి. మత చిహ్నాలున్న నాణేల పైభాగం మీద శంఖచక్రం చిహ్నాలు, అడుగుభాగం మీద నాగరి లిపిలో దేవరాయల పేరు ఉన్నాయి. మరికొన్ని నాణేలలో పైభాగం మీద ప్రతాపదేవ అనే ఆఖ్య, అడుగు భాగం మీద శంఖచక్రాల మధ్య ఏనుగు బొమ్మలు చిత్రించబడి ఉన్నాయి. మరికొన్ని నాణేల పైభాగం మీద రాజగజగండభేరుండ అనే ఆఖ్య, అడుగుభాగం మీద రాజు కత్తితో ఏనుగుపైకి లంఘించినట్లు చిత్రించబడి ఉంది. రాజు ఏనుగుల యుద్ధంలో ప్రసిద్ధుడని ఈ నాణెం తెలుపుతోంది. అందువల్లనే అతడు రాజగజగండభేరుండ అనే బిరుదును ధరించాడని తెలుస్తోంది.

బంగారు నాణేల పైభాగాన లక్ష్మీనారాయణులు కూర్చున్నట్లు, అడుగుభాగాన శ్రీ ప్రతాపదేవరాయ అనే ఆఖ్యలు ఉన్నాయి. ఈ నాణేలు రెండవ దేవరాయలు వైష్ణవ మతంపై ఉన్న అభిమానాన్ని చాటుతున్నాయి. అలాగే దానిపైన సూర్యుడు, చంద్రుడు బొమ్మలు చిత్రించబడ్డాయి. అడుగు భాగం మీద నాగరి లిపిలో రాజు పేరు ఉంది. మరొక నాణెం మీద పైన శ్రీ నీలకంఠుడు అంటే శివుడు, అడుగు భాగం మీద ఎడమకు తిరిగి ఉన్న వృషభం ఉన్నాయి. బంగారు నాణేల పైభాగాన శివపార్వతులు కూర్చొని ఉన్నారు. దేవరాయ అనే ఆఖ్య ఉంది. మరొక నాణెం పైభాగం మీద వృషభం కుడివైపుకు తిరిగి ఉంది. పైన సూర్యుడు చంద్రుడు ఉన్నారు, వృషభం ముందు నాగరి లిపిలో 'దే' అనే అక్షరం ఉంది. ఈ అక్షరం దేవరాయ కావచ్చును. అడుగుభాగం మీద నీలకంఠ బొమ్మ ఉంది. ఈ నాణేలు దేవరాయలకు శైవమతంపై ఉన్న అభిమానాన్ని స్పష్టం అవుతోంది. దానికి శైవవైష్ణవ భేదాలను పాటించకుండా రెండు శాఖలను ఆదరించాడని స్పష్టం అవుతోంది. దానికి నిదర్శనంగా రెండు మతాల చిహ్నాలను ఒకే నాణేం మీద ముద్రించారు. అలాంటి నాణేలు కూడా ఉన్నాయి.

ఒక నాణెం పైభాగం మీద శ్రీ ప్రతాపదేవరాయ అనే ఆఖ్య ఉంది. దాని అడుగుభాగం మీద కుడివైపుకు తిరిగి ఉన్న వృషభం, దానిపైన సూర్యుడు, చంద్రుడు ఉన్నారు. వారిపైన ఒక చురకత్తి, శంఖువు చిత్రించబడి ఉన్నాయి. ఈ నాణేలలోని వృషభం శైవచిహ్నం, శంఖువు వైష్ణవచిహ్నం. మరొక నాణెం మీద పైన ఏనుగు, సూర్యచంద్రులు ఉండగా, అడుగుభాగం మీద నాగరిలిపిలో ఉత్తమరాయ అనే ఆఖ్య ఉంది. ఇది దేవరాయల బిరుదు కావచ్చును. లేదా ఉత్తముడైన ప్రభువు అని అర్థంలో వాడి ఉండవచ్చును. ఇతని నాణేలపై ఉన్న సూర్యుడు అతని పరాక్రమానికి, చంద్రుడు అతడు విలాస పురుషుడు అని తెలుసుకోడానికి చిహ్నాలుగా తీసుకున్నాడని పండితులు భావించారు.

కుతుబ్‌షాహీల నాణేలు: కుతుబ్‌షాహీలు బంగారు, వెండి లోహాలతో నాణేలను ముద్రించారు. వారి ప్రధాన నాణెం హొన్ను. ఇది బంగారపు నాణెం. హొన్నులు అనే నాణేలు బహమనీ సుల్తాన్‌ల కాలం నుండి దక్కనులో చలామణిలో ఉన్నాయి. గోల్కొండ నవాబులు కూడా అవే నాణేలను కొనసాగించారు. గోల్కొండ నవాబుల చివరి కాలంలో మొగలుల నాణేలు దక్కనులో ప్రవేశించాయి. వారి నాణెం రూపాయి వెండి నాణెం. గోల్కొండ నవాబుల ఒక హొన్ను నాణేనికి 4 $^1/_2$ మొగలుల నాణేలు సమానం. ఈ కాలంలో హైదరాబాద్ రాజ్యంలోనే గాక దక్కన్ మొత్తంలో హొన్నులు చలామణిలో ఉన్నాయి. హొన్నులు గాక నార్, సూల్, ఫణం అనే మరి మూడు రాగి నాణేలు కూడా చలామణిలో ఉన్నాయి. 4 నార్‌లు 1 సూలు, 8 సూలులు 1 ఫణం, 16 ఫణాలు 1 హొన్ను విలువ కలిగి ఉన్నాయి.

గోల్కొండ రాజ్యాన్ని స్థాపించిన కులీకుతుబ్‌షా తన పేరుతో నాణేలు ముద్రించలేదు. అతడు తన ప్రభువైన బహమనీ సుల్తాన్ అహమ్మద్‌షా పేరుతో నాణేలు ముద్రించాడు. అతని కాలంలోనే గోల్కొండలో నాణేల

ముద్రణాశాలను నిర్మించాడు. అతని కుమారుడు జంషీద్ కుతుబ్‌షా విడుదల చేసిన నాలుగు రకాల నాణేలు లభించాయి. అవి 104, 110, 164, 167 గ్రెయిన్‌ల బరువు ఉన్నాయి. ఈ నాణేల మీద జంషీద్ అనే పేరుకు బదులు జమ్షీద్ అని అక్షు ఉండి' మహమ్మద్‌నగర్ గోల్కొండ అని చెక్కి ఉంది. ఇబ్రహీం కుతుబ్‌షా నాణేల మీద కూడా గోల్కొండ టంకశాల అని ఉంది. పైభాగం మీద జులాస్‌బైబె ఇబ్రహీం కులిసదత్‌మందే అలి అని చెక్కబడి ఉంది. హిజారా 937 అంటే క్రీ.శ.1565 సంవత్సరం ముద్రించబడింది. అవి కొన్ని గుండ్రని ఆకారంలో, మరికొన్ని చదరపు ఆకారంలో ఉన్నాయి. చదరపు నాణేల బరువు 67.224 గ్రెయిన్‌లు, గుండ్రపు నాణేల బరువు 65.232 గ్రెయిన్‌ల బరువు ఉన్నాయి. ఈ నాణేలపై అబుల్ ముజఫర్ మహమ్మద్ కులీ కుతుబ్‌షా జరిబ దారుసల్తనత్ హైదరాబాద్ అని చెక్కబడింది. ఇవి 1012 హిజరి, క్రీ.శ.1593లో ముద్రించబడింది. కులీ పేరున్న ప్రత్యేక నాణెం హిజ్రా 1017 క్రీ.శ.1598లో విడుదల చేయబడింది. దాని బరువు 132.274 గ్రెయిన్‌లు. సుల్తాన్ మహమ్మద్ కుతుబ్‌షా దారుసల్తనత్ షెహరె హైదరాబాద్ హిజ్రా 1025 క్రీ.శ.1616 చెక్కబడిన నాణాలు లభించాయి. వాటి బరువు 95.270 గ్రెయిన్ల బరువు ఉన్నాయి. అబ్దుల్లా కుతుబ్‌షా కాలం నాటి నాణేలు కూడా చాలా లభించాయి. వాటి మీద సుల్తాన్ అబ్దుల్లా బాదుషా ఘాజి జరిబ దారుసల్తనత్ హైదరాబాదు అని చెక్కబడి ఉంది. వాటి బరువు 99.7, 206.7 గ్రెయిన్లు. కొన్ని నాణేలపై సుల్తాన్ అబ్దుల్లాకుతుబ్‌షా అని మాత్రమే ఉంది. అబుల్ హసన్ తానీషా కాలం నాటి నాణేలు కూడా ఎక్కువగానే లభించాయి. అవి 103, 166 గ్రెయిన్ల బరువు ఉన్నాయి. వాటిపై క్రీ.శ.1683 సంవత్సరం ముద్రించబడి ఉంది.

కాకతీయ నాయకులు: కాకతీయ నాయకుల సంఖ్యను గురించి రకరకాల సమాచారం లభిస్తోంది. ప్రతాపరుద్ర చరిత్ర, వెలుగోటి వారి వంశావళి 77 గురు అమరనాయకులని తెలుపుతున్నాయి. అనితల్లి కలువ చేరు శాసనం 75 గురు నాయకులని తెలుపుతోంది. శివయోగసార పీఠికలో 72 అని వివరించబడింది. వద్దాది అప్పారావు 1947లో ప్రకటించిన రెడ్డి సంచికలో తన వద్ద ఉన్న వెలుగోటి వారి వంశావళిలో 72 మంది నాయకుల పేర్లు ఉన్నాయని, వారి పేర్లను ఆ సంచికలో 9వ పేజీలో ఇచ్చారు. ఆ లిస్టు ప్రకారం ఈ కింది 72 మంది పేర్లు ఇవ్వబడ్డాయి.

1. రేచర్ల ప్రసాదిత్యుడు
2. మల్లేపపాత్రుడు
3. అనాచి మల్దేవుండు
4. ఇల్లు రుద్రదేవుండు
5. మురారి మల్దేవుండు
6. సంగరాజు
7. మేడుకూరి రామనాథుండు
8. అమ్మనబ్రోలి రుద్రదేవుండు
9. సోమరాజు రుద్రుడు
10. నాచిరాజు భీముడు
11. సందాడు దేవుండు
12. పోతికంటి మైలు
13. ఇందుపాళి
14. కొండపర్తి గణపతిదేవుండు
15. దాచినాగదేవుని సమాదేవుండు
16. మహాదేవనాయని సమాదేవుండు
17. మల్లికార్జునేండు
18. కొలిపాడు నాగిరెడ్డి
19. తాడిపర్తి గన్నారెడ్డి
20. చండ మల్లారెడ్డి
21. పాచి బాచారెడ్డి
22. గడ్డి మన్నారెడ్డి
23. పాచిపెంచల మల్లారెడ్డి
24. బెదదకోట భైరవదేవుండు
25. కోవూరి నాచిదేవుండు
26. కాళ్లయముగ్గుండు
27. కొరవిసిశ్మంగుడు
28. ముగదల గణపతిదేవుండు
29. గుండనాయునాయుండు
30. చెరకుతోట చెన్న
31. సబ్బువారి బాలుడు
32. కుమార గణపుడు
33. యుత్తిడి బాలుడు
34. గోన కాటారెడ్డి
35. మల్లాడి పోతడు
36. మారయసాహిణి
37. రుద్రదేవుండు
38. పిల్లసాహిణి
39. మచ్చరుద్రదేవుండు
40. వీరభల్లుండు
41. శ్రీకంఠుడు
42. పెదమాచి రుద్రదేవుండు

43. చినకూచి రుద్రదేవుండు
44. ఇందులూరి.అన్నమదేవుండు
45. అప్పక మల్దేవుడు
46. చోక (చోద) దేవుండు
47. కరిదేవుండు
48. దేవరాజు
49. వీరన్న
50. విస్సన్న
51. విశాలాక్షుండు
52. వీణకొమ్మయ
53. వెంకళేశ్వరుండు
54. మల్లు
55. కరణకుమారుండు
56. గోవుల పోచినేడు
57. నాగనాధుండు
58. రాణిక్యదేవుండు
59. గుండయంగండు
60. సామిరాజు యేలు
61. అభంగా రాహుత్తరాయడు
62. అన్నమదేవుని వెంక
63. ఝుంట వెంక
64. గోవు వెంక
65. ------
66. ------
67. మాచర్ల నాగువెంక
68. కాటమల్లు నాగువెంక
69. మంకు గన్నవెంక
70. పారువార బ్రహ్మవెంక
71. ఉండవిల్లు వెంక
72. ధిట్టకాము వెంక

ఏలూరు నుండి సింహాచలం వరకు ఇందులూరి రుద్రదేవుడు అనుమగల్లు రాజధానిగా, కాపయ నాయకుడు కమ్మనాటిలో, చెరకు వంశపు రెడ్లు పల్నాటి సీమలో తంగెడయందు, శ్రీగిరి నాయడు వెలనాటిలో, సోమయాజుల రుద్రసేనాని వర్ధమానపురంలో, గొనరెడ్లు పాకనాటిలో, ముప్పిడి నాయకుడు ములికినాడు, రేనాడు, పెన్నా, నతవాడి, నకిలి, ఏరువ, పొత్తపినాడు, నూర్జవాడి మొదలైన దక్షిణాంధ్ర దేశాన్ని జట్లయ వెంకగొంకారెడ్డి, పిఠాపురం, కొరాంలను కొప్పులరెడ్లు, కోరుకొండలో ముమ్మడి నాయకుడు, తొయ్యేరును ముసునూరి కాపయనాయకుని సోదరపుత్రుడు అనపోతారెడ్డి, రేకపల్లిని ముసునూరు ప్రోలయనాయకుడు పాలిస్తున్నారని రెడ్డి సంచికలో వద్దాది అప్పారావు రాశారు. చిలుకూరు వీరభద్రరావు కూడా అందరినీ రెడ్లని రాశారు కాని, వారెవరూ రెడ్లు కాదు. ఆనాడు సరిగా పరిశోధన చేయకుండానే కాకతీయ సామంతులలో చాలా మందిని రెడ్లుగా రాశారు. వీరిలో కమ్మ, రెడ్డి, వెలమ కులాల వారున్నారు. వీరందరూ చారిత్రక పురుషులే. వీరిలో కొందరి ప్రస్తావనలు శాసనాలలో కూడా ఉన్నాయి.

LATEST INFORMATION

వార్త - మార్చి 18 బుధవారం 1998

పురాతన నాణేలు - ప్రాచీన చరిత్రకు సాక్ష్యాలు: రంగంపేట మండలం దొడ్డిగుంట గ్రామంలో ఇటీవల బయల్పడ్డ పురాతన నాణేలు, ఆ ప్రాంతంలోని ప్రాచీన చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. దొడ్డిగుంట గ్రామానికి సమీపంలో కోటపాడు అనే సంస్థానం ఉండేదని అంటున్నారు. ఆ సంస్థానాన్ని నవాబులు పాలించే వారనీ, ఈ నాణాలు ఆ కాలం నాటివే అయి ఉండేదని అంటున్నారు. ఆ సంస్థానాన్ని నవాబులు పాలించే వారనీ, ఈ నాణాలు ఆ కాలం నాటివే అయి ఉంటాయని చెబుతున్నారు. 15, 16 శతాబ్దాల కాలం నాటివై ఉంటాయంటున్నారు. కోటపాడు సంస్థానం స్వయం ప్రతిపత్తి కలిగి ఉండేదనీ, ఈ నాణాలు ఆ సంస్థానంలోనే చెల్లుబాటయ్యే విధంగా ఏర్పాటు చేసుకున్నారని అంటున్నారు. ఈ ప్రాంతంలో పురావస్తుశాఖ తవ్వకాలను చేపడితే పూర్తి వివరాలు తెలియగలవని ప్రజలు సూచిస్తున్నారు. దొడ్డిగుంట గ్రామస్థుడు అడబాల శేషగిరిరావుకు చెందిన వ్యవసాయ భూమిలో ఈ నాణాలు బయల్పడ్డాయి. మట్టితో తయారైన కూజా ఆకారంలో ఉన్న పాత్ర దుక్కి దున్నుతున్న సమయంలో పగిలి ఈ నాణాలు వెలుగు చూశాయి. దీంతో ఆ పరిసరాలలో తవ్వకాలు నిర్వహించినట్లు ఆ ప్రాంతీయుల చెప్పారు. మొత్తం 250 వరకు నాణాలు లభ్యమైనట్లు గ్రామస్థుడొకరు చెప్పారు. రంగంపేటకు 'తహవన్నీసా' అనే అరబ్బీ భాషలో ముద్రలున్న ఈ నాణాలను, దుష్టశక్తుల నిరోధానికి అప్పట్లో ఇళ్లలో ఉంచుకొనే వారని ఆమె తెలిపారు. వీటిపై ఏ విధమైన అంకెల విలువలు లేవన్నారు.

నాణాలు దొరికిన ప్రదేశంలో 60 సంవత్సరాల క్రితం కూడా జనావాసాలున్నట్లు దొడ్డిగుంట మాజీ మునసబు పేపకాయల మల్లిబ్బాయి తెలిపారు. నాణాలపై ఇటీవల వచ్చిన వార్తలను పురస్కరించుకొని రెవిన్యూ వర్గాలు విచారణ ప్రారంభించారు. ఎమ్మార్వో ఆదినారాయణ ఆదేశం మేరకు వి.ఏ.ఓ. కొన్ని నాణాలను సేకరించి డివిజన్ కార్యాలయానికి పంపుతున్నారు. రంగంపేట మండలం దొడ్డిగుంట ప్రాంతంలో బయటపడిన పురాతన నాణాల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. నాణాలను సేకరించిన సీతానగరం ఎంపిడిఓ బి. సత్యన్నారాయణ, ఆ ప్రాంతం గురించి, నాణాల గురించి విస్తృతంగా పరిశోధించి చారిత్రక విషయాలు వెలుగులోకి తెచ్చారు. అక్కడ లభించిన మూడు నాణాలు హైదరాబాద్ సంస్థానాధీశులైన నిజాంలు ముద్రించినవే. బ్రిటిష్ వారు పాలించే ఆ రోజుల్లో నాణేలు ముద్రణకు అర్హత కలిగిన 8 సంస్థానాల్లో, హైదరాబాద్ ఒకటి. వీటిలో ఒకటి మహమ్మద్ కుతుబ్‌షా కాలంలో 1513లో ముద్రించగా, మిగతా రెండూ అబ్దుల్ హసన్ తానీషా హయాంలో 1676లో ముద్రితమయ్యాయి. ఇవి అవక్రవృత్తాకారంలో 54 అంగుళాల సైజులో ఉన్నాయి. రాగితో చేసినవి. వీటిపై అరబిక్ భాష ఉర్దూ లిపిలో ఉంది. 1110 ఇజ్రి అని ఉంది. ఇజ్రి అంటే ఇస్లామ్ శకం. మహమ్మద్ మదీనా నుండి మక్కాకు పారిపోయిన నాటి నుండి ఈ శకం ప్రారంభం. యా మాలిక్, యా ఇలాహి, యా అల్లా అని దేవుని స్తుతి ఉంది. మరో దానిపై ప్రజారంజకుడు అని అర్థాన్నిచ్చే రభూమ్ అని, అలావాహి అని ఉంది. మహమ్మద్‌షా కుతుబ్‌షా వంశీయుల్లో 5వ వాడు. హైదరాబాద్ నగర నిర్మాత (1591). ఆ కాలంలో నాణాలను దీనార్లుగా పిలచేవారు. నిజాంల సామంతుడైన పెద్దాపురం సంస్థానానికి, వేంగి రాజ్యానికి సరిహద్దులో ఈ ప్రాంతం ఉంది. ప్రస్తుత నల్లచెరువుకు తూర్పున పశ్చిమార్గంలో 2, 3 కిలోమీటర్ల దూరంలో గల ఈ ప్రాంతం అప్పట్లో దట్టమైన అడవిగా ఉండేదని 110 ఏళ్ల కితం కందుకూరి వీరేశలింగం రాసిన తొట్ట తొలుత నవల రాజశేఖర చరిత్రలో విపులంగా ఉంది. అందులో రంగంపేట, వడిశలేరు గ్రామాల ప్రస్తావనే లేదు. ఆలమందల నిర్వహణ కోసం మహారాజులు ఉద్యోగులకు పంపిన ధనంలో భాగంగా ఈ నాణాలు పంపబడి ఉండొచ్చని భావిస్తున్నారు. వీటి అధ్యయనానికి ఉర్దూ టీచరు ఎం. అలీఖాన్, జనాబ్‌రజాక్, షేక్ సయ్యద్, బి. విజయలక్ష్మిలు సహకరించారు.

ఈనాడు - మార్చి 20, 1998 శుక్రవారం

పశ్చిమగోదావరి జిల్లాలో లభ్యమైన తామ్రపత్రాలు ఇక్ష్వాక, విష్ణుకుండినుల కాలం నాటివి: చారిత్రక ప్రాధాన్యం గల బౌద్ధమతాన్ని చాటి చెప్పే రెండు తామ్రపత్రాలు తొలిసారిగా రాష్ట్రంలో లభ్యమయ్యాయి. ఇందులో ఒకటి మూడో శతాబ్దంలోని ఇక్ష్వాకుల కాలానికి చెందినది కాగా, మరొకటి 5-6 శతాబ్దంలోని విష్ణుకుండినుల కాలానికి సంబంధించింది. బ్రహ్మలిపి, ప్రాకృత భాషలో ఉన్న ఈ తామ్రపత్రాలు పశ్చిమగోదావరి జిల్లాలోని పాతగండిగూడెం (కాళ్ల చెరువు) గ్రామంలో దొరికినట్లు రాష్ట్ర ప్రాథమిక విద్య, పురావస్తు శాఖ మంత్రి కె.ఇ

ప్రభాకర్ గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇక్ష్వాకుల కాలం నాటి తామ్రపత్రంలో 5 రేకులు ఉన్నాయనీ, అవన్నీ ఎహువల శాంతమూల రాజుకు సంబంధించినవని ఆయన చెప్పారు. రెండో తామ్రపత్రంలో ఏడు రేకులు సింహముద్ర కలిగి ఉన్నాయని ప్రభాకర్ తెలిపారు. విష్ణుకుండిన రాజులైన గోవిందవర్మ, మహేంద్రవర్మ, మాధవవర్మలు సమాజానికి చేసిన సేవలను ఈ పత్రంలో పొందుపరిచారని ఆయన వివరించారు. గుంటుపల్లి వద్ద ఒక బౌద్ధ కేంద్ర పరిసర ప్రాంతంలో ఈ తామ్రపత్రాలు బయల్పడ్డాయని మంత్రి చెప్పారు. పాతగండిగూడెం గ్రామానికి చెందిన చెన్నవరపు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి ఇంటి నిర్మాణం నిమిత్తం భూమి తవ్వుతుండగా, ఈ పత్రాలు దొరికాయని ఆయన తెలిపారు. గత ఏడాది నవంబర్ నెలలో దొరికిన పత్రాలను ఆయన పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌కు అప్పగించగా, ప్రస్తుతం అవి రాష్ట్ర పురావస్తు శాఖకు చేరాయని ప్రభాకర్ చెప్పారు. జాతీయ ప్రాధాన్యం గల తామ్రపత్రాలను తమ శాఖకు అప్పగించిన వ్యక్తికి ప్రతిఫలం పొందేందుకు అర్హత ఉందని ఆయన తెలిపారు. బౌద్ధమత ప్రాశస్త్యాన్ని చాటే లుంబిని ఉత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో ఈ తామ్రపత్రాలు లభ్యం కావడం విశేషమని ఆయన వివరించారు.

ఈనాడు - ఏప్రిల్ 1, 1998

ఆంధ్రులకు ఆఫ్రికన్లు చుట్టాలే: దక్షిణ భారతదేశంలో నివసించే వారికి జన్యుపరంగా యూరోపియన్లు, ఆసియన్ల కన్నా ఆఫ్రికన్లతోనే దగ్గర సంబంధాలున్నాయి. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆంత్రోపాలజీ విభాగం, అమెరికాలోని ఉటా యూనివర్సిటీ కలిసి నిర్వహించిన అధ్యయనంలో ఈ విషయం తేల్చారు. ఇందు కోసం ఆంధ్రప్రదేశ్‌లో బ్రాహ్మణ, యాదవ, కాపు, రెల్లి కులస్థుల జన్యువులను విశ్లేషించారు. 'హ్యూమన్ బయోలజీ' పత్రికలో ప్రచురితమైన వీరి అధ్యయన నివేదిక ప్రకారం... దక్షిణ భారతీయులకు-ఆఫ్రికన్లకు జన్యుపరంగా సంబంధాలున్నాయి. యూరోపియన్లతోను, ఆసియన్లతోను జన్యుపరంగా వీరికి ఒకేరకమైన దూరం ఉంది. 16వ శతాబ్దంలో భారత్‌కు ఆఫ్రికన్లు వలస రావడం వల్ల వీరి జన్యువులు కలిసి ఉండొచ్చు. అధ్యయనంలో.. వివిధ వృత్తులకు చెందిన వారు, భిన్న సామాజిక వర్గాల వారు, విభిన్న ఆర్థికస్థాయుల వారు ఉండాలన్న తలంపుతో ఈ నాలుగు కులస్థుల జన్యువులను విశ్లేషించారు. బ్రాహ్మణులు, క్షత్రియుల లక్షణాల మధ్య ఆసియన్లలో ఉన్నట్లు ఆఫ్రికా, ఈశాన్య ఆసియా, ఆస్ట్రేలియన్ల లక్షణాలకు రెల్లి కులస్థులు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అధ్యయనంలో తేల్చారు. ఈ నాలుగు కులాల్లోను యాదవ, కాపు కులస్థుల ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు అధ్యయనంలో తేల్చారు మిగిలిన రెండు కులస్థుల జన్యువుల కన్నా భిన్నంగా ఉన్నట్లు ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన బి.ఆర్ బసి పేర్కొన్నారు. ఢిల్లీ యూనివర్సిటీలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ సెమినార్‌లో తమ అధ్యయన వివరాలను ఆయన ప్రకటించారు కూడా. మానవ కణాల్లోని శక్తిని సరఫరా చేసే మైటోకాండ్రియా (ఎం-టిఎన్ఎ)లోని జన్యుపరమైన పదార్థాలను విశ్లేషించి శాస్త్రవేత్తల బృందం ఈ నిర్ణయానికి వచ్చింది. తల్లి నుండి పిల్లకు కచ్చితంగా సంక్రమించే లక్షణం ఈ ఎం-టిఎన్ఎకు ఉంది. ఆఫ్రికాకు చెందిన మహిళలు దక్షిణ భారతానికి వలస రావడం వల్ల ఈ జన్యు లక్షణాలు కనిపిస్తున్నాయి. కాపులు-రెల్లిలు, బ్రాహ్మణులు-యాదవులు మధ్య కూడా కొద్దిపాటి జన్యు విభేదాలున్నా - గుర్తించాల్సినంత ఎక్కువ కాదు. చివరకు.. భారతీయులు ఆఫ్రికన్లకు చాలా దగ్గరని నివేదిక ద్వారా తేల్చారు. యూరోపియన్లు, ఆసియన్లతో సమాన దూరం ఉన్నట్లు తెలిపారు. దీన్ని బట్టి ఒకప్పుడు ఆఫ్రికన్లు దక్షిణ భారతంలో నివసించినట్లు నిర్ధారించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు.

ఆంధ్రజ్యోతి - జూలై 7, 1998

పుడమిగర్భాన కలుస్తున్న దంతవరపు కోట: ఆంధ్రుల గతవైభవాన్ని చాటిచెప్పే శిల్పకళాసంపదకు, బౌద్ధ సంస్కృతికీ, చారిత్రక ఆధారాలకు సాక్షీభూతంగా నిలిచే ప్రాచీన కళింగరాజుల రాజధాని దంతవరపుకోట వైభవాలు క్రమేణా అంతరించిపోతున్నాయి. పూర్వీకుల చరిత్రలను, వారి నైపుణ్యాలను భావితరాలకు తెలిపేందుకు వీలుగా వీటిని భద్రపరచి చర్యలు తీసుకోవలసిన రాష్ట్ర, పురావస్తు శాఖ అధికారుల నిర్లక్ష్యానికి, ప్రభుత్వం చిన్నచూపుకు గత వైభవాలు పుడమితల్లి గర్భంలోనే అంతరించిపోవడం పట్ల సర్వత్రా ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతున్నాయి. అధికారుల, నేతల తీరు పట్ల విమర్శల బాణాలను ప్రజలు సంధిస్తున్నారు.

శ్రీకాకుళం జిల్లా అమదాలవలస నియోజకవర్గ పరిధి, సరుబుజ్జిలి మండలంలో క్రీస్తుపూర్వం 4వ శతాబ్దంలో కళింగరాజులు నిర్మించినట్లు భావిస్తున్న దంతవరపుకోట ప్రభుత్వ నిరాదరణ, పురావస్తు శాఖ నిర్లక్ష్యం కారణంగా పుడమిగర్భంలో అంతరించిపోయే పరిస్థితి ఏర్పడింది. కళింగ రాజుల రాజధానిగా పేరొందిన

దంతపురం నేడు దంతవరపు కోటగా పిలువబడుతుంది. ఈ కోట నిర్మాణంలో ఉపయోగించిన మట్టిలో బుద్ధుని దంతం ఉంచారని చెబుతారు. కళింగరాజుల పుట్టినిల్లయిన దంతవరపుకోట 500 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే కాలక్రమేణా ఈ భూములను వ్యవసాయం నిమిత్తం కొంత మంది రైతులు ఆక్రమించుకుని దున్నుతుండగా బంగారం, వెండి ఆభరణాలతోపాటు ఎరుపు, నలుపు మట్టిపాత్రలు, కూజాలు, పూసలు, విగ్రహాలు దొరికాయని ఈ ప్రాంతీయులు చెబుతుంటారు. ఈ కోట చుట్టూ గల పాలవలస, రావివలస గ్రామాలకు చెందిన కొందరు రైతులు వ్యవసాయబావులు తవ్వుతుండగా సుమారు 20 అడుగుల తర్వాత ఒక రాజకిరీటం దొరికిందని, మరో రైతు తీస్తున్న బావిలో సుమారు 30 అడుగుల లోతున ఆజానుబాహుడైన వ్యక్తి అవశేషాలు చెక్కుచెదరకుండా కనిపించాయని వృద్ధులు నేటికీ కథలు కథలుగా చెప్పుకుంటారు. ఈ కోట 500 ఎకరాల విస్తీర్ణం కలిగిన, 20 అడుగుల ఎత్తయిన శిథిలమైన గోడలు నేటికీ దర్శనమిస్తుండటం విశేషం. ఈ కోట గర్భంలో దొరికిన ప్రాచీన కూజాలు, కుండలను, అవశేషాలను పరిశీలిస్తే ఇక్కడ కొన్ని వందల సంవత్సరాల పాటు ప్రజాజీవనం కొనసాగినట్టు స్పష్టమవుతుంది. గౌతమ బుద్ధుడు క్రీస్తు పూర్వం 483వ సంవత్సరంలో నిర్యాణం చెందగా, ఆయన శరీర అవశేషాలను దేశవ్యాప్తంగా పంపించి, అశోకుడు, ఇతర మౌర్యరాజులు స్థూపాలు, కోటలు నిర్మించారని బౌద్ధ జాతకథలలో దంతపురం చరిత్రలో ఉంది. దీని ప్రకారం బుద్ధుని దంతంతో బ్రహ్మదత్తుడు అనే కళింగరాజు ఇక్కడ స్థూపం నిర్మించారు. కళింగరాజుల రాజధానిగా విలసిల్లి దంతపురాన్ని క్రీస్తుపూర్వం 493 నుండి 532 వరకు అంటే 39 సంవత్సరాల పాటు తూర్పు గంగవంశరాజపు ఇంద్రవర్మ పాలించారు. ఆ తర్వాత క్రీస్తు పూర్వం 535 నుండి 544 వరకు తొమ్మిది సంవత్సరాల కాలం పాటు దేవేంద్రవర్మ పాలించారని చరిత్ర చెబుతోంది. అయితే దేవేంద్రవర్మ దంతపురం ప్రాభవాన్ని తగ్గించేందుకు రాజధానిని కళింగ నగరానికి మార్చాడు. ప్రస్తుతం ఈ కళింగ నగరాన్ని శ్రీకాకుళం జిల్లాలోని శ్రీముఖలింగంగా పేర్కొంటున్నారు. ఇలా కాలగర్భంలో దంతపురం కలసిపోవడంతో బుద్ధుని దంతాన్ని శ్రీలంకలోని సిలోన్ ప్రాంతానికి తీసుకుపోయారని చెబుతున్నారు మొదట కామార్ణవుడు కళింగను పాలించే శబరనాథిత్యుని జయించి దంతపురాన్ని రాజధానిగా చేసుకున్నాడని, రెండో కామార్ణవుని కాలంలో రాజధానిని ప్రస్తుతం శ్రీముఖలింగంగా పిలుస్తున్న కళింగ నగరానికి మార్చి, అక్కడ మధురేశ్వరుని దేవాలయం నిర్మించారని మరికొందరు చరిత్రకారులు చెబుతుంటారు. ఇదిలా ఉండగా దంతవక్తుడనే రాజు పరిపాలించినందు వల్ల ఈ కోటకు దంత వక్తుని కోట అని పేరు వచ్చిందని, అది కూడా క్రమేపీ దంతవరపు కోటగా మారినట్టు స్థానికులు చెబుతుంటారు. ఈ దంతపురానికి అనుబంధంగా మూడు కోటలు, ఒక దుర్గం ఉండేవని, ఈ కోటలున్న స్థానంలో ప్రస్తుతం కొత్తకోట, ధనుకోట, పెద్దకోటలు మిగిలాయని అంటుంటారు. కోట దుర్గం ఉన్న కరకవలసలో నేటికీ వారి చరిత్రను స్మరిస్తూ ప్రతి ఏటా ఉత్సవాలు జరుపుతుండటం విశేషం. ఈ కోటకు 12 ద్వారాలు ఉండేవని వృద్ధులు చెబుతున్నారు. పాలవలస, రావివలస, మునగవలస, చిన్నపాలెం, పెద్దపాలెం, అవతరాబాద్ గ్రామాలు కోట చుట్టూ నిర్మించి ఉన్నాయి. పాలవలస కాలనీ వద్ద కట్టురాయి ఉంది. ఈ రాయిపై తెల్లనిరంగుతో దట్టమైన దారాలతో కుట్టినట్టు నేటికీ కనబడుతుండడం ప్రత్యేకత. అందుకే దీనిని పరిసర గ్రామస్థులు కట్టురాయి అని పిలుస్తుంటారు. ఈ రాయిలో బుద్ధుని అస్థికలు ఉన్నట్టు కొందరు చెబుతుంటారు. ఇదొరకమైన లిపి అని మరికొందరు వృద్ధులు చెబుతుంటారు. పాలవలస చెరువు వద్ద బుద్ధుని విగ్రహం ఉండగా, సమీప తోటల్లో ఒక శివలింగంతోపాటు, కోటలో లభిస్తున్న ఏదో ఒక విగ్రహాన్ని పోలి ఉండటం విశేషం. కోటలో ఉన్న శిల్ప శిథిలాలను బట్టి అప్పటి ప్రజలు జైన, బౌద్ధ పద్ధతులను, ఆచారాలను పాటించినట్లు తెలుస్తోంది.

రాష్ట్ర పురావస్తుశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.కె.వహోలి, నాటి జిల్లా కలెక్టర్ అనిల్ చంద్ర పునేరా 1993 సెప్టెంబర్ 5వ తేదీన దంతవరపు కోటలోని కళింగరాజుల పాలనా కాలం నాటి బౌద్ధ సంస్కృతికి సంబంధించిన చారిత్రక ఆధారాలను పరిశీలించి, గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అదే సమయంలో కొద్దిరోజుల పాటు తాత్కాలికంగా తవ్వకాలు జరిపి ఆపు చేశారు. అందులో భాగంగానే 52-4 సర్వే నంబర్‌లో తవ్వకాలను జరిపిన పురావస్తుశాఖ వాటిని పర్యవేక్షించేందుకు పురావస్తుశాఖ రీసెర్చి ఆఫీసర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సాంకేతిక నిపుణుడు చిట్టిబాబులను నియమించింది. వారి సమక్షంలో జరిపిన తవ్వకాలలో ఆనాడు క్రీస్తుపూర్వం ఒకటి, రెండు శతాబ్దాల నాటి మెరిసే నల్ల, ఎర్రపెంకులు, మట్టిపూసలు, రాతి పనిముట్లు లభించాయి. వీటిని పరిశీలించిన అధికారులు ఉత్తరాంధ్ర జిల్లాలలోని ఇతర ప్రాంతాలలో లభించిన ఆధారాలకన్నా దంతవరపు

కోటలో లభించినవి ప్రాచీనమైనవని ఆనాడు నిర్ధారించారు. రావి వలస సమీపంలో పురుషోత్తపురం పోయే రోడ్డు ఎడమ పక్కన జరిపిన తవ్వకాలలో రెండు వృత్తాకార బౌద్ధ స్థూపాలు బయటపడ్డాయి.

ఒకసారి కోటలో చారిత్రక ఆధారాలు లభించలేదని తవ్వకాలు నిలుపు చేసిన పురావస్తుశాఖ, రెండవసారి తవ్వకాలలో పురాతన ఆధారాలు లభించినా తవ్వకాలు నిలుపుదల చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినబడుతున్నాయి. దంతవరపు కోట వద్ద దొరికిన ఆధారాలను బట్టి దీనికి ఎంతో ప్రాచీన చరిత్ర ఉన్నట్టు స్పష్టమవుతోంది. మట్టిపొరల్లో లభించిన కుండపెంకులు, శిల్పాలను బట్టి క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దం నుండి క్రీ.శ.13వ శతాబ్దం వరకు దంతపురం గొప్ప నగరంగా విలసిల్లినట్లు చరిత్రకారుల అభిప్రాయం. దీనిని బట్టి బౌద్ధజాతక కథలలోను, ఇతిహాసాలలోను, శిలా శాసనాలలోను పేర్కొన్న దంతవరపు కోట వద్ద పురావస్తు శాఖ మరిన్ని తవ్వకాలు జరిపితే మరిన్ని చారిత్రక ఆధారాలు లభ్యమవుతాయని పలువులు అంటున్నారు. ఈ కోట అప్పటి రాష్ట్ర టూరిజం శాఖమంత్రి సీతారాం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆముదాలవలస నియోజకవర్గంలోనే ఉన్నా ఎటువంటి ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం పట్ల సర్వత్రా విమర్శల జల్లు కురుస్తున్నది. ఇటువంటి చారిత్రక స్థలాన్ని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తయారు చేస్తే, ప్రభుత్వానికి మంచి ఆదాయంతోపాటు భావితరాల వారికి విజ్ఞానానికి తోడ్పడగలదని పలువురి అభిప్రాయం. ఇదిలా ఉండగా గత కొద్ది సంవత్సరాలుగా కొంత మంది రహస్య తవ్వకాలు జరిపి, అందులో దొరికే పురాతన వస్తువులను అమ్ముకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పురావస్తుశాఖ, ప్రభుత్వం దీనిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

తూర్పుగోదావరి జిల్లా ధనాలదిబ్బ కొండపై బౌద్ధరామ శిథిలాలపై పురావస్తు సర్వే ఈనాడు-శనివారం 31-10-1998: తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం మండలం యర్రవరం గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన గల ధనాలదిబ్బ కొండపై బౌద్ధారామ శిథిలాలకు సంబంధించి సర్వే జరిపారు. గత వారం రోజులుగా తవ్వకాలలో దొరికిన ఆధారాలు క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దికి చెందినవిగా రాష్ట్ర పురావస్తుశాఖ తాజాగా నిర్ధారించింది. మూడేళ్ల క్రితం యర్రవరం కొండపైన రంగురాళ్ల కోసం తవ్వకాలు జరిపిన స్థానికులు స్థూపాకారపు రాతిపేటిక లభించగా వీటిని కాకినాడ ఆంధ్రా సారస్వత పరిషత్తు మ్యూజియం సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా రాష్ట్ర పురావస్తు శాఖ వారం రోజులుగా ధనాలదిబ్బ కొండపై జరిపిన సర్వేలో మరిన్ని ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్ర పురావస్తుశాఖ విభాగం సహాయ సంచాలకులు పి.వెంగళరెడ్డి న్యూస్ టుడేతో మాట్లాడుతూ తుని సమీపంలోని గోపాలపట్టణం, విశాఖ సమీపంలోని తొట్లకొండ, భావికొండ, పావురాళ్లకొండ, అమలాపురం వద్ద లభించిన ఆధారాలే యర్రవరం వద్ద కూడా లభించాయని, ఇక్కడ బయల్పడిన బౌద్ధ ధాతుపేటిక బావికొండ వద్ద ఇటీవల బయల్పడ్డ ధాతుపేటిక ఒకే సైజులో, ఒకే రకంగా ఉన్నాయని స్థూప నిర్మాణ పద్ధతిని క్రీస్తు పూర్వం 2వ శతాబ్దానికి చెందిన శాతవాహనుల బౌద్ధ నిర్మాణశైలిలో యర్రవరంలోని ఆరామం కూడా నిర్మాణమైందని ఆయన అన్నారు. తవ్వకాలలో లభించిన ఎరుపు-నలుపు నగిషీగా ఉన్న ఎర్రమట్టి పాత్ర అవశేషాలతోపాటు విహారం కప్పునకు వాడిన మట్టిపెంకులు, నేలపరుపునకు వాడిన చెక్కినరాళ్లు 50×25×7 సెంటీ మీటర్ల కొలతలు గలిగిన ఇటుకలు, తదితర ఆధారాలవల్ల ఇక్కడ పెద్ద బౌద్ధారామం ఉండేదని. చెప్పటానికి వీలైందని వెంగళరెడ్డి తెలిపారు. వెలుగు చూసిన ఛత్రం, వేదిక, శిథిలాలు, శిలామండప స్తంభాలు ఏ మాత్రం అలంకారం లేకుండా ఉన్న దృష్ట్యా ఈ అవశేషాలు హీనయాన బౌద్ధశాఖకు చెందినవని ఆరామాన్ని పూర్తిగా వెలికితీయటానికి కొండపైన, తుప్పలను తొలగించి పెద్ద ఎత్తున తవ్వకాలు చేపట్టవలసిన అవసరముందని అసిస్టెంటు డైరెక్టర్ వెంగళరెడ్డి తెలిపారు. పురావస్తు నిపుణులు డా కె. పద్మనాభం, డా। ఈమని శివనాగిరెడ్డిలు తవ్వకాల కార్యక్రమాలను నిర్వహించారు.

విశాఖజిల్లాలో రూ.కోట్ల విలువచేసే పురాతన ధాతుభరిణ లభ్యం-ఈనాడు 5-11-1998: విశాఖపట్నం జిల్లా యలమంచిలి సమీపంలోగల కొత్తూరు గ్రామ సమీపంలోని పురాతన బౌద్ధ క్షేత్రం వద్ద ఇటీవల మరమ్మత్తు పనులు చేపడుతుండగా అతిపురాతనమైన ధాతు భరిణ లభించిందని, అందులో కోట్లాది రూపాయల విలువైన రాజముద్ర, లిపి, ధాతువుతోపాటు బంగారు, వెండి పువ్వులు లభించాయని కేంద్ర పురావస్తుశాఖ డిప్యూటీ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు జి.యస్.నరసింహన్ (హైదరాబాద్), కన్సర్వేటర్ అసిస్టెంట్ యన్.సి.హెచ్. పెద్దింట్లు (కాకినాడ) తెలిపారు. శ్రీకాకుళం జిల్లా గార మండలం శాలిహుండం వద్ద (బౌద్ధక్షేత్రం) మంగళవారం నాడు ఈ విషయం వారు న్యూస్‌టుడేకు తెలిపారు. తమ శాఖ ఆధీనంలో గల కొత్తూరు ప్రాంతంలో ఆగస్టు నెలలో

మరమ్మత్తులు చేపడుతుండగా, అందులో పెద్ద రాతిభరిణ లభించిందని, అది సుమారు రెండు అడుగుల వైశాల్యం కలిగి ఉందని మరొక స్టోన్ భరిణ ఉందని, అందులో క్రిస్టర్ స్టోన్‌తో మరొక భరిణ, మొత్తం మూడు భరిణలు ఉన్నాయని అన్నారు. ఈ భరిణపై 'తంచాయదనం' అనే అక్షరాలు లిపి రూపంలో చెక్కి ఉన్నాయని, ఇంకా కెంపు, పైన శాతవాహన కాలం నాటి 'సింహం' కలిగిన రాజముద్ర చెక్కబడి ఉందని, అలాగే అందులో చిన్న ధాతువు (ఎముక ముక్క) కూడా ఉంచి వాటిలో బంగారు, వెండి పుష్పాలు, ఆకులు, నవరత్నాలు చుట్టూ పేర్చబడి ఉన్నాయని, వాటిని పరిశీలించగా క్రీస్తుకు పూర్వం 2 వేల 300 సంవత్సరాల కాలం నాటివిగా గుర్తించడం జరిగినదని వారు తెలిపారు. ఈ భరిణ లభించిన వెంటనే తమ శాఖ సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ డా॥ యస్.వి.పి. హలకట్టె ఆ ప్రాంతం వచ్చి మూడు రోజులు ఉండి దాని కింద తవ్వకాలు జరిపిస్తే పెద్ద బౌద్ధస్థూపం బయల్పడిందని అన్నారు. లభించిన రాతిభరిణను హైదరాబాదులో తమ కార్యాలయంలో భద్రపరచి ఉంచామని అన్నారు. లిపి, రాజముద్ర, ధాతువు, ఈ మూడు కలసి ఒకే భరిణలో లభించడం చాలా అరుదని, దక్షిణ భారతదేశంలోనే ఇటువంటిది లభించడం ఇదే మొదటిసారని నరసింహన్, పెద్దింట్లు తెలిపారు. ఈ ప్రాంతం కొత్తూరు సమీపంలో శారదానదీ తీరంలో ఉందని అన్నారు. దీనిని బట్టి ఇక్కడ ఉన్న కొత్తూరు చాలా ప్రాచీనమైందని తెలుస్తోంది. సముద్రగుప్తుని అలహాబాద్ శాసనంలో పేర్కొనబడిన కొత్తూరు ఇదే కావచ్చును. ఇక్కడ లభించిన భరిణలో రాజముద్రిక ఉన్నదంటే కొత్తూరు తప్పకుండా ఒక రాజ్యానికి రాజధాని అయి ఉంటుంది. సముద్రగుప్తుని కాలంలో కొత్తూరుని స్వామిదత్తుడు అనే రాజు పాలించినట్లు, అతనిని సముద్రగుప్తుడు ఓడించినట్లు అలహాబాద్ శాసనం వివరిస్తోంది.

సంధ్యాకిరణ విన్యాసాల వేదిక, వేదనారాయణస్వామి ఆలయం, నాగలాపురం, చిత్తూరు జిల్లా: విజయనగర కాలం నాటి ప్రసిద్ధి చెందిన దేవాలయాలలో చిత్తూరు జిల్లాలోని నాగలాపురంలోని వేదనారాయణ స్వామి దేవాలయం మరొకటి. ఈ దేవాలయ ప్రత్యేకత ఏమిటంటే సంవత్సరంలో మూడు రోజులు వేద నారాయణ స్వామి విగ్రహం మీద సూర్యకిరణాలు పడతాయి. ఆ మూడు రోజులు తప్ప మిగతా రోజులలో చూద్దామన్నా సూర్యకిరణాలు కనిపించవు. ఈ కాంతిపుంజాలు మూలవిరాట్టును స్పృశించడానికి కారణం ఆ దేవాలయాన్ని ఒక ప్రత్యేకమైన రీతిలో నిర్మించడమే. ఈ ఆలయన్ని శ్రీకృష్ణదేవరాయలు నిర్మించాడు. అతడు కుంభకోణ ప్రాంతంలో విజయం సాధించి తిరిగి వస్తూ ఇక్కడ తన తల్లి నాగాంబ పేరిట ఈ ఆలయాన్ని నిర్మించాడు. ఇందులో దేవుడు వేదనారాయణస్వామి. కాని ఈ ఆలయం నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ఈ దేవాలయానికి, వరంగల్లులోని శంభులింగేశ్వరాలయానికి పోలికలున్నాయని చరిత్రకారులు అంటారు. ఈ ఆలయ ప్రాకారాలు, వాటిమీద చెక్కిన నగిషీలు కృష్ణదేవరాయల కాలం నాటి కళాప్రాభవాన్ని తెలియజేస్తాయి. పంచ ప్రాకారాలతో, ఏడు గోపురాలతో ఉన్న ఈ వేదనారాయణస్వామి ఆలయం భక్తుల మనస్సులో ఆధ్యాత్మిక భావాలు నింపుతుంది. ఆ ఆలయంలోని శాసనాలు రాయలు దక్షిణ దేశాల మీద సాధించిన విజయాల వివరాలు తెలుపుతున్నాయి. ఈ ఆలయాన్ని గురించి స్థానికులు అది కృతయుగానికి చెందినదని వివరిస్తారు. పవిత్రమైన వేదాలను సోమకాశురుడు అనే రాక్షసుడు అపహరించుకొని పోతూ ఉండగా మహావిష్ణువు మత్స్యావతారం ఎత్తి బంగాళాఖాతం ప్రాంతంలో ఆ అసురుణ్ణి వధించి వేదాలను భద్రంగా ఈ నాగలాపురంలో బ్రహ్మకు అప్పగించాడని చెపుతారు. వేదాలను అసురుణ్ణి రక్షించిన శ్రీమన్నారాయణుడు అక్కవ వేదనారాయణస్వామిగా అవతరించాడని చెబుతూ మత్స్యావతార రూపంలో ఆ దేవుని కొలుస్తారు. కృతయుగం నాటి స్థలపురాణాల్ని కలిగి ఉన్న ఈ ఆలయంలో సూర్యపూజోత్సవాలు జరిగే మూడు రోజులూ సంధ్యాసమయంలో కనిపించే దృశ్యం భక్తులకు కన్నుల పండుగగా ఉంటుంది. ఈ పవిత్ర దినాలలో, ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడు, పడమట్లోకి జారిపోతూ, కిరణాలతో వేదనారాయణుడి మూలవిరాట్టును తాకే దృశ్యం సందర్శకులను సమ్మోహితుల్ని చేస్తుంది. మొదటి రోజు స్వామి పాదభాగం మీద, రెండోరోజు నాభిపైన ప్రసరించే సూర్యకిరణాలు మూడో రోజు వేదనారాయణుడి ముఖారవిందం మీద పడి విగ్రహాన్ని కాంతిమంతం చేస్తాయి. పారవశ్యంలో ముంచెత్తే ఈ అపురూప కాంతి విన్యాసాన్ని చూసేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు విశేషంగా వస్తారు. ఆలయ మహా ద్వారం మీదుగా కిరణాలు ఆరువందల అడుగుల దూరంలో ఉన్న మూల విరాట్టుపై ప్రసరించడం విజయనగర రాజుల నిర్మాణ కౌశల్యాన్ని తెలియజేస్తుంది. ఇక్కడ సూర్యపూజోత్సవాలతో పాటు చైత్ర, వైశాఖ, మాసాల్లో భారీ ఎత్తున బ్రహ్మోత్సవాలు చేస్తారు. దక్షిణాంధ్రలో ఉన్నటువంటి ఈ దేవాలయంలోని విష్ణు విగ్రహం మీద సూర్యకిరణాలు పడ్డట్లే ఉత్తరాంధ్రలో ఉన్నటువంటి అరసవిల్లి సూర్య

దేవాలయంలోని సూర్యవిగ్రహం పాదాల మీద సూర్యకిరణాలు పడేటట్లు నిర్మించబడ్డాయి. ఆంధ్రదేశంలోని ఈ రెండు దేవాలయాలు ఈ ప్రత్యేకతను కలిగి ఉన్నాయి.

ఊటికొండ శివాలయం-శయన శివుడు-Reclining Siva - చిత్తూరు జిల్లా: దేశంలో ఎక్కడా శివుడు శయన రూపంలో విగ్రహ ప్రతిష్ఠ జరుగలేదు. ఈ దేవాలయంలో శివుడు శయన రూపంలో ప్రతిష్ఠించబడ్డాడు. ఇది శయన శివమూర్తి కలిగిన ఏకైక దేవాలయమని చెప్పవచ్చును. ఈ ఆలయం చిత్తూరు జిల్లాలోని ఊటికొండ వద్ద ఉంది. ఆంధ్రదేశపు దేవాలయాలలో మరొక ప్రత్యేకత కలిగిన దేవాలయంగా దీనిని చెప్పుకోవచ్చు.

బాసరలోని సరస్వతీ దేవాలయం: ఆదిలాబాద్ జిల్లా, బాసరలోని సరస్వతీ దేవాలయం ఆంధ్రదేశానికి మరొక ప్రత్యేకత. దేశం మొత్తంలో రెండే రెండు చోట్ల సరస్వతీ దేవాలయాలు ఉన్నాయి. ఒకటి కాశ్మీరులో, రెండవది బాసరలో. దేశంలో మరెక్కడా లేని సరస్వతీ దేవాలయం ఆంధ్రదేశంలో ఉండటం మరొక ఘనత అని చెప్పవచ్చును.

ఉండవల్లి గుహల ప్రత్యేకత: భారతదేశంలో తొలి శతాబ్దాలలో బౌద్ధులు కొండలలో గుహలను తొలిపించి అక్కడ నివసించేవారు. తర్వాత హిందువులు కూడా తమ దేవుళ్లకు గుహాలయాలు నిర్మించారు. అలాంటి గుహాలయాలలో ఆంధ్రదేశంలోని ఉండవల్లి గుహాలయం చాలా ప్రఖ్యాతి వహించింది. భారతదేశపు ప్రఖ్యాతి చెందిన గుహాలయాలలో ఉండవల్లి గుహాలయం కూడా ఒకటి. ఇది నాలుగు అంతస్థులు కలిగిన ఏకశిల నిర్మితం. ఈ ఏకశిల గుహాలయం ఆంధ్రదేశానికి శిల్పకళారంగంలో గొప్ప కీర్తి ప్రతిష్టలు తెచ్చింది. ప్రసిద్ధి చెందిన ఈ ఉండవల్లి గుహలు కృష్ణాజిల్లా విజయవాడకు 5 కిలో మీటర్ల దూరంలో ప్రకాశం బ్యారేజికి అవతల గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలంలోని ఉండవల్లి గ్రామంలో ఉన్నాయి. ఈ గ్రామం చివరి భాగాన ఉన్న కొండలో ఈ గుహాలయం నిర్మింపబడింది. ఈ గుహాలయంలో శ్రీ అనంత పద్మనాభస్వామి పరివేష్టితుడై ఉన్నందున వీటిని అనంత పద్మస్వామి గుహాలయంగా పేర్కొంటారు. ఈ నిర్మాణం ఆంధ్రదేశపు ప్రాచీన శిల్పకళా నైపుణ్యానికి, సాంకేతిక ప్రతిభకు దర్పణం పట్టేలాగ ఉంది. ఈ గుహ శిల్ప సౌందర్యం అద్భుతం. గుహలోని స్తంభాల మీద చెక్కిన శిల్పాలు అత్యంత ఆకర్షణీయంగా ఉంటాయి. నాలుగు అంతస్థుల ఉండవల్లి గుహాలయాలు భారత దేశంలోనే విశిష్టమైనవి. ఒక్కొక్క అంతస్తులో అనేక గదులున్నాయి. గదులు అధ్యయనం, పారాయణం, తపస్సు చేసుకునేందుకు వీలుగా చెక్కబడి ఉన్నాయి. కృష్ణా నదీ తీరాన కొండవీటి వాగు పక్కనే ఉన్న ఈ గుహాలయంలో ప్రతి అంతస్థులో భాగంగా గోడల మీద, స్తంభాల మీద చెక్కిన ఆనాటి వైభవ ప్రాభవాలను గుర్తుకు తెచ్చి సందర్శకులను ఆకట్టుకొంటాయి. కింది అంతస్తు చిన్నచిన్న గుహలతో తపస్సు చేసుకునే వీలుగా చెక్కబడి ఉన్నాయి. రెండవ అంతస్థులో 16 మండపాలతో కూడిన నృసింహస్వామి, విఘ్నేశ్వరుడు, దత్తాత్రేయుడు, శంకరుని శిల్పాలున్నాయి. మూడవ అంతస్థు అత్యంత ప్రధానమైనది. ఈ అంతస్థులోనే 14 అడుగుల పొడవు ఉన్న అనంత పద్మనాభస్వామి ఏకశిలా విగ్రహం దర్శనమిస్తుంది. సుమారు 28 అడుగుల పొడవు, అయిదు అడుగుల వెడల్పు గల శేషతల్పం మీద శయనించిన విష్ణుమూర్తి రూపమే అనంతపద్మనాభస్వామి విగ్రహం అతుకులు లేకుండా ఒకే రాయితో ఈ విగ్రహాన్ని చెక్కడం విశిష్టత. భారతదేశం మొత్తం మీద కేరళలో మాత్రమే ఇటువంటి విగ్రహం ఉన్నా ఇంతటి శోభ, కళా నైపుణ్యం అక్కడ కనిపించదని చరిత్రకారులు అభిప్రాయం. ఆ తర్వాత నాల్గవ అంతస్తు అసంపూర్తిగా మిగిలిపోయి ఉంది. ఈ గుహాలయాలలో అనంతపద్మనాభస్వామి శయనించి ఉన్నా, గుహాలయాల నిర్మాణ తీరు చూస్తే ఇది బౌద్ధాలయంగా ద్యోతకమౌతుంది. ఈ గుహాలయాలు బౌద్ధాలయాలన్న ఖచ్చితమైన దృష్టాంతరాలుండబట్టే ఈ గ్రామాన్ని, గుహలను సందర్శించేందుకు గాను చైనా, మలేషియా, సింగపూర్, జపాన్, భూటాన్ తదితర ప్రాంతాల నుండి బౌద్ధ భిక్షువులు, యాత్రికులు ఈ నాటికి వస్తుంటారు. క్రీస్తు శకం రెండు లేదా మూడవ శతాబ్దంలో పల్లవుల కాలంలో ఈ గుహలు చెక్కబడ్డాయని, అనేక బౌద్ధారామాల నిర్మాణ .బాధ్యతలు వహించిన గోవిందశర్మ ఈ గుహలను నిర్మించాడని కొందరు చరిత్రకారులంటారు. అనంతశయుని విగ్రహం బౌద్ధ విగ్రహమని ఆరేడు శతాబ్దాల కాలంలో బౌద్ధ విగ్రహాన్ని మార్పులు చేసి పద్మనాభస్వామిగా మార్చేశారని చరిత్రకారులు చెబుతున్న అంశాల నేపథ్యంలో విగ్రహాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే సందర్శకులు కూడా బుద్ధుని రూపురేఖలు గమనించకపోరు. ఈ గుహకు ఎడమవైపు ఒక సొరంగం ఉండేది. ఆ సొరంగం ఇక్కడ నుండి మంగళగిరి కొండ మీద గల పానకాలస్వామి ఆలయం వరకు ఉండేదంటారు. ఈ సొరంగంలో ఒక కిలో మీటరు వరకు తమ తాత ముత్తాతలు పోయి చిమ్మచీకటి, శ్వాస

పీల్చటం కష్టం కావటంతో తిరిగి వచ్చేశారని ఇప్పటికి కూడా ఉండవల్లి గ్రామస్థులు చెబుతారు. ఈ సొరంగంలోకి వెళ్లి గ్రామస్థులు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని 1958లో గుహలను స్వాధీనం చేసుకున్న పురావస్తు శాఖ వారు సొరంగాన్ని మూసేశారు. కిలో మీటర్ దూరం సాగిన ఈ సొరంగం వింత ఏమిటో కనుక్కోవలసిన పురావస్తు శాఖ వారు సొరంగం మూసివేయడం విచారకరం. మన ప్రాచీనుల కళావైభవ ప్రాభవాలకు సజీవసాక్ష్యాలుగా ఉన్న ఈ గుహలను పురావస్తుశాఖ గుర్తించి స్వాధీనం చేసుకోవటంలో జరిగిన జాప్యం ఫలితంగా గుహలలోని అందమైన విగ్రహాలు కొన్ని దొంగల పాలయ్యాయి. మరికొన్ని విధ్వంసానికి గురయ్యాయి. ఉన్న వాటిని స్వాధీనం చేసుకొని గుహల పరిస్థితిని కొంతవరకు మెరుగుపర్చారు. ఈ గుహాలయాల మీద దృష్టి సారిస్తే పర్యాటకులను బాగా ఆకర్షించవచ్చు. గుహాలయాలలో ఉన్న శిల్పనైపుణ్య ప్రాభవం, పచ్చని పంట పొలాలు, కృష్ణా నదీ తీరాన, జలజల పారే కొండవీటి వాగు ఒడ్డున గల ప్రకృతి సౌందర్యం సందర్శకులను అతి తేలిగ్గా ఆకట్టుకోగలదు.

రామదుర్గం: తూర్పుగోదావరి జిల్లా ఏజన్సీలో దేవీపట్నం మండలం మేళకోటకు మూడు కిలో మీటర్ల దూరంలోని కొండపై సముద్ర మట్టానికి 1500 అడుగుల ఎత్తున ఒక దుర్గం నిర్మింపబడింది. ఈ దుర్గాన్ని స్థానికులు రామదుర్గం అని పిలుస్తారు. స్థానికులు ఈ దుర్గం ఇక్ష్వాకుల కాలంలో నిర్మింపబడిందని చెబుతారు. కొండశిఖరాన సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ కోట విస్తరించి ఉన్నట్లు శిధిలాలు కనిపిస్తున్నాయి. మూడు చోట్ల సింహద్వారాలు ఉన్న ఆనవాళ్ళు, ప్రహరీగోడ, జలక్రీడలాడే జలాశయాల ఆనవాళ్ళు అనేకం ఈ కొండపైన ఉన్నాయి. ఇవే కాక ఆనాటి కాలంలో నిర్మించిన శ్రీకృష్ణాలయం ఇప్పటికీ పదిలంగానే ఉన్నది. ఈ కృష్ణాలయం సమీపంలోనే ఈ పర్వతంపై విఘ్నేశ్వర, శివాలయాలు కూడా ఉండేవని ప్రాంతీయులు చెబుతారు. వీటికి దిగువన ఒక రామాలయం ఉంది. దానిని నేడు కూడా భక్తులు సందర్శిస్తున్నారు. దాని పక్కనే సీతమ్మ వారి చెరువు అని పిలిచే ఒక కోనేరు ఉంది. అందులో మున్నూట అరవై రోజులు నీటి మట్టం సమానంగా ఉంటుంది. అంత ఎత్తయిన పర్వతంపై నిండు ఊట కలిగిన జలాశయం ఉండటం గొప్ప వింత. రామాలయం గర్భగుడిలో రెండు పెద్ద బిళాలున్నాయి. ఈ దుర్గాన్ని మధ్యయుగంలో రెడ్డి రాజులు నిర్మించినట్లుగా కనిపిస్తోంది. ఆ కాలంలో రాజమహేంద్రవరంపై దాడి చేయడానికి వచ్చే శత్రువులు పోలవరం వద్ద గోదావరిని దాటి వచ్చేవారట. 'అందువల్ల వారిని గోదావరి నదిని దాటి వచ్చే సమయంలో అడ్డగించేందుకు నేలకోట వద్ద ఈ కోటను రక్షణ దుర్గంగా నిర్మించారని చరిత్రకారులు భావిస్తారు. శ్రీకృష్ణదేవరాయలు కూడా పోలవరం వద్దనే గోదావరినదిని దాటి రాజమహేంద్రవరంపై దాడి చేశాడట. రాతి ఇటుకలతో నిర్మించిన ఈ కోట అంతర్భాగాన 70 ఎకరాల వైశాల్యంలో గోడలు శిధిలావస్థలో ఉన్నాయి. 12 అంగుళాల పొడవు, 6 అంగుళాల వెడల్పు, 3 అంగుళాలు మందం కలిగిన రాతి ఇటుకలతో ఈ కోటను నిర్మించారు. రెడ్డి రాజులు ప్రజల నుండి వసూలు చేసిన సొమ్మును బంగారంగా మార్చి శత్రురాజుల కంటపడకుండా ఈ కోటలోనే దాచేవారని అంటారు. అందువల్లనే శత్రురాజులు రామదుర్గం కోటపై దాడి చేసి నిధినిక్షేపాల కోసం కోటను, ఆలయాలను కూలగొట్టారని స్థానికులు చెబుతూ ఉంటారు. కోటలో గుప్తనిధులున్నాయనీ, గత 60 సంవత్సరాలుగా రహస్య తవ్వకాలు జరుగుతున్నాయనీ అక్కడి గిరిజనులు అంటున్నారు. ఈ తవ్వకాల సమయంలోనే ఆ కోటలో నంది, వినాయక, శివలింగం, రామలక్ష్మణ సీతాదేవి విగ్రహాలు బయల్పడ్డాయి. ఈ పర్వతంపై ఇంత చారిత్రక కట్టడాలు ఉన్నట్లు మన్యంలోని చాలా మంది ప్రజలకు తెలియదు. పైకి వెళ్లడానికి సరైన దారి లేకపోవడం వల్ల, తెలిసిన 'వారు కూడా ఈ కోటను దర్శించలేకపోతున్నారు. మొత్తం మీద ఇది మధ్యయుగం నాటి ఒక గొప్ప కోట.

వజ్రగడ: మధ్యయుగంలో ప్రసిద్ధి చెందిన మరొక దుర్గం వజ్రగడ. ఈ దుర్గం యలమంచిలి నుండి నర్సీపట్నం వెళ్లే మార్గంలో ఉంది. బలిష్టమైన గోడలతో, విశాలమైన ప్రాంగణాలతో గొప్ప భవనాల శిధిలాలతో ఈ కోట నేటికీ కనిపిస్తుంది. రెడ్డిరాజులు, గజపతుల కాలంలో ఈ కోట విశాఖపట్నం జిల్లాలో అత్యంత ప్రముఖ పాత్ర నిర్వహించింది. ఆనాడు ఈ కోట గొప్ప వైభవాన్ని అనుభవించిందనడానికి అక్కడి శిధిలాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

కోరుకొండ కోట: తూర్పుగోదావరి జిల్లాలో మధ్యయుగంలో ప్రసిద్ధి చెందిన మరొక కోట కోరుకొండ కోట. ఈ కోటను కాపయనాయకుడు నిర్మించాడు. మంచికొండ వారికి కోరుకొండ కేంద్రంగా ఉండేది. నేడు ఇది శిధిల దుర్గం. కాని అక్కడ నిర్మింపబడిన కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వల్ల నేడు అది పుణ్యక్షేత్రంగా

భాసిల్లుతోంది. ఈ దేవాలయంలో రెండు వందల వరకు అద్భుత శిల్పాలు ఉన్నాయి. 1528వ సంవత్సరంలో గోల్కొండ నవాబు తానీషా నేటి ఇటికాయపల్లికి చెందిన వద్దాది శరభన్నను కోరుకొండ ప్రాంతానికి అధిపతిని చేశాడు. అతనిపై రాజమండ్రి సుబేదారు అల్లాఖోల్‌ఖాన్‌ను అధిపతిగా నియమించాడు. 1758లో ఈస్ట్ ఇండియా కంపెనీ వారు కోరుకొండను స్వాధీనం చేసుకొని మందపాటి తిరుపతిరాజుకు ఇజారాగా ఇచ్చారు. 1802లో కోరుకొండను మొగల్తూరు కలెక్టరు వేలం వేయగా పెద్దాపురం సంస్థానాధిపతి వత్సవాయి జగపతి 25000 వరహాలకు పాడి శ్రీ లక్ష్మీనరసింహస్వామికి తాంబూలంగా ఇచ్చినట్లు తెలుస్తున్నది. 1924 ఫిబ్రవరిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రబుద్ధాంధ్ర పత్రికలో ఇచ్చిన వివరాల ప్రకారం స్వామికి 2767 ఎకరాలు 42 సెంట్ల భూమి ఉందని తెలుస్తోంది. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ఉచిత భోజనం, బస కల్పించే ఉద్దేశ్యంతో ఒక సత్రం నిర్మించడానికి విరియాల రెడ్డి పంతులు అనే దాత 1926లో 145 ఎకరాల సాగుభూమిని దానం చేశాడని తెలుస్తోంది. అక్కడ భక్తులు పవిత్ర స్నానాలు చేయడానికి పాపనాశని అనే కోనేరు కూడా ఉంది. 1959లో ఈ ఆలయాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ప్రస్తుతం స్వామికి కేవలం 15 ఎకరాల భూమి మాత్రమే ఉన్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం స్వామికి కళ్యాణ మహోత్సవాలు జరుగుతున్నాయి.

శాతవాహన, ఇక్ష్వాకుల కాలం నాటి నాణాలు లభ్యం - ఈనాడు 1 ఏప్రిల్, 1998: క్రీస్తు శకం రెండు, మూడు శతాబ్దాలకు చెందిన శాతవాహన, ఇక్ష్వాకుల రాజుల కాలం నాటి కొన్ని సీసపు నాణాలు ఇటీవల దొరికాయి. ప్రకాశం జిల్లా అద్దంకి సమీపంలో గుండ్లకమ్మ నదీ తీరాన ఈ నాణాలు కళాశాలలో చరిత్ర, పురావస్తు శాఖ అధిపతిగా పని చేస్తున్న డాక్టర్.వి.వి.సుబ్బారెడ్డి ఇటీవల ప్రకాశం జిల్లాలో పురావస్తు పరిశోధనలో భాగంగా అన్వేషణలు జరిపారు. ఈ అన్వేషణలో ఈ నాణాలు వెలుగు చూశాయి. ఈ నాణాలన్నీ గుండ్రంగా ఉన్నాయి. నాణాల వ్యాసం 1.8 సెం.మీ., 1.7 సెం.మీ., 1.4 సెం.మీ., 1.5 సెం.మీ., 1.6 సెం.మీ., వాటి బరువు వరుసగా 2.6 గ్రా., 3.3 గ్రా, 2.5 గ్రా., 2.5 గ్రా., 2.625 గ్రాములు. మొదటి మూడు నాణాలపై లిపి అసంపూర్ణంగా ఉండగా, అన్ని నాణాలపై చిహ్నాలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటి నాణెం ఒకవైపు మూడు కొండల దొంతర దాని కింద జలతరంగం ఉన్నాయి. బొమ్మకు పైభాగాన నాణెం ఒక మూల నుంచి ఇంకొక మూలకు చుట్టూ బ్రాహ్మీలిపిలో ప్రాకృత భాషలో "రాణో వాసి త్రిపుర పులమవిస" అని రాసి ఉంది. నాణెం రెండో వైపు పెద్ద "ఉజ్జయిని చిహ్నం" ఉంది. రెండో సంఖ్య గల నాణెం మీద ఒకవైపున ఆరుకొండల దొంతర, మిట్ట మీదన ఉన్న కొండ మీద ఒక నెలవంక గుర్తులాంటి గిన్నె ఉంది. ఆరుకొండల దొంతర కింద నీటి తరంగం ఉంది. బొమ్మపైన నాణెం చుట్టూ బ్రాహ్మీలిపిలో ఉన్న ఆఖ్య (లెజెండ్) స్పష్టంగా లేదు. మూడో సంఖ్యగల నాణెం ఒకవైపు తొండం పైకి ఎత్తి నిలుచొని ఉన్న ఏనుగు, నాణెం పైభాగాన "వీరపు..." అనే అక్షరాలు బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. నాణానికి రెండోవైపున ఉజ్జయిని చిహ్నం ఉంది. 4, 5, 6, 7 సంఖ్యలు గల నాణాల మీద తొండం కిందికి వేలాడుతున్న ఏనుగు రెండో వైపున ఉజ్జయిని చిహ్నం ఉన్నాయి. ఈ నాణాలపైన ఎలాంటి లిపిలేదు. నాణాలపై ఉన్న చిహ్నాలు, లిపులను బట్టి 1, 2 సంఖ్యలు గల నాణాలు ఆంధ్ర శాతవాహన చక్రవర్తులు వేయించినట్లు తెలుస్తుంది. 1వ సంఖ్య గల గౌతమీపుత్ర శాతకర్ణి తర్వాత రాజ్యానికి వచ్చిన అతని కుమారుడు అయిన వాశిష్టపుత్ర పులోమావి వేయించినట్లు తెలుస్తుంది. 2వ సంఖ్య గల నాణెం మీద అస్పష్టంగా ఉన్న లిపిని బట్టి అది గౌతమీపుత్ర యజ్ఞశ్రీ శాతకర్ణి నాటిదని డాక్టర్ సుబ్బారెడ్డి అభిప్రాయపడ్డారు. 3వ సంఖ్య గల నాణెం ఇక్ష్వాకు వంశపు రాజుల్లో రెండో వాడైన వీరపురుషదత్తుని కాలం నాటిది.

మిగతా నాణాల మీద లిపి లేకపోయినప్పటికీ నాణాల శైలిని (టైపోలజీ) బట్టి అవి ఇక్ష్వాకుల కాలం నాటివని డాక్టర్ సుబ్బారెడ్డి అన్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా ప్రాంతాన్ని శాతవాహనులు, వారి తర్వాత ఇక్ష్వాకులు పాలించారు. క్రీ.శ.2వ శతాబ్దం కడపటి సగ భాగంలో శాతవాహనుల పాలన అంతమైందని చరిత్రకారులు నిర్ణయించారు. క్రీ.శ.3వ శతాబ్ది మధ్యకాలంలో ఇక్ష్వాకుల పరిపాలన పరిసమాప్తమైంది.

నూతన పరిశోధనలు: ఇటీవల ఖమ్మం జిల్లాలో జరిపిన తవ్వకాలలో ఒక పెద్ద రాగి కాగు బయటపడింది. విజయవాడ గుణదల కొండవద్ద ఉన్న స్కూలులో తవ్వకాలు జరుపగా మానవ కళేబరం, దాంతోపాటు కొన్ని వస్తువులు బయల్పడ్డాయి. ఈ కళేబరం క్రీ.పూ.2 వేల సంవత్సరాల నాటిదని, అంటే 4000 సంవత్సరాల నాటిదని, నియోలతిక్ యుగానికి చెందిన అస్థిపంజరమని నిర్ధారణ చేశారు. అంటే గుణదలలో నియోలతిక్ యుగం నుండి జనావాసం ఉన్నట్లు స్పష్టమైంది.

యుగ సమీక్ష

ఈ యుగంలో అంటే క్రీ.శ.1323 నుండి 1724 వరకు 400 సంవత్సరాలలో ఆంధ్రదేశాన్ని పది ప్రధాన వంశాలు పాలించాయి. ముసునూరి, కొండవీటి రెడ్డి, రాచకొండ పద్మనాయక, తూర్పుగాంగ, గజపతి, విజయనగర, గోండు, బహమనీ, గోల్కొండ కుతుబ్‌షాహీ, మొగలు వంశాలు పరిపాలించాయి. ఈ వంశాల మధ్య జరిగిన యుద్ధాల వల్ల అల్లకల్లోలమైంది. రాజకీయ అధికారం తరచూ చేతులు మారుతూ ఉండేది. ముఖ్యంగా గజపతి, నరపతి, అశ్వపతుల కాలంలో ఆంధ్రదేశం అనేక దాడులకు గురైంది. కమ్మ, రెడ్డి, వెలమ రాజ్యాల తర్వాత ఆంధ్రదేశాన్ని ఆంధ్రుడు పాలించలేదు. వారి తర్వాత గజపతులు, నరపతులు, బహమనీలు, కుతుబ్‌షాహీలు, మొగలులు, తర్వాత అసఫ్‌జాహీలు వరుసగా ఆంధ్రదేశాన్ని పాలించారు. వారిని ఎదుర్కొనే ఆంధ్రుడనే వాడే లేకుండాపోయాడు. అందువల్ల రాజకీయంగా ఆంధ్రులు పరాయి వారి పాలన కిందకు వెళ్లారు. అలాగే సాంస్కృతికంగా కూడా చాలా మార్పులు వచ్చాయి. బహమనీల కాలం నుండి క్రమేపీ ముస్లిం సంస్కృతి ఆంధ్రదేశంలో ప్రవేశించింది. ముస్లిం పరిపాలన విధానం కూడా ఆంధ్రదేశంలో ప్రవేశపెట్టబడింది. గోల్కొండ కోట హైదరాబాద్ సంస్కృతి అభివృద్ధి చెందింది. ముస్లింల కట్టడ నిర్మాణాలు, వేషధారణ, ఆంధ్ర సామంత రాజులపై ప్రసరించింది. తెలుగు భాషాపోషణ కూడా తగ్గిపోయింది. ఉత్తమ తెలుగు కావ్య రచనలు కూడా ఆగిపోయాయి. ఆంధ్రుల జీవన విధానంలో కూడా మార్పులు వచ్చాయి. ఈ విధంగా ఈ 400 సంవత్సరాల ఆంధ్రచరిత్ర అనేక మార్పులతో సాగింది.

BIBLIOGRAPHY

Kakatiya Nayakas .... Prof.N.G.Ranga

Journal of Andhra Historical Research Society .... Prof. Rallabandi Subba Rao Museum, Rajamundry

History of the Reddi Kingdoms .... Mallampalli Somasekhara Sarma

History of the Medieval Deccan .... Prof. H.R.K. Sherwani

A Forgotten Empire .... Robert Sewell

Report on Epigraphy .... Dr. N. Venkataramanaiah, Published by AP Govt. 1965

History and Culture of Andhras .... Telugu University

Indian History and Culture .... B.S.L. Hanumantha Rao

Temples of South India .... J. Ramanaiah

The Battle of Raksasi Tangadi .... Y. Srirama Murthy

.... Journal of Historical Society, Rajahmundry

Qutub Shahi Hyderabad .... D. Sadiq Naqvi

.... Presidential Address A.P.History Congress 1998

Select Monuments of Hyderabad .... Dr. V.V. Krishna Sastry

Telugu Culture .... Telugu Bhasha Samithi

Archaeology of A.P. .... Dept.of Archaeology and Museums

Conquest of Catuir by Krishnaraya .Journal of Historical Research Society, Rajahmundry

Indian Architecture .... Brown Percy

Moghul Administration in Golconda .... J.F.Richards

Administrative System of Madras Presidency .... Mecleans

Relations of Golconda in the early 17th Century .... Moreland W.H.

Further Sources of Vijayanagara History .... K.A.Neelakanta Sastry

The Araveedu Dynasty .... Heras. H.

A forgotten Chapter of Andhra History ...... Mallampalli Somasechara Sarma

History of the Qutub Shahi Dynastry .... Sherwani H.K.

Cuddapah District Gazeteer

Kurnool District Manual

Nellore District Gazeteer

దక్షిణ భారతదేశ చరిత్ర .... తెలుగు అకాడమీ

తెలుగువారి జానపద కళారూపాలు .... డా॥ మిక్కిలినేని రాధాకృష్ణ

విజయనగర సామ్రాజ్యం .... తెలుగు అకాడమీ

ఆంధ్రుల చరిత్ర .... డా॥ బి.యస్.యల్. హనుమంతరావు

ఆంధ్రదేశ చరిత్ర-సంస్కృతి .... బి.యన్. శాస్త్రి

కమ్మవారి చరిత్ర .... కొత్త భావయ్య చౌదరి

ఆంధ్ర సంస్కృతీ తరంగిణి .... మల్లంపల్లి సోమశేఖరశర్మ

హిస్టారికల్ అట్లాస్ .... మల్లంపల్లి సోమశేఖరశర్మ

ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర .... కంభంపాటి సత్యనారాయణ

భారతీయ వాస్తుశిల్పం .... తెలుగు అకాడమీ

భారతీయ శిల్పకళలు .... తెలుగు అకాడమీ

శాసనాలలో ఆంధ్ర స్త్రీలు .... శ్రీమతి ముప్పాళ్ల కమలాదేవి

విజయనగర సామ్రాజ్యం .... పి.శ్రీరామశర్మ

దక్షిణభారతంలో దేవాలయాలు .... కె.ఆర్.శ్రీనివాస్

ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహం .... మల్లంపల్లి సోమశేఖరశర్మ

భారతీయ సంస్కృతి-వారసత్వం .... తెలుగు అకాడమీ

ACC No. 99947

దాదాపు 5వేల పేజీలతో 5 భాగాలుగా రాసిన ఈ సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర-సంస్కృతి గ్రంథం అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి చరిత్ర-సంస్కృతులను ఔన్నత్యాన్ని చాటి చెప్పే ఏకైక ప్రామాణిక గ్రంథం. ఇందులో తెలుగు వారి చరిత్ర సంస్కృతులకు సంబంధించిన అంశాలలో లేనిదంటూ లేదు (ఎన్‌సైక్లోపిడియా). ఈ గ్రంథ రచనకు శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారం లభించింది. ఈ గ్రంథం రచయిత జీవితకాలపు కృషి.

డా॥ ముప్పాళ్ల హనుమంతరావు

సెల్: 9703589376

గుంటూరు జిల్లా, రాజుపాలెం మండలం,
పెద నెమలిపురి గ్రామ వాస్తవ్యులు

హై స్కూల్ విద్య: పిడుగురాళ్ల
డిగ్రీ విద్య: ఎస్.ఎస్.ఎన్.కాలేజి, నర్సరావుపేట
పోస్టు గ్రాడ్యుయేషన్: నాగపూర్ యూనివర్సిటి
పిహెచ్.డి: నాగార్జున యూనివర్సిటి
బి.ఎల్: నాగార్జున యూనివర్సిటి

1971 నుండి చరిత్ర గ్రంథాలు రాయటం మొదలుపెట్టి నేటి వరకు దాదాపు 30 గ్రంథాలు రాశారు. ప్రస్తుతం రచయిత హైదరాబాద్‌లో సివిల్స్, గ్రూప్-1, గ్రూప్-2, మొదలగు పోటీ పరీక్షల అభ్యర్థులకు చరిత్రలో శిక్షణ ఇస్తున్నారు.



₹349; Library Copy: ₹449



₹399; Library Copy: ₹499



₹399; Library Copy: ₹499



₹449; Library Copy: ₹549



₹399; Library Copy: ₹499